కార్ల్ మార్క్స్


# పెట్టుబడి




మొదటి సంపుటం

# కార్ల్ మార్క్స్

# పెట్టుబడి





## కార్ల్ మార్క్స్

# పెట్టుబడి

## మొదటి సంపుటం

**అనువాదకులు**

రాచమల్లు రామచంద్రారెడ్డి

బిట్రగుంట రామచంద్రరావు

గడ్డం కోటేశ్వరరావు

ఎ. గాంధీ

**మొదటి ముద్రణ**

**సంపాదకవర్గం**

వై.వి. కృష్ణారావు

వై. విజయకుమార్

ఈడ్పుగంటి నాగేశ్వరరావు

**రెండవ ముద్రణ**

(సవరించబడినది)

**సంపాదకుడు**

గడ్డం కోటేశ్వరరావు

విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్

విజయవాడ

**PETTUBADI (CAPITAL) KARL MARX** *Vol. 1 (Telugu)*

| | | |
|---|---|---|
| ప్రచురణ నెం. | : | 2350/1-1R |
| ప్రతులు | : | 1000 |
| మొదటి ముద్రణ | : | సెప్టెంబర్, 1996 |
| రెండవ ముద్రణ | : | ఫిబ్రవరి, 2017 |


**© విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్**

వెల : **₹ 600/-**

**(మూడు సంపుటాల వెల ₹ 1699/-)**

**ప్రతులకు**

**విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్**
33-22-2, చంద్రం బిల్డింగ్స్
చుట్టుగుంట, విజయవాడ-520004
ఫోన్ : 0866-2430302
Email : vphpublish@gmail.com

**విశాలాంధ్ర బుక్‌హౌస్**
విజయవాడ, విశాఖపట్నం,
అనంతపురం, గుంటూరు
తిరుపతి, కాకినాడ, ఒంగోలు
శ్రీకాకుళం, కడప, విజయనగరం


**హెచ్చరిక :** ఈ పుస్తకంలో ఏ భాగాన్నైనా పూర్తిగా కానీ, పాక్షికంగా కానీ కాపీరైట్ హక్కు కలిగినవారి నుండి లేక ప్రచురణకర్తల నుండి ముందుగా రాతపూర్వక అనుమతి పొందకుండా ఏ రూపంగా వాడుకున్నా కాపీరైట్ చట్టరీత్యా నేరం.

**ముద్రణ : విశాలాంధ్ర విజ్ఞాన సమితి ముద్రణాలయం - విజయవాడ**

# కృతజ్ఞతలు

ఆంధ్రప్రదేశ్ కమ్యూనిస్టు సమితి చొరవతో, దాతల సహకారంతో మార్క్స్ మహాశయుని "కాపిటల్" గ్రంథాన్ని తెలుగులో "పెట్టుబడి" గ్రంథంగా వెలువరించాలని విశాలాంధ్ర విజ్ఞాన సమితి 1984 సం॥రంలో బృహత్కార్యాన్ని చేపట్టింది. దాని ఫలితంగా 1996-2000 సం॥రాల మధ్య కాలంలో పెట్టుబడి గ్రంథం మూడు సంపుటాలు వెలువడినాయి. ఆ పుస్తకాలన్నీ చెల్లిపోవడంతో వాటిని విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ సహకారంతో పునర్ముద్రణ చేయాలనే సంకల్పంతో కామ్రేడ్స్ ఈడ్పుగంటి నాగేశ్వరరావు (ఛైర్మన్), గడ్డం కోటేశ్వరరావు (కన్వీనర్/సమన్వయ కర్త), రావు కృష్ణారావు, ఆచార్య నన్నపనేని అంజయ్య, ఆచార్య చేకూరి నరసింహారావులతో ఒక ఉపసంఘాన్ని ఆంధ్రప్రదేశ్ కమ్యూనిస్టు సమితి 26-2-2011న నియమించింది.

ఆ ఉపసంఘం 2011వ సం॥రం ఫిబ్రవరి 26, మార్చి 14, మార్చి 16 తేదీలలో సమావేశాలు జరిపి, పునర్ముద్రణకు అవసరమైన ప్రాతిపదికలను, విధి విధానాలను నిర్ణయించి, క్రింద పేర్కొన్న విధంగా పని విభజన చేసింది.

1. మొదటి ముద్రణ సమగ్రంగా రూపొందించబడినప్పటికీ, వాక్య నిర్మాణంలోనూ, భావ స్పష్టతలోనూ, వాక్యం నడకలోనూ అక్కడక్కడ యాదృచ్ఛికంగా దొర్లిన తప్పులను సరిచేసి అవసరమైనచోట్ల సవరణలు, మార్పులు చేర్పులు చేయాలి. అనువాదం వీలైనంత వరకూ ఒకే విధంగా (Uniform) ఉండేటట్లు చూడాలి.
2. సరఫరా చేయబడిన పారిభాషిక పదకోశంలోని పదజాలాన్ని వాడటం ద్వారా అనువాదం ఒకే విధంగా ఉండటానికి అందరూ ప్రయత్నించాలి. తప్పనిస్థితిలో, పదకోశంలో లేని, తాము వాడిన పదానికి పక్కనే ఇంగ్లీషు పదాన్ని బ్రాకెట్లో తప్పనిసరిగా రాయాలి.
3. మొదటి సంపుటానికి గడ్డం కోటేశ్వరరావు, రెండవ సంపుటానికి ఆచార్య సి. నరసింహారావు, ఆచార్య నన్నపనేని అంజయ్య, మూడవ సంపుటానికి రావు కృష్ణారావు, ఎ. గాంధీలు సంపాదక బాధ్యతలు నిర్వర్తించాలి.

2011వ సం॥రంలోనే పునర్ముద్రణ బాధ్యతలను విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ సంపాదకవర్గం స్వీకరించింది. అయితే పునర్ముద్రణకు సంపాదక బాధ్యతలు స్వీకరించిన ఆచార్య సి. నరసింహారావు, ఆచార్య ఎన్. అంజయ్య, మిత్రులు ఎ. గాంధీలు తమ వ్యక్తిగత కారణాల రీత్యా ఆ బాధ్యతలను నెరవేర్చలేమని తమ అశక్తతను వెల్లడిచేసినందున, మొదటి రెండు సంపుటాల సంపాదక బాధ్యతలను కామ్రేడ్ గడ్డం కోటేశ్వరరావు, మూడవ సంపుటం బాధ్యతలను కామ్రేడ్ రావు కృష్ణారావు, కామ్రేడ్ గడ్డం కోటేశ్వరరావులు స్వీకరించవలసి వచ్చింది.

మొదటిసారి అనువాదానికి మూలగ్రంథాలుగా స్వీకరించినవి :

1. 1887వ సం॥రపు శామ్యూల్ మూర్, ఎడ్వర్డ్ ఆవలింగ్‌ల ఇంగ్లీషు అనువాద గ్రంథాన్ని, 1954వ సం॥రంలో ఫారిన్ లాంగ్వేజస్ పబ్లిషింగ్ హౌస్, మాస్కో వారు పునర్ముద్రణ చేశారు. ఇది మొదటి సంపుటానికి మూలాధారం.
2. 1893వ సం॥రంలో జర్మన్ భాషలో ముద్రించబడిన "దాస్ కాపిటల్" (రెండవ సంపుటం) గ్రంథాన్ని ఫారిన్ లాంగ్వేజస్ పబ్లిషింగ్ హౌస్, మాస్కో వారు ఇంగ్లీషులోకి అనువదింపజేసి 1961వ సం॥రంలో ముద్రించారు. ఇది రెండవ సంపుటానికి మూలాధారం.
3. 1894వ సం॥రంలో జర్మన్ భాషలో ముద్రించబడిన "దాస్ కాపిటల్" (మూడవ సంపుటం) గ్రంథాన్ని ప్రోగ్రెస్ పబ్లిషర్స్, మాస్కో వారు ఇంగ్లీషులోకి అనువదింపజేసి 1966 సం॥రంలో ముద్రించారు. ఇది మూడవ సంపుటానికి మూలాధారం.

ఈ పుస్తకాలలోని ఇంగ్లీషేతర భాషల వాక్యాలు, పదాలు (జర్మన్, ఫ్రెంచి, ఇటాలిన్, స్పానిష్ వగైరాలు) ఆనాటి అనువాదానికి చాలా క్లిష్ట సమస్యలైనాయి. ప్రత్యేకించి పాదసూచికల్లోని అంశాలు మిక్కిలి క్లిష్టంగా మారాయి. అనువైనచోట్ల ఆనాడు అనువదించారు. తప్పని స్థితిలో కొన్నిచోట్ల ఆ భాషనే యథాతథంగా అక్కడ రాశారు. అయితే ప్రస్తుత రెండవ ముద్రణలో ఆ సమస్యలను పరిష్కరించడానికి మరికొన్ని ఇంగ్లీషు గ్రంథాలను ఆశ్రయించాము. అందుకు దోహదపడిన గ్రంథాలు : బెన్‌ఫోక్స్, డేవిడ్ ఫెరన్‌బాక్ లు ఇంగ్లీషులోకి అనువదించి, పెంగ్విన్, న్యూలెఫ్ట రెవ్యూ వారు ముద్రించిన "కాపిటల్" గ్రంథం మూడు సంపుటాలు; జి.డి.హెచ్. కోల్ ఉపోద్ఘాతంతో, ఈడెన్ అండ్ సిడార్‌పాల్‌లు ఇంగ్లీషులోకి అనువదించిన ఎవ్విరిమాన్ లైబ్రరీ వారు ముద్రించిన రెండు పుస్తకాలు; వీటితోపాటు, కాపిటల్ గ్రంథం మీద వివరణలు, వ్యాఖ్యానాలు, విశ్లేషణల రూపాల్లో రాసిన గ్రంథాలు; సి.జె. ఆర్థర్ రాసిన "మార్క్స్ కాపిటల్"; డేవిడ్ హార్వే రాసిన "ఎ కంపానియన్ టు మార్క్స్ కాపిటల్"; మైకేల్ హీన్‌రిక్ రాసిన "యన్ ఇన్‌ట్రడక్షన్ టు త్రి వాల్యూమ్స్ ఆఫ్ కారల్ మార్క్స్ కాపిటల్"; లూయీ ఆల్తూజర్, బలిబార్ రాసిన "రీడింగ్ కాపిటల్"; ఫ్రాన్సిస్ వీన్ రాసిన "మార్క్స్ దాస్ కాపిటల్" వగైరా గ్రంథాలు బాగా ఉపకరించాయి.

రెండవ ముద్రణ దాదాపుగా సమగ్రంగా అనువదించబడిందని వినయపూర్వకంగా మనవి చేస్తున్నాం. వాక్య నిర్మాణంలోనూ, భావ స్పష్టతలోనూ యాదృచ్ఛికంగా దొర్లిన పొరపాట్లను దాదాపుగా సరిచేశాం. మొదటి ముద్రణలో కనుగప్పి తప్పిపోయిన (Missing lines) వాక్యాలను తిరిగి చేర్చాము. ఇంగ్లీషేతర భాషల్లోని వాక్యాలనూ, పదాలనూ వీలైనంతవరకు అనువదించాము.

బహుభాషాకోవిదుడైన మార్క్స్ రచనలను అనువదించడం అంత సులభమైన పని కాదు. ఆయన రాసిన ప్రతి వాక్యంలోనూ దాదాపుగా సామెతలు, అలంకారాలు మెండుగా ఉంటాయి. అందులో పలురకాలైన భాషల్లో చెణుకులూ, వ్యంగ్యాలు ఉంటాయి. వాటి అనువాదం మాకు సంక్లిష్ట సమస్యగా మారింది. పలువురు భాషా కోవిదులను సంప్రదించవలసి వచ్చింది. మా శక్తి స్తోమతల మేరకు అనువదించాం. అయితే అందుకు సమయం పట్టింది.

మూడు సంపుటాల పునర్ముద్రణకు సంపాదక బాధ్యతలను గడ్డం కోటేశ్వరరావు, రావు కృష్ణారావులు మాత్రమే నెరవేర్చవలసివచ్చినందున, ఐదు సం॥రాలకు గానీ పునర్ముద్రణకు సిద్ధం చేయలేకపోయాము. మధ్యలో పునర్ముద్రణపై నీలినీడలు వ్యాపించడం కూడా ఆలస్యానికి మరో కారణం. వాటిని అధిగమించాం. ఆరోగ్యం సహకరించనప్పటికీ, పట్టుదలతో తన బాధ్యతను

నిర్విఘ్నంగా నెరవేర్చిన కామ్రేడ్ రావు కృష్ణారావు అభినందనీయులు. వారికి హృదయపూర్వక కృతజ్ఞతాభివందనాలు.

సక్రమంగా డి.టి.పి. చేయించడానికీ, ప్రూఫులు దిద్దడానికి కూడా సుదీర్ఘకాలం పట్టింది. సాంకేతిక పదాలు, శాస్త్ర సంబంధిత అంశాలు, గణాంకాలు, పట్టికలు వగైరాలను మూలగ్రంథ విధేయంగా తీసుకురావడానికి కూడా సమర్థులైన డి.టి.పి. ఆపరేటర్ల, ప్రూఫ్‌రీడర్ల ఆవశ్యకత ప్రత్యేకంగా పేర్కొనవలసిన అవసరంలేదు. విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్‌కున్న పరిమిత వనరులతోనే ఈ అంశాలన్నింటిలోనూ జాగ్రత్తపడ్డాం. ఎంతో ఓర్పుతో సంపాదకులు, సిబ్బంది శ్రమించి ఈ గ్రంథాన్ని ముద్రణకు సిద్ధం చేశారు.

యజ్ఞంలాగా సాగిన ఈ బృహత్తర కార్యక్రమానికి స్ఫూర్తినిచ్చిన భారత కమ్యూనిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ సురవరం సుధాకరరెడ్డిగార్కి, సి.పి.ఐ. ఆంధ్రప్రదేశ్ సమితి మాజీ కార్యదర్శి, నేటి కేంద్ర కార్యదర్శివర్గ సభ్యులు కామ్రేడ్ డా॥ కె. నారాయణగార్కి, సి.పి.ఐ. కేంద్ర కంట్రోల్ కమిషన్ ఛైర్మన్, పెట్టుబడి గ్రంథం పునర్ముద్రణ ఉపసంఘం ఛైర్మన్ కామ్రేడ్ ఈడ్పుగంటి నాగేశ్వరరావుగార్కి, సి.పి.ఐ. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమితి కార్యదర్శి కామ్రేడ్ కె. రామకృష్ణగారికి విప్లవాభివందనాలు.

విశాలాంధ్ర విజ్ఞాన సమితి రథసారథులు, రాష్ట్ర కమ్యూనిస్టు సమితి కార్యదర్శివర్గ సభ్యులు, కమ్యూనిస్టు పార్టీ నాయకులైన కామ్రేడ్స్ ముప్పాళ నాగేశ్వరరావు, జె.వి.వి. సత్యనారాయణమూర్తి, రావుల వెంకయ్య, పి. హరినాథరెడ్డి, జల్లి విల్సన్, జి. ఓబులేసు, పి.జె. చంద్రశేఖరరావు, మానం ఆంజనేయులు, నల్లూరి వెంకటేశ్వర్లు గార్లు వెన్నుతట్టి ప్రోత్సహించినందుకు కృతజ్ఞతాభివందనాలు.

అవిభక్త రాష్ట్రంలో విశాలాంధ్ర విజ్ఞాన సమితి అధ్యక్షులు కామ్రేడ్ చాడా వెంకటరెడ్డి, కార్యదర్శి కామ్రేడ్ బి.ఎస్.ఆర్. మోహన్‌రెడ్డి, కోశాధికారి కామ్రేడ్ డా॥ వి. రాంప్రసాద్, జనరల్ మేనేజర్ కామ్రేడ్ వై. చెంచయ్యగార్లకు కృతజ్ఞతలు.

ఈ ఐదు సం॥రాల కాలంలో ఈ ప్రాజెక్టు పూర్తిచేయడానికి సలహాలనిచ్చిన ఆచార్య నన్నపనేని అంజయ్యకు, విశ్రాంత అసోసియేట్ ఆచార్యులు గడ్డం సుశీలకు, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ డి.టి.పి. సిబ్బందికి, ప్రూఫ్‌రీడింగ్ చేసినవారికి, ప్రింటింగ్ ప్రెస్ సిబ్బందికి, ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ ఈ బృహత్ కార్యక్రమంలో సహాయ, సహకారాన్ని అందించిన వారందరికి హృదయపూర్వక ధన్యవాదాలు.

**కృతజ్ఞతాభివందనాలతో**

**టి. మనోహర్ నాయుడు**
**మేనేజర్**
**విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్**

**గడ్డం కోటేశ్వరరావు**
**సంపాదకుడు**
**విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ &**
**డిప్యూటీ జనరల్ మేనేజర్, విశాలాంధ్ర విజ్ఞాన సమితి**

## తెలుగులో రెండవ ముద్రణకు

# ముందుమాట

**"పెట్టుబడి"** (Capital) **మొదటి సంపుటం** 1867లో, రెండవ సంపుటం 1885లో, మూడవ సంపుటం 1894లో వెలువడినాయి. ప్రపంచ వ్యాపితంగా అనేక భాషల్లోకి అనువదించబడి, కోట్లాదిమందికి మార్గదర్శిగా "పెట్టుబడి" గ్రంథం ఆచంద్రతారార్కంగా వెలుగొందుతోంది.

సమగ్ర తెలుగు అనువాదం దాదాపుగా దశాబ్ద కాలంపాటు సాగి 1996లో మొదటి ముద్రణతో ముగిసింది. ఆ తర్వాత రెండవ, మూడవ సంపుటాలు తెలుగులో వెలువడ్డాయి.

"పెట్టుబడి" గ్రంథం వెలువడి నూటయాభై సంవత్సరాలైనా, దాని ప్రాధాన్యత నానాటికీ పెరుగుతూనే ఉందిగాని, తరగడం లేదు. అందులో విశ్లేషించిన అంశాలు, ప్రతిపాదించిన సూత్రీకరణలు సజీవంగా నేటికీ మన సామాజిక జీవనంలో ప్రస్ఫుటంగా కనిపిస్తున్నందు వల్లనే ఆ గ్రంథానికి అంత ప్రాధాన్యత ఉంది. 2008లో అమెరికాతో ప్రారంభమై ప్రపంచంలోని పెట్టుబడిదారీ దేశాలనూ, వాటితో వ్యాపార లావాదేవీలు కలిగిన అభివృద్ధి చెందుతున్న దేశాలను సహితం కుదిపివేసిన ఆర్థిక సంక్షోభం అనంతరం మార్క్సిస్టు మేధావులతోపాటుగా ఇతర మేధావులు, ఆర్థికవేత్తలు పెట్టుబడి గ్రంథాన్ని తిరిగి అధ్యయనం చేస్తున్నారన్న వార్తలు ఆ గ్రంథ ప్రాధాన్యతను నొక్కి వక్కాణిస్తున్నాయి. ప్రపంచ వ్యాపితంగా లక్షల సంఖ్యలో పెట్టుబడి గ్రంథ కాపీలు పునర్ముద్రించబడ్డాయి.

"పెట్టుబడి" గ్రంథాన్ని మార్క్స్ రాస్తున్న కాలంలో పెట్టుబడిదారీ విధానం ఉచ్ఛదశలో ఉంది. మానవ శ్రమను పెట్టుబడిదారు దోచుకోవడంపై ఆధారపడిన ఉత్పత్తి విధానం ఆనాడు ఇంగ్లండులో గట్టిగా వేళ్ళూనుకొని ఉంది. ఐరోపా దేశాలకూ, ఉత్తర అమెరికాకూ పెట్టుబడిదారీ వ్యవస్థ విస్తరిస్తూ ఉండేది. తనని తాను రక్షించుకోడానికి కార్మికవర్గం అప్పడప్పడే బలం కూడగట్టుకోవడం ప్రారంభించింది.

పెట్టుబడిదారీ విధానం తీగలుగా సాగి, లోతుగా వేళ్ళూనుకొని, ఎక్కువ దేశాలకూ, ఆర్థిక రంగాలకూ విస్తరించే కొలదీ ఆ ఉత్పత్తి విధానంలోని తీవ్ర వైరుధ్యాలూ, శత్రుత్వాలూ మరింత సమగ్రంగా నానాటికీ బట్టబయలయ్యాయి. 19వ శతాబ్దపు చరమాంకంలో, గుత్త సంస్థలు ఇంకా పూర్తిగా అవతరించకముందు కాలంలో, పెట్టుబడిదారీ విధానం సామ్రాజ్యవాదంగా పరిణామం చెందనారంభించింది. అది బూర్జువా సమాజ పరిమాణంలో ఒక నూతన దశకు నాందీ ప్రస్తావన పలికింది. దాన్నే తరవాత కాలంలో బూర్జువావర్గ సమాజపు అత్యున్నత దశనీ, దాని చరమ దశ

అనీ, సోషలిస్టు విప్లవారంభానికి ముంగిట దశ అనీ లెనిన్ పేర్కొన్నాడు. ఆ కాలంలోనే "పెట్టుబడి" గ్రంథం వెలువడింది.

1917 అక్టోబరులో ఆనాటి రష్యాలో ప్రపంచాన్ని కుదిపేసిన గొప్ప ఘటన ఒక నూతన యుగానికి నాందీ ప్రస్తావన పలికింది. కోటానుకోట్ల ప్రజలు చరిత్రను సృష్టించ నారంభించారు. ఆ తర్వాత ప్రపంచ వ్యాపితంగా జరిగిన ఘటనలు, పర్యవసానంగా సామాజిక పునరుజ్జీవనమూ, అవధుల్లేని బలంతో, విస్తృతితో నమ్మశక్యంగాని గమనంతో, నూతన రీతిలో అభివృద్ధి చెందాయి. ఉత్పత్తి శక్తులు ప్రపంచ వ్యాపితంగా బలం పుంజుకున్నాయి.

"పెట్టుబడి" గ్రంథంలోని భావాలు గత నూటయాభై సంవత్సరాల ప్రపంచ చరిత్ర పరిణామ క్రమంలో ముఖ్య భూమికను పోషించాయి. దూరదృష్టీ, వివేచనాశక్తీ గల వారందరికీ ఆ భావాల ప్రాధాన్యత స్పష్టంగా కనిపిస్తుంది. ప్రగతిశీల శక్తులను సమీకరించే పతాకంగా ఉన్న మార్క్సిస్టు-లెనినిస్టు సిద్ధాంతానికి "పెట్టుబడి" గ్రంథం ఈ కాలంలో దృఢమైన పునాదిగా ఉంది. అందులోని భావాలకు గల జీవశక్తిని సామాజిక పరిణామ క్రమం యావత్తూ నిరూపించింది.

ఈ గ్రంథం నిర్వహించిన అద్భుత పాత్రకు మార్క్స్ కనిపెట్టిన రెండు గొప్ప (సిద్ధాంతాలు) విషయాలు కారణం : **ఒకటి - భౌతికవాద దృక్పథంతో చరిత్రను అవగాహన చేసుకోవడం; రెండు - అదనపు విలువ సిద్ధాంతం.** పర్యవసానంగా సోషలిజం ఊహాజనిత సిద్ధాంత స్థాయి నుండి శాస్త్ర ప్రాతిపదిక సిద్ధాంతంగా అభివృద్ధి చెందింది.

చరిత్రను భౌతికవాద దృక్పథం నుండి అర్థం చేసుకోవడం అంటే, సామాజిక జీవితానికి శాస్త్రీయ జ్ఞానాన్ని వర్తింపజేయడమే! అజ్ఞానం తలదాచుకున్న ఆఖరి దుర్గం నుండి దాన్ని శాశ్వతంగా పారదోలడానికి సైద్ధాంతిక ఆటంకాలు తొలిగాయి. ప్రకృతిని గురించిన మానవ జ్ఞానానికీ, సమాజాన్ని గురించిన జ్ఞానానికీ మధ్య గల అంతరం తొలగించబడింది. అనంతమైన వైవిధ్యంతోనూ, నిరంతరమైన మార్పులతోనూ కనిపించే ప్రపంచాన్ని అవగాహన చేసుకోవడానికి సర్వతోముఖ జ్ఞానార్జనకు అవకాశం కలిగింది.

శ్రమకు, పెట్టుబడికీ మధ్య సంబంధాలను రహస్యంగా ఉంచిన తెరను అదనపు విలువ సిద్ధాంతం తొలగించివేసింది. పెట్టుబడిదారీ దోపిడీలోని ఆంతర్యాన్ని బట్టబయలు చేసింది; పెట్టుబడిదారీ వ్యవస్థ పరిణామానికి సంబంధించిన ఆర్థిక సూత్రాన్ని వెలుగులోకి తెచ్చింది. చరిత్రలో పెట్టుబడిదారీ వ్యవస్థకు గల స్థానాన్ని వివరించింది. పెట్టుబడిదారీ విధానం శాశ్వతమైనది కాదనీ, మార్పు లేనటువంటి సామాజిక వ్యవస్థ కాదనీ, మానవజాతి చరిత్రలో ఆద్యంతాలు గల ఒక తాత్కాలిక దశ అనీ పెట్టుబడి గ్రంథంలోని సూత్రీకరణలు నిరూపించాయి.

చరిత్రలో పెట్టుబడిదారీ విధానం ఒక తాత్కాలికమైన దశగా మార్క్సిస్టు సిద్ధాంత మూల పురుషులు నిరూపించడమేగాక, కార్మికవర్గం విప్లవాత్మకమైన మార్పును తీసుకురాగలదనీ, పెట్టుబడిదారీ విధానం స్థానే సోషలిజాన్ని స్థాపించగలిగే శక్తి ఆ వర్గానికి ఉన్నదనీ, ఆ సిద్ధాంతకర్తలు వెల్లడించారు. కార్మికవర్గ ప్రపంచ దృక్పథానికి గల ప్రాతిపదికను నిరూపించడమే గాక ఆ భావన విస్తరిస్తుందని "పెట్టుబడి" గ్రంథం నిరూపించింది. పెట్టుబడిదారీ వ్యవస్థ పుట్టుకకు, పెరుగుదలకు,

పతనానికి గల కారణాలను శాస్త్రీయంగా పెట్టుబడి గ్రంథం నిరూపించింది. దాని స్థానంలో నూతన సమాజం ఆవిర్భావానికి గల ప్రాతిపదికనూ వెల్లడించింది. సామాజిక జీవనాన్ని అవగాహన చేసుకోడానికి గల కీలకమైన అంశాలను "పెట్టుబడి" గ్రంథం మనకు అందించింది. అద్భుతమైన ప్రపంచ దృక్పథాన్ని కలిగించడంలోనూ, విప్లవ దృక్పథాన్ని ఏర్పర్చడంలోనూ మార్క్సిస్టు-లెనినిస్టు సిద్ధాంతం మహత్తరమైన పాత్ర పోషించింది. వాస్తవికమైన శాస్త్రీయ ప్రాతిపదిక గల సిద్ధాంతం అయినందువల్లనే ప్రపంచంలో అది విశిష్ట స్థాయిలో కీర్తించబడుతోంది. అందుకు మూలకారణం "పెట్టుబడి" గ్రంథంలోని సూత్రీకరణలే!

మూఢనమ్మకాలతోనూ, దోపిడీ వ్యవస్థ రక్షణ సిద్ధాంతాలతోనూ, వాటిని సమర్థించే తత్వంతోనూ, క్రియాశూన్యతనూ, సర్వమూ విధికృతమనే వాదనను ప్రతిపాదించే తత్వంతోనూ "పెట్టుబడి" గ్రంథంలోని సూత్రీకరణలకు పొత్తులేదు.

సామాజిక శాస్త్రజ్ఞుడుగా మార్క్స్ సాధించిన మహత్తర విజయం "పెట్టుబడి" రచన.

సామాజిక, ఆర్థిక నిర్మాణం, ఉత్పాదక శక్తుల పరిణామంలోని ఒకానొక నిర్దిష్ట దశలో రూపొందే ఉత్పత్తి సంబంధాలు, రాజకీయ ఉపరితల నిర్మాణానికి ప్రాతిపదికలుగా ఉంటాయనీ, అందుకు అనుగుణంగానే ఆయా సిద్ధాంతాల స్వరూపం ఉంటుందనీ చారిత్రక భౌతికవాదం, తత్వశాస్త్రం చెప్తాయి. తత్వశాస్త్ర మూలసూత్రం అదే! ఆర్థిక వ్యవస్థ సామాజిక జీవితానికి ప్రాతిపదిక అని మార్క్స్ గుర్తించాడు. అందువల్లనే ఆయన ప్రధానంగా పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానాన్నే "పెట్టుబడి" గ్రంథంలో పరిశీలించి, బూర్జువా వ్యవస్థ అంగాంగ స్వరూపాన్ని చిత్రించాడు.

మార్క్స్ ప్రధాన రచన అయిన "పెట్టుబడి" గొప్ప పరిశోధనా గ్రంథం. అది పెట్టుబడిదారీ విధాన పుట్టుక, పెరుగుదల, పతనాలను విశదీకరిస్తుంది. అపారమైన చారిత్రకాంశాలనూ స్థూలంగా సూత్రీకరిస్తుంది. ఇదొక గంభీరమైన తాత్విక రచన. ఒంక నిర్దిష్ట సామాజిక - ఆర్థిక నిర్మాణాన్ని గతితార్కిక సూత్రాల ప్రాతిపదికగా మార్క్స్ విశ్లేషించాడు. అదొక విజ్ఞాన సర్వస్వం.

మార్క్స్ గొప్ప విప్లవకారుడు. పెట్టుబడి రచనే అందుకు ప్రబల తార్కాణం. కార్మికవర్గ పోరాటానికి ఈ గ్రంథం గొప్ప సైద్ధాంతిక ఆయుధంగా ఉపయోగపడింది. మార్క్స్ ఊగిసలాట ఎరుగని విప్లవకారుడు. పెట్టుబడి గ్రంథానికి తన జీవితాన్ని ధారపోశాడు; రక్త తర్పణం చేశాడంటే అతిశయోక్తి కాదేమో!

## II

సిద్ధాంతాన్ని, చరిత్రను సమ్మిళితం చేసి (Integrate) సమగ్రంగా సమన్వయించు కోవడం ద్వారా సాంప్రదాయక రాజకీయ అర్థశాస్త్రం మీద, నయా ఉదారవాద ఆర్థిక సిద్ధాంతాల మీద ఆర్థిక సిద్ధాంతాల పరిధిలో మార్క్సిస్టు అర్థశాస్త్రం పైచేయి సాధించింది. పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానపు అభివృద్ధి ధోరణులనూ, అందులోని వైరుధ్యాలనూ "పెట్టుబడి" గ్రంథంలోని సూత్రీకరణలు శాస్త్రీయంగా విశదీకరించగలుగుతున్నందువల్లనే ఆ గ్రంథ శత్రువులు కూడా నిరంతరాయంగా దాని పుటలను తిరగేస్తున్నారు. ఆ గ్రంథంలోని ఆ సూత్రీకరణలను ఆధారం చేసుకుని తమ

సమకాలీన ఆర్థిక సమస్యలను, సామాజిక సమస్యలను విశదీకరిస్తూ పుంఖానుపుంఖాలుగా మార్క్సిస్టు సిద్ధాంతవేత్తలు పుస్తకాలు, వ్యాసాలు రాశారు. గత నూటయాభై సంవత్సరాల్లో వెలువడిన వ్యాసాలూ, గ్రంథాలు లక్షకు మించిపోయాయంటే, అతిశయోక్తి కాదు. (వెబ్‌సైట్‌లో కనిపించే మార్క్సిస్టు ప్రాచీన గ్రంథాలయంలో గాని, పురావస్తుశాలలో (Archives) గానీ ఉన్న పుస్తకాలను, వ్యాసాలను ముద్రిస్తే అవి అన్నీ ఒక అరడజను లారీల లోడుకు సరిపోతాయి.) అనేకమంది మార్క్సిస్టు సిద్ధాంత శత్రువులు కొన్ని వేలసార్లు కొన్ని తరాలపాటు మార్క్స్‌ను, ఆయన సిద్ధాంతాలనూ, ప్రత్యేకించి "పెట్టుబడి" గ్రంథంలోని సూత్రాలనూ ఖండనమండనలకు గురిచేస్తూ, వాటిల్లోని "లోటు పాట్లను" అశాస్త్రీయంగా రుజువు చేయ ప్రయత్నించారు. మార్క్సిస్టు సిద్ధాంతాల సానుభూతిపరులు కొంతమంది ఆ సూత్రాలకు వక్రభాష్యాలు చెప్పారు. అయినప్పటికీ "పెట్టుబడి" గ్రంథంలోని సూత్రీకరణలు మాసిపోలేదు, మరుగునపడలేదు. పైగా వాటి అధ్యయనం, అన్వయింపు నానాటికీ పెరుగుతోంది.

శ్రామికవర్గ "నికృష్ట పేదరికం" (absolute impoverishment of the working class) నిరంతరాయంగా పెరుగుతుందని మార్క్స్ చెప్పాడని అక్రమార్కులు వక్రభాష్యం చెప్పారు. మార్క్స్ చెప్పని విషయాన్ని ఆయనకు అంటగట్టి కొంతమంది విమర్శించారు. "పెట్టుబడి" గ్రంథం మొదటి సంపుటంలో పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానాల లోతుపాతులనూ, అందులోని వైరుధ్యాలనూ మార్క్స్ శాస్త్రీయంగా విశ్లేషించాడు. ఈ అంశమే గత నూటయాభై సంవత్సరాల్లో ప్రధాన చర్చనీయాంశ మైంది. ఆ గ్రంథం వెలువబడిన ప్రారంభకాలం నాటి నుండి కొంతకాలంపాటు నిశ్శబ్దాన్ని పాటించడం ద్వారా అందులోని వాస్తవాలను వెలుగుచూడనివ్వకుండా మూసివేయ ప్రయత్నించారు. ఆ తర్వాత వాటిల్లోని "అశాస్త్రీయతను" తమ "దివ్యజ్ఞానం" ద్వారా రుజువుచేయ ప్రయత్నించారు. విమర్శకుల దురభిప్రాయాలు శతకోటిమార్లు అజ్ఞాన శాస్త్ర సూత్రాలుగా రుజువు చేయబడి మహాసముద్రాల్లో కలిసిపోయాయి.

పెట్టుబడిదారీ విధానం అనివార్యంగా పతనమవుతుందని (దానికదే) మార్క్స్ చెప్పాడని మరో అపవాదు మార్క్స్ మీద వేశారు. సోషలిస్టు ఉద్యమంలో మార్క్సిజం అనుయాయులలో కొంతమందితోపాటు కొంతమంది బూర్జువా సిద్ధాంతవేత్తలు కూడా ఆ బాపతు మేధావుల్లో ఉన్నారు. ఇక్కడ మరో అంశాన్ని కూడా లేవనెత్తారు. "పెట్టుబడిదారీ విధానం తనకు తానుగా సంస్కరించుకొని మనుగడ సాగిస్తుంది కదా! దీన్ని మార్క్స్ చూడలేదు కదా!" లాంటి చొప్పదంటు ప్రశ్నలు, వక్రభాష్యాలు కూడా పుట్టుకొచ్చాయి.

పెట్టుబడిదారీ విధానం సుదీర్ఘ కాలంపాటు కొన్ని దేశాల్లో కొనసాగింది. కొన్నిచోట్ల కొనసాగుతోంది. అనేక సంక్షోభాలు తట్టుకుంది. ఎన్ని సంక్షోభాలను తట్టుకొని నిలబడుతుందో మార్క్స్ చెప్పలేదు. ఎంతకాలంపాటు పెట్టుబడిదారీ విధానం కొనసాగుతుందో కాల పట్టికను, క్యాలెండర్‌ను మార్క్స్ తయారు చేయలేదు. ఆ ఆర్థిక వ్యవస్థ శక్తి స్తోమతల్ని మన పండిత ప్రకాండులు ఊహించేవరకు మార్క్స్ తూకం వేయలేదు. ఐరోపా దేశాల్లోనూ, అమెరికాలోనూ ప్రస్తుతం మనుగడలో ఉన్న ఆర్థిక వ్యవస్థలను గురించీ, వాటి పని తీరు గురించీ, వాటి నిశ్చలత్వాన్ని

గురించీ, అందులో సంభవిస్తున్న సంక్షోభాల గురించీ "పాండిత్య ప్రకర్షను ప్రదర్శించే ప్రకాండులు" నిత్యం గుసగుసలాడుతున్నారు; వ్యాసాలు రాస్తున్నారు; ఉపన్యాసాలు ఇస్తున్నారు. అక్కడక్కడా అయిష్టంగానైనా మార్క్స్‌ను ప్రస్తావిస్తున్నారు. పెట్టుబడిదారీ వ్యవస్థ పేర్లు మార్చి, "మిశ్రమ ఆర్థిక వ్యవస్థ" అనీ, "నిపుణులు నిర్వహించే పెట్టుబడిదారీ విధానం" అనీ, "సంఘటిత పెట్టుబడిదారీ విధానం" అనీ, "మేనేజర్ల సమాజం" అనీ, "సౌభాగ్యవంతమైన సమాజం" అనీ, "సాంకేతిక నిపుణుల నిర్వహణా వ్యవస్థ" అనీ పలు పేర్లతో పిలుస్తున్నారు. పేర్లు ఏమైనా ఆ వ్యవస్థ మౌలిక లక్షణాల్లో మార్పేమీ ఉండదు. ఆ వ్యవస్థ అంతర్గత వైరుధ్యాలను శాస్త్రీయంగా విశదీకరించడానికి బదులుగా బయటకు కనిపించే అంశాలను, ఘటనలను బూర్జువా శాస్త్రవేత్తలు ప్రస్తావిస్తారేగానీ, అందులోని వైరుధ్యాలకు గల కారణాలను ప్రస్తావించరు.

పారిశ్రామిక విప్లవానంతరం ప్రపంచ అభివృద్ధి క్రమాన్ని అవగాహన చేసుకోడానికే గాక, పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం అంటే ఏమిటో నిర్వచించి, అది ఎవరికి ప్రాతినిధ్యం వహిస్తుందో "పెట్టుబడి" గ్రంథం స్పష్టంగా పేర్కొంది. పెట్టుబడిదారీ విధానమంటే అదొక పరిపూర్ణమైన పోటీ (మార్కెట్) వ్యవస్థా (Perfect Competition) కాదూ, నానాటికీ "పెరిగే పేదరికపు" (Increasing Pauperism) వ్యవస్థా కాదు. లేదా "ఫ్యాక్టరీలనూ, కర్మాగారాలను పాలించే లేక నడిపే వ్యాపారస్తుల "వ్యవస్థా" కాదు; లేదా "ద్రవ్యమే సకలార్థసాధనంగా నడిచే" వ్యవస్థా కాదు. ఈ విధమైన అసంపూర్ణ, అర్ధసత్య నిర్వచనాలను మార్క్స్‌కు అంటగట్టి, ఆ మహా మేధావిని విమర్శించడం అజ్ఞానాంధకారంలో మునిగేవారికే చెల్లుతుంది. పైగా ఈ విధమైన నిర్వచనాల మూలంగా అసలు సమస్యలను, వైరుధ్యాలను లోతుగా పరిశీలించడానికి అవకాశం లేని గందరగోళ స్థితికి నెట్టబడతాం. మౌలిక సమస్యల జోలికి పోకుండా ఉపరితలంలోని సమస్యలనే ప్రస్తావించి, అవే అసలు సమస్యలని చెప్పడం పశ్చిమ ఐరోపాలోని బూర్జువా మహా మేధావులకే చెల్లింది! లక్షణాలను (Symptom), కారణాలను (Causes) మమేకం చేసి చూడటంవల్లనే గందరగోళం ఏర్పడుతుంది.

పెట్టుబడిదారీ వ్యవస్థను గురించి, దాని ఉత్పత్తి విధానాన్ని గురించి "పెట్టుబడి" గ్రంథం మౌలికంగా మూడు అంశాలను పేర్కొంటుంది.

1) ఉత్పత్తి ప్రక్రియలో పాల్గొనే అసంఖ్యాక ఉత్పత్తిదార్లు ఉత్పత్తి సాధనాల యజమానులు కారు; కేవలం శ్రమశక్తిని పెట్టుబడిదార్లకు అమ్ముకునే స్థితికి నెట్టబడిన శ్రామికులు మాత్రమే! అదనపు విలువ సృష్టికర్తలైన శ్రామికులు ఆ విలువలో తమ వాటాగా కొంత మాత్రమే పొందగలరు.

2) ఉత్పత్తి సాధనాల యజమానులు, కర్మాగారాలను ఎవరికి వారే విడిగా నిర్వహించుకుంటూ, తమ వాటా మార్కెట్ కోసం పరస్పరం పోటీపడుతూ, సరుకులను మార్కెట్‌లో అమ్ముకుంటారు. తద్వారా "సంపాదించిన" లాభాలను తిరిగి పెట్టుబడిగా మార్పిడి చేసుకుని ప్రైవేట్ ఆస్తిని పోగేసుకుంటారు. (ఉత్పత్తి ప్రక్రియలో ప్రారంభమై రూపొందిన లాభం మార్కెట్‌లో బయటపడుతుంది.)

3) తమ ప్రైవేట్ ఆస్తి, సంపద పోగేసుకోడానికీ, పెరుగుదలకు అదనపు విలువను

అధికాధికంగా గుంజుకోడానికి ఉత్పత్తి సాధనాల యజమానులు నిరంతరాయంగా ప్రయత్నిస్తుంటారు. ఆ విధంగా సాంకేతిక జ్ఞానాన్ని శ్రమశక్తికి జోడించి, పెట్టుబడి అంతర్గత అంగ నిర్మాణాన్ని మార్చుకుంటూ (స్థిర-అస్థిర పెట్టుబడుల మధ్య నిష్పత్తి) పెట్టుబడి కేంద్రీకరణ, సాంద్రీకరణల (Concentration and Centralisation) ద్వారా సంపదను పోగేసుకుంటారు (Accumulation).

ఈ మహా యజ్ఞంలో లాభాల పెరుగుదల, తరుగుదల రేట్లతోపాటు, సంక్షోభాలు సంభవిస్తుంటాయి. పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానపు "జగన్నాటకం" అవగాహన కాకుండా, లాభాలను, సంక్షోభాలను, సంరంభాలను, సమ్మర్థాలను దర్శించలేం! రథానికున్న హంగులను మాత్రమే చూసి, దాని ఇరుసును చూడనిరాకరిస్తే ఆ రథం నడకకు కీలకాంశమేమిటో అర్థం కానట్లే అదనపు విలువ రహస్యాన్ని ఛేదించకుండా పెట్టుబడిదారీ వ్యవస్థ సంపన్నతను అవగాహన చేసుకోలేం.

వ్యవస్థాగతమైన దృక్కోణం నుండి పెట్టుబడిదారీ విధానాన్ని పరిశీలించవచ్చు. 19వ శతాబ్దం చివరి దశలో అనగా 1867లో మార్క్స్ కాలం నాటి పెట్టుబడిదారీ వ్యవస్థకు, 20వ శతాబ్దం చివరి దశలోని పెట్టుబడిదారీ వ్యవస్థకు మౌలిక వ్యత్యాసాలు లేవు; సన్నిహిత సారూప్యత ఉన్నది. అయితే వ్యవస్థాగత (Structural) వ్యత్యాసాలు ఉన్నాయి.

1) 19వ శతాబ్దం చివరి దశలో మధ్యంతరవర్గమైన చిన్న ఉత్పత్తిదార్లు (Intermediate Class of Small Independent Producers) ఉత్పత్తి సాధనాల మీద యాజమాన్యం కలిగి గణనీయమైన సంఖ్యలో ఉత్పత్తి ప్రక్రియలో పాల్గొనేవారు. అయితే ఆ వర్గం దాదాపుగా ఇప్పడు అంతర్ధానమైంది. వారి స్థానంలో శ్రమశక్తిని అమ్ముకుంటూ జీతాలు, వేతనాలు (Wages and Salaries) పొందే శ్రమజీవులు, ఆర్థిక వ్యవస్థలో క్రియాశీలంగా ఉండే ప్రజల్లో 80 శాతం, కొన్ని దేశాల్లో 90 శాతం వరకూ ఉన్నారు.

2) కేంద్రీకరణ, సాంద్రీకరణల పర్యవసానంగా ఒకటీ లేక రెండు వందల పెద్ద కార్పొరేట్ కంపెనీలు లేక సంస్థలు దేశ ఆర్థిక వ్యవస్థపై ఆధిపత్యం వహిస్తున్నాయి. సామ్రాజ్యవాద దేశాలన్నింటిలోనూ ఇదే స్థితి కొనసాగుతున్నది. కొన్ని వందల బహుళజాతి సంస్థల కబంధహస్తాల్లో ప్రపంచంలోని మూడవ వంతు సంపద కేంద్రీకృతమై ఉన్నది.

3) శ్రామిక ఉత్పాదక శక్తి గణనీయంగా పెరిగింది; ఆ మేరకు శ్రమ భారీ స్థాయిలో సామాజీకరించబడింది (Socialization). అందువల్ల ప్రైవేటు ఆస్తి పెంపొందడానికి ప్రతిబంధకాలు ఏర్పడ్డాయి. దీనితోపాటు వనరుల వినియోగం కూడా ఒక స్థాయికి మించి వినియోగించుకోడానికి ఆటంకాలేర్పడ్డాయి. సహజ వనరుల వినియోగం, వాతావరణ కాలుష్యం లాంటి ప్రమాదకర సమస్యలు ముందుకొచ్చాయి. ప్రణాళికాబద్ధంగా వీటిని వినియోగించుకోవాలనే డిమాండ్ ప్రజాందోళనల్లో ముందుకొచ్చింది. పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానపు సాంప్రదాయక దోపిడీకి ఈ అంశాలన్నీ ప్రతిబంధకాలే!

పెట్టుబడిదారీ వ్యవస్థలో ఇన్ని తీవ్ర వైరుధ్యాలున్నప్పటికీ, ఆ వ్యవస్థ ఎందుకు కూలిపోవడం



లేదు? పెట్టుబడిదారీ విధానం "ఆటోమాటిక్" (Automatic)గా, ఎలాంటి ప్రయత్నం లేకుండా, అనివార్యంగా దానికదే కుప్పకూలిపోతుందని మార్క్స్ గానీ, ఆ తర్వాత మార్క్సిస్టులు గానీ చెప్పలేదు (Never Predicted).

"పెట్టుబడి" గ్రంథంలోని మొదటి సంపుటంలో ప్రఖ్యాతిగాంచిన 32వ అధ్యాయంలో పెట్టుబడిదారీ సంచయనం యొక్క చారిత్రక ధోరణిని మార్క్స్ విశ్లేషించాడు. సామాజిక శక్తుల ప్రతిస్పందనను గురించి చెప్పాడు. శ్రామికవర్గం పెరుగుదల, ఆ వర్గ దోపిడీ పెరుగుదల, ఆ వర్గ చైతన్యం పెరుగుదల, శ్రామికవర్గ సంఘటిత తిరుగుబాటు, దాని నాయకత్వ సంసిద్ధత, దాని మిత్రుల సామాజిక సమీకరణలు పెట్టుబడిదారీ వ్యవస్థను కూలదోసే కీలకమైన అంశాలు. మార్క్స్ చెప్పినట్లు "పెట్టుబడి ప్రభువులు నిత్యం క్షీణించే సంఖ్యతోపాటు, దారిద్ర్యం, పీడన, బానిసత్వం, పతనం, దోపిడీల పరిమాణం పెరుగుతుంది; కానీ దానితోపాటు కార్మికవర్గం యొక్క నిరసన కూడా పెరుగుతుంది. ఈ వర్గం నిత్యం సంఖ్యలో పెరుగుతూ, పెట్టుబడిదారీ ఉత్పత్తి క్రమం యొక్క సంవిధానం చేతనే క్రమశిక్షితమై, సమైక్యమై, వ్యవస్థీకృతమైన వర్గం అవుతుంది. ఉత్పత్తి విధానంతోపాటు, ఉత్పత్తి విధానంలో పుట్టి, వర్ధిల్లిన పెట్టుబడి గుత్తాధిపత్యం ఆ ఉత్పత్తి విధానానికి శృంఖలం అవుతుంది. ఉత్పత్తి సాధనాల కేంద్రీకరణా, శ్రమ సామాజీకరణా చివరకు ఏ దశకు చేరుకుంటాయంటే, అక్కడ వాటికీ, వాటి పెట్టుబడిదారీ పై పెంకుకూ పొత్తు కుదరదు. దానితో ఈ పై పెంకు బ్రద్దలౌతుంది. పెట్టుబడిదారీ సొంత ఆస్తికి ఆయువు మూడుతుంది. ఆస్తిహరుల ఆస్తి హరించబడుతుంది."

చరిత్రగతినీ, మన కాలపు మహద్విజయాలనూ, అపజయాలనూ అవగాహన చేసుకోడానికి సహాయపడగలిగిన భావాలకు "పెట్టుబడి" గ్రంథం ఒక అక్షయనిధి. చారిత్రక పరిణామ నూతన అనుభవాలనుపయోగించి, భావజాలాన్ని, ఘటనలను సృజనాత్మకంగా వివరించగలిగిన మార్క్సిస్టు-లెనినిస్టు మూలసూత్రాలకు "పెట్టుబడి" గ్రంథం పునాదిరాయి. అలాంటి గ్రంథాన్ని అధ్యయనం చేయడం ప్రతి సామాజిక శాస్త్రవేత్తకూ, ప్రత్యేకించి ప్రతి మార్క్సిస్టు-లెనినిస్టుకూ శ్రమభరితమైనా, సంతోషకరమైన ఉత్తమ కర్తవ్యం కావాలి.

విజయవాడ

1-5-2016

**గడ్డం కోటేశ్వరరావు**

**సంపాదకుడు**

# తెలుగు ప్రచురణకు ఉపోద్ఘాతం

**"కాపిటల్"** ప్రథమ సంపుటం తెలుగు ప్రతిని తయారుచేసి ప్రచురించాలని 10 సంవత్సరాల నాడు నిర్ణయం జరిగినా, అది ఇప్పటివరకు వెలుగు చూడకపోవడం విచారకరమైన విషయం. అనువాదం ప్రారంభమయినప్పటి నుండి ఏవో అవాంతరాలు ఏర్పడుతూ వచ్చాయి. అనువాదకుల ఎంపిక, అనువాదానికి అనుసరించవలసిన మార్గదర్శక సూత్రాల రూపకల్పన, అనువాదాన్ని ఇంగ్లీషు ప్రతితో సరిచూడటం, ఆర్థిక వనరుల ఇబ్బందులు, ఇతర సాంకేతిక సమస్యలు కొంతవరకు కారణం కాగా, తెలుగు ప్రతి ముద్రణకు సిద్ధమయ్యేనాటికి మాస్కోలోని ప్రచురణాలయంతో చేసుకున్న ఒప్పందం రద్దవటంతో ప్రచురణ మరింత ఆలస్యమయింది.[1]

ఇప్పటికి ఆంధ్రప్రదేశ్ కమ్యూనిస్టు సమితి, విశాలాంధ్ర విజ్ఞాన సమితి, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్‌ల సహకారంతో "కాపిటల్" ప్రథమ సంపుటి తెలుగు ప్రతి వెలుగు చూస్తున్నది.

1984లో ఆంధ్రప్రదేశ్ కమ్యూనిస్టు సమితి, కార్యదర్శివర్గం, శ్రీయుతులు వై.వి. కృష్ణారావు, వై. విజయకుమార్, ఈడ్పుగంటి నాగేశ్వరరావులతో కూడిన ఉపసంఘానికి మార్క్స్ కాపిటల్ మూడు సంపుటాలను యధాతథంగా ఎట్టి మినహాయింపులు లేకుండా తెలుగులో తీసుకువచ్చే బాధ్యతను అప్పజెప్పింది. ఈ బృహత్ పథకానికి శ్రీ వై.వి. కృష్ణారావును సమన్వయకర్తగా నియమించింది. అప్పటికి మార్క్స్ కాపిటల్‌కు శ్రీమతి రంగనాయకమ్మగారి "పరిచయం" మాత్రం వెలువడింది. ఆమె కృషి ప్రశంసనీయమే అయినా అది కాపిటల్ అనువాదం కాదు. యధాతథ అనువాదం తెలుగులోకి వస్తే అందరికీ ఎన్నో విధాల తోడ్పడుతుందని ఆమె సూచించారు.

**అనువాదంలో ఎదురైన సమస్యలు :**

ఈ గ్రంథానువాదంలో ఎదురైన సమస్యలూ, అనుసరించిన పద్ధతులు క్లుప్తంగా పేర్కొనడం అవసరం. తెలుగులో ప్రామాణిక అర్థశాస్త్ర గ్రంథాలు తగినన్ని ఇంకా వెలువడని ప్రస్తుత పరిస్థితులలో మార్క్స్ పెట్టుబడి వంటి గ్రంథాన్ని అనువదించడంలో గల పెద్ద చిక్కు, ప్రాచుర్యంలోకి వచ్చి, పాఠకులకు పరిచితమైన పారిభాషిక పదాలు అనేక లేకపోవడం; ఉన్న సందర్భాల్లో, ఆయా రచయితలు ఎవరికి వారు తమకు నచ్చిన పర్యాయపదాన్ని ఎంచుకోవడం. ఉదాహరణకు అర్థ శాస్త్రంలో తరచు తటస్థపడే కన్‌జంప్షన్ (Consumption) అనే పదానికి కొందరు "వినియోగము" అని వాడితే, కొందరు "వినిమయము" అని అంటున్నారు. ఈ రెంటిని కాదని "అనుభోగమని" వాడుట కూడా కద్దు.

---

1. మాస్కోలోని ప్రగతి ప్రచురణాలయం ఆనాటి మేనేజర్/సంపాదకురాలు అయిన శ్రీమతి స్వెత్లానా గారితో 1984లో ''పెట్టుబడి'' గ్రంథ అనువాదాన్ని గురించిన చర్చలలో కామ్రేడ్స్ నిడమర్తి ఉమారాజేశ్వరరావు, ఆర్. వెంకటేశ్వరరావు, గడ్డం కోటేశ్వరరావులు పాల్గొన్నారు. తదనంతరం ఒప్పందం కుదిరింది. ఆ ఒప్పందం మేరకు అనువాదం దాదాపుగా 1984 సంIIరంలోనే ప్రారంభమైంది. అయితే అనేక ఇతర కారణాల రీత్యా ప్రచురణ ఆలస్యమైంది. - **సంపాదకుడు**

మార్క్సిస్టు అర్థశాస్త్రంలోని కొన్ని భావనలు తెలుగు పాఠకులకు కొత్త. మామూలు పాఠక లోకానికే కాదు - విశ్వవిద్యాలయ ఆచార్యులకు కూడా కొత్త అని అనుమానించవలసి వస్తోంది. ఎందువల్లనంటే 'అబ్‌స్ట్రాక్ట్ లేబర్' అంటే ఏమిటో తెలీక ఒక ప్రొఫెసర్ అయోమయంలో పడ్డాడంటే మామూలు పాఠకుల సంగతి చెప్పనవసరం లేదు. కనుక, ఒక పారిభాషిక పదానికి తెలుగులో ఒకే సమానార్థక పదాన్ని స్థిరపరచడం ఒక నియమంగా పాటించాము. వీటికన్న పెద్ద సమస్య మార్క్స్ రచనా విధానం. ఒక్కొక్క సందర్భంలో ఆయన వాక్యాలు సుదీర్ఘమైనవే కాక, జటిలమైనవి కూడా. అవి తెలుగులో ఒక వాక్యంలో ఇమిడేవి కావు. రెండు మూడు అడ్జెక్టివల్ క్లాజెస్, అన్నే అడ్‌వర్బియల్ క్లాజెస్, మధ్యలో ఒక పేరంథిటికల్ క్లాజ్ చోటుచేసుకొన్న వాక్యాలవి. వాటిని తెనిగించడంలో భావ స్పష్టత, అన్వయ సౌలభ్యం, వాక్యం నడక సందర్భోచితంగా వాటిని విడగొట్టడం సులభసాధ్యం కాదు.

ఈ ఉపసంఘము, అనువాదంలో అనుభవం ఉండి మార్క్సిజంతో పరిచయం ఉన్న కొందరి మేధావులను 1984 ఆగస్టులో సమావేశపర్చింది. ఆ సమావేశంలో "కాపిటల్" అనువాదానికి అనుసరించవలసిన పద్ధతులను చర్చించి నిర్ణయించింది. ఈ సమావేశ సూచన మేరకు అనువాదకులు గమనంలో ఉంచుకోవలసిన మార్గదర్శక సూత్రాలను, వారికి తోడ్పడటానికిగాను పారిభాషిక పదకోశాన్ని సంపాదకవర్గం రూపొందించి అనువాదకులకు సరఫరా చేయటం జరిగింది.[1] "కాపిటల్" మొదటి సంపుటాన్ని ప్రారంభంలో ఐదుగురు అనువాదకులకు వేరు వేరు భాగాలను పంచి యివ్వటం జరిగింది. అటు తరువాత వారిలో ఇద్దరికి కారణాంతరముల వల్ల అది సాధ్యపడలేదు. ఎ. గాంధీ, జి. కోటేశ్వరరావు, రాచమల్లు రామచంద్రారెడ్డి వున్నారు.

రాచమల్లు రామచంద్రారెడ్డి అనువదించిన "పెట్టుబడి పుట్టుక" అనే భాగాన్ని మాస్కో ప్రగతి ప్రచురణాలయం అప్పటికే ప్రచురించింది. రాచమల్లు రామచంద్రారెడ్డి దానిని మరొకమారు సరిజూచి యిచ్చారు. ఆ భాగాన్ని యధాతథంగా ఈ సంపుటిలో చేర్చాము. అంతేగాక అనువదించబడిన కాపిటల్ కొన్ని భాగాలను ఆయన సరిజూచారు. కాని అప్పటికే ఆయన ఆరోగ్యము దెబ్బతినడంతో తానా బాధ్యతను నెరవేర్చలేనని చెప్పడంతో ఆ బాధ్యతను సంపాదక వర్గం చేపట్టింది. అనువాదకులు తమకు ఎదురైన చిక్కులను ఎప్పటికప్పుడు సంపాదక వర్గానికి తెలిపి వివరణ పొందారు. అనువాద కార్యక్రమం సాగుతున్న కాలములో 3, 4 పర్యాయాలు అనువాదకుల సంపాదకుల సమీక్షా సమావేశాలు జరిగాయి.

తెలుగు అనువాదానికి మేము 1954లో మాస్కో "ఫారిన్ లాంగ్వేజెస్ పబ్లిషింగ్ హౌస్" వారు ప్రచురించిన "కాపిటల్" ప్రథమ సంపుటాన్ని ఆధారంగా తీసుకున్నాము. అయితే ఇక్కడ మరో మాట చెప్పాలి. బహు భాషాకోవిదుడైన మార్క్స్ రచనలో గ్రీకు, లాటిన్, ఫ్రెంచి తదితర భాషల్లోని పదబంధాలు, సామెతలు తరచు ఎదురవుతుంటాయి. వాటిని తెనిగించడానికి పెంగ్విన్ ప్రతిలోని వాటి ఆంగ్లీకరణ అనువాదాలను ఆధారము చేసుకోవడం జరిగింది.

మార్క్స్ "కాపిటల్" ప్రథమ సంపుటిలో పలు పాదసూచికలు వున్నాయి. ఇందులో కొన్ని

---

1. పారిభాషిక పదకోశాన్ని ముందుగా కామ్రేడ్ గడ్డం కోటేశ్వరరావు తయారుచేశారు. ఆ పదకోశాన్ని పరిపుష్టం చేయడానికి కామ్రేడ్స్ రాచమల్లు రామచంద్రారెడ్డి, రాంభట్ల కృష్ణమూర్తి, గడ్డం కోటేశ్వరరావులతో ఒక ఉపసంఘాన్ని సంపాదకవర్గం నియమించింది. ఆ ఉపసంఘం తయారుచేసిన పారిభాషిక పదకోశమే అనువాదానికి ప్రాతిపదిక అయింది. **- సంపాదకుడు**

దీర్ఘంగా కూడా వున్నాయి. "కాపిటల్" మూలములోని విషయాన్ని అర్థం చేసుకోడానికి ఈ పాద సూచికలు ఎంతో తోడ్పడుతాయి. వీటిని విడిచిపెట్టిన అనువాదం సంపూర్ణ అనువాదం అనిపించుకోదు. హిందీ మొదలగు భారతీయ భాషలలో ప్రచురించిన "కాపిటల్" అనువాదాలలో ఈ పాద సూచికలతో సహా ప్రచురించటం జరిగింది. మేము ఈ పద్ధతినే అనుసరించాము.

అంతేగాదు, అనువాదంలో ఏ భాగంలోను ఎక్కడా అనుకరణకు పూనుకోలేదు. మార్క్స్ "కాపిటల్"లోని అన్ని భాగాలను, కాపిటల్ చివర గల రచయితల, పత్రికల తదితర అనుబంధాలతో సహా యధాతథంగా అధికారయుత అనువాదంగా తీసుకురావడం జరిగింది.

ఇక సమీకరణల ఆంధ్రీకరణలో మార్క్స్ పద్ధతినే అనుసరించటం జరిగింది. ఉదాహరణకు, యం.సి.యం. (మనీ - కమోడిటీ - మనీ) అనే సమీకరణలో తెలుగులో డ-స-డ (డబ్బు - సరుకు - డబ్బు) అయింది. రెండవ, మూడవ సంపుటాల్లోని జటిలమైన సమీకరణల సందర్భంలో కూడా ఇదే పద్ధతిని అనుసరించడం వల్ల ఏ సంకేతాక్షరాలు ఏ పదాలను సూచిస్తాయో పాఠకులు సులభంగా గుర్తించవచ్చు. మరోమాట - అనువాదంలో పదప్రయోగం ఆద్యంతము ఒకే విధంగా వున్నదీ, లేనిదీ సరిజూచే బాధ్యతను శ్రీ సోదుం రామ్మోహన్‌కు అప్పగించాము. మాస్కో ప్రగతి ప్రచురణాలయం శ్రీ ఓమ్‌ప్రకాశ్ సంగల్ హిందీలోకి అనువదించిన మార్క్స్ కాపిటల్ ప్రథమ సంపుటిని ప్రచురించింది. అనువాదంలో సరైన తెలుగు పదం దొరకనప్పుడు, మూలంలోని భావం సక్రమంగా వచ్చినదీ, లేనిదీ సరిజూడటానికి సంపాదకులు, అనువాదకులు కూడా ఈ హిందీ సంపుటిని ఉపయోగించుకోవటం జరిగింది.

**మార్క్సిజం - నేడు**

ఆంధ్రదేశంలో గత అర్ధశతాబ్ద కాలంగా కమ్యూనిస్టు ఉద్యమం సల్పిన కృషి ఫలితంగా మార్క్స్ సిద్ధాంత భావాలు విస్తృత వ్యాప్తిపొందాయి. వేలాదిమంది ఉద్యమకారులు, ట్రేడ్ యూనియన్ కార్యకర్తలు మార్క్స్ రచనలను చదివారు. విశ్వవిద్యాలయాల్లో, కళాశాలల్లో సామాజిక శాస్త్రాల్లో భాగంగా మార్క్స్ సిద్ధాంతం ఒక పాఠ్యాంశంగా బోధించబడుతున్నది. సోషలిజం ఆశయంగా ఆంధ్ర దేశంలో గొప్ప ఉద్యమాలు సాగాయి. తెలంగాణా వీరోచిత రైతాంగ పోరాటం, ఆంధ్రప్రాంతంలో జమీందారీ వ్యతిరేక రైతాంగ పోరాటాలు, సమకాలీన చరిత్రలో మైలురాళ్ళుగా నిలుస్తాయి.

ఆంధ్రచరిత్ర, సంస్కృతీ, సాహిత్యాలను శాస్త్రీయ దృష్టితో పరిశీలించి వాటిలోని ప్రగతిశీల అంశాలను, విలువలను వెలుగులోకి తీసుకురావటంలో పండితులకు, మేధావులకు మార్క్సిస్టు పరిశీలనా పద్ధతి గొప్పగా తోడ్పడింది. తెలుగు ప్రజల రాజకీయ, సామాజిక ఆలోచనను ప్రభావితం చేసిన ఆధునిక ఉద్యమాలలో మార్క్సిజం ప్రముఖ స్థానాన్ని కల్గివున్నది.

భిన్న రాజకీయ, సిద్ధాంత ధోరణులు ఆంధ్రదేశంలో గతంలోనూ, నేడూ ప్రచారంలో వున్నాయి. మార్క్సిజంను బాహాటంగా వ్యతిరేకించే రచనలు రాకపోలేదు. సమకాలీన రాజకీయ చరిత్రలో కొన్ని కీలక దశలలో కమ్యూనిస్టు వ్యతిరేక దుమారాన్ని రెచ్చగొట్టిన సందర్భాలు వున్నాయి. నేటి పరిస్థితి కొంత భిన్నమయినది. సోవియట్ యూనియన్, తూర్పు యూరప్ దేశాలలో సోషలిస్టు వ్యవస్థ కూలిపోవటంతో మార్క్సిజానికి కాలం చెల్లిందని, సోషలిజానికి భవిష్యత్తు లేదనే ప్రచారం ప్రపంచ వ్యాప్తంగాను, ఆంధ్రదేశంలోను ఉధృతంగా సాగుతున్నది. కాపిటలిజాన్ని బాహాటంగా సమర్థించలేని వారిలో సైతం దానికి ప్రత్యామ్నాయం లేదనే గందరగోళం వ్యాపించింది. "స్వేచ్ఛా మార్కెట్ ఆర్థిక విధానమే" శరణ్యం అనే పేరుతో సైద్ధాంతిక ఎదురుదాడి ప్రారంభమయింది. ప్రయివేటీకరణ, సరళీకరణ విధానం, "గ్లోబలైజేషన్" (అంతర్జాతీయకరణ) విధానాలు అనివార్యం

అనే పేరుతో కాపిటలిజాన్ని సమర్థించే రచనలు నేడు తామరతంపరగా వెలువడుతున్నాయి.

కాని కాపిటలిజంలోని వైరుధ్యాలు సమసిపోలేదు. సమాజ సంక్షేమాన్ని, ప్రజల అవసరాలను అది పరిపూర్తి చేయలేదు. మానవాళి మనుగడ, పర్యావరణ సంరక్షణ, తృతీయ ప్రపంచ దేశాలలో తిష్టవేసిన నికృష్ట దారిద్ర్యం, వెనుకబాటుతనం, పశ్చిమదేశాలలో విస్తరిస్తోన్న నిరుద్యోగం లాంటి అంతర్జాతీయ (గ్లోబల్) సమస్యలు మనలను వెంటాడుతున్నాయి. గ్లోబల్ కాపిటలిజంలో నేడు నూతన పరిణామాలు ఏర్పడినాయి. బహుళజాతి కార్పొరేషన్ల ప్రాధాన్యత, ప్రభావం పెరిగింది. పారిశ్రామిక ఉత్పత్తి క్రమంలోనూ, ఫైనాన్షియల్ పెట్టుబడి, వాణిజ్య వ్యాపారాలలోనూ అంతర్జాతీయ కరణ పెరుగుతున్నది. దోపిడి, పీడన, ఆధిపత్యం లేకుండా కాపిటలిజం జీవించలేదు. శాస్త్ర, సాంకేతిక విప్లవం సాధించిన ప్రయోజనాలను సమాజ సమష్టి ప్రయోజనాలకు కాకుండా కొద్దిమంది స్వార్థం కొరకు, లాభం కొరకు వాటిని వినియోగించుకుంటున్నారు. అభివృద్ధిచెందిన పెట్టుబడిదారీ దేశాలలో ఉద్యోగిత పెరగని పారిశ్రామికాభివృద్ధి జరుగుతోంది. పశ్చిమ దేశాలలో ప్రజల సంక్షేమ కార్యక్రమాలపై కాపిటలిజం పెద్ద వేటు వేసింది. పెట్టుబడిదారీ అభివృద్ధి క్రమం వైరుధ్యాలతో కూడినది. పెట్టుబడిదారీ సంబంధాలు ఒకవైపు బలపడుతున్నాయి. రెండవవైపు దాని అమానుషత్వాన్ని ప్రతిఘటించే శక్తులు కూడా పెరుగుతున్నాయి.

పెట్టుబడిదారీ విధానంలో పెరుగుతున్న ఈ వైరుధ్యాలకు పరిష్కారం, ఆ వ్యవస్థలో లేదని మార్క్సిజం స్పష్టంగా చాటి చెప్పింది. సమాజ పరిణామక్రమంలో ఒకానొక దశలో పెట్టుబడిదారీ పద్ధతి ఆవిర్భవించిందని, అది శాశ్వతమైన వ్యవస్థ కాదని మార్క్సిజం విశ్లేషణ చేసింది. పీడనకు, దోపిడీకి గురయ్యే వర్గాలు పోరాటాల ద్వారా సంఘటితమై కాపిటలిజానికి ప్రత్యామ్నాయంగా సోషలిజం వైపు పురోగమిస్తాయని మార్క్సిజం చెప్పింది. కాపిటలిస్టు వ్యవస్థ నేటికి బలంగా ఉన్నప్పటికీ, సోషలిజానికి కొన్ని ఎదురుదెబ్బలు తగిలినప్పటికీ, కాపిటలిస్టు సంక్షోభాన్ని, దాని అంతర్గత వైరుధ్యాలను పరిశీలిస్తే చరిత్ర క్రమం మార్క్స్ ఆలోచన సరైనదేనని రుజువు చేసింది.

పూర్వపు సోషలిస్టు దేశాలలో అనుసరిస్తున్న పెట్టుబడిదారీ విధానాలు ఆ దేశాలలో పెద్ద సంక్షోభాన్ని సృష్టించాయి. ఆ విధానాలకు పలు దేశాలలో తీవ్ర నిరసన వ్యక్తమయింది. అంతేకాదు, తూర్పు, కేంద్ర యూరపు దేశాలు కొన్నింటిలో తిరిగి సోషలిజానికి అంకితమైన ప్రభుత్వాలు ఎన్నికల ద్వారా అధికారంలోకి వచ్చాయి. ఈ దేశాలలోనూ, చైనా ప్రజాతంత్ర రిపబ్లిక్, వియత్నాం, ఉత్తర కొరియా, క్యూబా మొదలగు సోషలిస్టు దేశాలలో గతం నుండి గుణపాఠాలు తీసుకొని సోషలిస్టు సమాజ గమ్యం చేరడానికి నూతన మార్గాలు అనుసరించబడుతున్నాయి.

మార్క్స్ రచనల పట్ల, మార్క్సిజం సిద్ధాంతం పట్ల ఇటీవల కాలంలో తిరిగి ఆసక్తి పెరుగు తున్నది. ఈ పరిణామం భవిష్యత్తు పట్ల నూతన విశ్వాసాన్ని కల్గిస్తున్నది.

మార్క్స్ మహత్తర గ్రంథం "కాపిటల్" ప్రథమ సంపుటి తెలుగు ప్రతిని సమగ్రంగా రూపొందించి, ఆంధ్ర పాఠకలోకానికి అందిస్తున్నందుకు, కొంత ఆలస్యమైనప్పటికి సంతోషిస్తున్నాం. ఈ మా కృషిలో తోడ్పడిన అనువాదకులకు, ఇతర విధాల తోడ్పడిన మిత్రులకు మా హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తున్నాం.

హైదరాబాదు **సంపాదకవర్గం**

తేది : 7 నవంబరు, 1995

**1809 జూన్ 21న టార్నావ్‌లో జన్మించి,**

**1864 మే 9న మాంచెస్టర్‌లో ప్రవాసంలో మరణించిన,**

**శ్రామికుల పక్షాన నిర్భయంగా,**

**విశ్వసనీయంగా నిల్చిన ఉదాత్తుడు,**

**మరచిపోలేని నా ప్రియమిత్రుడు**

## విల్హెల్మ్ ఉల్ఫ్‌కు అంకితం

# విషయసూచిక


| | |
|---|---|
| ఇంగ్లీషు ముద్రణకు ముందుమాట | 1 |
| జర్మన్, ఫ్రెంచ్ ముద్రణలకు | |
| కార్ల్ మార్క్స్ తొలిమాటలు, మలిమాటలు | 6 |
| జర్మన్ రెండో ముద్రణకు చివరి మాట | 10 |
| ఫ్రెంచ్ ముద్రణకు ముందుమాట | 18 |
| ఫ్రెంచ్ ముద్రణకు చివరి మాట | 19 |
| జర్మన్ మూడో ముద్రణకు ఎంగెల్స్ ముందుమాట | 20 |
| జర్మన్ నాలుగో ముద్రణకు ఎంగెల్స్ ముందుమాట | 23 |


## మొదటి భాగం

## సరుకులు, డబ్బు


| | |
|---|---|
| **అధ్యాయం - 1 : సరుకులు** | 31 |
| విభాగం 1 - సరుకు రెండు పార్శ్వాలు, ఉపయోగపు విలువ, విలువ (విలువ సారాంశం, విలువ పరిమాణం) | 31 |
| విభాగం 2 - సరుకులలో మూర్తీభవించిన శ్రమ ద్వంద్వ స్వభావం | 37 |
| విభాగం 3 - విలువ రూపం లేదా మారకం (Exchange) విలువ | 42 |
| అ. ప్రాథమిక లేదా యాదృచ్ఛిక విలువ రూపం | 43 |
| 1. విలువ వ్యక్తీకరణ రెండు ధ్రువాలు - సాపేక్ష రూపం, సమవిలువ రూపం | 43 |
| 2. విలువ సాపేక్ష రూపం | 44 |
| అ. ఈ రూపం స్వభావం, ప్రాధాన్యం | 44 |
| ఆ. సాపేక్ష విలువ పరిమాణాత్మక నిర్ధారణ | 47 |
| 3. సమ విలువ రూపంలో విలువ | 49 |
| 4. విలువ ప్రాథమిక రూపం స్థూల పరిశీలన | 55 |
| ఆ. సంపూర్ణ లేదా విలువ విస్తృత రూపం | 57 |
| 1. సాపేక్ష విలువ విస్తృత రూపం | 57 |
| 2. నిర్దిష్ట సమ విలువ రూపం | 58 |
| 3. సంపూర్ణ లేదా విస్తృత విలువ రూపంలో లోపాలు | 58 |

ఇ. విలువ సాధారణ రూపం 59
1. మారిన విలువ రూపం యొక్క స్వభావం 59
2. విలువ సాపేక్ష, సమ విలువ రూపాల పరస్పరాశ్రయ అభివృద్ధి 61
3. సాధారణ విలువ రూపం నుండి డబ్బు రూపంలోనికి పరివర్తన 63
ఈ. డబ్బు రూపం 63
విభాగం 4 - సరుకుల పూజ - అందులోని రహస్యం 64
**అధ్యాయం - 2 : మార్పిడి (Exchange)** 77
**అధ్యాయం - 3 : డబ్బు లేదా సరుకుల చెలామణి** 86
విభాగం 1 - విలువల కొలమానం 86
విభాగం 2 - చలామణి సాధనం 95
అ. సరుకుల రూపాంతరం 95
ఆ. డబ్బు చలనం 105
ఇ. నాణెమూ, విలువ చిహ్నాలూ 114
విభాగం 3 - డబ్బు 119
అ. నిల్వ 119
ఆ. చెల్లింపు సాధనం 124
ఇ. సార్వత్రిక ద్రవ్యం 131

## రెండవ భాగం

## డబ్బు పెట్టుబడిగా మారటం

**అధ్యాయం - 4 : పెట్టుబడి సాధారణ సూత్రం** 135
**అధ్యాయం - 5 : పెట్టుబడి సాధారణ సూత్రంలో వైరుధ్యాలు** 144
**అధ్యాయం - 6 : శ్రమశక్తి క్రయ విక్రయాలు** 154

## మూడో భాగం

## పరమ అదనపు విలువ ఉత్పత్తి

**అధ్యాయం - 7 : శ్రమ ప్రక్రియా, అదనపు విలువ ఉత్పత్తి ప్రక్రియా** 163
విభాగం : 1 - శ్రమ ప్రక్రియ, లేదా ఉపయోగపు విలువల ఉత్పత్తి 163
విభాగం - 2 - అదనపు విలువ ఉత్పత్తి 171
**అధ్యాయం - 8 : స్థిర పెట్టుబడి - అస్థిర పెట్టుబడి** 183
**అధ్యాయం - 9 : అదనపు విలువ రేటు** 194
విభాగం-1 - శ్రమశక్తి దోపిడీ స్థాయి 194
విభాగం 2 - ఉత్పాదితం విలువ యొక్క అంతర్భాగాలకు తదనుగుణ
పరిమాణం గల ఉత్పాదితపు భాగాల ప్రాతినిధ్యం 202

విభాగం - 3 - సీనియర్ "ఆఖరి గంట" 205

విభాగం - 4 - అదనపు ఉత్పాదితం 210

**అధ్యాయం - 10 : పనిదినం** 211

విభాగం-1 - పనిదినం పరిమితులు 211

విభాగం - 2 - అదనపు శ్రమకై పేరాస, కార్ఖానాదారుడు, జమీందారు 215

విభాగం - 3 - దోపిడీకి చట్టబద్ధ పరిమితుల్లేని ఇంగ్లీషు పారిశ్రామిక శాఖలు 223

విభాగం-4 - రాత్రి పనీ, పగటి పనీ, రిలే పద్ధతి 235

విభాగం - 5 - మామూలు పనిదినానికై పోరాటం - 14వ శతాబ్దం మధ్య భాగం నుండి 17వ శతాబ్దం అంతం వరకూ పనిదినాన్ని విస్తరింపజేయడానికై నిర్బంధ చట్టాలు 243

విభాగం - 6 - మామూలు పనిదినం కోసం పోరాటం - పని కాలానికి చట్టం రీత్యా నిర్బంధ పరిమితి - 1833 నుండి 1864 వరకూ ఇంగ్లీషు ఫ్యాక్టరీ చట్టాలు 255

విభాగం - 7 - మామూలు పనిదినం కోసం పోరాటం - ఇతర దేశాలపై ఇంగ్లీషు ఫ్యాక్టరీ చట్టాల ప్రభావం 274

**అధ్యాయం - 11 : అదనపు విలువ రేటు, అదనపు విలువ మొత్తం** 279


## నాలుగో భాగం

## సాపేక్ష అదనపు విలువ ఉత్పత్తి


**అధ్యాయం - 12 : సాపేక్ష అదనపు విలువ భావన** 288

**అధ్యాయం - 13 : సహకారం** 297

**అధ్యాయం - 14 : శ్రమ విభజన - కార్ఖానా ఉత్పత్తి** 310

విభాగం-1 - కార్ఖానా ఉత్పత్తి ద్వివిధ మూలం 310

విభాగం-2 - ప్రత్యేకీకృత కార్మికుడూ, అతని పరికరాలు 313

విభాగం-3 - కార్ఖానా ఉత్పత్తికి చెందిన రెండు మౌలిక రూపాలు బహురూప కార్ఖానా ఉత్పత్తి, ధారావాహిక కార్ఖానా ఉత్పత్తి 316

విభాగం-4 - కార్ఖానా ఉత్పత్తిలో శ్రమ విభజన, సమాజంలో శ్రమ విభజన 324

విభాగం-5 - కార్ఖానా ఉత్పత్తి పెట్టుబడిదారీ స్వభావం 332

**అధ్యాయం - 15 : యంత్రాలు, ఆధునిక పరిశ్రమలు** 342

విభాగం-1 - యంత్రాల అభివృద్ధి 342

విభాగం-2 - యంత్రాలు ఉత్పాదితానికి బదలాయించే విలువ 356

విభాగం-3 - కార్మికునిపై యంత్రాల తక్షణ ప్రభావం 363

అ. పెట్టుబడిచే అనుబంధ శ్రమ శక్తి స్వాయత్తత, పనిలో స్త్రీల, పిల్లల నియామకం 364

ఆ. పని దినం పొడిగింపు 371
ఇ. శ్రమను తీవ్రం చేయటం 377
విభాగం-4 - ఫ్యాక్టరీ 387
విభాగం-5 - కార్మికునికీ యంత్రానికీ మధ్య ఘర్షణ 395
విభాగం-6 - యంత్రాలవల్ల పని నుంచి తొలగించబడిన కార్మికులకు నష్టపరిహారం గురించిన సిద్ధాంతం 405
విభాగం-7 - ఫ్యాక్టరీ వ్యవస్థచే కార్మికుల నెట్టివేత, ఆకర్షణ నూలు బట్టల పరిశ్రమలో సంక్షోభం 414
విభాగం-8 - ఆధునిక పరిశ్రమ కార్ఖానా ఉత్పత్తిలో, చేతివృత్తుల్లో, గృహ పరిశ్రమల్లో తెచ్చిన విప్లవం 425
అ. చేతివృత్తి, శ్రమ విభజనపై ఆధారపడిన సహకార వ్యవస్థ నిర్మూలన 425
ఆ. కార్ఖానా ఉత్పత్తి, గృహ పరిశ్రమలపై ఫ్యాక్టరీ వ్యవస్థ ప్రభావం 427
ఇ. ఆధునిక కార్ఖానా ఉత్పత్తి 428
ఈ. ఆధునిక గృహ పరిశ్రమలు 431
ఉ. ఆధునిక యంత్ర పరిశ్రమలుగా ఆధునిక కార్ఖానా ఉత్పత్తుల గృహ పరిశ్రమల పరివర్తన - ఆ పరిశ్రమలకు ఫ్యాక్టరీ చట్టాల అనువర్తన వల్ల ఈ విప్లవాన్ని త్వరితం చేయడం 435
విభాగం-9 - ఫ్యాక్టరీ చట్టాలు, వాటిలో పారిశుద్ధ్యానికి, విద్యా బోధనకు సంబంధించిన క్లాజులు - ఇంగ్లండులో ఆ చట్టాల సార్వత్రిక విస్తరణ 446
విభాగం 10 - ఆధునిక పరిశ్రమలు, వ్యవసాయం 469

## అయిదో భాగం

## నిరపేక్ష, సాపేక్ష అదనపు విలువల ఉత్పత్తి

**అధ్యాయం 16 : నిరపేక్ష, సాపేక్ష అదనపు విలువలు** (Absolute and Relative Surplus Value) 472
**అధ్యాయం - 17 : శ్రమ శక్తి ధరలోను, అదనపు విలువ పరిమాణంలోను మార్పులు** 482
1. పని దిన పరిమాణం, శ్రమ తీవ్రత స్థిరంగా వుండి, శ్రమ ఉత్పాదకత మారుతూన్న స్థితి 483
2. పనిదినం స్థిరమై, శ్రమ ఉత్పాదకత స్థిరమై శ్రమ తీవ్రత మారుతున్న స్థితిలో 486
3. శ్రమ ఉత్పాదకత, తీవ్రత స్థిరమై, పని దిన పరిమాణం మారుతున్న స్థితిలో 487
4. శ్రమకాలం, ఉత్పాదకత, తీవ్రతలలో ఏకకాలంలో మార్పులు 489
(1) పనిదినం పొడిగింపుతో పాటు తగ్గిపోతున్న శ్రమ ఉత్పాదకత 489

(2) పని దినం తగ్గుదలతోపాటుగా, శ్రమ తీవ్రత, ఉత్పాదకతల పెరుగుదల 491

**అధ్యాయం - 18 : అదనపు విలువ రేటుకు వివిధ సూత్రాలు** 493

## ఆరో భాగం

## వేతనాలు

**అధ్యాయం - 19 : శ్రమ శక్తి విలువ, (దాని ధరతో సహా) వేతనాలుగా మారటం** 497

**అధ్యాయం - 20 : కాలం - వేతనాలు** 504

**అధ్యాయం - 21 : శాల్తీ వేతనం (Piece - Wages)** 512

**అధ్యాయం - 22 : వేతనాలలో జాతీయ భేదాలు** 520

## ఏడవ భాగం

## పెట్టుబడి సంచయనం

**అధ్యాయం 23 : సామాన్య పునరుత్పత్తి** 527

**అధ్యాయం - 24 : అదనపు విలువ పెట్టుబడిగా మారడం** 541

విభాగం-1 - పెట్టుబడిదారీ ఉత్పత్తి పురోగమనంలో పెరుగుదల స్థాయి
సరుకుల ఉత్పత్తిని వర్గీకరించే ఆస్తి నియమాలు పెట్టుబడిదారీ
విధానపు స్వాయత్త నియమాలుగా మారడం 541

విభాగం - 2 - పునరుత్పత్తి పురోగమనంలో పెరుగుదల స్థాయిని గురించి
రాజకీయ అర్థశాస్త్రవేత్తల పొరపాటు అవగాహన 550

విభాగం - 3 - అదనపు విలువ పెట్టుబడిగానూ, ఆదాయంగానూ
విభజించబడడం; వాంఛా విసర్జన సిద్ధాంతం 554

విభాగం - 4 - పెట్టుబడీ, ఆదాయంగా అదనపు విలువ విభజించబడిన
నిష్పత్తితో సంబంధం లేకుండా సంచయన పరిమాణాన్ని నిర్ణయించే
అంశాలు శ్రమ శక్తి దోపిడీ స్థాయి; శ్రామిక ఉత్పాదకత;
నియోగించబడిన పెట్టుబడి వినియోగించుకోబడిన పెట్టుబడి మొత్తంలో
వ్యత్యాసాల పెరుగుదల; అడ్వాన్సు చేయబడిన పెట్టుబడి పరిమాణం 553

విభాగం - 5 - పేరుకు శ్రామికనిధి అనబడేది 572

**అధ్యాయం - 25 : పెట్టుబడిదారీ సంచయనపు సాధారణ నియమం**

విభాగం 1 - పెట్టుబడి అంతర్నిర్మాణం యధాతథంగా ఉన్నపుడు,
సంచయనానికి జోడించబడిన శ్రమశక్తి గిరాకీ పెరుగుదల 576

విభాగం - 2 - సంచయన పురోభివృద్ధి, దానిననుసరించి జరిగే కేంద్రీకరణ
కాలంలోనే పెట్టుబడి అస్థిర భాగంలో సాపేక్ష క్షీణత 585

విభాగం - 3 - సాపేక్ష అదనపు జనాభా లేక పారిశ్రామిక రిజర్వు సైన్యం
క్రమానుగతంగా పెరుగుదల 593



విభాగం - 4 - సాపేక్ష అదనపు జనాభా విభిన్న రూపాలు - పెట్టుబడిదారీ
సంచయనపు సాధారణ నియమం 605
విభాగం - 5 - ఉదాహరణ సహితంగా పెట్టుబడి సంచయనపు సాధారణ
నియమం వివరణ 613
(అ) 1846-1866 మధ్యకాలంలో ఇంగ్లాండ్ 613
(ఆ) బ్రిటీష్ పారిశ్రామిక కార్మికవర్గంలో నికృష్టంగా చెల్లించబడే విభాగం 619
(ఇ) సంచార జనాభా 628
(ఈ) కార్మిక వర్గంలో ఎక్కువ వేతనం పొందే తరగతుల మీద
సంక్షోభాల ప్రభావం 632
(ఉ) బ్రిటీషు వ్యవసాయ కార్మిక వర్గం 638
(ఊ) ఐర్లండ్ 662

## ఎనిమిదవ భాగం
## పెట్టుబడి పుట్టుక

**అధ్యాయం - 26 :** ఆదిమ సంచయనపు రహస్యం 677
**అధ్యాయం - 27 :** వ్యవసాయ ప్రజానీకాన్ని భూమినుంచి తొలగించిన ఆస్తిహరణం 680
**అధ్యాయం - 28 :** నిరాస్తిపరులుగా చేయబడినవాళ్ల మీద 15వ శతాబ్ది అంతం నుండి రక్తసిక్తమైన చట్టాలు
పార్లమెంటు చట్టాల ద్వారా వేతనాలను దిగదోయడం 697
**అధ్యాయం - 29 :** పెట్టుబడిదారీ వ్యవసాయదారుని పుట్టుక 705
**అధ్యాయం - 30 :** పరిశ్రమల మీద వ్యవసాయ విప్లవం యొక్క ప్రభావం,
పారిశ్రామిక పెట్టుబడికి ఆంతరంగిక మార్కెట్ సృష్టి 708
**అధ్యాయం - 31 :** పారిశ్రామిక పెట్టుబడిదారుని పుట్టుక 712
**అధ్యాయం - 32 :** పెట్టుబడిదారీ సంచయనం యొక్క చారిత్రక ధోరణి 723
**అధ్యాయం - 33 :** ఆధునిక వలసకరణ సిద్ధాంతం 726

## సూచికలు

రచయితల సూచిక 736
వార్తపత్రికలు, ఇతర పత్రికల సూచిక 750
పార్లమెంటరీ నివేదికలు, ఇతర అధికార ప్రచురణలు 751

# ఇంగ్లీషు ముద్రణకు ముందుమాట

**'పెట్టుబడి'** ఇంగ్లీషు అనువాదాన్ని ఎందుకు ప్రచురిస్తున్నామో వివరించాల్సిన పని లేదు. కాగా ఈ ప్రచురణ ఇంత ఆలస్యం ఎందుకయిందో వివరించాల్సిన అవసరం మాత్రం ఉంది. అనేక సంవత్సరాలుగా ఇంగ్లండు, అమెరికాల్లోని పత్రికలూ, సాహిత్యమూ ఈ గ్రంథంలోని సిద్ధాంతాలను పదే పదే పేర్కొంటున్నాయి. వాటిపై ఖండన మండనలు చేస్తున్నాయి. భాష్యాలు, వక్రభాష్యాలూ కురిపిస్తున్నాయి. వీటన్నిటినీ గమనిస్తూ కూడా ఈ ప్రచురణ తీసుకురావడంలో ఇంతవరకు ఎందుకు ఆలస్యం జరిగిందో వివరించాల్సిన అవసరం వుంది.

1883లో ఈ గ్రంథ రచయిత మరణించిన వెంటనే ఇంగ్లీషు అనువాదం తప్పనిసరిగా అవసరమైనట్లు స్పష్టమైంది. మార్క్స్ సాహిత్యానికి బాధ్యులైనవాళ్ళు ఏనాటి నుండో ప్రజల ముందుంచాలని తహతహలాడుతున్న ఈ గ్రంథాన్ని అనువదించటానికి సామ్యూల్ మూర్ అంగీకరించాడు. ఆయన మార్క్స్‌కీ, నాకు చిరకాల మిత్రుడు. ఈ గ్రంథంతో ఆయనకున్న పరిచయం అనన్యమైనది. రాతప్రతుల్ని మూలగ్రంథంతో సరిపోల్చి అవసరమనుకొన్న మార్పుల్నీ చేర్పుల్నీ సూచించాల్సిన బాధ్యతని నేను స్వీకరించాను. శామ్యూల్ మూర్ తన వృత్తిపరమైన పనుల ఒత్తిడి వల్ల మేమంతా ఆశించినంత తొందరగా అనువాదాన్ని పూర్తి చేయలేకపోయాడు. గ్రంథంలో కొంత భాగాన్ని అనువదించడానికి ఆ సమయంలో డాక్టర్ ఎవెలింగ్ ముందుకొచ్చాడు. అతని ప్రతిపాదనని మేము సంతోషంగా స్వీకరించాము. మార్క్స్ చిన్న కుమార్తె శ్రీమతి ఎవెలింగ్ గ్రంథంలోని ఉల్లేఖనలను సరిచూడటానికి ముందుకొచ్చింది. ఇంగ్లీషు రచయితల్నుండీ, ఇంగ్లాండ్ పార్లమెంట్‌లో జరిగిన చర్చల నివేదికల (బ్లూబుక్స్) నుండీ మార్క్స్ జర్మన్‌లోకి అనువదించిన అనేక భాగాలను వెదికి వాటి మూలపాఠాలను ఆమె ఈ గ్రంథంలో చేర్చింది. అనివార్యమైన కొద్ది మినహాయింపులు గాక గ్రంథమంతటిలోనూ ఆ పని జరిగింది.


(1) పదో అధ్యాయం (పని దినం), పదకొండో అధ్యాయం (అదనపు విలువ రేటు, దాని పరిమాణం), (2) ఆరో భాగం (వేతనాలు, పందొమ్మిదో అధ్యాయం నుండి ఇరవై రెండో అధ్యాయం వరకు), (3) ఇరవై నాలుగో అధ్యాయంలో నాలుగో సెక్షన్ (పరిస్థితులు వగైరా) నుండి గ్రంథం చివరి వరకూ, అంటే ఇరవై నాలుగో అధ్యాయం చివరి భాగం నుండి ఇరవై అయిదో అధ్యాయమూ, ఎనిమిదో భాగం అంతా (ఇరవై ఆరో అధ్యాయం నుండి ముప్పయ్ మూడో అధ్యాయం వరకు), (4) మార్క్స్ రెండు ముందుమాటలూ, డాక్టర్ ఎవెలింగ్ అనువదించాడు. గ్రంథంలోని మిగిలిన భాగాన్నంతా మూర్ అనువదించాడు. ఈ ఇరువురు అనువాదకులు తమ తమ భాగాలకు బాధ్యులు, కాగా మొత్తం గ్రంథానికి నేను బాధ్యుణ్ణి.

మా పని అంతటికీ మూడో జర్మన్ ముద్రణే ఆధారం. రచయిత వదిలి వెళ్ళిన నోట్స్‌సాయంతో

నేను దానిని 1883లో తయారుచేశాను. రెండవ జర్మన్ ముద్రణలో ఏ ఏ భాగాలను తొలగించాలో వాటి స్థానంలో 1873లో ప్రచురితమైన ఫ్రెంచి ప్రతి[1]లోని ఏ ఏ భాగాలను చేర్చాలో రచయిత తన నోట్స్‌లో సూచించాడు. పదేళ్ళ క్రితం, అమెరికాలో ఇంగ్లీషు అనువాదాన్ని ప్రచురించటానికి ప్రయత్నించాము. అయితే సరైన అనువాదకుడులేక ఆ పథకం విరమించుకోవలసి వచ్చింది. ఆనాడే ఇంగ్లీషు అనువాదంలో చేయాల్సిన మార్పులను మార్క్స్ తన రాతప్రతుల్లో సూచించాడు. రెండో జర్మన్ ముద్రణకి సూచించిన మార్పులన్నీ దాదాపుగా వాటిలో వున్నాయి. ఆ రాతప్రతుల్ని మాకు అందించిన వ్యక్తి, మా చిరకాల మిత్రుడు, న్యూజెర్సీలోని హోబొకెన్‌కు చెందిన ఎఫ్.ఎ. సోర్జ్. ఫ్రెంచి ప్రతి నుండి మరికొన్ని భాగాలను యెత్తి జర్మన్ ముద్రణలో చేర్చాలని ఆ రాతప్రతులు సూచిస్తున్నాయి. కాని రచయిత జర్మన్ భాషలో మూడో ముద్రణ కోసం ఇచ్చిన చివరి ఆదేశాలుండగా, అంతకంటే అనేక ఏళ్ళు పాతవైన రాతప్రతులను అవసరమైనప్పుడు అరుదుగా తప్ప వాడే స్వేచ్ఛ నాకు లేదని భావించాను. అదీ, ఈ పనిలో మాకు ఎదురైన ఇబ్బందుల్ని తొలగించడానికి అవి తోడ్పడినప్పుడు మాత్రమే మేము వాటిని ఉపయోగించాము. అదే రకంగా జర్మన్ ప్రతిలో జటిలమైన భాగాలు ఎదురైనప్పుడు మేము ఫ్రెంచి ప్రతిని పరిశీలించాము. మూలగ్రంథంలోని కొన్ని భాగాలను మరో భాషలోకి పూర్తిగా అనువదించటం సాధ్యం కానప్పుడు అందులో ఏ ఏ భాగాలు వదిలేయటానికి రచయిత సిద్ధపడ్డాడో ఫ్రెంచి ప్రతి తెలియజేస్తుంది.

పాఠకుణ్ణి ఒక ఇబ్బంది నుండి మాత్రం మేము తప్పించలేకపోయాము. కొన్ని పదాలను నిత్య జీవితంలోనూ, సాధారణ రాజకీయ అర్థశాస్త్రంలోనూ ఉపయోగించే అర్థంలోకాక వేరే అర్థంలో ప్రయోగించాము. ఇది అనివార్యమైంది. శాస్త్రంలోని ప్రతి కొత్త అంశమూ, ఆ శాస్త్ర సాంకేతిక పదజాలంలో విప్లవం తెస్తుంది. దీనికి అత్యుత్తమ ఉదాహరణ రసాయన శాస్త్రం. దాదాపు ఇరవై ఏళ్ళకోసారి దానిలో మొత్తం పదజాలమంతా మౌలికంగా మారిపోతుంది. పేరు తర్వాత పేరు వరుసగా అనేక పేర్లను స్వీకరించని సేంద్రియ సంయోగం ఒక్కటి కూడా లేదు. కాని వాణిజ్య, పారిశ్రామిక జీవితాల్లో వాడుకలో ఉన్న పదాలను యధాతథంగా తీసుకోవటంతో రాజకీయ అర్థ శాస్త్రం ఇంతవరకూ సంతృప్తిపడుతూ వచ్చింది. అలా చేయడంవల్ల ఆ పదాలు వ్యక్తంచేసే భావాల సంకుచిత పరిధికే తాను పరిమితమైందని అది గ్రహించలేకపోయింది. యజమానికి కార్మికుడు సరఫరా చేసే ఉత్పాదితంలో లాభాలు, కౌలు అనేవి వేతనం పొందని భాగపు ఉప విభాగాలు మాత్రమే (ఆ భాగానికి యజమాని ఒక్కడే అంతిమంగా సొంతదారుడు కాకపోయినప్పటికీ, మొదట స్వాధీనమయ్యేది అతనికే) అని తెలిసినప్పటికీ సాంప్రదాయక రాజకీయ అర్థశాస్త్రం లాభాలు, కౌలు గురించి గతం నుండి సంక్రమించిన భావాలను ఎప్పుడూ దాటిపోలేదు. ఆ ఉత్పాదితంలో వేతనం పొందని భాగం గురించి మొత్తంగా ఎప్పుడూ పరిశీలించనే లేదు. (ఆ భాగాన్ని మార్క్స్ అదనపు ఉత్పాదితం అన్నాడు) కనుక దాని మూలం గురించిగానీ, దాని స్వభావం గురించిగానీ సాంప్రదాయక

1. "Le Capital", par Karl Marx. Traduction de M.J. Roy, entierement revisee par l'auteur. Paris. Lachatre. ఈ అనువాదంలో, ముఖ్యంగా గ్రంథం చివరి భాగంలో, రెండో జర్మన్ ముద్రణతో పోలిస్తే అనేక మార్పులు, చేర్పులూ వున్నాయి.



1867 ఆగస్టు 16న 'ఎంగెల్స్‌కు మార్క్స్ రాసిన లేఖకు ఫాసిమైల్ ప్రతి'
(సైజు తగ్గించబడింది)

ప్రియమైన ఫ్రెడ్, ఆగస్టు 16, 1867 రాత్రి రెండు గంటలు

గ్రంథం తాలూకు చివరి షీటు (49వ) దిద్దడం ఇప్పుడే పూర్తయింది. అనుబంధం చిన్న అచ్చులో 1 1/4 షీట్లు వచ్చింది.

ఉపోద్ఘాతం దిద్ది నిన్న తిప్పి పంపా. కనుక ఈ సంపుటి పూర్తయిపోయింది. ఇది సాధ్యపడిందంటే మీ కొక్కరికే కృతజ్ఞతలు తెలపాలి. మీరు నాకోసం స్వీయత్యాగం చేసివుండకపోతే ఈ మూడు సంపుటుల కోసం ఈ బృహత్ కృషిని బహుశా చేయగలిగేవాడినే కాదు. మిమ్మల్ని ఆలింగనం చేసుకుంటున్నా. మీకు సర్వ సంపూర్ణ కృతజ్ఞతలు! దిద్దిన రెండు షీట్లు ప్రూఫులూ ఇందులోనే పంపుతున్నా.

15 పౌండ్లు సర్వోత్కృష్ట కృతజ్ఞతలతో అందుకున్నా

నా ప్రియమైన మిత్రమా అభినందనలు!

మీ

**కె. మార్క్స్**

అర్థశాస్త్రానికి స్పష్టమైన అవగాహన లేదు. తదుపరి దాని విలువ, పంపిణీని శాసించే నియమాలను కూడ అది గ్రహించలేదు. వ్యవసాయం, చేతివృత్తుల్ని మాత్రమే కాదు, మొత్తం పరిశ్రమని సూచించటానికి కార్ఖానా తయారీ అనే పదాన్ని అది విచక్షణారహితంగా వాడింది. ఆ రకంగా ఆర్థిక చరిత్రలో రెండు విభిన్న కాలాలకున్న ప్రత్యేకతలను, తేడాలను అది చెరిపేసింది. మొదటిది, శారీరక శ్రమ విభజనపై ఆధారపడిన కార్ఖానాల కాలం. రెండోది, యంత్రాలపై ఆధారపడిన ఆధునిక పరిశ్రమల కాలం. మానవజాతి ఆర్థిక చరిత్రలో ఆధునిక పెట్టుబడిదారీ ఉత్పత్తి కేవలం ఒక తాత్కాలిక దశ మాత్రమే అని ఈ సిద్ధాంతం భావిస్తుంది. కనుక ఆ ఉత్పత్తి విధానాన్ని అవినాశనమని, అంతిమమైనదని భావించేవారు అలవాటుగా వాడుతున్న పదాలకంటే భిన్నమైన పదాలను అది వాడితీరాలనేది స్పష్టం.

రచయిత అనుసరించిన ఉల్లేఖనా పద్ధతి గురించి ఇక్కడ ఒక మాట చెప్పడం అనుచితం కాదు. అత్యధిక సందర్భాల్లో ఉల్లేఖనలు మామూలుగా అంటే, గ్రంథస్థ వాదాలకు లిఖిత సాక్ష్యాలుగా ఉపయోగపడ్డాయి. అయితే ఒకానొక ప్రతిపాదన మొట్టమొదటిసారిగా ఎవరు, ఎప్పుడు, ఎక్కడ ముందుకు తెచ్చారో తెలియజేయటానికి కూడా రచయిత అనేక సందర్భాల్లో ఆర్థికవేత్తలను ఉల్లేఖించారు. ఒక ప్రతిపాదన ఆనాటి సామాజిక ఉత్పత్తి, వినిమయ పరిస్థితులను ఎంతో కొంత సరిగా వ్యక్తం చేయడానికి అవసరమైనప్పుడు, దాని సాధారణ ప్రమాణీకతను మార్క్స్ అంగీకరించినా, అంగీకరించకపోయినా ఆయన దాన్ని ఉల్లేఖించాడు. కనుక ఈ ఉల్లేఖనలు అర్థశాస్త్ర చరిత్ర సమకాలిక వ్యాఖ్యానాలుగా గ్రంథానికి అనుబంధంగా వుంటాయి.

మొదటి సంపుటిని మాత్రమే మేము అనువదించాము. అయితే ఇది చాలావరకు ఒక సంపూర్ణ గ్రంథమే. ఇరవై ఏళ్ళుగా అది స్వతంత్ర గ్రంథంగా గుర్తించబడింది. అలాగే గుర్తిస్తున్నారు కూడా. జర్మన్ భాషలో రెండో సంపుటిని నేను 1885లో సంకలనం (ఎడిట్) చేశాను. అయితే అది మూడో సంపుటి తోడు లేకపోతే నిశ్చయంగా అసంపూర్ణమే. మూడో సంపుటి 1887లోగా ప్రచురించటం సాధ్యం కాదు. అది జర్మన్ భాషలో వెలువడినప్పుడే ఆ రెండు సంపుటాల ఇంగ్లీషు ప్రచురణను సిద్ధం చేసే విషయం ఆలోచించ వీలవుతుంది.

'పెట్టుబడి' గ్రంథాన్ని ఐరోపా ఖండంలో తరచుగా 'కార్మికవర్గ బైబిల్' అని పిలుస్తున్నారు. ఈ గ్రంథంలో చేసిన నిర్ధారణలు రోజు రోజుకీ మరింత ఎక్కువగా కార్మికవర్గ మహోద్యమం యొక్క మౌలిక సూత్రాలు అవుతున్నాయి. జర్మనీ, స్విట్జర్లాండ్‌లలో మాత్రమే కాదు. ఫ్రాన్స్, హాలెండ్, బెల్జియం, అమెరికాల్లో కూడా. ఇటలీ, స్పెయిన్‌లలో సైతం ఇదే వాస్తవం. తన స్థితినీ, ఆకాంక్షలను ఈ నిర్ధారణలు సరిగ్గా వ్యక్తం చేస్తున్నాయని కార్మికవర్గం నానాటికీ మరింత ఎక్కువగా గుర్తిస్తున్నది. పై విషయాలను కార్మికోద్యమంతో పరిచయమున్న వారెవరూ కాదనలేరు. సోషలిస్టు ఉద్యమం ఇంగ్లండు కార్మికవర్గంలో ఎంతగా వ్యాపిస్తోందో అంతకు ఏమాత్రం తగ్గకుండా దాని 'నాగరిక' ప్రజానీకంలో కూడా వ్యాపిస్తోంది. అక్కడ ఆ ఉద్యమంపైన ఇప్పుడు కూడా మార్క్స్ సిద్ధాంతాలకున్న ప్రభావం అపారం. అంతేకాదు. ఇంగ్లండు ఆర్థిక పరిస్థితిని సమగ్రంగా పరిశీలించటం ఒక తప్పనిసరి జాతీయ అవసరంగా మారే తరుణం వేగంగా ముందుకొస్తోంది. ఉత్పత్తితోపాటు మార్కెట్లు నిరంతరం వేగంగా పెరగకపోతే సాగని ఈ దేశ పారిశ్రామిక వ్యవస్థ పనిచేయటం పూర్తిగా ఆగిపోయే స్థితికి

చేరుకోబోతున్నది. స్వేచ్ఛా వాణిజ్యానికి ఇంతవరకూ వుండిన వనరులు అయిపోయాయి. పరమ సత్యమని తాను ఇంతవరకు నమ్మినదాన్ని మాంచెస్టర్ కూడా సందేహిస్తోంది.[1] వేగంగా అభివృద్ధి చెందుతున్న విదేశ పరిశ్రమ ప్రతిచోటా ఇంగ్లండు ఉత్పత్తికి ఎదురౌతున్నది. రక్షిత మార్కెట్లలో మాత్రమే కాదు, తటస్థ మార్కెట్లలో కూడా. ఇంగ్లీషు చానల్‌కు ఇటువైపు సైతం అదే జరుగుతోంది. ఉత్పాదక శక్తి గుణోత్తర శ్రేణిలో పెరుగుతోంది. కాగా మార్కెట్లు మహా అయితే అంక శ్రేణిలో మాత్రమే పెరుగుతున్నాయి. 1825 నుండి 1867 వరకు పునరావృతమవుతూ వచ్చిన మాంద్యం, సుభిక్షం, అధికోత్పత్తి, సంక్షోభాల దశవర్ష చక్రాల కాలం చెల్లిందేమోననిపిస్తోంది. అయితే అది మనని శాశ్వత మాంద్యం అనే నిరాశాపూరితమైన ఊబిలోనికి నెట్టబోతోంది. హాయిగా నిట్టూర్చడానికి అవకాశమిచ్చే సుభిక్ష స్థితి ఇక రాదు. అది వస్తున్న లక్షణాలు ఎన్నిసార్లు కనిపించినా అన్నిసార్లు అవి మాయమవుతున్నాయి. ఈలోగా ప్రతి శీతాకాలం "నిరుద్యోగుల్ని ఏం చేయాలి?" అనే మహా ప్రశ్నను ముందుకు తెస్తున్నది. ఏడాది ఏడాదికి నిరుద్యోగుల సంఖ్య పెరుగుతూనే వుంది. అయినా ఆ ప్రశ్నకు జవాబు చెప్పగల వారెవరూ లేరు. ఓర్పు నశించిన నిరుద్యోగులు తమ భవితవ్యాన్ని తామే నిర్ణయించుకునే సమయాన్ని మనం దాదాపుగా అంచనా వేయవచ్చు. ఇంగ్లండు ఆర్థిక పరిస్థితులనూ, చరిత్రనూ జీవిత పర్యంతం అధ్యయనం చేసి తన సిద్ధాంతాన్ని రూపొందించిన మనిషి, అనివార్యమైన సామాజిక విప్లవం కనీసం ఐరోపాలో ఒక్క ఇంగ్లండులో మాత్రమే శాంతియుత, చట్టబద్ధ సాధనాల ద్వారా రావచ్చునని ఆ అధ్యయనం ద్వారా నిర్ధారణకు వచ్చిన మనిషి – ఆ మనిషి చెప్పేదాన్ని అలాంటి సమయంలో విని తీరాలి. అయితే ఈ శాంతియుత, చట్టబద్ధ విప్లవానికి వ్యతిరేకంగా ఇంగ్లండు పాలకవర్గాలు "బానిసత్వ అనుకూల" తిరుగుబాటు జరపకుండా లొంగిపోవనే విషయాన్ని చెప్పడం మాత్రం ఆయన ఎప్పుడూ మరిచిపోలేదు.

ఫ్రెడరిక్ ఎంగెల్స్

నవంబరు 5, 1886.

---

1. మూడు నెలలకోసారి జరిగే మాంచెస్టర్ ఛేంబర్ ఆఫ్ కామర్స్ సమావేశం ఈ సాయంత్రం జరిగింది. దానిలో స్వేచ్ఛా వ్యాపారం గురించిన చర్చలు జోరుగా సాగాయి.
"ఇంగ్లండు చూపిన స్వేచ్ఛా వ్యాపార బాణీని మిగిలిన జాతులు కూడా స్వీకరిస్తాయని ఆశిస్తూ వృధాగా 40 ఏళ్ళపాటు వేచివున్న ఛేంబర్ ఆ వైఖరిని పునఃపరిశీలించుకోవాల్సిన తరుణం వచ్చిందని భావిస్తోంది" అనే తీర్మానం ఓటింగ్‌కు వచ్చింది. ఒక్క ఓటు తేడాతో మాత్రమే తీర్మానం ఓడిపోయింది. తీర్మానానికి అనుకూలంగా 21, వ్యతిరేకంగా 22 ఓట్లు వచ్చాయి. (ఈవెనింగ్ స్టాండర్డ్, నవంబర్ 1, 1886)

# జర్మన్, ఫ్రెంచ్ ముద్రణలకు కార్ల్ మార్క్స్ తొలిమాటలు, మలిమాటలు

## జర్మన్ మొదటి ముద్రణకు ముందుమాట

ఇప్పుడు నేను ప్రజలకు అందిస్తున్న "పెట్టుబడి" అనే గ్రంథంలో ఇది మొదటి సంపుటి. 1859లో ప్రచురితమైన "ZUR KRITIK DER POLITISCHEN OEKONOMIE" (రాజకీయ అర్థశాస్త్ర విమర్శ) అనే నా గ్రంథానికి ప్రస్తుతం మీ ముందుంచిన ఈ గ్రంథం కొనసాగింపు. ఆ మొదటి భాగానికీ దాని కొనసాగింపుకీ నడుమ ఇంత వ్యవధికి కారణం ఏళ్ళతరబడి పీడిస్తున్న నా అనారోగ్యం. అది పదే పదే నా పనికి భంగం కలిగించింది.

ఆ మొదటి పుస్తకం సారాంశాన్ని ఈ సంపుటి మొదటి మూడు అధ్యాయాల్లో సంక్షిప్తం చేశాను. అలా చేసింది కేవలం క్రమం కోసమూ, సంపూర్ణత్వం కోసమూ మాత్రమే కాదు. దీనిలో విషయ వివరణ మరింత మెరుగ్గా వుంది. అంతకు ముందు గ్రంథంలో రేఖామాత్రంగా చెప్పిన అంశాలను ఇందులో సాధ్యమైన అన్నిచోట్లా మరింత సంపూర్ణంగా వివరించాను. అలాగే ఆ గ్రంథంలో సంపూర్ణంగా వివరించిన కొన్ని అంశాలను ఇక్కడ రేఖామాత్రంగానే పేర్కొన్నాను. డబ్బు, విలువల సిద్ధాంతాల చరిత్రను మొత్తంగా వదిలేశాను. నా మొదటి గ్రంథాన్ని చదివిన పాఠకుడు ఆ సిద్ధాంతాల చరిత్రకి సంబంధించిన అదనపు సమాచారాన్ని ఈ మొదటి అధ్యాయానికిచ్చిన నోట్స్‌లో చూడొచ్చు.

ఆరంభం కష్టంగా వుంటుందనేది అన్ని శాస్త్రాలకూ వర్తిస్తుంది. అలాగే దీనిలో కూడా మొదటి అధ్యాయం, ముఖ్యంగా సరుకుల విశ్లేషణ ఉన్న విభాగం, అర్థం చేసుకోవటం అత్యంత కష్టదాయకం. విలువ సారాంశం గురించీ, దాని పరిమాణం గురించీ విశ్లేషించిన విభాగాన్ని నేను సాధ్యమైనంత వరకూ సరళం చేశాను.[1] డబ్బు అనే రూపం విలువ యొక్క అభివృద్ధిచెందిన రూపం. విలువ అనే రూపం చాలా ప్రాథమికమైనదీ, సరళమైనదీ. అయినా మానవ మేధ దాని అంతు కనుక్కోటానికి

---

1. ఇది అవసరం. ఎందుచేతంటే SCHULZE-DELITZSCH కి వ్యతిరేకంగా ఫెర్డినాండ్ లాసాల్ తన గ్రంథంలో ఒక విభాగాన్ని కేటాయించి, ఇదే అంశాలపైన నేనిచ్చిన వివరణల "మేధా సారాన్ని" అందిస్తాననే వాగ్దానంతో రాసిన అంశాలలో అనేక ముఖ్యమైన పొరపాట్లు వున్నాయి. అతను తన ఆర్థిక గ్రంథాలలో చర్చించిన పెట్టుబడి చారిత్రిక లక్షణం, ఉత్పత్తి పరిస్థితులకూ, ఉత్పత్తి విధానానికీ మధ్య ఉన్న సంబంధం వగైరా సాధారణ సిద్ధాంత ప్రతిపాదనలన్నిటినీ, చివరకు నేను సృష్టించిన పదజాలాన్ని సైతం, నా రచనల నుండి సంగ్రహిస్తున్నట్లు తెలపకుండానే దాదాపు మక్కీకి మక్కీ సంగ్రహించాడు. బహుశా ప్రచార లక్ష్యంతో ఇలా చేసి వుండవచ్చు. అయినా ఈ ప్రతిపాదనలను అతను ఎలా వివరించాడు, ఎలా వర్తింపజేశాడు అనే అంశాన్ని గురించి నేనిక్కడ మాట్లాడబోవటం లేదు. దానితో నాకేమాత్రం సంబంధం లేదు.

రెండు వేల ఏళ్ళ నుండి ప్రయత్నిస్తున్నప్పటికీ ఫలితం మాత్రం శూన్యం. అయితే మరోవైపున విలువ రూపం కంటే మరింత చిక్కుముడులున్న రూపాలను విశ్లేషించడంలో అది దాదాపు విజయం సాధించింది. ఎందువల్ల? శరీరంలోని కణాలను అధ్యయనం చేయడం కంటే మొత్తం శరీరాన్ని అధ్యయనం చేయడం తేలిక. పైగా ఆర్థిక రూపాల విశ్లేషణకు సూక్ష్మదర్శినులుగాని, రసాయనిక పదార్థాలుగాని పనికిరావు. ఆ రెండింటి స్థానాన్ని భావ సంగ్రహణ శక్తి తీసుకోవాలి. బూర్జువా సమాజంలో శ్రమ ఉత్పాదితం యొక్క సరుకు రూపం – లేక సరుకు యొక్క విలువ రూపం – అనేది ఆర్థశాస్త్రపు కణరూపం. పైపైన పరిశీలించే వానికి ఈ రూపాల విశ్లేషణ అతి సూక్ష్మ విషయాల మీద ఆధారపడినట్లు కన్పిస్తుంది. నిజమే, ఇది సూక్ష్మ అంశాల పరిశీలనే. అయితే ఆ అంశాలు శరీరంలోని సూక్ష్మకణాల స్థాయిలో వుంటాయి.

కనుక, విలువ రూపాన్ని గురించి వివరించిన విభాగం తప్ప సంపుటిలో మిగిలిన భాగాన్ని కష్టంగా వుందని నిందించాల్సిన పనిలేదు. అయితే పాఠకుడు కొత్త విషయాన్ని నేర్చుకోడానికీ, స్వయంగా ఆలోచించడానికీ సిద్ధపడిన వాడుగా వుండాలి.

భౌతిక విషయాలను పరిశీలించే భౌతిక శాస్త్రవేత్త అవి అత్యంత స్వచ్ఛమైన రూపంలో, ఏ ఇతర ప్రభావాలూ లేకుండా జరగటానికి వీలున్న పరిస్థితులను తన పరిశోధనకి ఎంచుకొంటాడు. లేదా అవి మామూలు రూపంలో జరిగే పరిస్థితుల్ని సృష్టించుకొని వాటిని పరిశోధిస్తాడు. ఈ గ్రంథంలో పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం గురించీ, దానికి అనుగుణమైన ఉత్పత్తి మార్పిడి పరిస్థితుల గురించీ నేను పరిశీలించాలి. ఇంతవరకు వాటికి అచ్చమైన స్థానం ఇంగ్లండే. అందుచేతనే నేను నా సిద్ధాంత భావాలను అభివృద్ధి చేయడానికి ఇంగ్లండును ప్రధాన ఉదాహరణగా తీసుకొన్నాను. ఇంగ్లీషు పారిశ్రామిక, వ్యవసాయ కార్మికుల పరిస్థితులు చూసి జర్మన్ పాఠకుడు నిర్లక్ష్యం వ్యక్తం చేస్తే, లేదా జర్మనీ పరిస్థితులు అంత దారుణంగా లేవులే అని సరిపెట్టుకోవాలనుకుంటే నేనతనికి స్పష్టంగా చెప్పదలచుకున్నదిది, “ఇదీ నీ కథే”.

పెట్టుబడిదారీ ఉత్పత్తి సహజ నియమాలవల్ల తలెత్తే సామాజిక శత్రుత్వాలు తక్కువ స్థాయిలో అభివృద్ధి చెందాయా, ఎక్కువ స్థాయిలో అభివృద్ధి చెందాయా అన్నది ప్రశ్న కాదు. అసలు ప్రశ్న ఈ నియమాలదే, దుర్వారమైన ఆవశ్యకంతో అనివార్య ఫలితాలకు దారితీసే ఈ ధోరణులదే. ఎక్కువ అభివృద్ధి చెందిన దేశం తక్కువ అభివృద్ధి చెందిన దేశానికి చూపించేది దాని భవిష్యత్ రూపాన్ని మాత్రమే.

అంతేకాదు, జర్మనీలో పెట్టుబడిదారీ సంబంధాలున్న రంగాలలో (ఉదాహరణకి, అచ్చంగా ఫ్యాక్టరీలనబడే వాటిలో) ఇంగ్లండులోకంటే పరిస్థితులు అధ్వాన్నంగా వున్నాయి. ఎందుకంటే, ఆ పరిస్థితులను నిరోధించే ఫ్యాక్టరీ చట్టాలు ఇక్కడ లేవు. పశ్చిమ యూరపు దేశాలన్నిటి లాగానే మనం కూడా అన్ని రంగాల్లోనూ కేవలం పెట్టుబడిదారీ అభివృద్ధివల్ల మాత్రమే గాక ఆ అభివృద్ధి అసంపూర్ణం కావటంవల్ల కూడా ఇబ్బందిపాలవుతున్నాము. ఆధునిక రుగ్మతలతో పాటు వారసత్వంగా వచ్చిన అనేక రుగ్మతలు కూడా మనల్ని పీడిస్తున్నాయి. ప్రాచీన ఉత్పత్తి విధానాలు ఇంకా బతికే వుండటంవల్ల ఇవి తలెత్తుతున్నాయి. వాటివల్ల సామాజిక, రాజకీయ రంగాల్లో కాలం చెల్లిన పాత పరిస్థితులు

తప్పడం లేదు. మనం బాధలు పడుతోంది బతికున్నవాటితోనే కాదు, చచ్చినవాటితో కూడా. చచ్చినవాడు బతికున్నవాళ్ళను పీడిస్తాడు.

ఇంగ్లండుతో పోలిస్తే, జర్మనీలోనూ, మిగిలిన పశ్చిమ యూరపు దేశాలలోనూ సామాజిక గణాంక సమాచార సేకరణ అధ్వాన్నంగా వుంది. అయితే అది పరిస్థితులు ఎంత అసహ్యంగా ఉన్నదీ రేఖా మాత్రంగా తెలుసుకోడానికి వీలు కలిగిస్తున్నది. ఆర్థిక పరిస్థితులను దర్యాప్తు చేయడానికి, ఇంగ్లండులో లాగా మనకి కూడా ఎప్పటికప్పుడు మన ప్రభుత్వాలూ, పార్లమెంటులూ దర్యాప్తు సంఘాలను (కమిషన్లు) నియమించి వుంటే మనకి అసలు పరిస్థితులు తెలిసి హడలిపోయి వుండేవాళ్ళం. అయితే ఆ కమిషన్లకు ఇంగ్లండులో లాగా వాస్తవాలను పట్టుకోటానికి అదే సంపూర్ణ అధికారాలుండాలి. అంతే సమర్థులైన అంతే నిష్పక్షపాతులైన ఫ్యాక్టరీ ఇన్‌స్పెక్టర్లూ, మెడికల్ రిపోర్టర్లు దొరకాలి. స్త్రీలూ, పిల్లలూ ఎంతగా దోపిడీకి గురవుతున్నారో, ఇళ్ళ పరిస్థితీ, ఆహార పరిస్థితీ ఎలా వుందో దర్యాప్తు చేసే వ్యక్తులు అంతే సమర్థవంతులూ, నిజాయితీపరులూ అయి వుండాలి. తాను చంపదలుచుకొన్న రాక్షసులకు కన్పించకుండా పెర్సియస్ అనే గ్రీకు పురాణ వీరుడు మంత్రపు టోపీ పెట్టుకున్నాడు. ఆ రాక్షసులు లేరనే భ్రమ కల్పించుకోడానికి ఆ మంత్రపు టోపీని మనం కళ్ళమీదకూ, చెవుల మీదకూ లాక్కున్నాం.

ఈ విషయంలో మనల్ని మనం మోసగించుకోవద్దు. 18వ శతాబ్దంలో అమెరికా స్వాతంత్ర్య పోరాటం యూరపు మధ్యతరగతిని శంఖారావంతో తట్టి లేపినట్లే, 19వ శతాబ్దంలో అమెరికా అంతర్యుద్ధం ఐరోపా కార్మిక వర్గాన్ని తట్టి లేపింది. ఇంగ్లండులో సమాజం విచ్ఛిన్నం కావడం స్పష్టంగా కనిపిస్తోంది. అది ఒక దశకి చేరుకున్నాక మిగిలిన ఖండమంతటిలోనూ అదే మళ్ళీ జరుగుతుంది. అది అక్కడ మరింత పాశవిక రూపం తీసుకుంటుందా, మరింత మానవతా రూపం తీసుకుంటుందా అనేది కార్మిక వర్గ అభివృద్ధి స్థాయిని బట్టి వుంటుంది. కార్మికవర్గం స్వేచ్ఛగా అభివృద్ధి చెందటానికి అడ్డుపడే అంశాలలో చట్టబద్ధంగా తొలగించే అవకాశమున్న వాటన్నిటినీ ప్రస్తుత పాలక వర్గాలు తొలగిస్తాయి. దీనికి కారణం వాటి ఉన్నత లక్ష్యాలు మాత్రమే కాక, వాటి అత్యంత ముఖ్యమైన సొంత ప్రయోజనాలు కూడా. అందువల్లనే గాక మరికొన్ని ఇతర కారణాలవల్ల కూడా ఈ గ్రంథంలో నేను ఇంగ్లీషు ఫ్యాక్టరీ చట్టాల చరిత్రకూ, వివరాలకూ, ఫలితాలకూ అంత ఎక్కువ స్థలం కేటాయించాను. ఒక జాతి మరో జాతి నుండి నేర్చుకోగలదు, నేర్చుకొని తీరాలి. (ఈ గ్రంథం ప్రధాన లక్ష్యం ఆధునిక సమాజపు ఆర్థిక చలన నియమాలను ఎత్తి చూపించటమే) ఒక సమాజం తన సహజ చలన నియమాలను కనుగొనే సక్రమ మార్గంలో ఉన్నప్పటికీ, దాని సహజ అభివృద్ధిలో వరుసగా వచ్చే దశలవల్ల దానికి అడ్డంకులు తప్పవు. అది ఎంత సాహసోపేతంగా ముందుకు దూకినా, ఎన్ని చట్టాలు చేసినా ఈ అడ్డంకుల్ని పూర్తిగా తొలగించలేదు. అయితే ఈ చర్యలతో అది తన పురుటి నొప్పుల్ని తగ్గించుకోగలదు.

అపార్థాలను నివారించటానికి ఒక్కమాట. పెట్టుబడిదారునీ, భూస్వామినీ నేనెప్పుడూ అతి సుందరంగా చిత్రించలేదు. ఆయా వ్యక్తులు వివిధ ఆర్థిక అభివర్గాలకు మానవ రూపాలుగానూ, ఆయా వర్గ సంబంధాలకూ, వర్గ ప్రయోజనాలకూ సాకార మూర్తులుగానూ ఉన్న మేరకు వారిని గురించి నేను రాశాను. సమాజం యొక్క ఆర్థిక వ్యవస్థ పరిణామాన్ని ప్రకృతి చరిత్రకు చెందిన ఒక

ప్రక్రియగా భావించే నేను ఆయా సామాజిక సంబంధాలకు వ్యక్తిని బాధ్యుని చేయలేను. వ్యక్తి స్వీయాత్మకంగా ఆ సంబంధాలను ఎంతగా దాటిపోగలిగినప్పటికీ అతను సామాజికంగా ఆ సంబంధాల సృష్టి మాత్రమే.

రాజకీయ అర్థశాస్త్రంలో స్వేచ్ఛాయుతమయిన శాస్త్ర పరిశోధనకి ఎదురయేది కేవలం మిగిలిన రంగాలలో ఎదురయ్యే శత్రువుల వంటివి మాత్రమే కాదు. అది పరిశోధించే విషయానికి ఒక ప్రత్యేక స్వభావం వుంది. దానివల్ల మహా నీచమైన, దుష్ట, ధూర్త, ఉద్రేకాలు రణరంగంలో కొస్తాయి. అవి వ్యక్తిగత ప్రయోజనానికి సంబంధించిన ఆగ్రహ జ్వాలలు. ఉదాహరణకి, ఇంగ్లీషు చర్చి తన 39 నిబంధనల్లో, 38 పైన దాడి చేసినా క్షమిస్తుంది. కాని దాని ఆదాయంలో 1/39వ వంతు పైన దాడిని కూడా అది సహించలేదు. ఈనాటి ఆస్తి సంబంధాలపై విమర్శతో పోలిస్తే నాస్తికత్వం చిన్న నేరం మాత్రమే. ఏమయినప్పటికీ, అర్థశాస్త్ర విమర్శలో సైతం స్పష్టమైన పురోగమనం వుంది. "విదేశాల్లో పారిశ్రామిక సమస్యలనీ, కార్మికుల సంఘాలనూ అధ్యయనం చేయడానికి బ్రిటిషు రాణిగారు విదేశాలకు పంపిన బృందాలతో ఉత్తర ప్రత్యుత్తరాలు" అనే పేరుతో ఇటీవలే, కొన్ని వారాల క్రితం విడుదలైన 'బ్లూబుక్'ని ఉదాహరణగా పేర్కొంటాను. దానిలో ఆ బృందాలు, జర్మనీలో, ఫ్రాన్సులో, ఒక్క ముక్కలో చెప్పాలంటే యూరపు ఖండంలోని నాగరిక దేశాలన్నిటిలోనూ ఇంగ్లండులోలాగే పెట్టుబడికీ, శ్రమకీ మధ్య ఉన్న సంబంధాలలో అంతే స్పష్టంగా, అంతే అనివార్యంగా మౌలికమయిన మార్పు కన్పిస్తోందని స్పష్టం చేశారు. బానిసత్వం రద్దయాక పెట్టుబడిలోనూ, భూమికి సంబంధించిన ఆస్తి సంబంధాల్లోనూ మార్పు రాబోతోందనే విషయాన్ని అట్లాంటిక్ సముద్రానికి అటువైపున్న అమెరికా ఉపాధ్యక్షుడు 'వాడె' కూడా బహిరంగ సభల్లో ప్రకటించాడు. ఇవి ఈ కాలపు చిహ్నాలు. వీటిని రాజగురువుల ఎర్రటి ఉత్తరీయాల్తో లేదా మతగురువుల నల్లటి గౌన్‌లతో కప్పిపెట్టడం సాధ్యం కాదు. రేపటికి రేపే ఓ అద్భుతం జరిగిపోతుందని ఇవి సూచించడంలేదు. కాని ప్రస్తుత సమాజం నిశ్చల స్ఫటికం కాదు, అది మారగలదు, నిరంతరం మారుతోంది అనే జ్ఞానోదయం పాలక వర్గాలలో సైతం ప్రారంభమైందనటానికి ఇది సూచన.

పెట్టుబడి చలామణి క్రమం గురించి (గ్రంథం II), పెట్టుబడి అభివృద్ధిలో అది తీసుకొనే వివిధ రూపాల గురించి (గ్రంథం III) నా రెండో సంపుటిలో చర్చించాను. ఆఖరిదైన నా మూడో సంపుటిలో (గ్రంథం IV) సిద్ధాంత చరిత్రని వివరించాను.*

శాస్త్రీయ విమర్శపైన ఆధారపడిన అభిప్రాయాలన్నింటికీ స్వాగతం. పోతే, ప్రజాభిప్రాయం పేరుతో చలామణి అయే దురభిప్రాయాలకు నేనెప్పుడూ రాయితీలివ్వలేదు. ఎప్పటిలాగే ఇప్పుడు కూడా ఫ్లోరెన్సుకు చెందిన మహనీయుని సూత్రమే నా సూత్రం :

"నీ దారిన నీవు పో, జనం ఏమైనా మాట్లాడనీ."

**కార్ల్ మార్క్స్**

లండన్, జులై 25, 1867

---

* కాని తర్వాత గ్రంథం II రెండో సంపుటిగానూ, గ్రంథం III మూడో సంపుటిగానూ, గ్రంథం IV 'అదనపు విలువ సిద్ధాంతాలు'గానూ వెలువడ్డాయి.

# జర్మన్ రెండో ముద్రణకు చివరి మాట

**మొ**దటి కూర్పు పాఠకులకు రెండో కూర్పులో చేసిన మార్పుల గురించి ఇక్కడ తెలియపర్చాలి. రెండో కూర్పులో మరింత స్పష్టమైన ఏర్పాటు వుందనేది కొట్టొచ్చినట్టు కన్పిస్తుంది. ప్రతిచోటా అదనపు నోట్స్‌ని రెండవ కూర్పుకు నోట్స్ అని గుర్తు పెట్టాను. గ్రంథంలోని ప్రధాన మార్పులు ఇలా వున్నాయి.

ఒకటో అధ్యాయం ఒకటో విభాగంలో ప్రతి మారకపు విలువనూ వ్యక్తీకరించిన సమీకరణల విశ్లేషణ ద్వారా విలువను చూపెట్టడంలో మరింత కచ్చితమైన శాస్త్రీయ పద్ధతిని పాటించాను. అదే రకంగా విలువ సారాంశానికీ, సామాజికంగా అవసరమైన శ్రమకాలంచేత విలువ పరిమాణం నిర్ణయింపబడానికీ మధ్య ఉన్న సంబంధం ఇక్కడ మరింత స్పష్టంగా నొక్కి చెప్పాను. మొదటి ముద్రణలో అది సూచనప్రాయంగా మాత్రమే వుంది. ఒకటో అధ్యాయం, మూడో విభాగం (విలువ రూపం) పూర్తిగా సంస్కరించాను. (మొదటి ముద్రణలో విలువ రూపానికిచ్చిన వివరణ / పునరావృతమయింది. దానికి కారణం టూకీగా వివరిస్తాను. 1867 వసంత కాలంలో నేను హాంబర్గ్‌లో ఉన్న నా మిత్రుడు డాక్టర్ కుగెల్‌మాన్ దగ్గరకు వెళ్ళాను అప్పుడే మొదటి ప్రూఫులు అక్కడికి వచ్చాయి. విలువ రూపంపై అత్యధిక పాఠకులకు సుబోధకమైన అదనపు వివరణ అవసరమని ఆయన నన్ను ఒప్పించాడు. కనుక దాన్ని మొదటి ముద్రణలో మరోసారి వివరించాను. "సరుకుల సంకేతారాధన, వగైరా"ను చాలా వరకు మార్చాను. 1859 బెర్లిన్‌లో ప్రచురితమైన 'అర్థశాస్త్ర విమర్శ'లో ఇచ్చిన వివరణను చదువుకొమ్మని పాఠకునికి సలహా ఇచ్చి మొదటి ముద్రణలో మూడో అధ్యాయం, ఒకటో విభాగాన్ని (విలువ కొలమానం) కొంత నిర్లక్ష్యం చేశాను. ఇప్పుడు దాన్ని జాగ్రత్తగా సంస్కరించాను. ఏడో అధ్యాయం ముఖ్యంగా రెండో భాగాన్ని చాలా వరకు తిప్పి రాశాను.

గ్రంథంలో చేసిన స్వల్పమయిన మార్పులన్నిటినీ వివరించడమంటే కాలాన్ని వృథాచేయడం అవుతుంది. అందులో చాలా మట్టుకు శైలికి సంబంధించిన మార్పులే. అటువంటివి పుస్తకం అంతటా జరిగాయి. అయినప్పటికీ, ఫ్రెంచి అనువాదాన్ని సంస్కరించిన మీదట జర్మన్ మూలంలో పలు భాగాలను పూర్తిగా మార్చాల్సిన అవసరం ఉందని నాకనిపిస్తోంది. శైలిరీత్యా కొన్ని భాగాలను సమూలంగా పరిష్కరించాలి (ఎడిట్). అక్కడక్కడా అనుకోకుండా దొర్లిన చిన్న పొరపాట్లను ఓపిగ్గా సరిచేయాలి. కానీ అందుకు సమయం లేదు. ఏమంటే మొదటి ముద్రణ కాపీలు పూర్తిగా అమ్ముడయిపోయాయి. రెండవ ముద్రణ 1872 జనవరి నాటికి ప్రారంభం కావాలి. ఈ విషయం నాకు 1871 ఆకురాలు కాలంలో మాత్రమే తెలిసింది. అప్పటికీ నేను మరో అత్యవసరమైన పనిలో మునిగి వున్నాను. కనుక దీనంతటికీ వ్యవధి లేకపోయింది.

జర్మన్ కార్మికవర్గ విస్తృత బృందాల్లో ఇంత తొందరగా "పెట్టుబడి"కి లభించిన ఆదరణ నా శ్రమకు లభించిన అత్యుత్తమ బహుమానం. సిద్ధాంత అవగాహనా పటిమ జర్మన్ జాతికి వారసత్వంగా సిద్ధిస్తుందనేది ఒకనాటి భావన. కానీ జర్మన్ విద్యాధిక వర్గాలనబడే వాటిలో ఆ పటిమ అదృశ్యమయిందనీ, కార్మిక వర్గంలో దాని పునర్వికాసం జరుగుతోందనీ హెర్ మేయర్ తన కరపత్రంలో పేర్కొన్నాడు. ఆయన వియన్నాలో పరిశ్రమ యజమాని. ఆర్థిక విషయాల్లో బూర్జువా దృక్పథం కలిగినవాడు. తన కరపత్రాన్ని ఆయన ఫ్రాంకో జర్మన్ యుద్ధకాలంలో ప్రచురించాడు.

ఈనాటి వరకూ అర్థశాస్త్రం జర్మనీకి ఒక విదేశీ శాస్త్రమే. జర్మనీలో పెట్టుబడిదారీ అభివృద్ధినీ తద్వారా ఆ దేశంలో బూర్జువా సమాజ అభివృద్ధిని నిరోధించిన చారిత్రక పరిస్థితుల గురించి గుస్తావ్‌వాన్ గ్యూలిచ్ తన "వాణిజ్యం, పరిశ్రమల చారిత్రక వివరణ" వగైరా గ్రంథాల్లో వివరంగా చర్చించాడు. ముఖ్యంగా 1830లో వెలువడిన ఆయన మొదటి రెండు సంపుటాల్లో బాగా వివరించాడు. ఆ విధంగా, రాజకీయ అర్థశాస్త్రం మొలకెత్తడానికి అనువైన నేల జర్మనీలో లేకపోయింది. ఈ "శాస్త్రాన్ని" ఇంగ్లండు, ఫ్రాన్సుల నుండి తయారైన వస్తువులా దిగుమతి చేసుకోవలసి వచ్చింది. దాని జర్మన్ ప్రొఫెసర్లు ఎప్పుడూ స్కూలు పిల్లలుగానే మిగిలిపోయారు. విదేశీ వాస్తవం యొక్క సిద్ధాంత వ్యక్తీకరణ అనేది వారి చేతిలో పిడిసూత్రాల జాబితాగా మారిపోయింది. తమ చుట్టూ ఉన్న స్వల్ప వాణిజ్య ప్రపంచం దృష్ట్యా వాళ్ళు ఆ శాస్త్రానికి భాష్యాలు చెప్పారు. కనుక దీనికి వక్రభాష్యాలు తయారయ్యాయి. సాహిత్య, చారిత్రక విషయాల పాండితీ ప్రకర్ష ద్వారా, వాణిజ్య శాస్త్రాలనబడే వాటి నుండి ఎరువు తెచ్చుకున్న అసంగత విషయాలను గుప్పించడం ద్వారా, జర్మన్ ప్రభుత్వ యంత్రాంగంలో చేరాలనుకొనే వాడు అభ్యసించాల్సిన అమాంబాపతు విషయాల పైపై పరిజ్ఞానం ద్వారా, శాస్త్ర రంగంలో తాము అసమర్థులమనే భావాన్ని ఎంత అణచిపెట్టుకోవాలన్నా అణగటం లేదు. తమకంతు పట్టని పరాయి విషయంతో వ్యవహరించాల్సి వస్తోందనే ఇబ్బందికరమైన స్పృహను ఎంత దాచిపెట్టుకోవాలనుకున్నా పూర్తిగా దాగటం లేదు.

1848 నుండి జర్మనీలో పెట్టుబడిదారీ ఉత్పత్తి వేగంగా అభివృద్ధి చెందింది. ప్రస్తుతం అది చట్టా వ్యాపారం, దగాలతో పరిపూర్ణంగా వికసిస్తోంది. అయినా ఈ వృత్తిరీత్యా ఆర్థికవేత్తలైనవారికి ఇంకా విధి అనుకూలంగా లేదు. వారు ప్రత్యక్షంగా అర్థశాస్త్రాన్ని పరిశీలించగలిగిన నాడు జర్మనీలో ఆధునిక ఆర్థిక పరిస్థితులు లేవు. తీరా అటువంటి పరిస్థితులు వచ్చిన వెంటనే, వాటిని వాస్తవ దృష్టితో నిష్పాక్షికంగా పరిశీలించే అవకాశం బూర్జువా ప్రపంచపు పరిమితులలో లేకపోయింది. ఎందుకంటే, వారు పెట్టుబడిదారీ వ్యవస్థను పరిణామ క్రమంలో ఒక తాత్కాలిక చారిత్రక దశగా అర్థం చేసుకోటానికి బదులు దానిని సామాజికోత్పత్తి తుదిరూపంగా పరిగణించారు. వర్గపోరాటం ఇంకా గుప్తంగానే ఉన్నప్పుడు లేదా అది అడపా దడపా బయటపడుతున్న కాలంలో మాత్రమే (బూర్జువా) రాజకీయ అర్థశాస్త్రం ఒక శాస్త్రంగా వుండగలుగుతుంది.

ఇంగ్లండును తీసుకొందాం. దాని రాజకీయ అర్థశాస్త్రం వర్గపోరాటం ఇంకా అభివృద్ధి చెందని కాలానిది. దాని చివరి గొప్ప ప్రతినిధి రికార్డో. వర్గ ప్రయోజనాల మధ్య, వేతనాలకీ లాభాలకీ మధ్య, లాభాలకీ కౌలుకీ మధ్య ఉండే శత్రుత్వాన్ని ఆయన పూర్తి స్పృహతోనే తన పరిశోధనకి తొలి అంశంగా

ఎంచుకున్నాడు. అయితే ఆయన ఈ శత్రుత్వాన్ని అమాయకంగా ప్రకృతిసిద్ధమైన సామాజిక నియమం అనుకున్నాడు. దీనితో బూర్జువా అర్థశాస్త్రం దాని పరిమితుల్ని చేరుకుంది. అంతకు మించి అది ముందుకు పోలేకపోయింది. రికార్డో బతికుండగానే అతని ప్రతిపాదనలను వ్యతిరేకిస్తూ సిస్మండీ[1] ముందుకొచ్చాడు.

రాజకీయ ఆర్థిక సిద్ధాంత రంగంలో శాస్త్రీయ కృషికి ఇంగ్లండులో 1820–1830 కాలం చెప్పుకోదగింది. రికార్డో సిద్ధాంతాన్ని భ్రష్టుపట్టించి విస్తృతపరచిన కాలం అది. పాత సిద్ధాంతాలతో ఆయన సిద్ధాంతం పోటీపడిన కాలం కూడా అదే. వివిధ సిద్ధాంతాల మధ్య ఆనాడు బ్రహ్మాండమైన పోటీలు జరిగాయి. ఆనాడు ఏం జరిగిందో సాధారణంగా ఈ ఖండానికి ఏమీ తెలియదు. ఎందుకంటే సిద్ధాంత రంగంలో వాగ్వివాదాలన్నీ సమీక్షా వ్యాసాల ద్వారా, అడపా దడపా వెలువడే సాహిత్యం ద్వారా, కరపత్రాల ద్వారా జరిగాయి. రికార్డో సిద్ధాంతం ఆనాటికే కొన్ని అరుదైన సందర్భాల్లో బూర్జువా ఆర్థిక వ్యవస్థపై దాడి చేయటానికి ఆయుధంగా ఉపయోగపడుతోంది. అయినప్పటికీ ఆనాటి సిద్ధాంత వాగ్వివాదాలు దురభిప్రాయ రహితంగా ఉండటానికి కారణం ఆనాటి పరిస్థితులే. 1825 నాటి సంక్షోభం ఆధునిక పరిశ్రమ యొక్క దశలవారీ ఆర్థిక వలయాన్ని (Periodic Cycle) మొట్టమొదటిసారి ప్రారంభించింది. అంటే ఆధునిక పరిశ్రమ తన బాల్యదశ నుండి అప్పుడే బయటపడబోతోంది. ఫ్యూడల్ ప్రభువుల, ప్రభుత్వాల పవిత్ర కూటమి ఒకవైపు, బూర్జువావర్గ నాయకత్వం క్రింద మొత్తం ప్రజానీకమంతా మరోవైపు చేరాయి. ఈ రెండు కేంద్రాల మధ్య తలెత్తిన వివాదం వల్ల రాజకీయంగానూ, పారిశ్రామిక పెట్టుబడికీ ప్రభువర్గపు ఆస్తులకీ మధ్య తలెత్తిన ఘర్షణ వల్ల ఆర్థికంగానూ, పెట్టుబడికీ శ్రమకీ మధ్య వుండే వర్గ పోరాటం వెనక్కు నెట్టబడింది. ఫ్రాన్సులో ఆర్థిక పోరాటం చిన్న కమతాలకూ పెద్ద కమతాలకూ మధ్య వ్యతిరేకత మాటున దాగి వుంది. కాగా ఇంగ్లండులో ధాన్యపు చట్టాల తర్వాత ఆ పోరాటం బహిరంగంగా సాగింది. ఈ కాలపు ఇంగ్లండు రాజకీయ అర్థశాస్త్ర సాహిత్యం చూస్తే డాక్టర్ క్వెనే (Dr. Quesnay) మరణం తర్వాత ఫ్రాన్స్‌లో ఉధృతంగా పురోగమించిన ఉద్యమం గుర్తువస్తుంది. అయితే అది సెయింట్ మార్టిన్ వేసవి మనకు వసంతకాలాన్ని గుర్తుచేసినట్టుగా మాత్రమే వుంది. 1830వ సంవత్సరం నిర్ణయాత్మకమైన సంక్షోభాన్ని తెచ్చింది.

ఫ్రాన్స్, ఇంగ్లండుల్లో బూర్జువా వర్గం రాజకీయాధికారం జయించుకుంది. ఆనాటి నుండి సిద్ధాంత, ఆచరణల రంగాల్లో వర్గ పోరాటం రాను రాను మరింత బాహాటపు, ప్రమాదసూచక రూపాలను తీసుకుంది. బూర్జువా సాంప్రదాయక ఆర్థిక సిద్ధాంతానికి అది భరత వాక్యం పాడింది. ఆనాటి నుండి ఈ సిద్ధాంతం సరైందా, మరో సిద్ధాంతం సరైందా అనేది కాదు ప్రశ్న. పెట్టుబడికి ఈ సిద్ధాంతం తోడ్పడుతుందా, హాని చేస్తుందా, అవసరమా, అనవసరమా, రాజకీయంగా ప్రమాదకరమా, కాదా అనేదే ప్రధాన ప్రశ్న. నిస్వార్థ అన్వేషకుల స్థానంలో కిరాయి కుస్తీ వస్తాదులు తయారయ్యారు. నిజమైన శాస్త్రీయ పరిశోధనలు అడుగంటాయి. వాటి స్థానంలో తన పక్షాన్ని ఎట్లాగయినా

1. నా గ్రంథం 'అర్థశాస్త్ర విమర్శ' పుట 39 చూడండి.

గెలిపించుకోవాలనే వకాల్తాదారుని దుష్టచింతన, చిత్తశుద్ధి రాహిత్యమూ చోటుచేసుకున్నాయి. కార్ఖానా యజమానులు కొబ్డన్, బ్రైట్‌ల నాయకత్వాన 'యాంటీ కార్న్‌లా లీగ్' జమీందార్ల వర్గానికి వ్యతిరేకంగా తామరతంపరగా ప్రచురించిన ఆడంబరపు కరపత్రాలకి శాస్త్రీయ విలువ లేకపోయినప్పటికీ, చారిత్రకంగా చూస్తే అవి సైతం ఆ వివాదం దృష్ట్యా ఆసక్తిదాయకమైనవే. అయితే సర్ రాబర్ట్ పీల్ ప్రవేశపెట్టిన స్వేచ్ఛా వాణిజ్య శాసనం అపభ్రంశపు ఆర్థిక సిద్ధాంతానికి (Vulgar Economics) ఉన్న ఈ ఆఖరి కొండెను (Sting) కూడా ఊడబెరికింది.

1848-49 ఐరోపా ఖండ విప్లవానికి ఇంగ్లండు కూడా ప్రతిస్పందించింది. ఇంకా శాస్త్రానికి ఎంతో కొంత కట్టుబడి ఉన్నామనే వాళ్ళూ, తాము కుతర్కవాదులు కాదనీ, పాలక వర్గాల భట్రాజులు కాదనీ నమ్మేవాళ్ళూ పెట్టుబడిదారీ అర్థశాస్త్రానికీ, ఇక ఏమాత్రమూ కొట్టిపారేయడానికి వీలులేని కార్మికవర్గ వాదనలకీ సామరస్యం ఏర్పర్చటానికి ప్రయత్నించారు. అందుకనే ఒక నిస్సారమైన మిశ్రమ సిద్ధాంతం తయారైంది. జాన్ స్టువర్ట్ మిల్ దానికి అత్యుత్తమ ప్రతినిధి. బూర్జువా అర్థశాస్త్రం దివాళా తీసిందనటానికి నిదర్శనం ఇది. ఈ సందర్భంలోనే ప్రముఖ రష్యా పండితుడూ, విమర్శకుడూ అయిన ఎన్. చెర్నిషేవ్‌స్కీ తన "మిల్ రాజకీయ అర్థశాస్త్రం" అనే గ్రంథంలో మహా మేధావులకు సహజమైన రీతిలో ఈ అంశాన్ని వివరించాడు.

ఫ్రాన్స్, ఇంగ్లండుల్లో వర్గాల మధ్య భీకరమైన సంఘర్షణ ద్వారా తన వర్గ వైరుధ్య స్వభావాన్ని పెట్టుబడిదారీ విధానం వెల్లడించుకున్న తర్వాతనే అది జర్మనీలో ఉన్నత దశకు చేరుకుంది. అంతేగాక ఈలోగా జర్మన్ కార్మిక వర్గం జర్మన్ బూర్జువా వర్గం కంటే ఎంతో స్పష్టంగా వర్గ చైతన్యాన్ని సంతరించుకుంది. జర్మనీలో ఎట్టకేలకు బూర్జువా రాజకీయ అర్థశాస్త్రం ఒక శాస్త్రంగా ఆవిర్భవించడం సాధ్యమవుతోందని అనిపించిన క్షణమే ఆచరణలో ఆ రకంగా అది మళ్ళీ అసాధ్యమైంది.

ఈ పరిస్థితుల్లో అర్థశాస్త్ర ప్రొఫెసర్లు రెండు బృందాలుగా చీలిపోయారు. వ్యవహారజ్ఞానం గల వాళ్ళు కార్యవాదులూ అయిన వ్యాపారులు మొదటి బృందంలో చేరారు. వారంతా బాస్టియట్ పతాకం కింద గుమిగూడారు. పైపై పరిజ్ఞానానికి బాస్టియట్ పెట్టింది పేరు. అందుకే అతడు భ్రష్ట అర్థశాస్త్ర సమర్థకులకు అత్యుత్తమ ప్రతినిధి. ఇక, తమ శాస్త్రానికీ, తమ ప్రొఫెసర్ పదవికీ ఉన్న హుందాతనం చూసుకుని గర్వపడేవాళ్ళు రెండో బృందంలో చేరారు. రాజీలేని వాటి మధ్య రాజీ కుదర్చటానికి ప్రయత్నించే జాన్ స్టువర్ట్ మిల్‌ని వీరంతా అనుసరించారు. బూర్జువా అర్థశాస్త్రం ఉన్నత దశలో ఉన్నప్పటిలాగానే దాని పతనావస్థలో కూడా జర్మన్లు కేవలం స్కూలు పిల్లలుగా, అనుకరించే వారుగా, అనుచరులుగా మాత్రమే మిగిలిపోయారు. గొప్ప విదేశీ టోకు సంస్థ సేవలో చిల్లర వ్యాపారులుగా, వీధి పక్క నిలబడి అమ్మేవారుగా వుండిపోయారు.

జర్మన్ సమాజపు విలక్షణమైన చారిత్రకాభివృద్ధి వల్ల ఆ దేశంలో సొంత బూర్జువా అర్థశాస్త్రానికి అవకాశం లేకుండా పోయింది. అయితే ఆ అర్థశాస్త్రంపై వచ్చే విమర్శకు అవకాశం వుంది. ఆ విమర్శ ఏ వర్గానికయినా ప్రాతినిధ్యం వహిస్తే, పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానాన్ని కూలదోసి అంతిమంగా సకల వర్గాలనూ రద్దుచేసే చారిత్రక బాధ్యత గల కార్మిక వర్గానికి మాత్రమే ప్రాతినిధ్యం వహించగలదు.

నా తొలి రచనల విషయంలో లాగే 'పెట్టుబడి' గ్రంథాన్ని కూడా జర్మన్ బూర్జువా వర్గ

పండిత పామర ప్రతినిధులంతా తమ మౌనంతో చంపడానికి ప్రయత్నించారు. కానీ ఇవాల్టి పరిస్థితుల వల్ల వారి ఎత్తులు పారలేదు. కనుక వారు నా గ్రంథాన్ని విమర్శించే సాకుతో "బూర్జువా హృదయాలకు సాంత్వన" యివ్వడం కోసం చిట్కాలు చెప్పారు. అయితే కార్మికవర్గ పత్రికల్లో తమకంటే బలమైన శత్రువులు వారికి ఎదురయ్యారు. అందుకే ఆ పత్రికల్లో వచ్చిన వ్యాసాలలో నేటికీ వారు సమాధానం చెప్పలేదు. ఉదాహరణకు వోల్క్ స్టాట్‌లో వచ్చిన జోసిఫ్ డెయిజన్ వ్యాసాలు.[1]

1872 వసంత కాలంలో "పెట్టుబడి" గ్రంథానికి రష్యన్ భాషలో చక్కటి అనువాదం వెలువడింది. మూడువేల కాపీల ఈ ముద్రణ దాదాపు అయిపోవచ్చింది. 1871లోనే కీయెవ్ విశ్వవిద్యాలయానికి చెందిన ఎన్. సియెబర్ అనే అర్థశాస్త్ర ప్రొఫెసరు "డేవిడ్ రికార్డో విలువ సిద్ధాంతం, పెట్టుబడి సిద్ధాంతం" అనే గ్రంథం రాశాడు. అతడు దానిలో విలువ, ధనం, పెట్టుబడులకు సంబంధించిన నా సిద్ధాంతాన్ని స్మిత్, రికార్డోల బోధనల ఫలితంగా విధిగా ఏర్పడే మౌలిక అంశాలు గల సిద్ధాంతంగా పేర్కొన్నాడు. ఈ చక్కటి గ్రంథాన్ని చదివే పశ్చిమ యూరపు పాఠకుడు, సిద్ధాంత ప్రతిపాదనలను రచయిత చాలా సమగ్రంగా, గాఢంగా అర్థం చేసుకోవడం చూసి ఆశ్చర్యపోతాడు.

'పెట్టుబడి' గ్రంథం గురించి పరస్పర విరుద్ధమైన రకరకాల భావనలు వ్యక్తం గావడం చూస్తే వారికి దానిలో ఉపయోగించిన పద్ధతి ఏ మాత్రం అర్థం కాలేదని స్పష్టమవుతుంది.

అర్థశాస్త్రాన్ని నేను అధిభౌతికంగా పరిగణించానని ఒకవైపూ, భావి పాకశాలలకుపయోగపడే చిట్కాలు (కామ్టి తరహా చిట్కాలా?) రాయటానికి బదులు వాస్తవ విషయాల విమర్శనాత్మక విశ్లేషణకే పరిమితమయ్యానని మరోవైపూ పారిస్ 'రివ్యూ పాజిటివిస్టీ' నన్ను నిందించింది. అధిభౌతికం అనే విమర్శకి ప్రొఫెసరు సియెబరు జవాబు ఇలా వుంది. "అసలు సిద్ధాంతానికి సంబంధించినంతవరకూ ఇంగ్లండులో ప్రచలితమైన నిగమన పద్ధతినే మార్క్స్ ఉపయోగించాడు. ఈ పద్ధతిలో ఉన్న సుగుణాలు, దుర్గుణాలూ అర్థశాస్త్ర ప్రముఖులందరికీ వర్తించేవే." నాది విశ్లేషణాత్మక పద్ధతి అని ఎమ్. బ్లాక్ తన "Les Theoriciens du socialisme en Allemagne. Extrait du Journal des Economistes, Juillet et Aout 1872" అనే రచనలో పేర్కొన్నాడు. "ఈ గ్రంథం ద్వారా మార్క్స్ అత్యంత ప్రతిభావంతులయిన విశ్లేషణకారుల పంక్తిలో స్థానం సంపాదించుకున్నాడు" అని ఆయన రాశాడు. నాది హెగెలియన్

---

1. ఈ జర్మన్ భ్రష్ట ఆర్థిక సిద్ధాంతపు కూట వాగాడంబరులు నా గ్రంథంలోని శైలిని తప్పుపట్టారు. 'పెట్టుబడి'లో ఉన్న సాహిత్య దోషాల గురించి నాకంటే బాగా గుర్తించిన వారెవరూ వుండరు. అయితే ఈ పెద్దమనుషులనూ, వారి పాఠకులనూ ఆనందింపజేయటం కోసం, ఒక ఇంగ్లీషు విమర్శకుడినీ, మరో రష్యను విమర్శకుడినీ ఉల్లేఖిస్తాను. నా భావాలకు ఎప్పుడూ చుక్కెదురుగా ఉండే "సాటర్‌డే రివ్యూ" నా మొదటి కూర్పు గురించి ఇలా అంది : "విషయాన్ని పాఠకుని ముందుంచిన తీరు వల్ల అత్యంత నిర్జీవమైన ఆర్థిక అంశాలు సైతం ఒక విశిష్టమైన సొగసును సంతరించుకున్నాయి." 1872 ఏప్రిల్ 8 (20)వ తేదీ సెయింట్ పీటర్స్ బర్గ్ పత్రిక ఇలా పేర్కొంది: "ఒకటి, రెండు ప్రత్యేక విభాగాలను మినహాయిస్తే విషయాన్ని చెప్పిన తీరు సామాన్య పాఠకునికి సుబోధకంగా ఉంది, స్పష్టంగా ఉంది. విషయంలో శాస్త్రీయ క్లిష్టత వున్నప్పటికీ అది అత్యంత అసాధారణ రీతిలో జీవంతో తొణికిసలాడుతోంది. ఈ విషయంలో ఈ రచయితకూ అత్యధిక జర్మన్ పండితులకూ పోలికే లేదు. మానవమాత్రులకు తలబద్దలు గొట్టుకున్నా అర్థంకాని నిర్జీవ భాషలో ఈ పండితులు రాస్తారు."

కుతర్కమని జర్మన్ సమీక్షలు అరిచాయి. సెయింట్ పీటర్స్ బర్గ్‌కి చెందిన ది యూరోపియన్ మెసెంజర్ (1872 మే, పుటలు 427 - 436) ప్రత్యేకంగా 'పెట్టుబడి' గ్రంథంలో ఉపయోగించిన పద్ధతి గురించే ఒక వ్యాసం రాసింది. విషయ పరిశీలనలో నేను అత్యంత వాస్తవిక పద్ధతి అనుసరించాననీ, విషయాన్ని వివరించడంలో దురదృష్టవశాత్తూ జర్మన్ గతితార్కిక పద్ధతిని ఉపయోగించాననీ అది పేర్కొంది. "విషయాన్ని చెప్పిన తీరుని బట్టి నిర్ణయిస్తే మొదటి చూపుకి మార్క్స్ జర్మన్ భావవాదు లందరికంటే భావవాది అనిపిస్తాడు. భావవాది అనే పదాన్ని జర్మన్ భాషలో గల అర్థంలో గ్రహించాలి – అంటే దాని చెడు అర్థంలో. అయితే నిజానికి, మార్క్స్ అర్థశాస్త్ర విమర్శలో తనకి ముందున్న వారందరికంటే లెక్కలేనన్ని రెట్లు వాస్తవికతావాది. ఆ విషయంలో ఆయన్ని ఏ రకంగానూ భావవాది అనలేము" అని ఆ వ్యాస రచయిత పేర్కొన్నాడు. ఆ వ్యాసంలోని కొన్ని భాగాల సాయంతోనే నేను ఆయనకు సమాధానం చెప్పడం మంచిది. రష్యన్ పాఠం అందుబాటులో లేని పాఠకులకు అది ఆసక్తికరంగా వుండొచ్చు.

"అర్థశాస్త్ర విమర్శ" అనే నా గ్రంథం (బెర్లిన్, 1859, పేజీలు iv-vii) ముందుమాటలో నా పద్ధతికున్న భౌతికవాద పునాది గురించి చర్చించాను. దాని నుండి రచయిత ఒక ఉల్లేఖనతో ప్రారంభించి ఇలా రాశాడు. "మార్క్స్‌కి తాను పరిశోధించే ఘటనల నియమాన్ని కనుగొనడం ముఖ్యం. ఒక నిర్దిష్ట చారిత్రక కాల పరిధిలో, ఒక నిర్దిష్ట రూపముండి, ఈ ఘటనల మధ్య పరస్పర సంబంధమున్న మేరకు వీటిని పాలించే నియమం మాత్రమే ముఖ్యం కాదు. ఈ ఘటనల పరివర్తనకీ వీటి అభివృద్ధికీ సంబంధించిన నియమం, అంటే ఇవి ఒక రూపం నుండి మరో రూపంలోకి మారే పరివర్తన యొక్క నియమం, ఒక రకం సంబంధాల పరంపర నుండి మరోరకం సంబంధాల పరంపరకి మారే పరివర్తన యొక్క నియమం, మార్క్స్‌కి మరింత ముఖ్యం. ఆ నియమాన్ని కనుగొన్నాక సామాజిక జీవితంలో అది ఏ ఏ ఫలితాలుగా వ్యక్తమవుతుందో ఆయన వివరంగా పరిశీలిస్తాడు. ఆ రకంగా ఒకే ఒక అంశం గురించి మార్క్స్ తంటాలు పడతాడు. కచ్చితమైన శాస్త్రీయ పరిశీలన ద్వారా నిర్దిష్ట సామాజిక పరిస్థితుల వ్యవస్థలూ ఒక దాని తర్వాత ఒకటి రావలసిన అగత్యాన్ని నిరూపించి, తనకు మౌలిక ప్రారంభ విషయాలుగా ఉపకరించే వాస్తవాలను సాధ్యమైనంత నిష్పాక్షికంగా నిర్ణయించడం అగత్యంగా రూపొందిందనీ, అది మరో వ్యవస్థలోకి అగత్యంగా మారుతుందనీ, ఆ అగత్యాన్ని మనుషులు నమ్మినా, నమ్మకపోయినా, గ్రహించినా, గ్రహించకపోయినా అలా జరుగుతుందనీ రుజువు చేస్తే దానికి సరిపోతుంది. సామాజిక చలనాన్ని మార్క్స్ ప్రకృతి చరిత్రలోని ఒక ప్రక్రియగా భావిస్తాడు. ఆ ప్రక్రియను పాలించే నియమాలకు మానవుల ఇచ్ఛతోను, చైతన్యంతోనూ, మేధాశక్తితోనూ ప్రమేయం లేకపోవడమే కాక, అవే మానవుల ఇచ్ఛనూ, చైతన్యాన్నీ, మేధాశక్తినీ నిర్ణయిస్తాయని మార్క్స్ నమ్మకం. మానవ జాతి చరిత్రలో చైతన్యం అంత అప్రధాన పాత్ర నిర్వహించేటప్పుడు, మానవ నాగరికతను పరిశీలించే విమర్శన సిద్ధాంతం చైతన్యం యొక్క ఒక రూపాన్నిగానీ, ఫలితాన్నిగానీ ఆధారం చేసుకోజాలదనేదీ స్పష్టం. అంటే దానికి నాందీ వాచకంగా తోడ్పడేది భావం కాదు. భౌతిక ఘటన మాత్రమే. కనుక అటువంటి సిద్ధాంతం ఒక వాస్తవాన్ని భావాలతో కాక మరో వాస్తవంతోనే పోల్చి చూస్తుంది. మరొక వాస్తవానికే పోటీ పెడుతుంది. ఈ రెండు వాస్తవాలను సాధ్యమైనంత కచ్చితంగా

పరిశోధించడమూ, అవి రెండూ ఒకే పరిణామంలోని రెండు భిన్న అంశాలుగా వుండడమూ మాత్రమే ఆ పరిశీలనకు ముఖ్యమైనవి. అయితే ఆ అభివృద్ధిలోని భిన్న దశల పరంపరనూ, వాటి వరుస క్రమాన్నీ, వాటి లంకెలనూ కచ్చితంగా విశ్లేషించటం అత్యంత ప్రధానం. అయితే ఆర్థిక జీవితానికి సంబంధించిన సాధారణ నియమాలు గతానికి వర్తించేవయినా, వర్తమానానికి వర్తించేవయినా ఒకటే గదా అనవచ్చు. దీన్నే మార్క్స్ గట్టిగా వ్యతిరేకించేది. ఆయన దృష్టిలో అటువంటి అభౌతిక నియమాలేవీ లేవు. పైగా ప్రతి చారిత్రక కాలానికీ దాని సొంత నియమాలుంటాయని ఆయన అభిప్రాయం. ఒక నిర్దిష్ట అభివృద్ధి కాలాన్ని గడిచిపోయి, ఒక దశ నుండి మరో దశకు మారుతుండగానే సమాజం ఇతర నియమాలకు గురికావడం ప్రారంభమవుతుంది. ఒక్క మాటలో చెప్పాలంటే, ఇతర జీవశాస్త్ర శాఖల పరిణామ చరిత్రను పోలిన చరిత్రే ఆర్థిక జీవితంలో కూడా కనిపిస్తుంది. గతంలో ఆర్థిక సిద్ధాంతవేత్తలు ఆర్థిక నియమాలను పదార్థ రసాయన శాస్త్ర నియమాలతో పోల్చడం ద్వారా వాటి స్వభావాన్ని పొరపాటుగా అర్థం చేసుకున్నారు. ఘటనలను క్షుణ్ణంగా విశ్లేషించడం వల్ల మొక్కలు, జంతువులు మౌలికంగా ఎంత భిన్నంగా వుంటాయో సామాజిక వ్యవస్థలు ఒకదానికొకటి అంత భిన్నంగానూ వుంటాయనే సంగతి స్పష్టమవుతుంది. అంతేగాదు; ఆయా వ్యవస్థల భిన్న నిర్మాణాన్ని బట్టి, వాటి ప్రత్యేక అంగాల్లో ఉన్న తేడాలను బట్టి ఆ అంగాలు పనిచేసే భిన్న పరిస్థితులూ వగైరాలనుబట్టి ఒకే ఘటన విభిన్న నియమాలకు లోబడుతుంది. ఉదాహరణకి, అన్నిచోట్లా, అన్ని కాలాల్లోనూ ఒకే లాంటి జనాభా నియమం వుంటుందని అంటే దాన్ని మార్క్స్ తిరస్కరిస్తాడు. ప్రతి అభివృద్ధి దశకూ దాని సొంతజనాభా నియమం వుంటుందని ఆయన అంటాడు. ఉత్పాదక శక్తి అభివృద్ధి స్థాయిని బట్టి, సామాజిక పరిస్థితులూ, వాటిని పాలించే నియమాలు కూడా మారుతుంటాయి. పెట్టుబడి పెత్తనంలో వుండే ఆర్థిక వ్యవస్థను ఈ దృష్టికోణం నుండి పరిశీలించి, వివరించటం మార్క్స్ తన లక్ష్యంగా పెట్టుకున్నాడు. తద్వారా, ఆర్థిక జీవితాన్ని పరిశోధించేవారు అనుసరించాల్సిన లక్ష్యాన్ని కఠినమైన శాస్త్రీయ ధోరణితో ఆయన నెలకొల్పుతున్నాడు. ఒక నిర్దిష్ట సామాజిక వ్యవస్థ పుట్టుక, ఉనికి, అభివృద్ధి, అంతాలను పాలించే ప్రత్యేక నియమాలనూ, అలాగే ఆ వ్యవస్థని తొలగించి వచ్చే అంతకంటే ఉన్నత వ్యవస్థ ఆవిర్భావానికి వర్తించే ప్రత్యేక నియమాలను వెల్లడించడంలోనే ఒక పరిశోధన యొక్క శాస్త్రీయ విలువ వుంటుంది. నిజానికి మార్క్స్ రాసిన ఈ గ్రంథానికి సరిగ్గా ఈ శాస్త్రీయ విలువే వుంది."

నా పద్ధతి అని తాను భావించిన దాన్ని రచయిత స్పష్టంగా (నేను దానిని ఉపయోగించిన మేరకు సంబంధించి) ఉదారంగా పాఠకుని ముందుంచాడు. అయితే ఇది గతితార్కిక పద్ధతి కాక మరేమిటి?

విషయాన్ని వ్యక్తీకరించే పద్ధతికి, దాన్ని పరిశోధించే పద్ధతికీ రూపంలో తేడా వుండాలి. పరిశోధనలో విషయ సేకరణ వివరంగా వుండాలి. విభిన్న రూపాలలో దాని అభివృద్ధిని విశ్లేషించాలి. ఆయా అంశాల అంతస్సంబంధం కనుక్కోవాలి. ఇదంతా జరిగాక మాత్రమే వాస్తవ చలనాన్ని సక్రమంగా వర్ణించడం సాధ్యమవుతుంది. దీన్ని సరిగా నిర్వహిస్తే, పరిశోధనాంశాన్ని అద్దంలో చూపినట్టు చూపగలిగితే, మన కళ్ళముందు మనం వర్ణించాల్సిన కట్టడం సిద్ధంగా ఉన్నట్టే.

నా గతితార్కిక పద్ధతి హెగెల్ దానికంటే భిన్నం మాత్రమే కాదు, దానికి సరిగ్గా వ్యతిరేకం కూడా. మానవ మస్తిష్కపు జీవన క్రమం, అంటే ఆలోచనా క్రమమే, వాస్తవ ప్రపంచాన్ని సృష్టించిందని హెగెల్ భావిస్తాడు. వాస్తవ ప్రపంచం ఆయన దృష్టిలో కేవలం "భావా"నికి బాహ్య, ఇంద్రియ గోచర రూపం మాత్రమే. "భావం" పేరుతో ఆయన ఆలోచనా క్రమాన్ని ఒక స్వతంత్ర కర్తగా మారుస్తాడు. దానికి విరుద్ధంగా, మానవ మస్తిష్కం భౌతిక ప్రపంచాన్ని ప్రతిబింబిస్తుందనీ, దాన్ని ఆలోచనా రూపాలుగా మారుస్తుందనీ, భావం అంటే అదేననీ నేనంటాను.

దాదాపు ముప్పయేళ్ళ క్రితం హెగెల్ గతితర్కంలోని మాయావాద పార్శ్వాన్ని నేను విమర్శించాను. ఆనాటి కింకా అది ఫాషన్‌గానే వుండేది. కాని నేను 'పెట్టుబడి' మొదటి సంపుటి రాస్తున్న నాటికి పరిస్థితి మారింది. ఒకనాడు, లెస్సింగ్ కాలంలో మోసెస్ మెండెల్‌సాన్ స్పినోజాని పరిగణించినట్టే ఈనాటి సభ్య జర్మన్ సమాజంలో అతిగా వాగుతున్న మూర్ఖపు, దురుసు, ప్రతిభాహీన పండిత పుత్రులు హెగెల్‌ని పరిగణిస్తున్నారు. అంటే 'చచ్చినకుక్క'ని చూసినట్టే చూస్తున్నారు. కనుక నేను ఆ మహామేధావి శిష్యుణ్ణి అని బహిరంగంగానే ప్రకటించుకున్నాను. విలువ సిద్ధాంతం ఉన్న అధ్యాయంలో అక్కడక్కడా ఆయన నుడికారాలను కూడా వాడుకున్నాను. గతితర్కం హెగెల్ చేతిలో మాయావాదానికి గురయింది. అయినప్పటికీ దాన్ని సమగ్రంగా, పూర్తి స్పృహతో సాధారణ రూపంలో వ్యక్తం చేసిన మొదటి వ్యక్తి హెగెల్ మాత్రమే. అతని గతితర్కం తలక్రిందులుగా ఉంది. మాయావాదపు పెంకులో ఉన్న హేతుబద్ధపు గుజ్జును గ్రహించాలంటే దాన్ని సక్రమంగా దాని కాళ్ళపై నిలబెట్టాలి.

మాయావాద రూపంలో గతితర్కం జర్మనీలో ఎందుకు ఫాషనయిందంటే ఆ రూపంలో అది ఉన్న పరిస్థితులను శ్లాఘిస్తున్నట్టు కన్పించింది. కానీ బూర్జువా వర్గానికీ, దాని పండితమ్మన్యులకూ, హేతుబద్ధ రూపంలో గతితర్కం ఒక బూతు, ఒక శాపనార్థం. ఎందుకంటే ఆ రూపంలో అది ఉన్న పరిస్థితుల్ని గుర్తించడం మాత్రమే కాదు. అవి తొలగిపోతాయనీ, అనివార్యంగా విచ్ఛిన్నమవుతాయనీ కూడా గుర్తిస్తుంది. చారిత్రకంగా అభివృద్ధిచెందిన ప్రతి సామాజిక రూపం నిరంతరం చలనంలో వుంటుందని భావిస్తుంది. కనుక దాని తత్కాలపు ఉనికితోపాటు దాని అశాశ్వత స్వభావాన్ని కూడా అది గ్రహిస్తుంది. అది దేనికీ తల ఒగ్గదు. దాని సారం విమర్శనాత్మకం, విప్లవాత్మకం.

పెట్టుబడిదారీ సమాజ చలనంలో అంతర్గత వైరుధ్యాలు నియతకాలిక చక్రపు (Periodic Cycle) మార్పులొచ్చినపుడు ఆచరణాత్మక బూర్జువాకు అత్యంత స్పష్టంగా తెలుస్తాయి. ఆధునిక పరిశ్రమ ఈ మార్పుల గుండానే పయనిస్తుంది. సార్వత్రిక సంక్షోభం ఈ మార్పులకు శిఖర దశ. ఆ సంక్షోభం ఇంకా తొలి దశలోనే ఉన్నప్పటికీ మరోసారి సమీపిస్తోంది. అది తీవ్రంగా, సార్వత్రికంగా వుండబోతోంది. నూతన పవిత్ర ప్రష్యన్ జర్మన్ సామ్రాజ్యంలో కుక్కగొడుగుల్లా పుట్టుకొస్తున్న కొత్త అధికార్ల బుర్రల్లోకి సైతం అది గతితర్కాన్ని నెడుతుంది.

**కార్ల్ మార్క్స్**

లండన్, జనవరి 24, 1873

# ఫ్రెంచ్ ముద్రణకు ముందుమాట

సిటిజన్ మారిన్ లాషాత్రేకి,

ప్రియమైన సిటిజన్,

'పెట్టుబడి' అనువాదాన్ని సీరియల్‌గా ప్రచురించాలనే మీ ఆలోచన బాగుంది. ఈ రూపంలో అది కార్మిక వర్గానికి మరింత అందుబాటులో వుంటుంది. మిగిలిన అంశాలన్నిటి కంటే ఈ అంశానికి నేను ప్రాధాన్యమిస్తాను.

మీ సూచనలో సానుకూల పార్శ్వం యిది. అయితే ఈ నాణానికి మరో పార్శ్వం కూడా వుంది. నేను ఉపయోగించిన విశ్లేషణ పద్ధతివల్ల మొదటి అధ్యాయాల పఠనం కష్టంగా వుంటుంది. ఈ పద్ధతిని ఇంతకు ముందెవరూ ఆర్థిక విషయాలకు వర్తింపజేయలేదు. ఫ్రెంచి వారు తొందరగా ఒక నిర్ణయానికి రావడానికి ఆతురతపడే ప్రజలు. తమని ఉద్వేగపరచిన తక్షణ సమస్యలకీ పెట్టుబడి గ్రంథంలోని సాధారణ సూత్రాలకీ మధ్య ఉన్న సంబంధాన్ని అక్కడికక్కడే తెలుసుకోవాలని ఆతురతపడతారు. కానీ, వెంటనే ముందుకు పోలేరు. గనుక వారు నిరాశపడొచ్చు.

ఇది యిందులో ఉన్న అసౌకర్యం. దీన్ని నేను అధిగమించలేదు. సత్యాన్వేషకులైన పాఠకులను ముందే హెచ్చరించి, సాయుధుల్ని చేయటం మినహా నేను చేయగలిగింది లేదు. శాస్త్ర విజ్ఞానానికి రాజమార్గమేదీ లేదు; శ్రమభరితమైన పర్వతారోహణకి భయపడనివారే తేజోమయమైన జ్ఞాన శిఖరాలను చేరుకోగలరు.

ప్రియమైన పౌరులారా, నామీద నమ్మకముంచండి.

మీ విధేయుడు
**కార్ల్ మార్క్స్**

లండన్, మార్చి 18, 1872

# ఫ్రెంచ్ ముద్రణకు చివరి మాట

**జె.** రాయ్ సాధ్యమైనంత కచ్చితంగా మక్కీకి మక్కీగా అనువదించాలనే లక్ష్యం పెట్టుకున్నారు. ఆ సూత్రానికి ఆయన నిష్కర్షగా కట్టుబడి అనువదించారు. అందువల్లనే పాఠకునికి మరింత సులభంగా వుండటం కోసం ఆయన రాతప్రతిని నేను మార్చాల్సి వచ్చింది. అయితే ఈ మార్పులు ఏరోజు కారోజు, ఏ భాగాని కాభాగం ప్రచురణ జరుగుతుండగా చేయటం వల్ల వాటన్నిటి మీదా సమానమైన శ్రద్ధ చూపించడం సాధ్యపడలేదు. కనుక శైలిలో పొందిక లేకపోవటం తప్పనిసరి.

ఈ రాతప్రతిని మొత్తంగా మార్చాల్సి రావటంతో దీని మూల గ్రంథాన్ని (రెండో జర్మన్ ముద్రణను) కూడా మార్చాను. దానిలో కొన్ని వాదనలను సరళం చేశాను. మరి కొన్నిటిని పరిపుష్టం చేశాను. అదనపు చారిత్రక, గణాంక వివరాలూ, విమర్శనాయుత సూచనలూ, మొదలైనవి చేర్చాను. కనుక ఈ ఫ్రెంచి ముద్రణలో శైలీ దోషాల మాట ఎట్లా ఉన్నప్పటికీ, మూల గ్రంథంతో ప్రమేయం లేకుండానే దీనికొక స్వతంత్ర శాస్త్రీయ విలువ వుంది. కనుక జర్మన్ భాష తెలిసిన పాఠకులు సైతం దీన్ని చదవాలి.

జర్మనీలో రాజకీయ అర్థశాస్త్ర అభివృద్ధి గురించి, గ్రంథంలో నేనుపయోగించిన పద్ధతి గురించి రెండో జర్మన్ ముద్రణ చివరి మాటలో ప్రస్తావించాను. ఆ ఖండికలను ఈ దిగువ యిస్తున్నాను.

**కార్ల్ మార్క్స్**

లండన్, ఏప్రిల్ 28, 1875

# జర్మన్ మూడో ముద్రణకు ఎంగెల్స్ ముందుమాట

**ఈ** మూడో ముద్రణను స్వయంగా ప్రచురణకిచ్చే అవకాశం మార్క్సుకి లేకుండా పోయింది. శత్రువులు సైతం గుర్తించి గౌరవించే ఔన్నత్యం గల ఆ మహామేధావి 1883 మార్చి 14వ తేదీన చనిపోయాడు.

నలభై ఏళ్ళపాటు నాకు అత్యుత్తమ ఆప్తమిత్రంగా ఉన్న వ్యక్తిని నేను కోల్పోయాను. మాటల్లో వివరించటానికి వీల్లేనంతగా నేను ఆయనకి రుణపడి వున్నాను. ఈ మూడో ముద్రణనూ, మార్క్సు రాతప్రతి రూపంలో వదిలిపోయిన రెండో సంపుటినీ ప్రచురించే బాధ్యత నా మీదుంది. మొదటి బాధ్యతను ఎలా నిర్వహించానో పాఠకునికి తెలియజేయాల్సిన అవసరం ఉంది.

మొదటి సంపుటిలో చాలా భాగాలను తిప్పి రాయాలని మార్క్సు అనుకున్నాడు. అనేక సిద్ధాంత అంశాలను మరింత సక్రమంగా వివరించాలనీ, కొత్త వాటిని చేర్చాలనీ ఆయన భావించాడు. చారిత్రక, గణాంక సమాచారంలో కొత్తగా తెలిసిన అంశాలను చేర్చాలనుకున్నాడు. అనారోగ్యం వల్ల, రెండో సంపుటి ఆఖరి అంశంగా పరిష్కరించవలసిన (ఎడిటింగ్) తక్షణ అవసరం వల్ల ఆయన ఆ పనులేమీ చేయలేకపోయాడు. కనుక ఫ్రెంచి ముద్రణలో చోటుచేసుకున్న మార్పులు మాత్రమే, అనగా అత్యంత అవసరమైన మార్పులు మాత్రమే, ఈ ముద్రణలో ఉంటాయి.

మార్క్సు వదిలి వెళ్ళిన గ్రంథాల్లో ఒక జర్మన్ ప్రతి ఉంది. దానిలో ఆయన అక్కడక్కడా సరిదిద్దాడు. ఫ్రెంచి ప్రతిని సంప్రదించాల్సిన భాగాలను అందులో ఆయన సూచించాడు. ఆయన గ్రంథాలలో ఒక ఫ్రెంచి ప్రతి కూడా ఉంది. దానిలో ఏ ఏ భాగాలను ఉపయోగించాలో ఆయన సూచించాడు. ఈ మార్పులూ, చేర్పులూ కొద్ది మినహాయింపులతో గ్రంథం చివరి భాగానికి (రెండో ఇంగ్లీషు ముద్రణలో చివరి నుండి రెండో భాగానికి) అంటే “పెట్టుబడి సంచయనం” అనే భాగానికి పరిమితమయ్యాయి. మిగిలిన భాగాలకంటే ఈ భాగం మూలప్రతికి దగ్గరగా ఉంది. గ్రంథంలో ముందు భాగాలను ఇదివరకే సరిదిద్దటం జరిగింది. శైలి సజీవంగా ఏకరూపంగా ఉంది. అయితే కొంత అశ్రద్ధ, కొన్ని ఇంగ్లీషు నుడికారాలు, కొంత అస్పష్టత కూడా చోటుచేసుకున్నాయి. వాదనలను పాఠకుని ముందుంచడంలో అక్కడక్కడా లోపాలున్నాయి. కొన్ని ప్రధానమైన వివరాలను కేవలం ప్రస్తావించడం మాత్రమే జరిగింది.

శైలికి సంబంధించినంత వరకూ, స్వయంగా మార్క్సే అనేక ఉపవిభాగాలను తిరగ రాశాడు. అదీగాక మాటల సందర్భంలో నాకు అనేక సూచనలు చేశాడు. ఇంగ్లీషు సాంకేతిక పదాలనూ, ఇంగ్లీషు నుడికారాలనూ నేను ఎంతవరకూ తొలగించవచ్చునో నిర్ణయించుకోటానికి ఇవే ఆధారం. ఈ మార్పుల్నీ, చేర్పుల్నీ మార్క్సు ఉన్నా చేసేవాడే. పోతే సరళమయిన ఫ్రెంచి భాష స్థానంలో తన కఠినమైన జర్మన్ భాషను ఉపయోగించి ఉండేవాడు. వాటిని మార్చేటపుడు తొలి ప్రతితో వాటికి పొంతన ఉండేలా చూడటంతోనే నేను సంతృప్తిపడాల్సి వచ్చింది.

రచయిత తానే మార్చేవాడు అనే గట్టి నమ్మకం ఉన్నచోట తప్ప ఒక్క మాట కూడా నేను

# Das Kapital.

## Kritik der politischen Oekonomie.

Von

**Karl Marx.**

Erster Band.

**Buch I: Der Produktionsprocess des Kapitals.**

Das Recht der Uebersetzung wird vorbehalten.

Hamburg
Verlag von Otto Meissner.
1867.

New-York: L. W. Schmidt. 24 Barclay-Street.

'క్యాపిటల్' మొదటి సంపుటం జర్మన్ మొదటి ముద్రణ టైటిల్ (సైజు తగ్గించబడింది)

మార్చలేదు. ప్రస్తుతం జర్మన్ ఆర్థికవేత్తలు ఉపయోగించే అమాం బాపతు పదాలను వాడాలనే ఆలోచన నాకెప్పుడూ రాలేదు. అర్థం పర్థం లేని వారి పదజాలం ప్రకారం డబ్బిచ్చి ఇతరుల శ్రమను పొందగలిగినవాడు శ్రమదాత (Arbeitgeber). వేతనం కోసం తన శ్రమని కోల్పోయినవాడు శ్రమ గ్రహీత (Arbeitnehmer). ఫ్రెంచి భాషలో కూడా "travail" అనే పదాన్ని వృత్తి అనే అర్థంలో జనం వాడుతున్నారు. కానీ పెట్టుబడిదారుణ్ణి శ్రమ దాత (donneur de travail) అనీ, కార్మికుణ్ణి శ్రమ గ్రహీత (receveur de travail) అనీ పేర్కొన్న ఆర్థికవేత్తను ఏ ఫ్రెంచి పాఠకుడయినా ఖాయంగా పిచ్చివాడనుకుంటాడు.

ఇంగ్లీషు నాణాలనూ, డబ్బునీ, తూకాలనూ, కొలమానాలనూ జర్మన్‌లోకి తర్జుమాచేసే స్వేచ్ఛని నేను పుచ్చుకోలేదు. గ్రంథం జర్మన్ భాషలో మొదటిసారి వెలువడినప్పుడు జర్మనీలో లెక్కకు మించినన్ని తూకాలూ, కొలమానాలు వున్నాయి. అవిగాక కనీసం రెండు రకాల మార్కులున్నాయి. (అందులో రెయిష్ మార్క్ ఒకటి. అది సోయెట్ బీర్ ఊహల్లో మాత్రమే ఉంది. దాన్నతడు 30వ దశకం చివరలో ఆవిష్కరించాడు.) రెండు రకాల గల్డెన్‌లున్నాయి. మూడు రకాల టేలర్‌లున్నాయి. అందులో ఒకటి జర్మన్ దేశంలో ఆనాడు వాడుకలో ఉన్న వెండి నాణెం (neues Tweidrittel). ప్రకృతి శాస్త్రాలలో మెట్రిక్ పద్ధతి ప్రచారంలో ఉంది. ప్రపంచ మార్కెట్లో ఇంగ్లీషు కొలమానాలు తూకాలూ వాడుకలో ఉన్నాయి. కాగా, దాదాపు తన వాస్తవ వివరాలన్నిటినీ బ్రిటీషు పారిశ్రామిక సంబంధాల నుండే గ్రహించిన గ్రంథం ఇంగ్లీషు కొలమానాలను ఉపయోగించటం పూర్తిగా సహజమే. ఈనాటికీ ఈ కారణం వర్తిస్తుంది. ప్రపంచ మార్కెట్లో ఆయా సంబంధాలేమీ మారలేదు. పైగా ఇనుము, పత్తిలాంటి కీలకమైన పరిశ్రమలలో ఇంకా ఇంగ్లీషు కొలమానాలకూ, తూకాలకూ పూర్తి అజమాయిషీ ఉంది.

మార్క్స్ ఉల్లేఖనా రీతులను అతి కొద్దిమంది మాత్రమే అర్థం చేసుకున్నారు. దాని గురించి రెండు ముక్కలు : ఇంగ్లీషు పార్లమెంటు నివేదికలు (బ్లూ బుక్స్) వగైరాల నుండి తీసుకొన్న ఉల్లేఖనలను కేవలం వాస్తవాల ప్రకటనకు లేదా వర్ణనలకు మార్క్స్ ఉపయోగించాడు. వాటిని లిఖిత ఆధారాలుగానే అర్థం చేసుకోవాలి. ఇతర ఆర్థికవేత్తల సిద్ధాంత దృక్పథాలను ఉల్లేఖించినప్పుడు మాత్రం వాటిని వేరుగా అర్థం చేసుకోవాలి. అభివృద్ధి క్రమంలో ఒక ఆర్థిక భావాన్ని ఎవరు, ఎప్పుడు, ఎక్కడ మొదట స్పష్టంగా ప్రకటించారు అనేదాన్ని వివరించడమే మార్క్స్ ఉద్దేశం. ఆ ఆర్థిక భావనకు అర్థశాస్త్ర చరిత్రలో ఏదో ఒక ప్రాధాన్యం ఉండటమే ఇక్కడ ప్రధానాంశం. అంటే దాని కాలంలోని ఆర్థిక పరిస్థితికి అది దాదాపు సరైన సిద్ధాంత వ్యక్తీకరణ అయివుంటుంది. రచయిత దృష్టిలో ఆ ఆర్థిక భావానికి ఇంకా ఈనాటికీ సంపూర్ణంగానో, సాపేక్షంగానో విలువ ఉందా లేక అది ఏనాడో గతచరిత్రగా మారిపోయిందా అనేది అప్రస్తుతం. ఈ ఉల్లేఖనలు గ్రంథంలోని విషయానికి సమకాలిక వ్యాఖ్యానాలు మాత్రమే. ఆర్థిక సిద్ధాంతంలో జరిగిన ప్రధానమైన పురోగమనాలలో కొన్నిటికి ఎవరు, ఎప్పుడు కారకులో ఇవి తెలియజేస్తాయి. అయితే సొంత బతుకులో పైకెగబాకటం తప్ప మరో యావ లేని ఏ అర్థశాస్త్రపు చరిత్రకారులు ఇంత వరకూ పక్షపాతంతో కూడిన అజ్ఞానాన్ని ప్రదర్శించుకున్నారో ఆ అర్థశాస్త్రానికి ఇది చాలా అవసరం. జర్మన్ రెండో ముద్రణ చివరి మాటలో చెప్పినట్లు, గ్రంథంలో ఎప్పుడో తప్ప జర్మన్ ఆర్థికవేత్తలను మార్క్స్ ఎందుకు ఉల్లేఖించలేదో దానినిబట్టి అర్థం చేసుకోవచ్చు.

రెండవ సంపుటి 1884లో వెలువడుతుందనే ఆశ ఉంది.

ఫ్రెడరిక్ ఎంగెల్స్

లండన్, నవంబర్ 7, 1883

# జర్మన్ నాలుగో ముద్రణకు ఎంగెల్స్ ముందుమాట

**జ**ర్మన్ నాలుగో ముద్రణ గ్రంథానికీ, పాద పీఠికకు సాధ్యమైన మేరకు తుది రూపం ఇవ్వాల్సి వచ్చింది. ఈ బాధ్యతని ఎలా నిర్వహించానో క్లుప్తంగా వివరిస్తాను.

మరోసారి ఫ్రెంచ్ ముద్రణ, మార్క్స్ చేతిరాతలో ఉన్న వ్యాఖ్యలనూ పోల్చి చూసిన తర్వాత జర్మన్ ముద్రణలో నేను ఆ ఫ్రెంచ్ అనువాదం నుంచి మరికొన్ని అంశాలను చేర్చాను. అవి 80వ పుటలో (మూడవ ముద్రణలో 88వ పుట)* (ఈ గ్రంథంలో), 458–60 పుటల్లో (మూడవ ముద్రణలో) పుట 509–10) (ఈ గ్రంథంలో), 547–51 పుటల్లో (మూడవ ముద్రణలో 600వ పుటల్లో) (ఈ గ్రంథంలో) 591–93 పుటల్లో (మూడవ ముద్రణలో 644వ పుట) (ఈ గ్రంథంలో), ఇంకా 596వ పుటలో (మూడవ ముద్రణలో 648వ పుట) (ఈ గ్రంథంలో) ఈ మార్పులు జరిగాయి. గని కార్మికుల గురించి పొడుగైన ఫుట్ నోట్స్‌ను టెక్స్టులో చేర్చడంలో ఫ్రెంచి, ఇంగ్లీషు ముద్రణలను అనుకరించాను. (మూడో ముద్రణలో 509 - 15 పుటలు, నాలుగో ముద్రణలో 461–67 పుటలు) (ఈ గ్రంథంలో) మిగిలిన కొద్దిపాటి మార్పులు కేవలం సాంకేతికమైనవి.

అవిగాక అక్కడక్కడా మరికొన్ని వివరణలిచ్చాను. మరీ ముఖ్యంగా చారిత్రక పరిస్థితులు మారిన కారణంగా వివరణ అవసరమైన సందర్భాలలో. ఈ అదనపు వివరణలిచ్చిన చోట ఎఫ్.ఇ. అని గానీ డి.హెచ్. అని గాని పేర్కొన్నాను.**

ఈలోగా ఇంగ్లీషు ముద్రణ వెలువడటంతో పలు ఉల్లేఖనలను పూర్తిగా తిరగరాయవలసి వచ్చింది. ఆ ముద్రణలోని ఉల్లేఖనలన్నిటినీ వాటి మూలాలతో పోల్చి చూసే బాధ్యత ఎలీనర్ నిర్వహించింది. వీటిలో అత్యధికం ఇంగ్లీషు మూలాధారాల నుండి తీసుకోబడ్డాయి. వాటిని జర్మన్ నుండి తిరిగి ఇంగ్లీషులోకి అనువాదం చేయకుండా ఇంగ్లీషు మూలాధారాలను వెదికి యధాతథంగా ఇవ్వడం జరిగింది. నాలుగో ముద్రను సిద్ధం చేయడం కోసం ఇంగ్లీషు ముద్రణను చూడవలసి వచ్చింది. అలా చూడగా చిన్న తప్పులు కొన్ని కనిపించాయి. కొన్ని పుటల సంఖ్యలు తప్పుగా పేర్కొనడం జరిగింది. ఇది కొంత నోటు పుస్తకాల నుండి కాపీ (copy) చేసే సందర్భంలో జరిగింది. మూడు ముద్రణల్లో పోగుబడిన అచ్చు తప్పులు జరిగాయి. అక్కడక్కడా కొన్ని మాటల అనువాదం అపసవ్యంగా ఉంది. 1843–45 నాటి నోటు పుస్తకాల నుండి తీసుకున్న ఉల్లేఖనల విషయంలో ఇది మరింత నిజం. అప్పటికి మార్క్స్‌కి ఇంగ్లీషు రాదు. ఇంగ్లీషు ఆర్థికవేత్తల గ్రంథాలను ఫ్రెంచి

* వీటిని 1887 ఇంగ్లీషు ముద్రణలో ఏంగెల్స్ చేర్చాడు.

** ఈ గుర్తులతో ఉన్నవన్నీ కూడా ఈ గ్రంథంలో బ్రాకెట్లలో ఉంచబడ్డాయి. పక్కన నా పేరు చిన్న అక్షరాల్లో ఎఫ్.ఇ. అని ఉంటుంది.

భాషలో చదువుకుంటున్నాడు. ఒక్కో కొటేషన్ ఆ రకంగా రెండుసార్లు అనువాదం అయింది. దానివల్ల దాని అర్థంలో కొద్దిపాటి వ్యత్యాసాలు చోటుచేసుకున్నాయి. ఉదాహరణకు స్టువార్ట్, ఉరే (Ure) మొదలయిన వారి విషయంలో ఇదే జరిగింది. అనేక చిన్న చిన్న తప్పులను ఇంగ్లీషు ముద్రణ సాయంతో సవరించగలిగాము. అయితే మేమింత భారీ శ్రమ పడినప్పటికీ, నాలుగో ముద్రణలో పాఠకునికి పెద్ద మార్పులున్నట్టుగా అనిపించదు. ఒకే ఒక ఉల్లేఖన మాత్రం మాకు దొరకలేదు. అది రిచర్డ్ జోన్స్‌ది (నాలుగో ముద్రణ) ఆ పుస్తకం పేరు రాసుకోవడంలో మార్క్స్ పొరబడి వుండొచ్చు.[1] మిగిలిన ఉల్లేఖనలన్నిటినీ యథాతథంగా సక్రమంగా యివ్వడం జరిగింది. ఇక్కడ ఓ పాత ఉదంతాన్ని చెప్పాలి.

నాకు తెలిసిన మేరకు, మార్క్స్ ఉటంకించిన కొటేషన్ల ప్రామాణికతని ప్రశ్నించిన సందర్భం ఒకే ఒకటుంది. మార్క్స్ చనిపోయాక కూడా ఈ చర్చ కొనసాగింది. కనుక దాన్ని నేనిక్కడ నిర్లక్ష్యం చేయలేను.

1872 మార్చి 7వ తేదీన 'కంకార్డియా' అనే బెర్లిన్ పత్రికలో "కార్ల్ మార్క్స్ ఉల్లేఖించే తీరు" అనే వ్యాసం రచయిత పేరు లేకుండా వెలువడింది. ఇది జర్మన్ కార్ఖానాదారుల సంఘ పత్రిక. 1863 ఏప్రిల్ 16వ తేదీన గ్లాడ్‌స్టన్[2] చేసిన బడ్జెట్ ప్రసంగాన్ని మార్క్స్ (1864లో ఇంటర్నేషనల్ వర్కింగ్ మెన్స్ అసోసియేషన్ ప్రారంభోపన్యాసంలోనూ, పెట్టుబడి మొదటి సంపుటిలోనూ) వక్రీకరించాడని ఆ వ్యాసం పేర్కొంది. "సంపద, అధికారాలు మత్తు గొలిపేలా పెరగటం ... కేవలం ఆస్తిపర వర్గాలకే పరిమితమయింది." అనే వాక్యంలో ఒక్క అక్షరమైనా హన్సార్డ్ (అర్ధ అధికారిక) స్టెనోగ్రాఫిక్ నివేదికలో లేదని ఆ వ్యాస రచయిత నైతిక ఆగ్రహంతో ఊగిపోతూ, అమర్యాదకర పదజాలంతో పొగలుసెగలు కక్కాడు. "గ్లాడ్‌స్టన్ ఉపన్యాసంలో ఎక్కడా ఈ వాక్యం కనిపించదు. అతడు మాట్లాడింది సరిగ్గా దీనికి వ్యతిరేకంగా ఉంది." (పెద్ద అక్షరాలలో) : ఈ వాక్యం దాని సారంలోనూ, రూపంలోనూ మార్క్స్ జొప్పించిన అబద్ధం" అని ఆ వ్యాస రచయిత పేర్కొన్నాడు.

ఆ 'కంకార్డియా' పత్రిక అదే ఏడాది మే నెలలో మార్క్స్‌కి అందింది. ఆయన జూన్ ఒకటో తేదీ 'వోల్క్‌స్టాట్' పత్రికలో ఆ 'ఆకాశరామన్నకి' జవాబు చెప్పాడు. ఆనాడు తాను ఏ వార్తా పత్రిక రిపోర్టును ఆధారం చేసుకున్నాడో గుర్తులేదు కనుక తాను పేర్కొన్న ఉల్లేఖనకి దగ్గరగా ఉన్న రెండు ఇంగ్లీషు పత్రికల రిపోర్టుల్నీ, 'ది టైమ్స్' పత్రికలోని వార్తనూ ఆయన చూపించాడు. 'ది టైమ్స్' పత్రిక ప్రకారం గ్లాడ్‌స్టన్ ఇలా అన్నాడు :

"ఈ దేశ సంపదకి సంబంధించి ఉన్న విషయం యిదీ. సంపద, అధికారాల మత్తెక్కించే పెరుగుదల బతుకు సాఫీగా గడిచిపోయే వర్గాలకే పరిమితమైందనే నమ్మకం నాకు కలిగితే, ఈ పెరుగుదల నాకు భయమూ, బాధా కలిగించక తప్పదు. ఈ పెరుగుదల శ్రామిక ప్రజల జీవితాలను తాకనైనా తాకదు. కచ్చితమైన లెక్కలమీద ఆధారపడిన ఈ పెరుగుదల పూర్తిగా ఆస్తిపర వర్గాలకే పరిమితం."

---

1. మార్క్స్ పుస్తకం పేరును సరిగానే రాశాడు. కాని పుట సంఖ్య తప్పుగా నోట్ చేశాడు. 37వ పుటకి బదులు 36వ పుట అని రాసుకున్నాడు - సం.
2. బ్రిటన్ ఆర్థిక మంత్రి - సం.

అది అలా వుంటే తాను విచారిస్తానని, కాని అది అలాగే వుందని ఇక్కడ గ్లాడ్‌స్టన్ అంటున్నాడు. సంపద, అధికారాల మత్తుగొల్పే పెరుగుదల పూర్తిగా ఆస్తిపరవర్గాలకే పరిమితమయింది. అర్ధ అధికారిక హన్సార్డ్ గురించి మార్క్స్ ఇలా అన్నాడు : "ఒక ఇంగ్లీషు ఆర్థిక మంత్రి నోటి నుండి ఇలాంటి మాటలు రావడం అప్రతిష్టకరం. కనుక తర్వాత గ్లాడ్‌స్టన్ తన ప్రసంగాన్ని హన్సార్డ్ నివేదికలో 'తారుమారు' చేశాడు. ఈ వాక్యాలను మాయం చేసే పాటి తెలివితేటలు ఆయనకున్నాయి. ఇటువంటివి ఇంగ్లండు పార్లమెంటుకి మామూలే. అంతేగాని ఇది బెబెల్‌కి వ్యతిరేకంగా చిన్ని లస్కర్ సృష్టించింది కాదు.

దానితో ఆకాశరామన్నలో ఆగ్రహం కట్టలు తెంచుకుంది. జులై నాలుగో తేదీ 'కంకార్డియా'లో సమాధానం చెబుతూ సెకండ్ హాండ్ ఆధారాలు చెల్లవని అతడు కొట్టిపారేశాడు. పార్లమెంటరీ ఉపన్యాసాలను స్టెనోగ్రాఫిక్ నివేదికల నుండి మాత్రమే ఉల్లేఖించడం 'ఆచారం' అని సెలవిచ్చాడు.

(ఈ వక్ర వాక్యం ఉన్న) ది టైమ్స్ రిపోర్టూ (అది లేని) హన్సార్డ్ రిపోర్టూ పూర్తిగా ఏకీభవిస్తున్నాయనీ, పైగా ది టైమ్స్ రిపోర్టులో ఉన్న వాక్యానికి ప్రారంభోపన్యాసంలో ఉన్న వాక్యం పూర్తిగా విరుద్ధమనీ అతడు నొక్కి వక్కాణించాడు. అయితే ది టైమ్స్ రిపోర్టులో పరస్పర విరుద్ధమైన ఆ రెండు వాక్యాలు ఉన్నాయనే విషయాన్ని ఈ మనిషి జాగ్రత్తగా దాస్తున్నాడు. ఏది ఏమయినప్పటికీ తనకి గట్టి దెబ్బ తగిలిందనే విషయాన్ని ఆకాశరామన్న గ్రహించాడు. ఏదో ఒక కొత్త ఎత్తుతో మాత్రమే దీన్నుంచి బయటపడగలననుకొన్నాడు. 'ద్రోహం', 'నిజాయితీ లేకపోవడం', 'అబద్ధపు ఆరోపణ', 'కల్తీ ఉల్లేఖన', 'సిగ్గులేని అబద్ధం', 'పూర్తి వక్రీకరణ', 'వక్ర ఉల్లేఖన', 'అపఖ్యాతిపాలైన' వగైరా పదజాలాన్ని తన వ్యాసంలో గుప్పించడంతోపాటు విషయాన్ని మరో రంగంలోకి మళ్ళించడం అవసరమనుకున్నాడు. కనుక గ్లాడ్‌స్టన్ మాటకు తాను (అంటే అబద్ధాలు చెప్పని ఆకాశరామన్న) యిచ్చే అర్థాన్ని మరో వ్యాసంలో వివరిస్తానని హామీ యిచ్చాడు. అక్కడికి, ఆయన అభిప్రాయానికి ఒక ప్రత్యేక విలువేదో ఉన్నట్టూ, దానికీ అసలు విషయానికీ ఏదో సంబంధం ఉన్నట్టూ! ఆ రెండో వ్యాసం 'కంకార్డియా'లో జూలై 11వ తేదీన వెలువడింది.

దానికి మరోసారి ఆగస్టు 7వ తేదీన 'వోల్క్‌స్టాట్'లో మార్క్స్ జవాబు చెప్పాడు. ఈసారి ఆయన 'మార్నింగ్ స్టార్', 'మార్నింగ్ ఎడ్వర్టయిజర్' పత్రికల నుండి కూడా గ్లాడ్‌స్టన్ ఉపన్యాస భాగాలను ఎత్తి చూపించాడు. ఆ రెండు 1863 ఏప్రిల్ 17వ తేదీవే. ఆ రెండిటిలోనూ "డబ్బు అధికారాల మత్తు గొలిపే సంపద పెరుగుదల బతుకు సాఫీగా గడిచిపోయే వర్గాలకు మాత్రమే పరిమితమయిందనే తన నమ్మకం నిజమేనని భయపడుతున్నాననీ, నిజానికి అది ఆస్తిపర వర్గాలకు మాత్రమే పరిమితమయిందనీ" అతను అన్నట్టుగా ఉంది. కనుక మార్క్స్ "జొప్పించా"డంటున్న ఈ "అబద్ధా"న్ని ఈ రెండు పత్రికలు కూడా ప్రచురించాయి. "ది టైమ్స్"నీ, "హన్సార్డ్"నీ మార్క్స్ మరోసారి పోల్చి చూపించాడు. ఒకదానితో ఒకటి ప్రమేయం లేకుండా వెలువడిన మూడు పత్రికలు ఒకే రోజు ఉదయం గ్లాడ్‌స్టన్ ఉపన్యాసంలోని ఈ వాక్యాన్ని ప్రచురించాయి. ఆ మాటలు అతనన్నాడనటానికి అదే రుజువు. కాగా హన్సార్డ్ నివేదికలో ఈ మాటలు లేవు. మార్క్స్ మాటల్లో చెప్పాలంటే మామూలు 'ఆచారం' ప్రకారం గ్లాడ్‌స్టన్ వాటిని 'మటుమాయం' చేశాడు. ఆకాశరామన్నతో వాగ్వివాదాన్ని కొనసాగించడానికి తనకిక తీరిక లేదని మార్క్స్ స్పష్టం చేశాడు. ఆ రచయితకి కూడా సరిపడా ముట్టినట్లుంది. ఏమైనా, తర్వాత మార్క్స్‌కి 'కంకార్డియా' పత్రికలను ఎవరూ పంపలేదు. దీనితో ఈ

విషయం ముగిసినట్టు కనిపించింది. కానీ కేంబ్రిడ్జి విశ్వవిద్యాలయంతో సంబంధం ఉన్న వ్యక్తుల ద్వారా అక్కడ కొన్ని వింత వదంతులు ప్రచారంలో ఉన్నట్టు ఒకటి రెండుసార్లు తెలిసింది. మార్క్స్ తన 'పెట్టుబడి' గ్రంథంలో చెప్పరాని సాహిత్య నేరమేదో చేసినట్టు ప్రచారమవుతోందని తెలిసింది. ఆ నేరమేమిటో మాత్రం నిర్దిష్టంగా తెలియరాలేదు. మార్క్స్ చనిపోయిన ఎనిమిది నెలల తర్వాత 1883 నవంబరు 29వ తేదీన ది టైమ్స్‌లో 'ట్రినిటీ కాలేజ్, కేంబ్రిడ్జి' అనే శీర్షికతో సెడ్లీ టేలర్ సంతకంతో ఒక లేఖ వెలువడింది. సహకార రంగ వ్యవహారాలతో ఈ మరుగుజ్జుకు కొద్దిగా సంబంధం ఉంది. ఆయన ఏదో అవకాశాన్ని పురస్కరించుకొని కేంబ్రిడ్జి వదంతుల గురించి మాత్రమే గాక, 'కంకార్డియా'లోని ఆనాటి ఆకాశరామన్న ఎవరైందీ కూడా తెలియజేసి మాకు జ్ఞానోదయం కలిగించాడు.

"గ్లాడ్‌స్టన్ ఉపన్యాసం నుండి ఒక భాగాన్ని తన ప్రారంభోపన్యాసంలో ఉల్లేఖించడంలో మార్క్స్ చేసిన ద్రోహాన్ని బట్టబయలు చేసే బాధ్యత ప్రొఫెసర్ బ్రెంటానో 'అప్పుడు బ్రెస్తా విశ్వవిద్యాలయం, ఇప్పుడు స్ట్రాస్‌బర్గ్ విశ్వవిద్యాలయం) స్వీకరించడం అత్యంత అసాధారణమైన అంశం. తన ఉల్లేఖనని సమర్థించుకోటానికి తంటాలు పడిన మార్క్స్ బ్రెంటానో ప్రజ్ఞావంతంగా నిర్వహించిన దాడిలో కొట్టిన "చావుదెబ్బ"ల తాకిడికి తట్టుకోలేకపోయాడు. 1863 ఏప్రిల్ 17వ తేదీన ది టైమ్స్‌లో వచ్చిన రిపోర్టును 'హన్సార్డ్'లో రావడానికి ముందు గ్లాడ్‌స్టన్ తారుమారు చేశాడనీ, ఒక ఇంగ్లీషు ఆర్థిక మంత్రికి ఈ వాక్యాలు అప్రతిష్ట కలిగిస్తాయి కనుక వాటిని అతడు 'మటుమాయం' చేశాడనీ చెప్పటానికి మార్క్స్ ప్రయత్నించాడు. అయితే ది టైమ్స్‌లోనూ, హన్సార్డ్‌లోనూ ఉన్న వాక్యాలను జాగ్రత్తగా పోల్చి చూపడం ద్వారా ఆ రెండు పూర్తిగా ఏకీభవిస్తున్నాయని బ్రెంటానో రుజువు చేశాడు. మోసంతో అసందర్భంగా తీసుకున్న ఒక కొటేషన్‌ని గ్లాడ్‌స్టన్‌కి ఆపాదించడం వల్ల తలెత్తిన భావం ఆ రెంటిలో ఎక్కడా లేదని బ్రెంటానో స్పష్టం చేశాడు." అని ట్రినిటీ కాలేజి మరుగుజ్జు రాశాడు.

అదీ అసలు సంగతి. 'కంకార్డియా'లో బ్రెంటానో పేరు పెట్టుకోకుండా నిర్వహించిన ప్రచారం కేంబ్రిడ్జ్ సహకార రంగపు ఊహల్లో ఫలప్రదంగా ప్రతిబింబించిన తీరు యిది. జర్మనీ కార్ఖానాదారుల సంఘపు సెయింట్ జార్జ్ ఆ రకంగా గోదాలో నిలబడ్డాడన్నమాట! కత్తిని చేబూనాడు, పోరాడాడు తన దాడిని ప్రజ్ఞావంతంగా నిర్వహించాడు. నిప్పులు కక్కే డ్రాగన్ మార్క్స్ ఆ "చావుదెబ్బ"లకు తాళలేక వేగంగా బ్రెంటానో "పాదాల ముందు తన కడసారి ఊపిరిని విడిచిపెట్టాడు."

ఈ యుద్ధరంగం కన్నుల పండుగగా ఉంది. ఇది మన సెయింట్ జార్జ్ జిత్తులను దాయటానికి మాత్రమే పనికొస్తుంది. ఇక్కడ 'అబద్ధాలని జొప్పించడం' గురించిగానీ, 'వక్రీకరణ' గురించిగానీ ఈ ప్రస్తావన లేదు. 'కుయుక్తితో కూడిన ఒంటరి ఉల్లేఖన' గురించి మాత్రమే ప్రస్తావన ఉంది. మొత్తం విషయం మారిపోయింది. అలా ఎందుకు జరిగిందో సెయింట్ జార్జ్‌కి అతని కేంబ్రిడ్జ్ సహాయకునికీ బాగా తెలుసు.

ఎలీనర్ మార్క్స్ ఉత్తరాన్ని ప్రచురించడానికి టైమ్స్ పత్రిక నిరాకరించడం వల్ల ఆమె టుడే మాస పత్రిక (1884 ఫిబ్రవరి)లో జవాబిచ్చింది. మార్క్స్ ఆ వాక్యాన్ని "అబద్ధంగా జొప్పించాడా" లేదా అనే ప్రధానమైన ఒకే ఒక అంశం మీద తన చర్చను ఆమె కేంద్రీకరించింది. దానికి సెడ్లీ టేలర్ "ఒక ప్రత్యేకమైన వాక్యం గ్లాడ్‌స్టన్ ఉపన్యాసంలో వుందా లేదా అనేది బ్రెంటానో మార్క్స్ వివాదంలో చాలా అప్రధానమైన అంశం" ... అని తేల్చాడు. వివాదంలో ఉన్న ఉల్లేఖన గ్లాడ్‌స్టన్

ఉద్దేశాన్ని తెలియజేయటానికి తోడ్పడిందా, వక్రీకరించడానికి తోడ్పడిందా అన్నదే ప్రధాన అంశం అని అతను అన్నాడు. టైమ్స్ రిపోర్టులో కొంత వైరుధ్యం ఉన్న సంగతిని అతను ఆమోదించాడు. (టుడే, మార్చి, 1884) అయితే సందర్భోచితమయిన భాష్యం చెబితే గ్లాడ్‌స్టన్ ఏం చెప్పదలచుకున్నాడో తెలుస్తుంది అంటాడతను. అంటే గ్లాడ్‌స్టన్ ఉదార వైఖరితో భాష్యం చెప్పాలి కాబోలు. ఇందులో నవ్వు పుట్టించే అంశమేమంటే 'ఆచారం' అనీ, 'ప్రామాణికమ'నీ బ్రెంటానో శ్లాఘించిన హన్సార్డ్ నుంచి కాక అతడు 'గందరగోళం' అని విసుక్కున్న టైమ్స్ నుంచి మాత్రమే ఆ ఉపన్యాసాన్ని ఉల్లేఖించాలని ఈ కేంబ్రిడ్జ్ మరుగుజ్జు పట్టుబడుతున్నాడు. సహజమే మరి. ఇంతగా వాదోపవాదాలకు గురైన వాక్యం హన్సార్డ్ నుంచి మాయమైపోయింది!

ఈ వాదోపవాదాలన్నిటినీ పటాపంచలు చేయడానికి (అదే సంచిక టుడేలో) ఎలీనర్ మార్క్స్ పెద్దగా కష్టపడలేదు. 1872 వాగ్వివాదాన్ని టేలర్ చదివాడా? చదివుంటే అతను అబద్ధాలను జొప్పించడం మాత్రమే కాదు, అబద్ధపు అణచివేతలు కూడా చేస్తున్నాడు. చదవలేదా? అయితే అతను మౌనంగా వుండటం మంచిది. చదివినా చదవకపోయినా మార్క్స్ అబద్ధాన్ని అతని మిత్రుడు బ్రెంటానో చేసిన ఆరోపణని అతడు ఒక్కసారి కూడా సమర్థించడానికి సాహసించలేదు. మార్క్స్ అబద్ధాలను జొప్పించలేదు గానీ, ఒక ముఖ్యమైన వాక్యాన్ని అణచిపెట్టాడు అని అంటున్నాడు. అణచిపెట్టాడంటున్న ఆ వాక్యాన్ని మార్క్స్ తన ప్రారంభోపన్యాసంలో 5వ పేజీలో ఉల్లేఖించాడు. ఇది అబద్ధాన్ని జొప్పించాడనే ఆరోపణకి గురైన వాక్యానికి కొన్ని వాక్యాల ముందుంది. ఇక గ్లాడ్‌స్టన్ ఉపన్యాసంలో వైరుధ్యం గురించా? 1863, 1864ల గ్లాడ్‌స్టన్ బడ్జెట్ ప్రసంగాల్లోని అంతులేని వైరుధ్యాల గురించి పేర్కొన్నది మార్క్స్ కాదా? (పెట్టుబడి, ఇంగ్లీషు ముద్రణలో 611వ పేజీ). అయితే ఎటొచ్చీ ఈ వైరుధ్యాలన్నిటినీ సెడ్లీలాగా ఉపేక్షాయుత, ఉదార భావాలుగా మార్చి పరిష్కరించాలని ఆయన అనుకోలేదు. తన జవాబును ముగిస్తూ ఎలీనర్ ఈ రకంగా పేర్కొంది.

"ఉల్లేఖించడానికి అర్హమైన దేన్నీ మార్క్స్ అణచిపెట్టలేదు. అబద్ధాలను జొప్పించలేదు కూడా. అయితే గ్లాడ్‌స్టన్ తన ప్రసంగంలో నిస్సందేహంగా పలికిన ఒక వాక్యాన్ని, హన్సార్డ్ నివేదికల నుండి తప్పించుకుపోయిన వాక్యాన్ని, మార్క్స్ వెలికితీసి దాని స్థానంలో దాన్ని వుంచాడు."

దానితో సెడ్లీ టేలర్‌కి ముట్టాల్సిందంతా ముట్టింది. రెండు దశాబ్దాలపాటు, రెండు దేశాలలో సాగిన ఈ ప్రొఫెసర్ తరహా సాలెగూడు అల్లిక వల్ల ఒక ఫలితం వచ్చింది. ఆ రోజు నుండి ఈ రోజు వరకూ మార్క్స్ సాహిత్య నిజాయితీపై ఎవరూ అపనిందలు వేయటానికి సాహసించలేదు.[1] పోతే వేలుబెట్టి చూపించడానికి వీలులేని పవిత్ర వేదంగా హన్సార్డ్‌ని ఇక ముందు బ్రెంటానో ఎలా నమ్మలేడో, బ్రెంటానో నడిపే సాహిత్య యుద్ధ బులెటిన్‌లను సెడ్లీ టేలర్ అలాగే నమ్మలేడనటంలో సందేహం లేదు.

ఫ్రెడరిక్ ఎంగెల్స్

లండన్, 25 జూన్, 1890

---

1. నిజానికి ఇది ఇంతటితో ఆగలేదు. బ్రెంటానో మరోసారి తలెత్తాడు. పూర్తిగా డాక్యుమెంటరీ ఆధారాలతో ఎంగెల్స్ అతని వాదనల్ని మరోసారి తుంగలో తొక్కాడు. మార్క్స్ ఎంగెల్స్ సంపూర్ణ రచనలలో ఇది పొందుపరచబడింది - సం. (పేజీ వగైరా)

మొదటి సంపుటం

# పెట్టుబడిదారీ ఉత్పత్తి

# మొదటి భాగం

# సరుకులు, డబ్బు

## అధ్యాయం - 1

# సరుకులు

### విభాగం 1

### సరుకు రెండు పార్శ్వాలు, ఉపయోగపు విలువ, విలువ

### (విలువ సారాంశం, విలువ పరిమాణం)

పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం ప్రబలంగా ఉన్న సమాజాల సంపద "సరుకుల అపార సంచయనంగా"[1] కనిపిస్తుంది. దాని ఏకకం (యూనిట్) ఒక సరుకు. కనుక సరుకు విశ్లేషణతోనే మన పరిశోధన ప్రారంభం కావాలి.

సరుకు అనేది మనకు బాహ్యంగా ఉన్న ఒక వస్తువు. అది తన గుణాల ద్వారా ఏదో ఒక తరహా మానవ అవసరాలను తీరుస్తుంది. ఆ అవసరాల స్వభావం ఏదైనా కావచ్చు. అవి కడుపులో నుంచి పుట్టినా, బుర్రలో నుంచి పుట్టినా ఒకటే.[2] ఈ వస్తువు అవసరాలను ఎలా తీరుస్తుంది. నేరుగా ఉదర పోషణ సాధనంగానా, పరోక్షంగా ఉత్పత్తి సాధనంగానా అనే విషయం కూడా ప్రస్తుతం మనకు అనవసరం.

ఇనుము, కాగితం వగైరా ప్రతి ఉపయోగకర వస్తువునీ గుణం, పరిమాణం అనే రెండు దృష్టి కోణాల నుండి పరిశీలించవచ్చు. ప్రతి వస్తువూ అనేక ధర్మాల సమాహారం కనుక అది అనేక రకాలుగా ఉపయోగపడవచ్చు. దాని వివిధ ఉపయోగాలను కనుగొనే పని చరిత్రది.[3] ఈ ఉపయోగ వస్తువుల పరిమాణాలకు సామాజికంగా గుర్తించబడే కొలమాన ప్రమాణాలను కూడా చరిత్రే

---

1. కార్ల్ మార్క్స్, అర్థశాస్త్ర విమర్శ, బెర్లిన్, 1859, పుట 3.
2. "కోరికలో అవసరం ఇమిడి ఉంది. అది మానసిక ఆకలి. ఆకలి లాగే అది సహజం. మానసిక అవసరాలను తీర్చడంలోనే అత్యధిక వస్తువుల విలువ యిమిడి వుంది." (నికోలస్ బార్బన్, ఎ డిస్‌కోర్స్ ఆన్ కాయినింగ్ ది న్యూ మనీ లైటర్ ... లండన్, 1696 పుట 2, 3)
3. "వస్తువులకి ఒక అంతర్గత సుగుణం ఉంది. (ఉపయోగంలో వున్న విలువను బార్బన్ సుగుణం అని పిలుస్తాడు.) ఈ సుగుణం అన్నిచోట్లా ఒకటే, సూదంటురాయి ఇనుమును ఆకర్షించినట్లు. అయస్కాంతంలో రెండు ధ్రువాలున్నాయని కనుగొన్నాకనే ఇనుమును ఆకర్షించే దాని స్వభావం ఉపయోగంలోకొచ్చింది.

రూపొందిస్తుంది. ఈ కొలమానాల్లో వైవిధ్యం ఉండటానికి కొలవాల్సిన వస్తువుల్లో వైవిధ్యం ఉండటం ఒక కారణం, సామాజిక అలవాటు మరో కారణం.

ఒక వస్తువుకున్న ఉపయోగం దానిని ఉపయోగపు విలువగా చేస్తుంది.[1] కాని ఈ ఉపయోగం అనేది గాలిలో నుండి ఊడిపడదు. అది సరుకు భౌతిక ధర్మాలకు పరిమితమై ఉంటుంది. కనుక, సరుకుకి ప్రమేయంలేని సొంత అస్తిత్వం దానికి లేదు. కనుక ఇనుము, ధాన్యం లేదా వజ్రం లాంటి సరుకు భౌతిక పదార్థం అయితేనే అది ఉపయోగపు విలువ అవుతుంది. ఏదో ఒక ఉపయోగకర వస్తువు అవుతుంది. సరుకు ఈ ఉపయోగకర లక్షణాలను సంతరించుకోవాలంటే దానిపై కొంత శ్రమ వెచ్చించాల్సి ఉంటుంది. అయితే సరుకు ఉపయోగం దానిపై ఎంత శ్రమ వెచ్చించబడింది అనే అంశంపై ఆధారపడి ఉండదు. ఉపయోగపు విలువ గురించి పరిశీలిస్తున్నప్పుడు నిర్దిష్టమైన పరిమాణాలను దృష్టిలో ఉంచుకుంటాము. ఉదాహరణకి, గడియారాలను డజన్లలో, వస్త్రాలను గజాలలో, ఇనుముని టన్నులలో, వగైరా ... సరుకుల ఉపయోగపు విలువలు సరుకులకి సంబంధించిన వ్యాపార పరిజ్ఞానం అనే ప్రత్యేక అంశ అధ్యయనానికి విషయాన్ని సమకూరుస్తాయి.[2] ఉపయోగపు విలువలు వినియోగం ద్వారా, లేదా అనుభోగం ద్వారా వాస్తవంగా మారతాయి. సకల సంపదల సారాంశం వాటిలోనే ఉంది – ఆ సంపద సామాజిక రూపం ఏదైనప్పటికీ. అంతేగాక, మనం పరిశీలించబోయే సామాజిక రూపంలో అవి మారకం (మారకం) విలువలకు భౌతిక నిలయాలు కూడా.

మొదటి చూపుకి, మారకం విలువ ఒక పరిమాణాత్మక సంబంధంలా కనిపిస్తుంది. ఒక రకం ఉపయోగపు విలువ మరోరకం ఉపయోగపు విలువతో మారకం చేసుకొనే నిష్పత్తిలా కనిపిస్తుంది.[3] స్థల కాలాలను బట్టి ఈ సంబంధం నిరంతరం మారుతూ ఉంటుంది. కనుక మారకం విలువ యాదృచ్ఛికమైనదిగానూ, కేవలం సాపేక్షమైనదిగానూ కనిపిస్తుంది. ఫలితంగా అంతర్గత విలువ అనేది, అంటే సరుకుల్లో అంతర్నిహితంగా ఉంటూ విడదీయరాని విధంగా ముడిపడి ఉండే మారకం విలువ అనేది, స్వయం విరుద్ధంలా అనిపిస్తుంది.[4] ఈ విషయాన్ని మరింత వివరంగా పరిశీలిద్దాం.

ఉదాహరణకు, 'య' బూట్ పాలిష్, 'ర' సిల్కు, 'ల' బంగారం వగైరా విభిన్న పరిమాణాల్లో ఉన్న సరుకులతో ఒక క్వార్టర్ గోధుమల మారకం జరుగుతోంది. అంటే గోధుమలకి ఒక మారకం

---

1. అవసరాలను తీర్చడంలో లేదా మానవ జీవిత సౌఖ్యాలను సమకూర్చడంలో వస్తువు యొక్క ఉపయోగపు విలువ ఉంది. (జాన్‌లాక్, "సమ్ కన్సిడెరేషన్స్ ఆన్ ది కాన్‌సీక్వెన్‌సెస్ ఆఫ్ ది లోవరింగ్ ఆఫ్ ఇంటరెస్ట్, 1691" లండన్ 1777. రెండో సంపుటి, పుట 78).
2. బూర్జువా సమాజంలో ప్రతి వ్యక్తీ ఒక కొనుగోలుదారుడుగా సరుకులకు సంబంధించిన సమస్త విజ్ఞాన ఖని అనే ఒక న్యాయశాస్త్రపు కట్టుకథ ప్రచారంలో ఉంటుంది.
3. ఒక వస్తువుకి మరో వస్తువుకీ మధ్య, అంటే నిర్దిష్ట పరిమాణం గల ఒక ఉత్పాదితానికీ, నిర్దిష్ట పరిమాణం గల మరో ఉత్పాదితానికీ మధ్య వున్న మార్పిడి సంబంధంలోనే విలువ ఉంది. (Le Trosne, De l'interit Social, Physiocrates, Paris, 1846, పుట 889).
4. అంతర్గత విలువనేది ఎందులోనూ ఉండదు ("ఎన్. బార్బన్, ఎ డిస్‌కోర్స్...") లేదా బట్లర్ చెప్పినట్లుగా, "ఒక వస్తువు ఎంత తెస్తే అంతే దాని విలువ."

విలువకి బదులు అనేక మారకం విలువలున్నాయి. 'య' బూట్ పాలిష్, 'ర' సిల్కు, 'ల' బంగారం వగైరాల్లో ప్రతిదీ ఒక క్వార్టర్ గోధుమల మారకం విలువకి ప్రాతినిధ్యం వహిస్తున్నది. గనుక, మారకం విలువలుగా 'య' బూట్ పాలిష్, 'ర' సిల్క్, 'ల' బంగారం వగైరాలలో ఒకదాని స్థానం మరొకటి ఆక్రమించగలదు లేదా ఒక దానితో మరొకటి సమానం. కనుక మొదటిది, ఒక సరుకుకున్న మారకం విలువలు ఏదో ఒక సమానమైన దాన్ని వ్యక్తం చేస్తాయి. రెండోది, మారకం విలువ అనేది దానిలో ఉండి, దానికంటే భిన్నమయిన ఒక అంశానికి వ్యక్తీకరణ, దృశ్యరూపం మాత్రమే.

రెండు సరుకుల్ని తీసుకుందాం. ఉదాహరణకు ధాన్యం, ఇనుము. ఈ రెంటి మారకం ఏ నిష్పత్తిలో జరిగినప్పటికీ దాన్ని ఒక సమీకరణం ద్వారా వ్యక్తం చేయొచ్చు. ఒక పరిమాణంలో ఉన్న ధాన్యం మరో పరిమాణంలో ఉన్న ఇనుముతో సమానం. ఉదాహరణకు ఒక పావు ధాన్యం = 'య' కిలోగ్రాముల ఇనుముకు సమానం. ఈ సమీకరణం ఏమి తెలియచేస్తోంది? పావు ధాన్యం 'య' కిలోగ్రాముల ఇనుము అనే సమీకరణంలోని రెండు భిన్న వస్తువుల్లోనూ ఉమ్మడిగా ఏదో ఒక అంశం సమాన పరిమాణంలో ఉంది అని తెలుపుతోంది. కనుక ఈ రెండు వస్తువులూ మరో మూడోదానికి సమానమై ఉండాలి. ఆ మూడోది మొదటి వస్తువు కాదూ, రెండో వస్తువు కాదు. అవి మారకం విలువలైన మేరకు ఆ రెంటిలో ప్రతిదాన్నీ ఆ మూడోదానిగా మార్చవచ్చు.

ఒక సాదా రేఖాగణిత సూత్రంతో దీన్ని స్పష్టం చేయొచ్చు. చతుర్భుజాకార చిత్రాల వైశాల్యాలను కొలవడానికీ, పోల్చడానికీ మనం వాటిని త్రిభుజాలుగా విభజిస్తాము. అయితే త్రిభుజం వైశాల్యం రూపంలో దానితో ఎటువంటి సంబంధం లేని $1/2 \times$ భూమి $\times$ ఎత్తు అనే సూత్రం ద్వారా వ్యక్తం అవుతుంది. అదేరకంగా సరుకుల మారకం విలువలు కూడా వాటన్నిటిలోనూ ఉమ్మడిగా ఉండే ఒక అంశం ద్వారా వ్యక్తం కాగలిగి ఉండాలి. ఆ ఉమ్మడి అంశం ఆయా సరుకుల్లో ఎక్కువగా ఉండొచ్చు, తక్కువగా ఉండొచ్చు.

ఈ ఉమ్మడి అంశం రేఖాగణిత ధర్మం, రసాయనిక ధర్మం, లేదా సరుకులకు స్వాభావికంగా ఉండే ఏ ఇతర ధర్మమూ కాజాలదు. ఆ ధర్మాలు ఆయా వస్తువుల ఉపయోగాన్ని ప్రభావితం చేసి, వాటి ఉపయోగపు విలువలుగా మార్చిన మేరకే మన దృష్టిని ఆకర్షిస్తాయి. అయితే సరుకుల మారకం అనేది ఉపయోగపు విలువ నుండి పూర్తిగా వేరుపడిన చర్య. మారకం దృష్ట్యా ఒక ఉపయోగపు విలువకీ మరో ఉపయోగపు విలువకీ తేడా ఏమీ లేదు. అయితే అది తగినంత పరిమాణంలో ఉండాలి. అంతే. లేదా బార్బన్ చెప్పినట్టు, "వాటి విలువ ఒకటే అయితే ఒక రకం సామాను మరో రకం సామానుతో సమానమే. వంద పౌండ్ల విలువ గల సీసం లేదా ఇనుము వంద పౌండ్ల విలువ గల వెండి లేదా బంగారంతో సమానమే."[1] సరుకు ఉపయోగపు విలువలుగా విభిన్న గుణాలు గలవి. అయితే మారకం విలువలుగా అవి కేవలం విభిన్న పరిమాణాలు మాత్రమే. ఫలితంగా వాటిలో అణుమాత్రమయినా ఉపయోగపు విలువ ఉండదు.

సరుకుల ఉపయోగపు విలువను వదిలేస్తే వాటిలో ఒకే ఒక ఉమ్మడి లక్షణం మిగులుతుంది.

1. ఎన్. బార్బన్, అదే గ్రంథం, పే. 53, 7.0

అవన్నీ శ్రమ ఉత్పాదితాలే. శ్రమ ఉత్పాదితం సైతం మన చేతుల్లో మార్పులకు లోనైంది. దానిని దాని ఉపయోగపు విలువ నుండి వేరు చేస్తున్నాము అంటే అదే సమయంలో ఆ ఉత్పాదితాన్ని ఉపయోగపు విలువగా మార్చే భౌతిక అంశాల నుండీ, ఆకారాల నుండీ కూడా వేరు చేస్తున్నామన్న మాట. దానిలో మనం బల్ల, ఇల్లు, నూలు లేదా మరే ఉపయోగకర వస్తువునీ చూడం. ఒక భౌతిక వస్తువుగా దాని అస్తిత్వాన్ని విస్మరిస్తాం. దానిని వడ్రంగి పనివాని, తాపీ పనివాని, వడకే వాని శ్రమ ఉత్పాదితంగా గానీ, ఒక నిర్దిష్ట తరహా ఉత్పాదక శ్రమ ఫలితంగా గాని పరిగణనలోకి తీసుకోము. ఆయా ఉత్పాదితాల ఉపయోగకర గుణాలతోపాటు వాటిలో ఇమిడి ఉన్న విభిన్న తరహాల శ్రమ యొక్క ఉపయోగకర స్వభావాన్నీ, ఆ శ్రమ యొక్క నిర్దిష్ట రూపాలనూ మనం పట్టించుకోము. వాటన్నిటికీ గల ఉమ్మడి అంశం మాత్రమే మిగిలి ఉంది. అవన్నీ ఒకే విధమైన శ్రమ – అనిర్దిష్ట శ్రమ.

ఈ ఉత్పాదితాల్లో ప్రతి దానిలోనూ మిగిలి ఉన్న అంశాన్ని పరిశీలిద్దాము. ప్రతి దానిలోనూ ఒకే విధమైన అభౌతిక వాస్తవం, ఘనీభవించిన ఒకే విధమైన మానవ శ్రమ, ఏ పద్ధతిలో ఖర్చయింది అనే దానితో ప్రమేయం లేకుండా ఖర్చయిన శ్రమ శక్తి ఉంది. ఈ వస్తువులు ఇప్పుడు మనకు తెలియజేసేదల్లా ఒకటే. వాటి ఉత్పత్తిలో మానవ శ్రమ శక్తి ఖర్చయింది. వాటిలో మానవ శ్రమ రూపుదాల్చి ఉంది. వాటన్నిటికి ఉమ్మడిగా వున్న ఈ సామాజిక అంశానికి సాకార రూపాలుగా ఆ వస్తువుల్ని పరిగణిస్తే అవి – విలువలు.

సరుకుల మార్పిడిలో వాటి మారకం విలువ, వాటి ఉపయోగపు విలువతో ప్రమేయం లేకుండా పూర్తిగా స్వతంత్రంగా వ్యక్తమవుతుందనే విషయాన్ని చూశాము. వాటిని ఉపయోగపు విలువ నుండి వేరుచేస్తే పైన నిర్వచించినట్టుగా వాటి విలువ మిగిలి ఉంటుంది. కనుక సరుకుల మారకం జరిగినప్పుడల్లా సరుకుల మారకం విలువలో వ్యక్తమయ్యే ఉమ్మడి అంశం వాటి విలువ. మారకం విలువ అనే రూపం ద్వారా మాత్రమే సరుకుల విలువ వ్యక్తమవుతుంది అనే విషయాన్ని మన పరిశోధన మరింత ముందుకు సాగాక తెలుసుకుంటాం. ప్రస్తుతానికి మనం విలువని దాని రూపంతో ప్రమేయం లేకుండా పరిశీలిద్దాం.

ఒక ఉపయోగ విలువలో లేదా ఉపయోగకర వస్తువులో అభౌతిక మానవ శ్రమ రూపుదాల్చి ఉంది. కనుకనే దానికి విలువ ఉంది. ఈ విలువ పరిమాణాన్ని ఎలా కొలవాలి? విలువను సృష్టించే శ్రమ వస్తువులో ఎంత పరిమాణంలో ఉంది అన్నదాన్ని బట్టి కొలవాలనేది స్పష్టం. అయితే శ్రమ పరిమాణం దాని కాల పరిమితిని బట్టి కొలవబడుతుంది. శ్రమ కాల ప్రమాణం వారాల్లో, రోజుల్లో, గంటల్లో ఉంటుంది.

ఒక సరుకు విలువ దాని తయారీలో ఖర్చయిన శ్రమని బట్టి నిర్ణయిస్తే, శ్రామికుడు ఎంత సోమరీ, నైపుణ్యం లేనివాడు అయితే అతని సరుకుకు అంత ఎక్కువ విలువ ఏర్పడుతుంది కదా, ఎందుకంటే ఆ సరుకు ఉత్పత్తిలో అంత ఎక్కువ కాలం ఖర్చవుతుంది కదా అని కొంతమంది అనుకోవచ్చు. అయితే విలువను సృష్టించే శ్రమ ఒకేలాంటి మానవ శ్రమ, ఏకరూప శ్రమశక్తి వ్యయం. ఒక సమాజం ఉత్పత్తి చేసిన మొత్తం సరుకుల విలువల సమస్తంలో రూపుదాల్చి ఉన్న

మొత్తం శ్రమశక్తిలో అసంఖ్యాకమైన విడివిడి విభాగాలున్నప్పటికీ అదంతా ఒకేలాంటి మానవ శ్రమశక్తి సమాహారంగా లెక్కగట్టబడుతుంది. దీనిలో ఉన్న విడి విభాగాలు సగటు సామాజిక శ్రమశక్తి లక్షణం కలిగి ఉన్న మేరకు, అలా పనిచేసే మేరకు, అవన్నీ ఒకటే. అంటే ఒక సరుకుని ఉత్పత్తి చేయడానికి సగటు కాలం కంటే ఎక్కువ అవసరం కానంతవరకూ, సామాజికంగా అవసరమైన దానికంటే ఎక్కువ కాలం పట్టనంత వరకూ అవన్నీ ఒకటే. సాధారణ ఉత్పత్తి పరిస్థితుల్లో, ఆనాడున్న సగటు నైపుణ్యం, శ్రమ తీవ్రతలతో ఒక వస్తువును ఉత్పత్తి చేయడానికి అవసరమైన కాలమే సామాజికంగా అవసరమైన శ్రమ కాలం. ఇంగ్లండులో మరమగ్గాల వల్ల కొంత పరిమాణం గల నూలును వస్త్రంగా మార్చడానికి అవసరమైన శ్రమ బహుశా సగానికి సగం తగ్గింది. చేనేత మగ్గాలతో బట్టలు నేసేవారికి మాత్రం ఇంతకు ముందు పట్టినంతే కాలం పట్టసాగింది. అయితే ఈ మార్పు వల్ల వారు గంటలో తయారు చేసిన వస్తువులో అరగంట సామాజిక శ్రమ మాత్రమే చేరింది. ఫలితంగా చేనేత బట్టల పూర్వపు విలువ సగానికి సగం పడిపోయింది.

ఒక వస్తువు ఉత్పత్తిలో గల సామాజికంగా అవసరమైన శ్రమ మొత్తం, లేదా సామాజికంగా అవసరమైన శ్రమ కాలం వస్తువు విలువ పరిమాణాన్ని నిర్ణయిస్తుందని గమనించాం.[1] ఈ సందర్భంలో ప్రతి వ్యక్తి, సరుకును దాని తరగతిలో ఒక సగటు నమూనాగా పరిగణించాలి.[2] కనుక సమానమైన పరిమాణంలో శ్రమ రూపుదాల్చి ఉన్న సరుకులకు లేదా ఒకే కాల పరిమితిలో ఉత్పత్తి చేయగల్గిన సరుకులకి ఒకే విలువ ఉంటుంది. ఒక సరుకు తయారీలో సామాజికంగా అవసరమైన శ్రమ కాలం మరో సరుకు తయారీలో సామాజికంగా అవసరమైన శ్రమ కాలానికి ఏ నిష్పత్తిలో ఉంటుందో దాని విలువ కూడా ఆ మరో సరుకు విలువకు అదే నిష్పత్తిలో ఉంటుంది. "విలువలుగా, సరుకులన్నీ నిర్దిష్ట మొత్తాలలో ఘనీభవించిన శ్రమ కాలం మాత్రమే.[3]

ఒక సరుకు తయారీకి అవసరమైన శ్రమ కాలం స్థిరంగా ఉంటే సరుకు విలువ కూడా స్థిరంగా ఉంటుంది. అయితే శ్రమ ఉత్పాదకతలో వచ్చే ప్రతి మార్పును బట్టీ శ్రమ కాలం మారుతుంటుంది. ఉత్పాదకత స్థాయిని వివిధ అంశాలు నిర్ణయిస్తాయి. శ్రామికుల సగటు నేర్పు, శాస్త్ర పరిస్థితి, ఆచరణలో దానిని వర్తింపచేస్తున్న స్థాయి, ఉత్పత్తి యొక్క సామాజిక వ్యవస్థీకరణ, ఉత్పత్తి సాధనాల విస్తృతి, వాటి సామర్థ్యాలు, భౌతిక పరిస్థితులు వగైరాలు ఉత్పాదకతను నిర్ణయిస్తాయి. ఉదాహరణకు, ఒక పరిమాణం గల శ్రమ అనుకూల రుతువుల్లో 8 బస్తాల ధాన్యాన్ని పండిస్తే, అదే శ్రమ ప్రతికూల రుతువులో 4 బస్తాలు మాత్రమే పండిస్తుంది. ఒకే శ్రమ నాసిరకం గనుల నుండి

1. ఒకదానితో మరోదాన్ని మార్పిడి చేసినప్పుడు వాటి (జీవితావసరాల) విలువను క్రమబద్ధం చేసేది, వాటి తయారీలో విధిగా అవసరమైన శ్రమ మొత్తమే. ("సమ్ థాట్స్ ఆన్ ది ఇంటరెస్ట్ ఆఫ్ మనీ ఇన్ జనరల్, అండ్ పర్టిక్యులర్లీ ఇన్ ది పబ్లిక్ ఫండ్స్ ..." లండన్) అద్భుతమైన ఈ అనామక రచన గత శతాబ్దానిది. తేదీ లేదు. గ్రంథస్థ విషయాన్ని బట్టి ఇది రెండో జార్జి కాలంలో సుమారు 1739 లేదా 1740లో రచించబడి ఉంటుందనేది స్పష్టం.
2. సరిగ్గా చెప్పాలంటే, ఒకే రకమైన ఉత్పాదితాలన్నీ ఒకే ఒక పదార్థమవుతాయి. ప్రత్యేక పరిస్థితులతో నిమిత్తం లేకుండా వాటి ధరలన్నీ మొత్తం మీద నిర్ణయించబడతాయి. (లేత్రోస్నె, పుట 893)
3. కార్ల్ మార్క్స్, అదే గ్రంథం, పుట 6.

కంటే సుసంపన్నమైన గనుల నుండీ ఎక్కువ లోహాన్ని బయటికి తీస్తుంది. భూ ఉపరితలంపై వజ్రాలు చాలా అరుదుగా దొరుకుతాయి. వాటిని కనుక్కోటానికి సగటున చాలా ఎక్కువ శ్రమ కాలం ఖర్చవుతుంది. ఫలితంగా ఒక చిన్న వస్తువు పెద్ద శ్రమ మొత్తానికి ప్రాతినిధ్యం వహిస్తోంది. బంగారానికి దాని పూర్తి విలువను చెల్లించడమనేది ఎప్పుడయినా జరిగిందా అనే సందేహాన్ని వ్యక్తం చేస్తున్నాడు జేకబ్. ఇది వజ్రాలకు మరింత బాగా వర్తిస్తుంది. వజ్రాల ఉత్పత్తిలో అత్యధిక శ్రమ ఖర్చవుతుంది. కనుక అవి ఎక్కువ విలువకి ప్రాతినిధ్యం వహిస్తాయి. అయినప్పటికీ 1823కి ముందున్న 80 ఏళ్ళ కాలంలో బ్రెజిల్ వజ్రాల గనులన్నీ ఉత్పత్తి చేసిన వజ్రాలకు ఆ దేశంలోని చెరకు, కాఫీ తోటల ఏడాదిన్నర సగటు ఉత్పత్తికి వచ్చిన ధర అయినా రాలేదు అని ఎష్వెజ్ అన్నాడు. సుసంపన్నమైన గనుల్లో అదే శ్రమ మరిన్ని వజ్రాలను ఉత్పత్తి చేయగలుగుతుంది. కనుక వాటి విలువ పడిపోతుంది. కొద్దిపాటి శ్రమతో కర్బనాన్ని వజ్రాలుగా మార్చడంతో మనం విజయం సాధించగలిగితే వాటి విలువ ఇటుకల విలువ కంటే తక్కువకు పడిపోవచ్చు. సాధారణంగా శ్రమ ఉత్పాదకత ఎంత ఎక్కువ ఉంటే ఒక వస్తువు ఉత్పత్తికి అంత తక్కువ శ్రమ కాలం అవసరమవుతుంది. ఆ వస్తువులో ఘనీభవించిన శ్రమ మొత్తం అంత తక్కువ ఉంటుంది. దాని విలువ అంత తక్కువ ఉంటుంది. అలాగే శ్రమ ఉత్పాదకత ఎంత తక్కువుంటే ఒక వస్తువు ఉత్పత్తికి అవసరమైన శ్రమ కాలం అంత ఎక్కువుంటుంది. దాని విలువ అంత ఎక్కువ ఉంటుంది. కనుక, ఒక సరుకు విలువ దానిలో ఇమిడి ఉన్న శ్రమ పరిమాణానికి అనులోమంగానూ, శ్రమ ఉత్పాదకతకి విలోమంగానూ ఉంటుంది.

విలువ లేకుండానే ఒక వస్తువు ఉపయోగపు విలువ అయ్యుండవచ్చు. మానవునికి దాని ఉపయోగకరత్వం (యుటిలిటి) శ్రమ వల్ల కానిసందర్భాల్లో అది సాధ్యం. గాలి, బీడు భూములు, సహజమైన పచ్చిక బయళ్ళు వగైరా. ఒక వస్తువు ఉపయోగకరం కావచ్చు, మానవ శ్రమ ఉత్పాదితం కూడా కావచ్చు; కానీ సరుకు కానక్కరలేదు. సొంత శ్రమతో తయారుచేసుకున్న వస్తువులతో తన అవసరాలను తీర్చుకునే వ్యక్తి తయారుచేసేది సరుకుల్ని కాదు, ఉపయోగపు విలువలని మాత్రమే. సరుకుల్ని ఉత్పత్తి చేయాలంటే అతను ఉపయోగపు విలువల్ని ఉత్పత్తి చేస్తే చాలదు; ఇతరులకు ఉపయోగపు విలువలుగా ఉండే వాటిని, అంటే సామాజిక ఉపయోగపు విలువలను ఉత్పత్తి చేయాలి. (కేవలం ఇతరుల ఉపయోగార్థం తయారుచేసినంత మాత్రాన చాలదు. మధ్యయుగాల్లో రైతు భూస్వామికి కౌలుగానూ, మత గురువుకి దక్షిణగానూ ధాన్యం చెల్లించుకొనేవాడు. అయితే ఆ కౌలు ధాన్యం గానీ, దక్షిణ ధాన్యం గాని ఇతరుల కోసం ఉత్పత్తి అయినంత మాత్రాన సరుకు కాదు. ఒక ఉత్పాదితం సరుకుగా మారాలంటే అది మారకం ద్వారా మరొకరికి బదిలీ అయి ఉపయోగపు విలువగా పనికి రావాలి.)[1] చివరిగా చెప్పాల్సిందేమంటే, ఉపయోగం లేనిదే దేనికీ విలువ ఉండజాలదు. వస్తువు ఉపయోగ రహితం అయితే దానిలో ఉన్న శ్రమ కూడా ఉపయోగ రహితమే. ఆ శ్రమ శ్రమగా లెక్కించబడదు. కనుక అది విలువను సృష్టించదు.

---

1. జర్మన్ నాలుగో ముద్రణలో నోట్: ప్రతి ఉత్పాదితమూ ఇతరులు అనుభవించగానే సరుకుగా మారిపోతుందనే అపార్థాన్ని తొలగించడానికి బ్రాకెట్లలో ఉన్న అంశాన్ని నేను చేర్చాను - ఏంగెల్స్.

### విభాగం 2

## సరుకులలో మూర్తీభవించిన శ్రమ ద్వంద్వ స్వభావం

మొదటి చూపుకి సరుకు అనేది ఉపయోగపు విలువ, మారకం విలువ (మారకం విలువ) అనే రెండు అంశాల సమ్మేళనంగా కనిపించింది. తర్వాత శ్రమకి కూడా అదే ద్వంద్వ స్వభావం ఉందని మనం గ్రహించాం. ఉపయోగపు విలువల సృష్టికర్తగా శ్రమకుండే లక్షణాలు అది విలువగా వ్యక్తమయి నప్పుడు దానికి ఉండవు. సరుకుల్లో ఉండే శ్రమ ద్వంద్వ స్వభావాన్ని మొట్టమొదటగా పేర్కొన్నదీ, విమర్శనాత్మకంగా పరిశీలించిందీ నేనే. అర్థశాస్త్రం స్పష్టంగా అవగతం కావాలంటే ఈ అంశం కీలకమైనది గనుక, మనం మరింత వివరంగా దీన్ని పరిశీలించాలి.

రెండు సరుకుల్ని తీసుకుందాం. ఒక కోటు, పది గజాల వస్త్రం విలువ కంటే కోటు విలువ రెట్టింపు అనుకుందాం. పది గజాల వస్త్రం = 'య' అయితే కోటు = 2 'య' అవుతుంది.

కోటు అనేది ఒక ఉపయోగపు విలువ, ఒక ప్రత్యేకమైన అవసరాన్ని తీరుస్తుంది. ఒక ప్రత్యేక తరహా ఉత్పాదక కార్యకలాపం కారణంగా అది అస్తిత్వంలోకి వచ్చింది. ఆ ఉత్పాదక కార్యకలాపం స్వభావాన్ని దాని లక్ష్యం, పని విధానం, ముడి పదార్థం, సాధనాలు, ఫలితం నిర్ణయిస్తాయి. తన ఉత్పాదితం యొక్క ఉపయోగపు విలువ ద్వారా తన ప్రయోజనాన్ని (ఉపయోగకరత్వాన్ని) వ్యక్తం చేసుకునే శ్రమని, లేదా తన ఉత్పాదితాన్ని ఉపయోగపు విలువగా తయారుచేయడం ద్వారా వ్యక్తమయ్యే శ్రమను మనం ఉపయోగకర శ్రమ అంటాం. ఈ సందర్భంలో మనం దాని ఉపయోగకర ప్రభావాన్ని మాత్రమే పరిగణనలోకి తీసుకొంటాము.

కోటూ, వస్త్రమూ గుణాత్మకంగా రెండు భిన్నమైన ఉపయోగపు విలువలయినట్టుగానే వాటిని ఉత్పత్తి చేసే కుట్టుపని, నేతపని కూడా రెండు భిన్నమైన శ్రమ రూపాలు. ఈ రెండు గుణాత్మకంగా భిన్నమయినవి కాకుంటే, గుణాత్మకంగా భిన్నమయిన శ్రమ వల్ల ఉత్పత్తి కాకుంటే వాటి మధ్య సరుకుల కుండే సంబంధం ఉండేది కాదు. కోటుల మారకం కోటులతో జరగదు. ఒక ఉపయోగపు విలువ మారకం అదే రకం ఉపయోగపు విలువతో జరగదు.

ఉపయోగపు విలువలు ఎన్ని రకాలు ఉంటాయో వాటి కనుగుణంగా అన్ని రకాల ఉపయోగకర శ్రమ ఉంటుంది. సామాజిక శ్రమ విభజనలో ఉపయోగకర శ్రమని జాతులుగా, ఉపజాతులుగా, శ్రేణులుగా, తరగతులుగా వర్గీకరించవచ్చు. సరుకుల ఉత్పత్తికి ఈ శ్రమ విభజన తప్పనిసరి అవసరం. అయితే శ్రమ విభజనకి సరుకుల ఉత్పత్తి ఉండి తీరాలని అర్థం కాదు. ఆదిమ భారతీయ సమాజంలో సరుకుల ఉత్పత్తి లేకుండానే సామాజిక శ్రమ విభజన ఉంది. మనకు దగ్గరగా ఉండే ఉదాహరణ తీసుకుందాం. ప్రతి ఫ్యాక్టరీలోనూ శ్రమ క్రమబద్ధంగా విభజించబడుతుంది. అయితే తమ ప్రత్యేక ఉత్పాదితాలను ఒకరికొకరు మారకం చేసుకోవడం ద్వారా శ్రామికులు ఈ విభజనను సాధించరు. ప్రైవేటు వ్యక్తుల కోసం వేటికవే స్వతంత్రంగా విభిన్న రకాల శ్రమవల్ల ఉత్పత్తి అయిన ఉత్పాదితాల మధ్య మాత్రమే సరుకులకుండే సంబంధం ఉంటుంది.

ప్రతి సరుకు యొక్క ఉపయోగపు విలువలోనూ ఉపయోగకర శ్రమ ఉంటుంది. అంటే నిర్దిష్ట లక్ష్యంతో నిర్వహించిన నిర్దిష్ట తరహా ఉత్పాదక కార్యకలాపం ఉంటుంది. సరుకుల్లో ఉన్న

ఉపయోగకర శ్రమ గుణాత్మకంగా ఒక దానికంటే ఒకటి భిన్నం కాకుంటే ఉపయోగపు విలువలు సరుకుల రూపంలో ఒకదానికొకటి ఎదురుపడవు. సాధారణంగా ఉత్పాదితాలు సరుకుల రూపం తీసుకొనే సమాజంలో ఎవరికి వారే స్వతంత్రంగా విడివిడి ఉత్పత్తిదారులు నిర్వహించే శ్రమ యొక్క ఉపయోగకర రూపాల మధ్య ఉండే ఈ గుణాత్మక భేదం ఒక సంక్లిష్ట వ్యవస్థగా, ఒక సామాజిక శ్రమ విభజనగా, అభివృద్ధి చెందుతుంది.

కోటును కుట్టుపనివాడు తొడుక్కున్నా, లేదా అతని దగ్గర కుట్టించుకునే వ్యక్తి తొడుక్కున్నా అది ఉపయోగపు విలువే. కుట్టుపని అనేది ఒక ప్రత్యేక వృత్తిగా, సామాజిక శ్రమ విభజనలో ఒక స్వతంత్ర విభాగంగా మారి ఉండవచ్చు. అయినప్పటికీ కోటుకీ, దానిని ఉత్పత్తి చేసిన శ్రమకీ ఉండే సంబంధం మారదు. దుస్తుల అవసరం ఒత్తిడి చేసిన చోటల్లా, ఒక్క మనిషి కూడా దర్జీవాడు కాకుండానే మానవజాతి వేల ఏళ్ళుగా దుస్తులు తయారుచేస్తూనే ఉంది. అయితే ప్రకృతి తనంత తానుగా ప్రసాదించిన సహజ సంపద కాక మిగతా పాదార్థిక సంపదకి సంబంధించిన ఇతర అంశాలన్నిటిలాగానే కోట్లు, వస్త్రాలు ఒక ప్రత్యేక ఉత్పాదక కార్యకలాపం వల్ల మాత్రమే తయారవుతాయి. నిర్దిష్ట లక్ష్యంతో నిర్వహించే కార్యకలాపమది. అది ప్రకృతి యిచ్చే ప్రత్యేక పదార్థాలను మానవుని ప్రత్యేక అవసరాలను తీర్చడం కోసం వినియోగిస్తుంది. కనుక శ్రమ అనేది ఉపయోగపు విలువను సృష్టించే శ్రమగా, ఉపయోగ శ్రమగా, సమాజ రూపం ఏదైనప్పటికీ మానవజాతి మనుగడకు అవసరమైన షరతు. అది ప్రకృతి మనపై రుద్దిన శాశ్వత అవసరం. శ్రమ లేకుంటే మానవునికీ ప్రకృతికీ మధ్య భౌతికంగా ఇచ్చి పుచ్చుకోవడం అనేది ఉండజాలదు. అంటే మనుగడే లేదు.

కోటు, వస్త్రం వగైరా ఉపయోగపు విలువలు, అంటే సరుకుల శరీరాలు రెండు అంశాల సమ్మేళనాలు – పదార్థం, శ్రమ. ఆ వస్తువులపైన ఖర్చయిన మానవ శ్రమను తీసేస్తే మానవ సాయం లేకుండా ప్రకృతే ఇచ్చిన పదార్థం మిగులుతుంది. మనిషి ప్రకృతిలాగే పనిచేస్తాడు. అంటే పదార్థ రూపాన్ని మారుస్తాడు.[1] అంటేగాదు. రూపం మార్చడం అనే ఈ కార్యక్రమంలో ప్రకృతి శక్తులు నిరంతరం అతనికి సాయపడతాయి. పాదార్థిక సంపదకీ, శ్రమ ఉత్పాదితాలైన ఉపయోగపు విలువలకీ, మూలం ఒక్క శ్రమ మాత్రమే కాదు. విలియమ్ పెట్టీ పేర్కొన్నట్టుగా పాదార్థిక సంపదకి తండ్రి శ్రమ, తల్లి భూమాత.

ఉపయోగపు విలువగా పరిగణించిన సరుకు నుండి సరుకుల విలువ అనే అంశం వైపు దృష్టి మళ్ళిద్దాం.

---

1. మానవుడి వల్ల జరిగేవైనా, భౌతిక శాస్త్ర సార్వత్రిక నియమాల కారణంగా జరిగేవైనా విశ్వ పరిణామాలను సృష్టి కార్యకలాపాలుగా కాక పదార్థానికి కొత్త రూపం ఇవ్వడంగా భావించాలి. పునరుత్పత్తి భావనను విశ్లేషించినప్పుడల్లా మానవ మేధకి కనిపించేది సంయోగం, వియోగం అనే అంశాలు మాత్రమే. విలువ పునరుత్పత్తి విషయంలో కూడా అంతే. (విలువ అంటే ఇక్కడ ఉపయోగ విలువ - ఫిజియోక్రాట్లతో వాదించేటప్పుడు వెర్రీ పేర్కొన్న అంశం ఇది. అయితే ఏ రకం విలువ గురించి మాట్లాడుతున్నాడో వెర్రీకి నిర్దిష్టంగా తెలియదు.) భూమి, వాయువు, నీరు పొలాలలో ధాన్యంగా మారి ఉండవచ్చు. ఒక పురుగు విసర్జితాన్ని మానవ హస్తం సిల్కుగా మార్చి ఉండవచ్చు. చిన్న లోహపు ముక్కను గడియారంలా అమర్చి ఉండవచ్చు. (పియెత్రో వెర్రీ, మెడిటాజియోనీ సల్లా ఎకనామియా పొలిటికా, ప్రథమ ముద్రణ 1771 - ఇటలీకి చెందిన అర్థశాస్త్ర వేత్తల కస్టోడి ప్రతి. పార్టిమోడెర్నా, సంపుటి 15, పుట 21, 22)

మన ఉదాహరణ ప్రకారం కోటు విలువ వస్త్రం విలువకి రెట్టింపు. ఇది కేవలం పరిమాణానికి సంబంధించిన భేదం. ప్రస్తుతం ఆ అంశాన్ని మనం పట్టించుకోబోవటం లేదు. పది గజాల వస్త్రం విలువకి కోటు విలువ రెట్టింపయితే ఇరవై గజాల వస్త్రం విలువ ఒక కోటు విలువతో సమానమయి ఉండాలి. విలువలుగా కోటు, వస్త్రం ఒకే పదార్థంతో తయారైన వస్తువులు, ఒకేలాంటి శ్రమకి భౌతిక రూపాలు. అయితే కుట్టుపని, నేతపని గుణాత్మకంగా భిన్న రకాల శ్రమ. ఒకే మనిషి ఒకసారి కుట్టుపని మరోసారి నేతపని చేసే సామాజిక దశలున్నాయి. ఆ సందర్భంలో ఈ రెండు రకాల శ్రమ ఒకే వ్యక్తి శ్రమకి భిన్న రూపాలు, భిన్న వ్యక్తుల ప్రత్యేక, నియమిత కార్యకలాపాలు కావు. దర్జీవాడు ఒక రోజు కోటు కుట్టి, రెండో రోజు ప్యాంటు కుట్టినట్టే ఒకే వ్యక్తి శ్రమలో మార్పును మాత్రమే ఇది సూచిస్తుంది. అంతేగాక పెట్టుబడిదారీ సమాజంలో మనం మరో అంశాన్ని గమనిస్తుంటాం. మానవ శ్రమలో కొంత భాగం గిరాకీని బట్టి ఒకసారి కుట్టుపని రూపంలోనూ, మరోసారి నేతపని రూపంలోనూ సరఫరా అవుతుంది. ఘర్షణ లేకుండా ఈ మార్పు జరగకపోవచ్చు. అయితే ఈ మార్పు మాత్రం జరిగి తీరాలి.

ఉత్పాదక కార్యకలాపం యొక్క ప్రత్యేక రూపాన్ని, అంటే శ్రమ యొక్క ఉపయోగకర స్వభావాన్ని మన దృష్టి నుండి తప్పిద్దాం. అప్పుడు ఉత్పాదక కార్యకలాపం అంటే మానవ శ్రమ శక్తి వ్యయం తప్ప మరోటి గాదు. కుట్టుపని, నేతపని గుణత్మకంగా భిన్నమయిన ఉత్పాదక కార్యకలాపాలే అయినప్పటికీ వీటిలో ప్రతి పనీ మానవుని మేధ, నరాలు, కండరాలు అనేవాటి ఉత్పాదక వ్యయం మాత్రమే. ఈ అర్థంలో అవి మానవ శ్రమ. అవి రెండూ మానవ శ్రమ శక్తి వ్యయంలో రెండు భిన్న రూపాలు మాత్రమే. అయితే ఈ శ్రమ శక్తి బహుళ రూపాలలో వ్యయం చేయబడటానికి ముందు ఒక ఉన్నత దశకు అభివృద్ధి చెంది ఉండాలి. సరుకు విలువ అనిర్దిష్ట మానవ శ్రమ ద్వారా, సాధారణ రూపంలో వ్యయమయ్యే మానవ శ్రమ ద్వారా వ్యక్తమవుతుంది. సమాజంలో ఒక సైనికాధిపతి (జనరల్) లేదా ఒక బ్యాంకర్ గొప్ప పాత్ర నిర్వహిస్తాడు. కానీ కేవలం మనిషి చాలా సాదా పాత్ర నిర్వహిస్తాడు.[1] కేవలం మానవ శ్రమ విషయంలో కూడా ఇదే వర్తిస్తుంది. అది సాదా శ్రమశక్తి వ్యయం. అంటే ప్రత్యేక అభివృద్ధిని అటుంచి, సగటున ప్రతి సాధారణ వ్యక్తిలోనూ ఉండే శ్రమశక్తి వ్యయం. సాదా సగటు శ్రమ దేశ కాలాలను బట్టి భిన్నంగా ఉంటుందనేది నిజమే. కానీ నిర్దిష్ట సమాజంలో అది నిర్దిష్టంగా ఉంటుంది. నిపుణ శ్రమ సాంద్రతరం అయిన సాదా శ్రమగా లెక్కించబడుతుంది. లేదా హెచ్చించబడిన సాదా శ్రమతో సమానం. ఒక పరిమాణంలో ఉన్న నిపుణ శ్రమ అంతకంటే ఎక్కువ పరిమాణంలో ఉన్న సాదా శ్రమతో సమానం. ఈ సర్దుబాటు నిరంతరాయంగా జరుగుతూ ఉంటుందని అనుభవం చెప్తోంది. ఒక సరుకు అత్యంత నిపుణ శ్రమ యొక్క ఉత్పాదితం కావచ్చు. దానిని నిపుణత్వం లేని సాదా శ్రమ ఉత్పాదితంతో పోల్చడం ద్వారా దాని విలువ నిర్దిష్ట సాదా శ్రమ పరిమాణానికి సమానమవుతుంది.[2] అనిపుణ శ్రమను ప్రమాణంగా

---

1. హెగెల్, ఫిలసాఫియె డెస్ రెక్ట్స్, బెర్లిన్, 1840, పుట 250, పారా 190.
2. నిర్దిష్ట శ్రమ కాలానికి శ్రామికుడు సంపాదించే వేతనం లేదా విలువ గురించి మేమిక్కడ ప్రస్తావించడం లేదనే అంశాన్ని పాఠకుడు గమనించాలి. ఆ శ్రమ కాలం ఇమిడి ఉన్న సరుకు విలువ గురించి మాత్రమే ఇక్కడ ప్రస్తావన. ప్రస్తుతం మన పరిశీలనలో వేతనాలనే అభివర్గం (కేటగిరి) ఇంకా అప్పుడే చోటుచేసుకోలేదు.

తీసుకొని, భిన్న రకాల శ్రమ ఏయే నిష్పత్తులలో అనిపుణ శ్రమగా మార్చబడేదీ ఉత్పత్తిదారుల పరోక్షంలో సాగే సామాజిక ప్రక్రియ నిర్ణయిస్తుంది. ఆ కారణంగానే వాటిని సంప్రదాయమే నిర్ధారించినట్టు అనిపిస్తుంది. సరళంగా ఉండటం కోసం ఇక నుంచీ ప్రతి తరహా శ్రమనీ నిపుణత్వం లేని, సాదా శ్రమగా అంచనా వేద్దాము. దానివల్ల ప్రతి ప్రత్యేక తరహా శ్రమనీ సాదా శ్రమగా కుదించి లెక్కించే ఇబ్బంది తప్పుతుంది.

కనుక, కోటునీ, వస్త్రాన్నీ విలువలుగా పరిగణించేటప్పుడు వాటి భిన్న ఉపయోగపు విలువల్ని వదిలేసినట్టే ఆ విలువలకు ప్రాతినిధ్యం వహించే శ్రమ విషయంలో కూడా దాని ఉపయోగ అంశాన్ని వదిలేస్తాము. అంటే ఆ శ్రమ యొక్క ఉపయోగకర రూపాలైన కుట్టుపని, నేత పనుల మధ్య ఉండే తేడాని పట్టించుకోము. ఉపయోగపు విలువలుగా కోటు, వస్త్రమూ ప్రత్యేక ఉత్పాదక కార్యకలాపాల సమ్మేళనాలు. కాగా విలువలుగా చూస్తే అవి కేవలం ఒకేలాంటి శ్రమకి అభిన్న సాకార రూపాలు. ఈ రకమైన విలువలలో ఇమిడి ఉన్న శ్రమ కోటుతోనూ, వస్త్రంతోనూ దానికి గల ఉత్పాదక సంబంధం ద్వారా కొలవబడదు. కేవలం మానవ శ్రమశక్తి వ్యయంగా మాత్రమే పరిగణించబడుతుంది. కోటు, వస్త్రమూ అనే ఉపయోగపు విలువలను సృష్టించడంలో కుట్టుపని, నేతపని అనేవి అవసరమైన అంశాలు. ఎందుకంటే ఈ రెండు రకాల శ్రమకూ గల గుణాలు వేరు గనుక. అయితే ప్రత్యేక గుణాలను వదిలేసిన మేరకే, రెండు పనుల్లోనూ మానవ శ్రమ అనే ఉమ్మడి గుణం ఉన్న మేరకే కుట్టుపని, నేతపని అనేవి ఆ రెండు వస్తువులకీ విలువని కల్పిస్తాయి.

కోట్లూ, వస్త్రమూ కేవలం విలువలు మాత్రమే కాదు. అవి నిర్దిష్ట పరిమాణం కలిగిన విలువలు. మన ఉదాహరణ ప్రకారం కోటు విలువ పది గజాల వస్త్రం విలువకు రెట్టింపు. వాటి విలువల్లో ఈ తేడా ఎక్కడి నుండి వచ్చింది? కోటులో ఉన్న శ్రమలో సగం మాత్రమే పది గజాల వస్త్రంలో ఉంది కనుక. ఆ కారణంగా వస్త్రం ఉత్పత్తిలో కంటే కోటు ఉత్పత్తిలో శ్రమశక్తి రెట్టింపు కాలంపాటు వ్యయం అయి ఉండాలి గనుక.

ఉపయోగపు విలువకు సంబంధించిన మేరకు ఒక సరుకులో ఉన్న శ్రమ గుణాత్మకంగా మాత్రమే పరిగణించబడుతుంది. విలువకు సంబంధించిన మేరకు అది పరిమాణాత్మకంగా మాత్రమే పరిగణించబడుతుంది. కనుక దానిని శుద్ధ, సాదా మానవ శ్రమగా కుదించాలి. ఉపయోగ విలువకి సంబంధించి నంతవరకూ ఎలా, ఏమిటి అన్నది ప్రశ్న. విలువకి సంబంధించిన మేరకు ఎంత, ఎంత కాలం అన్నది ప్రశ్న. ఒక సరుకు విలువ పరిమాణం ఆ సరుకులో ఇమిడి ఉన్న శ్రమ పరిమాణానికి మాత్రమే ప్రాతినిధ్యం వహిస్తుంది కనుక సరుకులన్నిటినీ తగిన నిష్పత్తులలో తీసుకుంటే అన్నిటికీ ఒకే విలువ ఉంటుంది.

ఒక కోటును ఉత్పత్తి చేయడానికి అవసరమైన విభిన్న తరహాల ఉపయోగకర శ్రమ యొక్క ఉత్పాదక శక్తి మారకుండా ఉంటే ఉత్పత్తి అయిన కోటుల విలువ మొత్తం వాటి సంఖ్యను బట్టి పెరుగుతుంది. ఒక కోటు 'య' రోజుల శ్రమకి ప్రాతినిధ్యం వహిస్తే రెండు కోటులు '2య' రోజులు పనికి ప్రాతినిధ్యం వహిస్తాయి. ఇలాగే ఎన్ని కోటులైనా, అయితే కోటు ఉత్పత్తి చేయడానికి అవసరమైన శ్రమ కాల పరిమాణం రెట్టింపయింది; లేదా సగానికి పడిపోయింది అనుకుందాం. రెట్టింపయితే

ఒక కోటు విలువ ఇంతకు ముందున్న రెండు కోటుల విలువతో సమానం. సగానికి పడిపోతే ఇప్పుడు రెండు కోటుల విలువ ఇంతకు ముందున్న ఒక కోటు విలువతో సమానం. రెండు సందర్భాల్లోనూ కోటు చేసే సేవలో గతానికీ ఇప్పటికీ తేడా లేదు. దానిలో ఉన్న ఉపయోగకర శ్రమ యొక్క గుణం యథాతథంగానే ఉంది. అయితే ఉత్పాదితంపై ఖర్చయిన శ్రమ పరిమాణంలో మార్పుంది.

ఉపయోగపు విలువల పరిమాణంలో పెరుగుదల అంటే పాదార్థిక సంపద పెరుగుదలే. రెండు కోటులుంటే ఇద్దరు మనుషులు ధరించవచ్చు. ఒక కోటుంటే ఒకరే ధరించగలరు. కానీ, పాదార్థిక సంపద పరిమాణం పెరగడంతో పాటు దాని విలువ పరిమాణం పడిపోవచ్చు. ఈ విరుద్ధ చలనానికి కారణం శ్రమ యొక్క ద్వంద్వ స్వభావమే. ఉత్పాదక శక్తి అనేది ఒక నిర్దిష్ట, ఉపయోగకర శ్రమ రూపానికే వర్తిస్తుంది. ఒక నిర్ణీత కాలంలో జరిగే ఉత్పాదక కార్యకలాపం యొక్క సమర్థత దాని ఉత్పాదకతపై ఆధారపడి ఉంటుంది. కనుక ఉపయోగకర శ్రమ ఉత్పాదకత యొక్క పెరుగుదలనూ తరుగుదలనూ బట్టి ఉత్పాదితాల సమృద్ధి అనేది ఎక్కువగానూ, తక్కువగానూ ఉంటుంది. కానీ ఈ ఉత్పాదకతలో మార్పు శ్రమ సృష్టించే విలువని మార్చదు. ఉత్పాదక శక్తి అనేది నిర్దిష్ట, ఉపయోగకర శ్రమ రూపాల స్వభావం. అయితే మనం ఆ నిర్దిష్ట ఉపయోగకర రూపాలను వదిలేయగానే ఉత్పాదక శక్తి ప్రభావం ఆ శ్రమపై ఏ మాత్రం ఉండదు. ఉత్పాదక శక్తి ఎంత మారినా ఒకే వ్యవధిలో వ్యయమయిన  అదే శ్రమ ఎప్పుడూ అంతే విలువను ఇస్తుంది. అయితే సమాన కాల వ్యవధుల్లో అది విభిన్న మొత్తాల ఉపయోగపు విలువలను ఇస్తుంది. ఉత్పాదక శక్తి పెరిగితే ఎక్కువగానూ, తగ్గితే తక్కువగానూ ఇస్తుంది. ఉత్పాదక శక్తిలో వచ్చే మార్పు వల్ల శ్రమ ఫలదాయకత పెరిగి, తత్ఫలితంగా ఆ శ్రమ ఉత్పత్తి చేసే ఉపయోగపు విలువల పరిమాణం పెరిగినప్పుడు, వాటిని ఉత్పత్తి చేయడానికి అవసరమైన మొత్తం శ్రమ కాలం తగ్గిన పక్షంలో... ఆ పెరిగిన పరిమాణపు ఉపయోగపు విలువల మొత్తం విలువ తగ్గుతుంది. అలాగే, శ్రమ ఫలదాయకత తరిగితే, చివరకు ఉపయోగపు విలువల మొత్తం విలువ పెరుగుతుంది.

భౌతికార్థంలో మాట్లాడాలంటే శ్రమ అంతా ఒక రకంగా మానవ శ్రమశక్తి వ్యయం. ఒకేలాంటి అనిర్దిష్ట మానవ శ్రమగా అది సరుకుల విలువను సృష్టిస్తుంది. మరో రకంగా శ్రమ అనేది ఒక నిర్దిష్ట లక్ష్యంతో ప్రత్యేక రూపంలో వ్యయమయ్యే మానవ శ్రమశక్తి. నిర్దిష్ట, ఉపయోగకర శ్రమగా అది ఉపయోగపు విలువలను సృష్టిస్తుంది.[1]

---

1. శ్రమ మాత్రమే సరైన, వాస్తవమైన కొలమానమనీ, అన్ని కాలాలలోనూ అన్ని సరుకుల విలువను ఈ కొలమానం ద్వారా మాత్రమే అంచనా వేయడం, పోల్చడం సాధ్యమవుతుందనీ రుజువు చేయడానికి ఆడమ్ స్మిత్ ఇలా అంటాడు. "అన్ని కాలాల్లోనూ, అన్నిచోట్లా సమాన పరిమాణాలలో వుండే శ్రమకి శ్రామికుని దృష్టిలో సమాన విలువ వుంటుంది. కార్మికుని ఆరోగ్యం, శక్తి, క్రియాశీలత మామూలు దశలో వున్నప్పుడు సగటు నిపుణత్వం వున్న కార్మికుడు అదే మోతాదులో తన విశ్రాంతినీ, స్వేచ్ఛనీ, సంతోషాన్నీ ఎప్పుడూ వదులుకోవలసి వుంటుంది..." (వెల్త్ ఆఫ్ నేషన్స్, పుస్తకం 1, అధ్యాయం 5) ఒకవైపున ఆడం స్మిత్ ఇక్కడ (ప్రతిచోటా కాదు) సరుకుల ఉత్పత్తిలో వ్యయమయిన శ్రమ పరిమాణాన్ని బట్టి విలువ నిర్ధారణ అనే అంశాన్ని, శ్రమ విలువని బట్టి సరుకుల విలువ నిర్ధారణ చేయడంగా భావించి గందరగోళపడతాడు. అందుచేతనే, సమాన శ్రమ పరిమాణాలకు సమాన విలువ వుంటుంది అని రుజువు చేయడానికి ప్రయత్నిస్తాడు. మరోవైపున సరుకుల విలువలో వ్యక్తం అయిన మేరకు శ్రమ

## విభాగం 3

# విలువ రూపం లేదా మారకం (Exchange) విలువ

ఉపయోగపు విలువలుగా, వస్తువులుగా, లేక ఇనుము, వస్త్రం, ధాన్యం లాంటి పదార్థాలుగా సరుకులు ప్రపంచంలోకి వస్తాయి. ఇది వాటి సాధారణ, సాదా సీదా వస్తుగత రూపం. కానీ అవి సరుకులు, ఎందుచేతంటే వాటికి ద్వంద్వ స్వభావం ఉంది. అవి ఉపయోగకర వస్తువులు, అదే సమయంలో విలువకి నిలయాలు కూడా. భౌతిక లేదా సహజ రూపం, విలువ రూపం అనే రెండు రూపాలున్న మేరకు అవి సరుకులుగా వ్యక్తమవుతాయి లేదా సరుకు రూపం కలిగి ఉంటాయి.

సరుకు విలువ అనే వాస్తవం "ఎక్కడ దొరుకుతుందో" మనకు తెలియదు. ఆ రకంగా అది దొరసాని క్విక్లీ కంటే భిన్నమైనది. సరుకుల విలువ వాటి ముతక పాదార్థికతకి పూర్తిగా వ్యతిరేకం. పదార్థానికి సంబంధించిన ఒక్క పరమాణువు సైతం దాని విలువలోకి ప్రవేశించదు. ఒక సరుకుని ప్రత్యేకంగా పరిశీలించండి. అది విలువున్న వస్తువుగా ఉన్న మేరకు, ఆ విలువ ఏమిటో గ్రహించడం అసాధ్యం అనిపిస్తుంది. అయితే సరుకు విలువకి ఉన్నది కేవలం సామాజిక అస్తిత్వం అనీ, మానవ శ్రమ అనే సామాజిక పదార్థానికి సాకార రూపంగా లేదా వ్యక్తీకరణగా ఉన్న మేరకే విలువకి ఈ అస్తిత్వం వస్తుందనీ మనం దృష్టిలో ఉంచుకుంటే సరుకుకీ సరుకుకీ మధ్య ఉన్న సామాజిక సంబంధం ద్వారా మాత్రమే సరుకు విలువ వ్యక్తమవుతుందని స్పష్టమవుతుంది. నిజానికి మనం మారకం (Exchange) విలువతో లేదా సరుకుల మారకం సంబంధంతో ప్రారంభించాం. ఆ సంబంధం వెనుక దాగి ఉన్న విలువని కనుక్కోవడం మన లక్ష్యం. విలువ మనకి మొట్టమొదట ఏ రూపంలో కనిపించిందో ఆ రూపాన్ని మళ్ళీ పరిశీలిద్దాం.

సరుకులకు ఉమ్మడిగా వర్తించే ఒక విలువ రూపం ఉందనే సంగతి అందరికీ తెలుసు. ఈ రూపం సరుకులకుండే వివిధ ఉపయోగపు విలువల వస్తురూపాలకు పూర్తిగా భిన్నం. నేనిక్కడ ప్రస్తావిస్తున్నది డబ్బు రూపం గురించి. బూర్జువా అర్థశాస్త్రం నెరవేర్చడానికి ప్రయత్నమైనా చేయని

---

కేవలం శ్రమశక్తి స్వయంగా మాత్రమే గణించబడుతుందనే అస్పష్టమైన ఊహ అతని మనసులో వుంది. అయితే ఈ శ్రమ వ్యయం అంటే అర్థం శ్రామికుడు తన విశ్రాంతినీ, స్వేచ్ఛనీ, సంతోషాన్నీ త్యాగం చెయ్యడం మాత్రమే అని అతడు అర్థం చేసుకుంటాడు. దానిని మానవుల సహజ కార్యకలాపమని అతడనుకోడు. అతని దృష్టిలో వున్నది ఆధునిక వేతన శ్రామికుడు. ఆడమ్ స్మిత్‌కి ముందున్న ఒక పేరు తెలియని ఆర్థికవేత్త ఇంతకంటే సరిగా పేర్కొన్నాడు. "ఒక జీవితావసర వస్తువు కోసం ఒక మనిషి ఒక వారం రోజులు పనిచేశాడు. దానికి బదులుగా మరొక వస్తువును మార్పిడి చేసుకునే వ్యక్తి తన వస్తువును ఎంత పరిమాణంలో ఇవ్వవలసిందీ తేల్చుకోడానికి తాను వారం రోజులలో ఎంత పరిమాణాన్ని ఉత్పత్తి చేసిందీ అంచనా వేయడం కంటే మేలైన మార్గం లేదు. అంటే ఒక నిర్దిష్ట కాలం ఒక మనిషి ఒక వస్తువుపై వెచ్చించిన శ్రమని అంతే కాలం పాటు మరో వ్యక్తి మరో వస్తువుపై వెచ్చించిన శ్రమతో మార్పిడి చేయడం తప్ప వేరుగాదు." (సమ్ థాట్స్ ఆన్ ది ఇంటరెస్ట్ ఆఫ్ మనీ ... పుట 39")

(శ్రమలోని రెండు పార్శ్వాలను వ్యక్తీకరించడానికి రెండు పదాలను వాడే సౌలభ్యం ఇంగ్లీషు భాషలో వుంది. ఉపయోగపు విలువను సృష్టించే గుణాత్మకమైన పార్శ్వాన్ని పని అనీ (వర్క్), మారకపు విలువను సృష్టించే పరిమాణాత్మకమైన పార్శ్వాన్ని శ్రమ అనీ (లేబర్) పిలువవచ్చు. -ఏంగెల్స్)

ఒక కర్తవ్యం మనముందుంది. అదేమంటే ఈ డబ్బు రూపం పుట్టుకని కనిపెట్టడం. సరుకుల విలువ సంబంధంలో ఇమిడి ఉన్న విలువ వ్యక్తీకరణ కనిపించీ కనిపించని రేఖామాత్ర రూపం నుండి మిరుమిట్లు గొలిపే డబ్బు రూపానికి ఎలా అభివృద్ధి చెందుతుందో వివరించాలి. ఇది చేయడం ద్వారా మనం, అదే సమయంలో డబ్బు రూపంలో మన ముందున్న చిక్కు సమస్యను పరిష్కరించిన వాళ్ళమవుతాము.

ఒక సరుకుకీ మరో రకం సరుకుకీ ఉన్న విలువ సంబంధమే అత్యంత సాదా విలువ సంబంధం. కనుక రెండు సరుకుల మధ్య ఉన్న సంబంధం మనకి ఒక సరుకు విలువ గురించి అత్యంత సాదా రూపంలో వ్యక్తం చేస్తుంది.

## అ. ప్రాథమిక లేదా యాదృచ్ఛిక విలువ రూపం

'య' పరిమాణం ఉన్న సరుకు 'క' = 'ర' పరిమాణం ఉన్న సరుకు 'చ' లేదా

'య' పరిమాణం ఉన్న సరుకు 'క' విలువ 'ర' పరిమాణం ఉన్న సరుకు 'చ'తో సమానం.

20 గజాల వస్త్రం = 1 కోటు  లేదా

20 గజాల వస్త్రం విలువ ఒక కోటుతో సమానం.

### 1. విలువ వ్యక్తీకరణ రెండు ధ్రువాలు - సాపేక్ష రూపం, సమవిలువ రూపం

విలువ రూపానికి సంబంధించిన నిగూఢత్వమంతా ఈ ప్రాథమిక రూపంలోనే ఉంది. కనుక దాని విశ్లేషణే మన ముందున్న క్లిష్ట సమస్య.

ఇక్కడ రెండు రకాల సరుకులు (మన ఉదాహరణలో వస్త్రమూ, కోటూ) రెండు భిన్న పాత్రలు నిర్వహిస్తున్నాయనేది స్పష్టం. వస్త్రం తన విలువని కోటు ద్వారా వ్యక్తం చేస్తుంది. కోటు ఆ విలువ వ్యక్తం కావడానికి తోడ్పడే సాధనం. మొదటిది క్రియాశీల పాత్ర నిర్వహిస్తుంది. రెండోది జడాత్మక పాత్ర వహిస్తుంది. వస్త్రం విలువ సాపేక్ష విలువగా వ్యక్తం చేయబడింది. లేదా సాపేక్ష రూపంలో కనిపిస్తుంది. కోటు సమ విలువగా వ్యవహరిస్తుంది; లేదా సమవిలువ రూపంలో కనిపిస్తుంది.

సాపేక్ష రూపం, సమవిలువ రూపం అనేవి విలువ వ్యక్తీకరణలో సన్నిహితంగా కలిసి ఉన్న పరస్పరాధారితమైన, విడదీయరాని రెండు అంశాలు. అయితే అదే సమయంలో అవి రెండూ పరస్పర భిన్న, విరుద్ధ పార్శ్వాలు. అంటే ఒకే వ్యక్తీకరణకున్న రెండు ధ్రువాలు. ఆ వ్యక్తీకరణ ద్వారా సంబంధం ఏర్పడిన రెండు భిన్నమైన సరుకులకు వరుసగా ఈ రెండు ధ్రువాలూ కేటాయించబడ్డాయి. వస్త్రం విలువని వస్త్రం ద్వారానే వ్యక్తం చేయడం సాధ్యం కాదు. 20 గజాల వస్త్రం = 20 గజాల వస్త్రం అనేది విలువ వ్యక్తీకరణ కాజాలదు. దానికి ప్రతిగా 20 గజాల వస్త్రం, 20 గజాల వస్త్రం తప్ప మరేమీ కాదని మాత్రమే అటువంటి సమీకరణం చెబుతుంది. కనుక వస్త్రం విలువని సాపేక్షంగా మాత్రమే, అంటే మరో సరుకు ద్వారా మాత్రమే వ్యక్తం చేయడం సాధ్యం. వస్త్రం విలువ యొక్క సాపేక్ష రూపం సమవిలువ రూపంలో మరో సరుకు (ఇక్కడ కోటు) ఉండాలని కోరుతుంది. మరోవైపు సమవిలువగా ఉన్న ఒక సరుకు అదే సమయంలో సాపేక్ష రూపాన్ని ధరించజాలదు. విలువ వ్యక్తం

అయేది రెండో సరుకుది కాదు. మొదటి సరుకు విలువని వ్యక్తం చేసే సాధనం మాత్రమే అది.

20 గజాల వస్త్రం = 1 కోటు లేదా 20 గజాల వస్త్ర విలువ ఒక కోటు అనే వ్యక్తీకరణ 1 కోటు = 20 గజాల వస్త్రం లేదా 1 కోటు విలువ 20 గజాల వస్త్రం అనే వ్యతిరేక సంబంధాన్ని కూడా సూచిస్తుందనటంలో సందేహం లేదు. అయితే కోటు విలువని సాపేక్షంగా వ్యక్తం చేయదలుచుకుంటే సమీకరణాన్ని నేను తిరగేయాల్సి ఉంటుంది. అలా చేసిన వెంటనే కోటుకి బదులు వస్త్రం సమవిలువగా మారిపోతుంది. కనుక ఒకే సరుకు ఏక కాలంలో ఒకే విలువ వ్యక్తీకరణలో రెండు రూపాలనూ కలిగి ఉండజాలదు. ఈ రూపాల ధ్రువత్వమే వీటిని పరస్పర భిన్నంగా చేస్తుంది.

ఒక సరుకు సాపేక్ష రూపం ధరిస్తుందా, దానికి వ్యతిరేకమైన సమవిలువ రూపం ధరిస్తుందా అనేది విలువ వ్యక్తీకరణలో దాని యాదృచ్ఛిక స్థానం మీద పూర్తిగా ఆధారపడుతుంది – విలువ వ్యక్తం కావలసిన సరుకు లేక విలువ దాని ద్వారా వ్యక్తమవుతోందా అనే అంశంపై ఆధారపడుతుంది.

## 2. విలువ సాపేక్ష రూపం

### (అ) ఈ రూపం స్వభావం, ప్రాధాన్యం

ఒక సరుకు విలువ ప్రాథమిక వ్యక్తీకరణ రెండు సరుకుల విలువ సంబంధంలో ఎట్లా దాగి ఉంటుందో కనుగొనాలంటే మొట్టమొదట ఆ విలువ సంబంధాన్ని, దాని పరిమాణాత్మక అంశాన్ని ప్రక్కనబెట్టి, పరిశీలించాలి. మామూలు పద్ధతి సాధారణంగా దీనికి వ్యతిరేకంగా ఉంటుంది. ఒకదానితో ఒకటి సమానం అనుకున్న రెండు భిన్న తరహాల సరుకుల నిర్దిష్ట పరిమాణాల మధ్య ఉండే నిష్పత్తిని తప్ప విలువ సంబంధంలో మరి దేన్నీ చూడరు. విభిన్న వస్తువుల పరిమాణాలు ఒకే ప్రమాణం ద్వారా వ్యక్తమయినప్పుడు మాత్రమే వాటిని పరిమాణాత్మకంగా పోల్చడం సాధ్యపడుతుందని మర్చిపోతారు. అటువంటి ప్రమాణానికి వ్యక్తీకరణలుగా మాత్రమే అవి ఒకే శ్రేణికి చెందినవవుతాయి. కనుకనే వాటిని కొలవడం సాధ్యం.[1]

20 గజాల వస్త్రం = 1 కోటు, లేదా 20 కోట్లు, లేదా 'య' కోట్లు కావచ్చు. అంటే ఒక నిర్దిష్ట పరిమాణం గల్గిన వస్త్రం కొద్ది కోటులతో సమానం కావచ్చు లేదా ఎక్కువ కోటులతో సమానం కావచ్చు. కోటూ, వస్త్రమూ విలువ పరిమాణాలుగా ఒకే ప్రమాణానికి వ్యక్తీకరణలు ఒకే రకానికి చెందిన వస్తువులు అని అది తెలియజేస్తుంది. వస్త్రం = కోటు అనేది సమీకరణకు ఆధారం. అయితే గుణాత్మకంగా ఒకే రకానికి చెందినట్లు భావించబడిన ఈ రెండు సరుకులూ ఒకే పాత్ర నిర్వహించవు. వస్త్రం విలువ మాత్రమే ఇక్కడ వ్యక్తమవుతుంది. ఎట్లా? సమవిలువగా, మారకం చేసుకోడానికి వీలైన వస్తువుగా, కోటుతో పోల్చడం ద్వారా, ఈ సంబంధంలో కోటు అనేది విలువ ఉండే రూపం, విలువకు సాకార రూపం. ఆ రకంగా మాత్రమే అది వస్త్రం లాంటిది. మరోవైపు వస్త్రం సొంత విలువ

1. విలువ రూపాన్ని విశ్లేషించాలని తంటాలుపడి విఫలమైన కొద్దిమంది అర్థశాస్త్రవేత్తల్లో ఎస్. బెయిలీ ఒకరు. దానికి మొదటి కారణం వారు "విలువనే" విలువ రూపం అనుకున్నారు. రెండోది, ఆచరణలో రూఢమైన బూర్జువా భావాల మొరటు ప్రభావంలో పడి విలువ యొక్క పరిమాణాత్మక అంశంపై మాత్రమే తమ దృష్టి కేంద్రీకరించారు. "పరిమాణ స్థాయే ... విలువ" ("డబ్బు, దాని ఆటుపోట్లు" ఇంగ్లీషు, లండన్, 1837, ఎస్. బెయిలీ, పుట 11)

ముందుకొస్తుంది. స్వతంత్ర వ్యక్తీకరణ పొందుతుంది. విలువగా మాత్రమే మరో సమాన విలువైన కోటుతో పోల్చబడుతుంది, లేదా మారకం చేయబడుతుంది. రసాయన శాస్త్రం నుంచి ఓ ఉదాహరణ తీసుకోవచ్చు. బుటిరిక్ ఆమ్లము (యాసిడ్) ప్రొఫిల్ ఫార్మేట్‌కి భిన్నమైన పదార్థం. అయితే రెంటిలోనూ ఒకే రకం రసాయనిక పదార్థాలుంటాయి. కర్బనం (C), ఉదజని (H), ఆమ్లజని (O). పైగా ఒకే అనుపాతంలో ఉంటాయి – $C_4H_8O_2$. మనం ఇప్పుడు బుటిరిక్ ఆమ్లాన్ని ప్రొఫిల్ ఫార్మేట్‌తో సమానం అంటున్నాం అంటే అందులో మొదటిది, ఈ సంబంధంలో ప్రొఫిల్ ఫార్మేట్ అనేది కేవలం $C_4H_8O_2$కి ఒక ఉనికి రూపం మాత్రమే; రెండోది, బుటిరిక్ ఆమ్లంలో కూడా $C_4H_8O_2$ ఉంది అని చెబుతున్నామన్న మాట. ఆ రకంగా ఈ రెండు పదార్థాల్ని సమం అని చూపుతున్నప్పుడు వాటి రసాయనిక నిర్మాణాన్ని మాత్రమే వ్యక్తం చేస్తున్నాము. ఇక్కడ వాటి భిన్నమైన భౌతిక రూపాలను నిర్లక్ష్యం చేస్తున్నాము.

విలువలుగా, సరుకులు మానవ శ్రమకి సాకార రూపాలు మాత్రమే అని అంటున్నామంటే మనం మన విశ్లేషణ ద్వారా వాటిని విలువ అనే అభౌతిక భావానికి కుదిస్తున్నామన్నది నిజం. అయితే మనం ఈ విలువకి వాటి భౌతిక రూపాన్ని తప్ప మరోదాన్ని ఆపాదించం. ఒక సరుకుకీ మరో సరుకుకీ ఉన్న విలువ సంబంధంలో దాని సంగతి వేరు. ఇక్కడ ఒక సరుకు మరో సరుకుతో గల సంబంధం కారణంగా దానికి గల విలువ స్వభావం వ్యక్తమవుతుంది.

వస్త్రానికి కోటుని సమ విలువగా చేయడం ద్వారా మనం కోటులో మూర్తీభవించిన శ్రమని వస్త్రంలో ఉన్న శ్రమతో సమం అంటున్నాము. కోటుని తయారుచేసే కుట్టుపని వస్త్రాన్ని తయారుచేసే నేత పనికి భిన్నమైన నిర్దిష్ట శ్రమ అనేది నిజమే. కాని దాన్ని నేత పనితో సమం చేసే చర్య కుట్టుపనిని ఈ రెండు రకాల శ్రమలోనూ నిజంగా సమంగా ఉన్న అంశానికి కుదిస్తుంది; వాటి ఉమ్మడి లక్షణం అయిన శ్రమగా కుదిస్తుంది. విలువని నేయడం మేరకు నేతపని కూడా కుట్టుపనికి భిన్నం కాదు. అది అనిర్దిష్ట మానవ శ్రమ మాత్రమే అనే సత్యం ఇలా డొంక తిరుగుడుగా వ్యక్తమవుతుంది. వివిధ రకాల సరుకుల మధ్య ఉండే సమత్వపు వ్యక్తీకరణే విలువను సృష్టించే శ్రమ యొక్క విశిష్ట స్వభావాన్ని ముందుకు తెస్తుంది. వివిధ రకాల సరుకుల్లో మూర్తీభవించిన విభిన్న తరహాల శ్రమని వాటి ఉమ్మడి గుణం అయిన అనిర్దిష్ట మానవ శ్రమగా కుదించడం ద్వారా అది ఈ పనిని సాధిస్తుంది.[1]

వస్త్రం విలువని సృష్టించే శ్రమ విశిష్ట లక్షణాన్ని వ్యక్తం చేయడమే కాక మరో అంశం అవసరం ఉంది. చలనంలో ఉన్న శ్రమ శక్తి, లేదా మానవ శ్రమ, విలువను సృష్టిస్తుంది. కాని మానవ శ్రమ స్వయంగా విలువ కాదు. అది తన మూర్తీభవించిన స్థితిలో మాత్రమే, ఒక వస్తువు

1. విలియమ్ పెట్టీ తర్వాత విలువ స్వభావాన్ని గ్రహించిన తొలి అర్థశాస్త్రవేత్తల్లో ఒకరైన ఫ్రాంక్లిన్ ఇలా అన్నాడు : "సాధారణంగా వ్యాపారం అంటే ఒక శ్రమ మరో శ్రమతో మారకం జరగడం తప్ప మరొకటి కాదు. అన్ని వస్తువుల విలువ శ్రమచేత కొలవబడుతుంది." (బి. ఫ్రాంక్లిన్ రచనలు, సంపాదకుడు, స్పార్క్స్, బోస్టన్, 1836, సంపుటి II, పే. 267) ప్రతి దానిని శ్రమని బట్టి అంచనా వేయడం ద్వారా మారకంకి గురైన విభిన్న తరహాల శ్రమల్లో విభేదాన్ని తాను వదిలేస్తున్నాననీ, వాటన్నిటినీ సమాన మానవ శ్రమగా కుదిస్తున్నాడనే విషయం ఆయనకి తెలియదు. అయినా దానిని చెప్పాడు. ఆయన ముందు 'ఒక శ్రమ', తర్వాత 'మరో శ్రమ' అంతిమంగా "శ్రమ" అంటే ప్రతి వస్తువు విలువ సారాంశమే అయినా, ఏ విశేషణాలు లేని "శ్రమ" గురించి మాట్లాడారు.

రూపంలో ఇమిడి ఉన్నప్పుడు లేక ఘనీభవించిన స్థితిలో మాత్రమే విలువ అవుతుంది. మానవశ్రమకి మూర్తీభావంగా వస్త్రం విలువ వ్యక్తం కావాలంటే ఆ విలువకి వస్తుగత అస్తిత్వం ఉన్నట్టుగా వ్యక్తం కావాలి. వస్తుతః వస్త్రం కంటే భిన్నమైనదిగా అయినప్పటికీ ఇతర అన్ని సరుకులకీ గల ఉమ్మడి అంశంగా అది వ్యక్తం కావాలి. సమస్య ఇప్పటికే పరిష్కారమైంది.

విలువ సమీకరణంలో సమవిలువ స్థానంలో ఉన్న కోటు ఒక విలువ. కనుక గుణాత్మకంగా వస్త్రంతో సమానమైనదిగా ఉంది. ఆ మేరకు అది వస్త్రంలాంటి వస్తువుగా పరిగణించబడుతుంది. ఈ స్థానంలో దానిలో విలువని తప్ప మరో అంశాన్ని మనం చూడము. దాని స్పష్టమైన వస్తురూపం విలువకి ప్రాతినిధ్యం వహిస్తుంది. అయితే కోటు తనంత తానుగా, కోటు అనే సరుకు భౌతిక ఆకృతిగా కేవలం ఉపయోగ విలువ మాత్రమే. వస్త్రాన్ని పట్టుకుని చూడండి. అది తాను విలువని అనే విషయం చెప్పదు. కోటు కూడా అంతే. తనంత తానుగా అది విలువనని చెప్పదు. చాలామంది మనుషుల ప్రాముఖ్యం సాదా దుస్తుల్లో ఉన్నప్పటికంటే ఆడంబరంగా యూనిఫాంలో ఉన్నప్పుడు పెరుగుతుంది. అలాగే వస్త్రంతో విలువ సంబంధంలో లేనప్పటికంటే, ఆ సంబంధంలో ఉన్నప్పుడు కోటు ప్రాముఖ్యం పెరుగుతుంది.

కోటు ఉత్పత్తిలో మానవ శ్రమ శక్తి కుట్టు పని రూపంలో తప్పకుండా ఖర్చయి ఉంటుంది. కనుక దానిలో మానవ శ్రమ పోగుబడింది. ఈ అంశం రీత్యా కోటు విలువకి నిలయం. కాని అది పీలికలుగా మారినా ఆ వాస్తవాన్ని బయటికి రానీదు. విలువ సమీకరణంలో వస్త్రానికి సమవిలువగా ఉన్నప్పుడు దానికి విలువగా మాత్రమే ఉనికి ఉంటుంది. అప్పుడు అది మూర్తీభవించిన విలువగా, విలువకొక సాకార రూపంగా పరిగణించబడుతుంది. 'చ' అనే వ్యక్తి దృష్టిలో ప్రభుత అనేది 'క' రూపం ధరిస్తే తప్ప 'క' అనే వ్యక్తి 'చ' అనే మరో వ్యక్తికి ప్రభువు కాలేడు. కొత్త ప్రభువు రాకతో పాటు ప్రభుత ముఖ కవళికలూ, కేశ సంపద, వగైరాలన్నీ మారతాయి.

వస్త్రానికి కోటు సమవిలువగా ఉన్నట్టి విలువ సమీకరణంలో, కోటు అనేది విలువ యొక్క రూపంగా వ్యవహరిస్తుంది. వస్త్రం అనే సరుకు విలువ కోటు అనే సరుకు యొక్క వస్తు రూపం ద్వారా వ్యక్తమైంది. ఒక దాని విలువ రెండో దాని ఉపయోగపు విలువ ద్వారా వ్యక్తమైంది. ఒక ఉపయోగపు విలువగా వస్త్రం అనేది స్పష్టంగా కోటు కంటే భిన్నమైన వస్తువు. విలువగా అది అచ్చం కోటులాంటిదే, కనుక ఇప్పుడు కోటు రూపంలో దర్శనమిస్తోంది. ఆ రకంగా వస్త్రం దాని భౌతిక రూపానికి భిన్నమైన విలువ రూపాన్ని పొందుతోంది. భగవంతుని గొర్రెపిల్ల అనబడే ఏసుక్రీస్తుతో క్రైస్తవునికి గల పోలికను బట్టి అతని గొర్రె స్వభావం వెల్లడైనట్లు వస్త్రం ఒక విలువ అనే వాస్తవం కోటుతో దాని సమత్వం ద్వారా వ్యక్తమవుతుంది.

సరుకుల విలువను విశ్లేషించినప్పుడు మన విశ్లేషణ మనకు చెప్పిన విషయమంతా వస్త్రమే మరో సరుకైన కోటుతో సంబంధం ఏర్పడగానే స్వయంగా చెప్పింది. అయితే అది తన ఆలోచనలని తనకి తెలిసిన ఏకైక భాషలో, సరుకుల భాషలో మాత్రమే వెల్లడిస్తుంది. తన సొంత విలువని మానవ శ్రమ అనే అనిర్దిష్ట స్వభావం కల్గిన శ్రమే సృష్టించింది అని చెప్పడానికి, వస్త్రంతో కోటు సమానం కనుక, అందువల్ల కోటు ఒక విలువ కనుక, దానిలో కూడా వస్త్రంలో ఉన్నట్టి శ్రమే ఉంది అని చెప్తుంది. విలువగా దాని ఉదాత్త వాస్తవికతా, గంజితో బిర్రబిగిసిన దాని శరీరమూ ఒకటి కాదు

అని చెప్పడానికి విలువకి కోటు రూపం ఉందనీ, ఆ కారణంగా వస్త్రం విలువగా ఉన్న మేరకు తానూ (వస్త్రమూ) కోటూ రెండు బఠాణీ గింజలలాగ భేదంలేని వస్తువులమనీ చెబుతుంది. మనం ఇక్కడ ఒక అంశాన్ని పేర్కొనవచ్చు. సరుకుల భాషకి హిబ్రూతో పాటు దాదాపుగా నిర్దుష్టమైన అనేక ఇతర భాషలు వున్నాయి. 'చ' అనే సరుకుతో 'క' అనే సరుకు సమం అనడంలో 'క' అనే సరుకు తన సొంత విలువని వ్యక్తం చేసుకునే పద్ధతి ఉంది. ఈ విషయాన్ని జర్మన్ భాషకి చెందిన "Wertsein" (విలువ కలిగి ఉండటం) అనే పదం కంటే "Valere", "Valer", "Valoir" అనే ఫ్రెంచి పదాలు మరింత స్పష్టంగా వ్యక్తం చేస్తాయి. పారిస్ నిజంగా పూజార్హం.

కనుక మన సమీకరణంలో వ్యక్తమయిన విలువ సంబంధం ద్వారా 'చ' అనే సరుకు యొక్క శారీరక రూపం 'క' అనే సరుకు యొక్క విలువ రూపం అవుతుంది, లేదా 'చ' అనే సరుకు శరీరం 'క' అనే సరుకు విలువకి అద్దంగా వ్యవహరిస్తుంది.[1] మూర్తీభవించిన విలువగా, మానవ శ్రమతో తయారైన పదార్థంగా 'క' అనే సరుకు 'చ' అనే సరుకుతో సంబంధాన్ని ఏర్పరచుకొని తన సొంత విలువని వ్యక్తం చేయడానికి అనువైన పదార్థంగా 'చ' అనే ఉపయోగపు విలువని మారుస్తుంది. 'చ' యొక్క ఉపయోగపు విలువలో ఆ రకంగా వ్యక్తమైన 'క' విలువ సాపేక్ష విలువ రూపం తీసుకుంది.

## ఆ. సాపేక్ష విలువ పరిమాణాత్మక నిర్ధారణ

విలువను వ్యక్తం చేయవలసిన ప్రతి సరుకూ నిర్ణీత పరిమాణం కలిగిన ఉపయోగకర వస్తువు; 15 బస్తాల ధాన్యం లేదా 100 పౌన్ల కాఫీలాగా. ఒక నిర్ణీత పరిమాణం గల ఏ సరుకులోనయినా ఒక నిర్దిష్ట పరిమాణం గల మానవ శ్రమ ఉంటుంది. కనుక విలువ రూపం మామూలుగా విలువని మాత్రమే గాక, నిర్దిష్ట పరిమాణం గల విలువను వ్యక్తం చేయాలి. కనుక సరుకు 'చ'తో సరుకు 'క' కున్న విలువ సంబంధంలో, కోటుతో వస్త్రానికున్న విలువ సంబంధంతో, సాధారణ విలువగా కోటు వస్త్రంతో గుణాత్మకంగా సమానం చేయబడడమే కాక, నిర్దిష్ట పరిమాణం గల కోటు (1 కోటు) నిర్దిష్ట పరిమాణం గల (20 గజాల) వస్త్రానికి సమవిలువగా చేయబడింది.

20 గజాల వస్త్రం = 1 కోటు లేదా 20 గజాల వస్త్రం విలువ ఒక కోటు అనే సమీకరణం ఒకే పరిమాణం గల విలువ అనే పదార్థం (ఘనీభవించిన శ్రమ) రెండు సరుకుల్లోనూ ఉందని తెలియజేస్తుంది. రెండు సరుకుల తయారీలోనూ ఒకే పరిమాణం గల శ్రమ కాలం, లేదా ఒకే మొత్తం శ్రమ అవసరమైందని తెలియజేస్తుంది. అయితే నేతపని లేదా కుట్టుపని ఉత్పాదకతలో వచ్చే ప్రతి మార్పు వల్ల, 20 గజాల వస్త్రం లేదా 1 కోటు తయారీకి అవసరమైన శ్రమ కాలం కూడా మారుతుంది. విలువ అనేదాని సాపేక్ష వ్యక్తీకరణ యొక్క పరిమాణాత్మక అంశం మీద అటువంటి మార్పుల ప్రభావాన్ని ఇప్పుడు మనం పరిశీలించాలి.

---

1. ఒక రకంగా ఈ విషయంలో సరుకులకి వర్తించేది మనుషులకీ వర్తిస్తుంది. ఈ ప్రపంచంలోకి మనిషి అద్దంతో రాడు. ''నేను అనగా నేను'' అనే దానితో సంతృప్తిపడే ఫిక్టియన్ తత్వవేత్తగా కూడా రాడు. మనిషి మొట్టమొదట తనని తాను ఇతరులలో చూసి గుర్తిస్తాడు. పీటర్ తన మనుష్యత్వాన్ని నిర్ధారించుకునేది తనలాంటి పాల్‌తో పోల్చుకున్నప్పుడే. ఆ రకంగా పాల్ తన పాలీయ వ్యక్తిత్వంతో పీటర్‌కి మనుష్య జాతి ప్రతినిధిగా కనిపిస్తాడు.

I. కోటు విలువ స్థిరంగా ఉండి, వస్త్రం విలువ[1] మారింది అనుకుందాం. పత్తి పండే నేల సారం తగ్గిపోవడం వల్ల వస్త్రం ఉత్పత్తి చేయడానికి అవసరమైన శ్రమ కాలం రెట్టింపయితే, వస్త్రం విలువ కూడా రెట్టింపవుతుంది. 20 గజాల వస్త్రం = 1 కోటు అనే సమీకరణం స్థానంలో 20 గజాల వస్త్రం = 2 కోట్లు అనే సమీకరణం వస్తుంది. ఎందుకంటే ఇప్పుడు 20 గజాల వస్త్రంలో ఉన్న శ్రమ కాలంలో సగం మాత్రమే ఒక కోటులో ఉంటుంది. అలా కాక మగ్గాలలో మెరుగుదల వల్ల వస్త్రానికి అవసరమైన శ్రమ కాలం సగానికి తగ్గిపోయిందనుకొందాం. వస్త్రం విలువ కూడా సగానికి పడిపోతుంది. అప్పుడు 20 గజాల వస్త్రం = 1/2 కోటు. 'చ' సరుకు విలువ స్థిరంగా ఉంటే సరుకు 'క' యొక్క సాపేక్ష విలువ, అంటే సరుకు 'చ'లో వ్యక్తమయ్యే దాని విలువ 'క' విలువతో పాటు పెరగడమూ, తరగడమూ జరుగుతుంది.

II. వస్త్రం విలువ స్థిరంగా ఉండి, కోటు విలువ మారింది అనుకుందాం. ఉన్ని ఉత్పత్తి పడిపోవడం వల్ల కోటు తయారీకి అవసరమైన శ్రమ కాలం రెట్టింపయితే, 20 గజాల వస్త్రం = 1 కోటు అనే సమీకరణం స్థానంలో 20 గజాల వస్త్రం = 1/2 కోటు అనే సమీకరణం చోటుచేసుకుంటుంది. అలాకాక, కోటు విలువ సగానికి సగం పడిపోతే అప్పుడు 20 గజాల వస్త్రం = 2 కోట్లు. కనుక 'క' విలువ స్థిరంగా ఉంటే 'చ'లో వ్యక్తమయే దాని సాపేక్ష విలువ 'చ' విలువకి విలోమంగా పెరగడమూ, తరగడమూ జరుగుతుంది.

I, II లోని భిన్న సందర్భాలను పోల్చి చూస్తే పరస్పర విరుద్ధమైన కారణాల వల్ల సాపేక్ష విలువలో ఒకేలాంటి మార్పు కలగవచ్చని అర్థమవుతుంది. వస్త్రం విలువ రెట్టింపయినా, కోటు విలువ సగానికి సగం పడిపోయినా 20 గజాల వస్త్రం = 1 కోటు అనే సమీకరణం, 20 గజాల వస్త్రం = 2 కోట్లుగా మారిపోతుంది. వస్త్రం విలువ సగానికి సగం పడిపోయినా, కోటు విలువ రెట్టింపు అయినా 20 గజాల వస్త్రం = 1 కోటు అనే సమీకరణం 20 గజాల వస్త్రం = 1/2 కోటుగా మారిపోతుంది.

III. వస్త్రం తయారీకి, కోటు తయారీకి అవసరమైన శ్రమ కాలం పరిమాణాలు ఏకకాలంలో, ఒకే దిశలో, ఒకే నిష్పత్తిలో మారాయనుకుందాం. అప్పుడు వాటి విలువలు ఎంతగా మారినా 20 గజాల వస్త్రం = 1 కోటు అనేదానిలో మార్పుండదు. ఆ రెంటినీ విలువలో మార్పులేని మూడో సరుకుతో పోల్చగానే వాటి విలువల్లో వచ్చిన మార్పు కనిపిస్తుంది. అన్ని సరుకుల విలువలూ ఏకకాలంలో ఒకే నిష్పత్తిలో పెరిగినా, తరిగినా వాటి సాపేక్ష విలువల్లో మార్పుండదు. నిర్ణీత కాలంలో ఉత్పత్తి అయిన సరుకుల పరిమాణం పెరగడంలోనూ, తరగడంలోనూ వాటి విలువల్లో వచ్చిన నిజమైన మార్పు తెలుస్తుంది.

IV. వస్త్రం తయారీకి, కోటు తయారీకి అవసరమైన శ్రమ కాలం, దానితోపాటు వాటి విలువలూ ఒకే దిశలో మారొచ్చు. అయితే అసమాన రేట్లలో మారొచ్చు. లేదా విరుద్ధ దిశల్లో, లేదా ఇతర రకాలుగా మారొచ్చు. అటువంటి వివిధ రకాల మార్పుల ప్రభావం ఒక సరుకు సాపేక్ష విలువపై ఎలా ఉంటుంది అనే దాన్ని I, II, III ఫలితాలని బట్టి గ్రహించవచ్చు.

1. ఇక్కడ విలువ అంటే విలువ పరిమాణం అని అర్థం. వెనకటి పుటల్లో కూడా కొన్ని సందర్భాల్లో అదే అర్థంలో ఉపయోగించడం జరిగింది.

ఆ రకంగా విలువ పరిమాణంలో వచ్చే నిజమైన మార్పులు వాటి సాపేక్ష వ్యక్తీకరణలో అసందిగ్ధంగా గానీ, సంపూర్ణంగా గానీ ప్రతిబింబించవు. అంటే సాపేక్ష విలువ పరిమాణాన్ని వ్యక్తం చేసే సమీకరణంలో ప్రతిబింబించవు. ఒక సరుకు విలువ స్థిరంగా ఉన్నప్పటికీ దాని సాపేక్ష విలువ మారొచ్చు. దాని సాపేక్ష విలువ స్థిరంగా ఉండి విలువ మారొచ్చు. విలువ పరిమాణంలోనూ, దాని సాపేక్ష వ్యక్తీకరణలోనూ ఏకకాలంలో మార్పులు జరిగినప్పటికీ ఆ మార్పుల పరిమాణాలు ఒక దానికొకటి అనుగుణంగా ఉండకపోవచ్చు.[1]

### 3. సమ విలువ రూపంలో విలువ

సరుకు 'క' (వస్త్రం) తనకంటే భిన్నమైన మరో సరుకు (కోటు) ఉపయోగపు విలువ ద్వారా తన విలువని వ్యక్తం చేసేటప్పుడు, అదే సమయంలో కోటుకి అది సమ విలువ అనే నిర్దిష్ట విలువ రూపాన్ని ఆపాదిస్తుంది అనే విషయాన్ని మనం గమనించాం. తన శరీర రూపానికి భిన్నమైన విలువ రూపాన్ని సంతరించుకోకుండా కోటు వస్త్రానికి సమం చేయబడడం ద్వారా విలువ కలిగి ఉండటం అనే తన గుణాన్ని వస్త్రం వ్యక్తం చేస్తుంది. కోటుతో ప్రత్యక్షంగా మారకం చేసుకోగలదు కనుక వస్త్రానికి విలువ ఉంది అనే నిజం వ్యక్తమవుతుంది. కనుక ఒక సరుకు సమ విలువ రూపంలో ఉంది అని మనం అంటున్నప్పుడు దాన్ని ఇతర సరుకులతో ప్రత్యక్షంగా మారకం చేయవచ్చు అని కూడా అంటున్నామన్న మాట.

కోటులాంటి ఒక సరుకు వస్త్రంలాంటి మరో సరుకుకి సమ విలువగా వ్యవహరించినప్పుడు, తత్ఫలితంగా కోటు వస్త్రంతో ప్రత్యక్షంగా మారకం అయ్యే ధర్మాన్ని సంతరించుకున్నప్పుడు, ఏ

1. విలువ పరిమాణానికీ, దాని సాపేక్ష వ్యక్తీకరణకీ మధ్య వున్న అసంగతత్వాన్ని నాటు అర్థశాస్త్రవేత్తలు తమ సాంప్రదాయక చతురతతో ఉపయోగించుకుంటున్నారు. ఉదాహరణకి - " 'క' తయారీకి అవసరమైన శ్రమ తగ్గకపోయినా, 'చ'తో 'క' మార్పిడి జరుగుతున్నప్పుడు 'చ' పెరిగితే 'క' తరుగుతుంది. ఈ విషయం ఆమోదిస్తే మీ సాధారణ విలువ సిద్ధాంతం నేలకూలుతుంది... 'చ'తో సాపేక్షంగా చూస్తే 'క' పెరిగినప్పుడు 'క'తో సాపేక్షంగా 'చ' తరుగుతుంది అనే విషయాన్ని ఆయన (రికార్డో) ఆమోదిస్తే ఒక సరుకులో ఇమిడి వున్న శ్రమే ఎప్పుడూ దాని విలువని నిర్ణయిస్తుందనే తన ఘనమైన ప్రతిపాదనని నిలబెట్టిన పునాదిని తానే తవ్వుతున్నాడన్నమాట. ఎందుకంటే 'క' ఉత్పత్తి వ్యయంలో వచ్చిన మార్పువల్ల తనతో మారకంలో వున్న 'చ'తో సాపేక్షంగా 'క' విలువ మారడమే గాక, 'క'తో సాపేక్షంగా 'చ' విలువ కూడా మారుతుంది. 'చ'ని ఉత్పత్తి చేయడానికి అవసరమైన శ్రమలో మార్పు లేనప్పటికీ ఇది జరుగుతుంది. కనుక ఒక వస్తువులో వున్న శ్రమ పరిమాణమే దాని విలువని నిర్ణయిస్తుందనీ, సిద్ధాంతంతోపాటు ఆ వస్తువు విలువని దాని ఉత్పత్తి వ్యయం నిర్ణయిస్తుందనే సిద్ధాంతం కూడా నేలకూలుతుంది." (జె. బ్రాడ్ హర్స్ట్, లండన్, 1842, పుట 11, 12)

   బ్రాడ్ హర్స్ట్ ఇలా కూడా చెప్పవచ్చు : 10/20, 10/50, 10/100 వగైరా భిన్నాలను పరిశీలించండి. అన్ని భిన్నాల్లోనూ లవం (10) మారలేదు. అయినా దాని పరిమాణ నిష్పత్తి తగ్గిపోతోంది. అంటే హారాలుగా వున్న 20, 50, 100 వగైరాలతో సాపేక్షంగా దాని పరిమాణం క్రమంగా తగ్గింది. కనుక 10 లాంటి ఓ పూర్ణాంకంలో ఒకట్లు ఎన్ని వున్నాయో, ఆ సంఖ్య దాని పరిమాణాన్ని నిర్ణయిస్తుందనే మహత్తర సూత్రం నేలకూలుతుంది. (ఈ అధ్యాయంలో 4వ విభాగంలో నాటు అర్థశాస్త్రవేత్తలంటే ఎవరో రచయిత వివరించాడు. - ఏంగెల్స్)

# CAPITAL:

## A CRITICAL ANALYSIS OF CAPITALIST PRODUCTION

BY KARL MARX

*TRANSLATED FROM THE THIRD GERMAN EDITION, BY SAMUEL MOORE AND EDWARD AVELING*

AND EDITED BY

FREDERICK ENGELS

VOL. I.



LONDON:
SWAN SONNENSCHEIN, LOWREY, & CO.,
PATERNOSTER SQUARE.
1887.

నిష్పత్తిలో ఈ రెండు సరుకుల మారకం జరుగుతుందో మనకు తెలియదు. వస్త్రం విలువకు ఫలానా పరిమాణం ఉందని తెలియజేయబడింది. కనుక ఆ నిష్పత్తి కోటు విలువపై ఆధారపడి ఉంటుంది. కోటు సమ విలువగానూ వస్త్రం సాపేక్ష విలువగానూ వ్యవహరించినా, కోటు సాపేక్ష విలువగానూ, వస్త్రం సమ విలువగానూ వ్యవహరించినా, కోటు విలువ పరిమాణానికి దాని విలువ రూపంతో ప్రమేయం ఉండదు. కోటు ఉత్పత్తికవసరమైన శ్రమ కాలమే దాని విలువను నిర్ణయిస్తుంది. అయితే, విలువ సమీకరణంలో కోటు సమ విలువ స్థానంలో ఉన్నప్పుడు దాని విలువ పరిమాణాత్మక రూపం ధరించదు. దానికి విరుద్ధంగా కోటు అనే సరుకు కేవలం నిర్దిష్ట పరిమాణం గల ఒకానొక వస్తువులా మాత్రమే వ్యవహరిస్తుంది.

ఉదాహరణకు, 40 గజాల వస్త్రం విలువ – ఎంత? 2 కోట్లు. ఇక్కడ కోటు అనే సరుకు సమ విలువ పాత్ర నిర్వహిస్తోంది కనుక, వస్త్రానికి సంబంధించినంత వరకు కోటు అనే ఉపయోగపు విలువ విలువకు సాకార రూపంగా దర్శనమిస్తోంది కనుక, వస్త్రంలో ఉన్న నిర్దిష్ట విలువ పరిమాణాన్ని వ్యక్తం చేయడానికి నిర్దిష్ట సంఖ్య గల కోట్లు సరిపోతాయి. 40 గజాల వస్త్రం విలువ పరిమాణాన్ని రెండు కోట్లు వ్యక్తం చేయొచ్చు. కాని తమ సొంత విలువ పరిమాణాన్ని అవి ఎన్నటికీ తెలియజేయవు. విలువ సమీకరణంలో సమ విలువ అనేది కేవలం ఏదో ఒక వస్తువు యొక్క, ఏదో ఒక ఉపయోగపు విలువ యొక్క, సాదా పరిమాణంగా మాత్రమే కనిపిస్తుందనే వాస్తవాన్ని పైపైన పరిశీలించిన బెయిలీ, ఆయనతో పాటు ఆయనకు ముందూ, తర్వాతా చాలామంది తప్పుదోవ బట్టారు. విలువ వ్యక్తీకరణలో కేవలం పరిమాణాత్మక సంబంధాన్ని మాత్రమే వారు చూడగలిగారు. సత్యం ఏమిటంటే, ఒక సరుకు సమ విలువగా వ్యవహరించినప్పుడు దాని విలువ పరిమాణం వ్యక్తం కాదు.

సమ విలువ రూపాన్ని పరిశీలించినప్పుడు మనకు కన్పించే మొదటి విశిష్టమేమంటే ఉపయోగపు విలువ దాని ప్రతిద్వంది అయిన విలువకి వ్యక్తీకరణ రూపం, దాని దృశ్య రూపం.

సరుకు వస్తురూపం దాని విలువ రూపంగా మారుతుంది. అయితే సరుకు 'చ' 'క' అనే మరో సరుకుతో విలువ సంబంధం కలిగి ఉన్నప్పుడు మాత్రమే, ఈ సంబంధపు పరిమితుల్లో మాత్రమే ఈ మార్పు సాధ్యం అన్న విషయాన్ని గుర్తుంచుకోవాలి. ఏ సరుకూ తనకి తానే సమ విలువగా వ్యవహరించలేదు. తన వస్తురూపాన్ని తన సొంత విలువ వ్యక్తీకరణగా మార్చలేదు. ప్రతి సరుకూ తన సమ విలువగా మరో సరుకుని ఎంచుకోవాల్సిందే. ఆ మరో సరుకు యొక్క భౌతిక రూపాన్ని, దాని ఉపయోగపు విలువని, తన సొంత విలువ రూపంగా అంగీకరించాల్సిందే.

భౌతిక పదార్థాలూ, ఉపయోగ విలువలూ అయిన సరుకుల్ని కొలవడానికి మనం వాడే ఒక సాధనం దానికి ఉదాహరణగా పనికొస్తుంది. పంచదారని తీసుకుందాం. దానికి బరువుంది. అయితే ఈ బరువుని చూడలేం. ముట్టుకోలేం. దానిని తూచడానికి అప్పుడు మనం రకరకాల పరిమాణాలలో, ముందే బరువు నిర్ధారించబడిన ఇనుప ముక్కల్ని తీసుకుందాం. పంచదార అన్నది బరువుని వ్యక్తం చేసే రూపం కాదు. ఇనుము కూడా అంతే. కేవలం ఇనుముగా చూస్తే అది బరువుని వ్యక్తం చేసే రూపం కాదు. అయితే పంచదార బరువు వ్యక్తం కావాలంటే దానిని మనం ఇనుముతో బరువు సంబంధంలో ఉంచుతాం. ఈ సంబంధంలో ఇనుము బరువుని మాత్రమే వ్యక్తం చేస్తుంది. కనుక ఒక నిర్దిష్ట పరిమాణం గల ఇనుము పంచదార బరువుని తూచే సాధనంగా పనికొస్తుంది. పంచదారతో

దానికున్న సంబంధం రీత్యా అది బరువుకి సాకార రూపంగా, ఒక వ్యక్తీకరణ రూపంగా వ్యవహరిస్తుంది. ఈ సంబంధంలో మాత్రమే, అంటే బరువు నిర్ధారించాల్సిన పంచదార కానీ మరే ఇతర వస్తువు కానీ ఇనుముతో సంబంధం ఏర్పరచుకున్నప్పుడు మాత్రమే ఇనుము ఈ పాత్ర నిర్వహిస్తుంది. ఆ రెంటికీ బరువు లేకుంటే వాటి మధ్య ఈ సంబంధం ఏర్పడి ఉండేది కాదు. ఒకటి రెండోదాని బరువుకి వ్యక్తీకరణగా వ్యవహరించగలిగేది కాదు. మనం వాటిని త్రాసులో ఉంచినప్పుడు బరువులుగా ఆ రెండూ ఒకటే అనే అంశాన్ని గ్రహిస్తాం. తగిన మొత్తాలలో తీసుకుంటే ఆ రెంటి బరువూ సమానం. పంచదారతో తనకున్న సంబంధంలో బరువుకి కొలమానంగా ఉన్న ఇనుము అనే పదార్థం బరువుకి మాత్రమే ప్రాతినిధ్యం వహించినట్టుగానే, విలువ వ్యక్తీకరణలో కోటు అనే వస్తువు వస్త్రంతో గల సంబంధంలో కేవలం విలువకి మాత్రమే ప్రాతినిధ్యం వహిస్తుంది.

పోలిక ఇక్కడితో అంతమవుతుంది. పంచదార బరువుని వ్యక్తం చేయడంలో ఇనుము రెండు వస్తువులకీ ఉమ్మడిగా ఉండే సహజ ధర్మానికి, అంటే బరువుకి, ప్రాతినిధ్యం వహిస్తుంది. అయితే వస్త్రం విలువ వ్యక్తీకరణంలో కోటు రెంటికీ ఉమ్మడిగా ఉండే సహజం కాని ధర్మానికి, కేవలం సామాజిక అంశమైన వాటి విలువకీ, ప్రాతినిధ్యం వహిస్తుంది.

ఒక సరుకు యొక్క – ఉదాహరణకు వస్త్రం యొక్క – సాపేక్ష రూపం దాని విలువను వ్యక్తం చేస్తుంది. అయితే ఆ సరుకు రూపానికి, దాని ధర్మాలకూ పూర్తిగా భిన్నమైన రూపంలో, ఉదాహరణకు కోటు రూపంలో, వ్యక్తం చేస్తుంది. దీని వెనుక ఏదో ఒక సామాజిక సంబంధం ఉందనే సంగతిని ఈ వ్యక్తీకరణే సూచిస్తోంది అని మనం గమనించవచ్చు. సమ విలువ విషయంలో ఇది పూర్తి విరుద్ధంగా ఉంటుంది. ఈ రూపంలో స్వయంగా సరుకే (కోటు) యధాతథంగా విలువకు ప్రతిరూపం. ప్రకృతే దానికి విలువ రూపాన్ని ప్రసాదించింది. అయితే వస్త్రానికి సమ విలువ కోటు అని తెలిపే విలువ సంబంధం ఉంటేనే ఇది వర్తిస్తుంది.[1] ఒక వస్తువు ధర్మాలు ఇతర వస్తువులతో దానికున్న సంబంధాల ఫలితం కాదు, కేవలం అటువంటి సంబంధాల్లో అవి వ్యక్తమవుతాయి. అందువల్ల బరువుగా ఉండటం, మనల్ని వెచ్చగా ఉంచటం లాంటి కోటుకున్న సహజ ధర్మాల లాగానే దాని సమ విలువ రూపాన్ని కూడా, ప్రత్యక్షంగా మారకం చేయటానికి వీలైన దాని ధర్మాన్ని కూడా, ప్రకృతే ప్రసాదించినట్టుగా అనిపిస్తుంది. అందుకే, సమ విలువ రూపానికి ఉన్న ఈ నిగూఢ లక్షణం బూర్జువా ఆర్థికవేత్త దృష్టి నుంచి తప్పించుకుంటుంది. ఈ రూపం పూర్తిగా అభివృద్ధిచెంది డబ్బు రూపంలో అతన్ని ఎదుర్కొన్నప్పుడే దాన్ని గమనిస్తాడు. అప్పుడు అతడు వెండి, బంగారాల స్థానంలో వాటికంటే తక్కువ మిరుమిట్లుగొలిపే సరుకులను ఉంచడం ద్వారా, ఎప్పుడో ఒకప్పుడు సమ విలువ పాత్ర నిర్వహించిన సరుకులన్నిటి జాబితాను నిత్య నూతన సంతృప్తితో గానం చేయడం ద్వారా వెండి, బంగారాల నిగూఢ లక్షణాన్ని వివరించి పారేయడానికి ప్రయత్నిస్తాడు. 20 గజాల వస్త్రం = 1 కోటు వంటి అత్యంత సాదా విలువ వ్యక్తీకరణ సమ విలువకి సంబంధించిన చిక్కు ప్రశ్నను

1. సంబంధాల ఈ వ్యక్తీకరణ సాధారణంగా చాలా చిత్రమైన శ్రేణికి చెందుతుంది. వీటిని హేగెల్ ప్రతిజనిత అభివర్గాలు (రిఫ్లెక్స్ - కేటగరీస్) అన్నాడు. ఉదాహరణకి, ఒక మనిషి రాజు ఎలా అవుతాడంటే, ఇతర మనుషులు అతని పాలితుల స్థానంలో వున్నారు గనుకనే. మరోవైపు దానికి ప్రతిగా వారు, అతను రాజు కనుక తామంతా పాలితులమని ఊహించుకుంటారు.

ఇప్పటికే మన ముందు ఉంచిందన్న కించిత్తు అనుమానమైనా అతనికి కలగదు.

సమ విలువగా వ్యవహరించే సరుకు రూపం అనిర్దిష్ట మానవ శ్రమకి వాస్తవ రూపం. అదే సమయంలో అది ఒక ప్రత్యేకంగా ప్రయోజనకరమైన నిర్దిష్ట శ్రమ యొక్క ఉత్పాదితం కూడా. కనుక ఈ నిర్దిష్ట శ్రమ అనిర్దిష్ట మానవ శ్రమని వ్యక్తం చేసే మాధ్యమంగా మారుతుంది. ఒకవైపున కోటు అనిర్దిష్ట మానవ శ్రమకి సాకార రూపమైతే, అలాగే మరోవైపు దానిలో ఇమిడి ఉన్న కుట్టుపని అనిర్దిష్ట శ్రమ వ్యక్తమయ్యే నిర్దిష్ట రూపం మాత్రమే. వస్త్రం యొక్క విలువ వ్యక్తీకరణలో కుట్టుపని ప్రయోజనం దుస్తుల్ని తయారుచేయడంలో లేదు, ఒక వస్తువును తయారుచేయడంలో ఉంది. ఎలాంటి వస్తువునంటే ఆ వస్తువుని వెంటనే విలువ అనీ, కనుక అది శ్రమకు సాకార రూపం అనీ, ఈ శ్రమ అచ్చంగా వస్త్రం విలువలో వ్యక్తమయ్యే శ్రమ కంటే ఏమీ భిన్నం కానిదనీ మనం వెంటనే గుర్తిస్తాము. అలాంటి అద్దంలా వ్యవహరించాలంటే కుట్టుపని శ్రమ సాధారణ మానవ శ్రమ అనే తన అనిర్దిష్ట గుణాన్ని మాత్రమే ప్రతిబింబించాలి.

కుట్టుపనిలోనూ, నేతపనిలోనూ మానవ శ్రమశక్తి ఖర్చవుతుంది. కనుక రెంటికీ మానవ శ్రమగా ఉండే సామాన్య ధర్మం ఉంటుంది. కనుక విలువ ఉత్పత్తి వగైరా కొన్ని సందర్భాల్లో ఈ అంశాన్నే దృష్టిలో ఉంచుకోవాలి. ఇందులో నిగూఢమైనదేమీ లేదు. అయితే విలువ వ్యక్తీకరణలో ఈ విషయం తలక్రిందులవుతుంది. ఉదాహరణకు, నేతపని వస్త్రాల విలువను సృష్టిస్తుంది. అయితే అది నేతపని అయినందువల్ల గాక మానవ శ్రమ అన్న సామాన్య ధర్మం కలిగి ఉన్నందువల్ల మాత్రమే విలువను సృష్టిస్తుందనే వాస్తవాన్ని ఎలా వ్యక్తం చేయాలి? నేతపనితో తయారైన వస్తువుకి సమానమైన విలువను సృష్టించే మరో నిర్దిష్ట శ్రమ యొక్క ప్రత్యేక రూపాన్ని (ఇక్కడ కుట్టుపనిని) నేతపనికి ఎదురుగా నిలిపితే చాలు. కోటు తన భౌతిక రూపంలో విలువకి ప్రత్యక్ష వ్యక్తీకరణ అయినట్టుగానే నిర్దిష్ట శ్రమ రూపమైన కుట్టుపని కూడా సాధారణ మానవ శ్రమకి ప్రత్యక్ష, ఇంద్రియ గోచర, సాకార రూపంగా దర్శనమిస్తుంది.

కనుక సమవిలువ రెండో విశిష్టత ఏమంటే నిర్దిష్ట శ్రమ రూపంలో దానికి విరుద్ధమైన అనిర్దిష్ట మానవ శ్రమ వ్యక్తమవుతుంది.

ఈ నిర్దిష్ట శ్రమ, మన ఉదాహరణలో కుట్టుపని, నిర్గుణమైన మానవ శ్రమగా పరిగణించబడు తుంది కనుక అది ఎలాంటి ఇతర మానవ శ్రమతో పోల్చినా, వస్త్ర రూపం ధరించిన శ్రమతో పోల్చినా, అభిన్నమైనదిగా పరిగణించబడుతుంది. కనుక సరుకుల్ని ఉత్పత్తి చేసే ఇతర శ్రమలాగే అది కూడా ప్రైవేటు వ్యక్తుల శ్రమ మాత్రమే అయినప్పటికీ, అది అదే సమయంలో దాని స్వభావం రీత్యా ప్రత్యక్షంగా సామాజిక శ్రమగా గణించబడుతుంది. ఈ కారణం చేతనే అది ఇతర సరుకులతో ప్రత్యక్షంగా మారకం చేసుకోదగిన ఉత్పాదితాన్ని సృష్టిస్తున్నది. కనుక సమ విలువ రూపం యొక్క మూడో విశిష్టత ఏమంటే, ప్రైవేటు వ్యక్తుల శ్రమ దానికి విరుద్ధమైన రూపాన్ని, ప్రత్యక్షంగా సామాజికమైన రూపాన్ని సంతరించుకుంటుంది.

ఆలోచన, సమాజం, ప్రకృతి తదితర రూపాలనూ, వాటితోపాటు విలువ రూపాన్ని మొట్టమొదటి సారిగా విశ్లేషించిన గొప్ప ఆలోచనాశీలి అరిస్టాటిల్. ఆయన ఏం చెప్పాడో పరిశీలిస్తే సమవిలువ రూపానికి ఉన్న చివరి రెండు విశిష్టతలూ మరింత సుబోధకమవుతాయి.

సరుకుల డబ్బు రూపం విలువ సాదా రూపానికి మరింత అభివృద్ధి చెందిన రూపం మాత్రమే అన్న విషయాన్ని అరిస్టాటిల్ స్పష్టంగా ప్రకటించాడు. విలువ సాదా రూపం అంటే ఒక సరుకు విలువను మరో సరుకు ద్వారా వ్యక్తం చేయడం.

5 మంచాలు - 1 ఇల్లు

5 మంచాలు - ఫలానా మొత్తం డబ్బు

ఈ రెండింటికీ తేడా లేదంటాడాయన.

ఈ వ్యక్తీకరణని సృష్టించిన విలువ సంబంధం ప్రకారం ఇల్లు మంచంతో గుణాత్మకంగా సమానం చేయబడాలి. అటువంటి సమత్వం లేకుండా ఈ రెండు భిన్నమైన వస్తువుల్నీ ఒకే కొలమానంతో కొలవడానికి అనువైన పరిమాణాలుగా పోల్చడం సాధ్యం కాదు అంటాడాయన. "సమానత లేనిదే మారకం జరగదు. ఒకే కొలమానంతో కొలవడానికి వీలు లేకుంటే సమానత్వం లేదు." అయితే ఇక్కడితో ఆయన ఆగిపోతాడు. విలువ రూపం విశ్లేషణని ఇంతటితో ఆపేశాడు. పైగా "వాస్తవంలో అది అసాధ్యం. అటువంటి భిన్న వస్తువుల్ని ఒకే కొలమానంతో కొలవడం సాధ్యం కాదు, అని కూడా ఆయన అంటాడు. అంటే అవి గుణాత్మకంగా సమానం కాజాలవు. అలా సమం చేయడం వాటి వాస్తవ స్వభావానికి భిన్నమైనది. అది కేవలం "ఆచరణాత్మక అవసరాలను గడుపుకోటానికి చేసుకున్న తాత్కాలిక ఏర్పాటు మాత్రమే" అంటాడాయన.

అరిస్టాటిల్ విశ్లేషణ మరింత ముందుకు సాగకుండా అడ్డుపడిందేమిటో ఆయన చెప్పినదాన్ని బట్టే మనకర్థమవుతుంది. విలువ అనే ఎలాంటి భావమూ లేకపోవటమే ఆ అడ్డంకి. మంచాల విలువను ఇంటి ద్వారా వ్యక్తం చేయడానికి వీలు కలిగించే ఆ సమాన అంశమేమిటి, ఆ ఉమ్మడి పదార్థమేమిటి? అటువంటిదేదీ వాస్తవంగా ఉండజాలదు అంటున్నాడు అరిస్టాటిల్. ఎందుకుండ జాలదు? మంచాలతో పోలిస్తే వాటితో సమానమైన ఏదో అంశానికి ఇల్లు ప్రాతినిధ్యం వహిస్తుంది. ఎందుకంటే మంచాలూ, ఇల్లూ అనే రెండిటిలోనూ వాస్తవంగా సమానంగా ఉన్నదాన్ని అది వ్యక్తం చేస్తుంది గదా. ఆ సమానంగా ఉన్నది ఏమిటంటే మానవ శ్రమ.

సరుకులకు విలువను ఆపాదించడమంటే, శ్రమ అంతటినీ సమాన మానవ శ్రమగానూ, సమాన గుణం గల శ్రమగానూ గుర్తించడమే. ఈ అంశాన్ని అరిస్టాటిల్ చూడకుండా అడ్డుపడిన ముఖ్యమైన వాస్తవం ఒకటి ఉంది. గ్రీకు సమాజం బానిసత్వంపై ఆధారపడింది. కనుక మనుషుల, వారి శ్రమ శక్తుల అసమానత్వమే దాని సహజ పునాదిగా ఉంది. సర్వ మానవ సమానత్వం అనే భావం ప్రజాభిప్రాయంలో బలంగా నాటుకోనంతవరకూ విలువ వ్యక్తీకరణ రహస్యం అవగతం కాదు. అంటే అన్ని రకాల శ్రమా సమానమూ, సమాన విలువ గలదీ, ఎందుకంటే అది మానవ శ్రమ కనుక, అనే రహస్యం స్పష్టం కాదు. శ్రమ ఉత్పాదితాల్లో అధిక భాగం సరుకుల రూపం ధరించే సమాజంలో, తత్ఫలితంగా మనిషికీ మనిషికీ మధ్య ఉండే ప్రబలమైన సంబంధం సరుకుల సొంతదార్ల మధ్య ఉండే సంబంధంగా ఉండే సమాజంలో – అలాంటి సమాజంలో మాత్రమే ఈ సర్వమానవ సమానత్వ భావం సాధ్యమవుతుంది. సరుకుల విలువ వ్యక్తీకరణలో సమానతా సంబంధాన్ని కనుగొనడమే అరిస్టాటిల్ అద్భుత ప్రతిభకు తార్కాణం. ఆయన జీవించిన సమాజం యొక్క ప్రత్యేక పరిస్థితులే ఈ సమానత్వానికి వాస్తవంగా మూలమేమిటో ఆయన పసిగట్టకుండా నిరోధించాయి.

## 4. విలువ ప్రాథమిక రూపం స్థూల పరిశీలన

ఒక సరుకుకి మరో భిన్న తరహా సరుకుతో ఉన్న విలువ సంబంధాన్ని వ్యక్తంచేసే సమీకరణంలో లేదా ఆ సరుకుతో దానికి గల మారకం సంబంధంలో ఆ సరుకు విలువ యొక్క ప్రాథమిక రూపం ఉంటుంది. సరుకు 'క'తో సరుకు 'చ' నేరుగా మారకం చేయటానికి అనువైంది అన్న వాస్తవం ద్వారా 'క' విలువ గుణాత్మకంగా వ్యక్తమవుతుంది. ఒక నిర్దిష్ట పరిమాణం గల సరుకు 'చ' ఒక నిర్దిష్ట పరిమాణం గల సరుకు 'క'తో మారకం చేయబడుతుంది; అన్న అంశం ద్వారా 'క' విలువ పరిమాణాత్మకంగా వ్యక్తమవుతుంది. మరో రకంగా చెప్పాలంటే, మారకం విలువ రూపం ధరించడం ద్వారా ఒక సరుకు విలువ, స్వతంత్ర, నిర్దిష్ట వ్యక్తీకరణను పొందుతుంది. ప్రతి సరుకూ ఒక ఉపయోగపు విలువ, మారకం విలువ కూడా అని ఈ అధ్యాయం మొదట్లో మామూలుగా వాడుక పద్ధతిలో ప్రస్తావించడం జరిగింది. ఖచ్చితంగా చెప్పాలంటే, అది తప్పు. ఒక సరుకు ఒక ఉపయోగపు విలువ (లేదా ఉపయోగకర వస్తువు), అలాగే ఒక విలువ కూడా. దాని విలువ స్వతంత్ర రూపం, అనగా మారకం విలువ రూపం, ధరించిన వెంటనే సరుకు ఆ ద్విముఖ వస్తువుగా దర్శనమిస్తుంది. ఒంటరిగా ఉన్నప్పుడు ఎప్పుడూ అది ఈ (మారకం విలువ) రూపాన్ని సంతరించుకోదు. వేరే రకమైన మరో సరుకుతో విలువ సంబంధంలోనో, మారకం సంబంధంలోనో ఉంచినప్పుడు మాత్రమే ఈ రూపం ధరిస్తుంది. ఈ విషయాన్ని ఒకసారి అర్థం చేసుకున్నాక, అదే పాత వాడుక పద్ధతిలో వ్యక్తీకరించినప్పటికీ నష్టం లేదు. అది కేవలం సంక్షిప్త రూపంగా ఉపకరిస్తుంది.

మన విశ్లేషణ బట్టి ఒక విషయం స్పష్టమయింది. సరుకు విలువ రూపం లేదా వ్యక్తీకరణ, విలువ స్వభావం నుంచి పుడుతుంది; అంతేగాని విలువా, దాని పరిమాణమూ మారకం విలువగా అవి వ్యక్తీకరించబడే పద్ధతిలో నుండి పుట్టవు. కానీ అవి అలా పుడతాయని వాణిజ్యవాదులూ, ఆ వాదానికి కొత్త పూజారులైన ఫెరియర్, గనిల్[1] లాంటి వారితోపాటు వాణిజ్యవాదానికి పరమ విరోధులయిన బాస్టియట్ లాంటి స్వేచ్ఛా వ్యాపారపు ఆధునిక ఏజంట్లూ భ్రమపడుతున్నారు. వాణిజ్యవాదులు విలువ వ్యక్తీకరణలో గుణాత్మక అంశానికి అధిక ప్రాధాన్యమిస్తారు; కనుక సరుకుల సమ విలువ రూపానికి, డబ్బులో పరిపూర్ణతను సాధించే రూపానికి ఎక్కువ ప్రాధాన్యమిస్తారు. కాని తమ సరుకుని ఏదో ఒక ధరకి వదిలించుకోవాల్సిన స్వేచ్ఛా వ్యాపారపు ఆధునిక విక్రేతలు విలువ సాపేక్ష రూపానికి చెందిన పరిమాణాత్మక అంశానికి అత్యధిక ప్రాధాన్యమిస్తారు. సరుకుల మారకం సంబంధం ద్వారా విలువ వ్యక్తం అయినప్పుడు తప్ప అంటే రోజువారీ ధరల జాబితాలో తప్ప వీరికి ఎక్కడా విలువగానీ, విలువ పరిమాణంగానీ కనిపించవు. లొంబార్డ్ స్ట్రీట్ గందరగోళపు భావాలను సున్నితమైన పాండిత్యపు వస్త్రాలతో ముస్తాబు చేసే పని చేపట్టిన మాక్లియడ్ మూఢవిశ్వాసులైన వాణిజ్యవాదులకూ, విజ్ఞాన ప్రబుద్ధులైన స్వేచ్ఛా వ్యాపారపు ఏజెంట్లకూ పుట్టిన సంకరజాతి సంతానం.

'క'కి, 'చ'తో ఉన్న విలువ సంబంధాన్ని వ్యక్తం చేసే సమీకరణంలో 'క' విలువ 'చ' ద్వారా వ్యక్తమవుతుంది. దీన్ని పరిశీలించి చూస్తే ఈ సంబంధంలో 'క' భౌతిక రూపం కేవలం ఉపయోగపు

1. ఎఫ్.ఎల్.ఎ. ఫెరియర్ రాసిన "డూ గవర్నమెంట్ కన్సిడియర్ డాన్స్‌నెస్ రాపర్ట్స్ అవేక్‌లే కామర్స్, పారిస్, 1805. చార్లెస్ గనిల్ రాసిన "డెస్ సిస్టమ్స్ డి ఎకనోమీ పొలిటిక్" రెండో ముద్రణ, పారిస్, 1821

విలువగానూ, 'చ' భౌతిక రూపం విలువ రూపం (లేదా అంశం) గానూ వ్యవహరిస్తున్నాయని అర్థమవుతుంది. ప్రతి సరుకులోనూ అంతర్గతంగా ఉపయోగపు విలువకీ, విలువకీ మధ్య ఉన్న వైరుధ్యం రెండు సురుకుల్ని ఒకలాంటి సంబంధంలో ఉంచడం ద్వారా బాహ్యంగా స్పష్టం అవుతుంది. ఈ సంబంధంలో విలువ తెలుసుకోవలసిన సరుకు ఉపయోగపు విలువగానూ, ఆ విలువని వ్యక్తం చేసే సరుకు కేవలం మారకం విలువగానూ వ్యవహరిస్తాయి. కనుక ఒక సరుకు విలువ యొక్క ప్రాథమిక రూపం అంటే ఆ సరుకులో ఉపయోగపు విలువకీ, విలువకీ మధ్య ఉన్న వైరుధ్యాన్ని స్పష్టం చేసే ప్రాథమిక రూపం అన్న మాట.

అన్ని సామాజిక దశల్లోనూ ప్రతి శ్రమ ఉత్పాదితమూ ఒక ఉపయోగ విలువే. అయితే సామాజిక అభివృద్ధిలో ఒక నిర్దిష్ట చారిత్రక యుగంలో మాత్రమే అటువంటి ఉత్పాదితం ఒక సరుకు అవుతుంది. ఏ యుగంలో అలా జరుగుతుందంటే, ఒక ఉపయోగకర వస్తువుపై ఖర్చు చేసిన శ్రమ ఆ వస్తువు యొక్క వస్తుగత గుణాలలో ఒకటిగా, అంటే దాని విలువగా, వ్యక్తమయ్యే యుగంలో దానిని బట్టి, విలువ ప్రాథమిక రూపమే చారిత్రకంగా ఒక శ్రమ ఉత్పాదితం ఒక సరుకుగా దర్శనమిచ్చే విలువ ఆదిమ రూపం అనీ, విలువ రూపం అభివృద్ధి చెందుతున్న కొద్దీ అదే వేగంతో శ్రమ ఉత్పాదితాలు క్రమంగా సరుకులుగా పరివర్తన చెందుతాయనీ స్పష్టమవుతుంది.

చూడగానే, విలువ ప్రాథమిక రూపంలో ఉన్న లోపం మనం గ్రహిస్తాం. అది పిండదశ మాత్రమే. ధర రూపంగా పక్వం కావడానికి ముందు అది ఎన్నో రూప పరివర్తనలకు గురికావలసి ఉంటుంది.

'క' అనే సరుకు విలువను 'చ' అనే ఏదైనా ఇతర సరుకు ద్వారా తెలిపే వ్యక్తీకరణ 'క' విలువని కేవలం దాని ఉపయోగపు విలువ నుండి వేరుచేసి చూపుతుంది. కనుక అది 'క'ని 'చ' అనే ఒకే ఒక భిన్నమైన సరుకుతో కేవలం మారకం సంబంధంలో ఉంచుతుంది. అయితే అది ఇతర సరుకులన్నిటితోనూ 'క'కి ఉన్న గుణాత్మక సమానతనీ, పరిమాణాత్మక నిష్పత్తినీ వ్యక్తం చేయలేదు. ఒక సరుకు యొక్క ప్రాథమిక సాపేక్ష విలువ రూపానికి అనుగుణంగా మరొక్క సరుకు యొక్క సమ విలువ రూపం మాత్రమే ఉంటుంది. ఆ రకంగా వస్త్రం యొక్క సాపేక్ష విలువ వ్యక్తీకరణలో కోటు సమ విలువ రూపం ధరిస్తుంది. లేదా వస్త్రం అనే ఒక్క సరుకుతో మాత్రమే కోటు మారకం నేరుగా జరుగగలదు.

అయినప్పటికీ, విలువ ప్రాథమిక రూపం ఒక సులభమైన పరివర్తన ద్వారా మరింత సంపూర్ణ రూపానికి మారుతుంది. ప్రాథమిక రూపం ద్వారా 'క' అనే సరుకు విలువ ఒకే ఒక ఇతర సరుకు ద్వారా వ్యక్తమవుతుందన్నది నిజమే. కాని ఆ ఒక్క సరుకు ఏదైనా కావచ్చు – కోటు, ఇనుము, ధాన్యం లేదా మరొకటి. కనుక మనం 'క'ని వేరు వేరు సరుకులతో సంబంధంలో ఉంచితే 'క' అనే ఒక సరుకుకి భిన్నమైన ప్రాథమిక విలువ రూపాలను[1] చూడొచ్చు. అటువంటి వ్యక్తీకరణల సంఖ్యకి పరిమితి లేదు. 'క' కంటే భిన్నమైన వేరు వేరు రకాల సరుకుల సంఖ్యకు పరిమితి ఉంటే తప్ప. కనుక 'క' విలువ యొక్క ఏకైక వ్యక్తీకరణను వ్యక్తీకరణల పరంపరగా మార్చవచ్చు. ఆ విలువకి సంబంధించిన భిన్న ప్రాథమిక వ్యక్తీకరణల జాబితాని ఎంతైనా పొడిగించవచ్చు.

---

1. ఉదాహరణకి, హోమర్ గ్రంథంలో వరసగా అనేక వస్తువుల ద్వారా ఒక వస్తువు విలువ వ్యక్తం చేయబడింది. II. VII. 472-475.

## ఆ. సంపూర్ణ లేదా విలువ విస్తృత రూపం

'ల' పరిమాణం గల సరుకు 'క' = 'గ' పరిమాణం గల సరుకు 'చ' లేదా = 'స' పరిమాణం గల సరుకు 'ట' లేదా = 'డ' పరిమాణం గల సరుకు 'త' లేదా = 'య' పరిమాణం గల సరుకు 'ప' లేదా = నిర్దిష్ట పరిమాణం గల మరో సరుకు.

(20 గజాల వస్త్రం = 1 కోటు లేదా = 10 పౌనుల టీ, లేదా = 40 పౌనుల కాఫీ లేదా = క్వార్టర్ ధాన్యం, లేదా = 2 ఔన్సుల బంగారం లేదా = 1/2 టన్ను ఇనుము లేదా = నిర్దిష్ట పరిమాణం గల మరో వస్తువు)

### 1. సాపేక్ష విలువ విస్తృత రూపం

వస్త్రం అనే ఏకైక సరుకు ఇప్పుడు సరుకుల ప్రపంచంలోని అసంఖ్యాకమైన ఇతర అంశాల ద్వారా వ్యక్తం అయింది. ప్రతి ఇతర సరుకూ ఇప్పుడు వస్త్రం విలువకి అద్దం అవుతుంది.[1] ఆ రకంగా ఈ విలువ మొదటిసారిగా ఘనీభవించిన నిర్గుణ మానవ శ్రమగా తన నిజ స్వరూపాన్ని ప్రదర్శిస్తుంది. దాన్ని సృష్టించే శ్రమ ప్రతి ఇతర తరహా మానవ శ్రమతోనూ సమానమైన శ్రమగా ఇప్పుడు స్పష్టంగా వ్యక్తమవుతుంది. ఆయా శ్రమల రూపం ఏదైనా అయుండవచ్చు – కుట్టు పని కావచ్చు, దున్నటం కావచ్చు, గని పని కావచ్చు. ఆ శ్రమ సాకార రూపం ధరించింది కోటుగానా, ధాన్యంగానా, ఇనుముగానా, బంగారంగానా అన్న దానితో కూడా ప్రమేయం లేదు. దాని విలువ రూపం కారణంగా వస్త్రం ఇప్పుడు కేవలం ఒక సరుకుతో మాత్రమే గాదు మొత్తం సరుకుల ప్రపంచంతోనే సామాజిక సంబంధంలో ఉంటుంది. ఒక సరుకుగా దానికి ఆ ప్రపంచ పౌరసత్వం ఉంది. అదే సమయంలో అనంతమైన విలువ సమీకరణల పరంపర తెలియజేసేది ఏమంటే, ఒక సరుకు యొక్క విలువకి సంబంధించిన మేరకు అది ఏ ప్రత్యేక రూపానికి, లేదా రకానికి చెందిన

---

1. ఈ కారణంగా వస్త్రం విలువ కోటు ద్వారా వ్యక్తం అయినప్పుడు మనం దాని కోటు రూపపు విలువ గురించి మాట్లాడగలం. ధాన్యం ద్వారా వ్యక్తం అయినప్పుడు దాని ధాన్య రూపపు విలువ గురించి మాట్లాడగలం. ఇలాగే ఇతర సరుకుల విషయంలో కూడా. కోటు, ధాన్యం వగైరా ఉప యోగపు విలువల్లో కన్పించేది వస్త్రం విలువ మాత్రమే అన్న సంగతిని అటువంటి వ్యక్తీకరణ ప్రతిదీ తెలియజేస్తుంది. "మారకంలో తన సంబంధాన్ని తెలియజేసే ఏ సరుకు విలువనైనా అది ఏ సరుకుతో పోల్చబడుతోంది అనే అంశాన్ని బట్టి ... ధాన్య రూపపు విలువ, వస్త్ర రూపపు విలువగా పిలవవచ్చు. కనుక వెయ్యి భిన్న తరహాల విలువలున్నాయి. సరుకులెన్ని రకాలున్నాయో విలువలు కూడా అన్ని రకాలు వున్నాయి. అన్నీ సమానంగా వాస్తవం. సమానంగా నామమాత్రం" ("ఎ క్రిటికల్ డిసర్టేషన్ ఆన్ ది నేచర్, మెజర్స్ అండ్ కాజస్ ఆఫ్ వాల్యూ; చీఫ్లీ ఇన్ రిఫరెన్స్ టు ది రైటింగ్స్ ఆఫ్ మిస్టర్ రికార్డో అండ్ హిజ్ ఫాలోయర్స్." "ఎస్సేస్ ఆన్ ది ఫార్మేషన్ ఎట్సెట్రా, ఆఫ్ ఒపీనియన్స్" రాసిన రచయిత ఉల్లేఖన. లండన్, 1825, పే. 39) ఈ అనామక గ్రంథ రచయిత ఎస్. బెయిలీ. ఈ గ్రంథం ఆ రోజుల్లో ఇంగ్లండులో అలజడి రేపింది. ఒకే ఒక విలువకి వున్న వివిధ సాపేక్ష వ్యక్తీకరణలను వేలుపెట్టి చూపించడం ద్వారా విలువ అనే భావాన్ని నిర్ధారించడం అసాధ్యమన్న సంగతిని అతడు రుజువు చేశాననుకొన్నాడు. ఈ అభిప్రాయం ఎంత సంకుచితమైనదైనప్పటికీ, రికార్డో సిద్ధాంతంలో కొన్ని తీవ్రమయిన లోపాలను అతడు ఎత్తిచూపగలిగాడు. రికార్డో అనుయాయులు ఇతనిపై చేసిన సిద్ధాంత దాడుల్ని తీవ్రతనుబట్టి ఈ విషయం స్పష్టమవుతుంది. ఉదాహరణకు వెస్ట్ మినిస్టర్ రివ్యూ చూడండి.

ఉపయోగపు విలువగా దర్శనమిస్తుందన్న విషయం అప్రస్తుతం.

20 గజాల వస్త్రం = 1 కోటు అనే మొదటి రూపంలో నిర్దిష్ట పరిమాణాలలో ఈ రెండు సరుకుల మారకం జరగటం యాదృచ్ఛికం కావచ్చు. దానికి విరుద్ధంగా రెండో రూపంలో దానిని నిర్ణయించే నేపథ్యం వెంటనే మనకు కన్పిస్తుంది. అది యాదృచ్ఛిక రూపం కంటే భిన్నమైనది. కోటు, కాఫీ, ఇనుము లేదా అసంఖ్యాకమైన విభిన్న సరుకులలో దేని ద్వారా వ్యక్తం అయినా వస్త్రం విలువ పరిమాణంలో మార్పుండదు. ఈ సరుకులన్నీ విభిన్న యజమానుల ఆస్తి. ఇద్దరు వ్యక్తిగత సరుకు సొంతదార్ల మధ్య గల యాదృచ్ఛిక సంబంధం అంతర్ధానమవుతుంది. సరుకుల విలువ పరిమాణాన్ని నిర్ణయించేది వాటి మారకం కాదనీ, అందుకు విరుద్ధంగా వాటి విలువ పరిమాణమే సరుకుల మారకం నిష్పత్తులను అదుపు చేస్తుందనీ స్పష్టం అవుతుంది.

## 2. నిర్దిష్ట సమ విలువ రూపం

వస్త్రం విలువ వ్యక్తీకరణలో కోటు, టీ, ధాన్యం, ఇనుము వగైరా ప్రతి సరుకూ సమ విలువగా వ్యవహరిస్తుంది. తత్ఫలితంగా విలువ అనే వస్తువుగా వ్యవహరిస్తుంది. ఈ సరుకులో ప్రతిదాని భౌతిక రూపమూ ఒక నిర్దిష్ట సమ విలువ రూపంగా, అనేక సమ విలువ రూపాలలో ఒకటిగా వ్యవహరిస్తుంది. అదే విధంగా, ఈ విభిన్న సరుకులలో సాకార రూపం ధరించిన అనేక రకాల నిర్దిష్ట ఉపయోగకర శ్రమ కూడా నిర్గుణ మానవ శ్రమకు అన్ని విభిన్న రూపాలలో వ్యక్తీకరణ మాత్రమే.

## 3. సంపూర్ణ లేదా విస్తృత విలువ రూపంలో లోపాలు

మొదటి సంగతి, సాపేక్ష విలువ వ్యక్తీకరణ అసంపూర్ణం. ఎందుకంటే దానికి ప్రాతినిధ్యం వహించే పరంపర అనంతం. కొత్త తరహా సరుకు అస్తిత్వంలోకి వచ్చి తాజా విలువ వ్యక్తీకరణకు అవకాశం ఇచ్చినప్పుడల్లా విలువ సమీకరణలు లింకులుగా ఉన్న ఆ గొలుసు పొడుగు పెరుగుతూనే ఉంటుంది. రెండో సంగతి, అది పరస్పర సంబంధంలేని, స్వతంత్ర విలువ వ్యక్తీకరణల బహువర్ణ చిత్రం. ఆఖరి సంగతి, ప్రతి సరుకు యొక్క సాపేక్ష విలువా ఈ విస్తృత రూపంలో వ్యక్తమయితే ప్రతి సందర్భంలోనూ ఒక భిన్నమైన సాపేక్ష విలువ రూపం తలెత్తి, విలువ వ్యక్తీకరణల ఎడతెగని పరంపరగా ఉంటుంది. విస్తృత సాపేక్ష విలువ రూపంలోని లోపాలు దానికి సంబంధించిన సమ విలువ రూపంలో ప్రతిబింబిస్తాయి. ప్రతి సరుకు యొక్క భౌతిక రూపమూ అసంఖ్యాకమైన ఇతర సమ విలువ రూపాలలో ఒక నిర్దిష్ట సమ విలువ రూపం. కనుక మొత్తం మీద మనకి కన్పించేది దేనికది మిగతా వాటిని తోసివేసే ఈ విడి విడి సమ విలువ రూపాలు మాత్రమే. అదే విధంగా ప్రతి ప్రత్యేక సమ విలువలోనూ సాకార రూపం ధరించిన ప్రత్యేక, నిర్దిష్ట ఉపయోగ శ్రమ కేవలం ఒక ప్రత్యేక తరహా శ్రమలా కన్పిస్తుంది. కనుక అది సామాన్య మానవ శ్రమకి సంపూర్ణ ప్రతినిధిగా కన్పించదు. సామాన్య మానవ శ్రమ దాని అనేక, ప్రత్యేక, నిర్దిష్ట రూపాల మొత్తంలో తగినంత వ్యక్తీకరణ పొందుతుంది. అయితే, అనంతమైన పరంపరలో దాని వ్యక్తీకరణ ఎప్పుడూ అసంపూర్ణమే, ఐక్యత రీత్యా లోపభూయిష్టమే.

విస్తృత సాపేక్ష విలువ రూపం అంటే ప్రాథమిక సాపేక్ష వ్యక్తీకరణల మొత్తం మాత్రమే. లేదా

మొదటి రకానికి చెందిన

20 గజాల వస్త్రం = 1 కోటు

20 గజాల వస్త్రం - 10 పౌనుల టీ

వగైరా సమీకరణాల మొత్తం మాత్రమే.

ఈ సమీకరణాల్లో ప్రతిదానిలోనూ దానికి తలక్రిందులుగా ఉండే మరో సమీకరణం ఇమిడి ఉంది.

1 కోటు = 20 గజాల వస్త్రం

10 పౌనుల టీ = 20 గజాల వస్త్రం వగైరా.

నిజానికి, ఒక వ్యక్తి తన వస్త్రాన్ని అనేక ఇతర సరుకులతో మారకం చేయడం ద్వారా దాని విలువని అనేక ఇతర సరుకుల పరంపరలో వ్యక్తం చేస్తున్నాడు అంటే ఆ ఇతర సరుకుల వివిధ సొంతదారులు కూడా వారి సరుకుల్ని వస్త్రంతో మారకం చేస్తున్నారని అర్థం. ఆ రకంగా వారు తమ వివిధ సరుకుల విలువని వస్త్రం అనే ఒకే ఒక సరుకు ద్వారా వ్యక్తం చేస్తున్నారన్నమాట. అప్పుడు మనం 20 గజాల వస్త్రం = 1 కోటు లేదా = 10 పౌనుల టీ వగైరా పరంపరను తిరగేస్తే, మనకి సాధారణ విలువ రూపం వస్తుంది.

### ఇ. విలువ సాధారణ రూపం

| | |
|---|---|
| 1 కోటు | = 20 గజాల వస్త్రం |
| 10 పౌనుల టీ | |
| 40 పౌనుల కాఫీ | |
| క్వార్టర్ ధాన్యం | |
| 2 ఔన్సుల బంగారం | |
| 1/2 టన్ను ఇనుము | |
| 'య' పరిమాణం గల సరుకు 'క' | |

### 1. మారిన విలువ రూపం యొక్క స్వభావం

సరుకులన్నీ ఇప్పుడు తమ విలువని (1) ప్రాథమిక రూపంలో, అంటే దేనికదే ఒక సరుకు ద్వారా వ్యక్తం చేస్తాయి. (2) ఐక్యంగా, అంటే ఒకే ఒక సరుకు ద్వారా అన్నీ తమ విలువల్ని వ్యక్తం చేస్తున్నాయి. ఈ విలువ రూపం ప్రాథమికం, అన్నిటికీ ఒకే రూపం, కనుక సాధారణం కూడా.

'క', 'చ' రూపాలు సరుకు విలువని దాని ఉపయోగపు విలువకి లేదా దాని భౌతిక రూపానికి భిన్నమైన అంశంలా వ్యక్తం చేస్తాయి.

మొదటి రూపం 'క', 1 కోటు = 20 గజాల వస్త్రం, 10 పౌనుల టీ = 1/2 టన్ను ఇనుము లాంటి సమీకరణాలను సమకూరుస్తుంది. కోటు విలువ వస్త్రంతోనూ, టీ విలువ ఇనుముతోనూ సమం చేయబడింది. కానీ వస్త్రంతోనూ, మళ్ళీ ఇనుముతోనూ సమం చేయబడడమంటే, వస్త్రమూ, ఇనుమూ ఎంత వేరు వేరుగా వున్నాయో అంత వేరు వేరుగా ఉండడం; యాదృచ్ఛికంగా ఎప్పుడో

ఒకసారి జరిగే మార్పిడుల ద్వారా శ్రమ ఉత్పాదితాలు సరుకులుగా మారే తొలిదశలో మాత్రమే ఈ రూపం తలెత్తుతుందనేది స్పష్టం.

రెండో రూపం 'చ', ఒక సరుకు విలువని దాని ఉపయోగపు విలువ నుండి ఇంతకంటే బాగా వేరుచేసి చూపుతుంది. ఎందుకంటే అక్కడ కోటు విలువ కోటు యొక్క భౌతిక రూపం కంటే భిన్నమైనదిగా సాధ్యమైన అన్ని ఆకారాలలోనూ చూపబడింది. కోటు వస్త్రంతో, ఇనుముతో, టీతో క్లుప్తంగా చెప్పాలంటే ప్రతి ఇతర సరుకుతోనూ సమం అని చూపబడింది. దానితో అది సమం చేయబడదు. అయితే అన్నిటికీ ఉమ్మడిగా ఉండే సాధారణ విలువ వ్యక్తీకరణ మాత్రం ఉండదు. ఎందుకంటే, ప్రతి సరుకు యొక్క విలువ సమీకరణంలోనూ మిగిలిన సరుకులన్నీ సమ విలువ రూపంలోనే కన్పిస్తాయి. పశువుల లాంటి ఒక నిర్దిష్ట శ్రమ ఉత్పాదితం అరుదుగా కాక అలవాటుగా వివిధ ఇతర సరుకులతో మార్పిడికి గురవుతున్నప్పుడు మొదటిసారిగా విలువ యొక్క విస్తృత రూపం అస్తిత్వంలోకి వస్తుంది.

మూడోది, చివరిదీ అభివృద్ధి చెందినదీ అయిన రూపం మొత్తం సరుకుల ప్రపంచం విలువలను ఒకే ఒక సరుకు ద్వారా వ్యక్తం చేస్తుంది. ఇక్కడ, ఆ సరుకు వస్త్రం. వస్త్రంతో మిగిలిన సరుకులకున్న సమత్వం ద్వారా అది వాటి విలువలకు ప్రాతినిధ్యం వహిస్తుంది. ఇప్పుడు ప్రతి సరుకు విలువనూ వస్త్రంతో సమం చేయడం ద్వారా ఆ సరుకు విలువ దాని ఉపయోగపు విలువ నుండి మాత్రమే కాక, మిగిలిన ఇతర ఉపయోగపు విలువలన్నింటి నుండి వేరు చేయబడుతోంది. అందువల్లనే అది అన్ని సరుకులకూ ఉమ్మడి అంశంలాగా వ్యక్తం అవుతోంది. ఈ రూపం వల్ల మొట్టమొదటిసారిగా, సరుకులు విలువలుగా ఒక దానితో ఒకటి సంబంధంలోకి వస్తాయి; లేదా మారకం విలువలుగా దర్శనమిస్తాయి.

మొదటి రెండు రూపాలూ ప్రతి సరుకు విలువనీ మరో భిన్న సరుకు ద్వారా వ్యక్తం చేస్తాయి. లేదా అటువంటి అనేక సరుకుల పరంపర ద్వారా వ్యక్తం చేస్తాయి. ఈ రెండు సందర్భాల్లోనూ ప్రతి సరుకుకీ ఉన్న ప్రత్యేక బాధ్యతేమంటే తన విలువకి వ్యక్తీకరణను కొనుగొనడమే. ఆ పని అది ఇతర సరుకుల సాయం లేకుండానే సాధిస్తుంది. దానికి సంబంధించి ఆ ఇతర సరుకులన్నీ క్రియారహితమైన సమ విలువ పాత్ర నిర్వహిస్తాయి. 'ట' అనే సాధారణ విలువ రూపం మొత్తం సరుకుల ప్రపంచం యొక్క సంయుక్త చర్య ద్వారా, తద్వారా మాత్రమే, తలెత్తుతుంది. ఒక సరుకు సాధారణ విలువ రూపాన్ని పొందాలంటే మిగిలిన సరుకులన్నీ ఏకకాలంలో వాటి విలువల్ని దాని సమ విలువ రూపం ద్వారా వ్యక్తం చేసుకోవాలి. ప్రతి కొత్త సరుకూ వాటిని అనుసరించాలి. దీనివల్ల స్పష్టమయ్యే దేమిటంటే, విలువలుగా సరుకుల అస్తిత్వం కేవలం సామాజికం గనుక, ఈ సామాజిక అస్తిత్వాన్ని వాటి సామాజిక సంబంధాల మొత్తం ద్వారా మాత్రమే వ్యక్తం చేయటం సాధ్యం; అందుచేత వాటి విలువ రూపం సామాజికంగా గుర్తించబడిన రూపం అయివుండాలి.

సరుకులన్నీ వస్త్రంతో సమం చేయబడటం వల్ల, ఇప్పుడవి విలువలుగా గుణాత్మకంగా సమానం కావడమే కాక, పోల్చడానికి వీలైన పరిమాణాలు గల విలువలుగా కూడా కనిపిస్తాయి. వాటి విలువల పరిమాణాన్ని ఒకే ఒక పదార్థం ద్వారా, అంటే వస్త్రం ద్వారా వ్యక్తం చేయటం వల్ల వాటి పరిమాణాలని కూడా ఒకదానితో ఒకదాన్ని పోల్చవచ్చు. ఉదాహరణకి 10 పౌనుల టీ = 20 గజాల వస్త్రం, 40

పౌనుల కాఫీ = 20 గజాల వస్త్రం అనుకుందాం. కనుక, 10 పౌనుల టీ = 40 పౌనుల కాఫీ. మరో రకంగా చెప్పాలంటే, ఒక పౌను టీలో ఉన్న విలువ పదార్థంలో, అంటే శ్రమలో, నాలుగో వంతు మాత్రమే ఒక పౌను కాఫీలో ఉంది.

సాపేక్ష విలువ యొక్క సాధారణ రూపం మొత్తం సరుకుల ప్రపంచాన్నంతటినీ ఆవరించి, ఆ సరుకుల నుండి వేరుచేయబడి సమ విలువ పాత్రను నిర్వహించే ఒక సరుకును – ఇక్కడ వస్త్రాన్ని – సార్వత్రిక సమ విలువగా మారుస్తుంది. ఇప్పుడు వస్త్రం యొక్క భౌతిక రూపం అన్ని సరుకుల విలువలూ స్వీకరించిన ఉమ్మడి రూపం. కనుక అది వాటన్నిటితోనూ, వాటిలో ప్రతిదానితోనూ మార్పిడికి సిద్ధంగా ఉంటుంది. వస్త్రం అనే పదార్థం ప్రతి తరహా మానవ శ్రమకీ దృశ్యమాన భౌతిక రూపంగానూ, దాని సామాజిక సంధి దశగానూ మారుతుంది. ఆ కారణంగా వస్త్రం అనే ప్రత్యేక వస్తువుని ఉత్పత్తి చేసే కొంతమంది ప్రైవేటు వ్యక్తుల శ్రమ అయిన నేత పని, సామాజిక స్వభావాన్ని సంతరించుకుంటుంది. ఇతర అన్ని తరహాల శ్రమతోనూ సమానత్వ స్వభావాన్ని పొందుతుంది. సాధారణ విలువ రూపంలో ఉండే అసంఖ్యాక సమీకరణాలు వస్త్రంలో ఇమిడి ఉన్న శ్రమను ప్రతి ఇతర సరుకులోనూ ఉన్న శ్రమతో సమానం చేస్తుంది. ఆ రకంగా అవి నేత పనిని నిర్గుణ మానవ శ్రమ యొక్క సాధారణ రూప వ్యక్తీకరణగా మారుస్తాయి. ఈ రకంగా సరుకుల విలువలలో వాస్తవ రూపం ధరించిన శ్రమ స్పష్టం అయేది దాని ప్రతికూల రూపంలో మాత్రమే కాదు. అంటే నిజమైన పని యొక్క ప్రతి నిర్దిష్ట రూపం నుండి, ప్రతి ఉపయోగకర గుణం నుండి దాన్ని వేరుచేసి రూపరహితంగా వ్యక్తం చేయడం మాత్రమే కాదు. స్పష్టంగా దాని అనుకూల స్వభావాన్ని అదే వ్యక్తం చేసుకుంటుంది. సాధారణ విలువ రూపం అంటే అన్ని తరహాల వాస్తవ శ్రమనీ వాటి ఉమ్మడి స్వభావం అయిన సాధారణ మానవ శ్రమగా, మానవ శ్రమ శక్తి వ్యయంగా కుదించటమే.

శ్రమ ఉత్పాదితాలన్నిటినీ నిర్గుణ మానవ శ్రమకి కేవలం సాకార రూపాలుగా ప్రదర్శించే సాధారణ విలువ రూపం తన రూప నిర్మాణం ద్వారా తాను సరుకుల ప్రపంచానికి సామాజిక సారాంశం అని తెలియజేస్తుంది. శ్రమ అంతా మానవ శ్రమే. సరుకుల ప్రపంచంలో సమస్త శ్రమకూ గల ఈ మానవ స్వభావమే దాని నిర్దిష్ట సామాజిక స్వభావమని ఈ సాధారణ విలువ రూపం స్పష్టం చేస్తుంది.

### 2. విలువ సాపేక్ష, సమ విలువ రూపాల పరస్పరాశ్రయ అభివృద్ధి

సాపేక్ష విలువ రూపం అభివృద్ధి సమ విలువ రూపం అభివృద్ధికి అనుగుణంగా ఉంటుంది. అయితే సమ విలువ అభివృద్ధి అనేది సాపేక్ష విలువ అభివృద్ధి యొక్క వ్యక్తీకరణే, దాని ఫలితమే అన్న విషయాన్ని దృష్టిలో ఉంచుకోవాలి.

ఒక సరుకు ప్రాథమిక లేదా ఒంటరి సాపేక్ష విలువ రూపం మరో సరుకుని ఒంటరి సమ విలువగా మారుస్తుంది. సాపేక్ష విలువ విస్తృత రూపం, అంటే ఇతర అన్ని సరుకుల ద్వారా ఒక సరుకు విలువను తెలిపే వ్యక్తీకరణ ఆ మిగిలిన సరుకులకు వేర్వేరు, ప్రత్యేక సమ విలువల స్వభావాన్ని ప్రసాదిస్తుంది. చివరిగా, ఒక నిర్దిష్ట సరుకు సార్వత్రిక సమ విలువ స్వభావాన్ని ఎలా సంతరించుకుంటుం దంటే, మిగిలిన అన్ని సరుకులూ తమ విలువల్ని ఒకే విధంగా దాని ద్వారా వ్యక్తం చేస్తాయి గనుక.

విలువ రూపానికి రెండు ధ్రువాలు : సాపేక్ష రూపం, సమ విలువ రూపం. విలువ రూప వికాసంతో పాటు వాటి మధ్య వైరుధ్యం కూడా అభివృద్ధి చెందుతుంది.

20 గజాల వస్త్రం = 1 కోటు అనే మొదటి రూపంలో కూడా ఈ వైరుధ్యం ఉంది. అయితే ఇంకా దాని నిర్ధారణ జరుగలేదు. ఈ సమీకరణాన్ని ఇటు నుంచి అటూ, అటు నుంచి ఇటూ చదివితే, వస్త్రమూ, కోటూ భిన్న పాత్రలు నిర్వహిస్తాయి. ఒక సందర్భంలో వస్త్రం సాపేక్ష విలువ కోటులో వ్యక్తమవుతుంది. మరో సందర్భంలో కోటు సాపేక్ష విలువ వస్త్రంలో వ్యక్తమవుతుంది. కనుక విలువ యొక్క ఈ మొదటి రూపంలో ధ్రువాల వైరుధ్యం గ్రహించడం కష్టం.

'చ' అనే రూపం ఏమి తెలియజేస్తుందంటే, ఎప్పుడైనా ఒక సమయంలో ఒక సరుకు మాత్రమే తన సాపేక్ష విలువని పూర్తిగా విస్తృతం చేయగలదనీ, దానికి సంబంధించి అన్ని ఇతర సరుకులూ సమ విలువలు కనుక ఆ మేరకు మాత్రమే అది ఈ విస్తృత రూపాన్ని పొందుతుందనీ తెలియజేస్తుంది. 20 గజాల వస్త్రం = 1 కోటు అనే సమీకరణాన్ని తిరగేసినట్టుగా 'చ' రూపాన్ని తిరగేయలేం. దాన్ని తిరగేస్తే దాని స్వభావం మారిపోతుంది. దాని విస్తృత విలువ రూపం సాధారణ విలువ రూపంగా మారిపోతుంది.

చివరిగా, రూపం 'ట' సరుకుల ప్రపంచానికి ఒక సాధారణ సామాజిక సాపేక్ష విలువ రూపాన్నిస్తుంది. ఎందుకంటే ఇందులో ఒక్క సరుకు తప్ప మిగిలిన ఏ సరుకూ సమ విలువ స్థానంలో ఉండదు. వస్త్రం అనే ఒకే ఒక సరుకుకు మాత్రమే మిగిలిన సరుకులన్నిటితోనూ నేరుగా మారకం చేసుకునే స్వభావం ఉంటుంది. ఎందుకంటే ఈ స్వభావం మిగిలిన సరుకులన్నింటికీ నిరాకరించబడింది గనుక.[1] మరోవైపున, సార్వత్రిక సమ విలువగా వ్యవహరిస్తున్న సరుకు సాపేక్ష విలువ రూపం నుండి మినహాయించబడింది. వస్త్రమయినా, సార్వత్రిక సమ విలువగా వ్యవహరిస్తున్న మరే సరుకయినా, అదే సమయంలో సాపేక్ష విలువ రూపాన్ని కూడా ధరించడం అంటే అర్థం స్వయంగా దానికదే సమ విలువ కావడమన్న మాట. అప్పుడు మనకి 20 గజాల వస్త్రం = 20 గజాల వస్త్రం అనే సమీకరణం వస్తుంది. ఈ చర్విత చర్వణం విలువనీ వ్యక్తం చేయదు, విలువ పరిమాణాన్నీ వ్యక్తం చేయదు. సార్వత్రిక సమ విలువ సాపేక్ష విలువని వ్యక్తం చేయాలంటే 'ట' అనే విలువ రూపాన్ని

---

1. నేరుగా, సార్వత్రికంగా మారకం చేయబడే ఈ స్వభావం రెండు ధ్రువాల్లో ఒకదాని స్వభావమనే విషయమూ, నేరుగా మారకంకు గురికాకపోవడమనేది దాని వ్యతిరేక ధ్రువమనే విషయమూ, అయస్కాంతానికి వున్న అనుకూల, ప్రతికూల ధ్రువాలకున్నట్లే ఈ సాపేక్ష సమ విలువ రూపాలకు సన్నిహిత పరస్పర సంబంధం వుందనే విషయమూ ఇంకా తేటతెల్లం కాలేదు. అందువల్ల సరుకులన్నిటికీ ఏకకాలంలో మారకం అర్హత ఉంటుందని ఎవరైనా ఊహించవచ్చు. కేథలిక్కులంతా ఏకకాలంలో పోప్‌లు కాగలరని ఊహించ గలిగినట్లు. సరుకుల ఉత్పత్తి అంటే మానవ స్వేచ్ఛకీ, వ్యక్తి స్వాతంత్ర్యానికీ అత్యున్నత దశ అని భావించే పెటీ బూర్జువా నేరుగా మారకం కాలేకపోవడమనే స్వభావం సరుకులకు వుండడం వల్ల కలిగే అసౌకర్యాలు తొలగిపోవాలని కోరడం సహజం. అల్పజ్ఞుల ఈ ఊహాస్వర్గాన్ని ప్రౌధాన్ తన సోషలిజంలో చిత్రించాడు. ఈ సోషలిజంలో కనీసం మౌలికత అనే సుగుణమైనా లేదన్న సంగతి నేను వేరేచోట (పావర్టీ ఆఫ్ ఫిలాసఫీ - సం.) ప్రస్తావించాను. ప్రౌధాన్ కంటే చాలా ముందే గ్రే, బ్రే లాంటివారు ఇదే విషయాన్ని ఇంతకంటే బాగా చెప్పారు. 'సైన్సు' పేరిట ఈ బాపతు విజ్ఞానం కొన్ని బృందాల్లో ఇప్పుడు కూడా వర్ధిల్లుతోంది. 'సైన్సు పదాన్ని ప్రౌధాన్ బృందం దుర్వినియోగం చేసినంతగా మరెవరూ చెయ్యలేదు. ఎందుకంటే "భావాలు కరువైనప్పుడు ఆ లోపాన్ని పదాలతో పూరిస్తారు." (మార్క్స్ కొద్ది మార్పుతో ఇక్కడ గోథేని ఉల్లేఖించాడు - సం.)

తిరగేయాలి. ఈ సమ విలువకి మిగిలిన సరుకులతోపాటు ఉమ్మడి సాపేక్ష విలువ లేదు. అయితే దాని విలువ ఇతర సరుకుల అనంతమైన పరంపర ద్వారా సాపేక్షంగా వ్యక్తం చేయబడుతుంది.

ఆ రకంగా సాపేక్ష విలువ యొక్క విస్తృత రూపం లేదా రూపం 'చ' ఇప్పుడు సమ విలువగా ఉన్న సరుకుకి సాపేక్ష విలువ యొక్క నిర్దిష్ట రూపంగా దర్శనమిస్తుంది.

### 3. సాధారణ విలువ రూపం నుండి డబ్బు రూపం లోనికి పరివర్తన

సార్వత్రిక సమ విలువ రూపం ఒక సాధారణ విలువ రూపం. కనుక ఏ సరుకయినా ఆ రూపాన్ని స్వీకరించవచ్చు. మరోవైపు ఒక సరుకు సార్వత్రిక సమ విలువ రూపాన్ని (రూపం 'ట'ని) సంతరించుకొని ఉన్నదీ అంటే దానికి కారణం, మిగిలిన సరుకులన్నీ దానిని తమ నుండి వేరుచేసి సమ విలువ స్థానంలో ఉంచటమే. ఇలా వేరు చేయబడడం చివరకు ఒకే ఒక నిర్దిష్ట సరుకుకు పరిమితమైనప్పటి నుంచే, ఆ క్షణం నుంచి మాత్రమే, సరుకుల ప్రపంచపు సాపేక్ష విలువ యొక్క సాధారణ రూపానికి నిజమైన స్థిరత్వమూ, సార్వత్రిక సామాజిక గుర్తింపూ వస్తాయి.

దేని భౌతిక రూపాన్ని ఈ విధంగా సమాజం సమ విలువ రూపంగా గుర్తిస్తుందో ఆ నిర్దిష్ట సరుకు ఇప్పుడు డబ్బు సరుకు అవుతుంది, లేదా డబ్బుగా వ్యవహరిస్తుంది. ఆ రకంగా సరుకుల ప్రపంచంలో సార్వత్రిక సమ విలువ పాత్రని నిర్వహించడం అనేది ఆ సరుకు యొక్క ప్రత్యేక సామాజిక క్రియ అవుతుంది. తత్ఫలితంగా అది దాని సామాజిక గుత్తాధికారం అవుతుంది. రూపం 'చ'లో వస్త్రానికి నిర్దిష్ట సమ విలువలుగా వ్యవహరించిన రూపం 'ట'లో వస్త్రం ద్వారా తమ సాపేక్ష విలువల్ని ఉమ్మడిగా వ్యక్తం చేసిన సరుకుల్లో ఈ అగ్రగణ్య స్థానాన్ని ఒక ప్రత్యేక సరుకు సంపాయించింది. దాని పేరు బంగారం. 'ట' రూపంలో వస్త్రానికి బదులు దాని స్థానంలో బంగారాన్నుంచితే, డబ్బు రూపం తలెత్తుతుంది.

#### ఈ. డబ్బు రూపం

| | |
|---|---|
| 20 గజాల వస్త్రం | |
| 1 కోటు | |
| 10 పౌనుల టీ | |
| 40 పౌనుల కాఫీ | = 2 ఔన్సుల బంగారం |
| క్వార్టర్ ధాన్యం | |
| అరటన్ను ఇనుము | |
| 'య' పరిమాణం గల సరుకు 'క' | |

'క' రూపం నుండి 'చ' రూపానికీ, దాని నుండి 'ట' రూపానికీ జరిగిన మార్పులు మౌలికమైనవి. అయితే 'ట' రూపానికీ, 'త' రూపానికీ మధ్య గల భేదమల్లా ఏమిటంటే, 'త'లో జరిగిన పురోగమనమల్లా ఏమిటంటే, వస్త్రానికి బదులు బంగారం సమ విలువ రూపం వహించింది. 'ట' రూపంలో సార్వత్రిక సమ విలువ వస్త్రం. 'త' రూపంలో అది బంగారం. సామాజిక సంప్రదాయం చిట్టచివరికి బంగారాన్ని వేరుగా, సార్వత్రికంగా మారకం చేయ వీలైన పదార్థంగా, అంటే సార్వత్రిక సమవిలువ రూపంగా గుర్తించింది.

మిగిలిన సరుకులన్నిటికీ ఇప్పుడు బంగారమే డబ్బు ఎందుకంటే ఇంత వరకు అది వాటిలాగే ఒక మామూలు సరుకు. మిగిలిన సరుకులన్నింటి లాగానే దానికి కూడా గతంలో సమ విలువగా వ్యవహరించే శక్తి ఉండేది. ఒంటరి మార్పిడులతో మామూలు సమ విలువగానూ, అలాగే ఇతర సరుకుల ప్రక్కన వాటితో పాటు నిర్దిష్ట సమ విలువగానూ అది వ్యవహరించింది. క్రమ క్రమంగా అది వివిధ పరిమితులలో సార్వత్రిక సమ విలువగా వ్యవహరించ ప్రారంభించింది. సరుకుల ప్రపంచపు విలువ వ్యక్తీకరణలో అది ఈ స్థానంపై గుత్తాధిపత్యం స్థాపించుకోగానే డబ్బు సరుకుగా మారుతుంది. అప్పుడు మాత్రమే – అంత వరకు కాదు – 'త' రూపం 'ట' రూపం నుండి వేరవుతుంది. సాధారణ విలువ రూపం డబ్బు రూపంగా మారుతుంది.

వస్త్రంలాంటి ఒక సరుకు యొక్క సాపేక్ష విలువను డబ్బు పాత్ర నిర్వహిస్తున్న బంగారం లాంటి సరుకు ద్వారా తెలిపే ప్రాథమిక వ్యక్తీకరణ ఆ సరుకు (వస్త్రం) యొక్క ధర రూపం. కనుక వస్త్రం ధర రూపం ఇది :

20 గజాల వస్త్రం = 2 ఔన్సుల బంగారం, 2 ఔన్సుల బంగారాన్ని నాణాలుగా మారిస్తే 2 పౌండ్లతో సమానం అయితే 20 గజాల వస్త్రం = 2 పౌండ్లు.

డబ్బు రూపం అనే భావాన్ని గ్రహించడంలో కష్టం ఎక్కడుందంటే, సార్వత్రిక సమ విలువ రూపాన్ని, వాని నుండి విధిగా ఏర్పడే సాధారణ విలువ రూపమైన 'ట' అనే రూపాన్ని స్పష్టంగా అవగాహన చేసుకోవడంలో ఉంది. విలువ విస్తృత రూపం నుండి అంటే 'చ' రూపం నుండి 'ట' రూపాన్ని పొందవచ్చు. 'చ' రూపంలో సారభూతమైన అంశం 'క' రూపం అని మనకు తెలుసు. అంటే, 20 గజాల వస్త్రం = 1 కోటు, లేదా 'య' పరిమాణం గల సరుకు 'క' = 'ర' పరిమాణం గల సరుకు 'చ'. కనుక సరుకు సాదా రూపం అనేది డబ్బు రూపానికి బీజం.

### విభాగం 4

## సరుకుల పూజ – అందులోని రహస్యం

మొదటి చూపుకి, సరుకు అనేది తృణప్రాయమైన వస్తువనిపిస్తుంది. దాన్ని తేలిగ్గా అర్థం చేసుకోవచ్చునిపిస్తుంది. కాని అధిభౌతిక నిగూఢతలతోనూ, ధర్మసూక్ష్మాలతోనూ నిండిన ఒక వస్తువనే సంగతి దాన్ని విశ్లేషించాకనే తెలుస్తుంది. అది ఉపయోగపు విలువ అయిన మేరకు అందులో నిగూఢత ఏమీ లేదు. తన ధర్మాల ద్వారా అది మానవ అవసరాలను సంతృప్తిపరుస్తుందనే దృష్టి నుంచి చూసినా, లేదా మానవ శ్రమే ఆ ధర్మాలను ఉత్పత్తి చేసింది అనే దృష్టి నుంచి చూసినా దానిలో వింతేమీ కన్పించదు. ప్రకృతి ప్రసాదించిన పదార్థాలను తనకు ఉపయోగపడే రీతిలో మానవుడు తన కృషి ద్వారా వాటి రూపాలను మారుస్తాడు అనే విషయం పట్టపగలులా స్పష్టం. ఉదాహరణకి కొయ్యదుంగ రూపం మార్చి దాన్ని టేబుల్‌గా అతడు మారుస్తాడు. అయినా ఆ టేబుల్ నిత్యపరిచితమైన మామూలు కొయ్యగానే ఉంటుంది. అయితే అది సరుకు రూపంలో ప్రపంచంలోకి అడుగుబెట్టగానే ఏదో ఒక ఇంద్రియాతీత వస్తువుగా మారిపోతుంది. అది నేలమీద కాళ్ళు మోపి నిలబడడమే కాక, ఇతర సరుకులన్నిటితోనూ గల సంబంధం దృష్ట్యా తలక్రిందులుగా నిలబడుతుంది. ఇక, దాని చెక్క బుర్రలో నుండి తలలు మార్చే ఆలోచనలను మించిన వింతైన భావాలను పుట్టిస్తుంది.

కనుక సరుకులకున్న ఈ నిగూఢ స్వభావం వాటి ఉపయోగపు విలువ నుంచి పుట్టలేదు. విలువని నిర్ధారించే అంశాల వల్ల కూడా అది తలెత్తలేదు. మొదటి సంగతేమంటే, ఉపయోగకర శ్రమ, లేదా ఉత్పాదక కార్యకలాపాలు ఎన్ని రకాలుగా ఉన్నప్పటికీ, అవన్నీ మానవ అంగాల క్రియలే అన్నది భౌతిక వాస్తవం. వాటిలో ప్రతి క్రియా దాని రూప స్వభావాలేమైనప్పటికీ మానవ మస్తిష్కం, నరాలు, కండరాలు వగైరాల వ్యయం మాత్రమే. రెండోది, విలువ పరిమాణాన్ని నిర్ధారించేది శ్రమ కాలం లేదా శ్రమ పరిమాణం. దాని పరిమాణానికీ, గుణానికీ మధ్య చాలా స్పష్టమైన తేడా ఉంది. జీవనాధార వస్తువుల ఉత్పత్తికి ఎంత శ్రమ కాలం పడుతోంది అనేది అన్ని సామాజిక దశల్లోనూ మానవ జాతికి ఆసక్తిని రేకెత్తించిన అంశం. అయితే భిన్న అభివృద్ధి దశల్లో ఒకే స్థాయిలో ఈ ఆసక్తి లేదు.[1] చివరి అంశం ఏమంటే మానవులు ఏదో ఒక పద్ధతిలో ఒకరి కోసం మరొకరు పని చేయడం ప్రారంభించగానే వారి శ్రమ సామాజిక రూపం ధరిస్తుంది.

శ్రమ ఉత్పాదితం సరుకుల రూపం ధరించగానే ఈ దుర్గ్రాహ్య స్వభావం ఎక్కడి నుండి వస్తుంది? స్పష్టంగా ఈ రూపం నుండే వస్తుంది. మానవ శ్రమ ఉత్పాదితాలన్నీ ఒకలాగే విలువలు కనుక తద్వారా అన్ని రకాల మానవ శ్రమా సమానమే అన్న విషయం వ్యక్తమవుతుంది. ఎంతకాలంపాటు శ్రమ శక్తి వ్యయం జరిగింది అన్నదే ఆ వ్యయానికి కొలబద్ద. అది శ్రమ ఉత్పాదితాల విలువ పరిమాణ రూపం తీసుకుంటుంది. ఉత్పాదకుల పరస్పర సంబంధాలు, ఏ సంబంధాలలోపల వాళ్ళ శ్రమ యొక్క సామాజిక స్వభావం నిరూపితమవుతుందో ఆ సంబంధాలు, ఉత్పాదితాల మధ్య సామాజిక సంబంధాల రూపం తీసుకొంటుంది.

మనుషుల శ్రమకున్న సామాజిక స్వభావం ఆ శ్రమ ఉత్పాదితాల వస్తుగత లక్షణంలా కనిపిస్తుంది. తమ మొత్తం శ్రమతో ఉత్పాదకులకున్న సంబంధం వారి కంటికి తమ మధ్య ఉన్న సామాజిక సంబంధంలా కాక అది సరుకుల మధ్య సామాజిక సంబంధంలా కనిపిస్తుంది. అందుకే సరుకు ఒక నిగూఢ వస్తువులా కనిపిస్తుంది. అందుచేతనే శ్రమ ఉత్పాదితాలు సరుకులుగా, ఇంద్రియాలకు ఒకేసారి గోచరంగానూ, అగోచరంగానూ ఉండే గుణాలు గల సామాజిక వస్తువులుగా మారుతాయి. ఒక వస్తువు నుండి వచ్చే వెలుగుని మనం మన కంటి నరం కదలికవల్ల ఉత్పన్నమైందనుకోము. కంటి బయట ఉన్న ఒక వస్తువు యొక్క వస్తుగత రూపంగానే దాన్ని మనం గ్రహిస్తాం. అయితే చూడటం అనే క్రియలో ఒక వస్తువు నుండి మరో వస్తువుకి, అంటే బయటి వస్తువు నుండి కంటికి, వెలుగు ప్రసరిస్తోంది. భౌతిక వస్తువుల మధ్య ఉన్న భౌతిక సంబంధం అది. అయితే సరుకుల విషయంలో ఇది వేరు. వస్తువులు సరుకుల రూపంలో ఉంటానికి గాని, శ్రమ ఉత్పాదితాలపై సరుకుల ముద్ర వేసే వాటి విలువ సంబంధానికి గానీ వాటి భౌతిక ధర్మాలతోనూ, వాటి భౌతిక సంబంధాలతోనూ ప్రమేయం లేదు. అక్కడ మానవుల మధ్య ఉండే నిర్దిష్ట సామాజిక సంబంధమే వస్తువుల మధ్య సంబంధంలా వింత రూపంలో వారికి దర్శనమిస్తుంది. దీనికి సరైన సాదృశ్యం

---

1. ప్రాచీన జర్మన్‌లలో భూమిని కొలవడానికి, ఒక రోజులో ఎంత పొలంలోని పంటను కోయవచ్చు అన్నదే ప్రమాణం. దానికి టాగ్ వెర్క్, టాగ్ వన్నె, మన్స్‌మాడ్ వగైరా పేర్లు (జి.ఎల్.వాన్ మారర్ రాసిన "ఎయిన్ లేటంగ్ జర్‌గెషిస్టేడెర్ మార్క్" మ్యూనిక్, 1854, పుల 129)

కావాలంటే మనం పొగమంచు ఆవరించిన మసక మసక మత ప్రపంచానికి వెళ్ళాలి. ఆ ప్రపంచంలో మానవుల కల్పనలే స్వతంత్ర జీవులుగా కనిపించడమే కాక, తమలో తాము సంబంధాలు పెట్టుకుంటూ మానవ జాతితో కూడా సంబంధాలు పెట్టుకుంటున్నట్టు కనిపిస్తాయి. మానవులు తయారుచేసిన వస్తువులు కూడా సరుకుల ప్రపంచంలో అలాగే కనిపిస్తాయి. దీనినే నేను సంకేతారాధన అంటాను. శ్రమ ఉత్పాదితాలు సరుకులుగా ఉత్పత్తి కాగానే ఆరాధ్య సంకేతాలవుతాయి. కనుక సరుకుల ఉత్పత్తికీ ఈ సంకేతారాధనకీ విడదీయరాని సంబంధం ఉంది.

పై విశ్లేషణ స్పష్టం చేసినట్టుగా, సరుకుల సంకేతారాధన అనేది వాటిని ఉత్పత్తి చేసే శ్రమకుండే విశిష్ట సామాజిక స్వభావం నుండీ తలెత్తుతుంది.

ఉపయోగకర వస్తువుల్ని ప్రైవేటు వ్యక్తులు లేదా వ్యక్తుల బృందాలు ఎవరికి వారు స్వతంత్రంగా తయారుచేస్తారు. కనుకనే అవి సరుకులవుతాయి. ఈ ప్రైవేటు వ్యక్తులందరి శ్రమ కలిపితే, మొత్తం సామాజిక శ్రమ అవుతుంది. ఉత్పాదకులు తమ ఉత్పాదితాలను మారకం చేసుకొనేంత వరకూ వారు సామాజిక సంబంధంలోకి ప్రవేశించరు. కనుక ప్రతి ఉత్పాదకుని శ్రమకూ గల నిర్దిష్ట సామాజిక స్వభావం మారకం అనే చర్యలో తప్ప బయటపడదు. మరో రకంగా చెప్పాలంటే, మారకం అనే చర్య ఉత్పాదితాల మధ్య ప్రత్యక్షంగానూ, వాటి ద్వారా ఉత్పాదకుల మధ్య పరోక్షంగానూ ఏర్పరచే సంబంధాల ద్వారా మాత్రమే ఒక వ్యక్తి శ్రమ సామాజిక శ్రమలో భాగంగా నిరూపించుకుంటుంది. కనుక ఉత్పాదకుల కంటికి, ఒక వ్యక్తి శ్రమని మిగిలినవారి శ్రమతో కలిపే సంబంధాలు పనిచేసే వ్యక్తుల మధ్య ఉండే ప్రత్యక్ష సామాజిక సంబంధాల్లా కనిపించవు. వ్యక్తుల మధ్య పాదార్థిక సంబంధాలుగానూ, వస్తువుల మధ్య సామాజిక సంబంధాలుగానూ కనిపిస్తాయి. నిజానికి ఆ సంబంధాలు అలాంటివే. ఉపయోగకర వస్తువులుగా తమకు గల వివిధ రూపాలకు భిన్నంగా శ్రమ ఉత్పాదితాలు మారకంలో మాత్రమే విలువలుగా ఒకేలాంటి సామాజిక అంతస్తును సాధిస్తాయి. ఉపయోగకర వస్తువులు మారకం కోసం తయారవుతూ, ఉత్పత్తికి ముందే విలువలుగా వాటి స్వభావాన్ని పరిగణనలోకి తీసుకోవలసిన విస్తృత స్థాయికి మారకం పెరిగినప్పుడు మాత్రమే ఒక ఉత్పాదితాన్ని ఉపయోగకర వస్తువుగానూ, విలువగానూ వేరుచేసి చూడటం ఆచరణలో ముఖ్యమవుతుంది. ఈ క్షణం నుంచే వ్యష్టి ఉత్పాదకుని శ్రమ సామాజికంగా రెండు రకాల స్వభావాన్ని సంతరించుకుంటుంది. ఒక నిర్దిష్ట ఉపయోగకర శ్రమగా ఒక నిర్దిష్ట సామాజిక అవసరాన్ని అది తీర్చాలి. ఆ రకంగా అందరి సమిష్టి శ్రమలో భాగంగా, స్వయంజనితమైన సామాజిక శ్రమ విభజనలో ఒక శాఖగా అది తన స్థానాన్ని నిలబెట్టుకోవాలి. రెండోవైపున అది వ్యష్టి ఉత్పాదకుని అనేక రకాల అవసరాలను తీర్చగలదు. అన్ని రకాల ఉపయోగకర ప్రైవేటు శ్రమ పరస్పరం మారకం చేసుకోవడమన్నది ఒక రూఢమైన సామాజిక వాస్తవం అయిన మేరకు తద్వారా ప్రతి ఉత్పాదకుని ప్రైవేటు ఉపయోగకర శ్రమ మిగిలిన వారందరి శ్రమతోనూ సమాన స్థాయిలో ఉన్న మేరకు మాత్రమే అది అలా వ్యష్టి ఉత్పాదకుని అవసరాలను తీర్చగలదు. అత్యంత విభిన్న తరహాల శ్రమని సమానం చెయ్యాలంటే వాటి అసమానతల అడుగున ఉన్న మానవ శ్రమ శక్తి లేదా అనిర్దిష్ట మానవ శ్రమ అనే సమాన అంశాలను గ్రహించాలి. ఈ ఉమ్మడి అంశపు స్థాయికి భిన్న తరహాల శ్రమని కుదించాలి. వ్యష్టి ఉత్పాదకుని శ్రమకి ఉన్న

రెండు రకాల సామాజిక స్వభావం అతని బుర్రలో ప్రతిఫలించినప్పుడు, రోజువారీ సరుకుల మార్పిడిలో ఆ శ్రమకు ఏర్పడే రూపాల్లో మాత్రమే అది అతనికి కనిపిస్తుంది. తన సొంత శ్రమకి సామాజిక ఉపయోగకర స్వభావం ఉందనే అంశం, కేవలం ఉపయోగకరం కావడం మాత్రమే కాదు అది ఇతరులకు ఉపయోగకరంగా ఉండాలి అనే రూపంలో అతనికి వ్యక్తమవుతుంది. తన నిర్దిష్ట శ్రమకు ఇతర అన్ని తరహాల నిర్దిష్ట శ్రమతోనూ సమానం అయ్యే సామాజిక స్వభావం ఉందనే సంగతిని, పాదార్థికంగా ఎంతో భిన్నమైన శ్రమ ఉత్పాదితాలన్నీ విలువ అనే ఉమ్మడి స్వభావం కలిగి వున్నాయన్న రూపంలో అర్థం చేసుకుంటాడు.

కనుక మన శ్రమ ఉత్పాదితాలను విలువలుగా పరస్పర సంబంధంలోకి తేవడానికి కారణం, వాటిలో మనం ఏకరూప మానవ శ్రమ ఉందని గ్రహించడం వల్ల కాదు. దానికి సరిగ్గా విరుద్ధంగా, మార్పిడిలో మన విభిన్న ఉత్పాదితాలను విలువలుగా సమం అని చూపినప్పుడల్లా వాటిపైన వ్యయమయిన విభిన్న తరహాల శ్రమని కూడా మానవ శ్రమగా సమం అని చూపుతున్నామన్నమాట. ఈ సంగతి మనకు తెలియదు. అయినా మనం ఆ పని చేస్తాం.[1] కనుక విలువ తనేమిటో తెలియజేసే చీటీని నుదుటి మీద అంటించుకుని తిరగదు. పైగా ప్రతి ఉత్పాదితాన్నీ చిత్రలిపిగా మార్చేది విలువే. తరువాత ఆ సామాజిక చిత్రలిపిని చదవడానికి మనం ప్రయత్నిస్తాము. మన సొంత సామాజిక ఉత్పాదితాల వెనక ఉన్న రహస్యాన్ని ఛేదించడానికి ప్రయత్నిస్తాము. ఒక ఉపయోగకర వస్తువుకి విలువ అనే ముద్ర తగిలించడం అనేది భాష లాగానే సామాజిక ఉత్పాదితం. శ్రమ ఉత్పాదితాలు విలువలుగా ఉన్న మేరకు అవి వాటి తయారీలో ఖర్చయిన మానవ శ్రమకి వ్యక్తీకరణలు మాత్రమే అన్న కొత్త శాస్త్రీయ ఆవిష్కరణ మానవ జాతి అభివృద్ధి చరిత్రలో ఒక నూతన యుగాన్ని సూచిస్తుంది. అయితే శ్రమ సామాజిక స్వభావం మనకు ఉత్పాదితాల వస్తుగత స్వభావంలా కనిపింపజేసే పొగమంచుని ఆ కొత్త ఆవిష్కరణ తొలగించదు. మనం చర్చిస్తున్న నిర్దిష్ట ఉత్పత్తి రూపంలో, అంటే సరుకుల ఉత్పత్తిలో, స్వతంత్రంగా ఖర్చు పెట్టబడిన ప్రైవేటు శ్రమ యొక్క నిర్దిష్ట సామాజిక స్వభావం ప్రతి తరహా శ్రమలోనూ ఉన్న సమాన అంశం నుండి, అంటే అది మానవ శ్రమ కావటం వల్ల తలెత్తుతుంది. కనుక ఆ స్వభావం ఉత్పాదితంలో విలువ రూపం తీసుకుంటుంది. గాలి వివిధ వాయువుల సంయోగం అని రుజువైన తర్వాత కూడా వాతావరణంలో ఏమీ మార్పు లేనట్టే, ఇంతకు ముందు పేర్కొన్న ఆవిష్కరణ ఉన్నప్పటికీ విలువ రూపం అనే ఈ వాస్తవమే ఉత్పాదకుల దృష్టికి సత్యమూ, నిత్యమూ అనిపిస్తుంది.

సరుకులు మారకం చేసుకునేటప్పుడు ఆచరణలో ఉత్పాదకులు ఆలోచించే మొదటి అంశం ఏదంటే, తమ వస్తువుకి బదులుగా అవతలి వస్తువు ఎంత వస్తుంది, ఏ నిష్పత్తిలో ఈ వస్తువుల్ని మారకం చెయ్యవచ్చు, అన్నదే. ఈ నిష్పత్తి అలవాటుగా మారి కొంత స్థిరత్వాన్ని సంతరించుకోగానే అది వస్తువుల స్వభావం నుంచే పుట్టినట్టు కనిపిస్తుంది. బంగారమూ, ఇనుమూ పాదార్థిక, రసాయనిక

1. "విలువ అనేది వ్యక్తుల మధ్య సంబంధం" అని గాలియనీ అన్నాడు. "వస్తువుల మధ్య సంబంధంలా వ్యక్తమయ్యే వ్యక్తుల మధ్య సంబంధం" అని అతను జతచేసి వుండాల్సింది. (గాలియనీ, డెల్లా మోనెటా, పుట 221, V, III కస్టొడి సేకరించిన సంపుటాలు, పార్టీ మోడెర్నా, మిలానో, 1803)

లక్షణాల రీత్యా ఎంతో భిన్నమైనప్పటికీ బరువులుగా చూస్తే ఒక పౌను బంగారం ఒక పౌను ఇనుముతో సమానం. అంతే సహజంగా విలువరీత్యా ఒక టన్ను ఇనుము రెండు ఔన్సుల బంగారంతో సమానంలా కనిపిస్తుంది. శ్రమ ఉత్పాదితాలు విలువ అనే స్వభావాన్ని సంతరించుకున్నాక, విలువ పరిమాణాలుగా వాటి మధ్య జరిగే చర్యా ప్రతిచర్యల ద్వారా ఆ స్వభావానికి స్థిరత్వం వస్తుంది. ఉత్పాదకుల అభీష్టంతోను, ముందుచూపుతోనూ, కార్యాచరణతోనూ ప్రమేయం లేకుండా ఈ పరిమాణాలు నిరంతరం మారుతుంటాయి. ఉత్పాదకుల దృష్టిలో తమ సొంత సామాజిక కార్యాచరణ, వస్తువుల కార్యాచరణ రూపం తీసుకుంటుంది. ఉత్పాదితాలు ఉత్పాదకులచే పాలించబడే బదులు, ఉత్పాదకుల్నే పాలిస్తాయి.

రకరకాల శ్రమ కార్యకలాపాలు దేనికదే స్వతంత్రంగా నిర్వహించబడుతూ, అయినా సామాజిక శ్రమ విభజనలో తమంతకు తామే అభివృద్ధి చెందే శాఖలుగా నిర్వహించబడతాయి. ఈ విభిన్న తరహాల ప్రైవేటు శ్రమ సమాజానికి అవసరమైన రీతిలో నిరంతరం పరిమాణాత్మక నిష్పత్తులుగా పరిగణించబడుతోందన్న శాస్త్రీయ విశ్వాసం ప్రోగుపడిన అనుభవం ద్వారానే తలెత్తుతుంది. అయితే అందుకు, బాగా అభివృద్ధి చెందిన సరుకుల ఉత్పత్తి వ్యవస్థ ఉండాలి. ఎందుచేత? ఎందుకంటే, ఉత్పాదితాల మధ్య ఎల్లప్పుడూ, యాదృచ్ఛికంగా మారిపోయే, మారకం సంబంధాలన్నిటిలోనూ వాటి ఉత్పత్తికి సామాజికంగా అవసరమైన శ్రమ కాలం అనేది అన్నిటినీ శాసించే ప్రకృతి నియమంలాగా పనిచేస్తుంది. మన కళ్ళముందే ఇల్లు కూలిపోయినప్పుడు గురుత్వాకర్షణ నియమం అలా పనిచేస్తుంది.[1] కనుక విలువ పరిమాణాన్ని శ్రమ కాలం నిర్ణయిస్తుందన్నది పైకి కనిపించే సరుకుల సాపేక్ష విలువల ఎగుడు దిగుళ్ళ మాటున దాగిన రహస్యం. ఉత్పాదితాల విలువ పరిమాణాలు యాదృచ్ఛికంగా నిర్ణయింపబడుతున్నట్లు కనిపించడాన్ని పూర్తిగా తొలగించినప్పటికీ ఈ కొత్త ఆవిష్కరణ ఆ నిర్ణయింపబడే తీరుని మార్చలేదు.

సామాజిక జీవిత రూపాల గురించిన మనిషి ఆలోచనలూ, తత్ఫలితంగా ఆ రూపాలకూ సంబంధించిన అతని శాస్త్రీయ విశ్లేషణా వాటి వాస్తవ చారిత్రకాభివృద్ధికి సరిగ్గా వ్యతిరేక దిశలో ఉంటాయి. సంఘటనలు జరిగిన తర్వాత అతను ఆలోచించడం ప్రారంభిస్తాడు. అనగా, చారిత్రక అభివృద్ధి ప్రక్రియ అతని ముందు ఉంచిన ఫలితాలతో అతను ప్రారంభిస్తాడు. ఉత్పాదితాలను సరుకులుగా మార్చే గుణాలు, సరుకుల చలామణి జరగాలంటే విధిగా ముందే ఉండవలసిన ఈ గుణాలు మనిషి వాటిని గ్రహించడానికి ముందే సహజ, స్వయం స్పష్ట సామాజిక జీవిత రూపాలలో స్థిరత్వాన్ని సంపాదించుకొన్నాయి. మనిషి మొదట తెలుసుకోటానికి ప్రయత్నించేది వాటి చారిత్రక స్వభావాన్ని కాదు, కేవలం వాటి అర్థాన్ని మాత్రమే. అతని దృష్టిలో ఈ గుణాలు ఎప్పుడూ మారకుండా శాశ్వతంగా ఉండేవి గనుక, వాటి చారిత్రక స్వభావాన్ని పరిశీలించటానికి అతను ప్రయత్నించడు. ఫలితంగా సరుకుల ధరల గురించిన విశ్లేషణే విలువ పరిమాణ నిర్ధారణకి దారితీసింది. సరుకులన్నిటినీ

1. నిర్ణీత కాలానికొసారి వచ్చే విప్లవాల ద్వారా వ్యక్తమయ్యే నియమం గురించి మనం ఏమనుకోవాలి? అనే దానికి లోబడేవారి అజ్ఞానం మీద ఆధారపడే ప్రకృతి నియమం తప్ప మరొకటి కాదు. (ఫ్రెడరిక్ ఏంగెల్స్: "ఉమ్‌రిస్సే జూ ఎయినర్ క్రిటిక్ డెర్ నేషనల్ ఒకనామీ" అనే వ్యాసం. అర్నాల్డ్ రూజ్. కార్ల్‌మార్క్స్‌ల సంపాదకత్వంలో వెలువడిన పత్రిక "డాయిష్-ఫ్రాంజోషిషే జహ్రుబుచ్యాషర్"లో పారిస్, 1844)

ఉమ్మడిగా డబ్బు రూపంలో వ్యక్తం చేయడమే విలువలుగా వాటి గుణాలను నిర్ధారించింది. అయితే సరుకుల ప్రపంచపు అత్యున్నత దశ అయిన ఈ డబ్బు రూపం ప్రైవేటు శ్రమలోని సామాజిక స్వభావాన్నీ, వ్యష్టి ఉత్పాదకుల మధ్య గల సామాజిక సంబంధాలనూ వెల్లడించడానికి బదులు మరుగుపరుస్తుంది. కోట్లకు లేదా బూట్లకు వస్త్రంతో ఒక సంబంధం ఉండడానికి కారణం వస్త్రం అనిర్దిష్ట మానవ శ్రమకి సార్వత్రిక సాకార రూపం కావడమే అని నేనంటే, ఆ ప్రకటనలోని అసంబద్ధత స్వయం వ్యక్తం. అయినప్పటికీ, కోట్లు, బూట్లు తయారుచేసే వారు వస్త్రాన్ని లేదా వెండినో, బంగారాన్నో సార్వత్రిక సమ విలువగా ఎంచి తమ సరుకులను దానితో పోలిస్తే, తమ సొంత వ్యక్తిగత శ్రమకీ, సామాజిక సమష్టి శ్రమకీ ఉన్న సంబంధాన్ని అదే అసంబద్ధ రూపంలో వ్యక్తం చేస్తున్నారన్న మాట.

బూర్జువా అర్థశాస్త్ర అభివర్గాలు (కేటగరీస్) ఈ రూపాలలోనే ఉంటాయి. చారిత్రకంగా నిర్ణయించ బడిన ఒక నిర్దిష్ట ఉత్పత్తి విధానానికి, అనగా సరుకుల ఉత్పత్తికి చెందిన పరిస్థితులనూ, సంబంధాలనూ సామాజిక గుర్తింపుతో వ్యక్తం చేసే ఆలోచనా రూపాలు యివి. కనుక సరుకుల నిగూఢత్వమూ, శ్రమ ఉత్పాదితాలు సరుకులు కాగానే వాటిని ఆదరించే ఇంద్రజాల మహేంద్రజాలాలూ మనం ఇతర ఉత్పత్తి రూపాలకు రాగానే అంతర్ధానమైపోతాయి.

రాబిన్‌సన్ క్రూసో అనుభవాలు అర్థశాస్త్రవేత్తలకు నచ్చిన విషయం కనుక[1] అతని ద్వీపంలో అతనివైపు ఒకసారి దృష్టి సారిద్దాం. అతని అవసరాలు మితమే అయినప్పటికీ, కొన్ని కోర్కెలను అతను తీర్చుకోవలసి ఉంది. కనుక వివిధ రకాల ఉపయోగకర శ్రమ చేయాల్సి ఉంది. పరికరాలు, ఫర్నిచర్ చేయడం, మేకల్ని మచ్చిక చేయడం, చేపలు పట్టడం, వేటాడటం వగైరా. అతని ప్రార్థనలూ గట్రా అతనికి ఆనందదాయకాలు గనుక, వాటిని అతడు వినోదంగా భావిస్తాడు గనుక మనం వాటిని పట్టించుకోము. అతని పనిలో వైవిధ్యం ఉన్నప్పటికీ, అతని శ్రమ, అది ఏ రూపంలో ఉన్నప్పటికీ, ఒకే ఒక రాబిన్‌సన్ కార్యకలాపం మాత్రమేననీ, తద్వారా దానిలో విభిన్న రకాల మానవ శ్రమ తప్ప ఏమీ లేదనీ అతనికి తెలుసు. అతని విభిన్న రకాల పనికి అనుగుణంగా తన సమయాన్ని సక్రమంగా విభజించేలా అవసరమే అతన్ని ఒత్తిడి చేస్తుంది. అతని సాధారణ కార్యకలాపాల్లో ఒకదానికంటే మరొకటి ఎక్కువ సమయాన్ని ఆక్రమిస్తుందా అన్నది ఆయా సందర్భాలనుబట్టి అనుకున్న లక్ష్యాన్ని సాధించడంలో అధిగమించాల్సి వచ్చిన ఇబ్బందులు ఎక్కువ వున్నాయా, తక్కువున్నాయా అన్నదాన్నిబట్టి ఉంటుంది. ఈ మన మిత్రుడు రాబిన్‌సన్ నిజమైన బ్రిటీషు పుత్రునిలా పగిలిపోయిన ఓడలో నుండి ఒక గడియారం, ఖాతా పుస్తకం, కలం, సిరా తెచ్చుకున్నాక తన సొంత అనుభవం ద్వారా కొన్ని పుస్తకాలను ఉంచుకోటం నేర్చుకున్నాడు. అతని ఖాతా పుస్తకంలో అతనికి సంబంధించిన

1. రికార్డోకి సైతం తన సొంత రాబిన్‌సన్ కథలున్నాయి. "అతను ఆదిమ వేటగాడినీ, చేపలు పట్టేవాడినీ ఏకంగా సరుకుల యజమానులుగా మార్చి చేపల్నీ, జంతువుల్నీ ఈ మార్పిడి విలువల్లో ఇమిడి వున్న శ్రమ కాలం యొక్క నిష్పత్తి ప్రకారం మార్పిడి చేసేలా చేస్తాడు. ఈ సందర్భంలో ఆయన కాల సందర్భం లేకుండా ఈ ఆదిమ మానవులు తమ పరికరాలను పరిగణనలోకి తీసుకోవాల్సిన మేరకు 1817 సంవత్సరంలో లండన్ ఎక్స్ఛేంజ్‌లో ప్రస్తుతం అమల్లో వున్న వార్షిక పట్టికలను ఉపయోగించేలా చేస్తున్నాడు. తనకు పరిచయమున్న బూర్జువా సామాజిక రూపం కాక ఆయనకి తెలిసిన మరో సామాజిక రూపం ఓవెన్ వర్ణించిన రూపం మాత్రమే అనిపిస్తోంది." (కార్ల్‌మార్క్స్, "అర్థశాస్త్ర విమర్శ", పుట 38, 39)

ఉపయోగకర వస్తువుల జాబితా ఉంటుంది. వాటి ఉత్పత్తికి అవసరమైన కార్యకలాపాల జాబితాతోపాటు ఆ వస్తువుల నిర్దిష్ట పరిమాణాలకి సగటున ఎంత శ్రమ కాలం ఖర్చయిందో దానిలో ఉంటుంది. రాబిన్‌సన్‌కి అతని సంపద అయిన, అతను సృష్టించుకున్న వస్తువులకీ మధ్య ఉన్న సంబంధాలన్నీ ఏ మాత్రం కష్టం లేకుండా శ్రీమాన్ సెడ్లీ టేలర్‌కి సైతం అర్థం అయ్యేంత స్పష్టంగా ఉంటాయి. అయినప్పటికీ ఆ సంబంధాల్లోనే విలువని నిర్ణయించడానికి అవసరమైనదంతా ఉంది.

కాంతితో స్నానమాడే రాబిన్‌సన్ దీవి నుండి ఇప్పుడు మనం చీకట్లు ముసిరిన యూరప్ మధ్య యుగాలకు వెళదాం. ఇక్కడ స్వతంత్ర మానవుడికి బదులు ప్రతి ఒక్కరూ అర్థబానిసలూ, ప్రభువులూ, సామంతులూ, సామ్రాట్‌లూ, సామాన్యుడూ, మతాధికారీ, ప్రతి ఒక్కరూ పరాధీనులే అని గమనిస్తాము. వ్యక్తిగత పరాధీనత అనేది ఇక్కడి ఉత్పత్తి యొక్క సామాజిక సంబంధాల లక్షణాన్ని సూచిస్తుంది. ఆ ఉత్పత్తి పునాదిపై నిర్వహించబడిన జీవిత రంగాలన్నిటిలోనూ అది ఈ లక్షణాన్ని సూచించినట్టుగానే. వ్యక్తిగత పరాధీనత అనేది ఆ సమాజానికి పునాదిగా ఉండటం వల్లనే శ్రమకీ, శ్రమ ఉత్పాదితాలకీ వాటి వాస్తవికతకి భిన్నమైన ఓ వింత రూపం సంతరించుకోవాల్సిన అవసరం లేదు. సామాజిక లావాదేవీల్లో అవి వస్తు రూపేణా సేవలు, వస్తు రూపేణా చెల్లింపుల రూపం తీసుకుంటాయి.

సరుకుల ఉత్పత్తిపై ఆధారపడిన సమాజంలోలాగా దాని సామాన్య అనిర్దిష్ట రూపం గాక దాని నిర్దిష్ట సహజ రూపమే ఇక్కడ శ్రమ యొక్క తక్షణ సామాజిక రూపం. సరుకులనుత్పత్తి చేసే శ్రమ లాగానే నిర్బంధ శ్రమ కూడా అంతే క్రమంగా కాలంచేత కొలవబడుతుంది. అయితే భూస్వామి సేవలో తాను వెచ్చించేది నిర్దిష్ట పరిమాణం గల తన వ్యక్తిగత శ్రమశక్తినే అన్న సంగతి అర్థబానిసకు తెలుసు. మతాధికారి ఆశీర్వాదాలకంటే ఆయనకు గల తన వ్యక్తిగత శ్రమశక్తినే అన్న సంగతి అర్థబానిసకు తెలుసు. మతాధికారి ఆశీర్వాదాలకంటే ఆయనకు తాను చెల్లించుకునే ముడుపులు మరింత వాస్తవం అని అతనికి తెలుసు. ఈ సమాజంలో విభిన్న వర్గాల ప్రజలు నిర్వహించే పాత్రల గురించి మనం ఏమి అనుకొన్నప్పటికీ తమ శ్రమైక జీవనంలో వ్యక్తుల మధ్య ఉండే సామాజిక సంబంధాలు అన్ని సందర్భాల్లోను తమ సొంత పరస్పర వ్యక్తిగత సంబంధాలుగానే కనిపిస్తాయి. శ్రమ ఉత్పాదితాల మధ్య సామాజిక సంబంధాలలాగా మారువేషంలో మాత్రం కనిపించవు.

ఉమ్మడి శ్రమకి లేదా సమష్టి శ్రమకి ఉదాహరణ కావాలంటే సకల నాగరిక జాతుల చరిత్ర ముఖద్వారాల దగ్గర దానిపాటికదే అభివృద్ధి చెందిన సమష్టి శ్రమ రూపం వద్దకు పోనక్కరలేదు.[1]

మనకు దగ్గరలోనే ఉదాహరణ దొరుకుతుంది. తనకవసరమైన ధాన్యం, పశువులు, నూలు,

1. సమష్టి ఆస్తి అనేది దాని ఆదిమ రూపంలో కేవలం స్లావ్ జాతుల ప్రత్యేకత, లేదా అది కేవలం రష్యన్ రూపం మాత్రమే అనే హాస్యాస్పదమైన ఊహ ఒకటి ప్రచారంలో వుంది. కాని ఈ ఆదిమ రూపం రోమన్లలోనూ, ట్యుటోన్లలోనూ, కెల్ట్‌ల్లోనూ వుండేదని రుజువు చేయవచ్చు. ఇవాల్టికి కూడా భారతదేశంలో, శిథిలాల రూపంలోనే అయినా, అసంఖ్యాకమైన ఉదాహరణలు దొరుకుతాయి. ఆసియా ఉమ్మడి ఆస్తి రూపాలను, ముఖ్యంగా దాని భారతీయ రూపాలను క్షుణ్ణంగా అధ్యయనం చేస్తే విభిన్న రూపాలలో వుండే ఆదిమ సమష్టి ఆస్తి ఏ విధంగా విభిన్న రకాలుగా విచ్ఛిన్నమైందీ తెలుస్తుంది. అలాగే విభిన్న భారతీయ ఉమ్మడి ఆస్తి రూపాలను పరిశీలించడం ద్వారా రోమన్లలోనూ, ట్యుటోన్లలోనూ గల ప్రైవేటు ఆస్తి యొక్క వివిధ మూల రూపాలను గ్రహించవచ్చు. (కార్ల్‌మార్క్స్, అర్థశాస్త్ర విమర్శ) జర్మన్ పే. 10)

వస్త్రం, బట్టలు వగైరాలన్నిటినీ తయారుచేసుకొనే పితృస్వామిక ఉమ్మడి రైతు కుటుంబాన్ని చూడొచ్చు. ఆ కుటుంబానికి సంబంధించినంత వరకూ, ఈ వస్తువులన్నీ దాని శ్రమ ఉత్పాదితాలే, కానీ ఇవి తమ మధ్య తాము సరుకులు మాత్రం కాదు. దున్నటం, పశువుల పెంపకం, వడకటం, నేయడం, కుట్టడం లాంటి విభిన్న తరహాల శ్రమ వల్ల ఈ వస్తువులన్నీ తయారవుతాయి. ఈ క్రియలన్నీ నేరుగా సామాజిక క్రియలే. ఎందుచేతంటే సరుకుల ఉత్పత్తిపై ఆధారపడే సమాజంలో లాగానే ఈ ఉమ్మడి కుటుంబంలో కూడా దానిపాటికదే అభివృద్ధి చెందిన శ్రమ విభజన ఉంటుంది. కుటుంబంలో పని విభజన, వివిధ కుటుంబ సభ్యుల మధ్య శ్రమ కాలాన్ని క్రమబద్ధం చేయడం లాంటివి వివిధ రుతువుల్లో మారే ప్రకృతి పరిస్థితులను బట్టి మాత్రమే కాక, సభ్యుల వయసుని బట్టీ, స్త్రీ పురుష భేదాన్ని బట్టీ కూడా జరుగుతాయి. ఈ సందర్భంలో ప్రతి వ్యక్తి శ్రమ కాలం సహజంగానే మొత్తం కుటుంబ శ్రమశక్తిలో ఒక నిర్దిష్ట భాగంగా వ్యవహరిస్తుంది. కనుక వ్యక్తిగత శ్రమశక్తి వ్యయాన్ని దాని కాల పరిమితిని బట్టి కొలవడం అనేది సహజంగానే సభ్యుల శ్రమశక్తికి గల సామాజిక స్వభావంలా కనిపిస్తుంది.

మనం కొంతసేపు స్వతంత్ర వ్యక్తుల సమాజాన్నొకదాన్ని ఊహిద్దాం. అక్కడ ఉత్పత్తి సాధనాలు ఉమ్మడిగా ఉన్నాయనుకుందాం. అక్కడ విభిన్న వ్యక్తులందరూ తమ శ్రమశక్తిని సమాజానికి సంబంధించిన ఉమ్మడి శ్రమశక్తి అనే స్పృహతో వినియోగిస్తారనుకుందాం. రాబిన్‌సన్ శ్రమ లక్షణాలన్నీ ఇక్కడ పునరావృతమవుతాయి. తేడా ఒక్కటే – అవి వ్యక్తిగతం కాదు, సామాజికం. అతను ఉత్పత్తి చేసిన ప్రతీదీ కేవలం అతని సొంత వ్యక్తిగత శ్రమ ఫలం, కనుక అది అతనికి మాత్రమే ఉపయోగకర వస్తువు. అయితే ఇక్కడ మనం ఊహిస్తున్న సమాజంలో మొత్తం ఉత్పత్తి సామాజికం. అందులో ఒక భాగం కొత్త ఉత్పత్తి సాధనాలుగా పనికొస్తుంది. కనుక సామాజిక అంశంగానే ఉంటుంది. అయితే మరో భాగాన్ని సభ్యులు జీవితావసర వస్తువులుగా ఉపయోగించుకుంటారు. వారి మధ్య ఈ భాగాన్ని పంచడం అవసరం అవుతుంది. ఈ పంపకం పద్ధతి ఆ సమాజం యొక్క ఉత్పత్తి వ్యవస్థను బట్టీ, ఆ ఉత్పాదకులు చేరుకున్న చారిత్రక అభివృద్ధి స్థాయిని బట్టి ఉంటుంది. జీవితావసర వస్తువుల తయారీలో ఆయా వ్యక్తులు ఖర్చు చేసిన శ్రమ కాలాన్ని బట్టి వారికి వాటిని పంచడం జరుగుతుందని అనుకుందాం. కేవలం ఆధునిక సరుకుల ఉత్పత్తితో ఆ వ్యవస్థను పోల్చడం కోసం అలా అనుకుందాం. ఈ సందర్భంలో శ్రమ కాలం అనేది ద్వంద్వ పాత్రను నిర్వహిస్తుంది. ఒక నిర్దిష్ట సామాజిక పథకం ప్రకారం జరిగే దాని విభజన మొత్తం సమాజానికున్న వివిధ అవసరాలను బట్టీ, చేయాల్సిన విభిన్న తరహాల పనుల్ని బట్టీ ఉంటుంది. మరోవైపున, ఉమ్మడి శ్రమలో ప్రతి వ్యక్తి యొక్క శ్రమ భాగాన్ని కొలవడానికీ, తద్వారా వ్యక్తుల అనుభోగానికి ఉపయోగించే మొత్తం ఉత్పాదితంలో అతని వాటాని నిర్ధారించడానికీ అది తోడ్పడుతుంది. ఈ సందర్భంలో వ్యష్టి ఉత్పాదకుల సామాజిక సంబంధాలు వారి శ్రమని బట్టి చూసినా, శ్రమ ఉత్పాదితాలను బట్టి చూసినా ఉత్పత్తి రీత్యానే కాదు, పంపిణీ రీత్యా కూడా సాదాగా, సులభగ్రాహ్యంగా ఉంటాయి.

మత ప్రపంచం వాస్తవ ప్రపంచానికి ప్రతిబింబం మాత్రమే. సరుకుల ఉత్పత్తిపై ఆధారపడిన సమాజంలో తమ ఉత్పాదితాలను సరుకులుగానూ, విలువలుగానూ పరిగణించే ఉత్పాదకులు ఒకరితో

ఒకరు సామాజిక సంబంధాలను ఏర్పరచుకొంటారు. వారు తమ వ్యక్తిగత శ్రమను ఏక స్వభావపు మానవ శ్రమగా పరిగణించుకుంటారు. అటువంటి సమాజానికి అనిర్దిష్ట మానవుణ్ణి పూజించే క్రైస్తవ మతం, ముఖ్యంగా దాని బూర్జువా పరిణామాలైన ప్రొటెస్టంటు మతం, డీయిజం వగైరాలు చక్కగా అతికే మత రూపాలు. ప్రాచీన ఆసియా ఉత్పత్తి విధానం లాంటి ప్రాచీన ఉత్పత్తి విధానాల్లో ఉత్పాదితాలు సరుకులుగానూ, మనుషులు సరుకుల ఉత్పాదకులుగానూ మారటం అప్రధాన స్థాయిలో మాత్రమే జరుగుతుంది. అయితే ఆదిమ సమాజాలు విచ్ఛిత్తికి దగ్గరవుతున్న కొద్దీ దాని ప్రాధాన్యం పెరుగుతుంది. ప్రాచీన సమాజాల్లో వ్యాపార జాతులనేవి కేవలం ఇంటర్ ముండియా[1]లలో బతికే ఎపిక్యూరస్ పేర్కొన్న దేవుళ్ళలాగానే లేదా పోలెండ్ సమాజపు మారుమూలల్లో బతికే యూదులాగానో అక్కడక్కడా అరుదుగా మాత్రమే ఉండేవి. బూర్జువా సమాజంతో పోలిస్తే ఆ ప్రాచీన ఉత్పత్తి వ్యవస్థలు అత్యంత సరళమైనవి, సులభగ్రాహ్యమైనవి. ఆదిమ గణ సమాజంలో తన సహచరులతో గల బొడ్డుతాడు సంబంధం ఇంకా తెగని మానవుని అపరిణిత వ్యక్తిగత అభివృద్ధి ఆధారంగా అవి ఏర్పడతాయి. లేదా ప్రత్యక్ష దాస్య సంబంధాల పునాది మీద అవి ఏర్పడి ఉంటాయి. శ్రమ ఉత్పాదక శక్తి ఒక హీన దశ దాటి అభివృద్ధి చెందనప్పుడు మాత్రమే, దాని కనుగుణంగా మనిషికీ మనిషికీ మధ్య, మనిషికీ ప్రకృతికీ మధ్య, భౌతిక జీవితంలోని సామాజిక సంబంధాలు సంకుచితంగా ఉన్నప్పుడు మాత్రమే అవి తలెత్తి, మనుగడ సాగిస్తాయి. ఈ సంకుచితత్వం ప్రకృతి ఆరాధనలోనూ, ఆనాటి ప్రజల మతాలలోని అనేక ఇతర అంశాల్లోనూ ప్రతిబింబిస్తుంది. దైనందిన జీవితంలో ప్రకృతితోనూ, తోటి మనుషులతోనూ మానవుని కుండే సంబంధాలు సులభగ్రాహ్యాలుగానూ, తర్కబద్ధంగానూ ఉన్నప్పుడు మాత్రమే వాస్తవ ప్రపంచపు మత ప్రతిబింబాలు చివరికి మాయమవుతాయి.

సామాజిక జీవిత ప్రక్రియకు ఆధారమైన భౌతిక ఉత్పత్తి ప్రక్రియ స్వేచ్ఛగా జమగూడిన మానవుల ఉత్పత్తి అనీ, ఒక నిశ్చిత ప్రణాళిక ప్రకారం వారు దాన్ని క్రమబద్ధం చేస్తున్నారనీ గ్రహించనంత వరకూ అది తన మాయ ముసుగును తొలగించదు. అయితే దీనికి సమాజంలో ఒక భౌతిక పునాది లేదా కొన్ని జీవిత పరిస్థితులు ఉండాలి. అవి సుదీర్ఘమైన బాధాకరమైన అభివృద్ధి ప్రక్రియలో తమంతకు తామే తలెత్తుతాయి.

అసంపూర్ణంగానే అయినప్పటికీ, రాజకీయ అర్థశాస్త్రం విలువని, దాని పరిమాణాన్ని విశ్లేషించింది.[2] ఈ రూపాల వెనుక ఏమి దాగి ఉందో దానిని కనుగొన్నది. అయితే శ్రమకి దాని ఉత్పాదితం విలువ ఎందుకు ప్రతినిధి అయ్యింది. శ్రమ కాలానికి ఆ విలువ పరిమాణం ఎందుకు

1. ఇది ఎపిక్యూరస్ వాడిన మాట. దేవుళ్ళు కేవలం వివిధ లోకాలకు మధ్య వుండే అంతరిక్షం (ఇంటర్ ముండియా)లో మాత్రమే వుంటారని, మానవ జీవితాలపై వారికి ఎటువంటి అదుపు లేదని ఆయన అన్నాడు. (సం.)

2. విలువ పరిమాణానికి సంబంధించి రికార్డో విశ్లేషణ ఇప్పటి వరకూ జరిపిన విశ్లేషణలన్నిటికంటే ఉత్తమం. కాని ఆయన విశ్లేషణలో వున్న అసమగ్రత గురించి పెట్టుబడి 3, 4 పుస్తకాల్లో వివరించబడింది. ఒక ఉత్పాదితం విలువలో కనిపించే శ్రమకీ అదే వస్తువు యొక్క ఉపయోగపు విలువలో కనిపించే శ్రమకీ మధ్య వున్న తేడాని సాంప్రదాయక రాజకీయ అర్థశాస్త్రం ఎక్కడా స్పష్టంగా, పూర్తి స్పృహతో వివరించలేదు. సాధారణ విలువకి సంబంధించి అది దాని బలహీనత. కాని ఆచరణలో అది ఆ తేడాని

ప్రాతినిధ్యం వహిస్తుంది, అన్న ప్రశ్న మాత్రం దానికి ఎప్పుడూ తోచలేదు.[1] తాము ఒక సామాజిక వ్యవస్థకు చెందుతామనీ, ఆ వ్యవస్థలో ఉత్పత్తి ప్రక్రియను మానవుడు అదుపు చేయడం కాక ఉత్పత్తి

---

గమనించిన మాట నిజమే. ఎలాగంటే, సాంప్రదాయక రాజకీయ అర్థశాస్త్రం ఒక సందర్భంలో శ్రమని పరిమాణాత్మక అంశంగా గుర్తిస్తుంది. మరోసారి దాన్ని గుణాత్మక అంశంగా గ్రహిస్తుంది. వివిధ తరహాల శ్రమ మధ్య వున్న భేదం కేవలం పరిమాణాత్మకం మాత్రమే అని పరిగణిస్తున్నప్పుడు తాము వాటి గుణాత్మక ఏకత్వాన్ని లేదా సమానతని గుర్తిస్తున్నామనీ, వివిధ తరహాల శ్రమని అనిర్దిష్ట మానవ శ్రమగా కుదిస్తున్నామనీ వారికి సూచనప్రాయంగానైనా తోచదు. “మన భౌతిక, నైతిక శక్తులే మనకున్న మౌలిక సంపదలు. ఆ శక్తుల వినియోగమే, అంటే ఏదో ఒక తరహా శ్రమ మాత్రమే మనకున్న మౌలిక సంపదలకు మూలం. శ్రమని ఈ రకంగా ఉపయోగించడం వల్లనే సంపదలు అని మనం పిలిచే ఆ వస్తువులన్నీ సృష్టించబడతాయి అన్నది తథ్యం ... శ్రమ సృష్టించిన వస్తువులన్నీ శ్రమకే ప్రాతినిధ్యం వహిస్తాయి. వాటికి ఒక విలువ వుంటే లేదా రెండు విభిన్నమైన విలువలుంటే అవి ఆ వస్తువులను సృష్టించిన శ్రమ విలువ నుండి మాత్రమే ఉత్పన్నమవుతాయనేది కూడా తథ్యం” అన్న డిస్టట్ డి్రేసీతో తాను ఏకీభవిస్తానని రికార్డో ప్రకటించాడు. (రికార్డో “రాజకీయ అర్థశాస్త్ర సూత్రాలు”, ఇంగ్లీషు, మూడో ముద్రణ, లండన్, 1821, పుట 334) డిస్టట్ మాటల్లో లేని పరిపూర్ణమైన అర్థాన్ని రికార్డో వాటికి ఆపాదిస్తున్నాడు. నిజానికి డిస్టట్ చెపుతున్నదేమంటే, ఒకవైపున సంపదకి మారురూపాలైన వస్తువులన్నీ వాటిని సృష్టించిన శ్రమకి ప్రాతినిధ్యం వహిస్తాయనీ, మరోవైపున సంపదకి మారురూపాలైన వస్తువులన్నీ వాటిని సృష్టించిన శ్రమకి ప్రాతినిధ్యం వహిస్తాయనీ, మరోవైపున అది తమ “రెండు భిన్నమైన విలువలను” (ఉపయోగ విలువ, మార్పిడి విలువ) “శ్రమ విలువ” నుండి పొందుతాయనీ. ఆ రకంగా డిస్టట్ కూడా నాటు అర్థశాస్త్రవేత్తలు ఎప్పుడూ చేసే పొరపాటునే చేస్తున్నాడు. మిగిలిన సరుకుల విలువ నిర్ధారించటానికి ముందు వారు ఒక సరుకుకి (ఇక్కడ శ్రమకి) కొంత విలువ ఆపాదిస్తారు. కాని ఉపయోగ విలువలోనూ, మార్పిడి విలువలోనూ శ్రమ (శ్రమ విలువ కాదు) ఉన్నదని డిస్టట్ అన్నట్టుగా రికార్డో అర్థం చేసుకున్నాడు. అయితే ఈ రెండు రకాల సాకార రూపాలు గల శ్రమకున్న రెండు రకాల స్వభావాన్ని రికార్డో సైతం పెద్దగా పట్టించుకోలేదు. “విలువ, సంపదలు వాటి విభిన్న ధర్మాలు” అనే తన అధ్యాయాన్నంతటినీ జె.బి.సే. లాంటి వ్యక్తి రాసిన చిల్లర విషయాల పరిశీలనకే పూర్తిగా అర్పించాడు. ఒకవైపు శ్రమ విలువకు ఆధారం అన్న విషయంలో తనతోనూ, మరోవైపు విలువ భావానికి సంబంధించి జె.బి.సే.తోనూ డిస్టట్ ఏకీభవిస్తున్నందుకు చివరిలో రికార్డో అమితంగా ఆశ్చర్యపోతాడు.

1. సరుకుల్నీ, వాటి విలువనీ విశ్లేషించడం ద్వారా విలువ ఏ రూపంలో మార్పిడి విలువగా మారుతుందో కనుగొనడంలో సాంప్రదాయక అర్థశాస్త్రం ఎప్పుడూ సఫలం కాలేదు. అది దాని ప్రధాన వైఫల్యాలలో ఒకటి. దానికి అత్యుత్తమ ప్రతినిధులైన ఆడమ్ స్మిత్, రికార్డోలు సైతం విలువ రూపానికి ప్రాధాన్యం ఇవ్వలేదు. సరుకుల అంతర్లీన స్వభావానికీ, దానికీ ఏమీ సంబంధం లేదనే వారు భావించారు. దానికి కారణం వారి దృష్టి విలువ పరిమాణపు పరిశీలనల మీద పూర్తిగా కేంద్రీకృతం కావడం మాత్రమే కాదు, దానికి అంతకంటే పెద్ద కారణం వుంది. బూర్జువా ఉత్పత్తిలో విలువ రూపం అనేది శ్రమ ఉత్పాదితం యొక్క అత్యంత అనిర్దిష్ట రూపం మాత్రమే కాదు, అత్యంత సార్వత్రిక రూపం కూడా. అది ఆ ఉత్పత్తి విధానానికి ఫలానా ఉత్పత్తి విధానమనే ముద్ర వేసి తద్వారా దానికి దాని ప్రత్యేక చారిత్రక స్వభావాన్నిస్తుంది. అయితే ఈ ఉత్పత్తి విధానాన్ని అన్ని సామాజిక దశల్లోనూ శాశ్వతంగా ప్రకృతి నిర్దేశించిన విధానంగా మనం పరిగణిస్తే, మనం విలువ రూపానికి గల ప్రత్యేకమైన విశిష్టతను గమనించలేము. తత్ఫలితంగా సరుకు రూపమూ, దాని పరిణత రూపాలైన డబ్బు రూపమూ, పెట్టుబడి రూపమూ వగైరాల విశిష్టతలను కూడా గమనించలేము. విలువ పరిమాణానికి శ్రమ కాలం కొలమానం అని పూర్తిగా అంగీకరించే ఆర్థికవేత్తలే సాధారణ సమ విలువకి పరిపూర్ణ రూపం అయిన డబ్బు విషయంలో అత్యంత వింతైన, పరస్పర విరుద్ధమైన భావాలను వ్యక్తం చేశారు. బ్యాంకింగ్ గురించి వారు చర్చించేప్పుడు ఈ విషయం మరింత స్పష్టమవుతుంది.

ప్రక్రియే మానవుడిపై పెత్తనం చేస్తుందనీ స్పష్టాతిస్పష్టంగా అర్థమయ్యే సూత్రీకరణలు బూర్జువా బుద్ధికి ఉత్పాదక శ్రమ లాగానే ప్రకృతి విధించిన స్వయం విదిత ఆవశ్యకంలా కనిపిస్తాయి. క్రైస్తవానికి పూర్వమున్న మతాలను క్రైస్తవ మతాధికార్లు (చర్చి ఫాదర్లు) ఎలా చూశారో బూర్జువా రూపానికి ముందున్న సామాజిక ఉత్పత్తి రూపాలను బూర్జువా వర్గం అలాగే పరిగణించింది.[1]

మారకం విలువ ఏర్పడటంలో ప్రకృతి నిర్వహించిన పాత్ర అనే అంశంపై అర్థ శాస్త్రజ్ఞుల

---

బ్యాంకింగు విషయంలో డబ్బుకి సంబంధించి మామూలు నిర్వచనాలు చెల్లవు. దీనివల్ల వ్యాపార వాదం మరోసారి తలెత్తింది (గనీల్ తదితరులు). ఈ వాదం విలువలో సామాజిక రూపాన్ని లేదా దాని ప్రేతాత్మని తప్ప మరిదేన్నీ గమనించదు. సాంప్రదాయక రాజకీయ అర్థశాస్త్రం నాటు అర్థశాస్త్రంలా గాక విలియమ్ పెట్టీ నాటి నుంచీ బూర్జువా సమాజంలో వాస్తవ ఉత్పత్తి సంబంధాలను పరిశోధించింది. తద్విరుద్ధంగా నాటు అర్థశాస్త్రం పై పై అంశాలను మాత్రమే పరిశీలిస్తుంది. అది అంతకు ముందున్న అర్థశాస్త్రం సమకూర్చిన విషయాలను పదే పదే నెమరు వేసుకుంటుంది. బూర్జువా రోజువారీ అవసరాలకు అనుగుణంగా, కళ్ళకు కట్టినట్లు కనిపించే విషయాలకు బాగా అతికినట్టు కనిపించే వివరణలు సమకూరుస్తుంది. తమ ప్రపంచమే అత్యంత ఉత్తమ ప్రపంచమని భావించే ఆత్మ సంతృప్త బూర్జువా వర్గపు చౌకబారు భావాలను పండిత సహజమైన ధోరణిలో క్రమబద్ధం చేయడానికీ, శాశ్వత సత్యాలుగా ప్రకటించడానికీ నాటు అర్థశాస్త్రం పరిమితమవుతుంది.

1. "ఈ ఆర్థికవేత్తల తర్కానికి ఓ చిత్రమైన సొంత పద్ధతి వుంది. వారి దృష్టిలో రెండే రకాల సంస్థలున్నాయి: కృత్రిమ సంస్థలు, సహజ సంస్థలు. ఫ్యూడలిజానికి సంబంధించిన సంస్థలు కృత్రిమం. బూర్జువా వ్యవస్థకు సంబంధించిన సంస్థలు సహజం. మతతత్వజ్ఞులు కూడా అంతే. తమ మతం తప్ప మిగిలిన మతాలన్నీ మానవులు సృష్టించుకొన్నవే. తమ మతం మాత్రం దైవసృష్టి అంటారు. ఇంతవరకూ చరిత్ర వున్నమాట నిజమే. కాని ఇక ముందు మాత్రం వుండదు." (తత్వశాస్త్ర దారిద్ర్యం, కార్ల్ మార్క్స్, 1847, ఫ్రెంచి, పుట 113) ప్రాచీన గ్రీకులూ, రోమన్లూ కేవలం కొల్లగొట్టడం మీదే బతికారని ఎమ్. బాస్టియట్ ఊహించడం హాస్యాస్పదం. శతాబ్దాల తరబడి కొల్లగొట్టడాలు జరిగాయి. అంటే అక్కడ కొల్లగొట్టటానికి ఏదో ఒకటి వుండి వుండాలి. అంటే కొల్లగొట్టబోతున్న వస్తువుల పునరుత్పత్తి జరగాలి. కనుక గ్రీకులకూ, రోమన్లకూ సైతం ఏదో ఒక రకమైన ఉత్పత్తి ప్రక్రియా, కనుక ఆర్థిక వ్యవస్థా వుండి వుండాలి. మన ఆధునిక ప్రపంచానికి బూర్జువా ఆర్థిక వ్యవస్థ పునాది అయినట్టే వారి ఆర్థిక వ్యవస్థ వారి ప్రపంచానికి భౌతిక పునాది. బానిసత్వం మీద ఆధారపడిన ఉత్పత్తి వ్యవస్థ, కొల్లగొట్టడంపై ఆధారపడిన వ్యవస్థ అన్నదే బహుశ బాస్టియట్ అభిప్రాయమేమో! అదే నిజమయితే అతడు చాలా ప్రమాదకరమైన భూమిపై అడుగు పెడుతున్నాడు. అయినా బానిస శ్రమ గురించిన అవగాహనలో మహా ఆలోచనాశీలి అరిస్టాటిలే తప్పు చేయగా, కూలి శ్రమని అర్థం చేసుకోవడంలో మరుగుజ్జు ఆర్థికవేత్త బాస్టియట్ ఎలా ఒప్పు అవుతాడు? అమెరికాలోని ఒక జర్మన్ భాషాపత్రిక నా "అర్థశాస్త్ర విమర్శ గ్రంథం 1859" విషయంలో తెలియజేసిన అభ్యంత రానికి నేనిక్కడ క్లుప్తంగా సమాధానం చెబుతాను. ప్రతి ప్రత్యేక ఉత్పత్తి విధానమూ, ఆ నిర్దిష్ట సమాజానికి అనుగుణమైన సామాజిక సంబంధాలూ అనేవాటి పునాదిపైన క్లుప్తంగా చెప్పాలంటే సమాజ ఆర్థిక నిర్మాణం అనే పునాదిపైన న్యాయ, రాజకీయ ఉపరినిర్మాణం తలయెత్తుతుందనీ, దానికి అనుగుణంగా నిర్దిష్ట సామాజిక రూపాలలో ఆలోచనలుంటాయనీ, ఉత్పత్తి విధానమే సామాజిక, రాజకీయ, బౌద్ధిక జీవిత స్వభావాన్ని నిర్ణయిస్తుందనీ చెప్పే నా దృక్పథం విషయంలో ఆ పత్రిక ప్రచురణ అంచనా యిది : భౌతిక ప్రయోజనాల ప్రాబల్యం వున్న మన కాలానికి ఈ దృక్పథం బాగా వర్తిస్తుంది. కాని కాథలిక్కు మతం రాజ్యం ఏలిన మధ్యయుగాలకీ, రాజకీయాలు పెత్తనం చేసిన ఏథెన్స్, రోమ్‌లకూ ఈ

మధ్య విసుగు కలిగేటట్లు నడిచిన వాద ప్రతివాదాలను చూస్తే వారిలో కొందరు సరకులలో అంతర్గతంగా ఉన్న సంకేతారాధన విషయంలోనూ, శ్రమ సామాజిక లక్షణాలు వస్తుగత రూపంలో కనిపించే విషయంలోనూ ఎంతగా తప్పుదోవ పట్టారో అర్థం అవుతుంది. మారకం విలువ అనేది ఒక వస్తువులో ఎంత శ్రమ ఇమిడి ఉందో వ్యక్తం చేసే ఒక నిర్దిష్ట సామాజిక పద్ధతి మాత్రమే. మారకం మార్గాన్ని నిర్ణయించే విషయంలో వలెనే ఈ విషయంలో కూడా ప్రకృతికేమీ సంబంధం లేదు.

ఏ ఉత్పత్తి విధానంలో ఉత్పాదితం సరకు రూపం ధరిస్తుందో లేదా నేరుగా మారకం కోసం ఉత్పత్తి చేయబడుతుందో, ఆ ఉత్పత్తి విధానం బూర్జువా ఉత్పత్తి యొక్క అత్యంత సాధారణ రూపం. అది దాని పిండదశ. కనుక ఈ రూపం చరిత్ర తొలిదశల్లోనే తలెత్తుతుంది. అయితే ఇవ్వాళ ఉన్నంత ప్రబలంగా, విలక్షణ గుణంగా ఉండదు. కనుక ఈ దశలో సరకుల ఆరాధ్య సంకేత స్వభావాన్ని అర్థం చేసుకోవటం సాపేక్షంగా సరళం. అయితే మనం మరింత నిర్దిష్ట రూపాలను పరిశీలించడానికి పూనుకుంటే ఈ సరళత్వం కూడా మాయమవుతుంది. ద్రవ్య వ్యవస్థకి సంబంధించిన భ్రమలు ఎక్కడ నుండీ తలెత్తాయి? ద్రవ్య వ్యవస్థలో డబ్బుగా వ్యవహరించే వెండి, బంగారాలను ఉత్పాదకుల మధ్య ఉండే సామాజిక సంబంధాల ప్రతినిధులుగా చూడరు. వారి దృష్టిలో అవి వింత సామాజిక లక్షణాలున్న సహజ వస్తువులు మాత్రమే. పోతే ద్రవ్య వ్యవస్థని ఆధునిక అర్థశాస్త్రం చాలా ఏవగింపుతో చూస్తుంది. అయితే పెట్టుబడిని అర్థం చేసుకోవడంలో దానికున్న మూఢనమ్మకాలు పట్టపగల్లా బయటపడటం లేదా? కౌలు అనేది సమాజం నుంచికాక నేలనుండే మొలకెత్తుతుందనే దాని ఫిజియోక్రాటిక్ భ్రమను విడనాడి ఎంత కాలమైంది?

ముందు రాబోయే దానిని చర్చించడం మానుకొని ప్రస్తుతం సరకు రూపానికి సంబంధించిన మరో ఉదాహరణని పరిశీలిద్దాము. సరకులు స్వయంగా మాట్లాడగలిగితే అవి ఇలా అంటాయి : మా ఉపయోగపు విలువ మనుషులకు ఆసక్తి కలిగించవచ్చు. వస్తువులుగా అది మాకు సంబంధించిన అంశం కాదు. వస్తువులుగా మాకు సంబంధించినది విలువ మాత్రమే. సరకులుగా మా మధ్య ఉన్న పరస్పర సంబంధం ఈ విషయాన్ని రుజువు చేస్తుంది. మేము ఒకదాని దృష్టిలో మరొకటి కేవలం మారకం విలువలం మాత్రమే. అయితే అవే సరకులు ఆర్థికవేత్త నోటిమీదుగా ఎలా పలుకుతాయో చూద్దాం : "విలువ (అంటే, మారకం విలువ) అనేది వస్తువుల లక్షణం. సంపద (అంటే ఉపయోగపు విలువ) మనిషి లక్షణం. ఈ అర్థంలో విలువ అంటే విధిగా మార్పిడులు అని అర్థం. సంపద అంటే

---

సూత్రం వర్తించదని ఆ పత్రిక అభిప్రాయం. మధ్యయుగాల గురించీ, ప్రాచీన ప్రపంచం గురించీ ఈ అరిగిపోయిన పదజాలం ఇంకెవ్వరికీ తెలియదన్నట్టుగా మాట్లాడటం చిత్రమనిపిస్తుంది. ఒకటి మాత్రం స్పష్టం. మధ్యయుగాలు కాథలిక్కు మతాన్నీ, ప్రాచీన ప్రపంచం రాజకీయాలనూ ఆరగించి బతకలేదు. వారి మనుగడకి ఆసరాగా వున్న ఉత్పత్తి విధానాన్ని పరిశీలిస్తే ఒకచోట రాజకీయాలూ, మరోచోట మతమూ ఎందుకు ప్రధాన పాత్ర వహించాయో అర్థమవుతుంది. ఉదాహరణకి రోమన్ రిపబ్లిక్ భూ ఆస్తి చరిత్రే దాని రహస్య చరిత్ర అనే సంగతి తెలుసుకోటానికి ఆ రిపబ్లిక్ చరిత్రతో స్వల్ప పరిచయం చాలు. పోతే ఖడ్గమూ, డాలూ ధరించిన అశ్వికుడు ఏ ఆర్థిక వ్యవస్థలోనైనా వీరవిహారం చేయగలడు అని పొరపాటుగా ఊహించుకున్నందుకు జుల్మానా చెల్లించుకున్న డాన్‌క్విక్సోట్ ఉదంతం వుండనే వుంది.

అలా కాదు.[1] సంపద (ఉపయోగపు విలువ) మానవుల లక్షణం. విలువ సరకుల లక్షణం. ఒక మనిషి సంపన్నుడు, లేదా ఓ సమాజం సంపన్నం.ఒక ముత్యం లేదా వజ్రం విలువైనది ... ఒక ముత్యం లేదా ఓ వజ్రం ముత్యంగా, వజ్రంగా విలువైనది..."[2] ముత్యంలో గానీ వజ్రంలో గానీ ఇంతవరకూ ఏ రసాయనిక శాస్త్రవేత్తా మారకం విలువని కనుక్కోలేదు. విమర్శనాత్మక పరిశీలనలో అత్యంత కుశాగ్రబుద్ధుల మని చెప్పుకునే అర్థశాస్త్ర ఆవిష్కర్తలు మాత్రం ఈ రసాయనిక పదార్థాన్ని కనుగొన్నారు. వారి దృష్టిలో వస్తువుల ఉపయోగపు విలువకి వాటి భౌతిక ధర్మాలతో ప్రమేయం లేదు. విలువ మాత్రం వాటి భౌతిక ధర్మాలలో ఒకటి. వారి ఈ అభిప్రాయాన్ని ధృవీకరించే చిత్రమైన అంశమొకటి వారికి తారసపడుతుంది. వస్తువుల మధ్య మారకం జరగకుండానే, వస్తువులకీ మనిషికీ మధ్య ఉండే ప్రత్యక్ష సంబంధం ద్వారానే వాటి ఉపయోగపు విలువ వ్యక్తమవుతోంది. వాటి విలువ మాత్రం మారకం ద్వారా మాత్రమే, అంటే ఒక సామాజిక ప్రక్రియ ద్వారా మాత్రమే, వ్యక్తమవుతోంది. ఈ సందర్భంలో "అందరికీ ప్రీతిపాత్రుడు కావటం అదృష్టం. చదవటం, రాయటం ప్రకృతిసిద్ధమైనవని" మన సహృదయ మిత్రుడు డాగ్‌బెర్రీ పొరుగునున్న సీకోల్‌కి ఇచ్చిన ఉపదేశం జ్ఞాపకం చేసుకోకుండా ఎవరూ ఉండలేరు.[3]

---

1. "విలువ, సరఫరా, గిరాకీలు అనే మాటల గురించి రాజకీయ అర్థశాస్త్రంలోని కొన్ని వాదోపవాదాల పరిశీలన" ఇంగ్లీషు, లండన్, 1821, పుట 16.
2. ఎస్. బెయిలీ.
3. పైన పేర్కొన్న "పరిశీలన" గ్రంథ రచయితతోపాటు ఎస్. బెయిలీ కూడా సాపేక్షమయిన మార్పిడి విలువను రికార్డో నిరపేక్షంగా మారుస్తున్నాడని ఆరోపించాడు. వాస్తవం దీనికి విరుద్ధంగా వుంది. ముత్యాలు, వజ్రాలు లాంటి వస్తువుల మధ్య పైకి కన్పించే సంబంధాన్ని ఏ సంబంధంలో అవి మారకపు విలువలుగా కనిపిస్తాయో ఆ సంబంధాన్ని రికార్డో వివరించి, పైకి కనిపించే రూపం మాటున దాగి వున్న వాస్తవ సంబంధాన్ని తెలిపాడు. అంటే, మానవ శ్రమకు కేవల వ్యక్తీకరణలుగా వాటి మధ్య వున్న సంబంధాన్ని తెలిపాడు. రికార్డో అనుయాయులు బెయిలీకి చెప్పిన సమాధానం చాలా మొరటుగా వుంది. ఏమాత్రం ఆమోదయోగ్యంగా లేదు. విలువకీ దాని రూపమైన మార్పిడి విలువకీ మధ్య దాగి వున్న సంబంధాలను అర్థం చేసుకోడానికి రికార్డో రచనలు వారికి తోడ్పడకపోవటమే దానికి కారణం.

# అధ్యాయం - 2

# మార్పిడి

# (Exchange)

సరుకులు స్వయంగా మార్కెటుకు పోయి తమకు తాము మార్పిడి చేసుకోవనేది స్పష్టం. కనుక మనం వాటి సంరక్షకుల సాయం తీసుకోవాలి. వారు వాటి సొంతదారులు కూడా. సరుకులు కేవలం వస్తువులు. మనిషి శక్తిని అవి ప్రతిఘటించలేవు. అవి లొంగకపోతే అతను బలప్రయోగం చేయగలడు. మరోలా చెప్పాలంటే వాటిని అతడు స్వాధీనంలో వుంచుకోగలడు.[1] ఈ వస్తువులు సరుకులుగా ఒకదానితో ఒకటి సంబంధం ఏర్పరచుకోవాలంటే వాటి సంరక్షకులు ఒకరితో ఒకరు సంబంధం ఏర్పరచుకోవాలి. వారి ఇచ్ఛ ఆ వస్తువుల్లో వుంటుంది. పరస్పర అంగీకారంతోనే వారు మరొకరి సరుకుని తీసుకొని తమ సరుకుని వదులుకుంటారు. కనుక వారిలో ప్రతి ఒక్కరూ మరొకరిలో ప్రైవేటు హక్కుల్ని గుర్తించాలి. ఈ న్యాయశాస్త్ర సంబంధం ఒక ఒప్పందం ద్వారా వ్యక్తమవుతుంది. ఆ ఒప్పందం వికసిత న్యాయ వ్యవస్థలో భాగం కావచ్చు, కాకపోవచ్చు. అది రెండు ఇచ్ఛల మధ్య సంబంధం. అది ఇద్దరి వాస్తవ ఆర్థిక సంబంధానికి ప్రతిబింబం మాత్రమే. ఈ ఆర్థిక సంబంధమే ప్రతి న్యాయశాస్త్ర చర్యలోని విషయాన్నీ నిర్ణయిస్తుంది.[2] వ్యక్తులు ఒకరికొకరు సరుకుల ప్రతినిధులుగా,

---

1. పవిత్రతకు పేరుమోసిన పన్నెండో శతాబ్దంలో సరుకుల జాబితాలో వారు చాలా సుతారమైన అంశాలను చేర్చారు. లాండిట్ మార్కెట్‌లో దొరికే వస్తువుల్లో బట్టలు, పాదరక్షలు, తోలువస్తువులు, వ్యవసాయ పరికరాలు వగైరాలతో పాటు వేశ్యల్ని కూడా చేర్చి రాశాడో ఫ్రెంచి కవి.
2. సరుకుల ఉత్పత్తికి అనుగుణంగా వుండే న్యాయశాస్త్ర సంబంధాల నుండి తన "శాశ్వత న్యాయం" అనే ఆదర్శాన్ని గ్రహించడంతో ప్రారంభిస్తాడు ప్రౌధాన్. దీని దావరా అతడు, మంచి పౌరులందరికీ ఊరట కలిగేటట్లు, న్యాయం ఎలా శాశ్వతమో సరుకుల ఉత్పత్తి కూడా అలాగే ఒక శాశ్వత ఉత్పత్తి రూపమని రుజువు చేస్తాడన్నది గమనార్హం. అటు పిమ్మట అతడు వెనక్కి తిరిగి వాస్తవ సరుకుల ఉత్పత్తినీ దానికి అనుగుణమైన వాస్తవ న్యాయ వ్యవస్థనీ తన ఆదర్శానికి అనుగుణంగా సంస్కరించ బూనుకుంటాడు. పదార్థ సంయోగ వియోగాలలో జరిగే అణుమార్పులకి సంబంధించిన వాస్తవ నియమాలను అధ్యయనం చేయడం ద్వారా నిర్దిష్ట సమస్యల పరిష్కారానికి పూనుకోకుండా, "సహజమూ", "ఆకర్షణా" అనే తన "శాశ్వత భావాల"తో పదార్థ సంయోగ, వియోగాలని అదుపు చేస్తాననే రసాయనిక శాస్త్రవేత్తను గురించి మనకెటువంటి అభిప్రాయం వుండాలి? శాశ్వత న్యాయానికీ "శాశ్వత సమానత"కీ, "శాశ్వత అనుబంధం" వగైరా "శాశ్వత సత్యా"లన్నిటికీ "వడ్డీ వ్యాపారం" విరుద్ధం అనటం ద్వారా దాన్ని గురించి మనకేమన్నా తెలుస్తుందా? "శాశ్వత కరుణకీ", "శాశ్వత విశ్వాసానికీ", "భగవంతుని శాశ్వత అభీష్టానికీ", "వడ్డీ వ్యాపారం" వ్యతిరేకమని తొలినాటి చర్చి ఫాదర్లు అన్నప్పుడు తెలిసిన దానికంటే మనకు దీనివల్ల వడ్డీ వ్యాపారం గురించి పిసరంతైనా ఎక్కువ తెలుస్తోందా?

అంటే వాటి సొంతదారులుగా మాత్రమే దర్శనమిస్తారు. ఆర్థిక నాటకరంగంపై కనిపించే పాత్రలు వారి మధ్య వున్న ఆర్థిక సంబంధాలకు సాధారణంగా మానవ రూపాలు మాత్రమే అనే విషయం ముందు ముందు మన పరిశోధనలో స్పష్టమవుతుంది.

ఒక సరుకు దాని సొంతదారుని కంటే భిన్నం అని చూపే ప్రధాన అంశమేమంటే, అది ప్రతి ఇతర సరుకునీ తన సొంత విలువ యొక్క దృశ్యమాన రూపంగా మాత్రమే చూస్తుంది. జన్మతః దానికి ఉచ్ఛ, నీచాలు లేవు. ఏ నైతిక విలువలను విశ్వసించదు. ఏ ఇతర సరుకుతోనైనా ఆత్మని మాత్రమే కాదు, శరీరాన్ని సైతం మార్చుకొంటానికి సిద్ధమవుతుంది. ఆ సరుకు మారిటోర్నెస్ కంటే అసహ్యంగా వున్నా సరే. ఇతర సరుకుల నిర్దిష్టతను గ్రహించే జ్ఞానం లేని తన సరుకు యొక్క లోపాన్ని దాని సొంతదారుడు తనకున్న పంచేంద్రియాలతోనూ, జ్ఞానంతోనూ పూడ్చుతాడు. తన సరుకు అతనికి తక్షణ ఉపయోగపు విలువ కాదు. అలా కాకుంటే అతను దాన్ని మార్కెటుకి తీసుకురాడు. అది ఇతరులకు మాత్రమే ఉపయోగపు విలువ." మార్పిడి విలువకి నిలయంగా వుండి, తత్ఫలితంగా మార్పిడి సాధనంగా వుండటమే అది అతనికి సమకూర్చే ప్రత్యక్ష ఉపయోగపు విలువ.[1] కనుక అతనికుపయోగపడే సరుకులకు బదులుగా తన సొంత సరుకును వదులుకోటానికి సిద్ధపడతాడు. సరుకులన్నీ తమ సొంతదారులకు ఉపయోగేతర విలువలు, సొంతదారులు కానివాళ్ళకు ఉపయోగపు విలువలు. కనుక అవన్నీ చేతులు మారాలి. ఈ చేతులు మారటమే మార్పిడి. మార్పిడి వాటన్నిటినీ విలువలుగా పరస్పర సంబంధంలో వుంచుతుంది. విలువలుగానే వాటిని గ్రహిస్తుంది. కనుక సరుకులు ఉపయోగపు విలువలుగా వ్యవహరించాలంటే ముందు అవి విలువలుగా వ్యవహరించాలి.

మరోవైపున, విలువలుగా దర్శనమివ్వటానికి ముందే తాము ఉపయోగపు విలువలమని అవి నిరూపించుకోవాలి. ఎందుకంటే, ఇతరులకు ఉపయోగపడే విధంగా వాటిపైన శ్రమ ఖర్చయినప్పుడు మాత్రమే నిజంగా ఆ శ్రమ లెక్కలోకి వస్తుంది. ఆ శ్రమ ఇతరులకు ఉపయోగకరమా, అది ఇతరుల అవసరాలను తీర్చగలదా అన్న విషయం మార్పిడి చర్య ద్వారానే రుజువవుతుంది.

ప్రతి సరుకు సొంతదారుడూ తన ఏదో ఒక అవసరాన్ని తీర్చే ఉపయోగపు విలువ గల సరుకులకు బదులుగా మాత్రమే తన సొంత సరుకుని వదులుకుంటాడు. ఈ రకంగా చేస్తే, అతని దృష్టిలో మార్పిడి అనేది కేవలం ప్రైవేటు లావాదేవీ. మరోవైపున, అతడు తన సరుకు విలువని రాబట్టాలనీ, సమానమైన విలువ కలిగిన మరో సరుకుగా దాన్ని మార్చుకోవాలనీ అనుకుంటాడు. ఆ మరో సరుకు సొంతదారునికి తన సరుకు ఉపయోగపు విలువా, కాదా అన్న అంశంతో అతనికి ప్రమేయం లేదు. ఈ రకంగా చేస్తే, మార్పిడి అనేది అతని దృష్టిలో ఒక సాధారణమైన సామాజిక లావాదేవీ. అయితే, ఈ లావాదేవీల సముదాయం సరుకుల సొంతదారులందరికి ఏకకాలంలో ప్రైవేటు వ్యవహారంగానూ, సామాజిక వ్యవహారంగానూ వుండజాలవు.

---

1. "ప్రతి వస్తువుకీ రెండు ఉపయోగాలున్నాయి. ఒకటి ఆ వస్తువుకి సంబంధించిన ప్రత్యేక లక్షణం. రెండోదలా కాదు. ఉదాహరణకి, పాదరక్షలను తొడుక్కోవచ్చు. మార్పిడి చేయొచ్చు. రెండూ పాదరక్షలకున్న ఉపయోగాలే. అయితే తనకవసరమైన డబ్బు కోసమూ, ఆహారం కోసమూ చెప్పుల్ని మార్చిన వ్యక్తి కూడా చెప్పుల్ని చెప్పులుగానే వాడతాడు, కానీ సహజమైన పద్ధతిలో కాదు. చెప్పులు తయారైంది మార్పిడి కోసం కాదు గదా! (అరిస్టాటిల్, "డి రిపబ్లికా" ఒకటో భాగం, తొమ్మిదో అధ్యాయం)

ఈ విషయాన్ని మరింత లోతుగా పరిశీలిద్దాం. ఒక సరుకు సొంతదారుని దృష్టిలో ప్రతి ఇతర సరుకూ తన సరుకుకి ఓ నిర్దిష్ట సమ విలువ. కనుక మిగిలిన సరుకులన్నిటికీ తన సరుకు సార్వత్రిక సమ విలువ. ఇది ప్రతి సరుకు సొంతదారునికీ వర్తిస్తుంది. కనుక సార్వత్రిక విలువగా వ్యవహరించే సరుకేదీ లేదు. సరుకుల్ని విలువలుగా సమానమైనవని చూపడానికి వాటి విలువల పరిమాణాన్ని పోల్చడానికి అనువుగా సరుకుల సాపేక్ష విలువకి ఒక సాధారణ రూపం ఏదీ లేదు. కనుక ఇంతవరకు అవి ఒక దానిని ఒకటి సరుకులుగా ఎదుర్కోవు. కేవలం ఉత్పాదితాలుగా, లేక ఉపయోగపు విలువలుగా తారసపడతాయి. ఈ కష్టాల్లో చిక్కుకున్న మన సరుకు సొంతదారులు అచ్చం ఫౌస్ట్‌లాగ "కార్యంతోనే శ్రీకారం జరిగింది" అని ఆలోచిస్తారు. అందుకే వారు ఆలోచించకముందే ఆచరించారు. సరుకుల స్వభావం నిర్దేశించిన నియమాలకు వారు అప్రయత్నంగా లోబడతారు. ఏదో ఒక సరుకుని సార్వత్రిక సమ విలువగా భావించి దానితో పోల్చడం ద్వారా మాత్రమే వారు తమ సరుకుల్ని విలువలుగా పరస్పర సంబంధంలో వుంచగలరు. తద్వారా సరుకులుగా పరస్పర సంబంధంలో వుంచగలరు. సరుకు విశ్లేషణలో ఈ విషయాన్ని ముందే చూశాము. ఒక ప్రత్యేక సరుకు సామాజిక చర్య ద్వారా తప్ప మరో రకంగా సార్వత్రిక సమ విలువ కాజాలదు. కనుక మిగిలిన సరుకులన్నీ తమ సామాజిక చర్య ద్వారా ఒక నిర్దిష్ట సరుకుని వేరు చేస్తాయి. అదే వాటన్నిటి విలువలనూ తెలుపుతుంది. అందువల్ల ఈ సరుకు యొక్క భౌతిక రూపం సామాజికంగా గుర్తించబడిన సార్వత్రిక సమ విలువ రూపంగా మారుతుంది. సామాజిక ప్రక్రియ కారణంగా సార్వత్రిక సమ విలువగా వుండటం అనేది వేరుచేయబడిన సరుకు యొక్క నిర్దిష్ట క్రియ అవుతుంది. ఆ రకంగా అది డబ్బు అవుతుంది. "వీరందరిదీ ఒకే లక్ష్యం. అందరూ తమ శక్తినీ, అధికారాన్నీ ఆ మృగానికి యిస్తారు." ఆ మృగం యొక్క పేరుగానీ, ఆ పేరుకి సంబంధించిన సంఖ్య గాని వుంటే తప్ప ఏ ఒక్కరూ అమ్మలేరు, కొనలేరు.

మార్పిడుల ప్రక్రియలో విధిగా డబ్బు అనే స్పష్టమైన ఏర్పడిన రూపం అవతరిస్తుంది. తద్వారా విభిన్న శ్రమ ఉత్పాదితాలు ఆచరణలో ఒకదానితో ఒకటి సమం చేయబడి, తద్వారా సరుకులుగా మార్చబడతాయి. సరుకులలో ఉపయోగపు విలువకూ, విలువకూ మధ్య గుప్తంగా వుండే వైరుధ్యం మార్పిడుల చారిత్రక పురోగతితోపాటు, విస్తృతితోపాటు పెరుగుతుంది. వాణిజ్య ప్రయోజనాల కొరకు ఈ వైరుధ్యాన్ని బాహ్యంగా వ్యక్తం చేయడం అవసరమవుతుంది. ఆ అవసరమే విలువకి ఒక స్వతంత్ర రూపాన్ని నెలకొల్పాలని కోరుతుంది. సరుకుల్ని సరుకులుగానూ, డబ్బుగానూ వేరు చేసిందాకా అది నిద్రించదు. శ్రమ ఉత్పాదితాలు ఎంత వేగంగా సరుకులుగా మారతాయో, అంతే వేగంగా ఒక ప్రత్యేక సరుకు డబ్బుగా మారుతుంది.[1]

---

1. దీన్ని చూస్తే పెట్టీ బూర్జువా సోషలిజం తెలివితేటలు మనకి బోధపడతాయి. అది సరుకుల ఉత్పత్తిని శాశ్వతం చేస్తూనే సరుకులకీ, డబ్బుకీ మధ్య వున్న "వైరుధ్యాన్ని" రద్దు చేయాలనుకుం టుంది. ఈ వైరుధ్యం కారణంగానే డబ్బు అనేది వుంది కనుక డబ్బునే రద్దు చేయాలంటుంది. పోప్‌ని తొలగించి కాథలిక్కు మతాన్ని నిలుపుకోవటం లాంటిదే ఇది. ఈ విషయంపైన మరికొంత వివరణను నా "అర్థశాస్త్ర విమర్శ"లో చూడండి. పుట 61.

ప్రత్యక్ష వస్తు మార్పిడికి ఒక రకంగా సాపేక్ష విలువ యొక్క ప్రాథమిక రూపంగా లభిస్తుంది. మరోరకంగా కాదు. ఆ రూపం 'య' పరిమాణం గల సరుకు 'క' = 'ర' పరిమాణం గల సరుకు 'చ' ప్రత్యక్ష వస్తు మార్పిడి రూపం ఏదంటే 'య' పరిమాణం గల ఉపయోగపు విలువ 'క' = 'ర' పరిమాణం గల ఉపయోగపు విలువ 'చ'.[1] ఇక్కడ 'క' 'చ' వస్తువులు ఇంకా సరుకులు కాదు. వస్తు మార్పిడి ద్వారా మాత్రమే అవి సరుకులవుతాయి. ఒక ఉపయోగకర వస్తువు మార్పిడి విలువని సంతరించుకోటానికి మొదటి మెట్టు ఏదంటే అది తన సొంతదారునికి ఉపయోగేతర వస్తువు కావాల్సి వుంది. ఉపయోగకర వస్తువులలో కొంత భాగం అతనికి తక్షణ అవసరాలకు అనవసరమైనప్పుడు అలా జరుగుతుంది. వస్తువులు మానవులకు బాహ్యంగా వుంటాయి. కనుక అతను వాటిని పరాధీనం చేయగలడు. తమ వస్తువులను ఒకరికొకరు పరాధీనం చేసుకోవాలంటే మనుషులు ఒకరినొకరు ప్రైవేటు సొంతదారులుగా అప్రకటితంగానైనా గుర్తించాలి. అంటే ఒకరినొకరు స్వతంత్ర వ్యక్తులుగా గుర్తించాలి. అయితే ఈ పరస్పర స్వాతంత్ర్యం అనేది ఉమ్మడి ఆస్తి పునాదిగా వుండే ఆదిమ సమాజంలో వుండదు. ఆ సమాజం పితృస్వామిక కుటుంబం రూపంలో వున్నా, ప్రాచీన భారత సమాజం రూపంలో వున్నా పెరూలోని ఇన్‌కా రాజ్యం రూపంలో వున్నా అది అంతే. ఆ సమాజాల్లో సరుకు మార్పిడి అనేది మొదట వాటి సరిహద్దుల్లో జరుగుతుంది. అంటే, ఇతర సమాజాలతో గానీ, ఆ సమాజాల్లో వున్న వ్యక్తులతో గాని జరుగుతుంది. అయితే, ఒక సమాజపు బాహ్య సంబంధాల్లో శ్రమ ఉత్పాదితాలు సరుకులుగా మారాయి అంటే, దాని ఫలితంగా తర్వాత ఆ సమాజంలో అంతర్గతంగా కూడా అదే జరుగుతుంది. ఏ పరిమాణాల్లో వాటి మార్పిడి జరుగుతుంది అనేది మొదట యాదృచ్ఛికం మాత్రమే. వాటి సొంతదారులు వాటిని పరాధీనం చేయాలను కోవడమే వాటిని మార్పిడి కాగల వస్తువులుగా చేస్తుంది. ఈలోగా ఇతరులకి చెందిన ఉపయోగకర వస్తువుల అవసరం క్రమంగా స్థిరపడుతుంది. మార్పిడి పదే పదే జరగటం ద్వారా అది సాధారణ సామాజిక చర్యగా మారుతుంది. కనుక కాలక్రమంలో శ్రమ ఉత్పాదితాల్లో కనీసం కొంత భాగాన్ని మార్పిడి చేసే ఉద్దేశంతోనే ఉత్పత్తి చేయడం జరుగుతుంది. ఆ క్షణం నుండి ఒక వస్తువు వినియోగానికి (అనుభోగానికి) ఉపయోగపడుతుందా, మార్పిడికి ఉపయోగపడుతుందా అన్న తేడా స్థిరంగా పాదుకొంటుంది. దాని ఉపయోగపు విలువకూ, మార్పిడి విలువకూ మధ్య భేదం వున్నట్లు గుర్తించబడుతుంది. మరోవైపున వస్తువుల మార్పిడి ఏ ఏ పరిమాణాల్లో జరుగుతుంది అనేది వాటి ఉత్పత్తిపైననే ఆధారపడి వుంటుంది. సామాజిక అలవాట్లు వాటిని నిర్దిష్ట పరిమాణాలు గల విలువలుగా నిర్ధారిస్తుంది.

ప్రత్యక్ష వస్తు మార్పిడిలో ప్రతి సరుకూ దాని సొంతదారునికి ఒక మార్పిడి సాధనం. దాని ఉపయోగం వున్న మిగిలిన వారందరికీ అది ఒక సమ విలువ. కనుక ఈ దశలో మార్పిడికి గురయ్యే వస్తువులు వాటి ఉపయోగపు విలువలతోనూ, మార్పిడి చేసేవారి అవసరాలతోనూ నిమిత్తం లేకుండా విలువ రూపాన్ని సంతరించుకోవు. మార్పిడికి గురయ్యే సరుకుల సంఖ్యా, వైవిధ్యమూ పెరిగే కొద్దీ విలువ రూపం అవసరం కూడా పెరుగుతుంది. సమస్యా, దాని పరిష్కార మార్గమూ

1. రెండు విభిన్న ఉపయోగపు విలువల మధ్య మార్పిడి జరగటానికి బదులు, బర్బర సమాజాల్లోలాగ ఒక వస్తువుకి అసంఖ్యాక వస్తువుల కలగూరగంప సమ విలువగా వ్యవహరించే దశల్లో వస్తు మార్పిడి సైతం దాని శైశవ దశలో వుందని అర్థం.

ఒకేసారి తలెత్తుతాయి. విభిన్న సొంతదారులకు చెందిన విభిన్న సరుకులు ఒకే ఒక ప్రత్యేక వస్తువుతో మార్పిడి కావటానికీ, విలువలుగా సమం అని పోల్చడానికీ వీలులేనప్పుడు సరుకు సొంతదారులు తమ సరుకుల్ని ఇతరుల సరుకులతో సమానం అని పోల్చడం గానీ, విస్తృత స్థాయిలో మార్పిడి చేయడం గానీ జరగదు. ఆ ప్రత్యేక వస్తువు వివిధ సరుకుల సమ విలువ కావడం ద్వారా సంకుచిత పరిమితుల్లోనే అయినప్పటికీ, సాధారణ సామాజిక సమ విలువ స్వభావాన్ని సంతరించుకొంటుంది. ఈ స్వభావం దానికి జీవం పోసే తాత్కాలిక సామాజిక చర్యలతోపాటు వస్తూ పోతూ వుంటుంది. ఈ స్వభావం ఒకసారి ఒక వస్తువుకీ మరోసారి మరో వస్తువుకీ తాత్కాలికంగా లభిస్తూ వుంటుంది. అయితే మార్పిడి అనేది పెరిగే కొద్దీ ఈ స్వభావం కొన్ని నిర్దిష్ట తరహా సరుకులకి స్థిరపడుతుంది. డబ్బు రూపం సంతరించుకుని సుస్థిరత్వాన్ని సాధిస్తుంది. అయితే ఇది ఏ నిర్దిష్ట సరుకులో స్థిరపడుతుంది అనేది మొదట యాదృచ్ఛికం. రెండు పరిస్థితులకు ఈ విషయంలో నిర్ణాయిక ప్రభావం వుంటుంది. బయటి నుండి వచ్చే అత్యంత ప్రధాన వస్తువులు ఈ డబ్బు రూపాన్ని స్వీకరించవచ్చు. ఇవి, సొంత సమాజంలో తయారైన వస్తువుల మార్పిడి విలువను వ్యక్తం చేసే ఆదిమ సహజ రూపాలు లేదా పరాధీనం చేయదగిన సొంత సమాజపు సంపదలో ప్రధాన భాగంగా వుండే ఉపయోగకర వస్తువు డబ్బు రూపాన్ని పొందుతుంది. ఉదాహరణకి, పశువులు. డబ్బు రూపాన్ని మొట్టమొదట అభివృద్ధి చేసింది సంచార జాతులే. వారికుండే వస్తువులన్నీ పట్టుకువెళ్ళడానికి వీలైనవే. కనుక అవి నేరుగా పరాధీనం కాగలవే. అంతేగాక, నిరంతరం ఇతర సమాజాలతో సంబంధం ఏర్పరచుకోవాల్సిన వారి జీవన విధానంలో ఉత్పాదితాల మార్పిడి అవసరం అవుతుంది. మనిషే తరచుగా బానిస రూపంలో వున్న మనిషిని డబ్బుగా ఉపయోగించాడు. కాని భూమిని మాత్రం ఎప్పుడూ ఆ విధంగా ఉపయోగించ లేదు. అలా ఉపయోగించే ఆలోచన బాగా అభివృద్ధిచెందిన బూర్జువా సమాజంలో మాత్రమే తలెత్తగలదు. అది 17వ శతాబ్దం చివరి మూడో భాగంలో మాత్రమే తలెత్తింది. ఒక శతాబ్దం తర్వాత జరిగిన ఫ్రెంచి బూర్జువా విప్లవ కాలంలో దానిని జాతీయ స్థాయిలో అమలుచేయటానికి తొలి ప్రయత్నం జరిగింది.

మార్పిడి ఏ నిష్పత్తిలో స్థానిక బంధాలను తెంచుకుంటుందో, రాను రాను ఏ నిష్పత్తిలో సరుకుల విలువ అనిర్దిష్ట మానవ శ్రమ యొక్క సాకార రూపంగా విస్తరిస్తుందో, అదే నిష్పత్తిలో సార్వత్రిక సమ విలువ అనే సామాజిక క్రియను నిర్వహించడానికి ప్రకృతి సిద్ధంగా అనువైన సరుకులకు అదే స్థాయిలో డబ్బు స్వభావం వస్తుంది. ఆ సరుకులే విలువైన లోహాలు.

"వెండి బంగారాలు స్వభావ రీత్యా డబ్బు కానప్పటికీ, డబ్బు స్వభావరీత్యా వెండి బంగారాలే"[1] అన్న ప్రతిపాదనలోని సత్యాన్ని, డబ్బు పాత్ర నిర్వహించడానికి ఈ లోహాలకున్న సహజ ధర్మాలే రుజువు చేస్తున్నాయి.[2] ఇప్పటివరకూ మనం డబ్బుకి సంబంధించిన ఒకే ఒక క్రియను గురించి తెలుసుకున్నాం. సరుకుల విలువను వ్యక్తం చేసే రూపంగానో లేదా వాటి విలువల పరిమాణాలను సామాజికంగా వ్యక్తం చేసే పదార్థంగానో వ్యవహరించడమనే దాని క్రియను గురించి తెలుసుకున్నాం.

1. కార్ల్‌మార్క్స్ పైన పేర్కొన్న గ్రంథం "లోహాలు స్వభావరీత్యా డబ్బే" (గాలయని, డెల్లా మానెటా, పార్టీ మోడెర్నా, అధ్యయనం 1, పుట 137.
2. మరింత విస్తృత సమాచారం కోసం పై గ్రంథంలో "విలువైన లోహాలు" అనే అధ్యాయాన్ని చూడండి.

ఏ పదార్థం యొక్క ప్రతి మచ్చూ (శాంపుల్) ఒకే గుణాలు కలిగి వుంటుందో, ఆ పదార్థం మాత్రమే విలువని వ్యక్తం చేయడానికి తగిన రూపంగానూ, అనిర్దిష్ట ఏకస్వభావపు, సమాన మానవ శ్రమకి తగిన సాకార రూపంగానూ వుండగలదు. వివిధ సరుకుల విలువల మధ్య వుండే తేడా కేవలం పరిమాణాత్మకం మాత్రమే. కనుక డబ్బుగా వ్యవహరించే పదార్థం కేవలం పరిమాణాత్మకమైన తేడాలను వ్యక్తం చేయగలగాలి. అంటే ఇష్టం వచ్చినట్టుగా అనేక భాగాలుగా విభజించటానికీ, వాటిని కలపటానికీ అది అనువుగా వుండాలి. వెండి బంగారాలకు స్వభావ సిద్ధంగా ఈ లక్షణాలున్నాయి.

డబ్బు అనే సరుకు యొక్క ఉపయోగపు విలువలు రెండు రకాలు. సరుకుగా దానికుండే ప్రత్యేక ఉపయోగపు విలువ (ఉదాహరణకి, బంగారం పళ్ళు కట్టడానికి, విలాస వస్తువులు వగైరాలను తయారుచేయడానికి ఉపయోగపడుతుంది.) తోపాటు, తన నిర్దిష్ట సామాజిక క్రియని నిర్వహించడం అనే ఉపయోగ విలువని కూడా కలిగి వుంటుంది.

అన్ని సరుకులూ డబ్బుకి నిర్దిష్ట సమ విలువలు, అన్ని సరుకులకీ అది సార్వత్రిక సమ విలువ. కనుక డబ్బు సార్వత్రిక సరుకు కాగా, దానికి మిగిలినవన్నీ నిర్దిష్ట సరుకులుగా వ్యవహరిస్తాయి.[1]

డబ్బు రూపం అంటే మిగిలిన సరుకుల మధ్య గల విలువ సంబంధాలన్నీ ఒకే ఒక సరుకులో ప్రతిబింబించడమే అనే సంగతిని మనం గ్రహించాము. పూర్తిగా అభివృద్ధి చెందిన రూపంలో డబ్బుని విశ్లేషించడం ప్రారంభించిన వారికి మాత్రమే డబ్బు కూడా సరుకే అనేది కొత్త ఆవిష్కరణ అనిపిస్తుంది.[2] డబ్బుగా మారిన సరుకుకి మార్పిడి అనే చర్య యిచ్చేది విలువని కాదు, దాని నిర్దిష్ట విలువ రూపాన్ని మాత్రమే. ఈ రెండు విభిన్నమైన అంశాల విషయంలో కొంతమంది రచయితలు గందరగోళానికి లోనై వెండి బంగారాల విలువ ఊహాత్మకం[3] మాత్రమే అనే నిర్ధారణకి వచ్చారు. కొన్ని క్రియల్లో

---

1. "డబ్బు సార్వత్రిక సరుకు" (పియత్రో వెర్రీ, అధ్యాయం 1, పుట 16)
2. "వెండి బంగారాలు (బులియన్ అని కూడా పిలవొచ్చు) సరుకులే. వాటి విలువలో పెరుగుదల/తరుగుదల వుంటుంది. తక్కువ బరువు గల వెండి బంగారాలు ఆ దేశంలో తయారైన ఎక్కువ వస్తువుల్ని కొనగలిగితే వెండి బంగారాల విలువ ఎక్కువ వున్నదని అర్థం". (ఎ డిస్ కోర్స్ ఆఫ్ ది జనరల్ నోషన్స్ ఆఫ్ మనీ, ట్రేడ్ అండ్ ఎక్స్ఛేంజ్, యాజ్ దే స్టాండ్ ఇన్ రిలేషన్ ఈచ్ టు అదర్, ఇంగ్లీషు, ఓ లండన్ వ్యాపారి, 1695, పుట 7) "వెండి బంగారాలు నాణాల రూపంలో వున్నా లేకున్నా, వాటిని ఇతర సరుకులన్నింటికీ కొలమానంగా ఉపయోగించినప్పటికీ అవి కూడా ద్రాక్షాసారా, నూనె, పొగాకు, బట్టలు, వగైరా లాగానే సరుకులు. ("ఎ డిస్ కోర్స్ కన్సర్నింగ్ ట్రేడ్ అండ్ దట్ ఇన్ పర్టిక్యులర్ ఆఫ్ ది ఈస్ట్ ఇండీస్" ఇంగ్లీషు, 1689, పుట 2) "రాజ్యంలో వుండే సంపదలు డబ్బుకే పరిమితం కాదు. అలాగే వెండి బంగారాలను వ్యాపార వస్తువుల నుండి మినహాయించ రాదు." (ది ఈస్ట్ ఇండియా ట్రేడ్ ఎ మోస్ట్ ప్రాఫిటబుల్ ట్రేడ్" లండన్, 1677, పుట 4)
3. డబ్బుగా మారక ముందు వెండి, బంగారాలకు లోహాలుగా విలువుంది. (గాలియనీ, పుట 72) "డబ్బుగా వ్యవహరించడానికి అనువుగా వెండికి వున్న లక్షణాల వల్ల దానికి సర్వ జనామోదం లభించింది. అందుకే దానికి ఒక ఊహాత్మక విలువ ఏర్పడింది" అని లాక్ అన్నాడు. "ఏ వస్తువుకైనా విభిన్న జాతులు ఒక ఊహాత్మక విలువని ఎలా ఇవ్వగలుగుతాయి? ఈ ఊహాత్మక విలువ నిరంతరాయంగా ఎలా కొనసాగుతోంది?" అని జాన్ లా ప్రశ్నించాడు. అయితే ఆయనే స్వయంగా ఎలా తప్పుగా అర్థం చేసుకొన్నాడో చూడండి : "వెండి తన ఉపయోగపు విలువకి అనుగుణంగా అదే నిష్పత్తిలో మార్పిడి చేయబడేది అంటే దాని నిజమైన విలువకి అనుగుణంగా అది డబ్బుగా మారటం వల్ల దానికి అదనపు విలువ ఏర్పడింది." (జీన్‌లా : "కన్సిడిరేషన్స్ సర్‌లే నుమేరైరి ఎట్‌లే కామర్స్." పుటలు 469-70)

డబ్బుకి బదులు కేవలం దాని చిహ్నాలు ఉపయోగపడతాయి. దాన్ని చూసి డబ్బు అనేదే కేవలం చిహ్నం అని కొంతమంది పొరబడ్డారు. ఈ పొరపాటు మాటున ఒక అస్పష్టమైన అవగాహన వుంది : ఒక వస్తువు యొక్క డబ్బు రూపం ఆ వస్తువు నుండి విడదీయరానిదేమీ కాదు. కొన్ని నిర్దిష్ట సామాజిక సంబంధాలు ఆ రూపంలో వ్యక్తం అవుతాయి. అంతే, అన్నదే ఆ అవగాహన. ఈ అర్థంలో ప్రతి సరుకూ ఒక చిహ్నమే; అది విలువగా వున్న మేరకు కేవలం దాని మీద ఖర్చు చేసిన మానవ శ్రమకి భౌతిక రూపం.[1] ఒక నిర్దిష్ట ఉత్పత్తి విధానంలో వస్తువులు పొందిన సామాజిక గుణాలు లేదా శ్రమ యొక్క సామాజిక గుణాలు స్వీకరించిన పాదార్థిక రూపాలు కేవలం చిహ్నాలు మాత్రమే అని ప్రకటిస్తే ఈ గుణాలు సర్వజన ఆమోదంతో తలెత్తిన కల్పనలు మాత్రమే అన్న అంశాన్ని కూడా అదే నోటితో ప్రకటించినట్టు అవుతుంది. 18వ శతాబ్దంలో ఈ బాపతు వివరణ బాగా అతికింది. మనిషికీ మనిషికీ మధ్య వుండే సామాజిక సంబంధాలు సంతరించుకుంటున్న చిత్ర విచిత్ర రూపాలు ఎలా ఉత్పన్నమవుతున్నాయో తెలియక ఆనాటి ప్రజలు ఆ వింత రూపాలు ఆనవాయితీగా వస్తున్నాయిలే అని సరిపెట్టుకున్నారు.

ఒక సరుకు యొక్క సమ విలువ దాని విలువ పరిమాణాన్ని సూచించదు అనే అంశాన్ని ఇంతకు ముందే తెలుసుకున్నాం. కనుక బంగారం డబ్బేననీ, మిగిలిన సరుకులన్నిటితోటి అది నేరుగా మార్పిడి కాగలదనీ మనకి తెలిసినప్పటికీ, ఉదాహరణకి, పది పౌనుల బంగారంలో ఎంత విలువుంది అన్న సంగతి మనకు తెలియదు. మిగిలిన సరుకుల్లాగానే డబ్బు కూడా తన సొంత

---

1. "డబ్బు వాటి (సరుకుల) చిహ్నం" (వి.డి. ఫంబొన్నెయిస్, ఎలెమన్స్ డూ కామర్స్, న్యూ ఎడిషన్ లెడె 1776, సంపుటి 2, పుట 143) "సరుకులు దానిని ఆకర్షిస్తాయి" (అదే గ్రంథం, పుట 155) 'డబ్బు ఒక వస్తువుకి చిహ్నం, దానికి ప్రతినిధి" (మాంటెస్క్యూ, ఎస్ప్రిట్ డెస్‌లాయిస్, లండన్, 1767, సంపుటి 2, పుట 3) డబ్బు కేవలం చిహ్నం కాదు. అది స్వయంగా సంపద. అది విలువలకు ప్రతినిధి కాదు. అది వాటి సమ విలువ. (లే ట్రాస్నే. పుట 910) "విలువ అనే భావన విలువైన వస్తువుల్ని కేవలం చిహ్నాలుగా పరిగణిస్తుంది. వస్తువు వస్తువుగా పరిగణించబడదు. దాని విలువగానే అది పరిగణించబడుతుంది." (హేగెల్, పుట 100) డబ్బు చిహ్నం మాత్రమే, వెండి బంగారాల విలువ కేవలం ఊహాత్మకం మాత్రమే అనే భావాలను ఆర్థికవేత్తల కంటే చాలా ముందే లాయర్లు ప్రారంభించారు. ఇది వారు మహారాజుల సేవలో భాగంగా చేశారు. రోమన్ సామ్రాజ్య సంప్రదాయాలను, డబ్బు పట్ల వారి అవగాహనలను ఈ లాయర్లు మధ్యయుగాలకు బట్వాడా చేశారు. వెండి, బంగారు నాణాలలో చౌక లోహాలు కల్తీ చేయటానికి రాజులకు హక్కు వుందని సమర్థించటానికి వారలా చేశారు. వారికి తగిన శిష్యుడు వాలోయిస్‌కి చెందిన ఫిలిప్, 1346 నాటి ఒక ప్రభుత్వ ఆదేశంలో యిలా పేర్కొన్నాడు : "కరెన్సీకి సంబంధించిన వ్యాపారం, దాని ఆంగిక నిర్మాణం, సరఫరా ఆదేశాల విడుదల వగైరా అన్ని అంశాలపై నిర్ణయం తీసుకునే హక్కు ప్రభువులమైన మాకు మాత్రమే వుంది. మాకు ఉచితమనిపించిన రీతిలో కరెన్సీ రేట్లను, ధరవరలను నిర్ణయిస్తాము. దీనినెవరూ ప్రశ్నించకుందురుగాక!" రోమన్ శాసనాల ప్రకారం, రాజు ఆదేశంలో డబ్బు విలువ నిర్ధారించబడుతుంది. డబ్బుని సరుకుగా పరిగణించరాదు. అది స్పష్టంగా నిషేధించబడింది. "డబ్బు ప్రజోపయోగం కోసం సృష్టించబడింది కనుక దానిని ఎవరు కొన్నా అది చట్టబద్ధం కాదు. డబ్బు సరుకుగా మారటం అనుమతించబడదు." ఈ అంశంపై జి.ఎఫ్. పాగ్నిని తన "సాగియో సోప్రా ఇల్‌గియుస్టో ప్రేగియోరెల్లెకోస్" అనే గ్రంథం (1751)లో చర్చించాడు. ఈ గ్రంథం రెండో భాగంలో ఆయన పైన పేర్కొన్న ఈ లాయర్‌పై వాగ్యుద్ధం ప్రకటించాడు.



విలువని ఇతర సరుకుల్లో సాపేక్షంగా తప్ప, వేరే విధంగా వ్యక్తం చేయలేదు. దాని ఉత్పత్తికి అవసరమైన శ్రమ కాలమే దాని విలువని నిర్ధారిస్తుంది. అదే శ్రమల కాలంలో ఎంత పరిమాణం గల మరో సరుకు తయారౌతుందో అంత పరిమాణం గల ఆ సరుకు ఆ విలువను వ్యక్తం చేస్తుంది.[1] దాని సాపేక్ష విలువని ఆ రకంగా పరిమాణాత్మకంగా నిర్ధారించటం అనేది దాని ఉత్పత్తి స్థానంలో వస్తుమార్పిడి ద్వారా జరుగుతుంది. అది డబ్బుగా చలామణిలోకి రాగానే దాని విలువ అప్పటికే నిశ్చితమై వుంటుంది. 17వ శతాబ్దం చివరి దశాబ్దాల్లోనే డబ్బు అనేది ఒక సరుకు అన్న సంగతి గ్రహించబడింది. అయితే సరుకు విశ్లేషణలో అది శైశవ దశ మాత్రమే. డబ్బు కూడా సరుకే అని తెలుసుకోవడం కష్టం కాదు. ఒక సరుకు ఎలా, ఎందుకు, ఏ మార్గం ద్వారా డబ్బుగా మారుతుందో కనుక్కోవడంలోనే వుంది కష్టమంతా.[2]

'య' పరిమాణం గల సరుకు 'క' 'ర' పరిమాణం గల సరుకు 'చ' అనే అత్యంత ప్రాథమిక విలువ వ్యక్తీకరణలో, మరో వస్తువు యొక్క విలువ పరిమాణానికి ప్రతినిధిగా వుండే వస్తువు ఈ సంబంధంతో ప్రమేయం లేకుండానే, స్వతంత్రంగానే సమ విలువ రూపాన్ని కలిగివున్నట్లూ, అది ఆ వస్తువుకూ ప్రకృతి ప్రసాదించిన సామాజిక లక్షణమైనట్లూ కనిపిస్తుందని మనం ఇంతకు ముందే గమనించాము. ఈ బూటకపు వేషం అంతిమంగా స్థిరపడిందాకా మనం దీన్ని పరిశీలించాము. ఇది ఎప్పుడు స్థిరపడుతుందంటే, సార్వత్రిక సమ విలువ రూపం ఒక నిర్దిష్ట వస్తువు యొక్క భౌతిక రూపంగా గుర్తించబడి, ఆ విధంగా డబ్బు అనే రూపంగా అవతరించిన వెంటనే ఈ బూటకపు వేషం అంతిమంగా స్థిరపడుతుంది.

---

1. ఒక బస్తా ధాన్యం పండించటానికి పట్టే శ్రమ కాలంలోనే ఒక వ్యక్తి పెరూలో తవ్వి తీసిన ఒక ఔన్స్ వెండిని లండన్ తీసుకురాగలిగితే ఒకటి రెండోదానికి సహజమైన ధర అవుతుంది. ఒకవేళ తేలిగ్గా తవ్వగలిగిన గనుల వల్ల అంతకు ముందు ఒక ఔన్సు వెండిని వెలికి తీసినంత సులభంగా ఇప్పుడు రెండు ఔన్సులు తీయగలిగితే ఇంతకు ముందు ఐదు షిల్లింగులకు వచ్చిన బస్తా ధాన్యం ఇప్పుడు పది షిల్లింగులవుతుంది." (విలయమ్ పెట్టీ, ఎ్రటైటైజ్ ఆఫ్ టాక్సెస్ అండ్ కంట్రిబ్యూషన్స్, లండన్, 1667, పుట 32)
2. "డబ్బుకి సంబంధించిన పొరపాటు నిర్వచనాలను రెండు ప్రధాన బృందాలుగా విభజించవచ్చు. మొదటిది దాన్ని సరుకుకంటే ఎక్కువగా చూపిస్తుంది. రెండోది తక్కువగా చూపిస్తుంది." అని విద్యుత్ శూరుడు ప్రొఫెసర్ రోష్చర్ మనకి తెలియజేస్తున్నాడు. డబ్బు స్వభావం పైన ఆయన మనకి అందిస్తున్న సుదీర్ఘమైన పుస్తకాల జాబితా చూస్తే ఆ సిద్ధాంత వాస్తవ చరిత్ర గురించి ఆయనకు పిసరంతైనా తెలియదనిపిస్తుంది. "పోతే, తర్వాత కాలంలో వచ్చిన అర్థశాస్త్రవేత్తలు సరుకులకు భిన్నంగా డబ్బుకు గల విలక్షణ గుణాలను దృష్టిలో వుంచుకోలేదన్న సంగతిని కాదన లేము" అని ఆయన అంటాడు. (అంటే, అది సరుకుకంటే ఎక్కువో, తక్కువో అన్నమాటే!) "గనీల్ యొక్క అర్థ వ్యాపార వాదపు ప్రతిస్పందనకి ఆధారం లేకపోలేదు." (విల్‌హెల్మ్ రొష్చర్ డైగ్రండ్లాజెన్‌డెర్‌నేషనల్ ఎకానమీ, మూడో ముద్రణ, 1858, పుట 207-210, ఎక్కువ! తక్కువ! తగినంతగాలేదు! ఈ మేరకు! మొత్తంగా కాదు! ఆహా, భావాలకీ భాషకీ సంబంధించి ఇవి ఎంత స్పష్టం, ఎంత కచ్చితం, ప్రొఫెసర్లకు తగిపోయిన ఈ మిశ్రమవాద ప్రలాపాలకు "శారీరక-అంగనిర్మాణ పద్ధతి" అని రోష్చర్ నామకరణం కూడా చేశాడు. అయితే ఒకందుకు ఆయన్ను అభినందించాల్సిందే. "డబ్బు హాయిగొలిపే సరుకు" అని ఆయన ఆవిష్కరించాడు.

సరుకులన్నీ తమ విలువల్ని బంగారంలో వ్యక్తం చేయడం వల్ల అది డబ్బుగా మారినట్టుగా కాక, అది డబ్బు కావడంవల్లనే అన్ని సరుకులూ తమ విలువల్ని బంగారంలో వ్యక్తం చేస్తున్నట్టుగా కనిపిస్తుంది. ఈ ప్రక్రియలో వుండే మధ్యంతర దశలన్నీ మాయమైపోతాయి. వాటి జాడ కనిపించదు. సరుకుల పక్కనే వున్న మరో సరుకు, వాటి ప్రయత్నమేమీ లేకుండానే, అప్పటికే వాటి విలువలను తెలుపుతున్నట్లు కనిపిస్తుంది. వెండి బంగారాలు భూగర్భం నుండి బయటపడగానే అవి సమస్త మానవ శ్రమకీ సాకార రూపాలుగా దర్శనమిస్తాయి. డబ్బు ఇంద్రజాలానికి అదే కారణం. మనం ఇప్పుడు అధ్యయనం చేస్తున్న సామాజిక వ్యవస్థ, సామాజిక ఉత్పత్తి ప్రక్రియలో మనుషుల ప్రవర్తన కేవలం వ్యక్తుల ప్రవర్తనగా వుంటుంది. అందుకే ఉత్పత్తిలో వారి మధ్య గల పరస్పర సంబంధాలకు ఎలాంటి భౌతిక స్వభావం లభిస్తుందంటే, ఆ స్వభావం వాళ్ళ అజమాయిషీకి లోబడకుండా, వాళ్ళ ఉద్దేశపూర్వక సృష్టి ఆచరణతో సంబంధం లేకుండా వుంటుంది. శ్రమ ఉత్పాదితాలు సార్వత్రికంగా సరుకుల రూపం సంతరించుకొన్నప్పుడు ఈ వాస్తవాలు మొదట వ్యక్తమవుతాయి. సరుకు ఉత్పాదకుల సమాజం యొక్క క్రమ క్రమ అభివృద్ధి కొన్ని విశిష్ట గుణాలున్న ఒక సరుకుకి ఏవిధంగా డబ్బు అనే ముద్ర వేస్తుందో గమనించాం. కనుక డబ్బు లేవనెత్తిన చిక్కు ప్రశ్న నిజానికి సరుకులు లేవనెత్తిన చిక్కు ప్రశ్న మాత్రమే. ఇప్పుడది మనకు కన్నులకు కట్టినట్లు అత్యంత స్పష్టమైన రూపంలో కనిపిస్తోంది అంతే.

## అధ్యాయం - 3

# డబ్బు లేదా సరుకుల చెలామణి

### విభాగం 1

### విలువల కొలమానం

**సౌ**లభ్యం కోసం నేను ఈ గ్రంథం అంతటా బంగారాన్ని డబ్బు అనే సరుకుగా పరిగణించాను. సరుకులకు వాటి విలువలను వ్యక్తం చేసే పదార్థాన్ని సమకూర్చడమే డబ్బు యొక్క ప్రధాన క్రియ. మరొక విధంగా చెప్పాలంటే, గుణాత్మకంగా సమానమై, పరిమాణాత్మకంగా పోల్చదగినవై ఒకే పేరుగల పరిమాణాలుగా సరుకుల విలువలను తెలుపగల పదార్థాన్ని సమకూర్చడమే డబ్బు యొక్క ప్రధాన క్రియ. ఆ విధంగా డబ్బు విలువ యొక్క సార్వత్రిక కొలమానంగా వ్యవహరిస్తుంది. ఈ క్రియ కారణంగానే సర్వోత్తమ సరుకు సమ విలువ అయిన బంగారం డబ్బు అవుతుంది.

సరుకులను ఒకే కొలమానానికి లోబడేటట్లు చేసేది డబ్బు కాదు. వాస్తవం దానికి పూర్తిగా వ్యతిరేకమైనది. సరుకులన్నీ, విలువలుగా, ఆకారం ధరించిన మానవ శ్రమ గనుక, అందువల్ల ఒకే కొలమానానికి లోబడతాయి గనుక, వాటి విలువలను ఒకే ప్రత్యేక సరుకు ద్వారా కొలవవచ్చు; ఆ సరుకునే వాటి విలువల్ని కొలిచే ఉమ్మడి కొలమానంగా అంటే డబ్బుగా మార్చవచ్చు. శ్రమ కాలమే[1] సరుకుల్లో అంతర్నిహితంగా వుండే విలువ కొలమానం. విధిగా అది విలువ కొలమానమైన డబ్బు అనే దృశ్య రూపాన్ని స్వీకరిస్తుంది. ఒక సరుకు విలువని బంగారంలో వ్యక్తం చేస్తే ('య' పరిమాణం గల సరుకు 'క' = 'ర' పరిమాణం గల డబ్బు అనే సరుకు) అది దాని డబ్బు రూపం లేదా ధర

---

1. ఓ కాగితం ముక్క 'య' గంటల శ్రమకి ప్రాతినిధ్యం వహించేటట్టుగా, డబ్బు అనేది శ్రమ కాలానికి నేరుగా ఎందుకు ప్రాతినిధ్యం వహించదు? ఈ ప్రశ్న, సరుకుల ఉత్పత్తి అనేది వున్నప్పుడు, ఉత్పాదితాలు సరుకుల రూపాన్ని ఎందుకు తీసుకోవాలన్న ప్రశ్నలాంటిదే. దానికి కారణం స్పష్టం. అవి సరుకుల రూపం తీసుకొంటున్నాయి అంటే అవి సరుకులుగా, డబ్బుగా విడిపోతున్నాయని కూడా అర్థం. ప్రైవేట్ వ్యక్తుల కోసం వెచ్చించబడిన ప్రైవేటు శ్రమని దానికి వ్యతిరేక రూపమైన తక్షణ సామాజిక శ్రమగా ఎందుకు పరిగణించరాదు అన్న ప్రశ్న కూడా ఇటువంటిదే. సరుకుల ఉత్పత్తి పునాదిగా గల సమాజంలో "శ్రమ ద్రవ్యం" అనే ఊహాజనిత భావాన్ని నేను మరో గ్రంథం ("అర్థశాస్త్ర విమర్శ" ఒకటవ అధ్యాయం, పేజి 61)లో సమగ్రంగా చర్చించాను. థియేటరు టికెట్టు ఎలా 'డబ్బు' కాదో ఓవెన్ ప్రవేశపెట్టిన 'శ్రమ ద్రవ్యం' కూడా అలాగే డబ్బు కాదు అని మాత్రమే నేనిక్కడ చెప్పదలిచాను. సరుకుల ఉత్పత్తికి పూర్తిగా వ్యతిరేక ఉత్పత్తి రూపం అయిన సమష్టి శ్రమ అమలులో వున్నట్లు ఓవెన్ ఊహించుకున్నాడు. ఒక వ్యక్తి ఉమ్మడి శ్రమలో పాలుపంచుకున్నా డనీ, అనుభోగానికి (వినియోగానికి) ఉద్దేశించిన ఉమ్మడి ఉత్పత్తిలో కొంత భాగాన్ని తీసుకునే హక్కు అతనికుందనీ మాత్రమే శ్రమ సర్టిఫికెట్ సూచిస్తుంది. అయితే ఒకపక్క సరుకుల ఉత్పత్తి వున్నట్లు ఊహించి, మరోపక్క డబ్బుతో గారడీ చేయడం ద్వారా సరుకుల ఉత్పత్తికి విధాయకమైన పరిస్థితుల్ని తప్పించుకోటానికి ప్రయత్నించే పొరపాటు మాత్రం ఓవెన్ చెయ్యలేదు.

అవుతుంది. ఇనుము విలువని సామాజికంగా ఆమోదయోగ్యమైన పద్ధతిలో వ్యక్తం చేయడానికి ఒక టన్ను ఇనుము= రెండు ఔన్సుల బంగారం అన్న ఒక్క సమీకరణం సరిపోతుంది. ఇప్పుడు సమ విలువ స్థానంలో వున్న సరుకుకి, అంటే బంగారానికి, డబ్బు స్వభావం వుంది. గనుక, ఈ సమీకరణం మిగిలిన సరుకులన్నిటి విలువలనూ వ్యక్తం చేసే సమీకరణాల గొలుసులో ఒక లంకె కానక్కరలేదు. సాపేక్ష విలువ యొక్క సాధారణ రూపం దాని మూల రూపమైన సాదా లేక ఒంటరి సాపేక్ష విలువ రూపాన్ని తిరిగి పొందింది. మరోపక్క, సాపేక్ష విలువ యొక్క విస్తృత వ్యక్తీకరణ, అంటే అనంతమైన సమీకరణాల పరంపర, డబ్బు అనే సరుకు యొక్క సాపేక్ష విలువకి గల ప్రత్యేక రూపంగా మారింది. ఆ పరంపర కూడా అమలులో వుంది. వాస్తవ సరుకుల ధరల ద్వారా దానికి సామాజిక గుర్తింపు వుంది. ధరల జాబితాను మనం వెనక్కి చదివితే చాలు. డబ్బు విలువ పరిమాణం అన్ని రకాల సరుకుల్లోనూ వ్యక్తం కావడాన్ని గ్రహించవచ్చు. అయితే డబ్బుకు ధర లేదు. మిగిలిన సరుకులన్నిటితోనూ సమాన స్థాయిలో దాన్ని నిలబెట్టడానికి, దాన్ని దానితోనే సమం అని పోల్చక తప్పదు.

సాధారణంగా సరుకుల విలువ రూపం లాగే వాటి ధర లేదా డబ్బు రూపం కూడా స్పష్టంగా కనిపించే వాటి వస్తు రూపం కంటే చాలా భిన్నమైనది. అది కేవలం భావాత్మక రూపం లేదా మానసిక రూపం. ఇనుము, వస్త్రం, ధాన్యం విలువ కన్పించకపోయినా, అది వాస్తవంగా ఆ వస్తువుల్లో వుంది. ఆ విలువని బంగారంతో సమం చేయడం ద్వారా దానికి భావాత్మకంగా గ్రహించడానికి వీలవుతోంది. ఈ సంబంధం, ఒక విధంగా చెప్పాలంటే, ఆ వస్తువులలో (బుర్రల్లో) మాత్రమే వుంటుంది. కనుక బాహ్య ప్రపంచానికి వాటి ధరలను తెలియజేయటానికి ముందు వాటి యజమాని వాటికి తన నాలుకని అరువివ్వాలి. లేదా ఒక చీటీని వాటి మెడలో వేలాడగట్టాలి.[1] బంగారం ద్వారా సరుకుల విలువని వ్యక్తీకరించడమనేది కేవలం భావాత్మక చర్య కనుక దీని కోసం మనం ఊహాత్మక లేదా భావాత్మక ద్రవ్యాన్ని ఉపయోగించవచ్చు. తన వస్తువుల విలువని ఒక ధర రూపంలో లేదా ఊహాత్మకమైన డబ్బు రూపంలో వ్యక్తం చేస్తున్నప్పుడు వాటిని డబ్బుగా మార్చలేదనే సంగతి ప్రతి వ్యాపారికీ తెలుసు. లక్షలాది పౌండ్ల విలువ గల వస్తువుల్ని బంగారంలో అంచనా వేయడానికి వీసమంతైనా నిజమైన బంగారం అక్కర్లేదని అతనికి తెలుసు. కనుక విలువ కొలమానంగా డబ్బు

---

1. అనాగరిక, అర్ధ నాగరిక జాతులు నాలుకను మరో రకంగా ఉపయోగిస్తారు. బాఫిన్స్ అఖాతానికి పశ్చిమ తీరవాసుల గురించి కెప్టెన్ పారీ యిలా తెలియజేశాడు. "ఈ సందర్భంలో (వస్తు మార్పిడి సందర్భంలో) దానిని (తమకు చూపించబడిన వస్తువుని) వారు నాలుకతో రెండుసార్లు నాకుతారు. అంటే బేరం సంతృప్తికరంగా కుదిరిందీ అని అర్థం." అదే రకంగా మార్పిడితో తాము స్వీకరించిన వస్తువులను తూర్పు ఎస్కిమోలు కూడా నాకుతారు. ఉత్తర ప్రాంతంలో వస్తువును స్వీకరించే సాధనంగా నాలుకని వాడగా, దక్షిణ ప్రాంతంలో బొజ్జని, ఆస్తి ఎంత పోగుబడిందో తెలిపే చిహ్నంగా భావించటంలో ఆశ్చర్యం లేదు. ఒక మనిషి ఆస్తిపాస్తుల్ని అతని బొజ్జనిబట్టి కాఫిర్ అంచనా కడతాడు. కాఫిర్లకు తామేమి చేస్తున్నదీ తెలుసు. ఉదాహరణకి, శ్రామిక వర్గంలో అత్యధికులు తినే తిండిలో కొవ్వు పదార్థాల లోపం వుందని 1864లో బ్రిటీష్ ఆరోగ్య నివేదిక తెలిపింది. అదే సమయంలో డాక్టర్ హార్వే అనబడే వ్యక్తి (రక్తప్రసరణని కనుగొన్న హార్వే గాదు) బూర్జువాలూ, రాజవంశీకులూ తమ శరీరాలలోని అనవసరమైన కొవ్వును ఎలా తొలగించుకోవాలో తెలిపే చిట్కాలను వ్యాపార ప్రకటనల ద్వారా ప్రచారం చేశాడు. తద్వారా మనకి సంగతి అర్థం కావడానికి తోడ్పడ్డాడు.

వ్యవహరిస్తున్నప్పుడు దానిని కేవలం ఊహాత్మక లేదా భావాత్మక ద్రవ్యంగా మాత్రమే ఉపయోగించడం జరుగుతుంది. ఈ పరిస్థితి చిత్రాతి చిత్రమైన సిద్ధాంతాలను సృష్టించింది.[1] విలువ కొలమానంగా వ్యవహరించే డబ్బు భావాత్మక ద్రవ్యమే అయినప్పటికీ ధరలు మాత్రం వాస్తవ ద్రవ్యం మీద ఆధారపడి వుంటాయి. ఒక టన్ను ఇనుములో వుండే విలువని, అంటే దానిలో వుండే మానవ శ్రమని, అంతే పరిమాణం గల మానవ శ్రమ వుండే ద్రవ్య సరుకు ద్వారా ఊహాత్మకంగా వ్యక్తం చేయబడుతుంది. విలువ కొలమానం బంగారమా, వెండా, రాగా అన్నదానిబట్టి ఒక టన్ను ఇనుము విలువ వేరు వేరు ధరలలో వ్యక్తమవుతుంది. లేదా వేరు వేరు పరిమాణాలు గల ఆయా లోహాలు దానికి ప్రాతినిధ్యం వహిస్తాయి.

కనుక బంగారం, వెండిలాంటి రెండు భిన్నమైన సరుకులు ఏకకాలంలో విలువ కొలమానాలుగా వుంటే, సరుకులన్నింటికీ రెండు ధరలుంటాయి – ఒకటి బంగారం ధర, రెండోది వెండి ధర. వెండి, బంగారాల విలువల నిష్పత్తిలో తేడా రానంతవరకు (15:1 ఉందనుకుందాం) ఇవి ఒకదాని ప్రక్కన మరొకటి వుంటాయి. ఈ నిష్పత్తిలో వచ్చే ప్రతి మార్పు సరుకుల వెండి ధరకీ, వాటి బంగారం ధరకీ మధ్య వుండే నిష్పత్తిని మారుస్తుంది. ఆ రకంగా, విలువకు రెండు ప్రమాణాలు వుండడమనేది ప్రమాణం యొక్క క్రియలకు విరుద్ధమని అది రుజువు చేస్తుంది.[2]

---

1. కార్ల్ మార్క్స్ "అర్థశాస్త్ర విమర్శ"లో "డబ్బు ప్రమాణం, వివిధ సిద్ధాంతాలు" చూడండి. ఇంగ్లీషు అనువాదంలో 76వ పేజీ.

2. వెండి, బంగారాలు రెండూ ద్రవ్యం క్రియను నిర్వర్తించాలని, లేదా పక్క పక్కనే అవి రెండూ విలువ కొలమానాలుగా వుండాలనీ శాసనబద్ధంగా నిర్ణయించిన ప్రతిచోటా, ఆ రెంటినీ ఒకే పదార్థంగా పరిగణించడానికి వృథా ప్రయత్నం జరిగింది. నిర్దిష్ట పరిమాణాలు గల వెండి, బంగారాల్లో ఎప్పుడూ ఒకే నిష్పత్తిలో మానవ శ్రమ కాలం ఇమిడి వుంటుందని భావించడం అంటే వెండి, బంగారాలు ఒకే పదార్థం అని భావించడం లాంటిదే. వెండి విలువ బంగారం విలువ కంటే తక్కువ గనుక ఫలానా పరిమాణం గల వెండి ఎప్పుడూ ఫలానా పరిమాణం గల బంగారంలో ఒక స్థిరమైన శాతం అని భావించడమే. మూడో ఎడ్వర్డు హయాం నుండి రెండో జార్జి కాలం వరకూ ఇంగ్లండు డబ్బు చరిత్రలో వెండి, బంగారాల విలువల మధ్య శాసనబద్ధంగా నిర్ణయించిన నిష్పత్తికీ, వాటి వాస్తవ విలువల్లో వచ్చిన హెచ్చు తగ్గులకీ మధ్య ఘర్షణ వల్ల అసంఖ్యాకమైన గందరగోళాలు తలెత్తాయి. ఒకప్పుడు బంగారం పెరిగిపోతే, మరొకప్పుడు వెండి పెరిగింది. ఆ సమయానికి తన నిజమైన విలువ కంటే తక్కువ విలువ వున్న లోహాన్ని చలామణి నుండి తప్పించి, కరిగించి ఎగుమతి చేయడం జరిగింది. అప్పుడు మళ్ళీ శాసనం ద్వారా ఆ రెండు లోహాల నిష్పత్తి మార్చబడింది. అయితే మళ్ళీ ఈ నామమాత్రపు నిష్పత్తి నిజ నిష్పత్తితో ఘర్షణపడింది. మన కాలంలో కూడా వెండికి భారత, చైనాలలో గిరాకీ పెరగటం వల్ల వెండితో పోలిస్తే బంగారం విలువ తాత్కాలికంగా కొద్దిగా తగ్గింది. వెంటనే ఫ్రాన్సులో అంతకు మించిన స్థాయిలో వెండి ఎగుమతి జరిగింది. చలామణి నుండి దానిని తప్పించి బంగారం ఆ స్థానాన్ని ఆక్రమించింది. 1855, 1856, 1857 సంవత్సరాల్లో ఫ్రాన్సులో బంగారం ఎగుమతుల కంటే బంగారం దిగుమతులు 41,580,000 పౌండ్లు ఎక్కువ. వెండి ఎగుమతులు, వాటి దిగుమతులకంటే 14,704,000 పౌండ్లు ఎక్కువ. ఈ రెండు లోహాలూ చట్టబద్ధంగా విలువ కొలమానాలుగా వున్న దేశాల్లో అంటే ప్రతి ఒక్కరూ రెంటిలో తమకు నచ్చిన లోహాన్ని చెల్లించడానికి అవకాశమున్నచోట విలువ పెరిగిన లోహానికి గిరాకీ పెరుగుతుంది. దాని ధర, ఇతర సరుకుల ధరలాగే, రెండవ లోహం ద్వారా (అనగా, నిజమైన విలువ కంటే ఎక్కువ అధికారిక విలువ గల లోహం ద్వారా) కొలవబడుతుంది. ఆ రెండవ లోహమే వాస్తవానికి విలువ ప్రమాణంగా వ్యవహరిస్తుంది. ఈ అంశానికి సంబంధించిన మొత్తం అనుభవమూ, చరిత్రా చెప్పేదొకటే. శాసనరీత్యా రెండు సరుకులు విలువ కొలమాన క్రియలు నిర్వహిస్తున్నప్పుడు ఆచరణలో ఆ స్థానాన్ని ఒకటి మాత్రమే ఆక్రమిస్తుంది. (కార్ల్ మార్క్స్ అర్థశాస్త్ర విమర్శ, ఇంగ్లీషు ముద్రణ, పుట 75-76).

నిర్దిష్ట ధరలు కల సరుకులు కన్పించే రూపమిది : 'ఖ' సరుకు 'క' = 'య' బంగారం 'ఛ' సరుకు 'చ' = 'ల' బంగారం, 'ఠ' సరుకు 'ట' = 'ర' బంగారం వగైరా. ఖ ఛ ఠ లు 'క', 'చ', 'ట' అనే సరుకుల నిర్దిష్ట పరిమాణాలను సూచిస్తాయి. 'య' 'ర' 'ల'లు నిర్దిష్ట పరిమాణాలు గల బంగారాన్ని సూచిస్తాయి. ఈ సరుకుల విలువల ఊహలో విభిన్న పరిమాణాల బంగారంగా మార్పు చెందుతాయి. గందరగోళ పరిచేటంతగా సరుకుల వైవిధ్యం వున్నప్పటికీ వాటి విలువలు మాత్రం ఒకే పేరు యొక్క పరిమాణాలు, బంగారం పరిమాణాలు అవుతాయి. అవి ఒకదానితో ఒకటి పోల్చడానికీ, కొలవడానికీ అనువుగా వుంటాయి. నిర్ణీత పరిమాణం గల బంగారాన్ని ఒక ఏకకం (యూనిట్)గా చేసుకొని, దానితో ఆ విలువలను పోల్చవలసిన సాంకేతిక అవసరం ఏర్పడుతుంది. తరువాత ఈ ఏకకం కొన్ని భాగాలుగా విభజింపబడి, తానే ప్రమాణం, లేదా కొలమానం అవుతుంది. బంగారు, వెండి, రాగి డబ్బుగా మారటానికి ముందే తమ ప్రామాణిక బరువుల్లో అటువంటి ప్రామాణిక కొలమానాలను కలిగి వుంటాయి. ఉదాహరణకి, ఏకకంగా వ్యవహరించే పౌండు బరువుని ఒకవైపున ఔన్సులుగా విభజించవచ్చు. మరోవైపు కొన్ని పౌండ్లను కలిపి హండ్రెడ్ వెయిట్స్[1]గా మార్చొచ్చు. ఈ కారణంగానే లోహ కరెన్సీలన్నిటిలోనూ ద్రవ్య ప్రమాణాలకి లేదా ధరలకి పెట్టిన పేర్లు అంతకు ముందే బరువు ప్రమాణాలుగా అస్తిత్వంలో వున్న పేర్లే.

విలువ కొలమానంగానూ, ధర ప్రమాణంగానూ డబ్బుకి రెండు విభిన్నమైన క్రియలున్నాయి. మానవ శ్రమకి సాకార రూపంగా అది సామాజిక గుర్తింపు పొందినందున ఆ మేరకు అది విలువ కొలమానంగా వ్యవహరిస్తుంది. లోహానికి నిశ్చితమైన బరువుగా వున్నందున అది ధర ప్రమాణంగా వుంటుంది. విలువ కొలమానంగా అది అనేకానేక సరుకుల విలువలను ధరలుగా, ఊహాత్మకమైన బంగారు పరిమాణాలుగా మారుస్తుంది. ధర ప్రమాణంగా అది ఆ బంగారు పరిమాణాలను కొలుస్తుంది. విలువ కొలమానం విలువలుగా పరిగణించబడే సరుకులను కొలుస్తుంది. తద్విరుద్ధంగా, ధర ప్రమాణం ఒక ఏకకం బంగారు పరిమాణంతో బంగారు పరిమాణాలను కొలుస్తుంది గానీ, ఒక పరిమాణపు బంగారు విలువని మరో పరిమాణపు బంగారు బరువుతో కొలవదు. బంగారాన్ని ధర ప్రమాణంగా చేయటానికి ఒక నిర్దిష్ట బరువుని ఒక ఏకకంగా నిర్ణయించాలి. ఒకే పేరు గల పరిమాణాలను కొలిచే సందర్భాలన్నిటిలో లాగానే, ఈ సందర్భంలో కూడా ఒక మారని కొలమానపు ఏకకాన్ని ఏర్పరచుకోవడం చాలా ముఖ్యం. ఈ ప్రమాణం ఎంత తక్కువగా మార్పుకి గురయితే ధర ప్రమాణం తన క్రియను అంత బాగా నిర్వహిస్తుంది. అయితే బంగారం స్వయంగా శ్రమ ఉత్పాదితం గనుకనే,

---

1. ఇంగ్లండులో ఒక ఔన్సు బంగారం, డబ్బుకి ప్రామాణిక ఏకకంగా వ్యవహరిస్తుంది. కాని ఒక పౌండ్ స్టెర్లింగ్ దానితో నిశ్శేషంగా భాగించబడదు. ఈ ప్రత్యేక పరిస్థితి ఇలా వివరించబడింది : "మన నాణాల వ్యవస్థను మొదట వెండిని ఉపయోగించడానికి మాత్రమే అనువుగా తయారు చేశారు. అంటే ఒక ఔన్సు వెండిని ఎప్పుడూ తగిన సంఖ్యలో చిన్న నాణాలుగా విభజించవచ్చు. తదనంతర కాలంలో, వెండికి మాత్రమే అనుకూలమైన నాణాల వ్యవస్థలోకి బంగారం ప్రవేశపెట్టబడినందున, ఔన్సు బంగారాన్ని పూర్ణ సంఖ్య గల ముక్కలుగా విభజించి నాణాలు చేయడం సాధ్యం కాదు. మాక్లారెన్, "ఎ స్కెచ్ ఆఫ్ ది హిస్టరీ ఆఫ్ ది కరెన్సీ." లండన్, 1858, పుట 16.

అందువల్ల దాని విలువ మార్పుకు గురయ్యే అవకాశం వుంది గనుకనే, అది విలువ కొలమానంగా వ్యవహరించగలుగుతుంది.[1]

మొదటి సంగతేమంటే, బంగారం విలువలో వచ్చే మార్పు ధర ప్రమాణంగా దాని క్రియను ఏరకంగానూ ప్రభావితం చేయదు. ఈ విలువ ఏరకంగా మారినప్పటికీ లోహానికి సంబంధించిన వివిధ పరిమాణాల విలువల మధ్య వుండే నిష్పత్తి స్థిరంగా వుంటుంది. దాని విలువ ఎంతగా పడిపోయినా 12 ఔన్సుల బంగారం ఒక ఔన్సు బంగారానికి పన్నెండు రెట్లే. ధరల విషయంలో, బంగారం యొక్క వివిధ పరిమాణాల మధ్య వున్న సంబంధం మాత్రమే పరిగణించబడుతుంది. మరోవైపున ఒక ఔన్సు బంగారం విలువలో పెరుగుదలగానీ, తరుగుదలగానీ దాని బరువుని మార్చలేదు గనుక, దాని భాగాల బరువులో ఎటువంటి మార్పు వుండబోదు. ఆ రకంగా బంగారం విలువ ఎంతగా మారినప్పటికీ అది మార్పులేని ప్రమాణంగా నిరంతరం ఒకే రకంగా ఉపయోగపడుతుంది.

రెండో సంగతేమంటే, బంగారం విలువలో వచ్చే మార్పు విలువ కొలమానంగా దానికున్న క్రియల్లో జోక్యం చేసుకోదు. ఆ మార్పు ఏకకాలంలో సరుకులన్నిటినీ ప్రభావితం చేస్తుంది. కనుక, మిగిలిన విషయాలన్నీ యధాతథంగా వున్న మేరకు వాటి విలువల పరస్పర సంబంధాలు కూడా యధాతథంగా వుంటాయి. అయితే ఆ విలువలను బంగారం రూపంలో వ్యక్తం చేసే ధరలు పెరగడమో, తరగడమో జరుగుతుంది.

ఏ సరుకు విలువనైనా మనం మరో సరుకు యొక్క నిర్దిష్ట పరిమాణం గల ఉపయోగపు విలువ ద్వారా అంచనా వేసినట్లే. దాని విలువని బంగారం ద్వారా అంచనా వేసేటప్పుడు ఆ సమయంలో నిర్దిష్ట పరిమాణం గల బంగారాన్ని ఉత్పత్తి చేయడానికి నిర్దిష్ట పరిమాణం గల శ్రమ ఖర్చవుతుంది అన్న అంశాన్ని మాత్రమే మనం పరిగణిస్తాము. పోతే, ధరల్లో వచ్చే హెచ్చు తగ్గులకి ప్రాథమిక సాపేక్ష విలువ నియమాలు వర్తిస్తాయి. వాటి పరిశోధన ఇంతకు ముందు ఒక అధ్యాయంలో జరిగింది.

సరుకుల ధరల్లో సార్వత్రిక పెరుగుదలకి కారణం వాటి విలువల్లో పెరుగుదల కావచ్చు (డబ్బు విలువ స్థిరంగా వుంటే), లేదా డబ్బు విలువ పడిపోవడం కావచ్చు (సరుకుల విలువలు స్థిరంగా వుంటే). మరోవైపున, ధరలు సార్వత్రికంగా పడిపోవటానికి కారణం సరుకుల విలువలు పడిపోవడం వల్ల కావచ్చు (డబ్బు విలువ స్థిరంగా వుంటే), లేదా డబ్బు విలువ పెరగడం వల్ల కూడా కావచ్చు (సరుకుల విలువలు స్థిరంగా వుంటే). కాబట్టి డబ్బు విలువ పెరగగానే అదే నిష్పత్తిలో సరుకుల ధరలు పడిపోయి తీరాలనేదేమీ లేదు. లేదా డబ్బు విలువ పడిపోగానే అదే నిష్పత్తిలో ధరలు పెరగాలనీ లేదు. ధరల్లో అటువంటి మార్పు విలువలు స్థిరంగా వున్న సరుకులకు మాత్రమే వర్తిస్తుంది. డబ్బు విలువతోపాటు అదే సమయంలో అదే నిష్పత్తిలో విలువలు పెరిగే సరుకుల ధరల్లో మార్పేమీ వుండదు. వాటి విలువ డబ్బు విలువ కంటే వేగంగా లేదా నెమ్మదిగానో పెరిగితే వాటి విలువల్లో వచ్చిన మార్పుకీ, డబ్బు విలువలో వచ్చిన మార్పుకీ మధ్య వున్న తేడాని బట్టి వాటి ధరల్లో, తలెత్తే పెరుగుదల లేదా తరుగుదల వుంటుంది. ఇలాగే మిగిలిన అంశాలు కూడా.

1. విలువ కొలమానం, ధర ప్రమాణం గురించి ఇంగ్లీషు రచయితల్లో వున్న గందరగోళం వర్ణనాతీతం. వారు నిరంతరం ఒకదాని క్రియల్ని, పేర్లనీ మరోదానికి తగిలించారు.

ధర రూపాన్ని పరిశీలించడానికి మనం వెనక్కి వెళదాం. డబ్బుగా అమలులో వున్న విలువైన లోహం యొక్క వివిధ బరువుల ద్రవ్య నామాలకీ, ఆ నామాలు పుట్టినప్పుడు మొదట తెలిపిన వాస్తవ బరువులకీ మధ్య క్రమ క్రమంగా తేడా తలెత్తుతుంది. చారిత్రక కారణాల ఫలితంగానే ఈ తేడా తలెత్తుతుంది. వాటిలో ప్రధానమైనవి : (1) అపరిపూర్ణంగా అభివృద్ధి చెందిన ఒక సమాజంలోకి విదేశీ ద్రవ్యం దిగుమతి కావడం. ఇది తొలినాటి రోమ్‌లో జరిగింది. అక్కడ వెండి, బంగారు నాణాలు మొదట విదేశీ సరుకులుగా చలామణి అయ్యాయి. ఈ విదేశీ నాణాల పేర్లు స్థానిక బరువుల పేర్లతో ఎప్పుడూ ఏకీభవించలేదు. (2) సంపద వృద్ధిచెందినకొద్దీ తక్కువ విలువున్న లోహాన్ని తొలగించి విలువ కొలమానంగా దాని స్థానాన్ని ఎక్కువ విలువైన లోహం ఆక్రమిస్తుంది. కవుల కాలక్రమానికి ఎంత విరుద్ధంగా ఉన్నప్పటికీ[1] ఇది జరుగుతుంది. రాగిని వెండి, వెండిని బంగారం తొలగిస్తాయి. ఉదాహరణకి, పౌండు అనే మాట వాస్తవంగా పౌండు (పౌను) బరువు గల వెండికి ఇవ్వబడిన ద్రవ్యనామం. విలువ కొలమానంగా బంగారం వెండిని తొలగించినప్పుడు అదే పేరు వెండి, బంగారాల విలువల నిష్పత్తికి అనుగుణంగా, బహుశా 1/15 పౌండు బంగారానికి వర్తింపజేయబడింది. ఆ విధంగా ద్రవ్యనామంగా పౌండ్ అనే పదం బరువు నామంగా పౌండ్ అనే పదంతో వేరయిపోతుంది.[2] (3) శతాబ్దాల తరబడి రాజులు డబ్బుని ఎంతగా రూపు చెడగొట్టారంటే నాణాల తొలి బరువుల్లో పేర్లు తప్ప ఇంకేమీ మిగల్లేదు.[3]

ఇలా ద్రవ్య నామం బరువు నామం నుండి వేరుపడటాన్ని చారిత్రక కారణాలు స్థిరపడిన ఆనవాయితీగా మారుస్తాయి. ద్రవ్య ప్రమాణం అనేది ఒకవైపున కేవలం సాంప్రదాయికం. మరోవైపున అది సర్వజన సమ్మతం అయివుండాలి. కనుక చివరిలో చట్టం దాన్ని క్రమబద్ధం చేస్తుంది. ఒకానొక విలువైన లోహపు నిర్దిష్ట బరువు, ఉదాహరణకి ఒక ఔన్సు బంగారం, అధికారికంగా కొన్ని భాగాలుగా విభజించబడుతుంది. వాటికి పౌండ్, డాలర్ లాంటి శాసనబద్ధ నామాలు వస్తాయి. ఇక నుంచీ డబ్బు ఏకకాలుగా వ్యవహరించే ఈ భాగాలు మళ్ళీ కొన్ని పూర్ణాంకపు భాగాలుగా విభజించబడతాయి. వీటికి షిల్లింగ్, పెన్నీలాంటి శాసనబద్ధ నామాలు వస్తాయి.[4] అయితే ఈ విభజనలు జరగడానికి ముందు, తర్వాత ఒక నిర్దిష్ట బరువు గల లోహమే లోహ ద్రవ్యానికి ప్రమాణం. జరిగిన మార్పల్లా ఉపవిభజనలోనూ, భాగాల పేర్లలోనూ వుంది.

---

1. అంతేగాక, దానికి సార్వత్రిక చారిత్రక గుర్తింపేదీ లేదు.
2. ఆ రకంగా ఇంగ్లండులో పౌండ్ స్టెర్లింగ్ దాని అసలు బరువులో మూడో వంతు మాత్రమే వుంది. విలీనానికి ముందు పౌండ్ స్కాట్ 1/36వ వంతు మాత్రమే వుంది. ఫ్రెంచి లివ్రే 1/74 వంతు, స్పానిష్ మరావెడి వెయ్యోవంతు కంటే తక్కువ, పోర్చుగీస్ రెయ్ అంతకంటే తక్కువ వున్నాయి.
3. ఈనాడు కేవలం భావాత్మకమైన నామాలున్న నాణాలు అన్ని జాతుల్లోనూ అత్యంత పురాతనమైనవే. ఒకప్పుడు అవన్నీ వాస్తవ నామాలే. అవి వాస్తవం కనుకనే జనం వాటిని గుర్తించారు. (గాలియనీ, డెల్లా మోనిటా, పుట 153). 1707లో ఇంగ్లండ్‌తో స్కాట్లండ్ విలీనం. (సం.)
4. ఇంగ్లండు ద్రవ్య ప్రమాణం అయిన పౌండ్ (స్టెర్లింగ్) ఇవ్వాళ కేవలం ఒక పావు ఔన్సు బంగారంతో మాత్రమే సమానం కావడమనే రాక్షసత్వం (!) గురించి 'ఫెమిలియర్ వర్డ్స్' అనే తన రచనలో డేవిడ్ ఉర్కుహర్ట్ రాశాడు. "ఇది ఒక ప్రమాణాన్ని ఏర్పర్చడం కాదు. ఒక కొలమానాన్ని వక్రీకరించడం మాత్రమే" అని ఆయన అన్నాడు. బంగారం బరువుకి ఇలాంటి "తప్పుడు నామధేయాన్ని" చూపి ప్రతి విషయంలోనూ ఇలాగే జరుగుతోందనీ, ప్రతిదాన్నీ వక్రీకరించేది నాగరికత హస్తమేననీ అతను భావిస్తాడు.

ధరలు, లేదా సరుకుల విలువలని భావాత్మకంగా మార్చగా వచ్చిన బంగారు పరిమాణాలు ఇప్పుడు నాణాల పేర్లలో వ్యక్తమవుతాయి. లేదా బంగారు ప్రమాణపు ఉప విభజనలకు శాసనబద్ధంగా పెట్టిన పేర్లతో వ్యక్తమవుతాయి. కనుక, ఒక క్వార్టర్ గోధుమ విలువ ఒక ఔన్సు బంగారం అనటానికి బదులు దాని విలువ 3 పౌండ్ల 17 షిల్లింగుల పదిన్నర పెన్నీలు అని మనం అంటాం. ఈ రకంగా సరుకులు తమ ధరల ద్వారా తమ విలువెంతో తెలియజేస్తాయి. ఒక వస్తువు విలువని డబ్బు రూపంలో నిర్ధారించాల్సి వచ్చినప్పుడల్లా డబ్బు ఖాతా డబ్బుగా వ్యవహరిస్తుంది.[1]

ఒక వస్తువు పేరు వేరు, దాని లక్షణాలు వేరు. ఒక మనిషి పేరు జాకబ్ అని తెలిసినంత మాత్రాన అతని గురించి నాకేమీ తెలియదు. అదే రకంగా డబ్బుకి సంబంధించి కూడా పౌండ్, డాలర్, ఫ్రాంక్, డుకాట్ వగైరా పేర్లలో విలువ సంబంధానికి చెందిన జాడలన్నీ మాయమవుతాయి. ఈ రహస్యమయ సంకేతాలకు ఒక గూఢార్థాన్ని ఆపాదించడం వల్ల తలెత్తే గందరగోళం అంతా ఇంతా కాదు. ఎందుకంటే ఈ ద్రవ్య నామాలు ఏకకాలంలో సరుకుల విలువల్నీ, ద్రవ్య ప్రమాణంగా వుండే లోహం బరువు యొక్క పూర్ణాంకపు భాగాలనీ వ్యక్తం[2] చేస్తాయి. మరోవైపున, సరుకుల వివిధ భౌతిక రూపాల కంటే భిన్నమైనదిగా గుర్తించటం కోసం విలువ పాదార్థికమూ, అర్థరహితమూ అయినా అదే సమయంలో సామాజికమూ అయిన రూపాన్ని[3] స్వీకరించడం అవసరం అవుతుంది.

ఒక సరుకులో వస్తావ రూపం ధరించిన శ్రమ యొక్క ద్రవ్యనామమే ధర. కనుక ఒక సరుకు సమ విలువని, దాని ధరని సూచించే డబ్బు మొత్తం ద్వారా వ్యక్తం చేయడం అంటే అది పునరుక్తి[4]

---

1. గ్రీకులు డబ్బుని ఎందుకు వాడారు అని ప్రశ్నించగా "లెక్కపెట్టడానికి" అని అనచార్సిస్ జవాబు చెప్పాడు. (ఏథేనియస్, డీప్నోసోపిస్టే, ఖండం 49, సంపుటి 2, స్క్యాయ్ గౌజర్ ముద్రణ, 1802)
2. ధరకి ప్రమాణంగా వ్యవహరించేప్పుడు డబ్బు సరుకుల ధరలలాంటి పేర్లతోనే లెక్కించబడుతుంది. కనుక 3 పౌండ్ల 17 షిల్లింగుల పదిన్నర పెన్నీలు ఒకవైపున ఒక ఔన్సు బంగారం బరువుని సూచించవచ్చు. మరోవైపున, ఒక టన్ను ఇనుము విలువని సూచించవచ్చు. డబ్బు లెక్కతెలిపే ఈ పేరుని టంకశాల ధర అంటారు. బంగారం విలువ దాని సొంత పదార్థంతోనే అంచనా వేయబడుతుంది. ఇతర సరుకులన్నిటికీ భిన్నంగా దాని ధరని ప్రభుత్వమే నిర్ణయిస్తుందనీ ఒక అసాధారణమైన భావం తలెత్తడానికి ఇదే కారణం. బంగారం యొక్క నిర్దిష్ట బరువులు గుర్తించడానికి వీలుగా పేర్లు పెట్టడమూ, ఆ బరువుల విలువలను నిర్ధారించడమూ ఒకటే అనే పొరపాటు ఆలోచన తలెత్తింది. (కారల్ మార్క్స్ అర్థశాస్త్ర విమర్శ, అధ్యాయం పుట 52)
3. ("అర్థశాస్త్ర విమర్శ"లో "ద్రవ్య ప్రమాణ సిద్ధాంతాలు" ఇంగ్లీషు ప్రతి, పుట 76) వెండి, బంగారాల నిర్దిష్ట బరువులకున్న శాసనబద్ధ నామాలను ఎక్కువ బరువున్న వెండి, బంగారు లోహాలకు ఆపాదిస్తే వాటి టంకశాల ధర పెరుగుతుందనీ, తక్కువ బరువులకు ఆపాదిస్తే వాటి టంకశాల ధర తగ్గుతుందనీ వింత భావాలు తలెత్తాయి. విలియమ్ పెట్టీ తన Quantulumcunque concerning money : To the Lord Marquisof Halifax, 1682లో ఈ భావాలను పరిశీలించాడు. ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లోని రుణదాతలకి ప్రతిగా తీసుకున్న అస్తవ్యస్తపు ఆర్థిక చర్యలను ఆయన పరిశీలించలేదు గాని ఈ వింత భావాలతో కూడిన చిట్కా ఆర్థిక పరిష్కారాలను మాత్రం క్షుణ్ణంగా పరిశీలించాడు. తర్వాత ఆయన అనుయాయులు సర్‌డడ్లీ నార్త్, జాన్‌లాక్ తదితరులు ఆయన సిద్ధాంతాన్ని అంత బాగా పరిశీలించలేదు. "ఓ ప్రకటన ద్వారా జాతి సంపదను పదిరెట్లు పెంచగలిగితే, గవర్నర్లు అటువంటి ప్రకటనలను ఇంత కాలంగా చెయ్యకపోవడం వింతే" అని పెట్టీ అన్నాడు. (పై గ్రంథం, పు. 36)
4. అలాకాకపోతే, పది లక్షల డబ్బు అంతే విలువ గల సరుకులకంటే విలువైనదని అంగీకరించాలి. (లెట్రోస్నె, పుట 918) అంటే ఒక విలువ దానితో సమానమైన మరో విలువ కంటే విలువైనది" అని చెప్పినట్టన్నమాట.

మాత్రమే. సాధారణంగా ఒక సరుకు సాపేక్ష విలువని వ్యక్తం చేయడమంటే రెండు సరుకుల సమ విలువని ప్రకటించడం లాంటిదే ఇది కూడా. ధర అనేది సరుకు విలువ పరిమాణానికి వక్త కనుక డబ్బుతో దాని మార్పిడి నిష్పత్తికి కూడా అది వక్తే. అయితే ఈ మార్పిడి నిష్పత్తి వక్త సరుకు విలువ పరిమాణానికి విధిగా వక్త కానవసరం లేదు. ఒక క్వార్టర్ గోధుమలోనూ, 2 పౌండ్లలోనూ (దాదాపు 1/2 ఔన్సు బంగారం) రెండు సమానమైన మొత్తాలలో సామాజిక అవసర శ్రమ ఇమిడి వుందనుకొందాము. 2 పౌండ్లు అనేది క్వార్టర్ గోధుమ విలువ పరిమాణానికి డబ్బు రూపంలో వ్యక్తీకరణ లేదా అది దాని ధర. ఇప్పుడు ఈ ధర 3 పౌండ్లకు పెరగడానికి లేదా 1 పౌండుకి తగ్గటానికి పరిస్థితులు అనుమతించాయి అనుకుందాం. గోధుమ విలువ పరిమాణాన్ని వ్యక్తం చేయడానికి 1 పౌండు, 3 పౌండ్లు అనేవి బాగా తక్కువ కావచ్చు, లేదా ఎక్కువ కావచ్చు. అయినప్పటికీ అవి దాని ధరలు. ఎందుకంటే, దాని విలువ డబ్బు రూపంలో కన్పించడం అనేది మొదటి కారణం. డబ్బుతో విలువ పరిమాణం యొక్క మార్పిడి నిష్పత్తికి అవి వక్తలు కావటం రెండో కారణం. ఉత్పత్తి పరిస్థితులు స్థిరంగా వుంటే, మరో రకంగా చెప్పాలంటే శ్రమ ఉత్పాదక శక్తి స్థిరంగా వుంటే, ధరల్లో మార్పు రావడానికి ముందూ, తర్వాతా కూడా ఒక క్వార్టర్ గోధుమ పునరుత్పత్తిలో ఒకే పరిమాణపు సామాజిక శ్రమ కాలం వ్యయం కావాలి. ఈ పరిస్థితి గోధుమ ఉత్పత్తిదారుని ఇచ్ఛపై గానీ, ఇతర సరుకుల ఉత్పత్తిదారుల ఇచ్ఛపైగానీ ఆధారపడి వుండదు.

విలువ పరిమాణం ఒక సామాజిక ఉత్పత్తి సంబంధాన్ని వ్యక్తం చేస్తుంది. ఒక వస్తువుకీ, దానిని ఉత్పత్తి చేయడానికీ అవసరమైన మొత్తం సామాజిక శ్రమ కాలంలో భాగానికీ మధ్య విధిగా వున్న సంబంధాన్ని అది వ్యక్తం చేస్తుంది. విలువ పరిమాణాన్ని ధరగా మార్చగానే ఈ విధాయక సంబంధం సరుకుకీ, డబ్బు అనే మరొక సరుకుకీ మధ్య గల యాదృచ్ఛిక మార్పిడి నిష్పత్తి రూపం తీసుకుంటుంది. అయితే ఈ మార్పిడి నిష్పత్తి ఆ సరుకు యొక్క నిజమైన విలువ పరిమాణాన్ని వ్యక్తం చేయవచ్చు. లేదా అప్పుడున్న పరిస్థితులలో ఆ సరుకును అమ్మితే విలువ నుండి వైదొలగిన బంగారం ఎంత వస్తుందో ఆ బంగారపు పరిమాణాన్ని వ్యక్తం చేయవచ్చు. కనుక ధరకీ, విలువ పరిమాణానికీ మధ్య పరిమాణాత్మక అస్తవ్యస్తత ఏర్పడే అవకాశం, అనగా ధర అనేది విలువ పరిమాణం నుండి వైదొలగే అవకాశం ధర రూపంలోనే అంతర్గతంగా వుంది.

ఇది లోపం కాదు. తద్విరుద్ధంగా ఇది ధర రూపాన్ని శ్లాఘనీయంగా ఒక ప్రత్యేక ఉత్పత్తి విధానానికి అనువుగా మలుస్తుంది. ఏ ఉత్పత్తి విధానం యొక్క అంతర్గత నియమాలు నియమ రహితమైనవిగా కనిపిస్తూ పరస్పరం సర్దుబాటు చేసుకునే అస్తవ్యస్తతల సగటు ఫలితంగా పనిచేస్తాయో ఆ ఉత్పత్తి విధానానికి అనువుగా మలుస్తుంది.

విలువ పరిమాణానికీ, ధరకీ మధ్య అంటే విలువ పరిమాణానికీ, డబ్బు రూపంలో దాని వ్యక్తీకరణకీ మధ్య పరిమాణాత్మక అసంగతత్వం వుండే అవకాశం ధర రూపానికి వ్యతిరేకం కాదు. పైగా ఎలాగంటే ధర రూపంలో గుణాత్మకమైన అంతర్వైరుధ్యం వుండవచ్చు. డబ్బు అనేది సరుకుల విలువ రూపం మాత్రమే అయినప్పటికీ, ధర అనేది విలువను బొత్తిగా వ్యక్తం చేయకపోవచ్చు. అంతరాత్మ, గౌరవం వగైరాలు తమంత తాముగా సరుకులు కానప్పటికీ వాటి యజమానులు వాటిని అమ్మకానికి పెట్టడం సాధ్యమే. ఆ రకంగా వాటి ధర వల్ల అవి సరుకుల రూపం ధరిస్తాయి. కనుక

విలువ అనేది లేని వస్తువులకు సైతం ధర అనేది వుండొచ్చు. అటువంటి సందర్భంలో ధర, గణితశాస్త్రంలో కొన్ని పరిమాణాల్లాగానే, ఊహాత్మకం. మరోవైపున ఈ ఊహాత్మక ధర రూపం కొన్ని సందర్భాల్లో ఒక నిజమైన, ప్రత్యక్ష లేదా పరోక్ష విలువ సంబంధాన్ని దాచవచ్చు. ఉదాహరణకి, సాగుచెయ్యని నేలలో మానవ శ్రమ లేదు. కనుక దానికి విలువ లేదు. కాని దానికి ధర వుండొచ్చు.

సాధారణ సాపేక్ష విలువలాగానే ధర కూడా ఒక సరుకు (ఉదాహరణకి, ఒక టన్ను ఇనుము) విలువని వ్యక్తం చేస్తుంది. ఒక నిర్దిష్ట పరిమాణం గల సమ విలువ (ఉదాహరణకి, ఒక ఔన్సు బంగారం) ఇనుముతో నేరుగా మార్పిడి కాగలదు అని ప్రకటించడం ద్వారా అది అలా వ్యక్తం చేస్తుంది. అయితే అది దీనిని తిరగేసిన రూపంలో, అంటే ఇనుము నేరుగా బంగారంతో మార్పిడి కాగలదు అని అది వ్యక్తం చేయదు. కనుక ఆచరణలో ఒక సరుకు సమర్థంగా మార్పిడి విలువలా వ్యవహరించాలంటే అది దాని శారీరక రూపాన్ని వదిలేయాలి. కేవలం ఊహాత్మక బంగారం నుండి నిజమైన బంగారంగా మారాలి. 'ఆవశ్యకం' నుండి 'స్వేచ్ఛ'కి పరివర్తన అనేది హెగెల్ భావనకు ఎంత కష్టమో, ఎండ్రకాయకి తన గుల్లని వదిలెయ్యడం ఎంత కష్టమో, పాపపు ఆలోచనల నుంచి తప్పించుకోవడం సెయింట్ జెరోమ్[1]కి ఎంత కష్టమో, ఈ పదార్థాంతరీకరణం (Transubstantiation) అనేది ఆ పదార్థానికి అంతకు మించిన కష్టమే అయినప్పటికీ అది తప్పదు. ఒక సరుకు దాని అసలు రూపం (ఉదాహరణకి, ఇనుము)తోపాటు పక్కపక్కనే మన ఊహలో బంగారం రూపం తీసుకున్నప్పటికీ, ఏక కాలంలో అది వాస్తవంలో ఇనుముగానూ, బంగారంగానూ, అంటే రెండింటి గానూ వ్యవహరించలేదు. దాని ధర నిర్ణయించడానికి ఊహలో దానిని బంగారంతో సమం చేస్తే సరిపోతుంది. కాని, దాని సొంతదారునికి అది సార్వత్రిక సమ విలువగా ఉపయోగపడాలంటే మాత్రం దాన్ని నిజంగానే బంగారంగా మార్చాలి. ఒకవేళ ఇనుము సొంతదారుడు మార్పిడికి సిద్ధంగా వున్న మరో సరుకు సొంతదారుని దగ్గరకుపోయి ఇనుము డబ్బేననీ దాని ధరే అందుకు నిదర్శనమనీ అన్నాడనుకుందాం. స్వర్గంలో డాంటేకు సెయింట్ పీటర్ ఇచ్చిన జవాబే అతనికీ ఎదురవుతుంది.

"నాణెం ధాతుమిశ్రమం గురించీ, దాని బరువు గురించీ జరిగిన చర్చ చాలు. ఇంతకీ అది నీ జేబులో వుందో, లేదో చెప్పు."

కనుక, ధర అనేది ఒక సరుకు మార్పిడికి అనువుగా వుంటుందని సూచించడంతోపాటు అది అలా మార్పిడి చేయబడాలని కూడా సూచిస్తుంది. మరోవైపున మార్పిడి ప్రక్రియలో బంగారం తనని తాను డబ్బు అనే సరుకుగా రూఢి చేసుకోగల్గింది కనుకనే అది భావరూపేణా, విలువ కొలమానంగా వ్యవహరించగల్గుతుంది. ఈ భావాత్మక విలువల కొలమానం మాటున నగదు డబ్బు దాగి వుంది.

---

1. ఎడారిలో తన ఊహాలోకపు సుందర నారీమణులతో జెరోమ్ నిర్వహించిన పోరాటం ద్వారా వెల్లడైనట్టుగా అతడు భౌతిక దేహంతో తన యవ్వనంలో మాత్రమేగాక ఆత్మిక దేహంతో వృద్ధాప్యంలో సైతం తీవ్రంగా పెనుగులాడాల్సి వచ్చింది. 'విశ్వ న్యాయాధీశుని ముందు నేను ఆత్మరూపంలో వున్నానేమో అనుకున్నాను'' అంటాడు అతను.
   ''ఎవరు నువ్వు?'' అడిగిందో కంఠం. ''నేనొక క్రైస్తవుణ్ణి''. ''అబద్ధం'' గర్జించింది మహా న్యాయాధీశుని కంఠం. ''నువ్వు ఒక సిసెరోనియన్‌వి తప్ప మరేమీ కాదు.''

## విభాగం 2
# చలామణి సాధనం
### అ. సరుకుల రూపాంతరం

సరుకుల మార్పిడిలో పరస్పర విరుద్ధమైనవీ, ఒకటి వుంటే మరొకటి వుండనివీ అయిన పరిస్థితులుంటాయనే విషయాన్ని మనం ఇంతకు ముందు ఒక అధ్యాయంలో గమనించాము. సరుకుల్ని సరుకులుగానూ, డబ్బుగానూ వేరుచేసినంత మాత్రాన పరస్పరం పొసగని అంశాలు తొలగిపోవు. అయితే దానివల్ల ఈ విరుద్ధ అంశాలు పక్కపక్కనే సహజీవనం చేయడానికి వీలు అయిన రూపం (వ్యవస్థ) చిక్కుతుంది. సాధారణంగా నిజమైన వైరుధ్యాలకు రాజీకుదిర్చే పద్ధతి ఇది. ఉదాహరణకి, ఒక వస్తువు నిరంతరాయంగా మరో వస్తువువైపు పడిపోతోందనీ, అదే సమయంలో అది దాని నుండీ దూరంగా ఎగిరిపోతోందని అనటం వైరుధ్యపూరితం. దీర్ఘవృత్తగతి (ellipse) అనేది ఆ వైరుధ్యాన్ని అనుమతిస్తూనే, అదే సమయంలో దానికి రాజీ కుదిరించే చలన రూపం.

సరుకులు ఉపయోగేతర విలువలుగా వున్న చోటునుండి ఉపయోగపు విలువలుగా వుండే చోటుకి మారే ప్రక్రియే మార్పిడి. ఈ మేరకు అది పదార్థం యొక్క సామాజిక చలామణి ఒక రూపంలో వున్న ఉపయోగకర శ్రమ యొక్క ఉత్పాదితం స్థానాన్ని మరొకటి ఆక్రమిస్తుంది. ఒక సరుకు విరామ ప్రదేశానికి చేరితే, అంటే అది ఉపయోగపు విలువగా వ్యవహరించగల్గిన చోటుకి చేరుకుంటే, అది మార్పిడి రంగం నుంచి తప్పుకొని, అనుభోగ (వినియోగ) రంగానికి చేరుతుంది. అయితే ప్రస్తుతానికి మనకి ఆసక్తి కలిగించేది మార్పిడి రంగం మాత్రమే. కనుక ఇప్పుడు మనం మార్పిడి అనేదాన్ని దాని రూపం దృష్టి నుంచి పరిశీలించాలి. అనగా పదార్థం యొక్క సామాజిక చలామణిని సాధించే సరుకుల రూప పరివర్తనను లేదా రూపాంతరాన్ని పరిశోధించాలి.

సాధారణంగా ఈ రూపాంతరాన్ని అర్థం చేసుకోవడం లోపభూయిష్టంగా వుంటుంది. విలువకి సంబంధించిన అస్పష్ట భావాలు అందుకు ఒక కారణం. కానీ అసలు కారణం ఏమిటంటే, ఒక సరుకు రూపంలో వచ్చే ప్రతి మార్పు రెండు సరుకుల మధ్య మార్పిడి వల్ల, అంటే ఒక మామూలు సరుకుకీ, ఒక ద్రవ్య సరుకుకీ మధ్య మార్పిడి వల్ల తలెత్తుతుందన్నది. ఒక సరుకు బంగారంతో మార్పిడి అయింది అనే భౌతిక సత్యాన్ని మాత్రమే మనం దృష్టిలో వుంచుకుంటున్నప్పుడు మనం పరిశీలించవలసిన అంశాన్ని పరిశీలించకుండానే వదిలేస్తున్నాము. అంటే, ఆ సరుకు రూపానికి ఏమయింది అన్న అంశాన్ని వదిలేస్తున్నాం. బంగారం కేవలం సరుకుగా వున్నపుడు అది డబ్బు కాదనీ, కానీ ఇతర సరుకులు బంగారం ద్వారా వాటి ధరలను వ్యక్తం చేసినప్పుడు ఈ బంగారమే ఆ సరుకుల ద్రవ్యరూపమనీ మనం గమనించడం లేదు.

సరుకులు మొదట మార్పిడి ప్రక్రియలోకి తామున్న రూపంలోనే ప్రవేశిస్తాయి. తర్వాత మార్పిడి ప్రక్రియ వాటిని సరుకులుగానూ, డబ్బుగానూ వేరుచేస్తుంది. ఆ రకంగా అది వాటిలో సహజంగా వున్న అంతర్వైరుధ్యానికి – ఒకేసారి ఉపయోగపు విలువలుగానూ, విలువలుగానూ వుండడం అనే అంతర్వైరుధ్యానికి – అనుగుణంగా ఒక బాహ్య వైరుధ్యాన్ని పుట్టిస్తుంది. ఇప్పుడు ఉపయోగపు విలువలుగా వుండే సరుకులకు వ్యతిరేకంగా మార్పిడి విలువగా డబ్బు నిలబడుతుంది. మరోవైపున, రెండు విరోధి పక్షాలూ సరుకులే. ప్రతిదానిలోనూ ఉపయోగపు విలువ, విలువ వుంటాయి. అయితే

ఈ విభేదాల ఐక్యత రెండు విరుద్ధ ధ్రువాల దగ్గర వ్యక్తమవుతుంది. ప్రతి ధ్రువం దగ్గరా ఈ ఐక్యత విరుద్ధంగా వ్యక్తమవుతుంది. అవి ధ్రువాలు కనుక విధిగా వాటి మధ్య ఎంత వైరుధ్యముందో అంత సంబంధం వుంది. సమీకరణానికి ఒకవైపున ఒక మామూలు సరుకుంది. అది నిజానికి ఉపయోగపు విలువ. దాని విలువ, దాని ధర ద్వారా కేవలం భావరూపేణా మాత్రమే వ్యక్తమైంది. తద్వారా అది దాని ప్రత్యర్థి అయిన బంగారంతో సమం అని చూపబడింది. ఇక్కడ, బంగారం దాని విలువకు సాకార రూపం. మరోవైపున, బంగారం తన లోహవాస్తవికతతో విలువకి సాకార రూపంగా, డబ్బుగా వ్యవహరిస్తుంది. బంగారం బంగారంగా స్వయంగా మార్పిడి విలువే. దాని ఉపయోగపు విలువకి సంబంధించినంత వరకూ దానికి కేవలం భావాత్మక అస్తిత్వం మాత్రమే వుంది. దానికి ఎదురుగా నిలిచే సరుకులన్నింటి సాపేక్ష విలువ వ్యక్తీకరణల పరంపర దాని ఉపయోగ విలువకు ప్రాతినిధ్యం వహిస్తుంది. వాటి ఉపయోగాల మొత్తమే, బంగారానికున్న వివిధ ఉపయోగాల మొత్తం సరుకులకుండే ఈ శత్రు రూపాల ద్వారానే ఆ సరుకుల మార్పిడి క్రమం జరుగుతుంది.

ఇప్పుడు మనం ఒక సరుకు సొంతదారుని వెంట, ఉదాహరణకి వస్త్రాన్ని నేసిన మన పాత మిత్రుడు నేతగాని వెంట కార్యరంగానికి, అంటే మార్కెటుకి వెళదాం. అతని 20 గజాల వస్త్రానికి ఒక నిర్దిష్టమయిన ధర వుంది. అది రెండు పౌండ్లు. అతడు దాన్ని 2 పౌండ్లకి మార్పిడి చేస్తాడు. అతడు సత్యకాలం మనిషిలాగా 2 పౌండ్లిచ్చి ఆ ధర గల బైబిల్ గ్రంథాన్ని కొంటాడు. అతని దృష్టిలో వస్త్రం అనేది కేవలం ఒక సరుకు, విలువకి నిలయం. బంగారంతో మార్పిడిలో అతడు దాన్ని పరాధీనం చేస్తాడు. బంగారం వస్త్రం యొక్క విలువ రూపం. ఈ రూపాన్ని కూడా అతను బైబిల్ అనే మరో సరుకు కోసం వదులుకుంటాడు. బైబిల్ ఇప్పుడు ఒక ఉపయోగకర వస్తువుగా, కుటుంబ సభ్యుల్లో నిష్ఠని పెంచే అంశంగా అతని ఇంటిలో ప్రవేశిస్తుంది. విరుద్ధమైన, అదే సమయంలో పరస్పర పూరకమైన స్వభావం గల రెండు రూపాంతరాల ద్వారా – సరుకు డబ్బుగా మారి, డబ్బు మరో సరుకుగా మళ్ళీ మారటం ద్వారా – మార్పిడి పూర్తయింది.[1] ఈ రూపాంతరం యొక్క రెండు దశలూ నేతగాడు నిర్వహించిన రెండు విభిన్నమయిన చర్యలు – అమ్మడం, లేదా సరుకుని డబ్బు కోసం మార్పిడి చేయడం, కొనడం, లేదా డబ్బుని సరుకు కోసం మార్పిడి చేయడం. తద్వారా రెండు చర్యల ఐక్యత, కొనడం కోసం అమ్మకం జరిగింది.

నేతగానికి సంబంధించినంతవరకూ ఈ లావాదేవీ మొత్తం ఫలితం ఏమంటే, ఇప్పుడు అతని చేతిలో వస్త్రానికి బదులు బైబిల్ వుంది. అతని దగ్గర తన తొలి సరుకుకి బదులు అంతే విలువ గల, భిన్న ఉపయోగం గల మరో సరుకు వుంది. అదే పద్ధతిలో అతను ఇతర జీవితావసర వస్తువుల్నీ, ఉత్పత్తి సాధనాల్నీ సంపాదిస్తాడు. అతని దృష్టిలో ఈ మొత్తం ప్రక్రియ సాధించింది ఏమిటంటే, అతని శ్రమ ఉత్పాదితం మరొకని శ్రమ ఉత్పాదితానికి మారకం కావడం తప్ప మరేమీ కాదు, రెండు ఉత్పాదితాల మారకం తప్ప మరేమీ కాదు.

---

1. "హెరాక్లిటస్ చెప్పినట్టుగా, అన్ని సరుకులూ బంగారంతోనూ, బంగారం అన్ని సరుకులతోనూ మార్పిడి చేసుకున్నట్లే, అన్ని వస్తువులూ అగ్నితోనూ, అగ్ని అన్ని వస్తువులతోనూ మార్పిడి చేసుకుంటాయి. (ఎఫ్. లాసాల్ : "Die Philosophic Herakleitos des Dunkeln", బెర్లిన్, 1858, ఒకటో సంపుటి, పుట 222.) ఈ ఉల్లేఖనపై తాను రాసిన వ్యాఖ్యానంలో లాసాల్ బంగారాన్ని కేవలం విలువ చిహ్నం అనడం పొరపాటు.

కనుక సరుకుల మార్పిడి జరిగినప్పుడు వాటి రూపంలో ఈ క్రింది మార్పులు వస్తాయి.

సరుకు --------------- డబ్బు --------------- సరుకు

స --------------- డ --------------- స

వస్తువులకి సంబంధించినంత వరకూ ఈ మొత్తం ప్రక్రియ ఫలితం "స – స". అంటే ఒక సరుకుని మరో సరుకు కోసం మార్పిడి చేయడం. అంటే పాదార్థిక రూపం ధరించిన సామాజిక శ్రమ చలామణి. ఈ ఫలితం వచ్చిందీ అంటే ఈ ప్రక్రియ అంతమైందని అర్థం.

## స – డ. మొదటి రూపాంతరం, లేదా అమ్మకం

సరుకు శరీరం నుండి బంగారం శరీరంలోకి విలువ లంఘిస్తుంది. నేను మరోచోట పేర్కొన్నట్టు ఇది సరుకు యొక్క నిరాశోన్మాద లంఘనం (Salto mortale). అది దూకటంలో పూర్తి సాఫల్యత సాధించకపోతే సరుకుకు హాని జరగదు కాని, దాని సొంతదారునికి మాత్రం కచ్చితంగా జరుగుతుంది. సామాజిక శ్రమ విభజన వల్ల అతని శ్రమ ఏకముఖంగా వుంటుంది. అతని అవసరాలు బహుముఖంగా వుంటాయి. ఈ కారణం వల్లనే అతని శ్రమ ఉత్పాదితం కేవలం మార్పిడి విలువగా అతనికి ఉపకరిస్తుంది. అయితే, అది డబ్బుగా మారితే తప్ప, సామాజికంగా గుర్తించబడిన సార్వత్రిక సమ విలువ లక్షణాలను సంతరించుకోలేదు. ఆ డబ్బు మరొకరి జేబులో వుంది. ఆ జేబులో నుండి డబ్బుని రాబట్టాలంటే, ఆ డబ్బు గల ఆసామికి మన మిత్రుని సరుకు ఉపయోగకర వస్తువు అయి వుండాలి. ఇది చాలా ముఖ్యం. అంటే, దానిపై వెచ్చించిన శ్రమ సామాజికంగా ఉపయోగకర శ్రమ అయి వుండాలి. సామాజిక శ్రమ విభజనలో అది ఒక విభాగం అయి వుండాలి. అయితే సామాజిక శ్రమ విభజన అనేది తనంతకు తానే పెరిగిన ఒక ఉత్పత్తి వ్యవస్థ. ఇప్పటికీ అది ఉత్పత్తిదారుల పరోక్షంలో పెరుగుతూనే వుంది. మార్పిడి చేయాల్సిన సరుకు ఒక కొత్త తరహా, శ్రమ యొక్క ఉత్పాదితం కావచ్చు. కొత్త అవసరాలను తీర్చగలనని అది చెప్పుకోవచ్చు. లేదా కొత్త అవసరాలను పుట్టిస్తానని కూడా చెప్పుకోవచ్చు. నిన్నటి వరకూ ఒక ఉత్పత్తిదారుడు ఒక సరుకు ఉత్పత్తిలో నిర్వహించిన అనేక కార్యకలాపాల్లో ఒకటిగా వున్న ఒక నిర్దిష్ట చర్య ఇవ్వాళ ఈ సంబంధం నుండి వేరుపడిపోవచ్చు. తనని తాను ఒక స్వతంత్ర శ్రమ విభాగంగా ఏర్పరచు కోవచ్చు. తన అసంపూర్ణ ఉత్పాదితాన్ని ఒక స్వతంత్ర సరుకుగా మార్కెటుకి పంపించవచ్చు. అటువంటి ఏర్పాటుకి పరిస్థితులు పక్వమై వుండొచ్చు, వుండకపోవచ్చు. ఈ రోజు ఒక ఉత్పాదితం ఒక సామాజిక అవసరాన్ని తీరుస్తుంది. రేపు అదే వస్తువుని పూర్తిగానో, పాక్షికంగానో మరో ఎక్కువ ఉపయోగకర వస్తువు తోసివేయవచ్చు. అంతేగాక, మన నేతగాని శ్రమ సామాజిక శ్రమ విభజనలో ఒక గుర్తించబడిన భాగమే అయుండవచ్చు. అంతమాత్రాన అది అతని 20 గజాల వస్త్రానికి ఉపయోగం వుందనటానికి హామీ కాదు. వస్త్రం కోసం సామాజిక అవసరం అనేదానికి, మిగిలిన అన్ని అవసరాల లాగానే ఒక పరిమితి వుంటుంది. పోటీ నేతగాళ్ళ ఉత్పాదితాల వల్ల అప్పటికే సమాజానికున్న వస్త్రాల అవసరం తీరి వుంటే మన మిత్రుని ఉత్పాదితం అనవసరం అవుతుంది; వృధా అవుతుంది. ఉపయోగ రహితం అవుతుంది. దానంగా వచ్చే గుర్రానికి దంతసిరి వుందో లేదో ఎవరూ పట్టించుకోరు. అయితే మన మిత్రుడు

కార్ల్ మార్క్స్, "అర్థశాస్త్ర విమర్శ" ....లో (సం.)

మార్కెటుకు పోయేది, దానాలివ్వటానికి కాదు. పోనీ, అతని ఉత్పాదితం నిజమైన ఉపయోగపు విలువ అని తేలింది. కనుక అది డబ్బుని రాబడుతుంది అనుకుందాం. ఎంత రాబడుతుంది అన్న ప్రశ్న తలెత్తుతుంది. ఆ వస్తువు విలువ పరిమాణానికి వక్త అయిన ధరని బట్టి సమాధానం ముందుగానే ఊహించబడిందనుటలో సందేహం లేదు. మన మిత్రుడు విలువని అంచనా వేయడంలో పొరపాటు పడవచ్చునే అంశాన్ని మనం ఇక్కడ పరిగణనలోకి తీసుకోము. అటువంటి పొరపాటుని మార్కెటు సరిచేస్తుంది. అతని ఉత్పాదకం పైన సామాజికంగా ఎంత శ్రమ అవసరమో అంతే వెచ్చించాడనుకుందాం. అటువంటప్పుడు అతని సరుకులో వాస్తవ రూపం ధరించిన సామాజిక శ్రమ పరిమాణానికి కేవలం ద్రవ్య నామమే దాని ధర. అయితే మన నేత మిత్రుని అనుమతి లేకుండానే, అతని పరోక్షంలో పాత నేత పద్ధతిలో మార్పు వస్తుంది. ఒక గజం గుడ్డ తయారుచేయడానికి సామాజికంగా నిన్న అవసరమైన శ్రమ కాలం ఈ రోజు కాదు. మన మిత్రుని పోటీ నేతగాళ్ళు ప్రకటించిన ధరలను చూపించి, డబ్బు సొంతదారుడు ఈ సత్యాన్ని నిరూపించటానికి ఆత్రంగా ప్రయత్నిస్తాడు. మన మిత్రుని దురదృష్టం కొద్దీ, నేతగాళ్ళు కొద్దిమంది కాదు, అరుదు అంతకన్నా కాదు. మార్కెట్‌లో వున్న ప్రతి వస్త్రం ముక్కలోనూ సామాజికంగా అవసరమైన శ్రమ కాలం మాత్రమే ఉందనుకుందాము. అయినప్పటికీ, ఈ మొత్తం ముక్కల్ని కలిపి చూస్తే వాటన్నిటిమీదా కలిపి అధిక శ్రమ కాలం ఖర్చయి వుండొచ్చు. గజానికి 2 షిల్లింగుల చొప్పున మామూలు ధరకి మొత్తం సరుకుని సమాజం వినియోగించుకోలేకపోతే, మొత్తం సామాజిక శ్రమలో మితిమీరిన భాగం నేతపని రూపంలో వ్యయమయిందని అర్థం. విడివిడిగా ప్రతి నేతగాడూ తన ఉత్పాదితంపైన సామాజికంగా అవసరమైనంత కంటే ఎక్కువ శ్రమ కాలం ఖర్చు పెట్టడం వల్ల వచ్చే ఫలితమే, దీనివల్ల కూడా వచ్చింది. “కలిపి పట్టుపడ్డారు. కలిపి ఉరిదీయబడ్డారు”. అనే జర్మన్ సామెత యిక్కడ వర్తిస్తుంది. మార్కెటులో వున్న వస్త్రం అంతా కలిపి ఒకే వాణిజ్య వస్తువు క్రింద లెక్క. ప్రతి వస్త్రం ముక్కా దానిలో ఒక పూర్ణాంకపు భాగం. నిజానికి, ప్రతి గజం యొక్క విలువా ఏకరూప మానవ శ్రమలో నిర్దిష్టమైన, సామాజికంగా నిర్ధారితమైన ఒకే పరిమాణం యొక్క పాదార్థిక రూపం”[1] మాత్రమే.

సరుకులు డబ్బుని ప్రేమిస్తున్నాయని మనం గ్రహించాము. అయితే “నిజమైన ప్రేమకి పూలబాట లేదు.” సామాజిక శ్రమ గుణాత్మక విభజన ఏరకంగా జరుగుతుందో సరిగ్గా అలాగే దాని పరిమాణాత్మక విభజన కూడా స్వయంజనితంగానూ, యాదృచ్ఛికంగానూ జరుగుతుంది. తమని స్వతంత్ర ప్రైవేటు ఉత్పాదకులుగా మార్చే శ్రమ విభజనే, సామాజిక ఉత్పత్తి ప్రక్రియనూ, ఆ ప్రక్రియ లోపల విడి విడి ఉత్పాదకుల మధ్య ఒకరితో మరొకరికి వున్న సంబంధాలనూ కూడా వారి ఇచ్ఛకు లోబడి వుండే స్థితి నుండి విముక్తి చేస్తుందనే సంగతిని సరుకుల సొంతదారులు గ్రహిస్తారు. పైకి కనిపించే తమ

1. మార్క్స్ 1878, నవంబరు 28న ఎన్.ఎఫ్. డేనియల్‌సన్ (నికోలాయ్)కి రాసిన ఉత్తరంలో ఈ వాక్యాన్ని ఈ క్రింది విధంగా సరిచేసుకోమని తెలిపాడు. ‘నిజానికి, ప్రతి గజం ముక్క విలువా మొత్తం గజాలన్నిటిలోనూ వెచ్చించిన సామాజిక శ్రమలో ఒక భాగం యొక్క పాదార్థిక రూపం మాత్రమే ‘పెట్టుబడి మొదటి సంపుటి రెండో జర్మన్ కూర్పులో కూడా ఇటువంటి సవరణ చేశారు. అయితే ఈ సవరణ అతని దస్తూరీలో లేదు. రష్యన్ కూర్పులో ‘మార్క్సిజం లెనినిజం సంస్థ’ నోట్.

పరస్పర స్వాతంత్ర్యానికి అనుబంధంగానే, ఉత్పాదితాల ద్వారా సార్వత్రిక, పరస్పర పరాధీనత కూడా తమని వెన్నంటి వుంటుందని వారు గ్రహిస్తారు.

శ్రమ విభజన, ఒక శ్రమ ఉత్పాదితాన్ని సరుకుగా మారుస్తుంది. తద్వారా అది సరుకు మళ్ళీ డబ్బుగా మారడాన్ని అవసరమయ్యేలా చేస్తుంది. అదే సమయంలో అది ఈ పదార్థాంతరీకరణం యాదృచ్ఛికంగా జరిగేలా చూస్తుంది. అయితే ఇక్కడ మనం ఈ ఘటనను పరిశుద్ధ రూపంలో పరిశీలిస్తున్నాము కనుక, అది మామూలుగా సాగుతోందని భావిస్తాం. అంతేగాక ఈ మార్పు జరిగితే, అంటే సరుకు పూర్తిగా అమ్మకానికి అనర్హం కాకుంటే, దాని రూపాంతరీకరణం జరిగి తీరుతుంది. సరుకుకి వచ్చిన ధర మామూలు విలువ కంటే బాగా ఎక్కువైనా, తక్కువైనా అది జరిగి తీరుతుంది.

అమ్మకందారుని సరుకు స్థానంలోకి బంగారం వచ్చింది. కొనుగోలుదారుని బంగారం స్థానంలోకి సరుకు వచ్చింది. ఇక్కడ ఒక వాస్తవం కొట్టొచ్చినట్టు కనిపిస్తుంది. ఒక సరుకూ, బంగారమూ, అంటే 20 గజాల వస్త్రమూ, 2 పౌండ్లూ చేతులు మారాయి, చోటు మారాయి. మరోలా చెప్పాలంటే వాటి మార్పిడి జరిగింది. అయితే సరుకు మార్పిడి దేనితో జరిగింది? తన సొంత విలువ ధరించిన రూపంతో, సార్వత్రిక సమవిలువతో బంగారం మార్పిడి దేనితో జరిగింది? తన సొంత ఉపయోగపు విలువ యొక్క ఒకానొక రూపంతో వస్త్రం ఎదురుపడినప్పుడు బంగారం డబ్బు రూపం ఎందుకు తీసుకుంటుంది? ఎందుకంటే, వస్త్రం ధర అయిన 2 పౌండ్లు, డబ్బు రూపంలో రెండు పౌండ్లు అనే పేరు కలిగినట్టిది, వస్త్రాన్ని డబ్బు స్వభావం వున్న బంగారంతో ఇంతకు ముందే సమం చేసింది. ఒక సరుకు పరాధీనం కాగానే, దాని తొలి సరుకు రూపాన్ని వదిలేస్తుంది. అంటే దాని ఉపయోగపు విలువ ఇంతకు ముందు కేవలం దాని ధరలో భావాత్మకంగా వున్న బంగారాన్ని ఆకర్షించిన మరుక్షణమే అది తన సరుకు రూపాన్ని వదిలేస్తుంది. సరుకు ధర లేదా దాని భావాత్మక విలువ రూపం వాస్తవ రూపం ధరించిందీ అంటే, అదే సమయంలో డబ్బు యొక్క భావాత్మక ఉపయోగపు విలువ కూడా వాస్తవ రూపం ధరించింది అని అర్థం. ఒక సరుకు డబ్బుగా మారటం అంటే అదే సమయంలో డబ్బు సరుకుగా మారటమే. పైకి ఒకటిగా కనిపించే ఈ ప్రక్రియ నిజానికి ద్వంద్వ ప్రక్రియ. సరుకు సొంతదారుని ధృవం నుంచి ఇది అమ్మకం. వ్యతిరేక ధృవం నుంచి, అంటే డబ్బు సొంతదారుని ధృవం నుంచి ఇది కొనుగోలు. మరో మాటలో చెప్పాలంటే, అమ్మకం అంటే కొనుగోలు. స – డ అంటే డ – స[1] కూడా.

ఇప్పటి వరకు మనం మనుషుల్ని ఆర్థికపరంగానే, అంటే సరుకుల సొంతదారులుగానే పరిశీలించాము. ఆ రకంగా వారు తమ సొంత శ్రమ ఉత్పాదితాన్ని పరాధీనం చెయ్యటం ద్వారా ఇతరుల శ్రమ ఉత్పాదితాన్ని స్వాధీనం చేసుకొంటారు. కనుక ఒక సరుకు సొంతదారుడు డబ్బు గల మరో ఆసామిని కలుసుకోవాలి అంటే ఆ ఆసామి లేదా ఆ కొనుగోలుదారుని శ్రమ ఉత్పాదితం స్వయంగా డబ్బు అయి వుండాలి. అంటే డబ్బు రూపం అయిన బంగారం అయి వుండాలి. లేదా అతని ఉత్పాదితం అప్పటికే తన చర్మాన్ని మార్చుకుని వుండాలి. తన తొలి ఉపయోగకర వస్తు

1. "ప్రతి అమ్మకం ఒక కొనుగోలు కూడా" (డా॥ క్వెస్నే, Dialogues surle commerce et les travause des artisans, physiocrates, ed, daire, ఒకటో భాగం, పారిస్, 1846, పుట 170) లేదా క్వెస్నే తన Maximes generalesలో చెప్పినట్టు" అమ్మటం అంటే కొనటమే".

రూపాన్ని వదిలేసి వుండాలి. డబ్బు పాత్ర నిర్వహించటం కోసం, బంగారం ఏదో ఒక సందర్భంలో మార్కెటులో ప్రవేశించాలి. ఆ సందర్భాన్ని ఆ లోహం యొక్క ఉత్పత్తి స్థానం దగ్గర గమనించవచ్చు. అక్కడ బంగారం ఒక తక్షణ శ్రమ ఉత్పాదితంగా, సమాన విలువ కలిగిన మరో ఉత్పాదితంతో వస్తు మార్పిడి చేయబడుతుంది. ఆ క్షణం నుంచీ అది ఎల్లప్పుడూ వాస్తవ రూపం ధరించిన ఏదో ఒక సరుకు ధరకి ప్రాతినిధ్యం వహిస్తుంది.[1] బంగారం తన ఉత్పత్తి స్థానంలో ఇతర సరుకులతో మార్పిడి చెందడం అటుంచితే, అది ఎవరి చేతిలో ఉన్నప్పటికీ, తన సొంతదారునిచేత పరాధీనం చేయబడిన ఏదో ఒక సరుకుకి మారిన రూపం మాత్రమే. అది ఒక అమ్మకం యొక్క ఉత్పాదితం, లేదా స - డ అనే మొదటి రూప పరివర్తన యొక్క ఉత్పాదితం.[2] సరుకులన్నీ తమ విలువల్ని బంగారంతో కొలుచుకోవడం వల్ల ఆ రకంగా అవి ఉపయోగకర వస్తువులుగా తమకు గల సహజ ఆకారానికి అది భావాత్మకంగా భిన్నమైనట్లు చూసి, దానిని తమ విలువ యొక్క ఆకారంగా చేయడం వల్ల, బంగారం భావాత్మక ద్రవ్యం లేదా విలువల కొలమానం అయ్యిందనే సంగతిని మనం గమనించాం. సరుకులు సార్వత్రికంగా, పరాధీనం కావడం వల్ల, ఉపయోగకర వస్తువులుగా వాటికున్న సహజ రూపాలతో అది చోటు మార్చుకోవడం వల్ల, ఆ రకంగా వాస్తవంలో వాటి విలువల సాకార రూపంగా మారడం వల్ల బంగారం వాస్తవ ద్రవ్యం అయింది. సరుకులు డబ్బు రూపాన్ని సంతరించుకోగానే అవి తమ సహజ ఉపయోగపు విలువకి సంబంధించిన ప్రతి జాడనీ విసర్జిస్తాయి. ఏకస్వభావపు మానవ శ్రమకి సామాజికంగా గుర్తించబడిన సాకార రూపంగా తమని తాము మార్చుకోడానికి, అవి తమ సృష్టికి కారణభూతమైన నిర్దిష్ట శ్రమకి సంబంధించిన ప్రతి జాడనీ విసర్జిస్తాయి. డబ్బుని చూసి అది ఏ నిర్దిష్ట సరుకుతో మార్పిడికి గురయిందో మనం చెప్పలేము. డబ్బు రూపంలో సరుకులన్నీ ఒకలాగే వుంటాయి. కనుక డబ్బు అనేది మురికి కావచ్చు, మురికి అనేది డబ్బు కానప్పటికీ, మన నేతగాడు తన వస్త్రాన్ని వదులుకుని సంపాదించిన రెండు బంగారు నాణాలూ ఒక క్వార్టర్ గోధుమల పరివర్తిత రూపం అనుకుందాం. వస్త్రం అమ్మకం, స-డ, అదే సమయంలో దాని కొనుగోలు కూడా, డ-స. అయితే అమ్మకం అన్నది ఈ ప్రక్రియలో మొదటి చర్య. దానికి వ్యతిరేక స్వభావం గల లావాదేవీతో ఈ ప్రక్రియ అంతమవుతుంది. ఇక్కడ బైబిల్ కొనుగోలుతో అంతమవుతుంది. మరోవైపున, వస్త్రం కొనుగోలు దానికి వ్యతిరేక స్వభావం గల లావాదేవీతో, అంటే గోధుమ అమ్మకంతో ప్రారంభమైన చలనాన్ని అంతం చేస్తుంది. స-డ-స (వస్త్రం-డబ్బు-బైబిల్)లో మొదటి దశ అయిన స-డ (వస్త్రం-డబ్బు) మరొక స-డ-స (గోధుమ-డబ్బు-వస్త్రం)లో చివరి దశ అయిన డ-స (డబ్బు-వస్త్రం) కూడా. కనుక ఒక సరుకు యొక్క మొదటి రూప పరివర్తనం, అంటే సరుకు డబ్బుగా మారటం అనేది, తప్పనిసరిగా మరో సరుకు యొక్క రెండో రూప పరివర్తనమే. అంటే డబ్బుగా వున్న ఆ మరో సరుకు సరుకుగా పునఃపరివర్తన చెందడమే.[3]

---

1. "ఒక సరుకు ధరని మరో సరుకు ధర ద్వారానే చెల్లించవచ్చు." (Mercier de la Riviere, L'ordre naturel et - essentieldes societes, politiques, Physiocrates, ed, Daire, రెండో భాగం, పుట 554.
2. "ఈ డబ్బుని పొందటానికి ఎవరైనా అమ్మకం జరిపి వుండాల్సిందే" (అదే గ్రంథం, పుట 543).
3. ఇంతకుముందే చెప్పినట్టుగా, వెండి లేక బంగారాల వాస్తవ ఉత్పత్తిదారుడు ఇందుకు మినహాయింపు. అతడు తన ఉత్పాదితాన్ని అమ్మడు. మరో సరుకుతో దాన్ని నేరుగా మార్పిడి చేస్తాడు.

## డ-స లేదా కొనుగోలు

## సరుకు యొక్క రెండోది, చివరిదీ అయిన రూప పరివర్తన

డబ్బు ఇతర సరుకులన్నిటి పరివర్తిత రూపం. అవి సార్వత్రికంగా పరాధీనం కావడం వల్ల తలెత్తిన ఫలితం డబ్బు. కనుక ఏ పరిమితులూ, షరతులూ లేకుండా అది స్వయంగా పరాధీనం కాగలుగుతుంది. అది అన్ని ధరలనీ ముందునుంచి వెనక్కి చదువుతుంది. తన సొంత ఉపయోగపు విలువ వాస్తవ రూపం ధరించటానికి వీలు కల్పించే ఇతర సరుకులన్నిటిలోనూ అది తనని తాను చిత్రించుకుంటుంది. అదే సమయంలో, డబ్బుపై సరుకులు విసిరే ప్రేమ చూపులయిన ధరలు డబ్బు పరిమాణాన్ని ఎత్తిచూపిస్తూ వేరే రూపంలోకి మారగల దాని శక్తికున్న పరిమితుల్ని నిర్వచిస్తాయి. ప్రతి సరుకూ డబ్బుగా మారగానే సరుకుగా మాయమవుతుంది. కనుక, డబ్బుని చూసి, దాని ఆసామి దగ్గరికి అది ఎలా చేరిందో అది ఏ వస్తువు యొక్క మారిన రూపమో చెప్పడం అసాధ్యం. అది ఎక్కడి నుండి వచ్చినా, దానికి వాసన వుండదు. ఒకవైపున ఒక అమ్మబడిన సరుకుకి ప్రాతినిధ్యం వహిస్తూనే మరోవైపున అది కొనాల్సిన సరుకుకి ప్రతినిధిగా వ్యవహరిస్తుంది.[1]

డ-స ఒక కొనుగోలు. అదే సమయంలో అది స-డ, అంటే ఒక అమ్మకం కూడా. ఒక సరుకు చివరి రూప పరివర్తనే మరో సరుకు మొదటి రూప పరివర్తన. మన నేతగానికి సంబంధించినంత వరకూ అతని సరుకు యొక్క జీవితం బైబిల్‌తో అంతమౌతుంది. బైబిల్‌గానే అతను తన 2 పౌండ్లను మార్చాడు. నేతగాడు వదిలేసిన 2 పౌండ్లు తీసుకొని బైబిల్ అమ్మిన వ్యక్తి ఆ డబ్బుని బ్రాందీగా, డ-సగా మార్చాడనుకుందాం. ఇది (డ-స), స-డ-స (వస్త్రం, డబ్బు, బైబిల్) యొక్క చివరి దశ. ఇదే స-డ-స (బైబిల్, డబ్బు, బ్రాందీ) యొక్క మొదటి దశ (స-డ) కూడా. ఒక నిర్దిష్ట సరుకు ఉత్పత్తిదారుని దగ్గర అమ్మటానికి ఒక వస్తువే వుంది. తరచుగా, దాన్నే అతడు పెద్ద మొత్తాలలో అమ్ముతుంటాడు. అతని బహుముఖ అవసరాలు అతని సరుకుకి వచ్చిన ధరని ముక్కలుగా విడగొట్టేలా అతన్ని ఒత్తిడి చేస్తాయి. అంటే అనేక కొనుగోళ్ళ కోసం ఆ ముక్కలను వదులుకొనేలా చేస్తాయి. ఆ రకంగా ఒక అమ్మకం వివిధ వస్తువులకు సంబంధించిన అనేక కొనుగోళ్ళకు దారితీస్తుంది. ఒక సరుకు యొక్క చివరి రూప పరివర్తన వివిధ ఇతర సరుకుల మొదటి రూప పరివర్తనల మొత్తం అవుతుంది.

మనం ఒక సరుకు యొక్క పూర్తయిన రూప పరివర్తనను మొత్తంగా పరిశీలిస్తే, మొదట మనకు దానిలో రెండు పరస్పర వ్యతిరేక, పరస్పర పూరక చలనాలు, స-డ, డ-స లు కనిపిస్తాయి. సరుకు సొంతదారుడు నిర్వహించే రెండు పరస్పర విరుద్ధ సామాజిక చర్యలవల్ల, సరుకులో పరస్పర విరుద్ధమైన ఈ రెండు రూప పరివర్తనలు తలెత్తుతాయి. ఈ చర్యలు అతని ఆర్థిక పాత్రల స్వభావాన్ని నిర్ణయిస్తాయి. అమ్మే మనిషిగా అతను అమ్మకందారుడు. కొనే మనిషిగా అతను కొనుగోలుదారుడు. సరుకు ప్రతిరూప పరివర్తనలోనూ దాని రెండు రూపాలూ, అంటే సరుకు రూపం, డబ్బు రూపం, ఏకకాలంలో వుంటాయి. కాని అవి వ్యతిరేక ధ్రువాలుగా వుంటాయి. అలాగే, ప్రతి అమ్మకందారుడికీ వ్యతిరేకంగా ఒక కొనుగోలుదారుంటాడు. ప్రతి కొనుగోలుదారుడికీ వ్యతిరేకంగా ఓ అమ్మకందా

---

1. మన చేతుల్లో వున్న డబ్బు మనం కొనాలనుకొనే వస్తువులకు మాత్రమే కాదు, ఈ డబ్బు కోసం అమ్మిన వస్తువులకు కూడా ప్రాతినిధ్యం వహిస్తుంది. (Mercier de la Reviere, అదే గ్రంథం, పుట 586)

రుంటాడు. ఒక సరుకు వరుసగా రెండు రూప పరివర్తనలకు గురి అవుతున్నపుడు, అంటే సరుకు నుండి డబ్బుకీ, డబ్బు నుండి మరో సరుకుకీ మారుతున్నప్పుడు, ఆ సరుకు సొంతదారుడు కూడా అదే వరసలో తన పాత్రను అమ్మకందారుడి నుంచి కొనుగోలుదారునిగా మార్చుకుంటాడు. కనుక ఈ అమ్మకందారు, కొనుగోలుదారు అనే పాత్రలు శాశ్వతం కాదు. సరుకుల చలామణిలో నిమగ్నమైన వివిధ వ్యక్తులకు ఈ పాత్రలు ఒకదాని తర్వాత ఒకటి వచ్చిపోతుంటాయి.

ఒక సరుకుకు జరిగే సంపూర్ణ రూప పరివర్తన అత్యంత సరళంగా వున్నప్పుడు దానిలో నాలుగు దశలూ, మూడు పాత్రలూ వుంటాయి. మొదట ఒక సరుకు డబ్బుకు అభిముఖంగా నిలబడుతుంది. డబ్బు, సరుకు విలువ రూపాన్ని తీసుకుంటుంది. డబ్బు కఠిన వాస్తవంగా తన రూపంలో, కొనుగోలుదారుని జేబులో వుంటుంది. ఆ రకంగా ఒక సరుకు సొంతదారునికీ ఒక డబ్బు గలవానికీ సంబంధం ఏర్పడుతుంది. ఇప్పుడు సరుకు డబ్బుగా మారగానే డబ్బు దాని తాత్కాలిక సమ విలువ రూపం అవుతుంది. ఆ సమ విలువ రూపం యొక్క ఉపయోగపు విలువ ఇతర సరుకుల శరీరాల్లో వుంటుంది. మొదటి రూప పరివర్తనలో డబ్బు చివరి అంశం. అదే సమయంలో రెండో దానిలో అది మొదటి అంశం. మొదటి లావాదేవీలో అమ్మకందారుగా వున్న వ్యక్తి రెండో దానిలో కొనుగోలుదారవుతాడు. రెండోదానిలో మూడో సరుకు సొంతదారుడు అమ్మకందారుగా రంగప్రవేశం చేస్తాడు.[1]

ఒక సరుకు రూప పరివర్తనంలో వుండే రెండు విరుద్ధ (విలోమ) దశలూ ఒక వృత్తాకార చలనాన్ని, ఒక వృత్తాన్ని ఏర్పరుస్తాయి; సరుకు రూపం, ఆ రూపాన్ని వదిలేయడం, మళ్ళీ సరుకు రూపధారణ. ఇక్కడ సరుకు రెండు విభిన్న అంశాలలో కనిపిస్తుందనటంలో సందేహం లేదు. ప్రారంభ దశలో అది తన సొంతదారునికి ఒక ఉపయోగపు విలువ కాదు. చివరి దశలో అది ఉపయోగపు విలువ అవుతుంది. అలాగే డబ్బు కూడా మొదటి దశలో విలువకి ఓ ఘనీభూత స్ఫటికంగా దర్శనమిస్తుంది. సరుకు ఆత్రంగా స్ఫటికంగా ఘనీభవించినట్టనిపిస్తుంది. రెండో దశలో అది ఒక ఉపయోగ విలువతో తొలగించబడే తాత్కాలిక సమ విలువ రూపంగా కరిగిపోతుంది.

వృత్తాన్ని ఏర్పరచే రెండు రూప పరివర్తనలూ అదే సమయంలో మరో రెండు ఇతర సరుకుల విరుద్ధ పాక్షిక రూప పరివర్తనలు కూడా. వస్త్రం అనే సరుకు తన సొంత రూప పరివర్తనల పరంపర ప్రారంభించడంతోపాటు మరో సరుకు (గోధుమ) రూప పరివర్తనను అంతం చేస్తుంది. మొదటి దశలో లేదా అమ్మకంలో వస్త్రం ఈ రెండు పాత్రలనూ తనే నిర్వహిస్తుంది. అయితే అది బంగారంగా మారి తన రెండోదీ, చివరిదీ అయిన రూప పరివర్తనను పూర్తిచేస్తుంది. అదే సమయంలో మూడో సరుకు యొక్క మొదటి రూప పరివర్తన జరగటానికి తోడ్పడుతుంది. ఆ రకంగా తన రూప పరివర్తనల క్రమంలో ఒక సరుకు ఏర్పరచిన వృత్తం ఇతర సరుకుల వృత్తాలతో విడదీయరాని విధంగా మిళితమై వుంటుంది. విభిన్న వృత్తాలన్నిటి మొత్తమే సరుకుల చెలామణి అవుతుంది.

సరుకుల చెలామణి వస్తు మార్పిడికి భిన్నం – రూపంలోనే కాదు, సారంలో కూడా. సంఘటనల క్రమాన్ని పరిశీలించండి. నిజానికి, నేతగాడు తన సరుకుని మరొకని సరుకుతో, అంటే వస్త్రాన్ని

1. “నాలుగు ఆఖరి చర్యలూ, ముగ్గురు ఒప్పందం కుదుర్చుకునే వ్యక్తులూ వుంటారు. వీరిలో ఒకరు రెండుసార్లు జోక్యం చేసుకుంటారు.” (లేట్రోస్నె, అదే గ్రంథం, పుట 909)

బైబిల్‌తో మార్పిడి చేశాడు. అయితే ఇది అతనికి సంబంధించిన మేరకే వాస్తవం. తనకు బైబిల్‌ని అమ్మిన వ్యక్తి, తన బైబిల్‌ని వస్త్రంతో మార్పిడి చేసుకోవాలని కోరుకోక, తన కడుపుని వెచ్చబరిచే వస్తువుని కొనుక్కున్నాడు. తన వస్త్రం కోసం మరో వ్యక్తి గోధుమల్ని అమ్మాడనే సంగతి మన నేతగానికి ఎలా తెలియదో అలాగే తనకు బైబిల్‌ని అమ్మిన వ్యక్తికి తన తస్త్రం గురించి కూడా తెలియదు. 'చ' సరుకు 'క' సరుకు స్థానంలోకి వస్తుంది. కాని 'క', 'చ'లు ఆ సరుకుల్ని పరస్పరం మార్చుకోరు. 'క', 'చ'లు ఏకకాలంలో ఒకరి నుండి ఒకరు కొంటే కొనవచ్చు. అయితే అటువంటి అరుదైన లావాదేవీలు సరుకుల చలామణికి చెందిన సాధారణ పరిస్థితులలో విధిగా జరిగేవి కాదు. ఒకవైపున సరుకుల మార్పిడి అనేది వస్తు మార్పిడితో అభేద్యంగా ముడిపడి వున్న స్థానిక, వ్యక్తిగత పరిమితులన్నింటినీ ఛేదించి, సామాజిక శ్రమ ఉత్పాదితాల చలామణిని ఎట్లా అభివృద్ధి చేస్తుందో ఇక్కడ గమనించవచ్చు. మరోవైపున పాత్రధారుల అదుపుకు బొత్తిగా లోబడకుండా, స్వయంగా పెరిగే సామాజిక సంబంధాల వ్యవస్థని అది ఎలా అభివృద్ధి చేస్తుందో కూడా చూడొచ్చు. రైతు తన గోధుమల్ని అమ్మాడు కనుకనే నేతగాడు తన వస్త్రాన్ని అమ్మగలిగాడు. నేతగాడు వస్త్రాన్ని అమ్మాడు కనుకనే మన నిషారాయుడు తన బైబిల్ అమ్మగలిగాడు. ఇతగాడు అమృతంతో సమానమైన పవిత్ర గ్రంథాన్ని అమ్మాడు గనుకనే సారా కొట్టువాడు ఈ ప్రబుద్ధునికి బ్రాందీ అమ్మగలిగాడు. ఇలాగే ఇతర సంబంధాలు కూడా.

కనుక, చలామణి ప్రక్రియ ప్రత్యక్ష వస్తు మార్పిడిలాగా ఉపయోగ విలువలు చేతులూ, చోటులూ మారగానే అంతమైపోదు. ఒక నిర్దిష్ట సరుకు రూప పరివర్తనకు చెందిన వృత్తం నుండి తప్పుకోగానే డబ్బు మాయమయిపోదు. చలామణి గోదాలో ఇతర సరుకులు ఖాళీచేసిన కొత్తచోట్లని అది నిరంతరం భర్తీచేస్తుంది. ఉదాహరణకి, వస్త్రం యొక్క సంపూర్ణ రూప పరివర్తనలో (వస్త్రం–డబ్బు–బైబిల్) వస్త్రం మొదట చలామణి నుంచి తప్పుకుంటుంది. దాని స్థానంలోకి డబ్బు ప్రవేశిస్తుంది. తర్వాత బైబిల్ చలామణి నుండి తప్పుకుంటుంది. మళ్ళీ డబ్బు దాని స్థానాన్ని ఆక్రమిస్తుంది. ఒక సరుకు మరో సరుకు స్థానాన్ని ఆక్రమించినప్పుడు, ద్రవ్య సరుకు ఎప్పుడూ మరో మూడో వ్యక్తి చేతికి అంటిపెట్టుకుని వుంటుంది.[1] చెలామణి డబ్బుతో అరవచాకిరీ చేయించుకుంటుంది.

ప్రతి అమ్మకం ఒక కొనుగోలు, ప్రతి కొనుగోలు ఒక అమ్మకం కనుక సరుకుల చలామణి అంటే విధిగా క్రయ విక్రయాల సమతా స్థితి అనే పిడిసూత్రం కంటే కుర్రతనం మరొకటుండదు. అంటే దీనర్థం వాస్తవ అమ్మకాల సంఖ్య వాస్తవ కొనుగోళ్ళ సంఖ్యతో సమంగా వుంటుంది అనటం. అయితే ఇది కేవలం చర్విత చర్వణం మాత్రమే. ప్రతి అమ్మకందారుడూ తనతోపాటు తన కొనుగోలుదారుని కూడా మార్కెటుకి తెచ్చుకొంటాడని చెప్పటం దీని నిజమైన ఉద్దేశం. అటువంటిదేమీ జరగదు. క్రయ విక్రయాలు ఒకే చర్య. సరుకు సొంతదారునికి, డబ్బు సొంతదారునికి మధ్య మార్పిడి. ఒక అయస్కాంతములోని రెండు ధ్రువాలలాగా పరస్పర వ్యతిరేకత గల ఇద్దరు వ్యక్తులు వాళ్ళు. ఒకే వ్యక్తి క్రయ విక్రయాలు నిర్వహించినప్పుడు అవి రెండు భిన్నమైన చర్యలు – ధ్రువాల స్వభావాలు కల్గిన, వ్యతిరేక స్వభావాలు కల్గిన చర్యలు. కనుక, చెలామణి సుడిగుండంలోకి ఒక సరుకును విసరినప్పుడు అది డబ్బుగా మారి పైకి రాకపోతే, అనగా సరుకు సొంతదారుడు దానిని

1. ఇది స్వయం విదితమే అయినప్పటికీ అర్థశాస్త్రవేత్తలు, ముఖ్యంగా "నాటు స్వేచ్ఛా వ్యాపార వాదులు" దీనిని చాలా వరకు గుర్తించనేలేదు.

అమ్మడమూ డబ్బు సొంతదారుడు దానిని కొనడమూ సాధ్యం కాకపోతే, అటువంటి పరిస్థితుల్లో క్రయ విక్రయాల అభిన్నత్వం ఆ సరుకు నిరుపయోగం అని తెలుపుతుంది. మార్పిడి అంటూ జరిగితే సరుకు జీవితంలో చిన్నదో, పెద్దదో విరామకాలం వుందని కూడా అది తెలియజేస్తుంది. ఒక సరుకు మొదటి రూప పరివర్తన అంటే అమ్మకంతోపాటు కొనుగోలు కూడా. కనుక అది కూడా స్వయంగా ఒక స్వతంత్ర ప్రక్రియ. కొనుగోలుదారునికి సరుకు వచ్చింది, అమ్మకందారునికి డబ్బు వచ్చింది. డబ్బు అంటే ఏ సమయంలోనైనా చలామణిలోకి వెళ్ళడానికి సిద్ధంగా వున్న సరుకు. ఒకరు అమ్మాలంటే ఎవరో ఒకరు దాన్ని కొనాలి. ఒక వ్యక్తి ఇప్పుడు అమ్మాడు కనుక అతను తిరిగి వెంటనే తప్పనిసరిగా కొనాలనేమీ లేదు. ప్రత్యక్ష వస్తు మార్పిడి విధించే స్థల కాల వైయక్తిక పరిమితులన్నింటినీ చలామణి ఛేదిస్తుంది. తన సొంత ఉత్పాదితం పరాధీనం కావటం, మరొకని ఉత్పాదితం స్వాధీనం కావటం మధ్య వస్తు మార్పిడిలో వుండే ప్రత్యక్ష అభిన్నత్వాన్ని అమ్మకం, కొనుగోలు అనే పరస్పర విరుద్ధ అంశాలుగా విడగొట్టడం ద్వారా చలామణీ దీన్ని సాధిస్తుంది. ఈ రెండు స్వతంత్ర, విరుద్ధ చర్యల మధ్య ఒక అంతర్గత ఐక్యత వుందనీ, అవి రెండూ సారభూతంగా ఒకటే అనీ అంటే ఈ అంతర్గత ఐక్యత బాహ్య వైరుధ్యంగా వ్యక్తమవుతోందని అర్థం. ఒక సరుకు సంపూర్ణ రూప పరివర్తనం యొక్క రెండు పరస్పర పూరక దశల మధ్య విరామం మరీ ఎక్కువగా వుంటే, క్రయ విక్రయాల మధ్య చీలిక మరీ తీవ్రంగా వుంటే వాటి మధ్య వుండే సన్నిహిత సంబంధం, వాటి ఏకత్వం ఒక సంక్షోభాన్ని పుట్టించడం ద్వారా తనని తాను నిరూపించుకుంటుంది. ఉపయోగపు విలువ, విలువల మధ్య వుండే వైరుధ్యం, ప్రైవేటు శ్రమ ప్రత్యక్ష, సామాజిక శ్రమగా వ్యక్తం కావటమూ, ఒక ప్రత్యేక, నిర్దిష్ట శ్రమ అనిర్దిష్ట మానవ శ్రమగా వ్యవహరించడమూ అనే వైరుధ్యాలు, వస్తువుల వ్యక్తుల్లా వ్యవహరించడం, వ్యక్తులు వస్తువులకు ప్రాతినిధ్యం వహించడం అనే వాటి మధ్య వుండే వైరుధ్యం – సరుకులలో అంతర్గతంగా వుండే ఈ వైరుధ్యాలన్నీ ఒక సరుకు రూప పరివర్తన యొక్క పరస్పర విరుద్ధ దశల్లో తమ చలన విధానాలని అభివృద్ధి చేసుకుంటాయి. తమని తాము నిరూపించు కొంటాయి. కనుక ఈ చలన విధానాలు సంక్షోభాల సంభావ్యతను, సంభావ్యతను మాత్రమే సూచిస్తాయి. ఈ కేవల సంభావ్యత వాస్తవంగా రూపొందటం అనేది సుదీర్ఘమైన సంబంధాల పరంపర ఫలితంగా జరుగుతుంది. మన ప్రస్తుత సాదా చలామణి దృష్టి నుండి వాటికింకా అస్తిత్వం లేదు.[1]

---

1. నా "అర్థశాస్త్ర విమర్శ ... " 74-76 పుటలలో జేమ్స్ మిల్‌పై రాసింది చూడండి. ఈ అంశానికి సంబంధించి వకాల్తాదారీ అర్థశాస్త్రానికి స్వభావసిద్ధమైన రెండు పద్ధతుల్ని మనం గమనించవచ్చు. మొదటిది సరుకుల చలామణిని, ప్రత్యక్ష వస్తు మార్పిడితో సమానం చేయటం. వాటి మధ్య వుండే తేడాలను మాత్రం వేరుచేయడం ద్వారా యీ పని చేస్తారు. రెండోది, పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానంలో వ్యక్తుల మధ్య గల సంబంధాలను సరుకుల చలామణిలో తలెత్తే సాదా సంబంధాల స్థాయికి కుదించడం ద్వారా ఆ విధానం లోని వైరుధ్యాలను వివరించాలనే ప్రయత్నం. సరుకుల ఉత్పత్తి చలామణి అనేవి అత్యంత వైవిధ్యం వున్న ఉత్పత్తి విధానాల్లో ఎక్కువగానో, తక్కువగానో తలెత్తే ఘటనలు. ఈ విధానాలన్నిటిలోనూ ఉమ్మడిగా వుండే చలామణి అనే అనిర్దిష్ట అభివర్గాలను గురించి తప్ప మరిదేన్ని గురించీ తెలుసుకోకపోతే, ఈ విధానాల మధ్య వుండే నిర్దిష్ట భేదాలేమిటో మనకు తెలియటం దాదాపు అసాధ్యం. వాటి మీద మన అభిప్రాయాలు చెప్పడం కూడా అసాధ్యం. సర్వసాధారణ, లోకప్రసిద్ధ వాస్తవాల గురించి రాజకీయ అర్థశాస్త్రంలో జరిగినంత గొడవ మరే శాస్త్రంలోనూ జరగలేదు. ఉదాహరణకి, ఒక సరుకంటే ఉత్పాదితం అనే సంగతి జె.బి.సే.కి తెలుసు గనుక తాను సంక్షోభాలపైన తీర్పు చెపుతాను అంటాడు.

## ఆ. డబ్బు చలనం*

రూపంలో మార్పు (స-డ-స) ద్వారా పాదార్థిక ఉత్పాదితాల చలామణి జరుగుతుంది. దానికి ఒక నిర్దిష్ట విలువ ఒక సరుకు రూపంలో ఈ ప్రక్రియను ప్రారంభించి ఒక సరుకు రూపంలోనే దాన్ని అంతం చేయడం అవసరం. కనుక సరుకు యొక్క చలనం ఒక వృత్తం. మరోవైపున ఈ చలన రూపంలో డబ్బు వృత్తం చేయలేదు. ఫలితం ఏమిటంటే, డబ్బు తిరిగి రావటంకాదు. దాని ప్రారంభ స్థానం నుంచి దూరంగా మరింత దూరంగా నిరంతరం తొలగిపోవడం. అమ్మకందారుడు తన సరుకు యొక్క మారిన రూపం అయిన డబ్బుని తన దగ్గరే అట్టేపెట్టుకున్నంత కాలం ఆ సరుకు రూప పరివర్తన మొదటి దశలోనే వుంటుంది. అది తన దారిలో సగం మాత్రమే పూర్తిచేసింది. అయితే అతడు ఈ ప్రక్రియను పూర్తిచేయగానే, అంటే అమ్మకంతోపాటు కొనుగోలుని కూడా నిర్వహించగానే, డబ్బు అతని చేతుల నుండి బయటపడుతుంది. నేతగాడు బైబిల్ కొన్న తర్వాత మరికొంత వస్త్రాన్ని అమ్మితే, అతని చేతిలోకి డబ్బు వస్తుంది. నిజమే, కాని ఇది మొదటి 20 గజాల వస్త్రం యొక్క చలామణి వల్ల తిరిగొచ్చిన డబ్బు కాదు. ఆ చలామణిలో డబ్బు బైబిల్‌ని అమ్మినవానికి పోయింది. కొత్త సరుకుతో ఈ చలామణి ప్రక్రియను పునరావృతం చేయడం ద్వారా మాత్రమే నేతగాని చేతిలో మరికొంత డబ్బు చేరింది. ఈ ప్రక్రియ కూడా ఇంతకు ముందు దానిలాగే అంతమవుతుంది. సరుకుల చలామణి వల్ల డబ్బుకి సంప్రాప్తించిన చలనం దానిని ప్రారంభ స్థానం నుండి దూరం తీసుకుపోయే నిరంతర చలన రూపం తీసుకుంటుంది. ఒక సరుకు సొంతదారుని చేతుల్లో నుండి డబ్బు మరో సరుకు సొంతదారుని చేతుల్లోకి నిరంతరం ప్రయాణిస్తుంది. ఈ పయనమే దాని చలనం. (Course de la monnaie)

డబ్బు చలనం అంటే ఒకే ప్రక్రియ నిరంతరాయంగా, రోకటి పాటలా పునరావృతం కావడమే – సరుకు ఎప్పుడూ అమ్మకందారుని చేతిలో వుంటుంది. కొనుగోలు సాధనంగా, డబ్బు ఎప్పుడూ కొనుగోలుదారుని చేతిలో వుంటుంది. సరుకు ధరని వాస్తవం చేయడం ద్వారా డబ్బు కొనుగోలు సాధనంగా వ్యవహరిస్తుంది. ఈ చర్య ద్వారా సరుకు అమ్మకందారు చేతిలో నుండి కొనుగోలుదారు చేతిలోకి వెళుతుంది. డబ్బు కొనుగోలుదారు చేతుల్లో నుండి అమ్మకందారు చేతుల్లోకి పోతుంది. అక్కడ అది మరో సరుకుతో మళ్ళీ అదే ప్రక్రియకు లోనౌతుంది. డబ్బు చలనంలో ఈ ఏకవిధ స్వభావానికీ కారణం, సరుకుల చలనంలో వున్న ద్వివిధ స్వభావమే. అయితే ఈ పరిస్థితి పైకి కన్పించదు. సరుకుల చలామణి స్వభావమే దానికి వ్యతిరేక రూపం యిస్తుంది. ఒక సరుకు మొదటి రూపపరివర్తన డబ్బు చలనంగా మాత్రమేగాక సరుకు చలనంగా కూడా కన్పిస్తుంది. అందుకు విరుద్ధంగా రెండో రూప పరివర్తనలో ఈ చలనం కేవలం డబ్బు చలనంగా మాత్రమే కన్పిస్తుంది. చలామణి మొదటి దశలో సరుకు డబ్బుతో తన స్థానాన్ని మార్చుకుంటుంది. ఆ పైన, సరుకు

* ఇంగ్లీషు ముద్రణ అనువాదకుని నోట్: ఒక చేతి నుండి మరో చేతిలోకి మారుతూ డబ్బు చేసే పయనాన్ని ఈ మాట సూచిస్తుంది. చలామణి కంటే ఇది భిన్నమైనది.

ఉపయోగకర వస్తు స్వభావంతో చలామణి నుండి తప్పుకుని అనుభోగంలోకి ప్రవేశిస్తుంది.[1] దాని బదులు దాని విలువ రూపమైన డబ్బు వుంది. తర్వాత ఆ సరుకు చలామణిలో రెండో దశగుండా, తన సొంత రూపంలో గాక డబ్బు రూపంలో పోతుంది. కనుక డబ్బు మాత్రమే ఈ చలనం నిరంతరాయంగా జరిగేలా చూస్తుంది. సరుకుకి సంబంధించినంత వరకూ ఆ చలనంలో విరుద్ధ స్వభావాలు గల రెండు ప్రక్రియలుంటాయి. అదే చలనాన్ని డబ్బు చలనంగా పరిగణించిన మేరకు అది ఎల్లప్పుడూ ఒకే ప్రక్రియగా వుంటుంది. ఎప్పటికప్పుడు కొత్త సరుకులతో నిరంతరం స్థానాలు మార్చుకోవడంగా వుంటుంది. కనుక, సరుకుల చలామణి వల్ల అంటే ఒక సరుకు స్థానాన్ని మరో సరుకు ఆక్రమించుకోవడం వల్ల తలెత్తిన ఫలితం, సరుకు రూపంలో వచ్చిన మార్పువల్ల తలెత్తినట్టుగా కాక, డబ్బు చలామణి సాధనంగా వ్యవహరించటం వల్ల తలెత్తినట్టుగా కన్పిస్తుంది. చలన రహితంగా కన్పించే సరుకుల చలామణిని నిర్వహించి, అవి ఉపయోగేతర విలువలుగా వున్నచోటు నుండి ఉపయోగపు విలువలుగా వున్నచోటుకి మార్చడం ద్వారా, డబ్బు వాటిని నిరంతరం తనకి వ్యతిరేకమైన దిశవైపు నెట్టడం ద్వారా ఈ ఫలితం తలెత్తినట్టు కన్పిస్తుంది. డబ్బు నిరంతరాయంగా సరుకుల్ని చలామణి నుంచి తప్పించి తాను వాటి స్థానంలో అడుగుపెడుతుంది. ఈ రకంగా అది తన ప్రారంభ స్థానం నుండి నిరంతరం అంతకంతకూ దూరంగా జరిగిపోతుంది. అందువల్ల డబ్బు చలనం అనేది కేవలం సరుకుల చలామణికి వ్యక్తీకరణే అయినప్పటికీ, దానికి విరుద్ధమైనది వాస్తవమైనట్లు కనిపిస్తుంది. సరుకుల చలామణి, డబ్బు చలనం వల్ల తలెత్తిన ఫలితంలా కన్పిస్తుంది.[2]

సరుకుల విలువలకి డబ్బులో స్వతంత్ర అస్తిత్వం వుంది కనుకనే డబ్బు చలామణి సాధనంగా పనిచేస్తుంది. కనుక నిజానికి చలామణి సాధనంగా దాని చలనం ఒక రూపం నుండి మరో రూపానికి మారేటప్పుడు సరుకులకు కలిగే చలనం మాత్రమే. ఈ వాస్తవం డబ్బు చలనంలో స్పష్టంగా కన్పించాలి. (ఉదాహరణకి వస్త్రం ఆ రకంగా మొదట తన సరుకు రూపాన్ని డబ్బు రూపంలోకి మార్చుకుంటుంది. దాని మొదటి రూప పరివర్తన అయిన స-డ లోని రెండో దశ, అంటే డబ్బు రూపం, డ-స అనే చివరి రూప పరివర్తనలో (అది బైబిల్‌గా మారే పరివర్తనలో) మొదటి దశ అవుతుంది. అయితే ఈ రెండు రూప పరివర్తనలలో ప్రతి ఒకటీ సరుకు డబ్బుల మధ్య జరిగిన మార్పిడివల్ల, అవి ఒకదాని స్థానంలోకి మరొకటి రావడంవల్ల జరిగాయి. అమ్మకందారుని చేతిలోకి సరుకు పరాధీన రూపంగా వచ్చిన నాణాలే పూర్తిగా పరాధీనం చేయవీలైన సరుకు రూపంగా ఆ చేతిని వదిలేసి పోయాయి. అవి రెండుసార్లు స్థానభ్రంశం చెందాయి. వస్త్ర మొదటి రూప పరివర్తన ఈ నాణాలను నేతగాని జేబులో వుంచుతుంది. రెండోది వాటిని బయటకు లాగేస్తుంది. అవే నాణాల స్థానభ్రంశం విరుద్ధ దిశల్లో, రెండుసార్లు పునరావృతం కావడంలో ఒకే సరుకుకు జరిగిన రెండు విరుద్ధ మార్పులు ప్రతిబింబించాయి.

---

1. ఒక సరుకు పదే పదే అనేకసార్లు అమ్ముడుకావచ్చు. ఆ అంశాన్ని మనం ఇక్కడ పరిశీలించడం లేదు. అది చివరిసారి అమ్ముడుకాగానే చలామణి రంగం నుండి అనుభోగ (వినియోగ) రంగానికి పోతుంది. అక్కడ అది జీవితావసర వస్తువుగానో, ఉత్పత్తి సాధనంగానో వ్యవహరిస్తుంది.
2. ఉత్పాదితాలు దానికిచ్చిన చలనం తప్ప మరో చలనమేదీ డబ్బుకి లేదు. (లేట్రోస్నే, అదే గ్రంథం, పు. 885)

అందుకు విరుద్ధంగా రూప పరివర్తనలో ఒక దశ మాత్రమే పూర్తయింది అనుకుందాం. అంటే కేవలం అమ్మకాలు లేదా కేవలం కొనుగోళ్ళు జరిగాయనుకుందాం. అప్పుడు ఓ నిర్దిష్ట మొత్తం డబ్బు ఒక్కసారి మాత్రమే తన స్థానాన్ని మారుస్తుంది. దాని రెండో స్థాన పరివర్తనం ఎప్పుడూ సరుకు రెండో రూప పరివర్తనను వ్యక్తం చేస్తుంది. అంటే డబ్బు నుండి సరుకుకు పునఃపరివర్తనని సూచిస్తుంది. ఒకే నాణాల స్థానభ్రంశం పదేపదే పునరావృతం కావడం అనేది ఒకే సరుకుకు జరిగిన రూప పరివర్తనల పరంపరను మాత్రమే గాక, సాధారణంగా సరుకుల ప్రపంచంలో జరిగే అసంఖ్యాక రూప పరివర్తనలు ఒకదానితో ఒకటి ముడిబడి వుండటాన్ని కూడా ప్రతిబింబిస్తుంది.)* ఇదంతా మనమిప్పుడు పరిశీలిస్తున్న సరుకుల చలామణి సాదా రూపానికి మాత్రమే వర్తిస్తుంది.

ప్రతి సరుకూ మళ్ళీ చలామణి నుండి తప్పుకోటానికీ, ఇతర సరుకులచే స్థానభ్రంశం కావటానికి మాత్రమే మొదట అది చలామణిలోకి అడుగుబెడుతుంది. తన మొదటి రూప పరివర్తనకు గురవుతుంది. అందుకు విరుద్ధంగా చలామణి సాధనంగా డబ్బు నిరంతరం చలామణి రంగంలోనే వుంటుంది. అందులోనే తిరుగుతుంటుంది. కనుక ఈ రంగం ఎంత డబ్బుని నిత్యం ఇముడ్చుకుంటుంది అన్న ప్రశ్న తలెత్తుతుంది.

ఒక నిర్దిష్ట దేశంలో ప్రతి రోజు విభిన్న ప్రాంతాల్లో ఏకకాలంలో అనేక ఏక పార్శ్వ సరుకు రూప పరివర్తనలు జరుగుతాయి. మరోలా చెప్పాలంటే అనేకమైన అమ్మకాలూ, అనేకమైన కొను గోళ్ళు జరుగుతాయి. ముందుగానే సరుకుల్ని వాటి ధరల ద్వారా నిర్దిష్ట పరిమాణం గల డబ్బుతో ఊహాత్మకంగా సమం అని చూపబడుతుంది. ప్రస్తుతం మనం పరిశీలిస్తున్న చలామణి రూపంలో డబ్బు, సరుకులూ ఎప్పుడూ ఒకటి ధనాత్మక ధ్రువమైన కొనుగోలు దగ్గర, మరొకటి రుణాత్మక ధ్రువమైన అమ్మకం దగ్గర వుంటూ, ఒకదానికొకటి తమ వస్తుగత రూపాలలో ఎదురూ బొదురుగా నిలబడతాయి. కనుక, ఈ సరుకులన్నిటి ధరల మొత్తాన్ని బట్టి ఎంత మొత్తం చలామణి సాధనం అవసరమవుతుంది అన్నది నిర్ధారితమవుతుందనేది స్పష్టం. నిజానికి ముందుగానే సరుకుల ధరల మొత్తాన్ని భావరూపేణా వ్యక్తం చేసిన బంగారం పరిమాణానికి డబ్బు ప్రాతినిధ్యం వహిస్తుంది. ఈ రెండు మొత్తాల సమానత స్వయం విదితం సరుకుల విలువలు స్థిరంగా వుంటే వాటి ధరలు, బంగారం (ద్రవ్య పదార్థం) విలువని బట్టి మారుతాయని మనకి తెలుసు. బంగారం విలువ పెరిగితే వాటి ధరలు తగ్గుతాయి. దాని విలువ తగ్గితే అవి పెరుగుతాయి. ఇప్పుడు బంగారం విలువలో అటువంటి పెరుగుదల లేదా తరుగుదల కారణంగా సరుకుల ధరల మొత్తం తరిగితే లేదా పెరిగితే అదే స్థాయిలో చలనంలో వున్న డబ్బు మొత్తం తరగాలి, లేదా పెరగాలి. చలామణి సాధనంలో వచ్చిన ఈ మార్పు డబ్బు వల్లే వచ్చిందనేది నిజమే. అయితే అది చలామణి సాధనం కావటం వల్లగాక, విలువ కొలమానం కావడం వల్ల ఈ మార్పు జరిగింది. మొదట, సరుకుల ధర డబ్బు విలువకి విలోమంగా మారుతుంది. ఆ పైన చలామణి సాధనం యొక్క పరిమాణం సరుకుల ధరకి అనులోమంగా మారుతుంది. ఉదాహరణకి, బంగారం విలువ పడిపోవడానికి బదులు విలువ కొలమానంగా బంగారాన్ని వెండి తొలగించినా, లేదా వెండి విలువ పెరగటానికి బదులు విలువ

---

* బ్రాకెట్లో వున్న భాగాన్నంతటినీ నాలుగో జర్మన్ ముద్రణ ఆధారంగా ఏంగెల్స్ చేర్చాడు. (సం)

కొలమానంగా వెండిని బంగారం బయటకు నెట్టేసినా, సరిగ్గా అదే జరుగుతుంది. మొదటి సందర్భంలో అంతకు ముందున్న బంగారం కంటే ఎక్కువ వెండి చలనంలో వుంటుంది. రెండో పరిస్థితిలో అంతకు ముందున్న వెండి కంటే తక్కువ బంగారం చలనంలో వుంటుంది. ప్రతి సందర్భంలోనూ ద్రవ్యంగా వున్న పదార్థం విలువ, అంటే విలువ కొలమానంగా వ్యవహరించే సరుకు విలువ, మార్పుకి గురి అయి వుంటుంది. కనుక డబ్బులో తమ విలువల్ని వ్యక్తం చేసే సరుకుల ధరలు కూడా మార్పుకి గురి అయి వుంటాయి. ఈ ధరల్ని వాస్తవం చేసే చలనంలో వున్న డబ్బు పరిమాణం కూడా మార్పుకి గురి అయి వుంటుంది. చలామణి రంగానికి ప్రవేశ ద్వారం వుంటుందనీ, దానిగుండా బంగారం (లేదా సాధారణ ద్రవ్య పదార్థం) ఒక నిర్దిష్ట విలువ గల సరుకుగా లోనికి ప్రవేశిస్తుందనీ మనం ఇంతకు ముందే గమనించాము. కనుక విలువ కొలమానంగా డబ్బు ప్రవేశించటానికి ముందే, అది ధరలను వ్యక్తం చేయటానికి ముందే దాని విలువ నిర్ధారితమైంది. ఇప్పుడు దాని విలువ పడిపోతే మొట్టమొదట దాని ప్రభావం విలువైన లోహాలతో వాటి ఉత్పత్తి స్థానాల దగ్గరే ప్రత్యక్ష వస్తు మార్పిడి చేసుకున్న సరుకుల ధరల మార్పులో కనిపిస్తుంది. మిగిలిన సరుకుల్లో అత్యధిక భాగాన్ని, ముఖ్యంగా అసంపూర్ణంగా అభివృద్ధిచెందిన సభ్య సమాజ దశల్లో, చాలాకాలం వరకూ విలువ కొలమానం యొక్క ఇదివరకటి పాత భ్రమాత్మక విలువ ద్వారానే అంచనా వేయటం జరుగుతుంది. అయినప్పటికీ తమ ఉమ్మడి విలువ సంబంధం ద్వారా ఈ ఒక సరుకు మరోదానిని ప్రభావితం చేస్తుంది. వాటి ధరలు బంగారం ద్వారా వ్యక్తమయినా, వెండి ద్వారా వ్యక్తమయినా, వాటి సాపేక్ష విలువల్ని బట్టి నిర్ధారించబడిన నిష్పత్తులలో స్థిరపడతాయి. చివరికి, డబ్బుగా వ్యవహరించే లోహం కొత్త విలువని బట్టి మొత్తం అన్ని సరుకుల విలువా అంచనా వేయబడుతుంది. ఈ ప్రక్రియతోపాటు విలువైన లోహాల పరిమాణం నిరంతరాయంగా పెరుగుతుంది. ఉత్పత్తి స్థానాల దగ్గర తమతో ప్రత్యక్షంగా వస్తు మార్పిడి చేసుకునే వస్తువులను వాటి స్థానాల నుండి తొలగించడానికి ప్రవాహంగా వచ్చే ఆ లోహాల వల్ల ఈ పెరుగుదల జరుగుతుంది. కనుక సాధారణంగా సరుకులు తమ నిజమైన ధరల్ని ఏ నిష్పత్తిలో పొందుతాయో, వాటి విలువలు విలువైన లోహం యొక్క పడిపోయిన విలువను బట్టి ఏ నిష్పత్తిలో అంచనా గట్టబడతాయో సరిగ్గా అదే నిష్పత్తిలో ఆ కొత్త ధరలను వాస్తవం చేయటానికి అవసరమైన పరిమాణంలో ఆ లోహం ముందే వుంది. వెండి, బంగారాల తాజా సరఫరాలను కనుగొనటం వల్ల తలెత్తిన ఫలితాలను 17వ శతాబ్దంలో, ముఖ్యంగా 18వ శతాబ్దంలో, ఒకే పార్శ్వం నుండి పరిశీలించిన కొంతమంది ఆర్థికవేత్తలు, చలామణి సాధనంగా వ్యవహరించే వెండి, బంగారాల పరిమాణం పెరగటం వల్ల సరుకుల ధరలు పెరిగాయనే పొరపాటు నిర్ధారణకి వచ్చారు. ఇకనుంచీ బంగారం విలువ అనేది ముందే నిర్ణయింపబడిన అంశంగా పరిగణిద్దాం. నిజానికి ఒక సరుకు ధరని మనం ఎప్పుడు అంచనా కట్టినా, ఆ సమయానికి బంగారం విలువ అప్పటికే నిర్ణయింపబడిన అంశంగా వుంటుంది.

కనుక దీని ప్రకారం, చలామణి సాధనం యొక్క పరిమాణాన్ని వాస్తవ రూపం ధరించాల్సిన ధరల మొత్తం నిర్ధారిస్తుంది. ప్రతి సరుకు ధరా ముందే నిర్ణయింపబడిందనుకుందాం. ధరల మొత్తం చలామణిలో వున్న సరుకుల మొత్తంపై ఆధారపడి వుంటుందనేది స్పష్టం. ఒక క్వార్టరు గోధుమ

ఖరీదు 2 పౌండ్లయితే వంద క్వార్టర్ల ఖరీదు 200 పౌండ్లు అవుతుందనీ, 200 క్వార్టర్ల ఖరీదు 400 పౌండ్లు అవుతుందనీ, గోధుమల్ని అమ్మినప్పుడు దానితోపాటు స్థానాలు మారే డబ్బు పరిమాణం గోధుమ పరిమాణంతోపాటు పెరగాలనీ తెలుసుకోడానికి బుర్ర బద్దలు కొట్టుకోవలసిన అవసరం లేదు.

సరుకుల మొత్తం స్థిరంగా వుంటే, చలామణిలో వున్న డబ్బు పరిమాణం ఆ సరుకుల ధరల హెచ్చు తగ్గులను బట్టి డబ్బు మొత్తం మారుతుంటుంది. కాబట్టి చలామణిలో వున్న డబ్బు పరిమాణం కూడా అదే విధంగా మారుతుంటుంది. ఈ ఫలితం రావాలంటే, మొత్తం సరుకుల ధరలు ఏకకాలంలో పెరగడమో తరగడమో జరగనక్కర్లేదు. ప్రధాన వస్తువుల ధరల హెచ్చుతగ్గుల్ని బట్టి సరుకుల ధరల మొత్తం పెరగడమో, తరగడమో జరుగుతుంది. దానిని బట్టి చలామణిలో వుండే డబ్బు పరిమాణం హెచ్చుతూ, తగ్గుతూ వుంటుంది. ధరల్లో వచ్చిన మార్పు సరుకుల వాస్తవ విలువలో వచ్చిన మార్పు వల్ల జరిగినా, లేదా కేవలం మార్కెట్ ధరల్లో వచ్చిన హెచ్చు తగ్గుల్ని బట్టి జరిగినా చలామణి సాధనం యొక్క పరిమాణంపై దాని ప్రభావం మాత్రం ఒకే విధంగా వుంటుంది.

ఈ క్రింది వస్తువులు విభిన్న ప్రాంతాల్లో ఏకకాలంలో అమ్మబడినాయి లేదా పాక్షికంగా రూపాంతరం చెందాయి అనుకుందాం; ఒక క్వార్టరు గోధుమలు, 20 గజాల వస్త్రం, ఒక బైబిల్, 4 గాలన్ల బ్రాందీ. ఇందులో ప్రతి వస్తువు ఖరీదు 2 పౌండ్లయితే, వాస్తవ రూపం ధరించాల్సిన ధరల మొత్తం 8 పౌండ్లు. అంటే 8 పౌండ్ల డబ్బు చలామణిలో వుండాలి. 1 క్వార్టరు గోధుమ – 2 పౌండ్లు – 20 గజాల వస్త్రం – 2 పౌండ్లు – 1 బైబిల్ – 2 పౌండ్లు – 4 గాలన్ల బ్రాందీ – 2 పౌండ్లు; మనకింతకు ముందే బాగా తెలిసిన ఈ రూప పరివర్తనల గొలుసులో ఈ వస్తువులు లంకెలుగా వుంటే, 2 పౌండ్ల విభిన్న సరుకులను ఒకదాని తర్వాత ఒకటిగా చలామణిలో వుంచుతుంది. వరసగా వాటి ధరలను వాస్తవం చేశాక, అంటే ఆ ధరల మొత్తం 8 పౌండ్లను వాస్తవం చేశాక అవి చివరికి సారా కొట్టువాని జేబులో విశ్రాంతి తీసుకోడానికి వస్తాయి. ఆ విధంగా 2 పౌండ్లు నాలుగుసార్లు స్థానం మారుతాయి. ఒకే డబ్బు నాణాలు పదే పదే స్థానాలు మారడం అనేది సరుకుల రూపంలో వచ్చే ద్వంద్వ పరివర్తనకీ, రెండు చలామణి దశల్లో రెండు విరుద్ధ దిశల్లో జరిగే వాటి చలనానికీ, విభిన్న సరుకుల రూప పరివర్తనలు ఒకదానితో మరొకటి పెనవేసుకొని వుండటానికి అనుగుణంగా వుంటుంది.[1] రూప పరివర్తన అనే ప్రక్రియలో ఈ రెండు విరుద్ధ, పరస్పర పూరక దశలు ఏకకాలంలో జరగవు. ఒకదాని తర్వాత ఒకటి గడుస్తాయి. కనుక ఈ పరంపర పూర్తికావటానికి కాలం పడుతుంది. కనుక నిర్దిష్ట సమయంలో నిర్దిష్ట ద్రవ్యం యొక్క కదలికల సంఖ్యని బట్టి డబ్బు చలన వేగం కొలవబడుతుంది. పై 4 వస్తువుల చలామణికి ఒక రోజు పడుతుంది అనుకుందాం. ఒక రోజులో వాస్తవ రూపం ధరించాల్సిన ధరల మొత్తం 8 పౌండ్లు. రెండు డబ్బు నాణాల కదలికల సంఖ్య

1. "వస్తువులే దానిని (డబ్బుని) చలనంలో వుంచుతాయి, చలామణి అయ్యేలా చేస్తాయి. దాని చలన వేగం దాని (డబ్బు) పరిమాణానికి పూరకంగా వుంటుంది. అవసరమైనప్పుడు, ఒక్క క్షణమైనా ఆగకుండా ఒక చేతి నుండి మరో చేతిలోకి జారటం తప్ప అది ఇంకేమీ చెయ్యదు." (లేత్రోస్నె, అదే గ్రంథం, పుటలు 915-16)

నాలుగు. చలనంలో వున్న ద్రవ్య పరిమాణం 2 పౌండ్లు. కనుక చలామణి ప్రక్రియ జరిగే నిర్ణీత వ్యవధిలో మనకి ఈ క్రింది సంబంధం తారసపడుతుంది; సరుకుల ధరల మొత్తాన్ని ఒకే పేరుగల నాణాల కదలికల సంఖ్యతో భాగించగా వచ్చే ఫలితం, చలామణి సాధనంగా పనిచేస్తున్న ద్రవ్య పరిమాణానికి సమానం. ఈ నియమం సర్వత్రా వర్తిస్తుంది.

ఒక నిర్ణీత వ్యవధిలో, నిర్దిష్ట దేశంలో సరుకుల మొత్తం చలామణిలో ఒకవైపున ఏకకాలంలో జరిగే వేరువేరు పాక్షిక రూప పరివర్తనలు అనేకం వుంటాయి. అవి ఒకేసారి అమ్మకాలూ, కొనుగోళ్ళు కూడా. వాటిలో ప్రతి నాణెం తన స్థానాన్ని ఒక్కసారి మాత్రమే మారుస్తుంది. లేదా ఒక్కసారి కదులుతుంది. మరోవైపున ఈ చలామణిలో అనేక విభిన్న రూపాంతరాల పరంపరలుంటాయి. ఇవి పాక్షికంగా ఒకదానిపక్క ఒకటి వుంటాయి. పాక్షికంగా ఒకదానితో ఒకటి కలిసి వుంటాయి. ఇందులో ప్రతి పరంపరలోనూ ప్రతి నాణెం అనేకసార్లు కదులుతుంది. ఆ కదలికల సంఖ్య పరిస్థితులను బట్టి ఎక్కువ వుండొొచ్చు, తక్కువ వుండొొచ్చు. చలామణిలో వున్న ఒకే పేరుగల మొత్తం నాణాల కదలికల సంఖ్య తెలిస్తే, దానిని బట్టి ఆ పేరుగల ఒక నాణెం సగటున ఎన్నిసార్లు కదిలిందో చెప్పగలం. లేదా డబ్బు సగటు చలన వేగాన్ని తెలుసుకోగలం. అయితే ప్రతి రోజూ ప్రారంభంలో చలామణిలోకి వచ్చే డబ్బు, పక్క పక్కనే ఏకకాలంలో చలామణిలో వున్న సరుకులన్నింటి ధరల మొత్తాన్ని బట్టి నిర్ణయించబడుతుంది. అయితే ఒకసారి చలామణిలోకి వచ్చాక నాణాలు ఒకదానికొకటి బాధ్యత వహిస్తాయని ఒక విధంగా చెప్పవచ్చు. ఒకటి తన వేగాన్ని పెంచుకుంటే మరోటి తన వేగాన్ని తగ్గించుకుంటుంది. లేదా మొత్తంగా చలామణి నుండి తప్పుకుంటుంది. ఎందుకంటే, ఒక నాణెం చేసే సగటు కదలికల సంఖ్యతో హెచ్చిస్తే, ధరల మొత్తానికి సమానం కావడానికి అవసరమైనంత పరిమాణంలో మాత్రమే బంగారాన్ని చలామణి యిముడ్చుకుంటుంది. వేర్వేరు నాణాల కదలికల సంఖ్య పెరిగితే, చలామణిలో వుండే ఆ నాణాల మొత్తం సంఖ్య తగ్గుతుంది. కదలికల సంఖ్య తగ్గితే, నాణాల మొత్తం సంఖ్య పెరుగుతుంది. ఒక నిర్దిష్ట సగటు చలన వేగంలో చలామణి ఇముడ్చుకోగలిగిన డబ్బు పరిమాణం నిర్దిష్టంగా వుంటుంది కనుక ఒక నిర్దిష్ట సంఖ్యలో నవరసు (సావరిన్*)లను చలామణి నుండి తప్పించాలంటే అంతే సంఖ్య గల పౌండ్ నోట్లను చలామణిలోకి నెడితే చాలు. ఇది బ్యాంకర్లందరికీ తెలిసిన చిట్కాయే.

సాధారణంగా డబ్బు చలనం అనేది సరుకుల చలామణిని లేదా సరుకులు లోనయ్యే విరుద్ధ రూప పరివర్తనలను ప్రతిబింబించినట్లే. డబ్బు చలన వేగం అనేది సరుకులు ఎంత వేగంగా తమ రూపాల్ని మార్చుకుంటున్నాయో అన్నదాన్ని ప్రతిబింబిస్తుంది. రూప పరివర్తనల పరంపరలు ఒకదానితో మరొకటి నిరంతరాయంగా పెనవేసుకోవడాన్ని, పదార్థం యొక్క సామాజిక అంతఃపరివర్తన హడావుడినీ, చలామణి రంగం నుండి సరుకులు శీఘ్రంగా మాయం కావడాన్నీ, అంతే శీఘ్రంగా కొత్త సరుకులు వాటి స్థానాలను ఆక్రమించుకోవడాన్నీ అది ప్రతిబింబిస్తుంది. పరస్పర విరుద్ధపూరక దశల ఐక్యతని, అనగా సరుకుల ఉపయోగ పార్శ్వం విలువ పార్శ్వంగా మారటానికీ, తిరిగి విలువ పార్శ్వం ఉపయోగ పార్శ్వంగా మారటానికీ మధ్య ఐక్యతని, లేదా క్రయ విక్రయ క్రమాల ఐక్యతని కరెన్సీ

* పౌండ్‌తో సమానమైన బంగారు నాణెం. (సం.)

వేగంలో మనం చూస్తాము. మరోవైపున కరెన్సీ వేగంలో మందకొడితనం ఈ రెండు ప్రక్రియలు రెండు వేర్వేరు, విరుద్ధ దశలుగా వేరుపడటాన్ని ప్రతిబింబిస్తుంది. రూప పరివర్తనలో తలెత్తిన, మందకొడితనాన్ని ఆ కారణంగా పదార్థం యొక్క సామాజిక అంతఃపరివర్తనలో తలెత్తిన మందకొడి తనాన్ని ప్రతిబింబిస్తుంది. అయితే ఈ మాంద్యానికి మూల కారణమేమిటో స్వయంగా చలామణి తెలియజేయలేదు. అది కేవలం ఈ ఘటనను మన ముందుంచుతుంది. డబ్బు చలనం మందగించగానే చలామణి రంగపు అంచులలో డబ్బు తక్కువ తరచుగా కనిపించి, మాయమవుతోందని సామాన్య జనం గమనిస్తారు. సహజంగానే వారు దీనికి కారణం చలామణి సాధనం తగినంత పరిమాణంలో లేకపోవడమే అనుకుంటారు.[1]

చలామణి సాధనంగా ఒక నిర్ణీత కాలంలో పనిచేసే డబ్బు పరిమాణాన్ని ఒకవైపున చలామణిలో వున్న సరుకుల ధరల మొత్తమూ, మరోవైపున, రూప పరివర్తనలలోని విరుద్ధ దశలు ఒకదాన్ని మరొకటి ఎంత శీఘ్రంగా అనుసరిస్తాయన్నదీ నిర్ణయిస్తాయి. ప్రతి నాణెం సగటున ధరల మొత్తంలో ఎంత భాగాన్ని వాస్తవం చేసేది ఈ శీఘ్రతనిబట్టి వుంటుంది. అయితే చలామణిలో వున్న సరుకుల ధరల మొత్తం సరుకుల పరిమాణంతోపాటు వాటి ధరలపైన కూడా ఆధారపడుతుంది. ధరల పరిస్థితి, చలామణిలో వున్న సరుకుల పరిమాణంతోపాటు వాటి ధరలపైన కూడా ఆధారపడుతుంది. ధరల పరిస్థితి, చలామణిలో వున్న సరుకుల పరిమాణం, డబ్బు చలనవేగం అనే ఈ మూడు అంశాలూ మారుతూ వుంటాయి. కనుక వాస్తవ రూపం ధరించాల్సిన ధరల మొత్తమూ, దానితోపాటు ఆ మొత్తంపై ఆధారపడే చలామణి సాధనం యొక్క పరిమాణమూ ఈ మూడు అంశాల సంయోగంలో

---

1. ''క్రయ విక్రయాలకు సామాన్య కొలమానం డబ్బు కనుక, తన సరుకులను అమ్మగోరే వ్యక్తికి కొనుగోలుదారుడు దొరకకపోతే రాజ్యంలో, లేదా దేశంలో డబ్బు కొరతవల్లే తన సరుకులు అమ్ముడుపోవటం లేదని అనుకొంటాడు. డబ్బు కావాలనేది సర్వ సాధారణ నినాదమవుతుంది. అది పెద్ద పొరపాటు. డబ్బు కావాలని అరిచేవాళ్ళకు నిజానికి కావలసిందేమిటి? రైతేమంటాడు? దేశంలో మరింత డబ్బు వుంటే తన సరుకులకు ధర పలికి వుండేది అని అతడనుకుంటాడు. నిజానికి అతనికి కావలసింది డబ్బు కాదు. అతను అమ్మాలనుకుని అమ్మలేకపోతున్న ధాన్యం, పశువుల ధర మాత్రమే. వాటికి ధర ఎందుకు రావటం లేదు (1) దేశంలో ధాన్యమూ, పశువులు అతిగా వుండి వుండాలి. ఈ రైతులాగానే అమ్మేవాళ్ళు ఎక్కువుండి, కొనేవాళ్ళు తక్కువుండొచ్చు. (2) విదేశాలకు రవాణా చేసే అవకాశాలు తగ్గిపోయుండొచ్చు. (3) దారిద్ర్యం వల్ల జనం ఇళ్ళల్లో ఇంతకు ముందు ఖర్చు పెట్టినంతగా ఖర్చు పెట్టలేనందున వాడకం తగ్గిపోవచ్చు. కనుక రైతు సరుకులు అమ్ముడుపోవాలంటే డబ్బు పరిమాణాన్ని పెంచడం కాదు. మార్కెటుని మందకొడిగా వుంచే పై మూడు కారణాలలో దేన్నైనా తొలగించాలి... ఒక వ్యాపారీ, దుకాణదారుడు కూడా ఇదే విధంగా డబ్బు కావాలనుకుంటారు. మార్కెటు విఫలం అయింది. తమ సరుకులు అమ్ముడుపోవాలి అనుకుంటారు. ''సంపదలు ఒక చేతి నుండి మరో చేతికి వేగంగా మారినప్పుడే (ఒక జాతి) వికసిస్తుంది. (సర్‌డట్లీ నార్త్; ''డిస్కోర్సెస్ అపాన్ ట్రేడ్'', లండన్, 1691, పుటలు 11-15) సరుకుల స్వభావంలోనే తలెత్తి చలామణిలో పునరుత్పత్తి చెందే వైరుధ్యాన్ని చలామణి సాధనం పెంచడం ద్వారా తొలగించవచ్చనే హెరెన్స్‌వండ్ వింత ఆలోచనల సారం. ఉత్పత్తి చలామణి రంగాలలో మాంద్యానికి చలామణి సాధనం కొరతే కారణమనేది - ప్రజల్లో పాతుకుపోయిన భ్రమ. అయితే మరోవైపున కరెన్సీని క్రమబద్ధం చేసేందుకు జరిగే శాసనాల జోక్యం వల్ల చలామణి సాధనంలో కొరత ఏర్పడితే, ఆ కొరత వల్ల మాంద్యం ఏర్పడదు అని అనుకోటానికి వీలులేదు.

వచ్చే అనేక మార్పుల కనుగుణంగా మారుతూ వుంటాయి. ఈ మార్పుల్లో ధరల చరిత్రలో అత్యంత ప్రధానమైన వాటిని మాత్రమే మనమిక్కడ పరిశీలిద్దాము.

ధరలు స్థిరంగా వుంటే, చలామణి సాధనం యొక్క పరిమాణం చలామణిలో వున్న సరుకుల సంఖ్య పెరగటం వల్ల పెరగొచ్చు, లేదా కరెన్సీ వేగం తగ్గటం వల్ల పెరగొచ్చు. లేదా రెండింటి సంయోగం వల్ల పెరగొచ్చు. మరోవైపున సరుకుల సంఖ్య తగ్గటం వల్ల లేదా వాటి చలామణి శీఘ్రత పెరగటం వల్ల చలామణి సాధనం యొక్క పరిమాణం తగ్గవచ్చు.

సరుకుల ధరలు సార్వత్రికంగా పెరిగినప్పుడు, అదే నిష్పత్తిలో చలామణిలో వున్న సరుకుల సంఖ్య తగ్గితే చలామణి సాధనం యొక్క పరిమాణం స్థిరంగా వుంటుంది. లేదా ధరలు పెరిగిన నిష్పత్తిలోనే కరెన్సీ వేగం కూడా పెరిగి, చలామణిలో వున్న సరుకుల సంఖ్య స్థిరంగా వుంటే కూడా చలామణి సాధనం పరిమాణం స్థిరంగా వుంటుంది. ధరల పెరుగుదల కంటే శీఘ్రంగా సరుకుల సంఖ్య తగ్గటం వల్లగానీ, కరెన్సీ వేగం అంతకంటే శీఘ్రంగా పెరగటంవల్ల గానీ చలామణి సాధనం యొక్క పరిమాణం తగ్గవచ్చు.

సరుకుల ధరలు సర్వత్రా పడిపోయినప్పుడు అదే నిష్పత్తిలో సరుకుల సంఖ్య పెరిగితే, లేదా అదే నిష్పత్తిలో కరెన్సీ వేగం తగ్గితే చలామణి సాధనం పరిమాణం స్థిరంగా వుంటుంది. ధరల పతనం కంటే వేగంగా సరుకుల సంఖ్య పెరిగితే, లేదా చలామణి శీఘ్రత తగ్గితే చలామణి సాధనం పరిమాణం పెరుగుతుంది.

ఈ విభిన్న అంశాలలో వచ్చే మార్పులు ఒకదానినొకటి పరిహరించవచ్చు. కనుక వాటి అస్థిరత నిరంతరాయంగా వున్నప్పటికీ, వాస్తవ రూపం ధరించాల్సిన ధరల మొత్తమూ, చలామణిలో వున్న డబ్బు పరిమాణమూ స్థిరంగా వుండొచ్చు. దీర్ఘకాల వ్యవధుల్ని మనం పరిగణనలోకి తీసుకున్నప్పుడు ఏ దేశంలోనయినా చలనంలో వున్న డబ్బు పరిమాణపు సగటు స్థాయిలో వచ్చే మార్పులు మనం ఊహించిన దానికంటే తక్కువగా వుండటానికి కారణమిదే. అయితే నిర్ణీత కాలానికోసారి తలెత్తే పారిశ్రామిక, వాణిజ్య సంక్షోభాలవల్ల, లేదా తక్కువ తరచుగా సంభవించే డబ్బు విలువలో హెచ్చుతగ్గుల వల్లా ఈ మార్పులు తీవ్రంగా వుంటాయి.

చలామణిలో వున్న సరుకుల ధరల మొత్తాన్నిబట్టీ, కరెన్సీ సగటు వేగాన్నిబట్టీ చలామణి సాధనం పరిమాణం ఆధారపడి వుంటుంది అనే నియమాన్ని ఈ రకంగా కూడా చెప్పవచ్చు.[1]

---

1. "ఒక దేశంలో వ్యాపారం నడవడానికి నిర్దిష్ట పరిమాణంలో డబ్బు అవసరం. అంతకు తక్కువున్నా, ఎక్కువున్నా వ్యాపారం దెబ్బతింటుంది. చిన్న చిల్లర వ్యాపారంలో, వెండి డబ్బుని మార్చాలంటే ఫార్తింగులు (చిల్లర పైసలు ఆనాడు ఒక పెన్నీకి 4 ఫార్తింగులుండేవి - సం) అవసరమవుతాయి. కొన్ని లెక్కల్ని అతి చిన్న వెండి నాణాలతో సైతం తేల్చడం సాధ్యం కాదు. కనుక ఇవి అవసరం. అలాగే పైది కూడా. వాణిజ్యంలో అవసరమైన ఫార్తింగుల సంఖ్యని ప్రజల సంఖ్యనిబట్టీ, మార్పిడుల వేగాన్నిబట్టీ, ప్రధానంగా అత్యంత చిన్న వెండి నాణాల విలువనుబట్టీ నిర్ణయించాలి. మన వ్యాపారంలో అవసరమైన డబ్బు (వెండి, బంగారాల) పరిమాణాన్ని కూడా అదేవిధంగా మార్పిడుల వేగాన్నిబట్టీ, చెల్లింపులు ఎంత పెద్దవి అన్నదాన్నిబట్టీ నిర్ణయించాలి." (విలియమ్ పెట్టీ, "ఎ ట్రెటైజ్ ఆఫ్ టాక్సెస్ అండ్ కంట్రిబ్యూషన్స్" లండన్,

సరుకుల విలువల మొత్తమూ, వాటి రూప పరివర్తనల సగటు శీఘ్రతా నిర్దిష్టంగా వుంటే, డబ్బుగా చలనంలో వున్న విలువైన లోహం యొక్క పరిమాణం ఆ లోహం విలువపైన ఆధారపడి వుంటుంది. అందుకు విరుద్ధంగా ధరలని చలామణి సాధనం యొక్క పరిమాణం నిర్ణయిస్తుందనీ, ఆ పరిమాణాన్ని దేశంలో వున్న విలువైన లోహాల పరిమాణం నిర్ణయిస్తుందనీ ఒక పొరపాటు అభిప్రాయం ఏర్పడింది.[1]

మొట్టమొదట చలామణిలో ప్రవేశించేటప్పుడు సరుకులకు ధర వుండదనీ, డబ్బుకి విలువుండదనీ, అవి ఒకసారి చలామణిలోకి వచ్చాక సరుకుల కలగూర గంప యొక్క ఒక పూర్ణాంకపు భాగం, విలువైన లోహాల కుప్ప యొక్క ఒక పూర్ణాంకపు భాగంతో మార్పిడి చేయబడుతుందనీ నమ్మిన తొలి ప్రతినిధుల అసంబద్ధ సిద్ధాంతమే ఈ పొరపాటు అభిప్రాయానికి మూలం.[2]

---

1667, పుట 17) జె. స్టువర్ట్ తదితరుల దాడులకు వ్యతిరేకంగా హ్యూమ్ సిద్ధాంతాన్ని ఎ. యంగ్ తన 'పొలిటికల్ అర్థమెటిక్' (లండన్, 1774) అన్న గ్రంథంలో సమర్థించాడు. ఆ గ్రంథంలో "డబ్బు పరిమాణంపైన ధరలు ఆధారపడతాయి" అనే ప్రత్యేక అధ్యాయం వుంది. (112వ పుట నుండి) 'నా అర్థశాస్త్ర విమర్శ'లో నేనిలా అన్నాను; (పుట 149) "ఆయన (ఆడమ్ స్మిత్) చలామణిలో వున్న నాణాల పరిమాణానికి సంబంధించిన విషయాన్ని ప్రస్తావించకుండా దాటిపోతాడు. డబ్బుని పొరబాటుగా కేవలం ఒక సరుకుగా మాత్రమే పరిగణిస్తాడు." అయితే ఆడమ్ స్మిత్ వృత్తిధర్మం రీత్యా డబ్బుని పరిగణించినమేరకే ఈ ప్రకటన వర్తిస్తుంది. అంతకు ముందున్న అర్థశాస్త్రాన్ని విమర్శించే సందర్భంలో లాగానే అప్పుడప్పుడూ ఆయన సరైన దృక్పథాన్నే ప్రదర్శిస్తాడు. "ప్రతి దేశంలోనూ నాణాల పరిమాణం దానిచేత చలామణిలో పెట్టబడే సరుకుల విలువను బట్టి నిర్ణయింపబడుతుంది ... ఏ దేశంలోనైనా ప్రతి ఏడాది కొనబడి అమ్మబడే సరుకులను వాటి అనుభోగాలకు పంపిణీ చేయడం కోసం నిర్దిష్ట పరిమాణంలో డబ్బు అవసరం. అయితే అంతకుమించిన డబ్బు మొత్తంలో పనిలేదు. చలామణి కాలువ తనని నింపటానికి అవసరమైన కొంత మొత్తాన్ని విధిగా తనవైపు లాక్కుంటుంది. అంతకు పైగా ఎంత మాత్రం దరిచేరనీయదు. ("వెల్త్ ఆఫ్ నేషన్స్") నాల్గో గ్రంథం, ఒకటో అధ్యాయం. అదేవిధంగా తన వృత్తిధర్మం రీత్యా ఆయన తన గ్రంథాన్ని శ్రమ విభజన స్తోత్రంతో ప్రారంభిస్తాడు. తర్వాత ప్రభుత్వాదాయ మార్గాలను చర్చించిన తన చివరి పుస్తకంలో అక్కడక్కడా శ్రమ విభజనని ఖండించడంలో తన గురువు ఎ. ఫెర్గూసన్ పలుకుల్ని పునశ్చరణ చేస్తాడు.

1. "ప్రజల దగ్గరున్న వెండి, బంగారాలు పెరిగితే దేశంలో వస్తువుల ధరలు పెరుగుతాయి. ఏ దేశంలోనైనా వెండి, బంగారాలు తగ్గితే అదే నిష్పత్తిలో అన్ని వస్తువుల ధరలూ తగ్గుతాయి." (జాకబ్ వాండర్ లింట్, "మనీ ఆన్సర్స్ ఆల్ థింగ్స్" లండన్, 1734, పుట 5) ఈ గ్రంథాన్ని హ్యూమ్ "వ్యాసాలతో జాగ్రత్తగా పోల్చి చూడగా హ్యూమ్‌కి వాండర్ లింట్ యొక్క ఈ ముఖ్యమైన గ్రంథం తెలుసనీ, ఆయన దాన్ని ఉపయోగించుకొన్నాడనీ ఏమాత్రం సందేహం లేకుండా నాకు స్పష్టమైంది. చలామణి సాధనం యొక్క పరిమాణమే ధరల్ని నిర్ధారిస్తుందనే అభిప్రాయం బార్బన్‌తోపాటు అంతకు చాలా ముందున్న రచయితలు కూడా వ్యక్తం చేశారు. "నిరాటంకంగా సాగు వ్యాపారం వల్ల అసౌకర్యమేమీ వుండదు. దానివల్ల ప్రయోజనమే కలుగుతుంది. దానివల్ల దేశంలో వున్న డబ్బు తగ్గిపోతే (ఈ తగ్గుదలని అరికట్టడమే ఆంక్షల ఉద్దేశం), ఆ డబ్బుని పొందిన దేశాల్లో డబ్బు పెరగటం వల్ల ప్రతిదాని ధర పెరిగిపోతుంది. ఇక్కడ మన ఉత్పత్తులూ వగైరాల ప్రతి దాని ధర తగ్గిపోయి వాణిజ్య శేషం మనకు అనుకూలంగా మారుతుంది. తద్వారా మన డబ్బు వెనక్కి వస్తుంది అంటాడు వాండర్ లింట్ (అదే గ్రంథం, పుటలు 43-44).

2. ప్రతి రకం సరుకు ధర చలామణిలో వున్న మొత్తం సరుకుల ధరల మొత్తంతో ఒక భాగమేననేది ఒక

## ఇ. నాణెమూ, విలువ చిహ్నాలూ

డబ్బు చలామణి సాధనం కావటం వల్లనే అది నాణెం రూపం ధరిస్తుంది. సరుకుల ధరలు, లేదా ద్రవ్య నామాలు ఊహాత్మకంగా ఎంత బరువు గల బంగారానికి ప్రాతినిధ్యం వహిస్తాయో అంత బరువు గల బంగారం నాణాల రూపంలో లేదా నిర్దిష్ట నామం గల బంగారం ముక్కల రూపంలో ఆ సరుకుల్ని చలామణిలో ఎదుర్కోవాలి. ధర ప్రమాణాన్ని నిర్ణయించడం లాగే నాణాలు చెయ్యటం కూడా ప్రభుత్వం పనే. నాణాలుగా వెండి, బంగారాలు దేశంలో విభిన్న జాతీయ యూనిఫారాలను ధరిస్తాయి. కాని ప్రపంచ మార్కెటులో అవి వాటిని విప్పేస్తాయి. సరుకుల చలామణి అంతర్గత, లేదా జాతీయ రంగం ప్రపంచ రంగంతో వేరుగావటాన్ని ఇది సూచిస్తుంది.

కనుక నాణానికి, బులియన్‌కి (ముద్దబంగారం) వున్న ఏకైక భేదం వాటి రూప భేదం మాత్రమే.

---

స్వయం విదిత ప్రతిపాదన. ఒకే కొలమానంతో కొలవడానికి వీలులేని ఉపయోగపు విలువలు మూకుమ్మడిగా దేశంలో వున్న వెండి, బంగారాల మొత్తంతో ఎలా మార్పిడి అవుతాయో అర్థం కాదు. సరుకులన్నీ కలిసి ఒక పెద్ద సరుకు అనే ఆ పెద్ద సరుకులో ప్రతి విడి సరుకూ ఒక పూర్ణాంకపు భాగమనీ మనం భావిస్తే మనకి సుందరమైన ఫలితం కనిపిస్తుంది; పెద్ద సరుకు = 'య' టన్నుల బంగారం, సరుకు 'క' = పెద్ద సరుకులో ఒక పూర్ణాంకపు భాగం = టన్నుల బంగారంలో అదే పూర్ణాంకపు భాగం. మాంటెస్క్యూ దీన్నే మనఃపూర్తిగా ప్రతిపాదించాడు. "ప్రపంచంలో వున్న వెండి, బంగారాలని సరుకుల మొత్తంతో పోలిస్తే విడిగా ప్రతి ఉత్పాదితాన్ని లేదా సరుకుని, మొత్తం డబ్బులో కొంత భాగంతో ఖాయంగా పోల్చవచ్చు. ప్రపంచంలో ఒకే ఒక ఉత్పాదితం లేదా సరుకు వుందనుకుందాం. కొనటానికి వీలైనది ఒకే ఒక సరుకు వుందనీ, డబ్బులాగానే దాన్ని కూడా అనేక భాగాలుగా విభజించవచ్చనీ అనుకుందాం; ఈ సరుకులో ఒక నిర్దిష్ట భాగం, మొత్తం డబ్బులో ఒక భాగానికి అనుగుణంగా వుంటుంది. ఉదాహరణకి, మొత్తం సరుకులో సగం మొత్తం డబ్బులో సగంతో తులతూగుతుంది. మౌలికంగా వస్తువుల ధరలు ఎప్పుడూ వస్తువుల మొత్తానికీ, వాటి ద్రవ్య చిహ్నాల మొత్తానికీ మధ్య వున్న సంబంధంపైన ఆధారపడి వుంటుంది." (మాంటెస్క్యూ, అదే గ్రంథం, మూడో సంపుటి, పుటలు 12, 13) రికార్డో అతని శిష్యులైన జేమ్స్‌మిల్, లార్డ్ ఓవర్‌స్టన్ తదితరులు ఈ సిద్ధాంతాన్ని ఎట్లా అభివృద్ధి చేశారో తెలుసుకోవాలంటే "అర్థశాస్త్ర విమర్శ" పుటలు 140-146, పుట 150, ఆపైన చూడండి. జాన్‌స్టువార్ట్ మిల్ తన మామూలు మిశ్రమవాద తర్కంతో తన తండ్రి జేమ్స్‌మిల్ అభిప్రాయాన్ని ఒకవైపు, దానికి సరిగ్గా వ్యతిరేకమైన దృక్పథాన్ని మరోవైపూ పట్టుకొని వుంటానికి తంటాలుపడతాడు. ఆయన తనని తాను తన కాలపు ఆడంస్మిత్‌గా ప్రకటించుకున్న మొదటి ముద్రణ ముందుమాటని ఆయన గ్రంథ సంగ్రహం "అర్థశాస్త్ర మూలసూత్రాల"తో పోల్చి చూశాక తనని తాను అభినవ ఆడమ్ స్మిత్‌గా ప్రకటించుకున్న ఆయన బోళాతనాన్ని మెచ్చుకోవాలో, ఆ మాటని యథాతథంగా నమ్మిన జనం బోళాతనాన్ని మెచ్చుకోవాలో మనకి తెలియదు. కార్స్‌కి చెందిన జనరల్ విలియమ్స్‌కీ, డ్యూక్ ఆఫ్ వెల్లింగ్‌టన్‌కి ఎంత సామ్యముందో ఆయనకీ ఆడంస్మిత్‌కి అంతే సామ్యముంది. అర్థశాస్త్రంలో జె.ఎస్. మిల్ మౌలిక పరిశోధనలన్నీ 1844లో వెలువడిన ఆయన చిరు పుస్తకం, "రాజకీయ అర్థశాస్త్రంలో కొన్ని పరిష్కారంకాని సమస్యలు"లో దొరుకుతాయి. అవి విస్తృతమూ కాదు, సమగ్రమూ కాదు. వెండి, బంగారాల్లో విలువ లేకపోవడానికీ, వాటి విలువలు కేవలం పరిమాణంచేత నిర్ణయింపబడటానికీ మధ్య గల సంబంధాన్ని లాక్ నొక్కి చెప్తాడు. "మానవ జాతి వెండి, బంగారాలకు విలువ నాపాదించటానికి అంగీకరించింది... ఈ లోహాల్లోని సహజ విలువ అంటే ఏదో కాదు, వాటి పరిమాణమే" ("సమ్ కన్సిడరేషన్స్...", 1691, - రెండో సంపుటి, పుట 15.)

బంగారం ఎప్పుడైనా ఒక రూపం నుండి మరో రూపానికి మారగలదు.[1] అయితే నాణెం టంకశాల నుండి బయటికి రాగానే అది లోహాన్ని కరిగించే కొలిమికి చేర్చే రోడ్డుపై వుంటుంది. నాణాలు తమ చలనంలో కొన్ని ఎక్కువగాను, కొన్ని తక్కువగానూ అరుగుతాయి. పేరూ దాని సారం, నామమాత్రపు బరువూ వాస్తవ బరువూ వేరుపడిపోయే ప్రక్రియ ప్రారంభమవుతుంది. ఒకే పేరుగల నాణాల బరువులు వేరవటంవల్ల, వాటి విలువలు కూడా వేరవుతాయి. ధర ప్రమాణంగా నిర్ణయింపబడిన బంగారం బరువు చలామణి సాధనంగా వ్యవహరించే దాని బరువు నుండి వేరవుతుంది. ఆపైన చలామణి సాధనంగా వ్యవహరించే డబ్బు సరుకుకు వాస్తవ సమ విలువగా వుండదు. దీనివల్ల తలెత్తిన నిత్యనూతన గందరగోళం ఎంతటిదో మధ్యయుగాల నుండి 18వ శతాబ్దం వరకూ నాణాల ముద్రణ చరిత్రని చూస్తే తెలుస్తుంది. చలామణి అనేది నాణాలను అవి ప్రాతినిధ్యం వహించే అంశానికి కేవల చిహ్నాలుగా మారుస్తుంది. అంటే అధికారికంగా తాము కలిగి వుండాల్సిన లోహపు బరువులకు చిహ్నాలుగా మారుస్తుంది. ఇది దాని సహజ ధోరణి, ఈ సంగతిని ఆధునిక శాసనాలు గుర్తించాయి. కనుకనే, ఒక బంగారు నాణెం ఏ మేరకు తన బరువుని కోల్పోతే అది నాణెం కాకుండా పోతుందో, లేదా చలామణికి యోగ్యం కాకుండా పోతుందో అవి నిర్ధారిస్తున్నాయి.

నాణాల చలనమే వాటి నామమాత్రపు బరువుని వాస్తవ బరువు నుండి వేరుచేస్తుంది. ఒకవైపున కేవలం లోహపు ముక్కలుగాను, రెండోవైపున నిర్దిష్ట విధులను నిర్వహించే నాణాలుగానూ వాటి మధ్య తేడాను సృష్టిస్తుంది అన్నది వాస్తవం. లోహపు నాణాలను తొలగించి ఆ స్థానాన్ని మరో పదార్థంతో చేసిన చిహ్నాలు, నాణాలుగా అదే పాత్రని నిర్వహించే చిహ్నాలు, ఆక్రమించుకోవచ్చు అన్న అంతర్నిహితంగా వున్న అవకాశాన్ని ఈ వాస్తవం వెల్లడిస్తుంది. అతి సూక్ష్మ పరిమాణాలలో వెండి, బంగారాలను నాణాలుగా మార్చడంలో ఆచరణాత్మక ఇబ్బందులున్నాయి. విలువ కొలమానంగా ఎప్పుడూ మొదట ఎక్కువ విలువైన లోహం బదులు తక్కువ విలువైన లోహం వాడబడుతుంది. వెండికి బదులు రాగిని, బంగారం బదులు వెండిని వాడటం జరుగుతుంది. ఎక్కువ విలువైన

---

1. ముద్రణాచట్టం (నాణాల ముద్రణపై పన్ను - అను.) లాంటి వివరాలను పరిశీలించడం ఇక్కడ నా లక్ష్యం కాదు. అయినప్పటికీ నాణాల ముద్రణలో బ్రిటీషు ప్రభుత్వం ప్రదర్శిస్తున్న "మహా ఔదార్యాన్ని" శ్లాఘించే కాల్పనిక తైనాతీ ఆడం మ్యుల్లర్ తెలుసుకోవడం కోసం సర్ డడ్లీ నార్త్ వ్యక్తం చేసిన ఈ క్రింది అభిప్రాయాన్ని ఉల్లేఖిస్తాను. "వెండి, బంగారాలకు కూడా ఇతర సరుకుల్లాగే ఆటుపోట్లుంటాయి. స్పెయిన్ నుండి అవి రాగానే బురుజులోకి తీసుకెళ్ళి వాటిని నాణాలుగా మారుస్తారు. వాటిని మళ్ళీ ఎగుమతి చేయాల్సిన అవసరం వస్తుంది. మొత్తం దేశంలో వున్న వెండి, బంగారాలన్నీ నాణాల రూపంలోనే వుంటే, ఏమవుతుంది? కరిగించు, నీకు పోయేదేమీ లేదు. నాణాల ముద్రణల వల్ల వాటి యజమానికి ఏమీ కాలేదు. ఆ రకంగా జాతికి అన్యాయం జరిగింది. గాడిదలు తినటానికి గడ్డిని చుట్టినందుకు అయ్యే ఖర్చును జాతి చెల్లించవలసి వస్తున్నది. నాణాల ముద్రణ ఖర్చుని వ్యాపారి భరించేలా చేస్తే అతను తన వెండిని ఆలోచన లేకుండా బురుజులోకి పంపించే వుండేవాడు కాడు. నాణెంగా మారిన డబ్బు విలువ నాణెంగా మారని వెండి కంటే ఎప్పుడూ అధికంగా వుండేది" (నార్త్, అదే గ్రంథం, పుట 18) రెండో చార్లెస్ హయాంలో నార్త్ స్వయంగా ప్రముఖ వ్యాపారి.

లోహం దాన్ని తొలగించేదాకా తక్కువ విలువైన లోహమే చలామణిలో వుంటుంది. బంగారం నాణాలకు బదులు వెండి, రాగి చిహ్నాలు చారిత్రకంగా నిర్వహించిన పాత్రను ఈ వాస్తవాలన్నీ విశదం చేస్తాయి. ఒక చేతి నుండి మరో చేతికి చాలా శీఘ్రంగా మారే చలామణి ప్రాంతాల్లో అత్యధికంగా అరుగుదలకి గురయ్యేచోట్ల వెండి, రాగి చిహ్నాలు బంగారం స్థానం ఆక్రమిస్తాయి. క్రయ విక్రయాలు చిన్నస్థాయిలో నిరంతరాయంగా జరిగేచోట ఇది జరుగుతుంది. బంగారం స్థానంలో ఈ ఉపగ్రహాలు శాశ్వతంగా స్థిరపడకుండా నిరోధించటం కోసం చెల్లింపుల్లో బంగారం బదులు వాటిని తప్పనిసరిగా ఏ మేరకు స్వీకరించాలో నిర్ణయిస్తూ శాసనాలు జరిగాయి. చలనంలో వున్న వివిధ నాణెం జాతులు పయనించే ప్రత్యేక మార్గాలు ఒకదానిలో ఒకటి కలుస్తాయి. అతి చిన్న బంగారు నాణెంలో భాగాలు చెల్లించేటందుకు బంగారం వెంట చిహ్నాలు వుంటాయి. బంగారం ఒకవైపున చిల్లర చలామణిలోకి నిరంతరం వస్తూ వుంటుంది. మరోవైపున అంతే నిరంతరాయంగా చిహ్నాలుగా మార్చబడటం ద్వారా బయటికి నెట్టబడుతుంది.[1]

వెండి, రాగి నాణాల్లో వుండాల్సిన లోహం బరువుని చట్టమే ఇష్టానుసారం నిర్ణయిస్తుంది. చలనంలో అవి బంగారు నాణాల కంటే శీఘ్రంగా అరిగిపోతాయి. అందువల్ల అవి నిర్వహించే క్రియలకు వాటి బరువుతో ప్రమేయం లేదు, కనుక ఏరకం విలువతోనూ ప్రమేయం లేదు. నాణెంగా బంగారం నిర్వహించే క్రియ, దాని లోహపు విలువతో ఏమాత్రం ప్రమేయం లేకుండా స్వతంత్రంగా మారుతుంది. కనుక సాపేక్షంగా చూస్తే విలువలేని కాగితం నోట్ల లాంటి వస్తువులు దాని స్థానంలో నాణాలుగా వ్యవహరించగలవు. లోహపు చిహ్నాలలో ఈ చిహ్నా స్వభావం కొంత మేరకు ముసుగులో వుంటుంది. కాగితం డబ్బు విషయంలో అది స్పష్టంగా దర్శనమిస్తుంది. నిజానికి, మొదటి అడుగుపైనే అంతా ఆధారపడుతుంది.

ప్రభుత్వం విడుదల చేసి నిర్బంధంగా చలామణిలో వుంచే, మార్పిడికి వీలులేని కాగితపు డబ్బు గురించి మాత్రమే మనం ఇక్కడ ప్రస్తావిస్తున్నాము. లోహపు కరెన్సీలోనే దాని ప్రత్యక్ష జన్మస్థానం వుంది. అప్పుపై ఆధారపడిన డబ్బు ఇతర పరిస్థితులని సూచిస్తుంది. సరుకుల సాదా చలామణి దృష్టినుంచి, ఆ పరిస్థితుల గురించి మనకిప్పుడు బొత్తిగా తెలియదు. అయితే ఒక సంగతి మాత్రం చెప్పొచ్చు. చలామణి సాధనంగా డబ్బు నిర్వహించే క్రియ నుండి నిజమైన కాగితం డబ్బు తలెత్తినట్టే,

---

1. "చిన్న చెల్లింపుల్లో వెండి అవసరమైన దానికంటే మించిలేకుంటే, పెద్ద చెల్లింపుల కోసం తగిన మొత్తం వెండిని సేకరించడం సాధ్యం కాదు ... ప్రధాన చెల్లింపుల్లో బంగారాన్ని ఉపయోగిస్తున్నారు. అంటే చిల్లర వ్యాపారంలో కూడా అది ఉపయోగించబడుతోందని అర్థం. చిన్న కొనుగోళ్ళలో బంగారాన్ని ఇచ్చేవారికి సరుకుతోపాటు మిగిలిన చిల్లర వెండి రూపంలో లభిస్తుంది. చిల్లర వ్యాపారి దగ్గర పేరుకుపోవలసిన వెండిని ఆ రకంగా బయటికి లాగి మామూలు చలామణిలో వుంచటం జరిగింది. బంగారంతో ప్రమేయం లేకుండా చిన్న చెల్లింపులకు సరిపడా వెండి వుంటే, చిల్లర వ్యాపారి దగ్గర చేసే కొనుగోళ్ళకి వెండి చెల్లించబడుతుంది. ఆ రకంగా అది అతని దగ్గర పోగుబడుతుంది." (డేవిడ్ బుకానన్, "ఇన్‌క్వయిరీ ఇన్‌టూ ది టాక్సేషన్ అండ్ కమర్షియల్ పాలసీ ఆఫ్ గ్రేట్ బ్రిటన్" ఎడిన్‌బర్గ్, 1844, పుటలు 248, 249)

చెల్లింపు సాధనంగా డబ్బు నిర్వహించే క్రియ నుండి రుణంపై ఆధారపడిన డబ్బు తనంతకు తానే తలెత్తుతుంది.[1]

1 పౌండు, 5 పౌండ్లు వగైరా పేర్లని ముద్రించి ప్రభుత్వం కాగితం ముక్కలను చలామణిలో పెడుతుంది. అవి అంతే మొత్తం బంగారం స్థానంలో వ్యవహరించిన మేరకు డబ్బు చలనాన్ని పాలించే నియమాలే వాటికీ వర్తిస్తాయి. కాగితం డబ్బు బంగారానికి ప్రాతినిధ్యం వహించే నిష్పత్తి నుండి మాత్రమే కాగితం డబ్బు చలామణికి సంబంధించిన ప్రత్యేక నియమం తలెత్తగలుగుతుంది. సాదాగా చెప్పాలంటే, ఆ నియమం ఇలా వుంటుంది : చిహ్నాలచేత తొలగించబడకపోతే చలామణిలో వుండే బంగారం మొత్తం (లేదా పరిస్థితిని బట్టి, వెండి) కంటే కాగితం డబ్బు ఎక్కువ మోతాదులో వుండరాదు. చలామణి ఇముడ్చుకోగలిగిన బంగారం పరిమాణం ఒక నిర్దిష్ట స్థాయికి అటూ యిటూ నిరంతరం మారుతూ వుంటుంది. అయినప్పటికీ ఒక నిర్దిష్ట దేశంలో చలామణి సాధనం యొక్క మొత్తం ద్రవ్యరాశి, ఒక కనీస మోతాదుకి లోపు ఎప్పుడూ వుండదు. ఈ కనీస మోతాదును వాస్తవానుభవం ద్వారా సులభంగా తెలుసుకోవచ్చు. ఈ కనీస ద్రవ్యరాశి అంతర్గత భాగాలు నిరంతరాయంగా మార్పుకి గురవుతూ వుంటాయన్న అంశంగానీ, లేదా ఆ ద్రవ్యరాశిలోని స్వర్ణ శకలాలను ఎప్పటికప్పుడు కొత్త శకలాలు తొలగిస్తాయనే వాస్తవం గానీ కనీస ద్రవ్యరాశి పరిమాణంలో లేదా దాని చలామణి నిరంతరాయతలో మార్పు తీసుకురాదు. కనుక కాగితం చిహ్నాలు దాని స్థానాన్ని ఆక్రమించుకోగలవు. మరోవైపున, చలామణికున్న అన్ని కాలువలూ డబ్బుని ఏ మేరకు ఇముడ్చుకోగలవో ఆ మేరకు వాటిని పూర్తిగా ఇవ్వాళ కాగితం డబ్బుతో నింపేస్తే, సరుకుల చెలామణిలో వుండే ఆటుపోట్ల కారణంగా రేపు అవి పొంగిపొర్లిపోవచ్చు. అటువంటప్పుడు ప్రమాణమనేదేదీ వుండదు. కాగితం డబ్బు దాని తగిన పరిమితిని దాటితే అంటే వాస్తవంగా చలనంలో వుండగల్గిన అవే ద్రవ్య నామాలు గల బంగారు నాణాలకంటే ఎక్కువ మోతాదులో వుంటే అది సార్వత్రికంగా అగౌరవానికి గురయ్యే ప్రమాదం వుంది. అంతేగాక సరుకుల చలామణి నియమాల ప్రకారం ఎంత పరిమాణం గల బంగారం అవసరమో అంత మొత్తానికి మాత్రమే అది ప్రాతినిధ్యం వహిస్తుంది. అవసరమైన దానికంటే రెట్టింపు కాగితం డబ్బు విడుదల అయితే అప్పుడు 1 పౌండు 1/4 ఔన్సు

---

1. చైనా ఆర్థిక మంత్రి మండారిన్ వాన్‌మావ్ ఇన్ ఓ రోజున చక్రవర్తి ఎదుట ఓ ప్రతిపాదన వుంచాడు. దాని అసలు ఉద్దేశం మార్పిడికి వీలుగాని కాగితం నోట్లని (యసిగ్నాట్స్) మార్పిడికి వీలైన బ్యాంకు నోట్లుగా మార్చడం. కాగితం నోట్ల కమిటీ 1854 ఏప్రిల్‌లో ఈ ప్రతిపాదనపై నివేదికను సమర్పిస్తూ తన తీవ్ర విమర్శలతో ఆర్థికమంత్రిని మందలించింది. సాంప్రదాయక రీతిలో అతన్ని వెదురు కర్రలతో కూడా బాదారేమో అది ప్రకటించలేదు. ఆ నివేదిక ముగింపు ఇలా వుంది : "అతని ప్రతిపాదనని కమిటీ జాగ్రత్తగా పరిశీలించింది. అది పూర్తిగా వ్యాపారులకు అనుకూలంగా వుంది. దానివల్ల చక్రవర్తికి ఒరిగేదేమీ లేదు. ("Arbeitender Kaiserlich Russischen Gesan dtschaft ZuPeking uber China" Ausdem Russischen von Dr. K. Abel and F.A. Mecklendurg, Erster Band, Berlin, 1858, P. 47 sq.) బ్యాంకు శాసనాలపై హౌస్ ఆఫ్ లార్డ్స్ కమిటీ ముందు మాట్లాడుతూ బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్ గవర్నరొకరు చలనంలో వున్న బంగారు నాణేల అరుగుదల గురించి ఇలా అన్నాడు : "ప్రతి ఏడాదీ ఒక కొత్త భాగం నవరసులు తేలికయి పోతాయి. ఒక ఏడాది పూర్తి బరువుతో వున్న నాణాలే అరుగుదలవల్ల తర్వాత సంవత్సరం తమ బరువుని కోల్పోతాయి. ఆ అరుగుదల త్రాసులో స్పష్టంగా కనిపిస్తుంది." (హౌస్ ఆఫ్ లార్డ్స్ కమిటీ, 1848, సంఖ్య 429)

బంగారానికి ద్రవ్యనామం కాదు, 1/8 ఔన్సు బంగారానికి మాత్రమే అది ద్రవ్యనామం అవుతుంది. ధరల ప్రమాణంగా బంగారం క్రియలో ఏదైనా మార్పు వస్తే ఎటువంటి ప్రభావం వుంటుందో దీనివల్ల కూడా అదే ప్రభావం వుంటుంది. ఇంతకుముందు 1 పౌండు ధర ద్వారా వ్యక్తమయిన విలువలు ఇప్పుడు 2 పౌండ్ల ధర ద్వారా వ్యక్తమవుతాయి.

కాగితం డబ్బు అనేది బంగారానికి లేదా డబ్బుకి ప్రాతినిధ్యం వహించే చిహ్నం. దానికీ సరుకుల విలువలకీ వున్న సంబంధమేమంటే, కాగితం సంకేతప్రాయంగా ఏ బంగారం పరిమాణాలకు ప్రాతినిధ్యం వహిస్తుందో అదే బంగారం పరిమాణాలు ఆ విలువల్ని భావాత్మకంగా వ్యక్తం చేస్తాయి. మిగిలిన సరుకులన్నిటి లాగే విలువ కలిగి వున్న బంగారానికి ప్రాతినిధ్యం వహించిన మేరకే కాగితం డబ్బు అనేది విలువ సంకేతంగా వుంటుంది.[1]

బంగారాన్ని విలువలేని చిహ్నాలు తొలగించడం ఎలా సాధ్యమవుతోందని ఎవరైనా అడగొచ్చు. అది కేవలం నాణెంగా పనిచేసిన మేరకే, కేవలం చలామణి సాధనంగా పనిచేసిన మేరకే, దాన్ని ఆ రకంగా తొలగించడం సాధ్యమనీ, మరోలా సాధ్యం కాదనీ మనం ఇంతకు ముందే గమనించాము. డబ్బుకి ఇది కాక వేరే క్రియలున్నాయి. బంగారు నాణానికి వున్నది, చలామణి సాధనంగా వ్యవహరించడమనే ఏకైక క్రియ మాత్రమే కాదు. అయితే ఇంకా చలామణిలో కొనసాగే అరిగిపోయిన నాణాలు మాత్రం ఈ ఒక్క క్రియనే నిర్వహించవచ్చు. ప్రతి ద్రవ్య శకలమూ చలామణిలో వున్నంత వరకూ కేవలం ఒక నాణెం మాత్రమే, లేదా చలామణి సాధనం మాత్రమే, అయితే కాగితం డబ్బుతో తొలగించబడే ఆ కనీస బంగారపు ద్రవ్యరాశికి మాత్రమే ఇది వర్తిస్తుంది. ఆ ద్రవ్యరాశి స్థిరంగా చలామణి రంగంలోనే వుంటుంది. నిరంతరాయంగా చలామణి సాధనంగా పనిచేస్తుంది. కేవలం ఆ లక్ష్యం కోసమే అది వుంటుంది. కనుక దాని చలనం, స–ద–స రూప పరివర్తనంలోని రెండు విరుద్ధ దశలూ నిరంతరం ఒకటి మరో దశగా మారడానికి మాత్రమే ప్రాతినిధ్యం వహిస్తుంది. ఈ దశల్లో సరుకులు తమ విలువ రూపాలను ఎదుర్కొంటుంటాయి, వెంటనే మాయమవుతాయి. ఒక సరుకు యొక్క మార్పిడి విలువకు గల స్వతంత్ర అస్తిత్వం అనేది ఇక్కడ ఒక తాత్కాలిక అంశం. ఈ అంశం ద్వారా ఆ సరుకు స్థానాన్ని వెంటనే మరో సరుకు ఆక్రమిస్తుంది. కనుక, డబ్బుని ఒక చేతి నుండి మరో చేతికి నిరంతరాయంగా మారేట్టు చేసే ఈ ప్రక్రియలో డబ్బుకి కేవలం సంకేత మాత్రపు

1. డబ్బు గురించి రాసిన అత్యుత్తమ రచయితలకి సైతం దాని వివిధ క్రియల గురించి ఎంత అస్పష్టత ఉందో పులర్టన్ రాసిన ఈ అంశాన్ని చూస్తే అర్థమవుతుంది : "మన దేశంలో జరిగే మార్పిడులకు సంబంధించినంత వరకూ మామూలుగా వెండి, బంగారాల నాణాలు నిర్వహించే క్రియలన్నిటినీ అంతే సమర్థవంతంగా చట్టం ద్వారా సంక్రమించే కృత్రిమ, సాంప్రదాయక విలువ తప్ప వేరే విలు లేని, మార్పిడికి వీలుకాని నోట్ల యొక్క చలామణి కూడా నిర్వహిస్తుందన్న వాస్తవం, నిరాకరించ వీలులేనిదని నేను భావిస్తున్నాను. ఈ రకమైన విలువ అంతర్గత విలువ లక్ష్యాలన్నిటినీ నెరవేర్చేలా చేయవచ్చు. ఒక ప్రమాణం యొక్క అవసరాన్ని కూడా అది తొలగించ వచ్చు. అయితే విడుదల చేసే నోట్ల పరిమాణాన్ని మాత్రం తగినంత పరిమితుల్లో వుంచాలి." (పులర్టన్ : "రెగ్యులేషన్ ఆఫ్ కరెన్సీస్" లండన్, 1845, పుట 21) డబ్బుగా వ్యవహరించే సరుకుని విలువ చిహ్నాలు చలామణి రంగంలో తొలగించగలుగుతున్నాయి కనుక, విలువ కొలమానంగానూ, ధరల ప్రమాణంగానూ ఆ సరుకు నిర్వహించే క్రియల్ని కూడా అనవసరం అని ప్రకటిస్తున్నారు.

అస్తిత్వం సరిపోతుంది. దాని క్రియకి సంబంధించిన అస్తిత్వం దాని పాదార్థిక అస్తిత్వాన్ని ఇముడ్చుకుంటుందని చెప్పవచ్చు. సరుకుల ధరలకి తాత్కాలిక, వస్తుగత ప్రతిబింబం కావటం వల్ల అది కేవలం తనకే ఒక చిహ్నంగా వ్యవహరిస్తుంది. కనుక ఒక చిహ్నం దాని స్థానాన్ని ఆక్రమించగలుగుతుంది.[1] అయితే ఒకటి మాత్రం అవసరం. ఈ చిహ్నానికి వస్తుగతంగా తనదైన సొంత సామాజిక గుర్తింపు వుండాలి. కాగితం చిహ్నానికి ఇది దాని నిర్బంధ చలనం వల్ల వస్తుంది. ప్రభుత్వం యొక్క ఈ నిర్బంధ చర్యకి ఆ సమాజ సరిహద్దుల లోపల వుండే అంతర్గత చలామణి రంగంలో మాత్రమే ప్రభావం వుంటుంది. ఆ రంగంలో మాత్రమే చలామణి సాధనంగా వుండాల్సిన తన క్రియను డబ్బు పూర్తిగా నిర్వహిస్తుంది, అనగా నాణెంగా మారుతుంది.

## విభాగం 3

# డబ్బు

విలువ కొలమానంగానూ, తనంత తానుగా గానీ తన ప్రతినిధి ద్వారా గానీ చలామణి సాధనంగానూ పనిజేసే సరుకే డబ్బు. కనుక బంగారం (లేదా వెండి) డబ్బు. ఒకపక్క అది స్వయంగా తన బంగారు రూపంలో దర్శనమివ్వాల్సి వచ్చినప్పుడు డబ్బుగా వ్యవహరిస్తుంది. అప్పుడది ద్రవ్య సరుకు. అప్పుడది విలువ కొలమానంగా వ్యవహరించేప్పుడు లాగా కేవలం భావాత్మకం కాదు. చలామణి సాధనంగా వ్యవహరించేప్పుడు మాదిరిగా తనకు మరొక వస్తువు ప్రాతినిధ్యం వహించడానికి వీలైనదీ కాదు. మరోపక్క తన విధిని స్వయంగా నిర్వహించినా, ఒక ప్రతినిధి ద్వారా నిర్వహించినా ఏకైక విలువ రూపంగా మూర్తీభవించడమనే తన విధి నిర్వహణ వల్ల కూడా అది డబ్బుగా వ్యవహరిస్తుంది. విలువ రూపమనేది ఇతర సరుకులన్నిటిలోనూ గల ఉపయోగపు విలువకు వ్యతిరేకమైన మార్పిడి విలువ అస్తిత్వానికి తగిన ఏకైక రూపం.

### అ. నిల్వ

సరుకుల రెండు విరుద్ధ రూప పరివర్తనలు వృత్తాలుగా జరిపే నిరంతర చలనం, లేదా ఒకటి మరొకటిగా మారే క్రయ విక్రయాల అనంత క్రమం డబ్బు యొక్క అవిరామ చలనంలో ప్రతిబింబిస్తుంది, లేదా చలామణికి శాశ్వత ప్రేరక శక్తి (Perpetum mobile)గా డబ్బు నిర్వహించే క్రియలో ప్రతిబింబిస్తుంది. అయితే రూప పరివర్తనల పరంపరకి ఆటంకం రాగానే, అమ్మకంతోపాటు వెంటనే కొనుగోలు జరగకపోతే డబ్బు కదలిక ఆగిపోతుంది. బోయిస్ గుల్లెబర్ట్ చెప్పినట్టుగా అది చలన స్థితి నుండి నిశ్చల స్థితికి, నాణెం స్థితి నుండి డబ్బు స్థితికి, మారుతుంది.

---

1. వెండి, బంగారాలు నాణాలుగా వున్న మేరకు లేదా కేవలం చలామణి సాధనాలుగానే వ్యవహరించిన మేరకు అవి తమకు తాము కేవలం చిహ్నాలుగా మారుతాయి అన్న వాస్తవాన్ని బట్టి నికలస్ బార్బన్ "డబ్బును పెంచడానికి" ప్రభుత్వాలకు హక్కుందంటున్నాడు. అంటే షిల్లింగ్ అని పిలవబడే వెండి బరువుకి అంతకంటే ఎక్కువ బరువు గల క్రౌన్ లాంటి పేరు పెట్టవచ్చునంటున్నాడు. ఆ రకంగా రుణదాతలకు క్రౌన్‌లకు బదులు షిల్లింగులు యివ్వచ్చు అంటాడతను. "తరచుగా ఎంచటం వల్ల డబ్బు అరిగిపోయి, తేలికవుతుంది. బేరమాడేప్పుడు జనం పరిగణించేది డబ్బుకున్న పేరునీ, చలనాన్నీ మాత్రమే. వారు చూసేది వెండి పరిమాణాన్ని కాదు. లోహంపై వున్న ప్రభుత్వ ముద్రే దానిని డబ్బుగా మారుస్తుంది" (ఎన్. బార్బన్, అదే గ్రంథం, పుటలు 29, 30, 25)

సరుకుల చలామణి అభివృద్ధి తొలిదశలోనే మొదటి రూప పరివర్తనం యొక్క ఉత్పాదితాన్ని గట్టిగా పట్టుకుని వుంచుకోవలసిన అవసరమూ, ప్రగాఢ వాంఛా అభివృద్ధి అయ్యాయి. ఈ ఉత్పాదితం సరుకు యొక్క మారిన రూపం. లేదా బంగారంగా మారబోయే ముందు పొందే ప్యూపా దశ.[1] సరుకుల్ని అమ్మింది ఇతర సరుకుల్ని కొనడానికి కాదు, వాటి సరుకు రూపాన్ని డబ్బు రూపంగా మార్చడానికి మాత్రమే. సరుకుల చలామణికి కేవలం సాధనంగా వుండే బదులు ఈ రూప పరివర్తనే లక్ష్యం అవుతుంది. ఆ రకంగా సరుకు యొక్క మారిన రూపం, నిరభ్యంతరంగా పరాధీనం అయ్యే రూపంగా లేదా తాత్కాలిక ద్రవ్య రూపంగా వ్యవహరించకుండా నిరోధించబడింది. డబ్బు నిల్వగా ఘనీభవిస్తుంది. అమ్మకందారుడు డబ్బు నిల్వదారుడవుతాడు.

సరుకుల చలామణి తొలిదశల్లో కేవలం అదనపు ఉపయోగ విలువలు మాత్రమే డబ్బుగా మార్చబడేవి. ఆ రకంగా వెండి, బంగారాలు అపరిమితత్వానికీ, లేదా సంపదకీ సామాజిక వ్యక్తీకరణలయ్యాయి. నిర్ణీత పరిమిత గృహావసరాలను సంతృప్తి పరచడానికి జరిగే సాంప్రదాయక ఉత్పత్తి విధానాన్ని అనుసరించే సమాజాల్లో ఈ అమాయక నిల్వ రూపం స్థిరపడుతుంది. ఆసియా, ముఖ్యంగా ఈస్టిండీస్ అది అంతే. ఒక దేశంలో దొరికే వెండి, బంగారాలని బట్టి ఆ దేశంలో సరుకుల ధరలుంటాయని ఊహించుకునే వాండర్ లింట్ భారతదేశపు సరుకులు ఎందుకంత చౌకగా వున్నాయని తనని తాను ప్రశ్నించుకున్నాడు. జవాబు : హిందువులు తమ డబ్బుని పాతిపెడతారు కనుక. 1602 నుండి 1734 వరకూ వారు 15 కోట్ల పౌండ్ల వెండి స్టెర్లింగులను పాతిపెట్టారని, అవి మొదట అమెరికా నుండి యూరపుకి వచ్చాయనీ అతను పేర్కొన్నాడు.[2] 1856 నుండి 1866 వరకూ గల 10 ఏళ్ళ కాలంలో ఇంగ్లండ్ 12 కోట్ల పౌండ్ల వెండిని భారత చైనా దేశాలకు ఎగుమతి చేసింది. దానికి బదులు ఆస్ట్రేలియన్ బంగారాన్ని అది పుచ్చుకుంది. చైనాకి ఎగుమతి అయిన వెండిలో అత్యధిక భాగం భారతదేశానికి చేరింది.

సరుకుల ఉత్పత్తి అభివృద్ధి చెందిన కొద్దీ ప్రతి ఉత్పత్తిదారుడూ రుణగ్రహీతలాగా (nexusrerum)* లేదా సామాజిక హామీ[3] గురించి నిర్ధారించుకోవాలి. ఎప్పటికప్పుడు అతని అవసరాలు ఒత్తిడి చేస్తుంటాయి. అతను ఇతరుల సరుకులను నిరంతరం కొంటూ ఉండాల్సిందే. ఈలోగా తన సొంత సరుకుల ఉత్పత్తికీ, అమ్మకానికీ సమయం పడుతుంది. ఇది పరిస్థితులపై ఆధారపడుతుంది. ఇప్పుడు అమ్మకుండానే కొనాలీ అంటే, అంతకు ముందు అతడు కొనకుండా అమ్మి వుండాలి. సాధారణ స్థాయిలో నిర్వహించబడిన ఈ కార్యకలాపం ఒక వైరుధ్యాన్ని సూచిస్తుంది. అయితే విలువైన లోహాలు వాటి ఉత్పత్తి స్థానాల దగ్గర ఇతర సరుకులతో ప్రత్యక్షంగా మార్పిడి చేయబడతాయి.

---

1. ద్రవ్య సంపద అంటే ... డబ్బుగా మారిన ఉత్పాదితాల సంపదే తప్ప మరొకటి కాదు. (Mercier de la Riviere. అదే గ్రంథం, పుట 573) ఉత్పాదకం రూపంలో వున్న విలువ కేవలం తన రూపం మార్చుకుంది. (అదే గ్రంథం, పుట 486).
2. "ఈ ఆచరణ ద్వారా తమ సరుకుల ధరలను వారు తక్కువ స్థాయిలో వుంచగలుగుతున్నారు. (వాండర్ లింట్, పుటలు, 95, 96)

* రోమన్ చట్టంలో, రుణదాతల ఎడల రుణ గ్రహీత బాధ్యత.

3. డబ్బు ... ఒక హామీ. (జాన్ బెల్లర్స్ : "ఎస్సెస్ అబౌట్ ది పూర్, మాన్యుఫ్యాక్చరర్స్, ట్రేడ్ ప్లాంటేషన్ అండ్ ఇమ్మొరాలిటి" లండన్, 1966 పుట 13.

(వెండి, బంగారాల సొంతదారుల చేత) కొను గోళ్ళు జరగకుండానే (సరుకుల సొంతదారులచేత) అమ్మకాలు జరిగాయి.[1] తద్వారా కొనుగోళ్ళు లేకుండానే జరిగే అమ్మకాల వల్ల కొత్తగా ఉత్పత్తి అయిన విలువైన లోహాలు సరుకుల సొంతదారులందరి మధ్య పంపిణీ చేయబడతాయి. ఈ రకంగా మార్పిడి మార్గం అంతటిలోనూ వెండి, బంగారాల నిల్వలు వివిధ స్థాయిల్లో పోగవుంతాయి. మార్పిడి విలువని ఒక ప్రత్యేక సరుకు రూపంలో నిల్వ వుంచుకోటానికి అవకాశం రావడంతో బంగారం కోసం అత్యాశ మొదలవుతుంది. చలామణి విస్తరించడంతో పాటు ఎప్పుడు పడితే అప్పుడు ఉపయోగించటానికి వీలుగా వుండే సంపదకి సంపూర్ణ సామాజిక రూపమైన డబ్బు ప్రాబల్యం పెరుగుతుంది. "బంగారం ఒక అద్భుతమైన వస్తువు. దగ్గరున్న వ్యక్తి తాను కోరిన వస్తువులన్నిటికీ ప్రభువు. బంగారం ద్వారా ఆత్మలను స్వర్గానికి కూడా పంపవచ్చు." (జమైకా నుండి కొలంబస్ రాసిన ఉత్తరం, 1503) ఏ పదార్థం బంగారంగా మారింది అన్న సంగతిని బంగారం వెల్లడించదు కనుక ప్రతి దాన్నీ, అది సరుకైనా కాకున్నా బంగారంగా మార్చవచ్చు. ప్రతీది క్రయార్థ్వంగానూ, విక్రయార్థ్వంగానూ తయారవుతుంది. చలామణి అనేది దానిలోకి ఏమి విసిరినా దాన్ని బంగారం రూపంలో తిరిగి యిచ్చే ఒక సామాజిక బట్టీగా మారుతుంది. సాధువుల ఎముకలు సైతం ఈ రసవాదాన్ని తట్టుకుని నిలబడలేవు. అంతకంటే సున్నితమైన మానవ వాణిజ్యానికి అతీతాలూ, భగవదర్పితాలూ* దీనిని అసలే తట్టుకోలేవు.[2]

డబ్బులో సరుకుల యొక్క ప్రతి గుణాత్మక భేదమూ అంతమైపోతుంది. అలాగే డబ్బు వీర సమవాదిలా అన్ని తేడాలను అంతం చేస్తుంది.[3]

---

1. కచ్చితమైన అర్థంలో కొనుగోలు జరగడమంటే, వెండి, బంగారాలు అప్పటికే సరుకుల మారిన రూపంగా వున్నాయని అర్థం. అంతకు ముందే ఒక అమ్మకం జరిగిందని అర్థం.

* ఈ సందర్భంలో, ఫినీషన్ కన్యలు. (సం)

2. ఫ్రాన్సు యొక్క అత్యుత్తమ క్రైస్తవ రాజైన (ఇది ఫ్రెంచి రాజుల బిరుదు - సం.) మూడో హెన్రీ ప్రాచీన మత మందిరాల్లో వుండే పవిత్ర స్మృతి చిహ్నాలను దోచి వాటిని డబ్బుగా మార్చాడు. డెల్ఫిక్ గుడిని ఫోసియెన్లు కొల్లగొట్టడం అనేది గ్రీసు దేశ చరిత్రలో ఎటువంటి పాత్ర వహించిందో అందరికి తెలిసిందే. ప్రాచీనులకు గుడులు సరుకుల దేవుళ్ళకు నిలయాలుగా పనికొచ్చాయి. అవి "పవిత్ర బ్యాంకులు". వాణిజ్యంలో ఆరితేరిన ఫినీషన్‌ల దృష్టిలో డబ్బు అంటే స్వభావాంతరం చెందిన సర్వ వస్తువులూ, కనుక ప్రేమ దేవత కోసం జరిగే ఉత్సవంలో ఫినీషన్ కన్యలు కొత్త వాళ్ళకు తమను తాము అర్పించుకుని తద్వారా వచ్చిన డబ్బుని ఆ దేవతకి సమర్పించడంలో ఆశ్చర్యం లేదు.

3. పసిమితో మిస మిసా మెరిసిపోయే పసిడి
   అత్యంత విలువయినదపురూపమపరంజి యింతమాత్రమే చాలు
   నలుపు తెలుపై పోవు తప్పు, ఒప్పుల కుప్పగా, తానె మారేను
   అవినీతి నీతిగా ఆమోదమొందేను - అల్పుడే ఉన్నతుడి అవతారమెత్తేను
   వృద్ధుడే నవ నవోన్మేష యువకుండౌను - పందకే ధీరుడను ప్రఖ్యాతి కలిగేను
   ఏమిటిది దైవమా? పాపిష్టి యీ పసిడి - నీదు పూజారులను నీకు దూరము జేయు
   పరువుగల పెద్దలను పదవీచ్యుతుల జేయు - మతములను జత గూర్చు, మరల వాటిని చీల్చు
   పాపి నభిషిక్తునిగ చేయనగు కనకమ్ము - కుష్ఠరోగికి ప్రియుల కొని తెచ్చు కాంచనము
   బందిపోటుకునిండు పేరోలగములోన - చందన తాంబూల సత్కారముల జేయు
   నిధువన క్రీడలో పండిపోయిన వృద్ధ - విధవనే వధువుగా విభవింపచేసేను
   వర్థిల్లు, వర్థిల్లు, ఓసీ కళంకినీ - సకల మానవ జాతి సంయుక్త జారిణీ
   (షేక్స్‌పియర్; టిమన్ ఆఫ్ ఏథెన్స్)

అయితే డబ్బే స్వయంగా ఒక సరుకు, ఒక బాహ్య వస్తువు. ఏ వ్యక్తికయినా అది ప్రైవేటు ఆస్తిగా మారగలదు. ఆ రకంగా సామాజిక శక్తి ప్రైవేటు వ్యక్తుల ప్రైవేటు శక్తి అవుతుంది. కనుక డబ్బు అనేది ఆర్థిక, నైతిక వ్యవహారాల వ్యవస్థని చెడగొడుతుందని ప్రాచీనులు దాన్ని ఖండించారు.[1] పసితనంలోనే ధనాదిదేవతను జుట్టు పట్టుకొని భూగర్భంలో నుంచి[2] పైకి లాగిన ఆధునిక సమాజం బంగారాన్ని పరమ పవిత్రమైనదిగా, తన ప్రాణ సారం యొక్క తళ తళలాడే సాకార మూర్తిగా గౌరవిస్తుంది.

ఉపయోగపు విలువగా ఒక సరుకు ఒక ప్రత్యేక అవసరాన్ని తీరుస్తుంది. అది భౌతిక సంపదలో ఒక ప్రత్యేక అంశం. ఒక సరుకు విలువ అనేది భౌతిక సంపద యొక్క మిగిలిన అంశాలన్నిటి యెడల దానికున్న ఆకర్షణ స్థాయిని కొలుస్తుంది. కనుక అది దాని సొంతదారుని సామాజిక సంపదని కొలుస్తుంది. ఆటవిక సరుకుల యజమానికి, పశ్చిమ యూరపు రైతుకి సైతం విలువ అంటే విలువ రూపమే. కనుక అతనికి వెండి, బంగారాల నిల్వ పెరగడం అంటే విలువ పెరిగినట్టే. డబ్బు విలువ మారుతుంది, నిజమే. ఒక సందర్భంలో దాని సొంత విలువలో మార్పు వల్ల కావచ్చు. మరో సందర్భంలో సరుకుల విలువల్లో వచ్చిన మార్పుల వల్ల కావచ్చు. అయితే దీనివల్ల 100 ఔన్సుల బంగారంలో కంటే 200 ఔన్సుల బంగారంలో ఎక్కువ విలువ వుండకుండా పోదు. మరోవైపున ఈ వస్తువు యొక్క వాస్తవ లోహ రూపం మిగిలిన అన్ని సరుకుల యొక్క సార్వత్రిక సమ విలువ రూపం కాకుండానూ పోదు, మానవ శ్రమ అంతటికీ తక్షణ, సామాజిక సాకార రూపం కాకుండానూ పోదు. కూడబెట్టాలనే వాంఛ స్వభావరీత్యా తృప్తి యెరగనిది. గుణాత్మకంగా చూస్తే డబ్బు ప్రయోజకత్వానికి పరిమితుల్లేవు. దానిని ఏ సరుకుగానైనా మార్చవచ్చు. కనుక అది పాదార్థిక సంపదకి సార్వత్రిక ప్రతినిధి. అదే సమయంలో ప్రతి వాస్తవ డబ్బు మొత్తం పరిమాణం రీత్యా పరిమితం. కనుక ఒక కొనుగోలు సాధనంగా దానికి పరిమితమైన ప్రయోజనమే వుంటుంది. డబ్బు పరిమాణాత్మక పరిమితులకీ దాని గుణాత్మక పరిమితి రాహిత్యానికీ మధ్య వున్న ఈ శత్రుత్వం నిల్వదారుణ్ణి సిసిఫస్ లాగా నిరంతరాయంగా కూడబెట్టేలా ప్రేరేపిస్తుంది. ఆక్రమించుకున్న ప్రతి కొత్త దేశంలోనూ కొత్త సరిహద్దులు తప్ప మరేమీ చూడని విజేతలాగే కూడబెట్టే మనిషి కూడా వ్యవహరిస్తాడు.

బంగారాన్ని డబ్బుగా నిలిపి వుంచడానికీ, నిల్వగా మార్చడానికీ దానిని చలామణి నుండి నిరోధించాలి. లేదా అది అనుభోగ సాధనంగా మారకుండా చూడాలి. కనుక నిల్వదారుడు బంగారం పూజకోసం తన శరీర వాంఛల్ని త్యాగం చేస్తాడు. వైరాగ్య సిద్ధాంతానికి అనుగుణంగా అతడు మనఃపూర్వకంగా నడుచుకుంటాడు. మరో వైపున చలామణిలోకి సరుకుల రూపంలో అతడు ఎంత విసురుతాడో అంతకు మించి దాని నుండి ఉపసంహరించుకోలేడు. అతను ఎంత ఎక్కువ ఉత్పత్తి

---

1. డబ్బు కాదు, అది పాపం - నగరాలకు అది ఒక శాపం
మానవుణ్ణి తరుముతుంది - మారీచుగ మార్చుతుంది
మంచికి అది అభిశాపం - లజ్జారహితం, నాస్తికత్వం (Sophocles, Antigone)
లేనేలేదు పశ్చాత్తాపం - పాపానికది మరో రూపం

2. లాభాపేక్ష (దురాపేక్ష) స్వయంగా ప్లోటోనే భూగర్భంలోనుంచి లాగి బయటకు తేవాలని చూస్తుంది. (Athenaeus, "Deipnosophis tarum libri quindecim).

చేయగలిగితే అంత ఎక్కువ అమ్మగలుగుతాడు. కనుక కష్టపడి పనిజేయటం, పొదుపు, అత్యాశ అనేవి అతనికున్న మూడు ప్రధాన సుగుణాలు. ఎక్కువ అమ్మి తక్కువ కొనాలి అనేది క్లుప్తంగా అతని అర్థశాస్త్ర సారాంశం.[1]

కూడబెట్టడం అనేదానికి వున్న ముతక రూపంతోపాటు దాని పక్కనే వెండి, బంగారు వస్తువులను కలిగి వుండటంలో దాని కళాత్మక రూపం కూడ వుంది. నాగరిక సమాజ సంపద పెరిగే కొద్దీ ఇదీ పెరుగుతుంది. "సంపన్నులమవుదాం లేదా సంపన్నుల్లా కనిపిద్దాం" (డైడరాట్). ఈ రకంగా ఒకవైపున వెండి, బంగారాలకు డబ్బుగా వాటి క్రియలతో ప్రమేయం లేకుండా నిరంతరాయంగా విస్తరించే మార్కెటు సృష్టించబడింది. మరోవైపున సరఫరాకున్న గుప్త ఆధారం సృష్టించబడింది. ముఖ్యంగా సంక్షోభ సమయాల్లోనూ, సామాజిక ఉపద్రవ సమయాల్లోనూ దాన్ని ఆశ్రయించడం జరుగుతుంది.

లోహ చలామణి ఉన్న ఆర్థిక రంగంలో కూడబెట్టడం అనేది అనేక లక్ష్యాలను నెరవేరుస్తుంది. వెండి, బంగారు నాణాల చలామణికి సంబంధించిన పరిస్థితుల నుండే దాని మొదటి క్రియ తలెత్తుతుంది. సరుకుల చలామణి విస్తృతి శీఘ్రతల్లోనూ, వాటి ధరల్లోనూ వచ్చే హెచ్చుతగ్గులతోపాటు చలనంలో వున్న డబ్బు పరిమాణంలో కూడా ఆటుపోట్లు అనేవి ఎలా వుంటాయో మనం చూశాం. కనుక ఈ ద్రవ్యరాశి మొత్తం పెరగటానికీ, తగ్గటానికీ అనువుగా వుండాలి. ఒక సందర్భంలో, డబ్బు చలామణిలో వున్న నాణెంగా వ్యవహరించడానికి ఆకర్షించబడాలి. వాస్తవంగా చలామణిలో వున్న ద్రవ్యరాశి చలామణి రంగంలో యిముడ్చుకోగల శక్తికి తగినంతగా ఎల్లప్పుడూ వుండాలి అంటే, ఒక దేశంలో నాణెంగా వ్యవహరించటానికి కావలసిన పరిమాణం కంటే ఎక్కువ పరిమాణంలో వెండి, బంగారాలు వుండాలి. డబ్బు, నిల్వ రూపం తీసుకోవడం ద్వారా ఈ షరతు నెరవేరుతుంది. ఈ నిల్వలు చలామణికి డబ్బుని సరఫరా చేయడానికీ, దాని నుండి డబ్బుని ఉపసంహరించడానికీ వీలు కల్పించే కాలువలుగా వ్యవహరిస్తాయి. ఆ రకంగా చలామణి అనేది ఎప్పుడూ గట్టు దాటి పొంగిపొర్లదు.[2]

---

1. అమ్మేవాళ్ళ సంఖ్యని, గరిష్ట స్థాయికి పెంచడం కొనేవాళ్ళ సంఖ్యని కనిష్ట స్థాయికి తగ్గించడం అనే ఇరుసుల చుట్టూ అర్థశాస్త్ర చర్యలన్నీ తిరుగుతాయి. (వెర్రీ, పుటలు 52-53).

2. ''ఒక జాతి వ్యాపారాన్ని నిర్వహించడానికి ఒక నిర్దిష్ట మొత్తంలో ద్రవ్యం కావాలి. పరిస్థితులను బట్టి ఆ మొత్తం ఒకప్పుడు ఎక్కువ కావచ్చు, మరొకప్పుడు తక్కువగావచ్చు. డబ్బు సరఫరాలో వుండే ఈ ఆటుపోట్లకి రాజకీయవేత్తల సాయం అక్కరలేదు. డబ్బు కొరత వచ్చినపుడు బులియన్ నాణాలుగా మారుతుంది. బులియన్ కొరత వచ్చినప్పుడు డబ్బు కరిగించబడుతుంది.'' (సర్ డి నార్త్, మలిపలుకు, పుట 3) ఈస్టిండియా కంపెనీలో చాలా కాలంపాటు అధికారిగా పనిచేసిన జాన్ స్టువార్ట్‌మిల్ ఈ వాస్తవాన్ని ధృవీకరించాడు. ఇండియాలో ఈనాటికీ వెండి ఆభరణాలు నిల్వ యొక్క క్రియలను నిర్వహిస్తున్నాయని ఆయన తెలిపాడు. వెండి ఆభరణాలను కొని వడ్డీరేటు ఎక్కువున్నపుడు వాటిని నాణాలుగా మారుస్తున్నారనీ, ఆ రేటు పడిపోయినపుడు వాటిని మళ్ళీ ఆభరణాలుగా మారుస్తున్నారనీ ఆయన రాశాడు. (జె.ఎస్. మిల్స్ ఎవిడెన్స్ ''రిపోర్ట్సు ఆన్ బ్యాంక్ యాక్ట్స్'' 1857, 2084) ఇండియాలో వెండి, బంగారాల ఎగుమతులూ, దిగుమతులకు సంబంధించిన, 1864 నాటి పార్లమెంటరీ డాక్యుమెంట్ ప్రకారం 1863లో వెండి, బంగారాల దిగుమతి ఎగుమతికంటే 19,367,764 పౌండ్లు అధికంగా జరిగింది. 1864కి ముందున్న ఎనిమిదేళ్ళ కాలంలో విలువైన లోహాల ఎగుమతులకంటే వాటి దిగుమతులు 109,652,917 పౌండ్లు అధికంగా జరిగాయి. ఈ శతాబ్దంలో ఇండియాలో 20 కోట్ల పౌండ్లకంటే ఎక్కువ నాణాలు తయారయ్యాయి.

## ఆ. చెల్లింపు సాధనం

ఇంతవరకూ మనం పరిశీలించిన సరుకుల చలామణి సాదా రూపంలో ఒక నిర్దిష్ట విలువ ఎప్పుడూ ఒక ధ్రువం దగ్గర సరుకుగానూ, మరో ధ్రువం దగ్గర డబ్బుగానూ ద్వంద్వ రూపాలలో మనకు దర్శనమిచ్చింది. కనుక సరుకుల సొంతదారుల మధ్య అప్పటికే సమానమైన విలువలు గల వాటి ప్రతినిధులుగా సంబంధం ఏర్పడింది. అయితే చలామణి అభివృద్ధి కావడంతో సరుకుల పరాధీనం కావడానికీ, వాటి ధరలు చేతికి రావడానికీ మధ్య కొంత వ్యవధి ఏర్పడే పరిస్థితులు తలెత్తుతాయి. వీటిలో అతి సాదా అంశాలను సూచిస్తే సరిపోతుంది. ఒక రకం వస్తువు తయారు కావడానికి ఎక్కువ కాలం పడుతుంది. మరో రకం వస్తువు తయారు కావడానికి తక్కువ కాలం పడుతుంది. అంతేగాక, విభిన్న సరుకుల ఉత్పత్తి విభిన్న రుతువులపై ఆధారపడుతుంది. ఒక రకం సరుకు తన సొంత మార్కెట్ ప్రదేశంలో పుట్టొచ్చు, మరోటి ఆ మార్కెటు చేరడానికి సుదీర్ఘ ప్రయాణం చేయాల్సి రావచ్చు. రెండో నంబరు వ్యక్తి కొనటానికి సిద్ధం కాకముందే ఒకటో నంబరు సరుకు సొంతదారుడు అమ్మడానికి సిద్ధం కావచ్చు. అవే లావాదేవీలు అదే వ్యక్తుల మధ్య నిత్యం పునరావృతం అయితే, అమ్మకం పరిస్థితులు ఉత్పత్తి పరిస్థితులను బట్టి క్రమబద్ధం అవుతాయి. మరోవైపున ఒక నిర్దిష్ట సరుకు ఉపయోగం, ఉదాహరణకి ఒక ఇల్లు ఉపయోగం, ఒక నిర్దిష్ట కాలం పాటు అమ్మబడింది అనుకుందాం. మామూలు భాషలో దీన్ని అద్దెకివ్వడం అంటారు. ఇక్కడ కాల పరిమితికి చివరిలో మాత్రమే కొనుగోలుదారుడు దాని ఉపయోగ విలువని పొందాడు. కనుక అతడు చెల్లించటానికి ముందే దానిని కొంటాడు. అమ్మే వ్యక్తి అప్పటికే వున్న వస్తువుని అమ్ముతాడు. కొనుగోలుదారుడు డబ్బుకి, లేదా భవిష్యత్ ద్రవ్యానికి కేవలం ప్రతినిధిగా కొంటాడు. అమ్మే వ్యక్తి రుణదాత అవుతాడు. కొనే వ్యక్తి రుణ గ్రహీత అవుతాడు. సరుకుల రూప పరివర్తన, లేదా వాటి విలువ రూపం యొక్క అభివృద్ధి, ఇక్కడ కొత్త పార్శ్వంలో కనిపిస్తుంది. కనుక డబ్బు కూడా కొత్త క్రియను సంతరించుకుంటుంది. అది చెల్లింపు సాధనంగా మారుతుంది.

ఇక్కడ రుణదాత లేదా రుణ గ్రహీత స్వభావం సాదా చలామణి నుండి తలెత్తుతుంది. చలామణి రూపంలో వచ్చిన మార్పు కొనుగోలుదారుడిపైనా, అమ్మకందారుడిపైనా ఈ కొత్త ముద్ర వేస్తుంది. కనుక మొదట ఈ కొత్త పాత్రలు కూడా క్రయ విక్రయదారుల పాత్రల్లాగానే తాత్కాలికం. ఒకటి మరోటిగా మారుతుంటుంది. అదే నటులు ఒకదాని తర్వాత మరో పాత్ర ధరిస్తారు. అయితే ఈ వ్యతిరేకత అనేది అంత సంతోషదాయక మేమీ కాదు. అది కఠినంగా మారే అవకాశం ఎంతైనా వుంది.[1] అయితే సరుకుల చలామణితో ప్రమేయం లేకుండానే అవే పాత్రలు రూపొందడం కూడా సాధ్యమే. ప్రాచీన ప్రపంచ వర్గ పోరాటాలు ప్రధానంగా అప్పులిచ్చిన వాళ్ళకీ, అప్పు పడ్డవాళ్ళకీ మధ్య పోటీ రూపంలో జరిగింది. రోమ్‌లో అది సామాన్య జనులైన రుణగ్రస్తుల వినాశనంతో ముగిసింది. వారి స్థానంలోకి బానిసలు వచ్చారు. మధ్య యుగాల్లో ఈ పోటీ ఫ్యూడల్ రుణగ్రస్తుల

1. 18వ శతాబ్దం ప్రారంభంలో ఇంగ్లీషు వ్యాపారుల మధ్య రుణదాత, గ్రహీతల సంబంధాల తీరుని ఈ క్రింది అంశం తెలియజేస్తుంది. ''ఇక్కడ, ఇంగ్లండులో వ్యాపారులలో వున్న క్రూరత్వం ఇంకే మానవ సమాజంలోనూ వుండదు, ప్రపంచంలో ఇంకే రాజ్యంలోనూ కన్పించదు.'' (''యాన్ ఎస్సే ఆన్ క్రెడిట్ అండ్ బాంక్‌రప్ట్ యాక్ట్'' లండన్, 1707, పుట 2)

వినాశనంతో అంతమైంది. వారు తమ ఆర్థిక పునాదితో పాటు దానిపై ఆధారపడి వున్న రాజకీయాధికారాన్ని కూడా కోల్పోయారు. అయినప్పటికీ, ఈ రెండు కాలాల్లోనూ అప్పు పుచ్చుకున్న వారికీ, అప్పు ఇచ్చినవారికీ మధ్య వున్న సంబంధం ఆయా వర్గాల సాధారణ ఆర్థిక పరిస్థితుల మధ్య లోతుగా వున్న శత్రుత్వాన్ని మాత్రమే ప్రతిబింబించింది.

మళ్ళీ సరుకుల చలామణిని పరిశీలిద్దాం. విక్రయ ప్రక్రియలో రెండు ధ్రువాల దగ్గర సరుకులు, డబ్బు అనే రెండు సమ విలువలు ఏకకాలంలో తలెత్తడం అనేది అంతమైంది. మొదటి విషయం, అమ్మిన సరుకు ధర నిర్ణయించడంలో డబ్బు ఇప్పుడు విలువ కొలమానంగా వ్యవహరిస్తుంది – ఈ ఒప్పందంలో నిర్ణయమైన ధర రుణ గ్రహీత బాధ్యతను కొలుస్తుంది. లేదా ఒక నిర్ణీత తేదీన అతడు చెల్లించాల్సిన డబ్బును కొలుస్తుంది. రెండో విషయం, అది భావాత్మకమైన కొనుగోలు సాధనంగా వ్యవహరిస్తుంది. అది కేవలం చెల్లిస్తాననే కొనుగోలుదారుని వాగ్దానంలో మాత్రమే వున్నప్పటికీ సరుకుని చేతులు మారేలా చేస్తుంది. చెల్లింపు తేదీకి ముందు మాత్రం చెల్లింపు సాధనం వాస్తవంగా చలామణిలోకి అడుగు పెట్టదు, కొనుగోలుదారుని చేతిని విడిచి అమ్మకందారుని చేతిలోకి పోదు. మొదటి దశ అవగానే ఈ ప్రక్రియ ఆగిపోవటం వల్ల, సరుకు యొక్క మారిన రూపం అయిన డబ్బు చలామణి నుండి ఉపసంహరించబడటం వల్ల, చలామణి సాధనం ఒక నిల్వగా మారింది. చెల్లింపు సాధనం చలామణిలో ప్రవేశిస్తుంది. అయితే దాని నుండి సరుకు వెళ్ళిపోయాక మాత్రమే. ఇక ఈ ప్రక్రియను నిర్వహించేది డబ్బు ఏమాత్రం కాదు. మార్పిడి విలువ యొక్క నిరపేక్ష అస్తిత్వ రూపంగా, లేదా సార్వత్రిక సరుకుగా డబ్బు ఆ ప్రక్రియలో అడుగు పెట్టడం ద్వారా దాన్ని అంతం మాత్రమే చేస్తుంది. ఒక అవసరం తీర్చుకోడానికి గాను అమ్మకందారుడు తను సరుకుని డబ్బుగా మార్చాడు. నిల్వదారుడు అదే పనిని, తన సరుకుని డబ్బు రూపంలో వుంచడం కోసం చేశాడు. రుణ గ్రహీత తాను చెల్లించ గలిగేందుకుగాను అదే పని చేశాడు. అతడు చెల్లించకపోతే అతని వస్తువుల్ని షరీఫ్ (శాంతి భద్రతలు కాపాడే అధికారి (తె.సం.) వేలం వేస్తాడు. కనుక సరుకుల విలువ రూపం అయిన డబ్బే ఇప్పుడు అమ్మకం యొక్క లక్ష్యమూ, పరమావధీ. చలామణి ప్రక్రియలో నుంచే తలెత్తే సామాజిక ఆవశ్యకమే ఇందుకు కారణం.

కొనుగోలుదారుడు సరుకులని డబ్బుగా మార్చడానికి ముందే డబ్బుని సరుకులుగా మారుస్తాడు. మరోలా చెప్పాలంటే, అతడు సరుకుల మొదటి రూప పరివర్తనంకంటే ముందే రెండో రూప పరివర్తనం సాధిస్తాడు. అమ్మకందారుని సరుకు చలామణి అవుతుంది. అది డబ్బుగా మారకముందే ఉపయోగ విలువగా మార్చబడింది. తదనంతర కాలంలో మాత్రమే దాని మొదటి రూప పరివర్తన పూర్తవుతుంది.[1]

1. 1859లో వెలువడిన నా "అర్థశాస్త్ర విమర్శ"లో ఈ క్రింది ఉల్లేఖన చూస్తే దీనికి వ్యతిరేకమైన రూపాన్ని గురించి ప్రస్తుత గ్రంథంలో ఎందుకు ప్రస్తావించలేదో అర్థమవుతుంది." డ-స ప్రక్రియలో డబ్బుని వాస్తవ కొనుగోలు సాధనంగా పరాధీనం చేయవచ్చు. ఆ రకంగా డబ్బు ఉపయోగ విలువ వాస్తవ రూపం ధరించక ముందే, సరుకు చేతులు మారక ముందే సరుకు ధరని రాబట్టవచ్చు. ఇది ప్రతి రోజూ ముందే చేసే చెల్లింపుల ద్వారా జరుగుతుంది. ఈ రూపంలోనే ఇంగ్లీషు ప్రభుత్వం భారతీయ రైతుల దగ్గర నల్లమందు కొంటుంది. అయితే ఈ సందర్భాల్లో ఎప్పుడూ డబ్బు కొనుగోలు సాధనంగా వ్యవహరిస్తుంది. పెట్టుబడి కూడా డబ్బు రూపంలోనే ముందుగా చెల్లింపబడుతుంది. అయితే ఈ దృష్టికోణం సాదా చలామణి పరిధిలోకి రాదు." ("అర్థశాస్త్ర విమర్శ", పుటలు 119, 120).

ఒక నిర్ణీత సమయంలోగా కట్టాల్సిన బాకీలు వాటికి సంబంధించిన సరుకుల ధరల మొత్తానికి ప్రాతినిధ్యం వహిస్తాయి. ఈ మొత్తాన్ని చెల్లించడానికి ఎంత బంగారం కావాలి అనేది ముఖ్యంగా చెల్లింపు సాధనం యొక్క చలన శీఘ్రతని బట్టి వుంటుంది. ఆ పరిమాణం రెండు పరిస్థితులపై ఆధారపడుతుంది. రుణగ్రహీతలకూ, రుణదాతలకూ మధ్య వున్న సంబంధాలు ఒక గొలుసులాగా ఏర్పడుతాయి. 'క' అనే వ్యక్తి తనకి బాకీ పడిన 'చ' నుండి డబ్బు తీసుకుని తిన్నగా దాన్ని తన రుణదాత అయిన 'ట'కి అప్పజెపుతాడు. అతను మరొకరికీ, ఆ మనిషి ఇంకొకరికీ ఇవ్వడం అనే గొలుసు ఏర్పడుతుంది. ఇది మొదటి పరిస్థితి. బాకీలు చెల్లించాల్సిన వేర్వేరు తేదీల మధ్య వుండే విరామ సమయం అన్నది రెండో పరిస్థితి. నిరంతరాయమైన చెల్లింపుల గొలుసు లేదా మందగించబడిన మొదటి రూప పరివర్తనలు అనేవి మనం ఇంతకు ముందు ప్రస్తావించిన, ఒకదానితో ఒకటి పెనవేసుకునే రూప పరివర్తనల పరంపరకీ ఎంతో తేడా వుంది. చలామణి సాధనం యొక్క చలనం ద్వారా కొనుగోలుదారులకీ, అమ్మకందారులకీ మధ్య వున్న సంబంధం కేవలం వ్యక్తం చేయబడటం మాత్రమే కాదు. ఈ సంబంధం చలామణి ద్వారానే తలెత్తి అందులోనే మనగలుగుతుంది. అందుకు విరుద్ధంగా చెల్లింపు సాధనం యొక్క చలనం అంతకు చాలా ముందే ఉన్న సామాజిక సంబంధాన్ని వ్యక్తం చేస్తుంది.

పలు అమ్మకాలు ఏకకాలంలో, పక్కపక్కనే జరుగుతాయనే వాస్తవం, చలన శీఘ్రత అనేది నాణాన్ని ఏ మేరకు తొలగించగలుగుతుంది అన్న అంశాన్ని పరిమితం చేస్తుంది. మరోపక్క ఈ వాస్తవం చెల్లింపు సాధనాన్ని పొదుపు చేయడానికి తోడ్పడే కొత్త సాధనం. ఒకచోట చెల్లింపులు ఏ మేరకు కేంద్రీకృతమయ్యాయో అదే నిష్పత్తిలో వాటి రద్దు కోసం ప్రత్యేక సంస్థలూ, పద్ధతులూ పెరుగుతాయి. మధ్య యుగాల్లో లియోన్స్‌లోని వెర్‌మెంట్స్* అటువంటివే. 'చ' నుండి 'క'కి, 'ట' నుండి 'చ'కి, 'క' నుండి 'ట'కి ఇలాగే ఒకరి నుండి మరొకరికి రావలసిన బాకీలు ఒకదాని నొకటి ఎదుర్కొని, ధనాత్మక రుణాత్మక పరిమాణాల్లాగా కొంతమేరకు ఒకదాన్నొకటి రద్దు చేసుకుంటాయి. ఆ రకంగా చెల్లించాల్సిన ఒకే ఒక శేషం మిగులుతుంది. చెల్లింపుల మొత్తం ఎంత ఎక్కువగా కేంద్రీకరించబడితే దానితో సాపేక్షంగా ఈ శేషం అంత తక్కువుంటుంది. చలామణిలో చెల్లింపు సాధనం యొక్క ద్రవ్యరాశి కూడా అంతే తక్కువుంటుంది.

చెల్లింపు సాధనంగా డబ్బు యొక్క క్రియలో ఒక వైరుధ్యం వుంది. అయితే అది అంతంలేని వైరుధ్యం కాదు. చెల్లింపులు ఒకదాన్నొకటి రద్దు చేసుకొనేటప్పుడు డబ్బు కేవలం భావరూపేణా ఖాతా డబ్బుగా, విలువ కొలమానంగా వ్యవహరిస్తుంది. వాస్తవ చెల్లింపులు చేయాల్సినప్పుడు డబ్బు చలామణి సాధనంగా పనిచేయదు. అంటే వస్తువుల అంతర్గత మార్పిడిలో కేవలం ఒక తాత్కాలిక ఏజెంటుగా పనిచేయదు. అది సామాజిక శ్రమకు ప్రత్యేక సాకార రూపంగా, మార్పిడి విలువ యొక్క స్వతంత్ర అస్తిత్వ రూపంగా, సార్వత్రిక సరుకుగా వ్యవహరిస్తుంది. ద్రవ్య సంక్షోభాలని పిలవబడే

* ఒక విభాగంలో వచ్చే లోటుని మరో విభాగంలో వున్న అదనపు మొత్తాలతో పూడ్చడం కోసం జరిగే అధికారిక బదలాయింపులు.

పారిశ్రామిక, వాణిజ్య సంక్షోభాల దశల్లో మాత్రమే ఈ వైరుధ్యం తీవ్రంగా ముందుకొస్తుంది.[1] అనంతంగా పెరిగిపోయే చెల్లింపుల గొలుసూ, ఆ చెల్లింపుల్ని పరిష్కరించడం కోసం ఒక కృత్రిమ వ్యవస్థా పూర్తిగా అభివృద్ధి చెందినచోట మాత్రమే ఇటువంటి సంక్షోభం తలెత్తుతుంది. సార్వత్రికంగా, విస్తృతంగా ఈ ఏర్పాటు అస్తవ్యస్తం అయినప్పుడు, దాని కారణం ఏదైనప్పటికీ, డబ్బు హఠాత్తుగా, తక్షణమే ఖాతా డబ్బు అనే కేవలం భావాకృతి నుండి అది నగదు రూపంలోకి మారుతుంది. మామూలు సరుకులు ఇక ఏమాత్రమూ దాని స్థానంలోకి రాలేవు. సరుకుల ఉపయోగపు విలువ విలువ రహితంగా మారుతుంది. వాటి విలువ దాని సొంత స్వతంత్ర రూపం ముందు మాయమైపోతుంది. సంక్షోభానికి ముందు అపార సంపదల మత్తు తలకెక్కిన బూర్జువా డబ్బు అనేది ఒక ఊహ మాత్రమే. సరుకులే డబ్బు అని ప్రకటించాడు. ఇప్పుడు ప్రతిచోటా డబ్బే సరుకు అని అతడు అరుస్తాడు. జింక మంచినీటి కోసం ఎలా తహతహ లాడుతుందో అలాగే అతని ఆత్మ ఏకైక సంపదైన డబ్బు కోసం పరితపిస్తుంది.[2] సంక్షోభంలో సరుకులకీ వాటి విలువ రూపమైన డబ్బుకీ మధ్య వున్న వైరం పరమ వైరుధ్యంగా మారుతుంది. కనుక, అటువంటి సందర్భాల్లో డబ్బు ఏ రూపంలో దర్శనమిస్తుంది అనేదానికి ఏమీ ప్రాముఖ్యం లేదు. చెల్లింపులు బంగారం రూపంలో జరిగినా లేదా బ్యాంకు నోట్ల వంటి ఖాతా ద్రవ్యం రూపంలో జరిగినా డబ్బు కరువు మాత్రం కొనసాగుతుంది.[3]

---

1. ఇక్కడ ప్రస్తావించిన ద్రవ్య సంక్షోభం ప్రతి సంక్షోభంలోనూ ఒక దశ. స్వయంగా ఒక స్వతంత్ర ఘటనగా పుట్టి పరిశ్రమలపైనా, వాణిజ్యంపైనా పరోక్షంగా మాత్రమే ప్రభావాన్ని కలిగించే మరో సంక్షోభాన్ని కూడా ద్రవ్య సంక్షోభమే అంటారు. ఈ రెంటినీ స్పష్టంగా వేరు చేసి చూడాలి. ఈ రెండో రకం సంక్షోభాలకి ద్రవ్య పెట్టుబడే ఇరుసు. ఆ పెట్టుబడి రంగమే, అంటే బ్యాంకింగ్, స్టాక్ ఎక్స్ఛేంజ్, ద్రవ్య రంగాలే దాని ప్రత్యక్ష కార్యరంగం.
2. "ఖాతా వ్యవస్థ నుండి నగదు వ్యవస్థకి హఠాత్తుగా వెనక్కి మళ్ళడంతో ఆచరణలో భయోత్పాతం, దానిపైన సిద్ధాంత భయ విహ్వలత చోటుచేసుకుంటాయి. ఎవరి ద్వారా చలామణి నడుస్తుందో ఆవర్తకులు తమ సొంత ఆర్థిక సంబంధాలను ఆవరించిన ఈ అభేద్యమైన రహస్యం అంతుచిక్కక కకావికలవుతారు." (కార్ల్ మార్క్స్, అదే గ్రంథం, పుట 126) "అన్న వస్త్రాలు తయారుచేయడానికి పేదల దగ్గర అంతకు ముందున్నట్టుగానే అవే చేతులు, అవే భూములూ వున్నప్పటికీ, డబ్బు కాక జాతికి నిజమైన సంపద అవే అయినప్పటికీ, ధనవంతుల దగ్గర వారిని పనిలో నియమించడానికి డబ్బుండదు కనుక వారు ఖాళీగా వుంటారు." (జాన్ బెల్లర్స్ : "ప్రపోజల్స్ ఫర్ రెయిజింగ్ ఎ కాలేజ్ ఆఫ్ ఇండస్ట్రీ" లండన్, 1696, పుట 3)
3. అటువంటి సందర్భాలను "వాణిజ్య మిత్రులు" ఎలా ఉపయోగించుకుంటారో ఈ క్రింది విషయం తెలియజేస్తుంది. "ఒకసారి (1839) అత్యాశపరుడైన ఒక వృద్ధ బ్యాంకర్ తన ప్రైవేట్ గదిలో తాను కూర్చున్న డెస్క్ మూత తెరచి అందులో వున్న బ్యాంకు నోట్ల కట్టలను, ఒక మిత్రునికి చూపించాడు. అందులో ఆరు లక్షల పౌండ్లున్నాయనీ, డబ్బు చలనాన్ని బిగించడానికి వాటిని ఆపి వుంచామనీ, అదే రోజు మూడు గంటల తర్వాత వదులుతామనీ ఆయన మహదానందంగా చెప్పాడు." ("ది థియరీ ఆఫ్ ఎక్స్ఛేంజెస్, ది బ్యాంక్ చార్టర్ యాక్ట్ ఆఫ్ 1844" లండన్ 1864, పుట 81) 1864, ఏప్రిల్ 24వ తారీకున అర్థ అధికారిక ప్రభుత్వ పత్రిక అబ్జర్వర్‌లో ఈ పేరా వుంది : "బ్యాంకు నోట్ల కొరకు సృష్టించడానికి ప్రయోగిస్తున్న సాధనాల గురించి చాలా వింత వదంతులు కొన్ని ప్రచారంలో వున్నాయి ... అటువంటి టక్కులు అనుసరిస్తారని ఊహించడం సందేహాస్పదంగా కనిపించినప్పటికీ వాటి గురించిన వార్తలు సర్వ వ్యాప్తంగా వున్నందున వాటిని పేర్కొనడం ఉచితం."

ఇప్పుడు, ఒక నిర్ణీత కాలంలో మొత్తం ఎంత డబ్బు చలనంలో వుంది అనే విషయాన్ని పరిశీలిద్దాం. చలామణి చెల్లింపు సాధనాల చలన శీఘ్రత నిర్దిష్టంగా వున్నప్పుడు, చేతులు మారవలసిన ధరల మొత్తాన్నీ, చెల్లించాల్సిన బాకీల మొత్తాన్నీ కూడి అందులో నుండి ఒకదాన్నొకటి రద్దుచేసుకునే చెల్లింపుల్ని ఒకసారి చలామణి సాధనంగా, మరోసారి చెల్లింపు సాధనంగా వ్యవహరించే ఒకే నాణేం చేసే ఆవృత్తాల సంఖ్యనీ తీసివేయాలి. అప్పుడు వచ్చిన మొత్తం ఒక నిర్ణీత కాలంలో చలనంలో వున్న డబ్బుతో సమానమవుతుంది. కనుక ధరలు, చలన శీఘ్రత, ఒకే నాణాన్ని పలుసార్లు వాడడం వల్ల చెల్లింపుల విషయంలో జరిగే పొదుపు – ఇవన్నీ ఒక నిర్ణీత కాలంలో ఉదాహరణకి ఒక రోజులో ఎంత వున్నదీ నిర్ణీతంగా తెలిసినప్పటికీ, చలనంలో వున్న డబ్బు పరిమాణమూ, చలామణిలో వున్న సరుకుల మొత్తమూ ఒకదానికొకటి అనుగుణంగా వుండవు. చలామణి నుండి ఎప్పుడో ఉపసంహరించబడిన సరుకులకు ప్రాతినిధ్యం వహించే డబ్బు చలనంలో కొనసాగుతుంది. సరుకులు చలామణిలో వుంటాయి కానీ, వాటి సమ విలువ అయిన డబ్బు మాత్రం ఎప్పుడో ఒక రోజున భవిష్యత్తులో తప్ప రంగంలోకి రాదు. అంతేగాక ప్రతి రోజూ కొత్తగా యిచ్చే రుణాలు, అదే రోజు చెల్లించాల్సిన మొత్తాలు కొలవడానికి వీలులేని పరిమాణాలు.[1]

చెల్లింపు సాధనంగా డబ్బు నిర్వహించే క్రియ నుండే సూటిగా ఖాతా ద్రవ్యం తలెత్తుతుంది. కొనుగోలు చేసిన సరుకుల వల్ల తలెత్తిన రుణ పత్రాలు ఆ రుణాలను ఇతరులకు బదిలీ చేయడం కోసం చలామణిలో వుంటాయి. మరో వైపున, ఖాతా వ్యవస్థ విస్తరించిన మేరకు చెల్లింపు సాధనంగా డబ్బు క్రియ కూడా విస్తరిస్తుంది. ఆ పాత్రలో అది తనకు విలక్షణమైన వివిధ రూపాలు ధరించి, ఆ రూపాలలో భారీ వాణిజ్య లావాదేవీల రంగంలో నిరాటంకంగా వ్యవహరిస్తుంది. మరోవైపున వెండి, బంగారు నాణాలు అత్యధికంగా చిల్లర వ్యాపార రంగానికి నెట్టివేయబడతాయి.[2] సరుకుల ఉత్పత్తి తగినంతగా విస్తరించినప్పుడు డబ్బు సరుకుల చలామణి రంగానికి ఆవల చెల్లింపు సాధనంగా

---

1. ఏ నిర్ణీత దినానైనా జరిగే కొనుగోళ్ళూ, ఒప్పందాలూ అదే రోజున రంగంలో వున్న డబ్బు పరిమాణాన్ని ప్రభావితం చేయవు. అయితే అత్యధిక సందర్భాల్లో అవి ఆ తర్వాతి దినాల్లో రంగంలోకొచ్చే డబ్బు పరిమాణంలో కొంత భాగం చేతులు మారేటట్లు చేస్తాయి. ఈ రోజు గ్రాంటయిన బిల్లులు, తీసుకున్న రుణాలు పరిమాణంలోగాని, సంఖ్యలోగాని కాల, వ్యవధిలోగాని రేపో ఎల్లుండో గ్రాంటయ్యే బిల్లులతో తీసుకొన్న రుణాలతో సరితూగనక్కరలేదు. అంతేకాదు, ఈ నాటి బిల్లులూ, రుణాలూ చెల్లించవలసిన నాడే ఇంతకు మును ఎప్పుడెప్పుడో పుట్టిన బిల్లులూ, రుణాలూ చెల్లించవలసి వస్తాయి. 12 నెలల క్రితం ఆరు నెలల క్రితం, మూడు నెలల క్రితం, నెల క్రితం పుట్టిన బిల్లులు కలిసి తరచుగా ఒకే రోజు పెద్ద మొత్తం చెల్లించవలసి వచ్చేటట్లు చేస్తాయి. (''ది కరెన్సీ థియరీ రివ్యూడ్; ఇన్ ఎ లెటర్ టుది స్కాటిష్ పీపుల్'' బై ఎ బ్యాంకర్ ఇన్ ఇంగ్లాండ్, ఎడిన్‌బర్గ్, 1845, పుటలు 29, 30)
2. వాణిజ్య కార్యకలాపాల్లో ఎంత తక్కువ నగదు ద్రవ్యం అవసరమవుతుందో తెలిపే ఉదాహరణగా లండన్‌లోని అత్యంత పెద్ద వ్యాపార సంస్థలో ఒకటి తన జమా ఖర్చుల గురించి చేసిన ప్రకటనను ఇక్కడ యిస్తాను. 1856లో జరిగిన లావాదేవీలు యివి. అనేక మిలియన్ల పౌండ్లున్న లావాదేవీలను ఇక్కడ ఒక మిలియన్‌కి కుదించి చూపడం జరిగింది.

☛

పనిజేయ నారంభిస్తుంది. అది అన్ని ఒప్పందాలకూ సార్వత్రిక విషయంగా వుండే సరుకు అవుతుంది.[1] కౌళ్లూ, పన్నులూ వగైరాలన్నీ వస్తు రూపంలో చెల్లింపులుగా వుండే స్థితి నుండి డబ్బు చెల్లింపులుగా మారతాయి. రోమన్ సామ్రాజ్యం వసూళ్ళన్నిటినీ డబ్బు రూపంలోనే సేకరించడానికి చేసిన ప్రయత్నం రెండుసార్లూ విఫలమైంది. పైన పేర్కొన్న మార్పు ఏ మేరకు సాధారణ ఉత్పత్తి పరిస్థితులపై ఆధారపడుతుందో తెలియజేయడానికి ఈ విషయం ఒక ఉదాహరణ. బాయిస్ గుల్లెబర్ట్, మార్షల్ వ్యాబన్ తదితరులు పద్నాలుగో లూయీ హయాంలో వ్యవసాయంపై ఆధారపడిన ఫ్రెంచి ప్రజల దుర్భర దారిద్ర్యాన్ని ఎలుగెత్తి ఖండించారు. కేవలం పన్నుల భారం వల్ల మాత్రమే కాక ఆ పన్నుల వసూళ్ళు వస్తు రూపం నుండి డబ్బు రూపంలోకి మార్చడం వల్ల కూడా అటువంటి దారిద్ర్యం తలెత్తింది.[2] దీనికి భిన్నంగా ఆసియాలో రాజ్యం విధించే పన్నులన్నీ ప్రధానంగా వస్తురూపంలోనే చెల్లించబడ్డాయి. ప్రకృతి పరిణామాల లాగే క్రమం తప్పకుండా ఉత్పత్తి పరిస్థితులు పునరుత్పత్తి కావడంపైన ఇది ఆధారపడి వుంది. తిరిగి ఈ చెల్లింపు విధానం ప్రాచీన ఉత్పత్తి విధానాన్ని కొనసాగించడానికి సాయపడుతుంది. ఒట్టోమన్ సామ్రాజ్యం యథాతథంగా వుండటానికి గల

---

☛ **రాబడులు :**

| | | |
|---|---|---|
| నిర్ణీత తేదీ తర్వాత బ్యాంకర్లు | | |
| వ్యాపారులు చెల్లించాల్సిన బిల్లులు | £ | 533,596 |
| డిమాండ్‌పై చెల్లించాల్సిన బ్యాంకర్లు తదితరుల చెక్కులు | £ | 357,715 |
| స్థానిక బ్యాంకుల నోట్లు | £ | 9,627 |
| బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండు నోట్లు | £ | 68,554 |
| బంగారం | £ | 28,089 |
| వెండి, రాగి | £ | 1,486 |
| పోస్టు ఆఫీసు ఆర్డర్లు | £ | 933 |
| మొత్తం | £ | 1,000,000 |

**చెల్లింపులు :**

| | | |
|---|---|---|
| నిర్ణీత తేదీ తర్వాత చెల్లించాల్సిన బిల్లులు | £ | 302,674 |
| లండన్ బ్యాంకర్ల చెక్కులు | £ | 663,672 |
| బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్ నోట్లు | £ | 22,743 |
| బంగారం | £ | 9,427 |
| వెండి, రాగి | £ | 1,484 |
| మొత్తం | £ | 1,000,000 |

"బ్యాంకు చట్టాల పైన సెలెక్ట్ కమిటీ నివేదిక", జులై, 1858, పుట 71.

1. "ఆ రకంగా వాణిజ్య పంథాలో సరుకుల బదులు సరుకులను మార్పిడి చేయడం అనేది అమ్మడం, చెల్లించడంగా మారిపోవడంవల్ల ... ఇప్పుడు జరిగే బేరాలన్నీ డబ్బు రూపంలో ధర ప్రాతిపదికపైన ప్రకటించబడతాయి." ('యాన్ ఎస్సే అపాన్ పబ్లిక్ క్రెడిట్' మూడో సంపుటి, లండన్ 1710, పుట 8)

2. డబ్బు ... ప్రతిదానికీ ఉరితాడుగా మారింది. "ద్రవ్య విధానం" ఒక బట్టిలాంటిది. అందులో భయంకరమైన పరిమాణంలో వస్తువుల్ని సరుకుల్ని పోసి, ఆ అపవిత్ర సారాన్ని బయటకు తీయడం కోసం వండబడతాయి. "డబ్బు మొత్తం మానవజాతిపైన యుద్ధాన్ని ప్రకటిస్తుంది." (బాయిస్ గుల్లెబర్ట్, Dissertain Sur la nature des Michesses, de largent et des tributs, ed, Daird, Economistes, Financiers, Paris, 1843, ఒకటో సంపుటి, పుటలు 413, 417, 418, 419)

రహస్యాల్లో ఇదొకటి. జపాన్‌పై యూరోపియన్లు రుద్దే విదేశీ వ్యాపారం ఆ దేశంలో వస్తు రూపేణా చెల్లించే కౌళ్ల స్థానంలో డబ్బు రూపంలో కౌళ్లు చెల్లించడానికి దారితీస్తే ఇక సుభిక్షంగా వున్న అక్కడి వ్యవసాయం నాశనమైనట్టే. అక్కడి వ్యవసాయం జరిగే పరిమిత పరిస్థితులన్నీ తుడిచి పెట్టుకుపోతాయి.

ప్రతి దేశంలోనూ అలవాటు ప్రకారం సంవత్సరంలో కొన్ని నిర్దిష్ట దినాల్లో మళ్ళీ మళ్ళీ కట్టాల్సిన వివిధ భారీ చెల్లింపులు జరుగుతాయి. ఈ దినాలు పునరుత్పత్తి చక్రంలో జరిగే ఇతర భ్రమణాలతోపాటు రుతువుల పరిస్థితిపైన కూడా ఆధారపడి వుంటాయి. సరుకుల చలామణితో ప్రత్యక్ష సంబంధం లేని పన్నులు, కౌళ్ళు వగైరాల చెల్లింపుల తేదీలను కూడా అవి క్రమబద్ధం చేస్తాయి. దేశంలో అవే రోజుల్లో జరగాల్సిన ఆ చెల్లింపులు ఆయా సమయాల్లో చెల్లింపు సాధనం యొక్క ఆర్థిక చట్రంలో కేవలం పైపైననే అయినప్పటికీ అలజడులు సృష్టిస్తాయి.[1]

చెల్లింపు సాధనం యొక్క చలన శీఘ్రుతా నియమం ప్రకారం, నిర్ణీత సమయంలో జరిగే చెల్లింపులన్నిటికీ, వాటి మూలమేదైనప్పటికీ వాటికి అవసరమైన చెల్లింపు సాధనం యొక్క పరిమాణం ఆయా కాల వ్యవధుల నిడివికి విలోమంగా[2] వుంటుంది.[3]

డబ్బు చెల్లింపు సాధనంగా అభివృద్ధి కావడం వల్ల బకాయిలు చెల్లించడానికి నిర్ణయించబడిన తేదీల నాటికి డబ్బు కూడబెట్టడం అవసరం అవుతుంది. డబ్బు దాచిపెట్టడం అనేది సంపదల సముపార్జనకు ఒక స్పష్టమైన పద్ధతి అయినప్పటికీ, అది సభ్య సమాజ ప్రగతితో అంతర్ధానమవుతుంది. ఆ ప్రగతితోపాటు చెల్లింపు సాధనం నిల్వలు పెరుగుతాయి.

---

1. 1826 కామన్స్ కమిటీలో క్రేగ్ ఇలా అన్నాడు : "1824 విట్‌సున్‌టైడ్ (ఈస్టర్ పండగ తర్వాత ఏడో ఆదివారం - సం.) రోజున ఎడిన్‌బర్గ్ బ్యాంకులో నోట్లకి విపరీతమైన గిరాకీ ఏర్పడింది. ఉదయం 11 గంటలయ్యేసరికి బ్యాంకు అధీనంలో ఒక్క నోటు కూడా మిగల్లేదు. అప్పుకోసం మిగిలిన అన్ని బ్యాంకులకీ కబురు పంపించారు. కానీ నోట్లు దొరకలేదు. అనేక లావాదేవీలను చీటీల ద్వారా సర్దాల్సి వచ్చింది. అయితే ఆ రోజు మూడు గంటలయ్యేసరికి ఉదయం విడుదలైన నోట్లన్నీ ఆయా బ్యాంకులకు వెనక్కి వచ్చేశాయి. ఇది కేవలం ఒక చేతి నుండి మరో చేతికి బదిలీ మాత్రమే." స్కాట్లెండ్‌లో బ్యాంకు నోట్ల సగటు చలామణి ముప్పయి లక్షల స్టెర్లింగులకు లోపే అయినప్పటికీ సంవత్సరంలో కొన్ని ప్రత్యేక చెల్లింపు దినాల్లో బ్యాంకుల స్వాధీనంలో వున్న మొత్తం డెబ్భయి లక్షల పౌండ్లు నోట్లలో ప్రతీదీ కార్యరంగంలో కొస్తుంది. ఈ సందర్భాల్లో నోట్లు నిర్వర్తించాల్సిన నిర్దిష్టమైన క్రియ ఒక్కటే. ఆ క్రియ నిర్వహణ పూర్తికాగానే నోట్లు తిరిగి యధావిధిగా ఆయా బ్యాంకులకి చేరుకుంటాయి. (చూ. జాన్ ఫులర్టన్ "రెగ్యులేషన్స్ ఆఫ్ కరెన్సీస్" లండన్, 1845, పుట 86) ఫులర్టన్ రచనా కాలం నాటికి స్కాట్లెండ్‌లో డిపాజిట్లు ఉపసంహరించుకోడానికి చెక్కులను గాక, నోట్లని ఉపయోగించే వారని ఇక్కడ చెప్పాల్సి వుంది.
2. అనులోమం అని రాయబోయి రచయిత పొరపాటున విలోమం రాశాడనేది స్పష్టం - రష్యన్ ప్రతిలో మార్క్సిజం - లెనినిజం సంస్థ నోట్.
3. "ఏడాదికి నాలుగు కోట్లు అవసరమయితే ఏడాది పొడుగునా వ్యాపారానికి అవసరమైన భ్రమణాలకో, చలామణులకో 60 లక్షల (బంగారం) సరిపోతుందా?" నేను అవునని జవాబు చెప్తాను. మొత్తం ఖర్చు 4 కోట్లు. ప్రతి శనివారం కూలి పుచ్చుకొనే పేద చేత పనివారి విషయంలోనూ, శ్రామికుల విషయంలోనూ జరిగే మాదిరిగా పరిభ్రమణాలు వారానికొక్కసారి జరుగుతాయనుకుందాం. అప్పుడు 4/52 కోట్ల డబ్బు సరిపోతుంది. అయితే ఈ ఆవృత్తం కౌలు, పన్నుల వసూళ్ళ విషయంలో లాగా మూడు నెలలకోసారి జరిగితే అప్పుడు ఒక కోటి అవసరమవుతుంది. కనుక సాధారణంగా చెల్లింపులు ఒక వారానికీ, పదమూడు వారాలకీ మధ్యలో వుంటాయి అనుకుందాం. అప్పుడు 1 కోటికి, 4/52 కోట్లు కలిపి దానిలో సగం లెక్కగడితే అది సుమారు 55 లక్షలవుతుంది. కనుక మన దగ్గర 55 లక్షలుంటే సరిపోతుంది. (విలియమ్ పెట్టీ, "పొలిటికల్ ఎకానమీ ఆఫ్ ఐర్లండ్" 1672, ఎడిషన్ లండన్, 1691, పుటలు 13, 14).

## ఇ. సార్వత్రిక ద్రవ్యం

స్వదేశంలోని చలామణి రంగంలో ఉన్నప్పుడు ధరల ప్రమాణంగా, నాణెంగా, టోకెన్లుగా, విలువ చిహ్నంగా తాను ధరించిన స్థానిక ముసుగుల్ని (దుస్తుల్ని) డబ్బు ఆ రంగం వదిలిపెట్టగానే విప్పేస్తుంది. తన తొలిరూపం అయిన మూస బంగారంగా (బులియన్‌గా) మారిపోతుంది. ప్రపంచ మార్కెట్ల మధ్య జరిగే వ్యాపారంలో సార్వత్రికంగా గుర్తించేందుకు వీలుగా సరుకుల విలువ వ్యక్తమవుతుంది. కనుక ఈ సందర్భాల్లో వాటి స్వతంత్ర విలువ రూపం సైతం వాటిని సార్వత్రిక ద్రవ్యం రూపంలో ఎదుర్కొంటుంది. ప్రపంచ మార్కెట్లలో మాత్రమే డబ్బు పూర్తిగా మూస బంగారం (బులియన్) అనే సరుకు స్వభావాన్ని సంతరించుకుంటుంది. ఆ సరుకు భౌతిక రూపం కూడా అభౌతిక మానవ శ్రమకి సూటి సామాజిక సాకార రూపం. ఈ రంగంలో దాని వాస్తవ అస్తిత్వ రూపం దీని భావానికి సరిగ్గా అనుగుణంగా వుంటుంది.

దేశీయ చలామణి రంగంలో విలువ కొలమానంగా వ్యవహరించి డబ్బుగా మారే సరుకు ఒకటే వుంటుంది. ప్రపంచ మార్కెట్లలో విలువకు ద్వంద్వ కొలమానాలుంటాయి – బంగారమూ, వెండి.[1]

---

1. కనుకనే ఒక దేశం బ్యాంకులు స్వదేశంలో చలామణి అయ్యే విలువైన లోహం నిల్వలు మాత్రమే ఏర్పరుచుకోవాలని విధించే ప్రతి చట్టమూ అసంబద్ధం. బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్ సొంతంగా సృష్టించుకున్న "ఆహ్లాదకరమైన ఇబ్బందుల" గురించి అందరికీ తెలుసు. వెండి, బంగారాల సాపేక్ష విలువల మార్పుల చరిత్రలో గొప్ప యుగాల గురించి తెలుసుకోవాలంటే కార్ల్ మార్క్స్ "అర్థశాస్త్ర విమర్శ" చూడండి. (పుట. 136) సర్ రాబర్ట్ పీల్ 1844 నాటి తన బ్యాంకు శాసనంతో వెండి బులియన్‌కి బదులు నోట్లను విడుదల చేయడం ద్వారా బ్యాంక్ ఆఫ్ ఇంగ్లడుని ఇబ్బందుల నుండి బయట పడేయటానికి ప్రయత్నించాడు. బంగారం నిల్వలో నాలుగో వంతు కంటే వెండి నిల్వ ఎప్పుడూ మించరాదనే షరతు మాత్రం పెట్టాడు. వెండి విలువను లండన్ మార్కెట్‌లో వున్న వెండి ధర ప్రకారం అంచనా వేశారు.
(4వ జర్మన్ ముద్రణలో చేర్చబడిన అంశం : బంగారం, వెండి సాపేక్ష విలువల్లో మరోసారి తీవ్రమైన మార్పు వచ్చిన కాలంలో మనం వున్నాము. సుమారు 25 ఏళ్ళ క్రితం బంగారం, వెండి సాపేక్ష విలువల నిష్పత్తి 15½:1 ఇప్పుడది 22 : 1 బంగారంతో పోల్చి చూడగా వెండి ధర యింకా పడిపోతోంది. ఈ రెండు లోహాల ఉత్పత్తి విధానంలో వస్తున్న విప్లవమే ఇందుకు కారణం. ఇంతకు ముందు స్వర్ణోత్పాదక శిలల వల్ల ఏర్పడిన ఒండ్రుమట్టిని బాగా కడగడం ద్వారా బంగారాన్ని ఉత్పత్తి చేసేవారు. ఆ పద్ధతి ఇప్పుడు సరిపోవటం లేదు. దాని స్థానంలో ఆ శిలల్నే శుద్ధి చేసే ప్రక్రియ ముందుకొచ్చింది. ఈ పద్ధతి ఇంతవరకూ ద్వితీయ స్థానంలో వుంటూ వచ్చింది. నిజానికిది ప్రాచీనులకి బాగా తెలుసు. (డియోడొరస్ III 12-14) (డియోడొరస్ V సిసిలీయోన్ "Historische Bibliothek", book III, 12-14, స్టుట్‌గార్ట్, 1828, పుటలు 258-61) ఉత్తర అమెరికాలో పడమటి రాకీ పర్వతాల్లో వెండి నిల్వల్ని కనుగొన్నారు. అంతేగాక రైల్వేల నిర్మాణం వల్ల ఈ గనులకీ, మెక్సికన్ వెండి గనులకీ ఆధునిక యంత్రాలన్నీ, ఇంధనాన్నీ సరఫరా చేయడం సాధ్యమైంది. ఆ కారణంగా గనుల నుండి చౌకగా పెద్ద స్థాయిలో వెండిని వెలికితీయడం సాధ్యమైంది. అయితే ఈ రెండు లోహాలూ శిలల్లో వుండే పద్ధతిలో చాలా తేడా వుంది. బంగారం చాలా వరకు శుద్ధంగానే దొరుకుతుంది. కాని ఆ శిలల్లో (Quartz) అది చాలా సూక్ష్మ పరిమాణాలలో మాత్రమే వ్యాపించి వుంటుంది. మొత్తం శిలల్ని చూర్ణం చేసి దాన్ని కడగటం ద్వారా వేరుచేయవచ్చు. లేదా పాదరసం ఉపయోగించడం ద్వారా వెలికి తీయొచ్చు. తరచుగా పది లక్షల గ్రాముల శిలలు కేవలం 1-3 గ్రాముల బంగారాన్నిస్తాయి. చాలా అరుదుగా వాటి నుండి 30-60 గ్రాముల బంగారం లభిస్తుంది. వెండి

ప్రపంచ ద్రవ్యం సార్వత్రిక చెల్లింపు సాధనంగా, సార్వత్రిక కొనుగోలు సాధనంగా సమస్త సంపదకీ సార్వత్రికంగా గుర్తించబడిన సాకార రూపంగా వ్యవహరిస్తుంది. చెల్లింపు సాధనంగా అంతర్జాతీయ వ్యాపార శేషాలను పరిష్కరించడమే దాని ప్రధాన క్రియ. కనుకనే వాణిజ్య వాదులకు వాణిజ్య శేషం[1] అనేది ప్రథమ సూత్రంగా వుంది. వెండి, బంగారాలు ముఖ్యంగా విభిన్న దేశాల మధ్య జరిగే వస్తువుల పరస్పర మార్పిడిలో మామూలుగా వుండే సమతూకం దెబ్బ తిన్నప్పుడు అవశ్యంగా అంతర్జాతీయ కొనుగోలు సాధనాలుగా వ్యవహరిస్తాయి. చివరిగా ఎవరైనా కొనటమో, చెల్లించడమో కాక ఒక దేశం నుండి మరో దేశానికి సంపదని బదిలీ చేయాల్సినప్పుడు, మార్కెట్లో వున్న అప్పటి ప్రత్యేక పరిస్థితుల వల్ల లేదా ఉద్దేశించిన లక్ష్యం కారణంగా ఈ బదిలీ సరుకుల

---

శుద్ధంగా దొరకడం అరుదు. అది ప్రత్యేకమైన ఇసుక రాళ్ళలో లభ్యమవుతుంది. ముడి వెండిని వాటి నుండి వేరుచేయడం సాపేక్షంగా సులభం. ఆ రాళ్ళలో వెండి 40-90% దొరుకుతుంది. లేదా వెండి చిన్న పరిమాణాలలో ముడి రాగి, సీసం వగైరా ఖనిజాలలో దొరుకుతుంది. ఆ లోహాలు కూడా వెలికి తీయబడటానికి అర్హమైనవే. ఈ విధంగా బంగారం ఉత్పత్తిపై ఖర్చయ్యే శ్రమ పెరుగుతుండగా, వెండి ఉత్పత్తికి అవసరమైన శ్రమ బాగా తగ్గింది. వెండి విలువ తగ్గటానికి యిదే కారణం. కృత్రిమంగా వెండి ధరని గనక ఇవ్వాళ కూడా నిలబెట్టి ఉంచకపోయినట్లయితే విలువలో ఏర్పడిన ఈ తగ్గుదల వెండి ధరలో మరింత తగ్గుదల రూపంలో వ్యక్తమై వుండేది. అమెరికాకి చెందిన సుసంపన్నమైన వెండి గనులను ఇంతవరకు చాలా కొద్దిగా మాత్రమే తవ్వారు. కనుక ఈ లోహం విలువ ఇంకా చాలా కాలం వరకూ పడిపోతూ వుంటానికే అవకాశం వుంది. దీనికి తోడ్పడే మరో అంశమేమంటే, సాధారణ ఉపయోగానికీ, విలాస వస్తువుల తయారీకి సాపేక్షంగా వెండి అవసరం తగ్గుతోంది. పూత పూసిన వస్తువులు అల్యూమినియం వగైరాలు దాని స్థానాన్ని ఆక్రమిస్తున్నాయి. అంతర్జాతీయ రంగంలో వెండిని కూడా తప్పనిసరి ప్రమాణంగా మారిస్తే పాత విలువ నిష్పత్తి 1 : 15½ తిరిగి అమలులోకి వస్తుందనే ద్విలోహవాదుల భావన కేవలం ఊహాజనితం అన్న సంగతి దీనినిబట్టి అర్థం చేసుకోవచ్చు. ప్రపంచ మార్కెట్లలో వెండి తన డబ్బు క్రియను కోల్పోవడానికే ఎక్కువ అవకాశం వుంది. - ఏంగెల్స్)

1. వెండి, బంగారాల్లో అదనపు వాణిజ్య శేషాలను పరిష్కరించడమే అంతర్జాతీయ వాణిజ్యం యొక్క లక్ష్యమని వాణిజ్యవాదం భావిస్తుంది. ఆ వాదాన్ని వ్యతిరేకించేవారు సైతం ప్రపంచ ద్రవ్యం క్రియలను పొరపాటుగా అర్థం చేసుకున్నారు. చలామణి సాధనం యొక్క పరిమాణాన్ని క్రమబద్ధం చేసే నియమాల గురించిన వారి పొరపాటు భావన విలువైన లోహాల అంతర్జాతీయ చలనంపై వారికి గల అంతే పొరపాటైన అభిప్రాయంలో ఎలా ప్రతిబింబిస్తోందో, రికార్డోని ఉదాహరణగా చూసి నేను వివరించాను. (అర్థశాస్త్ర విమర్శ, పుట 150) అతని పొరపాటు పిడిసూత్రం ఇది : "అధిక కరెన్సీ వల్ల తప్ప ప్రతికూల వాణిజ్య శేషం తలెత్తదు... నాణెం చౌకగా వుండటం వల్ల ఎగుమతి అవుతుంది. ప్రతికూల శేషానికి అది ఫలితం కాదు. అది దానికి కారణం." బార్బన్ కూడా ఇలాగే అంటాడు. "వాణిజ్య శేషం అంటూ వుంటే అది ఒక దేశం నుండి డబ్బుని బయటికి పంపించడానికి కారణం కాదు. ప్రతి దేశంలోనూ వున్న బులియన్ విలువలో వున్న తేడాని బట్టే అది తలెత్తుతుంది." (ఎన్. బార్బన్ : పైన పేర్కొన్న గ్రంథం, పుటలు 59, 60) బార్బన్ ఈ విషయం ఊహించినందుకుగాను "ది లిటరేచర్ ఆఫ్ పొలిటికల్ ఎకానమీ ఎ క్లాసిఫైడ్ కేటలాగ్, లండన్, 1845"లో మాకెల్లోక్ అతన్ని శ్లాఘించాడు. కాని అతని ఈ అసంబద్ధ ప్రతిపాదనకి ఎటువంటి అమాయకపు వస్త్రాలని కప్పాడో మాత్రం మాకెల్లోక్ తెలివిగా దాటవేశాడు. ఈ ప్రతిపాదన పునాదిపైనే అతని "కరెన్సీ సూత్రం" ఆధారపడి వుంది. ఆ Catelogueలో నిజమైన విమర్శగాని, కనీసం నిజాయితీగాని లోపించడం అనేది ద్రవ్య సిద్ధాంత చరిత్రని వివరించిన విభాగాల్లో పరాకాష్టకి చేరింది. ఈ భాగంలో మాకెల్లోక్ లార్డ్ ఓవర్‌స్టన్‌ని "ద్రవ్య వ్యాపారులకు ఎదురులేని రాజు"గా శ్లాఘించాడు.

రూపంలో జరగడం అసాధ్యమైనప్పుడు అది సామాజిక సంపదకు సార్వత్రికంగా గుర్తించబడిన సాకార రూపంగా వ్యవహరిస్తుంది.[1]

ప్రతి దేశానికి ఆ దేశాలలో చలామణి కోసం డబ్బు నిల్వ అవసరమైనట్టే ప్రపంచ మార్కెట్లలో కూడా చలామణి కోసం డబ్బు నిల్వ అవసరం. కనుక కూడబెట్టిన నిల్వల క్రియలు కొంతవరకు స్వదేశంలోని చలామణి, చెల్లింపుల సాధనంగా డబ్బు నిర్వహించే క్రియల నుండి మరికొంత మేరకు ప్రపంచ ద్రవ్యంగా దానికి గల క్రియల నుండీ తలెత్తుతాయి.[2] ఈ చివరి క్రియకు అచ్చమైన ద్రవ్య సరుకు, అంటే సాక్షాత్తూ వెండి, బంగారాలు అవసరమవుతాయి. ఆ విషయంలో వాటిని వాటి స్థానిక ప్రతిక్షేపాల నుండి వేరు చేసి చూపడానికి వెండి, బంగారాలను సర్ జేమ్స్ స్టువార్ట్ "ప్రపంచ ద్రవ్యం" అంటాడు.

వెండి, బంగారాల ప్రవాహానికి ద్వంద్వ చలనం వుంది. ఒకవైపున, విభిన్న జాతీయ చలామణి రంగాలలో వివిధ స్థాయిల్లో ఇమడడానికీ, కరెన్సీ కాల్వలను నింపడానికీ, అరిగిపోయిన వెండి, బంగారు నాణేలను తొలగించడానికీ, విలాస వస్తువులకు అవసరమైన పదార్థాన్ని సరఫరా చేయడానికీ నిల్వలుగా ఘనీభవించడానికీ[3] అది తన ఉత్పత్తి కేంద్రాల నుండి ప్రపంచ మార్కెట్లన్నిటిల్లోనూ విస్తరిస్తుంది. సరుకుల రూపం ధరించిన తమ శ్రమని విలువైన లోహాల రూపం ధరించిన శ్రమతో అంటే వెండి, బంగారాలు ఉత్పత్తి చేసే దేశాల శ్రమతో మార్పిడి చేసుకునే దేశాలే ఈ మొదటి చలనం ప్రారంభిస్తాయి. మరోవైపున, విభిన్న జాతీయ చలామణి రంగాల మధ్య వెండి, బంగారాలు నిరంతరాయంగా ముందుకీ, వెనక్కీ ప్రవహిస్తూ వుంటాయి. ఈ ప్రవాహ చలనం వివిధ దేశాల ద్రవ్య మార్పిడి క్రమంలో తలెత్తే నిర్విరామమైన హెచ్చు తగ్గులపైన ఆధారపడి వుంటుంది.[4]

---

1. ఉదాహరణకి, సబ్సిడీల విషయంలో, యుద్ధాలు చేయడానికి యిచ్చే రుణాల్లో లేదా బ్యాంకులు నగదు చెల్లింపులని తిరిగి చేపట్టడం కోసం యిచ్చే రుణాలు వగైరాలకి డబ్బు రూపం తప్ప ఇతర విలువ రూపం ఏదీ అవసరం కాకపోవచ్చు.
2. "అంతర్జాతీయ సర్దుబాట్ల కోసం రొక్కం చెల్లించే దేశాలు కూడబెట్టిన నిల్వల సమర్థతని వివరించడానికి ఫ్రాన్సుకి మించిన ఉదాహరణ ఇవ్వలేను. వినాశకర విదేశీ దురాక్రమణ దిగ్భ్రమ నుండి ఇంకా పూర్తిగా కోలుకోకముందే మిత్రమండలి రాజ్యాలు దానిపై రుద్దిన 2 కోట్లను అది 28 నెలల్లోగా, సాధారణ చలామణి నుండి ఏమాత్రం సాయం తీసుకోకుండా పూర్తిగా చెల్లించివేసింది. ఆ సొమ్ములో అత్యధిక భాగాన్ని రొక్కంగా చెల్లించింది. దీనివల్ల ఫ్రాన్సు కరెన్సీలో గమనించదగిన హెచ్చు తగ్గులేమీ లేవు. దాని విదేశీ ద్రవ్య నిధులలో సైతం ఎటువంటి ప్రమాదసూచక ఆటుపోట్లు లేవు." (ఫులర్టన్, పైన పేర్కొన్న గ్రంథం, పుట 141) (4వ జర్మన్ ముద్రణలో చేర్చబడిన అంశం : అదే ఫ్రాన్స్ 1871-73 మధ్య 30 నెలల కాలంలో దానిపై రుద్దబడిన అంతకు 10 రెట్ల మొత్తాన్ని చెల్లిస్తూ, అందులో గణనీయమైన భాగాన్ని రొక్కంగా చెల్లించింది. ఇది మరింత కొట్టొచ్చినట్టు కన్పించే ఉదాహరణ - ఏంగెల్స్.)
3. డబ్బుని వివిధ దేశాలు తమ అవసరాన్ని బట్టి పంచుకుంటాయి... డబ్బుని ఎప్పుడూ ఉత్పాదితాలు ఆకర్షిస్తాయి కనుక. (లేట్రొస్నే, పుట 916) "వెండి, బంగారాలను నిరంతరాయంగా యిస్తున్న గనులు, ప్రతి దేశానికీ అవసరమైన మిగులుని సరఫరా చేయడం కోసం చాలినంత యిస్తాయి." (జె. వాండర్ లింట్, పుట 40)
4. ప్రతి వారం మార్పిడులు పెరుగుతాయి, తరుగుతాయి. సంవత్సరంలో కొన్ని ప్రత్యేక సందర్భాల్లో ఒక దేశంలో అత్యధికంగా పెరగగా, మరో సందర్భంలో అదే దేశంలో అంతే ఉధృతిలో తగ్గుతాయి. (ఎన్. బార్బన్, పుట 39)

ఒక మేరకు బూర్జువా ఉత్పత్తి విధానం అభివృద్ధి చెందిన దేశాలు, డబ్బు నిల్వలు తమ ప్రత్యేక క్రియలను నిర్వహించడానికి ఏ మేరకు అవసరమో ఆ మేరకు వాటిని బ్యాంకు గదుల్లో పరిమితం చేస్తాయి.[1] ఈ నిల్వలు వాటి సగటు స్థాయి కంటే స్పష్టంగా ఎక్కువగా వున్నప్పుడు, అది కొన్ని సందర్భాలలో తప్ప, సరుకుల చలామణిలో మాంద్యాన్ని సూచిస్తుంది. సజావుగా సాగిపోతున్న వాటి రూప పరివర్తనల ప్రవాహానికి అంతరాయాన్ని సూచిస్తుంది.[2]

---

1. బ్యాంకు నోట్ల మార్పిడికి అవసరమైన నిధిగా కూడా వెండి, బంగారాలు వ్యవహరించినప్పుడల్లా ఈ వివిధ విధులు చాలా ప్రమాదకరంగా ఒకదానితో ఒకటి ఘర్షణపడతాయి.
2. దేశీయ వాణిజ్యంలో అత్యవసరమైనంతకంటే ఎక్కువ డబ్బుని నిల్వబెట్టిన దేశంలో అది కేవలం మృత నిల్వ మాత్రమే. దానివల్ల ఏమాత్రం లాభం రాదు. అది వాణిజ్యంలో విదేశాల నుండి వస్తేనో లేదా దాన్ని దిగుమతి చేసుకుంటేనో మాత్రమే అది లాభదాయకం. (జాన్‌బెల్లర్స్, ''ఎస్సేస్'', పుట 13) మనకి అతిగా నాణాలుంటే ఏమవుతుంది? బాగా బరువైన వాటన్నిటినీ కరిగించి వైభవోపేతంగా బంగారం లేదా వెండి ప్లేట్లనీ, వస్తువుల్నీ, పాత్రల్నీ తయారుచేసుకోవచ్చు. లేదా వెండి, బంగారాలకు గిరాకీ వున్న చోటుకి సరుకులుగా పంపించాలి. లేదా వడ్డీ ఎక్కువచ్చే చోటుకైనా పంపించాలి. (విలియం పెట్టీ : "Quantulum cunque" పుట 39) ''డబ్బు సమాజ శరీరంలో కొవ్వులాంటిది. అది ఎక్కువైతే లాఘవాన్ని చెడగొడుతుంది. తక్కువైతే జబ్బుపడేలా చేస్తుంది... కండరాల కదలికకి కొవ్వు కందెన లాంటిది. ఆహార కొరత లేకుండా చేస్తుంది... అసమానంగా వున్న తొర్రల్ని పూడుస్తుంది. శరీరాన్ని అందంగా చేస్తుంది. రాజ్యంలో డబ్బు కూడా అంతే. దాని కార్యశీలతని పెంచుతుంది. దేశంలో కొరత వున్నప్పుడు బయటి నుండి సరఫరా అవుతుంది. అంతటినీ అందంగా మారుస్తుంది. మరీ ముఖ్యంగా అది విస్తారంగా వున్న వ్యక్తుల్నీ మరీ అందంగా మారుస్తుంది.'' (పెట్టీ, పొలిటికల్ ఎకానమీ ఆఫ్ ఐర్లాండ్, పుట 14)

## రెండవ భాగం

# డబ్బు పెట్టుబడిగా మారటం

## అధ్యాయం - 4

# పెట్టుబడి సాధారణ సూత్రం

సరుకుల చలామణి పెట్టుబడికి ప్రారంభ స్థానం. సరుకుల ఉత్పత్తి, వాటి చలామణి, వాణిజ్యం అనబడే వాటి చలామణి యొక్క మరింత అభివృద్ధి చెందిన రూపమూ - ఇవి ఏర్పరిచే చారిత్రక పునాది నుండి పెట్టుబడి తలెత్తుతుంది. 16వ శతాబ్దంలో ప్రపంచ వ్యాపితమైన వాణిజ్యం, ప్రపంచ వ్యాపితమైన మార్కెటు సృష్టించబడటంతో పెట్టుబడి ఆధునిక చరిత్ర ప్రారంభమవుతుంది.

సరుకుల చలామణి యొక్క భౌతిక పదార్థాన్ని అంటే వివిధ ఉపయోగపు విలువల మార్పిడిని మనం పట్టించుకోకుండా కేవలం ఈ చలామణి ప్రక్రియ ఉత్పత్తి చేసే ఆర్థిక రూపాలను మాత్రమే పరిశీలిస్తే, దాని చివరి ఫలితం డబ్బు అని మనం గమనిస్తాము. సరుకుల చలామణి యొక్క ఈ చివరి ఉత్పాదితమే పెట్టుబడి దర్శనమిచ్చే మొదటి రూపం.

చారిత్రక వాస్తవం ఏమిటంటే, భూసంపదకు భిన్నంగా, పెట్టుబడి మొదట తప్పనిసరిగా డబ్బు రూపం ధరిస్తుంది. ద్రవ్య సంపదగా, వర్తక వ్యాపారి పెట్టుబడిగా, వడ్డీ వ్యాపారి పెట్టుబడిగా అది కనిపిస్తుంది.[1] పెట్టుబడి మొట్టమొదట కన్పించేది డబ్బు రూపంలోనని కనుక్కోడానికి పెట్టుబడి పుట్టుకను ప్రస్తావించక్కర్లేదు. రోజూ అది మన కళ్ళముందే జరగడాన్ని మనం గమనించవచ్చు. ప్రతి కొత్త పెట్టుబడి రంగం పైకి, అంటే మార్కెట్‌లోకి ఇప్పుడు కూడా డబ్బు రూపంలోనే ప్రవేశిస్తోంది. అది సరుకుల మార్కెట్, శ్రమ మార్కెట్, ద్రవ్య మార్కెట్ ఏదైనా కావచ్చు. అక్కడ ఒక నిర్దిష్ట ప్రక్రియ డబ్బుని పెట్టుబడిగా మారుస్తుంది.

కేవలం డబ్బుగా ఉండే డబ్బుకీ, పెట్టుబడిగా వ్యవహరించే డబ్బుకీ మధ్య వుండే మొదటి తేడాని మనం వాటి చలామణి రూపంలో మాత్రమే చూస్తాము.

సరుకుల చలామణి అత్యంత సాదా రూపం స-డ-స (సరుకు-డబ్బు-సరుకు). సరుకులు డబ్బుగా మారటం, డబ్బు తిరిగి సరుకులుగా మారిపోవడం, లేదా కొనటం కోసం అమ్మటం. దీని

---

1. భూసంపద వల్ల సంక్రమించే ఆధిపత్యం, దాస్యం అనే వ్యక్తిగత సంబంధాలపై ఆధారపడిన అధికారానికీ, డబ్బు ఇచ్చే వ్యక్తిగతం కాని అధికారినికీ ఉన్న తేడాను రెండు ఫ్రెంచి సామెతలు చక్కగా వ్యక్తం చేస్తాయి: "ప్రభువు లేని భూమి లేదు." "డబ్బుకు యజమాని లేడు."

పక్కనే మనం ప్రత్యేకంగా భిన్నమైన మరో రూపాన్ని చూస్తాము. డ-స-డ, డబ్బును సరుకులుగా మార్చడం, సరుకుల్ని తిరిగి డబ్బుగా మార్చేయడం, లేదా అమ్మడం కోసం కొనడం. రెండో పద్ధతిలో చలామణిలో వుండే డబ్బుకు పెట్టుబడిగా మారే శక్తి వుంది. పెట్టుబడిగా మారుతుంది.

డ-స-డ ఆవృత్తాన్ని మరింత క్షుణ్ణంగా పరిశీలిద్దాం. దానిలో కూడా రెండు విరుద్ధ దశలున్నాయి. మొదటి దశ డ-సలో, లేదా కొనుగోలులో, డబ్బు సరుకుగా మారింది. రెండో దశ స-డలో, అంటే అమ్మకంలో, సరుకు మళ్ళీ డబ్బుగా మారిపోయింది. ఈ రెండు దశల కలయిక ఒకే చలనం అవుతుంది. అందులో సరుకు కోసం డబ్బు మార్పిడి అయింది. అదే సరుకు డబ్బు కోసం మళ్ళీ మార్పిడికి గురైంది. ఒక సరుకు అమ్మబడటం కోసం కొనబడింది. లేదా క్రయ విక్రయాల రూపంలో వున్న తేడాని వదిలేస్తే, డబ్బుతో ఒక సరుకు కొనబడింది; తర్వాత ఒక సరుకుతో డబ్బు కొనబడింది.[1] దీని ఫలితం డబ్బుకి డబ్బు మార్పిడి : డ-డ. దీనిలో ఈ ప్రక్రియలోని దశలు మాయమవుతాయి. నేను 2000 పౌనుల దూదిని 100 పౌండ్లకి కొని దాన్ని 110 పౌండ్లకి అమ్మితే, నిజానికి నేను 100 పౌండ్లని 110 పౌండ్లకి అంటే డబ్బుని డబ్బుకి మార్చానన్నమాట.

ఈ పద్ధతి ద్వారా రెండు సమానమైన మొత్తాలను, అంటే 100 పౌండ్లను 100 పౌండ్లతో మార్పిడి చేయడమే లక్ష్యం అయితే డ-స-డ అనే ఆవృత్తం అసంబద్ధమూ, అర్థరహితమూ అవుతుంది. పిసినారి పథకం ఇంతకంటే సాదాగా, సంశయరహితంగా వుంటుంది. అతడు చలామణి ప్రమాదాల దరిదాపులకు పోకుండా తన 100 పౌండ్లను తన దగ్గరే వుంచుకుంటాడు. అయినప్పటికీ దూదిని కొంటానికి 100 పౌండ్లు చెల్లించిన వ్యాపారి దాన్ని తిరిగి 110 పౌండ్లకి అమ్మినా లేదా 100 పౌండ్లకీ, లేదా 50 పౌండ్లకే పోనిచ్చినా అతని డబ్బు విలక్షణమైన, మౌలిక చలనానికి గురి అవుతుంది. ధాన్యాన్ని అమ్మి ఆ డబ్బుతో బట్టలు కొనుక్కునే రైతు చేతిలో కంటే అది భిన్నమైన చలనానికి గురి అవుతుంది. కనుక మనం మొదట డ-స-డ, స-డ-స ఆవృత్త రూపాల విలక్షణ గుణాలను పరిశీలించాలి. అలా చేయడంలో కేవలం రూపంలో తేడా మాటున వున్న నిజమైన తేడా వెల్లడవుతుంది.

మొదట, ఈ రెండు రూపాలకూ వున్న ఉమ్మడి అంశాలేమిటో చూద్దాం.

రెండు ఆవృత్తాలను ఒకేలాంటి రెండు విరుద్ధ దశలుగా, స-డ, ఒక అమ్మకం డ-స, ఒక కొనుగోలుగా విడగొట్టవచ్చు. ఈ దశల్లో ప్రతిదానిలోనూ ఒకేలాంటి పాదార్థిక అంశాలుంటాయి : సరుకూ, డబ్బు. అవే ఆర్థిక నాటక పాత్రలుంటాయి. ఒక కొనుగోలుదారుడు ఒక అమ్మకందారుడు ఒకరినొకరు ఎదుర్కొంటారు. ప్రతి ఆవృత్తమూ ఒకేలాంటి రెండు విరుద్ధ దశల ఐక్యత ప్రతి సందర్భంలోనూ ఒప్పందంలో వున్న ముగ్గురి జోక్యం వల్ల ఈ ఐక్యత సిద్ధిస్తుంది. ఒకరు కేవలం అమ్ముతాడు. మరొకరు కేవలం కొంటారు. మూడో వ్యక్తి కొంటాడు, అమ్ముతాడు.

స-డ-స ఆవృత్తాన్ని డ-స-డ ఆవృత్తం నుండి వేరుచేసి చూపే మొదటి అంశమేమంటే, ఒకదాని తర్వాత ఒకటి ఈ రెండు దశలూ తిరగేసిన క్రమంలో వస్తాయి. సరుకుల సాదా చలామణి అమ్మకంతో ప్రారంభమై కొనటంతో అంతమవుతుంది. కాగా పెట్టుబడిగా డబ్బు చలామణి కొనుగోలుతో ప్రారంభమై అమ్మకంతో ముగుస్తుంది. మొదటి దాని విషయంలో ప్రారంభ అంశమూ, దాని గమ్యమూ

1. డబ్బుతో సరుకుల్ని కొంటారు. సరుకులతో డబ్బును కొంటారు. (మెర్సియర్ డి లా రివియెర్, L'ordre, natural et essential des societies politiques, పుట 543)

సరుకులే. రెండోదానిలో అది డబ్బు. మొదటి రూపంలో డబ్బు జోక్యం వల్ల చలనం ఏర్పడింది. రెండోదానిలో అది సరుకు జోక్యం వల్ల ఏర్పడింది.

స-డ-స చలామణి చివరిలో డబ్బు ఉపయోగపు విలువగాపనికొచ్చే సరుకుగా మారుతుంది. అది శాశ్వతంగా ఖర్చయిపోతుంది. అందుకు విరుద్ధంగా, దానికి తిరగేసిన రూపం అయిన డ-స-డలో కొనుగోలుదారుడూ, తర్వాత అమ్మకందారుడుగా తన డబ్బు తిరిగి పొందడం కోసమే డబ్బును ఖర్చు చేస్తాడు. సరుకుని కొనటం ద్వారా అతడు డబ్బును చలామణిలోకి విసురుతాడు. అదే సరుకుని అమ్మడం ద్వారా ఆ డబ్బును ఉపసంహరించుకోవడం అతని లక్ష్యం. డబ్బును తిరిగి రాబట్టే ఉద్దేశం తోనే దాన్ని ముందు వదిలి వెడతాడు. కనుక డబ్బు ఖర్చు చేయబడలేదు. కేవలం బజనా లేక బయానా (అడ్వాన్స్) చేయబడింది. అంతే.[1]

స-డ-స ఆవృత్తంలో అదే డబ్బు తన స్థానాన్ని రెండుసార్లు మార్చుకుంటుంది. అమ్మకందారుడు దాన్ని కొనుగోలుదారుడి దగ్గర నుండి పొందుతాడు, మరో అమ్మకందారునికి దాన్ని చెల్లించి వేస్తాడు. సరుకులమ్మి పుచ్చుకున్న డబ్బుతో ప్రారంభమయే చలామణి సరుకుల కోసం ఆ డబ్బుని చెల్లించడంతో పూర్తవుతుంది. డ-స-డ ఆవృత్తంలో ఇందుకు పూర్తి విరుద్ధంగా జరుగుతుంది. ఇక్కడ తన స్థానాన్ని రెండుసార్లు మార్చేది డబ్బుకాదు, సరుకు కొనుగోలుదారుడు దానిని అమ్మకందారుని చేతుల నుండి తీసుకుంటాడు; మరో కొనుగోలుదారుని చేతుల్లోకి దాన్ని పంపిస్తాడు. సరుకుల సాదా చలామణిలో ఒకే డబ్బు మొత్తం రెండుసార్లు స్థానం మారటం వల్ల అది ఒక చేతి నుండి మరో చేతిలోకి మారుతుంది. సరిగ్గా అలాగే ఇక్కడ కూడా ఒకే సరుకు రెండుసార్లు స్థానం మారడం వల్ల డబ్బు మళ్ళీ బయలుదేరిన చోటుకే చేరుకుంటుంది.

ఇలా వెనక్కి యథాస్థానానికి చేరుకోవడం అన్నది సరుకుకు చెల్లించిన దానికంటే దాన్ని ఎక్కువకు అమ్మడంపై ఆధారపడి వుండదు. ఈ పరిస్థితి వెనక్కి తిరిగి వచ్చే డబ్బు పరిమాణాన్ని మాత్రమే ప్రభావితం చేస్తుంది. కొనుగోలు చేసిన సరుకు తిరిగి అమ్మబడగానే, మరోలా చెప్పాలంటే డ-స-డ ఆవృత్తం పూర్తి కాగానే, డబ్బు యథాస్థానానికి వస్తుంది. కనుక డబ్బు పెట్టుబడిగా చలామణిలో వుండటానికి, కేవలం డబ్బుగా చలామణిలో చాలా స్పష్టమైన భేదాన్ని ఇక్కడ చూడొచ్చు.

ఒక సరుకు అమ్మకం వల్ల వచ్చిన డబ్బు మరో సరుకు కొనుగోలు ద్వారా ఉపసంహరించుకో బడగానే స-డ-స ఆవృత్తం పూర్తయిపోతుంది.

అయితే డబ్బు తిరిగి తన ప్రారంభ స్థానానికే చేరుకుందీ అంటే ఆ చర్య పునరుద్ధరణ లేదా పునరావృతం కావడం వల్ల మాత్రమే అలా జరుగుతుంది. నేను ఒక క్వార్టర్ ధాన్యాన్ని 3 పౌండ్లకి అమ్మి ఆ 3 పౌండ్లతో బట్టలు కొనుక్కుంటే నాకు సంబంధించినంతవరకూ ఆ డబ్బు ఖర్చయిపోయింది. అది బట్టల వ్యాపారికి చెందుతుంది. ఇప్పుడు నేను రెండో క్వార్టర్ ధాన్యాన్ని అమ్మితే డబ్బు మళ్ళీ వెనక్కి వచ్చే మాట నిజమే. అయితే ఇది మొదటి లావాదేవీ ఫలితంగా కాదు, దాని పునశ్చరణ ఫలితంగా మాత్రమే వస్తుంది. ఈ కొత్త లావాదేవీని నేను మరో కొత్త కొనుగోలు ద్వారా అంతం

1. తిరిగి అమ్మటం కోసమే ఒక వస్తువు కొనబడినప్పుడు ఉపయోగించిన సొమ్ముని అడ్వాన్స్ చేయబడింది అంటారు. దానిని కొన్నది తిరిగి అమ్మటానికి కాకపోతే ఆ సొమ్ముని ఖర్చయింది అంటారు. (జేమ్స్ స్టువార్ట్ : "వర్క్స్". సంపాదకత్వం : అతని కుమారుడు సర్ జేమ్స్ స్టువార్ట్, లండన్, 1805, పుట 274)

చేయగానే డబ్బు నన్ను విడిచిపెట్టి పోతుంది. కనుక స-డ-స ఆవృత్తంలో డబ్బు ఖర్చుకీ, అది తిరిగి రావడానికీ సంబంధం లేదు. మరోవైపున డ-స-డలో డబ్బు వెనక్కి రావడం అనేది, అది వ్యయమయ్యే పద్ధతిలోనే వుంది. ఇలా వెనక్కి రావడం అనేది జరక్కపోతే ఈ చర్య విఫలమవుతుంది. ఈ క్రమానికి అంతరాయం కలుగుతుంది. దాని పూరకమూ, ఆఖరిదీ అయిన అమ్మకం దశ లేకపోవడం వల్ల అసంపూర్ణం అవుతుంది.

స-డ-స ఆవృత్తం ఒక సరుకుతో ప్రారంభించి మరో సరుకుతో పూర్తవుతుంది. రెండో సరుకు చలామణి నుండి తప్పుకుని అనుభోగంలో అడుగు పెడుతుంది. అనుభోగం, అంటే కోరికల సంతృప్తి ఒక్కమాటలో చెప్పాలంటే ఉపయోగపు విలువ అనేది దాని గమ్యమూ, లక్ష్యమూ. అందుకు విరుద్ధంగా డ-స-డ ఆవృత్తం డబ్బుతో ప్రారంభమై డబ్బుతో అంతమవుతుంది. కనుక దాని ప్రధాన ఉద్దేశం, దాన్ని ఆకర్షించిన ప్రధాన లక్ష్యం కేవలం మార్పిడి విలువ మాత్రమే.

సరుకుల సాదా చలామణిలో ఆవృత్తానికి ఇరువైపులా వున్న అంశాలకు ఒకే ఆర్థిక రూపం వుంది. అవి రెండూ సరుకులే; సమ విలువ కల్గిన సరుకులు. అవి రెండూ భిన్నమైన గుణాలు కల్గిన ఉపయోగపు విలువలు కూడా. ఉదాహరణకు, ధాన్యమూ, బట్టలూ. ఉత్పాదితాల మార్పిడి అనేది, సామాజిక శ్రమ సాకార రూపం ధరించిన భిన్న పదార్థాల మార్పిడి అనేది, ఇక్కడ చలనానికి పునాది. డ-స-డ చలామణిలో ఇందుకు విరుద్ధంగా వుంటుంది. అది చర్విత చరణం కనుక మొదటి చూపుకు లక్ష్యరహితంగా కనిపిస్తుంది. ఇరువైపులా ఉన్న అంశాలకు ఒకే ఆర్థిక రూపం వుంది. అవి రెండూ డబ్బే. కనుక అవి గుణాత్మకంగా భిన్నమైన ఉపయోగపు విలువలు కాదు. డబ్బు అనేది సరుకుల మారిన రూపం. దానిలో వాటి ప్రత్యేక ఉపయోగపు విలువలు మాయమవుతాయి. 100 పౌండ్లను దూది కోసం మార్పిడి చేయడం, అదే దూదిని మళ్ళీ 100 పౌండ్లకు మార్పిడి చేయడం అనేది డొంకతిరుగుడు పద్ధతిలో డబ్బు కోసం డబ్బును మార్పిడి చేయడమే అవుతుంది. ఒకే వస్తువును అదే వస్తువుతో మార్పిడి చేయడమే. ఇది ఒక అర్థరహితమైన అసంబద్ధ చర్యలా కన్పిస్తుంది.[1]

ఒక డబ్బు మొత్తానికి మరో డబ్బు మొత్తానికీ పరిమాణాల్లో మాత్రమే భేదం వుంటుంది. డ-స-డ అనే ప్రక్రియకు ఇరువైపులా వున్న అంశాలు డబ్బే. కనుక ఆ ప్రక్రియ స్వభావమూ, ధోరణి రూపొందింది వాటి గుణాత్మక భిన్నత్వం వల్ల కాదు. వాటి పరిమాణాత్మక భిన్నత్వం వల్ల మాత్రమే.

---

1. "డబ్బుతో డబ్బు నెవరూ మార్పిడి చెయ్యరు" అంటాడు మెర్సియర్ డి లా రివియెర్ వ్యాపారులతో (పు 486). వ్యాపారం, చట్టా వ్యాపారం గురించి వివరిస్తానని చెప్పుకునే గ్రంథంలో ఇలా వుంది : "విభిన్న రకాల వస్తువుల మార్పిడే వ్యాపారం. ఈ విభిన్నత వల్లే కలుగుతుంది ప్రయోజనం (వ్యాపారులకా?). ఒక పౌను రొట్టెతో ఒక పౌను రొట్టెను మార్చటం వల్ల ప్రయోజనమేమీ లేదు." కనుక డబ్బుతో డబ్బు మార్పిడి అయ్యే జూదంతో పోలిస్తే వ్యాపారం ప్రయోజనకరమైంది. (థామస్ కార్బెట్, "యాన్ ఎంక్వయిరీ ఇంటు ది కాజెస్ అండ్ మోడ్స్ ఆఫ్ ది వెల్త్ ఆఫ్ ఇండివిడ్యువల్స్; ఆర్ ది ప్రిన్సిపుల్స్ ఆఫ్ ట్రేడ్ అండ్ స్పెక్యులేషన్ ఎక్స్‌ప్లెయిన్డ్", లండన్, 1841, పుట 5) డ-డ-ని, డబ్బుతో డబ్బు మార్పిడి జరగడం వ్యాపార పెట్టుబడి చలామణి యొక్క విలక్షణ రూపం మాత్రమే కాక మొత్తం పెట్టుబడి చలామణి యొక్క విలక్షణ రూపం అని కార్బెట్ గమనించలేదు. అయితే కనీసం అతడు జూదానికీ, ఒక రకం వ్యాపారమైన చట్టా వ్యాపారానికీ ఇది ఉమ్మడి రూపమనే సంగతి మాత్రం గ్రహించాడు : ఇక మాకల్లోకి

ప్రారంభంలో చలామణిలోకి నెట్టిన దానికంటే ఎక్కువ డబ్బు చివరిలో దాని నుండి ఉపసంహరించుకో బడుతుంది. 100 పౌండ్లకు కొన్న దూది బహుశా మళ్ళీ 100 పౌండ్లు + 10 పౌండ్లు, అనగా 110 పౌండ్లకి అమ్మబడింది. కనుక డ' = డ + Δడ = తొలిపెట్టుబడి + దానిపై పెరిగిన సొమ్ము. అయినప్పుడు ఈ ప్రక్రియ అసలు రూపం డ–స–డ గా వుంటుంది. ఈ పెరుగుదలని, లేదా మొదటి విలువ కంటే ఎక్కువగా వున్న అధిక డబ్బును నేను "అదనపు విలువ" అంటాను. మొదట అడ్వాన్స్ చేసిన విలువ చలామణిలో చెక్కుచెదరకుండా వుండటమే కాక అది అదనపు విలువని సంతరించుకుంటుంది, లేదా పెరుగుతుంది. దాన్ని పెట్టుబడిగా మార్చేది ఈ చలనమే.

స–డ–స లో ఇరువైపులా వున్న స–సలు, ఉదాహరణకు ధాన్యమూ, బట్టలూ, విభిన్న విలువ పరిమాణాలకు ప్రాతినిధ్యం వహించడం కూడా సాధ్యమే. రైతు తన ధాన్యాన్ని దాని అసలు విలువ కంటే ఎక్కువకు అమ్మవచ్చు. లేదా బట్టల్ని వాటి విలువ కంటే తక్కువకు కొనవచ్చు. మరోవైపున బట్టల వ్యాపారి చేతిలో అతను మోసపోయి కూడా వుండొచ్చు. అయితే ఈ రకం చలామణి రూపంలో విలువలో అటువంటి తేడాలు కేవలం యాదృచ్ఛికం మాత్రమే. ధాన్యమూ, బట్టలూ సమ విలువలనే వాస్తవం డ–స–డ ని చేసినట్లుగా ఈ క్రమాన్ని అర్థరహితం చేయదు. పైగా దాని మామూలు క్రమానికి వాటి విలువలు సమం కావటం అనేది ఒక అవసరమైన షరతు.

కొనడం కోసం అమ్మడం అనే చర్యను పునరావృతం చేయడానికి ఒక పరిమితి వుంది. అదే అనుభోగం, లేదా నిర్దిష్ట వాంఛల సంతృప్తి. ఈ లక్ష్యం మొత్తంగా చలామణి రంగానికి వెలుపల వుంటుంది. అయితే అమ్మడం కోసం మనం కొన్నప్పుడు దానికి విరుద్ధంగా ఒకే వస్తువుతో ప్రారంభించి దానితోనే ముగిస్తాము. అదే డబ్బు, మార్పిడి విలువ. అందువల్ల ఈ చలనం అనంతం. డ అనేది డ అవుతుంది; 100 పౌండ్లు 110 పౌండ్లవుతాయి. అందులో సందేహం లేదు. గుణాత్మక దృష్టి నుంచి మాత్రమే 110 పౌండ్లు 100 పౌండ్లూ ఒకటే. అది డబ్బు. పరిమాణం రీత్యా 110 పౌండ్లు 100 పౌండ్లు లాగానే ఒక నిర్దిష్ట పరిమిత విలువ వున్న మొత్తం మాత్రమే. ఇప్పుడు 110 పౌండ్లను డబ్బులాగా ఖర్చు పెట్టేస్తే అది తన పాత్ర నిర్వహించడం ఆగిపోతుంది! అది ఇక ఏ మాత్రమూ పెట్టుబడి కాదు. చలామణి నుండి ఉపసంహరించబడితే అది నిల్వగా శిలాకృతి ధరిస్తుంది. ఆ స్థితిలో అది ప్రళయ కాలం వరకూ అలాగే పడి వున్నా దానికి ఒక్క పైసా కూడా జతగాదు. అయితే, లక్ష్యం గనుక విలువ విస్తరణే అయితే, 100 పౌండ్లని పెంచడానికి ఆకర్షణే 110 పౌండ్లని పెంచడానికి వుంటుంది. ఎందుకంటే, రెండూ మార్పిడి విలువకి పరిమిత వ్యక్తీకరణలే. కనుక పరిమాణ వృద్ధి

---

వస్తాడు : అమ్మడం కోసమే కొనడం అంటే చట్టా వ్యాపారమే అని అతను అంటాడు. ఆ రకంగా వ్యాపారానికీ, చట్టా వ్యాపారానికీ మధ్య తేడా మాయమవుతుంది. "ఒక వ్యక్తి అమ్మడం కోసమే కొనే ప్రతి లావాదేవీ నిజానికి చట్టా వ్యాపారమే." (మాకల్లోకి, "ఎ డిక్షనరీ ప్రాక్టికల్ అండ్ ఎట్సెట్రా ఆఫ్ కామర్స్" లండన్, 1847, పుట 1009, ఆంస్టర్‌డామ్ స్టాక్ ఎక్స్ఛేంజ్ పిండార్* అయిన పింటో ఇంతకు మించిన అమాయకత్వంతో ఇలా అంటాడు. "వ్యాపారం ఒక ఆట (ఇది లాక్ నుండి అరువు తెచ్చుకొన్న మాట) యాచకుల్నుండి గెలుచుకోగలిగిందేమీ వుండదు. ప్రతి వారి నుండీ ప్రతీది గెల్చుకుంటే, ఆట మళ్ళీ మొదలు పెట్టాలంటే, గెల్చుకున్న దానిలో ఎక్కువ భాగం తిరిగి ఇచ్చేయాల్సి వుంటుంది." (పింటో, Traite de la circulation et du credit, Amsterdam, 1771, పుట 231)

* పిండార్ : (క్రీ.పూ. 522 - 422) ఒలింపిక్ విజేతల్ని స్తుతిస్తూ కవితా గానం జేశాడు. - సం.)

ద్వారా అనంత సంపదకి సాధ్యమైనంత దగ్గరగా చేరుకోవడమే రెంటికీ వున్న వ్యాపకం. తాత్కాలికంగా మొదట అడ్వాన్స్ చేసిన 100 పౌండ్లని, చలామణిలో దానికి తోడైన 10 పౌండ్ల నుండి వేరుచేసి చూడొచ్చు. కానీ ఈ భేదం వెంటనే అదృశ్యమవుతుంది. ఈ ప్రక్రియ చివరిలో మనం ఒక చేత్తో 100 పౌండ్లనీ మరోచేత్తో 10 పౌండ్ల అదనపు విలువనీ వేరు వేరుగా పుచ్చుకోము. మనం కేవలం 110 పౌండ్ల విలువనూ తీసుకుంటాం. మొదటి 100 పౌండ్లలాగే ఇది కూడా విస్తరణ ప్రక్రియను ప్రారంభించడానికి తగినట్టుగా వుంటుంది. డబ్బు తన చలనాన్ని ముగించేది కేవలం మళ్ళీ ప్రారంభించడానికే.[1] కనుక కొనుగోలు, అమ్మకమూ పూర్తయిన ప్రతి ఆవృత్తం యొక్క అంతిమ ఫలితమూ మరో ఆవృత్తానికి ప్రారంభ స్థానం అవుతుంది. సరుకుల సాదా చలామణి – కొనడం కోసం అమ్మడం – అనేది ఉపయోగపు విలువల్ని సంపాయించడం, అవసరాలను తీర్చుకోవడం అనే చలామణికి సంబంధం లేని లక్ష్యాన్ని నెరవేర్చడానికి ఒక సాధనం. దీనికి విరుద్ధంగా పెట్టుబడిగా డబ్బు చలామణిలో వుండటం దానికదే ఒక లక్ష్యం. ఎందుకంటే ఈ నిత్య పునశ్చరణ పొందే చలనంలో మాత్రమే విలువ విస్తరణ జరుగుతుంది. కనుక పెట్టుబడి చలామణికి అంతం లేదు.[2]

---

1. పెట్టుబడిని మూల పెట్టుబడిగా, పెట్టుబడికి జత అయిన లాభంగా విభజించవచ్చు. అయితే ఆచరణలో ఈ లాభం తక్షణమే పెట్టుబడిగా మారుతుంది. మూల పెట్టుబడితో పాటు చలనంలో పెట్టబడుతుంది. (ఎఫ్ ఏంగెల్స్, (Umrisse Zueiner Kritikder National okonomie, in deutsch Franzo Arnold Ruge Und Karl Marks" Paris, 1844, పుట 99)

2. అర్థశాస్త్రం, ద్రవ్య వృద్ధి శాస్త్రం (Chrematistic) కంటే భిన్నమైనది అని అరిస్టాటిల్ అంటాడు. ఆయన మొదటి దాని నుండి ప్రారంభిస్తాడు. జీవన భృతిని ఆర్జించుకొనే కళ అయిన మేరకు అది ఇల్లు లేదా రాజ్యం యొక్క మనుగడకు అవసరమైన, ఉపయోగకరమైన వస్తువుల సంపాదనకే పరిమితం అవుతుంది. జీవితాన్ని ఆనందమయం చేసుకోవడానికి తోడ్పడే ఉపయోగ విలువలే నిజమైన సంపద. వాటిని స్వాధీనంలో వుంచుకోటానికి వాటి పరిమాణం పరిమితులు లేనిది కాదు. అయితే మరో రకం వస్తు సముపార్జన కూడా వుంది. దానికి మనం ద్రవ్య వృద్ధి అని పేరు పెట్టవచ్చు. ఇందులో సంపదలకీ, ఆస్తులకీ పరిమితులుండవు. వ్యాపారం (అక్షరాలా చిల్లర వ్యాపారం. దీనిలో ఉపయోగ విలువలే ప్రాబల్యం వహిస్తాయి కనుక అరిస్టాటిల్ దాన్ని ఎంచుకున్నాడు.) స్వభావం రీత్యా ద్రవ్య వృద్ధి శాస్త్రానికి చెందదు. ఎందుకంటే ఇక్కడ మార్పిడి అనేది వారికి (కొనుగోలుదారునికీ, అమ్మకందారునికీ) అవసరమైన వస్తువులకే వర్తిస్తుంది. "కనుక, ఆయన వివరించినట్టుగా తొలి వ్యాపార రూపం వస్తు మార్పిడి. అది విస్తరించడం వల్ల డబ్బు అవసరం తలెత్తింది. డబ్బును కనుక్కోవడంతో విధిగా వస్తు మార్పిడి సరుకుల వ్యాపారంగా అభివృద్ధి అయింది. ఇది తిరిగి మొదటి ధోరణికి వ్యతిరేకంగా ద్రవ్య వృద్ధి శాస్త్రంగా అంటే డబ్బు చేసుకొనే కళగా పెరిగింది. ఇప్పుడు ద్రవ్య వృద్ధి శాస్త్రాన్ని అర్థశాస్త్రం నుంచి ఈ రకంగా వేరుచేసి చూడొచ్చు!" ద్రవ్య వృద్ధి శాస్త్రం విషయంలో చలామణి సంపదలకు మూలం. అది డబ్బు చుట్టూ తిరుగుతున్నట్టు కన్పిస్తుంది. ఎందుకంటే, ఈ రకం మార్పిడికి ఆది అంతమూ డబ్బే. ద్రవ్య వృద్ధి శాస్త్రం వెంపరలాడే డబ్బు కూడా పరిమితుల్లేనిది. ఒక లక్ష్యానికి సాధనం కాని కళలన్నిటి లాగే దాని లక్ష్యానికి కూడా పరిమితి లేదు. అది నిరంతరం ఆ లక్ష్యానికి మరింత చేరువ కావడానికి ప్రయత్నిస్తుంది. ఒక లక్ష్యానికి సాధనంగా పనిచేసే కళలకూ పరిమితి వుంది. ఆ లక్ష్యమే వాటికి ఆ పరిమితి విధిస్తుంది. అలాగే ద్రవ్య వృద్ధి శాస్త్ర లక్ష్యం అనంత సంపద కనుక ఈ లక్ష్యానికి పరిమితులుండవు. అలాగాక అర్థశాస్త్ర లక్ష్యానికి పరిమితులుంటాయి. రెండో దాని లక్ష్యం డబ్బు కంటే భిన్నమైనది. మొదటి దాని లక్ష్యం డబ్బును వృద్ధిచేయడం. ఒకదానితో మరొకటి కొంతవరకు ఏకీభవించే ఈ రెండు రూపాలనూ చూసి కొంతమంది డబ్బును కూడబెట్టి, అనంతంగా వృద్ధిచేయడమే అర్థశాస్త్ర లక్ష్యమని పొరపాటుపడ్డారు. (అరిస్టాటిల్, "De Rep", edit, Bekker ఒకటో గ్రంథం, 8, 9 అధ్యాయాలు)

ఈ చలనానికి ఉద్దేశపూర్వకమైన ప్రతినిధిగా డబ్బు గల ఆసామి పెట్టుబడిదారుడవుతాడు. అతను, లేదా అతని జేబు డబ్బుకు ప్రారంభ స్థానం. అది తిరిగి చేరుకునే స్థానం కూడా అదే. బ–స–డ అనే చలామణి యొక్క వస్తుగత ప్రాతిపదిక, లేదా చోదక శక్తి అయినట్టి విలువ విస్తరణ అతని ఆత్మగత లక్ష్యం అవుతుంది. ఆ నిర్దిష్ట సంపదను ఎప్పటికప్పుడు మరింత స్వాధీనం చేసుకోవడమే అతని కార్యకలాపాలకు మూలమయిన మేరకు అతను పెట్టుబడిదారుగా వ్యవహరిస్తాడు. అంటే చైతన్యమూ, ఇచ్ఛా సంతరించుకున్న పెట్టుబడికి మానవాకారంగా వ్యవహరిస్తాడు. కనుక ఉపయోగపు విలువల్ని ఎప్పుడూ పెట్టుబడిదారుని లక్ష్యాలనుకోరాదు.[1] ఒకే ఒక లావాదేవీలో లాభం కూడా అతని లక్ష్యం కాదు. ఎప్పుడూ ఎడతెగని లాభం చేసుకునే అవిరామ ప్రక్రియ మాత్రమే అతని లక్ష్యం.[2] సంపదపట్ల ఈ అపరిమితమైన దురాశ, మార్పిడి విలువ కోసం ఈ ఉద్వేగపూరితమైన వేట – వీటి విషయంలో పెట్టుబడిదారుడూ, పిసినారీ ఒకటే.[3] అయితే పిసినారి పిచ్చెక్కిన పెట్టుబడిదారుడు కాగా, పెట్టుబడిదారుడు హేతుబద్ధమైన పిసినారి. చలామణి పాలబడకుండా తన డబ్బును కాపాడు కోవడం ద్వారా మార్పిడి విలువను అనంతంగా వృద్ధి చేసుకోవాలనుకుంటాడు పిసినారి. అదే లక్ష్యాన్ని తెలివైన పెట్టుబడిదారుడు తన డబ్బును నిరంతరాయంగా నిత్యనూతనంగా చలామణిలోకి నెట్టటం ద్వారా సాధిస్తాడు.[4]

సాదా చలామణిలో సరుకుల విలువ సంతరించుకునే స్వతంత్ర రూపం, అంటే డబ్బు రూపం ఒకే ఒక లక్ష్యాన్ని, వాటి మార్పిడిని నెరవేరుస్తుంది. ఆ చలనం యొక్క చివరి ఫలితంలో అది మాయమవుతుంది. మరోవైపున డ–స–డ చలామణిలో డబ్బూ, సరుకూ రెండూ విలువ అస్తిత్వం యొక్క విభిన్న పద్ధతులకు ప్రాతినిధ్యం వహిస్తాయి. డబ్బు దాని సాధారణ పద్ధతికీ, సరుకు దాని ప్రత్యేక పద్ధతికీ, అంటే మారు రూపంలో ఉన్న పద్ధతికీ ప్రాతినిధ్యం వహిస్తాయి.[5] అది నిరంతరాయంగా

---

1. "సరుకులు (ఇక్కడ ఉపయోగపు విలువలు అనే అర్థంలో వాడబడింది) అనేవి వాణిజ్య పెట్టుబడి దారుని అంతిమ లక్ష్యం కాదు. అతని అంతిమ లక్ష్యం డబ్బు." (థామస్ చాల్మర్స్, ఆన్ పొలిటికల్ ఎకానమీ ఎట్సెట్రా రెండో ముద్రణ, గ్లాస్గో, 1832, పుటలు 165, 166)
2. అప్పుడు సంపాదించిన లాభాన్ని పెట్టుబడిదారుడు తృణీకరించనప్పటికీ అతని దృష్టి ఎప్పుడూ భవిష్యత్తు లాభంపైనే వుంటుంది. (ఎ. జెనోవెసి, Lezioni di economia civile (1765) Parte moderna, ఎనిమిదో సంపుటి, పుట 139)
3. లాభంకోసం ఆర్పరాని జ్వాలగా మండే కోరిక, బంగారం కోసం ఈ పాపిష్టి దాహం - ఇవే పెట్టుబడిదారుల్ని నడిపిస్తాయి. (మాకల్లోక్: "ది ప్రిన్సిపుల్స్ ఆఫ్ పొలిటికల్ ఎకానమీ" లండన్, 1830, పే. 179) ఇటువంటి అభిప్రాయం వ్యక్తం చేసిన మాకల్లోక్ గానీ, అతని బాపతు మనుషులు గానీ, అధికోత్పత్తి లాంటి సిద్ధాంత ఇబ్బందులు ఎదురైనప్పుడు ఇదే పెట్టుబడిదారుణ్ణి నీతి నియమాలు గల పౌరునిగా చిత్రించడానికి ఏమాత్రం వెనుకాడరు. ఆ నైతిక పౌరుని లక్ష్యం కేవలం ఉపయోగపు విలువలు మాత్రమే అన్నట్లుగా బూట్లు, టోపీలు, గుడ్లు, కాలికో లాంటి అందరికీ తెలిసిన ఉపయోగపు విలువల తీరని ఆకలితో అతను బాధపడుతున్నట్టుగా వారు చిత్రిస్తారు.
4. "వస్తువులు సరళరేఖలో పురోగమించేప్పుడు వాటికి లేని ఒక అనంత స్వభావం అవి వృత్తంలో పరిభ్రమిస్తున్నప్పుడు వాటికి వుంటుంది." (గాలియని)
5. "పెట్టుబడిగా ఏర్పడేది పదార్థం కాదు. ఆ పదార్థం యొక్క విలువ మాత్రమే" (జె.బి.సే. "Traite d' economic politique" మూడో ముద్రణ, పారిస్, 1817, రెండో సంపుటి, పుట 429)

ఒక రూపం నుండి మరో రూపంలోకి మారుతూ వుంటుంది. ఆ రకంగా అది ఈ చలనంలో లుప్తమై పోకుండా దానంతటదే ఒక క్రియాశీల పాత్రని నిర్వహిస్తుంది. ఇప్పుడు స్వయంగా పెరిగే విలువ తన జీవిత క్రమంలో ఒకదాని తర్వాత ఒకటిగా సంతరించుకునే రెండు విభిన్న రూపాల్లో ప్రతిదాన్నీ ఒక దాని తర్వాత మరొకటిగా పరిశీలిస్తే, మనకి ఈ రెండు ప్రతిపాదనలు ఎదురవుతాయి. పెట్టుబడి అంటే డబ్బు : పెట్టుబడి అంటే సరుకులు.[1] నిజానికి విలువది క్రియాశీల పాత్ర. అది ఈ ప్రక్రియలో ఒకప్పుడు డబ్బు రూపాన్నీ, మరోసారి సరుకుల రూపాన్నీ నిరంతరాయంగా స్వీకరిస్తూనే, అదే సమయంలో అది తన పరిమాణాన్ని మార్చుకుంటుంది. తన నుండి అదనపు విలువను బయటికి తోస్తుంది. మరో రకంగా చెప్పాలంటే, తొలి విలువ తనంతకు తానే విస్తరిస్తుంది. అది అదనపు విలువను సంతరించుకునే చలనం దాని సొంత చలనం. కనుక దాని విస్తరణ స్వయం విస్తరణ. అది స్వయంగా విలువ కనుక మరింత విలువ సమకూర్చుకునే గూఢ స్వభావాన్ని సంతరించుకుంది. అది సజీవ సంతానాన్ని కంటుంది. లేదా కనీసం బంగారపు గుడ్లనైనా పెడుతుంది.

అటువంటి ప్రక్రియలో విలువది క్రియాశీల పాత్ర. ఒకసారి అది డబ్బు రూపం ధరిస్తుంది. మరోసారి అది సరుకుల రూపం ధరిస్తుంది. ఈ మార్పులన్నిటిలోనూ తనని తాను కాపాడుకుంటుంది. విస్తరిస్తుంది. అయితే ఏ సమయంలోనైనా దానిని గుర్తుపట్టడానికి వీలుగా దానికో స్వతంత్ర రూపం కావాలి. డబ్బు ఆకారంలోనే దానికి ఈ రూపం లభిస్తుంది. డబ్బు రూపంలోనే విలువ తనంతకు తాను చేసే ప్రతి స్వీయ ఉత్పత్తి చర్యనూ ప్రారంభిస్తుంది, ముగిస్తుంది, మళ్ళీ ప్రారంభిస్తుంది. అది 100 పౌండ్లుగా ప్రారంభించింది. ఇప్పుడది 110 పౌండ్లు, యిలాగే కొనసాగుతుంది. అయితే విలువకున్న రెండు రూపాల్లో డబ్బు ఒకటి మాత్రమే. అది ఏదో ఒక సరుకు రూపం తీసుకోకపోతే పెట్టుబడి కాజాలదు. కూడబెట్టడం విషయంలో డబ్బుకీ సరుకులకీ మధ్య వున్నట్టుగా యిక్కడ వైరుధ్యమేమీ లేదు. సరుకులు ఎంత దిక్కుమాలినట్టు కనిపించిన, ఎంత చెడ్డ కంపు కొడుతున్నా అవన్నీ నిజంగా డబ్బే అనీ, స్వభావరీత్యా నూటికి నూరుపాళ్ళ యూదులలాంటివే అనీ, అంతకంటే ముఖ్యంగా డబ్బు నుంచి డబ్బును పుట్టించే అద్భుత సాధనాలనీ పెట్టుబడిదారుడికి తెలుసు.

స-డ-స అనే సాదా చలామణిలో సరుకుల విలువ, మహా అయితే వాటి ఉపయోగపు విలువలతో ప్రమేయం లేని స్వతంత్ర రూపాన్ని అంటే డబ్బు రూపాన్ని సంపాదించుకుంది. అయితే అదే విలువ ఇప్పుడు డ-స-డ చలామణిలో, లేదా పెట్టుబడి చలామణిలో, హఠాత్తుగా ఒక స్వతంత్ర అంశంలా దర్శనమిస్తుంది. తన సొంత జీవిత క్రమంలో పయనిస్తున్నట్టు కనిపిస్తుంది. అందులో డబ్బు, సరుకులు అనేవి కేవలం అది ఒకదాని తర్వాత ఒకటిగా సంతరించుకుని, వదిలేసే రూపాలు మాత్రమే. అంతేకాదు, కేవలం సరుకుల సంబంధాలకు ప్రాతినిధ్యం వహించడానికి బదులు అది ఇప్పుడు తనతో తాను ప్రైవేటు సంబంధాలను ఏర్పరుచుకుంటుంది. అది తనని తాను తొలి విలువగానూ, అదనపు విలువగానూ వేరుచేసుకుంటుంది. క్రైస్తవ మత ధర్మం ప్రకారం భగవంతుడైన

---

1. "వస్తువులను తయారుచేయడానికి ఉపయోగించే కరెన్సీ (!)యే పెట్టుబడి" (మాక్లియాడ్ : ది థియరీ అండ్ ప్రాక్టీస్ ఆఫ్ బ్యాంకింగ్" లండన్, 1855, ఒకటో సంపుటి, ఒకటో అధ్యాయం, పుట 55) "పెట్టుబడి అంటే సరుకులు" (జేమ్స్‌మిల్ ఎలిమెంట్స్ ఆఫ్ పొలిటికల్ ఎకానమీ' లండన్, 1821, పే. 74)

తండ్రీ భగవంతుడైన కుమారుడూ యిద్దరూ ఒకరే అయినప్పటికీ, యిద్దరి వయసూ ఒకటే అయినప్పటికీ తండ్రి తనని తాను వేరు చేసుకున్నట్టే ఇది కూడా. 10 పౌండ్ల అదనపు విలువ ద్వారానే ముందు అడ్వాన్స్ చేసిన 100 పౌండ్లూ పెట్టుబడి అవుతుంది. ఇలా జరిగిన వెంటనే, కుమారుడూ, కుమారుని వల్ల తండ్రీ పుట్టగానే వారి మధ్య తేడా మాయమవుతుంది. అవి రెండూ మళ్ళీ 110 పౌండ్లుగా ఒకటవుతాయి.

కనుక విలువ ఇప్పుడు ప్రక్రియలో విలువగా, ప్రక్రియలో డబ్బుగా, అందువల్ల పెట్టుబడిగా మారుతుంది. అది చలామణి నుండి బయటపడుతుంది. మళ్ళీ ప్రవేశిస్తుంది. తన ఆవృత్తం లోపలే తనని తాను భద్రపరుచుకొని గుణీకృతమవుతుంది. మళ్ళీ తాజాగా అదే భ్రమణాన్ని ప్రారంభిస్తుంది.[1] డ–డ, డబ్బును పుట్టించే డబ్బు – దాని తొలి భాష్యకారులైన వాణిజ్య వాదులు దానికిచ్చే వర్ణన యిదే.

అమ్మటానికి కొనటం లేదా ఇంకా ఖచ్చితంగా చెప్పాలంటే ప్రియంగా అమ్మకానికి కొనడం, డ–స–డ అనేది, ఒక రకం పెట్టుబడికి మాత్రమే, అంటే వాణిజ్య పెట్టుబడికి మాత్రమే ప్రత్యేకమైన రూపంలా కనిపిస్తుంది. అయితే పారిశ్రామిక పెట్టుబడి కూడా డబ్బే. అది సరుకులుగా మార్చబడి, ఆ సరుకుల్ని అమ్మటం ద్వారా మరింత ఎక్కువ డబ్బుగా మార్చబడిన డబ్బు. కొనటం అమ్మటాల మధ్య వుండే విరామ కాలంలో చలామణి రంగానికి ఆవల జరిగే సంఘటనలు ఈ చలన రూపాన్ని ప్రభావితం చేయవు. చివరిగా, వడ్డీ యిచ్చే పెట్టుబడి విషయంలో డ–స–డ చలామణి కుదించబడినట్లు కనిపిస్తుంది. మధ్యంతర దశ లేకుండానే డ–డ అనే మరింత క్లుప్త రూపంలో మనకీ ఆ ఫలితం వచ్చింది. అంతే ఎక్కువ డబ్బు అయిన డబ్బు, తనకంటేనే ఎక్కువైన విలువ.

కనుక, డ–స–డ అనేది, వాస్తవానికి చలామణి రంగంలో ప్రత్యక్షంగా కనిపించే పెట్టుబడి సాధారణ సూత్రం.

---

1. "పెట్టుబడి ... శాశ్వత స్వయం గుణీకృత విలువ" (సిస్మండీ, "Nouveaux Principles d' Econ. polit," ఒకటో సంపుటి, పుట 88, 89)

## అధ్యాయం - 5

# పెట్టుబడి సాధారణ సూత్రంలో వైరుధ్యాలు

డబ్బు పెట్టుబడి అయినప్పుడు చలామణి తీసుకునే రూపం మనం ఇంతవరకు పరిశీలించిన సరుకుల స్వభావం, విలువ, డబ్బు, చలామణి వగైరాలకు వర్తించే నియమాలన్నిటికీ వ్యతిరేకంగా వుంది. సరుకుల సాదా చలామణికీ దీనికి వున్న తేడా ఏమంటే దీనిలో అమ్మడం, కొనడం అనే రెండు విరుద్ధ ప్రక్రియలు వ్యతిరేక క్రమంలో జరుగుతాయి. కేవలం ఈ రెంటి రూపాల్లోనూ వున్న ఈ తేడా వీటి స్వభావాన్ని గారడీ చేసినట్టుగా ఎలా మార్చేయగలదు?

అంతేకాదు, వ్యాపారంలో కలిసే ముగ్గురి వ్యక్తుల్లో ఇద్దరికి ఈ వ్యతిరేక క్రమం అనేదేదీ లేదు. పెట్టుబడిదారునిగా నేను 'క' దగ్గర సరుకులు కొని 'చ'కి అమ్ముతాను. అయితే మామూలు సరుకుల యజమానిగా నేను వాటిని 'చ'కి అమ్ముతాను. కొత్తగా మళ్ళీ 'క' దగ్గర కొంటాను. ఈ రెండు రకాల లావాదేవీల్లోనూ 'క' 'చ'లు తేడా చూడరు. వారు కేవలం కొనుగోలుదారులు లేదా అమ్మకందారులు. మరోవైపున ప్రతి సందర్భంలోనూ నేను వారికి డబ్బు యజమానిగానో, సరుకుల యజమానిగానో తారసపడతాను. ఒక కొనుగోలుదారునిగానో, అమ్మకందారునిగానో ఎదురవుతాను. రెండు రకాల లావాదేవీల్లోనూ నేను 'క'కి కేవలం కొనుగోలుదారునిగానూ, 'చ'కి కేవలం అమ్మకందారునిగాను ఎదురుపడతాను. ఒకనికి కేవలం డబ్బుగాను మరొకరికి కేవలం సరుకులుగానూ కన్పిస్తాను. అంతేగాని వారిద్దరిలో ఏ ఒక్కరికీ నేను పెట్టుబడిలాగానో, పెట్టుబడిదారునిలాగానో లేదా డబ్బుకీ సరుకుకీ మించిన మరొకదాని లాగానో లేదా డబ్బు, సరుకులు కల్గించలేని ప్రభావం కల్గించే మరొక అంశం లాగానో కనిపించను. 'క' వద్ద నుండి కొనడమూ, 'చ'కి అమ్మడమూ నాకు ఒక చర్యా పరంపరలో భాగం. కానీ ఈ రెండు చర్యల మధ్య సంబంధం నాకు మాత్రమే వుంది. 'చ'తో నా లావాదేవీని గురించి 'క' ఆలోచించడు. 'క'తో నా వ్యవహారం గురించి 'చ' పట్టించుకోడు. క్రయ విక్రయాల క్రమాన్ని తిరగేయడంలో వున్న గొప్పతనాన్ని నేను వారికి వివరించడానికి ప్రయత్నిస్తే బహుశా ఆ క్రమం విషయంలో నేను పొరబడుతున్నాననీ, మొత్తం లావాదేవీ కొనుగోలుతో ప్రారంభమై అమ్మకంతో ముగియడానికి బదులు అమ్మకంతో ప్రారంభమై కొనుగోలుతో అంతమైందనీ వారు అనవచ్చు. నిజానికి నా మొదటి చర్య అయిన కొనుగోలు 'క' దృష్టిలో ఒక అమ్మకం. నా రెండవ చర్య అయిన అమ్మకం 'చ' దృష్టిలో ఒక కొనుగోలు. దీనితో సంతృప్తిపడి ఊరుకోకుండా ఇదంతా అనవసరమనీ, పితలాటకమనీ భవిష్యత్తులో 'క' తిన్నగా 'చ' దగ్గరే కొంటాననీ, 'చ' సూటిగా 'క'కే అమ్ముతాననీ 'క' 'చ' లిద్దరూ ప్రకటించవచ్చు. ఆ రకంగా మొత్తం లావాదేవీ ఒకే ఒక చర్యగా కుదించబడుతుంది. సరుకుల సాదా చలామణిలో అది ఒక ఒంటరి దశగా, పూరక దశ లేనిదిగా

వుంటుంది. అంటే 'క' దృష్టి నుంచి అది కేవలం అమ్మకం. 'చ' దృష్టి నుంచి అది కేవలం కొనుగోలు. కనుక ఈ రెండు దశల క్రమాన్ని తిరగేసినప్పటికీ అది సరుకుల సాదా చలామణి రంగం నుండి మనని బయటికి తీసుకుపోదు. ఈ సాదా చలామణిలో విలువ విస్తరణకూ, అదనపు విలువ సృష్టికీ వీలు కల్పించే అంశమేదైనా వుందా అని మనం చూడాలి.

చలామణి క్రమం సరుకుల సాదా, సూటి మార్పిడిగా దర్శనమిచ్చే రూపాన్ని పరిశీలిద్దాం. ఇద్దరు సరుకుల యజమానులు ఒకటి వద్ద నుండి మరొకరు కొనే ప్రతి సందర్భంలోనూ ఇది ఈ రూపంలోనే వుంటుంది. లెక్కలు చూసుకునే రోజున ఒకరికొకరు చెల్లించాల్సిన మొత్తాలు సమానం. ఒకదాన్నొకటి రద్దు చేసుకుంటాయి. ఈ సందర్భంలో డబ్బు ఖాతా డబ్బు. అది సరుకుల విలువల్ని వాటి ధరల ద్వారా వ్యక్తం చేయడానికి తోడ్పడుతుంది. అంతేగాని అది స్వయంగా నగదు రూపంలో సరుకుల్ని ఎదుర్కోదు. ఉపయోగపు విలువలకు సంబంధించిన మేరకు ఇరుపక్షాలూ ఎంతో కొంత ప్రయోజనం పొందవచ్చునేది స్పష్టం. ఉపయోగపు విలువలుగా తమకు అవసరం కాని వస్తువుల్ని ఇద్దరూ వదులుకుంటారు. తాము ఉపయోగించగల వాటిని స్వీకరిస్తారు. మరో లాభం కూడా వుండొచ్చు. ద్రాక్షాసవాన్ని అమ్మి ధాన్యం కొనే 'క' నిర్దిష్ట శ్రమకాలంలో రైతు 'చ' కంటే ఎక్కువ ద్రాక్షాసవాన్ని తయారుచేయవచ్చు. మరోవైపున ధాన్యాన్ని అమ్మే 'చ' ద్రాక్షాసవాన్ని అమ్మే 'క' కంటే నిర్దిష్ట శ్రమ కాలంలో ఎక్కువ ధాన్యాన్ని ఉత్పత్తి చేయవచ్చు. కనుక 'క' 'చ'లు ఎటువంటి మార్పిడీ చేసుకోకుండా వరుసగా ద్రాక్షాసవాన్ని ధాన్యాన్ని ఉత్పత్తి చేయడం ద్వారా పొందే దానికంటే అదే మార్పిడి విలువకు 'క' మరింత ఎక్కువ ధాన్యాన్నీ, 'చ' మరింత ఎక్కువ ద్రాక్షాసవాన్ని పొందవచ్చు. కనుక ఉపయోగపు విలువకు సంబంధించిన మేరకు "మార్పిడి అనే లావాదేవీలో ఇరుపక్షాలూ ప్రయోజనం పొందుతాయి"[1] అని చెప్పడానికి మంచి అవకాశం వుంది. మార్పిడి విలువ విషయంలో ఇది వేరు. "సమృద్ధిగా ద్రాక్షాసవం వుండి ధాన్యం లేని మనిషి సమృద్ధిగా ధాన్యం వుండి ద్రాక్షాసవం లేని మనిషితో వ్యవహరిస్తాడు. వారి మధ్య 50 విలువ గల ధాన్యంతో అంతే విలువగల ద్రాక్షాసవం యొక్క మార్పిడి జరుగుతుంది. ఆ ఇరువురిలో ఏ ఒక్కరికీ ఈ చర్య వల్ల అధికంగా మార్పిడి విలువ లభించదు. మార్పిడి ద్వారా సంపాదించిన విలువతో సమానమైన విలువ మార్పిడికి ముందే ప్రతి ఒక్కరి దగ్గరా వుంది."[2] చలామణి సాధనంగా సరుకుల మధ్య డబ్బును ప్రవేశపెట్టడం ద్వారా, క్రయ విక్రయాలను రెండు విభిన్న విడి చర్యలుగా చేయడం ద్వారా ఫలితంలో మార్పేమీ వుండదు.[3] ఒక సరుకు చలామణిలోకి వెళ్ళడానికి ముందే దాని విలువ దాని ధరలో వ్యక్తమవుతుంది. కనుక అది చలామణికి ముందు షరతు తప్ప దాని ఫలితం కాదు.[4]

---

1. "మార్పిడి అనేది ఒక శ్లాఘనీయమైన లావాదేవీ. దానివల్ల ఇరుపక్షాలూ ఎప్పుడూ ప్రయోజనం పొందుతారు." (డిస్టేట్ డి ట్రేస్, Traite de la volonte et de ses effects పారిస్, 1826, పుట 68) ఈ రచన Traite d' Economic politique (1823) తర్వాత వెలువడింది.
2. మెర్సియర్ డి లా రివియర్, పుట 544.
3. "ఈ రెండు విలువల్లో ఒకటి డబ్బైనా లేక రెండూ మామూలు సరుకులా అన్న విషయంలో ఇక్కడ ఏమాత్రం ప్రమేయం లేదు." (మెర్సియర్ డి లా రివియర్, పుట 543).
4. "విలువను నిర్ణయించేది ఒప్పందం చేసుకునే వ్యక్తులు కాదు. అది ఒప్పందానికి ముందే నిర్ణయమైంది." (లేట్రోస్నే, పుట 906)

మార్పిడిని సామాన్య రూపంలో పరిశీలిస్తే, అంటే సరుకుల సాదా చలామణి నియమాలతో ప్రమేయం లేని పరిస్థితుల నుండి దానిని వేరుచేసి చూస్తే (ఒక ఉపయోగపు విలువ స్థానంలోకి మరొక ఉపయోగపు విలువ వచ్చిందనే విషయాన్ని మనం మినహాయిస్తే) దానిలో రూప పరివర్తన తప్ప, కేవలం సరుకు రూపంలో మార్పు తప్ప, మరేమీ వుండదు. అదే మార్పిడి విలువ, అంటే భౌతిక రూపం ధరించిన అదే పరిమాణపు సామాజిక శ్రమ సరుకు యజమాని చేతిలో మొదటి నుండి చివరిదాకా వుంటుంది. మొదట తన సొంత సరుకు ఆకారంలో, తర్వాత అతను ఏ డబ్బుకు తన సరుకు మార్చాడో ఆ డబ్బు ఆకారంలోనూ, చివరిగా ఆ డబ్బుతో అతను కొనే సరుకు ఆకారంలోనూ అది వుంటుంది. రూపంలో ఈ మార్పు వచ్చిందంటే విలువ పరిమాణంలో మార్పు వచ్చినట్లు కాదు. ఈ ప్రక్రియలో సరుకు విలువకు కలిగే మార్పు దాని డబ్బు రూపంలో మార్పునకు మాత్రమే పరిమితం. ఈ రూపం మొదట అమ్మకానికి సిద్ధంగా వున్న సరుకు ధరగా వుంటుంది. తర్వాత వాస్తవంగా కొంత మొత్తం డబ్బుగా వుంటుంది. అయితే ఈ డబ్బు అంతకు ముందే దాని ధరలో వ్యక్తమై వుంటుంది. చివరిగా ఒక సమ విలువ గల సరుకు ధరగా వుంటుంది. 5 పౌండ్ల నోట్‌ని నవరసుగా, అర్ధ నవరసుగా, షిల్లింగులుగా మారిస్తే వాటి విలువలో మార్పేమీ వుండనట్లే విడిగా తీసుకుంటే, రూపంలో వచ్చిన ఈ మార్పు విలువ పరిమాణంలో ఏ మాత్రం మార్పును సూచించదు. సరుకుల చలామణి వాటి విలువల రూపాన్ని మాత్రమే ప్రభావితం చేస్తుంది కనుక, అంతరాయం కల్గించే ప్రభావాలకు లోబడకుండా వుంటుంది కనుక, ఆ మేరకు అది సమ విలువల మార్పిడి అయ్యుండాలి. విలువ స్వభావం గురించి నాటు అర్థశాస్త్రానికి తెలిసిందేమీ లేకపోయినప్పటికీ, చలామణి ఘటనలను వాటి స్వచ్ఛమైన రూపంలో పరిశీలించగోరి నప్పుడల్లా అది సరఫరా, గిరాకీలను సమానం అని భావిస్తుంది. అంటే వాటి ప్రభావం శూన్యం అన్నమాట. మార్పిడి జరిగిన ఉపయోగపు విలువల విషయంలో కొనుగోలుదారుడూ, అమ్మకందారుడూ ఇరువురూ దీనివల్ల ప్రయోజనం పొందవచ్చు. కాని మార్పిడి విలువల విషయంలో ఇది వర్తించదు. ఇక్కడ మనం "సమానత్వం ఉన్నచోట లాభం వుండదు."[1] అని చెప్పాల్సి వస్తుంది. సరుకుల్ని వాటి విలువలకి భిన్నమైన ధరలకి అమ్మడం సాధ్యమే. అయితే ఈ భిన్నత్వాలను సరుకుల మార్పిడి నియమాలకు ఉల్లంఘనలుగా మాత్రమే పరిగణించాలి.[2] సామాన్య స్థితిలో ఈ మార్పిడి సమ విలువల మార్పిడి మాత్రమే. కనుక విలువను వృద్ధిచేసే పద్ధతి కాదు.[3]

కనుక సరుకుల చలామణిని అదనపు విలువకు జన్మస్థానంగా చూపించే ప్రయత్నాలన్నిటి

1. "సమానత్వం వున్నచోట లాభం వుండదు." (గాలియని Della Moneta, in custodi parte/modema నాలుగో సంపుటి, పుట 244)
2. "ఏదో ఒక బాహ్య ప్రభావం వల్ల ధర హెచ్చటమో, తగ్గటమో జరిగితే దానివల్ల మార్పిడి అనేది ఇరు పక్షాల్లో ఒకరికి ప్రతికూలంగా మారుతుంది. దానివల్ల సమానత్వం దెబ్బతింటుంది. అయితే ఈ దెబ్బ బాహ్య ప్రభావం వల్ల తగిలిందే తప్ప మార్పిడి వల్ల కాదు. (లేట్రోస్నె, పుట 904.)
3. స్వభావరీత్యా మార్పిడి అనేది సమానత్వంపై ఆధారపడిన ఒప్పందం. అంటే అది రెండు సమాన విలువల మధ్య జరుగుతుంది. దానిలో ఎంత ఇస్తే అంతే పుచ్చుకుంటాం కనుక సంపన్నులం కావడానికి అది సాధనం కాదు. (లేట్రోస్నె, పుట 903)

వెనుక ఉపయోగ విలువనీ, మార్పిడి విలువనీ కలగాపులగం చేసే గందరగోళం తొంగి చూడటాన్ని మనం గమనిస్తాము. ఉదాహరణకు, కాండిలాక్ ఇలా అంటాడు : "సరుకుల మార్పిడిలో మనం విలువకు బదులు విలువ ఇస్తాం అనేది నిజం కాదు. అందుకు విరుద్ధంగా, ప్రతి సందర్భంలోనూ ఒప్పందంలో వున్న ఇరుపక్షాల్లో ప్రతి ఒకరూ ఎక్కువ విలువకి తక్కువ ఇస్తారు... మనం నిజంగా సమాన విలువల్ని మార్పిడి చేసుకుని వుంటే ఏ ఒక్కరికీ లాభం రాదు. అయినా ఇద్దరికీ ప్రయోజనకరంగా వుంటోంది. లేదా వుండాలి. ఎందువల్ల? ఒక వస్తువు విలువ కేవలం మన అవసరాలతో దానికి వున్న సంబంధాన్ని బట్టి వుంటుంది. ఒకరికి ఎక్కువైనదే, మరొకరికి తక్కువ. ఒకరికి తక్కువైందే మరొకరికి ఎక్కువ... మన సొంత వినియోగానికి అవసరమైన వస్తువుల్ని మనం అమ్మకానికి పెడతామని అనుకోరాదు... మనం మనకవసరమైన వస్తువు కోసం మనకు ఉపయోగం లేని వస్తువును విడిచిపెట్టాలనుకుంటాం. ఎక్కువకు బదులు మనం తక్కువివ్వాలనుకుంటాం... మార్పిడి చేయబడిన వస్తువులలో ప్రతిదానికీ ఒకే పరిమాణం గల బంగారంతో సమానమైన విలువ ఉన్నప్పుడల్లా మార్పిడిలో విలువకి బదులు విలువ యిచ్చినట్టు భావించడం సహజమే... కాని మన అంచనాలో పరిగణించాల్సిన మరో అంశం వుంది. మనమిరువురమూ ఒక అవసరమైన దానికోసం అనవసరమైన దాన్ని మార్పిడి చేస్తామా, చెయ్యమా అన్నదే ప్రశ్న"[1] ఇక్కడ కాండిలాక్ ఉపయోగపు విలువను మార్పిడి విలువగా భావించి గందరగోళపడటమే కాదు, సరుకుల ఉత్పత్తి బాగా అభివృద్ధి చెందిన సమాజంలో ప్రతి ఉత్పత్తిదారుడూ తన నిత్య జీవితావసర వస్తువుల్నే ఉత్పత్తి చేసి, తన సొంత అవసరాలు పోగా మిగిలిన వాటన్నిటినీ చలామణిలోకి విసురుతాడనీ నిజంగా పిల్లకాయ తరహాలో ఆలోచించాడు.[2] అయినా కాండిలాక్ వాదనను ఆధునిక ఆర్థికవేత్తలు ఇంకా ఉప యోగిస్తూనే వున్నారు. ముఖ్యంగా సరుకుల మార్పిడి యొక్క అభివృద్ధి చెందిన రూపమైన వాణిజ్యం అదనపు విలువను ఉత్పత్తి చేస్తుందని చెప్పాల్సి వచ్చినప్పుడల్లా. ఉదాహరణకు, 'వాణిజ్యం... వస్తువులకు విలువని కలుపుతుంది. వినియోగదారుల చేతుల్లో వున్న వస్తువులు ఉత్పత్తిదారుల చేతుల్లో వున్న వస్తువుల కంటే ఎక్కువ విలువ కలిగి వుంటాయి. దీన్ని కచ్చితంగా ఉత్పత్తి చర్యగా పరిగణించవచ్చు."[3] అయితే సరుకులు ఉపయోగపు విలువలైనందుకు ఒకసారీ, విలువలైనందుకు మరొకసారీ వాటికి రెండుసార్లు ఎవరూ డబ్బు చెల్లించరు. సరుకు ఉపయోగపు విలువ అమ్మిన వానికంటే కొన్నవానికే ఎక్కువ సేవ చేసే మాట నిజమే అయినప్పటికీ, దాని డబ్బు రూపం అమ్మినవానికే ఎక్కువ సేవ

---

1. కాండిలాక్, "Le Commerce et la Governament" (1776). Edit Daire et Molinari in the" Melanges d, Econ. Polit". పారిస్, 1847, పుటలు 267, 291)
2. లేట్రోన్సె అతని మిత్రుడు కాండిలాక్‌కి న్యాయబద్ధంగా ఇలా సమాధానం ఇస్తాడు : "అభివృద్ధి చెందిన సమాజంలో ఏదీ అనవసరం కాదు" అదే సమయంలో కాండిలాక్‌నిలా ఏడిపిస్తాడు : "మార్పిడి చేసుకున్న ఇద్దరూ సమాన మొత్తానికి ఎక్కువ పుచ్చుకుని సమాన మొత్తానికి తక్కువ మొత్తాన్ని ఇస్తే, వారిద్దరూ సమానంగానే పొందుతారు" మార్పిడి విలువ గురించి కాండిలాక్‌కి బొత్తిగా తెలియకపోవడం వల్లే శ్రీమాన్ ప్రొఫెసర్ విల్‌హెల్మ్ రోష్చర్ తన సొంత శైశవ భావాల సమర్థన కోసం కాండిలాక్‌ని ఎంచుకున్నాడు. చూ. రోష్చర్ రాసిన "Die Grundlagen der Nationalokonomie Dritte Aulage, 1858.
3. ఎస్.పి. న్యూమాన్ : "ఎలిమెంట్స్ ఆఫ్ పొలిటికల్ ఎకానమీ" యాండోవర్ అండ్ న్యూయార్క్, 1835, పుట 175.

జేస్తుంది. లేకపోతే అతడు అమ్ముతాడా? కనుక మేజోళ్ళని డబ్బుగా మార్చడం ద్వారా, కొనుగోలు దారుడు నిర్వహించేది "కచ్చితంగా ఉత్పాదక చర్యే" అని కూడా మనం ప్రకటించవచ్చు.

సమాన మార్పిడి విలువున్న సరుకు లేదా సరుకులూ, డబ్బు మార్పిడి చేయబడితే, చలామణిలోకి విసిరిన దానికంటే ఏ ఒక్కరూ ఎక్కువ విలువను గ్రహించలేరు. అందులో అదనపు విలువ సృష్టించబడదు. దాని మామూలు రూపంలో సరుకుల చలామణి సమ విలువల మార్పిడి జరగాలంటుంది. అయితే ఆచరణలో ఈ ప్రక్రియ దాని మామూలు రూపాన్ని నిలబెట్టుకోదు. కనుక మనం అసమ విలువల మార్పిడిని ఊహిద్దాం.

ఎప్పుడైనా సరుకుల మార్కెటుకు సరుకుల యజమానులే వస్తారు. వారు ఒకరి మీద ఒకరు ప్రసరించుకునే ప్రభావం వారి సరుకులది తప్ప వేరుగాదు. ఈ సరుకుల పాదార్థిక వైవిధ్యం మార్పిడి చర్యకు పాదార్థిక ప్రేరణ. అది కొనుగోలుదారుల్నీ అమ్మకందారుల్నీ పరస్పరం ఆధారపడేలా చేస్తుంది. ఎందుకంటే వారిలో ఏ ఒకరూ తనకు అవసరమైన వస్తువును కలిగి వుండడు. ప్రతి ఒక్కరూ ఇతరులకు అవసరమైన వస్తువును కలిగి వుంటాడు. వాటి ఉపయోగపు విలువల పాదార్థిక భేదాలతోపాటు సరుకుల మధ్య మరొక్క తేడా మాత్రమే వుంది. వాటి వస్తుగత రూపానికీ, అమ్మకం ద్వారా అవి మారే రూపానికీ మధ్య, అంటే సరుకులకూ డబ్బుకూ మధ్య తేడా అది. తత్ఫలితంగా, సరుకుల యజమానులను సరుకులు గలవారూ, డబ్బు గలవారూ, లేదా అమ్మకందారులూ, కొనుగోలుదారులూ అని వేరుచేయవచ్చు.

మనకు అర్థంకాని ఒక ప్రత్యేక సౌకర్యం వల్ల అమ్మకందారుడు తన సరుకుల్ని వాటి విలువకు మించి, 100 చేసేదాన్ని 110కి అమ్మగలిగాడు అనుకుందాం. అటువంటప్పుడు ధర నామమాత్రంగా 10% పెరిగింది. అమ్మకందారుడు 10 అదనపు విలువని జేబులో వేసుకుంటాడు. అయితే అతను అమ్మేసిన తర్వాత కొనుగోలుదారుడవుతాడు. ఇప్పుడు మరొక సరుకుల యజమాని అతని దగ్గరకి అమ్మకందారుడుగా వస్తాడు. అమ్మకందారుడుగా అతనికి తన సరుకుల్ని 10% ప్రియంగా అమ్మే సౌకర్యం వుంటుంది. మన మిత్రుడు అమ్మకందారుడుగా సంపాదించిన 10 ఇప్పుడు కొనుగోలు దారుడుగా పోగొట్టుకుంటాడు.[1] వెరసి మొత్తంగా ఫలితం ఏమంటే సరుకుల యజమాను లందరూ ఒకరికొకరు వారి సరుకుల్ని వాటి విలువ కంటే 10 శాతం ఎక్కువకు అమ్ముతారు. వాటిని వారు వాటి నిజమైన విలువలకే అమ్మితే వచ్చే ఫలితమే యిప్పుడూ వస్తుంది. విలువలను ఇంత తూకం గల బంగారం అని చెప్పడానికి బదులు ఇంత బరువు గల వెండి అని వ్యక్తం చేయడంవల్ల వచ్చే ఫలితమే అటువంటి సార్వత్రిక, నామమాత్రపు ధరల పెరుగుదల వల్ల కూడా వస్తుంది. సరుకుల నామమాత్రపు ధరలు పెరుగుతాయి; కాని వాటి విలువల మధ్య వుండే నిజమైన సంబంధాలలో మాత్రం మార్పుండదు.

సరిగ్గా దీనికి వ్యతిరేకంగా ఊహిద్దాం. కొనుగోలుదారునికి సరుకుల విలువల కంటే తక్కువకు కొనే సౌకర్యం వుందనుకుందాం. ఈ సందర్భంలో అతడు తర్వాత అమ్మకందారుడు అవుతాడని

---

1. "ఉత్పాదితానికి నామమాత్రపు విలువ పెరిగినంతనే ... అమ్మకందారులు సంపన్నులైపోరు. అమ్మకందారులుగా వారు పొందినదాన్ని కొనుగోలుదారులుగా వారు పోగొట్టుకుంటారు." ("ది ఎసెన్షియల్ ప్రిన్సిపుల్స్ ఆఫ్ ది వెల్త్ ఆఫ్ నేషన్స్" లండన్, 1797, పుట 66)

భావించనక్కరలేదు. అతడు కొనుగోలుదారుడు కావటానికి ముందే అమ్మకందారుడయ్యాడు. కొనుగోలుదారుడుగా 10% లాభం పొందటానికి ముందే అమ్మకందారుడుగా 10% కోల్పోయాడు.[1] అంతా అంతకు ముందు వుండినట్లే వుంది.

సరుకులు వాటి విలువలకు మించి అమ్మబడ్డాయనో లేదా వాటి విలువ కంటే తక్కువకు కొనబడ్డాయనో ఊహించడం ద్వారా అదనపు విలువ సృష్టినీ, డబ్బు పెట్టుబడిగా మారడాన్నీ వివరించడం సాధ్యం కాదు.[2]

కర్నల్ టోరెన్స్ తరహాలో అసందర్భపు అంశాలను చొప్పించడం వల్ల విషయం ఏ రకంగానూ సరళం కాదు : "ఫలప్రదమైన గిరాకీ అంటే ఉత్పత్తి ఖర్చులకంటే ఎక్కువ ... పెట్టుబడిని సూటి వస్తు మార్పిడి ద్వారాగానీ, ఆ వృత్తంలో జరిగే వస్తు మార్పిడి ద్వారా గానీ సరుకులకు ఇవ్వడానికి వినియోగదారులకు శక్తి, ఇష్టము (!) ఉండడం.[3]

చలామణికి సంబంధించి ఉత్పత్తిదారులూ, వినియోగదారులూ క్రయ విక్రయదారులుగా మాత్రమే కలుసుకుంటారు. సరుకులకు వినియోగదారులు వాటి విలువ కంటే ఎక్కువ చెల్లించడమే ఉత్పత్తిదారుడు అదనపు విలువ సంపాదించడానికి ఆధారం అనడం అంటే మరో రకంగా ఇలా చెప్పడమే అవుతుంది: సరుకుల యజమానికి అమ్మకందారుడుగా ప్రియంగా అమ్మే సౌకర్యం వుంది. అమ్మకందారుడు స్వయంగా సరుకుల్ని ఉత్పత్తి చేశాడు, లేదా వాటి ఉత్పత్తిదారుని ప్రతినిధిగా వ్యవహరిస్తాడు. అయితే కొనుగోలుదారుడు కూడా అంతకు ఏమాత్రం తగ్గకుండా అతని డబ్బుకు మూలమైన సరుకులని ఉత్పత్తి చేశాడు. లేదా వాటి ఉత్పత్తిదారునికి ప్రతినిధిగా వ్యవహరిస్తాడు. వారి మధ్య తేడా ఏమంటే ఒకరు కొంటారు. మరొకరు అమ్ముతారు. సరుకుల యజమాని ఉత్పత్తి దారుడుగా సరుకుల్ని వాటి విలువకు మించి అమ్ముతాడనీ, వినిమయదారుడుగా వ్యవహరించినప్పుడు అతడు ఎక్కువ చెల్లిస్తాడనీ తెలిపే ఈ వాదన వల్ల మనం ఒక్క అడుగు కూడా ముందుకు వెయ్యలేము.[4]

నామమాత్రమైన ధరల పెరుగుదలలోనో లేదా అతి ప్రియంగా అమ్మకానికి విక్రేతకున్న ప్రత్యేక సౌకర్యంవల్లనో అదనపు విలువకు మూలం వుందనే భ్రమను ప్రచారం చేసేవాళ్ళు ఏమీ అమ్మకుండా కొనుగోలు మాత్రమే చేసే ఒక వర్గం, అనగా ఏమీ ఉత్పత్తి చేయకుండా కేవలం వినియోగం మాత్రమే చేసే ఒక వర్గం వున్నట్లు ఊహించాల్సి వుంది. మనం ఇంతవరకూ పరిశీలించిన

---

1. "24 లివర్‌ల విలువైన, ఒక నిర్దిష్ట పరిమాణం గల వస్తువును 18 లివర్‌లకే అమ్మాల్సివస్తే, అతడు తిరిగి కొనేటప్పుడు అదే 18 లివర్‌ల మొత్తంతో తిరిగి 24 లివర్‌లతో కొనగలిగి వుండిన పరిమాణం గల వస్తువునే కొనగలుగుతాడు." (లేట్రోస్నే, పుట 897)
2. ఇతర అమ్మకందారుల సరుకులకు తాను ఎక్కువ చెల్లించడానికి అంగీకరించినప్పుడే సామాన్యంగా ఒక అమ్మకందారుడు తన సరుకుల ధరలను పెంచటంలో సఫలమవుతాడు. అదే విధంగా ఒక వినియోగ దారుడు తను అమ్మే సరుకుల ధరల్లో తగ్గుదలను ఆమోదిస్తేనే సామాన్యంగా తను కొనే సరుకులకు తక్కువ చెల్లించగలుగుతాడు. (మెర్సియర్ డి లా రివియర్, పుట 555)
3. ఆర్. టొరెన్స్ "యాన్ ఎస్సే ఆన్ ది ప్రొడక్షన్ ఆఫ్ వెల్త్" లండన్, 1821, పుట 349.
4. "లాభాలను చెల్లించేది వినియోగదారులే అన్నది ఖాయంగా చాలా అసంబద్ధమైన భావం. ఎవరు వినియోగదారులు?" (జి. రామ్‌సే : "యాన్ ఎస్సే ఆన్ ది డిస్ట్రిబ్యూషన్ ఆఫ్ వెల్త్" ఎడిన్‌బర్గ్, 1836, పుట 183)

సాదా చలామణి దృష్ట్యా అటువంటి వర్గం వుండడం సాధ్యం కాదు. అయితే ఊహిద్దాం. అటువంటి వర్గం నిరంతరాయంగా కొనుగోళ్ళ కోసం వినియోగిస్తున్న డబ్బు అంతే నిరంతరాయంగా వారి జేబుల్లోకి, సరుకు యజమానుల జేబుల్లోనుండే మార్పిడి వ్యవహారం ఏమీ లేకుండానే ఉచితంగా వస్తూ వుండి వుండాలి. అటువంటి వర్గానికి సరుకుల్ని వాటి ధరలకు మించి అమ్మడం అంటే దానికి అంతకు ముందు ఇచ్చిన డబ్బులో నుండి కొంత పిండుకోవడమే.[1] ఆసియా మైనర్‌లోని పట్టణాలు ప్రాచీన రోమ్‌కు ప్రతి ఏడాది కొంత డబ్బును కప్పంగా కట్టేవి. రోమ్ ఆ డబ్బుతో వాటి దగ్గర సరుకులు కొనేది. పైగా బాగా ప్రియంగా కొనేది. ఆ పట్టణాల వాళ్ళు రోమన్లని మోసగించే వాళ్ళు. ఆ రకంగా వాణిజ్య క్రమంలో వారు తమ విజేతలకు తాము కట్టిన కప్పంలో నుండి కొంత వెనక్కి లాక్కునేవారు. అయితే ఇక్కడ నిజంగా మోసపోయింది విజేతలుకాదు, విజితులే. వారి సరుకులకు వారి డబ్బే చెల్లించబడింది. సంపన్నులు కావడానికీ, అదనపు విలువ సంపాదించడానికీ మార్గం అది కాదు.

కనుక కొనుగోలుదారులే అమ్మకందారులుగానూ, అమ్మకందారులే కొనుగోలుదారులుగానూ వుండే మార్పిడి పరిమితుల్లోనే మనం ఉందాం. బహుశా మనుషులను వ్యక్తులుగా పరిగణించడానికి బదులు వస్తువులను మానవ మూర్తులుగా పరిగణించడం వల్ల మనకీ ఇబ్బందులు తలెత్తి వుండవచ్చు.

'చ' వద్ద నుండి లేదా 'ట' వద్ద నుండి ఎక్కువ రాబట్టే తెలివితేటలు 'క'కి వుండవచ్చు. 'చ', 'ట'లు దాన్ని తిప్పికొట్టలేకపోవచ్చు. 'క' 40 పౌండ్ల ద్రాక్షసవాన్ని 'చ'కి అమ్మి అతని దగ్గర 50 పౌండ్ల విలువైన ధాన్యం పొందుతాడు. 'క' తన 40 పౌండ్లను 50 పౌండ్లుగా మార్చాడు. తక్కువ డబ్బులోంచి ఎక్కువ డబ్బు చేసుకున్నాడు. తన సరుకుల్ని పెట్టుబడిగా మార్చుకున్నాడు. దీన్ని మరింత వివరంగా పరిశీలిద్దాం. మార్పిడికి ముందు 'క' చేతిలో 40 పౌండ్ల ద్రాక్షాసవం వుంది, 'చ' చేతిలో 50 పౌండ్ల ధాన్యం వుంది. మొత్తం విలువ 90 పౌండ్లు. మార్పిడి తర్వాత కూడా అదే 90 పౌండ్ల విలువే వుంది. మార్పిడిలో విలువ అణుమాత్రమైనా పెరగలేదు. అది 'క', 'చ'ల మధ్య భిన్నంగా పంచబడింది. అంటే 'చ' కోల్పోయిన మొత్తమే 'క' అదనపు విలువ. ఒకరికి వ్యవకలనమే మరొకరికి సంకలనమైంది. మార్పిడి అనే లాంఛనం లేకుండానే 'చ' దగ్గర 'క' 10 పౌండ్లు దొంగిలించినా ఇదే మార్పు వచ్చి వుండేది. ఒక యూదుడు ఆన్ మహారాణి కాలపు ఫార్తింగ్ అనే చిల్లర నాణాన్ని గినీ అనే బంగారు నాణానికి అమ్మినంత మాత్రంచేత దేశంలో వున్న విలువైన లోహాల పరిమాణంలో ఎటువంటి మార్పు రానట్టే. పంపిణీలో ఎటువంటి మార్పు వచ్చినప్పటికీ చలామణిలో వున్న సరుకుల విలువ ఏమాత్రం వృద్ధిచెందదు. పెట్టుబడిదారీ వర్గం మొత్తంగా తనని తాను మోసపుచ్చుకోలేదు.[2]

---

1. "ఒక మనిషి తన సరుకులకు గిరాకీ లేనప్పుడు వాటిని కొనడం కోసం మరో వ్యక్తికి అవసరమైన మొత్తాన్ని ఇవ్వాలని మాల్తస్ సిఫార్సు చేస్తాడా?" రికార్డో శిష్యుడొకరు కోపంగా మాల్తస్‌ని అడిగిన ప్రశ్న యిది. తన శిష్యుడు పార్సన్ చాల్మర్స్ లాగానే మాల్తస్ కూడా ఈ కేవల కొనుగోలుదార్ల, లేదా వినియోగదార్ల వర్గాన్ని ఆర్థికంగా శ్లాఘిస్తుంటాడు. (చూ. "యాన్ ఎంక్వయిరీ ఇంటు దోస్ ప్రిన్సిపుల్స్ రెస్పెక్టింగ్ ది నేచర్ ఆఫ్ డిమాండ్ అండ్ ది నెసెసిటీ ఆఫ్ కన్జంప్షన్, లేట్లీ అడ్వొకేటెడ్ బై మిస్టర్ మాల్తస్" లండన్, 1821, పుట 55)
2. డిస్టట్ డి ట్రేస్ అదే వర్గానికి చెందినప్పటికీ, బహుశా చెందినందువల్లనేనేమో, సరిగ్గా దీనికి వ్యతిరేక అభిప్రాయం కలిగి వున్నాడు. "పారిశ్రామిక పెట్టుబడిదార్లు ఉత్పత్తి వ్యయం కంటే ఎక్కువకు అమ్మడంవల్ల" లాభాలు సంపాదిస్తారని అతడంటాడు." అయితే వాళ్ళెవరికి అమ్ముతారు? మొదట ఒకరికొకరు అమ్ముకుంటారు. (పైన పేర్కొన్న గ్రంథం, పుట 239)

దీన్ని ఎంతగా, ఎటు తిప్పినా వాస్తవం మారదు. సమ విలువల మధ్య మార్పిడి జరిగితే అదనపు విలువ పుట్టదు. అసమ విలువల మధ్య మార్పిడి జరిగితే అదనపు విలువ పుట్టదు. అసమ విలువల మధ్య మార్పిడి జరిగినా అదనపు విలువ రాదు.[1] సరుకుల చలామణి నుండి, మార్పిడి నుండి విలువ పుట్టదు.[2]

ఆధునిక సమాజపు ఆర్థిక చట్రాన్ని నిర్ధారించే పెట్టుబడి యొక్క ప్రామాణిక రూపాన్ని విశ్లేషించే టప్పుడు దాని అత్యంత ప్రచలిత రూపాలూ, ఒక విధంగా చెప్పాలంటే అనాది కాలపు రూపాలు అయిన వాణిజ్య పెట్టుబడి గురించి వడ్డీ వ్యాపారుల పెట్టుబడి గురించీ నేను ఏమాత్రం ప్రస్తావించకపో డానికి గల కారణమేమిటో యిప్పుడు స్పష్టమైంది.

నిజమైన వాణిజ్య పెట్టుబడిలో డ-స-డ ఆవృత్తాన్ని, ప్రియంగా అమ్మడం కోసం కొనడాన్ని, అత్యంత స్పష్టంగా చూడొచ్చు. అయితే ఈ చలనం పూర్తిగా చలామణి రంగంలోనే జరుగుతుంది. డబ్బు పెట్టుబడిగా మారడానికీ, అదనపు విలువ ఏర్పడటానికి చలామణే కారణం కావడం అసాధ్యం కనుక సమ విలువల మార్పిడి జరిగినంత వరకు వాణిజ్య పెట్టుబడి అసంభవంగా కన్పిస్తుంది.[3] అమ్మే ఉత్పత్తిదారులకూ, కొనే ఉత్పత్తిదారులకూ మధ్య దూరి పరాన్నజీవిలాగా రెండు వైపులా ఇద్దరి నుండీ ప్రయోజనాన్ని పొందుతాడు వ్యాపారి. కనుక అందులోనే వాణిజ్య పెట్టుబడి మూలం వున్నట్లు కనిపిస్తుంది. ఈ అర్థంలోనే ఫ్రాంక్లిన్ యిలా అంటాడు : "యుద్ధం అంటే కొల్లగొట్టడం, వాణిజ్యం అంటే సాధారణంగా మోసం."[4] వ్యాపారుల డబ్బు పెట్టుబడిగా మారడానికి కేవలం ఉత్పత్తిదారులు మోసగించబడటం కాక మరో కారణం వుందని వివరించాలంటే, మధ్యంతర దశల సుదీర్ఘమైన పరంపర అవసరమవుతుంది. కాని ప్రస్తుతం మనం పరిశీలిస్తున్న అంశం కేవలం సరుకుల సాదా చలామణి మాత్రమే. కనుక ఈ దశలు మనకు కన్పించవు.

వాణిజ్య పెట్టుబడి గురించి మనం చెప్పింది వడ్డీ వ్యాపారుల పెట్టుబడికి మరింత బాగా

---

1. రెండు సమాన విలువల మార్పిడి సమాజంలో వున్న విలువల మొత్తాన్ని పెంచలేదు, తగ్గించనూ లేదు. అదేవిధంగా రెండు అసమ విలువల మధ్య మార్పిడి జరిగినా సామాజిక విలువల మొత్తంలో మార్పు రాదు. ఒక మనిషి కోల్పోయిన సంపదను మరో వ్యక్తి పొందుతాడు. అంతే. (జె.బి.సె. రెండో సంపుటి, పుటలు 443, 444) ఈ ప్రకటనవల్ల వచ్చే యిబ్బందుల్ని 'సే' ఏమాత్రం పట్టించుకోలేదు. ఈ మాటల్ని అతడు మక్కీకి మక్కీ ఫిజియోక్రాట్ల దగ్గర నుండి అదుపు తెచ్చు కున్నాడు. ఫిజియోక్రాట్ల రచనలను ఆయన తన "విలువ"ని పెంచుకోడానికి ఎంతగా ఉపయోగించు కున్నాడో ఈ ఉదాహరణ తెలియజేస్తుంది. "ఉత్పాదితాలను ఉత్పాదితాలతోనే కొనవచ్చు." (పుట 441) అనే అతని సుప్రసిద్ధ సూక్తికి మూలం "ఉత్పాదితాలకు ఉత్పాదితాలనే చెల్లించాలి" అన్న ఫిజియోక్రాట్ల సూత్రం. (లేట్రోసె, పుట 899)
2. "మార్పిడి ఉత్పాదితాలకు ఏమాత్రం విలువ కలపదు" (ఎఫ్. వేలాండ్ : "ది ఎలిమెంట్స్ ఆఫ్ పొలిటికల్ ఎకానమీ" బోస్టన్, 1843, పుట 169)
3. తప్పనిసరి సమ విలువల మధ్య వాణిజ్యం అసాధ్యం. (జి. ఆప్డైక్ : "ఏ ట్రైటైజ్ ఆన్ పొలిటికల్ ఎకానమీ" న్యూయార్క్, 1851, పుటలు 66-69) "ఒక వస్తువు విలువ వేరు. వ్యాపారంలో దానికి బదులు యివ్వబడే సమ విలువ అనబడేది వేరు. ఈ సమ విలువ సమ విలువ కాదు. నిజమైన విలువకూ, మార్పిడి విలువకూ మధ్య ఉన్న తేడాకు ఈ వాస్తవమే పునాది." (ఎఫ్. ఏంగెల్స్, పుట 96)
4. బెంజమిన్ ఫ్రాంక్లిన్ : వర్క్స్, రెండో సంపుటి. "స్పార్క్స్ ఇన్ పొజిషన్స్ టు బి ఎగ్జామిన్డ్ కన్సర్నింగ్ నేషనల్ వెల్త్". (పుట 376)

అతుకుతుంది. వ్యాపారుల పెట్టుబడిలో మార్కెటులోకి విసిరిన డబ్బు, మార్కెటు నుండి వెనక్కి తీసుకోబడిన, పెరిగిన డబ్బూ, ఈ రెండూ కనీసం క్రయ విక్రయాలతో కలపబడతాయి. మరో విధంగా చెప్పాలంటే చలామణి చలనం వీటిని కలుపుతుంది. వడ్డీ వ్యాపారుల పెట్టుబడిలో డ–స–డ, రూపం డ–డగా కుదించబడుతుంది. మధ్య దశ లేకుండా రెండు చివర్లు మాత్రమే వుంటాయి. డబ్బు మరింత ఎక్కువ డబ్బుతో మార్పిడి చేయబడుతుంది. డబ్బు స్వభావానికి పొసగని రూపం ఇది. అందువల్ల సరుకుల చలామణి దృష్టి నుండి దీనికి కారణం వివరించడం సాధ్యం కాదు. అందుకే అరిస్టాటిల్ ఇలా అంటాడు : 'ద్రవ్యవృద్ధి శాస్త్రం ఒక ద్వంద్వ శాస్త్రం. ఒక భాగం వాణిజ్యానికి చెందుతుంది. మరో భాగం ఆర్థికానికి చెందుతుంది. రెండోది అవసరమూ, శ్లాఘనీయమూ. మొదటిది చలామణిపై ఆధారపడి వుంటుంది. న్యాయంగానే అది ఆమోదయోగ్యం కానిది. (అది ప్రకృతిపై ఆధారపడకుండా పరస్పరం మోసం చేసుకోవడంపై ఆధారపడింది కనుక.) కనుకనే వడ్డీ వ్యాపారిని అత్యంత న్యాయంగా ద్వేషిస్తారు. డబ్బే అతని లాభానికి మూలం. డబ్బును ఏ ప్రయోజనం కోసం సృష్టించడం జరిగిందో ఆ ప్రయోజనం కోసం దాన్ని అతడు ఉపయోగించడమనేది సరుకుల మార్పిడి కోసం తలెత్తింది. అయితే వడ్డీ డబ్బు నుండి మరింత డబ్బును పుట్టిస్తుంది. అందుకే దానికా పేరు. గ్రీకు భాషలో వడ్డీ అనే మాటకు సంతానం అనే అర్థం కూడా వుంది. పుట్టినవారు పుట్టించిన వారిలాగే వుంటారు. అయితే వడ్డీ అనేది డబ్బుకే డబ్బు. కనుక పొట్ట పోషించుకునే పద్ధతులన్నిటిలోనూ యిది అత్యంత ప్రకృతి విరుద్ధం."[1]

వ్యాపారుల పెట్టుబడీ, వడ్డీని సృష్టించే పెట్టుబడీ రెండు జన్య (derivative) రూపాలు మాత్రమే అనేది మన పరిశోధనా క్రమంలో తెలుస్తుంది. అదే సమయంలో చరిత్ర క్రమంలో ఈ రెండు రూపాలూ పెట్టుబడి యొక్క ఆధునిక ప్రామాణిక రూపం కంటే ముందే ఎందుకు తలెత్తాయో కూడా స్పష్టమవుతుంది.

చలామణి అదనపు విలువను సృష్టించలేదని మనం రుజువు చేశాము. అయితే అది తలెత్తాలీ అంటే చలామణిలో కన్పించనిదేదో దాని పూర్వరంగంలో జరగాల్సి వుంది.[2] అయితే అదనపు విలువ చలామణిలో కాక వేరే ఇంకెక్కడైనా ఉత్పన్నం కాగలదా? చలామణి అనేది సరుకులు నిర్ణయించిన మేరకు సరుకు యజమానుల పరస్పర సంబంధాల మొత్తం కదా! చలామణిలో కాక సరుకు యజమానికి తన సొంత సరుకుతో మాత్రమే సంబంధం వుంటుంది. విలువకి సంబంధించిన మేరకు అతనికి సొంత సరుకుతో గల సంబంధానికి ఒక పరిమితి వుంది. అదేమిటంటే : ఆ సరుకులో నిర్దిష్ట పరిమాణం గల అతని సొంత శ్రమ వుంటుంది. ఆ పరిమాణం నిర్దిష్ట సామాజిక ప్రమాణంచేత కొలవబడుతుంది. ఆ పరిమాణాన్ని సరుకు విలువ వ్యక్తం చేస్తుంది. విలువని ఖాతా డబ్బుతో లెక్కించడం జరుగుతుంది కనుక ఈ పరిమాణాన్ని కూడా ధర వ్యక్తం చేస్తుంది. అది 10 పౌండ్లను కుందాం. అయితే అతని శ్రమకి ఆ సరుకు విలువా, దానికంటే ఎక్కువైన విలువా రెండూ ప్రాతినిధ్యం వహించవు. 11 అనే ధర కూడా అయిన 10 అనే ధర ప్రాతినిధ్యం వహించదు, తనకంటేనే

1. అరిస్టాటిల్, అధ్యాయం 10.
2. "మామూలు మార్కెట్ పరిస్థితుల్లో లాభం అనేది మార్పిడి ద్వారా ఉత్పన్నం కాదు. అది దానికి ముందే లేకుంటే ఆ లావాదేవీ తర్వాత కూడా ఉండజాలదు." (రామ్ సే, పుట 184)

ఎక్కువదైన విలువ ప్రాతినిధ్యం వహించదు. సరుకు యజమాని తన శ్రమతో విలువను సృష్టించగలడు. కానీ స్వయం ప్రవర్ధమానమైన విలువను మాత్రం కాదు. కొత్త శ్రమని జోడించడం ద్వారా అతను తను సరుకు విలువను పెంచగలడు. కనుక చేతిలో వున్న విలువకు మరింత విలువ చేకూర్చగలడు. ఉదాహరణకు, తోలును బూట్లుగా మార్చడం ద్వారా, అదే పదార్థానికి ఇప్పుడు ఎక్కువ విలువ వుంది. ఎందుకంటే దానిలో ఇప్పుడు ఎక్కువ పరిమాణం గల శ్రమ వుంది. కనుక బూట్లకి తోలుకంటే ఎక్కువ విలువుంది. అయితే తోలు విలువ యథాతథంగానే వుంటుంది. అది స్వయంగా విస్తరించలేదు. బూట్లు తయారుచేస్తున్నప్పుడు అది అదనపు విలువని కలుపుకోలేదు. కనుక ఒక సరుకుల ఉత్పాదకుడు యితర సరుకు యజమానులతో సంబంధం ఏర్పరచుకోకుండా చలామణి రంగానికి ఆవల విలువను పెంచడమూ, డబ్బునిగానీ, సుకుల్నిగానీ పెట్టుబడిగా మార్చడమూ అసాధ్యం.

కనుక చలామణి వల్ల పెట్టుబడి ఉత్పన్నం కావడమనేది అసాధ్యం. చలామణితో ప్రమేయం లేకుండా ఉత్పన్నం కావడం అంతే అసాధ్యం. దాని పుట్టుక చలామణిలోనూ వుండాలి, చలామణిలో లేకుండానూ వుండాలి.

మనకి ఇలా ద్వంద్వ ఫలితం వచ్చింది.

సరుకుల మార్పిడిని పాలించే నియమాల ప్రాతిపదికపై, సమ విలువ మార్పిడి ప్రారంభ స్థానంగా వుండేటట్లు డబ్బు పెట్టుబడిగా మారటాన్ని వివరించాల్సి వుంది.[1] మన మిత్రుడు డబ్బు సంచిగారు ఇంకా పిండదశలోనే వున్న పెట్టుబడిదారుడు. అతడు సరుకుల్ని వాటి విలువకే కొని వాటి విలువకే అమ్మాలి. అయినా అతడు మొట్టమొదట చలామణిలో వుంచిన దానికంటే ఈ ప్రక్రియ చివరిలో ఎక్కువ విలువను వెనక్కి తీసుకోవాలి. పూర్తిగా పెరిగిన పెట్టుబడిదారుడుగా అతడు అభివృద్ధి చెందాలి. అయితే ఆ అభివృద్ధి చలామణి రంగంలోపలా జరగాలి. చలామణి రంగం బయటా జరగాలి. ఇవీ ఈ సమస్య కున్న పరిస్థితులు.

---

1. ఒక సరుకు విలువ, ధర ఒకటే అయినప్పటికీ పెట్టుబడి సృష్టి సాధ్యం కావాలి అన్నదే ఈ ప్రకటన ఉద్దేశ మని ఇంతకు ముందు జరిగిన పరిశీలన ద్వారా పాఠకుడు తెలుసుకుంటాడు. ఎందుకంటే ఆ రెండిటి మధ్య వుండే ఎలాంటి తేడా వల్లనైనా పెట్టుబడి పుట్టినట్లు చెప్పలేము. ఆచరణలో ధరలు విలువకు భిన్నంగా వుంటే, మొట్టమొదట మనం ధరల్ని విలువలతో సమంగా కుదించాలి. అంటే వాటి మధ్య వున్న తేడాను యాదృచ్ఛికమని పరిగణించాలి. వివిధ ఘటనలను వాటి స్వచ్ఛ మైన రూపంలో పరిశీలించ డానికి, ఇప్పుడు చర్చించబడుతున్న అంశానికి ఏమాత్రం సంబంధం లేని పరిస్థితులు మన పరిశోధనకు అంతరాయం కల్గించకుండా వుండటానికి ఇది అవసరం. అంతేగాక ఇది కేవలం ఒక శాస్త్రీయ పద్ధతి మాత్రమే కాదు. ధరల్లో నిరంతరం కలిగే ఆటుపోట్లూ, హెచ్చుతగ్గులూ ఒకదాన్నొకటి రద్దుచేసుకొని, ఒక సగటు ధరగా రూపొందుతాయి. ఈ సగటు ధర అనేది గుప్తంగా వాటిని క్రమబద్ధం చేస్తుంది. వ్యవధి కావలసిన ప్రతి చర్యలోనూ వ్యాపారికీ, ఉత్పాదకునికీ అది ధ్రువతారగా దారి చూపుతుంది. సుదీర్ఘ కాలాన్ని పరిగణనలోకి తీసుకుంటే సరుకులు ఎక్కువ ధరకీ అమ్మబడవు, తక్కువ ధరకీ అమ్మబడవు. వాటి సగటు ధరకే అమ్మబడతాయని అతనికి తెలుసు. అసలు ఈ సమస్య గురించి అతడు ఆలోచించే వుంటే, పెట్టుబడి ఏర్పడడం గురించి అతని ప్రశ్న ఇలా వుంటుంది : ''సగటు ధరే, అంటే అంతిమంగా సరుకుల విలువే ధరల్ని క్రమబద్ధం చేస్తుందని భావిస్తే పెట్టుబడి పుట్టుకకు కారణం మనం ఎలా వివరించగలం?'' ఆడమ్ స్మిత్, రికార్డో తదితరులు భావించినట్టుగా సగటు ధరలనేవి సూటిగా సరుకుల విలువతో ఏకీభవించవు. అందుకే నేను ''అంతిమంగా'' అనే మాట వాడాను.

## అధ్యాయం - 6

# శ్రమశక్తి క్రయ విక్రయాలు

పెట్టుబడిగా మారాల్సిన డబ్బు విషయంలో వచ్చే విలువ మార్పు స్వయంగా డబ్బులోనే తలెత్తదు. కొనుగోలు సాధనంగా లేదా చెల్లింపు సాధనంగా తాను కొనే సరుకు ధరను చెల్లించడం మాత్రమే దాని విధి. నగదుగా చూస్తే అది శిలాకృతి ధరించిన ఎన్నడూ మారని విలువ.[1] చలామణి యొక్క రెండో చర్య, అంటే సరుకు పునర్విక్రయం సరుకును వస్తురూపం నుండి దాని డబ్బు రూపంలోకి మార్చడం తప్ప ఏమీ చెయ్యదు కనుక, దానిలో కూడా విలువ మార్పు పుట్టదు. కనుక ఈ మార్పు, మొదటి చర్య అయిన డ-స ద్వారా కొనబడిన సరుకులోనే వచ్చి వుండాలి. అయితే దాని విలువలో మాత్రం కాదు. ఎందుకంటే, మార్పిడి జరిగింది సమ విలువల మధ్య, సరుకుకు దాని పూర్తి విలువ చెల్లించబడింది. కనుక ఈ మార్పు సరుకు ఉపయోగపు విలువలోనే, అంటే దాని అనుభోగంలోనే వచ్చిందనే నిర్ధారణకి మనం చేరుకోక తప్పదు. ఒక సరుకు అనుభోగం నుండి విలువను రాబట్టటానికి వీలుగా మన మిత్రుడైన డబ్బు సంచిగారికి చలామణి రంగంలోనే, మార్కెట్‌లోనే, విలువకు మూలంగా వుండే ప్రత్యేక స్వభావం గల ఉపయోగపు విలువ ఉన్న సరుకు దొరికే అదృష్టం వుండాలి. ఆ సరుకు వాస్తవ అనుభోగం అనేదే స్వయంగా శ్రమకు సాకార రూపం. కనుక విలువ సృష్టి. డబ్బు గలవాడు మార్కెట్‌లో శ్రమ చేయగల సామర్థ్యం లేదా శ్రమశక్తి అనే ప్రత్యేక సరుకుని కనుగొంటాడు.

శ్రమశక్తి లేదా శ్రమ చేయడానికి సామర్థ్యం వుంటే మనిషిలో ఉండే మొత్తం బౌద్ధిక, శారీరక శక్తి సామర్థ్యాలనీ, అతడు ఏదో ఒక రకమైన ఉపయోగపు విలువను ఉత్పత్తి చేసినప్పుడల్లా వినియోగించే శక్తి సామర్థ్యాలనీ అర్థం చేసుకోవాలి.

అయితే మన డబ్బు యజమానికి శ్రమశక్తి అమ్మకానికి సిద్ధంగా వున్న సరుకుగా తారసపడాలీ అంటే మొదట వివిధ షరతులు పరిపూర్తి కావాలి. సరుకుల మార్పిడి అంటేనే దాని సొంత స్వభావం నుండి ఉత్పన్నమయ్యే పరిస్థితుల మీద తప్ప ఏ ఇతర పరిస్థితుల మీద అది ఆధారపడదని అర్థం. ఈ అర్థం ప్రకారం శ్రమశక్తి యజమాని, శ్రమశక్తి కలిగిన వ్యక్తి దానిని అమ్మకానికి పెట్టే మేరకు మాత్రమే, సరుకుగా దాన్ని అమ్మే మేరకు మాత్రమే మార్కెట్‌లో శ్రమశక్తి ఒక సరుకుగా ప్రత్యక్షమవుతుంది. అతడీ పని చేయగలగాలి అంటే, అది అతని స్వాధీనంలో వుండాలి. తన శ్రమశక్తికి

1. "డబ్బు రూపంలో ... పెట్టుబడి లాభాన్ని ఉత్పన్నం చేయలేదు." రికార్డో : "ప్రిన్సిపుల్ ఆఫ్ పొలిటికల్ ఎకానమీ" పుట 267)

అతడు తిరుగులేని యజమాని అయి వుండాలి. అంటే తనపై తనకు పూర్తి అధికారం వుండాలి.[1] అతడూ, డబ్బు యజమానీ మార్కెట్‌లో కలుసుకొని, సమాన హక్కుల ప్రాతిపదికపై ఒకరిలో ఒకరు వ్యవహరిస్తారు. ఒకడు కొనుగోలు దారుడు, మరొకరు అమ్మకందారుడు. వారి మధ్య వున్న తేడా ఇదొక్కటే. కనుక చట్టం దృష్టిలో ఇద్దరూ సమానమే. ఈ సంబంధం కొనసాగాలంటే, శ్రమశక్తి యజమాని దాన్ని ఒక నిర్దిష్ట కాలానికి మాత్రమే అమ్మాలి. దాన్ని ఒక్కసారే మొత్తంగా అమ్మేస్తే అతడు తనని తాను అమ్ముకున్నట్టే. స్వేచ్ఛాపరుడు బానిసగా మారడమే. సరుకు యజమాని సరుకుగా మారడమే. తన శ్రమశక్తిని అతడు ఎప్పుడూ తన సొంత ఆస్తిగా, తన సొంత సరుకుగా భావించాలి. దానిని అతడు కొనుగోలుదారుడి స్వాధీనంలో ఒక నిర్దిష్ట కాలం పాటు తాత్కాలికంగా మాత్రమే వుంచటం ద్వారా అది సాధ్యమవుతుంది. ఈ రకంగా మాత్రమే అతడు దానిపై తనకున్న యాజమాన్యపు హక్కులను వదులుకోకుండా వుండగలుగుతాడు.[2]

డబ్బు యజమానికి మార్కెట్‌లో శ్రమశక్తి ఒక సరుకు రూపంలో దొరకాలి అంటే రెండో షరతు ఇదీ – కార్మికుడు తన శ్రమకు సాకార రూపాలైన సరుకుల్ని అమ్మే స్థితిలో వుండటానికి బదులు తనలోనే వుండే తన సొంత శ్రమశక్తినే అమ్ముకోవాల్సిన పరిస్థితిలో వుండాలి.

ఒక వ్యక్తి శ్రమశక్తిని గాక సరుకుల్ని అమ్మగలగాలీ అంటే అతనికి ముడి పదార్థాలూ, పరికరాలూ వగైరా ఉత్పత్తి సాధనాలుండాలి. తోలు లేకుండా బూట్లు తయారుకావు. అతనికి జీవితాధార వస్తువులు కూడా వుండాలి. "పగటి కలలు కనేవాని"తో సహా ఏ ఒక్కరూ భవిష్యత్ వస్తువులపై అంటే ఇంకా తయారుకాని ఉపయోగపు విలువలపై ఆధారపడి బతకలేడు. మనిషి ఈ ప్రపంచ రంగంపై అడుగు పెట్టిన క్షణం నుండీ అతను ఉత్పత్తి చేయడానికి ముందూ, ఉత్పత్తి చేస్తున్నప్పుడు కూడా అనుభోక్తగా ఎప్పుడూ వుండినాడు, ఇప్పుడూ వుండాలి. ఉత్పాదితాలన్నీ సరుకుల రూపం ధరించే సమాజంలో,

---

1. ప్రాచీన ప్రపంచంలో "స్వేచ్ఛాయుత కార్మికుడు, ఖాతా వ్యవస్థ లేవు" గానీ, పెట్టుబడి మాత్రం సంపూర్ణంగా అభివృద్ధి చెందింది అని భావించే చెత్త ప్రాచీన విషయాల విజ్ఞాన సర్వస్వాల్లో బాగా కన్పిస్తుంది. తన "హిస్టరీ ఆఫ్ రోమ్"లో మోమ్‌సెన్ కూడా ఈ విషయంలో ఒకటి తర్వాత ఒకటిగా తప్పులు చేశారు.
2. అందుకే వివిధ దేశాలు శాసనాల ద్వారా కార్మిక ఒప్పందాలకు గరిష్ట పరిమితిని నిర్ణయిస్తాయి. స్వేచ్ఛాయుత శ్రమ ఉన్నచోటల్లా ఈ ఒప్పందాన్ని రద్దు చేసుకునే పద్ధతుల్ని చట్టాలు నిర్ణయిస్తాయి. కొన్ని రాజ్యాల్లో, ముఖ్యంగా మెక్సికోలో (అమెరికా అంతర్యుద్ధానికి ముందు, మెక్సికో నుండి లాక్కున్న భూభాగాల్లో కూడా, నిజానికి, కూసా నిర్వహించిన విప్లవం దాకా డాన్యూబ్ రాష్ట్రాల్లో కూడా) బానిసత్వం కట్టుబానిసత్వం (Peonage) రూపంలో దాగి వుంది. శ్రమతో చెల్లు పెట్టే షరతు పైన అడ్వాన్సులు ఇవ్వబడతాయి. ఒక తరం నుండి మరో తరానికి ఈ అప్పులు సంక్రమిస్తాయి. కేవలం ఒక కార్మికుడే గాక ఆచరణలో అతని మొత్తం కుటుంబం ఇతర వ్యక్తుల, వారి కుటుంబాల ఆస్తిగా మారుతుంది. జారెజ్ ఈ కట్టుబానిసత్వాన్ని రద్దుచేశాడు. మాక్సి మిలియన్ చక్రవర్తి అనబడే వాడు దాన్ని ప్రత్యేక శాసనం ద్వారా పునరుద్ధరించాడు. వాషింగ్టన్ ప్రతినిధుల సభలో దాన్ని మెక్సికోలో బానిసత్వాన్ని మళ్ళీ ప్రవేశపెట్టడానికి ఉద్దేశించిన శాసనంగా ఖండించడం జరిగింది. "నా శారీరక, బౌద్ధిక శక్తి స్తోమతులను ఉపయోగించడానికి మరొకరికి ఒక పరిమిత కాలం పాటు ఇవ్వవచ్చు. ఈ పరిమితి వల్ల నా నుండి విడిపోయి అవి పరాధీనం అవుతాయి. అయితే నేను నా శ్రమ కాలాన్నంతటినీ పరాధీనం చేస్తే నా జీవిత సారమంతా, మరోలా చెప్పాలంటే నా కార్యకలాపాలూ, నా వ్యక్తిత్వమూ మరొకరి సొత్తుగా మారిపోతాయి." హేగెల్, "Philosophie des Rechts" బెర్లిన్, 1840, పుట 104, పేరా 67).

ఉత్పత్తి అయ్యాకే ఈ సరుకుల్ని అమ్మాలి. వాటి అమ్మకం తర్వాతనే అవి తమ ఉత్పాదకుని అవసరాలు తీర్చగలుగుతాయి. వాటిని ఉత్పత్తి చేయడానికి అవసరమైన కాలానికి, వాటి అమ్మకానికి అవసరమైన కాలాన్ని జోడించాలి.

తన డబ్బు పెట్టుబడిగా మారాలి అంటే డబ్బు యజమాని మార్కెట్‌లో స్వేచ్ఛ గల కార్మికుణ్ణి కలుసుకోవాలి. ఇది రెండు అర్థాల్లో స్వేచ్ఛ. తన శ్రమశక్తిని తన సొంత సరుకుల్లా అమ్ముకోడానికి అతనికి ఏ నిర్బంధాలు లేని స్వేచ్ఛ వుంది. ఆ విషయంలో అతను సకల నిర్బంధాల నుండి విముక్తుడు. ఇది ఒక అర్థం. రెండవ అర్థం ఏమిటంటే, అతను అమ్ముకోడానికి మరో సరుకేదీ లేదు. తన శ్రమశక్తిని వినియోగించుకోడానికి అవసరమైన వస్తువులలో ఏదీ అతని దగ్గర లేదు. అనగా తన శ్రమశక్తిని అమ్ముకోకుండా అతన్ని ఆటంకపరచే దేదీలేదు. ఈ విషయంలో అతను సకల ఆటంకాల నుండి విముక్తుడు. అతని స్వేచ్ఛకు ఇది రెండవ అర్థం.

ఈ స్వతంత్ర కార్మికుడు తనకు మార్కెట్‌లో ఎందుకు తారసపడతాడు అన్న విషయంపై డబ్బు యజమానికి ఆసక్తి లేదు. అతని దృష్టిలో శ్రామిక మార్కెట్ సాధారణ సరుకుల మార్కెట్‌లో ఒక విభాగం మాత్రమే. ప్రస్తుతానికి ఆ విషయంపై మనకి ఆసక్తి లేదు. ఈ వాస్తవానికి అతడు ఆచరణలో ఎలా అంటుకుని వున్నాడో మనం సైద్ధాంతికంగా అలా వుంటాం. అంతే. అయితే ఒక విషయం మాత్రం స్పష్టం – ఒకవైపున డబ్బు లేదా సరుకుల యజమానుల్నీ, మరోవైపున తమ సొంత శ్రమశక్తి తప్ప మరేమీలేని మనుషుల్నీ ప్రకృతి సృష్టించదు. ఈ సంబంధానికి ప్రాకృతిక పునాది లేదు. దీనికున్న సామాజిక పునాది సైతం అన్ని చారిత్రక దశలకూ వర్తించే అంశం కాదు. ఇది స్పష్టంగా గత చారిత్రకాభివృద్ధి ఫలితం. అనేక ఆర్థిక విప్లవాల ఉత్పాదితం సామాజిక ఉత్పత్తి యొక్క పాత రూపాల పరంపర రూపు మాసిపోగా ఏర్పడిన ఫలితం ఇది.

మనం ఇంతకు ముందే చర్చించిన ఆర్థిక అభివర్గాల (కేటగిరీస్)పై కూడా చరిత్ర ముద్ర వుంటుంది. ఒక ఉత్పాదితం సరుకుగా మారాలంటే నిర్దిష్ట చారిత్రక పరిస్థితులుండాలి. అది ఉత్పాదకుని తక్షణ జీవితావసరాలను తీర్చడానికి ఉత్పత్తి కారాదు. ఉత్పాదితాలన్నీ లేదా వాటిలో అత్యధిక భాగం ఏ పరిస్థితుల్లో సరుకుల రూపం తీసుకుంటాయి అన్న విషయాన్ని మనం ఇంకా ముందుకు పోయి దర్యాప్తు చేసి వుంటే ఒక ప్రత్యేక తరహా ఉత్పత్తిలో మాత్రమే పెట్టుబడిదారీ ఉత్పత్తిలో మాత్రమే అలా జరుగుతుందని మనం గ్రహించగలిగేవాళ్ళం. అయితే అటువంటి దర్యాప్తు సరుకుల విశ్లేషణకు సంబంధం లేనిదిగా వుండి వుండేది. ఉత్పత్తి అయిన వస్తువుల్లో అత్యధికం ఉత్పత్తిదారుల తక్షణ అవసరాలను తీర్చడానికే ఉద్దేశించబడినప్పటికీ, అవి సరుకులుగా మారనప్పటికీ, సామాజిక ఉత్పత్తిలో యింకా సంపూర్ణంగా మార్పిడి విలువ ప్రాబల్యం లేనప్పటికీ, సరుకుల ఉత్పత్తి చలామణి అనేవి సాధ్యమే. ఉత్పాదితాలు సరుకులుగా కనిపించాలంటే సామాజిక శ్రమ విభజన ఒక మేరకు అభివృద్ధిచెంది వుండాలి. ఏ దశకు అంటే, ఉపయోగపు విలువ, మార్పిడి విలువ అనేవి ఒకదాని నుండి ఒకటి విడిపోయే చర్య – వస్తు మార్పిడితో ప్రారంభమైనట్టి చర్య – అప్పటికి పూర్తిగా జరిగి వుండాలి. అయితే ఆ మాత్రపు అభివృద్ధి అనేక సామాజిక రూపాలకు ఉమ్మడిగా వుంటుంది. మిగిలిన అంశాల్లో ఆయా రూపాలకు అత్యంత వైవిధ్యపూరితమైన చారిత్రక

లక్షణాలుంటాయి. మరోవైపున మనం డబ్బును పరిశీలిస్తే, దాని ఉనికి సరుకుల మార్పిడిలో ఒక నిర్దిష్ట దశను సూచిస్తుంది. కేవలం సరుకుల సమ విలువగా, లేదా చలామణి సాధనంగా, లేదా చెల్లింపు సాధనంగా, నిల్వగా, సార్వత్రిక ద్రవ్యంగా డబ్బు నిర్వహించే ఆయా విధుల విస్తృతి, సాపేక్ష ప్రాబల్యమూ సామాజిక ఉత్పత్తి క్రమంలో అత్యంత విభిన్న దశల్ని సూచిస్తాయి. సరుకుల చలామణి సాపేక్షంగా ఆదిమ స్థాయిలో ఉన్నప్పటికీ ఈ రూపాలన్నీ పుట్టడం సాధ్యమేనని అనుభవం ద్వారా మనకు తెలుసు. పెట్టుబడి విషయంలో అలా కాదు. కేవలం డబ్బు, సరుకులు చలామణిలో ఉన్నంత మాత్రంచేత దాని ఉనికికి అవసరమైన చారిత్రక పరిస్థితులున్నట్టు కాదు. ఉత్పత్తి సాధనాల, జీవనాధారాల యజమాని మార్కెట్లో తన శ్రమశక్తిని అమ్ముకునే స్వతంత్ర కార్మికుణ్ణి కలుసుకున్నప్పుడే దానికి ప్రాణం వస్తుంది. ఈ ఒక్క చారిత్రక పరిస్థితిలో ప్రపంచ చరిత్ర వుంది. కనుక పెట్టుబడి తన మొదటి దర్శనంతోనే సామాజిక ఉత్పత్తి ప్రక్రియలో నూతన యుగాన్ని ప్రకటిస్తుంది.[1]

ఇప్పుడు మనం శ్రమశక్తి అనే ఈ విలక్షణమైన సరుకుని మరింత పరిశీలించాల్సి వుంది. మిగతా అన్నిటి లాగానే దానికీ విలువుంది.[2] ఆ విలువ ఎలా నిర్ధారితమవుతుంది?

మిగిలిన సరుకులన్నిటి విషయంలోలాగే శ్రమశక్తి విలువను కూడా ఈ ప్రత్యేక వస్తువు ఉత్పత్తికీ, పునరుత్పత్తికీ అవసరమయ్యే శ్రమ కాలమే నిర్ణయిస్తుంది. దానికి విలువ వున్న మేరకు దానిలో రూపుదాల్చి వున్న నిర్దిష్ట పరిమాణపు సగటు సామాజిక శ్రమకు అది ప్రాతినిధ్యం వహిస్తుంది. శ్రమశక్తి సజీవ మానవుని శక్తిగా, లేదా సామర్థ్యంగా అస్తిత్వం కలిగి వుంటుంది. కనుక దాని ఉత్పత్తికి అతని ఉనికి అవసరం. నిర్దిష్ట మానవుడు తనని తాను పునరుత్పత్తి చేసుకోవడంలోనే, లేదా తనని తాను పోషించుకోవడంలోనే శ్రమశక్తి ఉత్పత్తి వుంది. అతని పోషణకు నిర్దిష్ట పరిమాణం గల జీవనాధారాలు అవసరం. కనుక, శ్రమశక్తి ఉత్పత్తికి అవసరమైన శ్రమ కాలం ఆ జీవనాధారాల ఉత్పత్తికి అవసరమైన శ్రమ కాలంగా వ్యక్తమవుతుంది. మరోలా చెప్పాలంటే కార్మికుని పోషణార్థం అవసరమైన జీవనాధారాల విలువే శ్రమశక్తి విలువ. అయితే, శ్రమశక్తిని ఉపయోగిస్తేనే అది వాస్తవంగా మారుతుంది. అది పని చేయడం ద్వారానే ఆచరణలోకి వస్తుంది. అయితే దానివల్ల ఒక నిర్దిష్ట పరిమాణం గల మానవ కండరాలు, నరాలు, మేధ వగైరాలు ఖర్చవుతాయి. వాటిని పునరుద్ధరించడం అవసరం. పెరిగిన ఈ ఖర్చు మరింత ఎక్కువ ఆదాయాన్ని కోరుతుంది.[3] శ్రమశక్తి యజమాని ఈ రోజు పనిచేస్తే అదే కార్యక్రమాన్ని అంతే ఆరోగ్యమూ, బలమూ గల స్థితిలో రేపు కూడా చేయగలగాలి.

---

1. కార్మికుని దృష్టిలో శ్రమశక్తి అతని ఆస్తి అయినట్టి సరుకు రూపం ధరిస్తుంది. తత్ఫలితంగా అతని శ్రమ వేతన శ్రమ అవుతుంది. మరోవైపున ఈ క్షణం నుండే శ్రమ ఉత్పాదితం సార్వత్రికంగా సరుకు అవుతుంది. ఇది పెట్టుబడిదారీ యుగపు స్వభావం.
2. మిగిలిన వస్తువులన్నిటిలాగానే ఒక మనిషి విలువ లేదా అర్హత అతని ధరే. అంటే అతని శక్తిని ఉపయోగించుకొన్నందుకు చెల్లించే మొత్తం. (థామస్ హాబ్స్ : "లెవియతన్" ఇన్ వర్క్స్, ఎడిటెడ్‌బై మోల్స్ వర్త్, లండన్, 1839-44, పుట 76)
3. కనుకనే, వ్యవసాయ బానిసలను అజమాయిషీ చేసే రోమన్ విల్లికస్ పని బానిసల పని కంటే తేలిక కనుక "వారికంటే అతనికి తక్కువ ప్రతిఫలం ముట్టింది." (Th. Mommsen, Rom, Geschichte, 1856, పుట 810)

కనుక అతని జీవనాధారాలు అతన్ని ఒక శ్రామిక వ్యక్తిగా మామూలు పరిస్థితిలో నిలిపి వుంచడానికి సరిపడా వుండాలి. అతని తిండి, గుడ్డ, ఇల్లు, ఇంధనం వగైరా సహజ వాంఛలు అతని దేశ వాతావరణ, భౌతిక పరిస్థితులను బట్టి మారుతుంటాయి. మరోవైపున, అతని తప్పనిసరి అవసరాలనబడే వాటి సంఖ్యా, స్థాయీ వాటిని తీర్చుకునే పద్ధతీ చారిత్రకాభివృద్ధిని బట్టి వుంటాయి. కనుక చాలా వరకు అవి ఒక దేశ నాగరికత స్థాయినిబట్టి వుంటాయి. ముఖ్యంగా స్వతంత్ర శ్రామికుల వర్గం ఏర్పడిన పరిస్థితులనుబట్టి, తత్ఫలితంగా అది అలవర్చుకున్న అలవాట్లనూ, సుఖాల స్థాయినీ బట్టి వుంటాయి.[1] కనుక ఇతర సరుకుల విషయానికి భిన్నంగా శ్రమశక్తి విలువను నిర్ధారించడంలో ఒక చారిత్రక, నైతిక అంశం రంగంలో కొస్తుంది. అయినప్పటికీ, ఒక నిర్దిష్ట దేశంలో నిర్దిష్ట కాలంలో కార్మికునికి అవసరమైన జీవనాధారాల సగటు పరిమాణం దాదాపు స్పష్టంగా తెలుస్తుంది.

శ్రమశక్తి యజమాని అమరుడు కాడు. మార్కెట్‌లో అతని ఉనికి నిరంతరాయం కావాలంటే, నిరంతరాయంగా డబ్బు పెట్టుబడిగా మారటానికి అది అవసరమైతే శ్రమశక్తి విక్రేత తనని తాను శాశ్వతం చేసుకోవాలి. "ప్రతి వ్యక్తి తనను తాను శాశ్వతం చేసుకొనే పద్ధతిలో, అంటే సంతానోత్పత్తి ద్వారా"[2] వృద్ధాప్యం వల్ల, మరణం వల్ల మార్కెట్ నుండి తప్పుకొన్న శ్రమశక్తికి బదులు నిరంతరాయంగా కనీసం సమాన పరిమాణం గల తాజా శ్రమశక్తి మార్కెట్‌లో ప్రవేశించాలి. కనుక శ్రమశక్తి ఉత్పత్తికి అవసరమైన జీవనాధారాల మొత్తానికి కార్మికుని ప్రత్యామ్నాయాలకు, అంటే అతని సంతానానికి అవసరమైన జీవనాధారాలను కూడా కలుపుకోవాలి. ఈ విలక్షణమైన సరుకు యజమానుల జాతి శాశ్వతంగా మార్కెట్‌లో దర్శనమిస్తూ వుండటానికి ఇది అవసరం.[3]

ఒక నిర్దిష్ట పారిశ్రామిక విభాగంలో నేర్పూ, చాకచక్యమూ పెట్టుబడి ఒక ప్రత్యేక తరహా శ్రమశక్తిని సంతరించుకొనేలా మానవ శరీరాన్ని తీర్చిదిద్దడానికి గాను ప్రత్యేక శిక్షణ అవసరం. దీనికి మళ్ళీ సరుకు రూపంలో కొంత ఖర్చవుతుంది. శ్రమశక్తి సంక్లిష్టతలోని ఎక్కువ తక్కువల్ని బట్టి ఈ ఖర్చు వుంటుంది. ఈ శిక్షణకు అయ్యే ఖర్చులు (సాధారణ శ్రమశక్తి విషయంలో ఇవి చాలా తక్కువ) శ్రమశక్తి ఉత్పత్తికి ఖర్చయిన మొత్తం విలువలో భాగం అవుతాయి.

శ్రమశక్తి విలువ జీవనాధారాల నిర్దిష్ట పరిమాణంగా మారుతుంది. కనుక, ఆ ఆధారాలతోపాటు, లేదా వాటి ఉత్పత్తికి అవసరమైన శ్రమ పరిమాణంతోపాటు అది కూడా మారుతుంటుంది.

ఆహారం, ఇంధనం లాంటి కొన్ని జీవనాధారాలు రోజూ ఖర్చవుతాయి. రోజూ వాటి కొత్త సరఫరా వుండాలి. బట్టలూ, ఫర్నిచరూ లాంటివి ఎక్కువ కాలం వుంటాయి గనుక వాటిని మళ్ళీ కొనటానికి కాలవ్యవధి కూడా ఎక్కువగా వుంటుంది. ఒక వస్తువును రోజూ కొనాలి, మరొక దానిని వారానికి ఒకసారి, మరోదాన్ని మూడు నెలలకోసారి కొనాలి. ఇలాగే మిగిలిన వాటి విషయంలో

1. థారన్‌టన్, ''ఓవర్ పాపులేషన్ అండ్ ఇట్స్ రెమిడీ'' (లండన్, 1846)తో పోల్చండి.
2. పెట్టీ
3. ''వాతావరణాన్నిబట్టీ, దేశ అలవాట్లనుబట్టీ కార్మికుడి పోషణకూ, మార్కెట్‌లో శ్రమ సరఫరా తగ్గకుండా వుండేలా అతని కుటుంబ పోషణకూ అవసరమైన జీవనాధారాల సుఖదాయకాల పరిమాణమే దాని (శ్రమ) సహజ ధర...'' (ఆర్. టోరెన్స్ : ''యాన్ ఎస్సే ఆన్ ది ఎక్స్‌టర్నల్ కార్న్ ట్రేడ్'' లండన్, 1815, పుట 62) ఇక్కడ శ్రమశక్తి అనటానికి బదులు శ్రమ అని పొరపాటుగా ఉపయోగించాడు రచయిత.

కూడా సంవత్సరం పొడుగునా ఈ ఖర్చుల మొత్తం ఎలా విస్తరించినప్పటికీ అవి ఒక రోజు సగటు ఆదాయానికి అనుగుణంగా వుండాలి. శ్రమశక్తి ఉత్పత్తికి రోజువారీ అవసరమైన సరుకుల మొత్తాన్ని 'క' అనుకుందాం. వారానికి ఒకసారి అవసరమైన వాటిని 'చ' అనీ, మూడు నెలలకోసారి అవసరమైనవాటిని 'ట' అనీ, ఇలాగే మిగిలినవాటినీ పరిగణిద్దాము. ఈ సరుకుల రోజువారీ సగటు (365 'క' + 52 'చ' + 'ట' + వగైరా) / 365 ఒక సగటు దినానికి అవసరమైన సరుకుల మొత్తంలో 6 గంటల శ్రమ రూపుదాల్చి వుంది అనుకుందాం. అంటే రోజూ శ్రమశక్తిలో సగం సగటు సామాజిక శ్రమ ఇమిడి వుంది. మరోలా చెప్పాలంటే, రోజువారీ శ్రమశక్తి ఉత్పాదనకి సగం రోజు శ్రమశక్తి అవసరం. శ్రమ యొక్క ఈ పరిమాణం ఒక రోజు శ్రమశక్తి విలువ అవుతుంది. లేదా రోజూ పునరుత్పత్తి అయ్యే శ్రమశక్తి విలువ అవుతుంది.

సగం రోజు సగటు సామాజిక శ్రమ 3 షిల్లింగుల్లో రూపుదాల్చి వుంటే అప్పుడు ఒక రోజు శ్రమశక్తి విలువ 3 షిల్లింగులవుతుంది. శ్రమశక్తి యజమాని దానిని 3 షిల్లింగులకు అమ్మటానికి సిద్ధంగా వుంటే, దాని అమ్మకం ధర దాని విలువకు సమానం అవుతుంది. మనం అనుకున్నట్టుగానే, తన మూడు షిల్లింగుల్ని పెట్టుబడిగా మార్చాలనుకొంటున్న మన మిత్రుడు డబ్బు సంచిగారు ఈ విలువను చెల్లించేస్తాడు.

రోజూ ఏ సరుకుల సరఫరా జరగకపోతే కార్మికుడు తన నూతన జీవశక్తిని మళ్ళీ పుంజుకోలేడో అటువంటి సరుకుల విలువ అంటే శారీరకంగా అనివార్యం అయిన జీవనాధారాల విలువే శ్రమశక్తి విలువకు కనీస పరిమితి. శ్రమశక్తి ధర ఈ కనీస స్థాయికి పడిపోతే, అది దాని విలువ కంటే తక్కువకు పడిపోయినట్టే. ఎందుకంటే అటువంటి పరిస్థితుల్లో దానిని నిలుపుకోవడం, అభివృద్ధి చేయడం అరకొరగా మాత్రమే జరుగుతుంది. అయితే మామూలు నాణ్యంతో ఒక సరుకు తయారీకి అవసరమైన శ్రమశక్తి ఆ సరుకు విలువను నిర్ధారిస్తుంది.

శ్రమశక్తి విలువను ఈ పద్ధతిలో నిర్ధారించడం అన్నది, ఈ విషయం యొక్క స్వభావంలోనే వుంది. అయితే ఈ పద్ధతిని పాశవికం అని రోస్సిలాగా విలపించడం మాత్రం మహా చౌకబారు మనో దౌర్బల్య ప్రదర్శన. రోస్సీ ఇలా అంటాడు : "ఉత్పత్తి జరిగే కాలంలో కార్మికుల జీవనాధార వస్తువుల సారమైనట్లు శ్రమ సామర్థ్యాన్ని అర్థం చేసుకోవడం భ్రమకు లోబడడమే. మనం శ్రమను గురించి లేదా శ్రమ చేయగల సామర్థ్యాన్ని గురించి మాట్లాడుతున్నామూ అంటే అదే సమయంలో మనం కార్మికుడి గురించీ, అతని జీవనాధారాల గురించీ, కార్మికుడి గురించీ అతని వేతనాల గురించీ మాట్లాడుతున్నట్లే."[1] మనం శ్రమ చేయగల శక్తి గురించి మాట్లాడుతున్నప్పుడు శ్రమ గురించి మాట్లాడుతున్నట్లు కాదు. మనం జీర్ణశక్తి గురించి మాట్లాడితే జీర్ణక్రియ గురించి మాట్లాడినట్టు కాదు. రెండో దానికి మంచి పొట్ట వుంటే చాలదు. మనం శ్రమ చేయగల సామర్థ్యం గురించి మాట్లాడుతున్నప్పుడు దానిని అవసరమైన జీవనాధార వస్తువుల సారంగా గ్రహించడం లేదు. అందుకు భిన్నంగా దాని విలువ ద్వారా వాటి విలువ వ్యక్తమవుతుంది. కార్మికుని శ్రమ చేయగల సామర్థ్యం అమ్ముడుపోకపోతే, దానివల్ల అతనికి ఒరిగేదేమీ లేదు. పైగా ఈ సామర్థ్యాన్ని ఉత్పత్తి చేయాలంటే

1. రాస్సీ : "Cours d' Econ. Polit" Bruxelles. 1842, పుట 370.

ఒక నిర్దిష్ట పరిమాణంలో జీవనాధారాలు ఖర్చు కావడమూ, దాని పునరుత్పత్తికి కూడా అలాగే ఖర్చు అవుతూ వుండడమూ క్రూరమైన ప్రకృతి విధించిన నియమంగా అతను భావిస్తాడు. అప్పుడు అతడు సిస్మండీతో ఇలా ఏకీభవిస్తాడు. "ఆ శ్రమ చేయగల శక్తి అమ్ముడు కాకపోతే వృధా."[1]

ఒక సరుకుగా శ్రమశక్తికి గల విలక్షణ స్వభావం యొక్క ఒక ఫలితం ఏమంటే, దాని కొనుగోలు దారునికి అమ్మకందారునికీ మధ్య ఒప్పందం కుదిరిన వెంటనే దాని ఉపయోగపు విలువ కొనుగోలుదారుని హస్తగతం కాదు. దాని తయారీలో కూడా ఒక నిర్దిష్ట పరిమాణంలో సామాజిక శ్రమ ఖర్చయింది కనుక మిగిలిన సరుకులన్నిటి లాగే దాని విలువ కూడా ముందే నిర్ణయించబడింది. అయితే దాని ఉపయోగపు విలువ మాత్రం ఆ తరువాత ఆ శక్తిని ఉపయోగించడంలోనే వుంది. శ్రమశక్తి పరాధీనం కావడానికీ, అది కొనుగోలుదారుని హస్తగతం కావడానికీ అంటే ఉపయోగపు విలువగా దానిని వినియోగించడానికీ మధ్య కొంత కాలవ్యవధి వుంటుంది. అయితే ఒక సరుకు ఉపయోగపు విలువని పరాధీనం చేయడమూ, వాస్తవంలో దానిని కొనుగోలుదారునికి బదిలీ చెయ్యడమూ ఏకకాలంలో జరగకపోతే కొనుగోలుదారుని డబ్బు చెల్లింపు సాధనంగా వ్యవహరిస్తుంది.[2] పెట్టుబడిదారీ ఉత్పత్తి వ్యవస్థ రాజ్యమేలే ప్రతి దేశంలోనూ శ్రమశక్తి వినియోగించక ముందే దానికి చెల్లించకపోవడం అన్నది ఒక ఆచారం అయింది. ఒప్పందం ద్వారా నిర్ణయించబడిన పనికాలం చివరిలో, అంటే ఉదాహరణకు, వారం చివరిలో మాత్రమే చెల్లించడం జరుగుతుంది. కనుక అన్ని సందర్భాల్లోనూ శ్రమశక్తి ఉపయోగపు విలువ పెట్టుబడిదారునికి అడ్వాన్సు చేయబడుతుంది. కార్మికుడు దాని ధరని స్వీకరించకముందే, కొనుగోలుదారుడు దానిని వినియోగించడాన్ని అతడు ఆమోదిస్తాడు. ప్రతిచోటా అతను పెట్టుబడిదారుడికి అప్పు ఇస్తాడు. అప్పు ఇవ్వడమనేది ఏ మాత్రం కట్టుకథ కాదు. పెట్టుబడిదారుడు అప్పుడప్పుడూ దివాళా ఎత్తినప్పుడు కార్మికులు జీతాలు కోల్పోవడం మాత్రమే[3] కాక, మరింత చిరస్థాయి అయిన పరిణామాల పరంపర కూడా ఈ అంశాన్ని రుజువు చేస్తాయి.[4]

---

1. సిస్మండీ : "Nov. Princ. etc." ఒకటో గ్రంథం, పుట 112.
2. "శ్రమ అంతమైన తర్వాతే వేతనం చెల్లించబడుతుంది" ("యాన్ ఎంక్వైరీ ఇంటుదోస్ ప్రిన్సిపుల్స్ రెస్పెక్టింగ్ ది నేచర్ ఆఫ్ డిమాండ్" పుట 104) "ఉత్పాదితాల ప్రధాన ఉత్పాదకుడైన కార్మికుడు అంతకు ముందు చేసుకున్న పొదుపు బలంతో, వారం చివరి వరకూ, పక్షం నెల, మూడు నెలల చివరి వరకూ తన జీతం కోసం వేచి వుండాల్సిన పరిస్థితిలోనే వాణిజ్య ఖాతా అనే పద్ధతి ప్రారంభ మైంది." (సి. గనీల్, des systemes de 1' economic politique, రెండో ముద్రణ, పారిస్, 1821, రెండో సంపుటి, పుట 150)
3. "కార్మికుడు తన పరిశ్రమను అరువిస్తాడు" అని చెప్పిన స్టార్చ్ మళ్ళీ కుయుక్తితో ఇలా అంటాడు. "కార్మికుడు కోల్పోయేదేమీ లేదు, అతని వేతనాలు తప్ప. పాదార్థిక స్వభావం వునన దేనినీ కార్మికుడు పరుల హస్తగతం చేయడంలేదు." (స్టార్చ్, coursd' economic politique, పీటర్స్‌బర్గ్, 1815, రెండో సంపుటి, పుటలు 36, 37)
4. ఒక ఉదాహరణ. లండన్‌లో రెండు రకాల బేకరీలున్నాయి. "పూర్తి ధర" బేకరీలు, "చౌకధర" బేకరీలు. మొదటివి, బ్రెడ్‌ని పూర్తి విలువకు అమ్ముతాయి. రెండోవి దాని విలువ కంటే తక్కువ కమ్ముతాయి. బేకరీ వాళ్ళల్లో నాలుగింట మూడొంతుల మంది రెండోరకం వారే. (పుట 11, హెచ్.ఎస్. ట్రెమెన్ హాయర్ నివేదిక. "ది గ్రివెన్సెస్ కంప్లెయిన్డ్ ఆఫ్ బై ది జర్నీమెన్ బేకర్స్" లండన్, 1862.) ఇలా తక్కువ కమ్మేవారంతా మినహాయింపు లేకుండా రొట్టెలో పటిక, సబ్బు, సుద్ద వగైరాలను కలుపుతున్నారు. (పైన పేర్కొన్న బ్లూ

ఏమయినప్పటికీ, డబ్బు కొనుగోలు సాధనంగా వ్యవహరిస్తుందా, చెల్లింపు సాధనంగా వ్యవహరిస్తుందా అన్నది సరుకుల మార్పిడి స్వభావాన్ని మార్చదు. ఒప్పందంలో శ్రమశక్తి ధర నిర్ణయ మవుతుంది. అయితే ఇంటి అద్దెలాగానే, అది కొంతకాలం తర్వాతనే చేతికి వస్తుంది. శ్రమశక్తి విక్రయం జరిగింది. అయితే కొంతకాలం తర్వాత మాత్రమే దాని ధర చెల్లించబడుతుంది. విషయం స్పష్టంగా అర్థం గావడానికిగాను ప్రతి అమ్మకంలోనూ శ్రమశక్తి కలవాడు దానికి నిర్ణయించిన ధరను వెంటనే పుచ్చుకోగలుగుతున్నాడని కాసేపు భావిద్దాం.

శ్రమశక్తి అనే ఈ విశిష్ట సరుకున్న మనిషికి దానిని కొనుక్కున్న వ్యక్తి చెల్లించే విలువ ఎలా నిర్ణయించబడుతుందో ఇప్పుడు మనకు తెలుసు. కొనుగోలుదారుడు మార్పిడి ద్వారా పొందే ఉపయోగపు విలువ వాస్తవంగా ఉపయోగించడం ద్వారానే వ్యక్తమవుతుంది. అంటే శ్రమశక్తి వినియోగంలోనే అది వ్యక్తమవుతుంది. ఈ లక్ష్యం కోసం డబ్బు యజమాని ముడి పదార్థాలవంటి వాటిని ప్రతి దాన్నీ మార్కెట్‌లో కొంటాడు. దాని పూర్తి విలువను చెల్లించి వేస్తాడు. శ్రమశక్తి వినియోగం అనేది ఏకకాలంలో సరుకులనీ, అదనపు విలువనీ ఉత్పత్తి చేస్తుంది. శ్రమశక్తి వినియోగం అనేది

---

బుక్‌తో పాటు "ది కమిటీ ఆఫ్ 1855 ఆన్ ది అడల్టరేషన్ ఆఫ్ బ్రెడ్" అనే నివేదికను కూడా చూడండి.) "ఇటువంటి కల్తీవల్ల అతని ఆరోగ్యం మీద అది కల్గించే దుష్ప్రభావం మాటటుంచి రోజుకు రెండు పౌండ్ల బ్రెడ్ అవసరమైన కార్మికునికి అందులో నాలుగో వంతు తక్కువగా లభిస్తోంది" అని 1855 కమిటీ ముందు సర్‌జాన్ గోర్డన్ ప్రకటించాడు. ఈ కల్తీ గురించి తెలిసినప్పటికీ కార్మికులు పటికనీ, దుమ్మునీ తమ కొనుగోలులో భాగంగా ఆమోదించడానికి కారణం గత్యంతరం లేకనే అనీ ట్రెమెన్ హేయర్ ప్రకటించాడు. వారం చివరి వరకూ వారికి జీతం డబ్బు ముట్టరు కనుక "ఆ వారంలో, వారం ఆఖరికి ముందున్న రోజులో వారి కుటుంబాలు తినే బ్రెడ్‌కి వారు డబ్బు" ముట్టజెప్పలేరనీ, అందుకే "కొట్టువాడు ఏ బాపతు బ్రెడ్ సరఫరా చేస్తే దాన్ని తీసుకోక తప్పదనీ," "ప్రత్యేకంగా వీరికి అమ్మటానికే అటువంటి బ్రెడ్ తయారు చేస్తున్నారనీ" ఆయన తెలియజేశాడు. చాలా ఇంగ్లీషు జిల్లాల్లోనూ, అంతకు మించిన సంఖ్యలో స్కాచ్ వ్యవసాయ జిల్లాల్లోనూ వేతనాలు పక్షానికో, నెలకో చెల్లిస్తారు. చెల్లింపుల మధ్య సుదీర్ఘమైన వ్యవధి వుండటం వల్ల కార్మికుడు అప్పుగా కొనక తప్పదు. దానివల్ల అతడు ఎక్కువ ధర చెల్లించాల్సి వస్తుంది. అప్పు ఇచ్చే దుకాణానికి బంధితుడవుతాడు. ఉదాహరణకు, హార్నింగామ్‌లో వేతనాలు నెలకోసారి ఇస్తారు. మామూలుగా ఒక షిల్లింగు 10 పెన్నీలకు దొరికే పిండికి అక్కడి దుకాణాలు కార్మికుల నుండి 2 షిల్లింగుల 4 పెన్నీలు రాబడతాయి. ("సిక్త్ రిపోర్ట్ ఆన్ పబ్లిక్ హెల్త్" బై ది మెడికల్ ఆఫీసర్ ఆఫ్ ది ప్రీవీ కౌన్సిల్, 1864, పుట 264)

"పాయిస్లీ, కిల్మర్ నాక్‌లకు చెందిన బ్లాక్ ప్రింటర్లు సమ్మె చేసి నెలసరి వేతనాల బదులు పక్షానికోసారి ఇచ్చేలా సాధించుకున్నారు. ("రిపోర్ట్స్ ఆఫ్ ది ఇన్స్పెక్టర్స్ ఆఫ్ ఫ్యాక్టరీస్" 1853, పుట 34) పెట్టుబడి దారుడికే కార్మికుడు అప్పు ఇస్తున్నాడని తెలియజేయడానికి ఇంగ్లీషు బొగ్గు గనుల్లో వున్న పద్ధతిని మనం ప్రస్తావించవచ్చు. అక్కడ కూడా వేతనాలు నెలాఖరునే ఇస్తారు. ఈలోగా పెట్టుబడిదారుడి దగ్గర్నుండి ఖాతా మీద కార్మికుడు కొంత కొంత మొత్తాలు తీసుకుంటాడు. తరచుగా వాటిని అతడు సరుకుల రూపంలో, మార్కెట్ ధర కంటే ఎక్కువ చెల్లించి పుచ్చుకోక తప్పదు (ట్రక్ పద్ధతి). "బొగ్గు గనుల యజమానులు వేతనాలు నెలకోసారి చెల్లిస్తారు. మధ్యలో ప్రతి వారాంతంలో తమ కార్మికులకు అడ్వాన్సులు ఇస్తారు. దీన్ని తిన్నగా దుకాణంలో ఇవ్వడం జరుగుతుంది" (అది యజమాని దుకాణమే). కార్మికులు దాన్ని ఈ వైపున తీసుకుని ఆ వైపున ఇచ్చేస్తారు." చిల్డ్రన్స్ ఎంప్లాయ్‌మెంట్ కమిషన్, మూడో నివేదిక, లండన్, 1864, పుట 38, సంఖ్య 192)

మిగిలిన అన్ని సరుకుల విషయంలోలాగానే మార్కెట్ పరిమితులకు, లేదా చలామని రంగానికి వెలుపల పూర్తవుతుంది. కనుక ప్రతిదీ అందరి కళ్ళముందూ బాహాటంగా జరిగే ఈ శబ్దాల హోరు నుంచి, ఈ చలామణి రంగం నుంచి మనం కాసేపు శ్రీమాన్ డబ్బు సంచిగారితోనూ, శ్రమశక్తి యజమానితోనూ కలిసి వారి వెంట గుప్త ఉత్పత్తి గృహానికి వెళదాం. అక్కడ ద్వారంపైన "పని మీద రాని వారికి ప్రవేశం లేదు." అన్న వాక్యం మనకు తారసపడుతుంది. ఇక్కడ పెట్టుబడి ఎలా ఉత్పత్తి చేసేదీ, అంతేకాక పెట్టుబడి ఎలా ఉత్పత్తి అయ్యేదీ కూడా మనకు కనపడుతుంది. చిట్టచివరికి మనం లాభార్జన రహస్యాన్ని ఛేదిస్తాం. (ఇప్పుడు మనం విడిచిపెట్టి వెళ్ళే రంగం, దేని సరిహద్దుల లోపల శ్రమశక్తి క్రయ విక్రయాలు జరుగుతాయో ఆ రంగం, నిజానికి మానవుని విసర్గ హక్కుల స్వర్గం. అక్కడ మాత్రమే స్వేచ్ఛ, సమానత, ఆస్తి, బెంథమ్ మహాశయుడు రాజ్యమేలుతారు. ఒక సరుకు యొక్క ఉదాహరణకు శ్రమశక్తి యొక్క క్రయ విక్రయదారు లిరువురికీ అడ్డేమీ లేదు – వారి స్వతంత్ర ఇచ్ఛ తప్ప. అందుకే స్వేచ్ఛ. వారు స్వతంత్ర వ్యక్తులుగా ఒప్పందం కుదుర్చుకుంటారు. వారు చేసుకునే ఒప్పందం వారి ఉమ్మడి ఇచ్ఛను చట్టబద్ధంగా వ్యక్తీకరించే రూపం మాత్రమే. ఇందులో ప్రతి వ్యక్తీ రెండో వ్యక్తితో సరుకులకు సాదా ప్రతినిధిగా సంబంధం ఏర్పరచుకుంటాడు. వారు ఒక సమ విలువను మరో సమ విలువతో మార్పిడి చేసుకుంటారు. అందుకే సమానత. ప్రతి ఒక్కరూ తన సొంతమైనదాన్నే అమ్ముతారు. అందుకే ఆస్తి. ప్రతి ఒక్కరూ తన సంగతి మాత్రమే తను చూసుకుంటాడు. వారిని కలిపేదీ, ఒకరితో ఒకరికి సంబంధం కలిపేదీ ఒకే ఒక శక్తి. అదే స్వార్థం. సొంత లాభం, సొంత ప్రయోజనం. అందుకే బెంథమ్, రాజ్యమనడం. ప్రతి ఒక్కరికీ తన సంగతి మాత్రమే పడుతుంది. మిగిలినవారి గురించి ఏ ఒక్కరూ ఆందోళనపడరు. వారలా చెయ్యడంవల్లనే అంతకు ముందే అమరి వున్న విషయాల సామరస్యానికి అనుగుణంగా, లేదా సర్వజ్ఞుడైన సర్వాంతర్యామి ఆధ్వర్యంలో వారి కృషి పరస్పర ప్రయోజనకరంగా, సర్వజన కళ్యాణప్రదంగా పరిణమిస్తుంది.

ఈ సాదా చలామణి రంగం, లేదా సరుకుల మార్పిడి రంగం "నాటు వాణిజ్యవాదులకు" వారి భావాలనూ, అభిప్రాయాలనూ సమకూరుస్తుంది. పెట్టుబడి, వేతనాలు పునాదిగా గల సమాజపు గుణ దోషాలను నిర్ణయించడానికి అతనికి అవసరమైన ప్రమాణాన్ని సరఫరా చేస్తుంది. ఈ రంగాన్ని వదిలేసి మనం మన నాటక పాత్రల రూపురేఖల్లో మార్పును గమనించ గలుగుతాము. అదుగో, ముందున్నాడే అతడే డబ్బు యజమాని. ఇప్పుడు పెట్టుబడిదారుడుగా మున్ముందుకి సాగిపోతున్నాడు. శ్రమశక్తి యజమాని అతని కార్మికునిగా అతని వెనుక అనుసరిస్తున్నాడు. ఒకరు హుందాగా, ధీమాగా వ్యవహర్తలా. మరొకరు పిరికిగా, సంకోచంగా, సొంత తోలు అమ్ముకోటానికి మార్కెట్‌కు వచ్చినవాడిలా, తోలు ఒలిపించుకోడానికి సిద్ధంగా.

## మూడో భాగం

# పరమ అదనపు విలువ ఉత్పత్తి

## అధ్యాయం - 7

# శ్రమ ప్రక్రియా, అదనపు విలువ ఉత్పత్తి ప్రక్రియా

### విభాగం : 1

### శ్రమ ప్రక్రియ, లేదా ఉపయోగపు విలువల ఉత్పత్తి

పెట్టుబడిదారుడు శ్రమశక్తిని ఉపయోగించడం కోసం దానిని కొంటాడు. ఉపయోగంలో వున్న శ్రమశక్తి అంటే శ్రమే. శ్రమశక్తి కొనుగోలుదారుడు దాని విక్రేతను పనిలో పెట్టడం ద్వారా దాన్ని వినియోగించుకుంటాడు. శ్రమశక్తి విక్రేత పని చేయడం ద్వారా క్రియాశీల శ్రమశక్తిగా, అంటే శ్రామికుడుగా మారుతాడు. ఇంతకు ముందు అతనికి అలా మారగల శక్తి మాత్రమే వుంది. అతని శ్రమ ఒక సరుకు రూపంలో పునర్దర్శనం యివ్వడానికి వీలుగా ఏదో ఒక ఉపయోగకరమైన వస్తువును, ఏదో ఒక అవసరాన్ని తీర్చే వస్తువును తయారు చేయడానికి దానిని ఖర్చు పెడతాడు. అందుకనే పెట్టుబడిదారుడు కార్మికుణ్ణి పురమాయించేది, ఒక ప్రత్యేక ఉపయోగపు విలువను, ఒక నిర్దిష్ట వస్తువును తయారుచేయాలని, ఉపయోగపు విలువల, లేదా సరుకుల ఉత్పత్తి పెట్టుబడిదారుని తరఫున అతని అజమాయిషీలో జరుగుతుందనే విషయం ఆ ఉత్పత్తి యొక్క సాధారణ స్వభావాన్ని మార్చదు. కనుక నిర్దిష్ట సామాజిక పరిస్థితుల్లో అది సంతరించుకునే ప్రత్యేక రూపంతో ప్రమేయం లేకుండా శ్రమ ప్రక్రియను పరిశీలిద్దాం.

ప్రప్రథమంగా, శ్రమ అనేది మానవుడూ ప్రకృతీ పాల్గొనే ఒక ప్రక్రియ. దానిలో మానవుడు తనకీ ప్రకృతికీ మధ్య పాదార్థిక ప్రతి చర్యలను తనంత తానుగానే ప్రారంభిస్తాడు, క్రమబద్ధం చేస్తాడు, అదుపు చేస్తాడు. అతడు ప్రకృతికున్న సొంత శక్తుల్లో ఒకడుగా దాన్ని ఎదుర్కొంటాడు. తన సొంత కోర్కెలకు అనుగుణమైన రూపంలో ప్రకృతి ఉత్పాదితాలను స్వాధీనం చేసుకోవడం కోసం తన సహజ శారీరక శక్తుల్నీ, కాళ్ళనీ, చేతుల్నీ, తలనీ చలనంలో పెడతాడు. ఆ రకంగా అతడు బాహ్య ప్రపంచంపైన పనిచేస్తూ దానిని మారుస్తూ అదే సమయంలో తన స్వభావాన్ని మార్చుకుంటాడు. తనలో నిద్రాణంగా వున్న శక్తుల్నీ అభివృద్ధి చేసుకుని అవి తన ఆధిపత్యాన్ని శిరసా వహించేలా చేసుకుంటాడు. జంతువులకు సహజమైన ఆదిమ సద్యోజనిత శ్రమ రూపాల గురించి మనం ఇప్పుడు చర్చించడం లేదు. మానవ శ్రమ యొక్క తొలి సద్యోజనిత దశకూ, ఒక మనిషి తన శ్రమశక్తిని ఒక సరుకు రూపంలో అమ్మటానికి మార్కెటుకు తెచ్చే దశకూ మధ్య లెక్కకు అందనంత కాలం

జరిగిపోయింది. శ్రమను మనం మానవ శ్రమగానే భావిస్తాం. ఒక సాలీడు చేసే పని నేతగాడు చేసే పనిలాగే కన్పిస్తుంది. తేనెటీగ తన తేనె తెట్టెను వాస్తుశిల్పి సైతం సిగ్గుపడేలా నిర్మించుకుంటుంది. అయితే అత్యుత్తమ తేనెటీగ కంటే అత్యధమ వాస్తు శిల్పి సైతం మెరుగని చూపే అంశం ఒకటుంది. వాస్తు శిల్పి వాస్తవంగా తన కట్టడాన్ని నిర్మించ డానికి ముందే దాన్ని ఊహా రూపంలో నిర్మిస్తాడు. ప్రతి శ్రమ ప్రక్రియ చివర కలిగే ఫలితం ... ప్రారంభం లోనే కార్మికుని ఊహలో వుంటుంది. అతను పనిజేసే పదార్థాన్ని మార్చడం మాత్రమేగాక నిర్దేశించుకున్న లక్ష్యాన్ని నెరవేర్చుకుంటాడు. అది అతని పని విధానాన్ని నిర్ణయిస్తుంది. ఆ నిర్ణయానికి అతడు తన ఇచ్ఛను లోబర్చాలి. ఈ లొంగుబాటు కేవలం క్షణికమైన చర్యగాదు. శారీరక అవయవాలను ఉపయోగించడంతోపాటు మొత్తం కార్యకలాపం జరుగుతున్నంత సేపూ పనివాడి ఇచ్ఛ అతని లక్ష్యానికి అనుగుణంగా వుండాలని ఆ ప్రక్రియ కోరుతుంది. అంటే తదేకంగా అదే పని మీద ధ్యాస వుండాలి. పని స్వభావమూ, దానిని నిర్వహించాల్సిన తీరూ అతనికి ఎంత తక్కువ నచ్చితే, అందువల్ల తన శారీరక, మానసిక శక్తులను స్వేచ్ఛగా వినియోగించే చర్యగా దాని నుండి అతను ఎంత తక్కువ ఆనందం పొందితే, అతను దానిపైన అంత ఎక్కువ ధ్యాస పెట్టి పనిచేయాల్సి వస్తుంది.

శ్రమ ప్రక్రియలో ప్రాథమిక అంశాలు 1. మనిషి వ్యక్తిగత కార్యకలాపం, అంటే పని, 2. ఆ పనికి గురి అయ్యే ముడి పదార్థం (శ్రమ గ్రహీత) 3. పనిముట్లు.

బీడు నేల (ఆర్థికపరంగా చెప్పాలంటే, నీరు కూడా) సార్వత్రిక మానవ శ్రమ గ్రహీత. అది మానవునితో ప్రమేయం లేకుండా వుంటుంది. జీవనాధార వస్తువుల్ని అతనికి సరఫరా చేస్తుంది.[1] శ్రమ వాటి తక్షణ పరిసరాల నుండి వేరుచేసే వస్తువులన్నీ ప్రకృతి సహజంగా ప్రసాదించిన శ్రమ గ్రహీతలే. ఉదాహరణకు మనం చేపకు ఆధారభూతమైన నీటి నుండి వానిని వేరు చేస్తాం, అడవిలో చెట్టును నరికి దుంగని వేరు చేస్తాం, గనుల నుండి ఖనిజాలను వేరు చేస్తాం. అలా కాకుండా శ్రమ గ్రహీతను మనం గత శ్రమ నుండి సంపాయించామంటే అది ముడి పదార్థమవుతుంది. అంతకు ముందే తీసిన ముడి ఖనిజం శుద్ధి చేయడానికి సిద్ధంగా వుంటే అది ముడి పదార్థం. ముడి పదార్థమంతా శ్రమ గ్రహీతే. కాని శ్రమ గ్రహీత ప్రతిదీ మాత్రం ముడి పదార్థం కాదు. శ్రమ ద్వారా దానిని కొంత మార్చాకనే అది ముడి పదార్థం అవుతుంది.

శ్రమ పరికరం అంటే, కార్మికుడు తనకీ తన శ్రమ గ్రహీతకీ మధ్యన వుంచే పరికరం, లేదా పరికరాల సముదాయం. అది అతని కార్యకలాపాల వాహికగా వ్యవహరిస్తుంది. అతడు కొన్ని పదార్థాలను తన లక్ష్యాలకు అనుగుణంగా మార్చడం కోసం మరికొన్ని పదార్థాల యాంత్రిక, భౌతిక, రసాయనిక ధర్మాలను ఉపయోగించుకుంటాడు.[2] పండ్ల వంటి జీవనాధార వస్తువులను పోగుచేయడంలో

---

1. భూమియొక్క స్వయంజనిత ఉత్పత్తులు కొద్దిపాటి పరిమాణంలో మాత్రమే వుంటాయి. అవి మానవునితో ప్రమేయం లేకుండానే దొరుకుతాయి. ఒక యువకునికి పరిశ్రమ నడపడానికి మొదట అతనికి కొద్దిపాటి సొమ్ము ఇవ్వబడినట్టుగానే ప్రకృతి కూడా వీటిని తనంత తానుగానే మానవునికి సమకూరుస్తుంది. (జేమ్స్ స్టువార్ట్ : "ప్రిన్సిపుల్స్ ఆఫ్ పొలిటికల్ ఎకానమీ" ఎడిషన్, డబ్లిన్, 1770, ఒకటో సంపుటి, పుట 116)
2. వివేకం అనేది ఎంత శక్తిమంతమో అంత యుక్తి కలది కూడా. ఆ యుక్తి అంతా దాని మధ్యవర్తిత్వం లోనే వుంది. వివేకం వస్తువులు తమ సొంత స్వభావానికి అనుగుణంగానే ఒకదాని మీద ఒకటి చర్య, ప్రతిచర్యలు నెరపుకొనేలా చేస్తుంది. తాను స్వయంగా ఈ ప్రక్రియలో పాల్గొనకుండానే తన ఉద్దేశాలను సాధించుకుంటుంది." (హెగెల్, "Enzyklopadie, Easter Theil, Die Logik" బెర్లిన్, 1840, పుట 382)

మానవుని సొంత అవయవాలే శ్రమ పరికరాలుగా వ్యవహరిస్తాయి. సిద్ధంగా వుండే అటువంటి జీవనాధార వస్తువులని మినహాయిస్తే, కార్మికుడు కలిగి వుండే మొదటి అంశం శ్రమ గ్రహీత కాదు, శ్రమ పరికరం. ఆ రకంగా ప్రకృతి అతని కార్యకలాపాలు నిర్వహించే అవయవాల్లో ఒకటవుతుంది. దాన్ని అతను తన శరీర అవయవాలకు కలుపుకుంటాడు. బైబిల్ మాటలేమయినప్పటికీ, ఆ రకంగా అతను తన అంతస్తు పెంచుకుంటాడు. భూమి అతని తొలి భోజన భాండాగారమైనట్లే అతని తొలి పరికరాగారం కూడా. ఉదాహరణకు, అది అతనికి విసరివేయడానికీ, పిండి చేయడానికీ, నొక్కటానికీ, తిప్పటానికీ, కొయ్యటానికీ వగైరాలకు రాళ్ళను సరఫరా చేస్తుంది. వ్యవసాయంలో ఉపయోగించినప్పుడు భూమే స్వయంగా ఒక శ్రమ పరికరం. అప్పటికీ అనేక ఇతర పరికరాలు రంగంలో కొస్తాయి.

సాపేక్షంగా శ్రమ ఉన్నత స్థాయిలో అభివృద్ధిచెంది వుంటుంది.[1] శ్రమలో ఏ కొద్దిపాటి అభివృద్ధి జరిగినా వెంటనే దానికి ప్రత్యేకంగా తయారుచేసిన పరికరాలు అవసరమవుతాయి. అందువల్ల అత్యంత ప్రాచీనమైన గుహల్లో మనకు రాతి పరికరాలూ, ఆయుధాలూ కనిపిస్తాయి. మానవ చరిత్రలోని అత్యంత ప్రథమ దశలో పెంపుడు జంతువులు కనిపిస్తాయి. ప్రత్యేక లక్ష్యంతో పెంచబడి, శ్రమవల్ల మార్పుకి గురైన జంతువులు కూడా ప్రత్యేకంగా తయారుచేసిన రాళ్ళు, కొయ్య, ఎముకలు, గుల్లలతోపాటు శ్రమ పరికరాలుగా వ్యవహరిస్తాయి.[2] శ్రమ పరికరాలను ఉపయోగించడం, తయారుచెయ్యడం అనేది బీజ ప్రాయంగా కొన్ని జంతువుల్లో వున్నప్పటికీ అది నిర్దిష్టంగా మానవ శ్రమ ప్రక్రియ యొక్క విశిష్ట లక్షణం. అందుకే ఫ్రాంక్లిన్ మనిషిని పనిముట్లు చేసే జంతువు అని నిర్వచించాడు. అంతరించిపోయిన జంతువులను నిర్ధారించడంలో శిలలపై ఏర్పడిన ఎముకల శిలాజాలకు ఎటువంటి ప్రాధాన్యం వుందో గడిచిన తరాల శ్రమ పరికరాల అవశేషాలకు కూడా అంతరించిపోయిన సామాజిక ఆర్థిక రూపాల పరిశోధనలో అదే ప్రాధాన్యం వుంది. ఏ వస్తువులు తయారుచేశారు అన్నదికాక, వాటిని ఎలా చేశారు, ఏ పరికరాలతో చేశారు అన్నది విభిన్న ఆర్థిక యుగాలను వేరుచేసి చూడటానికి వీలు కల్పిస్తుంది.[3] శ్రమ పరికరాల వల్ల మానవ శ్రమ సాధించిన అభివృద్ధి స్థాయితో పాటు, ఆనాటి శ్రమ ఏ సామాజిక పరిస్థితుల్లో నిర్వహించబడిందో కూడా తెలుస్తుంది. గొట్టాలు, తొట్లు, బుట్టలు, జాడీలు వగైరాలు శ్రమ పదార్థాలను వుంచే పాత్రలుగా

---

1. మరే రకంగా చూసినా ఘోరంగా వున్న తన గ్రంథంలో ("Theorie de l' Econ. Polit" పారిస్, 1815) గనీల్, "ఫిజియోక్రాట్ల"కు భిన్నంగా, నిజమైన వ్యవసాయం అనేది తలయెత్తడానికి ముందు గడిచిన ప్రక్రియల పరంపరను మాత్రం కళ్ళకు కట్టినట్టు ఏకరువు పెట్టాడు.
2. తన "Reflecxions sur la Formation et la Distribution des Richesses" (1766) రచనలో టర్గోట్ ప్రాచీన నాగరికతలో పెంపుడు జంతువులకు వున్న ప్రాధాన్యాన్ని బాగా వివరించాడు.
3. విభిన్న ఉత్పత్తి యుగాలను పోల్చడానికి అత్యంత తక్కువ ప్రాధాన్యం గల వస్తువులేమంటే, నిజమైన విలాస వస్తువులే. సమస్త సామాజిక జీవితానికీ, అందువల్ల సమస్త వాస్తవ చరిత్రకూ పునాది అయిన పాదార్థిక ఉత్పత్తి అభివృద్ధిని మన లిఖిత చరిత్రలు ఎంత తక్కువగా గమనించినప్పటికీ, ప్రాక్ చారిత్రక యుగాలను మాత్రం చారిత్రక పరిశోధనల ఫలితాలనబడే వాటి ప్రకారం కాక భౌతిక పరిశోధనల ఫలితాల ప్రకారమే వర్గీకరించడం జరిగింది. ఆయా యుగాల్లో ఆయుధాలూ, పరికరాలూ తయారుచేయడానికి ఉపయోగించిన పదార్థాన్ని బట్టి ఆయా కాలాలను రాతి యుగం, కంచు యుగం, ఇనుప యుగం అంటూ విభజించారు.

మాత్రమే వినియోగపడతాయి. ఈ తరగతి వస్తువుల్ని మనం సామాన్య రీతిలో ఉత్పత్తి యొక్క నాళ వ్యవస్థ అనవచ్చు. ఒక ఉత్పత్తి యుగం లక్షణాలను తెలియజేయడంలో యాంత్రిక స్వభావం వున్న పరికరాలు వీటికంటే ఎక్కువ తోడ్పడతాయి. వీటిని, మొత్తం మీద ఉత్పత్తి యొక్క ఎముకలూ, కండరాలుగా భావించవచ్చు. నాళ వ్యవస్థ మొదట రసాయన పరిశ్రమల్లో ముఖ్యమైన పాత్ర వహించడం మొదలవుతుంది.

సూటిగా శ్రమను శ్రమ గ్రహీతకు బదిలీ చేయడం ద్వారా ఏదో ఒక రకంగా కార్యకలాప వాహికలుగా వ్యవహరించే వాటితోపాటు శ్రమ ప్రక్రియ కొనసాగడానికి అవసరమైన అన్ని వస్తువులనూ విస్తృతార్థంలో మనం శ్రమ పరికరాల్లో చేర్చవచ్చు. ఇవి శ్రమ ప్రక్రియలో ప్రత్యక్షంగా పాల్గోవు. అయితే అవి లేకుండా ఈ ప్రక్రియను నిర్వహించడం అసాధ్యం అవుతుంది. లేదా పాక్షికంగా మాత్రమే సాధ్యపడుతుంది. భూమి అటువంటి సార్వత్రిక పరికరం. అది కార్మికుడు నిలబడేందుకు ఆధారం సమకూరుస్తుంది. అతని కార్యాచరణకు అది రంగభూమి. ఇంతకు ముందు శ్రమ వల్ల తయారైన పరికరాలలో కొన్ని ఈ తరగతికే చెందుతాయి. వర్క్‌షాపులు, కాలవలు, రోడ్లు వగైరా.

కనుక శ్రమ ప్రక్రియలో శ్రమ పరికరాల సాయంతో మానవ కార్యాచరణ ముందే అనుకున్న పథకం ప్రకారం శ్రమకు గురి అయ్యే పదార్థాన్ని మారుస్తుంది. ఆ ప్రక్రియ ఉత్పాదితంలో అదృశ్య మవుతుంది. ఉత్పాదితం ఒక ఉపయోగపు విలువ. ప్రకృతి ప్రసాదించిన పదార్థం రూపంలో మార్పు ద్వారా మానవ అవసరాలకు అనుగుణంగా మలచబడింది. శ్రమ తనను గ్రహించే పదార్థంతో (శ్రమ గ్రహీతతో) ఏకమైంది. శ్రమ భౌతిక పదార్థంగా మారింది. పదార్థం రూపాంతరం చెందింది. కార్మికునిలో చలనంగా కనిపించింది. ఇప్పుడు ఉత్పాదితంలో నిశ్చలంగా, స్థిరమైన గుణంగా కనిపిస్తుంది. కుమ్మరి మట్టిని తీసుకుని పనిచేస్తాడు. ఉత్పాదితం ఒక కుండ.

మొత్తం ప్రక్రియను దాని ఫలితం దృష్టి నుండి పరిశీలిస్తే శ్రమ పరికరాలూ, శ్రమ గ్రహీతా ఉత్పత్తి సాధనాలు[1] అనీ, శ్రమ అనేదే ఉత్పాదక శ్రమ[2] అనీ స్పష్టమవుతుంది.

శ్రమ ప్రక్రియలో ఒక ఉపయోగపు విలువ ఉత్పాదితం రూపంలో వెలువడినప్పటికీ, ఇదివరకటి శ్రమ ఉత్పాదితాలైన ఇతర ఉపయోగపు విలువలు దానిలో ఉత్పత్తి సాధనాలుగా ప్రవేశిస్తాయి. అదే ఉపయోగపు విలువ ఇదివరకటి ప్రక్రియ యొక్క ఉత్పాదితం, అలాగే అది తర్వాతి ప్రక్రియలో ఉత్పత్తి సాధనం కూడా. కనుక ఉత్పాదితాలు కేవలం శ్రమ ఫలితాలు మాత్రమే కాదు, శ్రమకు అత్యవసరమైన పరిస్థితులు కూడా.

గని పని, వేట, చేపలు పట్టడం, వ్యవసాయం (బీళ్ళను సాగుజేయడం మేరకు) వగైరా సంగ్రహణాత్మక పరిశ్రమలలో ప్రకృతే శ్రమ కవసరమైన పదార్థాన్ని సమకూరుస్తుంది. అవి తప్ప మిగిలిన పారిశ్రామిక శాఖలన్నీ ముడి పదార్థాలను అంటే, అంతకు ముందే శ్రమకు గురి అయినవాటిని, అంతకు ముందుగానే శ్రమ ఉత్పాదితాలుగా వున్నవాటిని ఉపయోగిస్తాయి. వ్యవసాయంలో విత్తనాలు

1. కనుక చేపల పరిశ్రమలో ఉదాహరణకు, ఇంకా పట్టని చేపల్ని ఉత్పత్తి సాధనాలనడం విడ్డూరంగా కనిపిస్తుంది. అయితే చేపలులేని నీళ్ళ నుండి చేపలు పట్టే విద్యను ఇంతవరకూ ఎవరూ కనుక్కోలేదు.
2. కేవలం శ్రమ ప్రక్రియ దృష్టి నుండి మాత్రమే ఉత్పాదక శ్రమను నిర్ణయించే ఈ పద్ధతి ఏ రకంగానూ పెట్టుబడిదారీ ఉత్పత్తి ప్రక్రియకు సూటిగా వర్తించదు.

అటువంటివే. మనం జంతువుల్నీ, మొక్కల్నీ ప్రకృతి ప్రసాదాలుగా భావించడానికి అలవాటుపడ్డాం. కాని అవి వాటి ప్రస్తుత రూపంలో ఉదాహరణకు, గత ఏడాది శ్రమ ఉత్పాదితాలు మాత్రమే కాదు, మనిషి అజమాయిషీ క్రింద, అతని శ్రమ ద్వారా అనేక తరాల పాటు సాగిన క్రమ క్రమ రూప పరివర్తన యొక్క ఫలితం కూడా. అయితే శ్రమ పరికరాల విషయంలో కేవలం పైపైనే పరిశీలించే వానికి సైతం, అత్యధిక సందర్భాల్లో గత యుగాల శ్రమ యొక్క జాడలు కనిపిస్తాయి.

ముడి పదార్థం ఉత్పాదితంలో ప్రధాన పదార్థం కావచ్చు. లేదా అది కేవలం దాని తయారీలో సహాయక అంశంగా మాత్రమే వుండొచ్చు. అలా తోడ్పడే పదార్థం బాయిలర్ కింద బొగ్గులాగా, చక్రంలో తైలం లాగా, దుక్కి గుర్రాలు తినే గడ్డిలాగా శ్రమ పరికరాలచేత వినియోగింపబడవచ్చు. లేదా చలవ చేయని బట్టలో క్లోరిన్‌లాగా, ఇనుములో బొగ్గులాగా, ఉన్నిలో అద్దకం రంగులాగా అది ముడి పదార్థంతో కలిసి కొంత మార్పు తేవడానికి తోడ్పడవచ్చు. లేదా వర్క్‌షాపుల్ని వేడిచేయడానికి వెలుగునివ్వడానికి ఉపయోగపడే పదార్థాల మాదిరిగా పని జరగడానికి తోడ్పడవచ్చు. అచ్చమైన రసాయన పరిశ్రమల్లో ప్రధాన పదార్థము, దాని సహాయక పదార్థమూ అనే భేదం మాయమవుతుంది. అక్కడ ఏ ముడి పదార్థమూ మళ్ళీ ఉత్పాదితంలో తన మొదటి రూపంలో దర్శనమివ్వదు.[1]

ప్రతి వస్తువూ వివిధ ధర్మాలను కలిగి వుంటుంది. కనుక అది అనేక రకాలుగా ఉపయోగపడ గలుగుతుంది. కనుక ఒకే ఉత్పాదితం విభిన్న ప్రక్రియలలో ముడి పదార్థంగా వ్యవహరించవచ్చు. ఉదాహరణకు, ధాన్యం ... మిల్లర్లకీ, స్టార్చి ఉత్పాదకులకీ, సారా తయారుచేసేవారికీ, పశువులు పెంచేవారికీ ముడి పదార్థం. అలాగే బొగ్గు కూడా బొగ్గుగనిలో ఉత్పాదితమూ, ఉత్పత్తి సాధనమూ కూడా.

అలాగే ఒక ఉత్పాదితం ఒకే ప్రక్రియలో శ్రమ పరికరంగానూ, ముడి పదార్థంగా కూడానూ ఉపయోగపడవచ్చు. ఉదాహరణకు, పశువుల్ని మేపడం విషయంలో, జంతువు ఒక రకంగా ముడి పదార్థంగా వ్యవహరిస్తుంది. మరో రకంగా అది ఎరువులు ఉత్పత్తిజేసే పరికరం కూడా.

ఒక పదార్థం వెంటనే అనుభోగం కావడానికి సిద్ధంగా వున్నప్పటికీ, అది మరో పదార్థానికి ముడి పదార్థంగా వ్యవహరించవచ్చు. ఉదాహరణకు, ద్రాక్షాసవం తయారీలో ద్రాక్ష ముడి పదార్థం. మరోవైపున శ్రమ తన ఉత్పాదితాన్ని కేవలం ముడి పదార్థం రూపంలో మాత్రమే మనకివ్వవచ్చు. ఉదాహరణకి, అది మళ్ళీ అనేక విభిన్న ప్రక్రియల పరంపరను దాటాలి. వీటిలో ప్రతిదానిలోనూ అది మారిన రూపంతో ముడిపదార్థంగానే వ్యవహరిస్తుంది. ఈ పరంపరలో చివరి క్రమం వరకూ ఇది కొనసాగుతుంది. అక్కడ మాత్రమే అది వ్యక్తిగత అనుభోగానికో లేదా శ్రమ పరికరంగా ఉపయోగపడడానికో అనువుగా పక్కా ఉత్పాదితంగా మారుతుంది.

కనుక, ఒక ఉపయోగపు విలువ ముడి పదార్థమా, లేక శ్రమ పరికరమా, లేక ఉత్పాదితమా అన్నది శ్రమ ప్రక్రియలో దాని క్రియను బట్టి మాత్రమే వుంటుంది. అక్కడది ఆక్రమించిన స్థానంపై పూర్తిగా ఆధారపడి వుంటుంది. స్థానం మారితే దాని స్వభావమూ మారుతుంది.

---

1. నిజమైన ముడి పదార్థాలను "matieres" అనే సహాయక పదార్థాన్ని "materiaux" అనీ స్టార్చ్ అంటాడు. సహాయక పదార్థాలని "matieres instrumentales" అంటాడు చెర్బూలియేజ్.

కనుక, కొత్త శ్రమ ప్రక్రియలోకి ఒక ఉత్పాదితం ఉత్పత్తి సాధనంగా అడుగు పెట్టినప్పుడల్లా అది ఉత్పాదితంగా తన స్వభావాన్ని కోల్పోయి, ఆ ప్రక్రియలో కేవలం ఒక అంశంగా మారుతుంది. వడికే మనిషి కదుళ్లని కేవలం వడికే పరికరాలుగానూ, నారని కేవలం వడకాల్సిన పదార్థంగానూ పరిగణిస్తాడు. ఈ పదార్థమూ, కదుళ్లూ లేకుండా వడకటం అసాధ్యమే. కనుక వడకటం అనే చర్య ప్రారంభించడానికి ముందే ఈ రెండు ఉత్పాదితాలు వుంటాయని ఊహించాలి. అయితే ఈ ప్రక్రియకు సంబంధించినంత వరకూ అది ఇదివరకటి శ్రమ ఉత్పాదితాలు అన్న విషయంలో బొత్తిగా ప్రమేయం వుండదు. జీర్ణ ప్రక్రియకు సంబంధించినంత వరకూ రైతు, మిల్లర్, బేకర్. వీరి గత శ్రమతో బ్రెడ్ తయారైందన్న విషయానికి ఏమీ ప్రాముఖ్యం వుండదు. ఇదీ అంతే. అందుకు విరుద్ధంగా ఉత్పాదితాలుగా వాటి స్వభావంలో లోపం వుంటేనే ఉత్పత్తి సాధనాలు సాధారణంగా ఏ ప్రక్రియలోనైనా ఉత్పాదితాలుగా తమ స్వభావాన్ని చాటుకుంటాయి. మొండి కత్తి లేదా తెగిపోయే దారం మనకు తప్పనిసరిగా కత్తులు చేసే వానిని, లేదా వడికే వానిని గుర్తుచేస్తుంది. పూర్తిగా తయారైన వస్తువులో దానికి ఆ ఉపయోగకర లక్షణాలను చేకూర్చిన శ్రమ కనిపించదు. దానిలో మాయమైపోయి నట్టనిపిస్తుంది.

శ్రమ లక్ష్యానికి పనికిరాని యంత్రం వృథా. పైగా అది ప్రకృతి శక్తుల వినాశకర ప్రభావానికి గురౌతుంది. ఇనుము తుప్పెక్కుతుంది. కొయ్య కుళ్ళిపోతుంది. మనం నేత పనిలోనో, కుట్టు పనిలోనో ఉపయోగించని దారం వృథా అయిన దూదితో సమానం. సజీవ శ్రమ ఈ వస్తువులను చేజిక్కించుకుని వాటిని తమ మృత్యు నిద్ర నుండి మేల్కొలపాలి. సంభావ్యమైన ఉపయోగపు విలువలుగా వున్న వాటిని వాస్తవమైన ఫలదాయకమైన ఉపయోగపు విలువలుగా మార్చాలి. శ్రమాగ్నిలో స్నానమాడి, శ్రమ అనే జీవిలో ఒక భాగంగా మారతాయవి. ఆ ప్రక్రియలో అవి తమ క్రియలను నిర్వహించడానికి గాను ప్రాణవంతం చేయబడతాయి. అవి నిజానికి వినియోగమవుతాయి. అయితే, జీవనాధార వస్తువులుగా వ్యక్తిగత వినియోగానికీ లేదా ఏదో ఒక కొత్త శ్రమ ప్రక్రియకి ఉత్పత్తి సాధనాలుగా వుంటానికీ సర్వదా సిద్ధంగా వుండే కొత్త ఉపయోగపు విలువల, కొత్త ఉత్పాదితాల ప్రాథమిక విభాగాలుగా ఒక లక్ష్యంతో వినియోగమవుతాయి.

ఒకవైపున తయారైన వస్తువులు శ్రమ ప్రక్రియలో తలెత్తిన ఫలితాలు మాత్రమేగాక, ఆ ప్రక్రియ సాగటానికి అవసరమైన షరతులు కూడా. మరోవైపున ఆ ప్రక్రియలోకి ప్రవేశించడం ద్వారా, సజీవ శ్రమతో సంబంధం ఏర్పర్చుకోవడం ద్వారా మాత్రమే అవి ఉపయోగ విలువలుగా తమ స్వభావాన్ని నిలుపుకోగలుగుతాయి, ఉపయోగపడతాయి.

శ్రమ దాని పాదార్థిక అంశాలను, అంటే దాని గ్రహీతనూ, దాని పరికరాలనూ ఖర్చు చేస్తుంది. అది వాటిని అనుభోగిస్తుంది. కనుక అది ఒక అనుభోగ ప్రక్రియ. అటువంటి ఉత్పాదక అనుభోగానికి వ్యక్తిగత అనుభోగానికీ వున్న తేడా ఇది : వ్యక్తిగత అనుభోగంలో ఉత్పాదితాలు సజీవ వ్యక్తికి జీవనాధార వస్తువులుగా ఖర్చవుతాయి. ఉత్పాదక వినిమయంలో అవి సాధనాలుగా ఖర్చవుతాయి. ఆ రకంగా మాత్రమే శ్రమ, సజీవ వ్యక్తి యొక్క శ్రమ శక్తి, పనిచేయ గలుగుతుంది. కనుక వ్యక్తిగత అనుభోగం యొక్క ఉత్పాదితం స్వయంగా అనుభోక్తే. ఉత్పాదక అనుభోగం యొక్క ఫలితం అనుభోక్త కంటే భిన్నమైన ఉత్పాదితం.

శ్రమ పరికరాలు, శ్రమ గ్రహీతలూ ఉత్పాదితాలే అయిన మేరకు శ్రమ ఉత్పాదితాలను సృష్టించడం కోసం ఉత్పాదితాలను అనుభోగిస్తుంది. మరోరకంగా చెప్పాలంటే, ఒక రకం ఉత్పాదితాల కొరకు మరో రకం ఉత్పాదితాలను ఉత్పత్తి సాధనాలుగా మార్చడం ద్వారా వాటిని శ్రమ అనుభోగిస్తుంది. బాగా తొలిదశలో శ్రమ ప్రక్రియలో పాల్గొన్నది మానవుడు, భూమి మాత్రమే. భూమికి మానవునితో ప్రమేయం లేని స్వతంత్ర అస్తిత్వం వుంది. ఇప్పుడు కూడా శ్రమ ప్రక్రియలో ప్రత్యక్షంగా ప్రకృతి సమకూర్చినవీ, మానవ శ్రమ చేరనివీ అయిన అనేక ఉత్పత్తి సాధనాలను మనం ఉపయోగిస్తున్నాం.

ఇలా సరళమైన ప్రాథమిక అంశాలుగా విడగొట్టితే, శ్రమ ప్రక్రియ అనేది ఉపయోగపు విలువలను ఉత్పత్తి చేసే ఉద్దేశంతో నిర్వహించే మానవ కార్యాచరణ. అది మానవ అవసరాల కొరకు ప్రకృతిలోని పదార్థాలను స్వాధీనం చేసుకోవడం. మనిషికీ ప్రకృతికీ మధ్య పదార్థ మార్పిడి జరగడానికి అవసరమైన షరతు ఇది. మానవ మనుగడకు ప్రకృతి విధించిన శాశ్వతమైన షరతు ఇది. కనుక ఇది ఏ సామాజిక దశతోనూ ప్రమేయం లేకుండా స్వతంత్రంగా వుంటుంది. అంటే అన్ని దశల్లోనూ ఉమ్మడిగా వుంటుంది. కనుక మన కార్మికుణ్ణి ఇతర శ్రామికులతో వున్న సంబంధం ద్వారా చూపించనక్కరలేదు. మానవుడూ అతని శ్రమా ఒకవైపూ, ప్రకృతీ దాని పదార్థాలూ మరోవైపూ వుంటే చాలు. అంబలి రుచిని బట్టి, ఏ రైతు ఆ ధాన్యాన్ని పండించాడో తెలియనట్టే, ఈ సరళమైన ప్రక్రియ ఏ సామాజిక పరిస్థితుల్లో జరిగిందో తనకు తానుగా మనకు తెలియజేయదు. ఈ ప్రక్రియ జరిగింది బానిస యజమాని పాశవిక కొరడా దెబ్బల కిందనా, పెట్టుబడిదారుని ఆరాటపు కనుసన్నల అజమాయిషీలోనా అనేది తెలియదు. తన పొలాన్ని దున్నటం ద్వారా ఒక రైతు దీన్ని నిర్వహించాడా, లేక ఒక బర్బరుడు అడవి మృగాలను రాళ్లతో కొట్టి చంపడం ద్వారా నిర్వహించాడా అన్నది తెలియదు.[1]

ఇప్పుడు మనం మళ్ళీ మన కాబోయే పెట్టుబడిదారుని దగ్గరకు పోదాం. బహిరంగ మార్కెట్‌లో అతడు శ్రమ ప్రక్రియకు అవసరమైన అంశాలన్నిటినీ దాని భౌతిక అంశాలైన ఉత్పత్తి సాధనాలనూ మానవ అంశమైన శ్రమశక్తినీ – కొనుక్కున్నాక మనం అతణ్ణి వదిలి వచ్చాం. నిపుణుని దృష్టి కోణంలో అతడు తన ప్రత్యేక ఉత్పత్తి అవసరాలకు అనుగుణంగా ఉత్పత్తి సాధనాలనూ, శ్రమశక్తినీ కొనుక్కున్నాడు. అది వడికే పని కావచ్చు. బూట్ల తయారీ కావచ్చు లేదా మరేదైనా కావచ్చు. ఇక అతడు తాను కొన్న శ్రమశక్తిని వినియోగం చేయ ప్రారంభిస్తాడు. శ్రమశక్తి యొక్క మానవాకారమైన కార్మికుడు తన శ్రమ ద్వారా ఉత్పత్తి సాధనాలను వినియోగం చేసేలా చూడడం ద్వారా పెట్టుబడిదారుడు దీన్ని సాధిస్తాడు. కార్మికుడు తన కోసం కాకుండా పెట్టుబడిదారుని కోసం పని చేయడం వల్ల శ్రమ ప్రక్రియ యొక్క సాధారణ స్వభావంలో మార్పేమీ కనిపించదు. అంతేగాక, బూట్ల తయారీలో లేదా వడకటంలో అనుసరించే నిర్దిష్ట పద్ధతులూ, పనులూ పెట్టుబడిదారుని జోక్యం వల్ల వెంటనే మారిపోవు. మార్కెట్లో ఎటువంటి శ్రమశక్తి దొరుకుతుందో దాన్ని స్వీకరించడంతోనే అతను ప్రారంభించాలి.

---

1. తన అద్భుత కుశాగ్ర బుద్ధి విన్యాసంతో కర్నల్ టొరెన్స్ ఈ బర్బరుని రాతిలో పెట్టుబడి పుట్టిందని కనుక్కొన్నాడు. "అతడు (బర్బరుడు) వెంబడించే జంతువుపై విసరిన మొదటి రాయిలో, తనకందని పండుని కొట్టి కిందపడేయడానికి ఉపయోగించిన మొదటి కర్రలో ఒక వస్తువు కోసం మరో వస్తువును ఉపయోగించడం చూస్తాం. దానిలోనే పెట్టుబడి పుట్టుకను కనుగొంటాం." (ఆర్. టొరెన్స్ : యాన్ ఎస్సే ఆన్ ది ప్రొడక్షన్ ఆఫ్ వెల్త్" పుటలు 70-71)

కనుక, పెట్టుబడిదారులు తలెత్తటానికి ముందున్న కాలంలో దొరికే తరహా శ్రమతోనే అతడు సంతృప్తిపడాలి. పెట్టుబడికి శ్రమ లొంగటం వల్ల ఉత్పత్తిలో జరిగే మార్పులు తర్వాత కాలంలో మాత్రమే తలెత్తుతాయి. కనుక వాటిని తర్వాత అధ్యాయంలో పరిశీలిద్దాం.

పెట్టుబడిదారుడు శ్రమశక్తిని వినియోగం చేసుకునే ప్రక్రియగా మారిన శ్రమ ప్రక్రియ రెండు విలక్షణ గుణాలను వ్యక్తం చేస్తుంది. మొదటిది, కార్మికుడు తన శ్రమశక్తి ఎవరికి చెందుతుందో ఆ అజమాయిషీలో పనిచేస్తాడు. పని సక్రమంగా జరిగేలా, ఉత్పత్తి సాధనాలు తెలివిగా ఉపయోగించ బడేలా, ముడి పదార్థాలు అనవసరంగా వృథా కాకుండా వుండేలా, పనివల్ల అవసరమైన దానికంటే ఎక్కువగా పరికరాలు అరిగిపోకుండా వుండేలా పెట్టుబడిదారుడు జాగ్రత్త తీసుకుంటాడు.

రెండోది, ఉత్పాదితం దాని ప్రత్యక్ష ఉత్పత్తిదారుడైన కార్మికుడిది కాదు. అది పెట్టుబడిదారుడైన కార్మికుడిది కాదు. అది పెట్టుబడిదారుడి ఆస్తి. పెట్టుబడిదారుడు ఒక రోజు శ్రమశక్తిని దాని విలువ ఇచ్చి కొనుక్కుంటే, ఒక రోజుపాటు దాన్ని ఉపయోగించుకునే హక్కు అతనిదే. అతడు కొనుక్కున్న ఇతర సరుకుల్లాగానే యిది కూడా. ఉదాహరణకు ఒక రోజు పాటు అద్దెకు పుచ్చుకున్న గుర్రం మాదిరిగా. ఒక సరుకుని కొనుక్కున్న వానికే దాని ఉపయోగం చెందుతుంది. శ్రమశక్తిని అమ్ముకొన్నవాడు తన శ్రమని అర్పించుకోవడం ద్వారా వాస్తవంలో తాను అమ్మినదాని ఉపయోగపు విలువని వదులుకోవడం తప్ప మరేమీ చెయ్యడు. అతడు వర్క్‌షాపులో అడుగు పెట్టిన దగ్గర్నుండీ, అతని శ్రమశక్తి యొక్క ఉపయోగపు విలువ పెట్టుబడిదారునికే చెందుతుంది. కనుక దాని ఉపయోగం, అంటే శ్రమ కూడా అతనికే చెందుతుంది. శ్రమశక్తిని కొనడం ద్వారా పెట్టుబడిదారుడు పులియబెట్టే సజీవ పదార్థంగా శ్రమను ఉత్పాదితం యొక్క నిర్జీవ భాగాలకు జోడిస్తాడు. అతని దృష్టిలో శ్రమ ప్రక్రియ అంటే కొనుక్కున్న సరుకును వినియోగించడం తప్ప వేరుగాదు. అంటే శ్రమశక్తిని వినియోగించడం. అయితే శ్రమశక్తిని ఉత్పత్తి సాధనాలు సరఫరా చేస్తేనే ఈ వినియోగం సాధ్యమవు తుంది. శ్రమ ప్రక్రియ అనేది పెట్టుబడిదారుడు కొనుక్కున్న వస్తువుల మధ్య, అతని ఆస్తిగా మారిన వస్తువుల మధ్య జరిగే ప్రక్రియ. కనుక ఈ ప్రక్రియలో పుట్టే ఉత్పాదితం అతనిదే. అతని నేల మాళిగలో పులియబెట్టబడిన ద్రాక్షాసవం అతనికి చెందినట్టుగానే ఇది కూడా.[1]

---

1. "ఉత్పాదితాలు పెట్టుబడిగా మారక ముందే స్వాధీనం చేసుకోబడతాయి. ఆ మార్పు వల్ల అవి అలా స్వాధీనం కాకుండా వుండే స్థితి ఏర్పడదు." (చెర్బ్యూలియజ్ : "Richesse on pauvrete" edit. పారిస్, 1841, పుట 54) "ఒక నిర్దిష్ట పరిమాణం గల జీవనాధారాల కోసం తన శ్రమను అమ్ముకోవడం ద్వారా కార్మికుడు ఉత్పాదితంలో వాటానంతటినీ వదులుకుంటాడు. ఉత్పాదితాల్ని స్వాధీనం చేసుకునే పద్ధతి ఇదివరకటిలాగే వుంటుంది. మనం పేర్కొన్న బేరసారాల వల్ల అందులో మార్పేమీ వుండదు. ముడి పదార్థాలనీ, జీవనాధార వస్తువుల్నీ సరఫరా చేసిన పెట్టుబడిదారునికే ఉత్పాదితం పూర్తిగా చెందుతుంది. స్వాధీన నియమం యొక్క కచ్చితమైన పరిణామం ఇది. ఆ నియమం యొక్క ప్రాథమిక సూత్రానికి ఇది పూర్తిగా వ్యతిరేకం. ప్రతి కార్మికునికీ తాను ఉత్పత్తి చేసే ఉత్పాదితం పైన పూర్తి యాజమాన్యపు హక్కుంటుంది అనేది ఆ సూత్రం." (పుట 58) "కార్మికులు తమ శ్రమకు వేతనాలు పొందినప్పుడు, పెట్టుబడిదారుడు కేవలం పెట్టుబడి (ఉత్పత్తి సాధనాలు, అని అతని ఉద్దేశం)కి మాత్రమే గాక శ్రమకు కూడా యజమానే. ఇప్పుడు మామూలుగా జరుగుతున్న తీరులో వేతనాల క్రింద చెల్లించిన మొత్తాన్ని కూడా పెట్టుబడిగా పరిగణిస్తే శ్రమను పెట్టుబడి నుండి వేరుచేసి మాట్లాడటం అసంబద్ధమవుతుంది. ఆ రకంగా పెట్టుబడి అనే పదం శ్రమనీ, పెట్టుబడినీ రెంటినీ సూచిస్తుంది. (జేమ్స్‌మిల్ "ఎలిమెంట్స్ ఆఫ్ పొలిటికల్ ఎకానమి" ఎడిషన్ 1921, పుటలు 70-71)

## విభాగం - 2

# అదనపు విలువ ఉత్పత్తి

పెట్టుబడిదారుడు స్వాధీనం చేసుకున్న ఉత్పాదితం ఒక ఉపయోగపు విలువ. ఉదాహరణకి, నూలు లేదా బూట్లు. ఒక రకంగా బూట్లు సామాజిక ప్రగతికంతటికీ పునాది అయినప్పటికీ, మన పెట్టుబడిదారుడు ఎదురులేని "ప్రగతివాది" అయినప్పటికీ అతడు బూట్లను బూట్ల కోసమే తయారుచేయడు. ఉపయోగపు విలువ అనేది ఏమాత్రం సరకుల ఉత్పత్తిలో "దానికోసమే అదిగా" కోరబడే వస్తువు కాదు. ఉపయోగపు విలువలు మార్పిడి విలువలకు పాదార్థిక రూపాలైన మేరకు, అవి వాటి నిలయాలయిన మేరకు, ఆ కారణంగా మాత్రమే పెట్టుబడిదారుడు ఉపయోగపు విలువల్ని ఉత్పత్తి చేస్తాడు. మన పెట్టుబడిదారుని దృష్టిలో రెండు లక్ష్యాలున్నాయి. మొదటిది, అతడు మార్పిడి విలువ వున్న ఉపయోగపు విలువను తయారు చెయ్యాలనుకుంటాడు. అంటే అమ్మకం కోసం ఉద్దేశించిన వస్తువు, ఒక సరకు. రెండోది, దాని ఉత్పత్తిలో ఉపయోగించిన సరకుల యొక్క అంటే అతడు తన డబ్బుతో కొనుక్కున్న ఉత్పత్తి సాధనాల యొక్కా శ్రమశక్తి యొక్కా విలువల మొత్తం కంటే ఎక్కువ విలువ కలిగిన సరకుని తయారు చేయాలనుకుంటాడు. అతను ఉత్పత్తి చేయాలనుకున్నది కేవలం ఉపయోగపు విలువని కాదు, సరకుని కూడా, ఉపయోగపు విలువని మాత్రమే కాదు, విలువని కూడా. విలువని మాత్రమే కాదు, అదే సమయంలో అదనపు విలువని కూడా.

ఇప్పుడు మనం సరకుల ఉత్పత్తితో వ్యవహరిస్తున్నామనీ, ఇప్పటి వరకూ ఆ ప్రక్రియ యొక్క ఒక పార్శ్వాన్నే పరిశీలించామనీ గుర్తుంచుకోవాలి. సరకులు ఏకకాలంలో ఉపయోగపు విలువలూ, విలువలూ అయినట్టే వాటిని ఉత్పత్తి చేసే ప్రక్రియ కూడా ఏకకాలంలో శ్రమ ప్రక్రియా, విలువని సృష్టించే ప్రక్రియ అవుతుంది.[1]

ఇప్పుడు మనం ఉత్పత్తిని విలువ సృష్టిగా పరిశీలిద్దాం.

ప్రతి సరకు విలువ, దాని ఉత్పత్తి కోసం దానిపై ఖర్చయి, భౌతిక రూపం ధరించిన శ్రమ పరిమాణాన్ని బట్టి, నిర్దిష్ట సామాజిక పరిస్థితుల్లో అవసరమైన శ్రమ కాలాన్ని బట్టి నిర్ణయించబడుతుందని మనకు తెలుసు. అతని కోసం నిర్వహించబడిన శ్రమ ప్రక్రియ ఫలితంగా పెట్టుబడిదారునికి సంక్రమించిన ఉత్పాదితానికి కూడా ఈ సూత్రం వర్తిస్తుంది. ఈ ఉత్పాదితం 10 పౌనుల నూలు అనుకుందాం. దానిలో భౌతిక రూపం ధరించిన శ్రమ పరిమాణాన్ని లెక్కగట్టడమే మన మొట్టమొదటి పని.

నూలు వడకాలంటే ముడి పదార్థం కావాలి. ఇక్కడ 10 పౌనుల దూది అవసరమనుకుందాం. ప్రస్తుతం మనం ఈ దూది విలువను పరిశోధించాల్సిన అవసరం లేదు. మన పెట్టుబడిదారుడు

---

1. ఇంతకు ముందే పేర్కొన్నట్టుగా, ఈ రెండు విభిన్న శ్రమ అంశాలకు గాను ఇంగ్లీషు భాషలో రెండు విభిన్న పదాలున్నాయి. సాదా శ్రమ ప్రక్రియలో, ఉపయోగపు విలువల ఉత్పత్తిలో వర్క్ (పని) అనే పదాన్ని వాడుతారు. విలువని సృష్టించే ప్రక్రియలో లేబర్ (శ్రమ) అనే పదాన్ని కచ్చితమైన ఆర్థిక అర్థంలో వాడుతారు. - ఏంగెల్స్.

దాన్ని దాని పూర్తి విలువ యిచ్చి ఉదాహరణకి 10 షిల్లింగులిచ్చి కొన్నాడనుకుందాం. ఈ ధరలో దూది ఉత్పత్తికి అవసరమైన శ్రమ, సగటు సామాజిక శ్రమ రూపంలో ఇంతకు ముందే వ్యక్తమైంది. ఇక్కడ కదురు మిగిలిన శ్రమ పరికరాలన్నిటికీ ప్రతినిధి అనుకుందాం. దాని అరుగుదల 2 షిల్లింగులనుకుందాం. 12 షిల్లింగుల విలువ గల బంగారం ఉత్పత్తి చేయడానికి, ఇరవై నాలుగు గంటలు లేదా రెండు పని దినాలు అవసరమైనాయనుకుందాం. అప్పుడు నూలులో ఇప్పటికే రెండు రోజుల శ్రమ రూపుదాల్చి వున్నదని అర్థం.

దూది కొత్త ఆకారం ధరించింది. కదురు కొంత మేరకు ఖర్చు అయింది. ఈ పరిస్థితి మనల్ని తప్పుదోవ పట్టించరాదు. సాధారణ విలువ నియమం ప్రకారం 40 పౌనుల నూలు విలువ = 40 పౌనుల దూది విలువ + మొత్తం కదురు విలువ అయినట్లయితే, సమీకరణంలో ఇరువైపులా వున్న సరకులను ఉత్పత్తి చేయడానికి ఒకే శ్రమ కాలం అవసరమయితే, అప్పుడు 10 పౌనుల నూలు నాలుగో వంతు కదురుతో కలిసిన 10 పౌనుల దూదితో సమానమవుతుంది. ఇప్పుడు మనం పరిశీలిస్తున్న ఉదాహరణలో ఒకవైపున 10 పౌనుల నూలులోనూ, మరో వైపున 10 పౌనుల దూదిలోనూ ఒక భాగం కదురులోనూ ఒకే శ్రమ కాలం భౌతిక రూపం ధరించింది. కనుక, విలువ దూదిలో దర్శనమిస్తుందా, కదురులో లేదా నూలులో దర్శనమిస్తుందా అన్నదానితో ఆ విలువ పరిమాణానికి ప్రమేయం లేదు. కదురూ, దూదీ పక్క పక్కనే కూర్చుని ప్రశాంతంగా విశ్రాంతి తీసుకోటానికి బదులు, ఆ ప్రక్రియలో కలుస్తాయి. వాటి రూపాలు మారుతాయి, అవి నూలుగా మారతాయి. అయితే దీనివల్ల వాటి విలువలో మార్పేమీ రాదు. అవి వాటితో సమ విలువ అయిన నూలుతో మార్పిడి చేసుకున్నా వాటి విలువలో మార్పు రాదు. ఇదీ అంతే.

నూలుకి ముడి పదార్థమైన దూదీ ఉత్పత్తికి అవసరమైన శ్రమ నూలు ఉత్పత్తికి అవసరమైన శ్రమలో ఒక భాగం. కనుక అది నూలులో వుంటుంది. ఇదే విషయం కదురులో వున్న శ్రమకీ వర్తిస్తుంది. అది అరగి వుండకపోతే దూది వడకబడి వుండేది కాదు.

నూలు విలువని లేదా దాని ఉత్పత్తికి అవసరమైన శ్రమ కాలాన్ని నిర్ధారించడానికి, వివిధ సమయాలలో, వివిధ ప్రాంతాల్లో నిర్వహించబడిన ప్రత్యేక ప్రక్రియలన్నిటినీ పరిగణనలోకి తీసుకోవాలి. మొదట దూదిని ఉత్పత్తి చేయడానికీ, ఖర్చయిన కదురుని ఉత్పత్తి చేయడానికీ, తర్వాత దూది, కదురులతో నూలు వడకటానికీ అవసరమైన ప్రక్రియలన్నిటినీ ఒకే ఒక ప్రక్రియకు వున్న విభిన్న క్రమ దశలుగా భావించవచ్చు. మొత్తం నూలులో వున్న శ్రమంతా గత శ్రమ. దాని అంతర్భాగాల ఉత్పత్తికి అవసరమైన కార్యకలాపాలన్నీ ప్రస్తుత సమయంతో పోలిస్తే, దాని చివరి చర్య అయిన వడకటానికి ముందు గతంలో ఎప్పుడో జరిగాయి అన్న అంశంతో ఇక్కడ ప్రమేయం లేదు. ఒక ఇల్లు కట్టడానికి ఒక నిర్దిష్ట పరిమాణం గల శ్రమ, ఉదాహరణకి ముప్పయి రోజుల శ్రమ అవసరం అనుకుందాం. మొదటి రోజు పని మొదలుపెట్టాక చివరి రోజు పని ఇరవై తొమ్మిది రోజుల తర్వాత జరిగింది అన్న విషయం వల్ల ఇంటిలో రూపుదాల్చి వుండే శ్రమ మొత్తం మారదు. కనుక, ముడి పదార్థంలోనూ, శ్రమ పరికరాల్లోనూ ఇమిడి వున్న శ్రమని, వాస్తవంగా వడకటం అనేది ఇంకా

ప్రారంభించకముందే వడకటం అనే ప్రక్రియ యొక్క తొలి దశలో ఖర్చయిన శ్రమగా పరిగణించవచ్చు.

ఉత్పత్తి సాధనాల విలువలు, అంటే దూది, కదురుల విలువలు 12 షిల్లింగుల్లో వ్యక్తమయ్యాయి. అవి నూలు విలువలో లేదా మరోలా చెప్పాలంటే, ఉత్పాదితం విలువలో అంతర్భాగాలు.

ఇక్కడ రెండు షరతులు నెరవేరాలి. మొదటిది, ఒక ఉపయోగపు విలువ ఉత్పత్తిలో దూది, కదురూ కలవాలి. ప్రస్తుత ఉదాహరణలో, అవి నూలుగా మారాలి. విలువకి, ఆ వస్తువు యొక్క నిర్దిష్ట ఉపయోగపు విలువతో ప్రమేయం లేదు. కాని అదే ఏదో ఒక ఉపయోగపు విలువలో సాకార రూపం ధరించాలి. రెండోది, ఉత్పత్తిలో శ్రమకి పట్టే కాలం నిర్దిష్ట సామాజిక పరిస్థితుల్లో నిజంగా అవసరమైన సమయం కంటే ఎక్కువ పట్టగూడదు. కనుక ఒక పౌను నూలు వడకటానికి 1 పౌను దూది అవసరమయితే ఇంతకు మించిన బరువు గల దూది వినియోగం కాకుండా జాగ్రత్త తీసుకోవాలి. కదురు విషయంలో కూడా అంతే. ఉక్కు కదురు వాడటానికి బదులు బంగారం కదురు వాడటం అనేది పెట్టుబడిదారుని హాబీ అయుండవచ్చు. కాని ఒక ఉక్కు కదురు ఉత్పత్తి చేయడానికి అవసరమైన శ్రమ మాత్రమే నూలు విలువలో భాగంగా లెక్క కట్టబడుతుంది. ఎందుకంటే, నిర్దిష్ట సామాజిక పరిస్థితుల్లో అంతకు మించి అవసరం లేదు.

నూలు విలువలో ఎంత భాగం దూది వల్ల, కదురు వల్లా ఏర్పడిందో ఇప్పుడు మనకి తెలుసు. అది 12 షిల్లింగులు, లేదా రెండు రోజుల పని విలువ. నూలు విలువలో ఎంత భాగం వడికే వ్యక్తి దూదికి కలిపాడు అన్నది మనం పరిశీలించాల్సిన తర్వాతి అంశం.

ఇప్పుడు మనం ఈ శ్రమని, అది శ్రమ ప్రక్రియలో ఉన్నప్పటి కంటే భిన్నమైన దృష్టితో పరిశీలించాలి. అక్కడ దాన్ని మనం కేవలం దూదిని నూలుగా మార్చే ఒక నిర్దిష్ట మానవ కార్యకలాపంగా మాత్రమే భావించాం. ఇతర పరిస్థితులు యధాతథంగా వున్నప్పుడు అక్కడ పనికి శ్రమ ఎంత అనువుగా వుంటే నూలు అంత చక్కగా తయారవుతుంది. వడికే మనిషి శ్రమ ఇతర ఉత్పాదక శ్రమల కంటే భిన్నమని భావించబడింది. ఒక రకంగా దాని ప్రత్యేక లక్ష్యం రీత్యా, అంటే వడకటం రీత్యా భిన్నం. మరో రకంగా దాని చర్యల ప్రత్యేక స్వభావం రీత్యా, దాని ఉత్పత్తి సాధనాల ప్రత్యేక స్వభావం రీత్యా, దాని ఉత్పాదితం యొక్క ప్రత్యేక ఉపయోగపు విలువ రీత్యా అది భిన్నం. వడకటం అనే ప్రక్రియకి దూది, కదురు అవసరం. అయితే తుపాకి చేయడానికి అవి ఏ రకంగానూ పనికిరావు. కాని ఇక్కడ, అందుకు విరుద్ధంగా వడికే వాని శ్రమని విలువ సృష్టించిన మేరకే, అంటే అది విలువకు మూలంగా వున్నంత మేరకే మనం పరిగణిస్తే, అప్పుడు తుపాకి గొట్టం చేసే వ్యక్తి శ్రమ కంటే ఈ శ్రమ ఏ రకంగానూ భిన్నం కాదు. లేదా (మన ఉదాహరణకి మరింత సన్నిహితంగా వుండే) ఉత్పత్తి సాధనాలలో ఇమిడివున్న రైతు శ్రమకి కదురు చేసే వాని శ్రమకీ ఇది భిన్నం కాదు.

ఈ అభిన్నత వల్లనే, పత్తి పండించడం, కదురు చేయడం, వడకటం అనేవి నూలు విలువ అనే ఒకే సమస్తంలో అంతర్భాగాలు కాగలిగాయి. అవి ఇక్కడ ఒకదాని కంటే ఒకటి పరిమాణం రీత్యా మాత్రమే భిన్నం. ఇక్కడ మనకి ప్రమేయం వున్నది నూలు విలువ యొక్క గుణంతో కాదు, దాని నిర్దిష్ట శ్రమ లక్షణాలతో కాదు, కేవలం దాని పరిమాణంతో మాత్రమే. దీన్ని లెక్కగట్టాలి అంతే. వడకటాన్ని మనం నైపుణ్యం లేని సాదా శ్రమగా, నిర్దిష్ట సామాజిక దశ యొక్క సగటు శ్రమగా

ఊహించి వ్యవహరిస్తాము. దీనికి విరుద్ధమైన ఊహను స్వీకరించినా, విషయంలో తేడా వుండదని ఇక ముందు గమనిస్తాం.

కార్మికుడు పనిలో వున్నప్పుడు అతని శ్రమ నిరంతరాయంగా రూప పరివర్తనకు గురౌతుంది. చలనంగా వున్నది చలన రహితమైన వస్తువుగా మారుతుంది. పనిచేసే కార్మికుడుగా వున్నది తయారైన వస్తువుగా మారుతుంది. ఒక గంట వడికినాక ఆ చర్య ఒక నిర్దిష్ట నూలు పరిమాణం చేత ప్రాతినిధ్యం వహించబడుతుంది. మరోలా చెప్పాలంటే ఒక నిర్దిష్ట పరిమాణం గల శ్రమ, ఒక గంట శ్రమ అనేది, దూదిలో సాకార రూపం ధరించింది. మనం శ్రమ అంటాం. అంటే వడికేవాని జీవశక్తి వ్యయం. మనం వడికే శ్రమ అనం. ఎందుకంటే, వడకటం అనే ప్రత్యేకమైన పని ఇక్కడ సాధారణ రూపంలో శ్రమశక్తి వ్యయంగా మాత్రమే లెక్కించబడుతుంది. వడికేవాని ప్రత్యేక పనిగా పరిగణించబడదు.

మనం ఇప్పుడు పరిశీలిస్తున్న ప్రక్రియలో దూదిని నూలుగా మార్చే పనిలో నిర్దిష్ట సామాజిక పరిస్థితుల్లో అవసరమైన కాలం కంటే ఎక్కువ కాలం పట్టకుండా వుండటం అత్యంత ప్రధానం. మామూలు, అంటే సగటు సామాజిక ఉత్పత్తి పరిస్థితుల్లో, ఒక గంట శ్రమ 'క' పౌనుల దూదిని 'చ' పౌనుల నూలుగా మార్చగలదు అనుకుందాం. అప్పుడు ఒక రోజు శ్రమ 12 'క' పౌనుల దూదిని 12 'చ' పౌనుల నూలుగా మార్చలేకపోతే, అది 12 గంటల శ్రమగా లెక్కించబడదు. ఎందుకంటే, విలువ సృష్టిలో సామాజికంగా అవసరమైన శ్రమ మాత్రమే లెక్కలోకి వస్తుంది.

శ్రమ మాత్రమే కాక ముడి పదార్థాలూ, ఉత్పాదితమూ కూడా మనం వాటిని శుద్ధ, సాదా శ్రమ ప్రక్రియలో చూసినప్పటి కంటే ఇప్పుడు కొత్త రూపంలో దర్శనమిస్తాయి. ముడి పదార్థం ఇప్పుడు కేవలం ఒక నిర్దిష్ట పరిమాణం గల శ్రమని ఇముడ్చుకున్న వస్తువుగా మాత్రమే వ్యవహరిస్తుంది. ఇలా ఇముడ్చుకోటం వల్ల నిజానికి అది నూలుగా మారింది. ఎందుకంటే వడకబడింది కనుక, వడకటం రూపంలో శ్రమశక్తి దానికి కలపబడింది కనుక. అయితే, నూలు అనే ఉత్పాదితం ఇప్పుడు దూది ఇముడ్చుకున్న శ్రమకి కొలమానం తప్ప వేరుగాదు. ఒక గంటలో $1\frac{2}{3}$ పౌనుల దూది, $1\frac{2}{3}$ పౌనుల నూలుగా వడకబడితే 10 పౌనుల నూలు 6 గంటల కాలాన్ని ఇముడ్చుకున్నట్టవుతుంది. ఉత్పాదితం యొక్క నిర్దిష్ట పరిమాణాలు (అనుభవం చేత నిర్ణయించబడేటట్టి పరిమాణాలు) ప్రాతినిధ్యం వహించేది నిర్దిష్ట శ్రమ పరిమాణాలకు, పదార్థ రూపం ధరించిన నిర్దిష్ట శ్రమ కాలపు మొత్తాలకు తప్ప వేరుగాదు. అవి భౌతిక రూపం ధరించిన యిన్ని సామాజిక శ్రమ గంటలు, లేదా రోజులు తప్ప వేరుగాదు.

శ్రమ అంటే వడకటమనే నిర్దిష్ట కార్యం అనీ, దాని గ్రహీత దూది అనీ, దాని ఉత్పాదితం నూలు అనీ తెలియజేసే వాస్తవాలతో మనకిక్కడ ప్రమేయం లేదు. ఆ గ్రహీతే స్వయంగా ఒక ఉత్పాదితమనీ, కనుక ముడి పదార్థమనీ తెలిపే వాస్తవాలతో ప్రమేయం లేనట్టే యిది కూడా. వడికే వ్యక్తి వడకటానికి బదులు బొగ్గుగనిలో పనిచేస్తూ వుండి వుంటే, అతని శ్రమ గ్రహీత అయిన బొగ్గుని ప్రకృతే సరఫరా చేసేది. అయినప్పటికీ, వెలికి తీసిన నిర్దిష్ట పరిమాణం గల బొగ్గు, ఉదాహరణకు ఒక హండ్రెడ్ వెయిట్ బొగ్గు తనలో ఇముడ్చుకున్న నిర్దిష్ట పరిమాణం గల శ్రమకి ప్రాతినిధ్యం వహిస్తుంది.

శ్రమశక్తి అమ్మకం జరుగుతున్న సమయంలో ఒక రోజు శ్రమశక్తి విలువ మూడు షిల్లింగులనీ, ఆ మొత్తంలో ఆరు గంటల శ్రమ రూపుదాల్చి వుందనీ భావించాం. కనుక సగటున ప్రతి రోజు కార్మికునికి అవసరమైన వస్తువుల తయారీకి యీ మొత్తం శ్రమ అవసరమనీ భావించాం. ఇప్పుడు మన వడికే వ్యక్తి ఒక గంట పనిజేసి $1\frac{2}{3}$ పౌనుల దూదిని, $1\frac{2}{3}$ పౌనుల[1] నూలుగా మార్చగలడూ అంటే అతడు ఆరు గంటల్లో 10 పౌనుల దూదిని 10 పౌనుల నూలుగా మార్చగలడని అర్థం. కనుక వడకటం అనే ప్రక్రియలో దూది ఆరు గంటల శ్రమని ఇముడ్చుకుంటుంది. మూడు షిల్లింగుల విలువ గల బంగారం ముక్కలో కూడా ఇంతే పరిమాణం గల శ్రమ సాకార రూపం ధరిస్తుంది. కనుక, కేవలం వడకటం అనే శ్రమవల్ల దూదికి మూడు షిల్లింగుల విలువ కలిసింది.

ఇప్పుడు మనం 10 పౌనుల నూలు అనే ఉత్పాదితం యొక్క మొత్తం విలువను పరిశీలిద్దాం. దానిలో రెండున్నర రోజుల శ్రమ సాకార రూపం ధరించింది. దూదిలోనూ, కదురు యొక్క అరిగిపోయిన భాగంలోనూ రెండు రోజులున్నాయి. వడకటం అనే ప్రక్రియలో సగం రోజు ఇముడ్చుకోబడింది. ఈ రెండున్నర రోజుల శ్రమకి పదిహేను షిల్లింగుల విలువ గల బంగారం ముక్క కూడా ప్రాతినిధ్యం వహిస్తుంది. కనుక పదిహేను షిల్లింగులు 10 పౌనుల నూలుకి సరైన ధర. లేదా ఒక పౌను నూలు ధర పద్దెనిమిది పెన్నీలు.

మన పెట్టుబడిదారుడు ఆశ్చర్యంతో గుడ్లప్పగించి చూస్తాడు. ఉత్పాదితం విలువ సరిగా అడ్వాన్సు చేసిన పెట్టుబడితో సమానంగా వుంది. అలా అడ్వాన్సు చేయబడిన విలువ విస్తరించలేదు. అదనపు విలువేదీ సృష్టించబడలేదు. కనుక, డబ్బు పెట్టుబడిగా మారలేదు. నూలు ధర పదిహేను షిల్లింగులు. ఆ ఉత్పాదితం యొక్క అంతార్భగాలన్నిటికీ కలిపి అంటే శ్రమ ప్రక్రియలో వున్న అంశాలన్నిటికీ బహిరంగ మార్కెటులో చెల్లించింది కూడా పదిహేను షిల్లింగులే. పది షిల్లింగులు దూది కోసం చెల్లించబడ్డాయి; రెండు షిల్లింగులు కదురులో అరిగిపోయిన పదార్థానికి మూడు షిల్లింగులు శ్రమశక్తికి, పెరిగిన నూలు విలువ వల్ల ప్రయోజనమేమి లేదు. ఎందుకంటే అది కేవలం దూదిలో, కదురులో యిదివరకే వున్న విలువలకు, శ్రమశక్తి విలువ కలవగా ఏర్పడిన మొత్తం మాత్రమే. ఉన్న విలువలను ఊరక కలపడం ద్వారా అదనపు విలువేదీ తలెత్తదు.[2] ఈ విడి విడి విలువలన్నీ ఇప్పుడు ఒకే వస్తువులో కేంద్రీకృతమయ్యాయి. సరకుల కొనుగోలులో పదిహేను షిల్లింగుల మొత్తం మూడు భాగాలుగా విడిపోటానికి ముందు ఈ మూడు భాగాలు కూడా అంతే; ఆ మొత్తంలో కేంద్రీకృతమయ్యాయి.

1. ఇవి కేవలం నా సొంత అంకెలు.
2. వ్యవసాయేతర శ్రమ అంతా అనుత్పాదకమే అనే ఫిజియోక్రాట్ల సిద్ధాంతానికి ఈ మౌలిక ప్రతిపాదన పునాది. సాంప్రదాయిక అర్థశాస్త్రవేత్తకి యిదొక తిరస్కరించ వీలులేని సత్యం. "ఒక నిర్దిష్ట వస్తువుకి అనేక యితర వస్తువుల విలువని కలిపే ఈ పద్ధతి (ఉదాహరణకి, నేతగాని కోసం పెట్టే ఖర్చుని నారకి అయ్యే ఖర్చుకి కలపడం) ఒకే ఒక విలువపైన పొరలు పొరలుగా వివిధ విలువల్ని పేర్చడం లాంటి ఈ పద్ధతి కలిగించే ఫలితం ఏమిటంటే, ఈ విలువ అదే మేరకు పెరుగుతుంది. తయారైన ఉత్పాదితం ధర ఎలా ఏర్పడిందీ అనే దాన్ని "కలపడం" అనే పదం స్పష్టం చేస్తుంది. అనుభుక్తమైన అనేక విలువల మొత్తమే ఈ ధర. వాటిని కలపడం ద్వారానే అది వచ్చింది. అయితే కలపడం అనేది హెచ్చించడం లాంటిది కాదు. (మెర్సియర్ డి లా రివియర్, పుట 599)

నిజానికి ఈ ఫలితం రావడంలో విచిత్రమేమీ లేదు. ఒక పౌను నూలు విలువ పద్దెనిమిది పెన్నీలు కనుక మన పెట్టుబడిదారుడు 10 పౌనులు నూలు మార్కెట్‌లో కొంటే అతడు దానికి పదిహేను షిల్లింగులు చెల్లించాలి. ఒక మనిషి తయారైన ఇంటిని కొనుక్కున్నా లేదా తాను ఇల్లు కట్టించుకున్నా, ఏ పద్ధతిలో అతను ఇల్లు సంపాయించుకున్నా, ఇంటికిగాను అతను ఖర్చు పెట్టే మొత్తం డబ్బు మారదు.

తన నాటు అర్ధశాస్త్రంలో ఆరితేరిన మన పెట్టుబడిదారుడు "అయితే, నేను మరింత డబ్బు సంపాదించడానికే కదా, నా డబ్బు అడ్వాన్సు చేశాను" అని అడుగుతాడు. నరకానికి పోయే బాట కూడా మంచి ఉద్దేశాలతోనే వేయబడింది. అసలు అతడు ఏమీ ఉత్పత్తి చేయకుండానే అంతే సులభంగా డబ్బు సంపాదించాలని అనుకొని వుండొచ్చు.[1] అతడు ఎన్నో రకాలుగా బెదిరిస్తాడు. ఇంత ఏమరుపాటుకు ఇక ఎప్పుడూ లోనుగాడు. ఇక ముందు సరకుల్ని తానే తయారుచేయడానికి బదులు వాటిని మార్కెట్లో కొనుక్కుంటాడు. అయితే అతని సోదర పెట్టుబడిదారులంతా అదే పని చేస్తే మనవాడికి మార్కెట్లో సరకులెట్లా దొరుకుతాయి? డబ్బునైతే తినలేడు గదా. అతడిక నచ్చచెప్పడానికి ప్రయత్నిస్తాడు. "చూడు. నేను భోగాలను విసర్జించాను. 15 షిల్లింగుల్నీ నేను ఎడాపెడా ఖర్చు పెట్టుకుని వుండొచ్చు. కాని నేను దానిని చాలా ఉత్పాదకంగా వినియోగించి, దానితో నూలు తయారుచేశాను." మంచిది. అందుకే, దానికి బహుమానంగా ఇప్పుడతనికి అంతరాత్మ బాధ లేకుండా, దానికి బదులు మంచి నూలుంది గదా. పిసినారిగా వుంటాడంటారా, అటువంటి చెడ్డ పద్ధతుల జోలికి అతడు మళ్ళీ ఎప్పుడూ పోడు. అటువంటి వాంఛా విసర్జనం ఎటువంటి ఫలితాలకు దారితీస్తుందో ముందే గమనించాము. పైగా ఏమీ లేనిచోట రాజుగారి హక్కులన్నీ పోతాయి. అతని భోగ విసర్జనంలో ఎటువంటి సుగుణం వున్నప్పటికీ దానికి బదులుగా ప్రతిఫలమేమీ వుండదు. ఎందుకంటే, ఉత్పాదితం విలువ అనేది కేవలం ఉత్పత్తి ప్రక్రియలోకి నెట్టబడిన సరకుల విలువల మొత్తం మాత్రమే. కనుక మంచితనమే తనకు దక్కే బహుమానమని తనని తాను ఊరడించుకోనివ్వండి. అబ్బే, అతడు రచ్చ పెడతాడు. "ఈ నూలు నాకక్కర్లేదు. అమ్మడానికే దాన్ని తయారుచేశాను" అంటాడు. అయితే అమ్ముకోనివ్వండి. లేదా అధికోత్పత్తి అనే అంటుజాడ్యానికి ఔషధంగా అతని వైద్యుడు మాక్‌ల్లోక్ నిర్ణయించిన తిరుగులేని చిట్కాని అనుసరించి ఇక ముందు తన సొంత అవసరాలు తీర్చుకోడం కోసమే వస్తువుల్ని ఉత్పత్తి చెయ్యనివ్వండి. ఇప్పుడు అతను ఇంకా మొండికెత్తుతాడు. "కార్మికుడు కేవలం తన చేతులూ, కాళ్ళతోనే సరకుల్ని శూన్యంలోంచి పుట్టిస్తాడా? అతనికి నేను అవసరమైన పదార్థాలను సరఫరా చెయ్యలేదా? వాటి ద్వారానే కదా అతని శ్రమ సాకార రూపం ధరించింది! సమాజంలో అత్యధికులు అటువంటి పుట్టుదరిద్రులే కాబట్టి నా ఉత్పత్తి పరికరాల ద్వారా, నా దూదీ, కదురుల ద్వారా సమాజానికి లెక్కగట్టలేనంత సేవజేయలేదా? సమాజానికే

1. ఆ రకంగానే అతడు 1844-47 నుండి ఉత్పాదక రంగం నుండి తన డబ్బులో కొంత భాగాన్ని రైల్వే చట్టా వ్యాపారంలో ఉపయోగించడం కోసం వెనక్కి తీసేసుకున్నాడు. అమెరికా అంతర్యుద్ధ కాలంలో కూడా అంతే. లివర్‌పూల్ దూది మార్కెట్‌లో జూదమాడేటందుకు అతను తన ఫ్యాక్టరీని మూసేసి పనివాళ్ళను వీధుల్లోకి నెట్టాడు.

కాదు, కార్మికునికి మాత్రం జీవనాధార వస్తువులను సమకూర్చడం ద్వారా నేను ఎనలేని సేవ జేయలేదా? ఈ సేవకంతటికీ నాకు దక్కేది శూన్యమేనా?" అని అడుగుతాడు. సరే, అతని దూదినీ, కదురునీ నూలుగా మార్చడం ద్వారా కార్మికుడు అతనికి సమానమైన సేవ జేయలేదా? పైగా ఇక్కడ సేవ అనే ప్రశ్నే లేదు.[1] సేవ అంటే సరకు రూపంలోనయినా సరే, శ్రమ రూపంలో నయినా సరే వున్న ఒక ఉపయోగపు విలువ యొక్క ఉపయోగకర ఫలితం తప్ప వేరుగాదు.[2] అయితే ఇక్కడ మనం పరిశీలిస్తోంది మార్పిడి విలువని. పెట్టుబడిదారుడు కార్మికునికి 3 షిల్లింగుల విలువని చెల్లించాడు. కార్మికుడు అంతే సమ విలువని, 3 షిల్లింగుల విలువని దూదికి కలిపి తిరిగి యిచ్చేశాడు. అతడు విలువకు బదులు విలువ యిచ్చేశాడు. ఇంత వరకూ ధన గర్వంతో వుండే మన మిత్రుడు హఠాత్తుగా తన సొంత పనివానికి సహజమైన నమ్రతతో యిలా అడుగుతాడు. "నేను మాత్రం స్వయంగా పని చేయలేదా? నేను అజమాయిషీ చెయ్యలేదా, వడికేవాడు సరిగా పనిచేస్తున్నదీ లేనిదీ చూడలేదా? ఈ శ్రమ కూడా విలువని సృష్టించదా?" అతని మేస్త్రీ, అతని మానేజరూ చిరునవ్వు దాచుకోడానికి ప్రయత్నిస్తారు. ఈలోగా మనవాడు పకపక నవ్వేసి పాత దర్పాన్ని సంతరించుకొంటాడు. ఆర్థికవేత్తల సూక్తుల్ని మనకి అతడు వల్లించినప్పటికీ వాస్తవంలో వాటికి చిల్లిగవ్వ విలువ కూడా యివ్వను అంటాడు. ఇటువంటి అమాంబాపతు సాకుల్నీ, టక్కుటమారాలనీ అర్థశాస్త్రపు ప్రొఫెసర్లకు, తమకు ముట్టే ప్రతిఫలం కోసం పనిచేసే ప్రొఫెసర్లకు వదిలేస్తాడు. అతని మట్టుకు అతను కార్యవాది. అతని వ్యాపారానికి బయట తను మాట్లాడే అంశాల గురించి ఆలోచించక పోయినప్పటికీ అతని వ్యాపారంలో మాత్రం తనకేం కావాలో అతనికి తెలుసు.

ఈ విషయాన్ని మరింత క్షుణ్ణంగా పరిశీలిద్దాం. ఒక రోజు శ్రమశక్తి విలువ 3 షిల్లింగు లవుతుంది. ఎందుకంటే ఆ శ్రమశక్తి పరిమాణంలో సగం రోజు శ్రమ సాకార రూపం ధరిస్తుందని మనం ముందే అనుకున్నాం. అనగా, ఆ శ్రమశక్తిని ఉత్పత్తి చేయడానికి రోజూ అవసరమైన జీవనాధారా లకు సగం రోజు శ్రమ ఖర్చవుతుంది. అయితే శ్రమశక్తిలో సాకార రూపం ధరించిన గత శ్రమకీ,

1. స్వోత్కర్ష చేసుకోదలుచుకుంటే చేసుకో. డాబుగా ముస్తాబుకా. ఆపాదమస్తకం అలంకరించుకో ... అయినా తానిచ్చిన దానికంటే ఎక్కువ ఎవరు పుచ్చుకున్నా అది వడ్డీ వ్యాపారమే. సేవ కాదు. అది పొరుగువానికి చేసిన అన్యాయమే. దొంగిలించటం, దోచుకోటం లాంటిదే అది కూడా. పొరుగువానికి చేస్తున్నామని చెప్పుకునే సేవా, ఉపకారమూ అంతా సేవా కాదు, ఉపకారమూ కాదు. వ్యభిచారి, వ్యభిచారిణి ఒకరికొకరు గొప్ప సేవ జేసుకుంటారు. ఆనందం ఇచ్చుకుంటారు. దోపిడీ దొంగ దారిదోపిడీలు చేయడానికి భూములూ, ఇళ్ళూ కొల్లగొట్టడానికి సాయం చేసే గుఱ్ఱపు రౌతు అతనికి గొప్ప సేవ చేస్తున్నట్టే. పోప్ అనుచరులు కూడా మనకటువంటి సేవే చేస్తున్నారు. ప్రజలనందరినీ ఒకేసారి నీటిలో ముంచేయటం లేదు. మంటల్లో కాల్చేయటం లేదు. చంపెయ్యడం లేదు. జైళ్ళలో మగ్గిపోయేలా చేయడం లేదు. కొంతమందిని బతక నిస్తున్నారు. కొంతమందిని కేవలం బయటికి గెంటుతున్నారు. అంతే; మహా అయితే, వారికున్నదంతా తీసేసుకుంటున్నారు. ఇదంతా సేవే. సైతాను కూడా స్వయంగా తన సేవకులకు ఎనలేని సేవజేస్తాడు... ఒక్క ముక్కలో చెప్పాలంటే: ప్రపంచం మహత్తరమైన, దివ్యమైన, రోజువారీ సేవతో, ఉపకారంతో నిండి పోయి వుంది. (మార్టిన్ లూథర్ : An diepfarrherrn wider den wucher zu predigen", విట్టెన్‌బర్గ్, 1540)
2. "అర్థశాస్త్ర విమర్శలో ఈ విషయంపై నేనిలా అన్నాను. "సేవ" అనే అభివర్గం జె.బి.సే బాస్టియట్ లాంటి అర్థశాస్త్రవేత్తలకి ఎటువంటి "సేవ" చేయాలో అర్థం చేసుకోవడం కష్టమేమీ కాదు."

దాని ఫలితంగా పనిచేయగల సజీవ శ్రమకీ తేడా వుంది. ప్రతి రోజూ శ్రమ నిర్వహణకయ్యే ఖర్చూ, పనిలో రోజూ జరిగే శ్రమ వ్యయమూ రెండూ రెండు విభిన్న అంశాలు. మొదటిది శ్రమశక్తి యొక్క మార్పిడి విలువని నిర్ణయిస్తుంది. రెండోది దాని ఉపయోగపు విలువ. కార్మికుడు 24 గంటలపాటు సజీవంగా వుండటానికి సగం రోజు శ్రమ అవసరమనే విషయం అతను రోజంతా పనిచేయకుండా ఏ రకంగానూ నిరోధించదు. కనుక శ్రమశక్తి విలువా, శ్రమ ప్రక్రియలో ఆ శ్రమశక్తి సృష్టించే విలువా రెండూ పూర్తిగా భిన్నమైన పరిమాణాలు. పెట్టుబడిదారుడు శ్రమశక్తిని కొనుగోలు చేస్తున్నప్పుడు అతని దృష్టిలో ఉన్నది సరిగ్గా ఈ భిన్నత్వమే. శ్రమశక్తికి వున్న ఉపయోగకర లక్షణాలు, ఏ లక్షణాల మూలంగా శ్రమశక్తి నూలునో, బూట్లనో తయారుచేస్తుందో ఆ లక్షణాలు, అతని దృష్టిలో తన కార్యకలాపాల కవసరమైన షరతు తప్ప మరేమీ కాదు. ఎందుకంటే విలువని సృష్టించాలంటే శ్రమని ఉపయోగకరమైన రీతిలో ఖర్చు పెట్టాలి గనుక. అతన్ని వాస్తవంగా ప్రభావితం చేసింది ఈ సరకుకున్న నిర్దిష్ట ఉపయోగపు విలువే. అది విలువకు మూలం మాత్రమే కాదు, తనకంటే ఎక్కువ విలువకది మూలం ఈ ప్రత్యేక సేవనే పెట్టుబడిదారుడు శ్రమశక్తి నుంచి ఆశిస్తాడు. ఈ లావాదేవీలో అతను సరకుల చలామణి యొక్క "శాశ్వత నియమాల"కి అనుగుణంగా ప్రవర్తిస్తాడు. శ్రమశక్తి విక్రేత సకల ఇతర సరకుల విక్రేతల్లాగే దాని మార్పిడి విలువని తీసుకుని దాని ఉపయోగపు విలువని యిస్తాడు. ఒకదాన్ని యివ్వకుండా మరోదాన్ని అతడు పుచ్చుకోలేడు. నూనె అమ్మిన తర్వాత దాన్ని అమ్మిన వర్తకునికి దాని ఉపయోగపు విలువ ఎలా చెందదో, అలాగే శ్రమశక్తి యొక్క ఉపయోగ విలువ, అంటే శ్రమ కూడా శ్రామికునికి చెందదు. డబ్బు యజమాని ఒక రోజు శ్రమశక్తి విలువను చెల్లించాడు. కనుక దాని ఒక రోజు ఉపయోగం అతనిదే. ఒక రోజు శ్రమ అతనికే చెందుతుంది. ఒకవైపున రోజువారీ శ్రమశక్తి పోషణకి అర రోజు శ్రమ మాత్రమే ఖర్చవుతుంది. మరోవైపున అదే శ్రమశక్తి మొత్తం రోజంతా పనిజేయగలదు. కనుక, పెట్టుబడిదారుడు దాని ఉపయోగానికి చెల్లించేదానికంటే ఒక రోజులో అది రెట్టింపు విలువని సృష్టిస్తుంది. ఈ పరిస్థితి నిస్సందేహంగా కొనుగోలుదారుని అదృష్టం, కానీ అమ్మేవానికి ఏ విధంగానూ హాని కలిగించదు.

మన పెట్టుబడిదారుడు ఈ పరిస్థితిని ముందే గమనించాడు. అదే అతని నవ్వుకి కారణం. కనుక వర్క్‌షాపులో కార్మికుడు ఆరు గంటలకు కాదు, పన్నెండు గంటలకు సరిపడా ఉత్పత్తి సాధనాలను చూస్తాడు. ఆరు గంటల ప్రక్రియలో 10 పౌనుల దూది ఆరు గంటల శ్రమని ఇముడ్చుకుని 10 పౌనుల నూలుగా మారినట్టే, ఇప్పుడు 20 పౌనుల దూది 12 గంటల శ్రమని ఇముడ్చుకొని 20 పౌనుల నూలుగా మారుతుంది. ఇప్పుడు ఈ దీర్ఘమైన ప్రక్రియ యొక్క ఉత్పాదితాన్ని పరీక్షిద్దాం. ఇప్పుడు ఈ 20 పౌనుల నూలులో ఐదు రోజుల శ్రమ భౌతిక రూపం ధరించింది. అందులో నాలుగు రోజులు దూది తయారీలోనూ, కదురులో అరిగిపోయిన ఉక్కు తయారీలోనూ ఖర్చు కాగా, మిగిలిన రోజుని వడికే ప్రక్రియలో దూది తనలో ఇముడ్చుకుని నూలుగా మారింది. బంగారం రూపంలో వ్యక్తం చేస్తే ఐదు రోజుల శ్రమ ముప్పయ్ షిల్లింగులు. ఇంతకు ముందులాగే ఒక పౌను 18 పెన్నీల చొప్పున ఇది 20 పౌనుల నూలు ధర. అయితే, ఈ ప్రక్రియలో ప్రవేశించిన సరకుల విలువలు మొత్తం 27 షిల్లింగులు. నూలు విలువ 30 షిల్లింగులు కనుక ఉత్పాదితం విలువ దాని

ఉత్పత్తి కోసం అడ్వాన్సు చేసిన సొమ్ము కంటే 1/9వ వంతు ఎక్కువ. 27 షిల్లింగులు 30 షిల్లింగులుగా మార్చబడ్డాయి. 3 షిల్లింగులు అదనపు విలువ సృష్టించబడింది. ఆఖరికి గారడీ సఫలమైంది. డబ్బు పెట్టుబడిగా మారింది.

ఈ సమస్యకి సంబంధించిన ప్రతి షరతూ నెరవేరింది. కాని సరకుల చలామణిని పాలించే నియమాలు మాత్రం ఏ రకంగానూ ఉల్లంఘించబడలేదు. సమ విలువకి బదులు సమ విలువ మార్పిడి అయింది. ఎందుకంటే, పెట్టుబడిదారుడు కొనుగోలుదారుడుగా ప్రతి సరకుకీ – దూదికీ, కదురుకీ, శ్రమశక్తికీ – దాని పూర్తి విలువని చెల్లించాడు. తరువాత సరకులను కొనే ప్రతి ఒక్కరూ చేసే పనే అతనూ చేశాడు. వాటి ఉపయోగపు విలువని అతడు వినియోగం చేశాడు. శ్రమశక్తి వినియోగమే సరకులను ఉత్పత్తి చేసే ప్రక్రియ కూడా. ఆ ప్రక్రియ ద్వారా 30 షిల్లింగుల విలువ గల 20 పౌనుల నూలు అనే ఫలితం వచ్చింది. ఇంతకు ముందు కొనుగోలుదారుడుగా వున్న పెట్టుబడి దారుడు ఇప్పుడు అమ్మకందారుగా మార్కెట్‌కి వస్తాడు. అతను తన నూలుని పౌను 18 పెన్నీల చొప్పున అమ్ముతాడు. అది దాని సరైన విలువ. అయినప్పటికీ అతడు చలామణిలోకి నెట్టిన సొమ్ముకంటే 3 షిల్లింగులు ఎక్కువగా దాని నుంచి వెనక్కి తీసుకుంటాడు. ఈ రూప పరివర్తన, డబ్బు పెట్టుబడిగా మారడం, చలామణి రంగంలోనూ జరుగుతుంది, దాని బయటా జరుగుతుంది. చలామణి రంగం లోపల అనడం ఎందుకంటే, శ్రమశక్తిని మార్కెట్‌లో కొనుగోలు చేయాల్సిన పరిస్థితి వల్ల. చలామణి రంగానికి బయట అనడం ఎందుకంటే, పూర్తిగా ఉత్పత్తి రంగానికి పరిమితమై వుండే అదనపు విలువ ఉత్పత్తి అనే ప్రక్రియకు చలామణి రంగంలో జరిగేది కేవలం ఒక మెట్టు మాత్రమే. ఆ రకంగా "అత్యుత్తమమైన ప్రపంచంలో ప్రతీదీ అత్యంత శ్రేయోదాయకమే."

కొత్త ఉత్పాదితం యొక్క భౌతిక అంశాలుగానూ, శ్రమ ప్రక్రియలో భాగాలుగానూ వ్యవహరించే సరకుల రూపంలోకి తన డబ్బుని మార్చడం ద్వారా, సజీవ శ్రమని వాటి మృత పదార్థంతో చేర్చడం ద్వారా పెట్టుబడిదారుడు అదే సమయంలో విలువని, అంటే భౌతికరూపం ధరించిన, గత, మృత శ్రమని పెట్టుబడిగా, అంటే విలువను ప్రసవించే విలువగా మారుస్తాడు. ఫలదాయకమైన, గుణీకృతం కాగల సజీవ భూతంగా మారుస్తాడు.

విలువని ఉత్పత్తి చేయడం అదనపు విలువను సృష్టించడం అనే ఈ రెండు ప్రక్రియలను పోలిస్తే రెండోది, ఒక నిర్దిష్టమైన హద్దు దాటాక మొదటిదాన్ని కొనసాగించడం తప్ప మరేమీ కాదని మనం గమనిస్తాము. శ్రమశక్తికి పెట్టుబడిదారుడు చెల్లించే విలువకు సరిగ్గా సమానమైన విలువ ఉత్పత్తి అయ్యే హద్దును దాటి ఉత్పత్తి కొనసాగకపోతే, అప్పుడది కేవలం విలువను ఉత్పత్తి చేసే ప్రక్రియ అవుతుంది. అలాకాక, ఆ హద్దును దాటి ఉత్పత్తి కొనసాగితే, అది అదనపు విలువను సృష్టించే ప్రక్రియ అవుతుంది.

మనం ఇంకా ముందుకు సాగి, విలువను ఉత్పత్తి చేసే ప్రక్రియను శుద్ధ శ్రమ ప్రక్రియతో పోలిస్తే, రెండోదానిలో వున్నది ఉపయోగకర శ్రమ అనీ, ఉపయోగపు విలువల్ని ఉత్పత్తి జేసే పని అనీ గ్రహిస్తాము. ఇక్కడ మనం శ్రమని ఒక ప్రత్యేక వస్తువుని ఉత్పత్తి చేసే అంశం అని భావిస్తాం. దాన్ని మనం దాని లక్ష్యం రీత్యా గుణాత్మక రూపంలోనే దర్శిస్తాం. అయితే విలువను సృష్టించే ప్రక్రియగా అదే శ్రమ ప్రక్రియ కేవలం తన పరిమాణాత్మక రూపంలో మాత్రమే దర్శనమిస్తుంది. ఆ

పని చేయడంలో కార్మికుడు ఎంతకాలం వెచ్చించాడు, శ్రమశక్తి ఎంతకాలంపాటు ఉపయోగకరంగా ఖర్చు చేయబడింది అన్నదే ఇక్కడ ప్రశ్న. ఇక్కడ ఈ ప్రక్రియలో పాల్గొనే సరకులు ఒక నిర్దిష్ట ఉపయోగకర వస్తువును తయారుచేయడంలో శ్రమశక్తికి అవసరమైన అనుబంధ అంశాలుగా లెక్కలోకి రావు. అవి కేవలం భౌతిక రూపం ధరించిన ఫలానా మొత్తం శ్రమకి నిలయాలుగా మాత్రమే లెక్కలోకి వస్తాయి. ఆ శ్రమ ఉత్పత్తి సాధనాలలో ఇదివరకే సాకార రూపం ధరించి వుండొచ్చు. లేదా ఈ ప్రక్రియలోనే శ్రమశక్తి కార్యకలాపం ద్వారా మొట్టమొదటిసారిగా వాటిలో చేరి వుండవచ్చు. రెండు సందర్భాల్లోనూ అది దాని కాల పరిమితిని బట్టే లెక్కించబడుతుంది. ఆ సందర్భాన్నిబట్టి అది ఇన్ని గంటలుగా లేదా ఇన్ని రోజులుగా లెక్కించబడుతుంది.

అంతేగాక, నిర్దిష్ట సామాజిక పరిస్థితుల్లో ఏ వస్తు ఉత్పత్తికైనా అవసరమైనంత కాలం మాత్రమే లెక్కలోకి వస్తుంది. దీనివల్ల అనేక పర్యవసానాలున్నాయి. మొదటిది, శ్రమ మామూలు పరిస్థితుల్లో నిర్వహించబడటం అవసరం అవుతుంది. వడకటం విషయంలో స్వయం చలిత యంత్రాలు ప్రబలంగా వున్న దశలో వడికే వ్యక్తికి పంటెనీ రాట్నాన్నీ యివ్వడం అసంబద్ధం. పనిలో అధికంగా వృధా అయ్యే నాసిరకం దూదిని కూడా యివ్వరాదు. దానికి తగిన నాణ్యం వుండాలి. లేకపోతే, ఒక పౌను నూలు వడకటానికి కార్మికుడు సామాజికంగా అవసరమైన దానికంటే ఎక్కువ కాలం ఖర్చు చేస్తాడు. అటువంటప్పుడు ఈ అదనపు కాలం విలువనీ సృష్టించదు, డబ్బునీ సృష్టించదు. అయితే ఈ ప్రక్రియలోని భౌతిక అంశాలకు కనీసపు నాణ్యం వుందా లేదా అన్నది కార్మికుడిపై ఆధారపడి వుండదు. అది పెట్టుబడిదారునిపైనే పూర్తిగా ఆధారపడి వుంటుంది. శ్రమశక్తికి కూడా సగటు ప్రయోజకత్వం వుండాలి. అది ఏ రంగంలో ఉపయోగించబడుతోందో ఆ రంగంలో వుండే సగటు నేర్పు, చాకచక్యం, వడీ దానికీ వుండాలి. మన పెట్టుబడిదారుడు అటువంటి సామాన్య సుగుణం వున్న శ్రమశక్తిని కొనడం విషయంలో తగు జాగ్రత్త తీసుకున్నాడు. ఈ శక్తిని వినియోగించేప్పుడు అది పడే పాటు, దాని తీవ్రత సగటు మోతాదులో వుండాలి. ఇది అమలు జరిగేలా పెట్టుబడిదారుడు అన్ని జాగ్రత్తలూ తీసుకుంటాడు. అంతేగాక అతని పనివాళ్ళు ఒక్క క్షణం కూడా ఖాళీగా వుండకుండా చూస్తాడు. అతడు శ్రమశక్తి వినియోగాన్ని ఒక నిర్దిష్ట కాలంపాటు కొనుక్కున్నాడు. కనుక దాన్ని ఉపయోగించడానికి గల హక్కుకై అతడు పట్టుపడతాడు. అతనికి దోచుకోబడాలని లేదు. చివరికి, దీని కోసం మన మిత్రునికి తన సొంత శిక్షాస్మృతి వుంది. ముడి పదార్థాల లేదా శ్రమ పరికరాల వృధా వినియోగమంతా నిషిద్ధం. ఎందుకంటే, అలా వృధా అయిన అంశాలు అనవసరంగా ఖర్చయిన శ్రమకి, ఉత్పాదితంలో భాగంగా లెక్కించబడని, లేదా దాని విలువలో ప్రవేశించని శ్రమకి ప్రాతినిధ్యం వహిస్తాయి.[1]

ఒకవైపున ఉపయోగకర వస్తువులను ఉత్పత్తి చేసే శ్రమకీ, మరోవైపున విలువను సృష్టించే శ్రమకీ మధ్య వున్న తేడా, సరకు విశ్లేషణలో మనం కనుగొన్న తేడా, ఉత్పత్తి ప్రక్రియ యొక్క రెండు పార్శ్వాల మధ్య వున్న తేడాగా రూపొందుతుంది.

---

1. బానిస శ్రమతోచేసే ఉత్పత్తిని అంత వ్యయభరిత ప్రక్రియగా చేసే కారణాలలో యిదొకటి. ప్రాచీనుల పదజాలంతో చెప్పాలంటే ఇక్కడ శ్రామికుడు మాట్లాడే పరికరం మాత్రమే. జంతువుని అర్ధ మూగ పరికరంగానూ, ఇతర సామానులను మూగ పరికరాలుగానూ వారు పరిగణించారు. అయితే పశువూ,

ఉత్పత్తి ప్రక్రియను ఒకవైపున, శ్రమ ప్రక్రియ యొక్కా విలువను సృష్టించే ప్రక్రియ యొక్కా ఐక్యతగా పరిగణిస్తే అది సరకుల ఉత్పత్తి అవుతుంది. మరొకవైపున, దాన్ని శ్రమ ప్రక్రియ యొక్కా, అదనపు విలువను ఉత్పత్తి చేసే ప్రక్రియ యొక్కా ఐక్యతగా పరిగణిస్తే అది పెట్టుబడిదారీ ఉత్పత్తి ప్రక్రియ అవుతుంది, లేదా సరకుల పెట్టుబడిదారీ ఉత్పత్తి అవుతుంది.

పెట్టుబడిదారుడు స్వాధీనపరచుకున్న శ్రమ నేర్పులేని, సాదా, సగటు శ్రమా, లేక మరింత సంక్లిష్టమైన నైపుణ్యంతో కూడిన శ్రమా, అన్నదానికి అదనపు విలువ సృష్టిలో బొత్తిగా సంబంధం లేదనే విషయాన్ని గత పుటల్లో వివరించాము. సగటు శ్రమ కంటే ఉన్నతమైన, సంక్లిష్టమైన శ్రమంతా మరింత ఖరీదైన శ్రమ శక్తి వ్యయమే. అంటే ఆ శ్రమశక్తి ఉత్పత్తికి ఎక్కువ కాలమూ, శ్రమా వ్యయమయ్యాయన్న మాట. కనుక, నైపుణ్యం లేని శ్రమశక్తి కంటే లేదా సాదా శ్రమశక్తి కంటే దీనికి ఎక్కువ విలువుంటుంది. ఇది ఎక్కువ విలువ కలిగిన శక్తి కావడంచేత దీని వినియోగం కూడా ఉన్నత శ్రేణికి చెందిన శ్రమే. ఒకే కాల వ్యవధిలో ఇది నైపుణ్యం లేని శ్రమకంటే సాపేక్షంగా ఎక్కువ విలువల్ని సృష్టిస్తుంది. వడికే వాని శ్రమ నైపుణ్యానికీ, స్వర్ణకారుని శ్రమ నైపుణ్యానికీ మధ్య ఎటువంటి తేడా అయినా వుండొచ్చు. కాని స్వర్ణకారుడు తన శ్రమశక్తి విలువకి బదులుగా ఖర్చు చేసే శ్రమ

---

పరికరమూ అతణ్ణి తమలో ఒకడని అనుకోకుండా మనిషి అని గుర్తించడానికిగానూ బానిస తగిన జాగ్రత్త తీసుకుంటాడు. పశువులను అతి నిర్దయగా బాదడం ద్వారా, పరికరాలను అతి మొరటుగా, కావాలని చెడగొట్టడం ద్వారాను అతడు తనని తాను ఆ రెంటి నుండి వేరు చేసుకోవడం ద్వారా అపారమైన సంతృప్తి పొందుతాడు. అందుకే ఈ రకం ఉత్పత్తిలో ఒక సూత్రం సార్వత్రికంగా అమల్లో వుంది. అతి మొరటు, బండ పరికరాలను మాత్రమే ఉపయోగించాలన్నదే ఈ సూత్రం. వాటి బండతనం కారణంగా వాటిని చెడగొట్టడం సాధ్యం కారాదు అన్నదే ఉద్దేశం. మెక్సికో సింధు శాఖకు సరిహద్దున వున్న బానిస రాజ్యాల్లో అంతర్యుద్ధం నాటిదాకా పాత చైనీయ నమూనాల్లో తయారుచేయబడిన నాగళ్ళనే ఉపయోగించారు. వాటితో దున్నిన నేల పందో, చుంచో కెలికినట్టుంటుంది తప్ప దున్నినట్టుండదు. "ది స్లేవ్ పవర్" అదే తన గ్రంథంలో (లండన్, 1862, పుట 46) జె.ఇ. కెయిర్‌నెస్ చెప్పిన విషయం ఇది. తన "సీ చోర్డ్ స్లేవ్ స్టేట్స్"లో ఆమ్‌స్టెడ్ ఇలా అంటాడు. "నాకిక్కడ కొన్ని పరికరాలు చూపించారు. మనలో శ్రామికుడికి వేతనాలు చెల్లిస్తున్నవాళ్ళల్లో వివేక మున్నవారెవరూ ఇటువంటి పరికరాలను వారికి అప్పజెప్పరు. ఆ పరికరాల బండతనంవల్ల మనం ఇప్పుడు ఉపయోగిస్తున్న పరికరాలవల్ల కంటే వాటి వల్ల కనీసం పది శాతం ఎక్కువ శ్రమ చేయాల్సి వుంటుంది. అయితే వాటిని బానిసలు ఉపయోగిస్తున్న తీరు అతి నిర్లక్ష్యంగానూ, అవకతవకగానూ వుండటాన్నిబట్టి ఈ పరికరాలు ఇంతకంటే తక్కువ మొరటుగానూ, తేలిగ్గానూ వుండటానికి వీల్లేదనీ, వారి ఆర్థిక రంగానికి తగవనీ నేను నిర్ధారించుకోగలిగాను. మనం మన శ్రామికులకు ఎప్పుడూ ఇచ్చి, దానినుండి లాభం సంపాదిస్తున్న పరికరాలు వర్జీనియా పంట పొలాల్లో ఒక్కరోజు కూడా మనలేవు. నిజానికి వారి నేల మన నేలకంటే మెత్తటిదీ, రాళ్ళు లేనిదీ అయినప్పటికీ, పొలంలో గుర్రాలకు బదులు కంచర గాడిదల్ని ఎందుకు ఉపయోగిస్తున్నారు అని నేనడిగితే వారు చెప్పిన మొదటి కారణం ఇది : గుర్రాలు నీగ్రోల దెబ్బకు తట్టుకోలేవు. అవి అతి తొందరగా జబ్బు పడటమో, అవిటివి కావడమో జరుగుతుంది. కంచర గాడిదలయితే వారి దెబ్బల్ని తట్టుకోగలుగు తాయి. ఒకటి రెండు పూటలు తిండి లేకపోయినా భరిస్తాయి. తొందరగా దెబ్బతినవు. నిర్లక్ష్యం చేసినా, పని భారం పెరిగినా వాటికి జలుబు చేయదు, తొందరగా జబ్బుపడవు. ఇప్పుడు చెప్పిన కారణమే, అసలు కారణం. నేను ఎక్కడిదాకానో పోకుండానే నేను రాసుకుంటున్న గది కిటికీ నుంచి ఎప్పుడు కావాలంటే అప్పుడు చూసి ఒక విషయం చెప్పగలను. ఇక్కడి బానిసలు పశువులతో వ్యవహరిస్తున్నట్టుగా ఉత్తరాదిన జరిగితే అక్కడి రైతు మరుక్షణమే పనివాణ్ణి పనిలోంచి పీకేస్తాడు.

భాగానికీ, అదనపు విలువని సృష్టించడానికి అతడు ఖర్చు చేసే అదనపు శ్రమ భాగానికీ మధ్య గుణాత్మకంగా తేడా ఏమీలేదు. వడికే పనిలో లాగానే ఆభరణాల తయారీలో కూడా అదనపు విలువ అనేది కేవలం అదనపు శ్రమ పరిమాణం వల్ల మాత్రమే, ఒకే శ్రమ ప్రక్రియను మరింత సాగదీయటం ద్వారా మాత్రమే సృష్టించబడుతుంది. ఒక సందర్భంలో అది ఆభరణాల తయారీ ప్రక్రియ, మరో సందర్భంలో అది నూలు వడికే ప్రక్రియ.[1]

అయితే, మరోవైపున విలువను సృష్టించే ప్రతి ప్రక్రియలోనూ నైపుణ్యం వున్న శ్రమను నైపుణ్యంలేని శ్రమగా, అంటే ఉదాహరణకు నిపుణుని ఒక రోజు శ్రమను నైపుణ్యం లేని వాని ఆరు రోజుల శ్రమగా మార్చడం అనివార్యం.[2] కనుక పెట్టుబడిదారుడు పనిలో పెట్టుకున్న పని వాని శ్రమను మనం నైపుణ్యం లేని సగటు శ్రమగా భావిస్తే వృధా ప్రయాసని పరిహరించి మన విశ్లేషణని సులభతరం చేయగలుగుతాము.

---

1. ఈ తేడా కొంతవరకు శుద్ధ భ్రమ మీద ఆధారపడుతుంది. లేదా క్లుప్తంగా చెప్పాలంటే, వాస్తవాలుగా ఏనాడో అంతరించిపోయిన తేడాల పైన, కేవలం సాంప్రదాయకమైన అలవాటు బలం వల్ల మాత్రమే ఇంకా బతికి వున్న తేడాలపైన ఆధారపడుతుంది. ఒక మేరకు కార్మికవర్గంలోని కొన్ని బృందాల నిస్సహాయ పరిస్థితిపైన ఇది ఆధారపడి వుంటుంది. ఆ పరిస్థితి వారిని మిగిలిన వారితో సమానంగా తమ శ్రమశక్తి విలువను రాబట్టుకోకుండా నిరోధిస్తుంది. ఇక్కడ యాదృచ్ఛిక పరిస్థితులు ఎంత పెద్ద పాత్ర వహిస్తాయంటే, ఒక్కోసారి ఈ రెండు రూపాలు ఒకదాని స్థానం మరొకటి తీసుకుంటాయి. ఉదాహరణకి, శ్రామిక వర్గం యొక్క శరీర దారుఢ్యం దెబ్బతిన్నచోట (బాగా అభివృద్ధిచెందిన పెట్టుబడిదారీ ఉత్పత్తి వున్న దేశాలన్నిటి లోనూ పరిస్థితి యిదే) సున్నితమైన శ్రమ రూపాలతో పోల్చినప్పుడు కండ బలం అవసరం వున్న హీన శ్రమ రూపాలే సాధారణంగా నైపుణ్యం గలవిగా పరిగణించబడతాయి. సున్నితమైన శ్రమ రూపాలు నైపుణ్యం లేని రూపాల స్థాయికి దిగజారుతాయి. ఉదాహరణకి, ఇటుకలు పెట్టేవాని శ్రమని ఉదాహరణగా తీసుకోండి. ఇంగ్లండులో ఇది బుట్టాలు వేసిన పట్టుబట్టలు నేసేవాని శ్రమకంటే చాలా ఉన్నత స్థాయిని ఆక్రమించుకుంది. కాని ఫస్టియన్ అనే రకం బట్టలు తయారుచేసే శ్రమ ఎంతో శరీర కష్టాన్ని కోరుతుంది. అంతేగాక అది అనారోగ్యకరం కూడా. అయినా అది నైపుణ్యం లేని శ్రమగానే లెక్కించబడుతుంది. పోతే, జాతీయ శ్రమ రంగంలో నైపుణ్యం గల శ్రమ అనబడేది ఎక్కువేమీ లేదన్న సంగతి మరవరాదు. లెయింగ్ అంచనాల ప్రకారం ఇంగ్లండులో (వేల్సుతో కలిసి) 1,13,00,000 మంది ప్రజల మనుగడ నైపుణ్యం లేని శ్రమపైనే ఆధారపడి వుంది. అతను ఇది రాసిన కాలంలో అక్కడున్న మొత్తం జనాభా 1,80,00,000. దానిలో 10,00,000 మంది "మర్యాదస్తులూ", 15,00,000 మంది దరిద్రులూ, తిరుగుబోతులూ, నేరస్తులూ, వ్యభిచారులూ వుంటారు. 46,50,000 మంది మధ్యతరగతి వాళ్ళు. మొత్తం జనాభాలో వీళ్లందరూ పోతే, పైన పేర్కొన్న 1,10,00,000 మంది మిగులుతారు. అయితే మధ్యతరగతిలో అతడు చిన్న మదుపులపై వచ్చే వడ్డీలతో బతికేవాళ్ళనూ, ఉద్యోగుల్నీ, సాహిత్యకారుల్నీ, కళాకారుల్నీ, ఉపాధ్యాయులూ తదితరుల్నీ చేర్చాడు. ఈ సంఖ్యను పెంచడం కోసం అతడు ఈ 46,50,000లోనే ఫ్యాక్టరీ పనివారిలో కాస్త ఎక్కువ సంపాదించేవారిని కూడా చేర్చాడు. బేలుదారీలు కూడా ఇందులో వున్నారు. (ఎస్. లెయింగ్ నేషనల్ డిస్ట్రెస్ & ఎట్సెట్రా, లండన్, 1844 "తిండికోసం తమ సాధారణ శ్రమ తప్ప మరేమీ యివ్వలేని మహా వర్గమే ప్రజల్లో అత్యధికం." జేమ్స్‌మిల్, ఎన్‌సైక్లోపిడియా బ్రిటానికా, 1831లోని అనుబంధం అయిన "కాలనీ" అనే వ్యాసంలో)
2. "విలువ కొలమానంగా శ్రమని పేర్కొన్నప్పుడు విధిగా అది ఒక నిర్దిష్ట తరహా శ్రమని సూచిస్తుంది... దానితో ఇతర తరహాల శ్రమకున్న నిష్పత్తిని తేలిగ్గానే నిర్ధారించవచ్చు. "ఔట్‌లైన్స్ ఆఫ్ పొలిటికల్ ఎకానమీ" లండన్, 1832, పుటలు 22, 23)

# అధ్యాయం - 8

# స్థిర పెట్టుబడి - అస్థిర పెట్టుబడి

ఉత్పాదితం యొక్క విలువను రూపొందించడంలో శ్రమ ప్రక్రియ యొక్క వివిధ అంశాలు విభిన్న పాత్రలు నిర్వహిస్తాయి.

కార్మికుడు తన శ్రమ గ్రహీత మీద నిర్దిష్ట అదనపు శ్రమ మొత్తాన్ని ఖర్చుపెట్టడం ద్వారా దానికి కొత్త విలువను చేరుస్తాడు. ఆ శ్రమ యొక్క నిర్దిష్ట స్వభావమూ, దాని ఉపయోగమూ ఏదైనా కావచ్చు. మరోవైపున ఈ ప్రక్రియలో ఖర్చు అయిన ఉత్పత్తి సాధనాల విలువలు భద్రపరచబడి ఉత్పాదితం యొక్క విలువలో అంతర్భాగాలుగా కొత్తగా దర్శనమిస్తాయి. ఉదాహరణకు, దూది, కదురుల విలువలు నూలు విలువలో పునర్దర్శనమిస్తాయి. కనుక ఉత్పత్తి సాధనాల విలువ ఉత్పాదితానికి బదిలీ కావడం ద్వారా భద్రపరచబడింది. ఆ సాధనాలు ఉత్పాదితంగా మారుతున్నప్పుడు ఈ బదిలీ జరుగుతుంది. లేదా మరో రకంగా చెప్పాలంటే, ఇది శ్రమ ప్రక్రియలో జరుగుతుంది. శ్రమవల్లే అది జరుగుతుంది. కాని ఎలా?

కార్మికుడు ఒకేసారి రెండు చర్యలు నిర్వహించడు. ఒకటేమో దూదికి విలువని జోడించడానికీ, మరోటి ఉత్పత్తి సాధనాల విలువను భద్రపరచడానికీ, భద్రపరచడం అంటే తను దేనిమీద పని చేస్తున్నాడో ఆ దూది విలువనీ, తను దేనితో పని చేస్తున్నాడో ఆ కదురు విలువలో ఒక భాగాన్ని ఉత్పాదితానికి అంటే నూలుకి బదిలీ చేయడమే. అయితే కొత్త విలువను కలిపే చర్యతోనే అతడు వాటి ఇదివరకటి విలువలను భద్రపరుస్తాడు. ఏమయినప్పటికీ అతని శ్రమ గ్రహీతకి కొత్త విలువని జోడించడమూ, దాని పాత విలువని భద్రపరచడమూ పూర్తిగా రెండు వేర్వేరు ఫలితాలు – ఒకే ఒక్క చర్య ద్వారా ఏకకాలంలో కార్మికునిచేత సృష్టించబడినట్టివి. ఈ ఫలితం యొక్క ద్వంద్వ స్వభావానికి కారణాన్ని అతని శ్రమ యొక్క ద్వంద్వ స్వభావం ద్వారానే వివరించగలం. ఏకకాలంలో అది ఒక స్వభావం ద్వారా విలువని సృష్టించాలి, మరో స్వభావం ద్వారా విలువని భద్రపరచాలి, లేదా బదిలీ చేయాలి.

ప్రతి కార్మికుడు కొత్త శ్రమని, తద్వారా కొత్త విలువని ఏ తరహాలో జోడిస్తాడు? ఒక నిర్దిష్ట తరహాలో ఉత్పాదకంగా పనిచేయడం ద్వారా అనేది స్పష్టం. వడికే వ్యక్తి వడుకటం ద్వారా, నేతగాడు నేయడం ద్వారా, కమ్మరి కమ్మరం ద్వారా, ఉత్పత్తి సాధనాలయిన దూదీ, కదురూ, నూలు, మగ్గమూ, ఇనుమూ దాగలీ[1] సాధారణ శ్రమని అంటే విలువని జోడించటంతోపాటు వరసగా వడుకటం,

1. "అంతరించిపోయిన దానికి బదులుగా కొత్తదాన్ని సృష్టిస్తుంది శ్రమ" "యాన్ ఎస్సే ఆన్ ది పొలిటికల్ ఎకానమీ ఆఫ్ నేషన్స్" లండన్, 1821, పుట 13

నేయడం కమ్మరం లాంటి నిర్దిష్ట తరహా శ్రమ రూపం ద్వారా మాత్రమే ఉత్పాదితం యొక్క, అంటే ఉపయోగపు విలువ యొక్క అంతర్భాగాలవుతాయి. ప్రతి ఉపయోగపు విలువా మాయమై ఒక కొత్త ఉపయోగపు విలువలో కొత్త రూపంలో పునర్దర్శనమిస్తుంది. విలువ సృష్టి ప్రక్రియను పరిశీలిస్తున్నప్పుడు మనం ఒక విషయాన్ని చూశాం. అదేమంటే, ఒక కొత్త ఉపయోగపు విలువ ఉత్పత్తిలో ఒక ఉపయోగపు విలువ సమర్థంగా అనుభుక్తమయితే, అనుభుక్తమయిన ఆ వస్తువు ఉత్పత్తిలో వ్యయమైన శ్రమ పరిమాణం కొత్త ఉపయోగపు విలువను ఉత్పత్తి చేయడానికి అవసరమైన శ్రమ పరిమాణంలో ఒక భాగంగా రూపొందుతుంది. కనుక ఈ భాగం ఉత్పత్తి సాధనాల నుండి కొత్త ఉత్పాదితానికి బదిలీ అయిన శ్రమ కనుక కార్మికుడు అనుభుక్తమయిన ఉత్పత్తి సాధనాల విలువల్ని భద్రపరుస్తాడు లేదా ఉత్పాదితం విలువలో ఒక భాగంగా దానికి బదిలీ చేస్తాడు. అతని అదనపు, అనిర్దిష్ట శ్రమ ద్వారా కాదు. అతని శ్రమ యొక్క నిర్దిష్ట ఉపయోగకర స్వభావం వల్ల దాని ప్రత్యేక ఉత్పాదక రూపం వల్ల మాత్రమే అతడలా చేస్తాడు. శ్రమ అటువంటి నిర్దిష్ట ఉత్పాదక కార్యకలాపం అయిన మేరకు, అది వడుకటం, లేదా నేయడం, లేదా కమ్మరం అయిన మేరకు కేవలం తన స్పర్శ ద్వారా మృత ఉత్పత్తి సాధనాలను లేపుతుంది. శ్రమ ప్రక్రియలో సజీవ అంశాలుగా మారుస్తుంది. వాటితో కలిసి కొత్త ఉత్పాదితాలను రూపొందిస్తుంది.

పనివాని ప్రత్యేక ఉత్పాదక శ్రమ వడుకటం కాకపోతే అతడు దూదిని నూలుగా మార్చలేడు. కనుక దూది, కదురు విలువల్ని నూలుకి బదిలీ చెయ్యలేడు. ఒకవేళ అదే పని వాడు తన వృత్తిని వడ్లపనికి మార్చుకున్నా అతడు ఒక రోజు పనితో తాను పనిజేసే పదార్థానికి విలువని చేకూరుస్తాడు. దానిని బట్టి కొత్త విలువని జోడించటం అన్నది అతని శ్రమ ప్రత్యేకంగా వడుకటం కావటం వల్ల లేదా వడ్ల పని కావటం వల్ల కాదు, అది అనిర్దిష్ట శ్రమ కావటం వల్ల, సామాజిక శ్రమ మొత్తంలో ఒక భాగం కావటం వల్ల మాత్రమే అని మనం గ్రహిస్తాము. జోడించిన విలువ ఒక నిర్దిష్ట పరిమాణంలో ఉండ టానికి కారణం అతని శ్రమకి ఒక ప్రత్యేక ఉపయోగం వుండటం వల్ల కాదు. అది ఒక నిర్దిష్ట కాలంపాటు నిర్వహించబడటం వల్ల మాత్రమే అని కూడా గ్రహిస్తాము. ఒకవైపున వడుకటం అనేది తన సాధారణ స్వభావ రీత్యా, అది మానవుని అనిర్దిష్ట శ్రమశక్తి వ్యయం కావటంచేత దూది, కదురు విలువలకు కొత్త విలువని జోడిస్తుంది. మరోవైపున అది తన ప్రత్యేక స్వభావం రీత్యా, వడుకటం అనబడే అదే శ్రమ తన నిర్దిష్ట ఉపయోగకర ప్రక్రియ ద్వారా ఉత్పత్తి సాధనాల విలువల్ని ఉత్పాదితానికి బదిలీ చేస్తుంది. ఉత్పాదితంలో భద్రపరుస్తుంది. కనుక ఒకే సమయంలో ద్వంద్వ ఫలితం ఉత్పన్నమైంది.

ఒక నిర్దిష్ట శ్రమ పరిమాణాన్ని కేవలం జోడించడం ద్వారా కొత్త విలువ జోడించబడింది. ఇలా జోడించబడిన శ్రమ యొక్క గుణం వల్ల ఉత్పత్తి సాధనాల తొలి విలువలు ఉత్పాదితంలో భద్రమయ్యాయి. శ్రమ యొక్క ద్వంద్వ స్వభావం వల్ల తలెత్తే ఈ ద్వంద్వ ఫలితం అనేక ఘటనల్లో గమనించవచ్చు.

ఏదో ఒక సృజన కారణంగా ఇంతకు ముందు 36 గంటల్లో వడికినంత నూలుని ఇప్పుడు వడికేవాడు 6 గంటల్లోనే వడుకుతున్నాడనుకుందాం. ఇప్పుడతని శ్రమ ఉపయోగకర శ్రమగా గతంలో

కంటే ఆరురెట్లు ఫలదాయకం. ఆరు గంటల శ్రమ యొక్క ఉత్పాదితం ఆరు రెట్లు పెరిగింది. 6 పౌనుల నుండి 36 పౌనులకి పెరిగింది. అయితే ఇప్పుడు 36 పౌనుల దూది, ఇదివరకటి 6 పౌనుల దూది ఇముడ్చుకున్నంత శ్రమనే ఇముడ్చుకుంటుంది. అంటే ప్రతి పౌను దూది ఆరో వంతు కొత్త శ్రమని మాత్రమే ఇముడ్చుకుంది. అందువల్ల ప్రతి పౌనుకీ శ్రమ వల్ల జోడించబడిన విలువ ఇదివరకటి విలువలో ఆరోవంతు మాత్రమే. మరోవైపున, ఉత్పాదితంలో, అంటే 36 పౌనుల నూలులో, దూది నుండి బదిలీ అయిన విలువ ఇంతకు ముందుకంటే ఆరు రెట్లు ఎక్కువ. అంటే, 6 గంటలపాటు వడుకటం వల్ల పనివాని శ్రమ ప్రతి పౌను ముడిపదార్థానికీ ఇదివరకటి విలువలో ఆరోవంతు మాత్రమే జోడించగలిగినప్పటికీ, అదే ముడిపదార్థం నుండి ఉత్పాదితానికి బదిలీ అయి భద్రపరచబడిన విలువ అంతకు ముందుకంటే ఆరు రెట్లు ఎక్కువ. దీన్నిబట్టి తెలిసేదేమిటంటే, శ్రమ ఒకరకంగా విలువని భద్రపరుస్తుందనీ, మరోరకంగా విలువని సృష్టిస్తుందనీ. దానికున్న ఈ రెండు లక్షణాలూ సారభూతంగా విభిన్నమనీ. ఒకవైపున, ఒక నిర్దిష్ట బరువు గల దూదిని నూలుగా వడుకటానికి పట్టే కాలం ఎంత ఎక్కువైతే పదార్థానికి జోడింపబడిన కొత్త విలువ అంత ఎక్కువ. మరోవైపున, ఒక నిర్దిష్ట కాల పరిమితిలో వడికిన దూది బరువు ఎంత ఎక్కువైతే ఉత్పాదితానికి బదిలీ కావటం ద్వారా భద్రపరచబడిన విలువ అంత ఎక్కువ.

వడికేవాని శ్రమ యొక్క ఉత్పాదక శక్తి మారటానికి బదులు స్థిరంగా వుందనుకుందాం. అతనికి ఇంతకు ముందు ఒక పౌను దూదిని నూలుగా మార్చటానికి పట్టినంత కాలమే ఇప్పుడూ పడుతోంది అనుకుందాం. కాని దూది మార్పిడి విలువ ఆరు రెట్లు పెరిగిందనో ఆరోవంతుకి పడిపోయిందనో అనుకుందాం. ఈ రెండు సందర్భాల్లోనూ వడికేవాడు ఒకే పరిమాణం గల శ్రమను ఒక పౌను దూదిలో పెడతాడు. కనుక విలువలో మార్పు రావడానికి ముందు అతను ఎంత విలువ జోడించాడో ఇప్పుడు అంతే జోడిస్తాడు : ఒక నిర్దిష్ట బరువు గల నూలుని అతడు ముందు తయారుచేసినంత కాలంలోనే చేస్తాడు. అయినప్పటికీ, దూది నుండి నూలుకి అతడు బదిలీ చేసే విలువ ఇంతకు ముందు దానిలో ఆరోవంతన్నా అయుంటుంది, లేదా దానికి ఆరురెట్లన్నా అయుంటుంది. శ్రమ పరికరాల ప్రయోజకత్వం మారకుండా వుండి, వాటి విలువ పెరిగినప్పుడూ, తరిగినప్పుడూ కూడా యిదే ఫలితం వస్తుంది.

వడికే ప్రక్రియ యొక్క సాంకేతిక పరిస్థితుల్లో మార్పేమీ లేకుంటే, ఉత్పత్తి సాధనాల విలువలో కూడా మార్పేమీ లేకుంటే, వడికే వ్యక్తి సమాన పని కాలాల్లో, విలువలో ఏ మార్పులేని ముడి పదార్థాలను సమాన పరిమాణాలలోనూ, అలాగే విలువలో ఏ మార్పులేని యంత్రాలను సమాన పరిమాణాలలోనూ అనుభుక్తం చేయడం కొనసాగుతుంది. ఉత్పాదితంలో అతను భద్రపరిచే విలువ, ఉత్పాదితానికి అతడు జోడించే కొత్త విలువకి అనులోమ నిష్పత్తిలో వుంటుంది. అతడు రెండు వారాల్లో, ఒక వారంలో జోడించిన దానికి రెండు రెట్ల శ్రమని, తద్వారా రెండు రెట్ల విలువని జోడిస్తాడు. అదే కాలపరిమితిలో రెండు రెట్ల పదార్థాన్ని వాడతాడు. యంత్రాలను రెండు రెట్లు అరిగేలా చేస్తాడు. రెండు సందర్భాల్లోనూ వాటి విలువ రెట్టింపు వుంటుంది. కనుక రెండు వారాల ఉత్పాదితంలో అతడు ఒక వారం ఉత్పాదితంలో కంటే రెట్టింపు విలువను భద్రపరుస్తాడు. పని

పరిస్థితులు యధాతథంగా వున్నంత వరకూ కొత్త శ్రమ ద్వారా కార్మికుడు ఎంత ఎక్కువగా విలువని జోడిస్తే, అంత ఎక్కువగా అతడు విలువను బదిలీ చేస్తాడు, భద్రపరుస్తాడు. అయితే అతడలా చేయగలగడానికి కారణమేమంటే, కొత్త విలువని కలపటం అన్నది మారని పరిస్థితుల్లో మాత్రమే జరుగుతుంది. ఈ పరిస్థితులకి అతని శ్రమతో ప్రమేయం లేకుండా స్వతంత్రంగా ఉంటాయి. ఒక రకంగా కార్మికుడు తను జోడించే కొత్త విలువకి అనులోమంగానే ఎల్లప్పుడూ పాత విలువని భద్రపరుస్తాడని కూడా చెప్పొచ్చు. దూది విలువ ఒక షిల్లింగు నుండి రెండు షిల్లింగులకు పెరిగినా, ఆరు పెన్నీలకు పడిపోయినా పనివాడు రెండు గంటల ఉత్పాదితంలో భద్రపరిచిన విలువలో సగాన్ని మాత్రమే ఒక గంటలో భద్రపరుస్తాడు. అలాగే అతని ఉత్పాదక శక్తి పెరగటంవల్లో, తరగటంవల్లో మారితే, ఆ సందర్భాన్ని బట్టి అతడు ఒక గంటలో అంతకు ముందుకంటే ఎక్కువో తక్కువో దూదిని వడుకుతాడు. తద్వారా ఒక గంట ఉత్పాదితం ఎక్కువో తక్కువో దూది విలువను భద్రపరుస్తాడు. ఏది ఏమయినప్పటికీ, అతడు తన రెండు గంటల శ్రమ ద్వారా ఒక గంటలో భద్రపరిచిన దానికి రెట్టింపు భద్రపరుస్తాడు.

విలువ ఉపయోగ వస్తువుల్లోనే ఉంటుంది. విలువకు చిహ్న మాత్రంగా ప్రాతినిధ్యం వహించే టోకెన్లను ఇక్కడ మనం పరిశీలించడం లేదు. (మూర్తీభవించిన శ్రమశక్తిగా చూస్తే, మనిషే ఒక సహజ వస్తువు. అయితే ఒక సజీవ, చైతన్య యుక్త వస్తువు. శ్రమ అతనిలో ఉన్న ఈ శక్తికి వ్యక్తీకరణ) కాబట్టి ఒక వస్తువు ఉపయోగాన్ని కోల్పోతే అది దాని విలువను కూడా కోల్పోతుంది. ఉత్పత్తి సాధనాలు వాటి ఉపయోగపు విలువను కోల్పోతాయి కాని, అదే సమయంలో వాటి విలువను మాత్రం కోల్పోవు. ఎందుచేతంటే అవి శ్రమ ప్రక్రియలో వాటి ఉపయోగపు విలువ మూలరూపాన్ని కోల్పోయి, ఉత్పాదితంలో కొత్త ఉపయోగపు విలువ రూపాన్ని సంతరించుకుంటాయి. విలువ సాకార రూపం ధరించడానికి ఏదో ఒక ఉపయోగకర వస్తువు ఉండాలన్నది విలువకు ఎంత ముఖ్యమైనప్పటికీ ఏ ప్రత్యేక వస్తువు ఈ అవసరాన్ని తీరుస్తుందన్నది ఏమీ ప్రాముఖ్యం లేని విషయం. సరుకుల రూప పరివర్తనను పరిశీలిస్తున్నప్పుడు మనం ఈ విషయాన్ని గమనించాము. కనుక శ్రమ ప్రక్రియలో ఉత్పత్తి సాధనాలు తమ ఉపయోగపు విలువతోపాటు, మార్పిడి విలువను కూడా కోల్పోయిన మేరకు మాత్రమే అవి తమ విలువను ఉత్పాదితానికి బదిలీ చేస్తాయి. ఉత్పత్తి సాధనాలుగా తాము కోల్పోయే విలువను మాత్రమే అవి ఉత్పాదితానికి ఇస్తాయి. అయితే ఈ విషయంలో శ్రమ ప్రక్రియలో ఉన్న పాదార్థిక అంశాలన్నీ ఒకేలా వ్యవహరించవు.

బాయిలర్ క్రింద కాల్చిన బొగ్గు జాడ లేకుండా మాయమవుతుంది. చక్రాల ఇరుసుల్లో వేసిన కందెన కూడా అంతే. అద్దకం రంగుల్లాంటి ఉప పదార్థాలు కూడా మాయమవుతాయి కాని ఉత్పాదితం యొక్క గుణాలుగా పునర్దర్శనమిస్తాయి. ముడిపదార్థం తన రూపాన్ని మార్చుకున్నాకే ఉత్పాదితం యొక్క పదార్థంగా రూపొందుతుంది. కనుక ముడిపదార్థమూ, ఉప పదార్థాలూ శ్రమ ప్రక్రియలో ప్రవేశించడానికి ముందు ధరించిన తమ స్వభావోచిత రూపాన్ని కోల్పోతాయి. శ్రమ పరికరాల విషయంలో అలా కాదు. పరికరాలు, యంత్రాలు, వర్క్‌షాపులు, పాత్రలు తమ మౌలిక రూపాన్ని నిలబెట్టుకున్నంత కాలమే, ప్రతి ఉదయమూ, శ్రమ ప్రక్రియను అవి తమ మారని రూపంతో ఆరంభించడానికి సిద్ధంగా ఉన్నంత కాలమే ఆ ప్రక్రియలో అవి ఉపయోగపడతాయి. వాటి జీవిత

కాలంలో అంటే అవి పనిచేసే నిరంతర శ్రమ ప్రక్రియలో తమ రూపాన్ని ఉత్పాదితంతో ప్రమేయం లేకుండా నిలబెట్టుకొన్నట్లే అవి తమ మరణం తర్వాత కూడా నిలబెట్టుకుంటాయి. యంత్రాలు, పరికరాలు, వర్క్‌షాపులు వగైరాల శవాలు అవి తయారుచేసే ఉత్పాదితాలకు ఎప్పుడూ భిన్నంగా, వేరుగా ఉంటాయి. మనం ఏ శ్రమ పరికరాన్ని అయినా దాని సేవా కాలం మొత్తాన్ని, అంటే వర్క్‌షాపులో అది ప్రవేశించిన నాటి నుండి పనికిరాని సామానుల గదిలోకి విసిరేయబడిందాకా పరిశీలిస్తే, ఈ కాలమంతటిలోనూ దాని ఉపయోగపు విలువ పూర్తిగా అనుభుక్తమయిందనీ, దాని మార్పిడి విలువ ఉత్పాదితానికి పూర్తిగా బదిలీ అయిందనీ గమనిస్తాం. ఉదాహరణకు, ఒక వడికే యంత్రం పదేళ్ళపాటు మన్నితే ఆ పని కాలంలో పదేళ్ళ ఉత్పాదితానికి క్రమ క్రమంగా దాని పూర్తి విలువ బదిలీ అయిందనేది స్పష్టం. కనుక ఒక శ్రమ పరికరం యొక్క జీవిత కాలం ఒకేలాంటి చర్యలను ఎక్కువ సంఖ్యలోనో తక్కువ సంఖ్యలోనో పునరావృత్తం చేయడంలో గడిచిపోయింది. దాని జీవితాన్ని మనిషి జీవితంతో పోల్చవచ్చు. ఒక మనిషి జీవితంలో ఒక రోజు గడిచిందంటే, ఆ మేరకు అతను తన సమాధికి దగ్గరగా చేరాడని అర్థం. ఎంత దగ్గరగా అంటే ఒక రోజంత దగ్గరగా. అయితే ఆ రోడ్డు మీద అతను ఇంకా ఎన్ని రోజులు పయనించాలి అన్నదాన్ని కేవలం అతన్ని చూసి ఎవరు ఖచ్చితంగా చెప్పలేరు. అయితే సగటు సిద్ధాంతం సాయంతో జీవిత భీమా కార్యాలయాలు చాలా కచ్చితమైన, అదే సమయంలో చాలా లాభదాయకమైన నిర్ధారణలకు రావడానికి ఈ ఇబ్బంది అడ్డురాదు. శ్రమ పరికరాల విషయం కూడా అంతే. అనుభవం వల్ల ఒక నిర్దిష్ట తరహా యంత్రం సగటున ఎంత కాలం మనగలుగుతుందో తెలుస్తుంది. శ్రమ ప్రక్రియలో దాని ఉపయోగపు విలువ ఆరు రోజులే ఉంటుంది అనుకుందాం. అటువంటప్పుడు సగటున అది ప్రతి రోజూ ఆరో వంతు ఉపయోగపు విలువను కోల్పోతుంది. కనుక రోజువారీ ఉత్పాదితానికి ఆరో వంతు విలువను ఇచ్చేస్తుంది. ఈ ప్రాతిపదికపైనే అన్ని పరికరాల అరుగుదలనీ, ప్రతి రోజూ అవి కోల్పోయే ఉపయోగపు విలువనూ, దాని అనుగుణంగా అవి ఉత్పాదితానికి ఇచ్చేసే విలువ పరిమాణాన్నీ అంచనా వేస్తారు.

శ్రమ ప్రక్రియలో ఉత్పత్తి సాధనాలు తమ సొంత ఉపయోగ విలువను నాశనం చేసుకోవటం ద్వారా కోల్పోయే విలువకు మించి ఉత్పాదితానికి తమ సొంత విలువను బదిలీ చెయ్యవనేది స్పష్టాతి స్పష్టం. అటువంటి పరికరానికి కోల్పోయే విలువ లేకపోతే, అంటే అది మానవ శ్రమ ఉత్పాదితం కాకపోతే, అది ఉత్పాదితానికి ఏ విలువనూ బదిలీ చెయ్యదు. అది మార్పిడి విలువ రూపొందడానికి తోడ్పడకుండానే ఉపయోగపు విలువను సృష్టించడానికి సాయపడుతుంది. మానవ సాయం లేకుండా ప్రకృతి సమకూర్చే ఉత్పత్తి సాధనాలన్నీ, భూమి, గాలి, నీరు, ఖనిజ రూపంలో ఉన్న లోహాలు, మానవుడు అడుగుపెట్టని అడవుల్లో కలప వగైరాలన్నీ, ఈ కోవకే చెందుతాయి. ఇక్కడ మరో ఆసక్తికరమైన ఘటన దర్శనమిస్తుంది. ఒక యంత్రం విలువ 1000 పౌండ్లనీ, అది 1000 రోజుల్లో అరిగిపోతుందనీ అనుకుందాం. అప్పుడు యంత్రం విలువలో వెయ్యోవంతు రోజువారీ ఉత్పాదితానికి బదిలీ అవుతుంది. అదే సమయంలో, యంత్రం తన జీవశక్తి తగ్గిపోతున్నప్పటికీ మొత్తంగా క్రమ ప్రక్రియలో పాల్గొనటాన్ని కొనసాగిస్తుంది. ఆ రకంగా శ్రమ ప్రక్రియలో ఒక అంశమైన ఉత్పత్తి సాధనాలు ఆ ప్రక్రియలోకి నిరంతరం మొత్తంగా ప్రవేశిస్తాయి. కానీ, విలువను రూపొందించే

ప్రక్రియలో మాత్రం అవి భాగాలుగా ప్రవేశిస్తాయి. ఈ రెండు ప్రక్రియల మధ్య ఉన్న ఈ తేడా వాటి పాదార్థిక అంశాల్లో ప్రతిబింబిస్తుంది. అదే శ్రమ పరికరం శ్రమ ప్రక్రియలో మొత్తంగా పాల్గొంటుంది. అదే సమయంలో విలువను రూపొందించే ప్రక్రియలోని అంశంగా అది భాగాలుగా ప్రవేశిస్తుంది.[1]

మరోవైపున, విలువను రూపొందించటంలో ఒక ఉత్పత్తి సాధనం మొత్తంగానూ, శ్రమ ప్రక్రియలో అది కొంచెం కొంచెంగానూ ప్రవేశించవచ్చు. నూలు వడుకటంలో ప్రతి 115 పౌనుల దూదిలోనూ 15 పౌనుల దూది వృథా అవుతోందనుకుందాం. ఇది నూలుగా మారదు. పనికిరాని చెత్తకుప్పగా మారుతుంది. ఈ 15 పౌనుల దూదినూలులో అంతర్భాగం కానప్పటికీ, వడుకటం యొక్క మామూలు పరిస్థితులలో ఈ వృథా సాధారణమూ, అనివార్యమూ అయితే దాని విలువ కూడా 100 పౌనుల దూది విలువ లాగానే నూలు విలువకు జోడించబడుతుంది. 100 పౌనుల నూలు తయారవటానికి ముందు 15 పౌనుల దూది ఉపయోగపు విలువ మట్టిలో కలవక తప్పదు. కనుక నూలు ఉత్పత్తిలో ఈ దూది నాశనం కావడం అనేది తప్పనిసరి షరతు. కేవలం ఆ కారణంచేతనే ఆ దూది విలువ ఉత్పాదితానికి బదిలీ అవుతుంది. శ్రమ ప్రక్రియలో తలెత్తే వృథా పదార్థాలన్నిటికీ ఇదే వర్తిస్తుంది. అయితే కొత్త, స్వతంత్ర ఉపయోగపు విలువల తయారీలో వాటిని మరోసారి ఉత్పత్తి సాధనాలుగా ఉపయోగించనంతవరకే ఇది వర్తిస్తుంది. వృథా పదార్థాలని అట్లా ఉపయోగించడాన్ని మాంచెస్టర్‌లో యంత్రాలు తయారుచేసే భారీ కార్ఖానాల దగ్గర చూడొచ్చు. ప్రతి సాయంత్రమూ లేతుల వద్ద పడిన ఇనుప ముక్కలను కుప్పలకొద్దీ బళ్ళపై ఫౌండ్రీలకు తరలించడమూ, అవి ఇనుప ముద్దలుగా మారి ప్రతి ఉదయమూ వర్క్‌షాపులకు చేరడమూ గమనించవచ్చు.

---

1. ఇక్కడ మనం శ్రమ పరికరాల మరమ్మతుల సంగతిని పట్టించుకోవడం లేదు. మరమ్మతులో ఉన్న యంత్రం వ్యవహరించేది శ్రమ పరికరంగా కాదు. శ్రమ గ్రహీతగా మాత్రమే. పని జరిగేది దానితో కాదు, దానిమీద. మనం ఇక్కడ పరికరాల మరమ్మతులో వ్యయమయిన శ్రమని వాటి తయారీకి అవసరమైన శ్రమలో భాగంగా పరిగణించవచ్చు. ఏ వైద్యుడూ నయం చేయలేని అరుగుదల గురించి, క్రమంగా మృత్యువుకి దారితీసే అరుగుదల గురించి మాత్రమే మనం చర్చిస్తున్నాము. "అప్పుడప్పుడు మరమ్మతులు చేయడానికి సైతం సాధ్యం కాని అరుగుదల ... అది కత్తి అయితే కత్తులు తయారు చేసేవాడు ఇక ఈ కత్తికి సాన పట్టడం వృథా అనే దశకు దారితీసే అరుగుదల ..." గురించి మనం చర్చిస్తున్నాము. ప్రతి శ్రమ ప్రక్రియలోనూ ఒక యంత్రం మొత్తంగా పాల్గొంటుందనీ, అయితే విలువను సృష్టించే ప్రక్రియలో మాత్రం అది కొంచెం కొంచెంగా మాత్రమే పాల్గొంటుందనీ మనం ఇంతకు ముందే నిరూపించాము. ఈ క్రింది ఉల్లేఖనలో ఉన్న గందరగోళాన్ని చూడండి. ఉదాహరణకు, "(మేజోళ్ళ) యంత్రాన్ని తయారు చేయడంలో వ్యయమయిన ఇంజనీరు శ్రమలో ఒక భాగం." మేజోళ్ళ జత విలువలో ఉంటుందని "రికార్డో అంటాడు." అయితే ప్రతి మేజోళ్ళ జతనీ ఉత్పత్తి చేసిన శ్రమ మొత్తం...లో ఇంజనీరు శ్రమ మొత్తం ఉంటుంది. కేవలం ఒక భాగం మాత్రమే కాదు. ఎందుకంటే, ఒక యంత్రం అనేక జతల్ని తయారు చేస్తుంది. వాటిలో ఏ ఒక్క జతా యంత్రంలో ఏ భాగం లేకపోయినా తయారయ్యేది కాదు. ("అబ్జర్వేషన్స్ ఆన్ సర్టన్ వర్బల్ డిస్పూట్స్ ఇన్ పొలిటికల్ ఎకానమీ పర్టిక్యులర్లీ రిలేటింగ్ టు వాల్యూ" పుట 54) అసాధారణంగా స్వయం సంతృప్తుడైన ఈ సర్వజ్ఞ వేషధారి గందరగోళంలోనూ, అతని వాదనలోనూ ఒక వాస్తవం ఉంది. రికార్డో శ్రమ యొక్క రెండు పార్శ్వాల మధ్య ఉన్న విభిన్నతను సరిగ్గా అర్థం చేసుకోలేదు. ఆయనకు ముందుగానీ, ఆయనకు తర్వాతగానీ మరే అర్థశాస్త్రవేత్తా దానిని గ్రహించలేదు. కనుక విలువ రూపొందటంలో ఏ పార్శ్వం ఏ పాత్ర వహిస్తుందో వారికసలే తెలియదు.

ఉత్పత్తి సాధనాలు శ్రమ ప్రక్రియలో తమ పాత ఉపయోగపు విలువ రూపంలో విలువను కోల్పోయిన మేరకు మాత్రమే కొత్త ఉత్పాదితానికి అవి విలువను బదిలీ చేస్తాయి. ఈ ప్రక్రియలో అవి కోల్పోయే గరిష్ట విలువ అవి ఆ ప్రక్రియలోకి వచ్చినప్పుడున్న తొలి విలువ మొత్తానికి, మరోలా చెప్పాలంటే వాటి ఉత్పత్తికి అవసరమైన శ్రమ కాలానికి పరిమితమవుతుంది అనేది స్పష్టం. కనుక ఉత్పత్తి సాధనాలు తాము సాయపడే ప్రక్రియతో ప్రమేయం లేకుండా స్వతంత్రంగా కలిగి ఉన్న విలువకు మించి ఉత్పాదితానికి విలువను జోడించలేవు. ఒక నిర్దిష్ట ముడిపదార్థం లేదా యంత్రం లేదా ఉత్పత్తి సాధనం ఎంత ఉపయోగకరమైనదైనా కావచ్చు. దాని ఖరీదు 150 పౌండ్లు లేదా 500 రోజుల శ్రమ కావచ్చు. అయితే అది ఏ పరిస్థితుల్లోనూ ఉత్పాదితానికి 150 పౌండ్లకు మించిన విలువను జోడించలేదు. దాని విలువ అది ఉత్పత్తి సాధనంగా ప్రవేశించే శ్రమ ప్రక్రియను బట్టిగాక అది ఉత్పాదితంగా ఏ శ్రమ ప్రక్రియ నుండి వెలువడిందో దాన్నిబట్టి నిర్ణయించబడుతుంది. దానికి అంతకు ముందే విలువ లేకపోతే, శ్రమ ప్రక్రియలో అది కేవలం ఒక ఉపయోగపు విలువగా, అంటే ఉపయోగకర లక్షణాలున్న వస్తువుగా మాత్రమే వ్యవహరిస్తుంది గనుక, అది ఉత్పాదితానికి ఏ విలువనీ బదిలీ చేయలేదు.[1]

ఉత్పాదక శ్రమ ఉత్పత్తి సాధనాలను కొత్త ఉత్పాదితం యొక్క అంతర్భాగాలుగా మార్చేటప్పుడు వాటి విలువ పరకాయ ప్రవేశం చేస్తుంది. అది అనుభుక్తమయిపోయిన దేహాన్ని వదిలేసి కొత్తగా సృష్టించబడిన దేహాన్ని ఆక్రమిస్తుంది. అయితే ఈ పరకాయ ప్రవేశం అన్నది శ్రామికునికి తెలియకుండా జరుగుతుంది. పాత విలువల్ని భద్రపరచకుండా అతను కొత్త శ్రమను జోడించలేడు. కొత్త విలువల్ని సృష్టించలేడు. ఎందుకంటే, అతను జోడించేది నిర్దిష్ట ఉపయోగకర శ్రమ అయి ఉండాలి. అతను

---

1. నేల, పరికరాలు, ముడి పదార్థమూ, అంటే ఉత్పత్తి సాధనాలు శ్రమ ప్రక్రియలో తమ ఉపయోగపు విలువ ద్వారా చేసిన "ఉత్పాదక సేవ" వల్ల అదనపు విలువ (వడ్డీ, లాభం, అద్దె) తలెత్తుతుందని చెప్పే జె.బి.సే. మాటలు ఎంత అసంబద్ధమో దీనినిబట్టి మనం నిర్ధారించవచ్చు. తెలివైన వకాల్తాదారీ కట్టుకథల్ని రాయడానికి వచ్చే ఏ అవకాశాన్నీ జారవిడవని శ్రీమాన్ విలియం రోష్చర్ ఇలా రాశాడు : "జె.బి.సే. (Traite ఒకటో గ్రంథం, అధ్యాయం 4) ఎంతో వాస్తవంగా ఇలా అంటాడు : ఒక నూనె మిల్లు అన్ని ఖర్చుల్నీ తీసేశాక ఉత్పత్తి చేసే విలువ అనేది ఒక కొత్త అంశం. నూనె మిల్లుని స్థాపించడానికి అవసరమైన శ్రమకి ఇది ఎంతో భిన్నం!" (పుట 82, నోట్) ఎంతో వాస్తవం. ప్రొఫెసర్‌గారూ! నూనె మిల్లు ఉత్పత్తి చేసిన నూనె, ఆ మిల్లుని నిర్మించడానికి వ్యయమైన శ్రమకి ఎంతో భిన్నం. విలువ అంటే "నూనె" లాంటి పదార్థం అని రోష్చర్ అర్థం చేసుకుంటాడు. నూనెకి విలువ ఉంది కనుక, "సాపేక్షంగా తక్కువ పరిమాణాల్లో"నే అయినప్పటికీ పెట్రోలియంని ప్రకృతి ఉత్పత్తి చేసినప్పటికీ ... ఈ వాస్తవాన్ని అతడు ప్రస్తావించినట్టే కనిపిస్తుంది : "అది (ప్రకృతి) ఏ మార్పిడి విలువనూ సృష్టించదు." తనకు బిడ్డ ఉందని ఒప్పుకుంటూనే, అయితే "అది చాలా చిన్నది" అని చెప్పే తెలివితక్కువ కన్యతో రోష్చర్ "ప్రకృతి"నీ, అది ఉత్పత్తి చేసే మార్పిడి విలువనూ పోల్చవచ్చు. ఈ "విద్వత్ శిఖామణి" ఇంకా ఇలా అంటాడు : "రికార్డో అనుయాయుల బృందానికి పెట్టుబడిని సంచిత శ్రమగా లెక్కించి శ్రమ ఖాతాలో ఉంచే అలవాటుంది. ఇది నైపుణ్యంలేని శ్రమ. ఎందుకంటే, పెట్టుబడి యజమాని కేవలం సృష్టించడం, భద్రపరచడం మాత్రమే కాక అంతకు మించిన పని చేశాడు. అదేమంటే దాని అనుభోగాన్ని త్యజించాడు. దానికోసం అతడు వడ్డీ డిమాండ్ చేస్తాడు." కేవలం ఒక వాంఛను విలువకు మూలంగా మార్చే ఈ అర్థశాస్త్ర "అంగాంగ విశ్లేషణా పద్ధతి" యొక్క నేర్పు ఎంతటిదో గదా!

కొత్త ఉత్పాదితం ఉత్పత్తిలో పాత ఉత్పాదితాలను ఉత్పత్తి సాధనాలుగా ఉపయోగించకుండా, వాటి విలువను ఆ రకంగా కొత్త ఉత్పాదితానికి బదిలీ చెయ్యకుండా ఉపయోగకరమైన పనిని నిర్వహించలేదు. కనుక విలువను భద్రపరచడమూ, అదే సమయంలో విలువను జోడించడమూ అనే ఈ ధర్మం కార్యరంగంలో ఉన్న శ్రమశక్తికి, అంటే సజీవ శ్రమకి, ఉండటం అన్నది ప్రకృతి ప్రసాదం. దానివల్ల కార్మికుడికి ఏమీ ఖర్చు కాదు. అది పెట్టుబడిదారుని పెట్టుబడికి గల విలువను భద్రపరుస్తుంది గనుక అతనికి ప్రయోజనకరం.[1] వ్యాపారం బాగా సాగుతున్నంత కాలం పెట్టుబడిదారుడు డబ్బు ఊడ్చుకోవడంలో మునిగిపోయి, ఊరికే నిర్నిమిత్తంగా లభిస్తున్న ఈ శ్రమ బహుమానాన్ని పట్టించుకోడు. ఒక సంక్షోభం వచ్చి ఈ శ్రమ ప్రక్రియ ఉగ్ర విఘాతానికి గురైనప్పుడు మాత్రం అతనికది బాధాకరంగా అవగతమవుతుంది.[2]

ఉత్పత్తి సాధనాలకు సంబంధించి అనుభుక్తమయింది వాటి ఉపయోగపు విలువ మాత్రమే. శ్రమ ఈ ఉపయోగ విలువను అనుభోగం చేయడం వల్ల వచ్చే ఫలితం ఉత్పాదితం. వాటి విలువ యొక్క అనుభోగం జరగదు.[3] కనుక విలువ పునరుత్పత్తి జరిగిందనటం సరిగాదు. అది నిజానికి భద్రపరచబడింది. ఈ ప్రక్రియలో అది గురయ్యే ఏ చర్యా దీనికి కారణం కాదు. అది మొదట ఏ వస్తువులో ఉందో ఆ వస్తువు అదృశ్యమైనప్పటికీ నిజానికది మరో కొత్త వస్తువుగా రూపొందింది కనుక విలువ భద్రపరచబడింది. కనుక అది ఉత్పాదితం విలువలో ఉత్పత్తి సాధనాల విలువ పునఃప్రత్యక్షం మాత్రమే. కచ్చితంగా చెప్పాలంటే అక్కడ ఆ విలువ పునరుత్పత్తి అనేది లేదు. కొత్తగా

---

1. రైతు తన వృత్తిలో ఉపయోగించే పరికరాలన్నిటిలోనూ తన పెట్టుబడిని తిరిగి చెల్లించడం కోసం అత్యధికంగా ఆధారపడే అంశం ... మానవ శ్రమ. మిగిలిన రెండు అంశాలూ, పనిచేసే పశు సంపద ... బళ్ళు, నాగళ్ళు, పారలు వగైరాలు. ఒక నిర్దిష్ట పరిమాణంలో మొదటి అంశం లేకపోతే మిగిలిన రెండు అంశాలూ నిరర్థకం. ఎడ్మండ్ బర్క్ : ''థాట్స్ అండ్ డిటెయిల్స్ ఆన్ స్కేర్సిటీ, ఒరిజినల్లీ ప్రజెంటెడ్ టు ది రైట్ ఆనరబుల్ డబ్ల్యు. పిట్, ఇన్ ది మంత్ ఆఫ్ నవంబర్ 1795'' ఎడిషన్ 1800, పుట 10)
2. ఒక ఫ్యాక్టరీ 800 మంది కార్మికులను పనిలో పెట్టేది. అది సగటున 150 భారతదేశపు దూది బేళ్ళను లేదా 130 అమెరికా బేళ్ళను వినియోగం చేసేది. దాని యజమాని 1862, నవంబర్ 26వ తేదీన వెలువడిన ది టైమ్స్ పత్రికలో తన ఫ్యాక్టరీలో పని స్తంభించడం వల్ల అవుతున్న ఖర్చుల గురించి విలపించాడు. ఆ ఖర్చులు ఏడాదికి 6000 పౌండ్లు అని అతని అంచనా. వాటిలో అద్దె, రేట్లు, పన్నులు, భీమా, మేనేజర్, గుమాస్తా, ఇంజనీర్ తదితరుల జీతాలు వగైరా అనేక అంశాలున్నాయి. వాటిని మనం ఇక్కడ పట్టించు కోవడం లేదు. అప్పుడప్పుడూ మిల్లును వేడి చేయడం కోసమూ, అప్పుడప్పుడూ ఇంజన్ని ఆడించడం కోసమూ వాడే బొగ్గుకి అయ్యే ఖర్చు 150 పౌండ్లని అతను లెక్కగట్టాడు. ఇదిగాక యంత్రాన్ని పనిచేసే స్థితిలో ఉంచడం కోసం అడపా దడపా కొంతమందిని పనిలో పెట్టడం వల్ల వారి జీతాలకయిన ఖర్చుని అతను ఈ మొత్తంలో కలిపాడు. చివరి అంశంగా యంత్రాల అరుగుదలకు గాను 1200 పౌండ్లని అతడు లెక్కించాడు. ఎందుకంటే, ''ఆవిరి యంత్రం తిరగనంత మాత్రంచేత వాతావరణమూ, సహజ క్షయమూ తమ పని మానుకోవు. ''అతని యంత్రాలు అప్పటికే దాదాపు పూర్తిగా పాతబడిపోయిన దశలో ఉన్నాయి కనుకనే తాను 1200 పౌండ్ల చిన్న మొత్తానికి మించి యంత్రాల అరుగుదలగా లెక్కించలేదని అతను నొక్కి చెప్పాడు.
3. ''ఉత్పాదక అనుభోగం ఇక్కడ ఉత్పత్తి ప్రక్రియలో ఒక సరకు అనుభోగం అన్నది ఒక భాగం. ఈ సందర్భంలో విలువ అనుభోగం ఉండదు.'' (ఎస్.పి. న్యూమాన్, 296)

ఉత్పత్తి అయింది కొత్త ఉపయోగపు విలువ. దానిలో పాత మార్పిడి విలువ పునర్దర్శనం ఇస్తుంది.[1]

శ్రమ ప్రక్రియలోని కర్తృపర అంశం విషయంలో, అంటే కార్యరంగంలో ఉన్న శ్రమశక్తి విషయంలో అది మరోలా ఉంటుంది. కార్మికుడు తన శ్రమ ఒక ప్రత్యేక తరహాదవటం వల్ల, దానికో ప్రత్యేక లక్ష్యం ఉండటం వల్ల ఉత్పత్తి సాధనాల విలువను ఉత్పాదితానికి బదిలీచేసి, దానిలో భద్రపరచడంతోపాటు అదే సమయంలో అతడు కేవలం పనిచేయడం ద్వారా ప్రతి క్షణమూ అదనపు లేదా నూతన విలువను సృష్టిస్తాడు. పనివాడు తన శ్రమశక్తి విలువతో సమానమైన విలువను ఉత్పత్తి చేయగానే, ఉదాహరణకు, ఆరు గంటల శ్రమ ద్వారా అతడు మూడు షిల్లింగుల విలువను జోడించగానే, ఉత్పత్తి ప్రక్రియ ఆగిపోయిందనుకుందాం. మొత్తం ఉత్పాదితం విలువలో ఉత్పత్తి సాధనాల వల్ల ఏర్పడిన విలువపోగా, మిగిలిన అదనపు విలువ ఇది. ఈ ప్రక్రియలో రూపొందిన మౌలిక విలువ అంశం ఇదొక్కటే. అయితే ఈ కొత్త విలువ, శ్రమశక్తిని కొనటానికి పెట్టుబడిదారుడు బయానాగా ఇచ్చిన డబ్బు అంటే కార్మికుడు తన జీవితావసరాలకై ఖర్చు చేసిన డబ్బు స్థానాన్ని మాత్రమే భర్తీ చేస్తుంది అన్న సంగతిని మనం మరిచిపోము. ఖర్చు పెట్టిన డబ్బుకి ఈ కొత్త విలువ కేవలం పునరుత్పత్తి మాత్రమే. అయితే ఉత్పత్తి సాధనాల విలువ వ్యవహారంలోలాగా ఇది కేవలం పునరుత్పత్తిలా కనిపించడం మాత్రం కాదు. ఇది వాస్తవ పునరుత్పత్తి. ఒక విలువ స్థానంలో మరో విలువను పెట్టడం అన్నది ఇక్కడ ఒక నూతన విలువ సృష్టి ద్వారా జరిగింది.

అయితే కేవలం శ్రమశక్తి విలువకు సమానమైన విలువను పునరుత్పత్తి చేయడానికి లేదా ఉత్పాదితంలో ఇమడ్చటానికి అవసరమైన కాలాన్ని దాటి శ్రమ ప్రక్రియ కొనసాగవచ్చునన్న సంగతి మనకు గత అనుభవాన్ని బట్టి తెలుసు. కేవలం శ్రమశక్తి విలువను పునరుత్పత్తి చేయడానికి అవసరమైన ఆరు గంటలకు బదులు ఈ ప్రక్రియ 12 గంటలపాటు కొనసాగవచ్చు. కనుక శ్రమశక్తి కార్యకలాపం తన సొంత విలువను పునరుత్పత్తి చేసుకోవడం మాత్రమే కాక దానికి మించిన విలువను ఉత్పత్తి చేస్తుంది. ఉత్పాదితం విలువకు ఆ ఉత్పాదితం రూపొందడానికి అనుభుక్తమైన అంశాల విలువకు మధ్య ఉన్న తేడాయే ఈ అదనపు విలువ. మరోలా చెప్పాలంటే ఉత్పాదితం విలువకూ, ఉత్పత్తి

1. 20 ముద్రణలకు గురైన ఒక అమెరికన్ గ్రంథ సంగ్రహంలో ఇలా ఉంది : "పెట్టుబడి ఏ రూపంలో పునర్దర్శనమిస్తుంది అన్నదానితో నిమిత్తం లేదు." ఈ వాక్యం తర్వాత ఉత్పత్తి యొక్క ఏ అంతర్భాగాల విలువ ఉత్పాదితంలో పునర్దర్శనమిస్తుందో వాటన్నిటినీ పేర్కొన్నాక ఆ అంశాన్ని రచయిత ఇలా ముగించాడు : "మనిషి మనుగడకూ, సుఖ జీవనానికీ అవసరమైన వివిధ రకాల ఆహారం, దుస్తులు, ఆశ్రయం కూడా మారుతాయి. అవి ఎప్పటికప్పుడు వినిమయమవుతూనే ఉంటాయి. వాటి విలువ అతని శరీరానికీ, బుద్ధికీ ప్రసాదించబడిన కొత్త జీవశక్తిలో పునర్దర్శన మిస్తుంది. ఉత్పత్తి కార్యంలో మళ్ళీ వినియోగించబడటానికి అది కొత్త పెట్టుబడిగా రూపొందు తుంది." (ఎఫ్. వేలాండ్, పుటలు 31, 32) మిగిలిన విపరీతాలన్నిటినీ పక్కనబెట్టి ఒక అంశాన్ని ఇక్కడ పేర్కొంటే సరిపోతుంది. కొత్త జీవశక్తిలో పునర్దర్శనమిచ్చేది బ్రెడ్ ధర కాదు, రక్త పుష్టినిచ్చే దాని పదార్థాంశాలు మాత్రమే. మరోవైపున ఆ జీవశక్తి విలువలో పునర్దర్శనమిచ్చేది జీవనాధార వస్తువులు కాదు, వాటి విలువ మాత్రమే. అవే జీవితావసర వస్తువులు సగం ధరలో అంతే కండరాల్నీ, ఎముకల్నీ రూపొందిస్తాయి. అంతే జీవశక్తిని ఇస్తాయి. కాని అదే విలువ కలిగిన జీవశక్తిని మాత్రం కాదు. ఇంతకు ముందున్న విలువలు కేవలం పునదర్దర్శనం ఇవ్వడాన్నిబట్టి అదనపు విలువను వివరించి పారేయడానికి రచయిత చేసే వృథా ప్రయత్నంలో అతని మోసపు అనిర్దిష్టతతో పాటు "విలువ"కూ, "జీవశక్తి"కీ మధ్య ఉన్న గందరగోళం కనిపిస్తుంది.

సాధనాల యొక్కా శ్రమశక్తి యొక్కా విలువకూ మధ్య ఉన్న తేడాయే అదనపు విలువ.

ఉత్పాదితం విలువ రూపొందటానికి జరిగిన శ్రమ ప్రక్రియలో వివిధ అంశాల విభిన్న పాత్రలను వివరించడం ద్వారా మనం నిజానికి పెట్టుబడి తన సొంత విలువను విస్తరించుకునే ప్రక్రియలో దాని విభిన్న అంశాలకు కేటాయించిన విభిన్న చర్యల స్వభావాలను వెల్లడించాము. ఉత్పాదితంలో దాని అంతర్భాగాల విలువల మొత్తం కంటే అదనంగా ఉన్న విలువ, మొదట అడ్వాన్స్ చేసిన పెట్టుబడికంటే తర్వాత విస్తరించిన పెట్టుబడిలో అదనంగా ఉన్న విలువే. ఒకవైపున ఉత్పత్తి సాధనాలు, మరోవైపున శ్రమశక్తి అనేవి మొదట డబ్బు రూపం నుండి శ్రమ ప్రక్రియలోని వివిధ అంశాలుగా రూపాంతరం చెందిన తొలి పెట్టుబడి విలువకు కేవలం విభిన్న అస్తిత్వ రూపాలు మాత్రమే. ఉత్పత్తి ప్రక్రియలో ఉత్పత్తి సాధనాలు – అంటే ముడి పదార్థమూ, ఉప పదార్థాలూ, శ్రమ పరికరాలూ – ప్రాతినిధ్యం వహించే పెట్టుబడి భాగం యొక్క విలువ ఎటువంటి పరిమాణాత్మక మార్పుకూ గురికాదు. కనుక దాన్ని నేను పెట్టుబడి యొక్క స్థిర భాగం అంటాను. లేదా ఇంకా క్లుప్తంగా స్థిర పెట్టుబడి అంటాను.

మరోవైపున ఉత్పత్తి ప్రక్రియలో శ్రమశక్తి ప్రాతినిధ్యం వహించే పెట్టుబడి విభాగం యొక్క విలువ మార్పుకు గురవుతుంది. అది తన సొంత విలువకు సమానమైన విలువనూ పునరుత్పత్తి చేస్తుంది. అదనపు విలువనూ ఉత్పత్తి చేస్తుంది. ఈ అదనపు విలువ స్వయంగా మారొచ్చు. పరిస్థితులను బట్టి ఎక్కువ కావచ్చు, తక్కువ కావచ్చు. పెట్టుబడి యొక్క ఈ భాగం నిరంతరాయంగా స్థిర పరిమాణం నుండి అస్థిర పరిమాణంగా మార్చబడుతుంది. కనుక దాన్ని నేను పెట్టుబడిలోని అస్థిర భాగం అంటాను. లేదా క్లుప్తంగా అస్థిర పెట్టుబడి అంటాను. పెట్టుబడి యొక్క ఏ అంతర్భాగాలు శ్రమ ప్రక్రియ దృష్టి నుండి వస్తుగత, కర్తృపర అంశాలుగా దర్శనమిస్తాయో, అంటే ఉత్పత్తి సాధనాలుగానూ, శ్రమశక్తిగానూ దర్శనమిస్తాయో, అవే అంతర్భాగాలు అదనపు విలువను సృష్టించే ప్రక్రియ దృష్ట్యా స్థిర, అస్థిర పెట్టుబడులుగా దర్శనమిస్తాయి.

స్థిర పెట్టుబడికి పైన ఇచ్చిన నిర్వచనాన్ని బట్టి దాని అంతర్భాగాల విలువలో మార్పు వచ్చే అవకాశం లేదని అనుకోకూడదు. ఉదాహరణకు ఒక రోజు ఒక పౌను ఆరు పెన్నీలు ఉన్న దూది ధర పత్తి పంట దెబ్బతినడం వల్ల రెండో రోజున ఒక పౌను దూది ఒక షిల్లింగ్‌కు పెరిగింది అనుకుందాం. ఆరు పెన్నీల చొప్పున కొన్న ప్రతి పౌను దూది దాని విలువ పెరిగిన తర్వాత పనిలో ఉత్పాదితానికి ఒక షిల్లింగ్ విలువను బదిలీ చేస్తుంది. విలువ పెరగక ముందే వడుకబడి, బహుశా నూలుగా మార్కెట్‌లో చలామణిలో ఉన్న దూది అదే విధంగా తన తొలి విలువకు రెట్టింపు విలువను ఉత్పాదితానికి బదిలీ చేస్తుంది. అయితే విలువలో వచ్చిన ఈ మార్పులకు, వడుకటంలో దూది విలువకు జోడింపబడిన అదనపు విలువతో సంబంధం లేదు. పాత దూదిని అసలు వడుకకుండా ఉంటే విలువ పెరిగాక దాన్ని ఒక పౌను ఆరు పెన్నీలకు బదులు ఒక షిల్లింగు చొప్పున మళ్ళీ అమ్మవచ్చు. అంతేగాక, దూది ఎన్ని తక్కువ ప్రక్రియలకు లోనయితే ఈ ఫలితం అంత ఖాయం. అందుకే విలువలో అటువంటి మార్పులు హఠాత్తుగా తలెత్తినప్పుడల్లా చట్టా వ్యాపారులు ఏ పదార్థం మీద అతి తక్కువ శ్రమ పరిమాణంలో ఖర్చయిందో దానితోనే చట్టా వ్యాపారం చెయ్యడాన్ని ఒక సూత్రంగా పాటిస్తారు. కనుక బట్టతో కంటే నూలుతోనూ, నూలుతో కంటే దూదితోనూ వారు చట్టా

వ్యాపారం చేస్తారు. మనం పరిశీలిస్తున్న ఉదాహరణలో విలువలో వచ్చే మార్పు దూది ఉత్పత్తి సాధనంగా వ్యవహరించే ప్రక్రియలో పుట్టదు. అంటే దూది స్థిర పెట్టుబడిగా వ్యవహరించే ప్రక్రియలో పుట్టదు. దూది ఉత్పత్తి అయే ప్రక్రియలోనే దాని విలువలో మార్పు వస్తుంది. ఒక సరుకు విలువ దానిలో ఉన్న శ్రమ పరిమాణాన్ని బట్టి నిర్ణయమవుతుందన్నది నిజమే. అయితే ఈ పరిమాణం అన్నదే స్వయంగా సామాజిక పరిస్థితులకు లోబడి ఉంటుంది. ఏ సరుకుని ఉత్పత్తి చేయడానికయినా సామాజికంగా అవసరమైన కాలం మారితే (ఒక నిర్దిష్ట బరువు గల దూది, పంట బాగా పండినప్పటి కంటే పంట దెబ్బతిన్నప్పుడు ఎక్కువ శ్రమకు ప్రాతినిధ్యం వహిస్తుంది.) అంతకు ముందున్న అదే రకం సరుకులన్నీ ఆ మార్పుకు గురవుతాయి. ఎందుకంటే అవి ఒకే జాతికి చెందిన వ్యష్టి అంశాలు మాత్రమే కనుక.[1] ఏ నిర్దిష్ట సమయంలోనైనా వాటి విలువ సామాజికంగా అవసరమైన శ్రమ ద్వారా కొలవబడుతుంది. అంటే ఆ నాడున్న సామాజిక పరిస్థితుల్లో వాటి ఉత్పత్తికి అవసరమైన శ్రమ ద్వారా కొలవబడుతుంది.

ముడిపదార్థం విలువ మారినట్టుగానే ఈ క్రమంలో వినియోగించబడిన శ్రమ పరికరాల, యంత్రాల విలువ కూడా మారొచ్చు. తద్వారా ఉత్పాదితం విలువలో ఎంత భాగం వాటి నుండి ఉత్పాదితానికి బదిలీ అయ్యేదీ కూడా మారొచ్చు. ఒక కొత్త సృజన వల్ల ఒక రకం యంత్రాలు తక్కువ శ్రమతో ఉత్పత్తి కాగలిగితే పాత యంత్రాల విలువ కూడా అంతో ఇంతో తగ్గుతుంది. కనుక ఆ మేరకు తక్కువ విలువను అవి ఉత్పాదితానికి బదిలీ చేస్తాయి. అయితే ఇక్కడ కూడా విలువలో వచ్చిన ఈ మార్పు యంత్రం ఉత్పత్తి సాధనంగా వ్యవహరించే ప్రక్రియకు వెలుపలే పుట్టింది. ఈ ప్రక్రియలోకి వచ్చాక యంత్రం తాను ఈ ప్రక్రియకు బయట సంతరించుకున్న విలువకు మించి బదిలీ చేయలేదు.

ఉత్పత్తి సాధనాలు శ్రమ ప్రక్రియలో పాత్ర నిర్వహించడం ప్రారంభమయ్యాక సైతం వాటి విలువలో వచ్చిన మార్పు స్థిర పెట్టుబడిగా వాటి స్వభావాన్ని మార్చదు. అలాగే స్థిర, అస్థిర పెట్టుబడుల మధ్య ఉన్న నిష్పత్తిలో వచ్చే మార్పు కూడా ఈ రెండు రకాల పెట్టుబడుల ధర్మాలను మార్చదు. ఇది వరకు పదిమంది మనుషులు, తక్కువ విలువ కలిగిన పది పరికరాలతో సాపేక్షంగా తక్కువ పరిమాణం గల ముడి పదార్థాన్ని వినియోగిస్తుండవచ్చు. ఇప్పుడు ఒకే మనిషి, ఒక ఖరీదైన యంత్రంతో వందరెట్లు ముడి పదార్థాన్ని వినియోగించే స్థాయికి శ్రమ ప్రక్రియ యొక్క సాంకేతిక పరిస్థితులు విప్లవాత్మకమయ్యా యనుకుందాం. అటువంటి సందర్భంలో స్థిర పెట్టుబడి అపారంగా పెరిగిందన్న మాట. ఉపయోగించ బడిన ఉత్పత్తి సాధనాల మొత్తం విలువ దీనికి ప్రాతినిధ్యం వహిస్తుంది. అదే సమయంలో శ్రమశక్తి కోసం మదుపు పెట్టబడిన అస్థిర పెట్టుబడి బాగా తగ్గిపోయింది. అయితే అటువంటి విప్లవం స్థిర, అస్థిర పెట్టుబడుల పరిమాణాత్మక సంబంధాన్ని మాత్రమే మారుస్తుంది. లేదా మొత్తం పెట్టుబడి స్థిర, అస్థిర భాగాలుగా ఏ నిష్పత్తిలో విభజింపబడిందో ఆ నిష్పత్తిని మారుస్తుంది. అంతేగాని ఆ రెంటి మధ్య ఉన్న సారభూతమైన భేదాన్ని మాత్రం అది ఏమాత్రం ప్రభావితం చేయదు.

---

1. "సరిగా చెప్పాలంటే ఒకే రకం ఉత్పాదితాలన్నీ ఒకే సమూహం అవుతాయి. వాటి ధర సార్వత్రికంగా నిర్ణయమవుతుంది. ప్రత్యేక పరిస్థితులు లెక్కలోకి రావు. (లేట్రోస్నె, పుట 893)

# అధ్యాయం - 9

# అదనపు విలువ రేటు

## విభాగం-1

## శ్రమశక్తి దోపిడీ స్థాయి

**ఉ**త్పత్తి ప్రక్రియలో తొలి పెట్టుబడి పె.[1] సృష్టించిన అదనపు విలువ, లేదా మరో రకంగా చెప్పాలంటే పెట్టుబడి పె. విలువ యొక్క స్వయం విస్తరణ, మన పరిశీలనార్థం మొట్టమొదట ఉత్పాదితం యొక్క అంతర్భాగాల విలువను మించి ఉత్పాదితంలో అదనంగా ఉన్న మొత్తంగా దర్శనమిస్తుంది.

పెట్టుబడి పె.లో రెండు భాగాలుంటాయి. మొదటిది, ఉత్పత్తి సాధనాలపై పెట్టిన డబ్బు మొత్తం స్థిర పెట్టుబడి. రెండోది, శ్రమశక్తిపై వ్యయం చేసిన డబ్బు మొత్తం అస్థిర పెట్టుబడి. స్థిర పెట్టుబడిగా మారిన భాగానికి స్థిర పెట్టుబడి ప్రాతినిధ్యం వహిస్తుంది. అస్థిర పెట్టుబడిగా మారిన భాగానికి అస్థిర పెట్టుబడి ప్రాతినిధ్యం వహిస్తుంది. అంటే మొదట పెట్టుబడి = స్థిర పెట్టుబడి + అస్థిర పెట్టుబడి. ఉదాహరణకు, అడ్వాన్సు చేసిన పెట్టుబడి 500 పౌండ్లు అయితే దానిలో భాగాలు 500 పౌండ్లు = 410 పౌండ్లు స్థిర పెట్టుబడి + 90 పౌండ్లు అస్థిర పెట్టుబడిగా ఉండొచ్చు. ఉత్పత్తి ప్రక్రియ పూర్తయ్యాక (స్థిర పెట్టుబడి + అస్థిర పెట్టుబడి) + అ.వి. విలువ కలిగిన ఉత్పాదితం లభిస్తుంది. ఇక్కడ అ.వి. అంటే అదనపు విలువ. పాత సంఖ్యలనే తీసుకుంటే ఈ ఉత్పాదితం విలువ (410 పౌండ్లు స్థిర పెట్టుబడి + 90 పౌండ్లు అస్థిర పెట్టుబడి) + 90 పౌండ్లు అ.వి. కావచ్చు. తొలి పెట్టుబడి పె. ఇప్పుడు పె.1 మారింది. 500 పౌండ్లు 590 పౌండ్లుగా మారింది. తేడా, లేదా అదనపు విలువ 90 పౌండ్లు. ఉత్పాదితం యొక్క అంతర్భాగాల విలువ అడ్వాన్స్ చేసిన పెట్టుబడితో సమానం కనుక ఉత్పాదితం యొక్క అంతర్భాగాల విలువను మించి ఉత్పాదితంలో అదనంగా ఉన్న విలువ మొత్తం అడ్వాన్స్ చేసిన పెట్టుబడి విస్తరణకు లేదా ఉత్పత్తి అయిన అదనపు విలువకు సమానం అనటం కేవలం పునరుక్తి మాత్రమే.

అయినప్పటికీ, మనం ఈ పునరుక్తిని మరింత క్షుణ్ణంగా పరిశీలించాలి. మనం పోలుస్తున్న రెండు అంశాలూ ఏవంటే ఉత్పాదితం విలువా, ఉత్పత్తి ప్రక్రియలో అనుభుక్తమైన దాని అంతర్భాగాల విలువా. శ్రమ పరికరాల రూపంలో ఉండే స్థిర పెట్టుబడి ఉత్పాదితానికి తన విలువలో ఒక భాగాన్ని మాత్రమే ఎలా బదిలీ చేస్తుందో మిగిలిన విలువ ఆ పరికరాల్లోనే ఎలా కొనసాగుతుందో చూశాము.

1. ఇక్కడ "పె." అడ్వాన్సు పెట్టుబడి లేక తొలి పెట్టుబడి లేక మొదటి పెట్టుబడి అనేవాటికి బదులుగా వాడబడింది. మార్క్స్ దీన్ని "C" అనే ఇంగ్లీషు పెద్ద అక్షరంతో గుర్తించాడు. (సంపాదకుడు)

విలువ రూపొందటంలో ఈ మిగిలిన విలువ ఏమీ పాత్ర వహించదు కనుక మనం దానిని ప్రస్తుతానికి ఒక పక్కన ఉంచుదాం. దానిని లెక్కించినా తేడా ఏమీ ఉండదు. ఉదాహరణకు, మన పాత సంఖ్యను తీసుకుంటే స్థిర పెట్టుబడి = 410 పౌండ్లు : ఈ మొత్తంలో 312 పౌండ్ల విలువ గల ముడి పదార్థమూ, 44 పౌండ్ల ఉప పదార్థమూ, ఈ ప్రక్రియలో యంత్రాల అరుగుదల విలువ 54 పౌండ్లు అనుకుందాం. పనిలో పెట్టిన మొత్తం యంత్రాల విలువ 1054 పౌండ్లు అనుకుందాం. దీనిలో నుండి ఉత్పాదితం తయారు కావడానికి యంత్రాల అరుగుదల రూపంలో అడ్వాన్సు చేసింది 54 పౌండ్లు మాత్రమేనని మనం లెక్కించాము. ఎందుకంటే, యంత్రాలు ఉత్పాదితానికి జోడించింది అంతమాత్రమే. ఇక్కడ మిగిలిన 1000 పౌండ్లనీ, అంటే యంత్రాలలో ఇంకా ఉన్న విలువ మొత్తాన్నీ, ఉత్పాదితానికి బదిలీ అయినట్లు గుర్తిస్తే, మనం దాన్ని అడ్వాన్స్ చేసిన విలువలో భాగంగా కూడా గుర్తించాలి. అంటే దాన్ని ఖాతాకి రెండువైపులా చేర్చాలి.[1] ఈ రకంగా అయితే మనకి ఒకపక్క 1500 పౌండ్లూ, రెండోపక్క 1590 పౌండ్లూ తేలతాయి. ఈ రెండు సంఖ్యల తేడా, లేదా అదనపు విలువ, ఇప్పుడు కూడా 90 పౌండ్లే. కనుక ఈ పుస్తకంలో అడ్వాన్సు చేయబడిన స్థిర పెట్టుబడి అన్నప్పుడల్లా, సందర్భం దానికి వ్యతిరేకంగా లేనంతవరకూ, ఆ ప్రక్రియలో వాస్తవంగా అనుభుక్తమయిన ఉత్పత్తి సాధనాల విలువ, ఆ విలువ మాత్రమే అని మా ఉద్దేశం.

పె. = స్థి.పె. + అస్థి.పె. అనే సూత్రానికి తిరిగి వద్దాం. పె – పె1గా మారింది కనుక ఈ సూత్రం పె1 = (స్థి.పె. + అస్థి.పె.) + అ.వి.గా రూపాంతరం చెందింది. స్థిర పెట్టుబడి విలువ ఉత్పాదితానికి బదిలీ అయిందనీ, కేవలం దానిలో పునఃప్రత్యక్షమయిందనీ మనకు తెలుసు. ఈ ప్రక్రియలో వాస్తవంగా సృష్టించబడిన కొత్త విలువ, అంటే ఉత్పత్తి చేయబడిన విలువ లేదా ఉత్పాదిత విలువ ఉత్పాదితం యొక్క విలువకంటే భిన్నమైనది. ఉత్పాదిత విలువ మొదట కనిపించే విధంగా (స్థి.పె. + అస్థి.పె.) + అ.వి. కాదు. అంటే 410 పౌండ్లు స్థిర పెట్టుబడి + 90 పౌండ్లు అస్థిర పెట్టుబడి + 90 పౌండ్లు, అదనపు విలువ కాదు. అది అస్థి.పె. + అ.వి. లేదా 90 పౌండ్లు అస్థిర పెట్టుబడి + 90 పౌండ్లు అదనపు విలువ మాత్రమే. అంటే 590 పౌండ్లు కాదు, 180 పౌండ్లు మాత్రమే. పె. = 0 అయితే, లేదా మరోలా చెప్పాలంటే పరిశ్రమలో శాఖలుండి ఉత్పత్తి సాధనాలన్నిటినీ, అవి ముడి పదార్థాలయినా, ఉప పదార్థాలయినా, శ్రమ పరికరాలయినా వాటన్నిటినీ పెట్టుబడిదారుడు బ్రాంచీలకు తరలించి కేవలం శ్రమశక్తినీ, ప్రకృతి సరఫరా చేసే పదార్థాలనూ మాత్రమే పనిలో పెట్టినట్టయితే ఆ సందర్భంలో ఉత్పాదితానికి బదిలీ చేయడానికి స్థిర పెట్టుబడి ఉండదు. ఉత్పాదితం యొక్క విలువలో ఈ భాగం మన ఉదాహరణ ప్రకారం 410 పౌండ్లు అనే మొత్తం రద్దయిపోతుంది. అయితే పెట్టుబడి అనేది ఊహించడానికి ఎంత వీలుంటే అంత పెద్ద విలువకు ప్రాతినిధ్యం వహించినప్పటికీ, సృష్టించబడిన కొత్త విలువ లేదా ఉత్పాదిత విలువ, అంటే 90 పౌండ్ల అదనపు విలువను కలిగి ఉండే 180 పౌండ్ల మొత్తం మాత్రం అంతే ఉంటుంది. ఇప్పుడు పె. = అస్థి.పె. = అస్థి.పె. లేదా విస్తరించిన పెట్టుబడి పె.1 = అస్థి.పె. + అ.వి. కనుక

1. "స్థిర పెట్టుబడిని మనం అడ్వాన్సు చేసిన మొత్తాలలో భాగంగా గుర్తిస్తే, ఆ పెట్టుబడిలో మిగిలిన విలువను సంవత్సరాంతంలో వార్షికాదాయంలో భాగంగా గుర్తించాలి." (మాల్తస్, ప్రిన్సిపుల్స్ ఆఫ్ పొలిటికల్ ఎకానమీ రెండో ముద్రణ, లండన్, 1836, పుట 269)

ఇదివరకులాగే పె.1 = పె. = అ.వి. మరోవైపున అ.వి. = 0 అయితే, లేదా మరో రకంగా చెప్పాలంటే, అస్థిర పెట్టుబడి రూపంలో అడ్వాన్స్ చేయబడే విలువ కలిగిన శ్రమశక్తి దానికి సమానమైన విలువను మాత్రమే ఉత్పత్తి చేస్తే అప్పుడు పె.= స్థి.పె.+ అస్థి.పె. అవుతుంది, లేదా ఉత్పాదితం యొక్క విలువ పె.1 = (స్థి.పె. + అస్థి.పె.) + 0 అవుతుంది. లేదా పె. = పె.1 అవుతుంది. తొలి పెట్టుబడి ఈ సందర్భంలో తన విలువను విస్తరించదు.

అదనపు విలువ అనేది కేవలం శ్రమశక్తిగా మారిన పెట్టుబడి భాగమైన అస్థి.పె. విలువలో వచ్చిన మార్పువల్ల కలిగిన ఫలితం మాత్రమే అని మనకు ఇంతకు ముందు చూసినదానిబట్టి తెలుసు. కనుక అస్థి.పె. + అ.వి. = అస్థి.పె. + అస్థి.పె1 లేదా అస్థి.పె. + అస్థి.పె.లో వచ్చిన పెరుగుదల అయితే పెట్టుబడిలో అస్థిర భాగం పెరిగిన ఫలితంగా తొలి పెట్టుబడి మొత్తం కూడా పెరిగే పరిస్థితి వల్ల మారేది అస్థి.పె. ఒక్కటే అనే విషయమూ, ఆ మారే పరిస్థితులూ మరుగున పడిపోతాయి. అది మొదట 500 పౌండ్లు. ఇప్పుడు 590 పౌండ్లు అవుతుంది. కనుక మన పరిశోధన కచ్చితమైన ఫలితాలకు దారితీయాలంటే, కేవలం స్థిర పెట్టుబడి మాత్రమే చూపించే ఉత్పాదితం యొక్క విలువ భాగాన్ని తొలగించి పరిశీలించాలి. తద్వారా స్థిర పెట్టుబడిని "సున్న"తో సమం చేయాలి, లేదా స్థి.పె. = 0 చేయాలి. ఇది కేవలం ఒక గణిత సూత్రాన్ని వర్తింపజేయడమే. మనం సంకలన వ్యవకలన చిహ్నాల ద్వారా మాత్రమే పరస్పర సంబంధం గల స్థిర, అస్థిర పరిమాణాలతో వ్యవహరించినప్పుడల్లా, ఈ సూత్రాన్ని వినియోగించాలి.

అస్థిర పెట్టుబడి తొలి రూపం వల్ల మరికొంత ఇబ్బంది ఎదురవుతుంది. మన ఉదాహరణలో పె1 = 410 పౌండ్లు స్థిర పెట్టుబడి + 90 పౌండ్లు, అస్థిర పెట్టుబడి + 90 పౌండ్లు అదనపు విలువ. అయితే 90 పౌండ్లు అనేది ఒక నిర్దిష్ట పరిమాణం. కనుక స్థిర పరిమాణం. కనుక దానిని అస్థిరం అని పరిగణించడం అసంబద్ధంగా ఉంటుంది. అయితే నిజానికి, 90 పౌండ్లు అస్థిర పెట్టుబడి అనే పదం ఈ విలువ ఒక ప్రక్రియకు లోనవుతుంది అని సూచించే చిహ్నం మాత్రమే. శ్రమశక్తి కొనుగోలులో మదుపు పెట్టబడిన పెట్టుబడి భాగం భౌతిక రూపం ధరించిన శ్రమ యొక్క నిర్దిష్ట పరిమాణం. కొనుగోలు చేయబడిన శ్రమశక్తి విలువలాగే అది కూడా ఒక స్థిర విలువ. అయితే ఉత్పత్తి ప్రక్రియలో 90 పౌండ్ల స్థానాన్ని కార్యరంగంలో ఉన్న శ్రమశక్తి తీసుకుంటుంది. మృత శ్రమ స్థానంలోకి సజీవ శ్రమ వస్తుంది. స్తబ్దంగా ఉన్న ఒక అంశం స్థానాన్ని ప్రవహిస్తున్న మరో అంశమూ, స్థిరమైన దాని స్థానాన్ని అస్థిరమైనదీ తీసుకుంటాయి. ఫలితమేమంటే పునరుత్పత్తితోపాటు దాని పెరుగుదల ఉత్పత్తి. పెట్టుబడిదారీ ఉత్పత్తి దృష్టి నుంచి మొత్తం ప్రక్రియ అంతా శ్రమశక్తిగా మార్చబడిన తొలి స్థిర విలువలో దానిపాటికదే వచ్చిన మార్పుగా కనిపిస్తుంది. ఈ ప్రక్రియా, దీని ఫలితమూ కూడా స్థిర విలువ వల్లే తలెత్తినట్టు కనిపిస్తాయి. కనుక "90 పౌండ్ల అస్థిర పెట్టుబడి" లేదా "ఇంత మొత్తం స్వయం ప్రవర్థమాన విలువ" లాంటి మాటలు వైరుధ్య పూరితంగా కనిపిస్తాయి. పెట్టుబడిదారీ ఉత్పత్తిలో అంతర్గతంగా ఉన్న వైరుధ్యాన్ని అవి బైటికి తేవడమే దీనికి కారణం.

మొదటి చూపుకు, స్థిర పెట్టుబడిని "సున్న"తో సమం చేయడం వింతగా అనిపిస్తుంది. అయితే మనం ప్రతి రోజూ చేసేదదే. దూది పరిశ్రమ నుండి ఇంగ్లండుకి వచ్చిన లాభాల మొత్తాన్ని లెక్కించాలి అనుకుంటే మొదట మనం అమెరికాకు, ఇండియాకు, ఈజిప్టుకు ఇతర దేశాలకూ దూది

కోసం చెల్లించిన మొత్తాలను తీసేస్తాం. మరో రకంగా చెప్పాలంటే ఉత్పాదితం విలువలో కేవలం పునఃప్రత్యక్షమయ్యే విలువ = 0గా మనం భావిస్తాం.

అదనపు విలువకు అది పెట్టుబడి యొక్క ఏ భాగం నుండి నేరుగా ఉద్భవిస్తుందో, దేని విలువలో మార్పుకు ప్రాతినిధ్యం వహిస్తుందో దానితో గల నిష్పత్తి మాత్రమే కాక, అడ్వాన్సు చేయబడిన మొత్తం పెట్టుబడితో గల నిష్పత్తి కూడా ఆర్థికంగా చాలా ప్రాముఖ్యం వహిస్తుంది. కనుక మనం మూడో గ్రంథంలో ఈ నిష్పత్తిని క్షుణ్ణంగా పరిశీలిస్తాము. ఒక భాగం పెట్టుబడిని శ్రమశక్తిగా మార్చటం ద్వారా దాని విలువను విస్తరించేలా చేయాలంటే, మరో భాగాన్ని ఉత్పత్తి సాధనాలుగా మార్చడం అవసరం. అస్థిర పెట్టుబడి తన క్రియను నిర్వహించాలంటే స్థిర పెట్టుబడి తగిన నిష్పత్తిలో ఉండాలి. ఆ నిష్పత్తి ప్రతి శ్రమ ప్రక్రియలోనూ ఆయా ప్రత్యేక సాంకేతిక పరిస్థితులను బట్టి ఉంటుంది. ఒక రసాయనిక ప్రక్రియకు కుప్పెలు పాత్రలూ అవసరమైనంత మాత్రాన రసాయన శాస్త్రజ్ఞుడు తన విశ్లేషణ ఫలితాల్లో వాటిని పరిగణించాలనేమీ లేదు. మనం ఉత్పత్తి సాధనాలను, ఇతర విషయాలన్నిటినీ వదలిపెట్టి, విలువ సృష్టితోనూ, విలువ పరిమాణంలో వచ్చే మార్పుతోనూ వాటికి గల సంబంధం దృష్ట్యా చూస్తే అవి విలువ సృష్టికర్త అయిన శ్రమశక్తికి నిలయంగా ఉండే పదార్థంలా కనిపిస్తాయి. ఆ పదార్థం యొక్క స్వభావానికి గానీ, దాని విలువకు గానీ ఎటువంటి ప్రాధాన్యమూ లేదు. ఉత్పత్తి ప్రక్రియలో వ్యయమైన శ్రమని ఇముడ్చుకోడానికి తగినంతగా వాటి సరఫరా ఉండడం ఒక్కటే అవసరం. ఆ సరఫరా ఒకసారి నిర్ధారితమయ్యాక ఆ పదార్థం విలువ పెరిగినా, తరిగినా లేదా నేల, సముద్రం లాగా స్వయంగా ఏ విలువా లేకున్నా విలువ సృష్టిపైనగానీ, విలువ పరిమాణం యొక్క మార్పుపైనగానీ దాని ప్రభావం ఏమీ ఉండదు.[1]

అంటే, మొదటి సంగతి, మనం స్థిర పెట్టుబడిని "సున్న"తో సమం చేస్తాం. కనుక తొలి పెట్టుబడి స్థి.పె. + అస్థి.పె. నుండి అస్థి.పె.కి కుదించబడుతుంది. ఉత్పాదితం యొక్క విలువ (స్థి.పె. + అస్థి.పె.) + అ.వి.కి బదులు ఇప్పుడు మనకు ఉత్పత్తి అయిన విలువ అస్థి.పె.+ అ.వి. ఉంది. ఉత్పత్తి అయిన నూతన విలువ = 180 పౌండ్లు. ప్రక్రియలో వ్యయమైన మొత్తం శ్రమకూ అది ప్రాతినిధ్యం వహిస్తుంది. దానిలో నుండి అస్థిర పెట్టుబడి విలువ 90 పౌండ్లు తీసేస్తే, మనకు అదనపు విలువ మొత్తం 90 పౌండ్లు మిగులుతుంది. ఈ 90 పౌండ్ల మొత్తం, లేదా అ.వి. అనేది ఉత్పత్తి అయిన అదనపు విలువ యొక్క పరమ పరిమాణాన్ని తెలుపుతుంది. ఉత్పత్తి అయిన సాపేక్ష పరిమాణం లేదా అస్థిర పెట్టుబడి పెరిగిన శాతం, అస్థిర పెట్టుబడితో అదనపు విలువకు ఉన్న నిష్పత్తిని బట్టి ఉంటుందన్నది స్పష్టం. లేదా అ.వి./అస్థి.పె. ద్వారా వ్యక్తమవుతుంది. మన ఉదాహరణలో ఈ నిష్పత్తి 90/90. అంటే 100% వృద్ధి. అస్థిర పెట్టుబడిలో ఈ సాపేక్ష వృద్ధిని, లేదా అదనపు విలువ యొక్క ఈ సాపేక్ష పరిమాణాన్ని నేను "అదనపు విలువ రేటు" అంటాను.[2]

---

1. లుక్రేటియస్ చెప్పేది స్వయం విదితం. "nil posse creari de nihilo". శూన్యంలో నుండి ఏదీ సృష్టించబడదు. విలువను సృష్టించడం అంటే శ్రమశక్తిని శ్రమగా మార్చడం. శ్రమశక్తి అనేది పోషక పదార్థం ద్వారా మానవ శరీరానికి బదిలీ అయిన శక్తి.
2. "లాభం రేటు", "వడ్డీ రేటు" లాంటి పదాలను ఇంగ్లీషు వారు వాడినట్టుగానే ఇది కూడా అదనపు విలువ నియమాలు మనకు అవగతం కాగానే లాభం రేటు అన్నది అర్థం కానిదేమీ కాదని మూడో గ్రంథంలో మనం గమనిస్తాము. ఈ క్రమాన్ని తిరగేస్తే మాత్రం మనకు ఏదీ అర్థం కాదు.

శ్రమ ప్రక్రియ యొక్క ఒక భాగంలో కార్మికుడు కేవలం తన శ్రమశక్తి విలువను మాత్రమే, తన జీవనాధారాల విలువను మాత్రమే, ఉత్పత్తి చేస్తాడనే అంశాన్ని మనం గమనించాము. సామాజిక శ్రమ విభజనపై ఆధారపడిన ఒక వ్యవస్థలో అతని పని ఒక భాగం కనుక తాను అనుభోగం చేసే వస్తువులను స్వయంగా ఉత్పత్తి చేసుకోడు. వాటికి బదులు అతడు ఒక ప్రత్యేక సరుకును ఉత్పత్తి చేస్తాడు. ఉదాహరణకు, నూలు. దాని విలువ ఆ అనుభోగ వస్తువుల విలువతో సమానం, లేదా వాటిని కొనుగోలు చేసే డబ్బుతో సమానం. ఈ ప్రయోజనం కొరకు అర్పించబడిన అతని రోజువారీ శ్రమలో భాగం, అతనికి సగటున రోజువారీ అవసరమైన వస్తువుల విలువను బట్టి, లేదా వాటిని ఉత్పత్తి చేయడానికి సగటున అవసరమైన శ్రమ కాలాన్ని బట్టి ఎక్కువగానో, తక్కువగానో ఉంటుంది. ఆ అవసరాల విలువ సగటున ఆరు గంటల శ్రమ వ్యయానికి ప్రాతినిధ్యం వహిస్తే పనివాడు ఆ విలువను ఉత్పత్తి చేయటానికి సగటున ఆరు గంటలు పని చేయాలి. అతడు పెట్టుబడిదారుని కోసం పని చేయడానికి బదులు తన కోసమే స్వతంత్రంగా పని చేసినా, ఇతర విషయాలేమీ మారకుండా ఉంటే, అతని శ్రమశక్తి విలువను ఉత్పత్తి చేయడానికీ, తద్వారా తన మనుగడకు, లేదా తన నిరంతర పునరుత్పత్తికి అవసరమైన జీవనాధారాలను పొందటానికీ అన్ని గంటలే పని చేయాల్సి ఉంటుంది. అయితే అతని శ్రమశక్తి విలువను, ఉదాహరణకు మూడు షిల్లింగులను, ఉత్పత్తి చేయడానికి అవసరమైన అతని ఒక రోజు శ్రమ యొక్క ఆ భాగంలో, అంతకు ముందే పెట్టుబడిదారుడు అడ్వాన్స్ చేసిన శ్రమశక్తి విలువకు సమానమైన విలువను మాత్రమే అతడు ఉత్పత్తి చేస్తాడు.[1] సృష్టించబడిన కొత్త విలువ అడ్వాన్స్ చేయబడిన అస్థిర పెట్టుబడి స్థానాన్ని మాత్రమే ఆక్రమిస్తుంది. ఈ వాస్తవం వల్లనే మూడు షిల్లింగుల కొత్త విలువ ఉత్పత్తి కేవలం పునరుత్పత్తిలా కనిపిస్తుంది. పనిదినంలో ఈ పునరుత్పత్తి జరిగే భాగాన్ని నేను అవసర శ్రమ కాలం అంటాను. ఆ సమయంలో వ్యయమైన శ్రమని నేను అవసర శ్రమ అంటాను.[2] కార్మికుని విషయంలో అవసరం అనడం ఎందుకంటే, అది అతని శ్రమ యొక్క నిర్దిష్ట సామాజిక రూపం మీద ఆధారపడదు గనుక. పెట్టుబడి విషయంలోనూ, పెట్టుబడిదార్ల ప్రపంచం విషయంలోనూ అవసరం అనడం ఎందుకంటే, నిరంతరాయమైన కార్మికుని మనుగడపైనే వారి మనుగడ కూడా ఆధారపడి ఉంటుంది కనుక.

శ్రమ ప్రక్రియలోని రెండో భాగంలో కార్మికుని శ్రమ అవసర శ్రమ కాదు. దానిలో కూడా అతడు శ్రమశక్తిని ఖర్చు చేస్తాడు. అయితే అతని శ్రమ అవసర శ్రమ కాదు కనుక తన కోసం

---

1. మూడో జర్మన్ కూర్పుకి ఏంగెల్స్ చేర్చిన నోట్ : ప్రస్తుతం వాడుకలో ఉన్న అర్థశాస్త్ర భాషను రచయిత ఇక్కడ ఉపయోగించాడు. కార్మికుడే పెట్టుబడిదారునికి అడ్వాన్స్ చేస్తాడని, పెట్టుబడిదారుడు కార్మికునికి అడ్వాన్స్ చేయడనీ 7వ అధ్యాయంలో నిరూపించబడింది. - ఏంగెల్స్.

2. ఈ గ్రంథంలో ఇంతవరకూ మనం "అవసర శ్రమ కాలం" అన్న పదాన్ని నిర్దిష్ట సామాజిక పరిస్థితుల్లో ఏ సరుకునైనా ఉత్పత్తి చేయడానికి అవసరమైన కాలాన్ని సూచించడానికి ఉపయోగించాము. ఇక నుంచీ శ్రమశక్తి అనే నిర్దిష్ట సరుకును ఉత్పత్తి చేయడానికి అవసరమైన కాలాన్ని సూచించడానికి కూడా ఈ పదాన్ని వాడతాము. ఒకే సాంకేతిక పదాన్ని విభిన్న అర్థాల్లో వాడటంలో అసౌకర్యం ఉంది. అయితే ఏ శాస్త్రంలోనూ దీన్ని పూర్తిగా పరిహరించడం సాధ్యం కాదు. ఉదాహరణకు, గణితశాస్త్రంలోని ఉన్నత శాఖలను కింది శాఖలతో పోల్చి చూడండి.

అతడు అప్పుడు విలువను సృష్టించడు. అతడు అదనపు విలువను సృష్టిస్తాడు. శూన్యం నుండి సృష్టించబడిన దానిలో కనిపించే మనోహరత్వమంతా దానిలో పెట్టుబడిదారునికి కనిపిస్తుంది. పని దినం యొక్క ఈ భాగాన్ని నేను అదనపు శ్రమ కాలం అంటాను. ఆ కాలంలో వ్యయమయిన శ్రమని అదనపు శ్రమ అంటాను. విలువను సక్రమంగా అర్థం చేసుకోడానికి, దాన్ని కేవలం ఇన్ని గంటల ఘనీభవించిన శ్రమగా, కేవలం భౌతిక రూపం ధరించిన శ్రమగా పరిగణించడం అవసరమైనట్టే, అదనపు విలువను సరిగా అర్థం చేసుకోడానికి దాన్ని కేవలం ఘనీభవించిన అదనపు శ్రమ కాలంగా, కేవలం భౌతిక రూపం ధరించిన అదనపు శ్రమగా పరిగణించడం అవసరం. సమాజం యొక్క వివిధ ఆర్థిక రూపాల మధ్య ఉండే సారభూతమైన తేడా, ఉదాహరణకు, బానిస శ్రమపై ఆధారపడిన సమాజానికీ, వేతన శ్రమపై ఆధారపడిన సమాజానికీ మధ్య ఉండే తేడా, ప్రతి సందర్భంలోనూ వాస్తవ ఉత్పత్తిదారుడైన కార్మికుని నుండి ఈ అదనపు విలువ పిండబడే పద్ధతిలోనే ఉంటుంది.[1] ఒకవైపున అస్థిర పెట్టుబడి విలువా, ఆ పెట్టుబడి కొనుగోలు చేసిన శ్రమశక్తి విలువా సమానం. ఈ శ్రమశక్తి విలువ పని దినంలో అవసర భాగాన్ని నిర్ణయిస్తుంది. మరోవైపున అదనపు విలువ పని దినంలో అదనపు భాగంచేత నిర్ణయించబడుతుంది. కాబట్టి అదనపు శ్రమ అవసర శ్రమతో ఏ నిష్పత్తిలో ఉంటుందో అదనపు విలువ అస్థిర పెట్టుబడితో అదే నిష్పత్తిలో ఉంటుంది. మరోలా చెప్పాలంటే, అదనపు విలువ రేటు అ.వి./అస్థి.పె. = అదనపు శ్రమ/అవసర శ్రమ. అ.వి./అస్థి.పె. అదనపు శ్రమ/అవసర శ్రమ అనే ఈ రెండు నిష్పత్తులూ వేర్వేరు విధాలుగా ఒకే విషయాన్ని తెలియజేశాయి. ఒకటి సాకార రూపం ధరించిన శ్రమ ఆధారం చేసుకోగా, మరొకటి సజీవ, ప్రవాహ శ్రమను ఆధారం చేసుకుంటుంది.

కనుక అదనపు విలువ రేటు అనేది శ్రమశక్తిని పెట్టుబడి, లేదా కార్మికుని పెట్టుబడిదారుడు దోపిడీ చేసే స్థాయిని సరిగ్గా వ్యక్తం చేస్తుంది.[2]

మన ఉదాహరణలో మనం ఉత్పాదితం విలువ = 410 పౌండ్ల స్థిర పెట్టుబడి + 90 పౌండ్ల అస్థిర పెట్టుబడి + 90 పౌండ్ల అదనపు విలువ. తొలి పెట్టుబడి = 500 పౌండ్లు. అదనపు

---

1. విల్ హెల్మ్ తూసిడ్రెడ్స్ రోష్చర్ ఒక ప్రధానమైన విషయాన్ని కనుగొన్నాడు. అదేమంటే, ఈ రోజుల్లో అదనపు విలువ, లేదా అదనపు ఉత్పాదితం రూపొందటం, తద్వారా పెట్టుబడి సంచయనం అనే దానికి పెట్టుబడిదారుల పొదుపరితనం కారణం కాగా నాగరికత నిమ్న దశల్లో బలవంతులే బలహీనుల్ని పొదుపుగా ఉండేలా బలవంతం చేసేవారు. (పుట 78) పొదుపు చేసేది దేన్ని? శ్రమనా? లేక, లేని అదనపు సంపదనా? రోష్చర్ లాంటి మనుషులు అదనపు విలువ యొక్క మూలాన్ని వివరించడంలో, అదనపు విలువ స్వాహా కోసం పెట్టుబడిదారుడు చెప్పే సాకుల పైన ఆధారపడటానికి కారణమేమిటి? వారి అజ్ఞానంతో పాటు విలువ, అదనపు విలువల శాస్త్రీయ విశ్లేషణ అన్నా, దాని నుండి పాలక వర్గాలకు బొత్తిగా సయించని ఫలితాలను సాధించడం అన్నా వారికున్న వకాల్తాదారీ భయమే దానికి కారణం.
2. శ్రమశక్తి దోపిడీ స్థాయిని అదనపు విలువ రేటు కచ్చితంగా వ్యక్తం చేసినప్పటికీ అది ఏ రకంగానూ దోపిడీ మొత్తాన్ని వ్యక్తం చేయలేదు. ఉదాహరణకు, అవసర శ్రమ = 5 గంటలు, అదనపు శ్రమ = 5 గంటలు అయితే, దోపిడీ స్థాయి 100% ఇక్కడ దోపిడీ పరిమాణం 5 గంటలు. ఒకవేళ అవసర శ్రమ = 6 గంటలు, అదనపు శ్రమ = 6 గంటలు అయితే, ఇప్పుడు కూడా దోపిడీ స్థాయి 100 శాతమే. కాని దోపిడీ వాస్తవ పరిమాణం 20% పెరిగింది. ఐదు నుండి ఆరు గంటలకు పెరిగింది.

విలువ = 90 పౌండ్లు, తొలి పెట్టుబడి = 500 పౌండ్లు కనుక, మామూలు లెక్క ప్రకారం అదనపు విలువ 18% (సాధారణంగా దీన్ని లాభాల రేటుగా పొరపడతారు.) కారీలాంటి సామరస్యవాదులకు ఆనందంతో కూడిన ఆశ్చర్యాన్ని కలిగించేంత తక్కువ రేటు ఇది. అయితే నిజానికి అదనపు విలువ రేటు అ.వి./స్థి.పె.కి గాని, అ.వి./స్థి.పె. + అస్థి.పె.కి గాని సమానం కాదు. అది అ.వి./అస్థి.పె.కి సమానం. కనుక అది 90/500 కాదు, 90/90 లేదా 100% అది పైకి కనిపించే దోపిడీ స్థాయికి ఐదు రెట్లకు పైగా ఉంది. మన ఉదాహరణలో పని దినం పొడవెంతో మనకి తెలియదు. శ్రమ ప్రక్రియ ఎన్ని రోజులు, లేక వారాలు జరిగిందో, పనిలో పెట్టబడిన కార్మికుల సంఖ్య ఎంతో మనకు తెలియదు. అయినప్పటికీ అదనపు విలువ రేటు అ.వి./అస్థి.పె., అదనపు శ్రమ/అవసర శ్రమ అనే తనకు సమానమైన వ్యక్తీకరణ ద్వారా పని దినం యొక్క రెండు భాగాల మధ్య ఉండే సంబంధాన్ని వెల్లడిస్తుంది. రేటు 100% కనుక ఈ సంబంధం సమాన సంబంధం. కనుక మన ఉదాహరణలో కార్మికుడు రోజులో సగం తన కోసమూ, తక్కిన సగం పెట్టుబడిదారుని కోసమూ పని చేస్తాడన్నది స్పష్టం.

అదనపు విలువను లెక్కించే పద్ధతి క్లుప్తంగా ఇలా ఉంటుంది. మనం మొత్తం ఉత్పాదితం విలువను తీసుకుని దానిలో కేవలం పునఃప్రత్యక్షమయ్యే స్థిర పెట్టుబడిని "సున్న"గా పరిగణిస్తాము. సరకు ఉత్పత్తి అయ్యే ప్రక్రియల్లో వాస్తవంగా సృష్టించబడిన విలువ మాత్రమే మిగులుతుంది. అదనపు విలువ మొత్తం మనకు తెలిసి ఉంటే, దాన్ని ఆ మిగిలిన మొత్తం నుండి తీసేస్తే అస్థిర పెట్టుబడి వస్తుంది. లేదా అస్థిర పెట్టుబడి మనకూ తెలిసి ఉంటే, దాన్ని మిగిలిన మొత్తం నుండి తీసేస్తే అదనపు విలువ వస్తుంది. రెండూ తెలిసి ఉంటే మనం అ.వి./అస్థి.పె.ని లెక్కగట్టాలి. అంటే అస్థిర పెట్టుబడితో అదనపు విలువకున్న నిష్పత్తిని లెక్కగట్టాలి.

ఈ పద్ధతి చాలా సరళంగానే ఉంది. అయినప్పటికీ పాఠకుడు దీనిలో ఉన్న కొత్త సూత్రాలను ఆకళింపు చేసుకొనేందుకు వీలుగా కొన్ని – ఉదాహరణలివ్వడం అనుచితం కాదు.

10,000 కదురులతో పనిచేసే నూలు మిల్లును తీసుకుందాం. అది అమెరికా దూది నుండి 32వ నంబరు నూలును వారానికి కదురుకు ఒక పౌను చొప్పున వడుకుతుందనుకుందాం. వృధా అయ్యే దూది 6%గా పరిగణిద్దాము. ఈ పరిస్థితుల్లో వారానికి 10,600 పౌనుల దూది అనుభుక్తమవుతుంది. దానిలో 600 పౌనులు వృధా అవుతుంది. 1871 ఏప్రిల్‌లో దూది ధర పౌనుకు $7\frac{3}{4}$ పెన్నీలు. కనుక ముడి పదార్థానికి సుమారు 342 పౌండ్లు ఖర్చవుతుంది. సన్నాహక యంత్రాలతో, చోదకశక్తితో సహా 10,000 కదుర్ల ఖరీదు, కదురుకు 1 పౌండ్ చొప్పున, 10,000 పౌండ్లవుతాయనుకుందాం. అరుగుదల 10% అనుకుందాం. అంటే ఏడాదికి 1000 పౌండ్లు, లేదా వారానికి 20 పౌండ్లు. ఏడాదికి ఆ భవనం అద్దె 300 పౌండ్లు, లేదా వారానికి 6 పౌండ్లు అనుకుందాం. అనుభుక్తమయిన బొగ్గు (మిల్లును వేడి చేయటంతో సహా ఒక గంటకు ఒక హార్స్‌పవర్‌కు 4 పౌనుల చొప్పున, 60 గంటల వారంలో 100 హార్స్‌పవర్స్‌కు) టన్నుకు 8 షిల్లింగుల 6 పెన్నీల చొప్పున వారానికి 11 టన్నులకు గాను $4\frac{1}{2}$ పౌండ్లు, గ్యాస్ వారానికి 1 పౌండ్, నూనె వగైరాలకు $4\frac{1}{2}$ పౌండ్లు అనుకుందాం. పైన పేర్కొనబడిన ఉప పదార్థాల మొత్తం ఖర్చు వారానికి 10 పౌండ్లు.

కనుక ఒక వారం ఉత్పాదితంలో స్థిర భాగం 378 పౌండ్లు. వేతనాలు వారానికి 52 పౌండ్లు. నూలు ధర పౌనుకు $12\frac{1}{4}$ పెన్నీలు. అంటే 10,000 పౌనుల నూలు ధర 510 పౌండ్లు. కనుక ఈ సందర్భంలో అదనపు విలువ 510 పౌండ్లు – 430 పౌండ్లు = 80 పౌండ్లు. ఉత్పాదితం విలువలో స్థిర భాగంగా పరిగణిద్దాము. దానికి పాత్ర లేదు కనుక. ఇక వారంలో సృష్టించబడిన విలువగా 132 పౌండ్లు మిగులుతుంది. దానిలో 52 పౌండ్లు అస్థిర పెట్టుబడి + 80 పౌండ్లు అదనపు విలువ కనుక అదనపు విలువ రేటు 80/52 = $153\frac{11}{33}$% సగటు శ్రమతో 10 గంటల పని దినం ఫలితం: అవసర శ్రమ = 3/31/33 గంటలు, అదనపు శ్రమ = $6\frac{2}{33}$.

మరో ఉదాహరణ. జాకబ్ 1815 సంవత్సరానికి సంబంధించిన ఈ క్రింది లెక్క ఇస్తున్నాడు. అంతకు ముందు జరిగిన అనేక సర్దుబాట్ల వల్ల ఇది చాలా అసమగ్రంగా ఉంది. అయినా మన అవసరానికి ఇది సరిపోతుంది. దీనిలో అతడు గోధుమ ధర 8 షిల్లింగులుగానూ, ఎకరానికి సగటు దిగుబడి 22 బస్తాలుగాను భావించాడు.

ఎకరానికి ఉత్పత్తి అయిన విలువ

| | పౌండ్లు, | షిల్లింగులు – | పెన్నీలు | | పౌండ్లు, | షిల్లింగులు – | పెన్నీలు |
|---|---|---|---|---|---|---|---|
| విత్తనం | 1 | 9 | 0 | పదోవంతు ముడుపులూ, రేట్లు, పన్నులు | 1 | 1 | 0 |
| ఎరువు | 2 | 10 | 0 | కౌలు | 1 | 8 | 0 |
| వేతనాలు | 3 | 10 | 0 | రైతు లాభం, వడ్డీ | 1 | 2 | 0 |
| మొత్తం | 7 | 9 | 0 | పౌండ్లు మొత్తం | 3 | 11 | 0 |

పైన పేర్కొన్న లెక్కల్ని నాకు ఒక మాంచెస్టర్ నూలు మిల్లు యజమాని ఇచ్చాడు. ఇంగ్లండులో ఇది వరకు ఒక ఇంజిన్ హార్స్ పవర్‌ని దాని సిలిండర్ వ్యాసాన్ని బట్టి లెక్కగట్టేవారు. ఇప్పుడు సూచిక తెలిపే వాస్తవ హార్స్‌పవర్‌ను గ్రహిస్తారు.

ఉత్పాదితం ధరా, దాని విలువా ఒకటే అని పరిగణిద్దాము, అదనపు విలువ ఇక్కడ లాభం, వడ్డీ, కౌలు వగైరా వివిధ రూపాల్లో ఉంది. వీటి వివరాలతో మనకు పని లేదు. మనం వాటన్నిటినీ కలిపేస్తాం. వాటి మొత్తం 3 పౌండ్ల 11 షిల్లింగుల అదనపు విలువ. విత్తనానికీ, ఎరువుకూ చెల్లించిన మొత్తం 3 పౌండ్ల 19 షిల్లింగులు. ఇది స్థిర పెట్టుబడి. మనం దాన్ని “సున్న”గా భావిద్దాం. ఇక 3 పౌండ్ల 10 షిల్లింగులుంది. అది అడ్వాన్స్ చేసిన అస్థిర పెట్టుబడి. దాని స్థానంలో 3 పౌండ్ల 10 షిల్లింగులు + 3 పౌండ్ల 11 షిల్లింగుల కొత్త విలువ సృష్టించబడింది. కనుక అ.వి./అస్థి.పె.= 3 పౌండ్ల 11 షిల్లింగులు/3 పౌండ్ల 10 షిల్లింగులు అంటే 100% పైగా అదనపు విలువ వస్తోంది. కార్మికుడు అదనపు విలువను ఉత్పత్తి చేయడానికి తన పని దినంలో సగానికి పైగా ఉపయోగిస్తాడు. దానిని విభిన్న వ్యక్తులు, విభిన్న సాకులతో తమలో తాము పంచుకుంటారు.[1]

1. ఇక్కడ ఇచ్చిన లెక్కలు కేవలం ఉదాహరణలు మాత్రమే. మనం నిజానికి ధరలు = విలువలు అని భావించాం. అయితే సగటు ధరల విషయంలో సైతం వాటిని అంత తేలిగ్గా భావించరాదనే విషయాన్ని గ్రంథం IIIలో గమనిస్తాము.

## విభాగం 2

# ఉత్పాదితం విలువ యొక్క అంతర్భాగాలకు తదనుగుణ పరిమాణం గల ఉత్పాదితపు భాగాల ప్రాతినిధ్యం

పెట్టుబడిదారుడు డబ్బును పెట్టుబడిగా ఎలా మారుస్తాడో తెలిపే ఉదాహరణను మళ్ళీ చూద్దాం.

12 గంటల పని దినం యొక్క ఉత్పాదితం 20 పౌనుల నూలు, దాని విలువ 30 షిల్లింగులు. ఈ విలువలో 8/10వ వంతు, అంటే 24 షిల్లింగులు, కేవలం పునఃప్రత్యక్షమైన విలువ (20 పౌనుల దూది విలువ 20 షిల్లింగులు, కదురు అరుగుదల 4 షిల్లింగులు). కనుక అది స్థిర పెట్టుబడి. మిగిలిన 2/10వ వంతు, లేదా 6 షిల్లింగులు, వడికే ప్రక్రియలో సృష్టించబడిన కొత్త విలువ. దీనిలో సగం ఒక రోజు శ్రమశక్తికి లేదా అస్థిర పెట్టుబడికి సమానం. మిగిలిన సగం 3 షిల్లింగుల అదనపు విలువ. 20 పౌనుల నూలు మొత్తం విలువ ఇలా ఉంటుంది.

30 షిల్లింగుల నూలు విలువ = 24 షిల్లింగుల స్థిర పెట్టుబడి + 3 షిల్లింగుల అస్థిర పెట్టుబడి + 3 షిల్లింగుల అదనపు విలువ.

ఈ విలువంతా ఉత్పత్తి అయిన 20 పౌనుల నూలులో ఉంది. కనుక ఈ విలువ యొక్క వివిధ అంతర్భాగాలు ఉత్పాదితంలోని తదనుగుణ భాగాలలో ఉన్నట్లు చూపించవచ్చు.

30 షిల్లింగుల విలువ 20 పౌనుల నూలులో ఉంటే అప్పుడు ఈ విలువలో 8/10వ వంతు ఉన్న స్థిర భాగం లేదా 24 షిల్లింగులు ఉత్పాదితం యొక్క 8/10వ వంతులో లేదా 16 పౌనుల నూలులో ఉంటుంది. ఈ 16 పౌనుల్లో $13\frac{1}{3}$ పౌనులు ముడి పదార్థానికి, 20 షిల్లింగుల విలువ గల దూదికి ప్రాతినిధ్యం వహిస్తుంది. $2\frac{2}{3}$ పౌనులు ఆ ప్రక్రియలో జరిగిన 4 షిల్లింగుల విలువ గల కదురు వగైరాల అరుగుదలకు ప్రాతినిధ్యం వహిస్తుంది.

కనుక 20 పౌనుల నూలు వడకటానికి ఉపయోగించబడిన మొత్తం దూదికి $13\frac{1}{3}$ పౌనులు నూలు ప్రాతినిధ్యం వహిస్తుంది. బరువు రీత్యా $13\frac{1}{3}$ పౌనుల నూలులో $13\frac{1}{3}$ పౌనుల దూదికి మించి ఉండదనేది నిజమే. ఆ దూది విలువ $13\frac{1}{3}$ షిల్లింగులు మాత్రమే. అయితే దానిలో ఉన్న $6\frac{2}{3}$ షిల్లింగుల అదనపు విలువ మిగిలిన $6\frac{2}{3}$ పౌనుల నూలు వడకటంలో అనుభుక్తమయిన దూదికి సమానమైన విలువ ఫలితం ఈ $6\frac{2}{3}$ పౌనుల నూలులో దూది అసలు లేనే లేదనీ, మొత్తం 20 పౌనుల దూదీ ఈ $13\frac{1}{3}$ నూలులో సాంద్రీకరించబడిందనీ అన్నదానితో సమానం. మరోవైపున ఈ $13\frac{1}{3}$ పౌనుల నూలులో ఉప పదార్థాల, పరికరాల విలువగానీ, ఈ ప్రక్రియలో కొత్తగా సృష్టించబడిన విలువగానీ అణుమాత్రమైనా ఉండదు.

అదే విధంగా స్థిర పెట్టుబడిలో మిగిలిన 4 షిల్లింగుల విలువ గల $2\frac{2}{3}$ పౌనుల నూలులో, 20 పౌనుల నూలు ఉత్పత్తిలో అనుభుక్తమైన ఉప పదార్థాల, శ్రమ పరికరాల విలువ తప్ప మరింకేమీ ఉండదు.

కనుక మనకొచ్చిన ఫలితం ఇది : 8/10వ వంతు ఉత్పాదితం అనగా 16 పౌనుల నూలు, ఉపయోగకర వస్తువు అనే తన స్వభావం రీత్యా మిగిలిన భాగం నూలులాగే వడికేవాని శ్రమ ఉత్పాదితమే. అయినప్పటికీ ఈ సందర్భంలో పరిశీలించి చూస్తే వడికే ప్రక్రియలో వ్యయమయిన

శ్రమ ఇందులో లేదు. ఇది ఏ శ్రమని ఇముడ్చుకోలేదు. దూది ఏ సాయమూ లేకుండా స్వయంగా నూలుగా మారిపోయిందా అన్నట్లు, అది సంతరించుకున్న రూపం కేవలం గారడీగా, వంచనగా అనిపిస్తుంది : ఎందుకంటే మన పెట్టుబడిదారుడు దానిని 24 షిల్లింగులకు అమ్మి ఆ డబ్బుతో కొత్త ఉత్పత్తి సాధనాలు కొని స్థానంలో ఉంచగానే, ఈ 16 పౌనుల నూలు మారురూపంలో ఉన్న దూది, కదురు అరుగుదల తప్ప వేరే ఏమీ కాదనేది స్పష్టమవుతుంది.

మరోవైపున, మిగిలిన 2/10వ వంతు ఉత్పాదితం, లేదా 4 పౌనుల నూలు, 12 గంటల వడికే ప్రక్రియలో సృష్టించబడిన 6 షిల్లింగుల కొత్త విలువకు తప్ప మరి దేనికీ ప్రాతినిధ్యం వహించదు. అనుభుక్తమయిన ముడిపదార్థం నుండి, శ్రమ పరికరాల నుండి ఆ 4 పౌనులకు బదిలీ అయిన మొత్తం విలువ మధ్యలో అడ్డగించబడి మొదట వడకబడిన 16 పౌనుల్లోనే ఇమడ్చబడుతుంది అని చెప్పొచ్చు. ఈ సందర్భంలో 4 పౌనుల నూలును వడికేవాడు గాలిలో నుండి వడికినట్లే, లేదా అతడు ప్రకృతి అవ్యాజంగా ప్రసాదించిన దూది, కదురుల సాయంతో వడికినట్లే. కనుక అవి ఉత్పాదితానికి ఏ విలువనూ బదిలీ చేయలేదు.

ఈ ప్రక్రియలో కొత్తగా సృష్టించబడిన విలువ మొత్తాన్ని సంగ్రహించుకున్న 4 పౌనుల నూలులో సగం అనుభుక్తమయిన శ్రమ విలువకు అంటే 3 షిల్లింగుల అస్థిర పెట్టుబడికి సమానం. మిగిలిన సగం 3 షిల్లింగుల అదనపు విలువకు ప్రాతినిధ్యం వహిస్తుంది.

6 షిల్లింగుల్లో వడికేవాని 12 పని గంటలు రూపుదాల్చి ఉన్నాయి కనుక, 30 షిల్లింగుల విలువ గల నూలులో 60 పని గంటలు రూపుదాల్చి ఉండాలి. శ్రమ కాలం యొక్క ఈ పరిమాణం 20 పౌనుల నూలులో నిజంగానే ఉంది. ఎందుకంటే 8/10వ వంతులో లేదా 16 పౌనుల్లో వడికే ప్రక్రియ మొదలవటానికి ముందే ఉత్పత్తి సాధనాల మీద వ్యయమైన 48 గంటల శ్రమ భౌతిక రూపం ధరించి ఉంది. ఇక మిగిలిన 2/10వ వంతులో, లేదా 4 పౌనుల్లో, ఆ ప్రక్రియలోనే 12 గంటల పని భౌతిక రూపం ధరించింది.

నూలు ఉత్పత్తిలో సృష్టించబడిన కొత్త విలువ మొత్తానికి అంతకు ముందే ఉత్పత్తి సాధనాల్లో ఉన్న విలువను కలిపితే ఆ నూలు విలువతో సమానం అన్న అంశాన్ని ఇంతకు ముందు పుటల్లో గమనించాము.

ఉత్పాదితం విలువ యొక్క వివిధ అంతర్భాగాలకు, అవి నిర్వహించే క్రియల రీత్యా ఒకదాని కంటే ఒకటి భిన్నమైన భాగాలకు, తదనుగుణ పరిమాణం గల ఉత్పాదితపు భాగాలే ప్రాతినిధ్యం వహించవచ్చన్న సంగతి ఇప్పుడు చూపబడింది.

ఈ రకంగా విభజించబడిన ఉత్పాదితం భాగాల్లో ఒకటి ఉత్పత్తి సాధనాలపైన ఇదివరకు వ్యయమైన శ్రమకు మాత్రమే లేదా స్థిర పెట్టుబడికి మాత్రమే ప్రాతినిధ్యం వహిస్తుంది. మరోటి ఉత్పత్తి ప్రక్రియలో వ్యయమయిన అవసర శ్రమకు లేదా అస్థిర పెట్టుబడికి మాత్రమే ప్రాతినిధ్యం వహిస్తుంది. చివరిదైన మరో భాగం అదే ప్రక్రియలో వ్యయమైన అదనపు శ్రమకు లేదా అదనపు విలువకు మాత్రమే ప్రాతినిధ్యం వహిస్తుంది. ఈ రకంగా భాగాలుగా విడదీయడమన్నది తేలికే అయినప్పటికీ, ఎంతో ప్రాముఖ్యం గలది. సంక్లిష్టమయిన, ఇంతవరకూ పరిష్కరించని సమస్యలకు ఆ పద్ధతిని వర్తింపజేయడం ద్వారా ఈ సంగతిని తర్వాత గమనిస్తాము.

ఇంతకు ముందు పరిశోధనలో మనం మొత్తం ఉత్పాదితాన్ని ఉపయోగానికి సిద్ధంగా ఉన్న 12 గంటల పని దినం యొక్క అంతిమ ఫలితంగా పరిగణించాము. అయితే ఉత్పత్తి ప్రక్రియ యొక్క అన్ని దశల్లోనూ మనం ఈ సంపూర్ణ ఉత్పాదితాన్ని అనుసరించవచ్చు. విభిన్న దశల్లో బయటికి వచ్చే పాక్షిక ఉత్పాదితాలు అంతిమ లేదా సంపూర్ణ ఉత్పాదితం యొక్క భాగాలుగా, అవి నిర్వహించే క్రియల రీత్యా భిన్నమైన భాగాలుగా మనం పరిగణించినా మనకు ఇంతకు ముందు వచ్చిన ఫలితమే వస్తుంది.

వడికేవాడు 12 గంటల్లో 20 పౌనుల నూలు ఉత్పత్తి చేస్తాడు, లేదా ఒక గంటలో $1\frac{2}{3}$ పౌనులు. కనుక 8 గంటల్లో అతడు $13\frac{1}{3}$ పౌనుల్ని, లేదా మొత్తం రోజులో వడకబడిన మొత్తం దూది విలువకు సమానమైన పాక్షిక ఉత్పాదితాన్ని ఉత్పత్తి చేస్తాడు. అలాగే తర్వాత 1 గంటా 36 నిమిషాల పాక్షిక ఉత్పాదితం $2\frac{2}{3}$ పౌనుల నూలు. ఇది 12 గంటల్లో అనుభుక్తమయిన శ్రమ పరికరాల విలువకు ప్రాతినిధ్యం వహిస్తుంది. ఆ తర్వాత గంటా 12 నిమిషాల్లో వడికేవాడు 3 షిల్లింగుల విలువ గల 2 పౌనుల నూలు ఉత్పత్తి చేస్తాడు. తన 6 గంటల అవసర శ్రమతో అతడు సృష్టించే మొత్తం విలువకు ఇది సమానం. చివరిగా మరో గంటా 12 నిమిషాల్లో అతడు మరో 2 పౌనుల నూలు తయారుచేస్తాడు. దాని విలువ, సగం రోజులో అతని అదనపు శ్రమ సృష్టించిన అదనపు విలువతో సమానం. ఈ విధంగా లెక్కించడం ఇంగ్లీషు కార్ఖానాదారుడి రోజువారీ అవసరాలకు సరిపోతుంది. మొదటి 8 గంటల్లో లేదా 2/3 పనిదినంలో తాను తన దూది విలువను తిరిగి పొందుతున్నాననీ, అలాగే మిగతా గంటల్లో మిగిలిన అంశాలనూ పొందుతున్నాననీ, ఆ విషయాన్ని ఇది తెలియజేస్తోందనీ అతడంటాడు. ఇది కూడా పూర్తిగా సరైన పద్ధతే. నిజానికి పైన చెప్పిన మొదటి పద్ధతికీ దీనికీ గల భేదమల్లా ఏమిటంటే, మొదటి పద్ధతి స్థలానికి వర్తించబడింది. దీని ప్రకారం పూర్తయిన ఉత్పాదితం యొక్క విభిన్న భాగాలు పక్క పక్కనే ఉంటాయి. రెండో పద్ధతి కాలానికి వర్తిస్తుంది. దాని ప్రకారం ఆ భాగాలు ఒకదాని తర్వాత ఒకటి ఉత్పత్తి అవుతాయి. ఈ రెండు పద్ధతుల్లోనూ తేడా ఇదే. అయితే ఈ రెండో పద్ధతితో పాటు కొన్ని ఆటవిక భావనలు కూడా వెంటరావొచ్చు. ముఖ్యంగా విలువను విలువ సృష్టించే ప్రక్రియ పట్ల ఆచరణలో ఎంతగా ఆసక్తి కలిగి ఉన్నారో అంతగానూ ఆ ప్రక్రియను సైద్ధాంతికంగా అపార్థం చేసుకోవడం పట్ల ఆసక్తి గలవారి బుర్రల్లో ఈ భావాలు తలెత్తుతాయి. ఈ భావాలు ఎలా ఉంటాయంటే, ఉదాహరణకు, మన వడికే వ్యక్తి తన పని దినం మొదటి 8 గంటల్లో దూది విలువనూ, తర్వాత గంటా 36 నిమిషాల్లో శ్రమ పరికరాల అరుగుదల విలువనూ, తర్వాత గంటా 12 నిమిషాల్లో వేతనాల విలువనూ ఉత్పత్తి చేస్తాడు. ఇక కేవలం తన సుప్రసిద్ధ "ఆఖరి గంట"ని మాత్రమే కార్ఖానాదారునికి అదనపు విలువ సృష్టించడానికి అర్పిస్తాడు. ఈ రకంగా పాపం, మన వడికేవాడు ఏకకాలంలో రెండు రకాల అద్భుతాన్ని సాధించాల్సి వస్తుంది. దూదీ, కదురులూ, ఆవిరి యంత్రమూ, బొగ్గూ, నూనె వగైరాలను ఉత్పత్తి చేయడంతో పాటు అతడు ఒక పని దినాన్ని ఐదు పని దినాలుగా మార్చాల్సి కూడా ఉంది. ఎందుకంటే మనం పరిశీలిస్తున్న ఉదాహరణలో ముడి పదార్థాల, శ్రమ పరికరాల ఉత్పత్తికి 12 గంటలు పని దినాలు 4 కావాలి. వాటిని నూలుగా మార్చడానికి అటువంటి పని దినమే మరొకటి కావాలి. ధన వ్యామోహం అటువంటి అద్భుతాలను తేలిగ్గా నమ్మేలా చేస్తుందనీ, ఆ అద్భుతాలు జరుగుతాయని రుజువు చేసే తైనాతీ పండితమ్మన్యులకు ఎప్పుడూ కొరత లేదనీ ఈ చరిత్ర ప్రసిద్ధ సంఘటన నిరూపిస్తుంది.

## విభాగం - 3

# సీనియర్ "ఆఖరి గంట"

ఇంగ్లీషు అర్ధశాస్త్రవేత్తల్లో మహామేధావి అనదగి, తన అర్ధ 'శాస్త్రం' రీత్యానేగాక, అందమైన శైలి రీత్యా కూడా ప్రసిద్ధుడైన నాసో డబ్ల్యు. సీనియర్‌కు 1836వ సంవత్సరంలో ఓ శుభోదయాన ఆక్స్‌ఫర్డ్ నుండి మాంచెస్టరుకు రమ్మని పిలుపు వచ్చింది. ఆక్స్‌ఫర్డ్‌లో అర్ధశాస్త్రం బోధించే ఆ పండితుని అదే అర్ధశాస్త్రం మాంచెస్టర్‌లో నేర్చుకోటానికిగ్గాను కార్ఖానాదారులు అక్కడికి పిలిపించారు. వారు ఆయన్ని తమ ప్రతినిధిగా ఎన్నుకొన్నారు. కొత్తగా ఆమోదించబడిన ఫ్యాక్టరీ చట్టానికి వ్యతిరేకంగా మాత్రమే కాదు, అంతకంటే ఎక్కువగా వేధిస్తున్న 10 గంటల ఆందోళనకు వ్యతిరేకంగా కూడా. తమ మామూలు ఆచరణాత్మక బుద్ధి కుశలతతో వారు ఈ విద్వాంసుడైన ప్రొఫెసర్‌కు మెరుగులు దిద్దవలసిన అవసరం చాలా ఉందని తెలుసుకొన్నారు. కనుకనే ఆయన్ను వారు అక్కడికి రమ్మని కబురంపించారు. ప్రొఫెసర్‌గారు మాంచెస్టర్ కార్ఖానాదారులు ఆయనకు ఇచ్చిన ఉపన్యాసాన్ని "లెటర్స్ ఆన్ ది ఫ్యాక్టరీ యాక్ట్, యాజ్ ఇట్ అఫెక్ట్స్ ది కాటన్ మాన్యుఫాక్చరర్స్" లండన్, 1837" అనే తన కరపత్రంలో పొందుపరిచాడు. దానిలో, ఇతర అంశాలతో పాటు, నీతి బోధకమైన ఈ భాగం కూడా ఉంది : "ప్రస్తుత చట్టం ప్రకారం 18 ఏళ్ళలోపు పిల్లల్ని పనిలో పెట్టుకొన్న ఏ మిల్లూ రోజుకు $11\frac{1}{2}$ గంటలకంటే ఎక్కువ పని చేయరాదు. అంటే, వారంలో 5 రోజులు 12 గంటల చొప్పున, శనివారం 9 గంటల చొప్పున.

ఇప్పుడు ఈ కింది విశ్లేషణ (!) తెలిపేదేమంటే, ఆ విధంగా పని చేసిన మిల్లులో నికర లాభం అంతా చివరి గంటలోనే వస్తుంది. ఒక కార్ఖానాదారుడు 1,00,000 పౌండ్లు పెట్టుబడి పెట్టాడనుకుందాం. దానిలో 80,000 పౌండ్లు అతని మిల్లు కోసమూ, యంత్రాల కోసమూ, 20,000 పౌండ్లు ముడి పదార్థాల కోసమూ, వేతనాల కోసమూ పెట్టాడనుకుందాం. పెట్టుబడిని ఏడాదికొక్కసారి లెక్క చూసుకుంటే మొత్తంగా 15 శాతం లాభం వచ్చిందనుకుంటే, 115,000 పౌండ్ల విలువైన సరకులు ఉత్పత్తి అయి ఉండాలి. 23 అర్ధగంటల పనిలో ప్రతిదీ 5/115 భాగం లేదా 1/23వ భాగం సరకులను ఉత్పత్తి చేస్తుంది. ఈ 23/23 భాగాలలో (అంటే మొత్తం 115,000 పౌండ్లలో) 20 భాగాలు, అనగా 1,00,000 పౌండ్లు కేవలం పెట్టుబడిని భర్తీ చేస్తాయి. ఒక 23వ భాగం (లేదా 115,000 పౌండ్లలో 5000 పౌండ్లు) మిల్లు, యంత్రాల అరుగుదలకు పోతుంది. మిగిలిన రెండు 23వ భాగాలూ, అంటే ప్రతి రోజూ ఉండే ఇరవై మూడు అరగంట పనిలో చివరి రెండు అరగంటల పని 10 శాతం నికర లాభం ఉత్పత్తి చేస్తుంది. కనుక (ధరలు స్థిరంగా ఉన్నాయనుకుందాం.) ఫ్యాక్టరీని రోజూ $11\frac{1}{2}$ గంటల బదులు 13 గంటల పని చేయిస్తే చలామణిలో ఉన్న పెట్టుబడికి సుమారు 2600 పౌండ్లను చేర్చడం ద్వారా నికర లాభం రెట్టింపు కంటే పెరుగుతుంది. మరోవైపున రోజుకు ఒక గంట చొప్పున పని గంటల్ని తగ్గిస్తే (ధరలు స్థిరంగా ఉన్నాయనుకుందాం.) నికర లాభం నాశనమవుతుంది. $1\frac{1}{2}$ పని గంటల్ని తగ్గిస్తే టోకు లాభం సైతం అంతమవుతుంది."[1]

---

1. సీనియర్, మొదటి సంపుటి, పుటలు 12, 13 సీనియర్‌కున్న విపరీత భావాల్లో మన అవసరం రీత్యా ప్రాధాన్యం లేని వాటిని వదిలేద్దాం. ఉదాహరణకు, యంత్రాల అరుగుదలను లేదా మరోలా చెప్పాలంటే

ప్రొఫెసర్ "విశ్లేషణ" అంటున్నది దీన్నే! అతడు కార్ఖానాదారుల ఆక్రందనలకు విలువ ఇచ్చి, పనివారు రోజులో అత్యధిక భాగాన్ని ఉత్పత్తిలోనే, అంటే భవనాలు, యంత్రాలు, దూది, బొగ్గు వగైరాల విలువ పునరుత్పత్తిలోనే లేదా పూరించడంలోనే గడుపుతున్నారని నమ్మితే అతని విశ్లేషణ అనవసరం. అతని జవాబు ఇలా ఉండాల్సింది : పెద్దలారా, మీరు మీ మిల్లుల్ని $11\frac{1}{2}$ గంటల బదులు 10 గంటలే పని చేయిస్తే, మిగిలిన విషయాలన్నీ సమంగా ఉన్న మేరకు, అదే అనుపాతంలో దూది, యంత్రాలు వగైరాల రోజువారీ అనుభోగం కూడా తగ్గుతుంది. మీరు ఎంత కోల్పోతారో అంతే పొందుతారు. మీ పని వారు ఇక ముందు భవిష్యత్తులో తొలి పెట్టుబడిని పునరుత్పత్తి చేయడంలో, లేదా పూరించడంలో ఒకటిన్నర గంట తక్కువ గడుపుతారు. లేదా మరోవైపున అతడు మరి కొంత దర్యాప్తు చేయకుండా వారి మాటలు నమ్మలేదనుకోండి. ఇటువంటి వ్యవహారాల్లో నిపుణుడు కావడం వల్ల ఒక విశ్లేషణ అవసరం అని భావించాడనుకోండి. అప్పుడు నికర లాభానికి పని దినం పొడవుతో ఉన్న సంబంధాన్ని మాత్రమే పరిశీలించే సమస్యలో, మిగిలిన విషయాలన్నింటికంటే ముందు, యంత్రాలు, వర్క్‌షాపులు, ముడి పదార్థాలు, శ్రమ వీటన్నిటిని కలగాపులగం చేయొద్దనీ, దయచేసి భవనాలు, యంత్రాలు, ముడి పదార్థాలు వగైరాల్లో మదుపు పెట్టబడిన స్థిర పెట్టుబడిని ఖాతాకు ఒకవైపూ, వేతనాల కోసం ముందుగా ఖర్చు పెట్టిన పెట్టుబడిని మరోవైపూ ఉంచాలని అతడు వారిని అడిగి ఉండాల్సింది. అప్పుడు కార్ఖానాదారుల అంచనాల ప్రకారం పనివాడు తన వేతనాలను 2 అరగంటల్లో పునరుత్పత్తి చేసినట్లు, లేదా పూరించినట్లు ప్రొఫెసరు గమనించి ఉంటే, అటువంటప్పుడు అతడు తన విశ్లేషణని ఇలా కొనసాగించి ఉండాల్సింది !

---

పెట్టుబడిలో ఒక భాగాన్ని పూరించడానికి అవసరమైన మొత్తాన్ని కార్ఖానాదారులు తమ మొత్తం లేదా నికర లాభంలో భాగంగా పరిగణిస్తారనే అతని ఉద్ఘాటన అటువంటిదే. అలాగే అతని అంకెల కచ్చితత్వాన్ని కూడా మనం ప్రశ్నించకుండా వదిలేద్దాం. వాటికి "విశ్లేషణ" అనబడిన దానికి లాగా ఏమీ విలువ లేదని లియొనార్డ్ హార్నర్ తన "ఎ లెటర్ టు మిస్టర్ సీనియర్" లండన్, 1837లో నిరూపించాడు. లియొనార్డ్ హార్నర్ 1833లో ఫ్యాక్టరీ దర్యాప్తు కమిషనర్లలో ఒకరు. 1859 వరకూ ఇన్‌స్పెక్టరూ, ఫ్యాక్టరీల సెన్సార్ అధికారీ. ఇంగ్లీషు కార్మిక వర్గానికి అతడు అజరామమైన సేవజేశాడు. అతను జీవితాంతం పోరాడింది శతృత్వం వహించిన కార్ఖానాదారులతో మాత్రమే కాదు, కాబినెట్‌తో కూడా. కాబినెట్ దృష్టిలో మిల్లులో "చేతులు" పనిచేసే గంటల సంఖ్య కంటే దిగువ సభలో యజమానుల కోట్ల సంఖ్య ఎంతో ప్రాముఖ్యం గల విషయం.

సూత్రరీత్యా ఉన్న తప్పుల మాట అలా ఉంచి, సీనియర్ ప్రకటన అంతా అయోమయం. అతడు నిజంగా చెప్పాలనుకున్నది ఇదీ : కార్ఖానాదారుడు పని వాడిని రోజుకి $11\frac{1}{2}$ గంటల పాటు లేదా 23 అర్థ గంటల పాటు పనిలో పెడతాడు. ఒక పనిదినంలో లాగానే ఒక పని సంవత్సరంలో కూడా $11\frac{1}{2}$ గంటలు లేదా 23 అర్థ గంటలు ఉన్నట్టు ఊహించవచ్చు. అయితే ప్రతిదీ సంవత్సరంలో ఉన్న పనిదినాల సంఖ్యతో గుణించబడుతుంది. ఈ ఊహ ప్రకారం 23 అరగంటలు 115,000 పౌండ్లు వార్షిక ఉత్పత్తిని ఇస్తాయి. 1 అరగంట 1/23×115,000 పౌండ్లను ఇస్తుంది. 20 అరగంటలు 20/23×115,000 = 100,000 పౌండ్లను ఇస్తాయి. అవి తొలి పెట్టుబడిని మించి పూరించవు. ఇంకా 3 అరగంటలున్నాయి. అవి 3/23 × 115,000 = 15,000 పౌండ్లు ఇస్తాయి. ఈ 3 అరగంటల్లో ఒక అరగంటకు 1/23×115,000 = 5000 పౌండ్లు వస్తాయి. అది యంత్రాల అరుగుదలను పూరిస్తుంది. మిగిలిన 2 అరగంటలూ, అంటే ఆఖరి గంట 2/23×115,000 = 10,000 పౌండ్లను లేదా నికర లాభాన్ని ఇస్తుంది. సీనియర్ తన గ్రంథంలో ఉత్పాదితం యొక్క చివరి 2/23 భాగాన్ని పని దినంలోనే భాగాలుగా మారుస్తాడు.

మీ అంకెల ప్రకారం పనివాడు చివరి గంటకు ముందున్న గంటలో తన వేతనాలను ఉత్పత్తి చేస్తాడు. చివరి గంటలో మీ అదనపు విలువను లేదా నికర లాభాన్ని ఉత్పత్తి చేస్తాడు. సమాన కాలంలో అతడు సమాన విలువల్ని ఉత్పత్తి చేస్తాడు గనుక చివరి గంటకు ముందున్న గంట ఉత్పత్తికి – చివరి గంట ఉత్పత్తికున్న విలువే ఉండాలి. పైగా అతను శ్రమించినప్పుడు మాత్రమే ఏదైనా విలువను ఉత్పత్తి చేయగలడు. అతని శ్రమ పరిమాణం అతని శ్రమ కాలంచేత కొలవబడుతుంది. మీరు చెప్పిన దాన్నిబట్టి ఇది రోజుకు $11\frac{1}{2}$ గంటలు. ఈ $11\frac{1}{2}$ గంటల్లో ఒక భాగాన్ని తన వేతనాలను ఉత్పత్తి చేయడానికి లేదా పూరించడానికీ, మిగిలిన భాగాన్ని అతడు మీ నికర లాభాన్ని ఉత్పత్తి చేయడానికీ ఉపయోగిస్తాడు. ఇంతకు మించి అతడు బొత్తిగా ఏమీ చేయడు.

మీ ఊహ ప్రకారం అతని వేతనాలూ, అతను సంపాదించి పెట్టే అదనపు విలువా సమాన విలువ కలిగి ఉన్నాయి కనుక, అతడు తన వేతనాలను $5\frac{3}{4}$ గంటల్లోనూ, మీ నికర లాభాన్ని మిగిలిన $5\frac{3}{4}$ గంటల్లోనూ ఉత్పత్తి చేస్తాడనేది స్పష్టం. 2 గంటల్లో ఉత్పత్తి చేయబడిన నూలు విలువ అతని వేతనాల యొక్క, మీ నికర లాభం యొక్కా మొత్తం విలువతో సమానం కనుక, ఈ నూలు విలువ కొలమానం $11\frac{1}{2}$ పని గంటలయి ఉండాలి. దానిలో $5\frac{3}{4}$ గంటలు ఆఖరి గంటకు ముందున్న గంటలో ఉత్పత్తి అయిన నూలు విలువకూ మిగిలిన $5\frac{3}{4}$ గంటలు ఆఖరి గంటలో ఉత్పత్తి అయిన నూలు విలువకూ కొలమానం అయుండాలి. ఇప్పుడు మనకొక చిత్రమైన చిక్కు ప్రశ్న ఎదురవుతుంది. కనుక, శ్రద్ధగా వినండి! ఆఖరి గంటకు ముందున్న గంట, మొదటి గంట లాగే సాధారణమైన పని గంట. అంతకు ఎక్కువా కాదు, తక్కువా కాదు. అటువంటప్పుడు వడికేవాడు ఒక గంటలో నూలు రూపంలో $5\frac{3}{4}$ గంటల శ్రమ మూర్తీభవించిన విలువను ఎలా ఉత్పన్నం చేయగలడు? సత్యమేమంటే, అతడు అటువంటి అద్భుతాలేమీ చేయడు. అతడు ఒక గంటలో ఉత్పత్తి చేసిన ఉపయోగపు విలువ ఒక నిర్దిష్ట పరిమాణం గల నూలు, ఈ నూలు విలువ $5\frac{3}{4}$ పని గంటలతో కొలవబడుతోంది. దానిలో $5\frac{3}{4}$ గంటల అతని సాయం ఏదీ లేకుండానే అంతకు ముందే ఉత్పత్తి సాధనాల్లో అనగా దూది, యంత్రాలు వగైరాల్లో మూర్తీభవించి ఉన్నాయి. మిగిలిన ఒక గంటని మాత్రమే అతను చేర్చాడు. అతని వేతనాలు $5\frac{3}{4}$ గంటల్లో ఉత్పత్తి అయ్యాయి. ఒక గంటలో ఉత్పత్తి అయిన నూలులో కూడా $5\frac{3}{4}$ గంటల పని ఉంది. కనుక, అతని $5\frac{3}{4}$ గంటల వడికే పని సృష్టించిన విలువ ఒక గంటలో వడకబడిన ఉత్పాదితం విలువతో సమానం కావడంలో మంత్ర మహిమ ఏమీ లేదు. అతడు, తన పని దినంలో ఒక క్షణాన్నయినా దూది, యంత్రాలు వగైరాల విలువల్ని పునరుత్పత్తి చేయడంలో లేదా పూరించడంలో పోగొట్టుకుంటున్నాడని మీరు ఊహిస్తే మొత్తంగా మీరు పొరబాటు మార్గంలో పడిపోయినట్టే. అందుకు భిన్నంగా దూదినీ, కదురులనూ అతని శ్రమ నూలుగా మారుస్తుంది కనుక, అతడు వడుకుతాడు కనుక, దూది, కదురుల విలువలు తమంత తామే నూలులోకి వెళతాయి. ఈ ఫలితం అతని శ్రమ గుణం వల్ల వచ్చిందే తప్ప దాని పరిమాణం వల్ల కాదు. అతను దూది రూపంలో ఒక అరగంటలో నూలులోకి బదిలీ చేసే విలువ కంటే గంటలో ఎక్కువ చేస్తాడన్నది నిజమే. అయితే అతడు అరగంటలో వడికిన దానికంటే గంటలో ఎక్కువ దూదిని వడుకుతాడు కనుక అలా జరుగుతుంది. పనివాడు చివరి గంటకు ముందున్న గంటలో తన వేతనాల విలువను

సృష్టిస్తాడనీ, చివరి గంటలో మీ నికర లాభాన్ని సృష్టిస్తాడనీ మీరు ఉద్ఘాటిస్తున్నారంటే, దాని అర్థం 2 పని గంటల్లో అవి మొదటి 2 గంటలయినా చివరి రెండు గంటలయినా, అతడు ఉత్పత్తి చేసిన నూలులో $11\frac{1}{2}$ పని గంటలు రూపుదాల్చి ఉన్నాయి, లేదా మొత్తం రోజు పని రూపుదాల్చి ఉంది. అంటే రెండు గంటల అతని సొంత పని, $11\frac{1}{2}$ గంటల ఇతరుల పని. మొదటి $5\frac{3}{4}$ గంటల్లో అతను తన వేతనాలనూ రెండో $5\frac{3}{4}$ గంటల్లో మీ నికర లాభాన్ని ఉత్పత్తి చేస్తాడని నేనంటున్నానంటే, దానర్థము మీరు మొదటి దానికే డబ్బు చెల్లిస్తున్నారు తప్ప రెండోదానికి కాదని. శ్రమశక్తికి డబ్బు చెల్లించడం అనడానికి బదులు శ్రమకు చెల్లించడం అనటంలో నేను కేవలం మీ వృత్తి పరిభాషలో మాట్లాడుతున్నాను, అంతే. కనుక పెద్దలారా, మీరు డబ్బు చెల్లిస్తున్న పని కాలాన్ని డబ్బు చెల్లించని పని కాలంలో పోలిస్తే వాటి నిష్పత్తి ఒక అర్ధ దినానికి మరో అర్ధ దినంతో గల నిష్పత్తి లాంటిదే అని మీరు గమనిస్తారు. ఇది 100 శాతం రేటు. చాలా పెద్ద శాతం. మీరు మీ "చేతుల్ని" $11\frac{1}{2}$ గంటకు బదులుగా 13 గంటల పాటు పని చేసేలా చేస్తే ఆ గంటన్నరలో అదనంగా చేసిన పనిని, మీ నుండి ఆశించాల్సిన తీరులోనే, శుద్ధ అదనపు శ్రమగా పరిగణిస్తే అది $5\frac{3}{4}$ గంటల శ్రమ నుండి $7\frac{1}{4}$ గంటల శ్రమకు పెరుగుతుంది. అదనపు విలువ రేటు 100% నుండి $126\frac{2}{33}$%కు పెరుగుతుంది. ఆ విధంగా పనిదినానికి $1\frac{1}{2}$ గంటలు కలపగానే ఆ రేటు 100% నుండి 200%కూ ఇంకా ఎక్కువకూ పెరిగిపోతుందనీ, మరోలా చెప్పాలంటే రెట్టింపు కంటే ఎక్కువవుతుందని ఊహించగలిగేంత ఆశాజీవులు మీరు. మరోవైపున మనిషి హృదయం అద్భుతం. ముఖ్యంగా అది పర్సులో ఉన్నప్పుడు. పని గంటలు $11\frac{1}{2}$ నుండి 10కి తగ్గిపోగానే మీ నికర లాభం అంతా నాశనమైపోతుందని భయపడినప్పుడు మీరు మరీ నిరాశావాద దృక్పథాన్ని స్వీకరిస్తున్నారు. ఎంత మాత్రం అది సరికాదు. మిగిలిన పరిస్థితులన్నీ యథాతథంగా ఉంటే అదనపు $5\frac{3}{4}$ గంటల నుండి $4\frac{3}{4}$ గంటలకు పడిపోతుంది. అయినా అది కూడా చాలా లాభదాయకమైన అదనపు విలువ రేటునే ఇస్తుంది. $82\frac{14}{23}$ శాతాన్ని. అయితే ఈ భయంకరమైన "ఆఖరి గంట" గురించి మీరూ, మత గురువులు స్వర్గ నరకాల గురించి అల్లిన దానికంటే ఎక్కువ కథలల్లారే, "అదంతా చెత్త". ఆ గంట పోతే మీరూ పోరు, మీ నికర లాభమూ పోదు. మీరు పనిలో పెట్టే బాల బాలికల "మానసిక నిర్మలత్వమూ" పోదు.[1] నిజంగానే మీకు "ఆఖరి గంట" దాపురించినప్పుడు ఆక్స్‌ఫర్డ్ ప్రొఫెసర్‌ను గుర్తుచేసుకోండి. ఇక ఇప్పుడు పెద్దలారా, "వీడ్కోలు, అదుగో మనం ఆ మేలైన ప్రపంచంలో కలుసుకుందాం. అంతకంటే ముందు వద్దు."

1. ఒకవైపున కార్ఖానాదారుని నికర లాభమూ, ఇంగ్లండు జౌళి పరిశ్రమ మనుగడా, ప్రపంచ మార్కెట్లపై ఇంగ్లండుకున్న అధికారము "ఆఖరి పని గంట"పైనే ఆధారపడి ఉందని సీనియర్ నిరూపించగా, మరోవైపున పిల్లలనూ, 18 ఏళ్ళలోపున్న కౌమార వయస్కులనూ ఫ్యాక్టరీ యొక్క వెచ్చటి, విశుద్ధ నైతిక వాతావరణంలో పూర్తిగా 12 గంటలు ఉంచకుండా ఒక గంట ముందే హృదయంలేని, బాధ్యతలేని బాహ్య ప్రపంచంలోకి పంపేస్తే వారు సోమరితనం వల్లా, పాపం వల్లా తమ ఆత్మలకు ముక్తి దొరికే ఆశనంతటినీ కోల్పోతారు, అని డా॥ ఆండ్రూ ఉరే నిరూపించాడు. 1848 నాటి నుంచి ఫ్యాక్టరీ ఇన్‌స్పెక్టర్లు ఈ "ఆఖరి" ఈ "ప్రాణాంతక గంటతో" యజమానుల్ని ఎగతాళి చేయడం మానలేదు. 1855, మే 21వ తేదీ నాటి తన నివేదికలో

'ఆఖరి గంట' అనే యుద్ధ నినాదాన్ని 1836లో సీనియర్ కనుగొన్నాడు.[1] 1848 ఏప్రిల్ 15 నాటి లండన్ ఎకనామిస్టులో మళ్ళీ, అదే నినాదాన్ని చాలా పేరు ప్రతిష్టలు గల అర్థశాస్త్ర పండిత శిఖామణి జేమ్స్ విల్సన్ ఇచ్చాడు : ఈసారి పది గంటల బిల్లుకు వ్యతిరేకంగా.

---

హోవెల్ ఇలా అన్నాడు : "మహాయుక్తితో కూడిన ఈ అంచనా (ఆయన సీనియర్‌ని ఉల్లేఖించాడు) నిజమే అయ్యుంటే యునైటెడ్ కింగ్‌డమ్‌లో ఉన్న జౌళి ఫ్యాక్టరీ ప్రతిదీ 1850 నుండి నష్టంతోనే నడుస్తూ ఉండి ఉండాలి." (రిపోర్ట్ ఆఫ్ ది ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ ఫర్ ది హాఫ్ ఇయర్ ఎండింగ్ థర్టీయత్, ఏప్రిల్, 1855 - పుటలు 19, 204) పదిగంటల బిల్లు ఆమోదించబడినాక 1848లో డోర్సెట్, సోమర్సెట్‌ల సరిహద్దుల్లో చెదురు మదురుగా ఉన్న నార మిల్లుల యజమానుల బిల్లుకు వ్యతిరేకంగా ఒక వినతిపత్రాన్ని తమ పనివాళ్ళ పేరుమీద సమర్పించారు. అందులో ఒక వాక్యం ఇలా ఉంది : "మీ అర్జీదార్లమైన మేము తల్లిదండ్రులుగా, సోమరితనం పాపానికి మూలం అని నమ్ముతూ ఒక అదనపు గంట విరామం మా పిల్లల్ని నైతికంగా బాగుపర్చడం కంటే ఎక్కువగా చెడగొడుతుంది అని మేము భావిస్తున్నాము." దీనిపైన 1848 అక్టోబరు 31 నాటి ఫ్యాక్టరీ రిపోర్టు నారమిల్లు వాతావరణం ముడి పదార్థానికి సంబంధించిన దుమ్ము, దూగరతో ఎంతగా నిండిపోయి ఉంటుందంటే ఆ వడికే గదుల్లో పది నిముషాల పాటు కూడా నిలబడటం కష్టం. అక్కడున్న వారి కళ్ళలో, చెవుల్లో, ముక్కుపుటల్లో, నోటిలో దూగర దూరిపోతుంది. దీన్నుంచి తప్పించుకొనే మార్గమేదీ ఉండదు. అత్యంత బాధాకరమైన అనుభూతి కలగకుండా మీరు అక్కడ నిలబడలేరు. యంత్రాల వెర్రి వేగం వల్ల అక్కడి శ్రమకు నిరంతరాయమైన నేర్పూ కదలికా అలసట ఎరుగని జాగరూకత అవసరం. తిండి తినే వేళని మినహాయిస్తే అటువంటి పనిలో అటువంటి వాతావరణంలో 10 గంటల పాటు బంధించబడి ఉండే తమ సొంత పిల్లల విషయంలో 'సోమరిగా ఉండటం' అనే మాటను తల్లిదండ్రులు ఉపయోగించడాన్ని ఆమోదించడం చాలా కష్టం. పొరుగు గ్రామాల కార్మికుల కంటే ఈ పిల్లలు ఎక్కువ గంటలు పనిచేస్తారు. "సోమరితనం, పాపం" గురించి జరుగుతున్న ఈ క్రూరమైన వాగుడును కల్తీలేనిదిగా, అత్యంత లజ్జారహితమైన వంచన అనవచ్చు. కార్ఖానాల్లో ఆఖరి గంట శ్రమ వల్లనే మొత్తం నికర లాభం వస్తుందనీ, పనిదినంలో ఒక గంట తగ్గితే మొత్తం నికర లాభం అంతమవుతుందనీ ఉన్నత అధికారిక ఆమోదంతోనే బహిరంగంగా, గంభీరంగా 12 ఏళ్ళ క్రితం ప్రకటించినప్పుడు ఆశ్చర్యపోయిన ప్రజా విభాగం "ఆఖరి గంట" సుగుణాలను కనుగొన్న తొలి సిద్ధాంతాన్ని, దానిలో లాభాలతో పాటు, నీతి సూత్రాలను కూడా చేర్చి, ఎంతో మెరుగులు దిద్దారన్న విషయాన్ని చూసి పిల్లల శ్రమ కాలాన్ని 10 గంటలకు పూర్తిగా తగ్గిస్తే వారి నీతీ, దానితోపాటు వారి యజమానుల నికర లాభాలూ ఈ ఆఖరి ప్రాణాంతక గంటపై ఆధారపడి ఉంటాయి గనుక, రెండూ మాయమైపోతాయనే వారి ధోరణి చూసి ఇప్పుడు తన కళ్ళను తానే నమ్మలేదు. (చూ. ఫ్యాక్టరీ ఇన్‌స్పెక్టర్ల నివేదికలు, 1848, అక్టోబరు 31, పు. 101) అటువంటి వినతి పత్రాలపై సంతకం చేసేట్టుగా కొంతమంది దిక్కులేని పనివాళ్ళను బలవంతం చేయటానికి, ఆ వినతి పత్రాన్ని మొత్తం పరిశ్రమకూ మొత్తం దేశానికీ సంబంధించిన పత్రంలా పార్లమెంటుపై రుద్దటానికి ఈ పరిశుద్ధ మానసులైన కార్ఖానాదారుల నైతికతకూ, సుగుణాలకూ ఉదాహరణగా వారు ఉపయోగించిన కుయుక్తులూ, వంచనలూ, లాలింపులూ, బెదిరింపులూ, వక్రీకరణలూ వగైరాలనూ ఈ నివేదిక వెల్లడించింది. సీనియర్ గురించి ఒక్క మాట. తర్వాత కాలంలో ఫ్యాక్టరీ శాసనాన్ని ఆయన శక్తిమంతంగా సమర్థించాడు. సీనియర్‌గాని, అతని ప్రత్యర్థుల్లో ఏ ఒక్కరుగాని ఈ "మౌలిక ఆవిష్కరణ" పొరబాటు నిర్ధారణలను ఎప్పుడూ వివరించలేదనేది ఆర్థిక శాస్త్రం అనబడేదాని ఈనాటి హోదాను తెలియజేస్తుంది. వాస్తవ అనుభవానికి వారు విజ్ఞప్తి చేశారు. ఎందుకు, ఎలా అనేది మాత్రం అంతుపట్టని రహస్యంగానే ఉంటుంది.

1. ఏమయినప్పటికీ, విద్వాంసుడైన ఈ ప్రొఫెసర్‌కు తన మాంచెస్టర్ ప్రయాణం వల్ల ప్రయోజనం లేకపోలేదు. తన "లెటర్స్ ఆన్ ది ఫ్యాక్టరీ యాక్ట్"లో "లాభం" "వడ్డీ"తో సహా "అంతకంటే ఎక్కువ" సైతం మొత్తం

## విభాగం - 4

# అదనపు ఉత్పాదితం

అదనపు విలువకు ప్రాతినిధ్యం వహించే ఉత్పాదితాన్ని (రెండో విభాగంలో ఇచ్చిన ఉదాహరణ ప్రకారం 20 పౌనుల్లో పదో వంతు అనగా 2 పౌనుల నూలును) మనం "అదనపు ఉత్పాదితం" అంటాము. అదనపు విలువ రేటు పెట్టుబడి మొత్తంతో దానికున్న సంబంధాన్నిబట్టి కాక అస్థిర భాగంతో దానికి ఉన్న సంబంధాన్నిబట్టి నిర్ణయించబడినట్టుగానే, అదనపు ఉత్పాదితం యొక్క సాపేక్ష పరిమాణం కూడా మొత్తం ఉత్పాదితంలో మిగిలిన భాగంతో దానికున్న నిష్పత్తినిబట్టి కాక కేవలం అవసర శ్రమ రూపుదాల్చి ఉన్న భాగంతో మాత్రమే దానికున్న నిష్పత్తినిబట్టి నిర్ణయించబడుతుంది. పెట్టుబడిదారీ ఉత్పత్తి అంతమూ, లక్ష్యమూ కూడా అదనపు విలువ ఉత్పత్తే కనుక, ఒక మనిషి సంపదను, లేదా ఒక జాతి సంపదను, మొత్తం ఎంత ఉత్పత్తి అయింది అన్నదాన్నిబట్టి కాక అదనపు ఉత్పాదితం యొక్క సాపేక్ష పరిమాణాన్ని బట్టి నిర్ణయించాలి.[1]

అవసర శ్రమ, అదనపు శ్రమల మొత్తం అనగా పనివాడు తన శ్రమశక్తి విలువను పూరించడానికి, అదనపు విలువను ఉత్పత్తి చేయడానికి వెచ్చించిన కాల వ్యవధుల మొత్తమే అతను పనిచేసే వాస్తవ కాలం. అదే అతని పని దినం.

---

నికర ఆదాయాలు కార్మికుని యొక్క ఒకే ఒక వేతనం పొందని పని గంటపై ఆధారపడి ఉంటాయని రాశాడు. ఒక ఏడాది ముందు ఆయన తన విద్యార్థుల కోసమూ, విద్యావంతులైన అల్పుల కోసమూ" ఔట్‌లైన్స్ ఆఫ్ పొలిటికల్ ఎకానమీ" రాశాడు. శ్రమనుబట్టి విలువ నిర్ణయించబడుతుందన్న రికార్డోకు వ్యతిరేకంగా లాభం పెట్టుబడిదారుని శ్రమవల్లా, వడ్డీ ఏమో అతని వైరాగ్యంవల్లా, అనగా పొదుపరితనంవల్లా లభిస్తుందని కూడా ఆయన ఆ పుస్తకంలో కనుగొన్నాడు." దాటవేయటం పాత సంగతే కాని 'పొదుపరితనం' అనే మాట మాత్రం కొత్తది. రోష్చర్ దాన్ని సరిగ్గా "Enthaltung"గా అనువదిస్తాడు. అతని దేశస్థుల్లో కొందరు జర్మనీకి చెందిన బ్రౌన్‌లూ, జోన్‌లూ, రాబిన్‌సన్‌లూ లాటిన్‌లో అతనికున్నంత పరిజ్ఞానం లేకపోవడం వల్ల మునిలాగా "Entsagung" సర్వసంగ పరిత్యాగం అన్న అర్థం వచ్చేలాగా అనువదించారు.

1. "20,000 పౌండ్ల పెట్టుబడితో ఏటా 2000 పౌండ్ల లాభం వచ్చే వ్యక్తి తన పెట్టుబడి వందమందిని పనిలో పెడుతుందా అన్నదానితో ప్రమేయం లేదు. ఏ సందర్భంలోనూ అతని లాభం 2000 పౌండ్లకు తగ్గరాదు అంతే. జాతి నిజమైన ప్రయోజనం కూడా అట్లాంటిదే కాదా? దాని నికర వాస్తవ ఆదాయమూ, దాని కౌలూ, లాభాలు ఒకే రకంగా ఉన్నమేరకు దేశంలో కోటిమంది ప్రజలున్నారా అన్నదానికి ప్రాధాన్యం లేదు." (రికార్డో, పుట 416) రికార్డోకు చాలా ముందే అదనపు ఉత్పాదితాన్ని మొండిగా సమర్థించే ఆర్థర్ యంగ్ (మిగిలిన విషయాల రీత్యా, ఇతను నిలకడలేని, విమర్శనా రహిత రచయిత. ఇతని పేరు ప్రఖ్యాతులు, ఇతని శక్తి సామర్థ్యాలకు విలోమానుపాతంలో ఉన్నాయి.) ఇలా అంటాడు : "ఒక ఆధునిక రాజ్యంలో భూభాగం అంతా ఇలా (ప్రాచీన రోమన్ పద్ధతిలో, సన్నకారు స్వతంత్ర రైతులచే) విభజించబడటం వల్ల ప్రయోజనం ఏముంది, ఎంత బాగా సాగు చేస్తేనేమి? విడిగా చూస్తే ఒక నిరర్థకమైన లక్ష్యం అయిన జనాభా వృద్ధికి తప్ప ఇది ఎందుకు పనికొస్తుంది. ఆర్థర్ యంగ్ : "పొలిటికల్ ఆరిత్‌మెటిక్, లండన్, 1774, పుట 47)

"నికర సంపద శ్రామిక వర్గానికి ప్రయోజనకరం అన్నట్టు చూపించటంపై ఉన్న గట్టి మోజు విచిత్రం. నిజానికి ఆ ప్రయోజనం అది నికరం అవడంవల్ల కానప్పటికీ" (థామస్ హాప్కిన్స్ "అన్‌రెంట్ ఆఫ్ లాండ్", లండన్, 1828, పుట 126).

## అధ్యాయం - 10

# పనిదినం

### విభాగం-1

## పనిదినం పరిమితులు

"శ్రమ శక్తి, దాని విలువకే కొనబడుతుంది, అమ్మబడుతుంది అనే ప్రమేయంతో మనం ప్రారంభించాము. మిగిలిన సరుకులన్నిటి విలువ లాగానే దాని విలువ కూడా దాని ఉత్పత్తికి అవసరమైన శ్రమకాలంచేత నిర్ణయించబడుతుంది. ఒకవేళ కార్మికుని సగటు రోజువారీ జీవనాధారాల ఉత్పత్తికి 6 గంటలు పడితే, అతడు తన రోజువారీ శ్రమ శక్తి ఉత్పాదనకు, లేదా దాని అమ్మకంవల్ల వచ్చిన విలువను పునరుత్పత్తి చేయడానికి రోజూ సగటున 6 గంటలు పనిచేయాలి. అతని పనిదినంలో అవసర భాగం 6 గంటలవుతుంది. కనుక, మిగిలిన విషయాల్లో మార్పులేనంత వరకూ, అది ఒక నిశ్చిత పరిమాణం. అయితే దీనివల్ల మాత్రమే పనిదినం విస్తృతి నిర్ణయించబడదు.

'క'...'చ' అనే రేఖ అవసర శ్రమ కాలం పొడవుకు, ఉదాహరణకు 6 గంటలకు, ప్రాతినిధ్యం వహిస్తుందనుకుందాం. శ్రమను 'క' 'చ'కు మించి 1, 3, 6 గంటలపాటు పొడిగిస్తే మనకు మరో మూడు రేఖలు వస్తాయి.

| పనిదినం I | పనిదినం II | పనిదినం III |
|---|---|---|
| క – చ – ట | క – చ – ట | క – చ – ట– |

అవి 7, 9, 12 గంటలు గల మూడు విభిన్న పనిదినాలకు ప్రాతినిధ్యం వహిస్తాయి. 'క' 'చ' రేఖ యొక్క విస్తరణ అయిన 'చ' 'ట' అదనపు శ్రమ పొడవుకు ప్రాతినిధ్యం వహిస్తుంది. పనిదినం అంటే 'క' 'చ' 'చ' 'ట' 'క' 'ట' కనుక, అది అస్థిర పరిమాణం అయిన 'చ' 'ట'తోపాటు, మారుతుంది. 'క' 'చ' స్థిరం కనుక 'క' 'చ' 'చ' 'ట' కున్న నిష్పత్తిని ఎల్లప్పుడూ లెక్కగట్టవచ్చు. పనిదినం Iలో అది 1/6, పనిదినం IIలో అది 3/6 పనిదినం, IIIలో అది 6/6. అంతేగాక $\frac{\text{అదనపు శ్రమ కాలం}}{\text{అవసర శ్రమ కాలం}}$ అనే నిష్పత్తి అదనపు విలువ రేటును నిర్ణయిస్తుంది కనుక ఆ రేటు 'క' 'చ' 'చ' 'ట' కున్న నిష్పత్తి ద్వారా తెలుస్తుంది. 3 విభిన్న పనిదినాల్లోనూ అది వరుసగా $16\frac{2}{3}$ 50, 100 శాతం. మరోవైపున అదనపు విలువ రేటు మాత్రమే మనకు పనిదినం విస్తృతిని తెలియజేయదు. ఈ రేటు 100 శాతం అయితే పనిదినంలో 8, 10, 12 లేదా అంతకంటే ఎక్కువ గంటలుండవచ్చు. పనిదినంలోని రెండు అంతర్భాగాలు, అవసర శ్రమ కాలం, అదనపు శ్రమ కాలం అనేవి, సమాన విస్తృతి కలిగి ఉన్నాయని మాత్రమే అది సూచిస్తుంది. అయితే వీటిలో ప్రతిదీ ఎంత పొడవుందో మాత్రం తెలుపదు.

ఆ రకంగా పనిదినం అస్థిర పరిమాణమే తప్ప స్థిర పరిమాణం కాదు. ఈ అంతర్భాగాల్లో ఒకటి కార్మికుని శ్రమ శక్తి పునరుత్పత్తికి పట్టే పని కాలంచేత నిర్ణయించబడుతుంది. అయితే అదనపు శ్రమ కాల విస్తృతితోపాటు పనిదినం మొత్తం విస్తృతి మారుతుంది. కనుక పనిదినాన్ని నిర్ధారించవచ్చు. అయితే తనంత తానుగా అది అనిర్ధారితం.[1]

పనిదినం స్థిర పరిమాణం కాక మరో పరిమాణమే అయినప్పటికీ, మరోవైపున అది కేవలం కొన్ని పరిమితులకు లోపలే మారుతుంది. అయితే కనీస పరిమితిని నిర్ధారించలేము. విస్తరణ రేఖ 'చ' 'ట', లేదా అదనపు శ్రమ = 0 అనుకుంటే మనకు అప్పుడు కనీస పరిమితి అంటే కార్మికుడు తన సొంత పోషణ కోసం తప్పనిసరిగా పని చేయాల్సిన భాగం తెలుస్తుంది. అయితే పెట్టుబడిదారీ ఉత్పత్తి ప్రాతిపదికపై ఈ అవసర శ్రమ పనిదినంలో భాగం కాగలదు తప్ప పనిదినమే ఈ కనీస పరిమితికి ఎన్నడూ కుదించబడదు. మరోవైపున పనిదినానికి గరిష్ఠ పరిమితి ఉంది. అది ఒక హద్దును మించి పొడిగించబడ జాలదు. రెండు విషయాలు ఈ గరిష్ఠ పరిమితిని నిర్ణయిస్తాయి. మొదటిది శ్రమ శక్తికున్న శారీరక పరిమితులు. ప్రకృతిసిద్ధమైన దినం యొక్క 24 గంటల లోపల మనిషి తన జీవశక్తిలో ఒక నిర్దిష్ట పరిమాణాన్ని మాత్రమే ఖర్చు పెట్టగలడు. అలాగే ఒక గుర్రం రోజుకు 8 గంటల వంతున మాత్రమే పని చేయగలదు. రోజులో ఒక భాగంలో ఈ జీవశక్తి విశ్రాంతి తీసుకోవాలి, నిద్రించాలి. మరో భాగంలో మనిషి తన ఇతర శారీరక అవసరాలు తీర్చుకోవాలి. తిండి తినాలి, స్నానం చేయాలి, బట్టలు కట్టుకోవాలి. కేవలం ఈ శారీరక పరిమితులలో పాటు పనిదినాన్ని పొడిగించడం అనేది నైతిక పరిమితుల్ని కూడా ఎదుర్కొంటుంది. కార్మికుడు తన బౌద్ధిక, సామాజిక అవసరాలను తీర్చుకోడానికి సమయం అవసరం. వాటి మేర, వాటి సంఖ్య సామాజిక పురోగమనం యొక్క సాధారణ పరిస్థితిని బట్టి ఉంటాయి. కనుక పనిదినం పొడవు శారీరక, సామాజిక పరిమితుల్లోపల మారుతుంటుంది. అయితే పరిమితులు విధించే ఈ రెండు షరతులూ సాగదీయడానికి వీలైనవి. కనుక ఇవి సర్దుబాటుకు చాలా అవకాశం ఇస్తాయి. అందుకే మనకు 8, 10, 12, 14, 16, 18 గంటల అత్యంత విభిన్న పొడవుల పనిదినాలు తారసపడతాయి.

పెట్టుబడిదారుడు శ్రమ శక్తిని దాని రోజు రేటు ప్రకారం కొన్నాడు. దాని ఉపయోగపు విలువ ఒక పనిదినంపాటు అతనికే చెందుతుంది. ఆ రకంగా అతడు తన కోసం ఒక రోజుపాటు కార్మికునితో పని చేయించుకునే హక్కు సంపాదించుకున్నాడు. ఇంతకీ పనిదినం అంటే ఏమిటి?[2]

ఎట్టి పరిస్థితుల్లోనూ అది ప్రకృతి సిద్ధమైన దినం కంటే తక్కువే. ఎంత తక్కువ? ఈ అంతిమ హద్దుపట్ల పనిదినం యొక్క అవసర పరిమితిపట్ల పెట్టుబడిదారునికి తన సొంత అభిప్రాయాలున్నాయి. పెట్టుబడిదారుడుగా అతడు పెట్టుబడి యొక్క మానవ రూపం మాత్రమే. పెట్టుబడి ఆత్మే అతని

1. "ఒక రోజు శ్రమ అనేది అస్పష్టం. అది పొడుగుదీ కావచ్చు, పొట్టిదీ కావచ్చు." ("యాన్ ఎస్సే ఆన్ ట్రేడ్ అండ్ కామర్స్ కంటెయినింగ్ అబ్జర్వేషన్స్ ఆన్ టాక్సెస్ అండ్ ఎట్సెట్రా." లండన్, 1770, పుట 73.)
2. పౌండ్ అనగానేమి? అని సర్ రాబర్ట్ పీల్ బర్మింగ్‌హామ్ చేంబర్ ఆఫ్ కామర్స్‌ను అడిగిన సుప్రసిద్ధ ప్రశ్నకంటే ఈ ప్రశ్నకు చాలా ప్రాధాన్యం ఉంది. బర్మింగ్‌హామ్‌కు చెందిన "చిన్న షిల్లింగు మనుషులు" డబ్బు స్వభావం గురించి ఎంత అజ్ఞానంలో ఉన్నారో పీల్ కూడా అంతే అజ్ఞానంలో ఉండటం వల్లనే అతడు పై ప్రశ్న వేయగలిగాడు.

ఆత్మ. అయితే పెట్టుబడికి ఒకే ఒక జీవిత ప్రేరణ ఉంది. అదేమంటే, విలువనూ, అదనపు విలువనూ సృష్టించే ధోరణి. దాని స్థిర అంశమైన ఉత్పత్తి సాధనాలు సాధ్యమైనంత ఎక్కువ అదనపు శ్రమను ఇముడ్చుకొనేలా చేసే ధోరణి.[1]

పెట్టుబడి అంటే మృత శ్రమ. రక్త పిశాచిలా సజీవ శ్రమను పీల్చడం ద్వారా మాత్రమే అది జీవిస్తుంది. అది ఎంత శ్రమను పీల్చుకుంటే అంతగా జీవిస్తుంది. కార్మికుడు పనిచేసే కాలమే పెట్టుబడి దారుడు తాను కొనుక్కున్న శ్రమ శక్తిని వినియోగించే కాలం.[2]

కార్మికుడు తాను ఖర్చు చేయగలిగిన కాలాన్ని సొంతానికి వినియోగిస్తే అతడు పెట్టుబడిదారుని దోచుకున్నట్టే.[3]

అప్పుడిక పెట్టుబడిదారుడు సరుకుల మార్పిడి నియమాన్ని తన వైఖరికి ఆధారం చేసుకుంటాడు. మిగిలిన కొనుగోలుదారులందరిలాగే అతడు కూడా తన సరుకు ఉపయోగపు విలువ నుండి సాధ్యమైనంత ఎక్కువ ప్రయోజనం పొందాలనుకుంటాడు. ఉత్పత్తి ప్రక్రియ యొక్క ఆటుపోట్లలో అణగిపోయిన కార్మికుని కంఠం ఇంతలో హఠాత్తుగా పైకి లేస్తుంది.

నేను నీకమ్మిన సరుకు మిగిలిన సరుకుల గుంపు కంటే భిన్నం. దాని వినియోగం విలువను సృష్టిస్తుంది. తన సొంత విలువకు మించిన విలువను సృష్టిస్తుంది. అందుకే నువ్వు దాన్ని కొన్నావు. నీ దృష్టిలో పెట్టుబడి యొక్క స్వయంజనిత విస్తరణగా కనిపిస్తున్నది, నా దృష్టిలో శ్రమ శక్తి అదనపు వ్యయం. మార్కెట్లో నీకూ, నాకూ తెలిసింది ఒకే నియమం. అదే సరుకుల మారకపు నియమం. ఒక సరుకు అనుభోగం దానిని వదులుకున్న అమ్మకందారునిది కాదు, దానిని పొందిన కొనుగోలుదారునిదే. కనుక నా రోజువారీ శ్రమ శక్తి నీకే చెందుతుంది. అయితే ప్రతిరోజూ నువ్వు దానికి చెల్లించే ధరతో నేను దాన్ని రోజూ పునరుత్పత్తి చేయగలగాలి, మళ్ళీ అమ్మగలగాలి. వయసు పైబడటం వగైరాల వల్ల కలిగే ప్రకృతిసిద్ధమైన బలహీనతనలా ఉంచి, నేను రోజూ ఉదయం ఈ రోజు లాగానే అదే శక్తితో అదే ఆరోగ్యంతో, అదే తాజాతనంతో పనిచేయగలగాలి. నువ్వెప్పుడూ నాకు "పొదుపు", "మిత వ్యయం" అనే ధర్మసూత్రాలు బోధిస్తుంటావు. మంచిది! నేను వివేకవంతుడైన పొదుపరి యజమానిలాగా నా ఏకైక సంపద అయిన శ్రమ శక్తిని కాపాడుకుంటాను, దానిని మూర్ఖంగా వృథా చెయ్యకుండా జాగ్రత్త తీసుకుంటాను. ప్రతి రోజూ నేను దాన్ని దాని మామూలు వ్యవధికి, ఆరోగ్యకరమైన అభివృద్ధికి అనుగుణంగా ఉన్న మేరకే వ్యయం చేస్తాను, చలనంలో ఉంచుతాను, పనిలో పెడతాను.

---

1. "తాను వెచ్చించే పెట్టుబడితో సాధ్యమైనంత ఎక్కువ పరిమాణం గల శ్రమను రాబట్టటమే పెట్టుబడిదారుని లక్ష్యం." (J.G. Courcelle - Sencuil. "Trade theorique et pratique des entreprises industriclles రెండో కూర్పు, పారిస్ 1857, పుట 63)
2. "ఒక రోజులో ఒక గంట శ్రమ పోతే వాణిజ్య రాజ్యానికి అది తీరని హాని... ఈ రాజ్యంలో శ్రమించే పేదల్లో ముఖ్యంగా ఉత్పత్తి చేసే ప్రజల్లో విలాసాల అనుభోగం చాలా ఎక్కువగా ఉంది. ఆ అనుభోగాలలో వాళ్ళ కాలం కూడా ఉంది. అది అనుభోగాలలోకెల్లా అత్యంత ప్రాణాంతకమైనది." "యాన్ ఎస్సే ఆన్ ట్రేడ్ అండ్ కామర్స్" పుట 47, 153)
3. స్వతంత్ర కార్మికుడు ఒక్క క్షణం విశ్రాంతి తీసుకున్నాడా, అతన్ని తదేకంగా గమనించే నీచ, తుచ్ఛ యాజమాన్యం అతను తన నుండి దొంగిలిస్తున్నాడంటుంది. (N. Linguet, Theorie, des lois civiles etc. లండన్, 1767, రెండో సంపుటి, పుట 466)

నేను మూడు రోజుల్లో పూరించగలిగిన శ్రమ శక్తి కంటే ఎక్కువ పరిమాణాన్ని నువ్వు పనిదినాన్ని అపరిమితంగా పెంచడం ద్వారా ఒక్క రోజులో ఉపయోగించేయవచ్చు. శ్రమ రూపంలో నువ్వు పొందింది, శారీరక రూపంలో నేను కోల్పోతాను. నా శ్రమ శక్తిని ఉపయోగించడం వేరు, దాన్ని కొల్లగొట్టడం వేరు. ఒక సగటు కార్మికుడు (సముచితమైనంత పని చేస్తూ) జీవించగల సగటు కాలం 30 సంవత్సరాలైతే నువ్వు రోజూ చెల్లించే నా శ్రమ శక్తి విలువ దాని మొత్తం విలువలో 1/365×30 లేదా 1/10950వ వంతు. అయితే నువ్వు దాన్ని పదేళ్ళలోనే వినియోగిస్తే, నువ్వు రోజూ దాని మొత్తం విలువలో 1/3650వ వంతు చెల్లించడానికి బదులు 1/10950వ వంతు మాత్రమే. అంటే దాని రోజువారీ విలువలో 1/3వ వంతు మాత్రమే చెల్లిస్తావు. అంటే ప్రతి రోజూ నా సరుకు విలువలో 2/3వ వంతు దోచుకుంటున్నావన్న మాట. నువ్వు నాకు చెల్లిస్తోంది ఒక రోజు శ్రమ శక్తికి మాత్రమే కాగా, నువ్వు ఉపయోగించుకుంటోంది మాత్రం మూడు రోజులది. అది మన ఒప్పందానికి, మారకపు నియమానికి విరుద్ధం. కనుక మామూలు పొడవున్న పనిదినాన్ని నేను డిమాండ్ చేస్తున్నాను. పైగా నీ హృదయానికి మొరబెట్టుకోకుండానే ఈ డిమాండ్ చేస్తున్నాను. ఎందుకంటే, డబ్బు వ్యవహారాల్లో హార్దిక భావాలకు స్థానం లేదు. నువ్వొక ఆదర్శ పౌరుడివయుండ వచ్చు. జీవకారుణ్య సంఘ సభ్యుడివయుండవచ్చు. చాలా పవిత్రుడవనే ఖ్యాతి కూడా నీకుండవచ్చు. అయితే నాకు నువ్వు ముఖాముఖిగా నిలబడినప్పుడు నీవు దేనికి ప్రాతినిధ్యం వహిస్తున్నావో దాని రొమ్ములో హృదయం లేదు. అక్కడ కొట్టుకుంటోంది నా గుండె మాత్రమే. నేను మామూలు పనిదినాన్ని డిమాండ్ చేస్తున్నాను. ఎందుకంటే నేను మిగిలిన అమ్మకందార్లందరిలాగానే నా సరుకు విలువను డిమాండ్ చేస్తాను.[1] సాగదీయడానికి ఎంతో వీలున్న హద్దులు తప్ప, పనిదినానికీ, అదనపు విలువకూ సరుకుల మార్పిడి స్వభావం స్వయంగా ఎటువంటి పరిమితుల్నీ విధించదన్న సంగతి మనం గమనిస్తాము. పెట్టుబడిదారుడు పనిదినాన్ని సాధ్యమైనంత సాగదీయటానికి ప్రయత్నిస్తున్నప్పుడూ, సాధ్యమైనప్పుడల్లా ఒక పనిదినంలో నుండి రెండు పనిదినాలను రాబట్టడానికి ప్రయత్నిస్తున్నప్పుడూ ఒక కొనుగోలుదారుడుగా తన హక్కు కాపాడుకుంటున్నాడన్న మాట. మరోవైపున అమ్మబడిన ఆ సరుకుకున్న విశిష్ట స్వభావం దాని అనుభోగంలో కొనుగోలుదారునికి పరిమితులు విధిస్తుంది. కార్మికుడు పనిదినాన్ని మామూలు కాల పరిమితికి కుదించడానికి ప్రయత్నిస్తున్నప్పుడు ఒక విక్రేతగా తన హక్కును కాపాడుకుంటున్నాడు. కనుక ఇక్కడ ఒక వైరుధ్యం, హక్కుకు వ్యతిరేకంగా హక్కు తలెత్తిందన్న మాట. ఈ రెండు హక్కులకూ మారకపు నియమం యొక్క ఆమోదముద్ర ఉంది. సమాన హక్కుల మధ్య వైరంలో బలప్రయోగమే నిర్ణేత. పెట్టుబడిదారీ ఉత్పత్తి చరిత్రలో పనిదినం అంటే ఏమిటి అన్నదాని నిర్ధారణ సమష్టి పెట్టుబడికీ, సమష్టి శ్రమకూ మధ్య, అనగా పెట్టుబడిదారీ వర్గానికీ, కార్మికవర్గానికీ మధ్య జరిగిన పోరాటం యొక్క ఫలితంలా దర్శనమివ్వడానికి గల కారణం అదే.

1. పనిదినాన్ని 9 గంటలకు తగ్గించడం కోసం 1860-61లో లండన్ కట్టడం పనివారల పెద్ద సమ్మె కాలంలో వారి కమిటీ ప్రచురించిన ప్రణాళికలో కొంత వరకు మన కార్మికుని విజ్ఞప్తి ఉంది. కట్టడం పని యజమానుల్లో అత్యధిక లాభాలను కోరే సర్.ఎమ్. పేటో అనబడే వ్యక్తి (బాప్టిస్టు సంఘ సభ్యుడుగా) పవిత్రుడనే ఖ్యాతి పొందిన విషయాన్ని ఈ ప్రణాళిక ప్రస్తావించింది. ఇందులో వెటకారం లేకపోలేదు. (1867 తర్వాత ఇదే పేటో స్ట్రౌస్‌బర్గ్‌లా దివాలా తీశాడు.)

## విభాగం - 2

# అదనపు శ్రమకై పేరాస, కార్ఖానాదారుడు, జమీందారు

పెట్టుబడి అదనపు శ్రమను సృష్టించలేదు. సమాజంలో ఒక విభాగానికి ఉత్పత్తి సాధనాలపైన గుత్తాధిపత్యం ఉన్న ప్రతిచోటా కార్మికుడు, స్వతంత్రుడైనా కాకున్నా, తన సొంత పోషణకు అవసరమైన పని కాలానికి తోడు ఉత్పత్తి సాధనాల ఆసామి యొక్క జీవితావసర సాధనాలను ఉత్పత్తి చేయడానికి అదనపు పని కాలాన్ని జోడించాలి.[1] ఆ యాసామి ఏథెన్స్ ప్రభు వర్గంవాడు కావచ్చు. ఎట్రూస్కన్ ధర్మపాలకుడు కావచ్చు. రోమ్ పౌరుడు కావచ్చు. నార్మన్ దొరగావచ్చు. అమెరికా బానిస యజమాని కావచ్చు. వాలాషియన్ జమీందారు కావచ్చు. ఆధునిక భూస్వామి లేదా పెట్టుబడిదారుడు కావచ్చు.[2]

ఉత్పాదితం యొక్క మార్పిడి విలువగాక దాని ఉపయోగపు విలువే ప్రబలంగా ఉండే ఏ సామాజిక ఆర్థిక వ్యవస్థలోనయినా అదనపు శ్రమ అనేది నిశ్చిత అవసరాల పరిధిలో మాత్రమే ఉంటుంది. ఆ అవసరాలు ఎక్కువగావొచ్చు, తక్కువగావొచ్చు. ఇక్కడ ఉత్పత్తి స్వభావం నుంచే అదనపు శ్రమ కోసం అపరిమితమైన దాహం తలెత్తదు. అందువల్ల ప్రాచీన కాలంలో మార్పిడి విలువను దానికి గల స్వతంత్ర మైన డబ్బు రూపంలో పొందడమే లక్ష్యం అయినప్పుడు మాత్రమే అంటే వెండి, బంగారాల ఉత్పత్తిలో మాత్రమే, అమితమైన పని భారం భయంకర రూపం తీసుకుంటుంది. ప్రాణం పోయేటట్లు నిర్భయంగా పని చేయించటం అన్నది ఇక్కడ అమితమైన పని భారానికి గుర్తించబడిన రూపం. డియోడరస్ సికులస్ రాసింది చదవండి చాలు.[3] అయినా ఇవి ప్రాచీన కాలంలో మినహాయింపులు మాత్రమే. బానిస శ్రమ, ఊడిగపు శ్రమ (Corvee labour) లాంటి నిమ్న రూపాలలోనే ఉత్పత్తి కొనసాగిస్తున్న ప్రజలు పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం యొక్క ప్రాబల్యం ఉండే అంతర్జాతీయ మార్కెట్ అనే సుడిగుండంలోకి లాగబడి, తమ ఉత్పాదితాలను ఎగుమతి కోసం అమ్మటమే వారి ప్రధాన ప్రయోజనమయినప్పుడు అమిత పని భారం యొక్క నాగరిక అఘోరాలు బానిసత్వం, దాస్యం వగైరాల యొక్క అఘోరాలపైన అంటుకట్టబడతాయి. కనుకనే అమెరికన్ యూనియన్ దక్షిణాది రాష్ట్రాల్లో ఉత్పత్తి ప్రధానంగా స్థానిక వినియోగానికి ఉద్దేశించబడినంత కాలం అక్కడి నీగ్రో శ్రమ కొంతవరకు పితృస్వామిక స్వభావాన్ని నిలుపుకుంది.

---

1. "శ్రమించే వాళ్ళు వాస్తవంలో (ధనవంతులనబడే) పింఛనుదారుల్నీ, తమనీ పోషించుకుంటారు. (ఎడ్మండ్ బర్క్, పుట 2)
2. నీబర్ తన "రోమ్ చరిత్ర"లో అమాయకంగా ఇలా అంటాడు : "శిథిలావస్థలో మనని ఆశ్చర్యపరిచే ఎట్రూస్కన్‌లాంటి కట్టడాలవల్ల చిన్న (!) రాజ్యాల్లో ప్రభువులూ, సామంతులూ ఉండేవారనే సంగతి తెలుస్తుంది అన్నది స్పష్టం." "బ్రస్సెల్స్ లేస్" వల్ల వేతన ప్రభువులూ వేతన బానిసలూ ఉండేవారని తెలుస్తుంది అన్న సిస్మండీ పలుకులు ఇక్కడ మరింత సూటిగా ఉన్నాయి.
3. "ఈజిప్టు, ఇథియోపియా, అరేబియాల నడుమనున్న బంగారు గనుల్లో పని చేస్తూ వొళ్ళు కడుక్కో టానికీ, బట్టలు కట్టుకోటానికీ సైతం నోచుకోని దురదృష్టవంతుల దౌర్భాగ్యం చూసిన వారెవరైనా జాలిపడకుండా ఉండలేరు. జబ్బుపడిన వారి ఎడల, బలహీనుల ఎడల, ముసలివాళ్ళ ఎడల, స్త్రీల బలహీనత ఎడల సైతం కనికరం లేదు. క్షమ లేదు. మృత్యువు వారి బాధలనీ, వేదననీ అంతం చేసేదాకా అందరూ దెబ్బలుతింటూ నిర్బంధంగా పనిచేయాల్సిందే." ("Diod, Sic. Bibl. Hist. Lib 2, c. 13)

అయితే ఈ రాష్ట్రాలకు దూది ఎగుమతి అన్నది ప్రాణప్రదమైన ప్రయోజనం కాగానే, అదే నిష్పత్తిలో నీగ్రోచేత అతిగా పని చేయించడం, కొన్ని సందర్భాల్లో కేవలం 7 శ్రమ సంవత్సరాల్లో అతని జీవితాన్ని ముగించడం అన్నది అన్నిటినీ లెక్కగట్టే ఈ వ్యవస్థలో ఒక అంశం అయ్యింది. ఇక ఇప్పుడు అతని నుంచి ఒక నిర్దిష్ట పరిమాణం గల ఉపయోగకర ఉత్పాదితాలను రాబట్టటం అన్నది ప్రశ్న కాదు. ఇప్పుడది అదనపు శ్రమ ఉత్పత్తికి సంబంధించిన ప్రశ్న. ఊడిగం విషయంలో ఉదాహరణకు డాన్యూబియన్ రాజ్యాల్లో (ప్రస్తుతం రుమేనియా) కూడా అంతే.

అదనపు శ్రమ కోసం డాన్యూబియన్ రాజ్యాల్లో ఉండిన పేరాసను ఇంగ్లీషు ఫ్యాక్టరీల్లో పేరాసతో పోల్చడంలో ఒక ప్రత్యేక ప్రయోజనం ఉంది. ఎందుకంటే ఊడిగంలో అదనపు శ్రమకు ఒక స్వతంత్రమైన స్పష్టమైన రూపం ఉంది.

పనిదినంలో 6 గంటల అవసర శ్రమ 6 గంటల అదనపు శ్రమ ఉందనుకుందాం. అప్పుడు స్వేచ్ఛాయుత కార్మికుడు పెట్టుబడిదారునికి ప్రతి వారం 6×6=36 గంటల అదనపు శ్రమ ఇస్తాడు. వారంలో తన కోసం 3 రోజులూ, పెట్టుబడిదారుని కోసం ఉత్తపుణ్యానికి 3 రోజులూ పని చేసిందానితో ఇది సమానం. అయితే, పైకి ఇది కనిపించదు. అదనపు శ్రమ, అవసర శ్రమ ఒకదానిలోకి ఒకటి జారతాయి. కనుక, కార్మికుడు ప్రతి నిముషంలోనూ 30 సెకండ్లు తన కోసమూ, 30 సెకండ్లు పెట్టుబడిదారుని కోసమూ పని చేస్తాడని చెప్పడం ద్వారా నేను ఇదే సంబంధాన్ని వ్యక్తం చేయగలను. ఊడిగం విషయంలో అలా కాదు. వాలాషియన్ రైతు తన పోషణార్థం చేసుకునే అవసర శ్రమ, జమీందారు కోసం చేసే అదనపు శ్రమ నుండి స్పష్టంగా వేరుగా ఉంటుంది. ఒకటి అతను తన సొంత పొలంలో చేసేది కాగా, మరోటి దొరగారి కమతంలో చేసేది. కనుక శ్రమ కాలం యొక్క రెండు భాగాలూ ఒకదాని పక్కన ఒకటి స్వతంత్రంగా ఉంటాయి. ఊడిగం విషయంలో అదనపు శ్రమ, అవసర శ్రమ నుండి కచ్చితంగా వేరుచేయబడి ఉంటుంది. అయితే దీనివల్ల అదనపు శ్రమకూ, అవసర శ్రమకూ ఉండే పరిమాణాత్మక సంబంధంలో తేడా రాదు. వారంలో మూడు రోజుల అదనపు శ్రమను ఊడిగం అన్నా లేదా వేతన శ్రమ అన్నా ఆ మూడు రోజులూ శ్రామికునికి స్వయంగా సమ విలువను ఇవ్వని మూడు రోజులుగానే ఉంటాయి. అయితే, అదనపు విలువకై పేరాస పెట్టుబడిదారుని విషయంలో పనిదినాన్ని అపరిమితంగా సాగలాగటానికి జరిగే తంటాల రూపంలో ఉంటుంది. కాగా జమీందారు విషయంలో అయితే మరింత సాదాగా, సూటిగా ఊడిగపు దినాలకై వేట రూపంలో ఉంటుంది.[1]

డాన్యూబ్ ప్రాంతపు రాజ్యాల్లో ఊడిగం అన్నది వస్తురూపంలో కౌళ్ళతోనూ, దాస్యానికి సంబంధించిన ఇతర వస్తువులతోనూ కలిసి ఉండినది. అయితే పాలకవర్గానికి చెల్లించిన అత్యంత ప్రధానమైన కప్పం అదే. ఈ పరిస్థితి ఉండినచోట, ఊడిగం అనేది ఫ్యూడల్ దాస్యంవల్ల అరుదుగా మాత్రమే తలెత్తింది. ఆ దాస్యమే ఇంతకంటే చాలా తరచుగా ఊడిగం నుండి తలెత్తింది.[2] రుమేనియా

1. క్రిమియా యుద్ధం తర్వాత వచ్చిన మార్పుకి ముందు రుమేనియా రాష్ట్రాల్లో పరిస్థితిని క్రింది విషయం తెలియజేస్తుంది.

2. జర్మనీకి, ముఖ్యంగా ఎల్బీనదికి తూర్పున ఉన్న ప్రష్యాకు కూడా ఇది వర్తిస్తుంది. 15వ శతాబ్దంలో జర్మన్ రైతు దాదాపు ప్రతిచోటా వస్తు రూపంలోనూ, శ్రమ రూపంలోనూ కొన్ని కౌళ్ళు చెల్లించాల్సి ఉండినప్పటికీ

రాష్ట్రాల్లో జరిగిందిదే. వారి తొలి ఉత్పత్తి విధానం సమష్టి నేలపై ఆధారపడి ఉండింది. అయితే అది స్లావ్ రూపంలోనూ, భారతీయ రూపంలోనూ కాదు. కొంత భూమిని సభ్యులు స్వతంత్రంగా విడివిడిగా సాగుచేసుకున్నారు. మిగిలిన భాగాన్ని సమష్టి నేలగా ఉమ్మడిగా సాగుచేశారు. ఈ సమష్టి శ్రమ ఉత్పాది తంలో కొంత భాగం పంటలు పాడయినప్పుడూ, ఇతర దుర్ఘటనలు జరిగినప్పుడూ ఉపయోగించుకునే రిజర్వు నిధిగానూ, మరికొంత భాగం యుద్ధ ఖర్చులూ, మతమూ ఇతర ఉమ్మడి ఖర్చులూ భరించడానికి ప్రభుత్వ నిధిగానూ ఉపయోగపడింది. కాలక్రమంలో సైనికాధికారులూ, మతాధికారులూ ఉమ్మడి భూమితో పాటు, దానిపై ఖర్చు చేయబడే శ్రమనీ కైవసం చేసుకున్నారు. స్వతంత్ర రైతులు తమ ఉమ్మడి నేలపై పెట్టే శ్రమ, ఉమ్మడి నేల దొంగలకు ఊడిగంగా మార్చబడింది. ఈ ఊడిగం త్వరలోనే చట్టరీత్యా కాకుండా ఆచరణలో ఒక భృత్యు సంబంధంగా మారింది. ప్రపంచ విమోచనకారి రష్యా దాస్యాన్ని రద్దుచేసే నెపంతో దాన్ని చట్టబద్ధం చేసింది. 1831లో రష్యన్ జనరల్ కిస్సెలెఫ్ ప్రకటించిన ఊడిగం నిబంధనావళిని జమీందార్లే చెప్పి రాయించారు. ఆ రకంగా రష్యా ఒక్క దెబ్బతో ఇటు డాన్యూబియన్ రాజ్యాల ధనాధిపతుల్నీ, అటు యూరపు అంతటిలోనూ ఉదార వాద మూర్ఖుల కరతాళ ధ్వనులనూ జయించింది. “రెగ్లేమెంట్ ఆర్గానిక్” అనబడే ఈ నిబంధనావళి ప్రకారం ప్రతి వాలాషియన్ రైతూ భూస్వామి అనబడే వాడికి వస్తు రూపంలో చెల్లించాల్సిన అనేక అమాంబాపతు పదార్థాలు కాక (1) 12 రోజుల సాధారణ శ్రమ (2) ఒక రోజు పొలం శ్రమ (3) ఒక రోజు కట్టెలు మొయ్యడం అనగా మొత్తం ఏడాదిలో 14 రోజుల ఊడిగం చేయాలి. అయితే అర్థశాస్త్రాన్ని సమగ్రంగా అర్థం చేసుకోవడం వల్ల పనిదినం అంటే దాని మామూలు అర్థంలో కాక, ఒక రోజు సగటు ఉత్పాదితాన్ని ఉత్పత్తి చేయడానికి అవసరమైన పనిదినంగా గ్రహించబడింది. ఎంత శక్తిమంతుడైనా 24 గంటల్లో చేయలేని విధంగా ఆ ఒక రోజు సగటు ఉత్పాదితం మోసపూరితంగా నిర్వచించబడింది. పొడి మాటల్లో రెగ్లెమెంటే స్వయంగా తన నిజమైన రష్యన్ వ్యంగ్యంతో 12 పనిదినాలను 36 రోజుల శారీరక శ్రమగానూ, 1 రోజు పొలం శ్రమను 3 రోజులుగాను, 1 రోజు కట్టెలు మోయడం అంటే 3 రోజులుగానూ అర్థం చేసుకోవాలని ప్రకటించింది. మొత్తం 42 ఊడిగం రోజులు. దీనికి తోడు అసాధారణ సందర్భాల్లో దొరకి చేసే జొబాగీ[1] అనే సేవని జత చేయాలి. ప్రతి గ్రామమూ దాని జన సంఖ్యని బట్టి ఏటా ఒక విభాగాన్ని జొబాగీ కోసం వినియోగిస్తుంది. ప్రతి వాలాషియన్ రైతుకీ ఈ అదనపు ఊడిగం మరో 14 రోజులుంటుందని అంచనా వేయబడింది. ఆ రకంగా నిర్దేశించబడిన ఊడిగం ఏటా 56 దినాలు. అయితే వాలాషియాలో తీవ్రమైన చలి మూలంగా

ఇతరత్రా, కనీసం ఆచరణలో స్వేచ్ఛాయుత మానవుడు. బ్రాండెన్ బర్గ్, పోమెరేనియా, సైలీసియా తూర్పు ప్రష్యాలకు వలసపోయిన జర్మన్లు చట్టబద్ధంగా కూడా స్వేచ్ఛాయుత మానవులుగా గుర్తించబడ్డారు. రైతుల యుద్ధంలో ప్రభు వర్గం విజయం దీన్ని అంతం చేసింది. మళ్ళీ బానిసలుగా మార్చబడింది దక్షిణ జర్మన్ రైతులు మాత్రమే కాదు. 16వ శతాబ్దం మధ్య భాగం నుండి, తూర్పు ప్రష్యా, బ్రాండెన్ బర్గ్, పొమేరేనీయా, సైలీసియా రైతులూ, అటు పిమ్మట అనతికాలంలోనే ష్లెస్విగ్ హోల్‌స్టైన్ రైతులూ కూడా ఫ్యూడల్ దాసుల పరిస్థితికి దిగజార్చబడ్డారు. (Maurer, Fronhofe IV, Vol. Meitzen, "Der Boden des Preussischen Staats" - Hanssen, "Leibeigenschaft in Schleswig - Holstein" - ఏంగెల్స్.)

1. ఇది ఒకరకమైన వెట్టిచాకిరి (తెలుగు సంపుటి సంపాదకుడు)

వ్యవసాయపు పనులు జరిగేది సంవత్సరంలో 210 రోజులు మాత్రమే. వాటిల్లో 40 రోజులు ఆదివారాలూ, శలవులూ, సగటున 30 రోజులు వాతావరణం బాగాలేకపోవడం వల్లా అనగా మొత్తం 70 రోజులు లెక్కలోకి రావు. ఇంకా 140 పనిదినాలున్నాయి. అవసర శ్రమతో ఊడిగం నిష్పత్తి 56/84 లేదా $66\frac{2}{3}\%$ అంటే ఇంగ్లీషు వ్యవసాయ కార్మికుని లేదా ఫ్యాక్టరీ కార్మికుని ద్వారా లభించే అదనపు విలువకంటే దీని ద్వారా తక్కువ అదనపు విలువ లభిస్తుంది. అయితే ఇది చట్టం ద్వారా నిర్ణయింపబడిన ఊడిగం. ఇంగ్లీషు ఫ్యాక్టరీ చట్టాల కంటే "ఉదార"మైన అవగాహన గల "రెగ్లెమెంట్ అర్గానిక్"కి తన నిబంధనావళిని ఉల్లంఘించటానికి ఎలా వీలు కల్పించాలో తెలుసు. 12 రోజుల్ని 56 రోజులుగా మార్చిన తర్వాత 56 రోజుల్లో పేరుకి ఒక రోజు పని అనబడే ప్రతి రోజు పనిలోనూ కొంతభాగం రెండో రోజుకు మిగిలిపోయేలా అది మళ్ళీ ఏర్పాటు చేసింది. ఉదాహరణకు, ఒక రోజులో ఇంత విస్తీర్ణం గల భూమిలో కలుపు తీయాలి. ఈ పనికి, ముఖ్యంగా మొక్కజొన్న తోటల్లో, రెట్టింపు కాలం పడుతుంది. కొన్ని రకాల వ్యవసాయ శ్రమ విషయంలో చట్టబద్ధమైన ఒక రోజు పని మేలో మొదలై అక్టోబరులో అంతమయ్యే విధంగా భాష్యం చెప్పడానికి వీలుంది. మొల్డావియాలో పరిస్థితులు మరింత కఠినంగా ఉంటాయి. "రెగ్లెమెంట్ అర్గానిక్" యొక్క 12 ఊడిగం రోజులూ సంవత్సరంలో 365 రోజులతో సమానం," అని విజయగర్వంతో అరిచాడొక జమీందారు.[1]

ప్రతి పేరాగ్రాఫులోనూ చట్టబద్ధం చేసిన అదనపు శ్రమ కొరకు గల అత్యాశకు డాన్యూబ్ ప్రాంతపు రాజ్యాల రెగ్లెమెంట్ అర్గానిక్ అనుకూల రూపంలో వ్యక్తీకరణ కాగా, అదే అత్యాశకు ఇంగ్లీషు ఫ్యాక్టరీ చట్టాలు ప్రతికూల రూపంలో వ్యక్తీకరణ. ఈ చట్టాలు, పెట్టుబడిదారుడూ, భూస్వామి పాలించే ప్రభుత్వం చేసిన ప్రభుత్వ నిబంధనల ద్వారా పనిదినానికి బలవంతంగా పరిమితి విధించడం ద్వారా పరిమితుల్లేకుండా శ్రమ శక్తిని జుర్రుకోవాలనే పెట్టుబడి తపనను అడ్డుకుంటాయి. రోజు రోజుకూ మరింత ప్రమాదకరంగా పెరిగిన కార్మికవర్గ ఉద్యమం మాటటుంచి, ఇంగ్లీషు పొలాల్లో ఏ అవసరం ఎరువులు జల్లేలా నిర్దేశించిందో అదే అవసరం ఫ్యాక్టరీ శ్రమను పరిమితం చెయ్యాలని నిర్దేశించింది. కొల్లగొట్టడానికై పడే అదే గుడ్డి ఆతురత వల్ల ఒక సందర్భంలో పొలాలను నిస్సారంగా మార్చగా మరో సందర్భంలో జాతి జీవశక్తిని వేళ్ళతో సహా పెరికి వేసింది. ఈ విషయాన్ని జర్మనీ, ఫ్రాన్సుల్లో తగ్గిపోతున్న సైనిక ప్రమాణంలాగా[2] అప్పుడప్పుడూ వచ్చే అంటువ్యాధులు కూడా స్పష్టం చేస్తాయి.

---

1. పారిస్‌లో 1855లో ముద్రించబడిన E. Regnault యొక్క "Historic Politique et social des principantes Danubiennes"లో మరిన్ని వివరాలు దొరుకుతాయి.

2. "స్థూలంగా, కొన్ని పరిమితుల లోపల ఒక జాతి సగటు శారీరక పరిమాణం పెరిగిందంటే ఆ జాతి జీవుల సుభిక్ష స్థితికి అది నిదర్శనం. మనిషి విషయంలో అతని మామూలు పెరుగుదలకు శారీరక లేదా సామాజిక పరిస్థితులు అడ్డుపడితే శారీరకంగా అతని ఎత్తు తగ్గిపోతుంది. నిర్బంధ సైనిక సేవ గల యూరపు దేశాలన్నిటిలోనూ వయోజనుల సగటు ఎత్తూ సైనిక సేవకు అవసరమైన దార్ఢ్యమూ తగ్గిపోయాయి. విప్లవానికి ముందు (1789) ఫ్రాన్స్ పదాతి దళానికి కావలసిన కనీస ఎత్తు 165 సెం.మీ. 1818లో (మార్చి 10వ తేదీ శాసనం) 157 సెం.మీ. 1832 మార్చి 21వ తేదీ శాసనం నాటికి 156 సెం.మీ. ఫ్రాన్స్‌లో సగటున సగం మంది తగినంత ఎత్తు లేకపోవడం వల్ల లేదా శారీరక బలహీనత వల్ల

ఇప్పుడు (1867) అమల్లో ఉన్న 1850 నాటి ఫ్యాక్టరీ చట్టం 10 గంటల సగటు పనిదినాన్ని అనుమతిస్తుంది. అనగా, మొదటి 5 రోజులూ ఉదయం 6 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకూ 12 గంటల చొప్పున, దీనిలో 1/2 గంట ఉదయ భోజనానికీ, ఒక గంట మధ్యాహ్న భోజనానికీ పోగా 10½ పనిగంటలు మిగులుతుంది. శనివారం నాడు ఉదయం 6 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకూ మొత్తం 8 గంటలు, అందులో 1/2 గంట ఉదయ భోజనానికి తీసేయబడుతుంది. 60 పని గంటలు మిగిలాయి – మొదటి 5 రోజులకూ 10½ గంటల చొప్పున చివరి రోజు 7½ గంటల చొప్పున.[1] నేరుగా హోమ్ సెక్రటరీ ఆధ్వర్యం కింద పనిచేసే ఫ్యాక్టరీ ఇన్‌స్పెక్టర్లు ఈ చట్టాల సంరక్షకులుగా నియమించబడ్డారు. పార్లమెంటు ఆదేశం ప్రకారం వారి నివేదికలు అర్ధ సంవత్సరానికోసారి ప్రచురించబడతాయి. అదనపు శ్రమకై పెట్టుబడిదారీ పేరాసకు సంబంధించిన అధికారిక గణాంక వివరాలను అవి క్రమబద్ధంగా అందిస్తాయి.

ఒక క్షణం ఫ్యాక్టరీ ఇన్‌స్పెక్టర్లు చెప్తున్న దానిని విందాం.[2] మోసకారి మిల్లు యజమాని ఉదయం 6 గంటలకు ఒక పావుగంట ముందే (ఒక్కోసారి కొంచెం ఎక్కువో తక్కువో కావచ్చు) పని మొదలు పెడతాడు. సాయంత్రం 6 గంటల తర్వాత ఒక పావుగంట (ఒక్కోసారి కొంచెం ఎక్కువో తక్కువో కావచ్చు) ఆలస్యంగా విడిచి పెడతాడు. మామూలుగా ఉదయ భోజనం కోసం లాంఛనంగా కేటాయించిన అరగంటలో నుండి ముందు 5 నిమిషాలు, వెనక 5 నిమిషాలు తీసుకుంటాడు.

---

తిరస్కరించబడ్డారు. 1780లో శాక్సనీలో సైనిక ప్రమాణం 178 సెం.మీ. అది ఇప్పుడు 155. ప్రష్యాలో అది 157. 1862 మే 9వ తేదీ బవేరియన్ గజెట్‌లో డా॥ మేయర్ ప్రకటన ప్రకారం 9 ఏళ్ళ సగటు ఫలితం ఏమంటే సైన్యంలో దాఖలు గావడానికి వచ్చిన 1000 మందిలో 716 మంది సైనిక సేవకు అనర్హులు. వారిలో 317 మంది తగినంత ఎత్తు లేకపోవడం వల్ల, 399 మంది శారీరక లోపాల వల్ల అనర్హులు. 1858లో బెర్లిన్ తన సైనిక దళాన్ని సమకూర్చలేకపోయింది. 156 మంది తక్కువయ్యారు." J. Von liebig : "Die Chemic in ihrer Anwendung auf Agrikultur und Physiologic. 1862" 7వ కూర్పు ఒకటో సంపుటి, పుట 117-118)

1. 1850 ఫ్యాక్టరీ చట్టం చరిత్ర ఈ అధ్యాయంలో వస్తుంది.
2. ఇంగ్లండులో ఆధునిక పరిశ్రమ ప్రారంభం నుండి 1845 వరకూ నేను అక్కడక్కడా మాత్రమే తడిమాను. ఈ కాలానికి సంబంధించి ఫ్రెడరిక్ ఏంగెల్స్ రాసిన "ఇంగ్లండులో కార్మికవర్గ పరిస్థితులు" (లీప్జిగ్, 1845) అనే గ్రంథాన్ని పాఠకునికి సిఫార్సు చేస్తాను. పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం యొక్క స్వభావాన్ని ఏంగెల్స్ ఎంత సంపూర్ణంగా అర్థం చేసుకున్నాడో, 1845 తర్వాత వెలువడిన ఫ్యాక్టరీ నివేదికలు తెలుపుతాయి. 18, 20 ఏళ్ళ తర్వాత (1863-1867) ప్రచురించబడిన "చిల్డ్రన్స్ ఎంప్లాయ్‌మెంట్ కమిషన్" యొక్క అధికార నివేదికలతో అతని రచనను పైపైన పోల్చినా ఆనాటి పరిస్థితులను వివరంగా ఎంత అద్భుతంగా చిత్రించాడో తెలుస్తుంది. 1862 వరకూ, నిజానికి ఈనాటికి కూడా ఫ్యాక్టరీ చట్టాలు ప్రవేశపెట్టబడని పారిశ్రామిక శాఖలను గురించి ఈ నివేదికలు ప్రత్యేకంగా వివరించాయి. ఏంగెల్స్ చిత్రించిన పరిస్థితుల్లో ఎటువంటి మార్పునీ అధికారులు అమలుజరుపలేదు. నేను నా ఉదాహరణలను ప్రధానంగా స్వర్గయుగ మనబడే 1848 తర్వాతి స్వేచ్ఛా వ్యాపార కాలం నుండే తీసుకున్నాను. ఈ కాలం గురించే నిర్లజ్జాపరులూ, అజ్ఞానులూ అయిన వాణిజ్య యాత్రికలు స్వేచ్ఛా వాణిజ్య మహాసంస్థ కోసం అటువంటి పెద్ద పెద్ద కథలు చెప్పారు. మిగతా విషయానికి వస్తే, ఇక్కడ ఇంగ్లండ్‌నే నేను ప్రముఖంగా తీసుకోడానికి కారణం ఏమంటే, పెట్టుబడిదారీ ఉత్పత్తికీ అది నిఖార్సయిన ప్రతినిధి. మనం పరిశీలిస్తున్న విషయాల అధికారిక గణాంక వివరాలను క్రమం తప్పకుండా అది మాత్రమే కలిగి ఉంది.

భోజనానికి లాంఛనంగా కేటాయించబడిన గంటలో ముందో పది నిమిషాలూ, చివరో పది నిమిషాలూ తీసేసుకుంటాడు. శనివారం నాడు మధ్యాహ్నం 2 గంటల తర్వాత ఒక పావుగంట (ఒక్కోసారి కొంచెం ఎక్కువో, తక్కువో కావచ్చు) అదనంగా పని చేయిస్తాడు. ఆ రకంగా అతని లాభం :

| | | |
|---|---|---|
| ఉదయం 6 గంటలకు ముందు | – | 15 నిమిషాలు |
| సాయంత్రం 6 గంటల తర్వాత | – | 15 నిమిషాలు |
| ఉదయ భోజన సమయంలో | – | 10 నిమిషాలు |
| మధ్యాహ్న భోజన సమయంలో | – | 20 నిమిషాలు |
| | | 60 నిమిషాలు |
| ఐదు రోజులకు – 300 నిమిషాలు | | |
| శనివారం నాడు ఉదయం 6 గంటలకు ముందు | – | 15 నిమిషాలు |
| ఉదయ భోజన సమయంలో | – | 10 నిమిషాలు |
| మధ్యాహ్నం 2 గంటల తర్వాత | – | 15 నిమిషాలు |
| | | 40 నిమిషాలు |

మొత్తం వారానికి – 340 నిమిషాలు

లేదా "వారానికి 5 గంటల 40 నిముషాలు. ఏడాదిలో 50 పని వారాలతో (శలవులకూ, అప్పుడప్పుడూ జరిగే స్తంభనలకూ రెండు వారాలు తీసేయగా) గుణిస్తే అది 27 పనిదినాలతో సమానమవుతుంది."[1]

"రోజుకు 5 నిమిషాలు పెరిగిన పని, వారాలతో గుణిస్తే ఏడాదికి రెండున్నర రోజుల ఉత్పత్తితో సమానమవుతుంది."[2]

"ఉదయం 6 గంటలకు ముందూ, సాయంత్రం 6 గంటల తర్వాతా, భోజనానికి లాంఛనంగా నిర్ణయించిన సమయాలకు ముందూ, వెనకా కొంత కొంత సమయాన్ని కలిపి రోజుకు ఒక గంట అదనంగా పని చేయిస్తే అది ఏడాదికి 13 నెలల పనితో దాదాపు సమానమవుతుంది."[3]

సంక్షోభాలలో ఉత్పత్తికి అంతరాయం కలుగుతుంది. ఫ్యాక్టరీలు 'తక్కువ కాలం' అనగా వారంలో కొంత భాగం మాత్రమే పని చేస్తాయి. అయితే అటువంటి సంక్షోభాలు సైతం సహజంగానే పనిదినాన్ని విస్తరింపచేసే ధోరణిని ప్రభావితం చేయవు. వ్యాపారం ఎంత తక్కువుంటే చేసిన వ్యాపారంలో అంత ఎక్కువ లాభం సంపాదించాలి. పనిలో ఎంత తక్కువ కాలం వెచ్చిస్తే ఆ కాలాన్ని అంత ఎక్కువగా అదనపు శ్రమ కాలంగా మార్చాలి.

1857–58 సంక్షోభ కాలంపై ఫ్యాక్టరీ ఇన్‌స్పెక్టర్ల నివేదిక :

"వ్యాపారం ఇంత బాగలేనప్పుడు అతిగా పని చేయించడం అనేది అసమంజసం అనిపించవచ్చు.

---

1. సజెషన్స్ & ఎట్సెట్రా బై ఎల్. హార్నర్, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ ఇన్ ఫ్యాక్టరీస్ రెగ్యులేషన్ యాక్ట్స్. ఆర్డర్డ్ బై ది హౌస్ ఆఫ్ కామర్స్ టు బి ప్రింటెడ్, నైన్త్ ఆగస్టు, 1859.
2. రిపోర్ట్స్ ఆఫ్ ది ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ ఫర్ ది ఇయర్ అక్టోబర్, 1856.
3. రిపోర్ట్స్ అండ్ ఎట్సెట్రా తర్టీయత్ ఏప్రిల్ 1858.

అయితే ఆ బాగలేకపోవడమే నీతిబాహ్యుల అతిక్రమణకు దారితీస్తుంది. దాని నుంచి వారు అదనపు లాభాన్ని పొందుతారు ... గత అర్ధ సంవత్సరంలో మా జిల్లాలో 122 మిల్లులు మూతబడ్డాయి. 143 మిల్లులు పని చేశాయి." అయినా చట్టబద్ధమైన గంటలకు మించి అతిగా పని చేయించడం కొనసాగింది, అని లియోనార్డ్ హార్నర్ చెప్పాడు.[1]

"వ్యాపారంలో మాంద్యం వల్ల చాల కాలంపాటు అనేక ఫ్యాక్టరీలు మొత్తంగా మూసేయబడ్డాయి. అంతకంటే ఎక్కువ ఫ్యాక్టరీలు తక్కువ కాలం మాత్రమే పని చేశాయి. అయినప్పటికీ, కార్మికుల విశ్రాంతికీ, భోజనానికీ అని చెప్పి కేటాయించిన సమయంలో జొరబడటం ద్వారా రోజుకు అరగంటో, ముప్పావు గంటో లాక్కోబడుతోందనే ఫిర్యాదులు నాకు మామూలు సంఖ్యలోనే అందుతున్నాయి." అని హోవెల్ చెప్పాడు.[2] ఇదే మోసం 1861 నుండి 1865 వరకూ ఉన్న భయంకరమైన దూది సంక్షోభంలో తక్కువ స్థాయిలో జరిగింది.[3] "భోజనానికి కేటాయించిన సమయంలో లేదా ఇతర చట్ట వ్యతిరేక సమయంలో కార్మికులు పనిలోనే ఉంటే, దానికి సాకుగా, వారు నిర్ణీత కాలంలో మిల్లును వదలరనీ, వారు పనిని (యంత్రాలను శుభ్రం చేయడం వగైరా) ముఖ్యంగా శనివారం మధ్యాహ్నోల్లో ఆపుజేయాలంటే బలవంతం అవసరమనీ చెప్పబడుతోంది. కాని యంత్రాలు తిరగడం ఆగిపోయాక కార్మికులు ఇంకా ఫ్యాక్టరీలోనే ఉంటే ... శుభ్రం చేయడం వగైరాల కోసం ఉదయం 6 గంటలకు ముందుగానీ, లేదా శనివారం మధ్యాహ్నోల్లో 2 గంటలకు ముందుగానీ తగినంత సమయం కేటాయించి వుంటే వారు ఆ విధంగా పనిలో ఉండరు."[4]

---

1. రిపోర్ట్స్ అండ్ ఎట్సెట్రా, అదే నివేదిక.
2. రిపోర్ట్స్ అండ్ ఎట్సెట్రా, అదే నివేదిక.
3. రిపోర్ట్స్ అండ్ ఎట్సెట్రా ఫర్ ది ఇయర్ ఎండింగ్ తర్టీయత్ ఏప్రిల్ 1861, చూ. అనుబంధం నెం. 2 రిపోర్ట్స్ అండ్ ఎట్సెట్రా తర్టీ ఫస్ట్ అక్టోబర్, 1862. ది వైలేషన్స్ ఆఫ్ ది యాక్ట్స్ బికేమ్ న్యూమరస్ డ్యూరింగ్ ది లాస్ట్ హాఫ్ ఇయర్ 1863. రిపోర్ట్స్ అండ్ ఎట్సెట్రా ఎండింగ్ తర్టీ ఫస్ అక్టోబర్, 1863.
4. Reports & C. October 31st 1860 న్యాయస్థానాల్లో కార్ఖానాదారులిచ్చిన సాక్ష్యాల ప్రకారం ఫ్యాక్టరీ శ్రమలో జరిగే ప్రతి అంతరాయానికి వ్యతిరేకంగా వారి కార్మికులు ఎంత మొండిగా నిలబడ్డారో ఆసక్తికరమైన ఈ క్రింది ఘటన తెలియజేస్తుంది. బాట్లీకి సమీపంలో గల 8 పెద్ద మిల్లుల యజమానులు ఫ్యాక్టరీ చట్టాలను ఉల్లంఘించారనే సమాచారం 1836 జూన్ ప్రారంభంలో డ్యూస్‌బరీ (యార్క్‌షైర్) మాజిస్ట్రేట్‌లకు అందింది. వీరిలో కొందరు పెద్దలు 12-15 ఏళ్ళబాలురు 5 గురిని శుక్రవారం ఉదయం 6 గంటల నుండి శనివారం సాయంత్రం 4 గంటల వరకూ భోజనానికీ, అర్ధరాత్రి ఒక గంట నిద్రకూ మినహా ఇంకేమాత్రం విరామం ఇవ్వకుండా పని చేయించారని ఆరోపించబడింది. ఈ ఎడతెరిపిలేని 30 గంటల శ్రమను ఈ బాలురు "దుమ్ము గది" అనబడే దానిలో పనిచేయాల్సి వచ్చింది. దానిలో చింపిరి ఉన్ని బట్టలను ముక్కలు చేయబడతాయి. దుమ్ము దూగరతో దట్టంగా ఉండే ఆ గదిలో పెద్దవాళ్ళు సైతం తమ ఊపిరితిత్తు లను కాపాడుకోటానికి నోటిని చేతిరుమాలుతో కప్పుకోవాలిసిందే. ముద్దాయిలైన ఈ పెద్దలు ప్రమాణం చేయడానికి బదులు వక్కాణించిందేమంటే - క్వేకర్లుగా వారు మత నిష్ఠాపరులు కనుక ప్రమాణం చేయరు - తాము ఈ దురదృష్టవంతులైన పిల్లలమీద అపారమైన కరుణ కారణంగా నిద్రపోవడానికి 4 గంటలు అనుమతించామనీ, అయినా ఈ మొండిపిల్లలు నిద్రించడానికి పోనేలేదని

"చట్టాన్ని అతిక్రమించి అతిగా పని చేయించడం ద్వారా లాభం సంపాదించడం అన్నది చాలా మందికి తట్టుకోలేని ఆకర్షణ. తాము పట్టుబడమని వారి అంచనా. పట్టుబడి శిక్షబడిన వారు చెల్లించాల్సిన జుల్మానాగానీ, ఖర్చులుగానీ చాలా చిన్న మొత్తాలనేది గమనించాక, ఒకవేళ తాము పట్టుబడినా కూడా లాభమే గణనీయంగా మిగులుతుంది...[1] రోజు మొత్తంలో చిరుదొంగతనాలన్నీ కలిపి అదనపు కాలాన్ని సంపాదించే చోట్ల అది రుజువు చేయడానికి ఇన్‌స్పెక్టర్లకు అధిగమించి వీలులేనన్ని ఇబ్బందులు ఎదురవుతున్నాయి."[2]

కార్మికుల భోజన, విరామ సమయాల నుండి పెట్టుబడి చేస్తున్న ఈ "చిరుదొంగతనాల"కు ఫ్యాక్టరీ ఇన్‌స్పెక్టర్లు కూడా "నిమిషాల చిల్లర దొంగతనాలు",[3] "కొద్ది నిమిషాలను కొట్టేయడం"[4] లేదా కార్మికులు సాంకేతికంగా అన్నట్టు భోజన సమయాలను "కొరుక్కు తినడం"[5] అని పేరు పెట్టారు.

ఈ వాతావరణంలో అదనపు శ్రమ వల్ల అదనపు విలువ ఏర్పడటం రహస్యం కాదు అన్నది స్పష్టం. "రోజుకు అదనంగా కేవలం పది నిమిషాలు నన్ను పని చేయించనిస్తే మీరు నా జేబులో ఏడాదికి ఓ వెయ్యి ఉంచినట్టే" అని నాతో అత్యంత గౌరవనీయుడైన యజమాని అన్నాడు.[6] "క్షణాలు లాభం యొక్క అంశాలు."[7]

ఈ దృక్పథం ప్రకారం పూర్తి కాలం పని చేసే కార్మికుల్ని "ఫుల్ టైమర్స్" అనీ, 6 గంటలే పని చేయడానికి అనుమతించబడే 13 ఏళ్ళలోపు బాలుడ్ని "హాఫ్ టైమర్స్" అనీ అనడం కంటే స్వభావోచిత మైన విషయం మరోటి ఉండదు. ఇక్కడ కార్మికుడు శ్రమ కాలానికి మానవ రూపం తప్ప మరొకటి కాదు. "ఫుల్ టైమర్స్", "హాఫ్ టైమర్స్" అనే ఆ పదాల్లో వ్యక్తిగతమైన విశేషాలన్నీ మరుగున పడిపోతాయి.[8]

---

చెప్పారు. ఈ సాధుపుంగవులకు 20 పౌండ్ల జుల్మానా పడింది. ఈ పెద్దమనుషుల గురించి డ్రైడన్ ముందే ఊహించాడు :

"ఫాక్స్ దొర కుహనా పవిత్ర మూర్తి
ప్రమాణం చేయమంటే భయం, కానీ సైతాన్‌లా అబద్ధాలాడుతాడు
పరమ సాధువులా కనిపిస్తాడు, కానీ ఒళ్ళంతా విషం
పాపం చేయనే చేయడు - ప్రార్థనానంతరం తప్ప!"

1. రిపోర్ట్ 31, అక్టోబర్, 1856
2. అదే నివేదిక
3. అదే నివేదిక
4. అదే నివేదిక
5. అదే నివేదిక
6. అదే నివేదిక
7. రిపోర్ట్స్ ఆఫ్ ది ఇన్‌స్పెక్టర్ అండ్ ఎట్సెట్రా 30 ఏప్రిల్ 1860.
8. ఫ్యాక్టరీల్లోనూ నివేదికల్లోనూ కూడా అధికారిక వ్యక్తీకరణ ఇదే.

## విభాగం - 3

# దోపిడీకి చట్టబద్ధ పరిమితుల్లేని ఇంగ్లీషు పారిశ్రామిక శాఖలు

పనిదినాన్ని విస్తరించే ధోరణి, ఒక ఇంగ్లీషు బూర్జువా ఆర్థికవేత్త చెప్పినట్లు, అమెరికన్ రెడ్ ఇండియన్లపై స్పానియర్డుల క్రూరకృత్యాలు సైతం అధిగమించలేని రీతిలో రాక్షసంగా పని రాబట్టే[1] ఒక విభాగంలో అదనపు విలువ కోసం తోడేలుకుండేలాంటి ఆకలి, చివరికి చట్టబద్ధ నియమాల గొలుసులతో పెట్టుబడి బంధించబడేలా చేసిన సంగతిని మనం ఇంతకు ముందు పరిశీలించాము. ఇవాళ్టికి లేదా నిన్నటి వరకూ శ్రమ దోపిడీకి సంకెళ్ళు లేని ఉత్పత్తి శాఖలవైపు ఇప్పుడు దృష్టి సారిద్దాం.

1860 జనవరి 14వ తేదీన సాటింగ్ హామ్ అసెంబ్లీ గదుల్లో నిర్వహించబడిన సమావేశానికి అధ్యక్షత వహించిన కౌంటీ మేజిస్ట్రేట్ అయిన బ్రాటన్ చార్లటన్ ఇలా ప్రకటించాడు : “అల్లిక వ్యాపారంలో పని చేస్తున్న ప్రజా విభాగం అనుభవిస్తున్న బీదరికమూ, బాధలూ మన రాజ్యంలో ఇతర భాగాల్లో గాని, నిజానికి నాగరిక ప్రపంచంలో గాని లేవు. తొమ్మిది, పదేళ్ళ పిల్లలను వాళ్ళ మురికి పక్కల మీద నుండి రాత్రి రెండు, మూడు లేదా నాలుగు గంటలకు లాగి మళ్ళీ రాత్రి పది, పదకొండు, పన్నెండు దాకా కేవలం బతికి ఉండటానికి అవసరమైనంత ఇచ్చి బలవంతంగా పని చేయిస్తారు. వారి అవయవాలు దస్సిపోయి, వారి శరీరం కృశించిపోయి, వారి ముఖాలు పాలిపోయి, వారి మానవత్వం పూర్తిగా శిలా సదృశమైన మత్తులోకి కుంగిపోయి, ఊహించటానికే అత్యంత భయానకం ... మాలెట్‌గాని లేదా ఏ ఇతర కార్ఖానాదారుడుగాని ముందుకొచ్చి, చర్చికి వ్యతిరేకంగా నిరసన తెలియజేయడం మాకు ఆశ్చర్యంగా లేదు ... రెవరెండ్ మోంటాగూ వాల్పీ వర్ణించినట్టుగా, ఈ పద్ధతి సామాజికంగా, శారీరకంగా, నైతికంగా, ఆత్మికంగా ఎటువంటి మినహాయింపులూ లేని బానిసత్వం ... మగవాళ్ళ శ్రమను రోజుకు పద్దెనిమిది గంటలకు తగ్గించాలని విజ్ఞప్తి చేయడం కోసం బహిరంగ సభ నిర్వహించే పట్టణం గురించి ఏమనుకో గలం? ... వర్జీనియా, కరోలీనియా పత్తి పొలాల యజమానుల్ని మనం ఖండిస్తుంటాము. వారి నల్ల బజారూ, వారి కొరడా, వారు నిర్వహించే మానవ శరీరాల క్రయ విక్రయాలూ పెట్టుబడిదార్ల ప్రయోజనం కోసం మేలి ముసుగుల, కాలర్ల అల్లికలో నెమ్మదిగా జరుగుతున్న ఈయీ నరబలి కంటే గర్హనీయాలా?”[2]

గత 22 ఏండ్లలోనూ స్టఫార్డ్‌షైర్‌కు చెందిన పింగాణీ కార్ఖానాలు మూడు పార్లమెంటరీ దర్యాప్తులకు పరిశీలనాంశమయ్యాయి. ఆ దర్యాప్తుల ఫలితం “చిల్డ్రన్స్ ఎంప్లాయ్‌మెంట్ కమిషనర్స్”కు

---

1. “లాభాల వేటలో మిల్లు యజమానుల క్రూర కృత్యాలకు బంగారం కోసం వేటలో అమెరికాను జయించాక స్పానియర్డుల కృత్యాలు సైతం సాటి రావు. అటువంటి మిల్లు యజమానుల దురాశ.” జాన్ వేడ్, “హిస్టరీ ఆఫ్ ది మిడిల్ అండ్ వర్కింగ్ క్లాసెస్” మూడో కూర్పు, లండన్, 1835. అర్థ శాస్త్రానికి ఒక రకంగా పాఠ్య గ్రంథం లాంటి ఈ గ్రంథంలో సైద్ధాంతిక విభాగం దాని ప్రచురణా కాలం రీత్యా కొన్ని అంశాలలో ఉదాహరణకు వాణిజ్య, సంక్షోభాల విషయంలో, మౌలికం. దాని చారిత్రక విభాగం చాలా వరు సర్ ఎఫ్.ఎమ్. ఈడెన్ యొక్క “ది స్టేట్ ఆఫ్ ది పూర్” లండన్, 1797 నుంచి లజ్జారహితమైన గ్రంథ చౌర్యం.
2. డెయిలీ టెలిగ్రాఫ్, జనవరి 17, 1860.

స్క్రీవెన్ సమర్పించిన 1841 నాటి నివేదికలోనూ, మెడికల్ ఆఫీసర్ ఆఫ్ ది ప్రీవీకౌన్సిల్ (పబ్లిక్ హెల్త్, మూడో నివేదిక) ఆదేశం మేరకు ప్రచురింపబడిన 1860 నాటి డా॥ గ్రీన్‌హౌ నివేదికలోనూ లాంజ్ యొక్క 1862 నాటి నివేదికలోనూ "చిల్డ్రన్స్ ఎంప్లాయ్‌మెంట్ కమిషన్" యొక్క 1863, జూన్ 13 నాటి మొదటి నివేదికలోనూ పొందుపరచబడింది. దోపిడీకి గురైన బాలలు స్వయంగా వెల్లడించిన విషయాలు ప్రస్తుతం మనకు చాలు. బాలుర పరిస్థితి నుండి మనకు పెద్దవాళ్ళ పరిస్థితి గురించీ, ప్రత్యేకంగా బాలికల, స్త్రీల పరిస్థితి గురించీ మనం ఒక అభిప్రాయం ఏర్పరచుకోవచ్చు. ఈ పారిశ్రామిక విభాగం పక్కన దూది వడకటం అన్నది ఆమోదయోగ్యమైన, ఆరోగ్యకరమైన వృత్తిలా కనిపిస్తుంది.[1]

9 ఏళ్ళ విలియమ్ ఉడ్ 7 సంవత్సరాల 10 నెలల వయసులో పనిలో చేరాడు. అతడు మొదటి నుంచీ పోత వస్తువుల్ని చేరవేస్తున్నాడు. (పోత పోయబడిన వస్తువుల్ని ఆరబెట్టే గదిలోకి చేరవేసి ఖాళీ అచ్చును వెనక్కు తెస్తాడు.) అతడు వారంలో ప్రతి రోజూ ఉదయం 6 గంటలకు పనిలోకొచ్చి రాత్రి 9 గంటలకు పని నుండి బయటపడతాడు. "నేను వారంలో 6 రోజులు రాత్రి 9 గంటల వరకూ పని చేస్తాను. ఏడెనిమిది వారాలుగా అలాగే చేస్తున్నాను." ఏడేళ్ళ వాడికి 15 గంటల పని! 12 ఏళ్ళున్న జె. ముర్రే ఇలా చెప్పాడు. "నేను పోత వస్తువుల్ని చేరవేస్తాను. నేను 6 గంటలకు వస్తాను. అప్పుడప్పుడూ 4 గంటలకే వస్తాను. ఈ రోజు ఉదయం 6 గంటల వరకూ గత రాత్రంతా నేను పని చేశాను. అంతకు ముందు రాత్రి నుండి ఇప్పటి వరకూ నేను నిద్రపోలేదు. గత రాత్రి ఇంకా 8, 9 మంది బాలురు పని చేశారు. ఒక్కరు తప్ప అందరూ ఈ రోజు ఉదయం వచ్చారు. నాకు 3 షిల్లింగుల ఆరు పెన్నీలు ఇస్తారు. రాత్రిపూట పని చేసినందుకు నాకేమీ ఇవ్వరు. పోయిన వారం నేను రెండు రాత్రులు పని చేశాను." పదేళ్ళ ఫెర్నీహౌ : "నాకు (భోజనానికి) ఎప్పుడూ ఒక గంట ఉండదు. కొన్నిసార్లు, గురు, శుక్ర, శని వారాల్లో అరగంటే ఉంటుంది."[2]

పింగాణీ వాడలుండే స్టోక్ ఆన్ ట్రెంట్, వోల్ స్టాంటన్ జిల్లాల్లో సగటు ఆయుస్సు అసాధారణంగా తక్కువ అని డా॥ గ్రీన్‌హౌ ప్రకటించాడు. 20 ఏళ్ళు దాటిన పురుషులు స్టోక్ జిల్లాలో కేవలం 36.6% మంది వొల్ స్టాంటన్ జిల్లాలో కేవలం 30.4% మంది పింగాణీ పనిలో నియమించబడ్డారు. మొదటి జిల్లాలో అదే వయసు గల పురుషుల్లో సగం కంటే ఎక్కువ, రెండో జిల్లాలో 2/5 వంతు మరణాలకు కారణం పింగాణీ కార్మికుల్లో శ్వాసకోశ వ్యాధులు. హాన్లేకి చెందిన వైద్యుడు డా॥ బూత్రాయడ్ ఇలా అన్నాడు : "ఆ కార్మికుల్లో ప్రతి కొత్త తరం అంతకు ముందు తరం కంటే మరుగుజ్జుగానూ, తక్కువ పుష్టిగానూ ఉంటోంది." అదే విధంగా మరో వైద్యుడు ఎమ్. బియన్ "తాను పింగాణీ కార్మికుల్లో పాతికేళ్ళుగా వైద్యం చేస్తున్నాననీ, వారి ఒడ్డూ పొడుగుల విషయంలో వారి శరీర క్షీణత మరింత స్పష్టంగా ఉందని గమనించగల్గాననీ" అన్నాడు. ఈ ప్రకటనలు డా॥ గ్రీన్‌హౌ యొక్క 1860 నాటి నివేదికల నుండి తీసుకోబడ్డాయి.[3]

1863 నాటి కమిషనర్ల నివేదిక నుండి : నార్త్‌స్టఫోర్డ్ షైర్ ఆస్పత్రికి చెందిన సీనియర్

1. చూ. ''వర్కింగ్ క్లాస్ కండిషన్స్ ఇన్ ఇంగ్లాండ్'' ఏంగెల్స్ 1845
2. చిల్డ్రన్స్ ఎంప్లాయ్‌మెంట్ కమిషన్ ఫస్ట్ రిపోర్ట్ 1863, ఎవిడెన్స్
3. పబ్లిక్ హెల్త్ థర్డ్ రిపోర్ట్

ఫిజీషియన్ డా॥ జె.టి. ఆర్లెడ్జ్ ఇలా అన్నాడు : "పింగాణీ కార్మికులు ఒక వర్గంగా పురుషులూ, స్త్రీలూ శారీరకంగానూ, నైతికంగానూ పతనమైన జనం. సాధారణంగా వారు ఎదుగుదల లేకుండా, అనాకారులుగా తరచుగా సహజ రూపంలేని ఛాతీలతో ఉంటారు. వారు అకాల వృద్ధులౌతారు. ఖచ్చితంగా అర్ధాయుష్యులుగా బతుకుతారు. వారు మందకొడిగా, రక్తహీనతతో ఉంటారు. మొండిగా తలెత్తే అజీర్ణం వల్లా, కాలేయమూ, మూత్రపిండాలూ సవ్యంగా పనిచేయకపోవడం వల్లా, కీళ్ళ నొప్పుల వ్యాధి వల్లా అవయవాల నిస్త్రాణ కలిగి ఉంటారు. ఈ వ్యాధులన్నిటి కంటే ఎక్కువగా వారికి రొమ్ము జబ్బు, న్యూమోనియా, క్షయ, బ్రాంకైటిస్, ఉబ్బసమూ వస్తాయి. ప్రత్యేకంగా వారికే వచ్చే జబ్బును పింగాణీ కార్మికుల ఉబ్బసం అంటారు. పింగాణీ కార్మికుల్లో మూడింట రెండు వంతుల మందికుండే జబ్బు గ్రంథుల్లో లేదా ఎముకల్లో లేదా శరీరంలో ఇతర భాగాల్లో వచ్చే గండమాల ... ఈ జిల్లాలో నిరంతరాయంగా పక్క ఊళ్ళ నుండి జనం చేరటం వల్లా, ఇంతకంటే ఆరోగ్యంగా ఉన్న జాతులతో అంతర్వివాహాల వల్లా జనం ఇంతకంటే ఎక్కువగా క్షీణించకుండా ఇంత మాత్రమైనా ఉంది."[1]

ఇంతకు మునుపు అదే సంస్థలో హౌస్‌సర్జన్‌గా ఉన్న చార్లెస్ పార్సన్, కమిషనర్ లాంజ్‌కు రాసిన లేఖలో ఇతర విషయాలతోపాటు ఇలా ఉంది : "నేను గణాంక సమాచారాన్ని బట్టిగాక వ్యక్తిగతమైన పరిశీలనను బట్టి మాత్రమే మాట్లాడగలను. తల్లిదండ్రుల లేదా యజమానుల దురాశను సంతృప్తిపరచ టానికి పేదపిల్లల ఆరోగ్యం బలికావటాన్ని చూసినప్పుడల్లా పదే పదే నాలో ఆగ్రహం ఉప్పొంగుతుందని నొక్కి చెప్పటానికి నేను సంకోచించను." ఆయన పింగాణీ కార్మికులకొచ్చే వ్యాధులకు కారణాలను వరసగా పేర్కొని "సుదీర్ఘమైన పని గంటలు" అని క్లుప్తంగా వాటన్నిటికీ కలిపి పేరు పెట్టాడు. "మొత్తం ప్రపంచంలో ఇంతటి ప్రముఖ స్థానాన్ని సంతరించుకున్న ఉత్పత్తి యొక్క ఘనమైన విజయంలో, అటువంటి ఘనమైన ఫలితాలు సాధించిన శ్రమ, నిపుణత్వమూ కల్గిన శ్రామిక ప్రజల ఒడ్డూ పొడుగుల తరుగుదలా, శరీరంలో బాధలు, అకాల మరణమూ ఇమిడి ఉన్నాయ"నే పేరు ఈ ఉత్పత్తికి ఇంకా ఎంతో కాలం ఉండబోదనే నమ్మకాన్ని కమిషన్ నివేదిక వ్యక్తం చేసింది.[2] ఇంగ్లండులోని పింగాణీ కార్ఖానాలకు వర్తించేదంతా స్కాట్లండ్‌లోని వాటికి కూడా వర్తిస్తుంది.[3]

లూసిఫర్ అగ్గిపుల్లల తయారీ 1833 నుంచీ, అనగా పుల్లకి భాస్వరం పూయటం అనే పద్ధతి కనుగొన్న నాటి నుంచీ ఉంది. 1845 నుండి ఈ ఉత్పత్తి ఇంగ్లండులో చాలా వేగంగా అభివృద్ధి అయింది. లండన్‌లో జన సాంద్రత గలచోట్లా, మాంచెస్టర్, బర్మింగ్‌హామ్, లివర్‌పూల్, బ్రిస్టల్, నార్విచ్, న్యూకాజిల్, గ్లాస్గోలలోనూ విస్తరించింది. దానితోపాటు 1845లో ఒక వియన్నా ఫిజీషియన్ కనుగొన్న లూసిఫర్ అగ్గిపుల్లలు తయారుచేసే వారికి ప్రత్యేకంగా వచ్చే నక్కిళ్ళు పడిపోయే జబ్బు (Lock Jaw) కూడా విస్తరించింది. కార్మికుల్లో సగం మంది 13 ఏళ్ళలోపు బాలురూ, 18 ఏళ్ళలోపు కౌమార వయస్కులూ, అనారోగ్యంగానూ, అసౌఖ్యంగానూ ఉండే దాని పరిస్థితుల వల్ల ఆ ఉత్పత్తికి ఎంత చెడ్డ పేరుందంటే, కార్మికవర్గంలో అత్యంత దరిద్రులూ, అర్ధాకలితో అలమటించే విధవరాళ్ళూ

1. చిల్డ్రన్స్ ఎంప్లాయ్‌మెంట్ కమిషన్ ఫస్ట్ రిపోర్ట్
2. చిల్డ్రన్స్ ఎంప్లాయ్‌మెంట్ కమిషన్
3. అదే నివేదిక

మాత్రమే "అర్ధాకలితో అలమటించే, చదువురాని, చింపిరి బట్టల పిల్లల్ని దానిలోకి పంపుతారు."[1]

కమిషనర్ వైట్ (1863) పరిశీలించిన సాక్షుల్లో 270 మంది 18 ఏళ్ళలోపు వారు. 50 మంది 10 ఏళ్ళలోపు వారు. 10 మంది కేవలం 8 ఏళ్ళ వాళ్ళు. 5 మంది కేవలం 6 ఏళ్ళ వాళ్ళు. 12 నుండి 14 లేదా 15 గంటల పనీ, రాత్రి శ్రమా, వేళాపాళా లేని భోజన సమయాలూ, భాస్వరంతో నిండిన గదుల్లో తిండీనూ. ఈ ఉత్పత్తిలో డాంటే తన నరక లోకపు బీభత్సాలను మించినవాటిని చూసి ఉండేవాడు.

గోడలకు అతికించే కాగితాల ఉత్పత్తిలో ముతక రకం వాటిని యంత్రాలపైనా, నాణ్యమైన వాటిని చేతితోనూ (బ్లాక్ ప్రింటింగ్) ముద్రిస్తారు. బాగా వ్యాపారపు గిరాకీ ఉండేది, అక్టోబరు ప్రారంభం నుంచీ ఏప్రిల్ చివరి వరకూ. ఈ కాలంలో పని వేగంగానూ, ఉధృతంగానూ ఉదయం 6 గంటల నుండి రాత్రి 10 గంటల వరకు, లేదా ఇంకా ఎక్కువసేపటి వరకూ జరుగుతుంది.

జె. లీచ్ వాంగ్మూలం : "గత శీతాకాలం అధిక పని వల్ల ఒకసారి 19 మంది ఆడపిల్లల్లో 6 మంది జబ్బుపడి పనికి రాలేదు. వారిని మెలకువగా ఉంచటానికి నేను గట్టిగా గదమాయిస్తూ ఉండాలి." డబ్ల్యు. డఫీ : "పిల్లల్లో ఎవ్వరూ పనికోసం కళ్ళు తెరచి ఉంచలేకపోవడాన్ని నేను గమనించాను. నిజానికి మాలో ఎవ్వరూ కళ్ళు తెరచి ఉంచలేకపోయారు." జె. లైట్‌బోర్న్ : "నా వయసు 13. గత శీతాకాలం మేము 9 గంటలదాకా (రాత్రి) పని చేశాము. అంతకు ముందు శీతాకాలమైతే 10 దాకా చేశాము. గత శీతాకాలం పుళ్ళు పడిన పాదాలతో నేను ప్రతి రాత్రీ ఏడ్చేవాణ్ణి." జి. అప్‌డెన్ "వాడు మా పిల్లడు ... వాడికి 7 ఏళ్ళున్నప్పుడు నేను వాణ్ణి వీపు మీద ఎక్కించుకుని మంచులో కార్ఖానాకు, ఇంటికి తీసుకెళ్ళేవాడిని. వాడికి రోజూ 16 గంటల పని ఉండేది ... వాడు యంత్రం దగ్గర నిల్చున్నప్పుడు అక్కడి నుంచి కదల్లేదు, దాన్ని ఆపలేదు. కనుక వాడికి అలాగే అక్కడే అన్నం పెట్టడం కోసం నేను తరచుగా మోకాళ్ళపై కూర్చునే వాడిని." స్మిత్ అనే ఒక మాంచెస్టర్ ఫ్యాక్టరీ మేనేజింగ్ పార్టనర్ : "మేము (అంటే "మా" కోసం పని చేసే అతని "చేతులు" అని అతని ఉద్దేశం.) సాయంత్రం 4.30 లోగా $10\frac{1}{2}$ గంటల రోజు పనిని పూర్తి చేయడం కోసం భోజనానికి విరామం లేకుండా పని చేస్తూనే ఉంటాం. 4.30 తర్వాత చేసేదంతా ఓవర్‌టైమ్."[2] ($10\frac{1}{2}$ గంటలలో శ్రీమాన్ స్మిత్ కూడా భోజనం చెయ్యడా?) "మేము (అదే స్మిత్) సాయంత్రం 6 గంటల వరకూ పని చేయకుండా ఎప్పుడోగాని వదిలి వెళ్ళము. (అనగా "మా" శ్రమ శక్తి యంత్రాల అనుభోగాన్ని వదిలి వెళ్ళటం అని అతని ఉద్దేశం.) ఆ రకంగా మేము (అదే మనిషి) నిజంగా ఏడాది పొడుగునా ఓవర్‌టైమ్ పని చేస్తున్నాము...

---

1. అదే నివేదిక
2. దీన్ని మన అదనపు శ్రమ కాలం లాగా అర్థం చేసుకోరాదు. ఈ పెద్దమనుషులు $10\frac{1}{2}$ గంటల శ్రమను మామూలు పనిదినంగా పరిగణిస్తారు. అయితే ఇందులోనే మామూలు అదనపు శ్రమ కూడా ఉంటుంది. దీని తర్వాత ఓవర్‌టైమ్ మొదలవుతుంది. దానికి కొంచెం మెరుగైన వేతనం ముడుతుంది. మామూలు పనిదినం అనబడే దానిలో వెచ్చించిన శ్రమకు దాని విలువ కంటే తక్కువ ముట్టింది అనే సంగతిని మనం తర్వాత గమనిస్తాము. కనుక ఈ ఓవర్‌టైమ్ అనేది మరింత అదనపు శ్రమను రాబట్టటానికి పన్నిన ఒక పెట్టుబడిదారీ కుయుక్తి. అయితే మామూలు పనిదినంలో వెచ్చించిన శ్రమశక్తికి సక్రమంగా వేతనం ముట్టినప్పటికీ అదనపు శ్రమ అనేది ఉండనే ఉంటుంది.

పిల్లలూ, పెద్దవాళ్ళూ (152 మంది పిల్లలు, 140 మంది పెద్దవాళ్ళు) అందరికీ గత 18 మాసాల కాలంలో వారానికి సగటున కనీసం 7 రోజుల 5 గంటల పని, అనగా $78\frac{1}{2}$ గంటల పని ఉంది. ఈ ఏడాది (1862) మే 2 వరకూ గల ఆరు వారాల్లో ఈ సగటు మరింత ఎక్కువ - 8 రోజులు, అనగా వారానికి 84 గంటలుంది." అయినప్పటికీ, రాచరికపు "మేము" అతిగా అంకితమైన ఇదే స్మిత్ తాను చెప్పినదానికి చిరునవ్వుతో "యంత్రాలతో పనిచేయటం గొప్పేమీ కాదు" అని జతచేస్తాడు. "యంత్రంతో పనిచేయడం కంటే చేతిపని ఆరోగ్యకరం" అని బ్లాక్ ప్రింటింగ్ యజమానులు అంటారు. "కనీసం భోజనాల వేళల్లో అయినా యంత్రాలను ఆపాలనే" ప్రతిపాదనకు వ్యతిరేకంగా మొత్తం మీద యజమానులంతా ఆగ్రహం ప్రకటించారు. బరోలో గోడ కాగితాల ఫ్యాక్టరీ మేనేజర్ ఓట్లే ఇలా అంటాడు: "ఉదయం 6 గంటల నుండి రాత్రి 9 గంటల వరకూ పని చేయడానికి అనుమతించే నియమం మాకు అనువుగా ఉంటుంది. (!) అంతేగాని, ఉదయం 6 గంటల నుండి సాయంత్రం 6 గంటల దాకా పని చేయడం మాకు అనువుగాదు. మా యంత్రం భోజనాల వేళల్లో, ఎప్పుడూ ఆపబడుతుంది. (ఏమి ఔదార్యం!) కాగితమూ, రంగూ వృధా అవడమన్నదేమీ లేదు." అని "అయితే సమయం వృధా కావడం నచ్చకపోవడాన్ని నేను అర్థం చేసుకోగలను" అని సానుభూతి వాక్యం జతచేశాడు. సమయం కోల్పోవడం, అనగా ఇతరుల శ్రమను స్వాహా చేసే సమయాన్ని కోల్పోవడం తద్వారా లాభాలు కోల్పోవడం విషయంలో కొన్ని "పెద్ద సంస్థలు" భయపడటం అన్నది 13 ఏళ్ళలోపు పిల్లల్ని, 18 ఏళ్ళలోపు కౌమార వయస్కుల్నీ రోజుకు భోజనం కూడా చేయకుండా 12-16 గంటలు పనిచేయడాన్ని గాని, లేదా ఆవిరి యంత్రానికి బొగ్గు, నీరు ఉన్నికి సబ్బు, చక్రానికి కందెన సరఫరా చేసినట్టుగా అనగా ఉత్పత్తి ప్రక్రియలోనే కేవలం శ్రమ పరికరాలకు సహాయక పదార్థాలు అందించినట్టుగా వారికి తిండి అందించడాన్ని గానీ అనుమతించ డానికి తగినంత కారణం కాదని కమిషన్ అమాయకంగా అభిప్రాయపడింది.[1]

ఇంగ్లండులో రొట్టెలు (బ్రెడ్డు) కాల్చడం కాక ఇక ఏ ఇతర పారిశ్రామిక శాఖా (యంత్రాలతో రొట్టెను చేసే పద్ధతి ఇటీవలే ప్రారంభమైంది అన్న అంశాన్ని మనం ఇక్కడ పరిగణించడం లేదు.) ఇవాళ్టి వరకూ క్రీస్తుపూర్వ, రోమన్ సామ్రాజ్యం నాటి కావ్యాల్లో మనం చూసేలాంటి ఇంత పురాతనమైన పద్ధతిని భద్రపరచలేదు. అయితే ఇంతకు ముందే చెప్పినట్టుగా శ్రమ ప్రక్రియ యొక్క సాంకేతిక స్వభావాన్ని పెట్టుబడి మొదట ఉపేక్షిస్తుంది. అది దాన్ని దానికి కనిపించిన రూపంలోనే తీసుకుంటుంది.

నమ్మశక్యంగాని రీతిలో బ్రెడ్ కల్తీ కావడం, ముఖ్యంగా లండన్‌లో మొదట హౌస్ ఆఫ్ కామన్స్ కమిటీ యొక్క "ఆహార పదార్థాల కల్తీ గురించి" అన్న నివేదిక (1855-56) ద్వారానూ, "కల్తీ కనిపెట్ట బడింది"[2] అనే డాక్టర్ హస్సల్ యొక్క రచన ద్వారానూ వెల్లడయింది. ఈ వెల్లడి పర్యవసానమే 1860 ఆగస్టు 6న చేయబడిన "ఆహార పానీయాల కల్తీ నిరోధం కోసం" అనే చట్టం. కల్తీ సరుకుల క్రయ విక్రయాల ద్వారా "నిజాయితీగా పైసలు సంపాదించుకోటానికి" నిర్ణయించుకునే

1. అదే నివేదిక, సాక్ష్యం.
2. మెత్తగా చూర్ణం చేసిన లేదా లవణంతో కలిపిన పటిక, "బేకర్ల పదార్థం" అనే గమనార్హమైన నామధేయంతో ఒక మామూలు వ్యాపార పదార్థం.

ప్రతి స్వేచ్ఛా వ్యాపారి ఎడలా అది అత్యంత మృదువైన వైఖరి తీసుకుంటుంది కనుక, అది అమలుకాని శాసనం.[1] స్వేచ్ఛా వ్యాపారం అంటే కల్తీ లేదా ఇంగ్లీషు వాళ్ళు తమ బుద్ధి చతురతతో "కల్పిత" సరుకులు అని పిలిచే వాటిలో వ్యాపారం అనే విశ్వాసాన్ని కమిటీ స్వయంగా దాదాపు అమాయకంగా ఏర్పర్చుకుంది. నిజానికి ఈ రకం కుతర్కానికి తెలుపును నలుపు, నలుపును తెలుపు ఎలా చేయాలో ప్రొటగోరస్ కంటే బాగా తెలుసు. వాస్తవమైన ప్రతిదీ కేవలం రూపమే అని చూపించే ఎలియాటిక్కుల కంటే బాగా తెలుసు.[2]

అన్ని పరిస్థితుల్లోనూ కమిటీ ప్రజల దృష్టినీ "రోజూ తినే రొట్టె"వైపు, కనుక బేకింగ్ వ్యాపారం వైపు మళ్ళించింది. అదే సమయంలో బహిరంగ సభల్లోనూ, పార్లమెంట్‌కు సమర్పించిన వినతి పత్రాల్లోనూ అధిక పని భారం వగైరాలకు వ్యతిరేకంగా లండన్ బేకరీలలో పనిచేసే దినకూలి కార్మికుల ఆక్రందన తలెత్తింది. ఆ ఆక్రందన ఎంత జరూరు అయిందంటే ఇంతకు ముందు అనేకసార్లు పేర్కొనబడిన 1863 కమిషన్‌లో కూడా సభ్యుడైన హెచ్.ఎస్. ట్రైమెన్ హీర్‌ను రాయల్ కమిషనర్ ఆఫ్ ఎంక్వైరీగా నియమించారు. సాక్ష్యాలతో కూడిన ఆయన నివేదిక[3] ప్రజల గుండెను కదిలించలేదు కాని కడుపులో తిప్పింది. దైవానుగ్రహంచేత పెట్టుబడిదారుడో, భూస్వామో, గౌరవ వేతనం పొందేవాడో కాకుంటే మనిషి చెమటోడ్చి పని చేయడం ద్వారా మాత్రమే రొట్టెముక్క తినగలడు, అన్న సంగతి బైబిల్‌తో మంచి పరిచయం ఉన్న ఇంగ్లీషు ప్రజలకు బాగానే తెలుసు. అయితే అతడు రోజూ తినే రొట్టెలో పటిక, ఇసుక, తదితర ఆమోదయోగ్యమైన ఖనిజ పదార్థాలు గాక, కొంత పరిమాణం పుళ్ళ చీము, బూజు, చచ్చిన బొద్దింకలు, మురిగిన జర్మన్ ఈస్టుతో కలిసిన చెమటకూడా ఉందనే సంగతి మాత్రం వారికి తెలియదు. కనుక, పవిత్రమైన "స్వేచ్ఛా వ్యాపార" దేవతను లక్ష్యం చేయకుండా స్వేచ్ఛా బేకింగ్ వ్యాపారం ప్రభుత్వ ఇన్‌స్పెక్టర్ల అజమాయిషీ కింద (1863 పార్లమెంటు సమావేశం చివరిలో) ఉంచబడింది. అదే పార్లమెంటు చట్టం బేకరీల్లో 18 ఏళ్ళ లోపు దినకూలి కార్మికులు రాత్రి

1. పొగమసి అందరికీ తెలిసిన, చురుకైన కర్బనము. అది ఎరువుగా రూపొందుతుంది. దానిని పెట్టుబడిదారీ పొగ గొట్టాలు కడిగే కూలీలు ఇంగ్లీషు రైతులకు అమ్ముతారు. కొనుగోలుదారునికి తెలియకుండా 90% దుమ్ము, ఇసుక కలిపిన పొగమసి వ్యాపార అర్థంలో అసలైన పొగమసియా, న్యాయశాస్త్ర అర్థంలో కల్తీ పొగమసియా అనే విషయాన్ని ఇప్పుడు 1862లో బ్రిటీషు జూరీ పెద్దమనుషులు ఒక దావాలో నిర్ణయించాల్సి వచ్చింది. దానిని "వాణిజ్య మిత్రులు" అసలైన వ్యాపార పొగమసి అని నిర్ణయించారు. ఫిర్యాది అయిన రైతు దావాలో ఓడిపోయి, అదనంగా దావా ఖర్చులు కూడా చెల్లించాల్సి వచ్చింది.

4. "కల్పిత" సరుకులపై రాసిన తన గ్రంథ సంగ్రహంలో ఫ్రెంచి రసాయనవేత్త షెవాలియర్ తాను సమీక్షించిన 600 లేదా అంతకంటే ఎక్కువ సరుకుల్లో చాలా వాటికి ఒక్కోదానికి 20, 30 కల్తీ పద్ధతుల్నీ వివరించాడు. తనకన్ని పద్ధతులూ తెలియవనీ, తనకు తెలిసిన వాటన్నిటినీ పేర్కొనలేదనీ జతచేశాడు. పంచదారకు 6 రకాలు, ఆవనూనెకు 9, వెన్నకు 10, ఉప్పుకు 12, పాలకు 18, బ్రెడ్‌కు 20, బ్రాందీకి 23, గోధుమ పిండికి 24, చాక్లెట్‌కు 28, వైన్‌కు 30, కాఫీకి 32 వగైరా ... కల్తీ పద్ధతుల్నీ ఆయన తెలిపాడు. సర్వ శక్తిమంతుడైన దేవుడు కూడా ఈ తలరాతను తప్పించుకోలేడు. చూ. రోవార్‌డి కార్డ్. "ఆన్ ది ఫాల్సిఫికేషన్స్ ఆఫ్ ది మెటీరియల్స్ ఆఫ్ ది సేక్రమెంట్" పారిస్, 1856.

3. "రిపోర్ట్ అండ్ ఎట్సెట్రా రిలేటివ్ టు ది గ్రీవెన్సెస్ కంప్లెయిండ్ ఆఫ్ బై ది జర్నీమెన్ బేకర్స్ అండ్ ఎట్సెట్రా, లండన్, 1862" అండ్ సెకండ్ రిపోర్ట్ అండ్ ఎట్సెట్రా; లండన్ 1863.

9 గంటల నుండి ఉదయం 5 గంటల లోపు పని చేయడాన్ని నిషేధించింది. ఈ పురాతన వాణిజ్యంలో ఉన్న అత్యధిక పని భారం గురించి ఈ ఆఖరి నియమం ఎంతైనా చెప్తుంది.

"లండన్ బేకరీ కార్మికుని పని సాధారణంగా రాత్రి పదకొండు గంటలకు మొదలవుతుంది. అప్పుడు అతడు పిండి పిసుకుతాడు. అదొక శ్రమతో కూడిన ప్రక్రియ. అక్కడ పని చేసే కార్మికుల సంఖ్యను బట్టి ఆ పనికి అరగంట నుండి ముప్పావు గంట దాకా పడుతుంది. తర్వాత పిండి పిసికిన తొట్టెపై మూతగా ఉండే రొట్టెల బల్లపైన ఒక బస్తా తన కింద, మరో బస్తా తలకింద దిండుగా వేసుకుని నడుం వాలుస్తాడు. సుమారు రెండు గంటలు కునుకు తీస్తాడు. ఇక అప్పుడు ఐదు గంటలపాటు వేగంగా, అదే పనిగా పనిచేస్తాడు – పిసికిన పిండి ముద్దను విసరటం, దాని పొట్టు దులపటం, దానిని మల్చటం, పొయ్యి గూడు (ఓవెన్)లో పెట్టడం, బ్రెడ్ రోల్స్‌నూ, ఫాన్సీ బ్రెడ్‌నూ తయారుచేసి కాల్చడమూ, కాలిన తర్వాత వాటిని పొయ్యి గూటిలోంచి తీయడమూ, పైకి షాపులోకి వాటిని తీసుకు వెళ్ళడమూ వగైరా వగైరా పనుల్ని చేస్తాడు. రొట్టె కాల్చే గది ఉష్ణోగ్రత 75 నుండి 90 డిగ్రీలకు మించి ఉంటుంది. చిన్న గదుల్లో ఉష్ణోగ్రత 75 కంటే 90 డిగ్రీలకే దగ్గరగా ఉంటుంది. బ్రెడ్, రోల్స్ వగైరాలు తయారుచేసే పని పూర్తికాగానే వాటి పంపిణీ మొదలవుతుంది. ఈ వ్యాపారంలో పని చేసే కార్మికుల్లో గణనీయమైన భాగం పైన చెప్పినట్టుగా రాత్రిపూట కష్టపడి పనిచేసిం తర్వాత పగలంతా చాలా గంటల పాటు రొట్టెల బుట్టల్ని మోస్తూ, తోపుడు బళ్ళను చేత్తో తోసుకుంటూ కాళ్ళపైనే ఉంటారు. కొన్నిసార్లు మళ్ళీ రొట్టె కాల్చే గదికి వచ్చి, అప్పటి రుతువును బట్టి, తమ యజమాని వ్యాపార పరిమాణాన్ని బట్టి, స్వభావాన్ని బట్టి మధ్యాహ్నం ఒంటిగంట తర్వాత సాయంత్రం 6 గంటలలోపు పనిలో నుంచి బయటపడతారు. ఇతర కార్మికులు మిట్ట మధ్యాహ్నం దాకా రొట్టెలు కాల్చే గదిలో మరిన్ని వరసల రొట్టెల్ని "బయటకు తెస్తారు..."[1] "లండన్ సీజన్" అనబడే సమయంలో నగరంలోని వెస్ట్ ఎండ్‌లో ఉన్న "పూర్తి ధర" బేకర్ల దగ్గర పనిచేసేవాళ్ళు సాధారణంగా రాత్రి 11 గంటలకు పని ప్రారంభిస్తారు. రెండో రోజు ఉదయం 8 గంటల దాకా ఒకటి, రెండు చిన్న విరామాలతో (కొన్నిసార్లు మరీ చిన్న విరామాలతో) రొట్టె తయారీలో నిమగ్నమవుతారు. ఇక అప్పుడు సాయంత్రం 4, 5, 6 గంటల దాకా, ఒక్కోసారి 7 గంటల దాకా పగలంతా రొట్టెలు మోసుకెళ్తూనో, లేదా కొన్నిసార్లు మధ్యాహ్నం మళ్ళీ రొట్టెల గదిలో బిస్కట్ల తయారీలో సాయపడుతూనో గడుపుతారు. పని పూర్తయాక, మళ్ళీ మొదలుపెట్టడానికి ముందు వారికి కొన్నిసార్లు ఐదారు గంటల, మరికొన్నిసార్లు నాలుగయిదు గంటల నిద్ర మాత్రమే ఉండొచ్చు. శుక్రవారాలలో వారు ఎప్పుడూ ఇంకా ముందే పని ప్రారంభిస్తారు. కొంతమంది 10 గంటలకే ప్రారంభించి కొన్ని సందర్భాలలో రొట్టె తయారీలో లేదా పంపిణీలో శనివారం రాత్రి 8 గంటల వరకూ, కాని సర్వసాధారణంగా ఆదివారం ఉదయం 4 లేదా 5 గంటల వరకూ పనిలో గడుపుతారు. రెండో రోజు రొట్టెకు సన్నాహాలు చేయడం కోసం పనివాళ్ళు ఆదివారాల్లో పగటి పూట రెండు మూడుసార్లు పనికి హాజరు కావాల్సిందే. తక్కువకమ్మే యజమానుల ("పూర్తి ధర" కంటే తక్కువ కమ్మేవారు, ఇంతకు ముందే పేర్కొన్నట్టు వారు లండన్

1. అదే నివేదిక ఫస్ట్ రిపోర్ట్ అండ్ ఎట్సెట్రా.

బేకర్లలో నాలుగింట మూడొంతుల మంది ఉంటారు.) దగ్గర పనిచేసే వాళ్ళు సగటున ఇంతకంటే ఎక్కువ గంటలు పని చేయాలి. అంతేగాక వారి పని దాదాపు పూర్తిగా రొట్టెలు కాల్చే గదికే పరిమితమవుతుంది. తక్కువ కమ్మే యజమానులు సాధారణంగా తమ రొట్టెలను ... కార్ఖానాలోనే అమ్ముతారు. కిరాణా దుకాణాలకు తప్ప బయటకు పంపరు. ఒకవేళ పంపితే దానికోసం వేరే మనుషుల్ని నియమించుకుంటారు. ఇంటింటికీ రొట్టె సరఫరా చేయడం వారికలవాటు లేదు. వారం చివరిలో ... పనివాళ్ళు గురువారం రాత్రి 10 గంటలకు పని ప్రారంభించి మధ్యలో కొద్దిపాటి విరామంతో శనివారం రాత్రి దాకా పని చేస్తూనే ఉంటారు.[1]

తక్కువకమ్మే యజమానుల పరిస్థితిని బూర్జువా మేధ సైతం అర్థం చేసుకుంటుంది. "వేతనం పొందని శ్రమ మూలాధారంగా పోటీ కొనసాగించబడుతోంది."[2] కమిషన్ ఆఫ్ ఎంక్వైరీ ముందు "పూర్తి ధర" గల బేకర్ తక్కువ కమ్మే తన పోటీదారులను పరాయి శ్రమను దోచుకునే దొంగలనీ, కల్తీదారులని ఖండిస్తాడు. "మొదట జనాన్ని మోసం చేసి, తర్వాత తమ మనుషుల 18 గంటల పనికి 12 గంటల వేతనం ఇవ్వడం ద్వారా మాత్రమే వారు ఇప్పుడు బతకగలుగుతున్నారు.[3]

రొట్టెని కల్తీ చేయటమూ, పూర్తి ధరకంటే తక్కువకమ్మే బేకర్ల వర్గం రూపొందటమూ అన్నవి 18వ శతాబ్దపు ఆరంభం నుంచీ, ఈ వ్యాపారం తన సంస్థా స్వభావాన్ని కోల్పోయి, మిల్లరు లేదా ఏజెంటు రూపంలో నామమాత్రపు మాస్టర్ బేకర్ వెనకనుండి పెట్టుబడిదారుడు తలెత్తిన నాటి నుంచి[4] మొదలయ్యాయి. ఆ రకంగా ఈ వ్యాపారంలో పెట్టుబడిదారీ ఉత్పత్తికీ, పనిదినాన్ని అపరిమితంగా సాగలాగడానికీ, రాత్రి పనికీ లండన్‌లో సైతం పునాది వేయబడింది.[5] అయితే రాత్రి పని 1824 తర్వాత మాత్రమే గణనీయమైన పరిమాణం అందుకుంది.

ఇంతవరకు చెప్పినదాన్నిబట్టి, బేకరీల్లో పని చేసే కార్మికులు తక్కువ కాలం బతికే వారిలో ఉంటారనీ, బాల్య మరణానికి గురయ్యే అత్యధిక సంఖ్యాకపు కార్మిక వర్గపు పిల్లలలో చేరకుండా తప్పించుకొన్న బేకరీ కార్మికులు చాలా అరుదుగా 42వ ఏడు వరకూ చేరుకుంటారనీ కమిషన్ నివేదిక ఎందుకు పరిగణించిందో అర్థమవుతుంది. అయినప్పటికీ బేకింగ్ వ్యాపారంలో పని చేయడానికి దాఖలు చేసుకున్న వారు ఇబ్బడి ముబ్బడిగా ఉన్నారు. లండన్‌లో ఈ శ్రమశక్తుల సరఫరాకు

---

1. అదే నివేదిక.
2. జార్జి రీడ్ "ది హిస్టరీ ఆఫ్ బేకింగ్" లండన్, 1848.
3. రిపోర్ట్ (ఫస్ట్) ఎట్సెట్రా చేజ్‌మన్ అనే పూర్తి ధర బేకర్ సాక్ష్యం.
4. జార్జి రీడ్, అదే గ్రంథం. 17వ శతాబ్దం చివరిలోనూ, 18వ శతాబ్దం ప్రారంభంలోనూ సాధ్యమైన ప్రతి వ్యాపారంలోకీ మూగిన ఈ ఏజెంట్లను "ప్రజలకు ఉపద్రవంగా" ఖండించడం జరిగింది. సొమెర్‌సెట్ కౌంటీకి చెందిన గౌరవ న్యాయమూర్తుల త్రైమాసిక సమావేశంలో గ్రాండ్ జ్యూరీ దిగువ సభకు ఇలా విన్నవించుకుంది. "బ్లాక్‌వెల్ హాల్‌కు చెందిన ఈ ఏజెంట్లు ప్రజలకు ఉపద్రవం, వస్త్ర పరిశ్రమకు హాని చేస్తారు. వీరిని ఒక ఉపద్రవంగా భావించి అణచివేయాల్సి ఉంది." ("ది కేస్ ఆఫ్ అవర్ ఇంగ్లీష్ వూల్ అండ్ ఎట్సెట్రా"), లండన్ 1685, పుటలు 6, 7)
5. ఫస్ట్ రిపోర్ట్ అండ్ ఎట్సెట్రా.

మూలాధారాలు : స్కాట్లండ్, ఇంగ్లండులోని పశ్చిమ వ్యవసాయ జిల్లాలు, జర్మనీ.

1858–60 సంవత్సరాల్లో ఐర్లండు బేకరీ కార్మికులు రాత్రిళ్ళూ, ఆదివారాలూ పని చేయడానికి వ్యతిరేకంగా ఆందోళన చేయడం కోసం తమ సొంత ఖర్చుతో గొప్ప సభలు నిర్వహించారు. వాటిలో ప్రజలు తమ ఐరిష్ ఆప్యాయతతో పాల్గొన్నారు. ఉదాహరణకు, 1860 మేలో జరిగిన డబ్లిన్ సభ. ఈ ఉద్యమం ఫలితంగా వెక్స్ ఫోర్డ్, కిల్కెన్నీ, క్లోన్‌మెల్, వాటర్ ఫర్డ్ వగైరాల్లో కేవలం పగటి పని అనేది స్థిరపడింది. కార్మికుల కష్టాలు అతిగా వ్యక్తమయ్యే లిమెరిక్‌లో మాస్టర్ బేకర్ల వ్యతిరేకత ఆ ఉద్యమాన్ని ఓడించింది. మిల్లర్ బేకర్లు అందరికంటే పెద్ద వ్యతిరేకులు. లిమెరిక్ ఉదాహరణ ఎన్నిస్, టిప్పరరీలలో తిరోగమనానికి దారితీసింది. సాధ్యమైనంత బలంగా ఆవేశం వ్యక్తమైన కార్క్‌లో యజమానులు కార్మికుల్ని పనిలో నుండి తొలగించగలిగిన తమ అధికారాన్ని ఉపయోగించి ఉద్యమాన్ని ఓడించారు. డబ్లిన్‌లో మాస్టర్ బేకర్లు ఉద్యమాన్ని కృతనిశ్చయంతో వ్యతిరేకించారు. కార్మికులు ఎంతగా ఉద్యమాన్ని పెంచాలనుకున్నప్పటికీ, వారిని ఉపేక్షించి వారి విశ్వాసాలకు విరుద్ధంగా కార్మికుల మెడలు వంచి ఆదివారాలూ, రాత్రిళ్ళూ పని చేయడానికి ఒప్పించడంలో మాస్టర్ బేకర్లు కృతకృత్యులయ్యారు.[1]

నిలువెల్లా ఆయుధాలు కల్గి, వాటిని ఎలా చూపించాలో సాధారణంగా తెలిసిన ఐర్లండులోని ఇంగ్లీషు ప్రభుత్వపు కమిటీ డబ్లిన్, లిమెరిక్, కార్క్ వగైరాల్లోని అసాధ్యులైన మాస్టర్ బేకర్లను గంభీరంగానే అయినప్పటికీ, సుతిమెత్తగా ఆక్షేపించింది. "పని గంటలకు ప్రకృతి నియమాలే పరిమితి విధిస్తాయి, అవి శిక్ష లేకుండా ఉల్లంఘించబడజాలవని కమిటీ విశ్వసిస్తోంది. పనిలో నుండి తొలగించబడతామనే భయాన్ని ఉపయోగించుకుని యజమానులు కార్మికుల మెడలు వంచటమూ, వారి మత విశ్వాసాలనూ, ఉత్తమ భావాలనూ ఉల్లంఘించటమూ, దేశంలో ఉన్న చట్టాలను ధిక్కరించటమూ, ప్రజాభిప్రాయాన్ని పట్టించుకోకపోవటమూ (ఇదంతా ఆదివారం శ్రమకు వర్తిస్తుంది) పనివాళ్ళకూ యజమానులకే మధ్య వైషమ్యం రెచ్చగొట్టటానికి ఉద్దేశించబడింది ... మతానికీ, నీతికీ, సామాజిక సువ్యవస్థకూ ప్రమాదకరమైన ఉదాహరణగా ఉంటుంది ... రోజుకు 12 గంటలకు మించిన ఏ పనైనా పని చేసే వాని గృహ జీవితంలోకీ, ప్రైవేటు జీవితంలోకీ జొరబడుతుందనీ, ప్రతి మనిషి కుటుంబంతోనూ, కుమారుడుగా, సోదరుడుగా, భర్తగా, తండ్రిగా అతడు నిర్వహించే గృహ బాధ్యతలతోనూ జోక్యం చేసుకోవడం వల్ల వినాశకం నైతిక పర్యవసానాలకు దారి తీస్తుందనీ కమిటీ నమ్ముతోంది. 12 గంటలకు మించిన పని, పనివాని ఆరోగ్యాన్ని బలహీనపరిచే అవకాశం ఉంది. అది అకాల వృద్ధాప్యానికీ, అకాల మరణానికీ దారితీస్తుంది. ఇంటి పెద్ద యొక్క ఆలనా పాలనా అత్యంత అవసరమైన కాలంలో, అది కరువై కార్మికుల కుటుంబాలకు తీరని హాని జరుగుతుంది."[2]

ఇంతవరకూ మనం ఐర్లండునే ప్రస్తావించాం. చానల్‌కు అవతల వైపునున్న స్కాట్లండ్‌లో వ్యవసాయ కార్మికుడు, దున్నేవాడు అత్యంత ప్రతికూల వాతావరణంలో రోజూ తాను చేసే 13, 14

---

1. రిపోర్ట్ ఆఫ్ కమిటీ ఆన్ ది బేకింగ్ ట్రేడ్ ఇన్ ఐర్లాండ్ ఫర్ 1861.
2. అదే నివేదిక.

గంటల పనికీ, ఆదివారం నాడు చేసే 4 గంటల అదనపు పనికీ (ఆదివారాన్ని పవిత్రంగా ఎంచే భక్తుల దేశంలో!) వ్యతిరేకంగా నిరసన తెలుపుతున్నాడు.[1] అదే సమయంలో ముగ్గురు రైల్వే మనుషులు – ఒక గార్డు, ఒక ఇంజిన్ డ్రైవరు, ఒక సిగ్నల్‌మాన్ లండన్‌లో మరణ కారణాలను విచారించే జ్యూరీ ముందు నిలబడ్డారు. ఒక అతి పెద్ద రైలు ప్రమాదం వందలాది ప్రయాణీకుల్ని మరో ప్రపంచానికి శీఘ్రంగా సాగనంపింది. రైల్వే ఉద్యోగుల నిర్లక్ష్యమే ఈ దుర్ఘటనకు కారణం. పది పన్నెండేళ్ళ క్రితం తమకు రోజుకు 8 గంటల పని మాత్రమే ఉండేదని వారు ఏకకంఠంతో జ్యూరీ ముందు ప్రకటించారు. గత ఐదారేళ్ళ కాలంలో అది 14, 18, 20 గంటలకు పెరిగింది. శలవుల్లో ప్రయాణించే వారు పెరిగినప్పుడు వినోద యాత్రీకుల రైళ్ళలో తరచుగా విరామం లేకుండా 40 లేదా 50 గంటల పని ఉంటుంది. వారు సాధారణ మానవులు, మానవాతీతులు కాదు. ఒకానొక దశలో వారి శ్రమ శక్తి విఫలమైంది. నిద్ర మత్తు వారిని ఆవహించింది. వారి మెదడు ఆలోచించడమూ, వారి కళ్ళు చూడటమూ మానుకున్నాయి. పూర్తిగా "గౌరవనీయమైన" జ్యూరీ వారిని మానవ హత్యాకాండ అనే నేరారోపణతో పై కోర్టుకు పంపే తీర్పు నిచ్చింది. రైల్వేల యొక్క పెద్ద పెట్టుబడిదారులు భవిష్యత్తులో తగినంత పరిమాణంలో శ్రమ శక్తిని కొనటానికి మరింత ధన వ్యయం చేసేవారుగానూ, వేతనం చెల్లించబడిన శ్రమ శక్తిని జుర్రుకొనేటప్పుడు మరింత "మిత వర్తనులు"గానూ, "స్వార్థ త్యాగులు"గానూ, "పొదుపరులు"గానూ ఉంటారనే పవిత్రమైన ఆశను జ్యూరీ తన తీర్పుకు అనుబంధంగా వ్యక్తం చేసింది.[2]

యులిసెస్ చుట్టూ పడివున్న హతుల ఆత్మల కంటే వేగంగా మన చుట్టూ హడావుడిగా

1. జనవరి 5వ తేదీన ఎడిన్ బర్గ్ సమీపాన గల లాస్వేడ్‌లో జరిగిన బహిరంగ సభ (చూ. వర్క్ మ్యాన్స్ అడ్వొకేట్, జనవరి 13, 1866) మొట్టమొదట స్కాట్లండులో వ్యవసాయ కార్మికుల ట్రేడ్ యూనియన్‌ను 1865 చివరిలో ఏర్పాటు చేయడం అన్నది ఒక చరిత్రాత్మక ఘటన. ఇంగ్లండులోని అత్యంత పీడిత వ్యవసాయ జిల్లాల్లో ఒకటైన బకింగ్‌హామ్ షైర్‌లో 1867 మార్చిలో శ్రామికులు తమ వారం జీతాలను 9-10 షిల్లింగుల నుండి 12 షిల్లింగులకు పెంచమని కోరుతూ ఒక పెద్ద సమ్మె చేశారు. (ఇంతకు ముందు చెప్పిన దాన్నిబట్టి ఇంగ్లీషు వ్యవసాయ కార్మికవర్గ ఉద్యమం. 1830 తర్వాత దాని హింసాత్మక ప్రదర్శనల అణచివేత జరిగిన నాటి నుండీ ముఖ్యంగా కొత్తగా పేదల చట్టాలను ప్రవేశపెట్టిన నాటి నుండీ, పూర్తిగా అణగదొక్కబడిందనీ, అయితే అది అరవైలలో మళ్ళీ ప్రారంభమై తుదకు 1872లో అది చరిత్రాత్మకం అయిందనీ గమనిస్తారు. రెండో సంపుటిలో దీన్ని మళ్ళీ ప్రస్తావిస్తాను. 1867 నుండీ ఇంగ్లీషు వ్యవసాయ కార్మికుల పరిస్థితిపైన వెలువడిన బ్లూ బుక్స్‌ను కూడా ప్రస్తావిస్తాను. 3వ కూర్పుకు అనుబంధం.)
2. రేనాల్డ్స్ న్యూస్ పేపర్, జనవరి, 1866 - ఇదే పత్రిక "ఫియర్‌ఫుల్ అండ్ ఫేటల్ యాక్సిడెంట్స్", "అప్పాలింగ్ ట్రాజెడీస్" వగైరా సంచలనాత్మక శీర్షికలతో ప్రతి వారం రైల్వే ప్రమాదాల కొత్త జాబితా నొకదాన్ని ఇస్తుంది. దీనిపైన నార్త్ స్టఫర్డ్ షైర్ లైనులో పనిచేసే ఒక ఉద్యోగి ఇలా వ్యాఖ్యానించాడు : "రైలింజన్ డ్రైవరూ, ఫైర్‌మాన్ నిరంతరం అప్రమత్తంగా ఉండకపోతే వచ్చే పర్యవసానాలు ప్రతీ ఒక్కరికీ తెలుసు. 29, 30 గంటలపాటు చలిలో, గాలిలో విరామం లేకుండా అటువంటి పనిలో ఉన్న మనిషి నుంచి అటువంటి అప్రమత్తతను ఎలా ఆశించగలం? ఈ క్రింది ఉదాహరణ తరచుగా జరుగుతూ ఉండేదే. ఒక ఫైర్‌మాన్ సోమవారం ఉదయం చాలా పెందళకాడే పని మొదలుపెట్టాడు. రోజు పని అనబడే దాన్ని పూర్తిచేసే సమయానికి అతను 14 గంటల 50 నిమిషాల పాటు డ్యూటీ చేశాడు. అతను టీ తాగే వ్యవధి కూడా లేకుండా మళ్ళీ అతన్ని డ్యూటీలోకి పిల్చారు. రెండోసారి పూర్తయ్యేసరికి అతను మరో 14 గంటల 25 నిమిషాలు డ్యూటీ చేశాడు. అంటే మొత్తం విరామం లేకుండా 29 గంటల 15 నిమిషాలు. వారంలో

కనిపించే అన్ని రకాల, వయసుల స్త్రీ పురుష కార్మికుల గుంపుల ముఖాలపై ఉన్న అధిక పని భారం యొక్క ముద్రను, వారి చంకల్లో ఉన్న బ్లూ బుక్స్‌ను చదవకుండానే, చూడగానే గమనించవచ్చు. పెట్టుబడి ముందు మనుషులంతా, దొరసానుల ఉడుపులు కుట్టే స్త్రీ అయినా, కమ్మరి అయినా ఒకటే అనే విషయాన్ని కళ్ళకు కట్టినట్టు కనిపించే తమ వైవిధ్యంతో రుజువు చేసే ఇద్దరు వ్యక్తుల్ని వారిలో నుండి తీసుకుందాం.

"కేవలం అధిక పని భారం వల్ల మరణం" అనే "సంచలనాత్మక" శీర్షికతో 1863 జూన్ ఆఖరి వారంలో లండన్ పత్రికలన్నీ ఒక పేరాగ్రాఫును ప్రచురించాయి. దొరసానుల ఉడుపులు కుట్టే మేరీ ఆన్ వాక్లీ అనే 20 ఏళ్ళ బాలిక మరణ వార్త అది. ఆమె అత్యంత గౌరవనీయమైన ఒక ఉడుపులు తయారు చేసే సంస్థలో పనికి కుదిరింది. ఆ సంస్థను దోపిడీ చేసే వ్యక్తి ఎలిజె అనే అందమైన పేరు గల వనిత. తరచుగా విన్న పాత కథే ఇక్కడ పునశ్చరణ చేయబడింది.[1] ఈ బాలిక రోజుకు సగటున $16\frac{1}{2}$ గంటలు పని చేసింది. సీజన్‌లో అయితే విరామం లేకుండా, అడుగంటే ఆమె శ్రమ శక్తిని అప్పుడప్పుడూ షెర్రీ, పోర్ట్ లేదా కాఫీ సరఫరాలతో తిరిగి కూడగట్టుకుని తరచుగా 30 గంటలపాటు పని చేసేది. ఇప్పుడు సీజన్ బాగా జోరుగా ఉంది. కొత్తగా దిగుమతి అయిన వేల్స్ యువరాణి గౌరవార్థం జరుగబోయే నృత్యాలకు సిద్ధమైన ప్రభువర్గపు స్త్రీల తళతళలాడే ఉడుపుల్ని రెప్పపాటు కాలంలో సృష్టించడం అవసరమైంది. మేరీ ఆన్ వాక్లీ విరామం లేకుండా మరో 60 మంది బాలికలతో, ఒక గదిలో 30 మందితో కలిసి $26\frac{1}{2}$ గంటలు ఏకబిగిన పని చేసింది. ఆ గదిలో వారి కవసరమైన గాలిలో $\frac{1}{3}$ వంతు మాత్రమే ఉంది. పడక గదిని చెక్కలతో విభజించి తయారుచేసిన ఊపిరాడని ఇరుకు బొక్కల్లో రాత్రిపూట ఇద్దరిద్దరు కలిసి పడుకుంటారు.[2] లండన్‌లో ఉడుపులు తయారుచేసే అత్యుత్తమ సంస్థల్లో ఇది ఒకటి. మేరీ ఆన్ వాక్లీ శుక్రవారం నాడు జబ్బుపడి, దాం ఎలిజెకి ఆశ్చర్యకరంగా చేతిలోని పని పూర్తి చేయకుండానే, ఆదివారం నాడు చనిపోయింది.

---

మిగిలిన రోజుల పని ఇలా ఉంది : బుధవారం 15 గంటలు, గురువారం 15 గంటల 35 నిమిషాలూ, శుక్రవారం $14\frac{1}{2}$ గంటలు, శనివారం 14 గంటల 10 నిమిషాలూ అంటే మొత్తం వారానికి 88 గంటల 40 నిమిషాలు అయ్యాయి. అయితే ఆ మొత్తానికి కలిపి కేవలం $6\frac{1}{4}$ రోజులకు మాత్రమే వేతనం చెల్లించబడినప్పుడు అతని ఆశ్చర్యాన్ని ఊహించండి. ఏదో పొరపాటుగా జరిగిందనుకుని అతడు టైమ్ కీపర్‌కు నివేదించుకున్నాడు ... ఒక రోజు పని అని వారు దేన్ని పరిగణిస్తారో దర్యాప్తు చేశాడు. గూడ్స్ పని వాడికి 13 గంటలు (అంటే 78 గంటలు) అనే సమాధానం వచ్చింది... దాని మీదట అతడు తాను 78 గంటలకు పైన చేసిన పనికి వేతనం అడిగాడు. కాని తిరస్కారం ఎదురయింది. ఏమయినప్పటికీ, చివరికి వారు అతనికి మరో 10 పెన్నీలు ఇస్తామని చెప్పారు." ఫిబ్రవరి 4, 1866.

1. చూ. ఎఫ్. ఏంగెల్స్, అదే గ్రంథం, పుట 253-254.
2. బోర్డ్ ఆఫ్ హెల్త్ కన్సల్టింగ్ ఫిజిషియన్ డా॥ లేత్‌బి ఇలా ప్రకటించాడు : "ప్రతి వయోజనుడికీ కావలసిన గాలి కనీస పరిమాణం నిద్రపోయే గదిలో 300, నివసించే గదిలో 500 ఘన అడుగులు." లండన్‌లో ఆస్పత్రులలో ఒకదానికి సీనియర్ ఫిజిషియన్ అయిన డా॥ రిచర్డ్సన్ : "దొరసానుల ఉడుపులు తయారుచేసే స్త్రీలు, డ్రెస్ మేకర్లు, ఆడ దర్జీలతో సహా సూదితో పనిచేసే అన్ని రకాల స్త్రీలకు మూడు దౌర్భాగ్యాలున్నాయి. అధిక పని, గాలి లోపం, ఆహార లోపం లేదా అజీర్తి ... సూది పని ప్రధానంగా ... పురుషుల కంటే స్త్రీలకు పూర్తిగా పొసుగుతుంది. అయితే ఈ వాణిజ్యంలో ఉన్న వంచన ఏమంటే ముఖ్యంగా లండన్‌లో 26 మంది పెట్టుబడిదారులకు దీనిపై గుత్తాధిపత్యం ఉంది. పెట్టుబడి ఇచ్చే

మృత్యుశయ్య దగ్గరికి డాక్టర్ కీస్‌ని ఆలస్యంగా పిలిచారు. ఆయన మరణ కారణాన్ని విచారించే జ్యూరీ ముందు ఇలా కచ్చితమైన సాక్ష్యం చెప్పాడు : "చాలామంది ఉన్న పని గదిలో ఎక్కువ గంటలపాటు అధికంగా పనిచేయడం వల్ల, గాలి సరిగ్గా ఆడని అతి చిన్న పడక గది వల్ల మేరీ ఆన్ వాక్లీ మరణించింది." డాక్టరు గారికి మంచి నడవడికలో గుణపాఠం చెప్పడం కోసం ఆ జ్యూరీ ఇలా తీర్పు చెప్పింది : "చనిపోయిన వ్యక్తి సన్నిపాతం వల్ల చనిపోయింది. అయితే ఎక్కువమంది ఉన్న పని గదిలో అధికంగా పని చేయటం వల్ల ఆమె చావు త్వరితమయిందని అనుకోటానికి కారణం ఉంది. స్వేచ్ఛా వ్యాపారులు కోబ్డన్ అండ్ బ్రైట్‌కి చెందిన మార్నింగ్ స్టార్ అనే పత్రిక ఇలా కేక పెట్టింది. "సమాధికి చేరేదాకా శ్రమ చేసే మన తెల్ల బానిసలు చాలా వరకు మౌనంగా కృశించి నశించి పోతారు.[1]

---

సదుపాయాల బలంతో వారు శ్రమ నుండి పొదుపును బలవంతంగా రాబట్టటానికి పెట్టుబడిని రంగంలోకి తెస్తారు. ఈ శక్తి మొత్తం వర్గంపై తన ప్రభావాన్ని కలిగిస్తుంది. పోటీ ఎలా ఉందంటే, ఒక డ్రస్ మేకర్‌కు ఒక చిన్న కష్టమర్ల బృందం దొరికితే తన ఇంటిలో బతికుండాలంటే చచ్చేంతవరకూ పని చేయాల్సిందే. ఇదే అధిక పనిని ఆమె తన సహాయకురాలిపైన కూడా రుద్దాల్సి ఉంటుంది. అటువంటి బృందాన్ని సంపాదించడంలో విఫలమయితే, లేదా స్వతంత్రంగా ప్రయత్నించకపోతే ఆమె ఒక సంస్థలో చేరాలి. అక్కడ ఆమె పని తక్కువగాదు, కాని ఆమె డబ్బు మాత్రం భద్రం. అటువంటి పరిస్థితిలో ఆమె కేవలం ఒక బానిస అవుతుంది. సమాజంలో వచ్చే మార్పులవల్ల కొట్టుకులాడుతూ, పని దొరకకపోతే ఇంట్లో ఒంటరి గదిలో పస్తులుంటూ లేదా అర్ధాకలితో, పని దొరికితే భరించ వీలులేని గాలిలో, ఒకవేళ భోజనం మంచిదే అయినా శుభ్రమైన గాలి లేనందున జీర్ణం కాజాలని తిండితో 24 గంటల్లోనూ 15, 16 లేదా 18 గంటలు సైతం పని చేయాలి. కేవలం చెడుగాలి వల్ల వచ్చే జబ్బు అయిన క్షయ రోగం ఈ బాధితులను తింటుంది." డా॥ రిచర్డ్‌సన్ : 1863 జులై 18వ తేదీ "సోషల్ సైన్స్ రివ్యూ"లో "వర్క్ అండ్ ఓవర్ వర్క్"లో.

1. మార్నింగ్ స్టార్, జూన్ 23, 1863. బ్రైట్ వగైరాలకు వ్యతిరేకంగా అమెరికా బానిస యజమానుల్ని సమర్ధించడానికి ది టైమ్స్ ఈ పరిస్థితిని వినియోగించుకుంది. "బలవంతంగా పని చేయించే సాధనంగా కొరడా ఝుళిపింపుకు బదులు ఆకలి అనే కొరడానుపయోగించి మనం మన యువతులతో చచ్చేలా పని చేయిస్తూనే, బానిస యజమానులుగా పుట్టీ, కనీసం తమ బానిసలకు బాగా తిండి పెడుతూ వారితో తక్కువ పని చేయించే కుటుంబాలపైన అగ్నినీ, హత్యాకాండనూ కురిపించడానికి మనకు హక్కు లేదని మనలో చాలామంది భావిస్తారు." అని 1863 జులై 2వ తేదీ సంపాదకీయం అంది. అదే విధంగా ది స్టాండర్డ్ అనే టోరీ పత్రిక రెవ. న్యూమాన్ హాల్‌ను తప్పుపట్టింది : "ఆయన బానిస యజమానులను వెలివేశాడు. అయితే, ఏ పశ్చాత్తాపమూ లేకుండా, అతి హీనమైన జీతాలిచ్చి తమ లండన్ డ్రైవర్లతోనూ, కండక్టర్లతోనూ రోజుకు 16 గంటలు పని చేయించుకునే పెద్దమనుషులతో కలిసి మాత్రం ఆయన ప్రార్థనలు చేస్తాడు." ఆఖరికి దైవవాణి వినిపించింది. థామస్ కార్లైల్ పలికాడు. ఎవరి గురించి నేను 1850లో "మేధా పూజలో మేధ సాతాను దగ్గరికి పోయింది, ఇక ఆ మేధ యొక్క పూజ మిగిలింది." అన్న వ్యాసంలో రాశానో ఆ కార్లైల్ ఒక చిన్న సామ్యంతో సమకాలీన చరిత్రలో ఒక గొప్ప ఘటన అయిన అమెరికా అంతర్యుద్ధాన్ని ఇలా కొట్టిపారేశాడు. ఉత్తరాది పీటర్ తన శక్తి అంతటితో దక్షిణాది పాల్ బుర్ర బద్దలు కొట్టాలనుకుంటాడు. ఎందుకంటే ఉత్తరాది పీటర్ శ్రమను ఒక రోజుకు కొనుక్కుంటాడు కాగా దక్షిణాది పాల్ శ్రమను దాని జీవితాంతం కొంటాడు గనుక. (Macmillan's Magazine" Ilias Americana in nuce. ఆగస్టు, 1863) నగర కార్మికుల ఎడల - గ్రామీణ కార్మికుల ఎడల ఏమాత్రం కాదు - టోరీ సానుభూతి బుడగ ఆఖరికి ఆ రకంగా పగిలిపోయింది. దీనంతటి సారాంశం బానిసత్వం!

చచ్చేటట్లు పని చేయించుకోవడం అన్నది కేవలం డ్రెస్ మేకర్స్ గదుల్లో మాత్రమే మామూలు వ్యవహారం కాదు. ఇంకా వెయ్యిచోట్ల కూడా ఇదే పరిస్థితి. వర్ధిల్లే వ్యాపారం ఉన్న ప్రతిచోటా ఇంతే అని నేను దాదాపు చెప్పాను ... మనం కమ్మరిని నమూనాగా తీసుకొందాము. కవులు చెప్పింది నిజమే అయితే కమ్మరి అంత ఆరోగ్యంగా, అతనంత ఆనందంగా మరొకరుండరు. అతడు పెందరాళే లేస్తాడు. సూర్యుడి కంటే ముందే మిణుగురు లెగిరేటట్లు సమ్మెటతో కొడతాడు. అందరి కంటే చక్కగా అతను తింటాడు, తాగుతాడు, నిద్రిస్తాడు. మితంగా పని చేస్తూ శారీరకంగా చెప్పాలంటే నిజంగా అతడు ఉత్తమ మానవ స్థితిలో ఉంటాడు. అయితే మనం అతని వెంట నగరానికో, పట్టణానికో వెళదాం. ఆ బలవంతుడు మీద పని భారాన్ని మనం గమనిస్తాము. ఇక తన దేశంలో మరణాల రేటులో అతని స్థానం ఏమిటి? మారిల్‌బోన్‌లో కమ్మరులు ఏడాదికి వెయ్యి మందికి 31 మంది చొప్పున చనిపోతారు. లేదా మొత్తంగా తన దేశంలోని వయోజనులైన పురుషుల సగటు రేటు కంటే 11 ఎక్కువ. మానవ కళలో దాదాపు ఒక భాగంగా సద్యోజనితమూ, మానవ పరిశ్రమలో ఒక విభాగంగా నిరభ్యంతరకరమూ అయిన ఈ వృత్తి కేవలం అతి పని వల్ల మానవ వినాశకంగా మార్చబడింది. అతడు రోజుకు ఇన్ని దెబ్బలు కొట్టగలడు, ఇన్ని అంగలు వేయగలడు, ఇన్నిసార్లు శ్వాస తీసుకోగలడు, ఇంత పని చేయగలడు, అప్పుడు సగటున యాభయి ఏళ్ళు బతుకుతాడనుకుందాం. రోజుకు మరికొన్ని దెబ్బలు కొట్టేలా, మరికొన్ని అంగలు నడిచేలా, మరికొన్నిసార్లు శ్వాస తీసుకునేలా, అతని జీవితాన్ని మొత్తంగా నాలుగోవంతు పెంచేలా చేయబడ్డాడనుకుందాం. అతడు దాన్ని సాధిస్తాడు. ఫలితం ఏమంటే ఒక పరిమిత కాలంలో నాలుగో వంతు పని ఎక్కువ చేసి 50వ ఏట చనిపోవలసిన వాడు 37వ ఏట చనిపోతాడు."[1]

## విభాగం-4

## రాత్రి పనీ, పగటి పనీ, రిలే పద్ధతి

అదనపు విలువ సృష్టి అనే దృష్టి నుంచి పరిశీలిస్తే స్థిర పెట్టుబడి, ఉత్పత్తి సాధనాలు కేవలం శ్రమనూ, ప్రతి శ్రమ బిందువుతో పాటు దానికి తగిన నిష్పత్తిలో అదనపు శ్రమను పీల్చుకోడానికే ఉంటాయి. అలా చేయడంలో అవి విఫలమైనప్పుడు కేవలం వాటి అస్తిత్వమే పెట్టుబడిదారునికి ఒక సాపేక్ష నష్టం కలిగిస్తుంది. ఎందుకంటే అవి ఖాళీగా పడివున్న కాలంలో పెట్టుబడి యొక్క నిరుపయోగమైన అడ్వాన్సును వ్యక్తం చేస్తాయి. వాటిని పనిలో పెట్టడంలో జరిగే ఈ విరామం పని పునఃప్రారంభమైనప్పుడు అదనపు పెట్టుబడి అవసరమయ్యేలా చేస్తే ఈ నష్టం రూఢమూ, నిరపేక్షమూ అవుతుంది. పనిదినాన్ని సహజమైన దినం యొక్క పరిమితుల్ని దాటి రాత్రిలోకి పొడిగించటం అనేది కేవలం ఉపశమనంగా మాత్రమే వ్యవహరిస్తుంది. శ్రమ యొక్క సజీవ రక్తం కోసం రక్తపిశాచి దాహాన్ని కొద్ది మోతాదులో మాత్రమే తీరుస్తుంది. కనుక రోజులో ఉండే మొత్తం 24 గంటలూ శ్రమను స్వాహా చేయటం అనేది పెట్టుబడిదారీ ఉత్పత్తిలో అంతర్నిహితంగా ఉన్న ధోరణి. అయితే ఒకే శ్రమ శక్తిని నిరంతరాయంగా రాత్రింబగళ్ళు వినియోగించుకోవడమన్నది భౌతికంగా అసాధ్యం

1. డా॥ రిచర్డ్సన్, అదే నివేదిక.

కనుక ఈ భౌతిక అడ్డంకిని అధిగమించటానికి, పగటి కార్మికులనూ, రాత్రి కార్మికులనూ మార్చి మార్చి వినియోగించుకోవడం అవసరమవుతుంది. ఈ మార్పును అనేక రకాలుగా సాధించవచ్చు. ఉదాహరణకు, పనివారిలో కొందరిని ఒక వారం పగలూ తర్వాత వారం రాత్రీ పనిలో పెట్టేలా ఏర్పాటు చేసుకోవచ్చు. ఈ రిలే పద్ధతి, రెండు జట్టుల పనివాళ్ళను మార్చి మార్చి వినియోగించుకోవడం అనేది ఇంగ్లీషు జౌళి ఉత్పత్తి తన తరుణ వయస్సులో జోరుగా ఉన్నప్పుడూ, ఇప్పుడు ఇతర ప్రాంతాలతోపాటు మాస్కో జిల్లాలో దూది వడకటంలోనూ పూర్తి స్థాయిలో ఉందనేది అందరికీ తెలిసిందే. ఇంకా స్వేచ్ఛగానే ఉన్న గ్రేట్ బ్రిటన్ యొక్క అనేక పారిశ్రామిక శాఖల్లో, బ్లాస్టు ఫర్నేసులూ, ఫోర్జిలూ, ప్లేట్ రోలింగ్ మిల్లులూ ఇంగ్లండు, వేల్స్, స్కాట్లండుల్లోని తదితర లోహ పరిశ్రమల్లోనూ ఈ 24 గంటల ఉత్పత్తి ప్రక్రియ ఇవ్వాళ కూడా ఒక పద్ధతిగా ఉంది. ఇక్కడ 6 పనిదినాల 24 గంటలతోపాటు ఆదివారం యొక్క 24 గంటల్లో అధిక భాగం పని కాలంలో భాగమవుతుంది. పనివారిలో స్త్రీలూ, పురుషులూ, ఆడ మగ పిల్లలూ ఉంటారు. పిల్లలూ, కౌమార వయస్కులూ 8 నుండి (కొన్ని సందర్భాల్లో 6 నుండి) 18 ఏళ్ళ వరకూ అన్ని వయస్సుల్లోనూ ఉంటారు.[1]

కొన్ని పారిశ్రామిక శాఖలలో రాత్రిళ్ళూ పురుషులతోపాటు బాలికలూ, స్త్రీలూ కూడా పని చేస్తారు.[2] మామూలుగా రాత్రి శ్రమ యొక్క హానికరమైన ప్రభావాన్ని అటుంచి[3] 24 గంటలూ

1. చిల్డ్రన్స్ ఎంప్లాయ్‌మెంట్ కమిషన్ మూడో నివేదిక, లండన్, 1864.
2. "స్టఫర్డ్ షైర్‌లోనూ, సౌత్‌వేల్స్‌లోనూ బొగ్గు పాతర్లపైనా, కుప్పలపైనా పగటిపూటే కాక రాత్రిళ్ళు కూడా బాలికలనూ, స్త్రీలనూ పనిలో పెడతారు. ఈ ఆచరణతో అనేక పెద్ద, ఘోరమైన కీడులు జరుగుతున్నాయని, పార్లమెంటుకు సమర్పించబడిన నివేదికల్లో తరచుగా గమనించబడింది. మగవారితోపాటు పనిలో పెట్టబడిన ఈ స్త్రీలు మురికి, పొగలతో మసిబారిన దుస్తుల్లో మగవారి కంటే భిన్నంగా కనిపించరు. వారి ఈ స్త్రీ సహజం కాని వృత్తి కారణంగా ఆత్మ గౌరవం కోల్పోయి నైతిక పతనానికి గురవుతారు." (అదే నివేదిక, చూ. నాలుగో నివేదిక, 1865) గ్లాస్ వర్క్సులో కూడా అంతే.
3. పిల్లల్ని రాత్రిపూట పనిలో పెట్టే ఒక ఉక్కు పరిశ్రమ యజమాని ఇలా అన్నాడు : రాత్రిపూట పని చేసే పిల్లలు పగలు నిద్రపోలేరు, సరైన విశ్రాంతి తీసుకోలేరు, అటూ ఇటూ పరుగులు పెడుతుంటారు అన్నది సహజమే అనిపిస్తుంది. (నాలుగో నివేదిక) శారీరక పెరుగుదలలోనూ, దానిని కాపాడుకోవటంలోనూ సూర్యరశ్మికి గల ప్రాధాన్యం గురించి ఒక ఫిజీషియన్ ఇలా రాశాడు : కాంతి శరీరంలోని టిష్యూలను గట్టిపరచి వాటి స్థితిస్థాపక శక్తిని బలపరుస్తుంది. తగిన మోతాదులో కాంతి లభించనప్పుడు జంతువుల కండరాలు మెత్తబడతాయి. వాటి స్థితి స్థాపక శక్తి పోతుంది. సరైన ప్రేరణలేక నరాల బలం తన క్రమం తప్పుతుంది. పెరుగుదల మొత్తం మొక్కబోతుంది... పిల్లల విషయంలో పగటిపూట ఎప్పుడూ కాంతి విస్తారంగా అందుబాటులో ఉండాలి. కొంతసేపైనా సూర్యకిరణాలు వంటిని తాకాలి. ఆరోగ్యానికి ఇది అత్యంత అవసరం. మంచి రక్తాన్ని అభివృద్ధి చేయడంలో కాంతి తోడ్పడుతుంది. నరం ఏర్పడ్డాక దాన్ని గట్టిపరుస్తుంది. దృష్టికి సంబంధించిన అవయవాలపైన కూడా అది ప్రేరణగా వ్యవహరిస్తుంది. దీని ద్వారా మెదడుకు సంబంధించిన వివిధ క్రియల్లో మరింత చురుకుదనాన్ని తెస్తుంది. "డా॥ డబ్ల్యుస్ట్రేంజ్, వోర్‌సెస్టర్ జనరల్ హాస్పిటల్‌లో సీనియర్ ఫిజీషియన్. "ఆరోగ్యం" (1864) గురించి ఆయన రాసిన పుస్తకం నుండి పై విషయం తీసుకోబడింది. కమిషనర్లలో ఒకరైన వైట్‌కు ఆయన రాసిన లేఖలో ఇలా ఉంది : "ఇంతకు ముందు నేను లాంక్‌షైర్‌లో ఉన్నప్పుడు పిల్లల మీద రాత్రి పని కలిగించే ప్రభావాన్ని గమనించే అవకాశాలు దొరికాయి. కొంతమంది యజమానులు చెప్పటానికి ఉవ్విళ్లూరే విషయాలకు విరుద్ధంగా, రాత్రి పనికి గురైన పిల్లలు అనారోగ్యంతో బాధపడ్డారని చెప్పటానికి నేను సంకోచించను."

విరామం లేకుండా జరిగే ఉత్పత్తి ప్రక్రియ అనేది మామూలు పనిదినం పరిమితుల్ని అధిగమించడానికి మంచి అవకాశాల నిస్తుంది. ఉదాహరణకు, ఇంతకు ముందే పేర్కొనబడిన, అమితంగా అలసట కలిగించే పారిశ్రామిక శాఖల్లో, అధికారిక పనిదినం అంటే ప్రతి కార్మికునికి పగలుగాని, రాత్రిగాని మామూలుగా 12 గంటలు ఈ పరిమాణానికి మించిన అధికపని చాలా సందర్భాల్లో ఇంగ్లీషు అధికారిక నివేదిక మాటల్లో చెప్పాలంటే "నిజంగా భయంకరం."[1]

"ఈ కింది ఖండికల్లో వివరించినట్టుగా 9–12 ఏళ్ళ వయసు గల పిల్లలు అంత పనిని చేస్తున్నారనే విషయాన్ని ఎవరు గుర్తించినా ... తల్లిదండ్రుల, యజమానుల అధికార దుర్వినియోగాన్ని ఇక ఏమాత్రం ఉండనివ్వరాదనే అనివార్యమైన నిర్ధారణకు రాకుండా ఉండడం అసాధ్యం" అని నివేదిక కొనసాగింది.[2]

"వంతుల వారీగా పగలూ రాత్రీ పనిచేసే బాలల ఆచరణ, మామూలు పని క్రమంలో లేదా ఒత్తిడి రోజుల్లో అసమంజసమైనన్ని ఎక్కువ గంటలపాటు తరచుగా వారు పని చేయడానికి ద్వారాలు తెరుస్తుంది. నిజానికి కొన్ని సందర్భాలలో ఇవి క్రూరమే గాక నమ్మశక్యంగానన్ని ఎక్కువ గంటలు అనేక మంది బాలల్లో ఏదో ఒక కారణం వల్ల ఒకరో కొందరో బాలురు గైరుహాజరవడం అనేది అరుదు కాదు. ఇలా జరిగినప్పుడు వారికి బదులుగా వేరే వంతులో పనిచేసే బాలురు వారి స్థానంలో పని చేస్తారు. ఇది అందరికీ తెలిసిన పద్ధతే అనేది స్పష్టం .... తమ వంతులో హాజరు కాని బాలుర పనిని ఎవరు చేస్తారు అని నేనడిగినప్పుడు, ఒక రోలింగ్ మిల్లు మేనేజరు "అయ్యా, ఆ సంగతి మీకూ తెలుసు, నాకూ తెలుసు" అని నిజాన్ని అంగీకరించాడు.[3]

"ఉదయం 6 గంటల నుండి సాయంత్రం $5\frac{1}{2}$ గంటల వరకూ పని ఉండాల్సిన ఒక రోలింగ్ మిల్లులో ఒక బాలుడు ప్రతి వారం నాలుగు రోజులు రాత్రి కనీసం $8\frac{1}{2}$ గంటల దాకా పని చేశాడు. ఇది ఆరు నెలలుపాటు సాగింది. మరో తొమ్మిదేళ్ళ బాలుడు వరస మూడు 12 గంటల షిఫ్టుల్లో పని చేశాడు. పదేళ్ళప్పుడు వరసగా రెండు పగళ్ళూ రెండు రాత్రులూ పని చేశాడు." "ఇప్పుడు పదేళ్ళున్న మూడో బాలుడు ... వారంలో మూడు రోజులు ఉదయం 6 గంటల నుండి రాత్రి 12 గంటల వరకూ, మూడు రోజులు రాత్రి 9 గంటల వరకూ పని చేశాడు..." "ఇప్పుడు 13 ఏళ్ళున్న మరో బాలుడు సాయంత్రం 6 గంటల నుంచి రెండో రోజు మధ్యాహ్నం 12 గంటల దాకా ఒక వారంపాటు, కొన్నిసార్లు మూడు షిఫ్టుల్ని కలిపి, అనగా సోమవారం ఉదయం లగాయతూ మంగళవారం రాత్రి దాకా పని చేశాడు. ఇప్పుడు 12 ఏళ్ళున్న ఒక బాలుడు స్టాన్లీలోని ఇనుము ఫౌండ్రిలో ఒక పక్షం రోజులపాటు ఉదయం 6 గంటల నుండి రాత్రి 12 గంటల దాకా పని చేశాడు. ఆపైన ఇక ఏ మాత్రం చేయలేకపోయాడు." "9 ఏళ్ళ జార్జి అల్సిన్ వర్త్ గత శుక్రవారం నేలమాళిగలో పని చేయడానికి వచ్చాడు. రెండో రోజు ఉదయం మేము 3 గంటలకే మొదలుపెట్టాలి.

ఇటువంటి సమస్య తీవ్ర వాద, వివాదాలకు విషయ సామాగ్రిని సమకూర్చిందీ అనేది, పెట్టుబడిదారీ ఉత్పత్తి పెట్టుబడిదారుల, వారి భృత్యుల మెదడుకు సంబంధించిన క్రియలపైన ఎలా పని చేస్తుందో తెలుపుతుంది.

1. అదే నివేదిక.
2. నాలుగో నివేదిక (1865)
3. అదే నివేదిక.

కనుక రాత్రంతా నేనిక్కడే ఆగిపోయాను. మా ఇల్లు ఐదు మైళ్ళ దూరంలో ఉన్నది. ఫర్నేసు నేలమీద నిద్రపోయాను. నాకింద ఒక చిన్న బట్టా, పైన ఒక చిన్న చొక్కాలాంటిది. మిగిలిన రెండో రోజులూ ఉదయం 6 గంటలకే ఇక్కడ ఉన్నాను. అబ్బా ఇక్కడ వేడి. ఇక్కడకు రాకముందు ఇదే పనిని ఒక ఏడాదిపాటు మరోచోట చేశాను. అక్కడ కూడా శనివారం ఉదయం 3 గంటలకే పని మొదలు పెట్టేవాడిని. అయితే అది ఇంటికి చాలా దగ్గర. ఇంటిలో నిద్రపోగలిగేవాణ్ణి. ఇతర రోజులు నేను ఉదయం 6 గంటలకు ప్రారంభించి సాయంత్రం 6 లేదా 7 దాకా పనిచేసేవాణ్ణి."[1]

1. ఈ 'శ్రమశక్తుల' సాంస్కృతిక స్థాయి సహజంగానే ఒక కమిషనర్‌తో జరిగిన సంభాషణల్లో కన్పించినట్టుగానే ఉండి ఉండాలి. జరమయ్ హేన్స్, వయసు 12 - నాలుగుకు రెట్టింపు 8. నాలుగు నాలుగులు 16. రాజు అంటే మొత్తం డబ్బూ, బంగారమూ ఉన్నవాడు. మనకు రాజు ఉన్నాడు. (రాణి అని చెప్పబడింది) ఆమెని అలగ్జాండ్రా రాకుమార్తె అని పిలుస్తారు. ఆమె రాణిగారి కుమారుణ్ణి పెళ్ళాడింది అని చెప్పబడింది. రాణిగారి కొడుకు అలగ్జాండ్రా రాకుమార్తె. రాకుమార్తె అంటే మగాడు." విలియమ్ టర్నర్, వయసు '12-' "ఇంగ్లండులో నివసించటం లేదు. అది ఒక దేశమనుకుంటాను. ఇంతకు ముందు తెలియదు." "జాన్ మారిస్, వయసు 14-" దేవుడు ప్రపంచాన్ని చేశాడు. ఒకటి తప్ప అందరూ మునిగిపోయారు అని చెప్పగా విన్నాను. ఒకటే ఒక చిన్న పిట్ట అని విన్నాను." విలియమ్ స్మిత్, వయసు 15- "దేవుడు మగాడిని చేశాడు. మగాడు ఆడదాన్ని చేశాడు." ఎడ్వర్డ్ టేలర్, వయసు 15- "లండన్ గురించి తెలియదు." హెన్రి మాత్యూమన్, వయసు 17- "చర్చికి వెళ్ళాను. ఈ మధ్య చాలాసార్లు వెళ్ళలేకపోయాను. వారు బోధించే ఒక పేరు ఏసుక్రీస్తు. అయితే నేనింకెవరి గురించీ చెప్పలేను. అతని గురించి ఇంకేమీ చెప్పలేను. అతన్ని చంపలేదు. మిగతావాళ్ళలాగే చచ్చిపోయాడు. కొన్ని విషయాల్లో తతిమ్మా వాళ్ళలాంటి వాడు కాదు. అతను కొన్ని రకాలుగా మతం మనిషి - తతిమ్మా వాళ్ళు అలా కాదు. (అదే నివేదిక) "సాతాను మంచివాడు, ఎక్కడుంటాడో నాకుతెలియదు." "క్రీస్తు దుర్మార్గుడు." ఈ బాలిక గాడ్‌ను డాగ్ అని ఉచ్చరించింది. రాణి పేరు తెలియదు." (చిల్డ్రన్స్ ఎంప్లాయ్‌మెంట్ కమిషన్, ఐదో నివేదిక, 1866) ఇంతకు ముందు పేర్కొన్న లోహ పరిశ్రమల్లో లాగానే గాజు, కాగితం పరిశ్రమల్లో ఇదే పద్ధతి ఉంది. యంత్రంతో కాగితం తయారయ్యే పేపరు ఫ్యాక్టరీల్లో ర్యాగ్ పార్టింగ్ తప్ప తతిమ్మా అన్ని ప్రక్రియల్లోనూ రాత్రి పని సాధారణంగా ఉంటుంది. కొన్ని సందర్భాల్లో రిలేల ద్వారా వారం అంతా ఎడతెరిపి లేకుండా, మామూలుగా ఆదివారం రాత్రి నుండి శనివారం అర్ధరాత్రి వరకూ రాత్రి పని నిర్వహించబడుతుంది. పగలు పని చేసేవారు వారంలో 5 రోజులపాటు 12 గంటల చొప్పున, ఒక రోజు 18 గంటలూ పని చేస్తారు. రాత్రి పని చేసేవారు 5 రాత్రులు 12 గంటల చొప్పున, 1 రాత్రి 6 గంటలు పని చేస్తారు. మరో పద్ధతిలో ప్రతి జట్టూ రోజు విడిచి రోజు 24 గంటలు పని చేస్తారు. ఒక జట్టు 24 గంటలు పూర్తి చేయడానికి సోమవారం 6 గంటలూ, శనివారం 18 గంటలూ పని చేస్తుంది. వేరేచోట్ల ఒక మధ్యంతర పద్ధతి వాడుకలో ఉంది. దీని ప్రకారం కాగితం తయారు చేసే యంత్రాల దగ్గర పని చేసేవారంతా వారంలో ప్రతి రోజు 15, 16 గంటలు పని చేస్తారు. ఈ పద్ధతి "12 గంటల 24 గంటల రిలేలలో ఉన్న చెడు అంశాలన్నిటిని కలిపి కలిగి ఉన్నట్టుంది" అని కమిషనర్ లార్డ్ అన్నాడు. 13 ఏళ్ళలోపు పిల్లలూ, 18 ఏళ్ళలోపు వాళ్ళూ, స్త్రీలూ ఈ రాత్రి పద్ధతిలో పని చేస్తారు. తమ పని ముగిశాక తమ స్థానంలోకి రావలసిన వారు కొన్నిసార్లు రాకపోవడం వల్ల 12 గంటల పద్ధతిలో వారు 24 గంటలపాటు రెండు విడతల పని చేయాల్సి వస్తుంది. బాలబాలికలు చాలా తరచుగా ఓవర్‌టైమ్ పని చేయాల్సి వస్తుంది. అది కొన్నిసార్లు 24 గంటల 36 గంటల శ్రమ నిర్విఘ్నంగా చేయాల్సి వస్తుంది. నిరంతరాయమైన వైవిధ్యం లేని మెరుగుపెట్టే ప్రక్రియలో 12 ఏళ్ళ బాలికలు నెలంతా రోజుకు 14 గంటలపాటు పని చేయడం కనిపిస్తుంది. "భోజనానికి అర్ధగంట చొప్పున 2 లేదా 3సార్లకు మించి శ్రమ విరామం గాని, పని నిలుపుదల గాని ఉండదు."

ఈ 24 గంటల పద్ధతిని స్వయంగా పెట్టుబడి ఎలా పరిగణిస్తుందో చూద్దాం. ఈ పద్ధతిలో ఉన్న మితిమీరిన రూపాలూ, పనిదినాన్ని "క్రూరంగా, నమ్మశక్యం కానంతగా" సాగలాగి దుర్వినియోగం చేయడమూ సహజంగానే మౌనంగా దాటవేయబడతాయి. ఈ పద్ధతి గురించి దాని "మామూలు" రూపంలో మాత్రమే పెట్టుబడి మాట్లాడుతుంది.

మెస్సర్స్ నేలర్ అండ్ వికర్స్ ఉక్కు పరిశ్రమలో 600 మంది నుండి 700 మంది దాకా పని చేస్తారు. వారిలో 10 శాతం మంది మాత్రమే 18 ఏళ్ళలోపువారు. వారిలో 20 మంది బాలురు మాత్రమే రాత్రి జట్లలో పని చేస్తారు. ఆ పరిశ్రమ యజమానులు ఇలా అంటారు : "ఈ బాలురు వేడి వల్ల బాధపడరు. ఉష్ణోగ్రత బహుశా 86° నుండి 90° వరకూ ఉంటుంది... కొలుముల దగ్గరా, రోలింగ్ మిల్లుల దగ్గరా పనివాళ్ళు రిలే పద్ధతిలో రాత్రింబగళ్ళు పని చేస్తారు. పనిలో ఇతర భాగాలన్నింటి లోనూ పగటి పనే, ఉదయం 6 గంటల నుండి సాయంత్రం 6 గంటల దాకా. కొలిమి దగ్గర పని గంటలు 12 నుంచి 12 వరకూ. కొంతమంది పగలొకసారి రాత్రికసారి అని మారకుండా ఎప్పుడూ రాత్రిపూటే పని చేస్తారు. ఎప్పుడూ రాత్రిపూట పని చేసే వారికీ, ఎప్పుడూ పగటి పూట పని చేసే వారికీ మధ్య ఆరోగ్యాలలో మాకు తేడా ఏమీ కనిపించలేదు. విశ్రాంతి తీసుకునే వేళను మార్చినప్పుడు కంటే ఒకే వేళ ఉన్నప్పుడు బహుశా జనం బాగా నిద్రపోతారు. 18 ఏళ్ళలోపు బాలురు సుమారు 20 మంది రాత్రి జట్లలో పని చేస్తారు ... 18 ఏళ్ళలోపు పిల్లలు రాత్రిపూట పని చేయకుండా మాకు కుదరదు. ఉత్పత్తి వ్యయం పెరగటం అనేది మా అభ్యంతరం... తన ప్రతి విభాగంలోనూ నిపుణులైన కార్మికులు దొరకడం కష్టం. పిల్లలయితే ఎంతమందయినా దొరుకుతారు... అయితే మేము చాలా చిన్న నిష్పత్తిలో బాలుర్ని నియమిస్తాము కనుక ఈ విషయం (అనగా, రాత్రి పనిపై ఆంక్షలు) మాకు ప్రాముఖ్యమూ, ఆసక్తీ లేనిది."[1]

మెస్సర్స్ జాన్ బ్రౌన్ అండ్ క్లో, స్టీల్ అండ్ బరన్ వర్క్స్‌లో 3000 మంది పెద్ద కార్మికులూ, బాలురూ పని చేస్తారు. దానిలో కొన్ని పనులు, అనగా ఇనుముతోనూ, బరువైన ఉక్కుతోనూ చేసే పని రిలే పద్ధతిలో రాత్రింబగళ్ళు జరుగుతుంది. ఆ సంస్థ యజమానుల్లో ఒకరైన జె. ఎల్లిస్, "బరువైన ఉక్కు పనిలో ప్రతి 20 లేదా 40 మంది మనుషులకూ ఒకరిద్దరు బాలురు పనిలో పెట్టబడ్డార"ని చెప్పాడు. వారి సంస్థ 500 మందికి పైగా 18 ఏళ్ళలోపు బాలల్ని పనిలో పెడుతుంది. వారిలో 1/3వ వంతు మంది లేదా 170 మంది 13 ఏళ్ళలోపు వారు. చట్టంలో ప్రతిపాదిత మార్పుల గురించి ఎల్లిస్ ఇలా అన్నాడు : "18 ఏళ్ళలోపు వారెవరైనా 24 గంటలలో 12 గంటలకు మించి పని చేయరాదనడం చాలా ఆక్షేపణీయం అని నేను అనుకోవడం లేదు. అయితే 12 ఏళ్ళ వారిని రాత్రి పనిలో వినియోగించుకోరాదనే విషయంలో ఒక సరిహద్దు అనేది గీయవచ్చని మేము అనుకోము. 13 ఏళ్ళ లోపు బాలురను, చివరకు 14 ఏళ్ళ వయసు గల బాలురనైనా సరే, బొత్తిగా

---

రోజువారీ రాత్రి పనిని పూర్తిగా వదిలేసిన కొన్ని మిల్లుల్లో అధిక పని భయంకర స్థాయి వరకూ పోతుంది." అదీ తరచుగా వివిధ ప్రక్రియల్లో అత్యంత మురికిగా, అత్యంత వేడిగా, అత్యంత విసుగు కలిగించేవిగా ఉన్నవాటిలో" ("చిల్డ్రన్స్ ఎంప్లాయ్‌మెంట్ కమిషన్ నాలుగో నివేదిక, 1865").

1. నాలుగో నివేదిక, 1865, 79, పుట XVI.

వినియోగించుకోకూడదన్నా మాకు సమ్మతమే కానీ, మావద్ద పని చేసే బాలురను రాత్రి పూట వినియోగించుకోకూడదనేది మాకు సమ్మతం కాదు. పగటి జట్లలో పని చేసే బాలురు రాత్రి జట్లలో కూడా తమ వంతు తీసుకోవాలి. ఎందుకంటే పెద్దవాళ్ళు రాత్రి జట్లలో మాత్రమే పని చేయజాలరు. అది వారి ఆరోగ్యాన్ని నాశనం చేస్తుంది... ఏమయినప్పటికీ వారు విడిచి వారం రాత్రి పని అనేది హాని చేయదని మా అభిప్రాయం." (మరోపక్క మెసర్స్ నేలర్స్ అండ్ వికర్స్, వారి వ్యాపార ప్రయోజనాలకనుగుణంగా, నిరంతరం రాత్రి పని కంటే కొంత కాలం రాత్రి పని, కొంత కాలం పగలు పని చేయడం అనేది ఎక్కువ హాని చేయవచ్చని అనుకున్నారు.) "వారం విడిచి వారం ఈ పని చేసే మనుషులు కేవలం పగటిపూట మాత్రమే ఇతర పని చేసే వాళ్ళున్నంత ఆరోగ్యంగా ఉన్నారు... 18 ఏళ్ళలోపు బాలుర్ని రాత్రి పూట పని చేయనివ్వరాదనే దానికి మా అభ్యంతరం ఖర్చు పెరుగుతుందని మాత్రమే. ఇదొక్కటే కారణం. (ఎంత అమానుషమైన నిష్కాపట్యం!) వాణిజ్యం విజయవంతంగా నిర్వహించబడాలనే దృష్టి నుండి చూస్తే, ఈ ఖర్చుల పెరుగుదల వాణిజ్యం మొయ్యగలిగిన దానికంటే పెద్ద భారం అని మేము అనుకుంటున్నాము. (ఏమి మాయావి పదజాలం!) ఇక్కడ శ్రామికుల కొరత ఉంది. అటువంటి చట్టం వస్తే వారు చాలకపోవచ్చు." (ఎల్లిస్ బ్రౌన్ అండ్ కో వాళ్ళు శ్రమ శక్తికి దాని పూర్తి విలువ చెల్లించాల్సిన చచ్చే చిక్కులో పడవచ్చు.)[1]

పైన పేర్కొనబడిన జాన్ బ్రౌన్ అండ్ కో లాగానే "మెసర్స్ కామెల్ అండ్ కో కు చెందిన సైక్లోప్స్ స్టీల్ అండ్ ఐరన్ వర్క్స్ "కూడా అంతే పెద్ద స్థాయిలో నిర్వహించబడుతుంది." దాని మేనేజింగ్ డైరెక్టర్ ప్రభుత్వ కమిషనర్ వైట్‌కు రాతపూర్వకంగా తన సాక్ష్యం ఇచ్చాడు. ఆ రాత ప్రతిని సంస్కరించమని తిప్పి పంపగా దానిని దాచెయ్యడమే అనుకూలంగా ఉంటుందని అతను భావించాడు. అయితే వైట్‌కు మంచి జ్ఞాపకశక్తి ఉంది. సైక్లోప్స్ సంస్థ 18 ఏళ్ళలోపు బాలుర్ని ఆరు శాతానికి కొంచెం పైగానూ, 13 ఏళ్ళలోపు పిల్లల్ని ఒక శాతంలోపూ మాత్రమే పనిలో పెట్టుకొన్నప్పటికీ, పిల్లల్నీ, చిన్న వయసు వాళ్ళనూ రాత్రి పని చేయకుండా నిషేధించడం సైక్లోప్స్ దృష్టిలో "అసాధ్యం, అది పనిని ఆపేయడంతో సమానమవుతుంది", అన్న సంగతి ఆయనకు జ్ఞాపకం ఉంది.[2]

"18 ఏళ్ళలోపు బాలుర్ని రాత్రిపూట పని చేయకుండా నిరోధిస్తే గొప్ప ఇబ్బంది కలుగుతుంది" అని ఆటర్ క్లిఫ్‌లోని శాండర్సన్ బ్రదర్స్ అండ్ కో, స్టీల్ రోలింగ్ మిల్స్ అండ్ ఫోర్జెస్, అనే సంస్థకు చెందిన ఇ.ఎఫ్. శాండర్సన్ అదే అంశంపై మాట్లాడుతూ అన్నాడు. బాలురికి బదులుగా పెద్దవాళ్ళను పనిలో పెట్టడం వల్ల కలిగే ప్రధానమైన ఇబ్బంది ఖర్చు పెరగడం. అదెంతో నేను చెప్పలేను. కార్ఖానాదారులు ఉక్కు ధర పెంచేందుకు వీలు కల్పించడానికి తగినంతగా ఇది బహుశా ఉండదు. ఆ కారణంగా అది వారిపైన పడుతుంది. పెద్ద కార్మికులు (ఏమి విపరీత బుద్ధులు!) దానిని చెల్లించడానికి తిరస్కరించారను కోండి." పిల్లలకు ఎంత వేతనం చెల్లిస్తున్నారన్న సంగతి శాండర్సన్‌కు తెలియదు. అయితే, "బహుశా బాలురు వారానికి నాలుగయిదు షిల్లింగులు పొందవచ్చు... బాలుర పని

1. అదే నివేదిక, 80, పుట XVI.
2. అదే నివేదిక, 82, పుట XVII.

ఎటువంటిదంటే, దానికి సాధారణంగా ("సాధారణంగా", ఎల్లప్పుడూ కాదన్నమాట.) బాలుర బలం సరిపోతుంది. ఆ కారణంగా నష్టాన్ని పూడ్చటానికి లోహం బరువుగా ఉండే కొద్ది సందర్భాల్లో తప్ప పెద్దవాళ్ళ అధిక బలం వల్ల ప్రయోజనమేమీ లేదు. పెద్దవాళ్ళు తక్కువ విధేయులుగా ఉంటారు కనుక తమ కింద పని చేయడానికి బాలురు లేకపోవడం కార్మికులకు నచ్చదు. అంతేగాక బాలురు చిన్నతనంలోనే పని నేర్చుకోవాలి. బాలురికి పగటి పని మాత్రమే వదలడం వల్ల ప్రయోజనం నెరవేరదు." ఎందుచేత? బాలురు తమ చేతిపని పగలెందుకు నేర్చుకోలేరు? తమరు చెప్పే కారణం? "వారం విడిచి వారం పెద్ద కార్మికులు పగలూ రాత్రీ పని చేయడం వల్ల సగం కాలం వాళ్ళు బాలుర నుండి వేరు చేయబడతారు. వారికి బాలుర నుండి వచ్చే లాభంలో సగం పోతుంది. వారు అభ్యాసాలకు ఇచ్చే శిక్షణ బాలుర శ్రమకు ఇచ్చే ప్రతిఫలంలో భాగంగా పరిగణించబడుతుంది. ఆ రకంగా కార్మికులు ఆ శ్రమను చౌక రేటులో పొందేందుకు వీలు కలుగుతుంది. ప్రతి కార్మికుడూ ఈ లాభంలో సగం కావాలని కోరుకుంటాడు." మరో రకంగా చెప్పాలంటే మెసర్స్ శాండర్సన్ పెద్దవాళ్ళ వేతనాల్లో ఒక భాగాన్ని బాలుర రాత్రి పనితో చెల్లించడానికి బదులు తమ జేబులో నుండి చెల్లించాల్సి వస్తుంది. ఆ రకంగా మెసర్స్ శాండర్సన్ లాభం కొంత వరకూ పడిపోతుంది. బాలురు తమ చేతి పనిని పగలు నేర్చుకోలేకపోవడానికి శాండర్సన్‌గారు చెప్పే కారణం ఇదే.[1] దీనితోపాటు, బాలురు చేసే రాత్రి పని పెద్దవాళ్ళపైన పడుతుంది. దానికి వారు తట్టుకోలేరు. నిజానికి, ఇబ్బందులు ఎంత ఎక్కువగా ఉంటాయి అంటే మొత్తంగా రాత్రి పనినే మానుకోవాల్సిన స్థితికి దారితీయవచ్చు. "పనికి మాత్రమే సంబంధించిన మేరకు, ఇది కూడా నప్పుతుంది. కాని–" అంటాడు ఇ.ఎఫ్. శాండర్సన్. కాని మెసర్స్ శాండర్సన్ ఉక్కుతో పాటు చేయాల్సింది మరొకటుంది. అదనపు విలువ తయారు చేయడానికి, ఉక్కు తయారు చేయడమన్నది ఒక సాకు మాత్రమే. కరిగించే ఫర్నేసులూ, రోలింగ్ మిల్లులూ వగైరాలూ, భవనాలూ, యంత్రాలూ, ఇనుమూ, బొగ్గూ వగైరాలు ఉక్కుగా మారడం కంటే చేయాల్సినది మరొకటుంది. అవి అక్కడున్నది అదనపు విలువను పీల్చుకోడానికి, సహజంగానే అవి 12 గంటలలో కంటే 24 గంటల్లో ఎక్కువ పీల్చుకుంటాయి. నిజానికి అవి దేవుని అనుగ్రహం వల్లా, చట్టం అనుమతి వల్లా రోజులోని 24 గంటల పొడవునా నిర్దిష్ట సంఖ్య గల కార్మికుల శ్రమ కాలంపైన శాండర్సన్‌లకు హక్కునిస్తాయి. శ్రమను పీల్చుకునే వాటి క్రియకు విఘాతం ఏర్పడగానే అవి పెట్టుబడిగా తమ స్వభావాన్ని కోల్పోతాయి. కనుక అవి శాండర్సన్‌లకు శుద్ధ నష్టం. "ఇంత ఖరీదైన యంత్రాలు సగం కాలం ఖాళీగా ఉండటం వల్ల నష్టం జరుగుతుంది. ప్రస్తుత యంత్రాంగంతో ఇప్పుడు మేము చేయగలుగుతున్న పనిని చేయాలంటే మా ఆవరణనూ, యంత్రాలనూ రెట్టింపు చేయాలి. అంటే పెట్టుబడి రెట్టింపు అవుతుంది." అయితే కేవలం పగలు మాత్రమే పని చేస్తూ, ఆ కారణంగా తమ భవనాలు, యంత్రాలూ, ముడి పదార్థమూ రాత్రిపూట ఖాళీగా ఉంచే పెట్టుబడిదారులకు లేని ప్రత్యేక

1. ఆలోచించే, తర్కించే మన యుగంలో ప్రతీ పనికీ మంచి కారణం చెప్పలేని మనిషికి పెద్ద విలువ లేదు. ఆ పని ఎంత చెడ్డదైనా, ఎంత పిచ్చిదైనా. ప్రపంచంలో చేయబడిన ప్రతి తప్పు పనీ అత్యుత్తమ కారణాల వల్లనే చేయబడింది. (హెగెల్, అదే గ్రంథం. పుట 249)

హక్కు ఏదో తమకు ఉన్నట్టుగా ఈ శాండర్సన్‌లు ఎందుకు నటించాలి? శాండర్సన్‌లందరి తరఫునా ఇ.ఎఫ్. శాండర్సన్ ఇలా సమాధానం చెప్పాడు : "పగలు మాత్రమే పనిచేసే పరిశ్రమల్లో యంత్రాలు ఖాళీగా ఉండటం వల్ల ఈ నష్టం జరుగుతోందన్నది నిజం. అయితే మా విషయంలో కొలుములు ఉపయోగించడం వల్ల మరింత ఎక్కువ నష్టం జరుగుతోంది. వాటినలా మండనిస్తే ఇంధనం వృధా అవుతుంది. (ఇప్పుడు జరుగుతున్నట్టుగా కార్మికుల జీవ పదార్థం వృధా కావడానికి బదులుగా), అలా మండనివ్వకపోతే వాటిని రాజెయ్యటానికీ, వేడెక్కించటానికీ కాలం వృధా అవుతుంది. (కాగా, 8 ఏళ్ళ పిల్లలకు సైతం నిద్ర కాలం వృధాకావడం అన్నది శాండర్సన్ తెగకు పని కాలం కలిసొచ్చినట్టవుతుంది.) ఉష్ణోగ్రతలో మార్పుల వల్ల కొలుములు దెబ్బతింటాయి." (కాగా, పగలూ రాత్రీ శ్రమ మారడం వల్ల ఆ ఫర్నేసులు ఏమీ దెబ్బతినవు.)[1]

1. అదే నివేదిక, 85 పుట, XVII ఫర్నేసులు విడుదల చేసే కొంత పరిమాణం ఉష్ణం "శుద్ధ దండుగ" లేదా "వృధా" అవుతుందనీ, అందుచేత ఒకేవేళను పిల్లల భోజనం కాలంగా చేయడం అసాధ్యమనీ చెప్పే గాజు పరిశ్రమదారుల ఇటువంటి దయగల నీతులకు కమిషనర్ వైట్ జవాబు చెప్పాడు. తమ డబ్బును ఖర్చు పెట్టడం విషయంలో పెట్టుబడిదారుల "మిత వ్యయానికి", "స్వార్థ త్యాగానికీ", "పొదుపుకూ", మానవ జీవితం విషయంలో వారి తైమూర్ తామరలేన్ తరహా దుర్ వ్యయానికీ స్పందించే యురే, సీనియర్ వగైరాలూ, వారి మరుగుజ్జు గ్రంథచోరులైన రోష్చర్ లాంటివారూ చెప్పే జవాబు లాంటిది కాదు ఆయన జవాబు. "భోజనాల వేళల్ని నిర్ధారిస్తే ఇప్పుడు జరుగుతున్న దానికంటే కొంత పరిమాణం గల వేడి వృధా కావచ్చు. కాని రాజ్యమంతటా ఇప్పుడు గాజు పరిశ్రమలో పని చేస్తున్న పెరిగే బాలురికి తీరికగా తిండి తినడానికి వ్యవధీ, ఆ తర్వాత అది అరగటానికి కొద్దిపాటి విరామమూ లేకపోవడం వల్ల వృధా అవుతున్న జీవశక్తితో మాత్రం డబ్బు విలువ రీత్యా అది సమానం కాదనిపిస్తుంది." (అదే నివేదిక) పైగా ఇది ప్రగతి సంవత్సరం 1865లో! సీసాలూ, నాణ్యమైన గాజు తయారుచేసే షెడ్డుల్లో అటువంటి బాలుడు ఎత్తటంలోనూ, మోయటంలోనూ వెచ్చించే శక్తిగాక తన పని కాలంలో ప్రతి 6 గంటల్లోనూ 15-20 మైళ్ళు నడుస్తాడు! తరచుగా ఈ పని 14 లేదా 15 గంటలుంటుంది! మాస్కో స్పిన్నింగ్ మిల్లుల్లో లాగానే ఈ గాజు పరిశ్రమల్లో చాలా వాటిల్లో 6 గంటల రిలే పద్ధతి అమల్లో ఉంది. వారంలో పని జరిగే రోజుల్లో ఏ ఒక్క సమయంలోనైనా నిరాటంకంగా ఏకబిగిన లభించే విరామ సమయం ఎక్కువలో ఎక్కువ 6 గంటలు. మళ్ళీ దీనిలో నుండి పనికి రావడానికీ, పోవడానికీ, స్నానానికీ, బట్టలు వేసుకోడానికీ, తిండికీ కొంత సమయం పోతుంది. ఇక విశ్రాంతికి అతి కొద్ది సమయం మిగులుతుంది. ఆ చిన్న వయసు బాలల నిద్రను బలిపెడితే తప్ప, ముఖ్యంగా ఆ వేడి వాతావరణంలో అలవగొట్టే పని తర్వాత అవసరమైన నిద్రను బలిపెడితే తప్ప, తాజా గాలికీ, ఆటలకూ సమయమే ఉండదు... రాత్రయితే బాలుడు తనంత తానే లేవాల్సినందువల్ల పగలయితే చప్పుడువల్ల ఆ కొద్దిపాటి నిద్ర సైతం పాడవుతుంది. ఒక బాలుడు వరుసగా 36 గంటలు పని చేసిన సందర్భాలనూ, 12 ఏళ్ళ బాలుడు ఉదయం 2 గంటలదాకా అరవ చాకిరీ చేసి అక్కడే పడుకుని మళ్ళీ ఉదయం 5 గంటలకు (3 గంటల నిద్ర!) పని ప్రారంభించిన సందర్భాలనూ వైట్ తెలిపాడు. "బాలురూ, తరుణ వయస్కులూ, బాలికలూ, స్త్రీలూ తమ పగటి లేదా రాత్రి విడత పని క్రమంలో చేసే పని పరిమాణం అసాధారణం" అని సాధారణ నివేదిక ముసాయిదా తయారుచేసిన ట్రెమెన్ హీయెర్, టప్నెల్‌లు చెప్పారు. (అదే నివేదిక) ఈలోగా బహుశా రాత్రి బాగా పొద్దుపోయాక, బాగా పోర్టవైన్‌ను బాగా పట్టించిన స్వార్థత్యాగి శ్రీమాన్ గాజు పెట్టుబడి తన క్లబ్బు నుండి ఇంటికి వెంగళాయిలా గొణుక్కుంటూ వెళ్తాడు. "బ్రిటిషు వాళ్ళు ఎన్నటికీ, ఎన్నటికీ బానిసలు కారు."

## విభాగం - 5

# మామూలు పనిదినానికై పోరాటం - 14వ శతాబ్దం మధ్య భాగం నుండి 17వ శతాబ్దం అంతం వరకూ పనిదినాన్ని విస్తరింపజేయడానికై నిర్బంధ చట్టాలు

"పనిదినం అంటే ఏమిటి? శ్రమ శక్తి యొక్క రోజువారీ విలువను కొనే పెట్టుబడి ఆ శ్రమ శక్తిని ఎంత కాలంపాటు అనుభోగించవచ్చు? శ్రమ శక్తిని పునరుత్పత్తి చేయడానికి అవసరమైన పని కాలం దాటి పనిదినం ఎంతవరకూ విస్తరించబడవచ్చు?" ఈ ప్రశ్నలకు పెట్టుబడి ఇలా సమాధానం ఇస్తుందని గమనించబడింది : పనిదినంలో 24 గంటలుంటాయి. దానిలో నుండి ఏ విశ్రాంతి లేకుంటే శ్రమ శక్తి మళ్ళీ తన సేవలనందించడానికి పూర్తిగా నిరాకరిస్తుందో ఆ విశ్రాంతి కొరకు కొద్దిపాటి గంటల్ని తీసేయాలి. కనుక కార్మికుడు తన జీవితమంతా శ్రమ శక్తి గాక మరేమీ కాదనేది స్వయం వ్యక్తం. కనుక అతను వెచ్చించగల కాలమంతా ప్రకృతిసిద్ధంగానూ, చట్టబద్ధంగానూ పెట్టుబడి స్వయం విస్తరణకు అంకితమయ్యే శ్రమ కాలమే. విద్యకూ, బౌద్ధిక అభివృద్ధికీ, సామాజిక విధులను నిర్వహించడానికీ, సామాజిక సంబంధాలకూ, అతని శారీరక, మానసిక కార్యకలాపం యొక్క స్వేచ్ఛా నిర్వహణకు, ఆదివారం నాటి విశ్రాంతి కాలానికి సైతం (అదీ ఆదివారాన్ని పవిత్ర దినంగా ఎంచేవారి దేశంలో)[1] అవసరమైన కాలం – ఎంత మూర్ఖత్వం! అయితే అదనపు శ్రమ కోసం తన గుడ్డి దుర్వారమైన కాంక్షలో తన తోడేలు ఆకలిలో పెట్టుబడి పనిదినం యొక్క నైతిక హద్దుల్నే కాక, భౌతిక హద్దుల్ని సైతం అతిక్రమిస్తుంది. అది శరీరం పెరుగుదలకూ, అభివృద్ధికీ ఆరోగ్యకర నిర్వహణకూ అవసరమైన సమయాన్ని స్వాహా చేస్తుంది. తాజా గాలినీ, సూర్యరశ్మినీ అనుభవించడానికి అవసరమైన కాలాన్ని అది దొంగిలిస్తుంది. అది భోజనాల వేళ విషయంలో కొసరు బేరాలాడుతుంది. సాధ్యమైనచోటల్లా దాన్ని ఉత్పత్తి ప్రక్రియలో కలిపేస్తుంది. ఆ రకంగా బాయిలర్‌కు బొగ్గు అందించినట్టూ,

---

1. ఇంగ్లండులో ఇప్పుడు కూడా అప్పుడప్పుడూ గ్రామీణ ప్రాంతాల్లో కార్మికుడు ఆదివారం నాడు తన ముందు తోటలో పనిచేయడం ద్వారా ఆదివార నియమాలను అతిక్రమించినందుకుగాను ఖైదులో పెట్టబడుతున్నాడు. అదే కార్మికుడు ఆదివారం నాడు మత విశ్వాసం వల్లనే అయినప్పటికీ తన లోహ, కాగితం లేదా గాజు కార్ఖానాకు వెళ్ళకపోతే ఒప్పందం ఉల్లంఘించినందుకుగానూ శిక్షింపబడతాడు. ఆదివారం నియమాన్ని ఉల్లంఘించడం అనేది పెట్టుబడి విస్తరణ ప్రక్రియలో జరిగితే నైష్ఠిక పార్లమెంటు ఆ ఉల్లంఘనకు సంబంధించిన ఫిర్యాదులేమీ వినదు. ఆదివారం శ్రమను రద్దు చేయాలని కోరుతూ చేపల, కోళ్ళ దుకాణాల్లో పనిచేసే కార్మికులు నివేదించుకున్న వినతి పత్రం (ఆగస్టు 1863) వారి పనివారంలో మొదటి 6 రోజులూ రోజుకు 15 గంటల చొప్పునా, ఆదివారం నాడు 8-10 గంటలూ ఉంటుందని ప్రకటించింది. ఎక్స్‌టర్ హాల్ యొక్క కులీన వంచకుల్లో సుతారపు తిండిపోతులు ఈ "ఆదివారం శ్రమ"ను మరీ ప్రత్యేకంగా ప్రోత్సహిస్తారనే విషయం ఇదే వినతి పత్రం ద్వారా మనం తెలుసుకుంటాం. తమ శరీర సౌఖ్యాలను తీర్చుకోవడంలో ఎంతో పట్టుదల గల ఈ "పవిత్రులు" ఇతరుల అధిక పనిని, బాధలనూ, ఆకలినీ భరించే తమ వినయం ద్వారా తమ క్రైస్తవత్వాన్ని చూపిస్తారు. తిండిపోతుతనం వారి (కార్మికుల) కడుపులకు వినాశకరం.

యంత్రానికి గ్రీజూ, ఆయిలూ అందించినట్టూ, ఉత్పత్తి సాధనాలకు అందించినట్టే కార్మికులకు కూడా ఆహారాన్నందిస్తుంది. శారీరక శక్తులు తిరిగి పనిచేయడానికీ, పునరుద్ధరింపబడటానికీ, సేదదీరటానికీ అవసరమైన గాఢ నిద్రను, పూర్తిగా శక్తి ఉడిగిపోయిన జీవియొక్క పునరుద్ధరణకు తప్పనిసరైన ఇన్ని గంటల జడత్వంగా అది కుదిస్తుంది. పనిదినం పరిమితుల్ని నిర్ణయించేది శ్రమ శక్తిని సుస్థితిలో ఉంచే అవసరాలు కాదు, అది రోగపీడితమైనా, నిర్బంధమైనా, బాధాకరమైనా సాధ్యమైనంత ఎక్కువ శ్రమ శక్తి యొక్క రోజువారీ వ్యయమే కార్మికుని విరామ వ్యవధి యొక్క పరిమితుల్ని నిర్ణయిస్తుంది. శ్రమ శక్తి జీవిత కాలం గురించి పెట్టుబడి ఏమాత్రం లక్ష్యపెట్టదు. ఒక పనిదినంలో రాబట్టడానికి వీలైన అత్యధిక శ్రమ శక్తిని మాత్రమే అది సూటిగా పట్టించుకుంటుంది. దురాశ గల రైతు భూసారాన్ని నష్టపరుస్తూ భూమి నుండి ఎక్కువ పంటను గుంజుకున్నట్టు పెట్టుబడిదారుడు కార్మికుని ఆయుస్సును క్షీణింపజేస్తూ ఈ లక్ష్యం సాధిస్తాడు.

ఆ రకంగా పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం (ముఖ్యంగా అదనపు విలువ ఉత్పత్తి, అదనపు శ్రమను పీల్చుకోవడం) అనేది పని దినాన్ని విస్తరించడంతో మానవ శ్రమ శక్తి యొక్క శారీరక అభివృద్ధికీ, క్రియాశీలతకూ అవసరమైన మామూలు నైతిక, భౌతిక పరిస్థితులను దోచుకోవడం ద్వారా ఉత్పత్తి చేసేది దాని క్షీణతను మాత్రమే కాదు. స్వయంగా ఈ శ్రమ శక్తి యొక్క అకాల అశక్తతనూ, మరణాన్నీ ఉత్పత్తి చేస్తుంది.[1] అది కార్మికుని వాస్తవ ఆయుస్సును తగ్గించడం ద్వారా ఒక నిర్ణీత కాలపరిమితిలో అతని ఉత్పత్తి కాలాన్ని పొడిగిస్తుంది.

అయితే శ్రమ శక్తి విలువలో కార్మికుని పునరుత్పత్తికి లేదా కార్మికవర్గాన్ని నిలబెట్టి ఉంచడానికి అవసరమైన సరుకుల విలువ కూడా ఉంటుంది. స్వయం విస్తరణ కోసం లెక్కలేనంత ఉద్వేగంతో పెట్టుబడి తప్పనిసరిగా చేసే ప్రయత్నంలో జరిగే పనిదినం యొక్క అసహజ విస్తరణ వ్యష్టి కార్మికుని జీవిత కాలాన్నీ, ఆ కారణంగా అతని శ్రమ శక్తి వ్యవధినీ తగ్గిస్తే వాడేయబడిన శక్తుల్నీ అంతకంటే ఎక్కువ వేగంతో పునస్థాపించాలి. అంటే శ్రమ శక్తి పునరుత్పత్తికయ్యే ఖర్చుల మొత్తం పెరుగుతుంది. ఒక యంత్రం ఎంత శీఘ్రంగా అరిగిపోతే, దానిలో రోజువారీ పునరుత్పత్తికి కావాల్సిన విలువ భాగం కూడా అంతే ఎక్కువగా ఉన్నట్లు కనుక పెట్టుబడి యొక్క స్వీయ ప్రయోజనమే మామూలు పనిదినాన్ని నిర్దేశిస్తున్నట్టుగా కనిపిస్తుంది.

బానిస యజమాని తన గుర్రాన్ని కొన్నట్టే తన బానిసనూ కొంటాడు. అతడు తన బానిసను కోల్పోతే తన పెట్టుబడి కోల్పోతాడు. బానిస బజారులో కొత్త ఖర్చు ద్వారా మాత్రమే ఆ పెట్టుబడిని అతడు పునరుద్ధరించుకుంటాడు. అయితే "జార్జియా వరి పొలాలూ – లేదా మిసిసిపీ చిత్తడి నేలలూ మనిషి ఆరోగ్యానికి అత్యంత హానికరం కావచ్చు. అయితే ఈ జిల్లాల వ్యవసాయం వల్ల వృధా అయ్యే మానవ ప్రాణం కొల్లలుగా ఉండే వర్జీనియా, కెంటకీ జనాభా పూడ్చలేనంత ఎక్కువ కాదు. అంతేగాక, సహజ వ్యవస్థలో బానిసను భద్రంగా నిలుపుకోవడం యజమానికి ప్రయోజనకరం కనుక, ఆర్థిక

1. "అధిక పని గంటలు ... మనుషుల పనిజేసే శక్తిని అకాలంగా ఉడిగిపోయేట్టు చేస్తాయని తెలిపే అనేక అనుభవశాలురైన కార్ఖానాదారుల ప్రకటనలను మేము ఇంతకు ముందు నివేదికల్లో ఇచ్చాము." (అదే నివేదిక, 64, పుట XIII)

పరిగణనల వల్ల యజమాని బానిసపట్ల మానవతా దృష్టితో వ్యవహరిస్తాడు. బానిసల వ్యాపారం అమల్లోకి రాగానే బానిస శ్రమను అత్యధికంగా పిండడానికి ఆర్థిక పరిగణనలే కారణమవుతాయి. ఎందుకంటే బానిస స్థానాన్ని వెంటనే విదేశీ నిల్వలతో భర్తీ చేయగలిగినప్పుడు అతను జీవించి ఉండగా అతని ఉత్పాదకత కంటే అతని ఆయుస్సు అనేది తక్కువ ప్రాధాన్యం గల విషయంగా మారుతుంది. ఆ రకంగా బానిసల దిగుమతి జరిగే దేశాల్లో అత్యంత తక్కువ కాల వ్యవధిలో మానవ సరుకు నుండి అత్యధిక శ్రమను వడగట్టగలిగిందే అత్యంత ఫలవంతమైన ఆర్థిక విధానమనేది బానిసల నిర్వహణ సూత్రం. వార్షిక లాభాలు తరచుగా తోటలపై పెట్టిన మొత్తం పెట్టుబడితో సమానమయ్యే వేడి ప్రాంతాల్లోనే నీగ్రో జీవితం అత్యంత నిర్లక్ష్యంగా బలిపెట్టబడుతుంది. శతాబ్దాలుగా అపార సంపదనిస్తున్న వెస్టిండీస్ వ్యవసాయమే లక్షలాదిగా ఆఫ్రికన్ జాతిని దిగమింగింది. కోట్ల ఆదాయం గల క్యూబాల్లో, తోటల యజమానులే రాకుమారులైన క్యూబాలో, సేవక వర్గంలో అత్యంత అధ్వాన్యమైన తిండినీ, అత్యంత అలసట కల్గించే, విరామం లేని శ్రమనీ, ప్రతి ఏడాదీ దానిలో ఒక భాగం యొక్క సంపూర్ణ వినాశనాన్ని సైతం మనం చూస్తాము."[1]

పేరు మారింది. కాని అది నీ కథే. బానిస వ్యాపారానికి బదులు కార్మిక మార్కెట్ అనీ, కెంటకీ, వర్జీనియాలకు బదులు ఐర్లండ్ అనీ, ఇంగ్లండ్, స్కాట్లండ్, వేల్స్‌ల్లోని వ్యవసాయ జిల్లాలనూ, ఆఫ్రికాకు బదులు జర్మనీ అనీ చదవాలి. లండన్ బేకర్ల సంఖ్య అధిక పని భారం వల్ల ఎలా పల్చబడిందో మనం విన్నాం. అయినప్పటికీ లండన్ కార్మిక మార్కెట్ ఎప్పుడూ బేకరీల్లో చావడానికి వచ్చే జర్మన్ తదితర కార్మికులతో నిండిపోయి ఉంటుంది. మనం గమనించినట్టుగా పింగాణీ పరిశ్రమ అతి తక్కువ ఆయుర్దాయం గల కార్మికుల పరిశ్రమ. అందువల్ల పింగాణీ కార్మికుల కొరత అంటూ ఉందా? ఆధునిక పింగాణీ పరిశ్రమను కనుగొన్న జోసయ వెడ్జ్ వుడ్ మొదట స్వయంగా ఒక సామాన్య కార్మికుడే. ఈ మొత్తం వ్యాపారంలో 15,000 నుండి 20,000 మంది దాకా పని చేస్తున్నారని 1785లో ఆయన కామన్స్ సభలో చెప్పాడు.[2] 1861లో గ్రేట్ బ్రిటన్‌లోని కేవలం పట్టణ ప్రాంతాల్లోనే ఈ పరిశ్రమలో 1,01,302 మంది ఉన్నారు. "జవుళీ వాణిజ్యం తొంబది ఏళ్ళుగా ఉంది ... అది మూడు తరాలుగా బ్రిటిష్ జాతితోపాటు ఉంది. ఆ కాలంలో అది తొమ్మిది తరాల ఫ్యాక్టరీ కార్మికుల్ని నాశనం చేసిందని నేను గట్టిగా చెప్పగలను."[3]

ఉత్పత్తి వెర్రిగా సాగిన కొన్ని యుగాల్లో కార్మిక మార్కెట్‌లో గణనీయమైన కొరతలు కనిపిస్తా యనటంలో సందేహం లేదు. ఉదాహరణకు 1834లో ఉత్తరాది వ్యవసాయ జిల్లాల్లోని "అదనపు జనాభా"ని తాము "ఇముడ్చుకుని, నిశ్శేషంగా ఉపయోగించుకుంటామని"[4] తెలుపుతూ వారిని పంపాల్సిందిగా యజమానులు పూర్‌లా కమిషనర్లకు (పేదల చట్టాల కమిషనర్లకు) ప్రతిపాదించారు. లా కమిషనర్ల అనుమతితోనే ... ఏజెంట్లు నియమించబడ్డారు. మాంచెస్టర్‌లో ఒక కార్యాలయం ఏర్పాటు చేయబడింది. దానికి వ్యవసాయ జిల్లాల నుండి పని చేయగోరే కార్మికుల జాబితాలు

1. కెయిర్నెస్, "ది స్లేవ్ పవర్" పుటలు 110, 111.
2. జాన్ వార్డ్ : "ది బరో ఆఫ్ స్టోక్ అపాన్ ట్రెంట్" లండన్, 1843, పుట 42.
3. కామన్స్ సభలో (1863) పెరాండ్ ఉపన్యాసం.
4. "సరిగ్గా వారుపయోగించింది అవే మాటలు." అదే నివేదిక.

పంపించబడ్డాయి. పుస్తకాలలో వారి పేర్లు నమోదయ్యాయి. ఈ కార్యాలయాలకు కార్ఖానా యజమానులు హాజరయి, వారికి నచ్చిన వారిని ఎంచుకున్నారు. వారి "అవసరాలకు తగిన" వ్యక్తుల్ని ఎంచుకున్నాక వారిని మాంచెస్టర్‌కు పంపించమని ఆదేశాలిచ్చారు. వారు అలాగే పంపించబడ్డారు. కాల్వల ద్వారా, లేదా ఇతర సాధనాల ద్వారా, చీటీలు తగిలించి సరుకుల మూటల్లాగా రవాణా చేయబడ్డారు. ఇతరులు కాలి నడకన ప్రయాణించారు. వారిలో అనేకమంది అర్ధాకలితో ఉన్నారు. కొంతమంది తప్పిపోయారు. ఈ పద్ధతి ఒక క్రమం తప్పని వ్యాపారంగా మారింది. ఈ సభ దానిని నమ్మటం కష్టం. అయితే మానవ శరీరాల ఈ రవాణా సజావుగా సాగిందనీ, అమెరికాలో పత్తి పండించేవానికి బానిసలు అమ్మబడినట్టే వారు ఈ కార్ఖానాల యజమానులకు అమ్మబడ్డారనీ నేను ఈ సభకు చెప్పగలను ... 1860లో 'జవుళి వ్యాపారం ఉచ్ఛస్థాయిలో ఉంది...' కార్ఖానా యజమానులు మళ్ళీ తమకు "చేతుల" కొరత వచ్చినట్టు గమనించారు ... మాంసపు ఏజెంట్లు అనబడేవారికి వారు మళ్ళీ నివేదించుకున్నారు. ఆ ఏజెంట్లు ఇంగ్లండులోని దక్షిణాది పొలాల్లోకి, డోర్సెట్‌షైర్ పచ్చిక బయళ్ళలోకి, డెవోన్‌షైర్ కొండకోనల్లోకి, విల్ట్‌షైర్ పశులకాపరుల దగ్గరికి తమ గుమస్తాలను పంపించారు. అయినా ప్రయోజనం లేకపోయింది. అదనపు జనాభా "ఇముడ్చుకోబడింది" ఫ్రెంచ్ ఒప్పందం పూర్తి అయిన మీదట 'బరీగార్డియన్' పత్రిక ఇలా అంది. లాంక్‌షైర్ 10,000 అదనపు చేతుల్ని ఇముడ్చుకోగలదు. 30,000 లేదా 40,000 చేతులు అవసరం." "మాంసపు ఏజెంట్లూ" సబ్ ఏజెంట్లు వ్యవసాయ జిల్లాల్లో వృధాగా "చేతుల" కోసం వెదుకులాడింతర్వాత "లాంక్‌షైర్ మిల్లుల కోసం ప్రభుత్వ గృహాల్లో ఉండే పేద పిల్లల్ని తీసుకెళ్ళడానికి అనుమతిని కోరేందుకు ఒక ప్రతినిధి వర్గం లండన్ వచ్చి పూర్‌లాబోర్డ్ అధ్యక్షుడు, విల్లియర్స్ అనే పెద్దమనిషి కోసం వేచి ఉన్నారు."[1]

---

1. విల్లియర్స్ సదుద్దేశాలను అలా ఉంచి, అతనికి చట్టబద్ధంగా కార్ఖానాదారుల విజ్ఞప్తిని తిరస్కరించక తప్పలేదు. ఈ పెద్దలు ఎలాగైతేనేమి స్థానికంగా ఉండే పూర్‌లా బోర్డుల పరోపకార స్వభావంవల్ల తమ లక్ష్యాన్ని సాధించుకున్నారు. స్కాట్లాండ్ వ్యవసాయ జిల్లాల నుండి లాంక్‌షైర్, చెషైర్‌లకు తీసుకురాబడిన అనేక బాలికల, యువతుల విషయంలో ఒక సందర్భంలో ఈ పద్ధతి కచ్చితంగా పాత తరహా దుర్వినియోగానికి గురైనప్పటికీ, అనాథల్ని, పేద పిల్లల్నీ "చట్టరీత్యా" అభ్యాసకులుగా పరిగణించే ఈ పద్ధతిలో 'పాత తరహా దుర్వినియోగం' జరుగలేదని (ఇటువంటి దుర్వినియోగం గురించి, చూ. ఎంగెల్స్ రాసిన "ఇంగ్లండులో కార్మికవర్గ పరిస్థితులు") ఫ్యాక్టరీల ఇన్‌స్పెక్టరు ఎ. రెడ్‌గ్రేవ్ ఉద్ఘాటించాడు. ఈ పద్ధతిలో కార్ఖానాదారుడు ఒక నిర్ణీత కాలంపాటు అనాథ గృహాల అధికారులతో ఒప్పందం కుదుర్చుకుంటాడు. అతడు ఈ పిల్లలకు తిండి, గుడ్డ, వసతి కల్పిస్తాడు. కొద్దిపాటి పైఖర్చు ఇస్తాడు. ఇంగ్లీషు జవుళీ వాణిజ్యం సుభిక్షంగా ఉన్న సంవత్సరాల్లో సైతం 1860కి సాటివచ్చేదేది లేదు. అంతేగాక వేతనాలు అసాధారణంగా ఎక్కువగా ఉన్నాయి. ఈ సందర్భాల్లో ఇప్పుడు లిఖించబోయే రెడ్‌గ్రేవ్ మాటలు వింతగా అనిపిస్తాయి. ఎందుకంటే పనికోసం ఈ అసాధారణమైన గిరాకీ, ఐర్లాండ్ యొక్క జనాభా తరుగుదలతోనూ, ఇంగ్లండు, స్కాట్లండ్ వ్యవసాయ జిల్లాల నుండి ఆస్ట్రేలియా, అమెరికాలకు సాగిన పొల్లువీలులేని వలసతోనూ పోటీపడాల్సి వచ్చింది. కార్మికుల జీవశక్తి పతనం కావడంవల్ల కొంత, మానవ మాంస వ్యాపారుల ద్వారా జరిగిన జనాభా తరలింపువల్ల కొంత ఇంగ్లండులోని కొన్ని వ్యవసాయ జిల్లాలలోని జనాభా వాస్తవంగా తగ్గిపోయింది. అయినప్పటికీ దీనంతటినీ అలా ఉంచి రెడ్‌గ్రేవ్ ఇలా అంటాడు : ఏ ఇతర శ్రమా

సాధారణంగా పెట్టుబడిదారునికి అనుభవం తెలిపేదేమంటే, నిరంతరం అమిత జనాభా, అంటే అదనపు శ్రమను ఇముడ్చుకునే పెట్టుబడి తక్షణ అవసరంతో పోల్చగా అమితం అన్న మాట, తరతరాల మానవులు మరుగుజ్జులుగా మారడం ద్వారా నుండి, వారి ఆయుక్షీణత ద్వారా, త్వర త్వరగా ఒకరి స్థానాన్ని ఒకరు భర్తీ చేసుకోవడం ద్వారా, చెప్పాలంటే ఇంకా పక్వానికి రాకముందే కసుగాయల్ని తుంచివేయబడటం ద్వారా ఈ అమితత్వం పుట్టినప్పటికీ.[1] చారిత్రకంగా చెప్పాలంటే కేవలం నిన్నటి నుండే ప్రారంభమైన పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం ఎంత శీఘ్రంగా ప్రజల జీవన శక్తిని వేళ్ళకంటా పెరికేసిందో – గ్రామసీమల నుండి నిరంతరాయంగా వచ్చిపడే శారీరకంగా చెడిపోని అనాగరిక మనుషుల రాక అన్నది పారిశ్రామిక జనాభా పతన వేగాన్ని ఎలా ఆపిందో – గ్రామాల కార్మికులు సైతం పరిశుభ్ర మైన గాలి ఉన్నప్పటికీ, వారిలో శక్తిమంతంగా పనిచేసి, వారిలో అందరికంటే బలాఢ్యుల్నే బతకనిచ్చే సహజ ఎంపిక సూత్రం అమలు జరిగినప్పటికీ ఎలా చనిపోనారంభించారో తెలివైన పరిశీలకుడికి అనుభవం తెలియజేస్తుంది.[2] తన చుట్టూ ఉన్న కార్మిక

---

దొరకనప్పుడే ఈ రకం శ్రమ కోరబడుతుంది. ఎందుకంటే ఇది ఖరీదైన శ్రమ 13 ఏళ్ళ బాలుని మామూలు కూలి వారానికి నాలుగు షిల్లింగులుంటుంది. అయితే వారానికిచ్చే ఈ 4 షిల్లింగులతో వారికి తిండి, గుడ్డ, వసతి, వైద్య సదుపాయం కల్పించడమూ, 50 లేదా 100 మంది బాలుర్ని అజమాయిషీ చేయడమూ వారికి కొంత పైఖర్చును కేటాయించడమూ సాధ్యంకాదు.'' (రిపోర్ట్ ఆఫ్ ది ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ ఫర్ తర్టీయత్ ఏప్రిల్, 1860) 50 లేదా 100 మందిని కలిపి ఒకచోట ఉంచి తిండిపెట్టి అజమాయిషీ చేయడం యజమానికి సాధ్యం కానప్పుడు వారానికి అదే 4 షిల్లింగులతో కార్మికుడు తన పిల్లలకు ఇవన్నీ ఎలా చేయగలడో రెడ్‌గ్రేవ్ మనకు చెప్ప మరిచాడు. గ్రంథస్థ విషయం నుండి పొరపాటు నిర్ధారణలు రాకుండా ఉండటం కోసం, ఇంగ్లీషు జౌళీ పరిశ్రమ, శ్రమ కాలాన్ని క్రమబద్ధం చేయడం వగైరాల్లో 1850 ఫ్యాక్టరీ చట్టం కిందికి తీసుకు రాబడినప్పటి నుండి దాన్ని ఇంగ్లండులో ఒక ఆదర్శ పరిశ్రమగా పరిగణించవచ్చు అన్న విషయాన్ని నేను ఇక్కడ పేర్కొనాల్సి ఉంది. ఇంగ్లీషు జౌళీ కార్మికుడు అన్ని అంశాల్లోనూ ఖండంలో ఇతరచోట్ల దరిద్రంలో ఉన్న జౌళీ కార్మికులకంటే మెరుగైన స్థితిలో ఉన్నాడు. ''ప్రష్యన్ ఫ్యాక్టరీ కార్మికుడు తన ఇంగ్లీషు పోటీదారునికంటే వారానికి కనీసం 10 గంటలు ఎక్కువ పని చేస్తాడు. ఒకవేళ అతను తన సొంత ఇంటిలో తన మగ్గంపై పని చేస్తే అతని శ్రమ ఈ అదనపు గంటలకు సైతం పరిమితం కాదు.'' (''రిపోర్ట్ ఆఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్'' అక్టోబరు 31, 1855, పుట 103) పైన పేర్కొనబడిన ఫ్యాక్టరీ ఇన్‌స్పెక్టరు రెడ్‌గ్రేవ్ 1851లో జరిగిన పారిశ్రామిక ప్రదర్శన తర్వాత ఖండమంతా, ముఖ్యంగా ఫ్రాన్స్, జర్మనీల్లో ఫ్యాక్టరీ పరిస్థితులను దర్యాప్తు చేయడానికి తిరిగాడు. ప్రష్యన్ కార్మికుని గురించి అతడిలా చెబుతాడు. ''అతని సాదా తిండికీ, అతను అలవాటుపడిన కొద్దిపాటి సుఖాలకూ సరిపడా అతనికి ప్రతిఫలం ముడుతుంది... అతను తన మొరటు తిండిపైన బతుకుతాడు. కష్టపడి పనిచేస్తాడు. కాగా అతని పరిస్థితి ఇంగ్లీషు కార్మికుని పరిస్థితి కంటే హీనంగా ఉంటుంది.'' (''రిపోర్ట్ ఆఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్'', అక్టోబరు 31, 1855, పుట 85)

1. అధికంగా పని చేసినవారు ''ఎంత శీఘ్రతతో చనిపోతారు. అయితే చనిపోయిన వారి స్థానాలు తక్షణమే భర్తీ అవుతాయి. తరచుగా మనుషులు మారటం వల్ల దృశ్యంలో మార్పేమీ ఉండదు.'' (''ఇంగ్లండ్ అండ్ అమెరికా'' లండన్, 1833, సంపుటి I, పుట 55, రచన : ఇ.జి. వేక్‌ఫీల్డ్)

2. చూ. ''పబ్లిక్ హెల్త్ సిక్స్ రిపోర్ట్ ఆఫ్ ది మెడికల్ ఆఫీసర్ ఆఫ్ ది ప్రీవీ కౌన్సిల్, 1863'' లండన్‌లో 1864 ప్రచురించబడింది. ఈ నివేదిక ప్రత్యేకంగా వ్యవసాయ కార్మికుల గురించి వివరించింది. ''నెదర్లాండ్‌కు ... చాలా మెరుగైన ప్రాంతమని పేరు... కాని ... ఒకనాడు దృఢమైన మనుషులకూ, వీర సైనికులకూ

శ్రేణుల బాధల్ని తొలగించడానికి అంత మంచి కారణాలున్న పెట్టుబడి, సూర్యుడిలోకి భూమి పడిపోవడానికున్న అవకాశం విషయంలో ఎంతగా చలించిందో, జరుగబోయే మానవ జాతి పతనం ఎడలా, అంతిమ జన క్షయం ఎడలా ఆచరణలో అంతే చలించింది. ప్రతి స్టాక్ మార్కెటు మోసంలో ఎప్పుడో ఒకప్పుడు పిడుగు పడుతుందని ప్రతి ఒక్కరికీ తెలుసు. అయితే ప్రతి ఒక్కరూ అది తన పొరుగువాడి నెత్తిమీద పడుతుందని ఆశిస్తాడు. తన మీద బంగారు వర్షం కురుస్తుందనీ, దాన్ని ముందే భద్రంగా దాస్తాననీ అనుకుంటాడు.

నా అనంతరం జగత్ ప్రళయం! అనేది ప్రతి పెట్టుబడిదారుని యొక్కా, పెట్టుబడిదారీ దేశం యొక్క జీవిత సూత్రం. కనుక పెట్టుబడి, సమాజం యొక్క బలవంతం మీద తప్ప కార్మికుని ఆరోగ్యాన్నీ, ఆయుర్దాయాన్నీ లక్ష్యపెట్టదు.[1] శారీరక, మానసిక పతనం, అకాల మరణం, అధిక పని భారపు చిత్రహింసల గురించి తలెత్తిన ఆక్రందనకు దాని సమాధానం : అవి మన లాభాల్ని పెంచుతుండగా, వాటిని గురించి మనకు దిగులెందుకుండాలి? అయితే విషయాలను మొత్తంగా పరిశీలించగా, ఇదంతా వ్యష్టి పెట్టుబడి దారుని మంచితనం లేదా చెడ్డతనం మీద ఆధారపడదు. నిర్నిబంధ పోటీ అనేది పెట్టుబడిదారీ ఉత్పత్తిలో అంతర్నిహితంగా ఉండే నియమాలను ప్రతి వ్యష్టి పెట్టుబడిదారునిపైనా పెత్తనం చేసే బలవంతపు బాహ్య నియమాల రూపంలో వెలికి తెస్తుంది.[2]

---

పేరుగాంచిన జిల్లాల్లో సైతం ఇటీవలి దర్యాప్తు ప్రకారం ప్రజలు అల్ప సంఖ్యాకులు గానూ, మరుగుజ్జులుగానూ మారినట్టు విదితమైంది. అత్యంత ఆరోగ్యకరమైన ప్రాంతాల్లో, సముద్ర తీరాన ఉన్న పర్వత ప్రాంతాల్లో సైతం వారి అన్నార్తులైన పిల్లల మొహాలు లండన్ సందుల్లో మురికి వాతావరణంలో ఉన్న పిల్లల మొహాలంతగానూ పాలిపోయి ఉన్నాయి. (''విలియం థామస్ థార్నటన్. ''ఓవర్ పాపులేషన్ అండ్ ఇట్స్ రెమిడీ'') నిజానికి గ్లాస్గో నగరం తన సందుల్లో, గొందుల్లో వేశ్యలతోనూ, దొంగలతోనూ కలిపి కుక్కుతున్న 30,000 మంది ''వీరులైన కొండప్రాంత వాసుల''ను వారు పోలి ఉంటారు.

1. ''కాని జాతీయ పెట్టుబడికి జనాభా ఆరోగ్యం అనేది ఎంతో ముఖ్యమైన విషయం అయినప్పటికీ, ఈ సంపదను సంరక్షించి పోషించటంలో శ్రమ వినియోగదారుల వర్గం అత్యంత పురోగామి కాదని చెప్పాల్సి ఉందని భావిస్తున్నాం... కార్మికుల ఆరోగ్యాన్ని పరిగణించడం అనేది మిల్లు యజమానులపైన రుద్దబడింది.'' (టైమ్స్, నవంబర్ 5, 1861) వెస్ట్ రైడింగ్ నివాసుల మానవజాతికి వస్త్రదాతలయ్యారు... కార్మిక ప్రజల ఆరోగ్యం బలిపెట్టబడింది. వారి జాతి కొద్ది తరాల్లో పతనం అయివుండేది. అయితే దానికి ప్రతిచర్య బయలుదేరింది. లార్డ్ షాఫ్ట్‌బరీ బిల్లు పిల్లల పని గంటల్ని పరిమితం చేసింది...'' (రిపోర్ట్ ఆఫ్ ది రిజిస్ట్రార్ జనరల్, అక్టోబర్ 1861)

2. కనుక ఉదాహరణకు, 1863 ఆరంభంలో స్టఫర్డ్ షైర్‌లో జోసయ వెడ్జ్ వుడ్ అండ్ సన్స్‌తో సహా విస్తారమైన పింగాణీ పరిశ్రమకు అధిపతులైన 26 సంస్థలు ఒక వినతి పత్రంలో ''ఏదో ఒక శాసనం'' చేయాల్సిందిగా విన్నవించుకోడాన్ని మనం గమనిస్తాము. ఇతర పెట్టుబడిదారులతో పోటీవల్ల స్వచ్ఛందంగా పిల్ల పని గంటల్ని పరిమితం చేయడం వీలు కావడం లేదు...'' ఇంతకు ముందు పేర్కొన్న దురంతాలను మేము ఎంతగా గర్హించినప్పటికీ కార్ఖానాదారుల మధ్య ఎటువంటి ఒప్పందపు పథకంతోనూ వాటిని నిరోధించడం సాధ్యం కాదు... ఈ అంశాలన్నిటినీ పరిగణించిన మీదట మేము ఏదో ఒక శాసనం చేయడం అవసరమనే అభిప్రాయానికి వచ్చాము.'' (చిల్డ్రన్స్ ఎంప్లాయ్‌మెంట్ కమిషన్ ఒకటో నివేదిక, 1863, పుట 322) కాగా ఇటీవలి అంశమొకటి మరింత స్పష్టమైన ఉదాహరణను ఇస్తుంది. బాగా ముమ్మరంగా పని సాగుతున్న దశలో దూది ధర పెరిగింది. అది బ్లాక్ బర్న్‌లోని కార్ఖానాదారులు పరస్పర అంగీకారంతో తమ మిల్లుల్లో నిర్ణీత కాలంపాటు పని గంటల్ని తగ్గించేలా చేసింది. ఈ కాలం 1871 నవంబర్ అంతానికి పూర్తయింది.

మామూలు పనిదినం రూపొందడం అన్నది పెట్టుబడిదారునికీ, కార్మికునికీ మధ్య శతాబ్దాల తరబడి సాగిన పోరాటం యొక్క ఫలితం. ఈ పోరాటపు చరిత్ర రెండు విరుద్ధ ధోరణులను చూపిస్తుంది. ఉదాహరణకు మన కాలపు ఇంగ్లీషు ఫ్యాక్టరీ శాసనాలను, 14వ శతాబ్దం నుండి 18వ శతాబ్దం మధ్య భాగం వరకూ చేసిన ఇంగ్లీషు కార్మిక చట్టాలతో పోల్చండి.[1]

ఆధునిక ఫ్యాక్టరీ చట్టాలు పనిదినాన్ని నిర్బంధంగా కుదించగా ఇంతకు ముందు చేసిన చట్టాలు దాన్ని నిర్బంధంగా పొడిగించడానికి ప్రయత్నించాయి. పెట్టుబడి తన పిండ దశలో, అంటే అది పెరగటం మొదలుపెట్టినప్పుడు తగినంత పరిమాణంలో అదనపు విలువను ఆరగించే హక్కును కేవలం ఆర్థిక సంబంధాల బలంతో మాత్రమే గాక రాజ్యం యొక్క సాయంతో పొందుతుంది. ఆనాటి దాని నిరాధారమైన హక్కులు, తన పరిణత దశలో అది ప్రతిఘటిస్తూ అయిష్టంగా ఇచ్చే రాయితీలతో పోల్చి చూస్తే చాలా పరిమితం అనిపిస్తాయి. పెట్టుబడిదారీ ఉత్పత్తి అభివృద్ధి కావడంవల్ల, "స్వేచ్ఛాయుత" కార్మికుడు తన మొత్తం క్రియాశీల జీవితాన్ని పని చేయడానికున్న తన యావచ్ఛక్తినీ జీవితావసరాల ధరకు, తన జన్మహక్కును ఒక గుక్కెడు గంజినీళ్ళకు అమ్మేయడానికి ఆమోదించే ముందు, అనగా సామాజిక పరిస్థితుల చేత నిర్బంధించబడే ముందు, శతాబ్దాలు గడుస్తాయి. కనుక, 14వ శతాబ్దం మధ్య భాగం నుండి 17వ శతాబ్దం చివరి వరకూ రాజ్యాంగ చర్యల ద్వారా వయోజన కార్మికులపైన రుద్దాలని ప్రయత్నించే పనిదినం పొడిగింపు అన్నది 19వ శతాబ్దం రెండో అర్ధభాగంలో పిల్లల రక్తాన్ని పెట్టుబడిగా మార్చడాన్ని నివారించడం కోసం రాజ్యం అక్కడక్కడా చేసిన పనిదినం కుదింపుతో సుమారుగా సమానమవుతుంది. ఉదాహరణకు, బాగా ఇటీవలి కాలం వరకూ ఉత్తర అమెరికా రిపబ్లిక్‌లో అత్యంత స్వేచ్ఛాయుత రాష్ట్రమయిన మస్సాషూ సెట్స్‌లో 12 ఏళ్ళలోపు పిల్లల కోసం ఇవ్వాళ ప్రకటించబడిన రాజ్యాంగబద్ధ శ్రమ పరిమితి అనేది ఇంగ్లండులో 17వ శతాబ్దం మధ్య భాగంలో సైతం కాయపుష్టి గల చేతివృత్తుల వాళ్ళకూ, దృఢ శరీరులైన కార్మికులకూ, భీమ బలం గల కమ్మరులకూ మామూలు పనిదినంగా ఉండేది.[2]

---

ఈలోగా వీరిలో వడుకటాన్ని నేయడంతో జతచేసిన మరింత ధనవంతులైన కార్ఖానాదారులు ఈ ఒప్పందం వల్ల తగ్గిన ఉత్పత్తిని తమ సొంత వ్యాపారాన్ని పెంచుకోడానికీ, ఆ రకంగా చిన్న యజమానులను బలిపెట్టి దండిగా లాభాలు సంపాదించడానికీ ఉపయోగించుకున్నారు. చిన్న యజమానులు దిక్కుతోచని పరిస్థితిలో కార్మికులను ఆశ్రయించి, 9 గంటల విధానం కోసం ఆందోళన చేయాల్సిందిగా ప్రేరేపించి, అందుకు అవసరమైన విరాళాలిస్తామని వాగ్దానం చేశారు.

1. ఈ కార్మిక చట్టాలు ఫ్రాన్స్, నెదర్లాండ్స్ తదితర దేశాల్లో కూడా అదే కాలంలో వచ్చాయి. ఉత్పత్తి పద్ధతుల్లో వచ్చిన మార్పులవల్ల వాటి కాలం చెల్లిన చాలా కాలానికి వాటిని ఇంగ్లండులో 1813లో మొట్టమొదటిసారి అధికారికంగా రద్దు చేశారు.

2. "12 ఏళ్ళలోపున్న ఏ బిడ్డనీ ఏ కార్ఖానా సంస్థలోనూ రోజుకు 10 గంటలకు మించి పనిలో పెట్టరాదు." జనరల్ స్టాట్యూట్స్ ఆఫ్ మెసాచు సెట్స్ 63, అధ్యాయం 12. (ఈ వివిధ చట్టాలు 1836కు, 1858కు మధ్య కాలంలో చేయబడ్డాయి.) "జవుళీ, ఉన్ని, పట్టు, కాగితం, గాజు, నార ఫ్యాక్టరీలన్నింటి లోనూ, ఇనుము, ఇత్తడి కార్ఖానాల్లోనూ ఏ రోజైనా పది గంటలపాటు చేయబడ్డ పని చట్టబద్ధంగా ఒక రోజు పనిగా పరిగణించబడుతుంది. శాసనం రీత్యా ఇకనుండీ ఏ మైనరూ ఏ ఫ్యాక్టరీలోనూ ఏ రోజైనా పది గంటలకుపైనా, ఏ వారంలోనయినా 60 గంటలకుపైనా పని చేయాల్సిన అవసరం లేదు. ఇక నుండీ

మొట్టమొదటి "కార్మిక చట్టానికి" (23 ఎడ్వర్డు–III 1349) అపార జనాన్ని హరించివేసిన మహమ్మారి ప్లేగు వ్యాధి సాకు (కారణంగాదు, ఎందుకంటే ఇటువంటి చట్టాలు సాకు మాయమయ్యాక శతాబ్దాల తరబడి కొనసాగుతాయి.)గా దొరికింది. ఒక టోరీ రచయిత ఇలా అన్నాడు : "పని చేయడానికి మనుషులు సముచితమైన షరతులపై (అనగా వారి యజమానులకు సముచితమైన అదనపు విలువ పరిమాణాన్ని వదిలే ధరకు) దొరకడం సహించరానంతగా కష్టమైంది."[1] కనుక సముచితమైన వేతనాలను చట్టమూ, పనిదినం పరిమితులూ నిర్ణయించాయి. ఇక్కడ మనకు ఈ రెండో అంశమే ఆసక్తికరం. ఇది 1496 (ఏడవ హెన్రీ) చట్టంలో పునరావృతమైంది. ఈ చట్టం (అయితే దీన్ని అమలుచేయలేకపోయారు.) ప్రకారం మొత్తం చేతివృత్తుల వారికీ, వ్యవసాయ కార్మికులకూ మార్చి నుండి సెప్టెంబర్ వరకూ పనిదినం అన్నది ఉదయం 5 గంటల నుండి సాయంత్రం 7, 8 గంటల మధ్య వరకూ ఉంటుంది. అయితే భోజనాల వేళలు 1 గంట ఉదయ భోజనం కోసమూ, $1\frac{1}{2}$ గంటలు మధ్యాహ్న భోజనం కోసమూ, $\frac{1}{2}$ గంట సాయంత్రం విశ్రాంతి కోసమూ కేటాయించాలి. ఇవి ఇప్పుడు ఫ్యాక్టరీ చట్టాల ప్రకారం అమల్లో ఉన్న దానికి సరిగ్గా రెట్టింపు.[2] శీతాకాలం పని ఉదయం 5 గంటల నుండి రాత్రి చీకటి పడేదాకా అవే విరామ సమయాలతో ఉంటుంది. 1562 నాటి ఎలిజబెత్ చట్టం "రోజు కూలికి లేదా వారం కూలికి" కుదిరిన కార్మికులందరి యొక్క పనిదినం నిడివిని యధాతథంగా ఉంచింది. అయితే విరామ సమయాలను మాత్రం వేసవిలో $2\frac{1}{2}$ గంటలకూ, శీతాకాలంలో 2 గంటలకూ పరిమితం చేయడానికి ఉద్దేశించింది. భోజనానికి 1 గంట మాత్రమే ఉండాలి. "ఒక గంట మధ్యాహ్నం నిద్ర" మే మధ్య భాగం నుండి ఆగస్టు మధ్య భాగం వరకు మాత్రమే అనుమతించబడింది. ప్రతి గంట గైరు హాజరుకు వేతనం నుండి ఒక పెన్నీ తీసేయబడుతుంది.

---

ఈ రాష్ట్రంలో పదేళ్ళలోపున్న ఏ మైనర్‌నూ ఏ ఫ్యాక్టరీలోనూ కార్మికునిగా చేర్చుకో రాదు.'' న్యూజెర్సీ రాష్ట్రం పని గంటల్ని పరిమితం చేసే చట్టం ... (లా ఆఫ్ ఎయిటీంత్, మార్చి 1851) (''12 ఏళ్ళకుపైనా 15 ఏళ్ళకులోపూ ఉన్న ఏ మైనర్‌నూ ఏ పారిశ్రామిక సంస్థలోనూ రోజుకు 11 గంటలకు మించిగానీ, ఉదయం 5 గంటలకు ముందుగానీ, సాయంత్రం 7-30కు తర్వాతగానీ పనిలో పెట్టరాదు. జులై 1, 1857'')

1. ''సోఫిజమ్స్ ఆఫ్ ఫ్రీ ట్రేడ్'' 7వ కూర్పు, లండన్, 1850, పుట 205, 9వ కూర్పు, పుట 253. పైగా ఇదే టోరీ ''కార్మికులకు వ్యతిరేకంగానూ, యజమానికి అనుగుణంగానూ వేతనాలను నిర్ణయించే పార్లమెంటు చట్టాలు 464 ఏళ్ళ సుదీర్ఘ కాలంపాటు నిల్చి ఉన్నాయి. జనాభా పెరిగింది. అప్పుడు ఈ చట్టాలు అనవసరంగానూ, భారంగానూ కనిపించాయి. నిజంగా అలా తయారయ్యాయి'' అని ఒప్పుకున్నాడు.'' (పుట 206)

2. ఈ చట్టాన్ని ఉద్దేశించి జె.వేడ్ ఇలా వాస్తవాన్ని పేర్కొన్నాడు : ''పై ప్రకటన ప్రకారం (చట్టానికి సంబంధించి) 1496లో భోజనం చేతివృత్తిదారుని ఆదాయంలో మూడో వంతుకూ, కార్మికుని ఆదాయంలో సగానికీ సమానం అయినట్టు కనిపిస్తుంది. కార్మిక వర్గాలలో ఇవాల్టికంటే ఎక్కువ స్థాయిలో స్వాతంత్ర్యాన్ని అది సూచిస్తుంది. ఎందుకంటే, కార్మికుల, చేతివృత్తిదారుల భోజనం ఖరీదు ఎప్పటి వారి జీతాలలో చాలా ఎక్కువ భాగంగా ఉన్నట్టు గుర్తించబడుతుంది.'' (జె.వేడ్. ''హిస్టరీ ఆఫ్ ది మిడిల్ అండ్ వర్కింగ్ క్లాసెస్'' పుట 24, 25, 577) బిషప్ ఫ్లీట్ వుడ్ రాసిన "chronicon preciosum..." మొదటి కూర్పు, లండన్ 1707. రెండో కూర్పు, లండన్ 1745ని ఒక్కసారి చూస్తే చాలు, అప్పటికీ ఇప్పటికీ ఆహార, వస్త్రాల ధర సంబంధాల్లో ఉన్న భేదం వల్లనే ఈ భేదం ఉంది అన్న అభిప్రాయం తప్పు అని రుజువవుతుంది.

అయితే, ఆచరణలో పరిస్థితులు చట్టంలో కంటే కార్మికులకు చాలా అనుకూలంగా ఉండినాయి. అర్థశాస్త్ర పితామహుడూ, కొంత మేరకు గణాంక శాస్త్రానికి మూలపురుషుడూ అయిన విలియమ్ పెట్టీ 17వ శతాబ్దం చివరి తృతీయ భాగంలో తాను ప్రచురించిన ఒక గ్రంథంలో ఇలా అన్నాడు : "కార్మికులు (అప్పుడు, వ్యవసాయ కార్మికులు అనే అర్థంలో) రోజుకు 10 గంటలు పని చేస్తారు. వారానికి 20 సార్లు భోంచేస్తారు. అంటే పనిదినాల్లో రోజుకు మూడుసార్లు, ఆదివారాల్లో రెండుసార్లు. దానినిబట్టి వారు శుక్రవారం రాత్రులు ఉపవాసం ఉండి, రోజూ భోజనం చేయడానికి పదకొండు నుండి ఒంటిగంట వరకూ, రెండు గంటలకు బదులు గంటన్నర మాత్రమే తీసుకుంటే, ఆ రకంగా 1/20 వంతు ఎక్కువ పనిజేసి 1/20 వంతు తక్కువ ఖర్చు పెడితే పైన పేర్కొన్నదానిని (పన్నును) పెంచవచ్చు."[1] 1833 నాటి 12 గంటల బిల్లును అంధ యుగాలకు తిరోగమనమని డా॥ ఆండ్రూ ఉరే ఆక్రోశించడం న్యాయం కాదా? చట్టంలో పెట్టి పేర్కొన్న ఈ శాసన సూత్రాలు అభ్యాసకులకు కూడా వర్తిస్తాయన్నది నిజం. అయితే 17వ శతాబ్దం చివరిలో సైతం బాల కార్మికుల పరిస్థితిని ఈ క్రింది ఫిర్యాదును బట్టి గ్రహించవచ్చు : "ఒక అభ్యాసకుని ఏడేళ్ళపాటు శిక్షణకు బంధించి ఉంచడం అన్న మన ఆచరణ వారి (జర్మనీ)లో లేదు. మూడు నాలుగేళ్ళు అన్నది వారి మామూలు ప్రమాణం కారణం, వారు పొత్తిళ్ళనుండే పని గురించి కొంత నేర్చుకుంటారు. అది వారిని అనువుగానూ, అణకువగానూ మారుస్తుంది. ఆ కారణంగా పరిణతినీ, పనిలో తొందరగా కుశలతనూ సంతరించుకునే సామర్థ్యం కలవారిగానూ చేస్తుంది. కాగా ఇక్కడ ఇంగ్లండులో మన యువకులు చాలా నెమ్మదిగా పురోగమిస్తారు. పూర్తిస్థాయి చేతిపనివారల పరిణతిని పొందడానికి చాలా ఎక్కువ కాలం తీసుకుంటారు.[2]

---

1. విలియమ్ పెట్టీ. "Political Antomy of Ireland, Verbum Sapienti", 1672 Ed. 1691, పుట 10)
2. "ఎ డిస్‌కోర్స్ ఆన్ ది నెసెసిటీ ఆఫ్ ఎంకరేజింగ్ మెకానిక్ ఇండస్ట్రీ" లండన్, 1690, పుట 13. విగ్గుల, బూర్జువాల ప్రయోజనాలకు అనుగుణంగా ఇంగ్లీషు చరిత్రను వక్రీకరించిన మెకాలే ఈ విధంగా ప్రకటించాడు : పిల్లల్ని చిన్న వయసులోనే పనిలో పెట్టే ఆచరణ అన్నది కార్ఖానా వ్యవస్థతో పోల్చి చూస్తే 17వ శతాబ్దంలో దాదాపు నమ్మశక్యం గానంత ప్రబలంగా కనిపిస్తుంది. వస్త్ర పరిశ్రమ ప్రధాన కేంద్రమైన నార్విచ్‌లో ఆరేళ్ళ పసికూన పనిచేయడానికి తగినట్లు భావించబడింది. ఆ నగరంలోని లేతవయసు గల బాల బాలికలు తమసొంత పోషణకు అవసరమైన దానికి మించి ఏడాదికి పన్నెండు వేల పౌండ్ల సంపదను సృష్టిస్తారనే నిజాన్ని ఆనాటి పలువురు రచయితలు, వారిలో ఎంతో కరుణామయులుగా పరిగణింపబడిన కొందరు కూడా హర్షాతిరేకంతో పేర్కొన్నారు. గతచరిత్రను మనం ఎంత ఎక్కువ జాగ్రత్తగా పరిశీలిస్తే, మన యుగం కొత్త సామాజిక రుగ్మతలను సృష్టించిందని ఊహించే వారితో విభేదించేందుకు మనకు అంత ఎక్కువ కారణం కనిపిస్తుంది... కొత్త అంశమేమంటే తెలివితేటలూ, ఆ రుగ్మతలను నివారించే మానవత్వమూ." హిస్టరీ ఆఫ్ ఇంగ్లండ్ ఇకటో సంపుటి, పుట 417) 17వ శతాబ్దపు "అత్యంత సహృదయ వాణిజ్య మిత్రులు" హాలెండ్‌లోని ఒక పేద గృహంలో ఒక నాలుగేళ్ళ బిడ్డ పనిలో పెట్టబడిన తీరుని "హర్షాతిరేకంతో" వర్ణించారనే, ఈ "సదాచార" ఉదాహరణ ఆడంస్మిత్ నాటి వరకూ మెకాలే తరహా మానవతావాద గ్రంథాలన్నిటిలోనూ చోటుచేసుకుందనీ మెకాలే పేర్కొని ఉండొచ్చు. చేతిపనుల స్థానంలో కార్ఖానా చోటు చేసుకోవడంతో పిల్లల్ని దోపిడీ చేసిన జాడలు కనిపించనారంభిస్తాయి. ఈ దోపిడీ కొంతమేరకు రైతాంగంలో ఎప్పుడూ ఉంది. రైతు మీద భారం పెరిగేకొద్దీ ఇది అభివృద్ధి చెందింది. పెట్టుబడి ధోరణి అక్కడ స్పష్టంగానే ఉంది. అయితే రెండు తలకాయల పిల్లలు ఎంత అరుదైన విషయమో ఇంకా ఈ

అయినప్పటికీ, 18వ శతాబ్దపు అధిక భాగంలో, ఆధునిక పరిశ్రమల యుగం వరకూ, ఇంగ్లండులో పెట్టుబడి శ్రమ శక్తికి వారం విలువను చెల్లిస్తూ కార్మికుని మొత్తం వారాన్ని కబళించడంలో సఫలం కాలేదు. అయితే వ్యవసాయ కార్మికులు ఒక మినహాయింపు. తాము నాలుగు రోజుల వేతనంతో వారమంతా బతకగలమనే వాస్తవం మిగిలిన రెండు రోజులూ పెట్టుబడిదారుని కోసం పని చెయ్యాలనే దానికి తగినంత కారణంగా కార్మికులకు కనిపించలేదు. ఇంగ్లీషు ఆర్థికవేత్తల్లో ఒక బృందం పెట్టుబడి ప్రయోజనార్థం ఈ మొండితనాన్ని అతి తీవ్రంగా ఖండించింది. మరో బృందం కార్మికుల్ని సమర్థించింది. పోస్టిల్ త్వేట్‌కు (ఇంతకు ముందే ఉల్లేఖించబడ్డ) "ఎస్సే ఆన్ ట్రేడ్ అండ్ కామర్స్" రచయితకు మధ్య సంవాదాన్ని విందాం.[1] ఆనాడు పోస్టిల్ త్వేట్ రాసిన వాణిజ్య నిఘంటువుకు ఈనాడు మాకల్లోక్, మాక్ గ్రెగర్‌ల అవే తరహారచనలకు ఉన్న ఖ్యాతియే ఉంది.

ఇతర అంశాలతోపాటు పోస్టిల్ త్వేట్ ఇలా అంటాడు : "ఈ పరిశీలనలు సమాప్తి చేసే ముందు చాలా ఎక్కువమంది నోళ్ళలో నానే ఒక చౌకబారు మాటను గమనించాలి. ఏమిటంటే శ్రమించే పేదలు ఐదు రోజుల పనితో తమని తాము పోషించుకోగలిగితే, వారు మొత్తం ఆరు రోజులు పని చేయరట. అందువల్ల చేతివృత్తిదారుణ్ణి, కార్ఖానా పనివానిని వారంలో ఆరు రోజులూ ఎడతెరపి లేకుండా పని చేసేలా చేయడానికి జీవితావసరాలను సైతం పన్నుల ద్వారా, లేదా మరే ఇతర సాధనాల ద్వారా నైనా ప్రియం చేయాల్సిన అవసరాన్ని వారు సూచిస్తారు. ఈ రాజ్యంలో కార్మిక ప్రజల్ని శాశ్వత బానిసత్వంలో ఉంచాలని వాదించే రాజకీయ దురంధరులతో విభేదిస్తున్నానని విన్నవించుకుంటున్నాను. ఆటపాటలు లేకుండా పొద్దస్తమానం పనిచేస్తే పిల్లలు మొద్దుబారుతారనే లోకోక్తిని వారు మర్చిపోతున్నారు. ఇంత వరకూ సామాన్యంగా బ్రిటీషు వస్తువులకు ప్రతిష్టనూ, ఖ్యాతినీ తెచ్చి పెట్టిన చేతివృత్తిదారుల, కార్ఖానా పనివారల చాతుర్యాన్నీ, లాఘవాన్నీ ఇంగ్లీషువారు ఘనంగా చెప్పుకోలేదా? అది దేనివల్ల వచ్చింది? తమ సొంత పద్ధతిలో శ్రామిక ప్రజలు విశ్రాంతి

---

ఘటనలు కూడా అంతే అరుదైన విషయాలు - కనుకనే దూరదృష్టి గల 'వాణిజ్య మిత్రులు' వాటిని పేర్కొనదగిన అంశాలుగానూ, అద్భుతాలుగానూ 'హర్షాతిరేకంతో' గమనించారు. తమ కాలానికీ, ముందుతరాలకూ ఆదర్శాలుగా వారు సిఫార్సు చేశారు. స్కాట్ భట్రాజూ, మాటకారీ అయిన ఇదే మెకాలే ఇలా అంటాడు : "ఇవ్వాళ మనం తిరోగమనం గురించి మాత్రమే వింటున్నాం. పురోగమనాన్ని మాత్రమే దర్శిస్తున్నాం." ఏమి కళ్ళు, ముఖ్యంగా ఏమి చెవులు!

1. "యాన్ ఎస్సే ఆన్ ట్రేడ్ కామర్స్, కంటెయినింగ్ అబ్జర్వేషన్స్ ఆన్ టాక్సెస్..." (లండన్, 1770)లో ఉల్లేఖించబడిన అజ్ఞాత రచయిత కార్మికులను నిందించే వారిలో అత్యంత ఆగ్రహావేశపరుడు. ఈయన ఇంతకు ముందు రాసిన తన "కన్సిడరేషన్స్ ఆన్ టాక్సెస్" లండన్, 1765 గ్రంథంలోనే ఈ అంశాన్ని చర్చించాడు. ఇదే పక్షంలో పలకవీలుగాని గణాంకాల వదరుబోతు పొలోనియస్ ఆర్థర్ యంగ్ ఉన్నారు. కార్మికవర్గ సమర్థకుల్లో ప్రప్రథములు : "మనీ ఆన్సర్స్ ఆల్ థింగ్స్‌ర్" లండన్, 1734, గ్రంథంలో వాండర్‌లింట్, "యాన్ ఎంక్వయిరీ ఇంటు ది కాజెస్ ఆఫ్ ది ప్రజంట్ హైప్రైస్ ఆఫ్ ప్రొవిజన్స్" లండన్, 1767, గ్రంథంలో రెవ. నెథేనియల్ ఫారెస్టర్, డి.డి. డా॥ ప్రైస్ ముఖ్యంగా తన "గ్రేట్ బ్రిటన్స్ కమర్షియల్ ఇంటరెస్ట్ ఎక్స్‌ప్లెయిన్డ్ అండ్ ఇంప్రూవ్డ్" రెండో కూర్పు, 1755, గ్రంథంలో లాగే తన యూనివర్సల్ డిక్షనరీ ఆఫ్ ట్రేడ్ అండ్ కామర్స్‌లో కూడా పోస్టిల్ త్వేట్ ఈ వాస్తవాలను అనేక ఇతర రచయితలు కూడా ధృవీకరించారు. వారిలో జోసయాటక్కర్ ఒకరు.

తీసుకోవటం వల్ల తప్ప బహుశా వేరేకాదు. వారు ఏడాది పొడుగునా, వారంలో ఆరు రోజులూ ఒకే పనిని పునరావృతం చేస్తూ పని చేయాల్సి వస్తే, అది వారి చాతుర్యాన్ని దెబ్బతీయదా? అప్రమత్తంగానూ, లాఘవంగానూ ఉండటానికి బదులు వారిని మొద్దులుగా మార్చదా? అటువంటి శాశ్వత బానిసత్వం వల్ల మన కార్మికులు తమ ఖ్యాతిని కాపాడుకోడానికి బదులు పోగొట్టుకోరా? ... అటువంటి ఒక్క పశువుల నుండి మనం ఎటువంటి పనితనాన్ని ఆశించగలం? ... ఒక ఫ్రెంచివాడు ఐదారు రోజుల్లో చేసినంత పనిని మనవారిలో అనేకమంది నాలుగు రోజుల్లోనే నిర్వహిస్తారు. అయితే ఇంగ్లీషు వాళ్ళు శాశ్వత చాకిరీ గొడ్లుగా మారితే వారు ఫ్రెంచివాళ్ళ కంటే దిగజారిపోతారని భయపడాల్సి ఉంది. యుద్ధంలో మనవాళ్ళు సాహసానికి పేరు మోశారూ అంటే అది వారి కడుపులో ఉన్న వేయించిన ఇంగ్లీషు ఎద్దు మాంసంవల్లా, పుడ్డింగ్‌వల్లా, దానితోపాటు వారిలో అంతర్లీనంగా ఉన్న స్వేచ్ఛాదీప్తివల్లా అని మనం అనమా? మన కళాకారుల, కార్ఖానా పనివారల ఉన్నత చాతుర్యమూ, లాఘవమూ తమ సొంత పద్ధతిలో తమను తాము మలుచుకొనే స్వేచ్ఛా స్వాతంత్ర్యాల వల్ల ఎందుకు అయివుండరాదు? దేనివల్ల వారి సహనమూ అంతకు తగ్గకుండా వారి చాతుర్యమూ తలెత్తుతున్నాయో అటువంటి ప్రత్యేక సౌకర్యాలనూ, ఆ మంచి జీవితాన్నీ మనం ఎప్పుడూ వారికి కరువయ్యేలా చెయ్యబోమని ఆశిస్తాను."[1] దానిమీద "ఎస్సే ఆన్ ట్రేడ్ అండ్ కామర్స్" రచయిత ఇలా సమాధానం చెప్పాడు : "ప్రతి ఏడో రోజునూ శలవు దినంగా మార్చడం అన్నది దైవ నిబంధన అనుకుంటే మిగిలిన ఆరు రోజులూ శ్రమకే" (పెట్టుబడికే అని అతని ఉద్దేశం అన్న సంగతిని త్వరలోనే గ్రహిస్తాము.) వినియోగించాలని అది సూచిస్తుంది. దానిని అమలు చేయడం క్రూరత్వంగా ఏమాత్రం భావించ బడదు... సాధారణంగా మానవ జాతి సహజంగానే సుఖానికీ, సోమరితనానికీ మొగ్గుతుందన్నది, జీవితావసర సరుకులు చాలా ప్రియమైతే తప్ప సగటున వారానికి నాలుగు రోజులకు మించి పనిచేయని మన కార్ఖానా పనివారల ప్రవర్తనను బట్టి, నిజమేనన్న సంగతి మనకు దారుణంగా అనుభవమవుతున్నది. పేదవాళ్ళ అవసరాలన్నిటినీ ఒకే పేరుతో పిలుద్దాం. ఉదాహరణకు వాటన్నిటినీ గోధుమలు అందాం. లేదా ఒకవేళ ఒక బస్తా గోధుమల ఖరీదు ఐదు షిల్లింగులైతే, అతడు (కార్ఖానా పనివాడు) తన శ్రమ ద్వారా ఒక షిల్లింగు సంపాదించగలిగితే, వారంలో అతడు ఐదు రోజులు మాత్రమే పని చేయాల్సి వస్తుంది. అయితే ఈ రాజ్యంలో నిత్యావసరాల ధరతో పోలిస్తే వేతనాలు చాలా ఎక్కువ కనుక ... నాలుగు రోజులు పనిచేసిన కార్ఖానా కార్మికునికి మిగిలిన వారమంతా సోమరిగా బతకడానికి సరిపడా అదనపు డబ్బు ఉంటుంది. వారానికి ఆరు రోజుల మితమైన శ్రమ బానిసత్వమేమీ కాదని కనిపించేలా చేయడానికి అవసరమైనంత చెప్పానని ఆశిస్తాను. మన వ్యవసాయ కార్మికులు ఇలాగే చేస్తున్నారు. కనిపించే అంశాలన్నిటి బట్టి వారు మన శ్రామిక పేదలందరి కంటే సంతోషపరులు.[2] కార్ఖానాల్లో డచ్చివారు ఇదే పని చేస్తారు. చాలా సంతోషంగా ఉండే ప్రజల్లా

1. పోస్టిల్ త్వేట్, ఫస్ట్ ప్రిలిమినరీ డిస్‌కోర్స్ పుట 14.
2. ''యాన్ ఎస్సే...'' 1770లోనే ఇంగ్లీషు వ్యవసాయ కార్మికుల ''సంతోషం'' ఎక్కడుందో అతడే స్వయంగా 96వ పుటలో ప్రస్తావిస్తాడు : ''వారి శక్తి స్తోమతులెప్పుడూ అతిగా వినియోగించబడతాయి. వారు అంతకంటే చౌకగా బతకజాలరు. అంతకంటే గట్టిగా పని చేయజాలరు.''

కనిపిస్తారు. శలవు దినాలు అడ్డు తగలనప్పుడు ఫ్రెంచి వాళ్ళూ ఇదే పని చేస్తారు.[1] అయితే మన జనాభా ఇంగ్లీషు వారిగా తాము యూరపులోని అన్ని దేశాలలో కంటే ఎక్కువగా స్వేచ్ఛాపరులుగానూ, స్వతంత్రులుగానూ ఉండటం తమ జన్మహక్కు అని భావిస్తోంది. ఈ భావం మన దళాల సాహసాన్ని ప్రభావితం చేసిన మేరకు కొంత ఉపయోగకరం కావచ్చు. కాని ఇది కార్ఖానాల పేదలకు ఎంత తక్కువుంటే అంత మంచిది. అది వారికి మంచిది, రాజ్యానికి మంచిది. శ్రామిక పేదలు ఎన్నడూ తమ పైవారితో ప్రమేయం లేని స్వతంత్రులమని భావించుకోరాదు .... ఎనిమిదింట ఏడు వంతుల మంది జనానికి ఆస్తిపాస్తుల్లేని మనలాంటి వాణిజ్య రాజ్యంలో మూకల్ని ప్రోత్సహించడం అత్యంత ప్రమాదకరం. మన కార్ఖానా పేదలు ఇప్పుడు నాలుగు రోజుల్లో సంపాదించే మొత్తంతోనే ఆరు రోజులు శ్రమించడానికి సంతృప్తిపడేంత వరకూ చికిత్స పూర్తి కాదు.[2] ఈ లక్ష్యం కోసం, "సోమరితనాన్ని, జారత్వాన్నీ, అతినీ" నిర్మూలించడం కోసం, పరిశ్రమించే గుణాన్ని పెంచడం కోసం, "కార్ఖానాల్లో శ్రమ యొక్క ధరను తగ్గించడం కోసం, పేదల కోసం విధించే పన్నుల భారం నుండి భూముల్ని విముక్తి చేయడం కోసం", పెట్టుబడి యొక్క మన ఈ విధేయ సమర్థకుడు ఈ ఆమోదిత చిట్కాను ప్రతిపాదించాడు : ప్రభుత్వపు అండపై ఆధారపడిన కార్మికుల్ని, అంటే దరిద్రుల్ని, ఒక "ఆదర్శ కార్యగృహం" (వర్క్‌హౌస్)లో బంధించాలి. అటువంటి "ఆదర్శ కార్య గృహాన్ని" "బీభత్స గృహం" చెయ్యాలి. అంతేగాని పేదలకు "సుష్టుగా తిండి పెట్టి, వెచ్చని, చక్కని బట్టలిచ్చి వారు ఏమీ పనిచేయనక్కర్లేని" ఆశ్రయం కాదు.[3] ఈ బీభత్స గృహంలో, ఈ ఆదర్శ కార్య గృహంబులో పేదలు రోజుకు 14 గంటలు పని చేస్తారు. భోజనానికి సక్రమమైన సమయాన్ని అనుమతించగా 12 గంటల నిఖార్సయిన శ్రమ మిగలాలి.[4] ఆదర్శ కార్యగృహంలో, 1770 నాటి బీభత్స గృహంలో రోజూ పన్నెండు పని గంటలు! 63 ఏళ్ళ తర్వాత 1833లో ఇంగ్లీషు పార్లమెంటు నాలుగు పారిశ్రామిక శాఖల్లో 13 నుండి 18 ఏళ్ళ వయసు గల పిల్లల పనిదినాన్ని 12 పూర్తి గంటలకు తగ్గించినప్పుడు ఇంగ్లీషు పరిశ్రమకు ప్రళయం సమీపించినట్లు అనిపించింది. 1852లో లూయీ బోనపార్ట్ చట్టబద్ధ పనిదినాన్ని మార్చడం ద్వారా బూర్జువా వర్గంతో తన స్థానాన్ని పదిలపరుచుకోవాలని చూసినప్పుడు ఫ్రెంచి కార్మికులు "పనిదినాన్ని 12 గంటలకు పరిమితం చేసిన చట్టం అన్నది రిపబ్లిక్ చేసిన శాసనంలో మాకు మిగిలిన ఒకే మంచి అంశం" అని ఏకకంఠంతో ఆక్రోశించారు.[5] జ్యూరిక్‌లో

---

1. దాదాపు సాంప్రదాయక శలవు దినాలన్నిటినీ పనిదినాలుగా మార్చడం ద్వారా ప్రొటెస్టెంట్ మతం పెట్టుబడి పుట్టుకలో ఒక ప్రధానమైన పాత్ర నిర్వహించింది.
2. "యాన్ ఎస్సే ..." పుటలు 15, 41, 96, 97, 55, 57, 69 - పెట్టుబడిదారులు కార్మికుల నుండి అవే వేతనాలకు 4 రోజులకు బదులు 6 రోజుల శ్రమను కోరడమే కార్మిక ప్రజల సోమరితనం గురించి వారు చేసే ఆక్రందనలోని రహస్యం అన్న సంగతిని 1734లోనే జాకబ్ వాండర్‌లింట్ ప్రకటించాడు.
3. అదే గ్రంథం, పుట 242.
4. అదే గ్రంథం, "స్వేచ్ఛ గురించిన మన అత్యుత్సాహపు భావాలు చూసి ఫ్రెంచి వాళ్ళు నవ్వుతారు" అంటాడతడు.
5. "రోజుకు 12 గంటలకు మించి పని చేయడానికి వారు ప్రత్యేకంగా అభ్యంతరం చెప్పారు. ఎందుకంటే ఈ గంటల్ని నిర్ణయించిన చట్టం అన్నది రిపబ్లిక్ చేసిన శాసనాల్లో మిగిలిన ఏకైక మంచి అంశం" "రిపోర్ట్ ఆఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్" అక్టోబరు 31, 12856, పుట 80) 1848, మార్చి 2 నాటి తాత్కాలిక

పదేళ్ళు దాటిన పిల్ల పనిని 12 గంటలకు పరిమితం చేశారు. 1862లో ఆర్గాన్‌లో 13, 16 ఏళ్ళ మధ్య పిల్లల పని $12\frac{1}{2}$ నుండి 12 గంటలకు తగ్గించబడింది. 1860లో ఆస్ట్రియాలో 14, 16 ఏళ్ళ మధ్య పిల్లల పని గంటల్ని కూడా అదే విధంగా తగ్గించారు.[1] 1770 నాటి నుండి ఏమి ప్రగతి! అని మెకాలే హర్షాతిరేకంతో అరుస్తాడు!

1770లో పెట్టుబడిదారీ ఆత్మ కేవలం కలలు కన్న పేదల బీభత్స గృహం కొద్ది సంవత్సరాల తర్వాత పారిశ్రామిక కార్మికుని అతి పెద్ద కార్యగృహం రూపంలో వాస్తవ రూపం ధరించింది. దాని పేరు ఫ్యాక్టరీ. ఈసారి వాస్తవం ముందు ఆదర్శం వెలవెలబోతోంది.

### విభాగం - 6

## మామూలు పనిదినం కోసం పోరాటం - పని కాలానికి చట్టం రీత్యా నిర్బంధ పరిమితి - 1833 నుండి 1864 వరకూ ఇంగ్లీషు ఫ్యాక్టరీ చట్టాలు

పనిదినాన్ని దాని మామూలు గరిష్ఠ పరిమితికి అటు పిమ్మట దానిని మించి 12 గంటల[2] సహజదినం యొక్క పరిమితికి సాగలాగడానికి పెట్టుబడికి శతాబ్దాలు పట్టిన తర్వాత 18వ శతాబ్దపు ఆఖరి మూడో భాగంలో యంత్రవాదం, ఆధునిక పరిశ్రమల ఆవిర్భావంలో, తీవ్రతలోనూ విస్తృతిలోనూ విరుచుకుపడే కొండ చరియలాంటి ఉధృతమైన అతిక్రమణ దానిని అనుసరించింది. నీతి, ప్రకృతి,

---

ప్రభుత్వ డిక్రీకి బూర్జువా కూర్పు అయిన 1850, సెప్టెంబరు 5 నాటి 12 గంటల ఫ్రెంచి బిల్లు మినహాయింపులు లేకుండా వర్క్‌షాపులన్నిటిలోనూ ఉంటుంది. ఈ చట్టానికి ముందు ఫ్రాన్స్‌లో పనిదినానికి నిర్దిష్టమైన పరిమితి ఏదీ లేదు. అది ఫ్యాక్టరీల్లో 14, 15 లేదా ఇంకా ఎక్కువ గంటలుండేది. "Desclasses ouvriers en France, Pendant L'annee 1848, Par M. Blanqui" చూడండి. ఆర్థికవేత్త (విప్లవకారుడు కాదు) ఎమ్. బ్లాంక్వేకి కార్మికవర్గ పరిస్థితి దర్యాప్తు చేసే పనిని ప్రభుత్వం అప్పజెప్పింది.

1. పనిదినాన్ని క్రమబద్ధం చేయడం విషయంలో బెల్జియం ఆదర్శ బూర్జువా ప్రభుత్వం బ్రస్సెల్స్‌లోని ఇంగ్లీషు ప్లెనీ పొటెన్షియరీ, వెల్డన్‌కి చెందిన లార్డ్ హోవార్డ్. తమ విదేశీ కార్యాలయానికి 1862, మే 12న ఇలా తెలియజేశాడు : "పిల్లల శ్రమ అన్నది ఒక సాధారణ నియమం ద్వారాగానీ, ఏదైనా స్థానిక నిబంధన ద్వారా పరిమితం చేయబడలేదనీ, గత మూడేళ్ళుగా ఈ విషయంపై ప్రభుత్వం ఒక బిల్లు ప్రతిపాదించాలనుకుందనీ, అయితే సంపూర్ణ శ్రమ స్వాతంత్ర్యం అనే సూత్రానికి విరుద్ధంగా ఏ శాసనానికైనా పట్టుదలతో కూడిన వ్యతిరేకత అన్నది అధిగమించి వీలులేని అడ్డంకిగా మారిందనీ మంత్రి రోజియర్ నాతో చెప్పారు."
2. ఏ వర్గానికి సంబంధించిన వ్యక్తులైనా రోజుకు 12 గంటలపాటు పని చేయాల్సి రావటం నిజంగా ఎంతో విచారించతగిన విషయం. భోజనానికి, ఫ్యాక్టరీకి పోయి రావటానికి పట్టే సమయంతో కలుపుకొని 24 గంటల్లోనూ 14 గంటలయిపోతాయి. ఆరోగ్యం సమస్యను అట్లా ఉంచి, నైతిక దృష్టితో చూస్తే, 13 ఏళ్ళ చిరుప్రాయం నుండీ, ఆంక్షల్లేని వృత్తుల్లోనయితే మరింత చిన్న వయసు నుండి విరామం అనేది లేకుండా కార్మిక వర్గాల సమయాన్ని అంతగా స్వాహాచేయడం అనేది అత్యంత హానికరమనీ, తీవ్రంగా గర్హించాల్సిన కీడు అనీ అంగీకరించడంలో ఎవ్వరూ సందేహించరనుకుంటాను ... కనుక సామాజిక నీతి కోసం, నియమబద్ధమైన జనాభాను తీర్చిదిద్దటం కోసం అత్యధిక ప్రజానీకానికి సముచితమైన జీవితానందాన్ని సమకూర్చడానికి అన్ని వృత్తుల్లోనూ ప్రతి పనిదినంలోనూ కొంత భాగాన్ని వినోద విరామాల కోసం కేటాయించాల్సిన అవసరం ఎంతైనా ఉంది." (రిపోర్ట్ ఆఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ ఫర్ 31, డిసెంబర్ 1841లో లియొనార్డ్ హోర్నర్.)

పగలు, రాత్రి, వయసు, స్త్రీ, పురుషుడు అనే వాటికి గల పరిమితులన్నీ బద్దలుగొట్టబడ్డాయి. పాత చట్టాల్లో పగలూ రాత్రీ అని గ్రామీణ సాదాతనంతో ఉండే భావాలు సైతం ఎంత గందరగోళమయ్యాయంటే 'న్యాయశాస్త్ర రీత్యా' పగలంటే ఏమిటి రాత్రంటే ఏమిటి అనేది వివరించడానికి ఆఖరికి 1860లో ఒక ఇంగ్లీషు జడ్జికి థార్మిక వివేచన అవసరమైంది.[1] పెట్టుబడి విచ్చల విడిగా వీరంగం వేసింది.

కొత్త ఉత్పత్తి వ్యవస్థ యొక్క మోత, అలజడులతో మొదట నిశ్చేష్టమై తర్వాత మళ్ళీ కొంత తేరుకోగానే కార్మికవర్గం యొక్క ప్రతిఘటన ఆరంభమైంది. అదీ మొదట యంత్రవాదానికి పుట్టినిల్లయిన ఇంగ్లండులోనే. అయితే 30 ఏళ్ళపాటు శ్రామిక ప్రజలు గెల్చుకున్న రాయితీలు కేవలం నామమాత్రమే. 1802కు 1833కు మధ్య పార్లమెంట్ 5 కార్మిక చట్టాలు చేసింది. కాని వాటి అమలు కోసమూ అవసరమైన అధికారులూ వగైరాల ఖర్చు కోసమూ ఒక్క పెన్నీ కూడా మంజూరు చెయ్యకుండా ఉండే తెలివితేటలు దానికుండినాయి.[2]

అది అమలులోకి రాలేదు. "వాస్తవం ఏమంటే 1833 చట్టానికి ముందు తరుణ వయస్కులతో, పిల్లలతో రాత్రంతా, పగలంతా లేదా రాత్రింబగళ్ళూ యథేచ్ఛగా పని చేయించడం జరిగింది.[3]

జవులి, ఉన్ని, నార, సిల్కు ఫ్యాక్టరీలతో కూడిన ఆధునిక పరిశ్రమకు మామూలు పనిదినం అనేది 1833 ఫ్యాక్టరీ చట్టం నుండే ప్రారంభమవుతుంది. 1833 నుండి 1864 వరకూ గల ఇంగ్లీషు ఫ్యాక్టరీ చట్టాల చరిత్రకంటే పెట్టుబడి సారానికి స్వభావోచితమైనది మరొకటి ఏదీ ఉండదు.

1833 చట్టం సాధారణ ఫ్యాక్టరీ పనిదినం అంటే ఉదయం ఐదున్నర నుండి రాత్రి ఎనిమిదిన్నర వరకూ అని ప్రకటించింది. ఈ పరిమితుల్లోపల, 15 గంటల్లోనూ తరుణ వయస్కుల్ని (13 నుండి 18 ఏళ్ళ వయసు గల వ్యక్తుల్ని) రోజులో ఏ సమయంలోనైనా పనిలో నియమించడం చట్టబద్ధం. అయితే ఏ రోజూ విడిగా ఏ వ్యక్తీ ప్రత్యేకంగా చట్టం రీత్యా వీలు కల్పించబడిన కొన్ని సందర్భాల్లో తప్ప, 12 గంటలకు మించి పని చేయరాదు. చట్టంలో 6వ విభాగం ఇలా పేర్కొంది : "పైన పేర్కొన్న నిబంధనలు వర్తించి ప్రతి వ్యక్తికీ ప్రతి రోజూ ఒకటిన్నర గంటలకు తగ్గకుండా భోజనాల వ్యవధిని అనుమతించాలి." 9 ఏళ్ళలోపు పిల్లలను, తర్వాత పేర్కొన్న మినహాయింపులతో, పనిలో

---

1. చూ. జడ్జిమెంట్ ఆఫ్ మిస్టర్ ఆట్వే, బెల్ ఫాస్ట్ హిలరీ సెషన్స్ కౌంటీ ఆంట్రిమ్, 1860."

2. బూర్జువా రాజైన లూయి ఫిలిప్ హయాం 1841 మార్చి 22న చేసిన ఏకైక ఫ్యాక్టరీ చట్టం ఎప్పుడూ అమలులోకి రాకపోవడం అన్నది అతని పాలనకు ఎంతో స్వభావోచితం. ఈ చట్టం కేవలం బాల కార్మికులకే ఉద్దేశించబడింది. 8, 12 ఏళ్ళ మధ్య పిల్లలకు రోజుకు 8 గంటల్ను, 12, 16 ఏళ్ళ మధ్య పిల్లల్ను సైతం రాత్రి పనికి అనుమతించేటటువంటి అనేక మినహాయింపులున్నాయి. ప్రతి ఎలుక సహితం పోలీసు పరిపాలనాధికారం కింద ఉండే దేశంలో ఈ చట్టాన్ని అజమాయిషీ, అమలు అన్నవి 'వాణిజ్య మిత్రుల' సహృదయతకు వదిలేయబడ్డాయి. కేవలం 1853 నుండి మాత్రమే ఒకే ఒక విభాగంలో - డునార్డ్ విభాగంలో - వేతనం పొందే ప్రభుత్వ ఇన్‌స్పెక్టర్ నియమించబడ్డాడు. 1848 విప్లవం నాటి వరకూ సర్వ అంశాలకూ సంబంధించిన అనేక చట్టాల మొత్తంలో లూయీ ఫిలిప్ చట్టం ఒంటరిగా ఉందనే విషయం కూడా ఫ్రెంచి సమాజ అభివృద్ధికి తక్కువ స్వభావోచితం కాదు.

3. "రిపోర్ట్ ఆఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్" ఏప్రిల్ 30, 1860, పుట 50.

నియమించడం నిషిద్ధం. 9–13 ఏళ్ళ పిల్లల పని రోజుకు 8 గంటలకు పరిమితం చేయబడింది. రాత్రి పని, అంటే ఈ చట్టం ప్రకారం రాత్రి 8.30కీ, ఉదయం 5.30కీ మధ్య అని 9–18 ఏళ్ళ పిల్లలందరికీ నిషిద్ధం.

వయోజనుల శ్రమ శక్తిని దోచుకోవడంలో పెట్టుబడికుండే స్వేచ్ఛను, వారి మాటల్లో శ్రమ స్వేచ్ఛను, ఆటంకపర్చాలనే కోరిక చట్టాన్ని రూపొందించిన వారికేమాత్రం లేదు. పైగా ఫ్యాక్టరీ చట్టాలు అంత అఘాయిత్యపు పర్యవసానాలకు దారితీయకుండా నిరోధించేందుకు వారొక ప్రత్యేక పద్ధతిని సృష్టించారు.

1833, జూన్ 28న కమిషన్ యొక్క సెంట్రల్ బోర్డ్ మొదటి నివేదిక ఇలా అంది : ఇప్పుడు నిర్వహించబడుతున్న తీరులో ఫ్యాక్టరీ వ్యవస్థలో ఉన్న మహా దౌష్ట్యం ఏమిటంటే, పిల్లల శ్రమను దాదాపు పెద్దవాళ్ళ శ్రమ కాలంతో సమానంగా కొనసాగించే అవసరాన్ని కలిగిస్తుందని మా కనిపిస్తోంది. పెద్దవాళ్ళ శ్రమను పరిమితం చేయడం ద్వారా ఆ దౌష్ట్యాన్ని తొలగించవచ్చు గానీ, అప్పుడది ఇంకా పెద్ద దౌష్ట్యాన్ని కలిగిస్తుందని మా అభిప్రాయం. అందువల్ల రెండు జట్ల పిల్లలతో పని చేయించడం అన్న పథకం దానికి ఏకైక పరిష్కారంలా కనిపిస్తుంది...” కనుక రిలే వ్యవస్థ అనబడే పేరుతో ఈ ‘పథకం’ అమలు జరిగింది. ఉదయం 5.30 నుండి మధ్యాహ్నం 1.30 వరకూ 9–13 ఏళ్ళ ఒక జట్టు పిల్లలూ, మధ్యాహ్నం 1.30 నుండి రాత్రి 8.30 వరకూ మరో జట్టు పిల్లలూ పనిలో పెట్టబడ్డారు.”

పిల్లల శ్రమకు సంబంధించి గత 22 ఏళ్ళుగా చేయబడిన చట్టాలన్నిటినీ సిగ్గుమాలిన విధంగా నిర్లక్ష్యం చేసినందుకు కార్ఖానా యజమానులను సత్కరించేందుకు గాను ఆ మాత్రకు మరికొంత పంచదార పూయడం జరిగింది. 1834 మార్చి ఒకటో తేదీ తర్వాత 11 ఏళ్ళలోపూ, 1835 మార్చి ఒకటో తేదీ తర్వాత 12 ఏళ్ళలోపూ, 1836 మార్చి ఒకటో తేదీ తర్వాత 13 ఏళ్ళలోపూ వయసున్న పిల్లలెవరితోనూ ఫ్యాక్టరీలో రోజుకు ఎనిమిది  గంటలు మించి పని చేయించరాదని పార్లమెంటు శాసించింది. డా॥ ఫార్, సర్ ఎ కార్లిస్లె, సర్ బి. బ్రోడీ, సర్ సి. బెల్, మిస్టర్ గుత్రి తదితరులు, ఒక్కమాటలో చెప్పాలంటే లండన్‌లో ఉన్న అత్యంత ప్రఖ్యాత శాస్త్ర నిపుణులూ, వైద్యులూ కామన్స్ సభలో ఇచ్చిన తమ వాంగ్మూలంలో ఆలస్యం చేస్తే ప్రమాదం అని ప్రకటించినప్పటికీ, పెట్టుబడి ఎడల పూర్తి సద్భావంతో చూపబడిన ఈ ‘ఉదార వాదం’ మరింత గమనార్హం. డా॥ ఫార్ తన అభిప్రాయాన్ని మరింత ముతకగా వ్యక్తం చేశాడు.: “అకాల మృత్యువును కలిగిస్తున్న రూపం ఏదైనా దాన్ని నిరోధించడానికి శాసనం అవసరం. తప్పకుండా ఇది (ఫ్యాక్టరీ పద్ధతి) మరణాన్ని కల్గిస్తున్న అత్యంత క్రూరమైన పద్ధతి.”

ఏ ‘సంస్కరింపబడిన’ పార్లమెంటు కార్ఖానా యజమానుల ఎడల తనకున్న సున్నితమైన సద్భావం దృష్ట్యా 13 ఏళ్ళలోపు పిల్లల్ని రాబోయే అనేక ఏళ్ళపాటు ఫ్యాక్టరీ నరకంలో వారానికి 72 గంటలు పనిచేయమని శాసించిందో, అదే పార్లమెంటు మరోవైపున విమోచన చట్టంలో మాత్రం (అక్కడ కూడా స్వేచ్ఛను బొట్టు బొట్టుగా మాత్రమే జారనిచ్చింది.) ప్రారంభంలోనే ఏ నీగ్రో బానిసతోనూ వారంలో 45 గంటలకు మించి పని చేయించరాదని తోటల యజమానుల్ని శాసించింది.

అయితే ఏ రకంగానూ సమాధానపడని పెట్టుబడి ఇప్పుడు పెద్ద గోలతో ఆందోళన

ప్రారంభించింది. అది ఏళ్ళపాటు కొనసాగింది. పిల్లల పేరుతో 8 గంటల పనికి పరిమితం చేయబడి, నిర్దిష్ట స్థాయిలో నిర్బంధ విద్య నేర్పబడాల్సిన వారి వయస్సుపై ప్రధానంగా ఆందోళన జరిగింది. పెట్టుబడిదారీ మానవ శాస్త్రం ప్రకారం బాల్యం పదో ఏటే అంతమైపోతుంది. మహా అయితే 11వ ఏట ఫ్యాక్టరీ చట్టం పూర్తి స్థాయిలో అమల్లోకి వచ్చే సమయం, 1836 అనే దారుణ సంవత్సరం, దగ్గరపడే కొద్దీ కార్ఖానా యజమానుల మూక ఆటవికంగా చెలరేగింది. నిజానికి ప్రభుత్వాన్ని వారు ఎంతగా బెదరగొట్టగలిగారంటే 1835లో అది బాలల వయో పరిమితిని 13 నుండి 12కు తగ్గించాలని ప్రతిపాదించింది. ఈలోగా బయట నుండి ఒత్తిడి మరింత ప్రమాదకరంగా పెరిగింది. కామన్స్ సభ ధైర్యం సడలిపోయింది. 13 ఏళ్ళలోపు పిల్లల్ని పెట్టుబడి అనే జగన్నాథ రథచక్రాల కింద రోజుకు 8 గంటలకు మించి నెట్టడానికి అది తిరస్కరించింది. 1833 చట్టం పూర్తిగా ఆచరణలోకి వచ్చింది. 1844 జూన్ వరకూ అది మారకుండా ఉండింది.

ఫ్యాక్టరీ పనిని మొదట పాక్షికంగానూ, తర్వాత పూర్తిగానూ అది క్రమబద్ధం చేసిన ఈ పదేళ్ళ కాలంలోనూ ఫ్యాక్టరీ ఇన్‌స్పెక్టర్ల అధికార నివేదికలు ఈ చట్టాన్ని అమలు చేయడం అసాధ్యమనే ఫిర్యాదులతో నిండి ఉన్నాయి. రోజులో ఉదయం 5.30 నుండి రాత్రి 8.30 వరకూ గల 15 గంటల్లో ప్రతి తరుణ వయస్కునితోనూ, ప్రతి బాలునితోనూ అతని 12 లేదా 8 గంటల పని ఎప్పుడైనా చేయించుకోవచ్చు. పని ప్రారంభం, విరామం, తిరిగి కొనసాగించడం, సమాప్తం – ఈ అన్నిటినీ 1833 చట్టం పెట్టుబడి ప్రభువుల అభీష్టానికి వదిలేసింది. అంతేగాక వారు విభిన్న వ్యక్తులకు వేర్వేరు భోజనాల వేళల్ని కేటాయించడాన్ని అనుమతించింది. ఈ పెద్దమనుషులు ఒక కొత్త రిలేల పద్ధతిని కనుగొన్నారు. దాని ప్రకారం కార్మిక అశ్వాలు నిర్ణీత కేంద్రాల దగ్గర మార్చబడవు. మారుతున్న కేంద్రాలలో మరో కొత్త బండికి కట్టబడతాయి. ఈ పద్ధతిలో ఉన్న అందాన్ని చూడటానికి తర్వాత తిరిగొస్తాం కనుక మనం ఇక్కడ ఎక్కువసేపు ఆగబోవడం లేదు. కాని మొదటి చూపులోనే ఇది మాత్రం స్పష్టం : ఈ పద్ధతి మొత్తం ఫ్యాక్టరీ చట్టాన్ని సారంలో మాత్రమే కాదు, అక్షరాలా అంతం చేసింది. ప్రతి విడి బాలునికీ, విడి తరుణ వయస్కునికీ వేర్వేరు చిట్టా కలిగిన ఈ సంకీర్ణమైన పద్ధతిలో ఫ్యాక్టరీ ఇన్‌స్పెక్టర్లు చట్టబద్ధంగా నిర్ణయించబడిన పని కాలాన్నీ, కేటాయించబడిన చట్టబద్ధ భోజనాల వేళల్నీ ఇలా అమలు జరిపించగలరు? అనేక ఫ్యాక్టరీల్లో పాత పాశవికత్వం త్వరలోనే మళ్ళీ వికసించి, ఏ శిక్షకూ గురికాకుండా తప్పించుకుంది. కొత్తగా కనుగొనబడిన రిలే వ్యవస్థలో ఎటువంటి అదుపు సాధ్యం కాదని హోం సెక్రటరీతో జరిగిన ఇంటర్వ్యూలో (1844) ఫ్యాక్టరీ ఇన్‌స్పెక్టర్లు నిరూపించారు.[1] అయితే ఈలోగా పరిస్థితులు బాగా మారాయి. ఫ్యాక్టరీ కార్మికులు, ముఖ్యంగా 1838 నుండీ, చార్టర్‌ని తమ రాజకీయ ఎన్నికల నినాదంగా చేసుకొన్నట్టే పది గంటల బిల్లును ఆర్థిక ఎన్నికల నినాదంగా చేసుకున్నారు. 1833 చట్టానికి అనుగుణంగా తమ ఫ్యాక్టరీలను నిర్వహించిన కొంతమంది కార్ఖానా యజమానులు సైతం తమ దొంగ సహోదరులు తమ అధిక లజ్జా రాహిత్యం వల్లనో లేదా మరింత అనుకూలమైన స్థానిక పరిస్థితుల వల్లనో చట్టాన్ని ఉల్లంఘించగలుగుతూ నీతి బాహ్యంగా సాగిస్తున్న పోటీపై వినతి పత్రాలతో పార్లమెంటును ముంచెత్తారు. అంతేగాక వ్యష్టి

1. "రిపోర్ట్ ఆఫ్ ఇన్‌స్పెక్టర్ ఫ్యాక్టరీస్", అక్టోబరు 31, 1849, పుట 6.

కార్ఖానా యజమాని లాభం కోసం తహతహలాడినప్పటికీ కార్ఖానా యజమానుల వర్గ ప్రతినిధులూ, రాజకీయ నాయకులూ కార్మికుల విషయంలో తమ యుద్ధరంగంలోనూ, మాటల వైఖరిలోనూ మార్పును ఆదేశించింది. వారు ధాన్యపు చట్టాల రద్దు కొరకు పోరాటం ప్రారంభించారు. తమ విజయానికి వారికి కార్మికుల సహాయం అవసరమైంది. కనుక వారు రెండింతల రొట్టెని మాత్రమేగాక స్వేచ్ఛా వాణిజ్యపు స్వర్ణయుగంలో పది గంటల చట్టాన్ని చేస్తామని కూడా వాగ్దానం చేశారు.[1] ఆ రకంగా వారు కేవలం 1833 చట్టాన్ని వాస్తవం చేయడానికి మాత్రమే ఉద్దేశించిన చర్యను వ్యతిరేకించడానికి మరింతగా భయపడ్డారు. తమ అత్యంత పవిత్ర ప్రయోజనమైన భూమి కౌలు పోతుందనే భయంలో టోరీలు తమ శత్రువుల "నీచమైన పద్ధతుల"కు[2] వ్యతిరేకంగా జీవకారుణ్యపు ఆగ్రహంతో గర్జించారు.

1844, జూన్ 7వ తేదీ నాటి అదనపు ఫ్యాక్టరీ చట్టం ఇలా పుట్టింది. అది 1844 సెప్టెంబరు 10వ తేదీన అమల్లోకి వచ్చింది. అది కార్మికుల్లో మరో తరగతికి, అంటే 18 ఏళ్ళు దాటిన స్త్రీలకు రక్షణ కల్పించింది. అన్ని అంశాల్లోనూ వారు తరుణ వయస్కులతో సమానంగా పరిగణింపబడ్డారు. వారి పని కాలం 12 గంటలకు పరిమితం చేయబడింది. వారి విషయంలో రాత్రి పని నిషేధించబడింది. మొట్టమొదటిసారిగా వయోజన కార్మికుల శ్రమను ప్రత్యక్షంగా, అధికారికంగా అదుపు చేయాల్సిన తప్పనిసరి పరిస్థితిని శాసనం గమనించింది. 1844-1845 ఫ్యాక్టరీ నివేదికలో ఎలా వ్యంగ్యంగా రాయబడింది : "ఆ రకంగా తమ హక్కుల్లో జరిగిన జోక్యానికి స్త్రీలెవ్వరూ విచారించిన దాఖలాలు నా దృష్టికి రాలేదు."[3] 13 ఏళ్ళలోపు పిల్లల పని కాలం రోజుకు $6\frac{1}{2}$ గంటలకు, కొన్ని పరిస్థితుల్లో 7 గంటలకు తగ్గించబడింది.[4]

"మోసపు రిలే పద్ధతి" యొక్క దుర్లక్షణాలను వదిలించుకోడానికి ఇతర అంశాలతోపాటు ఈ ముఖ్యమైన నిబంధనల్ని చట్టం ఏర్పరచింది : "పిల్లల, తరుణ వయస్కుల పని గంటలు అనేవి ఉదయం ఏ ఒక్క బాలుడైనా లేదా తరుణ వయస్కుడూ పని ప్రారంభిస్తాడో అప్పటి నుంచి లెక్కించబడతాయి." అంటే ఉదాహరణకు 'క' ఉదయం 8 గంటలకు 'చ' ఉదయం 10 గంటలకు పని ప్రారంభించా రనుకుందాం. అయినప్పటికీ 'చ' పనిదినం 'క' పనిదినంతోపాటు అదే గంటలో ముగుస్తుంది. "ఒక ప్రభుత్వ గడియారాన్ని బట్టి వేళను క్రమబద్ధం చేయాలి." ఉదాహరణకు దగ్గరలో ఉన్న రైల్వే గడియారం. దాని ప్రకారం ఫ్యాక్టరీ గడియారం నడవాలి. ఏ యే వేళల్లో పని ప్రారంభించేదీ, ముగించేదీ, భోజనాలు చేసేదీ తెలిపే ఒక "స్పష్టమైన" అచ్చు నోటీసును యజమాని తగిలించాలి. మధ్యాహ్నం 12 గంటలకు ముందు పని ప్రారంభించే పిల్లల్ని మళ్ళీ మధ్యాహ్నం ఒంటిగంట తర్వాత పనిలో పెట్టరాదు. కనుక అపరాహ్నం జట్టులో ఉదయం పని చేసినవారు కాక వేరే పిల్లలుండాలి.

1. "రిపోర్ట్ ఆఫ్ ఇన్‌స్పెక్టర్ ఫ్యాక్టరీస్, అక్టోబరు 31, 1848, పుట 98.
2. 'నీచమైన పద్ధతులు' అనే మాటల్ని లియొనార్డ్ హార్నర్ తన అధికారి నివేదికల్లో ఉపయోగించాడు. ("రిపోర్ట్ ఆఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్" అక్టోబరు 31, 1859, పుట 7)
3. "రిపోర్ట్ ఆఫ్" సెప్టెంబర్ 30, 1844, పుట 15.
4. పిల్లలు ప్రతి రోజూ కాకుండా, రోజు విడిచి రోజు పని చేసినట్లయితే వారితో రోజుకు 10 గంటల పాటు పని చేయించడాన్ని చట్టం అనుమతిస్తుంది. ఈ నిబంధన చాలామటుకు అమలు జరుగలేదు.

భోజనాల కోసం ఉన్న గంటన్నరలో "కనీసం ఒక గంట అపరాహ్నం 3 గంటలకు ముందు కేటాయించాలి ... రోజూ దానికి ఒకే సమయం కేటాయించాలి. కనీసం 30 నిమిషాల భోజన సమయాన్ని విరామంగా కేటాయించకుండా ఏ బాలునితోనూ, తరుణ వయస్కునితోనూ మధ్యాహ్నం ఒంటిగంటకు ముందు అయిదు గంటలకంటే ఎక్కువసేపు పని చేయించరాదు. అప్పుడు (భోజనాల వేళల్లో) ఏ బాలుడినీ, తరుణ వయస్కుడినీ పనిలో పెట్టరాదు. ఉత్పత్తి ప్రక్రియ సాగుతున్న ఏ గదిలోనైనా ఉండటాన్ని అనుమతించరాదు.

ఈ సూక్ష్మ అంశాలు గంటల్ని, పరిమితులను, విరామాల్ని గడియారం ప్రకారం సైనిక ఏక రూపతతో నిర్ణయిస్తున్నాయని గమనించాము. ఇవి ఏ మాత్రం పార్లమెంటు ఊహాజనితాలు కాదు. అవి క్రమ క్రమంగా పరిస్థితుల నుండే ఆధునిక ఉత్పత్తి విధానం యొక్క సహజ నియమాలుగా పరిణమించాయి. ప్రభుత్వం వాటిని రూపొందించడం, అధికారికంగా గుర్తించడం, ప్రకటించడం అన్నవి వర్గాల సుదీర్ఘ పోరాటపు ఫలితం. వాటి తొలి పర్యవసానాల్లో ఒకటేమంటే ఆచరణలో ఫ్యాక్టరీలలో పురుష కార్మికుల పనిదినం అవే పరిమితులకు లోనైంది. ఎందుకంటే, అత్యధిక ఉత్పత్తి ప్రక్రియల్లో పిల్లల, తరుణ వయస్కుల, స్త్రీల సహకారం తప్పనిసరి. కనుక మొత్తం మీద 1844 నుండి 1847 వరకూ ఫ్యాక్టరీ చట్టం క్రింద అన్ని పారిశ్రామిక శాఖల్లోనూ 12 గంటల పనిదినం సామాన్యమూ, ఏకరూపమూ అయింది.

అయితే కార్ఖానా యజమానులు ఈ "పురోగమనాన్ని" దానికి బదులు "తిరోగమనం" లేకుండా అనుమతించలేదు. వారి ప్రేరణతో కామన్స్ సభ దోపిడీ చేయవీలైన పిల్లల కనీస వయస్సును 9 నుండి 8కి తగ్గించింది. దైవ, మానవ న్యాయం[1] ప్రకారం పెట్టుబడిదారులకు చెందాల్సిన ఫ్యాక్టరీ బాలల అదనపు సరఫరాను ఖాయపర్చడం కోసం ఇది జరిగింది.

ఇంగ్లండు ఆర్థిక చరిత్రలో 1846-47 సంవత్సరాలు యుగావిష్కర్తలు. ధాన్యం చట్టాల రద్దూ, దూది వగైరా ముడి పదార్థాలపై సుంకం రద్దూ, స్వేచ్ఛా వ్యాపారమే శాసనాలకు మార్గదర్శకం అనే ప్రకటనా; ఒక్కమాటలో, స్వర్ణయుగ ఆగమనం. మరోవైపున అవే సంవత్సరాల్లో చార్టిస్టు ఉద్యమమూ, 10 గంటల ఆందోళనా వాటి అత్యున్నత స్థాయిని చేరుకున్నాయి. పగతో బుసలు కొడుతున్న టోరీలు వాటికి మిత్రులయ్యారు. బ్రైట్, కాబ్డెన్‌ల నాయకత్వంతో తప్పుడు సత్యాల స్వేచ్ఛా వ్యాపారుల సైన్యం యొక్క మొండి వ్యతిరేకత ఎదురైనప్పటి ఎంతో సుదీర్ఘ సంఘర్షణకు లోనైన పది గంటల బిల్లును పార్లమెంటు ఆమోదించింది.

1847 జులై ఒకటో తేదీన తరుణ వయస్కులకూ (13 నుండి 18 ఏళ్ళ వరకూ), మొత్తం స్త్రీలకూ పనిదినాన్ని 11 గంటలకు కుదించాలనీ, 1848 మే ఒకటో తేదీన పనిదినాన్ని నిర్దిష్టంగా 10 గంటలకు పరిమితం చేయాలని 1847 జూన్ 8వ తేదీ నాటి ఫ్యాక్టరీ చట్టం ఆదేశించింది. ఇతర అంశాలలో ఈ చట్టం 1833 చట్టాలను సంస్కరించడమూ, సంపూర్ణం చేయడమూ మాత్రమే చేసింది.

---

1. "వారి పని గంటల్లో కుదింపు వల్ల ఎక్కువ సంఖ్యలో (పిల్లల్ని) నియమించాల్సి వస్తుంది. కనుక 8 నుండి 9 ఏళ్ళ పిల్లల అదనపు సరఫరా పెరిగిన గిరాకీని సంతృప్తిపరుస్తుందని భావించబడింది." (అదే నివేదిక, పుట 13)

ఇప్పుడిక 1848 మే ఒకటిన ఆ చట్టం పూర్తిగా ఆచరణలోకి రాకుండా అడ్డుకోటానికి పెట్టుబడి ఒక ప్రాథమిక ఉద్యమం ప్రారంభించింది. అనుభవం ద్వారా నేర్చుకున్నామనే సాకుతో కార్మికులే తమ సొంత పనిని నాశనం కావడంలో సాయపడేటట్లు పథకం వేయబడింది. ఆ సమయం తెలివిగా ఎంచుకోబడింది. "ఇప్పటికే రెండేళ్ళకు పైగా (1846–47 భయంకర సంక్షోభం కారణంగా) చాలా మిల్లులు తక్కువసేపు పని చేయడం వల్లా, చాలా మిల్లులు పూర్తిగా మూసేయబడటం వల్లా ఫ్యాక్టరీ కార్మికులు తీవ్రమైన బాధలు పడ్డారని కూడా గుర్తుంచుకోవాలి. కనుక గణనీయమైన సంఖ్యలో కార్మికులు చాలా ఇబ్బందులలో ఉండి ఉండాలి. చాలామంది అప్పట్లో అప్పుల్లో ఉండి ఉంటారు. కనుక పోయిన నష్టాలను పూడ్చుకోవడానికీ, బహుశా అప్పులు తీర్చుకోడానికీ, లేదా తమ ఫర్నిచర్‌ను తాకట్టు నుండి విడిపించుకోడానికీ, లేదా అమ్మేసిన వాటికి బదులు కొత్తవి సంపాదించుకోడానికీ లేదా తమకు తమ కుటుంబాలకు అవసరమైన కొత్త దుస్తులు కొనుక్కోడానికీ ప్రస్తుతానికి తాము ఎక్కువ గంటలు పని చేయాలని కార్మికులు కోరుకుంటారనే ఊహ కలిగి ఉండవచ్చు."[1]

వేతనాలను సార్వత్రికంగా 10% తగ్గించడం ద్వారా ఈ పరిస్థితుల సహజ ప్రభావాన్ని మరింత పెంచడానికి కార్ఖానా యజమానులు ప్రయత్నించారు. కొత్త స్వేచ్ఛా వ్యాపార యుగారంభ ఉత్సవాన్ని జరపటానికా అన్నట్లు ఇది జరిగింది. పని దినం 11 గంటలకు తగ్గించబడగానే వేతనం మరో $8\frac{1}{3}\%$ కుదించబడింది. పనిదినాన్ని చివరికి పది గంటలకు తగ్గించగానే మరోమారు వేతనంలో అందుకు రెట్టింపు కుదించబడింది. కనుక పరిస్థితులు అనుమతించిన ప్రతిచోటా వేతనాలలో కనీసం 25% కుదింపు జరిగింది.[2] అటువంటి సానుకూలంగా సన్నద్ధం చేయబడిన పరిస్థితుల్లో 1847 చట్టాన్ని రద్దు చేయించడం కోసం ఫ్యాక్టరీ కార్మికుల్లో ఆందోళన ప్రారంభమైంది. ఈ ప్రయత్నంలో అబద్ధాలూ, లంచాలూ, బెదిరింపులూ వేటినీ వదిలేయలేదు. అయితే అంతా వృధా అయింది. ఈ "చట్టం తమను అణచివేస్తోంద"ని ఫిర్యాదు చేసేలా చేయబడిన కార్మికుల అరడజను అర్జీలకు సంబంధించి, ముఖాముఖి జరిగిన దర్యాప్తులో అర్జీదారులే తమతో బలవంతంగా సంతకాలు పెట్టించారని ప్రకటించారు. "వారు అణచివేయబడుతున్నట్టు భావించారు. కాని కచ్చితంగా ఫ్యాక్టరీ చట్టం వల్ల మాత్రం కాదు"[3] అయితే కార్ఖానా యజమానులు కోరుకున్నట్టు కార్మికులతో మాట్లాడించడంలో సఫలం కాకుంటేనేం, తామే స్వయంగా శ్రామిక ప్రజల పేరుతో పత్రికల్లోనూ, పార్లమెంటులోనూ అంతకంటే బిగ్గరగా కేకలేశారు. దురదృష్టవంతులైన ఫ్యాక్టరీ కార్మికులను తమ

1. "రిపోర్ట్ ఆఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్", అక్టోబరు 31, 1848, పుట 16.
2. "వారానికి 10 షిల్లింగులు పొందుతున్న వారి నుండి 10 శాతం తగ్గింపు ద్వారా 1 షిల్లింగూ, పని గంటలు తగ్గినందుకుగాను మిగిలిన 9 షిల్లింగుల నుండి 1 షిల్లింగు 6 పెన్నీలూ, మొత్తం 2 షిల్లింగుల 6 పెన్నీలు తగ్గించబడ్డాయని నేను గమనించాను. అయినప్పటికీ వారిలో చాలామంది తాము పది గంటలే పని చేస్తామని చెప్పారు." (అదే నివేదిక)
3. "దాని (అర్జీ)పై నేను సంతకం పెట్టినప్పటికీ, నా చేతిని చెడ్డపనికి ఉపయోగిస్తున్నానని ఆ సమయంలో నేను చెప్పాను." "అయితే నీ చేతిని దాని కోసం ఎందుకుపయోగించావు?" "ఎందుకంటే నేను తిరస్కరించి వుంటే నన్ను తొలగించేవారు..." దీనినిబట్టి ఈ అర్జీదారుడు 'అణచివేయబడింది', కచ్చితంగా ఫ్యాక్టరీ చట్టంవల్ల కాదని భావించినట్టు కనిపిస్తుంది." అదే నివేదిక, పుట 102.

మానవతావాద బలిపీఠానికి నిర్దయగా బలిచ్చిన ఫ్రెంచి జాతీయ పరిషత్ విప్లవ కమిషనర్లలా వ్యవహరిస్తున్నారని, ఫ్యాక్టరీ ఇన్‌స్పెక్టర్లను వారు నిందించారు. ఈ పన్నాగం కూడా విఫలమైంది. ఫ్యాక్టరీ ఇన్‌స్పెక్టర్ లియొనార్డ్ హార్నర్ స్వయంగానూ, తన సబ్ ఇన్‌స్పెక్టర్ల ద్వారానూ లాంక్‌షైర్ ఫ్యాక్టరీలలో సాక్షుల పరిశీలన నిర్వహించాడు. పరిశీలించబడిన వారిలో సుమారు 70 శాతం కార్మికులు 10 గంటలకు అనుకూలంగానూ, అంతకంటే చాలా తక్కువ శాతం 11 గంటలకు అనుకూలంగానూ, పరిగణించనవసరం లేనంత తక్కువ మంది పాత 12 గంటలకు అనుకూలంగానూ ఉన్నట్లు ప్రకటించారు.[1]

మరో 'స్నేహపూర్వక' పన్నాగం ఏమంటే, పురుష కార్మికులతో 12–15 గంటలపాటు పని చేయించడమూ, తర్వాత ఈ విషయాన్ని కార్మికవర్గం తన గుండెలోతుల్లో ఏం కోరుతోందో తెలపటానికి అత్యుత్తమ ఉదాహరణగా ఊదరగొట్టడమూ. అయితే "నిర్దాక్షిణ్యపు" ఫ్యాక్టరీ ఇన్‌స్పెక్టరు లియొనార్డ్ హార్నర్ మళ్ళీ ముందుకొచ్చాడు. ఎక్కువ గంటలు పని చేసిన వారిలో అత్యధికులు ఇలా ప్రకటించారు: "తక్కువ వేతనాలతో అయినా పది గంటల పని చేయడమే వారికిష్టం. అయితే వేరే దిక్కు లేదు. ఎందుకంటే చాలామందికి పని లేదు. (చాలామంది వడికేవాళ్ళు దారాలు అతుకు వేసేవాళ్ళుగా పని చేయాల్సి రావడం వల్ల చాలా తక్కువ వేతనాలు పొందుతున్నారు.) వారు ఎక్కువ గంటలు పని చేయడానికి నిరాకరిస్తే వెంటనే ఇతరులు వారి స్థానాల్లోకి వస్తారు. కనుక వారు ఎక్కువ గంటలు పని చేయాలా, లేదా మొత్తంగా ఉద్యోగం నుండి తొలగించబడాలా అన్నదే వారి ముందున్న ప్రశ్న.[2]

ఆ రకంగా పెట్టుబడి యొక్క తొలి ప్రచారం విఫలమైంది. పది గంటల చట్టం 1848 మే ఒకటో తేదీన ఆచరణలోకి వచ్చింది. ఈలోగా చార్టిస్టు పార్టీ నాయకులు జైళ్ళలో పెట్టబడ్డారు. దాని నిర్మాణం విచ్ఛిన్నమయింది. దాని వైఫల్యం ఇంగ్లీషు కార్మికుల ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీసింది. తర్వాత త్వరలోనే పారిస్‌లో జరిగిన జూన్ తిరుగుబాటూ, దానిపై జరిగిన రక్తసిక్తమైన దమనకాండా మొత్తం ఖండమంతటిలో లాగే ఇంగ్లండులో కూడా పాలక వర్గ విభాగాలన్నింటినీ చేసింది. భూస్వాములూ, పెట్టుబడిదారులూ, స్టాక్ ఎక్స్ఛేంజ్‌ల తోడేళ్ళు, దుకాణదార్లూ, రక్షణవాదులూ, స్వేచ్ఛా వ్యాపారవాదులూ, ప్రభుత్వమూ ప్రతిపక్షమూ, మత గురువులూ, హేతువాదులూ, పడుచులంజలూ, వృద్ధ సన్యాసినులూ, ఆస్తి, మత, కుటుంబ, సమాజాల రక్షణకై ఉమ్మడి నినాదం క్రింద ఏకమయ్యారు. కార్మిక వర్గం ప్రతీచోటా బహిష్కరణలో, అర్ధాత్తూ అనుమానితు శాసనం కింద ఉంచబడింది; ప్రకటించబడింది. కార్ఖానా యజమానులు ఇక ఏమాత్రం సంయమనం పాటించాల్సిన అవసరం లేకపోయింది. వారు కేవలం పది గంటల చట్టానికి వ్యతిరేకంగా మాత్రమే కాదు, 1833 నుంచీ శ్రమ శక్తి "నిర్నిబంధ" దోపిడీని కొంత మేరకు అరికట్టే శాసనాలన్నిటికీ వ్యతిరేకంగా బహిరంగ తిరుగుబాటు ప్రకటించారు.

1. అదే నివేదిక, పుట 17. హార్నర్ జిల్లాలో ఆ రకంగా 181 ఫ్యాక్టరీలలోని 10,270 మంది పురుష కార్మికులు పరిశీలించబడ్డారు. 1848 అక్టోబరుతో ముగిసే అర్ధ సంవత్సర ఫ్యాక్టరీ నివేదికల అనుబంధంలో వారి సాక్ష్యం దొరుకుతుంది. ఇతరత్రా కూడా ఈ పరిశీలనలు విలువైన సమాచారం సమకూరుస్తాయి.

2. స్వయంగా లియొనార్డ్ హార్నర్ సేకరించిన సాక్ష్యం చూడండి. నంబర్లు 69, 70, 71, 72, 92, 93. తర్వాత సబ్ ఇన్‌స్పెక్టరు A సేకరించింది. చూడండి. నంబర్లు 51, 52, 58, 59, 62, 70 (అనుబంధంలో) ఒక కార్ఖానా యజమాని కూడా నగ్నసత్యాన్ని చెప్పాడు. నం. 14, నం. 265 చూడండి. అదే నివేదిక.

అది చిన్న స్థాయిలో ఒక బానిసత్వ అనుకూల తిరుగుబాటు. రెండేళ్ళ పాటు అమానుష నిర్లక్ష్యంతోనూ, టెర్రరిస్టు పశుబలంతోనూ కొనసాగించారు. ఇందులో తిరుగుబాటు చేసిన పెట్టుబడిదారునికి పోయేదేమీ లేదు, అతని కార్మికుల చర్మం తప్ప.

రాబోయే అంశాన్ని అర్థం చేసుకోవాలంటే, 1833, 1844, 1847 ఫ్యాక్టరీ చట్టాలు ఒకదాన్నొకటి సవరించుకోనంత మేరకూ మూడు అమల్లో ఉన్నాయనీ, వాటిలో ఏదీ 18 ఏళ్ళు దాటిన పురుష కార్మికుని పనిదినాన్ని పరిమితం చేయలేదనీ, 1833 నుంచీ ఉదయం 5.30 నుంచి రాత్రి 8.30 వరకూ గల 15 గంటలు చట్టబద్ధమైన 'దినం'గా ఉండిపోయిందనీ, ఈ పరిమితుల్లోపల తరుణ వయస్కులకూ, స్త్రీలకూ పైన పేర్కొన్న పరిస్థితుల్లో మొదట 12, తర్వాత 10 గంటల శ్రమ అమల్లో ఉందనీ గుర్తుంచుకోవాలి.

అక్కడక్కడా కార్ఖానాదారులు తరుణ వయస్కుల్లోనూ, స్త్రీలలోనూ ఒక భాగాన్ని, చాలా సందర్భాలలో సగం మందిని తొలగించి, ఇక పురుష కార్మికులకు దాదాపు కాలం చెల్లిన రాత్రి పనిని మళ్ళీ ప్రవేశపెట్టారు. పది గంటల చట్టం వల్ల తమకు మరో ప్రత్యామ్నాయం లేదని వారు అరిచారు.[1]

వారి రెండో చర్య భోజనానికి చట్టబద్ధమైన విరామాలకు సంబంధించింది. ఫ్యాక్టరీ ఇన్‌స్పెక్టర్లు చెప్పేది విందాం : "ఫ్యాక్టరీ యజమానులు ఆచరణలో అంత దూరం పోనప్పటికీ, వాళ్ళ వాదం ఏమిటంటే, పని గంటల్ని పదికి తగ్గించినప్పటి నుంచి, పని గంటలు ఉదయం 9 నుండి రాత్రి 7 గంటల వరకూ అనుకుంటే తాము ఉదయం 9కి ముందు ఒక గంటా, రాత్రి 7 తర్వాత ఒక అరగంటా (భోజనానికి) విరామం ఇవ్వడం ద్వారా చట్టంలోని విధులను నెరవేరుస్తామని అంటున్నారు. ఇప్పుడు కొన్ని సందర్భాల్లో భోజనానికి వారు గంటో, అరగంటో అనుమతిస్తున్నారు. అదే సమయంలో ఫ్యాక్టరీ పనిదినంలోనే గంటన్నర కేటాయించాల్సిన బాధ్యత తమకూ లేదని వారు పట్టుబడుతున్నారు."[2] కనుక భోజనాల వేళలకు సంబంధించి 1844 చట్టంలోని అత్యంత కచ్చితమైన విధులు కార్మికులు ఫ్యాక్టరీకి రావడానికి ముందూ, ఫ్యాక్టరీ నుండి బయటపడిన తర్వాతా మాత్రమే, అనగా తమ ఇంట్లో, తినడానికీ తాగడానికీ వారిని అనుమతించాయన్నమాట. కార్మికులు ఉదయం 9కి ముందే ఎందుకు తిండి తినరాదు? అయితే "విరామం అన్నది పని గంటలప్పుడే ఉండాలనీ, విరామం లేకుండా వరుసగా ఉదయం 9 నుండి రాత్రి 7 గంటల వరకూ 10 గంటలపాటు పని చేయించడం చట్టబద్ధం కాదనీ ప్రభుత్వ న్యాయవాదులు నిర్ణయించారు.[3]

ఈ సరస ప్రదర్శనల తర్వాత, పెట్టుబడి తన తిరుగుబాటుకు నాందిగా ఒక చర్య తీసుకుంది. ఆ చర్య 1844 చట్టానికి శాబ్దికంగా అనుగుణమైనదే, కనుక చట్టబద్ధమైనదే.

మధ్యాహ్నానికి ముందు పని చేయించిన 8–13 ఏళ్ళ పిల్లల్ని మధ్యాహ్నం ఒంటిగంట తర్వాత పనిలో పెట్టరాదని 1844 చట్టం కచ్చితంగా నిషేధించింది. అయితే మధ్యాహ్నం 12 గంటల తర్వాత పని మొదలయ్యే పిల్లల $6\frac{1}{2}$ గంటల పనిని అది ఏ రకంగానూ నియంత్రించలేదు. 8 ఏళ్ళ

1. "రిపోర్ట్", అక్టోబరు 31, 1848, పుటలు 133, 134.
2. "రిపోర్ట్", ఏప్రిల్ 30, 1848, పుట 47.
3. "రిపోర్ట్", అక్టోబరు 31, 1848, పుట 130.

పిల్లలు మధ్యాహ్నం తమ పని ప్రారంభించి ఉంటే వారితో 12 నుండి ఒంటిగంట వరకూ 1 గంటపాటు, 2 నుండి 4 గంటల వరకూ 2 గంటలపాటు, సాయంత్రం 5 నుండి 8.30 గంటల వరకూ 3½ గంటల పాటు మొత్తం చట్టబద్ధమైన 6½ గంటలపాటు పని చేయించవచ్చు. ఇంకా మెరుగేమంటే, వారి పని పురుష కార్మికుల పనితోపాటు రాత్రి 8.30 గంటల వరకూ కొనసాగడానికి గాను కార్ఖానా యజమానులు మధ్యాహ్నం రెండు గంటల వరకూ వారికి ఏ పనీ ఇవ్వకుండా ఉంటే సరిపోతుంది. అప్పుడు వారిని విరామం లేకుండా రాత్రి 8.30 వరకూ ఫ్యాక్టరీలో అట్టేపెట్టవచ్చు. "తమ యంత్రాలు పది గంటలకు పైగా పనిలో ఉండటానికి గానూ మొత్తం తరుణ వయస్కులూ, స్త్రీలూ వెళ్ళిపోయాక రాత్రి 8.30 వరకూ యజమానులు కావాలనుకుంటే పిల్లల్ని పురుష కార్మికులతోపాటు పనిలో ఉంచే ఈ అలవాటు ఇంగ్లండులో ఉందనేది ఇప్పుడు స్పష్టంగా ఆమోదించబడింది."[1] కార్మికులూ, ఫ్యాక్టరీ ఇన్‌స్పెక్టర్లూ దానిని ఆరోగ్య, నైతిక కారణాల ఆధారంగా నిరసించారు. అయితే పెట్టుబడి సమాధానమిది :

"నా శాసనాలు నాకున్నాయి, నే కోరేది న్యాయం
ఒప్పందంలో ఉన్నదే ఇప్పించండి మహాప్రభో"

నిజానికి, 1850 జులై 26వ తేదీన కామన్స్ సభకు సమర్పించబడిన గణాంకాల ప్రకారం, నిరసనలన్నిటినీ పక్కనబెట్టి, 1850 జులై 15న 257 ఫ్యాక్టరీలలో 3,742 పిల్లలు ఈ 'అలవాటు'కి గురయ్యారు.[2] 1844 చట్టం మధ్యాహ్నానికి ముందు కనీసం 30 నిమిషాల భోజన విరామం లేకుండా ఏకబిగిన 5 గంటలపాటు పని చేయించరాదన్నది కాని, మధ్యాహ్నం తర్వాత అటువంటిదేదీ అది సూచించలేదన్న విషయాన్ని పెట్టుబడి యొక్క శివంగి కళ్ళు పసికట్టాయి. కనుక అది 8 ఏళ్ళ పిల్లలతో విరామం లేకుండా మధ్యాహ్నం 2 నుండి రాత్రి 8.30 వరకూ చాకిరీ చేయించుకునే ఆనందాన్ని మాత్రమే గాక ఆ సమయంలో వారిని ఆకలితో మాడ్చే ఆనందాన్ని కూడా పొందే హక్కు తనకు ఉందని, ఆ హక్కును అనుభవించింది.

"ఇవ్వాల్సిందే అతని హృదయం
అదే అదే మా ఒప్పందం"[3]

---

1. "రిపోర్ట్", అదే నివేదిక, పుట 142.
2. "రిపోర్ట్", 1850, అక్టోబరు 31, పుటలు 5, 6.
3. పెట్టుబడికి దాని అభివృద్ధి చెందని రూపంలో ఉన్న స్వభావమే దాని అభివృద్ధి చెందిన రూపంలో కూడా ఉంది. అమెరికా అంతర్యుద్ధానికి కొంచెం ముందు బానిస యజమానుల ప్రభావం న్యూ మెక్సికో భూభాగంపై రుద్దిన చట్టం ప్రకారం, పెట్టుబడిదారుడు కార్మికుని శ్రమ శక్తిని కొనుక్కున్న మేరకు కార్మికుడు "పెట్టుబడిదారుని డబ్బు" రోమన్ పాట్రీషియన్లకు కూడా అదే అభిప్రాయం ఉండింది. ప్లెబియన్ రుణగ్రస్తులకు తాము అప్పుగా ఇచ్చిన డబ్బు జీవనాధార వస్తువుల ద్వారా రుణగ్రస్తుని రక్త మాంసాలుగా రూపాంతరం చెందింది. కనుక ఈ "రక్త మాంసాలు" "వారి డబ్బు" అదే పది పట్టికల షైలాక్ న్యాయం. పాట్రిషియన్ రుణదాతలు అప్పుడప్పుడూ టైబర్ నదికి అవతల రుణగ్రస్తుల మాంసంతో విందులు ఏర్పాటు చేశారనే సిద్ధాంతాన్ని లింగ్వెట్ ప్రతిపాదించాడు. అయితే డామర్ ప్రతిపాదించిన క్రైస్తవుల విందు భోజన సిద్ధాంతంలాగే ఇది కూడా అనిర్ధారితం.

పిల్లల శ్రమ విషయంలో 1844 చట్టాన్ని షైలాక్‌లా పట్టుకు వేళ్ళాడటం అన్నది "తరుణ వయస్కుల, స్త్రీల" శ్రమ విషయంలో అదే చట్టానికి వ్యతిరేకంగా బహిరంగ తిరుగుబాటు చేయడానికి సిద్ధం కావడమే. "తప్పుడు రిలే పద్ధతిని" రద్దు చేయడమే ఆ చట్టం యొక్క ప్రధాన ఉద్దేశమూ, లక్ష్యమూ అని గుర్తుంచుకోవాలి. 15 గంటల దినంలో తరుణ వయస్కులతోనూ, స్త్రీలతోనూ పరిమితుల్లేకుండా రోజులో స్వల్ప భాగాలలో పెట్టుబడిదారులు తమ చిత్తానుసారం పని చేయించుకోడాన్ని 1844 చట్టంలోని సెక్షనులు నిషేధించడం అన్నది, పని కాలం 12 గంటలుగా నిర్ణయమైనప్పుడు 'సాపేక్షంగా నిరపాయకర' మనీ అయితే పది గంటల చట్టం కింద మాత్రం అది "బాధాకరమైన ఇబ్బంది"[1] అనే సరళమైన ప్రకటనతో వారు తిరుగుబాటు ప్రారంభించారు. తాము చట్టంలోని శాబ్దికార్థాన్ని అతిక్రమించి, తమ సొంత బాధ్యతపైన పాత పద్ధతిని పునఃప్రవేశపెట్టబోతున్నా మని[2] ఇన్‌స్పెక్టర్లకు చాలా ప్రశాంతంగా తెలియజేశారు. అవివేకులైన కార్మికుల ప్రయోజనాలకోసమే "వారికి మరింత ఎక్కువ వేతనాలు చెల్లించ గలిగేటందుకే" తాము ఇలా వ్యవహరిస్తున్నామని చెప్పారు. పది గంటల చట్టం కింద గ్రేట్ బ్రిటన్ యొక్క పారిశ్రామిక ఆధిక్యాన్ని నిలబెట్టటానికి తోడ్పడే ఏకైక పథకం ఇది." "బహుశా ఈ రిలే వ్యవస్థలో అవకతవకల్ని పసికట్టటం కొంత కష్టంగావచ్చు. అయితే ఏం? ఫ్యాక్టరీ ఇన్‌స్పెక్టర్లకూ, సబ్ ఇన్‌స్పెక్టర్లకూ కొంత ఇబ్బందిని తగ్గించడం కోసం ఈ దేశ పారిశ్రామిక ప్రయోజనాన్ని అప్రధాన అంశంగా పరిగణించాలా?"[3]

సహజంగానే ఈ యుక్తులేమీ పారలేదు. ఫ్యాక్టరీ ఇన్‌స్పెక్టర్లు న్యాయస్థానాలకు ఫిర్యాదు చేశారు. అయితే యజమానుల నుండి త్వరలోనే పిటీషన్ల ధూళి మేఘాలు హోం సెక్రటరీ సర్ జార్జి గ్రేని చుట్టుముట్టాయి. 1848 ఆగస్టు 5వ తేదీ ఆయన పంపిన సర్క్యులర్‌లో ఇన్‌స్పెక్టర్లను ఇలా కోరాడు : చట్టంలో శాబ్దికార్థాన్ని ఉల్లంఘించినందుకు, లేదా చట్టం ఇచ్చిన అవకాశానికి మించి తరుణ వయస్కులను ఎక్కువ గంటలపాటు పని చేయించారని నమ్మటానికి అవకాశం లేనిచోట్ల అల్ప వయస్కులతో రిలేలలో పని చేయించినందుకు మిల్లు యజమానులకు వ్యతిరేకంగా సమాచారం అందజేయవద్దు." దాని తర్వాత ఫ్యాక్టరీ ఇన్‌స్పెక్టరు జె. స్టువార్ట్ 15 గంటల ఫ్యాక్టరీ దినంలో రిలే పద్ధతి అనబడేదాన్ని స్కాట్లండ్ అంతటిలోనూ అనుమతించాడు. పాత పద్ధతిలో త్వరలోనే అది వర్థిల్లింది. మరోవైపున, చట్టాన్ని నిరోధించే నియంతృత్వ అధికారమేదీ హోం సెక్రటరీకి లేదని ఇంగ్లీషు ఫ్యాక్టరీ ఇన్‌స్పెక్టర్లు ప్రకటించారు. బానిసత్వ అనుకూల తిరుగుబాటుకు వ్యతిరేకంగా న్యాయస్థానాల్లో వారు తమ పోరాటాన్ని కొనసాగించారు.

కోర్టులు పెట్టుబడిదారుల్ని నిర్దోషులని వదిలేస్తుంటే వారిని కోర్టుకు లాగడం వల్ల ప్రయోజన మేమిటి? కోర్టులు అంటే ఈ సందర్భంలో స్థానిక కోర్టులు. కాబెట్ వర్ణించిన "వేతనం పొందని గొప్ప వ్యక్తులు." ఈ న్యాయస్థానాలలో యజమానులే తమ మీద వచ్చే కేసులను విచారిస్తారు. ఒక ఉదాహరణ. 'కెర్షాలీస్ అండ్ కో'కు చెందిన ఎస్‌క్రిగ్ అనే నూలు మిల్లు యజమాని తన జిల్లా

1. "రిపోర్ట్", ఏప్రిల్ 30, 1848, పుట 28.
2. ఆ రకంగా మిగిలిన వారితోపాటు జీవకారుణ్యవాది అష్వార్త్ కూడా రోత పుట్టించే క్వేకర్ మత తరహాలో లియొనార్డ్ హార్నర్‌కు ఒక లేఖ రాశాడు. ("రిపోర్ట్స్..." 1849, ఏప్రిల్, పుట 4)
3. అదే నివేదిక, పుట 140.

ఫ్యాక్టరీ ఇన్‌స్పెక్టరు ముందు తన మిల్లులో తాను ప్రవేశపెట్టబోతున్న రిలే పద్ధతి పథకాన్ని ఉంచాడు. దానికి తిరస్కారం ఎదురయింది. మొదట అతడు మాట్లాడకుండా ఊరుకున్నాడు. కొన్ని నెలల తర్వాత రాబిన్‌సన్ అనే పేరు గల మరో నూలు మిల్లు యజమాని ఎస్‌క్రిగ్ ఆవిష్కరించిన రిలే పథకం లాంటి దాన్నే తన మిల్లులో ప్రవేశపెట్టాడనే ఆరోపణపై స్టాక్ పోర్ట్ నగర మేజిస్ట్రేట్ల ముందు నిలబడ్డాడు. ఈ రాబిన్‌సన్ ఎస్‌క్రిగ్ యొక్క సేవకుడు కాదు గాని అతని బంధువు. తీర్పు చెప్పటానికి నలుగురు న్యాయమూర్తులు కూర్చున్నారు. వారిలో ముగ్గురు నూలు మిల్లుల యజమానులు. వారికి అధిపతిగా ఇదే ఎస్‌క్రిగ్ ఉన్నాడు. రాబిన్‌సన్‌ను నిర్దోషి అని ఎస్‌క్రిగ్ తీర్పు చెప్పాడు. ఇప్పుడు రాబిన్ విషయంలో కూడా న్యాయమే అనే అభిప్రాయానికొచ్చాడు. తన సొంత న్యాయ నిర్ణయ బలంతోనే తన సొంత ఫ్యాక్టరీలో వెంటనే ఈ పథకాన్ని ప్రవేశపెట్టాడు.[1] అసలు ఈ న్యాయస్థానాల నిర్మాణమే చట్టానికొక ఉల్లంఘన.[2] ఈ న్యాయ సంబంధమైన కపట నాటకాలకు “శీఘ్రంగా విరుగుడు అవసరం. ఈ నిర్ణయాలకు అనుగుణంగా చట్టాన్నైనా మార్చాలి లేదా దీన్ని చట్టానికి అనుగుణమైన నిర్ణయాలు చేయగల, తప్పిదాలు చేయడానికి తక్కువ అవకాశం గల న్యాయస్థానానికైనా అప్పగించాలి. ఈ కేసులు ముందుకొచ్చినప్పుడు, వేతనం పొందే మేజిస్ట్రేటు కావాలనుకుంటున్నా”నని ఇన్‌స్పెక్టర్ హోవెల్ వ్యక్తం చేశాడు.[3]

1848 చట్టానికి యజమానులు చెప్పిన భాష్యం అసంబద్ధమని ప్రభుత్వ న్యాయవాదులు ప్రకటించారు. అయితే ఈ “సమాజ పరిరక్షకులు” తమ లక్ష్యం నుండి వైదొలగటానికి సిద్ధంగాలేరు. లియొనార్డ్ హార్నర్ ఇలా నివేదించాడు : “చట్టాన్ని అమలు చేయించటానికి ప్రయత్నిస్తూ... ఏడు మేజిస్టీరియల్ డివిజన్లలో పది కేసులు పెట్టగా ఒక్క కేసులో మాత్రమే మేజిస్ట్రేట్లు సమర్థించారు... కనుక చట్టాన్ని ఉల్లంఘించినందుకు ఇంకా కేసులు పెట్టడం అన్నది వృథా అని భావించాను... పని గంటల్లో ఏకరూపతను సాధించడానికి చేసిన 1848 చట్టంలోని ఆ భాగం ... ఆ రకంగా నా జిల్లా (లాంక్‌షైర్)లో ఏమాత్రం అమల్లో లేదు. షిఫ్టుల్లో పని చేస్తున్న మిల్లుల్ని మేం తనిఖీ చేస్తున్నప్పుడు సబ్ ఇన్‌స్పెక్టర్లకు గానీ, నాకు గానీ తరుణ వయస్కులూ, స్త్రీలూ పది గంటల కంటే ఎక్కువ పని చేయడం లేదని నిర్ధారించుకోవడానికి మార్గాలేమి లేవు... మళ్ళీ షిఫ్టుల పద్ధతిని తిరిగి చేపట్టిన మిల్లుల సంఖ్య ... ఏప్రిల్ 30 నాటికి 114 ఉన్నాయి. కొంత కాలంగా అవి శీఘ్రంగా పెరుగుతున్నాయి. సాధారణంగా మిల్లు పని గంటలు ఉదయం 6 నుండి రాత్రి $7\frac{1}{2}$ వరకూ, $13\frac{1}{2}$ గంటలకు పెరిగాయి. కొన్ని సందర్భాల్లో అది ఉదయం $5\frac{1}{2}$ నుండి రాత్రి $8\frac{1}{2}$ వరకూ, అంటే 15 గంటలపాటు ఉంటోంది.”[4]

---

1. “రిపోర్ట్స్...” 1849, ఏప్రిల్ 30. పుటలు 21, 22. ఇటువంటి ఉదాహరణలు ఇదే గ్రంథం 4, 5 పుటలలో ఉన్నాయి. పోల్చి చూడండి.
2. నూలు మిల్లు లేదా బట్టల మిల్లు యజమానిగానీ, అతని తండ్రిగానీ, కుమారుడుగానీ, సోదరుడు గానీ ఫ్యాక్టరీ చట్టానికి సంబంధించిన ఏ దర్యాప్తుల్లోనూ న్యాయమూర్తిగా వ్యవహరించరాదని సర్ జాన్ హౌస్ యొక్క ఫ్యాక్టరీ చట్టం I & II విలియం IV అధ్యాయం 24, నెం. 10లో ఉంది.
3. అదే నివేదిక.
4. “రిపోర్ట్స్...” ఏప్రిల్ 30, 1849, పుట 5.

ఎటువంటి తనిఖీ పద్ధతయినా ఈ రిలే పద్ధతిలో అపారమైన అధిక పని గంటల్ని నిరోధించజాలదని ఏకగ్రీవంగా ప్రకటించిన 65 మంది కార్ఖానా యజమానులు, 29 మంది మేస్త్రీల జాబితాను లియొనార్డ్ హోర్నర్ 1848 డిసెంబరు నాటికే తయారుచేయ గలిగాడు.[1] అదే పిల్లలూ, అదే తరుణ వయస్కులూ 15 గంటల పనిదినంలోనూ ఒకోసారి వడికే గది నుండి నేసే గదికీ, ఒకోసారి ఒక ఫ్యాక్టరీ నుండి మరో ఫ్యాక్టరీకి మార్చబడుతూ ఉన్నారు.[2] రిలేల మారు రూపం కింద నడిచే ఈ పద్ధతి కార్మికుల్ని అనంతమైన పద్ధతుల్లో కలపడానికి ఉన్న పథకాల్లో ఒకటి. విభిన్న వ్యక్తుల పని కాలాన్నీ, విరామ కాలాన్నీ రోజంతటిలోనూ మార్చడం వల్ల ఒకే గదిలో, ఒకే సమయంలో కలిసి పనిచేసే ఒక పూర్తి కార్మిక బృందమనేది ఎప్పుడూ ఉండజాలదు. ఇటువంటి పద్ధతిని అదుపు చేయడం ఎలా సాధ్యం.[3]

వాస్తవ అధిక పని గంటల భారంతో ఏ మాత్రం ప్రమేయం లేకుండానే ఈ రిలే పద్ధతి అనబడేది పెట్టుబడిదారుల ఊహ కల్పితం. ఫోరియర్ రచించిన "స్వల్ప శ్రమ కాలాలు" అనే హాస్య గల్పికలు సైతం దీనికి ఏ మాత్రం సాటి రావు. అయితే "శ్రమ ఆకర్షణ" అనేది ఇక్కడ పెట్టుబడి ఆకర్షణ అయింది అంతే. ఉదాహరణకు "సముచితమైన శ్రద్ధా, క్రమ పద్ధతీ సాధించగలిగిన నమూనాలుగా "గౌరవనీయ" పత్రికలచే కీర్తించబడిన ఆ యజమానుల పథకాలను చూడండి. కార్మిక సిబ్బందిని ఒక్కోసారి 12, 14 రకాలుగా వర్గీకరించడం జరిగింది. ఈ వర్గాలలోని వ్యక్తులు నిరంతరాయంగా మార్పులకు గురవుతూనే వుండేవాళ్ళు 15 గంటల ఫ్యాక్టరీ దినంలో పెట్టుబడి కార్మికుని ఒకసారి 30 నిమిషాలపాటూ, మరోసారి ఒక గంటపాటూ లోపలికి లాగి మళ్ళీ బయటికి తోసేది. మళ్ళీ ఫ్యాక్టరీ లోపలికి లాగి మళ్ళీ కొత్తగా బయటికి నెట్టేది. కొంతసేపు ఇక్కడికీ, కొంతసేపు అక్కడికీ తరుముతూ, మొత్తం మీద అతను తన 10 గంటల పనిని పూర్తి చేసేదాకా అతని మీద పట్టు జారనివ్వదు. నాటకరంగం మీద లాగానే అదే వ్యక్తులు విభిన్న రంగాల్లో తమ వంతుల ప్రకారం ప్రత్యక్షమవ్వాలి. మొత్తం నాటకం జరిగినంతసేపూ నాటకరంగానికి చెందే నటునిలాగే కార్మికులు కూడా 15 గంటలసేపూ ఫ్యాక్టరీకే చెందుతారు. బయటికి పోవడానికీ, రావడానికీ అయ్యే కాలం లెక్కబెట్టబడదు. ఆ రకంగా విశ్రాంతి తీసుకోవలసిన గంటలు నిర్బంధంగా ఖాళీగా ఉండాల్సిన గంటలుగా మార్చబడ్డాయి. దీనివల్ల యువకులు సారాకొట్టుకో, యువతులు వ్యభిచార గృహాలకో తరమబడ్డారు. కార్మికుల సంఖ్యను పెంచకుండానే తన యంత్రాలతో 12 లేదా 15 గంటలపాటు పని చేయించడానికిగాను పెట్టుబడిదారుడు రోజు రోజుకు వేసే ప్రతి కొత్త యుక్తివల్లా కార్మికుడు తన తిండిని ఇప్పుడొక సమయంలోనూ, మరొకరోజు ఇంకో సమయంలోనూ చిన్న చిన్న వ్యవధుల్లో కతకాల్సి వచ్చింది. కార్మిక మూకలు 10 గంటల పనితో 12 గంటలు వేతనాలను పొందాలనే ఆశతోనే పిటీషన్లు పెట్టారని, పది గంటల ఆందోళనా కాలంలో యజమానులు ఆక్రోశించారు. ఇప్పుడు వారు ఆ నాణాన్ని తిరగేశారు. వారు శ్రమ శక్తిపైన 12 లేదా 15 గంటల

1. "రిపోర్ట్స్..." అక్టోబరు 31, 1849, పుట 6.
2. "రిపోర్ట్స్..." ఏప్రిల్ 30, 1849, పుట 21.
3. "రిపోర్ట్స్..." అక్టోబరు 31, 1848, పుట 95.

ఆధిపత్యానికిగాను 10 గంటల వేతనాలను చెల్లించారు.[1] ఇదే అసలు సంగతి. పది గంటల చట్టానికి యజమానులిచ్చిన భాష్యం ఇదే! ధాన్యాన్ని నిర్నిబంధంగా దిగుమతి చేసుకుంటే ఇంగ్లీషు పరిశ్రమకున్న సాధనాల రీత్యా పెట్టుబడిదారుల్ని సంపన్నం చేయడానికి 10 గంటల శ్రమ చక్కగా సరిపోతుందని పౌండ్లలోనూ, షిల్లింగుల్లోనూ, పెన్నీలలోనూ లెక్కలు కట్టి, మానవ జాతిపై ప్రేమతో తలమునకలయ్యే ఇదే స్వేచ్ఛా వ్యాపారవాదులు ధాన్యం చట్టాలకు వ్యతిరేకంగా సాగిన మొత్తం పదేళ్ళ కాలంలోనూ కార్మికులకు బోధించారు.[2] ఇంగ్లండులోని నాలుగు అత్యున్నత న్యాయస్థానాల్లో ఒకటైన ఎక్స్‌చెకర్ న్యాయస్థానం యొక్క నిర్ణయంతో, పెట్టుబడి యొక్క తిరుగుబాటుకు రెండేళ్ళ తర్వాత విజయం లభించింది. ఆ న్యాయస్థానం 1850 ఫిబ్రవరి 8న తన ముందుకు వచ్చిన కేసులో పెట్టుబడిదారులు 1844 చట్టం యొక్క సారాంశానికి వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నారనీ, అయితే ఆ చట్టంలోని కొన్ని మాటలు ఆ చట్టాన్ని అర్థరహితం చేశాయనీ తీర్పు చెప్పింది. "ఈ నిర్ణయంతో పది గంటల చట్టం రద్దయింది."[3] తరుణ వయస్కులకు, స్త్రీలకు రిలే పద్ధతిని వర్తింపజేయడానికి భయపడిన యజమానుల గుంపు ఇప్పుడు దాన్ని పూర్తి శ్రద్ధాసక్తులతో చేపట్టింది.[4]

అయితే నిర్ణయాత్మకం అనిపించిన పెట్టుబడి యొక్క ఈ విజయానికి వెనువెంటనే దాని విరుగుడు తలెత్తింది. ఇంత వరకూ కార్మికులు పట్టు విడవకుండానే, ఎడతెగకుండానే ప్రతిఘటించినప్పటికీ ఆ ప్రతిఘటన క్రియారహితంగా ఉండింది. ఇప్పుడు వారు లాంక్‌షైర్‌లోనూ, యార్క్‌షైర్‌లోనూ బెదిరించే సమావేశాల్లో తమ నిరసన వ్యక్తం చేశారు. ఉన్నదనుకొన్న పది గంటల చట్టం కేవలం బూటకం, పార్లమెంటరీ వంచన, ఏనాడూ లేనట్టిది! వెంటనే ఫ్యాక్టరీ ఇన్‌స్పెక్టర్లు వర్గ శత్రుత్వం నమ్మశక్యం కానంత ఉద్రిక్తతా స్థాయికి చేరుకుందని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కొంతమంది యజమానులే స్వయంగా ఇలా సణిగారు : "మేజిస్ట్రేట్ల పరస్పర విరుద్ధమైన తీర్పులవల్ల ఒక అసాధారణమైన, అరాజకమైన పరిస్థితి తలెత్తింది. యార్క్‌షైర్‌లో ఒక చట్టం అమల్లో ఉంటే, లాంక్‌షైర్‌లో మరో చట్టం, లాంక్‌షైర్‌లోనే ఒక పేటలో ఒక చట్టమూ, దాని పొరుగునే మరో చట్టమూ ఉన్నాయి. పెద్ద పట్టణాల్లో ఉన్న కార్ఖానాదారుడు చట్టాన్ని అతిక్రమించగలడు. గ్రామీణ జిల్లాల్లో ఉన్న కార్ఖానాదారునికి రిలే పద్ధతికి అవసరమైనంత మంది జనం దొరకరు. ఒక ఫ్యాక్టరీ నుండి మరో ఫ్యాక్టరీకి తరలించ గలిగినంత మంది కార్మికులు అసలే దొరకరు." పెట్టుబడిదారులంతా శ్రమ శక్తిని సమానంగా దోపిడీ చేయడం అన్నది పెట్టుబడి యొక్క ప్రప్రథమ జన్మహక్కు.

---

1. ఏప్రిల్ 30, 1849 నివేదికలు చూడండి. పుట 6. షిఫ్టింగ్ వ్యవస్థను గురించి 1848 అక్టోబరు 31 నివేదికల్లో ఫ్యాక్టరీ ఇన్‌స్పెక్టర్లు హోవెల్, సాండర్స్‌ల వివరణ చూడండి. "షిఫ్టు పద్ధతికి" వ్యతిరేకంగా ఆష్టన్ పరిసర ప్రాంతాలకు చెందిన మతాచార్యులు 1849 వసంతంలో రాణిగారికి సమర్పించిన పిటీషన్ కూడా చూడండి.
2. ఉదాహరణకు ఆర్.హెచ్. గ్రెగ్ 1837లో రాసిన "ది ఫ్యాక్టరీ క్వశ్చన్ అండ్ ది టెన్ అవర్స్ బిల్" చూడండి.
3. ఫ్రె. ఏంగెల్స్ : "ది ఇంగ్లీష్ టెన్ అవర్స్ బిల్" (కారల్ మార్క్స్ సంపాదకత్వం వహించిన "Neve Rheinischezeitung Politisch - Oekonomische Revue" 1850 పుట 13) ఇదే "ఉన్నత" న్యాయస్థానం అమెరికా అంతర్యుద్ధ కాలంలో సముద్ర దొంగల ఓడల్ని సాయుధం చేయడానికి వ్యతిరేకంగా ఉన్న చట్టంలోని పదాల అస్పష్టతను పసిగట్టి చట్టాన్ని పూర్తిగా తలకిందులు చేసింది.
4. "రిపోర్ట్స్..." 1850, ఏప్రిల్ 30.

ఈ పరిస్థితుల్లో యజమానులకూ, కార్మికులకూ మధ్య రాజీ కుదిరింది. ఇది 1850 ఆగస్టు 5 నాటి అదనపు ఫ్యాక్టరీ చట్టం పేరుతో పార్లమెంటు ఆమోద ముద్రను పొందింది. "తరుణ వయస్కులకూ, స్త్రీలకూ" పనిదినం వారంలో 5 రోజులలో 10 గంటల నుండి 10½ గంటలకు పెంచబడింది. శనివారం నాడు అది 7½ గంటలకు తగ్గించబడింది. ఉదయం 6 గంటల నుండి సాయంత్రం 6 గంటలదాకా పని జరుగుతుంది.[1] దానిలో భోజన విరామాలు 1½ గంటకు తక్కువ కాకుండా ఉండాలి. అందరికీ ఒకే భోజన వేళలుండాలి. అవి 1844 చట్టానికి అనుగుణంగా ఉండాలి. దీనితో రిలే పద్ధతికి శాశ్వతంగా స్వస్తి చెప్పబడింది.[2] పిల్లల శ్రమ విషయంలో 1844 చట్టం అమల్లో నిలిచింది.

ఈసారి కూడా ఇదివరకులాగే ఒక బృందం యజమానులు కార్మికుల పిల్లలపైన ప్రత్యేక జమీందారీ హక్కుల్ని పొందారు. వీరు పట్టు పరిశ్రమాధిపతులు. "ఏ వయసు పిల్లలతోనైనా రోజుకు 10 గంటలసేపు పని చేయించుకునే స్వేచ్ఛ తమకు లేకపోతే తమ కార్ఖానాలు మూసేస్తాం"[3] అని 1833లో వారు బెదిరించే రీతిలో అరిచారు. 13 ఏళ్ళకు పైబడిన పిల్లలను తగినంత సంఖ్యలో కొనుక్కోవడం తమకు అసాధ్యం అన్నారు. వారు కోరుకున్న ప్రత్యేక సౌకర్యం బలవంతంగా రాబట్టుకున్నారు. ఆ తర్వాత జరిగిన దర్యాప్తులో వారు చెప్పిన సాకు పచ్చి అబద్ధమని రుజువైంది.[4] అయితే అది వారిని ఆ పదేళ్ళలోనూ రోజుకు 10 గంటల చొప్పున పని చేయించడానికి బల్లపై కూర్చోపెట్టాల్సినంత చిన్నపిల్లల రక్తం నుండి పట్టును వడకకుండా నిరోధించలేదు.[5] 1844 చట్టం వారి నుండి 11 ఏళ్ళలోపు పిల్లల రోజుకు 6½ గంటల కంటే ఎక్కువసేపు పనిలో పెట్టే "స్వేచ్ఛ"ని నిశ్చయంగా దోచుకుంది. అయితే మరోవైపున ఇది వారికి 11-13 ఏళ్ళ పిల్లలతో రోజుకు 10 గంటలు పని చేయించే హక్కునూ, మిగిలిన ఫ్యాక్టరీల పిల్ల లందరికీ నిర్బంధం చేయబడిన విద్యను వారి విషయంలో రద్దు చేసే హక్కునూ ఇచ్చింది. ఈసారి సాకే మంటే "వారు పనిజేసే వస్త్రం యొక్క సున్నితమైన నేతకు మృదువైన స్పర్శ అవసరం. చిన్నప్పుడే ఈ ఫ్యాక్టరీల్లో వారిని ప్రవేశపెట్టడం ద్వారానే అది సాధ్యమవుతుంది."[6] దక్షిణ రష్యాలో కొమ్ములున్న పశువుల్ని వాటి చర్మం కోసమూ, కొవ్వు కోసమూ నరికినట్టే పిల్లల్ని వారి సున్నితమైన వేళ్ళ కోసం తెగనరికారు. 1844లో దఖలుపడిన ప్రత్యేక హక్కు చివరికి 1850లో సిల్క్ ట్విస్టింగ్‌కీ, సిల్క్ వైండింగ్‌కీ పరిమితం చేయబడింది. అయితే ఇక్కడ "స్వాతంత్ర్యాన్ని" పోగొట్టుకున్న పెట్టుబడికి నష్ట పరిహారంగా 11-13 ఏళ్ళ పిల్లల పనికాలం 10 గంటల నుండి 10½ గంటలకు పెంచబడింది. సాకు : "ఇతర రకాల వస్త్ర పరిశ్రమల్లోకంటే

---

1. శీతాకాలంలో ఉదయం 7 గంటల నుండి రాత్రి 7 గంటల వరకూ అని మార్చుకోవచ్చు.
2. ప్రస్తుత (1850) చట్టం ఒక రాజీ, పని గంటలు మొదలవడమూ, ముగియడమూ ఏకరీతిగా ఉండే ప్రయోజనం కోసం కార్మికులు పది గంటల చట్టం ఇచ్చే ప్రయోజనాన్ని వదులుకున్నారు. ("రిపోర్ట్స్..." ఏప్రిల్ 30, 1852, పుట 14)
3. "రిపోర్ట్స్..." 1844, సెప్టెంబర్, పుట 13.
4. అదే నివేదిక.
5. అదే నివేదిక.
6. "రిపోర్ట్స్..." 1846 అక్టోబర్ 31, పుట 20.

పట్టు పరిశ్రమలో శ్రమ తేలిక. ఇతరత్రా కూడా ఆరోగ్యానికి తక్కువ హానికరం.[1]

అధికారిక వైద్య దర్యాప్తులు అందుకు విరుద్ధంగా ఇలా రుజువు చేశాయి. "పట్టు నేసే జిల్లాల్లో సగటు మరణాల రేటు చాలా ఎక్కువ. లాంక్‌షైర్‌లోని నూలు బట్టల జిల్లాల్లో కంటే పట్టు జిల్లాల్లో స్త్రీల మరణాలు మరింత ఎక్కువ"[2] ప్రతి ఆరు నెలలకూ ఒకసారి ఫ్యాక్టరీ ఇన్‌స్పెక్టర్లు తమ నిరసన తెలియజేసి నప్పటికీ ఈ మోసం ఇవాళ్టికీ కొనసాగుతోంది.[3]

1850 చట్టం ఉదయం 5.30 గంటల నుండి రాత్రి 8.30 వరకూ గల 15 గంటల పని కాలాన్ని ఉదయం 6 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకూ గల 12 గంటల పని కాలంగా మార్చింది. అయితే ఇది "తరుణ వయస్కులకూ, స్త్రీలకూ" మాత్రమే వర్తిస్తుంది. కనుక అది పిల్లలను తాకలేదు. వారితో ఈ కాలానికి ఒక అరగంట ముందుగానూ, $2\frac{1}{2}$ గంటలు తర్వాతా పని చేయించ వచ్చు. అయితే వారి మొత్తం పని కాలం $6\frac{1}{2}$ గంటలకు మించరాదు, అంతే. బిల్లు చర్చ కొచ్చినప్పుడు

1. ''రిపోర్ట్స్...'' 1861 అక్టోబర్ 31, పుట 26.
2. మొత్తంమీద ఫ్యాక్టరీ చట్టం వర్తించే కార్మిక జనం ఆరోగ్యపరంగా బాగా మెరుగయ్యారు. వైద్య పరీక్షలన్నీ ఈ విషయంలో ఏకాభిప్రాయం తెలుపుతాయి. విభిన్న సమయాల్లో నా వ్యక్తిగత పరిశీలన వల్ల కూడా నేను దీన్ని నమ్ముతున్నాను. అయినప్పటికీ, తొలి సంవత్సరాల్లో పిల్లల మరణాల్ని మినహాయిస్తే, ''మామూలు ఆరోగ్యం గల వ్యవసాయ జిల్లాలతో'' పోల్చినప్పుడు పరిశ్రమలున్న జిల్లాల ప్రజల ఆరోగ్యం ప్రతికూలంగా ఉందన్న సంగతిని డా॥ గ్రీన్‌హౌ అధికారిక నివేదికలు తెలియజేస్తాయి. దానికి రుజువుగా ఆయన 1861 నివేదికలోని ఈ క్రింది పట్టికను చూడండి.

| పరిశ్రమల్లో పనిచేసే పురుషుల శాతం | శ్వాసకోశ వ్యాధులవల్ల ప్రతి లక్షమంది పురుషుల మరణాల రేటు | జిల్లా పేరు | శ్వాసకోశ వ్యాధులవల్ల ప్రతి లక్షమంది స్త్రీల మరణాల రేటు | పరిశ్రమల్లో పనిచేసే స్త్రీల శాతం | స్త్రీలు పనిచేసే పని స్వభావం |
|---|---|---|---|---|---|
| 14.9 | 598 | నిగాన్ | 644 | 18.0 | జవుళి |
| 42.6 | 708 | బ్లాక్‌బర్న్ | 734 | 34.9 | జవుళి |
| 37.3 | 547 | హలిపాక్స్ | 564 | 20.4 | ఉన్ని |
| 41.9 | 611 | బ్రాడ్‌ఫర్డ్ | 603 | 30.0 | ఉన్ని |
| 31.0 | 691 | మాక్లెస్‌ఫీల్డ్ | 804 | 26.0 | పట్టు |
| 14.9 | 588 | లీక్ | 705 | 17.2 | పట్టు |
| 36.6 | 721 | స్లోకపాన్‌ట్రెంట్ | 665 | 19.3 | పింగాణీ పాత్రలు |
| 30.4 | 726 | ఊల్‌స్టాంటన్ | 727 | 13.9 | పింగాణీ పాత్రలు |
| | 305 | ఎనిమిది ఆరోగ్యవంత మైన వ్యవసాయ జిల్లాలు | 340 | | |

3. పట్టు పరిశ్రమను ఆదుకోడానికి విధించే సుంకాన్ని ఇంగ్లీషు ''స్వేచ్ఛా వ్యాపారవాదులు'' ఎంత విముఖత్వంతో వదులుకున్నారో అందరికీ తెలిసిందే. ఫ్రెంచి దిగుమతులకు వ్యతిరేకంగా రక్షణకు బదులుగా ఇంగ్లీషు ఫ్యాక్టరీల్లో పనిచేసే పిల్లలకు రక్షణ లేకపోవడం అన్నది వారి ప్రయోజనాన్ని నెరవేరుస్తోంది.

ఈ లోపంవల్ల జరుగుతున్న దారుణమైన దుర్వినియోగాల గణాంకాలను ఫ్యాక్టరీ ఇన్‌స్పెక్టర్లు పార్లమెంటుకు సమర్పించారు. ప్రయోజనం లేకపోయింది. సుభిక్షంగా ఉన్న సంవత్సరాలలో పురుష కార్మికుల పనిదినాన్ని పిల్లల సాయంతో 15 గంటలకు సాగలాగాలనే ఉద్దేశం దీని వెనక దాగి ఉండింది. అటువంటి ప్రయత్నం పురుష కార్మికుల ప్రతిఘటన ముందు విఫలమై తీరుతుందని తర్వాత వచ్చిన మూడు సంవత్సరాల అనుభవం రుజువు చేసింది కనుక "తరుణ వయస్కులూ, స్త్రీలూ ఉదయం రావడానికి ముందూ, సాయంత్రం వెళ్ళిన తర్వాతా పిల్లలతో పని చేయించడాన్ని" నిషేధించడంతో చివరికి 1850 ఫ్యాక్టరీ చట్టం 1853లో పూర్తయింది. అప్పటి నుండి కొద్ది మినహాయింపులతో 1850 చట్టం వర్తించే పారిశ్రామిక విభాగాలన్నిటిలోనూ అది కార్మికులందరి పనిదినాన్నీ క్రమబద్ధం చేసింది.[1] మొదటి ఫ్యాక్టరీ చట్టం చేయబడిన నాటి నుండి అర్ధశతాబ్దం గడిచింది.[2]

ఫ్యాక్టరీ శాసనం మొట్టమొదటిసారిగా తన మౌలిక ఆచరణ పరిధిని 1845 అద్దకం పన్నుల చట్టంలో దాటిపోయింది. ఈ 'అతి'ని పెట్టుబడి ఎంత అయిష్టంగా స్వీకరించిందో చట్టంలోని ప్రతి వాక్యమూ చెబుతుంది. 8-13 ఏళ్ళ పిల్లలకూ, స్త్రీలకూ అది పనిదినాన్ని ఉదయం 6 గంటల నుండి రాత్రి 10 గంటల వరకూ, తిండి తినడానికి ఎటువంటి చట్టబద్ధ విరామం లేకుండా, 16 గంటలకు పరిమితం చేసింది. 13 ఏళ్ళు దాటిన మగవాళ్ళతో యధేచ్ఛగా[3] రాత్రింబగళ్ళు పని చేయించడాన్ని అది అనుమతించింది. అది ఒక పార్లమెంటరీ గర్భస్రావం.[4]

అయితే ఆధునిక ఉత్పత్తి విధానం యొక్క అత్యంత స్వభావోచితమైన సృష్టి అనదగిన ఆ గొప్ప పారిశ్రామిక శాఖల్లో తన విజయంతో సూత్రం నెగ్గింది. 1853 నుండి 1860 వరకూ ఫ్యాక్టరీ కార్మికుల శారీరక, నైతిక పునఃసృష్టితో పాటు వాటి అద్భుతమైన అభివృద్ధి బాగా దృష్టి మాంద్యం

---

1. ఇంగ్లీషు జవులీ పరిశ్రమ ఉచ్ఛదశలో ఉన్న 1859, 1860 సంవత్సరాలలో కొంతమంది కార్ఖానా యజమానులు ఎక్కువ పని గంటలకు ఎక్కువ వేతనాలనే అందమైన ఎరను చూపించి పనిదినాన్ని పెంచడానికి కార్మికులను ఒప్పించాలని ప్రయత్నించారు. చేతి రాట్నం వడికేవారూ, స్వయం చలిత రాట్నాలను నడిపేవారూ తమ యజమానులకు ఒక పిటీషన్ సమర్పించడం ద్వారా ఈ ప్రయోగానికి స్వస్తి పలికారు. దానిలో వారిలా అన్నారు : "స్పష్టంగా చెప్పాలంటే మా బతుకులు మాకొక భారం. దేశంలో మిగిలిన కార్మికులకంటే మేము వారంలో దాదాపు రెండు రోజులు ఎక్కువగా మిల్లులలో బంధింపబడుతున్నాం. దానివల్ల మేము ఈ దేశంలో గులాముల్లాగున్నామనీ, మేము మాకూ, రాబోయే తరాలకూ హానికరమైన ఒక వ్యవస్థను చిరస్థాయి చేస్తున్నామనీ భావిస్తున్నాం... కనుక తమకు మేము సమర్పించుకునే అత్యంత గౌరవప్రదమైన నోటీసు ఏమంటే క్రిస్టమస్, కొత్త సంవత్సరం సెలవుల తర్వాత మేము పని మొదలుపెట్టినప్పుడు వారానికి 60 గంటలు మాత్రమే పని చేస్తాం. అంతకు మించి చేసేది లేదు. అనగా ఉదయం 6 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకూ, దానిలో గంటన్నర తీసెయ్యాలి." ("రిపోర్ట్స్..." 1860 ఏప్రిల్ 30, పుట 30)
2. ఈ చట్టాన్ని ఉల్లంఘించడానికి ఇందులోనే ఉన్న పదజాలం ఎలా వీలు కల్పిస్తోందో "ఫ్యాక్టరీస్ రెగ్యులేషన్ యాక్ట్" (1859 ఆగస్టు 5) అనబడే పార్లమెంటు ప్రచురణను చూడండి. ఇప్పుడు ప్రబలంగాఉన్న అవకతవకల్ని నిరోధించడానికై ఇన్‌స్పెక్టర్లకు వీలు కల్పించడం కోసం ఫ్యాక్టరీ చట్టాలను సవరించడానికి సూచనలు" అన్న పేరుతో లియొనార్డ్ హార్నర్ దానిలో రాసిన అంశాలను చూడండి.
3. "గత అర్ధసంవత్సరంలో 8 ఏళ్ళు అంతకుమించిన పిల్లలతో మా జిల్లాలో నిజంగానే ఉదయం 6 గంటల నుండి రాత్రి 9 గంటలవరకూ పని చేయించడం జరిగింది." (1857 అక్టోబరు 31, "రిపోర్ట్స్" పుట 39).
4. అద్దకం పనుల చట్టం, దాని విద్యా సంబంధమైన, సంరక్షణ సంబంధమైన అంశాల్లో రెండింటిలోనూ విఫలమైందని ఆమోదించబడింది. ("రిపోర్ట్స్..." 1862 అక్టోబరు 31, పుట 52).

ఉన్నవారికి సైతం అగుపించింది. అర్ధశతాబ్దపు అంతర్యుద్ధం తర్వాత ఎవరి నుండి అయితే కొద్ది కొద్దిగా చట్టబద్ధ పరిమితులూ, నియమబద్ధత లాక్కోవడం జరిగిందో ఆ యజమానులే ఇప్పుడు ఇంకా ఇప్పటికీ "స్వతంత్రంగా" ఉన్న దోపిడీ విభాగాలతో తమకున్న తేడాను సగర్వంగా ప్రస్తావించారు.[1] చట్టబద్ధంగా నిర్ణయించబడిన పనిదినం యొక్క ఆవశ్యకతను పసికట్టడం అన్నది తమ "శాస్త్రం" యొక్క విలక్షణమైన నూతన ఆవిష్కరణ అని "రాజకీయ అర్థశాస్త్ర" పండితమ్మన్యులు ఇప్పుడు ప్రకటించారు.[2] ఫ్యాక్టరీ అధిపతులు వెనక్కు తగ్గి, తప్పనిసరి అయిన దానితో సరిపెట్టుకున్నాక పెట్టుబడి ప్రతిఘటనాశక్తి క్రమంగా బలహీనపడింది. కాగా అదే సమయంలో కార్మికవర్గం యొక్క దాడి చేయగల శక్తి, ఆ సమస్య ఎడల తక్షణ ఆసక్తి లేని సామాజిక వర్గాలలో దాని సహచరుల సంఖ్యతోపాటు పెరిగింది. కనుకనే 1860 నుంచీ ఇంతకు ముందుకంటే శీఘ్ర పురోగమనం జరిగింది.

1850 ఫ్యాక్టరీ చట్టం కిందికి అన్ని రకాల రంగులద్దకం పనులూ, చలవ పనులూ 1860లోనూ; అల్లకం, మేజోళ్ళ కార్ఖానాలు 1861లోనూ వచ్చాయి.[3]

పిల్లల ఉద్యోగ కమిషన్ నివేదిక (1863) ఫలితంగా పింగాణీ పాత్రలే కాక అన్ని రకాల మట్టి పాత్రలూ, లూసిఫర్ అగ్గిపుల్లలూ, తూటాల ప్రేలుడు మందు గొట్టాలూ, తూటాలూ తయారుచేసే కార్ఖానాలూ, ఫ్రిస్టియన్ అనే ముతక బట్ట కత్తిరింపులకూ, తుది మెరుగులు దిద్దడం (ఫినిషింగ్) అనే పేరు కిందికి వచ్చే అనేక పనులకూ సంబంధించిన కార్ఖానాలూ అదే అదృష్టానికి నోచుకున్నాయి.

1. ఉదాహరణకు 'టైమ్స్ పత్రికకు 1863 మార్చి 24వ తేదీన ఇ. పాటర్ రాసిన లేఖ. పది గంటల బిల్లుకు వ్యతిరేకంగా కార్ఖానా యజమానుల తిరుగుబాటును ది టైమ్స్ అతనికి గుర్తు చేసింది.
2. టూకీ రచించిన "ధరల చరిత్ర"కు సహ రచయిత, సంపాదకుడూ అయిన డబ్ల్యు. న్యూమార్చ్ వారిలో ఒకడు. ప్రజాభిప్రాయానికి పిరికితనంతో రాయితీ లివ్వడం శాస్త్రీయ పురోగమనమా?
3. 1860లో చేయబడిన చట్టం రంగులద్దకం చలువ పనుల కార్ఖానాలకు పనిదినాన్ని 1861 ఆగస్టు 1వ తేదీ నుండి తాత్కాలికంగా రోజుకు 12 గంటలుగానూ, 1862 ఆగస్టు 1వ తేదీ నుండి ఖాయంగా రోజుకు 10 గంటలుగానూ, అంటే మామూలు రోజుల్లో రోజుకు 10$\frac{1}{2}$ గంటల చొప్పునా, శనివారంనాడు 7$\frac{1}{2}$ గంటల చొప్పునా నిర్ణయించింది. ఆ దారుణ సంవత్సరం 1862 రాగానే పాత నాటకం పునరావృతం చేయబడింది. అంతేగాక మరో ఏడాదిపాటు తరుణ వయస్కులతోనూ, స్త్రీలతోనూ రోజుకు 12 గంటలపాటు పని చేయించుకోడాన్ని అనుమతించాల్సిందిగా కార్ఖానా యజమానులు పార్లమెంటుకు ఇలా నివేదించుకున్నారు: "రోజుకు 12 గంటలపాటు పనిజేసి సంపాదించ గలిగినప్పుడే వేతనాలు సంపాదించుకోవడం అన్నది ఇప్పుడున్న వ్యాపార పరిస్థితుల్లో (దూది కరువు కాలంలో) కార్మికులకే ఎంతో ప్రయోజనకరం." ఈమేరకు ఒక బిల్లు తీసుకురాబడింది. "అయితే ప్రధానంగా స్కాట్లండులోని చలువ పనులుచేసే (బట్టలు ఉతికి ఇస్త్రీ చేయడం) కార్మికుల కార్యాచరణ వల్ల బిల్లు వదిలేయబడింది". (రిపోర్ట్స్..." 1862 అక్టోబరు 31, పుటలు 14-15) ఆ రకంగా ఎవరి పేరుమీదనైతే మాట్లాడుతున్నానని నటించిందో అదే కార్మికులచేత ఓడించబడిన పెట్టుబడి ఇప్పుడు లాయరు కళ్ళద్దాల సాయంతో 1860 చట్టాన్ని పరిశీలించింది. "కార్మికుల సంరక్షణ" కోసం పార్లమెంట్ చేసే చట్టాలన్నిటిలోలాగే ఈ చట్టంలో కూడా ఉన్న ద్వంద్వార్థ సూచక పద ప్రయోగాలను కనుగొని అది కాలెండర్లనూ, పినిషర్లనూ చట్టం పరిధి నుండి మినహాయించడానికి దాన్ని సాకుగా ఉపయోగించింది. పెట్టుబడి ఎప్పుడు నమ్మినబంటు అయిన ఇంగ్లీషు న్యాయశాస్త్రం పెట్టుబడిదార్ల కూటవాదాన్ని సాధారణ వ్యాజ్యాల న్యాయస్థానంలో ఆమోదించింది. "కార్మికులు పెద్దగా ఆశాభంగానికి గురయ్యారు. అధిక పనిగంటల భారం గురించి వారు మొత్తుకున్నారు. ఒక పొరపాటు నిర్వచనం కారణంగా శాసనం యొక్క స్పష్టమైన ఉద్దేశం విఫలం కావడం అన్నది ఎంతో విచారించదగ్గ అంశం" (అదే నివేదిక, పుట 18)

1863వ సంవత్సరంలో ఆరుబయట చలవ పనులూ,[1] బ్రెడ్డు తయారీ ప్రత్యేక చట్టాల కింద ఉంచబడ్డాయి. దాని ప్రకారం మొదటిదానిలో తరుణ వయస్కుల, స్త్రీల రాత్రి పనిని (రాత్రి 8 గంటల నుండి ఉదయం 6 గంటల వరకూ) రెండో దానిలో 18 ఏళ్ళ లోపున్న కార్మికుల పనిని రాత్రి 9 గంటల నుండి ఉదయం 5 గంటల వరకూ నిషేధించడం జరిగింది. అదే కమిషన్ సిఫార్సులను మనం తర్వాత చర్చిద్దాం. అవి వ్యవసాయాన్ని, గనులనూ, రవాణా సాధనాలనూ మినహాయించి ఇంగ్లీషు పారిశ్రామిక ప్రధాన శాఖలన్నిటి "స్వేచ్ఛ"నూ హరించే ప్రమాదాన్ని తెచ్చిపెట్టాయి.[2]

---

1. "ఆరుబయట చలవ పనుల్లో" రాత్రిపూట స్త్రీలు పని చేయడంలేదనే అబద్ధంతో వాటి యజమానులు 1860 చట్టాన్ని తప్పించుకున్నారు. ఫ్యాక్టరీ ఇన్‌స్పెక్టర్లు ఆ అబద్ధాన్ని ఎండగట్టారు. అదే సమయంలో కార్మికుల పిటీషన్ల వల్ల ఆరుబయట చలువ పనులు అనేవి చల్లని పచ్చికబయళ్ళ సువాసనల మధ్య జరుగుతాయి అని నమ్మిన అభిప్రాయాలను పార్లమెంట్ కూడా కోల్పోయింది. గాలిలో చలువ పనులు 90° నుండి 100° ఫారెన్‌హీట్ వరకూ ఉండే ఆరబెట్టే గదుల్లో జరుగుతాయి. వాటిలో చాలామట్టుకు బాలికలే పని చేస్తారు. ఆరబెట్టే గదుల నుండి వేడిని తప్పించుకుని అప్పుడప్పుడూ శుభ్రమైన గాలిలోకి వెళ్ళడానికి సాంకేతిక నామం "చల్లబర్చుకోవడం". "పొయ్యిల దగ్గర పదిహేనుమంది బాలికలు. వస్త్రాలకు 80 నుండి 90 డిగ్రీల ఉష్ణం మల్లు వస్త్రాలకు 100 డిగ్రీలు, అంతకంటే ఎక్కువ ఉష్ణం. 10 చదరపు అడుగులున్న చిన్న గదిలో ఒక పొయ్యి 12 మంది బాలికలు ఇస్త్రీ చేస్తూ బాలికలు పొయ్యి చుట్టూ నిల్చుంటారు. ఇస్త్రీ చేసే వారికి మల్లు వస్త్రాలు తొందరగా ఆరడానికై పొయ్యి నుండి ప్రచండమైన సెగలు వస్తుంటాయి. ఈ కార్మికులకు పని గంటలు అపరిమితం. పని బాగా ఉన్నప్పుడు వరుసగా ప్రతి రాత్రీ 9 లేదా 12 గంటల వరకూ పని చేస్తారు. ("రిపోర్ట్స్..." 1862 అక్టోబరు 31, పుట 56) ఒక వైద్యుడు ఇలా ప్రకటించాడు. "చల్లబరుచుకోడానికి" ప్రత్యేకమైన వేళలేమీ లేవు. ఉష్ణోగ్రత మరీ ఎక్కువయినపుడు లేదా చెమట వల్ల కార్మికుల చేతులు మురికి అయినపుడు కొద్ది నిమిషాలపాటు వారిని బయటికి పోనివ్వడం జరుగుతుంది... పొయ్యి దగ్గర పనిచేసే కార్మికుల జబ్బులకు చికిత్స చేయడంలో గణనీయమైన నా అనుభవం వల్ల, వారి ఆరోగ్య పరిస్థితి ఏ రకంగానూ నూలు పరిశ్రమ కార్మికులకున్నంత ఉన్నతంగా లేదని చెప్పాల్సివస్తోంది. (పార్లమెంటుకు నివేదించుకున్న వినతి పత్రాల్లో పెట్టుబడి దానిని రూబెన్స్ తరహాలో అందంగా, ఆరోగ్యవంతంగా చిత్రించింది.) వారిలో అధికంగా కనిపించే జబ్బులు క్షయ, ఊపిరితిత్తులు వ్యాధి, గర్భాశయం సరిగా పనిచేయకపోవడమూ, బాగా ముదిరిన రూపాల్లో హిస్టీరియా, కీళ్ళవ్యాధి, ఇవన్నీ కూడా ప్రత్యక్షంగానో, పరోక్షంగానో కార్మికులు పనిచేసే గదుల్లోని అపరిశుభ్రమైన, అతివేడి గాలివల్లా, శీతాకాలంలో వారు ఇళ్ళకు తిరిగి పోయేప్పుడూ చలి నుండీ, తేమగాలి నుండీ రక్షించడానికి అవసరమైన వెచ్చటి దుస్తులు లేకపోవడంవల్లా కలుగుతున్నాయని నా నమ్మకం. (అదే నివేదిక, పుటలు 56-57) ఈ ఆరుబయట చలువ పనుల కార్మికుల నుండి లాక్కోబడిన 1860 అనుబంధ చట్టం గురించి ఫ్యాక్టరీ ఇన్‌స్పెక్టర్లు ఇలా అన్నారు: "కార్మికులను సంరక్షించడానికి ఉన్నట్టు కనిపించే ఈ చట్టం ఆ సంరక్షణను కల్పించడంలో విఫలం కావడమే కాదు. వ్యక్తులు రాత్రిపూట 8 గంటల తర్వాత పని చేస్తున్నట్లు కనిపెట్టి పట్టుకుంటే తప్ప వారు ఎటువంటి సంరక్షణకు నోచుకోనట్టే కనిపిస్తుంది. రాత్రి 8 గంటల తర్వాత వారు పని చేసినా దాన్ని రుజువు చేసే పద్ధతి సందేహాస్పదం. నేరస్తులకు శిక్ష పడటం అనేది జరుగనే జరుగదు. ఆ చట్టంలోని ఒక క్లాజు అలా కూర్చబడింది (పుట 52). కనుక కరుణ లేదా విద్య లక్ష్యాలతో చేయబడిన చట్టంగా అది అన్ని విధాలా విఫలమైంది. ఎందుకంటే, వయసు పరిమితి ఏదీ లేకుండా, స్త్రీ పురుష విచక్షణ లేకుండా, ఆ పనులు (చలువ పనులు, రంగు అద్దకమూ జరిగే ప్రాంతపు కుటుంబాల సామాజిక అలవాట్ల గురించిన పరిగణన లేకుండా స్త్రీలతోనూ, పిల్లలతోనూ తిండి తిన్నా తినకున్నా రోజుకు 14 గంటలపాటు పని చేయించుకోడానికి అనుమతించే చట్టాన్ని కరుణాత్మకం అనజాలము." ("రిపోర్ట్స్... 1863 ఏప్రిల్ 30, పుట 40)

2. రెండో కూర్పుకు నోట్. 1866లో పై అంశాలను నేను రాసిన నాటి నుండి ఒక ప్రతిచర్య మళ్ళీ మొదలయింది.

## విభాగం - 7

# మామూలు పనిదినం కోసం పోరాటం - ఇతర దేశాలపై ఇంగ్లీషు ఫ్యాక్టరీ చట్టాల ప్రభావం

పెట్టుబడికి శ్రమలోబడటం మూలంగా ఉత్పత్తి విధానంలో తలెత్తే ఎటువంటి మార్పులతోనూ ప్రమేయం లేకుండా అదనపు విలువలను ఉత్పత్తి చేయడం, లేదా అదనపు శ్రమను రాబట్టటం అనేదే పెట్టుబడిదారీ ఉత్పత్తి యొక్క గమ్యమూ, లక్ష్యమూ, సమస్త సారాంశమూ అని పాఠకుడు మనసులో ఉంచుకోవాలి. మనం ఇప్పటి వరకూ పరిశీలించిన మేరకు స్వతంత్ర కార్మికుడు, అంటే తన తరఫున తాను వ్యవహరించటానికి చట్టపరంగా అర్హత గల కార్మికుడు మాత్రమే, ఒక సరుకు అమ్మకందారుడుగా పెట్టుబడిదారునితో ఒప్పందం చేసుకొంటాడని పాఠకుడు గుర్తుంచుకోవాలి. కనుక మన చారిత్రక రేఖాచిత్రంలో ఒకవైపున ఆధునిక పరిశ్రమా, మరోవైపున భౌతికంగానూ, చట్టపరంగానూ మైనర్లు అయిన వారి శ్రమా ముఖ్యమైన పాత్రలు వహిస్తున్నాయీ అంటే, మన దృష్టిలో శ్రమ దోపిడీకి మొదటిది కేవలం ఒక ప్రత్యేక విభాగం కాగా, రెండోది కన్నులకు కట్టినట్లు కనిపించే ఒక స్పష్టమైన ఉదాహరణ మాత్రమే. అయితే మన దర్యాప్తు యొక్క తదుపరి పరిణామం ఎలా ఉన్నప్పటికీ, కేవలం మన ముందున్న చారిత్రక వాస్తవాల సంబంధాన్ని బట్టి ఇది తెలుస్తుంది:

**మొదటిది :** పనిదినాన్ని అపరిమితంగా, నిర్లక్ష్యంగా పొడిగించాలనే పెట్టుబడి ఆరాటం మొదట జలశక్తి, ఆవిరి, యంత్రాలవల్ల అన్నిటికంటే ముందు విప్లవాత్మక మార్పులకు గురైన పరిశ్రమల్లో, అనగా దూదినీ, ఉన్నినీ, నారనూ, పట్టునూ వడకటమూ, నేయడమూ అనే ఆధునిక ఉత్పత్తి విధానం యొక్క తొలి సృజనలలో నెరవేరింది. భౌతిక ఉత్పత్తి విధానంలోని మార్పులవల్లా, వాటి కనుగుణంగా ఉత్పత్తిదారుల[1] సామాజిక సంబంధాల్లో వచ్చిన మార్పులవల్లా మొదట హద్దుల్లేని అమితత్వం తలెత్తింది. తర్వాత దీనికి వ్యతిరేకంగా పనిదినాన్నీ, దాని విరామాల్ని చట్టబద్ధంగా పరిమితమూ, క్రమబద్ధమూ ఏక రూపమూ చేసే సమాజం యొక్క అదుపు వచ్చింది.

అందుకే, 19వ శతాబ్దపు మొదటి అర్ధభాగంలో ఈ అదుపు సాధారణంగా చేయని శాసనావళిగా కనిపిస్తుంది.[2] ఈ కొత్త ఉత్పత్తి విధానం యొక్క ఆదిమ దశ దాటిపోగానే, ఈలోగా అనేక ఇతర ఉత్పత్తి శాఖలు అదే ఫ్యాక్టరీ వ్యవస్థను అనుసరించడం మాత్రమే కాదు, పింగాణీ, గాజు తయారీలాంటి దాదాపు కాలం చెల్లిన పద్ధతులు గల కార్ఖానాలూ, బ్రెడ్డు తయారీలాంటి పాత తరహా చేతివృత్తులూ, చివరికి మేకుల తయారీలాంటి గృహ పరిశ్రమలనబడేవి సైతం ఎంతోకాలంగా ఫ్యాక్టరీలంతగానూ

1. వీటిలో ప్రతి వర్గమూ (పెట్టుబడిదారులూ, కార్మికులూ) అది ఉన్న సాపేక్ష పరిస్థితిని బట్టి ప్రవర్తిస్తుంది...'' (''రిపోర్ట్స్...'' 1848, అక్టోబరు 31, పుట 113).

2. ఆవిరి శక్తితోనూ, జల శక్తితోనూ నడిచే జౌళి వస్త్రాల ఉత్పత్తికి సంబంధించిన పనులు పరిమితుల క్రింద ఉంచబడ్డాయి. ఏ పనినైనా తనిఖీ చేయాలంటే రెండు షరతులు. అది ఆవిరి లేదా జలశక్తిని ఉపయోగించాలి; కొన్ని నిర్దిష్టమైన వస్త్రాలను తయారు చేయాలి.'' (''రిపోర్ట్స్...'' 1864 అక్టోబరు 31, పుట 8).

పెట్టుబడిదారీ దోపిడీ క్రిందికి వచ్చేశాయి.[1] కనుక, శాసనావళి క్రమంగా తన అసాధారణ స్వభావాన్ని వదిలించుకోక తప్పలేదు; లేదా, ఇంగ్లండులో లాగా రోమన్ కాస్యూయిస్ట్‌ల తరహాలో వ్యవహరించే చోట, పని జరిగే ప్రతి ఇంటినీ ఫ్యాక్టరీ అనక తప్పలేదు.[2]

**రెండోది :** కొన్ని ఉత్పత్తి శాఖల్లో పనిదినం క్రమబద్ధత యొక్క చరిత్రా, మరికొన్ని శాఖల్లో ఇప్పటికీ ఆ క్రమబద్ధత కొరకు సాగుతున్న పోరాటమూ ఒక విషయాన్ని నిర్ధారణగా రుజువు చేస్తాయి. అదేమంటే, పెట్టుబడిదారీ ఉత్పత్తి ఒక దశను అందుకున్నాక ఒంటరి కార్మికుడు, అంటే తన శ్రమ శక్తి యొక్క 'స్వతంత్ర' అమ్మకందారుగా ఉండే కార్మికుడు. ఏ మాత్రం ప్రతిఘటన శక్తి లేకుండా పెట్టుబడికి లొంగిపోతాడు. కనుక మామూలు పనిదినం ఏర్పడడం అన్నది పెట్టుబడిదారీ వర్గానికీ, కార్మిక వర్గానికీ మధ్య దాదాపు ప్రచ్ఛన్నంగా సాగిన సుదీర్ఘ అంతర్యుద్ధ ఫలితం. ఈ ఘర్షణ ఆధునిక పరిశ్రమ రంగంలో జరుగుతుంది కనుక ఆ పరిశ్రమకు పుట్టినిల్లయిన ఇంగ్లండులోనే మొదట అది ప్రారంభమవుతుంది.[3] ఇంగ్లీషు కార్మికవర్గ సిద్ధాంతకారులు పెట్టుబడి సిద్ధాంతానికి సవాలు విసిరిన మొదటివారు.[4] అలాగే ఇంగ్లీషు ఫ్యాక్టరీ కార్మికులు, కేవలం ఇంగ్లీషు కార్మిక వర్గానికి మాత్రమే కాక, మొత్తం ఆధునిక కార్మిక వర్గానికి మొనగాళ్ళుగా ఉన్నారు. "పరిపూర్ణ శ్రమ స్వాతంత్ర్యం" కోసం

---

1. గృహ పరిశ్రమలనబడే వాటి పరిస్థితి గురించి ముఖ్యంగా పిల్లల ఉద్యోగ కమిషన్ తాజా నివేదికల్లో విలువైన సమాచారం దొరుకుతుంది.
2. గత సమావేశం (1864) చేసిన చట్టాలు వివిధ వృత్తులకు వర్తిస్తాయి. వాటి అలవాట్లలో ఎంతో భిన్నత్వం ఉంది. యంత్రాలను నడపడానికి యాంత్రిక శక్తిని ఉపయోగించడం అన్నది "ఫ్యాక్టరీ" అనే చట్టబద్ధ నిర్వచనానికి ఇదివరకులాగా ఇప్పుడు ఏ మాత్రం అవసరమైన అంశాలలో ఒకటిగాదు. ("రిపోర్ట్స్..." 1864 అక్టోబరు 31, పుట 8)
3. యూరపు ఖండ ఉదారవాద స్వర్గం అయిన బెల్జియంలో ఈ ఉద్యమ జాడలేమీ లేవు. బొగ్గు, లోహం గనుల్లో సైతం కార్మికుల్లో స్త్రీలూ, పురుషులూ, అన్ని వయసుల వాళ్ళూ ఏ సమయంలోనైనా, ఎంతసేపైనా పూర్తి "స్వేచ్ఛ"తో ఆరగించబడతారు. అక్కడ పనిచేసే ప్రతి 1000 మందిలోనూ, 733 మంది పురుషులూ, 88 మంది స్త్రీలూ, 135 మంది బాలురూ, 44 మంది 16 ఏళ్ళలోపు బాలికలూ. బ్లాస్ట్ ఫర్నేసులు వగైరాల్లో ప్రతి 1000 మందికీ, 668 మంది పురుషులూ, 149 మంది స్త్రీలూ, 98 మంది బాలురూ, 85 మంది 16 ఏళ్ళలోపు బాలికలూ ఉన్నారు. దీనికితోడు పరిణత, అపరిణత శ్రమ శక్తిని దారుణంగా దోపిడీ చేసి, అతి తక్కువ వేతనాలు ఇస్తారు. పురుషుని సగటు రోజు కూలి 2 షిల్లింగుల 8 పెన్నీలు. స్త్రీకి 1 షిల్లింగు 8 పెన్నీలు. బాలునికి 1 షిల్లింగు $2\frac{1}{2}$ పెన్నీలు. దాని ఫలితంగా 1850తో పోల్చి చూస్తే 1863లో బెల్జియం తన బొగ్గు, ఇనుము వగైరాల ఎగుమతులను పరిమాణం రీత్యానూ, విలువ రీత్యానూ దాదాపు రెట్టింపు చేసుకుంది.
4. రాబర్ట్ ఓవెన్ 1810 తర్వాత త్వరలోనే పనిదినాన్ని పరిమితం చేయాల్సిన అవసరాన్ని సిద్ధాంతపరంగా వాదించడం మాత్రమేగాక, న్యూ లానార్క్‌లోని తన ఫ్యాక్టరీలో 10 గంటల పనిదినాన్ని వాస్తవంగా ప్రవేశపెట్టాడు. దీన్ని ఒక కమ్యూనిస్టు ఊహా స్వర్గంగా ఎగతాళి చేశారు. ఆయన "ఉత్పాదక శ్రమకు పిల్లల విద్యను జోడించడం" అన్నదాన్నీ, మొట్టమొదటిసారిగా ఆయన రంగంలోకి తెచ్చిన కార్మికుల సహకార సంఘాలనూ అలాగే హేళన చేశారు. ఇవ్వాళ మొదటి ఊహా స్వర్గం ఫ్యాక్టరీ చట్టం అయింది. రెండోది. ఫ్యాక్టరీ చట్టాలన్నిటిలోనూ అధికారిక నుడికారంగా ఉంది. మూడోది. ఇప్పటికే అభివృద్ధి నిరోధక వంచనకు ముసుగుగా ఉపయోగించబడుతోంది.

హుందాగా ప్రయత్నిస్తున్న పెట్టుబడికి వ్యతిరేకంగా తాము చేబూనిన పతాకంపై "ఫ్యాక్టరీ చట్టాల బానిసత్వాన్ని" లిఖించుకున్న కార్మికవర్గానికి అది అంతులేని అవమానమని ఫ్యాక్టరీ తాత్వికుడు యురే ఖండిస్తాడు.[1]

ఇంగ్లండు వెనక ఫ్రాన్స్ మెల్లగా కుంటుతోంది. 12 గంటల చట్టాన్ని[2] ప్రపంచంలోకి తేవడానికి ఫిబ్రవరి విప్లవం అవసరమయింది. దాని మాతృక అయిన ఇంగ్లీషు చట్టం కంటే అది చాలా లోపభూయిష్టం. అయినప్పటికీ, ఫ్రెంచి విప్లవ పద్ధతివల్ల ఒనగూడే ప్రత్యేక సదుపాయాలున్నాయి. ఇంగ్లీషు శాసనం ఒకసారి ఒక అంశంమీదా, మరొకసారి మరొక అంశంమీదా, పరిస్థితుల ఒత్తిడికి అయిష్టంగా తలవొగ్గుతూ, పరస్పర విరుద్ధ శాసనాల చీకాకుపరిచే చిక్కుముడిలో అంతూ దరీ లేకుండా కూరుకుపోతూంది.[3] కాగా ఫ్రెంచి శాసనం తేడా పాడాల్లేకుండా అన్ని షాపులూ, ఫ్యాక్టరీల్లో ఒక్కసారిగా పనిదినానికి ఒకే విధమైన పరిమితిని సాధించింది. మరోవైపున ఇంగ్లండులో పిల్లల, మైనర్ల, స్త్రీల పేరు మీద మాత్రమే సాధించినదాన్ని, ఇటీవల మాత్రమే ఒక సార్వత్రిక హక్కుగా సాధించుకున్నదాన్ని ఫ్రెంచి శాసనం ఒక సూత్రంగా ప్రకటించింది.[4]

ఉత్తర అమెరికా సంయుక్త రాష్ట్రాల రిపబ్లిక్‌లో ఒక భాగాన్ని బానిసత్వం కురూపం చేసినంత

---

1. ఉరే. ఫ్రెంచి అనువాదం : "Philosophic des Manufacturers" పారిస్, 1836, సంపుటి-II పుటలు 39, 40, 67, 77 వగైరా.

2. 1855లో జరిగిన అంతర్జాతీయ గణాంక మహాసభ "కాంప్టీ రెండూ"లో ఇలా ప్రకటించబడింది. "ఫ్యాక్టరీల్లోనూ, వర్క్‌షాపుల్లోనూ పనిదినాన్ని 12 గంటలకు పరిమితం చేసిన ఫ్రెంచి చట్టం ఈ పనిని నిర్దిష్ట వేళలకు పరిమితం చేయలేదు. పిల్లల పని విషయంలో మాత్రమే పని కాలాన్ని ఉదయం 5 గంటలకూ రాత్రి 9 గంటలకూ మధ్య ఉండాలని నిర్దేశించింది. కనుక కొంతమంది యజమానులు, ఈ ప్రాణాంతకమైన మౌనం ఇచ్చే హక్కును బహుశా ఒక్క ఆదివారం తప్ప మిగతా రోజుల్లో రాత్రీ, పగలూ విరామం లేకుండా, తమ కార్ఖానాలు నడిపించుకోటానికి ఉపయోగించుకుంటున్నారు. దీనికోసం వారు రెండు జట్ల కార్మికుల్ని ఉపయోగిస్తారు. ఇందులో ఏ జట్టూ ఒకేసారి వర్క్‌షాపులో 12 గంటలకు మించి ఉండదు. అయితే సంస్థలో పని మాత్రం రాత్రి పగలూ ఉంటుంది. చట్టం పాటించబడింది. మరి మానవత్వం?" "మానవ శరీరంపై రాత్రి శ్రమ కల్గించే వినాశకర ప్రభావం"తోపాటు, "సరిగ్గా వెలుగుండని అవే వర్క్‌షాపుల్లో రాత్రిపూట ఆడా మగా కలిసి ఉండటంవల్ల కలిగే దారుణ ప్రభావాన్ని" కూడా అది నొక్కి చెప్పింది.

3. "ఉదాహరణకు, నా జిల్లాలో ఒకే కార్ఖానాకు చెందిన ఒక యజమాని ఏకకాలంలో చలువ పనులకూ, రంగులద్దకానికీ సంబంధించిన చట్టం కిందికీ, అద్దకం పనుల చట్టం కిందకీ, ఫ్యాక్టరీ చట్టం కిందికీ వస్తున్నాడు." (1861 అక్టోబరు 31 వరకూ సమర్పించబడిన "రిపోర్ట్స్..."లో బేకర్ నివేదిక) ఈ చట్టాల్లోని వివిధ నిబంధనలనూ, వాటి నుండి తలెత్తే ఇబ్బందులనూ ఏకరువు పెట్టిన తర్వాత బేకర్ ఇలా అంటాడు. "కనుక, యజమాని చట్టాన్ని అతిక్రమించాలనుకుంటే పార్లమెంట్ చేసిన ఈ మూడు చట్టాల అమలును సాధించడం చాలా కష్టమనిపిస్తుంది. అయితే దీనివల్ల న్యాయవాదులకు కేసులు మాత్రం ఖాయం."

4. ఆ రకంగా ఫ్యాక్టరీ ఇన్‌స్పెక్టర్లు చివరికి చెప్ప సాహసించారు. "ఈ అభ్యంతరాలు (పనిదినం పరిమితికి పెట్టుబడి అభ్యంతరాలు) శ్రమ హక్కుల విస్తృత సూత్రానికి తలవంచక తప్పదు... కార్మికుని శ్రమపైన యజమాని హక్కు అంతమయ్యే సమయం అంటూ ఉంది. కార్మికుడు పనిలో అలసిపోకపోయినా సరే అతని కాలం అతనిదే అవుతుంది. ("రిపోర్ట్స్..." 1862 అక్టోబరు 31, పుట 54)

కాలం, దేశంలో కార్మికుల స్వతంత్ర ఉద్యమం ప్రతిదీ దెబ్బతింది. నల్ల చర్మపు కార్మికుడు శృంఖలాబద్ధ మైనచోట తెల్ల చర్మపు కార్మికుడు విముక్తి సాధించజాలడు. అయితే బానిసత్వపు మరణంలో నుండి వెంటనే కొత్త జీవం తలెత్తింది. అంతర్యుద్ధం యొక్క మొదటి ఫలితం ఎనిమిది గంటల ఉద్యమం. అది అట్లాంటిక్ నుండి పసిఫిక్ దాకా, న్యూ ఇంగ్లండు నుండి కాలిఫోర్నియా దాకా వాయువేగంతో వ్యాపించింది. బాల్టిమోర్ (1866 ఆగస్టు 16)లో జరిగిన కార్మికుల సార్వజనీన సమావేశం ఇలా ప్రకటించింది : "పెట్టుబడిదారీ బానిసత్వం నుండి ఈ దేశ కార్మికులను విముక్తి చేయడానికి అన్ని అమెరికా రాష్ట్రాల్లోనూ మామూలు పనిదినాన్ని ఎనిమిది గంటలుగా నిర్దేశించే చట్టాన్ని చేయడం అన్నది ఈనాటి ప్రథమ, మహత్తర ఆవశ్యకం. ఈ ఘనమైన ఫలితాన్ని సాధించేదాకా దీనికోసం మా శక్తినంతా ధారపోయడానికి నిర్ణయించుకున్నాం.[1] అదే సమయంలో ఇంటర్నేషనల్ వర్కింగ్ మెన్స్ అసోసియేషన్ జెనీవా మహాసభలో లండన్ సాధారణ సమితి ప్రతిపాదనపై "పనిదినాన్ని పరిమితం చేయడం అన్నది ఒక ప్రాథమిక షరతు. అది లేకుండా మెరుగుదల కోసం, విముక్తి కోసం చేసే పనులన్నీ విఫలం కాకతప్పదు... పనిదినానికి చట్టబద్ధమైన పరిమితి ఎనిమిది గంటలుండాలని మహాసభ ప్రతిపాదిస్తోంది" అని తీర్మానించ బడింది.

ఆ రకంగా అట్లాంటిక్‌కు ఇరువైపులా ఉత్పత్తి పరిస్థితుల నుండి సద్యోజనితంగా వర్ధిల్లిన కార్మికవర్గ ఉద్యమం ఇంగ్లీషు ఫ్యాక్టరీ ఇన్‌స్పెక్టరు ఆర్.జె. సాండర్స్ యొక్క ఈ మాటలకు ఆమోదముద్ర వేశాయి: "పని గంటలను పరిమితం చేయకుండా, ఆ పరిమితిని కచ్చితంగా అమలుచేయకుండా సమాజాన్ని సంస్కరించడానికి తీసుకునే మిగిలిన చర్యలు సఫలమవుతాయనే ఆశతో అమలుపరచడం ఎప్పటికీ సాధ్యం కాదు."[2]

ఉత్పత్తి ప్రక్రియలో ప్రవేశించిన కార్మికుడు దానిలో నుండి భిన్నంగా బయటికొస్తాడని మనం గుర్తించాలి. అతను మార్కెట్‌లో "శ్రమ శక్తి" సరుకు యజమానిగా ఇతర సరుకుల యజమానులకు అభిముఖంగా, ఒక వ్యాపారికి ఎదురుగా మరొక వ్యాపారిగా, నిలబడ్డాడు. అతను తనను తాను స్వేచ్ఛగా సమర్పించుకున్నాడని, అతను తన శ్రమ శక్తి అమ్మకంలో పెట్టుబడిదారునితో చేసుకున్న ఒప్పందం స్పష్టంగా రుజువు చేస్తోంది. ఒప్పందం కుదిరిన తర్వాత తెలిసి వచ్చేదేమిటంటే, అతను "స్వేచ్ఛాయుత వ్యక్తి" కాదనీ, ఎంతకాలంపాటు పరాధీనమయ్యేటట్లు తన శ్రమ శక్తిని అమ్మడానికి

1. "డన్‌కిర్క్ కార్మికులమైన మేము ప్రస్తుత వ్యవస్థలో కోరబడుతున్న శ్రమ కాలం చాలా ఎక్కువగా ఉందని ప్రకటిస్తున్నాము. అది కార్మికునికి విశ్రాంతి, విద్యల కోసం సమయం ఇవ్వకపోగా అతన్ని బానిసత్వం కంటే ఏ మాత్రం మెరుగుకాని దాస్యంలోకి లాగుతోంది. అందుకే, ఒక పని దినానికి ఎనిమిది గంటలు చాలుననీ, అలా చాలుననీ చట్టబద్ధంగా గుర్తించాల్సి ఉందనీ నిర్ణయించాం. అందుకే బలోపేతశక్తి అయిన పత్రికల రంగాన్ని మాకు సాయపడాల్సిందిగా కోరుతున్నాం... అందుకే మాకు ఈ సాయాన్ని తిరస్కరించిన వారందర్నీ శ్రమ సంస్కరణకూ, కార్మికుల హక్కులకూ శత్రువులుగా పరిగణిస్తున్నాం." (న్యూయార్క్ రాష్ట్రంలోని డన్‌కిర్క్ కార్మికుల తీర్మానం, 1866)
2. "రిపోర్ట్స్..." 1848 అక్టోబరు, పుట 112.

అతనికి స్వేచ్ఛ ఉండిందో అంతకాలంపాటు అతను దాన్ని విధిలేక అమ్మినాడనీ,[1] నిజానికి దోపిడీ చేయడానికి "అక్కడ ఓ కండరం, ఓ నరం, ఓ రక్తబిందువు" ఉన్నంత వరకూ రక్తపిశాచి తన పట్టు విడవదనీ,[2] తమ "వేదనా సర్పం" బారినుండి "రక్షణ" కోసం కార్మికులు కలిసికట్టుగా ఆలోచించాలి. పెట్టుబడితో తాము ఖచ్చితంగా చేసుకొనే ఒప్పందం ద్వారా తమనూ, తమ కుటుంబాలనూ బానిసత్వానికీ, మృత్యువుకూ అమ్ముకోకుండా నిరోధించే శక్తివంతమైన సామాజిక అవరోధంగా ఉండే చట్టాన్ని చెయ్యడం కోసం ఒక వర్గంగా వారు ఒత్తిడి చేయాలి.[3] "ఉల్లంఘించరాని మానవ హక్కులు" ఆడంబరపు జాబితా స్థానంలో చట్టబద్ధంగా పనిదినాన్ని పరిమితం చేసే ఒక వినమ్రమైన హక్కుల పత్రం వచ్చింది. కార్మికుడు అమ్మే కాలం ఎప్పుడు అంతమవుతుందో, అతని సొంత కాలం ఎప్పుడు ప్రారంభమవుతుందో అది స్పష్టం చేస్తుంది.[4] ఆనాటి నుండి ఇప్పటికి ఎంత గొప్ప మార్పు!

---

1. అంతేకాక, ఈ వ్యవహారాలు (1848-50 నుండీ పెట్టుబడి ఎత్తులు) కార్మికులకు సంరక్షణ అక్కర్లేదనీ, తమకున్న ఏకైక ఆస్తి అయిన "తమ చేతుల శ్రమ, తమ నుదుటి చెమట"ను ఖర్చు చేయడంలో స్వేచ్ఛాయుత వ్యక్తులుగా వారిని పరిగణించవచ్చనీ చేసే వాదనలోని వంచనను నిర్వివాదంగా రుజువు చేశాయి. ("రిపోర్ట్స్..." 1850 ఏప్రిల్ 30, పుట 45) "ఒక స్వతంత్ర దేశంలో సైతం స్వతంత్ర శ్రమ (దానికి ఆ పేరు పెడితే)ను సంరక్షించడానికి చట్టం యొక్క బలమైన హస్తం అవసరం." ("రిపోర్ట్స్..." 1864 అక్టోబరు 31, పుట 34) "తిండి తిన్నా, తినకున్నా రోజుకు 14 గంటలపాటు పని చేయించుకోడానికి అనుమతించే చట్టాన్ని (నిర్బంధించే చట్టాన్ని అనవచ్చు) వగైరా. ("రిపోర్ట్స్..." 1863 ఏప్రిల్ 30, పుట 40)
2. ఫ్రెడరిక్ ఏంగెల్స్ పూర్వోక్త రచన, పుట 5)
3. "పది గంటల చట్టం, అది అమలుజరిగిన పారిశ్రామిక శాఖల్లో "మునుపు ఎక్కువ గంటలపాటు పనిజేసిన కార్మికుల అకాల వార్ధక్యానికి అంతం పలికింది." ("రిపోర్ట్స్..." 1859 అక్టోబరు 31, పుట 47) "పనిజేసే కార్మికులకు ఆరోగ్యానికీ, నీతికీ కొంత హాని చేయకుండా ఒక పరిమిత కాలానికి మించి యంత్రాలను ఆడించడం ఎన్నడూ పెట్టుబడికి (ఫ్యాక్టరీలలో) సాధ్యం కాదు. కార్మికులు స్వయంగా తమను తాము రక్షించుకోలేరు. (పుట 8)
4. "అంతకంటే గొప్ప వరం ఏమంటే కార్మికుని సొంత సమయానికీ, అతని యజమాని సమయానికీ ఉన్న తేడా ఆఖరికి స్పష్టమయింది. ఇప్పుడు తను అమ్మే కాలం ఎప్పుడు అంతమవుతుందో, తన సొంత కాలం ఎప్పుడు మొదలవుతుందో కార్మికుడికి తెలుసు. ఇది ముందే ఖచ్చితంగా తెలుసు గనుక కార్మికుడు తన సొంత అవసరాలకు తన సొంత నిమిషాలను ముందే ఏర్పాటుచేసు కుంటాడు." (అదే నివేదిక, పుట 52) వారి కాలానికి వారినే యజమానులుగా చేయడం ద్వారా (ఫ్యాక్టరీ చట్టాలు) తుదకు వారు రాజకీయ అధికారాన్ని చేపట్టే దిశగా పయనించేలా చేసే నైతిక శక్తిని ఇచ్చాయి. (పుట 47) పెట్టుబడికి కేవల సాకార రూపమైన మనిషికి సహజంగా ఉండే పాశవికతలో కొంత భాగం నుండి పెట్టుబడిదారుణ్ణి వాస్తవ చట్టం విముక్తి చేస్తుందనీ, అతనికి 'సంస్కారం' కోసం కొంత సమయం ఇస్తుందనీ అణుచుకున్న వ్యంగ్యంతో, ఆచి తూచి చెప్పిన మాటలతో ఫ్యాక్టరీ ఇన్‌స్పెక్టర్లు సూచించారు. "ఇంతకు ముందు యజమానికి డబ్బు కోసంతప్ప మరి దేనికీ వ్యవధి లేదు, సేవకుడికి శ్రమ చేయడానికితప్ప మరి దేనికీ వ్యవధి లేదు." (పుట 48)

## అధ్యాయం - 11

# అదనపు విలువ రేటు, అదనపు విలువ మొత్తం

ఇదివరకులాగే ఈ అధ్యాయంలో కూడా శ్రమ శక్తి విలువా, దాన్నిబట్టి ఆ శ్రమ శక్తి పునరుత్పత్తికి లేదా పోషణకు అవసరమైన పనిదినం భాగమూ ముందే తెలుసనీ, అవి స్థిర పరిమాణాలనీ అనుకుందాం.

ఇలా అనుకున్నాక, అదనపు విలువ రేటు తెలుసు గనుక, నిర్దిష్ట కాల వ్యవధిలో పెట్టుబడిదారునికి కార్మికుడు ఇచ్చే అదనపు విలువ మొత్తం కూడా తెలుసు. ఉదాహరణకు అవసర శ్రమ రోజుకు 6 గంటలనీ, అది 3 షిల్లింగుల బంగారంతో సమానమనీ అనుకుందాం. అప్పుడు 3 షిల్లింగులు అనేది ఒక శ్రమ శక్తి యొక్క రోజు విలువ. లేదా ఒక శ్రమ శక్తిని కొనటానికి అడ్వాన్సు చేసిన పెట్టుబడి విలువ. అదనపు విలువ రేటు 100% అయినట్టయితే 3 షిల్లింగుల అస్థిర పెట్టుబడి 3 షిల్లింగుల అదనపు విలువను ఉత్పత్తి చేస్తుంది. లేదా కార్మికుడు రోజూ 6 గంటల అదనపు శ్రమను సరఫరా చేస్తాడు.

అయితే పెట్టుబడిదారుని అస్థిర పెట్టుబడి అనేది అతను ఏకకాలంలో పనిలో నియమించిన మొత్తం శ్రమ శక్తుల మొత్తం విలువకు డబ్బు రూపం. కనుక ఒక శ్రమ శక్తి సగటు విలువను పనిచేస్తున్న శ్రమ శక్తుల సంఖ్యతో గుణిస్తే అది అస్థిర పెట్టుబడి విలువకు సమానం. కనుక శ్రమ శక్తి విలువ స్థిరంగా ఉన్నప్పుడు అస్థిర పెట్టుబడి యొక్క పరిమాణం ఏకకాలంలో పనిచేస్తున్న కార్మికుల సంఖ్యకు అనుగుణంగా మారుతుంది. ఒక శ్రమ శక్తి యొక్క రోజు విలువ 3 షిల్లింగులయితే అప్పుడు 100 శ్రమ శక్తుల్ని రోజూ దోపిడీ చెయ్యాలంటే 300 షిల్లింగుల్ని అడ్వాన్సు చేయాలి. రోజూ n శ్రమ శక్తుల్ని దోపిడీ చెయ్యాలంటే nx 3 షిల్లింగుల అస్థిర పెట్టుబడిని అడ్వాన్సు చేయాలి.

అదేవిధంగా, ఒక శ్రమ శక్తి యొక్క రోజు విలువైన 3 షిల్లింగుల అస్థిర పెట్టుబడి 3 షిల్లింగుల అదనపు విలువను ఉత్పత్తి చేస్తే, 300 షిల్లింగుల అస్థిర పెట్టుబడి రోజూ 300 షిల్లింగుల అదనపు విలువనూ, nx 3 షిల్లింగుల అస్థిర పెట్టుబడి రోజూ nx 3 షిల్లింగుల అదనపు విలువనూ ఉత్పత్తి చేస్తుంది. కనుక ఉత్పత్తి అయ్యే మొత్తం అదనపు విలువ అనేది ఒక కార్మికుడు ఒక పనిదినంలో సరఫరా చేసే అదనపు విలువను పనిచేసే కార్మికుల సంఖ్యతో గుణించగా వచ్చిన దానితో సమానం. అయితే శ్రమ శక్తి విలువ స్థిరమైనపుడు, ఒక కార్మికుడు ఉత్పత్తి చేసే అదనపు విలువ మొత్తం అదనపు విలువ రేటును బట్టి నిర్ణయమవుతుంది. దానిని బట్టి ఈ నియమం తలెత్తుతుంది : అడ్వాన్సు చేసిన అస్థిర పెట్టుబడిని అదనపు విలువ రేటుతో గుణించగా వచ్చేది ఉత్పత్తి అయిన మొత్తం అదనపు విలువకు సమానం. మరో రకంగా చెప్పాలంటే : ఏకకాలంలో అదే పెట్టుబడిదారుడు

దోపిడీ చేసే శ్రమ శక్తుల సంఖ్యను ప్రతి వ్యష్టి శ్రమ శక్తి యొక్క దోపిడీ స్థాయితో గుణించగా వచ్చే మొత్తాన్ని బట్టి అది నిర్ణయమవుతుంది.

అదనపు విలువ మొత్తాన్ని 'S' అనుకుందాం. వ్యష్టి కార్మికుడు సగటున ఒక రోజులో సరఫరా చేసిన అదనపు విలువను S అనుకుందాం. ఒక వ్యష్టి శ్రమ శక్తిని కొనటానికి ఒక రోజుకు అడ్వాన్సు చేసిన అస్థిర పెట్టుబడిని V అనుకుందాం. అస్థిర పెట్టుబడి మొత్తాన్ని V అనుకుందాం. ఒక శ్రమ శక్తి సగటు విలువను P అనుకుందాం. దాని దోపిడీ స్థాయిని $a^1/a$ అదనపు శ్రమ/అవసర శ్రమ అనుకుందాం. పనిచేసే కార్మికుల సంఖ్య n అనుకుందాం. అప్పుడు

$$S = \frac{\frac{S}{V} \times V}{p \times \frac{a-1}{a} n}$$

సగటు శ్రమ శక్తి విలువ స్థిరమని మాత్రమే కాక, పెట్టుబడిదారుడు పనిలో నియమించిన కార్మికులు సగటు కార్మికులను కూడా ఎప్పుడూ పరిగణించబడుతుంది. ఉత్పత్తి అయిన అదనపు విలువ, దోపిడీ చేయబడిన కార్మికుల సంఖ్యకు అనుగుణంగా పెరగని కొన్ని ప్రత్యేక సందర్భాలుంటాయి. అయితే అప్పుడు శ్రమ శక్తి విలువ స్థిరంగా ఉండదు.

కనుక, ఒక నిర్దిష్ట అదనపు విలువ మొత్తాన్ని ఉత్పత్తి చేయడంలో ఒక అంశం తగ్గితే దాన్ని మరో అంశం పెరగటం ద్వారా భర్తీ చేయొచ్చు. అస్థిర పెట్టుబడి తగ్గినపుడు అదే సమయంలో అదే నిష్పత్తిలో అదనపు విలువ రేటు పెరిగితే ఉత్పత్తి అయిన అదనపు విలువ యథాతథంగా ఉంటుంది. మనం మొదట అనుకున్నదాని ప్రకారం పెట్టుబడిదారుడు రోజుకు 100 మంది కార్మికుల్ని దోపిడీ చెయ్యాలంటే 300 షిల్లింగుల్ని అడ్వాన్సు చేయాలి. ఒకవేళ అదనపు విలువ రేటు 50% ఉంటే ఈ 300 షిల్లింగుల అస్థిర పెట్టుబడి 150 షిల్లింగుల అదనపు విలువను ఇస్తుంది. లేదా 100×3 పని గంటల అదనపు విలువను యిస్తుంది. అదనపు విలువ రేటు రెట్టింపయిందనుకుందాం. లేదా పని దినం 6 నుండి 9 గంటలకు పెరగడానికి బదులు 6 నుండి 12 గంటలకు పెరిగిందనుకుందాం. అదే సమయంలో అస్థిర పెట్టుబడి సగానికి అంటే 150 షిల్లింగులకు తగ్గిందనుకుందాం. అప్పుడు కూడా అది 150 షిల్లింగుల అదనపు విలువను, లేదా 50×6 పని గంటల అదనపు విలువను ఇస్తుంది. కనుక అస్థిర పెట్టుబడిలో తగ్గుదల అనేది అదే నిష్పత్తిలో శ్రమ శక్తి దోపిడీ స్థాయి పెరుగుదల వల్ల భర్తీ కావచ్చు. లేదా పనిచేసే కార్మికుల సంఖ్య తగ్గితే, అదే నిష్పత్తిలో పనిదినం పెరగటం వల్ల అది భర్తీ కావచ్చు. కనుక పెట్టుబడి దోపిడీ చేయడానికి వీలైన శ్రమ సరఫరా అనేది కొన్ని పరిమితులకు లోపల కార్మికుల సరఫరా మీద ఆధారపడకుండా స్వతంత్రంగా ఉంటుంది.[1] మరొకవైపున అదనపు విలువ రేటు పడిపోయినప్పుడు అదే నిష్పత్తిలో అస్థిర పెట్టుబడి పెరిగినా,

---

గమనిక : అదనపు విలువ మొత్తాన్ని పెద్ద 'S'తోనూ, ఒక కార్మికుడు పని మూలంగా ఒక సగటు రోజులో ఉత్పత్తి అయిన అదనపు విలువను చిన్న 's'తో గుర్తించడం జరిగింది.

1. ఈ ప్రాథమిక నియమం నాటు అర్థశాస్త్రవేత్తలకు తెలియనట్టు కనిపిస్తుంది. మార్కెట్‌లో శ్రమ ధర సరఫరా గిరాకీని బట్టి నిర్ణయించబడుతుందనే ఈ తల్లకిందులు ఆర్కిమెడీసులు తమకొక ఆధారం దొరికిందనీ, దానితో ప్రపంచాన్ని కదిలించగలమనీ కాదు, దాని చలనాన్ని ఆపేయగలమనీ ఊహించుకుంటారు.

అనగా పనిచేసే కార్మికుల సంఖ్య పెరిగినా అదనపు విలువ మొత్తం యథాతథంగా ఉంటుంది.

ఏమయినప్పటికీ, పనిలో ఉన్న కార్మికుల సంఖ్యలో లేదా అడ్వాన్సు చేసిన అస్థిర పెట్టుబడి మొత్తంలో తగ్గుదలను పనిదినాన్ని పొడిగించడం ద్వారానో లేదా అదనపు విలువ రేటు పెంచడం ద్వారానో భర్తీ చేయడానికి దాట శక్యంగాని పరిమితులున్నాయి. శ్రమ శక్తి విలువ ఎంతైనప్పటికీ, కార్మికుని పోషణార్థం అవసరమైన శ్రమ కాలం 2 గంటలైనా, 10 గంటలైనా, రాత్రీ, పగలూ పనిచేసినా ఒక కార్మికుడు రోజులో ఉత్పత్తి చేయగల మొత్తం విలువ 24 గంటల శ్రమ సృష్టించే విలువ కంటే తక్కువగా ఉంటుంది. వినియోగించబడిన 24 గంటల శ్రమకు డబ్బు రూపం 12 షిల్లింగులయితే, అది 12 షిల్లింగుల కంటే తక్కువగా ఉంటుంది. మనం ఇంతకు ముందు అనుకున్న దాని ప్రకారం శ్రమ శక్తిని పునరుత్పత్తి చేయడానికి, లేదా దానిని కొనడానికి అడ్వాన్సు చేసిన పెట్టుబడి విలువను సృష్టించడానికి రోజువారీ 6 గంటల శ్రమ కాలం అవసరం. 100% అదనపు విలువ రేటుతో, 12 గంటల పనిదినంతో 500 మంది కార్మికులతో పని చేయించే 1500 షిల్లింగుల అస్థిర పెట్టుబడి రోజూ 1500 షిల్లింగుల అదనపు విలువను, లేదా 6×500 పని గంటల అదనపు విలువను ఉత్పత్తి చేస్తుంది. రోజుకు 200% అదనపు విలువ రేటుతో, అనగా 18 గంటల పనిదినంతో, 100 మంది కార్మికులతో పనిచేయించే 300 షిల్లింగుల పెట్టుబడి రోజుకు 600 షిల్లింగుల అదనపు విలువను, లేదా 12×100 పని గంటల అదనపు విలువను మాత్రమే సృష్టిస్తుంది. అడ్వాన్సు చేసిన అస్థిర పెట్టుబడికి అదనపు విలువను కలిపితే దాని మొత్తం విలువ ఉత్పాదితం అవుతుంది. ఇది ఎన్నటికీ రాత్రీ, పగలూ కలిసినా 1200 షిల్లింగుల్ని, లేదా 24×100 పని గంటల్ని చేరుకోలేదు. సగటు పనిదినం యొక్క పరమ పరిమితి ప్రకృతిసిద్ధంగా ఎప్పుడూ 24 గంటలకు లోపే ఉంటుంది. ఇది అస్థిర పెట్టుబడి తగ్గుదలను, అదనపు విలువ రేటును పెంచడం ద్వారానూ, దోపిడీ చేయబడే కార్మికుల సంఖ్యలో తగ్గుదలను దోపిడీ స్థాయిని పెంచడం ద్వారానూ భర్తీ చేయడానికి పరమ పరిమితిని విధిస్తుంది. సాధ్యమైనంత అత్యధిక అదనపు విలువను ఉత్పత్తి చేయాలనే తన మరో ధోరణికి విరుద్ధంగా పెట్టుబడి తాను పనిచేయించే కార్మికుల సంఖ్యను, లేదా శ్రమ శక్తిగా రూపొందే తన అస్థిర భాగాన్ని సాధ్యమైనంతగా తగ్గించాలనే ధోరణి నుండి తలెత్తుతున్న అనేక విషయాలను వివరించడంలో ఈ స్పష్టమైన నియమానికి ప్రాముఖ్యం ఉంది. మరోవైపున, అదనపు విలువ రేటు పడిపోయినంతగా పనిలో నియమించబడిన శ్రమ శక్తి మొత్తం, లేదా అస్థిర పెట్టుబడి మొత్తం పెరగకపోతే ఉత్పత్తి అయ్యే అదనపు విలువ మొత్తం పడిపోతుంది.

ఉత్పత్తి అయ్యే అదనపు విలువ మొత్తం రెండు అంశాలను బట్టి నిర్ణయించబడుతుంది. అవి : అదనపు విలువ రేటూ, అడ్వాన్సు చేసిన అస్థిర పెట్టుబడి మొత్తమూ. దీని నుండి మూడో నియమం పుడుతుంది. అదనపు విలువ రేటు లేదా శ్రమ శక్తి దోపిడీ స్థాయి, శ్రమ శక్తి విలువ లేదా అవసర శ్రమ కాలం పరిమాణం స్థిరంగా ఉంటే, అస్థిర పెట్టుబడి ఎంత ఎక్కువయితే అంత ఎక్కువగా మొత్తం విలువా, మొత్తం అదనపు విలువా ఉత్పత్తి అవుతాయనేది స్వయం విదితం. పనిదినం పరిమితీ, దాని అవసర శ్రమ భాగం యొక్క పరిమితీ స్థిరంగా వుంటే, ఒక వ్యష్టి పెట్టుబడిదారుడు ఉత్పత్తి చేసే మొత్తం విలువా, మొత్తం అదనపు విలువా కేవలం అతడు పనిలో పెట్టే శ్రమ మొత్తంపైన

ఆధారపడతాయి. అయితే పైన పరిగణించిన పరిస్థితుల్లో ఇది శ్రమ శక్తి మొత్తంపైన లేదా పెట్టుబడిదారుడు దోపిడీ చేసే కార్మికుల సంఖ్యపైన ఆధారపడుతుంది. అయితే ఈ సంఖ్య అడ్వాన్సు చేయబడిన అస్థిర పెట్టుబడి మొత్తాన్ని బట్టి నిర్ణయమవుతుంది. కనుక అదనపు విలువ రేటూ, శ్రమ శక్తి విలువా స్థిరంగా ఉంటే, ఉత్పత్తి అయ్యే అదనపు విలువ మొత్తాలు అడ్వాన్సు చేయబడే అస్థిర పెట్టుబడుల మొత్తాలకు అనుగుణంగా మారుతుంటాయి. పెట్టుబడిదారుడు తన పెట్టుబడిని రెండు భాగాలుగా విభజిస్తాడని మనకు తెలుసు. అతడు ఒక భాగాన్ని ఉత్పత్తి సాధనాల్లో పెడతాడు. అది అతని పెట్టుబడిలోని స్థిర భాగం. రెండో భాగాన్ని అతడు సజీవ శ్రమ శక్తి కోసం వెచ్చిస్తాడు. ఈ భాగం అతని అస్థిర పెట్టుబడి. ఒకే సామాజిక ఉత్పత్తి విధానంలో పెట్టుబడి స్థిర అస్థిర భాగాలుగా విభజించబడటం అన్నది విభిన్న ఉత్పత్తి శాఖల్లో విభిన్నంగా ఉంటుంది. ఒకే ఉత్పత్తి శాఖలో సైతం సాంకేతిక పరిస్థితుల్లోని మార్పులను బట్టీ, ఉత్పత్తి ప్రక్రియల సామాజిక కలయికలలోని మార్పులను బట్టీ ఇది మారుతూ ఉంటుంది. అస్థిర పెట్టుబడి, స్థిర పెట్టుబడుల నిష్పత్తి 1:2 లేదా 1:10 లేదా 1:× ఎంతైనా కావచ్చు. పెట్టుబడి యొక్క ఈ రెండు భాగాల మధ్య నిష్పత్తి ఏదైనప్పటికీ, ఇంతకు ముందు పేర్కొన్న నియమంపైన దాని ప్రభావం ఉండదు. ఎందుకంటే, ఇంతకుముందు మనం చేసిన విశ్లేషణ ప్రకారం స్థిర పెట్టుబడి విలువ ఉత్పాదితం యొక్క విలువలో పునఃప్రత్యక్షమవుతుంది. అంతేగాని కొత్తగా ఉత్పత్తి అయిన విలువలో కొత్తగా సృష్టింపబడిన విలువ ఉత్పాదితంలో ప్రవేశించదు. 100 మందిని పనిలో పెట్టడానికి అవసరమైన ముడిపదార్థాలు, కదుళ్ళు వగైరాల కంటే 1000 మందిని పనిలో పెట్టడానికి ఎక్కువ అవసరమవుతాయి. ఈ అదనపు ఉత్పత్తి సాధనాల విలువ పెరగొచ్చు, తరగొచ్చు, యథాతథంగా ఉండొచ్చు. ఎక్కువగావచ్చు, తక్కువ గావచ్చు. అయితే శ్రమ శక్తులు ఆ ఉత్పత్తి సాధనాలను ఉపయోగించి అదనపు విలువను సృష్టించే ప్రక్రియపై దాని ప్రభావం ఏమీ ఉండదు. కనుక పైన నిరూపించబడిన నియమం ఈ రూపం తీసుకుంటుంది : శ్రమ శక్తి విలువ స్థిరంగానూ, దోపిడీ స్థాయి యథాతథంగానూ ఉంటే, విభిన్న పెట్టుబడుల ద్వారా ఉత్పన్నమైన విలువ, అదనపు విలువల మొత్తాలు ఈ పెట్టుబడుల అస్థిర భాగాలకు అనుగుణంగా మారుతుంటాయి – అనగా ఈ పెట్టుబడులలో సజీవ శ్రమ శక్తిగా పరివర్తన చెందిన భాగాలకు అనుగుణంగా మారుతుంటాయి.

పైకి కనిపించేదాన్నిబట్టి మనకు ఏర్పడిన అనుభవానికి ఈ నియమం స్పష్టంగా విరుద్ధంగా ఉంది. తాను పెట్టే మొత్తం పెట్టుబడిపై వచ్చే శాతాన్ని లెక్కజూసుకొనే నూలు మిల్లు యజమాని ఎక్కువ మొత్తం స్థిర పెట్టుబడిగానూ, తక్కువ మొత్తం అస్థిర పెట్టుబడిగానూ పెడతాడు. కానీ, ఆ కారణం వల్ల, సాపేక్షంగా తక్కువ స్థిర పెట్టుబడినీ ఎక్కువ అస్థిర పెట్టుబడినీ వినియోగించే బ్రెడ్డు ఉత్పత్తిదారుని కంటే అతడు తక్కువ లాభాన్ని లేదా అదనపు విలువను సంపాయించడని ప్రతి ఒక్కరికీ తెలుసు. $\frac{5}{8}$ ఒక వాస్తవ పరిమాణాన్ని సూచిస్తుందని అర్థం చేసుకోవడానికి ప్రాథమిక బీజగణితపు స్థాయి నుండి అనేక మధ్యంతర దశలు గడవాల్సి ఉన్నట్టే, పైకి కనిపించే ఈ వైరుధ్యాన్ని పరిష్కరించడానికి కూడా అనేక మధ్యంతర దశలు గడవాల్సి ఉంది. సాంప్రదాయక అర్థశాస్త్రం ఈ నియమాన్ని రూపొందించనప్పటికీ దాన్ని అసంకల్పితంగా ఆమోదిస్తుంది. ఎందుకంటే అది విలువ

సాధారణ నియమం యొక్క ఆవశ్య పర్యవసానం. ఒక ఉగ్ర భావ సంగ్రహణ ద్వారా అది విరుద్ధ విషయాలతో ఢీకొనే ప్రమాదం నుండి ఈ నియమాన్ని రక్షించడానికి ప్రయత్నిస్తుంది. ఈ అవరోధాన్ని అధిగమించడంలో రికార్డో సిద్ధాంతం ఎలా విఫలమైందో తర్వాత[1] పరిశీలిద్దాము. అన్ని సందర్భాల్లో లాగానే ఇక్కడ కూడా "నిజంగా ఏమీ నేర్చుకోని" నాటు అర్థశాస్త్రం విరుద్ధ విషయాలను క్రమబద్ధం చేసి, వివరించే నియమాన్ని వదలిపెట్టి, పైపై రూపాలను పట్టుకు వేళ్ళాడుతుంది. స్పినోజాకి వ్యతిరేకంగా అది "అజ్ఞానం తగినంత కారణం" అని నమ్ముతుంది.

మొత్తం సమాజం యొక్క పెట్టుబడి రాత్రింబగళ్ళు పనిలో ఉంచిన శ్రమను ఒక సమష్టి పనిదినంగా పరిగణించవచ్చు. ఉదాహరణకు, కార్మికుల సంఖ్యను 10 లక్షలనీ, కార్మికుని సగటు పనిదినం 10 గంటలనీ అనుకుంటే సామాజిక పనిదినంలో కోటి గంటలు ఉంటాయి. పనిదినం యొక్క పరిమితులు భౌతికంగా నిర్ణయించబడినా లేదా సామాజికంగా నిర్ణయించబడినా పనిదినం యొక్క పొడవు నిర్దిష్టంగా ఉన్నప్పుడు, కార్మికుల, అంటే కార్మిక జనాభా యొక్క సంఖ్యను పెంచడం ద్వారా మాత్రమే అదనపు విలువ మొత్తం పెంచబడగలదు. ఇక్కడ మొత్తం సామాజిక పెట్టుబడి ఉత్పత్తి చేసే అదనపు విలువకు జనాభా పెరుగుదల అనేది సంఖ్యాత్మక పరిమితి అవుతుంది. దీనికి వ్యతిరేకంగా, జనాభా స్థిరంగా ఉన్నప్పుడు పనిదినాన్ని సాధ్యమైనంత పొడిగించడం ద్వారా ఈ పరిమితి ఏర్పడుతుంది.[2] అయితే ఇప్పటి వరకూ పరిశీలించిన అదనపు విలువ రూపానికి మాత్రమే ఈ నియమం వర్తిస్తుంది అనేది రాబోయే అధ్యాయంలో గమనించవచ్చు.

ఇంతవరకూ అదనపు విలువ ఉత్పత్తిని పరిగణించిన దానినిబట్టి, ప్రతి డబ్బు మొత్తం లేదా విలువ మొత్తం ఇష్టానుసారంగా పెట్టుబడిగా మార్చబడజాలదని తెలుస్తుంది. ఇలా మార్చాలంటే, నిజానికి డబ్బుగానీ, సరుకులుగానీ గల వ్యక్తి చేతిలో ముందుగానే కొంత కనీస మొత్తం డబ్బు లేదా మార్పిడి విలువ ఉండాలి. కనీస అస్థిర పెట్టుబడి అంటే అదనపు ఉత్పత్తి కోసం రాత్రింబగళ్ళు సంవత్సరం పొడుగునా పనిలో పెట్టబడే ఒక శ్రమ శక్తి కొనుగోలు ధర. ఈ కార్మికునికి తన సొంత ఉత్పత్తి సాధనాలు స్వాధీనంలో ఉండి అతడు కార్మికుడుగా బతకడంతో సంతృప్తిపడితే అతనికి తన జీవనాధార వస్తువుల పునరుత్పత్తికి అవసరమైన కాలం కంటే, అది రోజుకు 8 గంటలనుకుంటే, అంతకంటే ఎక్కువ కాలం అతను పని చేయాల్సిన అవసరం ఉండదు. అంతేకాక, 8 పనిగంటలకు తగిన ఉత్పత్తి సాధనాలు మాత్రమే అతనికి అవసరమవుతాయి. దీనికి భిన్నంగా, 8 గంటలకు తోడు అతనితో మరో 4 గంటలపాటు అదనపు శ్రమ చేయించే పెట్టుబడిదారునికి అదనపు ఉత్పత్తి సాధనాలు సమకూర్చడానికి అదనపు డబ్బు అవసరమవుతుంది. అతడు కార్మికునిలాగే, కార్మికునికంటే ఏ మాత్రం మెరుగుగా కాకుండా, జీవించాలంటే కేవలం అతని అవసరాలను మాత్రమే తీర్చుకోవాలీ

1. మిగిలిన వివరాలు గ్రంథం IVలో ఉంటాయి.
2. "శ్రమ, అనగా సామాజిక ఆర్థిక కాలం, నిర్దిష్ట పరిమాణం. ఉదాహరణకు 10 లక్షల ప్రజల పది గంటల పనిదినం లేదా కోటి గంటలు ... పెట్టుబడి పెరుగుదలకు సరిహద్దు ఉంది. వినియోగించబడే ఆర్థిక కాలపు వాస్తవ పరిమితి ద్వారా ఏ నిర్దిష్ట సమయంలోనైనా ఈ సరిహద్దును చేరవచ్చు." ("యాన్ ఎస్సే ఆన్ ది పొలిటికల్ ఎకానమీ ఆఫ్ నేషన్స్" లండన్, 1821, పు. 47, 49)

అంటే మన ఉదాహరణ ప్రకారం అతడు ఇద్దరు కార్మికుల్ని పనిలో పెట్టాల్సి ఉంటుంది. ఈ సందర్భంలో అతని ఉత్పత్తి లక్ష్యం సంపద పెరుగుదల కాక కేవలం జీవిత పోషణ మాత్రమే అవుతుంది. అయితే సంపద పెరుగుదల అన్నది పెట్టుబడిదారీ ఉత్పత్తి యొక్క పరమార్థం. అతడు మామూలు కార్మికునికంటే రెండింతలు బాగా బతికి, ఉత్పత్తి అయిన అదనపు విలువలో అర్ధభాగాన్ని పెట్టుబడిగా మార్చాలీ అంటే అతడు కార్మికుల సంఖ్యతోపాటు అడ్వాన్స్ చేసే కనీస పెట్టుబడిని 8 రెట్లు పెంచాలి. అతడు తన కార్మికునిలాగానే స్వయంగా పని చేయొచ్చు. ఉత్పత్తి ప్రక్రియలో ప్రత్యక్షంగా పాల్గొనవచ్చు. అయితే అప్పుడు అతడు పెట్టుబడిదారునికీ, కార్మికునికీ మధ్య సంకర సంతానమైన "చిన్న యజమాని" అవుతాడు. ఇతరుల శ్రమను స్వాహా చేయడం కోసం, అదుపు చేయడం కోసం ఆ శ్రమ ఉత్పాదితాలను అమ్మడం కోసం, పెట్టుబడిదారుడుగా, అనగా మానవ రూపం ధరించిన పెట్టుబడిగా వ్యవహరించడం కోసమే పెట్టుబడిదారుడు తన యావత్కాలాన్నీ అర్పించవలసిన స్థితి ఒక నిర్దిష్ట పెట్టుబడిదారీ ఉత్పత్తి దశలో అవసరమవుతుంది.[1] అందుకే ఒక యజమాని పనిలో పెట్టగలిగిన కార్మికుల సంఖ్యను అతి చిన్న గరిష్ఠ మొత్తానికి పరిమితం చేయడం ద్వారా ఒక వృత్తి యజమాని పెట్టుబడిదారుడుగా రూపాంతరం చెందకుండా బలవంతంగా నిరోధించడానికి మధ్యయుగాల వృత్తి సంఘాలు ప్రయత్నించాయి. ఉత్పత్తి కోసం అడ్వాన్సు చేయబడిన కనీస మొత్తం మధ్యయుగాల గరిష్ఠ మొత్తాన్ని బాగా దాటిన సందర్భాలలో మాత్రమే డబ్బు లేదా సరుకుల యజమాని వాస్తవంగా పెట్టుబడిదారుడుగా మారతాడు. కేవలం పరిమాణాత్మక భేదాలు ఒక నిర్దిష్ట దశ తర్వాత గుణాత్మక మార్పులుగా పరిణమిస్తాయని హెగెల్ (తన "తర్కం"లో) కనుగొన్న నియమం ప్రకృతి శాస్త్రంలోలాగే ఇక్కడ కూడా సరైనదని రుజువయింది.[2]

---

1. "ఒక రైతు తన శ్రమ మీద మాత్రమే ఆధారపడజాలడు. ఒకవేళ అలా ఆధారపడితే దానివల్ల అతడు నష్టపోతాడని చెప్పగలను. అతని పని మొత్తం వ్యవహారాన్ని పర్యవేక్షించడం కావాలి. నూర్చేవాణ్ణి గమనించాలి. లేకుంటే నూర్చని ధాన్యం వల్ల అతని వేతనాలు కోల్పోతాడు. కోతకోసే వాళ్ళనూ, కుప్ప వేసే వాళ్ళనూ చూడాలి. కంచెలను నిరంతరం చూసుకుంటూ ఉండాలి. ఎక్కడా నిర్లక్ష్యం జరగకుండా చూసుకోవాలి. అతడు ఏదో ఒకచోటికి పరిమితమైతే నిర్లక్ష్యమే జరుగుతుంది." ("యాన్ ఎంక్వైరీ ఇంటు ది కనెక్షన్ బిట్వీన్ ది ప్రజంట్ ప్రైస్ ఆఫ్ ప్రావిజన్స్ అండ్ ది సైజ్ ఆఫ్ ఫార్మ్స్ ... బై ఎ. ఫార్మర్" లండన్, 1773, పు. 12) ఈ పుస్తకం చాలా ఆసక్తిదాయకంగా ఉంది. దీనిలో "పెట్టుబడిదారీ రైతు" లేదా స్పష్టంగా పేర్కొనబడినట్టి "వాణిజ్య రైతు" పుట్టుకను అధ్యయనం చేయవచ్చు. కేవలం జీవితాధార వస్తువులతో బతుకునీడ్చే చిన్న రైతును హీనపరచి పెట్టుబడిదారీ రైతు చేసుకునే ఆత్మస్తుతిని గమనించవచ్చు. "పెట్టుబడిదారీ వర్గం మొదట పాక్షికంగానూ, చివరికి పూర్తిగానూ శారీరక శ్రమ చేయాల్సిన అవసరం నుండి బయటపడతారు." (టెక్స్ట్‌బుక్ ఆఫ్ లెక్చర్స్ ఆన్ ది పొలిటికల్ ఎకానమీ ఆఫ్ నేషన్స్ బై ది రెవరెండ్ రిచర్డ్ జోన్స్." (హెర్ట్ ఫోర్డ్ 1852, లెక్చర్ III, పుట 39)
2. మొట్టమొదట లారెంట్, గెర్‌హార్ట్‌లచే శాస్త్రీయంగా రూపొందించబడిన ఆధునిక రసాయన శాస్త్రపు అణు సిద్ధాంతం మరే నియమంపైనా ఆధారపడదు. (3వ కూర్పులో చేర్చబడింది) రసాయనవేత్తలు కానివారికి సుస్పష్టం కాని ఈ ప్రకటనను వివరించడం కోసం, ఇక్కడ రచయిత స్వజాతీయ కర్బనపు సమ్మేళనాల

డబ్బు లేదా సరుకుల యజమాని పెట్టుబడిదారుడుగా రూపాంతరం చెందాలంటే కలిగి ఉండాల్సిన కనీస విలువ మొత్తం పెట్టుబడిదారీ ఉత్పత్తి యొక్క భిన్న అభివృద్ధి దశలనుబట్టి మారుతుంటుంది. నిర్దిష్ట దశలలో ఇది విభిన్న ఉత్పత్తి రంగాలలో వాటి ప్రత్యేక, సాంకేతిక పరిస్థితులనుబట్టి విభిన్నంగా ఉంటుంది. పెట్టుబడిదారీ ఉత్పత్తి తొలిదశలో సైతం కొన్ని నిర్దిష్ట ఉత్పత్తి రంగాలకు ఇంకా ఒంటరి వ్యక్తుల చేతుల్లో లేనంత కనీస పెట్టుబడి అవసరమవుతుంది. దీనివల్ల కొల్బర్ట్ కాలంలో ఫ్రాన్సులోనూ, మన యుగం వరకూ అనేక జర్మన్ రాష్ట్రాల్లోనూ జరిగినట్టుగా, కొంత మేరకు ప్రైవేటు వ్యక్తులకు ప్రభుత్వ సబ్సిడీలు తలెత్తుతాయి. మరికొంతమేరకు కొన్ని పారిశ్రామిక, వాణిజ్య శాఖలలో వ్యాపారం చేయడానికి చట్టబద్ధమైన గుత్తాధిపత్యంతో కొన్ని సంఘాలు తలెత్తుతాయి. ఇవి మన ఆధునిక జాయింట్ స్టాక్ కంపెనీలకు తొలి రూపాలు.[1]

మనం గమనించినట్లుగా, ఉత్పత్తి ప్రక్రియలో, శ్రమపైన, అనగా శ్రమ శక్తి నిర్వహణపైన లేదా స్వయంగా కార్మికునిపైన పెట్టుబడి ఆధిపత్యం సంపాదించింది. కార్మికుడు క్రమం తప్పకుండానూ, తగిన తీవ్రతా స్థాయితోనూ పనిచేసేలా మానవ రూపం ధరించిన పెట్టుబడి అయినట్టి పెట్టుబడిదారుడు జాగ్రత్త తీసుకుంటాడు.

తన సొంత పరిమిత జీవితావసరాలకు సరిపోయిన దానికంటే ఎక్కువ పనిని కార్మిక వర్గం చేసేలా ఒత్తిడి చేసే ఒక బలవంతపు సంబంధంగా పెట్టుబడి పరిణమించింది. ఇతరుల కార్యశీలత యొక్క ఉత్పత్తిదారుగా, అదనపు శ్రమను బయటికి తోడే శక్తిగా, శ్రమ శక్తి యొక్క దోపిడీదారుగా అది ప్రత్యక్ష నిర్బంధ శ్రమపైన ఆధారపడి ఉన్న ఇదివరకటి ఉత్పత్తి వ్యవస్థలన్నిటినీ శక్తిలోనూ, హద్దులు మీరటంలోనూ, నిర్లక్ష్యంలోనూ, సమర్థతలోనూ దాటిపోతుంది.

మొదట, పెట్టుబడి తనకు చారిత్రకంగా తటస్థపడిన సాంకేతిక పరిస్థితుల ప్రాతిపదికపైనే శ్రమను లోబర్చుకుంటుంది. కనుక అది వెంటనే ఉత్పత్తి విధానాన్ని మార్చదు. కనుక ఉత్పత్తి విధానంలో ఎటువంటి మార్పుతోనూ ప్రమేయం లేకుండానే కేవలం పనిదినాన్ని పొడిగించడం ద్వారా ఇంతవరకూ మనం పరిశీలించిన రూపంలో అదనపు విలువ ఉత్పత్తి కాగలదని రుజువైంది. అది ఆధునిక జౌళి మిల్లుల్లోకంటే పాత తరహా బేకరీల్లో ఏ మాత్రం తక్కువ సమర్థం కాదు.

---

పరంపర గురించి మాట్లాడుతున్నాడని తెలియజేస్తున్నాం. వాటికి మొదట ఆ పేరు 1843లో సి. గెర్‌హార్ట్ పెట్టాడు. ప్రతి పరంపరకు తన సొంత సాధారణ బీజగణిత సూత్రం ఉంటుంది. ఆ రకంగా పారాఫిన్ పరంపర : $C^n H^{2n} + 2$, మామూలు ఆల్కహాల్స్ : $C^n H^{2n} + {}^2O$ మామూలు కొవ్వు ఆమ్లాలు : $C^n H^{2n} + O^2$ ఇలాగే అనేక ఇతరాలు. పైన పేర్కొన్న ఉదాహరణల్లో అణు సూత్రానికి కేవలం అనే పరిమాణాత్మక జోడింపు ద్వారా ప్రతిసారీ $CH^2$ గుణాత్మకంగా భిన్న వస్తువు రూపొందుతుంది.

ఈ ప్రధాన వాస్తవాన్ని నిర్ణయించడంలో లారెంటు, గెర్‌హార్ట్‌ల పాత్రను (మార్క్స్ అతిగా అంచనా వేశాడు.) గ్రహించాలంటే చూ. "Kopp. Entwicklung der chemie." మ్యూనిక్, 1873 పుటలు 709, 716. Schorlemmer "ది రైజ్ అండ్ డెవలప్‌మెంట్ ఆఫ్ ఆర్గానిక్ కెమిస్ట్రీ" లండన్, 1879, పుట 54 - ఏంగెల్స్.)

1. ఈ రకం సంస్థలను మార్టిన్ లూథర్ 'కంపెనీ మోనోపలియా' అంటాడు.

సాదా శ్రమ ప్రక్రియ దృష్టి నుంచి మనం ఉత్పత్తి ప్రక్రియను పరిశీలిస్తే కార్మికుడు ఉత్పత్తి సాధనాలతో వాటి యొక్క పెట్టుబడి నైజం రీత్యా కాక, కేవలం తన తెలివైన ఉత్పత్తి కార్యకలాపాల యొక్క సాధనాలుగానూ, సామాగ్రిగానూ వాటితో సంబంధం కలిగి ఉంటాడు. ఉదాహరణకు తోళ్ళు పదును పెట్టడంలో తోళ్ళను అతడు తన శ్రమ వస్తువులుగా పరిగణిస్తాడు. అతడు పదును పెట్టే తోలు పెట్టుబడిదారునిది కాదు. అయితే అదనపు విలువ సృష్టి అయ్యే ప్రక్రియ దృష్టి నుండి ఉత్పత్తి ప్రక్రియను పరిశీలిస్తే అది వేరు. వెంటనే ఉత్పత్తి సాధనాలు ఇతరుల శ్రమను సంగ్రహించే సాధనాలుగా మారిపోతాయి. ఇప్పుడు ఉత్పత్తి సాధనాలను వినియోగించేది కార్మికుడు కాదు. ఉత్పత్తి సాధనాలే కార్మికుణ్ణి వినియోగిస్తాయి. అవి అతని ఉత్పాదక కార్యకలాపాలకు పాదార్థిక అంశాలుగా అతనిచేత అనుభోగించబడటానికి బదులు, తమ సొంత జీవిత ప్రక్రియకు అవసరమైన ఉద్దీపకంగా అతన్ని అనుభోగిస్తాయి. నిరంతరం విస్తరించే వృద్ధిచెందే విలువగా చలనంలో ఉండడమే పెట్టుబడి యొక్క జీవిత ప్రక్రియ. సజీవ శ్రమను సంగ్రహించకుండా రాత్రిపూట ఖాళీగా ఉండే ఫర్నేసులూ, వర్క్‌షాపులూ పెట్టుబడిదారుని దృష్టిలో 'కేవలం నష్టాలు'. కనుక ఫర్నేసులూ, వర్క్‌షాపులూ శ్రామిక ప్రజల రాత్రిపనిపైన చట్టబద్ధ హక్కులౌతాయి. డబ్బు ఉత్పత్తి ప్రక్రియ యొక్క పాదార్థిక అంశాలుగా, ఉత్పత్తి సాధనాలుగా రూపాంతరం చెందినప్పుడు ఆ చిన్న మార్పు ఉత్పత్తి సాధనాలను ఇతరుల శ్రమపైనా, అదనపు శ్రమపైనా హక్కుగా మార్చేస్తుంది. పెట్టుబడిదారీ ఉత్పత్తికి స్వభావోచితమూ, విలక్షణమూ అయిన ఈ కుతర్కమూ, మృత శ్రమకూ సజీవ శ్రమకూ మధ్య, విలువకూ విలువను సృష్టించే శక్తికీ మధ్య ఉండే సంబంధం యొక్క ఈ పూర్తి తలక్రిందుల వ్యవహారమూ పెట్టుబడిదారుల చైతన్యంలో ఎలా ప్రతిఫలిస్తుందో చివరిగా ఒక ఉదాహరణ తెలియజేస్తుంది.

1848కీ, 1850కీ మధ్య ఇంగ్లీషు ఫ్యాక్టరీ ప్రభువుల తిరుగుబాటు కాలంలో స్కాట్లండుకు పశ్చిమ ప్రాంతంలో ఉన్న కార్లైల్ సన్స్ అండ్ కంపెనీ అనే అత్యంత ప్రాచీన, అత్యంత గౌరవప్రద సంస్థ అధిపతి 1849 ఏప్రిల్ 25వ తేదీన గ్లాస్గో డెయిలీ మెయిల్‌కి "రిలే పద్ధతి" అనే శీర్షికతో ఒక లేఖ రాశాడు.[1] ఆయన సంస్థ పాయిస్లీలో ఉన్న ఒక జౌళి, నూలు మిల్లు. అది 1752 నుంచీ దాదాపు శతాబ్దం పాటు అస్తిత్వంలో ఉంది. దానిని ఒకే కుటుంబానికి చెందిన నాలుగు తరాలు నిర్వహిస్తూ వచ్చాయి. పోతే "ఇదే తెలివైన పెద్దమనిషి" రాసిన లేఖలో ఇతర అంశాలతోపాటు వెగటు పుట్టించే అమాయకత్వంతో కూడిన అంశం కూడా ఉంది : "ఫ్యాక్టరీ పనిని పది గంటలకు పరిమితం చేయడం వల్ల ... ఎటువంటి కీడు సంభవిస్తుందో చూద్దాం ... దానివల్ల మిల్లు యజమానుల అవకాశాలకూ, ఆస్తికీ తీవ్రమైన దెబ్బ తగులుతుంది. తాను (అనగా తన కార్మికులు) ఇదివరకు 12 గంటలు పనిచేసేవాడు. ఇప్పుడు 10 గంటలకు పరిమితం చేస్తే, అతని సంస్థలోని ప్రతి 12 యంత్రాలూ, లేదా కదురుళ్ళూ 10కి కుంచించుకుపోతాయి. మిల్లును అమ్మేయాలంటే, దాని విలువ

1. "రిపోర్ట్స్..." 1849 ఏప్రిల్ 30, పుట 59.

10 కదుళ్ళుగా మాత్రమే ఉంటుంది. ఆ రకంగా దేశంలో ఉన్న ప్రతి ఫ్యాక్టరీ విలువ నుండీ ఆరో భాగం తీసివేయబడుతుంది."[1]

"నాలుగు తరాల" కూడబెట్టిన పెట్టుబడిదారీ సుగుణాలను వారసత్వంగా పుణికిపుచ్చుకున్న ఈ "పశ్చిమ స్కాట్లండ్ బూర్జువా బుర్రలో ఉత్పత్తి సాధనాలూ, కదుళ్ళూ వగైరాల విలువ అనేది తమ సొంత విలువను పెంచుకోవడానికీ, రోజూ నిర్దిష్ట పరిమాణం గల వేతనం పొందని ఇతరుల శ్రమను దిగమింగటానికీ, పెట్టుబడిగా వాటికి గల స్వభావంతో ఎంతగా వేరుచేయ వీల్లేనంత కలగాపులగంగా కలిసిపోయిందీ అంటే, కార్టెల్ అండ్ కంపెనీ అధిపతి తన ఫ్యాక్టరీని అమ్మితే అతనికి కదుళ్ళ విలువ మాత్రమే గాక దానితోపాటు అదనపు విలువను స్వాహా చేసే దాని శక్తి కూడా సంక్రమించాలని, వాటిలో సాకార రూపం ధరించిన, ఈ రకం కదుళ్ళ ఉత్పత్తికి అవసరమైన శ్రమ మాత్రమే గాక, పాయిస్లీకి చెందిన సాహసులైన స్కాట్ పౌరుల నుండి రోజూ అవి తోడివేసే అదనపు శ్రమ కూడా దక్కాలనీ ఊహించుకుంటున్నాడు. అందుకే పనిదినాన్ని 2 గంటలు తగ్గిస్తే 12 వడికే యంత్రాల అమ్మకం ధర 10 యంత్రాల ధరకు పడిపోతుందని అతడు భావిస్తాడు!

---

1. అదే నివేదిక, పుట 60. ఫ్యాక్టరీ ఇన్‌స్పెక్టర్ స్టువార్ట్ కూడా స్కాట్ పౌరుడే. ఇంగ్లీషు ఫ్యాక్టరీ ఇన్‌స్పెక్టర్లకు భిన్నంగా అతడు పెట్టుబడిదారీ ఆలోచనా పద్ధతికి పూర్తిగా బందీ అయ్యాడు. అతడు తన రిపోర్టులో ఈ లేఖను గుదిగుచ్చి దానిపై ఇలా వ్యాఖ్యానించాడు. "ఇది అదే వృత్తిలో రిలే పద్ధతి కింద పనిచేస్తున్న ఫ్యాక్టరీ యజమానులకు అత్యంత ఉపయోగకరమైన వర్తమానం. పని గంటల ఏర్పాటులో వచ్చే ఏ మార్పును గురించి అయినా నీతిపరులకు గల దురభిప్రాయాలను తొలగించడానికి ఇది ఉద్దేశించబడింది.

## నాలుగో భాగం

# సాపేక్ష అదనపు విలువ ఉత్పత్తి

## అధ్యాయం - 12

# సాపేక్ష అదనపు విలువ భావన

పెట్టుబడిదారుడు కార్మికుని శ్రమ శక్తికి చెల్లించిన విలువకు సమానమైనవిలువను మాత్రమే ఉత్పత్తి చేసే పనిదిన భాగాన్ని ఇంతవరకు మనం ఒక స్థిర పరిమాణంగా పరిగణిస్తూ వచ్చాము. నిర్ణీత ఉత్పత్తి పరిస్థితుల్లో, సమాజపు ఆర్థికాభివృద్ధిలోని ఒక నిర్ణీత దశలో అది వాస్తవంగా అట్టిదే. దీని తరువాత, అంటే, కార్మికుని అవసర శ్రమ కాలం తరువాత అతడు 2, 3, 4, 5, 6 వగైరా గంటలు పని చేయగలడని గమనించాము. ఈ పొడిగింపు పరిమాణంపై అదనపు విలువ రేటూ, పని రోజు కాలమూ ఆధారపడ్డాయి. మరోవైపు, అవసర శ్రమ కాలం స్థిరంగా ఉన్నప్పటికీ, మొత్తం పని రోజు అస్థిరంగా ఉంటుందని చూశాము. ఇప్పుడు, పని రోజు కాలమింత, దీనిలో అవసర శ్రమ భాగమింత, అదనపు శ్రమ భాగమింత అని ఊహించుకొందాం. ఉదాహరణకు : క–ట, క–చ–ట అన్న సరళరేఖ మొత్తంగా 12 గంటల పని రోజును, దానిలో క–చ అన్న భాగం 10 గంటల అవసర శ్రమను, చ–ట అన్న భాగం 2 గంటల అదనపు శ్రమను సూచిస్తుందనుకొందాం. ఇప్పుడు, అదనపు విలువ ఉత్పత్తిని ఎలా పెంచవచ్చు? అంటే, క–ట ను పొడిగించకుండా, లేదా దాని పొడిగింపుతో నిమిత్తం లేకుండా అదనపు శ్రమను ఎలా పొడిగించవచ్చు?

క–ట పొడవు నిర్ణయమైనప్పటికీ, చ–ట ను పొడిగించ వీలుందని కనిపిస్తుంది. చ–ట కొస అయిన ట (అది పని రోజు క–ట కొస కూడా) ఆవలికి దాన్ని విస్తరింపజేయడం ద్వారా కాకపోయినా, దాని ప్రారంభ బిందువైన చ ను క దిశగా వెనక్కు నెట్టడం ద్వారా, తప్పకుండా అలా పొడిగించవచ్చు. క–చ–ట రేఖలో చ'–చ, చ–టలో సగానికి సమానమని క–చ'–చ–ట లేదా ఒక గంట పని కాలానికి సమానమని అనుకొందాం. 12 గంటల పని రోజయిన క–ట లో చ బిందువును చ' వరకు జరిపితే, చ–ట చ'–ట అవుతుంది. అదనపు శ్రమ సగం పెరుగుతుంది. అంటే రెండు గంటల నుంచి మూడు గంటలకు పెరుగుతుంది. కాని పని రోజు మునుపటి లాగా 12 గంటలే ఉంటుంది. అయితే అదే సమయంలో, అవసర శ్రమ కాలాన్ని, క–చ నుండి క–చ'కు, 10 గంటల నుంచి 9 గంటలకు కుంచించకుండా, అదనపు శ్రమ కాలాన్ని చ–ట నుంచి చ' ట కు 2 గంటల నుండి మూడు గంటలకు పొడిగించటం అసాధ్యమనేది స్పష్టమే. అదనపు శ్రమ పొడిగింపు అవసర శ్రమ తగ్గింపునకు అనుగుణంగా ఉంటుంది. అంటే, అంతకు మునుపు, కార్మికుని ప్రయోజనానికై వాస్తవంలో

వినియోగమయిన శ్రమ కాలంలో కొంత భాగం పెట్టుబడిదారుకు ప్రయోజనకరమైన శ్రమ కాలంగా మారుతుందన్న మాట. మార్పు వచ్చేది పని రోజు పొడవులో కాదు, అవసర శ్రమ కాలంగానూ, అదనపు శ్రమ కాలంగానూ, దాని విభజనలోనే.

మరోవైపు, పని రోజు పొడవూ, శ్రమ శక్తి విలువా నిర్ణీతమైనప్పుడు, అదనపు శ్రమ కాలం నిర్ణయమైనట్లే. శ్రమ శక్తి విలువ, అంటే శ్రమ శక్తి ఉత్పత్తికి అవసరమైన శ్రమ కాలం, ఆ విలువ పునరుత్పత్తికి అవసరమైన శ్రమ కాలాన్ని నిర్ధారణ చేస్తుంది. ఒక్క పని గంటకు ఆరు పెన్నీలు సాకార రూపమూ, ఒక్క రోజు శ్రమ శక్తి విలువ అయిదు షిల్లింగులూ అయితే, కార్మికుడు తన శ్రమ శక్తికి గాను పెట్టుబడిదారుడు చెల్లించిన విలువను తిరిగి భర్తీ చేయడానికి, లేక తన దైనిక జీవితావసరాల విలువకు సమానమైన విలువను ఉత్పత్తి చేయడానికి, రోజుకు 10 గంటలు పని చేయాలి. ఈ జీవితావసరాల విలువ నిర్ణీతమైతే అతని శ్రమ శక్తి విలువ నిర్ణీతమైనట్లే.[1] అతని శ్రమ శక్తి విలువ నిర్ణీతమైనప్పుడు, అతని అవసర శ్రమ కాలం నిర్ణీతమే. కాని అదనపు శ్రమ కాలాన్ని తేల్చేందుకు మొత్తం పనిదినం నుండి అవసర శ్రమ కాలాన్ని తీసివేస్తాం. 12 గంటల్లో 10 గంటలు తీసివేస్తే మిగిలేది 2 గంటలు. నిర్ణీత పరిస్థితుల్లో అదనపు శ్రమను రెండు గంటలకు పైన పొడిగించే మార్గం కనుక్కోవడం సులభం కాదు. పెట్టుబడిదారుడు కార్మికునికి అయిదు షిల్లింగులకు బదులు నాలుగు షిల్లింగులా ఆరు పెన్నీలే చెల్లించవచ్చు. సందేహం లేదు. ఈ నాలుగు షిల్లింగులా ఆరు పెన్నీలు విలువను పునరుత్పత్తి చేయడానికి తొమ్మిది గంటల శ్రమ కాలం చాలు. ఫలితంగా పెట్టుబడిదారుకు, రెండు గంటలకు బదులు మూడు గంటలు అదనపు శ్రమ చేకూరుతుంది. అదనపు విలువ ఒక షిల్లింగు నుంచి 18 పెన్నీలకు పెరుగుతుంది. కాని కార్మికుని వేతనాన్ని అతని శ్రమ శక్తి విలువ కన్నా తగ్గించడం ద్వారా మాత్రమే ఈ ఫలితం దక్కుతుంది. 9 గంటల్లో తాను ఉత్పత్తి చేసే నాలుగు షిల్లింగులా ఆరు పెన్నీలతో అతని చేతికందే జీవితావసరాలు మునుపటి వాటికన్నా పదో వంతు తక్కువ. అందువల్ల అతని శ్రమ శక్తి తగు విధంగా పునరుత్పత్తి కాకుండా కుంటుపడుతుంది. ఈ సందర్భంలో అదనపు శ్రమ పొడిగించబడేది, దాని మామూలు పరిమితులను అతిక్రమించడం ద్వారానే. అవసర శ్రమ కాల పరిధిలో కొంత భాగాన్ని అక్రమంగా ఆక్రమించుకోవడం ద్వారానే అదనపు శ్రమ పరిధి విస్తరింపబడుతుంది. ఇది వాస్తవాచరణలో ముఖ్య పాత్ర వహిస్తున్నప్పటికీ,

---

1. "బతకడానికీ, శ్రమించడానికీ, పిల్లల్ని కని, పెంచడానికీ" కార్మికునికి అవసరమైనవి అతని సగటు దిన వేతనం విలువను నిర్ధారణ చేస్తాయి. (విలియం పెట్టీ, "ఐర్లాండ్ రాజకీయ స్వరూప విశ్లేషణ," 1672, పుట 64) "శ్రామికుని వెల ఎల్లప్పుడూ జీవితావసరాల వెలే ... శ్రమించే మనిషి వేతనం శ్రమించే మనిషిగా అతని తగ్గు స్థాయికీ, స్థానానికీ తగ్గట్లు అటువంటి కుటుంబ పోషణకు చాలకపోతే - తరచు, వారిలో అనేకుల దుర్గతి అదే". అతడు తగిన వేతనం పొందటం లేదన్నమాట. (జె. వాండర్‌లింట్, ఉదాహృత గ్రంథం, పుట 15) "తన చేతులు, శ్రమశీలత తప్ప ఇంకేమీ లేని సామాన్య కార్మికుడు తన శ్రమను ఇతరులకు అమ్ముకోలేకపోతే, అతని పని ఖాళీ ... ప్రతి రకం పనిలోనూ, కార్మికుని వేతనం, జీవించేందుకు అతనికి అవసరమైన వాటికి పరిమితమై ఉండక తప్పదు. వాస్తవంలో ఉంటుంది కూడ." (టర్గోట్, రిఫ్లెక్షన్స్, ఎట్సెట్రా, ఈ ప్రెస్‌లో, సంపా. డైరీ, సంపుటి 1, పుట 10) "జీవితావసరాల వెల వాస్తవంలో శ్రమను ఉత్పత్తి చేయడానికయ్యే ఖర్చే." (మాల్తస్, "ఇంక్వయిరీ ఇంటురెంట్, లండన్, 1815, పుట 48 నోట్)

దీన్ని మనమిక్కడ పరిశీలించే ఆస్కారం లేదు. ఎందువల్లనంటే, శ్రమ శక్తితో సహా అన్ని సరకులూ వాటి పూర్తి విలువకే కొనుగోలూ, అమ్మకం జరుగుతున్నాయని మనం ఊహించుకొంటున్నాం. ఇలా జరుగుతున్నదనుకొన్నప్పుడు, కార్మికుని శ్రమ శక్తి విలువే పడిపోతే తప్ప, ఆ విలువకన్నా అతని వేతనాన్ని తగ్గించడం ద్వారా శ్రమ శక్తి ఉత్పత్తికి, లేదా దాని విలువ పునరుత్పత్తికి అవసరమైన శ్రమ కాలాన్ని తగ్గించడం సాధ్యం కాదని తేలుతున్నది. పని రోజు పొడవు నిర్ణీతమైనప్పుడు, అదనపు శ్రమ పొడిగింపు తప్పనిసరిగా అవసర శ్రమ కాలం కుదింపు నుంచి ఉత్పన్నమై తీరాలి తప్ప, అవసర శ్రమ కాలం కుదింపు అదనపు శ్రమ పొడిగింపు నుంచి ఉత్పన్నం కాజాలదు. మనం తీసుకొన్న ఉదాహరణలో, అవసర శ్రమ కాలం పదో వంతు, అంటే పది గంటల నుంచి తొమ్మిది గంటలకు తగ్గడానికీ, తత్ఫలితంగా అదనపు శ్రమ రెండు గంటల నుంచి మూడు గంటలకు పెరగడానికీ, శ్రమ శక్తి విలువ వాస్తవంగా పదోవంతు పడిపోవడం అవసరం.

కాని, శ్రమ శక్తి విలువ అలా పడిపోయిందంటే, మునుపు పది గంటల్లో ఉత్పత్తి అయ్యే జీవితావసరాలే ఇప్పుడు తొమ్మిది గంటల్లో ఉత్పత్తి కాగలవని అర్థం. అయితే శ్రమ ఉత్పాదకత పెరగనిదే ఇది అసాధ్యం. ఉదాహరణకు, ఒక చర్మకారుడు కొన్ని నిర్ణీత పరికరాలతో పండ్రెండు గంటల పనిదినంలో ఒక జత బూట్లు తయారు చేస్తాడనుకొందాం. అదే కాలంలో అతను రెండు జతలు తయారుచేయాలంటే అతని శ్రమ ఉత్పాదకత రెట్టింపు కావాలి. అతని పరికరాల్లోనో, లేదా అతని పని విధానంలోనో, లేదా రెంటిలోనూనో మార్పు వస్తే తప్ప అతడా పని చేయలేడు. అందువల్ల ఉత్పత్తి పరిస్థితుల్లో అంటే, అతని ఉత్పత్తి పద్ధతిలో, శ్రమ ప్రక్రియలోనే విప్లవం రావాలి. శ్రమ ఉత్పాదకత పెరుగుదల అంటే మనం మామూలుగా చెప్పుకొనే అర్థమిది : ఒక సరకు ఉత్పత్తికి సామాజికంగా అవసరమైన శ్రమ కాలాన్ని తగ్గించి, ఉపయోగపు విలువను మరింత ఎక్కువ పరిమాణంలో ఉత్పత్తి చేయగల శక్తిని ఒక నిర్ణీత శ్రమ పరిమాణానికి ఇవ్వగలిగిన మార్పు శ్రమ ప్రక్రియలో రావడం.[1] ఇంతవరకు, కేవలం పని రోజు పొడిగింపు మూలంగా ఉత్పన్నమవుతున్న అదనపు విలువను గురించి చెబుతున్నప్పుడు, ఉత్పత్తి విధానం నిర్ణీతమైనదనీ, మార్పు లేనిదనీ ఊహించుకొన్నాము. కాని, అవసర శ్రమను అదనపు శ్రమగా మార్చడం ద్వారా అదనపు విలువను ఉత్పత్తి చేయవలసి ఉన్నప్పుడు పెట్టుబడి, చారిత్రకంగా సంక్రమించిన రూపంలో శ్రమ ప్రక్రియను స్వీకరించి, తరువాత ఆ ప్రక్రియ కాలాన్ని కేవలం పొడిగిస్తూపోతే సరిపోదు. ముందు, ఆ ప్రక్రియ యొక్క సాంకేతిక, సామాజిక పరిస్థితుల్లో విప్లవాత్మకమైన మార్పు, దాని పర్యవసానంగా అసలు ఉత్పత్తి విధానంలోనే విప్లవాత్మకమైన మార్పూ తీసుకువస్తేనే శ్రమ ఉత్పాదకత పెరగగలదు. ఆ విధంగా మాత్రమే శ్రమ శక్తి విలువ పడిపోయేలా చేయవచ్చు. ఆ విలువ పునరుత్పత్తికి అవసరమైన పనిదిన భాగాన్ని కుదించవచ్చు.

---

1. ''చేతివృత్తులు మరింత నిర్దిష్ట రూపం ధరించాయంటే, ఒక వస్తువును మునుపటికన్నా తక్కువ మందితో, లేదా తక్కువ కాలంలో (రెండూ ఒకటే) తయారు చేయగల కొత్త పద్ధతులను కనుక్కొన్నారని తప్ప మరేమీ కాదు.'' (గలియానీ, ఉదాహృత గ్రంథం, పుట 159) ''ఉత్పత్తి వ్యయంలో పొదుపులు ఉత్పత్తికి వినియుక్తమయ్యే శ్రమ పరిమాణంలో పొదుపులు తప్ప మరొకటి కాజాలదు'' (సిస్మండి, ఎటుడెస్ సం. 1, పుట 22)

పని రోజు పొడిగింపు ద్వారా ఉత్పత్తి అయ్యే అదనపు విలువను పరమ అదనపు విలువ అని పేర్కొంటాను. మరోవైపు, అవసర శ్రమ కాలం కుదింపు మూలంగా, పని రోజులోని రెండు అంతర్భాగాల పరిమాణాల్లో వచ్చే తదనుగుణమైన మార్పు మూలంగా ఉత్పన్నమయ్యే అదనపు విలువను సాపేక్ష అదనపు విలువ అని పేర్కొంటాను.

శ్రమ శక్తి విలువ పడిపోయేలా చేయాలంటే, ఆ విలువను నిర్ణయించే ఉత్పాదితాలను, అంటే మామూలు జీవనాధారాల తరగతికి చెందిన వస్తువులను లేదా వాటి స్థానం వహించగల వస్తువులను ఉత్పత్తి చేసే పారిశ్రామిక శాఖల్లో శ్రమ ఉత్పాదకత పెరగాలి. కాని ఒక సరకు విలువను నిర్ణయించేది, కార్మికుడు ప్రత్యక్షంగా ఆ సరకుపై వెచ్చించే శ్రమ పరిమాణం మాత్రమే కాదు, ఉత్పత్తి సాధనాల్లో నిక్షిప్తమైన శ్రమ కూడా. ఉదాహరణకు, బూట్ల జత విలువ చర్మకారుని శ్రమపైనే కాక, చర్మం, మైనం, దారం మొదలైన వాటి విలువపై కూడ ఆధారపడి ఉంటుంది. కాబట్టి, జీవితావసరాల ఉత్పత్తికి కావలసిన స్థిర పెట్టుబడిలోని పాదార్థిక అంశాలుగా రూపొందే శ్రమ సాధనాలనూ, ముడి పదార్థాలనూ సరఫరా చేసే పరిశ్రమల్లో శ్రమ ఉత్పాదకత పెరుగుదలా, తదనుగుణంగా వాటి సరకుల వెల తగ్గుదలా కూడ శ్రమ శక్తి విలువ పడిపోవడానికి దారి తీస్తాయి. అయితే, జీవితావసరాలను గానీ, అటువంటి అవసరాల ఉత్పాదక సాధనాలను గానీ సరఫరా చేయని పారిశ్రామిక శాఖల్లో జరిగే శ్రమ ఉత్పాదకత పెరుగుదల వల్ల శ్రమ శక్తి విలువ ఏ విధంగానూ ప్రభావితం కాదు.

సరకు చౌక కావడం శ్రమ శక్తి విలువలో సాపేక్ష తగ్గుదలకు, శ్రమ శక్తి పునరుత్పత్తిలో ఆ సరకు వినియుక్తమయిన మోతాదుకు అనుగుణమైన తగ్గుదలకు మాత్రమే దారి తీస్తుందని వేరే చెప్ప పనిలేదు. ఉదాహరణకు, చొక్కాలు ఒక జీవితావసరం. కాని అవి అనేక జీవితావసరాల్లో ఒకటి మాత్రమే. అయితే, వివిధ సరకులు కలిసి మొత్తం జీవితావసరాలవుతున్నాయి. వాటిలో ప్రతి ఒకటీ ఒక ప్రత్యేక పరిశ్రమ ఉత్పాదితం, ఆ సరకుల్లోని ప్రతి ఒక్కదాని విలువా శ్రమ శక్తి విలువలో అంతర్భాగమవుతున్నది. శ్రమ శక్తి పునరుత్పత్తికి అవసరమైన శ్రమ కాలం తగ్గేకొద్దీ శ్రమ శక్తి విలువ తగ్గుతుంది. మొత్తం తగ్గుదల వేరు వేరు ప్రత్యేక పరిశ్రమల్లోని శ్రమ కాలంలో సాధించిన పలువిధమైన అన్ని కుదింపుల సమాహారం. ఈ మొత్తం ఫలితాన్ని, ప్రతి ఒక్క సందర్భంలోనూ ప్రత్యక్షంగా సాధించ తలపెట్టిన తక్షణ ఫలితమా అన్నట్లు, ఇక్కడ చూపుతూ వచ్చాము. ఉదాహరణకు, ఎవరైనా ఒక పెట్టుబడిదారుడు శ్రమ ఉత్పాదకతను పెంచడం ద్వారా చొక్కాలు చౌకయ్యేలా చేస్తే, అతని ఉద్దేశం అవశ్యంగా శ్రమ శక్తి విలువను తగ్గించాలనీ, ఆ నిష్పత్తిలో అవసర శ్రమ కాలాన్ని కుదించాలనీ కాదు. కాని ఈ ఫలితానికి దోహదం చేస్తున్నంత మేరకే అతడు అదనపు విలువ సార్వత్రిక రేటు పెరుగుదలకు తోడ్పడుతున్నాడు.[1] పెట్టుబడి యొక్క సార్వత్రిక అవశ్య ధోరణులను వాటి వ్యక్తీకరణ రూపాల నుంచి వేరు చేసి చూడాలి.

1. "యంత్రాల మెరుగుదల వల్ల పరిశ్రమదారుని ... ఉత్పాదితాలు ... రెట్టింపయ్యాయని అనుకొందాం... మొత్తం రాబడిలో మునుపటికన్నా తక్కువ భాగంతో అతను తన పనివారికి బట్టలు ఇవ్వగలుగుతాడు ... ఆ విధంగా అతని లాభం పెరుగుతుంది. అంతే తప్ప మరే విధంగానూ అది ప్రభావితం కాదు." (రాంసే, పుటలు 168, 169)

పెట్టుబడిదారీ ఉత్పత్తి అంతర్గత నియమాలు విడివిడి పెట్టుబడి మొత్తాల గమనాల్లో ఏ విధంగా వ్యక్తమవుతున్నదీ పరిశీలించడం ఇక్కడ మా ఉద్దేశం కాదు. అవి పోటీ యొక్క నిర్బంధ నియమాలుగా రూఢమై వ్యష్టి పెట్టుబడిదారుని చర్యలకు కారణభూతమైన ఉద్దేశాలుగా అతని మనసుకూ, చైతన్యానికీ అనుభూతమవుతుంటాయి. కాని ఇది మాత్రం స్పష్టం. ఇంద్రియాలకు ప్రత్యక్షంగా గోచరం కాని వాస్తవ గ్రహ గమనాలు తెలిసిన వ్యక్తికి తప్ప మరెవ్వరికైనా సరే, పైకి కనిపించే తత్ గమనాలు దుర్గ్రాహ్యమైనట్లు, మనకు పెట్టుబడి అంతర్గత స్వభావం గురించిన అవగాహన లేనిదే, పోటీని శాస్త్రీయంగా విశ్లేషించడం అసాధ్యం. కాని సాపేక్ష అదనపు విలువ ఉత్పత్తిని గురించి మరింత బాగా అవగాహన చేసుకొనేందుకు కింది వ్యాఖ్యలను చేర్చవచ్చు. వీటిలో, మనకు ఇదివరకే లభ్యమైన ఫలితాలు తప్ప వేటినీ దత్తాంశాలుగా స్వీకరించడం లేదు.

ఆరు పెన్నీలలో ఒక గంట శ్రమ మూర్తివంతమై ఉంటే, ఆరు షిల్లింగుల విలువ 12 గంటల పని రోజులో ఉత్పత్తి అవుతుంది. ప్రస్తుత శ్రమ ఉత్పాదకతతో, ఈ పండ్రెండు గంటల్లో 12 వస్తువులు ఉత్పత్తి అవుతాయని అనుకొందాం. ప్రతి వస్తువులోనూ వినియుక్తమయిన ఉత్పత్తి సాధనాల విలువ ఆరు పెన్నీలనుకొందాం. ఈ పరిస్థితుల్లో ప్రతి వస్తువు ఉత్పత్తి వ్యయం ఒక షిల్లింగు. ఉత్పత్తి సాధనాల విలువకై ఆరు పెన్నీలు, ఈ సాధనాలతో పనిచేయడంలో కొత్తగా చేకూరిన విలువకై ఆరు పెన్నీలు. ఇప్పుడు ఎవరో ఒక పెట్టుబడిదారుడు శ్రమ ఉత్పాదకతను రెట్టింపు చేసి, 12 గంటల పని రోజులో 12 వస్తువులకు బదులు 24 వస్తువులు ఉత్పత్తి చేయగలిగాడని అనుకొందాం. ఉత్పత్తి సాధనాల విలువ యధాతథంగా ఉన్నప్పుడు, ప్రతి వస్తువు విలువా తొమ్మిది పెన్నీలకు పడిపోతుంది. ఇందులో ఉత్పత్తి సాధనాల విలువ ఆరు పెన్నీలు. శ్రమ కొత్తగా చేకూర్చిన విలువ మూడు పెన్నీలు. శ్రమ ఉత్పాదకత రెట్టింపు అయినప్పటికీ, ఆ రోజు శ్రమ మునుపటిలాగే సృష్టిస్తున్నది ఆరు షిల్లింగుల కొత్త విలువే తప్ప, దానికి మించదు. కానీ ఇప్పుడిది మునుపటికన్నా రెండింతలు ఎక్కువ వస్తువులకు వ్యాప్తమై ఉంది. ఈ విలువలో 1/12 భాగానికి మారు 1/24 భాగాన్ని, ఆరు పెన్నీలకు బదులు మూడు పెన్నీలను ప్రతి వస్తువూ తనలో పొందుపరుచుకొంది. లేదా అదే విషయం మరో విధంగా చెప్పాలంటే ఉత్పత్తి సాధనాలు వస్తువులుగా పరివర్తన చెందుతున్నప్పుడు ప్రతి ఒక వస్తువుకు పూర్తి ఒక గంట శ్రమ కాలానికి బదులు ఇప్పుడు అరగంట శ్రమ కాలం మాత్రమే వచ్చి చేరుతోంది.

ఈ వస్తువుల వ్యష్టి విలువ ఇప్పుడు వాటి సామాజిక విలువకన్నా తక్కువ, వేరు మాటల్లో చెప్పాలంటే, సగటు సామాజిక పరిస్థితుల్లో తయారయ్యే అదే వస్తువులకన్నా వీటికి వ్యయమైన శ్రమ కాలం తక్కువ. ప్రతి వస్తువుకూ సగటున ఒక షిల్లింగు ఖర్చవుతోంది. రెండు గంటల సామాజిక శ్రమకది ప్రతీకగా ఉంది. కానీ మారిన ఉత్పత్తి విధానంలో దానికి తొమ్మిది పెన్నీలు మాత్రమే ఖర్చవుతోంది. లేదా దానిలో $1\frac{1}{2}$ గంట శ్రమ మాత్రమే పొందుపడి ఉంది. కాని ఒక సరుకు వాస్తవ విలువ దాని సామాజిక విలువే తప్ప దాని వ్యష్టి విలువ కాదు. అంటే, వాస్తవ విలువకు కొలమానం, ప్రతి ఒక సందర్భంలోనూ ఉత్పాదకునికి వ్యయమయ్యే శ్రమ కాలం కాదు. దాని ఉత్పత్తికి సామాజికంగా అవసరమైన శ్రమ కాలమే దాని కొలమానం అన్నమాట. కాబట్టి పెట్టుబడిదారుడు కొత్త పద్ధతిని ప్రవేశపెట్టి, తన సరకును దాని సామాజిక విలువైన ఒక షిల్లింగుకు అమ్మినట్లయితే, అతను దాని

వ్యష్టి విలువకన్నా మూడు పెన్నీలు ఎక్కువ ధరకు అమ్ముతున్నాడు. ఆ విధంగా మూడు పెన్నీల అధిక అదనపు విలువను సొమ్ము చేసుకొంటున్నాడు. మరోవైపు, అతనికి సంబంధించినంత వరకు, 12 గంటల పనిదినానికి ఇప్పుడు 12 వస్తువులకు బదులు 24 వస్తువులు ప్రతీకగా ఉన్నాయి. కాబట్టి, ఒక పని రోజు ఉత్పాదితాన్ని వదిలించుకోవాలంటే, గిరాకీ మునుపటి దానికి రెట్టింపుగా ఉండాలి. అంటే మార్కెట్ రెండింతలు విస్తృతం కావాలి. తక్కినవన్నీ సమానంగా ఉన్నప్పుడు, అతని సరుకుల ధరలు తక్కువగా ఉంటేనే, వాటికి మరింత విస్తృతమైన మార్కెట్ లభించగలదు. కాబట్టి అతను వాటి వ్యష్టి విలువకన్నా ఎక్కువగా, అయితే, వాటి సామాజిక విలువకన్నా తక్కువగా ఉన్న ధరకు వాటిని అమ్ముతాడు. మాట వరసకు ఒక్కొక్కటి పది పెన్నీల చొప్పున అమ్ముతాడనుకొందాం. ఈ పద్ధతిన కూడ అతను ప్రతి వస్తువు నుంచి ఒక పెన్నీ అధిక అదనపు విలువను పిండుకొంటున్నాడు. తన సరకులు శ్రమ శక్తి సార్వత్రిక విలువను నిర్ణయించడంలో పాలుపంచుకొనే జీవితావసరాల తరగతికి చెందినా, చెందకపోయినా అదనపు విలువలోని ఈ పెచ్చును అతను జేబులో వేసుకొంటాడు. కాబట్టి తన సరకులు ఏ తరగతికి చెందినవనే దానితో నిమిత్తం లేకుండా, శ్రమ ఉత్పాదకతను పెంచడం ద్వారా తన సరకుల్ని చౌక చేయాలన్న ప్రేరణ ప్రతి ఒక్క పెట్టుబడిదారుకూ ఉంది.

కాని ఈ సందర్భంలో కూడ, అదనపు విలువ అధికోత్పత్తికి అవసర శ్రమ కాలం కుదింపూ, తదనుగుణంగా అదనపు శ్రమ పొడిగింపూ మూలకారణంగా ఉన్నాయి.[1] అవసర శ్రమ కాలం 10 గంటలు. ఒక రోజు శ్రమ శక్తి విలువ అయిదు షిల్లింగులు, అదనపు శ్రమ కాలం 2 గంటలు, రోజువారీ అదనపు విలువ ఒక షిల్లింగు అని అనుకొందాం. కాని, పెట్టుబడిదారుడు ఇప్పుడు 24 వస్తువులు ఉత్పత్తి చేస్తున్నాడు. వాటిని ఒక్కొక్కటి పది పెన్నీల చొప్పున అమ్మి మొత్తం ఇరవై షిల్లింగులు సొమ్ము చేసుకొంటున్నాడు. ఉత్పత్తి సాధనాల విలువ పండ్రెండు షిల్లింగులు కాబట్టి, ఈ వస్తువుల్లో 14 2/5 భాగం మదుపు పెట్టిన స్థిర పెట్టుబడిని కేవలం భర్తీ చేస్తుంది. 12 గంటల పని రోజు శ్రమకు మిగతా 9 3/5 వస్తువులు ప్రతీకగా ఉంటాయి. శ్రమ శక్తి వెల అయిదు షిల్లింగులు కాబట్టి, ఆరు వస్తువులు అవసర శ్రమ కాలానికీ, 3 3/5 వస్తువులు అదనపు శ్రమకూ ప్రతీకలు. అవసర శ్రమ, అదనపు శ్రమల మధ్య నిష్పత్తి సగటు సామాజిక పరిస్థితుల్లో 5:1గా ఉన్నది. ఇప్పుడు 5:3 మాత్రమే. ఇదే ఫలితాన్ని కింది విధంగా సాధించవచ్చు. 12 గంటల పని రోజుల్లో ఉత్పత్తి అయిన దాని విలువ 20 షిల్లింగులు. ఈ మొత్తంలో పండ్రెండు షిల్లింగులు ఉత్పత్తి సాధనాల విలువ, అంటే కేవలం పునరుద్భవించే విలువ. మిగిలినవి ఎనిమిది షిల్లింగులు. ఇవి పని రోజులో కొత్తగా సృష్టి అయిన విలువను డబ్బు రూపంలో వ్యక్తం చేస్తున్నాయి. ఈ మొత్తం అదే రకమైనసగటు సామాజిక శ్రమను వ్యక్తం చేసే మొత్తంకన్నా ఎక్కువ. పండ్రెండు గంటల సగటు సామాజిక శ్రమను ఆరు

---

1. "ఒక వ్యక్తి లాభం ఇతరుల శ్రమ ఉత్పత్తి చేసిన వాటి మీద అతని అధికారాన్నిబట్టి ఉండదు. అసలు ఆ శ్రమపైనే అతని అధికారాన్నిబట్టి ఉంటుంది. తన పనివారి వేతనాల్లో మార్పులేని స్థితిలో అతను తన సరకులను ఎక్కువ ధరకు అమ్మకోగలిగితే, అతను స్పష్టంగా లాభపడతాడు. ఆ శ్రమను క్రియోన్ముఖం చేయటానికి అతని ఉత్పత్తుల్లో, మునుపటికన్నా తక్కువ భాగం చాలు. ఫలితంగా మునుపటికన్నా ఎక్కువ భాగం అతనే ఉంచుకోగలుగుతాడు." "ఔట్ లైన్స్ ఆఫ్ పొలిటికల్ ఎకానమీ" లండన్, 1832, పుటలు 49, 50)

షిల్లింగులు మాత్రమే వ్యక్తం చేస్తున్నవి. అసాధారణమైన ఉత్పాదక శక్తి గల శ్రమ తీవ్ర శ్రమగా పని చేస్తుంది. సమాన వ్యవధుల్లో ఈ శ్రమ అదే రకమైన సగటు సామాజిక శ్రమకన్నా ఎక్కువ విలువలను సృష్టిస్తుంది. (అధ్యాయం 1, విభాగం 2 చూడండి) కాని మన పెట్టుబడిదారుడు ఒక రోజు శ్రమ శక్తి విలువగా, మునుపటిలాగానే ఇప్పుడూ అయిదు షిల్లింగులు మాత్రమే చెల్లిస్తూంటాడు. కాబట్టి, కార్మికుడు ఈ విలువ పునరుత్పత్తికి 10 గంటలకు బదులు ఇప్పుడు 7 1/2 గంటలు మాత్రమే పనిచేస్తే చాలు. కాబట్టి అతని అదనపు శ్రమ 2 1/2 గంటలు పెరుగుతుంది. అతను ఉత్పత్తి చేసే అదనపు విలువ ఒక షిల్లింగు నుంచి మూడు షిల్లింగులకు హెచ్చుతుంది. కాబట్టి, మెరుగైన ఉత్పత్తి విధానాన్ని ఆచరణలో పెట్టే పెట్టుబడిదారుడు అదే వ్యాపారంలోని ఇతర పెట్టుబడిదారులకన్నా పని రోజులో ఎక్కువ భాగాన్ని అదనపు శ్రమకు బదలాయిస్తాడు. సాపేక్ష విలువను ఉత్పత్తి చేయటంలో నిమగ్నమైన మొత్తం పెట్టుబడిదారులు సమష్టిగా చేసే పనినే అతను వ్యష్టిగా చేస్తాడు. కాని, మరోవైపు ఈ కొత్త ఉత్పత్తి పద్ధతి సర్వ సామాన్యమై, తత్పర్యవసానంగా, చౌక సరకు వ్యష్టి విలువకూ, దాని సామాజిక విలువకూ మధ్య తేడా అదృశ్యమయేందుకు దారితీసిన వెను వెంటనే, ఈ అధిక అదనపు విలువ అదృశ్యమవుతుంది. విలువను శ్రమ కాలం నిర్ణయిస్తుందనే నియమం. కొత్త ఉత్పత్తి పద్ధతిని ఆచరణలో పెట్టే వ్యష్టి పెట్టుబడిదారును తన సరకులను వాటి సామాజిక విలువకన్నా తక్కువ ధరకు విధిగా అమ్మేలా చేయడం ద్వారా అతణ్ణి తన పట్టులోకి తెచ్చుకొనే నియమం, ఆ నియమమే నిర్బంధించే పోటీ నియమంగా పనిచేస్తూ, అతని పోటీదార్లు కూడ ఆ కొత్త పద్ధతిని తప్పనిసరిగా అనుసరించేలా చేస్తుంది.[1] కాబట్టి, జీవితావసరాలలో భాగమై, ఆ కారణాన శ్రమ శక్తి విలువలోని అంశాలైన సరకుకు సంబంధించిన ఉత్పత్తి శాఖలో శ్రమ ఉత్పాదకత పెరిగి, ఆ సరకులను చౌక చేసినప్పుడు మాత్రమే ఈ మొత్తం పరిణామక్రమం అదనపు విలువ సార్వత్రిక రేటును తుదకు ప్రభావితం చేస్తుంది.

సరకుల విలువ శ్రమ ఉత్పాదకతకు విలోమ నిష్పత్తిలో ఉంటుంది. శ్రమ శక్తి విలువ కూడ అంతే. ఎందువల్లనంటే అది సరుకుల విలువపై ఆధారపడినది. సాపేక్ష అదనపు విలువ అలాకాక, ఆ ఉత్పాదకతకు అనులోమ నిష్పత్తిలో ఉంటుంది. అది ఉత్పాదకత పెరుగుదలతో పెరుగుతుంది. ఉత్పాదకత తగ్గుదలతో తగ్గుతుంది. డబ్బు విలువ స్థిరంగా ఉందని ఊహించుకొంటే, 12 గంటల సగటు సామాజిక పని రోజు ఎల్లప్పుడూ ఒకే కొత్త విలువను, ఆరు షిల్లింగులను ఉత్పత్తి చేస్తుంది. అదనపు విలువ, వేతనాల మధ్య ఈ మొత్తం ఎలా విభజితమైనా సరే. కాని ఉత్పాదకత పెరిగిన కారణాన, జీవితావసరాల విలువ పడిపోయి, అందువల్ల ఒక రోజు శ్రమ శక్తి విలువ అయిదు

1. "నా పొరుగు మనిషి తక్కువ శ్రమతో ఎక్కువ పని చేయిస్తూ చౌకగా అమ్మగలిగితే, నేనూ అతనంత చౌకగా అమ్మగల ఉపాయం చేపట్టాలి. పర్యవసానంగా, తక్కువమంది శ్రమతో, ఆ కారణాన చౌకగా పనిచేసే ప్రతి వృత్తి కళ, పారిశ్రామిక శాఖ, లేదా ఇంజన్ అదే వృత్తి కళను, పారిశ్రామిక శాఖను, లేదా ఇంజన్‌ను ఉపయోగించవలసిన లేదా అటువంటి దేదైనా కనిపెట్టవలసిన ఒక విధమైన ఆవశ్యకాన్ని, పోటీని ఇతరుల్లో జనింపచేస్తుంది. పర్యవసానంగా ప్రతి ఒక్కరూ నిజాయితీతో వ్యవహరించ వీలవుతుంది. ఎవరూ తన పొరుగు మనిషి కన్న తక్కువ ధరకు అమ్మే వీలు లేకుండా పోతుంది." ("ది అడ్వాంటెజెస్ ఆఫ్ ది ఈస్ట్ ఇండియా ట్రేడ్ టు ఇంగ్లాండ్" లండన్, 1720, పుట 67)

షిల్లింగుల నుంచి మూడు షిల్లింగులకు తగ్గిపోతే, అదనపు విలువ ఒక షిల్లింగు నుంచి మూడు షిల్లింగులకు పెరుగుతుంది. శ్రమ శక్తి విలువ పునరుత్పత్తికి పది గంటలు పట్టేది. ఇప్పుడు ఆరు గంటలే సరిపోతుంది. నాలుగు గంటలు విడుదల అయ్యాయి. వాటిని అదనపు విలువ పరిధికి కలిపివేయవచ్చు. కాబట్టి, సరకులను చౌకపరచి, అలా చౌకపరచడం ద్వారా కార్మికుణ్ణే చౌకపరచేందుకు శ్రమ ఉత్పాదకతను పెంచే మొగ్గు, నిరంతర ధోరణి పెట్టుబడికి స్వతఃసిద్ధ గుణం.[1]

ఒక సరకు విలువ సంగతినే పెట్టుబడిదారుడు పట్టించుకోడు. అతను పట్టించుకొనేదొకటే – అందులో చోటుచేసుకుని, అమ్మకం ద్వారా తన చేతికందే అదనపు విలువ. అదనపు విలువ చేతికందడంతో, మదుపు పెట్టిన విలువ కూడ అవశ్యంగా తిరిగి చేతికందుతుంది. శ్రమ ఉత్పాదకత పెరిగే కొద్దీ అనులోమ నిష్పత్తిలో సాపేక్ష అదనపు విలువ పెరుగుతూ, మరోవైపు సరుకుల విలువ అదే నిష్పత్తిలో తగ్గుతూంటుంది. కాబట్టి, ఒకే పరిణామ క్రమం సరుకులను చౌకపరిచి, వాటిలో నిక్షిప్తమయిన అదనపు విలువను పెంచుతుంది కాబట్టి, తికమక పెట్టిన కింది ప్రశ్నకు మనకిక్కడ సమాధానం లభిస్తోంది : మార్పిడి విలువ ఉత్పత్తిపట్ల మాత్రమే శ్రద్ధ వహించే పెట్టుబడిదారుడు సరుకుల మార్పిడి విలువను దిగజార్చేందుకు నిరంతరం ఎందుకు ప్రయత్నిస్తూంటాడు? రాజకీయ అర్థశాస్త్ర సంస్థాపకుల్లో ఒకరైన క్వెస్నే తన ప్రత్యర్థులను వేధించింది ఈ చిక్కు ప్రశ్నతోనే. వారు దీనికి సమాధానం ఇవ్వలేకపోయారు.

క్వెస్నే ఇలా అంటున్నారు. "పారిశ్రామిక వస్తువుల ఉత్పత్తిలో ఖర్చులను, శ్రమకయ్యే వ్యయాన్ని, ఉత్పత్తికి దెబ్బ తగలకుండా ఎంత తగ్గిస్తే, అటువంటి తగ్గింపు అంత లాభదాయకమనీ, ఎందువల్లనంటే అది తయారైన సరకు ధరను తగ్గిస్తుందనీ మీరు అంగీకరిస్తున్నారు. కాని, పనివారి శ్రమ నుంచి ఉద్భవించే సంపద ఉత్పత్తి, వారి ఉత్పాదితాల మార్పిడి విలువ పెంపుదలే అని మీరు నమ్ముతున్నారు."

కాబట్టి, పెట్టుబడిదారీ ఉత్పత్తిలో, శ్రమ ఉత్పాదకతను పెంచడం ద్వారా శ్రమను పొదుపు చేసినప్పుడు, తలపెట్టిన లక్ష్యం పనిరోజు కాలాన్ని తగ్గించడం కానే కాదు.[2] ఒక నిర్దిష్ట పరిమాణం

---

1. "కార్మికుని ఖర్చులు ఏ నిష్పత్తిలో తగ్గినా, అదే సమయంలో పరిశ్రమపై కట్టుబాట్లు తొలగించినట్లయితే, అదే నిష్పత్తిలో అతని వేతనాలు తగ్గుతాయి." ("కన్సిడరేషన్స్ కన్సర్నింగ్ టేకింగ్ ఆఫ్ ది బౌంటీ ఆన్ కార్న్ ఎక్స్‌పోర్టెడ్" వగైరా, లండన్, 1753, పుట 7) "ధాన్యం అన్ని ఆహార పదార్థాలు సాధ్యమయినంత చౌకగా ఉండటం వాణిజ్య ప్రయోజనాలకు అవసరం. ఎందువల్లనంటే అవి ప్రియమయ్యేలా చేసేదేదైనా సరే శ్రమ కూడ ప్రియమయ్యేలా చేయక తప్పదు... పరిశ్రమలపై కట్టుబాట్లు లేని అన్ని దేశాల్లోనూ ఆహార పదార్థాల ధర, శ్రమ ధరను ప్రభావితం చేసి తీరుతుంది. జీవితావసరాలు చౌక అయినప్పుడల్లా శ్రమ ధర తగ్గుతుంది." (అదే గ్రంథం, పుట 3) "ఉత్పాదక శక్తులు ఏ నిష్పత్తిలో పెరుగుతాయో అదే నిష్పత్తిలో వేతనాలు తగ్గుతాయి. యంత్రాలు జీవితావసరాలను చౌకపరచే మాట నిజమే. కాని అవి కార్మికుణ్ణి కూడా చౌకపరుస్తాయి." ("ఎ ప్రైజ్ ఎస్సే ఆన్ ది కంపేరిటివ్ మెరిట్స్ ఆఫ్ కాంపిటిషన్ అండ్ కో ఆపరేషన్" లండన్, 1834, పుట 27)
2. "తాము డబ్బు చెల్లించవలసిన కార్మికుల శ్రమ విషయంలో ఎంతో పొదుపు పాటించే ఈ చట్టా వ్యాపారులు" (జె.ఎన్. బైడట్ (బిదొ), "దు మోనాపొలీ క్విసేట బ్లిట్ డాన్స్ తే. ఆర్ట్స్, ఇండస్ట్రీస్ ఎట్ లే కామర్స్." పారిస్, 1828, పుట 13) కాలాన్ని, శ్రమను పొదుపు చేయడానికి యజమాని ఎల్లప్పుడూ విశ్వ ప్రయత్నం చేస్తుంటాడు. (డుగాల్డ్ స్టివార్ట్, రచనలు సంపాదకుడు, సర్. ఎం. హా మిల్టన్, ఎడింబరో

గల సరకుల ఉత్పత్తికి అవసరమైన శ్రమ కాలాన్ని తగ్గించడమొక్కటే లక్ష్యం. కార్మికుని శ్రమ ఉత్పాదకత పెరిగినప్పుడు అతను మునుపటికన్నా (ఉదాహరణకు) 10 రెట్లు ఎక్కువ సరకులు ఉత్పత్తి చేసి, ఆ విధంగా ప్రతి సరకుకూ మునుపటి శ్రమ కాలంలో పదో వంతు వెచ్చిస్తాడనుకుందాం. అయితే, మునుపటిలాగే అతడు తన పనిని 12 గంటలపాటు కొనసాగించి, ఆ 12 గంటల్లో 120 వస్తువులకు బదులు 1,200 వస్తువులు ఉత్పత్తి చేయడానికి ఆ విషయం ఏ విధంగానూ అడ్డురాదు. అంతేకాదు, అతనితో 14 గంటల్లో 1400 వస్తువులను ఉత్పత్తి చేయించడానికై అతని పని రోజు పొడిగింపబడవచ్చు కూడా. అందువల్ల మాక్‌కుల్లోచ్, ఉరే, సీనియర్, ఇంకా ఆ బాపతు అర్థశాస్త్రజ్ఞుల గ్రంథాల్లో, తన ఉత్పాదకతను పెంచి, తద్వారా అవసర శ్రమ కాలాన్ని తగ్గించినందుకు పెట్టుబడికి కార్మికుడు రుణపడి ఉన్నాడని ఒక పుటలో చదువుతాము. తరువాత పుటలో, అతడు ఇకముందు 10 గంటలకు బదులు 15 గంటలు పనిచేయడం ద్వారా తన కృతజ్ఞతను నిరూపించాలని చదువుతాం. పెట్టుబడిదారీ ఉత్పత్తి పరిమితుల్లో శ్రమ ఉత్పాదకత పెరుగుదల అంతటి లక్ష్యమిదీ : పనిరోజులో కార్మికుడు తన ప్రయోజనం కోసం శ్రమించవలసిన భాగాన్ని కుదించడం, ఆ కుదింపు ద్వారానే, పెట్టుబడిదారు కోసం ఉచితంగా పని చేయడానికి అతనికి స్వేచ్ఛ ఉన్న మిగతా పనిదిన భాగాన్ని పెంచడం. సరకులను చౌకపరచకుండానే ఈ ఫలితాన్ని ఎంతవరకు సాధించవచ్చునో, సాపేక్ష అదనపు విలువను ఉత్పత్తి చేసే నిర్దిష్ట పద్ధతుల పరిశీలన వల్ల తెలుస్తుంది. ఇప్పుడా పరిశీలనకు పూనుకొందాం.

---

V, VIII 1855, లెక్చర్స్ ఆన్ పొలిటికల్ ఎకానమీ'' పుట 318). ''తాము పనిలో పెట్టుకున్న కార్మికుల ఉత్పాదక శక్తులు సాధ్యమైనంత ఎక్కువగా ఉండాలని వారి (పెట్టుబడిదారుల) ఆసక్తి, ఆ శక్తిని పెంచడంపై, దాదాపు ఆ ఒక్కదానిపైన్నే వారు తమ దృష్టిని నిల్పారు.'' (ఆర్. జోన్స్ : పూర్వోక్త గ్రంథం, ఉపన్యాసం III)

## అధ్యాయం - 13

# సహకారం

**మ**నం ఇదివరకే తెలుసుకొన్నట్లు, పెట్టుబడిదారీ ఉత్పత్తి నిజంగా ప్రారంభమయ్యేది ప్రతి ఒక్క వ్యష్టి పెట్టుబడి ఒకేసారి, సాపేక్షంగా అధిక సంఖ్యలో కార్మికులను నియమించినప్పుడే, తత్ పర్యవసానంగా శ్రమ ప్రక్రియ విస్తార స్థాయిలో సాగి, సాపేక్షంగా భారీ పరిమాణాల్లో ఉత్పాదితాలను అందించినప్పుడే. ఒక పెట్టుబడిదారు యాజమాన్యాన ఒకే రకమైన సరకులు తయారుచేయడానికై, ఒకేసారి, ఒకే స్థలంలో (లేదా ఒకే శ్రమ క్షేత్రంలో), మరింత పెద్ద సంఖ్యలో కార్మికులు కలిసి పనిచేయటం, చారిత్రకంగానూ, తార్కికంగానూ పెట్టుబడిదారీ ఉత్పత్తికి నాంది అవుతున్నది. అసలు ఉత్పత్తి పద్ధతికి సంబంధించినంత వరకు, కార్ఖానా, చేతి ఉత్పత్తి తొలిదశల్లో, దాని కచ్చితమైన అర్థాన్నిబట్టి, దానికీ, వృత్తి సంఘాల చేతివృత్తులకూ మధ్య, ఒకే వ్యష్టి పెట్టుబడిచే ఏకకాలంలో నియమితులైన పనివారి అధికతర సంఖ్యను తప్పిస్తే తేడా కనిపించదు. మధ్యయుగాల నాటి చేతివృత్తుల పెద్ద నడిపిన కార్ఖానా ఇక్కడ విస్తృతమయిందంతే.

కాబట్టి, తొలుత ఈ తేడా కేవలం పరిమాణాత్మకమైనది. ఒక నిర్ణీత పెట్టుబడి ఉత్పత్తి చేసే అదనపు విలువ, ప్రతి కార్మికుడూ ఉత్పత్తి చేసే అదనపు విలువను ఏకకాలంలో నియమితులైన పనివారి సంఖ్యతో గుణిస్తే వచ్చేదానికి సమానమని నిరూపించాం. అసలు పనివారి సంఖ్య అదనపు విలువ రేటును కాని, శ్రమ శక్తిని దోచుకొనే మోతాదును కాని ప్రభావితం చేయదు. 12 గంటల పని రోజు ఆరు షిల్లింగుల్లో మూర్తీభవించి ఉంటే, అటువంటి 1,200 రోజులు, ఆరు షిల్లింగులు 1,200 రెట్లుకు పెరిగిన మొత్తంలో మూర్తీభవించి ఉంటాయి. రెండవ సందర్భంలో 12 × 1,200 గంటలు, మొదటి సందర్భంలో అటువంటి 12 గంటలు ఉత్పాదితంలో మూర్తిమంతమై ఉంటాయి. విలువ ఉత్పాదనలో ఎంతమంది పనివారైనా అంతమంది విడివిడి పనివారుగా లెక్కకు వస్తారు. అంతే కాబట్టి, 1,200 మంది విడివిడిగా పని చేసినా, ఒకే పెట్టుబడిదారు అజమాయిషీలో ఐక్యంగా పనిచేసినా, ఉత్పత్తి అయిన విలువలో తేడా లేదు.

అయినప్పటికీ, కొన్ని నిర్దిష్ట పరిమితుల్లో మార్పు వస్తుంది. విలువ రూపం ధరించిన శ్రమ సగటు సామాజిక గుణం కల శ్రమ, కాబట్టి అది సగటు శ్రమ శక్తి హెచ్చింపు. కానీ ఏ సగటు పరిమాణమైనా, ఒకే రకానికి చెందినా, రాశిలో తేడా ఉన్న విడివిడి పరిమాణాల సగటు మాత్రమే. ఏ పరిశ్రమలోనైనా, ప్రతి కార్మికుడూ – అతడు రంగన్న అయినా, గంగన్న అయినా – సగటు కార్మికునికి భిన్నంగా ఉంటాడు. వ్యక్తిగతమైన ఈ వ్యత్యాసాలు, ఒక నిర్దిష్టమైన కనీస సంఖ్యలో పనివారిని కలిపి నియమించినప్పుడల్లా, ఒకదానినొకటి రద్దు చేసి, అదృశ్యమవుతాయి. పేరుమోసిన

కుతర్కవాదీ, ముఖస్తుతి పరాయణుడూ అయిన ఎడ్మండ్ బర్క్, వ్యవసాయదారుగా ఆచరణలో తాను చూసిన వాటిని ఆధారంగా చేసుకొని ఇలా గట్టిగా చెబుతున్నాడు : అయిదుగురు వ్యవసాయ కార్మికులున్న దళంలో కూడా శ్రమలోని వైయక్తిక వ్యత్యాసాలన్నీ అదృశ్యమవుతాయి. ఫలితంగా, ఏ అయిదుగురు వ్యవసాయ కార్మికులను మొత్తంగా తీసుకొన్నా అదే కాలంలో మరే అయిదుగురు వ్యవసాయ కార్మికులైనా చేసినంత పనే చేస్తారు.[1] కానీ, అది ఎలా ఉన్నా ఏకకాలంలో నియుక్తులైన చాలామంది పనివారి సమష్టి పని రోజును ఆ పనివారి సంఖ్యతో భాగిస్తే ఒక సగటు సామాజిక శ్రమ రోజు వస్తుందనేది స్పష్టం. ఉదాహరణకు, ప్రతి వ్యక్తి పని రోజూ 12 గంటలనుకొందాం. అప్పుడు, ఏకకాలంలో నియుక్తులయిన 12 మంది సమష్టి పని రోజు 144 గంటలు. ఈ డజనుమందిలో ప్రతి ఒక్కరి శ్రమ సగటు సామాజిక శ్రమకు కొద్దో గొప్పో భిన్నంగా ఉండి, ఒకే పనికి వారిలోని ప్రతి ఒక్కరికీ పట్టే సమయం వేరువేరుగా ఉన్నప్పటికీ, ప్రతి ఒక్కరి పని రోజూ 144 గంటల సమష్టి పని రోజులో పంద్రెండోపాలు కాబట్టి, దానికి ఒక సగటు సామాజిక పని రోజు లక్షణాలుంటాయి. కానీ ఈ 12 మందిని పనికి నియమించిన పెట్టుబడిదారు దృష్టిలో పని రోజు అంటే మొత్తం డజనుమంది పని రోజన్న మాట. ఈ పంద్రెండుగురు తమ పనిలో ఒకరికొకరు తోడ్పడినా, లేదా వారి పనుల మధ్య సంబంధం, వారంతా ఒకే పెట్టుబడిదారుడి కోసం పని చేస్తూండటమే అయినా, ప్రతి ఒక్క మనిషి పని రోజూ సమష్టి పని రోజులో ఒక పూర్ణాంకపు భాగం. కాని ఈ పంద్రెండు మందిని ఆరు జతలుగా చేసి, ఆరుగురు వేరు వేరు చిన్న యజమానులు తలా ఒక జతను పనిలో నియమిస్తే, ఈ యజమానుల్లో ప్రతి ఒకరూ ఒకే విలువను ఉత్పత్తి చేస్తాడా, పర్యవసానంగా అదనపు విలువ సార్వత్రిక రేటును సాధిస్తాడా అనేది పూర్తిగా యాదృచ్ఛికం. ఆయా సందర్భాలను విడివిడిగా తీసుకుంటే, తేడాలుంటాయి. ఒక పనివానికి ఒక సరకును తయారు చేసేందుకు సామాజికంగా అవసరమైన దానికన్నా గణనీయంగా ఎక్కువ సమయం పట్టితే, అతని విషయంలో మనకు విదితమయ్యేటట్లుగా, అవసర శ్రమ కాలం సగటున సామాజికంగా అవసరమైన శ్రమ కాలానికి భిన్నంగా ఉంటుంది. పర్యవసానంగా అతని శ్రమను సగటు శ్రమ కింద, అతని శ్రమ శక్తిని సగటు శ్రమ శక్తి కింద లెక్కవేయము. ఆ శ్రమ శక్తి అమ్మకం కాదు, లేదా శ్రమ శక్తి సగటు విలువ కన్నా తక్కువకు అమ్మకమవుతుంది. కాబట్టి, సమస్త శ్రమలోనూ ఒక నిర్ణీతమైన కనీస సామర్థ్యముందని భావించడం కద్దు. పెట్టుబడిదారీ ఉత్పత్తి ఈ కనీస సామర్థ్యాన్ని నిర్ణయించే

1. "బలం, చాతుర్యం, పని చేయడంలో చిత్తశుద్ధి, వీటినిబట్టి చూస్తే, ఒక మనిషి శ్రమ విలువకు, మరొకరి శ్రమ విలువకు మధ్య నిస్సందేహంగా చాలా వ్యత్యాసం ఉంటుంది. అయితే ఏ అయిదుగురిని తీసుకున్నా, మొత్తంపై మరే అయిదుగురైనా చేసినంత పనే చేస్తారని, నేను బాగా పరికించిన దాన్నిబట్టి గట్టిగా నమ్ముతున్నాను. అంటే, అటువంటి అయిదుగురిలో మంచి పనివానికి గల అన్ని గుణాలూ గలవాడొకడు. అప్రయోజకుని లక్షణాలు గలవాడొకడు ఉంటారు. మిగతా ముగ్గురిలో ఒకడు మధ్యస్థంగానూ, ఇంకొకడు మొదటి వానికి దరిదాపుగానూ, మరొకడు చివరివానికి దరిదాపుగానూ ఉంటారు. పర్యవసానంగా అయిదుగురే ఉన్న చిన్నపాటి దళంలో కూడా, అయిదుగురు మనుషులు సంపాదించగల శక్తి పూర్తిగా ఉందని మనకు స్పష్టమవుతుంది." (ఇ. బర్క్, పూర్వోక్త గ్రంథం, పుటలు 15, 16)

విధానాన్ని సమకూర్చుతుందని ఉత్తరోత్తరా మనం గ్రహిస్తాము. కానీ, ఈ కనీస సామర్థ్యానికీ, సగటు సామర్థ్యానికీ కొంత భేదముంటుంది. అయినా పెట్టుబడిదారు శ్రమ శక్తి సగటు విలువనే చెల్లించవలసి వస్తుంది. కాబట్టి పై ఆరుగురు చిన్నపాటి యజమానుల్లో ఒకరు అదనపు విలువ సగటు రేటుకన్నా ఎక్కువ ఒడుపుకొంటే, మరొకరికి తక్కువ లభిస్తుంది. ఈ ఎక్కువ తక్కువలు మొత్తం సమాజం విషయంలో పరిహారమవుతాయి. కానీ, వ్యష్టి యజమానుల విషయంలో అలా కాదు. కాబట్టి, వ్యష్టి ఉత్పత్తిదారు పెట్టుబడిదారుగా ఉత్పత్తి చేస్తేనే, పలువురు పనివారిని కూడదీసి నియమిస్తేనే, అతని విషయంలో విలువ ఉత్పత్తి నియమాలు పూర్తిగా అమల్లోకి వస్తాయి. వారి శ్రమ సమష్టి స్వభావం కలది కాబట్టి, వెంటనే దానికి సగటు సామాజిక శ్రమ ముద్రపడుతుంది.[1]

పని పద్ధతిలో మార్పు లేకపోయినా, ఏకకాలంలో చాలామంది కార్మికుల నియామకం శ్రమ ప్రక్రియ భౌతిక పరిస్థితుల్లో విప్లవాన్ని తెస్తుంది. వారు పనిచేసే భవనాలు, ముడి సరుకులను నిల్వ చేసే గోదాములు, ఏకకాలంలో, లేదా విడతలుగా కార్మికులు ఉపయోగించే పరికరాలు, పాత్రలు, ఒక్క ముక్కలో చెప్పాలంటే, ఉత్పత్తి సాధనాల్లో ఒక భాగం ఇక్కడ ఉమ్మడిగా వినియోగమవుతున్నాయి. ఒక వంక ఈ ఉత్పత్తి సాధనాల మార్పిడి విలువ పెరగడం లేదు. ఎందువల్లనంటే, ఒక సరకు యొక్క ఉపయోగపు విలువ మరింత సమగ్రంగా, మరింత ప్రయోజనకరంగా వినియోగమవుతున్నంత మాత్రాన ఆ సరకు మార్పిడి విలువ పెరగదు. మరోవంక ఈ ఉత్పత్తి సాధనాలు ఉమ్మడిగా, అందువల్ల మునుపటికన్నా హెచ్చు ప్రమాణంలో వినియోగమవుతున్నాయి. ఇద్దరు సహాయకులు గల ఒక నేత పనివాని గదికన్నా ఇరవై మగ్గాల వద్ద పనిచేసే ఇరవై నేతవారున్న గది పెద్దదిగా ఉండి తీరుతుంది. కాని, ఇద్దరిద్దరికి ఒకటి చొప్పున పది కార్ఖానాలను కట్టడం కన్నా, ఇరవై మందికి ఒక కార్ఖానా నిర్మించడానికి తక్కువ వ్యయమవుతుంది. కాబట్టి, ఉమ్మడి వినియోగం కోసం సాంద్రీకృతమైన ఉత్పత్తి సాధనాల విలువ, ఆ సాధనాల విస్తరణకూ, వాటి అధికతర ఉపయుక్తతకూ అనుగుణమైన నిష్పత్తిలో పెరగదు. ఉమ్మడిగా వినియోగమయినప్పుడు, అవి ప్రతి ఒక్క ఉత్పాదితానికి తమ విలువలో అందజేసే భాగం తక్కువగా ఉంటుంది. అవి అందజేసే మొత్తం విలువ ఎక్కువ పరిమాణంలో ఉన్న ఉత్పాదితాలకు పంపిణీ కావడం ఇందుకొక కారణం. వాటి విలువ, విడి విడి ఉత్పత్తి సాధనాల మొత్తం విలువకన్నా ఎక్కువైనప్పటికీ, ఈ ప్రక్రియలో వాటి కార్యరంగాన్ని దృష్టిలో ఉంచుకొన్నప్పుడు, సాపేక్షంగా తక్కువగా ఉండటం మరో కారణం. ఇందువల్ల స్థిర పెట్టుబడిలోని ఒక భాగం విలువ పడిపోతుంది. ఇది ఏ నిష్పత్తిలో పడిపోతుందో ఆ నిష్పత్తిలో సరకు మొత్తం విలువ కూడ పడిపోతుంది. దీని ఫలితం ఉత్పత్తి సాధనాలకు తక్కువ వ్యయమైనప్పుడు కలిగే ఫలితంలాగే ఉంటుంది. వాటి వినియోగంలో పొదుపునకు పూర్తిగా కారణం, ఎక్కువ మంది పనివారు వాటిని ఉమ్మడిగా వినియోగించడమే. అంతేకాదు, ఒకచోటికి చేర్చబడ్డ పలువురు పనివారు కేవలం పక్క పక్కన

1. శ్రీమతి రోషెర్ నియమించిన ఒక కుట్టుపని మనిషి రెండు రోజుల్లో చేసిన పని, అలా నియమితులైన ఇద్దరు కలిసి ఒక రోజులో చేసిన పనికన్నా ఎక్కువ అని తాను కనుగొన్నట్లు ప్రొఫెసరు రోషెర్ చెబుతున్నారు. పండిత ప్రకాండుడైన ఈ ప్రొఫెసరు పెట్టుబడిదారీ ఉత్పత్తి ప్రక్రియలను, చిన్నపిల్లలాడుకొనే గదిలో, లేదా అసలు వ్యక్తి అయిన పెట్టుబడిదారు కొరవడిన పరిస్థితుల్లో అధ్యయనం చేయరాదు.

పనిచేయటం తప్ప, ఒకరికొకరు తోడ్పడకపోయినప్పటికీ సామాజిక శ్రమకు అవసరమైన పరిస్థితుల లక్షణాన్ని ఇవి సంతరించుకొంటాయి. ఎవరికి వారుగా స్వతంత్రంగా పనిచేసే కార్మికులకు, లేదా చిన్నపాటి యజమానులకు చెందినా చెల్లాచెదరుగా ఉన్నట్లే సాపేక్షంగా మరింత ఖర్చుతో కూడుకొన్నట్టి ఉత్పత్తి సాధనాల నుంచి వీటిని వేరుచేసి చూపే లక్షణమిదే. అసలు శ్రమ ప్రక్రియ కంటే ముందే శ్రమ సాధనాల్లో ఒక భాగం ఈ సామాజిక స్వభావాన్ని సంతరించుకుంటుంది.

ఉత్పత్తి సాధనాల వినియోగంలో పొదుపును కింది రెండు దృక్పథాల నుంచి పరిశీలించాలి. మొదటిది అది సరకులను చౌకపరుస్తుంది. తద్వారా శ్రమ శక్తి విలువను తగ్గిస్తుంది. రెండవది, మదుపు పెట్టిన స్థిర, అస్థిర పెట్టుబడి విలువల మొత్తానికీ, అదనపు విలువకూ మధ్య ఉండే నిష్పత్తిని మారుస్తుంది. రెండవ అంశాన్ని మనం మూడవ సంపుటానికి వచ్చే వరకు పరిశీలించబోము. ప్రస్తుత సమస్యకు సంబంధించిన అనేక ఇతర విషయాలను కూడా, వాటి సముచిత సందర్భంలో చర్చించేందుకై, ఆ సంపుటికే అట్టిపెడుతున్నాము. మన విశ్లేషణ సాగుతున్న తీరువల్ల చర్చిస్తున్న విషయాన్ని ఇలా విడగొట్టవలసి వస్తోంది. ఈ విడగొట్టడం పెట్టుబడిదారీ ఉత్పత్తి సరళికి పూర్తిగా అనుగుణమైనదే. ఎందువల్లనంటే, ఈ ఉత్పత్తి పద్ధతిలో, శ్రమ సాధనాలు తనతో నిమిత్తం లేకుండా మరొకరి ఆస్తిగా ఉన్నాయని కార్మికునికి కనిపిస్తూంది కాబట్టి, వాటి వినియోగంలో పొదుపు తనకు సంబంధం లేని ఒక ప్రత్యేక చర్య అనీ, అందువల్ల తన వ్యక్తిగత శ్రమ ఉత్పాదకతను పెంచే పద్ధతులతో దానికి సంబంధం లేదనీ అతనికి అగుపిస్తుంది.

అనేకమంది కార్మికులు ఒకే శ్రమ ప్రక్రియలోనో, లేదా భిన్నమైనవైన పరస్పర సంబంధమున్న ప్రక్రియల్లోనో పక్క పక్కన కలిసి పని చేస్తున్నప్పుడు, వారు సహకరించుకొంటున్నారని, లేదా పరస్పర సహకారంతో పనిచేస్తున్నారని అంటాము.[1]

ఒక అశ్విక దళ దాడి శక్తి, లేదా ఒక పదాతి పటాలం ఆత్మరక్షణ శక్తి విడివిడి అశ్విక సైనికుని దాడి శక్తిని, లేదా ఒక పదాతి సైనికుని ఆత్మరక్షణ శక్తిని వేరువేరుగా తీసుకొని చూస్తే వాటి సమాహారం కన్నా, సారభూతంగా ఎలా భిన్నమైనవో, అలాగే ఒక పెద్ద బరువును ఎత్తడం, లేదా బరువులెత్తే యంత్రాన్ని తిప్పడం, లేదా ఒక అవరోధాన్ని తొలగించడం వంటి ఒకే అవిభక్తమైన పనిలో పలువురు ఏకకాలంలో పాల్గొంటున్నప్పుడు, రూపుగొనే సామాజిక శక్తి, ఏకాకులైన కార్మికులు ప్రదర్శించే యాంత్రిక శక్తుల సమాహారానికి భిన్నమైనది.[2] అటువంటి సందర్భాల్లో, సంయుక్త శ్రమ సాధించిన ఫలితాన్ని, ఏకాకి వ్యక్తి శ్రమ సాధించజాలదు. లేదా ఎంతో కాలాన్ని వెచ్చిస్తేనే సాధించగలదు. లేదా బహు తక్కువ మోతాదులో మాత్రమే సాధించగలదు. ఇక్కడ సహకారం ద్వారా వ్యక్తి ఉత్పాదక

1. ''కంకొర్స్ డి ఫోర్సెస్'' (డెస్టంట్ డిట్రేసీ, పూర్వోక్త గ్రంథం, పుట 80)
2. ''భాగాలుగా విభజించ వీలులేనంత సామాన్యమైన పనులు చాలా ఉన్నాయి. అనేకులు చేయివేసి సహకరిస్తే తప్ప వాటిని నెరవేర్చడం సాధ్యం కాదు. ఒక పెద్ద చెట్టును బండికెత్తడం ... ఒక్క ముక్కలో చెప్పాలంటే, ఒకే అవిభక్తమైన పనిలో, ఏకకాలంలో చాలామంది చేయివేసి ఒకరికొకరు తోడ్పడితే తప్ప నిర్వహించ వీలులేని ప్రతి ఒక్కటీ ఇందుకు ఉదాహరణ.'' (ఇ.జి. వేక్ ఫీల్డ్. ''ఎ వ్యూ ఆఫ్ ది ఆర్ట్ ఆఫ్ కాలనైజేషన్'' లండన్, 1849, పుట 168)

శక్తి పెరగడమే కాదు, ఒక కొత్త శక్తి, బహుజన సమష్టి శక్తి అనేది కూడా ఉద్భవిస్తుంది.[1]

అనేక శక్తులు ఒకే శక్తిగా విలీనం అయినందువల్ల కొత్త శక్తి ఉద్భవించడమే కాక, కేవలం సామాజిక సంపర్కం అత్యధిక సంఖ్యాక పరిశ్రమల్లో ప్రతి ఒక్క కార్మికుని సామర్థ్యాన్నీ పెంచే పోటీని, ఉత్సాహాన్ని రేకెత్తిస్తుంది. అందువల్లనే, కలిసి పనిచేస్తున్న డజనుమంది తమ 144 గంటల, సమష్టి శ్రమ దినంలో ఏకాకులుగా తలా 12 గంటలు పనిచేసే పండ్రెండుమంది విడి విడి మనుషులకన్నా, లేదా వరుసగా 12 రోజులు పనిచేసే ఒక మనిషికన్నా ఎక్కువ ఉత్పత్తి చేస్తారు.[2] మనిషి, అరిస్టాటిల్ వాదిస్తున్నట్లు రాజకీయ జీవి కాదనుకున్నా, ఎట్టి పరిస్థితుల్లోనూ సామాజిక జీవి కావటం దీనికి కారణం.[3]

ఒకేసారి, ఒకే పనిలో, లేదా ఒకేరకమైన పనిలో పలువురు నిమగ్నమైనప్పటికీ, సమష్టి శ్రమలో భాగంగా ప్రతి ఒక్కరి శ్రమా, శ్రమ ప్రక్రియలోని ఏదో ఒక నిర్దిష్ట దశకు సరిపడుతుంది. సహకార ఫలితంగా మరింత త్వరితగతితో వారి పని జరుగుతుంది. ఉదాహరణకు ఒక డజనుమంది బేలుదార్లు, రాళ్ళను నిచ్చెన క్రిందినుంచి దానిపైకి అందజేసేందుకు వీలుగా ఒక వరుసలో నిలబడితే, వారిలో ప్రతి ఒక్కరూ చేసే పని ఒకటే. కాని వారి విడివిడి పనులు ఒక మొత్తం కార్యంలో పరస్పర సంబంధమున్న భాగాలుగా రూపుగొంటున్నాయి. అవి ప్రతి రాయి గడిచి తీరవలసిన నిర్దిష్ట దశలు, ప్రతి మనిషి ఎవరికి వారు బరువెత్తుకొని నిచ్చెన ఎక్కుతూ, దిగుతూ ఉంటే, రాళ్ళు పైకి చేరడానికి పట్టే కాలం కన్నా, వరుసగా నిల్చున్న వారి 24 చేతులు వాటిని త్వరగా పైకి చేర్చగలవు.[4] ఆ

---

1. "ఒక టన్ను బరువు ఎత్తడానికి ఒక మనిషి పూనుకోలేడు. పదిమందైతే చాలా కష్టపడాలి. కానీ వందమంది తలా ఒక వేలి బలం చూపితే ఆ పని చేయగలరు." (జాన్ బెల్లర్స్ : ప్రపోజల్స్ ఫర్ రైజింగ్ ఎ కాలడ్జ్ ఆఫ్ ఇండస్ట్రీ" లండన్ 1696, పుట 21

2. తలా 30 ఎకరాలున్న పదిమంది వ్యవసాయదారులచే నియమితులైన మొత్తం పనివారు, అదే సంఖ్యలో, 300 ఎకరాలున్న ఒక వ్యవసాయదారుచే నియమితులైతే, "పనిమనుషుల నిష్పత్తిలో ఒక అనుకూలం కూడా ఉంది. ఇది అనుభవజ్ఞులకు తప్ప ఇతరులకు సులభంగా అర్థం కాదు. ఎందువల్లనంటే, 1:4 ఎంతో 3:12 కూడా అంతే అని చెప్పడం సహజం. కాని ఇది ఆచరణలో సరికాదు. ఎందుకంటే, నూర్పిళ్ళ కాలంలో త్వరగా ముగించవలసిన అటువంటి ఇతర పనులలో పలువురు పని మనుషులను కలిపి పురమాయించడం వల్ల పని మరింత బాగా, మరింత త్వరగా జరుగుతుంది. ఉదాహరణకు, పంట కోతలప్పుడు డ్రైవర్లు ఇద్దరు, బోదెల్ని, బళ్ళకెత్తేవారు ఇద్దరు, పంగల కట్టెలవారు ఇద్దరు, గడ్డికుప్ప పెట్టేవారిద్దరు, వామిపైన, లేదా ధాన్యపు కొట్టులో మిగతావారు కలిసి చేసే పనివారినే వేరు వేరు క్షేత్రాల్లో, పనికి వేరు వేరు దళాలుగా విభజిస్తే చేసే పనికన్నా రెండు రెట్లు ఎక్కువ ఉంటుంది." ("యాన్ ఎంక్వయిరీ ఇంటు ది కనెక్షన్ బిట్విన్ ది ప్రజెంట్ ప్రైస్ ఆఫ్ ప్రొవిజన్స్ అండ్ ది సైజ్ ఆఫ్ ఫారమ్స్" ఒక వ్యవసాయదారు రచన, లండన్, 1773, పుటలు 7, 8)

3. కచ్చితంగా చెప్పాలంటే, అరిస్టాటిల్ నిర్వచనం, మనిషి స్వభావతః నగర పౌరుడని. మనిషి పరికరాలను తయారుచేసే జీవి అన్న ఫ్రాంక్లిన్ నిర్వచనం ఎంతగా యాంకీ (అమెరికన్) సమాజ లక్షణమో, అంతగా పై నిర్వచనం ప్రాచీన గ్రీకు సమాజ లక్షణం.

4. "కార్మికులు ఒకే పనిలో నియమితులయినపుడు కూడా, శ్రమలో ఈ విధమైన పాక్షిక విభజన జరుగవచ్చునని గమనించాలి. ఉదాహరణకు ఒక భవనం పై అంతస్తుకు చేరవేసేందుకై ఇటుకలను చేతినుంచి చేతికి అందివ్వడంలో నిమగ్నమైన బేలుదార్లంతా ఒకే పని చేస్తున్నారు. కాని వారి మధ్య ఒక విధమైన శ్రమ

వస్తువును తక్కువ కాలంలో అంతే దూరానికి చేరవేస్తున్నారు. ఉదాహరణకు, ఒక భవనాన్ని ఏకకాలంలో వేరు వేరు పక్కల నుంచి కడుతున్నప్పుడు శ్రమ సమ్మేళన జరుగుతుంది. ఇక్కడ కూడ పరస్పరం సహకరించుకొంటున్న బేలుదార్లు, ఒకే, లేదా ఒకే రకమైన పని చేస్తున్నప్పటికీ, 12 రోజులు, లేదా 144 గంటలు పనిచేసిన ఒక బేలుదారుకన్నా, 12 మంది బేలుదార్లు, 144 గంటల సమష్టి పనిదినంలో భవన నిర్మాణంలో ఎక్కువ ప్రగతిని సాధిస్తారు. కారణమేమిటంటే, పరస్పర సమన్వయంతో పనిచేస్తున్న పనివారి బృందానికి ముందూ, వెనకా చేతులూ, కళ్ళూ ఉంటాయి. కొంతమేర వారు సర్వాంతర్యాములు. పనిలోని వివిధ భాగాలు ఏక కాలంలో పురోగమిస్తాయి.

పై ఉదాహరణల్లో పనివారు ఒకే, లేదా ఒకే విధమైన పని చేస్తారనే విషయాన్ని నొక్కి చెప్పాము. ఎందువల్లనంటే, ఇది అతి సామాన్యమైన ఉమ్మడి శ్రమ రూపం, సహకారంలో ఒక గొప్ప పాత్రను, దాని అత్యంత అభివృద్ధి చెందిన దశలో సైతం నిర్వహిస్తుంది. పని క్లిష్టమైనదైతే, పరస్పరం సహకరించుకొనే పనివారి సంఖ్యే, వేరు వేరు మనుషులకు వేరు వేరు పనులను కేటాయించడానికీ, తత్పర్యవసానంగా అవి ఏకకాలంలో నిర్వహింపబడటానికీ వీలు కలిగిస్తోంది. మొత్తం పని పూర్తి చేయడానికి అవసరమయ్యే కాలం, ఆ కారణాన తగ్గుతుంది.[1]

అనేక పరిశ్రమల్లో, ఆయా పనుల స్వభావాన్ని బట్టి కొన్ని కీలక దశలుంటాయి. ఈ దశల్లో కొన్ని నిర్దిష్టమైన ఫలితాలను సాధించవలసి ఉంటుంది. ఉదాహరణకు, ఒక గొర్రెల మందలో వాటి బొచ్చు కత్తిరించవలసివస్తే లేదా ఒక గోధుమ పొలాన్ని నూర్చవలసివస్తే ఒక నిర్దిష్ట వ్యవధిలో పనిని ప్రారంభించి పూర్తి చేయడంపై ఉత్పాదిత పరిమాణమూ, నాణ్యతా ఆధారపడి ఉంటాయి. హెర్రింగ్ చేపల వేటలో లాగానే, ఈ సందర్భాల్లో కూడా ఈ పనులు నిర్దిష్ట వ్యవధిలో పూర్తి కావాలి. ఒకే మనిషి ప్రకృతిసిద్ధమైన దినంలో నుంచి 12 గంటలకు మించిన పనిదినాన్ని సృష్టించలేడు. కాని సహకరించు కొంటున్న 100 మంది పనిదినాన్ని 1,200 గంటలకు విస్తరింపచేయగలరు. పనికి అవకాశమున్న వ్యవధి తక్కువగా ఉన్న లోటును, నిర్ణయాత్మక సమయంలో ఉత్పత్తి రంగంలోకి దింపిన శ్రమ యొక్క విస్తార పరిమాణం భర్తీ చేస్తోంది. తగు వ్యవధిలో కర్తవ్యం పూర్తికావడమన్నది సమ్మిళితమైన అనేక పనిదినాలను ఏకకాలంలో వినియోగించుకోవడంపై ఆధారపడి ఉంటుంది. ఉపయోగకరమైన ఫలితం ఏ మోతాదులో ఉన్నదీ కార్మికుల సంఖ్యను బట్టి ఉంటుంది. కాని ఈ సంఖ్య అదే వ్యవధిలో అదే పరిమాణం గల పనికి అవసరమైన విడివిడి కార్మికుల సంఖ్యకన్నా

---

విభజన ఉంది. వారిలో ప్రతి ఒక్కరూ ఇటుకను ఒక నిర్ణీత దూరానికి అందజేస్తున్నారన్నదే ఈ విభజన. తన ఇటుకను ప్రతి ఒక్కరూ ఎవరికి వారు పై అంతస్తుకు తీసుకెళితే పట్టే కాలంకన్నా చాలా త్వరగా వారంతా కలిసి ఇటుకను నిర్ణీత స్థలానికి చేరుస్తున్నారు." (ఎఫ్. స్కార్‌బెక్, థియర్ డి రిచెనెస్ నోషియలే, పారిస్, 1839, సం. 1, పుటలు 97-98.)

1. "సమస్య సంకీర్ణ శ్రమ నిర్వహణకు సంబంధించినదైతే, వేరు వేరు పనులు, ఏకకాలంలో చేయవలసి ఉంటుంది. ఒకడు ఒక పని చేస్తాడు. మరొకడు మరో పని చేస్తాడు. వారంతా, ఒకే మనిషి సాధించలేని ఫలితానికి తోడ్పడుతారు. ఒకడు చుక్కాని పట్టుకొంటే, మరొకడు తెడ్డు వేస్తాడు. మూడోవాడు వల విసరుతాడు, లేదా చేపలను బల్లెంతో పొడుస్తాడు. ఈ విధంగా చేపల వేటలో, ఈ సహకారమే లేకుంటే అసంభవమయిన విజయం సహకారం వల్ల పొందుతుంది." (డెస్టట్ డి ట్రేసీ, ఉదాహృత గ్రంథం, పుట 78)

ఎల్లప్పుడూ తక్కువే.[1] ఈ విధమైన సహకారం లేనందువల్లనే అమెరికా పశ్చిమ భాగంలో ఎంతో ధాన్యమూ, ఇంగ్లీషు పాలన వల్ల ప్రాచీన సాముదాయక సమాజాలు నాశనమైన ఈస్టిండియాలో ఎంతో పత్తీ ఏటా వృధా అయిపోతున్నాయి.[2]

ఒకవైపు సహకారం విస్తృత స్థలంలో పని నిర్వహణకు వీలు కల్పిస్తోంది. అందువల్ల, ముంపు తోడకం, కరకట్టలు, నీటి పారుదల పథకాల నిర్మాణం, కాలువలు, రోడ్లు, రైలు మార్గాల నిర్మాణం వంటి కొన్ని పనుల్లో సహకారం తప్పనిసరిగా అవసరం. మరోవైపు, ఉత్పత్తి స్థాయిని పెంచుతూ, స్థల విస్తీర్ణాన్ని సాపేక్షంగా కుదించడానికి అది అవకాశమిస్తోంది. స్థాయి పెంపుదల మూలంగా, ఆ పెంపుదలతో పాటు స్థల విస్తీర్ణం ఇలా కుదించబడటానికి అవకాశమిచ్చే కారణాలు ఏమిటంటే, శ్రామికులు ఒక్క గుంపుగా ఉండటం, వివిధ ప్రక్రియలను ఒకటిగా కూడదీయడం, ఉత్పత్తి సాధనాల సాంద్రీకరణ, ఈ కుదింపువల్ల నిరుపయోగమైన ఎన్నో ఖర్చులు తగ్గుతాయి.[3]

సమ్మిళిత పనిదినం, దానికి సమానమైన విడివిడి శ్రమ దినాల మొత్తంకన్నా ఎక్కువ పరిమాణంలో ఉపయోగపు విలువలను ఉత్పత్తి చేస్తుంది. తత్పర్యవసానంగా, నిర్ణీతమైన ఉపయోగకర ఫలితాన్ని సాధించేందుకు అవసరమైన శ్రమ కాలాన్ని తగ్గిస్తుంది. ఒక నిర్దిష్ట సందర్భంలో సమ్మిళిత పనిదినం శ్రమ యొక్క యాంత్రిక శక్తిని పెంచినందు వల్లనో, లేదా దాని కార్యాచరణ రంగాన్ని మరింత ఎక్కువ స్థలానికి విస్తరింపచేయడం వల్లనో, లేదా ఉత్పత్తి స్థాయితో పోల్చినప్పుడు, ఉత్పత్తి రంగాన్ని కుదించడం వల్లనో, లేదా కీలక సమయంలో భారీ పరిమాణాల్లో శ్రమను పనిలోకి దింపడం వల్లనో, లేదా వ్యక్తుల మధ్య పోటీని రేకెత్తించి వారి ఉత్సాహాన్ని పెంపొందించడం వల్లనో, లేదా పలువురు నిర్వహించే ఒకే రకమైన చర్యలకు అనుస్యూతి గుణాన్నీ, బహుముఖత్వ గుణాన్నీ కలిగించినందు వల్లనో, లేదా ఏకకాలంలో వేరు వేరు పనులను నిర్వర్తించినందు వల్లనో, లేదా ఉమ్మడిగా వినియోగం ద్వారా ఉత్పత్తి సాధనాలను ఆదా చేయడం వల్లనో, లేదా వ్యష్టి శ్రమకు

---

1. "కీలక సమయంలో దాన్ని (వ్యవసాయపు పనిని) నిర్వర్తించడం ఎంతో ఎక్కువ ఫలదాయకమైనది." ("యాన్ ఎంక్వయిరీ ఇంటు ది కనెక్షన్ బిట్వీన్ ది ప్రజెంట్ ప్రైస్ ఆఫ్ ప్రొవిజన్స్ అండ్ ది సైజ్ ఆఫ్ ఫారమ్స్" పుట 9) "వ్యవసాయంలో కాలంకన్నా ముఖ్యమైన అంశం మరొకటి లేదు." (లీబిగ్ : "యూబెర్ థియరీ అండ్ ప్రాన్సెస్ ఇన్‌డెర్ లాండ్ విర్ట్ షాఫ్ట్" 1856, పుట 23)

2. "పత్తి విడవడానికి తగినంత మంది లభించడం సాధ్యం కాకపోవడం తరువాతి చెడుగు, బహుశా చైనా, ఇంగ్లండు తప్ప, ప్రపంచంలో అన్ని దేశాలకన్నా ఎక్కువగా శ్రామికులను ఎగుమతి చేసే ఒక దేశంలో ఇలా ఉంటుందని ఎవరూ అనుకోరు. దీని పర్యవసానంగా, బోలెడు పత్తిని విడువ కుండా వదిలివేస్తున్నారు. రాలిపోయి తప్పనిసరిగా రంగు చెడి, కొంత మేరకు కుళ్ళిన పత్తిని నేల నుంచి ఏరుకొంటున్నారు. దీని ఫలితంగా చాలా ఆదుర్దాతో ఇంగ్లండు ఎదురుచూస్తున్న ఆ పంటలో చాలా భాగాన్ని, తగిన రుతువులో శ్రామికులు లేనందువల్ల వ్యవసాయదారు నష్టపడక తప్పడం లేదు." ("బెంగాహుర్కారు" "బై మంత్లీ ఓవర్‌లాండ్ సమ్మరీ ఆఫ్ న్యూస్, 1861 జులై 22)

3. "వ్యవసాయ పురోగతిలో" ఒకప్పుడు 500 ఎకరాలకు చెదురు మదురుగా ఆవరించిన పెట్టుబడీ, శ్రమా అంతా, బహుశా అన్నిటికన్నా ముఖ్యంగా, మరింత సమగ్రంగా 100 ఎకరాల సాగుకై ఇప్పుడు సాంద్రీకృతమయాయి. "వినియోగింపబడిన పెట్టుబడి, శ్రమల పరిమాణానికి సంబంధించి, స్థలం సాంద్రీకృతం" అయినప్పటికీ, "అది, మునుపు ఒకే స్వతంత్ర ఉత్పాదకుని ఆక్రమణలో ఉన్న లేదా సాగులో ఉన్న ఉత్పత్తి రంగంకన్నా విస్తృతమైనది." (ఆర్. జోన్స్, "యాన్ ఎస్సే ఆన్ ది డిస్ట్రిబ్యూషన్స్ ఆఫ్ వెల్త్", 1వ భాగం, ఆన్ రెంట్ లండన్, 1831, పుట 191)

సగటు సామాజిక శ్రమ లక్షణాన్నీ సంతరించటం వల్లనో వీటిలో ఏ కారణం వల్లనైనా సరే, సమ్మిళిత శ్రమ దినం అధికతర ఉత్పాదక శక్తిని సంతరించుకొన్నప్పుడు, ఆ ప్రత్యేక ఉత్పాదక శక్తి, అన్ని సందర్భాల్లోనూ, శ్రమ యొక్క సామాజిక ఉత్పాదక శక్తే, లేక సామాజిక శ్రమ యొక్క ఉత్పాదక శక్తే. ఈ శక్తికి కారణం సహకారమే. ఒక కార్మికుడు క్రమ పద్ధతిలో ఇతర కార్మికులతో సహకరించినప్పుడు, అతను తన వ్యక్తిగతమైన శృంఖలాలను తొలగించుకొని, తన జాతిగతమైన శక్తి సామర్థ్యాలను పెంపొందించుకొంటాడు.[1] కార్మికులను కూడదీయకపోతే, వారు పరస్పరం సహకరించుకోలేరు. వారు ఒకచోట అలా కూడటం వారి పరస్పర సహకారానికి తప్పనిసరిగా అవసరం. కాబట్టి, ఒకే పెట్టుబడి, ఒకే పెట్టుబడిదారుడు వేతన కార్మికులను ఏకకాలంలో నియోగిస్తే తప్ప, అందువల్ల వారి శ్రమ శక్తులను అతను ఏకకాలంలో కొంటే తప్ప వారు సహకరించుకోలేరు. ఉత్పత్తి ప్రక్రియ కోసం పనివారిని ఒకచోట చేర్చే ముందు, ఈ శ్రమ శక్తుల మొత్తం విలువ, లేదా ఆ సందర్భాన్నిబట్టి, ఈ కార్మికుల ఒక రోజు, లేదా ఒక వారం వేతనం పెట్టుబడిదారుడి జేబులో సిద్ధంగా ఉండాలి. కేవలం ఒక రోజుకైనా సరే 300 మంది పనివారికి వేతనం చెల్లించేందుకు, కొద్దిమంది పనివారికి సంవత్సరం పొడుగునా వారం వారం చెల్లించేందుకున్నా ఎక్కువ పెట్టుబడి పెట్టవలసి ఉంటుంది. కాబట్టి సహకరించుకొనే కార్మికుల సంఖ్య, లేదా సహకార స్థాయి, అన్నిటికన్నా ముందు, వ్యష్టి పెట్టుబడిదారు శ్రమ శక్తి కొనుగోలు కొరకు వినియోగించగల పెట్టుబడి మొత్తంపై ఆధారపడి ఉంటుంది. మరొక విధంగా చెప్పాలంటే, పలువురు కార్మికుల జీవనాధారాలు ఒక్క పెట్టుబడిదారుడి స్వాధీనంలో ఏ మేరకు ఉన్నాయనే దానిపై ఆధారపడి ఉంటుంది.

అస్థిర పెట్టుబడికి వర్తించేదే స్థిర పెట్టుబడికీ వర్తిస్తుంది. ఉదాహరణకు 300 మంది పనివారిని నియమించే పెట్టుబడిదారుడు ముడి పదార్థాలకై పెట్టే డబ్బు, తలా పదిమందిని నియమించే 30 మంది పెట్టుబడిదారుల్లోని ఒక్కక్కరు పెట్టేదానికన్నా 30 రెట్లు ఎక్కువ. ఉమ్మడిగా ఉపయోగించే శ్రమ సాధనాల విలువా, పరిమాణమూ పనివారి సంఖ్య పెరిగినంతగా పెరగవనేది నిజమే. కానీ, అవి గణనీయంగా పెరుగుతాయి. కాబట్టి వ్యష్టి పెట్టుబడిదారుల చేతుల్లో, భారీ పరిమాణంలో ఉత్పత్తి సాధనాల సాంద్రీకరణ వేతన కార్మికుల పరస్పర సహకారానికి ఒక భౌతికావసరం. ఆ సహకార స్థాయి, లేదా ఉత్పత్తి స్థాయి ఈ సాంద్రీకరణ స్థాయిని బట్టి ఉంటుంది.

ఏకకాలంలో నియుక్తులయిన కార్మికుల సంఖ్యా, తత్ పర్యవసానంగా ఉత్పత్తి అయిన అదనపు విలువా వారి నియామకుణ్ణి శారీరక శ్రమ నుంచి విముక్తి చేయడానికీ, చిన్నపాటి యజమానిగా ఉన్న అతణ్ణి ఒక పెట్టుబడిదారుగా మార్చడానికీ, ఆ విధంగా పెట్టుబడిదారీ ఉత్పత్తిని సలాంఛనంగా స్థాపించడానికి సరిపోవాలంటే, ఒక నిర్దిష్టమైన కనీస పెట్టుబడి మొత్తం అవసరమని మునుపటి ఒక అధ్యాయంలో చూచాము. విడి విడి స్వతంత్ర ప్రక్రియలను ఒకే సమ్మిళిత సామాజిక ప్రక్రియగా మార్చడానికి ఒక నిర్దిష్టమైన కనీస మొత్తం తప్పనిసరిగా అవసరమని ఇప్పుడు చూస్తున్నాము.

1. "వ్యష్టి మానవుని బలం చాలా స్వల్పం. కానీ చాలా స్వల్పమైన పలు శక్తుల కలయిక ఉత్పన్నం చేసే సమష్టి శక్తి దాని అంతర్భాగ శక్తులన్నింటి సమాహారం కన్నా ఎక్కువ. ఫలితంగా వాటిని కేవలం అనుసంధించినప్పుడు అవి, పనికి పెట్టే కాలాన్ని తగ్గిస్తాయి. తమ కార్యరంగాన్ని విస్తరింప చేస్తాయి." (జి.ఆర్. కార్లీ, నోట్ టు పి. వెరీ, ఉదాహృత గ్రంథం, సంపుటి 15, పుట 196)

పెట్టుబడికి శ్రమ తోడు కావడమనేది, మొదట కార్మికుడు తన కోసం పని చేయడానికి బదులు పెట్టుబడిదారు కోసం, పర్యవసానంగా పెట్టుబడిదారు క్రింద పనిచేయడం వల్ల కలిగిన కేవల లాంఛన ప్రాయపు ఫలితమని కూడా చూచాము. పలువురు వేతన కార్మికుల సహకారం మూలంగా, పెట్టుబడి ఆధిపత్యం అసలు శ్రమ ప్రక్రియ నిర్వహణకే ఒక ఆవశ్యకంగా, ఉత్పత్తికి వాస్తవావసరంగా రూపొందుతుంది. రణరంగంలో సేనాని ఆధిపత్యం ఎంత అవిసర్జనీయమో ఉత్పత్తి రంగంలో పెట్టుబడిదారు ఆధిపత్యం కూడ అంత అవిసర్జనీయం.

వ్యష్టి కార్యకలాపాలు సమరసంగా సాగేలా చూసేందుకూ, సమ్మిళిత యంత్రాంగంలోని వేరు వేరు అంగాల కార్యకలాపానికి భిన్నమైన ఆ యంత్రాంగ కార్యకలాపం నుంచి ఉద్భవించే సార్వత్రిక క్రియలను నిర్వర్తించేందుకూ, భారీ స్థాయిలోని సమ్మిళిత శ్రమలన్నిటికీ సారథ్యం వహించే ఒక అధిపతి ఏదో ఒక మేరకు అవసరం. ఒకడే వయొలిన్ వాయిస్తున్నప్పుడు, అతను తనకు తానే కండక్టర్. ఒక వాద్య బృందానికి వేరే కండక్టర్ అవసరం. పెట్టుబడి నియంత్రణలో శ్రమ సహకార స్వభావం సంతరించుకొన్న క్షణం నుంచి దాని పనిని నడపడం, అజమాయిషీ చేయడం, సర్దుబాటు చేయడం పెట్టుబడి నిర్వర్తించవలసిన ఒక క్రియ అవుతుంది. సారథ్యం వహించడం పెట్టుబడి క్రియల్లో ఒకటి అయినప్పుడు, అది కొన్ని ప్రత్యేక లక్షణాలను పొందుతుంది.

సాధ్యమయినంత ఎక్కువ అదనపు విలువను ఒడుపుకోవడం, తత్ఫలితంగా శ్రమ శక్తిని సాధ్యమయినంత మేరకు దోచుకోవడం పెట్టుబడిదారీ ఉత్పత్తికి ప్రేరణ, పరమార్థం, ధ్యేయం.[1] సహకరించుకొనే కార్మికుల సంఖ్య పెరిగేకొద్దీ, పెట్టుబడి ఆధిపత్యానికి వారి ప్రతిఘటనా పెరుగుతుంది. దానితోపాటు పెట్టుబడి ఈ ప్రతిఘటనను ఎదురొత్తిడితో అధిగమించవలసిన ఆవశ్యకతా పెరుగుతుంది. పెట్టుబడిదారుడు అమలుజరిపే నియంత్రణ, సామాజిక శ్రమ ప్రక్రియ స్వభావం వల్ల, ఒక ప్రత్యేక క్రియగాను, ఆ ప్రక్రియ యొక్క విశిష్ట లక్షణంగానూ ఉండటమేకాక అదే సమయంలో సామాజిక శ్రమ ప్రక్రియ మీద జరిగే దోపిడీ యొక్క క్రియగా కూడా ఉంటుంది. పర్యవసానంగా, అది దోపిడీదారుకూ, అతను దోచుకునే సజీవ, శ్రమశీల ముడి పదార్థానికీ మధ్య గల అనివార్య శత్రుత్వంతో వేరూని ఉంటుంది.

మరొక సంగతి : ఇక కార్మికుని ఆస్తిగా ఉండకుండా, పెట్టుబడిదారు ఆస్తి అయిపోయిన ఉత్పత్తి సాధనాల పరిమాణం పెరిగే నిష్పత్తిలోనే, ఆ సాధనాల సముచిత వినియోగంపై ఫలప్రద నియంత్రణ ఉండవలసిన ఆవశ్యకత కూడా పెరుగుతుంది.[2] పైగా వేతన కార్మికుల మధ్య సహకారాన్ని

1. "ప్రాఫిట్స్ ... ఈజ్ ది సోల్ ఎండ్ ఆఫ్ ట్రేడ్" జె. వాండర్‌లింట్, పూర్వోక్త గ్రంథం (పుట 11).
2. "మాంచెస్టర్ వైర్ వర్క్ కంపెనీ"లో పెట్టుబడిదారుకు, పనివారికి మధ్య ఒక విధమైన భాగస్వామ్యాన్ని ప్రవేశపెట్టిన తరువాత, మొట్టమొదటి ఫలితమేమిటంటే పదార్థం వ్యర్థం కావడం హఠాత్తుగా తగ్గిపోవడం యజమాని ఆస్తి లాగానే, తమ సొంత ఆస్తిని కూడ వ్యర్థం చేయరాదనీ, వ్యర్థం కావడం వసూలు కాజాలని బాకీలతో దాదాపు సమానం. ఉత్పత్తికి అన్నిటికన్నా ఎక్కువ నష్టదాయకం అనీ పనివారు గ్రహించారు." అంటూ కుసంస్కారపు పత్రిక స్పెక్టేటర్ చెబుతోంది. అదే పత్రికకు రోచ్‌డేల్ సహకార ప్రయోగాల్లో కనిపిస్తున్న ప్రధాన లోపమిదీ : "పనివారి సంఘాలు కార్ఖానాల్నీ, మిల్లుల్నీ, దాదాపు అన్ని రూపాల పరిశ్రమనూ జయప్రదంగా నడపగలవనీ, వెంటనే పనివారి పరిస్థితులను మెరుగుపరచాయనీ అవి నిరూపించాయి. కాని అవి యజమానులకు ఒక స్పష్టమైన స్థానం వదలిపెట్టలేదు." ఎంత ఘోరం!

పూర్తిగా తెచ్చిపెట్టేది వారిని నియమించే పెట్టుబడే. ఒక ఉత్పాదక వ్యవస్థగా వారు ఏకం కావడం వారి వ్యష్టి క్రియల మధ్య సంబంధం నెలకొనడం – అవి వారికి అన్యమైనవీ, బాహ్యమైనవీ, అవి వారి సొంత చర్య కాదు. వారిని ఒకచోటికి తెచ్చి, కలిపి ఉంచిన పెట్టుబడి చర్య, కాబట్టి, తమ వేరు వేరు శ్రమల మధ్య ఉన్న సంబంధం, పెట్టుబడిదారుడు ముందుగా వేసుకొన్న పథక రూపంలో వారి భావనకు కనిపిస్తుంది. ఆచరణలోనేమో, అదే పెట్టుబడిదారుని అధికార రూపంలో, తమందరి కార్యకలాపాలనూ స్వీయ లక్ష్యాలకు లోనుచేసే మరొక వ్యక్తి ప్రబల సంకల్ప రూపంలో కనిపిస్తుంది. మరి ఉత్పత్తి ప్రక్రియ ద్వివిధ స్వభావం కారణంగా – అది ఒకవైపు ఉపయోగ విలువలను ఉత్పత్తి చేసే సామాజిక ప్రక్రియ, మరోవైపు అదనపు విలువను ఉత్పత్తి చేసే ప్రక్రియ – పెట్టుబడిదారుడి నియంత్రణ, దాని అంతస్సారాన్ని బట్టి ద్వివిధమైనదైతే, రూపంలో ఆ నియంత్రణ నిరంకుశమైనది. సహకార ప్రమాణం విస్తరించేకొద్దీ ఈ నిరంకుశత్వం తన విలక్షణ రూపాలను ధరిస్తుంది. అచ్చంగా పెట్టుబడిదారీ ఉత్పత్తి దేనితో ప్రారంభమయిందో ఆ కనీస మొత్తాన్ని తన పెట్టుబడి అందుకోగానే మొదట్లో పెట్టుబడిదారు వాస్తవ శ్రమ నుంచి విడుదల అయినట్లుగానే, ఇప్పుడతను విడివిడి పనివారిపైనా, పనివారి బృందాలపైనా ప్రత్యక్షంగా నిరంతరం అజమాయిషీ పనిని ఒక ప్రత్యేక రకమైన వేతన కార్మికునికి అప్పగిస్తాడు. పెట్టుబడిదారీ ఆధిపత్యాన ఉన్న పనివారి పారిశ్రామిక సైన్యానికి కూడా, నిజమైన సైన్యానికి లాగానే ఆఫీసర్లు (మేనేజర్లు), సార్జెంట్లు (ఫోర్మెన్లు, మేస్త్రీలు) అవసరమవుతారు. పని జరుగుతుండగా, వీరు పెట్టుబడిదారు తరఫున ఆధిపత్యం వహిస్తారు. అజమాయిషీ పనివారి సుస్థాపిత, ఏకైక క్రియ అవుతుంది. విడి విడి రైతుల చేతివృత్తి వారి ఉత్పత్తి పద్ధతిని బానిస శ్రమ ఉత్పత్తితో పోలుస్తున్నప్పుడు రాజకీయ అర్థశాస్త్రజ్ఞుడు, ఈ అజమాయిషీ పనిని అనవసర ఖర్చుల్లో ఒకటిగా పరిగణిస్తాడు.[1] కానీ, పెట్టుబడిదారీ ఉత్పత్తి పద్ధతిని పరిశీలిస్తున్నప్పుడు అతను, అందుకు భిన్నంగా, శ్రమ ప్రక్రియ యొక్క సహకార స్వభావం వల్ల అవసరమైన నియంత్రణ పనిని ఆ ప్రక్రియ యొక్క పెట్టుబడిదారీ స్వభావం వల్లనూ, పెట్టుబడిదారు ప్రయోజనాలకూ కార్మికుని ప్రయోజనాలకూ మధ్య గల వైరుధ్యం మూలంగానూ ఆవశ్యకమైన వేరే రకం నియంత్రణ పని లాంటిదిగా చూస్తున్నాడు.[2] ఒక మనిషి పారిశ్రామిక నాయకుడయినందు వల్ల పెట్టుబడిదారుడు కావడం లేదు. అతను పెట్టుబడిదారుడు కాబట్టి పారిశ్రామిక నాయకుడవుతున్నాడు. ఫ్యూడల్ కాలంలో సేనాని, న్యాయమూర్తుల క్రియలు భూస్థితి లక్షణాలుగా ఉండినట్లు, పారిశ్రామిక నాయకత్వం పెట్టుబడి

1. శ్రమపై అజమాయిషీ ఉత్తర అమెరికాలోని దక్షిణ రాష్ట్రాల్లో బానిసల ద్వారా జరిగే ఉత్పత్తికి గల ప్రముఖ లక్షణాల్లో ఒకటని చెప్పిన తరువాత, ప్రొఫెసర్ కెర్నేస్ ఇలా అంటున్నారు. "తన శ్రమ ఉత్పత్తి చేసినదంతా స్వాయత్తం చేసుకొంటున్న (ఉత్తరాది రాష్ట్రాలలోని) భూకామందుకు పాటుపడటానికి మరే ఇతర ప్రేరణా అక్కరలేదు. ఇక్కడ అజమాయిషీని పూర్తిగా విసర్జించారు." (కైర్నెస్, పూర్వోక్త గ్రంథం, పుటలు 48, 49)

2. వివిధ ఉత్పత్తి పద్ధతుల మధ్య, వాటి విలక్షణ సామాజిక వ్యత్యాసాలను అట్టే గమనించడంలో చెప్పుకోదగిన రచయిత సర్ జేమ్స్ స్టువర్ట్ ఇలా అంటున్నాడు. "కార్ఖానా ఉత్పత్తిని చేపట్టిన భారీ సంస్థలు, బానిసల సౌలభ్యానికి మరింత దగ్గరగా రావడం ద్వారా తప్ప, వ్యక్తిగత పరిశ్రమను ఎలా నాశనం చేస్తున్నాయి?" ("ప్రిన్సిపుల్స్ ఆఫ్ పొలిటికల్ ఎకానమీ" లండన్, 1769, సంపుటి 1, పుట 167.

లక్షణాల్లో ఒకటి.[1] కార్మికుడు తన శ్రమ శక్తిని పెట్టుబడిదారుకు అమ్మడానికి బేరం కుదుర్చుకొనే వరకు అతను ఆ శ్రమ శక్తి సొంతదారు, తన వద్ద ఉన్నదానికి మించి, అంటే, ఒంటరిగా ఉన్న తన వ్యష్టి శ్రమకు మించి దేన్నీ అమ్మలేడు. పెట్టుబడిదారు ఒక మనిషి శ్రమ శక్తిని కొనటానికి మారు వందమంది శ్రమ శక్తిని కొన్నంత మాత్రాన, ఒక్క మనిషితో కాక, ఒకరితో ఒకరికి సంబంధంలేని 100 మందితో వేరు వేరు ఒప్పందాలు కుదుర్చుకొన్నంత మాత్రాన, ఈ పరిస్థితి ఏ విధంగానూ మారదు. అతను ఆ వందమందినీ పరస్పరం సహకరించుకోనివ్వకుండా, వారికి పని పురమాయించవచ్చు. వారి 100 స్వతంత్ర శ్రమ శక్తుల విలువను చెల్లిస్తాడే కానీ, వందమంది సమ్మిళిత శ్రమ శక్తికై డబ్బు చెల్లించడు. కానీ కార్మికులు ఒకరితో ఒకరికి సంబంధం లేనివారు కాబట్టి, ఏకాకులు. వారు పెట్టుబడిదారుతో సంబంధాలు ఏర్పరచుకొంటారే తప్ప ఒకరితో ఒకరు కాదు. ఈ సహకారం శ్రమ ప్రక్రియతో మాత్రమే ప్రారంభమవుతుంది. కాని అప్పుడు వారు తమకు తాము చెందకుండా పోయారు. ఆ ప్రక్రియలలో ప్రవేశించడంతో వారు పెట్టుబడిలో అంతర్భాగ మవుతారు. సహకారులుగా, పనిచేసే ఒక యంత్రాంగంలో సభ్యులుగా వారు, పెట్టుబడి అస్తిత్వం యొక్క విశిష్ట రూపాలు మాత్రమే. కాబట్టి, సహకరించుకొంటూ పని చేసేటప్పుడు కార్మికుడు పెంపొందించుకొనే ఉత్పాదక శక్తి పెట్టుబడి యొక్క ఉత్పాదక శక్తే. పనివారిని కొన్ని నిర్ణీత పరిస్థితుల్లో ఉంచినప్పుడల్లా, ఈ శక్తి ఉచితంగా ఉత్పన్నమవుతుంది. వారిని అటువంటి పరిస్థితుల్లో ఉంచేది పెట్టుబడే. ఈ శక్తికి పెట్టుబడికి వీసమెత్తు ఖర్చు కాదు కనుకా, మరోవైపు తన శ్రమ పెట్టుబడికి చెందక ముందు కార్మికుడు కూడా ఈ శక్తిని పెంపొందించుకోడు కనుకా, అది పెట్టుబడికి ప్రకృతి ప్రసాదించిన శక్తిగా – పెట్టుబడిలో స్వతః సిద్ధంగా ఉన్న ఉత్పాదక శక్తిగా కనిపిస్తుంది.

ప్రాచీన ఆసియావాసులు, ఈజిప్షన్లు, ఎట్రూస్కన్లు మొదలైనవారి బ్రహ్మాండమైన కట్టడాల్లో సామాన్య సహకారం వల్ల కలిగే బ్రహ్మాండమైన ఫలితాలు కనిపిస్తాయి. “గత కాలంలో ఈ ప్రాచ్య రాజ్యాలు తమ పౌర, సైనిక సంస్థల కోసం ఖర్చు చేసిన తరువాత దేదీప్యమానమైన, లేదా ఉపయోగకరమైన కట్టడాలకు వినియోగించగల అదనపు నిధులు వాటి చేతిలో ఉండటం తటస్థించింది. వీటి నిర్మాణంలో దాదాపు యావత్తు వ్యవసాయేతర జనాభా హస్తాలపై, బాహువులపై వాటికి గల అధికారం నేటికీ వాటి శక్తికి ప్రతీకలుగా ఉన్న బ్రహ్మాండమైన నిర్మాణాలను రూపొందించింది ... సారవంతమైన నైల్ లోయ ... తండోపతండాల వ్యవసాయేతర జనాభాకు ఆహారాన్ని ఉత్పత్తి చేసింది; రాజుకూ, పూజారులకూ చెందిన ఈ ఆహార పదార్థాలు దేశమంతటా గొప్ప స్మారక నిర్మాణాల స్థాపనకు సాధనాలను సమకూర్చింది... రవాణా ఎలా జరిగిందని ఆశ్చర్యం గొలిపే బ్రహ్మాండమైన విగ్రహాలనూ, అపారమైన వస్తువులనూ తరలించడంలో దాదాపు మానవ శ్రమను మాత్రమే లెక్కలేనంత వినియోగించారు... శ్రామికుల సంఖ్య, వారి కృషి కేంద్రీకరణ ఇందుకు సరిపోయింది. సముద్ర గర్భం నుంచి బ్రహ్మాండమైన పగడపు రాతిగట్లు దీవులుగా, స్థిరమైన భూ ఖండాలుగా పైకి లేవడం చూస్తున్నాము. కాని వీటిని పేర్చే క్రిమి అల్పమైనది. దుర్బలమైనది, నికృష్టమైనది. ఈ కర్తవ్యానికి

1. కాబట్టి ఫ్యూడల్ ప్రభువులు కూడా ఆచంద్రార్కంగా అవసరమని ఆగస్టే కామ్టే, ఆయన మతం వారూ నిరూపించి ఉండవచ్చు - పెట్టుబడి ప్రభువుల విషయంలో వారు అలా నిరూపించిన విధంగానే.

అర్పించేందుకు ఆసియా రాచరికాల్లోని వ్యవసాయేతర శ్రామికులకు తమ వ్యష్టి శారీరక శ్రమ తప్ప మరేమీ లేదు. కాని వారి సంఖ్యే వారి బలం. ఈ జన సమూహాలను నడిపించిన శక్తే, వేటి అవశేషాలు మనల్ని సంభ్రమాశ్చర్యాల్లో ముంచెత్తుతాయో, ఆ రాజసౌధాలనూ, దేవాలయాలనూ, పిరమిడ్లనూ, బ్రహ్మాండమైన అసంఖ్యాక విగ్రహాలనూ అవతరింప జేసింది. వారికి తిండి పెట్టే రాబడులు ఒకరికి, లేదా బహు కొద్దిమందికి పరిమితమై ఉండటం వల్లనే ఇటువంటి కార్యాలు సాధ్యమయాయి."[1] ఆసియా దేశాల రాజులు, ఈజిప్టు రాజులు, ఎట్రూస్కన్ పూజారి పాలకులు మొదలుగా గల వారి ఈ శక్తి ఆధునిక సమాజంలో పెట్టుబడిదారుకు – అతను ఏకాకి పెట్టుబడిదారుగా ఉన్నా, లేక జాయింట్ స్టాక్ కంపెనీలలో లాగా సమష్టి పెట్టుబడిదారుగా ఉన్నా – బదిలీ అయింది.

మానవాభివృద్ధి తొలినాళ్ళలో, వేట వల్ల బతికే నరవర్గాల్లోనూ[2] లేదా, ఉదాహరణకు, భారతీయ సమాజాల వ్యవసాయంలోనూ మనకు కనిపించే సహకారానికి ప్రాతిపదిక, ఒకవైపు ఉత్పత్తి సాధనాలపై ఉమ్మడి యాజమాన్యమూ, మరోవైపు ప్రతి తేనెటీగా తేనెతుట్టెతో తనకు గల సంబంధం నుంచి విడిపోనట్లే, ఈ సందర్భాల్లో ప్రతి వ్యక్తి తన తెగతో, లేదా తన సమాజంతో గల బొడ్డుతాటి సంబంధాన్ని తెగ్గోసుకోలేదన్న వాస్తవమూ. అటువంటి సహకారాన్ని పై రెండు లక్షణాలు పెట్టుబడిదారీ సహకారం నుంచి వేరుచేసి చూపుతున్నాయి. ప్రాచీన కాలంలో, మధ్యయుగాల్లో, ఆధునిక వలసల్లో చెదురు మదురుగా భారీ స్థాయిలో అమలుజరిగే సహకారం స్వామి భృత్య సంబంధాలపై, ప్రధానంగా బానిసత్వంపై ఆధారపడి ఉంది. కానీ, పెట్టుబడిదారీ రూపంలో, ఇందుకు భిన్నంగా పెట్టుబడికి తన శ్రమ శక్తిని అమ్ముకొనే స్వేచ్ఛాయుత వేతన కార్మికుని ఉనికి అత్యంత గర్భితం. అయితే, చారిత్రకంగా ఈ రూపం, రైతాంగ వ్యవసాయానికి వ్యతిరేకంగా, వృత్తి సంఘాల్లోనో, లేదా అవి లేకుండానో జరిగే స్వతంత్ర చేతివృత్తుల నిర్వహణకు వ్యతిరేకంగా అభివృద్ధి అవుతుంది.[3] వీటి దృష్టితో చూస్తే పెట్టుబడిదారీ సహకారం, సహకారం తాలూకు ప్రత్యేక చారిత్రక రూపంగా వ్యక్తం కాదు; సహకారమే పెట్టుబడిదారీ ఉత్పత్తి ప్రక్రియకు విలక్షణమై, దాన్ని నిర్దిష్టంగా వేరుపరచి చూసే చారిత్రక రూపంగా కనిపిస్తుంది.

సహకారం పెంపొందించే సామాజిక ఉత్పాదక శక్తి పెట్టుబడి యొక్క ఉత్పాదక శక్తిగా కనిపించినట్లుగానే, సహకారమే విడి విడి స్వతంత్ర కార్మికులు, లేదా సన్నకారు యజమానులు సైతం సాగించే ఉత్పత్తి ప్రక్రియతో పోల్చి చూసినప్పుడు, పెట్టుబడిదారీ ఉత్పత్తి ప్రక్రియ యొక్క

---

1. ఆర్. జోన్స్ "టెక్స్ట్‌బుక్ ఆఫ్ లెక్చర్స్" వగైరా, పుటలు 77, 78. లండన్ మొదలైన యూరపు రాజధానుల్లోని ప్రాచీన అస్సీరియన్, ఈజిప్షియన్, తదితర వస్తు సంకలనాల మూలంగా ఆ సహకార శ్రమ నిర్వహణ పద్ధతులను మనం ప్రత్యక్షంగా చూడగలుగుతున్నాము.
2. వేట మొట్టమొదటి సహకార రూపమనీ, మనిషికి వేటాడటం (యుద్ధం) వేట మొదటి రూపాల్లో ఒకటనీ లెంగ్వెట్ తన "థియరీ డీ లూయి సివిలే"లో చెప్పడం బహుశా సరియైనదే.
3. ఫ్యూడల్ ఉత్పత్తి పద్ధతికి ప్రాతిపదికగా ఉండి, ఆ వ్యవస్థ అంతరించిన తరువాత కూడా పెట్టుబడిదారీ ఉత్పత్తి పద్ధతి సరసనే కొనసాగిన చిన్న స్థాయి రైతాంగ సన్నకారు వ్యవసాయమూ, స్వతంత్ర చేతివృత్తుల నిర్వహణా, భూమిపై ఉమ్మడి యాజమాన్యపు ఆదిమ కాల రూపం అదృశ్యమైన తరువాత, ఉత్పత్తి రంగం బానిస వ్యవస్థ చేతిలోకి నిజంగా పోకముందు, ప్రాచీన గ్రీకు సమాజాలకు కూడా, వాటి అత్యుత్తమ దశలో, ఆర్థిక పునాదిగా ఉండేవి.

నిర్దిష్ట రూపంగా కనిపిస్తుంది. పెట్టుబడి ఆధీనంలోకి వచ్చినప్పుడు వాస్తవ శ్రమ ప్రక్రియలో వచ్చే తొలి మార్పు ఇది. ఈ మార్పు అప్రయత్నంగా సంభవిస్తుంది. ఒకే శ్రమ ప్రక్రియలో, ఏకకాలంలో బహుళ సంఖ్యా వేతన కార్మికుల నియామకం ఈ మార్పుకు తప్పనిసరిగా అవసరమే కాక, పెట్టుబడిదారీ ఉత్పత్తికి ప్రారంభ స్థానం కూడా. ఈ స్థానంలోనే అసలు పెట్టుబడి ఆవిర్భావం కూడా ఉంది. ఒకవైపు పెట్టుబడిదారీ ఉత్పత్తి పద్ధతి, సామాజిక ప్రక్రియగా శ్రమ ప్రక్రియ పరివర్తన చెందడానికి, చారిత్రకంగా తప్పనిసరియైన ఆవశ్యకంగా మనకు కనిపిస్తున్నట్లే, మరోవైపు శ్రమ ప్రక్రియ యొక్క ఈ సామాజిక రూపం ఆ శ్రమ ఉత్పాదకతను పెంచడం ద్వారా, శ్రమను మరింత లాభదాయకంగా దోచుకొనేందుకు పెట్టుబడి చేపట్టే పద్ధతిగా ప్రత్యక్షమవుతుంది.

సహకారం, దాన్ని మనం ఇంతవరకు పరిశీలిస్తూ వచ్చిన ప్రాథమిక రూపంలో, భారీ స్థాయిలో జరిగే సమస్త ఉత్పత్తితోనూ అవశ్యంగా కలిసి ఉంటుంది. కానీ అది పెట్టుబడిదారీ ఉత్పత్తి పద్ధతి యొక్క అభివృద్ధిలో ఒక నిర్దిష్ట యుగానికి లక్షణమైన స్థిర రూపం కాదు. మహా అయితే, చేతివృత్తి తరహా కార్ఖానా ఉత్పత్తి ప్రారంభ దశలోనూ,[1] కార్ఖానా ఉత్పత్తి యుగానికి అనురూపమైనదీ, ప్రధానంగా ఏకకాలంలో నియుక్తులైన శ్రామికుల సంఖ్యను బట్టి, వారి వాడకానికై కేంద్రీకృతమైన ఉత్పత్తి సాధనాల బాహుళ్యాన్ని బట్టీ రైతాంగ వ్యవసాయానికి భిన్నమైనదే అయినా భారీ స్థాయి వ్యవసాయంలోనూ ఈ సహకారం అలాంటి స్థిర రూపమైనట్లు, అది కూడా దాదాపుగా మాత్రమే అలా అయినట్లు కనిపిస్తుంది. ఏ యే ఉత్పత్తి శాఖల్లో పెట్టుబడి భారీ స్థాయిలో పనిచేస్తుందో, శ్రమ విభజనా, యంత్రాలు అప్రధాన పాత్ర మాత్రమే వహిస్తాయో వాటిలో ఎల్లప్పుడూ సరళమైన సహకారం ప్రబల రూపంగా ఉంటుంది.

సహకారం ఎల్లప్పుడూ పెట్టుబడిదారీ పద్ధతి యొక్క మౌలిక రూపంగా ఉంటుంది. అయినా, సహకార ప్రాథమిక రూపం పెట్టుబడిదారీ ఉత్పత్తి యొక్క ఒక ప్రత్యేక రూపంగా, ఆ ఉత్పత్తి పద్ధతికి చెందిన మరింత పురోగామి రూపాల సరసనే కొనసాగుతుంది.

---

1. ''ఒకే పనిలో కలిసి ఉన్న అనేకుల సమైక్య నైపుణ్యం, పరిశ్రమ, పోటీ ఆ పనిని అభివృద్ధి చేసే మార్గం కాదా?'' ఇలా కాకుంటే, తన ఉన్ని కార్ఖానా ఉత్పత్తిని అంత గొప్ప నిర్దిష్ట స్థితికి తీసుకెళ్ళడం ఇంగ్లండుకు సాధ్యమై ఉండేదా? (బర్కీ, ''ది క్వెరిస్ట్'', లండన్, 1751, పుట 56, పేరా 521)

# అధ్యాయం - 14

# శ్రమ విభజన - కార్ఖానా ఉత్పత్తి

## విభాగం-1

## కార్ఖానా ఉత్పత్తి ద్వివిధ మూలం

"శ్రమ విభజనపై ఆధారపడిన సహకారం కార్ఖానా ఉత్పత్తిలో తన విశిష్ఠ రూపం ధరిస్తుంది. అది, కార్ఖానా ఉత్పత్తి దశ అని నిజంగా అనదగిన దశ అంతటా పెట్టుబడిదారీ ఉత్పత్తి ప్రక్రియ యొక్క ప్రముఖ విలక్షణ రూపం. ఆ దశ, ఉజ్జాయింపుగా చెప్పవలసి వస్తే, 16వ శతాబ్ది మధ్య నుంచి 18వ శతాబ్ది తుది మూడోవంతు భాగం వరకు కొనసాగింది.

### కార్ఖానా ఉత్పత్తి రెండు విధాల ఆవిర్భవిస్తుంది

1. వేరు వేరు చేతివృత్తులకు చెందినవారైనా, ఒక నిర్ణీత వస్తువు పూర్తిగా తయారు కావడానికి ఎవరెవరి చేతులగుండా వెళ్ళవలసి ఉంటుందో అటువంటి కార్మికులను ఒకే పెట్టుబడిదారుడి నియంత్రణ కింద ఒక కార్ఖానాలో ఆలకూర్చడం ద్వారా. ఉదాహరణకు, చక్రాలు చేసేవారు, గుర్రాన్ని బండికి పూన్చే పరికరాలు చేసేవారు, దర్జీలు, కంసాలివారు, మెత్తలమర్చేవారు, టర్నర్లు, జాలర్లు తయారుచేసేవారు, కిటికీలకు గాజు తలుపులమర్చేవారు, రంగుపనివారు, నునుపు చేసేవారు, మలామా పనివారు మొదలుగా గల అనేక స్వతంత్ర చేతివృత్తుల వారి శ్రమవల్ల మునుపు ఒక గుర్రపుబగ్గీ తయారయ్యేది. కానీ కార్ఖానాలో గుర్రపుబగ్గీల తయారీకి, ఈ రకరకాల చేతివృత్తుల వారినందరినీ ఒకే భవనంలో చేరుస్తారు; పని వరుసగా అందరి చేతుల మీదుగా జరుగుతుంది. బగ్గీ తయారుకాక ముందే దానికి మలాం వేయడం సాధ్యం కాదనే మాట నిజమే. కానీ, ఒకేసారి అనేక బగ్గీలు తయారవుతున్నప్పుడు, కొన్ని మలాం పనివారి చేతుల్లో ఉంటే, మిగతావి దానికి మునుపటి ప్రక్రియల దశలో ఉండవచ్చు. ఇంత వరకు మనం సామాన్య సహకార రంగంలోనే ఉన్నాము; తనకవసరమైన సామాగ్రి మనుషుల, వస్తువు రూపంలో సిద్ధంగా ఉన్న రంగమిది. కానీ, అనతి కాలంలోనే ఒక ముఖ్యమైన మార్పు సంభవిస్తుంది. దర్జీ, కంసాలి, ఇతర చేతివృత్తులవారు ఇప్పుడు కేవలం గుర్రపుబగ్గీల తయారీలోనే నిమగ్నమైనందువల్ల, వీరిలో ప్రతి ఒక్కడూ అభ్యాసం లేనందువల్ల, తన మునుపటి చేతివృత్తిని ఆమూలాగ్రంగా నిర్వహించగల శక్తిని క్రమ క్రమంగా కోల్పోతాడు. కానీ మరోవైపు, ఇప్పుడు ఒకే గాడికి పరిమితమైన అతని కార్యకలాపాలు ఆ సంకుచిత కార్యరంగానికి బహు చక్కగా ఒదిగిన రూపాన్ని సంతరించుకొంటాయి. మొదట్లో గుర్రపుబగ్గీల తయారీ స్వతంత్రమైన వివిధ చేతివృత్తుల సమ్మేళనం. క్రమ క్రమంగా అది, వివిధ పాక్షిక ప్రక్రియల కింద గుర్రపుబగ్గీ తయారీ పని విభజనగా రూపొందుతుంది. ఈ ప్రక్రియల్లో ప్రతీదీ ఒక ప్రత్యేకమైన కార్మికుడు మాత్రమే

నిర్వహించే కార్యంగా కరుడుగట్టగా కార్ఖానాల్లో మొత్తం బగ్గీ తయారీని, పనివారు సంయుక్తంగా నిర్వహించడం జరుగుతుంది. అదే విధంగా కార్ఖానాల్లో బట్టల ఉత్పత్తి, ఇంకా అనేక కార్ఖానా ఉత్పత్తుల పరంపరా ఒకే పెట్టుబడిదారు నియంత్రణ కింద వివిధ చేతివృత్తుల సమ్మేళనం ద్వారా ఆవిర్భవించాయి.[1]

2. కార్ఖానా ఉత్పత్తి, దీనికి సరిగ్గా తల్లక్రిందులుగా ఉన్న రీతిలో కూడా ఆవిర్భవిస్తుంది. అంటే, అంతా ఒకే లేదా ఒకే విధమైన పనిని – కాగితం, ముద్రాక్షరాలు లేదా సూదుల తయారీ వంటి పని చేసే పలువురు చేతివృత్తుల వారిని ఒకే కార్ఖానాలో, ఏకకాలంలో, ఒకే పెట్టుబడిదారుడు నియమించడం ద్వారా కూడా ఆవిర్భవిస్తుంది. ఇది అతి ప్రాథమిక రూపంలోని సహకారం. ఈ చేతివృత్తుల వారిలో ప్రతి ఒక్కరూ (బహుశా ఒకరిద్దరు ఉమేజుదారుల) అప్రెంటీస్‌ల (సహాయంతో) ఆ సరుకును ఆసాంతం తయారు చేస్తాడు. పర్యవసానంగా, దాని ఉత్పత్తికి అవసరమైన పనులన్నీ వరుసగా చేసుకుపోతాడు. అతను ఇంకా తన పాత చేతివృత్తి పద్ధతిలోనే పని చేస్తాడన్న మాట. కానీ ఒకేచోట పనివారి కేంద్రీకరణనూ, వారు ఒకే సమయంలో పని చేస్తున్న విషయాన్నీ మరో విధంగా ఉపయోగించు కొనేందుకు, బాహ్య పరిస్థితులు, త్వరలోనే దారితీస్తాయి. ఆ వస్తువును బహుశా ఒక నిర్దిష్ట కాలంలో, ఎక్కువ పరిమాణంలో అందజేయవలసి వస్తుంది. కాబట్టి, పని పునః పంపిణీ అవుతుంది. ప్రతి ఒకరితో వేరు వేరు పనులన్నీ వరుసగా చేయించే బదులు అవి ఒకదానితో ఒకటి సంబంధం లేకుండా, విడివిడిగా, పక్క పక్కనే నిర్వహింపబడే పనులుగా మార్చివేయబడుతాయి; ప్రతి పనినీ వేరు వేరు చేతివృత్తి పనివారికి కేటాయిస్తారు. పరస్పరం సహకరించుకొనే ఈ పనివారు మొత్తం పనులన్నిటినీ కలిపి, ఏకకాలంలో నిర్వహిస్తారు. యాదృచ్ఛికమైన ఈ పునర్విభజన పునరావృతమై, తన సొంత అనుకూలతలను పెంపొందించుకొంటుంది; క్రమేణా ఒక క్రమబద్ధమైన శ్రమ విభజనగా కరుడుగడుతుంది. ఒక స్వతంత్ర వృత్తిపనివాని వ్యక్తిగత ఉత్పాదితంగా ఉన్న ఆ సరుకు మొత్తం పనిలోని అంతర్భాగాలయిన పాక్షిక ప్రక్రియల్లో ప్రతి ఒక్కరూ ఒకటి, ఒకే ఒకటి మాత్రమే చేసే

---

1. ఇంతకన్నా ఆధునికమైన ఉదాహరణ ఇస్తాను : లయన్స్, "పట్టుదారం తీయడం, పట్టు వస్త్రాలు నేయడం పూర్తిగా పితృస్వామిక పద్ధతిలో జరుగుతోంది. ఈ పనిలో చాలామంది స్త్రీలూ, పిల్లలూ నియుక్తులై ఉన్నారు. కాని ఆ పని, వారి మూల్గులను పీల్చివేయడం లేదు. వారిని సర్వనాశనం చేయడం లేదు. తమ అందమైన డ్రోం, వార్, ఇసెరే, వౌక్లూజ్ లోయల్లో ఉండి, తమ పట్టు పురుగులను పెంచుకొనేందుకు, పట్టుకాయల దారం విడదీసుకొనేందుకు వారికది అవకాశమిస్తోంది. ఇది ఎన్నటికీ ఒక ఫ్యాక్టరీ పరిశ్రమగా రూపొందదు. కానీ, శ్రమ విభజన సూత్రాన్ని ఇక్కడ అవసరమైన ఉన్నత స్థాయిలో వర్తింపచేయడానికి వీలుగా ... అది ఒక ప్రత్యేక లక్షణాన్ని సంతరించుకొంది. నిజంగా, ఇక్కడ దారపు కండెలు చుట్టేవారు, వడికేవారు, అద్దకంవారు, సైజువారీగా దారం వేరుపరచేవారు, ఆఖరున, నేసేవారు ఉన్నారు. కానీ, వారిని ఒకే కార్ఖానాలో చేరవేయడం జరుగలేదు. వారు ఒకే యజమానిపై ఆధారపడినవారు కాదు. వారంతా స్వతంత్రులు" (ఎ. బ్లాంక్వి, కోర్స్, డీ ఎకానమీ ఇండస్ట్రీయల్లే, పార్ ఎ. బ్లెజ్, పారిస్ 1838-9, పుట 79) బ్లాంక్వి ఇది రాసిన దరిమిలా వివిధ స్వతంత్ర కార్మికులను కొంత మేరకు ఫ్యాక్టరీలో ఐక్యం చేశారు. (మార్క్స్ పై విషయం రాసిన తరువాత ఈ ఫ్యాక్టరీల్లో మరమగ్గం జొరబడింది. ఇప్పుడు 1886లో త్వర త్వరగా చేతి మగ్గం స్థానాన్ని ఆక్రమిస్తోంది. నాల్గవ జర్మన్ కూర్పులో చేర్చిన మాటలు - క్రెఫెల్డ్ పట్టు పరిశ్రమ కూడ ఈ విషయంపై వెల్లడించగలదెంతో ఉంది. (ఫ్రెడరిక్ ఎంగెల్స్)

వృత్తిపనివారి సమ్మేళన యొక్క సామాజిక ఉత్పాదితమవుతున్నది. ఒక జర్మన్ వృత్తి సంఘానికి చెందిన ఒక కాగితపు ఉత్పాదకుని విషయంలో, ఒకే వృత్తిపనివాని వరుస కార్యాలుగా ఒకదానిలో ఒకటి విలీనమయిన పనులే డచ్ కార్ఖానాల కాగితపు ఉత్పత్తిలో, పరస్పరం సహకరించుకొనే పలువురు కార్మికులు పక్కపక్కనే నిర్వహించే అనేక పాక్షికపు పనులయ్యాయి. న్యూరెంబర్గ్ వృత్తి సంఘానికి చెందిన సూదుల ఉత్పాదకుడు ఇంగ్లీషు కార్ఖానాలో సూదుల ఉత్పత్తి ఆవిర్భావానికి పునాదిరాయి అయ్యాడు. కానీ న్యూరెంబర్గ్లో ఆ వృత్తిపనివారు ఒక్కొక్కప్పుడు బహుశా 20 పనులను వరుసగా ఒకటి తరువాత ఒకటి చేయగా, ఇంగ్లండులో సూదులు చేసేవారు 20 మంది పక్క పక్కనే ఉంటూ, ఆ 20 పనుల్లో ఒక్కొక్కరు ఒక్క పని మాత్రమే చేయడం అనతికాలంలో జరిగిపోయింది. తదుపరి అనుభవ పర్యవసానంగా, ఆ 20 పనుల్లోని ప్రతి ఒక్కటీ మళ్ళీ భాగాలుగా విభజితమై, దేనికదిగా వేర్పడిపోయి, ఒక ప్రత్యేక పనివాని ఏకైక కర్తవ్యమయింది.

కాబట్టి, కార్ఖానా ఉత్పత్తి ఆవిర్భవించిన తీరు, చేతివృత్తుల నుంచి అది పుట్టి వృద్ధిచెందిన తీరు, ద్విముఖమైనది. ఒకవైపు అది స్వతంత్రమైన వేరు వేరు చేతివృత్తుల సమ్మేళన నుంచి ఆవిర్భవిస్తుంది; ఆ చేతివృత్తులు తమ స్వాతంత్ర్యం కోల్పోయి, ఒకే ఒక నిర్దిష్ట సరకు ఉత్పత్తిలో కేవలం అనుబంధ పాక్షిక ప్రక్రియలుగా దిగజారి పోయేంతగా ప్రత్యేకీకృతమవుతాయి. మరోవైపు, అది ఒకే చేతివృత్తికి చెందిన వృత్తిపనివారి సహకారం నుంచి ఆవిర్భవిస్తుంది. అది ఆ ప్రత్యేక చేతివృత్తిని వేరు వేరు పాక్షిక చర్యలుగా విడగొట్టి, వేర్పరచి, ఈ చర్యల్లో ప్రతి ఒక్కటీ ఒక ప్రత్యేక కార్మికునికి మాత్రమే పరిమితమైన క్రియగా రూపొందే పర్యంతం ఈ ప్రక్రియలను ఒకటి మరొకదానితో నిమిత్తం లేనివిగా చేస్తుంది. కాబట్టి కార్ఖానా ఉత్పత్తి ఒకవైపు, ఉత్పత్తి ప్రక్రియలో శ్రమ విభజనను ప్రవేశపెట్టనైనా పెడుతుంది, లేదా ఆ విభజనను మరింత అభివృద్ధిపరచనైనా పరుస్తుంది. మరోవైపు, అది మునుపు వేరు వేరుగా ఉన్న చేతివృత్తులను కలిపి కడుతుంది. కానీ నిర్దిష్ట ప్రారంభ బిందువు ఏదైనా, దాని తుది రూపం ఎల్లప్పుడు ఒకటే – అది మానవులు అంతర్భాగాలుగా ఉన్న ఒక ఉత్పాదక యంత్రాంగం.

కార్ఖానా ఉత్పత్తిలో శ్రమ విభజనను సరిగా అర్థంచేసుకొనేందుకు కింది విషయాలను గట్టిగా గ్రహించడం అత్యవసరం. మొదటిది, ఒక ఉత్పత్తి, క్రమం దాని వేరు వేరు వరుస దశలుగా విభజింప బడడం. ఇక్కడ ఒక చేతివృత్తిని దాని వరుస చేతి చర్యల కింద విడగొట్టడంతో కచ్చితంగా ఏకీభవిస్తుంది. ప్రతి ప్రక్రియను జటిలమైనదైనా లేక సరళమైనదైనా, చేతితోనే చేయవలసి ఉంటుంది; దాని చేతివృత్తి స్వభావం అట్టే ఉంటుంది. కాబట్టి, తన పరికరాలతో పనిచేయడంలో ఆయా పనివాని బలం, నైపుణ్యం, చురుకుదనం, ఆత్మవిశ్వాసంపై అది ఆధారపడి ఉంటుంది. చేతివృత్తే ప్రాతిపదికగా కొనసాగు తుంది. ఈ సంకుచిత సాంకేతిక ప్రాతిపదిక, ఉత్పత్తి ప్రక్రియను దాని ఆంగిక భాగాలుగా నిజంగా శాస్త్రీయమైన పద్ధతిలో విభజించడానికి ఆస్కారమివ్వదు. ఎందువల్లనంటే, ఆ ఉత్పాదితం గడచే ప్రతి పాక్షిక ప్రక్రియా, చేతితో నిర్వహించేందుకూ, ఒక ప్రత్యేక చేతివృత్తిగా రూపొందేందుకూ, ఇంకా తప్పనిసరిగా వీలుండాలి. ఈ విధంగా, ఉత్పత్తి ప్రక్రియకు చేతివృత్తే ఇంకా పునాదిగా కొనసాగు

తున్నందువల్లనే, ప్రతి కార్మికునికీ ఒక పాక్షికపు పనిని మాత్రమే కేటాయిస్తారు; జీవితాంతం, అతని శ్రమశక్తి ఈ పాక్షికపు పనిని నిర్వహించే సాధనంగా మారిపోతుంది.

రెండవది, ఈ శ్రమ విభజన ఒక ప్రత్యేక రకమైన సహకారం. దానిలోని అనేక సౌకర్యాలు సహకారం యొక్క సార్వత్రిక స్వభావం నుంచి ఉత్పన్నమైనవే తప్ప, దాని ఈ ప్రత్యేక రూపం నుంచి కాదు.

### విభాగం-2

## ప్రత్యేకీకృత కార్మికుడూ, అతని పరికరాలు

మనమిప్పుడు వివరాల్లోకి వెళ్ళామంటే, మొదట ఒక విషయం స్పష్టమవుతుంది. తన జీవితాంతం సులువైన ఒకే చర్య చేసే కార్మికుడు తన శరీరమంతటినీ ఆ చర్య నిర్వహించే స్వయంచాలిత, ప్రత్యేకీకృత పరికరంగా మార్చుకొంటాడు. అందువల్ల, చర్యల పరంపరకు పరంపరనే వరుస క్రమంలో చేసే వృత్తి పనివానికన్నా తక్కువ కాలంలో ఆ పని చేస్తాడు. మరి, కార్ఖానా ఉత్పత్తి యొక్క సజీవ యంత్రాంగమయిన సమిష్టి కార్మికుడు, కేవలం అటువంటి ఏకపార్శ్వ ప్రత్యేకీకృత కార్మికుల సమాహారమే. కాబట్టి, స్వతంత్ర చేతివృత్తితో పోలిస్తే, ఒక నిర్ణీత కాలంలో జరిగే ఉత్పత్తి ఎక్కువగా ఉంటుంది. అంటే శ్రమ ఉత్పాదక శక్తి పెరుగుతుందన్నమాట.[1] అంతే కాదు, ఈ పాక్షికపు పని ఒకే వ్యక్తి యొక్క ఏకైక క్రియగా స్థిరపడినప్పుడు, అది ఉపయోగించే పద్ధతులు నిర్దుష్టమవుతాయి. సామాన్యమైన ఒకే పని నిరంతరాయంగా మళ్ళీ మళ్ళీ అతను చేయడం, అతని దృష్టి దానిపైనే కేంద్రీకృతం కావడం – ఇవి, కనీస శ్రమతో వాంఛిత ఫలితం ఎలా సాధించాలో అతనికి అనుభవం ద్వారా నేర్పుతాయి. కాని, ఒకే కాలంలో, కొన్ని తరాల కార్మికులు ఎల్లప్పుడూ జీవిస్తుంటారు. ఒక నిర్ణీత వస్తువును ఉత్పత్తి చేసే కార్ఖానాలో కలిసి పని చేస్తుంటారు. కాబట్టి, ఆ విధంగా గడించిన సాంకేతిక నైపుణ్యం, ఆ వృత్తిలోని మెళకువలు స్థిరపడి, పోగవుతాయి; తరువాత తరాలకు సంక్రమిస్తాయి.[2] సహజంగా వృద్ధి చెందిన వృత్తి విభజన బయటి సమాజంలో సిద్ధంగా ఉంది. కార్ఖానా ఉత్పత్తి దీన్ని కార్ఖానాలో అనుకరించడం ద్వారా, తుదకంటా తీసుకుపోవడం ద్వారా ప్రత్యేకీకృత కార్మికుని నైపుణ్యాన్ని నిజంగా ఆవిర్భవింపచేస్తుంది. మరోవైపు, ఒక మనిషి జీవిత వృత్తిగా పాక్షికపు పని పరివర్తన చెందడం వృత్తులను అనువంశికమైనవిగా చేసిన మునుపటి సమాజాల ధోరణి వంటిదే. అది వృత్తులను కులాలుగా ఘనీభవింపచేసినట్టి ధోరణి లేదా నిర్దిష్ట చారిత్రక పరిస్థితుల వల్ల వ్యక్తిలో కులాల స్వభావానికి పొసగని రీతిలో భిన్నంగా ఉండే ధోరణి తలయెత్తినప్పుడల్లా, వృత్తులను వృత్తి సంఘాలుగా కరుడుగట్టేలా చేసినట్టి ధోరణి వేరు వేరు జీవజాతులుగా, వంగడాలుగా మొక్కల, జంతువుల విభజనను క్రమబద్ధం చేసే అదే ప్రకృతి నియమ ప్రభావమే కులాలను, వృత్తి సంఘాలను

1. ''అతి వైవిధ్యం గల ఏ వస్తూత్పత్తినైనా వేరు వేరు హస్తకళాకారులకు పంపిణీ చేసి, కేటాయించే కొద్దీ మరింత బాగా, మరింత త్వరగానూ, కాలమూ, శ్రమా మునుపంత వృథా కాకుండానూ ఆ ఉత్పత్తి జరగక తప్పదు.'' (''ది అడ్వాంటేజెస్ ఆఫ్ ది ఈస్టిండియా ట్రేడ్'' లండన్, 1720, పుట 71)
2. ''సులువైన శ్రమ, బదలాయించిన నైపుణ్యమే'' (టి.హెచ్. హాడ్గ్‌స్కిన్, ''పాపులర్ పొలిటికల్ ఎకానమీ'' పుట 48)

జనింపచేస్తుంది. అయితే, అభివృద్ధి ఒక నిర్దిష్ట స్థాయినందుకొన్నప్పుడు, కులాల అనువంశికత, వృత్తి సంఘాల ప్రత్యేక ప్రతిపత్తి ఒక సమాజ నియమంగా నిర్ధారణ అవుతాయి.[1] "నాజూకుదనంతో ఢాకా రవసెల్లాలకు, తళతళమనే మాయని రంగుల్లో కోరమాండల్ కొలికోలూ, తదితర వస్త్రాలకు మించినవేవీ లేవు. కాని, పెట్టుబడి, యంత్రాలు, శ్రమ విభజన, యూరపులోని కార్ఖానా ఉత్పత్తిదారులకు అంతటి సదుపాయాలు కలుగజేసినా మరే ఇతర సాధనాలు లేకనే, అవి తయారవుతున్నాయి. ఢాకా నేత కార్మికుడు కేవలం ఒక విడి వ్యక్తి; తన ఖాతాదారు పురమాయించినప్పుడు, మొరటుగా కలిపి కట్టిన కొన్ని రెమ్మలు, లేదా కఱ్ఱగెడలతో, అతి మోటుగా నిర్మించిన మగ్గంతో నేతపని చేస్తాడు. పడుగును చుట్టగా చుట్టే ఉపకరణ కూడా లేదు; అందువల్ల మగ్గాన్ని దాని పొడవునా లాగి ఉంచాల్సి ఉంటుంది. అదెంత పెద్దదైపోయి, ఎంత అననుకూలంగా ఉంటుందంటే, అది ఉత్పత్తిదారు పాకలో పట్టదు. అందువల్ల అతను తన వృత్తిపనిని ఆరుబయట సాగించక తప్పడం లేదు. అక్కడ వాతావరణంలోని ప్రతి మార్పు అతని పనికి అంతరాయం కలిగిస్తూంటుంది."[2] సాలెపురుగులాగానే హిందువుకు ఈ సామర్థ్యాన్ని ఇచ్చేది తరతరాలుగా సంచితమై, తండ్రి నుంచి కొడుకుకు అందుతూ వచ్చిన ప్రత్యేక నైపుణ్యమే. అయినప్పటికీ, అలాంటి హిందూ నేత కార్మికుని పని, కార్ఖానా కార్మికుని పనితో పోలిస్తే, చాలా జటిలమైనది.

పనివాడు ఒకసారి తన స్థలం మారవలసి వస్తుంది. మరొకసారి తన పరికరాలను మార్చవలసి వస్తుంది. ఒక చర్య నుంచి మరొక చర్యకు మారడం అతని శ్రమ ప్రవాహంలా సాగకుండా అంతరాయం కలిగిస్తుంది. ఒక విధంగా చెప్పాలంటే, అతని పని రోజులో ఖాళీలను సృష్టిస్తుంది. అతణ్ణి రోజంతా ఒకే ఒక చర్యకు కట్టివేసిన వెంటనే ఈ ఖాళీలు మూసుకుపోతాయి. అతని పనిలోని మార్పులు తగ్గే నిష్పత్తిలోనే ఇవీ అదృశ్యమవుతాయి. ఫలితంగా పెరిగిన ఉత్పాదక శక్తికి మూలం ఒక నిర్ణీత కాలంలో వ్యయమయ్యే శ్రమ శక్తి పెరుగుదల, అంటే శ్రమ తీవ్రత పెరుగుదల, లేదా అనుత్పాదకంగా

1. "హస్తకళలు కూడా ... ఈజిప్టులో కావలసిన నిర్దుష్టతా స్థాయినందుకొన్నాయి. ఎందువల్లనంటే, ఆ దేశంలో మాత్రమే హస్తకళాకారులు పౌరుల్లోని మరో వర్గపు వ్యవహారాల్లో ఏ విధంగానూ జోక్యం చేసుకోరాదు. చట్టం వల్ల తమ తెగలో అనువంశికమైన వృత్తిని మాత్రమే చేపట్టాలి. ఇతర దేశాల్లో చేతివృత్తులవారు మరీ ఎక్కువ విషయాలపై శ్రద్ధ వహించడం కద్దు. ఒకసారి వారు వ్యవసాయంలో చేయి వేసి చూస్తారు. మరొకసారి వర్తకం చేపడతారు. మరోసారి ఏకకాలంలో రెండు మూడు వృత్తుల్లో నిమగ్నులవుతారు. స్వేచ్ఛాయుత దేశాల్లో వారు అతి తరచుగా ప్రజాసభలకు హాజరవుతారు. కానీ, ఈజిప్టులో అలా కాదు. రాజ్య వ్యవహారాల్లో తలదూర్చినా లేదా ఒకేసారి పలు వృత్తులు సాగించినా ప్రతి హస్తకళాకారుణ్నీ కఠినంగా శిక్షిస్తారు. ఆ విధంగా, తమ వృత్తికి అంటిపెట్టుకోకుండా వారి దృష్టిని మళ్ళించేదేదీ లేదు... అంతేకాదు, వారికి తమ పూర్వీకుల నుంచి అనేక నిబంధనలు వంశపారంపర్యంగా వస్తున్నాయి. కాబట్టి వారికి కొత్త సానుకూలతలను కనుగొనాలనే కుతూహలం ఉంది." (డియోడోరస్ సికులస్ : హిస్టారిశ్చే బిబ్లియోథిక్. 1వ భాగం, 74వ అధ్యాయం.)

2. "హిస్టారికల్ అండ్ డిస్క్రిప్టివ్ ఎకౌంట్ ఆఫ్ బ్రిటిష్ ఇండియా ఎట్‌సెట్రా", రచన : హ్యూముర్రే, జేమ్స్ విల్సన్ మొదలయినవారు. ఎడింబర్గ్ 1832, సం. II, పుట 449. భారతదేశపు మగ్గం నిటారుగా ఉంటుంది. అంటే పడుగును నిలువునా లాగి ఉంచుతారు.

వ్యయమయ్యే శ్రమ శక్తి పరిమాణంలో తగ్గుదల. నిశ్చల స్థితి నుంచి చలన స్థితికి మారేందుకు ప్రతిసారీ అవసరమైన అదనపు శక్తి వ్యయాన్ని, మామూలు గమన వేగాన్ని అందుకొన్న తరువాత దాని కాల వ్యవధిని పొడిగించడం ద్వారా భర్తీ చేయడం జరుగుతుంది. అయితే, ఒకే రకమైన నిరంతర శ్రమ, కేవలం కార్యకలాపాల మార్పుతో ఉల్లాసమూ, ఆహ్లాదమూ పొందే మనిషి జీవశక్తుల తీవ్రతనూ, వాటి ప్రసార ధారనూ చెదరగొడుతుంది.

శ్రమ ఉత్పాదకత పనివాని సామర్థ్యం పైనే కాక, అతని పరికరాల నిర్దుష్టతపై కూడా ఆధారపడి ఉంటుంది. చాకులు, పిడిసానలు, బరమాలు, సుత్తులు మొదలయిన వాటిలో ఒకే రకమైన పరికరాలను వేరు వేరు ప్రక్రియల్లో వినియోగించవచ్చు. ఒకే ప్రక్రియలో ఒకే పరికరం వివిధ ప్రయోజనాలకు ఉపయోగపడవచ్చు. కాని, శ్రమ ప్రక్రియలోని వివిధ చర్యలు ఒకదాని నుంచి ఒకటి వేరుచేయబడి, ప్రతి పాక్షిక చర్యా ఆయా ప్రత్యేక కార్మికుని చేతిలో ఒక అనువైన, ప్రత్యేక రూపం సంతరించుకొన్న వెనువెంటనే, మునుపు పలు ప్రయోజనాలకు ఉపయోగపడిన పరికరాల్లో మార్పులు అవసరమవుతాయి. ఆ పరికర స్వరూపం మారనప్పుడు ఎదురయ్యే చిక్కులు ఈ మార్పు తీరు తెన్నులను నిర్ణయిస్తాయి. శ్రమ పరికరాల వైవిధ్యమూ, వాటి ప్రత్యేకీకరణా కార్ఖానా ఉత్పత్తి యొక్క విశిష్ట లక్షణాలు. ఆ వైవిధ్యం ఎలాంటిదంటే, నిర్దిష్ట రకానికి చెందిన పరికరాలు ప్రతి ప్రత్యేక ప్రయోజనానికీ అనువుగా మలచబడిన స్థిర రూపాలను సంతరించుకునేటట్లు చేసే వైవిధ్యం. ఆ ప్రత్యేకీకరణ ఎలాంటి దంటే, నిర్దిష్ట రకానికి చెందిన కార్మికుని చేతుల్లో మాత్రమే పూర్తిగా ఉపయోగపడే గుణాన్ని ప్రతి ప్రత్యేక పరికరానికీ కలిగించే ప్రత్యేకీకరణ. ఒక్క బర్మింగ్ హామ్‌లోనే 500 రకాల సుత్తులు ఉత్పత్తి అవుతున్నాయి; వాటిలో ప్రతి ఒకటి ఒక ప్రత్యేక ప్రక్రియకు అనువుగా దిద్ది తీర్చినది మాత్రమే కాదు, తరచుగా అనేక రకాలు ఒకే ప్రక్రియలోని వేరు వేరు చర్యలకు మాత్రమే ఉపయుక్తమవుతున్నాయి. కార్ఖానా ఉత్పత్తి దశ శ్రమ పరికరాలను ప్రతి రకానికీ చెందిన కార్మికుని ప్రత్యేక క్రియలకు మాత్రమే అనువుగా దిద్ది తీర్చడం ద్వారా వాటిని సరళం చేస్తుంది, మెరుగుపరుస్తుంది. ఇబ్బడి ముబ్బడిగా పెంచుతుంది.[1] ఆ విధంగా, అదే సమయంలో అది సరళమైన పరికరాల సమ్మేళన వల్ల ఏర్పడే యంత్రాల ఉనికికి కావలసిన భౌతిక పరిస్థితుల్లో ఒకదాన్ని సృష్టిస్తుంది. ప్రత్యేకీకృత కార్మికుడూ, అతని పరికరాలూ కార్ఖానా ఉత్పత్తిలోని అతి సరళమైన మూలకాలు. ఇప్పుడు దాని మొత్తం స్వరూపం పరిశీలిద్దాం.

---

1. జీవ జాతుల మూలాల గురించి డార్విన్ రాసిన నూతన యుగారంభక గ్రంథంలో, మొక్కల, జంతువుల సహజ అంగాలకు సంబంధించి ఇలా వ్యాఖ్యానించారు : "ఒకే అవయవం వేరు వేరు రకాల పనులు చేయవలసి ఉన్నంత కాలం, దానిలో మార్పు రాగల అవకాశానికి ప్రాతిపదిక బహుశా ఇది - ప్రకృతి ఎంపిక, ఒక అవయవపు ప్రతి చిన్న రూప భేదాన్ని అట్టిపెట్టడంలో, లేదా అణచి వేయడంలో ఆ అవయవం ఒక ప్రత్యేక ప్రయోజనానికి మాత్రమే నిర్దేశితమైనప్పుడు చూపినంత జాగ్రత్త చూపదు. ఉదాహరణకు, అన్ని రకాల వస్తువులనూ కోయడానికి అనువుగా రూపుదిద్దిన చురకత్తుల మొత్తం పై ఒకే రూపంలో ఉండవచ్చు. కాని కేవలం ఒకే విధంగా మాత్రమే వాడటానికి నిర్దేశితమైన పరికరం వేరు వేరు వాడకాలకు వేరు వేరు రూపాల్లో ఉండాలి."

### విభాగం-3

## కార్ఖానా ఉత్పత్తికి చెందిన రెండు మౌలిక రూపాలు
## బహురూప కార్ఖానా ఉత్పత్తి, ధారావాహిక కార్ఖానా ఉత్పత్తి

కార్ఖానా ఉత్పత్తి వ్యవస్థీకరణకు రెండు మౌలిక రూపాలున్నాయి. అవి అప్పుడప్పుడు సమ్మిళితమైనా, సారభూతంగా భిన్నమైనవి. అంతేకాక, కార్ఖానా ఉత్పత్తి యంత్రాలతో నిర్వహింపబడే ఆధునిక పరిశ్రమగా ఉత్తరోత్తరా పరివర్తన చెందడంలో అవి ఎంతో భిన్నమైన పాత్రలు నిర్వహిస్తాయి. ఈ ద్వంద్వ లక్షణం ఉత్పత్తి అయ్యే వస్తువు స్వభావం నుంచి ఉత్పన్నమవుతోంది. దేనికది స్వతంత్రంగా తయారయిన పాక్షిక ఉత్పాదితాలను కేవలం యాంత్రికంగా ఒకటిగా అమర్చడం ద్వారానైనా ఈ వస్తువు సిద్ధిస్తుంది; లేదా పరస్పర సంబంధమున్న ప్రక్రియల, పనుల పరంపరయినా దాని సంపూర్ణాకృతికి కారణంగా ఉంటుంది.

ఉదాహరణకు ఒక రైలింజన్‌లో అయిదు వేలకు పైగా విడి భాగాలున్నాయి. కాని, అది మొదటి రకానికి చెందిన అచ్చమైన కార్ఖానా ఉత్పత్తికి ఉదాహరణ కాజాలదు. ఎందువల్లనంటే, అది ఆధునిక యంత్ర పరిశ్రమచే నిర్మితమైనది. కానీ ఒక గడియారం అలాంటి ఉదాహరణ కాగలదు. దాన్ని విలియం పెట్టీ కార్ఖానా ఉత్పత్తిలో శ్రమ విభజనకు ఉదాహరణగా వాడారు. మునుపు ఒక న్యూరెంబర్గ్ హస్తకళాకారుడు ఒకడే తయారుచేసే గడియారం అనేకానేక ప్రత్యేకీకృత కార్మికుల సామాజిక ఉత్పాదితంగా మారిపోయింది : మెయిన్ స్ప్రింగ్ తయారుచేసేవారు, డయల్ తయారు చేసేవారు, స్పైరల్ స్ప్రింగ్ తయారు చేసేవారు, జ్యుయల్ రంధ్రం తొలిచేవారు, కెంపుమీట తయారు చేసేవారు, ముళ్ళు తయారు చేసేవారు, కేస్ తయారు చేసేవారు – స్క్రూలు తయారు చేసేవారు, మలాము వేసేవారు, వీరిలో ఎన్నో ఉపభాగాలున్నాయి – చక్రాలు తయారు చేసేవారు (ఇత్తడివి వేరు, ఉక్కువి వేరు), పిన్నులు తయారు చేసేవారు, గమన కారులు, ఆర్కేవెయర్ డి పిగ్నన్ (చక్రాలను ఇరుసులపై అమర్చేవారు, వాటి పక్షాల ఉపరితలాలను నునుపు చేసేవారు వగైరా) కీలు చీలలను తయారు చేసేవారు, ప్లాంటియర్ డి ఫినిసేజ్ (చక్రాలను, స్ప్రింగులను గడియారంలో అమర్చేవారు), ఫినిస్పియర్ డి బారిలెట్ (చక్రాల్లో పళ్ళను కోసేవారు, సరియైన పరిమాణంలో రంధ్రాలు తొలిచేవారు వగైరా), ఎస్కేప్‌మెంట్ తయారు చేసేవారు, సిలెండర్ ఎస్కేప్‌మెంట్లకు సిలెండర్ తయారు చేసేవారు, ఎస్కేప్‌మెంట్ చక్రం తయారు చేసేవారు, బాలెన్స్ చక్రం తయారు చేసేవారు, రాకెట్ (గడియారం నడకను క్రమబద్ధం చేసే సాధనం) తయారు చేసేవారు, తరువాత ప్లాంటర్ డి ఎచాప్‌మెంట్ (అసలు ఎస్కేప్‌మెంట్ తయారీదారు); తరువాత రిసాస్పియర్ డి బారిలెట్ (స్ప్రింగ్ వగైరాలకై పెట్టెకు తుది మెరుగులు దిద్దేవారు), ఉక్కు భాగాలను నునుపు చేసేవారు, చక్రాలను నునుపు చేసేవారు, స్క్రూలను నునుపు చేసేవారు, అంకెలు రాసేవారు, డయల్‌పై పింగాణీ పూత పూసేవారు (రాగిపై పింగాణీ పదార్థాన్ని కరిగించేవారు), ఫ్యాబ్రికెంట్ డిపెండెంట్స్ (కేసును వేలాడదీసే రింగులు తయారు చేసేవారు), పినిస్పియర్ డి బార్నియెరే (పై తొడుగు వగైరాలలో ఇత్తడి కీలు అమర్చేవారు), ఫెమినియర్ డి సిక్రెట్ (కేసును తెరిచే స్ప్రింగులు అమర్చేవారు), గ్రేవియర్, సిసెలియర్, పాలిసియర్ డి బాయటే

వగైరా, వగైరా, ఆఖరున రిపాస్సియరీ (మొత్తం గడియారంలో భాగాలన్నిటినీ అమర్చి, అది సరిగా నడుస్తున్న స్థితిలో అందజేసేవారు). గడియారంలో బహు కొద్ది భాగాలు మాత్రమే పలువురు చేతిగుండా వెడతాయి. చెల్లా చెదురుగా ఉన్న ఈ అవయవాలను, ఒక సంపూర్ణ యంత్రంగా కలిపి కట్టే పనివాని చేతిలో, అవి మొట్టమొదటిసారిగా ఒకచోట చేరుతాయి. ప్రత్యేకీకృత కార్మికులను ఒకే కార్ఖానాలోకి తెస్తారా లేదా అనేది, తయారీ సరకుకూ, దాని వేర్వేరు భిన్న భాగాలకూ మధ్య గల బాహ్య సంబంధం వల్ల ఇటువంటి అన్ని తయారీ సరకుల విషయంలో లాగానే ఈ సందర్భంలో కూడా, యాదృచ్ఛిక విషయమవుతుంది. వాడ్, న్యూఫ్‌చాటెల్ రాష్ట్రాలలోలాగా, ఈ పాక్షికపు పనులు స్వతంత్ర చేతివృత్తులుగానే ఇకముందూ నిర్వహింపబడవచ్చు; కాని, జెనీవాలో, ఒకే పెట్టుబడిదారు అజమాయిషీలో ప్రత్యక్షంగా సహకరించుకొనే ప్రత్యేకీకృత కార్మికులు గల గడియారపు భారీ కార్ఖానాలున్నాయి. ఈ సందర్భంలో సైతం, డయల్ స్ప్రింగులు, కేసు ఫ్యాక్టరీలోనే తయారవడం అరుదు. గడియారాల వ్యాపారాన్ని పనివారి కేంద్రీకరణ గల ఒక కార్ఖానా ఉత్పత్తిగా నిర్వహించడం అసాధారణ పరిస్థితుల్లో మాత్రమే లాభదాయకం. ఎందువల్లనంటే, ఇంటి వద్దనే పనిచేయగోరే కార్మికుల మధ్య ఎక్కువ పోటీ ఉంది; పనిని అనేక భిన్న రూప ప్రక్రియలుగా విభజించడం వల్ల శ్రమ పరికరాలను ఉమ్మడిగా ఉపయోగించేందుకు అవకాశం ఉండదు. పనిని చెల్లాచెదురుగా జరిపించడం వల్ల పెట్టుబడిదారు కార్ఖానాలు, మొదలైన వాటిపై మదుపు పెట్టే డబ్బును ఆదా చేస్తాడు.[1] కాని, ఇంట్లో పని చేసినా, పెట్టుబడిదారుడి (కార్ఖానా యజమాని, వ్యాపారస్తుడు) కోసం అలా పనిచేసే ప్రత్యేకీకృత కార్మికుని స్థానం తన సొంత ఖాతాదారుల కోసం పనిచేసే స్వతంత్ర వృత్తి పనివాని స్థానానికి చాలా భిన్నమైనది.[2]

రెండవ రకం కార్ఖానా ఉత్పత్తి దాని నిర్దుష్ట రూపం, అది ఉత్పత్తి చేసే వస్తువులు పరస్పర సంబంధమున్న పరిణామ దశలనూ, అంచెలంచెలుగా కొన్ని ప్రక్రియల పరంపరనూ గడుస్తూ వెడతాయి.

---

1. 1854వ సంవత్సరంలో జెనీవా 80,000 గడియారాలను ఉత్పత్తి చేసింది. ఇది న్యూఫ్‌చాటెల్ రాష్ట్రంలోని ఉత్పత్తిలో అయిదో వంతు కూడా కాదు. లా చే డి ఫాండ్ ఒకటే - దీన్ని మనం ఒక పెద్ద గడియారపు కార్ఖానాగా పరిగణించవచ్చు - ఏటా జెనీవా చేసినదానికి రెండింతలు ఉత్పత్తి చేస్తోంది. 1850 నుండి 1861 వరకు జెనీవా 720,000 గడియారాలను ఉత్పత్తి చేసింది. "పరిశ్రమలు, వాణిజ్యం మొదలయిన వాటిపై రాజుగారి రాయబారి కార్యాలయ, ప్రతినిధి వర్గ కార్యదర్శుల నివేదికలు. 1863, నెం. 6" లోని "రిపోర్ట్ ఫ్రమ్ జెనీవా ఆన్ ది వాచ్ ట్రేడ్"ను చూడండి. కేవలం కలిపి బిగించిన భాగాలు గల వస్తువు ఉత్పత్తిలోని విభజిత ప్రక్రియల మధ్య సంబంధం లేని కారణంగానే, అటువంటి వస్తూత్పత్తిని యంత్రాలతో నడిచే ఆధునిక పారిశ్రామిక శాఖగా మార్చడం చాలా కష్టం; కాని గడియారం విషయంలో, దీనికి తోడు మరి రెండు అడ్డంకులున్నాయి - దాని భాగాలు అతి సూక్ష్మమైనవీ, సున్నితమైనవీ కావడం. అదొక విలాస వస్తువుగా ఉండటం. దాని వైవిధ్యానికి అదే కారణం. ఈ వైవిధ్యమెంతగా ఉంటుందంటే, అత్యుత్తమమైన లండన్ కంపెనీల్లో, ఒక ఏడాదిలో ఒక డజన్ గడియారాలను కూడా ఒకే నమూనాలో తయారుచేయరు. యంత్రాలను విజయవంతంగా వాడుతున్న మెస్సర్స్ వాచెరన్ అండ్ కాన్ స్టాంటిన్ గడియారాల కార్ఖానా మహా అయితే, వేరు వేరు పరిమాణమూ, ఆకృతీ గల మూడు, లేదా నాలుగు రకాలను ఉత్పత్తి చేస్తోంది.
2. బహురూప కార్ఖానా ఉత్పత్తికి ప్రామాణిక ఉదాహరణ అయిన గడియారాల తయారీలో, చేతివృత్తుల ఉపవిభజన మూలంగాజరిగే శ్రమ పరికరాల వైవిధ్యాన్ని వాటి ప్రత్యేకీకరణనూ మనం ఎంతో కచ్చితంగా అధ్యయనం చేయవచ్చు.

సూదుల ఉత్పత్తిలో తీగలాగా, అది 72 మంది, కొన్ని సందర్భాల్లో 92 మంది వేరు వేరు ప్రత్యేకీకృత కార్మికుల చేతులగుండా వెడుతుంది.

మొదట ప్రారంభించినప్పుడు అటువంటి కార్ఖానా ఉత్పత్తి, చెదురు మదురుగా ఉన్న చేతివృత్తులను సమ్మిళితం చేయడం వల్ల, ఉత్పత్తిలోని వివిధ దశలను ఒక దానినుండి ఒకటిని వేరు చేస్తున్న దూరాన్ని తగ్గిస్తుంది. ఒక దశ నుంచి మరొక దశకు వెళ్ళటానికి పట్టే కాలం తగ్గుతుంది; ఇలా వెళ్ళటానికి అవసరమయ్యే శ్రమ కూడా తగ్గుతుంది.[1] చేతివృత్తితో పోల్చి చూస్తే, ఉత్పాదక శక్తి పెరుగుతుంది. కార్ఖానా ఉత్పత్తి సాధారణ సహకార స్వభావం ఈ పెరుగుదలకు కారణం. కానీ మరోవైపు కార్ఖానా ఉత్పత్తి యొక్క విశిష్ట సూత్రమైన శ్రమ విభజన వల్ల, ఉత్పత్తిలోని వివిధ దశలను వేరుచేయడం, ఒకదానిపై ఒకటి ఆధారపడకుండా చేయడం అవసరమవుతుంది. వేర్పడిన క్రియల మధ్య సంబంధం ఏర్పరచి, దాన్ని కొనసాగించడానికి, వస్తువును ఒకరి చేతి నుంచి మరొకరి చేతికి, ఒక ప్రక్రియ నుంచి మరొక ప్రక్రియకు నిరంతరం చేరవేయడం అవసరం. ఆధునిక యంత్ర పరిశ్రమ దృష్టితో చూస్తే, ఈ అవసరం కార్ఖానా ఉత్పత్తికి విలక్షణమైనట్టి, ఖర్చుతో కూడినట్టి అసౌకర్యంగా, కార్ఖానా ఉత్పత్తి సూత్రంలో అంతర్భూతమైన అసౌకర్యంగా ప్రస్ఫుటమవుతుంది.[2]

ముడిపదార్థాల్లో, ఉదాహరణకు కాగితపు కార్ఖానా ఉత్పత్తిలోని బట్ట పేలికల్లో, లేదా సూదుల కార్ఖానా ఉత్పత్తిలోని తీగలో ఏదో కొంత పరిమాణంపై మాత్రమే మన దృష్టిని నిలిపినట్లయితే, ఉత్పత్తి పూర్తి అయ్యేసరికి అది వివిధ ప్రత్యేకీకృత కార్మికుల చేతుల్లో వరుసగా కొన్ని దశల పరంపరను గడుస్తుందని మనకు కనిపిస్తుంది. కాని, మొత్తంగా కార్ఖానాపై దృష్టి సారించామంటే ఒకే సమయంలో దాని అన్ని ఉత్పత్తి దశల్లోనూ ఉన్న ముడిపదార్థం కనిపిస్తుంది. సమష్టి కార్మికుడు తన అనేక చేతుల్లోని, ఒక హస్త సముదాయంతో ఒకరకమైన పరికరాలు ధరించి, తీగను లాగుతాడు. మరో రకం పరికరాలున్న మరో హస్త సముదాయంతో అతను అదే సమయంలో దాన్ని వంపులు తీరుస్తాడు. మరో హస్త సముదాయంతో దాన్ని కోస్తాడు. మరో హస్త సముదాయంతో దాని మొనకు పదును పెడతాడు, వగైరా వగైరా వరుస క్రమంలో జరిగిన ఈ వేరు వేరు ప్రత్యేకీకృత ప్రక్రియలు ఏకకాలికమై, ప్రాదేశికంగా పక్క పక్కనే సాగుతాయి. ఒక నిర్ణీత కాలంలో సంపూర్ణ సరకులు ఎక్కువ పరిమాణంలో ఉత్పత్తి కావడానికి కారణమిదే.[3] ఈ ఏకకాలికతకు మొత్తం ఉత్పత్తి క్రమం యొక్క సార్వత్రిక సహకార రూపం కారణమనేది నిజమే; కానీ ఈ సహకారానికి అవసరమైన పరిస్థితులు కార్ఖానా ఉత్పత్తికి

1. "జనం ఒకరికొకరు అంత దగ్గరగా ఉండటం వల్ల మోతపని కూడ అవశ్యంగా తగ్గుతుంది." (ది అడ్వాంటేజెస్ ఆఫ్ ది ఈస్ట్ ఇండియా ట్రేడ్". పుట 106)

2. "శారీరక శ్రమ వినియోగ ఫలితంగా కార్ఖానా ఉత్పత్తిలోని వివిధ దశలు వేర్పడి పోవడంతో, ఉత్పత్తి ఖర్చు చాలా పెరుగుతుంది. ఒక ప్రక్రియ నుంచి మరొక ప్రక్రియకు కేవలం వస్తువుల చేరవేత ఈ నష్టానికి ప్రధాన కారణం." ("ఇండస్ట్రీ ఆఫ్ నేషన్స్", లండన్, 1855, II భాగం, పుట 200.)

3. "ఇది (శ్రమ విభజన) పనిని, దాని వేరు వేరు శాఖలుగా విడదీయం ద్వారా, కాలాన్ని పొదుపు చేస్తుంది. వీటన్నిటినీ ఒకే సమయంలో నిర్వహించవచ్చు ... ఒక వ్యక్తి వేరు వేరుగా నిర్వహించక తప్పని భిన్న ప్రక్రియలన్నిటినీ ఒకేసారి నిర్వహించడం ద్వారా, ఒకే ఒక పిన్నును కోయడానికి, లేదా దాని మొనకు పదును పెట్టడానికి పట్టే కాలంలోనే, పూర్తిగా తయారైన బోలెడు పిన్నులను ఉత్పత్తి చేయ వీలవుతుంది." (డుగాల్డ్ స్టివార్ట్, ఉదాహృత గ్రంథం, పుట 319.)

సర్వసిద్ధంగా లభించడమే కాదు, అది కూడా చేతివృత్తి శ్రమను ఉపభాగాలుగా విడగొట్టడం ద్వారా కొంత వరకు ఆ పరిస్థితులను సృష్టిస్తుంది. మరోవైపు అది ప్రతి కార్మికుణ్ణి పనిలో ఒకే ఒక స్వల్ప భాగానికి కట్టి వేయడం ద్వారా మాత్రమే శ్రమ ప్రక్రియ యొక్క ఈ సామాజిక వ్యవస్థీకరణను సాధిస్తుంది.

ప్రతి ప్రత్యేకీకృత కార్మికుని ఉత్పాదితమూ, అదే సమయంలో, ఒకే సంపూర్ణ వస్తువు పరిణామ క్రమంలోని ఒక నిర్దిష్ట దశ కాబట్టి, ప్రతి కార్మికుడూ, లేదా ప్రతి కార్మిక బృందమూ మరో కార్మికునికి, లేదా కార్మిక బృందానికి ముడి పదార్థాన్ని తయారు చేయడం జరుగుతుంది. ఒకరి శ్రమ ఫలితం మరొకరి శ్రమకు ప్రారంభ బిందువు. కాబట్టి ఒక కార్మికుడు రెండవ కార్మికునికి సూటిగా పని కల్పిస్తున్నాడు. ప్రతి పాక్షిక ప్రక్రియలోనూ వాంఛిత ఫలితాన్ని సాధించేందుకు అవసరమైన కాలాన్ని అనుభవం నుంచి తెలుసుకుంటారు. మొత్తం కార్ఖానా ఉత్పత్తి యంత్రాంగం, ఒక నిర్ణీత ఫలితం ఒక నిర్ణీత కాలంలోనే లభిస్తుందన్న ఊహపై ఆధారపడింది. ఈ ఊహపై మాత్రమే వివిధ అనుబంధ శ్రమ ప్రక్రియలు నిరంతరాయంగా, ఏకకాలంలో, పక్క పక్కనే సాగగలవు. ఈ చర్యలు ఒక దానిపై ఒకటి సూటిగా ఆధారపడి ఉండటం వల్ల, ఆ కారణంగా ఈ కార్మికులు కూడా ఒకరిపై ఒకరు సూటిగా ఆధారపడి ఉండటం వల్ల, వారిలో ప్రతి ఒకరూ తన పనిపై అవసరమైన దానికన్నా ఎక్కువ కాలం వ్యయం చేయకుండా ఉండటం తప్పనిసరి అవుతుంది; ఆ విధంగా, ఒక స్వతంత్ర చేతివృత్తిలో, లేదా సామాన్య సహకారంలో కనిపించే దానికి పూర్తి భిన్నమైన నిరంతరాయత, ఏకరీతి, క్రమబద్ధత, క్రమ పద్ధతి,[1] శ్రమ తీవ్రత సైతం పుట్టుకొస్తాయి. ఒక సరకుపై వ్యయమయిన శ్రమ కాలం దాని ఉత్పత్తికి సామాజికంగా అవసరమైన కాలాన్ని మించకూడదన్న నియమం, సాధారణంగా సరకుల ఉత్పత్తిలో, కేవలం పోటీ ప్రభావం వల్ల స్థాపితమయినట్లు కనిపిస్తుంది. ఎందువల్లనంటే, లోతులకు పోకుండా చెప్పవలసి వస్తే, ప్రతి ఒక్క ఉత్పాదకుడూ తన సరకును దాని మార్కెట్ ధరకే అమ్ముకోవలసి ఉంటుంది. కానీ ఇందుకు భిన్నంగా, కార్ఖానా ఉత్పత్తి దశలో, ఒక నిర్ణీత కాలంలో, ఒక నిర్ణీత పరిమాణంలో వస్తువు తయారు కావడం అసలు ఉత్పత్తి ప్రక్రియ యొక్క సాంకేతిక నియమం.[2]

కాని, భిన్న చర్యలకు పట్టే కాలం సమానంగా ఉండదు. అందువల్ల అవి, సమాన కాలాల్లో వచ్చే అంశిక ఉత్పాదితాలు అసమ పరిమాణాల్లో ఉంటాయి. కాబట్టి, అదే కార్మికుడు అనునిత్యం అదే పని చేయవలసి ఉన్నప్పుడు, ప్రతి పనికీ కార్మికులు వేరు వేరు సంఖ్యల్లో ఉండాలి. ఉదాహరణకు ముద్రాక్షరాల పోత కార్ఖానాలో నునుపు చేసే ఒక కార్మికునికి నలుగురు పోత పోసేవారు, ఇద్దరు విడగొట్టే వారు ఉంటారు : పోత కార్మికుడు గంటకు 2,000 అక్షరాలు పోత పోస్తాడు. విడగొట్టేవాడు 4,000 అక్షరాలను విడగొడతాడు. నునుపు చేసే కార్మికుడు 8,000 అక్షరాలను సాపు చేస్తాడు.

---

1. "ప్రతి కార్ఖానా ఉత్పత్తిలోనూ, హస్తకళాకారుల రకాలు ఎక్కువగా ఉండేకొద్దీ ... ప్రతి పనిలోనూ క్రమబద్ధత, క్రమ పద్ధతీ ఎక్కువవుతుంది. అదే పని మరింత తక్కువ కాలంలో చేయడం అవసరం, శ్రమ తగ్గడం అవసరం." ("ది అడ్వాంటేజెస్ ఆఫ్ ది ఈస్టిండియా ట్రేడ్" పుట 68.)

2. కానీ, అనేక పారిశ్రామిక శాఖల్లో కార్ఖానా ఉత్పత్తి వ్యవస్థ ఈ ఫలితాన్ని సాధించడంలో చాలా లోపాలున్నాయి. ఎంచేతనంటే, ఉత్పత్తి ప్రక్రియకు సంబంధించిన సాధారణ రసాయనిక, భౌతిక పరిస్థితులను ఎలా అదుపులో ఉంచాలో దానికి ఇదమిద్ధంగా తెలీదు.

ఇక్కడ మనకు మళ్ళీ కనిపించేది అతి సామాన్య రూపంలోని సహకార సూత్రం; ఒకే పని చేస్తున్న అనేకులను ఏకకాలంలో నియమించడం, అయితే ఇప్పుడీ సూత్రం ఒక అంగాంగిక సంబంధ వ్యక్తీకరణ. కార్ఖానా ఉత్పత్తిలో అమలుజరిగే శ్రమ విభజన సామాజిక సమష్టి కార్మికునిలోని గుణాత్మకంగా భిన్నమైన విభాగాలను సరళం చేసి, హెచ్చించడమే కాక, ఆ విభాగాల పరిమాణాత్మక మోతాదును నిర్ణయించే ఒక స్థిరమైన సంఖ్యాత్మక సంబంధాన్ని, లేక నిష్పత్తిని సృష్టిస్తుంది. అనగా, ప్రతి ప్రత్యేక చర్యకూ సాపేక్షంగా అవసరమయ్యే కార్మికుల సంఖ్యను (కార్మిక బృంద పరిమాణాన్ని) నిర్ణయిస్తుంది. అది, సామాజిక శ్రమ ప్రక్రియ గుణాత్మక అంతర్విభజనతో పాటుగా, ఆ ప్రక్రియకు ఒక పరిమాణాత్మక నియమాన్నీ, పరిమాణాత్మక నిష్పత్తినీ అభివృద్ధి చేస్తుంది.

ఒక నిర్ణీత స్థాయిలో ఉత్పత్తి చేస్తున్నప్పుడు, వివిధ బృందాల్లోని ప్రత్యేకీకృత కార్మికుల సంఖ్య విషయంలో అత్యుచితమైన నిష్పత్తిని ప్రాయోగికంగా ఒకసారి నిర్ధారణ చేసిన తరువాత, ప్రతి ప్రత్యేక బృందాన్నీ ఏదైనా పూర్ణ సంఖ్యచేత గుణించడం ద్వారా మాత్రమే ఆ స్థాయిని విస్తరింప జేయవచ్చు.[1] అదీకాక, ఒక వ్యక్తి కొన్ని పనులను చిన్న స్థాయిలో చేసినంత బాగా భారీ స్థాయిలో కూడా చేయగలదు; తనిఖీ పని, ఉత్పాదిత భాగాలను ఒక అంచె నుంచి తరువాతి అంచెకు చేరవేయడం మొదలయినవి ఇందుకు ఉదాహరణలు. అటువంటి పనులను దేనికదిగా వేరు చేయటం, వాటిని ఒక ప్రత్యేక కార్మికునికి కేటాయించడం, నియమితులైన కార్మికుల సంఖ్య పెరిగిన తరువాత గానీ ప్రయోజనకరంగా ఉండదు. అయితే ఈ పెరుగుదలను ప్రతి బృందానికి అదే నిష్పత్తిలో వర్తింపచేయాలి. ఏయే నిర్దిష్ట ప్రత్యేకీకృత క్రియనైనా నిర్వహించటానికి నియుక్తమైన ప్రత్యేక కార్మిక బృందం ఏక రూపాంశాలతో ఏర్పడినది. మొత్తం యంత్రాంగ నిర్ధారణ భాగాల్లో అది ఒకటి. కానీ అనేక కార్ఖానా ఉత్పత్తుల్లో ఈ బృందమే ఒక సువ్యవస్థిత కార్మిక బృందం, మొత్తం యంత్రాంగం ఈ ప్రాథమిక వ్యవస్థల పునశ్చరణగానో, లేదా గుణీకరణగానో ఉంటుంది. ఉదాహరణకు, గాజు సీసాల కార్ఖానా ఉత్పత్తిని తీసుకోండి. దాన్ని మౌలికంగా భిన్నమైన మూడు భాగాలుగా విభజింపవచ్చు. మొదటిది, గాజు అంతర్భాగ పదార్థాలను సిద్ధం చేయడం, ఇసుక, సున్నం కలపడం వగైరా, వాటిని ద్రవ పదార్థంగా కరిగించడం ప్రాథమిక దశ.[2] ఈ తొలి దశలో వివిధ ప్రత్యేకీకృత కార్మికులను నియమిస్తారు. ఆరబెట్టే బట్టీ నుంచి సీసాలను బయటికి తీయడం, రకాలను బట్టి వాటిని వేరు చేయడం, ప్యాక్ చేయడం వగైరా పనులు జరిగే తుది దశలో కూడా అంతే. మధ్యలో, ఈ రెండు దశల నడుమ, అసలు గాజును కరిగించడం, ద్రవ పదార్థరాశిని మలచడం ఉంటుంది. బట్టీకి గల ప్రతి మూతి వద్ద "రంధ్రం" అనే పేరు గల ఒక బృందం పని చేస్తూంటుంది. అందులో సీసాలు చేసేవాడు, లేదా

1. "(ప్రతి కార్ఖానా ఉత్పత్తి చేసే వస్తువు యొక్క ప్రత్యేక స్వభావాన్ని బట్టి) దాన్ని ఎన్ని ప్రక్రియలుగా విభజిస్తే, ఎంతమందిని నియమిస్తే అత్యనుకూలంగా ఉంటుందో తేలినప్పుడు ఈ సంఖ్య యొక్క సూటి గుణిజాన్ని వినియోగించని ఇతర కార్ఖానాలన్నిటికీ ఆ వస్తువు ఉత్పత్తికై ఎక్కువ ఖర్చు అవుతుంది. కార్ఖానా ఉత్పత్తి సంస్థలు చాలా పెద్దవిగా ఉండడానికి గల కారణాల్లో ఇదొకటి." (సి. బాబేజ్, "ఆన్ ది ఎకానమీ ఆఫ్ మెషినరీ" మొదటి కూర్పు, లండన్, 1832, అధ్యాయం XXI, పుటలు 172-173.)

2. ఇంగ్లాండులో కరగించే బట్టీ వేరు, గాజు తయారుచేసే బట్టీ వేరు. బెల్జియంలో ఈ రెండు ప్రక్రియలకూ ఒకే బట్టీ వాడుతున్నారు.

తుదిరూపు దిద్దేవాడు, ఊదేవాడు, పోగుచేసేవాడు, అందించేవాడు, గ్రహీత ఉంటారు. ఈ అయిదుగురు ప్రత్యేకీకృత కార్మికులూ అఖండమైన ఒకే క్రియాశీల వ్యవస్థలోని అయిదు అవయవాలు. అందువల్ల, మొత్తం అయిదుగురి పరస్పర ప్రత్యక్ష సహకారంతో మాత్రమే అది పని చేయగలదు. ఈ బృందంలోని ఏ ఒక్కరు లేకపోయినా మొత్తం బృందం స్తంభించిపోతుంది. కానీ ఒక గాజు బట్టీకి పలు మూతు లుంటాయి. (ఇంగ్లండులో 4 నుంచి 6 దాకా ఉంటాయి.) ప్రతి ఒక్క దానిలో గాజు ద్రవంతో నిండిన ఒక కరగబోత మట్టిపాత్ర ఉంటుంది. అక్కడ, అలాంటి అయిదుగురు కార్మికుల బృందం పనిచేస్తుంది. ప్రతి బృందం శ్రమ విభజన ప్రాతిపదికగా ఏర్పాటయి ఉంటుంది. కానీ ఈ వేరు వేరు బృందాల మధ్య అనుబంధం సామాన్య సహకారమే. ఉత్పత్తి సాధనాల్లో ఒకటైన బట్టీని ఉమ్మడిగా ఉపయోగించడం ద్వారా అది మరింత పొదుపుగా వినియోగమయేందుకు ఈ సహకారం వీలు కల్పిస్తోంది. 4- 6 బృందాలు గల బట్టీ ఒక గాజు గృహం. ప్రాథమిక, తుది దశలకు అవసరమైన పరికరాలతో, పనివారితో సహా అటువంటి పలు గాజు గృహాలు ఒక గాజు కార్ఖానాలో ఉంటాయి.

ఆఖరు సంగతి; కార్ఖానా ఉత్పత్తి దశ కొంతవరకు వివిధ చేతివృత్తుల సమ్మేళన నుంచి ఉత్పన్నమయినట్టే, వేరు వేరు ఉత్పత్తుల సమ్మేళనగా కూడా వృద్ధి పొందుతుంది. ఉదాహరణకు ఇంగ్లండులోని పెద్ద పెద్ద గాజు కార్ఖానా యజమానులు తమ సొంత మట్టి కరగపోత కుండలను తయారు చేస్తున్నారు. ఎందువల్లనంటే, వీటి నాణ్యం పైనే ఆ ప్రక్రియ సాఫల్య వైఫల్యాలు చాలా వరకు ఆధారపడి ఉంటాయి. ఉత్పత్తి సాధనాల్లో ఒకదాని తయారీ ఈ సందర్భంలో, ఉత్పాదితాల తయారీతో సమైక్యమయింది. మరోవైపు, ఒక వస్తువు కార్ఖానా ఉత్పత్తి ఆ వస్తువు ముడిపదార్థంగా ఉండే ఇతర వస్తువుల లేదా ఆ తరువాత ఆ వస్తువు మిశ్రమం చేసే వస్తువుల కార్ఖానా ఉత్పత్తితో సమైక్యం కావచ్చు. ఆ విధంగా, గాజు కోత, ఇత్తడి పోత కార్ఖానాల పనితో ఫ్లంట్ గాజు కార్ఖానా ఉత్పత్తి మిళితమైంది. ఇత్తడి కోత కార్ఖానా వివిధ గాజు వస్తువులకు లోహపు కుదుళ్ళ ఉత్పత్తికి ఉద్దేశించినది. అలా సమ్మిళితం చేసిన వివిధ కార్ఖానా ఉత్పత్తులు ఒక భారీ కార్ఖానా ఉత్పత్తిలో ఇంచుమించు వేరు వేరు శాఖలుగా ఏర్పడుతాయి. కానీ అదే సమయంలో అవి ప్రతి ఒకటి దేనికి దాని సొంత శ్రమ విభజన గల స్వతంత్ర ప్రక్రియలు, కార్ఖానా ఉత్పత్తుల ఈ సమ్మేళన ఎన్నో అనుకూలాలను సమకూర్చినా, అది తన సొంత పునాది మీదనే ఒక సంపూర్ణ సాంకేతిక వ్యవస్థగా ఎన్నటికీ పెంపొందదు. అది యంత్రాలతో నిర్వహింపబడే పరిశ్రమగా పరివర్తన చెందినప్పుడు మాత్రమే అలా జరుగుతుంది.

కార్ఖానా ఉత్పత్తి దశ తొలినాళ్ళలో సరకుల ఉత్పత్తిలో అవసర శ్రమకాలాన్ని తగ్గించాలన్న సూత్రం[1] అంగీకారం పొంది రూపుగొనింది. ప్రత్యేకించి, భారీ స్థాయిలోనూ, పెద్ద ఎత్తున శక్తిని ప్రయోగించడం ద్వారానూ నిర్వహించవలసి వచ్చిన సరళమైన కొన్ని తొలి ప్రక్రియల కోసం అక్కడక్కడ యంత్రాల వాడకం ప్రారంభమైంది. ఉదాహరణకు, కాగితపు కార్ఖానా ఉత్పత్తిలోని తొలిదశలో బట్ట

1. తక్కినవారి మాట అలా ఉంచి, డబ్ల్యు పెటీ, జాన్ బెల్లర్స్ ఆండ్రూ ఎర్రాంటన్‌లు, "ది అడ్వాంటేజెస్ ఆఫ్ ది ఈస్టిండియా ట్రేడ్" అనే రచన జె. వాండర్‌లింట్ చెబుతున్నదాన్నిబట్టి ఇది విదితమవుతోంది.

పేలికలను చింపే పనిని కాగితం మిల్లులు, లోహ కార్ఖానాల్లో ముడి ఖనిజాలను పొడిగొట్టే పని దంచే మిల్లులు చేశాయి.[1]

రోమన్ సామ్రాజ్యం నేటి చక్రం ద్వారా సమస్త యంత్రాల ప్రాథమిక రూపాన్ని తరువాతి తరాలకు అందించింది.[2] చేతివృత్తుల దశ నుంచి మనకు దిక్సూచి, తుపాకి మందు, అచ్చు అక్షరాల ముద్రణ, అదంతకదే నడిచే గోడ గడియారం వంటి గొప్ప సృజనలు సంక్రమించాయి. కానీ, మొత్తం మీద, శ్రమ విభజనతో పోలిస్తే యంత్రాలు, ఆడంస్మిత్ చెప్పినట్లు అప్రధాన పాత్రనే నిర్వహించాయి.[3] 17వ శతాబ్దంలో యంత్రాల చెదురు మదురు వాడకానికి అత్యంత ప్రాముఖ్యముంది. ఎందువల్లనంటే, ఆనాటి గొప్ప గణిత శాస్త్రజ్ఞుల కది యంత్ర శాస్త్ర సృష్టికి ఆచరణాత్మక ప్రాతిపదికనూ, ప్రేరణనూ ఇచ్చింది.

పలు ప్రత్యేకీకృత కార్మికుల కలయిక ద్వారా ఏర్పడిన సమష్టి కార్మికుడు కార్ఖానా ఉత్పత్తి దశకు ప్రత్యేకించి విలక్షణమైన యంత్రం. ఒక సరకు ఉత్పత్తిదారు వంతుల వారీగా చేస్తున్నట్టి, ఉత్పత్తి పురోగమన క్రమంలో ఒక దానితో ఒకటి సమ్మిళితమవుతున్నట్టి వివిధ ప్రక్రియలు అతనిపై వివిధ మార్గాల్లో బాధ్యత మోపుతాయి. ఒక ప్రక్రియలో అతను మరింత బలమూ, మరో ప్రక్రియలో మరింత నైపుణ్యమూ, మరో ప్రక్రియలో మరింత శ్రద్ధా చూపాలి. ఒకే వ్యక్తికి ఇన్ని గుణాలు సమాన స్థాయిలో ఉండవు. కార్ఖానా ఉత్పత్తి దశ వివిధ ప్రక్రియలను వేరుపరచి, స్వతంత్రమైనవిగా ఒకదానితో ఒకటి నిమిత్తం లేనివిగా చేసిన తరువాత కార్మికులను వారి వారి ప్రధాన గుణాలను బట్టి విభజించడం, వర్గీకరించడం, జట్లుగా ఏర్పరచడం జరుగుతుంది. ఒకవైపు వారి సహజ శక్తులు, శ్రమ విభజన పెంపుదలకు పునాది కాగా, మరోవైపు కార్ఖానా ఉత్పత్తి దశ రంగప్రవేశం చేసిన తరువాత, వారిలో పరిమితమైన, ప్రత్యేకమైన క్రియలకు స్వభావ రీత్యా తగిన కొత్త శక్తులను పెంపొందిస్తుంది. ఇప్పుడు సమష్టి కార్మికునికి, ఉత్పత్తికి అవసరమైన అన్ని గుణాలూ ఉన్నత స్థాయిలో సమానంగా ఉంటాయి; ప్రత్యేక కార్మికుల, లేదా కార్మికుల జట్ల రూపంలో ఉన్న తన అంగాలనన్నిటినీ సమష్టి కార్మికుడు

---

1. 16వ శతాబ్దం చివరి రోజుల్లో ఖనిజాలను పొడిచేయడానికీ, శుద్ధి చేయడానికీ ఫ్రాన్స్‌లో ఇంకా రోకళ్ళనూ, జల్లెళ్ళనూ వాడుతుండేవారు.

2. యంత్రాల అభివృద్ధి గురించిన మొత్తం చరిత్రను ధాన్యపు మిల్లు చరిత్రలో కనుగొనవచ్చు. ఇంగ్లండులో ఫ్యాక్టరీ ఇప్పటికీ "మిల్లే". (ఇంగ్లీషు భాషలో "మిల్" అంటే పిండిగొట్టే సాధనమని అర్థం - అనువాదకుడు.) ఈ శతాబ్ది తొలి దశాబ్దాల నాటి జర్మన్ సాంకేతిక శాస్త్ర గ్రంథాల్లో, ప్రకృతి శక్తులు నడిపించే యంత్రాలకే కాక, యంత్ర స్వభావం కల పరికరాలు వినియోగించే అన్ని కార్ఖానాలకు కూడ "మ్యూల్" అనే పదం వాడటం కనిపిస్తుంది.

3. ఈ గ్రంథం నాల్గవ భాగంలో మరింత వివరంగా మనకు విదితం కానున్నట్లు, శ్రమ విభజనకు సంబంధించి ఆడమ్ స్మిత్ ఒక్క కొత్త ప్రతిపాదన కూడా చేయలేదు. కానీ కార్ఖానా ఉత్పత్తి దశ నాటి ఉత్తమోత్తమ రాజకీయ అర్థశాస్త్రవేత్తగా ఆయన్ను వేరుపరుస్తున్నదేమిటంటే, శ్రమ విభజనకు ఆయన ఇస్తున్న ప్రాధాన్యం, యంత్రాలకు ఆయన కేటాయించిన తక్కువ పాత్ర, ఆధునిక యాంత్రిక పరిశ్రమ తొలినాళ్ళలో లాడర్‌డేల్ వాదోపవాదాలకు, ఆ తరువాతి కాలంలో ఉరే వాదోపవాదాలకు కారణభూతమయింది. ప్రత్యేకీకృత కార్మికుల స్వీయ క్రియాశీల పాత్ర ద్వారా జరిగిన శ్రమ పరికరాల వైవిధ్యం సృజనను స్మిత్ కూడ నూతన యంత్ర సృజనగా భ్రమపడ్డారు. నూతన యంత్ర సృజనలో పాత్ర వహించేది, విద్వజ్ఞులు, చేతివృత్తులవారు, తుదకు రైతులు (బ్రిండ్లే) తప్ప కార్ఖానాల్లోని పనివారు కాదు.

వాటి వాటి ప్రత్యేక క్రియల నిర్వహణకు మాత్రమే నియోగించడం ద్వారా ఈ శక్తులను అతి పొదుపుగా వ్యయం చేస్తాడు.[1] ప్రత్యేకీకృత కార్మికుని అసమగ్రతా, లోపాలూ అతను సమష్టి కార్మికునిలో భాగమయినప్పుడు సమగ్రతలవుతాయి.[2] ఒకే పని మాత్రమే చేసే అలవాటు అతణ్ణి ఎప్పటికీ విఫలంకానీ పరికరంగా మారుస్తుంది. అదే సమయంలో, మొత్తం యంత్రాంగంతో అతని సంబంధం, అతడు యంత్ర భాగాల క్రమబద్ధతతో విధిగా పనిచేసేలా చేస్తుంది.[3] సమష్టి కార్మికుని క్రియలు సరళమైనవీ, జటిలమైనవీ, పై స్థాయివీ, కింది స్థాయివీ ఉంటాయి. కాబట్టి అతని సభ్యులకు వైయుక్తిక శ్రమ శక్తులకు – వేరు వేరు స్థాయిల శిక్షణ అవసరం. అందువల్ల వాటికి వేరు వేరు విలువలుండక తప్పదు. కాబట్టి, కార్ఖానా ఉత్పత్తి దశ శ్రమ శక్తుల్లో అంతస్తుల దొంతరను రూపొందిస్తుంది. దానికి అనుగుణమైన వేతనాల ప్రమాణాలుంటాయి. ఒకవైపు విడి విడి కార్మికులను జీవితాంతం పరిమితమైన ఒక పనికి కేటాయించి దానికి కట్టివేస్తారు. మరోవైపు ఈ దొంతరలోని వేరు వేరు ప్రక్రియలను ఆయా కార్మికులకు సహజంగా ఉన్న గడించిన శక్తి సామర్థ్యాల ననుసరించి వారి మధ్య విభజిస్తారు.[4] కానీ ప్రతి ఒక్కరికీ చేతనయిన కొన్ని సామాన్య హస్త విన్యాసాలు ఉత్పత్తిలోని ప్రతి ప్రక్రియకు అవసరం. అయితే ఇప్పుడివి కూడా, కార్యకలాపాల్లోని మరింత కీలకమైన వాటితో తమకు గల లంకె నుంచి విడిపోయి, ప్రత్యేకంగా నియమితులైన కార్మికులు మాత్రమే చేసే పనులుగా కరుడు గట్టిపోతాయి. కాబట్టి కార్ఖానా ఉత్పత్తి దశ తన పట్టులోకి తెచ్చుకొన్న ప్రతి చేతివృత్తిలోనూ, నైపుణ్యం

---

1. "ప్రతిదానికీ వేరు వేరు స్థాయిల్లో నైపుణ్యం, లేదా బలం అవసరమైన వేరు వేరు ప్రక్రియలుగా నిర్వహింప బడేందుకు పనిని విభజించడం ద్వారా, యజమాని అయిన కార్ఖానా ఉత్పత్తిదారు ప్రతి ప్రక్రియకు సరిగ్గా అవసరమైనంత పరిమాణంలోనే ఈ రెంటినీ కొనగలడు. కానీ, మొత్తం పనిని ఒకే కార్మికుడు నిర్వహించవలసివస్తే, ఏయే ప్రక్రియలుగా వస్తువు విభజితమైందో వాటిల్లో కెల్లా అతి కష్టమైన వాటిని నిర్వర్తించేందుకు తగినంత నైపుణ్యం, అతి ప్రయాసకరమైన వాటిని నిర్వర్తించేందుకు తగినంత బలం అతనికి ఉండాలి." (సిహెచ్. బాబేజ్ పూర్వోక్త గ్రంథం, అధ్యాయం XIX).
2. ఉదాహరణకు, కొన్ని కండరాల అసాధారణ పెరుగుదల, ఎముకల వక్రత మొదలయినవి.
3. కుర్రవాళ్ళను తమ పనికి స్థిరంగా ఎలా అంటిపెట్టుకొని ఉండేలా చేస్తున్నారు, అని దర్యాప్తు కమిషనర్లలో ఒకరు వేసిన ప్రశ్నకు ఒక గాజు కార్ఖానా జనరల్ మేనేజర్, విలియమ్ మార్షల్ చాలా సరియైన సమాధానమిచ్చారు : "వారు తమ పనిని నిర్లక్ష్యం చేయలేరు. వారు పని ప్రారంభించారా ఇక దాన్ని కొనసాగించవలసిందే. వారు ఒక యంత్రంలోని భాగాల వంటివారు, అంతే." ("చిల్డ్రన్స్ ఎంప్లాయ్‌మెంట్ కమిషన్" 4వ నివేదిక, 1865, పుట 247)
4. డా॥ ఉరే ఆధునిక యంత్ర పరిశ్రమ గురించిన తన సంకీర్తనలో ఈ విషయమై ఆయనకున్న వాదోపవాద ఆసక్తిలేని మునుపటి అర్థశాస్త్రజ్ఞులకన్నా సూటిగా, తన సమకాలికులకన్నా కూడా సూటిగా కార్ఖానా ఉత్పత్తి ప్రత్యేక లక్షణాన్ని వెల్లడి చేశారు. ఉదాహరణకు, అతని సమకాలికుడైన బాబేజ్, గణిత శాస్త్రజ్ఞుడుగా, యంత్ర శాస్త్రజ్ఞుడుగా డా॥ ఉరే కన్నా, అధికుడైనప్పటికీ, యంత్ర పరిశ్రమను కేవలం కార్ఖానా ఉత్పత్తి దృక్కోణం నుంచే పరిశీలించాడు. ఉరే ఇలా అంటున్నారు : "ఈ కేటాయింపు ... ప్రతి దానికి తదుచితమైన విలువ, వెలగల కార్మికుడు సహజంగా నియమితుడవుతాడు - శ్రమ విభజనలోని సారభూతాంశమవు తుంది." మరోవైపు ఆయన శ్రమ విభజనను, "మనుషుల భిన్న భిన్న శక్తి సామర్థ్యాలకు అనుగుణంగా శ్రమను మలచడం" అని వర్ణిస్తారు. ఆఖరున, "మొత్తం కార్ఖానా ఉత్పత్తి వ్యవస్థ, శ్రమను విభజించే, లేదా వర్గీకరించే వ్యవస్థ" అనీ, "నైపుణ్య స్థాయిల వారీగా శ్రమను విభజించడం" అనీ వర్ణిస్తాడు.

లేని కార్మికులు అని పేర్కొనబడే ఒక వర్గాన్ని – చేతివృత్తిలో ఇటువంటి వర్గానికి బొత్తిగా స్థానం ఉండేది కాదు – రంగంపైకి తెస్తుంది. అది మనిషి మొత్తం పని సామర్థ్యాన్ని దెబ్బతీసి, ఒక ఏకముఖ ప్రత్యేక నైపుణ్యాన్ని నిర్దుష్టమైనదిగా అభివృద్ధి చేయడమే కాదు, ఏ విధమైన అభివృద్ధి లేకపోవడమే ఒక ప్రత్యేకతగా చేయనారంభిస్తుంది కూడా. అంతస్తులవారీ వర్గీకరణతోపాటు, కార్మికుల మధ్య నిపుణులు, అనిపుణులు అన్న సరళమైన విభజన ప్రత్యక్షమవుతుంది. అనిపుణుల విషయంలో ఉమేజు వారి (అప్రెంటిస్‌షిప్) ఖర్చు అదృశ్యమవుతుంది; క్రియలను సులభతరం చేయడం వల్ల అది నిపుణుల విషయంలో, చేతివృత్తుల వారితో పోలిస్తే తగ్గిపోతుంది. ఈ రెండు సందర్భాల్లోనూ శ్రమ శక్తి విలువ పడిపోతుంది.[1] శ్రమ ప్రక్రియ భాగాలుగా విడిపోవడం వల్ల మునుపు చేతివృత్తుల్లో బొత్తిగా స్థానం లేని, లేదా బహుకొద్దిపాటి స్థానమే ఉంటూ వచ్చిన సమగ్రమైన కొత్త క్రియలు సృష్టి అయినప్పుడల్లా పై నియమం చెల్లదు. ఉమేజు వారి ఖర్చులు లేకపోవడం వల్ల, లేదా తగ్గిపోవడం వల్ల శ్రమ శక్తి విలువ పడిపోతుంది. అంటే, పెట్టుబడికి ప్రయోజనకరంగా అదనపు విలువ సూటిగా పెరుగుతుందన్న మాట. ఎందువల్లనంటే, శ్రమ శక్తి పునరుత్పత్తికి కావలసిన అవసర శ్రమ కాలాన్ని తగ్గించే ప్రతిదీ అదనపు శ్రమ పరిధిని విస్తరింప చేస్తుంది.

### విభాగం-4

## కార్ఖానా ఉత్పత్తిలో శ్రమ విభజన, సమాజంలో శ్రమ విభజన

మనం మొదట కార్ఖానా ఉత్పత్తి మూలాన్నీ, తరువాత దానిలోని సరళమైన అంశాలనూ, తరువాత ప్రత్యేకీకృత కార్మికుణ్ణీ, అతని పరికరాలనూ, ఆఖరున ఈ మొత్తం యంత్రాంగాన్నీ పరిశీలించాము. ఇక, కార్ఖానా ఉత్పత్తిలో శ్రమ విభజనకూ, సరకుల ఉత్పత్తికంతటికీ పునాదిగా ఉన్న శ్రమ, సామాజిక విభజనకూ మధ్య గల సంబంధాన్ని గురించి టూకీగా పేర్కొంటాము.

మనం శ్రమను మాత్రమే దృష్టిలో ఉంచుకొంటే, వ్యవసాయం, పరిశ్రమలు మొదలయిన ప్రధాన భాగాల కింద లేదా కుటుంబాల కింద సామాజిక ఉత్పత్తి, వేర్పాటును శ్రమ సార్వత్రిక విభజనగానూ, జాతులు, ఉపజాతుల కింద ఈ కుటుంబాలు చీలిపోవడాన్ని శ్రమ ప్రత్యేక విభజనగానూ, కార్ఖానాలోని శ్రమ విభజనను శ్రమ ఏకాంశ విభజనగా లేదా పాక్షికపు పని విభజనగా పేర్కొనవచ్చు.[2]

---

1. "ప్రతి చేతివృత్తి పనివాడూ ఒకే అంశంలో సాధన ద్వారా నిష్ణాతుడయ్యే వీలున్నందువల్ల, అతను చౌక పనివాడయాడు." (ఉరే, ఉదాహృత గ్రంథం, పుట 19.)

2. "శ్రమ విభజన అత్యంత భిన్నమైన వృత్తుల వేర్పాటుతో ప్రారంభమై, కార్ఖానా ఉత్పత్తిలో లాగా, ఒకే వస్తువు తయారీని పలువురు కార్మికులు తమ మధ్య పంచుకొనే విభజనను చేరుకొంటుంది." (స్టార్చ్ : **"కోర్స్ డి ఎకానమీ పొలిటిక్"**, పారిస్ కూర్పు సం. 1, పుట 173.) "నాగరికతలో ఒకానొక స్థాయినందుకొన్న జాతులలో, మనకు మూడు రకాల శ్రమ విభజన కనిపిస్తుంది. మొదటిది - దాన్ని సార్వత్రిక విభజన అని పిలుద్దాం - వ్యవసాయదారులుగా, కార్ఖానాదారులుగా, దుకాణదారులుగా ఉత్పత్తిదారుల విభజనకు దారితీస్తుంది. ఇవి జాతి శ్రమలోని మూడు ప్రధాన శాఖలు. రెండవది - దీన్ని ప్రత్యేక విభజన - అని పిలువవచ్చు. ఆయా రకాలుగా ప్రతి శ్రామిక శాఖ విభజన. మూడవ శ్రమ విభజన - దీన్ని కర్తవ్యాల విభజన లేదా అసలైన శ్రమ విభజన అని పేర్కొనాలి. విడి విడి చేతివృత్తుల్లో పెంపొంది ... అధిక సంఖ్యాక కార్ఖానాల్లో, ఫ్యాక్టరీల్లో వేరూనింది." (స్కార్‌బెక్ ... పూర్వోక్త గ్రంథం. పుటలు 84-85.)

సమాజం లోపల జరిగే శ్రమ విభజన ఒక ప్రారంభ బిందువు నుంచి అభివృద్ధి చెందుతుంది. వ్యక్తులు తదనుగుణంగా ఒక నిర్దిష్ట వృత్తికి బంధితులు కావటం, కార్ఖానా ఉత్పత్తిలోని శ్రమ విభజన లాగానే, విరుద్ధ ప్రారంభ బిందువు నుంచి వృద్ధి అవుతుంది. ఒక కుటుంబంలో[1] తదుపరి అభివృద్ధి అనంతరం ఒక తెగలో, స్త్రీ పురుష భేదాల, వయో భేదాల మూలంగా సహజంగానే ఒకలాంటి శ్రమ విభజన తలయెత్తుతుంది. తత్కారణంగా అది కేవలం శారీరక పునాదులపై ఆధారపడిన విభజన, సమాజ విస్తరణ వల్లనేమి, జనాభా పెరుగుదల వల్లనేమి అంతకన్న ముఖ్యంగా, వేరు వేరు తెగల మధ్య ఘర్షణలు సంభవించి, ఒక తెగ మరొక తెగను లోబరుచుకోవడం వల్లనేమి, ఈ విభజన తన సామాగ్రిని విస్తరింపజేసుకొంటుంది. మరోవైపు, నేను ఇంతకు ముందు చెప్పినట్లు, వేరు వేరు కుటుంబాలకు, తెగలకు, సమాజాలకు పరస్పర సంపర్కం ఏర్పడినచోట్ల ఉత్పాదితాల మార్పిడి ప్రారంభమవుతుంది. ఎందువల్లనంటే, నాగరికత ప్రారంభ దశలో స్వతంత్ర ప్రాతిపదికపై కలుసుకొన్నది కుటుంబాలు, తెగలు మొదలయినవి తప్ప ప్రైవేటు వ్యక్తులు కాదు. భిన్న సమాజాలకు తమ నైసర్గిక పరిసరాల్లో భిన్న ఉత్పత్తి సాధనాలూ, భిన్న జీవనాధారాలూ లభిస్తాయి. అందువల్ల వాటి ఉత్పత్తి పద్ధతులూ, జీవన పద్ధతులూ, వాటి ఉత్పాదితాలూ భిన్నంగా ఉంటాయి. వివిధ సమాజాల మధ్య సంపర్కం ఏర్పడనప్పుడు, ఉత్పాదితాల పరస్పర మార్పిడీ, పర్యవసానంగా అమ్మకపు సరకులుగా ఈ ఉత్పాదితాల క్రమ క్రమ పరివర్తనా ఆవశ్యకమయేది, అసంకల్పితంగా పెంపొందిన ఈ భిన్నత్వం మూలంగానే, మార్పిడి అనేది ఉత్పత్తి రంగాల మధ్య భేదాలను సృష్టించదు. కానీ, అదివరకే భిన్నంగా ఉన్న వాటి మధ్య సంబంధం ఏర్పరస్తుంది. ఆ విధంగా వాటిని మరింత విస్తృతమైన సమాజ సమిష్టి ఉత్పత్తిలోని కొద్దో గొప్పో పరస్పరాధారమైన శాఖలుగా మార్చుతుంది. ఈ సందర్భంలో శ్రమ సామాజిక విభజన, ఆదిలో భిన్నంగా, స్వతంత్రంగా ఉన్న ఉత్పత్తి రంగాల మధ్య జరిగే మార్పిడి నుంచి ఉత్పన్నమవుతుంది. శారీరక ప్రాతిపదికపై శ్రమ విభజన ప్రారంభ బిందువుగా ఉన్న మునుపటి సందర్భంలో, సుసంఘటిత అఖండ వ్యవస్థలోని ఆయా అంగాలూ, ప్రధానంగా అన్య సమాజాలతో ఉత్పాదితాల మార్పిడి మూలంగా సడలి, విడిపోతాయి. తరువాత అవి ఒకదాని నుంచి మరొకటి ఎంత వేర్పడి ఉంటాయంటే అమ్మకపు సరకులుగా ఉత్పాదితాల మార్పిడే వివిధ రకాల పనిని ఇంకా కలిపికట్టే ఏకైక బంధంగా ఉంటుంది. ఒక సందర్భంలో అది, మునుపు స్వతంత్రంగా ఉన్న వాటిని మరొకదాని మీద ఆధారపడినవిగా చేయటం, మరో సందర్భంలో మునుపు మరొక దానిమీద ఆధారపడిన వాటిని స్వతంత్రమైనవిగా చేయటం.

బాగా అభివృద్ధి చెందినట్టిదీ, సరకుల మార్పిడివల్ల ఏర్పడేదీ అయిన ప్రతి శ్రమ విభజనకూ,

---

1. **మూడవ కూర్పుకు ఫ్రెడరిక్ ఏంగెల్స్ నోట్** -
ఆ తరువాత, మానవుని ఆదిమ కాల పరిస్థితులను రచయిత లోతుగా తరచి అధ్యయనం చేసిన ఫలితంగా ఆయన ఇలా నిర్ధారణ చేశారు. ప్రారంభంలో తెగగా పెంపొందింది కుటుంబం కాదు సరికదా, అందుకు భిన్నంగా తెగ, రక్త సంబంధం ప్రాతిపదికపై మానవులు కలిసి వుండే ఆదిమ కాల, అసంకల్పిత రూపం. తెగ అనుబంధాలు తొలిసారిగా సడలడం ప్రారంభం కావడంతో అనేక బహువిధ కుటుంబ రూపాలు, ఆ తరువాత ఉత్పన్న మయాయి - ఫ్రెడరిక్ ఏంగెల్స్.

పట్టణం పల్లెసీమ వేరుపడటం ప్రాతిపదిక.[1] సమాజ ఆర్థిక చరిత్ర యావత్తూ, ఈ వైరుధ్యపు గతిక్రమంలో క్రోడీకరింపబడిందని చెప్పవచ్చు. కానీ ప్రస్తుతానికి, ఆ విషయం వదిలి ముందుకు పోదాం.

ఏకకాలంలో, ఒక నిర్దిష్ట సంఖ్యలో నియమితులైన కార్మికులు కార్ఖానా ఉత్పత్తిలో శ్రమ విభజనకు భౌతికంగా అవసరమైనట్లే నిర్దిష్ట జన సంఖ్య, సాంద్రత (ఇవి ఇక్కడ ఒక కార్ఖానాలోని కార్మిక బృందం లాంటివి) సమాజంలో శ్రమ విభజనకు తప్పనిసరిగా అవసరం.[2] కానీ, ఈ జన సాంద్రత దాదాపు సాపేక్షమైనది. బాగా అభివృద్ధి చెందిన రవాణా సాధనాలు కలిగి, జనాభా సాపేక్షంగా పల్చగా వున్న దేశ జన సాంద్రత సరిగా అభివృద్ధి చెందని రవాణా సాధనాలు కలిగి అధికతర జనసంఖ్య వున్న దేశ జన సాంద్రత కన్నా ఎక్కువ. ఈ అర్థంలో, అమెరికన్ యూనియన్‌లోని ఉత్తర రాష్ట్రాల జన సాంద్రత భారతదేశంలో కన్నా ఎక్కువ.[3]

సరకుల ఉత్పత్తి సరకుల చలామణీ పెట్టుబడిదారీ ఉత్పత్తి పద్ధతికి సర్వ సాధారణమైన పూర్వా వసరాలు కాబట్టి, కార్ఖానా ఉత్పత్తిలో శ్రమ విభజనకు, అంతకు ముందే మొత్తం సమాజంలో శ్రమ విభజన ఒక నిర్దిష్ట స్థాయిని అందుకొని ఉండటం అవసరం. అటువైపు నుంచి, కార్ఖానా ఉత్పత్తిలో శ్రమ విభజన, సమాజంలో శ్రమ విభజనను ప్రభావితం చేసి అభివృద్ధిపరుస్తుంది. శ్రమ పరికరాలలో వైవిధ్యం పెరిగే కొద్దీ ఆ పరికరాలను ఉత్పత్తి చేసే పరిశ్రమలలో కూడా అంతకంతకూ వైవిధ్యం పెరుగుతుంది.[4]

మునుపు ఇతర పరిశ్రమలతో అనుసంధించి, ప్రధానమైన లేదా సహాయకమైన పరిశ్రమగా, ఒకే ఉత్పత్తిదారు నిర్వహించిన ఏదైనా ఒక పరిశ్రమను కార్ఖానా ఉత్పత్తి వ్యవస్థ తన పట్టులోకి తెచ్చుకొన్నట్లయితే, ఈ పరిశ్రమలు వెంటనే తమ సంబంధాన్ని తెంచివేసుకొని, స్వతంత్ర పరిశ్రమలవుతాయి. కార్ఖానా ఉత్పత్తి వ్యవస్థ ఒక సరకు ఉత్పత్తిలోని ఒక నిర్దిష్ట దశను తన పట్టులోకి

---

1. ఈ విషయాన్ని అందరికన్నా బాగా వివరించిన ఆర్థికవేత్త, సర్‌జేమ్స్ స్టూవర్ట్. "వెల్త్ ఆఫ్ నేషన్స్"కు పదేళ్ళముందే వెలువడిన ఆయన పుస్తకం గురించి ఇప్పటికీ ఎంత బొత్తిగా తెలీదో ఒక విషయాన్ని బట్టి అంచనా వేయవచ్చు - స్టూవర్ట్ పుస్తకం నుంచి ఉటంకించిన భాగాలూ, అంతకన్న కొంత తక్కువగా వాలెస్, టౌన్‌సెండ్‌ల రచనల భాగాలు తప్ప, జనాభాపై మాల్తస్ పుస్తకం తొలి కూర్పులో - కేవలం ఉద్రేకపు ఉద్ఘాటనలు మినహాయిస్తే - మరేమీ లేదని; మాల్తూస్‌ను ఎంతో మెచ్చుకొనే వారికి బొత్తిగా తెలీదు.
2. "సామాజిక సాంగత్యానికీ, వేటి సంయోగం వల్ల శ్రమ ఉత్పాదితాలు హెచ్చుతాయో ఆ శక్తుల సంయోగానికీ రెంటికీ కూడా అనువైన ఒకానొక నిర్దిష్ట జనసాంద్రత ఉంది." (జేమ్స్ మిల్, ఉదాహృత గ్రంథం, పుట 50.) "కార్మికుల సంఖ్య పెరిగేకొద్దీ, సమాజ ఉత్పాదక శక్తి, శ్రమ విభజన ఫలితాలచే గుణీకృతమై, ఆ పెరుగుదల యొక్క యోగ నిష్పత్తిలో (కాంపౌండ్ రేషియో) హెచ్చుతుంది." (థామస్ హాడ్గ్‌స్కిన్, పూర్వోక్త గ్రంథం, పుటలు 125, 126.)
3. 1861 తరువాత దూదికి గిరాకీ బ్రహ్మాండంగా పెరిగినందువల్ల, భారతదేశంలో జనం కిక్కిరిసి ఉన్న కొన్ని జిల్లాల్లో వరి సాగును తగ్గించి పత్తి ఉత్పత్తిని విస్తరింపజేశారు. దీని ఫలితంగా స్థానిక క్షామాలు సంభవించాయి. ఒక జిల్లాలో వరిపంట పండని లోటును మరో జిల్లా నుంచి ధాన్యం దిగుమతి ద్వారా భర్తీ చేయడానికి, లోపభూయిష్టమైన రవాణా సాధనాలు వీలివ్వలేదు.
4. ఉదాహరణకు, దారపు కండె నాడెల తయారీ 17వ శతాబ్దంలోనే, హాలెండ్‌లో ఒక ప్రత్యేక పరిశ్రమగా రూపొందింది.

తెచ్చుకొన్నట్లయితే, ఆ సరకు ఉత్పత్తిలోని ఇతర అన్ని దశలూ, అన్ని స్వతంత్ర పరిశ్రమలవుతాయి. ఒక సమగ్రమైన సరకు, వివిధ భాగాలను కలిపి అమర్చినదైతే ఆ భాగాల ఉత్పత్తి ప్రక్రియలు వేరు వేరు అచ్చమైన చేతివృత్తులుగా తిరిగి నెలకొనవచ్చు. కార్ఖానా ఉత్పత్తిలో శ్రమ విభజనను మరింత నిర్దుష్టంగా నిర్వహించడానికై, ఒకే ఉత్పత్తి శాఖను, దాని ముడి పదార్థాల రకాలను బట్టి, లేదా ఒకే ముడిపదార్థం వహించగల వివిధ రూపాలను బట్టి, అనేకమైన, కొంత వరకు పూర్తిగా కొత్తవైన కార్ఖానా ఉత్పత్తులుగా విడగొట్టడం జరుగుతుంది. ఆ విధంగా ఒక్క ఫ్రాన్సులోనే, 18వ శతాబ్ది ప్రథమార్థంలో వంద వేరు వేరు రకాల పట్టు బట్టలను నేసేవారు. అవిన్యాన్‌లో, "ప్రతి ఉమేజుదారు (అప్రెంటిస్ – అను) ఒకే ఒక విధమైన నేత పనికి అంకితుడై ఉండాలే కాని, ఒకేసారి పలురకాల బట్టల తయారీని నేర్చుకోరాదు" అన్న చట్టం ఉండేది. ఉత్పత్తిలోని ప్రత్యేక శాఖలను ఒక దేశంలోని ప్రత్యేక జిల్లాలకు పరిమితం చేసే ప్రాదేశిక శ్రమ విభజనకు, ప్రతి ప్రత్యేక సదుపాయాలన్నీ వినియోగించుకొనే కార్ఖానా ఉత్పత్తి వ్యవస్థ, కొత్త ప్రోద్బల మిస్తుంది.[1] వలస వ్యవస్థా, ప్రపంచ మార్కెట్లు అందుబాటులోకి రావడమూ – కార్ఖానా ఉత్పత్తి దశ ఉనికికి అవసరమైన సాధారణ పరిస్థితులలో భాగమైన ఈ రెండూ – సమాజంలో శ్రమ విభజన పెంపొందడానికి పుష్కలంగా సామాగ్రిని సమకూరుస్తాయి. శ్రమ విభజన ఆర్థిక రంగాన్నే కాక, ప్రతి ఇతర సామాజిక రంగాన్నీ ఎలా తన పట్టులోకి తెచ్చుకొంటుందో, మనుషులను ప్రత్యేకీకరించే, వర్గీకరించే ఆ సర్వవ్యాప్త వ్యవస్థకు, మనిషిలో తక్కిన అన్ని శక్తియుక్తులనూ దిగదీసి, ఒకే ఒక శక్తి పెంపుదలకు సర్వత్రా ఎలా పునాది వేస్తుందో నిరూపించడానికి ఇది సందర్భం కాదు; ఆడం స్మిత్ గురువైన ఎ. ఫెర్గుసన్ "మనం బానిసల జాతిగా తయారయ్యాము; మనకు స్వేచ్ఛా పౌరులు లేరు."[2] అని గట్టిగా వాపోయేలా చేసింది ఈ పరిణామమే.

కానీ సమాజ అంతర్గత శ్రమ విభజనకూ, కార్ఖానా అంతర్గత శ్రమ విభజనకూ మధ్య అనేక పోలికలూ, వాటిని అనుసంధించే ఎన్నో లంకెలూ ఉన్నప్పటికీ, అవి స్థాయిలోనే కాక, స్వభావంలో కూడా భిన్నమైనవి. వివిధ పారిశ్రామిక శాఖలను కలిపి కట్టే అదృశ్య బంధం ఉన్న సందర్భంలో ఈ పోలిక పూర్తిగా నిర్వివాదమైనదిగా తోస్తుంది. ఉదాహరణకు, పశుపోషకుడు చర్మాలు ఉత్పత్తి చేస్తాడు; చర్మకారుడు తోళ్ళను పదును చేస్తాడు; పాదరక్షలు తయారు చేసేవాడు పదును చేసిన చర్మంతో బూట్లు తయారు చేస్తాడు. ఇక్కడ, వీరిలో ప్రతి ఒకరూ తయారు చేసే వస్తువు, వారందరి సంయుక్త శ్రమల ఉత్పాదితమైన దాని తుది రూపంవైపు వేసిన ఒక అడుగు మాత్రమే. ఇది కాక, పశు పోషకునికీ, చర్మకారునికీ, బూట్లు కుట్టేవానికీ, ఉత్పత్తి సాధనాలను సరఫరా చేసే వివిధ పరిశ్రమలన్నీ ఉండనే ఉన్నాయి. పై సామాజిక శ్రమ విభజనకూ, కార్ఖానా ఉత్పత్తిలోని విభజనకూ మధ్య తేడా

---

1. ఇంగ్లండులో ఉన్ని వస్త్రాల కార్ఖానా ఉత్పత్తి, ప్రత్యేక స్థలాలకు కేటాయించబడిన అనేక భాగాలుగా లేక శాఖలుగా విభజితమై, అక్కడ అవి మాత్రమే లేదా ప్రధానంగా అవే సోమర్‌సెట్ షైర్‌లో నయమైన వస్త్రాలు, యార్క్ షైర్‌లో ముతకవి, ఎక్స్‌టర్‌లో లాంట్ ఎల్స్, సుడ్బరీలో సర్జీలు, నార్విక్‌లో క్రేప్‌లు, కెండార్‌లో ఎల్లెగిసిన నార కలిసిన ఉన్ని వస్త్రాలు, విట్నేలో దుప్పట్లు ఇలా ఉత్పత్తి కావడం లేదా?" (బెర్క్‌లీ : "పృచ్ఛకుడు" 1751, 520వ ప్రశ్న)
2. ఎ. ఫెర్గుసన్ : "హిస్టరీ ఆఫ్ సివిల్ సొసైటీ" ఎడింబరో, 1767, 4వ భాగం, 2వ సెక్షన్, పుట 285.

కేవలం ఆత్మాశ్రయమైనది. కేవలం పరిశీలకుని దృష్టిలో మాత్రమే ఉన్నట్టిది అని, ఆడం స్మిత్‌తో పాటు ఎవరైనా భావించడానికి పూర్తి అవకాశముంది. అతని కంటికి కార్ఖానా ఉత్పత్తిలో, ఒకేచోట నిర్వహింపబడుతున్న పలు ప్రక్రియలన్నీ కనిపిస్తుండగా, పైన పేర్కొన్న ఉదాహరణలో, ఆ పని విశాల ప్రాంతాలకు వ్యాపించి ఉండటం వల్లనూ, ప్రతి శ్రమ శాఖలోనూ ఎంతోమంది జనం నియమితులై ఉండటం వల్ల ఈ సంబంధం కనిపించదు.[1] కానీ, పశు పోషకుడు, చర్మకారుడు, బూట్లు కుట్టేవాడు – వీరి స్వతంత్ర శ్రమల మధ్య గల బంధం ఏమిటి? వారి వారి ఉత్పాదితాలు అమ్మకపు సరకులు కావటం. కానీ, కార్ఖానా ఉత్పత్తులలోని శ్రమ విభజనల విశిష్ట లక్షణమేమిటి? ప్రత్యేకీకృత కార్మికుడు అమ్మకపు సరకులను ఉత్పత్తి చేయకపోవడం.[2] అమ్మకపు సరకుగా రూపొందేది ప్రత్యేకీకృత కార్మికులందరి ఉమ్మడి ఉత్పాదితం[3] సమాజంలో శ్రమ విభజనను తెస్తున్నది పరిశ్రమలోని

1. అసలైన కార్ఖానా ఉత్పత్తిలో శ్రమ విభజన మరింత ఎక్కువగా ఉన్నట్లు కనిపించడానికి ఆయన చెబుతున్న కారణమిదీ : "పనికి సంబంధించిన ప్రతి భిన్న శాఖలోనూ నియమితులైన వారిని తరచు ఒకే కార్ఖానాలో పోగుచేసి, ఒక్కసారిగా ప్రేక్షకుని కంటి ముందు ఉంచవచ్చు. ఎంతోమంది ప్రజల ఎన్నో అవసరాలను తీర్చనున్న ఆ గొప్ప కార్ఖానా ఉత్పత్తుల్లో (!) అలాకాక, పనికి సంబంధించిన ప్రతి భిన్న శాఖా ఎంత పెద్ద సంఖ్యలో పనివారిని నియోగిస్తుందంటే, వారందరినీ ఒకే కార్ఖానాలో పోగుచేయడం అసాధ్యం ... విభజన అంతగా గోచరం కాదు." (ఎ. స్మిత్, "వెల్త్ ఆఫ్ నేషన్స్" 1వ భాగం, 1వ అధ్యాయం) అదే అధ్యాయంలో, "నాగరికమైన, వర్థిల్లుతున్న దేశంలో అతి సామాన్యమైన చేతివృత్తికారుని, లేదా దిన శ్రామికుని అవసరాలు తీరే క్రమాన్ని గమనించండి." మొదలయిన మాటలతో ప్రారంభమై, ఆ తరువాత ఒక మామూలు కార్మికుని అవసరాలను తీర్చడానికి బహు సంఖ్యాక, బహువిధ పరిశ్రమలు ఎన్నెన్ని దోహదం చేస్తున్నాయో చిత్రిస్తూపోయే ఆ భాగమంతా బి.డీ. మండవిలే తన "తేనెటీగల కట్టు కథ లేదా వ్యక్తిగత దుర్గుణాలు, ప్రజా ప్రయోజనాలు" అన్న రచనకు చేర్చిన వ్యాఖ్యలకు దాదాపు తు.చ.లతో సహా నకలే (తొలి కూర్పు, వ్యాఖ్యలు లేనిది, 1706, వ్యాఖ్యలతోటిది, 1714.)
2. "వ్యక్తిగత శ్రమ సహజ ప్రతిఫలం అని మనం పిలువగలిగిందిక లేదు. ప్రతి కార్మికుడు ఒక అఖండాంశంలో కొంత భాగం మాత్రమే ఉత్పత్తి చేస్తాడు." ప్రతి భాగం, స్వయంగా విలువగానీ, ఉపయోగం గానీ లేనిది కనుక కార్మికుడు తన చేతిలోకి తీసుకొని, "ఇది నేను ఉత్పత్తి చేసింది. దీన్ని నేను ఉంచుకొంటాను." అని చెప్పగలిగిందేదీ లేదు. ("లేబర్ డిఫెండెడ్ ఎగెనెస్ట్ ది క్లెయిమ్స్ ఆఫ్ కాపిటల్", లండన్, 1825, పుట 25.) ప్రశంసనీయమైన ఈ గ్రంథం రచయిత నేను ఇదివరకే ఉదహరించిన టి.హెచ్. హాడ్గ్‌స్కిన్.
3. సమాజంలో శ్రమ విభజనకూ, కార్ఖానా ఉత్పత్తిలో శ్రమ విభజనకూ మధ్య ఈ తేడా యాంకీలకు ఆచరణలో తేటతెల్లమయింది. అంతర్యుద్ధకాలంలో, వాషింగ్టన్‌లో రూపొందించిన కొత్త పన్నుల్లో ఒకటి "అన్ని పారిశ్రామిక ఉత్పాదితాలపైనా" 6% పన్ను. ప్రశ్న : పారిశ్రామిక ఉత్పాదితం అంటే ఏది? శాసనసభ సమాధానం : "ఒక వస్తువును చేసినప్పుడు, అది ఉత్పత్తి అయిందన్న మాట." అది అమ్మకానికి సిద్ధంగా ఉన్నప్పుడు అది చేయబడిందన్న మాట. ఎన్నో ఉదాహరణల్లో ఒకటిది: న్యూయార్క్ ఫిలడెల్ఫియా ఉత్పత్తిదారులకు, మునుపు గొడుగులను, వాటికి సంబంధించిన వాటి అన్నిటితో "చేసే" అలవాటుండేది. కానీ గొడుగు ఎంతో భిన్నమైన భాగాల సమ్మిశ్రణ కనుక, ఈ భాగాలు క్రమ క్రమంగా వేరు వేరు స్థలాల్లో స్వతంత్రంగా నిర్వహింపబడే వేరు వేరు ప్రత్యేక పరిశ్రమల ఉత్పాదితాలయాయి. అవి గొడుగుల కార్ఖానాలో విడి విడి సరకులుగా ప్రవేశించాయి; అక్కడ వాటిని కలిపి బిగించడం జరిగింది. ఆ విధంగా కలిపి బిగించిన వస్తువులకు యాంకీలు "కూర్చిన వస్తువులు" అని పేరు పెట్టారు. పన్నులు కూర్పుగా ఉన్నందువల్ల; అది వాటికి తగిన పేరే. ఆ విధంగా గొడుగు మొదట తన ప్రతి భాగం వెలపై 6%ను, తన మొత్తం వెలపై 6%ను "కూర్చుతుంది."

వివిధ శాఖల యొక్క ఉత్పాదితాల క్రయ విక్రయాలు కాగా, కార్ఖానాలోని పాక్షిక పనుల మధ్య సంబంధానికి కారణం, ఒకే పెట్టుబడిదారుకు పలువురు కార్మికుల శ్రమ శక్తి అమ్మకమూ, అతడు దాన్ని సమష్టి శ్రమ శక్తిగా వినియోగించడమూ. ఒకే పెట్టుబడిదారు చేతుల్లో ఉత్పత్తి సాధనాల కేంద్రీకరణ కార్ఖానాలోని శ్రమ విభజనలో ఇమిడి ఉంది; సరకుల స్వతంత్ర ఉత్పత్తి దారులనేకుల మధ్య ఉత్పత్తి సాధనాలు చెల్లాచెదరు కావటం సమాజంలోని శ్రమ విభజనలో ఇమిడి ఉంది. కార్ఖానా లోపల కఠోరమైన నిష్పత్తుల నియమం అమలుజరుగుతుంది గనుక, నిర్దిష్ట క్రియలకు నిర్దిష్ట సంఖ్యలో కార్మికులు ఉంటారు. కానీ, కార్ఖానా వెలుపల సమాజంలో, వివిధ పారిశ్రామిక శాఖల మధ్య ఉత్పత్తిదారుల, వారి ఉత్పత్తి సాధనాల పంపిణీలో యాదృచ్ఛికత, చిత్తచపలత పూర్తిపాత్ర వహిస్తాయి. ఉత్పత్తి రంగంలోని వివిధ శాఖలు సమతూకంవైపు నిరంతరం మొగ్గుచూపే మాట నిజమే; ఎందుచేతనంటే, ఒకవైపు ఒక సరకును ఉత్పత్తి చేసే ప్రతి ఒక్కరూ ఒక నిర్దిష్ట సామాజిక అవసరాన్ని తీర్చేందుకు ఒక ఉపయోగపు విలువను ఉత్పత్తి చేసి తీరాలి. ఈ అవసరాలు పరిమాణ రీత్యా భిన్నమైనవే కానీ వాటి నిష్పత్తులను ఒక క్రమబద్ధమైన వ్యవస్థగా స్థిరపరచే ఒక అంతర్గత సంబంధముంది; అది అసంకల్పితంగా పెరిగే వ్యవస్థ; మరోవైపు సమాజం, తనకు గల పనికాలంలో, ఒక్కొక్క రకపు సరకులపై ఎంత వెచ్చించగలదో సరకుల విలువ నియమం తుదకు నిర్ధారణ చేస్తుంది. కాని, సమతూకంవైపు ఉత్పత్తిలోని వివిధ రంగాల మొగ్గుదల ఆచరణలోకి వచ్చేది ఈ సమతూకం నిరంతరం తల్లకిందులయ్యే స్థితిని అడ్డుకొనే ప్రతి క్రియ రూపంలోనే; కార్ఖానాలో క్రమానుసారం శ్రమ విభజన అమలుజరిగేందుకు ఒక ప్రాతిపదిక ముందుగానే ఉంటుంది. సమాజంలోని శ్రమ విభజనలో, ఆ ప్రాతిపదిక ప్రకృతి విధించే ఆవశ్యకంగా రూపొందుతుంది; అది ఉత్పత్తిదారుల నియమ రహితచిత్త చాంచల్యాన్ని అదుపులో ఉంచుతూ, మార్కెట్ వాతావరణం సూచి అయిన దాని ధరల ఎగుడు దిగుడులలో గోచరమవుతుంది. పెట్టుబడిదారుడు సొంత యంత్రాంగంలో కేవలం భాగాలైన మనుషులపై అతని నిర్వివాద అధికారం కార్ఖానాలోని అంతర్గత శ్రమ విభజనలో ఇమిడి ఉంది. సమాజంలోని శ్రమ విభజన స్వతంత్రులైన సరకు ఉత్పత్తిదారుల మధ్య సంబంధం కలిగిస్తుంది. అయితే ఈ స్వతంత్ర ఉత్పత్తిదారులు ఎలాంటి వాళ్ళంటే, జంతువుల రాజ్యంలో అందరిపైనా అందరి యుద్ధమనేది. ప్రతి జంతు జాతి మనుగడకూ పరిస్థితులను ఇంచుమించు స్థిరంగా ఉంచుతున్నట్లుగా, ఈ స్వతంత్ర ఉత్పత్తిదారులు పోటీ యొక్క అధికారాన్ని తప్ప, పరస్పర ప్రయోజనాల ఒత్తిడి విధించే నిర్బంధాల అధికారాన్ని తప్ప మరో అధికారాన్ని గుర్తించరు. కార్ఖానాలో శ్రమ విభజననూ, ఒక పాక్షికపు పనికి కార్మికుని యావజ్జీవ బంధననూ, పెట్టుబడికి అతని సంపూర్ణ లొంగుబాటునూ శ్రమ ఉత్పాదకతను పెంచే శ్రమ వ్యవస్థీకరణగా పొగిడే బూర్జువా బుద్ధి, ఆ బూర్జువా బుద్ధే ఉత్పత్తిని సామాజికంగా నియంత్రించి, క్రమబద్ధం చేసే ప్రతి ఉద్దేశపూర్వక చర్యనూ ఆస్తి హక్కులు, స్వేచ్ఛ, వ్యష్టి పెట్టుబడిదారు అభిరుచులకు సంపూర్ణ అవకాశం వంటి పవిత్ర విషయాలపై దాడిగా అంత గట్టిగానూ ఖండిస్తుంది. సమాజ శ్రమ వ్యవస్థీకరణను ఖండించడానికి, అది యావత్ సమాజాన్నీ ఒక బ్రహ్మాండమైన ఫ్యాక్టరీగా మార్చివేస్తుందనే దానికి మించిన మరే పాపమూ ఉత్సాహవంతులైన ఫ్యాక్టరీ వ్యవస్థ వకాల్తాదారులు దానిపై మోపలేకపోవడం ఒక విశిష్ట లక్షణాన్ని సూచిస్తోంది.

సామాజిక శ్రమ విభజనలో అరాచకమూ, కార్ఖానా శ్రమ విభజనలో నిరంకుశత్వమూ – ఇవి పెట్టుబడిదారీ ఉత్పత్తి గల సమాజంలో ఒకదాని కొకటి విధాయకంగా ఉంటాయి. కానీ, వృత్తుల వేర్పాటు అదంతకదే అభివృద్ధి చెంది, తరువాత కరుడుగట్టి, తుదకు చట్టం ద్వారా చిరస్థాయిగా నెలకొన్న ఆ మునుపటి సమాజ రూపాల్లో అలాకాక, ఆమోదం పొందిన అధికారికమైన పథకాన్ని అనుసరించి, సమాజ శ్రమ వ్యవస్థీకరణకు ఒక నమూనా ఒకవైపు కనిపిస్తుంది; మరోవైపు కార్ఖానాలో శ్రమ విభజన సంపూర్ణ బహిష్కరణ లేదా మహా అయితే, కేవలం దాని అల్పాల్పమైన లేదా చెదురుమదురు, యాదృచ్ఛిక అభివృద్ధి మనకు కనిపిస్తుంది.[1]

భూమిపై ఉమ్మడి స్వామ్యమూ, వ్యవసాయంతో సమ్మిళితమైన చేతివృత్తులూ, మార్చరాని శ్రమ విభజనా – ఇవి బహు ప్రాచీనమైన చిన్న చిన్న గ్రామ సమాజాలకు ప్రాతిపదిక. ఆ సమాజాలలో కొన్ని ఈనాటి వరకు కొనసాగుతున్నాయి. ఎక్కడైనా కొత్త గ్రామ సమాజం ప్రారంభమైనప్పుడల్లా, అదివరకే తయారై, అమలుపరచుకోడానికి సిద్ధంగా ఉన్న పథకంగా ఆ ప్రాతిపదిక ఉపయోగపడేది. 100 మొదలుకొని కొన్ని వేల ఎకరాల విస్తీర్ణం గల ప్రాంతాలకు ఆవరించిన ఈ గ్రామ సమాజాలలో ప్రతి ఒకటీ తనకు కావలసినదంతా ఉత్పత్తి చేసే ఒక అవిరళ అఖండ వ్యవస్థ. ఈ ఉత్పాదితాల్లో ప్రధాన భాగాన్ని ఆ సమాజమే నేరుగా వాడుకోవడం తప్పనిసరి. అది సరకు రూపం వహించదు. కాబట్టి, మొత్తం భారతీయ సమాజంలో, సరకుల మార్పిడి ద్వారా ఉత్పన్నమైన శ్రమ విభజనతో ఈ ఉత్పత్తికి నిమిత్తం లేదు. మిగులుగా ఉన్న ఉత్పాదితాలు మాత్రమే సరకు అవుతాయి. అందులో సైతం ఒక భాగం, రాజ్య వ్యవస్థ చేతికందే వరకు సరకు అవదు; ఈ ఉత్పాదితాల్లో ఒక నిర్దిష్ట భాగం వస్తు రూపపు కౌలుగా రాజ్య వ్యవస్థ చేతిలోకి అనాది కాలం నుంచి వెడుతూంది. ఈ గ్రామ సమాజాల నిర్మాణ స్వరూపం భారతదేశంలోని వేరు వేరు ప్రాంతాల్లో వేరు వేరుగా ఉంది. వీటిలోకెల్లా అత్యంత సరళ రూపంలో ఉన్న సమాజాల్లో భూమిని ఉమ్మడిగా సాగు చేస్తారు. పంట సభ్యుల మధ్య పంపకమవుతుంది. అదే సమయంలో, నూలు వడకడమూ, నేతా ప్రతి కుటుంబంలోనూ అనుబంధ పరిశ్రమలుగా ఉంటాయి. ఇలా ఒకే విధమైన పనిలో నిమగ్నమైన ఈ ప్రజా బాహుళ్యం 'సరస'నే మనకు ఈ కింది వారు కూడా కనిపిస్తారు : న్యాయాధిపతి, పోలీసు, పన్ను వసూలు చేసే అధికారి అంతా తానే అయిన "ప్రధాన గ్రామస్థుడు", భూమిసాగు లెక్కల్ని తయారు చేస్తూ, దానికి సంబంధించిన దానినంతటినీ నమోదు చేసే కరణం; నేరస్థులపై కేసు పెట్టడం, ఆ దోవన ప్రయాణం చేస్తున్న కొత్తవారికి రక్షణ ఇవ్వటం. పై గ్రామానికి వారిని భద్రంగా తీసుకువెళ్ళటం – ఈ పనులు చేసే మరో అధికారి; పొరుగు గ్రామ సమాజాల నుంచి తమ ఎల్లలకు కాపలా ఉండే ఎల్లాపి; ఉమ్మడి చెరువుల నీటిని సాగుకు పంపిణీ చేసే నీరుగంటి; మత కాండను నిర్వహించే బ్రాహ్మణుడు; పిల్లలకు ఇసుకలో

1. సమాజంలో శ్రమ విభజనపై అధికారం ఎంత తక్కువగా ఉంటే, కార్ఖానాలో శ్రమ విభజన అంత ఎక్కువ వృద్ధి అవుతుంది, ఒకే వ్యక్తి అధికారానికి అంత ఎక్కువగా లోనవుతుంది అనేది ... ఒక సార్వత్రిక నియమమని నిర్ణయించవచ్చు. ఆ విధంగా శ్రమకు సంబంధించి, కార్ఖానాలో అధికారం, సమాజంలో అధికారం ఒకదానికొకటి విలోమ నిష్పత్తిలో ఉంటాయి. (కార్ల్ మార్క్స్, మిజరీ డీ లా ఫిలాసఫీ, పుటలు 130-131)

చదువనూ, రాయనూ నేర్పే ఉపాధ్యాయుడు; విత్తడానికి, పంట కోతలకు, అన్ని రకాల వ్యవసాయ పనులకు శుభ, అశుభ దినాలను తెలియజేసే పంచాంగ బ్రాహ్మణుడు; లేదా జ్యోతిష్కుడు; అన్ని వ్యవసాయపనిముట్లు చేసే కమ్మరి; వడ్రంగి; గ్రామానికి కావలసిన కుండలన్నిటినీ తయారు చేసే కుమ్మరి; మంగలి; బట్టలుతికే చాకలి; వెండి ఆభరణాలు చేసే కంసాలి; అక్కడక్కడ కవి – ఇతను కొన్ని గ్రామ సమాజాల్లో కంసాలి వృత్తీ, తక్కిన సమాజాల్లో ఉపాధ్యాయ వృత్తీ చేయడం కద్దు. ఈ డజనుమంది వ్యక్తులనూ మొత్తం సమాజమే భరిస్తూంటూంది. జనాభా పెరిగిందంటే, అనాక్రమిత భూమిపై ఒక కొత్త గ్రామ సమాజాన్ని పాత గ్రామ సమాజం ఫక్కీలోనే స్థాపిస్తారు. ఒక క్రమ పద్ధతిలో శ్రమ విభజన, ఈ మొత్తం యంత్రాంగంలో గోచరమవుతుంది. కానీ కార్ఖానాలలో ఉన్నట్టి శ్రమ విభజన ఇక్కడ అసాధ్యం. ఎందువల్లనంటే కమ్మరి, వడ్రంగి మొదలయినవారికి గల మార్కెట్ మారేది కాదు. మహా అయితే, ఆయా గ్రామాల పరిమాణాన్ని బట్టి వీరు ఒకరికి బదులు ఇద్దరు, ముగ్గురు ఉంటారు.[1] ప్రతి విడి విడి వృత్తికారుడూ – కమ్మరి, వడ్రంగి మొదలయినవారు, తన కార్ఖానాలో తన చేతివృత్తి పనులన్నిటినీ, సాంప్రదాయక పద్ధతిలో, అయితే స్వతంత్రంగా, ఎవరి అధికారాన్నీ గుర్తించకుండా నిర్వహిస్తుండగా, సమాజంలో శ్రమ విభజనను నియంత్రించే నియమం, ప్రకృతి నియమం యొక్క అప్రతిహత అధికారంతో పని చేస్తుంది. నిరంతరం తమ్ము తాము పునఃసృష్టి చేసుకొంటూ, తాము యాదృచ్ఛికంగా నాశనమయినప్పుడల్లా అదేచోట, అదే పేరుతో మళ్ళీ మళ్ళీవెలసే ఈ స్వయం సంపూర్ణ గ్రామ సమాజాల్లోని ఉత్పత్తి వ్యవస్థీకరణ సరళతలో[2] – ఆ సరళతలో, ఆసియా గ్రామ సమాజాలు ఎందుకు మారజాలవో, ఆసియా రాజ్యాల నిరంతర పతన, పునఃస్థాపనాలకూ, పాలక వంశాల అనవరతమైన మార్పులకూ కొట్టవచ్చినంత భిన్నంగా ఎందుకు మారజాలవో, ఆ రహస్యానికి కీలకముంది. సమాజపు ఆర్థిక మూలకాల నిర్మాణానికి రాజకీయ గగనతలంలోని తుపాను మబ్బులు సోకవు.

నేనిదివరకే చెప్పినట్లు, ఒక యజమాని పనిలో పెట్టుకోగల ఉమేజుదారుల, రోజువారీ కూలీల సంఖ్యను వృత్తి సంఘాల నియమాలు అతి కచ్చితంగా పరిమితం చేశాయి; తద్వారా, అతను పెట్టుబడిదారుగా రూపొందకుండా నివారించాయి. అంతేకాదు, తాను యజమానిగా ఉన్నా ఆ ఒక్క

---

1. లెఫ్టినెంట్ కల్నల్ మార్క్ విల్క్స్ : ''హిస్టారికల్ స్కెచెస్ ఆఫ్ ది సౌత్ ఆఫ్ ఇండియా'' లండన్, 1810-17, సం. 1, పుటలు 118-120. భారతీయ సమాజాల వివిధ రూపాల గురించిన చక్కని వర్ణనను, ''మోడ్రన్ ఇండియా'' (లండన్, 1852) అన్న జార్జ్ కాంబెల్ పుస్తకంలో చూడవచ్చు.

2. ''ఈ సరళ రూపంలో ... ఈ దేశస్తులు అనాది కాలం నుంచి జీవిస్తున్నారు. గ్రామాల సరిహద్దులను ఎప్పుడో సకృత్తుగా కాని మార్చడం జరగలేదు. యుద్ధం, క్షామం, వ్యాధులు ఈ గ్రామాలకు గ్రామాలనే కొన్ని సందర్భాల్లో దెబ్బతీసినా, మరుభూమిగా మార్చినా, అదే పేరు, అదే సరిహద్దులు, అదే ప్రయోజనాలు, అదే కుటుంబాలు సైతం యుగ యుగాలుగా కొనసాగుతున్నాయి. రాజ్య విచ్ఛిత్తి విభజనను గురించి గ్రామవాసులు ఎప్పుడూ కలత చెందరు; గ్రామం మొత్తంగా నిల్చి ఉన్నంత కాలం, అది ఏ రాజ్యానికి బదిలీ అయిందో, తమకు రాజెవరో పట్టించుకోరు; దాని ఆంతరంగిక ఆర్థిక వ్యవస్థ మారకుండా నిల్చి ఉంటుంది. (టిహెచ్. స్టాంఫోర్డ్ రాఫుల్స్, కీ. రే. జావా లెఫ్టినెంట్ గవర్నరు ''ది హిస్టరీ ఆఫ్ జావా'', లండన్, 1817, సం. 1, పు. 285.)

వృత్తిలో తప్ప, ఇతర ఏ వృత్తిలోనూ అతను తన కూలివారిని పనిలో నియమించరాదు. వృత్తి సంఘాలు వర్తకుల పెట్టుబడి నుంచి వచ్చే ప్రతి దురాక్రమణనూ పట్టుదలతో తిప్పికొట్టాయి. వాటితో సంపర్కమేర్పడిన స్వేచ్ఛాయుత పెట్టుబడి రూపం అదొక్కటే. వర్తకుడు ప్రతి రకం సరకునూ కొనవచ్చు; కానీ శ్రమను మాత్రం సరకుగా కొనవీలులేదు. అతను చేతివృత్తుల ఉత్పాదితాల వ్యాపారిగా ఉన్నాడంటే, అతణ్ణి అలా ఉండనిచ్చినందువల్లనే పరిస్థితుల వల్ల ఇతోధిక శ్రమ విభజన అవసరమైనప్పుడు, నాడున్న వృత్తి సంఘాలు వివిధ రకాల వృత్తి సంఘాలుగా చీలిపోయేవి, లేదా పాత సంఘాల సరసనే కొత్తవి స్థాపితమయేవి. కానీ ఇదంతా, వివిధ చేతివృత్తులు ఒకే కార్ఖానాలో కేంద్రీకృతం కాకుండా జరిగేది. కాబట్టి చేతివృత్తులు వేరుపడి, ఒకదానికొకటి సంబంధం లేకుండాపోయి, నిర్దుష్టం కావడానికి వృత్తి సంఘ వ్యవస్థ ఎంతగా దోహదం చేసినప్పటికీ, కార్ఖానాలో శ్రమ విభజనకు ఆస్కారమివ్వలేదు. మొత్తంపై కార్మికుడూ, అతని ఉత్పత్తి సాధనాలూ – సత్తా, దాని గుల్లా ఉన్నట్లు – గాఢంగా అంటగట్టుకొని ఉండటం జరిగింది. ఆ విధంగా కార్ఖానా ఉత్పత్తికి ప్రధాన ప్రాతిపదిక – ఉత్పత్తి సాధనాల నుంచి కార్మికుని వేర్పాటూ, పెట్టుబడిగా ఆ సాధనాల పరివర్తనా – లోపించింది.

మొత్తం సమాజంలోని శ్రమ విభజన – అటువంటి శ్రమ విభజనను తెచ్చి పెట్టింది. సరకుల మార్పిడి అయినా – కాకపోయినా సమాజం యొక్క అత్యంత భిన్న ఆర్థిక రూపాలకు సమాన లక్షణం; కాగా కార్ఖానాలోని శ్రమ విభజన – కార్ఖానా ఉత్పత్తి దశ ఆచరణలోకి తెచ్చే శ్రమ విభజన – కేవలం పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం యొక్క ప్రత్యేక సృష్టి.

### విభాగం-5

## కార్ఖానా ఉత్పత్తి పెట్టుబడిదారీ స్వభావం

ఒక పెట్టుబడిదారుడి నియంత్రణ కింద హెచ్చిన కార్మికుల సంఖ్య మొత్తంపై సహకారానికీ, ప్రత్యేకించి కార్ఖానా ఉత్పత్తికీ – రెంటికీ కూడా సహజమైన ప్రారంభ బిందువు. కానీ కార్ఖానా ఉత్పత్తిలోని శ్రమ విభజన పనివారి సంఖ్యలో ఈ పెరుగుదలను సాంకేతిక ఆవశ్యకంగా చేస్తుంది. ఏ నిర్ణీత పెట్టుబడిదారైనా తప్పనిసరిగా నియమించవలసిన కార్మికుల కనీస సంఖ్యను, మునుపు రూఢమైన శ్రమ విభజన నిర్ణయిస్తుంది. మరోవైపు ఇతోధిక శ్రమ విభజన వల్ల ఒనగూడే సదుపాయాలు, పనివారి సంఖ్యను పెంచడం వల్ల మాత్రమే లభించగలవు. వివిధ పాక్షికపు పనివారి బృందాలను ఏదైనా పూర్ణ సంఖ్యచేత హెచ్చించడం ద్వారానే ఇది సాధ్యం. కాని, మదుపు పెట్టిన పెట్టుబడిలోని అస్థిర భాగం పెంపుదల వల్ల, దాని స్థిర భాగాన్ని కూడ, అంటే కార్ఖానా విభాగాలు, పరికరాలు మొదలయిన వాటినీ, ప్రత్యేకించి ముడి పదార్థాలనూ పెంచవలసిన అవసరమేర్పడుతుంది; వీటిని, పనివారి సంఖ్యకన్నా సత్వరంగా పెంచవలసి ఉంటుంది. ఒక నిర్ణీత పరిమాణం గల శ్రమ ఒక నిర్ణీత కాలంలో వాడే ముడి పదార్థాల పరిమాణం, ఆ శ్రమ విభజన పర్యవసానంగా ఆ శ్రమ ఉత్పాదక శక్తి పెరిగే నిష్పత్తిలోనే పెరుగుతుంది. కాబట్టి, ప్రతి పెట్టుబడిదారుని చేతిలో ఉండి తీరవలసిన కనీస పెట్టుబడి మొత్తం పెరుగుతూండాలనేది, మరో విధంగా చెప్పాలంటే, ఉత్పత్తి సామాజిక సాధనాలు, జీవన సామాజిక ఆధారాలు పెట్టుబడిగా పరివర్తన చెందడం విస్తరిస్తూ

పోవాలి అనేది, కార్ఖానా ఉత్పత్తి స్వభావంపైనే ఆధారపడిన ఒక నియమం.[1]

కార్ఖానా ఉత్పత్తి దశలోనూ, సహకార దశలోనూ కూడా సమష్టి పని యంత్రాంగం పెట్టుబడి అస్తిత్వ రూపం పలువురు విడి విడి ప్రత్యేకీకృత కార్మికులతో ఏర్పడిన యంత్రాంగం పెట్టుబడిదారునిది. కాబట్టి కార్మికులు సమ్మేళన ఫలితమైన ఉత్పాదక శక్తి పెట్టుబడి ఉత్పాదక శక్తిగా కనిపిస్తుంది. అసలైన కార్ఖానా ఉత్పత్తి దశ, మునుపు స్వతంత్రుడైన కార్మికుణ్ణి పెట్టుబడి యొక్క క్రమశిక్షణకూ, ఆజ్ఞకూ లోనుచేయడమే కాదు, దానికితోడు కార్మికుల్లోనే అంతస్తుల దొంతరను సృష్టిస్తుంది. సామాన్య సహకార దశ వ్యక్తుల పని విధానాన్ని మార్చకుండా, చాలావరకు యధాతథంగా ఉంచగా కార్ఖానా ఉత్పత్తి దశ దానిలో సంపూర్ణమైన విప్లవమే తెస్తుంది. శ్రమ శక్తిని సమూలంగా హస్తగతం చేసుకొంటుంది. కార్మికుని ఉత్పాదక సామర్థ్యాలనూ, సహజ ప్రేరణలనూ అణచివేసి, అతని ప్రత్యేకీకృత పని చాతుర్యాన్ని బలవంతాన పెంచడం ద్వారా కార్ఖానా ఉత్పత్తి దశ కార్మికుణ్ణి అంగవికలుడైన శత వికారిగా మార్చివేస్తుంది – లా ప్లాటా రాజ్యాల్లో పశు చర్మం కోసం, లేదా దాని కొవ్వు కోసం మొత్తం పశువునే చంపినట్లు. ప్రత్యేకీకృత పనిని వేరు వేరు వ్యక్తులకు పంపిణీ చేయటమే కాదు, వ్యక్తినే పాక్షికపు పని కొరకు స్వయంచలిత చోదక యంత్రంగా చేయటం జరుగుతుంది.[2] మనిషిని స్వశరీరంలోని ఒక ముక్కగా చేస్తున్న మెనెనియస్ అగ్రిప్పా అసంగతమైన కట్టుకథ వాస్తవమవుతోంది.[3] కార్మికుడు, మొదట్లో సరకును ఉత్పత్తి చేసే భౌతిక సాధనాలు తనకు లేనందువల్ల తన శ్రమ శక్తిని పెట్టుబడికి అమ్ముకోగా, ఇప్పుడతడు తన శ్రమ శక్తిని పెట్టుబడికి అమ్ముకొంటే తప్ప, అతనికి ఉపకరించడానికి అది నిరాకరిస్తుంది. ఆ అమ్మకం తరువాత, పెట్టుబడిదారుని కార్ఖానాలో గల వాతావరణంలో మాత్రమే శ్రమ శక్తి తన క్రియలను నిర్వహించగలదు. దేన్నీ స్వతంత్రంగా చేయడానికి స్వభావతః అయోగ్యుడైనందువల్ల, కార్ఖానా కార్మికుడు పెట్టుబడిదారుని కార్ఖానా తాలూకు ఉపాంగంగా మాత్రమే ఉత్పాదక క్రియాశీలతను పెంచుకుంటాడు.[4] దేవుని అభిమానం పొందినట్లు చెప్పుకునే యూదులు

---

1. "చేతివృత్తుల ఉప విభజనకు అవసరమైన పెట్టుబడి" (అవసరమైన జీవనాధారాలూ, ఉత్పత్తి సాధనాలూ అని ఈ రచయిత చెప్పి ఉండవలసింది.) "సమాజంలో సిద్ధంగా ఉంటేనే చాలదు. యజమానులు తమ పనులను భారీ స్థాయిలో సాగించడానికి వీలుగా వారి చేతుల్లో అది తగినంత పెద్ద పరిమాణాల్లో పోగుపడి ఉండాలి కూడా... విభజన పెరిగేకొద్దీ, ఒక నిర్ణీత సంఖ్యలో కార్మికులను నిరంతరం నియమించాలంటే, పరికరాల కొరకూ, ముడి పదార్థాల కొరకూ పెట్టుబడి మదుపు కూడ పెరుగుతూంటుంది." (స్టార్చ్ : కోర్స్ డి ఎకానమీ పోలిటిక్, పారిస్ కూర్పు, సం. 1, పుటలు 250-251) రాజకీయ రంగంలో ప్రభుత్వ అధికార కేంద్రీకరణా, ప్రైవేటు ప్రయోజనాల విభజనా ఎంత విడదీయరానివో, అంతగానూ ఉత్పత్తి సాధనాల కేంద్రీకరణా, శ్రమ విభజనా ఒకదాని నుండి ఒకటి విడదీయరానివి" (కార్ల్ మార్క్స్, మిసరే డి లా ఫిలాసఫీ, పుట 134.)
2. డుగాల్డ్ స్టివార్ట్ కార్ఖానా శ్రామికులను "పని పాక్షిక ప్రక్రియల్లో నియుక్తులైన ... సజీవ స్వయంచాలిత యంత్రాలు" అని పేర్కొంటున్నారు. (పూర్వోక్త గ్రంథం, పుట 318)
3. ప్రగడాల్లో ప్రతిదీ, వాస్తవంలో మొత్తం సముదాయానికి కడుపే; కాని అది, రోమన్ కులీనుని లాగా, పోషకాహారాన్ని 'సముదాయం నుంచి' సంగ్రహించదు సరికదా, సముదాయానికి దాన్ని సమకూర్చుతుంది.
4. "ఒకే మొత్తం చేతివృత్తిలో నిష్ణాతుడైన కార్మికుడు ఎక్కడైనా సరే పనిచేయగలడు. జీవనాధారాలను సంపాదించుకోగలడు; ఇతరుడు (కార్ఖానా కార్మికుడు') ఒక ఉపాంగం మాత్రమే; తన తోటివారి నుంచి

జెహోవా చేవ్రాలును తమ ఆకృతిపై తాల్చినట్లుగా, శ్రమ విభజన, కార్ఖానా ఉత్పత్తి దశ కార్మికుణ్ణి పెట్టుబడిదారుని ఆస్తిగా ముద్రవేస్తుంది.

ఆటవికుడు మొత్తం యుద్ధకళను సొంత జిత్తుల ప్రయోగంగా చేసినట్టుగా, స్వతంత్రుడైన రైతు లేదా చేతివృత్తి పనివాడు బహుకొద్దిగానే అయినా ఆచరణలో చూపే పరిజ్ఞానం, వివేచనా శక్తి, సంకల్పబలం – ఈ శక్తులన్నీ ఇప్పుడు, మొత్తం కార్ఖానాకు మాత్రమే అవసరం. ఉత్పత్తిలో తెలివితేటలు ఒకే దిశలో విస్తరిస్తాయి. ఎందువల్లనంటే, అవి అనేక ఇతర దిశల్లో అదృశ్యమవుతాయి. ప్రత్యేకీకృత కార్మికులు కోల్పోయినది. వారిని నియోగించే పెట్టుబడిలో కేంద్రీకృతమవుతుంది.[1] మరొకరి ఆస్తి పాలక శక్తి అయిన భౌతిక ఉత్పత్తి ప్రక్రియ యొక్క మేధా శక్తులకు కార్మికుణ్ణి ముఖాముఖిగా తీసుకురావడం అనేది, కార్ఖానా ఉత్పత్తుల్లో శ్రమ విభజన ఫలితమే. ఈ వేర్పాటు, సామాన్య సహకారంలో ప్రారంభమవు తుంది. అటువంటి సహకారంలో పెట్టుబడిదారుడు విడి విడి కార్మికుని దృష్టిలో పలువురి సంయుక్త శ్రమ యొక్క ఏకత్వానికీ, సంకల్పానికీ ప్రతీక. కార్మికుని ఒక ప్రత్యేకీకృత కార్మికునిగా దిగజార్చే కార్ఖానా ఉత్పత్తిలో ఈ వేర్పాటు పెంపొందుతుంది. శాస్త్ర విజ్ఞానాన్ని శ్రమకు భిన్నమైన ఉత్పాదక శక్తిగా చేసి, దాన్ని పెట్టుబడి సేవలోకి లాక్కొచ్చే ఆధునిక పరిశ్రమలో ఈ వేర్పాటు పరిపూర్ణమవుతుంది.[2]

కార్ఖానా ఉత్పత్తిలో సమష్టి కార్మికుణ్ణి, అతని ద్వారా పెట్టుబడినీ, సామాజిక ఉత్పాదక శక్తిలో సంపన్నం చేసేందుకు, ప్రతి కార్మికుణ్ణి వ్యక్తిగత ఉత్పాదక శక్తిలో దరిద్రునిగా చేసి తీరాలి... "అజ్ఞానం, మూఢ విశ్వాసాలకు లాగానే పరిశ్రమలకూ తల్లి". చింతన, ఊహ పొరపడవచ్చు కాని, చేయి లేదా కాలు కదిలించే అలవాటు చింతన, ఊహలలో దేనితోనూ నిమిత్తం లేనిది. ఆ కారణంవల్లనే బుద్ధి ప్రమేయం అతి తక్కువగా ఉన్నచోట, కార్ఖానాను... మనుషులే అంతర్భాగాలుగా ఉన్న ఒక ఇంజన్‌గా పరిగణించేచోట కార్ఖానా ఉత్పత్తులు వర్ధిల్లుతున్నాయి.[3] వాస్తవంలో 18వ శతాబ్ది మధ్యలోని కొందరు కార్ఖానా యజమానులు, వ్యాపార రహస్యాలయిన కొన్ని ప్రక్రియలకు కొంత వెర్రిమొర్రిగా ఉన్నవారిని నియమించడమే మేలనుకొన్నారు.[4]

---

వేరుపడినప్పుడు అతనికి సామర్థ్యం ఉండదు, స్వతంత్రమూ ఉండదు. తనపై రుద్దదగినదిగా పరిగణింపబడిన ఏ చట్టాన్నైనా అతను అంగీకరించక తప్పని స్థితిలో ఉంటాడు. (స్టార్చ్, ఉదాహృత గ్రంథం, పెయింట్ పీటర్స్ బర్గ్ కూర్పు, 1515, సం. 1, పుట 204)

1. ఎ. ఫర్గుసన్, ఉదాహృత గ్రంథం, పుట 281, "ఒకరు కోల్పోయినదాన్ని మరొకరు పొందవచ్చు."
2. "విషయ పరిజ్ఞానం గల మనిషీ, వస్తూత్పాదకుడైన కార్మికుడూ ఒకరికొకరు దూరమైపోతారు; కార్మికుని ఉత్పాదక శక్తులను పెంచడానికి అతని చేతిలో ఉపకరణగా ఉండవలసిన విషయ పరిజ్ఞానం... దాదాపు సర్వత్రా శ్రమకు వ్యతిరేకంగా మోహరించి నిల్చుంది... కార్మికుల కండబలాన్ని పూర్తి యాంత్రికమైనదిగా, విధేయమైనదిగా చేసేందుకు, వారిని ఒక పద్ధతి ప్రకారం మోసగిస్తూ పెడతోవ పట్టిస్తూంది." (డబ్ల్యు. థామ్సన్, "యాన్ ఎంక్వయిరీ ఇంటు ది ప్రిన్సిపుల్స్ ఆఫ్ ది డిస్ట్రిబ్యూషన్ ఆఫ్ వెల్త్". లండన్, 1824, పుట 274.)
3. ఎ. ఫెర్గుసన్, పూర్వోదాహృత గ్రంథం, పుట 280.
4. జె.డి. టుక్కెట్ : "ఎ హిస్టరీ ఆఫ్ ది పాస్ట్ అండ్ ప్రజంట్ స్టేట్ ఆఫ్ ది లేబరింగ్ పాపులేషన్", లండన్, 1846.

ఆడం స్మిత్ ఇలా అంటున్నారు : "మనుషుల్లో ఎక్కువమంది గ్రహణ శక్తిని వారి మామూలు ఉద్యోగాలు అవశ్యంగా రూపుదిద్దుతాయి. కొన్ని సరళమైన పనులను నిర్వహించడంలో యావజ్జీవితం గడిపే వ్యక్తికి తన గ్రహణ శక్తిని ఉపయోగించే అవకాశం ఉండదు... సాధారణంగా అతను మనిషి ఎంత మూఢుడూ, అజ్ఞాని కావడానికి వీలుందో, అంత మూఢుడూ, అజ్ఞాని అవుతాడు." ప్రత్యేకీకృత కార్మికుని మూఢత్వాన్ని వర్ణించిన తరువాత ఆడం స్మిత్ ఇలా చెబుతున్నారు : "అతని అచల జీవితం ఒకే విధంగా సాగడం వల్ల, సహజంగానే అతని మనోధైర్యం పాడవుతుంది... అతని శారీరక క్రియాశీలత సైతం పాడవుతుంది; తాను తరిఫీదయిన ఉద్యోగంలో తప్ప మరే ఇతర ఉద్యోగాల్లోనూ అతను శక్తివంతంగా, పట్టుదలతో తన బలం చూపలేడు. తన సొంత ప్రత్యేక వృత్తిలో అతని చాతుర్యం, ఈ విధంగా తన బౌద్ధిక, సామాజిక, సమరశీల సుగుణాలను పణంగా పెట్టి సంపాదించినవిగా కనిపిస్తాయి. కానీ, మెరుగైన, నాగరికమైన ప్రతి సమాజంలోనూ, శ్రమించే పేదలు అంటే, ప్రజానీకంలోని పెద్ద భాగం తప్పనిసరిగా దిగజారేది ఈ స్థితికే."[1] శ్రమ విభజనవల్ల బహుళ సంఖ్యాక ప్రజలు సంపూర్ణంగా పతనమైపోకుండా నివారించేందుకు ప్రజలకు రాజ్య వ్యవస్థే విద్య గరపాలని, అయితే జాగ్రత్తగా, హోమియోపతి మందుల్లాగా స్వల్ప మోతాదుల్లో అలా చేయాలని ఎ. స్మిత్ సూచిస్తున్నారు. ఆయన రచనల ఫ్రెంచి అనువాదకుడూ, వ్యాఖ్యాత అయిన జి. గార్నియర్ – మొదటి ఫ్రెంచి సామ్రాజ్యంలో ఎంతో సహజంగా, సెనేటర్‌గా ఎదిగిన ఈయన అంత సహజంగానూ ఈ విషయంపై స్మిత్‌ను వ్యతిరేకిస్తున్నారు. ప్రజా బాహుళ్యాలకు విద్యాబోధన శ్రమ విభజన తొలి సూత్రాన్ని ఉల్లంఘిస్తుందనీ, దానితో "మన మొత్తం సామాజిక వ్యవస్థ నిషిద్ధమవుతుందనీ" ఆయన ఉద్బోధిస్తున్నారు. ఆయన చెబుతున్నది : "సమాజం (ఆయన ఈ మాటను పెట్టుబడీ, భూస్థితీ, వాటి రాజ్య వ్యవస్థలకు పర్యాయంగా సరిగానే వాడుతున్నారు.) అంతకంతకూ మరింత సంపన్నమయ్యేకొద్దీ ఆ నిష్పత్తిలోనే శారీరక శ్రమ, మేధాశ్రమల మధ్య విభజన[2] ఇతర శ్రమ విభజనలన్నిటిలాగానే మరింత ప్రస్ఫుటమూ, నిశ్చితమూ అవుతుంది. ఈ శ్రమ విభజన, తక్కిన ప్రతి శ్రమ విభజనలాగానే, గత ప్రగతి ఫలితం, భావి ప్రగతికి కారణం... మరి, ప్రభుత్వం ఈ శ్రమ విభజనకు వ్యతిరేకంగా పనిచేసి, దాని సహజ గతిక్రమాన్ని నిరోధించాలా? విభజన కోసం, వేర్పడిపోవడం కోసం పాటుపడుతున్న రెండు శ్రామికవర్గాలను గందరగోళపరచి, వాటిని కలగలిపివేసే ప్రయత్నంలో

---

1. ఎ. స్మిత్, ''వెల్త్ ఆఫ్ నేషన్స్'', భాగం V, అధ్యాయం 1, అధికరణం 2. శ్రమ విభజన వల్ల సంభవించే హానికర ఫలితాలను ఎత్తిచూపిన ఆడం, ఫెర్గుసన్ శిష్యుడు కాబట్టి ఈ విషయం అతి స్పష్టంగా చెప్పారు. తన గ్రంథ పీఠికలో - అదే తన అభిప్రాయమైనట్లు, శ్రమ విభజనను పొగడుతున్న ఆ పీఠికలో - సామాజిక అసమానతలకు శ్రమ విభజన మూలమని కేవలం ప్రసంగవశాత్తు సూచిస్తారు. ''రాజ్య ఆదాయం'' గురించిన అయిదవ భాగానికి వచ్చే వరకు గాని ఆయన, ఫెర్గుసన్ మాటల్ని ఉటంకించరు : శ్రమ విభజనపై ఫెర్గుసన్, ఎ. స్మిత్, లెమొంటే, సేల విమర్శలకు సంబంధించినంత వరకు, వారి మధ్య గల చారిత్రక సంబంధాన్ని నేను నా 'మిజరీ డి లా ఫిలాసఫీ'లో తగినంత వివరించాను. కార్ఖానా ఉత్పత్తుల్లో అమలుజరుగుతున్నట్టి శ్రమ విభజన పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానపు ఒక నిర్దిష్ట రూపమని, మొట్ట మొదటిసారిగా నిరూపించాను.
2. ఫెర్గుసన్ అదివరకే ఇలా చెప్పారు : (ఉదాహృత గ్రంథం, పుట 281) : ''ఈ వేర్పాటుల యుగంలో ఆలోచించడమే ఒక విశిష్టమైన వృత్తిగా రూపొందవచ్చు.''

అది, ప్రజల డబ్బులో ఒక భాగాన్ని ఖర్చు పెట్టాలా?"[1]

కొంత శారీరక, మేధా వైకల్యం మొత్తం సమాజంలోని శ్రమ విభజన నుండి కూడా విడదీయరానిది. కాని, కార్ఖానా ఉత్పత్తి దశ, శ్రమ శాఖల యొక్క ఈ సామాజిక వేర్పాటును మరింత ముందుకు తీసుకుపోతుంది. అంతేకాక, దాని విద్దూరపు విభజన ద్వారా వ్యక్తిని, అతని జీవిత మూలకందాల వద్దనే దెబ్బగొడుతుంది; కాబట్టి, పారిశ్రామిక వ్యాధి లక్షణ శాస్త్రానికి మొట్టమొదటిసారిగా సమాచార సామాగ్రిని అందజేసి, దానికి ఊపునిచ్చినది కార్ఖానా ఉత్పత్తి దశే.[2]

"ఒక మనిషిని ఉప విభజన చేయటమంటే, అతడు మరణశిక్షా పాత్రుడైతే అతణ్ణి ఉరితీయడమే, దానికి పాత్రుడు కాకుంటే, అతణ్ణి హత్య చేయటమే... శ్రమ ఉప విభజన ఒక జాతిని హత్య చేయటమే."[3]

శ్రమ విభజనపై ఆధారపడిన సహకారం, మరో విధంగా చెప్పాలంటే కార్ఖానా ఉత్పత్తి, స్వయంజనిత నిర్మాణ రూపంగా ప్రారంభమవుతుంది. అది కొంత నిలకడనూ, విస్తృతినీ సంతరించుకొన్న వెంటనే ఒక పద్ధతీ, క్రమమూ గల పెట్టుబడిదారీ ఉత్పత్తి రూపంగా గుర్తింపు పొందుతుంది. కార్ఖానా ఉత్పత్తికి ఖచ్చితంగా కార్ఖానా ఉత్పత్తి అనదగిన దానికి – విలక్షణమైన శ్రమ విభజన, తొలుదొల్త అనుభవం ద్వారా, పాత్రధారుల కనుమరుగులో జరిగిందా అన్నట్లుగా, అత్యుపయుక్త రూపాన్ని ఎలా సంతరించుకొంటుందో, తరువాత, వృత్తి సంఘపు చేతివృత్తులలాగా, ఆ రూపాన్ని కనుగొన్న తరువాత ఎలా దానికి అంటిపెట్టుకొని ఉంటుందో, అక్కడక్కడ కొన్ని శతాబ్దాలపాటు ఎలా దాన్ని నిలుపుకుంటుందో చరిత్ర తెలుపుతూంది. ఈ రూపంలో ఏ మార్పైనా, స్వల్ప విషయాల్లో తప్ప, కేవలం శ్రమ సాధనాల్లో విప్లవం వల్లనే వస్తుంది. ఆధునిక కార్ఖానా ఉత్పత్తి అదెక్కడ తల ఎత్తినాసరే – ఇక్కడ నేను సూచిస్తున్నది యంత్రాలపై ఆధారపడిన ఆధునిక పరిశ్రమను కాదు – పెద్ద పట్టణాల్లో, దుస్తుల కార్ఖానా ఉత్పత్తిలోలాగా, చెల్లాచెదురుగా ఉన్న పాత్రధారులు

---

1. జి. గార్నియర్, ఎ. స్మిత్ గ్రంథానికి ఆయన అనువాదంలోని 5వ సంపుటి, పుటలు 4-5.
2. పాడువాలో అనువర్తిత వైద్యశాస్త్ర ఆచార్యుడు రమజ్జినీ "డి మార్బిస్ ఆర్టిఫికమ్" అనే తన రచనను 1713లో ప్రచురించారు; ఇది 1781లో, ఫ్రెంచిలో అనువదింపబడి, 1841లో, "ఎన్‌సైక్లోపిడియా సైన్సెస్ మెడికల్, 7 మెడిస్, ఆటెయర్స్ క్లాసిక్స్"లో పునర్ముద్రితమైంది. ఆయన ఇచ్చిన శ్రామిక వ్యాధుల పట్టీని, ఆధునిక యంత్ర పరిశ్రమ చాలా విస్తరింపచేసిందని వేరే చెప్పనక్కరలేదు. "హైజీన్ ఫిజీక్ ఎట్‌మోరేల్‌డి లా ఓవ్రియర్ డాన్స్ లే గ్రాండే విల్లె ఎన్ జనరల్ ఎట్ డాన్స్‌లా విల్లే డీ లయన్ ఎన్ పర్టిక్యులియర్. పర్‌లే డాక్టర్ ఎ. ఎల్. ఫంటరెట్, పారిస్ 1858." డై క్రాంఖీటెన్, విలే? వర్లీడ్‌నెన్, స్టాండెన ఆల్లర్స్ అండ్ గెర్‌బ్లెట్ టర్మ్ ఎయిజెన్‌థుమ్లిచ్ సిండ్, ఆరు సంపుటాలు, ఉర్మ్, 1860." తదితర రచనలను చూడండి. 1854లో కళా సంఘం పారిశ్రామిక వ్యాధుల విచారణ కమిషన్‌ను నియమించింది. ఈ కమిషన్ సేకరించిన పత్రాల జాబితా "ట్వికెన్ హోం ఎకనామిక్ మ్యూజియం" పట్టికలో కనిపిస్తుంది. అధికారయుతమైన "పౌర ఆరోగ్య నివేదికలు" చాలా ముఖ్యమైనవి. ఎడ్వర్డ్ రీచ్ ఎం.డి. రచన" ఉబెర్‌డై ఎన్‌టర్‌టుంగ్ డెస్ మెన్‌శ్చెన్," ఎన్‌లార్జన్, 1868ని కూడ చూడండి.
3. డి. ఉర్కుహార్ట్ : ("ఫెమిలియర్ వర్డ్స్". లండన్, 1855, పుట 119) హేగెల్‌కు, శ్రమ విభజనపై, ఆనాటి వాటికి చాలా భిన్నమైన అభిప్రాయాలుండేవి. తన "రెక్ట్ ఫిలాసఫీ"లో ఆయన ఇలా చెబుతున్నారు : "బాగా చదువుకొన్న వారంటే ముఖ్యంగా ఇతరులు చేసే ప్రతిదీ చేయగలవారని, మన అవగాహన."

కేవలం ఒకచోట చేర్చబడేందుకు ఎదురుచూస్తూ సర్వసిద్ధంగా, దాని అందుబాటులో ఉంటారు; లేదా అది పుస్తకాల బైండింగు లాంటి చేతివృత్తిలోని వివిధ చర్యలను కేవలం ఆ యా ప్రత్యేకమైన పనివారికి కేటాయించడం ద్వారా విభజన సూత్రాన్ని సులభంగా అమలు జరుపగలదు; అటువంటి సందర్భాల్లో, వివిధ క్రియలకు అవసరమైన పనివారు ఏ నిష్పత్తిలో ఉండాలో నిర్ణయించడానికి ఒక వారం అనుభవం చాలు.[1]

చేతివృత్తులను వేరు వేరు భాగాలుగా విభజించడం ద్వారా శ్రమ సాధనాల ప్రత్యేకీకరణ ద్వారా, ప్రత్యేకీకృత కార్మికుల ఏర్పాటు ద్వారా, వారిని ఒకే యంత్రాంగంగా సమీకరించి, సమ్మిళితం చేయడం ద్వారా, కార్ఖానా ఉత్పత్తిలో శ్రమ విభజన, సామాజిక ఉత్పత్తి ప్రక్రియలో, ఒక గుణాత్మక అంతస్తుల దొంతరనూ, పరిమాణాత్మక నిష్పత్తినీ సృష్టిస్తుంది. తత్పర్యవసానంగా అది సామాజిక శ్రమకు ఒక నిర్ధిష్ట వ్యవస్థను సృష్టిస్తుంది; తద్వారా, అదే సమయంలో సమాజంలో కొత్త ఉత్పాదక శక్తులను పెంపొందిస్తుంది. తన నిర్దిష్ట పెట్టుబడిదారీ రూపం ఆ నిర్ణీత పరిస్థితుల్లో అది పెట్టుబడిదారీ రూపం తప్ప మరే ఇతర రూపమూ ధరించజాలదు – ధరించినా కార్ఖానా ఉత్పత్తి, సాపేక్ష అదనపు విలువను ఆవిర్భవింపచేసేందుకు, లేక కార్మికుణ్ణి నష్టపెట్టి, పెట్టుబడి స్వయం విస్తరణను పెంచేందుకు ఒక ప్రత్యేక పద్ధతి మాత్రమే. ఈ పెట్టుబడినే, మామూలుగా సామాజిక సంపద, "జాతుల సంపద" మొదలయిన పేర్లతో పిలుస్తారు. కార్ఖానా ఉత్పత్తిలోని శ్రమ విభజన కార్మికుని ప్రయోజనానికి బదులు పెట్టుబడిదారు ప్రయోజనం కోసం శ్రమ యొక్క సామాజిక ఉత్పాదక శక్తిని పెంచడమే కాక, వ్యష్టి కార్మికులను అవిటివాళ్ళనుగా చేయడం ద్వారా ఈ పని చేస్తుంది. అది శ్రమ మీద పెట్టుబడి పెత్తనానికి నూతన పరిస్థితులను సృష్టిస్తుంది. కాబట్టి, అది ఒక వంక చారిత్రకంగా పురోగతిగా, సమాజ ఆర్థికాభివృద్ధిలో ఒక ఆవశ్యమైన దశగా రంగంపైకి వచ్చినా, దోపిడీ చేసే నాజూకు, నాగరిక పద్ధతి అది. ఒక స్వతంత్ర శాస్త్రంగా మొట్టమొదట కార్ఖానా ఉత్పత్తి దశలో ఆవిర్భవించిన రాజకీయ అర్థశాస్త్రం, సామాజిక శ్రమ విభజనను కార్ఖానా ఉత్పత్తి దృక్కోణం నుంచి మాత్రమే చూస్తుంది.[2] దాన్ని ఒక నిర్ణీత పరిమాణం గల శ్రమతో మరిన్ని సరకులను ఉత్పత్తి చేసే సాధనంగా మాత్రమే, అందువల్ల, సరకులను చౌకపరచేందుకు, పెట్టుబడి సంచయనాన్ని వేగిరపరచేందుకు సాధనంగా మాత్రమే పరిగణిస్తుంది. పరిమాణానికీ, మార్పిడి విలువకూ ప్రాధాన్యమిచ్చే ఈ దృష్టికి ప్రాచీన గ్రీకు రచయితల వైఖరి కొట్టవచ్చినంత విరుద్ధమైనది. వారి దృష్టి

1. శ్రమ విభజనలో వ్యష్టి పెట్టుబడిదారు, ముందుగానే చూపే సృజనాత్మక ప్రతిభపై అమాయకమైన నమ్మకం నేడు హెర్‌రోష్చర్ లాంటి జర్మన్ ప్రొఫెసర్లలో మాత్రమే ఉంది. తయారుగా ఉన్న శ్రమ విభజనను, తన దివ్య మేధ నుంచి ప్రాదుర్భవింపచేసిన పెట్టుబడిదారుకు బహుమతిగా ఆయన, "వివిధ వేతనాలను" ధారాదత్తం చేస్తున్నారు. శ్రమ విభజనను దాదాపు విస్తృతంగా అమలుజరపడం, డబ్బుసంచి నిండుతనంపై ఆధారపడి ఉంటుందే తప్ప, ప్రతిభా మహత్తుపై కాదు.

2. "అడ్వాంటేజెస్ ఆఫ్ ది ఈస్టిండియా ట్రేడ్" అనే పుస్తకం రచించిన అజ్ఞాత గ్రంథకర్త వంటి పాతకాలపు రచయితలు, కార్ఖానా ఉత్పత్తిలో అమలుజరిగే శ్రమ విభజన తాలూకు పెట్టుబడిదారీ లక్షణాన్ని ఎ. స్మిత్ కన్నా కూడా బాగా బహిర్గతం చేశారు.

అంతా కేవలం నాణ్యంపైనా, ఉపయోగపు విలువపైనా[1] సామాజిక ఉత్పత్తి శాఖలు వేరుపడిన ఫలితంగా సరకులు మరింత చక్కగా తయారవుతాయి; వ్యక్తుల అభిరుచులు, ప్రతిభలు తమకు తగిన రంగాన్ని ఎంచుకొంటాయి.[2] ఏదో కొంత అదుపు లేకుండా, ఎక్కడా ముఖ్యమైన ఫలితాలేవీ సాధింపబడ జాలవు.[3] కాబట్టి ఉత్పాదితాన్నీ, ఉత్పాదకుణ్ణీ కూడా శ్రమ విభజన మెరుగుపరుస్తుంది. ఉత్పత్తి అయిన వస్తువుల పరిమాణం పెరుగుదలను అప్పుడప్పుడు పేర్కొనడం జరిగిందంటే, మరింత సమృద్ధిగా ఉన్న ఉపయోగపు విలువల ప్రస్తావన సందర్భంగానే. మార్పిడి విలువ గురించిగానీ, సరకులు చౌక కావటం గురించి గానీ ఒక్క మాట కూడా లేదు. ఉపయోగపు విలువ మాత్రమే దృష్టిలో గల ఈ వైఖరిని ప్లేటో కూడా[4] – వర్గాల కింద సమాజం విభజితం కావడానికి శ్రమ

1. ఆధునికుల్లో, బెక్కారియా, జేమ్స్ హారిస్ లాంటి కొద్దిమంది 18వ శతాబ్ది రచయితలు ఇందుకు మినహాయింపు; వీరు శ్రమ విభజన విషయంలో ప్రాచీనులను పూర్తిగా అనుసరిస్తున్నారు. ఉదాహరణకు, బెక్కారియా ఇలా రాస్తున్నారు : "చేతుల్నీ, తెలివితేటల్నీ ఒకే విధమైన పనికీ, ఒకే ఉత్పాదితాలకూ ఎల్లప్పుడూ వినియోగించినట్లయితే, ప్రతి వ్యక్తీ తనకు అవసరమైన వస్తువులను స్వయంగా తయారుచేసుకొనేటప్పటికన్నా, వాటిని మరింత సులభంగా... మరింత సమృద్ధిగా, మరింత నాణ్యమైనదిగా ఉత్పత్తి చేస్తాడని అందరికీ తెలుసు... ఈ విధంగా, మానవులు తమకూ, సమాజానికీ సౌకర్యంగా ఉండేలా, వివిధ వర్గాలుగా విభజితులై ఉన్నారు." (సీజర్ బెక్కారియా, "ఎలిమెంట్స్ డి ఎకనామియా పబ్లికా", సం. కు స్టోడి, పార్లె మా పెర్నా, సం. II, పుట 29.) సెయింట్ పీటర్స్‌బర్గ్‌లోని తన దౌత్య కార్యాలయం "డైరీల"వల్ల ప్రఖ్యాతుడైన జేమ్స్ హారిస్ (ఈయన ఉత్తరోత్తరా ఎర్ల్ ఆఫ్ మాల్మెస్‌బరీ, అయ్యారు), "డైలాగ్ కన్సర్నింగ్ హాపీనెస్" (లండన్, 1741) అన్న తన రచనకు జోడించిన వివరణలో ఇలా చెప్పారు : "సమాజం సహజసిద్ధమైనదని (అంటే, పనుల విభజన ద్వారా) నిరూపించే మొత్తం వాదన ప్లేటో రాసిన 'రిపబ్లిక్'లోని రెండవ భాగం నుంచి గ్రహించినది." "డైలాగ్ కన్సర్నింగ్ హాపీనెస్" ఆ తరువాత "త్రీ ట్రీటీస్" మూడవ కూర్పు, లండన్ (1772)లో పునర్ముద్రితమైంది.
2. ఉదాహరణకు, ఒడెస్సే - XIV, 228లో "వేరు వేరు వ్యక్తులు వేరు వేరు పనుల్లో ఆనందానుభూతి పొందుతారు" అని ఉంది : సెక్స్టస్ ఎంపెరికస్ రచనలో ఆర్కిలోకస్ ఇలా అంటున్నాడు : "వేరు వేరు వ్యక్తులకు వేరు వేరు విషయాలు హృదయోల్లాసం కలిగిస్తాయి."
3. అతను అనేక పనులు చేయగలడు. కానీ అన్నిటినీ అధ్వాన్నంగానే. ప్రతి ఎథీనియనూ, సరకుల ఉత్పాదకుడుగా తాను ఒక స్పార్టన్ కన్నా అధికుడనని భావించేవాడు. ఎందువల్లనంటే, ఎథీనియన్లను పెలోపొనీషియన్ యుద్ధానికి రెచ్చగొట్టిన పెరిక్లిస్ ప్రసంగంలో, అతనిచే థుసిడిడెస్ చెప్పించినట్లుగా, స్పార్టన్‌కు యుద్ధకాలంలో కావలసినంత మంది మనుషులు తన ఆధీనంలో ఉండేవారు. కానీ, చేతిలో డబ్బు ఆడేది కాదు. (తుసిడైడెస్ : 1, ఉదాహృత గ్రంథం, 41) కానీ, వస్తూత్పత్తి విషయంలో కూడా, శ్రమ విభజనకు విరుద్ధమైన స్వయం సంపూర్ణత వారి ఆదర్శంగా ఉంటూ వచ్చింది. వెనుక పేర్కొన్నవారికి (స్పార్టన్లకు - అను) సంక్షేమముంది. కాని మొదట పేర్కొన్నవారికి (ఎథీనియన్లకు - అను) స్వాతంత్ర్యముంది. ఇక్కడ ఒక విషయం చెప్పాలి - 30 మంది నిరంకుశుల పతనం నాటికి భూస్థితి లేని ఎథీనియన్లు 5000 మంది కంటే తక్కువగా ఉండినారు.
4. ప్లేటో దృష్టిలో, సమాజంలోని శ్రమ విభజన అన్నది, వ్యక్తులకు బహువిధ అవసరాలూ, పరిమిత సామర్థ్యాలూ ఉండడం వల్ల ఉత్పన్నమైన పరిణామం. ఆయన ప్రధాన వాదన ఏమంటే శ్రామికుడు పనికి అనుగుణంగా తన్ను తాను దిద్దుకోవాలే తప్ప, పనిని శ్రామికునికి అనుగుణంగా దిద్దరాదు. అతను ఒకేసారి పలు వృత్తులను నిర్వహిస్తూ, ఆ విధంగా వాటిలో ఏదో ఒకదాన్ని అప్రధానమైనదిగా చేస్తే పని అలా దిద్దుబాటుకాక తప్పదు - "ఎందువల్లనంటే పని శ్రామికుని తీరిక సమయంకోసం వేచి ఉండదు;

విభజనను ప్రాతిపదికగా పరిగణించిన ప్లేటో కూడా – గ్జెనోఫోన్[1] లాగానే అవలంబించారు. గ్జెనోఫోన్, విలక్షణమైన బూర్జువా ప్రవృత్తితో, కార్ఖానాలో శ్రమ విభజనకు మరింత దగ్గరగా వచ్చారు. శ్రమ విభజనను రాజ్య నిర్మాణ సూత్రంగా పరిగణించిన మేరకు ప్లేటో రిపబ్లిక్, ఈజిప్టు కుల వ్యవస్థను ఆదర్శంగా ఎంచిన ఎథీనియన్ దృక్పథ చిత్రణమే. ఎందువల్లనంటే ఈజిప్టు ఐసోక్రేట్స్‌తో[2] సహా,

---

కాగా, శ్రామికుడు అది తన ప్రధాన వ్యవహారమనే దృష్టితో ఆ పని చేయాలే తప్ప, దాన్ని ఒక ఉపవృత్తిగా చూడకూడదు.'' ''అతను నిజంగా ఆ దృష్టితోనే ఆ పని చేయాలి.'' ''ఒక మనిషి తన స్వభావానికి అనుగుణమైన ఒకే పనిని, సరియైన సమయంలో ఇతర వృత్తులను మానుకొని చేసినట్లయితే, మరిన్ని వస్తువులు, మరింత చక్కగా, మరింత సులభంగా తయారవు తాయి.'' (ప్లేటో : ''రిపబ్లిక్'' 2వ భాగం, 2వ పేరా, కూర్పు, బెయిలుర, బరెల్లి, వగైరా). అదే విధంగా తుసిడైడెస్‌లో (ఉదాహృత గ్రంథం పేరా 142) ఇలా ఉంది : ''నావికా వృత్తి ఇతర వృత్తులలాగానే ఒక కళ; పరిస్థితులనుబట్టి, ఒక ఉపవృత్తిగా నిర్వహించ వీలుకానిది. అంతేకాదు, దీనితోపాటు ఇతర ఉపవృత్తులను నిర్వహించ వీలులేదు.'' ''పని శ్రామికునికోసం వేచి ఉండవలసి వస్తే, పని క్రమంలోని కీలక క్షణం తప్పిపోయి, ఆ వస్తువు చెడిపోతుంది'' అని ప్లేటో అంటున్నాడు: ''పనికి సరియైన సమయాన్ని ఎవరైనా జారవిడిస్తే అది చెడిపోతుంది.'' ఫ్యాక్టరీ చట్టంలో, పనివారందరికీ ఒక నిర్ణీతమైన భోజన సమయాన్ని నిర్దేశించే నిబంధనకు వ్యతిరేకంగా ఇంగ్లీషు బ్లీచర్లు (నూలు బట్టలు తెలుపు చేసే ఫ్యాక్టరీ యజమానులు - అను) సాగిస్తున్న నిరసనోద్యమంలో ప్లేటో వ్యక్తం చేసిన భావమే తిరిగి వ్యక్తమవుతూంది. శ్రామికుల సౌకర్యం కోసం వారి వ్యాపారం వేచి ఉండజాలదు. ఎందువల్లనంటే, ''ఉడకబెట్టడం, ఉతకడం, తెలుపు చేయడం, ఇస్త్రీ చేయడం, నునుపు చేయడం, రంగద్దడం వంటి వేరు వేరు పనుల్లో దేన్ని కూడా, నష్టం జరిగే ప్రమాదం లేకుండా, ఒక నిర్ణీత సమయంలో ఆపివేయ వీలులేదు - పనివారందరికీ ఒకే భోజన సమయాన్ని ఏర్పాటుచేయడం వల్ల అసంపూర్ణ చర్యల మూలంగా విలువైన వస్తువులు చెడిపోయే ప్రమాదానికి అప్పుడప్పుడు గురికావచ్చు.'' దీని తరువాత ప్లేటో నిజం ఎక్కడ తేలుతుందో మరి!

1. పర్షియా రాజుగారి భోజనపు బల్లపై నుంచి ఆహారం అందుకోవటం కేవలం గౌరవమే కాదు. ఆ ఆహారం ఇతర ఆహారం కన్నా చాలా రుచికరమైనది, అంటారు గ్జెనోఫోన్. ''ఇది ఆశ్చర్యకరమైనదేమీ కాదు; ఎందువల్లనంటే, మహాపట్టణాల్లో ఇతర కళలను ప్రత్యేక పరిపూర్ణతా స్థాయికి తెచ్చినట్లుగానే రాజుల ఆహారం కూడ ఒక ప్రత్యేక పద్ధతిలో వండుతారు. చిన్న పట్టణాల్లో ఒకే వ్యక్తి మంచాలు, తలుపులు, నాగళ్ళు, బల్లలు చేస్తాడు. అంతేకాదు, ఇళ్ళుకడతాడు. తనకు వచ్చే బేరం తన జీవనానికి సరిపోతే అతను పూర్తిగా తృప్తిచెందుతాడు. అన్ని పనులు చేసే మనిషి అవన్నీ బాగా చేయడం పూర్తిగా అసాధ్యం. కాని, ప్రతి ఒక్కరికీ అనేక కొనుగోలుదార్లుండే పెద్ద పట్టణాల్లో, ఒకే వృత్తిలో ఉన్నవాణ్ణి పోషించడానికి ఆ వృత్తి చాలు. అంతేకాదు, ఒక సంపూర్ణ వృత్తి సైతం తరచు అవసరం లేదు. పురుషుల పాదరక్షలు ఒకరు, స్త్రీల పాదరక్షలు మరొకరు తయారు చేయవచ్చు. ఒకడు బట్టలు కత్తిరించడం తప్ప మరేమీ చేయడు; మరొకడు ఆ కత్తిరించిన వాటిని కుట్టడం తప్ప మరే పని చేయడు. కాబట్టి అత్యంత సరళమైన పని చేసే వ్యక్తి ఆ పని తక్కినవారికన్న బాగా చేస్తాడని దీన్నిబట్టి, ఆవశ్యంగా తేలుతోంది. పాకకళ కూడా అంతే''. (గ్జెనోఫోన్ : సైరోపీడియా, 8వ భాగం, 2వ ప్రకరణం.) శ్రమ విభజన స్థాయిలు, మార్కెట్ ఏ మేరకు ఉందనే దానిపై ఆధారపడి ఉంటాయని గ్జెనోఫోన్‌కు బాగా తెలుసు. అయినా ఆయన ఇక్కడ ఉపయోగపు విలువ అందుకొన్న ఉత్కృష్టతకు మాత్రమే ప్రాధాన్యమిస్తున్నారు.
2. ఆయన (బుసిరిస్) వారందరినీ ప్రత్యేక కులాలుగా విభజించారు. ఆయా వ్యక్తులు ఎల్లప్పుడూ ఆయా వృత్తులను మాత్రమే అనుసరించాలని ఆజ్ఞాపించారు. ఎందువల్లనంటే, తమ వృత్తులను మార్చేవారు ఏ వృత్తిలోనూ నిపుణులు కాలేరని, ఒకే వృత్తికి నిరంతరం అంటిపెట్టుకొని ఉన్నవారు దాన్ని అత్యున్నత పరిపూర్ణ స్థాయికి తీసుకెడతారనీ ఆయనకు తెలుసు. వాస్తవంలో కళల, వృత్తుల విషయంలో వారు,

ప్లేటో సమకాలికులనేకుల దృష్టిలో పారిశ్రామిక దేశానికి ఆదర్శంగా ఉండేది; రోమన్ సామ్రాజ్యం నాటి గ్రీకులు దానికి ఈ ప్రాముఖ్యమిస్తూనే వచ్చారు.[1]

అసలైన కార్ఖానా ఉత్పత్తి దశలో, అటే పెట్టుబడిదారీ ఉత్పత్తి ధరించిన ప్రముఖ రూపంగా కార్ఖానా ఉత్పత్తి ఉన్న కాలంలో, దాని ప్రత్యేక ధోరణులు పూర్తిగా పెంపొందడానికి ఎన్నో అవరోధాలు ఎదురయ్యాయి. ఇదివరకే మనం చూసినట్టు, కార్ఖానా ఉత్పత్తి కార్మికులలో నిపుణులూ, అనిపుణులూ అనే సరళమైన వేర్పాటును తెచ్చి, అదే సమయంలో అంతస్తుల వారీగా వారిని వర్ణాలుగా ఏర్పరచినప్పటికీ, నిపుణుల సర్వాధిక ప్రభావం వల్ల అనిపుణుల సంఖ్య చాలా పరిమితంగా ఉంటుంది. కార్ఖానా ఉత్పత్తి పాక్షిక చర్యలను సజీవ శ్రమ సాధనాల పరిణితిలోనూ, బలంలోనూ అభివృద్ధిలోనూ గల వేరు వేరు స్థాయిలకు అనుగుణంగా మలచి, ఆ విధంగా స్త్రీలనూ, పిల్లలనూ దోచుకొనేందుకు దోహదం చేసినప్పటికీ, మొత్తంపై ఈ పోకడ, పురుష కార్మికుల అలవాట్లు వల్లా, ప్రతిఘటన వల్లా భగ్నమయింది. చేతివృత్తుల విభజన వల్ల, ఒక వ్యక్తి కార్మికుడుగా తయారయ్యేందుకు అయ్యే వ్యయం తగ్గిపోతుంది; అందువల్ల అతని విలువ తగ్గుతుంది. అయినప్పటికీ, మరింత కష్టమైన పాక్షికపు పనికి, ఎక్కువ కాలం ఉమేజుదారుగా ఉండవలసి వస్తుంది; అది అవసరం లేని పరిస్థితిలో కూడా ఉండి తీరాలని పనివారు పట్టుదలతో ఆ పద్ధతిని నిలుపుకున్నారు. ఉదాహరణకు ఇంగ్లండులో, ఏడేండ్ల ప్రొబేషన్‌ను నిర్దేశించే ఉమేజుదారీ చట్టాలు కార్ఖానా ఉత్పత్తి దశ ముగిసే వరకు అమల్లో ఉండేవి; ఆధునిక పరిశ్రమ అవతరించే వరకు వాటిని తోసివేయటం జరగలేదు. చేతివృత్తి నైపుణ్యం కార్ఖానా ఉత్పత్తికి పునాది కనుకనూ, మొత్తం కార్ఖానా ఉత్పత్తి యంత్రాంగానికి, స్వయంగా కార్మికులు తప్ప ఒక చట్రమంటూ లేదు కనుకనూ, కార్మికుల అవిధేయతతో పెట్టుబడి నిరంతరం శిగపట్లు పట్టక తప్పదు. మిత్రుడు ఉరే ఇలా అంటున్నారు: "మానవ స్వభావంలోని బలహీనత మూలంగా, కార్మికుడు ఎంత నిపుణుడైతే, అతను అంత హఠవాదిగా, అంత మొండిఘటంగా తయారవుతాడు. అందువల్ల ఒక యాంత్రిక వ్యవస్థలో అంతర్భాగంగా ఇమడటానికి సహజంగానే అంత అనర్హుడుగా తయారవుతాడు... దానితో అతను... మొత్తం యంత్రాంగానికే పెద్ద నష్టం కలుగజేయవచ్చు.[2] అందువల్లనే మొత్తం కార్ఖానా ఉత్పత్తి కాలమంతటా, కార్మికుల క్రమశిక్షణా రాహిత్యాన్ని గురించిన ఫిర్యాదు 'పూసలో దారంలా' ఉంది.[3] సమకాలీన రచయితల సాక్ష్యం మనకు లేకపోయి ఉండినా, సామాన్య వాస్తవాలే ఈ విషయం వేనోళ్ళ చాటుతున్నాయి. అవేమంటే 16వ శతాబ్దికీ, ఆధునిక పరిశ్రమల యుగానికీ మధ్య గల కాలంలో, కార్ఖానా ఉత్పత్తి కార్మికులు వినియోగించ వీలున్న మొత్తం పని కాలాన్ని పెట్టుబడి తన ఆధీనంలోకి తెచ్చుకోలేకపోవడం, కార్ఖానాల కొద్ది కాలపు

---

చేతగానివాణ్ణి చేయితిరిగినవాడు మించిన దానికన్నా ఎక్కువగా తమ పోటీదారులను మించిపోయారు. రాచరికాన్నీ, వారి రాజ్యానికి సంబంధించిన ఇతర వ్యవస్థలనూ కాపాడటానికి గల సాధనాలు ఎంత ప్రశంసనీయమైనవంటే, ఈ విషయాన్ని తరచిన ప్రసిద్ధ తత్వవేత్తలు, ఈజిప్షియన్ రాజ్యాంగ నిర్మాణాన్ని తక్కిన వాటికన్న చాలా ఎక్కువగా పొగడుతున్నారు. (ఐసోక్రీట్స్, బుసిరిస్, అధ్యాయం 8.)

1. చూ. డైయొడోరస్ సికులస్.
2. ఉరే : పూర్వోదాహృత గ్రంథం, పుట 20.
3. ఇది ఫ్రాన్స్‌లో కన్నా ఇంగ్లండులో ఎక్కువ, హాలండ్‌లో కన్నా ఫ్రాన్స్‌లో ఎక్కువ.

మనుగడలు; వలస పోయే, వలస వచ్చే కార్మికులతో పాటు అవీ ఒక దేశం నుంచి మరొక దేశానికి తరలిపోవడం. "వర్తక, వాణిజ్యాలపై వ్యాసం" గ్రంథకర్త – తరచు ఉదాహరింపబడుతున్న ఈ గ్రంథకర్త "ఏదో ఒక విధంగా క్రమ పద్ధతిని ప్రవేశపెట్టాలి" అని 1770లో ఘంటాపథంగా చెప్పారు. 66 సంవత్సరాల తరువాత డాక్టర్ ఆండ్ర్యూ ఉరే "క్రమ పద్ధతి" అని ప్రతిధ్వానం చేశారు. "శ్రమ విభజన గురించిన పాండిత్యపు పిడిసూత్రం"పై ఆధారపడిన కార్ఖానా ఉత్పత్తిలో "క్రమ పద్ధతి" కొరవడింది; "ఆర్క్‌రైట్ క్రమ పద్ధతిని సృష్టించారు."

అదే సమయంలో, కార్ఖానా ఉత్పత్తి సమాజ ఉత్పాద క్రమాన్ని, సంపూర్ణంగా చేజిక్కించుకోవడం గానీ, ఆ ఉత్పాదన క్రమంలో ఆమూలాగ్రంగా విప్లవం తీసుకురావడంగానీ చేయలేకపోయింది. అది పట్నపు చేతివృత్తుల, గ్రామీణ గృహ పరిశ్రమల విస్తృత పునాదిపైన కృత్రిమమైన ఆర్థిక నిర్మాణంగా ఉవ్వెత్తుగా లేచింది. దాని అభివృద్ధిలోని ఒకానొక దశలో కార్ఖానా ఉత్పత్తికి ఆధారభూతంగా ఉన్న సంకుచిత సాంకేతిక ప్రాతిపదిక, కార్ఖానా ఉత్పత్తే స్వయంగా సృష్టించిన ఉత్పత్తి అవసరాలతో ఘర్షణ పడింది.

ప్రత్యేకించి, అప్పటికే వినియోగంలో ఉన్న సంక్లిష్ట యాంత్రిక పరికరాలతో సహా శ్రమ పరికరాలను ఉత్పత్తి చేసే కర్మాగారం, కార్ఖానా ఉత్పత్తి, పరిపూర్ణంగా సృష్టించిన వాటిలో ఒకటి. యంత్రాల ఫ్యాక్టరీ, "ఫైల్, డ్రిల్, లేత్ వంటి బహువిధ తరగతుల్లో శ్రమ విభజనను ప్రదర్శించింది. వీటిలో ప్రతి దానికీ నైపుణ్యంలో తరతమ భేదాలున్న కార్మికుడుండేవాడు" అని అంటారు ఉరే (పుట 21). కార్ఖానా ఉత్పత్తిలోని శ్రమ విభజన ఫలితమైన ఈ కర్మాగారం, తన వంతుగా యంత్రాలను ఉత్పత్తి చేసింది. సామాజిక ఉత్పత్తిని నియంత్రించే సూత్రంగా, చేతివృత్తి పనివాని పనిని తుడిచిపెట్టింది ఈ యంత్రాలే. ఆ విధంగా పాక్షిక క్రియకు కార్మికుణ్ణి యావజ్జీవితం కట్టివేసిన సాంకేతిక కారణం ఒకవైపు నిర్మూలన కాగా, మరోవైపు పెట్టుబడి అధికారంపై ఇదే సూత్రం విధించిన బంధనాలు పటాపంచలయ్యాయి.

## అధ్యాయం - 15

# యంత్రాలు, ఆధునిక పరిశ్రమలు

### విభాగం-1

## యంత్రాల అభివృద్ధి

**జా**న్ స్టువర్ట్ మిల్ "రాజకీయ అర్థశాస్త్ర సూత్రాలు" అన్న తన గ్రంథంలో ఇలా చెబుతున్నారు: ఇంతవరకు సృష్టించిన యంత్రాలన్నీ కూడా, ఏ మనిషి శ్రమ భారాన్నైనా తగ్గించాయా అనేది సందేహాస్పదమే."[1] కానీ, పెట్టుబడిదారులు యంత్రాలను వాడటంలోని ఉద్దేశం అది కానే కాదు. శ్రమ ఉత్పాదకతలోని ప్రతి ఇతర పెరుగుదల లాగానే, యంత్రాలు సరుకులను చవకపరచడానికి ఉద్దేశించినవి. శ్రమ దినంలో, కార్మికుడు తన కోసం పనిచేసే భాగాన్ని తగ్గించడం ద్వారా, అతను సమాన ప్రతిఫలం లేకుండా పెట్టుబడిదారుడికిచ్చే మిగతా భాగాన్ని పొడిగించడానికి ఉద్దేశించినవి. ఒక్క ముక్కలో చెప్పాలంటే, అవి అదనపు విలువను ఉత్పత్తి చేసే సాధనాలు.

ఉత్పత్తి పద్ధతిలో విప్లవం, కార్ఖానా ఉత్పత్తిలో శ్రమ శక్తితో ప్రారంభమవుతుంది; ఆధునిక పరిశ్రమల్లో అది శ్రమ సాధనాలతో ప్రారంభమవుతుంది. కాబట్టి పరికరాలుగా ఉన్న శ్రమ సాధనాలు యంత్రాలుగా ఎలా మారాయి, లేక యంత్రానికి చేతివృత్తికి చెందిన పరికరాలకు తేడా ఏమిటి అనేది మనం తొలుత పరిశీలించవలసిన విషయం. ఇక్కడ మనకు నిమిత్తమున్నది కొట్టవచ్చినట్లు కనిపించే సాధారణ లక్షణాలతో మాత్రమే; ఎందుచేతనంటే సమాజ చరిత్రలోని యుగాలు ఒకదాని నుండి మరొకటి, కచ్చితమైన, విభజన రేఖల వల్ల భూగర్భశాస్త్ర, యుగాల లాగానే వేరుపడినవి కావు.

గణిత శాస్త్రజ్ఞులు, యంత్ర శాస్త్రజ్ఞులు పరికరాన్ని సరళమైన యంత్రమనీ, యంత్రాన్ని పరికరమనీ అంటారు – ఈ విషయంలో వారిని కొందరు ఆంగ్లేయ ఆర్థిక శాస్త్రజ్ఞులు అనుసరిస్తున్నారు. వాటి మధ్య ప్రధానమైన భేదముందని వారనుకోవటం లేదు. సామాన్యమైన యాంత్రిక పరికరాలకు, మీట (lever), వాలుబల్ల (inclined plane) మర మేకు (Screw), అడ్డుచీల (Wedge) మొదలయిన వాటికి సైతం యంత్రమని పేరుపెడుతున్నారు.[2] వాస్తవానికి, ప్రతి యంత్రం, ఆ సామాన్య శక్తుల సమ్మేళనే – అవి ఏ మారురూపంలో ఉన్నా సరే. అర్థశాస్త్ర దృష్ట్యా ఈ వివరణకెట్టి విలువా లేదు.

---

1. మిల్, "ఇతరుల శ్రమ వల్ల బతకని ఏ మనిషి" అని చెప్పి ఉండే ఉండవలసింది; ఎందువల్లనంటే, యంత్రాలు నిస్సందేహంగా, సంపన్నులైన సోమరిపోతుల సంఖ్యను ఎంతో పెంచింది.
2. ఉదాహరణకు, "కోర్స్ ఆఫ్ మేథమేటిక్స్" అనే హట్టన్ గ్రంథం చూడండి.

ఎందువల్లనంటే, అందులో చారిత్రకాంశం లేదు. పరికరం విషయంలో చోదక శక్తి మనిషి కాగా, యంత్రానికి చోదక శక్తి మనిషికి భిన్నమైన మరొకటి, ఉదాహరణకు, జంతువు, నీరు, గాలి మొదలయినవి, అంటూ పరికరానికి, యంత్రానికీ మధ్య గల భేదాన్ని గురించిన మరో వివరణ ఉంది.[1] దీని ప్రకారం, ఎడ్లులాగే నాగలి – అత్యంత భిన్న యుగాలకు సమాన సాధ్యమైన నాగలి, యంత్రం కాగా, ఒకే ఒక కార్మికుని నిర్వాహకత్వంలో నిమిషానికి 96,000 చుక్కల్లి అల్లే క్లాసిన్ గుండ్రని మగ్గం కేవలం ఒక పరికరం మాత్రమే అవుతుంది. అంతేకాదు, ఈ మగ్గమే చేతితో నడిపినప్పుడు పరికరమైనప్పటికీ, ఆవిరి శక్తితో నడిపితే యంత్రమైపోతుంది. పశు శక్తిని ఉపయోగించడం మానవుని తొట్టతొలి సృష్టిలో ఒకటి కాబట్టి, యంత్రాలతో ఉత్పత్తి చేతివృత్తులతో ఉత్పత్తికన్నా ముందే జరిగి ఉంటుంది. 1735లో జాన్ వ్యాట్ తన వడికే యంత్రాన్ని రంగంపైకి తెచ్చి, 18వ శతాబ్ది పారిశ్రామిక విప్లవానికి నాంది పలికినప్పుడు, ఆయన దాన్ని ఒక మనిషికి బదులు కంచరగాడిద నడిపే ఊసెత్తనే లేదు. కానీ ఈ పని పడింది దాని పైనే; దాన్ని ఆయన, "వేళ్ళు లేకుండా వడికే యంత్రం" అని వర్ణించారు.[2]

సంపూర్ణంగా అభివృద్ధిపరచిన అన్ని యంత్రాల్లో ప్రధానాంశాల్లో భిన్నమైన మూడు భాగా

---

1. "ఈ దృక్కోణం నుంచి మనం పరికరానికీ, యంత్రానికీ మధ్య తేడా చూపే స్పష్టమైన రేఖ గీయవచ్చు: పారలు, సుత్తులు, ఉలులు మొదలయినవీ, మీటల సమ్మేళనలు, మరమేకుల సమ్మేళనలు - ఇతర విషయాల్లో ఎంత జటిలంగా ఉన్నప్పటికీ, నాటికి మనిషే చోదక శక్తి ... ఇవన్నీ పరికరమన్న భావన కిందికొస్తాయి. కాని పశువులాగే నాగలి, గాలిమరలు (wind mills) మొదలయిన వాటిని యంత్రాల కింద వర్గీకరించాలి." (విల్ హెల్మ్ స్కుల్జ్ : "డై బెవెగుంగ్‌డెర్ ప్రొడక్షన్", జూరిచ్ 1843, పుట 38) అనేక విషయాలను బట్టి ఇది ఎన్నదగిన పుస్తకం.
2. ఆయన కాలానికి ముందు, వడుకే యంత్రాలు చాలా లోపభూయిష్టంగా ఉన్నప్పటికీ, వాడుకలో ఉండేవి. బహుశా అవి మొదట ఇటలీలో రంగంపైకి వచ్చాయి. 18వ శతాబ్ది నూతన సృజనలేవీ కూడా ఒక వ్యక్తి పని కాదని సాంకేతిక శాస్త్ర సవిమర్శక చరిత్ర రుజువు చేస్తుంది. ఇంత వరకు ఇటువంటి పుస్తకం లేదు. డార్విన్ ప్రకృతి సాంకేతిక శాస్త్ర చరిత్రపై, అంటే, మొక్కల, జంతువుల అవయవాలు రూపుగొనే తీరును ప్రాణాధారాలను ఉత్పత్తి చేసే సాధనాలుగా ఏ యే అవయవాలు ఉపయోగపడుతాయనే సంగతిని గురించీ మనకు ఆసక్తి కలిగించారు. మనిషి ఉత్పాదక అవయవాల, సమస్త సామాజిక వ్యవస్థకు భౌతిక ప్రాతిపదిక అయిన అవయవాల చరిత్ర కూడా అంతటి శ్రద్ధ చూపదగినది కాదా? అటువంటి చరిత్ర రచన మరింత సులభం కాదా? ఎందువల్ల నంటే, వికో చెబుతున్నట్లు, మానవ చరిత్రకూ, ప్రకృతి చరిత్రకూ గల భేదమిది - మనం మానవ చరిత్ర నిర్మాతలం, కానీ, ప్రకృతి చరిత్ర నిర్మాతలం కాదు. ప్రకృతి పట్ల మానవుడు వ్యవహరించే పద్ధతినీ, అతనికి ప్రాణాధారమైన వస్తూత్పత్తి క్రమాన్నీ సాంకేతిక శాస్త్రం వెల్లడిస్తుంది; తద్వారా అతని సామాజిక సంబంధాలూ, వాటి నుంచి ఉత్పన్నమైన మానసిక భావనలూ రూపుగొన్న తీరును కూడా బట్టబయలు చేస్తుంది. ఈ భౌతిక ప్రాతిపదికను పరిగణనకు తీసుకోని మత చరిత్ర సైతం సవిమర్శక దృష్టి లేనిది. వాస్తవంలో, జీవిత యథార్ధ సంబంధాల నుంచి, ఆ సంబంధాల యొక్క తత్ పారలౌకిక రూపాలను అభివృద్ధిపరచడం కన్నా ఇటువైపు నుంచి, మత అయోమయ సృష్టిలోని లౌకిక సారాన్ని, విశ్లేషణ ద్వారా కనుగొనడం మరింత సులభం. మొదటి పద్ధతి ఒక్కటే భౌతిక శాస్త్ర ఊహాత్మక భౌతిక వాదంలో, చరిత్రకు, దాని పరిణామ క్రమానికీ చోటివ్వని భౌతికవాదంలో గల బలహీనతలు, దాని ప్రతినిధులు తమ ప్రత్యేక విషయ హద్దులను దాటి వెళ్ళినప్పుడల్లా వారి ఊహావాద, భావజాల శాస్త్ర భావనల నుంచి వెంటనే తెలిసిపోతాయి.

లుంటాయి; మోటారు యంత్రాంగం, ప్రసారక యంత్రాంగం, ఆఖరుది పరికరం, లేదా పని నిర్వాహక యంత్రం. మోటారు యంత్రాంగం, మొత్తం యంత్రాన్ని చలనంలో పెడుతుంది; అది, ఆవిరి ఇంజన్, ఉష్ణోత్పాదక ఇంజన్, విద్యుదయస్కాంత యంత్రం మొదలయిన వాటిలాగా తన సొంత సంచాలక శక్తిని ఉత్పత్తి చేస్తుంది; లేదా జలపాతం నుంచి నీటి చక్రం, గాలి నుంచి గాలిమర వంటి వాటిలాగా అదివరకే ఉన్న ప్రకృతి శక్తి నుంచి తన ప్రేరక శక్తిని గ్రహిస్తుంది. ఫ్లై–వీల్స్, షాఫ్టింగ్, పళ్ళ చక్రాలు, కప్పీలు, పట్టీలు, తాళ్ళు, దట్టీలు, చిన్న పళ్ళ చక్రాలు, అనేక విధాలైన గేర్లు గల ప్రసారక యంత్రాంగం చలనాన్ని నియంత్రిస్తుంది. అవసరమైనప్పుడు దాని రూపాన్ని, ఉదాహరణకు సరళరేఖా చలనగతిని వర్తుల చలనగతిగా మారుస్తుంది; ఆ చలనాన్ని విభజించి, పని నిర్వాహక యంత్రాల మధ్య పంపిణీ చేస్తుంది. మొత్తం యంత్రాంగంలోని ఈ రెండు భాగాలు ఉన్నది పని నిర్వాహక యంత్రాలను చలనంలో పెట్టడానికి మాత్రమే; ఈ చలనం ద్వారానే, అది శ్రమ వస్తువును తన పట్టులోకి తెచ్చుకొని, కోరిన విధంగా మార్చుతుంది. పరికరంతోనే లేదా యంత్రాంగంలోని పని నిర్వాహక యంత్రంతోనే 18వ శతాబ్ది పారిశ్రామిక విప్లవం ప్రారంభమైంది. ఈ రోజు వరకు, ఒక చేతి వృత్తిని, లేదా ఒక వస్తూత్పత్తిని యంత్రాలతో నిర్వహింపబడే పరిశ్రమగా మార్చినప్పుడల్లా అది సదా అటువంటి ప్రారంభ బిందువుగా ఉంది.

అసలైన పని నిర్వాహక యంత్రాన్ని మరింత నిశితంగా పరిశీలిస్తే, తరచూ నిస్సందేహంగా, ఎంతో మార్పు చెందిన రూపాల్లోనే అయినా, ఒక సార్వత్రిక నియమంగా, అందులో చేతివృత్తికారుడు, లేదా కార్ఖానా ఉత్పత్తిలోని కార్మికుడు ఉపయోగించిన సాధనాలు, పరికరాలు కనిపిస్తాయి. కానీ ఒకే భేదముంది – అవి మానవుని పరికరాలు కాక, ఒక యంత్రాంగంలో పరికరాలు, లేదా యాంత్రిక పరికరాలు. మొత్తం యంత్రం. మరమగ్గంలాగా[1] పాత చేతివృత్తి పరికరం దాదాపు మారిన యంత్ర రూపంగానైనా ఉంటుంది; లేదా, నూలు యంత్రంలోని కదుళ్ళలాగా, స్టాకింగుల మగ్గంలోని సూదుల్లాగా, కోత యంత్రంలోని రంపాల్లాగా, నరికే యంత్రంలో కత్తుల్లాగా యంత్రపు చట్రంలో బిగించిన పని నిర్వాహక భాగాలుగానైనా ఉంటాయి. ఈ పరికరాలకూ, యంత్రం అసలు భాగానికీ మధ్య తేడా వాటి పుట్టుక నాటి నుంచే ఉంది. ఎందువల్లనంటే, అవి చాలావరకు చేతివృత్తి ద్వారానో, లేదా, కార్ఖానా ఉత్పత్తి ద్వారానో ఉత్పత్తి అయి, ఆ తరువాత యంత్రాల ఉత్పాదితమైన యంత్ర ప్రధాన భాగంలో అమర్చబడుతుంది.[2] కాబట్టి, అసలు యంత్రమనేది, చలనంలో పెట్టబడిన తరువాత, మునుపు శ్రామికుడు ఏ పరికరాలతో ఏ పనులు చేసేవాడో, అదే పరికరాలతో చేసే యంత్రం నుంచి వచ్చినా ఒక్కటే. ఆ పరికరాన్ని మానవుడి నుంచి తీసుకొని, ఒక యంత్రాంగంలో అమర్చిన

1. ప్రత్యేకించి మర మగ్గం తొలి రూపంలో, చూసీ చూడగానే, పూర్వకాలపు మగ్గాన్ని మనం గుర్తించగలం.
2. ఇంగ్లండులో యంత్ర పరికరాల్లో అంతకంతకు ఎక్కువ భాగం యంత్రాలే తయారు చేస్తున్నవి. గత 15 సంవత్సరాలుగానే (దాదాపు 1850 నుంచి) వీటిని కూడా యంత్రాలను తయారుచేసే వారు ఉత్పత్తి చేయడం లేదు. ఈ యాంత్రిక పరికరాలను తయారుచేసే యంత్రాలకు ఉదాహరణలివి - దారపు ఉండ గొట్టం తయారీ యంత్రం, ఏకుల తయారీ యంత్రం, నూలు కండె సంచాల పరికరాన్ని తయారుచేసే యంత్రం, దారం వడుకే కదుళ్ళను, దారానికి పురిపెట్టి కండెలుగా చుట్టే కదుళ్ళను తయారుచేసే యంత్రాలు.

క్షణం నుంచి యంత్రం కేవలం ఒక పరికరం స్థానం వహిస్తుంది. మనిషే ప్రధాన చోదకుడుగా కొనసాగిన సందర్భాల్లో కూడా, ఈ తేడా కొట్టవచ్చినట్లు మనకు కనిపిస్తుంది. మనిషి తానుగా, ఏకకాలంలో ఉపయోగించగల పరికరాల సంఖ్యను, అతనికి సొంత, సహజమైన ఉత్పాదక సాధనాల సంఖ్య, అంటే అతని శరీరాంగాల సంఖ్య పరిమితం చేస్తుంది. జర్మనీలో మొదట, నూలు వడుకే ఒక వ్యక్తితో రెండు రాట్నాలతో పని చేయించడానికి, అంటే ఏకకాలంలో రెండు కళ్ళతోనూ, రెండు చేతులతోనూ పని చేయించడానికి ప్రయత్నించారు. ఇది మరీ కష్టమైపోయింది. ఆ తరువాత, రెండు కదుళ్ళు గల ట్రెడిల్ రాట్నాన్ని కొత్తగా సృజన చేశారు. కానీ, రెండు తలల మనుషులు లేనట్టే, రెండు దారాలను ఒకేసారి వడుకగల నిపుణులు లేరు. కానీ జెన్నీ యంత్ర రాట్నం, అది రూపొందిన నాటి నుంచినే 12–18 కదుళ్ళతో వడుకుతూ వచ్చింది. స్టాకింగుల అల్లిక మగ్గం ఏకకాలంలో అనేక వేల సూదులతో అల్లుతుంది. ఒక యంత్రం ఏకకాలంలో పనిలో పెట్టగల పరికరాల సంఖ్య, మొట్టమొదటి నుంచీ, చేతివృత్తికారుని పరికరాల్లో నక్కి ఉన్న శరీరాంగ పరిమితుల నుంచి విముక్తమయింది.

కేవలం చోదక శక్తిగా ఉన్న మనిషికీ, కార్మికుడుగా, లేదా పని నిర్వాహకుడుగా (అలా పిలవడమే సరియైనది) ఉన్న మనిషికీ మధ్య వ్యత్యాసం అనేక చేతి పరికరాల్లో కొట్టవచ్చినట్లు కనిపిస్తుంది. ఉదాహరణకు, పాదం, రాట్నానికి ప్రధాన చోదక శక్తి కాగా, చేయి, కదురుతో పని చేయిస్తూ, దారం తీస్తూ, దానికి పురిపెడుతూ నూలు వడుకడమన్న అసలు పని నిర్వహిస్తుంది. పారిశ్రామిక విప్లవం తొలుత తన పట్టులోకి తెచ్చుకొనింది, చేతివృత్తికారుని పరికరంలోని ఈ ఆఖరు భాగాన్నే. అది యంత్రాన్ని కళ్ళతో గమనించడం, దాని తప్పులను తన చేతులతో సరిదిద్దడం అనే కొత్త పనికి తోడు, చోదక శక్తిగా ఉండే కేవలం యాంత్రిక పని భాగాన్ని మాత్రమే కార్మికునికి వదిలివేసింది. మరోవైపు, కొన్ని పరికరాల విషయంలో మనిషి ఎల్లప్పుడూ వట్టి చోదక శక్తిగా, ఉదాహరణకు, పిండి మిల్లు వంపుటిరుసును (Crank) తిప్పడం,[1] పంపుగొట్టడం, కొలిమితిత్తుల గెడలను పైకీ, కిందికీ ఆడించడం, రోకలితో దంచడం మొదలయిన పనుల ద్వారా, వట్టి చోదక శక్తిగా పనిచేస్తాడు. అనతి కాలంలోనే అటువంటి పరికరాలకు పశువులను, నీటిని,[2] గాలిని

1. "కళ్ళంలో ఎద్దుతో ధాన్యం తొక్కించేటప్పుడు దానికి మూతి కట్టు బిగించవద్దు" అని మోసెస్ చెప్పాడు. కాని జర్మనీలో, దాన దయాపరులైన క్రైస్తవులు, అందుకు భిన్నంగా, పిండి కొట్టటానికి చోదక శక్తిగా ఉపయోగించిన బానిసలు, తమ చేతులతో పిండిని నోట్లో వేసుకోకుండా నివారించేందుకు వారి మెడల చుట్టూతా ఒక చెక్కపలక బిగ్గట్టేవారు.

2. మంచి జలపాతాలున్న వాగులు లేకపోవడం కొంత, ఇతర విషయాల్లో నీరు అపారంగా ఉండటం కొంత, డచ్‌వారు తప్పనిసరిగా గాలిని చోదక శక్తిగా ఉపయోగించుకొనేలా చేశాయి. అసలు గాలి మర వారికి జర్మనీ పెట్టిన భిక్ష. అక్కడ గాలి మర సృష్టితో, ప్రభు వర్గీయులకు, మత గురువులకు, చక్రవర్తికి మధ్య ఈ ముగ్గురిలో గాలి 'ఎవరిది' అనే విషయమై పెద్ద గొడవ ప్రారంభమైంది. గాలి బానిసత్వాన్ని తెచ్చిపెడుతోంది అని జర్మనీలో గగ్గోలు లేచిన సమయంలోనే గాలి హాలెండ్‌కు స్వేచ్ఛ ప్రసాదించింది. అది ఈ సందర్భంలో దాస్యానికి దిగజార్చింది డచ్ దేశీయుణ్ణి కాదు. డచ్ దేశీయుని కోసం అక్కడి భూమిని, భూమిలో మూడింట రెండు వంతులు మళ్ళీ చిత్తడి నేలలుగా మారకుండా నివారించేందుకై 1836లో హాలెండ్‌లో మొత్తం 6,000 అశ్వ శక్తి గల 12,000 గాలి మరలు ఇంకా ఉపయోగించేవారు.

ఉపయోగించే అవసరం ఏర్పడుతుంది. అక్కడక్కడ కార్ఖానా ఉత్పత్తి దశకన్నా చాలా నాళ్ళముందూ, కొంతమేరకు ఆ దశలోనూ ఈ పరికరాలు యంత్రాలుగా మారిపోతాయి. అయితే ఉత్పత్తి పద్ధతిలో ఎటువంటి విప్లవాన్ని సృష్టించకుండా అలా జరుగుతుంది. ఆధునిక పరిశ్రమల కాలంలో, ఈ పరికరాలు, చేతి కొరముట్ల రూపంలో సైతం అప్పటికే యంత్రాలుగా ఉన్నాయని స్పష్టంగా కనపడుతుంది. ఉదాహరణకు, 1836–37లో డచ్‌వారు ఆహార్లెం సరస్సు నీటిని పూర్తిగా తోడివేసేందుకు వాడిన పంపులు, మామూలు పంపుల సూత్రంపై నిర్మాణమయినవి. భేదమల్లా ఒకటే – ఆ పంపుల పిస్టన్లను మనుషులకు బదులు బ్రహ్మాండమైన ఆవిరి ఇంజన్లు ఆడించాయి. ఇంగ్లండులో చాలా లోపభూయిష్టమైన మామూలు, కమ్మరి కొలిమితిత్తులు కర్రను ఆవిరి ఇంజన్‌కు అనుసంధించడం ద్వారా, వాటిని గాలిని ఊదే ఇంజన్‌గా తరచూ మార్చడం జరుగుతోంది. అసలు ఆవిరి ఇంజనే 17వ శతాబ్దాంతాన, కార్ఖానా ఉత్పత్తి దశలో, దాన్ని కనిపెట్టినప్పటి తీరులోనూ 1780[1] నాటి వరకు అది కొనసాగిన తీరులోనూ, ఏ విధమైన పారిశ్రామిక విప్లవానికీ దారితీయలేదు. పైపెచ్చు, ఆవిరి ఇంజన్ల స్వరూపంలో విప్లవం రావలసిన అవసరం కలిగించింది. యంత్రాల సృజనే, మనిషి తన శ్రమ గ్రహీత వస్తువుపై ఒక పరికరంలో పనిచేయడానికి బదులు, ఒక పరికర యంత్రానికి కేవలం చోదక శక్తి అయిన వెంటనే, ఆ చోదక శక్తి మనిషి కండరం ముసుగు ధరించడం కేవలం యాదృచ్ఛికమే. అది అంత బాగానూ గాలి, నీరు, లేదా ఆవిరి రూపం ధరించవచ్చు. రూపంలోని అలాంటి మార్పు, మనిషిచే మాత్రమే నడపబడటానికై ఆదిలో నిర్మాణమైన యంత్రాంగంలో గొప్ప సాంకేతిక మార్పులను తీసుకు రాకుండా ఇది నివారించదు. ఈనాడు కొత్త పుంత తొక్కవలసిన యంత్రాలు – కుట్టు యంత్రాలు, రొట్టె తయారుచేసే యంత్రాలు మొదలయిన వాటి వంటివి, వాటి స్వభావాన్ని బట్టి స్వల్పస్థాయిలో వినియోగానికి వీలయినవి కాకపోతే తప్ప, మనిషే, అచ్చం యాంత్రికమైన చోదక శక్తీ కూడా నడపటానికి నిర్మాణమవుతున్నాయి. పారిశ్రామిక విప్లవానికి నాందీవాచకమైన యంత్రం, ఒకే ఒక పరికరంతో పని చేసే కార్మికుణ్ణి తొలగించి, అతని స్థానంలో అటువంటివే పలు పరికరాలతో పనిచేసే ఒకే ఒక చోదక శక్తిచే ఆ శక్తి రూపం ఏమైనప్పటికీ, ప్రచలితమయ్యే యంత్రాంగాన్ని ప్రవేశపెడుతుంది.[2]

యంత్ర పరిమాణంలోనూ, పనిచేసే తత్పరికరాల సంఖ్యలోనూ పెరుగుదల మూలంగా దాన్ని నడపడానికి మరింత భారీ యంత్రాంగం అవసరమవుతుంది. ఈ యంత్రాంగ ప్రతిఘటనను అధిగమించడానికి మనిషి కన్నా బలమైన చోదక శక్తి అవసరం. అంతేకాదు, ఒకే విధమైన, నిరంతరాయ చలన సృష్టికి మనిషి చాలా లోపభూయిష్టమైన పరికరం. కానీ, అతను ఒక మోటారుగా మాత్రమే పనిచేస్తున్నాడని, ఒక యంత్రం అతని పరికర స్థానాన్ని ఆక్రమించిందనీ అనుకొన్నప్పుడు, అతని స్థానంలో ప్రకృతి శక్తులను ప్రవేశపెట్టవచ్చునని విదితమవుతుంది. కార్ఖానా ఉత్పత్తి దశ నుంచి

1. నిజంలో దాన్ని, వాట్ రూపొందించిన తొలి ఏక ప్రక్రియ ఇంజన్ ఎంతో మెరుగుపరచింది. కానీ ఈ రూపంలో అది, కేవలం నీటిని, ఉప్పుగనుల నుంచి ద్రావణాన్ని తోడే యంత్రంగానే కొనసాగింది.
2. "ఒకే ఒక మోటారుచే ప్రచలితమయ్యే ఈ సాధారణ పరికరాల సమ్మేళనొక యంత్రమవుతుంది." (బాబేజ్, పూర్వోదాహృత గ్రంథం)

సంక్రమించిన భారీ మోటారులన్నిటిలోకి అశ్వ శక్తి అధ్వాన్నమయినది. ఎందువల్లనంటే, ఒక కారణం గుర్రానికీ సొంత బుద్ధి ఉంది; రెండోది దాని ఖరీదెక్కువ; ఫ్యాక్టరీలలో దాని వినియోగావకాశాలు బహు పరిమితం.[1]

అయినప్పటికీ, ఆధునిక పరిశ్రమల శైశవ దశలో గుర్రాన్నే విస్తారంగా వాడేవారు. ఆనాటి వ్యవసాయదారుల ఫిర్యాదులే కాక, యాంత్రిక శక్తిని వ్యక్తంచేసే మాటగా ఈనాటికీ నిలిచి ఉన్న "అశ్విక శక్తి" అనే పదం కూడా ఇందుకు నిదర్శనం. గాలి మరీ అస్థిరమైనది. అదుపులో ఉంచ శక్యం కానిది. అదీకాక, ఆధునిక పరిశ్రమల జన్మస్థానమైన ఇంగ్లండులో కార్ఖానా ఉత్పత్తి దశలో సైతం, జల శక్తి వినియోగం ప్రబలంగా ఉండేది. ఒకే నీటి చక్రంతో రెండు జతల తిరగలి రాళ్ళను తిప్పేందుకు 17వ శతాబ్దిలోనే ప్రయత్నాలు జరిగాయి. కానీ చలన ప్రసార మీటల పరిమాణం పెరగడంతో జలశక్తి వాటికి తూగలేకపోయింది. జలశక్తి చాలలేదు. రాపిడి నియమాల గురించి మరింత కచ్చితంగా పరిశోధన చేయడానికి దారితీసిన కారణాల్లో ఇదొకటి. ఒక మీటను తోయటం, లాగడం ద్వారా చలనంలో ఉంచిన మిల్లుల్లో, చోదక శక్తి వల్ల సంభవించే క్రమబద్ధతా రాహిత్యం, అదే విధంగా ఫ్లైవీల్ గురించిన సిద్ధాంతానికీ, దాన్ని ప్రవేశపెట్టడానికీ దారితీసింది. అది, ఆ తరువాత ఆధునిక పరిశ్రమల్లో ఎంతో ముఖ్య పాత్ర వహిస్తుంది.[2] ఈ విధంగా, కార్ఖానా ఉత్పత్తి కాలంలో, ఆధునిక యాంత్రిక పరిశ్రమల తొలి శాస్త్ర, సాంకేతిక అంశాలు అభివృద్ధి చెందాయి. ఆర్క్‌రైట్ నూలు రాట్నపు మిల్లు మొట్టమొదటి నుంచి నీటితో నడిచింది. కానీ, ఇంత జరిగినా, ప్రధానమైన చోదక శక్తిగా నీటి వాడకంలో ఎన్నో చిక్కు లుండేవి. కావలసినప్పుడు దాన్ని పెంచడానికి వీలయ్యేది

---

1. 1861 జనవరిలో జాన్ సి. మోర్టన్ కళాకారుల సంస్థల సమావేశంలో "వ్యవసాయంలో వినియోగించు శక్తులు" అన్న పత్రం చదివారు. దానిలో ఆయన ఇలా చెబుతున్నారు : "భూమిని ఒకే రీతికి తెచ్చేందుకు తోడ్పడే ప్రతి మెరుగుదలా, ఆవిరి యంత్రాన్ని శుద్ధ యాంత్రిక శక్తి ఉత్పాదనకు అంతకంతకు మరింత వినియోగార్హంగా చేస్తుంది. వంకరటింకర కంచెలు ఇతర అడ్డంకులు ఒకే విధమైన పనికి నిరోధకంగా ఉన్నచోటల్లా అశ్వ శక్తి అవసరమవుతుంది. ఈ అడ్డంకులు రోజు రోజుకు అదృశ్యమవుతున్నాయి. బలప్రయోగం కన్నా సంకల్ప శక్తి ఎక్కువ అవసరమైన పనులకు వినియోగార్హమైనది. అనుక్షణం మానవ బుద్ధిచే నియంత్రితమైన శక్తే. వేరు మాటల్లో చెప్పాలంటే మానవ శక్తి." ఇలా చెప్పిన తరువాత, మోర్టన్ ఆవిరి శక్తిని, అశ్వ శక్తిని, మానవ శక్తిని ఆవిరి ఇంజన్ల విషయంలో సర్వత్రా వాడుకలో ఉన్న యూనిట్‌లోకి (అంటే 33,000 పౌండ్లను ఒక నిమిషంలో ఒక అడుగు ఎత్తడానికి పట్టే శక్తి) మార్చి ఆవిరి ఇంజన్ నుంచి లభించే ఒక ఆశ్విక శక్తికి గంటకు 3 పెన్నీలు, గుర్రం నుంచి లభించే ఆశ్విక శక్తికి గంటకు $5\frac{1}{2}$ పెన్నీలు ఖర్చవుతుందని లెక్క వేశారు. అంతేకాదు, గుర్రం సంపూర్ణారోగ్యంతో ఉండాలంటే అది రోజుకు 8 గంటలకన్నా ఎక్కువ పని చేయరాదు. ఏడాదిలో భూమి దున్నడానికి ఉపయోగించే ప్రతి ఏడు గుర్రాల్లో కనీసం మూడు గుర్రాలను, ఆవిరి శక్తి వాడకంతో వదులుకోవచ్చు. ఈ ఆవిరి శక్తి వాడకానికయ్యే వ్యయం ఆ మూడు గుర్రాలకు, అవి ఫలప్రదంగా పని చేయగల 3 లేదా 4 నెలల్లో అయ్యే ఖర్చుకు మించదు. ఆఖరు విషయం, ఆవిరి శక్తిని వినియోగించ వీలున్న వ్యవసాయప్పనుల్లో, అది అశ్వ శక్తికన్నా పని నాణ్యతను మెరుగుపరుస్తుంది. ఒక ఆవిరి ఇంజన్ చేసే పనికి 66 మంది మనుషులు కావాలి. వారికి మొత్తంగా అయ్యే ఖర్చు గంటకు 15 షిల్లింగులు. ఒక గుర్రం చేసే పనికి 32 మంది మనుషులు కావాలి. వారికి మొత్తంగా అయ్యే ఖర్చు గంటకు 8 షిల్లింగులు.
2. ఫాల్ హేబర్, 1625, డీకాస్, 1688.

కాదు. సంవత్సరంలోని కొన్ని రుతువుల్లో అది పనిచేయలేకపోయింది. అన్నిటికీ మించి, అది ప్రధానంగా స్థానికమైనది.[1] బొగ్గు, నీరు వినియోగం ద్వారా తన సొంత శక్తిని సృష్టించుకొన్నట్టి, తన శక్తిని పూర్తిగా మానవుని అదుపులో ఉంచినట్టి, చలనశీలమై చాలక సాధ్యమైనట్టి, పట్టణవాసి అయినట్టి, నీటిచక్రంలా, గ్రామవాసి కానట్టి, నీటిచక్రాల్లా దేశమంతటా చెల్లాచెదరుగా ఉండక, ఉత్పత్తిని పట్టణంలో కేంద్రీకృతం చేయ వీలు కల్పించినట్టి[2] సర్వత్రా సాంకేతిక అనువర్తనకు వీలు కల్పించినట్టి, సంస్థాపక స్థలాన్ని ఎంచుకోవడంలో, స్థానిక పరిస్థితులచే ప్రభావితం కానట్టి ఒక ప్రధాన చోదకం, వాట్ రెండవ, ద్వంద్వ క్రియాశీలి అయిన ఆవిరి ఇంజన్ అనేదాని సృష్టి వరకు గాని లభించలేదు. వాట్ ప్రతిభ గొప్పతనం 1784 ఏప్రిల్‌లో ఆయన తీసుకొన్న పేటెంట్‌లోని నిర్దిష్ట వివరణలో ప్రదర్శితమైంది. ఆ నిర్దిష్ట వివరణంలో ఆయన, తన ఆవిరి ఇంజన్‌ను, ఒక నిర్దిష్ట ప్రయోజనానికి కాక, యాంత్రిక పరిశ్రమలో సార్వత్రిక అనువర్తనకు వీలున్న సాధనంగా వర్ణించారు. అందులో ఆయన పేర్కొన్న వినియోగాల్లో ఎన్నో ఆ తరువాత అర్ధ శతాబ్దం వరకు ఆచరణలోకి రాలేదు. ఉదాహరణకు, ఆవిరి సమ్మెట అటువంటి వాటిలో ఒకటి. అయితే, ఆయన నౌకాయానంలో ఆవిరి ఇంజన్ల వాడకం సందేహాస్పదమని అన్నారు. ఆయన తరువాతి వారు బౌల్టన్, వాట్ 1851 వస్తు ప్రదర్శనకు, సముద్రయానానికి అనువైన స్టీమర్లకు అమర్చదగిన బ్రహ్మాండ పరిమాణం గల ఆవిరి ఇంజన్లను పంపారు.

మనిషి చేతి పరికరాలుగా ఉన్న కొరముట్లు యాంత్రిక సాధనం యొక్క, యంత్రం యొక్క పరికరాలుగా మారిన వెంటనే, చోదక యంత్రాంగం కూడా మానవ బల పరిమితుల నుంచి పూర్తిగా విముక్తమై ఒక స్వతంత్ర రూపం సంతరించుకొంది. తత్ఫలితంగా, మనమింత వరకు పరిశీలిస్తున్న విడి విడి యంత్రం, యంత్రాలచే జరిగే ఉత్పత్తిలో, కేవలం ఒక కారకంగా దిగజారుతుంది. ఒకే చోదక యంత్రాంగం ఇప్పుడు ఒకేసారి అనేక యంత్రాలను నడపగలుగుతోంది. ఏకకాలంలో తిప్పబడుతున్న యంత్రాల సంఖ్య పెరుగుదలతో చోదక యంత్రాంగమూ పెరుగుతుంది; చలన ప్రసారక యంత్రాంగం విస్తార పరివ్యాప్త సాధనమవుతుంది.

ఇప్పుడు మనం ఒకే రకమైన పలు యంత్రాల పరస్పర సహకారాన్నిచ్చే ఒక సంశ్లిష్ట యంత్ర వ్యవస్థకూ తేడా చూపడానికి పూనుకొంటున్నాము.

ఒకదాని విషయంలో, ఉత్పాదితాన్ని తయారు చేసేది ఒకే ఒక యంత్రం; ఇది, మునుపు ఒకే చేతివృత్తికారుడు తన పరికరాలతో నిర్వహించిన వివిధ ప్రక్రియలనన్నిటినీ, ఉదాహరణకు, నేత

---

1. పరిశ్రమల్లో జలశక్తి వినియోగానికి గల మునుపటి అడ్డంకుల బెడదను ఆధునిక టర్బైన్‌తో తొలగించింది.
2. ''జౌళి కార్ఖానా ఆ తొలిరోజుల్లో, ఫ్యాక్టరీకి స్థల నిర్ణయం, నీటి చక్రాన్ని తిప్ప చాలినంత జలపాతం గల నీటి వాగు ఉనికిపై ఆధారపడి ఉండేది. నీటి మిల్లుల స్థాపన కుటీర చేతిపరిశ్రమను బద్దలు చేయడానికి నాంది అయినప్పటికీ, తప్పనిసరిగా నీటి వాగులవద్ద, తరచూ ఒకదానికొకటి చాలా దూరంగా స్థాపితమైన మిల్లుల పట్టణ వ్యవస్థలో కాక, గ్రామీణ వ్యవస్థలో భాగంగా ఉండేవి. నీటి వాగుకు ప్రత్యామ్నాయంగా ఆవిరి శక్తిని ప్రవేశపెట్టేవరకు కానీ ఫ్యాక్టరీలు, పట్టణాల్లో, ఆవిరి ఉత్పత్తికి అవసరమయినంత పరిమాణాల్లో బొగ్గు, నీరు ఉన్న స్థలాల్లో కేంద్రీకృతం కాలేదు. ఆవిరి ఇంజన్ పారిశ్రామిక పట్టణాలకు తల్లి. ''ఫ్యాక్టరీల ఇన్‌స్పెక్టర్ల నివేదికలు, 1860 ఏప్రిల్ 30''లో రెడ్‌గ్రేవ్, పుట 36.)

కార్మికుడు తన మగ్గంలో చేసిన పనుల నన్నిటినీ నిర్వర్తిస్తుంది. లేదా పలువురు చేతివృత్తికారులు ఒకరి తరువాత ఒకరు విడివిడిగా, లేదా కార్ఖానా ఉత్పత్తి వ్యవస్థ సభ్యులుగా చేసే పనులన్నిటినీ నిర్వర్తిస్తుంది.[1] ఉదాహరణకు, కవర్ల తయారీలో ఒకడు ఫోల్డర్‌తో కాగితాన్ని మడిచాడు. మరొకడు జిగురు పట్టించాడు. మూడవ మనిషి కవరు మూతను (Slap) తిరగవేశాడు – కంపెనీ ముద్ర వేసేది దానిపైనే. నాల్గో మనిషి ముద్ర వేశాడు. ఇలా పనులు జరిగిపోయాయి. ఈ పనులు ఒక్కోదానికీ కవరు చేతులు మారవలసి వచ్చింది; ఇప్పుడు ఒకే కవరు యంత్రం ఈ పనులన్నిటినీ ఒకేసారి చేస్తోంది. ఒక గంటలో 3,000కు పైగా కవర్లను తయారు చేస్తోంది. 1862 లండన్ వస్తు ప్రదర్శనలో, కాగితపు సంచులను తయారుచేసే ఒక అమెరికన్ యంత్రాన్ని ప్రదర్శించారు. అది ఒక నిమిషంలో కాగితం కత్తిరించి, జిగురు అంటించి, మడిచి, ఒక్క నిమిషంలో 300 సంచులను తయారుచేసింది. ఈ మొత్తం పని, కార్ఖానా ఉత్పత్తిగా నిర్వహింపబడిన ఈ సందర్భంలో, దీన్ని పలు క్రియల పరంపరగా విడగొట్టడం జరిగింది; ఒకే యంత్రం వివిధ పరికరాల సమ్మేళనతో పని చేయిస్తూ, మొత్తం పనిని పూర్తి చేస్తోంది. గమనించండి; అటువంటి యంత్రం, జటిలమైన చేతి పరికరాలకు కేవలం ప్రతిసృష్టి అయినా, లేదా కార్ఖానా ఉత్పత్తిచే ప్రత్యేకీకృత మైన వివిధ సామాన్య పరికరాల సమ్మేళన అయినా, ఈ రెండు సందర్భాల్లోనూ, ఫ్యాక్టరీలో అంటే యంత్రాలను మాత్రమే వాడే కార్ఖానాలో, మనకు మళ్ళీ తటస్థపడుతున్నది సామాన్య సహకారమే; ప్రస్తుతానికి కార్మికుని సంగతి వదిలివేసి చూచామంటే, ఈ సహకారం, అన్నిటికన్నా ముందు, ఒకచోట, ఏకకాలంలో పనిచేసే ఒకే విధమైన యంత్రాల కదంబంగా మనకు కనిపిస్తుంది. ఆ విధంగా నేత ఫ్యాక్టరీ, పక్క పక్కనే పనిచేసే పలు మరమగ్గాలతో ఏర్పడినది; కుట్టుపని ఫ్యాక్టరీ, అన్నీ ఒకే భవనంలో ఉన్న పలు కుట్టు యంత్రాలు గలది. కానీ ఇక్కడ మొత్తం వ్యవస్థలో సాంకేతిక ఏకత ఉంది. ఎందువల్లనంటే, ఈ యంత్రాలన్నీ, ఉమ్మడి ప్రాథమిక చోదక యంత్ర స్పందనల నుంచి, మధ్యస్థ ప్రసారక యంత్రాంగం ద్వారా ఏకకాలంలో, సమాన స్థాయిలో, తమ ఊపునందుకొంటున్నాయి. ఈ యంత్రాంగం కూడా కొంతవరకు వాటన్నిటికి ఒకటే. ఎందుకంటే, ప్రతి యంత్రానికి వేరు వేరుగా వెడుతున్నది దాని ప్రత్యేక శాఖలే. కాబట్టి, పలు పరికరాలు ఒక యంత్రానికి అంగాలు అయినట్లే, ఒకే రకమైన పలు యంత్రాలు చోదక యంత్రాంగానికి అంగాలవుతున్నాయి.

కానీ, ఒకదానికొకటి అనుబంధంగా ఉన్న బహువిధ యంత్రాల పరంపరచే నిర్వహింప బడుతున్న ప్రత్యేకీకృత ప్రక్రియలను శ్రమ గ్రహీత వస్తువు గడిస్తే తప్ప, ఈ స్వతంత్ర యంత్రాల స్థానాన్ని ఒక నిజమైన యంత్ర వ్యవస్థ ఆక్రమించలేదు. ఇక్కడ మళ్ళీ మనకు కనిపిస్తుంది, శ్రమ

1. కార్ఖానా ఉత్పత్తిలో, శ్రమ విభజన దృష్ట్యా, నేత పని సులభమైనది కాదు సరికదా, అది శారీరక శ్రమను క్లిష్టతరం చేసింది; అందువల్ల మరమగ్గం చాలా క్లిష్టమైన పని చేసే యంత్రం. శ్రమ విభజన సరళం చేసిన ఆ ప్రక్రియలను ఆధునిక యంత్రాలు తొలుత, ఏకంగా స్వాయత్తం చేసుకొన్నా యనుకోవడం పూర్తిగా పొరపాటు. కార్ఖానా ఉత్పత్తి దశలో, దారం వడకడం, నేత రెండు కొత్త మౌలిక ప్రక్రియలుగా చీలిపోయాయి. పరికరాలను తదనుగుణంగా మార్చడం మెరుగుపరచడం జరిగింది. కానీ అసలు శ్రమ ఏ విధంగానూ విభజితం కాలేదు. అది తన చేతివృత్తి లక్షణాన్ని నిలుపుకొంది. యంత్రానికి ప్రారంభ బిందువుగా ఉన్నది శ్రమ పరికరమే తప్ప శ్రమ కాదు.

విభజన ద్వారా సహకారం – కార్ఖానా ఉత్పత్తి లక్షణమైన ఆ సహకారం. అయితే, ఇప్పుడది పాక్షిక యంత్రాల సంయోగం. దీన్ని బట్టల కార్ఖానా ఉత్పత్తిలోని నలగ్గొట్టేవారు, చిక్కుదీసేవారు, వడుకేవారు మొదలుగా గల వేరు వేరు ప్రత్యేకీకృత కార్మికుల ప్రత్యేక పరికరాలు ఇప్పుడు ప్రత్యేక యంత్రాల పరికరాలుగా మారిపోతాయి; వీటిలోని ప్రతి ఒక్క యంత్రం ఆ వ్యవస్థలో, ఒక ప్రత్యేక క్రియను నిర్వహించే ప్రత్యేక అంగమవుతోంది. యంత్ర వ్యవస్థను తొలుత ప్రవేశపెట్టిన పారిశ్రామిక శాఖల్లో కార్ఖానా ఉత్పత్తే ఉత్పత్తి క్రమ విభజనకు, తత్పర్యవసానమైన దాని వ్యవస్థీకరణకు సహజ ప్రాతిపదికను స్థూలంగా సమకూర్చింది.[1] కానీ, అతి ముఖ్యమైన ఒక భేదం వెంటనే గోచరమవుతుంది. కార్ఖానా ఉత్పత్తిలో, ఒంటిగానో, లేక బృందాలుగానో తమ చేతిపరికరాలతో, నిర్దిష్టమైన ప్రతి పాక్షిక ప్రక్రియను నిర్వహించవలసింది కార్మికులే. ఒకవైపు, కార్మికుడు ఈ ప్రక్రియకు అనుగుణంగా తన్ను తాను మలచుకోగా, మరోవైపు, ఈ ప్రక్రియ కార్మికునికి తగిన విధంగా అంతకు ముందే రూపొందింపబడింది. శ్రమ విభజనలోని ఈ ఆత్మాశ్రయ సూత్రం యంత్రాలచే జరిగే ఉత్పత్తిలో ఇక ఉండటం లేదు. ఇక్కడ మొత్తం ప్రక్రియను వస్తుగత దృష్టిలో, దాని తత్వాన్ని అవలోకన చేస్తారు; అంటే, మనిషి చేతులతో దాని నిర్వహణ సమస్యను పరిగణకు తీసుకోకుండా, దాని అంతర్దశలుగా ఆ ప్రక్రియను విడగొడతారన్న మాట; ప్రతి పాక్షిక ప్రక్రియను ఎలా నిర్వహించాలి, వాటన్నిటినీ ఒక అఖండ ప్రక్రియగా ఎలా కలిపి కట్టాలి అనే సమస్యను యంత్రాలు, రసాయన శాస్త్రం మొదలయిన వాటి సహాయంతో పరిష్కరిస్తారు.[2] కానీ ఈ సందర్భంలో సైతం, పెద్ద ఎత్తున సంచితమైన అనుభవంతో సిద్ధాంతాన్ని నిర్దుష్టం చేయాలని వేరే చెప్ప పనిలేదు. ప్రతి నిర్దిష్ట యంత్రమూ, దాని తరువాతి యంత్రానికి ముడి పదార్థాన్ని అందజేస్తుంది; అవన్నీ ఏకకాలంలో పని చేస్తున్నాయి. కాబట్టి,

---

1. యంత్ర పరిశ్రమ యుగానికి మునుపు, ఇంగ్లండులో, ఉన్ని వస్త్రోత్పత్తి ప్రధానమైన కార్ఖానా ఉత్పత్తిగా ఉండేది. కాబట్టి 18వ శతాబ్ది ప్రథమార్థంలో అత్యధిక ప్రయోగాలు జరిగింది ఈ పరిశ్రమలోనే. యంత్రాలచే వస్త్రోత్పత్తి ప్రక్రియలకు దూదిని సిద్ధం చేయటానికి అంతటి జాగ్రత్తలు అవసరం లేదు; ఉన్ని విషయంలో గడించిన అనుభవం దూదికి ఉపయోగపడింది - ఆ తరువాత, యంత్రాలతో దూది నుంచి నూలు తీసి, వస్త్రాలు నేసే సరళిలోనే, యంత్రాలచే ఉన్ని వస్త్రోత్పత్తి ప్రక్రియలు అభివృద్ధి చెందినట్టుగానే. ఫ్యాక్టరీ వ్యవస్థలో ఉన్ని చిక్కుతీయడం వంటి ఉన్ని కార్ఖానా ఉత్పత్తిలోని ప్రత్యేక ప్రక్రియను ఫ్యాక్టరీ వ్యవస్థలో ప్రవేశపెట్టబడింది 1866కు పదేళ్ళ ముందునుంచే. "ఉన్నిని చిక్కుతీసే ప్రక్రియకు యంత్రశక్తిని వాడటం, చిక్కంట యంత్రం, ప్రత్యేకించి లిస్టర్ యంత్రం ప్రవేశపెట్టబడిన నాటి నుంచి విస్తృతంగా అమల్లో ఉంది... ఇది ఎంతోమంది పనులు కోల్పోయేందుకు దారితీసిందనేది నిస్సందేహం. మునుపు ఉన్నిని చేత్తో చిక్కు తీసేవారు. ఇది తరచు ఆ పనివాని ఇంటిలో జరిగేది. ఇప్పుడు ఉన్నిని సాధారణంగా ఫ్యాక్టరీలోనే చిక్కు తీస్తున్నారు. చేతితో చిక్కు తీసిన ఉన్నే ఇంకా అభిమానపాత్రంగా ఉన్న కొన్ని రకాల పనులలో తప్ప, చేతి శ్రమ రద్దయిపోయింది. చేతితో చిక్కు తీసేవారికి ఫ్యాక్టరీల్లో పని దొరికింది. కాని, చేతితో చిక్కు తీసే వారి ఉత్పత్తి, యంత్రం ఉత్పత్తి చేసిన దానికన్నా ఎంత తక్కువగా ఉందంటే, చాలా పెద్ద సంఖ్యలో, ఉన్ని చిక్కు తీసేవారి నియామకం గతకాలపు మాటయింది." ("రిపోర్ట్ ఆఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్, 1856", అక్టోబరు 31, పుట 16)
2. "కాబట్టి, వృత్తికారుల మధ్య శ్రమ విభజన కోసం లేదా శ్రమను క్రమంగా విభాగించడానికై ఒక ఉత్పాదక క్రమాన్ని దాని ప్రధాన అంగాలుగా విడగొట్టడమే ... ఫ్యాక్టరీ వ్యవస్థ సూత్రం." (ఆండ్రూ ఉరే: "ది ఫిలాసఫీ ఆఫ్ మాన్యుఫ్యాక్చర్స్" లండన్, 1835, పుట 20.)

ఉత్పాదిత వస్తువు దానికి రూపుదిద్దే వివిధ దశలను ఎల్లప్పుడూ గడుస్తూంటుంది; ఒక దశ నుంచి మరో దశకు పరివర్తన చెందే స్థితిలో నిరంతరం ఉంటుంది కూడా. కార్ఖానా ఉత్పత్తిలో ప్రత్యేకీకృత కార్మికుల మధ్య ప్రత్యక్ష సహకారం ప్రత్యేక బృందాల మధ్య సంఖ్యా నిష్పత్తిని నిర్ధారణ చేస్తున్నట్లుగానే, ఒక నిర్దిష్ట యంత్రం మరొక యంత్రానికి పని కల్పిస్తున్న సంఘటిత యంత్ర వ్యవస్థలో సైతం ఆ నిర్దిష్ట యంత్రాల సంఖ్య మధ్య, వాటి పరిమాణం మధ్య, వాటి వేగం మధ్య ఒక స్థిరమైన సంబంధం స్థాపిత మవుతుంది. మొత్తం ఉత్పాదన క్రమం ఒక నిరంతరాయ క్రమంగా రూపొందే కొద్దీ, అంటే ముడి పదార్థం దాని మొదటి దశ నుంచి ఆఖరు దశకు సాగిపోవడంలో అంతరాయం తగ్గేకొద్దీ, వేరు మాటల్లో చెప్పాలంటే, ముడి పదార్థం ఒక దశ నుంచి మరో దశకు సాగిపోవడం మనిషి చేతితో కాక, యంత్రాల ద్వారానే జరిగేకొద్దీ, ఈ సమష్టి యంత్రం – ఇప్పుడు, వేరు వేరు రకాలకే చెందిన విడి యంత్రాల, విడి యంత్ర బృందాల సుసంఘటిత వ్యవస్థగా ఉన్న ఈ యంత్రం మరింత నిర్దుష్టమవుతుంది. కార్ఖానా వస్తూత్పత్తిలో ప్రతి నిర్దిష్ట ప్రక్రియ దేనికది వేర్పడి ఉండటం, శ్రమ విభజన స్వభావం నిర్దేశించిన స్థితి; అయితే, పూర్తిగా అభివృద్ధిచెందిన ఫ్యాక్టరీలో అలాకాక, ఈ నిర్దిష్ట ప్రక్రియల నిరంతరాయత తప్పనిసరి.

ఒక యంత్ర వ్యవస్థ, నేతలోలాగా ఒకే రకమైన యంత్రాల సహకారంపై మాత్రమే ఆధారపడినా, లేదా నూలు వడకడంలోలాగా, పలు రకాల యంత్రాల సమ్మేళనపై ఆధారపడిన స్వయం ప్రవర్తక చోదక సాధనంచే నడపబడినప్పుడు అదే ఒక పెద్ద స్వయంచాలిత యంత్రమవుతుంది. మొత్తం ఫ్యాక్టరీని దాని ఆవిరి ఇంజన్ నడిపినా, కొన్ని విడియంత్రాల యొక్క కొన్ని గమనాలకు కార్మికుని సహాయం అవసరం కావచ్చు. (స్వయంచాలిత కదురును కనిపెట్టక ముందు, కదురుపెట్టెను గాడిలో ఉంచడానికి అటువంటి సహాయం అవసరమయ్యేది. నాణ్యమైన నూలు మిల్లుల్లో ఇప్పటికీ అవసరం.) లేక, ఒక యంత్రంతో పని చేయించడానికి దానిలోని కొన్ని భాగాలకు, చేతి పనిముట్టులాగా, కార్మికుడు చేతితో నడపవలసి రావచ్చు. “స్లైడ్ రెస్ట్” స్వయం ప్రవర్తక సాధనంగా మారకముందు, యంత్ర నిర్మాతల కార్ఖానాలో అలాగే ఉండేది. ఒక యంత్రం మనిషి సహాయం లేకుండా, ముడి పదార్థంతో వస్తూత్పత్తికి కావలసిన అన్ని చలన విన్యాసాలను నిర్వహించగలిగిందా (అవసరమైనదల్లా మనిషి నిఘా మాత్రమే). మనకొక స్వయంచాలిత యంత్ర వ్యవస్థ సమకూడిందన్న మాట. దారం తెగిన వెంటనే దూదికండె ఉన్న లాగుడు చట్రాన్ని నిలిపివేసే సాధనం, నాడెలోని నూలుకండె ఖాళీ అయిన వెంటనే మర మగ్గాన్ని నిలిపి వేసే స్వయంచాలిత నిరోధని వంటి మెరుగుదలలు అత్యధునాతన సృజనలు. ఉత్పాదన క్రమ నిరంతరాయత, స్వయంచాలన సూత్రం అమలు, రెంటికీ ఆధునికమైన కాగితం మిల్లును ఉదాహరణగా తీసుకొనవచ్చు. భిన్న ఉత్పాదక సాధనాలపై ఆధారపడిన ఉత్పాదక పద్ధతుల మధ్య భేదాలనే కాక, ఆ పద్ధతులతో ఉత్పత్తి, సామాజిక పరిస్థితులకు గల సంబంధాన్ని కూడా, మొత్తం కాగిత పరిశ్రమలో మనం సవివరంగా, ఉపయోగకరంగా అధ్యయనం చేయవచ్చు; ఎందువల్లనంటే, పాత జర్మన్ కాగితపు పరిశ్రమ చేతివృత్తి సరళి ఉత్పత్తికి ఒక నమూనా; 17వ శతాబ్దిలో హాలెండ్, 18వ శతాబ్దిలో ఫ్రాన్స్ కాగితపు పరిశ్రమ కచ్చితమైన కార్ఖానా వస్తూత్పత్తికి నమూనాలు; ఆధునిక ఇంగ్లండు కాగితపు పరిశ్రమ, ఆ వస్తువు స్వయంచాలిత ఉత్పాదనకు నమూనా.

ఇవే కాక, భారతదేశం, చైనాల్లో ఆ పరిశ్రమకు చెందిన రెండు ప్రత్యేక, పురాతన ఆసియా ఖండపు ఉత్పత్తి రూపాలున్నాయి.

ఒక కేంద్ర స్వయంచాలక యంత్రం నుంచి ప్రసారక యంత్రాంగం ద్వారా ప్రచలితం అయ్యే యంత్రాల సంఘటిత వ్యవస్థ యంత్రాల ద్వారా సాగే అత్యంత ప్రవర్ధిత ఉత్పాదనా రూపం. దేనికది విడిగా ఉన్న యంత్రం స్థానంలో ఒక యంత్ర భూతం మన ముందుంది. దీని కాయం ఫ్యాక్టరీలకు ఫ్యాక్టరీలనే ఆక్రమిస్తోంది; ప్రారంభంలో బ్రహ్మాండమైన స్వీయ అంగాల లయబద్ధ మంద చలనాల ముసుగు కప్పుకొన్న ఈ భూతశక్తి తుదకు దాని అసంఖ్యాక కార్యనిర్వాహక అవయవాల భయంకర భ్రమణంగా ప్రారంభమవుతుంది (breaks out).

దర్జీలనేవారు లేకముందు కూడా మనుషులు దుస్తులు ధరించేవారు; అలాగే కదుళ్ళు, ఆవిరి ఇంజన్లు చేయడమే తమ ఏకైక వృత్తిగా పెట్టుకొన్న కార్మికులు లేక ముందు కూడా కదుళ్ళు, ఆవిరి ఇంజన్లు ఉండేవి. వ్యాకన్‌సన్, ఆర్క్‌రైట్, వాట్ మొదలయినవారి సృజనలు ఆచరణయోగ్యమయ్యాయంటే, కార్ఖానా వస్తూత్పత్తి దశ, నిపుణులైన యంత్ర నిర్మాణ కార్మికులను సిద్ధంగా, ఆవిష్కర్తలకు అందుబాటులో ఉంచడమే అందుకు కారణం. ఈ కార్మికుల్లో కొందరు వివిధ వృత్తులకు చెందిన స్వతంత్రులైన హస్త కళాకారులు. మిగతావారు, పైన చెప్పినట్లు శ్రమ విభజన ఖచ్చితంగా అమలుజరిగే కార్ఖానాల్లో సమీకృతులై ఉండేవారు. కొత్తగా సృష్టించిన యంత్రాల సంఖ్య పెరిగి, కొత్తగా కనిపెట్టిన యంత్రాలకు గిరాకీ హెచ్చిన కొద్దీ, యంత్ర నిర్మాణ పరిశ్రమ పలు స్వతంత్ర శాఖలుగా చీలిపోవడం అంతకంతకు ఎక్కువయింది; ఈ వస్తువుల కార్ఖానా ఉత్పత్తిలో శ్రమ విభజన అంతకంతకు వృద్ధిచెందింది. కాబట్టి కార్ఖానా వస్తూత్పత్తిలో ఆధునిక పరిశ్రమలకు ప్రత్యక్ష సాంకేతిక పునాది ఇక్కడ మనకు గోచరమవుతూంది. కార్ఖానా వస్తూత్పత్తి దశ యంత్రాలను తయారుచేయగా, వాటిని వినియోగించుకొని ఆధునిక పరిశ్రమలు తాము మొదట తన పట్టులోకి తెచ్చుకొన్న ఉత్పత్తి రంగాలలో చేతివృత్తిని, కార్ఖానా ఉత్పత్తి వ్యవస్థలను రద్దు చేశాయి. కాబట్టి ఫ్యాక్టరీ వ్యవస్థ పరిణామాల సహజ గతిక్రమంలో, చాలీచాలని పునాదిపై అవతరించింది. ఆ వ్యవస్థ ఒకానొక అభివృద్ధి స్థాయినందుకొన్నప్పుడు, అంతకు ముందే తయారై, ఈలోగా పాత ఫక్కీలోనే విస్తరించిన ఈ పునాదిని నిర్మూలించి, తన ఉత్పత్తి పద్ధతులకు అనుగుణంగా ప్రాతిపదికను నిర్మించుకో వలసివచ్చింది. విడిగా ఉన్న యంత్రం, దాన్ని కేవలం మానవ శక్తి ఒక్కటే నిర్వహించినంత కాలం, మరుగుజ్జు లక్షణాన్ని వదులుకోదు; మునుపటి చోదక శక్తులయిన జంతువులు, గాలి, తుదకు నీటి స్థానాన్ని ఆవిరి ఇంజన్ ఆక్రమించక ముందు ఏ యంత్ర వ్యవస్థనూ సరిగా అభివృద్ధిపరచడం సాధ్యం కాలేదు. అదే విధంగా, ఆధునిక పరిశ్రమలకు విలక్షణ సాధనమైన యంత్రం ఉనికిని మనిషి బలం, మనిషి నైపుణ్యం మూలంగా ఉన్నన్నాళ్ళూ, వస్తువుల కార్ఖానా ఉత్పత్తిల్లో ప్రత్యేకీకృత కార్మికులు చేతివృత్తుల్లో కాయకష్టం చేసే కార్మికులు తమ మరుగుజ్జు సాధనాలతో పని చేసేటప్పుడు వినియోగించే కండపుష్టీ, దృష్టి నైశిత్యమూ, హస్త లాఘవంపై ఆ యంత్రం ఆధారపడినన్నాళ్ళూ, ఆధునిక పరిశ్రమల సంపూర్ణ అభివృద్ధి కుంటుపడుతూ వచ్చింది. ఈ విధంగా తయారయ్యే యంత్రాలు ప్రియమైనవే కాక (ఈ విషయం పెట్టుబడిదారు మనసులో ఎప్పుడూ మెదులుతూంటుంది.) యంత్రం ద్వారా జరిగే పరిశ్రమల విస్తరణ, కొత్త ఉత్పత్తి శాఖలకు యంత్రాల వ్యాప్తి – ఇవి ఒక తరగతి కార్మికుల పెరుగుదలపై ఆధారపడి ఉండేవి. ఆ తరగతి

కార్మికులు దాదాపు కళాత్మకమైన తమ పని స్వభావం మూలంగా క్రమేణా పెరగ వీలుందే తప్ప, ఉరుకులు, పరుగులతో పెరగలేదు. అదీగాక, చేతివృత్తులూ, కార్ఖానా వస్తూత్పత్తి దశా సమకూర్చిన పునాదితో ఆధునిక పరిశ్రమలకు పొత్తు కుదరలేదు. చోదక యంత్రాల, చలన ప్రసారక యంత్రాంగం, అసలు యంత్రాల అధికాధిక పరిమాణం, తొలుత శారీరక శ్రమ నిర్మించిన తమ నమూనాకు అంతకంతకు దూరమై, తాము పనిచేసే పరిస్థితులు తప్ప మరే అవరోధమూ లేని రూపం సంతరించు కొన్న కొద్దీ ఈ యంత్రాలు ఆ సంతరించుకొన్న అధికతర జటిలత, బహురూపత, వాటి అంతర్గతాంశాలు క్రమబద్ధత,[1] స్వయంచాలక వ్యవస్థ నిర్దుష్టం కావటం, కర్రకు బదులు ఇనుము వంటి మరింత ఉష్ణ నిరోధకమైన సామాగ్రి, రోజు రోజుకు అనివార్యంగా వినియోగంలోకి రావడం – పరిస్థితుల ప్రాబల్యం వల్ల ఉత్పన్నమైన ఈ సమస్యలన్నిటి పరిష్కారానికి కార్ఖానా వస్తూత్పత్తి దశలోని సమష్టి కార్మికుడు సైతం, పరిమిత స్థాయిలో తప్ప అధిగమించలేకపోయిన వైయక్తిక పరిమితులు, సర్వత్రా అడ్డంకి అయాయి. నేటి హైడ్రాలిక్ ప్రెస్, నేటి మర మగ్గం, దూదినేకే నేటి ఇంజన్, కార్ఖానా వస్తూత్పత్తి దశ వల్ల ఎన్నటికీ సమకూడి ఉండేవి కావు.

ఒక పారిశ్రామిక రంగంలో ఉత్పత్తి పద్ధతిలో సమూలమైన మార్పు దాని ఇతర రంగాల్లో అటువంటి మార్పులను తెస్తుంది. ఒకే ఉత్పత్తి ప్రక్రియలోని వేరు వేరు దశలయిన కారణాన పరస్పరం ముడిపడి ఉన్న పారిశ్రామిక శాఖల్లో మొదట ఇది జరుగుతుంది; అలా ముడిపడి ఉన్నా, వాటిలోని ప్రతి ఒక్కటి స్వతంత్రమైన ఒక సరకును తయారుచేసే విధంగా శ్రమ సామాజిక విభజన వాటిని దేనికదిగా వేరుపరుస్తుంది. ఉదాహరణకు, యంత్రాలతో నూలు వడకడం వల్ల యంత్రాలతో నేయడం తప్పనిసరి అయింది. ఈ రెండూ కలిసి, బట్టలు తెలుపు చేయడంలో, కలంకారీ, రంగులద్దకం పనుల్లో యాంత్రిక, రసాయనిక విప్లవాన్ని అనివార్యం చేశాయి. అదే విధంగా మరోవైపు పత్తి నూలు వడుకడంలో విప్లవం వల్ల దూదినుంచి పత్తి విత్తులను వేరు చేసేందుకు 'జిన్ను'ను కనిపెట్టవలసి వచ్చింది. ఈ నూతన యంత్ర సృష్టి వల్లనే ప్రస్తుతం అవసరమైన బ్రహ్మాండస్థాయిలో పత్తి ఉత్పత్తి సాధ్యమయ్యింది.[2] కానీ, అంతకన్నా ముఖ్యంగా పారిశ్రామిక, వ్యవసాయక రంగాల్లో ఉత్పత్తి పద్ధతులలో

1. మరమగ్గాన్ని మొదట్లో ప్రధానంగా కొయ్యతో తయారు చేసేవారు. మెరుగయిన దాని ఆధునిక రూపంలో ఇప్పుడది ఇనుముతో తయారవుతున్నది. ఈనాటి మరమగ్గాన్ని పాత మరమగ్గంతోనూ, లోహపు బట్టీలోకి గాలి ఊదే ఆధునిక సాధనాన్ని మామూలు కొలిమితిత్తులకు అవసరమైన తొట్టతొలి యాంత్రిక ప్రతిరూపం తోనూ, పైపైన పోల్చి చూస్తే చాలు, ఉత్పత్తి పరికరాల పాత రూపాలు, ప్రారంభంలో వాటి కొత్త రూపాలను ఏ మేరకు ప్రభావితం చేశాయో తెలుస్తుంది; ఈనాటి రైలింజన్‌ను కనిపెట్టకముందు, గుర్రంలాగా ఒకదాని తరువాత మరొకదాన్ని నేలమీది నుంచి పైకెత్తే రెండు కాళ్ళు నిజంగా ఉన్న ఒక రైలింజను నిర్మించేందుకు జరిగిన ప్రయత్నాలవల్ల, బహుశా, మరేదానికన్న కన్నులకు కట్టినట్లు ఈ సంగతి తెలుస్తుంది. యంత్ర శాస్త్రం గణనీయంగా పెంపొంది, ఆచరణాత్మక అనుభవం పోగైన తరువాత మాత్రమే, పూర్తిగా యంత్ర సూత్రాల ననుసరించి, యంత్ర రూపం స్థిరపడింది; దాన్ని ఉద్భవింపచేసిన పరికర సాంప్రదాయక రూపం నుంచి విముక్తి చెందింది.
2. ఎల్ వైట్నీ పత్తి జిన్ను ఇటీవల కాలం వరకు 18వ శతాబ్ది నాటి ఏ ఇతర యంత్రానికన్నా తక్కువ మార్పులు చెందింది. మరో అమెరికన్, న్యూయార్క్‌లోని ఆల్బెనీ ఎమెరీవిట్నీ జిన్నును ఎంత సరళమో, అంత ఫలప్రదమైన మార్పులతో మెరుగుపరచడం వల్ల, దానికి కాలం చెల్లినది గత పదేళ్ళలోనే (1856 నుంచీనే).

విప్లవం, ఉత్పత్తి సామాజిక క్రమాల సార్వత్రిక పరిస్థితుల్లో, అంటే, కమ్యూనికేషన్, రవాణా సాధనాల్లో విప్లవం రావలసిన అవసరం కల్పించింది. సహాయక గృహ పరిశ్రమలూ, పట్టణ చేతివృత్తులతోటి సన్నకారు వ్యవసాయం మూలస్తంభంగా గల సమాజంలోని కమ్యూనికేషన్, రవాణా సాధనాలు, కార్ఖానా దశ ఉత్పాదక అవసరాలకు – సామాజిక శ్రమ విస్తృత విభజన, శ్రమ సాధనాల, కార్మికుల కేంద్రీకరణ, వలస విపణులు గల ఆ దశ ఉత్పాదక అవసరాలకు ఎంత బొత్తిగా చాలలేదంటే, వాస్తవానికి వాటిలో విప్లవమే వచ్చింది. అదే విధంగా, కార్ఖానా వస్తూత్పత్తి దశ నుంచి సంక్రమించిన కమ్యూనికేషన్, రవాణా సాధనాలు ఆధునిక పరిశ్రమలకు – ఉత్పత్తి ఉదగ్ర వేగం బ్రహ్మాండ విస్తృతి నిరంతరం ఒక ఉత్పత్తి రంగం నుంచి మరో ఉత్పత్తి రంగానికి పెట్టుబడి, శ్రమల నెట్టివేత, మొత్తం ప్రపంచంలోని మార్కెట్లతో కొత్తగా ఏర్పడ్డ సంబంధాలు గల ఆధునిక పరిశ్రమలకు త్వరలోనే దుర్భర ప్రతిబంధకాలయ్యాయి. అందువల్ల నౌకా నిర్మాణంలో ప్రవేశపెట్టబడిన సమూలమైన మార్పులే కాక, నదుల్లో పయనించే స్టీమర్లు, రైలు మార్గాలు, సముద్రపు స్టీమర్లు, టెలిగ్రాఫ్‌ల వ్యవస్థ సృష్టి కావడం వల్ల, కమ్యూనికేషన్, రవాణా సాధనాలు యాంత్రిక పరిశ్రమల ఉత్పత్తి పద్ధతులకు అనువుగా క్రమేణా మారిపోయాయి. కానీ, బ్రహ్మాండమైన పరిమాణాల్లోని ఇనుమును కాచి రూపుదిద్దడానికి, అతకడానికి, కోయడానికి, దానికి రంధ్రాలు తొలవడానికి, నిర్దిష్ట ఆకారమివ్వడానికి బృహత్ యంత్రాలు కావలసి వచ్చింది. అందుకు కార్ఖానా ఉత్పత్తి పద్ధతులు బొత్తిగా సరిపోలేదు.

కాబట్టి ఆధునిక పరిశ్రమే, తనకు విలక్షణ ఉత్పాదక సాధనమైన యంత్రాన్ని స్వీకరించి, యంత్రాలతో యంత్రాలను నిర్మించవలసి వచ్చింది. ఈ పని చేసిన తరువాతనే అది తనకు తగిన సాంకేతిక పునాది నిర్మించుకొని, తన కాళ్ళపై తాను నిలబడగలిగింది. ఈ శతాబ్ది తొలి దశాబ్దాల్లో యంత్రాల వినియోగం పెరగడంతో పాటుగానే యంత్రాలు మెట్టు మెట్టుగా అసలైన యంత్రాల నిర్మాణాన్ని తన చేతిలోకి తెచ్చుకొన్నాయి. కానీ, అపార స్థాయిలో రైలు మార్గాల, మహాసముద్రపు స్టీమర్ల నిర్మాణం, నేడు ప్రధాన చోదక సాధనాల నిర్మాణంలో వాడుతున్న బ్రహ్మాండమైన యంత్రాలను సృష్టించింది 1866 మునుపటి పదేళ్ళ కాలంలోనే.

యంత్రాలతో యంత్రాలను ఉత్పత్తి చేయాలంటే ఎంతైనా సరే శక్తిని ప్రయోగించగలిగినట్టి, అయితే సంపూర్ణంగా అదుపులో ఉన్నట్టి ఒక ప్రధాన చోదక సాధనం ఉండటం అన్నిటికన్నా ముఖ్యం. ఆవిరి యంత్ర రూపంలో అది వరకే అటువంటి సాధనముంది. రేఖాగణిత శాస్త్రరీత్యా కచ్చితమైన సరళ రేఖలు, సమతలాలు, వర్తులాలు, వర్తుల స్తంభాకారాలు, శంకువులు, గోళాలు – యంత్రాల అంతర్భాగాలకు అవసరమైన వీటిని, అదే సమయంలో తయారు చేయడం అవసరం ... ఈ శతాబ్దం తొలి దశాబ్దిలో స్లైడ్ రెస్ట్‌ను కనిపెట్టడం ద్వారా హెన్రీ మాడ్‌స్లే ఈ సమస్యను పరిష్కరించారు. ఈ పరికరం అనతి కాలంలోనే స్వయంచాలితమైంది; ఆదిలో లేత్ కోసం ఉద్దేశించిన ఈ పరికరం, దానికే కాక, మార్పులతో ఇతర నిర్మాణ యంత్రాలకు కూడా వర్తింపజేశారు. ఈ యంత్ర పరికరం ఏదో ఒక ప్రత్యేక పరికరానికి కాక, అసలు చేతికే ప్రత్యామ్నాయంగా ఉంది; తయారీకి తీసుకొన్న ఇనుప వస్తువు, లేదా మరేదైనా వస్తువు పొడుగునా, కోత పరికరాన్ని పట్టుకొని, నడిపించడం ద్వారా దానికి నిర్దిష్ట రూపమిస్తుంది. "అతి నిపుణుడైన కార్మికుని హస్తం గడించిన అనుభవం వల్ల సైతం

సాధ్యం కానంత సునాయాసంగా, కచ్చితంగా, వేగంగా," యంత్రాల విడి విడి అంతర్భాగాల రూపాలను తయారుచేయడం ఆ విధంగా సాధ్యమయింది.[1]

ఇక యంత్రాల నిర్మాణానికి నియుక్తమైన యంత్రంలో, పని నిర్వాహక పరికరంగా ఉన్న భాగంపై మన దృష్టి నిలిపితే, చేతి పరికరాలు, అయితే బ్రహ్మాండ పరిమాణంలో మళ్ళీ ప్రత్యక్షమవుతున్నాయని మనకు కనిపిస్తుంది. రంధ్రాలు తొలిచే యంత్రంతో పనిచేసే భాగం, ఆవిరి యంత్రంతో నడిచే ఒక బ్రహ్మాండమైన బరమా; మరోవైపు, భారీ ఆవిరి యంత్రాల్లోని, హైడ్రాలిక్ ప్రెస్సులలోని వర్తులాకారపు గొట్టాలు తయారై ఉండేవి కావు. యంత్రపు లేత్, మామూలు కాలిలేత్‌కు బ్రహ్మాండ ప్రతిరూపమే; చిత్రిక పట్టే యంత్రం, కర్రపనికి మామూలు వడ్రంగి వాడే అదే కొరముట్లను ఇనుముపై పనికి ఉపయోగించే ఇనుప వడ్రంగే; లండన్ రేవు ఒడ్డులపై పలకల్ని కోసే సాధనం ఒక పెద్ద మంగలి కత్తి, గుడ్డను కత్తిరించే దర్జీ కత్తెరంత సులభంగా ఇనుమును కత్తిరించే లోహచ్ఛేదక యంత్ర పరికరం ఒక రాకాసి కత్తెర. ఆవిరి యంత్రపు సమ్మెట మామూలు సమ్మెట తల దిమ్మెతో పనిచేస్తుంది. కానీ అది ఎంత బరువుంటుందంటే థోర్ (పర్జన్యుడు - అను) కూడా దాన్ని ఎత్తి పట్టుకోలేడు.[2] ఈ ఆవిరి యంత్రపు సమ్మెటలు నాస్మిత్ యొక్క సృజన. వాటిలో ఒకటి ఆరు టన్నులకు పైగా బరువుంటుంది. 36 టన్నుల బరువున్న దాగలిపై 7 అడుగుల ఎత్తు నుండి నిటారుగా పడి, కొట్టగలదు. ఒక నల్లరాతి దిమ్మెను పొడిగా నలగ్గొట్టడం దానికి శైశవ క్రీడ వంటిది. కానీ అంత సునాయాసంగానూ, మెత్తని కర్రముక్కలో ఒక చీలను మెల్ల మెల్లగా తట్టి దిగ్గొట్టగలదు కూడా.[3]

యంత్రాల రూపంలోని శ్రమ సాధనాల మూలంగా, మనిషి శక్తికి బదులు ప్రకృతి శక్తులను ప్రవేశపెట్టడం, గతానుగతికమైన ఆచరణకు బదులు ఎరుకతో విజ్ఞాన శాస్త్రాన్ని వర్తింపజేయడం అవసరమవుతుంది. కార్ఖానా ఉత్పత్తి దశలో, సామాజిక శ్రమ ప్రక్రియ వ్యవస్థీకరణ కేవలం ఆత్మాశ్రితమైనది; అది ప్రత్యేకీకృత కార్మికుల సమ్మేళన, ఆధునిక పరిశ్రమలకు, యంత్ర వ్యవస్థ రూపంలో ఉన్న ఉత్పాదక అంగ నిర్మాణం కేవలం వస్తునిష్ఠమైనది. అందులో, కార్మికుడు అదివరకే ఉన్న ఉత్పత్తి పాదార్థిక పరిస్థితికి ఒక అనుబంధం మాత్రమే. సామాన్య సహకారంలో, శ్రమ విభజన ప్రాతిపదికపై నెలకొల్పిన అటువంటి సహకారంలో సైతం, వేరు వేరుగా ఉన్న కార్మికుని సమష్టి కార్మికుడు అణచటం ఇంచుమించు యాదృచ్ఛికంగా జరిగినట్లు కనిపిస్తుంది. యంత్రాలు, మున్ముందు

---

1. "ది ఇండస్ట్రీ ఆఫ్ నేషన్స్" లండన్, 1855, 2వ భాగం, 239వ పుట. ఈ గ్రంథంలో కింది వ్యాఖ్యానం కూడా ఉంది : "లేత్‌కు చేకూర్చిన ఈ అనుబంధం సామాన్యమైనదిగా, పైకి అప్రధానమైనదిగా కనిపించ వచ్చు. కాని యంత్రాల వినియోగాన్ని అభివృద్ధి పరచడంలో, విస్తరింప చేయడంలో దాని ప్రభావం, ఆవిరి యంత్రాన్ని వాట్ వృద్ధిపరచడం వల్ల కలిగిన ప్రభావమంత గొప్పదని చెప్పడం అతిశయోక్తి కాదని మా విశ్వాసం. దాన్ని ప్రవేశపెట్టడం వెనువెంటనే, అన్ని యంత్రాలు నిర్దుష్టం, చౌక కావడానికి, నూతన యంత్ర సృష్టిని, మెరుగుదలను ప్రోత్సహించేందుకు తోడ్పడింది."
2. ఇనుమును కాచి, సాగగొట్టి, ఓడ తెడ్డు చక్రాల ఇరుసును తయారు చేయడానికి ఉపయోగించే ఈ యంత్రాల్లో ఒకదానికి "థోర్" అని పేరు. కమ్మరి, గుర్రపు నాడాను తయారుచేసినంత సునాయాసంగా అది $6\frac{1}{2}$ టన్నుల ఇరుసును తయారుచేస్తుంది.
3. కొద్దిపాటి స్థాయిలో వినియోగించడానికి కూడా వీలున్న వడ్రంగపు యంత్రాలు ఎక్కువగా అమెరికన్లు సృష్టించినవే.

పేర్కొనబడే కొన్ని తప్ప, సమీకృత శ్రమ ద్వారా, లేక ఉమ్మడి శ్రమ ద్వారా మాత్రమే పనిచేస్తాయి. కాబట్టి యంత్రాల విషయంలో, శ్రమ, ప్రక్రియకు గల సహకార స్వభావం, శ్రమ సాధనమే నిర్దేశించిన ఒక సాంకేతిక ఆవశ్యకత.

### విభాగం-2

## యంత్రాలు ఉత్పాదితానికి బదలాయించే విలువ

సహకార, శ్రమ విభజన ఫలితంగా జనించే ఉత్పాదక శక్తులు పెట్టుబడికి ఖర్చు లేకుండా లభిస్తున్నాయని చూచాము. అవి సామాజిక శ్రమ సహజ శక్తులు. అదే విధంగా నీటి ఆవిరి, నీరు మొదలయినవి ఉత్పాదక ప్రక్రియల స్వాధీనంలోకి వచ్చినప్పుడు అందుకేమీ ఖర్చు కాదు. ఉచ్ఛ్వాస నిశ్వాసాలకు మనిషికి ఊపిరితిత్తులు అవసరమైనట్లే, భౌతిక శక్తులను ఉత్పాదకంగా వినియోగించుకోవాలంటే అతనికి, మానవుని చేతులు నిర్మించినదేదో ఒకటి కావాలి. జలశక్తిని వినియోగించుకొనేందుకు జలచక్రం అవసరం; ఆవిరి స్థితి స్థాపకతా గుణాన్ని వినియోగించుకొనేందుకు ఆవిరి యంత్రం అవసరం. విద్యుత్ ప్రసరణ క్షేత్రంలో అయస్కాంత సూచి తన మార్గం నుంచి వైదొలగుతుందనే నియమం లేదా తన చుట్టూ విద్యుత్తు ప్రసరించినప్పుడు ఇనుముకు అయస్కాంత గుణమబ్బుతుందన్న నియమం కనుగొనబడిన తరువాత, దానికొక చిల్లిగవ్వ కూడా ఖర్చు కాదు.[1] కానీ, తంత్రీ వార్తా ప్రసార వ్యవస్థ మొదలయిన వాటి ప్రయోజనాల కోసం ఈ నియమాలను వినియోగించడానికి చాలా ఖరీదైన, విస్తృతమైన సాధన సముదాయం అవసరమవుతుంది. ఇదివరకే మనం తెలుసుకొన్నట్లు పరికరాన్ని యంత్రం తొలిగించివేయదు. మానవుని అంగ నిర్మాణానికి మరుగుజ్జు పరికరంగా ఉన్న స్థితి నుండి, మానవుడు సృష్టించిన యంత్రాంగం యొక్క పరికరంగా అది విస్తరిస్తుంది; వృద్ధి పొందుతుంది.

పెట్టుబడి ఇప్పుడు కార్మికునితో పని చేయించేది చేతి పరికరాలతో కాదు. స్వయంగా పరికరాన్ని ఉపయోగించే యంత్రంతో బ్రహ్మాండమైన భౌతిక శక్తులు, ప్రకృతి శాస్త్రాలు రెంటినీ ఉత్పత్తి ప్రక్రియలో అంతర్భాగంగా చేయడం ద్వారా ఆధునిక పరిశ్రమలు శ్రమ ఉత్పాదకతను అసాధారణ స్థాయికి పెంచుతున్నాయని, చూచిన వెంటనే స్పష్టమయినప్పటికీ, మరోవైపు, పెరిగిన ఈ ఉత్పాదక శక్తి, అదనపు శ్రమ వ్యయంతో కొన్నది కాదనే సంగతి అంత స్పష్టంగా కనిపించదు. స్థిర పెట్టుబడిలోని ఏ ఇతర అంతర్భాగం లాగానే, యంత్రాలు కూడా కొత్త విలువను సృష్టించవు; ఏ వస్తు ఉత్పత్తికి అవి ఉపకరిస్తున్నాయో ఆ ఉత్పాదితానికి సొంత విలువను అందజేస్తున్నాయి. యంత్రానికి విలువ

---

1. మొత్తంపై చెప్పవలసి వస్తే, విజ్ఞాన శాస్త్రానికై, పెట్టుబడిదారునికి ఏమీ ఖర్చు కాదు. కానీ దాన్ని వినియోగించుకొనేందుకు ఇదేమీ అడ్డురాదు. ఇతరుల విజ్ఞాన శాస్త్రాన్ని పెట్టుబడిదారుడు ఇతరుల శ్రమలాగే స్వాయత్తం చేసుకొంటున్నాడు. విజ్ఞాన శాస్త్రాన్ని గాని, భౌతిక సంపదను గానీ పెట్టుబడిదారీ పద్ధతిలో స్వాయత్తం చేసుకోవడం వేరు, వ్యక్తిగతంగా స్వాయత్తం చేసుకోవడం వేరు. తనకు ప్రీతిపాత్రమైన యంత్రాలను వినియోగించే ఉత్పత్తిదారుల్లో యంత్ర శాస్త్రజ్ఞానం బొత్తిగా లేదని డాక్టర్ ఉరే వాపోతున్నారు. ఇంగ్లీషు రసాయన ఉత్పత్తిదార్లు రసాయన శాస్త్రం విషయంలో ప్రదర్శించే దిగ్భ్రమజనకమైన అజ్ఞానం గురించి, లీబిగ్ కథలు కథలుగా చెప్పగలరు.

ఉంది. అందువల్ల ఉత్పాదితానికి తన విలువను ఇస్తూంది; కనుక, యంత్రం ఆ ఉత్పాదితం విలువలోని ఒక అంశమవుతోంది. ఉత్పాదితం చౌక కావడానికి బదులు, యంత్రం విలువ మోతాదును బట్టి మరింత ప్రియమవుతుంది. ఆధునిక పరిశ్రమల విశిష్ట శ్రమ సాధనాలయిన యంత్రాలు, యంత్ర వ్యవస్థలు చేతివృత్తుల్లోనూ, కార్ఖానా ఉత్పత్తుల్లోనూ వినియోగించిన సాధనాలకన్నా ఎనలేనంత ఎక్కువ విలువతో నింపబడి ఉన్నవనేది ముంజేతి కంకణమంత స్పష్టంగా కనిపిస్తోంది.

మొట్టమొదట ఒక సంగతి చెప్పాలి : యంత్రాలు ఎల్లప్పుడూ మొత్తంగా, శ్రమ ప్రక్రియలో పాలుపంచుకొంటున్నప్పటికీ, విలువ సృష్టి ప్రక్రియలో కొద్ది కొద్దిగా పాలుపంచుకొంటాయి. అరుగుదల వల్ల అవి సగటున కోల్పోయిన దానికన్నా ఎక్కువ విలువను ఉత్పాదితానికి చేర్చవు కాబట్టి, ఒక యంత్రం విలువకూ, ఒక నిర్దిష్ట కాలంలో ఆ యంత్రం ఉత్పాదితానికి బదలాయించే విలువకూ మధ్య పెద్ద తేడా ఉంటుంది. శ్రమ ప్రక్రియలో ఆ యంత్రం మన్నిక కాలం ఎంత ఎక్కువగా ఉంటే, ఈ తేడా అంత హెచ్చుగా ఉంటుంది. మనమిదివరకే తెలుసుకొన్నట్లు ప్రతి శ్రమ సాధనమూ మొత్తంగా, శ్రమ ప్రక్రియలో ప్రవేశిస్తుంది. కానీ, విలువ సృష్టి ప్రక్రియలోకి కొద్ది కొద్దిగా తన సగటు దినసరి అరుగుదలను బట్టి మాత్రమే ప్రవేశిస్తుంది అనేది నిస్సందేహంగా నిజమే. కానీ, మొత్తం సాధనానికి, దాని దినసరి అరుగుదలకు మధ్య ఈ తేడా, ఒక పరికరంలో కన్నా ఒక యంత్రంలో చాలా ఎక్కువ. ఎందువల్లనంటే, యంత్రం మరింత గట్టి పదార్థంతో చేసినది కాబట్టి, ఎక్కువ కాలం మన్నుతుంది. కచ్చితమైన శాస్త్రీయ నియమాలు దాని వినియోగాన్ని క్రమబద్ధం చేస్తాయి కాబట్టి, దాని భాగాల అరుగుదలలో, అది వాడే పదార్థాలలో పొదుపునకు అవకాశముంటుంది. ఆఖరు విషయం, దాని ఉత్పత్తి రంగం, పరికరం యొక్క ఉత్పత్తి రంగం కన్నా ఎంతో పెద్దది. యంత్రం, పరికరం, ఈ రెంటి సగటు దైనందిన వ్యయానికి, అంటే, తమ సగటు దినసరి అరుగుదల వల్ల అవి ఉత్పాదితానికి అందజేసే విలువకూ, అవి ఉపయోగించే నూనె, బొగ్గు మొదలయిన సహాయక పదార్థాల వినిమయానికి మినహాయింపులు చేసిన తరువాత ఆ రెంటిలో ప్రతిదీ, ప్రకృతి ప్రసాదిత శక్తులలాగే, మనిషి సహాయం లేకుండా తన పని ఉచితంగా చేస్తోంది. పరికరంతో పోల్చి చూచినప్పుడు యంత్ర ఉత్పాదక శక్తి ఎంత ఎక్కువగా ఉంటే, దాని ఈ ఉచిత సేవ, పరికరం సేవకన్నా అంత ఎక్కువ. మానవుడు, తన గత శ్రమ ఉత్పాదితంతో, ప్రకృతి శక్తులతో లాగానే, పెద్ద ఎత్తున ఉచితంగా పని చేయించడంలో, మొట్టమొదటిసారిగా ఆధునిక పరిశ్రమల దశలో కృతకృత్యుడయ్యాడు.[1]

---

1. రికార్డో యంత్రాలకు గల ఈ ప్రభావానికి ఎంత ప్రాముఖ్యమిచ్చారంటే, (ఇతర సందర్భాల్లో, ఆయన శ్రమ ప్రక్రియకు, అదనపు విలువను సృష్టించే ప్రక్రియకు మధ్య గల సర్వ సాధారణమైన వ్యత్యాసాన్ని గురించి పట్టించుకోనట్లుగానే యంత్రాల ప్రభావాన్ని గురించి కూడా పట్టించుకోరు.) యంత్రాలు ఉత్పాదితానికి చేర్చుతున్న విలువను అప్పుడప్పుడు విస్మరించడం, యంత్రాలను, ప్రకృతి శక్తులను ఒకే గాట కట్టడం కద్దు. ఉదాహరణకు, ఆయన ఇలా అంటున్నారు : "ప్రకృతి శక్తులు, యంత్రాలు మనకు చేస్తున్న సేవలను ఆడమ్ స్మిత్ ఎక్కడా కూడా తక్కువ చేసి చూపరు. కానీ అవి సరుకులకు చేర్చుతున్న విలువ స్వభావాన్ని వేరుపరచి చూపుతున్నారు. ఇది సరియైనదే... అవి తమ పని ఉచితంగా చేస్తున్నందువల్ల మార్పిడి విలువకు ఏమీ చేర్చడం లేదు." (రికార్డో, పూర్వోదాహృత గ్రంథం, పుటలు 336, 337). యంత్రాలు "లాభాల్లో" ఒక భాగంగా ఉన్న విలువను సృష్టించే "సేవ" చేస్తున్నాయని భావిస్తున్న జె.బి. సే పై ఎక్కుపెట్టిన మేరకు, రికార్డో చేసిన ఈ వ్యాఖ్య సరియైనదే అని వేరే చెప్ప పనిలేదు.

సహకారాన్ని, కార్ఖానా ఉత్పత్తులను గురించి చెప్పేటప్పుడు, ఎవరికి వారుగా ఉన్న కార్మికుల చెదురు మదురు ఉత్పత్తి సాధనాలతో పోల్చి చూస్తే భవనాలు వంటి కొన్ని ఉత్పాదనా సార్వత్రిక కారకాలు ఉమ్మడిగా వినియోగం కావడం వల్ల ఆదా అవుతాయనీ, కాబట్టి అవి ఉత్పాదితాన్ని చౌకపరుస్తాయనీ నిరూపించాము. యంత్ర వ్యవస్థలో, యంత్ర చట్రాన్ని, దానిలోని పని చేసే పలు సాధనాలు ఉమ్మడిగా వాడటమే కాకుండా, చలన ప్రసార యంత్రాంగంలో ఒక భాగంతో సహా, చోదక యంత్రాన్ని పలు పని నిర్వాహక యంత్రాలు ఉమ్మడిగా వినియోగిస్తాయి. యంత్రాల విలువకూ, అవి ఉత్పాదితానికి ఒక రోజులో బదలాయించే విలువకూ మధ్య గల తేడా నిర్ణీతమైనప్పుడు అలా బదలాయింపబడిన విలువ ఉత్పాదితానికి అయిన ఖర్చును ఏ మేరకు పెంచేదీ, అన్నిటికన్నా ముఖ్యంగా, ఉత్పాదితం యొక్క పరిమాణంపై, ఒక విధంగా చెప్పాలంటే, దాని విస్తీర్ణంపై ఆధారపడి ఉంటుంది. బ్లాక్ బర్న్‌కు చెందిన బేన్స్, 1858లో ప్రచురితమైన ఒక ఉపన్యాసంలో ఇలా అంచనా వేశారు; "సన్నద్ధం చేసిన, స్వయం ప్రవర్తకమైన 450 మామూలు కదుళ్ళను లేదా దారం తీసి, పురిపెట్టి, ఉండలుగా చుట్టే 200 కదుళ్ళను, లేదా పడుగును అమర్చడానికీ, గంజి పెట్టడానికి సాధనాలు కలిగి, 40 అంగుళాల బట్ట నేయగల 15 మగ్గాలను నిజమైన ప్రతి యాంత్రిక అశ్వ శక్తి[1] నడుపుతుంది." మొదటి సందర్భంలో 450 మామూలు కదుళ్ళు, రెండవ సందర్భంలో దారం తీసి పురిపెట్టి ఉండలుగా చుట్టే కదుళ్ళు, మూడవ సందర్భంలో 15 మరమగ్గాలు ఒక రోజులో చేసిన ఉత్పత్తి కంతటికీ, ఒక అశ్వ శక్తికి ఒక రోజుకయ్యే ఖర్చూ, ఆ శక్తిచే సంచాలితమైన యంత్రాల దినసరి అరుగుదలా విస్తరించి ఉంటాయి. అందువల్ల, ఒక పౌండు నూలుకు, లేక ఒక గజం బట్టకు అటువంటి అరుగుదల బదలాయించిన విలువ అల్పాల్పమైనది. పైన పేర్కొన్న ఆవిరి సమ్మెట విషయంలో కూడా జరిగేది, దాని రోజువారీ అరుగుదల, దానికయ్యే బొగ్గు వినియోగం మొదలయినవి.

---

1. ఒక అశ్వ శక్తి నిమిషానికి 33,000 అడుగు - పౌండ్ల శక్తికి సమానం. అంటే, ఒక నిమిషంలో 33,000 పౌండ్లను ఒక అడుగు లేక ఒక పౌండును 33,000 అడుగులు పైకి ఎత్తగల శక్తికి సమానం. గ్రంథ పాఠంలోని అశ్వ శక్తికి ఇదీ అర్థం. మామూలు భాషలోనూ ఈ గ్రంథంలో, ఇతర రచనల నుంచి ఉల్లేఖింపబడిన వాక్యాల్లోనూ అక్కడక్కడ ఒకే చోదక యంత్రం "నామకార్థ", "వాణిజ్య" లేక "సూచిత" అశ్వ శక్తుల మధ్య తేడా చూపించడం జరిగింది. పాత లేదా నామకార్థ అశ్వ శక్తిని కేవలం పిస్టన్ విసురు కొలతను, సిలిండర్ వ్యాసాన్ని బట్టి లెక్కగడతారు. ఆవిరి ఒత్తిడిని, పిస్టన్ వేగాన్ని ఇందులో పరిగణనకు తీసుకోరు. ఇది ఆచరణలో వ్యక్తం చేస్తున్నది;
బౌల్టన్, వాట్‌ల రోజులంతటి తక్కువ ఆవిరి ఒత్తిడితో, అంతటి తక్కువ పిస్టన్ వేగంతో నడిచేదైతే ఈ చోదక యంత్రం 50 అశ్వ శక్తి గలది. కాని ఆ తరువాత, ఈ ఒత్తిడి, వేగం బ్రహ్మాండంగా పెరిగాయి. నేడు ఒక చోదక యంత్రం ప్రయోగించగల యాంత్రిక శక్తిని కొలిచేందుకు, సిలిండరులోని ఆవిరి ఒత్తిడిని చూపే ఒక సూచికను కనిపెట్టారు. పిస్టన్ వేగాన్ని సులభంగా తెలుసుకోవచ్చు. ఆ విధంగా, ఒక చోదక యంత్రం యొక్క "సూచిత", "వాణిజ్య" అశ్వ శక్తిని ఒక గణిత శాస్త్ర సూత్రం వ్యక్తం చేస్తుంది; ఇది సిలిండర్ వ్యాసాన్ని, పిస్టన్ విసురు కొలతను, దాని వేగాన్ని ఏకకాలంలో పరిగణనకు తీసుకొని, ఒక నిమిషంలో ఈ చోదక యంత్రం 33,000 పౌండ్లకు ఎన్నింతలు ఎక్కువ బరువును పైకెత్తగలదో చూపుతుంది. కాబట్టి ఒక "నామకార్థ" అశ్వ శక్తి మూడు, నాలుగు, తుదకు అయిదు "సూచిత" లేక "నిజమైన" అశ్వ శక్తులను ప్రయోగించవచ్చు. తరువాతి పుటల్లోని వివిధ ఉల్లేఖనల విశదీకరణకై ఈ వివరణను ఇచ్చాము - ఫ్రెడరిక్ ఎంగెల్స్.

అది ఒక రోజులో సాగ్గొట్టే బ్రహ్మాండ పరిమాణాల్లోని ఇనుము కంతటికీ విస్తరించి ఉంటుంది. కాబట్టి, ఒక హండ్రెడ్ వెయిట్ ఇనుముకు బహు కొద్ది విలువ మాత్రమే చేరుతుంది. కానీ ఆ రాకాసి సాధనాన్ని మేకులను దిగ్గొట్టడానికి వినియోగించినట్లయితే, ఆ విలువ ఎంతో ఎక్కువగా ఉంటుంది.

ఏదైనా ఒక యంత్రానికి పని చేయగల సామర్థ్యం అంటే దానిలోని పని చేసే పరికరాల సంఖ్య లేక సమస్య శక్తికి సంబంధించినదయితే, ఆ పరికరాల పరిమాణం నిర్ణీతమైనప్పుడు, ఆ యంత్ర ఉత్పాదితాల పరిమాణం, దానిలోని పనిచేసే భాగాల వేగంపైనా, ఉదాహరణకు, కదుళ్ళ వేగంపైనా లేదా ఒక నిమిషంలో సమ్మెట వేసే వేట్ల సంఖ్యపైనా ఆధారపడి ఉంటుంది. బ్రహ్మాండమైన ఈ సమ్మెటల్లో కొన్ని నిమిషానికి 70 వేట్లు వేయగలవు. సుత్తులతో కొట్టి కదుళ్ళను తయారుచేసే రైడర్ పేటెంట్ యంత్రం నిమిషానికి 700 సార్లు కొట్టగలదు.

యంత్రాలు ఉత్పాదితానికి తన విలువను బదలాయించే రేటు నిర్ణీతమైనప్పుడు, ఆ విధంగా బదలాయించిన విలువ పరిమాణం యంత్రాల మొత్తం విలువపై ఆధారపడి ఉంటుంది.[1] వాటిలో నిక్షిప్తమయిన శ్రమ ఎంత తక్కువగా ఉంటే అవి ఉత్పాదితానికి చేర్చే విలువ అంత తక్కువగా ఉంటుంది. అవి అందచేసే విలువ ఎంత తక్కువైతే వాటి ఉత్పాదకత అంత ఎక్కువ; వాటి సేవలు ప్రకృతి శక్తుల సేవలకు అంత దరిదాపులకు వస్తాయి. కానీ, యంత్రాలచే యంత్రాల ఉత్పత్తి వాటి విలువను తగ్గిస్తుంది. ఆ తగ్గుదల ఉత్పత్తి విస్తరణ, సమర్థతలను బట్టి ఉంటుంది.

చేతివృత్తుల వల్ల, లేదా కార్ఖానా ఉత్పత్తుల వల్ల తయారయ్యే సరుకుల ధరలను, యంత్రాల వల్ల తయారయ్యే అదే సరుకుల ధరలను విశ్లేషించి, పోల్చి చూస్తే, మొత్తంపై ఒక సంగతి రుజువవుతుంది. యంత్రాల ఉత్పాదితంలో, శ్రమ సాధనాల మూలంగా చేరే విలువ సాపేక్షంగా పెరుగుతుంది. కానీ నిరాపేక్షంగా తగ్గుతుంది. వేరు మాటల్లో చెప్పాలంటే, దాని నిరాపేక్ష పరిమాణం తగ్గుతుంది; కానీ ఉత్పాదితం మొత్తం విలువకు, ఉదాహరణకు ఒక పౌండు నూలు మొత్తం విలువకు సంబంధించి పెరుగుతుంది.[2]

---

1. పెట్టుబడిదారీ భావాలు జీర్ణించుకుపోయిన పాఠకునికి, యంత్రం, తన పెట్టుబడి విలువకు అనురూపంగా ఉత్పాదితానికి చేర్చే "వడ్డీ" ప్రస్తావన ఇక్కడ లేదనే భావం కలుగుతుంది. కానీ, స్థిర పెట్టుబడిలోని ఏ ఇతర భాగంలాగానే యంత్రం కూడా కొత్త విలువను సృష్టించదు కాబట్టి, "వడ్డీ" పేరుతో అది ఏ కొత్త విలువనూ చేర్చజాలదని సులభంగానే గ్రహించవచ్చు. అదనపు విలువ ఉత్పత్తిని గురించి పరిశీలిస్తున్న ఈ సందర్భంలో, వడ్డీ పేరుతో ఆ విలువలోని ఏ భాగం ఉనికినీ ముందుగానే ఊహించజాలము. చూచీ చూడగానే అసంగతమూ, విలువ సృజన నియమాలకు బద్ధ విరుద్ధమూ అని కనిపించే పెట్టుబడిదారుడి లెక్కాచార పద్ధతిని ఈ గ్రంథం మూడవ సంపుటంలో వివరిస్తాము.
2. పదార్థ రూపాన్ని మార్చడానికి కాక, కేవలం చోదక శక్తులుగా నియుక్తమైన గుర్రాలను, ఇతర జంతువులను యంత్రాలు విసర్జించినప్పుడు, యంత్రాలు చేర్చే ఈ విలువ భాగం నిరాపేక్షంగానూ, సాపేక్షంగానూ తగ్గుతుంది. ప్రాసంగికంగా ఒక సంగతి చెప్పాలి; జంతువులను కేవలం యంత్రాలుగా నిర్వచించడంలో డెకార్టే కార్ఖానా వస్తూత్పత్తి దశ కళ్ళతో చూడగా, మధ్య యుగాల కళ్ళకు, జంతువులు మనిషికి చేదోడులుగా కనిపించాయి. ఉత్తరోత్తరా వాన్ హాలర్‌కు, ఆయన "రెస్టరేషన్‌డర్ స్టాట్ విస్సెన్‌చ్యాఫ్టన్"ను బట్టి, కనిపించినట్లుగానే ఆలోచనా పద్ధతులు మారిన ఫలితంగా, ఉత్పత్తి రూపంలో మార్పు వస్తుందనీ, మానవుడు ప్రకృతిని ఆచరణాత్మకంగా లొంగదీసుకొంటాడని, బేకన్‌లాగా, డెకార్టే కూడ ముందుగా

ఒక యంత్రాన్ని తయారు చేయడానికి, ఆ యంత్ర వినియోగం ద్వారా ఆదా అయినంత శ్రమే వ్యయమైనప్పుడల్లా జరిగినది శ్రమ బదలాయింపు తప్ప మరేమీ కాదనేది విదితమే; ఫలితంగా, ఒక సరకును ఉత్పత్తి చేయటానికి పట్టే మొత్తం శ్రమా తగ్గదు; శ్రమ ఉత్పాదకత పెరగదు. కాబట్టి ఒక యంత్రానికి వ్యయమయ్యే శ్రమకు, అది ఆదాచేసే శ్రమకూ మధ్య తేడా, వేరు మాటల్లో, దాని ఉత్పాదకతా స్థాయి, దాని విలువకూ, అది దేని స్థానం వహిస్తుందో ఆ పరికరం విలువకూ మధ్య గల తేడాపై ఆధారపడి ఉండదు. ఒక యంత్రంపై వ్యయమైన శ్రమ, తత్పర్యవసానంగా, ఉత్పాదితానికి చేరిన ఆ యంత్రపు విలువలోని భాగం, కార్మికుడు తన పరికరంతో ఉత్పాదితానికి చేర్చిన విలువకన్నా తక్కువగా ఉన్నంత కాలం, ఆదా అయిన శ్రమలోని తేడా యంత్రానికి అనుకూలంగా ఉంటుంది. కాబట్టి, ఒక యంత్రం ఉత్పాదకతను, అది దేని స్థానం వహిస్తుందో ఆ మానవ శ్రమ శక్తితో కొలుస్తారు. బేనెస్ చెబుతున్న దాని ప్రకారం, ఒక అశ్విక శక్తితో నడిచే సన్నాహక యంత్రాలతో సహా[1], 450 యంత్ర కదుళ్ళకు $2\frac{1}{2}$ మంది నిర్వాహకులు అవసరం; ప్రతి స్వయం ప్రవర్తక యంత్ర కదురు, పది గంటలు పనిచేస్తూ, 13 ఔన్సుల నూలును (సగటు నంబరు మందంది) ఉత్పత్తి చేస్తుంది; ఫలితంగా, $2\frac{1}{2}$ మంది నిర్వాహకులు వారానికి $365\frac{5}{8}$ పౌండ్ల నూలు వడుకుతారన్న మాట. కాబట్టి, రద్దును వదలివేస్తే, 366 పౌండ్ల పత్తి, నూలుగా మారే సందర్భంలో 150 గంటల శ్రమను మాత్రమే గ్రహిస్తుంది; లేక, రోజుకు పది గంటల చొప్పున 15 రోజుల శ్రమను గ్రహిస్తుంది. చేతితో వడికే వాడు 60 గంటల్లో 13 ఔన్సుల నూలు ఉత్పత్తి చేస్తాడనుకొంటే, రాట్నంతో, అంతే బరువున్న దూది రోజుకు పది గంటల చొప్పున, 2700 రోజుల శ్రమను, లేక 27,000 గంటల

---

ఊహించారని ఆయన "డిస్కోర్స్ డిలా మెథడే" నుంచి స్పష్టమవుతోంది. అందులో ఆయన ఇలా చెబుతున్నారు : "జీవితంలో ఉపయోగపడే పరిజ్ఞానాన్ని (ఆయన తత్వశాస్త్రంలో ప్రవేశపెట్టిన పద్ధతిని ఉపయోగించి), సంపాదించడం సాధ్యం. పాఠశాలల్లో బోధించే చింతనాత్మక తత్వశాస్త్రానికి బదులు, ఆచరణాత్మక తత్వశాస్త్రం లభ్యం కావచ్చు. అగ్ని, నీరు, గాలి, నక్షత్రాలు, మన చుట్టూ ఉన్న ఇతర గ్రహాల శక్తులను, ప్రభావాన్ని గురించి, మన హస్త కళాకారుల వివిధ చేతివృత్తులంత బాగా, అంత కచ్చితంగా తెలిసినప్పుడు, ఆచరణాత్మక తత్వశాస్త్ర సహాయంతో, మనం వాటిని, ఆయా పనులకు అనుగుణంగా చేతివృత్తులను మలచి ఉపయోగిస్తున్నట్లుగానే, వినియోగించుకోగలుగుతాము. అలా, ఒక విధంగా చెప్పాలంటే, మనం ప్రకృతికి యజమానులం, సొంతదారులం అవుతాము." తద్వారా, "మానవ జీవిత పరిపూర్ణతకు" దోహదం చేస్తాము. డెకార్టే పద్ధతి రాజకీయ అర్థశాస్త్రాన్ని, పాత పుక్కిటి పురాణాల నుంచి బంగారం, వర్తకం మొదలయిన వాటిని గురించి మూఢ భావాలనుంచి విముక్తి చేయనారంభించిందని, సర్ డడ్లీ, నార్త్ "వర్తకంపై ప్రసంగాలు" (1691) అన్న రచనకు పీఠికలో చెప్పారు. కాని, మొత్తంపై తొట్టతొలి ఇంగ్లీషు ఆర్థికవేత్తలు, తమ తాత్వికులైన బేకన్, హాబ్స్‌ల పక్షం వహించగా, తరువాత దశలో లాకే ఇంగ్లండు, ఫ్రాన్స్, ఇటలీలలో రాజకీయ అర్థశాస్త్ర తాత్వికుడయ్యాడు.

1. 1862లో క్రుప్స్ పోత ఉక్కు కర్మాగారం, తన 161 బట్టీలతో, 32 ఆవిరి ఇంజన్లతో (1800వ సంవత్సరంలో మాంచెస్టర్‌లో పనిచేస్తున్న అన్ని ఆవిరి ఇంజన్ల సంఖ్య దాదాపు ఇంతే) 14 ఆవిరి సమ్మెటలతో (అన్నీ కలిసి 1,236 అశ్విక శక్తి గలవి), 49 కొలుములతో, 203 పరికర యంత్రాలతో, రమారమి 2400 మంది శ్రామికులతో 13 మిలియన్ పౌండ్ల పోత ఉక్కును ఉత్పత్తి చేసిందని, ఎస్సెన్ వాణిజ్య మండలి వార్షిక నివేదిక (1863) చెబుతోంది. ఇక్కడ ప్రతి అశ్విక శక్తికి ఇద్దరు కార్మికులు లేరు.

శ్రమను గ్రహిస్తుంది.[1] కాలికోపై చేతితో కలంకారీ పాత పద్ధతి అయిన దిమ్మచ్చు అద్దకం స్థానాన్ని యంత్ర అద్దకం ఆక్రమించిన సందర్భంలో, ఒకే ఒక యంత్రం ఒక పురుషుని లేదా ఒక కుర్రవాని సహాయంతో, ఒక గంటలో మునుపు రెండు వందల మంది చేసినంత నాల్గు రంగుల కాలికో అద్దకం పనిని చేస్తోంది.[2] ఎల్ వైట్నీ 1793లో దూది జిన్నును కనిపెట్టక ముందు, ఒక పౌండు దూది నుంచి విత్తులు వేరుచేయడానికి ఒక సగటు రోజు శ్రమ వ్యయమయ్యేది. ఆయన నూతన యంత్ర సృష్టితో, ఒక నీగ్రో స్త్రీ రోజుకు 100 పౌండ్ల దూదిని శుద్ధి చేయగలిగింది. దరిమిలా, జిన్ను సామర్థ్యాన్ని గణనీయంగా పెంపొందించారు. మునుపు 50 సెంట్ల ఖర్చుతో తయారయ్యే ఒక పౌండు దూదితో ఈ నూతన సృష్టి తరువాత, కూలి చెల్లించబడని శ్రమ మరింత ఎక్కువ నిక్షిప్తమైంది. పర్యవసానంగా అది మరింత లాభంతో, పది సెంట్లకే అమ్మకమయింది. ఇండియాలో పత్తి నుంచి విత్తులను వేరుచేయడానికి చర్కా అనే ఒక సాధనాన్ని వినియోగిస్తారు. అది సగం యంత్రం, సగం పరికరం; దీనితో ఒక పురుషుడు, ఒక స్త్రీ రోజు 28 పౌండ్లను శుద్ధి చేయగలరు. కొన్నేళ్ళ క్రితం డాక్టర్ ఫోర్బెస్ కనిపెట్టిన చర్కాతో ఒక పురుషుడు, ఒక బాలుడు రోజుకు 250 పౌండ్ల దూది తయారు చేస్తున్నారు. దాన్ని నడపడానికి ఎద్లు, ఆవిరిని, లేదా నీటిని వినియోగించినప్పుడు, పత్తిని అందించడానికి కొద్దిమంది బాలురు, బాలికలు మాత్రమే అవసరమవుతారు. ఎద్లతో నడిపించే ఇలాంటి పదహారు యంత్రాలు మునుపు సగటున 750 మంది చేసినంత పని చేస్తాయి.[3]

ఇదివరకే చెప్పినట్లు, 15 షిల్లింగుల ఖర్చుతో, 66 మంది పురుషులు చేసినంత పని ఒక ఆవిరి నాగలి మూడు పెన్నీల ఖర్చుతో ఒక గంటలో చేస్తుంది. ఒక పొరపాటు అభిప్రాయాన్ని తొలగించేందుకు నేనీ ఉదాహరణను మళ్ళీ పేర్కొంటున్నాను. 66 మంది పురుషులు ఒక గంటలో చేసిన యావత్తు శ్రమను, 15 షిల్లింగులు డబ్బు రూపంలో ఎంత మాత్రమూ వ్యక్తం చేయవు. అదనపు శ్రమ, అవసర శ్రమల మధ్య నిష్పత్తి 100 శాతం ఉన్నట్లయితే, ఈ 66 మంది పురుషుల వేతనమైన 15 షిల్లింగులు వారి అరగంట శ్రమకు మాత్రమే ప్రతీకగా ఉన్నప్పటికీ, వారు 30 షిల్లింగుల విలువను ఒక గంటలో ఉత్పత్తి చేస్తారు. ఇక, ఒక యంత్రం వెల, దానిచే తొలగింపబడిన 150 మంది పురుషుల ఏడాది వేతనానికి సమానమని, మాట వరుసకు 3000 పౌనులని అనుకొందాం. ఈ 3000 పౌనులు, ఆ యంత్రాన్ని ప్రవేశపెట్టక మునుపు ఈ 150 మంది ఉత్పత్తి చేసిన వస్తువుకు చేర్చిన శ్రమను, డబ్బు రూపంలో ఎంత మాత్రమూ వ్యక్తం చేయడం లేదు. వారి ఏడాది శ్రమలో తమ కోసం వెచ్చించిన భాగాన్ని వారి వేతనాలు ప్రాతినిధ్యం వహిస్తున్న ఆ భాగాన్ని వ్యక్తం చేస్తుందంతే. మరోవైపున ఈ 3000 పౌనులు డబ్బు రూపంలో ఈ యంత్రం విలువ, దాని ఉత్పత్తికై వెచ్చించిన శ్రమలో కార్మికుని వేతనం, పెట్టుబడిదారునికి చెందే అదనపు విలువ ఏ నిష్పత్తిలో ఉందనే దానితో

1. జావాలో, వడికే శ్రమా, దూది విలువకు 117 శాతం చేర్చుతుందని బాబేజ్ అంచనా వేస్తున్నారు. అదే కాలంలో (1832) శ్రేష్ఠమైన నూలు పరిశ్రమలో యంత్రాలూ, శ్రమ, దూదికి చేర్చే విలువ, దూది విలువలో దాదాపు 33 శాతం. ("ఆన్ ది ఎకానమీ ఆఫ్ మెషినరీ" పుట 165, 166.)
2. యంత్రంతో అద్దకం వల్ల రంగు కూడ పొదుపవుతుంది.
3. ఇండియా ప్రభుత్వానికి ఉత్పాదితాలపై సమాచార నివేదికుడు డాక్టర్ వాట్సన్ 1860 ఏప్రిల్ 17న, కళా సంఘం ముందు చదివిన పత్రం చూడండి.

నిమిత్తం లేకుండా, ఆ యంత్రాన్ని తయారు చేయడానికి వెచ్చించిన యావత్తు శ్రమను వ్యక్తం చేస్తుంది. కాబట్టి ఒక యంత్రం వెల, దానిచే తొలగింపబడిన శ్రమ శక్తి వెల ఎంతో, అంతే అయినా, ఆ యంత్రంలో వస్తు రూపం ధరించిన శ్రమ దానిచే తొలగింపబడిన ఆ సజీవ శ్రమ కన్నా చాలా తక్కువగా ఉంటుంది.[1]

కేవలం ఉత్పాదితాన్ని చౌకపరచేందుకు ఉద్దేశించిన యంత్రాల వినియోగానికి కింది విధంగా ఒక పరిమితి ఉంది : యంత్రాల ఉత్పత్తికై వెచ్చించే శ్రమ, వాటి వినియోగం ద్వారా తొలగింపబడే శ్రమ కన్నా తక్కువగా ఉండాలి. కానీ పెట్టుబడిదారుకు ఈ వినియోగం మరింత పరిమితమైనది. అతడు శ్రమకు డబ్బు చెల్లించడానికి బదులు వినియోగించిన శ్రమ శక్తి విలువను మాత్రమే చెల్లిస్తాడు. కాబట్టి, అతడు ఒక యంత్రాన్ని వాడటానికి గల పరిమితిని, ఆ యంత్రం విలువకు అది దేని స్థానాన్ని పుచ్చుకొంటున్నదో ఆ శ్రమ శక్తి విలువకు మధ్య భేదం నిర్ధారిస్తుంది. అవసర, అదనపు శ్రమలుగా రోజు పని విభజన, వేరు వేరు దేశాల్లో తుదకు ఒకే దేశంలోనే వేరు వేరు కాలాల్లో, లేదా వేరు వేరు పారిశ్రామిక శాఖల్లో, వేరు వేరుగా ఉంటుంది. అంతేకాక ఒక సమయంలో కార్మికుని వాస్తవ వేతనం అతని శ్రమ శక్తి విలువ కన్నా తగ్గుతుంది; మరో సమయంలో దానికన్నా పెరుగుతుంది; కాబట్టి, యంత్రాన్ని తయారు చేయడానికి పట్టే శ్రమ పరిమాణానికీ, అది దేని స్థానం ఆక్రమిస్తుందో ఆ శ్రమ మొత్తం పరిమాణానికీ మధ్య భేదం స్థిరంగా ఉన్నప్పటికీ, యంత్రాల ధరకు, అవి దేని స్థానం ఆక్రమిస్తున్నాయో ఆ శ్రమ శక్తి ధరకు మధ్య తేడా చాలా మారవచ్చు.[2] కానీ, పెట్టుబడిదారుకు, ఒక సరుకును ఉత్పత్తి చేయడానికయ్యే ఖర్చును నిర్ణయించేదీ, పోటీ ఒత్తిడి ద్వారా అతని చర్యను ప్రభావితం చేసేదీ పైన పేర్కొన్న ధరల మధ్య భేదమే. పదహారవ, పదిహేడవ శతాబ్దాల్లో కేవలం హాలండ్‌లో వినియోగానికై జర్మనీలో కొత్త యంత్రాలు సృష్టి అయినట్లుగా 18వ శతాబ్ది నాటి ఎన్నో ఫ్రెంచి నూతన యంత్రాలు ఇంగ్లండులో మాత్రమే వినియోగమయినట్లుగా, కేవలం ఉత్తర అమెరికాలో వినియోగింపబడుతున్న కొత్త యంత్రాల సృష్టి నేడు ఇంగ్లండులో జరగడానికి అదీ కారణం. పాత (పారిశ్రామిక) దేశాల్లో యంత్రాలు కొన్ని పారిశ్రామిక శాఖల్లో వినియుక్తమైనప్పుడు, ఇతర శాఖల్లో శ్రమను ఎంత అక్కరకు మించినదిగా చేస్తుందంటే, ఈ శాఖల్లో వేతనాలు, శ్రమ శక్తి విలువ కన్నా తగ్గిపోయి, యంత్రాల వాడకానికి ఆటంకం అవుతాయి. పెట్టుబడిదారుని లాభం వినియుక్త శ్రమ తగ్గుదల నుంచి కాక, వేతనం చెల్లించబడిన శ్రమ నుంచి లభిస్తుంది కాబట్టి, అతని దృష్టిలో ఈ యంత్రాల వాడకం అనవసరమూ, తరచూ అసాధ్యమూ అవుతుంది. ఇంగ్లండులో ఉన్న బట్టల ఉత్పత్తికి సంబంధించిన కొన్ని శాఖల్లో పిల్లల నియామకం ఇటీవలి సంవత్సరాల్లో గణనీయంగా తగ్గిపోయింది; కొన్ని సందర్భాల్లో పూర్తిగా రద్దయింది. ఎందుకు? ఎందుకంటే, ఫ్యాక్టరీ చట్టం వల్ల, పిల్లల బృందాలు రెండు – ఒకటి ఆరు గంటలు పని చేసేది, మరొకటి నాలుగు గంటలు పని

1. “ఈ మూగ ఏజెంట్లు (యంత్రాలు) తాము దేని స్థానం ఆక్రమిస్తాయో ఆ శ్రమా, డబ్బు రూపంలో ఒకే విలువ గలవి అయినా, అవి అంతకన్నా చాలా తక్కువ శ్రమ ఉత్పత్తి చేసినవి.” (రికార్డో, పూర్వోదాహృత గ్రంథం, పుట 40)

2. కాబట్టి కమ్యూనిస్టు సమాజంలో, యంత్రాల వినియోగావకాశం, బూర్జువా సమాజంలో ఉండగల దానికి చాలా భిన్నంగా ఉంటుంది.

చేసేది, లేదా ప్రతీదీ అయిదు గంటలు పనిచేసేవి అవసరమయాయి. కానీ ఈ "సగం కాలపు పని వారిని," "పూర్తి కాలపు పనివారి" కన్నా చౌకగా అమ్మడానికి తల్లిదండ్రులు నిరాకరించారు. అందువల్ల "సగం కాలపు పనివారి" స్థానంలో యంత్రాలు వచ్చాయి.[1] గనుల్లో స్త్రీల, పదేళ్ళలోపు పిల్లల శ్రమను నిషేధించడానికి మునుపు, తరచూ పురుషుల సరసనే నగ్న స్త్రీలను, బాలికల నియామకాన్నీ తమ నీతి నియమావళి, ప్రత్యేకించి తమ ఆవర్జా పుస్తకాలు ఏ మేరకు ఆమోదిస్తున్నట్లు పెట్టుబడిదారులు పరిగణించారంటే, వారు యంత్రాలను ఆశ్రయించింది, ఆ చట్టం వచ్చాకనే. యాంకీలు రాళ్ళు పగులగొట్టే యంత్రాన్ని కనిపెట్టారు. ఇంగ్లీషువారు దీన్ని ఉపయోగించడం లేదు. ఎందువల్లనంటే, ఈ పనిచేసే "దౌర్భాగ్యుడు"[2] తన శ్రమలో ఎంత స్వల్ప భాగానికి ప్రతిఫలం పొందుతున్నాడంటే, యంత్రాల వల్ల పెట్టుబడిదారునికి ఉత్పత్తి ఖర్చు పెరుగుతుంది.[3] ఇంగ్లండులో, ఇప్పటికీ కాలువ పడవలను లాగేందుకు గుర్రాలకు బదులు స్త్రీలను తరచుగా వినియోగిస్తున్నారు.[4] ఎందుచేతనంటే, గుర్రాల, యంత్రాల ఉత్పత్తికి అవసరమైన శ్రమ, ఖచ్చితంగా తెలిసిన పరిమాణం గలది; కానీ, అదనపు జనాభాలోని స్త్రీల పోషణకు అవసరమైన శ్రమ పరిమాణం అన్ని అంచనాల కన్నా తక్కువగానే ఉంటుంది. కాబట్టి, మానవ శ్రమ శక్తి యంత్రాల దేశమైన ఇంగ్లండులో కన్నా సిగ్గుచేటుగా, అతి తుచ్ఛ ప్రయోజనాల కోసం దుర్వ్యయం కావడం మరెక్కడా మనకు కనిపించదు.

## విభాగం-3

## కార్మికునిపై యంత్రాల తక్షణ ప్రభావం

మేము నిరూపించినట్లుగా, శ్రమ సాధనాల్లో విప్లవం ఆధునిక పరిశ్రమలకు నాంది; ఈ విప్లవం ఒక ఫ్యాక్టరీలోని సుసంఘటిత యంత్ర వ్యవస్థలో అత్యున్నత అభివృద్ధిచెందిన రూప మందుకొంటుంది. ఈ వస్తుగత అంగ నిర్మాణంలో మానవ వనరు ఎలా మూర్తిమంతమవుతుందో పరిశోధించే ముందు, అసలు కార్మికునిపై ఈ విప్లవ సార్వత్రిక ఫలితాలు కొన్నిటిని పరిశీలిద్దాం.

---

1. "13 సంవత్సరాల లోపు పిల్లల బృందాలు రెంటిని ఉంచుకోవడానికి కార్మిక యజమానులు ఇష్టపడటం లేదు. వాస్తవంలో, ఒక తరగతి కార్ఖానా యజమానులు, ఉన్ని దారం వడికే కార్ఖానా యజమానులు, ఈనాడు పదమూడేళ్ళలోపు పిల్లలను అంటే, సగం కాలం పనివారిని నియమించడం అరుదు. వారు మెరుగయిన, వివిధ రకాల కొత్త యంత్రాలను ప్రవేశపెట్టారు. ఇవి పిల్లల (అంటే, 13 ఏళ్ళలోపు వారి) నియామకాన్ని పూర్తిగా రద్దు చేశాయి. ఉదాహరణకు, ఈ పిల్లల సంఖ్య తగ్గుదలకు నిదర్శనంగా ఒక ప్రక్రియను పేర్కొంటాను; ఇందులో, ఇప్పుడున్న యంత్రానికి, పోగులతికే యంత్రం అనే ఒక సాధనాన్ని చేర్చడం ద్వారా, ఆయా యంత్ర ప్రత్యేకతను బట్టి ఆరుగురు లేక నలుగురు సగం కాలం పనివారి పనిని ఒక యువకుడు (13 ఏళ్ళు పైబడినవాడు) చేయగలడు. సగం కాలపు పని పద్ధతి "పోగులతికే యంత్ర సృష్టిని ప్రేరేపించింది". (ఫ్యాక్టరీ ఇన్‌స్పెక్టర్ల నివేదికలు, 1858, అక్టోబరు 31.)
2. ఇంగ్లీషు వారి రాజకీయ అర్థశాస్త్రంలో, "నీచుడు" అనేది వ్యవసాయ కార్మికునికి వాడే, గుర్తింపు పొందిన పదం.
3. "శ్రమ (వేతనాలు అని ఆయన భావం) పెరిగే వరకూ, యంత్రాలు ... తరచూ, వాడ వీలులేదు." (రికార్డో, పూర్వోదాహృత గ్రంథం, పుట 479).
4. "ఎడింబరో"లో సామాజిక శాస్త్ర మహాసభ నివేదికను (1863, అక్టోబరు) చూడండి.

## అ. పెట్టుబడిచే అనుబంధ శ్రమ శక్తి స్వాయత్తత, పనిలో స్త్రీల, పిల్లల నియామకం

యంత్రాలు భుజ బలం అక్కరలేకుండా చేస్తాయి కనుక, అవి కొద్దిపాటి కండబలమున్న కార్మికులను, శరీరం ఇంకా పూర్తిగా పెరక్కపోయినా, తత్కారణంగా మరింత అవయవ లాఘవం కలవారిని పనిలో నియమించేందుకు సాధనాలవుతున్నాయి. కాబట్టి యంత్రాలను వాడిన పెట్టుబడిదారులు మొదట వెతికింది స్త్రీల, పిల్లల శ్రమను. వయో, లింగ భేదం పాటించకుండా, కార్మికుని కుటుంబంలోని ప్రతి ఒక్కరినీ పెట్టుబడి ప్రత్యక్ష ఆధిపత్యం కింద పనిలో చేర్చుకోవడం ద్వారా వేతన కార్మికుల సంఖ్యను పెంచడానికి ఒక సాధనంగా, శ్రమకు, కార్మికులకు శక్తివంతమైన ఆ ప్రత్యామ్నాయాన్ని తక్షణమే మార్చివేశారు. పిల్లల ఆటపాటల స్థానాన్నే కాకుండా, కుటుంబ జీవనాధారం కోసం, ఒక మోస్తరు పరిమితుల్లో ఇంటిపట్టున సాగే స్వేచ్ఛా శ్రమ స్థానాన్ని సైతం, పెట్టుబడిదారు కోసం నిర్బంధ శ్రమ అన్యాయంగా ఆక్రమించుకొంది.[1]

శ్రమ శక్తి విలువను నిర్ణయించినది, వయోజనుడైన ఆయా కార్మికుని పోషణకు అవసరమైన శ్రమ కాలం మాత్రమే కాదు, అతని కుటుంబ పోషణకు అవసరమైన శ్రమ కాలం కూడా. ఆ కుటుంబంలోని ప్రతి ఒక్కరినీ శ్రమ విపణిలోకి నెట్టడం ద్వారా యంత్రాలు మనిషి శ్రమ శక్తి విలువను అతని మొత్తం కుటుంబానికి పరివ్యాప్తం చేస్తాయి. ఆ విధంగా అవి అతని శ్రమ శక్తి విలువను తగ్గిస్తాయి. నలుగురు పనివారున్న ఒక కుటుంబ శ్రమ శక్తిని కొనేందుకు, మునుపు ఆ కుటుంబ పెద్ద శ్రమ శక్తిని కొనేందుకయిన దానికన్నా బహుశా, ఎక్కువ ఖర్చు కావచ్చు. కానీ, దీనికి ప్రతిఫలంగా, ఒక రోజు శ్రమ స్థానాన్ని నాలుగు రోజుల శ్రమ వహిస్తుంది. నలుగురి అదనపు శ్రమ ఒకరి అదనపు శ్రమకు మించి ఉన్న నిష్పత్తిలో వారి శ్రమ ధర పడిపోతుంది. కుటుంబం బతకడానికి ఇప్పుడు నలుగురు పెట్టుబడిదారుడి కోసం శ్రమించడమే కాక, అదనపు శ్రమ చేయాలి. ఆ విధంగా పెట్టుబడి దోపిడీ శక్తికి ప్రధాన వస్తువుగా రూపొందిన మానవ వనరును యంత్రాలు పెంచుతూ,[2] అదే సమయంలో దోపిడీ స్థాయినీ హెచ్చిస్తాయి.

---

1. ఇంగ్లీషు ప్రభుత్వం, అమెరికన్ అంతర్యుద్ధం వల్ల సంభవించిన పత్తి సంక్షోభ కాలంలో, పత్తి మిల్లుల పనివారి పారిశుద్ధ్య పరిస్థితిని గురించి నివేదించేందుకై డాక్టర్ ఎడ్వర్డ్ స్మిత్‌ను లాంక్‌షైర్, చెషైర్ తదితర స్థలాలకు పంపింది. ఫ్యాక్టరీ వాతావరణం నుంచి పని వారి బహిష్కరణ సంగతి అటుంచి పారిశుద్ధ్యం దృష్ట్యా చూస్తే, ఈ సంక్షోభం వల్ల పలు అనుకూలతలు కలిగాయని ఆయన నివేదించారు. తమ చంటిపిల్లలకు విష కాలుష్య "గ్రాడ్ ఫ్రే పానీయం" తాగించడానికి బదులు చనుబాలు ఇవ్వడానికి స్త్రీల కిప్పుడు తగినంత తీరిక ఉంది. వంటా వార్పూ నేర్చుకొనేందుకు వ్యవధి లభించింది. అయితే, వండటానికి ఏమీలేని సమయంలో ఈ కళ అబ్బడం దురదృష్టకరం. కానీ, దీన్నిబట్టి, పెట్టుబడి తన స్వయం విస్తరణ ప్రయోజనాల కోసం, కుటుంబ గృహంలో అవసరమైన శ్రమ స్థానాన్ని ఎలా ఆక్రమించుకొందో మనకు తెలుస్తోంది. కుట్టుపని పాఠశాలల్లో కార్మికుల పిల్లలకు కుట్టుపని నేర్పడానికి కూడా ఈ సంక్షోభాన్ని వినియోగించారు. యావత్ ప్రపంచం కోసం నూలు వడికే కార్మిక యువతులు కుట్టడం నేర్చుకోగలిగేందుకు ఒక అమెరికన్ విప్లవమూ, ఒక సార్వత్రిక సంక్షోభమూ!
2. పురుషుల శ్రమకు బదులు మహిళల శ్రమను, అన్నిటికన్నా ముఖ్యంగా, వయోజన శ్రమకు బదులు బాలల శ్రమను అధికాధికంగా ప్రవేశపెట్టడం ద్వారా కార్మికుల సంఖ్య ఎంతో పెరుగుతూ వచ్చింది. "వారానికి ఆరు షిల్లింగుల నుంచి ఎనిమిది షిల్లింగుల దాకా వేతనంతో నియమితులయ్యే 13 ఏళ్ళ

యంత్రాలు కార్మికునికీ, పెట్టుబడిదారునికీ మధ్య ఒప్పందంలో, వారి పరస్పర సంబంధాన్ని సాధికారికంగా స్థాపించే ఆ ఒప్పందంలో పూర్తిగా ఒక విప్లవం తెస్తుంది. సరకుల మార్పిడిని మన ప్రాతిపదికగా తీసుకొంటూ, మనం మొట్టమొదట ఊహించుకొన్నదేమిటంటే, పెట్టుబడిదారు, కార్మికుడు స్వేచ్ఛాయుత వ్యక్తులుగా, స్వతంత్రులైన సరకుల సొంతదారులుగా కలుసుకొన్నారని. ఒకరికి డబ్బూ, ఉత్పత్తి సాధనాలున్నాయి; మరొకరికి శ్రమ శక్తి ఉంది. కానీ ఇప్పుడు పెట్టుబడిదారుడు పిల్లలను, వయసురాని చిన్నవారిని కొంటున్నాడు. మునుపు కార్మికుడు తన సొంత శ్రమ శక్తిని అమ్ముకొనేవాడు. దాన్ని నామమాత్రంగానే ఒక స్వతంత్ర కర్తగా అమ్మాడు. ఇప్పుడతను పెళ్ళాన్ని, పిల్లను అమ్ముతున్నాడు; అతను బానిస వ్యాపారి అయ్యాడు.[1] బాల శ్రామికులు కావాలన్న కోర్కెలు, మునుపు నీగ్రో బానిసల కోసం అమెరికన్ పత్రికల్లో అడ్వర్‌టైజ్‌మెంట్ల ద్వారా వాకబు చేసిన రూపంలోనే తరచూ వ్యక్తమవుతున్నాయి. ఒక ఇంగ్లీషు ఫ్యాక్టరీ ఇన్‌స్పెక్టర్ ఇలా చెబుతున్నాడు : "నా జిల్లాలోని ఒక అతి ముఖ్య పారిశ్రామిక పట్టణానికి చెందిన స్థానిక పత్రికలోని ఒక అడ్వర్‌టైజ్‌మెంట్ నా దృష్టికి వచ్చింది. అది ఇలా ఉంది : 12 మంది నుంచి 20 మంది దాకా కుర్రవాళ్ళు కావాలి. వారి వయస్సు 13 సంవత్సరాలకు తక్కువ ఉన్నట్లు అనిపించరాదు. వేతనం, వారానికి 4 షిల్లింగులు, దరఖాస్తులు

---

బాలికలు ముగ్గురు, 18 షిల్లింగుల నుంచి 45 షిల్లింగుల వరకు ఉన్న వివిధ వేతనాలతో నియమితులయ్యే పరిణత వయస్కుడైన ఒక పురుషుని స్థానం వహించారు." (థామస్ డిక్వీన్సీ : "లాజిక్ ఆఫ్ పొలిటికల్ ఎకానమీ", లండన్, 1844, 144వ పుటలో గమనిక.) చంటిపిల్లల ఆలనా పాలనా, వారికి పాలివ్వడం వంటి కొన్ని కుటుంబ విధులను పూర్తిగా తొక్కిపెట్టడం సాధ్యం కాదు కాబట్టి, పెట్టుబడి స్వాధీనం చేసుకొన్న తల్లులు ఏదో ఒక విధమైన ప్రత్యామ్నాయాలకై ప్రయత్నించక తప్పదు. కుట్టడం, మరమ్మతు చేయడం వంటి ఇంటి పనులు పోయి, తయారీ వస్తువుల కొనుగోలు రాక తప్పదు. కాబట్టి ఇంటిలో శ్రమ వ్యయం తగ్గడంతోపాటుగా, డబ్బు వ్యయం పెరుగుతోంది. కుటుంబ పోషణ ఖర్చు పెరిగి, హెచ్చిన ఆదాయానికి సమానమవుతోంది. దీనికి తోడు, జీవనావసరాల వినియోగంలో, వాటిని సిద్ధపర్చడంలో పొదుపు, వివేకం అసాధ్యమవుతోంది. అధికార రాజకీయ అర్థశాస్త్రం దాచిపెడుతున్న ఈ వాస్తవాలను గురించిన బోలెడు సమాచారం ఫ్యాక్టరీల ఇన్‌స్పెక్టర్ల నివేదికల్లో, పనిలో పిల్లల నియామకంపై కమిషన్ నివేదికల్లో, అంతకన్నా ముఖ్యంగా, ప్రజారోగ్యంపై నివేదికల్లో లభిస్తోంది.

1. ఇంగ్లీషు ఫ్యాక్టరీల్లో స్త్రీల, పిల్లల పనిగంటల తగ్గింపును పురుష కార్మికులు పెట్టుబడి నుంచి సాధించుకొన్నారనే గొప్ప వాస్తవానికి కొట్టవచ్చినట్లున్నంత భిన్నంగా, పనిచేసే తల్లిదండ్రులు పిల్లలను అమ్ముకోవడంలో ప్రదర్శించే లక్షణాలు మనకు, పిల్లల నియామకంపై కమిషన్ సమర్పించిన నివేదికల్లో కనిపిస్తాయి. ఇవి నిజంగా రోతపుట్టించేవీ, బానిస వ్యాపారం లాంటివి. కానీ అదే నివేదికలను బట్టి మనకు తెలుస్తున్నట్లుగా ఆషాఢభూతి అయిన పెట్టుబడిదారుడు తాను స్వయంగా సృష్టించి, చిరస్థాయిగా చేసి, స్వార్థానికి వినియోగించుకొంటూ, పైగా "శ్రమ స్వేచ్ఛా" అని నామకరణం చేసిన ఈ పాశవికత్వాన్ని ఖండిస్తున్నాడు. "పనిపిల్లల శ్రమను, సహాయార్థం, వారు తుదకు తమ కడుపు కోసం పని చేయడానికై రంగంలోకి దింపడం జరిగింది. అంతటి తలకు మించిన కాయకష్టానికి తట్టుకోగల శక్తి లేకుండా, తమ భావి జీవితానికి మార్గం చూపే చదువు సంధ్యలు లేకుండా, వారు భౌతికంగా, నైతికంగా కలుషితమైన పరిస్థితుల్లోకి నెట్టివేయబడ్డారు. మానవత్వం లేని ఒక తల్లి, అపరిమితమైన ఆకలి బాధ తీర్చుకొనేందుకు తన కన్నబిడ్డనే బలి పెట్టినప్పుడు, జెరూసలం అంతా సర్వ నాశనం కావడంలో ఆశ్చర్యం లేదని, టైటస్ జెరూసలంను కూలదోయడం గురించి, యూదు చరిత్రకారుడు వ్యాఖ్యానించాడు." (పబ్లిక్ ఎకానమీ కాన్సన్‌ట్రేటెడ్" కార్లిసిల్, 1833, పుట 66)

పంపవలసిన అడ్రసు వగైరా."[1] "13 సంవత్సరాలకు తక్కువ ఉన్నట్లు అనిపించరాదు" అనే మాటలు, ఫ్యాక్టరీ చట్టం ప్రకారం, 13 ఏళ్ళ వయసులోపు పిల్లలు 6 గంటలు మాత్రమే పని చేయాలన్న నిబంధనకు సంబంధించినవి. సాధికారికంగా నియమితుడైన ఒక సర్జన్ వారి వయస్సును ధ్రువపరుస్తూ సర్టిఫికెట్ ఇవ్వాలి. కాబట్టి ఫ్యాక్టరీ యజమాని, 13 ఏళ్ళు దాటినట్లు కనిపించే పిల్లలు కావాలంటాడు. ఫ్యాక్టరీల్లో నియమితులైన 13 ఏళ్ళలోపు పిల్లల సంఖ్యలో వచ్చిన విపరీతమైన తగ్గుదల – గత 20 సంవత్సరాల ఇంగ్లీషు గణాంక వివరాలు ఆశ్చర్యకరమైన రీతిలో చూపుతున్న ఈ తగ్గుదల – ఫ్యాక్టరీ ఇన్‌స్పెక్టర్ల సాక్ష్యాన్ని బట్టి, చాలావరకు సర్టిఫికెట్లు ఇచ్చే సర్జన్ల పనే. దోచుకోవాలనే పెట్టుబడిదారుడి దురాశకూ, ఈ క్షుద్ర వ్యాపారంలో తల్లిదండ్రుల అవసరాలకూ అనువైన రీతిలో సర్జన్లు పిల్లల వయస్సును, ఉన్నదానికన్నా ఎక్కువ వేశారు. అపఖ్యాతికరమైన బెత్నాల్ గ్రీన్ జిల్లాలో ప్రతి సోమవారం, మంగళవారం ఉదయం ఒక సంత జరుగుతుంది. అక్కడ 9 ఏళ్ళూ, దానికి పైబడ్డ మగపిల్లలు, ఆడపిల్లలు పట్టు పరిశ్రమదారుల కింద కూలిపనికి ఒప్పుకొంటారు. "మామూలు షరతులు, వారానికి 1 షిల్లింగు, 8 పెన్నీలు (ఇది తల్లిదండ్రులకు పోతుంది), 2 పెన్నీలు నాకు, టీకి." ఈ ఒప్పందానికి కట్టుబడి ఉండే కాలం ఒక వారమే. ఆ సంత జరుగుతున్నప్పుడు అక్కడి దృశ్యమూ, మాటలు పూర్తిగా సిగ్గుచేటయినవి.[2] ఇంగ్లండులో కూడా స్త్రీలు తమ "పిల్లల్ని శరణాలయాల నుంచి తెచ్చి, వారిని ఎవరికైనా సరే వారానికి 2 షి. 6 పె. చొప్పున కూలిపనికి ఇవ్వడం" జరిగింది.[3] చట్టం నిషేధిస్తున్నప్పటికీ, పొగ గొట్టం తుడిచే సజీవ యంత్రాలుగా పనిచేసేందుకై గ్రేట్ బ్రిటన్‌లో తల్లిదండ్రులు అమ్మివేసిన బాలుర సంఖ్య (వారికి బదులు, పనిచేసే యంత్రాలెన్నో ఉన్నప్పటికీ) 2000కు మించింది.[4] శ్రమ శక్తి కొనుగోలుదారుకు, దాని అమ్మకందారుకు మధ్య న్యాయశాస్త్రపరమైన సంబంధాల్లో యంత్రాలు తెచ్చిన విప్లవం వల్ల, ఈ మొత్తం వ్యవహారం స్వతంత్ర వ్యక్తుల మధ్య ఒప్పంద రూపాన్ని కోల్పోవడంతో, న్యాయశాస్త్ర సూత్రాల ప్రాతిపదికపై, ఫ్యాక్టరీల విషయంలో ప్రభుత్వ జోక్యానికి ఆంగ్లేయుల పార్లమెంటుకు సాకు దొరికింది. మునుపు జోక్యం చేసుకోబడని పరిశ్రమల్లో చట్టం పిల్లల శ్రమను ఆరు గంటలకు పరిమితం చేసినప్పుడల్లా, పరిశ్రమదారులు సదా, మళ్ళీ ఫిర్యాదులు చేస్తూనే ఉంటారు. ఆ చట్టం కిందికి వచ్చిన పరిశ్రమ నుంచి తమ పిల్లలను తల్లిదండ్రులెందరో ఉపసంహరించుకొంటున్నారని వారి ఫిర్యాదు. "శ్రమ స్వేచ్ఛ" ఇంకా రాజ్యమేలుతున్నచోట్ల అంటే, 13 ఏళ్ళలోపు పిల్లలు పెద్దవారిలా విధిగా పని చేయవలసి ఉన్నందువల్ల ఎక్కువ ధరకు వారిని తల్లిదండ్రులు వదిలించుకో వీలున్నచోట్ల వారిని అమ్మేందుకు ఇలా చేస్తున్నారని వారంటారు. కానీ పెట్టుబడి అన్నిటినీ సమం చేసే స్వభావం గలది కాబట్టి, ప్రతి ఉత్పత్తి రంగంలోనూ శ్రమను దోచుకొనే పరిస్థితుల్లో సమానతను రుద్దుతుంది. అందువల్ల ఒక పారిశ్రామిక శాఖలో పిల్లల శ్రమపై చట్టం విధించే పరిమితి, ఇతర శాఖల్లో దాని పరిమితికి కారణభూతమవుతుంది.

---

1. "1858 అక్టోబరు 31 తాలూకు ఫ్యాక్టరీల ఇన్‌స్పెక్టరు నివేదికలు"లో ఎ. రెడ్ గ్రేవ్ (పుటలు 40, 41).
2. "పనిలో నియామకంపై కమిషన్, అయిదవ నివేదిక, లండన్ 1866, పుట 81, సం. 31 (నాల్గవ జర్మన్ కూర్పుకు చేర్చినది - బెత్నాల్ గ్రీన్ పట్టు పరిశ్రమ నేడు దాదాపు నాశనమైపోయింది. (ఫ్రెడరిక్ ఎంగెల్స్)
3. "పిల్లల నియామకంపై కమిషన్, మూడవ నివేదిక" లండన్, 1864, పుట 53, సం. 15.
4. పైన ఉదహరించిన పుస్తకం, అయిదవ నివేదిక, పుట 22, సం. 137.

యంత్రాలు, తమ ప్రాతిపదికపై తల ఎత్తిన ఫ్యాక్టరీల్లో, మొదట ప్రత్యక్షంగానూ తరువాత మిగతా అన్ని పారిశ్రామిక శాఖల్లో పరోక్షంగానూ, పెట్టుబడిదారీ దోపిడీకి గురిచేసే స్త్రీలు, పిల్లలు, పిన్నవయసువారు శారీరకంగా ఎలా క్షీణిస్తారో ఇదివరకే పేర్కొన్నాము. కాబట్టి ఇక్కడ ఒక్క విషయం మాత్రమే, పుట్టిన తరువాత కొద్ది సంవత్సరాల్లోనే పనివారి పిల్లలు ఎంత పెద్ద ఎత్తున మరణించారో చెబుతాను. జనన మరణాల నమోదుకై ఇంగ్లండులో ఏర్పరచిన జిల్లాల్లో 16 జిల్లాల్లో, బతికి ఉన్న ఏడాదిలోపు పిల్లలు ప్రతి 100,000కి సగటున ఏడాదికి 9000 మంది మాత్రమే చనిపోయారు. (ఒక జిల్లాలోనైతే 7,047 మంది మాత్రమే); 24 జిల్లాల్లో ఈ మరణాలు 10,000కు పైగా కానీ, 11,000కు లోపలా ఉన్నాయి; 39 జిల్లాల్లో 11,000 పైగా కానీ, 12,000కు లోపుగా ఉన్నాయి; 48 జిల్లాలో 12,000కు పైగా కానీ, 13,000కు లోపుగా ఉన్నాయి; 22 జిల్లాల్లో 20,000కు పైబడ్డాయి; 25 జిల్లాల్లో 21,000కు పైబడ్డాయి; 17 జిల్లాల్లో 22,000కు, 11 జిల్లాల్లో 23,000కు పైబడ్డాయి. హూ, వోల్వర్‌హామ్‌టన్, ఆష్టన్–అండర్–లైన్, ప్రెస్టన్‌లలో 24,000కు, నాటింగ్‌హామ్, స్టాక్‌పోర్ట్, బ్రాడ్ ఫోర్డ్‌లలో 25,000కు, లిస్బ్నిచ్‌లో 26,000కు, మాన్‌చెస్టర్‌లో 26,125కు పైబడ్డాయి.[1] 1861 సంవత్సరంలోని సాధికారిక వైద్య విచారణ తెలుపుతున్నట్లుగా, మరణాల రేట్లు ఇంత ఎక్కువగా ఉండటానికి, స్థానిక కారణాల సంగతి అలా ఉంచి చూస్తే తల్లులు తమ ఇళ్ళకు దూరంగా పని చేయడం, సమక్షంలో తల్లి లేనందువల్ల పిల్లల పట్ల ఉపేక్ష, తగినంత పోషకాహారం లేకపోవడం, అనుచితమైన ఆహారమివ్వటం, నల్లమందుతో నిద్రపుచ్చడం వంటి పలు నిరాదరణ ప్రవర్తన ప్రధాన కారణం.[2] "కానీ పనిలో స్త్రీల నియామకం కనీస స్థాయిలో ఉన్న వ్యవసాయక జిల్లాల్లో" మరణాల రేటు చాలా తక్కువ."[3] కానీ 1861 విచారణ కమిషన్, అనుకోని ఒక ఫలితానికి దారితీసింది. ఉత్తర సముద్ర తీరాన, కొన్ని కేవలం వ్యవసాయక జిల్లాల్లో ఏడాదిలోపు పిల్లల మరణాల రేటు అతి ఘోరమైన ఫ్యాక్టరీ జిల్లాలోని దానికి దాదాపు సమానమని తేలింది. అందువల్ల డాక్టరు జూలియస్ హంటర్‌కు ఈ పరిణామాన్ని అక్కడే దర్యాప్తు చేసే కర్తవ్యాన్ని అప్పజెప్పారు. ఆయన నివేదిక "ప్రజారోగ్యంపై ఆరవ నివేదిక"లో పొందుపరచబడింది.[4] పిల్లలు మలేరియా, పల్లపు, చిత్తడి నేలలున్న జిల్లాల్లో సంభవించే ప్రత్యేకమైన ఇతర వ్యాధుల వల్ల చనిపోతున్నారని అంతవరకు అనుకొనేవారు. కానీ ఈ దర్యాప్తులో తేలింది ఇందుకు పూర్తిగా భిన్నమైనది. మలేరియాను పారదోలి, శీతాకాలంలో చిత్తడి నేలగానూ, వేసవి కాలంలో పలుచగా పచ్చిక గల బయలుగానూ ఉన్న భూమిని మంచి

---

1. ''సిక్స్ రిపోర్ట్ ఆన్ పబ్లిక్ హెల్త్'', లండన్, 1864, పుట 34.
2. ''ఇది (1861లో దర్యాప్తు) ... మరొక విషయం కూడా వెల్లడి చేసింది. వర్ణించిన ఈ పరిస్థితులలో పసిపాపలు, వారి తల్లుల వృత్తుల్లో గర్భితమైన ఉపేక్ష, ఇంటి వ్యవహారాల అస్తవ్యస్త నిర్వహణ వల్ల చనిపోతూండగా, మరోవైపు తమ పిల్లల విషయంలో తల్లుల సహజ ప్రవృత్తి ఘోరంగా అంతరిస్తుంది. వారు చనిపోతే, మామూలుగా పట్టించుకోరు; కొన్ని సందర్భాల్లోనైతే, వారు తప్పకుండా చనిపోవడానికి ప్రత్యక్ష చర్యలు కూడా తీసుకొంటారు'' (పూర్వోదాహృత గ్రంథం).
3. పూర్వోదాహృత గ్రంథం, పుట 454.
4. పూర్వోదాహృత గ్రంథం (పుటలు 454, 463) ''ఇంగ్లండులోని కొన్ని గ్రామీణ జిల్లాల్లో పసిపిల్లల అమిత మరణాలపై డాక్టర్ జూలియన్ హంటర్ నివేదిక.''

దిగుబడినిచ్చే ధాన్యపు పొలాలుగా మారడానికి కారణభూతమైనదే పసిపిల్లల అసాధారణ మరణాల రేటుకు కారణమని తేలింది.[1] ఆ జిల్లాల్లో డాక్టర్ హంటర్ విచారించిన 70 మంది వైద్యులు ఈ విషయమై "ఆశ్చర్యకరమైన ఏకాభిప్రాయం" వ్యక్తం చేశారు. వాస్తవంలో సాగు పద్ధతిలో వచ్చిన విప్లవం పారిశ్రామిక పద్ధతులను ప్రవేశపెట్టడానికి దారితీసింది. బాల, బాలికలతోపాటుగా ముఠాలుగా పనిచేసే వివాహితులైన స్త్రీలను "మేస్త్రీ" (అండర్‌టేకర్) అనే ఒక వ్యక్తి వ్యవసాయదారు వినియోగానికై ఒక నిర్ణీత మొత్తానికి అప్పగిస్తాడు. ఇతడు మొత్తం ముఠా తరఫున ఒప్పందం కుదుర్చుకుంటాడు. "ఈ ముఠాలు కొన్ని సందర్భాల్లో తమ గ్రామం నుంచి అనేక మైళ్ళు ప్రయాణం చేస్తాయి. వీరు, కురుచని లంగాలు, వాటికి తగిన కోట్లు, బూట్లు, కొన్ని సందర్భాల్లో ట్రౌజర్లు ధరించి, ఆశ్చర్యం గొలిపేటంత బలంగా, ఆరోగ్యంగా కనిపించే ఈ ముఠాలు ఉదయం, సాయంత్రం రోడ్లపై తటస్థపడుతుంటారు; కానీ వీరు అలవాటుగా వచ్చిన ఒక అవినీతికి పాల్పడినవారు, తీరికలేని, స్వతంత్ర జీవితంపై తమ మోజు, ఇంట్లో బెంగపెట్టుకొన్న దురదృష్ట జాతకులైన తమ సంతానానికి తెచ్చిపెట్టే ప్రాణాంతక ఫలితాలు వీరికి పట్టవు.[2] ఫ్యాక్టరీ జిల్లాల్లోని ప్రతి పరిణామం, మరుగుపుచ్చినా దాగని శిశు హత్యలు, పిల్లలకు నల్లమందు మాత్రలివ్వటం వంటి వాటితో సహా (అయితే మరింత విస్తృత స్థాయిలో) ఇక్కడ పునరుత్పన్నమవుతున్నాయి.[3] "పరిశ్రమల్లో వయసులో ఉన్న స్త్రీల విస్తృత నియామకం పట్ల నాకు గల భయాందోళనలు సహేతుకమైనవని, అటువంటి చెడుగుల గురించిన నా పరిజ్ఞానం ధ్రువపరుస్తోంది" అని ప్రీవీ కౌన్సిల్ వైద్యాధికారీ, ప్రజారోగ్యంపై నివేదికల అధిపతీ డాక్టర్ సైమన్ అంటున్నారు.[4] "పెళ్ళయి కుటుంబమున్న ప్రతి స్త్రీని ఏ జౌళి కర్మాగారంలో కూడా పనిచేయ నివ్వకుండా నిషేధించినప్పుడు, ఇంగ్లండులో పారిశ్రామిక జిల్లాలకు నిజంగా సుఖముంటుంది" అని ఫ్యాక్టరీ ఇన్‌స్పెక్టర్ బేకర్, తన అధికార నివేదికలో గొంతెత్తి చెబుతున్నాడు.[5] స్త్రీలను, పిల్లలను పెట్టుబడి దోచుకోవడం వల్ల సంభవించే నైతిక పతనాన్ని, తన "లాగే డెర్ ఆర్బైటెండెన్ క్లాసే ఇంగ్లండ్స్"లో (ఇంగ్లండులో కార్మికవర్గ పరిస్థితి – అను) ఫ్రెడరిక్ ఎంగెల్స్, ఇంక ఇతర రచయితలు నిశ్శేషంగా వర్ణించి ఉన్నందువల్ల నేనిక్కడ ఆ సంగతి పేర్కొంటే చాలు. అదనపు విలువను సృష్టించేందుకోసం, అపరిణత వయస్కులను వట్టి యంత్రాలుగా మార్చడం వల్ల కృత్రిమంగా కలిగే మేధా వినాశనం మనో వికాస శక్తినీ, దాని సహజసిద్ధ సృజనశీలాన్నీ నాశనం చేయకుండా మనసును బీడుగా ఉంచే ప్రాకృతిక అజ్ఞానానికి స్పష్టంగా భిన్నమైన ఒక మానసిక పరిస్థితి; ఈ వినాశన స్థితిని

---

1. అదే గ్రంథం, పుటలు 35, 455, 456.
2. అదే గ్రంథం, పుట 456.
3. ఫ్యాక్టరీ జిల్లాల్లో అంతగా, వ్యవసాయక జిల్లాల్లో కూడా, శ్రామిక స్త్రీ, పురుషులు ఉభయుల్లోనూ నల్లమందు వాడకం రోజూ పెరిగిపోతోంది. "నల్లమందు గల నిద్ర మాత్రలు అమ్మకం పెంచడం చొరవ గల కొందరు టోకు వర్తకుల పరమ లక్ష్యం. మాదక ద్రవ్య వ్యాపారులు దీన్ని అతి ప్రముఖ వస్తువుగా పరిగణిస్తున్నారు. (అదే గ్రంథం పుట 459) నల్లమందు గల నిద్ర మాత్రలు పుచ్చుకొన్న పసిపిల్లలు చిట్టి ముదుసలులుగా కుంచించుకుపోయారు; లేదా చిట్టి కోతుల్లాగా వడలిపోయారు". (అదే గ్రంథం, పుట 460). ఇండియా, చైనాలు, ఇంగ్లండుపై ఎలా పగతీర్చుకొన్నాయో మనకిక్కడ కనిపిస్తుంది.
4. అదే పుస్తకం, పుట 37.
5. ఫ్యాక్టరీ ఇన్‌స్పెక్టర్ నివేదిక, 1862, అక్టోబరు 31, పుట 59, బేకర్ అంతకు మునుపు ఒక డాక్టర్.

చూచి తుదకు ఇంగ్లీషువారి పార్లమెంటు సైతం, ఫ్యాక్టరీ చట్టాలకు లోనైన ప్రతి పరిశ్రమలో "ఉత్పాదనకై" 14 ఏళ్ళలోపు పిల్లల్ని నియమించాలంటే, వారికి ప్రాథమిక విద్య ఉండాలన్న నిర్బంధ షరతు విధించవలసి వచ్చింది. ఫ్యాక్టరీ చట్టాల్లో, విద్యకు సంబంధించినవనే క్లాజుల్లోని పరిహాసాస్పదమైన మాటల తీరు, వ్యవహార నిర్వాహక యంత్రాంగం కొరత, నిర్బంధాన్ని మిధ్యగా చేస్తున్న ఈ కొరత, విద్యకు సంబంధించిన ఈ క్లాజుల పట్ల పారిశ్రామిక యజమానుల వ్యతిరేకత, వాటి నుంచి తప్పుకొనేందుకు వారు చేపట్టే మాయోపాయాలు, వేసే కప్పదాట్లు – వీటిలో పెట్టుబడిదారీ ఉత్పత్తి తత్వం ప్రస్ఫుటమవుతుంది. "దీనికి తప్పంతా, ఒక మోసకారి చట్టాన్ని చేసిన శాసన నిర్మాణ సభదే; ఆ చట్టం ఫ్యాక్టరీల్లో నియుక్తులైన పిల్లలకు విధిగా చదువుండాలి అన్న నిబంధన చేస్తున్నట్లు కనిపిస్తుంది; కానీ ఆ ప్రకటిత లక్ష్యం నెరవేరేందుకు శాసన నిబంధన ఏదీ అందులో లేదు. వారంలో ఫలానా రోజుల్లో, రోజూ ఇన్ని గంటలపాటు (మూడు) పాఠశాల అని పిలువబడే స్థలం నాలుగు గోడల లోపల పిల్లల్ని ఉంచాలనీ, ఆ విధంగా ఉంచినట్లు ఉపాధ్యాయుడు లేదా ఉపాధ్యాయిని అని కింద రాసుకొన్న ఒక వ్యక్తి సంతకంతో ఒక సర్టిఫికెట్, ఆ చిన్నారిని పనిలో పెట్టుకొన్న యజమాని వారం వారం తీసుకోవాలనీ చెప్పడం తప్ప, ఈ చట్టం అంతకు మించి ఏమీ నిర్దేశించడం లేదు."[1] సవరింపబడిన 1844 ఫ్యాక్టరీ చట్టం ఆమోదం పొందటానికి మునుపు, పాఠశాలకు హాజరైనట్లు ఇచ్చే సర్టిఫికెట్లపై ఉపాధ్యాయుడు లేదా ఉపాధ్యాయిని రెండు అడ్డుగీతలతో సంతకం పెట్టడం తరచూ జరిగేది. ఎందువల్లనంటే, అసలు వారికే రాయటం రాదు. "పాఠశాల హాజరు సర్టిఫికెట్లను జారీచేస్తున్న, పాఠశాల అనబడే ఒక స్థలాన్ని నేను సందర్శించిన ఒక సందర్భంలో, ఉపాధ్యాయుని అజ్ఞానం నాకు ఎంత దిగ్భ్రమగొలిపిందంటే, 'అయ్యా, దయ ఉంచి చెప్పండి, మీరు చదవగలరా?' అని ఆయన్ని అడిగాను. 'ఓ, కాస్త వొత్తుంది' అని ఆయన సమాధానం. సర్టిఫికెట్టు మంజూరు చేయటానికి తన హక్కుకు సమర్థనగా ఇంకా ఇలా అన్నాడు : 'ఏదేమైనా, నా బడిపిల్లల ముందున్నాగా.' చట్టాలను పాటించాలి కాబట్టి తాము అంగీకరించవలసి వచ్చిన సర్టిఫికెట్లను జారీచేసే పాఠశాలలనబడే స్థలాల సిగ్గుమాలిన పరిస్థితిని గురించి, ఇన్‌స్పెక్టర్లు, 1844 బిల్లు తయారవుతున్నప్పుడు, నివేదించకపోలేదు. కానీ వారు సాధించగలిగినదల్లా ఇంతే; 1844 చట్టం ఆమోదింపబడిన తరువాత, "సర్టిఫికెట్‌లోని అంకెలు ఉపాధ్యాయుని దస్తూరీలోనే ఉండాలి. వారు తమ క్రైస్తవ నామం, ఇంటి పేరుతో సహా పూర్తి సంతకం చేయాలి కూడా." స్కాట్‌లాండ్ ఫ్యాక్టరీ ఇన్‌స్పెక్టర్ సర్ జాన్ కిన్ కెయిడ్ ఇలాంటి అనుభవాలనే చెబుతున్నాడు. "మేము వెళ్ళి చూచిన తొట్టతొలి పాఠశాల, యాన్ కిల్లిన్ అనే ఆమె పెట్టినది. తన పేరు అక్షర క్రమం చెప్పమని మేమడుగగా, ఆమె వెంటనే ఒక తప్పు చేసింది. సి (c) అక్షరంతో మొదలుపెట్టింది. కానీ వెనువెంటనే తప్పు సరిదిద్దుకొని, తన పేరు కె (k)తో మొదలవుతుందని చెప్పింది. కానీ, పాఠశాల సర్టిఫికెట్ పుస్తకాల్లో ఆమె చేవ్రాలు చూడగా, ఆమె తన పేరు అక్షర క్రమాన్ని రకరకాలుగా రాసిందని గమనించాను. ఇక ఆమె దస్తూరీ, చదువు చెప్పే అర్హత ఆమెకు లేదనే విషయంలో ఎట్టి సందేహానికీ ఆస్కారమివ్వలేదు. రిజిస్టర్‌ను సరిగా ఉంచలేనని కూడా ఆమె స్వయంగా ఒప్పుకొంది. రెండవబడిలో, పాఠశాల గది పొడవు 15 అడుగులు,

1. "1857 జూన్ 30న, ఫ్యాక్టరీ ఇన్‌స్పెక్టర్ల నివేదికలు"లో, ఎల్. హార్నర్, పుట 17.

వెడల్పు 10 అడుగులు. ఈ స్థలంలో, స్పష్టం కానీదేదో వదరుతున్న పిల్లల్ని ఎంచితే, 75 మంది ఉన్నారు."[1] "ఏపాటి విద్యాబోధ లేకుండానే పిల్లలు బడికి హాజరయినట్లు సర్టిఫికెట్లు పొందేది పైన పేర్కొన్న దౌర్భాగ్యపు స్థలాల్లోనే కాదు; ఎందుచేతనంటే, అర్హత గల ఉపాధ్యాయుడున్న అనేక పాఠశాలల్లో, మూడేళ్ళ పసిపాపలు మొదలుకొని అన్ని వయసులకూ చెందిన పిల్లల గుంపు మూలంగా మనసు చెదిరిపోతూ ఉండడం వల్ల అతని కృషి నిష్ఫలమవుతోంది; ఆ స్థలంలో ఎంతమంది పిల్లల్ని కూరవచ్చో, వారందరి నుంచి వచ్చే పెన్నీలపై ఆధారపడిన అతని జీవితం గుడ్డిలో మెల్లకంటే దీనమైనది. వీటన్నిటికీ తోడు, పాఠశాల ఫర్నీచర్ బహు తక్కువ. పుస్తకాలు, ఇతర బోధనా పరికరాలు చాలవు. క్రిక్కిరిసిన గదిలోని అనారోగ్యకర వాతావరణం పాపం, అసలు ఆ పిల్లల మనసును కుంగదీస్తుంది. నేను అలాంటి ఎన్నో పాఠశాలలకు వెళ్ళాను. అక్కడ, వరుసలుగా వరుసలుగా ఉన్న పిల్లలు, ఏమీ చేయకుండా ఉండటం చూచాను; బడికి పిల్లలు హాజరయినట్లు సర్టిఫికెటు ఇచ్చేదీ దీనికే. గణాంక నివేదికల్లో అటువంటి పిల్లలు చదువుకొంటున్నట్లుగా నమోదు చేస్తున్నారు."[2] స్కాట్‌లాండ్‌లో కర్మాగార యజమానులు, బడికి వెళ్ళి తీరవలసిన పిల్లలు లేకుండా పని జరుపుకొనేందుకు తాము చేయగలిగిన దంతా చేస్తున్నారు. "మిల్లు యజమానుల్లో అంతటి ప్రాతికూల్యతకు గురి అయిన ఫ్యాక్టరీ చట్టంలోని విద్యా సంబంధమైన క్లాజువల్ల ఆ తరగతి పిల్లలు చాలా వరకు అటు ఉపాధికీ, ఇటు చట్టం తలపెట్టిన విద్యా బోధనా ప్రయోజనాలకు వెలి అయిపోతున్నారని నిరూపించడానికి ఇంకే వాదన అవసరం లేదు.[3] ఒక ప్రత్యేక చట్టంచే నియంత్రితమైన కలంకారీ వస్త్ర కర్మాగారాల్లో ఇది భయంకరమైన వికృత రూపంలో కనిపిస్తుంది. ఆ చట్టం ప్రకారం, "ఒక కలంకారీ వస్త్ర కర్మాగారంలో పనిలో పెట్టుకొనేందుకు ప్రతి బాలుడూ, బాలికా, అలా పనిలో నియుక్తులైన మొదటి రోజుకు మునుపటి ఆరు నెలల్లో కనీసం 30 రోజులు, 150 గంటలకు తక్కువ కాకుండా పాఠశాలకు హాజరై ఉండాలి. బుడత ఆ కలంకారీ వస్త్ర కర్మాగారంలో పనిలో కొనసాగినంత కాలమూ, వరుసగా వచ్చే ప్రతి ఆరు నెలల కాలంలోనూ, అదే 30 రోజులు, 150 గంటలు బడికి హాజరు కావాలి. బడికి హాజరైన కాలం ఉదయం 8 గంటలకు, సాయంత్రం 6 గంటలకు మధ్య ఉండాలి. $2\frac{1}{2}$ గంటలకు తక్కువగా లేదా 5 గంటలకు పైగా ఉన్న హాజరు కాలాన్ని ఆ 150 గంటల్లో భాగంగా లెక్కగట్టరాదు. పిల్లలు బడికి ఉదయమూ, సాయంత్రం 30 రోజులు, రోజూ కనీసం 5 గంటలపాటు హాజరవుతారు. 30 రోజులు గడిచిన తరువాత, చట్టం నిర్దేశించిన మొత్తం 150 గంటల హాజరు కాలం పూర్తికావడంతో, వారి మాటల్లోనే చెప్పాలంటే, తమ హాజరు పట్టీని పూర్తిచేయడంతో, వారు కలంకారీ వస్త్ర కర్మాగారానికి తిరిగి వెడతారు. అక్కడ ఆరు నెలలు గడిచేవరకు పనిలో కొనసాగుతారు. పాఠశాలల్లో హాజరు కాలం మరో విడతకు సమయం ఆసన్నమవుతుంది. వారు హాజరు పట్టీ పూర్తి అయ్యేవరకు మళ్ళీ బడికి వెడతారు. నిర్దేశితమైనన్ని గంటలు బడికి హాజరయిన ఎందరో బాలురు, కలంకారీ వస్త్ర కర్మాగారంలో తమ ఆరు నెలల పని గడువు తరువాత, పాఠశాలకు తిరిగి వెళ్ళినప్పుడు, వారు

1. "1858 అక్టోబరు 31, ఫ్యాక్టరీ ఇన్‌స్పెక్టర్ల నివేదికలు"లో సర్ జాన్ కిన్ కెయిడ్, పుటలు 31, 32.
2. "1857 అక్టోబరు 31, ఫ్యాక్టరీ ఇన్‌స్పెక్టర్ల నివేదికలు"లో ఎల్. హార్నర్, పుటలు 17, 18.
3. "1850 అక్టోబరు 31, ఫ్యాక్టరీ ఇన్‌స్పెక్టర్ల నివేదికలు"లో సర్ జాన్ కిన్ కెయిడ్, పుట 66.

కలంకారీ పని కుర్రవాళ్ళుగా మొదట బడికి వెళ్ళినప్పుడున్న స్థితిలోనే ఉన్నారు; మునుపు పాఠశాలకు హాజరయినందువల్ల పొందినదంతా వారు కోల్పోయారని తేలింది. ఇతర కలంకారీ వస్త్ర కర్మాగారాల్లో పాఠశాలకు పిల్లలు హాజరు కావడమంతా ఆ సంస్థలో పని అవసరాలపై ఆధారపడి ఉండేలా చేశారు. బడికి హాజరు కావలసి ఉన్న మొత్తం గంటలను ప్రతి ఆరు నెలల్లో, విడతకు 3 నుంచి 5 గంటల చొప్పున, విడతలు విడతలుగా పూర్తి చేస్తారు; ఇవి బహుశా మొత్తం ఆరు నెలల పొడుగునా విస్తరించవచ్చు. ఉదాహరణకు ఈ హాజరయిన కాలం ఒక రోజు ఉదయం 8 నుంచి 11 గంటలదాకా ఉండవచ్చు. మరో రోజు సాయంత్రం ఒంటిగంట నుంచి 4 గంటలదాకా ఉండవచ్చు; ఆ బుడత చాలా రోజులు బడికి ముఖం చూపకుండా మళ్ళీ సాయంత్రం 3 నుంచి 6 గంటల వరకు హాజరు కావచ్చు; తరువాత వరుసగా 3 లేదా 4 రోజులు హాజరై, మళ్ళీ 3 వారాలు లేదా ఒక నెల బడికి గైరుహాజరు. ఆ తరువాత ఆ బుడతను పనికి పంపిన కార్మికుడు, తన అనుకూలాన్ని బట్టి పంపే ఏవో రోజుల్లో ఏవో గంటల్లో హాజరవుతాడు. ఆ విధంగా ఆ బుడతను బడి నుంచి పనికి, పని నుంచి బడికి, 150 గంటల కథ పూర్తి అయ్యేవరకూ, ఒక విధంగా చెప్పాలంటే, తరిమికొట్టారు."[1]

కార్మిక శ్రేణులకు స్త్రీలను, పిల్లలను అమితంగా చేర్చడం ద్వారా యంత్రాలు, కార్ఖానా దశలో పెట్టుబడి నిరంకుశత్వానికి పురుష కార్మికుల నుంచి వచ్చిన ప్రతిఘటనను తుట్టతుదకు బద్దలుకొట్టాయి.[2]

## ఆ. పని దినం పొడిగింపు

యంత్రాలు శ్రమ ఉత్పాదకతను పెంచేందుకు, అంటే, ఒక సరుకు ఉత్పత్తిలో కావలసిన పనికాలాన్ని తగ్గించేందుకు అత్యంత శక్తివంతమైన, సాధ్యమైనప్పుడు, అవి పెట్టుబడి తొలుత జొరబడిన పరిశ్రమల్లో, మానవ ప్రకృతి నిర్దేశించిన అన్ని హద్దులకు మించి, పని దినాన్ని పొడిగించేందుకు,

---

1. "ఫ్యాక్టరీ ఇన్‌స్పెక్టర్ల నివేదికలు"లో ఎ. రెడ్ గ్రేవ్, పుటలు 41-42. అసలు ఫ్యాక్టరీ చట్టం (గ్రంథ పాఠంలో పేర్కొన్న కలంకారీ వస్త్ర కర్మాగారాల చట్టం కాదు) కొన్నాళ్ళుగా అమలుజరుగుతూన్న పరిశ్రమల్లో, విద్యా బోధనకు సంబంధించిన క్లాజుల అమలుకు గల ప్రతిబంధకాలను ఇటీవలి సంవత్సరాల్లో అధిగమించడం జరిగింది. ఈ చట్టం కిందికి రాని పరిశ్రమల్లో ఇప్పటికీ, గాజు పరిశ్రమదారు జె. గెడ్డెస్ అభిప్రాయాలు విస్తృతంగా నెలకొని ఉన్నాయి. అతను దర్యాప్తు కమిషనర్లలో ఒకరైన వైట్‌కు ఇలా తెలిపారు : "కార్మిక వర్గంలో ఒక భాగం గడచిన కొన్ని సంవత్సరాలుగా పొందుతున్న అధికతర విద్య ఒక చెడుగని నామట్టుకు నాకు అనిపిస్తోంది; అది ప్రమాదకరమైనది; ఎందువల్లనంటే, అది వారిని స్వతంత్రులుగా చేస్తుంది." ("చిల్డ్రన్స్ ఎంప్లాయ్‌మెంట్ కమిషన్, ఫోర్త్ రిపోర్ట్", లండన్, 1865, పుట 253.
2. "మిస్టర్ ఇ అనే ఒక పరిశ్రమదారు - తన మరమగ్గాల్లో కేవలం ఆడవారినే నియమించారని నాకు తెలియజేశారు. పెళ్ళైన ఆడవారే, ప్రత్యేకించి పోషణకు తమపై ఆధారపడిన కుటుంబాలు ఇంట్లో ఉన్న వివాహితులు ఇతరులకన్నా మేలన్న కృతనిశ్చయంతో, ఆయన వారినే ఎంచుకొంటాడు. వారు శ్రద్ధ, వినయ విధేయతలు కలవారు. పెళ్ళికాని ఆడవారికన్నా వారిలో ఇవి మరింత ఎక్కువ. జీవితావసరాలను సంపాదించడానికి వారు తమ యావచ్ఛక్తిని వినియోగించక తప్పదు. ఈ విధంగా, ఈ సుగుణాలే - స్త్రీ స్వభావానికి విశిష్టమైన సుగుణాలే, ఆమెకు హాని చేసేలా, విపరీతంగా తిప్పారు - ఆ విధంగా, ఆమె ప్రకృతిలో, అత్యంత స్వధర్మ పరాయణమూ, మార్దవమూ అయిన దానినంతటినీ ఆమెను దాస్యంలో, బాధల్లో మగ్గచేసే సాధనాలుగా చేశారు." (పది గంటలు ఫ్యాక్టరీ బిల్లు, లార్డ్ యాష్లీ ప్రసంగం, మార్చి 15, లండన్, 1844, పుట 20)

పెట్టుబడి చేతిలో అత్యంత శక్తివంతమైన సాధనమవుతుంది. ఒకవైపు, పెట్టుబడికి గల ఈ స్థిరత్వ ధోరణికి నిరాటంకావకాశాన్ని కల్పించే నూతన పరిస్థితులనూ, మరోవైపు ఇతరుల శ్రమ కొరకు పెట్టుబడి యొక్క ఆకలిని పెంచే నూతన ప్రేరణలను యంత్రాలు సృష్టిస్తాయి.

మొదటి విషయం, యంత్రాల రూపంలో, శ్రమ సాధనాలు స్వయంచాలితమవుతాయి; కార్మికునితో ప్రమేయం లేకుండా కదులుతూ, పని చేస్తుంటాయి. అవి, ఆ మీదట ఒక పారిశ్రామిక శాశ్వత చలనమై, తమను అట్టిపెట్టుకొని ఉన్న మానవుల దుర్బర శరీరాలు, దృఢ సంకల్పాల రూపంలో కొన్ని సహజ ప్రతిబంధకాలు ఎదురుకాకుంటే, శాశ్వతంగా ఉత్పత్తి చేస్తూనే ఉంటాయి. స్వయం చలనం, పెట్టుబడిగానూ, పెట్టుబడి కాబట్టి, పెట్టుబడిదారు రూపంలో తెలివితేటలూ, సంకల్పం కలది; అందువల్ల అడ్డుకొనే గుణమున్నా, సర్దుకొనిపోయే గుణం గల సహజ అవరోధమైన మానవుని నుంచి వచ్చే ప్రతిఘటనను కనీస స్థాయికి తగ్గించాలన్న ఆకాంక్ష దాన్ని పురికొల్పుతూంటుంది.[1] అదీకాక, యంత్రాలతో పని తేలికైనదిగా కనిపించడం వల్లనేమి, ఆ పనికి నియమితులైన స్త్రీల, పిల్లల విధేయత, అణకువ వల్లనేమి ఈ ప్రతిఘటన తగ్గింది.[2]

మనం ఇదివరకే తెలుసుకొన్నట్టు, యంత్రాల ఉత్పాదకత, ఉత్పాదితానికి అవి బదలాయించే విలువకు విలోమానుపాతంలో ఉంటుంది. యంత్రం మన్నిక కాలం ఎంత ఎక్కువగా ఉంటే అది అందించే విలువ అంత ఎక్కువ పరిమాణం గల ఉత్పాదితాలకు పరివ్యాప్తమవుతుంది. ప్రతి ఒక సరుకుకు చేరే ఆ విలువ భాగం అంత తక్కువగా ఉంటుంది. కానీ ఒక యంత్ర క్రియాశీల జీవిత కాలం పనిదినం పరిమాణంపై, లేదా దైనందిన శ్రమ ప్రక్రియ కాలాన్ని, ఆ ప్రక్రియ సాగే రోజుల సంఖ్యతో గుణిస్తే వచ్చే కాల పరిమాణంపై ఆధారపడి ఉంటుంది.

---

1. "యంత్రాలు సర్వత్రా ప్రవేశపెట్టబడినప్పటి నుంచీ, మానవ ప్రకృతి తన సగటు శక్తికి ఎంతో మించి వ్యవహరించక తప్పడంలేదు." (రాబర్ట్ ఓవెన్, "అబ్జర్వేషన్స్ ఆన్ ది ఎఫెక్ట్స్ ఆఫ్ ది మాన్యుఫాక్చరింగ్ సిస్టమ్", రెండవ కూర్పు, లండన్, 1817.)
2. ఒక విషయం ప్రత్యక్షమయ్యేటప్పటి దాని తొట్టతొలి రూపం దాని ఉనికి కారణంగా పరిగణించే ధోరణి ఆంగ్లేయులకు కద్దు. ఫ్యాక్టరీ వ్యవస్థ శైశవ దశలో పెట్టుబడిదారులు బీదల సంరక్షణశాలల, అనాథ బాలల శరణాలయాల నుంచి పిల్లలను పెద్ద ఎత్తున బలాత్కారంతో అపహరించుకుపోవడం, ఈ బందిపోటు చర్య ద్వారా దోపిడీకి అడ్డుచెప్పని జీవులు వారికి లభించడం, ఫ్యాక్టరీల్లో రోజువారీ పని కాలం అంత ఎక్కువగా ఉండటానికి కారణమని, ఆంగ్లేయులు భావించారు. ఉదాహరణకు స్వయాన, పరిశ్రమదారైన ఫీల్డెన్ ఇలా చెబుతున్నారు. "ఒక విషయం స్పష్టంగా కనిపిస్తోంది. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి సరఫరా అయిన దిక్కులేని పిల్లల సంఖ్య ఎంత ఎక్కువగా ఉండేదంటే యజమానులకు పనివారి ఇష్టాయిష్టాలతో నిమిత్తం లేకపోయింది. ఈ స్థితి సుదీర్ఘమైన పని కాలాన్ని తెచ్చిపెట్టింది. ఈ విధంగా సమకూర్చుకొన్న దౌర్భాగ్య జీవుల ద్వారా ఈ ఆచారాన్ని నెలకొల్పిన తరువాత, వారి పొరుగువారిపై దాన్ని మరింత సులభంగా రుద్దగలిగారు." (జె. ఫీల్డెన్ "ది కర్స్ ఆఫ్ ది ఫ్యాక్టరీ సిస్టమ్" లండన్, 1836, పుట 11) స్త్రీల శ్రమ గురించి ప్రస్తావిస్తూ, ఫ్యాక్టరీ ఇన్‌స్పెక్టర్ సాండర్స్ 1844 సంవత్సరపు నివేదికలో ఇలా చెబుతున్నారు : "ఆడ పనివారిలో, కొద్ది రోజులను మినహాయిస్తే, వరుసగా అనేక వారాలపాటు ఉదయం ఆరు గంటల నుంచి అర్ధరాత్రి వరకూ, భోజనానికి 2 గంటలకన్నా తక్కువ విరామంతో, పనికి నియమితులయిన స్త్రీలున్నారు; ఫలితంగా, వారంలో 5 రోజులు, ఇళ్ళకు వెళ్ళి వచ్చేందుకు, పడకపై నడుము వాల్చేందుకు, 24 గంటల్లో వారికి మిగిలేది ఆరు గంటలే."

ఒక యంత్రం అరుగుదల, దాని పని కాలానికి సరిగ్గా అనుగుణమైన నిష్పత్తిలో ఉండదు. ఒకవేళ అలా ఉందనుకొన్నా, రోజూ 16 గంటల చొప్పున $7\frac{1}{2}$ సంవత్సరాలు పని చేసిన యంత్రం పని కాలం, అదే యంత్రం రోజుకు కేవలం 8 గంటల చొప్పున 15 సంవత్సరాలు పని చేసినట్లయితే, దాని పని కాలమెంతో అంతే; మొదటి సందర్భంలో అది మొత్తం ఉత్పాదితానికి అందజేసే విలువ, రెండవ సందర్భంలో అందజేసినంతే. దానికి మించదు. కానీ, మొదటి సందర్భంలో యంత్రం విలువ, రెండవ సందర్భంలోకన్నా రెండింతలు త్వరగా పునరుత్పత్తి అవుతుంది. పెట్టుబడిదారులు యంత్రాన్ని ఇలా ఉపయోగించడం వల్ల $7\frac{1}{2}$ సంవత్సరాల్లో, రెండవ సందర్భంలో 15 సంవత్సరాల్లో పిండుకొన్నంత అదనపు విలువను పిండుకొంటారు.

యంత్రపు భౌతికమైన అరుగుదల రెండు రకాలు. ఒకటి, చలామణి వల్ల నాణేలు అరిగి పోయినట్లుగా వాడకం వల్ల సంభవిస్తుంది; రెండవది ఒరలోనే వదలివేసిన కత్తి తుప్పు పట్టినట్లుగా వాడకపోవడం వల్ల సంభవిస్తుంది. రెండవ రకం అరుగుదలకు ప్రాకృతిక శక్తులు కారణం. మొదటిది, యంత్ర వినియోగానికి ఇంచుమించు అనులోమ నిష్పత్తిలో ఉంటుంది. రెండవది కొంత మేరకు విలోమ నిష్పత్తిలో ఉంటుంది.[1]

కానీ, భౌతికమైన అరుగుదలతోపాటు, యంత్రం నైతికమైన విలువ తగ్గుదలకు కూడా లోనవుతుంది. అదే రకం యంత్రాలు దానికన్నా చౌకగా ఉత్పత్తి కావడంవల్ల గానీ, దానికన్నా మేలైన యంత్రాల పోటీవల్ల గానీ దాని మార్పిడి విలువ తగ్గిపోతుంది.[2] ఈ రెండు సందర్భాల్లోనూ, యంత్రం కొత్తదీ, ఎన్నాళ్ళో పని చేయగలిగినదీ అయినప్పటికీ, దాని విలువను నిర్ణయించేది, దాన్ని లేదా దానికన్నా మేలయిన యంత్రాన్ని పునరుత్పత్తి చేయడానికి అవసరమైన శ్రమే తప్ప, దానిలో యథార్థంగా మూర్తివంతమై ఉన్న శ్రమ కాదు. కాబట్టి దాని విలువ కొద్దో గొప్పో తగ్గిపోయిందన్న మాట. దాని మొత్తం విలువ పునరుత్పత్తికి పట్టే కాలం తగ్గే కొద్దీ, నైతిక విలువ తగ్గే ప్రమాదమూ తగ్గుతుంది; పని దిన పరిమాణం పెరిగే కొద్దీ పునరుత్పత్తికి పట్టే కాలం తగ్గుతుంది. ఒక పరిశ్రమలో యంత్రాలను తొలుత ప్రవేశపెట్టినప్పుడు, వాటిని మరింత చౌకగా పునరుత్పత్తి చేసే కొత్త పద్ధతులు, ఒకదాని నొకటి వెంబడిస్తూ వస్తాయి.[3] ఒక యంత్రంలోని విడి విడి భాగాలూ, వివరాలకు సంబంధించిన అంశాలు మాత్రమే కాక, దాని మొత్తం నిర్మాణ స్వరూపాన్ని కూడా ప్రభావితం చేసే మెరుగుదలలూ, ఆ విధంగా వెంట వెంటనే వస్తాయి కాబట్టి పని దినం పొడిగింపునకు ఈ ప్రత్యేక

1. "లోహ యంత్ర వ్యవస్థలోని కదిలే సున్నితమైన భాగాలకు, నిర్వ్యాపారం వల్ల ... హాని సంభవిస్తుంది." (ఉరే, పూర్వోదాహృత గ్రంథం, పుట 281)

2. ఇంతకు ముందు పేర్కొనబడిన మాన్‌చెస్టర్ స్పిన్నర్ (టైమ్స్, 1862, నవంబరు 26), ఈ విషయానికి సంబంధించి ఇలా చెబుతోంది : "యంత్రాలు పూర్తిగా అరిగిపోకముందే, వాటి స్థానంలో, ఒక కొత్త మరింత మేలైన నిర్మాణం గల ఇతర యంత్రాలు రావడం వల్ల నిరంతరం సంభవిస్తున్న నష్టాన్ని భర్తీ చేయడానికి కూడా ఇది (అంటే "యంత్రాల క్షీణతకు కేటాయించిన డబ్బు") ఉద్దేశించినది."

3. "కొత్తగా కనిపెట్టిన యంత్ర నమూనాకు చెందిన మొట్టమొదటి యంత్ర నిర్మాణం ఖర్చు, రెండవ యంత్ర నిర్మాణానికయ్యే ఖర్చుకు అయిదు రెట్లుంటుందని ఉజ్జాయింపుగా అంచనా వేశారు." (బాబేజ్, పూర్వోక్త గ్రంథం, పుట 349)

ప్రోత్సాహకం అతి తీవ్రంగా అనుభూతమయింది యంత్రాలు అవతరించిన తొలినాళ్ళలో.[1]

పనిదిన పరిమాణం నిర్ణీతమై, మిగతా పరిస్థితులు సమానంగా ఉన్నప్పుడు, రెట్టింపు సంఖ్యలోని కార్మికుల దోపిడీకి, స్థిర పెట్టుబడిలో యంత్రాలు, భవనాల్లో మదుపు పెట్టిన భాగమే కాక, ముడి పదార్థాలూ, సహాయక వస్తువులపై పెట్టిన భాగాన్ని కూడా రెట్టింపు చేయవలసి ఉంటుంది. కానీ, పని దినం పొడిగింపు వల్ల యంత్రాలు, భవనాలపై పెట్టిన పెట్టుబడి మొత్తంలో ఎటువంటి మార్పు లేకుండానే, విస్తృత స్థాయిలో ఉత్పత్తికి వీలు కలుగుతుంది.[2] ఇక్కడ, అదనపు విలువ పెరగడమే కాక, అది చేతికి అందేందుకు అవసరమైన పెట్టుబడి తగ్గుతుంది. దాదాపు పని దినపు ప్రతి పొడిగింపుతో ఇది జరుగుతుందనేది నిజమే. కానీ పరిశీలనలో ఉన్న ఈ సందర్భంలో, ఈ మార్పు మరింత ప్రస్ఫుటమైనది. ఎందువల్లనంటే, శ్రమ సాధనాలుగా మారిన పెట్టుబడికి గల ప్రాముఖ్యం మరింత ఎక్కువ ఉంటుంది.[3] ఫ్యాక్టరీ వ్యవస్థ అభివృద్ధి చెందడం వల్ల పెట్టుబడిలోని, నిరంతర ప్రవర్ధమాన భాగం ఏ రూపం వహిస్తుందంటే, ఆ రూపంలో ఒకవైపు, దాని విలువ నిరంతరాయ స్వయం విస్తరణ శక్తి గలది. మరోవైపు, సజీవ శ్రమతో సంబంధం కోల్పోయినప్పుడల్లా ఉపయోగపు విలువ, మార్పిడి విలువ రెంటినీ కోల్పోతుంది. యాష్‌వర్త్ అనే ఒక నూలు వస్త్ర పరిశ్రమదారు ప్రొఫెసర్ నస్సావ్ డబ్ల్యు. సీనియర్‌తో ఇలా అన్నారు : "ఒక కార్మికుడు తన గడ్డపారను కిందపెడితే, దాన్ని కింద పెట్టినంత కాలం, 18 పెన్నీల విలువ గల పెట్టుబడిని నిరుపయోగం చేస్తున్నాడు; మా మనుషుల్లో ఒకడు మిల్లును వదలిపోతే, 1,00,000 పౌండ్లు ఖర్చయిన పెట్టుబడిని నిరుపయోగం చేస్తున్నాడు."[4] ఊహించండి! 1,00,000 పౌండ్లు ఖర్చయిన పెట్టుబడిని ఒక్క క్షణం "నిరుపయోగం" చేయటమా! మా మనుషుల్లో ఒక్కడైనా సరే ఫ్యాక్టరీని ఎప్పుడైనా వదిలిపోవడం నిజంగా ఘోరం! యాష్‌వర్త్ నుంచి ఉపదేశం పొందిన తరువాత, సీనియర్ స్పష్టంగా గుర్తించినట్లు, స్థిరంగా పని

1. "పేటెంట్ వల్ల తయారు చేయడానికి ఉపయోగించే చట్రాల్లో కొన్నాళ్ళ క్రితం ఎంతటి అభివృద్ధి వచ్చిందంటే, బాగా పని చేయగల స్థితిలో ఉండి, మునుపు 1,200 పౌండ్లు ఖరీదు చేసిన యంత్రం, తరువాత కొన్ని సంవత్సరాలకు 60 పౌండ్లకు అమ్మకమయింది. మెరుగుదలలు వెంట వెంటనే ఎంత త్వరగా వచ్చాయంటే, నిర్మాణం పూర్తికాని యంత్రాలు వాటి నిర్మాతల చేతుల్లోనే వదలివేయబడ్డాయి. కొత్త మెరుగుదలలు వచ్చి ఆ యంత్రాలను వాడుక నుంచి తొలగించడం ఇందుకు కారణం." (బాబేజ్, పూర్వోక్త గ్రంథం, పుట 233) కాబట్టి, చొరవ రెక్కవిప్పిన ఈ సంక్షోభిత కాలంలో టుల్లే (నాజూకు అల్లికపు పట్టువస్త్రం - అను) ఫ్యాక్టరీ యజమానులు రెండు బృందాల పనివారి నియామకం ద్వారా పని దినాన్ని 8 గంటల నుంచి 24 గంటలకు త్వరలోనే పొడిగించారు.
2. "మార్కెట్ల ఆటుపోటుల మధ్య గిరాకీలో విడిచి విడిచి వచ్చే పెరుగుదల, తగ్గుదలల మధ్య, ఫ్యాక్టరీ యజమాని, భవనాలూ, యంత్రాలకై అదనపు ఖర్చులు పెట్టుకోకుండా, అదనపు ముడి పదార్థాలను ఉత్పత్తికి వినియోగించగలిగితే అదనపు స్థిర పెట్టుబడిని వినియోగించకుండానే, అదనపు అస్థిర పెట్టుబడిని (floating capital) వినియోగించ వీలున్న సందర్భాలు. "ఆన్ వేజెస్ అండ్ కాంబినేషన్" స్వయం విదితమే. (ఆర్. టొరెన్స్, "వేతనాలు, సమ్మేళన గురించి," లండన్, 1834, పుట 64)
3. ఈ సంగతిని, విషయ సమగ్రత కోసం పేర్కొన్నాను. ఎందుకంటే, మూడవ సంపుటానికి వచ్చే వరకు, నేను లాభం రేటును అంటే, మదుపు పెట్టిన మొత్తం పెట్టుబడికీ, అదనపు విలువకూ గల నిష్పత్తిని పరిశీలనకు తీసుకోను.
4. సీనియర్, "లెటర్స్ ఆన్ ది ఫ్యాక్టరీ యాక్ట్" లండన్, 1837, పుటలు 13, 14.

దినం పొడిగింపును యంత్రాల అధికారిక వినియోగం "వాంఛనీయంగా" చేస్తోంది.[1]

యంత్రాలు సాపేక్ష అదనపు విలువను ఉత్పత్తి చేస్తాయి; అలా చేసేది శ్రమ శక్తి విలువను ప్రత్యక్షంగా తగ్గించడం ద్వారా, శ్రమ శక్తి పునరుత్పత్తిలో పాత్ర వహించే సరుకులను ప్రత్యక్షంగా చౌకపరచడం ద్వారా మాత్రమే కాదు, ఒక పరిశ్రమలో యంత్రాలు తొలుత చెదురు మదురుగా ప్రవేశపెట్టబడినప్పుడు, ఆ యంత్రాల సొంతదారుచే నియుక్తమైన శ్రమను, మరింత ఉన్నత స్థాయీ, అధికతర ఫలదాయకత గల శ్రమగా మార్చడం ద్వారానూ, ఉత్పత్తి అయిన వస్తువు సామాజిక విలువను దాని వ్యష్టి విలువకు మించి పెంచడం ద్వారానూ, ఆ విధంగా ఒక రోజు శ్రమ శక్తి విలువ స్థానాన్ని ఒక రోజు ఉత్పాదితం విలువలో మునుపటికన్నా తక్కువ భాగంతో భర్తీ చేసేందుకు పెట్టుబడిదారుడికి వీలు కల్పించడం ద్వారా కూడా అవి సాపేక్ష అదనపు విలువను ఉత్పత్తి చేస్తాయి. యంత్రాలు ఒక రకమైన గుత్త సొమ్ముగా ఉన్న ఈ పరివర్తనా దశలో, లాభాలు అసాధారణమైనవి; పెట్టుబడిదారుడు పని రోజును సాధ్యమయినంత పొడిగించడం ద్వారా, "తన తొలి ప్రేమ ఆమని కాలాన్ని" సంపూర్ణంగా వినియోగించుకొనేందుకు ప్రయత్నిస్తాడు. అంతేసి లాభం ఇతోధిక లాభపిపాసను ఇనుమడింప చేస్తుంది.

ఒకానొక పరిశ్రమలో యంత్రాల వినియోగం మరింత సర్వసాధారణమైన కొద్దీ, ఉత్పాదితం యొక్క సామాజిక విలువ దాని వ్యష్టి విలువకు పడిపోతుంది; అదనపు విలువ, యంత్రాలతో పని చేయడానికి యథార్థంగా నియమితమైన శ్రమ శక్తి నుంచి ఉద్భవిస్తుందే తప్ప, యంత్రాలచే తొలగింప బడిన శ్రమ శక్తి నుంచి ఉత్పన్నం కాదన్న అదనపు విలువ నియమం తనకు తిరుగులేదని రుజువు చేస్తుంది. అదనపు విలువ అస్థిర పెట్టుబడి నుంచి మాత్రమే ఉత్పన్నమవుతుంది. అదనపు విలువ పరిమాణం రెండు అంశాలపై అంటే, అదనపు విలువ రేటూ, ఏకకాలంలో నియమితులైన కార్మికుల సంఖ్యపై ఆధారపడి ఉంటుందని చూచాము. పని దిన పరిమాణం నిర్ణీతమైనప్పుడు, అదనపు విలువ రేటును, ఒక రోజులోని అవసర శ్రమ, అదనపు శ్రమల సాపేక్ష కాలం నిర్ణయిస్తుంది. ఏకకాలంలో నియుక్తులైన కార్మికుల సంఖ్యయేమో అస్థిర పెట్టుబడికి, స్థిర పెట్టుబడికి మధ్య గల నిష్పత్తిపై ఆధారపడి ఉంటుంది. కానీ, యంత్రాల వాడకం శ్రమ ఉత్పాదకతను హెచ్చించడం ద్వారా అవసర శ్రమను తగ్గించి, అదనపు శ్రమను ఎంత పెంచినా సరే, అది ఈ ఫలితాన్ని సాధించేది, ఒక నిర్ణీత పరిమాణపు పెట్టుబడి నియమించే కార్మికుల సంఖ్యను తగ్గించడం ద్వారానే అనేది స్పష్టం. అది, మునుపు శ్రమ శక్తికై మదుపు పెట్టిన అస్థిర పెట్టుబడిని యంత్రాలుగా మారుస్తుంది.

1. "చలామణిలోని పెట్టుబడి కన్నా స్థిర పెట్టుబడి చాలా ఎక్కువ పరిమాణంలో ఉండటం వల్ల, రోజువారీ పని కాలం ఎక్కువగా ఉండటం వాంఛనీయం." యంత్రాలు మొదలయినవాటి వినియోగం పెరగడంతో, "స్థిర పెట్టుబడిలోని ఒక పెద్ద భాగాన్ని లాభదాయకం చేయగల ఏకైక సాధనంగా, రోజువారీ పని కాలం పెంపుదలకు ప్రేరణలు అధికమవుతాయి." (అదే గ్రంథం, పుటలు 11-13) "మిల్లు తక్కువ కాలం పనిచేసినా, పూర్తి కాలం పనిచేసినా, దానికి ఒకే పరిమాణంలో కొనసాగే కొన్ని ఖర్చులు ఉంటాయి. ఉదాహరణకు, అద్దె రేట్లు, పన్నులు, అగ్ని ప్రమాద సంబంధమైన బీమా, పలువురు శాశ్వత పనివారి వేతనాలు, యంత్రాల క్షీణత, వస్తూత్పత్తి సంస్థపై గల వివిధమైన ఇతర ఖర్చులు. ఉత్పత్తి తగ్గేకొద్దీ, లాభాలకు సంబంధించి వీటి నిష్పత్తి పెరుగుతుంది. (1862 అక్టోబరు 31, "ఫ్యాక్టరీ ఇన్‌స్పెక్టర్ల నివేదిక", పుట 19)

యంత్రాలు స్థిర పెట్టుబడి కాబట్టి, అదనపు విలువను ఉత్పత్తి చేయవు. ఉదాహరణకు, 24 మంది కార్మికుల నుంచి పిండుకోగల అదనపు విలువను ఇద్దరు కార్మికుల నుంచి పిండుకోవడం అసాధ్యం. ఈ 24 మంది 12 గంటల్లో ఒక గంట అదనపు శ్రమను మాత్రమే అందిస్తే, 24 మంది కలిసి, 24 గంటల అదనపు శ్రమను అందిస్తారన్న మాట. 24 గంటల ఇద్దరు కార్మికుల మొత్తం శ్రమ. కాబట్టి అదనపు విలువ ఉత్పత్తికి యంత్రాల వాడకంలో అంతర్గతమైన ఒక వైరుధ్యముంది; ఎందువల్లనంటే, ఒక నిర్ణీత పరిమాణపు పెట్టుబడి సృష్టించే అదనపు విలువకు సంబంధించిన రెండు అంశాల్లో, ఒకటియైన అదనపు విలువ రేటును, రెండవదైన కార్మికుల సంఖ్యను తగ్గిస్తే తప్ప హెచ్చించడం అసాధ్యం. ఒక నిర్దిష్ట పరిశ్రమలో యంత్రాల సార్వత్రిక వినియోగం వల్ల యంత్రోత్పాదితమైన సరుకు విలువ, అదే రకమైన అన్ని సరుకుల విలువనూ క్రమబద్ధం చేసీ చేయగానే, ఈ వైరుధ్యం బయటపడుతుంది. పెట్టుబడిదారుడు, తనకు తెలియకనే[1] పనిదినాన్ని విపరీతంగా పొడిగించడానికి పురికొల్పేది ఈ వైరుధ్యమే – తాను దోచుకొనే కార్మికుల సాపేక్ష సంఖ్య తగ్గుదల వల్ల కలిగే నష్టాన్ని, సాపేక్ష అదనపు శ్రమనే కాక, నిరపేక్ష అదనపు శ్రమను కూడా పెంచడం ద్వారా భర్తీ చేసుకోవడం ఈ పొడిగింపు ఉద్దేశం.

అలా యంత్రాల పెట్టుబడిదారీ వినియోగం ఒకవైపు, పని దినాన్ని విపరీతంగా పొడిగించేందుకు కొత్త, బలమైన ప్రేరణలను సమకూర్చి, ఈ పోకడ పట్ల వ్యతిరేకత బద్దలయ్యే విధంగా శ్రమ పద్ధతులనూ, అంతగానూ సామాజిక శ్రమ వ్యవస్థ స్వభావాన్నీ మూలపట్టుగా మారుస్తుంది. మరోవైపు, మునుపు పెట్టుబడిదారుడికి అందుబాటులో లేని కార్మికవర్గపు కొత్త తరగతులను అతని పంచలోకి తీసుకురావడం వల్ల కొంత, తన వల్ల స్థానభ్రష్టులైన శ్రామికులను అలా పని నుండి విడుదల చేసి, అదనపు శ్రామిక జనాభాను సృష్టిస్తుంది.[2] ఈ అదనపు జనాభా పెట్టుబడి హుకుములకు విధిగా తల ఒగ్గవలసి వస్తోంది. ఆధునిక పరిశ్రమల చరిత్రలో, పని దినం పొడిగింపుపై ఉంచిన ప్రతి నైతిక, సహజసిద్ధ ఆంక్షనూ యంత్రాలు తుడిచివేసే అట్టి విస్మయకర పరిణామానికి కారణం అదే. శ్రమ కాలాన్ని తగ్గించే అత్యంత శక్తివంతమైన సాధనం, తన పెట్టుబడి విలువను పెంచుకొనేందుకోసం కార్మికుని యొక్క, అతని కుటుంబం యొక్క కాలంలో ప్రతి క్షణాన్ని పెట్టుబడిదారుడి వినియోగంలో ఉండేందుకు అమోఘమైన సాధనం కావడమన్న ఆర్థిక వైపరీత్యానికి కూడా, అదే కారణం. ప్రాచీన కాలం నాటి చింతనాశీలురలోకెల్లా గొప్పవాడైన అరిస్టాటిల్ ఈ కలలుగన్నాడు : "డీడలస్ సృష్టించిన వస్తువులు తమంతకు తాము కదిలి వెళ్ళినట్లు, లేదా హెఫీస్టస్ ముక్కాల పీటలు తమంతకు తామే తమ పవిత్రమైన పనికి పూనుకొన్నట్లు, ప్రతి పరికరం, ఆజ్ఞాపించబడనప్పుడు లేక తనకు తానై, తనకు తగిన పని చేయగలిగితే, సాలెవాని నూలు కండెలు తమంతకు తాము బట్టలు నేస్తే, నేత కార్మికుల పెద్దలకు ఉమేజుదార్ల అవసరం ఉండదు; ప్రభువులకు బానిసల అవసరం ఉండదు."[3]

---

1. పెట్టుబడిదారుడికి, అతని భావాలు బాగా ఒంటబట్టిన రాజకీయ అర్థశాస్త్రజ్ఞులకు ఈ వైరుధ్యం గురించిన ఎరుక ఎందుకు లేదో మూడవ సంపుటం మొదటి భాగం నుంచి వెల్లడి అవుతుంది.
2. యంత్రాలు సరుకుల ఉత్పత్తికే కాక, "అక్కరకు మించిన జనాభాను" సృష్టించేందుకు సాధనాలని గమనించడం రికార్డో గొప్ప ప్రతిభా విశేషాల్లో ఒకటి.
3. ఎఫ్. బీసే, "డీ ఫిలాసఫీ డే అరిస్టాటిల్" సం. 4, బెర్లిన్, 1842, పుట 408.

పిండి విసరడానికి సృష్టించిన నీటి చక్రాన్నీ – యంత్రాలన్నిటికీ ప్రాథమిక రూపమై ఈ నూతన ఆవిష్కరణ సిసిరో కాలం నాటి ఆంటీ పెట్రోస్ అనే ఒక గ్రీకు కవి దాసీజనానికి స్వేచ్ఛాప్రదాతగా, స్వర్ణయుగ పునరావతరణ కర్తగా ప్రస్తుతించాడు.[1] ఆ విగ్రహారాధకుల సంగతి అంతే! పండితుడైన బాస్టియట్, అంతకు ముందు, ఆయన కన్నా వివేకవంతుడైన మాక్‌కుల్లోచ్ కనిపెట్టినట్లు, ఆ విగ్రహారాధకులకు రాజకీయ అర్థశాస్త్రం క్రైస్తవ మతం బొత్తిగా అర్థం కాలేదు. ఉదాహరణకు, యంత్రాలు పని దినాన్ని పొడిగించేందుకు అతి నమ్మకమైన సాధనమని వారు గ్రహించలేకపోయారు. ఒకరి బానిసత్వం మరొకరి సంపూర్ణ వికాసానికి సాధనమనే కారణంతో, బానిసత్వం క్షంతవ్యమని బహుశా అనుకొన్నారేమో. కానీ వానాకాలపు చదువు గల కొద్దిమంది మొరటు నడమంత్రపు సిరిగాళ్ళను "గొప్ప నూలు పరిశ్రమదారులు"గా, "విస్తారమైన కైమా ఉత్పత్తిదారులు"గా, "పలుకుబడి గల బూట్ పాలిష్ వర్తకులు"గా చేసేందు కోసం, ప్రజాబాహుళ్యానికి బానిసత్వంలోని మంచిని గురించి బోధించేందుకు, క్రైస్తవ మత బోధనామృతం వారికి లేకపోయింది.

## ఇ. శ్రమను తీవ్రం చేయటం

పెట్టుబడి చేతుల్లోని యంత్రాలు పని దినాన్ని మితిమీరి పొడిగించడం వల్ల సమాజ జీవిత మూలాలకే ముప్పు ఏర్పడి, అది సమాజ ప్రతిఘటనకు, తదుపరి ఒక ప్రామాణికమైన పని దినం నిర్ణయం కావడానికీ దారితీస్తుంది. ఆ పని దిన పరిమాణాన్ని చట్టం స్థిరపరుస్తుంది. అక్కడి నుంచి మనం ఇదివరకే చూచిన పరిణామానికి, అంటే శ్రమను తీవ్రం చేయటానికి గొప్ప ప్రాముఖ్యం ఏర్పడుతుంది. నిరపేక్ష అదనపు విలువ గురించిన మా విశ్లేషణ ప్రధానంగా శ్రమ కాల విస్తరణకు సంబంధించినది. శ్రమ తీవ్రత ఒక నిర్ణీత స్థాయిలో ఉందన్న ప్రతిపాదన అందులో గర్భితం. మరింత ఎక్కువ కాలంపాటు సాగే శ్రమ స్థానంలో మరింత తీవ్రమైన శ్రమను ప్రవేశపెట్టడం ఆ శ్రమ తీవ్రతా స్థాయి – వీటిని పరిశీలించడానికి ఇప్పుడు పూనుకొంటాం.

యంత్రాల వినియోగం విస్తరించిన మేరకు, యంత్రాలకు అలవాటు పడిన ఒక ప్రత్యేక తరగతి కార్మికుల అనుభవం సంచితమైన మేరకు, ఒక సహజ పర్యవసానంగా, శ్రమ వేగం, తీవ్రతా పెరుగుతాయనేది స్వయం విదితమే. ఆ విధంగా ఇంగ్లండులో ఒక అర్ధ శతాబ్దిలో, పని దినం పొడిగింపూ, ఫ్యాక్టరీలో శ్రమ తీవ్రత హెచ్చింపు ఒకదానితోపాటు మరొకటి కొనసాగాయి. కానీ పాఠకునికి ఇక్కడ ఒక విషయం స్పష్టమవుతుంది. శ్రమ, పట్టు విడుపులతో కాకుండా, అనుదినం

1. ఈ పద్యానికి స్టోల్‌బర్గ్ అనువాదాన్ని దిగువ ఇస్తున్నాను. ఎందుకంటే, ఇది శ్రమ విభజనను ప్రస్తావించిన మునుపటి ఉల్లేఖనల సరళిలోనే, ప్రాచీనుల, ఆధునికుల దృక్పథాల మధ్య గల వైరుధ్యాన్ని ప్రస్ఫుటం చేస్తోంది : "తిరగలి తిప్పే పడుచు పిల్లల్లారా, పిండి విసిరే చేతికి శ్రమ ఇవ్వకండి. హాయిగా నిద్రపోండి. పొద్దు పొడిచిందిరో అని కోడి కూస్తే కూయనీ, దాని శ్రమ వృథా! ఆడపిల్లల పనిని జలకన్యలు చేయాలని దేవుడు ఆజ్ఞాపించాడు. వారిప్పుడు ఆ చక్రాలపై పాదం మోపీ మోపకుండా గంతులేస్తున్నారు. ఫలితంగా కదలిన ఇరుసులు, తమ చక్రాల ఆకులతో తిరుగుతూ, బరువైన విసురాళ్ళను తిప్పుతున్నాయి. మన తాతలు బతికినట్టే బతుకుదాం. పని చేసిన తరువాత విశ్రాంతి తీసుకొని, దేవి మనకు ప్రసాదించిన సదుపాయాలను అనుభవిద్దాం." (గెడిక్టే అన్స్‌డెంగ్రీబిశ్చెన్ ఉబెర్‌సెట్జ్ వాన్‌క్రిశ్చియన్ జు స్టోల్‌బర్గ్, హాంబర్గ్, 1782.)

మార్పు లేకుండా ఏకరీతిగా పునరావృతమవుతున్న సందర్భంలో, పని దినం పొడిగింపూ, శ్రమ తీవ్రతా ఒకదానికొకటి ఆస్కారం లేకుండా చేసే దశ అనివార్యంగా వస్తుంది. ఆ దశలో శ్రమ తీవ్రతా స్థాయి తగ్గితేనే పని దినాన్ని పొడిగించడానికి అవకాశముంటుంది; పని దిన పరిమాణాన్ని తగ్గిస్తేనే తీవ్రతా స్థాయి హెచ్చించడానికి అవకాశముంటుంది; క్రమేణా పెల్లుబుకుతున్న కార్మికవర్గ తిరుగుబాటు మూలంగా, పార్లమెంటు నిర్బంధంగా పని గంటలను తగ్గించి, అసలైన ఫ్యాక్టరీల్లో ఒక ప్రామాణిక పని దినాన్ని నిర్దేశించవలసి వచ్చిన వెనువెంటనే, తత్ఫలితంగా, పని దినం పొడిగింపు ద్వారా జరిగే అదనపు విలువ ఉత్పత్తి పెంపుదలకు శాశ్వతంగా స్వస్తి జరిగిన వెనువెంటనే, ఆ మరుక్షణం నుంచీ పెట్టుబడి యంత్రాలను మరింత అభివృద్ధి పరచడానికి త్వరపడి, సాపేక్ష అదనపు విలువ ఉత్పత్తికై తన శక్తినంతా ఒడ్డింది. అదే సమయంలో సాపేక్ష అదనపు విలువ స్వభావంలో ఒక మార్పు వచ్చింది. మొత్తంపై చెప్పవలసి వస్తే, కార్మికుడు ఒక నిర్ణీత కాలంలో, అదే శ్రమను వెచ్చించి మరింత ఉత్పత్తి చేయగలిగే విధంగా అతని ఉత్పాదకతను పెంచడమే సాపేక్ష అదనపు విలువను ఉత్పత్తి చేసే పద్ధతి అవుతుంది. శ్రమ కాలం మునుపటిలాగే మొత్తం ఉత్పాదితానికి అదే విలువను అందిస్తూనే ఉంటుంది. దాని మార్పిడి విలువ పరిమాణంలో మార్పు లేదు కానీ ఆ పరిమాణం, మరింత ఎక్కువ ఉపయోగపు విలువకు వ్యాప్తమవుతుంది. కాబట్టి ప్రతి విడి సరుకు విలువ పడిపోతుంది. కానీ, పని గంటల నిర్బంధపు తగ్గింపు జరిగిన వెంటనే అది ఉత్పాదక శక్తి పెరుగుదలకూ, ఉత్పత్తి సాధనాల పొదుపునకూ బ్రహ్మాండమైన ఊపునిస్తుంది. కార్మికుడు ఒక నిర్ణీత కాలంలో చేసే శ్రమను పెంచుతుంది. శ్రమ శక్తి బిగువును (Tension) హెచ్చిస్తుంది. శ్రమ దినంలోని ఖాళీలను (Pores) మరింత కట్టుదిట్టంగా బిగిస్తుంది. అంటే, కుంచించిన పని దినం పరిమితులలో మాత్రమే సాధించ వీలున్న స్థాయికి శ్రమను సాంద్రీకరిస్తుంది. అధికతర శ్రమ రాశిని ఒక నిర్ణీత వ్యవధిలో ఇమిడేలా సాంద్రీకరించడం, ఆ పై అధికతర పరిమాణం గల శ్రమ కింద లెక్కే. అది నిజంగా అలాంటిదే. శ్రమ తన విస్తృతికి, అంటే పని కాలానికి సంబంధించిన కొలమానాన్నే కాక, తన తీవ్రతకు లేదా తన సాంద్రీకరణకు సంబంధించిన కొలమానాన్ని కూడా సంతరించుకొంటుంది.[1] పది గంటల పని దినంలోని సాంద్రతరమైన పని గంటలో, 12 గంటల పని దినంలోని మరింత విరళమైన పని గంటలో కన్నా ఎక్కువ శ్రమ, అంటే వినియోగమైన శ్రమ శక్తి ఉంటుంది. కాబట్టి సాంద్రతరమైన ఒక పని గంట విరళమైన $1\frac{1}{5}$ పని గంట ఉత్పాదితానికున్నంత లేదా దానికన్నా ఎక్కువగానే విలువ ఉంటుంది. శ్రమ ఉత్పాదకత పెరుగుదల ద్వారా, సాపేక్ష అదనపు విలువ మరింత లభించడమొక్కటే కాక, పెట్టుబడిదారుడికి ఇప్పుడు, $3\frac{1}{3}$ గంటల అదనపు శ్రమ, $6\frac{2}{3}$ గంటల అవసర శ్రమ ద్వారా, మునుపు నాలుగు గంటల అదనపు శ్రమ, ఎనిమిది గంటల అవసర శ్రమ ద్వారా ఉత్పత్తి అయినంత పరిమాణం గల విలువే ఉత్పత్తి అవుతుంది.

1. వేరు వేరు పరిశ్రమల్లో శ్రమ తీవ్రతల్లో సహజంగా ఎల్లప్పుడూ తేడాలుంటాయి. కానీ ఆడమ్ స్మిత్ నిరూపించినట్లు, ఆ తేడాలకు పాక్షిక పరిహారంగా, ప్రతి రకం శ్రమకూ దేనికి దాని ప్రత్యేకమైన కొద్దిపాటి పరిస్థితులున్నాయి. అయితే, విలువకు కొలమానమైన శ్రమ కాలాలపై ఈ సందర్భంలో, ఎట్టి ప్రభావమూ లేదు. ఎందువల్లనంటే, శ్రమ కాలమూ, దాని తీవ్రతా స్థాయి ఈ రెండూ, ఒకే శ్రమ పరిమాణానికి పరస్పర విరుద్ధమైన, ఒకటినొకటి మినహాయించే వ్యక్తీకరణలు.

ఇప్పుడు శ్రమను ఎలా తీవ్రం చేస్తారు, అనే ప్రశ్నను తీసుకొందాం. శ్రమ శక్తి సామర్థ్యం, శ్రమ శక్తి వ్యయమైన కాలానికి విలోమ నిష్పత్తిలో ఉంటుందన్న స్వయం విదిత నియమం నుంచి, పని దిన పరిమాణం తగ్గుదల తొలి ఫలితం ఉత్పన్నమవుతుంది. కాబట్టి కొన్ని పరిమితుల్లో, శ్రమ కాలం తగ్గుదల వల్ల జరిగే నష్టం శ్రమ శక్తి బిగువును హెచ్చించడం ద్వారా పుడుతుంది. పైగా, పెట్టుబడిదారుడు కార్మికునికి డబ్బు చెల్లించే పద్ధతి, అతడు నిజంగా మరింత ఎక్కువ శక్తిని వెచ్చించేలా హామీ కల్పిస్తోంది.[1] యంత్రాలకు బహు తక్కువ పాత్ర వున్నా, లేదా అసలు ఏ పాత్రా లేని కుండల పరిశ్రమ లాంటి వాటిలో ఫ్యాక్టరీ చట్టం అమలుజరగడం వల్ల ఒక విషయం కొట్టవచ్చినట్లు స్పష్టమయింది : పని దిన పరిమాణాన్ని తగ్గిస్తే చాలు, శ్రమ యొక్క క్రమబద్ధత, ఏకరూపత, క్రమపద్ధతి, నిరంతరాయత, జవసత్వాలు అద్భుత స్థాయికి పెరుగుతాయి.[2] కానీ అసలైన ఫ్యాక్టరీలో పనిదిన కాలం తగ్గింపు ఈ ఫలితమిచ్చిందా అనే సందేహం కలిగింది. ఎందుకంటే, యంత్రాల నిరంతరాయం, ఏకరూప గమనంపై ఆధారపడి ఉన్న కార్మికుని పని, అతి కచ్చితమైన క్రమశిక్షణను అప్పటికే ప్రవేశపెట్టింది. కాబట్టి పని దిన పరిమాణం 12 గంటలకన్నా తక్కువగా ఉండేలా దాన్ని తగ్గించే విషయంపై 1844లో చర్చ జరుగుతున్నప్పుడు, యజమానులు "పనివారు కాలహరణం చేయకుండా, తమ తనిఖీదారులు గట్టి జాగ్రత్త తీసుకుంటున్నా" రనీ, "కార్మికుల జాగరూకతను, శ్రద్ధను ఇంకా పెంచడం సాధ్యం కాదనీ," కాబట్టి యంత్రాల వేగం, ఇతర పరిస్థితులు యథాతథంగా ఉన్న స్థితిలో, "బాగా నిర్వహింపబడుతున్న ఫ్యాక్టరీలో కార్మికుల శ్రద్ధ పెరిగినందువల్ల ఏదైనా ఫలితం కలుగుతుందని ఆశించడం అసంగతమనీ," దాదాపు ఏకగ్రీవంగా ప్రకటించారు.[3] దృఢంగా చెప్పిన ఈ మాట నిజం కాదని ప్రయోగాలు నిరూపించాయి. రాబర్ట్ గార్డ్‌నర్ 1844 ఏప్రిల్ 20న, ఆ తరువాతా, ప్రెస్టన్‌లోని తన రెండు పెద్ద ఫ్యాక్టరీల్లో రోజువారీ పని కాలాన్ని 12 గంటల నుంచి 11 గంటలకు తగ్గించాడు. రమారమి ఒక సంవత్సరం పని ఫలితమిది : "మునుపటి ఖర్చుకే, మునుపటంతటి ఉత్పాదితమే చేతికి అందింది. మొత్తం కార్మికులు మునుపు 12 గంటల్లో ఆర్జించినంత వేతనాలే 11 గంటల్లో ఆర్జించారు."[4] నూలు వడికే గదుల్లో, నూలు చిక్కు తీసే గదుల్లో ప్రయోగాలను దాటవేస్తున్నాను. ఎందుకంటే, వాటితోపాటు యంత్రాల వేగాన్ని 2% హెచ్చించారు. కానీ నేత విభాగంలో పని పరిస్థితుల్లో లవలేశం కూడా మార్పు చేయబడలేదు. పైగా అక్కడ అనేక రకాల డిజైన్లున్న ఆకర్షణీయమైన వస్త్రాలు నేసేవారు. అక్కడ ఫలితమిది : "1844 జనవరి 6 నుంచి, ఏప్రిల్ 20 వరకు, 12 గంటల పని దినంతో, ప్రతి ఒక్క కార్మికుని వారపు వేతనం సగటున 10 షి, $1\frac{1}{2}$ పెన్నీలు; 1844 ఏప్రిల్ 20 నుంచి జూన్ 29 వరకు, 11 గంటల పని దినంతో, సగటు

1. ప్రత్యేకించి, జరిగిన పనిని బట్టి డబ్బు చెల్లించే పద్ధతి; ఈ పద్ధతిని ఈ గ్రంథం నాల్గవ సంపుటిలో పరిశీలిస్తాం.
2. 1865 అక్టోబరు 31, ఫ్యాక్టరీ ఇన్‌స్పెక్టర్ల నివేదికను చూడండి.
3. 1844కు, 1845 ఏప్రిల్ 30తో ముగిసే మాసత్రయానికి సంబంధించిన ఫ్యాక్టరీ ఇన్‌స్పెక్టర్ల నివేదిక, పుటలు 20, 21.
4. పూర్వోక్త గ్రంథం, పుట 19, జరిగిన పనిని బట్టి చెల్లించే వేతనాలు మారలేదు. కాబట్టి, వారపు వేతనాలు ఉత్పాదితాల పరిమాణంపై ఆధారపడ్డాయి.

వారపు వేతనం 10 షి. $3\frac{1}{2}$ పెన్నీలు.[1] ఇక్కడ 11 గంటల్లో మునుపు 12 గంటల్లో కన్నా ఎక్కువ ఉత్పత్తి అయింది. ఇదంతా కూడా కార్మికులు మరింత స్థిరంగా పని చేసి, కాలాన్ని పొదుపు చేసిన ఫలితం. వారికి మునుపటి వేతనమే వచ్చింది; ఒక గంట విడి సమయం లభించింది. కాగా, పెట్టుబడిదారుకు మునుపటంత ఉత్పత్తి అయింది. బొగ్గు, గ్యాస్, ఇంకా అలాంటి వస్తువులు ఒక గంట వాడుక కాకుండా ఆదా అయ్యాయి. హొర్రోక్స్, జాక్సన్‌ల మిల్లుల్లో కూడా అలాంటి ప్రయోగాలు, అంత జయప్రదంగా జరిగాయి.[2]

మొదటి విషయం, పని గంటల తగ్గింపు కార్మికుడు ఒక నిర్ణీత కాలంలో, ఎక్కువ బలం ఉపయోగించేలా చేస్తుంది; తద్వారా శ్రమ సాంద్రీకరణకు ఆత్మాశ్రయ పరిస్థితులను కల్పిస్తుంది. ఆ తగ్గింపు నిర్బంధమైన వెనువెంటనే యంత్రాలు, పెట్టుబడిదారుని చేతిలో ఒక నిర్ణీత కాలంలో మరింత శ్రమను పిండుకొనేందుకు, క్రమ పద్ధతిలో వాడే భౌతిక సాధనాలవుతాయి. ఇలా శ్రమను పిండటం రెండు మార్గాల్లో జరుగుతుంది. యంత్రాల వేగాన్ని పెంచడం; కార్మికుడు చూచుకోవలసిన యంత్రాలను ఎక్కువ చేయడం, యంత్రాల నిర్మాణాన్ని మెరుగుపరచడం అవసరమవుతుంది. అది జరగనిదే, కార్మికునిపై మరింత ఎక్కువ పని భారం మోపడం సాధ్యం కాకపోవడం ఇందుకొక కారణం. పని గంటల తగ్గుదల మూలంగా, పెట్టుబడిదారుడు ఉత్పత్తి ఖర్చులపై అతి ఖచ్చితమైన నిఘా ఉంచవలసి రావడం మరో కారణం. ఆవిరి ఇంజన్‌లోని మెరుగుదలలు పిస్టన్ వేగాన్ని పెంచాయి. అదే సమయంలో, శక్తిని పొదుపు చేయడం ద్వారా అంతే బొగ్గు వినియోగంతో లేదా అంతకన్నా తక్కువ వినియోగంతో అదే ఇంజన్‌తో ఎక్కువ యంత్రాలను నడపడం ఈ మెరుగుదలల వల్ల సాధ్యమయింది. చలన శక్తి సరఫరా యంత్రాంగంలో మెరుగుదలలు రాపిడిని తగ్గించాయి. వ్యాసాన్ని, బరువును కనీస స్థాయికి తగ్గించాయి; ఆధునిక యంత్రాలను పాతవాటి నుంచి ప్రస్ఫుటంగా వేరుపరచి చూపే విశిష్టత ఇది. ఆ కనీస స్థాయి కూడా నిరంతరం ఇంకా తగ్గుతూనే ఉంది. ఆఖరు విషయం, ఉత్పత్తి నిర్వాహక యంత్రాల్లో మెరుగుదలలు ఆధునిక మర మగ్గాల్లోలాగా, వాటి పరిమాణాన్ని తగ్గించాయి. అదే సమయంలో వాటి వేగాన్ని సామర్థ్యాన్ని పెంచాయి; లేదా నూలు వడికే యంత్రాల్లోలాగా, వాటి చట్రాల పరిమాణాన్ని పెంచడంతోపాటు, పనిచేసే భాగాల విస్తృతినీ, సంఖ్యనూ పెంచాయి. లేదా పదేళ్ళ క్రితం స్వయం ప్రవర్తకమైన వడికే యంత్రాల్లోని కదుళ్ళ వేగాన్ని అయిదో వంతుకు పెంచినటువంటి కనిపించని, బహు సూక్ష్మమైన మార్పుల ద్వారా ఈ భాగాల వేగాన్ని హెచ్చించాయి. పని దినాన్ని 12 గంటలకు తగ్గించడం ఇంగ్లండులో 1832లో జరిగింది. 1886లో ఒక కర్మాగార యజమాని ఇలా చెప్పారు : "ఇప్పుడు ఫ్యాక్టరీలో సాగుతున్న శ్రమ, ముప్పై, నలభై ఏళ్ళ క్రితం శ్రమతో పోల్చితే ... దానికన్నా చాలా ఎక్కువ ... యంత్రాల వేగం ఎంతో పెంచినందువల్ల

1. పూర్వోక్త గ్రంథం, పుట 20.
2. పై ప్రయోగాల్లో నైతిక అంశం ఒక ముఖ్య పాత్ర వహించింది. పనివారు ఫ్యాక్టరీ ఇన్‌స్పెక్టరుకు ఇలా చెప్పారు : "మేము మరింత ఉత్సాహంగా పని చేస్తాము. మునుపటికన్నా త్వరగా రాత్రిపూట వెళ్ళిపోతామన్న ప్రతిఫలం మాకుందని ఎల్లప్పుడూ మా మనసులో మెదులుతూంటుంది; తెగిన దారప్పోగులతికే కుర్రాడు మొదలుకొని చేయి తిరిగిన పెద్దవాడి వరకు మిల్లులో అంతటా ఒకే చురుకుదనం, ఉల్లాసం వ్యాపించి ఉన్నాయి. మేము ఒకరికొకరు ఎంతో తోడ్పడగలం." (అదే గ్రంథం, పుట 21)

కావలసివచ్చిన అధికతర శ్రద్ధ, క్రియాశీలత ఇందుకు కారణం."[1]

1844లో, లార్డ్ ఆష్లీ – ఇప్పుడాయన లార్డ్ షాఫ్టెస్‌బరీ – కామన్స్ సభలో లిఖితపూర్వకమైన సాక్ష్యాధారాలతో కింది ప్రకటనలు చేశారు.

"కర్మాగార వస్తూత్పత్తి ప్రక్రియల్లో నియుక్తులైన వారి శ్రమ, అటువంటి పనులు ప్రారంభమయిన నాటి శ్రమకు మూడింతలుంది. లక్షోప లక్షల మంది కండబలం అవసరమైన పనిని యంత్రాలు నిర్వహించాయనేది నిస్సందేహం. కానీ వాటి భయంకర చలనాలచే నియంత్రితులైన వారి శ్రమను కూడా అవి బ్రహ్మాండంగా పెంచాయి... 1815లో, 40వ నంబరు నూలు వడికే ఒక జత యంత్ర కదుళ్ళను చూచుకొనే పనికి (పని దినమంటే, 12 గంటలనే లెక్కన.) 8 మైళ్ళ నడక అవసరమయ్యేది. 1832లో, అదే నంబరు నూలు వడికే యంత్ర కదుళ్ళను చూచుకోవడంలో నడచిన దూరం 20 మైళ్ళు. తరచూ ఇంకా ఎక్కువే. 1835లో (ఇది పద్దెనిమిది వందలా పదిహేనా లేక పద్దెనిమిది వందలా ఇరవై అయిదా?) "నూలు వడికేవాడు ఈ యంత్ర కదుళ్ళు ప్రతి ఒక్కదానిపైనా రోజుకు 820 దూది కండెలుంచేవాడు. అంటే రోజుకు మొత్తం 1,640 కండెలుంచేవాడన్న మాట. 1832లో, అతను ప్రతి యంత్ర కదురుపైన 2,200 కండెలుంచేవాడు. అంటే మొత్తం 4,400 కండెలుంచేవాడు. కొన్ని సందర్భాల్లో అవసరమైన శ్రమ ఇంతకన్నా ఎక్కువే ఉండేది... 1842లో నాకు పంపిన మరో పత్రం నా వద్ద ఉంది. అది చెబుతున్నదేమంటే – శ్రమ అంతకంతకు పెరుగుతూంది. ఎందుకు పెరుగుతూందంటే, నడవవలసిన దూరం ఎక్కువ. ఉత్పత్తి అయిన వస్తువుల పరిమాణం పెరుగుతూండగా, పనివారి సంఖ్య మునుపటి కన్నా తక్కువ నిష్పత్తిలో ఉంది. అంతేకాదు, ఇప్పుడు తరచూ నాసిరకం దూదిని వడుకుతున్నారు. దీన్ని వడకడం మరింత కష్టం... నూలు చిక్కు తీసే గదిలో కూడా శ్రమ ఎంతో పెరిగింది. మునుపు ఇద్దరి మధ్య పంపిణీ అయిన పని నేడు ఒకడే చేస్తున్నాడు. చాలా పెద్ద సంఖ్యలో మనుషులు, ప్రధానంగా ఆడవారు పని చేసే నేత గదిలో ... గత కొద్ది సంవత్సరాల్లో పని పూర్తి పది శాతం పెరిగింది. నూలు వడికే యంత్రాల వేగం హెచ్చడం ఇందుకు కారణం. 1838లో వారానికి వడికిన నూలు కండెలు 18,000. 1843లో వీటి సంఖ్య 21,000; 1819లో మరమగ్గం నేతలో పేక నూలు కండెను నిమిషానికి 60 సార్లు ఆడించేవారు. 1842లో ఈ సంఖ్య 140కి పెరిగింది. శ్రమ విస్తారంగా పెరిగిందని ఇది రుజువు చేస్తోంది.[2]

పంద్రెండు గంటల చట్టం కింద 1844 నాటికే శ్రమ తీవ్రత ఈ అసాధారణ స్థాయినందుకొన్న దృష్ట్యా, ఆ దిశలో ఇక ఏ మాత్రం ప్రగతి సాధ్యం కాదనీ, కాబట్టి పని గంటలను ఏ మాత్రం తగ్గించినా ఉత్పత్తి తగ్గుతుందనీ ఆనాడు ఇంగ్లాండు కర్మాగార యజమానులు నొక్కి చెప్పడం సమర్థనీయమేనని అనిపించింది. వారు చూపుతున్న కారణాలు స్పష్టంగా సరియైనవని, వారిపై ఎప్పుడూ నిఘా ఉంచే ఫ్యాక్టరీ ఇన్‌స్పెక్టరు లియోనార్డ్ హోర్నర్ ఆనాడు చెప్పిన క్రింది మాటలు అన్నిటికన్నా బాగా రుజువు చేస్తున్నాయి :

"ఉత్పాదిత వస్తువుల పరిమాణాన్ని ప్రధానంగా యంత్రాల వేగం క్రమబద్ధం చేసి తీరుతుంది.

---

1. జాన్‌ఫీల్డెన్, పూర్వోక్త గ్రంథం, పుట 32.
2. లార్డ్ ఆష్లే, పూర్వోక్త గ్రంథం, 6-9 పుటల్లో అక్కడక్కడ ఉన్న భాగాలు.

కాబట్టి, వాటిని, కింది షరతులకు అనుగుణమైన అత్యధిక వేగంతో నడపడం మిల్లు యజమానికి ప్రయోజనకరం. ఆ షరతులు యంత్రాలు మరీ త్వరగా చెడిపోకుండా, వాటిని కాపాడుకోవడం, ఉత్పత్తి అయ్యే వస్తువు నాణ్యతను కాపాడుకోవడం, స్థిరంగా కార్మికుడు భరించగల దానికన్నా ఎక్కువ శ్రమ పడకుండా, యంత్రాల గమనాన్ని అనుసరించగలగటం. కాబట్టి, కార్మికుడు పరుగెత్తగల గరిష్ట వేగాన్ని ఫ్యాక్టరీ యజమాని, పై షరతులను దృష్టిలో ఉంచుకొని, కనుక్కోవడం అత్యంత ముఖ్యమైన సమస్యల్లో ఒకటి. తాను వేగం మరీ పెంచాననీ, యంత్రాలు దెబ్బతిని ఆగిపోవడం వల్ల, పని సరిగా లేకపోవడం వల్ల కలిగిన నష్టం, వేగం పెంపుదల వల్ల కలిగిన లాభాన్ని మించిపోయిందనీ కనుక్కొని, అతను ఈ వేగం తగ్గించవలసిరావడం తరచూ జరుగుతోంది. చురుకుదనం, తెలివితేటలు గల మిల్లు యజమాని హానికరం కానీ గరిష్ట వేగాన్ని కనుగొంటాడు కాబట్టి, 12 గంటల్లో ఉత్పత్తి చేసినంత, 11 గంటల్లో ఉత్పత్తి చేయడం సాధ్యం కాదని నేను నిర్ధారణ చేశాను. పనిని బట్టి వేతనం పొందే కార్మికుడు, ఒకే వేగంతో పనిచేస్తూ పోగల తన శక్తికి తగిన అత్యధిక స్థాయిలో పాటుపడతాడని కూడా నేను అనుకొన్నాను.[1] కాబట్టి హార్నర్, పని గంటల్ని 12 లోపుకు తగ్గించడం వల్ల ఉత్పత్తి ఆవశ్యంగా పడిపోతుందన్న నిర్ధారణకు వచ్చాడు.[2] యంత్రాల స్థితి స్థాపక గుణాన్ని మనిషి శ్రమ శక్తిని 1845లో తాను ఎంత తక్కువ అంచనా వేశానో రుజువు చేయటానికి ఆనాటి తన ఈ అభిప్రాయాన్ని ఆయనే, తరువాత 10 సంవత్సరాలకు ఉదాహరించాడు. పనిదిన పరిమాణాన్ని నిర్బంధంగా తగ్గించడం వల్ల ఆ రెంటినీ ఏకకాలంలో విపరీతంగా సాగదీశారు.

1847లో ఇంగ్లండులోని నూలు, ఉన్ని, పట్టు, ఎల్లగిసె నార బట్టల మిల్లుల్లో పది గంటల చట్టాన్ని ప్రవేశపెట్టిన తరువాత దశకు ఇప్పుడు వస్తాము.

"త్రాసిల్ యంత్రంపై (దారం తీసి పురిపెట్టి, చుట్టు చుట్టే యంత్రం – అను) కదుళ్ళ వేగం నిమిషానికి 500 భ్రమణాలు, వడికే యంత్రాలపై కదుళ్ళ వేగం 1,000 భ్రమణాలు పెరిగింది. అంటే, 1839లో, త్రాసిల్ కదురు వేగం నిమిషానికి 4,500 భ్రమణాలున్నది. ఇప్పుడు (1862) 5000కు, వడికే యంత్రపు కదురు వేగం నిమిషానికి 5000 నుంచి ఇప్పుడు 6000 భ్రమణాలకు పెరిగింది. మొదటి సందర్భంలో ఈ పెరుగుదల పదో వంతు, రెండవ సందర్భంలో అయిదో వంతు."[3] ప్రాట్రిక్రాఫ్ట్‌కు చెందిన ప్రసిద్ధ ఇంజనీర్ జేమ్స్ నాస్మిత్, 1852లో లియొనార్డ్ హార్నర్‌కు రాసిన ఒక ఉత్తరంలో, 1848–1852 మధ్య ఆవిరి ఇంజన్‌లో వచ్చిన మెరుగుదలల స్వభావాన్ని వివరించాడు. ఆవిరి ఇంజన్ల ఆశ్విక శక్తిని, 1828లో అటువంటి ఇంజన్ల శక్తిని బట్టి అధికార పత్రాల్లో ఎల్లప్పుడూ వేసే అంచనా నామమాత్రమైనదనీ,[4] అది వాటి వాస్తవ శక్తికి ఒక సూచికగా మాత్రమే

1. "1844 సెప్టెంబరు 20తో ముగిసే మాసత్రయ కాలానికీ, 1844 అక్టోబరు నుంచి 1845 ఏప్రిల్ 30 వరకు గల కాలానికి ఫ్యాక్టరీ ఇన్‌స్పెక్టర్ల నివేదికలు" పుట 20.
2. అదే గ్రంథం, పుట 22.
3. 1862 అక్టోబరు 31కి ఫ్యాక్టరీ ఇన్‌స్పెక్టర్ల నివేదికలు.
4. 1862 "పార్లమెంటరీ పత్రం"లో దీనిని మార్చారు. ఆధునిక ఆవిరి ఇంజన్ల నీటి చక్రాల నామక ఆశ్విక శక్తికి బదులు వాస్తవ ఆశ్విక శక్తి ఇందులో కనిపిస్తుంది. (1839, 1850, 1856 నాటి "పత్రాల్లో" చేర్చినట్లుగా) వడికే కదుళ్ళలో, జోడు కదుళ్ళను చేర్చలేదు. అదీకాక, ఉన్ని మిల్లుల విషయంలో "గిగ్గులను" (బొచ్చు

ఉపయోగపడగలదనీ పేర్కొన్న తరువాత ఇలా చెప్పుకపోయాడు : "మునుపటి అదే బరువు గల ఆవిరి ఇంజన్ యంత్రాల నుంచి, మనకిప్పుడు సగటున, కనీసం 50 శాతం ఎక్కువ పని లభిస్తోందనీ, నిమిషానికి 220 అడుగుల పరిమిత వేగమున్న నాటి ఇంజను 50 ఆశ్విక శక్తినివ్వగా, ఇప్పుడు 100కు పైగా అశ్వ శక్తినిస్తోందని నా దృఢ విశ్వాసం..." "100 అశ్వ శక్తి గల ఆధునిక ఆవిరి ఇంజన్ మునుపటి కన్నా చాలా ఎక్కువ బలంగా నడప వీలుంది. దాని నిర్మాణంలోనూ, బాయిలర్ల పరిమాణం, నిర్మాణం మొదలయిన వాటిలోనూ వచ్చిన మెరుగుదలలు ఇందుకు కారణం..." "మునుపటి దశలో ఆశ్విక శక్తికి ఏ నిష్పత్తిలో పనివారు నియుక్తులయ్యేవారో ఆ నిష్పత్తిలోనే ఇప్పుడు నియుక్తులౌతున్నప్పటికీ, యంత్రాలను బట్టి చూస్తే, వారి సంఖ్య మునుపటికన్నా తక్కువ.[1] 1850లో యునైటెడ్ కింగ్‌డమ్‌లోని ఫ్యాక్టరీలు 25,638,716 కదుళ్ళను, 301,445 మగ్గాలను నడిపించేందుకు 134,217 నామక ఆశ్విక శక్తిని వినియోగించారు. 1856లో ఉన్న కదుళ్ళు 33,503,580; మగ్గాలు 369,205; అవసరమైన నామక ఆశ్విక శక్తి బలం 1850లో లాగానే ఉందని అనుకొంటే, పైన పేర్కొన్న కదుళ్ళకు, మగ్గాలకు 175,000 ఆశ్విక శక్తికి సమానమైన బలం అవసరమవుతుంది. కానీ 1856కు సంబంధించిన పత్రంలో ఇచ్చిన వాస్తవ ఆశ్విక శక్తి 161,435; 1850 నాటి పత్రం ప్రాతిపదికపై లెక్కవేస్తే, 1856లో ఫ్యాక్టరీలకు ఆవశ్యమైన దానికన్నా ఇది 10,000 పైచిలుకు ఆశ్విక శక్తి తక్కువ."[2] "ఈ విధంగా ఈ పత్రం (1856 నాటిది) వెల్లడి చేస్తున్న వాస్తవాలు ఇవీ అని తోస్తోంది; ఫ్యాక్టరీ వ్యవస్థ శీఘ్రగతిలో అభివృద్ధి చెందుతుంది. మునుపటి దశల్లో ఆశ్విక శక్తికి ఏ నిష్పత్తిలో పనివారు నియుక్తులయారో ఆ నిష్పత్తిలోనే ఇప్పటికీ నియుక్తులవుతున్నా, యంత్రాలను బట్టి చూస్తే వారి సంఖ్య మునుపటికన్నా తక్కువ. శక్తి వినియోగంలో పొదుపు, తదితర పద్ధతుల ద్వారా, అదే ఆవిరి ఇంజన్, మునుపటి కన్నా ఎక్కువ బరువు గల యంత్రాలను నడపగలుగుతోంది; యంత్రాల్లో ఉత్పత్తి పద్ధతుల్లో మెరుగుదలలు యంత్రాల వేగం పెంచడం, తదితర రకరకాల కారణాల వల్ల మునుపటి కన్నా ఎక్కువ పని జరుగుతోంది."[3]

"ప్రతి రకం యంత్రాల్లోని గొప్ప మెరుగుదలలు వాటి ఉత్పాదక శక్తిని చాలా పెంచాయి. పని గంటల తగ్గింపు ... ఈ మెరుగుదలకు ప్రేరణ ఇచ్చిందనేందుకు సందేహం లేదు. ఈ మెరుగుదలలూ, కార్మికునిపై ఉంచిన తీవ్రమైన ఒత్తిడీ కలిసి ఇచ్చిన ఫలితమిది – పని కాలం (రెండు గంటలు, లేదా ఆరో వంతు) తగ్గించబడిన పని రోజులో, కనీసం మునుపటి ఎక్కువ గంటల పని రోజులో అయినంత ఉత్పత్తి అవుతోంది."[4]

శ్రమ శక్తిని మరింత తీవ్రంగా దోపిడీ చేయటంతోపాటు, ఫ్యాక్టరీ యజమానుల సంపద

---

బట్టల నేతలో ఉపయోగించే యంత్రాలు - అను) చేర్చారు. జనపనార, గోగునార మిల్లులకూ, ఎల్లగిసె నార మిల్లులకూ మధ్య తేడా చూపారు. ఆఖరు విషయం మేజోళ్ళ నేతను, మొట్టమొదటిసారిగా ఈ నివేదికలో చేర్చారు.

1. 1856 అక్టోబరు 31కి ఫ్యాక్టరీ ఇన్‌స్పెక్టర్ల నివేదిక, పుటలు 13-14, 20. 1852 నివేదిక, పుట 23.
2. పూర్వోక్త గ్రంథం, పుటలు 14-15.
3. అదే గ్రంథం, పుట 20.
4. "1858 అక్టోబరు 31 ఫ్యాక్టరీ ఇన్‌స్పెక్టర్ల నివేదికలు" పుటలు 9-10. "1850 ఏప్రిల్ 30 ఫ్యాక్టరీ ఇన్‌స్పెక్టర్ల నివేదికలు", 30వ పుట, తదుపరి పుటలతో పోల్చి చూడండి.

ఎంత పెద్ద ఎత్తున పెరిగిందో రుజువు చేయడానికి ఒక వాస్తవం చెబితే చాలు. 1838 నుంచి 1850 వరకు ఇంగ్లండులోని నూలు, తదితర సగటు పెరుగుదల నిష్పత్తి 32 శాతం కాగా, 1850 నుంచి 1856 వరకు అది 86 శాతం.

కానీ 1848–1856 మధ్య గల 8 సంవత్సరాల్లో ఆంగ్లేయుల పరిశ్రమల పురోగతి, 10 గంటల పని దినం ప్రభావం వల్ల గొప్పగా ఉన్నా, తరువాత, 1856–1862 మధ్య గల ఆరేళ్ళలో పురోగతి మునుపటిదాన్ని చాలా మించిపోయింది. ఉదాహరణకు, పట్టు వస్త్రాల ఫ్యాక్టరీల్లో 1856లో 1,093,799 కదుళ్ళుండగా, 1862లో ఉన్నవి 1,388,544, 1856లో మగ్గాలు 9,260, 1862లో వాటి సంఖ్య 10,709. కానీ 1856లో పనివారి సంఖ్య 56,131. 1862లో 52,429. కాబట్టి కదుళ్ళు 26.9 శాతం, మగ్గాలు 15.6 శాతం పెరగ్గా, పనివారి సంఖ్య 7 శాతం తగ్గింది. 1850లో అల్లిక దుస్తుల మిల్లుల్లో 875,380 కదుళ్ళను ఉపయోగించారు. 1856లో వాటి సంఖ్య, 1,324,549 (పెరుగుదల 51.2 శాతం), 1862లో అవి 1,289,172 (తగ్గుదల 2.7 శాతం). కానీ 1856కు సంబంధించిన ఆ అంకెలో చేరిన జోడు కదుళ్ళను తీసివేస్తే, (1862 నాటి అంకెలో అవి చేరలేదు). 1856 తరువాత, కదుళ్ళ సంఖ్య దాదాపు స్థిరంగా ఉందని తేలుతుంది. కానీ, 1850 తరువాత కదుళ్ళ, మగ్గాల వేగం, అనేక సందర్భాల్లో రెట్టింపయింది. అల్లిక దుస్తుల మర మగ్గాల సంఖ్య 1850లో 32,617, 1856లో 38,986, 1862లో 43,048. పనివారి సంఖ్య 1850లో 79,737, 1856లో 87,794, 1862లో 86,063. కానీ వీటిలో 14 సంవత్సరాల లోపు పిల్లల సంఖ్య 1850లో 9,956, 1856లో 11,228, 1862లో 13,178. కాబట్టి 1856తో పోలిస్తే, 1862లో మగ్గాల సంఖ్య బాగా పెరిగినప్పటికినీ, నియుక్తులైన పనివారి మొత్తం సంఖ్య తగ్గింది. దోపిడీ చేయబడిన పిల్లల మొత్తం సంఖ్య హెచ్చింది.[1]

1863 ఏప్రిల్ ఫెర్రాండ్ కామన్స్ సభలో ఇలా చెప్పారు : "లాంక్‌షైర్ చెషైర్‌కు చెందిన 16 జిల్లాల ప్రతినిధుల తరఫున నేను మాట్లాడుతున్నాను. యంత్రాల్లోని మెరుగుదలల పర్యవసానంగా ఫ్యాక్టరీల్లో పని నిరంతరం పెరుగుతూందని వారు నాకు తెలియజేశారు. మునుపు, ఇద్దరు సహాయకులతో ఒకడు రెండు మగ్గాలను చూసుకొనేవాడు. దానికి బదులు ఇప్పుడు ఆ ఒకడు, సహాయకులు లేకుండానే మూడు మగ్గాలను చూసుకొంటున్నాడు. ఒకడు నాలుగు మగ్గాలను చూసుకోవడం అసాధారణమేమీ కాదు. ఉదాహరించిన వాస్తవ విషయాలనుబట్టి విదితమవుతున్నట్లు, 12 గంటల పనిని, 10 గంటలకన్నా తక్కువ కాలంలోనే ఇమిడ్చారు.[2]

1. "1862 అక్టోబరు 31 ఫ్యాక్టరీ ఇన్‌స్పెక్టర్ల నివేదికలు", పుటలు 100, 130.

2. "ఇప్పుడు నేత కార్మికుడు రెండు ఆధునిక మరమగ్గాలపై, 60 గంటల వారంలో ఒక నిర్దిష్ట నాణ్యం, పొడవు, వెడల్పు గల 26 శాల్తీలు నేస్తాడు. కాని, పాత మరమగ్గాలపై అతను 4 శాల్తీలను మించి నేయలేకపోయేవాడు. అటువంటి బట్ట ధర 1850 నాటికే 2 షి. 9 పె. నుంచి 5 1/8 పె. లకు పడిపోయింది. ముప్పై సంవత్సరాల క్రితం (1841లో) తెగిన పోగులతికే ముగ్గురితో కలిసి ఒక నేత కార్మికుడు 300-324 కదుళ్ళు గల వడికే యంత్రాలను రెంటికి మించి చూడవలసిన అవసరముండేది కాదు. ఇప్పుడు (1871) పోగులతికే ముగ్గురితో కలిసి 2,200 కదుళ్ళను చూసుకో వలసి ఉంది. అతను 1841లో కన్నా ఏడింతలకు తక్కువగాకుండా నూలు ఉత్పత్తి చేస్తున్నాడు." (ఫ్యాక్టరీ ఇన్‌స్పెక్టరు అలెగ్జాండర్ రెడ్‌గ్రేవ్ - 1872 జనవరి 5వ తేదీ, జర్నల్ ఆఫ్ ఆర్ట్స్‌లో.

కాబట్టి ఫ్యాక్టరీ ఇన్‌స్పెక్టర్లు 1844, 1850 చట్టాల ఫలితాలను ఎడతెగకుండా మెచ్చుకొంటున్నప్పటికీ, పని గంటల తగ్గింపు కార్మికుని ఆరోగ్యానికీ, పని చేయగల అతని శక్తికీ హాని కలిగించేటంత శ్రమ తీవ్రతను అప్పటికే తెచ్చి పెట్టిందని అంగీకరిస్తున్నారు. "నూలు వస్త్రాల, అల్లిక దుస్తుల, పట్టు వస్త్రాల మిల్లులు ఎక్కువ వాటిలో గత కొన్ని సంవత్సరాల్లో గమన వేగం ఎంతో పెరిగిన యంత్రాలను సంతృప్తికరంగా నిర్వహించగలిగేందుకు, కార్మికుడు అలసిపోయేలా చేసే ఉద్విగ్న స్థితిలో ఉండాలి; ఈ స్థితి ఊపిరితిత్తుల వ్యాధుల వల్ల విపరీతంగా సంభవిస్తున్న మరణాలకు ఒక కారణమై ఉండవచ్చునని నాకు తోస్తుంది." ఈ విషయంపై తన ఇటీవలి నివేదికలో డాక్టర్ గ్రీన్‌హౌ ఈ సంగతి పేర్కొన్నాడు.[1] పనిగంటల హెచ్చింపు శాశ్వతంగా నిషేధింపబడిన వెనువెంటనే, శ్రమ తీవ్రతను ఒక పద్ధతి ప్రకారం పెంచడం ద్వారా తన నష్టాన్ని పూడ్చుకోవడానికీ, యంత్రాలలోని ప్రతి మెరుగుదలనూ, కార్మికుని బలాపహరణకు మరింత పరిపూర్ణమైన సాధనంగా మార్చడానికీ పెట్టుబడిని ప్రేరేపించే ధోరణి, పని గంటల తగ్గింపును మళ్ళీ అనివార్యం చేసే పరిస్థితికి దారితీస్తుందనడంలో ఎట్టి సందేహమూ ఉండజాలదు.[2] మరోవైపు, 10 గంటల పని దిన ప్రభావం మూలంగా, 1848కీ, నేటికీ మధ్య ఇంగ్లండు పరిశ్రమల్లో వచ్చిన సత్వర పురోగతి, 12 గంటల పని దినమున్న 1833–1847 మధ్యకాలంలోని పురోగతిని మించిపోయింది – ఫ్యాక్టరీ వ్యవస్థ ప్రవేశపెట్టబడిన తరువాత పనిదినానికి పరిమితులంటూ లేని అర్ధ శతాబ్దంలో పరిశ్రమల పురోగతిని, 12 గంటల పని దినం అమల్లో ఉన్న పై దశలో వాటి పురోగతి ఎంత మించిందో అంతకన్నా ఎంతో ఎక్కువ మించిపోయింది.[3]

---

1. "1861 అక్టోబరు 31 ఫ్యాక్టరీ ఇన్‌స్పెక్టర్ల నివేదికలు," పుటలు 25, 26.
2. 8 గంటల పనిదినం కోసం ఆందోళన ఇప్పుడు (1867) లాంక్‌షైర్ ఫ్యాక్టరీ కార్మికుల్లో ప్రారంభమయింది.
3. 1848 దరిమిలా యునైటెడ్ కింగ్‌డమ్ "ఫ్యాక్టరీల" పెరుగుదలను కింది కొద్ది అంకెలు సూచిస్తున్నాయి:

| | ఎగుమతి అయిన పరిమాణం 1848 | ఎగుమతి అయిన పరిమాణం 1851 | ఎగుమతి అయిన పరిమాణం 1860 | ఎగుమతి అయిన పరిమాణం 1865 |
|---|---|---|---|---|
| **దూది** | | | | |
| నూలు | పౌండ్లు 135,831,162 | పౌండ్లు 143,966,106 | పౌండ్లు 197,343,655 | పౌండ్లు 103,751,455 |
| కుట్టుదారం | పౌండ్లు - | పౌండ్లు 4,392,176 | పౌండ్లు 6,297,554 | పౌండ్లు 4,648,611 |
| నూలు బట్టలు | గజాలు 1,091,373,930 | గజాలు 1,543,161,789 | గజాలు 2,776,218,427 | గజాలు 2,015,237,851 |
| **ఎల్లిగిసె నార, గోగునార** దారం | పౌండ్లు 11,722,182 | పౌండ్లు 18,841,326 | పౌండ్లు 31,210,612 | పౌండ్లు 36,777,334 |

| | | | | |
|---|---|---|---|---|
| బట్టలు | గజాలు<br>88,901,519 | గజాలు<br>129,106,753 | గజాలు<br>143,996,773 | గజాలు<br>247,012,529 |
| పట్టు<br>దారం | పౌండ్లు<br>466,825 | పౌండ్లు<br>462,513 | పౌండ్లు<br>897,402 | పౌండ్లు<br>812,589 |
| బట్టలు | గజాలు<br>- | గజాలు<br>1,781,455 | గజాలు<br>1,307,293 | గజాలు<br>2,869,837 |
| ఉన్ని<br>ఉన్నిదారం | పౌండ్లు<br>- | పౌండ్లు<br>14,670,880 | పౌండ్లు<br>27,533,968 | పౌండ్లు<br>31,669,267 |
| కుట్టుపనికి<br>వాడే దారం | గజాలు<br>- | గజాలు<br>241,120,973 | గజాలు<br>190,371,507 | గజాలు<br>278,837,418 |

| | **ఎగుమతి విలువ 1848 పౌండ్లు** | **ఎగుమతి విలువ 1851 పౌండ్లు** | **ఎగుమతి విలువ 1860 పౌండ్లు** | **ఎగుమతి విలువ 1865 పౌండ్లు** |
|---|---|---|---|---|
| **దూది** | | | | |
| నూలు | 5,927,831 | 6,63,026 | 9,870,875 | 10,351,049 |
| బట్టలు | 16,753,369 | 23,454,810 | 42,141,505 | 46,903,796 |
| **ఎల్లిగిసె, గోగునారు** | | | | |
| దారం | 493,449 | 951,426 | 1,801,272 | 2,505,497 |
| బట్టలు | 2,802,789 | 4,107,396 | 4,804,803 | 9,155,358 |
| **పట్టు** | | | | |
| దారం | 77,789 | 196,380 | 826,107 | 768,064 |
| బట్టలు | - | 1,130,398 | 1,587,303 | 1,409,221 |
| **ఉన్ని** | | | | |
| దారం | 776,975 | 1,484,544 | 3,843,450 | 5,424,047 |
| బట్టలు | 5,733,828 | 8,377,183 | 12,156,998 | 20,102,259 |

పార్లమెంటు ప్రచురించిన పత్రాలు "యునైటెడ్ కింగ్‌డమ్ గణాంక వివరాల సంగ్రహం" సం. 8, సం. 13, లండన్, 1861, 1866 చూడండి. లాంక్‌షైర్‌లో మిల్లుల సంఖ్య 1839-1850 మధ్య 4% మాత్రమే పెరిగింది. 1850-1856 మధ్య 19% ఉంటే 1856-1862 మధ్య 33% పెరిగింది. అయితే, వాటిలో నియుక్తులయిన పనివారి సంఖ్య పై దశలోని ప్రతి 11 సంవత్సరాల కాలంలో నిరాపేక్షంగా పెరిగింది. కానీ సాపేక్షంగా తగ్గింది. ("1862 అక్టోబరు 31 ఫ్యాక్టరీ ఇన్‌స్పెక్టర్ల నివేదికలు", పుట 63 చూడండి.) లాంక్‌షైర్‌లో నూలుబట్ట వ్యాపారానిదే పైచేయి. యునైటెడ్ కింగ్‌డమ్‌లోని మొత్తం జౌళి మిల్లుల్లో 45.2%, కదుళ్ళలో 83.3%, మరమగ్గాల్లో 81.4%, యాంత్రిక అశ్వశక్తిలో 72.6% దానికి చెందినవే. పనిచేస్తున్న మొత్తం కార్మికుల్లో 58.2% అందులోనివారే. అంటే, ఆ జిల్లాలోని నూలు బట్టల వ్యాపారం ఎంత బ్రహ్మాండమైనదో మనం గ్రహించవచ్చు. (అదే గ్రంథం, పుటలు 62-63.)

## విభాగం-4

# ఫ్యాక్టరీ

ఈ అధ్యాయం ప్రారంభంలో మనం, ఫ్యాక్టరీ ఆకారం అని పిలువదగిన వాటిని, అంటే ఒక వ్యవస్థగా సంఘటితపరచిన యంత్రాలను పరిశీలించాము. యంత్రాలు స్త్రీల, పిల్లల శ్రమను స్వాయత్తం చేసుకోవడం ద్వారా, పెట్టుబడిదారీ దోపిడీకి వస్తువుగా రూపొందే మనుషుల సంఖ్యను ఎలా పెంచుతాయో, పని గంటలను అమితంగా పొడిగించడం ద్వారా కార్మికుని వినియోగార్హ కాలమంతటినీ అవి ఎలా తమదిగా చేసుకొంటాయో, తుదకు, అంతకంతకు తక్కువ కాలంలో ఉత్పత్తిని బ్రహ్మాండంగా హెచ్చించేందుకు వీలు కల్పించే ఆ యంత్రాల ప్రగతి, మరింత తక్కువ కాలంలో ఒక పద్ధతిలో, మరింత ఎక్కువ పని చేయించేందుకు, లేక శ్రమ శక్తిని మరింత తీవ్రంగా దోచుకొనేందుకు ఒక సాధనంగా ఎలా ఉపకరిస్తుందో, ఆ సందర్భంలో మనం చూశాము. ఇప్పుడు మనం మొత్తం ఫ్యాక్టరీవైపు, తన పరిపూర్ణ రూపంలో ఉన్న ఫ్యాక్టరీవైపు దృష్టి మళ్ళిద్దాం.

స్వయంచాలకమైన ఫ్యాక్టరీకి పిండార్‌లాంటి భట్రాజైన డాక్టర్ ఉరే (పిండార్ ప్రాచీన గ్రీకు కవి – అను) దాన్ని ఒకవైపు ఇలా వర్ణిస్తున్నాడు : అది, "ఒక కేంద్ర శక్తిచే" (ప్రధాన చోదక యంత్రం) "నిరంతరం ప్రేరేపితమైన ఉత్పాదక యంత్రాల వ్యవస్థను దీక్షాయుత నైపుణ్యంతో చూసుకోవడంలో అనేక స్థాయిలకు చెందిన కార్మికుల – పెద్దవారూ, పిన్నవారి – సంయుక్త సహకారం," మరోవైపు ఇలా వర్ణిస్తున్నాడు : అది "స్వయం నియంత్రిత చోదక శక్తికి లోనై, ఒక ఉమ్మడి వస్తువు ఉత్పత్తి కోసం నిరంతరాయ సమన్వయంతో పనిచేసే బహు విధ యాంత్రిక, బౌద్ధిక అంగాలతో ఏర్పడ్డ స్వయం ప్రవర్తక యంత్రం." ఈ రెండు వర్ణనలు ఎంత మాత్రమూ ఒకే విధమైనవి కావు. ఒకదానిలో, సమష్టి కార్మికుడు లేదా శ్రమ సామాజిక మూర్తియేమో ప్రముఖమైన కర్తగా, యాంత్రిక స్వయం ప్రవర్తక వ్యవస్థయేమో క్రియాగ్రహీత వస్తువుగా ప్రత్యక్షమవుతున్నాయి. రెండవ వర్ణనలో స్వయం ప్రవర్తక యంత్ర వ్యవస్థే కర్త కాగా, కార్మికులు కేవలం చైతన్యయుతమైన అంగాలు: అవి స్వయం ప్రవర్తక యంత్రం యొక్క చైతన్యరహిత అంగాలకు అనుగుణంగా వ్యవహరిస్తున్నాయి. వాటితోపాటు కేంద్ర చోదక శక్తికి లోనై ఉన్నాయి. మొదటి వర్ణన, పెద్దయెత్తున యంత్రాలను ఎలా, ఎలా వినియోగించ వీలుందో, అలాంటి ప్రతి వినియోగానికీ వర్తిస్తుంది; రెండవది, పెట్టుబడిచే వాటి వినియోగం యొక్క స్వభావోచిత వర్ణన. కాబట్టి ఉరే, చలనమూలమైన కేంద్ర యంత్రాన్ని స్వయం ప్రవర్తక యంత్రంగానే కాక, ఏకచ్ఛత్రాధినేతగా వర్ణిస్తున్నాడు. "ఈ విశాల మందిరాల్లో, కనికరము కలిగిన యంత్రాల నేతృత్వంలో విధేయులైన అసంఖ్యాక సేవకులను తన చుట్టూ పనికి పురమాయిస్తోంది."[1]

పరికరంతోపాటు, దాన్ని వాడటంలో కార్మికుని నైపుణ్యం కూడా యంత్రానికి దఖలు పడుతుంది. మానవుని శ్రమ శక్తికి గల విడదీయరాని పరిమితుల నుంచి పరికర శక్తి సామర్థ్యాలు విముక్తి చెందుతాయి. తద్వారా కార్ఖానా వస్తూత్పత్తిలో శ్రమ విభజనకు ప్రాతిపదిక అయిన సాంకేతిక పునాది తుడిచిపెట్టుకు పోతుంది. ప్రత్యేక నైపుణ్యం గల కార్మికుల దొంతర కార్ఖానా వస్తూత్పత్తి లక్షణం. దాని పునాది తుడిచిపెట్టుకు పోయినందువల్ల, ఈ దొంతర స్థానంలో, యంత్రాలను నిర్వహించేవారు

1. ఉరే, పూర్వోదాహృత గ్రంథం, పుట 18.

చేయవలసిన ప్రతి రకం పనిని సమానం చేసి, ఒకే స్థాయికి తెచ్చే ధోరణి స్వయంచాలిత ఫ్యాక్టరీలో ప్రవేశిస్తుంది.[1] ప్రత్యేకీకృత కార్మికుల మధ్య కృతకంగా ఉత్పన్నమయిన భేదాల స్థానంలో, సహజసిద్ధమైన వయో భేదాలు, స్త్రీ పురుష భేదాలు ప్రవేశిస్తాయి.

ఫ్యాక్టరీలో శ్రమ విభజన మళ్ళీ ప్రత్యక్షమయ్యే సంగతిని తీసుకొంటే, అది ప్రధానంగా, ప్రత్యేక యంత్రాల మధ్య కార్మికుల పంపిణీ, ఫ్యాక్టరీలోని వేరు వేరు శాఖల మధ్య కార్మిక బాహుళ్యం పంపిణీ, కానీ వారు బృందాలుగా సంఘటితులు కారు. ఆ ప్రతి ఒక్క శాఖల్లోనూ వారు, కలిపి ఉంచిన ఒకే విధమైన కొన్ని యంత్రాల వద్ద పని చేస్తారు. కాబట్టి వారి సహకారం సామాన్యమైనదేతప్ప మరొకటి కాదు. కార్ఖానా వస్తూత్పత్తికి స్వభావోచితమైన సంఘటిత బృందం స్థానంలో, కార్మికుల మేస్త్రీకి, అతని కింద ఉన్న కొద్దిమంది సహాయకులకూ మధ్య సంబంధం చోటుచేసుకుంటుంది. వాస్తవంలో యంత్రాల నిర్వహణకై నియమితులైన పనివారూ (వారిలో ఇంజన్‌ను చూచుకొనేవారు కూడా చేరుతున్నారు.) కేవలం ఈ పనివారి సహాయకులు (దాదాపు వీరంతా పిల్లలే) – ఇదీ ప్రధానమైన విభజన. ఈ సహాయకుల్లో "అందించే వారంతా" సహాయకుల కింద లెక్కే. వీరు యంత్రాలకు, ఉత్పాదన క్రియకు పదార్థాలను అందిస్తారు. ఈ రెండు ప్రధాన వర్గాలే కాకుండా, సంఖ్యా బలాన్ని బట్టి ముఖ్యంకానీ మరొక వర్గం వారున్నారు; మొత్తం యంత్రాలను చూచుకోవడం, అవసరమైనప్పుడు వాటిని మరమ్మతు చేయడం వీరి పని; వీరు ఇంజనీర్లు, మెకానిక్కులు, వడ్రంగులు మొదలైనవారు. పై స్థాయికి చెందిన పనివారి వర్గమిది. వారిలో కొందరు శాస్త్రీయ విద్య నభ్యసించినవారు, ఇతరులు ఏదో ఒక పారిశ్రామిక శాఖలో శిక్షణ పొందినవారు, ఈ వర్గం ఫ్యాక్టరీలో ఉత్పత్తి పని చేసే వర్గానికి భిన్నమైనది. దానికి కేవలం చేర్చబడుతున్నదంతే.[2] ఈ శ్రమ విభజన అచ్చంగా సాంకేతికమైనది.

ఒక యంత్రం వద్ద కార్మికుడు పని చేయాలంటే, చిన్నతనం నుంచే అతనికి ఆ పని నేర్పాలి. ఒక స్వయం ప్రవర్తక యంత్ర గమనానికి అనుగుణంగా తన అంగ విన్యాసాలను ఎలా దిద్దుకోవాలో నేర్చుకోవడానికి అప్పుడతనికి వీలవుతుంది. యంత్రాలు మొత్తంగా, ఏకకాలంలోనూ, పరస్పర సమన్వయంలోనూ పనిచేసే నానావిధ యంత్రాల వ్యవస్థగా ఏర్పడినప్పుడు, వాటిపై ఆధారపడిన సహకారానికి, వివిధ కార్మిక బృందాలను వివిధ రకాల యంత్రాల మధ్య పంపిణీ చేయడం అవసరం. కానీ, ఒక నిర్దిష్ట వ్యక్తిని ఒక నిర్దిష్ట క్రియకు శాశ్వతంగా అనుబంధించడం ద్వారా, కార్ఖానా వస్తూత్పత్తి పద్ధతిలో ఈ పంపిణీని కరుడుగట్టించవలసిన ఆవశ్యకత యంత్రాల వినియోగం వల్ల తొలిగిపోతుంది.[3]

---

1. ఉరే, పూర్వోదాహృత గ్రంథం, పుట 31, కార్ల్‌మార్క్స్, పూర్వోదాహృత గ్రంథం, పుటలు 140-141.
2. ఇది, గణాంక వివరాలు ఉద్దేశపూర్వకంగా తప్పుదోవ పట్టించే వైనంలాగా కనిపిస్తోంది. (ఇతర సందర్భాల్లో కూడా ఈ విషయం సవివరంగా నిరూపించవచ్చు.) ఇంగ్లీషు వారి ఫ్యాక్టరీ చట్టాలు పై పాఠంలో ఆఖరున పేర్కొన్న కార్మిక వర్గాన్ని, ఆ చట్టాల పరిధి నుంచి మినహాయించగా, పార్లమెంటు పత్రాలు, ఫ్యాక్టరీ పనివారనే అభివర్గంలో ఇంజనీర్లు, మెకానిక్కులు మొదలయిన వారినే కాకుండా, మేనేజర్లు, అమ్మకందార్లు, వార్తాహరులు, గోదాము పనివారు, ప్యాకర్లు మొదలైన వారిని కూడా. ఒక్క ముక్కలో చెప్పాలంటే ఫ్యాక్టరీ యజమానిని తప్ప మిగతా ప్రతి ఒక్కరినీ స్పష్టంగా చేరుస్తున్నాయి మరి.
3. ఉరే దీన్ని అంగీకరిస్తున్నాడు. "అవసరమైనప్పుడు" కార్మికులను మేనేజరు తన అభీష్టాన్ని బట్టి, ఒక యంత్రం నుండి మరొక యంత్రానికి తరలించవచ్చునని చెబుతూ, విజయోత్సాహంతో గొంతెత్తి ఇలా చాటుతున్నాడు : "శ్రమను విభజించే పాత మామూలు వాడుకకు - ఒక కార్మికునికి సూది పై కొనను

మొత్తం వ్యవస్థ గమనం యంత్రాల నుంచి ప్రారంభమవుతుందే తప్ప, కార్మికుల నుంచి కాదు కనుక, పనికి అంతరాయం లేకుండా ఎప్పుడైనా సరే మనుషులను మార్చవచ్చు.

ఫ్యాక్టరీ యజమానులు తమ తిరుగుబాటు కాలంలో, 1848-50 నుంచి అమల్లో పెట్టిన అంచెల పద్ధతి దీనికి ప్రస్ఫుటమైన నిరూపణ. ఆఖరు విషయం, యంత్రాల పనిని యోజనులు బహు త్వరగా నేర్చుకుంటారు కాబట్టి, కేవలం యంత్రాల పనికోసమే ప్రత్యేక తరగతికి చెందిన పనివారిని తర్ఫీదు చేయవలసిన అవసరం లేకుండా పోతుంది.[1] కేవలం సహాయకుల పని సంగతికి వస్తే, దాన్ని మిల్లుల్లో, కొంతవరకు యంత్రాలతోనే చేయించవచ్చు.[2] అది అత్యంత సులభమైన పనికాబట్టి, విసుగు పుట్టించే ఈ పని భారం కింద నలుగుతున్న వ్యక్తులను త్వర త్వరగా, నిరంతరం మార్చవచ్చు.

అందువల్ల, సాంకేతిక దృష్టితో చెప్పవలసి వస్తే, పాత శ్రమ విభజన వ్యవస్థను యంత్రాలు కూలదోసినప్పటికీ అది, కార్ఖానా వస్తూత్పత్తి దశ నుంచి సంక్రమించిన ఒక సాంప్రదాయిక అలవాటుగా ఫ్యాక్టరీలను పట్టుకొని వేలాడుతూ వచ్చింది. తరువాత, పెట్టుబడి క్రమ పద్ధతిలో దానికి కొత్త రూపు దిద్ది, శ్రమ శక్తిని దోచుకొనే ఒక సాధనంగా మరింత వికృతాకారంలో స్థాపిస్తుంది. ఒకే ఒక

---

రూపొందించే కర్తవ్యాన్నీ, మరొకరికి దాని మొనను వాడి చేసే పనినీ కేటాయించే ఆ పద్ధతికి, అటువంటి మార్పు పూర్తిగా విరుద్ధం"; స్వయం చాలక ఫ్యాక్టరీలో, ఈ "పాత మామూలు వాడుక" నుంచి "అవసర మైనప్పుడు" మాత్రమే ఎందుకు వైదొలగడం జరిగిందో ఉరే తన్ను తాను ప్రశ్నించుకొని ఉండవలసింది.

1. దారిద్ర్య బాధ తీవ్రమైనప్పుడు, ఉదాహరణకు, అమెరికా అంతర్యుద్ధ కాలంలో, ఫ్యాక్టరీ పనివాణ్ణి రోడ్లు వేయడం మొదలయిన అతి మోటు పనులకు బూర్జువా వర్గం అప్పుడప్పుడు నియమించింది. నిరాధారులైన నూలు మిల్లు పనివారి కోసం 1862లోనూ, ఆ తరువాత సంవత్సరాల్లోనూ స్థాపితమైన ఇంగ్లీషు "జాతీయ కర్మాగారాలు", 1848 నాటి ఫ్రెంచి జాతీయ కర్మాగారాలకు మధ్య తేడా ఉంది : ఫ్రెంచి జాతీయ కర్మాగారాల్లో కార్మికులు ప్రభుత్వం ఖర్చుతో అనుత్పాదకమైన పని చేయవలసిరాగా ఇంగ్లీషు వారి "జాతీయ కర్మాగారాల్లో" బూర్జువా వర్గానికి లాభదాయకంగా, ఉత్పాదకమైన మునిసిపల్ పని చేయవలసి వచ్చింది. అది కూడా, తమతో పోటీ చేయవలసి వచ్చిన మామూలు పనివారి కన్నా చౌకగా. "నూలు మిల్లు కార్మికుల దేహస్థితి నిస్సందేహంగా మెరుగుపడింది. పురుషులకు సంబంధించినంత వరకు, ప్రభుత్వ పథకాల్లో ఆరుబయట పనిచేయటం ... ఇందుకు కారణమని నా అభిప్రాయం." ("1863 అక్టోబరు 31, ఫ్యాక్టరీ ఇన్‌స్పెక్టర్ల నివేదికలు." పుట 59) ఇక్కడ రచయిత ప్రస్తావిస్తున్నది ప్రెస్టన్ ఫ్యాక్టరీ పనివారిని గురించి, వారితో ప్రెస్టన్ మూర్‌లో (ప్రెస్టన్ బీడు - అను) పని చేయించారు.

2. ఇందుకొక ఉదాహరణ, ఉన్ని మిల్లుల్లో, పిల్లల శ్రమకు బదులుగా, 1844 చట్టం తరువాత ప్రవేశపెట్టబడిన వివిధ యాంత్రిక పరికరాలే; ఫ్యాక్టరీ కార్మికుల పిల్లలే, మిల్లుల్లో సహాయకులుగా తరఫీదు పొందవలసి వచ్చిన వెనువెంటనే, యంత్ర శాస్త్రంలో అంతవరకు దాదాపు పరిశోధింపబడని ఈ భాగం త్వరలోనే ఆశ్చర్యకరంగా పురోగమిస్తుంది. "యంత్రాల్లో కెల్లా, స్వయంచాలక కదుళ్ళ యంత్రాలు బహుశా తక్కిన ఏ రకమైన యంత్రం అయినా సరే, దానంత ప్రమాదకరమైనవి. వాటి వల్ల ప్రమాదాల్లో ఎక్కువ భాగం, అవి చలనంలో ఉండగా, నేలపై కసువు చిమ్మడానికై వాటికింద పాకే చిన్నపిల్లలకు సంభవిస్తున్నాయి. యంత్రాలు "చూచుకొనే వారిలో" చాలామందికి ఈ నేరం జరిగినందుకు జుల్మానా వేశారు. కాని ఇది పెద్దగా ఉపయోగపడలేదు. యంత్ర నిర్మాతలు స్వయంగా కసువు చిమ్మే పరికరాన్ని సృజిస్తే ఈ చిన్నపిల్లలు యంత్రాల కింద పాకవలసిన అవసరం లేకుండా పోతుంది. అది సంతోషకరమైన మరో భద్రతా చర్య అవుతుంది." (1866 అక్టోబరు 1 ఫ్యాక్టరీ ఇన్‌స్పెక్టర్ల నివేదికలు, పుట 63)

పరికరాన్ని ఉపయోగించే ఆజన్మాంత ప్రత్యేక నైపుణ్యం, ఇప్పుడు ఒకే ఒక యంత్రానికి సేవ చేసే ఆజన్మాంత ప్రత్యేక నైపుణ్యమవుతుంది. కార్మికుణ్ణి చిన్ననాటి నుంచీ ఒక పాక్షిక ప్రక్రియ తాలూకు యంత్రంలో భాగంగా మార్చే లక్ష్యంతో యంత్రాలను అక్రమంగా వినియోగిస్తున్నారు.[1] ఈ విధంగా, అతని పునరుత్పత్తి ఖర్చులు గణనీయంగా తగ్గడమే కాదు, అదే సమయంలో మొత్తం ఫ్యాక్టరీపైనా, ఆ కారణాన పెట్టుబడిదారునిపైనా పూర్తిగా ఆధారపడిన అతని నిస్సహాయ పరాధీనత పరిపూర్తి గావించబడుతుంది. తక్కిన ప్రతి ఒక్క సందర్భంలో లాగానే ఇక్కడ కూడా మనం, ఉత్పత్తి సామాజిక ప్రక్రియ అభివృద్ధి వల్ల పెరిగే ఉత్పాదకతకు, ఆ ప్రక్రియను పెట్టుబడిదారు దోచుకోవడం వల్ల పెరిగే ఉత్పాదకతకు మధ్య తేడా చూడాలి. చేతివృత్తులలోనూ, కార్ఖానా వస్తూత్పత్తిలోనూ కార్మికుడు పరికరాన్ని ఉపయోగిస్తాడు. ఫ్యాక్టరీలో యంత్రమే అతణ్ణి ఉపయోగిస్తుంది. అక్కడ శ్రమ సాధనాల కదలికలు అతనితో ప్రారంభమవుతాయి. ఇక్కడ అతను అనుసరించవలసింది యంత్ర కదలికను. కార్ఖానా వస్తూత్పత్తిలో కార్మికులు ఒక సజీవ యంత్రాంగంలో భాగాలు, ఫ్యాక్టరీలో ఉన్నది, కార్మికునితో ప్రమేయం లేని ఒక నిర్జీవ యంత్రాంగం, అతడు దానికి సజీవ అనుబంధమవుతాడంతే. "అదే, అదే యాంత్రిక ప్రక్రియను పదే పదే నిర్వహించవలసిన, విసుగెత్తించే, అంతులేని, దిక్కుమాలిన రొడ్డ కొట్టు పనీ, కాయకష్టమూ, సిసిఫస్ (నరక లోకంలో, ఒక బ్రహ్మాండమైన గండశిలను కొండపైకి నిరంతరం తోసుకపోతూండవలసిందిగా శపింపబడ్డ కోరింత్ రాజు – అను) శ్రమ లాంటిది. ఈ శ్రమ భారం, ఆ గండశిలలాగా, పూర్తిగా అలసిపోయిన కార్మికునిపై, ఎల్లప్పుడూ మళ్ళీ పడుతూనే ఉంటుంది.[2]

ఫ్యాక్టరీ పని నాడీ మండలాన్ని సంపూర్తిగా అలయజేస్తూ, అదే సమయంలో, కండరాల బహుముఖ ప్రయోగావకాశాలను హరించివేస్తుంది. శారీరక, బౌద్ధిక కార్యకలాపాలు రెంటిలోనూ అణుమాత్రమైనా స్వేచ్ఛ లేకుండా చేస్తుంది.[3] శ్రమ తేలిక కావడం కూడా ఒక రకమైన చిత్రహింసగా పరిణమిస్తుంది. ఎందువల్లనంటే, యంత్రం కార్మికుణ్ణి పని నుండి విముక్తుణ్ణి చేయదు. సరికదా, పనిలోని ఆసక్తికరమైన దంతటినీ హరిస్తుంది. ప్రతి రకపు పెట్టుబడిదారీ ఉత్పత్తీ శ్రమ ప్రక్రియే కాక అదనపు విలువను సృష్టించే ప్రక్రియ కూడా కావడం వల్ల, వాటన్నిటికీ ఒక ఉమ్మడి లక్షణముంది : శ్రమ సాధనాలను వినియోగించేది కార్మికుడు కాదు, సరికదా శ్రమ సాధనాలే కార్మికుణ్ణి వినియోగిస్తాయి. కానీ ఈ తలక్రిందుల వ్యవహారం మొట్టమొదటిసారిగా సాంకేతికమైన, ప్రస్ఫుటమైన

---

1. ప్రౌధాన్ అద్భుత భావంలోని పస బయటపెట్టడానికి ఇది చాలు : ఆయన యంత్రాలను శ్రమ సాధనాల సంయోగంగా "వ్యాఖ్యానించడం" లేదు. అవి కార్మికునికి ప్రయోజనకరమైన ప్రత్యేక క్రియల సంయోగమని వ్యాఖ్యానిస్తున్నాడు.
2. ఫ్రెడరిక్ ఎంగెల్స్, పూర్వోదాహృత గ్రంథం, పుట 217. మొలినారీ వంటి ఆశావాద దృష్టిగల ఒక సామాన్య స్వేచ్ఛా వర్తకవాది సైతం ఇలా చెప్పేంతదాకా వెళ్ళాడు : "ఒక యంత్రపు ఏకరూప గమనాన్ని రోజుకు 15 గంటలపాటు కనిపెట్టుకొని ఉండే మనిషి. అదే కాలమాద్యంతం, తన దేహ బలాన్ని ఉపయోగించినప్పటి కన్నా త్వరగా అలసిపోతాడు. నిఘా ఉంచే పని మరీ ఎక్కువసేపు కొనసాగకుంటే, బహుశా మనసుకు ఉపయోగకరమైన పనిగా ఉపకరించవచ్చు. కాని ఆ పని మితిమించి చేసినట్లయితే, కొంత కాలానికి అది మనసును, శరీరాన్ని కూడా నాశనం చేస్తుంది." (జె.డి. మొలినారీ "ఏ టుడే ఎకనామిక్", పారిస్, 1846)
3. ఫ్రెడరిక్ ఎంగెల్స్, పూర్వోక్త గ్రంథం, పుట 216.

వాస్తవమయ్యేది ఫ్యాక్టరీ వ్యవస్థలోనే. స్వయంచాలక యంత్రంగా మారడం ద్వారా శ్రమ సాధనం, శ్రమ ప్రక్రియ సందర్భంగా కార్మికునికి పెట్టుబడి రూపంలో సజీవ శ్రమ శక్తిపై పెత్తనం చేస్తూ, దాన్ని నిశ్శేషంగా పీల్చివేసే మృత శ్రమ రూపంలో ఎదురవుతుంది. ఉత్పత్తి మేధాశక్తులు శారీరక శ్రమ నుంచి విడిపోయి, ఈ శక్తులు శ్రమపై పెట్టుబడి బలాధిక్యతగా మారడమన్నది మనం ఇంతకు ముందే చూచినట్లు, యంత్రాల పునాదిపై నిర్మితమైన ఆధునిక పరిశ్రమల వల్ల తుదకు పూర్తి అవుతుంది. గణనకు రాని ప్రతి వ్యష్టి ఫ్యాక్టరీ కార్మికుని ప్రత్యేక నైపుణ్యం విజ్ఞాన శాస్త్రం ముందు, ఆ బ్రహ్మాండమైన భౌతిక శక్తుల ముందు సూక్ష్మ పరిమాణంగా అదృశ్యమవుతుంది. ఫ్యాక్టరీ యంత్రాంగంలో మూర్తీభవించిన శ్రమ రాశి, ఆ యంత్రాంగంతో పాటు "యజమాని" శక్తి అవుతుంది. కాబట్టి ఈ యంత్రాలు వాటిపై తన గుత్తాధిపత్యం అవిభాజ్యంగా ఏకమై ఉన్నట్లు భావిస్తున్న ఈ "యజమాని" తన "పనివారి"తో కొట్లాటకు దిగినప్పుడల్లా తిరస్కార భావంతో వారికిలా చెబుతాడు : "తమది నిజంగా తక్కువ రకపు నిపుణ శ్రమ అనీ, దానికన్నా సులభంగా సేకరించే వీలున్నదీ, దాని నాణ్యత కన్నా పుష్కలంగా ప్రతిఫలం సంపాదించగలిగినదీ, అత్యుత్తమ స్థాయి ప్రవీణుడిచ్చే కొద్దిపాటి శిక్షణతో దానికన్నా త్వరగా, సమృద్ధిగా సేకరించ వీలున్నదీ మరేదీ లేదనీ, ఫ్యాక్టరీ పనివారు బాగా జ్ఞాపకముంచుకోవాలి... ఉత్పత్తి వ్యవహారంలో పనివాని శ్రమ కన్నా, నైపుణ్యం కన్నా యజమాని యంత్రాలు నిజంగా చాలా ప్రముఖ పాత్ర నిర్వహిస్తున్నాయి. ఆ నైపుణ్యాన్ని ఆరు నెలల శిక్షణతో నేర్పవచ్చు; ఏ మామూలు కార్మికుడైనా నేర్చుకోగలడు."[1] శ్రమ సాధనాల ఏకరూప గమనానికి కార్మికుని సాంకేతిక లొంగుబాటు, స్త్రీలు, పురుషులు, అన్ని వయసుల వారు ఉన్న కార్మిక సముదాయపు ప్రత్యేక స్వరూపం. ఇవి బారకాసుల క్రమశిక్షణకు దారితీస్తాయి. దీన్ని ఫ్యాక్టరీలో ఒక సంపూర్ణ వ్యవస్థగా రూపొందిస్తారు. ఇది, ఇంతకు ముందు పేర్కొన్న పర్యవేక్షక శ్రమను పూర్తిగా పెంపొందించి, తద్వారా కార్మికులను పనివారుగానూ, పర్యవేక్షకులుగానూ, పారిశ్రామిక సైన్యంలోని మామూలు సైనికులుగానూ, సార్జెంట్లుగానూ విభజిస్తుంది. మనుషులు పని విషయంలో నిలకడ, పొందిక లేని తమ అలవాట్లను వదులుకొని, జటిలమైన స్వయంచాలక యంత్రాల అచంచల క్రమబద్ధతతో తాదాత్మ్యాన్ని పెంపొందించుకునే వారిని తర్ఫీదు చేయడం ముఖ్యంగా, (స్వయంచాలక ఫ్యాక్టరీలోని) ప్రధానమైన కష్టం. ఫ్యాక్టరీ క్రమశిక్షణకు, ఫలప్రదమైన, ఫ్యాక్టరీలోని అవిరళ శ్రమకు తగిన నిబంధనావళిని రూపొందించి, అమలు జరపడం ఆర్క్‌రైట్ భగీరథ ప్రయత్నం, అతను సాధించిన ఉదాత్త ఘనకార్యం! ఫ్యాక్టరీ వ్యవస్థ నిర్దుష్టంగా సంఘటితమై, దాని శ్రమ పూర్తి తేలికైన ఈనాడు సైతం, యవ్వనారంభ దశ దాటిన వారిని ఉపయోగకరమైన ఫ్యాక్టరీ పనివారుగా దిద్ది తీర్చడం ఇంచుమించు అసాధ్యమని తేలింది."[2] ఫ్యాక్టరీ నిబంధనావళిలో పెట్టుబడి, ప్రైవేటు శాసన నిర్మాతలాగా,

1. "వడికేవారి యజమానుల, ఉత్పత్తిదారుల రక్షణ నిధి కమిటీ నివేదిక", మాంచెస్టర్, 1854, పుట 17, తన "సజీవ" స్వయం ప్రవర్తక "యంత్రాన్ని" కోల్పోయే ప్రమాద మేర్పడినప్పుడు "యజమాని" ప్లేటు మార్చి మరో పాట పాడగలడని ఇకముందు తెలుసుకొంటాము.

2. ఉరే, పూర్వోక్త గ్రంథం, పుట 15. ఆర్క్‌రైట్ జీవిత చరిత్ర తెలిసిన ఎవరూ కూడా ఈ క్షౌరక ప్రతిభాశాలికి "ఉదాత్తుడు" అన్న కితాబు ఇవ్వడు. 18వ శతాబ్ది ఆవిష్కర్తలలో, ఇతగాడంతగా ఇతరులు కనిపెట్టినవి దొంగిలించినవాడు, ఇంతటి నీచుడు మరొకడు లేడు.

తన ఇష్టానుసారం తన కార్మికులపై తన నిరంకుశాధిపత్యానికి సూత్రరూపమిచ్చింది. ఇతర విషయాల్లో ఎంతగానో బూర్జువా ఆమోదం పొందిన బాధ్యతల విభజన ప్రసక్తి మాత్రం ఇందులో లేదు. అంతకన్నా ఎక్కువగా ఆ వర్గ ఆమోదం పొందిన ప్రాతినిధ్య వ్యవస్థ మాటా లేదు. అటువంటి ఈ నిబంధనావళి, భారీ స్థాయి సహకారంలోనూ, శ్రమ సాధనాల, ప్రత్యేకించి యంత్రాల ఉమ్మడి వినియోగంలోనూ, శ్రమ ప్రక్రియపై అవసరమైన సామాజిక నియంత్రణ యొక్క పెట్టుబడిదారీ వక్ర చిత్రణే తప్పలేదు కదా. బానిసల గామా కొరడా స్థానంలో తనిఖీదారు జుల్మానాల రిజిష్టరు వస్తుంది. అన్ని శిక్షలు సహజంగా, జుల్మానాలుగా, వేతనాల్లో కోతలుగా పరిష్కారమవుతాయి. ఫ్యాక్టరీ లికుర్గస్ (.......) శాసన నిర్మాణ ప్రతిభ, తన శాసనాలు పాటింపబడటం కన్నా ఉల్లంఘింపబడటమే, సాధ్యమయితే, ఎక్కువ లాభదాయకంగా ఉండేలా, వ్యవహారాలను ఏర్పాటు చేస్తాడు.[1] ఇక్కడ మేము ఫ్యాక్టరీ శ్రమ సాగుతున్న భౌతిక పరిస్థితులను గురించి కేవలం ప్రస్తావిస్తాము. ఉష్ణోగ్రతను కృతకంగా హెచ్చడం

---

1. బూర్జువా వర్గం శ్రామిక వర్గాన్ని బానిస సంకెళ్ళతో బంధించింది. ఈ బానిసత్వం ఇతరత్రాకన్నా అతి స్పష్టంగా ఫ్యాక్టరీ వ్యవస్థలో కనిపిస్తోంది. ఇందులో స్వేచ్ఛ యావత్తూ చట్టరీత్యా, యథార్థంగానూ కూడా అంతరిస్తుంది. కార్మికుడు ఉదయం అయిదున్నర గంటలకు ఫ్యాక్టరీలో ఉండాలి. అతడు కొద్ది నిమిషాలు ఆలస్యంగా వస్తే శిక్ష తప్పదు; పది నిమిషాలు ఆలస్యంగా వస్తే నాష్టా తరువాత గాని అతణ్ణి లోనికి రానివ్వరు. ఆ విధంగా అతడు దిన వేతనంలో నాల్గవ వంతు కోల్పోతాడు. అతని అన్న, పాన, నిద్రాదులన్నీ ఉత్తర్వు అయినప్పుడే... అతడు నిద్రలో ఉన్నా, నాష్టా చేస్తున్నా, మధ్యాహ్న భోజనం చేస్తున్నా నిరంకుశమైన ఫ్యాక్టరీ గంట పిలుపు రాక తప్పదు. ఇక మిల్లులో అతని స్థితి ఏమిటి? అక్కడ యజమాని నిరంకుశు డైన శాసనకర్త. అతడు తనకు నచ్చిన నిబంధన లను జారీ చేస్తాడు. తన నియమావళిని ఇష్టానుసారం మారుస్తాడు. వాటికి కొత్తవి చేరుస్తాడు. అతడు బొత్తిగా అర్థం పర్థం లేనివి ప్రవేశపెట్టినా సరే, న్యాయస్థానాలు కార్మికునికి ఇలా చెబుతాయి: "నీవు ఈ ఒప్పందంలో స్వచ్ఛందంగా భాగస్వామివయ్యావు కాబట్టి, దాన్ని నీవు అమలు జరపాలి... కార్మికులు తమ తొమ్మిదో ఏడు నుంచి, చనిపోయే వరకు ఈ మానసిక, శారీరక చిత్రహింసలను అనుభవించే దుర్గతి పాలవుతున్నారు." (ఫ్రెడరిక్ ఎంగెల్స్, పూర్వోదాహృత గ్రంథం, పుట 217. తరువాతివి కూడా దానిలోనివే) "న్యాయస్థానాలు ఏమి చెప్పేది నేను రెండు ఉదాహరణలతో తెలుపుతాను. ఒకటి 1866 చివర, షెఫీల్డ్‌లో జరిగింది. ఆ పట్టణంలో ఒక కార్మికుడు ఒక ఉక్కు కర్మాగారంలో రెండేళ్ళు పని చేయడానికి ఒప్పందం చేసుకొన్నాడు. తన యజమానితో కొట్లాట వచ్చి అక్కడ పని వదిలి వేశాడు; ఎట్టి పరిస్థితుల్లోనూ, ఆ యజమానికింద ఇక పని చేయనని చెప్పాడు. ఒప్పందాన్ని ఉల్లంఘించినందుకు అతనిపై నేరం మోపి, రెండు నెలల జైలు శిక్ష వేశారు. యజమాని ఒప్పందాన్ని ఉల్లంఘిస్తే, అతనిపై సివిల్ దావా వేయవచ్చునంతే. నష్ట పరిహారం కింద డబ్బు ఇచ్చుకోవడం తప్ప అతనికి ఏ చిక్కూ రాదు. పై కార్మికుడు రెండు నెలల జైలు చేసి వచ్చిన తరువాత అతణ్ణి, ఒప్పందం ప్రకారం కర్మాగారానికి తిరిగి రమ్మని యజమాని పిలుస్తాడు. కార్మికుడు రానంటాడు. ఒప్పందాన్ని ఉల్లంఘించినందుకు ఇదివరకు శిక్ష అనుభవించానంటాడు. యజమాని మళ్ళీ అతనిపై కేసు పెడతాడు. న్యాయస్థానం మళ్ళీ అతనికి శిక్ష వేస్తుంది - న్యాయాధిపతుల్లో ఒకరైన షీ దీన్ని న్యాయశాస్త్ర భయంకర వైపరీత్యమనీ, దీన్నిబట్టి, ఒక వ్యక్తిని, ఒకే తప్పుకు లేదా నేరానికి, అతను బతికి ఉన్నన్నాళ్ళూ మళ్ళీ, శిక్షించవచ్చుననీ బహిరంగంగా ఖండించినప్పటికీ, న్యాయస్థానం ఈ తీర్పిస్తుంది. తీర్పు చెప్పింది. 'జీతం పుచ్చుకోని గొప్పవారు', మునిసిపల్ మూర్ఖశిఖామణులు కాదు. లండన్‌లోని అత్యున్నత న్యాయస్థానాల్లో ఒకటి ఆ తీర్పిచ్చింది. (నాల్గవ జర్మన్ కూర్పులో చేర్చిన వాక్యాలు : ఇప్పుడు దీన్ని రద్దు చేశారు. కొన్ని సందర్భాలలో తప్ప, ఉదాహరణకు పౌర గ్యాస్ సరఫరా సంస్థలకు ఈ వ్యవహారంలో ప్రమేయం

వల్లనేమి, దుమ్ము ధూళితో నిండిన వాతావరణం వల్లనేమి, చెవులు దిమ్మువేసే రొద వల్లనేమి; ప్రతి జ్ఞానేంద్రియమూ దెబ్బతింటుంది.

---

ఉన్నప్పుడు తప్ప, ఇంగ్లండులో, కార్మికుణ్ణి ఒప్పంద ఉల్లంఘన సందర్భంలో యజమానితో సమానంగా చూస్తున్నారు. అతనిపై సివిల్ కేసు మాత్రమే పెట్టవచ్చు - (ఫ్రెడరిక్ ఎంగెల్స్). రెండవ ఘటన 1863 నవంబరు చివరిలో విల్ట్‌షైర్‌లో జరిగింది. వెట్స్‌బరీలీలో ఉన్న లియోవర్ మిల్లులోని హరుప్ అనే ఒక జౌళి పరిశ్రమదారు వద్ద పనిచేసే దాదాపు 30 మరమగ్గపు నేత కార్మికులు సమ్మె చేశారు. ఎందువల్లనంటే, ఆలస్యంగా వచ్చినవారి వేతనాల్లో కోత పెట్టే బహు ఇష్టమయిన అలవాటుకు అతను వశుడయాడు. 2 నిమిషాలాలస్యమైతే 6 పెన్నీలు, 3 నిమిషాలైతే ఒక షిల్లింగు, పది నిమిషాలైతే 1 షిల్లింగు ఆరు పెన్నీలు పట్టుకొనేవాడు. నేత కార్మికుల వేతనాలు సంవత్సరంలో సగటున ఎప్పుడూ వారానికి 10 షి. 12 పెన్నీలకు మించలేదు. కాని, ఈ మినహాయింపు ఏమో గంటకు 9 షిల్లింగులు, రోజుకు 4 పౌండ్ల 10 షిల్లింగుల చొప్పున ఉంది. పని ప్రారంభ సమయాన్ని విజిల్ ద్వారా తెలియజేసేందుకు హరుప్ ఒక కుర్రాణ్ణి నియమించాడు కూడా. వాడు ఉదయం ఆరు గంటలకు ముందే తరచు ఆ పని చేసేవాడు. విజిల్ ఆగిపోయిన క్షణాన, పనివారందరూ అక్కడ లేకపోతే, ఫ్యాక్టరీ తలుపులు మూసి, బయట ఉన్న వారికి జుల్మానా వేసేవారు. ఫ్యాక్టరీ ఆవరణలో గడియారం లేదు కాబట్టి, దురదృష్టవంతులైన పనివారు, హరుప్ ప్రోద్బలమున్న కుర్ర టైమ్ కీపర్ దయాదాక్షిణ్యాలపై ఆధారపడి ఉండేవారు. కుటుంబాలు గల తల్లులూ, ఆడపిల్లలూ టైమ్ కీపర్ బదులు ఒక గడియారం ఉంచి, కొంత సహేతుకమైన జుల్మానా రేట్లను ప్రవేశపెడితే, మళ్ళీ పనిలో చేరుతామని సమ్మెదార్లు చెప్పారు. ఒప్పందాన్ని ఉల్లంఘించినందుకు 19 మంది స్త్రీలను, పిల్లలను హరుప్ మేజిస్ట్రేట్ల ముందుకు రప్పించాడు. వారిలో ప్రతి ఒక్కరూ జుల్మానా కింద 6 పెన్నీలు, ఖర్చుల కింద 2 షి. చెల్లించాలని కోర్టు తీర్పు చెప్పగా, అది అక్కడున్న వారందరినీ ఆగ్రహోదగ్రులను చేసింది. గుమికూడిన జనం హరుప్‌ను ఛీకొడుతూ కోర్టు నుంచి అతడి వెంటపడ్డారు. తయారు చేసిన వస్తువుల్లో లోపాలున్న కారణంగా, కార్మికుల వేతనాలలో కోతలు పెట్టడం ద్వారా వారిని శిక్షించడం కర్మాగార యజమానులకు ఇష్టమైన పనుల్లో ఒకటి. ఈ పద్ధతి ఇంగ్లండులోని కుండల పరిశ్రమ జిల్లాల్లో 1866లో సార్వత్రిక సమ్మెకు దారితీసింది. కార్మికునికి వేతనాలు అందకపోగా, తన శ్రమ మూలంగానూ, అపరాధపు నిబంధనల మూలంగానూ, అతడు ఉత్తముడైన తన యజమానికి బాకీపడిన సందర్భాలను, ''పనిలో పిల్లల నియామకంపై కమిషన్ నివేదికలు'' (1863-1866) తెలుపుతున్నాయి. వేతనాల నుంచి డబ్బు పట్టుకోవడంలో ఫ్యాక్టరీల నిరంకుశ ప్రభువులు చూపే కుశాగ్రబుద్ధికి, ఇటీవలి పత్తి సంక్షోభం, కనువిప్పు కలిగించే ఉదాహరణలు చూపింది. ఫ్యాక్టరీల ఇన్‌స్పెక్టర్ ఆర్. బేకర్ ఇలా చెబుతున్నాడు : ''తాను నియమించిన కొందరు బాల కార్మికులకై డాక్టర్ సర్టిఫికెట్ కోసం తాను 6 పెన్నీలే చెల్లించి, బాధాకరమైన ఈ కష్టకాలంలో వారి వేతనం నుంచి తలా 10 పెన్నీలు పట్టుకున్నందుకు ఒక పత్తి మిల్లు యజమానిపైననే ఇటీవల కేసు పెట్టవలసి వచ్చింది. 3 పెన్నీలు మాత్రమే పట్టుకోవడానికి చట్టం అనుమతిస్తున్నది; అసలు ఏమీ పట్టుకోకపోవడం సంప్రదాయం ... ఈ చట్టాన్ని అతిక్రమించకుండానే అదే లక్ష్యంతో ఒక యజమాని, తన కోసం పని చేసే పేద పిల్లల్ని, నూలు వడికే వృత్తికి శారీరకంగా తగినవారని డాక్టరు ప్రకటించిన వెంటనే, ఆ కళనూ, దాని రహస్యాలనూ నేర్పినందుకంటూ వారితో తలా షిల్లింగు పని చేయించుకొంటున్నట్లు నాకు తెలియవచ్చింది. కాబట్టి సమ్మెలు జరిగిన ప్రతిచోటా మాత్రమే కాకుండా, ప్రత్యేకించి ఇప్పుడున్నలాంటి కాలంలో సమ్మెల వంటి అసాధారణ ప్రదర్శనలకు అంతర్లీన కారణాలుండవచ్చు. ఈ సమ్మెలకు కారణాలను వివరించకపోతే, అవి ప్రజలకు అయోమయంగా ఉంటాయి.'' ''ఇక్కడ ఆయన ప్రస్తావిస్తున్నది డార్వెన్‌లో 1863 జూన్ నాటి మరమగ్గపు నేత కార్మికుల సమ్మె. (1863 ఏప్రిల్ 30 నాటి ఫ్యాక్టరీ ఇన్‌స్పెక్టర్ల నివేదికలు, పుట 50-51) ఈ నివేదికలు అధికారపూర్వకమైన వాటి తేదీలను ఎల్లప్పుడూ దాటి ముందుకు పోతుంటాయి.

ఇక, క్రిక్కిరిసి ఉన్న యంత్రాల మధ్యన, ప్రాణానికి, దేహానికి కలుగ గల ప్రమాదం సంగతి ఇక చెప్పనేబట్టదు. రుతుభ్రమణమంతటి క్రమబద్ధతతో ఇవి, ఈ పారిశ్రామిక సమరంలో చనిపోయినవారి, గాయపడినవారి జాబితాను జారీ చేస్తుంటాయి.[1] ఉష్ణగ్రహంలోలాగా, ఫ్యాక్టరీ వ్యవస్థ, ఉత్పత్తి సామాజిక సాధనాల పొదుపును పరిపక్వ స్థితికి తెచ్చి, బలవంతాన రుద్దింది. పొదుపు కార్మికుడు పని చేస్తున్నప్పుడు అతని ప్రాణానికి అవసరమైన వాటిని ఒక పద్ధతి ప్రకారం హరించే ప్రక్రియగా, స్థలమూ, వెలుతురు, గాలినీ, ఉత్పాదక ప్రక్రియను అంటిపెట్టుకొని ఉంటే ప్రమాదకరమూ, అనారోగ్యకరమూ అయిన వాటి నుంచి అతని శరీరానికి గల రక్షణను హరించే ప్రక్రియగా, పెట్టుబడి చేతుల్లో మారిపోతోంది; ఇక కార్మికుని సౌకర్యార్థమున్న సాధనాలను హరించిన

1. ఫ్యాక్టరీ చట్టాలు ప్రమాదకరమైన యంత్రాల నుండి కల్పించిన రక్షణ ఒక సత్ఫలితమిచ్చింది. "కానీ ... ప్రమాదాలకు ఇతర ఆలవాలాలు ఇప్పుడున్నాయి. ఈ చట్టాలు వచ్చిన నాటి నుంచి 20 ఏళ్ళ వరకూ ఇవి లేవు. ఒకటి ప్రత్యేకించి ముఖ్యమైనది. అది యంత్రాల అధికతర వేగం, చక్రాలు, రోలర్లు, కదుళ్ళు, పేకనూలు కండెలను ఇప్పుడు మరింత ఎక్కువ వేగంగా నడిపిస్తున్నారు. తెగిన నూలు పోగును చేతిలోకి తీసుకోవడానికి వేళ్ళ కదలికల్లో మరింత వడీ, నేర్పూ ఉండాలి; ఎందువల్లనంటే వేళ్ళను జంకుతోనో, అశ్రద్ధతోనో ఉంచామంటే, అవి తెగిపోతాయి... తమ పని త్వరగా పూర్తి చేయాలన్న కార్మికుల ఆతురత ఎన్నో ప్రమాదాలకు కారణం... తమ యంత్రాలు నడుస్తూనే ఉండటం, అంటే నూలును, సరకులను ఉత్పత్తి చేస్తూనే ఉండటం కర్మాగార యజమానులకు అత్యంత ముఖ్యమైన విషయమని గుర్తుంచుకోవాలి. యంత్రాలు ఆగిపోయిన ప్రతి నిమిషం వల్ల ఇంధన శక్తే కాక, ఉత్పత్తి కూడ నష్టమవుతుంది. జరిగిన పని పరిమాణంపైనే దృష్టిగల తనిఖీదారులు యంత్రాలను చలనంలో ఉంచవలసిందిగా కార్మికులను ఒత్తిడి చేస్తుంటారు. వాటిని చలనంలో ఉంచడం, పనివారికి కూడా అంతగానూ ముఖ్యమే. ఎందువల్లనంటే, వారికి ఉత్పాదితాల బరువును బట్టి, లేదా శాల్తీలను బట్టి డబ్బు చెల్లిస్తారు. అనేక ఫ్యాక్టరీల్లో, కాదు, అత్యధిక సంఖ్యాక ఫ్యాక్టరీల్లో యంత్రాలు చలనంలో ఉండగా వాటిని శుభ్రం చేయకూడదన్న నిషేధమున్నప్పటికీ, పై కారణంవల్ల, అన్ని ఫ్యాక్టరీల్లో కాకపోయినా, ఎక్కువవాటిలో రోలర్లు, చక్రాలు మొదలైనవాటిని, వాటి చట్రాలు చలనంలో ఉండగానే కార్మికులు తుడవడం, రద్దును చేత్తో తొలగించడం ఎల్లప్పుడూ జరుగుతూంది. వారిని ఎవరూ మందలించడం లేదు. ఆ విధంగా ఈ ఒక్క కారణం వల్లనే, గడిచిన ఆరు నెలల్లో 906 ప్రమాదాలు సంభవించాయి... శుభ్రపరచే పని రోజూ నిరంతరం సాగుతున్నప్పటికీ, యంత్రాలను ఆమూలాగ్రంగా శుభ్రం చేయడానికి మామూలుగా శనివారాన్ని కేటాయించారు. చాలా వరకు ఈ పని, యంత్రాలు చలనంలో ఉండగానే జరుగుతోంది." శుభ్రపరచినందుకు డబ్బివ్వరు కాబట్టి, కార్మికులు ఆ పని సాధ్యమయినంత త్వరగా పూర్తిచేయ చూస్తారు. కాబట్టి "శుక్రవారాల్లో, ముఖ్యంగా శనివారాల్లో సంభవించే ప్రమాదాలు మరే దినంలో కన్నా చాలా ఎక్కువ. శుక్రవారాల్లో జరిగేవి ఆ వారంలోని తొలి నాలుగు రోజుల సగటుకన్నా దాదాపు 12 శాతం, శనివారంలో జరిగేవి క్రితం అయిదు రోజుల సగటు సంఖ్యకన్నా 25 శాతం ఎక్కువ. శనివారం నాటి పని గంటల సంఖ్యను పరిగణనకు తీసుకొంటే - తక్కిన 5 రోజుల్లో పని గంటల సంఖ్య $10\frac{1}{2}$ కాగా, శనివారం నాడు అవి $7\frac{1}{2}$ గంటలు - శనివారం జరిగే ప్రమాదాలు, తక్కిన అయిదు రోజుల సగటుకన్నా 65 శాతం ఎక్కువ." ("1966 అక్టోబరు 31 నాటి ఫ్యాక్టరీ ఇన్‌స్పెక్టర్ల నివేదికలు," పుటలు 9, 15, 16, 17)

సంగతి చెప్పనేబట్టదు.[1] ఫ్యాక్టరీలు "క్రౌర్యోగ్రత కాస్త తగ్గిన బందిఖానాలు" అని ఫోరియర్ అనడం తప్పా?"[2]

## విభాగం-5

# కార్మికునికీ యంత్రానికీ మధ్య ఘర్షణ

పెట్టుబడిదారునికి, వేతన కార్మికునికీ మధ్య పోరు (Contest) పెట్టుబడి పుట్టిన నాటి నుంచే ఉంది. ఇది, కార్ఖానా వస్తూత్పత్తి దశ ఆద్యంతం తీవ్రంగా చెలరేగింది.[3] కానీ, కార్మికుడు, యంత్రాలను ప్రవేశపెట్టినప్పటి నుండి మాత్రమే, పెట్టుబడి యొక్క మూర్తిమంతమైన శ్రమ సాధనాలకు వ్యతిరేకంగా పోరాటం సాగించాడు. పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానానికి పాదార్థిక ప్రాతిపదికయిన ఈ నిర్దిష్ట ఉత్పత్తి సాధనాల రూపంపై అతను తిరుగుబాటు చేస్తున్నాడు.

17వ శతాబ్దిలో దాదాపు యూరపు అంతటా రిబ్బన్ మగ్గంపై శ్రామికుల తిరుగుబాట్లు వచ్చాయి. అది రిబ్బన్లను, లేసులను నేసే యంత్రం. దాన్ని జర్మనీలో బాండ్మ్యూల్, స్కుర్న్మ్యూల్,

---

1. ప్రమాదకరమైన యంత్రాల నుంచి పనివారిని రక్షించే ఫ్యాక్టరీ చట్టాల్లోని క్లాజులకు వ్యతిరేకంగా ఇంగ్లీషు పరిశ్రమదారులు ఇటీవల సాగించిన ప్రచారోద్యమాన్ని గురించి మూడవ సంపుటిలోని 1వ భాగంలో వివరిస్తాను. ఇప్పటికి, లియొనార్డ్ హార్నెర్ అధికార నివేదికలోని, కింద ఉటంకించిన ఈ వాక్యాలు చాలు : "కొన్ని ప్రమాదాలను గురించి కొందరు మిల్లు యజమానులు క్షమించరాని చులకన భావంతో, ఉదాహరణకు, చేతివేలు పోవడం స్వల్ప విషయమైనట్లు మాట్లాడటం నేను విన్నాను. కార్మికుని జీవనం, అతని భవిష్యత్తు అతని చేతివేళ్ళపై ఎంతగా ఆధారపడి ఉన్నాయంటే, వాటిలో ఏదైనా పోతే అతనికది చాలా తీవ్రమైన విషయం. దయాదాక్షిణ్యాలు లేని అలాంటి మాటలు విన్నప్పుడు నేనే మామూలుగా ఈ ప్రశ్న వేస్తుంటాను : మీకు అదనంగా ఒక కార్మికుడు కావలసి వచ్చిందనుకోండి, ఇద్దరు దరఖాస్తు పెట్టుకొంటారు. ఇద్దరికీ ఇతర విషయాల్లో సమానార్హతలున్నాయి కాని ఒకరికి ఒక బొటనవేలు లేదా చూపుడువేలు లేదు. మీరు ఎవరిని పనిలో పెట్టుకుంటారు? ఈ నా ప్రశ్నకు, సమాధానమివ్వటానికి వారు సందేహించే వాళ్ళేకాదు..." "కుహనా కారుణ్య దృష్టి గల శాసనాలయినట్లు చిత్రింపబడగా తాము విన్న వీటి గురించి "పరిశ్రమదారులకు" తప్పుడు దురభిప్రాయాలున్నాయి. ("1855 అక్టోబరు 31 నాటి ఫ్యాక్టరీ ఇన్స్పెక్టర్ల నివేదికలు") ఈ పరిశ్రమదారులు తెలివైనవారు, బానిస యజమానుల తిరుగుబాటు పట్ల వారు ఉత్సాహం చూపడానికి కారణం లేకపోలేదు.
2. పని గంటలపై నిర్బంధ పరిమితి, తదితర నిబంధనలు గల ఫ్యాక్టరీ చట్టాలకు అన్నిటికన్నా దీర్ఘకాలంగా లోనైవున్న ఫ్యాక్టరీలలో మునుపటి దురాచారాల్లో అనేకం అంతరించాయి. యంత్రాల్లో వచ్చిన అభివృద్ధి కారణంగానే, కొంతవరకు, "భవనాల నిర్మాణంలో మెరుగుదల" అవసరమయింది. ఇది కార్మికులకు అనుకూలించే విషయం ("1863 అక్టోబరు 31 ఫ్యాక్టరీ ఇన్స్పెక్టర్ల నివేదికలు", 109వ పుట చూడండి.)
3. తక్కిన ఇటువంటి రచనలలో "మెరుగుపడిన వ్యవసాయం, వర్తకం" అనే జాన్హుటన్ గ్రంథాన్ని (లండన్, 1729) "ది అడ్వాంటేజెస్ ఆఫ్ ది ఈస్ట్ ఇండియా ట్రేడ్" అనే జాన్బెల్లెర్స్ పూర్వోక్త గ్రంథాన్ని చూడండి. "యజమానులూ, వారి కార్మికులూ, ఒకరితో ఒకరు నిరంతర యుద్ధం సాగిస్తున్నారు. ఇది శోచనీయం. తమ పని సాధ్యమయినంత చౌకగా చేయించుకోవాలని యజమానుల అచంచల లక్ష్యం. ఇందుకై వారు ప్రతి ఎత్తుగడను చేపట్టక మానడం లేదు. కాగా, కార్మికులు ఇతోధికమైన తమ కోర్కెలను అంగీకరించేలా తమ యజమానులను వేధించే ప్రతి సమయం పట్ల అంతగానూ శ్రద్ధ చూపుతున్నారు." ("పచారీ సరుకులకు ఇప్పుడున్న అధిక ధరలకు కారణాల దర్యాప్తు," పుటలు 61-62, గ్రంథకర్త, పూర్తిగా కార్మికుల పక్షం వహించిన రెవరెండ్ నాథానియల్ పార్ట్స్టర్.)

ముహ్లెన్–స్టుల్ అని పిలుస్తారు. ఈ యంత్రాలను జర్మనీలో కనిపెట్టారు. 1579లో రాసినదైనా, 1636లో వెనిస్‌లో వెలువడిన ఒక పుస్తకంలో అబే లాన్‌సెల్లోట్టీ ఇలా చెబుతున్నాడు : "డాన్జిగ్ వాస్తవ్యుడు ఆంథోని ముల్లర్, దాదాపు 50 ఏళ్ళ క్రితం ఆ పట్టణంలో చాలా చమత్కారమైన ఒక యంత్రాన్ని చూచాడు. అది 4–6 శాల్తీలను ఒకేసారి నేస్తుంది. కానీ ఈ నూతన యంత్ర సృష్టి కార్మికులను పెద్ద ఎత్తున నిరుద్యోగులను చేస్తుందన్న భయంతో ఆ యంత్రాన్ని సృష్టించిన వ్యక్తిని నగర మేయరు రహస్యంగా గొంతు నులిమో, లేక నీటిలో ముంచో చంపించాడు." లేడెన్‌లో ఈ యంత్రం 1629 వరకు వాడబడలేదు. అక్కడ రిబ్బన్లు నేసేవారి దొమ్మీల వల్ల తుదకు పట్టణ సమితి దాన్ని నిషేధించవలసి వచ్చింది. లేడన్‌లో ఈ యంత్రం ప్రవేశపెట్టబడిన సంగతిని ప్రస్తావిస్తూ, బాక్స్‌హరన్ ఇలా అంటున్నాడు (ఇన్‌స్టిట్యూషన్ కె పొలిటికరమ్ లిబర్ ప్రైమస్, 1663) "దాదాపు 20 సంవత్సరాల క్రితం కొందరు ఒక కొత్త రకం నేత యంత్రాన్ని కనిపెట్టారు. దానితో ఒకే వ్యక్తి, అనేకమంది నేసిన దానికన్నా ఎక్కువ బట్టను, మరింత సులభంగా అంతే వ్యవధిలో నేయగలడు. ఫలితంగా నేతపనివారి అల్లర్లు, ఫిర్యాదులు ప్రారంభమయాయి. ఈ సాధనాన్ని వాడరాదని తుదకు పట్టణ సమితి నిషేధించింది." 1632, 1639 వగైరా సంవత్సరాల్లో ఈ మగ్గాన్ని ఇంచుమించు నిషేధించే పలు రకాల డిక్రీలు జారీ చేసిన తరువాత హాలండ్ స్టేట్స్ జనరల్ తుట్టతుదకు, కొన్ని షరతులతో, 1661 డిసెంబరు 15 డిక్రీ ద్వారా దాని వాడకాన్నీ అనుమతించాడు. ఇంగ్లండులో దాన్ని ప్రవేశపెట్టడం వల్ల కార్మికుల అల్లర్లు చెలరేగుతున్న సమయంలోనే, 1676లో, కొలోన్‌లో కూడా దాన్ని నిషేధించారు. 1685 ఫిబ్రవరి 19న వెలువడ్డ రాజశాసనం జర్మనీ అంతటా దాని వినియోగాన్ని నిషేధించింది. హాంబర్గ్‌లో సెనెట్ ఉత్తర్వుపై దాన్ని బహిరంగంగా దగ్ధం చేశారు. చక్రవర్తి ఆరవ చార్లెస్, 1719 ఫిబ్రవరి 9న, 1685 నాటి రాజశాసనం అమలును పొడిగించాడు. 1765 వరకు గానీ బాహాటంగా దాని వాడకం, శాగ్జనీ ఎలెక్టోరేట్‌లో అనుమతింపబడలేదు. యూరపును పునాదుల దాకా కుదిపి వేసిన ఈ యంత్రం కదురు యంత్రానికీ, మరమగ్గానికీ, 18వ శతాబ్ది పారిశ్రామిక విప్లవానికి వేగుచుక్కలాంటిది. ఒక కడ్డీని వెనక్కు ముందుకు జరపడం ద్వారా, బొత్తిగా అనుభవం లేని కుర్రవాడు మొత్తం మగ్గాన్ని, దానీ నూలు కండెలన్నిటితో పాటు చలనంలో ఉంచేందుకు, అది వీలు కల్పించింది; వృద్ధిపరచిన రూపంలో అది ఒకేసారి 40 నుంచి 50 దాకా శాల్తీలు ఉత్పత్తి చేయగలదు.

ఇంచుమించు 1630లో లండన్‌లో ఒక హాలండ్ దేశస్తుడు నిర్మించిన గాలిరంపపు మిల్లు, ప్రజల కోపావేశానికి బలి అయిపోయింది. ఎప్పుడో కాదు, 18వ శతాబ్ది ప్రారంభంలో సైతం, నీటితో నడిచే రంపపు మిల్లుల పట్ల ప్రజల వ్యతిరేకతను, వాటికి పార్లమెంటు మద్దతు ఉన్నప్పటికీ కూడా, ఎంతో కష్టంపైన మాత్రమే అధిగమించడం జరిగింది. 1758లో గొర్రెబొచ్చును కత్తిరించే తొలి జలశక్తి చోదక యంత్రాన్ని ఎవరెట్ నిర్మించాడో లేదో, పని కోల్పోయిన 100,000 మంది దాన్ని దగ్ధం చేశారు. మునుపు, ఉన్నిని చిక్కుదీసే పనివల్ల బతికే యాభైవేల మంది కార్మికులు, ఆ పనికై ఆర్క్‌రైట్ ప్రవేశపెట్టిన మిల్లులకు, ఇంజన్లకు వ్యతిరేకంగా పార్లమెంటుకు అర్జీ పెట్టుకొన్నారు. ప్రధానంగా మరమగ్గాల వినియోగం మూలంగా ఈ శతాబ్ది తొలి 15 ఏళ్ళలో, ఇంగ్లండులోని పారిశ్రామిక జిల్లాల్లో అపార యంత్ర విధ్వంసన జరిగింది. లుడ్డైట్ ఉద్యమమని పేరుబడ్డ ఈ

విధ్వంసన సిడ్మౌత్, కాజిల్‌రే వంటి వారి జేకోబిన్ వ్యతిరేక ప్రభుత్వాలకు, అత్యంత అభివృద్ధి నిరోధక చర్యల్ని, దమన చర్యల్ని తీసుకునేందుకు సాకు అయింది. యంత్రాలకూ, పెట్టుబడిచే వాటి వినియోగానికీ మధ్య తేడా చూపి, తమ ఉత్పత్తులను ఉత్పత్తి యొక్క భౌతిక సాధనాలపై కాక, వాటిని వినియోగించే పద్ధతిపై ఎక్కుపెట్టడం ఎలాగో కార్మికులు నేర్చుకొనేందుకు కొంత కాలం పట్టింది. అనుభవమూ కావలసి వచ్చింది.[1]

కార్ఖానా వస్తూత్పత్తి దశలో వేతనాల గురించిన పోరాటాల్లో, కార్ఖానా వస్తూత్పత్తి గర్భితం. ఆ పోరాటాలు దాని ఉనికిపై ఏ విధంగానూ ఎక్కుపెట్టబడినవి కాదు. కొత్త వస్తువుల ఉత్పత్తికై కార్ఖానా స్థాపనకు ప్రతిఘటన వచ్చేది. వృత్తి సంఘాల నుంచీ, ప్రత్యేక హక్కులు గల పట్టణాల నుంచే తప్ప, కార్మిక ప్రజల నుంచి కాదు కాబట్టి, కార్ఖానా వస్తూత్పత్తి దశలోని రచయితలు, శ్రమ విభజనను కార్మికుల కొరతను వాస్తవంగా తీర్చే సాధనంగా పరిగణించారే తప్ప, పనిలో ఉన్నవారిని తొలగించి వారి స్థానాన్ని యథార్థంగా ఆక్రమించే సాధనంగా చూడలేదు. ఈ రెంటికీ గల వ్యత్యాసం స్వయం విదితమే. ఇంగ్లండులో, నేడు 500,000 మంది కదురు యంత్రాలతో వడికే పత్తిని, పాత రాట్నంతో వడికేందుకు 100 మిలియన్ల మంది అవసరమవుతారని అన్నప్పుడు, ఈ కదురు యంత్రాలు, ఎన్నడూ ఉనికిలోనే లేని అన్ని మిలియన్ల మంది స్థానం వహించాయని అర్థం కాదు. ఈ వడికే యంత్రాల స్థానం వహించడానికి అనేక మిలియన్ల మంది కార్మికులు అవసరమవుతారని మాత్రమే దీని భావం. మరోవైపు, ఇంగ్లండులో మరమగ్గం 800,000 మంది నేత కార్మికులను వీధుల్లోకి నెట్టివేసిందని మనం అన్నామంటే, నిజంగా ఉన్న ఫలానా మంది నేత కార్మికుల స్థానాన్ని ఆ మరమగ్గాలు యథార్థంగా ఆక్రమించాయి. లేక వారిని వారి స్థానం నుచి తొలగించాయి అని చెబుతున్నాము కానీ, నిజంగా ఉన్న యంత్రాల స్థానంలో, ఒక నిర్దిష్ట సంఖ్యాక కార్మికులను నియమించవలసి ఉంటుందని చెప్పడం లేదు. కార్ఖానా వస్తూత్పత్తి దశలో, శ్రమ విభజన వల్ల చేతివృత్తి శ్రమ మార్పు చెందినప్పటికీ, అదే ప్రాతిపదికగా ఉండేది. మధ్యయుగాలు వారసత్వంగా ఇచ్చిన పట్టణ కార్మికుల సంఖ్య సాపేక్షంగా తక్కువ; అందువల్ల, కొత్త వలస మార్కెట్టు అవసరాలను తీర్చడం సాధ్యం కాలేదు. ఫ్యూడల్ వ్యవస్థ విచ్ఛిత్తి మూలంగా భూముల నుంచి తరిమివేయబడ్డ గ్రామీణ జనాభాకు, అసలైన కార్ఖానా ఉత్పత్తులు ఉత్పత్తి నూతన రంగాల తలుపులను తెరిచాయి కాబట్టి. ఆనాడు కార్ఖానాల్లో శ్రమ విభజనను, సహకారాన్నీ ఎక్కువగా నిర్మాణాత్మక దృష్టితో చూచారు. అవి కార్మికుల ఉత్పాదకతను పెంచుతాయని వారి దృష్టి.[2] ఆధునిక పరిశ్రమల దశకు చాలా కాలం ముందే, సహకారం, కొద్దిమంది

---

1. పాతరకం వస్తూత్పత్తిల్లో యంత్రాలకు వ్యతిరేకంగా కార్మికుల తిరుగుబాట్లు, షెఫీల్డ్‌లో ఆకురాళ్ళను సానబట్టే వారి 1865 తిరుగుబాటు లాగా, ఈనాటికీ, అప్పుడప్పుడు ఆటవిక స్వభావం సంతరించు కోవడం కద్దు.

2. సర్ జేమ్స్ స్టువర్ట్‌కు కూడా యంత్రాల గురించి ఉన్న అవగాహన ఇదే : "కాబట్టి, యంత్రాలు, మునుపటికన్నా ఎక్కువ అన్నపానాదులను అందజేయవలసిన బాధ్యత లేకుండా ఆచరణలో శ్రామిక ప్రజల సంఖ్యను పెంచే సాధనమని నా భావం... యంత్రాల ప్రయోజనం, నూతన స్థిర నివాసుల వల్ల కలిగే ప్రయోజనానికి ఎలా భిన్నమైనది?" (ఫ్రెంచి అనువాదం, సం. 1, ఒకటవ భాగం, 19వ అధ్యాయం). పెట్టీ, మరింత అమాయకంగా యంత్రం "బహుభార్యాత్వం" స్థానం వహిస్తోందని అంటున్నాడు. పై దృక్పథం మహా అయితే, అమెరికాలోని కొన్ని భాగాలకు మాత్రమే వర్తిస్తుంది. మరోవైపు "ఒక వ్యక్తి

చేతుల్లో శ్రమ సాధనాల కేంద్రీకరణా, వ్యవసాయంలో ఈ పద్ధతులు అన్వయించబడిన పలు దేశాల్లో, అవి ఉత్పత్తి పద్ధతుల్లో, బలాత్కారంగా కూడిన పెద్ద ఆకస్మిక విప్లవాలకు, తత్ఫలితంగా, గ్రామీణ ప్రజల జీవన పరిస్థితుల్లోనూ, వారిని పనిలో నియమించే పద్ధతుల్లోనూ అటువంటి విప్లవాలకు దారితీశాయి.

కానీ మొదట్లో ఈ పోరాటం, పెట్టుబడికీ, వేతన శ్రమకు మధ్య కన్నా ఎక్కువగా పెద్ద భూస్వాములకు, చిన్న భూస్వాములకు మధ్యనే జరుగుతుంది. మరోవైపు, శ్రమ సాధనాలు, గొర్రెలు, గుర్రాలు మొదలయినవి. కార్మికులను వారి స్థానాల నుంచి తొలగించినప్పుడు, రానున్న పారిశ్రామిక విప్లవానికి సూచిక అయిన బల ప్రయోగానికి ప్రత్యక్షంగా పూనుకోవడం మొదట్లో జరుగుతుంది. మొదట కార్మికులను భూమి నుంచి వెళ్ళగొడతారు. ఆ తరువాత గొర్రెలను తీసుకొస్తారు. భారీ స్థాయి వ్యవసాయ స్థాపనకు రంగం సిద్ధం చేయడంలో తొలి చర్యగా, ఇంగ్లండులో ఘోరంగా జరిగినట్లు, పెద్ద ఎత్తున భూములు గుంజుకొన్నారు.[1] కాబట్టి, వ్యవసాయంలోని ఈ విద్రోహ చర్యలు మొదట్లో, ఎక్కువగా ఒక రాజకీయ విప్లవంగా కనిపించింది.

శ్రమ సాధనం, యంత్ర రూపం ధరించినప్పుడు, అది వెంటనే కార్మికునికే పోటీదారు అవుతుంది.[2] యంత్రాల ద్వారా జరిగే పెట్టుబడి స్వయం విస్తరణ అప్పటి నుంచి, యంత్రాల వల్ల బతుకుతెరువు నాశనమైన కార్మికుల సంఖ్యకు అనులోమానుపాతంలో ఉంటుంది. కార్మికుడు తన శ్రమ శక్తిని సరుకుగా అమ్ముకొంటాడనే వాస్తవంపై పెట్టుబడిదారీ ఉత్పత్తి మొత్తం వ్యవస్థ ఆధారపడి ఉంది. శ్రమ విభజన శ్రమను ఒక ప్రత్యేక పరికరాన్ని వినియోగించే నైపుణ్యంగా దిగజార్చడం ద్వారా, శ్రమ శక్తిని ప్రత్యేకీకరిస్తుంది. ఈ పరికరాన్ని వాడటం ఒక యంత్రపు పని అయిన వెంటనే కార్మికుని శ్రమ శక్తికి గల ఉపయోగపు విలువతో పాటు దాని మార్పిడి విలువ కూడా అంతర్థాన మవుతుంది. చట్టం వల్ల నోట్లు చలామణీ నుంచి నెట్టివేయబడినట్లు, కార్మికుడు విక్రయార్హత కోల్పోతాడు. కార్మిక వర్గంలో, యంత్రాల వల్ల అక్కరలేకుండాపోయిన ఆ భాగం, అంటే పెట్టుబడి స్వయం విస్తరణకు తక్షణమే ఇక అవసరంలేని భాగం, యంత్రాలతో పాత చేతివృత్తుల, కార్ఖానా వస్తూత్పత్తులు సాగించే అసమ సమరంలో చేతులెత్తేస్తుంది; లేదా మరింత సులభంగా అందుబాటులో ఉన్న పారిశ్రామిక

---

శ్రమను తగ్గించడానికి యంత్రాలను జయప్రదంగా వాడజాలము. యంత్రాల నిర్మాణానికి, వాటి వినియోగం ద్వారా ఆదా కాగలదానికన్నా ఎక్కువ కాలమే వ్యయమవుతుంది. అవి విస్తారమైన ప్రజా బాహుళ్యంతో పనిచేసినప్పుడు మాత్రమే, ఒక యంత్రం వేలమంది పనికి తోడ్పడినప్పుడు మాత్రమే నిజంగా ఉపయోగపడతాయి. అందువల్లనే, పనిలేనివారు ఎక్కువగా ఉన్న అత్యధిక జనాభా గల దేశాల్లో అవి సమృద్ధిగా ఉన్నాయి. విశాల ప్రజా బాహుళ్యంతో పనికి సుకరమైనది కాబట్టి వాటిని వాడుతున్నారే తప్ప, మనుషుల కొరతవల్ల కాదు." ("పియర్సీ రవెన్‌స్టోన్", "థాట్స్ ఆన్ ది ఫండింగ్ సిస్టమ్ అండ్ ఇట్స్ ఎఫెక్ట్స్", లండన్, 1824, పుట 45)

1. (4వ జర్మన్ కూర్పులో నోట్ - ఇది జర్మనీకి కూడా వర్తిస్తుంది. మన దేశంలో భారీ స్థాయి వ్యవసాయం ఉన్నచోట్ల, కాబట్టి ప్రత్యేకించి తూర్పున ఎస్టేట్ల నుంచి కౌలుదారులనందరినీ వెళ్ళగొట్టడం వల్లనే ఇది సాధ్యమయింది. ఈ పని 16వ శతాబ్దంలో ప్రత్యేకించి 1648 దరిమిలా విస్తృతంగా వ్యాప్తిలోకి వచ్చింది - ఫ్రెడరిక్ ఎంగెల్స్)
2. "యంత్రాలూ, శ్రమా నిరంతరం పోటీపడుతున్నాయి." రికార్డో, పూర్వోక్త గ్రంథం, పుట 479.

శాఖల్లోకి మూగుతుంది. శ్రామిక విపణిని ముంచెత్తుతుంది. శ్రమ శక్తి ధరను దాని విలువకన్నా తక్కువ స్థాయికి దింపివేస్తుంది. మొదటి విషయం, కార్మికుల బాధలు తాత్కాలికమైనవి మాత్రమే అనీ ("తాత్కాలిక అసౌకర్యం" అని), రెండవ విషయం, యంత్రాల ఉత్పత్తిలోని ఒక నిర్ణీత రంగంపై ఆధిపత్యం క్రమక్రమంగా మాత్రమే సంపాదిస్తుందనీ, అందువల్ల, ఈ వినాశకర ప్రభావ విస్తృతీ, తీవ్రత తక్కువగా ఉంటుందనీ అవి పెద్ద ఊరటయినట్లుగా కార్మికులకు నచ్చజెప్పడం జరిగింది. మొదటి ఊరడింపు మాట రెండవ మాటను ప్రతిహతం చేస్తుంది. యంత్రాలు ఒకానొక పరిశ్రమను క్రమక్రమంగా తన పట్టులోకి తెచ్చుకొన్నప్పుడు, వాటితో పోటీపడుతున్న చేతిపనివారికి అవి దీర్ఘకాల దైన్యావస్థను తెచ్చిపెడతాయి. పరివర్తన త్వరగా జరిగిపోతే, దాని ప్రభావం తీవ్రంగా ఉంటుంది. అది విశాల శ్రామిక బాహుళ్యంపై పడుతుంది. ఇంగ్లీషు చేనేత కార్మికుల క్రమానుగత నిర్మూలనకన్నా భయంకర విషాదగాథ చరిత్రలో కనిపించదు. ఆ నిర్మూలన కొన్ని దశాబ్దాలపాటు సాగుతూ తుదకు, 1838లో సమాప్తమయింది. వారిలో అనేకులు తిండిలేక చచ్చిపోయారు. అనేకులు కుటుంబాలతో చాలా కాలంపాటు, రోజుకు 21.2 పెన్నీలతో జీవచ్ఛవాలుగా రోజులు గడిపారు.[1] మరోవైపు, ఇంగ్లీషు నూలు వస్త్ర పరిశ్రమ యంత్రాలు భారతదేశంలో తీవ్ర ప్రభావం నెరపాయి. గవర్నర్ జనరల్ 1834-35లో తన నివేదికలో ఇలా చెప్పారు :

"వాణిజ్య చరిత్రలో ఈ దైన్యావస్థ వంటిది మరొకటి లేదు. నూలు బట్టలు నేసేవారి ఎముకలతో భారతదేశ మైదానాలు తెలుపెక్కుతున్నాయి. వారిని "ఐహిక" ప్రపంచం నుంచి వెళ్ళగొట్టడంలో ఆ యంత్రాలు వారికి, "తాత్కాలిక అసౌకర్యం" కలుగజేశాయంతే. ఇక ఇక్కడ మిగిలిపోయినవారి విషయమందామా, యంత్రాల కొత్త ఉత్పత్తి రంగాలను నిరంతరం తన పట్టులోకి తెచ్చుకొంటూన్నందు వల్ల, వారికి ఈ తాత్కాలిక అసౌకర్యం నిజంగా శాశ్వతమైనది. కాబట్టి పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం కార్మికునికి వ్యతిరేకంగా శ్రమ సాధనాలకూ, ఉత్పాదితానికీ కలిగించే స్వతంత్రతా, పరోన్ముఖతా

1. 1833 పేదల చట్టం ఆమోదింపబడక ముందు, ఇంగ్లండులో చేనేతకూ, మరమగ్గం నేతకు మధ్య పోటీ, కనీస స్థాయికన్నా బాగా తగ్గిపోయిన వేతనాలకు, స్థానిక చర్చి ఉచిత సహాయం తోడైనందువల్ల, మరికొంత కాలం సాగింది. "రెవరండ్ టర్నర్ 1827లో, పారిశ్రామిక జిల్లా అయిన చెషైర్‌లో (మిమ్‌స్లో), రెక్టర్‌గా (క్రైస్తవ మతగురువు - అను) ఉండేవారు. యంత్రాలపై మానవ శ్రమ పోటీని నిలిపి ఉంచడం ఎలా జరుగుతూందో, విదేశాలకు ప్రజల వలసపై కమిటీ అడిగిన ప్రశ్నలూ, వాటికి టర్నర్ ఇచ్చిన సమాధానాలు వెల్లడిస్తున్నాయి. 'ప్రశ్న : మరమగ్గం వాడకం చేతిమగ్గం వాడకానికి స్థానం లేకుండా చేసిందా? సమాధానం: నిస్సందేహంగా; వేతనాల తగ్గుదలకు తల ఒగ్గడానికి చేనేత కార్మికులకు వీలు కల్పించి ఉండకపోతే, అది చేతిమగ్గాలకు మరింతగా స్థానం లేకుండా చేసి ఉండేది. ప్రశ్న : కానీ తల ఒగ్గడం వల్ల అతను తన పోషణకు చాలని వేతనాలను అంగీకరించి, తన పోషణకు కావలసిన మిగతా డబ్బుకై స్థానిక విరాళం కోసం ఎదురుచూస్తుంటాడు కదా? సమాధానం : ఔను, వాస్తవంలో చేతి మగ్గానికీ, మర మగ్గానికీ పోటీని, పేదసాదలకిచ్చే సహాయం నిలిపి ఉంచుతోంది. "శ్రమించి పనిచేసేవారికి యంత్రాలను ప్రవేశపెట్టడం నుంచి లభిస్తున్న మేలు మాన హీనమైన దారిద్ర్యం లేదా దేశ భ్రష్టత్వం, గౌరవనీయుడూ, కొంతవరకు స్వతంత్రుడూ అయిన మెకానిక్‌ను, జోలెలో వేసిన నికృష్టమైన రొట్టెముక్కపై ఆధారపడి, దేహీ అని జీవించే దౌర్భాగ్యునిగా దిగజార్చే స్థితిన్నీ. దీన్నే వారు తాత్కాలిక అసౌకర్యం అని అంటున్నారు." ("ఏ ప్రైజ్ ఎస్సే ఆన్ ది కంపేరిటివ్ మెరిట్స్ ఆఫ్ కాంపిటీషన్ అండ్ కో-ఆపరేషన్", లండన్, 1834, పుట 29)

లక్షణం యంత్రాల వల్ల సంపూర్ణమైన శతృత్వంగా పెంపొందింది.[1] కాబట్టి కార్మికుడు మొట్టమొదటి సారిగా శ్రమ సాధనాలకు వ్యతిరేకంగా పాశవికంగా తిరుగుబాటు చేసేది యంత్రాల రంగ ప్రవేశంతోనే.

శ్రమ సాధనం కార్మికుణ్ణి దెబ్బతీస్తుంది. కొత్తగా ప్రవేశపెట్టబడిన యంత్రాలు గతకాలం నుంచి సంక్రమించిన చేతివృత్తులతో లేదా కార్ఖానా వస్తూత్పత్తులతో పోటీపడినప్పుడల్లా శ్రమ సాధనానికీ, కార్మికునికీ మధ్య ప్రత్యేక శతృత్వం బలంగా వ్యక్తమవుతుంది. ఆధునిక పరిశ్రమల్లో కూడా, యంత్రాల నిరంతరాయ అభివృద్ధి, స్వయంచాలిత వ్యవస్థ ఆవిర్భావం అదే విధమైన పర్యవసానానికి దారితీస్తాయి. "శారీరక శ్రమను తగ్గించడం, ఒక ప్రక్రియ నిర్వహణకు లేదా ఉత్పత్తిలో ఒక లంకెను పూర్తిచేయడానికి మానవ సామాగ్రికి బదులుగా ఒక లోహపు కడ్డీ సహాయం సమకూర్చడం – ఇదీ మెరుగుపరచిన యంత్రాల లక్ష్యం."[2] "ఇంతవరకు చేతితో నడుపుతున్న యంత్రాలకు శక్తిని అనుసంధించడం దాదాపు నిత్యకృత్యమయింది... శక్తిని పొదుపు చేయడం, మరింత మేలయిన పని జరిపించడం, మునుపటి అదే వ్యవధిలో లేక ఒక బాల బాలిక యొక్క, ఒక స్త్రీ యొక్క లేక ఒక పురుషుని స్థానాన్ని తాము తీసుకోవడంలో మరింత ఎక్కువ పని జరగడం వీటిని లక్ష్యంగా పెట్టుకొని, యంత్రాల్లో తెస్తున్న చిన్నపాటి మెరుగుదలలు నిత్యకృత్యమయ్యాయి. కొన్ని సందర్భాల్లో వీటికి పెద్ద ప్రాముఖ్యమున్నట్లు కనిపించకపోయినా, కొంత ముఖ్యమైన ఫలితాలకు దారితీస్తున్నాయి."[3] "ఒక ప్రక్రియకు ప్రత్యేకమైన హస్త చాతుర్యం, స్థిరత్వాలు కావలసివచ్చినప్పుడల్లా, సాధ్యమైనంత త్వరగా ఆ ప్రక్రియను, అనేక రకాల క్రమభంగాలకు పాల్పడే ఉపాయశాలి అయిన ఆ కార్మికుని నుంచి ఉపసంహరించి, ఒక కుర్రవాడు సైతం అజమాయిషీ చేయగలంతటి స్వయం నియంత్రితమైన ఒక ప్రత్యేక యంత్రానికి దాన్ని అప్పగించడం జరుగుతుంది."[4] "దానంతటకదే

1. "దేశ ఆదాయం" (అంటే, రికార్డో తన గ్రంథంలోని అదే భాగంలో వివరిస్తున్న ప్రకారం, ఎవరి సంపద ఆర్థిక దృష్ట్యా జాతి సంపద అవుతుందో ఆ భూస్వాముల, పెట్టుబడిదారుల ఆదాయం) "పెంపొందడానికి కారణభూతంగా ఉన్న అదే అంశమే జనాభాను అవసరానికి మించినదిగా చేస్తుంది. కార్మికుని పరిస్థితినీ క్షీణింపచేస్తుంది." (రికార్డో, పూర్వోక్త గ్రంథం, పుట 469) "యంత్రాలలోని ప్రతి అభివృద్ధి లక్ష్యమూ, ధోరణీ వాస్తవంలో మానవుని శ్రమను పూర్తిగా రద్దు చేయడం, లేదా పురుషుల శ్రమకు బదులు స్త్రీల, పిల్లల శ్రమను లేదా నిపుణ కార్మికుల శ్రమకు బదులు నిపుణత లేనివారి శ్రమను ప్రవేశపెట్టడం ద్వారా మానవ శ్రమ ధరను తగ్గించడం." (ఉరే, పూర్వోక్త గ్రంథం, పుట 35)
2. "1858 అక్టోబరు 31 ఫ్యాక్టరీ ఇన్‌స్పెక్టర్ల నివేదికలు," పుట 43)
3. "1856 అక్టోబరు 31 ఫ్యాక్టరీ ఇన్‌స్పెక్టర్ల నివేదికలు," పుట 15)
4. ఉరే, పూర్వోక్త గ్రంథం, పుట 19 "ఇటుకలు చేయడానికి ఉపయోగించే యంత్రాలలోని గొప్ప సౌకర్యమిది: అది యజమానిని నిపుణ కార్మికులపై ఏమాత్రమూ ఆధారపడకుండా చేస్తుంది." (చిల్డ్రన్స్ ఎంప్లాయ్‌మెంట్ కమిషన్ రిపోర్ట్, 1866, పుట 130, సంఖ్య 46.) గ్రేట్ నార్దర్న్ రైల్వేలోని యంత్ర విభాగం సూపరింటెండెంట్ రైలింజన్లు మొదలయిన వాటి నిర్మాణ విషయమై ఇలా చెబుతున్నారు : "ఎక్కువ డబ్బు వ్యయమయ్యే ఇంగ్లీషు కార్మికుల నియామకాన్ని రోజు రోజుకూ తగ్గిస్తున్నారు. మెరుగైన పరికరాల వాడకం ద్వారా, ఇంగ్లండు కర్మాగారాల ఉత్పత్తిని పెంచుతున్నారు. ఈ పరికరాలను కూడా తక్కువ స్థాయి కార్మికులు ఉపయోగిస్తున్నారు. మునుపు కార్మికుల నిపుణ శ్రమ ఇంజన్లలోని అన్ని భాగాలను అవశ్యంగా తయారు చేసేది. ఇప్పుడీ ఇంజన్ భాగాలను తక్కువ నైపుణ్యం గల కార్మికులు, అయితే మంచి పరికరాలతో తయారు చేస్తున్నారు. పరికరాలంటే, నా భావం ఇంజనీరు యంత్రాలు, లేత్‌లు, చిత్రిక యంత్రాలు, బరమాలు వగైరా." (రైల్వేలపై రాయల్ కమిషన్," లండన్, 1867, సాక్షుల వాఙ్మూలాల వివరాలు, సంఖ్య 17, 862, 17, 863.)

పథకం ప్రకారం నిపుణ శ్రమ అధికారికంగా రద్దయిపోతోంది.[1] "ఒక నిర్ణీత ఫలితార్థం సాధించేందు కోసం, మునుపటంతటి వయోజన శ్రమను వినియోగించవలసిన ఆవశ్యకతను రద్దు చేయడంలోనే కాక, ఒక రకమైన శ్రమకు బదులు మరో రకం శ్రమను ప్రవేశపెట్టడంలో, నిపుణ శ్రమ స్థానంలో అంతకన్నా తక్కువ నైపుణ్యం గల శ్రమను, వయోజన శ్రమకు బదులు బాలబాలికల శ్రమను, పురుషుల శ్రమకు స్త్రీల శ్రమను ప్రవేశపెట్టడంలో యంత్రాల అభివృద్ధి ప్రభావం వేతనాల రేట్లలో కొత్త కల్లోలాన్ని తెచ్చిపెడుతోంది.[2]

"మామూలు కదురు యంత్రం స్థానంలో స్వయం ప్రవర్తక కదురు యంత్రాన్ని ప్రవేశపెట్టడం వల్ల నూలు వడికే పురుషుల్లో ఎక్కువ భాగం పని నుండి తొలగింపబడటం, వయసు వచ్చీరాని వారినీ, పిల్లల్ని పనిలో అట్టిపెట్టడం జరుగుతుంది."[3] సంచితమైన ఆచరణాత్మకానుభవం, అందుబాటులోని యాంత్రిక సాధనాలు, నిరంతర సాంకేతిక ప్రగతి – వీటి కారణంగా ఫ్యాక్టరీ వ్యవస్థకు అసాధారణమైన విస్తరణ శక్తి వుందని, తగ్గిన పని దినం ఒత్తిడికింద ఆ వ్యవస్థ సాధించిన బ్రహ్మాండ పురోగతి నిరూపించింది. కానీ, అమెరికన్ అంతర్యుద్ధ ప్రేరణలో 1860 తరువాత మూడు సం॥రాల్లో ఉధృత గతితో యంత్రాల్లో వచ్చిన అభివృద్ధీ, తదనుగుణంగా పని నుంచి శ్రామిక ప్రజల తొలగింపు గురించి, ఇంగ్లీషు నూలు బట్టల పరిశ్రమ తారాస్థాయినందుకొన్న 1860లో, ఎవరు కలగన్నారు? ఇందుకు, ఫ్యాక్టరీల ఇన్‌స్పెక్టర్ల నివేదికల నుంచి రెండు ఉదాహరణలు చాలు : ఒక మాంచెస్టర్ పరిశ్రమదారు ఇలా అంటున్నాడు : "మాకు మునుపు నూలు చిక్కుదీసే ఇంజన్లు 75 ఉండేవి; ఇప్పుడు అంతే పని చేస్తున్న 12 ఉన్నాయి... మాకున్న పనివారు మునుపటికన్నా 14 మంది తక్కువ. వారితోనే మాకు పని గడుస్తుంది. వేతనాల్లో వారానికి పది పౌండ్ల చొప్పున ఆదా అవుతోంది. వినియోగమవుతున్న దూదిలో వృధా అవుతున్న భాగం దాదాపు 10 శాతం తగ్గిందని మా అంచనా." "వేగం పెంచడం ద్వారా, కొన్ని స్వయంచాలిత ప్రక్రియలను చేపట్టడం ద్వారా, ఫ్యాక్టరీలోని ఒక విభాగంలో పనివారి సంఖ్య నాల్గోవంతు, మరో విభాగంలో సగానికి పైగా తగ్గించినట్లు రెండవసారి నూలు చిక్కుదీసే దానికొక యంత్రాన్ని ప్రవేశపెట్టడం ద్వారా, చిక్కుదీసే గదిలో మునుపు పనిచేసేవారి సంఖ్యను గణనీయంగా తగ్గించినట్లు, మాంచెస్టర్‌లోని మరో నయం నూలు మిల్లులో నాకు చెప్పారు." మరో నూలు మిల్లులో శ్రమ పది శాతం ఆదా అయినట్లు అంచనా. మాంచెస్టర్‌లో మెస్సర్స్ గిల్మోర్ అనే నూలు మిల్లు కంపెనీ వారు ఇలా చెబుతున్నారు : "కొత్త యంత్రాలతో, మా గాలి ఊదే గది విభాగంలో వేతనాల కింద ఖర్చు, పనివారి సంఖ్యా పూర్తిగా మూడో వంతు తగ్గాయి; జాక్ – ఫ్రేమ్, డ్రాయింగ్ – ఫ్రేమ్ గదిలో ఖర్చు దాదాపు మూడో వంతు, అదే విధంగా పనివారి సంఖ్య మూడో వంతు, వడుకే గదిలో ఖర్చులు దాదాపు మూడో వంతు తగ్గాయి. ఇంతేకాదు, పరిశ్రమదారులకు మా నూలు అందినప్పుడు, మా కొత్త యంత్రాల వాడకం వల్ల అది ఎంత బాగుంటుందంటే, పాత యంత్రాలతో ఉత్పత్తి అయిన నూలుతో ఉత్పత్తి చేసిన దానికన్నా వారు ఎక్కువ పరిమాణంలో మరింత చౌకగా బట్ట ఉత్పత్తి చేస్తున్నారు.[4] రెడ్ గ్రేవ్ అదే నివేదికలో ఇంకా

1. ఉరే, పూర్వోక్త గ్రంథం, పుట 20.
2. ఉరే, పూర్వోక్త గ్రంథం, పుట 321.
3. ఉరే, పూర్వోక్త గ్రంథం, పుట 23.
4. "ఫ్యాక్టరీ ఇన్‌స్పెక్టర్ల నివేదిక, 1863 అక్టోబరు 31, పుటలు 108, 101.

ఇలా చెబుతున్నారు : "ఉత్పత్తి పెరిగిన స్థితిలో పనివారిని తగ్గించడం, వాస్తవంలో నిరంతరం సాగుతోంది. ఉన్ని మిల్లుల్లో ఈ తగ్గింపు, కొన్నాళ్ళ తరువాత ప్రారంభమై కొనసాగుతోంది. తరువాత కొన్ని రోజులకు రోచ్‌డేల్ పొరుగున ఉన్న ఒక స్కూల్ మాస్టార్, బాలికల పాఠశాలలో చదువుకొనేవారి సంఖ్య విపరీతంగా తగ్గిపోవడానికి కారణం దారిద్ర్య బాధ ఒక్కటే కాదు, ఉన్ని మిల్లుల్లో యంత్రాల మార్పులు కూడా కారణమనీ, ఆ మార్పు ఫలితంగా 70 మంది స్వల్పకాలిక కార్మికులను తగ్గించారనీ నాతో చెప్పారు.[1]

అమెరికా అంతర్యుద్ధం కారణంగా ఇంగ్లీషు నూలుబట్టల పరిశ్రమలోని యంత్రాలలో వచ్చిన మెరుగుదలల మొత్తం ఫలితాన్ని కింద పట్టిక చూపుతోంది.

**ఫ్యాక్టరీల సంఖ్య**

| | 1857 | 1861 | 1868 |
|---|---|---|---|
| ఇంగ్లండు, వేల్స్ | 2,046 | 2,715 | 2,405 |
| స్కాట్‌లాండ్ | 152 | 163 | 131 |
| ఐర్లాండ్ | 12 | 9 | 13 |
| యునైటెడ్ కింగ్‌డమ్ | 2,210 | 2,887 | 2,549 |

**మరమగ్గాల సంఖ్య**

| | 1857 | 1861 | 1868 |
|---|---|---|---|
| ఇంగ్లండు, వేల్స్ | 275,590 | 368,125 | 344,719 |
| స్కాట్‌లాండ్ | 21,624 | 30,110 | 31,864 |
| ఐర్లాండ్ | 1,633 | 1,757 | 2,746 |
| యునైటెడ్ కింగ్‌డమ్ | 298,847 | 399,992 | 379,329 |

**కదుళ్ళ సంఖ్య**

| | 1857 | 1861 | 1868 |
|---|---|---|---|
| ఇంగ్లండు, వేల్స్ | 25,818,576 | 28,352,125 | 30,478,228 |
| స్కాట్‌లాండ్ | 2,041,129 | 1,915,398 | 1,397,546 |
| ఐర్లాండ్ | 150,512 | 119,944 | 124,240 |
| యునైటెడ్ కింగ్‌డమ్ | 28,010,217 | 30,387,467 | 32,000,014 |

1. పూర్వోక్త గ్రంథం, పుట 109, సంక్షోభ కాలంలో యంత్రాల సత్వర అభివృద్ధి కారణంగా, ఇంగ్లీషు పారిశ్రామికులు, అమెరికన్ అంతర్యుద్ధం ముగిసిన వెంటనే, దాదాపు కొద్దిరోజుల్లోనే ప్రపంచ మార్కెట్లను తమ సరకుతో అక్కరకు మించి నింపివేశారు. 1866 ఆఖరు ఆరు నెలల్లో బట్టలు దాదాపు అమ్మకం కావడమే అసాధ్యమయింది. అందువల్ల సరకు ఇండియా, చైనాలకు పంపించడం ప్రారంభమయింది. అందువల్ల, మార్కెట్ సరకు పేరుకుపోవడం తీవ్రమైంది. 1867 ప్రారంభంలో పరిశ్రమదారులు ఈ చిక్కు నుంచి బయటపడేందుకు తమ మామూలు పద్ధతిని అవలంబించారు. అంటే వేతనాలను 5 శాతం తగ్గించారు. కార్మికులు దీన్ని ప్రతిఘటించి, తక్కువ కాలం అంటే వారానికి 4 రోజులు పని చేయటమొక్కటే దీనికి పరిష్కారమన్నారు. వారి సిద్ధాంతం సరియైనది. పరిశ్రమాధినేతలుగా తమ్ముతాము ఎన్నిక చేసుకొన్న యజమానులు కొన్నాళ్ళు తమ పట్టు విడువలేదు. తరువాత, తక్కువ కాలం పనికి కొన్నిచోట్ల వేతనాల తగ్గింపుతో, మిగతాచోట్ల తగ్గింపు లేకుండానే అంగీకరించక తప్పలేదు.

పనిలో ఉన్నవారి సంఖ్య

| | 1857 | 1861 | 1868 |
|---|---|---|---|
| ఇంగ్లండు, వేల్స్ | 341,170 | 407,598 | 357,052 |
| స్కాట్‌లాండ్ | 34,698 | 41,237 | 39,809 |
| ఐర్లాండ్ | 3,345 | 2,374 | 4,203 |
| యునైటెడ్ కింగ్‌డమ్ | 379,213 | 451,569 | 401,064 |

కాబట్టి 1861–1868 మధ్యకాలంలో 338 నూలు బట్టల ఫ్యాక్టరీలు అదృశ్యమయ్యాయి; వేరుమాటల్లో చెప్పాలంటే, మరింత ఉత్పాదక శక్తి గల యంత్రాలు పెద్దయెత్తున, మరింత తక్కువమంది పెట్టుబడిదారుల చేతుల్లో కేంద్రీకృతమయ్యాయి. మరమగ్గాల సంఖ్య 20,663 మేరకు తగ్గింది. అయితే అదే కాలంలో వాటి ఉత్పత్తి పెరిగింది కనుక. మెరుగైన మగ్గం పాతదానికన్నా ఎక్కువ ఉత్పత్తి చేసి ఉంటుంది. ఆఖరు విషయం, కదుళ్ళ సంఖ్య 1,612,541 మేరకు పెరిగింది; కాగా, కార్మికుల సంఖ్య 50,505 మేరకు తగ్గింది. పత్తి సంక్షోభం కార్మిక ప్రజలపై రుద్దిన "తాత్కాలిక" దారిద్ర్య దైన్యావస్థ, యంత్రాల సత్వర, నిరంతరాయ ప్రగతి మూలంగా తీవ్రతరమైంది; తాత్కాలికమైనది చిరస్థాయి అయింది.

కానీ, యంత్రాలు, కార్మికుని మీద పైచేయి సాధించి, అతని అక్కరే లేకుండా చేయనున్న స్థితిలో, స్థిరంగా ఉండే పోటీదారులుగా మాత్రమే పని చేయడం లేదు. అవి అతనికి శత్రువుగా ఉన్న శక్తి కూడా. అది అలాంటిదని పెట్టుబడి ఘంటాపథంగా చాటుతుంది; ఆ వాస్తవాన్ని ఉపయోగించుకొంటుంది. అవి, సమ్మెలను పెట్టుబడి నిరంకుశత్వానికి వ్యతిరేకంగా కార్మిక వర్గం అప్పుడప్పుడు చేసే ఆ తిరుగుబాట్లను – అణచివేయటానికి అత్యంత శక్తివంతమైన ఆయుధం.[1] గ్యాస్కెల్ చెబుతున్న దాన్నిబట్టి, ఆవిరి ఇంజన్ ఆదినుంచినే మానవ శక్తికి శత్రువు. కొత్తగా ఆవిర్భవించిన ఫ్యాక్టరీ వ్యవస్థకు సంక్షోభ ప్రమాదం కల్పించిన కార్మికుల అధికమైన కోర్కెలను పెట్టుబడిదారు కాలరాచివేయడానికి వీలు కల్పించిన శత్రువు.[2] కార్మికవర్గ తిరుగుబాట్లకు వ్యతిరేకంగా పెట్టుబడికి ఆయుధాలను సమకూర్చటానికి 1830 నుంచి జరుగుతున్న నూతన యంత్రాల సృష్టిపై ఒక చరిత్రే రాయవచ్చు. ప్రాధాన్యాన్ని బట్టి, వీటిలో అగ్రస్థానం వహిస్తున్నది స్వయం ప్రవర్తక కదురు యంత్రం. ఎందువల్లనంటే అది స్వయంచాలక వ్యవస్థలో నూతన శకానికి నాంది పలికింది.[3] యంత్రాల్లో

---

1. "ఊదుడు ఫ్లింట్ గాజు సీసాల పరిశ్రమల్లో యజమానికీ, కార్మికునికీ మధ్య సంబంధం ఒక దీర్ఘకాలిక సమ్మెలా ఉంది." పీడనకు గురిచేసి తయారుచేసే గాజు (ప్రెస్డ్ గ్లాస్) ఉత్పత్తికి ప్రేరణ ఇదే. అందులో ప్రధాన ప్రక్రియలు యంత్రాలు నిర్వహిస్తాయి. న్యూకాజిల్‌లో మునుపు 350,000 పౌనుల ఊదుడు ఫ్లింట్ గాజును ఉత్పత్తి చేసిన ఒక కంపెనీ ఇప్పుడు 3,000,500 పౌనుల ప్రెస్డ్ గ్లాస్ తయారు చేస్తోంది. ("చిల్డ్రన్స్ ఎంప్లాయ్‌మెంట్ కమిషన్ రిపోర్ట్ IV" 1865 పుటలు 262-263.)
2. గ్యాస్కెల్ "ఇంగ్లండులో పారిశ్రామిక జనాభా" లండన్, పుట 34.
3. డబ్ల్యు. ఫేర్ బయిర్న్, తన సొంత కార్ఖానాల్లో సమ్మెల కారణంగా, యంత్రాల నిర్మాణానికి యంత్రాలను వాడే చాలా కొత్త పద్ధతులను అనేకం కనుగొన్నాడు.

తాను తీసుకొచ్చినట్టీ, 1851లో ఇంజనీర్ల దీర్ఘ విస్తృత వ్యాప్త సమ్మెల ఫలితంగా ప్రవేశపెట్టబడినట్టీ మెరుగుదలలను గురించి ఆవిరి సమ్మెటను సృష్టించిన నాస్మిత్, వృత్తుల యూనియన్ కమిషన్ ముందు ఇలా సాక్ష్యమిచ్చారు : "స్వయంచాలక పరికర యంత్రాలను ప్రవేశపెట్టడం, ఆధునిక యంత్ర పని మెరుగుదలల స్వభావోచిత లక్షణం. నేడు ప్రతి యంత్ర కార్మికుడు చేయవలసినదీ, ప్రతి కుర్రవాడూ చేయగలదీ, తాను స్వయంగా పని చేయటం కాదు, యంత్రం చేసే చక్కని పనిని పర్యవేక్షించడం. కేవలం తమ నైపుణ్యంపై ఆధారపడిన కార్మికులలోని ఒక తరగతికి తరగతినే తప్పించివేశాము. మునుపు నేను ప్రతి మెకానిక్‌కు నలుగురు కుర్రవాళ్ళను నియమించేవాణ్ణి. కొత్తయాంత్రిక సమ్మేళనల పుణ్యమా అని, ప్రాయస్థులైన పురుషుల సంఖ్యను 1,500 నుంచి 750కి తగ్గించాను. ఫలితంగా నా లాభాలు గణనీయంగా పెరిగాయి."

కాలికో అద్దకంలో యంత్రాల వాడకం గురించి ఉరే ఇలా చెబుతున్నాడు : "తుట్టతుదకు పెట్టుబడిదారులు ఈ దుర్భర దాస్యం నుంచి" (అంటే, కార్మికులతో తాము చేసుకొనే ఒప్పందాలలో, వారి దృష్టికి భారమైనవిగా కనిపించే షరతుల నుంచి) "విముక్తికై, విజ్ఞానశాస్త్ర ఆవిష్కరణల ఆధారాలను ఆశ్రయించారు. తమ న్యాయసమ్మతమైన పాలనలో, తక్కువ స్థాయి సభ్యులపై అధిపతులుగా పునఃస్థాపితులయారు." పడుగులను సాపు చేసేందుకు సృష్టించిన ఒక కొత్త యంత్రాన్ని గురించి చెబుతూ ఆయన ఇలా అన్నారు : "పరిశ్రమ విభజన రక్షణ శ్రేణుల వెనుక దుర్భేద్య స్థావరాల్లో తాము పాదుకొని ఉన్నామని భ్రమించిన, కట్టుగా ఉన్న అసంతృప్త జీవులు, కొత్త యాంత్రికపు ఎత్తుగడలు తమ పార్శ్వ దిశలను దాటి, తమ రక్షణ శ్రేణులను నిరుపయోగం చేశాయని తెలుసుకొని, వారి వారి వివేచనా జ్ఞానాన్ని బట్టి, లొంగిపోవలసి వచ్చింది."

స్వయం ప్రవర్తక కదురు యంత్రం సృష్టిని గురించి ఆయన ఇలా అంటున్నారు : "శ్రమించి పని చేసే వర్గాల్లో క్రమ ప్రవర్తనను పునరుద్ధరించే విద్యుక్త కర్తవ్యం నెరవేర్చనున్న సృష్టి ఇది... విజ్ఞాన శాస్త్రాన్ని పెట్టుబడి తన సేవకు నియమించినప్పుడు, పెడసరి శ్రామిక హస్తానికి అణకువను బోధించుతుందనే గొప్ప సిద్ధాంతాన్ని ఈ నూతన యంత్ర సృష్టి ధృవీకరిస్తున్నది."[1] ఉరే గ్రంథం ఫ్యాక్టరీ వ్యవస్థ, సాపేక్షంగా, బహు కొద్దిగా మాత్రమే అభివృద్ధి చెందిన 30 ఏళ్ళనాడు వెలువడినప్పటికీ, అది ఫ్యాక్టరీ తత్వాన్ని, మరుగులేని దాని అమానుషత్వం ద్వారానే కాక, పెట్టుబడిదారు మెదడులోని మూర్ఖపు వైరుధ్యాలను బయటపెట్టుకొనే దాని అమాయకత్వం ద్వారా కూడా. ఇప్పటికీ పరిపూర్ణంగా వ్యక్తం చేస్తోంది. ఉదాహరణకు, పైన పేర్కొన్న "సిద్ధాంతాన్ని" అంటే, పెట్టుబడి, కిరాయికి తన కింద ఉంచుకొన్న విజ్ఞాన శాస్త్ర సహాయంతో పెడసరి కార్మిక హస్తాన్ని అణకువగా ఉండే స్థితికి ఎల్లప్పుడూ తెస్తుందన్న సిద్ధాంతాన్ని ప్రతిపాదించిన తరువాత, ఉరే ఆగ్రహోదగ్రుడవుతున్నాడు; "పేదలను వేధించడానికి ఒక సాధనంగా సంపన్నుడైన పెట్టుబడిదారునికి అది ఉపయోగపడుతుందని భౌతిక – యాంత్రిక శాస్త్రాన్ని నిందిస్తున్నారు" అని ఆయన కోపం. యంత్రాల సత్వరాభివృద్ధి కార్మిక వర్గాలకు ఎంత ప్రయోజనకరమో చెప్పే సుదీర్ఘ ధర్మోపదేశం తరువాత, ఆ వర్గాలు, తమ మూర్ఖపు పట్టుదల వల్ల, సమ్మెల వల్ల ఆ అభివృద్ధిని వేగిరపరుస్తున్నాయని వాటిని హెచ్చరించాడు. "ఇటువంటి

1. ఉరే, పూర్వోక్త గ్రంథం, పుటలు 368-370.

స్వభావం గల దౌర్జన్యపూరిత ఏవగింపులు దూరదృష్టిలేని మనిషిని, తన్ను తాను హింసించుకొనే హేయమైన వ్యక్తిగా చూపుతున్నాయి" అని అంటున్నాడు. దీనికి ముందు కొన్ని పుటల్లో, అతను ఇందుకు భిన్నమైన మాట అన్నాడు : "ఫ్యాక్టరీ పనివారిలో ఉన్న పొరపాటు అభిప్రాయాల ఫలితంగా దౌర్జన్యయుత ఘర్షణలు, అంతరాయాలు లేకుండా ఉన్నట్లయితే, ఫ్యాక్టరీ వ్యవస్థ, ఇంకా వేగంగా, ఇందుకు సంబంధించిన వారందరికీ ఇంకా ప్రయోజనకరంగా అభివృద్ధిచెంది ఉండేది." తరువాత మళ్ళీ ఇలా చాటుతున్నాడు : "గ్రేట్ బ్రిటన్‌లో, నూలు బట్టల పరిశ్రమలున్న జిల్లాల్లో, సమాజం అదృష్టం కొద్దీ, యంత్రాల్లో మెరుగుదలలు క్రమక్రమంగా వస్తున్నాయి." "అది" (యంత్రాల్లో మెరుగుదల) "వయోజనులను వారి స్థానాల నుంచి తొలగించి, ఆ విధంగా, వారి శ్రమకు గల గిరాకీతో పోలిస్తే వారి సంఖ్య మరీ మితిమించినదిగా చేయడం వల్ల, వారి ఆదాయాలను తగ్గిస్తున్నదని చెబుతున్నారు. నిజంగా అది పిల్లల శ్రమకు గిరాకీ పెంచి, వారి వేతనాలను హెచ్చిస్తుంది." ఊరడింపు మాటలు చెప్పే ఇతనే మరోవైపు పిల్లల వేతనాలు తక్కువగా ఉండటం మంచిదేనని సమర్థిస్తున్నాడు. కారణం, తల్లిదండ్రులు తమ పిల్లల్ని మరీ చిన్న వయసులో ఫ్యాక్టరీకి పంపకుండా అది నివారిస్తుందట. ఈ మొత్తం పుస్తకం, కాల పరిమితిలేని పనిదిన సమర్థన, రోజుకు 12 గంటల పనితో 13 ఏళ్ళ పిల్లలను పూర్తిగా అలిసిపోయేలా చేయరాదని పార్లమెంటు నిషేధించినందుకు, ఈ ఉదారవాద పుణ్యాత్మునికి మధ్యయుగాల కటిక చీకటి రోజులు గుర్తుకు వస్తున్నాయి. తమ "అనశ్వర ప్రయోజనాలను" గురించి ఆలోచించడానికి, యంత్రాల ద్వారా విరామ సమయం ప్రసాదించిన ఈశ్వరునికి కృతజ్ఞత తెలుపుకోవలసిందిగా ఫ్యాక్టరీ కార్మికులకు విజ్ఞప్తి చేయడానికి, ఇది ఆయనకు అడ్డు రాలేదు.[1]

### విభాగం-6

## యంత్రాలవల్ల పని నుంచి తొలగించబడిన కార్మికులకు నష్టపరిహారం గురించిన సిద్ధాంతం

కార్మికులను పని నుంచి తొలగించే యంత్రాలన్నీ అదే తరహా కార్మికులను పనిలో నియమించడానికి తగినంత పెట్టుబడిని, అదే సమయంలో, అవశ్యంగా విడుదల చేస్తాయని జేమ్స్ మిల్, మాక్ కులోచ్, టోరెన్స్ సీనియర్, జాన్ స్టువర్ట్‌మిల్, ఇంకా మొత్తం వరసగా బూర్జువా రాజకీయ అర్థశాస్త్రజ్ఞులు నొక్కి చెబుతున్నారు.[2]

ఒక పెట్టుబడిదారు, ఏడాదికి తలా 30 పౌండ్ల చొప్పున, 100 మంది కార్మికులను ఒక తివాచీ ఫ్యాక్టరీలో నియమిస్తాడనుకొందాం. కాబట్టి అతను మదుపు పెట్టిన అస్థిర పెట్టుబడి 3,000 పౌండ్లు అవుతుంది. అతను తన కార్మికుల్లో యాభైమందిని, 1,500 పౌండ్లు వెల చేసే యంత్రాలతో పని చేయడానికి నియమిస్తాడని కూడా అనుకొందాం. లెక్కాచార సౌలభ్యం కోసం భవనాలు, బొగ్గు మొదలయిన వాటిని మనం పరిగణనకు తీసుకోవడం లేదు. ఈ మార్పుకు ముందూ, తరువాత

1. ఉరే, పూర్వోక్త గ్రంథం, పుటలు 368, 7, 370, 280, 281, 321, 370, 475.
2. రికార్డో కూడా మొదట ఇదే విధంగా అభిప్రాయపడ్డాడు. కానీ తరువాత, ఆయన స్వభావోచితమైన శాస్త్రీయ నిష్పక్షపాతంతో, సత్య సంధతతో ఈ అభిప్రాయాన్ని స్పష్టంగా ఖండించాడు.

వినియోగమయిన ముడిపదార్థాల వెల 3,000 పౌండ్లని కూడా అనుకొందాం.[1] ఈ మార్పువల్ల పెట్టుబడి ఏమైనా విడుదల అయిందా? మార్పుకు ముందు మొత్తం 6,000 పౌండ్లలో సగం స్థిరపెట్టుబడీ, సగం అస్థిర పెట్టుబడి. మార్పు తరువాత ఈ మొత్తంలో 4,500 పౌండ్లు స్థిర పెట్టుబడి (3,000 పౌనులు ముడి పదార్థాలు, 1,500 పౌండ్లు యంత్రాలు) 1,500 పౌండ్లు అస్థిర పెట్టుబడి. అస్థిర పెట్టుబడి, మొత్తం పెట్టుబడిలో సగభాగం బదులు ఇప్పుడు పావు భాగమే. పెట్టుబడిలో ఒక భాగం విడుదల కావడానికి బదులు, శ్రమ శక్తితో మార్పిడి కావడం ఆగిపోయే విధంగా చిక్కుకుపోయింది! అస్థిర పెట్టుబడి స్థిర పెట్టుబడిగా మారింది! ఇతర విషయాలు మారకుండా ఉన్నట్లయితే, 6,000 పౌండ్ల పెట్టుబడి భవిష్యత్తులో 50 మందికి మించి పనిలో నియమించలేదు. యంత్రాల్లో వచ్చే ప్రతి మెరుగుదలతో, అది పనిలో నియమించే వారి సంఖ్య తగ్గుతూనే ఉంటుంది. కొత్తగా ప్రవేశపెట్టిన యంత్రాలకు, వాటిచే తొలగింపబడ్డ శ్రమ శక్తి, పరికరాలకన్నా తక్కువ వ్యయమై ఉంటే, ఉదాహరణకు, 1,500 పౌండ్లకు మారు 1,000 పౌండ్లే వ్యయమై ఉంటే, 1,000 పౌండ్ల అస్థిర పెట్టుబడి స్థిర పెట్టుబడిగా మారి, చిక్కుకుపోయి ఉండేది. 500 పౌనుల పెట్టుబడి విడుదల అయివుండేది. వేతనాలు మారలేదనుకొంటే, ఈ మొత్తం, పని నుండి తొలగింపబడ్డ 50 మందిలో దాదాపు 16 మందిని, కాదు అంతకన్నా తక్కువమందినే పనిలో పెట్టుకొనేందుకు తగినంత మొత్తంగా ఉంటుంది. ఎందువల్లనంటే, పెట్టుబడిగా వినియోగం కావాలంటే, ఈ 500 పౌండ్లలో ఒక భాగం స్థిర పెట్టుబడిగా రూపొందవలసి ఉంటుంది; శ్రమ శక్తి కోసం మదుపు పెట్టేందుకుండేది మిగతా మొత్తం మాత్రమే.

ఇంతేకాదు, కొత్త యంత్రాల తయారీ మరింత ఎక్కువమంది మెకానీక్కులకు పనులు కల్పిస్తుందని అనుకొందాం. కానీ, దీన్ని వీధుల్లోకి నెట్టబడ్డ తివాచీ కార్మికులకు నష్టపరిహారంగా పేర్కొనగలమా? మహా అయితే, యంత్రాల నిర్మాణం, వాటి వినియోగం వల్ల తొలగింపబడిన దానికన్నా తక్కువ మందికే పని కల్పిస్తుంది. పని నుండి తొలగించబడిన తివాచీ కార్మికుల వేతనాలకు మునుపు కేటాయించిన 1,500 పౌండ్ల మొత్తం ఇప్పుడు కింది వాటికి కేటాయించబడింది. (1) యంత్రాల నిర్మాణంలో వ్యయమయిన ఉత్పత్తి సాధనాల విలువ (2) వాటి నిర్మాణంలో నియుక్తులైన మెకానీక్కుల వేతనాలు (3) వారి "యజమాని" వాటాకు చేరే అదనపు విలువ. అంతేకాక, ఈ యంత్రాలు అరిగిపోయే వరకు కొత్తవాటిని స్థాపించనవసరం లేదు. కాబట్టి, ఈ అదనపు మెకానీక్కులను స్థిరంగా పనిలో ఉంచాలంటే పలువురు తివాచీ పరిశ్రమదారులు ఒకరి తరువాత ఒకరు కార్మికుల స్థానంలో యంత్రాలను స్థాపించవలసి ఉంటుంది.

నిజానికి, ఈ వకాల్తాదారుల భావం ఈ రకమైన విడుదల జరుగుతుందని కాదు. వారి మనసులో ఉన్నది, విడుదల అయిన కార్మికుల జీవనాధారాలు. పైన ఇచ్చిన ఉదాహరణలో యంత్రాలు 50 మంది కార్మికులను విడుదల చేసి, ఆ విధంగా వారిని ఇతరులు నియమించుకొనే అవకాశం కల్పించడమే కాక, 1,500 పౌండ్లు విలువ చేసే జీవనాధారాలను ఆ కార్మికుల వినియోగం నుంచి లాగివేసి, విడుదల చేస్తుంది. యంత్రాలు కార్మికులను వారి జీవనాధారాల నుంచి వేరు చేస్తాయనే సులభగ్రాహ్యమైన ఈ వాస్తవం కొత్తదేమీ కాదు. కాబట్టి, ఆర్థిక పరిభాషలో యంత్రాలు కార్మికుని

1. గమనిక : నా ఉదాహరణ పూర్తిగా పైన నేను పేర్కొన్న అర్థశాస్త్రజ్ఞుల పంథా ప్రకారమే ఉంది.

జీవనాధారాలను విముక్తం చేస్తాయి. లేదా అతణ్ణి పనిలో నియమించేందుకు ఆ జీవనాధారాలకు పెట్టుబడిగా మారుస్తాయన్న మాట. నొమినిబస్ మ్యుల్లర్ లిసెట్ మలా (అపదల భారాన్ని మాటలతో తగ్గించడం సముచితం – అను).

ఈ సిద్ధాంతంలో భావమిది : 1,500 పౌనులు విలువ చేసే జీవనాధారాలు, పని నుంచి తొలగింపబడిన 50 మంది కార్మికుల శ్రమ వల్ల విస్తృతమవుతూ వచ్చిన పెట్టుబడిగా ఉండేది; అందువల్ల, ఈ కార్మికులపై బలవంతాన రుద్దిన సెలవులు ప్రారంభం కాగానే ఈ పెట్టుబడి వినియోగంలో లేకుండా పోయి, మళ్ళీ మదుపు పెట్టబడే వరకు ఊరుకోదు. అప్పుడు దాన్ని అదే 50 మంది, ఉత్పాదకంగా వినియోగించవచ్చు. కాబట్టి, అనతికాలంలో పెట్టుబడీ, కార్మికుడు మళ్ళీ ఒకచోటికి రాక తప్పదు. అప్పుడు నష్టానికి పరిహారం చెల్లింపు పూర్తి అవుతుంది. కాబట్టి, యంత్రాలచే పని నుంచి తొలగించబడిన కార్మికుల బాధలు, భోగభాగ్యాల లాగానే క్షణికమైనవి.

తొలగింపబడిన కార్మికులకు సంబంధించి, 1,500 పౌండ్లు విలువ గల జీవనాధారాలు ఎప్పుడూ పెట్టుబడిగా లేవు. పెట్టుబడిగా వారికి నిజంగా ఎదురైంది. తరువాత యంత్రాల్లో మదుపు పెట్టిన 1,500 పౌండ్ల మొత్తం. మరింత జాగ్రత్తగా పరిశీలిస్తే ఈ మొత్తం, తొలగింపబడ్డ కార్మికులు ఒక సంవత్సరంలో ఉత్పత్తి చేసిన తివాచీల్లో కొంత భాగాన్ని సూచిస్తుంది. వారికి తమ యజమాని నుంచి వస్తురూపంలో కాక, డబ్బు రూపంలో అందిన భాగమిది. డబ్బు రూపంలోని ఈ తివాచీలతో వారు 1,500 పౌండ్ల విలువ గల జీవనాధారాలను కొన్నారు. కాబట్టి ఈ జీవనాధారాలు వారికి సరుకులే తప్ప పెట్టుబడి కాదు. ఈ సరకులకు సంబంధించినంతవరకు వారు కొనుగోలుదార్లే తప్ప, వేతన కార్మికులు కాదు. యంత్రాలు, వారిని కొనుగోలు సాధనాల నుంచి "విముక్తి చేసిన" పరిస్థితి వల్ల కొనుగోలుదార్లుగా ఉన్నవారు కొనుగోలుదార్లు కాకుండా పోయారు. అందువల్ల ఆ సరకులకు గిరాకీ తగ్గింది. (వయిలాటౌట్) దళారీ వ్యాపారి ఈ తగ్గుదలను మరోచోటి నుంచి వచ్చే పెరుగుదల పూరించకపోతే, ఆ సరకుల యొక్క మార్కెట్ ధర పడిపోతుంది. ఈ పరిస్థితి కొంత కాలంపాటు ఉండి, ఇంకా కొనసాగితే ఈ సరకుల ఉత్పత్తిలో నియుక్తులైన కార్మికులకు పని నుంచి ఉద్వాసన జరుగుతుంది. మునుపు జీవనాధారాల ఉత్పత్తికై పెట్టిన పెట్టుబడిలో కొంత భాగం మరో రూపంలో పునరుత్పత్తి చెందవలసి ఉంటుంది. ధరలు పడిపోతూండగా, పెట్టుబడి, స్థానభ్రంశం చెందుతూండగా జీవనాధారాల ఉత్పత్తిలో నియుక్తులయిన కార్మికుల వంతు వచ్చి వారూ తమ వేతనాల్లోని కొంత భాగం నుంచి "విడుదలవుతారు". కాబట్టి, యంత్రాలు కార్మికుణ్ణి తన జీవనాధారాల నుంచి విడుదల చేసినప్పుడు అవి అదే సమయంలో, ఈ జీవనాధారాలను, ముమ్ముందు అతని ఉపయోగం కొరకు, మరింతగా, పెట్టుబడిగా మారుస్తుందని రుజువు చేయడానికి బదులు ఈ వకాల్తాదారులు, సరఫరా, గిరాకీ అనే పడికట్టు నియమంతో, యంత్రాలు ప్రవేశించిన ఉత్పత్తి శాఖ లోనే కాక, అవి ప్రవేశించని శాఖల్లో సైతం కార్మికులను వీధుల్లోకి నెట్టివేస్తాయని రుజువు చేస్తున్నారు.

అర్థశాస్త్రవేత్తల ఆశావాదం తారుమారు చేసిన అసలు వాస్తవాలివి : యంత్రాలు కార్మికులను కర్మాగారం నుంచి గెంటినప్పుడు వారు శ్రమ విపణిలోకి వచ్చిపడతారు; పెట్టుబడిదారులు ఉపయోగించుకోగల కార్మికుల సంఖ్య, అందువల్ల అక్కడ పెరుగుతుంది. యంత్రాల వల్ల కలిగే ఈ ఫలితాన్ని కార్మికవర్గం పొందే నష్ట పరిహారంగా చిత్రించారని చూచాము. అది అలాంటిది కాదు

సరికదా, అతి భయంకరమైన ఉపద్రవమని ఈ గ్రంథం ఏడవ భాగంలో తెలుస్తుంది. ఇప్పటికి, నేను చెప్పేది ఇంత మాత్రమే : ఏ పారిశ్రామిక శాఖలోనైనా పని నుంచి తొలగించబడిన కార్మికులు ఏదో మరో శాఖలో ఉద్యోగం కోసం ప్రయత్నించవచ్చు. సందేహం లేదు. వారికి పని దొరికి, ఆ విధంగా వారికి, జీవనాధారాలకు మధ్య బంధం పునస్థాపితమైతే, అలా జరిగేది, మదుపు కోసం చూస్తున్న ఒక కొత్త, అదనపు పెట్టుబడి మధ్యవర్తిత్వం ద్వారానే తప్ప వారిని మునుపు నియమించినట్టి, ఆ తరువాత యంత్రాలుగా మారినట్టి పెట్టుబడి మధ్యవర్తిత్వం ద్వారా మాత్రం కాదు. వారికి పని దొరికినా, వారి పరిస్థితి ఎంత దయనీయమైనది! పాపం, శ్రమ విభజనచే వికలురైన ఈ దౌర్భాగ్యులకు తమ పాత వృత్తి వెలుపల ఎంత విలువ లేకుండా పోతుందంటే, తక్కువ రకం పరిశ్రమలు కొన్నింటిలో తప్ప మరే పరిశ్రమల్లోనూ వారిని చేర్చుకోరు. ఆ తక్కువ రకం పరిశ్రమలకు కూడా, తక్కువ వేతనంతో పనిచేసే కార్మికులు, కావలసిన దానికన్నా ఎక్కువ సరఫరా అవుతున్నారు.[1] ఇంతేకాక, ప్రతి పారిశ్రామిక శాఖా ఏటా కొత్త జన ప్రవాహాన్ని ఆకర్షిస్తోంది. ఇది ఖాళీలను భర్తీ చేయటానికీ, విస్తరణకు కావలసినంత మందిని తీసుకొనేందుకు సిబ్బంది దళాన్ని సమకూరుస్తుంది. ఒక నిర్ణీత పారిశ్రామిక శాఖలో పనిచేసే కార్మికుల్లో ఒక భాగాన్ని యంత్రాలు విడుదల చేశాయో లేదో, అప్పటికే నిలవగా ఉన్నవారు కూడా, పనులు కల్పించే నూతన మార్గాల వైపు మళ్ళి, ఇతర శాఖల్లో కుదురుకొంటారు. ఈలోగా, పని కోల్పోయిన పాతవారిలో అత్యధిక భాగం ఈ అవస్థాంతర దశలో తిండిలేక మాడి చస్తారు.

కార్మికుడు జీవనాధారాల నుంచి "విడుదల కావడానికి" బాధ్యత స్వయంగా యంత్రాలది కాదనేది నిస్సందేహం. అవి తమ గుప్పిటిలోకి తెచ్చుకొన్న శాఖలో ఉత్పత్తి వ్యయాన్ని తగ్గిస్తాయి. ఉత్పత్తిని పెంచుతాయి. ఇతర శాఖల్లో ఉత్పత్తి అయ్యే జీవనాధారాల రాశిలో మొదట మార్పులు తీసుకురాదు. కాబట్టి, అవి ప్రవేశపెట్టబడిన తరువాత, పని కోల్పోయిన కార్మికులకై ఉన్న జీవనాధారాలు, మునుపటికన్నా ఎక్కువగా కాకపోయినా, అంతైనా సమాజానికుంటాయి. ఏటా ఉత్పత్తి అయ్యేవాటిలో ఎంతో భాగం కార్మికేతరులు వృథా వ్యయం చేస్తున్నది కాకనే, అవీ ఉంటాయి. మన వకాల్తాదారులు ఆధారపడినది ఈ విషయంపైనే. యంత్రాల పెట్టుబడిదారీ వినియోగం నుంచి విడదీయరాని వైరుధ్యాలు, శత్రుత్వాలు అసలు ఉనికిలోనే లేవు. ఎందుకంటే, అవి, యంత్రాల పెట్టుబడిదారీ వినియోగం నుంచి ఉత్పన్న మవుతున్నాయే తప్ప, యంత్రాలు, యంత్రాలుగా వాటిని ఉత్పన్నం చేయడం లేదు గదా, అని వారంటారు. అందువల్ల ఒక్క యంత్రాలనే పరిగణనకు తీసుకొని చూస్తే అవి పని గంటలను తగ్గిస్తాయి, కానీ పెట్టుబడి సేవలో వాటిని పొడిగిస్తాయి కాబట్టి, అవి స్వతహాగా

---

1. జె.బి. సే చలీ సారంలేని వాదనలకు సమాధానంగా రికార్డో శిష్యుల్లో ఒకరు విషయమై ఇలా వ్యాఖ్యానిస్తున్నాడు : "శ్రమ విభజన బాగా అభివృద్ధి చెందినచోట, కార్మికుని నైపుణ్యం, అతడు దాన్ని ఏ నిర్దిష్ట శాఖలో సంపాదించాడో, అందులోనే ఉపయోగపడుతుంది; అతనే ఒక విధమైన యంత్రం. కాబట్టి వస్తువులకు తమ స్థాయిని చేరుకొనే ధోరణి ఉందని చిలుకలా వల్లించడం, పరిస్థితిని చక్కదిద్దడానికి అణుమాత్రం కూడా తోడ్పడదు. అవి, చాలా కాలంపాటు తమ స్థాయిని చేరుకోలేకుండా ఉన్నాయనీ, దాన్ని ఎట్లో చేరుకొన్నప్పుడు, ఆ స్థాయి, ఈ ప్రక్రియ ప్రారంభమయిన వాటికన్నా ఎల్లప్పుడూ తక్కువగానే ఉందనీ, చుట్టూ చూస్తే మనకు కనిపించక తప్పదు." (యాన్ ఎంక్వయిరీ ఇంటు దోస్ ప్రిన్సిపుల్స్ రెస్పెక్టింగ్ ది నేచర్ ఆఫ్ డిమాండ్ అండ్ ఎట్‌సెట్రా", లండన్ 182, పుట 72.)

శ్రమ భారాన్ని తగ్గిస్తాయి; కానీ పెట్టుబడి వాటిని ఉపయోగించినప్పుడు అవి శ్రమ తీవ్రతను హెచ్చిస్తాయి కాబట్టీ; అవి స్వతహాగా, ప్రకృతి శక్తులపై మానవుని విజయం, కానీ పెట్టుబడి చేతుల్లో మానవుణ్ణి ఈ శక్తులకు బానిసగా చేస్తాయి కాబట్టీ; అవి స్వతహాగా ఉత్పత్తిదారుల సంపదను పెంచుతాయి కానీ, పెట్టుబడి చేతుల్లో వారిని పరమ దరిద్రులుగా చేస్తాయి కాబట్టీ ఇంకా ఇతర కారణాలను బట్టీ, ఈ వైరుధ్యాలన్నీ వాస్తవమైనట్టు కేవలం కనిపిస్తాయే తప్ప నిజంగా, వాటికి యధార్థమైన అస్తిత్వం లేదు. సైద్ధాంతికమైన అస్థిత్వం లేదనేది పట్టపగలంత స్పష్టం అని తొణుకూ బెణుకూ లేకుండా అంటాడు బూర్జువా అర్థశాస్త్రజ్ఞుడు. ఆ విధంగా అతను మెదడుకు శ్రమ ఇవ్వవలసిన అవసరం నుంచి తప్పించుకొంటాడు. అంతేకాదు, తన ప్రత్యర్థి యంత్రాల పెట్టుబడిదారీ వినియోగాన్ని కాక, అసలు యంత్రాలనే వ్యతిరేకించేటంత మూఢుడని చాటుతాడు.

యంత్రాల పెట్టుబడిదారీ వినియోగం వల్ల తాత్కాలిక అసౌకర్యం కలుగవచ్చుననే సంగతిని అతను ఎంతమాత్రము కాదనడు. ఇందుకు సందేహం లేదు. కానీ, బొరుసు లేని నాణెం ఎక్కడుంది! పెట్టుబడి వల్ల కాకుండా యంత్రాల వినియోగమే అతని దృష్టిలో అసాధ్యం కాబట్టి, యంత్రం కార్మికుణ్ణి ఉపయోగించుకోవడం, కార్మికుడు యంత్రాన్ని ఉపయోగించడమూ, రెండూ ఒకటే అని అతని అభిప్రాయం. కాబట్టి, యంత్రాల పెట్టుబడిదారీ వినియోగంలోని వాస్తవ పరిస్థితిని బయటపెట్టిన ఎవరైనా సరే, వాటి ఏ విధమైన వినియోగానికీ వ్యతిరేకీ, సామాజిక ప్రగతికి శత్రువూ![1] పేరుమోసిన బిల్ సైక్స్ వాదన సరిగ్గా ఇదే : "న్యాయ నిర్ణేతల్లారా, ఈ వాణిజ్య సంస్థ ప్రతినిధి గొంతు కోయడం జరిగింది. నిజమే, కానీ అది నా తప్పు కాదు. చురకత్తి తప్పు. అటువంటి తాత్కాలిక అసౌకర్యం కలిగినందుకు మనం చురకత్తి వాడకాన్నే రద్దు చేయాలా? ఆలోచించండి. అంతే! చురకత్తి లేకుండా వ్యవసాయం, వర్తకం ఎక్కడ వుండేవి? అది శరీరాంగ నిర్మాణాన్ని తెలుసుకోవడంలో లాగానే శస్త్ర చికిత్సలో ఉపయోగం కాదా? దానికి తోడు విందు భోజనంలో అవశ్యంగా సహాయపడటం లేదా? మీరు కత్తే లేకుండా చేస్తే మమ్మల్ని అనాగరిక కూపంలోకి తిరిగి నెట్టివేస్తున్నారు."[2]

యంత్రాలు ప్రవేశపెట్టబడిన పరిశ్రమల్లో అవి తప్పనిసరిగా కార్మికులను పని నుంచి తొలగించినప్పటికీ, ఇతర పరిశ్రమల్లో ఉద్యోగాలను పెంచవచ్చు. కానీ ఈ ఫలితానికీ, నష్ట పరిహార సిద్ధాంత మనబడే దానికీ మధ్య ఎలాంటి పొత్తూ లేదు. యంత్రం ఉత్పత్తి చేసే ప్రతి వస్తువూ చేతితో చేసే అలాంటి వస్తువుకన్నా చౌక కాబట్టి, ఈ క్రింది నియమం తిరుగులేనిదనే నిర్ధారణకు వచ్చాము.

---

1. "డాంబికపు మందబుద్ధులలో, మిగతా వారితోపాటు మాక్కులోచ్‌ది అగ్రతాంబూలం. కృతకమైన 8 ఏళ్ళ కుర్రవాని అమాయకత్వంతో అతను ఇలా అంటున్నాడు : "కార్మికుడు అంతే శ్రమతో, లేదా అంతకన్నా తక్కువ శ్రమతో స్థిరంగా పెరుగుతున్న పరిమాణంలో సరుకులను ఉత్పత్తి చేయగలిగేలా, అతని నైపుణ్యాన్ని పెంపొందించడం ఎక్కువ ప్రయోజనకరంగా ఉంటే, ఈ ఫలితాన్ని సాధించడంలో అతనికి దృఢంగా తోడ్పడగల యంత్రాల సహాయాన్ని అతడు వినియోగించుకోవడం కూడా ఎక్కువ ప్రయోజనకరం." (మాక్‌కులోచ్ : "ప్రిన్సిపుల్స్ ఆఫ్ పొలిటికల్ ఎకానమీ," లండన్, 1830, పుట 166)
2. "వడికే యంత్రాన్ని కనిపెట్టిన వ్యక్తి ఇండియాను నాశనం చేశాడు. కానీ ఈ విషయం మనకు సంబంధించిన విషయం కాదు." (ఎ. థీర్స్, డీలా ప్రాప్రయిటే - ఇక్కడ థీర్స్, వడికే యంత్రం మరమగ్గం ఒకటే అనుకొనే గందరగోళంలో పడ్డాడు. కానీ ఇది మనకు సంబంధించిన విషయం కాదు.

యంత్రాలు ఉత్పత్తి చేసిన మొత్తం వస్తువులు, మునుపు చేతివృత్తి ద్వారా లేదా కార్ఖానా ఉత్పత్తి వల్ల తయారైన మొత్తం వస్తువులకు సమానంగా ఉంటే, వ్యయమైన మొత్తం శ్రమ తగ్గిందన్న మాట. శ్రమ సాధనాలపై, యంత్రాలపై బొగ్గు, మొదలయిన వాటిపై వ్యయమైన నూతన శ్రమ, యంత్రాలచే తొలగింపబడిన శ్రమకన్నా అవశ్యంగా తక్కువగా ఉండి తీరాలి. లేకపోతే, యంత్ర ఉత్పాదితం శారీరక శ్రమ ఉత్పాదితం అంత ప్రియంగా, లేక మరింత ప్రియంగా ఉంటుంది. కానీ వాస్తవంలో, తక్కువమంది కార్మికులతో యంత్రాలు ఉత్పత్తి చేసిన మొత్తం వస్తువులు, వాటిచే తొలగించబడిన చేతి తయారీ వస్తువుల మొత్తానికి సమానంగా ఉండటానికి బదులు, ఎంతో ఎక్కువగా ఉంటాయి. చేతితో 100,000 గజాల బట్టను నేసే కార్మికులకన్నా తక్కువ మంది నేత కార్మికులతో మరమగ్గాలు 400,000 గజాల గుడ్డను ఉత్పత్తి చేస్తాయనుకొందాం. నాలుగు రెట్లు హెచ్చిన ఈ ఉత్పాదితాల్లో నాలుగు రెట్లు ఎక్కువ ముడిపదార్థాలున్నాయి. కాబట్టి ముడిపదార్థాల ఉత్పత్తి కూడా నాల్గింతలు పెరగాలి. కానీ భవనాలు, బొగ్గు, యంత్రాలు మొదలయిన శ్రమ సాధనాల విషయంలో ఇలా ఉండదు. వాటి ఉత్పత్తికి కావలసిన అదనపు శ్రమ ఎంతవరకు పెరుగుతుందనేది, యంత్రోత్పాదిత వస్తువుల మొత్తానికీ, అంతేమంది కార్మికులు ఉత్పత్తి చేయగల అదే వస్తువుల మొత్తానికీ మధ్య భేదాన్ని బట్టి మారుతూంటుంది.

కాబట్టి, ఒకానొక పరిశ్రమలో యంత్రాల వాడకం విస్తరించే కొద్దీ, దాని తక్షణ ఫలితంగా ఆ పరిశ్రమకు ఉత్పత్తి సాధనాలను సరఫరా చేసే ఇతర పరిశ్రమల్లో ఉత్పత్తి పెరుగుతుంది. తద్వారా పని లభించే వారి సంఖ్య ఎంత పెరిగేదీ, పని దిన పరిమాణం, శ్రమ తీవ్రత నిర్ణీతమై ఉన్నప్పుడు, మదుపు పెట్టిన పెట్టుబడి అంతర్నిర్మాణంపై ఆధారపడి ఉంటుంది; అంటే దాని అంతర్గత స్థిర భాగానికీ అస్థిర భాగానికీ మధ్య నిష్పత్తిపై ఆధారపడి ఉంటుంది. ఈ నిష్పత్తి మళ్ళీ, యంత్రాలు ఆ పారిశ్రామిక శాఖలను ఏ మేరకు ఇదివరకే తన పట్టులోకి తెచ్చుకొన్నదీ, లేక పట్టులోకి తెచ్చుకొంటున్నది అనే దానిపై ఆధారపడి ఉంటుంది. ఇంగ్లీషు వారి ఫ్యాక్టరీ వ్యవస్థ వృద్ధి చెందినందువల్ల బొగ్గు, లోహపు గనుల్లో పనిచేసే దుర్గతిపాలయిన మనుషుల సంఖ్య బ్రహ్మాండంగా పెరిగింది; కానీ గని తవ్వకంలో కొత్త యంత్రాల వాడకం వల్ల, గత కొద్ది దశాబ్దాల్లో ఈ సంఖ్య పెరుగుదల వేగం తగ్గింది.[1] యంత్రంతోపాటు ఒక కొత్త తరహా కార్మికుడు, అంటే యంత్ర నిర్మాత రంగంపైకి వస్తాడు. యంత్రాలు ఈ ఉత్పత్తి శాఖను సైతం తన అధీనంలోకి తెచ్చుకొందనీ, అలా అధీనంలోకి తెచ్చుకొనే స్థాయి రోజు రోజుకూ పెరుగుతోందనీ మనం ఇదివరకే తెలుసుకొన్నాం.[2] ముడి పదార్థాల విషయం

1. 1861 జనాభా లెక్కల ప్రకారం (సం. II లండన్, 1863) ఇంగ్లండు, వేల్స్‌లలో బొగ్గు గనుల్లో పనిచేసేవారి సంఖ్య 246,613. వారిలో 20 ఏళ్ళలోపు వారు 173,067. 20 ఏళ్ళకు పైబడ్డవారు 73,547. 20 ఏళ్ళలోపువారిలో 20,835 మంది 5-10 ఏళ్ళ మధ్యవయసు వారు; 30,701 మంది 10-15 ఏళ్ళ మధ్య వయసువారు; 42,010 మంది వయసు 15-19 ఏళ్ళ మధ్య ఉంటుంది. ఇనుము, రాగి, సీసం, తగరం, తదితర అన్ని రకాల గనుల్లో పనిచేసేవారి సంఖ్య 319,222.

2. ఇంగ్లండు, వేల్స్‌లో 1861లో యంత్ర నిర్మాణ రంగంలో 60,807 మంది పనిచేసేవారు. వీరిలో ప్రవీణులూ, వారి గుమాస్తాలు మొదలయినవారు, ఈ పరిశ్రమతో సంబంధమున్న యావన్మంది ఏజెంట్లు, వర్తకులు చేరి ఉన్నారు. కానీ కుట్టుమిషన్లు మొదలయిన చిన్న చిన్న యంత్రాలను చేసేవారు, యంత్రాలలోని, కదుళ్ళవంటి ఉత్పాదన నిర్వాహక భాగాలను తయారుచేసేవారు ఇందులో చేరరు. మొత్తం సివిల్ ఇంజనీర్ల సంఖ్య 3,329.

తీసుకొంటే,[1] నూలు పరిశ్రమ సత్వర పురోగమనం ఉష్ణమండల సస్యసమృద్ధిని తోడ్పాటుగా చేసుకొని, అమెరికా సంయుక్త రాష్ట్రాల్లో పత్తి పంటకు, దానితోపాటు ఆఫ్రికన్ బానిస వ్యాపారానికి పెద్ద ఊపు నివ్వటమే కాక, సరిహద్దు బానిస వర్తకపు రాష్ట్రాల్లో బానిసల పెంపకాన్నీ ప్రధాన వ్యాపారంగా చేసింది. సందేహం లేదు, 1790లో సంయుక్త రాష్ట్రాలలో తొలిసారిగా బానిస జనాభా లెక్కలు తయారు చేసినప్పుడు, వారి సంఖ్య 697,000 ఉండేది. 1861లో అది దాదాపు నాలుగు మిలియన్లకు చేరుకొంది. మరోవైపు ఇంగ్లీషు ఉన్ని బట్టల ఫ్యాక్టరీల ఆవిర్భావం వల్లనూ, దానితోపాటుగా గొర్రెలను మేపే పచ్చిక పొలాలుగా వ్యవసాయ భూముల క్రమ క్రమ పరివర్తన వల్లనూ వ్యవసాయ కార్మికుల సంఖ్య అక్కరకు మించినదయింది. ఇది వారిని పట్టణాలకు మూకుమ్మడిగా తరిమింది. జనాభా గత 20 సంవత్సరాల్లో దాదాపు సగానికి తగ్గిపోయిన ఐర్లండులో ప్రస్తుతం దాని భూస్వాముల అవసరాలకు ఇంగ్లీషు ఉన్ని బట్ట పరిశ్రమదారుల అవసరాలకు సరిగ్గా సరిపోయేలా దాని జనాభా మరింత తగ్గిపోతోంది. శ్రమ గ్రహీత వస్తువు పూర్తిగా తయారైన స్థితికి చేరుకొనే మార్గంలో అది గడపవలసిన ప్రాథమిక, మధ్యంతర దశల్లో దేనికైనా యంత్రాలు వాడినప్పుడు, ఆ దశల్లోని పదార్థాల ఉత్పత్తి పెరుగుతుంది. అదే సమయంలో ఆ యంత్రాల ఉత్పాదితాలను అందుకొనే చేతివృత్తుల్లో లేక కార్ఖానా వస్తూత్పత్తుల్లో కార్మికులకు గిరాకీ పెరుగుతుంది. ఉదాహరణకు యంత్రాలతోనే వడకడం వల్ల చేనేత కార్మికుల నూలు ఎంత చౌకగా, ఎంత సమృద్ధిగా లభించిందంటే, వారు మొదట్లో, అదనపు డబ్బు మదుపు పెట్టకుండానే పూర్తి కాలం పనిచేయగలిగారు. తత్ఫలితంగా వారి ఆదాయాలు పెరిగాయి.[2] నూలు బట్టల నేత పరిశ్రమలోకి, అందువల్ల జనం ధారా ప్రవాహంగా వచ్చారు. జెన్నీ – దారానికి పురిపెట్టి చుట్టలు చుట్టే యంత్రం, వడికే యంత్రం – ఈ విధంగా రంగంపైకి తెచ్చిన 800,000 మంది చేనేత కార్మికులను తుట్టతుదకు మర మగ్గం నట్టేటిలో ముంచివేసింది. అదే విధంగా, యంత్రాలు ఉత్పత్తి చేసిన బట్ట సమృద్ధిగా ఉండటం వల్ల దర్జీలు, కుట్టుపని చేసే స్త్రీల, సూది కుట్టుపని చేసే స్త్రీల సంఖ్య, కుట్టు యంత్రం ఆవిర్భవించే వరకు పెరుగుతూ పోయింది.

సాపేక్షంగా తక్కువ మంది కార్మికుల సహాయంతో, యంత్రాలు ముడిపదార్థాల, మధ్యంతర ఉత్పాదితాల, శ్రమ సాధనాల పరిమాణాన్ని పెంచేకొద్దీ, ఈ ముడి పదార్థాలతో, మధ్యంతర ఉత్పాదితాలతో చేసే పని అసంఖ్యాక శాఖలుగా చీలిపోతుంది; సామాజిక ఉత్పత్తి వైవిధ్యం హెచ్చుతుంది. శ్రమ సామాజిక విభజనను కార్ఖానా వస్తూత్పత్తికన్నా ఫ్యాక్టరీ వ్యవస్థ అపారంగా ముందుకు తీసుకుపోతుంది. ఎందువల్లనంటే, ఫ్యాక్టరీ వ్యవస్థ తన గుప్పిట్లోకి తెచ్చుకొన్న పరిశ్రమల ఉత్పాదకతను పెంచే స్థాయి ఎంతో ఎక్కువ.

---

1. అతి ముఖ్యమైన ముడి పదార్థాలలో ఇనుము ఒకటి. కాబట్టి ఇక్కడొక విషయం చెప్పాలి : ఇంగ్లండు, వేల్స్‌లో 1861లో, 125,771 మంది ఇనుము ఫ్యాక్టరీ పనివారుండేవారు. వీరిలో 123,430 మంది పురుషులు, 2,341 మంది స్త్రీలు. పురుషుల్లో 20 ఏళ్ళలోపువారు 30,810; 20 ఏళ్ళకు పైబడ్డవారు 92,620.
2. "గత శతాబ్ది తుదిలోనూ, ప్రస్తుత దశాబ్ది ప్రారంభంలోనూ, నలుగురు పెద్దవాళ్ళున్న కుటుంబం కండెలు చుట్టే ఇద్దరు పిల్లలతో, రోజుకు పది గంటలు పనిచేసి, వారానికి 4 పౌండ్లు సంపాదించారు. పని ఒత్తిడి ఎక్కువగా ఉంటే వారు ఇంకా ఎక్కువ ఆర్జించగలిగారు. అంతకు ముందు వారికెప్పుడూ, తగినంత నూలు సరఫరా అయ్యేది కాదు." (గాస్కెల్, పూర్వోక్త గ్రంథం, పుటలు 25-27.)

అదనపు విలువ తనలో అదనపు విలువను పొందుపరచుకొన్న ఉత్పాదితాల రాశి – వీటి పెరుగుదల యంత్రాల తక్షణ ఫలితం. పెట్టుబడిదారులు, వారిపై ఆధారపడిన వారు వినియోగించే వస్తువులు మరింత సమృద్ధిగా లభించే కొద్దీ, ఈ సామాజిక వర్గాలు కూడా విస్తృతమవుతాయి. పెరుగుతున్న సంపదా, జీవనాధారాల ఉత్పత్తికి కావలసిన కార్మికుల సంఖ్య సాపేక్ష తగ్గుదలా, విలాస జీవితపు కొత్త అవసరాలతో పాటుగా, ఈ అవసరాలను తీర్చే సాధనాలను ఆవిర్భవింపచేస్తాయి. సమాజపు ఉత్పత్తిలో మరింత పెద్ద భాగం అదనపు ఉత్పత్తిగా మారుతుంది; ఈ అదనపు ఉత్పత్తిలో మరింత పెద్ద భాగం, అనేకానేక నాజూకు రూపాల్లో వినియోగానికై సరఫరా అవుతుంది. వేరు మాటల్లో చెప్పాలంటే, విలాస వస్తువుల ఉత్పత్తి పెరుగుతుంది.[1] ప్రపంచ మార్కెట్లతో ఏర్పడ్డ కొత్త సంబంధాలు కూడా ఈ ఉత్పాదితాల నాజూకు, బహువిధ నాజూకు రూపాలకు కారణం ఇవి ఆధునిక పరిశ్రమలు సృష్టించిన సంబంధాలు. దేశీయ ఉత్పాదితాలకు మరింత ఎక్కువ పరిమాణాల్లో విదేశీ విలాస వస్తువులు మార్పిడి కావడమే కాదు; విదేశీ ముడి పదార్థాలు, ఘటక ద్రవ్యాలు. మధ్యంతర ఉత్పాదితాలు కూడా మరింత ఎక్కువ పరిమాణంలో దేశీయ పరిశ్రమల్లో ఉత్పత్తి సాధనాలుగా వాడబడుతున్నాయి. ప్రపంచ మార్కెట్లతో ఈ సంబంధాల మూలంగా, రవాణా పరిశ్రమల్లో కార్మికులకు గిరాకీ పెరుగుతుంది; ఈ రవాణా పరిశ్రమలు బహువిధ శాఖలుగా చీలిపోతాయి.[2]

ఉత్పత్తి సాధనాలు, జీవనాధారాల పెరుగుదలా, దీనితోపాటు శ్రామికుల సంఖ్య సాపేక్ష తగ్గుదల మూలంగా, కాలువలు, రేవులు దొరువులు, సొరంగాలు, వంతెనలు, మొదలయిన వాటి నిర్మాణానికై కార్మికులకు గిరాకీ పెరుగుతుంది. ఇవి సుదూర భవిష్యత్తులో మాత్రమే ఫలితమిచ్చేవి. యంత్రాల ప్రత్యక్ష ఫలితంగానో, వాటివల్ల పారిశ్రామిక రంగంలో వచ్చిన సార్వత్రిక మార్పువల్లనో, పూర్తిగా కొత్తవైన ఉత్పత్తి శాఖలు కూడా ఏర్పడి, నూతన శ్రమ రంగాలను సృష్టిస్తాయి. కానీ సాధారణ ఉత్పత్తి రంగాలలో ఈ శాఖలకున్న స్థానం, అన్నిటికన్నా అభివృద్ధి చెందిన దేశాల్లో సైతం, ఎంత మాత్రమూ ముఖ్యమైనది కాదు. వాటిలో పని దొరికిన కార్మికుల సంఖ్య, అతి మొరటు శారీరక శ్రమ రూపానికి, ఆ పరిశ్రమలు కల్పించిన గిరాకీకి ప్రత్యక్ష అనులోమ నిష్పత్తిలో ఉంటుంది. ప్రస్తుతం గ్యాస్ ఉత్పత్తి సంస్థలు, టెలిగ్రాఫ్ శాఖలు, ఛాయాచిత్ర గ్రహణం, పొగ ఓడల ద్వారా రవాణా, రైల్వేలు ఈ విధమైన ప్రధాన పరిశ్రమలు. ఇంగ్లండు, వేల్స్‌లలో 1861 జనాభా లెక్కల ప్రకారం, గ్యాస్ పరిశ్రమలో (గ్యాస్ కర్మాగారాలు, యంత్ర పరికరాల ఉత్పత్తి, గ్యాస్ కంపెనీల నౌకర్లు, వగైరా) 15,211 మంది ఉన్నారు. టెలిగ్రాఫ్ శాఖలో 2,399 మంది, ఛాయాచిత్ర గ్రహణంలో 2,399 మంది, పొగ ఓడల రవాణాలో 3,570 మంది, రైల్వేలలో 70,599 మంది పనిచేస్తున్నారు. వీరిలో నైపుణ్యం లేని "నావికులు" ఇంచుమించు ఖాయపు పనివారు. వ్యవహార నిర్వాహక సిబ్బంది, వర్తక సిబ్బంది కలిసి దాదాపు 28,000 మంది ఉంటారు. కాబట్టి ఈ అయిదు పరిశ్రమల్లోనూ నియమితులైన వారి సంఖ్య 94,145.

---

1. ఫ్రెడరిక్ ఎంగెల్స్ "ఇంగ్లండులో కార్మికవర్గ పరిస్థితి" అన్న గ్రంథంలో ఈ విలాస వస్తువులను తయారు చేస్తున్న ఎంతోమంది దీనావస్థను గురించి చెబుతున్నాడు. "రిపోర్ట్స్ ఆఫ్ ది చిల్డ్రన్ ఎంప్లాయ్‌మెంట్ కమిషన్"లోని అనేక ఉదాహరణలను కూడా చూడండి.
2. 1861లో, ఇంగ్లండు, వేల్స్‌లలో వాణిజ్య నౌకల్లో 94,665 మంది నావికులుండేవారు.

ఆఖరు విషయం, ఆధునిక పరిశ్రమల అసాధారణ ఉత్పాదకత వల్లనేమి, దానితోపాటు, ఇతర ఉత్పాదక రంగాలన్నిటిలోనూ శ్రమశక్తి మరింత విస్తృతంగా, మరింత తీవ్రంగా దోపిడీకి గురి అవుతున్నందువల్లనేమి, కార్మిక వర్గంలో అంతకంతకు పెద్ద భాగాన్ని ఉత్పత్తేతరమైన పనుల్లో నియమించడానికి వీలవుతోంది. తత్కారణంగా నౌకరు వర్గం అనే పేరుతో ప్రాచీన గృహ బానిసలు పునఃసృష్టి అవుతున్నారు. వీరిలో మగనౌకర్లు, ఆడనౌకర్లు, యజమానిని అంటిపెట్టుకొని ఉండే బంట్లు (lackeys) మొదలయిన వారున్నారు. 1861 జనాభా లెక్కలను బట్టి ఇంగ్లండు, వేల్స్ జనాభా 20,066,244. వీరిలో పురుషులు 9,776,259 మంది. స్త్రీలు 10,289,965. పనిచేయలేని వృద్ధులను, పసిపిల్లలను, ఉత్పాదక రంగంలో లేని స్త్రీలను, యువజనులను, పిల్లలను, ప్రభుత్వోద్యోగులు, మతగురువులు, న్యాయవాదులు, సైనికులు మొదలయిన "భావజాలపు" వర్గాలను, ఇంతేకాక, కౌలు, వడ్డీ మొదలయిన వాటి రూపంలో ఇతరుల శ్రమను వినియోగించడం తప్ప మరే వృత్తీ లేనివారినీ, ఆఖరున పరమ దరిద్రులను, దేశదిమ్మరులనూ, నేరస్తులనూ తీసివేస్తే, అన్ని వయసుల్లోని దాదాపు 8 మిలియన్ల మంది స్త్రీ, పురుషులు మిగులుతారు. ఇందులో ప్రతి పెట్టుబడిదారూ ఉన్నాడు. ఏమైనా ఇతను పరిశ్రమ, వర్తకం లేదా పరపతి వ్యాపారంలో ఉన్నవాడే కదా! ఈ 8 మిలియన్ మందిలో :

| | మనుష్యుల సంఖ్య |
|---|---|
| వ్యవసాయ కార్మికులు (గొర్రెలు కాసేవారు, వ్యవసాయ క్షేత్రాల్లో నౌకర్లు, వ్యవసాయదారుల ఇంట్లో ఉండే పనికత్తెలు ... | 1,098,261 |
| నూలు, ఉన్ని, అల్లిక, ఎల్లిగిసెనార, జనపనార ఫ్యాక్టరీల్లో, యంత్రాలలో మేజోళ్ళు, లేస్ తయారీలో మొత్తం కార్మికులు ... | 642,607[1] |
| బొగ్గు, లోహపు గనుల్లో మొత్తం కార్మికులు ... | 565,834 |
| లోహ కర్మాగారాల్లో (బట్టీలు, రోలింగ్ మిల్లులు మొదలైనవి) అన్ని రకాల లోహపు ఉత్పత్తుల్లో మొత్తం కార్మికులు ... | 396,998[2] |
| నౌకర్ల వర్గం ... | 1,208,648[3] |

జౌళి ఫ్యాక్టరీల్లోనూ, గనుల్లోనూ పనిచేసే వారందరి మొత్తం సంఖ్య 1,208,442, జౌళి ఫ్యాక్టరీల్లో, లోహ పరిశ్రమల్లో పనిచేసే వారి మొత్తం సంఖ్య 1,039,605. రెండు సందర్భాల్లోనూ వీరి సంఖ్య ఆధునిక గృహ బానిసల సంఖ్య కన్నా తక్కువే. పెట్టుబడిదారీ పద్ధతిలో యంత్రాల వినియోగ ఫలితం ఎంత అద్భుతంగా ఉందీ!

---

1. వీరిలో, 13 ఏళ్ళకు పైబడిన మగవారు : 177,596 మంది మాత్రమే.
2. వీరిలో 30,504 మంది స్త్రీలు.
3. వీరిలో 137,447 మంది పురుషులు, ప్రైవేటు వ్యక్తుల ఇళ్ళలో పనిచేసే వారినెవ్వరినీ ఈ 1,208,648 మందిలో చేర్చలేదు. 1861-1870 మధ్య కాలంలో నౌకర్లుగా ఉన్న పురుషుల సంఖ్య దాదాపు రెట్టింపై, 267,710కి పెరిగింది. 1847లో భూస్వాముల సొంత అడవుల్లో మృగాలను ఇతరులు చంపకుండా కాచివుండే కావలివారి సంఖ్య 1847లో 2,694; 1869లో ఇది 4,921కు పెరిగింది. లండన్‌లోని కింది మధ్యతరగతి వారి ఇళ్ళలో ఉన్న పనిపిల్లలను మామూలుగా "దాసీలు" అని పిలుస్తారు.

## విభాగం-7

# ఫ్యాక్టరీ వ్యవస్థచే కార్మికుల నెట్టివేత, ఆకర్షణ నూలు బట్టల పరిశ్రమలో సంక్షోభం

కొత్త యంత్రాలను ప్రవేశపెట్టినప్పుడు, అవి తొలుత ఏ పాత చేతివృత్తులతో, కార్ఖానా వస్తూత్పత్తులతో పోటీపడ్డాయో వాటిలోని కార్మికులకు అది చేటు తెచ్చిందని రాజకీయ అర్థశాస్త్రజ్ఞులు అందరూ – వారే స్థాయి వారైనా సరే – అంగీకరిస్తున్నారు. ఫ్యాక్టరీ కార్మికుని బానిసత్వం గురించి దాదాపు వారందరూ దుఃఖపడుతున్నారు. మరి వారు ఆడే పెద్ద తురుపు ముక్క ఏమిటి? యంత్రాలను ప్రవేశపెట్టి, అభివృద్ధిపరచిన దశలో జరిగిన ఘోరాలు సద్దుమణిగిన తరువాత, సాగిన సుదీర్ఘకాలంలో బానిస కార్మికుల సంఖ్య తగ్గడానికి బదులు పెరిగింది. యంత్రాలపై ఆధారపడిన ఫ్యాక్టరీ వ్యవస్థ తదభివృద్ధి, పరిణామ దశ తరువాత, దాని మకుటాయమాన విజయం తరువాత సైతం తన తొలి రంగప్రవేశం వల్ల వీధుల్లోకి నెట్టివేయబడిన దానికన్నా ఎక్కువమంది కార్మికులను రాచిరంపాన పెడుతుందన్న భయంకర సిద్ధాంతంలో (పెట్టుబడిదారీ ఉత్పత్తి శాశ్వతమైన ప్రకృతి నిర్దేశిత ఆవశ్యకత అని నమ్మే ప్రతి "జీవకారుణ్యవాదికీ" భయంకరమైన ఈ సిద్ధాంతంలో) రాజకీయ అర్థశాస్త్రం ఆనందోత్సాహాలతో మునిగి తేలుతోంది.[1]

ఆంగ్లేయుల అల్లిక, పట్టు వస్త్రాల ఫ్యాక్టరీల విషయంలో మనం చూచినట్లు, కొన్ని సందర్భాల్లో ఫ్యాక్టరీ వ్యవస్థ అసాధారణంగా విస్తరించినప్పుడు, దాని ఒకానొక దశలో, ఫ్యాక్టరీ కార్మికుల సంఖ్య సాపేక్షంగానే కాక, నిరపేక్షంగా కూడా తగ్గవచ్చుననేది నిజమే. 1860లో పార్లమెంటు ఉత్తర్వుపై యునైటెడ్ కింగ్‌డమ్‌లో యావత్తూ ఫ్యాక్టరీల వివరాలను ప్రత్యేకంగా 1860లో సేకరించారు; ఫ్యాక్టరీ ఇన్‌స్పెక్టర్ బేకర్‌కు సంబంధించిన జిల్లాలో చేరి ఉన్న లాంక్‌షైర్, చెషైర్, యార్క్‌షైర్‌లోని భాగాల్లోని ఫ్యాక్టరీల సంఖ్య ఆ సంవత్సరంలో 652; వీటిలో 570 ఫ్యాక్టరీల్లో 85,622 మరమగ్గాలు, 681,914

1. గానిల్ అభిప్రాయం ఇందుకు భిన్నమైనది. ఫ్యాక్టరీ వ్యవస్థ ఫలితంగా, అందులోని కార్మికుల సంఖ్య మొత్తంపై తగ్గుతుందనీ, వారి కష్ట ఫలితంపైనే "మర్యాదస్తులు" బతుకుతున్నారనీ, తమ సుప్రసిద్ధ "పరిపూర్ణతను" వృద్ధి చేస్తున్నారనీ ఆయన భావిస్తున్నారు. ఉత్పత్తి గమనాన్ని ఆయన అర్థం చేసుకోలేదు. అయినా యంత్రాల రంగ ప్రవేశం, పని చేస్తున్న కార్మికులను పరమ దరిద్రులుగా మార్చాయంటే, వాటి అభివృద్ధి వల్ల అణగారిపోయిన వారికన్నా ఎక్కువమంది బానిస కార్మికులు ఆవిర్భవించారంటే, అది చాలా ప్రాణాంతకమైన వ్యవస్థ అయి ఉంటుందని ఆయనకు తోస్తోంది. ఆయన దృక్పథంలోని బుద్ధిమాంద్యాన్ని ఆయన సొంత మాటలను ఉదహరించడం ద్వారా తప్ప, స్పష్టం చేయడం అసాధ్యం: "ఉత్పత్తి చేయడం, వినియోగించడమన్న దుర్గతిపాలయిన వర్గాలు తగ్గుతూ పోతాయి. శ్రమను నడుపుతూ, మొత్తం జనాభాకు విశ్రాంతి, ఊరట, విజ్ఞానం ప్రసాదించే వర్గాలు పెరుగుతాయి. శ్రమకయ్యే వ్యయం తగ్గిన ఫలితంగానూ, సరకులు సమృద్ధిగా సరఫరా కావడం వల్లనూ, వినియోగ వస్తువుల చౌకధరల వల్లనూ లభించే సమస్త సదుపాయాలను స్వాయత్తం చేసుకొంటాయి. వీటి నాయకత్వాన మానవజాతి, ప్రతిభా సృజనశీలతల అత్యున్నత శిఖరాలందుకొంటుంది; మత నిగూఢ రహస్యాల లోతులను తరచి చూస్తుంది. ఉదాత్త నైతిక సూత్రాలను స్థాపిస్తుంది." (సూత్రాలు అన్ని సదుపాయాలను స్వాయత్తం చేసుకోవడం, వగైరా) "స్వేచ్ఛా రక్షణకు శాసనాలకూ" ("ఉత్పత్తి చేసే దుర్గతిపాలయిన వర్గాల" స్వేచ్ఛా ఇది?) "విధేయత, న్యాయాల శక్తినీ, బాధ్యత, మానవతల శక్తినీ స్థాపిస్తుంది." ఈ పిచ్చి వాగుడు సింగానిల్ రాసిన డే సిస్టమే డి ఎకానమీ పొలిటిక్, 2వ కూర్పు, పారిస్, 1821, సం. 1, పుట 224, 212లో ఉంది.

కదుళ్ళు (జోడు కదుళ్ళు కాక) ఉండేవి. ఇవి 27,439 (ఆవిరి) అశ్వ శక్తిని, 1,390 (జల) అశ్వ శక్తినీ వినియోగించేవి; వీటిలో నియమితులైన పనివారి సంఖ్య 94,119. 1865లో ఇదే ఫ్యాక్టరీలో 95,163 మగ్గాలు; 7,025,031 కదుళ్ళు ఉన్నాయి. ఇవి 28,925 ఆవిరి అశ్వ శక్తినీ, 1,445 జల అశ్వ శక్తినీ వినియోగించాయి; వీటిలో 88,913 మంది పనిచేసే వారు. కాబట్టి 1860–1865 మధ్యకాలంలో, మర మగ్గాల సంఖ్య 11 శాతం, కదుళ్ళు సంఖ్య 3 శాతం, ఇంజన్ శక్తి 3 శాతం పెరిగాయి. కానీ పనివారి సంఖ్య $5\frac{1}{2}$ శాతం తగ్గింది.[1] 1851–1862 మధ్య ఆంగ్లేయుల ఉన్ని పరిశ్రమ గణనీయంగా విస్తరించింది. కానీ అందులో నియమితులైన పనివారి సంఖ్య దాదాపు స్థిరంగా ఉండింది. కొత్త యంత్రాలను ప్రవేశపెట్టడం వల్ల మునుపటి దశల్లోని శ్రమ ఎలా రద్దయిందో ఇది తెలుపుతోంది.[2] కొన్ని సందర్భాల్లో, పనివారి సంఖ్య పెరిగినట్లు పైకి కనిపిస్తుంది; అంటే ఈ పెరుగుదలకు కారణం ఇదివరకే స్థాపితమై ఉన్న ఫ్యాక్టరీల విస్తరణ కాదు; సంబంధిత పరిశ్రమలను క్రమంగా వాటిలో కలిపివేసుకోవడం దానికి కారణం; ఉదాహరణకు, 1838–1856 మధ్య కాలంలో మర మగ్గాల సంఖ్యా, వాటిలో నియమితులైన పనివారి సంఖ్యా నూలు బట్టల పరిశ్రమలో పెరగడానికి, ఈ పారిశ్రామిక శాఖ విస్తరణకు కారణం. కానీ ఇతర పారిశ్రామిక శాఖల్లో, తివాచీ నేసే మగ్గానికి, రిబ్బన్ నేసే మగ్గానికి, ఎల్లిగిసెనార బట్టల మగ్గానికి ఆవిరి శక్తిని వినియోగించడం వల్ల పనివారి సంఖ్య పెరిగింది. ఇవి మునుపు మానవుని శ్రమ శక్తితో[3] నడిచేవి కాబట్టి, ఆఖరున పేర్కొన్న ఈ పారిశ్రామిక శాఖల్లో పనివారి సంఖ్య పెరుగుదల, పనివారి మొత్తం సంఖ్య తగ్గుదలకు సూచికే. ఆఖరు విషయం ఈ సమస్యను మనం ఒక వాస్తవానికి సంబంధం లేకుండా పరిశీలించాం. అదేమిటంటే, లోహ పరిశ్రమల్లో తప్ప, సర్వత్రా ఫ్యాక్టరీ పనివారి వర్గంలో ఎక్కువగా ఉండేది (18 ఏళ్ళలోపు) పిన్నవారు, స్త్రీలు, పిల్లలు.

అయినా, యంత్రాలు పనివారిని పెద్ద సంఖ్యలో వాస్తవంలో తొలగించి, వారి స్థానాన్ని, ఆచరణలో ఆక్రమించినప్పటికీ ఒక నిర్ణీత పరిశ్రమలో మరిన్ని మిల్లుల నిర్మాణం ద్వారా, పాత వాటి విస్తరణ ద్వారా ఫ్యాక్టరీ కార్మికుల సంఖ్య, స్థానభ్రంశం పొందిన కార్ఖానా కార్మికుల సంఖ్యను, చేతివృత్తుల వారి సంఖ్యను మించిపోవచ్చు. ఉదాహరణకు, పాత ఉత్పత్తి విధానంలో ఏటా 500

---

1. "1865 అక్టోబరు 31 ఫ్యాక్టరీ ఇన్‌స్పెక్టర్ల నివేదికలు", పుట 58, తరువాతి పుటలు. కానీ అదే సమయంలో, 11,625 మగ్గాలు, 628,576 కదుళ్ళు, మొత్తం 2,695 ఆవిరి, జల, అశ్వ శక్తి గల 110 కొత్త మిల్లుల్లో అదనపు సంఖ్యలో పనివారికి ఉపాధులు సిద్ధంగా ఉండేవి. (పూర్వోక్త గ్రంథం)
2. "1862 అక్టోబరు 31 ఫ్యాక్టరీ ఇన్‌స్పెక్టర్లు నివేదికలు" పుట 79. 1871వ సంవత్సరాంతంలో ఫ్యాక్టరీ ఇన్‌స్పెక్టర్ ఎ. రెడ్‌గ్రేవ్ బ్రాడ్ ఫోర్డ్‌లోని, కొత్త మెకానిక్కుల ఇన్‌స్టిట్యూట్‌లో ఇచ్చిన ఉపన్యాసంలో ఇలా చెప్పారు : "కొన్నాళ్ళుగా నాకు, కొట్టవచ్చినట్లు కనిపించిందేమిటంటే, ఉన్ని ఫ్యాక్టరీల రూపంలో వచ్చిన మార్పు. మునుపు అవి స్త్రీలు, పిల్లలతో నిండి ఉండేవి. ఇప్పుడు యంత్రాలే పనంతా చేస్తున్నట్లుంది. దీనికి కారణమేమని ఒక పరిశ్రమదారును అడగ్గా, అతను కింది కారణం చెప్పాడు : పాత వ్యవస్థలో నేను 63 మందిని పనిలో పెట్టుకొన్నాను. మెరుగైన యంత్రాలను ప్రవేశపెట్టిన తరువాత నా పనివారి సంఖ్యను 33కు తగ్గించాను." (ఇటీవల, విస్తృతమైన కొత్త మార్పుల పర్యవసానంగా 33 మందిని 13 మందికి తగ్గించగల స్థితికి వచ్చాను.)
3. "1856 అక్టోబరు 31 ఫ్యాక్టరీ ఇన్‌స్పెక్టర్ల నివేదికలు" పుట 16 చూడండి.

పౌండ్ల పెట్టుబడిని మదుపు పెట్టారనీ, దానిలో అయిదింట రెండు పాళ్ళు స్థిర పెట్టుబడి, అయిదింట మూడు పాళ్ళు అస్థిర పెట్టుబడి అని అనుకొందాం. అంటే, 200 పౌండ్లు ఉత్పత్తి సాధనాలకూ, 300 పౌండ్లు శ్రమ శక్తికీ (మాట వరుసకు, మనిషికి ఒక పౌండు చొప్పున) మదుపు పెట్టారన్న మాట. యంత్రాలను ప్రవేశపెట్టడంతో ఈ పెట్టుబడి అంతర్నిర్మాణ స్వరూపం మారుతుంది. ఇప్పుడు అందులోని స్థిర పెట్టుబడి, అయిదింట నాలుగు పాళ్ళు, అస్థిర పెట్టుబడి అయిదింట ఒక పాలు ఉందనుకొందాం. అంటే 100 పౌండ్లు మాత్రమే శ్రమ శక్తికి మదుపు పెట్టారన్న మాట. ఫలితంగా కార్మికుల్లో మూడింట రెండు వంతుల మంది పని నుంచి తొలగింపబడ్డారన్న మాట. ఇప్పుడు, వ్యాపారం విస్తరించి, పరిస్థితులు మారకుండా ఉన్న స్థితిలో మదుపు పెట్టిన మొత్తం పెట్టుబడి, 1,500 పౌండ్లకు పెరిగినప్పుడు, పనిలో నియమితులయ్యే కార్మికుల సంఖ్య 300కు, అంటే యంత్రాలు ప్రవేశించక మునుపు ఉన్నంత సంఖ్యకు పెరుగుతుంది. పెట్టుబడి 2,000 పౌండ్లకు పెరిగినట్లయితే, 400 మంది, అంటే పాత వ్యవస్థ కింద ఉన్నదానికన్నా మూడో వంతు ఎక్కువమంది నియమితులవుతారు. వాస్తవంలో వారి సంఖ్య సాపేక్షంగా మాత్రమే పెరిగింది. అంటే, మదుపు పెట్టిన మొత్తం పెట్టుబడిని బట్టి చూస్తే, వారు 800 మేరకు తగ్గారు. ఎందువల్లనంటే, పాత పరిస్థితుల్లో, 2000 పౌండ్ల పెట్టుబడి, 400 మందికి బదులు 1,200 మందిని నియమించి ఉండేది. కాబట్టి పనివారి సంఖ్యలో సాపేక్ష తగ్గుదల వాస్తవ పెరుగుదలకు పొసగేది. మొత్తం పెట్టుబడి పెరిగినప్పుడు, ఉత్పత్తి పరిస్థితులు స్థిరంగా ఉన్నాయి కాబట్టి, ఆ పెట్టుబడి అంతర్నిర్మాణ స్వరూపం యధాతథంగా ఉందని పైన ఊహించుకొన్నాము. కానీ, యంత్రాల వాడకంలోని ప్రతి ప్రగతిలో పెట్టుబడిలోని స్థిర భాగం, అంటే యంత్రాలు, ముడిపదార్థాలు మొదలయిన వాటి రూపంలో ఉన్న భాగం పెరగ్గా, అస్థిర భాగం, అంటే శ్రమ శక్తికై మదుపు పెట్టిన భాగం తగ్గుతుందని, ఇదివరకే చూచాము. మరే ఉత్పత్తి వ్యవస్థలోనూ అభివృద్ధి, ఫ్యాక్టరీ వ్యవస్థలో అంత అవిచ్ఛిన్నమైనది కాదనీ, మదుపు పెట్టిన పెట్టుబడి అంతర్నిర్మాణం అంత స్థిరంగా మారుతుండదనీ కూడా తెలుసుకొన్నాము. కానీ, ఈ మార్పులకు విశ్రాంతి దశలు అడ్డు తగులుతుంటాయి. ఈ దశల్లో అప్పుడున్న సాంకేతిక ప్రాతిపదికపై ఫ్యాక్టరీలు కేవలం పరిమాణాత్మకంగా విస్తరిస్తుంటాయి. అటువంటి దశల్లో ఫ్యాక్టరీ పనివారి సంఖ్య పెరుగుతుంది. ఉదాహరణకు, 1835లో యునైటెడ్ కింగ్‌డమ్‌లో నూలు, ఉన్ని, అల్లిక, ఎల్లగిసెనార, పట్టు వస్త్రాల ఫ్యాక్టరీల్లోని మొత్తం పనివారి సంఖ్య 354,685 మాత్రమే. కానీ 1861లో, మరమగ్గాల నేత కార్మికుల (ఎనిమిదేళ్ళకు పైబడ్డ అన్ని వయసుల స్త్రీ, పురుషుల) సంఖ్య 230,654. ఒక విషయాన్ని దృష్టిలో ఉంచుకొంటే ఈ పెరుగుదలకు అంత ప్రాముఖ్యం లేదు. అదేమంటే, ఆసియాలోనూ, యూరపు ఖండంలోనూ పని నుండి తొలగింపబడిన వారి మాట అటుంచి, బ్రిటన్‌లో 1838 నాటికి సైతం ఉన్న చేనేత కార్మికులు, వారి కుటుంబాలతో కలిసి 800,000.[1]

1. "చేనేత కార్మికుల బాధలపై, ఒక రాయల్ కమిషన్ విచారణ జరిగింది. వారి దురవస్థను గుర్తించడం, వాపోవడం జరిగినా, వారి స్థితులను బాగుపరిచే పనిని అదృష్ట దేవతకు, కాలగతిలో మార్పులకు బహుశా తప్పనిసరియై వదలివేశారు. ఇవి ఆ దీనావస్థను దాదాపు తుడిచి వేశాయని నేడు (20 ఏళ్ళ తరువాత) ఆశించవచ్చు. మరమగ్గాలు ఈనాడు బ్రహ్మాండంగా విస్తరించడం వల్ల ఇలా జరిగి ఉంటుందనేది అసంభవం కాదు." ("ఫ్యాక్టరీ ఇన్‌స్పెక్టర్ల నివేదికలు, 1856 అక్టోబరు 31," పుట 15)

1831–1866 సంవత్సరాల మధ్య బ్రిటన్‌లోకి దిగుమతి అయిన, అక్కడ నుంచి ఎగుమతి అయిన అన్ని రకాల ధాన్యం, ధాన్యప్పిండి మొత్తం పరిమాణాల గురించిన వివరణ పత్రం తయారు చేయవలసిందిగా, 1867 ఫిబ్రవరి 27న, కామన్స్ సభ, గ్లాడ్‌స్టన్ ప్రతిపాదనపై ఉత్తర్వు చేసింది. దాని ఫలితాలను సంగ్రహంగా కింద ఇస్తున్నాను. ఇందులో పిండి వివరాలు, ధాన్యం క్వార్టర్లలో ఇవ్వబడింది. కింది పట్టిక చూడండి.

**పంచవర్ష కాలాల, 1866వ సంవత్సరం లెక్క**

| వార్షిక సగటు | 1831-1835 | 1836-1840 | 1841-1845 | 1846-1850 | 1851-1855 | 1856-1860 | 1861-1865 | 1866 |
|---|---|---|---|---|---|---|---|---|
| దిగుమతి (క్వార్టర్లలో) | 1,096,373 | 2,389,729 | 2,843,865 | 8,776,552 | 8,345,237 | 10,913,612 | 15,009,871 | 16,457,340 |
| ఎగుమతి (క్వార్టర్లలో) | 225,263 | 251,770 | 139,056 | 155,461 | 307,491 | 341,150 | 302,754 | 21,628 |
| దిగుమతి కన్నా అదనంగా ఉన్న ఎగుమతి పరిమాణం | 871,110 | 2,137,959 | 2,704,809 | 8,621,091 | 8,037,746 | 10,572,462 | 14,707,117 | 16,241,122 |
| **జనాభా** | | | | | | | | |
| ప్రతి పంచవర్ష కాలంలోని వార్షిక సగటు | 24,621,107 | 25,929,507 | 27,262,569 | 27,797,598 | 27,572,923 | 28,391,544 | 29,381,460 | 29,935,404 |
| దేశీయ ఉత్పత్తులకు మించి ఏటా తలసరి వినియోగమైన ధాన్యం వగైరా సగటు పరిమాణం, క్వార్టర్లలో | 0.036 | 0.082 | 0.099 | 0.310 | 0.291 | 0.372 | 0.501 | 0.543 |

ఈ విషయంపై నేనింకా చేయవలసిన ఉన్న కొద్ది వ్యాఖ్యానాల్లో వాస్తవంగా ఉన్న కొన్ని సంబంధాలను గురించి ప్రస్తావిస్తాను; ఇవి ఉన్నట్లు, మా సైద్ధాంతిక పరిశీలన ఇంకా వెల్లడించలేదు.

ఒక నిర్ణీత పరిశ్రమలో ఫ్యాక్టరీ వ్యవస్థ పాత చేతివృత్తులను, కార్ఖానా ఉత్పత్తులను దెబ్బతీసి, విస్తరిస్తున్నంత కాలం దీని ఫలితం, తుపాకీలున్న సైన్యానికీ, విల్లంబులున్న సైన్యానికీ మధ్య జరిగే ఘర్షణ ఫలితమంత నిశ్చితమైనది. యంత్రాలు తమ కార్యాచరణ రంగాన్ని జయించే ఈ తొలిదశ నిర్ణయాత్మకంగా ముఖ్యమైనది. కారణం, అసాధారణ లాభాలను గడించేందుకు అది సహాయపడుతుంది. ఈ లాభాలు పెట్టుబడి సత్వర సంచయనానికి మూలాధారం కావడమే కాదు; నిరంతరం సృష్టి అవుతూ, కొత్త మదుపుల కోసం వెదికే అదనపు సామాజిక పెట్టుబడిలో ఒక పెద్ద భాగాన్ని అది అనుకూలమైన ఈ ఉత్పత్తి రంగంలోకి ఆకర్షిస్తుంది కూడా. యంత్రాలు దండెత్తే ప్రతి ఉత్పత్తి శాఖలోనూ, వేగంగా, ఉగ్రంగా కార్యకలాపాలు జరిగే ఈ తొలి దశ ప్రత్యేక ప్రయోజనాలు అనుభూతమవుతాయి. కానీ, ఫ్యాక్టరీ వ్యవస్థ కొంత మేరకు స్థానం సంపాదించి, నిర్దిష్టమైన పరిణత స్థాయిని అందుకొన్న వెంటనే, ప్రత్యేకించి, దాని సాంకేతిక ప్రాతిపదిక అయిన యంత్రాలనే యంత్రాలు ఉత్పత్తి చేసిన వెనువెంటనే, బొగ్గు గనులు, ఇనుప గనుల తవ్వకం లోహ పరిశ్రమలు, రవాణా సాధనాల్లో విప్లవం వచ్చిన వెనువెంటనే, ఒక్క ముక్కలో చెప్పాలంటే, ఆధునిక పారిశ్రామిక వ్యవస్థ ద్వారా ఉత్పత్తి జరగడానికి  కావలసిన సాధారణ పరిస్థితులు ఏర్పడిన వెనువెంటనే ఈ ఉత్పత్తి విధానం ఒక విధమైన స్థితిస్థాపక గుణాన్ని, అమాంతంగా ఉరకలు, పరుగులతో విస్తరించే శక్తిని సంతరించుకొంటుంది; ముడి పదార్థాల సరఫరాల్లో ఉత్పాదిత వస్తువుల అమ్మకంలో తప్ప మరెందునా ఆ శక్తికి అడ్డంకి ఉండదు. ఒకవైపు, యంత్రాల తక్షణ ఫలితంగా, ముడి పదార్థాల సరఫరా పెరుగుతుంది. ఉదాహరణకు, పత్తి, జిన్ను మూలంగా దూది ఉత్పత్తి పెరిగిన విధంగా,[1] మరోవైపు, యంత్రాలు ఉత్పత్తి చేసే వస్తువుల చౌకదనమూ, మెరుగైన రవాణా వార్తా ప్రసార సాధనాలూ విదేశీ మార్కెట్లను కైవసం చేసుకొనే ఆయుధాలవుతాయి. ఇతర దేశాల్లో చేతివృత్తుల ఉత్పత్తిని నాశనం చేయడం ద్వారా యంత్రాలు ఆ దేశాలను తమకు ముడి పదార్థాలను సరఫరా చేసే ప్రదేశాలుగా బలాత్కారంతో మార్చివేస్తాయి. ఈ విధంగా ఈస్టిండియా (భారతదేశం–అను) దూది, ఉన్ని, గోగు, జనపనారలను, నీలిమందును ఉత్పత్తి చేయక తప్పలేదు.[2] శ్రామికుల్లో ఒక భాగాన్ని నిరంతరం, "అవసరానికి మించినదిగా" చేయడం ద్వారా ఆధునిక పరిశ్రమలు, తాము వేరుదన్నిన సమస్త దేశాల్లో, ప్రజల వలసకూ, విదేశాల్లో వారి స్థిరావాసాల స్థాపనకై గట్టి ప్రోద్బలమిస్తాయి. ఫలితంగా ఆ దేశాలు మాతృదేశం కోసం ముడిపదార్థాలను పండించే జనావాసాలుగా మారుతాయి. ఆస్ట్రేలియా ఉన్నిని ఉత్పత్తి చేసే వలసగా మారడం ఇందుకొక ఉదాహరణ.[3] ఒక కొత్త శ్రమ అంతర్జాతీయ

---

1. యంత్రాలు ముడిపదార్థాల ఉత్పత్తిని ప్రభావితం చేసే ఇతర మార్గాలు మూడవ సంపుటిలో పేర్కొంటాము.
2. ఇండియా నుండి గ్రేట్ బ్రిటన్‌కు పత్తి ఎగుమతి, 1846లో 34,540,143 పౌన్లు. 1860లో 204,141,168 పౌన్లు. 1865లో 445,947,600 పౌన్లు (ఇండియా నుంచి గ్రేట్ బ్రిటన్‌కు ఉన్ని ఎగుమతి, 1846లో 4,570,581 పౌన్లు. 1860లో 20,214,173 పౌన్లు. 1865లో 20,679,111 పౌన్లు).
3. కేప్ నుంచి గ్రేట్ బ్రిటన్‌కు ఉన్ని ఎగుమతి 1846లో 2,958,457 పౌన్లు. 1860లో 16,574,345 పౌన్లు. 1865లో 29,920,623 పౌన్లు. ఆస్ట్రేలియా నుంచి గ్రేట్ బ్రిటన్‌కు ఉన్ని ఎగుమతి 1846లో 21,789,346 పౌన్లు. 1860లో 59,166,616 పౌన్లు. 1865లో 109,734,261 పౌన్లు.

విభజన – ఆధునిక పరిశ్రమల ప్రధాన కేంద్రాలకు అనుకూలమైన విభజన తలయెత్తుతుంది. అది ప్రపంచంలో ఒక భాగాన్ని మిగతా భాగానికి సరఫరా చేసేందుకై, ప్రధానంగా వ్యవసాయ సరకులను ఉత్పత్తి చేసే రంగంగా మారుస్తుంది; మిగతా భాగం ప్రధానంగా పారిశ్రామిక రంగంగానే ఉండిపోతుంది. ఈ విప్లవం, వ్యవసాయంలో తీవ్రమైన మార్పులతోపాటు సాగుతుంది. ఈ విషయాన్ని ఇక్కడ మరింత పరిశీలించవలసిన అవసరం లేదు.[1]

ఫ్యాక్టరీ వ్యవస్థకు గంతులతో విస్తరించే బ్రహ్మాండమైన స్వతఃసిద్ధ శక్తి ఉండటం వల్లనేమి, ఆ వ్యవస్థ ప్రపంచ మార్కెట్లపై ఆధారపడి ఉన్నందువల్లనేమి, అది ఉన్మత్తంగా ఉత్పత్తి చేస్తుంది. పర్యవసానంగా మార్కెట్లు, ఉత్పత్తులతో నిండి నిబిడీకృతమవుతాయి. ఆపై, మార్కెట్లు కుంచించుకు పోయినందు వల్ల ఉత్పత్తి దెబ్బతింటుంది. ఒక మోస్తరు కార్యకలాపాలు, అభివృద్ధి, మితిమీరిన ఉత్పత్తి, సంక్షోభం, స్తబ్దతా దశల పరంపరగా ఆధునిక పరిశ్రమల జీవితం తయారవుతుంది. ఫ్యాక్టరీ కార్మికుల ఉపాధులు, తత్ఫలితంగా వారి జీవన పరిస్థితులు యంత్రాల మూలంగా లోనయ్యే అనిశ్చిత స్థితి, అస్థిరతా, పారిశ్రామిక ఆవృత్తిలో, నియమిత సమయాల్లో వచ్చే మార్పుల వల్ల, మామూలు విషయమవుతాయి. మార్కెట్లలో తమ తమ వాటా కోసం పెట్టుబడిదారుల మధ్య, అభివృద్ధి దశల్లో తప్ప, భీషణ పోరాటం చెలరేగుతుంది. ఈ వాటా ఉత్పాదితం యొక్క చౌకదనానికి అనులోమానుపాతంలో

1. అమెరికా సంయుక్త రాష్ట్రాల ఆర్థికాభివృద్ధి, యూరోపియన్ల ప్రత్యేకించి, ఇంగ్లీషువారి ఆధునిక పరిశ్రమల ఫలితం. సంయుక్త రాష్ట్రాలున్న ప్రస్తుత రూపంలో అవి ఒక యూరోపియన్ వలసగా ఇప్పటికీ పరిగణించవలసి ఉంటుంది. **నాల్గవ జర్మన్ కూర్పులో చేర్చిన మాటలు.** ("ఆ తరువాత అది, ప్రపంచంలో పారిశ్రామికంగా రెండవ స్థానం వహిస్తున్న దేశంగా అభివృద్ధి చెందింది. అయితే, ఆ కారణాన అవి తమ వలస లక్షణాన్ని పూర్తిగా కోల్పోవడం జరగలేదు." ఫ్రెడరిక్ ఎంగెల్స్)

**సంయుక్త రాష్ట్రాల నుంచి గ్రేట్ బ్రిటన్‌కు పత్తి ఎగుమతి**

1846లో 401,949,393 పౌన్లు. 1852లో 765,630,543 పౌన్లు.
1859లో 961,707,264 పౌన్లు. 1860లో 1,115,890,680 పౌన్లు.

**సంయుక్త రాష్ట్రాల నుంచి గ్రేట్ బ్రిటన్‌కు ధాన్యం వగైరాల ఎగుమతి**

| | 1850 | 1862 |
|---|---|---|
| గోధుమ – హండ్రెడ్ వెయిట్లు | 16,202,312 | 41,033,503 |
| బార్లీ " | 3,669,653 | 6,624,800 |
| ఓట్ ధాన్యం " | 3,174,801 | 4,426,994 |
| రై ధాన్యం " | 388,749 | 7,108 |
| పిండి " | 3,819,440 | 7,207,113 |
| బక్‌వీట్ " | 1,054 | 19,571 |
| మొక్కజొన్న " | 5,473,161 | 11,694,818 |
| బరేలేదాబిగ్ (ఒక రకమైన బార్లీ) " | 2,039 | 7,675 |
| బటాణీ " | 811,620 | 1,024,722 |
| బీన్స్ " | 1,822,972 | 2,037,137 |
| **మొత్తం ఎగుమతులు "** | **35,365,801** | **74,083,441** |

ఉంటుంది. ఈ పోరాటం, శ్రమ శక్తికి బదులు మరింత మెరుగైన యంత్రాల, కొత్త ఉత్పాదక పద్ధతుల వాడకంలో తెచ్చిపెట్టే పోటీ మాత్రమే కాక, సరకులను చౌకపరిచేందుకై వేతనాలను శ్రమ శక్తి విలువకన్నా తక్కువ స్థాయికి బలవంతాన తగ్గించే సమయం కూడా ప్రతి పారిశ్రామిక ఆవృత్తిలో వస్తుంది.[1]

కాబట్టి ఫ్యాక్టరీ కార్మికుల సంఖ్య పెరగాలంటే, మిల్లుల్లో మదుపు పెట్టే పెట్టుబడి మొత్తం అంతకన్నా చాలా త్వరగా పెరగడం తప్పనిసరిగా అవసరం. కానీ ఈ పెరుగుదల పారిశ్రామిక ఆవృత్తి ఆటుపోటులను బట్టి ఉంటుంది. అదీకాక, ఒకప్పుడు కొత్త కార్మికులకు ఆచరణలో స్థానం కల్పిస్తూ, మరొకప్పుడు పాత కార్మికులను యధార్థంగా తొలగించే సాంకేతిక ప్రగతి ఈ పెరుగుదలకు ఎల్లప్పుడూ అంతరాయం కలిగిస్తూంటుంది. యంత్ర పరిశ్రమలోని ఈ గుణాత్మకమైన మార్పు ఫ్యాక్టరీలోని కార్మికులను నిరంతరం పని నుంచి తొలగిస్తుంది. లేదా కొత్తగా పనిలో చేరనున్న వారికి ఫ్యాక్టరీ తలుపులు మూసివేస్తుంది; కానీ ఫ్యాక్టరీల కేవల పరిమాణాత్మక విస్తరణ, పని నుంచి తొలగించబడిన వారినేకాక, కొత్త కార్మిక దళాలను కూడా ఇముడ్చుకొంటుంది. ఈ విధంగా కార్మికులను నెట్టివేయడం, ఆకర్షించడం, ఒకచోటినుంచి మరోచోటికి తరమడం జరుగుతుంది; అదే సమయంలో పనిలోకి సమీకరించే కార్మికుల స్త్రీ పురుష నిష్పత్తిలో, వయసులో, నైపుణ్యంలో నిరంతరం మార్పులు జరుగుతాయి.

---

1. లాకౌట్‌వల్ల వీధుల్లోకి నెట్టబడిన లీసెస్టర్‌లోని ముచ్చీలు 1866 జులైలో ఇంగ్లండు పారిశ్రామిక సంఘాలకు ఒక విజ్ఞప్తి చేశారు. అందులో ఇలా ఉంది : "కుట్టడానికి బదులు రివెటింగ్‌ను ప్రవేశపెట్టడం వల్ల 20 ఏళ్ళ క్రితం లీసేస్టర్ బూట్ల పరిశ్రమలో విప్లవం వచ్చింది. ఆ రోజుల్లో మంచి వేతనాలను సంపాదించ వీలయింది. ఇతరులకన్నా చక్కని వస్తువును తయారుచేయాలని వివిధ కంపెనీలు పరస్పరం ఎంతగానో పోటీపడేవి. కానీ ఆ తరువాత త్వరలోనే దానికన్నా నికృష్టమైన పోటీ, ఒకదానికన్నా మరొకటి తక్కువ ధరకు అమ్మాలనే పోటీ తలయెత్తింది. దీని హానికరమైన పర్యవసానాలు త్వరలోనే, వేతనాల తగ్గుదలలో ప్రదర్శితమయాయి.

   శ్రమ ధర ఎంత త్వర త్వరగా పడిపోయిందంటే, అనేక కంపెనీలు ఇప్పుడు, ఆదిలో ఉన్న వేతనాల్లో సగం మాత్రమే ఇస్తున్నాయి. వేతనాలు అంతకంతకు పడిపోతూన్నప్పటికీ, లాభాలేమో, వేతనాల స్కేళ్ళను మార్చినప్పుడల్లా పెరుగుతున్నట్లుంది." వేతనాలను విపరీతంగా తగ్గించడం ద్వారా, అంటే కార్మికుని జీవనాధారాలను ప్రత్యక్షంగా దోచుకోవడం ద్వారా అసాధారణమైన లాభాలను ఆర్జించేందుకు పరిశ్రమ దారులు, కష్టకాలాలను కూడా ఉపయోగించుకొంటున్నారు. ఇందుకొక ఉదాహరణ (కొవెంట్రీ పట్టు వస్త్రాల పరిశ్రమలో సంక్షోభ ప్రస్తావన ఇది) : "పరిశ్రమదారుల నుంచి కార్మికుల నుంచి కూడా నాకందిన సమాచారాన్ని బట్టి, వేతనాలు విదేశీ ఉత్పత్తిదార్ల నుండి పోటీవల్ల, లేదా ఇతర పరిస్థితులవల్ల అవసరమైన దానికన్నా ఎక్కువగా తగ్గించే విషయంలో ఎట్టి సందేహమూ లేదని తోస్తుంది. నేత కార్మికులలో అధిక సంఖ్యాకులు 30-40 శాతం మేరకు తగ్గిన వేతనాలకే పని చేస్తున్నారు. అయిదేళ్ళ క్రితం ఒక రిబ్బన్‌ను తయారుచేసినందుకు నేత కార్మికునికి 6-7 షిల్లింగులు ముట్టేది. ఇప్పుడు ముడుతున్నది 3 షి. 3 పెన్నీలు, లేదా 3 షి. 6 పెన్నీలు మాత్రమే. మునుపు 4 షిల్లింగులూ, 4 షి. 3 పెన్నీలు వెల పలికిన ఇతర పనులకు ఇప్పటి వెల 2 షిల్లింగులూ, 2 షి. 3 పెన్నీలు మాత్రమే. వేతనాలను, గిరాకీ పెంచడానికి అవసరమైన దానికన్నా ఎక్కువగా కోత పెట్టారని తోస్తోంది. నిజంగా, అనేక రకాల రిబ్బన్ల విషయంలో, నేతకయ్యే ఖర్చుల తగ్గుదలతోపాటు, తయారైన వస్తువు అమ్మకం ధరలో తదనుగుణమైన తగ్గుదల లేదు." (ఎఫ్.డి. లాంగే నివేదిక. "పనిలో పిల్లల నియామకంపై నివేదిక. V నివేదిక, 1866" పుట 114,1)

ఇంగ్లీషు వారి నూలు బట్టల పరిశ్రమ గడచివచ్చిన మార్గాన్ని త్వరితగతిలో సమీక్షిస్తే, ఫ్యాక్టరీ కార్మికుల దుర్గతిని అతి చక్కగా వర్ణించినట్లవుతుంది.

1770–1815 మధ్య ఈ పరిశ్రమ అయిదేళ్ళపాటు మాత్రమే మందంగా లేదా స్తబ్దుగా ఉంది. 45 ఏళ్ళలో ఇంగ్లీషు పరిశ్రమదారులకు యంత్రాలపైనా, ప్రపంచ మార్కెట్లపైనా గుత్తాధిపత్యం ఉండేది. 1815 నుంచి 1821 వరకు మాంద్యం; 1822 నుంచి 1823 వరకు వృద్ధి. 1824లో ట్రేడ్ యూనియన్లకు వ్యతిరేకమైన శాసనాల రద్దు, సర్వత్రా ఫ్యాక్టరీల అపార విస్తరణ, 1825 సంక్షోభం; 1826 విపరీతమైన దైన్యావస్థ, ఫ్యాక్టరీ కార్మికుల మధ్య దొమ్మీలు, 1827 పరిస్థితిలో కాస్త మెరుగుదల, 1828 మరమగ్గాల్లోనూ, ఎగుమతుల్లోనూ పెద్దయెత్తున పెరుగుదల, 1829 ఎగుమతులు ప్రత్యేకించి ఇండియాకు ఎగుమతులు, మునుపటి సంవత్సరాలలోని వాటినన్నిటిని మించిపోయాయి. 1830 మార్కెట్లలో పేరుకుపోయిన ఉత్పత్తులు మహా కష్టకాలం; 1831–1833 కొనసాగుతున్న మాంద్యం, ఇండియా, చైనాలతో వ్యాపారంపై గుత్తాధికారాన్ని ఈస్టిండియా కంపెనీ నుంచి ఉపసంహరించడం, 1834, పెద్దయెత్తున ఫ్యాక్టరీల, యంత్రాల పెరుగుదల, పనివారికి కొరత. పేదలకు సంబంధించిన కొత్త చట్టాలు ఫ్యాక్టరీ జిల్లాలకు వ్యవసాయ కార్మికుల వలసకు దోహదం చేశాయి. గ్రామసీమల్లో పిల్లలే లేని స్థితి, శ్వేత బానిస వ్యాపారం, 1835 గొప్ప వృద్ధి; అదే సమయంలో చేనేత కార్మికులు తిండిలేక మాడటం, 1836 గొప్ప వృద్ధి, 1837–1838 మాంద్యం, సంక్షోభం; 1839 పునరుజ్జీవనం; 1840 మహామాంద్యం, దొమ్మీలు, సైన్యాన్ని రంగంలో దింపడం; 1841, 1842 ఫ్యాక్టరీ కార్మికుల్లో భయంకరమైన దారిద్ర్య బాధ; 1842 ధాన్యపు చట్టాలను రద్దు చేయించేందుకు యజమానులచే ఫ్యాక్టరీల మూత, ఫ్యాక్టరీ కార్మికులు వేల సంఖ్యలో లాంక్‌షైర్, యార్క్‌షైర్ పట్టణాలకు మూగడం, సైన్యం వారిని వెనక్కు తరమటం, లాంకెస్టర్‌లో వారి నాయకులపై కోర్టులో విచారణ; 1843 మహా దైన్యావస్థ; 1844 పునరుజ్జీవనం; 1845 గొప్ప అభివృద్ధి; 1846 తొలుత పరిస్థితి మెరుగుదల తరువాత వెనుకపట్టు పట్టడం, ధాన్యపు చట్టాల రద్దు; 1847 సంక్షోభం, "పెద్ద రొట్టె" గౌరవార్థం 10 శాతం, అంతకన్నా ఎక్కువగా కూడా సర్వత్రా వేతనాలు తగ్గింపు; 1848 మాంద్యం కొనసాగింపు, మాంచెస్టర్‌కు సైనిక రక్షణ; 1849లో పునరుజ్జీవనం; 1850 అభివృద్ధి; 1851 పడిపోతున్న ధరలు, తక్కువ వేతనాలు, తరచూ సమ్మెలు; 1852 పరిస్థితుల మెరుగుదల ప్రారంభం, సమ్మెల కొనసాగింపు, పరిశ్రమదారులు విదేశీ కార్మికులను దిగుమతి చేసుకొంటామని బెదిరించడం; 1853 ఎగుమతుల పెరుగుదల, 8 నెలల సమ్మె, ప్రెస్టన్ దుర్భర దీనావస్థ; 1854 వృద్ధి, మార్కెట్లలో సరకులు పేరుకొనిపోవడం; 1855 సంయుక్త రాష్ట్రాలు, కెనడా, తూర్పు దేశాల మార్కెట్ల నుండి వర్తక వైఫల్యాల గురించి కుప్పతెప్పలుగా వార్తలు; 1856 గొప్ప వృద్ధి; 1857 సంక్షోభం; 1858 పరిస్థితి మెరుగుదల; 1859 గొప్ప వృద్ధి, ఫ్యాక్టరీల సంఖ్య పెరుగుదల; 1860 ఇంగ్లీషు వారి బట్టల పరిశ్రమ అత్యున్నత దశ, ఇండియా, ఆస్ట్రేలియా, తదితర మార్కెట్లలో సరకులెంత పేరుకుపోయాయంటే 1863లో సైతం అవి పూర్తిగా అమ్మకం కానీ స్థితి. ఫ్రెంచి వాణిజ్య సంధి, ఫ్యాక్టరీల, యంత్రాల బ్రహ్మాండమైన పెరుగుదల; 1861 అభివృద్ధి కొంత కాలం కొనసాగడం, తిరోగమనం, అమెరికా అంతర్యుద్ధం, దూది కరవు; 1862–1863 పూర్తిగా

కుప్పకూలడం. దూది కరవు చరిత్ర అటువంటి కరవులకు మచ్చుతునక; అందువల్ల దాన్ని గురించి క్షణంపాటు వివరంగా చెప్పకుండా వదలివేయరాదు. 1860, 1861 సంవత్సరాల్లో ప్రపంచ మార్కెట్ల పరిస్థితిని తెలిపే సూచనలను బట్టి, కరవు జౌళి ఉత్పత్తిదారులకు సరియైన సమయంలోనే వచ్చిందనీ, అది కొంతవరకు వారికి అనుకూలించిందనీ మనకు స్పష్టమవుతుంది. వాస్తవాన్ని మాంచెస్టర్ వాణిజ్య సంఘం నివేదికల్లో ఒప్పుకొన్నారు. పామర్‌స్టన్, డెర్బీలు పార్లమెంటులో ప్రకటించారు. ఘటనలూ ధ్రువపరచాయి.[1] 1861 బ్రిటన్‌లో ఉన్న 2,887 జౌళి మిల్లులో అనేకం నిస్సందేహంగా చిన్నవి. ఎ. రెడ్‌గ్రేవ్ నివేదిక ప్రకారం, అతని జిల్లాలో చేర్చబడిన 2,109 మిల్లుల్లో 392 లేక 19 శాతం మిల్లులు తలా పదికన్నా తక్కువ అశ్వ శక్తిని వాడాయి. 345 లేదా 16 శాతం 10 హెచ్.పి.నీ, 20 హెచ్.పి. కన్నా తక్కువ వాడాయి. 1,372 మిల్లులు 20 హెచ్.పి.కి మించి వాడాయి.[2] చిన్న మిల్లుల్లో ఎక్కువ భాగం నేసే షెడ్లు, 1858 అనంతరం అభివృద్ధి దశలో నిర్మాణమయినవి. వీటిలో అత్యధిక భాగం చట్టా వ్యాపారులు స్థాపించినవి. కొందరు నూలు, కొందరు యంత్రాలు, మరికొందరు భవనాలు సమకూర్చారు. మునుపు తనిఖీదార్లుగా పనిచేసిన వారు, లేదా కొద్దిపాటి రాబడి గలవారు ఈ మిల్లుల పని నిర్వహించారు. ఈ చిన్న ఉత్పత్తిదారులు దివాళా తీశారు. వర్తక సంక్షోభంలో వారికి ఇదే గతి పట్టివుండేది. కానీ దూది కరవు వల్ల ఆ సంక్షోభం తప్పిపోయింది. మొత్తం ఉత్పత్తిదారుల్లో వారు మూడో వంతు ఉండిన, జౌళి వర్తకంలో మదుపు పెట్టిన మొత్తం పెట్టుబడిలో వారి మిల్లుల వాటా అంతకన్నా చాలా తక్కువ. పని ఏమేరకు ఆగిపోయిందనే సంగతిని తీసుకొంటే, 1862 అక్టోబరులో కదుళ్ళలో 60.3 శాతం, మగ్గాలలో 58 శాతం ఆడటం లేదని ప్రామాణికమైన అంచనాలను బట్టి తెలుస్తోంది. ఇవి మొత్తం జౌళి పరిశ్రమకు సంబంధించిన లెక్కలు. విడివిడి జిల్లాల విషయంలో మార్పులు అవసరమని వేరే చెప్పనక్కరలేదు. పూర్తికాలం (వారానికి 60 గంటలు) పనిచేసిన మిల్లులు బహు తక్కువ. మిగతావి అప్పుడప్పుడు పనిచేసేవి. పూర్తికాలం, మామూలు కట్టు కూలి రేట్లతో పనిచేసిన కొద్ది సందర్భాల్లో సైతం, మిల్లు కార్మికులు వారానికి గడించిన వేతనాలు అవశ్యంగా తగ్గిపోయాయి. ఎందువల్లనంటే మంచి దూది బదులు నాసిరకం దూదిని – సీ ఐలెండు దూది బదులు ఈజిప్షన్ దూది (నయం నూలు మిల్లుల్లో) అమెరికన్, ఈజిప్షన్ దూది బదులు సూరత్ దూది, అచ్చమైన దూది బదులు రద్దు, సూరత్ దూది మిశ్రణను – వాడారు. సూరత్ పొట్టిపింజ దూది, దాని మాలిన్యం, పోగు మరింత పెళుసుబారడం, పడుగులకు జిగురు అంటించే పిండి, బరువైన నానారకాల పదార్థాల వాడకం ఇవన్నీ యంత్రాల లేదా ఒక నేత కార్మికుడు చూచుకోగల మగ్గాల సంఖ్యను తగ్గించాయి; వేగాన్ని తగ్గించాయి. యంత్రాల లోపాల వల్ల చేయవలసిన శ్రమను హెచ్చించాయి. మొత్తం ఉత్పత్తి పరిమాణాన్ని తగ్గించడం ద్వారా కట్టుకూలిని తగ్గించాయి. సూరత్ దూది వాడిన సందర్భంలో, పూర్తికాలం పనిచేసిన కార్మికులకు 20, 30, ఇంకా ఎక్కువ శాతం నష్టం జరిగింది. కానీ, దీనికితోడు మిల్లు యజమానులు కట్టు కూలి రేట్లను 5, $7\frac{1}{2}$, 10 శాతం తగ్గించారు. కాబట్టి వారానికి 3, $3\frac{1}{2}$ లేదా 4 రోజులు, లేదా రోజుకు 6 గంటలే నియుక్తులైన

1. "ఫ్యాక్టరీ ఇన్‌స్పెక్టర్ల నివేదికలు ... 1862, అక్టోబరు 31" పుట 30.
2. పూర్వోక్త గ్రంథం, పుట 19.

కార్మికుల పరిస్థితి ఏమిటో మనం ఊహించుకోవచ్చు. 1863లో సైతం, పరిస్థితి సాపేక్షంగా మెరుగయిన తరువాత వడికే వారి, నేసేవారి వేతనాలు 3 షి. 4 పెన్నీలు, 3 షి. 10 పెన్నీలు, 4 షి. 6 పెన్నీలు, 5 షి. 1 పెన్నీ ఉండేది.[1] దీనావస్థలో కూడా, యజమాని సృజనాత్మక శక్తి పనిచేయడం మానలేదు. అది వేతనాలలో కోతలు విధించే మార్గాలు కనిపెడుతూనే ఉండేది. తయారయిన వస్తువులోని లోపాలకు ఇచ్చుకోవలసిన అపరాధంగా అవి, కొంతమేరకు విధించబడ్డాయి. కానీ నిజానికి, యజమాని నాసిరకం పత్తీ, తగినట్లులేని అతని యంత్రాలు ఆ లోపాలకు కారణం. అంతేకాదు, కార్మికుల కుటీరాలు మిల్లు యజమానివైనప్పుడు, అతను, వారి నికృష్ట వేతనాల నుంచి అద్దె డబ్బు మినహాయించడం ద్వారా తనకు తానే అద్దె చెల్లించుకొనేవాడు. రెడ్‌గ్రేవ్, స్వయం ప్రవర్తక నిర్వాహకులను (రెండు స్వయం ప్రవర్తక కదురు యంత్రాలను నిర్వహించే కార్మికులను) గురించి ఇలా చెబుతున్నాడు. వారు, "ఒక పక్షం రోజులు పూర్తికాలంగా పనిచేసిన తరువాత 8 షి. 11 పె.లు ఆర్జించారు. ఈ మొత్తం నుంచి ఇంటి అద్దె మినహాయించబడింది. కానీ మిల్లు యజమాని సగం అద్దెను కానుకగా తిరిగి ఇచ్చాడు. ఆ యంత్ర నిర్వాహకులు 6 షి. 11 పెన్నీల మొత్తం తీసుకెళ్ళారు. అనేకచోట్ల 1862 ఉత్తరార్థంలో, స్వయం నిర్వాహకుల వేతనం వారానికి 5 షిల్లింగుల నుంచి 9 షిల్లింగుల వరకు, నేత కార్మికుల వేతనం వారానికి 2 షిల్లింగుల నుంచి 6 షిల్లింగుల వరకు ఉండేది."[2] పని కాలం తక్కువగా ఉన్నప్పుడు సైతం కార్మికుల వేతనాల నుంచి అద్దెను పట్టుకోవడం తరచూ జరిగింది.[3] కాబట్టి లాంక్‌షైర్‌లోని కొన్ని ప్రాంతాల్లో ఒక రకమైన క్షామజ్వరం ప్రారంభం కావడం ఆశ్చర్యకరమేమీ కాదు. కానీ వీటన్నిటికన్నా పరిస్థితికి విలక్షణమైనది, శ్రామిక ప్రజలకు నష్టకరంగా ఉత్పత్తి ప్రక్రియలో వచ్చిన విప్లవం. పనికిరాని శరీరాలపై ప్రయోగాలు కప్పలపై శరీర శాస్త్రజ్ఞులు చేసే ప్రయోగాల వంటివి అన్ని హంగులతోనూ జరిగాయి. రెడ్‌గ్రేవ్ ఇలా అంటున్నాడు: "అనేక మిల్లుల్లో నేను మిల్లు కార్మికుల వాస్తవ ఆదాయాలను ఇచ్చాను. కానీ దీన్నిబట్టి వారు అదే మొత్తాన్ని వారం వారం ఆర్జిస్తారని నిర్ధారణ చేయరాదు. మిల్లు యజమానులు నిరంతరం చేస్తున్న ప్రయోగాల మూలంగా ఆ కార్మికులు ఎన్నో ఎగుడు దిగుడుల పాలవుతున్నారు. కార్మికుల ఆదాయాలు దూది మిశ్రణల నాణ్యతను బట్టి హెచ్చుతుంటాయి, తగ్గుతుంటాయి; కొన్ని సందర్భాల్లో అవి మునుపటి ఆదాయాలకు 15 శాతంలోనే ఉండేవి. తరువాత ఒకటి, రెండు వారాల్లో అవి 50 నుంచి 60 శాతం దాకా పడిపోయాయి."[4] ఈ ప్రయోగాలు కార్మికుని జీవనాధారాలకు మాత్రమే నష్టకరంగా జరగలేదు. అతని పంచేంద్రియాలు కూడా అపరాధం చెల్లించుకోవలసి వచ్చింది. "సూరత్ పత్తితో పని చేయడానికి నియమితులైనవారు చాలా ఫిర్యాదులు చేస్తున్నారు. పత్తి బేళ్ళను తెరచినంతనే భరించరాని వాసన వస్తుందనీ, అందువల్ల జబ్బు చేస్తున్నదనీ వారు నాకు చెప్పారు. కలగలిపే, ఏకే, చిక్కుదీసే గదుల్లో, వదిలించిన దుమ్మూ ధూళివల్ల శ్వాసనాళికలు చిమచిమలాడి, దగ్గు వస్తుంది.

---

1. "ఫ్యాక్టరీ ఇన్‌స్పెక్టర్ల నివేదికలు, 1863, అక్టోబరు 31" పుటలు 41-45.
2. అదే గ్రంథం, పుటలు 41-42.
3. అదే గ్రంథం, పుట 51.
4. అదే గ్రంథం, పుటలు 50-51.

ఊపిరాడటం కష్టమవుతుంది. చర్మవ్యాధి కూడా రావడం కద్దు; నిస్సందేహంగా, సూరత్ పత్తిలోని దుమ్మువల్ల పుట్టిన జిల దీనికి కారణం... పత్తి పింజ అంత పొట్టిగా ఉన్నందువల్ల, పెద్దయెత్తున జిగురు – జంతువులదీ, మొక్కలదీ – వాడుతున్నారు... ధూళివల్ల రొమ్ము పడిశం మరింత వ్యాపించింది... అదే కారణంవల్ల గొంతు నొప్పి, వాపూ మామూలు. పేక పోగు తరచూ తెగిపోవడం కద్దు; అప్పుడు నేత కార్మికుడు కండె రంధ్రం గుండా పోగును నోటితో పీలుస్తాడు. ఇందువల్ల కడుపు తిప్పుట, అజీర్తి వ్యాధులు వస్తున్నాయి. "మరోవైపు, పిండికి బదులు వాడే ప్రత్యామ్నాయాలు నూలు బరువును పెంచడంవల్ల అవి మిల్లు యజమానులకు ఫార్చునేటస్[1] గల్లాపెట్టెలయాయి." వీటి మూలంగా, "15 పౌనుల ముడి పదార్థాన్ని నేసిన తరువాత దాని బరువు 26 పౌనులవుతుంది."[2] 1864 ఏప్రిల్ 30 నాటి ఫ్యాక్టరీ ఇన్‌స్పెక్టర్ల నివేదికలో ఇలా ఉంది. "ఈ పరిశ్రమ ప్రస్తుతం వనరును వినియోగించుకొంటున్న మోతాదు అప్రతిష్ఠాకరమైనది కూడా. 8 పౌనుల బరువున్న ఒక బట్ట, $5\frac{1}{4}$ పౌనుల పత్తి, $2\frac{3}{4}$ పౌనుల జిగురుతో తయారయిందనీ, $5\frac{1}{4}$ పౌనులు బరువున్న మరో బట్టలో జిగురే 2 పౌనులుందనీ అధికారపూర్వకంగా చెప్పగా విన్నాను. ఇవి మామూలుగా ఎగుమతి చేసే షర్టింగ్ గుడ్డలు. ఇతర రకాల బట్టల్లో కొన్ని సందర్భాల్లో అంతా ఇంతా కాదు, 50 శాతం దాకా జిగురు చేరుస్తున్నారు. ఫలితంగా, బట్టల్లోని నూలుకు మాత్రమే పౌండ్ల లెక్కన తాను చెల్లించిన దానికన్నా తక్కువ ధరకు ఆ బట్టల్ని అమ్మడం ద్వారా ధనవంతుడనైపోతున్నానని జౌళి మిల్లు యజమాని సగర్వంగా చెప్పుకోవచ్చు. నిజంగా అలా చెప్పుకొంటున్నాడు కూడా."[3] కానీ, కార్మికులు యమయాతనలు పడవలసి వచ్చింది. మిల్లుల్లో యజమానుల, బయట మున్సిపాలిటీల ప్రయోగాలవల్లనే కాదు, వేతనాల తగ్గుదల, పనిలేకపోవడం, లేమిడి, దాతృత్వంవల్లనే కాదు. ప్రభువుల సభలో, కామన్స్ సభలో ప్రశంసాపూర్వక ప్రసంగాలవల్లనే కాదు. "దూది కరవు ఫలితంగా, ప్రారంభంలోనే పనులు కోల్పోయి, ఆ కారణంగా సమాజ బహిష్కృతులైన దురదృష్ట స్త్రీలు, ఇప్పుడు పరిశ్రమ మళ్ళీ పుంజుకొని, పని పుష్కలంగా ఉన్నప్పటికీ, ఆ దురదృష్ట వర్గ సభ్యులుగానే కొనసాగుతున్నారు. ఇక ముందు అలాగే కొనసాగవచ్చు. ఇప్పుడు ఆ పట్టణ ప్రాంతంలో గత 25 సంవత్సరాలుగా నేనెరిగిన దానికన్నా నేడు ఎక్కువమంది లేత వయసు వెలయాండ్రున్నారు."[4]

కాబట్టి, ఇంగ్లీషు జౌళి పరిశ్రమ తొలి 45 సంవత్సరాల్లో (1770–1815) సంక్షోభమూ, స్తబ్దత ఉన్నది అయిదేళ్ళు మాత్రమే. కానీ ఇది పరిశ్రమదారుల గుత్తాధిపత్య దశ. 1815 నుంచి 1863 దాకా రెండవ దశ. ఈ 48 సంవత్సరాల్లో పునరుజ్జీవనం, వృద్ధి సాగినది 20 సంవత్సరాలే కాగా, 28 సంవత్సరాలు మాంద్యమూ, స్తబ్దతల కాలం. 1815–1830 మధ్య కాలంలో యూరపు ఖండంతోనూ, సంయుక్త రాష్ట్రాలతోనూ పోటీ ప్రారంభమయ్యింది. 1833 తరువాత, "మానవాళి

---

1. ఫార్చునేటస్, ట్యుటాన్ల గాథా పురుషుడు, అతని గల్లాపెట్టె ఎప్పుడూ ఖాళీగా ఉండేది కాదట - అను.
2. పూర్వోక్త గ్రంథం, పుటలు 62-63.
3. ఫ్యాక్టరీ ఇన్‌స్పెక్టర్ల నివేదికలు, 1864, ఏప్రిల్, పుట 27.
4. "ఫ్యాక్టరీ ఇన్‌స్పెక్టర్ల నివేదికలు, 1865, అక్టోబరు 31"లోని బోల్టన్ చీఫ్ కానిస్టేబుల్ హారిస్ లేఖ నుంచి ఉటంకించినది. పుట 61-62.

విధ్వంసన ద్వారా (ఇండియా చేనేత కార్మికులను మూకుమ్మడిగా తుడిచిపెట్టడం ద్వారా), ఆసియా మార్కెట్ల బలాత్కార విస్తరణ జరిగింది. ధాన్యపు చట్టాల రద్దు తరువాత, 1846-1863 మధ్య కాలంలో 8 ఏళ్ళపాటు ఒక మోస్తరు పారిశ్రామిక కార్యకలాపాలు, అభివృద్ధి సాగగా, 9 ఏళ్ళు మాంద్యం, స్తబ్దత నెలకొన్నాయి. అభివృద్ధి కాలంలో సైతం ప్రాయస్తులైన పురుష కార్మికుల పరిస్థితిని కింద జోడించిన నోట్ నుంచి అంచనా కట్టవచ్చు.[1]

## విభాగం-8

# ఆధునిక పరిశ్రమ కార్ఖానా ఉత్పత్తిలో, చేతివృత్తుల్లో, గృహ పరిశ్రమల్లో తెచ్చిన విప్లవం

### అ. చేతివృత్తి, శ్రమ విభజనపై ఆధారపడిన సహకార వ్యవస్థ నిర్మూలన

చేతివృత్తులపై ఆధారపడిన సహకారాన్ని, చేతివృత్తిలోని శ్రమ విభజనపై ఆధారపడిన కార్ఖానా ఉత్పత్తిని యంత్రాలు ఎలా నిర్మూలిస్తాయో చూచాము. నూర్పిడి యంత్రం మొదటి తరహా యంత్రాలకు ఉదాహరణ; అవి పంట కోసేవారి మధ్య సహకార స్థానం వహిస్తాయి. రెండవ తరహా యంత్రాలకు

1. సువ్యవస్థిత వలసకై ఒక సంఘాన్ని ఏర్పాటు చేసేందుకు, లాంక్‌షైర్ మొదలైన స్థలాల ఫ్యాక్టరీ కార్మికులు 1863లో చేసిన విజ్ఞప్తిలో ఇలా ఉంది : "ఫ్యాక్టరీ కార్మికులు ప్రస్తుతమున్న అధోగతి నుంచి బయట పడటానికి పెద్దయెత్తున వారు వలస పోవడం నేడు అత్యవసరమనే సంగతిని ఎవరూ కాదనరు; కానీ, వారు నిరంతరం వలస పోవడం ఎల్లప్పుడూ అవసరమనీ, అలా తరలి వెళ్ళకుండా మామూలు కాలాలలో తమ స్థానం నిలబెట్టుకోవడం వారికి అసాధ్యమనీ నిరూపించడానికి కింది వాస్తవాలను గమనించవలసిందిగా మనవి చేస్తున్నాము : 1814లో ఎగుమతి అయిన జౌళి సరకుల అధికార పూర్వక విలువ 17,665,378 పౌండ్లు కాగా, వాటి వాస్తవ విలువ 20,070,824 పౌండ్లు. 1858లో ఎగుమతి అయిన జౌళి సరకుల అధికార పూర్వక విలువ 182,221,681 పౌండ్లు. కానీ వాటి వాస్తవమైన లేదా అమ్మకపు విలువ 43,000,322 పౌండ్లు మాత్రమే. పది రెట్లు పరిమాణంలో ఉన్నా, రెండు రెట్లకు మించని ధరకు అమ్మబడిన సరుకది. దేశానికి, ప్రత్యేకించి ఫ్యాక్టరీ కార్మికులకు ఇంతటి ప్రతికూల ఫలితాలు సంభవించడానికి పలు కారణాలు, ఒక దానికొకటి తోడయ్యాయి. పరిస్థితులు అనుమతించి ఉంటే, వాటిని మీ దృష్టికి మరింత స్పష్టంగా తీసుకురావలసిందే. అత్యంత స్పష్టమైన కారణం, కార్మికులు అక్కరలేనంతగా నిరంతరం ఉండటమే అని ఇప్పటికి చెప్పితే చాలు. ఇలా లేకుంటే, ఇంతటి వినాశకర ఫలితాలు గల పరిశ్రమ - తుడిచి పెట్టుకుపోకుండా రక్షించబడటానికి మార్కెట్ నిరంతర విస్తరణ, అవసరమైన ఈ పరిశ్రమ, ఎన్నటికీ కొనసాగి ఉండేది కాదు. మన జౌళి మిల్లులు, నియమిత కాలాల్లో వచ్చే స్తబ్దతల వల్ల ఆగిపోవచ్చు. ప్రస్తుత పరిస్థితుల్లో ఈ స్తబ్దతలు మృత్యువంత అనివార్యమైనవి. కానీ మానవుని బుద్ధి నిరంతరం పని చేస్తూంటుంది. గత 25 ఏళ్ళలో ఈ దేశం నుంచి ఆరు మిలియన్లమంది వెళ్ళిపోయారని మేము చెబుతున్నప్పుడు, వారి సంఖ్యను తక్కువ చేసి చెబుతున్నాము. కానీ, జనాభా సహజాభివృద్ధి వల్లనేమి, ఉత్పత్తి ఖర్చులను తగ్గించడానికై అత్యంత వృద్ధికరమైన కాలాల్లో సైతం ప్రాయస్తులైన పురుషుల్లో చాలా భాగానికి, ఎట్టి షరతులపై కూడా, పని దొరకడం అసాధ్యమయిపోయింది." ("ఫ్యాక్టరీ ఇన్‌స్పెక్టర్ల నివేదికలు, 1863, ఏప్రిల్ 30" పుటలు 51, 52) జౌళి పరిశ్రమలోని విపత్ కాలంలో, మిల్లు కార్మికుల వలసను నివారించడానికి మన మిత్రులు, మిల్లు యజమానులు, ప్రభుత్వ జోక్యంతో సహా, అన్ని సాధనాలతో ఎలా ప్రయత్నించారో, ముందు ఒక అధ్యాయంలో మనం తెలుసుకొందాం.

సూదులు చేసే యంత్రం ప్రస్ఫుటమైన ఉదాహరణ. ఆడమ్ స్మిత్ చెబుతున్న దాన్నిబట్టి, ఆయన కాలంలో, 10 మంది పరస్పర సహకారంతో రోజుకు 48,000కు పైగా సూదులు తయారుచేసేవారు. కానీ, సూదుల యంత్రం ఒక్కటే 11 గంటల పనిదినంలో 145,000 సూదులు తయారుచేస్తుంది. ఒక స్త్రీ లేదా ఒక బాలిక అటువంటి నాలుగు యంత్రాలను చూచుకోగలదు; కాబట్టి ఒక రోజులో 600,000 సూదులను, ఒక వారంలో 3,000,000 సూదులను తయారు చేస్తుందన్న మాట.[1] ఒకే యంత్రం సహకార స్థానాన్ని లేదా కార్ఖానా ఉత్పత్తి స్థానాన్ని వహించినట్లయితే, అది చేతివృత్తి స్వభావం గల ఒక పరిశ్రమకు ప్రాతిపదికగా ఉపకరించవచ్చు. కానీ, చేతివృత్తులకు అలా మళ్ళటం, ఫ్యాక్టరీ వ్యవస్థకు పరివర్తన చెందే దశ మాత్రమే. యంత్రాలను నడిపేందుకు, మనిషి కండరాల స్థానంలో ఆవిరి లేదా నీరు వంటి యాంత్రికమైన చోదకశక్తి వచ్చిన వెంటనే విధిగా ఫ్యాక్టరీ వ్యవస్థ రంగంపైకి వస్తుంది. అక్కడక్కడ, అయితే ఎట్టి పరిస్థితిలోనూ, కొన్నాళ్ళు మాత్రమే ఏదైనా ఒక పరిశ్రమ, యాంత్రిక శక్తి ద్వారా చిన్న ఎత్తున నిర్వహింపబడవచ్చు. కొన్ని బర్మింగ్‌హామ్ పరిశ్రమల్లోలాగా, ఆవిరి శక్తిని అద్దెకు తీసుకోవడం ద్వారా లేక నేత పరిశ్రమలోని కొన్ని శాఖల్లోలాగా, చిన్న ఉష్ణోత్పాదక ఇంజన్లను (Caloric-engines) వినియోగించడం ద్వారా ఇలా నిర్వహించవచ్చు.[2] కొవెంట్రీ పట్టు నేత పరిశ్రమలో "కుటీర ఫ్యాక్టరీ" ప్రయోగం జరిగింది. చుట్టూ కుటీరాల వరుసలు వరుసలుగా ఒక చౌకు మధ్యలో ఒక ఇంజన్ భవనం కట్టారు. ఇంజన్‌కు కుటీరాల్లోని మగ్గాలను షాఫ్ట్‌లతో అనుసంధించారు. అన్ని సందర్భాల్లోనూ, మగ్గానికి ఇంత లెక్కన శక్తిని అద్దెకు తీసుకొన్నారు. మగ్గాలు పనిచేసినా, చేయకపోయినా, అద్దె వారం వారం చెల్లించవలసిందే. ప్రతి కుటీరంలో 2 నుంచి 6 వరకు మగ్గాలుండేవి. కొన్ని నేత కార్మికునివి, కొన్ని పరపతిపై కొన్నవి, కొన్ని అద్దెకు తీసుకొన్నవి. ఈ కుటీర ఫ్యాక్టరీలకు, అసలైన ఫ్యాక్టరీకి మధ్య ఈ పోరాటం 12 సంవత్సరాలకు పైగా సాగింది. ఈ ప్రయోగం 300 కుటీర ఫ్యాక్టరీలు పూర్తిగా దివాళా తీయటంతో ముగిసింది.[3] పని స్వభావం భారీ స్థాయి ఉత్పత్తికి సంబంధించినది కొన్ని సందర్భాల్లో. గత కొద్ది దశాబ్దాల్లో తలయెత్తిన కొత్త పరిశ్రమలు – కవర్ల తయారీ, ఉక్కు కలాల తయారీ మొదలయినవి సర్వసాధారణంగా, మొదట చేతివృత్తి దశను, తరువాత కార్ఖానా ఉత్పత్తి దశను గడిచాయి. ఇవి ఫ్యాక్టరీ దశకు పరివర్తన చెందే స్వల్పకాలిక ఉపదశలు. ఒక వస్తువు ఉత్పత్తి, మెట్లు మెట్లుగా ఉన్న ప్రక్రియా పరంపరగా ఉండకుండా, ఆ ఒకదానికొకటి సంబంధంలేని అనేక ప్రక్రియలతో కూడి ఉన్న సందర్భాల్లో, ఈ పరివర్తన చాలా క్లిష్టమైనది. ఉక్కు కలాల ఫ్యాక్టరీల స్థాపనకు పెద్ద అవరోధమైనది ఇదే. అయినప్పటికీ, 15 సంవత్సరాల క్రితం, ఆరు వేరు వేరు ప్రక్రియలను తనంతకు తానే నిర్వహించే ఒక యంత్రాన్ని కనిపెట్టారు. మొట్టమొదటి ఉక్కు కలాలను, 1820వ సంవత్సరంలో, చేతివృత్తి వ్యవస్థ, గ్రోసు

1. "పనిలో పిల్లల నియామకంపై కమిషన్, 3వ నివేదిక, 1864," పుట 108, సంఖ్య 447.
2. యంత్రాల ప్రాతిపదికపై ఈ విధంగా చేతివృత్తుల పునరుద్ధరణ అమెరికా సంయుక్త రాష్ట్రాల్లో తరచుగా జరుగుతోంది. కాబట్టి, ఫ్యాక్టరీ వ్యవస్థకు అనివార్య పరివర్తన జరిగి తీరినప్పుడు, తత్పర్యవసానమైన కేంద్రీకరణ, యూరపుతో, ఇంగ్లండుతో సైతం పోల్చితే, వాయువేగంతో పురోగమిస్తుంది.
3. ఫ్యాక్టరీ ఇన్‌స్పెక్టర్ల నివేదికలు, 1865 అక్టోబరు 31, పుట 64 చూడండి.

4 పౌండ్ల 4 షి. చొప్పున సరఫరా చేసింది. 1830లో కార్ఖానా ఉత్పత్తి వ్యవస్థ 8 షిల్లింగులకు సరఫరా చేసింది. నేడు ఫ్యాక్టరీ వ్యవస్థ వాటిని వాణిజ్య సంస్థలకు గ్రోసు 2 షి. 6 పెన్నీల లెక్కన సరఫరా చేసింది.[1]

## ఆ. కార్ఖానా ఉత్పత్తి, గృహ పరిశ్రమలపై ఫ్యాక్టరీ వ్యవస్థ ప్రభావం

ఫ్యాక్టరీ వ్యవస్థ అభివృద్ధి, వ్యవసాయ రంగంలో దాన్ని వెన్నంటి వచ్చే విప్లవం అభివృద్ధితోపాటుగా ఇతర పారిశ్రామిక రంగాలన్నిటిలో ఉత్పత్తి విస్తరించడమే కాక, దాని స్వభావం కూడా మారుతుంది. ఉత్పత్తి ప్రక్రియను దాని అంతర్భాగ దశలుగా విశ్లేషణ చేసే సూత్రం, యంత్రగతి శాస్త్రం, రసాయన శాస్త్రం, బహువిధ ప్రకృతి శాస్త్రాల సముదాయాన్ని వర్తింపచేయడం ద్వారా తలెత్తే సమస్యలను ఆ విధంగా పరిష్కరించాలన్నది, ఫ్యాక్టరీ వ్యవస్థలో అమలు జరుగుతోంది. ఇది సర్వత్రా నిర్ణాయకమవుతున్న సూత్రం. కాబట్టి యంత్రాలు, కార్ఖానా ఉత్పత్తి దశలోని పరిశ్రమల్లోకి, మొదట ఒక ప్రత్యేకీకృత ప్రక్రియకై ఆ తరువాత మరొకదానికై తీసుకొని వస్తాయి. ఆ విధంగా పాత శ్రమ విభజనపై ఆధారపడిన ఆ పరిశ్రమల పటుతర స్ఫటికంలాంటి నిర్మాణం కరిగిపోయి, నిరంతర మార్పులకు దారి యిస్తుంది. దీనితో నిమిత్తం లేకుండానే సమిష్టి కార్మికుని అంతర్నిర్మాణంలో ఒక సమూలమైన మార్పు వస్తుంది. అది సంయుక్తంగా పనిచేస్తున్న వ్యక్తుల మార్పు. కార్ఖానా ఉత్పత్తి దశలోలాగా కాక, ఇకముందు శ్రమ విభజనకు సాధ్యమయినచోటల్లా స్త్రీల, అన్ని వయసులలోని పిల్లల, నైపుణ్యంలేని శ్రామికుల నియామకాన్నీ, ఒక్కముక్కలో చెప్పాలంటే, చౌక శ్రమను (చౌక శ్రమ అనేది ఇంగ్లండులో దాని స్వభావోచితమైన పేరు) ప్రాతిపదికగా చేస్తారు. ఇది వర్తించేది, యంత్రాలను వినియోగించినా, వినియోగించకపోయినా భారీ స్థాయిలో జరిగే ఉత్పత్తికే కాదు, శ్రామికుల ఇళ్ళలో, లేదా చిన్న చిన్న వర్క్‌షాపుల్లో నడిచే గృహ పరిశ్రమలకు కూడా వర్తిస్తుంది. ఆధునిక గృహ పరిశ్రమలకు పాత తరహా గృహ పరిశ్రమలకు మధ్య ఒక్క పేరులో తప్ప, మరెందులోనూ సామ్యం లేదు. పాత తరహా గృహ పరిశ్రమలున్నాయంటే, స్వతంత్రమైన పట్టణ చేతివృత్తులు, స్వతంత్రమైన రైతు వ్యవసాయం, అన్నిటికన్నా ముఖ్యంగా, శ్రామికునికి, అతని కుటుంబానికి ఒక నివాస గృహం ఉన్నట్లే లెక్క. ఆ పాత తరహా పరిశ్రమ ఇప్పుడు ఫ్యాక్టరీ, కార్ఖానాకు లేదా గోదాముకు వెలుపల ఉండే ఒక శాఖగా మార్పు చెందింది. పెట్టుబడి ఫ్యాక్టరీ కార్మికులను, కార్ఖానా శ్రామికులను, చేతివృత్తుల వారిని పెద్ద సంఖ్యలో ఒకేచోట కేంద్రీకరించి, ప్రత్యక్షంగా తన అదుపాజ్ఞలలో ఉంచుకోవడమే కాక, అదృశ్య బంధాల ద్వారా మరో సేనను నడుపుతుంది. అది గృహ పరిశ్రమల్లోని కార్మికుల సేన. వారు పెద్ద పెద్ద పట్టణాల్లో నివసిస్తూ, దేశమంతటా చెల్లాచెదురై ఉంటారు. ఇందుకొక ఉదాహరణ లండన్ డెర్రీలోని మెసర్స్ టిల్లీ షర్ట్ ఫ్యాక్టరీ. ఇది 1,000 కార్మికులను అసలు ఫ్యాక్టరీలోనూ, 9000 మందిని

1. గిల్లెట్ బర్మింగ్‌హామ్‌లో తొట్టతొలి ఉక్కు కలాల ఫ్యాక్టరీని భారీస్థాయిలో నిర్మించాడు. అది 1851లోనే, ఏటా 180,000,00 కలాలను ఉత్పత్తి చేసింది. 120 టన్నుల ఉక్కును వాడింది. బ్రిటన్‌లో ఈ పరిశ్రమపై బర్మింగ్‌హామ్‌దే గుత్తాధిపత్యం. ప్రస్తుతం అది వేల మిలియన్ల ఉక్కు కలాలను ఉత్పత్తి చేస్తోంది. 1861 జనాభా లెక్కల ప్రకారం, పరిశ్రమలో నియమితులైన వారి సంఖ్య 1,428. వీరిలో 1,268 మంది అయిదేళ్ళూ, దానికి పైబడిన ఆడవారు.

దేశం నలుమూలలా తమ సొంత ఇండ్లలోనూ నియమిస్తుంది.[1]

చౌకగా లభించే అపరిణత శ్రమ శక్తిని, అసలు ఫ్యాక్టరీలోకన్నా ఆధునిక కార్ఖానా చేతి ఉత్పత్తిలో మరింత సిగ్గుమాలిన విధంగా దోపిడీ చేస్తున్నారు. ఎందువల్లనంటే, ఫ్యాక్టరీ వ్యవస్థకు గల సాంకేతిక పునాది అంటే, కండబలం స్థానంలో యంత్రాలను ప్రవేశపెట్టడం, శ్రమ తేలిగ్గా ఉండటం – కార్ఖానా ఉత్పత్తిలో దాదాపు బొత్తిగా లేదు. అదే సమయంలో స్త్రీలను, మరీ చిన్నపిల్లలను, ఏమాత్రమూ నీతి నియమం లేకుండా విషపూరితమైన లేదా హానికరమైన పదార్థాల దుష్ప్రభావాలకు లోనయ్యేలా చేస్తున్నారు. కానీ గృహ పరిశ్రమలనబడే వాటిలో ఈ దోపిడీ, కార్ఖానా ఉత్పత్తుల్లోకన్నా సిగ్గుమాలినది. ఎందువల్లనంటే, శ్రామికులు చెల్లాచెదురై ఉండటంలో వారి ప్రతిఘటనా శక్తి తగ్గుతుంది కాబట్టి, కొల్లగొట్టే పరాన్నభుక్కుల పరంపరకు పరంపరే యజమానికీ, కార్మికునికీ మధ్య ఉపాయంగా జొరబడతారు. కాబట్టి, గృహ పరిశ్రమ ఎల్లప్పుడూ ఫ్యాక్టరీ వ్యవస్థతోనో లేక అదే ఉత్పత్తి శాఖలోని కార్ఖానా ఉత్పత్తితోనో పోటీపడవలసి వస్తుంది కాబట్టి; పేదరికం, తన శ్రమ ప్రక్రియకు అత్యవసరమైన పరిస్థితులను స్థలం వెలుతురు, ధారాళమైన గాలి ప్రసరణను కార్మికునికి లేకుండా చేస్తుంది కాబట్టి; పని దొరకడంలో అంతకంతకు, ఒక క్రమమూ పద్ధతీ లేకుండాపోతుంది కాబట్టి. ఆఖరు విషయం, ఆధునిక పరిశ్రమ, వ్యవసాయాలవల్ల, "అక్కరలేకుండా పోయిన" ప్రజాబాహుళ్యం తుట్టతుదిన ఆశ్రయించే ఈ గృహ పరిశ్రమల్లో పనికోసం పోటీ తన గరిష్ట స్థాయినందుకొంటుంది. కాబట్టి ఉత్పత్తి సాధనాల్లో పొదుపును, మొట్టమొదటిసారిగా ఒక పద్ధతి ప్రకారం ఫ్యాక్టరీ వ్యవస్థలో పాటిస్తారు. ఇది, శ్రమ శక్తిని అతి నిర్లక్ష్యంగా దుర్వ్యయం చేయడంతోపాటే, శ్రమ ప్రక్రియకు మామూలుగా అవసరమైన వాటిని హరించడంతోపాటే జరుగుతుంది. ఒక నిర్ణీత పారిశ్రామిక శాఖలో శ్రమ యొక్క సామాజిక ఉత్పాదన శక్తీ, ఆయా ప్రక్రియల సమ్మేళనకు గల సాంకేతిక ప్రాతిపదికా ఎంత తక్కువ అభివృద్ధి చెందివుంటే, ఈ పొదుపు, అందులో తన శత్రుత్వ, హంతక లక్షణాన్ని అంత ఎక్కువగా చూపుతుంది.

## ఇ. ఆధునిక కార్ఖానా ఉత్పత్తి

పైన నిర్ణయించిన సూత్రాలను నిరూపించడానికి ఇప్పుడు కొన్ని ఉదాహరణలిస్తాను. వాస్తవానికి, పని దినం గురించిన అధ్యాయంలో ఇచ్చిన అనేక ఉదాహరణలు పాఠకునికి ఇదివరకే తెలుసు. బర్మింగ్‌హామ్, దాని పరిసరాల్లోని పాత్ర సామాను కార్ఖానాల్లో 10,000 మంది స్త్రీలే కాక, 30,000 మంది పిల్లలు, తరుణ వయస్సువారు ఎక్కువగా, చాలా భారమైన పనిలో నియుక్తులై ఉన్నారు. వారు అనారోగ్యకరమైన ఇత్తడి పోత కార్ఖానాల్లో, గుండీ ఫ్యాక్టరీల్లో, పింగాణీ, తుత్తునాగం, లక్కపూత కార్ఖానాల్లో కనిపిస్తారు.[2] వార్తాపత్రికలు, పుస్తకాలు అచ్చుయ్యే కొన్ని లండన్ ముద్రణాలయాల్లోని కార్మికులు – వయోజనులూ, తదితరులు కూడా చేస్తున్న తలకుమించిన శ్రమ మూలంగా, వాటికి "కబేళాలు" అనే అశుభసూచకమైన పేరు వచ్చింది.[3] అటువంటి అత్యాచారాలు పుస్తకాల బైండింగ్

---

1. "పనిలో పిల్లల నియామకంపై కమిషన్, 2వ నివేదిక, 1864," పుట LXVIII, సంఖ్య 415.
2. షెఫీల్డ్‌లో, ఆకురాయి కోత పని ఇప్పుడు నిజంగా పిల్లలతో చేయిస్తున్నారు.
3. పనిలో పిల్లల నియామకంపై కమిషన్, 5వ నివేదిక, 1866, పుట 3, సంఖ్య 24. పుట 6, సంఖ్య 55, 56. పుట 7, సంఖ్య 59, 60.

పనిలో కూడా జరుగుతున్నాయి. ఇక్కడ బలి అవుతున్నది ప్రధానంగా స్త్రీలు, బాలికలు, పసిపిల్లలు. తాళ్ళు నేసే షెడ్లలో, ఉప్పుగనుల్లోని రాత్రి పనిలో, కొవ్వొత్తుల కార్ఖానాల్లో రసాయనిక కార్ఖానాల్లో పసివారు బరువైన పని చేయవలసి వస్తోంది. పట్టు వస్త్రాల నేత పనికి యంత్రాలను వినియోగించని సందర్భాల్లో మగ్గాలను తిప్పడానికై పనివారితో చచ్చేటంత పని చేయిస్తున్నారు.[1]

అత్యంత అవమానకరమైనవీ, అసహ్యమైనవీ, అతి నికృష్ట వేతనం గలవీ అయిన పనుల్లో, బట్ట పేలికలను రకాలవారీగా వేరుపరచే పని ఒకటి. గ్రేట్ బ్రిటన్‌కు తన సొంత బట్టపేలికలు గుట్టలు గుట్టలు ఉన్నాయి. ఇదికాక, యావత్ ప్రపంచపు బట్ట పేలికల వ్యాపారానికి అది కేంద్రం. జపాన్ నుంచి దక్షిణ అమెరికాలోని మారుమూల రాజ్యాల నుంచి, కానరీ దీవుల నుంచి అవి కుప్పతెప్పలుగా వస్తున్నాయి. కానీ వాటిని సరఫరా చేసే ప్రధాన దేశాలు జర్మనీ, ఫ్రాన్స్, రష్యా, ఇటలీ, ఈజిప్టు, టర్కీ, బెల్జియం, హాలెండులు. వాటిని ఎరువులకు, బొంతలకు ఉపయోగిస్తున్నారు. కాగితం పరిశ్రమకు అది ముడిపదార్థంగా ఉపయోగపడుతోంది. బట్టపేలికను వేరుపరచే వారి ద్వారా మసూచి, ఇతర అంటువ్యాధులు వ్యాపిస్తున్నాయి. ఆ వ్యాధులకు మొదట గురి అయ్యేది వారే.[2] మితిమీరిన పనికీ, కష్టమైన, అనుచితమైన శ్రమకూ, మనిషిని పశుప్రాయుణ్ణి చేసే ఆ శ్రమ, చిన్ననాటి నుంచి శ్రామికునిపై నెరపే ప్రభావానికీ ఒక ప్రామాణిక ఉదాహరణ. బొగ్గుగనుల్లో పనీ, మొత్తం గని కార్మికులే కాదు, బంగళా పెంకుల, ఇటుకల బట్టీ పని కూడా వీటికి ఉదాహరణ. ఈ పరిశ్రమలో ఇటీవల కొత్తగా కనిపెట్టిన యంత్రాలను ఇంగ్లండులో అక్కడక్కడ మాత్రమే వాడుతున్నారు. మే, సెప్టెంబరు మాసాల మధ్య ఈ పరిశ్రమలో పని ఉదయం 5 గంటల నుంచి సాయంత్రం 8 గంటల వరకు ఉంటుంది. ఇటుకలను ఆరబెట్టడం ఆరుబయట జరుగుతున్నచోట్ల, తరచూ ఉదయం 4 నుంచి రాత్రి 9 వరకు కొనసాగుతుంది. ఉదయం 5 నుంచి సాయంత్రం 7 వరకు పని జరిగితే, పని "తగ్గినట్లు" "మోతాదుగా" ఉన్నట్లు లెక్క. ఈ పనికి ఆరు, తుదకు నాలుగు సంవత్సరాల బాల, బాలికలను కూడా నియమిస్తున్నారు. వీరు పెద్దవారు చేసినంతసేపు, తరచూ ఇంకా ఎక్కువసేపే పని చేస్తారు. పని కష్టమైనది, వేసవికాల తాపంవల్ల మనిషి మరింత అలిసిపోతాడు. ఉదాహరణకు, మోస్లేలోని ఒకానొక పెంకుల తయారీ స్థలంలో 24 సంవత్సరాల యువతి ఒకతె, ఇద్దరు బాలికల సహాయంతో, రోజుకు 2000 పెంకులు చేయడానికి అలవాటు పడింది. ఈ పిల్లలు ఆమెకు బంకమట్టిని మోసుకుపోయి ఇచ్చేవారు, పెంకులను పేర్చేవారు. వారు, 30 అడుగుల లోతునుంచి బంకమట్టి గుంతల జారుడు గట్లపైకి, తరువాత 210 అడుగుల దూరానికి రోజుకు 10 టన్నుల మట్టి మోసేవారు. "నైతికంగా పూర్తిగా దిగజారిపోకుండా, పెంకుల తయారీ స్థలమనే యమలోకంగుండా వెళ్ళటం పనిపిల్లకు సాధ్యం కాదు. పసితనం నుంచి వినడానికి వారు అలవాటుపడిన బూతు మాటలవల్లనేమి, అసహ్యమైన, అశ్లీలమైన, సిగ్గు విడిచిన అలవాటు మధ్య పెరగడంవల్లనేమి, తరువాత జీవితంలో

1. పూర్వోక్త గ్రంథం పుటలు 114, 115. సంఖ్య 6, 7. సర్వసాధారణంగా యంత్రాలు మనుషుల స్థానం వహిస్తున్నప్పటికీ, ఇక్కడ పసివారే, అక్షరాలా యంత్రాల స్థానం వహిస్తున్నారని కమిషనర్ అంటున్న మాట సహేతుకమైనదే.

2. బట్టపీలికల వ్యాపారంపై నివేదికను, "ప్రజారోగ్యం, 8వ నివేదిక," లండన్, 1866, 196, 208 పుటల్లోని అనేక వివరాలు చూడండి.

వారు తమకు తెలియకనే అరాచకంగా తయారవుతారు. అన్ని కట్టుబాట్లను వదిలివేస్తారు. పరమ పోకిరీలవుతారు... నైతిక అధఃపతనానికి భయంకర ఆలవాలం జీవిత విధానమే... మట్టిని అచ్చుపోసే ప్రతి ఒకరూ నిపుణుడైన శ్రామికుడు, ఒక బృంద నాయకుడు, అతను తనకింద పనిచేసే ఏడుగురికి తన కుటీరంలో తిండీ, వసతి ఏర్పాటు చేస్తాడు. అతని కుటుంబ సభ్యులైనా, కాకపోయినా, పురుషులు, బాలురు, బాలికలు అంతా మామూలుగా రెండు సకృత్తుగా మూడు గదులున్న ఆ కుటీరంలోనే, గాలి వెలుతురూ సరిగారాని కింది అంతస్తులో పడుకొంటారు. పగలంతా ఒళ్ళు హూనం చేసే పనివల్ల వారు ఎంత అలసిపోయి ఉంటారంటే, ఆరోగ్య, పరిశుభ్రతా నియమాలను గానీ, మర్యాద నియమాలను గానీ ఏమాత్రమూ పాటించరు. ఈ కుటీరాల్లో అనేకం అపరిశుభ్రతకు, దుమ్మూ, ధూళికి నమూనాలు... చిన్నపిల్లల్ని ఈ విధమైన పనికి నియమించే ఈ వ్యవస్థ, వారిని పసితనం నుంచీ, తరువాత జీవితాంతం అతి విచ్చలవిడిగా ప్రవర్తించే అల్లరిమూకకు గాఢంగా బంధిస్తుంది. అది తెచ్చిపెట్టే కీడుల్లోకెల్లా ఇది పెద్దది. తాము స్త్రీలమని ప్రకృతి తమకు బోధించకముందే వారు నానాబూతులు మాట్లాడే రౌడీపిల్లవాళ్ళయి పోతారు. ఒకటి రెండు చింపిరి మురికి బట్టలతో మోకాళ్ళపై వరకు కనిపించే కాళ్ళతో, దుమ్ముకొట్టిన జుత్తూ, మొగంతో తిరుగాడే వీరు, మానం, మర్యాద ప్రవృత్తులనన్నిటినీ తృణీకార భావంతో చూస్తారు. భోజన సమయాల్లో వారు పొలాల్లో నేలపై కాళ్లారజాపి పడుకొని, దగ్గరి కాలువలో స్నానం చేస్తున్న కుర్రవాళ్ళను గమనిస్తూంటారు. భారమయిన ఆ రోజు పని ముగిసిన వెంటనే, కాస్త మంచి బట్టలు వేసుకొని, మగవారివెంట సారాకొట్లకు వెడతారు.” మొత్తం ఈ వర్గంలో చిన్నతనం నుంచి విపరీతమైన తాగుడు వ్యాపించి ఉండటం సహజమే. “ఇటుకలు తయారుచేసేవారు తమని గురించి నిస్పృహతో ఉండటం అన్నిటికన్నా ఘోరమైనది. ‘స్వామీ, మీరు దయ్యాన్ని ఒక ఇటుక పనివానిగా పెంచి బాగుపరచడానికి ప్రయత్నించి చూడండి, అని సౌత్‌హాల్ ఫీల్డ్‌కు చెందిన ఒక మతగురువుతో, ఇటుక పనివారిలో కాస్త మంచి’వాడు అన్నాడు!”[1]

ఆధునిక కార్ఖానా ఉత్పత్తిలో (ఇందులో నేను మరింత భారీ ప్రమాణంలో ఉన్న అసలైన ఫ్యాక్టరీలను తప్ప మిగతా కార్ఖానాలనన్నిటినీ చేర్చుతున్నాను.) శ్రమ ప్రక్రియకు అవసరమైనవాటిని పెట్టుబడి పొదుపు చేసే తీరును ఎత్తుకొంటే, ప్రజారోగ్య నివేదిక (1863), (1864)లోనూ దీనికి సంబంధించిన అధికార పూర్వక సమాచారం కావలసినంత ఉంది. కార్ఖానాల, ముఖ్యంగా లండన్ ముద్రాపకుల, దర్జీల కార్ఖానాల వర్ణన, మన కల్పనా సాహిత్యకారుల అసహ్యకరమైన ఊహాచిత్రాలను తలదన్నుతుంది. శ్రామికుల ఆరోగ్యంపై ఆ కర్మాగారం ప్రభావం స్వయం విదితం. ప్రీవీ కౌన్సిల్ ప్రధాన వైద్యాధికారీ, “ప్రజారోగ్య నివేదికల” ప్రధాన సంపాదకుడూ డాక్టర్ సైమన్ ఇలా చెబుతున్నాడు: “కార్మికులు తమ ప్రప్రథమ పారిశుద్ధ్య హక్కును గురించి, అంటే శ్రామికులను వారి యజమాని ఒకచోట చేర్చడం ఏ పనికోసమైనా సరే, నివారించ వీలున్న అనారోగ్య పరిస్థితుల బెడద, తన చేతిలో ఉన్న మేరకు వారికి లేకుండా చేయాలని కోరే హక్కును గురించి పట్టుబట్టడం దాదాపు ఎలా అసాధ్యమో, నేను నా నాల్గవ నివేదికలో (1863) నిరూపించాను. పారిశుద్ధ్యపరమైన ఈ న్యాయం

1. పనిలో పిల్లల నియామకంపై కమిషన్, 5వ నివేదిక, 1866, పుటలు XVI సంఖ్య 86-97, పుటలు 130-133, సంఖ్య 39-71, 3వ నివేదిక, 1864, పుటలు 48-56 కూడా చూడండి.

శ్రామికులు, ఇంట తమకు తాము కలుగజేసుకోనూ లేరు. అటు, జీతం తీసుకొనే పారిశుద్ధ్య పోలీసు పాలనా సంస్థల నుంచి గట్టి మద్దతు సంపాదించనూ లేరు. కేవలం తమ వృత్తి తెచ్చిపెట్టిన అనంత శారీరక బాధలవల్ల వేలకు వేల కార్మిక స్త్రీ పురుషుల జీవితం నేడు చిత్రహింసల పాలవుతోంది. వారి ఆయుస్సు క్షీణిస్తూంది."[1]

పని జరిగే గదులు ఆరోగ్య పరిస్థితిని ప్రభావితం చేస్తున్న తీరుకు దృష్టాంతంగా డాక్టర్ సైమన్ కింది మరణ పట్టిక ఇస్తున్నాడు.[2]

| **ఆయా పరిశ్రమల్లో నియుక్తులైన అన్ని వయస్సుల్లోని వారి సంఖ్య** | **ఆరోగ్య దృష్ట్యా పోల్చి చూసిన పరిశ్రమలు** | **ఆయా పరిశ్రమల్లో కింద పేర్కొన్న వయసుల మధ్య ఉన్న ప్రతి 100,000 మందికి మరణాల రేటు** | | |
|---|---|---|---|---|
| | | **వయసు 25-35** | **వయసు 35-45** | **వయసు 45-55** |
| 958,265 | ఇంగ్లండు, వేల్స్‌ల్లో వ్యవసాయం | 743 | 865 | 1,145 |
| 22,301 పురుషులు<br>12,379 స్త్రీలు } | లండన్ దర్జీలు | 958 | 1,262 | 2,093 |
| 13,803 | లండన్ ముద్రాపకులు | 894 | 1,747 | 2,367 |

## ఈ. ఆధునిక గృహ పరిశ్రమలు

ఇప్పుడు ఆధునిక గృహ పరిశ్రమలనే వాటికి వస్తాను. ఆధునిక యాంత్రిక పరిశ్రమల నేపథ్యంలో పెట్టుబడి తన దోపిడీని సాగిస్తున్న ఈ రంగంలోని బీభత్సాలను గురించి ఒక అభిప్రాయానికి రావటానికి మనం అచ్చంగా పల్లెపట్టుల సుఖ వృత్తిగా కనిపించే చీలల తయారీ పరిశ్రమను[3] తీసుకోవాలి. దాన్ని ఇంగ్లండులోని కొన్ని మారుమూల గ్రామాల్లో నడుపుతున్నారు. కానీ, ఇక్కడ

1. "ప్రజారోగ్యం, ఆరవ నివేదిక," లండన్, 1864, పుటలు 29, 31.
2. పూర్వోక్త గ్రంథం, పుట 30. 25-35 ఏళ్ళ మధ్య వయసున్న లండన్ దర్జీలు, ముద్రాపకులు మరణాల రేటు ఇంతకన్నా చాలా ఎక్కువని, డా॥ స్మిత్ చెబుతున్నారు. ఎందువల్లనంటే, లండన్‌లోని యజమానులు గ్రామసీమ నుంచి 30 ఏళ్ళు, అంతకు లోపు వయసున్న యువజనులను "అప్రెంటీస్‌లు", "నేర్చుకొనే వారు"గా తెచ్చిపెట్టుకొంటున్నారు. తమ వృత్తిలో పరిపూర్ణులు కావాలన్న ఉద్దేశంతో వారు వస్తారు. వారంతా లండన్ వాసులుగా జనాభా లెక్కల్లో కెక్కుతున్నారు. లండన్ మరణాల రేటు లెక్కగట్టడానికి ప్రాతిపదికగా ఉన్న జనసంఖ్య వారివల్ల పెరుగుతోంది. కాని, అక్కడి మరణాల సంఖ్య ఆ నిష్పత్తిలో పెరగదు. నిజానికి వారిలో ఎక్కువ భాగం తిరిగి తమ గ్రామాలకు, ప్రత్యేకించి తీవ్రంగా జబ్బు చేసినప్పుడు, వెళ్ళిపోతారు. (అదే గ్రంథం)
3. నేనిక్కడ ప్రస్తావిస్తున్నది సుత్తితో కొట్టి తయారుచేసే చీలలను గురించి. యంత్రాలతో కోసి తయారు చేసే చీలలు కాదు. "పనిలో పిల్లల నియామకంపై కమిషన్, మూడవ నివేదిక" పుటలు XI, XIX, సంఖ్య 125-130 పుట 52, సంఖ్య 11. పుట 114, సంఖ్య 487. పుట 137, సంఖ్య 674.

లేస్, గడ్డి అల్లకం పరిశ్రమల్లోని కొన్ని శాఖల నుంచి కొన్ని ఉదాహరణలిస్తే చాలు. ఇవి ఇంకా యంత్రాల సహాయంతో నిర్వహింపబడటం లేదు. ఫ్యాక్టరీల్లో లేదా కార్ఖానాల్లో నిర్వహింపబడుతున్న శాఖలతో పోటీపడటం లేదు.

ఇంగ్లండులో లేస్ ఉత్పత్తిలో నియుక్తులైన 150,000 మంది పనివారిలో దాదాపు 10,000 మంది 1861 ఫ్యాక్టరీ చట్టం పరిధిలోకి వస్తారు. మిగిలిన 140,000లో దాదాపు అందరూ స్త్రీలు, పనివారు, ఆడ, మగపిల్లలు. వీరిలో మగవాళ్ళ సంఖ్య చాలా తక్కువ. దోపిడీ చేయడానికి చౌకగా దొరికిన ఈ మూగజీవుల ఆరోగ్య స్థితి కింది పట్టిక నుంచి తెలుస్తుంది. ఇది నాట్టింగ్‌హామ్ జనరల్ డిస్పెన్సరీ వైద్యుడు డాక్టర్ ట్రూమెన్ తయారు చేసింది. జబ్బుపడ్డ 686 మంది ఆడవారిలో (వీరంతా లేస్ తయారు చేసేవారు, అత్యధిక సంఖ్యాకులు 17–24 ఏళ్ళ మధ్యవారు) క్షయ రోగుల సంఖ్య :

| సం॥ | | సం॥ | |
|---|---|---|---|
| 1852 | 45 మందిలో ఒకరు | 1857 | 13 మందిలో ఒకరు |
| 1853 | 28 మందిలో ఒకరు | 1858 | 15 మందిలో ఒకరు |
| 1854 | 17 మందిలో ఒకరు | 1859 | 9 మందిలో ఒకరు |
| 1855 | 18 మందిలో ఒకరు | 1860 | 8 మందిలో ఒకరు |
| 1856 | 15 మందిలో ఒకరు | 1861 | 8 మందిలో ఒకరు[1] |

క్షయవ్యాధి వ్యాపిస్తున్న ఈ రేటు, ప్రగతివాదుల్లోని అత్యంత ఆశావాదిని, జర్మనీలోని స్వేచ్ఛా వ్యాపార వకాల్తాదారుల్లోని సర్వాబద్ధాల ప్రచారకుని నోరు మూయించడానికి చాలు.

లేస్ తయారీ పనిని అది యంత్రాలతో నిర్వహించబడిన మేరకు, 1861 ఫ్యాక్టరీ చట్టం నియంత్రిస్తుంది. ఇంగ్లండులో ఇది నియమం. కార్ఖానాల్లో లేదా గోదాముల్లో పనిచేసేవారు కాక, ఇంట్లో పనిచేసే శ్రామికులకు సంబంధించినంత వరకు, మేమిప్పుడు పరిశీలించబోతున్న శాఖలు రెండు విభాగాలుగా ఉన్నాయి : 1. తుది మెరుగులు దిద్దటం, 2. చక్కచేయటం, మొదటిది యంత్రంతో తయారైన లేసుకు తుదిమెరుగులు దిద్దుతుంది. ఇందులో పలు ఉప భాగాలున్నాయి. లేసుకు తుది మెరుగులు దిద్దేపని, "యజమానురాండ్ర ఇళ్ళు" అనే వాటిలోనైనా జరుగుతుంది. లేదా స్త్రీలు తమ సొంత ఇండ్లలోనైనా చేస్తారు. "యజమానురాండ్ర ఇళ్ళను" నడిపేవారు పేదవారే. పని జరిగే గది ఒక ప్రైవేటు ఇంట్లో ఉంటుంది. యజమానురాండ్రు పరిశ్రమదారుల నుంచి, లేదా గోదాముల వారి నుంచి ఆర్డర్లు తీసుకొని, తమ గదుల వైశాల్యాన్నీ, వర్తక అవసరాల హెచ్చు తగ్గులనూ బట్టి, వీలున్నంత మంది స్త్రీలను, బాలికలను, చిన్నపిల్లలను పనిలో పెట్టుకొంటారు. ఈ గదులు కొన్నింటిలో పనిచేసే కార్మిక స్త్రీల సంఖ్య 20–40 మధ్య, తక్కువ వాటిలో 10–12 మధ్య మారుతూంటుంది. పిల్లలు సగటున, ఆరేళ్ళ వయసు నుంచి పని చేయడం ప్రారంభిస్తారు. కానీ అనేక సందర్భాల్లో అయిదేళ్ళు కూడా రాకనే ప్రారంభించడం కద్దు. మామూలు పని గంటలు ఉదయం 8 నుంచి సాయంత్రం 8 వరకు. మధ్యలో భోజనాలకు $1\frac{1}{2}$ గంటల విరామం. దానికొక నిర్ణీత సమయమంటూ

1. "పనిలో పిల్లల నియామకంపై కమిషన్" పుట XXII, సంఖ్య 166.

ఉండదు. అసహ్యమైన ఆ పని గదుల్లోనే భోజనాలు. వ్యాపారం జోరుగా సాగుతున్నప్పుడు పని తరచూ ఉదయం 8 నుంచి లేదా 6 నుంచి మొదలై, రాత్రి 10, 11 లేదా 12 గంటల వరకు సాగుతుంది. ఆంగ్లేయుల బారకాసుల్లో ప్రతి సైనికునికి నిబంధనల ననుసరించి కేటాయించబడిన స్థలం 500–600 ఘ. అడుగులు. సైనిక ఆసుపత్రుల్లో అది 1,200 ఘ. అడుగులు. కానీ లేసుకు తుది మెరుగులు దిద్దే ఈ పందుల దొడ్లలో ప్రతి వ్యక్తికి ఉన్న స్థలం 67–100 ఘ. అడుగులు మాత్రమే. అదే సమయంలో, గాలిలోని ప్రాణ వాయువును గ్యాస్‌లైట్లు హరిస్తాయి. లేస్‌ను శుభ్రంగా ఉంచడానికి నేల పెంకులతో లేదా రెల్లు కప్పబడినా, పిల్లలు చలికాలంలో సైతం బూట్లు తీసివేయవలసిందే. "నాట్టింగ్‌హామ్‌లో 12 చ. అడుగులకు మించని చిన్న గదిలో 14 నుంచి 20 మందిదాకా పిల్లలు ఒకరినొకరు రాసుకొంటూ, 24 గంటల్లో 15 గంటలు పనిచేస్తున్న దృశ్యం అసాధారణమైనదేమీ కాదు. ఆ పని విసుగెత్తించేది, ఒకేవిధమైనదీ, కాబట్టి మనిషి అలసిపోతాడు. పైగా అది సాధ్యమైనంతటి అనారోగ్యకర పరిస్థితుల్లో చేసేదాయె... మరీ చిన్న పిల్లలు సైతం ప్రయాసకరమైన ఏకాగ్రతతో, అబ్బురపాటు గొలిపేటంత వడివడిగా పనిచేస్తారు. వారు తమ వేళ్ళకు విశ్రాంతి ఇవ్వటం, లేదా వాటి చలన వేగాన్ని తగ్గించటం బహు అరుదు. వారికేదైనా ఒక ప్రశ్న వేస్తే, తమ పనిమీదే ఉన్న తమ కళ్ళు ఎప్పటికీ ఎత్తరు. ఎత్తితే ఒక క్షణం వృధా అవుతుందని భయం." పనిగంటలు అంతకంతకు పొడిగించబడే కొద్దీ యజమానురాలు, పిల్లలకు చురుకు పుట్టించేందుకు "దండప్రయోగం" చేస్తూంటుంది. "ఆ పని విసుగు పుట్టిస్తుంది. కళ్ళు నొస్తాయి. ఒంటిని ఒకే భంగిమలో ఉంచడం వల్ల అలసట కలుగుతుంది. అటువంటి పనిలో తమని నిర్బంధంగా ఉంచిన కాలం ముగిసేటప్పటికి, పిల్లలు క్రమేణా అలసిపోయి పక్షుల్లా గిలగిలలాడుతారు. వారి పని బానిసత్వం వంటిది."[1] స్త్రీలూ, వారి పిల్లలూ ఇంట్లోనే పనిచేసే సందర్భంలో (ఇప్పుడు ఇల్లంటే అద్దె గది అనే అర్థం. అది తరచూ మిద్దెమీద గూడు) పరిస్థితి, ఇంతకన్నా అధ్వాన్నంగా ఉంటుంది – అది సాధ్యమైతే. ఈ విధమైన పనిని నాటింగ్‌హామ్ చుట్టూ 80 మైళ్ళ పరిధిలో ఇస్తున్నారు. గోదాముల నుంచి రాత్రి 9, 10 గంటలకు వెళ్ళిపోతున్న పిల్లలకు, ఇంటికి తీసుకుపోయి మెరుగులు దిద్దడానికి ఒక లేస్ మూటగట్టి తరచూ ఇస్తారు. ఆషాఢభూతి వంటి పెట్టుబడిదారుకు ప్రాతినిధ్యం వహిస్తున్న అతని భృత్యుల్లో ఒకడు ఈ మూట ఇస్తూ, "అది అమ్మకు" అని అభిమానం ఒలకపోసే మాట అంటాడు. కానీ ఇది, పాపం, ఆ పిల్లలు కూడా కూర్చొని సహాయపడవలసిన పని అని తనకు స్పష్టంగా తెలుసు.[2]

తలగడల లేస్ తయారీ, ప్రధానంగా ఇంగ్లండులోని రెండు వ్యవసాయక జిల్లాల్లో జరుగుతుంది. ఒకటి హోనిటన్ లేస్ జిల్లా; ఇది డెవొన్‌షైర్ దక్షిణ కోస్తా పొడుగూతా 20–30 మైళ్ళు విస్తరించి ఉంది; ఇందులో నార్త్ డెవోన్‌లోని కొన్ని ప్రాంతాలు కూడా ఉన్నాయి. రెండవదానిలో ఉన్నది, బకింగ్‌హామ్, బెడ్‌పోర్ట్, నార్త్ ఆంప్టన్ కౌంటీలలో ఎక్కువ భాగం. దానికి ఆనుకొని ఉన్న ఆక్స్‌ఫోర్డ్‌షైర్, హంటింగ్ డాన్‌షైర్ భూభాగాలు మామూలుగా, ఈ పని జరిగే స్థలాలు వ్యవసాయ కార్మికుల

1. "పనిలో పిల్లల నియామకంపై కమిషన్, 2వ నివేదిక, 1864." పుటలు XIX, XX, XXI.
2. పూర్వోక్త గ్రంథం, పుటలు XXI, XXII.

కుటీరాలు. అనేక కార్ఖానా యజమానులు ఈ లేస్ తయారుచేసేవారిని 3,000 పైగా నియమిస్తున్నారు. వీరు ప్రధానంగా చిన్నపిల్లలు, లేత్రాయపువారు. వీరంతా ఆడవారే. లేస్‌కు తుదిమెరుగులు దిద్దే పని పరిస్థితులు మునుపు చెప్పినవే. ఒకటి తప్ప – "యజమానురాండ్ర ఇళ్ళ"కు బదులు ఇక్కడ "లేస్ పాఠశాల"లనేవి కనిపిస్తాయి. వీటిని పేదలయిన ఆడవారు తమ కుటీరాల్లో నడుపుతున్నారు. పిల్లలు, తమ అయిదో ఏటి నుంచి, తరచూ అంతకన్నా ముందు నుంచే, తమకు పండ్రెండేళ్ళు లేదా పదిహేనేళ్ళు వచ్చేవరకు ఈ పాఠశాలల్లో పనిచేస్తుంటారు. మొదట సంవత్సరంలో, అందరిలోకీ చిన్నవారు 4-8 గంటలు పనిచేస్తారు. ఉత్తరోత్తరా వారు ఉదయం 8 నుంచి రాత్రి 10 గంటల వరకు పనిచేస్తారు. "ఈ గదులు, సర్వత్రా చిన్నపాటి కుటీరాల్లోని పడసాలలు. చలిగాలి తెరలు లోపలికి రాకుండా పొగ గొట్టాలను, తరచూ శీతాకాలంలో మూసి ఉంచుతారు. ఇంట్లో వాళ్ళకు వెచ్చదనమిచ్చేది వారి శరీరోష్ణమే. తక్కిన సందర్భాల్లో, పాఠశాలల గదులనబడేవి, నిప్పుగూళ్ళు లేని చిన్నవి ఉగ్రాణపు గదుల్లా ఉంటాయి... ఈ గుహలు తరచూ జనంతో విపరీతంగా క్రిక్కిరిసి ఉంటాయి. ఫలితంగా గాలి పూర్తిగా చెడి ఉంటుంది. చిన్న కుటీరాల పరిసరాల్లో మామూలుగా ఉండే మురుగు కాల్వలు, మరుగుదొడ్లు, కుళ్ళిపోతున్న పదార్థాలు, ఇతర చెత్తా చెదారం వల్ల కలిగే హాని దీనికి తోడవుతుంది." ఇక స్థలం సంగతి : "ఒక లేస్ పాఠశాలలో 18 మంది పిల్లలకు ఒక యజమానురాలికి, ఒక్కొక్కరికి 35 ఘ. అడుగుల స్థలం ఉంటుంది. వాసన దుర్భరంగా ఉన్న మరో పాఠశాలలో 18 మంది వ్యక్తులకు తలా $24\frac{1}{2}$ ఘ. అడుగుల స్థలం ఉంది. ఈ పరిశ్రమల్లో 2, $2\frac{1}{2}$ సంవత్సరాల పిల్లలు పనిచేయడం కనిపిస్తుంది.[1]

బకింగ్‌హామ్, బెడ్‌ఫోర్డ్ కౌంటీలలో లేస్ తయారీ ప్రాంతం అంతమైన చోటునుంచి గడ్డి అల్లకం ప్రాంతం ప్రారంభమై, హెర్ట్ ఫోర్డ్‌షైర్‌లోని చాలా భాగానికి, ఎసెక్స్ పడమటి, ఉత్తర భాగాలకు విస్తరించి ఉంది. 1861లో గడ్డి అల్లకంలో, గడ్డితో టోపీల తయారీలో 40,043 మంది పనిచేసేవారు. వారిలో 3,815 మంది అన్ని వయసుల మగవారు, మిగతావారు ఆడవారు. వీరిలో 7,000 మంది పసిపిల్లలతో సహా 14,913 మంది 20 ఏళ్ళలోపువారు. లేస్ పాఠశాలల బదులు ఇక్కడ మనకు "గడ్డి అల్లకం పాఠశాలలు" కనిపిస్తాయి. పిల్లలు, సాధారణంగా తమ 4వ సంవత్సరంలో, తరచూ 3, 4 సంవత్సరాల మధ్యలోనే గడ్డి అల్లకం పని నేర్చుకోవడం ప్రారంభిస్తారు. వారికి చదువు చెప్పరని వేరే చెప్పనక్కరలేదు. నెత్తురు పీల్చే ఈ సంస్థల నుంచి ప్రాథమిక పాఠశాలలను వేరుచేసి చూపటానికై, పిల్లలు ప్రాథమిక పాఠశాలలను "సహజ పాఠశాలలు" అని పిలుస్తారు. సంస్థల్లో పిల్లల్ని ఉంచడం, మామూలుగా 30 గజాలు అల్లాలని, కడుపు కాలే వారి తల్లులు నిర్దేశించిన పని వారితో చేయించడానికే. ఈ తల్లులే, పాఠశాల అయిపోయిన తరువాత తరచూ పిల్లలతో రాత్రి 10, 11, 12 గంటల వరకు పనిచేయిస్తారు. గడ్డిపోచల వల్ల వాళ్ళ నోళ్ళూ, వేళ్ళూ కోసుకుపోతాయి (గడ్డిపోచల్ని వారు నోటితో నిరంతరం తడి చేస్తుంటారు). పడకగదిలో గానీ, పనిచేసే గదిలోగాని ప్రతి వ్యక్తికీ ఉండవలసిన కనీస స్థలం 300 ఘ. అడుగులని, లండన్‌లోని మొత్తం వైద్యాధికారుల మామూలు అభిప్రాయమైనట్లు డాక్టర్ బల్లార్డ్ చెబుతున్నారు. కానీ గడ్డి అల్లకం పాఠశాలల్లో స్థలం,

1. పూర్వోక్త గ్రంథం, పుటలు XXIX, XXX.

లేస్ పాఠశాలలో కన్నా పొదుపుగా కేటాయిస్తున్నారు. అది "ప్రతి వ్యక్తికీ $12\frac{2}{3}$, 17, $18\frac{1}{2}$ ఘ. అడుగులు, 22 ఘ. అడుగులకన్నా తక్కువ." పైవాటిలోకెల్లా చిన్న అంకె సూచించే స్థలం, ప్రతివైపూ 3 అడుగులున్న ఒక పెట్టెలో ప్యాక్ చేయబడ్డ శిశువు ఆక్రమించే స్థలంకన్నా తక్కువ అని కమిషన్ సభ్యుల్లో ఒకరైన వైట్ అంటున్నాడు. ఆ పిల్లలు 12 లేదా 14 సంవత్సరాల వయసు వరకు జీవిత సుఖాలు అనుభవించే తీరు అదీ. కడుపునిండా తిండిలేని దిక్కుమాలిన తల్లితండ్రులకు తమ పిల్లల నుంచి సాధ్యమయినంత లబ్ధి పొందటం తప్ప మరే చింతా లేదు. పిల్లలు కాస్త ఎదిగిన వెంటనే, తమ తల్లితండ్రుల సంగతి ఏమాత్రమూ పట్టించుకోకుండా (ఇది సహజమే) వాళ్ళను వదిలివేసి పోతారు. "ఈ విధంగా పెరిగిన జనాభాలో అజ్ఞానం, దుర్మార్గం విస్తారంగా వ్యాపించి ఉండటం ఆశ్చర్యకరం కాదు. వారి శీలం అడుగంటింది... చాలామంది ఆడవారికి అక్రమ సంతానం కద్దు. అందులోనూ, నేరాల గణాంక వివరాలు బాగా తెలిసినవారికి కూడా దిగ్భ్రమగొలిపేటంతటి చిన్నవయసులో కలిగిన సంతానం."[1] ఆదర్శ కుటుంబాల మాతృభూమి, యూరపునకు ఆదర్శ ప్రాయమైన క్రైస్తవ దేశం, కనీసం కౌంట్ మాంటలెంబర్ట్ అంటున్నదిదీ; మరీ నిజంగా ఆయన క్రైస్తవ మతంపై అర్హత గల ప్రామాణికుడాయె!

పై పరిశ్రమల్లో వేతనాలు అసలే నికృష్టంగా ఉన్నాయి. (గడ్డి అల్లకం పాఠశాలల్లో పిల్లల గరిష్ట వేతనాలు అరుదుగా 3 షిల్లింగులకు పెరుగుతాయి.) అవి సర్వత్రా, ప్రత్యేకించి లేస్ జిల్లాల్లో నెలకొని ఉన్న ట్రక్ పద్ధతి మూలంగా (అవసరమైన వస్తువులు యజమానుల దుకాణాల్లోనే కొనుగోలు చేసే పద్ధతి – అను) నమోదైన మొత్తంకన్నా చాలా తక్కువ స్థాయికి దిగజారాయి.[2]

### ఉ. ఆధునిక యంత్ర పరిశ్రమలుగా ఆధునిక కార్ఖానా ఉత్పత్తుల గృహ పరిశ్రమల పరివర్తన ఆ పరిశ్రమలకు ఫ్యాక్టరీ చట్టాల అనువర్తన వల్ల ఈ విప్లవాన్ని త్వరితం చేయడం

స్త్రీల, పిల్లల శ్రమను కేవలం దుర్వినియోగం చేయడం వల్లనేమి, శ్రమకు, జీవికకు తప్పనిసరి యైన ప్రతి మామూలు అవసరాన్నీ కేవలం హరించడం వల్లనేమి, మితిమీరిన పని, రాత్రి పని పాశవికత వల్లనేమి శ్రమ శక్తిని చౌకపరచే క్రమానికి, తుదకు సహజసిద్ధ అవరోధాలు ఎదురవుతాయి. అవి అధిగమించరానివి. అదే విధంగా, సరకులను చౌకపరచే క్రమమూ, మొత్తంపై పెట్టుబడిదారీ దోపిడీ ఈ పద్ధతులపై ఆధారపడినప్పుడు, వాటికి కూడా అట్టి అవరోధాలు ఎదురవుతాయి. తుదకు ఈ స్థితి నందుకొన్న వెనువెంటనే దీనికి చాలా సంవత్సరాలు పడుతుంది – యంత్రాలను ప్రవేశ పెట్టడానికి, చెల్లాచెదురుగా ఉన్న గృహ పరిశ్రమలనూ, కార్ఖానా ఉత్పత్తులను, ఫ్యాక్టరీ పరిశ్రమలుగా అప్పటి నుండి సత్వర గతితో మార్చుడానికీ సమయం ఆసన్నమయిందన్న మాటే.

ఈ ఉద్యమం అత్యంత భారీ స్థాయిలో సాగిన దానికి ఒక ఉదాహరణ దుస్తుల ఉత్పత్తి. పనిలో పిల్లల నియామకంపై ఏర్పడిన కమిషన్ వారి వర్గీకరణను బట్టి ఈ పరిశ్రమ కిందికి వచ్చేవారు: గడ్డిపోచ టోపీలు తయారుచేసేవారు, ఆడవారి టోపీలు తయారు చేసేవారు, మామూలు టోపీలు తయారు చేసేవారు, దర్జీలు, ఆడవారి ఉడుపులు కుట్టేవారు, దుస్తులు కుట్టేవారు, షర్టులు కుట్టేవారు,

1. పూర్వోక్త గ్రంథం, పుటలు XL, XLI.
2. "పనిలో పిల్లల నియామకంపై కమిషన్, 1వ నివేదిక, 1863." పుట 185.

రవికలు కుట్టేవారు, చేతి తొడుగులు తయారు చేసేవారు, బూట్లు కుట్టేవారు, వీరంతా కాక, నెక్‌టైలు, కాలర్లు మొదలయిన వాటిని తయారుచేసే అనేక చిల్లర మల్లర శాఖలు. ఇంగ్లండు, వేల్స్‌లలో 1860లో ఈ పరిశ్రమల్లో నియమితులైన స్త్రీల సంఖ్య 586,299. వీరిలో కనీసం 115,242 మంది 20 ఏళ్ళలోపు వారు. 16,650 మంది వయస్సు 15 కన్నా తక్కువ. బ్రిటన్‌లో ఈ కార్మిక స్త్రీల సంఖ్య 750,334. ఇంగ్లండు, వేల్స్‌లలో గడ్డిపోచల టోపీల తయారీ, బూట్లు కుట్టడం, చేతి తొడుగుల తయారీ, దర్జీ పనుల్లో నియమితులైన పురుషుల సంఖ్య 437,969. వీరిలో 14,964 మంది వయసు 15 ఏళ్ళకన్నా తక్కువ; 89,285 మంది వయసు 15-20 ఏళ్ళ మధ్యన, 333,117 మంది వయసు 20 ఏళ్ళకు పైగా ఉంటుంది. ఈ అంకెల్లో మరీ చిన్న శాఖలు చాలా వాటిని చేర్చలేదు. కానీ ఇలా ఉన్న అంకెలనే తీసుకోండి. ఒక్క ఇంగ్లండు, వేల్స్‌లలోనే, 1861 జనాభా లెక్కలను బట్టి, మొత్తం 1,024,277 మంది, అంటే వ్యవసాయం, పశుపోషణ రంగాలు ఇముడ్చుకొన్నంత మంది ఉన్నారు. యంత్రాల ఇంద్రజాలం ఆవాహన చేసిన సరకుల అపార రాశి, ఈ యంత్రాలు విడుదల చేసిన అసంఖ్యాక శ్రామిక జనావళి ఏమవుతుందో మనకు అవగాహన కానారంభిస్తుంది.

ఉడుపుల ఉత్పత్తి కార్ఖానాలలో కొంత, సన్నకారు చేతివృత్తికారుల పెద్దలచే కొంత నిర్వహింప బడుతుంది. కార్ఖానా పనిగదుల్లో ఉన్నది చెల్లాచెదురుగా, అదివరకే సర్వసిద్ధంగా ఉన్న శ్రమ విభజన పునఃసృష్టి తప్ప మరొకటి కాదు. కానీ ఈ చేతివృత్తుల వారు పనిచేసేది కార్ఖానాలకు, గోదాములకే తప్ప, మునుపటిలా విడివిడి వినియోగదారులకు కాదు; కానీ, ఈ పని ఎంత విస్తృతంగా జరుగుతుందంటే, తరచూ పట్టణాలకు పట్టణాలే, దేశంలోని ప్రాంతాలకు ప్రాంతాలే బూట్ల తయారీలాంటి కొన్ని శాఖలను, తమ ప్రత్యేకతగా నిర్వహిస్తాయి. చివరి విషయం, ఉడుపుల ఉత్పత్తిని చాలా పెద్ద ఎత్తున గృహ కార్మికు లనబడేవారు కూడా చేస్తారు. వీరు కార్ఖానాల, గోదాముల బయటి శాఖలుగా, సన్నకారు యజమానుల వర్క్‌షాపుల బయటి శాఖలుగా కూడా ఉంటారు.[1]

వీటికి ముడిపదార్థాలూ, మొదలయిన వాటిని యంత్ర పరిశ్రమ సరఫరా చేయగా, ఉడుపుల ఉత్పత్తికి చౌకగా లభించే మానవ వనరులకు కావలసిన వ్యక్తులను యంత్ర పరిశ్రమ, అభివృద్ధి చెందిన వ్యవసాయం "విముక్తి" చేస్తాయి. పెరుగుతుండే గిరాకీ అది ఏమాత్రమైనా సరే తీర్చగలగడానికి, అన్ని హంగులతో తయారుగా ఉన్న ఒక కార్మిక వాహిని పెట్టుబడిదారునికి అందుబాటులో ఉండవలసిన ఆవశ్యకతే, ప్రధానంగా ఈ రకం ఉత్పత్తులకు మూలకారణం.[2] కానీ ఈ కార్ఖానా ఉత్పత్తులు చెల్లాచెదురుగా ఉన్న చేతివృత్తులను గృహ పరిశ్రమలను, ఒక విస్తృత ప్రాతిపదికపై కొనసాగనిచ్చాయి. ఈ శ్రమ శాఖల్లో అదనపు విలువ ఎక్కువగా ఉత్పత్తి కావడానికీ, వాటి వస్తువులు అంతకంతకు చౌక కావడానికీ, నికృష్టంగా బతుకు వెళ్ళమార్చడానికి తప్ప మరెందుకూ చాలని

1. ఇంగ్లండులో, స్త్రీల టోపీల తయారీ, దుస్తుల తయారీ ఎక్కువగా యజమాని ఇంట్లోనే జరుగుతుంది. ఈ పని అక్కడే నివసించే కార్మిక స్త్రీలు కొంత, బయట నివసించే స్త్రీలు కొంత చేస్తారు.
2. వైట్ అనే ఒక కమిషనర్ వెళ్ళి చూచిన ఒక సైనిక దుస్తుల కార్ఖానాలో 1,000 నుంచి 1,200 వరకు పని చేసేవారు. వీరంతా స్త్రీలే. ఆయన సందర్శించిన ఒక బూట్ల కార్ఖానాలో 1,300 మంది పని చేసేవారు. వారిలో దాదాపు సగంమంది పిల్లలూ, తరుణ వయస్సులోని వారు.

కనీస వేతనాలూ, ఏ మేరకు మానవ శరీరం భరించగలదో అంతవరకు పని దినం పొడిగింపూ ప్రధాన కారణాలుగా ఉండేవి, ఉంటున్నాయి. లోగడ మార్కెట్లను స్థిరంగా విస్తరింపచేసిందీ, నేడూ అనునిత్యం విస్తరింపచేస్తున్నదీ, సరకులుగా మారుతున్న ఆ స్వేదం, రక్తంను చౌకపరచడం ద్వారానే, ప్రత్యేకించి ఇంగ్లండు వలస మార్కెట్ల విషయంలో ఇలాగే జరిగింది; పైగా అవి, ఆంగ్లేయుల అభిరుచులూ, అలవాట్లూ ప్రాబల్యం వహించిన ప్రదేశాలాయె. ఎట్టకేలకు కీలక సమయం వచ్చింది. శ్రామిక ప్రజల దోపిడీలోని కేవల పాశవికత, దాన్ని ఇంచుమించు అంటిపెట్టుకొని ఉన్న సువ్యవస్థిత శ్రమ విభజన – పాత పద్ధతికి ఆధారభూతంగా ఉన్న ఇవి, మార్కెట్లను విస్తరింపచేయడానికీ, అంతకన్నా త్వరగా విస్తరిస్తున్న పెట్టుబడిదారుల పోటీకి ఇక చాలలేదు. యంత్రాల ప్రవేశానికి సమయం ఆసన్నమైంది. నిర్ణయాత్మకంగా విప్లవకరమైన యంత్రం – ఈ ఉత్పత్తి రంగంలోని అసంఖ్యాక శాఖలన్నిటిపైనా, దుస్తుల తయారీ, దర్జీ పని, బూట్ల తయారీ, కుట్టు పని, టోపీల తయారీ, తదితర అనేక శాఖలన్నిటిపైనా సమాన స్థాయిలో దాడి చేసే యంత్రం ఏదంటే, కుట్టుమిషన్.

శ్రామిక ప్రజలపై దాని తక్షణ ప్రభావం ఎలాంటిదంటే – ఆధునిక పరిశ్రమలు తలయెత్తిన నాటి నుంచి, కొత్త వృత్తులను తమ పట్టులోకి తెచ్చుకొన్న యంత్రాలన్నీ నెరపిన ప్రభావం వంటిదే. మరీ లేత వయసులోని పిల్లలను గాలికి వదలివేయడం జరుగుతుంది. యంత్ర కార్మికుల వేతనం పేదల్లోకెల్లా పేదలయిన గృహ పరిశ్రమల కార్మికుల వేతనంతో పోల్చితే, పెరుగుతుంది. కొంత మెరుగయిన స్థానంలో ఉన్న చేతివృత్తుల వారితో యంత్రం పోటీపడుతుంది కాబట్టి, వారి వేతనం పడిపోతుంది. కొత్త యంత్రపు పనివారంతా బాలికలూ, యువతులూ మాత్రమే. యాంత్రిక శక్తి సహాయంతో వారు, బరువు పనులపై పురుష శ్రమకు గల గుత్తాధిపత్యాన్ని నిర్మూలిస్తారు; తేలిక పనుల నుంచి వృద్ధ స్త్రీలను, పసిపిల్లలను తరిమివేస్తారు. అప్రతిహతమైన పోటీ, కాయకష్టం చేసే శ్రామికుల్లో కెల్లా దుర్బలులను అణచివేస్తుంది. లండన్‌లో, గత 10 సంవత్సరాల్లో ఆకలి చావులు భయంకరంగా పెరగడం, మిషన్ కుట్టుపని విస్తరణకు సమానాంతరంగా సాగింది.[1] కొత్త కార్మిక మహిళలు ఈ యంత్రాలను చేత్తోనూ, పాదంతోనూ లేదా చేత్తో మాత్రమే తిప్పుతారు. మిషన్ బరువు, పరిమాణం, దాని ప్రత్యేక నిర్మాణాన్ని బట్టి కొన్ని సందర్భాల్లో కూర్చొని, కొన్ని సందర్భాల్లో నిల్చుని అలా చేస్తూ, ఎంతో శ్రమ శక్తిని వ్యయం చేస్తారు. వారి పని గంటల కాలం అత్యధిక సందర్భాల్లో పాత వ్యవస్థలో ఉన్నంత దీర్ఘమైనది కాకపోయినా, ఎక్కువే. అందువల్ల వారి వృత్తి అనారోగ్యకరమైనది. ఇరుగ్గా వున్న, అదివరకే పనివారితో క్రిక్కిరిసి ఉన్న గదుల్లో కుట్టుమిషన్ స్థాపితమైన చోటల్లా, అది అనారోగ్యకర ప్రభావాలను ఇనుమడింపజేస్తుంది. “30 నుంచి 40 దాకా కుట్టుమిషన్ వారు పని చేస్తున్న గుజ్జన గూళ్ళవంటి పని గదుల్లో అడుగు పెట్టగానే మనపై పడే ప్రభావం దుర్భరమైనది... ఆ సెగ – ఇస్త్రీ పెట్టెలను వేడిచేయడానికి వాడే గ్యాస్ స్టవులు దీనికి కొంతవరకు కారణం – దారుణమైనది... ఒక మోస్తరు పని గంటలు అంటే ఉదయం 8 నుంచి సాయంత్రం 6

1. ఇందుకొక ఉదాహరణ. మరణాల గురించి, రిజిస్ట్రార్ - జనరల్ పంపిన 1864 ఫిబ్రవరి 26వ తేదీ వార నివేదికలో అయిదు ఆకలిచావు ఉదంతాలున్నాయి. అదే రోజు ది టైమ్స్ అటువంటి మరొక చావును గురించిన వార్త ప్రకటించింది. ఒక్క వారంలోనే, క్షుద్బాధకు ఆరుగురు బలి.”

గంటల వరకు అమలు జరుగుతున్న అలాంటి చోట్లలో కూడా, ప్రతి రోజూ ముగ్గురు, నలుగురు మూర్ఛపోవడం మామూలు" అని లార్డ్ అంటున్నాడు.[1]

పారిశ్రామిక పద్ధతులలోని విప్లవం, ఉత్పత్తి పరికరాల్లో విప్లవ అవశ్య ఫలితంగా వచ్చింది. ఇది అనేక పరివర్తనా రూపాల కలగాపులగం ద్వారా సంభవించింది. పరిశ్రమలోని ఆయా శాఖలో కుట్టు మిషన్ ఏ మేరకు వ్యాపించి ఉన్నదీ, అది ఎంత కాలం నుంచి పని చేస్తున్నదీ, కార్మికుల మునుపటి పరిస్థితులు, కార్ఖానా ఉత్పత్తులు లేదా చేతివృత్తులు లేదా గృహ పరిశ్రమల ప్రాబల్యం, పని గదుల అద్దె మొదలయిన అంశాలను బట్టి ఆ రూపాలు మారుతాయి.[2] ఉదాహరణకు, ముఖ్యంగా సాధారణ సహకారం ద్వారా శ్రమ, అదివరకే చాలా వరకు సువ్యవస్థితమై ఉన్న దుస్తుల కార్ఖానా పరిశ్రమలో కుట్టుమిషన్, మొదట, కేవలం ఒక కొత్త కారకంగా రూపొందింది. దర్జీ పని, చొక్కాల తయారీ, బూట్ల తయారీ మొదలయిన వాటిలో ఆ రూపాలన్నీ కలగాపులగంగా ఉన్నాయి. ఇక్కడ అసలైన ఫ్యాక్టరీ వ్యవస్థ మనకు కనిపిస్తుంది. మధ్య దళారీలు ప్రధాన పెట్టుబడిదారుడి నుంచి ముడి పదార్థాలను తీసుకొని, "గదుల్లో", "మిద్దెపై పాకల్లో", 10 నుంచి 50 దాకా లేదా ఇంకా ఎక్కువ మంది కార్మిక మహిళలను తన కుట్టుమిషన్ల చుట్టూ చేరుస్తారు. యంత్రాలు ఒక వ్యవస్థగా సంఘటితం కానప్పుడల్లా, వాటిని అల్ప సంఖ్యలో కూడా వినియోగించ వీలున్నప్పుడల్లా జరిగినట్లుగానే, తుదకు చేతివృత్తులవారు, గృహ పరిశ్రమ కార్మికులు, తమ కుటుంబాలతోపాటు లేదా బయటి నుంచి తెచ్చుకొన్న కొంతమంది అదనపు శ్రామికులతో, తమ సొంత కుట్టుమిషన్లను వాడుతారు.[3] ఇంగ్లండులో వ్యాప్తిలో ఉన్న పద్ధతి ఇదీ : పెట్టుబడిదారుడు తన ఆవరణలో కుట్టుమిషన్లను చాలా పెద్ద సంఖ్యలో కేంద్రీకరిస్తాడు. తరువాత ఆ యంత్రాలు ఉత్పత్తి చేసిన నాటికి తుదిరూపమివ్వటానికై వాటిని గృహ పరిశ్రమల కార్మికుల మధ్య పంపిణీ చేస్తాడు.[4] కానీ, ఈ పరివర్తనా రూపాల వైవిధ్యం, అసలైన ఫ్యాక్టరీ వ్యవస్థగా మారే పోకడను దాచదు. ఈ పోకడను కుట్టుమిషన్ స్వభావమే పెంచి పోషిస్తుంది. దీని బహువిధ ఉపయోగాలు, మునుపు విడిగా ఉన్న ఒక పరిశ్రమ శాఖలను ఒకే భవనంలో, ఒకే మేనేజ్‌మెంట్ కింద కేంద్రీకరింప చేస్తాయి. సన్నాహక సూది కుట్టు, ఇంకా కొన్ని ఇతర పనులు కుట్టుమిషన్ పనిచేసే ఆవరణలోనే జరగడంలోని అత్యంతానుకూల్యం, చేతికుట్టువారికి, తమ సొంత కుట్టుమిషన్లతో పనిచేసే గృహ పరిశ్రమ కార్మికులకు వృత్తి నుంచి అనివార్యంగా జరిగే ఉద్వాసన,

1. పనిలో పిల్లల నియామకంపై కమిషన్, రెండో నివేదిక, పుట LXVII, సంఖ్య 84, సంఖ్య 124. పుట LXXXIII, సంఖ్య 441. పుట 68, సంఖ్య 6. పుట 84, సంఖ్య 126. పుట 78, సంఖ్య 85. పుట 76, సంఖ్య 69. పుట LXXII, సంఖ్య 483.
2. "ఈ అంశాన్ని తుదకు నిర్ధారణ చేసేది, పని గదులకు అవసరమైన ఆవరణం అద్దెలే అని తోస్తోంది. అందువల్లనే సన్నకారు యజమానులకు, కుటుంబాలకు పని ఇచ్చే పాత పద్ధతిని ఇతరత్రాకన్నా ఎక్కువ కాలం అట్టిపెట్టిందీ, ముందుగా మళ్ళీ చేపట్టిందీ రాజధానిలోనే." (పూర్వోక్త గ్రంథం, పుట 83, సంఖ్య 123) ఈ ఉల్లేఖనలోని ముగింపు మాటల కేవలం బూట్ల తయారీకి సంబంధించి చెప్పినవి.
3. చేతి తొడుగుల తయారీలోనూ, శ్రామిక ప్రజల పరిస్థితులు, పరమ దరిద్రులైన అనాథల పరిస్థితుల కన్నా భిన్నంగా లేని తదితర పరిశ్రమల్లోనూ ఇలా జరగదు.
4. పూర్వోక్త గ్రంథం, పుట 83, సంఖ్య 122.

దీనికి దోహదం చేస్తాయి. ఇప్పటికే వారు కొంతవరకు ఈ దుర్గతిపాలయారు. కుట్టుమిషన్లలో మదుపు పెట్టే పెట్టుబడి స్థిరంగా పెరుగుతూండటం వల్ల,[1] యంత్రోత్పాదిత వస్తువుల తయారీకి ఊపు వస్తుంది. వాటితో మార్కెట్లు ఎక్కసంగా నిండిపోతాయి. తమ యంత్రాలను అమ్ముకోవలసిందిగా గృహ పరిశ్రమదారులకు అది హెచ్చరిక అవుతుంది. అసలు కుట్టు యంత్రాల అమితోత్పత్తి కారణంగా, వాటి ఉత్పత్తిదారులు వాటిని అమ్ముకోలేక, వారానికి ఒక నిర్ణీత మొత్తం చొప్పున అద్దెకిస్తారు. ఆ విధంగా ప్రాణాంతకమైన పోటీతో యంత్రాల సన్నకారు సొంత దారులను అణచివేస్తారు.[2] ఈ యంత్రాల నిర్మాణంలో వచ్చే నిరంతరమైన మార్పులూ, అవి అంతకంతకు చౌక కావడం, పాత నమూనా యంత్రాల విలువ రోజు రోజుకు పడిపోవటం, ఫలితంగా వాటిని కారుచౌకగా పెద్ద పెట్టుబడిదారులకు అమ్మివేయటం జరుగుతుంది. వాటిని లాభదాయకంగా వినియోగించుకోగలిగేది వారొక్కరే. అంతిమంగా, మనిషి స్థానంలో ఆవిరి ఇంజన్ రంగప్రవేశంతో, ఇటువంటి తరహా అన్ని విప్లవాల్లో లాగానే ఇందులో కూడా తుది దెబ్బ తీసింది. మొదట్లో ఆవిరి శక్తి వినియోగానికి కేవలం సాంకేతిక ఇబ్బందులు – యంత్రాలకు నిలకడ లేకపోవడం, వాటి వేగాన్ని నియంత్రించడంలో గల చిక్కు, మరీ తేలికైన యంత్రాలు త్వరగా అరిగిపోవడం వంటివి – ఎదురవుతాయి; వీటినన్నిటినీ అనుభవం ద్వారా అనతి కాలంలోనే అధిగమించడం జరుగుతుంది.[3] ఒకవైపు పెద్ద పెద్ద కార్ఖానా ఉత్పత్తుల్లో అనేక యంత్రాల కేంద్రీకరణ, ఆవిరి శక్తి వినియోగానికి దారితీయగా మరోవైపు మనిషి కండబలంతో నీటి ఆవిరి పోటీ, భారీ ఫ్యాక్టరీల్లో కార్మికుల, యంత్రాల కేంద్రీకరణను త్వరితం చేస్తుంది. ఆ విధంగా నేడు ఇంగ్లండులో, బృహత్ పరిశ్రమ అయిన ఉడుపుల ఉత్పత్తిలోనే కాక, పైన పేర్కొన్న ఇతర పరిశ్రమల్లో అత్యధిక భాగంలో కూడా, కార్ఖానా ఉత్పత్తి, చేతివృత్తులు, గృహపరిశ్రమలు, ఫ్యాక్టరీ వ్యవస్థగా మార్పు చెందుతున్నాయి. ఈ ఉత్పత్తి రూపాల్లో ప్రతి ఒక్కటీ ఆధునిక పరిశ్రమల ప్రభావం వల్ల పూర్తిగా మారి, అస్తవ్యస్తమై, ఫ్యాక్టరీ వ్యవస్థలో గల సామాజిక ప్రగతికి సంబంధించిన అంశాల్లో దేనిలోనూ పాలుపంచుకోకుండానే, ఆ వ్యవస్థలోని సమస్త బీభత్సాలను ఏనాడో పునఃసృష్టించడమే కాక, వాటిని తలదన్నే ఘోరాలు చేసినవే; ఆ తరువాతనే ఇలా మార్పు చెందుతున్నాయి.[4]

---

1. లీసెస్టర్ పాదరక్షల టోకు మార్కెట్‌లో 1864 నాటికే 800 కుట్టు యంత్రాలు వాడకంలో ఉండేవి.
2. పూర్వోక్త గ్రంథం, పుట 84, సంఖ్య 124.
3. ఉదాహరణలు : లండన్‌లోని పిమ్లికో సైనిక దుస్తుల డిపో, లండన్ డెర్రీలోని టిల్లీ, హెండర్సన్ షర్ట్ ఫ్యాక్టరీ; లిమెరిక్‌లోని 1,200 కార్మికులు పని చేస్తున్న మెస్సర్స్ టైట్ దుస్తుల ఫ్యాక్టరీ.
4. "ఫ్యాక్టరీ వ్యవస్థ వైపుగా మొగ్గు" (పూర్వోక్త గ్రంథం, పుట LXVII) "ఈనాడు మొత్తం పనివారి నియామకం పరివర్తనా దశలో ఉంది. లేస్ పరిశ్రమ, నేత మొదలైనవాటిలో వచ్చిన అదే మార్పుకు లోనవుతూంది." (పూర్వోక్త గ్రంథం, సంఖ్య 405) "అది ఒక సంపూర్ణ విప్లవం" (పూర్వోక్త గ్రంథం, పుట XLVI ఎన్. 318) పనిలో పిల్లల నియామకంపై 1840 నాటి కమిషన్ కాలంలో, మేజోళ్ళు ఇంకా కాయకష్టంతోనే తయారయ్యేవి. 1846 దరిమిలా వివిధ రకాల యంత్రాలు ప్రవేశపెట్ట బడ్డాయి. ఇప్పుడు అవి ఆవిరితో నడుస్తున్నాయి. 1862లో ఇంగ్లండులో మేజోళ్ళ తయారీలో నియమితులైన, మూడేళ్ళకు పైబడ్డ అన్ని వయసుల స్త్రీ, పురుషుల మొత్తం సంఖ్య 129,000. 1862 ఫిబ్రవరి 11వ తేదీ పార్లమెంటరీ పత్రాన్ని బట్టి, వీరిలో 4,062 మంది మాత్రమే ఫ్యాక్టరీ చట్టాల కింద పనిచేసేవారు.

అయత్నకంగా సంభవించే ఈ పారిశ్రామిక విప్లవానికి ఫ్యాక్టరీ చట్టాలు కృతకంగా తోడ్పడుతున్నాయి. స్త్రీలు, తరుణ వయస్కులు, పిల్లలు పనిచేసే పరిశ్రమలన్నింటికి ఫ్యాక్టరీ చట్టాలు విస్తరించడంతో ఈ సహాయం జరుగుతున్నది. పనిదిన పరిమాణం, విరామ సమయాలు, దాని ప్రారంభం, సమాప్తి – వీటికి సంబంధించిన నిర్బంధ నియంత్రణ, పిల్లల విషయంలో అంచెల పద్ధతి ఒక నిర్దిష్ట వయసులోపలి యావన్మంది పిల్లల నియామకంపై నిషేధం కారణంగా, ఒకవైపు మరిన్ని యంత్రాలను[1] మనిషి కండబలం స్థానంలో, చోదక శక్తిగా ఆవిరి యంత్రాన్ని[2] ప్రవేశపెట్టవలసిన అవసరం కల్పిస్తాయి. మరోవైపు, పనికాలం తగ్గినందువల్ల కలిగే నష్టాన్ని భర్తీ చేయడం కోసం, ఉమ్మడిగా వాడే ఉత్పత్తి సాధనాలు, బట్టీలు, భవనాలు మొదలయిన వాటి ఇతోధిక విస్తరణ జరుగుతుంది; ఒక్క మాటలో చెప్పాలంటే, ఉత్పత్తి సాధనాల ఇతోధిక కేంద్రీకరణ, తదనుగుణంగా కార్మికుల ఇతోధిక సమీకరణ జరుగుతుంది. ఫ్యాక్టరీ చట్టానికి లోనయ్యే ప్రమాదం ఎదురైన ప్రతి కార్ఖానా ఉత్పత్తి తరఫున పదే పదే మహావేశంతో వచ్చిన ప్రధాన అభ్యంతరం, వ్యాపారాన్ని పాత స్థాయిలో కొనసాగించడానికి మరింత ఎక్కువ పెట్టుబడి మదుపు పెట్టవలసి వస్తుందనేదే. కానీ, గృహ పరిశ్రమలనబడే వాటిలోనూ, వాటికీ, కార్ఖానా ఉత్పత్తికీ నడుమ గల మధ్యంతర రూపాల్లోని శ్రమ విషయానికి వస్తే, పని దినానికీ పిల్లల నియామకానికీ పరిమితులు విధించిన వెంటనే, ఆ పరిశ్రమలు నాశనమవుతాయి. పోటీ చేయడానికి వాటికి గల సత్తాకు, పునాది చౌకగా లభించే శ్రమ శక్తిని హద్దూ పద్దూ లేకుండా దోచుకోవడం ఒక్కటే.

ఫ్యాక్టరీ వ్యవస్థ ఉనికికి, ముఖ్యంగా పని దిన పరిమాణం నిర్ణీతమైనప్పుడు, అత్యవసరమైన షరతుల్లో ఒకటి, అది సాధించే ఫలితం నిశ్చయమై ఉండడం. అంటే, ఒక నిర్ణీత కాలంలో ఒక నిర్ణీత పరిమాణంలో జరిగే సరకుల ఉత్పత్తి లేదా ఉపయోగకరమైన ఒక నిర్ణీత ఫలితం. అంతేకాదు, నియమిత కాలాల్లో అకస్మాత్తుగా పని నిలుపుదల, ఉత్పాదన ప్రక్రియకు లోనవుతున్న వస్తువుకు ఎలాంటి హాని కలిగించదన్న భావం, చట్టాలు నిర్దేశించే పని దినంలోని విరామాలలో గర్భితంగా ఉంది. ఫలితం విషయంలో ఈ నిశ్చయతను, పనికి అంతరాయం కలిగించే ఈ అవకాశాన్ని రసాయన, భౌతిక ప్రక్రియలు కొంత పాత్ర వహించే పరిశ్రమల్లో కన్నా – ఉదాహరణకు, మట్టి పాత్రల పరిశ్రమ, వస్త్రాలను తెలుపు చేయటం, అద్దకం, రొట్టెల పరిశ్రమ, అత్యధిక లోహ పరిశ్రమల్లో కన్నా – కేవలం యంత్ర పరిశ్రమల్లో సాధించడం సులభం. పని దినానికి కాల పరిమాణం విషయంలో పరిమితులు లేనిచోటల్లా, రాత్రి పని, మానవ జీవితం నిరాటంకంగా వృధా అయ్యేచోటల్లా, మంచి

1. ఉదాహరణకు, మట్టిపాత్రల పరిశ్రమలో, గ్లాస్గో బ్రిటన్ పాటరీకి చెందిన కొక్రేన్ కంపెనీ ఇలా చెబుతోంది: "మా ఉత్పత్తి పరిమాణాన్ని నిల్పుకొనేందుకు మేము నైపుణ్యం అవసరంలేని శ్రమచే నడిచే యంత్రాలను విస్తృతంగా వాడకంలోకి తెచ్చాము. పాత పద్ధతిలోకన్నా ఎక్కువ పరిమాణంలో ఉత్పత్తి చేయగలమని ప్రతి రోజు అనుభవం మాకు నమ్మకం కలిగిస్తుంది." ("1865 అక్టోబరు 31, ఫ్యాక్టరీ ఇన్‌స్పెక్టర్ల నివేదిక," పుట 13) "ఫ్యాక్టరీ చట్టాల ప్రభావం, యంత్రాలను మరింతగా ప్రవేశపెట్టేలా మెడలు వంచడమే." (పూర్వోక్త గ్రంథం, పుటలు 13-14)

2. ఉదాహరణకు, మట్టి పాత్రల పరిశ్రమకు ఫ్యాక్టరీ చట్టాలను విస్తరింపచేసిన తరువాత, చేతితో నడిచే కుమ్మరి చక్రం స్థానంలో ఆవిరి శక్తితో తిరిగే చక్రాలు పెద్దయెత్తున వాడుకలోకి వచ్చాయి.

మార్పు రావటానికి పని స్వభావం తెచ్చిపెట్టే అతి చిన్న ఆటంకాన్నీ, ప్రకృతి నిర్మించిన శాశ్వత అవరోధంగా పరిగణించడం కద్దు. ఫ్యాక్టరీ చట్టం అటువంటి అవరోధాలను తొలగించినంత నిశ్చయంగా ఏ విషమూ క్రిములను చంపలేదు. "అసాధ్యతలను" గురించి మట్టి పాత్రల కార్ఖానా యజమానులు లేవదీసినంత గగ్గోలు మరెవరూ లేవదీయలేదు. కానీ 1864లో వాటిని ఆ చట్టం కిందికి తేవడం జరిగింది. పదహారు నెలల్లో ప్రతి "అసాధ్యత" అంతర్థాన మయింది. "తడి ఆరబెట్టడానికి బదులు, ఒత్తిడి ద్వారా మూసను తయారుచేసే మెరుగైన పద్ధతి", ఈ చట్టం మూలంగా ప్రవేశపెట్టవలసి వచ్చిన ఈ పద్ధతి, "పాత్రలు పచ్చిగా ఉన్నప్పుడు ఎండపెట్టడానికి కొత్తగా నిర్మించిన ఇనుప కుంపట్లు, మొదలయినవి ప్రతి ఒక్కటి, మట్టి పాత్రలు తయారుచేసే కళలో ఎంతో ప్రాధాన్యమున్న విశేషాలు, ఇవి తెచ్చిన పురోగతితో, గత శతాబ్దంలోనిదేదీ పోటీ పడజాలదు. ఇవి అసలు, ఇనుప కుంపట్ల ఉష్ణోగ్రతనే గణనీయంగా తగ్గించాయి. దానితో, ఇంధనం గణనీయంగా ఆదా అయింది. పాత్రలపై వాటి ప్రభావం మరింత త్వరగా పడింది.[1] మట్టి పాత్రల ఉత్పత్తి ధర పెరుగు తుందని ఎందరో జోస్యాలు చెప్పినా, అలా జరుగలేదు; కానీ ఉత్పత్తి పరిమాణం పెరిగింది. ఎంత పెరిగిందంటే, 1865 డిసెంబరుతో ఆఖరయ్యే 12 నెలలకు వాటి ఎగుమతి విలువ, అంతకు ముందు మూడేళ్ళ సగటు ఎగుమతి విలువను 138,628 పౌండ్ల మేరకు మించింది. అగ్గిపుల్లల పరిశ్రమలో పిల్ల వాళ్ళు ఆదరాబాదరా భోజనం చేస్తున్నప్పుడు కూడా అగ్గిపుల్లల్ని భాస్వర ద్రవంలో అద్దుతూనే ఉండటం తప్పనిసరిగా అవసరమని అనుకొనేవారు. ఈ ద్రవం నుంచి లేచిన ఆవిర్లు వాళ్ళ ముఖాలకు కమ్ముకొనేవి. ఫ్యాక్టరీ చట్టం (1864) వల్ల కాలాన్ని పొదుపు చేయడం అవసరమయింది. కాబట్టి పుల్లల్ని అద్దే యంత్రం ఉనికిలోకి రావడం తప్పనిసరి అయింది. కార్మికులకు ఈ యంత్రం నుంచి వచ్చే భాస్వర వాయువుల స్పర్శ లేకుండా పోయింది.[2] అదే విధంగా, ప్రస్తుతం, లేస్ ఉత్పత్తిలో, ఇంకా ఫ్యాక్టరీ చట్టం కిందికి రాని శాఖల్లో, భోజన సమయాలను క్రమబద్ధం చేయ వీలులేదనే వాదన ఉంది; వేరు వేరు రకాల లేసును ఆరబెట్టడానికి పట్టే వ్యవధులు వేరు వేరుగా మూడు నిమిషాలు మొదలుకొని, గంట వరకు అంతకు మించి కూడా ఉండటం, ఇందుకు చెబుతున్న కారణం. పనిలో పిల్లల నియామకంపై కమిషన్ దీనికి చెబుతున్న సమాధానమిది : "ఈ వ్యవహారంలోని పరిస్థితులకూ, మా తొలి నివేదికలో, గోడ కాగితాలు తయారుచేసే వారి విషయమై వివరించిన పరిస్థితులకూ సాదృశ్యముంది. ఆ పరిశ్రమలో ఉపయోగించే పదార్థాల స్వభావం, వాటి వివిధ ప్రక్రియల ఫలితంగా, తీవ్రమైన నష్టం లేకుండా, ఏ నిర్ణీత సమయంలోనైనా భోజనం పొద్దుకోసం పని ఆపడం తమకు సాధ్యం కాదని, ఆ పరిశ్రమలోని ప్రధాన ఉత్పత్తిదారులు కొందరు గట్టిగా చెప్పారు. కానీ, తగిన జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా, ముందుగానే ఏర్పాట్లు చేయడం ద్వారా, వారు అనుకొంటున్న చిక్కును అధిగమించవచ్చునని, సాక్ష్యాధారాలను బట్టి తేలింది. ఆ ప్రకారమే,

---

1. "ఫ్యాక్టరీ ఇన్‌స్పెక్టర్ల నివేదిక, 1865, అక్టోబరు 31," పుటలు 96, 127.
2. అగ్గిపుల్లల తయారీలో ఈ యంత్రాన్ని తదితర యంత్రాలనూ ప్రవేశపెట్టడం వల్ల, ఒక డిపార్టుమెంటులోనే 230 మంది పసివాళ్ళ స్థానంలో 14-17 సంవత్సరాల బాలబాలికలను నియమించారు. ఆవిరిశక్తి వినియోగం ద్వారా, 1865లో శ్రమను ఇలా పొదుపు చేయడాన్ని ఇంకా ముందుకు తీసుకెళ్ళారు.

ఫ్యాక్టరీ చట్టాలు భోజనానికి నిర్దేశించిన గంటల్ని పాటించడానికి, పార్లమెంటు సమావేశంలో ఆమోదించిన ఫ్యాక్టరీ చట్టాల విస్తరణ చట్టంలోని 6వ సెక్షన్‌లోని 6వ క్లాజు ద్వారా, వారికి చట్టం ఆమోదం పొందిన నాటి నుంచి 18 నెలల వ్యవధి ఇవ్వబడింది."[1] ఈ చట్టం ఆమోదం పొందిందో లేదో, మన మిత్రులు, కార్ఖానా యజమానులు తెలుసుకొన్నదిది : "వస్తూత్పత్తి శాఖలో ఫ్యాక్టరీ చట్టాలను ప్రవేశపెట్టినందువల్ల ఉత్పన్నమవుతాయని మేము అనుకొన్న ఇబ్బందులు తలయెత్తలేదని చెప్పడానికి సంతోషిస్తున్నాము. ఉత్పత్తికి ఏ మాత్రమూ అంతరాయం ఏర్పడినట్లు మాకు అగుపించలేదు. ఒక్క ముక్కలో చెప్పాలంటే, మేము అదే కాలంలో ఇంకా ఎక్కువ ఉత్పత్తి చేస్తున్నాము."[2] ప్రతిభావంతులు మరీ ఎక్కసంగా ఉన్నారని ఎవరూ నిందించ సాహసించని ఇంగ్లీషు శాసనసభ, అనుభవం ద్వారా ఒక నిర్ధారణకు వచ్చింది : అదేమంటే, పని దినానికి పరిమితిని విధించి, క్రమబద్ధం చేసేందుకు అవరోధాలంటూ పేర్కొనబడే వాటిని ఉత్పత్తి ప్రక్రియ స్వభావానికి వ్యతిరేకమైన వీటిని – మాయం చేసేందుకు ఒక చిన్న నిర్బంధ శాసనం చాలు. కాబట్టి, ఒకానొక పరిశ్రమలో ఫ్యాక్టరీ చట్టం ప్రవేశపెట్టిన తరువాత ఆ చట్టం పని చేయడానికి గల అన్ని సాంకేతిక అవరోధాలను విధిగా తొలగించడానికి, పరిశ్రమదారులకు, ఆరు మొదలుకొని పద్దెనిమిది నెలల వరకు వేరు వేరు వ్యవధులను అది నిర్దేశించింది. "అసాధ్యమా! అపహాస్యభాజనమైన ఆ మాట నా విషయంలో ఎప్పటికీ వాడవద్దు!" అన్న మిరాబే మాటలు ప్రత్యేకించి ఆధునిక సాంకేతిక శాస్త్రానికి వర్తిస్తాయి. కానీ, కార్ఖానా ఉత్పత్తి వ్యవస్థను ఫ్యాక్టరీ వ్యవస్థగా మార్చడానికి అవసరమైన భౌతిక అంశాలను ఫ్యాక్టరీ చట్టాలు కృతకంగా పరిపక్వానికి తెస్తున్నప్పటికీ, అదే సమయంలో, అవి పెట్టుబడిని మరింత ఎక్కువగా మదుపు పెట్టవలసిన ఆవశ్యకాన్నీ నెత్తిపై రుద్దడం వల్ల, సన్నకారు యజమానులు క్షీణించడం, పెట్టుబడి సాంద్రీకరణ త్వరితమవుతుంది.[3]

సాంకేతిక సాధనాల ద్వారా తొలగించ వీలున్న కేవల సాంకేతిక అవరోధాలు కాక, ఒక క్రమమూ, పద్ధతీ లేని కార్మికుల అలవాట్లు కూడా శ్రమ గంటలను క్రమబద్ధం చేయటానికి ఆటంకంగా ఉన్నాయి. పనినిబట్టి వేతనం చెల్లింపు ప్రబలంగా ఉన్న సందర్భాలకు, దినంలో లేదా వారంలో ఒకప్పుడు కాలం వృథా అయినందువల్ల జరిగిన నష్టాన్ని, తరువాత అదనపు గంటల్లో లేదా రాత్రిపూటో పని చేయడం ద్వారా భర్తీ చేసుకోవీలున్న ఈ సందర్భాలకు ఇది ప్రత్యేకించి వర్తిస్తుంది. ఇలా పని

1. "పనిలో పిల్లల నియామకంపై కమిషన్, 2వ నివేదిక, 1864, పుట IX, ఎన్. 5.
2. ఫ్యాక్టరీ ఇన్‌స్పెక్టర్ల నివేదికలు, 1865, అక్టోబరు 31, పుట 22.
3. "ఆ మెరుగుదలలను కొన్ని సంస్థల్లో పూర్తిగా ప్రవేశపెట్టినప్పటికీ, అవి ఎంతమాత్రమూ సార్వత్రికమైనవి కావు; పాత కార్ఖానాలను తమకింద ఉంచుకొన్నవారిలో అనేకుల శక్తికి మించిన పెట్టుబడిని ఖర్చు చేయకుండా, ఈ మెరుగుదలలను, ఆ కార్ఖానాలు చాలా వాటిలో వాడుకలో పెట్ట వీలు లేదు; అని గుర్తుంచుకోవాలి." "అటువంటి చర్యను (ఫ్యాక్టరీ చట్టాల విస్తరణ చట్టం వంటిదాన్ని) తీసుకొన్నందువల్ల అనివార్యంగా వెనువెంటనే తాత్కాలిక అవ్యవస్థ నెలకొన్నప్పటికీ, నేను సంతోషించకుండా ఉండలేదు. ఏ చెడుగులను చక్కపరచడం ఈ చర్య ఉద్దేశమో, వాటికి, ఈ అవ్యవస్థ నిజంగా ప్రత్యక్ష సూచిక." (ఫ్యాక్టరీ ఇన్‌స్పెక్టర్ల నివేదికలు, 1865, అక్టోబరు 31.)

చేయడంవల్ల వయోజనుడైన కార్మికుడు పశుప్రాయుడవుతాడు. అతని భార్యా పిల్లలు నాశనమవుతారు.[1] శ్రమ శక్తి వ్యయంలో ఈ క్రమబద్ధతా రాహిత్యం, ఒకే విధమైన బండచాకిరి పుట్టించే విసుగుదలకు వ్యతిరేకంగా ఉత్పన్నమైన, సహజమైన, మొరటు ప్రతిక్రియే అయినప్పటికీ, అంతకన్నా చాలా ఎక్కువగా ఉత్పత్తిలోని అరాచకత్వం కూడా దానికి మూలం. పెట్టుబడిదారుడు శ్రమ శక్తిని హద్దూ, అదుపు లేకుండా దోపిడీ చేయడం గర్భితంగా ఉన్న అరాజకత్వమది. పారిశ్రామిక ఆవృత్తికి సంబంధించిన సాధారణమైన, నియమిత అవధుల్లో వచ్చే మార్పులనూ, ప్రతి పరిశ్రమను శాసించే మార్కెట్లలోని ఎగుడు దిగుడులనూ మాత్రమే కాక, "రుతువు" అనేదాన్ని కూడా మనం లెక్కలోకి తీసుకోవచ్చు. ఇది నౌకాయానానికి సంవత్సరంలో, నియమిత కాలాల్లో వచ్చే అనుకూల రుతువులపైనా, లేదా ఫ్యాషన్‌పైనా, సాధ్యమైనంత తక్కువ కాలంలో పూర్తి చేయవలసిన భారీ ఆర్డర్లు హఠాత్తుగా రావడంపైనా ఆధారపడి ఉంటుంది. రైలు మార్గాల, తంతి వార్తా ప్రసార సాధనాల విస్తరణలో ఇటువంటి ఆర్డర్లు ఇచ్చే అలవాటు మరింత త్వరితమవుతుంది. "దేశమంతటా రైల్వే వ్యవస్థ విస్తరణ, స్వల్ప వ్యవధి గల ఆర్డర్లను ప్రోత్సహించే ధోరణి హెచ్చింది. కొనుగోలుదారులు ఇప్పుడు దాదాపు ప్రతి పదిహేను రోజుల కొకసారి, గ్లాస్గో, మాంచెస్టర్, ఎడింబరోల నుండి, మేము సరకులు సరఫరా చేసే నగరపు టోకు గోదాములకు వచ్చి, వెంటనే నెరవేర్చవలసిన చిన్న చిన్న ఆర్డర్లు ఇస్తున్నారు; మునుపటిలా నిల్వ నుంచి కొనడం లేదు. కొన్ని సంవత్సరాల క్రితం, మార్కెట్ మందంగా ఉన్న రోజుల్లో, తరువాతి రుతువు గిరాకీని తీర్చడానికి అనువుగా, ఎల్లప్పుడూ పనిచేయగలిగే వారం. కానీ అప్పుడు గిరాకీ ఎలా ఉంటుందో నేడు ముందుగా ఎవరూ చెప్పలేరు."[2]

ఇంకా ఫ్యాక్టరీ చట్టాల కిందికి రాని ఫ్యాక్టరీల్లోనూ, కార్ఖానాల్లోనూ రుతువు అని పేర్కొనబడుతున్న కాలంలో, హఠాత్తుగా వచ్చే ఆర్డర్ల పర్యవసానంగా, అతి భయంకరమైన అదనపు పని నియమిత కాలాల్లో ప్రబలంగా ఉంది. ఫ్యాక్టరీ, కార్ఖానా, గోదాములకు చెందిన బయటి శాఖలో, గృహ పారిశ్రామికులనే వారు, తమ ముడి సరకులకు, ఆర్డర్లకు పెట్టుబడిదారుని చపలచిత్తంపై పూర్తిగా

---

1. ఉదాహరణకు, కర్మాగారపు గాలి బట్టీల పనిలో "సోమవారం నాడూ, అప్పుడప్పుడూ మంగళవారం నాడు కూడా ఆసాంతం, లేదా కొంతవరకు వృధా కాలక్షేపం చేసే కార్మికుల అలవాటు మూలంగా, వారాంతరంలో పని కాలాన్ని సర్వ సాధారణంగా బాగా హెచ్చించడం కద్దు." (పనిలో పిల్లల నియామకంపై కమిషన్, 3వ నివేదిక, పుట IV). "చిన్నపాటి పని పెద్దల పని గంటలు ఒక క్రమమూ, పద్ధతిలో ఉండవు. వారు రెండు మూడు రోజులు పని చేయరు. ఆ నష్టాన్ని పూడ్చుకొనేందుకు, తరువాత రాత్రంతా పని చేస్తారు... వారెల్లప్పుడూ తమ పిల్లల్ని పనికి నియోగిస్తుంటారు - వారికి పిల్లలుంటే." (పూర్వోక్త గ్రంథం, పుట VII) "పనికి సక్రమంగా రాకపోవడానికి, ఎక్కువ గంటలు పని చేయడం ద్వారా ఈ నష్టాన్ని భర్తీ చేసుకొనే అవకాశమూ, ఆచారమూ ప్రోద్బలమిస్తోంది." (పూర్వోక్త గ్రంథం, పుట VIII) "బర్మింగ్‌హామ్‌లో కాలం విపరీతంగా వ్యర్థమైపోతోంది... కాలంలో కొంత భాగం వృధాగా గడపడం, మిగతా కాలం గొడ్డుచాకిరీ చేయడం." (అదే గ్రంథం, పుట XI)
2. "పనిలో పిల్లల నియామకంపై కమిషన్," 4వ నివేదిక, పుట xxxii. "హఠాత్తుగా ఆర్డర్లు ఇచ్చే ఈ ఆచారానికి, తత్ఫలితమైన హడావుడికీ, కార్మికుల భోజనం వేళలపట్ల అలక్ష్యానికి, వారు పొద్దుపోయే వరకు పనిచేయడానికీ, రైల్వే వ్యవస్థ విస్తరణ చాలా దోహదం చేసిందని అంటున్నారు." (పూర్వోక్త గ్రంథం, పుట xxxi)

ఆధారపడ్డారు. ఈ పరిశ్రమల్లో, పెట్టుబడిదారుడికి, తన భవనాలు, యంత్రాల అరుగుదల గురించిన ఆలోచన అడ్డురాదు. పని నిలుపుదల వల్ల అతనికి నష్టం జరుగగల ప్రమాదమేమీ లేదు, కార్మికుని ప్రాణం పోవడం తప్ప. ఇక్కడ హెచ్చరిక చేసిన మరుక్షణంలో సిద్ధంగా ఉండే పారిశ్రామిక నిల్వ బలాలను తయారుచేసి ఉంచుకొనేందుకు అతడు ఒక పద్ధతి ప్రకారం పూనుకొంటాడు. సంవత్సరంలో కొంతకాలం పాటు అతి అమానుష శ్రమతో ఈ బలాల్లో కొందరి ప్రాణం తీస్తాడు. సంవత్సరంలో మిగతా కాలం వారిని, పని లేనందువల్ల ఆకలి బాధతో మాడుస్తాడు. "ఒక్క దెబ్బలో అదనపు పని అవసరమైనప్పుడు యజమానులు, ఇంట్లో జరిగే పనిలో అలవాటుగా ఉన్న క్రమబద్ధతా రాహిత్యాన్ని ఉపయోగించుకొంటారు; పర్యవసానంగా పని, రాత్రి 11, 12 గంటల వరకు లేదా అర్ధరాత్రి తరువాత రెండు గంటల వరకు కూడా లేదా మామూలుగా చెబుతున్నట్లు 'అన్ని గంటల్లోనూ' సాగుతుంది. 'నీవు మూర్ఛపోయేటంత కంపు కొడుతున్న' స్థలాల్లో బహుశా 'నీవు తలుపు వద్దకు వెళ్ళి తలుపు తీస్తావు. కానీ ఆ తరువాత ముందుకు పోవాలంటే ఒళ్ళు జలదరిస్తుంది."[1] ఈ యజమానులను గురించి చెబుతూ, సాక్షుల్లోని ఒక ముచ్చీ ఇలా అన్నాడు : "వారు విడ్డూరమైన మనుషులు. కుర్రవాడు సంవత్సరంలో సగం కాలం దాదాపు పని లేకుండా ఉంటే, మిగతా సగం కాలం, తలకు మించిన పని చేయడం వాడికి ఏ హాని చేయదని వారనుకొంటున్నారు."[2]

సాంకేతిక అవరోధాల లాగానే, "పరిశ్రమ పెరుగుదలతో పాటు పెరిగిన ఆనవాయితీలు" కూడా, పని స్వభావంవల్ల వచ్చిన అవరోధాలయినట్లు వీటివల్ల లాభపడుతున్న పెట్టుబడిదారులు లోగడ ఘంటాపథంగా చెప్పారు. ఇంకా చెబుతూనే ఉన్నారు. ఫ్యాక్టరీ చట్టాల నుంచి తొలుత తమకు ప్రమాదం ఏర్పడినప్పుడు, ఇది జౌళీ పరిశ్రమ ప్రభువులకు ప్రియమైన నినాదంగా ఉండేది. మరేదానికన్నా వారి పరిశ్రమ నౌకాయానంపై ఆధారపడి ఉన్నప్పటికీ, వారు చెప్పేది సర్వాబద్ధమని అనుభవంలో తేలింది. ఆనాటి నుంచి, వ్యాపారానికి ఆటంకంగా ఉన్నట్టు బుకాయిస్తున్న ప్రతి ఒక్కదాన్ని కేవలం మోసంగా ఫ్యాక్టరీ ఇన్‌స్పెక్టర్లు పరిగణిస్తున్నారు.[3] కొన్ని పరిశ్రమల్లో పని గంటలను క్రమబద్ధం చేసిన ఫలితంగా, మునుపు నియుక్తమైన శ్రమ రాశి సంవత్సరం పొడుగునా మరింత సమానంగా పంపిణీ అయిందనీ,[4] ఈ క్రమబద్ధీకరణ, ఫ్యాషన్‌ల ఘాతుకమైన అర్థరహితమైన చాంచల్యాలు,[5] ఆధునిక పరిశ్రమల వ్యవస్థతో అంత అధ్వాన్నంగా సహవసించే ఈ చాంచల్యాలకు

1. "పనిలో పిల్లల నియామకంపై కమిషన్," 4వ నివేదిక, పుటలు XXXVI, సంఖ్య 235, 23.
2. "పనిలో పిల్లల నియామకంపై కమిషన్," 4వ నివేదిక, పుట సంఖ్య 56.
3. "నౌకల కోసం ఇచ్చిన ఆర్డర్లను సకాలంలో పూర్తి చేయనందువల్ల పరిశ్రమకు కలుగుతున్న నష్టం సంగతికి వస్తే, ఇది 1832లో, 1833లో ఫ్యాక్టరీ యజమానులకు బహు ప్రీతికరమైన వాదనగా ఉండేదని నాకు జ్ఞాపకం. ఆనాడు, దూరాలన్నిటినీ ఆవిరి శక్తి సగానికి తగ్గించివేసి, రవాణాకు కొత్త నిబంధనలను స్థాపించక మునుపు, ఈ వాదనకున్న బలం, ఈ విషయంపై ఈనాడు తీసుకురా వీలున్న ఏ వాదనకు ఉండజాలదు. ఆనాడు పరీక్షకు పెట్టి చూచినప్పుడు, ఆ వాదన రుజువు కాలేదు. ఇప్పుడు పరీక్షించవలసివస్తే ఖచ్చితంగా మళ్ళీ రుజువు కాదు." (ఫ్యాక్టరీ ఇన్‌స్పెక్టర్ల నివేదికలు, 1862, అక్టోబరు 31.)
4. "పనిలో పిల్లల నియామకంపై కమిషన్," 5వ నివేదిక, పుట xviii, సంఖ్య 118.
5. జాన్ బెల్లర్స్ 1699లోనే ఇలా వ్యాఖ్యానించారు; "ఫ్యాషన్ల అనిశ్చయత జీవనాధారంలేని పేదల సంఖ్యను పెంచుతుంది. దానికి రెండు పెద్ద చెడు గుణాలున్నాయి. మొదటిది, శీతాకాలంలో పని లేనందువల్ల

ఈ క్రమబద్ధీకరణ సహేతుకమైన తొలి కట్టడి అనీ, రుతువును బట్టి జరిగే పనికి నిజంగా ఆధారభూతమైన సాంకేతిక పునాదిని, సముద్ర నౌకాయానం, మొత్తంపై, కమ్యూనికేషన్ల అభివృద్ధి తుడిచిపెట్టిందనీ,[1] పెద్ద భవనాలూ, అదనపు యంత్రాలూ, నియుక్త శ్రామికుల సంఖ్య పెరుగుదల ముందు,[2] టోకు వ్యాపార పద్ధతిలో ఇవన్నీ తెచ్చిన మార్పుల ముందు,[3] ఇతర దుర్భేద్యమైన చిక్కులనేవన్నీ అంతర్ధానమవుతాయనీ, పనిలో పిల్లల నియామకంపై కమిషన్ సంపూర్ణమైన చిత్తశుద్ధితో చేసిన దర్యాప్తుల్లో రుజువయింది. అయినప్పటికీ, పని గంటలను నిర్బంధంగా క్రమబద్ధం చేయడానికీ, "పార్లమెంటు సార్వత్రిక చట్టపు ఒత్తిడి కింద" తప్ప పెట్టుబడి ఎన్నటికీ అటువంటి మార్పులు అనివార్యమని మనసును సమాధానపరచుకోదు.[4] ఇది దాని ప్రతినిధులు పదే పదే అంగీకరించిన విషయమే.

---

రోజు కూలీలు పరమ దీనావస్థలో ఉంటారు. జౌళీ వ్యాపారులు, చేనేత కార్మిక యజమానులు, వసంత రుతువు రాకముందు, అప్పుడు ఏ ఫ్యాషన్ ఉంటుందో తెలుసుకోక ముందు, దిన కూలీలను పనిలో ఉంచుకొనేందుకు తమ పెట్టుబడినే వినియోగించడానికి సాహసించరు. రెండవది, వసంత రుతువులో ఈ దిన కూలీలు చాలరు. కాబట్టి, పావు లేదా అర్ధ సంవత్సరంలో, రాజ్య వాణిజ్య రంగానికి సరకులు సరఫరా చేయడానికి వీలుగా చేనేత కార్మిక యజమానులు అనేకమంది ఉమేజుదార్లను పనిలోకి తీసుకోకతప్పదు. ఇందువల్ల సేద్యపు పనులకు మనుషులు కరువవుతారు. పల్లెసీమల్లోని శ్రామికులను లాగివేయడం జరుగుతుంది. ఎక్కువ భాగం, నగరం బిచ్చగాళ్ళతో నిండిపోతుంది. అడుక్కుతినడానికి సిగ్గుపడే కొందరు శీతాకాలంలో, తిండిలేక మాడుతారు." ("ఎస్సేస్ అబౌట్ ది పూర్, మాన్యుఫాక్చరర్స్ అండ్ ఎట్సెట్రా" పుట 9)

1. పనిలో పిల్లల నియామకంపై కమిషన్ నివేదిక, 5వ నివేదిక, పుట 171, ఎన్. 34.
2. కొన్ని బ్రాడ్ ఫోర్డ్ ఎగుమతి సంస్థల సాక్ష్యం ఇలా ఉంది : "ఈ పరిస్థితుల్లో పని పూర్తి కావడానికి పిల్లవాండ్లతో ఉదయం 8 నుంచి సాయంత్రం 7, 7.30 కన్నా ఎక్కువసేపు పని చేయించవలసిన అవసరం లేదు. ఇది కేవలం, అదనపు పనివారికి, అదనపు పెట్టుబడికి సంబంధించిన సమస్య. కొంతమంది యజమానులు అంత దురాశాపరులు కాకపోతే, కుర్రవాళ్ళు పొద్దుపోయేవరకు పని చేయరు. ఒక అదనపు యంత్రానికయ్యే డబ్బు 16 లేదా 18 పౌండ్లే. అటువంటి అదనపు పని గంటల్లో చాలా భాగానికి సాధనాలు, స్థలమూ తగినంత లేకపోవడమే మూలకారణం." ("పనిలో పిల్లల నియామకంపై కమిషన్, 5వ నివేదిక," పుట 171, సంఖ్య 35, 36, 38.)
3. పూర్వోక్త గ్రంథం, పని గంటలను నిర్బంధంగా క్రమబద్ధం చేయడం, పారిశ్రామిక యజమానుల నుంచి శ్రామిక ప్రజలకూ, టోకు వర్తకం నుంచి పారిశ్రామిక యజమానులకు రక్షణగా భావించే ఒక లండన్ పారిశ్రామిక యజమాని ఇలా చెబుతున్నాడు : "మా పరిశ్రమలో ఒత్తిడికి కారణం నౌకా వ్యాపారులే. వారు ఉదాహరణకు, ఒక నిర్ణీత రుతువులో సరకులను వాటి గమ్యస్థానానికి చేరేలా తెరచాపల ఓడలో పంపి, అదే సమయంలో, తెరచాప ఓడకు, పొగ ఓడకు మధ్య రవాణా చార్జీల మధ్య తేడాను జేబులో వేసుకోగోరుతున్నారు; లేక, విదేశీ మార్కెట్‌లో తమ పోటీదార్లకన్నా ముందుండటానికై, రెండు పొగ ఓడల్లో, ముందు బయలుదేరే దాన్ని ఎంచుకొంటారు."
4. "దీన్ని నివారించవచ్చు. కానీ పార్లమెంటు సార్వత్రిక చట్టపు ఒత్తిడి కింద జరిగే ఫ్యాక్టరీల విస్తరణ.

## విభాగం-9

# ఫ్యాక్టరీ చట్టాలు, వాటిలో పారిశుద్ధ్యానికి, విద్యా బోధనకు సంబంధించిన క్లాజులు ఇంగ్లండులో ఆ చట్టాల సార్వత్రిక విస్తరణ

ఉత్పత్తి ప్రక్రియ అయత్నంగా సంతరించుకొన్న రూపానికి వ్యతిరేకంగా సమాజం చైతన్యంతో, ఒక క్రమపద్ధతిలో తీసుకొన్న తొట్టతొలి ప్రతిక్రియ అయిన ఫ్యాక్టరీ చట్టాలు, మనం ఇదివరకే చూచినట్లు, నూలు, స్వయం ప్రవర్తక సాధనాలు, విద్యుత్, టెలిగ్రాఫ్ లాగానే, ఆధునిక పరిశ్రమల అవశ్య ఫలితమే. ఇంగ్లండులో ఆ చట్టాల అనువర్తన విస్తరణను పరిశీలించడానికి పూనుకొనే ముందు, ఫ్యాక్టరీ చట్టాల్లోని పని గంటలకు సంబంధించిన కొన్ని క్లాజులను గురించి క్లుప్తంగా ప్రస్తావిస్తాము.

వాటిలోని మాటల తీరువల్ల పెట్టుబడిదారుడు ఆ చట్టాల నుంచి సులభంగా తప్పుకోవచ్చు. ఇది కాక, పారిశుద్ధ్యపు క్లాజులు అల్పాతి అల్పమైనవి. ఇవి నిజానికి, గోడలకు సున్నం కొట్టడం, మరి కొన్ని విషయాల్లో శుభ్రత పాటించడం, ధారాళంగా గాలి వెలుతురు వచ్చే ఏర్పాట్లు, ప్రమాదకర యంత్రాల నుంచి రక్షణ – వీటికి సంబంధించిన నిబంధనలకు పరిమితమైనవి. తమ కార్మికుల అవయవాలకు రక్షణగా ఉండే సాధనాలపై ఖర్చును కాస్త తమపై మోపే క్లాజులను యజమానులు ఎంత వీరావేశంతో వ్యతిరేకిస్తారో ఈ గ్రంథం మూడవ సంపుటిలో తిరిగి చెబుతాను. పరస్పర విరుద్ధ ప్రయోజనాలు గల సమాజంలో ప్రతి వ్యక్తీ తన సొంత ప్రయోజనాలను తప్ప మరిదేన్నీ పట్టించుకోకుండా ఉండటం ద్వారా, అవశ్యంగా ఉమ్మడి సంక్షేమానికి దోహదం చేస్తాడట! అలా చెప్పే స్వేచ్ఛా వ్యాపారపు, పిడిసూత్రంపై మిరుమిట్లుగొలిపే కొత్త వెలుగును ప్రసరింపచేస్తున్నది యజమానుల వ్యతిరేకత. ఇందుకొక ఉదాహరణ చాలు. గత 20 సంవత్సరాల్లో ఎల్లగిసెనార బట్టల పరిశ్రమ చాలా విస్తరించిందనీ, ఆ విస్తరణతో, నారను శుద్ధి చేసే మిల్లుల సంఖ్య ఐర్లాండులో పెరిగిందనీ పాఠకులకు తెలుసు. 1864లో ఆ దేశంలో అలాంటి మిల్లులు 1,800 దాకా ఉండేవి. క్రమం తప్పకుండా ప్రతి శీతాకాలంలో, స్త్రీలను, "చిన్నవాళ్ళను" – పొరుగున ఉన్న సన్నకారు రైతుల భార్యలను, కొడుకులను, కూతుళ్ళను, యంత్రాలకు బొత్తిగా అలవాటుపడని ఈ వర్గ ప్రజలను – ఎల్లిగిసెనార శుద్ధి మిల్లులలోని రోలర్లకు నారను అందివ్వడానికై పొలం పనుల నుంచి తీసుకువెడతారు. అక్కడ జరిగేలాంటి ప్రమాదాలూ, వాటి సంఖ్యా యంత్రాల చరిత్రలోనే కనీవినీ ఎరగము. కోర్క్ వద్ద కిల్డినాన్‌లోని ఒక ఎల్లిగిసెనార శుద్ధి కర్మాగారంలో 1852–1856 మధ్య, ప్రమాదాల్లో ఆరుగురు మరణించారు. 60 మంది అంగవికలులయ్యారు. వీటిలో ప్రతి ఒక్కదాన్నీ, కొన్ని షిల్లింగులు వ్యయమయ్యే అతి సామాన్య సాధనాలతో నివారించి ఉండవచ్చు. డౌన్ పాట్రిక్‌లోని ఫ్యాక్టరీలకు సంబంధించి, సర్టిఫికెట్లు ఇచ్చే సర్జన్, డాక్టర్ డబ్ల్యు. వైట్ 1865 డిసెంబరు 15వ తేదీ గల తన అధికార నివేదికలో ఇలా చెబుతున్నాడు : "ఎల్లిగిసెనార శుద్ధి మిల్లుల్లోని తీవ్ర ప్రమాదాలు అత్యంత భయంకరమైనవి. అనేక సందర్భాల్లో, శరీరంలో పావు భాగం, మొల నుంచి మెడ వరకు గల దేహ భాగం నుంచి తెగిపోతుంది. మనిషి చావడమో లేక అతను నికృష్టమైన అశక్తతతో, బాధతో భావిజీవితం గడపడమో తప్పదు. దేశంలో మిల్లుల పెరుగుదల, సహజంగానే ఈ భయానక ఫలితాలను ఎక్కువ చేస్తుంది. ఈ మిల్లులను చట్టాల పరిధిలోకి తీసుకొస్తే, అదొక పెద్ద వరప్రసాద

మవుతుంది. అపారమైన మానవ ప్రాణాల, అవయవాల బలిని, నారశుద్ధి మిల్లులపై తగిన అజమాయిషీ నివారిస్తుంది."[1]

పరిశుభ్రతను, ఆరోగ్యాన్ని కాపాడేందుకు అతి సామాన్య పరికరాలను పార్లమెంటు చట్టాల ద్వారా పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానంపై బలాత్కారంతో రుద్దవలసిన ఆవశ్యకత కలిగింది; ఆ ఉత్పత్తి విధాన స్వభావాన్ని ఇంతకంటే బాగా మరేది తెలపగలదు? మట్టిపాత్రల పరిశ్రమలో, "200కు పైగా వర్క్‌షాపుల్లో శుభ్రం చేసే పనిని, యజమానులు అనేక సందర్భాల్లో 20 ఏళ్ళపాటు, కొన్ని సందర్భాల్లోనైతే పూర్తిగా పరిత్యజించిన తరువాత," "1864 ఫ్యాక్టరీ చట్టం" "వాటికి వెల్ల వేయించాయి, శుభ్రం చేయించాయి." (ఇదీ పెట్టుబడిదారుని "పరిత్యాగం!") "వీటిలో నియమితులైన 27,800 మంది వృత్తికారులు అంతవరకూ పగలూ, తరచూ రాత్రీ, దీర్ఘకాలంపాటు శ్రమిస్తూ, కంపుగొట్టే గాలి పీల్చుకొనేవారు. ఇది, ఇతరత్రా నిరుపద్రవకరమైన ఒక వృత్తిని వ్యాధులకు, మృత్యువుకు ఆకారంగా చేసింది. ఈ చట్టం గాలి ప్రసరణను ఎంతో మెరుగుపరచింది."[2] అదే సమయంలో, పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం, దాని స్వభావాన్ని బట్టే ఒక నిర్దిష్ట పరిధికి మించి సహేతుకమైన మెరుగుదలకు ఆస్కారమివ్వదని, చట్టంలోని ఈ భాగం స్పష్టంగా రుజువు చేస్తోంది. పని నిరంతరాయంగా సాగేచోట, ప్రతి వ్యక్తికీ కనీసం 500 ఘ. అడుగుల స్థలం ఉండాలని ఇంగ్లీషు డాక్టర్లు, ఏకగ్రీవంగా చెబుతున్నట్లు అంటున్నారు. మరి, ఫ్యాక్టరీ చట్టాలు గనుక, తమ నిర్బంధ నిబంధనల మూలంగా, చిన్న చిన్న వర్క్‌షాపులు ఫ్యాక్టరీలుగా మారే క్రమాన్ని పరోక్షంగా వేగిరపరిస్తే, ఆ విధంగా చిన్న పెట్టుబడిదారుల యాజమాన్య హక్కులను దెబ్బతీసి, పెద్ద పెట్టుబడిదారులకు గుత్తాధిపత్యానికి హామీ కల్పిస్తే – అంటే, ప్రతి వర్క్‌షాపులోని ప్రతి కార్మికునికి తగినంత స్థలం సమకూర్చడం విధాయకంగా చేస్తే, ఒక్క దెబ్బతో, వేలమంది సన్నకారు యజమానుల ఆస్తులు ప్రత్యక్షంగా లాక్కోవడమవుతుంది! కాబట్టి, పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానపు మూలాన్నే అంటే, శ్రమ శక్తిని "స్వేచ్ఛగా" కొనడం, వినియోగించడం ద్వారా జరిగే చిన్న, పెద్ద పెట్టుబడులన్నిటిని స్వయం విస్తరణకు దెబ్బతీయడమవుతుంది. కాబట్టి, ఊపిరి పీల్చుకొనేందుకు ఉద్దేశించిన 500 ఘ. అడుగుల స్థలం ముందు ఫ్యాక్టరీ చట్టాలు ప్రతిష్టంభనలో పడ్డాయి. ఆ 500 ఘ. అడుగులు తప్పనిసరిగా అవసరమనీ, వాటిని పెట్టుబడి నుంచి రాబట్టడం అసాధ్యమనీ పారిశుద్ధ్య శాఖాధికారులు, పారిశ్రామిక దర్యాప్తు కమిషన్ సభ్యులూ, ఫ్యాక్టరీ ఇన్‌స్పెక్టర్లు, అందరూ పదే పదే గోలపెడుతున్నారు. ఆ విధంగా వారు, కార్మిక ప్రజల్లో క్షయ, తదితర శ్వాసకోశ వ్యాధులు పెట్టుబడి ఉనికికి తప్పనిసరిగా అవసరమని, నిజానికి చాటుతున్నారు.[3]

---

1. పూర్వోక్త గ్రంథం, పుట XV, సంఖ్య 72, తదుపరివి.
2. "ఫ్యాక్టరీ ఇన్‌స్పెక్టర్ల నివేదికలు, 1865 అక్టోబరు 31." పుట 127.
3. ఆరోగ్యవంతుడైన సగటు మనిషి, సగటు తీవ్రత గల ప్రతి శ్వాసతో దాదాపుగా 25 ఘ. అంగుళాల గాలిని వినియోగిస్తాడనీ, ప్రతి నిమిషానికీ 25 సార్లు ఊపిరి పీల్చుకొంటాడనీ ప్రయోగంలో తేలింది. కాబట్టి, ప్రతి వ్యక్తి 24 గంటల్లో దాదాపు 720,000 ఘ. అంగుళాల లేక 416 ఘ. అడుగుల గాలి పీలుస్తాడు. కానీ, ఒకసారి పీల్చిన గాలి, ప్రకృతి మహా కర్మాగారంలో శుద్ధిపొందే వరకు, మళ్ళీ శ్వాసక్రియకు ఉపయోగపడదనేది స్పష్టమే. వాలెంటెన్, బ్రున్నర్‌ల ప్రయోగాలను బట్టి, ఆరోగ్యవంతుడు గంటకు 1,300 ఘ. అంగుళాల బొగ్గుపులుసు వాయువును వదులుతాడు; అంటే, ఊపిరితిత్తులు 24 గంటల్లో దాదాపు 8 ఔన్సుల ఘనరూప అంగారక్షారాన్ని బయటికి తోసివేస్తాయన్న మాట. "ప్రతి మనిషికీ కనీసం 800 ఘ. అడుగుల స్థలం ఉండి తీరాలి" (హక్స్లీ).

ఈ చట్టంలో విద్యకు సంబంధించిన క్లాజులు మొత్తంపై పనికిమాలినవైనప్పటికీ, ప్రాథమిక విద్య నేర్పడం, పిల్లల్ని పనిలో పెట్టుకొనేందుకు తప్పనిసరియైన షరతు అని ప్రకటిస్తున్నాయి.[1] ఈ క్లాజుల సార్థకత విద్యా, వ్యాయామాలను కాయకష్టంతో,[2] పర్యవసానంగా, కాయకష్టాన్ని విద్యా వ్యాయామాలతోనూ సమ్మిళితం చేయడం సాధ్యమేనని మొట్టమొదటిసారిగా రుజువు చేసింది.

పూర్తికాలం విద్యార్థులకు చెప్పే చదువులో సగమే ఫ్యాక్టరీ పిల్లలకు చెబుతున్నప్పటికీ, వారు ఆ విద్యార్థులు నేర్చుకొన్నంత తరచూ అంతకన్నా ఎక్కువే నేర్చుకొంటున్నారని ఫ్యాక్టరీ ఇన్‌స్పెక్టర్లు ఈ ఉపాధ్యాయులను ప్రశ్నించడం ద్వారా, త్వరలో తెలుసుకొన్నారు. దీనికి కారణం సులభ గ్రాహ్యామే – పాఠశాలలో సగం దినమే ఉన్నందువల్ల వారి మనసు నవోన్మేషితమై ఉంటుంది. చెప్పింది నేర్చుకోవాలన్న అభిలాషతో, వారు దాదాపు ఎల్లప్పుడూ అందుకు సిద్ధంగా ఉంటారు. వారు పనిచేసే పద్ధతి – సగం కాలం కాయకష్టం చేయడం, సగం కాలం చదువుకోవడం – ఈ రెండు వ్యావృత్తుల్లోని ప్రతిదాన్ని ఒక విశ్రాంతిగా, మిగతా దానిలోని శ్రమను నివారించేదిగా చేస్తుంది. కాబట్టి, పిల్లవాడు నిరంతరం ఒకే కార్య నిమగ్నుడైనప్పటికన్నా ఈ రెండూ అతని స్వభావానికి అనువుగా ఉంటాయి. ఉదయమంతా పాఠశాలలో ఉన్న కుర్రవాడు, తన పని నుంచి నవోన్మేషిత మనసుతో, ఉల్లాసంతో వచ్చే కుర్రవాడితో (ప్రత్యేకించి వేడి వాతావరణంలో) సరితూగలేడు.[3] ఈ విషయంపై మరింత సమాచారం 1863లో ఎడింబరోలో జరిగిన సామాజిక శాస్త్ర మహాసభలో సీనియర్ ఉపన్యాసంలో ఉంది. పై తరగతి, మధ్య తరగతి పిల్లల విసుగెత్తించే, అనవసరంగా సుదీర్ఘమైన బడిగంటలు, ఉపాధ్యాయుని శ్రమను నిష్ప్రయోజనంగా ఎలా పెంచుతున్నాయో, ఆయన తక్కిన విషయాలతోపాటు, నిరూపిస్తున్నాడు; "అదే సమయంలో ఉపాధ్యాయుడేమో, పిల్లల కాలాన్ని ఆరోగ్యాన్ని, శక్తినీ నిష్ఫలంగానే కాక, పూర్తి హానికరంగా వృధా చేస్తున్నాడు."[4]

---

1. ఇంగ్లీషు ఫ్యాక్టరీ చట్టం ప్రకారం, తల్లితండ్రులు 14 ఏళ్ళలోపు ఉన్న తమ పిల్లల్ని, ప్రాథమిక విద్య పొందడానికి అనుమతిస్తే తప్ప, వారిని ఆ చట్టపు నియంత్రణ కింద ఉన్న ఫ్యాక్టరీల్లోకి పంపరాదు. ఈ చట్టాన్ని పాటించే బాధ్యత ఫ్యాక్టరీ యజమానిది. "ఫ్యాక్టరీలో విద్యాబోధ నిర్బంధం; అది శ్రమకొక నియమం" (ఫ్యాక్టరీ ఇన్‌స్పెక్టర్ల నివేదికలు, 1865 అక్టోబరు 31, పుట 111.)
2. ఫ్యాక్టరీ పిల్లలకు, పేద విద్యార్థులకు నిర్బంధ విద్యతో వ్యాయామాన్ని (పిల్లవాళ్ళ విషయంలో డ్రిల్లును) సమ్మిళితం చేయడంవల్ల కలిగే అత్యనుకూల ఫలితాలను గురించి, "సామాజిక శాస్త్ర సంవర్థక జాతీయ సంఘం," ఏడవ వార్షిక మహాసభలో ఎన్.డబ్ల్యు. సీనియర్ ఉపన్యాసాన్ని ("సభా కార్యకలాపాల గురించిన నివేదిక వగైరా" లండన్ 1863, పుటలు 63, 64లో ఉంది) "ఫ్యాక్టరీ ఇన్‌స్పెక్టర్ల నివేదికలు, 1865 అక్టోబరు 31," పుటలు 118, 119, 120, 126, తరువాతి పుటలనూ చూడండి.
3. "ఫ్యాక్టరీ ఇన్‌స్పెక్టర్ల నివేదికలు, 1865 అక్టోబరు 31," పుట 118. ఒక పట్టు వస్త్రాల పరిశ్రమదారు, పనిలో పిల్లల నియామకంపై కమిషన్ సభ్యులతో అమాయకంగా ఇలా చెప్పారు : "సమర్థులైన కార్మికులను తయారుచేసే రహస్యం, చిన్నతనం నుంచీనే విద్యను పనితో జోడించడంలో ఉంది. కానీ పని మరీ తీవ్రమైనదీ, చీకాకు కలిగించేదీ లేదా అనారోగ్యకరమైనదిగా ఉండరాదని వేరే చెప్పనవసరం లేదు. మా పిల్లల బడిలో చదువుకు వైవిధ్యం చేకూర్చడానికి వారికి కొంత పనీ, ఆట పాటలూ ఉండి వుంటే బాగుండు ననుకొంటున్నాను." (పనిలో పిల్లల నియామకంపై కమిషన్, 5వ నివేదిక, పుట 82, సంఖ్య 36)
4. సీనియర్, పూర్వోక్త గ్రంథం, పుట 66. ఆధునిక పరిశ్రమలు ఒకానొక స్థాయి నందుకొన్నప్పుడు, ఉత్పత్తి పద్ధతిలోనూ, ఉత్పత్తి తాలూకు సామాజిక పరిస్థితుల్లోనూ అవి తెచ్చే విప్లవం ద్వారా, ప్రజల మనసులను

ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచే ఒక పద్ధతిగానే కాక, సంపూర్ణంగా అభివృద్ధి చెందిన మానవులను తయారుచేసే ఏకైక పద్ధతిగా కూడా, ఒక నిర్ణీత వయసు దాటిన ప్రతి బాల, బాలిక విషయంలోనూ ఉత్పాదక శ్రమను, చదువు సాములతో మేళవించే ఆ భావి కాలపు విద్యకు బీజావాసనం చేసింది రాబర్ట్ ఓవెన్ సవివరంగా చూపినట్టుగా ఫ్యాక్టరీ వ్యవస్థే.

ప్రతి మనిషిని ఒకే ఒక ప్రత్యేక ప్రక్రియకు పూర్తిగా బంధించివేసిన కార్ఖానా ఉత్పత్తి తాలూకు శ్రమ విభజనను, మనం ఇదివరకే చూచినట్లు, ఆధునిక పరిశ్రమలు సాంకేతిక సాధనాల ద్వారా నిర్మూలిస్తాయి. అదే సమయంలో, ఆ పరిశ్రమల పెట్టుబడిదారీ రూపం అదే శ్రమ విభజనను మరింత వికృతాకారంలో పునఃసృష్టిస్తుంది. ఇది ఫ్యాక్టరీ లోపల, కార్మికుణ్ణి యంత్రానికి సజీవ అనుబంధంగా మార్చడం ద్వారా జరుగుతుంది; ఫ్యాక్టరీ వెలుపల, సర్వత్రా కొంతవరకు యంత్రాలను, యంత్ర కార్మికులను అప్పుడప్పుడు ఉపయోగించడం ద్వారా[1] కొంతవరకు స్త్రీల, పిల్లల శ్రమను, నిపుణతలేని చౌక శ్రమను ప్రవేశపెట్టి, కొత్త ప్రాతిపదికపై శ్రమ విభజనను పునఃస్థాపించడం ద్వారా జరుగుతుంది.

కార్ఖానా ఉత్పత్తిలోని శ్రమ విభజనకు, ఆధునిక పారిశ్రామిక పద్ధతులకు మధ్య తీవ్ర వైరుధ్యం బలంగా అనుభూతమవుతుంది. అది తక్కినవాటితోపాటు, ఒక భయంకర వాస్తవంలో వ్యక్తమవుతుంది; ఆధునిక ఫ్యాక్టరీల్లో, కార్ఖానా ఉత్పత్తుల్లో నియుక్తులైన పిల్లలు, చాలా చిన్నతనం నుంచే, అత్యంత సరళమైన ప్రక్రియలకు బంధించబడి, సంవత్సరాలపాటు దోపిడీ చేయబడతారు. కానీ అదే కార్ఖానా లేదా ఫ్యాక్టరీలో సైతం వారికి, ఉత్తరోత్తరా ఇవ్వవీలున్న మరే రకమైన పని ఒక్కటైనా నేర్పరు. ఉదాహరణకు పాత కార్ఖానాల్లో, చేతివృత్తుల్లో ఉమేజుదారులను సుళువైన పని నుంచి, అంతకంతకు

కూడా ఎలా విప్లవీకరించగలవో, 1863లో సీనియర్ చేసిన ప్రసంగాన్ని, 1833 ఫ్యాక్టరీ చట్టంపై ఆయన గుప్పించిన వాగ్బాణాలతో పోల్చితే, తెలుస్తుంది. లేదా ఇంగ్లండులోని కొన్ని గ్రామీణ జిల్లాల్లో పేదవారైన తల్లితండ్రులు ఆకలితో మాడి చావకుండా ఉండాలంటే, తమ పిల్లల్ని చదివించరాదనే నిషేధముందన్న వాస్తవంతో, పైన పేర్కొన్న మహాసభ అభిప్రాయాలను పోల్చి చూస్తే తెలుస్తుంది. ఉదాహరణకు, ఒక పేదవాడు పారిష్ చర్చి నుంచి ఉచిత సహాయాన్ని కోరినప్పుడు, అతను తన పిల్లలను పాఠశాల నుంచి తీసుకువచ్చి తీరాలని నిర్బంధించడం సోమర్‌సెట్‌షైర్‌లో మామూలని స్నెల్ చెబుతున్నారు. కొన్ని కుటుంబాలు, తమ పిల్లల్ని పాఠశాలకు పంపుతున్నారనే కారణంతో కొన్ని కుటుంబాలకు మొత్తం సహాయాన్నే నిరాకరించిన సందర్భాలను గురించి ఫెల్ట్‌హామ్‌లోని వొల్లార్టన్ అనే ఫాదర్ కూడా చెబుతున్నాడు.

1. మనుషులు నడిపే చేతివృత్తి యంత్రాలు, యాంత్రిక శక్తితో నడిచే, మరింత అభివృద్ధి చెందిన యంత్రాలతో ప్రత్యక్షంగానో, పరోక్షంగానో పోటీ చేసినచోటల్లా, ఆ యంత్రాన్ని నడిపే కార్మికుని విషయంలో పెద్ద మార్పు వస్తుంది. మొదట్లో ఆవిరి ఇంజన్ ఈ కార్మికుని స్థానం వహిస్తుంది. తరువాత అతను ఆవిరి యంత్రం స్థానం వహించక తప్పదు. పర్యవసానంగా ఉద్రిక్తత, వ్యయమయ్యే శ్రమ శక్తి పరిమాణం, ప్రత్యేకించి ఈ చిత్రహింసకు లోనైన పిల్లల విషయంలో, భయంకరంగా పెంపొందుతుంది. ఉదాహరణకు, రిబ్బన్ మగ్గాలను నడపడానికి నియుక్తులైన 10-15 ఏళ్ళ కుర్రవాళ్ళను అంతకన్నా చిన్న యంత్రాలను నడిపే మరింత చిన్నపిల్లల సంగతి ఇక్కడ చెప్పడం లేదు. కమిషన్ సభ్యుల్లో ఒకరైన లాంగే కొవెంట్రీలోను, దాని పరిసర ప్రాంతాల్లో చూచారు. "అది విపరీతంగా అలత పెట్టే పని. కుర్రవాడు ఆవిరి శక్తికి కేవలం ప్రత్యామ్నాయం." ("పనిలో పిల్లల నియామకంపై కమిషన్", 5వ నివేదిక, 1866, పుట 114, సంఖ్య 6) ఈ బానిస వ్యవస్థ వల్ల ఈ అధికార నివేదిక దీన్ని వర్ణించిన తీరు ఇది - సంభవించే ప్రాణాంతక పర్యవసానాలను తెలుసుకోవాలంటే, ఆ నివేదికలోని 144వ పుట, తదుపరి పుటలు చూడండి.

కష్టమైన పనికి సమాయత్తులను చేసే పద్ధతి వంటిది ఇంగ్లీషు ముద్రణాలయ పరిశ్రమలో మునుపు ఉండేది. పరిపూర్ణపు ముద్రాపకులయ్యే వరకు వారికి శిక్షణ ఇచ్చేవారు. వారిలో ప్రతి ఒక్కరికీ చదవనూ, రాయనూ వచ్చివుండాలి. ఇది వారి వృత్తికి అవశ్య అర్హత. అచ్చు యంత్రం వల్ల ఇదంతా మారిపోయింది. అదిప్పుడు రెండు రకాల కార్మికులను నియమిస్తోంది. ఒక రకం, అక్షరాలు కూర్చిన చట్రాన్ని యంత్రానికి బిగించే పెద్దవాళ్ళు, రెండవ రకం, ఎక్కువగా 11 ఏళ్ళ నుంచి 17 ఏళ్ళదాకా వయసు గల బాలురు. వీరి పనల్లా, కాగితాలను యంత్రం కింద పరచడం లేదా యంత్రం కింది నుంచి వాటిని తీయడం. విసుగు పుట్టించే ఈ పనిని వారు, ప్రత్యేకించి లండన్‌లో వారంలో అనేక రోజులు, ఏకబిగిని 14, 15, 16 గంటల చొప్పున చేస్తారు. భోజనానికి, నిద్రకు కేవలం 2 గంటల విశ్రాంతితో, తరచూ 36 గంటలు కూడా చేయడం కద్దు.[1] వారిలో ఎక్కువ మందికి చదువు లేదు. వారు సర్వసాధారణంగా, పూర్తి మృగప్రాయులు, చాలా అసాధారణ జీవులు. "వారు చేయవలసిన పనికి అర్హులు కావటానికి ఎటువంటి బౌద్ధిక శిక్షణ అవసరం లేదు; అందులో నైపుణ్యానికి చోటులేదు; విచక్షణా జ్ఞానానికి అంతకన్నా లేదు. వారు కుర్రవాళ్ళనే దృష్టితో చూస్తే వారి వేతనాలు కాస్త ఎక్కువే. కానీ, వారు పెరిగేకొద్దీ, తదనుగుణంగా అవి పెరగవు. వారిలో ఎక్కువమంది, అంతకన్నా మంచి వేతనం, మరింత బాధ్యత గల యంత్ర నిర్వాహకుని పదవికి వెళ్ళగలమని అనుకోలేరు. ఎందువల్లనంటే, ప్రతి యంత్రానికి ఒకే నిర్వాహకుడు ఉండగా, దానికి అంటిపెట్టుకుని ఉన్న కుర్ర వాళ్ళు కనీసం ఇద్దరు, తరచూ నలుగురు ఉంటారు."[2] అటువంటి చిన్నపిల్లవాడి పనికి తగని వయసు, అంటే కనీసం 17 ఏళ్ళు వచ్చిన వెంటనే వారిని, ముద్రణాలయం నుంచి పంపించివేస్తారు. వారు నేరస్థులలో చేరిపోతారు. ఇతరత్రా వారికి ఏదో ఉపాధి కల్పించేందుకు చేసిన అనేక ప్రయత్నాలు, వారి అజ్ఞాన, పాశవికతలవల్లా, వారు మానసికంగా, శారీరకంగా భ్రష్టులైపోయినందువల్లా వృధా అయ్యాయి.

వస్తూత్పాదక కార్ఖానాల లోపల శ్రమ విభజనకు ఏమి జరుగుతుందో, సమాజంలోపల శ్రమ విభజనకూ అదే జరుగుతుంది. చేతివృత్తి, కార్ఖానా వస్తూత్పత్తి సామాజిక ఉత్పత్తికి సాధారణ ప్రాతిపదికగా ఉన్నన్నాళ్ళూ, ఉత్పాదకుణ్ణి కేవలం ఒకే శాఖకు లోనుచేయడం, అతని పనిలోని బహుముఖాలను చీలదీయడం[3] అభివృద్ధిలో అవశ్య చర్య. ఆ ప్రాతిపదికపై ఉత్పత్తిలోని ప్రతి విడి

1. పూర్వోక్త గ్రంథం, పుట 3, సంఖ్య 34.
2. పూర్వోక్త గ్రంథం, పుట 7, సంఖ్య 60.
3. "స్కాట్‌లాండ్ తాలూకు హైలండర్స్‌లోని కొన్ని ప్రాంతాల్లో, కొన్నేళ్ళ క్రితం, గణాంక సమాచారాన్ని బట్టి, ప్రతి రైతు తాను స్వయంగా పదును చేసిన చర్మంతో తన బూట్లు తానే కుట్టుకొనేవాడు. ఎందరో గొర్రెల కాపరులు, ఇళ్ళు గల రైతులు సైతం తన పెళ్ళాం పిల్లలతో, తమవి తప్ప, మరెవరి చేతులు స్పృశించని దుస్తుల్లో చర్చికి వచ్చేవారు. వాటిపై ఇతరుల చేయి పడకపోవడానికి కారణమేమిటంటే, అవి వారు స్వయంగా కత్తిరించిన గొర్రె బొచ్చుతో, స్వయంగా పండించిన ఎల్లగిసె నారతో తయారు చేసుకొన్నవి. వీటిని తయారు చేయడంలో, ఆరె, సూది, కదురు, నేతలో ఉపయోగించే ఇనుప చట్రంలోని కొన్ని భాగాలు తప్ప, ఒక వస్తువు కూడా వారు కొనలేదని, ఈ గణాంక వివరాలు చెబుతున్నాయి. రంగులు కూడా ప్రధానంగా చెట్లూ, పొదల నుంచి మూలికల నుంచి స్త్రీలు తీసినవే." (డుగాల్డ్ స్టివార్ట్, "రచనలు", హామిల్టన్ కూర్పు, సం. VIII, పుటలు 327-328.)

విడి శాఖ, తనకు సాంకేతికంగా అనుకూలమైన రూపాన్ని ఆచరణలో సంతరించుకొంటుంది. నిదానంగా దాన్ని నిర్దిష్టం చేస్తుంది. ఒక నిర్ణీత పరిపక్వతా స్థాయిని అందుకోగానే, ఆ రూపాన్ని త్వరితగతిలో సుస్థిరపరుస్తుంది. వాణిజ్యం సరఫరా చేసే కొత్త ముడి పదార్థాలు కాక, అక్కడక్కడ మార్పును తెచ్చే ఏకైకాంశం శ్రమ సాధనాల్లో క్రమేపి వచ్చే మార్పే. కానీ ఈ రూపం కూడా అనుభవంవల్ల, కచ్చితంగా స్థిరపడిన తరువాత కరుడుగట్టి శిలాసదృశమవుతుంది. వేల సంవత్సరాలుగా, ఒక తరం నుంచి మరో తరానికి ఇవి అందజేయ బడుతూండటం దీనికి రుజువు. దీని లక్షణం తెలిపే ఒక విశేషమేమిటంటే, 18వ శతాబ్దిలో సైతం వివిధ వృత్తులను "రహస్యాల"ను (మిస్టరీస్) అని పిలిచేవారు;[1] వృత్తిలోకి తగు విధంగా, ప్రవేశం పొందినవారు తప్ప మరెవ్వరికీ వాటి రహస్యాలను ఛేదించే వీలుండేది కాదు. ఉత్పత్తికి సంబంధించిన తమ సొంత సామాజిక ప్రక్రియను మనుష్యుల నుంచి మరుగుపుచ్చి, అసంకల్పితంగా విభజితమైన వివిధ ఉత్పత్తి శాఖలను, బయటివారికే కాక, ఆయా వృత్తిలోని ఆంతరంగికులకు సైతం నిగూఢ రహస్యాలుగా మార్చిన ముసుగును ఆధునిక పరిశ్రమలు చింపివేశాయి. ప్రతి ప్రక్రియను దాని అంతర్భాగ కదలికలుగా, మనిషి తన చేతితో వాటిని నిర్వహించడం సాధ్యమా అనే సంగతిని పట్టించుకోకుండా, విశ్లేషించడమన్న సూత్రాన్ని ఆధునిక పరిశ్రమలు అనుసరించాయి. ఇది సాంకేతిక విద్య అనే కొత్త ఆధునిక శాస్త్రాన్ని సృష్టించింది. బహు విధమైనట్టి, పరస్పర సంబంధం లేనివిగా కనిపించినట్టి, శిలలా కరుడుగట్టినట్టి పారిశ్రామిక ప్రక్రియల రూపాలు, ఇప్పుడు నిర్ణీతమైన ఉపయోగకర ఫలితాల సాధనకు ప్రకృతి శాస్త్రాన్ని చైతన్యంతో, ఒక పద్ధతి ప్రకారం వర్తింపజేసే క్రియలుగా విడిపోయాయి. సాంకేతిక శాస్త్రం కొన్ని ప్రధాన చలన రూపాలను కూడా కనుగొంది. ఇవి, ఉపయోగించే పరికరాల్లో వైవిధ్య మున్నప్పటికీ, మానవ శరీరం యొక్క ప్రతి ఉత్పాదక క్రియకు, ఆవశ్యంగా వర్తిస్తాయి. అత్యంత జటిలమైన ఆధునిక యంత్రాలను సామాన్యమైన యాంత్రిక ప్రక్రియల నిరంతర పునరావృతిగా తప్ప మరే విధంగానూ యంత్ర (?) శాస్త్రం చూడనట్లుగానే ఇది కూడా.

ఆధునిక పరిశ్రమ, ఉనికిలోని ఒక ప్రక్రియా రూపాన్ని దాని తుది రూపంగా పరిగణించదు. ఆ భావంతో వ్యవహరించదు. కాబట్టి ఆధునిక పరిశ్రమల సాంకేతిక ప్రాతిపదిక విప్లవాత్మకమైనది; కాగా, దానికి ముందున్న ఉత్పత్తి పద్ధతులన్నీ సనాతనమైనవే.[2] యంత్రాలు, రసాయన ప్రక్రియలు,

---

1. "లివ్రే డీ మెటియర్" అనే బాయ్‌లూ ఎటినే ప్రసిద్ధ రచనలో మనకీ నిర్దేశన కనిపిస్తుంది : ఒక ఉమేజుదారు వృత్తికారులలోకి చేర్చుకొనబడిన తరువాత అతను పాటించవలసిన ఇతర విషయాలతో పాటు "తన సోదరులను సోదర ప్రేమతో ప్రేమిస్తాననీ, వారికి వారి వారి వృత్తుల్లో చేదోడుగా ఉంటాననీ, వృత్తి రహస్యాలను ఉద్దేశపూర్వకంగా బయట పెట్టబోననీ, అంతేకాక, ఇతరులు చేసిన వస్తువుల లోపాలను కొనుగోలుదారు దృష్టికి తీసుకురావడం ద్వారా, తన సొంత సామాగ్రిని కొనవలసిందిగా, యావన్మంది శ్రేయస్సు దృష్ట్యా సూచించాననీ" ప్రమాణం చేయవలసి వచ్చేది."

2. "ఉత్పత్తి సాధనాలను నిరంతరాయంగా విప్లవీకరించకుండా, తద్వారా ఉత్పత్తి సంబంధాలను, సమస్త సామాజిక సంబంధాలను విప్లవీకరించకుండా, బూర్జువా వర్గం మనజాలదు. అలాకాక, పాత ఉత్పత్తి పద్ధతులను - వాటి రూపాన్ని మార్చకుండా అట్టిపెట్టడం, అంతకు మునుపటి సమస్త పారిశ్రామిక వర్గాల ఉనికికి తొట్టతొలి అవసరం. ఉత్పత్తిలో నిరంతర విప్లవం, అన్ని సామాజిక పరిస్థితులను నిరంతరాయంగా కల్లోలపరచడం, శాశ్వత అనిశ్చిత స్థితి, అలజడి బూర్జువా యుగాన్ని మునుపటి

తదితర పద్ధతుల ద్వారా అది, ఉత్పత్తి సాంకేతిక పునాదిలోనేకాక, కార్మికుని విధుల్లో, శ్రమ ప్రక్రియ సామాజిక సంయోగాల్లో కూడా అవిరామంగా మార్పులు తెస్తుంది. అదే సమయంలో, తద్వారా అది సమాజం లోపలి శ్రమ విభజనను కూడా విప్లవీకరిస్తుంది. ఒక ఉత్పాదక శాఖ నుంచి మరో ఉత్పాదక శాఖకు పెద్ద యెత్తున పెట్టుబడినీ, కార్మికులను నిరంతరాయంగా తరలిస్తుంది. కాబట్టి, ఆధునిక పరిశ్రమలు స్వభావ రీత్యానే శ్రమలో వైవిధ్యం, విధుల్లో అనర్గళత, కార్మికుల్లో సార్వత్రిక సంచారశీలత ఉండవలసిన ఆవశ్యకతను కల్పించినా, మరోవైపు దాని పెట్టుబడిదారీ రూపంలో, పాత శ్రమ విభజనను కరుడుగట్టిన దాని ప్రత్యేకీకరణలతో పాటుగా పునరుత్పత్తి చేస్తుంది. ఆధునిక పరిశ్రమల సాంకేతిక ఆవశ్యకతలకూ, దాని పెట్టుబడిదారీ రూపంలో సహజసిద్ధంగా ఉన్న సామాజిక స్వభావానికీ మధ్య గల ఈ సంపూర్ణ వైరుధ్యం కార్మికుని పరిస్థితిలో స్థిరత్వం, భద్రతను పూర్తిగా ఎలా పటాపంచలు చేస్తుందో చూచాము; శ్రమ సాధనాలను అతని చేతుల నుంచి లాక్కోవడం ద్వారా, తన జీవనాధారాలను గుంజుకొంటుందనే భయం,[1] అతని ప్రత్యేకీకృత పనిని అణచివేయడం ద్వారా, తన అక్కర లేకుండా పోతుందనే భయం అతనికి నిరంతరం ఎలా కల్పిస్తుందో చూచాము. పెట్టుబడికి కావలసి వచ్చినప్పుడు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండేందుకై పరమ దీనావస్థలో ఉంచిన ఒక పారిశ్రామిక నిల్వసేన అనే ఆ రాక్షస వైపరీత్యాన్ని సృష్టించడం ద్వారా, కార్మిక వర్గంలో పలువురి ప్రాణాలను బలిగొనడం ద్వారా శ్రమ శక్తిని అతి నిర్లక్ష్యంగా వృథా వ్యయం చేయడం ద్వారా, ప్రతి ఆర్థిక ప్రగతిని ఒక సామాజిక ఉపద్రవంగా మార్చుతున్న సామాజిక అరాచకత్వం తెచ్చిపెట్టే వినాశనం ద్వారా ఈ తీవ్ర వైరుధ్యం ఎలా తన ఆగ్రహం వెళ్ళగక్కుతుందో చూచాము. ఇది ప్రతికూల పార్శ్వం. అజేయమైన ప్రకృతి నియమంలాగా, ఒకవైపు పని వైవిధ్యం, అన్నిచోట్లా ప్రతిఘటనను ఎదుర్కొనే ప్రకృతి నియమం యొక్క విచక్షణారహిత విధ్వంసక చర్యతో,[2] ప్రస్తుతం నెత్తిపై కూర్చుంటే, ఆధునిక పరిశ్రమలు మరోవైపు తన ఉపద్రవాల ద్వారా, పని వైరుధ్యాన్ని, పర్యవసానంగా బహువిధమైన

---

యుగాలన్నిటి నుంచి వేరుపరుస్తాయి. పాదుకొనిపోయి గడ్డకట్టిన సంబంధాలు, వాటి ప్రాచీన గౌరవనీయ దురభిమానాలూ, అభిప్రాయాల పరంపరతో పాటు తుడిచిపెట్టబడతాయి. కొత్తగా రూపుగొన్నవి స్థిరపడకముందే వాటికి కాలం చెల్లిపోతుంది. ఘనమైనదంతా కరిగి అదృశ్యమవుతుంది. పవిత్రమైనదంతా అపవిత్రమవుతుంది. తుట్టతుదకు మానవుడు నిరావేశమైన తన ఇంద్రియ జ్ఞానంతో, తన జీవిత వాస్తవ పరిస్థితులను, తన తోటి మానవులతో తనకు గల సంబంధాలను ఎదుర్కోక తప్పదు.'' (ఎఫ్. ఎంగెల్స్, కార్ల్ మార్క్స్, ''మానిఫెస్ట్ డెర్ కమ్యూనిస్టిశ్చెన్ పార్టీ,'' లండన్, 1848, పుట 5.)

1. ''నాకు జీవనాధారంగా ఉండే వాటిని నీవు లాక్కొన్నప్పుడు నీవు నా ప్రాణం హరిస్తున్నావు'' - షేక్స్పియర్.
2. శాన్‌ఫ్రాన్సిస్కో నుంచి తిరిగి వచ్చిన ఒక ఫ్రెంచి కార్మికుడు ఇలా వ్రాస్తున్నాడు : ''కాలిఫోర్నియాలో నేను నియుక్తుడైన వివిధ వృత్తుల్లో పని చేయగలనని నేనెన్నడూ అనుకోలేదు. నేను ముద్రాపకుని పనికి తప్ప మరి దేనికీ తగనని గట్టిగా నమ్మాను... తమ చొక్కా మార్చుకొన్నంత తరచుగా తమ వృత్తిని మార్చుకొనే ఈ సాహసికుల ప్రపంచం మధ్యలో ఉన్న తరువాత, నేను దైవసాక్షిగా వారు చేసినట్లే చేశాను. గని తవ్వకం పనిలో తగినంత ప్రతిఫలం ముట్టనందువల్ల నేను పట్టణానికి వెళ్ళిపోయి, అక్కడ వరుసగా, అచ్చు అక్షరాలు కూర్చడం, ఇళ్ళు కప్పడం, ఇళ్ళకు నీటి గొట్టాలు అమర్చడం మొదలయిన పనులు చేశాను. దీని ఫలితంగా నేను ఎలాంటి పనికైనా తగుదునని తెలుసుకొన్నాను. నేను నత్తను కాను, మనిషినే అనే అనుభూతి కలుగుతోంది.'' (ఎ. కోర్బన్, ''డే లెన్‌సీన్‌మెంట్ ప్రొఫెషనల్'' రెండవ కూర్పు, పుట 50)

పనులకు కార్మికుని అర్హతను, పర్యవసానంగా, సాధ్యమయినంత అతని బహువిధ అభిరుచుల పెంపుదలను, ఉత్పత్తి మౌలిక నియమంగా గుర్తించవలసిన అవశ్యతను రుద్దుతుంది. ఉత్పత్తి పద్ధతిని, ఈ నియమం మామూలుగా పనిచేసే తీరుకు అనుగుణంగా మలచడం సమాజానికి జీవన్మరణ సమస్య అవుతుంది. ఒకే ఒక అల్ప ప్రక్రియను యావజ్జీవితం చర్వితచరణంగా చేయడం వల్ల అంగవికలుడై, ఆ విధంగా మనిషిలో ఒక ముక్కగా దిగజారిన నేటి ప్రత్యేకీకృత కార్మికుని స్థానంలో, బహువిధ శ్రమ ప్రక్రియలకు అర్హత కలిగి, ఉత్పత్తిలో ఏ మార్పునైనా ఎదుర్కొనేందుకు సిద్ధమైన, సమగ్రాభివృద్ధి చెందిన వ్యక్తిని నిల్పడం సమాజానికి, ఆధునిక పరిశ్రమల మూలంగా, విధాయక మవుతుంది. అలా చేయకపోతే, ఆ సమాజం అంతరించక తప్పదు. ఆ వ్యక్తి నిర్వహించే వివిధ సామాజిక విధులు, అతని సహజసిద్ధ శక్తులకు, సంపాదిత శక్తులకు స్వేచ్ఛావకాశం ఇచ్చే పద్ధతులే తప్ప మరొకటి కాదు.

సాంకేతిక, వ్యవసాయిక పాఠశాలలను, "ఎకొలెడి ఎన్‌సీనెమెంట్ ప్రొఫెషనేల్‌ని" (వృత్తి శిక్షణా పాఠశాలలు – అను) స్థాపించడం ఈ విప్లవాన్ని తీసుకొచ్చేందుకు ఇదివరకే చేపట్టిన ఒక సద్యోజనిత చర్య. వీటిలో కార్మికుల పిల్లలకు సాంకేతిక పద్ధతుల్లోనూ, వివిధ శ్రామిక పరికరాలను ఆచరణలో వినియోగించడంలోనూ కొంత శిక్షణ ఇస్తారు. పెట్టుబడి నుండి కష్టంపై సాధించుకొన్న తొలి కొద్దిపాటి రాయితీ అయిన ఫ్యాక్టరీ చట్టం, ప్రాథమిక విద్యను ఫ్యాక్టరీలో పనితో మేళవించడానికి పరిమిత మైనప్పటికీ, కార్మికవర్గం అధికారంలోకి వచ్చినప్పుడు (అది జరగడం అనివార్యం), సైద్ధాంతికమైన, ఆచరణాత్మకమైన సాంకేతిక శిక్షణలూ రెండూ కార్మికవర్గ పాఠశాలల్లో తమ సముచిత స్థానం వహించడం నిస్సందేహం. తుదకు పాత శ్రమ విభజన రద్దుకు దారితీసే విప్లవ అలజడులు పెట్టుబడిదారీ ఉత్పత్తి రూపానికీ, ఆ రూపానికి అనుగుణమైన కార్మికుల ఆర్థిక ప్రతిపత్తికి బద్ధ వ్యతిరేకంగా ఉండటమూ నిస్సందేహం. కానీ, ఒక నిర్ణీత ఉత్పత్తి రూపంలో అంతర్గతంగా ఉన్న శత్రు వైరుధ్యాల చారిత్రక అభివృద్ధి ఒక్కటే, ఆ ఉత్పత్తి రూపాన్ని నిర్మూలించి ఒక కొత్త రూపాన్ని స్థాపించగల మార్గం." "ముచ్చీ తన వృత్తికి తుదిశ్వాస వరకు అంటిపెట్టుకొని ఉండుగాక"* చేతివృత్తి విజ్ఞతకు పరాకాష్ఠ అయిన ఈ మాటకు గడియారాలు చేసే వాట్ ఆవిరి ఇంజన్‌నూ, క్షురకుడు ఆర్క్‌రైట్, దారం తీసి, పురిపెట్టి చుట్టే యంత్రాన్నీ, కంసాలి పుల్టన్ పొగ ఓడనూ కొత్తగా కల్పించిన నాటినుంచి, అర్థం పర్థం లేకుండా పోయింది.[1]

---

* తన చిత్రాల్లో ఒకదాన్ని విమర్శించిన ఒక ముచ్చికి, గ్రీకు వర్ణ చిత్రకారుడు అప్పెల్లెస్ ఇలా సమాధాన మిచ్చాడని ప్రథ - అను.

1. సమాజంలో ఒక కొసన అమిత బలుపును, దాని ఎదురుకొసన అతి బలహీనతను ఉత్పన్నం చేసే ప్రస్తుత విద్యా వ్యవస్థనూ, శ్రమ విభజననూ రద్దు చేయవలసిన అవశ్యతను, రాజకీయ అర్థశాస్త్ర చరిత్రలోని ఒక అసాధారణ వ్యక్తి అయిన జాన్ బెల్లెర్స్, 17వ శతాబ్ది చివరిలో, స్పష్టంగా గుర్తించాడు. ఆయన తక్కిన విషయాలతోపాటు, ఇలా చెప్పాడు : ''కాలక్షేపానికై విద్య నేర్చుకోవడం, ఎలా వృథా కాలక్షేపం చేయాలో నేర్చుకోవడం తప్ప మరొకటి కాదు... శారీరక శ్రమ - అది ఆదిమ కాలపు వ్యవస్థ శరీరంలో జీవం ఉండటానికి తిండి ఎంత యుక్తమో, శరీర ఆరోగ్యానికి శ్రమ అంత యుక్తం... చింతన జీవన దీపాన్ని ఉజ్వలితం చేయగా శ్రమ దానికి చమురు పోస్తుంది. పనికిమాలిన పిల్లతరహా పనివల్ల పిల్లల మనసులు పనికిమాలినవవుతాయి.'' ఇది జరుగుతుందనే అనుమానంతో బేస్‌డౌ వంటివారు, వారి ఆధునిక

ఫ్యాక్టరీలూ, కార్ఖానాలూ మొదలయిన వాటిలో శ్రమను క్రమబద్ధం చేయడానికి ఫ్యాక్టరీ చట్టాలు పరిమితమై ఉన్నంత కాలం, దోపిడీ చేసేందుకు పెట్టుబడికి గల హక్కులతో ఇవి కేవలం జోక్యం చేసుకొంటున్నట్టుగా భావించారు. కానీ, "గృహ శ్రమ"[1] అనేదాన్ని క్రమబద్ధం చేసే సంగతి వచ్చేసరికి, అది తల్లిదండ్రుల అధికారంపై ప్రత్యక్ష దాడిగా వెన్వెంటనే పరిగణిస్తారు. జాలిగుండె గల ఇంగ్లీషు పార్లమెంటు, ఈ చర్య తీసుకొనేందుకు తాను జంకుతున్నట్లు చాలా కాలం నటించింది. కానీ, ఆధునిక పరిశ్రమలు సాంప్రదాయక కుటుంబానికీ, తదనుగుణమైన కుటుంబ శ్రమకు ఆధారభూతంగా ఉన్న ఆర్థిక పునాదిని తల్లకిందులు చేయటంలో, అవి సాంప్రదాయక కుటుంబ అనుబంధాలనన్నిటినీ కూడా సడలించాయని వాస్తవాల ఒత్తిడివల్ల, పార్లమెంటు గుర్తించక తప్పలేదు. పిల్లల హక్కులను ప్రకటించవలసి వచ్చింది. పనిలో పిల్లల నియామకంపై కమిషన్, 1866 నాటి తన తుది నివేదికలో ఇలా చెప్పింది. "బాలురకు, బాలికలకు, మరెవ్వరి నుంచి కన్నా ఎక్కువగా తమ తల్లిదండ్రుల నుంచే రక్షణ అవసరమని మొత్తం సాక్ష్య విచారణలో స్పష్టమయింది. ఇది మనసుకు బాధ కలిగించేటంత శోచనీయ విషయం." సర్వత్రా, ప్రత్యేకించి గృహ శ్రమ అనేదానిలో, పిల్లల శ్రమను "హద్దూ, పద్దూ లేకుండా దోచుకొనే వ్యవస్థ" నిలదొక్కుకొని ఉందంటే, తల్లిదండ్రులు, తమ చిన్న, లేత పిల్లలపై హద్దూ, అదుపూ లేకుండా, నిరంకుశమూ, హానికరమూ అయిన ఈ అధికారాన్ని చెలాయించగలగటమే అందుకు కారణం… తమ పిల్లల్ని, 'వారం వారం నిర్దిష్టమైన వేతనం సంపాదించే యంత్రాలుగా' చేసే నిరంకుశాధికారం తల్లిదండ్రులకు ఉండరాదు… వారి శారీరక శక్తి పరిపక్వ స్థితినందుకోక ముందే, దాన్ని నాశనం చేసి, బుద్ధీ, నీతీ గల జీవుల్లో వారి స్థానాన్ని దిగజార్చివేసే ఈ నిరంకుశాధికారం నుంచి విముక్తిని, అటువంటి అన్ని సందర్భాల్లోనూ, పిల్లలు, కౌమార వయసులోని వారు ఒక సహజ హక్కుగా, శాసన నిర్మాణ సభ నుంచి, న్యాయంగా కోరవచ్చు."[2] కానీ, పిల్లల శ్రమను, ప్రత్యక్షంగానో, పరోక్షంగానో పెట్టుబడిదారీ పద్ధతిలో దోచుకోవడానికి మూలం, తల్లిదండ్రుల అధికార దుర్వినియోగం కాదు, తల్లిదండ్రుల అధికారపు ఆర్థిక ప్రాతిపదికను నిర్మూలించడం ద్వారా దాన్ని చెలాయించే తీరును, అధికార అనర్థక దుర్వినియోగంగా దిగజార్చింది పెట్టుబడిదారీ దోపిడీ పద్ధతే. పెట్టుబడిదారీ వ్యవస్థలో కుటుంబ పాత అనుబంధాల నిర్మూలన ఎంత భయంకరంగా, అసహ్యకరంగా కనిపించినప్పటికీ, ఆధునిక పరిశ్రమలు, స్త్రీలకు, తరుణ వయస్కులకు, బాల బాలికలకు గృహావరణానికి వెలుపల ఉత్పత్తి ప్రక్రియలో ఒక ముఖ్య పాత్రను కేటాయించిన కారణాన, కుటుంబం, స్త్రీ పురుషుల మధ్య సంబంధాల విషయంలో, మరింత ఉన్నతమైన రూపానికి ఒక కొత్త ఆర్థిక పునాదిని సృష్టిస్తుంది. ప్రాచీన రోమన్, గ్రీక్ లేదా ప్రాచ్య కుటుంబ రూపాలను, పరమ రూఢమైన

---

అనుకారకులను గురించి చేసిన హెచ్చరిక ఇది. ("ఉపయోగకరమైన యావత్తు వృత్తులకు, పరిశ్రమకు, వ్యవసాయానికి సంబంధించిన కళాశాల స్థాపనకు ప్రతిపాదనలు," లండన్, 1696, పుటలు 12, 14, 18.)

1. ఈ రకమైన శ్రమ చాలా వరకు చిన్న వర్క్‌షాపుల్లో సాగుతోంది. లేస్ తయారీ, గడ్డి అల్లకం. వృత్తుల్లో ఈ విషయం మనకు ఇదివరకే చూచాము. షెఫీల్డ్, బర్మింగ్‌హామ్ మొదలయినచోట్ల లోహాకార వృత్తులలో దీన్ని మరింత వివరంగా చూపవచ్చు.
2. "పనిలో పిల్లల నియామకంపై కమిషన్, 5వ నివేదిక" పుట XXV, సంఖ్య 162, 2వ నివేదిక, XXXVIII, సంఖ్య 285, 289, పుట XXV, XXVI, సంఖ్య 191.

తుది రూపాలుగా పరిగణించడం ఎంత అసంగతమో, టు టానిక్ – క్రైస్తవ కుటుంబ రూపానికి ఆ లక్షణం ఆపాదించడం అంత అసంగతం. పైగా ఇవన్నీ మొత్తంగా తీసుకొంటే చారిత్రక పరిణామ క్రమంలో ఇవి పరంపరలు. అంతేకాదు, సమష్టి శ్రామిక బృందం, అన్ని వయసులకూ చెందిన స్త్రీ పురుషులతో ఏర్పడినదనే వాస్తవం, తగు పరిస్థితుల్లో అవశ్యంగా మానవతా వికాసానికి మూలభూతంగా ఉండాలి; అయితే, అసంకల్పితంగా అభివృద్ధి చెందిన దాని పాశవిక పెట్టుబడిదారీ రూపంలో, కార్మికుడున్నది, పెట్టుబడిదారీ ఉత్పత్తి ప్రక్రియ కోసం తప్ప, ఉత్పత్తి ప్రక్రియ కార్మికుని కోసం ఉన్నది కాదు కాబట్టి, పై వాస్తవం, అవినీతి బానిసత్వాలకు ఉపద్రవకర మూలమవుతుంది.[1] ఫ్యాక్టరీ చట్టాలను సామాన్యీకరించాల్సిన ఆవశ్యకత, యంత్రంతో వడకడానికీ, నేయడానికీ – యంత్రాలు తొలుత సృష్టించిన వీటికి మాత్రమే – సంబంధించిన ప్రత్యేక శాసనంగా ఉన్న ఫ్యాక్టరీ చట్టాలను మొత్తం సామాజిక ఉత్పత్తికి వర్తించే శాసనంగా మార్చవలసిన ఆవశ్యకత, మనమిదివరకే చూచినట్లు, ఆధునిక పరిశ్రమలు చారిత్రకంగా అభివృద్ధి చెందిన తీరువల్ల ఉత్పన్నమయింది. ఆ పరిశ్రమల – వీటి సాంప్రదాయక రూపంలో సంపూర్ణమైన విప్లవం వచ్చింది. కార్ఖానా ఉత్పత్తులు ఫ్యాక్టరీ వ్యవస్థగా, చేతివృత్తులు కార్ఖానా ఉత్పత్తులుగా నిరంతరం మారిపోతున్నాయి. ఆఖరు విషయం, చేతివృత్తుల, గృహ పరిశ్రమల రంగాలు, తక్కినవాటితో పోల్చి చెప్పవలసివస్తే, ఆశ్చర్యకరమైన స్వల్ప కాలంలోనే దౌర్భాగ్య నిలయాలయ్యాయి. వాటిలో పెట్టుబడిదారీ దోపిడీ పరమ కిరాతకమైన అత్యాచారాలకు పూనుకొనేందుకు స్వేచ్ఛ లభిస్తుంది. తుదకు రెండు పరిణామాలు ఈ పరిస్థితిని మార్చివేస్తాయి. మొదటిది, పెట్టుబడి ఒకచోట శాసన నియంత్రణకు లోనైన వెంటనే, అది మరొకచోట మరింత దూకుడుగా ఆ నష్టాన్ని పూడ్చుకోవడం నిరంతరం పునరావృతమవుతున్న అనుభవం;[2] రెండవది, పోటీ పరిస్థితుల్లో సమానతకై, అంటే శ్రమను దోచుకొనే ప్రక్రియలన్నిటిపైనా సమానమైన అదుపుకై పెట్టుబడిదారులు పెట్టే గావుకేకలు.[3] ఈ విషయంపై, గుండె పగులగొట్టే రెండు కేకల్ని విందాం. మేకులు, గొలుసులు మొదలయిన వాటిని తయారుచేసే మెస్సర్స్ కూక్స్లీ అనే బ్రిస్టల్ కంపెనీ యజమానులు తమ పరిశ్రమలో ఫ్యాక్టరీ చట్ట నిబంధనలను తమంతకు తామే ప్రవేశపెట్టారు. "ఇరుగు పొరుగు కర్మాగారాల్లో పాత క్రమ విరుద్ధ వ్యవస్థ అమల్లో ఉన్నందువల్ల కూక్స్లీ కంపెనీవారు ఒక ఇబ్బందికి గురి అవుతున్నారు. వారి కుర్రవాళ్ళను సాయంత్రం 6 గంటల తరువాత, మరెక్కడో తమ పని కొనసాగించేందుకై తన్నుకుపోతున్నారు. 'ఇది మాకు అన్యాయమూ, నష్టమున్నూ. ఎందువల్లనంటే, మాకు పూర్తిగా ఉపయోగపడవలసిన కుర్రవాళ్ళ శక్తిలో కొంత, ఇది హరించివేస్తోంది.' అని వారనడం సహజమే."[4] పనిలో పిల్లల నియామకంపై కమిషన్ ముందు, లండన్ కాగితపు పెట్టెల, సంచుల ఉత్పత్తిదారు, జె. సిమ్సన్ ఇలా చెప్పారు : "అందుకు (శాసన జోక్యానికై) పెట్టుకొనే ఏ దరఖాస్తుపైనైనా నేను సంతకం చేస్తాను... ఇప్పటి పరిస్థితిలో, నా కార్య స్థానాన్ని మూసివేసిన

---

1. "ఫ్యాక్టరీ శ్రమ గృహ శ్రమ అంత, బహుశా అంతకన్నా ఎక్కువ స్వచ్ఛమైనదిగా, శ్రేష్టమైనదిగా ఉండవచ్చు." (ఫ్యాక్టరీ ఇన్‌స్పెక్టర్ల నివేదిక, 1865 అక్టోబరు 31, పుట 129.)
2. "ఫ్యాక్టరీ ఇన్‌స్పెక్టర్ల నివేదికలు, 1865 అక్టోబరు 31," పుటలు 27-32.
3. ఇందుకనేక ఉదాహరణలు "ఫ్యాక్టరీ ఇన్‌స్పెక్టర్ల నివేదికలు"లో కనిపిస్తాయి.
4. "పనిలో పిల్లల నియామకంపై కమిషన్, 5వ నివేదిక," పుట సంఖ్య 35.

తరువాత, ఇతరులు ఇకమీదట కూడా పని చేస్తూ, ఆ ఆర్డర్లను తన్నుకుపోతున్నారేమోనని నాకు ఎల్లప్పుడూ రాత్రిళ్ళు, సరిగా నిద్రపట్టడం లేదు."[1] పనిలో పిల్లల నియామకంపై కమిషన్, బేరీజు వేస్తూ ఇలా అంటోంది : "తమ వ్యాపార శాఖలోని చిన్న కార్యస్థానాల్లో పని గంటలపై ఎటువంటి శాసన పరిమితి లేనప్పుడు, పెద్ద యజమానుల ఫ్యాక్టరీలను శాసన నిబంధనలకు లోనుచేయడం వారికి అన్యాయం చేయడమే. చిన్న కార్య స్థానాలను మినహాయించినట్లయితే, పని గంటల విషయంలో, పక్షపాతంతో కూడిన పోటీ పరిస్థితులు ఏర్పడుతాయి. దీనివల్ల జరిగే అన్యాయానికి తోడు, వారొక ఇబ్బందికి లోనవుతారు. వారు చేకూర్చుకొన్న బాల, మహిళా కార్మికులను చట్టాల నుంచి మినహాయించబడిన పని స్థలాలు లాగివేస్తున్నాయి. పైగా, చిన్న పని స్థలాలు ఇబ్బడిముబ్బడి కావడానికి ప్రేరణ ఇచ్చినట్లవుతుంది; ప్రజల ఆరోగ్యానికి, సౌకర్యానికి, విద్యకు వారు మొత్తంగా బాగుపడటానికి, దాదాపు ఇవేవీ బొత్తిగా అనుకూలమైనవి కావు."[2]

కమిషన్, తన తుది నివేదికలో 1,400,000 పైగా చిన్నపిల్లలను, పెద్దపిల్లలను, స్త్రీలను ఫ్యాక్టరీ చట్టం కిందికి తీసుకురావలసిందిగా ప్రతిపాదిస్తున్నది; వీరిలో దాదాపు సగమంది చిన్నతరహా పరిశ్రమల్లోనూ, ఇంటిపని అనేదాని ద్వారానూ దోపిడీకి గురి అవుతున్నారు.[3] ఆ నివేదిక ఇలా చెబుతోంది : "ఆ బహుళ సంఖ్యాక బాల బాలికలను, తరుణ వయస్కులను, స్త్రీలను మొత్తంగా పైన పేర్కొన్న పరిరక్షక శాసనాల కిందికి తీసుకురావడం యుక్తమని పార్లమెంటు భావిస్తే... అటువంటి శాసనానికి తక్షణ లక్ష్యాలైన చిన్నారులకు, దుర్బలులకే కాక, అంతకన్నా ఎక్కువ సంఖ్యలో ఉన్న కార్మిక వయోజనులకు కూడా అవి అత్యంత ప్రయోజనకరంగా ఉంటాయి; ఈ పనుల్లో నియమితులైన వీరిపై ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ వెంటనే ఆ చట్టం ప్రభావం పడుతుంది. వారికి అది క్రమబద్ధమైన, పరిమితమైన పని గంటలను శిరోధార్యం చేస్తుంది. వారి పని స్థలాలు ఆరోగ్యకరంగా, శుభ్రంగా ఉండటానికి దారితీస్తుంది. కాబట్టి, వారి శ్రేయస్సుకు, దేశ శ్రేయస్సుకు అంతగా ఆధారభూతమైన వారి శారీరక బలాన్ని వినియోగంలోకి తెస్తుంది; దాన్ని అభివృద్ధి చేస్తుంది; చిన్నతనంలో తలకు

---

1. "పనిలో పిల్లల నియామకంపై కమిషన్, 5వ నివేదిక," పుట IX, సంఖ్య 28.
2. పూర్వోక్త గ్రంథం, పుట XXV, సంఖ్య 165-167, చిన్నతరహా పరిశ్రమలతో పోల్చి చూస్తే, భారీ స్థాయి పరిశ్రమలలో గల అనుకూలాలను గురించి, "పనిలో పిల్లల నియామకంపై కమిషన్, 3వ నివేదిక" పుట 13, సంఖ్య 144, పుట 25, సంఖ్య 121, పుట 26, సంఖ్య 125, పుట 29, సంఖ్య 140 వగైరాలను చూడండి.
3. ఈ చట్టం కిందికి తీసుకురావాలని ప్రతిపాదితమైన పరిశ్రమలివి : లేస్ తయారీ, మేజోళ్ళ నేత, గడ్డి అల్లకం, దుస్తుల తయారీ, దాని అనేకానేక ఉపశాఖలు, కృతకమైన పూల తయారీ, బూట్ల తయారీ, టోపీల తయారీ, చేతి తొడుగుల తయారీ, దర్జీ పని, బట్టీలు మొదలుకొని సూది కర్మాగారాల వరకు గల అన్ని లోహ పరిశ్రమలు, పుగాకు ఫ్యాక్టరీలు, ఇండియా రబ్బరు కర్మాగారాలు, రిబ్బన్ల తయారీ (నేతకోసం), తివాసీల చేనేత, గొడుగుల తయారీ, కదుళ్ళు, నూలు కండెల గొట్టాల తయారీ, ముద్రాక్షర శాలలు, పుస్తకాల బైండింగ్, రాత పరికరాల (కాగితపు సంచులు, అట్టలు, రంగు కాగితాలతో సహా) ఉత్పత్తి, తాళ్ళ తయారీ, నల్లరాళ్ళ ఆభరణాలు, ఇటుకల బట్టీలు, పట్టు వస్త్రాల చేనేత పరిశ్రమ, కొవెంట్రీ నేత పరిశ్రమ, ఉప్పు కొటారాలు, కొవ్వొత్తుల పరిశ్రమ, సిమెంటు కర్మాగారాలు, పంచదార ఫ్యాక్టరీలు, బిస్కత్తుల తయారీ, కలపకు సంబంధించిన వివిధ పరిశ్రమలకు ఇతర మిశ్రమ పరిశ్రమలు.

మించి శ్రమించడంవల్ల శారీరకంగా దెబ్బతిని, అకాలంగా క్షీణించిపోకుండా వర్ధమాన తరాన్ని కాపాడుతుంది. ఆఖరు విషయం, కనీసం 13 సంవత్సరాల వయసు వచ్చేవరకు, విద్యలోని ప్రాథమిక విషయాలైనా అభ్యసించే అవకాశం వారికి లభిస్తుంది; అసిస్టెంట్ కమిషనర్లు తమ నివేదికల్లో యథాతథంగా చూపిన పరమ అజ్ఞానాన్ని అంతం చేస్తుంది. ఈ అజ్ఞానం అమితమైన బాధను, ఇది జాతికే సిగ్గుచేటన్న ప్రగాఢ వేదనను కలిగించక తప్పదు."[1]

పారిశ్రామిక విచారణ కమిషన్ ప్రతిపాదనలను[2] బిల్లులుగా రూపొందించినట్లు, 1867 ఫిబ్రవరి 5న, రాజు ముఖతః టోరీ మంత్రిమండలి ప్రకటించింది. వ్యవహారం ఆ వరకైనా రావటానికి, పనికిరాని మనుషులపై అంతకు ముందు 20 ఏళ్ళపాటు ప్రయోగాలు చేయవలసి వచ్చింది. 1840లోనే, పిల్లల శ్రమపై ఒక పార్లమెంటరీ విచారణా కమిషన్‌ను నియమించడం జరిగింది. 1842లో దాని నివేదిక, నసౌ డబ్ల్యు. సీనియర్ మాటల్లో చెప్పాలంటే, "యజమానుల, తల్లిదండ్రుల దురాశను, స్వార్థాన్ని, క్రౌర్యాన్ని, బాలబాలికల, పసిపిల్లల దైన్యాన్ని, పతనావస్థను, వినాశనాన్ని చూపెట్టిన చిత్రాల్లోకెల్లా అత్యంత భయంకర దృశ్యాన్ని ఆవిష్కరించింది. అందులో ఇంకా ఇలా వుంది. అది గత యుగపు భయంకర కృత్యాలను వర్ణిస్తున్నట్లు అనుకోవచ్చు. కానీ, ఆ భయంకర కృత్యాలు మునుపంతటి తీవ్రంగా కొనసాగుతూన్నట్లు, నిదర్శనలుండటం శోచనీయం. 1842లో ఫిర్యాదు చేసిన దురాచారాలు ఈనాడు పూర్తిగా పేట్రేగి ఉన్నట్లు, రెండేళ్ళ క్రితం హార్డ్‌విక్‌లో వెలువడిన ఒక కరపత్రం చెబుతూంది. కార్మికవర్గ బాలబాలికల నీతి, ఆరోగ్యం గురించి సర్వత్రా ఉపేక్ష వహించారనీ, ఈ నివేదిక 20 ఏళ్ళపాటు గమనంలోకే రాకుండా ఉండిపోయిందనీ చెప్పడానికిది చిత్రమైన రుజువు. ఈ 20 ఏళ్ళలో, నీతి అన్న పదానికి అర్థమేమిటో అవగాహన ఉన్న సూచన అణుమాత్రమైనా లేకుండా పెరిగి జ్ఞానంగానీ, మతంగానీ, సహజ అనురాగం గానీ లేని పిల్లలు ప్రస్తుత తరానికి తల్లితండ్రులు కావడానికి అవకాశం కలిగింది."[3]

సామాజిక పరిస్థితులు మారిపోయినందువల్ల, పార్లమెంటు 1840 నాటి కమిషన్ విషయంలో వ్యవహరించినట్టుగా, 1862 నాటి కమిషన్ కోర్కెలను బుట్టదాఖలు చేయడానికి సాహసించలేక పోయింది. కాబట్టి 1864లో కమిషన్ తన నివేదికల్లో ఒక భాగానికి మించి ప్రకటించక ముందే, కుండల పరిశ్రమతో సహా మట్టి సామాగ్రి పరిశ్రమలకూ, అలంకరణ కాగితాలు, అగ్గిపుల్లలు, తూటాలు, టోపీలు, దళసరి బట్టల కత్తెరలు తయారుచేసే వారికీ, జౌళీ పరిశ్రమల్లో అమలు జరుగుతున్న

1. పూర్వోక్త గ్రంథం, పుట XV, సంఖ్య 169.
2. ఫ్యాక్టరీ చట్టాల విస్తరణ చట్టం 1867 ఆగస్టు 12లో ఆమోదం పొందింది. మొత్తం లోహపు పోత బట్టీలు, కొలుములు, యంత్ర నిర్మాణ కర్మాగారాలతో సహా లోహకార కర్మాగారాలు; ఇవేకాక, గాజు కర్మాగారాలు, కాగితం మిల్లులు, గుట్టపర్చా, ఇండియా రబ్బరు కర్మాగారాలు, పుగాకు కార్ఖానాలు, ముద్రాక్షర శాలలు, పుస్తకాల బైండింగ్ కార్ఖానాలు, 50 మందికిపైగా పనివారున్న అన్ని వర్క్‌షాపులు ఈ చట్ట నియంత్రణ కింద ఉంటాయి. 1867, ఆగస్టు 17న ఆమోదం పొందిన పనిగంటల నియంత్రణ చట్టం, మరింత చిన్న వర్క్‌షాపులను, గృహ పరిశ్రమలనబడే వాటినీ నియంత్రిస్తుంది. ఈ చట్టాలను, 1872 నాటి కొత్త గని తవ్వకం చట్టాన్ని గురించి, 2వ సంపుటంలో తిరిగి ఎత్తుకొంటాను.
3. సీనియర్, "సామాజిక శాస్త్ర మహాసభ", పుటలు 55-58.

చట్టాలను వర్తింపచేశారు. కమిషన్ 1866లో తన పని పూర్తి చేసింది. దాని తుది సిఫార్సులకు ప్రాతిపదికపై రూపొందిన బిల్లులను ప్రవేశపెడుతున్నట్లు, 1867 ఫిబ్రవరి 5న, ఆనాటి టోరీ మంత్రిమండలి రాజు ముఖతః ప్రకటించింది.

1867 ఆగస్టు 15న ఫ్యాక్టరీ చట్టాల విస్తరణ చట్టం, ఆగస్టు 21న వర్క్‌షాపుల నియంత్రణ చట్టం రాజు ఆమోదం పొందింది. వీటిలో మొదటి చట్టం పెద్ద పరిశ్రమలకు, రెండవది చిన్న పరిశ్రమలకు సంబంధించినవి.

గాలి బట్టీలు, ఇనుము, రాగి మిల్లులు, లోహపు పోత కర్మాగారాలు, యంత్ర నిర్మాణ కర్మాగారాలు, లోహ కర్మాగారాలు, గుట్ట – పర్చా కర్మాగారాలు, కాగితపు మిల్లులు, గాజు కర్మాగారాలు, పుగాకు కార్ఖానాలు, ముద్రాక్షర శాలలు, (వార్తాపత్రిక ముద్రణాలయాలతో సహా), పుస్తకాల బైండింగ్, ఒక్క ముక్కలో చెప్పాలంటే, ఏకకాలంలో 50 మందీ, అంతకు పైగా, సంవత్సరంలో వంద రోజులకు తక్కువ కాకుండా పని చేసే సమస్త పరిశ్రమలకు మొదటి చట్టం వర్తిస్తుంది.

వర్క్‌షాపుల నియంత్రణ చట్టం అనువర్తనలో, దాని పరిధి ఏ మేరకు విస్తరించి ఉంటుందో చూపటానికి మేము, దాని అర్థ వివరణపు క్లాజులోని కింది భాగాలను ఉటంకిస్తున్నాము :

"**చేతివృత్తి** అంటే, వృత్తి రీత్యానో, లేదా లాభం పొందటానికైై ఏదైనా వస్తువును, లేదా ఒక వస్తువులో భాగాన్ని తయారు చేయడంలో లేదా ఏదైనా వస్తువును మార్చడం, మరమ్మతు చేయడం, మెరుగులు దిద్దడం, దానికి తుది రూపమివ్వటం లేదా అమ్మకానికై ఇతర విధాలా దాన్ని మలచడంలోనో లేదా తత్సంబంధంగానో చేసే శారీరక శ్రమ అని అర్థం."

**వర్క్‌షాప్** అంటే, ఏ చిన్నపిల్ల లేదా పిల్లవాడైనా లేదా తరుణ వయసులోని పిల్ల లేదా పిల్లవాడు అయినా లేదా స్త్రీ అయినా ఏ చేతివృత్తి అయినా నిర్వహించేటట్టిన్నీ, అటువంటి ఏ చిన్నపిల్లనూ, పిల్లవాడినైనా లేదా తరుణ వయసులోని పిల్లనూ లేదా పిల్లవాడినైనా లేదా స్త్రీనైనా నియమించిన వ్యక్తి ప్రవేశించడానికీ, తన అధీనంలో ఉంచుకోడానికి హక్కు ఉన్న ఏ గది అయినా లేదా ఆరుబయట నున్న లేదా పైకప్పుగల స్థలమైనా అని అర్థం."

"పనిలో నియుక్తత అంటే, ఒక యజమాని కిందనో లేదా ఇందులో నిర్వచించినట్టి ఒక తల్లి లేదా తండ్రి కిందనో, వేతనానికో లేదా వేతనం లేకనో, ఏ చేతివృత్తిలోనైనా నియుక్తత అని అర్థం."

"తల్లి లేదా తండ్రి అంటే, తల్లి లేదా తండ్రి లేదా సంరక్షకుడు ఏ పిల్లనూ, పిల్లవాణ్ణయినా లేదా తరుణ వయసులోని పిల్ల, పిల్లవాడినైనా తన రక్షణలో లేదా ఆధీనంలో ... ఉంచుకొన్న వ్యక్తి అని అర్థం."

పిల్లలను, తరుణ వయసులోని వారిని, స్త్రీలను ఈ చట్ట నిబంధనలకు విరుద్ధంగా నియమించినందుకు తప్పు మోపే 7వ క్లాజు, జరిమానాకు పాత్రుణ్ణి చేసేది ఆ వర్క్‌షాపు అనుభవదారుణ్ణే కాదు (ఆ అనుభవదారు తల్లో, తండ్రో అయినా, కాకపోయినా), "ఆ చిన్నపిల్ల లేదా పిల్లవాడి లేదా తరుణ వయసులోని పిల్లవాడి తల్లిని, తండ్రిని, ఆ పిల్ల లేదా పిల్లవాడి యొక్క, ఆ స్త్రీ యొక్క శ్రమ నుంచి ప్రత్యక్షంగా ప్రయోజనం పొందుతున్నట్టి లేదా వారిని తన అదుపులో ఉంచుకొన్నట్టి వ్యక్తి"ని కూడా జరిమానాకు పాత్రుణ్ణి చేస్తుంది.

పెద్ద సంస్థలకు వర్తించే ఫ్యాక్టరీ చట్టాల విస్తరణ చట్టం, అనేక కుటిలమైన మినహాయింపుల మూలంగానూ, యజమానులతో పిరికితనంతో చేసుకొన్న రాజీల మూలంగానూ, ఫ్యాక్టరీ చట్టం నుంచి వెనుకంజ అయింది.

వర్క్‌షాపుల నియంత్రణ చట్టం, దానిలోని ఏ వివరం తీసుకొన్నా, నికృష్టంగా ఉన్నప్పటికీ, దాన్ని అమలుజరిపే అధికారం ఇవ్వబడిన మునిసిపల్ అధికారులు, స్థానికాధికారులు దాన్ని బుట్టదాఖలు చేశారు. ఈ అధికారాన్ని ఫ్యాక్టరీ ఇన్‌స్పెక్టర్లకు దాఖలు పరచేందుకై 1871లో పార్లమెంటు ఈ అధికారాన్ని మునిసిపల్ తదితర స్థానిక అధికారుల నుంచి ఉపసంహరించి, ఒక్క కలం పోటుతో ఫ్యాక్టరీ ఇన్‌స్పెక్టర్ల అధికార పరిధిలోకి ఒక లక్ష వర్క్‌షాపులను, మూడు వందల ఇటుకల బట్టీలను చేర్చింది. అయితే, అప్పటికే తగినంతమంది లేని తనిఖీ సిబ్బందికి, ఎనిమిది మందికి మించి, సహాయకులను చేర్చకుండా పార్లమెంటు జాగ్రత్తపడింది.[1]

కాబట్టి, పెట్టుబడిదారీ దోపిడీ అత్యాచారాలకు వ్యతిరేకంగా, అంతటి అసాధారణమైన చర్యలను, అంత పెద్దయెత్తున, సూత్రరీత్యా ఆమోదించవలసిన ఆవశ్యకత పాలక వర్గాల పార్లమెంటు నెత్తిపై పడటం ఒకవైపు, మరోవైపు ఈ చర్యలను ఆచరణలో అమలు జరిపే కర్తవ్య నిర్వహణలో అది చూపిన సంకోచం, వైముఖ్యం, ద్రోహబుద్ధి – ఇవీ 1867 నాటి ఈ ఇంగ్లీషు చట్టాల్లో మనకు కొట్టవచ్చినట్లు కనిపించే లక్షణాలు.

1862 విచారణ కమిషన్ గని పరిశ్రమకు కూడా ఒక కొత్త నియమావళిని ప్రతిపాదించింది. భూస్వామి ప్రయోజనాలు, పెట్టుబడిదారుడి ప్రయోజనాలు ఇక్కడ చెట్టపట్టాలు వేసుకోవడం, ఈ పరిశ్రమను తక్కిన వాటి నుంచి వేరుపరచే దీనిలోని అసాధారణ లక్షణం. ఈ రెండు ప్రయోజనాల మధ్య తీవ్ర వైరుధ్యం ఫ్యాక్టరీ చట్టాలకు అనుకూలించగా, మరోవైపు ఆ వైరుధ్యం లేకపోవడం, గనులపై శాసనాలు చేయడంలో ఆలస్యాలకు, పితలాటకానికి తగిన కారణమయింది.

1840 విచారణ కమిషన్, ఎంత భయంకరమైన, ఎంత దిగ్భ్రమజనకమైన విషయాలు బయటపెట్టిందంటే, అది యూరపు అంతటా ఎంత అప్రతిష్ఠాకరమైన సంచలనాన్ని సృష్టించిందంటే, పార్లమెంటు, తన అంతరాత్మ క్షోభ ఉపశమనానికై 1842 గని తవ్వకం చట్టాన్ని ఆమోదించింది. గనుల భూగర్భపు పనులకు స్త్రీలను, పదేళ్ళలోపు పిల్లలను నియమించరాదని నిషేధించడానికి మాత్రమే ఈ చట్టంలో పార్లమెంటు పరిమితమైంది.

గనుల తనిఖీని, అందుకోసం ప్రత్యేకంగా నియమితులైన ప్రభుత్వాధికారులు జరపాలనీ, పాఠశాల సర్టిఫికెట్ ఉంటే తప్ప, లేదా నిర్దిష్టమైన కొన్ని గంటలపాటు పాఠశాలకు వెడితే తప్ప 10–12 ఏళ్ళ మధ్య వయసు పిల్లవాళ్ళను పనిలో నియమించకూడాదనీ, మరో చట్టం 1860 గనుల తనిఖీ చట్టం – నిర్దేశిస్తోంది. అయితే, తనిఖీదారులు హాస్యాస్పదమైనంత తక్కువ సంఖ్యలో

---

1. ఈ సిబ్బందిలోని ఉద్యోగులల్లా ఇద్దరు ఇన్‌స్పెక్టర్లు, ఇద్దరు అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్లు, 41 మంది సబ్ ఇన్‌స్పెక్టర్లు. 1871లో అదనంగా 8 మంది సబ్ ఇన్‌స్పెక్టర్లను నియమించారు. చట్టాన్ని ఉల్లంఘించిన యజమానులపై కేసు పెట్టినందుకైన ఖర్చులు కూడా కలుపుకొంటే, ఇంగ్లండు, స్కాట్లండు, ఐర్లండుల్లో ఈ చట్టాన్ని అమలు జరిపినందుకు 1871-72లో అయిన మొత్తం ఖర్చు 25,347 పౌండ్లు.

ఉండటం వల్లనేమి, వారి అధికారాలు అల్పాతి అల్పంగా ఉండటం వల్లనేమి, తదితర కారణాల వల్లనేమి (మనం ముందుకు వెళ్ళేకొద్దీ ఇవి స్పష్టమవుతాయి), ఈ చట్టం ఉన్నా, లేనట్లే అయింది.

"సాక్ష్యం వగైరాలతో సహా, గనులపై సెలెక్షన్ కమిటీ నివేదిక, 1866 జులై 23", గనుల గురించిన తాజా పార్లమెంటు పత్రాల్లో ఒకటి. కామన్స్ సభ సభ్యుల నుంచి ఎంపికై, సాక్షులను పిలిపించి విచారించే అధికారమున్న ఒక పార్లమెంటరీ కమిటీ తయారు చేసిన పత్రమిది. ఇదొక బృహత్ సంపుటం. ఇందులో అసలు నివేదిక ఆరు పంక్తులే. కమిటీ చెప్పవలసిందేమీ లేదని, ఈ నివేదిక తాత్పర్యం; అంతకన్నా విశేషమేమిటంటే, ఇంకా ఎక్కువమంది సాక్షులను విచారించాల్సి ఉందని చెప్పడం.

సాక్షులను విచారించే పద్ధతి ఇంగ్లీషు న్యాయస్థానాల్లో సాక్షులను క్రాస్ పరీక్ష చేసే తీరులో ఉంది. ఈ న్యాయస్థానాల్లో న్యాయవాది, సాక్షి ఊహించని, సందిగ్ధమైన, డొంకతిరుగుడు, కొంటె ప్రశ్నలు, సందర్భం లేకుండా వేస్తాడు. సాక్షిని భయపెట్టడం, ఏమరుపాటులో పెట్టడం, గందరగోళ పరచడం, అతన్నుంచి రాబట్టిన సమాధానాలకు దానిలో లేని అర్థం ఆపాదించడం ఈ ప్రశ్నల ఉద్దేశం. అలాంటి ఈ విచారణలో క్రాస్ పరీక్ష చేసే వారు కమిటీ సభ్యులే. వారిలో గనుల సొంతదారులు, గని పరిశ్రమదారులు ఉభయులూ ఉన్నారు. సాక్షుల్లో ఎక్కువమంది, పనిచేసే గని కార్మికులు. ఈ ప్రహసనమంతా, పెట్టుబడి తత్వానికి ఎంత స్వభావోచితంగా ఉందంటే, ఈ నివేదికలో కొన్ని భాగాలనైనా ఉటంకించడం అవసరం. క్లుప్తత కోసం వీటిని వర్గీకరించాను. ఇంగ్లీషు పార్లమెంటరీ పత్రాల్లో ప్రతి ప్రశ్నకూ, దానికి ఇచ్చిన సమాధానానికీ, వరుస సంఖ్యలున్నాయి.

**I. గనుల్లో పదేళ్ళు, దానికి పైబడిన బాలుర నియామకం :** గనుల్లో పని, అక్కడికి వెళ్ళి తిరిగి రావడానికి పట్టే కాలం కూడా కలుపుకొంటే, మామూలుగా 15 గంటలుంటుంది. కొన్ని సందర్భాల్లో ఉదయం 3, 4, 5 గంటల నుంచి, సాయంత్రం 5, 6 గంటల వరకు (సంఖ్య 6; 452, 83) వయోజనులు రెండు షిఫ్టుల్లో పనిచేస్తారు. ఒక్కొక్క షిఫ్టు 8 గంటలుంటుంది. కానీ ఖర్చులు కారణంగా బాలుర విషయంలో అటువంటి షిఫ్టులు లేవు (సంఖ్య 80, 203, 204). చిన్నపిల్లవాళ్ళు, గనిలోని వివిధ భాగాల్లో, గాలి ప్రసరణకై ఉన్న తలుపులను తెరవడానికీ, మూయడానికీ ప్రధానంగా నియుక్తులైనవారు : పెద్దపిల్లవాళ్ళు, అంతకన్నా బరువైన పనికి – బొగ్గు మోసుకుపోవడం మొదలయిన వాటికి నియమితులైనవారు (సంఖ్య 122, 739, 1747). తమకు 18వ లేదా 22వ ఏడు వచ్చేవరకు వారు రోజుకు ఇన్ని గంటలపాటు భూగర్భంలో పనిచేస్తారు. అప్పుడు వారికి అసలు గని కార్మికుని పని ఇస్తారు (సంఖ్య 161). చిన్నపిల్లల్ని, పెద్దపిల్లల్ని మునుపటినాటికన్నా నేడు మరింత అధ్వాన్నంగా చూస్తున్నారు. వారితో మరింత కష్టమైన పని చేయిస్తున్నారు (సంఖ్య 1663–1667). 14 ఏళ్ళలోపు పిల్లల నియామకాన్నీ నిషేధిస్తూ పార్లమెంటు చట్టం చేయాలని గని కార్మికులు ఏకగ్రీవంగా కోరుతున్నారు. ఈ సందర్భంలో హస్సే వివియన్ (అతను స్వయంగా గని పరిశ్రమదారు) ఇలా అడుగుతాడు : "కార్మికుని అభిప్రాయం అతని కుటుంబ దారిద్ర్యంపై ఆధారపడి ఉండదా?" బ్రూస్: "తన తండ్రి గాయపడి ఉన్నప్పుడు లేదా అతను జబ్బు మనిషి అయినప్పుడు లేదా తండ్రి చనిపోయి, తల్లి మాత్రమే ఉన్నప్పుడు, 12–14 ఏళ్ళ కుర్రవాణ్ణి కుటుంబ శ్రేయస్సు కోసం, రోజుకు 1 షిల్లింగు

7 పెన్నీలు సంపాదించకుండా నిరోధించడం కఠోరం కాదా?.... నీవొక సార్వత్రిక నిబంధన నిర్ధారణ చేయాలి కదా? 12-14 ఏళ్ళలోపు పిల్లలను, వారి తల్లిదండ్రుల పరిస్థితి ఏమైనప్పటికీ, ఉద్యోగంలో నియమించకుండా నిరోధించే చట్టం చేయాలని సిఫార్సు చేయడానికి నీవు సిద్ధమా?" "సిద్ధమే" (సంఖ్య 107-110). వివియన్ : "14 ఏళ్ళలోపు పిల్లల నియామకాన్ని నిరోధిస్తూ చట్టం చేశారనుకో, అప్పుడు ఆ పిల్లల తల్లిదండ్రులు తమ పిల్లలకు ఇతర మార్గాల్లో, ఉదాహరణకు, కార్ఖానాల్లో ఉద్యోగం సంపాదించడం బహుశా జరగవచ్చు కదా?" "సర్వత్రా జరగదనుకొంటాను" (సంఖ్య 174). కిన్నాయిర్డ్ : "పిల్లవాళ్ళలో కొందరు వాకిలి కాపలాదార్లు కదా?" "ఔను" "తలుపు తెరచినప్పుడూ లేదా మూసినప్పుడల్లా, మామూలుగా, గాలి చాలా ఒరవడితో తోసుకురాదా?" "ఔను మామూలుగా తోసుకొస్తుంది." "ఇది సులువైనదిగా తోస్తుంది. కానీ నిజానికి బాధాకరమైనది కదూ?" "అయినప్పటికీ, అతను ఖైదీ కొట్టులో ఉన్నట్టుగా బంధితుడై ఉంటాడు." బూర్జువా వర్గీయుడు, వివియన్ : "కుర్రవానికి ఒక లాంతరు ఇచ్చినప్పుడల్లా అతను చదువుకోలేడా?" "ఔను, చదువుకోగలడు - తనవద్ద కొవ్వొత్తులుంటే... అతను చదువుకొంటుండగా ఎవరైనా కనుక్కొంటే, తప్పుపడతారనుకొంటాను. అతడక్కడున్నది తన పని చేయడానికి. అతనికి, నిర్వర్తించవలసిన ఒక విధి ఉంది; అన్నిటికన్నా ముందు ఆ పని చూడాలి. గనిలో ఉన్నప్పుడు చదవటానికి అనుమతిస్తారనుకోను." (సంఖ్య 139, 141, 143, 158, 160.)

**II. విద్య :** పని చేస్తున్న గని కార్మికులు, తమ పిల్లలకు, ఫ్యాక్టరీల్లోలాగా నిర్బంధ విద్యా బోధకై ఒక చట్టం ఉండాలని కోరుతున్నారు. 10-12 ఏళ్ళ కుర్రవాళ్ళను పనిలో పెట్టుకొనే ముందు, వారి నుంచి పాఠశాల సర్టిఫికెట్‌ను పుచ్చుకోవడం అవసరమని నిర్దేశించే 1860 చట్టపు క్లాజులు ఉత్తుత్తవని వారు చెప్పారు. ఈ విషయంపై సాక్షుల విచారణ నిజంగా ఒక ప్రహసనం. "ఇది (చట్టం) కావలసి వచ్చింది. ఎక్కువగా యజమానులకు వ్యతిరేకంగానా, లేక తల్లితండ్రులకు వ్యతిరేకంగానా?" "ఇది కావలసివచ్చింది, ఇద్దరికీ వ్యతిరేకంగా, అనుకొంటాను." "ఇద్దరిలో ఎవరికి ఇతరుడికన్నా ఎక్కువ వ్యతిరేకంగా కావలసి వచ్చిందో నీవు చెప్పలేవా?" "ఆ ప్రశ్నకు సమాధానం చెప్పలేను." (సంఖ్య 115, 116) "కుర్రవాళ్ళు పాఠశాలకు వెళ్ళేందుకు వీలుగా పని గంటలు ఉండాలని యజమానులు కోరుతున్నట్లు కనిపిస్తుందా?" "లేదు; అందుకోసం పని గంటలను తగ్గించడం ఎప్పుడూ జరగలేదు." కిన్నాయిర్డ్ : "బొగ్గు గని కార్మికులు సాధారణంగా తమ విద్యను అభివృద్ధిపరచు కొంటున్నారని చెబుతావా?; కార్మికులు పనిచేయడం ప్రారంభించిన తరువాత తమ విద్యను అభివృద్ధి చేసుకొన్న ఉదాహరణలు నీకు తెలుసా? లేక, వారు ఇంకా దిగజారి, తాము సాధించినదేమైనా ఉంటే, అది కూడా కోల్పోవటంలేదా?" "సాధారణంగా, వారు పాడవుతున్నారు; బాగుపడటం లేదు. వారికి చెడు అలవాట్లు అబ్బుతున్నాయి. తాగుడు, జూదం, ఇంకా అలాంటివి అలవడి, పూర్తిగా భ్రష్టుపడుతున్నారు." (సంఖ్య 211) "రాత్రిపూట పాఠశాలలను ఏర్పాటు చేయటం ద్వారా, అటువంటి (చదువు చెప్పించే) ప్రయత్నం చేస్తున్నారా?" "రాత్రి పాఠశాలను నడుపుతున్న కొద్ది బొగ్గు గనులున్నాయి. ఆ గనుల వద్ద బహుశా కొద్దిమంది కుర్రవాళ్ళు ఆ పాఠశాలలకు వెడుతూండవచ్చు; కానీ వారు శారీరకంగా ఎంత అలసిపోయి ఉంటారంటే, అక్కడికి వెళ్ళటం వల్ల ప్రయోజనమేమీ ఉండదు."

(సంఖ్య 454) "కాబట్టి నీవు విద్యా బోధకు వ్యతిరేకమన్న మాట?" అని ఆ బూర్జువా నిర్ధారిస్తూ ప్రశ్నిస్తాడు. "కానేకాదు. అయితే..." (సంఖ్య 443) "అయితే అవి (పాఠశాల సర్టిఫికెట్లు) కావాలంటూ వారు (యజమానులు) కోరి తీరాలన్న నిర్బంధం ఉంది కదా?" "చట్టం ప్రకారం ఆ నిర్బంధం ఉంది. కానీ యజమానులు అవి కావాలని పట్టుబడుతున్నట్లు నాకు తెలీదు." "అంటే, సర్టిఫికెట్లు పుచ్చుకోవాలనే చట్టంలోని ఈ నిబంధనను, సాధారణంగా బొగ్గు గనుల్లో పాటించడం లేదని నీ అభిప్రాయమన్న మాట?" "పాటించడం లేదు." (సంఖ్య 443, 444) "ఈ సమస్య పట్ల (విద్యా సమస్య) కార్మికులు పెద్దగా ఆసక్తి చూపుతున్నారా?" "వారిలో అధిక సంఖ్యాకులు చూపుతున్నారు." (సంఖ్య 717) "చట్టం అమలు జరిగేలా చూడాలన్న ఆతురత వారికుందా?" "అధిక సంఖ్యాకులకు ఉంది. (సంఖ్య 718) "ఈ దేశంలో ఏ చట్టం చేసినా, దాన్ని ఆచరణలో పెట్టడానికి ప్రజానీకమే స్వయంగా తోడ్పడితే తప్ప, దానివల్ల నిజంగా ఫలితముంటుందని నీవు అనుకొంటున్నావా?" "పనిలో కుర్రవాళ్ళ నియామకానికి అభ్యంతర పెట్టాలని చాలామంది కార్మికులకు ఉండవచ్చు. కానీ దానివల్ల అతనికి వాత పడుతుంది." (సంఖ్య 720) "వాత ఎవరేస్తారు?" "అతని యజమానులు." (సంఖ్య 721) "చట్టం ప్రకారం నడుచుకొనే పనివాణ్ణి యజమానులు తప్పుపడతారని అనుకొంటున్నావా...?" "తప్పుపడతారని నా నమ్మకం." (సంఖ్య 722) "రాయటం, చదవటం రాని 10-12 ఏళ్ళ కుర్రవాణ్ణి పనిలో పెట్టుకొనేందుకు ఏ కార్మికుడైనా అభ్యంతరం చెప్పినట్లు నీవు ఎప్పుడైనా విన్నావా?" "అది కార్మికుల ఇష్టాయిష్టాలకు వదిలివేసిన విషయం కాదు." (సంఖ్య 623) "పార్లమెంటు జోక్యం చేసుకోవాలని కోరుతావా?" "బొగ్గు గని కార్మికుల పిల్లల విద్య విషయమై ప్రయోజనకరమైనదేమైనా చేయాలంటే, విద్యను పార్లమెంటు చట్టం ద్వారా నిర్బంధం చేయాల్సి ఉంటుంది." (సంఖ్య 1634) "ఆ బాధ్యతను ఒక్క గని కార్మికుల విషయంలోనే విధిస్తున్నావా, లేక గ్రేట్ బ్రిటన్‌లోని యావన్మంది కార్మికుల విషయంలోనా?" "నేను బొగ్గు గని కార్మికుల తరపున మాట్లాడటానికి వచ్చాను." (సంఖ్య 1636) "వారికి (బొగ్గు గనిలోని పని కుర్రవాళ్ళు) ఇతర కుర్రవాళ్ళకు మధ్య ఎందుకు తేడా చూపు తున్నావు?" "ఎందుకంటే, వారు సూత్రానికి ఒక మినహాయింపు." (సంఖ్య 1638) "ఏ విధంగా?" "శారీరకంగా" (1639) విద్య ఇతర తరగతుల కుర్రవాళ్ళకన్నా వారికి ఎందుకు ఎక్కువ విలువైనది?" "ఎక్కువ విలువైనదో కాదో నాకు తెలీదు; కానీ, గనుల్లో పనిచేసే కుర్రవాళ్ళు అక్కడ శక్తికి మించి శ్రమించడంవల్ల, ఆదివారం పాఠశాలల్లో గానీ, పగటి పాఠశాలల్లో గానీ చదువుకొనే అవకాశం వారికి తక్కువ. (సంఖ్య 1640) "ఈ రకమైన ప్రశ్నను, దేనితోనూ నిమిత్తం లేకుండా చూడటం సాధ్యం కాదా? (సంఖ్య 1644) "పాఠశాలలు తగినన్ని ఉన్నాయా?" "లేవు..." (సంఖ్య 1646) ప్రతి బాలుడు, బాలికను బడికి పంపాలని ప్రభుత్వం నిర్ణయిస్తే, పిల్లలు పోగలిగినన్ని పాఠశాల లుంటాయా?" "ఉండవు. కానీ ఆ పరిస్థితులు తలయెత్తితే, పాఠశాలలు ఏర్పాటవుతాయి." (సంఖ్య 1647) "వాళ్ళలో (కుర్రవాళ్ళలో) కొంతమందికి రాయనూ, చదవనూ బొత్తిగా రాదనుకొంటాను?" "ఎక్కువమందికి రాదు... అసలు పెద్దవాళ్ళలోనే చాలామందికి రాదు." (సంఖ్య 705, 725)

**III. పనిలో స్త్రీల నియామకం :** 1842 దరిమిలా స్త్రీలను భూగర్భంలో పనికి పెట్టుకోవడం లేదు. కానీ, బయట బొగ్గు మొదలయిన వాటిని తొట్లకు ఎత్తడం, తొట్లను కాలువల వద్దకు, రైలు

వ్యాగన్ల వద్దకు లాక్కొనిపోవడం, బొగ్గును రకాల వారీగా వేరుపరచడం మొదలయిన పనులను చేస్తున్నారు; గత మూడు, నాలుగు సంవత్సరాలుగా వారి సంఖ్య గణనీయంగా పెరిగింది. (సంఖ్య 1727) వారిలో ఎక్కువమంది పనిచేసే గని కార్మికుల భార్యలు, కూతుళ్ళు, చనిపోయిన గని కార్మికుల భార్యలు. వారి వయసు 12 సంవత్సరాలు మొదలుకొని 50, 60 ఏళ్ళ వరకు ఉంటుంది. (సంఖ్య 645, 1779) "పనిలో స్త్రీల నియామకం గురించి పని చేసే గని కార్మికుల్లో ఉన్న అభిప్రాయమేమి?" "వారు సాధారణంగా దాన్ని ఖండిస్తారు." (సంఖ్య 648) "ఆ పనికి నీ అభ్యంతరమేమి?" "అది స్త్రీకి మానహీనమైనది." (సంఖ్య 649) "దుస్తులు విడ్డూరంగా ఉంటాయా?" "ఉంటాయి; అవి మగవాని దుస్తులు. కొన్ని సందర్భాల్లో అవి మానం, మర్యాద అన్న భావం లేకుండా చేస్తున్నాయి." "స్త్రీలు పొగ తాగుతారా?" "కొందరు తాగుతారు." "అది చాలా రోత పని అనుకొంటాను." "చాలా రోతపని" "వారు నల్లగా, అసహ్యంగా తయారవుతారా?" "గనుల్లోపల పని చేసే వారంత నల్లగా తయారవుతారు... చిన్నపిల్లలున్న స్త్రీ, వారిపట్ల తన విధి నెరవేర్చజాలదని నా అభిప్రాయం; అలా పిల్లలున్న స్త్రీలు కొల్లలుగా గట్లపై ఉన్నారు." (సంఖ్య 650, 654, 701) "ఆ వితంతువులకు, అంత వేతనం (వారానికి 8 షి. నుండి 10 షి. వరకు) వచ్చే పని మరెక్కడైనా దొరుకుతుందనుకొంటావా?" "ఆ విషయమై నేనేమీ చెప్పలేను." (సంఖ్య 709) "ఈ విధంగా వారు బతుకుతెరువు సంపాదించుకోకుండా అడ్డుపడటానికి నీవు సిద్ధపడతావా?" (రాతిగుండె వెధవా!) "సిద్ధపడతాను." (సంఖ్య 710) "స్త్రీలను పనిలో పెట్టుకొనే విషయమై... మీ జిల్లాలో సాధారణంగా ఉన్న అభిప్రాయమేమి?" "అది మానహీనమైన పని అన్న అభిప్రాయముంది. ఆడవాళ్ళలో గని ఒడ్డున పని చేయించడంకన్నా వారిని మరింత మర్యాదగా చూడాలని, గని కార్మికులుగా, మా అభిలాష... వారి పనిలో కొంత భాగం చాలా కష్టమైనది. ఈ ఆడవాళ్ళలో కొందరు రోజుకు 10 టన్నుల సరకు పైకి తీసికెళ్ళారు." (సంఖ్య 1715, 1717) "ఫ్యాక్టరీల్లో పనిచేసే స్త్రీలకన్నా గనులవద్ద పనిచేసే స్త్రీలకు నీతి నియమాలు తక్కువ అని నీ భావమా?" "చెడు నడత గల స్త్రీల శాతం ఫ్యాక్టరీల్లోకన్నా కాస్త ఎక్కువ ఉండవచ్చు." (సంఖ్య 1237) "అయితే, ఫ్యాక్టరీల్లో నీతి నియమాల పరిస్థితి నీకు పూర్తి సంతృప్తికరంగా లేదన్న మాట?" "లేదు." (సంఖ్య 1733) "ఫ్యాక్టరీల్లో కూడా, స్త్రీల నియామకాన్నీ నీవు నిషేధిస్తావా?" "లేదు, నిషేధించను." (సంఖ్య 1734) "ఎందుకు నిషేధించవు?" "వారికి మిల్లుల్లో పని, మరింత గౌరవనీయమైనదని అనుకొంటున్నాను." (సంఖ్య 1735) "అయినా వారి నీతి నియమాలకది హానికరమని నీ భావం?" "గని ఒడ్డున పని చేయటమంత కాదు. నేను దాన్ని చూస్తున్నది, ఎక్కువగా సామాజిక దృష్టితోనే; దాని నైతిక కారణాలను బట్టి మాత్రమే చూడటం లేదు. ఈ నైతిక పతనం, ఆడపిల్లలపై దాని సామాజిక ప్రభావం దృష్ట్యా అత్యంత శోచనీయం. ఈ 400 లేదా 500 మంది ఆడపిల్లలు బొగ్గు గని కార్మికుల భార్యలైనప్పుడు, ఈ నైతిక పతనం వల్ల, ఆ మగవారు చాలా బాధపడతారు. ఈ కారణంవల్ల వారు తమ ఇల్లు వాకిలి వదిలిపెట్టి పోతారు. తాగుడుకు అలవాటుపడతారు." (సంఖ్య 1736) బొగ్గ గనుల్లో స్త్రీల నియామకాన్నీ నీవు మాన్పిస్తే, ఇనుము కర్మాగారాల్లో సైతం దాన్ని మాన్పించక తప్పదు; అంతే కదూ?" "నేను ఏ ఇతర పరిశ్రమ తరఫునా మాట్లాడలేను." (సంఖ్య 1737) "ఇనుము కర్మాగారాల్లో నియమితులైన స్త్రీల పరిస్థితులకూ, బొగ్గ

గనుల్లో గట్టుపైన నియమితులైన స్త్రీల పరిస్థితులకూ మధ్య తేడా ఏదైనా నీకు కనిపిస్తోందా?" "దాన్ని గురించి నేనే నిశ్చితంగా కనుక్కోలేదు." (సంఖ్య 1740) "ఒక తరగతి వారికీ, మరో తరగతి వారికీ మధ్య వ్యత్యాసమేదైనా నీకు కనిపిస్తుందా?" "దాన్ని నిశ్చితంగా కనుక్కోలేదు. కానీ, ఇంటింటికీ వెళ్ళి చూచినందువల్ల, మా జిల్లాలో పరిస్థితి శోచనీయమని నాకు తెలుసు... (సంఖ్య 1741) పనిలో స్త్రీల నియామకం నైతికంగా దిగజార్చుతూన్న ప్రతి సందర్భంలోనూ నీవు జోక్యం చేసుకొంటావా?" "అది హాని కలుగజేస్తుందనుకొంటాను. ఏమంటే, ఇంగ్లీషు వాళ్ళ అత్యుత్తమ హృదయ ప్రవృత్తులు సమకూడింది తల్లి శిక్షణ మూలంగానే..." (సంఖ్య 1750) "అది అంతగానూ వ్యవసాయంలో పనులకు కూడా వర్తిస్తుంది. కాదూ?" "ఔను, కానీ అది రెండు రుతువులే ఉంటుంది. మాకు నాలుగు రుతువులూ పని ఉంటుంది. (సంఖ్య 1751) వారు తరచూ పగలూ, రాత్రి పని చేస్తారు. ఒళ్ళు తడిసి ముద్దవుతుంది. వారి శరీర దారుఢ్యం దెబ్బతింటుంది. ఆరోగ్యం నాశనమవుతుంది." "బహుశా, ఆ విషయమై, నీవు దర్యాప్తు చేయలేదేమో?" "నేను నా పని చూచుకొంటూ పోతూ, ఆ విషయం కచ్చితంగా గమనించాను. గని గట్టున స్త్రీల నియామకంవల్ల కలిగే ఫలితాలకు సమానమైనదేదీ నేను చూడలేదని ఖండితంగా చెప్పగలను... అది మగవాని పని... బలిష్ఠుడైన మగవాని పని." (సంఖ్య 1753, 1793, 1794) "తాము పతనావస్థ నుంచి బయటపడాలని, మానవతా గుణాలను అలవర్చుకోవాలని వాంఛించే, బొగ్గుగని కార్మికుల్లోని ఉత్తమ తరగతికి, ఆడవారు సహాయపడకపోగా, పైపెచ్చు వారిని దిగలాగుతున్నారని, మొత్తంగా ఈ విషయంపై నీ భావం?" "ఔను." (సంఖ్య 1808) ఈ బూర్జువాల నుంచి మరికొన్ని కుటిల ప్రశ్నలు వచ్చిన తరువాత, వితంతువులపట్లా, పేద కుటుంబాలు, మొదలయిన వాటిపట్లా వారి "సానుభూతి"లోని అసలు రహస్యం తుదకు బయటపడుతుంది : "బొగ్గు పరిశ్రమ సొంతదారు, పనుల పర్యవేక్షణకై కొందరు వ్యక్తులను నియమిస్తాడు. మెప్పు పొందడానికై, వ్యవహారాలను తమకు సాధ్యమయినంత పొదుపుగా నడపడం, వారి విధానం, పురుషులను రోజుకు 2 షి. 6 పె. చొప్పున నియమించాల్సినచోట, రోజుకు 1 షి. – 1 షి. 6 పె. చొప్పున ఆడపిల్లల్ని నియమిస్తున్నారు." (సంఖ్య 1816)

**IV. దుర్మరణ విచారణాధికారి దర్యాప్తులు :** "మీ జిల్లాలో దుర్మరణ విచారణాధికారి దర్యాప్తులకు సంబంధించిన మాట – ప్రమాదాలు జరిగినప్పుడు ఆ దర్యాప్తులు జరిగే తీరుపై కార్మికులకు విశ్వాసం ఉందా?" "లేదు, వారికి విశ్వాసం లేదు." (సంఖ్య 360) "ఎందుకు లేదు?" "ప్రధాన కారణమేమిటంటే, సాధారణంగా, అందుకు ఎంపికైనవారు, గనులూ, అటువంటి వాటిని గురించి బొత్తిగా తెలియనివారు." "జ్యూరీలుగా వ్యవహరించడానికి కార్మికులను పిలవడమే లేదా?" "నాకు తెలిసినంత వరకు, సాక్షులుగా తప్ప, వారిని పిలిపించరు." "ఈ జ్యూరీలుగా ఉండటానికి సాధారణంగా పిలిపించేదెవరిని?" "సాధారణంగా ఇరుగు పొరుగున ఉన్న వర్తకులను... వారి పరిస్థితులను బట్టి, కొన్ని సందర్భాల్లో, వారు తమ యజమానుల... కర్మాగారాల సొంతదారుల ప్రభావానికి లోనుకావడం కద్దు. వారు సాధారణంగా, విషయ పరిజ్ఞానం లేనివారు; వారి ముందుకు పిలవబడ్డ సాక్షులనూ, వాడబడే పదాలు మొదలయిన వాటిని అర్థం చేసుకోలేరు." "జ్యూరీ, గని తవ్వకంలో నియమితులైన వ్యక్తులతో ఏర్పాటు కావాలని నీ అభిమతమా?" "ఔను, కొంత మేరకు... తీర్పు, మొత్తంపై దాఖలయిన

సాక్ష్యానికి అనుగుణంగా ఉండటం లేదని, వారి (కార్మికుల) అభిప్రాయం." (సంఖ్య 361, 364, 366, 368, 371, 375) "నిష్పాక్షికమైన విచారణ జరగడం, జ్యూరీని రప్పించడంలోని ఒక ముఖ్య ఉద్దేశం కాదూ?" "ఔను, నేను అలాగే అనుకొంటున్నాను." "జ్యూరీలు, చాలా వరకు, కార్మికులతో ఏర్పాటయితే, అవి నిష్పక్షంగా ఉంటాయని అనుకొంటున్నావా?" "పక్షపాతంతో వ్యవహరించడానికి అతనికేదైనా కారణముంటుందని అనుకోను... గనికి సంబంధించిన పనులను గురించి అతనికి, అవశ్యంగా, మరింత బాగా తెలిసి ఉంటుంది." "కార్మికుల్లో, అన్యాయంగా, కఠినమైన తీర్పులు చెప్పే ధోరణి ఉంటుందని, నీవు భావించడం లేదూ?" "లేదు. అలా భావించడం లేదు." (సంఖ్య 378, 379, 380)

**V. తప్పుడు తూకాలు, కొలతలు :** తమ వేతనాలను పక్షానికి ఒకసారి కాకుండా వారానికొకసారి చెల్లించాలనీ, తొట్ల ఘనపరిమాణాన్నిబట్టి కాక, బొగ్గు బరువును బట్టి చెల్లించాలని కార్మికుల కోర్కె. తప్పుడు తూకాలు మొదలయిన వాటి నుంచి కూడా వారు రక్షణ కోరుతున్నారు. (సంఖ్య 1071) "తొట్లను మోసంతో పెంచడం జరిగితే, కార్మికుడు 14 రోజుల నోటీసిచ్చి, పని మానేయవచ్చు గదా?" "కార్మికుడు మరోచోటికి వెడితే, అక్కడా అదే జరుగుతూంది." (సంఖ్య 1071) "తప్పు జరిగిన ఆ చోటు కూడా అతను వదిలిపెట్టి పోవచ్చు గదూ?" "అంతటా అది జరుగుతూంది; అతను ఎక్కడికి వెళ్ళినా దానికి తల ఒగ్గక తప్పదు." (సంఖ్య 1072) "14 రోజుల నోటీసిచ్చి, కార్మికుడు వదలి వెళ్ళవచ్చునా?" "ఔను, వెళ్ళవచ్చు." (సంఖ్య 1073) అయినా వారికి తృప్తి కలగటం లేదు!

**VI. గనుల తనిఖీ :** కార్మికులు గరి అవుతున్నది ప్రేలుళ్ళవల్ల ప్రమాదాలకు మాత్రమే కాదు. (సంఖ్య 234, ఆ తరువాతివి) "మా కార్మికులు గనుల్లోకి శుభ్రమైన గాలి వచ్చే ఏర్పాట్లు బాగులేవని ఎంతో ఫిర్యాదు చేశారు... గాలి వచ్చే ఏర్పాట్లు సాధారణంగా, ఎంత అధ్వాన్నంగా ఉన్నాయంటే, కార్మికులకు ఊపిరాడటమే కష్టం; వారీ పనిలో చాలా కాలంపాటు ఉన్న తరువాత మరే విధమైన పనికీ తగరు; గనిలో నేను పని చేస్తున్న భాగంలో కార్మికులు, నిజంగా, ఆ కారణంవల్ల తమ పని వదలుకొని ఇళ్ళకు రావలసి వస్తున్నది... ప్రేలుడు గ్యాస్ లేనిచోట, గాలి వచ్చే ఏర్పాటు అధ్వాన్నంగా ఉన్న పర్యవసానంగా, వారిలో కొందరు వారాల తరబడి పని చేయలేని స్థితిలో ఉన్నారు... గనిలోని ప్రధాన మార్గాల్లో సాధారణంగా, కొల్ల గాలి వస్తుంది. కానీ కార్మికులు పనిచేసే స్థలాల్లోకి గాలి వచ్చే ఏర్పాట్లు చేయడానికి ప్రయత్నించడం లేదు." "మీరు ఇన్‌స్పెక్టరుకు ఎందుకు ఫిర్యాదు చేయడం లేదు?" "నిజం చెప్పాలంటే, అలా చేసేందుకు అనేకమంది కార్మికులు భయపడుతారు. ఇన్‌స్పెక్టరుకు ఫిర్యాదు చేసిన కారణాన, కార్మికులు బలియైపోయి, తమ ఉద్యోగాలు కోల్పోయిన సందర్భాలున్నాయి. "ఎందుకు, ఫిర్యాదు చేసినందుకు ఆయనకు వాత పెట్టారా?" "ఔను." "మరో గనిలో అతనికి పని దొరకడం కష్టమవుతుంది కదూ?" "ఔను." "నీవున్న చుట్టుపట్ల, చట్ట నిబంధనలు సరిగ్గా పాటించబడేలా చూచేందుకు, గనులు తగినట్లు తనిఖీ చేయబడుతున్నాయా?" "లేదు, అవి తనిఖీ చేయబడటమే లేదు... ఇన్‌స్పెక్టరు ఒక్క దఫా మాత్రమే గనిలో దిగారు. అనేక సంవత్సరాలుగా ఇలాగే సాగిపోతుంది... నేనున్న జిల్లాలో తగినంత మంది ఇన్‌స్పెక్టర్లు లేరు. 130కు పైగా గనులను తనిఖీ చేసేందుకు

మాకు, 70 ఏళ్ళు దాటిన ఒక ముసలాయన ఉన్నాడు." "సబ్–ఇన్‌స్పెక్టర్ల వర్గమొకటి ఉండాలని మీ కోరికా?" "ఔను." (సంఖ్య 234, 241, 251, 254, 275, 554, 276, 293) "కార్మికుల నుంచి సమాచారం లేకుండా, మీరనుకొన్నంత పని చేయడానికి అవసరమయ్యే అంత పెద్ద ఇన్‌స్పెక్టర్ల సేనను పోషించడం ప్రభుత్వానికి సాధ్యమనుకొంటున్నావా?" "లేదు, అది దాదాపు అసాధ్యమనే నా భావం..." "ఇన్‌స్పెక్టర్లు మరింత తరచుగా రావడం వాంఛనీయం, ఔనా?" "ఔను, పిలవనంపకుండానే." (సంఖ్య 280, 277) "ఈ ఇన్‌స్పెక్టర్లు గనులను అంత తరచుగా తనిఖీ చేయడం వల్ల, గాలి వచ్చే సరియైన ఏర్పాట్లు చేసే బాధ్యతను (!) గనుల యజమానుల నుంచి ప్రభుత్వ అధికారులకు బదలాయించినట్లవుతుందని నీకు అనిపించడం లేదా?" "లేదు, నాకలా అనిపించడం లేదు. ఇదివరకే ఉన్న చట్టాలను అమలుజరిపించడం, వారు తమ పనిగా పెట్టుకోవాలి." (సంఖ్య 285) "నీవు సబ్–ఇన్‌స్పెక్టర్లను గురించి మాట్లాడేటప్పుడు, తక్కువ వేతనం, ఇప్పటి ఇన్‌స్పెక్టర్లకన్నా తక్కువ స్థాయి గల వ్యక్తులని నీ భావమా?" "వారు తక్కువ స్థాయికి చెందినవారై ఉండటం నాకిష్టం లేదు. అంతకన్నా మంచివారు దొరికితే." (సంఖ్య 294) "నీకు కేవలం మరింత మంది ఇన్‌స్పెక్టర్లు కావాలా, లేక ఇన్‌స్పెక్టరుగా తక్కువ వర్గానికి చెందిన వ్యక్తులు కావాలా?" "నేను కోరేది, గట్టిగా నాలుగుచోట్లకు వెడుతూ, అన్నీ సరిగా ఉండేలా చూచే మనిషిని, తన నీడకు తానే భయపడే రకానికి చెందని మనిషిని." (సంఖ్య 295) "తక్కువ తరగతికి చెందిన ఇన్‌స్పెక్టర్లను నియమించాలన్న నీ వాంఛ నెరవేరినట్లయితే, నైపుణ్యం లోపం మొదలయినవాటి నుంచి ప్రమాదం ఉంటుందని నీవనుకోవడం లేదా?" "నేనలా అనుకోవడం లేదు. ఆ విషయం ప్రభుత్వం చూచుకొంటుందనీ, ఆ స్థానంలో తగిన వారినే నియమిస్తుందనీ అనుకొంటున్నాను." (సంఖ్య 297) ఈ విధమైన విచారణ తుట్టతుదకు కమిటీ అధ్యక్షునికి సైతం దుస్సహమవుతుంది. ఆయన కింది వ్యాఖ్యతో అడ్డు తగులుతాడు : "గనికి సంబంధించిన అన్ని విషయాలను పరిశీలించడం, అన్ని సందు, గొందులూ, మూలల్లోకి వెళ్ళటం, వాస్తవ విషయాలను తరచి చూడడం – ఇవన్నీ చేసే రకం మనుషులు కావాలంటావు... వారు వెళ్ళి చీఫ్ ఇన్‌స్పెక్టరుకు నివేదిస్తారు. అప్పుడాయన, వారు చెప్పిన వాస్తవాలను తన శాస్త్రీయ పరిజ్ఞానంతో విశ్లేషిస్తాడు?" (సంఖ్య 298, 299) "ఈ పాత గని భాగాలన్నిటిలో గాలి ప్రసరణ సదుపాయాలను అమర్చడానికి చాలా ఖర్చు కాదా?" "ఔను, ఖర్చు కావచ్చు. కానీ అదే సమయంలో ప్రాణాలకు రక్షణ వుంటుంది." (సంఖ్య 531) పనిచేసే ఒక గని కార్మికుడు 1860 నాటి చట్టంలోని 17వ సెక్షన్‌కు అభ్యంతరం చెబుతాడు. అతను ఇలా అంటాడు : "ప్రస్తుతం, గనిలోని ఒక భాగం, పని చేయటానికి తగినది కాకపోతే, ఆ విషయం గని సొంతదారుకు, హోం సెక్రటరీకి తెల్పాల్సి ఉంది. అది జరిగిన తరువాత, ఈ విషయం పరిశీలించడానికి గని సొంతదారుకు 20 రోజులు వ్యవధి ఇస్తారు. 20 రోజులు అనంతరం గనిలో ఎటువంటి మార్పు చేయడానికీ నిరాకరించే హక్కు అతనికి ఉంది. కానీ అలా నిరాకరించినప్పుడు అతను ఆ విషయం హోం సెక్రటరీకి రాసి, అదే సమయంలో అయిదుగురు ఇంజనీర్ల పేర్లను సూచిస్తాడు. గని సొంతదారే పేర్కొన్న ఆ అయిదుగురు ఇంజనీర్ల నుంచి ఒకరిని హోం సెక్రటరీ, మధ్యవర్తిగా (అనుకొంటాను) నియమిస్తాడు. లేదా వారిలో కొందరిని మధ్యవర్తులుగా నియమిస్తాడు. అటువంటి సందర్భంలో, గని సొంతదారే ఆచరణలో, తన సొంత

మధ్యవర్తిని నియమించుకొంటున్నాడని నా అభిప్రాయం." (సంఖ్య 581) స్వయంగా గని సొంతదారైన బూర్జువా విచారణకర్త : "కానీ... ఇది కేవలం ఊహాగానంతో చెప్పే అభ్యంతరమా?" (సంఖ్య 586) "అయితే గని ఇంజనీర్ల నిజాయితీని నీవు శంకిస్తున్నావన్న మాట?" "అది నిజంగా అన్యాయం, అక్రమం." (సంఖ్య 588) "గని ఇంజనీర్లకు ఒక విధమైన పౌర ధర్మ నిరతి లేదూ? నీవు ఊహిస్తున్నలాంటి పక్షపాత నిర్ణయం చేసే పనికి వారు అతీతులని నీవనుకొనడం లేదు కదూ?" "వారి వ్యక్తిగత గుణగణాలకు సంబంధించిన అలాంటి ప్రశ్నకు సమాధానం చెప్పడం నాకిష్టం లేదు. అనేక సందర్భాల్లో వారు, నిజంగా పక్షపాతంతో వ్యవహరిస్తారనీ, మనుషుల ప్రాణాలకు ముప్పు ఏర్పడిన సందర్భంలో, అలా వ్యవహరించే అవకాశం వారికివ్వరాదనీ నా అభిప్రాయం." (సంఖ్య 588) ఇదే బూర్జువా, కింది ప్రశ్న వేయడానికి సిగ్గుపడలేదు: "పేలుడువల్ల గని సొంతదారుకు కూడా నష్టం కలుగుతుందని నీకు తోచడం లేదూ?" ఆఖరు ప్రశ్న: "లాంకషైర్‌లోని మీ కార్మికులు, ప్రభుత్వ సహాయం కోరకుండా, మీ సొంత ప్రయోజనాలను మీరే చూసుకోలేరా?" "చూచుకోలేము." (సంఖ్య 1042)

1865వ సంవత్సరంలో, గ్రేట్ బ్రిటన్‌లో ఉన్న బొగ్గు గనులు 3,217, ఇన్‌స్పెక్టర్లు 12 మంది. ఇన్‌స్పెక్టర్లు, తమ ఆఫీసు పని అంతా పక్కకు పెడితే (వారి కాలమంతా దీనికే పడుతుంది.) ఒక ఇన్‌స్పెక్టర్ ప్రతి గనినీ పదేళ్ళలో ఒక్కసారి మాత్రమే వెళ్ళి చూడగలడు. కాబట్టి గత పదేళ్ళలో పేలుళ్ళ సంఖ్యా, విస్తృతీ (కొన్ని సందర్భాల్లో 200-300 మందిని బలిగొంటూ) పెరిగాయి. ఇవీ "స్వేచ్ఛాయుత" పెట్టుబడిదారీ ఉత్పత్తి అందచందాలు!*

1872లో ఆమోదం పొందిన బహు లోపభూయిష్టమైన చట్టం, గనుల్లో నియమితులైన పిల్లల పని గంటలను నియమబద్ధం చేస్తూన్నట్టి ప్రమాదాలనే వాటికి, కొంత వరకు దోపిడీదారులనూ, సొంత దారుల బాధ్యులను చేస్తూన్నట్టి మొట్టమొదటి చట్టం.

వ్యవసాయ రంగంలో పనికి చిన్నపిల్లల, తరుణ వయస్కుల, స్త్రీల నియామకం గురించి దర్యాప్తు జరిపేందుకై 1867లో ఏర్పాటైన రాయల్ కమిషన్ చాలా ముఖ్యమైన నివేదికలను ప్రకటించింది. ఫ్యాక్టరీ చట్టాల సూత్రాలను, సవరించిన రూపంలో, వ్యవసాయానికి వర్తింపజేయడానికి పలు ప్రయత్నాలు జరిగాయి; కానీ ఇప్పటి వరకు అవి పూర్తిగా విఫలమయాయి. నేనిక్కడ దృష్టికి తేదలచినదంతా, ఈ సూత్రాలను సర్వత్రా వర్తింపజేయాలనే, ఒక అప్రతిహత ధోరణి ఉందని మాత్రమే.

కార్మిక వర్గాన్ని మానసికంగానూ, శారీరకంగానూ రక్షించడానికై ఫ్యాక్టరీ చట్టాలను సర్వత్రా విస్తరింపచేయటం అనివార్యమైతే, మరోవైపు, దేనికదిగా ఉన్న అనేక చిన్న పరిశ్రమలు భారీ స్థాయిలో నిర్వహింపబడే కొన్ని సంయుక్త పరిశ్రమలుగా సర్వత్రా మారటం, అటువంటి విస్తరణవల్ల వేగం పుంజుకొంటుంది. కాబట్టి, ఆ విస్తరణ, పెట్టుబడి కేంద్రీకరణనూ, ఫ్యాక్టరీ వ్యవస్థ ఏకైక ప్రాబల్యాన్నీ త్వరితపరుస్తుంది. పెట్టుబడి ఆధిపత్యాన్ని కొంత వరకు ఇంకా మరుగుపుచ్చుతున్న పురాతన, తాత్కాలిక

* నాల్గవ జర్మన్ కూర్పుకు అనుగుణంగా దాని ఇంగ్లీషు పాఠంలో ఈ వాక్యాన్ని చేర్చారు. సం॥

రూపాలను నాశనం చేసి, వాటి స్థానంలో ప్రత్యక్షమైన, బాహాటమైన పెట్టుబడి అధికారాన్ని స్థాపిస్తుంది. కానీ, తద్వారా అది ఈ అధికారానికి ప్రత్యక్ష వ్యతిరేకతను కూడా సార్వత్రీకరిస్తుంది. ప్రతి విడి విడి వర్క్‌షాపులోనూ అది ఏకరూపతను, నియమబద్ధతను, క్రమపద్ధతిని, పొదుపును విధించుతుంది. అదే సమయంలో, పని దినాన్ని పరిమితం, క్రమబద్ధం చేసినందువల్ల సాంకేతిక మెరుగుదలకు కలిగిన బ్రహ్మాండమైన ప్రేరణ ద్వారా అది మొత్తం పెట్టుబడిదారీ ఉత్పత్తి యొక్క అరాచకతను, ఉపద్రవాలను, శ్రమ తీవ్రతను, కార్మికునికి యంత్రాల పోటీని పెంచుతుంది. చిన్నతరహా పరిశ్రమలను, గృహ పరిశ్రమలను నాశనం చేయడం ద్వారా, అది "అక్కరలేని జనాభా"కు గల ఆఖరు ఆశ్రయాన్ని, దానితో మొత్తం సామాజిక యంత్రాంగానికి మిగిలి ఉన్న ఒకే ఒక రక్షక విధానాన్ని (Safety Valve) నాశనం చేస్తుంది. భౌతిక పరిస్థితులను, ఉత్పత్తి ప్రక్రియ సామాజిక సంయోగాన్ని పరిపక్వం చేయడం ద్వారా అది ఉప్పత్తి యొక్క పెట్టుబడిదారీ రూపంలోని వైరుధ్యాలను, శత్రుత్వాలను పరిపాకోన్ముఖం చేస్తుంది. తద్వారా, నవ సమాజం రూపొందడానికి మూలకాలను, పాత సమాజాన్ని బద్దలు చేయడానికీ శక్తులను సమకూర్చుతుంది.[1]

---

1. రాబర్ట్ ఓవెన్ సహకార ఫ్యాక్టరీలకు, సహకార దుకాణాలకు పిత; కాని, ఇంతకు ముందు చెప్పినట్లు, దేనికదిగా వున్న ఈ పరివర్తన ప్రాథమికాంశాల ప్రభావం గురించి తన అనుయాయులకున్న భ్రమలు బొత్తిగా లేని ఆయన, తన ప్రయోగాలకు ఫ్యాక్టరీ వ్యవస్థను, ఆచరణలో ఏకైక ప్రాతిపదికగా చేయటమే కాక, ఆ వ్యవస్థ సామాజిక విప్లవానికి సైద్ధాంతికంగా నాంది అని ప్రకటించారు. లేడన్ విశ్వవిద్యాలయంలో రాజకీయ అర్థశాస్త్ర ఆచార్యుడు యస్. విస్సరింగ్‌కు ఈ విషయమై సందేహాలున్నట్లుంది. ఎందువల్లనంటే, భ్రష్ట అర్థశాస్త్రపు ఊకదంపుడు మాటలన్నీ వల్లిస్తున్న "హాండ్‌బుక్ వాన్ ప్రాక్టిష్చె స్టాట్‌షుయిపొడుకుండే, 1860-62" అన్న తన రచనలో, ఫ్యాక్టరీ వ్యవస్థకు వ్యతిరేకంగా చేతివృత్తులను సమర్థిస్తున్నాడు. (4వ జర్మనీ కూర్పుకు చేర్చిన వాక్యాలు - "ఫ్యాక్టరీ చట్టాలు, ఫ్యాక్టరీ చట్టాల విస్తరణ చట్టం, వర్క్‌షాపుల చట్టం - పరస్పరం ఘర్షణపడే వీటన్నిటి ద్వారా, ఇంగ్లీషు చట్టం, "బొత్తిగా దిక్కుతోచని దిగ్భ్రాంతిగొలిపే పరస్పర విరుద్ధ చట్టాల గజిబిజిని" తెచ్చిపెట్టింది. (ఈ సంపుటి పుట -). తుదకది దుస్సహామయిపోయి నందువల్ల, ఈ విషయంపై వున్న అన్ని చట్టాలను 1878 ఫ్యాక్టరీ, వర్క్‌షాపు చట్టంలో క్రోడీకరించారు. ప్రస్తుతం అమల్లో వున్న అన్ని చట్టాలను 1878 ఫ్యాక్టరీ, వర్క్‌షాపు చట్టంలో క్రోడీకరించారు. ప్రస్తుతం అమల్లో వున్న ఈ ఇంగ్లీషు పారిశ్రామిక స్మృతిని గురించిన వివరమైన సవిమర్శక పరిశీలనకు ఇక్కడ, సహజంగా తావు లేదు. కింది వ్యాఖ్యలతో సరిపెట్టుకోవాలి. ఈ చట్టం పరిధిలోనివి :

   1) జౌళి మిల్లులు. ఇక్కడ అంతా మునుపటిలాగే వుంది : 10 సంవత్సరాలకు పైబడ్డ పిల్లలు రోజుకు 5½ గంటలు, లేదా శనివారం సెలవుతో రోజుకు 6 గంటలు పనిచేయవచ్చు. తరుణ వయస్కులు, స్త్రీలు 5 రోజులు, రోజుకు 10 గంటల చొప్పున, శనివారం 6½ గంటలకు మించకుండా పని చేయవచ్చు.

   2) జౌళి మిల్లు తప్ప మిగతా ఫ్యాక్టరీలు. ఇక్కడ నిబంధనలను, జౌళి మిల్లులోని వాటికి మునుపటికన్న దగ్గరగా తీసుకొచ్చారు; కాని పెట్టుబడిదారులకు అనుకూలంగా ఇంకా, పలు మినహాయింపు లున్నాయి. హోం సెక్రటరీ ప్రత్యేక అనుమతిపై వీటిని, కొన్ని సందర్భాల్లో విస్తరింప చేయవచ్చు.

   3) మునుపటి చట్టంలో ఇంచుమించుగా నిర్వచింపబడిన వర్క్‌షాపులు; ఇక్కడ నియమితులైన పిల్లలూ, తరుణ వయస్కులూ, కార్మికులూ, స్త్రీలకు సంబంధించినంత వరకు, వర్క్‌షాపులు వస్త్రేతర సరకుల

## విభాగం 10

# ఆధునిక పరిశ్రమలు, వ్యవసాయం

ఆధునిక పరిశ్రమలు, వ్యవసాయంలోనూ, వ్యవసాయ ఉత్పత్తిదారుల సామాజిక సంబంధాల్లోనూ తీసుకొచ్చిన విప్లవం, తరువాత పరిశోధింపబడుతుంది. ఆ పరిశోధనల ఫలితాలు ఇలా ఉండక తప్పదన్న ఊహతో కొన్నింటిని కేవలం సూచనప్రాయంగా పేర్కొంటాను. యంత్రాల వినియోగం ఫ్యాక్టరీ కార్మికునిపై నెరపే హానికర భౌతిక ప్రభావాన్ని వ్యవసాయ రంగంలో కల్గించటం లేదు. కాని శ్రామికులను తొలగించి, వారి స్థానం ఆక్రమించడంలో వ్యవసాయ రంగంలో వాటి చర్య మరింత తీవ్రమైనది. దానికి ఎదురయ్యే ప్రతిఘటనా తక్కువ – ఈ విషయం మనం ఉత్తరోత్తరా వివరంగా తెలుసుకొంటాం. ఉదాహరణకు, కేంబ్రిడ్జి, సఫోక్‌కౌంటీలలో గత 20 సంవత్సరాల్లో (1868 వరకు) సాగైన భూమి విస్తీర్ణం చాలా విస్తరించగా, అదే కాలంలో గ్రామీణ జనాభా, సాపేక్షంగానే కాక నిరపేక్షంగా కూడ తగ్గింది. అమెరికా సంయుక్త రాష్ట్రాల్లో వ్యవసాయ యంత్రాలు కార్మికుల స్థానం వహిస్తున్నట్లు మాత్రమే పరిగణించవచ్చునంతే; వేరు మాటల్లో చెప్పాలంటే, వాటి మూలంగా వ్యవసాయదారు మరింత విస్తీర్ణమున్న నేలను సాగుచేయడానికి వీలు కల్పిస్తున్నాయి. కాని, పనిలో నియుక్తులైన కార్మికులను నిజానికి వెళ్ళగొట్టడం లేదు. ఇంగ్లండు, వేల్స్‌లలో వ్యవసాయ యంత్రాల ఉత్పత్తిలో నిమగ్నులైన వారి సంఖ్య 1,034 కాగా, వ్యవసాయ యంత్రాలు, ఆవిరి ఇంజన్ల వాడకానికి నియమితులైన వ్యవసాయ కార్మికుల సంఖ్య 1,205కు మించలేదు.

ఆధునిక పరిశ్రమలు, ఇతరత్రా కన్న వ్యవసాయ రంగంపై ఎక్కువ విప్లవకర ప్రభావం నెరపుతాయి. దానికి కారణమిది : పాత సమాజానికి అండగా వున్న రైతును అది నామరూపాలు

---

ఫ్యాక్టరీలకు దాదాపు సమానంగా వున్నాయి; కాని, పరిస్థితులు, చిల్లర మల్లర విషయాల్లో మునుపటి కన్న సుకరంగా వున్నాయి.

4) 18 ఏళ్ళపైబడ్డ స్త్రీ పురుషులను తప్ప, పిల్లలను గాని, తరుణ వయస్కులను గాని పనిలో పెట్టుకోని వర్క్‌షాపులు; ఈ తరగతికి చెందిన వాటిలో పరిస్థితులు మరింత సుకరంగా వున్నాయి.

5) కుటుంబ గృహంలో, కుటుంబ సభ్యులు మాత్రమే పనిచేసే గృహ పరిశ్రమల వర్క్‌షాపులు; మరింత వెసులుబాటున్న నిబంధనలు, అదే సమయంలో, కాపురానికి కూడ ఉపయోగించని గదుల్లో మాత్రమే, ఇన్‌స్పెక్టరు, మంత్రిత్వ శాఖ, లేదా కోర్టువారి ప్రత్యేక అనుమతి లేకుండా ప్రవేశించవచ్చుననే కట్టడి, ఆఖరు విషయం, కుటుంబ సభ్యులచే గడ్డి అల్లకానికి, లేస్, చేతితొడుగుల తయారీకి నిర్బంధ స్వేచ్ఛ. దీనిలో ఎన్ని లోపాలున్నా, ఈ చట్టం, 1877, మార్చి 23 నాటి స్విస్ ఫెడరల్ ఫ్యాక్టరీ చట్టంతోపాటు, ఇప్పటి వరకు, ఈ రంగంలో వున్న అత్యుత్తమ శాసనం. దీన్ని స్విస్ ఫెడరల్ చట్టంతో పోల్చి చూడటం, ప్రత్యేకించి ఆసక్తిదాయకంగా వుంటుంది. ఎందువల్లనంటే, అది ఈ రెండు శాసన నిర్మాణ పద్ధతులలోని గుణ దోషాలను స్పష్టంగా చూపుతుంది. ఇంగ్లీషు వారిది "చారిత్రక" పద్ధతి; అది అవసరం కలిగినప్పుడు జోక్యం చేసుకొంటుంది. యూరపు ఖండ పద్ధతి ఫ్రెంచి విప్లవ సంప్రదాయాల ప్రాతిపదికపై పెంపొందినది; ఎక్కువగా, అది సామాన్యీకరించే పద్ధతి. దురదృష్టవశాత్తు, తనిఖీ సిబ్బంది తగినంతమంది లేనందువల్ల, ఇంగ్లీషు చట్టం, వర్క్‌షాపుల్లో ఇప్పటికీ చాలా వరకు అమలుజరగడం లేదు." - ఫ్రెడరిక్ ఏంగెల్స్.

లేకుండా చేసి, అతని స్థానంలో వేతన కార్మికుని తెచ్చిపెడుతుంది. ఆ విధంగా సామాజిక మార్పులు రావాలన్న ఆకాంక్ష, వర్గ శత్రు వైరుధ్యాలు గ్రామసీమల్లో కూడ, పట్టణాల్లో వున్న స్థాయికి చేరుకొంటాయి. హేతువిరుద్ధమైన పాతకాలపు వ్యవసాయ పద్ధతుల స్థానంలో శాస్త్రీయ పద్ధతులు వస్తాయి. కార్ఖానా ఉత్పత్తి శైశవ దశలో దాన్ని వ్యవసాయంతో కలిపి కట్టిన పాత ఐక్యతా బంధాన్ని పెట్టుబడిదారీ ఉత్పత్తి పూర్తిగా తెగ్గొడుతుంది. కాని, అదే సమయంలో, భవిష్యత్తులో మరింత ఉన్నతమైన వాటి సంయోగానికి, అంటే, తాత్కాలికంగా విడిపోయి వున్న దశలో వ్యవసాయమూ, పరిశ్రమ రంగమూ రెండూ సంతరించుకొన్న మరింత నిర్దుష్టమైన రూపాల ప్రాతిపదికపై వాటి సంయోగానికి, భౌతిక పరిస్థితులను సృష్టిస్తుంది. పెట్టుబడిదారీ ఉత్పత్తి పెద్ద కేంద్రాల్లోకి జనాభాను చేరవేయటం ద్వారా పట్టణ జనాభా ప్రాబల్యాన్ని అంతకంతకు పెంచడం ద్వారా, ఒకవైపు సమాజపు చారిత్రక చోదక శక్తిని కేంద్రీకృతం చేస్తుంది. మరోవైపు మనిషికి, నేలకు మధ్య గల పదార్థ ఆదాన ప్రదాన క్రమాన్ని చెదరగొడుతుంది; అంటే, మనిషి తిండి, బట్ట రూపంలో వాడే నేలలోని మూలకాలను మళ్ళీ నేలకు తిరిగి చేరకుండా నివారిస్తుంది. కాబట్టి, సుస్థిర భూసారానికి కావలసిన పరిస్థితులను అతిక్రమిస్తుంది. ఈ చర్య ద్వారా అది, ఒకే సమయంలో పట్టణ కార్మికుని ఆరోగ్యాన్ని, గ్రామీణ కార్మికుని మేధా జీవితాన్ని నాశనం చేస్తుంది.[1] కాని, పైన చెప్పిన పదార్థ ఆదాన ప్రదాన క్రమానికై సహజసిద్ధంగా వృద్ధిచెందిన పరిస్థితులను తారుమారు చేస్తూనే ఒక వ్యవస్థగా, సామాజిక ఉత్పత్తిని క్రమబద్ధం చేసే ఒక నియమంగా, మానవ జాతి సంపూర్ణ వికాసానికి తగిన రూపంలో ఆ ఆదాన ప్రదాన క్రమాన్ని పునరుద్ధరించవలసిన, మీరరాని ఆవశ్యకతను కల్పిస్తుంది. కార్ఖానా ఉత్పత్తిలో లాగానే వ్యవసాయంలో కూడ, పెట్టుబడి ఆధిపత్యం కింద ఉత్పత్తి పరివర్తన చెందడమంటే, అదే సమయంలో ఉత్పాదకుణ్ణి బలిగొంటుందని కూడ అర్థం. శ్రమ సాధనం, కార్మికుణ్ణి బానిసగా చేయడానికీ, దోచుకోవడానికీ, పేదరికంలో మగ్గచేయడానికీ సాధనమవుతుంది; శ్రమ ప్రక్రియల సామాజిక సమ్మేళన, వ్యవస్థీకరణా, కార్మికుని వైయక్తిక జీవశక్తినీ, స్వేచ్ఛనూ, స్వాతంత్ర్యాన్నీ అణచివేసే సువ్యవస్థిత పద్ధతిగా మారిపోతుంది. గ్రామీణ కార్మికులు మరింత విశాలమైన ప్రాంతాల్లో చెల్లాచెదురు కావడంవల్ల, వారి ప్రతిఘటనా శక్తి బద్దలవుతుంది. అదే సమయంలో పట్టణ కార్మికుల ప్రతిఘటనా శక్తి వారి కేంద్రీకరణవల్ల పెరుగుతుంది. పట్టణ పరిశ్రమల్లోలాగానే, ఆధునిక వ్యవసాయంలో కూడ శ్రమ ఉత్పాదకతను, సంచారశీలమైన శ్రమ పరిమాణాన్ని పెంచిన ఫలితంగా శ్రమ శక్తే విధ్వంసితమవుతుంది; రోగ పీడితమవుతుంది. అంతేకాదు, పెట్టుబడిదారీ వ్యవసాయంలో సమస్త ప్రగతీ, కళలో ప్రగతే. అది కార్మికుణ్ణే కాక, భూసారాన్ని కూడ దోచుకొనే కళలో ప్రగతి; భూసారాన్ని ఒక నిర్ణీత కాలంపాటు

---

1. “నీవు ప్రజలను, జెంగ్లీల్లాంటి మోటు మనుషులూ, బక్కచిక్కిన మరుగుజ్జులు అనే రెండు శత్రు శిబిరాల కింద విభజిస్తున్నావు. అయ్యో దైవమా! వ్యవసాయ, వర్తక ప్రయోజనాల కింద విభజితమైన జాతి తనకు స్వస్థ చిత్తమున్నట్లు చెప్పుకోవడమా! ఈ అమానుష, అసహజ విభజన జరిగినప్పటికీ, పైపెచ్చు, ఆ విభజన కారణంగానే, తాను విజ్ఞాన సంపన్నమైన, నాగరికమైన జాతి అని చెప్పుకోవడమా!” (డేవిడ్ ఉర్కుహార్ట్, పూర్వోక్త గ్రంథం, పుట 119). ఈ వాక్యాలు, ఈ తరహా విమర్శ గుణదోషాలు రెంటినీ ఒకేసారి వెల్లడిచేస్తున్నాయి. దీనికి, వర్తమాన పరిస్థితిని ఎలా అంచనాకట్టి, ఖండించాలో తెలుసు. కాని ఎలా అవగాహన చేసుకోవాలో తెలీదు.

పెంచడంలో సాధించే సమస్త ప్రగతీ, ఆ సారానికి గల శాశ్వత మూలాధారాలను నాశనం చేయటంలో ప్రగతే. ఒక దేశం, ఉదాహరణకు అమెరికాలాగా, ఆధునిక పరిశ్రమల పునాదిపై అభివృద్ధి చెందటం ప్రారంభించినకొద్దీ, ఈ విధ్వంసన క్రమం మరింత త్వరితగతితో సాగుతుంది.[1] కాబట్టి పెట్టుబడిదారీ ఉత్పత్తి, సమస్త సంపదకు మూలాధారాలను అంటే, నేలనీ, శ్రామికుణ్ణీ పీల్చి పిప్పి చేయడం ద్వారా మాత్రమే, సాంకేతిక విజ్ఞానాన్ని, సామాజిక ఉత్పత్తి ప్రక్రియల సమ్మేళన స్థాయిని అభివృద్ధిపరుస్తుంది.

---

1. "డైషెమీయిన్ ఇహ్రర్ అన్వెండుంగ్ ఆఫ్ అగ్రికల్చర్ అండ్ ఫిజియాలజీ" అన్న లీబిగ్ గ్రంథం 7వ కూర్పును ప్రత్యేకించి, దాని తొలి సంపుటంలోని "ఐన్‌లీటుంగ్ ఇనడైనాచుర్‌గెసెట్‌జే డిస్ ఫెల్డ్‌బాస్" ("వ్యవసాయ ప్రకృతి నియమాల పరిచయం" - అను) చూడండి. ప్రకృతి శాస్త్ర దృష్టితో, ఆధునిక వ్యవసాయపు ప్రతికూల పార్శ్వాన్ని అంటే, వినాశకర పార్శ్వాన్ని విశదీకరించడం లీబిగ్ చిరస్మరణీయ ప్రతిభా విశేషాల్లో ఒకటి. ఆయన సంగ్రహంగా చెప్పిన వ్యవసాయ చరిత్రలో ఘోరమైన తప్పులు లేకపోలేదు. కాని విజ్ఞానదాయకమైన నిశిత వ్యాఖ్యానాలున్నాయి. కాని, ఆయన కింద పేర్కొన్నటువంటి యథాలాపపు ఉద్ఘాటనలకు పూనుకోవడం శోచనీయం : "మట్టిపెళ్ళలను మరింతగా పొడి చేయడం, దున్నడం, సూక్ష్మరంధ్రాలున్న నేల పొరలో అంతర్గతంగా గాలి ప్రసరణకు తోడ్పడుతాయి. వాతావరణ ప్రభావానికి గురి అయ్యే ఉపరితలం హెచ్చి, పునరుజ్జీవం పొందుతుంది. కాని, భూమిలో హెచ్చిన దిగుబడి ఆ భూమిపై వ్యయమైన శ్రమకు అనుగుణమైన నిష్పత్తిలో ఉండజాలదనీ, అది అంతకన్నా చాలా తక్కువ నిష్పత్తిలో హెచ్చుతుందనీ, సులభంగానే గ్రహించవచ్చు. లీబిగ్ ఇంకా ఇలా చెప్పుకుపోతున్నాడు : "ఈ నియమాన్ని మొట్టమొదటి జాన్ స్టువర్ట్ మిల్ తన 'రాజకీయ అర్థశాస్త్ర సూత్రాలు' సం. 1, 17వ పుటలో ఇలా ప్రతిపాదించారు : 'భూమిలో, పండే పంట, నియమితులైన కార్మికుల పెరుగుదలకు క్షీణమాన నిష్పత్తిలో వుంటుందనేది వ్యవసాయక పరిశ్రమ సార్వత్రిక నియమం' రికార్డో మతం ప్రతిపాదించిన నియమాన్ని మిల్ ఇక్కడ తప్పు రూపంలో ప్రవేశపెడుతున్నాడు. ఎందువల్లనంటే, 'నియమితులైన కార్మికుల తగ్గుదల' ఇంగ్లండులో వ్యవసాయ పురోగతితో సమాన స్థాయిలో వుంటూ వచ్చింది. కనుక, ఇంగ్లండులో కనుగొనబడి, ఆ దేశానికి వర్తింపచేయబడిన ఈ నియమం, ఏ పరిస్థితిలో కూడ దానికి వర్తించేది కాదు. (ఇది ఆశ్చర్యకరమైన విషయం. ఎందుచేతనంటే, ఈ నియమానికి కారణమేమిటో మిల్‌కు బొత్తిగా తెలీదు.' (లీబిగ్, పూర్వోక్త గ్రంథం, సం. 1, పుట 143, గమనిక) "శ్రమ" అన్న పదాన్ని లీబిగ్ అర్థం చేసుకొంటున్న తీరు, రాజకీయ అర్థశాస్త్ర దృష్టిలో ఆ పదానికి గల అర్థానికి పూర్తిగా భిన్నమైనది. ఆ పదానికి ఆయన తప్పు అర్థం చెబుతున్న సంగతే కాక, ఆడమ్ స్మిత్ కాలంలో జేమ్స్ ఆండర్సన్ మొట్టమొదట వెల్లడి చేయగా, 19వ శతాబ్ది ప్రారంభం వరకు వివిధ రచనల్లో చర్విత చర్వణమైన ఒక సిద్ధాంతాన్ని జాన్‌స్టువర్ట్ మిల్ తొలిసారిగా ప్రతిపాదించినట్లు లీబిగ్ చెప్పడం, ఏది ఏమైనా, "ఎంతో ఆశ్చర్యకరమైన విషయం." గ్రంథ చౌర్యంలో సిద్ధహస్తుడైన ఆ మాల్తస్, 1815లో ఆ సిద్ధాంతాన్ని సొంతం చేసుకొన్నాడు. ఆండర్సన్ ఆ సిద్ధాంతాన్ని రూపొందిస్తున్నప్పుడే, స్వతంత్రంగా వెస్ట్ దాన్ని రూపొందించాడు. 1817లో దాన్ని రికార్డో, విలువ గురించిన సార్వత్రిక సిద్ధాంతంతో ముడిపెట్టాడు. తరువాత అది రికార్డో సిద్ధాంతంగా ప్రపంచమంతటా చలామణి అయింది. జాన్‌స్టువర్ట్ మిల్ తండ్రి జేమ్స్ మిల్ దాన్ని భ్రష్టుపట్టించాడు. అప్పటికే సర్వసాధారణమైపోయి, ప్రతి పాఠశాల విద్యార్థికీ తెలిసిన ఈ సిద్ధాంతాన్నే జాన్‌స్టువర్ట్ మిల్, తదితరులు ఒక పిడిసూత్రంగా తిరిగి చెప్పారు. ఏది ఏమైనా, జాన్‌స్టువర్ట్ మిల్ తన "ఆశ్చర్యకరమైన ప్రామాణికతకు" అటువంటి ఉచ్ఛిష్టానికి రుణపడి వున్నాడు.

## అయిదో భాగం

# నిరపేక్ష, సాపేక్ష అదనపు విలువల ఉత్పత్తి

## అధ్యాయం 16

# నిరపేక్ష, సాపేక్ష అదనపు విలువలు

## (Absolute and Relative Surplus Value)

శ్రమ ప్రక్రియను పరిశీలిస్తున్నప్పుడు, మేము దాని చారిత్రిక రూపాల్లోనే కాక, మనిషికీ ప్రకృతికీ మధ్య ప్రక్రియగా అనిర్దిష్ట రూపంలో దానిని పరిగణించటం ప్రారంభించాం (7వ అధ్యాయం చూడండి). అక్కడ ఇలా చెప్పాము. పుట 176 "మొత్తం ప్రక్రియను దాని ఫలితమైన ఉత్పాదితాన్ని మనం దృష్టిలో ఉంచుకొని పరీక్షించినట్లయితే, శ్రమ పరికరాల, శ్రమ గ్రహీత వస్తువూ రెండూ శ్రమ సాధనాలే అనీ, శ్రమ అనేది ఉత్పాదితాన్ని మనం దృష్టిలో ఉంచుకొని పరీక్షించినట్లయితే, శ్రమ పరికరాల, శ్రమ గ్రహీత వస్తువు రెండూ శ్రమ సాధనాలే అనీ, శ్రమ అనేది ఉత్పాదక శ్రమ అని స్పష్టమవుతుంది." అదే పుటలోని 2వ పాద సూచికలో ఇంకా ఇలా చెప్పాము : "కేవలం శ్రమ ప్రక్రియ దృక్కోణం నుంచి, ఉత్పాదక శ్రమ ప్రక్రియ అంటే ఏమిటో నిర్ధారణ చేసే ఈ పద్ధతి, పెట్టుబడిదారీ ఉత్పత్తి ప్రక్రియకు ఈ విధంగానూ ప్రత్యక్షంగా వర్తించదు." ఈ విషయాన్ని మరింత వివరించడానికి ఇప్పుడు పూనుకొంటాము.

శ్రమ ప్రక్రియ కేవలం వైయక్తికమైనదిగా ఉన్నంత వరకు, ఉత్తరోత్తరా విడిపోయే క్రియలన్నీ ఒకే కార్మికునిలో ఏకమై వుంటాయి. ఒక వ్యక్తి తన జీవనం కోసం ప్రకృతిలోని వస్తువులను స్వాయత్తం చేసుకొన్నప్పుడు అతడు స్వయం నియంత్రితుడే తప్ప, పర నియంత్రితుడు కాడు. తరువాత, తరువాత అతడు పరనియంత్రితుడవుతాడు. ఒకే ఒక వ్యక్తి, తన సొంత మెదడు నియంత్రణలో తన సొంత కండరాలను పని చేయించకుండా, ప్రకృతిని ఏ పనికీ ఉపయోగించుకోలేడు. సహజ శరీరంలో తలా, చేయీ ఒకదానికొకటి సేవ చేయటం వల్ల, శ్రమ ప్రక్రియ, చేతి శ్రమను, మేధా శ్రమను ఏకం చేస్తున్నాయి. ఉత్తరోత్తరా అవి విడిపోతాయి; బద్ధ శత్రువులవుతాయి కూడా. ఆ పైన, ఉత్పాదితం వ్యక్తి ప్రత్యక్ష ఉత్పాదితంగా ఉండకుండా, సమష్టి కార్మికుడు ఉమ్మడిగా ఉత్పత్తి చేసిన సామాజిక ఉత్పాదితమవుతుంది. అంటే, తమ శ్రమ గ్రహీత వస్తువు తయారీలో ప్రతి ఒక్కరూ కొద్దో, గొప్పో కేవలం ఒక పాత్ర వహించే కార్మికుల సమ్మేళన యొక్క ఉత్పాదితమవుతుంది. శ్రమ ఉత్పాదితం యొక్క సహకార స్వభావం ప్రస్ఫుటమయ్యే కొద్దీ, తదవశ్య ఫలితంగా, ఉత్పాదక శ్రమను, దాని కారకుడైన ఉత్పాదక కార్మికుని గురించిన మన భావన విస్తృతమవుతుంది. ఉత్పాదకంగా శ్రమించడానికి,

ఇక మీదట ఎవరికీ, స్వయంగా కాయకష్టం చేయవలసిన అవసరం లేదు; సమష్టి కార్మికుని అంగంగా వుండి, దాని చిన్నపాటి క్రియల్లో ఒకటి నిర్వహిస్తే చాలు. ఉత్పాదక శ్రమను గురించి పైన ఇచ్చిన మొదటి నిర్వచనం, భౌతిక వస్తువుల ఉత్పత్తి, స్వభావం నుంచీ నిష్పన్నమైన ఈ నిర్వచనం, సమష్టి కార్మికుణ్ణి మొత్తంగా తీసుకొని చూచినప్పుడు, అతని విషయంలో కూడా సరియైనదే. కాని, దానిలోని ప్రతి సభ్యుణ్ణి, విడివిడిగా తీసుకొని చూచినప్పుడు అది ఇక వర్తించదు.

కానీ, మరోవైపు, ఉత్పాదక శ్రమ గురించిన మన భావన సంకుచితమవుతుంది. పెట్టుబడిదారీ ఉత్పత్తి కేవలం సరుకుల ఉత్పత్తి కాదు. అది, దాని సారభూతాంశాన్ని బట్టి, అదనపు విలువ ఉత్పత్తి. కార్మికుడు పెట్టుబడి కోసం ఉత్పత్తి చేస్తాడే తప్ప, తన కోసం కాదు. కాబట్టి అతడు, కేవలం ఉత్పత్తి చేస్తే సరిపోదు. అతను అదనపు విలువను ఉత్పత్తి చేయాలి. పెట్టుబడిదారు కోసం అదనపు విలువను ఉత్పత్తిచేసి, ఆవిధంగా పెట్టుబడి స్వయం విస్తరణ కోసం పని చేసిన కార్మికుడు మాత్రమే ఉత్పాదకుడవుతాడు. భౌతిక వస్తువుల ఉత్పత్తి రంగం వెలుపలి ఉదాహరణను తీసుకొందాం: పాఠశాలలోని ఒక ఉపాధ్యాయుడు తన శిష్యుల తలలు చితకబాదడంతో పాటు, పాఠశాల యజమాని జేబులు నింపడానికై దుక్కిటెద్దులా పని చేస్తేనే అతను ఉత్పాదక కార్మికుడవుతాడు. యజమాని తన పెట్టుబడిని ఒక సాసేజ్ (మాంసపు కూర – అను) ఫ్యాక్టరీకి బదులు, విద్యాబోధన ఫ్యాక్టరీలో మదుపు పెట్టిన మాత్రాన, ఈ సంబంధం మారదు. కాబట్టి, ఉత్పాదక కార్మికుడన్న భావనలో గల అంతరార్థం పనికీ, ఉపయోగకరమైన ఫలితానికీ మధ్య, కార్మికునికి, శ్రమ ఉత్పాదితానికి మధ్య సంబంధం మాత్రమే కాదు. ఉత్పత్తి యొక్క ఒక నిర్దిష్టమైన సామాజిక సంబంధం కూడా; అది కార్మికుణ్ణి, అదనపు విలువను సృష్టించే ఒక ప్రత్యక్ష సాధనంగా ముద్ర వేసే సంబంధం, చారిత్రకంగా ఉత్పన్నమైన సంబంధం. కాబట్టి ఉత్పాదక కార్మికుడుగా ఉండటం ఒక అదృష్టం కాదు, దురదృష్టం. ఈ గ్రంథం నాల్గవ సంపుటంలో ఈ సిద్ధాంత చరిత్రను గురించి చెబుతాము. సాంప్రదాయ రాజకీయ అర్థ శాస్త్రజ్ఞులు అదనపు విలువ ఉత్పత్తిని ఉత్పాదక కార్మికుని స్వభావోచిత లక్షణంగా ఎల్లప్పుడూ పరిగణించారని, అందులో మరింత స్పష్టమవుతుంది. కాబట్టి, ఉత్పాదక కార్మికుని గురించిన వారి నిర్వచనం అదనపు విలువ స్వభావం గురించిన వారి అవగాహనతో మారుతూ వచ్చింది. ఉదాహరణకు, ఫిజియోక్రాట్లు, (సర్వ సంపదలకు భూమి మూలమనే సిద్ధాంతకారులు – అను) వ్యవసాయక శ్రమ ఒక్కటే ఉత్పాదకమైనదని నొక్కి చెబుతారు; ఎందువల్లనంటే అదనపు విలువను సృష్టించేది అదొక్కటే అని వారి వాదం. వారెందుకలా చెబుతారంటే, వారి దృష్టిలో కౌలు రూపంలో తప్ప, అదనపు విలువకు ఉనికే లేదు.

తన శ్రమ శక్తి విలువకు సరిగ్గా సమానమైన విలువను కార్మికుడు ఉత్పత్తి చేసిన కాలానికి మించి పనిదినాన్ని పొడిగించడం, ఆ అదనపు శ్రమను స్వాయత్తం చేసుకోవడం – ఇదే, నిరపేక్ష అదనపు విలువ ఉత్పత్తి అంటే. పెట్టుబడిదారీ వ్యవస్థకు సార్వత్రిక పునాదిగా, సాపేక్ష అదనపు విలువకు ప్రారంభ బిందువుగా వుండేది ఇదే. అదివరకే పనిదినం రెండు భాగాల కింద, అవసర శ్రమ, అదనపు శ్రమల కింద విభజితమైందని, సాపేక్ష విలువ ఉత్పత్తిలో గర్భితం. అదనపు శ్రమను పొడిగించడానికై, వేతనాలకు సమానమైన విలువ మరింత తక్కువ కాలంలో ఉత్పత్తి అయ్యే పద్ధతులతో, అవసర శ్రమ తగ్గించబడుతుంది. నిరపేక్ష అదనపు విలువ ఉత్పత్తి కేవలం పనిదిన పరిమాణంపై

మాత్రమే ఆధారపడి వుంటుంది. సాపేక్ష అదనపు విలువ ఉత్పత్తి, శ్రమ సాంకేతిక ప్రక్రియల్లోనూ, సమాజ నిర్మాణ స్వరూపంలో పూర్తిగా విప్లవం తెస్తుంది. కాబట్టి ఒక ప్రత్యేక ఉత్పత్తి విధానం, పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం పెట్టుబడికి శ్రమ లాంఛనప్రాయమైన లొంగుబాటు వల్ల ఏర్పడిన పునాదిపై తనదైన పద్ధతులతో, సాధనాలతో, పరిస్థితులతో పాటు అయత్నంగా ఉత్పన్నమై, పెంపొందిన ఒక పద్ధతి, సాపేక్ష అదనపు విలువ ఉత్పత్తిలో గర్భితం. ఈ పరిణామక్రమంలో పెట్టుబడికి శ్రమ లాంఛనప్రాయమైన లొంగుబాటు స్థానంలో నిజమైన లొంగుబాటు వస్తుంది.

ప్రత్యక్ష బలాత్కారంగా ఉత్పాదకుని నుంచి అదనపు శ్రమను చేయించడం కాని, ఉత్పాదకుడు తానుగా పెట్టుబడికి లాంఛనంగా లొంగి ఉండటం కాని లేని కొన్ని మధ్యంతర రూపాలను కేవలం ఇక్కడ పేర్కొనడం చాలు. అటువంటి రూపాల్లో పెట్టుబడి శ్రమ ప్రక్రియపై ప్రత్యక్ష నియంత్రణను ఇంకా సాధించి వుండదు. సాంప్రదాయకమైన పాత ఫక్కీలో తమ చేతివృత్తులను, వ్యవసాయాన్ని కొనసాగించే స్వతంత్ర ఉత్పత్తిదారుల సరసనే, వడ్డీ వ్యాపారుడు, లేదా వర్తకుడు, తన వడ్డీ వ్యాపారపు పెట్టుబడితో, లేదా వర్తకపు పెట్టుబడితో నెలకొని, పర రక్తోపజీవిలా వారి కష్టార్జితంపై బతుకుతుంటాడు. ఒక సమాజంలో ఈ రూపంలోని దోపిడీ ప్రబలంగా ఉన్నప్పుడు, అది పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానానికి ఆస్కారమివ్వదు. కాని ఈ రూపం, మధ్య యుగాల ఆఖరు రోజుల్లోలాగా, ఆ పద్ధతికి, ఒక పరిణామ దశగా ఉపయోగపడవచ్చు. తుదకు, ఆధునిక "గృహ పరిశ్రమలు" రుజువు చేస్తున్నట్లు, ఆధునిక పరిశ్రమల నేపథ్యంలో కొన్ని మధ్యంతర రూపాలు అక్కడక్కడ పునరావిర్భవించవచ్చు. అయితే వాటి రూపురేఖలే పూర్తిగా మారిపోయి వుంటాయి.

ఒకవైపు, పెట్టుబడికి కేవలం లాంఛనంగా శ్రమ లొంగి ఉండటం, నిరపేక్ష అదనపు విలువ ఉత్పత్తికి చాలుననీ, ఉదాహరణకు, మునుపు తమ కోసం లేదా ఒక యజమానికి ఉమేజుదారులుగా పనిచేసిన చేతివృత్తుల వారు పెట్టుబడిదారుని ప్రత్యక్ష నియంత్రణ కింద వేతన కార్మికులుగా పని చేయడం చాలుననీ చూచాము. మరోవైపు, సాపేక్ష అదనపు విలువను ఉత్పత్తి చేసే పద్ధతులే ఎలా నిరపేక్ష అదనపు విలువను ఉత్పత్తి చేసే పద్ధతులుగా ఉంటాయో చూచాము. అంతేకాదు, విశేష మేమిటంటే, పనిదినాన్ని విపరీతంగా పొడిగించడం, ఆధునిక పరిశ్రమల ప్రత్యేక ఫలితమని తేలింది. మొత్తంపై చెప్పవలసి వస్తే ఈ ప్రత్యేక పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం ఒకానొక ఉత్పత్తి శాఖ నంతటినీ స్వాధీనం చేసుకొన్న వెంటనే, అది కేవలం సాపేక్ష అదనపు విలువను ఉత్పత్తి చేసే సాధనంగా ఇక వుండదు. అన్ని ముఖ్యమైన శాఖలను స్వాధీనం చేసుకొన్న వెనువెంటనే అలా ఉండనే వుండదు. అప్పుడది సర్వ సాధారణమైన, సామాజికంగా ప్రబలమైన ఉత్పత్తి రూపమవుతుంది. సాపేక్ష అదనపు విలువను ఉత్పత్తి చేసే ఒక ప్రత్యేక పద్ధతిగా అది ఫలప్రదంగా వుండేది, రెండు సందర్భాల్లోనే : మునుపు పెట్టుబడికి లాంఛనంగా లోనై వున్న పరిశ్రమలను, అది తన పట్టులోకి తెచ్చుకొన్న మేరకు, అంటే అది ఇంకా ప్రచారస్థాయిలో వున్న మేరకూ; రెండవది, అది స్వాధీనం చేసుకొన్న పరిశ్రమలను, ఉత్పత్తి, పద్ధతుల్లోని మార్పులు విప్లవీకరించడం కొనసాగినంత వరకు. ఒక దృక్కోణం నుంచి చూస్తే, నిరపేక్ష, సాపేక్ష అదనపు విలువల మధ్య ఏ విధమైన భేదాన్నీ చూపడం భ్రమజనితమని తోస్తుంది. సాపేక్ష అదనపు విలువ నిరపేక్షమైనది. ఎందువల్లనంటే, అది కార్మికుని ఉనికికి అవసరమైన

శ్రమ కాలానికి మించి పనిదినాన్ని నిరపేక్షంగా పొడిగించడం తప్పనిసరి చేస్తుంది. నిరపేక్ష అదనపు విలువ సాపేక్షమైనది; ఎందువల్లనంటే, అవసర శ్రమ కాలాన్ని పనిదినంలో ఒక భాగానికి పరిమితమై వుండటానికి వీలైన విధంగా శ్రమ ఉత్పాదకతను పెంచవలసిన ఆవశ్యకతను అది కల్పిస్తుంది. కాని, అదనపు విలువ ప్రవర్తనను మనం దృష్టిలో ఉంచుకొంటే ఈ అభేదత అదృశ్యమవుతుంది. పెట్టుబడిదారీ ఉత్పత్తి సుస్థాపితమై, సార్వత్రికమైన తరువాత, అదనపు విలువ రేటును పెంచే సమస్య ఉత్పన్నమైనప్పుడల్లా, నిరపేక్ష, సాపేక్ష అదనపు విలువల మధ్య భేదం అనుభూతమవుతుంది. శ్రమ శక్తికి దాని విలువను బట్టి డబ్బు చెల్లించామనుకోండి. అప్పుడు మనకు కింది ప్రత్యామ్నాయం ఎదురవుతుంది. శ్రమ ఉత్పాదకతా, దాని సాధారణ తీవ్రతా నిర్ణీతమైనప్పుడు, అదనపు విలువ రేటును పనిదినాన్ని పొడిగించడం ద్వారా మాత్రమే పెంచగలం. మరోవైపు పనిదిన పరిమాణం నిర్ణీతమైనప్పుడు, పనిదినంలోని అంతర్భాగాల, అంటే అవసర శ్రమ, అదనపు శ్రమల సాపేక్ష పరిమాణాల్లో మార్పు తీసుకురావడం ద్వారా మాత్రమే అదనపు విలువ రేటును పెంచగలం. వేతనాలు శ్రమ విలువకన్నా తక్కువ స్థాయికి పడిపోకుండా ఉండాలంటే, ఈ మార్పు రావడానికి, శ్రమ ఉత్పాదకతలో గానీ, దాని తీవ్రతలో గానీ మార్పు వచ్చి వుండాలి.

తన కాలమంతా తనకూ, తన జాతికీ అవసరమైన జీవితావసరాలను ఉత్పత్తి చేయడానికే కార్మికునికి సరిపోతే, ఇతరులకు ఉచితంగా పని చేయడానికి అతనికి వ్యవధి ఉండదు. తన శ్రమకు ఒక నిర్దిష్ట ఉత్పాదకతా స్థాయి లేకుంటే, అతనికి అటువంటి అదనపు సమయం వుండదు. అటువంటి అదనపు సమయం లేకపోతే, అదనపు శ్రమాలేదు; కాబట్టి పెట్టుబడిదారులు లేరు. బానిస యజమానులు లేరు, ఫ్యూడల్ ప్రభువులూ లేరు. ఒక్క మాటలో చెప్పాలంటే, పెద్ద ఆస్తిమంతుల వర్గమూ లేదు.[1]

కాబట్టి, అదనపు విలువకు ఒక సహజ ప్రాతిపదిక వుందని మనం చెప్పవచ్చు. కాని, అతి సామాన్యార్థంలోనే ఇలా చెప్పవీలుంది. అంటే, ఒక మనిషి మరో మనిషి మాంసం తినకుండా నివారించే ఏ దుర్భేద్యమైన సహజ అవరోధాలూ లేనట్లే, ఒక మనిషి తన మనుగడకు అవసరమైన శ్రమ భారాన్ని వదలించుకొని, ఆ భారం మరొక మనిషిపై వేయకుండా నివారించే సహజ అవరోధమేదీ లేదన్న మాట.[2] చారిత్రకంగా అభివృద్ధి చెందిన ఈ శ్రమ ఉత్పాదకతతో, కొన్ని సందర్భాల్లో జరుగు తున్నట్లు ఏ కార్మిక భావాలనూ ముడిపెట్టరాదు. మానవులు జంతువుల స్థాయి నుంచి పైకి ఎదిగిన తరువాతనే, ఆ కారణంగా వారి శ్రమ కొంతమేరకు సామాజికీకృతమైనప్పుడు మాత్రమే, ఒకరి అదనపు శ్రమ మరొకరి మనుగడకు ఆవశ్యకమైన పరిస్థితి ఉత్పన్నమవుతుంది. నాగరికత ఆవిర్భావ కాలంలో శ్రమకున్న ఉత్పాదకత తక్కువ; కాని, నాటి అవసరాలూ తక్కువే. వాటిని తీర్చే సాధనాలతో పాటుగానూ, ఆ సాధనాల ద్వారానూ అవి పెరుగుతాయి. అంతేకాక, ఆ తొలి దశలో, ఇతరుల

---

1. "ఒక ప్రత్యేక వర్గంగా యజమానులైన పెట్టుబడిదారుల ఉనికి పరిశ్రమల ఉత్పాదకతపై ఆధారపడి వుంది." (రామ్‌సే, పూర్వోక్త గ్రంథం, పుట 206) "ప్రతి మనిషి శ్రమ అతని ఆహారోత్పత్తికే సరిపోతే, ఆస్తి అనేది వుండజాలదు." (రెవెన్ స్టోన్, పూర్వోక్త గ్రంథం, పుటలు 14, 15)
2. ఇటీవల ఒక అంచనాను బట్టి, ఇప్పటి వరకు పరిశోధింపబడిన భూమండల భాగాల్లో ఇంకా, కనీసం 4,000,000 మంది నరమాంస భక్షకులున్నారు.

శ్రమపై బతికే సమాజ భాగం ప్రత్యక్ష ఉత్పాదకుల బాహుళ్యంతో పోల్చితే, అణుమాత్రమే. శ్రమ ఉత్పాదకత పెరిగేకొద్దీ, సమాజంలోని ఆ అల్పాల్ప భాగం నిరపేక్షంగానూ, సాపేక్షంగానూ పెరుగుతుంది.[1] పైగా, పెట్టుబడీ, దాని వెంటనంటి వుండే సంబంధాలూ, సుదీర్ఘమైన అభివృద్ధి క్రమ ఫలితమైన ఆర్థిక క్షేత్రం నుంచి ఉత్పన్నమవుతాయి. ఆ పెట్టుబడికి పునాదిగానూ, ప్రారంభ బిందువుగానూ వున్న శ్రమ ఉత్పాదకత, వేల శతాబ్దాల చరిత్ర వరప్రసాదమే తప్ప ప్రకృతి ప్రసాదితం కాదు.

సామాజిక ఉత్పత్తి, రూపంలో అభివృద్ధి స్థాయి ఎక్కువ తక్కువల మాట అలా వుంచి, శ్రమ ఉత్పాదకతకు భౌతిక పరిస్థితులు ప్రతిబంధకాలవుతాయి. ఇవన్నీ అసలు మానవుని శరీరానికి (నరవర్గం వగైరా) పరిసర ప్రకృతికి సంబంధించినవి. బాహ్య భౌతిక పరిస్థితులు రెండు పెద్ద ఆర్థిక తరగతులుగా విభజింపబడుతాయి. (1) జీవనాధారాలకు సంబంధించిన ప్రకృతి సంపద అంటే, సారవంతమైన భూమి, చేపలు మొదలయినవి పుష్కలంగా వున్న జలాశయాలు, (2) జలపాతాలు, నౌకాయానానికి అనువైన నదులు, కలప, లోహాలు, బొగ్గు మొదలయిన శ్రమ సాధనాలకు సంబంధించిన సహజ సంపద. నాగరికతోదయ కాలంలో, ప్రగతికి ఊపునిచ్చేది మొదటి తరగతి కాగా అభివృద్ధి ఉన్నత దశలో రెండవ తరగతి ఆ పని చేస్తుంది. ఉదాహరణకు, ఇంగ్లండుకు ఇండియాతో, లేదా ప్రాచీన కాలంలో ఏథెన్స్, కోరింత్‌లను నల్లసముద్ర తీరప్రాంతాలతో పోల్చి చూడండి.

తప్పనిసరిగా తీర్చవలసిన సహజ అవసరాలు తక్కువగా వుండేకొద్దీ సహజమైన భూసారము, శీతోష్ణస్థితి సానుకూలత అధికంగా వుండేకొద్దీ, ఉత్పాదకుని పోషణకు, పునరుత్పత్తికి అవసరమైన శ్రమ కాలం తక్కువగా వుంటుంది. కాబట్టి తన కోసం చేసే శ్రమకు మించి, అతడు ఇతరుల కోసం చేసే శ్రమ ఎక్కువగా వుంటుంది. డియొడోరస్ ప్రాచీన ఈజిప్షియన్ల విషయంలో ఈ సంగతి చాలా నాళ్ళ క్రితమే చెప్పాడు : "తమ పిల్లల పెంపకానికి వారు పడే ఇబ్బందీ, పెట్టే ఖర్చు ఎంత తక్కువో అసలు నమ్మశక్యమే కాదు. వారు పిల్లల కోసం, తమ చేతికి తొలుత అందిన ఆహార పదార్థం వండి పెడతారు. తేగల్ని, నిప్పుపై కాల్చడానికి వీలున్న వాటిని, చిత్తడి నేలల్లోని మొక్కల వేళ్ళనూ, కాడల్ని కొన్ని పచ్చివి, కొన్ని ఉడికించీ, లేదా నిప్పులపై కాల్చి యిస్తారు. పిల్లల్లో ఎక్కువ మందికి చెప్పులూ, బట్టలూ వుండవు. ఎందుకంటే, వాతావరణం హాయిగా వుంటుంది. కాబట్టి పిల్లవాడు పెరిగి పెద్దవాడయ్యే వరకు అతని కోసం తల్లిదండ్రులకు అయ్యే ఖర్చు మొత్తంపై 20 డ్రచ్‌మాలకు మించదు. ఈజిప్టు జనాభా అంత అధికంగా వుండటానికి, అంత పెద్ద పనులను అక్కడ చేపట్టగలగడానికి ఇదీ కారణం.[2] కాని, ప్రాచీన ఈజిప్టులోని మహోన్నత నిర్మాణాలకు, దాని విస్తార జనాభాకన్నా అందులోని విస్తార భాగం ఉచితంగా ఉపయోగించుకో వీలుండటమే కారణమని చెప్పాలి. వ్యష్టి శ్రామికుని అవసర శ్రమ కాలం ఎంత తక్కువగా వుంటే, అతడు అదనపు శ్రమ అంత ఎక్కువగా చేయగలడనేది

---

1. "అమెరికాలోని ఆటవికులైన ఇండియన్లలో దాదాపు ప్రతి ఒక్కటి శ్రామికుడిదే. నూటిలో 99 పాళ్ళు శ్రమకు జమకడతారు. ఇంగ్లండులో శ్రామికుడికి జమ అయ్యేది 2/3 పాళ్ళు కూడా వుండదు." ("ది అడ్వాంటేజెస్ ఆఫ్ ది ఈస్టిండియా ట్రేడ్ అండ్ ఎట్సెట్రా" పుట 73)
2. డియొడొరస్, పూర్వోక్త గ్రంథం, సం. 1, పుట 80.

శ్రామిక జనాభాకు కూడా వర్తిస్తుంది. వారిలో, అవసరమైన జీవనాధారాల ఉత్పత్తికి కావలసిన భాగం తక్కువగా వుండేకొద్దీ, ఇతర పనులకు పురమాయించ వీలున్న భాగం ఎక్కువవుతుంది.

పెట్టుబడిదారీ ఉత్పత్తి జరుగుతున్నదనుకొందాం. అప్పుడు ఇతర పరిస్థితులన్నీ ఒకేలాగా వుండి, పనిదిన పరిమాణం నిర్ణీతమైనప్పుడు, అదనపు విలువ పరిమాణం, శ్రమకు గల భౌతిక పరిస్థితులను బట్టి, ప్రత్యేకించి భూసారాన్ని బట్టి మారుతుంది. కాని, అత్యంత ఫలదాయకమైన భూమి పెట్టుబడిదారీ ఉత్పత్తి పెరుగుదలకు అత్యంతోచితమైనదని దీన్నిబట్టి అర్థం చేసుకోరాదు. ఈ పద్ధతి ప్రకృతి మీద మానవునికి గల ఆధిపత్యంపై ఆధారపడి వుంటుంది. ప్రకృతి దేవత అమితాధారంగా వుంటే, ఆమె "అతణ్ణి, ఇంకా నడకరాని పిల్లాడిలా తన చేయిదాటిపోనివ్వదు." తన్ను తాను అభివృద్ధి చేసుకోవలసిన ఆవశ్యకతను అతనిపై రుద్దదు.[1] పెట్టుబడి మాతృభూమి సమశీతోష్ణ మండలమే తప్ప, చెట్టూ చేమా సమృద్ధిగా వున్న ఉష్ణ మండలం కాదు. శ్రమ సామాజిక విభజనకు భౌతిక ప్రాతిపదికగా వుండేదీ, ప్రకృతి పరిసరాల్లోని మార్పుల ద్వారా తన అవసరాలను, అతని శక్తి యుక్తులను తన శ్రమ సాధనాలను, పద్ధతులను ఇబ్బడిముబ్బడిగా పెంచుకొనేందుకు మనిషిని పురికొల్పేదీ, కేవలం భూసారం కాదు. భూసారంలోని తేడాలూ, దాని సహజ ఉత్పత్తుల్లోని వైవిధ్యమూ, రుతువుల్లోని మార్పులూ అలాంటి ప్రేరణ అవుతాయి. ఒక ప్రకృతి శక్తిని సమాజపు గుప్పిట్లోకి తీసుకురావలసిన ఆవశ్యకత, మనిషి కృషి ద్వారా ఆ శక్తిని పొదుపుగా వాడుకోవలసిన ఆవశ్యకత, దాన్ని పెద్ద ఎత్తున స్వాయత్తం చేసుకోవలసిన లేదా అణిచివేయవలసిన ఆవశ్యకత – పరిశ్రమల చరిత్రలో తొలుత నిర్ణయాత్మక పాత్ర వహించేది, యిదే. ఈజిప్టు,[2] లంబార్డీ, హాలెండ్ లేదా ఇండియా, పర్షియాల్లోని

---

1. "మొదటిది (ప్రకృతి సంపద) అత్యుదాత్తమూ, అత్యనుకూలమూ అయినందు వల్ల, మనుషులలో నిర్లక్ష్యత, గర్వం పెరుగుతాయి. నానా వ్యసనాలకు వారు లోనవుతారు. కాని రెండవది, జాగరూకతను, సాహిత్యాన్ని, కళలను, విధాన బద్ధతను అనివార్యంగా తెచ్చిపెడుతుంది." ("విదేశీ వాణిజ్యం వల్ల ఇంగ్లండుకు చేకూరిన నిధి. లేదా మన విదేశీ వాణిజ్యంలో మిగులు, మన నిధి నియమం." లండన్ వర్తకుడు థామస్ మున్ రచన, ఇప్పుడు సర్వజన శ్రేయస్సు కోసం, ఆయన కొడుకు జాన్‌మున్‌చే ప్రకటితం." లండన్, 1699, పుటలు 181, 182) "బతకడానికీ, తిండికీ కావలసిన ఉత్పత్తులు సద్యోజనితాలై, గుడ్డా, గూడు విషయంలో పెద్దగా శ్రద్ధ వహించవలసిన అవసరం గానీ, అవకాశం గానీ లేని వాతావరణమున్న గడ్డపై జన సందోహాన్ని విసరివేయడం కన్నా వారికి పెద్ద శాపం ఉండగలదని నేను ఊహించలేను. దీనికి పూర్తిగా విరుద్ధమైనదీ సంభవమే. ఏ శ్రమా లేకుండానే పుష్కలంగా ఉత్పత్తి అయ్యే భూమి ఎంత చెడుగో, శ్రమ వల్ల ఏమీ ఉత్పత్తి కాని భూమి కూడా అంతే చెడుగు" (ఆహార పదార్థాల ప్రస్తుత అధిక ధరకు కారణాలను గురించిన విచారణ" లండన్, 1767, పుట 10)
2. నైల్ నది ఎప్పుడు ఉప్పొంగుతుందో, ఎప్పుడు నీరు తీస్తుందో ముందుగా తెలుసుకొని చెప్పవలసిన ఆవశ్యకత ఈజిప్షియన్ ఖగోళ శాస్త్రాన్ని సృష్టించింది. దానితోపాటు వ్యవసాయ దర్శకులుగా పూజారుల ఆధిపత్యాన్ని స్థాపించింది. "సంవత్సరంలో నైల్ నది పొంగనారంభించేది. సూర్యుడు భూమధ్య రేఖకు అతి దూరంగా వున్న సమయంలో, ఈజిప్షియన్లు మరింత శ్రద్ధతో దానికోసం గమనించవలసి వచ్చిన సమయం అదే... వారు ఈ ఉష్ణ మండల సంవత్సరపు పరిణామం తీరు తెన్నులను దృఢంగా స్థిరపరచు కోవలసి వచ్చింది. అప్పుడు, వారు తమ వ్యవసాయపనులను తదనుగుణంగా సాగించవీలవుతుంది. కాబట్టి వారు ఆ సమయం మళ్ళీ వచ్చిందన్న స్పష్టమైన సూచనల కోసం ఆకాశాన్ని పరిశీలనగా చూచేవారు." (కువియర్, "డిస్కోర్స్, సుర్‌లే రెవల్యూషన్ దుగ్లోబ్" సం. హోయిఫర్, పారిస్, 1863, పుట 141)

సేద్యపు నీటి పారుదల నిర్మాణాలు ఇందుకు ఉదాహరణలు. ఇండియా, పర్షియాలలో, కృతకంగా ఏర్పాటుచేసిన సేద్యపు కాలువలు పొలాలకు తప్పనిసరియైన నీటిని సరఫరా చేయడమే కాక, కొండల నుంచి ఒండ్రుమట్టి రూపంలో ఖనిజ ఎరువులను కూడా తీసుకొస్తాయి. అరబ్బుల ఆధిపత్యంలో స్పెయిన్, సిసిలీలలో పరిశ్రమలు వర్ధిల్లడంలోని రహస్యం, వాటి నీటి పారుదల నిర్మాణాలే.[1]

అనుకూలమైన నైసర్గిక పరిస్థితులు మాత్రమే వుంటే అవి అదనపు శ్రమకు కేవలం అవకాశమిస్తాయే తప్ప అది వాస్తవమయేలా చేయవు. తత్పర్యవసానంగా, అదనపు విలువను, ఒక అదనపు ఉత్పాదితాన్ని ఇవ్వవు. నైసర్గిక పరిస్థితుల్లో తేడా వున్న ఫలితంగా, ఒకే పరిమాణం గల శ్రమ వేరు వేరు దేశాల్లో తీర్చే అవసరాలు భిన్న పరిమాణాల్లో వుంటాయి.[2] పర్యవసానంగా, పరిస్థితులు ఇతర విషయాల్లో ఒకే విధంగా ఉన్నప్పుడు, అవసర శ్రమ కాలం భిన్నంగా వుంటుంది. ఈ పరిస్థితులు, సహజమైన హద్దులుగా మాత్రమే అదనపు శ్రమను ప్రభావితం చేస్తాయి. అంటే, ఇతరుల కోసం శ్రమ ఎప్పుడు ప్రారంభం కాగలదో నిర్ణయిస్తాయి. పరిశ్రమలు పురోగమించే కొద్దీ, ఈ సహజ హద్దులు వెనక్కి పోతాయి. కార్మికుడు అదనపు శ్రమ రూపంలో మూల్యం చెల్లించడం ద్వారా తన జీవిక కోసం పనిచేసే హక్కును సంపాదించుకొంటున్న మన పశ్చిమ యూరపు సమాజంలో, అదనపు ఉత్పాదితం సమకూర్చడం మానవ శ్రమ స్వతస్సిద్ధ గుణమన్న భావం సులభంగా వేరూనుతుంది.[3] కానీ, ఉదాహరణకు ఆసియాద్వీప సముదాయపు తూర్పు దీవుల్లోని వారినే తీసుకోండి. అక్కడ సగ్గుబియ్యపు చెట్లు, అడవుల్లో విస్తారంగా పెరుగుతాయి. "ఆ ద్వీపవాసులు ఆ చెట్టుకు రంధ్రం తొలిచి, దాని మూలుగు పక్వానికి వచ్చిందన్న నిశ్చయానికి వచ్చిన తరువాత, ఆ చెట్టును నరికి, అనేక తునకలు చేస్తారు. మూలుగును తొలిచి తీసి, నీటితో కలిపి, వడగడతారు. ఇక దాన్ని

---

1. భారతదేశంలో, పరస్పర సంబంధం లేని చిన్న చిన్న ఉత్పాదక వ్యవస్థలపై రాజ్యాధికారానికి గల భౌతిక ప్రాతిపదికల్లో ఒకటి, నీటి సరఫరా క్రమబద్ధీకరణ. భారతదేశంలోని మహమ్మదీయ పాలకులు ఈ విషయాన్ని వారి తరువాత వచ్చిన ఇంగ్లీషు వారికన్నా బాగా అర్థం చేసుకున్నారు. ఈ సందర్భంలో 1866 కరువును జ్ఞాపకం చేసుకొంటే చాలు. ఆ కరువుకు బెంగాల్ ప్రెసిడెన్సీలోని ఒరిస్సా జిల్లాలో పది లక్షలకు పైగా హిందూదేశస్థుల ప్రాణాలు బలి అయ్యాయి.
2. "ఏ రెండు దేశాలూ ఒకే పరిమాణం గల శ్రమతో, జీవితావసరాలను సమాన సంఖ్యలో, సమాన పరిమాణంలో చేకూర్చవు. మానవుల నివాస ప్రాంత శీతోష్ణస్థితి కఠోరమైనదా, మితమైనదా అనేదాన్ని బట్టి వారి అవసరాలు ఎక్కువగానో, తక్కువగానో వుంటాయి. ఫలితంగా వేరు వేరు దేశాల వాస్తవ్యులు, ఆవశ్యకత కారణంగా, సాగించవలసిన వ్యాపారం ఒకే నిష్పత్తిలో వుండజాలదు. ఉష్ణ, శైత్యాల స్థాయిలను బట్టి కాక, ఇతరత్రా ఈ తరతమ భేదాల స్థాయిని నిర్ధారించడమూ ఆచరణ సాధ్యం కాదు. దీన్నిబట్టి, ఒక నిర్దిష్ట సంఖ్యాక ప్రజలకు అవసరమైన శ్రమ, చలి దేశాల్లో అత్యధికము, ఉష్ణదేశాల్లో అది తక్కువ అని మనం ఒక సాధారణ నిర్ధారణ చేయవచ్చు. ఎందువల్లనంటే చలి దేశాల్లో జనానికి ఉష్ణ దేశాల్లోని వారికన్నా ఎక్కువ బట్టలు కావలసి వుండటమేకాక అక్కడ భూముల్ని మరింత ఎక్కువగా సేద్యం చేయవలసి వుంటుంది." ("యాన్ ఎస్సే ఆన్ది గవర్నింగ్ కాజెస్ ఆఫ్ ది నాచురల్ రేట్ ఆఫ్ ఇంటరెస్ట్." లండన్, 1750, పుట 59) నూతన యుగారంభకమైన ఈ అనామధేయ గ్రంథం రచయిత జె.మాస్సీ. వడ్డీ గురించిన తన సిద్ధాంతాన్ని హ్యూం దీన్నుంచి గ్రహించాడు.
3. "సమస్త శ్రమ కొంత అదనపు ఉత్పాదితమిచ్చి తీరాలి." (శ్రమ చేయటం కూడా పౌరుని 'హక్కులు, విధుల'లో భాగమేననేది విదితమే) ప్రౌధాన్.

సగ్గుబియ్యంగా వాడవచ్చునన్నమాట. ఒక చెట్టునుంచి మామూలుగా 300 పౌన్లు, అప్పుడప్పుడు 500–600 పౌన్లు సైతం సగ్గుబియ్యం లభ్యమవుతుంది. కాబట్టి అక్కడి జనం అడవుల్లోకి వెళ్ళి, వంటచెరుకుల్లాగా తమ ఆహారాన్ని కొట్టి తెచ్చుకొంటారు."[1] ఇలా చెట్టు నరికి ఆహారం తెచ్చుకొనే ప్రాచ్య దేశస్థునికి, తన అవసరాలన్నీ తీర్చుకొనేందుకు వారానికి 12 పని గంటలు పడుతుందని అనుకొందాము. అతనికి తీరిక సమయం కొల్లగా వుంటుంది. అది, ప్రకృతి అతనికిచ్చిన ప్రత్యక్ష బహుమతి. అతను ఈ తీరిక సమయాన్ని తన కోసం ఉత్పాదకంగా వినియోగించుకో గలిగే ముందు కొన్ని చారిత్రక ఘటనా పరంపరలు పరంపరలే జరగవలసి వుంటుంది. ఆ కాలాన్ని కొత్తవారికి అదనపు శ్రమలో గడపడానికి ముందు నిర్బంధం అవసరమవుతుంది. పెట్టుబడిదారీ ఉత్పత్తిని ప్రవేశపెట్టినామనుకోండి. ఒక పనిదిన ఉత్పాదితాన్ని అతను అనుభవించాలంటే, నిజాయితీపరుడు బహుశా వారానికి ఆరు రోజులు పనిచేయవలసి వుంటుంది. అతడు మరి, వారానికి ఆరు రోజులు పని చేయడానికి, లేదా అయిదు రోజుల అదనపు శ్రమ చేయడానికి ప్రకృతి దాతృత్వం కారణం కాదు. అతని అవసర శ్రమ కాలం వారంలో ఒక రోజుకు పరిమితం కావడానికి మాత్రం అది కారణం. అంతేకాని, ఎలా చూచినా, అతని అదనపు ఉత్పత్తి, మానవ శ్రమలో స్వతస్సిద్ధంగా వున్న ఏదో ఒక నిగూఢ గుణం నుంచి ఆవిర్భవించదు.

ఆ విధంగా, చారిత్రకంగా అభివృద్ధి చెందిన శ్రమ సామాజిక ఉత్పాదకత కాక, దాని సహజ ఉత్పాదకత కూడా, ఆ శ్రమకు మూర్తిమంతమైన పెట్టుబడి యొక్క ఉత్పాదికతగా కనిపిస్తుంది.

డేవిడ్ రికార్డో అదనపు శ్రమ మూలాన్ని గురించి ఎప్పుడూ పట్టించుకోలేదు. దాన్ని పెట్టుబడిదారీ ఉత్పత్తి పద్ధతిలో స్వతస్సిద్ధంగా వున్న విషయంగా పరిగణిస్తాడు. అతని దృష్టిలో ఆ ఉత్పత్తి పద్ధతి సామాజిక ఉత్పత్తి, సహజ రూపం. శ్రమ ఉత్పాదకతను గురించి ఆయన చర్చించినప్పుడల్లా, ఆయన అందులో వెదకుతున్నది, అదనపు విలువకు కారణమేమిటని కాదు; ఆ విలువ పరిమాణాన్ని నిర్ణయిస్తున్న దేమిటనేది. ఒకవైపు ఆయన మతం, లాభానికి (ఇక్కడ విలువ అని చదువుకోండి) మూల కారణం శ్రమ ఉత్పాదకతే అని చాటి చెప్పింది. ఏది ఏమైనా, వ్యాపారవాదులతో పోలిస్తే, ఇది ప్రగతే. ఎందు వల్లనంటే, ఉత్పాదితం యొక్క ఉత్పత్తి ఖర్చుకు మించిన అధిక ధర. మార్పిడి క్రియలో ఉత్పాదితం తన విలువకు మించి అమ్మకమవుతున్నదనే విషయం నుంచి ఉత్పన్నమవుతూందని వారి వాదం. రికార్డో వాదన ఈ సమస్యను, కిమ్మనకుండా దాటవేసింది; దాన్ని పరిష్కరించలేదు. అదనపు విలువ మూలానికి సంబంధించిన అతి ముఖ్య సమస్యను మరీ లోతుగా కెలకడం చాలా ప్రమాదకరమని, వాస్తవంలో, బూర్జువా అర్థ శాస్త్రజ్ఞులు, తమ సహజ ప్రవృత్తితో సరిగానే పసిగట్టారు. కాని రికార్డోను భ్రష్టుపట్టించిన ఆయన తొట్టతొలి అనుయాయుల నికృష్టపు కప్పదాటు మాటలనే రికార్డో తరువాత అర్థ శతాబ్దానికి ఎడ్డెమడ్డిగా వల్లిస్తూ, వ్యాపారాదుల కన్నా తాను గొప్పవాడనని చెప్పుకొనే జాన్‌స్టువర్ట్ మిల్‌ను గురించి మనం ఏమనుకోవాలి? మిల్ ఇలా అంటున్నాడు : "శ్రమ తన పోషణకు అవసరమైన దానికన్నా ఎక్కువ ఉత్పత్తి చేయడమే లాభానికి కారణం." అంతవరకు అది పాత కథే. కాని మిల్

1. ఎఫ్. ష్యూ, "డైయెర్డే, డైప్లాన్జెన్ అండ్ డర్‌మెన్‌ష్" 2వ కూర్పు, లీప్‌జిగ్, 1854, పుట 148.



తాను సొంతంగా దీనికి ఏదైనా చేరుద్దామన్న కాంక్షతో ఇలా చెప్పుకుపోతున్నాడు : "ఈ సిద్ధాంత రూపాన్ని మార్చితే పెట్టుబడి ఎందుకు లాభాన్ని ఇస్తుందంటే, తిండి, బట్ట, పదార్థాలు, పరికరాలు వీటిని ఉత్పత్తి చేయడానికి పట్టే దానికన్నా ఎక్కువ కాలం ఇవి మన్నుతాయి." ఇక్కడ ఆయన శ్రమ కాలం గడువునూ, దాని ఉత్పాదితాల మన్నిక గడువునూ గందరగోళపరుస్తున్నాడు. మిల్ అభిప్రాయాన్ని బట్టి చూస్తే, యంత్రాల తయారీ ఫ్యాక్టరీ యజమాని తన కార్మికుల నుంచి పిండుకొన్నంత లాభాన్ని రొట్టెల ఫ్యాక్టరీ యజమాని తన కార్మికుల నుంచి ఎన్నడూ పిండుకోలేడు. ఎందువల్లనంటే రొట్టె లుండేది ఒక రోజే. మరి యంత్రాలు 20 ఏళ్ళుపైగా కూడా మన్నుతాయి. ఒక పక్షి గూడు కట్టడానికి అయినదానికన్నా ఎక్కువ కాలం అది ఉండకపోతే, పక్షులు గూళ్ళు లేకుండానే ఉండవలసి వస్తుందని వేరే చెప్పనక్కరలేదు.

ఈ మౌలిక సత్యాన్ని స్థాపించిన తరువాత మిల్ వ్యాపారవాదులపై తన ఆధిక్యతను స్థాపించు కొంటున్నాడు. ఆయన ఇలా అంటున్నాడు : "కాబట్టి, లాభం ఉత్పన్నమవుతున్నది శ్రమ ఉత్పాదక శక్తి నుంచే తప్ప, మార్పిడి అన్న ఘటననుంచి కాదని మనకు స్పష్టమవుతోంది; మార్పిడి అనేది జరిగినా, జరక్కపోయినా, ఎల్లప్పుడూ దేశ సార్వత్రిక లాభం, శ్రమ ఉత్పాదక శక్తి సృష్టించినదే. పనుల విభజనే లేకుంటే, కొనడం, అమ్మడం వుండదు. కాని లాభం మాత్రం వుంటుంది. కాబట్టి మిల్ దృష్టిలో పెట్టుబడిదారీ ఉత్పత్తికి తప్పనిసరిగా సర్వత్రా అవసరమైన మార్పిడి, అమ్మకం, కొనుగోళ్ళు కేవలం ప్రాథమిక ఘటనలు, శ్రమ శక్తి కొనుగోలు, అమ్మకం లేకపోయినా లాభాలు సదా వుంటాయి!

తరువాత ఆయన ఇలా అంటున్నారు : "ఒక దేశ కార్మికులు తమ వేతనాల కన్నా 20 శాతం ఎక్కువ ఉత్పత్తి చేస్తే ధరలు ఎలా వున్నా, ఎలా లేకపోయినా, లాభాలు 20 శాతం వుంటాయి." ఇది అరుదైన చర్విత చర్వణం. ఎందువల్లనంటే, కార్మికులు పెట్టుబడిదారుడి కోసం 20 శాతం అదనపు విలువను సృష్టిస్తే, కార్మికుల మొత్తం వేతనాలకు సంబంధించి అతని లాభం 20:100 నిష్పత్తిలో వుంటుంది. మరోవైపు అతని "లాభాలు 20% వుంటాయని" చెప్పడం శుద్ధ అబద్ధం. అవి ఎప్పుడూ అంతకన్నా తక్కువగానే వుంటాయి. ఎంచేతనంటే, వాటిని మదుపు పెట్టి మొత్తం పెట్టుబడిని బట్టి లెక్కగడతారు. ఉదాహరణకు పెట్టుబడిదారుడు 500 పౌండ్లు మదుపు పెట్టాడనీ, అందులో 400 పౌండ్లు ఉత్పత్తి సాధనాలకూ, 100 పౌండ్లు వేతనాలకూ వ్యయమైనాయనీ అనుకొంటే, అదనపు విలువ రేటు 20% అయినప్పుడు, లాభాల రేటు 20:500 అంటే 4% అవుతుందే కాని 20% కాదు.

సామాజిక ఉత్పత్తి యొక్క వేరు వేరు చారిత్రక రూపాలను మిల్ పరిశీలించే అద్భుత పద్ధతి – ఆ తరువాత వస్తుంది. "కార్మికులు, పెట్టుబడిదారులు వేరు వేరు వర్గాలుగా వున్న పరిస్థితి – కొన్ని మినహాయింపులు వుండవచ్చు; సర్వత్రా నెలకొని వుందనేది ఆద్యంతం, నా ఆలోచన. అంటే, పెట్టుబడిదారుడు కార్మికునికి ముట్టజెప్పే మొత్తం ప్రతిఫలంతో సహా ఖర్చులన్నీ ముందుగానే పెట్టుకొంటాడని ఊహించుకొంటున్నాను." మన భూమండలంలో చాలా అరుదుగా మాత్రమే వుండే పరిస్థితి సర్వత్రా కనిపించడం విచిత్రమైన దృష్టి దోషం వల్ల కలిగిన భ్రాంతి. కాని పూర్తి చేద్దాం –

"అతను అలా పెట్టుకోవడం స్వతస్సిద్ధ ఆవశ్యకతకు సంబంధించిన విషయం కాదు" అని మిల్ అంగీకరిస్తున్నాడు.* పైపెచ్చు "ఉత్పత్తి పూర్తి అయ్యేవరకు, తన వేతనంలో కేవలం అవసరాలకు మించిన భాగమంతటి కోసం కార్మికుడు వేచి వుండవచ్చు. తన తాత్కాలిక పోషణకు చాలినంత డబ్బు చేతిలో వుంటే అతను మొత్తం వేతనాల కోసం వేచి వుండవచ్చు. కాని రెండవ సందర్భంలో, కార్మికుడు ఆ సంస్థను నడపడానికి అవసరమైన మొత్తంలో ఒక భాగాన్ని సరఫరా చేయడం ద్వారా, ఆ మేరకు అందులో నిజంగా ఒక పెట్టుబడిదారే. మిల్ ఇంకా కొంత ముందుకు పోయి, జీవితావసరాలను తనకు తాను ఇచ్చుకోవడమే కాక, ఉత్పత్తి సాధనాలను కూడా సమకూర్చుకొనే కార్మికుడు నిజానికి, తన సొంత వేతన కార్మికుడే తప్ప మరొకడు కాదని చెప్పివుండవచ్చు. సొంత భూమి గల అమెరికన్ రైతు, తన ప్రభువుకు బదులు, తనకు తన నిర్బంధ శ్రమ చేసే అర్ధ బానిస అని కూడా మిల్ చెప్పి వుండవచ్చు.

పెట్టుబడిదారీ ఉత్పత్తి ఉనికిలో లేకపోయినప్పటికీ, అది ఎల్లప్పుడూ ఉంటుందని స్పష్టంగా నిరూపించిన తరువాత మిల్ అలా కాక, పెట్టుబడిదారీ ఉత్పత్తి నిరూపించగలిగిన నిలకడైన వైఖరి ప్రదర్శిస్తున్నాడు. "మొదటి సందర్భంలో సైతం (కార్మికుడు వేతన శ్రామికుడుగా వుండి, అతనికి పెట్టుబడిదారుడు అన్ని జీవితావసరాలను ఇచ్చినప్పుడు, "కార్మికుణ్ణి అదే విధంగా") అంటే పెట్టుబడిదారుగా" పరిగణించవచ్చు. ఎందుచేతనంటే అతను తన శ్రమను మార్కెట్ ధరకన్నా తక్కువకు (!) అందజేస్తూ ఈ తేడాను (?) తన యజమానికి ఎరువిచ్చి, దాన్ని వడ్డీతో మళ్ళీ తీసుకొంటున్నట్లు భావించవచ్చు."[1] వాస్తవంలో కార్మికుడు తన శ్రమకు గల మార్కెట్ ధరను వారాంతంలో పుచ్చుకొనేందుకు, ఒక వారంపాటు దాన్ని మొదట ఉచితంగా అందజేస్తాడు. మిల్ చెబుతున్న దాన్నిబట్టి, అతణ్ణి పెట్టుబడిదారుగా మారుస్తున్నదదీ. సమతల మైదానంలో మామూలు మట్టి దిబ్బలు కొండల్లా కనిపిస్తాయి; ప్రస్తుత బూర్జువా వర్గపు బుద్ధి మాంద్యపు సమతలాన్ని ఆ వర్గపు మహా మేధల ఔన్నత్యాన్ని బట్టి కొలవవలసి వుంది.

---

* మార్క్స్ 1878 నవంబరు 28న రాసిన ఉత్తరంలో, యన్.యఫ్. డేనియల్ సన్‌కు చేసిన సూచనను బట్టి ఈ పేరాగ్రాఫ్‌లో "మన భూమండలంలో" అనే మాటలతో ప్రారంభమై, "అంగీకరిస్తున్నాడు" అనే మాటతో అంతమైన భాగం ఇలా వుండాలి : "కార్మికులు, పెట్టుబడిదారులు వేరు వేరు వర్గాలుగా వున్న ఆర్థిక వ్యవస్థలో సైతం, అది అలా వుండటం పూర్తిగా అవసరం కాదని అంగీకరించడానికి మిల్ సిద్ధంగా వున్నాడు." **- రష్యన్ కూర్పులో మార్క్సిజం - లెనినిజం ఇన్‌స్టిట్యూట్ నోట్.**

1. జె. స్టువర్ట్‌మిల్ "ది ప్రిన్సిపుల్స్ ఆఫ్ పొలిటికల్ ఎకానమీ". లండన్, 1868, పుటలు 252-53 (అక్కడక్కడి వ్యాసాలు)

## అధ్యాయం - 17

# శ్రమ శక్తి ధరలోను, అదనపు విలువ పరిమాణంలోను మార్పులు

సగటు కార్మికునికి, అలవాటుగా అవసరమైన జీవితావసరాల విలువను బట్టి శ్రమశక్తి విలువ నిర్ణయమవుతుంది. ఒక నిర్ణీత సమాజపు నిర్ణీత యుగంలో ఈ అవసరాల పరిమాణమెంతో తెలిసినదే. కాబట్టి దాన్ని ఒక స్థిరపరిమాణంగా పరిగణించవచ్చు. శ్రమశక్తి విలువ నిర్ణయంలో మరో రెండు అంశాలు కూడా వున్నాయి. ఒకటి ఆ శక్తిని అభివృద్ధి పరచేందుకయ్యే ఖర్చులు – ఇవి ఉత్పత్తి పద్ధతి బట్టి మారుతుంటాయి; రెండవది ఆ శక్తి సహజ భిన్నత్వం – పురుషుల, స్త్రీల శ్రమ శక్తి మధ్య, పిల్లల, వయోజనుల శక్తి మధ్య గల భేదం, ఉత్పాదక పద్ధతి వల్ల ఈవేరు వేరు రకాల శ్రమ శక్తి నియామకం అవసరమవుతుంది. వీటి నియామకం కార్మికుని కుటుంబ పోషణకయ్యే ఖర్చులోనూ, ప్రాయస్థుడైన పురుషుని శ్రమశక్తి విలువలోనూ పెద్ద తేడాలకు దారి తీస్తుంది. కానీ, కింది పరిశీలనలో ఈ రెండు అంశాలు వదిలి వేయబడ్డాయి.[1]

1. సరుకులు వాటి విలువకు అమ్మకమవుతున్నాయనీ, 2. శ్రమ శక్తి వెల (ధర) అప్పుడప్పుడు దాని విలువకు మించి పెరుగుతుందే తప్ప, ఎప్పుడూ తగ్గదని ఊహించుకొంటున్నాను.

ఇలా ఊహించుకొన్నప్పుడు, అదనపు విలువ, శ్రమ శక్తి వెల సాపేక్ష పరిమాణాలు మూడు అంశాలను బట్టి నిర్ధారణ అవుతాయని మనం ఇది వరకు చూచాము. అవి (1) పని దిన పరిమాణం లేక శ్రమ విస్తరణాత్మక పరిమాణం; (2) శ్రమ మామూలు తీవ్రత, లేక దాని తీవ్రతా పరిమాణం, ఒక నిర్ణీత కాలంలో వ్యయమయ్యే శ్రమ పరిమాణం దీన్ని బట్టి వుంటుంది. (3) శ్రమ ఉత్పాదకత; దీన్ని బట్టి, ఒకే పరిమాణం గల శ్రమ, ఉత్పత్తి పరిస్థితుల్లోని అభివృద్ధి స్థాయిని బట్టి, ఒక నిర్ణీత కాలంలో ఇచ్చే ఉత్పాదితం యొక్క పరిమాణం ఎక్కువగానో, తక్కువగానో వుంటుంది. మూడు అంశాల్లో ఒకటి స్థిరంగా వుండి, రెండు మారుతూండవచ్చు. లేదా రెండు స్థిరంగా వుండి ఒకటి మారుతూండవచ్చు. లేదా మూడూ ఏకకాలంలో మారుతూండవచ్చు – ఈ విధంగా వీటి బహువిధ సంయోగాలు సాధ్యమనేది స్పష్టమే. ఈ అంశాలు ఏకకాలంలో మారుతున్నప్పుడు, వాటి మార్పుల పరిమాణమూ, ధోరణి రకరకాలుగా వుండవచ్చు; ఇందువల్ల ఈ సంయోగాల సంఖ్య బహుగుణీకృత మవుతుంది. ప్రధాన సంయోగాలు మాత్రమే దిగువ పరిశీలింపబడతాయి.

---

1. మూడవ జర్మన్ కూర్పులో వ్యాఖ్య - (ఈ సంపుటిలో పుటల సంఖ్య) పేజీల్లో పరిగణనకు తీసుకున్న ఉదాహరణ ఇక్కడ వదలివేయబడిందని వేరే చెప్పనవసరం లేదు.

**1. పని దిన పరిమాణం, శ్రమ తీవ్రత స్థిరంగా వుండి, శ్రమ ఉత్పాదకత మారుతూన్న స్థితి**

ఈ స్థితిలో శ్రమ శక్తి విలవనూ, అదనపు విలువ పరిమాణాన్నీ మూడు నియమాలు నిర్ణయిస్తాయి.

(1) శ్రమ ఉత్పాదకత, దానితో పాటు, ఉత్పాదితపు రాశి, ఉత్పత్తి అయిన ప్రతి ఒక్క సరుకు ధర ఎలా మారినప్పటికీ, ఒక నిర్ణీత పరిమాణం గల పని దినం ఒకే మొత్తపు విలువను సృష్టిస్తుంది.

12 గంటల పని దినం సృష్టించే విలువ, మాట వరుసకు, ఆరు షిల్లింగులైతే, శ్రమ ఉత్పాదకతతో పాటు ఉత్పత్తి అయ్యే వస్తువుల రాశి మారినప్పటికీ, ఫలితమొకటే – ఆరు షిల్లింగులు ప్రాతినిధ్యం వహించే విలువ, ఉత్పత్తి అయిన వస్తువులు ఎక్కువగా వున్నా, తక్కువగా వున్నా వాటన్నిటికీ పరివ్యాప్తమై వుంటుంది.

(2) అదనపు విలువ, శ్రమ శక్తి విలువ విరుద్ధ మార్గాల్లో మారుతుంది. శ్రమ ఉత్పాదకతలో మార్పు, అంటే, దాని పెరుగుదల గానీ, లేక తగ్గుదల గానీ, శ్రమశక్తి విలువను తద్విరుద్ధ మార్గంలోనూ, అదనపు విలువను అదే మార్గంలోనూ మార్చుతుంది.

12 గంటల పని దినం సృష్టించే విలువ ఒక స్థిర పరిమాణం; అది ఆరు షిల్లింగు లనుకొందాం. స్థిర పరిమాణం అదనపు విలువ, శ్రమ శక్తి విలువల సమాహారం. శ్రమ శక్తి విలువ స్థానాన్ని కార్మికుడు దానికి సమానమైన విలువతో భర్తీ చేస్తాడు. ఒక స్థిర పరిమాణంలో రెండు భాగాలుంటే, వాటిలో ఏదీ, రెండవది తగ్గకుండా పెరగలేదనేది స్వయం విదితమే. రెండు భాగాలు ప్రారంభంలో సమానమనుకొందాం. అంటే, శ్రమశక్తి విలువ 3 షిల్లింగులు, అదనపు విలువ 3 షిల్లింగులు. అప్పుడు, శ్రమ శక్తి విలువ మూడు షిల్లింగుల నుంచి రెండు షిల్లింగులకు పడిపోకుండా, అదనపు విలువ మూడు షిల్లింగుల నుంచి నాలుగు షిల్లింగులకు పెరగలేదు. కాబట్టి పరిస్థితుల్లో, అదనపు విలువ, లేదా శ్రమ శక్తి విలువ – ఈ రెంటి సాపేక్ష పరిమాణాల్లో, అంటే వాటి పరస్పర పరిమాణాల్లో ఏక కాలంలో మార్పు రాకుండా, ఏ ఒక్క దాని నిరపేక్ష విలువలో మార్పు రాజాలదు.

అంతే కాదు, శ్రమ ఉత్పాదకత పెరక్కుండా, శ్రమ శక్తి విలువ పడిపోజాలదు; పర్యవసానంగా, అదనపు విలువా పెరగజాలదు. ఉదాహరణకు, పైన పేర్కొన్న సందర్భంలో, మునుపు 6 గంటల్లో ఉత్పత్తి అయిన జీవితావసరాలనే, శ్రమ ఉత్పాదతక పెరుగుదల వల్ల, 4 గంటల్లోనే ఉత్పత్తి చేయగలిగితే తప్ప, శ్రమ శక్తి విలువ 3 షిల్లింగుల నుంచి 2 షిల్లింగులకు పడిపోజాలదు. మరోవైపు, మునుపు 6 గంటల్లో ఉత్పత్తి అయిన జీవితావసరాలనే, ఉత్పత్తి చేయడానికి శ్రమ ఉత్పాదకత తగ్గడం వల్ల 8 గంటలు అవసరమైతే తప్ప, శ్రమ శక్తి విలువ 3 షిల్లంగుల నుండి 4 షిల్లింగులకు పెరగలేదు. దీన్ని బట్టి తేలుతున్నదేమిటంటే, శ్రమ ఉత్పాదకత పెరుగుదల, శ్రమశక్తి విలువ పడిపోవడానికి, పర్యవసానంగా అదనపు విలువ పెరగడానికీ దారితీస్తుంది. అదే సమయంలో, ఆ ఉత్పాదకత తగ్గుదల, శ్రమ శక్తి విలువ పెరగడానికీ, అదనపు విలువ పడిపోవడానికీ దారితీస్తుంది.

ఈ నియమాన్ని సూత్రీకరించడంలో రికార్డో ఒక విషయాన్ని విస్మరించాడు. అదనపు విలువ, లేదా అదనపు శ్రమ పరిమాణంలో మార్పు, తద్విరుద్ధ దిశలో శ్రమ శక్తి విలువ పరిమాణం, లేదా అవసర శ్రమ పరిమాణం మారటానికి దారితీసినప్పటికీ, అవి ఒకే నిష్పత్తిలో మారుతుంటాయని

నిర్ధారణ చేయరాదు. అవి ఒకే పరిమాణంలో పెరుగుతాయి. లేదా తగ్గుతాయి. కానీ వాటి పెరుగుదల, లేదా తగ్గుదల నిష్పత్తి, శ్రమ ఉత్పాదకతలో మార్పు రాకముందు, ఆదిలో వున్న వాటి పరిమాణాలపై ఆధారపడి వుంటుంది. శ్రమ శక్తి విలువ 4 షిల్లింగులు, లేదా అవసర శ్రమ కలది 8 గంటలు అయితే, శ్రమ ఉత్పాదకత పెరిగిన ఫలితంగా, శ్రమశక్తి విలువ 3 షిల్లింగులకు, లేదా అవసర శ్రమ 6 గంటలకు పడిపోయినప్పుడు, అదనపు విలువ 3 షిల్లింగులకు, లేదా అదనపు శ్రమ 6 గంటలకు పెరుగుతుంది. ఒకే పరిమాణాన్ని, అంటే 1 షిల్లింగును లేదా 2 గంటల్ని ఒక సందర్భంలో కూడటం, మరో సందర్భంలో తీసివేయడం జరుగుతోంది. కానీ పరిమాణాల నిష్పత్తిలో మార్పు, ఈ రెంటిలోని ప్రతి సందర్భంలో భిన్నమైనది. శ్రమ శక్తి విలువ 4 షిల్లింగులనుంచి 3 షిల్లింగులకు, అంటే 1/4 భాగం లేక 25% పడిపోగా, అదనపు విలువ 2 షిల్లింగుల నుండి 3 షిల్లింగులకు, అంటే 1/2 లేదా 50% పెరుగుతోంది. కాబట్టి శ్రమ ఉత్పాదకతలో ఒక నిర్ణీతమైన మార్పు ఫలితంగా అదనపు విలువ నిష్పత్తి పెరుగుదల లేదా తగ్గుదల, అదనపు విలువలో మూర్తిమంతమైన మునుపటి పనిదిన భాగం యొక్క పరిమాణంపై ఆధారపడి వుంటుంది; ఆ భాగం తక్కువగా వున్న కొద్దీ, ఈ నైష్పత్తిక మార్పు ఎక్కువగా వుంటుంది; ఆ భాగం ఎక్కువగా ఉన్నకొద్దీ ఈ మార్పు తక్కువగా వుంటుంది.

(3) అదనపు విలువలో పెరుగుదల, లేక తగ్గుదల ఎల్లప్పుడూ, శ్రమశక్తి విలువలో తదనుగుణమైన తగ్గుదల, లేదా పెరుగుదల ఫలితమే తప్ప. దానికి కారణం కాదు.[1]

పనిదినం స్థిర పరిమాణం గలిగి, స్థిర పరిమాణపు విలువను ప్రతిబింబిస్తున్నందువల్లనూ, అదనపు విలువ పరిమాణంలోని ప్రతి మార్పునకూ అనుగుణంగా శ్రమశక్తి విలువలో, తద్వ్యతిరేకమైన మార్పు ఉన్నందువల్లనూ, శ్రమ ఉత్పాదకతలో మార్పు, పర్యవసానంగా తప్ప, శ్రమ శక్తి విలువ మారనందువల్లనూ, అదనపు విలువ పరిమాణంలో ప్రతి మార్పు, శ్రమ శక్తి విలువ పరిమాణంలో వచ్చే తద్వ్యతిరేకమైన మార్పు వల్ల ఉత్పన్నమయినదేనని, ఈ పరిస్థితుల్లో స్పష్టంగా నిర్ధారణ అవుతోంది. కాబట్టి మనం, ఇదివరకే తెలుసుకొన్నట్లు, శ్రమశక్తి విలువ యొక్క, అదనపు విలువ యొక్క సాపేక్ష పరిమాణాల్లో మార్పు రాకుండా, వాటి నిరపేక్ష విలువలో మార్పు వుండజాలదు. కాబట్టి, వాటి సాపేక్ష పరిమాణాల్లో మార్పు, అంతకుముందే శ్రమశక్తి విలువ నిరపేక్ష పరిమాణంలో మార్పు లేనిదే, అసంభవమని తేలుతుంది.

మూడవ నియమం ప్రకారం, అదనపు విలువ పరిమాణంలో మార్పు రావడానికి, శ్రమ శక్తి విలువలో చలనం వచ్చి వుండాలి. ఈ కదలికను తెచ్చేది శ్రమ ఉత్పాదకలో మార్పు. అదనపు విలువ

---

1. మూడవ నియమానికి మాక్ కుల్లోచ్, తక్కిన విషయాలతో పాటు కింది, అసంబద్ధమైన విషయాన్ని చేర్చాడు. శ్రమ శక్తి విలువ తగ్గకుండానే, పెట్టుబడిదారుడు చెల్లించవలసిన పన్నులను రద్దు చేయడం ద్వారా అదనపు విలువ పెరగ వీలుందట. పెట్టుబడిదారు, కార్మికుని నుంచి ప్రత్యక్షంగా పిండుకొనే అదనపు విలువ పరిమాణంలో, అటువంటి పన్నుల రద్దు ఏ మార్పునూ తీసుకురాదు. అది, పెట్టుబడి దారుడికీ తదితర వ్యక్తుల మధ్య అదనపు విలువ పంపిణీ అయ్యే నిష్పత్తిని మార్చుతుంది. అంతే కాబట్టి అది, అదనపు విలువకూ, శ్రమ శక్తి విలువకూ మధ్య సంబంధంలో ఎలాంటి మార్పునూ తీసుకురాదు. కాక మాక్ కుల్లోచ్ వాదన ఈ నియమాన్ని ఆయన సరిగా అర్థం చేసుకోలేదని మాత్రమే నిరూపిస్తోంది. ఆడమ్ స్మిత్ సూత్రీకరణలను భ్రష్టుపట్టించడంలో జె.బి. సేకు పట్టిన దుర్గతే, అంత తరచుగా, రికార్డో సూత్రీకరణలను భ్రష్టుపట్టించడంలో మాక్ కుల్లోచ్‌కూ పడుతూంది.

పరిమాణంలో ఈ మార్పు పరిమితిని, మారిన శ్రమ శక్తి విలువ నిర్ధారణ చేస్తుంది. ఈ నియమం పని చేయటానికి పరిస్థితులు అవకాశం కల్పించినప్పటికీ, సహాయక చలనాలు సంభవించవచ్చు. ఉదాహరణకు : శ్రమ ఉత్పాదకత పెరిగిన ఫలితంగా, శ్రమ శక్తి విలువ 4 షిల్లింగుల నుంచి 3 షిల్లింగులకు పడిపోతే, లేదా అవసర శ్రమకాలం 8 గంటల నుంచి 6 గంటలకు పడిపోతే, శ్రమశక్తి విలువ, 3 షి. 8 పెన్నీల కన్నా, 3 షి. 6 పెన్నీలకన్నా, లేదా 3 షి. 2 పెన్నీలకన్నా తక్కువ స్థాయికి పడిపోవడం సాధ్యం కాకపోవచ్చు. పర్యవసానంగా అదనపు విలువ 3 షి. 4 పెన్నీల కన్నా 3 షి. 6 పెన్నీలకన్నా, లేక 3 షి. 10 పెన్నీల కన్నా ఎక్కువ స్థాయికి పెరగకపోవచ్చు. శ్రమ శక్తి విలువ ఏ మేరకు పడిపోతుందనేది (దీని కనీస పరిమితి 3 షిల్లింగులు; ఇది, శ్రమ శక్తి యొక్క కొత్త విలువ), ఒకవైపు పెట్టుబడి ప్రయోగించే ఒత్తిడి, మరోవైపు శ్రామికుని నుంచి వచ్చే ప్రతిఘటన ఈ రెంటి పరస్పర బలాలపై ఆధారపడి వుంటుంది.

శ్రమ శక్తి విలువ, ఒక నిర్ణీత పరిమాణం గల జీవితావసరాల విలువను బట్టి నిర్ణయమవుతుంది. శ్రమ ఉత్పాదకతతో పాటుగా మారేది, ఈ జీవితావసరాల విలువే తప్ప, వీటి రాశి కాదు. కానీ, ఉత్పాదకత పెరుగుదల కారణంగా, శ్రమశక్తి వెలలో కానీ, అదనపు విలువలో కానీ ఎలాంటి మార్పు లేకుండానే, కార్మికులు, పెట్టుబడిదారుడూ ఉభయులూ కూడా మరింత ఎక్కువ పరిమాణంలో ఈ జీవితావసరాలను ఏకకాలంలో స్వాయత్తం చేసుకోవచ్చు. శ్రమశక్తి విలువ 3 షిల్లింగులూ, అవసర శ్రమ కాలం 6 గంటలూ అయితే, అదే విధంగా అదనపు విలువ 3 షిల్లింగులైతే, అప్పుడు అవసర శ్రమకు, అదనపు విలువకు మధ్య నిష్పత్తిని మార్చకుండా శ్రమ ఉత్పాదకతను రెట్టింపు చేస్తే, అదనపు విలువ పరిమాణంలోనూ, శ్రమ శక్తి వెలలోనూ మార్పు వుండదు. దీని ఫలితమల్లా, ఈ రెంటిలో ప్రతి ఒక్కటీ మునుపటి ఉపయోగపు విలువల రెట్టింపునకు ప్రతీకగా వుండటమే. ఎందువల్లనంటే, ఈ ఉపయోగపు విలువలు మునుపటికన్నా రెండింతలు చౌకగా వుంటాయి. శ్రమ శక్తి వెలలో మార్పు లేనప్పటికీ, శ్రమ శక్తి తన విలువను మించి వుంటుంది. కానీ, శ్రమ శక్తి వెల 1 షి. 6 పెన్నీలకు, అంటే, దాని కొత్త విలువకు అనుగుణంగా, పడిపోవడానికి వీలున్న కనీస స్థాయికి కాక, 2షి. 10 పెన్నీలకో, లేదా 2 షి. 6 పెన్నీలకో పడిపోయినట్లయితే, అప్పటికీ ఈ తక్కువ వెల మునుపటి కన్నా ఎక్కువ పరిమాణం గల జీవితావసరాలకు ప్రతీకగా వుంటుంది. ఈ విధంగా, శ్రమ ఉత్పాదకత పెరుగుతూన్న స్థితిలో, శ్రమ శక్తి వెల తగ్గుతూండటం, అయినప్పటికీ, ఈ తగ్గుదలతో పాటు శ్రామికుని జీవనాధారాల రాశి స్థిరంగా పెరుగుతుండటం సాధ్యమే. కానీ అటువంటి సందర్భంలో సైతం, శ్రమ శక్తి విలువ తగ్గుదల, అదనపు విలువలో తదనుగుణమైన పెరుగుదలకు దారితీస్తుంది. ఆ విధంగా, కార్మికుని పరిస్థితికీ, పెట్టుబడిదారుడి పరిస్థితికీ మధ్య గల అఖాతం పెరుగుతూ పోతూంది.[1]

---

1. "పరిశ్రమల ఉత్పాదకతలో మార్పు వచ్చినప్పుడు, ఒక నిర్ణీత పరిమాణంలోని శ్రమా, పెట్టుబడీ ఉత్పత్తి చేసేది ఎక్కువైనా, తక్కువైనా, వేతనాల నిష్పత్తి మారవచ్చు. ఇది సువిదితమే. కానీ, ఆ నిష్పత్తి సూచించే పరిమాణం అలాగే వుంటుంది, లేక, పరిమాణం మారవచ్చు, కానీ నిష్పత్తి అలాగే వుంటుంది." ("ఔట్ లైన్స్ ఆఫ్ పొలిటికల్ యెకానమీ అండ్ ఎట్సెట్రా". పుట 67)

మేము పైన పేర్కొన్న మూడు నియమాలను మొట్టమొదట కచ్చితంగా సూత్రీకరించినది రికార్డో. కానీ ఆయన ఈ కింది పొరపాట్లు చేశాడు : 1) నియమాలు అమలు జరిగే ప్రత్యేక పరిస్థితులను, పెట్టుబడిదారీ వుత్పత్తి సార్వత్రిక, యేకైక పరిస్థితులుగా ఆయన పరిగణించాడు. పని దిన పరిమాణంలో గానీ, శ్రమ తీవ్రతలో గానీ వచ్చే మార్పు గురించి ఆయనకు తెలీదు. ఫలితంగా, ఆయన దృష్టిలో, మారగల అంశం ఒకటే, అది శ్రమ ఉత్పాదకత, (2) ఆయన విశ్లేషణను, ఒకటవ దానికన్న ఎక్కువ దోషభూయిష్టం చేస్తున్న, మరో పొరపాటు ఇది : ఇతర అర్థ శాస్త్రవేత్తల లాగానే ఆయన కూడా అదనపు విలువను, అదనపు విలువగా పరిశోధించలేదు. అంటే, దాని ప్రత్యేక రూపాలయిన లాభం, కౌలు మొదలయిన వాటితో నిమిత్తం లేకుండా పరిశోధించలేదు. కాబట్టి ఆయన అదనపు విలువ రేటుకు సంబంధించిన నియమాలను లాభానికి సంబంధించిన నియమాలను గందరగోళపరుస్తున్నాడు. మేమిదివరకే చెప్పినట్లు, లాభం రేటు అదనపు విలువకు, మదుపు పెట్టిన మొత్తం పెట్టుబడికి మధ్య గల నిష్పత్తి; అదనపు విలువ రేటు అదనపు విలువకు, ఆ పెట్టుబడిలోని అస్థిర భాగానికి మధ్య నిష్పత్తి. 500 పౌండ్ల పెట్టుబడిలో, ముడి పదార్థాలు, శ్రమ సాధనాలు మొదలైన వాటికై వ్యయమైన 400 పౌండ్లు మొత్తం (స్థిరపెట్టుబడి) వేతనాలకు వ్యయమైన 100 పౌండ్ల మొత్తం (అస్థిర పెట్టుబడి) వున్నాయనుకొందాం. అదనపు విలువ (అ) – 100 పౌండ్లని కూడా అనుకొందాం. అప్పుడు అదనపు విలువ రేటు =

$$\frac{\text{అదనపు విలువ}}{\text{అస్థిర పెట్టుబడి}} - \frac{100 \text{ పౌండ్లు}}{100 \text{ పౌండ్లు}} = 100\%. \text{ కాని లాభం రేటు } = \frac{\text{అదనపు విలువ}}{\text{పెట్టుబడి}} - \frac{100 \text{ పౌండ్లు}}{500 \text{ పౌండ్లు}} = 20\%.$$

అంతేకాక, లాభం రేటు అదనపు విలువ రేటును ఏ విధంగానూ ప్రభావితం చేయని పరిస్థితులపై ఆధారపడి వుండవచ్చుననేది స్పష్టమే. ఒక నిర్ణీత అదనపు విలువ రేటుతో, లాభం రేట్లు ఎన్నైనా వుండవచ్చునని, కొన్ని నిర్ణీత పరిస్థితుల్లో వివిధ అదనపు విలువ రేట్లు ఒకే లాభపు రేటులో వ్యక్తం కావచ్చుననీ IIIవ సంపుటంలో నిరూపిస్తాను.

## 2. పనిదినం స్థిరమై, శ్రమ ఉత్పాదకత స్థిరమై శ్రమ తీవ్రత మారుతున్న స్థితిలో

శ్రమ తీవ్రత పెరగడమంటే, ఒక నిర్ణీత కాలంలో వ్యయమయిన శ్రమ పెరగడమన్న మాట. కాబట్టి, రెండింటి పని రోజుల పరిమాణం ఒకటే అయినప్పుడు, శ్రమ తీవ్రత తక్కువగా వున్న పని రోజుకు మూర్తీభావమైన దానికన్నా ఎక్కువ ఉత్పాదితాలు శ్రమ తీవ్రత ఎక్కువగా వున్న పని రోజుకు మూర్తీభావంగా వుంటాయి. శ్రమ ఉత్పాదకత పెరుగుదల కూడా, ఒక నిర్ణీత పని రోజులో ఎక్కువ ఉత్పాదితాలను సరఫరా చేసే మాట నిజమే, కానీ ఈ రెండవ సందర్భంలో, ప్రతి ఒక్క ఉత్పాదితానికి పట్టిన శ్రమ తక్కువ కాబట్టి దాని విలువ పడిపోతుంది; మొదటి సందర్భంలో, ప్రతి వస్తువుకు పట్టే శ్రమ మునుపటిలాగే వుంటుంది. కాబట్టి విలువ మారదు. కాబట్టి విడివిడి ఉత్పాదితాల ధరలు తగ్గకుండానే ఉత్పాదితాల సంఖ్య పెరుగుతుంది. వాటి సంఖ్య పెరిగే కొద్దీ, వాటి ధరలు కూడా పెరుగుతాయి. కానీ ఉత్పాదకత పెరిగిన సందర్భంలో, ఒక నిర్ణీతమైన విలువ, ఉత్పాదితాల అధికతర రాశికి పరివ్యాప్తమవుతుంది. పని దిన పరిమాణం స్థిరంగా వున్నప్పుడు, అధికతర తీవ్రత గల ఒక రోజు శ్రమ, అధికతర విలువలోనూ, డబ్బు విలువ మారకుంటే, ఎక్కువ డబ్బులోనూ మూర్తిమంతమవుతుంది. శ్రమ తీవ్రత సమాజంలో మామూలుగా వున్న శ్రమ తీవ్రతనుంచి

ఏ మేరకు వైదొలగుతుందో ఆ మేరకు, సృష్టి అయిన విలువ కూడా మారుతుంది. కాబట్టి ఒక నిర్ణీత పనిదినం సృష్టించే విలువ ఇక స్థిరంగా వుండకుండా, మారుతూంటుంది. శ్రమ తీవ్రత మామూలుగా వున్న 12 గంటల పని రోజుల్లో సృష్టి అయిన విలువ 6 షిల్లింగులనుకొందాం; కానీ తీవ్రత పెరిగినపుడు, సృష్టి అయిన విలువ 7, 8 లేదా యింకా ఎక్కువ షిల్లింగులే కావచ్చు. ఒక రోజు శ్రమ సృష్టించే విలువ, మాట వరుసకు 6 షిల్లింగుల నుంచి 8 షిల్లింగులకు పెరిగితే, ఈ విలువలోని రెండు భాగాలు అంటే, శ్రమ శక్తి వెల, అదనపు విలువ రెండూ ఏకకాలంలో పెరగవచ్చు. అవి సమానంగా పెరగవచ్చు. లేదా అసమంగానూ పెరగవచ్చు అనేది స్పష్టమే. అవి రెండూ ఏకకాలంలో 3 షిల్లింగుల నుండి 4 షిల్లింగులకు పెరగవచ్చు. ఇక్కడ, శ్రమ శక్తి వెల పెరుగుదలను బట్టి, ఆ వెల శ్రమ శక్తి విలువకు మించి పెరిగిందని, అవశ్యంగా అర్థం చేసుకోరాదు. పైపెచ్చు. శ్రమ శక్తి వెల పెరుగుదలతో పాటు దాని విలువ పడిపోవచ్చు కూడా. ఆ శ్రమ శక్తి గురి అయ్యే అధికతర తరుగుదల వల్ల కలిగిన నష్టాన్ని, శ్రమ శక్తి వెలలోని పెరుగుదల భర్తీ చేయని సందర్భంలో ఇలా జరగవచ్చు.

తాత్కాలిక మినహాయింపులతో, శ్రమ ఉత్పాదకతలో మార్పు వల్ల, తత్సంబంధిత పరిశ్రమల యొక్క ఉత్పాదితాలు అలవాటుగా కార్మికలు వాడేవి అయితే తప్ప, శ్రమశక్తి విలువలో యెలాంటి మార్పు రాదు. పర్యవసానంగా, అదనపు విలువ పరిమాణంలోనూ మార్పు రాదు, అని మనకు తెలుసు. ప్రస్తుత సందర్భంలో ఈ షరతు వర్తించదు. ఎందువల్లనంటే, శ్రమకాలంలో గానీ, దాని తీవ్రతలో గానీ మార్పు వున్నప్పుడల్లా, సృష్టి అయిన విలువకు మూర్తీభావమైన వస్తువు స్వభావంతో నిమిత్తం లేకుండా, ఆ విలువ పరిమాణంలో తదనుగుణమైన మార్పు వుంటుంది.

శ్రమ తీవ్రత ప్రతి పారిశ్రామిక శాఖలోనూ ఏకకాలంలో, సమానంగా పెరిగినట్లయితే, అలా పెరిగిన ఈ కొత్త తీవ్రతా స్థాయే సమాజానికి మామూలు తీవ్రతా స్థాయి అవుతుంది; కాబట్టి దాన్ని పరిగణనకు తీసుకోవడం యిక జరగదు. కానీ, అప్పుడు కూడా, శ్రమ తీవ్రత, వేరు వేరు దేశాల్లో వేరుగా వుండి, విలువ నియమం యొక్క అంతర్జాతీయ అనువర్తనను దిద్దుబాటు చేస్తుంది. ఒక దేశంలో శ్రమ తీవ్రత ఎక్కువగా వున్న పని దినానికి, మరో దేశంలో అది తక్కువగా వున్న పని దినానికన్నా ఎక్కువ మొత్తం డబ్బు ప్రాతినిధ్యం వహిస్తుంది.[1]

### 3. శ్రమ ఉత్పాదకత, తీవ్రత స్థిరమై, పని దిన పరిమాణం మారుతున్న స్థితిలో

పనిదినం రెండు విధాల మారవచ్చు. అది పొడిగింపబడవచ్చు, లేదా తగ్గింపబడవచ్చు. మన ప్రస్తుత దత్తాంశాల నుంచి..... పుటలో ఊహించుకొన్న అంశాల పరిమితుల్లో, కింది నియమాలు నిష్పన్నమవుతాయి.

---

1. "అన్ని విషయాలు సమానంగా వున్న స్థితిలో, ఇంగ్లీషు ఉత్పత్తిదారు ఒక నిర్ణీత కాలంలో ఒక విదేశీ ఉత్పత్తిదారునికన్నా గణనీయంగా ఎక్కువ పని చేయగలడు; పని రోజుల్లోని తేడా, ఇక్కడి 60 గంటలు వారానికీ, ఇతరత్రా వున్న 72, లేదా 80 గంటల వారానికి మధ్య గల తేడా భర్తీ అయ్యేటంత ఎక్కువ పనిచేయగలడు." ("ఫ్యాక్టరీ ఇన్‌స్పెక్టర్ల నివేదికలు, 1855, అక్టోబరు 31" పేజీ. 65) యూరపు భూ ఖండంలో, పనిదిన పరిమాణాన్ని తగ్గిస్తూ శాసనం చేయడం, ఇంగ్లీషు పని గంటకు, యూరపు భూ ఖండంలోని పని గంటకు మధ్య గల ఈ గుణాత్మక వ్యత్యాసాన్ని తగ్గించడానికి అత్యమోఘమైన పద్ధతి కాగలదు.

1) పని దినం, తన పరిమాణానికి అనుగుణంగా ఎక్కువ మొత్తంలోనో, తక్కువ మొత్తంలోనో, ఆ విధంగా స్థిరమైనది కాక, అస్థిరమైన మొత్తంలో – విలువను సృష్టిస్తుంది.

2) అదనపు విలువ యొక్క, శ్రమ శక్తి విలువ యొక్క పరిమాణాల మధ్య సంబంధంలో ప్రతి మార్పు, అదనపు శ్రమ నిరపేక్ష పరిమాణంలో, తత్పర్యవసానంగా, అదనపు విలువ పరిమాణంలో మార్పు వల్ల ఉత్పన్నమవుతుంది.

3) అదనపు శ్రమ పొడిగింపు శ్రమ శక్తి తరుగుదలపై నెరపే ప్రభావ పర్యవసానంగా మాత్రమే, శ్రమ శక్తి నిరపేక్ష విలువ మారగలదు. కాబట్టి ఈ నిరపేక్ష విలువలో వచ్చే ప్రతి మార్పు, అదనపు విలువలోని మార్పు ఫలితమే తప్ప. ఎప్పటికి దానికి కారణం కాదు.

పనిదినం తగ్గింపబడిన సందర్భంతో ప్రారంభిస్తాము.

1) పైన పేర్కొన్న పరిస్థితుల్లో, పనిదినం తగ్గింపు శ్రమ శక్తి విలువను, దానితో పాటు అవసర శ్రమకాలాన్ని మార్చదు. అది అదనపు శ్రమను, అదనపు విలువను తగ్గిస్తుంది. దానితోపాటు, అదనపు విలువ నిరపేక్ష పరిమాణం, దాని సాపేక్ష పరిమాణం కూడా పడిపోతుంది; అంటే పరిమాణం మారకుండా వున్న శ్రమ శక్తి విలువకు సంబంధించి, అదనపు విలువ పరిమాణం పడిపోతుంది. శ్రమ శక్తి వెలను దాని విలువ కన్నా తక్కువ స్థాయికి తగ్గించడం ద్వారా మాత్రమే పెట్టుబడిదారుడు తనకు నష్టం కలుగకుండా కాపాడుకోగలడు.

పనిదినం తగ్గింపునకు వ్యతిరేకంగా జరిగే మామూలు వాదనలన్నీ, మనం వున్నవని యిక్కడ ఊహించిన పరిస్థితుల్లో ఈ తగ్గింపు జరుగుతుందనే భావంతో చేసేవే. కానీ వాస్తవంలో, జరిగేది దీనికి పూర్తిగా భిన్నమైనది : శ్రమ ఉత్పాదకతలో, శ్రమ తీవ్రతలో మార్పు. పని దినం తగ్గింపునకు ముందో, లేదా దాని వెనువెంటనే వస్తుంది.[1]

2) పని దినం పొడిగింపు అవసర శ్రమ కాలం 6 గంటలు, లేదా శ్రమ శక్తి విలువ 3 షిల్లింగులు అనుకొందాం. అలాగే అదనపు శ్రమ 6 గంటలు, లేదా అదనపు విలువ 3 షిల్లింగులు అనుకొందాం. అప్పుడు మొత్తం శ్రమ దినం 12 గంటలవుతుంది. అది 6 షిల్లింగుల విలువలో మూర్తిమంతమవుతుంది. ఇప్పుడు పని దినం 2 గంటలు పొడిగింపబడి, శ్రమ శక్తి వెల మారకుండా వున్నట్లయితే, అదనపు విలువ నిరపేక్షంగానూ, సాపేక్షంగానూ హెచ్చుతుంది. శ్రమ శక్తి విలువలో నిరపేక్షమైన మార్పు లేకపోయినా, సాపేక్షంగా అది తగ్గుతుంది. పై I వ శీర్షిక కింద ఊహించుకొన్న పరిస్థితుల్లో, శ్రమ శక్తి విలువ నిరపేక్ష పరిమాణంలో మార్పు లేనిదే, దాని సాపేక్ష పరిమాణంలో మార్పు వచ్చే వీలు లేదు. కానీ, ఇందుకు భిన్నంగా ఇక్కడ, శ్రమ శక్తి విలువ పరిమాణం సాపేక్షంగా మారడం, అదనపు విలువ నిరపేక్ష పరిమాణంలో వచ్చిన మార్పు ఫలితమే.

ఒక దినం శ్రమకు మూర్తీభావమైన విలువ ఆ దినం పొడిగింపుతో పెరుగుతుంది కాబట్టి, అదనపు విలువ, శ్రమ శక్తి వెల ఏకకాలంలో, సమ పరిమాణాల్లోనో, అసమ పరిమాణాల్లోనో పెరగవచ్చు. కాబట్టి, ఏక కాలంలో ఇలా పెరగడం రెండు సందర్భాల్లో సాధ్యం; ఒకటి, పని దినం

1. "నష్టపరిహారకమైన పరిస్థితులున్నాయి..... పది గంటల చట్టం అమలు వల్ల అవి వెలుగులోకి వచ్చాయి". ("ఫ్యాక్టరీ యిన్‌స్పెక్టర్ల నివేదికలు, 1848, అక్టోబర్ 3". పుట 7.)

యథార్థంగా పొడిగింపబడినప్పుడు, రెండవది, అలా పనిదినం పొడిగింపబడకుండా, శ్రమ తీవ్రత పెరిగినపుడు.

పనిదినం పొడిగింపబడినప్పుడు, శ్రమ శక్తి వెల (ధర) నామకః మారకపోయినా, లేదా పెరిగినా కూడా, అది దాని విలువ కన్నా తక్కువ స్థాయికి పడిపోవచ్చు. శ్రమ శక్తి యొక్క సాధారణ సగటు కాల పరిమాణాన్ని బట్టి లేక కార్మికుల్లోని సాధారణ ఆయుఃప్రమాణాన్ని బట్టి, మానవుని స్వభావాన్ననుసరించి శరీరాంగ రూపంలోని పదార్థం చలన క్రమంలో తదనుగుణ్యంగా చెందే సాధారణ పరివర్తనలను బట్టి శ్రమశక్తి ధరను అంచనా వేయవచ్చు. చలనంగా శరీరాంగ రూపంలోని పదార్థం చెందే తదనుగుణమైన సాధారణ పరివర్తనలను బట్టి కూడా అంచనా కడతారని, పాఠకులకు జ్ఞాపకం వుంటుంది.[1]

పని దినం పొడిగింపు నుంచి వేరు చేయ వీలులేని శ్రమ శక్తి అదనపు తరుగుదలకు వేతనాల హెచ్చింపు ద్వారా ఒకానొక మేర వరకు ప్రతిఫలం ముట్టజెప్పవచ్చు. కానీ ఈ మేర దాటితే, ఈ తరుగుదల గుణోత్తర శ్రేణిలో పెరుగుతుంది; శ్రమశక్తి మామూలుగా పునరుత్పత్తి కావడానికి, పనిచేయడానికి అనుగుణమైన ప్రతి పరిస్థితీ అణచివేయబడుతుంది. శ్రమ శక్తి వెలా, దాన్ని దోపిడీ చేసే స్థాయీ వాటి కనుగుణ్యమైన పరిమాణాల్లో ఇక వుండవు.

### 4. శ్రమకాలం, ఉత్పాదకత, తీవ్రతలలో ఏకకాలంలో మార్పులు

ఇక్కడ ఎన్నో కలయికలు సంభావ్యమని తెలుస్తూనే వుంది. ఈ అంశాల్లో ఏ రెండైనా మారుతూ మూడవది స్థిరంగా వుండవచ్చు, లేక మూడూ ఒకేసారి మారవచ్చు. అవి ఒక స్థాయిలో, లేదా వేరు వేరు స్థాయిల్లో, ఒకే దిశగా, లేదా వ్యతిరేక దిశల్లో మారవచ్చు. ఫలితంగా ఈ మార్పులు ఒక దానికొకటి, పూర్తిగానో, పాక్షికంగానో భంగం కలిగించవచ్చు. కానీ I, II, III శీర్షికల కింద యిచ్చిన ఫలితాల దృష్ట్యా, సంభావ్యమైన ప్రతి ఒక్క సందర్భాన్నీ విశ్లేషించడం సులభమే. వాటిని వరుసగా ఒక్కొక్కదాన్నే తీసుకుని, ఒక దాన్ని అస్థిరమైనదిగానూ, మిగతా రెంటిని స్థిరమైనవిగానూ తాత్కాలికంగా పరిగణిస్తూపోతే, సంభావ్యమైన ప్రతి కలయిక ఫలితాన్ని కనుక్కోవచ్చు. కాబట్టి, రెండు ముఖ్యమైన సందర్భాలను మాత్రమే, అదీ క్లుప్తంగా పరిశీలిద్దాము.

#### (1) పనిదినం పొడిగింపుతో పాటు తగ్గిపోతున్న శ్రమ ఉత్పాదకత

తగ్గిపోతున్న శ్రమ ఉత్పాదకతను గురించి మాట్లాడుతున్నప్పుడు, శ్రమ శక్తి విలువను నిర్ణయించే వస్తువులను ఉత్పత్తి చేసే పరిశ్రమలలో దాని తగ్గుదల గురించి ప్రస్తావిస్తున్నాము. ఇందుకు, భూసారం తగ్గిపోవడం వల్ల, తదనుగుణంగా దాని ఉత్పాదితాలు ప్రియం కావడం వల్ల జరిగే తగ్గుదలను వుదాహరణగా తీసుకొంటాము. పని దినం 12 గంటలనీ, అది సృష్టించే విలువ 6 షిల్లింగులనీ, అందులో సగం శ్రమ శక్తి విలువ స్థానాన్ని వహిస్తుందనీ, మిగతా సగం అదనపు విలువగా వుంటుందనీ అనుకొందాం. భూమి నుంచి ఉత్పత్తి అయ్యే వస్తువు మరింత ప్రియమైనందువల్ల, శ్రమ శక్తి విలువ

1. "ఒక మనిషి శరీరంలో కలిగిన రసాయనిక మార్పులనూ, చలన శక్తి వినియోగానికి సూచనగా, మారిన తత్ పదార్థ రూపాలను పరిశీలించడం ద్వారా, అంతకు ముందు 24 గంటల గతిక్రమంలో అతడు చేసిన శ్రమను ఉజ్జాయింపుగా లెక్కగట్టవచ్చు" (గ్రోవ్, "ఆన్ ది కో రిలేషన్ ఆఫ్ ఫిజికల్ ఫోర్సెస్")

3 షిల్లింగుల నుంచి 4 షిల్లింగులకు, ఆ కారణంగా, అవసర శ్రమకాలం 6 గంటల నుండి 8 గంటలకు పెరిగిందనుకొందాం. పనిదిన పరిమాణంలో మార్పు లేకుంటే, అదనపు శ్రమ 6 గంటల నుంచి 4 గంటలకు, అదనపు విలువ 3 షిల్లింగుల నుండి 2 షిల్లింగులకు పడిపోతాయి. పని దినం 2 గంటలకు, అంటే 12 గంటల నుంచి 14 గంటలకు పొడిగింపబడితే, అదనపు శ్రమ 6 గంటలూ, అదనపు విలువ 6 షిల్లింగులూ అవుతుంది; కానీ, శ్రమ శక్తి విలువ, అవసర శ్రమ కాలాన్ని, బట్టి నిర్ధారణ అవుతుంది. కాబట్టి ఆ విలువతో పోలిస్తే, అదనపు విలువ తగ్గుతుంది. పని దినాన్ని 4 గంటలు పొడిగించినట్లయితే, అంటే 12 గంటల నుండి 16 గంటలకు పొడిగించినట్లయితే, అదనపు విలువ, శ్రమ శక్తి విలువ, అదనపు శ్రమ, అవసర శ్రమల విలువ – వీటి నైష్పత్తిక పరిమాణాలు మారకుండా అలాగే వుంటాయి. కానీ, అదనపు విలువ నిరపేక్ష పరిమాణం 3 షిల్లింగుల నుండి 4 షిల్లింగులకు, పెరుగుతుంది, అదనపు శ్రమ నిరపేక్ష పరిమాణం 6 గంటల నుంచి 8 గంటలకు, అంటే $33\frac{1}{3}\%$ పెరుగుతుంది. కాబట్టి, శ్రమ ఉత్పాదకత తగ్గి, దానితో పాటుగా పని దిన పరిమాణం పెరిగినప్పుడు, అదనపు విలువ నిరపేక్ష పరిమాణం మారకుండా వుంటూనే, దాని సాపేక్ష పరిమాణం తగ్గవచ్చు. దాని సాపేక్ష పరిమాణం మారకుండా వుంటూనే, దాని నిరపేక్ష పరిమాణం హెచ్చువచ్చు. పని దినం తగినంత పొడిగింపబడినప్పుడు, రెండూ పెరగవచ్చు.

1799–1815 మధ్యకాలంలో ఆహారాది పచారీ సరుకుల ధరల పెరుగుదల ఇంగ్లండులో వేతనాలు నామకల పెరగడానికి దారితీసింది. కానీ జీవితావసరాల రూపంలో వ్యక్తమయ్యే వాస్తవ వేతనాలు పడిపోయాయి. వ్యవసాయిక శ్రమ ఉత్పాదకతలో తగ్గుదల అదనపు విలువ రేటు పడిపోయేలా చేసిందని, పై వాస్తవాన్ని బట్టి వెస్ట్, రికార్డో నిర్ధారణ చేశారు. కేవలం తమ మనః కల్పితమైన ఒక సంగతిని నిజమని వారు ఊహించుకొని, దాన్ని వేతనాల, లాభాల, కౌలు సాపేక్ష పరిమాణాలను గురించిన ముఖ్యమైన పరిశీలనలకు ప్రాతిపదికగా చేసుకొన్నారు. కానీ వాస్తవంలో, ఆనాడు, శ్రమ తీవ్రత పెరిగినందువల్లనేమి, అదనపు విలువ పరిమాణం నిరపేక్షంగానూ, సాపేక్షంగానూ కూడా హెచ్చింది. ఇది, పనిగంటలను మహాదారుణంగా పెంచే హక్కు స్థాపితమైన కాలం[1] ఒకచోట,

1. "ధాన్యం, శ్రమ భుజం భుజం కలిపి నడవడం అరుదు. కానీ, సువిదితమైన హద్దొకటి వుంది - అది దాటితే వాటిని వేరు చేయ వీలు లేదు. సాక్షుల విచారణ సందర్భంగా (అంటే, 1814 - 15 పార్లమెంటరీ విచారణ కమిటీ ముందు) వేతనాలు పడిపోయిన సంగతి దృష్టికి వచ్చింది. వస్తువులు ప్రియమైన కాలాలు దీనికి కారణం; ఈ కాలాల్లో శ్రామిక వర్గాలు చేసే అసాధారణమైన, ప్రయాసకర శ్రమను తీసుకొని చూస్తే. అది వ్యక్తుల్లో అత్యంత ప్రశంసనీయమైన విషయం. అది కచ్చితంగా పెట్టుబడి పెరుగుదలకు అనుకూలిస్తుంది. కానీ, మానవత్వం వున్న ఎవరూ, అది స్థిరంగా, అవిరామంగా కొనసాగాలని కోరరు. ఒక తాత్కాలిక వుపశమనంగా అది అత్యంత శ్లాఘనీయమైనది. కానీ అదొక నిరంతరాచరణ అయితే, తన ఆహార పదార్థాలు తుది దశకు చేరే పరిస్థితికి నెట్టబడిన దేశ జనాభా మూలంగా సంభవించే ఫలితాలే, దాని నుంచీ కూడా సంభవిస్తాయి." (మాల్తస్, "ఇంక్వైరీ ఇంటు ది నేచర్ అండ్ ప్రొగ్రెస్ ఆఫ్ రెంట్". లండన్, 1815, పుట 48. నోట్) పని గంటల పొడిగింపును గురించి నొక్కి చెప్పినందుకు మాల్తస్‌కు జోహారులు. ఈ వాస్తవాన్ని ఆయన తన రచనలో ఇంకోచోట కూడా మన దృష్టికి తెస్తున్నాడు. కానీ రికార్డో, తదితరులు ఆ ప్రతిష్టాకరమైన వాస్తవాలను కాదని, పని దినం పొడిగింపును తమ సమస్త పరిశోధనలకు ప్రాతిపదికగా చేసుకొంటున్నారు. కానీ, పని దినాన్ని,

పెట్టుబడి సత్వర గతితో పోగుపడటం, మరొకచోట దుర్భర దారిద్ర్యం, ప్రత్యేక లక్షణంగా గల కాలం.[1]

## (2) పని దినం తగ్గుదలతో పాటుగా, శ్రమ తీవ్రత, ఉత్పాదకతల పెరుగుదల

శ్రమ ఉత్పాదకత పెరుగుదల, దాని అధికతర తీవ్రతా, ఈ రెంటి ప్రభావం ఒకటే. రెండూ ఒక నిర్ణీత కాలంలో ఉత్పత్తి అయ్యే వస్తువుల రాశిని పెంచుతాయి. కాబట్టి తన జీవనాధారాలను, లేదా వాటికి సమమైన దాన్ని ఉత్పత్తి చేసేందుకు శ్రామికునికి అవసరమైన పని, దిన భాగాన్ని ఈ రెండూ తగ్గిస్తాయి. ఈ అవసరమైన, కానీ సంకోచశీలమైన ఈ భాగం పని దిన కనీస పరిమాణాన్ని నిర్ణయిస్తుంది. మొత్తం పని దినం ఈ భాగ పరిమాణానికి కుంచించుకు పోయినట్లయితే, అదనపు శ్రమ అంతర్థానమవుతుంది. పెట్టుబడి హయాంలో ఇది పూర్తిగా అసాధ్యమైన పరాకాష్ట. పెట్టుబడిదారీ ఉత్పత్తి రూపాన్ని నిర్మూలించడం ద్వారా మాత్రమే పని దిన పరిమాణాన్ని అవసర శ్రమ కాలానికి తగ్గించే వీలుంది. కానీ ఆ సందర్భంలో సైతం అవసర శ్రమ కాలపు హద్దులు విస్తరిస్తాయి. ఒకవైపు "జీవనాధారాలు" గురించిన భావన గణనీయంగా విస్తృతమై కార్మికులు పూర్తిగా భిన్నమైన జీవన ప్రమాణాన్ని ఒక హక్కుగా కోరడం దీనికి ఒక కారణం, మరోవైపు, ప్రస్తుతం అదనపు శ్రమగా వున్న దానిలో ఒక భాగం, అప్పుడు అవసర శ్రమ కింద జమపడటం ఇంకో కారణం. అది నిల్వ కోసం, పెట్టుబడి సంచయనం కోసం నిధిని ఏర్పరచేందుకు చేసే శ్రమ అని ఇక్కడ నా భావం.

శ్రమ ఉత్పాదకత పెరిగే కొద్దీ పని దినాన్ని తగ్గిస్తూపోవచ్చు. పని దినాన్ని తగ్గించే కొద్దీ, శ్రమ తీవ్రత పెరగవచ్చు. సమాజ దృక్కోణం నుంచి చూస్తే, శ్రమ పొదుపయ్యే నిష్పత్తిలోనే శ్రమ ఉత్పాదకత పెరుగుతుంది. ఇటు, శ్రమ పొదుపులో, ఉత్పత్తి సాధనాల్లో పొదుపే కాక, నిరుపయోగమైన శ్రమనంతటినీ తప్పించడం కూడా ఇమిడి వుంది. పెట్టుబడిదారీ ఉత్పత్తి పద్ధతి ఒకవైపు, ప్రతి వ్యష్టి వ్యాపారంలో పొదుపును నిర్బంధంగా అమలు జరుపుతూనే, మరోవైపు, అరాచకమైన వ్యాపారపు

---

అపరిమితంగా పెంచడం, దానితో పాటు, యంత్రాలు అసాధారణంగా అభివృద్ధి చెందడం, స్త్రీల, పిల్లల శ్రమను దోచుకోవడం - ఇవి అనివార్యంగా కార్మిక వర్గంలో ఒక పెద్ద భాగాన్ని "అనవసరమైనదిగా" చేసి వుంటుందని, ప్రత్యేకించి, యుద్ధం ఆగిపోయి, ప్రపంచ మార్కెట్లలో ఇంగ్లండు గుత్తాధిపత్యం అంతమైనప్పుడు యిలా జరుగుతుందని, మాల్థూస్ గ్రహించకుండా, ఆయన ఊడిగం చేసే మితవాదపు ప్రయోజనాలు అడ్డుకొన్నాయి. మాల్థూస్ పాలక వర్గాల ప్రయోజనాలను ఆరాధించే నిజమైన పూజారి. ఈ "అదనపు జనాభా" ఉనికికి పెట్టుబడిదారీ ఉత్పత్తి తాలూకు చారిత్రక నియమాలను కాక, ప్రకృతి సిద్ధమైన శాశ్వత నియమాలను కారణంగా చూపడం సహజంగానే, పాలక వర్గాల ప్రయోజనాలకు మరింత అనుకూలమూ, మరింత అనుగుణమున్నూ.

1. "ప్రతి సమాజంలోనూ అత్యధిక సంఖ్యాకులైన శ్రామిక వర్గాల అధికతర శ్రమనుంచి, బహుశా అధికతర దారిద్ర్య బాధలనుంచి పెట్టుబడి పెరుగుదలకు ఒక ప్రధాన కారణం ఉత్పన్నమైంది. దారిద్ర్య పరిస్థితుల వల్ల మరింత మంది స్త్రీలు, పిల్లలు ప్రయాసకరమైన పనుల్లో ప్రవేశించక తప్పింది కాదు. ముందు నుంచి పని చేస్తున్న కార్మికులు తమ శ్రమ కాలంలో మరింత ఎక్కువ భాగాన్ని ఉత్పత్తిని పెంచడానికి వినియోగించవలసి వచ్చింది కూడా అదే కారణం వల్లనే". ("రాజకీయ అర్థశాస్త్రంపై వ్యాసాలు - ప్రస్తుత జాతీయ దురవస్థ ప్రధాన కారణాలకు ఉదాహరణలతో సహా." లండన్, 1839, పుట 248)

పోటీ వ్యవస్థ కారణంగా, శ్రమ శక్తీ, సామాజిక ఉత్పత్తి సాధనాలూ అతి దారుణంగా దుర్వ్యయ మయ్యేందుకు దారితీస్తుంది. పోతే, ప్రస్తుతం తప్పని సరియైనవిగా వున్నప్పటికీ, వస్తుతః అవసరమైన అసంఖ్యాక పనులను అది సృష్టించిన సంగతి వేరే చెప్పనక్కరలేదు.

శ్రమ తీవ్రత, ఉత్పాదకత నిర్ణీతమైనప్పుడు, పాదార్థిక ఉత్పత్తికై సమాజం కేటాయించే కాలం తప్పనిసరిగా ఇప్పటికన్నా తక్కువగా వుంటుంది; ఫలితంగా, భౌతికంగానూ, సామాజికంగానూ, వ్యక్తి స్వేచ్ఛగా అభివృద్ధి చెందేలా చేయటానికై సమాజానికున్న వ్యవధి ఎక్కువవుతుంది. దృఢకాయులైన సమాజ సభ్యులందరి మధ్య పని అంతకంతకు సమానంగా పంపిణీ కావడం, శ్రమ సహజ భారాన్ని తన భుజస్కంధాల నుంచి, సమాజంలోని యింకో పొరకు చెందిన వారి భుజాల పైకి నెట్టే అధికారం ఒక నిర్దిష్ట వర్గానికి అంతకంతకూ లేకుండా చేయడం, ఇది జరిగిన నిష్పత్తిలోనే ఈ వ్యవధి పెరుగుతుంది. ఈ దిశలో పని దినం తగ్గింపునకు శ్రమ సామాన్యీకరణే ఒక హద్దు ఏర్పరస్తుంది. పెట్టుబడిదారీ సమాజంలో, ప్రజా బాహుళ్య జీవిత కాలమంతటినీ శ్రమ కాలంగా మార్చడం ద్వారా ఒక వర్గానికి విరామ కాలం లభిస్తోంది.

## అధ్యాయం - 18

# అదనపు విలువ రేటుకు వివిధ సూత్రాలు

అదనపు విలువ రేటును కింది సూత్రాలు చూపుతున్నాయని మనం తెలుసుకొన్నాము.

$$1. \quad \frac{\text{అదనపు విలువ}}{\text{అస్థిర పెట్టుబడి}} \; \frac{\text{(అ.వి.)}}{\text{(అ.పె)}} = \frac{\text{అదనపు విలువ}}{\text{శ్రమ శక్తి విలువ}} = \frac{\text{అదనపు శ్రమ}}{\text{అవసర శ్రమ}}$$

ఈ సూత్రాల్లో విలువల నిష్పత్తిగా వున్న మొదటి రెండూ, ఆ విలువలను ఉత్పత్తి చేయడానికి పట్టే కాలాల నిష్పత్తిగా మూడవ సూత్రం చూపుతున్న దానికి ప్రతీకలు. ఒక దానికొకటి అనుబంధంగా వున్న ఈ మూడు సూత్రాలు అతి నిర్దిష్టంగా, సరిగా వున్నాయి. కాబట్టి సంప్రదాయ రాజకీయ అర్థ శాస్త్రంలో వాటిని ఉద్దేశపూర్వకంగా కాకపోయినప్పటికీ, వాస్తవికరీతిలో (Substanstially) రూపొందించిన సంగతి మనకు అగుపిస్తుంది. అందులో క్రింది వ్యుత్పన్న సూత్రాలు మనకెదురవుతాయి.

$$2. \quad \frac{\text{అదనపు శ్రమ}}{\text{పని దినం}} = \frac{\text{అదనపు విలువ}}{\text{ఉత్పాదితం యొక్క విలువలు}} = \frac{\text{అదనపు ఉత్పాదితం}}{\text{మొత్తం ఉత్పాదితం}}$$

ఒకటే నిష్పత్తి, ఇక్కడ, శ్రమ కాలాల నిష్పత్తిగా, ఆ శ్రమ కాలాలకు మూర్తీభావమైన విలువల నిష్పత్తిగా, ఆ విలువలున్న ఉత్పాదితాల నిష్పత్తిగా వ్యక్తమవుతోంది. "ఉత్పాదితం యొక్క విలువ" అంటే, పని దినంలో కొత్తగా సృష్టి అయిన విలువ మాత్రమే అని అర్థం చేసుకోవాలనేది గ్రాహ్యం; ఉత్పాదితం విలువలోని స్థిర భాగం యిందులో చేరదు.

2లోని ఈ సూత్రాలన్నీ శ్రమను దోచుకొనే వాస్తవ స్థాయిని, లేదా అదనపు విలువ రేటును తప్పుగా చూపుతున్నాయి. పని దినం 12 గంటలనుకొందాం. మునుపటి ఉదాహరణల్లో ఊహించు కొన్న వాటినే ఇక్కడా ఊహించుకొంటే, శ్రమను దోచుకొనే వాస్తవ స్థాయిని కింది నిష్పత్తులు చూపుతాయి :

$$\frac{\text{6 గంటల అదనపు శ్రమ}}{\text{6 గంటల అవసర శ్రమ}} = \frac{\text{3 షి. అదనపు విలువ}}{\text{3 షి. అస్థిర పెట్టుబడి}} = 100\ \%$$

2లోని సూత్రాల నుంచి వచ్చే దీనికి చాలా భిన్నమైనది.

$$\frac{\text{6 గంటల అదనపు శ్రమ}}{\text{12 గంటల పని దినం}} = \frac{\text{3 షి. అదనపు విలువ}}{\text{6 షి. విలువ గల ఉత్పాదితం}} = 50\ \%$$

వాస్తవంలో, పని దినం, లేదా అది ఉత్పత్తి చేసిన విలువ, పెట్టుబడిదారుడికి కార్మికునికి మధ్య ఏ నిష్పత్తిలో విభజితమైందో ఆ నిష్పత్తిని మాత్రమే ఈ వ్యుత్పన్న సూత్రాలు వ్యక్తం చేస్తున్నాయి. ఈ సూత్రాలు పెట్టుబడి స్వయం విస్తరణ స్థాయి యొక్క ప్రత్యక్ష వ్యక్తీకరణలుగా పరిగణింపబడినట్లయితే,

అదనపు శ్రమ, లేదా అదనపు విలువ ఎన్నటికీ వంద శాతాన్ని అందుకోజాలదన్న తప్పుడు నియమం సరియైనదవుతుంది[1]. అదనపు శ్రమ, పని దినంలోని ఒక పూర్ణాంకంలోని భాగం మాత్రమే, లేదా అదనపు విలువ, ఆ దినంలో సృష్టి అయిన విలువలో నిశ్శేష భాగం మాత్రమే కాబట్టి, అదనపు శ్రమ యెల్లప్పుడూ, శ్రమ దినం కన్నా అవశ్యంగా తక్కువగా వుండాలి; లేదా అదనపు విలువ, ఉత్పత్తి అయిన మొత్తం విలువ కన్నా యెల్లప్పుడూ తక్కువగానే వుండాలి. కానీ, ఈ నిష్పత్తి 100:100 కావాలంటే, అవి సమానంగా వుండాలి. అదనపు శ్రమ మొత్తం పని దినానికి (అంటే వారంలో, లేదా సంవత్సరంలో, సగటు పని దినానికి) ఆవరించాలంటే, అవసర శ్రమ సున్నకు దిగిపోవాలి. కానీ, అవసర శ్రమ అంతర్ధానం కావాలంటే, అదనపు శ్రమా అంతర్ధానం కావాలి. ఎందువల్లనంటే అదనపు శ్రమ అవసర శ్రమకు చెందిన క్రియే.

కాబట్టి, $\frac{\text{అదనపు శ్రమ}}{\text{పని దినం}}$ లేక $\frac{\text{అదనపు విలువ}}{\text{ఉత్పత్తి అయిన విలువ}}$ అన్న హద్దును $\frac{100}{100}$ నిష్పత్తికి ఎన్నటికీ అందుకోలేదు. అది $\frac{100 + \text{య} (?)}{100}$ కు అసలే పెరగలేదు.

కానీ శ్రమను దోచుకొనే స్థాయిని తెలిపే అదనపు విలువ రేటు అలాంటిది కాదు. ఉదాహరణకు యల్.డి. లవర్గ్నే అంచనానే తీసుకొందాం. ఆయన అంచనా ప్రకారం, ఇంగ్లీషు వ్యవసాయ కార్మికునికి ఉత్పాదితంలో లేదా దాని విలువలో 1/4 మాత్రమే లభించగా, పెట్టుబడిదారునికేమో (వ్యవసాయదారు)

1. దీనికి ఉదాహరణ "డ్రిట్టర్ బ్రీఫ్ యన్.వి.కిర్చ్‌మెన్ వాన్ రాడ్ బర్టస్, విందర్‌లేగంగ్ మెర్ రైకార్డో స్కెన్ లెహ్రే వాకడెర్ గ్రున్ డ్రెన్ టే అండ్ వెగ్రున్ డంగ్ మెయినర్ న్యూన్ రెంటెన్ థియరీ."
ఈ ఉత్తరం సంగతి మున్ముందు మళ్లీ ప్రస్తావిస్తాను; అందులోని కౌలు సిద్ధాంతం తప్పు అయినా అది పెట్టుబడిదారీ ఉత్పత్తి స్వభావాన్ని గ్రహించింది. **(3వ జర్మన్ కూర్పుకు చేర్చిన వ్యాఖ్య) -** తనకు ముందు రచయితల్లో నిజంగా ప్రగతిశీల భావాలు, లేదా కొత్త, సరియైన భావాలున్నప్పుడు మార్క్స్, వారిని ఎంత సహృదయతతో అంచనా కట్టారో, దీన్నిబట్టి తెలుస్తుంది. డడ్ మేయర్‌కు రాడ్‌మెర్టస్ రాసిన ఉత్తరాలు తరువాత ప్రచురింపబడ్డాయి. వాటి మార్క్స్ గుర్తింపునకు కొంత పరిమితులు విధించడం అవసరమని ఆ ఉత్తరాలను బట్టి స్పష్టమవుతుంది. ఆ లేఖల్లో కింది వ్యాక్యాలున్నాయి : "పెట్టుబడిని శ్రమనుంచే కాక, పెట్టుబడి నుంచి కూడా రక్షించవలసి వుంది. దానికి అత్యుత్తమ మార్గమిది - పారిశ్రామిక పెట్టుబడిదారుని చర్యలను, అతని పెట్టుబడితో పాటు దఖలుపడిన ఆర్థిక, రాజకీయ విధులుగా పరిగణించడం, మనం మరే విధమైన సామాజిక వ్యవస్థనూ ఇంకా ఎరుగము కాబట్టి, అతని లాభాన్ని ఒక విధమైన జీతంగా పరిగణించడం. కానీ జీతాలను క్రమబద్ధం చేయవచ్చు; అవి వేతనాల నుంచీ మరీ ఎక్కువ తీసుకొన్నవయితే వాటిని తగ్గించనూవచ్చు. సమాజంలోకి మార్క్స్ చొరబాటును (నేను ఆయన పుస్తకాన్ని అలా పిలుస్తాను) అడ్డుకోవాలి.... మొత్తంపై మార్క్స్ పుస్తకం, పెట్టుబడి ప్రస్తుత రూపానికి వ్యతిరేకమైన వాదనే తప్ప. పెట్టుబడి గురించిన పరిశోధన కాదు. ఆయన యీ రూపమే అసలు పెట్టుబడి గురించిన భావన అన్న గందరగోళంలో పడ్డాడు". (బ్రీఫ్, వగైరా, వాన్ డాక్టర్ రాడ్ బెర్టస్ - జగెటోజౌ, హెరౌస్గ వాన్ డాక్టర్ రుడ్ మేయర" బెర్లిన్, 1881, 1. బడి. పుట 111, 48, బ్రీఫ్ వాన్ రాడ్ బెర్టస్) తన "సామాజిక లేఖల్లో" రాడ్ బెర్టస్ చేసిన సాహసిక దాడి తుదకు అలాంటి భావజాలపు ఊకదంపుడుగా దిగజారింది. - (ఫ్రెడరిక్ ఎంగెల్స్)

3/4 లభిస్తుంది[1]. ఇలా దోచుకొన్నది, తరువాత పెట్టుబడిదారుడు, భూస్వామి, మొదలయిన వారి మధ్య ఎలా పంపిణీ అవుతుందన్న సమస్యను ఇక్కడ వదలివేస్తున్నాము. ఈ అంచనా ప్రకారం ఇంగ్లీషు వ్యవసాయ కార్మికుని అదనపు శ్రమకు, అతని అవసర శ్రమకు మధ్య నిష్పత్తి 3:1; ఇక్కడ దోపిడీ రేటు 300%.

పని దినాన్ని స్థిర పరిమాణం గల అంశంగా పరిగణించే అభిమాన పాత్రమైన పద్ధతి, IIలోని సూత్రాల వినియోగం వల్ల, స్థిరపడిపోయింది. ఎందువల్లనంటే, వాటిలో అదనపు విలువను ఒక నిర్ణీత పరిమాణం గల పని దినంతోనే ఎల్లప్పుడూ పోల్చిచూచేవారు : ఉత్పత్తి అయిన విలువ పునర్విభజనను మాత్రమే దృష్టిలో వుంచుకొన్నప్పుడు కూడా జరిగేదిదే. ఒక నిర్ణీతమైన విలువలో అదివరకే మూర్తిమంతమైన పని దినం ఒక నిర్ణీత పరిమాణం గలదిగా వుండక తప్పదు.

అదనపు విలువను, శ్రమశక్తి విలువను ఉత్పత్తి అయిన విలువ యొక్క భిన్నాంకాలుగా చూపే అలవాటు పెట్టుబడిదారీ ఉత్పత్తి పద్ధతిలోనే ఆవిర్భవించింది. దీని అంతరార్థాన్ని యిక వెల్లడి చేస్తాను. ఈ అలవాటు పెట్టుబడి లక్షణమైన లావాదేవీనే, సజీవ శ్రమ శక్తిగా అస్థిర పెట్టుబడి మార్పిడినీ, తత్పర్యవసానంగా, ఉత్పాదితం నుంచి కార్మికుడు వేర్పడిపోవడాన్నీ మరుగుపుచ్చుతోంది. వాస్తవ విషయానికి బదులు, ఒక బూటకపు సాహచర్యాన్ని చూపుతుంది. ఈ సాహచర్యంలో కార్మికుడూ, పెట్టుబడిదారూ ఉత్పాదితాన్ని రూపొందించడానికి చేకూర్చిన తమ తమ భిన్న దోహదాలకు అనుగుణంగా ఉత్పాదితాన్ని పంచుకొంటున్నట్లు చూపుతుంది.[2]

అంతేకాదు IIలోని సూత్రాలను, ఎప్పుడైనా సరే I లోని సూత్రాలుగా తిరిగి మార్చవచ్చు. ఉదాహరణకు, $\frac{\text{6 గంటల అదనపు శ్రమ}}{\text{12 గంటల పని దినం}}$ అనే సూత్రాన్ని తీసుకొందాం. అప్పుడు 12 గంటల్లో 6 గంటల అదనపు శ్రమను తీసివేయగా మిగిలేది అవసర శ్రమ. కాబట్టి నిష్పన్న ఫలితమిది :

$$\frac{\text{6 గంటల అదనపు శ్రమ}}{\text{6 గంటల అవసర శ్రమ}} = \frac{100}{100}$$

నేను అప్పుడప్పుడు ఇదివరకే సూచించిన మూడవ సూత్రమిది.

$$\text{III} \quad \frac{\text{అదనపు విలువ}}{\text{శ్రమ శక్తి విలువ}} = \frac{\text{అదనపు శ్రమ}}{\text{అవసర శ్రమ}} = \frac{\text{డబ్బు చెల్లించబడని శ్రమ (Unpaid Labour)}}{\text{డబ్బు చెల్లించబడిన శ్రమ (Paid Labour)}}$$

1. ముందుగా మదుపు పెట్టిన స్థిర పెట్టుబడి స్థానాన్ని కేవలం భర్తీ చేసే ఉత్పాదిత భాగాన్ని ఈ అంచనాలో వదలి వేయడం జరిగింది. ఇంగ్లండును గుడ్డిగా మెచ్చుకొనే యల్.డి. లవర్గ్నే పెట్టుబడిదారుడి వాటాకు, తక్కువ అంచనా వేయడానికి ఇష్టపడతాడే తప్ప ఎక్కువ అంచనా వేయడానికి కాదు.
2. పెట్టుబడిదారీ ఉత్పత్తి యొక్క, బాగా అభివృద్ధి చెందిన అన్ని రూపాలూ సహకార రూపాలే కాబట్టి, దాని వైరుధ్యయుత లక్షణం నుంచి అనిర్దిష్టతను సాధించి, వాటిని ఒకమాటతో, యేదో ఒక విధమైన స్వేచ్ఛాయుత సాహచర్యంగా మార్చడం కన్నా సులభమైనది మరొకటి లేదు. ఎ.డి. లబోర్డే తన "డె.యెస్ప్రిలిట్ డి అసోసియేషన్ డాన్స్ టౌస్ లే. ఇంటరేస్ట్స్. డిలీ కమ్యూనాటే," పారిస్, 1818,లో చేసినదిదే. బానిసత్వ ఫలితంగా నెలకొన్న సంబంధాల విషయంలో సైతం అమెరికన్ దేశస్తుడు హెచ్.కారే. అంత జయప్రదంగానూ, తరచూ ఈ గారడీ చేశాడు.

మేము పైన పేర్కొన్న పరిశోధనల తరువాత, డబ్బు చెల్లించబడని శ్రమ / డబ్బు చెల్లించబడిన శ్రమ అన్న సూత్రాన్ని పెట్టుబడిదారు శ్రమ శక్తికి కాక, శ్రమకు డబ్బు చెల్లిస్తాడని నిర్ధారించే పెడమార్గం పట్టడం ఇక సాధ్యం కాదు.

ఈ సూత్రం, అదనపు శ్రమ / అవసర శ్రమ అన్నదాన్ని జనానికి సుబోధకంగా చెబుతున్న మాటలు మాత్రమే.

పెట్టుబడిదారుడు శ్రమ శక్తి విలువను – వెల, ఆ విలువకు సమానంగా వున్న మేరకు – చెల్లించి, దానికి బదులుగా, సజీవ శ్రమ శక్తిని వినియోగించుకొనే అధికారాన్ని పొందుతున్నాడు. అనుభవాధికారం రెండు దశలకు పరివ్యాప్తమై వుంటుంది. ఒక దశలో కార్మికుడు తన శ్రమ శక్తి విలువకు కేవలం సమానంగా వున్న విలువను ఉత్పత్తి చేస్తాడు; అంటే అతను దానికి సమానమైన దాన్ని ఉత్పత్తి చేస్తాడన్నమాట. ఆ విధంగా పెట్టుబడిదారు శ్రమ శక్తి వెలను చెల్లించినందుకు బదులుగా, అదే వెల గల ఉత్పాదితాన్ని పొందుతాడు. అతడు మార్కెట్‌లో తయారైన, సిద్ధంగా వున్న ఉత్పాదితాన్ని కొనడం లాంటిదే యిది. రెండవ దశలో, అంటే అదనపు శ్రమ దశలో, శ్రమ శక్తిని వినియోగించుకొనే ఈ అధికారం, పెట్టుబడిదారు కోసం ఒకానొక విలువను సృష్టిస్తుంది; దానికి సమానమైన డబ్బు అతనికి ఖర్చు కాదు.[1] ఈ శ్రమ శక్తి వ్యయం అతనికి ఉచితంగా లభిస్తుంది. అదనపు శ్రమను డబ్బు చెల్లించబడని శ్రమ అని పేర్కొన వీలున్నది ఈ అర్థంలోనే.

కాబట్టి, ఆడమ్ స్మిత్ చెబుతున్నట్లుగా పెట్టుబడి అంటే శ్రమపై మాత్రమే అధికారం కాదు; అది, ప్రధానంగా డబ్బు చెల్లించబడని శ్రమపై అధికారం. అదనపు విలువ ఉత్తరోత్తరా ప్రస్ఫుటంగా ఏ ప్రత్యేక రూపమెత్తినా సరే (లాభంగానో, వడ్డీగానో, లేదా కౌలుగానో), అది, సారాంశాన్ని బట్టి డబ్బు చెల్లించబడని శ్రమ యొక్క పదార్థ రూపమే పెట్టుబడి స్వయం విస్తరణలోని రహస్యం, డబ్బు చెల్లించబడని, ఒక నిర్దిష్ట పరిమాణంలోని పరుల శ్రమను వినియోగించే అధికారమే అని తేలుతుంది.

1. భూమే సర్వ సంపదకు ఆకరమనే సిద్ధాంత ప్రతిపాదకులు అదనపు విలువ రహస్యాన్ని ఛేదించకలేక పోయినా, వారికి ఒకటి మాత్రం స్పష్టమయింది. అదేమిటంటే, "అతను (అదనపు విలువ సొంతదారు) తాను కొన్నది కాకపోయినా, అమ్ముకొంటున్నది స్వతంత్ర ప్రతిపత్తిగలిగి, వినియోగించుకో వీలున్న ఈ సంపదనే". (టర్గోట్ "రిఫ్లెక్షన్స్ సర్ లా ఫార్మేషన్ యెట్ లా డిస్ట్రిబ్యూషన్ డే రిచెస్," పుట11)

## ఆరో భాగం

# వేతనాలు

## అధ్యాయం - 19

# శ్రమ శక్తి విలువ, (దాని ధరతో సహా) వేతనాలుగా మారటం

**బూ**ర్జువా సమాజ ఉపరితలం పైన కార్మికుని వేతనం అతని శ్రమ యొక్క ధరలాగా, ఒక నిర్దిష్ట పరిమాణం గల శ్రమకు చెల్లించబడిన ఒక నిర్దిష్ట పరిమాణం గల డబ్బు లాగా కన్పిస్తుంది. ఆ రకంగా ప్రజలు శ్రమ విలువ గురించి మాట్లాడతారు. డబ్బు రూపంలో దాని వ్యక్తీకరణని ఆవశ్యక లేదా సహజ ధర అని పిలుస్తారు. మరోవైపున వారు శ్రమ యొక్క మార్కెటు ధరల గురించి, అంటే దాని సహజ ధరకి అటూ ఇటూ ఊగిసలాడే ధరల గురించి మాట్లాడతారు.

అయితే సరుకు విలువ అంటే యేమిటి? దాని ఉత్పత్తిలో వ్యయమైన సామాజిక శ్రమ యొక్క వస్తుగత రూపం. అప్పుడు ఈ విలువ పరిమాణాన్ని ఎలా కొలుస్తాం? దానిలో వున్న శ్రమ పరిమాణాన్ని బట్టి, అయితే అప్పుడు 12 గంటల పని దినం విలువ ఎలా నిర్ణయించబడుతుంది? 12 గంటల పని దినంలో వున్న 12 గంటల్ని బట్టి. ఇది అసంబద్ధమైన పునరుక్తి.[1]

మార్కెటులో సరుకుగా అమ్మబడాలీ అంటే శ్రమ అలా అమ్మబడటానికి ముందు అన్ని విధాలా

---

1. "ఉత్పత్తిలో వినియోగించబడిన శ్రమ పరిమాణంపై విలువ ఆధారపడి వుంటుందనే తన సిద్ధాంతానికి చూడగానే ఎదురయ్యే ప్రమాదం వున్న ఇబ్బందిని రికార్డో తెలివిగా తప్పించాడు. ఈ సూత్రానికి పట్టు విడుపులు లేకుండా కట్టుబడి వుంటే శ్రమ విలువ అనేది దానిని ఉత్పత్తి చేయడానికి వినియోగించబడిన శ్రమ పరిమాణంపై ఆధారపడి వుంటుంది అన్నట్లవుతుంది. ఇది అసంబద్ధమనేది స్పష్టం. కనుక రికార్డో లాఘవంగా శ్రమ విలువని, వేతనాలని ఉత్పత్తి చేయడానికి అవసరమైన శ్రమ పరిమాణం పైన ఆధారపడేలా చేశాడు. అతని మాటల్లోనే చెప్పాలీ అంటే శ్రమ విలువని వేతనాలని ఉత్పత్తి చేయడానికి అవసరమైన శ్రమ పరిమాణాన్ని బట్టి అంచనా వేయాలని వాదిస్తాడు. అనగా కార్మికుడికి ఇవ్వబడిన డబ్బు లేదా సరుకుల ఉత్పత్తికి అవసరమైన శ్రమ పరిమాణం అని ఆయన అర్థం. అంటే వస్త్రం విలువని దాని ఉత్పత్తిలో ఖర్చయిన శ్రమ పరిమాణాన్ని బట్టి గాక దానితో మార్పిడి అయ్యే వెండి ఉత్పత్తికి ఖర్చయిన శ్రమ పరిమాణాన్ని బట్టి అంచనా వేయాలి అని చెప్పినట్లవుతుంది" ("ఏ క్రిటికల్ డెజర్టేషన్ ఆన్ ది నేచర్ అండ్ ఎట్సెట్రా ఆఫ్ వాల్యూ" పుటలు 50, 51)

అస్తిత్వంలో వుండాలి. అయితే కార్మికుడు దానికి ఒక స్వతంత్ర వస్తుగత అస్తిత్వాన్ని యివ్వగలిగితే అతడు ఒక సరుకునే అమ్ముతాడు, శ్రమని గాదు.[1]

ఈ వైరుధ్యాల సంగతలా వుంచి, సజీవ శ్రమతో డబ్బు యొక్క అనగా వాస్తవ రూపం ధరించిన శ్రమ యొక్క ప్రత్యక్ష మార్పిడి అనేది, పెట్టుబడి ప్రాతిపదికపైన స్వతంత్రంగా అభివృద్ధి చెందటానికి అప్పుడే ప్రారంభించిన విలువ నియమాన్నైనా రద్దు చేస్తుంది, లేదా వేతన శ్రమపైన ప్రత్యక్షంగా ఆధారపడిన పెట్టుబడిదారీ ఉత్పత్తినైనా రద్దు చేస్తుంది. ఉదాహరణకి, 12 గంటల పని దినం 6 షిల్లింగుల డబ్బు విలువలో సాకార రూపం ధరించిందనుకుందాం. అలాంటప్పుడు యిక్కడ మార్పిడి చెందేది సమవిలువలైనా అయ్యుండాలి. అప్పుడు కార్మికుడు 12 గంటల శ్రమకి 6 షిల్లింగులు పొందాలి. అతని శ్రమ ధర, అతని ఉత్పాదితం ధరతో సమానమవుతుంది. ఈ సందర్భంలో అతని శ్రమ యొక్క కొనుగోలుదారునికి అతడు అదనపు విలువని ఉత్పత్తి చేయడు, 6 షిల్లింగులు పెట్టుబడిగా మారదు, పెట్టుబడిదారీ ఉత్పత్తి యొక్క ప్రాతిపదికే మాయమవుతుంది. అయితే అతను తన శ్రమను అమ్మేదీ, అతని శ్రమ వేతన శ్రమ అయ్యేదీ ఈ ప్రాతిపదికపై మాత్రమే. లేదా అతను తన 12 గంటల శ్రమకి గాను 6 షిల్లింగుల కంటే, అనగా 12 గంటల శ్రమ కంటే తక్కువైనా పొందుతూ వుండాలి. 12 గంటల శ్రమ 10, 6 వగైరా గంటల శ్రమతో మార్పిడి చేయబడుతోందన్న మాట. ఈ అసమాన పరిమాణాలని సమానం చేయడం అన్నది విలువ నిర్ధారణని రద్దు చేయడం మాత్రమే కాదు, అటువంటి ఆత్మ వినాశకర వైరుధ్యం ఒక నియమంగా ఏరకంగానూ ఉచ్చరించబడజాలదు, రూపొందించబడజాలదు.[2]

ఒకటి వాస్తవాకృతి ధరించిన శ్రమ, మరోటి సజీవ శ్రమ అయినంత మాత్రాన వాటి రూపంలో భిన్నత్వాన్ని బట్టి ఎక్కువ శ్రమ, తక్కువ శ్రమతో మార్పిడి అవుతుందని ఊహించడం వల్ల ప్రయోజనం లేదు.[3] ఇది మరింత అసంబద్ధం. ఎందుకంటే, సరుకు యొక్క విలువ దానిలో వాస్తవ రూపం

---

1. శ్రమని మీరు సరుకు అన్నప్పుడు, అది మార్పిడికోసం ఉత్పత్తి చేయబడి ఆ సమయంలో మార్కెట్లో వున్న సరుకులతో తమ తమ పరిమాణాలను బట్టి వాటితో మార్పిడి చేసుకోవడం కోసం మార్కెట్‌కి తేబడిన సరుకులాంటిది కాదు. శ్రమ మార్కెటుకి తేబడిన క్షణమే సృష్టించబడుతుంది. కాదు, అది సృష్టించబడటానికి ముందే మార్కెట్‌కి తేబడుతుంది. ("అబ్జర్వేషన్ ఆన్ సర్టన్ వర్బల్ డిస్ప్యూట్స్ అండ్ ఎట్సెట్రా" పుటలు 75, 76)
2. "శ్రమని ఒక సరుకుగానూ, శ్రమ ఉత్పాదితమైన పెట్టుబడిని మరో సరుకుగానూ పరిగణించి చూద్దాం. అప్పుడు ఈ రెండు సరుకుల విలువలూ సమాన శ్రమ పరిమాణాలని బట్టి క్రమబద్ధం చేయబడితే ఒక నిర్దిష్ట శ్రమ మొత్తం.... అంతే శ్రమ మొత్తంతో ఉత్పత్తి అయిన పెట్టుబడి యొక్క పరిమాణంతో మార్పిడి అవుతుంది. గత శ్రమ అంతే మొత్తం గల ప్రస్తుత శ్రమతో మార్పిడి అవుతుంది. అయితే ఇతర సరుకుల విషయంలో శ్రమ విలువ శ్రమ యొక్క సమాన పరిమాణాల్ని బట్టి నిర్ణయించబడదు." (ఇ.జి. వేక్‌ఫీల్డ్ ఇన్ హీజ్ ఎడిషన్ ఆఫ్ ఆడమ్ స్మిత్స్ వెల్త్ ఆఫ్ నేషన్స్". ఒకటో సంపుటి, లండన్ 1836, పుట 231, నోట్)
3. ప్రతిసారీ పూర్తయిన శ్రమ ఇంకా నిర్వహించాల్సిన శ్రమతో మార్పిడి చేయించబడిందనే విషయంలో ఒక అంగీకారానికి రావడం అవసరం. (ఇది కాంట్రాక్ట్ సోషల్ యొక్క మరో కూర్పు). పెట్టుబడిదారుడు కార్మికుడి కంటే ఎక్కువ విలువని పొందుతాడు. సిమాండే (సిస్మండే). De la Mechesse Commerciale సంపుటి 1 జెనీవా, 1803, పుట 37)

ధరించిన శ్రమ పరిమాణాన్ని బట్టి గాక దాని ఉత్పత్తికి అవసరమయ్యే సజీవ శ్రమ పరిమాణాన్ని బట్టి నిర్ణయించబడుతుంది. ఒక సరుకు 6 పనిగంటలకి ప్రాతినిధ్యం వహిస్తుంది అనుకుందాం. దానిని 3 గంటల్లో ఉత్పత్తి చేయటానికి తోడ్పడే ఆవిష్కరణ ఒకటి చేయబడితే అప్పటికే ఉత్పత్తి అయిన సరుకు విలువ సైతం సగానికి పడిపోతుంది. ఇదివరకు అవసరమైన 6 గంటలకి బదులు 3 గంటల సామాజిక శ్రమకి అది ఇప్పుడు ప్రాతినిధ్యం వహిస్తుంది. సరుకు విలువ యొక్క మొత్తం నిర్ణయించబడేది, దాని ఉత్పత్తికి అవసరమైన శ్రమ పరిమాణాన్ని బట్టి మాత్రమే. అంతేగాని దానిలో వాస్తవ రూపం ధరించిన శ్రమను బట్టి కాదు.

మార్కెటులో డబ్బు యజమానికి ముఖాముఖి వచ్చేది నిజానికి శ్రమ గాదు, శ్రామికుడు మాత్రమే. అతను అమ్మేది శ్రమ శక్తి. అతని శ్రమ వాస్తవంగా మొదలుకాగానే అది అతనిది కాకుండా పోతుంది. కనుక అతను ఇక ఏమాత్రం దాన్ని అమ్మజాలడు. శ్రమ అనేది విలువ యొక్క సారాంశమూ, స్వభావ సిద్ధ కొలమానము. అయితే **స్వయంగా మాత్రం దానికి విలువ లేదు.**[1]

"శ్రమ విలువ" అన్న వ్యక్తీకరణలో విలువ భావం పూర్తిగా తుడిచిపెట్టుకు పోవడమే గాదు, వాస్తవంగా తలకిందులైంది. భూమి విలువ అన్నది ఎంత ఊహాజనితమో ఇదీ అంతే. అయితే ఈ ఊహాజనిత వ్యక్తీకరణలు ఉత్పత్తి సంబంధాల నుండే తలెత్తుతాయి. అవి సారభూత సంబంధాల యొక్క దృశ్య రూపాలకి అభివర్గాలు. వస్తువులు తరచుగా వాటి ఆకారంలో తలకిందులు రూపానికి ప్రాతినిధ్యం వహిస్తాయన్నది అర్థశాస్త్రం మినహా అన్ని శాస్త్రాల్లోనూ బాగా తెలిసిన సంగతే.[2]

"శ్రమ యొక్క ధర" అనే అభివర్గాన్ని విమర్శనాత్మకంగా తరచి చూడకుండానే సాంప్రదాయక

---

1. "శ్రమ యొక్క ఏకైక విలువ ప్రమాణం..... సర్వ సంపదల సృష్టికర్త, సరుకు కాదు" (థామస్ హాడ్జ్ స్కిన్ "పాపులర్ పొలిటికల్ ఎకానమీ" పుట - 186)
2. మరోవైపున, అటువంటి రూపాలను కేవలం కవిత్వ సహజమైన రాయితీలను వివరించే ప్రయత్నం మాత్రం విశ్లేషించడంలో అసమర్థతను చాటుతాయి. "శ్రమకి విలువ వున్నది అని చెప్పబడుతోంది. ఒక సరకుగా కాదు అది కలిగి ఉంటుందనుకునే విలువల దృష్ట్యా మాత్రమే అలా చెప్పబడుతుంది." శ్రమ విలువ అనేది అలంకారికంగా చెప్పబడిన మాట మాత్రమే, అనే ప్రౌథాన్ ప్రవచనానికి ప్రతిగా నేనిలా అన్నాను: "ఒక సరుకుగా శ్రమ అనేది భయంకరమైన వాస్తవం. దానిలో అతడు (ప్రౌథాన్) వ్యాకరణ దోషం తప్ప మరేమీ గమనించడు. ఆ రకంగా ఒక సరుకుగా శ్రమ పునాదిపై వున్న నేటి సమాజం ఒక కవితాత్మక రాయితీ, ఒక అలంకారికమైన పదం యొక్క పునాదిపైనే నిర్మించబడిందన్న మాట! సమాజం తనని పట్టి పీడిస్తున్న "లోపాలన్నిటినీ" నిర్మూలించదలచుకుంటే, అది తప్పు అర్థాన్నిచ్చే పదాలన్నిటినీ తొలగించాలి. భాషని మార్చాలి. దీనికోసం అది చేయాల్సింది, తన నిఘంటువుకి ఒక కొత్తకూర్పు తయారు చేయాల్సిందిగా 'అకాడమీ'కి విజ్ఞప్తి చేయడం మాత్రమే." (కార్ల్‌మార్క్స్ : 'తాత్విక దారిద్ర్యం', పుటలు 49, 50) విలువ అంటే ఏమీ అర్థం చేసుకోకుండా ఉండటం మరింత సుకరం. ఇక అప్పుడు యీ అభివర్గంలో ప్రతిదాన్నీ ఏమాత్రం కష్టపడకుండానే చేర్చేయొచ్చు. ఆ రకంగా ఉదాహరణకి జె.బి.సే. 'విలువ అంటే ఏమిటి?' అని ప్రశ్నించి దానికిలా సమాధానం చెపుతాడు : 'ఒక వస్తువుకున్న విలువే విలువ'. ధర అంటే ఏమిటి? "డబ్బు రూపంలో వ్యక్తమయిన ఒక వస్తువు విలువ". పొలంలో పనిచేసే శ్రమ.... విలువ ఎట్లా అయింది? ఎందుకంటే దానికి ఒక ధర వుంది కనుక. కాబట్టి విలువంటే ఒక వస్తువుకున్న విలువ. నేలకి విలువుంది. ఎందుకంటే దాని విలువ డబ్బు రూపంలో వ్యక్తమయింది. ఏది ఏమైనప్పటికీ ఎందుకు? ఎట్లా? అనే విషయాలను వివరించడంలో ఇది చాలా సులభ పద్ధతి.

అర్థశాస్త్రం రోజువారీ జీవితం నుండి ఎరువు తెచ్చుకుని, అప్పుడు ఈ ధరని ఎలా నిర్ణయించాలి అని సాదాగా ప్రశ్నించింది. గిరాకీ సరఫరాల సంబంధాలలో వచ్చే మార్పు అనేది ఇతర అన్ని సరుకుల విషయంలో లాగానే శ్రమ యొక్క ధర విషయంలో కూడా దాని మార్పు తప్ప, అనగా ఒక నిర్దిష్ట సగటుకి పైన, లేదా కింద మార్కెట్ ధరల హెచ్చు తగ్గుల్ని గురించి తప్ప మరేమీ వివరించదన్న సంగతి అది త్వరలోనే గ్రహించింది. గిరాకీ, సరఫరాలు సమం అయితే, మిగిలిన పరిస్థితులన్నీ యధాతథంగా వున్న మేరకు ధరలో హెచ్చు తగ్గులు వుండవు. అటువంటప్పుడు గిరాకీ, సరఫరాలు కూడా ఏమీ వివరించలేవు. గిరాకీ, సరఫరాలు సమతాస్థితిలో వున్నప్పుడు, గిరాకీ, సరఫరాలతో ప్రమేయం లేకుండా నిర్ణయమైన శ్రమ యొక్క ధర దాని సహజ ధర. ఈ ధర ఎలా నిర్ణయమవుతుంది అన్నదే అసలు ప్రశ్న. లేదా ఇంతకంటే ఎక్కువ కాలవ్యవధిలో, ఉదాహరణకి ఒక యేడాదిలో మార్కెట్ ధర హెచ్చు తగ్గుల్ని చూద్దాం. అవి ఒక సగటు పరిమాణాన్ని సాపేక్షంగా ఒక స్థిర పరిమాణాన్ని వదిలి, ఒకదాన్నొకటి రద్దు చేసుకున్నట్టు గమనిస్తాం. సహజంగానే ఈ ధరని, ఒక దాన్నొకటి పరిహరించుకొనే మార్పుల్నిబట్టి గాక మరోలా నిర్ణయించాల్సి వచ్చింది. శ్రమ యొక్క యాదృచ్ఛిక మార్కెట్ ధరలపైన అంతిమంగా యెప్పుడూ ప్రాబల్యం వహించి, వాటిని క్రమబద్ధం చేసే ఈ ధర, శ్రమ యొక్క ఈ "ఆవశ్యక ధర" (ఫిజియోక్రాట్లు) లేదా ఈ "సహజ ధర" (ఆడమ్ స్మిత్) ఇతర సరుకులన్నింటి విషయంలోలాగే, డబ్బు రూపంలో వ్యక్తమయిన దాని విలువ తప్ప మరేమీ కాదు. ఈ రకంగా అర్థశాస్త్రం శ్రమ యొక్క యాదృచ్ఛిక ధరలగుండా శ్రమ యొక్క విలువ దాకా తాను చొచ్చుకుపోగలనని భావించింది. ఇతర సరుకుల విషయంలోలాగే ఈ విలువ కూడా దాని ఉత్పత్తి ఖర్చుని బట్టి నిర్ణయమవుతుంది. మరి, కార్మికుని – ఉత్పత్తి ఖర్చెంత, అనగా కార్మికుని ఉత్పత్తి లేదా పునరుత్పత్తికి అయ్యే ఖర్చెంత? శ్రమ యొక్క ఉత్పత్తి ఖర్చు కోసం సాగిన అన్వేషణ వున్న చోటును వదలకుండా అక్కడే గిరికీలు కొట్టింది కనుక అర్థశాస్త్రంలో ఈ ప్రశ్న మూలప్రశ్నకి బదులుగా చోటు చేసుకుంది. కనుక అర్థ శాస్త్రవేత్తలు శ్రమ విలువ అంటున్నది నిజానికి శ్రమ శక్తి విలువ. దాని అస్తిత్వం కార్మికునిలో వుంది. ఒక యంత్రం తాను నిర్వహించే పని కంటే ఎలా భిన్నమో అలాగే శ్రమ శక్తి కూడా అది నిర్వహించే శ్రమ కంటే భిన్నం. శ్రమ యొక్క మార్కెటు ధరలకీ, దాని యొక్క విలువ అనబడే దానికీ మధ్య వున్న భేదాన్ని, అలాగే లాభం రేటుతోనూ, శ్రమ సాధనాలతో ఉత్పత్తి అయిన సరుకుల విలువలతోనూ ఈ విలువకున్న సంబంధాలు వగైరాలని అధ్యయనం చేయడంలో మునిగిపోయి ఈ విశ్లేషణాక్రమం శ్రమ శక్తి యొక్క విలువగా పరిణమించడం వరకూ దారి తీసిందనే విషయాన్ని వారు యెప్పుడూ కనుక్కోలేదు. సాంప్రదాయక అర్థశాస్త్రానికి యెప్పుడూ తన సొంత విశ్లేషణా ఫలితాల స్పృహ కలగలేదు. అది విమర్శనా రహితంగా 'శ్రమ విలువ', 'శ్రమ సహజ విలువ' లాంటి అభివర్గాలను, పరిశీలన కింద వున్న విలువ సంబంధానికి సరైన, అంతిమ వ్యక్తీకరణలుగా ఆమోదించింది. ఆ రకంగా అది అభేద్యమైన గందరగోళంలోనూ, వైరుధ్యంలోనూ కూరుకుపోయిందనీ, అదే సమయంలో సూత్రరీత్యా పైపై రూపాలని మాత్రమే ఆరాధించే నాటు అర్థ శాస్త్రం యొక్క డొల్లతనానికి, దాని కార్యకలాపాలకి ఒక సురక్షితమైన ప్రాతిపదికని ఇచ్చిందనీ ముందు ముందు ఇంకా గమనించబడుతుంది.

ఈ మారిన పరిస్థితిలో శ్రమ శక్తి యొక్క విలువ (ధర)లు వేతనాలుగా ఎలా కన్పిస్తాయో చూద్దాం.

శ్రమ శక్తి యొక్క రోజువారీ విలువ అనేది శ్రామికుని నిర్దిష్ట జీవిత కాలాన్ని బట్టి లెక్క గట్టబడుతుందని మనకి తెలుసు. దీని కనుగుణంగా పని దినం యొక్క నిర్దిష్ట కాలం వుంటుంది. ఆచరణలో వున్న పని దినాన్ని 12 గంటలనీ, శ్రమ శక్తి రోజువారీ విలువ 6 గంటల శ్రమ ద్వారా రూపొందించిన విలువ యొక్క డబ్బు రూపం అయిన 3 షిల్లింగులనీ అనుకుందాం. కార్మికుడు 3 షిల్లింగులు పొందాడూ అంటే అతడు 12 గంటల పాటు పని చేసే తన శ్రమ శక్తి విలువని పొందాడన్న మాట. ఇప్పుడు ఒకరోజు శ్రమ శక్తి విలువ ఒక రోజు శ్రమ విలువగా వ్యక్తం చేయబడితే ఈ సూత్రం వర్తిస్తుంది, పన్నెండు గంటల శ్రమ యొక్క విలువ 3 షిల్లింగులు. ఆ రకంగా శ్రమశక్తి విలువ శ్రమ విలువని లేదా డబ్బుగా వ్యక్తం చేయబడితే, దాని అవసర ధరని నిర్ణయిస్తుంది. మరో వైపు, శ్రమ శక్తి ధర దాని విలువ కంటే భిన్నంగా వుంటే అదే విధంగా శ్రమ యొక్క ధర దాని విలువ అనబడే దాని కంటే భిన్నంగా వుంటుంది.

శ్రమ విలువ అనేది శ్రమ శక్తి విలువకి ఒక నిర్హేతుక వ్యక్తీకరణ మాత్రమే కనుక, దానిని బట్టి శ్రమ విలువ ఎప్పుడూ అది ఉత్పత్తి చేసే విలువ కంటే తక్కువగా వుండాలి. ఎందుకంటే పెట్టుబడి దారుడు ఎప్పుడూ శ్రమ శక్తితో దాని సొంత విలువ పునరుత్పత్తికి అవసరమైన దాని కంటే ఎక్కువ సేపు పని చేయిస్తాడు. పై ఉదాహరణలో 12 గంటల పాటు పనిచేసే శ్రమ శక్తి విలువ 3 షిల్లింగులు. దాని పునరుత్పత్తికి 6 గంటల పని అవసరమయ్యే విలువ అది, మరోవైపున శ్రమ శక్తి ఉత్పత్తి చేసే దాని విలువ 6 షిల్లింగులు. ఎందుకంటే అది నిజానికి 12 గంటల పాటు పనిచేస్తుంది. పైగా అది ఉత్పత్తి చేసే విలువ, తన సొంత విలువపై కాక అది పనిలో వున్న కాలం పొడవుపై ఆధారపడుతుంది. ఆ రకంగా మొదటి చూపుకి అసంబద్ధంగా కన్పించే ఫలితం – 6 షిల్లింగుల విలువని సృష్టించే శ్రమ విలువ 3 షిల్లింగులనే ఫలితం వస్తుంది.[1]

ఇంకా చూద్దాం : పని దినంలో ఒక భాగానికి మాత్రమే, 6 గంటల శ్రమకి మాత్రమే, చెల్లించబడిన 3 షిల్లింగుల విలువ మొత్తం 12 గంటల పని దినం యొక్క విలువ లేదా ధరలాగా కన్పిస్తుంది. ఆ 12 గంటల్లో వేతనం చెల్లించబడని 6 గంటలున్నాయి. ఆ రకంగా అవసర శ్రమగా, అదనపు శ్రమగా, వేతనం చెల్లించబడిన శ్రమగా, చెల్లించబడని శ్రమగా పని దినం యొక్క విభజనని తెలిపే ప్రతి జాడనీ వేతన రూపం తుడిచి వేస్తుంది. శ్రమ అంతా వేతనం చెల్లించబడిన శ్రమలాగే కన్పిస్తుంది. భూస్వామ్య వ్యవస్థలో వెట్టిచాకిరీ విషయానికొస్తే, అక్కడ కార్మికుడు తన కోసం తాను చేసుకునే శ్రమ, తన ప్రభువు కోసం చేసే నిర్బంధ శ్రమ స్పష్టాతి స్పష్టంగా స్థల కాలాల్లో భిన్నంగా వుంటాయి. బానిస శ్రమ విషయంలో, బానిస కేవలం తన సొంత అస్తిత్వ సాధనాల విలువని సృష్టించడానికి, అనగా నిజానికి తన కోసం తను పనిచేసే పని దినం యొక్క భాగం సైతం తన

---

1. చూ. "Zur Knitik der politischen ockonomie" పుట 40. అక్కడ నేను పెట్టుబడి గురించి చర్చించిన గ్రంథ భాగంలో ఈ సమస్య పరిష్కరించబడుతుందని చెప్పాను. : "కేవలం శ్రమ కాలంచేత నిర్ణయించబడిన మార్పిడి విలువ ప్రాతిపదికపై జరిగే ఉత్పత్తి, శ్రమ ఉత్పాదితం యొక్క మార్పిడి విలువ కంటే శ్రమ యొక్క మార్పిడి విలువ తక్కువగా వుండే ఫలితానికి ఎలా దారితీస్తుంది?"

యజమాని కోసం చేస్తున్న శ్రమలా కన్పిస్తుంది. మొత్తం బానిస శ్రమ అంతా వేతనం చెల్లించబడని శ్రమలాగా కన్పిస్తుంది.[1] అందుకు విరుద్ధంగా, వేతన శ్రమలో అదనపు శ్రమ లేదా వేతనం చెల్లించబడని శ్రమ సైతం వేతనం చెల్లించబడినట్టుగా కనిపిస్తుంది. అక్కడ ఆస్తి సంబంధం, బానిస తన కోసం తాను చేసుకునే శ్రమని దాస్తుంది. ఇక్కడ డబ్బు సంబంధం వేతన కార్మికుని నిష్ఫల శ్రమని దాస్తుంది.

దానిని బట్టి శ్రమ శక్తి యొక్క విలువ, ధర వేతన రూపంగా, లేదా శ్రమ యొక్క విలువ, ధరగా మారడానికి వున్న నిర్ణయాత్మక ప్రాధాన్యాన్ని మనం అర్థం చేసుకోవచ్చు. ఈ ఇంద్రియ గోచర రూపం వాస్తవ సంబంధాన్ని కన్పించకుండా చేస్తుంది. నిజానికి ఆ సంబంధానికి సరిగ్గా వ్యతిరేక సంబంధాన్ని చూపిస్తుంది. కార్మికుల, పెట్టుబడిదారుల, ఇరువురి యొక్క సకల ధార్మిక భావాలకి, పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం యొక్క సకల పితలాటకాలకీ, స్వేచ్ఛ విషయంలో దానికున్న సకల భ్రమలకీ, నాటు అర్థ శాస్త్రవేత్తల సకల వకాల్తాదారీ కుయుక్తులకీ యిదే మూలాధారాన్ని ఏర్పరుస్తుంది.

వేతనాల నిగూఢత్వాన్ని ఛేదించడానికి చరిత్రకి దీర్ఘకాలం పట్టగా, మరోవైపున ఈ ఇంద్రియ గోచర అంశం యొక్క ఆవశ్యకతా, దాని అస్తిత్వ కారణమూ అర్థం చేసుకోవడం కంటే తేలికైనదేదీ లేదు.

పెట్టుబడికీ, శ్రమకి మధ్య మార్పిడి కూడా మొదట ఇతర సరుకులన్నిటి క్రయ విక్రయాల రూపంలోనే మనసుకి అనిపిస్తుంది. కొనుగోలుదారుడు కొంత మొత్తం డబ్బుని యిస్తాడు. అమ్మకం దారుడు డబ్బుకంటే భిన్నమైన స్వభావం గల ఒక వస్తువుని యిస్తాడు. ఇందులో మహా అయితే ధార్మికుని చైతన్యం గుర్తించేది, "నువ్విస్తావని నేనిస్తా, నువ్వు చేస్తావని నేనిస్తా, నువ్విస్తావని నేను చేస్తా, నువ్వు చేస్తావని నేను చేస్తా" అనే ధార్మిక సమ విలువ సూత్రం ద్వారా వ్యక్తమయ్యే పాదార్థిక భేదం మాత్రమే.

పోతే, మార్పిడి విలువ ఉపయోగపు విలువ అనేవి వాటి స్వభావం రీత్యా కొలవబడజాలని పరిమాణాలు. కనుక "శ్రమ విలువ", "శ్రమ ధర" లాంటి మాటలు "పత్తి విలువ", "పత్తి ధర" లాంటి మాటల కంటే నిర్హేతుకమని అన్పించవు. అంతేగాక, కార్మికుడు తన శ్రమని అర్పించిన తరువాతే అతనికి వేతనం చెల్లించబడుతుంది. చెల్లింపు సాధనంగా డబ్బు సరఫరా అయిన వస్తువు – అంటే ఈ సందర్భంలో సరఫరా అయిన శ్రమ యొక్క విలువ లేదా ధరని వాస్తవం చేస్తుంది. అంతిమంగా, పెట్టుబడిదారునికి కార్మికుడు సరఫరా చేసిన ఉపయోగ విలువ, నిజానికి శ్రమ శక్తి గాదు. అది దాని క్రియ అయిన కొంత నిర్దిష్ట శ్రమ మాత్రమే. అంటే కుట్టుపని, పాదరక్షల తయారీ, వడకటం వగైరా మాత్రమే. ఇదే శ్రమ మరో వైపున సార్వత్రిక విలువను సృష్టించే అంశమనీ, ఆ రకంగా అది మిగిలిన సరుకులన్నిటి కంటే భిన్నమైన ఒక ధర్మాన్ని కలిగి వుందనీ మామూలు బుర్రకి తోచదు.

12 గంటల పాటు పని జేసి 6 గంటల శ్రమకి మాత్రమే అనగా 3 షిల్లింగులు మాత్రమే

1. దక్షిణాది రాష్ట్రాలో నీగ్రో బొత్తిగా వూరికే పనిచేస్తాడని అంటూ, లండన్ స్వేచ్ఛా వ్యాపార పత్రిక ది మార్నింగ్ స్టార్ ఒక మనిషి పొందడానికి వీలున్నంత నైతికావేశంతో వెకిలి అమాయకత్వంతో, అమెరికా అంతర్యుద్ధ కాలంలో పదే పదే తన నిరసన వ్యక్తం చేసింది. ఆ నీగ్రో యొక్క రోజువారీ ఖర్చుని లండన్ తూర్పు శివార్లలో వున్న స్వతంత్ర కార్మికుని ఖర్చుతో అది పోల్చి చూసుకోవలసింది.

పొందే కార్మికుడి స్థానం నుంచి చూద్దాం. నిజానికి అతని దృష్టిలో తన 12 గంటల శ్రమ అనేది 3 షిల్లింగులను కొనుగోలు చేసే సాధనం – మాత్రమే. అతని మామూలు జీవనాధార వస్తువుల విలువతో పాటు అతని శ్రమ శక్తి విలువ కూడా 3 నుండి 4 షిల్లింగులకు, లేదా 3 నుండి 2 షిల్లింగులకు మారొచ్చు. లేదా అతని శ్రమ శక్తి విలువ స్థిరంగా వుంటే సరఫరా గిరాకీ సంబంధాలలో మార్పు వల్ల దాని ధరలో వచ్చిన మార్పులా కనిపిస్తుంది. ఈ పరిస్థితి వల్ల, పని దినాన్ని స్థిర పరిమాణంగా పరిగణించిన ఆడమ్ స్మిత్, జీవనాధార వస్తువుల విలువ మారినప్పటికీ శ్రమ విలువ మాత్రం స్థిరంగానే వుంటుందనీ, కనుక ఒకే పనిదినం కార్మికులకు చెందాల్సిన ఎక్కువ లేదా తక్కువ డబ్బులకు ప్రాతినిధ్యం వహించవచ్చనీ తెలిపే ఒక పొరపాటు నిర్ధారణకు వచ్చాడు.

మరోవైపున, మనం పెట్టుబడిదారుణ్ణి పరిశీలిద్దాం. అతడు సాధ్యమైనంత తక్కువ డబ్బుతో సాధ్యమైన ఎక్కువ శ్రమని పొందాలనుకుంటాడు. కనుక ఆచరణలో, శ్రమ శక్తి ధరకి దాని క్రియ సృష్టించే విలువకీ మధ్య వుండే అంతరం మాత్రమే అతనికి ఆసక్తి గొలుపుతుంది. అతడు సరుకులన్నిటినీ సాధ్యమైనంత చౌకగా కొనడానికి ప్రయత్నిస్తాడు. సాదా మోసంలోనూ, తక్కువకి కొని ఎక్కువకి అమ్మడంలోనూ మాత్రమే తన లాభం వుందని అతను భావిస్తాడు. కనుక శ్రమ అనేదొకటి నిజంగా వుండి వుంటే, ఆ విలువని అతడు చెల్లించి వుంటే పెట్టుబడి అనేదేదీ వుండదనీ, తన డబ్బు పెట్టుబడిగా మారనే మారదనీ అతడు ఎన్నటికీ గ్రహించలేడు.

చెల్లించబడింది శ్రమ శక్తి విలువగాక శ్రమ విలువే అన్నట్టుగా, వేతనాల వాస్తవ చలనంలో పైకి కన్పించే అంశాలు రుజువు చేస్తున్నట్టుగా అన్పిస్తుంది. పైకి కన్పించే ఈ అంశాలను రెండు మహా వర్గాలుగా కుదించవచ్చు. (1) మారుతున్న పని దినం పొడవుతో పాటు వేతనాల మార్పు. ఒక యంత్రాన్ని ఒక రోజుకి అద్దెకు తీసుకున్న దానికంటే వారం రోజులపాటు అద్దెకు తీసుకుంటే ఎక్కువ ఖర్చవుతుంది. కనుక చెల్లించింది యంత్రం విలువ కాదనీ కేవలం దాని పని విలువ మాత్రమేననీ ఎవరైనా నిర్ధారణకు రావచ్చు కూడా. (2) ఒకే పని చేసే విభిన్న వ్యక్తుల వేతనాలలో వైయక్తిక తేడా, ఎటువంటి డొంకతిరుగుడు లేకుండా, నిర్మొహమాటంగా బహిరంగంగా శ్రమ శక్తే అమ్మబడే బానిస వ్యవస్థలో మనం ఈ వైయక్తిక తేడాని గమనిస్తాము. కానీ దానిని చూసి మోసపోము. బానిస వ్యవస్థలో మాత్రమే సగటు కంటే ఎక్కువ శ్రమ శక్తి యొక్క సౌకర్యమూ, సగటు కంటే తక్కువ శ్రమశక్తి యొక్క అసౌకర్యమూ బానిస యజమానికి వర్తిస్తాయి. వేతన శ్రమ వ్యవస్థలో అది కార్మికుడికే వర్తిస్తుంది. ఎందుకంటే, మొదటి సందర్భంలో శ్రమ శక్తిని అతనే అమ్ముతాడు. రెండో సందర్భంలో దానిని మూడో వ్యక్తి అమ్ముతాడు

శ్రమశక్తి యొక్క విలువ, ధర అనే సారభూత సంబంధానికి విరుద్ధంగా పైకి కన్పించే రూపం అయిన "శ్రమ విలువ ధర" లేదా "వేతనాల" గురించి చెప్పాలంటే పైకి కన్పించే రూపాలకి, వాటిలో దాగి వుండే సారాంశానికీ మధ్య వుండే తేడాయే ఇక్కడా వర్తిస్తుంది. మొదటిది ప్రత్యక్షంగా, దానంతటదే వ్యాప్తిలో వున్న ఆలోచనా రీతులుగా కన్పిస్తుంది. రెండోదాన్ని మొదట శాస్త్రం కనుగొనాల్సి వుంటుంది. సాంప్రదాయ అర్థశాస్త్రం వస్తువుల వాస్తవ సంబంధాన్ని చైతన్యవంతంగా రూపొందించకుండానే దాదాపు దాన్ని స్పృశిస్తుంది. అయితే అది తన బూర్జువా తోలు కప్పుకున్నంత వరకూ ఆ పని చేయజాలదు.

# అధ్యాయం - 20

# కాలం - వేతనాలు

**వే**తనాలు మళ్ళీ అనేక రూపాలు తీసుకుంటాయి. దీనికి సంబంధించిన పాదార్థిక అంశాన్ని మాత్రమే తీసుకుని, రూప వైవిధ్యాన్ని పట్టించుకోని మామూలు ఆర్థిక, గ్రంథ సంగ్రహాలలో ఈ వాస్తవం కనిపించదు. అయితే ఈ రూపాలన్నిటి వివరణ అనేది ఈ గ్రంథానికి సంబంధించిన వ్యవహారం గాదు. అది వేతన శ్రమ యొక్క ప్రత్యేక అధ్యయనానికి వర్తిస్తుంది. అయినప్పటికీ దాని రెండు ప్రాథమిక రూపాలని యిక్కడ క్లుప్తంగా వివరించాల్సి వుంది.

శ్రమ శక్తి విక్రయం అనేది ఒక నిర్దిష్ట కాలం పాటు జరుగుతుందనేది గుర్తుంచుకోవాలి. శ్రమ శక్తి యొక్క రోజువారీ లేదా వారంవారీ విలువ మారిన రూపంలో దర్శనమిచ్చేది కాలం వేతనాలు. అనగా రోజు కూలి వగైరాల రూపంలో.

శ్రమ శక్తి యొక్క అదనపు విలువ యొక్క ధరల సాపేక్ష పరిమాణాల మార్పులపై 17వ అధ్యాయంలో వివరించబడిన నియమాల రూపంలో సరళమైన మార్పు ద్వారా అవి వేతనాల నియమాలవుతాయి. అదే విధంగా శ్రమ శక్తి యొక్క మార్పిడి విలువకీ, ఈ విలువ యొక్క మారిన రూపం అయిన జీవితావసరాల మొత్తానికీ నడుమ వున్న తేడా నామమాత్ర వేతనాలకీ, వాస్తవ వేతనాలకీ నడుమ వున్న తేడాగా పునః ప్రత్యక్షమవుతుంది. ఇంతకు ముందే తగినంత స్థాయిలో వివరించబడిన, పైకి కన్పించే రూపాల గురించి పునరావృత్తం చేయడం ఇక్కడ వృథా. కనుక కాలం వేతనాలకి స్వభావ సిద్ధమైన కొన్ని అంశాలకు మేము యిక్కడ పరిమితం అవుతాము.

కార్మికుడు తన రోజువారీ, లేదా వారంవారీ శ్రమకి పొందే డబ్బు మొత్తం[1] అతని నామమాత్రపు వేతనాలు అవుతాయి. లేదా విలువ రూపంలో అంచనా కట్టబడిన వేతనాలవుతాయి. అయితే పని దినం పొడవుని బట్టి, అనగా రోజువారీ వెచ్చించబడిన వాస్తవ శ్రమ ప్రకారం ఒకేరోజువారీ లేదా వారంవారీ వేతనాలు శ్రమ యొక్క విభిన్న ధరలకు ప్రాతినిధ్యం వహించవచ్చు. అనగా ఒకే శ్రమ పరిమాణానికి విభిన్న డబ్బు మొత్తాలు ప్రాతినిధ్యం వహించవచ్చు.[2] కనుక కాలం వేతనాలని పరిశీలించేటప్పుడు రోజువారీ లేదా వారంవారీ కూలి యొక్క మొత్తమూ, శ్రమ యొక్క ధరా వేర్వేరని

---

1. డబ్బు విలువ ఇక్కడ ఎప్పుడూ స్థిరమని భావించబడుతుంది.
2. "శ్రమ యొక్క ధర అంటే ఒక నిర్దిష్ట పరిమాణం గల శ్రమకి చెల్లించబడిన మొత్తం" (సర్ ఎడ్వర్డ్ వెస్ట్. "ప్రైస్ ఆఫ్ కార్న్ అండ్ వేజెస్ ఆఫ్ లేబర్" (లండన్, 1826, పుట 67) "ఎస్సే ఆన్ ది అప్లికేషన్ ఆఫ్ కాపిటల్ టు ల్యాండ్, బై ఏ ఫెలో ఆఫ్ ది యూనివర్శిటీ కాలేజీ ఆఫ్ ఆక్స్‌ఫర్డ్" లండన్ 1815, అనే గ్రంథాన్ని పేరు పెట్టుకోకుండా రాసిన వ్యక్తి ఈ వెస్ట్. రాజకీయ అర్థ శాస్త్ర చరిత్రలో ఈ గ్రంథం ఒక యుగావిష్కరణ.

గ్రహించాలి. ఈ ధరని అనగా నిర్దిష్ట పరిమాణం గల శ్రమ యొక్క డబ్బు విలువని ఎలా కనుగొనడం? శ్రమ శక్తి యొక్క సగటు రోజు విలువని పని దినంలో వున్న సగటు గంటలతో భాగిస్తే శ్రమ యొక్క సగటు ధర తెలుస్తుంది. ఉదాహరణకి, శ్రమ శక్తి యొక్క రోజు విలువ 3 షిల్లింగులు, అనగా 6 పని గంటల ఉత్పాదితం విలువ అనుకుందాం. అప్పుడు పని దినం 12 గంటలయితే ఒక పని గంట ధర 3/12 షిల్లింగులు – 3 పెన్నీలు. ఆ రకంగా తెలుసుకున్న పని గంట ధర శ్రమ ధరకీ యూనిట్ కొలమానంగా వ్యవహరిస్తుంది. శ్రమ యొక్క ధర స్థిరంగా పడిపోతూ వున్నప్పటికీ రోజువారీ, వారం వారీ వేతనాలు యథాతథంగా వుండొచ్చు. ఉదాహరణకు, మామూలు పని దినం 10 గంటలై, శ్రమ శక్తి యొక్క రోజు విలువ 3 షిల్లింగులు అయి వుంటే పని గంట ధర 3 3/5 పెన్నీలు అవుతుంది. పని దినం 12 గంటలకు పెరగగానే 3 పెన్నీలకూ, 15 గంటలకు పెరగగానే 2 2/5 పెన్నీలకూ అది పడిపోతుంది. ఇదంతా ఎలా వున్నప్పటికీ రోజువారీ, వారంవారీ వేతనాలు మాత్రం మారవు. అందుకు విరుద్ధంగా శ్రమ యొక్క ధర స్థిరంగా వున్నప్పటికీ, లేదా పడిపోయినప్పుడు సైతం రోజువారీ లేదా వారంవారీ వేతనాలు పెరగొచ్చు. ఉదాహరణకి, పని దినం పది గంటలై, శ్రమ శక్తి యొక్క రోజు విలువ 3 షిల్లింగులయితే ఒక పని గంట ధర 3 3/5 పెన్నీలు. వాణిజ్యం పెరగడం కారణంగా, శ్రమ యొక్క ధర మారకుండా వుంటే, ఇప్పుడు అతని రోజు వేతనం 3 షిల్లింగుల 7 1/5 పెన్నీలకు పెరుగుతుంది. శ్రమ విలువలో మార్పు లేకుండానే, శ్రమ యొక్క విస్తృత పరిమాణానికి బదులు దాని సాంద్రతర పరిమాణం పెరిగినా అదే ఫలితం వస్తుంది.[1] కనుక రోజువారీ లేదా వారం వారీ నామమాత్రపు వేతనాల పెరుగుదలని, స్థిరంగా వున్న లేదా పడిపోయిన శ్రమ ధర అనుసరించవచ్చు. కుటుంబ పెద్ద వెచ్చించే శ్రమకి అతని కుటుంబ సభ్యుల శ్రమ తోడై దాని పరిమాణం పెరిగిన సందర్భంలో ఇదే సూత్రం కార్మికుని కుటుంబాదాయానికి కూడా వర్తిస్తుంది. కనుక రోజువారీ లేదా వారంవారీ వేతనాల తగ్గుదలతో ప్రమేయం లేకుండానే శ్రమ యొక్క ధరని తగ్గించే పద్ధతులున్నాయి.[2]

---

1. "శ్రమ వేతనాలనేవి, శ్రమ యొక్క ధర నిర్వహించిన శ్రమ పరిమాణం బట్టి నిర్ణయించబడుతుంది..... శ్రమ వేతనాలలో పెరుగుదల శ్రమ ధరలో పెరుగుదలని సూచించాలనేమీ లేదు. పూర్తి ఉద్యోగ వసతితోనూ, ఎక్కువ పని చేయించడం ద్వారానూ శ్రమ యొక్క ధర యధాతథంగా వుంటూనే శ్రమ వేతనాలను గణనీయంగా పెంచొచ్చు. వెస్ట్, అదే గ్రంథం పుటలు 67, 68, 112. "శ్రమ ధర ఎలా నిర్ణయించబడుతుంది?" అన్నదే అసలు ప్రశ్న. దాన్ని వెస్ట్, చిల్లర విషయాల ప్రస్తావనతో కొట్టివేస్తాడు.
2. 18వ శతాబ్దపు పారిశ్రామిక బూర్జువా వర్గ ఉన్మాద ప్రతినిధి, మేము అనేకసార్లు ఉల్లేఖించిన "ఎస్సే ఆన్ ది ట్రేడ్ అండ్ కామర్స్" రచయితా, విషయాన్ని గందరగోళపరచినప్పటికీ దీన్ని గ్రహించాడు. "నిత్య జీవితావసర వస్తువులను బట్టి నిర్ధారించబడేది, శ్రమ పరిమాణమే తప్ప దాని ధర (అంటే అతని ఉద్దేశం, రోజువారీ లేదా వారంవారీ నామమాత్రపు వేతనాలు) కాదు : జీవితావసరాల ధరని బాగా తగ్గించండి. మీరు అదే నిష్పత్తిలో శ్రమ పరిమాణాన్ని తగ్గించారన్న మాట. శ్రమ ధర యొక్క నామమాత్ర పరిమాణాన్ని మార్చడం మాత్రమే గాక దాని ధరని పెంచడానికి, పడగొట్టడానికి వివిధ మార్గాలున్నాయన్న సంగతి పెద్ద పారిశ్రామికవేత్తలకి తెలుసు". (అదే గ్రంథం, పుటలు 48, 61) "త్రీ లెక్చర్స్ ఆన్ ది రేట్ ఆఫ్ వేజెస్" లండన్, 1830 అనే తన గ్రంథంలో ఎన్.డబ్ల్యు. సీనియర్, వెస్ట్ యొక్క గ్రంథాన్ని చెప్పాపెట్ట కుండానే ఉపయోగించుకున్నాడు. అందులో అతనిలా అంటాడు. "కార్మికుడు ప్రధానంగా వేతనాల

ఒక సాధారణ నియమంగా వర్తించేదేమంటే, రోజువారీ వారంవారీ శ్రమ పరిమాణం స్థిరంగా వుంటే, రోజువారీ లేదా వారంవారీ వేతనాలు శ్రమ యొక్క ధరపైన ఆధారపడతాయి. ఆ ధరే శ్రమ శక్తి విలువతో పాటు లేదా దాని ధరకీ, దాని విలువకీ మధ్య వున్న తేడాతో పాటు మారుతుంది. మరోవైపు శ్రమ ధర స్థిరంగా వుంటే రోజువారీ లేదా వారంవారీ వేతనాలు రోజువారీ లేదా వారం వారీ శ్రమ పరిమాణంపై ఆధారపడతాయి.

కాలం వేతనాల యూనిట్ కొలమానం, అనగా పని గంట యొక్క ధర అనేది శ్రమ శక్తి యొక్క రోజు విలువని సగటు పని దినంలోని పని గంటల సంఖ్యతో భాగించగా వచ్చే లబ్ధము. ఆ పని గంటలు 12 అనుకుందాం. శ్రమ శక్తి యొక్క రోజు విలువ, అనగా 6 గంటల పని ఉత్పాదితం యొక్క విలువ 3 షిల్లింగులనుకుందాం. ఈ పరిస్థితుల్లో ఒక పని గంట ధర 3 పెన్నీలు. దానిలో ఉత్పత్తి అయింది 6 పెన్నీలు. కార్మికుడు ఇప్పుడు 12 గంటల కంటె తక్కువగా (లేదా వారానికి ఆరు రోజుల కంటే తక్కువగా) ఉదాహరణకు, 6 గంటలో 8 గంటలో పనిలో పెట్టుకుంటే శ్రమ యొక్క ఈ ధరతో అతడు రోజుకి 2 షిల్లింగులు లేదా 1 షిల్లింగు 6 పెన్నీలు పొందుతాడు.[1] మన ప్రతిపాదిత సూత్రం ప్రకారం, అతను కేవలం తన శ్రమ శక్తి విలువకి సరిపోయిన ఒక రోజు వేతనాన్ని ఉత్పత్తి చేయడానికి రోజుకి 6 గంటలు పని చేయాలి. అదే ప్రతిపాదిత సూత్రం ప్రకారం, ప్రతి గంటలోనూ సగం మాత్రమే తన కోసం పని చేస్తాడు. సగం పెట్టుబడిదారుడి కోసం పనిచేస్తాడు. దీనిని బట్టి అతను 12 గంటల కంటే తక్కువ కాలం పాటు పనిలో పెట్టబడితే 6 గంటల ఉత్పాదితం యొక్క విలువని తాను పొందలేడనేది స్పష్టం. ఇంతకు ముందున్న అధ్యాయాల్లో అధిక పని భారం యొక్క వినాశకర పర్యవసానాలను చూశాము. అరకొర ఉద్యోగ వసతి వల్ల కార్మికులకెదురయ్యే బాధల కారణాలను ఇక్కడ గమనిస్తాము.

ఒకవేళ గంట వేతనం నిర్ణయించబడితే పెట్టుబడిదారుడు రోజు వేతనాన్ని లేదా వారం వేతనాన్ని చెల్లించాల్సిన పని లేదు. అతడు కార్మికుడిని పనిలో పెట్టడానికి యెంచుకున్న గంటలకే వేతనం చెల్లించాల్సి వుంటుంది. గంట వేతనమనే దానికి మౌలిక ప్రాతిపదికగా వున్న దానికంటే, లేదా శ్రమ ధర యొక్క యూనిట్ కొలమానం కంటే తక్కువ కాలం పాటు కార్మికుణ్ణి పనిలో పెట్టగలడు.

---

పరిమాణం ఎడలే ఆసక్తి కలిగి వుంటాడు." (పుట 15) అంటే కార్మికుడు ప్రధానంగా ఆసక్తి కలిగి వుండేది తాను పుచ్చుకొనే నామమాత్రపు వేతనాల మొత్తంలో మాత్రమే గాని తాను ఇచ్చే శ్రమ పరిమాణంలో కాదు అని చెప్పడమే.

1. అలా అసాధారణంగా ఉద్యోగ వసతిని తగ్గించడం వల్ల కలిగే ఫలితం, పని దినాన్ని చట్టపరంగా సాధారణంగా పరిమితం చేయడం వల్ల కలిగే ఫలితం కంటే పూర్తిగా భిన్నం; మొదటిది పని దినం యొక్క పూర్తి నిడివితో ప్రమేయం లేదు. అది 15 గంటల పనిదినంలోనైనా తలెత్తుతుంది; 6 గంటల పనిదినంలోనైనా తలెత్తుతుంది. మొదటి సందర్భంలో రోజుకి 15 గంటలు పనిచేసే కార్మికుడిని బట్టి, రెండో దానిలో 6 గంటలు పని చేసే వానిని బట్టి శ్రమ యొక్క మామూలు ధర లెక్కగట్టబడుతుంది. కనుక అతడు ఒక సందర్భంలో $7\frac{1}{2}$ గంటల పాటు, మరో సందర్భంలో 3 గంటల పాటు పనిలో పెట్టబడినా ఫలితం మాత్రం ఒక్కటే.

ఈ యూనిట్ అన్నది $\frac{\text{శ్రమ శక్తి యొక్క రోజు విలువ}}{\text{ఇన్ని గంటల పని దినం}}$ అన్న దాన్నిబట్టి నిర్ణయించబడుతుంది.

కనుక పని దినంలో ఫలానా ఇన్ని గంటలు లేకపోయేసరికి అది అర్థరహితం అవుతుంది. వేతనం చెల్లించబడిన శ్రమకీ, చెల్లించబడని శ్రమకి మధ్య వున్న సంబంధం నాశనమైపోతుంది. కార్మికుడు తన జీవనాధార సాధనాలను సంపాదించుకోవడానికి అవసరమైన శ్రమ కాలాన్ని అతనికి యివ్వకుండానే అతన్నుండి ఇప్పుడు పెట్టుబడిదారుడు కొంత అదనపు విలువ పరిమాణాన్ని లాక్కోగలడు. అతడు ఉద్యోగ క్రమాన్నంతనీ ఖతం చేయగలడు. తన వీలుని బట్టి, చిత్తాన్ని బట్టి, క్షణిక ప్రయోజనాన్ని బట్టి కార్మికుడిపైన అత్యధిక పని భారాన్ని మోపగలడు. ఆ వెంటనే అతనికి దాదాపుగా లేదా పూర్తిగా పని లేకుండా చేయగలడు. "శ్రమ యొక్క మామూలు ధర" ని చెల్లిస్తున్నాననే నెపంతో కార్మికుడికి తగిన నష్టపరిహారం లేకుండానే పని దినాన్ని అసాధారణంగా పొడిగించగలడు. ఈ బాపతు వేతనాన్ని తమపైన రుద్దటానికై పెట్టుబడిదారుల ప్రయత్నానికి వ్యతిరేకంగా నిర్మాణ వృత్తుల్లో వున్న లండన్ కార్మికుల పూర్తి సహేతుక విప్లవం 1860లో అందుకే జరిగింది.

పనిదినం చట్టబద్ధంగా పరిమితం కావడం అన్నది అటువంటి మోసానికి అంతం పలుకుతుంది. అయితే యంత్రాల పోటీ వల్ల, పనిలో పెట్టబడిన కార్మికుల నైపుణ్యంలో వచ్చిన మార్పువల్ల, పాక్షిక సాధారణ సంక్షోభాల వల్ల ఉద్యోగ వసతి తగ్గిపోవడాన్ని మాత్రం అది అంతం చేయలేదు. రోజువారీ వారంవారీ వేతనం పెరిగినప్పటికీ శ్రమ ధర స్థిరంగా వుండవచ్చు. దాని మామూలు స్థాయికంటే పడిపోవచ్చు కూడా. ఇది (పని గంట కింత అని లెక్కించబడిన) శ్రమ ధర స్థిరంగా వుంటూ పని దినాన్ని దాని మామూలు స్థాయి కంటే పొడిగించినప్పుడల్లా ఇలా జరుగుతుంది.

$\frac{\text{శ్రమశక్తి యొక్క రోజు విలువ}}{\text{పని దినం}}$ అనే భిన్నంలో హారం పెరిగితే, లవం మరింత వేగంగా పెరుగుతుంది.

తన అరుగుదలపై ఆధారపడే శక్తి విలువ దాని పని కాలంతో పాటు పెరుగుతుంది. ఆ పని కాలం కంటే వేగమైన నిష్పత్తిలో పెరుగుతుంది. కనుక పని కాలానికి చట్టబద్ధ పరిమితుల్లేకుండా, కాలం వేతనమే సాధారణ సూత్రంగా వున్న అనేక పారిశ్రామిక శాఖల్లో పని దినాన్ని ఒక దశ వరకు మాత్రమే, ఉదాహరణకు పదో గంట ("మామూలు పని దినం", "రోజు పని", "మామూలు పని గంటలు") పూర్తయే వరకు మాత్రమే మామూలు పని దినంగా పరిగణించడం అన్నది దానంతటదే తలెత్తింది. ఈ పరిమితి దాటాక పని కాలం ఓవర్‌టైమ్ అవుతుంది. గంటని యూనిట్ కొలమానంగా తీసుకుంటూ ఈ పనికాలానికి మెరుగ్గా (అదనపు వేతనం) చెల్లించబడుతుంది. అయితే యిది చాలాసార్లు హాస్యాస్పదమైనంత తక్కువ మొత్తంలో[1] వుంటుంది.

---

1. "(లేసు తయారీలో) ఓవర్ టైమ్‌కి చెల్లించే రేటు ఎంత తక్కువంటే గంటకి 1/2 పెన్నీ, 3/4 పెన్నీ నుండి 2 పెన్నీల వరకు మాత్రమే వుంటుంది. కార్మికుల ఆరోగ్యానికీ, శక్తికీ ఆ ఓవర్‌టైమ్ కలిగించిన హానికి ఇది ఏమాత్రం తూగదు. ఆ రకంగా సంపాయించబడిన ఆ కొద్దిపాటి మొత్తాన్ని కూడా అదనపు తిండి కోసం ఖర్చు చేయక తప్పదు" (పిల్లల నియామకం కమిషన్ నివేదిక II ")

మామూలు పని దినం అన్నది యిక్కడ వాస్తవ పనిదినంలో ఒక భాగంగా వుంది. రెండోది ఏడాది పొడుగునా మొదటి దానికంటే ఎక్కువసేపుంటుంది.[1]

ఒక నిర్దిష్ట పరిమితి దాటి పని దినం పెరగడంతో పాటు శ్రమ ధర కూడా పెరగడం అన్నది వివిధ బ్రిటీష్ పరిశ్రమల్లో ఇటువంటి రూపం తీసుకుంటుంది; మామూలు కాలం అనబడే దానిలో శ్రమ యొక్క తక్కువ ధర వల్ల, కార్మికుడు తగినంత వేతనాన్ని పొందాలని ఏ మాత్రం అనుకున్నా అతడు మెరుగ్గా చెల్లించబడే ఓవర్ టైమ్‌లో పని చేయక తప్పదు.[2] ఈ సదుపాయాలన్నిటికీ, పని దినానికి చట్టబద్ధ పరిమితి అన్నది స్వస్తి పలుకుతుంది.[3]

ఏ శాఖలోనైనా, పనిలో దినాలు ఎంత నిడివిగా వుంటే వేతనాలు అంత తక్కువగా వుంటాయి

---

1. ఉదాహరణకి ఇటీవల ఈ వాణిజ్యంలో ఫ్యాక్టరీ చట్టాన్ని ప్రవేశపెట్టడానికి ముందు కాగితాలకు రంగువేసే పనుల్లో "సాయంత్రం 4.30లోగా 10 1/2 గంటల రోజు పనిని పూర్తి చేయడం కోసం మేము తిండి కోసం ఆగకుండా పనిచేసేవాళ్ళం. ఆ తర్వాత అంతా ఓవర్‌టైమ్. సాయంత్రం 6 గంటలకి ముందు మేము సాధారణంగా ఎప్పుడూ పని ముగించేవాళ్ళం కాదు. ఏడాది పొడవునా మేము ఓవర్‌టైమ్ చేస్తూనే వుండే వాళ్ళం". (స్మిత్ గారి "ఎవిడెన్స్ ఇన్ చిల్డ్రన్ ఎంప్లాయ్‌మెంట్ కమిషన్ I రిపోర్ట్" పుట 125)
2. ఉదాహరణకి స్కాచ్ బ్లీచింగ్ పనుల్లో "స్కాట్లండ్‌లోని కొన్ని భాగాల్లో, ఈ వాణిజ్యం (1862లో ఫ్యాక్టరీ చట్టం ప్రవేశపెట్టడానికి ముందు) ఓవర్ టైమ్ పద్ధతిలో నిర్వహించబడింది. అనగా రోజుకి 10 గంటల మామూలు పని దినం, దానికిగాను ఒక మనిషికి రోజుకి 1 షిల్లింగు 2 పెన్నీల నామమాత్రపు వేతనం చెల్లించబడేది. ఆ తర్వాత ప్రతి రోజూ చేసే 3, 4 గంటల ఓవర్ టైమ్‌కిగాను గంటకి 3 పెన్నీలు చెల్లించబడేవి. దీని ఫలితం..... మామూలు గంటల్లో పనిచేస్తున్నప్పుడు ఒక మనిషి వారానికి 8 షిల్లింగులు మించి సంపాదించలేడు..... ఓవర్ టైమ్ చెయ్యకుండా సముచితమైన రోజు వేతనాన్ని వారు సంపాదించ జాలరు. ("రిపోర్ట్ ఆఫ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్" ఏప్రిల్ 30, 1863, పుట. 10) కార్మికులతో ఎక్కువ గంటలు పనిచేయించడం కోసం, ఎక్కువ వేతనాల ఆశని తట్టుకోవడం సాధ్యం కాదు" ("రిపోర్ట్ ఆఫ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్". ఏప్రిల్ 30, 1848 పుట 5) లండన్ పట్టణంలో బుక్ బైండింగ్ వాణిజ్యం 14, 15 యేళ్ళ బాలికల్ని అనేక మందిని పనిలో పెట్టింది. ఇది నిర్దిష్ట పని గంటల్ని నిర్దేశించే ఒడంబడిక ప్రకారం జరిగింది. అయినప్పటికీ, ప్రతి నెలా ఆఖరి వారం రోజూ రాత్రి 10, 11, 12 లేదా ఒంటి గంట వరకూ తమ కంటే పెద్దవాళ్ళయిన కార్మికులతో కలిసి పని చేస్తారు. "యజమానులు వారిని అదనపు వేతనంతోనూ, రాత్రి భోజనంతోనూ ఊరిస్తారు." వారు ఆ తిండిని బయటి వసతి గృహాల్లో తింటారు. ఆ రకంగా ఈ బాలికల్లో తలెత్తే వ్యభిచార పాపాన్ని అనేక బైబిల్ గ్రంథాలనూ, మత గ్రంథాలనూ వీరు బైండింగ్ చేస్తారనే వాస్తవం పరిహరిస్తుంది.
3. చూ. "రిపోర్ట్స్ ఆఫ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్" ఏప్రిల్ 30, 1863, అదే గ్రంథం. నిర్మాణ వృత్తుల్లో పని చేసే లండన్ కార్మికులు పరిస్థితిని చాలా కచ్చితంగా అర్థం చేసుకున్నారు. అందుకే 1860 నాటి పెద్ద సమ్మె, లాకౌట్ల కాలంలో గంట కింత వేతనం అన్న దాన్ని రెండు షరతులపైన ఆమోదించారు. (1) పని గంట ధరతో పాటు వరసగా 9, 10 గంటల మామూలు పని దినాన్ని కూడా నిర్ణయించాలి. 10 గంటల పని దినంలో గంట పనికీ, 9 గంటల పని దినంలో గంట పని కంటే ఎక్కువ వేతనాన్ని నిర్ణయించాలి. (2) మామూలు పని దినం తర్వాత ప్రతి గంటనీ ఓవర్‌టైమ్‌గా పరిగణించాలి. వరసగా ఒక గంట కంటే దాని తర్వాత గంటకి ఎక్కువ చెల్లించాలి.

అన్నది అందరికీ తెలిసిన వాస్తవమే.[1] 1839-59 నాటి 20 ఏళ్ల తులనాత్మక సమీక్ష ద్వారా ఈ విషయాన్ని ఫ్యాక్టరీ ఇన్‌స్పెక్టర్ ఎ. రెడ్ గ్రేవ్ రుజువు చేశాడు. దాని ప్రకారం 10 గంటల చట్టం అమల్లో వున్న ఫ్యాక్టరీల్లో వేతనాలు పెరిగాయి. కాగా రోజుకి 14, 15 గంటల పాటు పని సాగే ఫ్యాక్టరీల్లో వేతనాలు పడిపోయాయి.[2]

"శ్రమ యొక్క ధర స్థిరంగా వుంటే రోజువారీ లేదా వారంవారీ వేతనం అనేది వెచ్చించబడిన శ్రమ పరిమాణంపై ఆధారపడుతుంది" అనే సూత్రాన్ని బట్టి ఈ విషయం విదితమవుతుంది. మొదటిది, శ్రమ ధర ఎంత తక్కువగావుంటే, శ్రమ పరిమాణం అంత ఎక్కువగా వుండాలి లేదా పని దినం అంత ఎక్కువ నిడివి వుండాలి. ఎందుకంటే కార్మికుడు నికృష్టమైన సగటు వేతనాన్ని పొందాలంటే అది అవసరం. ఇక్కడ శ్రమ ధర తక్కువగా వుండటం అనేది శ్రమ కాలం యొక్క విస్తరణకు ప్రేరణగా వ్యవహరిస్తుంది.[3]

మరోవైపున, పని కాలం పెరగడం ఫలితంగా అది శ్రమ ధరని పడగొడుతుంది. దీనితో పాటు రోజువారీ లేదా వారంవారీ వేతనాలు కూడా పడిపోయాయి.

$$\frac{\text{శ్రమశక్తి రోజు విలువ}}{\text{నిర్ణీత గంటల పని దినం}}$$ అనే సూత్రం ద్వారా ధర నిర్ణయం కావడం అన్నది తెలిపేదేమంటే పరిహారం లేకుండా వుంటే కేవలం పని దినాన్ని పొడిగించడం అన్నది శ్రమ ధరని పడగొడుతుంది. కాలక్రమేణా పని దినాన్ని పొడిగించడానికి వీలు కల్పించిన పరిస్థితులే, పెరిగిన పని గంటల మొత్తం ధరని తగ్గించేదాకా, ఫలితంగా దిన లేదా వారం వేతనాన్ని కుదించేదాకా నామమాత్రంగా శ్రమ యొక్క ధరని కుదించడానికి మొదట అతనికి వీలు కల్పిస్తుంది. చివరికి అతన్ని ఒత్తిడి చేస్తుంది. ఇక్కడ రెండు పరిస్థితుల ప్రస్తావన చాలు. ఒక మనిషి $2\frac{1}{2}$ లేదా ఇద్దరు మనుషుల పని చేస్తే, మార్కెట్‌లో శ్రమ శక్తి సరఫరా స్థిరంగానే వున్నప్పటికీ, శ్రమ సరఫరా పెరుగుతుంది. ఆ రకంగా కార్మికుల మధ్య సృష్టించబడిన ఈ పోటీ, శ్రమ ధరని పడగొట్టడానికి పెట్టుబడిదారుడికీ వీలు కల్పిస్తుంది. కాగా ఈ పడిపోయే ధర మరోవైపున పని కాలాన్ని అతడు మరింత పెంచడానికి వీలు

---

1. "ఎక్కువ పని గంటలు సామాన్యం అయినచోట తక్కువ వేతనాలు కూడా సామాన్యమే." ("రిపోర్ట్ ఆఫ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్" అక్టోబర్ 31, 1863 పుట 9) "చాలీ చాలని మెతుకుల్ని సంపాదించే పని ఎంతకూ ముగియనన్ని గంటలపాటుంటుంది". ("పబ్లిక్ హెల్త్, సిక్స్త్ రిపోర్ట్" 1864, పుట 15)
2. "రిపోర్ట్ ఆఫ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్" ఏప్రిల్ 30, 1860 పుటలు 31, 32.
3. ఉదాహరణకి, ఇంగ్లండులో చేతి పరిశ్రమల్లో మేకులు తయారు చేసే వారు తమ హీనమైన వారంవారీ తన నికృష్టమైన వేతనాన్ని మిగల్చడం కోసం రోజుకి 15 గంటల పాటు పని చేయాల్సి వుంటుంది. "రోజులో అవి చాలా గంటలు (ఉదయం 6 గంటల నుండి సాయంత్రం 8 గంటల వరకూ) 11 పెన్నీలు లేదా 1 షిల్లింగు కోసం రోజంతా కఠోరంగా పని చెయ్యాలి. అది గాక పరికరాల అరుగుదల, కొలిమి ఖర్చు, వృథా అయ్యే ఇనుము అన్నీ కలిపి రోజుకి ఇందులో నుండి $2\frac{1}{2}$ లేదా 3 పెన్నీలు పోతాయి. ("చిల్డ్రన్స్ ఎంప్లాయిమెంట్ కమిషన్ III రిపోర్ట్" పుట 136, అదే పని కాలంలో వారానికి స్త్రీలు సంపాదించేది 5 షిల్లింగులు మాత్రమే. అదే నివేదిక, పుట 137)

కల్పిస్తుంది.[1] వేతనం చెల్లించబడని శ్రమ అనగా సామాజిక సగటుకి మించిన శ్రమ యొక్క అపార, పరిమాణాలపైన గల ఈ పెత్తనం పట్టుబడిదారుల మధ్యే పోటీకి కారణభూతమవుతుంది. సరుకు ధర యొక్క ఒక భాగం శ్రమ ధరగా వుంటుంది. శ్రమ ధర యొక్క చెల్లించబడని భాగాన్ని సరుకు ధరలో లెక్కించాల్సిన అవసరం లేదు. దాన్ని కొనుగోలుదారుడికి బహూకరించవచ్చు. పోటీకి దారి తీసే మొదటి దశ ఇది. పని దినం పొడిగింపు వల్ల సృష్టించబడిన అసామాన్య అదనపు విలువలో కనీసం ఒక భాగాన్ని సరుకు యొక్క అమ్మకం ధర నుండి మినహాయించడమన్నది పోటీ వలనే నెట్టబడే రెండో దశ. ఈ రకంగా సరుకు అసామాన్యమైన తక్కువ ధరకి అమ్మబడటం అన్నది తలెత్తుతుంది. అది మొదట చెదురు మదురుగా ప్రారంభమై దశల వారీగా నిశ్చయమవుతుంది. తక్కువ అమ్మకం ధర అన్నది ఇక నుంచీ అతి ఎక్కువ పని కాలానికిగాను లభించే నికృష్టమైన వేతనానికి ప్రాతిపదిక అవుతుంది. నిజానికి ఇది మొదట యిదే పరిస్థితుల వలన సృష్టించబడుతుంది. పోటీ గురించి విశ్లేషణ మన పాఠ్యాంశంలోని ఈ భాగానికి సంబంధించింది కాదు గనుక ఈ చలనాన్ని ఇక్కడ సూచించడం మాత్రమే జరిగింది. అయినప్పటికీ ఒక క్షణం పెట్టుబడిదారుడు తన గురించి ఇలా మాట్లాడుకోవచ్చు; "బర్మింగ్‌హామ్‌లో ఒకరికి వ్యతిరేకంగా మరొకరికి, యజమానుల మధ్య ఎంత పోటీ వుందంటే యితరత్రా సిగ్గుపడే పనులను వారు యజమానులుగా చేయక తప్పడం లేదు. అయినా దాని వల్ల వారి ఆదాయం ఏమాత్రం పెరగడం లేదు. కేవలం కొనుగోలు చేసే జనం మాత్రం లాభపడతారు.[2] లండన్‌లో రెండు రకాల రొట్టెల దుకాణదారులు పాఠకులకు గుర్తుండే వుంటారు. వారిలో ఒక రకం బ్రెడ్‌ని పూర్తి ధరకి అమ్ముతారు. ("పూర్తి ధర" బేకర్లు) మిగిలిన వారు దాని మామూలు ధర కంటే తక్కువకి అమ్ముతారు. ("తక్కువ ధర" బేకర్లు) పార్లమెంటరీ కమిటీ దర్యాప్తు సంఘం ముందు "పూర్తి ధర" వాళ్ళు తమ ప్రత్యర్థులను ఇలా ఖండించారు : "ముందు జనాన్ని మోసం చేయడం ద్వారా, తర్వాత తమ కార్మికులకి 12 గంటల వేతనాలిచ్చి వారి నుండి 18 గంటల పని రాబట్టడం ద్వారా మాత్రమే వాళ్లు బతుకుతున్నారు. కార్మికుల వేతనం చెల్లించబడని శ్రమే మూలాధారంగా పోటీ నిర్వహించబడింది. ఇప్పటికీ అలాగే కొనసాగుతోంది. మాస్టర్ బేకర్ల మధ్య పోటీయే రాత్రిపూట పనిని వదిలించుకొనడంలో ఎదురయ్యే ఇబ్బందికి కారణం. తక్కువ ధరకి అమ్మేవాడు పిండి ధరని బట్టి తయారీ ఖర్చు కంటే తక్కువకి అమ్మాలీ అంటే అతడు తన కార్మికుల నుండి ఎక్కువ శ్రమని రాబట్టడం ద్వారా ఆ లోటుని భర్తీ చెయ్యాల్సి వుంటుంది. నా మనుషుల నుండి నేను 12 గంటలే పొందగా, నా పొరుగువాడు 18 లేదా 20 గంటల్ని పొందితే నన్ను అతడు అమ్మకం ధరలో దెబ్బగొడతాడు. అధిక పనికి వేతనం చెల్లించాలని కార్మికులు పట్టుబడితే

1. ఉదాహరణకి, ఒక ఫ్యాక్టరీ కార్మికుడు మామూలుగా వుండే అధిక పనిగంటల్లో పనిచేయ నిరాకరిస్తే, "ఎంత సేపైనా పని జేయడానికి సిద్ధపడే మరో వ్యక్తిని చేర్చుకొని, అతన్ని ఉద్యోగంలోంచి తొలగించి బయటికి నెట్టడం జరుగుతుంది.". (రిపోర్ట్స్ ఆఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీ." ఏప్రిల్ 30, 1848 సాక్ష్యం పుట 39) "ఒక మనిషి ఇద్దరి పనిచేస్తే..... శ్రమ యొక్క అదనపు సరఫరా వల్ల దాని ధర తగ్గడం కారణంగా.... లాభం రేటు సాధారణంగా పెరుగుతుంది". (సీనియర్, అదే గ్రంథం, పుట 15)
2. ("చిల్డ్రన్స్ ఎంప్లాయ్‌మెంట్ కమిషన్ III రిపోర్ట్," ఎవిడెన్స్ పుట 66)

ఇది చక్కబడుతుంది. తక్కువ ధరకి అమ్మేవాడు పనిలో పెట్టుకున్న వారిలో చాలా మంది విదేశీయులూ, యువకులూ – వారికి ఏ వేతనాలయినా ఆమోదించక తప్పదు.[1]

కేవలం ఉత్పత్తి సంబంధాల రూపం అన్నది పెట్టుబడిదారుని బుర్రలో ఎలా ప్రతిబింబిస్తుందో చూపిస్తుంది. కనుక కూడా ఈ విషాద గాథ ఆసక్తికరం. మామూలు శ్రమ ధరలో కూడా ఒక నిర్దిష్ట పరిమాణం గల వేతనం చెల్లించబడని శ్రమ వుంటుందనీ, ఈ వేతనం చెల్లించబడని శ్రమే అతని మామూలు లాభానికి మూలమనీ పెట్టుబడిదారుడు ఎరుగడు. అదనపు శ్రమ కాలం అనే అభివర్గం అతని దృష్టిలో వుండనే వుండదు. ఎందుకంటే అది మామూలు పని దినంలో కలిసి వుంటుంది. కనుక దానికి తాను రోజు వేతనంలో చెల్లించాననుకుంటాడు. అయితే అతని దృష్టిలో (ఓవర్‌టైమ్) అధికకాలం పని అనేది, మామూలు శ్రమ ధరకి అనుగుణమైన పరిమితులను దాటి పని దినాన్ని పొడిగించడం అనేది వుంటుంది. తక్కువ ధరకమ్మే వానితో తనకు ముఖాముఖి పోటీలో, అతడు ఈ అధిక కాలం పనికి అదనంగా చెల్లించాలని కూడా పట్టుబడతాడు. ఈ అదనపు చెల్లింపులో కూడా మామూలు పని గంట ధరలో వున్నట్టే వేతనం చెల్లించబడని శ్రమ వుంటుందని కూడా అతనెరుగడు. ఉదాహరణకి 12 గంటల పని దినంలో ఒక గంట ధర 3 పెన్నీలు అనగా సగం పని గంట యొక్క విలువ ఉత్పాదితం అనుకుందాం. కాగా అధికకాలం పని గంట ధర 4 పెన్నీలు అనుకుందాం. అనగా 2/3 వ వంతు పని గంట యొక్క విలువ ఉత్పాదితం. మొదటి దానిలో సగాన్ని, రెండో దానిలో మూడో వంతునీ వేతనం చెల్లించకుండానే పెట్టుబడిదారుడు స్వాహా చేస్తాడు.

---

1. "రిపోర్ట్ అండ్ రిలేటివ్ టు ది గ్రీవెన్సస్ కంప్లయిన్డ్ ఆఫ్ బై ది జర్నీ మెన్ బేకర్స్" లండన్, 1862 ఏమయినప్పటికీ, పూర్తి ధర బేకర్లు కూడా పైన పేర్కొన్నట్టే వారి ప్రతినిధి బెన్నట్ స్వయంగా ఆమోదించినట్టే. వారు తమ కార్మికులతో సాధారణంగా రాత్రి 11 గంటలకు పని ప్రారంభిస్తారు...... అది రెండో రోజు 8 గంటల వరకూ సాగుతుంది...... అప్పుడు మళ్ళీ రాత్రి 7 గంటల వరకూ రోజంతా వారితో పని చేయిస్తారు". (అదే నివేదిక, పుట 22).

# అధ్యాయం - 21

# శాల్తీ వేతనం

## (Piece - Wages)

**కా**లాన్ని బట్టి వేతనం అనేది శ్రమ శక్తి విలువ లేదా ధర యొక్క మారిన రూపం అయినట్టే శాల్తీని బట్టి వేతనం అనేది కాలాన్ని బట్టి వేతనానికి మారిన రూపం తప్ప వేరు గాదు.

శాల్తీ వేతనాలు మొదటి చూపుకి కార్మికుడి నుంచి కొన్ని ఉపయోగ విలువ, అతని శక్తి విలువ యొక్క క్రియలాగా అనగా శ్రమ లాగా కాక, ఉత్పాదితంలో అప్పటికే భౌతిక రూపం ధరించిన శ్రమలాగా కన్పిస్తుంది. దాని ధర కాలం వేతనాల విషయంలో లాగా : $\frac{\text{శ్రమ శక్తి రోజు విలువ}}{\text{నిర్ణీత గంటల పని దినం}}$ అనే భిన్నాన్ని బట్టి గాక కార్మికుడి పని చేసే శక్తిని బట్టి నిర్ణయమైనట్టుగా కనిపిస్తుంది [1]

ఈ పై రూపాన్ని విశ్వసించే నమ్మకం మొట్టమొదట ఈ రెండు వేతన రూపాలూ, యేక కాలంలో, ఒకే పారిశ్రామికశాఖలో పక్క పక్కన వుండటం చూసి తీవ్రంగా దిగ్భ్రాంతి చెందుతుంది : ఉదాహరణకి. "లండన్ కంపోజిటర్లు సాధారణంగా శాల్తీలను బట్టి పనిచేస్తారు. కాలాన్ని బట్టి చేసే పనికి అక్కడ మినహాయింపు. గ్రామాల్లో రోజుని బట్టి పని చేస్తారు. శాల్తీని బట్టి పని అనేది అక్కడ మినహాయింపు. లండన్ నౌకాశ్రయంలో ఓడలు తయారు చేసే కార్మికులు పనిని బట్టి, లేదా శాల్తీని బట్టి పనిచేస్తారు. కాగా యితర ప్రాంతాలన్నిటిలోనూ రోజుని బట్టి పని చేస్తారు.[2]

లండన్‌లోని జీనులు కుట్టే దుకాణంలో తరచుగా ఒకే పనిని ఫ్రెంచి కార్మికులకు శాల్తీని బట్టి, ఇంగ్లీషు కార్మికులకు కాలాన్ని బట్టి వేతనాలివ్వబడతాయి. మామూలుగా శాల్తీ వేతనాల

---

1. "శాల్తీల ప్రకారం పని అనే పద్ధతి కార్మికుని చరిత్రలో ఒక యుగాన్ని సూచిస్తుంది. పెట్టుబడిదారుని ఇష్టాయిష్టాలపై ఆధారపడే రోజు కూలీకే. సమీప భవిష్యత్తులో చేతివృత్తిదారునికీ, పెట్టుబడిదారునికీ మేలు కలయికగా రూపొందబోయే సహకార చేతివృత్తిదారునికీ మధ్య దశ ఇది. యజమాని పెట్టుబడిపై పని చేసేటప్పుడు సహితం శాల్తీ పని వారు, నిజానికి తమకి తామే యజమానులు." (జాన్‌వాట్స్ : "ట్రేడ్ సొసైటీస్ అండ్ స్ట్రైక్స్, మెషినరీ అండ్ కో ఆపరేటివ్ సొసైటీస్" మాంచెస్టర్. 1865 పుటలు 52, 53) నేను ఈ చిన్న పుస్తకాన్ని ఉల్లేఖించడానికి కారణం : చాలాకాలం నాటి కుళ్ళిన, వకాల్తాదారీ చిల్లర విషయాలకు అది కూడలి. ఇదే వాట్స్ ఇంతకుముందు ఓవెనిజంతో వ్యవహారం సాగించాడు; 1842లో "ఫాక్ట్స్" అండ్ ఫిక్షన్స్ ఆఫ్ పొలిటికల్ ఎకనామిస్ట్స్ అనే పేరుతో మరో కరపత్రం ప్రచురించాడు. దానిలో అతడు అనేక ఇతర విషయాలతో పాటు "ఆస్తి అంటే దోపిడీ" అని ప్రకటించాడు. అది చాలా కాలం నాటి సంగతి.
2. టి.జె. డున్నింగ్ : "ట్రేడ్" యూనియన్ అండ్ స్ట్రయిక్స్" లండన్, 1860, పుట 22

ప్రాబల్యమున్న ఫ్యాక్టరీల్లో ఈ వేతనరూపం కుదరని ప్రత్యేక తరహా పనికి కాలాన్నిబట్టి చెల్లించ బడుతుంది.[1] పెట్టుబడిదారీ అభివృద్ధికి ఒక రూపం కంటే మరోరూపం అనుకూలమైతే కావచ్చు. అయినప్పటికీ వేతనాల చెల్లింపుల రూపంలో వున్న ఈ తేడా వాటి సారభూత స్వభావాన్ని ఏ రకంగానూ మార్చదన్నది స్వయం విదితం.

సాధారణ పనిదినంలో 12 గంటలున్నాయనీ, దానిలో 6 గంటలు వేతనం చెల్లించబడినవీ, 6 గంటలు చెల్లించబడనివీ అనుకుందాం. దాని విలువ ఉత్పాదితం 6 షిల్లింగులు అనుకుందాం. కనుక ఒక గంట విలువ ఉత్పాదితం 6 పెన్నీలు. కనుక అనుభవం కారణంగా సగటు తీవ్రతతోనూ, నైపుణ్యంతోనూ పనిచేసే కార్మికుడు నిజానికి ఒక వస్తువు ఉత్పత్తికి సామాజికంగా అవసరమైన కాలాన్ని మాత్రమే యిస్తాడనీ, 12 గంటల్లో 24 వేర్వేరు శాల్తీలు లేదా ఒకే వరస మొత్తంలో భాగాలను సరఫరా చేస్తాడనీ అనుకుందాం. ఈ 24 శాల్తీల నుండి వాటిలో వున్న స్థిర పెట్టుబడి భాగాన్ని తీసివేసిన తర్వాత వాటి విలువ 6 షిల్లింగులనీ ఒక శాల్తీ విలువ 3 పెన్నీలనీ అనుకుందాం. కార్మికుడు శాల్తీకి $1\frac{1}{2}$ పెన్నీ చొప్పున 12 గంటల్లో 3 షిల్లింగులు పొందుతాడు. కాలం, వేతనాల్లో లాగానే కార్మికుడు 6 గంటలు తన కోసమూ, 6 గంటలు పెట్టుబడిదారుని కోసమూ పని చేస్తాడనుకున్నా, లేదా ప్రతి గంటలో సగం తన కోసమూ, పెట్టుబడిదారుని కోసం సగమూ పని చేస్తాడనుకున్నా ఫర్వాలేదు. కనుక ఇక్కడ ప్రతి శాల్తీలో సగానికే ప్రతిఫలం ముట్టిందనీ, సగానికి ముట్టలేదనీ అనుకోవచ్చు. లేదా 12 శాల్తీల ధర మాత్రమే శ్రమశక్తి విలువకి సమానమనీ, కాగా మరో 12 శాల్తీల్లో అదనపు విలువ వుందనీ అనుకోవచ్చు. ఎలా అనుకున్నా ఒకటే.

శాల్తీ వేతన రూపం అన్నది కాలం వేతన రూపంలాగే నిర్హేతుకం. కాగా మన ఉదాహరణలో రెండు శాల్తీల నుండి వాటిలో వినియోగించబడిన ఉత్పత్తి సాధనాల విలువను తీసేశాక ఆ శాల్తీల విలువ 6 పెన్నీలు. అవి ఒక గంట పని ఉత్పాదితాలు కనుక కార్మికునికి వాటికి బదులు 3 పెన్నీలు ధర లభిస్తుంది. శాల్తీ వేతనాలు నిజానికి వేరే ఏ విలువ సంబంధాన్నీ వ్యక్తం చేయవు. కనుక శాల్తీ విలువని దానిలో వున్న శ్రమ కాలంతో కొలవడం అన్నది కాదు. అందుకు విరుద్ధంగా కార్మికుడు

---

1. వేతనాలు ఈ రెండు రూపాల్లో ఏకకాలంలో పక్కపక్కనే వుండటం అన్నది యజమాని మోసానికి ఎలా తోడ్పడుతుందో చూడండి: "ఒక ఫ్యాక్టరీ 400 మందిని పనిలో పెడుతుంది. వారిలో సగం మంది శాల్తీల వారీ పనిచేస్తారు. కనుక ఎక్కువ గంటల పాటు పనిచేయడంలో వారికి ప్రత్యక్ష ప్రయోజనం వుంది. మిగిలిన 200 మందికి రోజుని బట్టి చెల్లించబడుతుంది. అయితే వారు మిగిలిన వారితో పాటు అంతే ఎక్కువ గంటల పాటు పనిచేస్తారు. అయితే ఈ అధిక కాలానికి వారికి ఏ మాత్రం డబ్బు ముట్టదు. ఈ 200 మంది ఒకరోజులో చేసే అరగంట పని ఒక వ్యక్తి 50 గంటలు చేసే పనికి, అనగా వారం రోజుల పనిలో 5/6 వంతు పనికి సమానం. ఆ రకంగా అది యజమానికి ఖాయమైన లాభం." ("రిపోర్ట్స్ ఆఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్" అక్టోబర్ 31, 1860 పుట 9.)
"ఇప్పటికీ చాలా వరకు ఎక్కువ గంటల పాటు పనిచేయడం అన్నది వ్యాప్తిలో వుంది. చాలా సందర్భాల్లో దాన్ని పసికట్టడానికి, చట్టబద్ధమైన శిక్ష విధించడానికి వీల్లేకుండా పూర్తి రక్షణ వుంది.... ఇంతకుముందు సమర్పించిన అనేక నివేదికల్లో శాల్తీవారీ గాక, వారంవారీ వేతనాలను పొందే కార్మికులకు జరిగే హాని గురించి నేను తెలియజేశాను." (లియొనార్డ్ హార్నర్, "రిపోర్ట్స్ ఆఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్," ఏప్రిల్ 30, 1859 పుటలు 8, 9)

ఉత్పత్తి చేసిన శాల్తీల సంఖ్యను బట్టి అతడు వెచ్చించిన శ్రమ కాలాన్ని కొలవడమన్నదే ప్రశ్న. కాలం వేతనాల్లో శ్రమ దాని తక్షణ వ్యవధిని బట్టి కొలవబడుతుంది. శాల్తీ వేతనాల విషయానికొస్తే ఒక నిర్దిష్ట కాలంలో ఎంత పరిమాణం గల ఉత్పాదితాల్లో శ్రమ చేరింది అన్న దాన్ని బట్టి అది కొలవబడుతుంది.[1] శ్రమ ధరే అంతిమంగా ఈ సమీకరణం ద్వారా నిర్ణయించబడుతుంది. : ఒకరోజు శ్రమ విలువ = శ్రమ శక్తి యొక్క రోజు విలువ.

కనుక శాల్తీ వేతనం అన్నది కాలం వేతనం యొక్క మారిన రూపం మాత్రమే. శాల్తీ వేతనాల స్వభావోచితమైన ప్రత్యేకతలను ఇప్పుడు మరింత క్షుణ్ణంగా పరిశీలిద్దాం.

ఇక్కడ శ్రమ నాణ్యత అన్న దాన్ని పనే అదుపు చేస్తుంది. శాల్తీ ధర పూర్తిగా చెల్లించబడాలి అంటే పని సగటు పరిపూర్ణత కలిగినదై వుండాలి. ఈ దృష్టి నుంచి శాల్తీ వేతనాలనేవి వేతనాల తగ్గింపుకీ, పెట్టుబడిదారీ వంచనకీ అత్యంత ఫలప్రదమైన ఆధారమవుతాయి.

శ్రమ తీవ్రతని పెంచడానికి పెట్టుబడిదారునికి అవి కచ్చితమైన కొలమానాన్ని ఇస్తాయి. ముందే నిర్ధారించబడిన, ప్రయోగ పూర్వకంగా నిర్ణయించబడిన, సరుకుల యొక్క ఒక పరిమాణంలో రూపొందిన శ్రమ కాలం మాత్రమే సామాజిక అవసర శ్రమకాలంగా లెక్కించబడుతుంది, అలా చెల్లించబడుతుంది. కనుక లండన్ దర్జీల పెద్ద వర్కుషాపుల్లో ఒక నిర్దిష్ట పని మొత్తాన్ని, ఒక వెయిస్టు కోటుని ఉదాహరణకీ, గంట లేదా అర్ధగంట అంటారు. 6 పెన్నీలకు ఒక గంట అంటారు. అలవాటుని బట్టి ఒక గంట సగటు ఉత్పాదితం ఎంతో తెలుసు. కొత్త ఫ్యాషన్లు, రిపేర్లు వగైరా వచ్చినపుడు ఒక ప్రత్యేక పని మొత్తం ఒక గంటా, లేదా ఎంత అన్న విషయంలో యజమానికీ, కార్మికునికీ మధ్య వివాదం తలెత్తుతుంది. అలాగే లండన్ ఫర్నిచర్ వర్కు షాపులు వగైరాల్లో కూడా అంతే. కార్మికునికి సగటు శక్తి స్తోమతులు లేకుంటే, అతడు ఆ కారణంగా రోజుకి ఒక కనీస పని మొత్తాన్ని చెయ్యలేక పోతే అతను బర్తరఫ్ చేయబడతాడు.[2]

ఇక్కడ పని నాణ్యత, తీవ్రతల్ని వేతన రూపమే అదుపు చేస్తుంది. కనుక శ్రమపైన అజమాయిషీ అన్నది చాలా వరకు అవసరమవుతుంది. కనుక శాల్తీ వేతనాలు పైన పేర్కొనబడిన ఆధునిక "గృహ శ్రమ"కీ, దానితో పాటు హెచ్చు తగ్గుల దొంతర్ల వారీ నిర్వహించబడిన దోపిడీ, పీడనల వ్యవస్థకీ పునాది వేస్తాయి. ఈ వ్యవస్థకి రెండు మౌలిక రూపాలున్నాయి.

ఒకవైపున శాల్తీ వేతనాలు పెట్టుబడిదారులకీ, వేతన శ్రామికులకీ మధ్య పరాన్నభుక్కులకీ, "మరొకరి శ్రమని బాడుగకివ్వడం" అన్న దానికి వీలు కల్పిస్తుంది. పెట్టుబడిదారుడు చెల్లించే శ్రమ

---

1. "వేతనాలను రెండు రకాలుగా కొలవవచ్చు : శ్రమ కాలం బట్టి లేదా దాని ఉత్పాదితాన్ని బట్టి" ("Abrege elementaire des Principes de 1 Economic Politique," Paris 1796, P. 32) పేరు పెట్టుకోకుండా రాసిన ఈ గ్రంథ రచయిత జి. గార్నర్.

2. "ఇంత బరువు గల దూదిని అతనికి (వడికే వానికి) సరఫరా చేస్తారు. అతను దానికి బదులుగా ఒక నిర్దిష్ట కాలంలోపల ఒక నిర్దిష్ట భారం గల పురిని లేదా నూలుని తిరిగి యివ్వాలి. అది నిర్దిష్ట స్థాయిలో నాణ్యతని కలిగి వుండాలి. అలా తిరిగి ఇచ్చిన దానికి గాను ఒక పౌండ్‌కి ఇంత చొప్పున ప్రతిఫలం ముడుతుంది. అతని పనిలో నాణ్యత లోపిస్తే అతనికి జుల్మానా పడుతుంది. నిర్దిష్ట కాలానికి నిర్ణయించిన కనీస మొత్తం కంటే తక్కువుంటే అతన్ని తొలగించి మరో సమర్థుడైన పనివాణ్ణి కుదుర్చుకోవడం జరుగుతుంది" (ఉరే, అదే గ్రంథం, పుట 317)

ధరకీ, మధ్య దళారులు దానిలో వాస్తవంగా కార్మికుడిని చేరనిచ్చే భాగానికీ మధ్య ఎంత తేడా వుంటే ఈ దళారులకి అంత ప్రయోజనకరం.[1] ఇంగ్లండులో ఈ పద్ధతిని దీని స్వభావానికి తగినట్టు "చెమట పిండే పద్ధతి" (స్వెటింగ్ సిస్టమ్) అంటారు. మరోవైపున కార్మిక పెద్దతో (కార్ఖానాల్లో ఒక బృందం పెద్దతో, గనుల్లో బొగ్గు తోడే వానితో, ఫ్యాక్టరీలో అసలు యంత్ర కార్మికునితో) శాల్తీకింత చొప్పున అని ఒప్పందం చేసుకోవటానికి, శాల్తీ వేతనం పెట్టుబడిదారుడికీ వీలు కల్పిస్తుంది. ఆ ధర ప్రకారం కార్మిక పెద్ద తన కింద పనిచేసే వాళ్ళని చేర్చుకునే బాధ్యత, వారికి వేతనం చెల్లించే బాధ్యత తీసుకుంటాడు. ఇక్కడ కార్మికుడే కార్మికుణ్ణి దోపిడీ చేయడం ద్వారా కార్మికుణ్ణి పెట్టుబడి దోపిడీ చేయడం అన్నది అమలు జరుగుతుంది.[2]

శాల్తీ వేతనంలో సహజంగానే కార్మికునికి వ్యక్తిగత ప్రయోజనమే అతని శ్రమశక్తిని సాధ్యమైనంత ఎక్కువ పిండేటట్టు చేస్తుంది. శ్రమ తీవ్రత మామూలు స్థాయిని చాలా సునాయాసంగా పెంచేలా పెట్టుబడిదారుడికి ఇది వీలు కల్పిస్తుంది.[3] అంతేగాక యిప్పుడు శ్రమ కాలంతో పాటు రోజు లేదా వారం వేతనం పెరుగుతుంది. కనుక కార్మికుని వ్యక్తిగత ప్రయోజనమే పని దినాన్ని పొడిగిస్తుంది.[4]

---

1. "పని అనేక చేతులు మారినప్పుడు, ప్రతిదీ తన వంతు లాభం తీసుకుంటుంది, నిజానికి పనిచేసేది ఆఖరి చెయ్యి మాత్రమే. ఆఖరికి కార్మిక స్త్రీ చేతికి చేరే వేతనం అతి నికృష్టమైన నిష్పత్తిలో వుంటుంది". ("చైల్డ్ ఎంప్లాయ్‌మెంట్ కమిషన్ II సెకండ్ రిపోర్ట్)
2. వకాల్తాదారీ వాట్స్ సైతం ఇలా అంటాడు : "స్వలాభం కోసం తన తోటి వారిని అధికంగా పని చేయించడంలో ఆసక్తి కలిగి ఉండటానికి బదులు, ఒక పనిలో పెట్టబడిన కార్మికులందరూ ఒప్పందంలో ఎవరి శక్తి సామర్థ్యాలను బట్టి వారు భాగస్వాములయితే శాల్తీల వారీ పని అనే పద్ధతి బాగా మెరుగవుతుంది". (అదే గ్రంథం, పుట 53) ఈ పద్ధతిలో వున్న దుర్మార్గం గురించి, చూ. "చైల్డ్ ఎంప్లాయ్‌మెంట్ కమిషన్ రిపోర్ట్ త్రీ".
3. అనుకోకుండా వచ్చిన ఈ ఫలితం కృత్రిమంగా తరచుగా రాబట్టబడుతుంది. ఉదాహరణకి, లండన్ ఇంజనీరింగ్ వాణిజ్యంలో మామూలుగా ప్రయోగించే కుయుక్తి యిది: "మిగిలిన వారికంటే యెక్కువ దారుఢ్యమూ, లాఘవమూ వున్న మనిషిని అనేక మంది కార్మికులకు పెద్దగా నియమిస్తారు. అతనికి ఒక పావు వంతో ఎంతో అదనపు రేటుని చెల్లిస్తారు. సాధారణ వేతనాలు మాత్రమే చెల్లించబడే యితర కార్మికుల్ని తనతో సమానంగా పనిచేసేలా చేయడానికి గాను అతను వొళ్లు విరిగేలా పని చేయాలన్నది అవగాహన. యజమానులు కార్మికులకు వ్యతిరేకంగా వారికంటే ఉన్నతమైన కార్యాచరణనీ, నైపుణ్యాన్ని, పనిచేసే శక్తినీ ప్రయోగిస్తున్నారనే ఫిర్యాదుల్ని వివరించడానికి యిది చాలావరకు వ్యాఖ్యానం అవసరం లేకుండానే వివరిస్తుంది" (ఇన్ ట్రేడ్ యూనియన్స్, డున్నింగ్; అదే గ్రంథం, పుటలు 22, 23) ఈ రచయిత స్వయంగా ఒక కార్మికుడూ, ట్రేడ్ యూనియన్ల కార్యదర్శి కనుక దీనిలో అతిశయోక్తి వుందని భావించవచ్చు. అయితే జె.పి.హెచ్. మోర్టన్ రాసిన వ్యవసాయ విజ్ఞాన సర్వస్వమనదగిన, "అత్యంత గౌరవప్రదమైన" "లేబరర్" గ్రంథాన్ని పాఠకుడు పోల్చి చూడవచ్చు. దీనిలో యీ పద్ధతి ఖరారు చేయబడిన పద్ధతిగా రైతులకు సిఫార్సు చేయబడింది.
4. "శాల్తీ వేతనం పొందేవారంతా..... చట్టబద్ధ పరిమితుల్ని అతిక్రమించడంవల్ల ప్రయోజనం పొందుతారు. అధికకాలం పని చేయడానికి సుముఖంగా వుండటం అన్నది నేత పని, కండె తిప్పే పని చేసే స్త్రీలకు బాగా వర్తిస్తుంది." ("రిపోర్ట్ ఆఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్, ఏప్రిల్ 30, 1858." పుట 9) యజమానికి యింత సదుపాయం కలిగించే యీ పద్ధతి (శాల్తీవారీ పని)..... కుమ్మరి తక్కువ వేతనాలకి తాను పని చేసే నాలుగయిదేళ్ళలోనూ అతిగా ఒళ్లు విరిగేలా పని చేయడాన్ని ప్రోత్సహిస్తుంది..... కుమ్మరుల లోపభూయిష్టమైన అంగసౌష్టవానికి యిది మరో ప్రధాన కారణం. ("చైల్డ్ ఎంప్లాయ్‌మెంట్ కమిషన్ I ఫస్ట్ రిపోర్ట్ : పుట XIII )

శాల్తీ వేతనం స్థిరంగా ఉన్నప్పటికీ పని దినం పొడిగింపు అన్నది తప్పనిసరిగా శ్రమ ధరని పడగొడుతుంది అన్నదానితో ప్రమేయం లేకుండానే ఇదంతా క్రమంగా ఇంతకు ముందు కాలం వేతనాల విషయంలో వివరించబడిన ప్రతిక్రియనే తెచ్చిపెడుతుంది.

కాలం వేతనాల్లో, కొద్ది మినహాయింపులతో ఒకే రకం పనికి ఒకే వేతనం వర్తిస్తుంది. కాగా శాల్తీ వేతనాల్లో పని కాలం యొక్క ధర ఉత్పాదితం యొక్క నిర్దిష్ట పరిమాణాన్ని బట్టి కొలవబడినప్పటికీ కార్మికుల వైయక్తిక భేదాలను బట్టి వారి రోజువారీ లేదా వారంవారీ వేతనాలు వేర్వేరుగా వుంటాయి. వారిలో ఒకడు నిర్దిష్ట కాలంలో కనీస ఉత్పాదితాన్ని మాత్రమే సరఫరా చేస్తాడు. మరొకడు సగటు ఉత్పాదితాన్ని, మూడోవాడు సగటుకంటే ఎక్కువనీ సరఫరా చేస్తాడు. కనుక విభిన్నమైన నైపుణ్యమూ, స్తోమత శక్తి వగైరాలని బట్టి వాస్తవ ఉత్పాదితాలను పొందటంలో గొప్ప వైవిధ్యం వుంటుంది.[1] అయితే యిది పెట్టుబడికీ, వేతన శ్రమకీ మధ్య వుండే సాధారణ సంబంధాన్ని మార్చదు. మొదటిది, వర్కుషాపులో మొత్తంగా ఈ వైయక్తిక భేదాలు ఒకదాన్నొకటి పరిహరించుకుని సమతూకాన్ని నెలకొల్పుతాయి. ఆ రకంగా నిర్దిష్ట శ్రమకాలంలో సగటు ఉత్పాదితాలు సరఫరా అవుతాయి. చెల్లించబడిన మొత్తం వేతనాలు ఆ ప్రత్యేక పారిశ్రామిక శాఖ యొక్క సగటు వేతనాలవుతాయి.

రెండోది : వేతనాలు, అదనపు విలువ మధ్య వుండే నిష్పత్తి మారదు. ఎందుకంటే ప్రతి కార్మికుడూ సరఫరాచేసే అదనపు విలువ మొత్తం అనేది అతడు తీసుకునే వేతనానికి అనుగుణంగానే వుంటుంది. శాల్తీ వేతనం వ్యక్తిత్వానికి విస్తృత అవకాశం ఇవ్వడం వలన ఒక వైపున ఆ వ్యక్తిత్వాన్ని పెంచుతుంది. దానితో పాటు స్వేచ్ఛ, స్వాతంత్ర్యం, సొంత అదుపు అనే భావన కార్మికుల్లో పెరుగుతుంది. మరోవైపున వారి మధ్య పోటీ పెరుగుతుంది. కనుక విడి కార్మికుని వేతనాన్ని సగటుని మించి పెంచుతూనే, ఈ సగటునే తగ్గించే ధోరణి శాల్తీ వేతనానికి వుంది. అయితే సాంప్రదాయ కారణంగా ఒక ప్రత్యేక శాల్తీ వేతనం యొక్క రేటు చాలాకాలంగా స్థిరపడటంవల్ల దాన్ని తగ్గించడం అన్నది ప్రత్యేక యిబ్బందులతో కూడుకున్నదైనప్పుడు అటువంటి ప్రత్యేక సందర్భాల్లో యజమానులు కొన్నిసార్లు దాన్ని నిర్బంధంగా కాలం వేతనాలుగా మార్చారు. ఉదాహరణకి కవెంట్రికి చెందిన రిబ్బన్ నేతగాళ్ళు 1860లో అందుకే పెద్ద సమ్మె చేశారు.[2] ఇంతకుముందు అధ్యాయంలో వివరించబడిన

---

1. "శాల్తీవారీ వేతనాలు చెల్లించే యే వృత్తిలోనైనా..... వేతనాల మొత్తాలు వేర్వేరుగా వుంటాయి.... అయితే కాలంవారీ వేతనాలున్నచోట సాధారణంగా వేతనాలలో ఏకరూపత వుంటుంది..... ఆ వృత్తిలో కార్మిక జనసామాన్యానికి వర్తించే వేతన, ప్రమాణంగా దీన్ని యజమానులూ కార్మికులూ గుర్తిస్తారు" (డున్నింగ్, అదే గ్రంథం, పుట 17)

2. వృత్తి సంఘాల్లో సభ్యులైన కార్మికుల శ్రమ పని కాలాన్ని బట్టి లేదా శాల్తీని బట్టి నిర్ణయించబడుతుంది. ప్రతి వృత్తిలోనూ ఒక కార్మికుడు రోజుకి ఎంత పని చేయగలడో వృత్తి సంఘ యజమానికి సుమారుగా తెలుసు. తరచుగా కార్మికుడు చేసిన పనిని బట్టే చెల్లించడం జరుగుతుంది. ఆ రకంగా కార్మికులు, సొంత ప్రయోజనం ఉన్నందునే ఏ అజమాయిషీ అవసరం లేకుండానే తాము చేయగలిగినంత పనిని చేస్తారు. (Cantillon, "Essai surla Nature du Commerce en general," Amst Ed. 1756, పుటలు 185, 202. మొదటి కూర్పు 1755లో ప్రచురించబడింది) క్వెస్నే. సర్‌జేమ్స్ స్టువార్ట్, ఆడంస్మిత్ ధారాళంగా ఎవరినుండి ఎరువు తెచ్చుకున్నారో ఆ కాంటిలాన్ ఇక్కడ శాల్తీ వేతనమంటే కాలం వేతనానికి మారు రూపం మాత్రమే అన్న సంగతిని చెప్పనే చెప్పాడు. కాంటిలాన్ యొక్క ఫ్రెంచి కూర్పు, ఇంగ్లీషు కూర్పుకి

గంటలవారీ పద్ధతికి ప్రధాన ఆసరాల్లో చివరికి శాల్తీ వేతనం కూడా ఒకటి.[1]

ఇంత వరకూ తెలియజేసిన దాన్ని బట్టి శాల్తీ వేతనం అన్నది పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానానికి అత్యంత అనుకూలమైన వేతనాల రూపమనేది స్పష్టమవుతుంది. అది అధికారికంగా 14వ శతాబ్దపు ఫ్రెంచి, ఇంగ్లీషు కార్మిక చట్టాల్లో కాలం వేతనాలతో పాటు పక్కనే వుంది. శాల్తీ వేతనం అన్నది ఏ రకంగానూ కొత్తది కాకపోయినప్పటికీ అది కార్ఖానా యుగంలో మాత్రమే పైచేయి సంపాదించింది. ఆధునిక పరిశ్రమ యొక్క సంక్షుభిత కౌమారంలో, ముఖ్యంగా 1797 నుండి 1815 వరకూ, అది పని దినాన్ని పొడిగించటానికీ, వేతనాలను తగ్గించడానికీ ఆధారంగా వ్యవహరించింది. ఆ కాలంలో వేతనాల్లో యేర్పడిన హెచ్చు తగ్గుల గురించి తెలియజేసే ప్రధానమైన విషయ సామాగ్రి ఈ బ్లూ బుక్స్‌లో దొరుకుతుంది : "రిపోర్ట్ అండ్ ఎవిడెన్స్ ఫ్రమ్ ది సెలెక్ట్ కమిటీ ఆన్ పిటిషన్స్ రెస్‌పెక్టింగ్ ది కార్న్‌లాస్" (పార్లమెంటరీ సమావేశం, 1813-14). "రిపోర్ట్ ఫ్రమ్ ది లార్డ్స్ కమిటీ, ఆన్ ది స్టేట్ ఆఫ్ ది గ్రోత్, కామర్స్ అండ్ కన్‌జంప్షన్ ఆఫ్ గ్రెయిన్ అండ్ ఆల్ లాస్ రిలేటింగ్ దేర్ టు" (సమావేశం, 1814-15). జాకొబిన్ వ్యతిరేక యుద్ధం ఆరంభం నాటి నుండి శ్రమ ధర నిరంతరాయంగా ఎలా తగ్గించబడిందో తెలియజేసే లిఖిత సాక్ష్యాధారాలివి. ఉదాహరణకు, నేత పరిశ్రమలో శాల్తీ వేతనాలు ఎంతగా పడిపోయాయీ అంటే పని దినాన్ని అపారంగా పొడిగించినప్పటికీ రోజువారీ వేతనాలు అంతకుముందు కంటే తక్కువగానే వున్నాయి. "ఇప్పుడు నేతగాని సంపాదన ఇదివరకు కంటే చాలా తక్కువ. సామాన్య కార్మికుని కంటే మొదట ఎంతో ఎక్కువగా వుండే అతని ఆధిక్యత ఇప్పుడు దాదాపు అంతమైంది. నిజానికి..... నైపుణ్యం గల శ్రమకీ, సాదా శ్రమకీ మధ్య వేతనాలలో గల తేడా ఇంతకు ముందెప్పటికంటే ఇప్పుడు ఎంతో తక్కువ."[2] శాల్తీ వేతనాల కారణంగా పెరిగిన శ్రమ తీవ్రత వల్ల, విస్తృతి వల్ల వ్యవసాయ కార్మికులకు ఎంత తక్కువ ప్రయోజనం చేకూరిందో

---

అనువాదమని శీర్షికలో తెలియజేసుకుంది. అయితే "ది ఆనలైసిస్ ఆఫ్ ట్రేడ్, కామర్స్ బై ఫిలిప్ కాంటిలాన్, లేట్ ఆఫ్ ది సిటి ఆఫ్ లండన్, మర్చంట్ అనే ఇంగ్లీషు కూర్పు. ఫ్రెంచి కూర్పు తర్వాతే ప్రచురించబడింది. (1759) అంతేగాక, దానిలోని విషయాలను బట్టి చూసినా అది తర్వాత సంస్కరించబడిన కూర్పు అని అర్థమవుతుంది. ఉదాహరణకు, ఫ్రెంచి కూర్పులో ఇంకా హ్యూమ్‌ని పేర్కొనడం జరగలేదు. కాగా మరోవైపున ఇంగ్లీషు కూర్పులో ఇక ఏమాత్రమూ పెట్టీ ప్రస్తావన లేదు. ఇంగ్లీషు కూర్పుకి తక్కువ సైద్ధాంతిక ప్రాముఖ్యం వుంది. అయితే దానిలో ప్రత్యేకంగా ఇంగ్లీషు వాణిజ్యమూ, వెండి బంగారాల వ్యాపారమూ వగైరాలకు సంబంధించిన అన్ని రకాల వివరాలూ వున్నాయి. ఇవేవీ ఫ్రెంచి కూర్పులో లేవు. ఇంగ్లీషు కూర్పు ముఖపత్రం పైన యిచ్చిన వివరణని బట్టి యీ గ్రంథం 'కీర్తిశేషుడైన ఒక బుద్ధిశాలి యొక్క రాతప్రతిని అనుసరించి' రాయబడినదని తెలుస్తుంది. అయితే ఆ కాలపు ఆనవాయితీగా యిలా రాయబడిన శుద్ధ కల్పన మాత్రమే అనిపిస్తుంది.

1. పని చేయడానికి అవసరమైన దానికంటే చాలా యెక్కువ మంది కార్మికుల్ని కొన్ని వర్కుషాపులు తీసుకొనడాన్ని మనం యెన్నిసార్లు చూడలేదు? అనిర్దిష్టమైన లేదా పూర్తి ఊహాజనితమైన పనికోసం ఎదురుచూస్తూ తరచుగా కార్మికుల్ని తీసుకోవడం జరుగుతుంది. కార్మికుల కిచ్చేది శాల్తీ వేతనాలు గనుక తమకు పోయేదేమీ లేదనీ, పని కాలం వృథా అయితే పని దొరకని కార్మికులకే నష్టమనీ యజమానులు అనుకుంటారు. (H.Gregoir : "Les Typographes devant le Tribulanal Correctional de Bruxelles," Bruxelles, 1865, పుట 9)
2. "రిమార్క్స్ ఆన్ ది కమర్షియల్ పాలసీ ఆఫ్ గ్రేట్ బ్రిటన్" లండన్, 1815.

భూస్వాములకూ, రైతులకూ అనుకూలంగా రాయబడిన ఒక గ్రంథంలోని ఈ విషయం తెలియజేస్తుంది: వ్యవసాయంలో ఎక్కువ భాగం : పనుల్ని రోజు లెక్కన లేదా శాల్తీ లెక్కన కూలికి పనిచేసే వారే చేస్తారు. వారి వారంవారీ వేతనాలు సుమారు 12 షిల్లింగులుంటాయి. శాల్తీ లెక్కన చేసే వారికి శ్రమ ప్రేరణ ఎక్కువుండటం కారణంగా వారు వారానికి ఒకటో రెండో షిల్లింగులు అదనంగా సంపాదించినప్పటికీ, ఏడాది పొడుగునా అతను కోల్పోయే పని దినాలు ఇంతకంటే ఎక్కువే వుంటాయి..... అంతేగాక వీరి వేతనాలు వారికి అవసరమైన జీవనాధారాలకు నిర్దిష్ట నిష్పత్తిలో వుంటాయి. ఇద్దరు పిల్లలున్న ఒక వ్యక్తి చర్చి సాయం లేకుండానే కుటుంబాన్ని పోషించేలా ఈ నిష్పత్తి వుంటుంది.[1] పార్లమెంట్ ప్రచురించిన వాస్తవాలను ప్రస్తావిస్తూ ఆ సమయంలో మాల్తూస్ ఇలా పేర్కొన్నాడు. "శాల్తీ వేతనాల పద్ధతి మితంగా పెరగడం అన్నదాన్ని నేను సందేహంతో గమనిస్తున్నానని అంగీకరిస్తాను. ఏ మనిషికైనా 12 లేదా 14 గంటల చాకిరీ లేదా అంతకు మించిన పని అన్నది చాలా ఎక్కువ".[2]

ఫ్యాక్టరీ చట్టాలు వర్తించే వర్కుషాపుల్లో శాల్తీ వేతనమన్నది సాధారణ సూత్రమవుతుంది. ఎందుకంటే పెట్టుబడి అక్కడ శ్రమని తీవ్రతరం చెయ్యడం ద్వారా మాత్రమే పని దినం యొక్క సార్థకతను పెంచగలుగుతుంది.[3]

శ్రమ ఉద్పాదకత మారడంతో పాటు ఒకే పరిమాణం గల ఉత్పాదితం వేర్వేరు శ్రమ కాలాలకు ప్రాతినిధ్యం వహిస్తుంది. కనుక శాల్తీ వేతనం అన్నది ఒక నిర్ణీత శ్రమ కాలానికి డబ్బు రూపం కనుక అది కూడా మారుతుంది. మనం పైన పేర్కొన్న ఉదాహరణలో 12 గంటల్లో 24 శాల్తీలు ఉత్పత్తి చేయబడ్డాయి. 12 గంటల ఉత్పాదితం విలువ 6 షిల్లింగులు. శ్రమ శక్తి రోజు విలువ 3 షిల్లింగులు. ఒక శ్రమ గంట ధర 3 పెన్నీలు. ఒక శాల్తీకిచ్చే వేతనం $1\frac{1}{2}$ పెన్నీలు. ఒక శాల్తీలో అరగంట శ్రమ చేరింది. అదే పని దినం ఇప్పుడు శ్రమ ఉత్పాదకత రెట్టింపు కావడం వల్ల 24 శాల్తీలకు బదులు 48 శాల్తీలు సరఫరా చేసిందనుకుందాం. ఇతర పరిస్థితులన్నీ యధాతథంగా వుంటే, అప్పుడు శాల్తీ వేతనం $1\frac{1}{2}$ పెన్నీ నుండి 3/4 పెన్నీకి పడిపోతుంది. ఎందుకంటే, ఇప్పుడు ప్రతి శాల్తీ పని గంటలో 1/2 కి బదులు 1/4వ వంతుకే ప్రాతినిధ్యం వహిస్తుంది. 24 ని $1\frac{1}{2}$ పెన్నీతో భాగిస్తే 3 షిల్లింగులొస్తుంది. అలాగే 48 ని 3/4తో భాగిస్తే 3 షిల్లింగులొస్తుంది. మరో రకంగా చెప్పాలంటే, ఒకే వ్యవధిలో ఉత్పత్తి అయ్యే శాల్తీల సంఖ్య పెరిగే నిష్పత్తిలోనే, ఒకే శాల్తీపై వెచ్చించిన శ్రమ కాలం పడిపోతుంది. కనుక శాల్తీ వేతనం తగ్గుతుంది.[4]

---

1. "ఎ డిఫెన్స్ ఆఫ్ ది ల్యాండ్ ఓనర్స్ అండ్ ఫార్మర్స్ ఆఫ్ గ్రేట్ బ్రిటన్" లండన్, 1815.
2. మాల్తస్ : "ఇంక్వైరీ ఇంటు ది నేచర్ అండ్ ప్రోగ్రెస్ ఆఫ్ రెంట్" లండన్, 1815.
3. "శాల్తీవారీ వేతనం పొందేవారు...... బహుశా ఫ్యాక్టరీల్లో ఐదింట నాలుగు వంతుల మంది వుంటారు". "రిపోర్ట్ ఆఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్, ఏప్రిల్ 30, 1858"
4. "తన వడికే యంత్రం యొక్క ఉత్పాదక శక్తి కచ్చితంగా కొలవబడుతుంది. దానిపై చేసే పనికి చెల్లించే వేతనం రేటు ఉత్పాదకత పెరిగినంత కాకపోయినా, దానితో పాటు తగ్గుతుంది." (ఉరే, అదే గ్రంథం పుట 317) ఈ చివరి వకాల్తాదారీ పదాన్ని మళ్లీ ఉరే స్వయంగా రద్దుచేస్తాడు. వడికే యంత్రంపై పని కాలాన్ని పెంచడం ద్వారా కొంత శ్రమ పెరుగుతుందని అతను ఆమోదిస్తాడు. కనుక ఉత్పాదకత పెరిగిన

శాల్తీ వేతనాల్లో కేవలం నామమాత్రమైన ఈ మార్పు పెట్టుబడిదారునికీ, కార్మికునికీ మధ్య నిరంతరాయమైన పోరాటాలకు దారి తీస్తుంది. శ్రమ ధరని వాస్తవంగా తగ్గించడానికి దానిని పెట్టుబడిదారుడు ఒక సాకుగా ఉపయోగించడం వల్లనో, లేదా పెరిగిన శ్రమ ఉత్పాదక శక్తితో పాటు దాని తీవ్రత కూడా పెరగడం వల్లనో ఇది జరుగుతుంది. లేదా శాల్తీ వేతనాల రూపాన్ని అనగా తన శ్రమ శక్తికి గాక తన ఉత్పాదితానికి చెల్లించబడిన వేతనాన్ని చూసి, కార్మికుడు దాన్ని తీవ్రమైన విషయంగా పరిగణించడం వల్ల సరుకు అమ్మకం ధరలో తగ్గుదల లేకుండానే తన వేతనాలు తగ్గడానికి వ్యతిరేకంగా అతను తిరుగుబాటు చేస్తాడు. "కార్మికులు ముడిపదార్థాల ధరనీ, ఉత్పత్తి అయిన వస్తువుల ధరనీ జాగ్రత్తగా గమనిస్తారు. ఆ రకంగా వారు తమ యజమాని లాభాలను కచ్చితంగా అంచనా వేయగలుగుతారు.[1]

ఇలా మాట్లాడేవారు తీవ్రమైన పొరపాటు చేస్తున్నారనీ వేతన శ్రమ స్వభావం వారికి ఏమాత్రం అర్థం కాలేదంటాడు పెట్టుబడిదారుడు.[2] ఈ స్వాహాదారీ ప్రయత్నాన్ని తన పరిశ్రమ పురోగమనంపై విధిస్తున్న పన్నులని అతడు ఆక్రోశిస్తాడు. శ్రమ ఉత్పాదకతతో కార్మికునికి ఏ మాత్రం ప్రమేయం లేదని ప్రకటిస్తాడు.[3]

---

నిష్పత్తిలోనే శ్రమ తగ్గదు. ఇంకా: "ఈ పెరుగుదల వల్ల యంత్రం యొక్క ఉత్పాదకత శక్తి అయిదోవంతు పెరుగుతుంది. ఈ సంఘటన జరిగినప్పుడు వడికే వానికి యింతకుముందు చెల్లించిన వేతనం రేటే చెల్లించబడదు. అయితే ఆ రేటు అయిదో వంతు ప్రకారం తగ్గిపోదు. ఈ పెరుగుదల అతను పనిచేసే యెన్ని గంటల ఆదాయాన్నైనా కొంత పెంచుతుంది." అయితే "ఈ ప్రకటనలో కొంత మార్పు అవసరం... అతనీ అదనపు 6 పెన్నీలలో కొంత, పెద్ద వాళ్ళ స్థానంలో పని చేసిన బాల కార్మికులకు చెల్లించాలి" (అదే గ్రంథం, పుట 321) దానికి ఏ రకంగానూ వేతనాలు పెంచే ధోరణి లేదు.

1. హెచ్. ఫాసెట్ : ది ఎకనామిక్ పొజిషన్ ఆఫ్ ది బ్రిటీష్ లేబరర్" కేంబ్రిడ్జి, లండన్, 1865 పుట 178.
2. 1861, అక్టోబర్ 26వ తేదీ లండన్ 'స్టాండర్డు' పత్రికలో ఒక దావాకి సంబంధించిన వార్త : ఇది రోచ్‌డేల్ మేజిస్ట్రేట్ల ముందున్న జాన్ బ్రైట్ అండ్ కంపెనీ దావా. "తివాచీ నేతగాళ్ళ ట్రేడ్ యూనియన్ల ప్రతినిధుల బెదిరింపులకు వ్యతిరేకంగా" నడిపిన దావా యిది. "బ్రైట్ భాగస్వాములు కొత్త యంత్రాలను ప్రవేశపెట్టారు. అవి అంతకుముందు 160 గజాల తివాచీలను ఉత్పత్తి చేయడానికి పట్టే కాలంలో, అంతే శ్రమ (!)తో యిప్పుడు 240 గజాల తివాచీలు ఉత్పత్తి చేస్తాయి. యాంత్రిక మెరుగుదల కోసం యజమాని తన పెట్టుబడిలో కొంత భాగాన్ని మదుపు పెట్టగా వచ్చే లాభాలలో వాటా కోరే హక్కు కార్మికులకు లేదు. దాని ప్రకారం బ్రైట్ కంపెనీ వారు గజానికి $1\frac{1}{2}$ పెన్నీ నుండి 1 పెన్నీకి వేతనం రేటు తగ్గించారు. అదే శ్రమతో, కార్మికులు ఇదివరకు సంపాదించగలిగినంతే సంపాదిస్తారు. అయితే యిక్కడ నామమాత్రమైన తగ్గుదల వుంది. దీనిని గురించి కార్మికులకు ముందుగానే హెచ్చరించడం జరుగలేదు".
3. తమ వేతనాలని నిలబెట్టి వుంచుకోటానికి గాను ట్రేడ్ యూనియన్లు మెరుగుపడిన యంత్రాల లాభాలని పంచుకోటానికి ప్రయత్నిస్తాయి. (ఎంత భయానకం) శ్రమ తగ్గింది కనుక, పెచ్చు వేతనాలను డిమాండ్ చేయడం అంటే మరో రకంగా చెప్పాలంటే యాంత్రిక మెరుగుదలలపైన పన్ను విధించడానికి ప్రయత్నించడమే అవుతుంది.
(ఆన్ కాంబినేషన్ ఆఫ్ ట్రేడ్స్ - న్యూ ఎడిషన్, లండన్ 1834, పుట 42)

# అధ్యాయం - 22

# వేతనాలలో జాతీయ భేదాలు

శ్రమ శక్తి విలువ పరిమాణంలో మార్పుని తెచ్చే పలురకాల కలయికల గురించి మనం 17వ అధ్యాయంలో దృష్టిని కేంద్రీకరించాము. అదనపు విలువతో పోల్చి సాపేక్షంగానో లేదా నిరపేక్షంగానో ఈ విలువని పరిశీలించాము. కాగా మరో ప్రక్క శ్రమధరయే జీవితావసర సాధనాల పరిమాణంతో భౌతిక రూపం ధరించిందో ఆ పరిమాణం శ్రమ ధరతో ప్రమేయం లేకుండానూ, దానికంటే భిన్నంగానూ హెచ్చు తగ్గులకు గురవుతుంది.[1] ఇంతకు ముందే చెప్పినట్టుగా, వేతనాల బాహ్య రూపంగా శ్రమ శక్తి విలువ లేదా ధర యొక్క సాదా పరివర్తన అనేది ఈ నియమాలన్నిటినీ వేతనాల హెచ్చుతగ్గుల నియమాలుగా మారుస్తుంది. ఈ వేతనాల హెచ్చు తగ్గుల్లో ఒక దేశం లోపల వేరు వేరు కలయికల పరంపరగా కన్పించేదే, విభిన్న దేశాల వేతనాల్లో ఏకకాలంలో వుండే జాతీయ భేదంగా కన్పిస్తుంది. కనుక వివిధ దేశాల వేతనాలని పోల్చడంలో, శ్రమ శక్తి విలువ మొత్తంలో మార్పుల్ని నిర్ధారించే అన్ని అంశాలనూ మనం పరిగణనలోకి తీసుకోవాలి. అనగా ప్రాకృతికంగా, చారిత్రకంగా పరిణమించిన ప్రాథమిక జీవితావసరాల ధరనీ, విస్తృతినీ, కార్మికుల శిక్షణా వ్యయాన్ని స్త్రీల శ్రమా, పిల్లల శ్రమా నిర్వహించే పాత్రనీ, శ్రమ ఉత్పాదకతనీ, దాని విస్తృత, సాంద్రతర పరిమాణాన్ని లెక్కలోకి తీసుకోవాలి. కేవలం పైపైన పోల్చాలన్నా విభిన్న దేశాల్లోని ఒకే వృత్తిలో సగటురోజు వేతనాన్ని మొదట ఒకేలాంటి పని దినంగా కుదించడం అవసరం. ఈ విధంగా ఒకేలాంటి రోజు వేతనాలుగా లెక్కించిన తర్వాత కాలం వేతనాలను మళ్ళీ శాల్తీ వేతనాలుగా మార్చాలి. ఎందుకంటే, శ్రమ ఉత్పాదకత, తీవ్రత అనే రెంటికీ శాల్తీ వేతనాలు మాత్రమే కొలమానం.

ప్రతి దేశంలోనూ కొంత సగటు శ్రమ తీవ్రత వుంటుంది. దానికంటే తక్కువుంటే శ్రమ ఒక సరుకు ఉత్పత్తి చేయడానికి, సామాజిక అవసర కాలం కంటే ఎక్కువ కాలం పడుతుంది. కనుక అది మామూలు నాణ్యత వున్న శ్రమగా లెక్కించబడదు. ఒక దేశంలో జాతీయ సగటుకి మించిన తీవ్రతా స్థాయి మాత్రమే శ్రమ కాలావధిని బట్టి విలువ కొలమానాన్ని మార్చగలుగుతుంది. ప్రపంచ మార్కెట్‌కి ఇది వర్తించదు. విడిగా దేశాలన్నీ దానిలో అంతర్భాగాలు. సగటు శ్రమ తీవ్రత అనేది వేర్వేరు దేశాల్లో వేర్వేరుగా వుంటుంది. ఒకచోట ఎక్కువ వుంటుంది. మరోచోట తక్కువుంటుంది. ఈ జాతీయ సగటులు ఒక కొలమానాన్ని ఏర్పరుస్తాయి. దాని కొలమాన ప్రమాణమే ప్రపంచ శ్రమ సగటు

1. "వేతనాలు (వాటి డబ్బు రూపాన్ని అతడు ప్రస్తావిస్తున్నాడు) మరింత చౌక అయిన వస్తువుని మరింత ఎక్కువగా కొన్నంత మాత్రాన అవి పెరిగినట్టు కాదు" (ఆడమ్ స్మిత్ "వెల్త్"ని తాను ప్రచురించిన కూర్పులో డేవిడ్ బుకానన్, 1814, సంపుటి 1, పుట 417,నోట్)

ప్రమాణం. కనుక ఎక్కువ తీవ్రత గల్గిన జాతీయ శ్రమ, తక్కువ తీవ్రత వున్న శ్రమతో పోలిస్తే ఒకే కాలంలో ఎక్కువ డబ్బు రూపంలో వున్న ఎక్కువ విలువని ఉత్పత్తి చేస్తుంది.

అయితే దీని వల్ల విలువ నియమం అంతర్జాతీయ స్థాయిలో వర్తించే సందర్భంలో మరింత మారుతుంది. ప్రపంచ మార్కెట్‌లో ఎక్కువ ఉత్పాదక జాతీయ శ్రమ ఎక్కువ తీవ్రత గల్గిన శ్రమగాకూడా గుర్తించబడుతుంది. అయితే అది ఎక్కువ ఉత్పాదక శక్తి గల దేశం పోటీ వల్ల తన సరుకుల అమ్మకం ధరను వాటి విలువ స్థాయికి తగ్గించనంత వరకు మాత్రమే.

ఒక దేశంలో పెట్టుబడిదారీ ఉత్పత్తి అభివృద్ధి చెందిన నిష్పత్తిలోనే అక్కడ జాతీయ శ్రమ తీవ్రత, ఉత్పాదకతలు కూడా అంతర్జాతీయ స్థాయిని మించి పెరుగుతాయి.[1] కనుక విభిన్న దేశాలలో ఒకే శ్రమ కాలంలో తయారయిన ఒకే లాంటి సరుకుల విభిన్న పరిమాణాలకు అసమాన అంతర్జాతీయ విలువలుంటాయి. అవి విభిన్న ధరల రూపంలో అనగా అంతర్జాతీయ విలువల్ని బట్టి మారే డబ్బు మొత్తాల్లో వుంటాయి. కనుక పెట్టుబడిదారీ విధానం తక్కువ అభివృద్ధి చెందిన దేశం కంటే ఎక్కువ అభివృద్ధి చెందిన దేశానికి చెందిన డబ్బు సాపేక్ష విలువ తక్కువుంటుంది. కాబట్టి నామమాత్ర వేతనాలు, అనగా డబ్బు రూపంలో వున్న శ్రమ శక్తి సమ విలువ కూడా రెండో దేశంలో కంటే మొదటి దానిలో ఎక్కువుంటుంది. అయితే ఇది నిజ వేతనాలకు, అనగా కార్మికునికి అందుబాటులో వున్న జీవితాధార వస్తువులకు కూడా వర్తిస్తుందని రుజువైనట్టు కానేకాదు.

అయితే విభిన్న దేశాల డబ్బు విలువలో ఈ సాపేక్ష భేదాల సంగతెలా వున్నా రోజు వేతనాలూ, వారం వేతనాలూ మొదటి దేశంలో రెండో దేశంలో కంటే ఎక్కువ ఉంటున్నాయనీ, కాగా శ్రమ యొక్క సాపేక్షధర, అనగా అదనపు విలువ, ఉత్పాదితం విలువ రెంటితోనూ పోల్చబడిన శ్రమ ధర రెండో దానిలో మొదటి దాని కంటె ఎక్కువుంటోందనీ తరచుగా గమనించబడుతుంది.[2]

1833 ఫ్యాక్టరీ కమీషన్ సభ్యుడు, జె.డబ్ల్యు.కొవెల్ నూలు వ్యాపారాన్ని జాగ్రత్తగా పరిశీలించిన

---

1. ఉత్పాదకతకి సంబంధించిన ఏ పరిస్థితులు విడి పారిశ్రామిక శాఖల్లో ఈ నియమాన్ని మారుస్తాయో మరోచోట పరిశీలిద్దాం.

2. ఆడమ్ స్మిత్‌తో జరిపిన సంవాదంలో జేమ్స్ ఆండర్సన్ ఇలా అంటాడు: "నేలలో పండేవి, ముఖ్యంగా ధాన్యం చౌకగా వుండే పేద దేశాలలో శ్రమ ధర పైకి మామూలుగా తక్కువ వున్నట్లు కన్పిస్తుంది. అయితే నిజానికి, చాలావరకు అవి ఇతర దేశాలలో కంటే పెచ్చు అనే విషయాన్ని పేర్కొనాలి. ఎందుకంటే, వాస్తవ శ్రమ ధర అంటే కార్మికునికివ్వబడిన రోజు వేతనం కాదు. అది దాని పైకి కన్పించే ధర మాత్రమే. నిర్వహించబడిన ఒక నిర్దిష్ట పనికిగానూ యజమానికి వాస్తవంగా ఎంత ఖర్చవుతుందో అదే వాస్తవ ధర. ఈ దృష్టి నుండి చూస్తే పేద దేశాలలో కంటే ధనిక దేశాల్లోనే శ్రమ దాదాపు అన్ని సందర్భాల్లోనూ చౌక, ధాన్యం వగైరా జీవితావసర వస్తువుల ధరలు పేద దేశాల్లో సాధారణంగా తక్కువే అయినప్పటికీ..... రోజు వేతనాన్ని బట్టిచూస్తే శ్రమ ఇంగ్లండులో కంటే స్కాట్లండ్‌లో చాలా చౌక.... శాల్తీవారీ శ్రమ సాధారణంగా ఇంగ్లండులోనే చౌక. (జేమ్స్ ఆండర్సన్ : "అబ్జర్వేషన్స్ ఆన్ ది మీన్స్ ఆఫ్ యెక్సైటింగ్ ఏ స్పిరిట్ ఆఫ్ నేషనల్ ఇండస్ట్రీ..... 1777, పుటలు 350, 351.) అందుకు విరుద్ధంగా వేతనాలు తక్కువగా వుండటం వల్ల శ్రమ అనేది ప్రియమవుతుంది." "ఇంగ్లండులో కంటే ఐర్లండులో శ్రమ ప్రియం... ఎందుకంటే వేతనాలు చాలా తక్కువ." (సంఖ్య 2074, "రాయల్ కమిషన్ ఆన్ రైల్వేస్, మినిట్స్" 1867)

తర్వాత ఈ నిర్ధారణకొచ్చాడు: "యూరపు ఖండంతో పోలిస్తే ఇంగ్లండులో కార్మికుడు పొందే వేతనం ఎక్కువే అయినప్పటికీ పెట్టుబడిదారుడు ఇచ్చే వేతనాలు మాత్రం తక్కువ. (ఉరే, పుట 314) ఇంగ్లీషు ఫ్యాక్టరీ ఇన్‌స్పెక్టర్ అలగ్జాండర్ రెడ్ గ్రేవ్ తన 1866, అక్టోబరు 31 నివేదికలో, యూరపు ఖండ దేశాలతో పోల్చబడిన గణాంకాలతో ఈ విషయం రుజువు చేశాడు : అదేమంటే యూరపు ఖండ దేశాల శ్రమకి ఎక్కువ శ్రమకాలమూ, తక్కువ వేతనాలూ ముడుతున్నప్పటికీ అది ఉత్పాదితంతో పోలిస్తే ఇంగ్లండులో కంటే ప్రియం. ఓల్డేన్‌బర్గ్‌లో ఒక నూలు మిల్లులో రోజూ పని కాలం శనివారాలతో సహా ఉదయం 5.30 నుండి రాత్రి 8 గంటల వరకూ వుంటుందనీ, ఇక్కడి కార్మికులు ఇంగ్లీషు పర్యవేక్షకుల కింద పనిచేసినప్పుడు ఈ పని కాలంలో ఇంగ్లీషు కార్మికులు 10 గంటలలో సరఫరా జేసే ఉత్పాదితాన్ని సరఫరా చేయలేరనీ, జర్మన్ పర్యవేక్షకుల కింద పని చేసినప్పుడు వారు ఇంకా తక్కువ ఉత్పత్తి చేస్తారనీ ఆ మిల్లు యొక్క ఇంగ్లీషు మేనేజర్ ప్రకటించాడు. వేతనాలు ఇంగ్లండులో కంటే చాలా తక్కువ. చాలా సందర్భాల్లో అవి 50% వుంటాయి. అయితే యంత్రాలతో పోలిస్తే కార్మికుల నిష్పత్తి చాలా ఎక్కువ. కొన్ని డిపార్ట్‌మెంటుల్లో 5:3 నిష్పత్తిలో వున్నారు. రష్యన్ నూలు మిల్లు గురించి రెడ్ గ్రేడ్ పూర్తి వివరాలు ఇచ్చాడు. ఇటీవల కాలం వరకూ అక్కడ పనిచేసిన ఒక ఇంగ్లీషు మేనేజరు అతనికి ఈ గణాంక సమాచారమిచ్చాడు. ఈ రష్యన్ నేలపై జరగని దురాగతం లేదు. ఇంగ్లీషు ఫ్యాక్టరీల పాత బీభత్సాలన్నీ ఇక్కడ పూర్తిగా తాండవిస్తున్నాయి. ఫ్యాక్టరీ వ్యవహారాలు స్థానిక రష్యన్ పెట్టుబడిదారుడికి చేతగావు కనుక మేనేజర్లందరూ ఇంగ్లీషు వాళ్ళే. రాత్రింబగళ్ళు కార్మికులతో అపరిమితంగా పనిజేయించినప్పటికీ, వారికి అత్యంత లజ్జాకరమైనంత తక్కువ వేతనాలను చెల్లించినప్పటికీ, రష్యన్ పరిశ్రమ కేవలం విదేశీ పోటీని నిషేధించడం ద్వారా మాత్రమే మన గలుగుతోంది. దీనికి ఉదాహరణగా నేను రెడ్‌గ్రేవ్ ఇచ్చిన పట్టికని యిస్తాను. ఫ్యాక్టరీకి, వడికే కార్మికునికి సగటున ఎన్ని కదుళ్ల చొప్పున వున్నాయో ఈ పట్టిక తెలియజేస్తుంది. ఈ అంకెలను తాను కొన్ని సంవత్సరాల క్రితం సేకరించాననీ, అప్పటికీ ఇప్పటికీ ఇంగ్లండులో ఫ్యాక్టరీల పరిమాణమూ, కదుళ్ళ సంఖ్యా పెరిగాయని ఆయన పేర్కొన్నాడు. అయితే దాదాపు ఇదే పెరుగుదల తాను పేర్కొన్న ఇతర దేశాలకు కూడా వర్తిస్తుంది కనుక ఇక్కడ ఇచ్చిన అంకెలు పోల్చి చూడడానికి ఇంకా పనికొస్తాయని అతడు భావించాడు.

**ఫ్యాక్టరీలో సగటున కదుళ్ల సంఖ్య**

| | |
|---|---|
| ఇంగ్లండు ........................................ | 12,600 |
| ఫ్రాన్సు ........................................ | 1,500 |
| ప్రష్యా ........................................ | 1,500 |
| బెల్జియం ........................................ | 4,000 |
| శాక్సనీ ........................................ | 4,500 |
| ఆస్ట్రియా ........................................ | 7,000 |
| స్విట్జర్లాండు........................................ | 8,000 |

**ఒక కార్మికుడు పనిచేసే కదుళ్ళ సగటు సంఖ్య**

| | | |
|---|---|---|
| ఫ్రాన్సు | ఒక కార్మికుడు | 14 కదుళ్ళు |
| రష్యా | ” | 28 ” |
| ప్రష్యా | ” | 37 ” |
| బవేరియా | ” | 46 ” |
| ఆస్ట్రియా | ” | 49 ” |
| బెల్జియం | ” | 50 ” |
| శాక్సనీ | ” | 50 ” |
| స్విట్జర్లాండు | ” | 55 ” |
| జర్మనీలో చిన్న రాజ్యాలు | ” | 55 ” |
| గ్రేట్ బ్రిటన్ | ” | 74 ” |

గ్రేట్ బ్రిటన్‌లో చాలా ఫ్యాక్టరీల్లో విద్యుచ్ఛక్తితో నడిచే నేత పనితో పాటు, నూలు వడకటం అన్నది జంటగా వుంటుంది. (అయితే పట్టికలో ఇచ్చిన లెక్కల్లో నేతగాళ్ళను తీసేయడం జరగలేదు) కనుక ఈ పోలిక ఇంకా గ్రేట్ బ్రిటన్‌కే ప్రతికూలంగా వుందని రెడ్ గ్రేవ్ అన్నాడు. “విదేశాల్లో వున్న ఫ్యాక్టరీలు ప్రధానంగా నూలు మిల్లులు, నూలు మిల్లుల్ని, నూలు మిల్లులతోనే పోల్చడానికి వీలుంటే మా జిల్లాలో 2,200 కదుళ్లున్న మిల్లుని ఒక కార్మికుడు, ఇద్దరు సహాయకులతో నిర్వహిస్తూ రోజుకి 400 మైళ్ళ పొడవు గల 320 పౌనుల నూలు వడుకుతాడు” (రిపోర్ట్స్ ఆఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్, అక్టోబరు 31; 1866 పుటలు 31 – 37).

తూర్పు యూరపులోనూ, ఆసియాలోనూ ఇంగ్లీషు కంపెనీలు రైల్వే నిర్మాణాన్ని చేపట్టాయనీ, ఆ నిర్మాణంలో అవి స్థానిక కార్మికులతో పాటు కొంతమంది ఇంగ్లీషు కార్మికులను కూడా నియోగించాయనీ అందరికీ తెలిసిందే. ఆచరణలో అవసరం వల్ల వారు శ్రమ తీవ్రతలో వుండే జాతీయ భేదాల్ని పరిగణనలోకి తీసుకోవలసి వచ్చింది. అయితే దీని వల్ల వారికేమీ నష్ట రాలేదు. వారి అనుభవం తెలియజేసేదేమంటే – వేతనాల స్థాయి సగటు శ్రమ తీవ్రతకి దాదాపు అనుగుణంగా వున్నప్పటికీ, శ్రమ యొక్క సాపేక్ష ధర సాధారణంగా విలోమ దిశలో మారుతుంది.

“వేతనాల రేటుపై వ్యాసం”[1] అనే తన మొదటి ఆర్థిక రచనల్లో ఒక దానిలో హెచ్.కారీ రుజువు చేయడానికి ప్రయత్నించిన అంశం యిది : విభిన్న దేశాల వేతనాలు జాతీయ పని దినాల ఉత్పాదక స్థాయికి అనులోమంగా వుంటాయి. అనగా వేతనాలు ప్రతిచోటా శ్రమ ఉత్పాదకతని బట్టి అదే నిష్పత్తిలో పెరుగుతాయి. తరుగుతాయి. అదనపు విలువ ఉత్పత్తిపై జరిపిన మన విశ్లేషణ యావత్తూ ఈ నిర్ధారణ యొక్క అసంబద్ధతని తెలియజేస్తుంది. గందరగోళపు గణాంక సమాచారాన్ని తారుమారు చేయడం ద్వారా తన ప్రాథమిక ప్రతిపాదనను, తన మామూలు విమర్శనారహిత, పైపై

1. “ఎస్సే ఆన్ ది రేట్ ఆఫ్ వేజెస్ : విత్ ఆన్ యెక్జామినేషన్ ఆఫ్ ది కాజెస్ ఆఫ్ ద డిఫరెన్సెస్ యిన్ ది కండిషన్స్ ఆఫ్ ది లేబరింగ్ త్రూ ఔట్ ది వరల్డ్”. ఫిలడెల్ఫియా 1835

ధోరణితో నిరూపించాడనుకున్నప్పటికీ ఇది అసంబద్ధమే. అతని సిద్ధాంతం ప్రకారం ఉండాల్సిన రీతిలోనే పరిస్థితులు వాస్తవంగా వున్నాయని అతడు వక్కాణించక పోవడమే అతని రచనలో వున్న అత్యుత్తమ అంశం. దానికతడు సహజ ఆర్థిక సంబంధాలను ప్రభుత్వ జోక్యం వక్రీకరించిందంటాడు. కనుక ప్రతిదాని నుండీ పన్నుల రూపంలో ప్రభుత్వానికి పోయేదంతా కార్మికుడికే సంక్రమించిం దనుకొని విభిన్న జాతీయ వేతనాలను లెక్కించాలి అంటాడతను. అయితే ఆ 'ప్రభుత్వ ఖర్చులు' పెట్టుబడిదారీ అభివృద్ధి యొక్క 'సహజ' ఫలితాలేనని కారీ అర్థం చేసుకోవద్దా? పెట్టుబడిదారీ ఉత్పత్తి సంబంధాలు అనేవి ప్రకృతి సిద్ధమైన, తర్కబద్ధమైన శాశ్వత నియమాలనీ, ప్రభుత్వం జోక్యం వల్లనే అవి స్వేచ్ఛగా, సహజంగా వర్తించడానికి భంగం కలుగుతోందనీ మొట్టమొదట ప్రకటించిన మనిషికి తగినట్టుగానే వుంది ఈ తర్కం. ప్రపంచ మార్కెటు పైన ఇంగ్లండు యొక్క దుష్ట ప్రభావం (ఈ ప్రభావం పెట్టుబడిదారీ ఉత్పత్తి సహజ నియమాల నుండి తలెత్తలేదన్నట్టు!) కారణంగా ప్రభుత్వం జోక్యం అనగా ఆ ప్రాకృతిక, తార్కిక నియమాలకు ప్రభుత్వ రక్షణ, అనగా వాణిజ్య రక్షణ వ్యవస్థ అనేది అవసరమవుతోందన్న సంగతిని ఆ తర్వాత అతడు కనుగొన్నాడు. సామాజిక శత్రుత్వాలూ వైరుధ్యాలూ రికార్డో తదితరుల సిద్ధాంతాల్లో, పొందుపరచబడ్డాయి కదా, అవి నిజమైన ఆర్థిక చలనానికి భావ రూపాలు అని కాక, విరుద్ధంగా ఇంగ్లండులోనూ, ఇతర చోట్లా పెట్టుబడిదారీ ఉత్పత్తిలో వున్న శత్రుత్వాలు రికార్డో తదితరుల సిద్ధాంతాల ఫలితమే అని కూడా అతను కనుగొన్నాడు. అసలు పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం యొక్క సహజాత సౌందర్యాన్నీ, సామరస్యాన్ని నాశనం చేస్తూ వున్నది అంతిమంగా వాణిజ్యమేనని కూడా అతను చివరికి కనుగొన్నాడు. ఒక్క అడుగు ముందుకు వేసి, పెట్టుబడిదారీ విధానంలో వున్న ఒకే ఒక దౌష్ట్యం పెట్టుబడే అని కనుగొన్నా కనుగొనగలడు. అతని వాణిజ్య రక్షణవాద కులభ్రష్టత మాట ఎలా ఉన్నప్పటికీ, బాస్టియట్‌లాంటి నేటి స్వేచ్ఛా వ్యాపార ఆశావాదుల సొంపైన విజ్ఞానానికి నిగూఢ ఆధారంగా వుండాలీ అంటే దానికి విమర్శనా శక్తి అన్నది కలికాని క్కూడా ఇంత నకలీ పాండిత్యం వున్న మనిషి మాత్రమే అర్హుడు.

## ఏడవ భాగం

# పెట్టుబడి సంచయనం

పెట్టుబడిగా విధిని నిర్వహించనున్న విలువ మొత్తంలో కొంత డబ్బు, మొదటి దశలో ఉత్పత్తి సాధనాలుగానూ, శ్రమశక్తిగానూ మార్చబడుతుంది. ఈ మార్పు చలామణి రంగంలో అంతర్భాగమైన మార్కెట్‌లో జరుగుతుంది. ఉత్పత్తి సాధనాలు సరుకులుగా మార్పు చెందటంలో ఉత్పత్తి క్రమం యొక్క రెండవ దశ పూర్తి అవుతుంది. ఆ విధంగా మార్పు చేయబడిన సరుకు విలువ, దాని అంతర్భాగాల విలువ కన్నా అధికంగా వుంటుంది కాబట్టి, అందులో ప్రారంభంలో అడ్వాన్స్ చేయబడిన పెట్టుబడితో పాటు అదనపు విలువ కూడా వుంటుంది. ఈ సరుకులను తిరిగి చలామణి రంగంలో ప్రవేశపెట్టాలి. అవి అమ్ముడు పోవాలి; వాటి విలువను డబ్బు రూపంలో రాబట్టుకోవాలి; ఆ డబ్బును తిరిగి పెట్టుబడిగా మార్చుకోవాలి. అది ఆ విధంగా పునరావృత్తం అవుతుంది. అదే దశలలో నిరంతరం పునరావృత్తం అయ్యే ఈ వర్తులాకార చలనమే పెట్టుబడి యొక్క చలామణిగా రూపొందుతుంది.

పెట్టుబడిదారుడు తన సరుకులను అమ్మి తద్వారా పొందిన డబ్బులో ఎక్కువ భాగాన్ని తిరిగి పెట్టుబడిగా మార్చుకోగలగడమే సంచయనానికుండే ప్రథమ షరతు. సాధారణమైన పద్ధతిలో పెట్టుబడి చలామణి అవుతుందనే ప్రమేయాన్ని రాబోయే పుటలలో మనం భావిస్తాం. ఈ ప్రక్రియకు సంబంధించిన సవివరమైన విశ్లేషణను రెండో సంపుటిలో చూడవచ్చు.

అదనపు విలువను ఉత్పత్తిచేసే, అనగా శ్రామికుల నుండి వేతనం పొందని శ్రమను నేరుగా రాబట్టి సరుకులో ఇమిడ్చే పెట్టుబడిదారుడు అదనపు విలువను మొట్టమొదటగా కాజేసేవాడేగాని దాని అంతిమ యజమాని కాజాలడు. సంక్లిష్టమైన సామాజికోత్పత్తిలో ఇతర క్రియలను నిర్వర్తించే పెట్టుబడిదారులు, భూస్వాములు, తదితరులతో అతను దానిని పంచుకోవాలి. అందువలన అదనపు విలువ వివిధ భాగాలుగా విభజించబడుతుంది. లాభం, వడ్డీ, వాణిజ్య లాభం, భూమి కౌలులాంటి పరస్పర సంబంధం లేని రూపాలలో, అందులోని భాగాలు వివిధ రకాలైన వ్యక్తులకు చెందుతాయి. అదనపు విలువ యొక్క ఈ మారురూపాలను మూడవ సంపుటిలో మాత్రమే చర్చించగలం.

ఈ రూపాలలో మరుగుపర్చబడిన పునరుత్పత్తి యొక్క నిర్దిష్ట పరిస్థితులను గానీ, చలామణి రంగంలో పెట్టుబడి ధరించే నూతన రూపాలను గానీ ప్రస్తావించకుండా, పెట్టుబడిదారుడు, తాను ఉత్పత్తి చేసిన సరుకులను వాటి విలువకే అమ్ముతాడని ఒక వైపున భావిస్తాం. మొత్తం అదనపు విలువకు యజమానిగా, ఇంకా బాగా చెప్పాలంటే దోపిడీ చేయబడిన సొమ్ముకు భాగస్థులైన వారందరికీ ప్రతినిధిగా, పెట్టుబడిదారీ ఉత్పత్తిదారుని మరొకవైపు నుండి పరిగణిస్తాం. కాబట్టి సంచయనాన్ని

ఒక అనిర్దిష్ట దృక్పథంతో (అబ్‌స్ట్రాక్ట్ పాయింట్ ఆఫ్ వ్యూ) అనగా ఉత్పత్తి ప్రక్రియలో కేవలం ఒక దశగా మాత్రమే ముందుగా పరిశీలన చేస్తాం.

పెట్టుబడిదారుడు తన సరుకులను అమ్ముకోగలిగి, తద్వారా పొందిన డబ్బును పెట్టుబడిగా మార్చుకోగలిగిన మేరకు సంచయనం జరుగుతుంది. పైగా, అదనపు విలువ అనేక భాగాలుగా విభజించబడినందువల్ల దాని స్వభావంలో గానీ, సంచయనానికి అదొక సాధనమయ్యే పరిస్థితులలో గానీ ఏ విధమైన మార్పు వుండదు. తన ఆధీనంలో వుంచుకున్నటువంటి లేక ఇతరులకు వదిలి వేసినటువంటి అదనపు విలువ నిష్పత్తి, ఏదైనప్పటికీ పారిశ్రామిక పెట్టుబండిదారుడే దానిని ముందుగా స్వాహా చేస్తాడు. కాబట్టి వాస్తవంలో జరిగేదానికి మించి మనం ఊహించం. అదనపు విలువ విభజించబడటం మూలంగానూ, చలామణి ప్రభావం వల్లనూ సంచయన ప్రక్రియ యొక్క మౌలిక రూపం మరొక వైపున నిగూఢ పర్చబడుతుంది. అందువలన ఆ క్రమం యొక్క కచ్చితమైన విశ్లేషణ చేయాలంటే దాని అంతర్గత యంత్రాంగం యొక్క పని విధానాన్ని మరుగుపరచే అంశాలను ప్రస్తుతానికి ప్రస్తావించకపోవడం అవసరం.

## ఏడవ భాగం

# పెట్టుబడి సంచయనం

## అధ్యాయం 23

# సామాన్య పునరుత్పత్తి

**ఒ**క సామాజిక వ్యవస్థలోని ఉత్పత్తి క్రమం యొక్క రూపం ఏదైనప్పటికీ అదొక నిరంతర ప్రక్రియగా నియమిత కాల పరిధిలో అదే దశలలో కొనసాగాలి. ఏ సామాజిక వ్యవస్థలోనైనా వినియోగాన్ని మానుకోవడం అసాధ్యం గనుక, ఉత్పత్తి లేకుండా వుండదు. అందువలన ఉత్పత్తి యొక్క ప్రతి సామాజిక క్రమాన్ని ఒక సుసంఘటితమైన మొత్తంగానూ, ప్రవాహంలాగా నిరంతరం పునఃపూరణమయ్యేదిగానూ, భావించినప్పుడు ఆ క్రమం, అదే సమయంలో, ఒక పునరుత్పత్తి ప్రక్రియలాగా వుంటుంది.

ఉత్పత్తికున్న నియమాలే పునరుత్పత్తికి కూడా వుంటాయి. ఏ సామాజిక వ్యవస్థ అయినా దాని ఉత్పత్తులలో ఒక భాగాన్ని కొత్త ఉత్పత్తుల కారకాలుగానో లేక ఉత్పత్తి సాధనాలుగానో నిరంతరం మార్పు చేయడం ద్వారా తప్ప ఉత్పత్తిని కొనసాగించలేదు; అనగా పునరుత్పత్తి చేయలేదు. మిగిలిన పరిస్థితులలో మార్పు లేనప్పుడు, ఒక సంవత్సర కాలంలో వినియోగించబడే ఉపవస్తువులకు, ముడి సరుకులకు, శ్రమ సాధనాలకు అనగా ఉత్పత్తి సాధనాలకు బదులుగా అదే రకమైన వస్తువులను సమాన మొత్తాలలో ఏర్పాటు చేసుకునే విధానం ద్వారా తప్ప మరొక విధంగా ఏ సమాజమైనా దాని సంపదను పునరుత్పత్తిచేసి అదే స్థాయిలో నిర్వహించలేదు. ఈ వస్తువులన్నింటినీ వార్షికోత్పత్తుల మొత్తం నుండి వేరు చేసి తిరిగి ఉత్పత్తి క్రమంలోకి తాజాగా ప్రవేశపెట్టగలగాలి. కాబట్టి, ప్రతి సంవత్సరపు ఉత్పాదితాలలో ఒక నిర్దిష్టమైన భాగం ఉత్పాదక రంగానికి చెంది యుంటుంది. మొదటి నుండీ ఉత్పత్తిదాయక వినియోగానికై నిర్దేశించబడిన ఈ భాగం వైయక్తిక వినియోగానికి బొత్తిగా అవకాశం లేని వస్తు రూపంలో వుంటుంది.

ఉత్పత్తి, పెట్టుబడి రూపంలో వున్నప్పుడు పునరుత్పత్తి కూడా అదే రూపంలో వుంటుంది. పెట్టుబడిదారీ విధానంలో, శ్రమ ప్రక్రియ ఏ విధంగా పెట్టుబడి స్వీయాభివృద్ధి సాధనంగా కనిపిస్తుందో, అదే విధంగా, పునరుత్పత్తి ప్రక్రియ కూడా పెట్టుబడిగా అడ్వాన్సు చేయబడిన విలువను పునరుత్పత్తి చేసేదిగా అనగా విలువ స్వీయాభివృద్ధి సాధనంగా స్పష్టమవుతుంది. ఒక వ్యక్తి యొక్క డబ్బు నిరంతరం పెట్టుబడిగా వ్యవహరించినపుడు మాత్రమే పెట్టుబడిదారుని యొక్క ఆర్థిక లక్షణాన్ని ఆ వ్యక్తికి స్థిరంగా ఆపాదించగలం. ఉదాహరణకు ఈ సంవత్సరం 100 పౌండ్లను, పెట్టుబడిగా మార్చి 20 పౌండ్ల

అదనపు విలువను ఉత్పత్తిచేస్తే, అదే చర్యను కొనసాగించటానికి ఆ మరుసటి సంవత్సరం, ఆ తరువాత సంవత్సరాలలో కూడా దీనిని పునరావృత్తం చేయాలి. అడ్వాన్స్ చేయబడిన పెట్టుబడి నుండి నియమిత కాల పరిధిలో వచ్చే మిగులుగానూ, లేక పెట్టుబడి ప్రక్రియ మూలంగా (క్యాపిటల్ ఇన్ ప్రాసెస్) నియమిత కాలంలో లభించే ఫలితంగానూ, కనిపించే అదనపు విలువ. పెట్టుబడి నుండి ప్రవహించే ఆదాయంగా రూపొందుతుంది.[1]

ఈ ఆదాయం పెట్టుబడిదారుని వినియోగానికి ఒక నిధిగా మాత్రమే ఉపయోగపడుతూ, అది సమకూరిన వెంటనే ప్రతి సంవత్సరం ఖర్చు అయితే, మిగిలిన పరిస్థితులలో మార్పు లేనప్పుడు, కేవలం సామాన్య పునరుత్పత్తి మాత్రమే సంభవిస్తుంది. ఈ పునరుత్పత్తి పాత మోతాదులో పునరావృత్తం చేయబడిన ఉత్పత్తి ప్రక్రియే అయినప్పటికీ ఆ పునరావృత్త క్రమం లేక దాని కొనసాగింపు ఉత్పత్తి ప్రక్రియకు ఒక నూతన లక్షణాన్ని చేకూర్చటంతో పాటు ముఖ్యంగా దానికి విడివిడిగా క్రమరాహిత్యంగా చేకూరిన కొన్ని స్పష్టమైన లక్షణాలను అదృశ్యం అయ్యేటట్లు చేస్తుంది.

ఉత్పత్తి ప్రక్రియకు నాంది ఒక నిర్ణీత కాలానికి శ్రమశక్తిని కొనుగోలు చేయడమే; నిర్ణీత కాల పరిమితి పూర్తికాగానే ఉత్పత్తియొక్క నిర్దిష్ట కాల పరిమితి అయిన ఒక వారం లేక ఒక మాసం గడిచిపోగానే ఈ నాంది నిరంతరం పునరావృత్తం చేయబడుతుంది. అయితే తన శ్రమశక్తిని వెచ్చించి దాని విలువను మాత్రమే కాక ఇంకొంత అదనపు విలువను కూడా సరుకుల్లో ఇమిడ్చేంత వరకూ కార్మికునికి వేతనం చెల్లించబడదు. కాబట్టి వేతనాల రూపంలో తిరిగి తనకు చెల్లింపు కాక పూర్వమే కార్మికుడు అదనపు విలువను మాత్రమే కాక అస్థిర పెట్టుబడిని కూడా ఉత్పత్తి చేస్తాడు. అదనపు విలువను పెట్టుబడిదారుని యొక్క ప్రైవేట్ వినియోగానికి ఉపయోగపడే నిధిగానూ, అస్థిర పెట్టుబడిని కార్మికుల వేతనాల చెల్లింపు నిధిగానూ ప్రస్తుతానికి పరిగణిద్దాం. ఆ నిధిని ఎంతకాలం వరకు పునరుత్పత్తి చేస్తాడో ఆ మేరకు మాత్రమే అతని ఉద్యోగం కొనసాగుతుంది. కాబట్టి ఉత్పాదితంలో వేతనాలు ఒక భాగం అనే అర్థశాస్త్రవేత్తల సూత్రానికి ఇదే కారణం.[2] దీనిని 18వ అధ్యాయంలో ప్రస్తావించాం. కార్మికునిచే నిరంతరం పునరుత్పత్తి చేయబడుతున్న ఉత్పాదితంలోని ఒక భాగమే వేతనాల రూపంలో అతనికి తిరిగి చెల్లించబడుతుంది. పెట్టుబడిదారుడు కార్మికునికి డబ్బురూపంలో

---

1. "పరాయి శ్రమ ఉత్పాదితాలను (ప్రొడక్ట్సు ఆఫ్ అదర్స్ లేబర్) వినియోగించుకునే ధనికులు మారకం వేయడం ద్వారా మాత్రమే" (సరుకులను కొనుగోలు చేయడం ద్వారా) ఆ ఉత్పాదితాలను పొందగలరు. అందువలన ముందుగానే తమ నిల్వ నిధులు పూర్తిగా ఖర్చు అయిపోయే ప్రమాదానికి ధనికులు లోనయ్యేట్లుగా కనిపిస్తుంది. అయితే మన సామాజిక వ్యవస్థలో, పరాయి శ్రమ ద్వారా తనకు తానే పునరుత్పత్తి చేసుకునే శక్తిని సంపద సంపాదించుకొన్నది.... శ్రమలాగా, సంపద కూడా శ్రమ సాధనం ద్వారా ప్రతి సంవత్సరం ఫలితాన్ని ఇస్తుంది. అయితే ధనికుడు, ఏమాత్రం పేదవాడుగా మారకుండానే ఆ ఫలం ప్రతి సంవత్సరం వాడకం అయిపోతుంది. పెట్టుబడిచే సృష్టించబడిన ఆ ఫలితమే ఆదాయం (రెవెన్యూ)" (సిస్మాండీ, న్యూ ప్రిన్సిపుల్స్ ఆఫ్ పొలిటికల్ ఎకానమీ, పారిస్, 1819, సంపుటి 1; పుటలు 81, 82)
2. "వేతనాలతో పాటు లాభాలను కూడా తయారైన ఉత్పాదితంలో వాస్తవమైన ఒక భాగంగా పరిగణించాలి" (రామ్‌సే,యాన్ ఎస్సే ఆన్ ది డిస్ట్రిబ్యూషన్ ఆఫ్ వెల్త్. పుట 142) "ఉత్పాదితంలోని భాగం వేతనాల రూపంలో కార్మికునికి సంక్రమిస్తుంది." (జె. మిల్ : ఎలిమెంట్స్ ఆఫ్ పొలిటికల్ ఎకానమీ, అనువాదం, పారిసాట్, పారిస్ 1823. పుటలు 33-34)

వేతనం చెల్లిస్తాడు అనే మాట వాస్తవం అయినప్పటికీ ఈ డబ్బు కేవలం కార్మికుని యొక్క శ్రమ ఫలితానికి ఒక రూపాంతరం మాత్రమే. ఉత్పత్తి సాధనాలలోని ఒక భాగాన్ని ఉత్పాదితాలుగా కార్మికుడు మార్పు చేస్తున్నప్పుడు తన గత శ్రమ ఫలితంలోని ఒక భాగాన్ని డబ్బు రూపంలోకి మార్పు చేస్తాడు. గత వారంలో లేక గత సంవత్సరంలోని అతని శ్రమ ఫలితం నుండే ఈ వారం గానీ, లేక ఈ సంవత్సరం గానీ అతని శ్రమ శక్తికి వేతనం చెల్లిస్తున్నారు. ఒక పెట్టుబడిదారుడికీ, ఒక కార్మికుడికీ బదులుగా కార్మికవర్గాన్నీ, పెట్టుబడిదారీ వర్గాన్నీ మొత్తంగా తీసుకుని ఆలోచిస్తే డబ్బు జోక్యం వల్ల ఏర్పడ్డ భ్రమలు పటాపంచలయిపోతాయి. కార్మికవర్గంచే ఉత్పత్తి చేయబడి పెట్టుబడిదారీ వర్గంచే కైవసం చేసుకోబడిన సరుకులలో ఒక భాగాన్ని పెట్టుబడిదారీ వర్గం కార్మిక వర్గానికి ఎల్లప్పుడూ డబ్బు రూపంలో ఆజ్ఞాపత్రాలను (ఆర్డర్–నోట్స్) జారీ చేస్తుంది. కార్మికులు తాము పొందే ఈ ఆజ్ఞాపత్రాలను అదే విధంగా పెట్టుబడిదారీ వర్గానికి తిరిగి ఎల్లప్పుడూ ఇచ్చివేస్తూ తద్వారా తమ స్వీయోత్పత్తిలో కొంత భాగాన్ని తమ వాటాగా పొందుతారు. ఈ లావాదేవీ అంతా ఉత్పాదితం యొక్క సరుకు రూపంలోనూ సరుకు యొక్క డబ్బు రూపంలోనూ మరుగుపర్చబడుతుంది.

కాబట్టి జీవితావసరాలను సమకూర్చే నిధే అస్థిర పెట్టుబడి; లేక కార్మికుని స్వయం పోషణకూ, అతనికుటుంబ నిర్వహణకూ అవసరం అయిన కార్మిక నిధి యొక్క ఒక ప్రత్యేకమైన చారిత్రక రూపం మాత్రమే. సామాజికోత్పత్తి యొక్క రూపం ఏదైనప్పటికీ కార్మికుడు తనే స్వయంగా ఈ నిధిని ఉత్పత్తి, పునరుత్పత్తి చేస్తూ వుండాలి. కార్మికుని చేత సృష్టించబడిన ఉత్పాదితం పెట్టుబడి రూపంలో అతని నుండి నిరంతరం దూరం కావటం మూలంగానే అతని శ్రమకు కార్మిక నిధి నుండి ఎల్లప్పుడూ డబ్బు రూపంలో వేతనాల చెల్లింపు జరుగుతుంది. కార్మికుని శ్రమ ఫలితంగా సృష్టించబడిన ఉత్పాదితాన్నే పెట్టుబడిదారుడు కార్మికునికి అడ్వాన్స్ చేస్తున్నాడనే వాస్తవాన్ని ఈ లావాదేవీలేవీ తలక్రిందు చేయలేవు.[1] భూస్వామికి నిర్బంధంగా చాకిరీ చేయవలసిన పరిస్థితి ఒక రైతుకి ఏర్పడిందనుకుందాం. ఒక వారంలో 3 రోజులు తన స్వంత ఉత్పత్తి సాధనాలతో తన భూమి మీద ఆ రైతు పని చేస్తాడనుకుందాం. మరో 3 రోజులు ఆ భూస్వామి భూమిమీద నిర్బంధంగా పని చేస్తాడు. ఆ రైతు తన శ్రమ నిధిని తానే నిరంతరం పునరుత్పత్తి చేసుకుంటాడు. అతని విషయంలో నిధి అతని శ్రమకీ ద్రవ్యరూప చెల్లింపుగా వుండదు. మరో వ్యక్తి చేత అడ్వాన్సూ చేయబడదు. అయితే దానికి బదులుగా ఆ భూస్వామికి అతను చేసిన చెల్లింపులేని నిర్బంధ శ్రమ, ఇప్పుడు కూడా స్వచ్ఛందంగా చెల్లించబడే శ్రమ లక్షణాన్ని పొందలేదు. ఒకానొక శుభోదయాన ఆ రైతుకున్న భూమిని, పశువులను, విత్తనాలను ఒక్క మాటలో చెప్పాలంటే, అతనికున్న ఉత్పత్తి సాధనాలను ఆ భూస్వామి లాగేసుకుంటే అప్పటి నుండి ఆ రైతు అతని శ్రమ శక్తిని ఆ భూస్వామికి అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. మిగిలిన పరిస్థితులలో మార్పు లేనప్పుడు ఆ రైతు గతంలో లాగా వారంలో 6 రోజులు పని చేస్తే – 3 రోజులు తన కోసం, 3 రోజులు భూస్వామికోసం, – అప్పటి నుండి భూస్వామి వేతనాలు చెల్లించే పెట్టుబడిదారుగా మార్పు చెందుతాడు. గతంలో లాగా ఆ రైతు ఉత్పత్తి సాధనాలను ఉత్పత్తి సాధనాలుగా

1. "కార్మిక వేతనాలకై అడ్వాన్సు చేస్తూ పెట్టుబడి వినియోగించినపుడు (ఎంప్లాయిడ్) శ్రామికుల పోషణకు అవసరమైన నిధికి అని (పెట్టుబడి) చేకూర్చేది యేమీ లేదు." (కాజ్‌నోవ్, తాను ప్రచురించిన "డెఫినిషన్స్ ఇన్ పొలిటికల్ ఎకానమీ" అనే మాల్థస్ గ్రంథానికి రాసిన నోట్‌నుండి, లండన్, 1853, పుట 22)

ఉపయోగించి వాటి విలువను ఉత్పాదితంలోకి బదిలీ చేస్తాడు. గతంలోలాగా ఉత్పాదితంలోని ఒక నిర్దిష్ట భాగం పునరుత్పత్తికి కేటాయించబడుతుంది. అయితే, ఏ క్షణంలోనయితే నిర్బంధ శ్రమ వేతన శ్రమగా మార్చబడిందో, ఆ క్షణం నుండీ, గతంలో వలె నిరంతరాయంగా, రైతు చేత ఉత్పత్తి పునరుత్పత్తి చేయబడుతున్న కార్మిక నిధి, వేతనాల రూపంలో ఆ భూస్వామి చేత అడ్వాన్స్ చేయబడిన పెట్టుబడి రూపాన్ని పొందుతుంది. సంకుచిత దృక్పథం మూలంగా పైకి కనిపించే రూపాన్నీ, ఆ రూపంలో వాస్తవంగా వున్న వస్తువునీ, వేరు చేయలేని బూర్జువా అర్థశాస్త్రవేత్త, ప్రస్తుత కాలంలో కూడా భూతలం మీద అక్కడక్కడ మాత్రమే కార్మిక నిధి పెట్టుబడి రూపంలో బైటపడుతుందనే వాస్తవం ముందు కళ్లు మూసుకుంటున్నాడు.[1]

పెట్టుబడిదారీ ఉత్పత్తి క్రమాన్ని దాని నిరంతరం పునఃపూరణ ప్రవాహంలో గమనించినపుడు మాత్రమే పెట్టుబడిదారుని స్వంత నిధులనుండి అడ్వాన్స్ చేయబడిన విలువగా, అస్థిర పెట్టుబడి తన లక్షణాన్ని కోల్పోయే మాట నిజమే.[2] అయితే ఆ ప్రక్రియకైనా ఏదో ఒక రకమైన ఆరంభం అంటూ వుండాలి. కాబట్టి మన ప్రస్తుత అభిప్రాయాన్ని అనుసరించి, చెల్లింపు లేని ఇతరుల శ్రమతో నిమిత్తం లేకుండానే ఏదో ఒక విధమైన ప్రాథమిక సంచయనం మూలంగా కొంత కాలం క్రితం పెట్టుబడిదారుడు ద్రవ్యాన్ని పొందగలిగి వుండి వుండవచ్చు. కాబట్టి, ఆ విధంగా అతను శ్రమశక్తి కొనుగోలుదారుగా మార్కెట్‌లో ప్రవేశించగలిగాడు. ఇది ఎలా ఉన్నప్పటికీ కేవలం సామాన్య పునరుత్పత్తి క్రమం కొనసాగితే అది అస్థిర పెట్టుబడినే కాక మొత్తం పెట్టుబడిని కూడా ప్రభావితం చేస్తూ మరికొన్ని అద్భుతమైన మార్పులను తీసుకువస్తుంది.

1000 పౌండ్ల పెట్టుబడి వల్ల సంవత్సరానికి 200 పౌండ్ల అదనపు విలువ సృష్టించబడితే దానిని ప్రతి సంవత్సరం వినియోగించుకుంటే 5వ సంవత్సరాంతానికి ఆ విధంగా అనుభవించబడిన మొత్తం అదనపు విలువ 5×200 పౌండ్లకు అనగా మొదట అడ్వాన్స్ చేసిన 1000 పౌండ్లకు సమానమని స్పష్టం అవుతుంది. ఉదాహరణకు సగభాగం మాత్రమే వినియోగం అయినప్పుడు కూడా 10 సంవత్సరాలు గడిచిన తర్వాత ఇదివరకటి ఫలితమే వస్తుంది. ఎందుకంటే 10×100 పౌండ్లు= 1000 పౌండ్లు కాబట్టి. దీని ననుసరించి సాధారణ సూత్రాన్ని ఒక దానిని రూపొందించవచ్చు. అడ్వాన్స్ చేయబడిన పెట్టుబడిని, సాలీనా వినియోగించుకోబడిన అదనపు విలువ చేత విభాగిస్తే పునరుత్పత్తి కాలం లేక సంవత్సరాలు తెలుస్తాయి. ప్రారంభంలో అడ్వాన్స్ చేయబడిన పెట్టుబడి పెట్టుబడిదారుని చేత వినియోగించుకోబడినందువల్ల ఆ కాలానంతరం అదృశ్యం అయిపోతుంది.

---

1. "భూగోళంపై నున్న కార్మికులలోని నాల్గవ వంతుకి మాత్రమే పెట్టుబడిదారులు వేతనాలను అడ్వాన్సు చేస్తున్నారు." (రిచర్డ్ జోన్స్. "టెక్స్ట్‌బుక్ ఆఫ్ లెక్చర్స్ ఆన్ ది పొలిటికల్ ఎకానమీ ఆఫ్ నేషన్స్". హెర్ట్‌ఫోర్ట్, 1852, పుట 36)
2. "కార్ఖానాదారునికి (అనగా కార్మికునికి) అతని యజమానే వేతనాలను అడ్వాన్సు చేస్తున్నప్పటికీ, ఆ యజమాని వాస్తవానికి ఏ విధమైన ఖర్చుకు లోనుకాడు; ఏ వస్తువు మీద అయితే కార్మికుని శ్రమ వెచ్చించబడుతుందో, ఆ వస్తువు విలువ పెరగడం మూలంగా కార్మికునికి చెల్లించిన వేతనాలతో పాటుగా కొంత లాభం కూడా సాధారణంగా తిరిగి పెట్టుబడిదారుకు చేకూర్చబడుతుంది" (ఎ. స్మిత్, వెల్త్ ఆఫ్ నేషన్స్, వేక్ ఫీల్డ్ ఎడిషన్, రెండవ సంపుటి, అధ్యాయం 3, పుట 311)

తన ప్రారంభ పెట్టుబడిని చెక్కు చెదరకుండా వుంచుతున్నాననీ, ఇతరులకు చెల్లింపుకాని శ్రమ ఫలితాన్నే అనగా అదనపు విలువనే వినియోగించుకుంటున్నాననీ పెట్టుబడిదారుడు భావిస్తాడు. అయితే అతని ఆధీనంలోనున్న పెట్టుబడి విలువ, సంవత్సరాలలో అతను స్వాహా చేసిన అదనపు విలువ మొత్తానికి సమానం. ఆ విధంగా అతను వినియోగించుకున్న విలువ మొత్తం అతని ప్రారంభ పెట్టుబడికి సమానం. అతని ఆధీనంలో వున్న పెట్టుబడి మొత్తం మారకుండా అందులో భాగాలు అయిన భవనాలు, యంత్రాలు వగైరా అతని వ్యాపార కార్యకలాపాలు ప్రారంభించినప్పటికే ఉనికిలో ఉన్న మాట నిజమే. అయితే మనకిక్కడ కావలసింది పెట్టుబడి భౌతికాంశాలు కాదు; దాని విలువ మాత్రమే. ఒక వ్యక్తి తన ఆస్తి మొత్తాన్ని వినియోగించుకోవటం ద్వారా ఆ ఆస్తి విలువకు సమానమైన అప్పుల భారాన్ని నెత్తిన వేసుకున్నప్పుడు అతని ఆస్తి అతనికున్న అప్పుల మొత్తాన్ని తప్ప మరిదేన్నీ సూచించదని స్పష్టమవుతుంది. పెట్టుబడిదారుడి విషయంలో కూడా అంతే; అతని ప్రారంభ పెట్టుబడికి సమానమైన మొత్తాన్ని అతను వినియోగించుకున్నపుడు, అతని ప్రస్తుత పెట్టుబడి విలువ, చెల్లింపు లేకుండా స్వాయత్తం చేసుకోబడిన అదనపు విలువ మొత్తాన్ని తప్ప మరి దేన్నీ సూచించదు. అతని పాత పెట్టుబడి విలువలో ఒక్క అణువైనా ప్రస్తుతం ఉనికిలో లేదు.

కాబట్టి, అన్ని విధాలైన సంచయన పద్ధతులను ప్రక్కన పెట్టి కేవలం ఉత్పత్తి ప్రక్రియను కొనసాగిస్తే అనగా సామాన్య పునరుత్పత్తి మాత్రమే జరిగితే, కాస్త ముందూ వెనుకగా, అనివార్యంగా ప్రతి పెట్టుబడి సంచయనం చేయబడిన పెట్టుబడిగా లేక పెట్టుబడీకరించబడిన అదనపు విలువగా మారుతుంది. పెట్టుబడి యజమాని తన వ్యక్తిగత శ్రమ ద్వారా మొదట్లో పెట్టుబడిని కూడబెట్టినప్పటికీ అది ఉత్పత్తి క్రమంలోకి ప్రవేశించగానే కాస్త ముందు వెనుకగా వేతనం లేని శ్రమగా డబ్బు రూపంలోనో లేక వస్తు రూపంలోనో ఇమడ్చబడి ఏవిధమైన సమాన ప్రతిఫలం లేని స్వాహా చేయబడిన విలువగా మారుతుంది. మనం 4వ అధ్యాయంలో చెప్పినట్లుగా డబ్బు పెట్టుబడిగా మార్చబడాలంటే సరుకుల ఉత్పత్తి చలామణికన్నా ఇంకా కొంత ఎక్కువ అవసరం అవుతుంది. ఒకవైపున డబ్బుకూ లేక విలువకూ యజమానినీ, మరోవైపున విలువ సారాంశాన్ని సృష్టించగలిగే వానినీ; జీవనాధారాలనూ ఉత్పత్తి సాధనాలనూ స్వాధీనంలో వుంచుకున్న వానిని ఒకవైపునా, శ్రమశక్తిని తప్ప మరేమీ లేని వాడిని మరొకవైపునా, మార్కెట్‌లో కొనుగోలుదారుగా, అమ్మకందారుగా ఒకరి నొకరు ఎదుర్కొనటాన్ని మనం చూశాం. శ్రమ యొక్క భౌతిక పరిస్థితుల నుండి, దాని స్వీయాత్మక శ్రమశక్తిని, అనగా శ్రమను దాని ఉత్పాదితం నుండి వేరు చేయటమే పెట్టుబడిదారీ ఉత్పత్తి క్రమానికి నిజమైన పునాదీ, ఆరంభ స్థానం.

అయితే కేవలం ఆరంభ స్థానంగానే మొదట్లో ప్రారంభమైన ఈ ప్రక్రియ కేవలం ఆ ప్రక్రియ కొనసాగింపు మూలంగానూ, సామాన్య పునరుత్పత్తి మూలంగానూ, పెట్టుబడిదారీ ఉత్పత్తి యొక్క ప్రత్యేక ఫలితమవుతుంది. అది ఎడతెగని పునఃపూరణలో నిరంతరం కొనసాగించబడుతుంది. ఈ ఉత్పత్తి ప్రక్రియ ఒకవైపున భౌతిక సంపదను పెట్టుబడిగానూ, అధిక సంపదను సృష్టించే సాధనాలు గానూ, పెట్టుబడిదారునికి ఆనందాన్ని చేకూర్చే ఉపకరణాలుగానూ నిరంతరాయంగా మార్పు చేస్తుంది. మరోవైపు, సంపద సృష్టికి మూలాధారమైన కార్మికుడు, ఆ సంపదను తనదిగా చేసుకోవడానికి అన్ని రకాలైన సాధనాలు నిరాకరించబడిన వాడై, ఆ ప్రక్రియలోకి ఏవిధంగా ప్రవేశిస్తాడో అదే విధంగా

నిష్క్రమిస్తాడు. శ్రామికుడు ఆ ప్రక్రియలోకి ప్రవేశించక ముందే, అతని శ్రమ శక్తి అమ్ముడు పోవడం మూలంగా, అతని స్వీయ శ్రమశక్తి అప్పటికే, అతని నుండి పరాధీనము చేయబడి, పెట్టుబడిదారుని హస్తగతమై, పెట్టుబడిలో ఇమడ్చబడుతుంది; ఆ ప్రక్రియలో ఆ శ్రమ, ఉత్పాదిత రూపాన్ని ధరించి తనిదిగాకుండా పోతుంది. శ్రమశక్తిని పెట్టుబడిదారుడు వినియోగించుకోవడమూ, కార్మికుని ఉత్పాదితాన్ని సరుకులగానే, గాక పెట్టుబడిగానూ అనగా విలువను సృష్టించే శక్తిని పీల్చివేసే విలువగానూ, మానవులను కొనుగోలు చేయగలిగిన జీవనాధార సాధనాలు గానూ, ఉత్పత్తిదారులను శాసించగలిగిన ఉత్పత్తి సాధనాలుగానూ నిరంతరాయంగా మార్పిడి చేసే ప్రక్రియ కూడా ఆ ఉత్పత్తి ప్రక్రియే.[1] కాబట్టి కార్మికుడు, భౌతిక సంపదను పెట్టుబడి రూపంలో నిరంతరం ఉత్పత్తి చేస్తాడు. అయితే ఆ పెట్టుబడి పరాయి శక్తిగా అతని మీద పెత్తనం చేసి దోపిడీ చేస్తుంది. పెట్టుబడిదారుడు కూడా శ్రమ శక్తిని సంపద యొక్క స్వీయాత్మక మూలాధార రూపంలో, నిరంతరం ఉత్పత్తి చేస్తాడు. అయితే అది కార్మికుని యొక్క భౌతికమైన శరీరంలో మాత్రమే ఇమిడి యున్న అభౌతిక రూపం. భౌతిక రూపం నుండి అది వేరు చేయబడుతుంది. ఒక్క మాటలో చెప్పాలంటే పెట్టుబడిదారుడు కార్మికులను వేతన కార్మికులుగా ఉత్పత్తి చేస్తాడు.[2] నిరంతరమైన ఈ పునరుత్పత్తి ప్రక్రియ లేక కార్మికుని శాశ్వతమొనర్చే విధానం, పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానానికి తప్పని పరిస్థితి.

కార్మికుని వినియోగం రెండు విధాలుగా వుంటుంది. ఉత్పత్తి చేసేటప్పుడు తన శ్రమ ద్వారా ఉత్పత్తి సాధనాలను వినియోగించుకుని అడ్వాన్సు చేయబడిన పెట్టుబడికన్నా అధిక విలువ గలిగిన ఉత్పాదితాలుగా కార్మికుడు ఆ సాధనాలను మార్పు చేస్తాడు; ఇదే అతని ఉత్పత్తిదాయక వినియోగం. కార్మికుని శ్రమ శక్తిని కొనుగోలు చేసిన పెట్టుబడిదారుడు దానిని వినియోగించడం కూడా, ఉత్పత్తి దాయక వినియోగమే. మరో వైపున తన శ్రమ శక్తికి చెల్లించబడిన డబ్బును కార్మికుడు జీవనాధార సాధనాలుగా మార్చుకుంటాడు. ఇది అతని వైయక్తిక వినియోగం. కాబట్టి, కార్మికుని ఉత్పాదిత వినియోగమూ, అతని వైయక్తిక వినియోగమూ, పూర్తిగా భిన్నమైనవి. మొదటి దానిలో పెట్టుబడికి చోదక శక్తిగా కార్మికుడు పని చేస్తాడు; అందువలన పెట్టుబడిదారునికి చెందుతాడు. రెండవ దానిలో తనకు తానే చెందుతాడు; ఉత్పత్తి ప్రక్రియకు వెలుపల తనకవసరమైన కీలక విధులను నిర్వహిస్తాడు. మొదటి దాని ఫలితంగా పెట్టుబడిదారుడు జీవిస్తాడు. రెండవ దాని మూలంగా కార్మికుడు బ్రతుకుతాడు.

---

1. "ఇది ఉత్పాదక శ్రమకి వున్నటువంటి అసాధారణమైన ఒక ప్రత్యేక లక్షణం. ఉత్పత్తిదాయకంగా వినియోగించుకోబడేదంతా పెట్టుబడే; వినియోగం మూలంగా అది పెట్టుబడి అవుతుంది." (జేమ్స్ మిల్. అదే గ్రంథం. పుట 242) "అసాధారణమైన ప్రత్యేక లక్షణం" అనే మార్గాన్ని జేమ్స్ మిల్ యెప్పుడూ కనుగొనలేకపోయాడు.

2 "ఒక కార్ఖానాలో మొదట ఎక్కువ మంది పేదవారిని ఉద్యోగంలో నియమించే మాట వాస్తవమైనప్పటికీ, వారి స్థితి గతులలో మార్పు వుండదు సరిగదా, ఆ విధమైన కొనసాగింపు అనేక విషయాలను తెలియ జేస్తుంది". (రీజన్స్ ఫర్ ఎ లిమిటెడ్ఎక్స్‌పోర్టేషన్ ఆఫ్ ఊల్, లండన్, 1677. పుట 19.) "పేదవారిని కడు జాగ్రత్తగా చూస్తున్నానని ఆ రైతు అసంగతంగా సమర్థించుకుంటున్నప్పటికీ, నిజానికి పేదవారు హీన స్థితిలోనే వుంచబడ్డారు" (రీజన్స్ ఫర్ ది లేట్ ఇంక్రీజ్ ఆఫ్ ది పూర్ రేట్స్; ఆర్ ఎ కంపారిటివ్ వ్యూ ఆఫ్ ది ప్రైజ్ ఆఫ్ లేబర్ అండ్ ప్రావిజన్స్, లండన్ 1777. పుట 31)

ఉత్పత్తి ప్రక్రియలో ఒక కేవల ఘటనగా మాత్రమే అతని వ్యక్తిగత వినియోగం ఉండేటట్లుగా చేయడానికి కార్మికునిపై తరుచు ఒత్తిడి తెచ్చే విషయాన్ని "పనిదినాన్ని" పరిశీలించేటప్పుడు మనం చూశాం. ఆవిరి యంత్రానికి బొగ్గూ, నీరు, చక్రానికి చమురూ, ఏవిధంగా సరఫరా చేయబడతాయో, అదే విధంగా తన శ్రమ శక్తిని పోషించుకోవడానికి అవసరమైన వస్తువులను కార్మికుడే స్వయంగా సమకూర్చుకుంటాడు. అప్పుడు అతని వినియోగ సాధనాలు, ఉత్పత్తి సాధనాల కవసరమైన వినియోగ సాధనాలుగా మాత్రమే వుంటాయి; అతని వ్యక్తిగత వినియోగం ప్రత్యక్షంగా ఉత్పత్తిదాయక వినియోగమవుతుంది. అయితే ఇదంతా ఒక్క పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానానికే సంబంధించిన దుర్వినియోగం అన్నట్లేమీ లేదు.[1]

ఒక పెట్టుబడిదారునీ, ఒక కార్మికునీ గాక, మొత్తం పెట్టుబడిదారీ వర్గాన్ని, కార్మిక వర్గాన్నీ; చెదురుమదురుగా నున్న ఉత్పత్తి క్రమాన్ని గాక మొత్తం పెట్టుబడిదారీ ఉత్పత్తిని, దాని సర్వ సంపూర్ణత్వంలో, వాస్తవిక సామాజిక స్థాయిలో, మనం ఆలోచించినప్పుడు ఈ విషయంలో మరో భిన్న రూపాన్ని తీసుకుంటుంది. పెట్టుబడిదారుడు తన పెట్టుబడిలో కొంత భాగాన్ని శ్రమ శక్తిగా మార్పు చేయడం ద్వారా, తన మొత్తం పెట్టుబడి విలువను పెంచుకుంటున్నాడు. అతడు ఒక దెబ్బకు రెండు పిట్టలను కొడుతున్నాడు. కార్మికుడి నుండి పొందే దాని వలనే గాక అతనికిచ్చే దాని నుండి కూడా పెట్టుబడిదారుడు లబ్ధి పొందుతున్నాడు. శ్రమశక్తికి బదులుగా ఇవ్వబడిన పెట్టుబడి, అవసర వస్తువులుగా మార్చబడి వాటి వినియోగం మూలంగా ప్రస్తుతం జీవిస్తున్న కార్మికుల యొక్క కండరాలు నరాలు, ఎముకలు, బుర్రలు పునరుత్పత్తి కావడమే గాక నూతన కార్మికులు ఉద్భవిస్తారు. కాబట్టి కచ్చితంగా అవసరమైన అంశాల సరిహద్దులలోనే జరిగే కార్మికవర్గం యొక్క వైయక్తిక వినియోగమంతా కూడా, శ్రమ శక్తికి బదులుగా పెట్టుబడిచే ఇవ్వబడిన జీవనాధార సాధనాలను, పెట్టుబడిచే దోపిడీ చేయడానికి దాని అందుబాటులో ఉంచబడే తాజా శ్రమ శక్తిగా తిరిగి మార్పు చేయడమే. అది పెట్టుబడిదారుడికి అత్యంత అనివార్యంగా వుండే ఉత్పత్తి సాధనమైన, కార్మికుని ఉత్పత్తి పునరుత్పత్తి చేసే ప్రక్రియ. శ్రమ ప్రక్రియ గానీ లేక విరామంలోనున్నప్పుడు గానీ యంత్రాన్ని ఏవిధంగా శుభ్రపరుస్తారో, అదే విధంగా కార్మికుని వైయక్తిక వినియోగం కర్మాగారం లోపల జరిగినా లేక వెలుపల జరిగినా, అది ఉత్పత్తి క్రమంలో భాగమైనా కాకపోయినా, పెట్టుబడి ఉత్పత్తి – పునరుత్పత్తికి సంబంధించిన ఒక ముఖ్య కారకంగా రూపొందుతుంది. పెట్టుబడిదారుని ఆనందపర్చడానికి గాక తన స్వీయ ప్రయోజనార్థమే జీవనాధార సాధనాలను కార్మికుడు వినియోగిస్తాడనే వాస్తవం పై విషయాన్ని ఏవిధంగానూ ప్రభావితం చేయలేదు. ఎందుకంటే, గుదిబండను మోసే పశువేదైనా దానికి దొరికిన మేతతో పరమానందం పొందవచ్చు గానీ, దాని వినియోగం మాత్రం ఉత్పత్తి ప్రక్రియలో ఒక అవసరమైన కారకంగావుంటుంది. పెట్టుబడి పునరుత్పత్తికి కార్మిక వర్గ పోషణ, పునరుత్పత్తి ఒక అవసరమైన తప్పనిసరి పరిస్థితిగా వుంటుంది; ఎప్పుడూ వుండాలి కూడా. అయితే దీనినంతా కూడా పూర్తిగావించే బాధ్యతను, స్వీయ జీవితాన్ని భద్రపరచుకోవాలని, వంశ వ్యాప్తి గావించాలనీ, కార్మికునికి వుండే సహజ ప్రేరణకే పెట్టుబడిదారుడు నిరాటంకంగా వదలి వేయవచ్చు. పెట్టుబడిదారుడు శ్రద్ధ

1. "ఉత్పాదక వినియోగం"లోని రహస్యాలను నిజంగా రాస్సీ లోతుగా పరిశీలిస్తే ఈ విషయంలో అతను అంత గట్టిగా వ్యతిరేకించి ఉండేవాడు కాదు.

వహించాల్సిందల్లా కార్మికుని వ్యక్తిగత వినియోగాన్ని సాధ్యమైన మేరకు కచ్చితంగా అవసరమైన అంశాలకే కుదించి వేయడం; మరింత బలవర్ధకమైన ఆహారాన్ని తీసుకోవలసిందిగా తమ కార్మికుల్ని బలవంతం చేసే ఆ పాశవిక దక్షిణ అమెరికా గని యజమానులను మాత్రం మన పెట్టుబడిదారుడు అనుకరించబోడు.[1]

కాబట్టి, పెట్టుబడిదారుడూ, అతని సైద్ధాంతిక ప్రతినిధి అయిన రాజకీయ అర్థశాస్త్రవేత్తా ఇద్దరూ కూడా కార్మిక వర్గాన్ని శాశ్వతమొనర్చడానికీ, అది ఆ విధంగా కొనసాగడానికీ, పెట్టుబడిదారుడి వినియోగానికి ఉపయోగపడే శ్రమశక్తిని సరఫరా చేయడానికి అవసరమైన కార్మికుని వైయక్తిక వినియోగంలోకి ఒక భాగాన్ని మాత్రమే, ఉత్పాదకమైనదిగా పరిగణిస్తారు. ఆ భాగానికి మించి, తన ఆనందం కోసం కార్మికుడు చేసే వినియోగం అంతా అనుత్పాదమేనని వారు భావిస్తారు.[2] పెట్టుబడి సంచయనం మూలంగానే గనుక వేతనాలు పెరిగి, తద్వారా కార్మికుల వినియోగం పెరిగి, దానితో పాటుగా పెట్టుబడిచే వినియోగించుకోబడే శ్రమశక్తిలో పెరుగుదల లేకపోతే, ఆ అదనపు పెట్టుబడి అనుత్పాదకంగా వినియోగించుకోబడుతుంది.[3] నిజానికి, కార్మికుని వైయక్తిక వినియోగం, అతనికి సంబంధించినంత వరకు అనుత్పాదకమైనది; ఎందుచేతనంటే, అది కేవలం అవసరమైన వ్యక్తినే తప్ప మరి దేనినీ పునరుత్పత్తిచేయదు; అయితే, అది పెట్టుబడిదారునికీ, రాజ్యాంగ యంత్రానికి ఉత్పాదకమైనదే. ఎందుచేతనంటే, వారి సంపదను సృష్టించే శక్తిని అది ఉత్పత్తి చేస్తుంది.[4]

కాబట్టి సామాజిక దృక్కోణాన్నుండి చూసినపుడు, శ్రమ ప్రక్రియలో నేరుగా పాల్గొనక పోయినప్పటికీ, కార్మికవర్గం, జీవం లేని సామాన్యమైన శ్రమ పరికరాల్లాగే, అంతమేరకే, పెట్టుబడికి, ఒక ఉపాంగంగా వుంటుంది. కొన్ని నియమిత పరిమితుల్లో, కార్మిక వర్గపు వైయక్తిక వినియోగం కూడా పెట్టుబడిదారీ ఉత్పత్తి ప్రక్రియలో నామమాత్రాంశంగానే వుంటుంది. అయితే, కార్మిక వర్గం

---

1. "దక్షిణ అమెరికాలోని గని కార్మికులు రోజువారీ (బహుశా ప్రపంచంలోనే అత్యంత భారమైన పని) సుమారు 450 అడుగుల లోతు నుండి 180 నుండి 200 పౌనుల బరువుండే లోహాన్ని తమ భుజాలపై వేసుకుని పైకి మోసుకురావడం, రొట్టె, చిక్కుడు కాయలను మాత్రమే తింటూ జీవించడం, వారి యిష్టప్రకారమే అయితే, కేవలం రొట్టెను మాత్రమే ఆహారంగా పుచ్చుకోగోరుతారు. అయితే తమ కార్మికులు కేవలం రొట్టె మాత్రమే తింటే కఠినమైన శ్రమ చెయ్యలేరని కనుగొన్న యజమానులు, గుర్రాలను మేపినట్లుగా కార్మికులను గూడా చిక్కుడు కాయలు తినమని బలవంతం చేస్తారు. ఏమైనప్పటికీ రొట్టెతో పోల్చితే చిక్కుళ్లలో మంచి లవణాలు, విటమిన్లు వుంటాయి!" (లీబిగ్, చూడు. అదే గ్రంథం, సంపుటి 1, పుటలు 194)
2. జేమ్స్ మిల్. అదే గ్రంథం పుట. 238
3. "పెట్టుబడి పెరుగుదలతో నిమిత్తం లేకుండానే వేతనాలు (శ్రమ ధర) ప్రైస్ ఆఫ్ లేబర్ (యెక్కువగా పెరగవలసి వస్తే, ఇక ఏ మాత్రం కార్మికులను అదనంగా నియోగించుకోవడం) సాధ్యం కాదు గదా, పెట్టుబడిలోని ఆ పెరుగుదల అనుత్పాదకమైన కార్యకలాపాలకే వినియోగించుకోబడుతుందని నేను చెప్పాల్సి వుంటుంది." (రికార్డో. అదే గ్రంథం. పుట 163)
4. "పునరుత్పత్తి దృష్ట్యా, పెట్టుబడిదారులు, సంపదను వినియోగించుకోవం లేదా వినాశనం చేయడమే (ఉత్పత్తి సాధనాలను వినియోగించుకోవడం) నిజమైన ఉత్పత్తిదాయక వినియోగం... స్పష్టంగా చెప్పాలంటే, తనకు తాను తప్ప, తన శ్రమను వినియోగించుకునే వానికీ, రాజ్యాంగ యంత్రానికీ కార్మికుడు ఉత్పాదకమైన వినియోగదారుడుగా వుంటాడు." (మాల్తస్, డెఫినిషన్స్. పుట. 30)

ఉత్పత్తి చేసిన ఉత్పాదితాన్ని, అది తయారైన వెంటనే వారి స్థానాన్నుండి దానికి వ్యతిరేకమైన పెట్టుబడి స్థానానికి లాగివేయడం ద్వారా, స్వీయ చైతన్యం కలిగిన ఈ పరికరాలను, ఉత్పత్తి ప్రక్రియను నట్టేట ముంచి పారిపోకుండా నిరోధిస్తూ, పెట్టుబడిదారీ ఉత్పత్తి ప్రక్రియ బాగా జాగ్రత్తలు తీసుకుంటుంది. వైయక్తిక వినియోగం, ఒక వైపున కార్మికులు పోషణ పునరుత్పత్తులకు సాధనాలను సమకూర్చుతుంది; మరోవైపున, జీవితావసర వస్తువులు హరించబడటం ద్వారా, కార్మికుడు శ్రామిక మార్కెట్‌లోకి నిరంతరం పునః ప్రత్యక్షమయ్యే ప్రక్రియను నమ్మకంగా సాధించగలుగుతుంది. రోమన్ బానిసను సంకెళ్లతో బంధించారు. అయితే మన వేతన కార్మికుడు అగోచరమైన బంధనాలచే తన యజమానికి కట్టి వేయబడుతున్నాడు. నిరంతరం మారే యజమానుల ద్వారాను, న్యాయశాస్త్ర పరికల్పనా ఒప్పందం ద్వారానూ, వేతన కార్మికుని స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు వున్నట్లుగా ప్రదర్శింపబడి, కొనసాగించబడుతుంది.

వెనుకటి రోజుల్లో, స్వతంత్ర కార్మికునిపై తన యాజమాన్య హక్కుల్ని అధికారికంగా నెలకొల్పుకోడానికి, అవసరమైనపుడల్లా శాసనాలను రూపొందించుకునే కార్యక్రమాన్ని పెట్టుబడి చేపట్టింది. ఉదాహరణకు, ఇంగ్లాండ్‌లో 1815వ సంవత్సరం వరకు, భారీ ఎత్తున జరిమానాలూ, తీవ్రమైన దండనలూ విధించబడతాయని యంత్ర నిర్మాణంలో పనిచేస్తున్న మెకానిక్కులు వలస పోకుండా చట్టరీత్యా నిషేధించబడింది.

కార్మిక వర్గపు పునరుత్పత్తి తనతో పాటుగా అది సంతరించుకొన్న నైపుణ్యాన్ని ఒక తరాన్నుండి మరొక తరానికి అందిస్తుంది.[1] హక్కు రీత్యా తనకు చెందియున్న ఉత్పత్తి కారకాలలో ఒకటిగా, నైపుణ్యం గలిగిన వర్గంగా, కార్మికవర్గపు వునికిని, వాస్తవరూపం దాల్చిన అస్థిర పెట్టుబడిగా దానిని ఏ మేరకు పెట్టుబడిదారు గుర్తిస్తాడంటే, ఆ నైపుణ్య వర్గాన్ని కోల్పోయే ప్రమాదకరమైన సంక్షోభ స్థితి ఏర్పడిన వెంటనేనని మనకు స్పష్టమవుతుంది. అమెరికా సంయుక్త రాష్ట్రాలలో, అంతర్యుద్ధ పర్యవసానంగా దానితోపాటుగా సంభవించిన ప్రత్తి కరువు మూలంగా, లాంక్‌షైర్ నగరంలోని నూలు కార్మికులలో అధిక సంఖ్యాకుల్ని పని నుండి తీసివేశారనే విషయం మనకందరికీ తెలిసిందే. ఆ విధంగా "అత్యధికమైన" కార్మికులు వలస ప్రాంతాలలో లేక సంయుక్త రాష్ట్రాలకో వలసపోవడానికి, సహాయ పడటానికై, ప్రభుత్వ సహాయమైనా లేక స్వచ్ఛంద జాతీయ విరాళాలైనా కావాలనే విజ్ఞప్తులు ఇటు స్వయానా కార్మికవర్గం నుండి, అటు సమాజంలోని ఇతర తరగతులనుండీ కూడా వచ్చాయి. ఈ విషయమై, మాంచెస్టర్ వర్తక సంఘం మాజీ అధ్యక్షుడు ఎడ్మండ్ పాటర్ రాసిన ఒక లేఖను 1863 మార్చి 24 నాటి "ది టైమ్స్" పత్రికలో ప్రచురించారు. కామన్స్ సభలో ఆ లేఖను "ఉత్పత్తి దారుల ప్రణాళిక" అని సరిగానే పేర్కొన్నారు.[2] శ్రమశక్తిపై పెట్టుబడికి యాజమాన్య హక్కులున్నా యంటూ, సిగ్గు బిడియం లేకుండా నొక్కి వక్కాణించిన ఆ లేఖలోని కొన్ని "విలక్షణమైన" భాగాలను ఈ దిగువ ఉదహరిస్తున్నాం :

---

1. "శ్రమ నైపుణ్యం ఒక్కటి మాత్రమే ముందుగా తయారై నిల్వ చేయబడుతుందని ఎవరైనా చెప్పగలరు.. అత్యంత ప్రాముఖ్యం గలిగిన శ్రమ నైపుణ్య సంచయనమూ, నిల్వా అనే కార్యక్రమం, యావన్మంది కార్మికులకు సంబంధించినంతవరకు, ఎలాంటి పెట్టుబడి లేకుండానే నెరవేర్చబడుతుంది" (హాడ్జిస్కిన్, లేబర్ డిఫెన్‌డెడ్, పుట 13)
2. ఈ లేఖను కార్ఖానాదారుల ప్రణాళికగా పేర్కొనవచ్చు. ("ఫెర్రాండ్ : మోషన్ ఆన్ ది హౌస్ ఆఫ్ కామన్స్ 27-4-1863)

"నూలు కార్మికుల సరఫరా మరీ ఎక్కువగా వున్నదని అతనికి (పనిలో లేని కార్మికుడికి) చెప్పవచ్చు.... అంతేగాక.... వాస్తవానికి మూడవ భాగానికి (ఆ కార్మికుల్ని) తగ్గించాలి. బహుశా, అప్పుడు మిగిలిన రెండు భాగాలకు ఆరోగ్యకరమైన గిరాకీ వుంటుంది. ప్రజాభిప్రాయం వలస పొమ్మని అర్థిస్తుంది. యజమాని తన కార్మికుల సరఫరా తగ్గిపోవడాన్ని సుముఖంగా చూస్తూ ఊరుకోలేదు; అలా జరగడం తప్పేగాక అపసవ్యమని కూడా, బహుశా, అతడు న్యాయంగా భావించవచ్చు..... వలస పోవడానికి ప్రజాధనమే గనుక వ్యయం చేయాల్సి వస్తే తన వాదాన్ని అందరికీ వినిపించే హక్కు అతనికి వుంటుంది; బహుశా నిరసన కూడా తెలియజేయవచ్చు. "ఆ తర్వాత, పాటర్, నూలు పరిశ్రమ ఎంత ప్రయోజనకరమైనదో చెప్తూ, ఐర్లండ్ నుండీ వ్యవసాయక జిల్లాల నుండీ అదనపు జనాభాను ఈ పరిశ్రమ నిస్సంకోచంగా ఇముడ్చుకున్నదని", ఆ పరిశ్రమ ఎంతో విస్తృతమైనదనీ, 1860వ సంవత్సరంలో మొత్తం ఇంగ్లాండ్ యెగుమతులలో 5/13 వంతులు ఈ పరిశ్రమ ఏవిధంగా చేకూర్చిందో. మార్కెట్ల విస్తరణ మూలంగానూ, ప్రత్యేకించి భారతదేశ మార్కెట్ మూలంగానూ, పౌనుకు 6 పెన్నీల రేటు చొప్పున నూలు సమృద్ధిగా సరఫరా అయితే ఈ పరిశ్రమ కొద్ది సంవత్సరాలలో తిరిగి ఏవిధంగా పుంజుకుంటుందో వివరిస్తాడు. ఆయన ఇంకా ఇలా అంటున్నాడు. "ఒకటి, రెండూ లేక మూడు సంవత్సరాల తర్వాత అవసరమైన పరిమాణంలో (పత్తి) ఉత్పత్తి గావచ్చు. అయితే నా ప్రశ్న ఏమిటంటే, ఈ పరిశ్రమను అట్టిపెట్టుకోవడం లాభదాయకమేనా? యంత్రాంగాన్ని (అతని ఉద్దేశంలో సజీవ శ్రమ యంత్రాలు) మంచి స్థితిలో వుంచుకోవడం లాభదాయకమేనా? ఆ యంత్రాంగాన్ని విడనాడే ఆలోచన గొప్ప తప్పుకాదా? నేను తప్పే అనుకుంటున్నాను. కార్మికులు ఎవరి ఆస్తి కారనీ, లాంక్‌షైర్ నగరానికి గానీ, యజమానులకు కూడా ఆస్తి కారనీ, నేను ఒప్పుకుంటాను, అయితే ఆ రెండింటికీ బలం చేకూర్చేది వాళ్లే; యింకోతరం వరకూ పూరింప శక్యంగాని, సుశిక్షితమైన మానసిక శక్తి వారు; వారు ఉపయోగించే యంత్రాలనైతే అందులో ఎక్కువ భాగాన్ని పన్నెండు మాసాల్లో లాభదాయకంగా ఏర్పాటు చేసుకొని మెరుగుపర్చుకోవచ్చు.[1] శ్రమ శక్తి వలసపోవడానికి అంగీకరిస్తే (!) లేదా ప్రోత్సహిస్తే మరి పెట్టుబడిదారుడి గతేమిటి?.... కార్మికుల్లో సుశిక్షితులైన వారిని తీసివేస్తే స్థిర పెట్టుబడి పెద్ద ఎత్తున తరిగిపోతుంది. నాసిరకం కార్మికులు కూడా తగినంతగా సరఫరా కాని పరిస్థితి ఏర్పడినపుడు, (నిర్వహణా మూలధనం) దానికదే ఆ స్థితిని ఎదుర్కోలేదు. కార్మికులు ఇష్టపడుతున్నారని చెప్పారు.

1. సాధారణ పరిస్థితులలో వేతనాలు తగ్గించే సమస్య వచ్చినపుడు అదే పెట్టుబడి పూర్తిగా మరొక పాట పాడుతుందనే విషయం విస్మరించజాలం. అపుడు యజమానులంతా ఒకే గొంతుతో ఘోషిస్తారు. "నిజానికి తాము చేసేది తక్కువస్థాయి నిపుణుల శ్రమ అనే సత్యాన్నీ, అంతకంటే సులభంగా చేకూరేదియేదీ లేదనీ, లేక మత నైపుణ్యానికి సమృద్ధిగా సంభావన యిచ్చేదీ లేక కనిష్టస్థాయి నిపుణుడు ఇచ్చే స్వల్ప శిక్షణతోనే అంత త్వరితగతిని, అంత సమృద్ధిగా పొందగలిగేదీ ఏదీ లేదనీ కర్మాగార కార్మికులంతా బాగా గుర్తుంచుకోవాలి... ఉత్పత్తి ప్రక్రియలో యజమానుల యంత్రాలే (12 మాసాల్లోనే లాభదాయకంగా వీటికి ప్రత్యామ్నాయంగా వేరే ఏర్పాటు చేసుకోవచ్చునని మనకి యిప్పుడు బోధపడుతుంది). కార్మికుని శ్రమా, నైపుణ్యం కన్నా నిజానికి అర్థిక ప్రాధాన్యత గలిగిన పాత్రను నిర్వహిస్తాయి. (ఈ కార్మికులకి బదులుగా 30 సంవత్సరాలలోపు ఎవరినీ తెచ్చుకోలేం) కేవలం ఆరు మాసాల విద్యే సామాన్య కార్మికునికి నైపుణ్యాన్ని బోధించగలదూ. అతడు అలవర్చుకోగలడు. (ముందు ఉదాహరించిన గ్రంథం. పు. 423)

(వలసపోవడానికి) ... వారలా చెయ్యడం సహజమైనదే... తగ్గించండి; ఈ పరిశ్రమలోని కార్మికులను తరలించడం ద్వారా, వారి వేతనాలను ఐదవ వంతుకు లేక ఐదు మిలియన్ల పౌండ్లకు గానీ తగ్గించడం ద్వారా నూలు పరిశ్రమను కుదించివేయండి; అప్పుడు వీళ్ళపై ఆధారపడే చిన్న దుకాణదారుల వర్గం గతేమిటి?...... అద్దెల సంగతేమిటి?.... దుకాణాల బాడుగుల సంగతేమిటి? కాస్త ముందుకు పోయి, సన్నకారు రైతు మీద, కొంత స్థితి గలిగిన గృహ యజమాని మీద, భూకామందు మీద దీని ప్రభావం ఎలా వుంటుందో గమనించండి; ఒక దేశంలోని అత్యుత్తమమైన కార్మిక జనాభాలోని ఒకభాగాన్ని ఎగుమతి చేయడం ద్వారా, అది సృష్టించిన సంపద విలువలో భాగమైన ఉత్పత్తిదాయక పెట్టుబడిని నాశనం చేయడం ద్వారా, ఆ జాతిని బలహీనపర్చే ఆత్మహత్యాసదృశమైన సలహా కన్నా మరేమన్నా వుంటుందా?.... కనీసం కార్మికుల మనో నిబ్బరాన్ని నిలబెట్టడానికైనా, ప్రత్యేకమైన న్యాయ శాసనాల ద్వారా, కార్మికులకు ఏదో ఒక రకమైన వృత్తినో లేక పనినో కల్పించే నిమిత్తం, పత్తి పండించే జిల్లాలోని సంరక్షణ సంఘం ఆధ్వర్యంలో పనిచేసే ప్రత్యేక అధికారుల పాలన క్రింద రెండు, మూడు సంవత్సరాలకు విస్తరించే రీతిలో రుణాలు (ఐదు లేక ఆరు మిలియన్ల పౌండు షెర్లింగులు) మంజూరు చెయ్యాలని నేను ప్రతిపాదిస్తున్నాను..... బలహీనపర్చే ఈ వలసపోయే విధానం కొనసాగడం మూలంగా, కార్మికులలో అత్యుత్తమైన వారిని కోల్పోయి, మిగిలిన వారిలో నిరాశా నిస్పృహలు చోటు చేసుకునే దాని కంటే, దేశమంతటిలోనూ పెట్టుబడి విలువలు తరిగిపోతూ వుండే దానికంటే, భూస్వాములకు గానీ, యజమానులకు గానీ మరేదైనా హీనమైన స్థితి వుంటుందా?"

పెట్టుబడిదారులచే ఎంపిక చేసుకోబడిన పాటర్, పెట్టుబడిదారుడికి చెందిన "యంత్రాంగం"లో రెండు రకాలైన వాటి మధ్య వ్యత్యాసాన్ని చూపిస్తాడు. అందులో ఒకటి, పెట్టుబడిదారుని కర్మాగారంలోనే నిలకడగా వుండగా, మరొకటి, రాత్రివేళల్లో, ఆదివారాల్లో మాత్రమే కర్మాగారానికి వెలుపల పూరిగుడిసెల్లో నివసిస్తుంది. అందులో ఒకటి నిర్జీవమైనదీ, మరొకటి సజీవమైనదీ. నిర్జీవమైన యంత్రాలు రోజు రోజుకి అరిగిపోతూ తరగిపోతాయి; నిరంతరం సాంకేతిక పురోభివృద్ధిలో, అందులో ఎక్కువభాగం ఎంత త్వరగా పాతబడితే అంత వేగంగానే, కొన్ని నెలల్లోనే వాటికి బదులుగా కొత్త యంత్రాలను లాభదాయకంగా ఏర్పాటు చేసుకోవచ్చు. దీనికి భిన్నంగా, సజీవ యంత్రాలు ఎంత ఎక్కువ కాలం జీవిస్తే అంత మంచిగా రూపొందుతాయి. ఒక తరం నుండి మరొక తరానికి సంక్రమిస్తూ వచ్చిన నైపుణ్యం ప్రోగుపడే అనుపాతంలోనే మరింత నైపుణ్యంగా అవి రూపొందుతాయి. ఈ నూలు పరిశ్రమాధిపతికి "ది టైమ్స్" పత్రిక క్రింది విధంగా జవాబిచ్చింది.

"నూలు పరిశ్రమ యజమానుల అపూర్వమైన అత్యున్నత ప్రాధాన్యతతో ఎడ్మండ్ పాటర్‌గారు ఎంత ఎక్కువగా ప్రభావితుడయ్యాడంటే ఈ వర్గాన్ని అట్టిపెట్టుకొని వారి వృత్తిని శాశ్వత మొనర్చడానికి ఐదు లక్షల మంది కార్మిక వర్గాన్ని వారి అభీష్టానికి విరుద్ధంగా ఒక మహత్తర నైతిక శ్రమ గృహంలో నిర్బంధించి ఉంచాలనుకుంటున్నాడు. 'ఈ వ్యాపారాన్ని అట్టిపెట్టుకోవడం లాభదాయకమేనా?' అని పాటర్‌గారు అడుగుతున్నారు. 'అన్ని రకాలైన నిజాయితీ మార్గాల ద్వారా దానిని తప్పనిసరిగా, నిలుపుకోవాలని' మేము జవాబిస్తాము. 'యంత్రాలను మంచి స్థితిలో ఉంచుకోవడం లాభదాయకమేనా?' అని పాటర్ తిరిగి ప్రశ్నిస్తున్నారు. ఇక్కడ కొద్దిగా సంకోచిస్తున్నాము. 'యంత్రాలు' అంటే పాటర్ ఉద్దేశం మానవ యంత్రాలు; ఎందుకంటే దానిని సంపూర్ణమైన ఆస్తిగా ఉపయోగించాలని తన

అభిప్రాయం కాదంటూ పదే పదే నిరసన వ్యక్తం చేస్తున్నాడు గనుక. మానవ యంత్రాలను మంచి స్థితిలో వుంచుకోవడం 'లాభదాయకమని' గానీ, కనీసం సాధ్యమవుతుందని గానీ మేమే భావించడం లేదని ఒప్పుకుంటున్నాము. అంటే, అవసరం వచ్చేవరకు, దానిని పని లేకుండా పోషిస్తూ వుంచుకోవడం. దానిని పోషించి, ఎంత మెరుగులు పెట్టినా, పనిలేని స్థితిలో మానవ యంత్రాలు కూడా తుప్పుపడతాయి. అంతేగాక మానవ యంత్రాలు తమంత తామే సెగలు పొగలు గక్కుతూ, మన పెద్ద పెద్ద పట్టణాల్లో పేలిపోతూనో లేక తొక్కిసలాడుతూనో వుంటాయని మనం ఇంతకుముందే చూశాం. పాటర్ చెప్పినట్లుగా, కార్మికుల పునరుత్పత్తికి కొంత కాలం అవసరం కావచ్చు; అయితే, యంత్ర చోదకులూ, పెట్టుబడిదారులూ, అందుబాటులోనున్నపుడు మనకి ఏనాడు అవసరం లేనంత మంది నిపుణైన కార్మికుల్ని సృష్టించుకోవడానికీ, మితవ్యయం చేస్తూ బలిష్టంగా వుండి కష్టపడి పనిచేసే కార్మికులు కావలసినంత మంది దొరుకుతారు. ఒకటీ రెండు లేక మూడు సంవత్సరాలలో ఈ వ్యాపారం పుంజుకొంటుందని చెప్తూ, శ్రమ వలస పోవడాన్ని 'ప్రోత్సహించవద్దనీ లేక అనుమతించవద్దనీ' (!) పాటర్‌గారు మనల్ని కోరుతున్నారు. కార్మికులు వలస పోవాలని కోరుకోవడం అతి సహజమేనని ఆయన అంటున్నారు; అయితే వారి అభీష్టం ఎలా వున్నప్పటికీ, ఐదు లక్షల మంది కార్మికులతో పాటుగా, వారి ఆశ్రితులైన 700,000 మందిని గూడా నూలు మండలాల్లో, నిలిపివేసి ఉంచుకోవాల్సిన అవసరం జాతికి వున్నదని ఆయన భావిస్తున్నారు; ఆ ఆలోచనకు తప్పనిసరి పర్యవసానంగా, ఏదో ఒక నాటికి పత్తి యజమానులు ఆ కార్మికులను తీసుకోగలుగుతారనీ ఆ సదవకాశం కోసం నిరీక్షిస్తూ, వారిని దానధర్మాలతో పోషిస్తూ, వారి అసంతృప్తిని మన జాతి బలప్రయోగంతో అణిచివేయాల్సి వుంటుందనే ఆలోచన గూడా ఆయన చేయాలి. ఇనుము, బొగ్గు, పత్తిలో వ్యవహరించే రీతిలోనే 'శ్రమశక్తి'తో గూడా వ్యవహరించే వారి బారి నుండి దానిని కాపాడటానికి ఈ దీవులలో మహత్తర ప్రజాభిప్రాయానికై కృషి చేయాల్సిన సమయం ఆసన్నమైంది".[1]

'ది టైమ్స్' పత్రికలోని వ్యాసం ఒక నీతిబోధగా, చమత్కార విమర్శగా మిగిలిపోయింది. కర్మాగారంలోని చలన శీల యంత్రా భాగాల్లో, కర్మాగారాన్ని నడిపే కార్మికులు గూడా ఒక భాగం మాత్రమేననే పాటర్‌గారి అభిప్రాయమే "మహత్తర ప్రజాభిప్రాయం"గా వాస్తవంలో రూపుదిద్దుకొన్నది. కార్మికులు వలస పోవడాన్ని నిరోధించారు.[2] ఆ "నైతిక శ్రమగృహంలో", "నూలు మండలాల్లో వారు

1. 'ది టైమ్స్' - 24-3-1863, లండన్

2. వలస పోవడానికి సహాయంగా ఒక చిల్లిగవ్వ కూడా యివ్వడానికి ఓటు వెయ్యని పార్లమెంటు, కార్మికులను అర్ధాకలితో వుంచేందుకూ, అనగా మామూలుగా యిచ్చే వేతనాలకన్నా తక్కువ చెల్లించి వారిని దోపిడీ చేయడానికి పురపాలక సంఘాలకు అధికారాల్నిస్తూ శాసనాలు జారీ చేసింది. దీనికి భిన్నంగా, మూడు సంవత్సరాల తర్వాత పశువ్యాధి విజృంభించినపుడు, పార్లమెంటు దాని సాంప్రదాయాల నన్నింటినీ యధేచ్ఛగా వుల్లంఘించి, లక్షాధికారులైన భూస్వాములకు లక్షలాది పౌండ్ల డబ్బును నేరుగా యివ్వడానికి అనుకూలంగా ఓటు వేసింది. మాంసం ధరలు పెరగడం మూలంగా రైతులు మాత్రం యే విధమైన నష్టాలు లేకుండా బయటపడ్డారు. ఏ వ్యక్తి అయినా హిందువు కాకుండానే గోమాతను పూజించవచ్చుననీ, జూపిటర్ (రోమన్ పురాణాలలోని దేవతల రాజు) కాకపోయినా యెద్దుగా మారవచ్చుననీ 1866వ సంవత్సరంలో పార్లమెంటు సమావేశాలు ప్రారంభమైన వెంటనే భూస్వాములు వేసిన ఆంబోతు రంకెల లాంటి పెడబొబ్బలు తెలియజేశాయి.

బంధింపబడి, పూర్వం లాగానే లాంక్‌షైర్ నగరంలోని పత్తి కార్ఖానాదారులకు ""బలాన్ని" చేకూర్చే వారైనారు.

కాబట్టి, శ్రమ సాధనాలకూ, శ్రమ శక్తికి మధ్య గల విభజనను పెట్టుబడిదారీ ఉత్పత్తి దానంతటదే పునరుత్పత్తి చేస్తుంది. తద్వారా కార్మికుని దోపిడీ చేసేందుకు కావలసిన పరిస్థితిని పునరుత్పత్తి చేసి శాశ్వత మొనర్చుతుంది. జీవించడానికి తన శ్రమ శక్తిని అమ్ముకునేటట్లుగా కార్మికుని అది నిరంతరం వత్తిడి చేస్తుంది; శ్రమశక్తిని కొనుగోలు చేసి తద్వారా సంపన్నవంతుడయ్యే సామర్థ్యాన్ని పెట్టుబడిదారుడికి ఇస్తుంది.[1] పెట్టుబడిదారుడూ, కార్మికుడూ మార్కెట్‌లో కొనుగోలుదారుడూ, అమ్మకందారుడుగా ముఖాముఖి తలపడడం మరెంత మాత్రం ఆకస్మిక సంఘటనగా వుండదు. పెట్టుబడిదారీ ఉత్పత్తి ప్రక్రియే కార్మికుడ్ని నిరంతరం తన శ్రమశక్తిని అమ్ముకునే విక్రయదారుగా మార్కెట్ లోకి విసరివేస్తుంది; ఆ ప్రక్రియే, ఆ కార్మికుడి స్వీయోత్పాదితాన్ని తిరిగి ఆ కార్మికుడ్నే కొనేందుకు మరొక వ్యక్తికి ఒక సాధనంగా నిరంతరం మార్పు చేస్తుంది. నిజానికి, తనకు తాను పెట్టుబడిదారుడికీ అమ్ముడుపోక పూర్వమే, కార్మికుడు పెట్టుబడికి చెందుతాడు. నియమిత కాల పరిధిలో తానే అమ్ముడు పోవడం మూలంగానూ, అతని యజమానులుమారడం వల్లనూ, శ్రమ శక్తి[2] యొక్క మార్కెట్ ధరలో వూగిస లాడటం మూలంగానూ, కార్మిక ఆర్థిక దాస్యం[3] వెలుగులోకి వస్తుంది; మరుగుపర్చబడుతుంది గూడా.

---

1. "బ్రతకడానికి జీవనాధార సాధనాలను కార్మికుడు అడిగితే, లాభాలను సంపాదించడానికి కార్మికులు కావాలని యజమాని అడిగాడు" (సిస్మాండో - అదే గ్రంథం. పుట91)

2. బాల కార్మికుల శ్రమకు సంబంధించినంత వరకు, స్వచ్ఛంద అమ్మకం అనే లాంఛనం గూడా అదృశ్యమై పోతుందనే విషయాన్ని మరిచిపోతారు.

3. ఈ దాస్యం యొక్క అతి మొరటైన వికృతరూపం డర్‌హామ్ రాష్ట్రంలో కనిపిస్తుంది. వ్యవసాయ కార్మికుల మీద తిరుగులేని యాజమాన్య హక్కుల్ని చెలాయించడానికి భూస్వాములకు అనుకూలమైన పరిస్థితులు లేని రాష్ట్రాలలో ఇదొక రాష్ట్రం. అక్కడ గని పరిశ్రమ యజమానులు కార్మికులకు కొంత స్వేచ్ఛకి అవకాశాన్ని కలిగిస్తారు. మిగిలిన ప్రాంతాలలోని సాంప్రదాయానికి విరుద్ధంగా, ఈ రాష్ట్రంలోని భూస్వాములు, "శ్రామిక గుడిసెలు" (లేబరర్స్ కాటేజెస్) వున్న పొలాలను మాత్రమే కౌలుకి యిస్తారు. గుడిసెకి ఇచ్చే అద్దె వేతనంలో భాగంగా వుంటుంది. ఈ గుడిసెలను "జీతగాళ్ల గుడిసెలు" (హిండ్స్ హౌసెస్) అంటారు. కట్టు బానిసత్వం (బాండేజ్) అనే ఒప్పందం ద్వారా కొన్ని భూస్వామ్య సేవలకు (వెట్టిచాకిరికి) గుర్తింపుగా ఈ గుడిసెలను కార్మికులకు అద్దెకిస్తారు. కార్మికుడు తాను యితర ప్రాంతాలలో పనిచేయాల్సి వచ్చినపుడు, తన స్థానాన్ని భర్తీ చేయడానికి తన కుమార్తెలాంటి వారిని తన స్థానంలో తనకు బదులుగా వుంచేట్లుగా, మిగిలిన అంశాలతో పాటుగా, ఈ కట్టుబానిసత్వ ఒడంబడిక కార్మికున్నీ బందీ చేస్తుంది. ఆ కార్మికుడ్ని "కట్టుబానిస"గా పిలుస్తారు. కార్మికుని యొక్క వ్యక్తిగత వినియోగం ఏ విధంగా పెట్టుబడి తరఫున వినియోగంగా అనగా ఉత్పత్తిదాయక వినియోగంగా వుంటుందో కూడా ఇక్కడ ఏర్పాటు చేసుకున్న సంబంధం పూర్తిగా ఒక నూతన దృక్పథాన్నుండి తెలియజేస్తుంది: కట్టుబానిస మల మూత్రాలు కూడా పిసినిగొట్టు అయిన భూస్వామిహక్కుగా వుంటాయని తెలుసుకోవడం మిక్కిలి ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది.... ఆ భూస్వామి తన పరిసరాల్లో తన సొంత మరుగుదొడ్డిని తప్ప మరొక దాన్ని

కాబట్టీ, పెట్టుబడిదారీ ఉత్పత్తి ఒక నిరంతర సంబంధిత ప్రక్రియగా, ఒక పునరుత్పత్తి ప్రక్రియగా సరుకులను మాత్రమే గాక, అదనపు విలువను మాత్రమే గాక, పెట్టుబడిదారీ సంబంధాలను కూడా ఉత్పత్తి, పునరుత్పత్తి చేస్తుంది. ఒక వైపున పెట్టుబడిదారునీ, మరొకవైపున వేతన కార్మికున్నీ ఉత్పత్తి, పునరుత్పత్తి చేస్తుంది.[1]

---

ఉంచుకోడానికి ఒప్పుకోడు.... తోటకు అక్కడక్కడ కొంత ఎరువైనా ఇవ్వడానికి సిద్ధపడతాడు. గానీ తనకు సంక్రమించిన భూస్వామ్య హక్కుల్లో ఏ భాగాన్ని కూడా తగ్గించుకోడు'' (పబ్లిక్ హెల్త్ రిపోర్టు VII 1864. పుట 188)

1. ''పెట్టుబడికి వేతన శ్రమ వుండాలి; (ప్రీసపోజెస్) వేతన శ్రమకి కూడా పెట్టుబడి వుండాలి. ఒక దాని మనుగడకు మరొకటి అవసరమైన షరతు; అవి పరస్పరం ఉనికిలోకి (ఎగ్జిస్టెన్స్) వచ్చేటట్లుగా ఒక దాన్నొకటి బలవంతం చేస్తాయి. నూలు కర్మాగారంలో పనిచేసే కార్మికుడు నూలునుతప్ప మరి దేన్నీ ఉత్పత్తి చేయడా? చేస్తాడు, పెట్టుబడిని ఉత్పత్తి చేస్తాడు; అతని శ్రమను తాజాగా ఆజ్ఞాపించగలిగిన విలువను ఉత్పత్తి చేస్తాడు. ఆ విధమైన ఆజ్ఞ మూలంగా తాజా విలువలు సృష్టించబడతాయి'' (కారల్ మార్క్స్:వేజ్ లేబర్ అండ్ కాపిటల్, నయారీనీష్ జెటింగ్.నెం.266.7.4.1848).1847లో బ్రస్సెల్స్‌లో జర్మనీ శ్రామిక సంఘానికి ఇదే అంశంపై నేను ఇచ్చిన ఉపన్యాసాలలోని భాగాల నుండి పై పత్రికలో వచ్చిన వ్యాసాలు గ్రహింపబడ్డాయి. ఫిబ్రవరిలో వచ్చిన విప్లవం కారణంగా వాటి ముద్రణకు అంతరాయం కలిగింది.

## అధ్యాయం - 24

# అదనపు విలువ పెట్టుబడిగా మారడం

### విభాగం-1

## పెట్టుబడిదారీ ఉత్పత్తి పురోగమనంలో పెరుగుదల స్థాయి

### సరుకుల ఉత్పత్తిని వర్గీకరించే ఆస్తి నియమాలు పెట్టుబడిదారీ విధానపు స్వాయత్త నియమాలుగా మారడం

పెట్టుబడి నుండి అదనపు విలువ ఏవిధంగా ఉద్భవించిందో ఇంత వరకు పరిశోధన చేశాం. ఇప్పుడు అదనపు విలువ నుండి పెట్టుబడి ఏవిధంగా పుడుతుందో చూడాలి. అదనపు విలువను పెట్టుబడిగా నియోగించడాన్నీ, దానిని పెట్టుబడిగా తిరిగి మార్చడాన్నీ పెట్టుబడి సంచయనం అంటారు.[1]

ముందుగా ఒక వైయుక్తిక పెట్టుబడిదారుడి దృక్కోణాన్నుండి ఈ లావాదేవీని పరిశీలిద్దాం. ఉదాహరణకు, ఒక నూలు మిల్లు యజమాని 10,000 పౌండ్లు పెట్టుబడిని అడ్వాన్సు చేశాడు అనుకుందాం. అందులో అయిదింట నాల్గువంతులు (8,000 పౌండ్లు) పత్తి, యంత్రాలూ వగైరాలకూ, మిగిలిన ఒక వంతు భాగాన్ని (2,000 పౌండ్లు) వేతనాలకూ ఖర్చు పెట్టాడని అనుకొందాం. సాలీనా 12,000 పౌండ్లు విలువ చేసే 2,40,000 పౌనుల నూలును అతను ఉత్పత్తి చేశాడని అనుకొందాం. అదనపు విలువ రేటు 100 శాతం అనుకుంటే, ఆ మొత్తం నూలు ఉత్పాదితంలో ఆరవ భాగం. అనగా 2,000 పౌండ్లు విలువ గలిగిన 40,000 పౌనుల మిగులు లేక నికర ఉత్పాదితంలో ఇమిడి వున్న అదనపు విలువ అమ్మకం ద్వారా రాబట్టుకోబడుతుంది. 2,000 పౌండ్లు మొత్తాన్ని ఏవిధంగా చూసినా 2,000 పౌండ్లే. ఈ డబ్బు మొత్తంలో అదనపు విలువ జాడను దేనినీ చూడనూ లేమూ, పసిగట్టనూ లేమూ. ఒక నిశ్చితమైన విలువ అదనపు విలువ అని మనకు తెలిసినపుడు దాని యజమానికి అది ఏవిధంగా సమకూరిందో మనకు తెలుస్తుంది; అయితే, అంత మాత్రాన, ఆ విలువ స్వభావం గానీ, లేక డబ్బు స్వభావం గానీ మారదు.

నూతనంగా సంపాదించిన ఈ 2,000 పౌండ్లు అదనపు మొత్తాన్నీ పెట్టుబడిగా మార్చడానికి, మిగిలిన పరిస్థితులు యథాతథంగా వున్నప్పుడు, అందులో అయిదింట నాల్గు వంతులు (1600

1. "పెట్టుబడి సంచయనం; పెట్టుబడిలోని ఒక భాగం పెట్టుబడిగా నియోగించడం"(మాల్తస్; డెఫినిషన్స్. కాజనోవ్.పుట 11);"ఆదాయాన్ని పెట్టుబడిగా మార్చడం" (మాల్థస్: ప్రిన్సిపుల్స్ ఆఫ్ పొలిటికల్ ఎకానమీ" రెండవ ముద్రణ; లండన్, 1836, పుట 320)

పౌండ్లు) పత్తి వగైరాల కొనుగోలుకూ, మిగిలిన ఒక వంతు భాగాన్నీ (400 పౌండ్లు) అదనంగా నూలు కార్మికులను కొనుగోలు చేయడానికీ నూలు మిల్లు యజమాని అడ్వాన్సు చేస్తాడు; మిల్లు యజమాని అడ్వాన్సు చేసిన విలువతో ఈ అదనపు కార్మికులు మార్కెట్‌లో తమ జీవితావసరాలను కొనుగోలు చేయగలరు. అప్పుడు ఈ 2000 పౌండ్లు నూతన పెట్టుబడి నూలుమిల్లులో తన క్రియను నిర్వహించడం ద్వారా తన వంతుకు 400 పౌండ్లు అదనపు విలువను తెచ్చిపెడుతుంది.

ప్రారంభంలో పెట్టుబడి విలువ డబ్బు రూపంలో అడ్వాన్సు చేయబడుతుంది. దీనికి భిన్నంగా, అదనపు విలువ మొదటి నుండీ మొత్తం ఉత్పాదితంలో ఒక నిశ్చితమైన భాగపు విలువగా వుంటుంది. ఈ మొత్తం ఉత్పాదితాన్ని అమ్మి, దానిని డబ్బురూపంలోకి మార్చినపుడు, ఆ పెట్టుబడి విలువ దాని తొలి రూపాన్ని తిరిగి పొందుతుంది. ఆ క్షణాన్నుండీ పెట్టుబడి విలువా, అదనపు విలువా రెండు కూడా డబ్బు మొత్తాలే. అవి తిరిగి పెట్టుబడిగా మార్పు చెందడం కచ్చితంగా యథాపూర్వకంగానే జరుగుతుంది. ఈ రెండు రకాల విలువల్ని కూడా సరుకుల కొనుగోలు కోసం పెట్టుబడిదారు ఖర్చు చేస్తాడు; అందువల్ల తిరిగి తాజాగా ఈసారి విస్తృత స్థాయిలో, సరుకుల ఉత్పత్తిని ప్రారంభించ గలుగుతాడు. అయితే ఆ విధంగా సరుకులను కొనగల్గాలంటే ముందుగా అవి మార్కెట్‌లో సిద్ధంగా వుండాలి.

ఇతర పెట్టుబడిదార్లు తమ సరుకులను మార్కెట్‌కు తీసుకువచ్చినట్లుగానే, ఈ పెట్టుబడిదారుడు కూడా తన వార్షికోత్పాదితాన్ని మార్కెట్‌కు తీసుకు వస్తున్నందువల్లనే అతని నూలు చలామణి అవుతుంది. అయితే మార్కెట్‌కు రాకముందు ఈ సరుకులన్నీ మొత్తం వార్షికోత్పాదితం (మొత్తం జాతీయోత్పత్తి)లో ఒక భాగం; అనగా వైయక్తిక పెట్టుబడుల మొత్తాన్ని లేక మొత్తం సామాజిక పెట్టుబడినీ ఒక సంవత్సర కాలంలో అన్ని రకాలైన సరుకులుగా మార్పిడి చేయడం ద్వారా ఉత్పత్తి అయిన మొత్తం రాశిలో ఒక భాగం మాత్రమే; అందులో ప్రతి పెట్టుబడిదారుడి ఆధీనంలో ఒక పూర్ణాంకపు భాగం మాత్రమే వుంటుంది. మార్కెట్‌లో జరిగే ఈ లావాదేవీ అంతా, వార్షికోత్పాదితంలోని వైయక్తిక భాగాల పరస్పర మార్పిడీ ఒక చేతి నుండి మరొక చేతికి వాటి మారకం మాత్రమే గానీ, దీని మూలంగా మొత్తం వార్షికోత్పాదితంలో పెరుగుదలా వుండదూ, ఉత్పత్తి అయిన సరుకుల స్వభావమూ మారదూ, కాబట్టి మొత్తం వార్షికోత్పాదితాన్ని ఉపయోగించుకో గలగడమనేది పూర్తిగా దాని నిర్మాణం మీదే ఆధారపడి వుంటుంది గానీ ఏవిధంగానూ దాని చలామణి మీదగాదు.

ఒక సంవత్సర కాలంలో వాడకం అయిపోయి పెట్టుబడి భౌతికాంశాలను తిరిగి పూరించేందుకు అవసరమయ్యే ఆయా వస్తువులన్నింటినీ (ఉపయోగపు విలువలను) వార్షికోత్పత్తి ముందుగా సమకూర్చవలసి వుంటుంది. వీటిని తీసివేయగా మిగిలి వుండే నికర లేక మిగులు ఉత్పాదితంలో అదనపు విలువ వుంటుంది. ఈ అదనపు ఉత్పాదితంలో వుండే వస్తువులేవీ? కేవలం పెట్టుబడిదారీ వర్గం కోర్కెల్నీ, అవసరాల్నీ తృప్తి పరచడానికీ, పర్యవసానంగా ఆ వర్గ వినియోగ నిధికై నిర్దేశించిన వస్తువులు మాత్రమే వుంటాయా? ఆ విధంగా అయితే, అదనపు విలువ భాండంలో చివరికి మడ్డి కూడా మిగలకుండా మొత్తం వూడ్చి పెట్టుకుపోతుంది; ఇక అప్పుడు కేవలం సామాన్య పునరుత్పత్తి మాత్రమే జరుగుతుంది.

సంచయనం జరగాలంటే, అదనపు ఉత్పాదితంలో ఒక భాగాన్ని పెట్టుబడిగా మార్చాల్సిన అవసరం వుంది. అయితే శ్రమ ప్రక్రియలో నియోగించబడే వస్తువులనూ (అనగా ఉత్పత్తి సాధనాలనూ) ఇంకా కార్మికుని పోషణకు అవసరమయ్యే మరికొన్ని వస్తువులనూ (అనగా జీవనాధార సాధనాలనూ) తప్ప, మరియే వస్తువులనైనా, ఇంద్రజాలంతో తప్ప, పెట్టుబడిగా మార్చలేము. పర్యవసానంగా, అడ్వాన్సు చేసిన పెట్టుబడి స్థానే, అంతకుమించి, దానిని భర్తీ చేయడానికి అవసరమైన ఉత్పత్తి సాధనాలనూ, జీవనాధారాలనూ అదనంగా ఉత్పత్తి చేయడానికి సాలుసరి అదనపు శ్రమలో ఒక భాగాన్ని ఉపయోగించవలసి వుంటుంది. ఒక్కమాటలో చెప్పాలంటే, నూతన పెట్టుబడి యొక్క భౌతికాంశాలను అదనపు ఉత్పాదితం అంతకు ముందే కలిగివున్నందు వల్ల, దాని విలువ అయిన అదనపు విలువ పెట్టుబడిగా మార్చబడుతుంది.[1]

ఇప్పుడు ఈ భౌతికాంశాలతో పెట్టుబడిగా పని చేయించడం వాస్తవంగా సాధ్యపడాలంటే పెట్టుబడిదారీ వర్గానికి అదనపు శ్రమ అవసరమవుతుంది. ఇదివరకే నియమించబడిన కార్మికుల దోపిడీ విస్తృతంగా గానీ లేక తీవ్రంగా గానీ పెరగకపోయినట్లయితే, అప్పుడు అదనపు శ్రమ శక్తిని అన్వేషించాల్సి వుంటుంది. కేవలం తన పోషణకే గాక, తన వ్యాప్తికి కూడా కనీస వేతనంతోనే సరిపుచ్చుకొనే కార్మికవర్గాన్ని, వేతనం మీద ఆధారపడే వర్గంగా మార్చడం ద్వారా పెట్టుబడిదారీ ఉత్పత్తి యంత్రాంగం ఆ అన్వేషణకు ముందుగానే మార్గాన్ని ఏర్పరచింది. ప్రతి సంవత్సరం, వివిధ వయోపరిమితులకు చెందిన కార్మికుల రూపంలో, కార్మికవర్గం సరఫరా చేస్తున్న ఈ అదనపు శ్రమ శక్తిని వార్షికోత్పత్తిలో భాగమైన అదనపు ఉత్పత్తి సాధనాలతో జోడించడం ఒక్కటే పెట్టుబడికి అవసరమవుతుంది; దీనితో అదనపు విలువను పెట్టుబడిగా మార్చడం పూర్తి అవుతుంది. ఒక నిర్దిష్ట దృక్కోణాన్నుండి చూసినపుడు పురోగమన స్థాయిలో, అత్యధిక మోతాదులో పెట్టుబడి పునరుత్పత్తిగా సంచయనం చేయబడుతుందని చెప్పవచ్చు. సామాన్య పునరుత్పత్తి యొక్క చలనపు వలయాకారం, తన రూపాన్ని మార్చుకొని, సిస్‌మాండ్ మాటల్లో చెప్పాలంటే, సర్పిలాకారంగా రూపొందుతుంది.[2]

ఇప్పుడు, మనం ఇంతకు ముందు తీసుకున్న ఉదాహరణకు వెళదాం. అదిపాత కథే! అబ్రహాం, ఐజాక్‌ను కంటే, ఐజాక్ జాకబ్‌ను కన్నాడు; అది ఆ విధంగా సాగుతూనే వుంటుంది. తొలి పెట్టుబడి అయిన 10,000 పౌండ్లు, 2,000 పౌండ్లు అదనపు విలువను కంటుంది; ఈ అదనపు విలువ పెట్టుబడీకరించబడుతుంది. నూతన పెట్టుబడి అయిన 2,000 పౌండ్లు మరో 400 పౌండ్లు అదనపు

1. ఆడంబర వస్తువులను ఉత్పత్తి సాధనాలుగా గానీ లేక జీవనాధార సాధనాలుగా గానీ అదే విధంగా యీ వస్తువులను ఆ వస్తువులుగా గానీ యే దేశమైనా మార్పు చేసుకోవడానికి సాధనంగా ఉపకరించే ఎగుమతి వ్యాపారాన్ని ఇక్కడ మనం పరిగణనలోకి తీసుకోవడం లేదు. చికాకు పరిచే అనుబంధ సమస్యలతో సంబంధం లేకుండా, మనం పరిశోధించే విషయాన్ని సమగ్రంగా పరిశీలించడానికి మొత్తం ప్రపంచాన్ని ఒక దేశంగా పరిగణించి పెట్టుబడిదారీ ఉత్పత్తి ప్రతిశాఖలోనూ, ప్రతి ప్రాంతంలోనూ పాదుకొని వున్నదని భావించాలి.

2. "ఆదాయాన్ని పెట్టుబడిగా మార్చడం" అనే ప్రక్రియ యొక్క భౌతిక పరిస్థితులను లోతుగా పరిశీలించక పోయినప్పటికీ, ఆ పదంతో తనకు తానుగా గొప్ప సంతృప్తి చెందడమే సిస్‌మాండ్ యొక్క సంచయనపు విశ్లేషణలోని పెద్ద లోపం.

విలువను కంటుంది; అది కూడా మళ్లీ పెట్టుబడీకరించబడి, రెండవ అదనపు పెట్టుబడిగా మార్చబడి, తద్వారా ఇంకా మరో 80 పౌండ్లు అదనపు విలువ సృష్టించబడుతుంది. ఈ విధంగా ఆ క్రమం కొనసాగుతూనే వుంటుంది.

పెట్టుబడిదారుడు వినియోగించుకొన్న అదనపు విలువలోని భాగాన్ని గురించి మనం ఇక్కడ పరిగణించకుండా ప్రస్తుతానికి వదిలిపెడదాం. అలాగే, అదనపు పెట్టుబడి, తొలి పెట్టుబడితో జోడించబడిందా లేదా స్వతంత్రంగా తన క్రియను నిర్వహించడానికి దానినుండి వేరు చేయబడిందా లేదా; దానిని సంచయనం చేసిన పెట్టుబడిదారుడే దానిని వినియోగించుకున్నాడా లేక ఇతరులకు స్వాధీనం చేశాడా లాంటి అంశాలతో కూడా ప్రస్తుతానికి మనకు నిమిత్తం లేదు. అయితే నూతనంగా ఏర్పడిన పెట్టుబడి సరసనే తొలి పెట్టుబడి ఇంకా స్వీయ పునరుత్పత్తి సాగిస్తూనే వుంటుందనీ, అదనపు విలువను ఉత్పత్తి చేస్తూనే వుంటుందనీ, సంచయనం చేయబడిన పెట్టుబడి మొత్తానికీ, అది సృష్టించిన అదనపుపెట్టుబడికీ కూడా ఇది వర్తిస్తుందని మాత్రం మనం మరిచిపోకూడదు.

10,000 పౌండ్లు అడ్వాన్సు ద్వారా తొలి పెట్టుబడి ఏర్పాటు అయింది. ఈ మొత్తాన్ని ఆ యజమాని ఏవిధంగా పొందగలిగాడూ? "అతని సొంత శ్రమ వల్లనూ, అతని పూర్వీకుల వల్లనూ" అని రాజకీయ అర్థశాస్త్ర ప్రతినిధులంతా ఏకగ్రీవంగా జవాబు యిస్తారు.[1] నిజానికి సరుకుల ఉత్పత్తి నియమాలకు ఒక అనుకూలంగా మాత్రమే వారివూహ వున్నట్లుగా కనిపిస్తుంది.

అయితే 2,000 పౌండ్లు అదనపు పెట్టుబడికి సంబంధించినంత వరకు దీనికి పూర్తి భిన్నంగా వుంది. అది ఏ విధంగా పుట్టిందో మనకు తెలుసు. దాని విలువలో ఏ ఒక్క అణువు కూడా దాని మనుగడకు వేతనం లేని శ్రమకు రుణపడకుండా లేదు. అదనపు శ్రమ శక్తిని ఇముడ్చుకున్నటు వంటి ఉత్పత్తి సాధనాలూ, అదే విధంగా కార్మికులను పోషించే జీవితావసరాలూ రెండు కూడా అదనపు ఉత్పాదితంలోని అంశీభూతమగు భాగాలు (అంతర్భాగాలు) తప్ప మరేమీ కావు; అవి పెట్టుబడిదారీ వర్గం, కార్మికవర్గాన్నుండి సాలీనా బలవంతంగా రాబట్టుకునే కప్పంలో భాగాలే. ఆ కప్పంలో ఒక భాగంతో, అదనపు శ్రమ శక్తిని దాని పూర్తి ధరకే పెట్టుబడిదారీ వర్గం కొనుగోలు చేసినప్పటికీ, ఆ విధంగా సరి సమానమై మార్పిడి చేయబడినప్పటికీ, ఈ లావాదేవీ అంతా, ప్రతి విజేతా, పరాజితుల నుండి తాను దోపిడీ చేసిన సొమ్ముతోనే, వారి సరుకులను కొనుగోలు చేసే పాత చర్యగానే వుంటుంది.

అదనపు పెట్టుబడి, తనను ఉత్పత్తి చేసిన వ్యక్తిని పనిలో నియమించినట్లయితే, ఆ ఉత్పత్తి దారుడు తొలిపెట్టుబడి విలువను సదా పెంచుతూ వుండడమే గాక, తన గత శ్రమ ఫలితాలను వాటి ఖరీదు కంటే ఎక్కువ శ్రమను వెచ్చించి తిరిగి కొనుగోలు చేయవలసి వుంటుంది. పెట్టుబడిదారీ వర్గానికీ, కార్మిక వర్గానికీ మధ్య జరిగే లావాదేవీగా చూసినపుడు, గతంలో నియమించబడిన కార్మికుల వేతనం లేని శ్రమ ద్వారా అదనపు కార్మికుల నియామకం జరుగుతున్నదనే విషయం వల్ల కలిగే వ్యత్యాసం ఏమీ వుండదు. పెట్టుబడి యొక్క ఉత్పత్తిదారులను పని నుండి గెంటివేసి, వారి స్థానాన్ని

1. "అతని పెట్టుబడి, దాని పుట్టుకకు, తొలి శ్రమకు రుణపడి వుంటుంది" (సిస్మాండీ, ఉదాహృత గ్రంథం, సంపుటి 1; పుట. 109 పారిస్)

కొంతమంది పిల్లలతో భర్తీ చేయగలిగిన యంత్రంగా అదనపు పెట్టుబడిని పెట్టుబడిదారుడు మార్చి వేయగలడు. ప్రతి సందర్భంలోనూ ఒక సంవత్సరపు అదనపు శ్రమతో మరుసటి సంవత్సరపు అదనపు శ్రమను నియమించేందుకు నిర్దేశించబడిన పెట్టుబడిని కార్మికవర్గం సృష్టిస్తూనే వుంటుంది.[1] దీన్నే పెట్టుబడి నుండి పెట్టుబడి సృష్టించబడటం అంటారు.

2,000 పౌండ్ల మొదటి అదనపు పెట్టుబడిని సంచయనం చేయాలంటే, పెట్టుబడిదారుని "ఆదిమ శ్రమ" మూలంగా, అతనికే చెంది, అతని చేత అడ్వాన్సు చేయబడిన 10,000 పౌండ్ల విలువ వుండి వుండాలి. దీనికి భిన్నంగా, 400 పౌండ్ల రెండవ అదనపు పెట్టుబడికి 2,000 పౌండ్ల పూర్వపు సంచయనం మాత్రమే వుండి వుంటే సరిపోతుంది; అందులో 400 పౌండ్ల పెట్టుబడీకరించ బడిన అదనపు విలువగా వుంటుంది. అప్పటి నుండీ సజీవంగా వున్న వేతనం లేని శ్రమను నిరంతరాయంగా అత్యధిక మోతాదులో స్వాయత్తం చేసుకోడానికి వున్న ఏకైక షరతు వేతనం లేని గత శ్రమపై యాజమాన్యం కలిగి వుండడమే. పెట్టుబడిదారుడు ఎంత ఎక్కువగా సంచయనం చేస్తే ఇంకా అంతకంటే ఎక్కువగా సంచయనం చేయగలిగే స్థితిలో వుంటాడు. తొలి పెట్టుబడిలో ఒక భాగంతో శ్రమ శక్తిని కొనుగోలు చేయగా వచ్చిన ఫలితమే అదనపు విలువలో భాగమైన మొదటి అదనపు పెట్టుబడి; సరుకుల మార్పిడి నియమాలకు అనుగుణ్యంగానే ఆ కొనుగోలు జరుగుతుంది. కార్మికుడికి సంబంధించినంత వరకూ అతని శక్తి స్థోమతులూ, డబ్బు లేక సరుకుల యజమానికి సంబంధించినంత వరకూ అతని విలువలనూ చట్టరీత్యా కూడా స్వేచ్ఛగా అమ్ముకోడానికి ఏ విధమైన అవరోధాలూ లేకుండా వుండాలి; ఇక రెండవ అదనపు పెట్టుబడికి సంబంధించినంత వరకూ, అది మొదటి అదనపు పెట్టుబడి ఫలితం మాత్రమే; అందువలన అదీ కూడా పై పరిస్థితుల పర్యవసానమే; కాబట్టి ప్రతి పెట్టుబడిదారుడూ దాని విలువకే శ్రమ శక్తిని కొనుగోలు చేస్తాడనీ, ప్రతి కార్మికుడూ దాని విలువకే శ్రమ శక్తిని అమ్ముతాడనీ మనం ఊహిస్తే, అందులో ప్రతి ఒక్క లావాదేవీ కూడా తప్పనిసరిగా సరుకుల మార్పిడి నియమాలకు సదా అనుగుణ్యంగానే వుంటుంది; సరుకుల ఉత్పత్తీ, చలామణీ పునాదిగా రూపొందిన ప్రయివేట్ ఆస్తి లేక స్వాయత్త నియమాలు, వాటి స్వీయ అంతర్గత అనివార్య గతితర్కం మూలంగా, వాటికి పూర్తి విరుద్ధంగా మార్పు చెందుతాయని స్పష్టంగా గోచరిస్తుంది. మనం ప్రారంభించిన తొలి ప్రక్రియ అయిన సమాన విలువల మార్పిడి యిప్పుడు స్పష్టమైన మార్పిడి మలుపు తిరిగింది. ఎందుచేతనంటే, మొదటిది : శ్రమ శక్తికి మార్పిడి చేయబడిన పెట్టుబడి కూడా, సమాన ఫలితం లేకుండా స్వాయత్తం చేసుకోబడిన పరాయి శ్రమ ఉత్పాదితంలోని ఒక భాగం అయినందువల్లనూ, రెండవది; ఈ పెట్టుబడిని, దాని ఉత్పత్తిదారుడు కొంత అదనపు మొత్తంతో సహా పునఃస్థాపన చేయవలసి వున్నందువల్లనూ, పెట్టుబడిదారుడికి, కార్మికుడికీ మధ్య జరిగే మార్పిడి సంబంధం, ఆ లావాదేవీ నిజ స్వభావానికి సంబంధం లేని ఒక రూపం మాత్రమేగాక, దాని నిజ స్వరూపాన్ని మరుగుపరిచే, చలామణి ప్రక్రియకు సంబంధించిన ఒక పోలిక మాత్రమే. నిరంతరం పునరావృత్తమయ్యే శ్రమశక్తి అమ్మకం, కొనుగోలూ కేవలం దాని రూపం మాత్రమే; గతంలో రూపధారణ

1. "శ్రమను పెట్టుబడి నియోగించకముందే, శ్రమ పెట్టుబడినిసృష్టిస్తుంది" (ఇ.జి. వేక్‌ఫీల్డ్; ఇంగ్లాండ్ అండ్ అమెరికా; లండన్, 1833, సంపుటి 2; పుట 110)

జరిగిన పరాయి శ్రమలోని ఒక భాగాన్ని సరిసమాన విలువ లేకుండా ఎక్కువ పరిమాణంలో సజీవశ్రమతో మార్పిడి చేసి మళ్ళీ మళ్ళీ దానిని పెట్టుబడిదారు స్వాయత్తం చేసుకోవడం వాస్తవంలో జరిగేది ఇదే. మొదట్లో ఆస్తి హక్కులు వ్యక్తి సొంత శ్రమపై ఆధారపడి వున్నట్లు మనకు కనిపించవచ్చు. కనీసం ఆ విధమైన ఊహ మనకు అవసరమయింది; ఎందుచేతనంటే, సరుకుల యజమానులు మాత్రమే సమాన హక్కులతో ఎదురుబొదురుగా నిలబడ్డారు గనుక; శ్రమ ద్వారా మాత్రమే ఉత్పత్తి చేయగలిగిన సరుకులను, వ్యక్తి నుండి పరాధీనం చెయ్యగలగడమొక్కటే, స్వాయత్తం చేసుకోవడానికి ఏకైక మార్గం. అయితే ఇప్పుడు, ఆస్తి అంటే, పెట్టుబడిదారుడికి సంబంధించినంత వరకూ వేతనం లేని పరాయి శ్రమను గానీ, లేక, దాని ఉత్పాదితాన్ని గానీ స్వాయత్తం చేసుకోగలిగిన హక్కునూ; కార్మికునికి సంబంధించినంత వరకూ తన సొంత ఉత్పాదితాన్నే స్వాయత్తం చేసుకోలేని అసాధ్య స్థితినీ, సూచిస్తున్నట్లుగా కనిపిస్తుంది. ఈ విధంగా వాటి అనన్యతలోనే స్పష్టంగా ఉద్భవించిన నియమం యొక్క తప్పనిసరి పర్యవసానమే శ్రమ నుండి ఆస్తిని వేరుచేయడం.[1]

కాబట్టి* సరుకుల ఉత్పత్తి సహజ నియమాల ముందు పెట్టుబడిదారీ స్వాయత్త విధానం బాహాటంగా అవినయం ప్రదర్శిస్తూ కనిపించినప్పటికీ, ఆ నియమాల ఉల్లంఘన మూలంగా కాక, దాని భిన్నంగా, వాటి వర్తింపు వల్లనే ఆ విధానం పుట్టింది. పెట్టుబడిదారీ సంచయనానికి దారితీసే చలనపు పర్యవసాన దశలను క్లుప్తంగా సమీక్షించడం ద్వారా మరొకసారి దీనిని స్పష్టంచేద్దాం.

మార్పిడి నియమాలకు పూర్తి అనుగుణ్యంగానే కొంత విలువ పరిమాణం పెట్టుబడిగా తొలుత మార్పు చెందడాన్ని ముందుగా మనం చూశాం. ఒడంబడికలోని ఒక పక్షం తన శ్రమశక్తిని అమ్ముకుంటే, మరొకపక్షం కొంటుంది. కార్మికుడు తన సరుకు విలువను పుచ్చుకొంటాడు; దానితో, అతని సరుకు యొక్క ఉపయోగపు విలువ అయిన శ్రమ, కొనుగోలుదారుడికీ పరాధీనం చెయ్యబడుతుంది. కొనుగోలుదారుడు అంతకుముందే తన అధీనంలో వున్న ఉత్పత్తి సాధనాలను అంతే సమానంగా అతనికి చెందియున్న శ్రమ సహాయంతో నూతన ఉత్పాదితంగా మార్పు చేస్తాడు. చట్టరీత్యా ఆ ఉత్పాదితం కూడా అతనిదే.

ఈ ఉత్పాదితం యొక్క విలువలో చేర్చబడినవి – ఒకటి : ఉపయోగించుకోబడిన ఉత్పత్తి సాధనాల విలువ : వీటి విలువను నూతన ఉత్పాదితంలోకి మార్చకుండా, ఉపయోగపు శ్రమ ఈ ఉత్పత్తి సాధనాలను వినియోగించుకోలేదు; అయితే, తనను నియమించబోయే పరిశ్రమ యొక్క ప్రత్యేక విభాగానికి అమ్ముడుబోవడానికి వీలుగా, ఉపయోగపు శ్రమను శ్రమ శక్తి సరఫరా చెయ్యగలిగి వుండాలి.

---

1. పరాయి శ్రమ ఉత్పాదితం పెట్టుబడిదారుడి ఆస్తిగావడం "స్వాయత్త నియమం యొక్క కచ్చితమైన పర్యవసానమే; దీనికి భిన్నంగా, కార్మికుని యొక్క ఉత్పాదితం. ప్రతి కార్మికుని యొక్క సంపూర్ణ హక్కు గావడమే దాని యొక్క ప్రాథమిక నియమం" (చెర్‌బులైజ్, రిచెస్స్ అండ్ పావర్టీ, పారిస్, 1841; పుట 58) ఏమైనప్పటికీ, ఇక్కడ గతి తార్కిక విలోమం స్పష్టంగా అభివృద్ధి కాలేదు.

* ఈ క్రింది భాగం (551వ పుట వరకు "పెట్టుబడిదారీ స్వాయత్త నియమాలు") నాల్గవ జర్మన్ ముద్రణకు అనుగుణంగా ఇంగ్లీషు అనువాదానికి జత చేయబడింది. **తె. సంపాదకుడు.**

ఆ నూతన ఉత్పాదితం యొక్క విలువలో ఇంకా చేర్చబడినవి : శ్రమ శక్తి విలువకు సరిసమానమైన విలువతో పాటు అదనపు విలువ కూడా వుంటుంది. ఎందుకంటే, ఒకరోజో, ఒకవారమో లాంటి నిర్ణీత కాలానికి అమ్ముడుబోయిన శ్రమశక్తి విలువ, దాన్ని ఉపయోగించుకున్న కాలంలో, అది సృష్టించిన విలువకన్నా తక్కువ వుంటుంది గనుక, అయితే, కార్మికుడు తన శ్రమ శక్తి యొక్క మార్పిడి విలువకి వేతనాన్ని పుచ్చుకొని, తద్వారా, దాని ఉపయోగ విలువను పరాధీనం చేస్తున్నాడు. ప్రతి అమ్మకం, కొనుగోలులో జరిగే తతంగం అంతా ఇదే!

శ్రమశక్తి అనే ప్రత్యేకమైన సరుకు, శ్రమను సరఫరా చేయగలిగిన ఒక ప్రత్యేకమైన ఉపయోగపు విలువను కలిగి వున్నందువల్ల, విలువను సృష్టించగలగడం వాస్తవమైనప్పటికీ, సరుకుల ఉత్పత్తి యొక్క సాధారణ నియమాన్ని ప్రభావితం చెయ్యలేదు. వేతనాల రూపంలో అడ్వాన్సు చేయబడిన విలువ పరిణామం మరొకసారి ఉత్పాదితంలో కనిపించక పోయినంత మాత్రాన, అదనపు విలువ వృద్ధిలో కనిపించినట్లయితే, అది అమ్మకందారుడు మోసపోయినందువల్ల గాదు; పైగా అతను తన సరుకు విలువను నిజంగా పుచ్చుకొన్నాడు గూడా; కొనుగోలుదారుడే ఆ సరుకును వినియోగించుకోవడం అనే ఏకైక వాస్తవం మూలంగా అలా జరుగుతుంది.

సరుకులు ఒకదానితో మరొకటి మార్పిడి చేయబడినప్పుడు, ఆ సరుకుల మార్పిడి విలువల మధ్య సమానత్వం మాత్రమే మార్పిడి నియమానికి అవసరం. దానికి, మొదటి నుండీ కూడా వాటి ఉపయోగపు విలువల మధ్య వ్యత్యాసమే వుండాలి తప్ప, ఒడంబడిక కుదిరి, మారకం పూర్తి అయిన తర్వాత ప్రారంభమయ్యే వినియోగాన్ని గురించి దానికి ఎట్టి సంబంధమూ వుండదు.

ఈ విధంగా, సరుకు ఉత్పత్తి యొక్క ఆస్తి నియమాలకూ, వాటినుండి ఉత్పన్నమైన ఆస్తి హక్కులకూ అత్యంత అనుగుణ్యంగానే డబ్బునూ పెట్టుబడిగా తొలుత మార్పిడి చేయడం నెరవేర్చబడింది; అయినప్పటికీ, వాటి ఫలితాలు :

1. ఉత్పాదితం పెట్టుబడిదారుడికే చెందుతుంది గానీ కార్మికునికి చెందదు :
2. ఆ ఉత్పాదితం విలువలో అడ్వాన్సు చేయబడిన, పెట్టుబడి విలువతో పాటు, పెట్టుబడిదారుడికి ఏ ఖర్చు లేకుండా, కార్మికుని శ్రమ వ్యయంతో ఉత్పత్తి అయిన అదనపు విలువ చేర్చబడుతుంది; అయినప్పటికీ, అది పెట్టుబడిదారుడి యొక్క న్యాయ సమ్మతమైన ఆస్తిగా వుంటుంది;
3. కార్మికుడు తన శ్రమ శక్తిని తిరిగి పొందడమేగాక, కొనుగోలుదారుడిని అన్వేషించగలిగితే ఆ శ్రమశక్తిని తిరిగి అమ్ముకోవచ్చు.

ఈ తొలి ప్రక్రియ నియమిత కాలంలో పునరావృత్తం గావడమే సామాన్య పునరుత్పత్తి; ప్రతిసారీ, డబ్బు పెట్టుబడిగా తాజాగా మార్చబడుతుంది. కాబట్టి ఆ నియమం ఉల్లంఘించబడలేదు; దానికి భిన్నంగా నిరంతరాయంగా తన ప్రక్రియను కొనసాగించడానికి దానికి శక్తి వస్తుంది. "క్రమానుగతమైన పలుమార్పిడి చర్యల మూలంగా చివరిది మొదటిదాని ప్రతినిధిగా రూపకల్పన చేయబడింది."[1]

అయినప్పటికీ, పూర్తిగా మార్పు చెందిన లక్షణంతో ఒక ప్రత్యేకమైన ప్రక్రియగా ఈ తొలి

1. సిస్‌మాండీ - ఉదాహృతగ్రంథం సంపుటి 1, పుట 70

ప్రక్రియను భావించిన మేరకు దాన్ని ప్రభావితం చెయ్యగలిగిన సామర్థ్యం సామాన్య పునరుత్పత్తికి ఉన్నదని మనం చూశాం. "జాతీయాదాయ పంపిణీదార్లలో ఒక వర్గం (కార్మికులు) వారి తాజా శ్రమ మూలంగా వారి వాటాకు ప్రతి సంవత్సరం తాజా హక్కును సంపాదిస్తారు. మిగతావారు (పెట్టుబడిదార్లు) తమ తొలి శ్రమ మూలంగా వారి వాటాకు ఒక శాశ్వతమైన హక్కును అంతకు ముందే పొందుతారు"[1] జ్యేష్ఠాధికార సిద్ధాంతపు ఇంద్రజాల ప్రదర్శన ఒక్క శ్రామిక రంగానికి మాత్రమే పరిమితమై లేదనే విషయం జగద్విదితం!

సంచయనం ద్వారా సామాన్య పునరుత్పత్తి స్థానే, దానికి బదులుగా విస్తృత స్థాయిలో పునరుత్పత్తి జరిగినపుడు కూడా, ఈ విషయంలో వ్యత్యాసం ఏమీ వుండదు. సామాన్య పునరుత్పత్తిలో అదనపు విలువనంతా విలాసవంతమైన జీవితంలో పెట్టుబడిదారుడు దుబారా చేస్తాడు. విస్తృత పునరుత్పత్తిలో అందులో ఒక భాగాన్ని వినియోగించుకొని, మిగిలిన దాన్ని డబ్బుగా మార్పు చేయడంలో తన బూర్జువా లక్షణాన్ని పెట్టుబడిదారుడు ప్రదర్శిస్తాడు.

అదనపు విలువ పెట్టుబడిదారుని ఆస్తి; అది ఎప్పుడూ, ఏ ఒక్కరికీ చెందియుండలేదు. ఉత్పత్తి చేయాలనే లక్ష్యంతో, పెట్టుబడిదారుడు దానిని అడ్వాన్సు చేసినట్లయితే, అతను మార్కెట్‌లోకి మొదటిసారి ప్రవేశించిన రోజు కచ్చితంగా ఏవిధంగా చేస్తాడో, అదే విధంగా అతను తన సొంత నిధి నుండే అడ్వాన్సు చేస్తాడు. కార్మికుల వేతనం లేని శ్రమ నుండే ఆ నిధి ఉత్పన్నమైనదనే వాస్తవం. ఈ సందర్భంలో ఏ విధమైన వ్యత్యాసాన్ని చూపించలేదు. 'క' అనే కార్మికుడు ఉత్పత్తి చేసిన అదనపు విలువ నుండి 'చ' అనే కార్మికుడికి వేతనం చెల్లించినట్లయితే, అపుడు, అందులో మొదటి విషయంగా, సగానికి కోతబడటం ద్వారా అతని సరుక్కి న్యాయమైన ధర లేకుండా ఆ అదనపు విలువను 'క' సమకూరుస్తాడనీ, ఇక రెండవ విషయంగా, ఆ లావాదేవీతో 'చ'కు ఎట్టి సంబంధమూ లేదనీ మనం గుర్తుంచుకోవాలి. తన శ్రమ శక్తి విలువను పెట్టుబడిదారుడు చెల్లించాలని 'చ' అడగవచ్చు; అలా అడిగే హక్కు అతనికి వుంది. 'ఎట్టి శ్రమా చేయకమునుపే' (ఇలా అన్వయించుకోవాలి; అతని శ్రమ ఇంకా ఫలప్రదం కాకమునుపే) "అతని శ్రమ ఫలితాలు అతనికి అడ్వాన్సు చేయబడుతున్నందువల్ల కార్మికుడూ" ఇలా అన్వయించుకోవాలి; (పరాయి కార్మికుల వేతనం లేని శ్రమను) "యజమాని పొందే వేతనాల కన్నా అతను చేసే కృషి ఎక్కువ విలువ గలిగినది అయినందువల్ల యజమానీ" (ఇలా అన్వయించుకోవాలి: అతని వేతనాల విలువకన్నా ఎక్కువ విలువను ఉత్పత్తి చేస్తున్నందువల్ల) "ఇద్దరు కూడా లాభాన్ని పొందుతారు."[2]

వైయక్తిక పెట్టుబడిదారుడూ, వైయక్తిక కార్మికుడూ స్థానే, పెట్టుబడిదారీ వర్గంగా, కార్మిక వర్గంగా పరస్పరం ఎదుర్కొనడాన్ని వాటి సంపూర్ణత్వంలో పరిశీలించినట్లయితే పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానాన్ని నిరంతరాయమైన పునఃపూరణ ప్రవాహంగా పరిగణించినట్లయితే నిజంగా ఈ విషయం పూర్తి భిన్నంగా వుంటుంది. అయితే, అలా చేస్తున్నపుడు సరుకు ఉత్పత్తికి ఏవిధంగానూ సంబంధం లేని కొలబద్దలను ఉపయోగించాలి.

---

1. సిస్‌మాండీ - ఉదాహృతగ్రంథం సంపుటి 1, పుటలు 110-111
2. సిస్‌మాండీ - ఉదాహృతగ్రంథం సంపుటి 1, పుట 135

సరుకుల ఉత్పత్తిలో పరస్పరం సంబంధం లేని కొనుగోలుదారుడూ, అమ్మకందారుడూ మాత్రమే ఒకరికి మరొకరు ముఖాముఖి తారసపడతారు. వారు చేసుకున్న ఒడంబడికలోని నిర్దేశించుకున్న కాలపరిమితి పూర్తి అయిన రోజుతోనే వారి మధ్య సంబంధాలు ఆగిపోతాయి. ఆ లావాదేవీ పునరావృత మయితే, అంతకు ముందు ఒడంబడికతో యెట్టి సంబంధం లేని నూతన ఒడంబడిక ఫలితంగానే అది పునరావృతమవుతుంది; దానివల్ల అదే కొనుగోలుదారుడూ, అదే అమ్మకందారుడూ యాదృచ్ఛికంగా మాత్రమే మళ్ళీ కలవవచ్చు.

కాబట్టి సరకు ఉత్పత్తిని గానీ లేక దాని తాలుకు ప్రక్రియలలో ఒక దానిని గానీ, దాని స్వీయ ఆర్థిక నియమాలను అనుసరించి తీర్పు చెప్పాల్సివస్తే, అంతకుముందు గానీ లేక ఆ తర్వాత గానీ జరిగే మార్పిడి చర్యలతో ఎట్టి సంబంధము లేకుండా ప్రతి మార్పిడి చర్యనూ, దానికి అదిగానే పరిగణించాలి. కేవలం ప్రత్యేకమైన వ్యక్తుల మధ్య మాత్రమే అమ్మకమూ, కొనుగోళ్లు జరుగుతున్నందు వల్ల మొత్తం సామాజిక వర్గాల మధ్య సంబంధాలను ఇక్కడ అన్వేషించడానికి అనుమతించరాదు.

నియమిత కాలంలో, వరుస క్రమంలో వచ్చే పునరుత్పత్తుల ద్వారా గానీ, అంతకు ముందు జరిగిన సంచయనాల ద్వారా గానీ ప్రయాణించడానికి ఈ రోజు వున్న క్రియాత్మక పెట్టుబడికి ఎంతకాలం పట్టినప్పటికీ, దాని తొలి పరిశుద్ధతను ఎప్పుడూ రక్షించుకుంటూనే వుంటుంది... ప్రతి ఒక్క మార్పిడి చర్యలోనూ, మార్పిడి నియమాలను పాటించినంత కాలం సరుకు ఉత్పత్తికి అనుగుణ్యమైన ఆస్తి హక్కులకు ఏ విధమైన భంగమూ వాటిల్లకుండా స్వాయత్త విధానాన్ని పూర్తి విప్లవాత్మకం చేయవచ్చు. ఉత్పాదితం ఉత్పత్తిదారునికి చెందియుండి, ఆ ఉత్పత్తిదారు సరిసమాన విలువలనే మారకం చేస్తున్నప్పుడు, అతను, సొంత శ్రమ ద్వారా మాత్రమే సంపన్నవంతుడు కాగలిగిన ప్రారంభ దశలోనూ, వేతనం లేని పరాయి శ్రమను ఎప్పుడూ, తాజాగా, నిరంతరాయంగా స్వాయత్తం చేసుకోగలిగిన స్థితిలో వున్నవారికి అత్యధిక మోతాదులో సామాజిక సంపద సొంత ఆస్తిగా పరిణమిస్తున్న పెట్టుబడిదారీ విధాన కాలంలోనూ కూడా అదే హక్కులు అమలులో వుంటాయి.

శ్రమశక్తిని ఒక సరుకుగా కార్మికుడు తనకు తానే స్వేచ్ఛగా అమ్ముకున్న క్షణం నుండీ ఈ ఫలితం తప్పనిసరి అవుతుంది. అయితే, అప్పటినుండి మాత్రమే సరుకు ఉత్పత్తి సర్వసాధారణమై పోయి, ఉత్పత్తి యొక్క ఒక ప్రత్యేక రూపం అవుతుంది. అప్పటినుండీ, ఆ తదుపరి మాత్రమే, ప్రతి ఉత్పాదితం అమ్మకం కోసం ఉత్పత్తి చేయబడి, ఆ విధంగా ఉత్పత్తి చేయబడిన సంపద అంతా చలామణి రంగంలోకి ప్రవేశిస్తుంది. ఎప్పుడైతే సరుకు ఉత్పత్తికి, శ్రమశక్తి పునాది అయిందో, అప్పుడు మాత్రమే, అక్కడ సరుకు ఉత్పత్తి తనకు తానుగా సామాజిక వ్యవస్థ నెత్తిమీద కూర్చుంటుంది; అయితే, అప్పుడు మాత్రమే, అక్కడ, అది గుప్తమైన తన సర్వశక్తి సామర్థ్యాలనూ ప్రదర్శిస్తుంది. శ్రమశక్తి జోక్యం వల్ల సరుకు ఉత్పత్తి కల్తీ అవుతుందని చెప్పడం, కల్తీ లేకుండా వుండాలంటే సరుకు ఉత్పత్తి వృద్ధి కాకూడదని చెప్పడం లాంటిదే. దాని స్వీయ అంతర్గత నియమాలకు అనుగుణ్యంగా, సరుకు ఉత్పత్తి పెట్టుబడి దారీ ఉత్పత్తిగా ఇంకా వృద్ధి చెందిన మేరకు, సరుకు ఉత్పత్తి యొక్క ఆస్తి నియమాలు, పెట్టుబడిదారీ స్వాయత్త నియమాలుగా మార్పు చెందుతాయి.[1]

---

1. కాబట్టి సరుకుల ఉత్పత్తి ప్రాతిపదికగా గలిగిన ఆస్తి యొక్క శాశ్వత నియమాలను అమలు చేయడం ద్వారా పెట్టుబడిదారీ ఆస్తిని రద్దు చేయాలనే ప్రౌధాన్ మేధాశక్తికి మనం ఆశ్చర్యపోతాం!

దాని మూలాధారం ఏదైనప్పటికీ, పెట్టుబడి అంతా సంచయనం చేయబడిన పెట్టుబడిగా, పెట్టుబడీకరించబడిన అదనపు విలువగా మార్పు చెందుతుందని సామాన్య పునరుత్పత్తి విషయంలో కూడా మనం గమనించాం. అయితే నేరుగా సంచయనం చేయబడిన పెట్టుబడితో పోల్చినపుడు, అనగా సంచయనకారుని ఆధీనంలో పని చేసినా లేక ఇతరుల ఆధీనంలో పని చేసినా, పెట్టుబడిగా తిరిగి మార్పుచేయబడిన అదనపు విలువ లేక అదనపు ఉత్పాదితంతో పోల్చినపుడు, తొలుత అడ్వాన్సు చేసిన పెట్టుబడి అంతా, వరదలా పరవళ్ళు త్రొక్కుతున్న ఉత్పత్తి ప్రవాహంలో, ఒక అదృశ్యమవుతున్న పరిమాణం (గణిత శాస్త్ర పరిభాషలో అత్యల్పం) లాగా వుంటుంది. కాబట్టి, పెట్టుబడిని సాధారణంగా "అదనపు విలువను ఉత్పత్తి చేయడానికి మళ్ళీ మరొకసారి నియోగించబడే సంచనం చేయబడిన సంపదగా"[1] (మార్పు చేయబడిన అదనపు విలువా లేక ఆదాయంగా)నూ, పెట్టుబడిదారుని "అదనపు విలువ యజమానిగానూ"[2] రాజకీయ అర్థశాస్త్రం వర్ణిస్తుంది. ఉనికిలో ఉన్న పెట్టుబడి అంతా సంచయనం చేయబడిన లేక పెట్టుబడీకరించబడిన వడ్డీ అనీ, ఆ వడ్డీ అదనపు విలువలో ఒక భాగం మాత్రమేననీ వ్యక్తీకరించే ధోరణి కూడా అదే అంశానికీ, అదే ధోరణికి సంబంధించిన మరొక రూపం మాత్రమే.[3]

### విభాగం - 2

## పునరుత్పత్తి పురోగమనంలో పెరుగుదల స్థాయిని గురించి రాజకీయ అర్థశాస్త్రవేత్తల పొరపాటు అవగాహన

సంచయనం లేక అదనపు విలువ తిరిగి పెట్టుబడిగా మారడాన్ని మనం లోతుగా పరిశీలన చెయ్యబోయే ముందు, సాంప్రదాయ అర్థశాస్త్రవేత్తలు ప్రవేశపెట్టిన గందరగోళాన్నుండి మన మార్గాన్ని సుగమం చేసుకోవాలి.

అదనపు విలువలో ఒక భాగంతో తన సొంత వినియోగం కోసం పెట్టుబడిదారుడు కొనుగోలు చేసే సరుకులు ఉత్పత్తి సాధనాలుగా గానీ లేక విలువను సృష్టించే సాధనాలుగా గానీ తోడ్పడవు. అదే విధంగా తన సహజమైన, సామాజిక అవసరాలను సంతృప్తి పరచుకోడానికి కొనుగోలు చేసే శ్రమ కూడా ఉత్పాదక శ్రమగా ఉపకరించదు. అదనపు విలువను పెట్టుబడిగా మార్చే దానికి బదులుగా దానికి భిన్నంగా ఆ సరుకులనూ, ఆ శ్రమనూ కొనుగోలు చేయడం ద్వారా పెట్టుబడిదారుడు దానిని

---

1. "పెట్టుబడి అనగా లాభోద్దేశ్యంతో నియోగించబడిన సంచయనం చేసిన సంపద" (మాల్తస్, ఉదాహృత గ్రంథం. పుట 262)
లాభోద్దేశ్యంతో, ఆదాయాన్నుండి పొదుపు చేయబడి ఉపయోగించుకోబడినదే పెట్టుబడి" (ఆర్. జోన్స్: "యాన్ ఇన్‌ట్రడక్టరీ లెక్చర్స్ ఆన్ పొలిటికల్ ఎకానమీ" లండన్. 1833. పుట. 16)
2. "అదనపు ఉత్పాదితాన్ని గానీ లేక పెట్టుబడిని గానీ కలిగిన వారు" (ది సోర్స్ అండ్ రెమిడీ ఆఫ్ ది నేషనల్ డిఫికల్టీస్, ఎ లెటర్ టు జాన్ రస్సెల్, లండన్ 1821).
3. "పొదుపు చేయబడిన పెట్టుబడిలోని ప్రతి భాగానికీ వచ్చే చక్రవడ్డీతో పాటు, ఆదాయాన్ని ఉత్పన్నం చేసే ప్రపంచంలోని సకల సంపదా పెట్టుబడిలో లీనమై ఎప్పుడో పెట్టుబడి మీద వడ్డీగా మారాయి" లండన్, ఎకనామిస్ట్, జులై 19. 1851)

వినియోగించుకోవడమో లేక ఒక ఆదాయంగానో ఖర్చు చేస్తాడు. సరిగ్గా హెగెల్ చెప్పినట్లు "చేతికి దొరికిందంతా వినియోగించుకునే" పాత, భూస్వామ్య కులీన వర్గాల అలవాటు పడిన జీవన విధానం, ప్రత్యేకించి వారి వ్యక్తిగత భృత్యుల ఆడంబర ప్రదర్శన, ఎదురైనప్పుడూ దానిని తిప్పికొట్టడానికి, తమ ఖర్చుకు మించిన ఆదాయాన్ని తెచ్చిపెట్టే అదనపు ఉత్పాదక కార్మికులను సంపాదించేందుకు తన ఆదాయంలో గణనీయమైన భాగాన్ని ఖర్చుచేసే దానికి బదులుగా తన ఆదాయాన్నంతా వినియోగించుకున్నట్లయితే, ఏ వ్యక్తి అయినా సంచయనం చేయలేదని నిర్విరామంగా బోధించడమూ, పెట్టుబడి సంచయనం ప్రతిపౌరుని యొక్క విధీ అనే సిద్ధాంతాన్ని ప్రచారం చెయ్యడమూ బూర్జువా అర్థశాస్త్రానికి అత్యంత ప్రాముఖ్యమైనది. పెట్టుబడిదారీ ఉత్పత్తికి, దాచిపెట్టడానికీ[1] (హోర్డింగ్) మధ్య వున్న గందరగోళం మూలంగా సంచయనం చేయబడిన సంపదను దాని సహజ రూపాన్నుండి వినాశనం చేయబడకుండా అనగా వినియోగించుకోకుండా రక్షించబడిన సంపదగానో లేక చలామణి నుండి ఉపసంహరించబడిన సంపదగానో ఊహించే జన వ్యాపితమైన దురభిప్రాయానికి వ్యతిరేకంగా కూడా మరొకవైపున ఈ అర్థశాస్త్రవేత్తలు వాదించాల్సి వచ్చింది. చలామణి నుండి డబ్బుని మినహాయిస్తే, పెట్టుబడిగా దాని స్వీయాభివృద్ధి పూర్తిగా అసంభవమవుతుంది; దాచిపెట్టే విధంగా సరుకుల రూపంలో సంచయనం చేయబడం కేవలం తెలివితక్కువ పనిగా వుంటుంది.[2] అమితోత్పత్తి వల్ల గానీ లేక చలామణి కున్న అవరోధాల ఫలితంగా గానీ పెద్ద రాశులుగా సరుకులు సంచయనం చేయబడతాయి.[3] ఒకవైపున నిత్యజీవిత వాడకానికి ధనికులచే నిల్వచేయబడిన వస్తురాశినీ,[4] మరొకవైపున భవిష్యత్తు కోసం ఏర్పాటు చేసుకునే నిల్వ రాశులనూ చూసి, సాధారణ ప్రజానీకం, ప్రభావితులైన మాట వాస్తవమే; ఈ రెండవ అంశం ఉత్పత్తి విధానాలన్నింటిలోనూ సామాన్యమైన విషయమే; చలామణిని గురించి విశ్లేషించే సందర్భంలో దీని మీద మన దృష్టిని సారిద్దాం. కాబట్టి, అదనపు ఉత్పాదితాన్ని అనుత్పాదక కార్మికులకు బదులుగా ఉత్పాదక కార్మికులే వినియోగించుకోవడం, సంచయన ప్రక్రియ యొక్క స్వభావోచిత లక్షణమని సాంప్రదాయక అర్థశాస్త్ర వ్యక్తం చేయడం పూర్తిగా సరైనదే. అయితే

1. "పొదుపు అంటే కేవలం దాచిపెట్టడమే అని ఈ రోజునున్న ఏ రాజకీయ అర్థశాస్త్రవేత్త అభిప్రాయంగా ఉండజాలదు; అసమగ్రమైన ఈ కుచ్చిత వాదన వెనుక జాతీయ సంపదకు సంబంధించిన పదాన్ని పేర్కొనడం నిష్ప్రయోజనమని మనం బాగానే ఊహించవచ్చు. అయితే పొదుపు చేయబడిన దానిని మరొక రూపంలో ఉపయోగించుకోవడం మూలంగా సంక్రమించేది. దానిచేత పోషించబడుతున్న భిన్న రూపాల శ్రమ మధ్య నున్న నిజమైన వ్యత్యాసాల మీద ఆధారపడి వుంది." (మాల్తస్ : ఉదాహృత గ్రంథం పుటలు 38, 39)
2. ఉదాహరణకు, లోభితనాన్ని ప్రతికోణాన్నుంచీ పరిశీలించిన బాల్జాక్, వడ్డీవ్యాపారి అయిన గోబ్సెక్ సరుకులను రాశిగా పోగేసుకోవడానికి ప్రయత్నించినపుడు, అది అతని రెండవ బాల్యదశగా చిత్రిస్తాడు.
3. "సంచయనపు రాశులు..... మార్పిడి లేకపోవడం..... అమితోత్పత్తి" (టి. కోర్బెట్; ఉదాహృత గ్రంథం. పుట 104)
4. "అమోఘమైన ఆడంబర వస్తువులు" అనీ, వాటి "సంచయనం కాలక్రమేణా పెరిగింది" అనీ, "అవి సామాజిక వ్యవస్థలోని ఒకే వర్గం అధీనంలో గుదిగచ్చబడటానికి ఆస్తి నియమాలు దోహదం చేశాయి." అనే అర్థంలోనే నెక్కర్ చెప్తాడు. (యూగ్రస్.డే.యం. నెక్కర్, పారిస్ అండ్ లాసన్నే. 1789, సంపుటి 2, పు. 291)

సరిగ్గా ఈ అంశం దగ్గరే పొరపాటు కూడా ప్రారంభమవుతుంది. అదనపు ఉత్పాదితాన్ని, ఉత్పాదక కార్మికులు వినియోగించుకోవడమే సంచయనమని వర్ణించడాన్ని ఆడమ్ స్మిత్ ఒక విధానంగా చేశాడు. అదనపు విలువను పెట్టుబడీకరించడమంటే కేవలం అదనపు విలువను శ్రమశక్తిగా మార్పు చేయడమేనని చెప్పడంతో ఇది సమానమవుతుంది. ఇక రికార్డో ఏమి చెప్పాడో చూద్దాం : "ఒక దేశం యొక్క ఉత్పత్తులన్నీ వినియోగించుకోబడతాయని అర్థం చేసుకోవాల్సి వుంటుంది; అయితే వాటిని వినియోగించుకొనేది పునరుత్పత్తి చేసే వారేనా లేక మరొక విలువను పునరుత్పత్తి చేయని వారా అనేది చాలా ముఖ్యమైన విషయము. ఆదాయం పొదుపు చేయబడి పెట్టుబడికి జోడించబడిందని చెప్పినపుడు, దాని అర్థం, పెట్టుబడికి జత చేయబడిందిగా చెప్పబడుతున్న ఆదాయంలోని ఆ భాగాన్ని అనుత్పాదక కార్మికులకు బదులుగా ఉత్పాదక కార్మికులే వినియోగించుకుంటారని మన అభిప్రాయం; వినియోగం లేకుండా వుండటం ద్వారానే పెట్టుబడి అభివృద్ధి అవుతుందని భావించడం కన్నా పెద్ద పొరపాటు మరేదీ వుండదు."[1] ఆడమ్ స్మిత్ ననుసరించి డేవిడ్ రికార్డో, ఆ తర్వాత వచ్చిన అర్థ శాస్త్రవేత్తలూ "పెట్టుబడికి జత చేయబడిందిగా చెప్పబడుతున్న ఆదాయంలో ఆ భాగాన్ని ఉత్పాదక కార్మికులు వినియోగించుకుంటారు" అని పునశ్చరణ చేసిన దానికన్నా మరొక పెద్ద పొరపాటేదీ వుండదు. దీని ప్రకారం, పెట్టుబడిగా మార్చబడిన అదనపు విలువ అంతా అస్థిర పెట్టుబడి అవుతుంది. ఏమైనప్పటికీ, వాస్తవంగా, తొలి పెట్టుబడిలాగే అదనపు విలువస్థిర పెట్టుబడిగానూ, అస్థిర పెట్టుబడిగానూ, ఉత్పత్తి సాధనాలు గానూ, శ్రమ శక్తిగానూ విభజించబడుతుంది. ఉత్పత్తి ప్రక్రియ కాలంలో, శ్రమ శక్తి రూపంలో అస్థిర పెట్టుబడి వుంటుంది. ఈ ప్రక్రియలో శ్రమ శక్తి పెట్టుబడిదారుడు వినియోగించుకుంటే, శ్రమ అనే తన క్రియను నెరవేర్చడానికి శ్రమ శక్తి ఉత్పత్తి సాధనాలను వినియోగించుకుంటుంది. అదే సమయంలో శ్రమ శక్తిని కొనుగోలు చేయడానికి చెల్లించబడిన డబ్బు జీవితావసరాలుగా మార్చబడి "ఉత్పాదక శ్రమ"చే గాక "ఉత్పాదక కార్మికుని"చే వినియోగించుకోబడుతుంది. ప్రధానంగా వక్ర విశ్లేషణ మూలంగా, ప్రతి వైయక్తిక పెట్టుబడీ స్థిర, అస్థిర భాగాలుగా విభజించబడినప్పటికీ, సామాజిక వ్యవస్థ యొక్క పెట్టుబడి మాత్రం కేవలం అస్థిర పెట్టుబడిగా మారుతుందనీ, అనగా వేతనాలు చెల్లించడానికి ఒక ప్రత్యేక కేటాయింపుగా మాత్రమే వుంటుందనే అసంబద్ధమైన నిర్ధారణకు ఆడమ్ స్మిత్ వస్తాడు. ఉదాహరణకు, ఒక వస్త్ర పరిశ్రమ యజమాని 2,000 పౌండ్లను పెట్టుబడిగా మార్చాడు అనుకొందాం. అందులో ఒక భాగాన్ని నేత కార్మికులను కొనుగోలు చేయడానికి, మిగతా భాగాన్ని ఉన్ని దారాన్నీ యంత్రాలనూ వగైరా కొనుగోలు చేయడానికీ కేటాయిస్తాడు. అయితే, అతను ఎవరి దగ్గరనుండి నూలునూ, యంత్రాలనూ కొనుగోలు చేశాడో, వారు తాము పొందిన డబ్బులో ఒక భాగాన్ని కార్మికులకు చెల్లిస్తారు. ఆ మొత్తం 2,000 పౌండ్లు వేతనాల చెల్లింపు కోసం ఖర్చు చేసే వరకు అది ఆ విధంగా కొనసాగుతుంది. అనగా 2,000 పౌండ్లకు ప్రాతినిధ్యం వహిస్తున్న మొత్తం ఉత్పాదితం ఉత్పాదక కార్మికులు వినియోగించుకునే వరకు అది ఆ విధంగా కొనసాగుతుంది; ఈ వాదన యొక్క మొత్తం సారాంశమంతా "అది ఆ విధంగా" అనే మాటల్లోనే ఉందనేది స్పష్టంగా

1. రికార్డో ఉదాహృత గ్రంథం, పుట 163, నోట్.

తెలుస్తూనే వుంది; పైగా ఇది మనల్ని ఒక ఆధారాన్నుండి మరొక ఆధారానికి పరుగెత్తించే విధంగా గుంజీళ్లు పెట్టిస్తుంది. నిజానికి, ఎక్కడైతే చిక్కులు ప్రారంభమవుతాయో అక్కడే ఆడమ్ స్మిత్ తన పరిశోధనను నిలిపివేస్తాడు.[1]

వార్షికోత్పత్తి మొత్తాన్ని మాత్రమే మనం దృష్టిలో ఉంచుకొన్నంత కాలం పునరుత్పత్తి యొక్క వార్షిక ప్రక్రియలను సులభంగా అవగాహన చేసుకోవచ్చు. అయితే, ఈ ఉత్పాదితంలోని ప్రతి ఒక్క భాగాన్ని, ఒక సరుకుగా మార్కెట్‌లోకి తీసుకురావాల్సి వచ్చినపుడు ఇబ్బంది ప్రారంభమవుతుంది. సామాజిక వ్యవస్థ యొక్క సంపద చలామణిలో, వైయక్తిక పెట్టుబడుల, వైయక్తిక ఆదాయాల కార్యకలాపాలు అడ్డదిడ్డంగా కలిసిపోయి, సాధారణ మార్పులలో స్థానాలను కోల్పోతాయి. ఇది మన దృష్టిని గందరగోళపరచి, పరిష్కారం కోసం అతి సంక్లిష్ట సమస్యలను ప్రతిపాదిస్తుంది. రెండవ సంపుటంలోని మూడవ భాగంలో దీనికి సంబంధించిన నిజానిజాలను విశ్లేషణ చేస్తాను. చలామణి ప్రక్రియ నుండి బయటపడిన తర్వాత వార్షికోత్పత్తిని మనకు ప్రతిపాదించిన రూపంలో ఫిజియోక్రసీ సిద్ధాంతకర్తలు తమ "టేబుల్ ఎకానమీ"లో మొట్టమొదటి సారిగా విశదీకరించడానికి చేసిన ప్రయత్నం. వారు చేసిన గొప్ప ప్రయత్నాలలో విశిష్టమైనదిగా పేర్కొనవచ్చు.[2]

ఇక మిగతా విషయానికొస్తే, పెట్టుబడిదారీ వర్గ ప్రయోజనాలకు అనుగుణంగా, పెట్టుబడిగా మార్చబడిన అదనపు ఉత్పాదితంలోని ఆ మొత్తం భాగాన్ని కార్మిక వర్గమే వినియోగించుకుంటుంది అనే ఆడమ్ స్మిత్ సిద్ధాంతాన్ని ఉపయోగించుకోవడంలో రాజకీయ అర్థశాస్త్రం వైఫల్యం చెందలేదన్నది విస్పష్టం.

---

1. జాన్ స్టువర్ట్ మిల్ ఎంత ''తర్కించి''నప్పటికీ, అతని పూర్వీకులు చేసిన ఆ విధమైన పొరపాటు విశ్లేషణను గూడా, అది బూర్జువా దృష్టి క్షేత్ర పరిమితులలోనైనా సరిదిద్దాలని గగ్గోలు పెడుతున్నప్పటికీ, అతను ఏ సందర్భంలోనూ ఆ పొరపాటును గ్రహించలేకపోయాడు. ప్రతి విషయంలోనూ, ఒక శిష్యుడి కుండే పిడివాదంతో ఆయన గురువుల గందరగోళాన్నంతా నమోదు చేస్తూ వుంటాడు. ఆ విధంగానే ఇక్కడ కూడా, ''దీర్ఘకాలంలో పెట్టుబడి దానికదే పూర్తిగా వేతనాలుగా మారుతుంది. ఉత్పాదిత అమ్మకం ద్వారా దానిని భర్తీ చేసినపుడు, అది మరొకసారి వేతనాలుగా మారుతుంది.
2. సంచయనానికీ, ఉత్పత్తి ప్రక్రియకూ సంబంధించిన తన విశదీకరణలో, ఆడమ్‌స్మిత్, ఏ విధంగా చూసినప్పటికీ, ఒక్క అడుగు ముందుకు వేయలేదు సరికదా, తన పూర్వీకులతో పోల్చినపుడు, గణనీయంగా తిరోగమించాడు. వేతనాలూ, లాభం (వడ్డీ) భూమి కౌలూ అనగా, వేతనాలూ అదనపు విలువతో కలిపి సరుకుల ధరలు వుంటాయనే పిడివాదం. ఆయననుండి రాజకీయ అర్థశాస్త్రానికి సంక్రమించిన వారసత్వం. గ్రంథంలో పేర్కొనబడిన భ్రమభరితమైన ఈ పిడివాదం నిజంగా ఆశ్చర్యాన్ని గొల్పే పిడివాదం. దీని ప్రాతిపదికగా, ''అవసర ధరను దాని సామాన్య అంశాలలోకి మార్పు చేయడం అసాధ్యం'' అని స్టార్చ్ కల్లాకపటం లేకుండా అంగీకరిస్తాడు. (స్టార్చ్, ఉదాహృత గ్రంథం పీటర్స్‌బర్గ్, 1815. సంపుటి 2, పుట 141) ఇది సరుకు యొక్క ధరను దాని సామాన్య అంశాలలోకి మార్పు చేయడం అసాధ్యమని ప్రకటించే ఆశ్చర్యకరమైన అర్థశాస్త్రం! ఈ అంశాన్ని రెండవ సంపుటిలోని మూడవ భాగంలోనూ మూడవ సంపుటిలోని ఏడవ భాగంలోనూ ఇంకా పరిశోధిస్తాం.



## విభాగం - 3

# అదనపు విలువ పెట్టుబడిగానూ, ఆదాయంగానూ విభజించబడడం; వాంఛా విసర్జన సిద్ధాంతం

పెట్టుబడిదారుడి వైయక్తిక వినియోగానికై సరఫరా చేయబడుతున్న ఒక నిధిగా మాత్రమే అదనపు విలువను (లేక అదనపు ఉత్పాదితాన్ని) గత అధ్యాయంలో మనం పరిశీలించాం. ఈ అధ్యాయంలో సంచయనానికి ఒక నిధిగా మాత్రమే ఇంత వరకు దాన్ని పరిశీలించాం. ఏమైనప్పటికీ నిజానికి అది అదీ కాదూ, ఇదీ కాదూ; అయితే ఆ రెండూ కూడా. అదనపు విలువలో ఒక భాగాన్ని ఆదాయంగా పెట్టుబడిదారుడే వినియోగించుకుంటాడు.[1] మరొక భాగం పెట్టుబడిగా నియోగించబడి సంచయనం చేయబడుతుంది.

ఉన్నటువంటి అదనపు విలువ పరిణామంలో ఈ భాగాలలో ఒకటి పెద్దదిగా వుంటే మరొకటి చిన్నదిగా వుంటుంది. మిగిలిన పరిస్థితులు యథాతథంగా ఉన్నప్పుడు ఈ భాగాల మధ్య నిష్పత్తి సంచయనం యొక్క పరిమాణాన్ని నిర్ణయిస్తుంది. అయితే అదనపు విలువ యజమాని అయిన పెట్టుబడిదారు మాత్రమే ఈ విభజన చేయగలడు. అది అతని ఉద్దేశ్యపూర్వకమైన చర్య. అతనిచే బలవంతంగా కొల్లగొట్టబడిన ఆ భాగం, అతను వినియోగించుకోనందువల్లనే పొదుపు చేయబడి సంచయనం చేయబడుతుందని చెప్పబడుతుంది; అనగా అతను ఒక పెట్టుబడిదారుడిగా తన విధిని నిర్వర్తించడం మూలంగానే సంపన్నవంతుడు అవుతాడు అని సిగ్గులేకుండా సమర్థించుకుంటారు.

పెట్టుబడి సంకేతంగా తప్ప పెట్టుబడిదారుడికి చారిత్రక ప్రాధాన్యతా లేదూ; చారిత్రక అస్తిత్వానికి హక్కూ లేదు. లిచనోవస్కీ హాస్యోక్తిలో చెప్పాలంటే, ఇంకా ఆ అస్తిత్వానికి "పోయేకాలం దాపురించలేదు". ఆ మేరకు మాత్రమే పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం యొక్క తాత్కాలిక ఆవశ్యకత, పెట్టుబడిదారుడి తాత్కాలిక అస్తిత్వం యొక్క ఆవశ్యకతను సూచిస్తుంది. అయితే, అతను పెట్టుబడి సంకేతంగా వున్న మేరకు, వుపయోగపు విలువలూ, వాటి అనుభవమూ గాక, మార్పిడి విలువలూ, వాటి అభివృద్ధియే అతన్ని ప్రోత్సహించి కార్యాచరణలోకి దించుతాయి. విలువను వృద్ధి చేయాలనే మూఢావేశంతో ఉత్పత్తి కోసమే ఉత్పత్తి చేసేందుకని మానవ జాతిని నిర్దాక్షిణ్యంగా బలవంతం చేస్తాడు. అతను, ఆ విధంగా సామాజిక వ్యవస్థ యొక్క ఉత్పాదక శక్తుల పురోగమనాన్ని బలవంతం చేయడం ద్వారా ప్రతి వ్యక్తీ, సంపూర్ణంగా స్వేచ్ఛగా వికసించడానికి శాసన సూత్రంగా వుండే ఒక ఉన్నత సామాజిక రూపానికి నిజమైన పునాదిని ఏర్పాటు చేయడానికి కావలసిన భౌతిక పరిస్థితుల్ని మాత్రమే సృష్టిస్తాడు. పెట్టుబడికి సంకేతంగా మాత్రమే పెట్టుబడిదారుడు గౌరవించబడతాడు. ఆ విధంగా సంపదను

---

1. ఆదాయం అనే పదం ద్వంద్వార్థంలో వాడబడిందని పాఠకుడు గమనించాలి; మొదటిది : పెట్టుబడిద్వారా కాల పరిమితిలో సంక్రమించే ఫలితం మేరకు అదనపు విలువగానూ, రెండవది : కాలపరిమితిలో పెట్టుబడిదారుడు వినియోగించుకునే ఆ ఫలితంలో భాగంగానూ లేక అతని వ్యక్తిగత వినియోగానికి సరఫరా చేసే నిధికి జత చేయబడిందిగానూ దీనిని గుర్తిస్తాము. ఇంగ్లీషూ, ఫ్రెంచి అర్థశాస్త్రవేత్తల భాషతో ఆ పదం మేళవింపబడినందు వల్ల నేను ఈ ద్వంద్వార్థాన్నే తీసుకుంటున్నాను.

సమృద్ధిగా ఆర్జించాలనే వ్యామోహంలో అతను లోభిలాగా వ్యవహరిస్తాడు. అయితే లోభిలో వైయక్తిక మానసిక ప్రవృత్తిగా కనిపించేదే, పెట్టుబడిదారుడిలో సామాజిక యంత్రం ఫలితంగా కనిపిస్తుంది. ఆ సామాజిక యంత్రానికి పెట్టుబడిదారుడు ఒక చోదక చక్రంలా వుంటాడు. అంతేగాక పెట్టుబడిదారీ ఉత్పత్తి అభివృద్ధి మూలంగా, ఒక పారిశ్రామిక సంస్థలో వెచ్చించబడిన పెట్టుబడి మొత్తం పెరుగుతూ వుండవలసిన నిరంతర ఆవశ్యకత కలుగుతుంది. పెట్టుబడిదారీ ఉత్పత్తి సహజ నియమాలు, బహిర్గతమైన బలవంతపు నియమాలుగా ప్రతి పెట్టుబడిదారుడినీ పోటీకి తలొగ్గేటట్లు చేస్తాయి. ఇది, తన పెట్టుబడిని భద్రపరచుకోడానికి, దాన్ని నిరంతరాయంగా విస్తృతం చేసుకోడానికీ పెట్టుబడిదారుడిని బలవంతం చేస్తుంది. అత్యధిక మోతాదులో పెట్టుబడిని సంచయనం చేయడం ద్వారా తప్ప, దాన్ని విస్తృతం చేసుకోడానికి అతనికి మరొక మార్గం లేదు.

కాబట్టీ చైతన్యమూ, సంకల్పమూ కలిగిన సాధనంగా పెట్టుబడి సంకేతంగా దాని క్రియకు మాత్రమే పెట్టుబడిదారుడి కార్యకలాపాలు పరిమితమైనందువల్ల పద్దు పుస్తకాల్లో జంట పదాల్లాగా పెట్టుబడిదారుడి యొక్క వ్యక్తిగత ఖర్చును అతని ఖాతాకింద రాసినట్లయితే, అతని వ్యక్తిగత వినియోగం సంచయనం మీద శాశ్వతమైన దోపిడీగా లెక్కించబడుతుంది. సంచయనం చేయడానికి, సామాజిక సంపద ప్రపంచాన్ని స్వాధీనం చేసుకోవాలి. అతనిచే దోపిడీ చేయబడే మానవ సమూహం పెరగాలి; ఆ విధంగా పెట్టుబడిదారుడి యొక్క ప్రత్యక్ష, పరోక్షమైన ఆధిపత్యం విస్తృతం చేయబడాలి.[1]

1. ఛాందసుడైనప్పటికీ, ఎప్పుడూ పునర్దర్శనమిచ్చే పెట్టుబడిదారుడి ప్రతినిధిగా వడ్డీ వ్యాపారిని ప్రధానాంశంగా తీసుకుని, సంపన్నుడు కావాలనే కోర్కెతోనే అధికార వ్యామోహం ఒక అంశంగా వుంటుందని లూథర్ సముచితంగానే పేర్కొన్నాడు. "ఆత్మవికాసం లేనివాడైనప్పటికీ, విచక్షణా జ్ఞానంతో, వడ్డీ వ్యాపారిని మిక్కిలి కళంకితుడైన దొంగ అనీ, హంతకుడనీ పేర్కొనగలుగుతున్నాడు. ఏమైనప్పటికీ, క్రైస్తవులమైన మనం మాత్రం ఆ వడ్డీ వ్యాపారుల డబ్బు కోసం, గౌరవ మర్యాదలనూ చూపిస్తూ వారిని ఘనంగా పూజిస్తాము.... మరొకరి ఆహారాన్ని ఎవరైనా భోంచేసినా, దోపిడీ చేసినా, దొంగిలించినా ఒక వ్యక్తిని ఉపవాసం చేయించినా లేక నాశనము చేసినా ఆ వ్యక్తి భయంకరమైన హత్య చేసినట్లే. (అతనికి సంబంధించినంత వరకు) అలాంటి వడ్డీ వ్యాపారి ఉరికొయ్యకు వేళ్ళాడదీయబడి, ఎన్ని బంగారు నాణాలను దొంగిలించాడో అన్ని కాకులు అతన్ని తింటూ ఉండవలసి వుండగా, వాడి శరీరం ఎంత ఎక్కువగా కొవ్వివుంటే, అంత ఎక్కువగా కాకులు తమ ముక్కులతో పొడిచి అతన్ని నంజుకుతింటూ ఉండవలసి వుండగా, ఆ వడ్డీ వ్యాపారి సురక్షితంగా తన కుర్చీ మీద కూర్చుని వున్నాడు. చిన్న చిన్న దొంగల్ని ఉరితీయడానికి మాత్రం మనం వెనుకాడం... సన్నకారు దొంగలు పరిహాసం చేయబడుతూ వుంటే, పెద్ద దొంగలు వెండి బంగారాల్లో కులుకుతున్నారు... అందువలన ఈ ప్రపంచంలో సకల జనులకూ దేవుడుగా చెలామణి కావాలనుకునే వడ్డీ వ్యాపారికీ, ధనదాహపరుడికీ మించిన గొప్ప శత్రువు మనిషికి ఎవరైనా వున్నారా? (దెయ్యం తరువాత) టర్కీ దేశస్తులూ, సైనికులూ, నిరంకుశులూ కూడా చెడ్డ మనుషులే; అయినప్పటికీ వాళ్ళు జనాన్ని బతకనిస్తారు; పైగా తాము చెడ్డవారమనీ, శత్రువులమనీ వారే అంగీకరిస్తారు; అడపా దడపా కొంతమంది మీద దయా దాక్షిణ్యాలను కూడా చూపిస్తారు. అయితే ఆకలిదప్పులతోనో, దైన్య స్థితిలోనో మొత్తం ప్రపంచమంతా వినాశనమైపోయినా, సకలమూ తనకే కావాలనుకొనే ఒక వడ్డీ వ్యాపారీ, డబ్బుతో కడుపు నింపుకునే వ్యక్తి, సకల జనులూ దేవుడి దగ్గర నుండి పొందుతున్నట్లుగానే, తన దగ్గరనుండి పొందాలనీ, వారంతా తనకు శాశ్వతంగా అర్ధబానిసలుగా వుండాలనీ భావిస్తాడు. ఆడంబర దుస్తులనూ, బంగారు నగలనూ, ఉంగరాలనూ ధరించేవాడినే అసలు సిసలైన పవిత్ర వ్యక్తిగా భావించడం రివాజు అయింది. ..... కాకస్, జెరిన్, యాంటస్ లాంటి కొండలకు మించి

అయితే, మొదటి పాపం (ఒరిజినల్ సిన్) ప్రతి చోటా పని చేస్తూనే వుంటుంది. పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం అభివృద్ధి అయ్యే కొలదీ, సంచయనమూ, సంపదా పెరిగే కొలదీ, పెట్టుబడిదారుడు కేవలం పెట్టుబడి అవతారంగా వుండడాన్ని విరమిస్తాడు. తన పాత సంస్కారరాహిత్య జీవితం మీద సానుభూతి ఏర్పడి భోగలాలసపట్ల తనకున్న తీవ్రాభిలాషను కేవలం పాతకాలపు లోభియొక్క దురభిప్రాయంగా, అతని జీవితానుభవం క్రమేపీ అతన్ని నవ్వుకునేటట్లు చేస్తుంది. సాంప్రదాయక వర్గానికి చెందిన పెట్టుబడిదారుడు వైయక్తిక వినియోగాన్ని తన క్రియకు వ్యతిరేకమైన ఒక పాపంగానూ, సంచయనపు "వాంఛా విసర్జనగా" ముద్ర వేస్తే ఆధునిక పెట్టుబడిదారు సంచయనాన్ని సుఖానుభవం నుండి "వాంఛా విసర్జనగా" చూడగలుగుతున్నాడు.

**"అతని వక్షంలో రెండు ఆత్మల సహజీవనం;**

**అనుక్షణం సందిగ్ధపు అనుబంధంలో విడివిడిగా పయనం"[1]**

పెట్టుబడిదారీ ఉత్పత్తి యొక్క చరిత్ర ప్రారంభమైనపుడు, నడమంత్రపు సిరిగలిగిన ప్రతి పెట్టుబడిదారుడూ వ్యక్తిగతంగా, నాడు అమలులో వున్న వ్యామోహాలైన లోభితనమూ సంపన్నం కావాలనే కోరికల చారిత్రక దశల గుండానే ప్రయాణించాలి. అయితే పెట్టుబడిదారీ ఉత్పత్తి యొక్క పురోగమనం వారికి ఆనందమయమైన ప్రపంచాన్ని సృష్టించడమే గాక, సట్టా వ్యాపారం, పరపతి వ్యవస్థల ద్వారా ఆకస్మికంగా సంపన్నవంతుడు గావడానికి వెయ్యి ఆధారాలను ఆవిష్కరిస్తుంది. అభివృద్ధి ఒకానొక దశకు చేరినపుడు, దుబారా యొక్క సాంప్రదాయిక స్థాయి, సంపదకు ఒక ప్రదర్శనగా, పర్యవసానంగా, పరపతికి ఒక మూలాధారంగా "దురదృష్టవంతుడైన" పెట్టుబడిదారుడికి ఒక వ్యాపార ఆవశ్యకతగా పరిణమిస్తుంది. పెట్టుబడియొక్క వ్యయాల రూపకల్పనలో ఆడంబరం ప్రవేశిస్తుంది. అంతేగాక, లోభిలాగా వ్యక్తిగతమైన శ్రమకూ, పరిమితమైన వినియోగానికీ మధ్య నిష్పత్తి ద్వారా గాక, పరాయి శ్రమ శక్తిని ఏ రేటులో పీల్చి వేస్తాడో అదే రేటులో కార్మికులను జీవితావసరాల నుండి బలవంతంగా ఉపవాసం చేయించడం ద్వారా పెట్టుబడిదారుడు సంపన్నుడు కాగలడు. భూస్వామి యొక్క బాహాటపు దుబారా యథార్థ లక్షణం పెట్టుబడిదారీ దుబారాలో లేనప్పటికీ

---

సకలమూ వ్యర్థం చేసే తోడేలుగా మారిన వ్యక్తిలాగా వడ్డీ వ్యాపారం ఒక పెద్ద బ్రహ్మరాక్షసిలాంటిది. అయినప్పటికీ కూడా, అతడు పవిత్రుడనే బురఖా తగిలించుకొని, ఆ ఎద్దులు ఎక్కడకు పోయాయో ప్రజలు తెలుసుకోకుండా, తన వడ్డీ వ్యాపార గుహలోకి మళ్లీ లాగుతాడు. అయితే హెర్క్యులస్ ఆ ఎద్దుల రోదనలనూ, ఆ వడ్డీ వ్యాపారి బందీల హాహాకారాలను వినకమానడు; కొండ కోనల్లో, ఎక్కడ వున్నా ఆ దుర్మార్గుడి నుండి వారిని బంధ విముక్తులను చేస్తాడు. కాకస్ అంటే సకలమూ దొంగిలించే, దోపిడీ చేసే, ఆరగించే పవిత్ర ముసుగు కప్పుకున్న దుర్మార్గుడైన వడ్డీ వ్యాపారి. అతను ఆవిధంగా చేస్తున్నానని అంగీకరించబోడు, పైగా ఎవ్వరికీ ఈ విషయం తెలియదని భావిస్తాడు; ఎందుచేతనంటే ఎద్దులను అతని గుహనుండి బయటికి లాక్కొచ్చినట్లుగా అడుగుజాడలు కనిపిస్తున్నందువల్ల వాటిని విముక్తుల్ని చేశారనుకుంటాడు. అందువలన తమ ప్రపంచానికి ఉపయోగపడుతున్నాననీ, అతను చీల్చి తింటున్నప్పటికీ ప్రపంచానికి అవసరమైన ఎద్దుల్ని ఇస్తున్నాననీ, ప్రపంచాన్ని మోసం చేస్తాడు.... దారి దోపిడీ గాండ్లనూ, హంతకుల్ని, ఇళ్ళ దోపిడీగాండ్రను ఉరి తీస్తున్నప్పుడు, ఈ దొంగ వ్యాపారిని ఎంత ఎక్కువగానైనా శిక్షించవచ్చు... వేటాడి, తిట్టి వడ్డీ వ్యాపారులందరినీ ఉరితీయాలి'' (మార్టిన్ లూథర్, ఉదాహృత గ్రంథం.

1. గోతే - ''ఫాస్ట్''.

దానికి భిన్నంగా దాని వెనుక అత్యంత నీచమైన లోభితనమూ, అత్యంత ఆత్రంతో గూడుకొన్న లెక్కలూ ఎప్పుడూ దాగి వుంటాయి. అయినప్పటికీ, ఒకదాన్ని మరొకటి అదుపు చేయనవసరం లేకుండానే పెట్టుబడిదారుడి దుబారా అతని సంచయనంతో పెరుగుతూనే వుంటుంది. అయితే, ఆ పెరుగుదలతో పాటు, అతని హృదయంలో, సంచయనానికి వున్న వ్యామోహానికీ, అనుభవించాలనే కోర్కెకీ మధ్య ఫాస్టియన్ సంఘర్షణ పెరుగుతూనే వుంటుంది.

1795లో ప్రచురించబడిన ఒక గ్రంథంలో డా॥ ఐకిన్ ఇలా అంటాడు : "మాంచెస్టర్ వ్యాపారాన్ని నాలుగుదశలుగా విభజించవచ్చు : మొదటిదశ : తమ జీవనాధారాల కోసం కార్ఖానాదారులు కష్టపడి పని చేయాల్సి వచ్చినపుడు" వృత్తి శిక్షణ పొందాల్సి వచ్చిన పిల్లల తల్లిదండ్రులను ముఖ్యంగా దోపిడీ చేయడం ద్వారా కార్ఖానాదారులు ధనవంతులైనారు; తల్లిదండ్రులు తమ పిల్లల శిక్షణ కోసం పెద్ద మొత్తాల్లో శుల్కం చెల్లించేవారు. వృత్తి శిక్షణలో వున్న పిల్లలు ఆకలితో మాడిపోయేవారు. మరోవైపున సగటు లాభాలు తక్కువగా ఉన్నందువల్ల, సంచయనం చేయడానికి, అత్యంత మితవ్యయం చేయాల్సిన అవసరం వుండేది. వారి పెట్టుబడి మీద వచ్చే వడ్డీని సైతం వినియోగించుకోకుండా కార్ఖానాదారులు పిసినారుల్లాగా జీవించేవారు. రెండవ దశ : భాగ్యవంతుడు కావడం ప్రారంభమైనపుడు; అయితే గతంలోలాగా కష్టపడి పని చేసేవారు: బానిసలను పర్యవేక్షించే వాడికి తెలిసినట్లుగా, నేరుగా కార్మికుల శ్రమ వ్యయాలను దోపిడీ చేయడానికి గతంలో లాగే నిరాడంబర జీవితాన్ని గడిపేవారు. మూడవ దశ : ఆడంబరం ప్రారంభమైనపుడూ, ఆర్డర్ల కోసం, దేశంలోని పట్టణ ప్రాంత మార్కెట్‌లు అన్నింటికీ వాణిజ్య ప్రతినిధులను పంపడం ద్వారా వ్యాపారం పెరిగినపుడూ, 1690కి పూర్వం వ్యాపారం ద్వారా 3,000 పౌండ్లు నుండి 4,000 పౌండ్లు పెట్టుబడిని సంపాదించిన వారు దాదాపుగా లేరు; బహుశా వుంటే, కొద్దిమంది వుండవచ్చు. అయినప్పటికీ, బహుశా అదే కాలంలో గానీ లేక ఆ తర్వాత కొద్ది కాలానికి గానీ, వ్యాపారస్తులు ముందుగానే డబ్బును సంపాదించి కలపా, సున్నపు పూతకు బదులుగా, ఇటుకలతో ఆధునిక ఇళ్ళు కట్టడం ప్రారంభించారు. పద్దెనిమిదవ శతాబ్దపు మొదటి భాగంలో సహితం, మాంచెస్టర్‌లోని ఒక కార్ఖానాదారుడు ఒక సీసా విదేశీ మత్తు పానీయాన్ని అతిథుల ముందు పెట్టి తనదిరుగు పొరుగు వారు తలలు ఊపి వ్యాఖ్యానాలు చేయడానికి తనకు తానుగా అవకాశాన్ని యిచ్చాడు. యాంత్రికోత్పత్తి ప్రారంభం కాక ముందు, కార్ఖానాదారులు కలుసుకునే క్లబ్‌లో ఒక కార్ఖానాదారునికి ఒక సాయంకాలపు ఖర్చు, ఆరు పెన్నీలు ఖరీదు చేసే ఒక గ్లాసు ద్రాక్ష సారాయికి, ఒక పెన్నీ ఖరీదు చేసే ఒక పుగాకు చుట్టకూ ఎప్పుడూ మించలేదు. నిజంగా వ్యాపారం చేస్తున్న ఏ వ్యక్తి అయినా, ఒక యుగంగా గుర్తించబడిన 1758 వరకూ, తన పరివారంతో కనిపించే వాడు కాదు. నాల్గవ దశ : 18వ శతాబ్దపు చివరి 30 సంవత్సరాలు : "ఆడంబరాలూ, ఖర్చులూ ఎక్కువగా పెరిగాయి; దీనికితోడుగా ఐరోపా అంతటా వ్యాపార ప్రతినిధులూ, తదితర కార్యకలాపాల ద్వారా వ్యాపారం విస్తృతమైనది.[1] డా॥ ఐకిన్ తన సమాధి నుండి బయటికి రాగలిగినట్లయితే, ఈ రోజున్న మాంచెస్టరును చూసి ఏం చెప్తాడో?

1. డా. ఐకిన్ : ''డిస్క్రిప్షన్ ఆఫ్ ది కంట్రీ ఫ్రమ్ తర్టీ టు ఫార్టీ మైల్స్ రౌండ్ మాంచెస్టర్'', లండన్. 1795 పుట 182.

సంచయనం చేయండి! సంచయనం చేయండి! మోజస్సులూ, ప్రవక్తలూ అంతా అదేమాట! “పరిశ్రమ సమకూర్చే భౌతిక సరంజామా అంతా పొదుపు ద్వారా సంచయనం చేయబడినదే!”[1] కాబట్టి పొదుపు చెయ్యండీ పొదుపు చెయ్యండి. అనగా అదనపు విలువలో లేక అదనపు ఉత్పాదితంలో సాధ్యమైనంత ఎక్కువ భాగాన్ని పెట్టుబడిగా మార్చండి. సంచయనం, సంచయనం కోసం, ఉత్పత్తి, ఉత్పత్తి కోసం ! ఈ సూత్రంద్వారా సాంప్రదాయక అర్థశాస్త్రం బూర్జువా వర్గం యొక్క చారిత్రక లక్ష్యాన్ని వ్యక్తం చేసింది; సంపద యొక్క ప్రసవ వేదనలకు సంబంధించిన ఏ ఒక్క ఘటనను గురించి కూడా సమాచారాన్ని ఇవ్వడంలో సాంప్రదాయక అర్థశాస్త్రం ఆత్మవంచన చేసుకుందికాదు.[2] అయితే చారిత్రక ఆవశ్యకతను గురించి రోదించి ప్రయోజనమేమిటి? సాంప్రదాయిక అర్థశాస్త్రం దృష్టిలో, కార్మికవర్గం అదనపు విలువను సృష్టించే యంత్రం అయితే, ఆ అదనపు విలువను అదనపు పెట్టుబడిగా మార్చే యంత్రం పెట్టుబడిదారుడు. పెట్టుబడిదారుడి చారిత్రక లక్ష్యాన్ని అత్యంత హృదయపూర్వకంగా రాజకీయ అర్థశాస్త్రం భుజాన వేసుకుంది. అనుభవించాలనే కోర్కెకీ సంపద కోసం వేటకీ మధ్య వున్న తీవ్రమైన మానసిక సంఘర్షణను మసిబూసి మారేడుకాయ జేయాలనే తలంపుతో వాస్తవంగా ఉత్పత్తిలో నిమగ్నమైన పెట్టుబడిదారుడికి సంచయనం చేసే బాధ్యతనూ, అదనపు విలువలో మిగతా వాటాదార్లయిన భూస్వాములు, ప్రభుత్వ భృత్యులు, దేవుడి మాన్యాధిపతులైన మతాధికారులు వగైరాలకు వ్యయం చేసే బాధ్యతనూ అప్పగించే ఒక శ్రమ విభజనను 1820 సంవత్సర ప్రారంభంలో మాల్థస్ ప్రతిపాదించి ప్రచారం చేశాడు. “ఖర్చు చేయాలనే కాంక్షనూ, సంచయనం చేయాలనే వ్యామోహాన్ని వేరు చేయడం”[3] అత్యంత ఆవశ్యకమని ఆయన అంటాడు. బహుకాలంగా సుఖ జీవనం గడుపుతూ అన్ని విషయాలలో ఆరితేరిన పెట్టుబడిదారులు దీన్ని జూసి గుండెలు బాదుకున్నారు. భూమి కౌలు, పన్నులు వగైరాలు అధికంగా వుండాలనీ తద్వారా అనుత్పాదక మైన వినియోగదార్ల ఒత్తిడి వల్ల పారిశ్రామికవేత్తలు నిరంతరం ప్రోత్సహించబడతారనీ మాల్తస్ గారు బోధిస్తున్నారా అని రికార్డో శిష్యుడైన, పెట్టుబడిదార్ల ప్రతినిదుల్లో ఒకడు ఆశ్చర్యాన్ని ప్రకటించాడు. ఏ మార్గాల ద్వారానైనా గానీ ఉత్పత్తి చేయడం, నిరంతరాయంగా అత్యధిక మోతాదులో ఉత్పత్తి చేయడమనేవి పడికట్టు పదాలైనాయి. అయితే, “ఆ విధమైన ప్రక్రియ ద్వారా ఉత్పత్తి ప్రోత్సహించ బడటానికన్నా ఇంకా ఎక్కువగా నిరోధించబడుతుంది. మనం బలవంతంగా పని చేయించగలిగిన ట్లయితే, జాగ్రత్తగానే పని చేయగలిగిన లక్షణాలున్న అంత మంది జనాన్ని, ఇతరులను పిండటానికి మాత్రమే సోమరితనంతో ఆ విధంగా పోషించడం ఏవిధంగానూ న్యాయం కాదు”.[4] పారిశ్రామిక పెట్టుబడిదారుడి ఆదాయాన్ని తగ్గించే విధంగా అతని మీద ఒత్తిడి తీసుకురావడం న్యాయం కాదని పెట్టుబడిదార్ల ప్రతినిధి

1. ఆడమ్ స్మిత్ : ఉదాహృత గ్రంథం మూడవ సంపుటి; అధ్యాయం మూడు.
2. జె.బి.సే. సహితం ఇలా చెప్తాడు : “పేదవారిని నాశనం చేయడం ద్వారా ధనికులు పొదుపు చేస్తారు.” “రోమన్ సామ్రాజ్యపు శ్రామిక వర్గం సామాజిక వ్యవస్థ మీద జీవించారు. ఆధునిక సమాజమంతా కార్మిక వర్గ శ్రమ ఫలితాలనుండి దోపిడీ చేసినదానిమీద జీవిస్తుంది” (సిస్మండీ : యెటుడిస్; సంపుటి ; పుట 24)
3. మాల్తస్, ఉదాహృతగ్రంథం. పుటలు 319. 320
4. “యాన్ ఎంక్వయిరీ యిన్ టు దోజ్ ప్రిన్సిపుల్స్ రెస్పెక్టింగ్ ది నేచర్ ఆఫ్ డిమాండ్’ పుట 67

భావించినప్పటికీ కార్మికుడ్ని "పరిశ్రమించే వాడుగా వుంచడానికి" అతని వేతనం కనీస స్థాయికి తగ్గించడం అవసరమని ఆ ప్రతినిధి భావిస్తున్నాడు. వేతనం లేని శ్రమను స్వాయత్తం చేసుకోవడమే అదనపు విలువ యొక్క రహస్యమనే వాస్తవాన్ని ఒక్క క్షణం పాటు కూడా అతను మరుగు పరచలేకపోయాడు. "కార్మికులకు సంబంధించినంత వరకు గిరాకీ పెరుగుదల అనగా, వారి ఉత్పాదితంలో ఎక్కువ భాగాన్ని వారి యజమానులకు వదలివేసి, తమకు తాముగా తక్కువ భాగాన్ని తీసుకోవడం ఇష్టపడడం తప్ప మరేమీ కాదు; యింకా చెప్పాల్సి వస్తే, వినియోగాన్ని తగ్గించడం ద్వారా (కార్మికులకు సంబంధించినంత వరకు) ఇది అమితోత్పత్తిని సృష్టిస్తే, ఆ అమితోత్పత్తి, అధిక లాభాలకు పర్యాయ పదమని నేను గట్టిగా సమాధానం చెప్పగలను".[1]

కార్మికుల మూలుగులను పీల్చివేయడం ద్వారా కొల్లగొట్టబడిన సొమ్మును, సంచయనం నిమిత్తం అత్యంత లాభసాటిగా పారిశ్రామిక పెట్టుబడిదార్ల, సోమరిపోతులైన ధనిక భూస్వాముల మధ్య ఏవిధంగా పంపిణీ చేసుకోవచ్చుననే విజ్ఞానదాయకమైన చర్చ జులై విప్లవంతో నిశ్శబ్దంగా ముగిసిపోయింది. దాని తర్వాత, అతి కొద్ది కాలానికి, లై ఆన్స్ పట్టణంలో పారిశ్రామిక కార్మిక వర్గం విప్లవ గంటల్ని మోగిస్తే, ఇంగ్లాండ్‌లోని వ్యవసాయ శ్రామికులు పొలాల్లో వున్న దొడ్లను, ధాన్యపు కుప్పలను తగులబెట్టడం ప్రారంభించారు. ఇంగ్లీషు చానల్‌కు ఈ వైపున ఓవెన్ సిద్ధాంతమూ, అవతల వైపున సైమన్, ఫోరియర్ల సిద్ధాంతాలూ వ్యాపించడం ప్రారంభమైనాయి. నాటు అర్థశాస్త్రానికి తుది ఘడియలు సమీపించాయి. కార్మికుల పన్నెండు గంటల శ్రమలోని చివరి గంట శ్రమ ఫలితమైన ఉత్పాదితమే పెట్టుబడియొక్క లాభం (వడ్డీని కూడా కలుపుకొని) అని కచ్చితంగా ఒక సంవత్సరం ముందు నాసూ విలియం సీనియర్ మాంచెస్టర్‌లో కనుగొన్న తర్వాత, మరొక కొత్త విషయాన్ని ప్రపంచానికి చాటి చెప్పాడు. "ఉత్పత్తికి ఒక సాధనంగా భావించబడే పెట్టుబడి అనే పదానికి బదులుగా నేనైతే వాంఛా విసర్జన అనే పదం వాడతాను"[2] అని అతను మహాగర్వంతో ప్రకటించాడు. ఆహా! నాటు అర్థశాస్త్ర 'ఆవిష్కరణలలో' ఇదొక పోలికలేని మచ్చుతునక! ఒక ఆర్థిక అభివర్గానికి బదులుగా 'అంతే మహాప్రభో'

---

1. పై గ్రంథమే. పుట 59
2. (సీనియర్ : ''ఫండమెంటల్ ప్రిన్సిపుల్స్ ఆఫ్ పొలిటికల్ ఎకానమీ అనువాదం : అర్రివాబెనీ, పారిస్.1836, పుట 308) పాత సాంప్రదాయిక ఆలోచనకు సంబంధించిన వారు హెచ్చుగానే మాట్లాడుతున్నారు. సీనియర్ దాని బదులుగా (శ్రమా, లాభం అనే పదాలు) శ్రమా వాంఛా విసర్జన అనే పదాల్ని వాడారు. ఆదాయాన్ని మార్చగలిగిన వారెవ్వరైనా, అతను ఖర్చు చేయగలిగినప్పటికీ వినియోగించుకోకుండా వాంఛను విసర్జిస్తాడు. పెట్టుబడి ద్వారా గాక, పెట్టుబడిని ఉత్పత్తిదాయకంగా వినియోగించుకోవడం మూలంగానే లాభాలు వస్తాయి. (జాన్ కజ్‌నోవ్, ఉదాహృతగ్రంథం పుట 130) దీనికి భిన్నంగా, జాన్ స్టువర్ట్ మిల్ ఒక వైపున రికార్డో లాభ సిద్ధాంతాన్ని అంగీకరిస్తూనే, మరొక వైపున సీనియర్ రాసిన ''వాంఛా విసర్జనకు ఫలితం'' అనే వ్యాసాన్ని దానికి అనుబంధిస్తాడు. అతను ఒకవైపున వైరుధ్యాల పుట్టలో కూరుకుపోయి, మరొకవైపున గతి తర్కానికి మూలాధారమైన హెగెల్ వైరుధ్యాల మహాసముద్రంలో ఈదుతున్నాడు. ప్రతి మానవ కార్యాచరణనూ దాని వ్యతిరేక దిశనుండి చూసినపుడు ''వాంఛా విసర్జన''గా చూడవచ్చుననే సామాన్యమైన భావన నాటు అర్థశాస్త్రవేత్తలకెవ్వరికీ ఎప్పుడూ ఆలోచనకు రాలేదు. ఉపవాసాన్ని విరమించడమే తినడం; విరామాన్ని విరమించడమే చలనం; సోమరితనాన్ని వదలివేయడమే పని చేయడం; పని చేయడం మానుకోవడమే సోమరితనం వగైరా; స్పినోజా చెప్పిన ''నిర్ధారణ నిషేధం'' అనే సామెతను గురించి ఏదో ఒక విధంగా ఈ పెద్దమనుషులంతా ఆలోచించడం మంచిది.

అనే భట్రాజు పొగడ్త ప్రతిస్థాపన చేయబడింది. "మిల్లును తయారు చేస్తున్నప్పుడు, ఆదిమానవుడు పరిశ్రమిస్తున్నాడే గానీ వాంఛా విసర్జన చేయడం లేదు"అని సీనియర్ అంటాడు. గత సామాజిక వ్యవస్థలో పెట్టుబడిదారుడు వాంఛా విసర్జన చేయకుండానే శ్రమ పరికరాలను ఏవిధంగా ఏ లక్ష్యంతో తయారు చేస్తున్నాడో ఇది మనకు విశదం చేస్తుంది. "సామాజిక వ్యవస్థ పురోగమించే కొలదీ వాంఛా విసర్జన ఎంకా ఎక్కువగా చేయవలసి వుంటుంది.[1] అనగా పరాయి శ్రమ ఫలితాలను స్వాయత్తం చేసుకునే పరిశ్రమలను నడిపేవారు ఈ పని ఎక్కువగా చేయవలసి వుంటుంది. శ్రమ ప్రక్రియను (దోపిడీని) కొనసాగించడానికి వున్న షరతులన్నింటినీ, పలు విధాలైన వాంఛా విసర్జన చర్యలుగా పెట్టుబడిదారుడికి సంబంధించినంత వరకు ఆకస్మికంగా మార్చివేయబడతాయి. పండిన ధాన్యాన్ని పూర్తిగా వినియోగించుకోకుండా, అందులో కొంత భాగాన్ని విత్తనాలుగా ఉపయోగించుకున్నా కూడా అది పెట్టుబడిదారుడి వాంఛా విసర్జనమే! ద్రాక్ష సారాయి పరిపక్వ దశకు వచ్చే సమయం ఆసన్నమైనా అది పెట్టుబడిదారుడి వాంఛా విసర్జనమే![2] పెట్టుబడిదారుడు "కార్మికులకు ఉత్పత్తి పరికరాలను అరువు ఇచ్చే (!) సందర్భంలో" తనకు తానే ఆత్మద్రోహం చేసుకుంటాడు! అనగా, స్వయంగా ఆవిరి యంత్రాలనూ, పత్తినీ, రైళ్ళనూ, ఎరువులనూ, గుర్రాలనూ వగైరాలను వినియోగించుకోకుండా లేక నాటు అర్థశాస్త్రవేత్తలు బాల్య చాపల్యంతో చెప్పినట్లుగా, వాటి విలువను విలాస వస్తువుల ఆడంబర వినియోగంలో దుబారా చేయకుండా, శ్రమ శక్తితో వాటిని జోడించడం ద్వారా శ్రమశక్తి నుండి అదనపు విలువను గుంజడానికి ఉపయోగిస్తాడు.[3] పెట్టుబడిదార్లు ఒక వర్గంగా ఈ గడసామును ఏవిధంగా నిర్వహిస్తున్నారన్న రహస్యాన్ని వెల్లడించకుండా నాటు అర్థశాస్త్రం మొండి పట్టుదలతో ఇంతవరకూ నిరాకరిస్తూ వచ్చింది. ఇక మాట్లాడే పనిలేదు; ఈ ఆధునిక శ్రీవైష్ణవుడైన పెట్టుబడిదారుడి స్వీయ పరిశుద్ధతలో మాత్రమే ప్రపంచం కాళ్ళీడ్చుకుంటూ ముందుకు పోతుంది. సంచయనానికి మాత్రమే కాకుండా, సాధారణమైన "పెట్టుబడి సంరక్షణకు కూడా దాన్ని వినియోగించుకోవాలనే ప్రలోభాన్ని నిరోధించడానికి నిరంతరంగా ప్రయత్నం అవసరమవుతుంది.[4] నీగ్రోజాతి బానిసలపై

---

1. సీనియర్. ఉదాహృతగ్రంథం. పుట 342.
2. "ఉదాహరణకు..... ఏ ఒక్కడూ కూడా గోధుమ విత్తనాలను విత్తి భూమిలోనే ఒక సంవత్సరం పాటు - ఆ విధంగా వుంచడానికి అవకాశమివ్వడు.. లేక నేల మాళిగలో ఉంచిన ద్రాక్షసారాయిని గానీ లేక దానికి సమానమైన విలువను గానీ వినియోగించుకోకుండా అందులోనే సంవత్సరాల తరబడి వుంచడు... అదనంగా విలువ పొందవచ్చునని ఊహిస్తే తప్ప" (స్క్రోప్ "పొలిటికల్ ఎకానమీ"; సంపాదకుడు, ఎ.పాటర్, న్యూయార్క్, 1841, పుటలు 133 - 134)
3. "పెట్టుబడిదారుడు తన ఉత్పత్తి సాధనాలను, ప్రయోజనాన్ని లేక సంతోషాన్ని కలిగించే వస్తువులుగా మార్పు చేయడం ద్వారా వాటి విలువను తానే వినియోగించుకోడానికి బదులుగా, కార్మికులకు అప్పుగా ఇవ్వడం ద్వారా" (పరాయి పెట్టుబడిదార్ల దగ్గర నుండి డబ్బుని అప్పుగా పుచ్చుకొనే పారిశ్రామిక పెట్టుబడిదారుతో, దోపిడీ చేయబడుతున్న వేతన కార్మికుడ్ని ఒకే గాటన కట్టి వేయడానికి నాటు అర్థశాస్త్రం అనుసరించే పద్ధతికి అనుగుణంగానే ఈ అస్పష్టమైన పదం వాడబడింది) తనకు తానుగా నష్టాన్ని నెత్తిమీదకి తెచ్చుకుంటున్నాడు. (జి.డి. మోలినారీ, ఉదాహృత గ్రంథం. పు.36)
4. "పెట్టుబడిని వినియోగించుకోవాలనే తీవ్ర వాంఛ నుండి దానిని కూడబెట్టుకోడానికి నిరంతరం ప్రయత్నం అవసరం." (కోర్సెల్లా - సెనివిల్ - ఉదాహృత గ్రంథం పుట 57).

కొరడాల ప్రయోగం ద్వారా దోపిడీ చేయబడిన అదనపు ఉత్పాదితాన్ని ద్రాక్షసారాయిలో ముంచి సేవించడమా లేక అందులో ఒక భాగాన్ని అదనపు నీగ్రో జాతి బానిసలుగానో లేక అదనపు భూమిగానో మార్చడమా అనే బాధాకరమైన సంశయాన్నుండి బానిస విధానం రద్దుగావడం ద్వారా అమెరికాలోని జార్జియా రాష్ట్ర బానిస యజమాని ఈమధ్య కాలంలో ఏవిధంగా విముక్తుడైనాడో అదేవిధంగా పెట్టుబడిదారుడిని కూడా అతని ఆత్మత్యాగాన్నుండీ ప్రలోభాలనుండీ విముక్తుడ్ని చేయమని సామాన్య మానవ ధర్మాలు స్పష్టంగా ఆదేశిస్తున్నాయి.

భిన్న రూపాలు గలిగిన సామాజిక వ్యవస్థలోని ఆర్థిక నిర్మాణాలలో సామాన్య పునరుత్పత్తి మాత్రమే గాక, తరతమ స్థాయిలలో క్రమానుగతంగా అత్యధిక మోతాదులో కూడా పునరుత్పత్తి జరుగుతుంది. ఆ స్థాయి ననుసరించి అధికోత్పత్తి చేయబడుతుంది. వినియోగమూ పెరుగుతుంది; పర్యవసానంగా అధికాధికంగా ఉత్పాదితాలు ఉత్పత్తి సాధనాలుగా మార్చబడాలి. అయితే, కార్మికుని యొక్క ఉత్పత్తి సాధనాలూ, వాటితో పాటుగా అతని ఉత్పాదితమూ, జీవనాధార సాధనాలూ పెట్టుబడి రూపంలో పెట్టుబడిదారుడిని ఎదుర్కోనంత కాలమూ, ఈ ప్రక్రియ పెట్టుబడి సంచయనంగానూ కనిపించదు, పర్యవసానంగా పెట్టుబడిదారు క్రియగానూ కనిపించదు.[1] మాల్తస్ తర్వాత, హైల్ బరీ కళాశాలలో రాజకీయ అర్థశాస్త్ర పీఠాధిపత్యాన్ని అధిష్టించి, కొద్ది సంవత్సరాల క్రితమే చనిపోయిన రిచర్డ్ జోన్స్ రెండు ప్రధానమైన వాస్తవాలను దృష్టిలో వుంచుకొని ఈ అంశాన్ని చక్కని రీతిలో చర్చిస్తాడు. భారతదేశ జనాభాలో ఎక్కువభాగం వారి భూములలో వారే సాగు చేసుకునే రైతులయినందువల్ల, వారి ఉత్పాదితాలూ, వారి శ్రమ పరికరాలూ, జీవనాధార సాధనాలూ ఏ సందర్భంలోనూ "ఆదాయాన్నుండి పొదుపు చేయబడిన ఒక నిధి రూపంలో లేనందువల్ల ఆ నిధి సంచయనం యొక్క పూర్వ ప్రక్రియలో కలిసిపోయింది."[2] మరోవైపున, ఎక్కడైతే ఆంగ్లేయుల పాలన ప్రాచీన వ్యవస్థను అతి తక్కువగా విచ్ఛిన్నం చేసిందో, ఆ ప్రాంతాలలోని వ్యవసాయేతర కార్మికులను ధనవంతులే నేరుగా పనుల్లో నియమించుకొని కానుకలరూపంలోనూ లేక కౌలు రూపంలోనో వ్యవసాయపు అదనపు ఉత్పాదితంలోని ఒక భాగాన్ని వస్తురూపంలో ధనికులే వినియోగించుకోగా, మరొక భాగాన్ని వారి ఉపయోగార్థం ఆడంబర వస్తువులుగా కార్మికులే మార్పు చేసేవారు; ఇక మిగిలిన దానిని కార్మికులకు వేతనాలుగా ఇచ్చేవారు; ఆ కార్మికులకు సొంత ఉత్పత్తి పరికరాలు వుండేవి. బిక్కమొఖం పెట్టిన వీరుడూ "కోర్కెలను విసర్జించిన" వింత రుషే అయిన పెట్టుబడిదారుడి ప్రమేయం లేకుండానే ఇక్కడ ఉత్పత్తి, పునరుత్పత్తి క్రమేపీ అత్యధిక మోతాదులో జరుగుతూనే వుంటాయి.

---

1. "జాతీయ పెట్టుబడి పురోగతికి అత్యంత సమృద్ధిగా ఫలితాన్ని చేకూర్చే ప్రత్యేకమైన ఆదాయవర్గాలు, పురోగతిలో విభిన్న స్థానాలను కలిగియున్న దేశాల్లో పూర్తిగా విభిన్న రీతుల్లో వుంటాయి..... సామాజిక వ్యవస్థ ప్రారంభ దశలో వేతనాలూ, భూమి కౌలుతో పోల్చినపుడు, సంచయానికి లాభం.... ప్రాధాన్యత లేని మూలాధారంగా వుంటుంది. జాతీయ పరిశ్రమల శక్తి గణనీయంగా పెరిగినపుడు లాభాలు, సంచయనానికి మూలాధారంగా సాపేక్ష ప్రాధాన్యాన్ని సంతరించుకొంటాయి" (రిచర్డ్ జోన్స్ : టెక్స్ట్‌బుక్, పు. 16-21).

2. అదే గ్రంథం, పుట 36

## విభాగం - 4

# పెట్టుబడీ, ఆదాయంగా అదనపు విలువ విభజించబడిన నిష్పత్తితో సంబంధం లేకుండా సంచయన పరిమాణాన్ని నిర్ణయించే అంశాలు

### శ్రమ శక్తి దోపిడీ స్థాయి; శ్రామిక ఉత్పాదకత; నియోగించబడిన పెట్టుబడి వినియోగించుకోబడిన పెట్టుబడి మొత్తంలో వ్యత్యాసాల పెరుగుదల; అడ్వాన్సు చేయబడిన పెట్టుబడి పరిమాణం

పెట్టుబడిగానూ, ఆదాయంగానూ అదనపు విలువ ఏ నిష్పత్తిలో విభజించబడిందో మనకు తెలిసినపుడు, సంచయనం చేయబడిన పెట్టుబడి పరిమాణం, అదనపు విలువ యొక్క సంపూర్ణ పరిమాణంపై ఆధారపడి వుంటుందని స్పష్టమవుతుంది. ఉదాహరణకు, అదనపు విలువలో 80 శాతం పెట్టుబడీకరించబడిందనీ 20 శాతం వినియోగించుకోబడిందనీ అనుకొందాం; మొత్తం అదనపు విలువ 3,000 పౌండ్లు లేక 1500 పౌండ్లు అనుకొన్నపుడు, 2400 పౌండ్లు లేక 1200 పౌండ్లు సంచయనం చేయబడిన పెట్టుబడి అవుతుంది. కాబట్టి అదనపు విలువ పరిమాణాన్ని నిర్ణయించే అంశాలన్నీ, సంచయనం యొక్క పరిమాణాన్ని నిర్ణయించడానికి పని చేస్తాయి. సంచయనానికి సంబంధించినంత వరకు అవి ఏ మేరకు నూతన దృక్కోణాలను అందజేయగలవో, ఆ మేరకు వాటిని మరొకసారి సంక్షిప్తంగా పరిశీలిద్దాం.

అదనపు విలువ రేటు మొట్ట మొదటగా శ్రమ శక్తి దోపిడీ స్థాయి మీద ఆధారపడుతుందని జ్ఞప్తికి తెచ్చుకోవాలి. రాజకీయ అర్థశాస్త్రం ఈ అంశాన్ని చాలా ప్రధానమైనదిగా భావిస్తూ, అప్పుడప్పుడూ, శ్రామిక ఉత్పాదకత పెరుగుదల మూలంగా వేగాన్ని పుంజుకునే సంచయనాన్ని కార్మికుల దోపిడీ పెరుగుదల ఫలితమైన సంచయనపు వేగ వృద్ధితో సమానమని భావిస్తుంది.[1] అదనపు విలువ ఉత్పత్తిని గురించి చర్చించిన అధ్యాయాలలో వేతనాలు కనీసం శ్రమశక్తి విలువకు సమానంగానైనా వుండాలని స్పష్టంగా భావించాం. అయితే కార్మికుల వేతనాలను వారి శ్రమశక్తి విలువకన్నా బలవంతంగా తగ్గించే విధానం, ఆచరణలో చాలాముఖ్యమైన పాత్రను నిర్వహిస్తున్నందున దానిని ప్రస్తుతానికి చర్చించకుండా ముందుకు పోలేము. వాస్తవానికి, ఆ విధానం కొన్ని పరిమితులలో కార్మికుల యొక్క వినియోగావసరనిధిని పెట్టుబడి సంచయనంగా మార్చుతుంది.

---

1. "రికార్డో ఇలా అంటాడు. : 'సామాజిక వ్యవస్థ వివిధ దశలలో పెట్టుబడిని సంచయనం చేయడంలో గానీ లేక శ్రమను నియోగించుకొనే' (దోపిడీ చేసే) సాధనాలుగానీ ఇంచుమించుగా త్వరితంగా పెరిగాయి; పైగా అన్ని సందర్భాలలోనూ శ్రామిక ఉత్పాదక శక్తిపైనే ఆధారపడింది. సారవంతమైన భూమి సమృద్ధిగా ఎక్కడ లభిస్తుందో, అక్కడల్లా శ్రామిక ఉత్పాదకశక్తి చాలా ఎక్కువగా వుంటుంది'. మొదటి వాక్యంలోని శ్రామిక ఉత్పాదకశక్తి ఏ శారీరక శ్రమ ద్వారా ఉత్పత్తి చేయబడిందో, ఆ శ్రమకు ఆ ఉత్పాదితంలోని శేషించిన భాగం చెందుతుందనే అర్థమే అయితే ఆ వాక్యం చర్విత చరణమే!.... ఎందువల్లననగా మిగిలిన భాగం అప్పుడు పెట్టుబడి నిధిగా, యజమాని అలా చేయాలనుకుంటే, సంచయనం చేయబడుతుంది. అయితే అత్యంత సారవంతమైన భూమి లభించిన చోట ఇది సాధారణంగా జరగదు". (అబ్జర్వేషన్స్ ఆన్ సర్టన్ వెర్బల్ డిస్ప్యూట్స్)

"వేతనాలకు ఉత్పాదక శక్తి వుండదు; ఉత్పాదక శక్తి యొక్క ధరే వేతనాలు. పరికరాలతో పాటుగా పరికరాల ధరలు దోహదం చేసిన దాని కన్నా మించి, శ్రమతో పాటుగా వేతనాలు సరుకుల ఉత్పత్తికి దోహదం చేయవు. కొనుగోలు లేకుండా శ్రమ లభ్యమైనట్లయితే వేతనాలను రద్దుచేయవచ్చు."[1] అని జాన్ స్టువర్ట్ మిల్ అంటాడు. అయితే, కార్మికులు గాలిని భోంచేసి జీవించగలిగితే, ఏ ధరనైనా చెల్లించి వారిని కొనుగోలు చేయడం సాధ్యం కాదు. అందువలన, ఏమీ చెల్లించకుండా వారిని కొనుగోలు చేయడానికి సున్నా అనేది ఒక పరిమితిగా వుంటుంది. కాబట్టి, గణితశాస్త్ర పరిభాషలో, దానికి ఉజ్జాయింపుగా, అతి సన్నిహితంగా రావడానికి ప్రయత్నించగలమే గానీ, దానికి మించి పోలేము. శ్రమ వ్యయాన్ని ఈ సున్నా వరకు తిరిగి నెట్టడమే పెట్టుబడి యొక్క నిరంతర ధోరణిగా వుంటుంది. ఫ్రాన్స్, హాలెండ్ స్థాయికి ఇంగ్లాండ్‌లోని వేతనాలను బలవంతంగా తగ్గించడమే ఇంగ్లాండ్ యొక్క చారిత్రక కర్తవ్యమని మనం తరచుగా ఉటంకించిన 18వ శతాబ్దపు రచయితా, "యస్సే ఆన్ ట్రేడ్ అండ్ కామర్స్" వ్యాసకర్త ప్రకటించి ఇంగ్లీషు పెట్టుబడిదారీ విధానం యొక్క అంతర్గత ఆత్మ రహస్యాన్ని బయటపెట్టాడు.[2] మిగిలిన అంశాలతో పాటు అతను సహజంగా ఇలా చెప్పాడు : "అయితే, మనపేద (కార్మికులకు బదులుగా ఆయన వాడే సాంకేతిక పదం) ప్రజలు ఆడంబరంగా జీవించినట్లయితే... కార్ఖానాదారులు వినియోగించే ఆడంబరాలైన బ్రాందీ, జిన్, టీ, పంచదార, విదేశీ పండ్లు, ఘాటైన బీరు, అద్దకం వేసిన నేత బట్టలు, నశ్యం, పొగాకు వగైరాలను పరిగణనలోకి తీసుకుంటే బహుశా అప్పుడు శ్రమ ప్రియమవుతుంది.[3] ఆకాశంవైపు దొంగచూపు చూస్తూ, దురదృష్టానికి రోదించే నార్త్ ఆంప్టన్ షైర్ కార్ఖానాదారుడి అభిప్రాయాన్ని ఈ రచయిత ఈ విధంగా పేర్కొన్నాడు. "ఇంగ్లాండ్‌లో కన్నా ఫ్రాన్స్‌లో శ్రమ 1/3 వంతులు చౌక; ఎందుకంటే ఆ దేశంలో పేదలు బాగా కష్టపడి పని చేస్తారు, అన్న వస్త్రాలకు చాలా తక్కువగా ఖర్చుపెడతారు. వారి ప్రధానమైన ఆహారం రొట్టె, పండ్లు, ఆకుకూరలు, దుంపలు, ఎండుచేపలు, మాంసాహారాన్ని మహా అరుదుగా తింటారు; గోధుమలు ప్రియమైనపుడు, బహుతక్కువ రొట్టెను తింటారు."[4] మన వ్యాసకర్త ఇంకా ఇలా చెప్తున్నాడు: "దానికి ఈ అంశాలను కూడా చేర్చవచ్చు. ఆ పేదలు నీళ్ళు గానీ, తక్కువ రకం సారాయిగానీ తాగితే

---

1. జె. స్టువర్ట్‌మిల్ : ''యస్సే ఆన్ సమ్ ఆన్‌సెటిల్డ్ క్వశ్చన్స్ ఆఫ్ పొలిటికల్ ఎకానమీ'' లండన్; 1844; పుట 90.
2. ''యాన్ యస్సే ఆన్ ట్రేడ్ అండ్ కామర్స్'' లండన్. 1770, పుట 44. 'యజమానుల' కోసం తాము జీవించడానికి అవసరమైన దానికి మించి బెల్జియం గని కార్మికులు అడగటమూ లేదనీ, పుచ్చుకోవడమూ లేదనీ, ఆ కార్మికుల సంతృప్తికరమైన స్థితిని వర్ణిస్తూ బెల్జియం గని యజమానులు కుమ్మరించిన మాటలను 1866 డిసెంబరులోనూ, 1867 జనవరిలోనూ ఒకే విధంగా టైమ్స్ పత్రిక ప్రచురించింది. టైమ్స్ పత్రికచే ఆదర్శ కార్మికులుగా గుర్తించబడడానికి బెల్జియం కార్మికులు ఎంతో ప్రయాసపడవలసి వచ్చింది! 1866 ఫిబ్రవరి ప్రారంభంలో అసలు సమాధానం వచ్చింది : మార్చెన్నీలో బెల్జియం గని కార్మికుల సమ్మె నిర్దాక్షిణ్యంగా తుపాకీ తూటాలతో అణచివేయబడింది.
3. అదే గ్రంథం పుట 44-46.
4. హృదయమున్న వాడెవడైనా క్షమించగలిగిన పవిత్రమైన వంచనను నార్త్ ఆంప్టన్ షైర్ కార్ఖానాదారుడు చేస్తున్నాడు. అతను, తన గందరగోళ పద్ధతిలో తర్వాత అంగీకరించినదే! ఫ్రాన్సు వ్యవసాయ కార్మికుల్ని గురించి విశదీకరిస్తూ, ఇప్పుడే ఉటంకించిన పదాల్లో ఇంగ్లాండ్ ఫ్రాన్సు కార్ఖానా కార్మికుల్ని గురించి వర్ణిస్తున్నట్లు నటిస్తున్నాడు.

ఇంకా తక్కువగా డబ్బును ఖర్చు పెట్టగలరు..... ఈ విషయాలను ఇక్కడ అమలు చేయడం కష్టం కావచ్చు. అయితే ఫ్రాన్సులో, హాలెండ్‌లో వాటిని అమలు జరిపినందున ఇక్కడ కూడా అమలు జరపడం అసాధ్యం కాకపోవచ్చు.[1] ఇరవై సంవత్సరాల తర్వాత, ఒక మోసకారీ, బిరుదు తగిలించుకున్న అమెరికా వాసీ అయిన బెంజిమన్ థాంప్సన్ (అనే జమీందార్ రమ్ ఫోర్టు) అదే పరోపకార మార్గాన్ని అనుసరించడం ద్వారా దేవుడికీ, మనిషికీ గొప్ప సంతృప్తిని కలిగించాడు! ఆయన "వ్యాసాలు," కార్మికులు సాధారణంగా తినే ఆహారంలో కొద్దిగా ప్రియమైన వస్తువుల స్థానే, వాటికి ప్రత్యామ్నాయంగా చౌకగా వుండే పలురకాలైన పచారీ వస్తువులను వివరించే "పాకశాస్త్ర గ్రంథం". విచిత్రమైన ఈ తత్వవేత్త యొక్క పచారీ పద్దుల్లో ఈ క్రిందివి ప్రత్యేకించి పేర్కొనదగినవి : "5 పౌన్లు బార్లీ ఆహారం $7\frac{1}{2}$ పెన్నీలు, 5 పౌన్లు మొక్క జొన్నలు, $6\frac{1}{4}$ పెన్నీలు; 3 పెన్నీల ఖరీదు చేసే ఉప్పు చేపలు; ఒక పెన్నీకి ఉప్పు; ఒక పెన్నీకి రేగుపండ్ల సారాయి; 2 పెన్నీలకు మిరియాలపొడి, తియ్యటి ఆకుకూరలు, వెరసి $20\frac{3}{4}$ పెన్నీలు, ఈ మొత్తంతో 64 మందికి చారును (సూప్) తయారుచేయవచ్చు. బార్లీ, మొక్కజొన్నలు ఇంకా ఒక మోస్తరు ధరకి లభ్యమయితే 20 ఔన్సుల చారు 1/4 పెన్నీకే ఇవ్వవచ్చు."[2] పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం వేళ్ళూనే కొలదీ దానితో పాటుగా వుండే ఆహార కల్తీ థాంప్సన్ గారి 'ఆదర్శ భోజనాన్ని' వమ్ము జేసింది.[3] 18వ శతాబ్దాంతంలోనూ, 19వ శతాబ్దపు మొదటి పది

---

1. ఉదాహృత గ్రంథం పుట 70-71 : (జర్మన్ మూడవ ముద్రణకు ఏంగిల్స్ చేర్చిన నోట్) ప్రపంచ మార్కెట్‌లో పోటీ. అప్పటినుండి దాని పెరుగుదల మూలంగా, ఈ రోజున ఇంకాముందుకు వెళ్ళాం. పార్లమెంట్ సభ్యుడైన స్టాపిల్‌టన్ తన నియోజకవర్గ ప్రజలనుద్దేశించి ఇలా చెప్తున్నాడు : "చైనాయే గనుక ఒక పెద్ద పారిశ్రామిక దేశం అయితే, ఐరోపా ఖండంలోని కార్ఖానాదారులంతా, వారి పోటీదారుల స్థాయికి దిగకుండా, ఈ పోటీని ఏవిధంగా తట్టుకొని నిలబడగలరో నాకుఅర్థం కావడం లేదు" (టైమ్స్, సెప్టెంబర్ 3, 1873; పుట 8) ఇంగ్లీషు పెట్టుబడి యొక్క ప్రకటిత లక్ష్యం ఇక ఏమాత్రం ఖండాంతర వేతనాలు కాదు; చైనా వేతనాలే!
2. బెంజిమన్ థాంప్సన్ : "యస్సేస్, పొలిటికల్, ఎకానమికల్ అండ్ ఫిలసాఫికల్", 3 సంపుటాలు; లండన్, 1796 - 1802; సంపుటి 1, పు. 294. "ది స్టేట్ ఆఫ్ ది పూర్ ఆర్ యాన్ హిస్టరీ ఆఫ్ ది లాబరింగ్ క్లాసెస్ యిన్ ఇంగ్లాండ్" అనే తన గ్రంథంలో, సర్.ఎఫ్.ఎం. ఈడెన్, ప్రభుత్వం యేర్పరచిన నిరుపేదల వసతి గృహ నిర్వహణాధికార్లకు రమ్ ఫోర్టుగారు సూచించిన వరకు బలాన్ని గట్టిగా సిఫార్సు చేస్తూ "చాలామంది పేదవారు, ప్రత్యేకించి స్కాట్‌లాండ్‌లో నీళ్ళూ, ఉప్పుతో మిశ్రమం చేయబడిన ఓట్స్, బార్లీ అన్నంతో నెలల తరబడి చాలా సౌకర్యంగా జీవిస్తున్నారు" అని మందలింపుగా ఇంగ్లాండ్ కార్మికుల్ని హెచ్చరిస్తున్నారు. (ఉదాహృత గ్రంథం సంపుటి 1; ఒకటవ భాగం, అధ్యాయం 2; పుట 503) 19వ శతాబ్దంలో కూడా అదే పద్ధతిలో సూచనలు ఇస్తున్నారు "(ఇంగ్లాండ్ వ్యవసాయ కార్మికులు) అత్యంత సంపూర్ణమైన పిండి మిశ్రమాన్ని నిరాకరించారు..... బాగా చదువు సంధ్యలున్న స్కాట్‌లాండ్‌లో ఈ దురభిప్రాయం ఇంకా చోటు చేసుకోలేదు" (చార్లెస్ హెచ్.ప్యారీ; యం.డి.) "ది క్వశ్చన్ ఆఫ్ ది నెసిసిటీ ఆఫ్ ది ఎగ్జిస్టింగ్ కారన్ లాస్‌కన్సిడర్డ్". లండన్. 1816; పుట 69) ఈడెన్ కాలంలో (1797) కన్నా ఇప్పుడు (1815) ఇంగ్లాండ్ కార్మికులు అతి నికృష్ట జీవితాన్ని గడుపుతున్నారని అదే ప్యారీ ఫిర్యాదు చేస్తాడు.
3. జీవనాధార సాధనాలకల్తీని గురించి ఏర్పరచిన పార్లమెంటరీ సంఘ నివేదిక ఆధారంగా, ఇంగ్లాండ్‌లో మందులను కూడా కల్తీ చేయడం ఒక రివాజు అయిందని మనం చెప్పవచ్చు. ఉదాహరణకు, లండన్‌లో వివిధ రకాలైన మందుల వ్యాపారస్తుల దగ్గరి నుండి సేకరించిన 34 నమూనాల నల్ల మందులను పరీక్షిస్తే, అందులో 31 మందులు గసగసాలూ, గోధుమపిండీ, గమ్ము, మట్టి, ఇసుక వగైరాలతో కల్తీ చేయబడ్డాయి. చాలా వాటిల్లో అణువైనా మార్ఫియా లేదు.

సంవత్సరాల కాలంలోనూ ఇంగ్లండ్‌లోని రైతులు, భూస్వాములూ వ్యవసాయ కార్మికులకు కనీసం కన్నా తక్కువగా వేతనాల రూపంలోనూ, మిగతా భాగాన్ని పేదవారుగా ఇచ్చే దాన రూపంలోనూ చెల్లించడం ద్వారా పూర్తిగా కనిష్ట వేతనాలను అమలు పరిచారు. వేతన సుంకాన్ని "చట్ట రీత్యా" నిర్ణయించిన సందర్భంలో బుద్ధిహీనులైన ఇంగ్లీషు జమీందార్లు ప్రదర్శించిన హాస్యాస్పద ధోరణికి ఒక ఉదాహరణ : "వేతనాల రేటును నిర్ణయించే సందర్భంలో నార్‌పోక్‌లని జమీందార్లు, భూస్వాములు సుష్టుగా భోజనం చేశారు" అని బర్క్‌గారు అంటారు; 1795లో స్పీన్ హోలాండ్ దగ్గర వేతనాల రేటును నిర్ణయించిన సందర్భంలో కార్మికుల ఆ విధంగా ప్రవర్తించి వుండవలసిందిగాదని బెర్క్షలోని భూస్వాములు, జమీందార్లు వాస్తవంగా ఆలోచించి వుండవచ్చు.... 8 పౌనుల 11 ఔన్సుల తూకం గల అరపెక్ లేక ఒక గాలను రొట్టెముక్కల ఖరీదు ఒక షిల్లింగ్‌గా వున్నప్పుడు 'ఒక మనిషికి ఆదాయం (వారానికి) మూడు షిల్లింగులుగా వుండాలని' వారు అక్కడ నిర్ణయించారు; రొట్టె ఖరీదు 1 షెల్లింగ్ 5 పెన్నీలు అయ్యే వరకు దానిని క్రమేపి పెంచాలనీ, అపుడు కార్మికుని ఆహారం 1/5 వంతుకు తగ్గాలని వారు నిర్ణయించారు"[1] 1814లో ప్రభువుల సభా విచారణా సంఘం ముందు విచారణకై వచ్చిన ఒక పెద్ద రైతూ, న్యాయాధికారీ, పేదల చట్ట సంరక్షకుడూ, వేతనాలను అమలుపరిచే అధికారీ అయిన ఎ.బెన్నిట్‌ను ఒక ప్రశ్న అడిగారు. "పేదవారికిచ్చే దాన ధర్మాల నుండీ రోజువారీ శ్రమ విలువలో ఏ భాగమైనా కార్మికులకు ఇస్తున్నారా? "సమాధానం : అవును; అలాగే జరుగుతుంది; ప్రతి కుటుంబానికీ వారానికీ ఒక గాలను (8 పౌనుల 11 ఔన్సులు) రొట్టె ముక్కలూ, తల ఒక్కింటికి 3 పెన్నీలు ఇస్తున్నాం..... కుటుంబంలోని ప్రతి వ్యక్తికి ఒక వారం పోషణకు వారానికిచ్చే ఈ గాలను రొట్టె ముక్కలు సరిపోతాయని మేము భావిస్తున్నాం; 3 పెన్నీలు బట్టలకు సరిపోతాయి; అయితే బట్టలు వున్నాయని పేదరికపు చట్టాన్ని అమలు పరిచే అధికారి భావిస్తే, ఆ 3 పెన్నీలను తగ్గిస్తారు. విల్ట్‌షైర్ పశ్చిమ భాగం మొత్తంలోనూ, నా నమ్మకమేమిటంటే, దేశం మొత్తంలోనూ కూడా ఇదే విధానం అమలు పరుచబడుతుంది"[2]

ఆ కాలంలోని ఒక బూర్జువా రచయిత ఈ విధంగా ఆశ్చర్యాన్ని ప్రకటించాడు : "ఆ దేశ ప్రజానీకంలోని ఒక గౌరవప్రదమైన వర్గాన్ని సంవత్సరాల తరబడి పేదల వసతి గృహాల ఆశ్రయం పొందేటట్లుగా వారు (రైతులు) దిగజార్చారు.....రైతు తన ఆదాయాన్ని పెంపొందించుకొంటూనే తన మీద ఆధారపడిన శ్రమ జీవులకు సంబంధించినంత వరకు ఏ కొద్ది సంచయనం కూడా లేకుండా నిరోధించాడు"[3] పెట్టుబడి సంచయనపు నిధిని ఏర్పాటు చేసుకోడానికి అవసరమైన అదనపు విలువను పోగేసుకోవడంలో కార్మికుల యొక్క అవసర వినియోగనిధిని నేరుగా దోపిడీ చేయడానికి

1. జి.బి. న్యూహామ్ (బారిష్టర్) ''ఎ రెవ్యూ ఆఫ్ ది యెవిడెన్స్ బిఫోర్ ది కమిటీ ఆఫ్ టూ హౌసెస్ ఆఫ్ పార్లమెంట్ ఆన్ కారన్ లాస్'' లండన్, 1815; పుట 20.
2. ఉదాహృత గ్రంథం. పుటలు 19, 20
3. సిహెచ్. ప్యారీ ఉదాహృత గ్రంథం పుట. 77, 69. ఇంగ్లాండ్ కోసమనే పేరుతో జాకోబియన్ వ్యతిరేక యుద్ధాలలో పాల్గొనడం మూలంగా, భూస్వాములు తమ ''నష్టపరిహారాలను'' పూడ్చుకోవడమే గాక, బాగా సంపన్నులైనారు. వారికి వచ్చే భూమి కౌలు రెండూ, మూడూ, నాలుగు రెట్లు కూడా పెరిగింది. ''ఒక సందర్భంలో 16 సంవత్సరాలలో ఆరు రెట్లు కూడా పెరిగింది.''

"స్వదేశీ పరిశ్రమ" వ్యవహారమే మన కాలంలో నిర్వహించిన పాత్రను చూపించగలదు. (అధ్యాయం XV విభాగం 8) ఈ విషయం మీద ఇంకా వాస్తవాలు తర్వాత ఇస్తాం.

పరిశ్రమల్లోని అన్ని శాఖల్లోనూ, స్థిర పెట్టుబడిలో భాగమైన శ్రమ పరికరాలు కొంత మంది కార్మికులకు సరిపోయినప్పటికీ (ఆ శాఖ పరిమాణం చేత నిర్ణయించబడుతుంది) నియమించబడిన శ్రమ పరిమాణం నిష్పత్తిలోనే ఆ పరికరాలు తప్పనిసరిగా పెరగాల్సిన అవసరం లేదు. ఉదాహరణకు, ఒక కర్మాగారంలో 100 మంది కార్మికులు, రోజుకి 8 గంటల చొప్పున 800 గంటలు పనిచేయగలరు అనుకొందాం. పెట్టుబడిదారుడు గనుక ఈ మొత్తాన్ని సగానికి పెంచాలనుకుంటే, 50మంది కార్మికులను అదనంగా నియమించుకోవచ్చు; అయితే, అప్పుడు వేతనాలకే గాక, శ్రమ పరికరాలకు గూడా అదనపు పెట్టుబడిని అతను అడ్వాన్సు చేయవలసి వుంటుంది. అయితే రోజుకి 8 గంటలకు బదులుగా 12 గంటల చొప్పున 100 మంది కార్మికులుచేత పని చేయించుకుంటే, అప్పుడు అంతకు ముందే అందుబాటులో వున్న శ్రమ పరికరాలు సరిపోతాయి. అప్పుడు ఇవి అత్యంత త్వరితగతిని వినియోగించు కోబడతాయి. ఆ విధంగా శ్రమ శక్తి యొక్క తీవ్రతా ఫలితంగా స్థిర పెట్టుబడిలో అదనపు శ్రమకు అనుగుణ్యమైన భాగంలో పెరుగుదల లేకుండానే అదనపు శ్రమ అదనపు ఉత్పాదితాన్నీ, అదనపు విలువనూ (అనగా సంచయనం యొక్క అధ్యయనాంశం) సృష్టిస్తుంది.

నూనె పరిశ్రమా, గనుల త్రవ్వకాలూ మొదలైన పరిశ్రమల్లో, అడ్వాన్సు చేసిన పెట్టుబడిలో ముడి సరుకులు భాగం కావు. ఈ పరిశ్రమల్లో కూడా, మిగతా పరిశ్రమలైన లోహాలూ, ఖనిజాలూ, బొగ్గూ, రాళ్ళూ వగైరాల్లాగే శ్రమ గ్రహీతలు, గత శ్రమ ఉత్పాదితాలు కావు; అయితే అవి ప్రకృతి సిద్ధంగా ఉచితంగా సమకూర్చబడతాయి. ఈ పరిశ్రమల్లో పెరిగే శ్రమపరిమాణాన్ని (పగలు, రాత్రి, షిఫ్టుల్లో పని చేసే కార్మికులు) బాగా ఇముడ్చుకోగలిగిన శ్రమ పరికరాలే, ప్రత్యేకంగా స్థిరపెట్టుబడిగా ఉంటాయి. అన్ని పరిస్థితులూ సమానంగా ఉన్నపుడు, ఉత్పాదితం యొక్క పరిమాణమూ, విలువా వెచ్చించబడిన శ్రమకు అనులోమ అనుపాతంలో పెరుగుతాయి. ఉత్పాదితాన్ని తయారు చేసుకోవడానికి పని చేసిన తొలి కారకాలైన మనిషి. ప్రకృతి ఇప్పుడు పెట్టుబడి యొక్క భౌతికాంశాల సృష్టికర్తలుగా ఉత్పత్తి ప్రారంభమైన మొదటి రోజులో వలె ఇప్పటికీ కలిసి పని చేస్తున్నాయి. శ్రమ శక్తి యొక్క స్థితి స్థాపకత పుణ్యమా అని స్థిర పెట్టుబడి పరిమాణంలో అంతకు ముందు ఏ విధమైన పెరుగుదల లేకుండానే సంచయనం యొక్క పరిధి విస్తరింపబడింది.

విత్తనాలూ, ఎరువులూ ఎక్కువగా అడ్వాన్సు చేయబడకుండానే వ్యవసాయంలో సాగులో వున్న భూమి పెరగదు. అయితే ఒకసారి ఈ విధంగా అడ్వాన్సు చేసిన తర్వాత కేవలం యాంత్రికంగా భూమి పని చేయడం మూలంగా, ఉత్పాదిత పరిమాణంపైన అపూర్వమైన ప్రభావం కలుగుతుంది. గతంలో వలె అదే సంఖ్యలో వున్న కార్మికులు ఎక్కువ పరిమాణంలో శ్రమ చెయ్యడం మూలంగా శ్రమ పరికరాల రూపంలో ఏ విధమైన తోడ్పాటు అవసరం లేకుండానే భూసారం పెరుగుతుంది. ఏ విధమైన నూతన పెట్టుబడి జోక్యంతో నిమిత్తం లేకుండానే అధిక సంచయనానికి తక్షణ మూలాధారంగా ప్రకృతి మీద మానవ ప్రత్యక్ష కార్యాచరణయేననీ మరొకసారి పేర్కొనవచ్చు.

ఇక చివరి అంశంగా, వస్తూత్పాదక పరిశ్రమలని పిలువబడే వానిలో శ్రమ యొక్క ప్రతి

అదనపు వ్యయానికీ, దానికి అనుగుణ్యమైన ముడి సరుకుల యొక్క అదనపు వ్యయమే వుండాలి గానీ అదనపు శ్రమ పరికరాల యొక్క ఆవశ్యకత లేదు. గనుల పరిశ్రమా, వ్యవసాయమూ, వస్తూత్పాదక పరిశ్రమలకు ముడి సరుకులతో పాటు శ్రమ పరికరాలను కూడా సరఫరా చేస్తున్నందువల్లా, అదనపు పెట్టుబడి అడ్వాన్సు చేయకుండానే ఈ గనుల పరిశ్రమా,వ్యవసాయమూ అదనపు ఉత్పాదితాన్ని సృష్టించడం వల్లా చివరికి వస్తూత్పాదక పరిశ్రమలకు పెద్ద లాభం చేకూరుతుంది.

సాధారణ ఫలితం : శ్రమశక్తీ, భూమి అనే రెండు ప్రధానమైన సంపద సృష్టికర్తలను తనలో ఇముడ్చుకోవడం ద్వారా వ్యాప్తి చెందే శక్తిని పెట్టుబడి సంపాదించుకొని, తద్వారా తన పరిమాణం చేత స్పష్టంగా నిర్ణయించబడిన పరిమితులకు మించి, తన సంచయన కారకాలనూ లేక తన మనుగడకు ఆధారమైన అంతకుముందే ఉత్పత్తి చేయబడిన ఉత్పత్తి సాధనాల విలువనూ, పరిమాణాన్నీ పెంచుకోగలుగుతుంది.

పెట్టుబడి సంచయనంలో మరో ముఖ్యమైన కారకం సామాజిక శ్రమ యొక్క ఉత్పాదకతా స్థాయి. శ్రమశక్తి యొక్క ఉత్పాదకతా శక్తి పెరిగే కొలదీ, కొంత విలువా, అందువలన కొంత అదనపు విలువ పరిమాణమూ ఇమిడియున్న ఉత్పాదితాల పరిమాణం కూడా పెరుగుతుంది. అదనపు విలువ రేటు యధాతథంగా ఉన్నప్పుడూ లేక ఒకవేళ తగ్గినా, శ్రామిక ఉత్పాదకత పెరుగుదల రేటుకన్నా తక్కువ రేటులో నిదానంగా తగ్గిపోయినంత కాలం వరకూ, అదనపు ఉత్పాదిత పరిమాణం పెరుగుతూనే వుంటుంది. ఆదాయంగానూ, అదనపు పెట్టుబడిగానూ ఈ ఉత్పాదితం ఒక్క విభజన యధాతథంగా వున్నట్లయితే సంచయనపు నిధిలో ఏ విధమైన తగ్గుదల లేకుండానే పెట్టుబడిదారుడి వినియోగం తదనుగుణ్యంగా పెరగవచ్చు. వినియోగనిధిని తగ్గించడం ద్వారా సంచయనపు నిధి యొక్క సాపేక్షపరిమాణం పెరగవచ్చు కూడా; అదే సమయంలో సరుకుల ధరలు చౌకగావడం మూలంగా, గతంలో వలె ఇంకా అంతకంటే ఎక్కువగా పలు రకాలైన జీవితానుభవ సాధనాలు పెట్టుబడిదారుడి ఆధీనంలో వుంచబడతాయి. అయితే, శ్రామిక ఉత్పాదక పెరుగుదలతో పాటుగా, మనం ఇంతకు ముందే చూసినట్లుగా, కార్మికుడు కూడా చౌకగావడం మూలంగా నిజవేతనాలు పెరుగుతున్నప్పటికీ అదనపు విలువ రేటు ఇంకా ఎక్కువగా పెరుగుతుంది. శ్రామిక ఉత్పాదకతా శక్తి పెరుగుదల నిష్పత్తిలో ఏ సందర్భంలోనూ నిజవేతనాలు పెరగవు. అందువలన అస్థిర పెట్టుబడిలో వున్న అదే విలువ, అధిక శ్రమ శక్తినీ పర్యవసానంగా అధిక శ్రమనూ ఇంకా పెంచుతుంది. స్థిర పెట్టుబడిలోని అదే విలువ అధిక ఉత్పత్తి సాధనాలలో ఇమిడి వుంటుంది; అనగా, అధికంగా వుండే శ్రమ పరికరాలూ, శ్రమ భౌతికాంశాలూ, సహాయ భౌతికాంశాలలోనూ ఇమిడి వుంటుంది; అందువలన ఉపయోగపు విలువనూ, విలువను ఉత్పత్తి చేయడానికి అవసరమైన కారకాలనూ, దీనితో పాటుగా శ్రమనూ ఎక్కువగా ఇముడ్చుకోగలిగిన కారకాలను అది సరఫరా చేస్తుంది. కాబట్టి అదనపు పెట్టుబడి యొక్క విలువ యధాతథంగా వున్నప్పుడు లేక ఒకవేళ క్షీణించినప్పటికీ వేగంపుంజుకొంటున్న సంచయనం యింకా జరుగుతూనే వుంటుంది. పునరుత్పత్తి మోతాదు భౌతికంగా విస్తృతంగావడమే గాక అదనపు పెట్టుబడి విలువకన్నా అదనపు విలువ ఉత్పత్తి కూడా ఇంకా త్వరితంగా పెరుగుతుంది.

శ్రామిక ఉత్పాదకత పెరుగుదల ప్రభావం అంతకుముందే ఉత్పత్తి ప్రక్రియలో వున్నటువంటి తొలి పెట్టుబడిమీద కూడా వుంటుంది. క్రియాత్మక స్థిర పెట్టుబడిలో భాగమైన యంత్రాలు వగైరా శ్రమ పరికరాలు వినియోగించుకోబడినందువల్ల, చాలా కాలం గడిచే వరకు పునరుత్పత్తి చేయబడవు లేక అదే రకమైన కొత్త వాటితో తిరిగి ఏర్పాటు చేయబడవు. అయితే, ప్రతి సంవత్సరం, శ్రమ పరికరాల్లోని ఒక భాగం నిరుపయోగమవుతాయి లేక ఉత్పాదక క్రియ యొక్క పరిమితిని చేరుకుంటాయి. అందువలన, అదే రకమైన కొత్తవాటితో తిరిగి యేర్పాటు చేసుకోవడానికి, పునరుత్పత్తి కాలపరిమితి అదే సంవత్సరంలో ఆసన్నమవుతుంది. శ్రమ పరికరాలు వాడకం అవుతున్న కాలంలో శ్రామిక ఉత్పాదక పెరిగినట్లయితే (నిరంతరాయంగా పెరుగుతున్న శాస్త్ర సాంకేతిక విజ్ఞానంతో పాటుగా యిది కూడా నిరంతరాయంగా పెరుగుతుంది) పాత వాటి స్థానే, ఎక్కువ సామర్థ్యమూ (పెరిగే వాటి సామర్థ్యాన్ని పరిగణనలోకి తీసుకున్నపుడు) చౌక అయిన యంత్రాలూ, పరికరాలూ, తదితర సామాగ్రి తిరిగి యేర్పాటు చేసుకోబడతాయి. అంతకు ముందే వాడకంలో వున్న పలురకాలైన శ్రమ పరికరాల నిరంతర అభివృద్ధితో పాటుగా, పాత పెట్టుబడికూడా ఎక్కువ ఉత్పాదక రూపంలో పునరుత్పత్తి చేయబడుతుంది. స్థిరపెట్టుబడిలోని మరొక భాగమైన ముడి సరుకులూ, సహాయక అంశాలూ ఒక సంవత్సరం లోపుగానే నిరంతరం పునరుత్పత్తి చేయబడతాయి; ఇక వ్యవసాయంలో ఉత్పత్తి చేయబడుతున్న స్థిరపెట్టుబడిలోని ఆ భాగం సాలీనా పునరుత్పత్తి చేయబడుతుంది. అందువలన, కొత్త పెట్టుబడి పైనేగాక, అంతకు ముందే క్రియారూపంలో వున్న పెట్టుబడి మీద కూడా నూతనంగా ప్రవేశపెట్టిన మెరుగైన పద్ధతులు ఏకకాలంలో పని చేస్తాయి. రసాయనిక శాస్త్రంలో వేసిన ప్రతి ముందడుగూ, ఉపయోగపడే వస్తువులను పెంచడమే గాక, అంతకు ముందే తెలిసిన అంశాలను కూడా ఉపయోగకరంగా వర్తింపజేసుకోవడం ద్వారా పెట్టుబడి వృద్ధితో పాటుగా, దాని మూలధనపు పరిధినీ విస్తృతం చేస్తుంది. అదే సమయంలో వినియోగమూలంగానూ, ఉత్పత్తి ప్రక్రియల మూలం గానూ సంక్రమించిన నిరుపయోగ ఉత్పాదితాలను తిరిగి పునరుత్పత్తి ప్రక్రియ చట్రంలో ఏ విధంగా ప్రవేశపెట్టాలో కూడా ఈ శాస్త్ర విజ్ఞానం మనకు బోధించడం ద్వారా ఏ విధమైన పాత పెట్టుబడి వెచ్చించబడకుండానే పెట్టుబడికి నూతన జ్ఞానాన్ని ప్రసాదిస్తుంది. శ్రమశక్తి తీవ్రతను పెంచడం ద్వారానే సహజసిద్ధమైన సంపద దోపిడీని పెంపుదల చేసినట్లుగానే, వాస్తవంగా వున్న క్రియాత్మక పెట్టుబడి పరిమాణంతో సంబంధం లేకుండానే, శాస్త్ర సాంకేతిక విజ్ఞానం పెట్టుబడికి విస్తృతమయ్యే శక్తినిస్తుంది. అదే సమయంలో, పునఃపూరణ దశను చేరుకున్న తొలి పెట్టుబడిలోని ఆ భాగం మీద కూడా వాటి ప్రభావాన్ని చూపిస్తాయి. తన పాతరూపం వాడకం అయిపోతూ కొత్త రూపంలోకి ప్రవేశిస్తున్న సందర్భంలో శాస్త్ర విజ్ఞానంలో వేసిన ప్రతి ముందడుగునూ ఏ విధమైన వెల చెల్లించకుండానే ఇది తనలో ఇముడ్చుకుంటుంది. ఉత్పాదక శక్తిలో వచ్చిన ఈ పెరుగుదలతో పాటు క్రియాత్మక పెట్టుబడిలో పాక్షికమైన తరుగుదల కూడా బహుశా వుండవచ్చు. పోటీలో, తరుగుదలకు సంబంధించి నంత వరకు, తన తీవ్ర ప్రభావాన్ని చూపించిన మేరకు, నష్టపరిహారం కోసంచూసే పెట్టుబడిదారుడు దోపిడీని పెంచడం ద్వారా ఆ బరువునంతా కార్మికుడి మీద మోపుతాడు.

తనచే వినియోగించుకోబడిన ఉత్పత్తి సాధనాల విలువను, తన ఉత్పాదితానికి శ్రమ బదిలీ

చేస్తుంది. మరో వైపున శ్రామిక ఉత్పాదకత పెరిగే కొలదీ ఒకానొక శ్రమ పరిమాణంచే చలనంలో వుంచబడిన ఉత్పత్తి సాధనాల విలువా, పరిమాణమూ పెరుగుతాయి. అదే పరిమాణంలో వున్న శ్రమ, తన ఉత్పాదితాలకు అదే మొత్తంలో నూతన విలువను ఎప్పుడూ కలుపుతున్నప్పటికీ, ఆ ఉత్పాదితాలకు శ్రమచే బదిలీ చేయబడిన పాత పెట్టుబడి విలువ, శ్రామిక ఉత్పాదకత పెరిగే కొలదీ పెరుగుతుంది.

ఉదాహరణకు, ఒక ఇంగ్లీషు నేత కార్మికుడూ, ఒక చైనా నేత కార్మికుడూ, ఒకే తీవ్రతతో, సమానమైన గంటల్లో పని చేశారనుకుందాము : అప్పుడు ఆ ఇద్దరూ ఒక వారంలో సమానమైన విలువలనే సృష్టిస్తారు. అయితే, ఇక్కడ సమానత్వం వున్నప్పటికీ ఒక పెద్ద స్వయంచాలక యంత్రంతో పనిచేసే ఇంగ్లీషు కార్మికుడి యొక్క వారపు ఉత్పాదిత విలువకూ, కేవలం రాట్నంతోనే పనిచేసే చైనా కార్మికునియొక్క ఒక వారపు ఉత్పాదిత విలువకూ మధ్య ఎంతో వ్యత్యాసం వుంటుంది. చైనా కార్మికుడు ఒక పౌను పత్తిని వడికే కాలంలోనే, ఇంగ్లీషు కార్మికుడు అనేక వందల పౌనులను వడకగలడు. అనేక వందల రెట్లు ఎక్కువగా పాత విలువల మొత్తం, ఈ కార్మికుని యొక్క ఉత్పాదితపు విలువలో కలిసి పోయి దాని విలువను పెంచుతాయి; ఆ ఉత్పాదితంలోని పాత విలువలు నూతనంగా ఉపయోగించుకునే రూపంలో పునర్దర్శనమివ్వడం వల్ల తిరిగిపెట్టుబడిగా పని చేయగలవు. ఫ్రెడరిక్ ఏంగిల్స్ మనకు బోధిస్తున్నట్లుగా "1782లో ఇంగ్లాండులో అంతకు ముందు మూడు సంవత్సరాల ఉన్ని ఉత్పత్తి అంతా కార్మికుల కొరత మూలంగా అలాగే ముట్టుకోబడకుండా వుంది; కనుక నూతనంగా కనుగొన్న యంత్రాలు ఉన్ని దారం సహాయానికి వచ్చి దానిని వడక్కపోయినట్లయితే అది అంతా అలాగే పేరుకుపోయి మూలనబడి వుండవలసింది".[1] యంత్రరూపంలో ఇమిడి వున్న శ్రమ ఒక వ్యక్తిని నేరుగా జీవిత రంగంలోకి లాక్కు రాలేనప్పటికీ సజీవ శ్రమలో సాపేక్షికంగా అతి తక్కువ మంది కార్మికులను తనతో కలుపుకురావడానికి అవకాశాన్ని కలిగించడం ద్వారా, ఉన్నిని ఉత్పాదకంగా వినియోగించుకొని, దానిలో నూతన విలువను జొప్పించడమే గాక, పాత విలువను దారం వగైరా రూపంలో భద్రపరుస్తుంది. అదే సమయంలో ఉన్ని పునరుత్పత్తి పెరిగేటట్లుగా అది సాధనాలను సమకూర్చి ప్రోత్సాహాన్ని కలిగిస్తుంది. నూతన విలువను సృష్టించే సందర్భంలో పాత విలువను కూడా బదిలీ చేయడం సజీవ శ్రమ యొక్క సహజ లక్షణం. కాబట్టి, తన ఉత్పత్తి సాధనాల సార్థకతా, పరిధీ, విలువా పెరుగుదల పర్యవసానంగా తన ఉత్పాదక శక్తి పెరుగుదలతో అనుసంధించ బడిన సంచయనాన్నీ నిరంతరాయంగా పెరిగే పెట్టుబడి విలువనూ యెప్పటికప్పుడు నూతన రూపంలో శ్రమ పోషించడమే గాక శాశ్వత పరుస్తుంది.[2] అదనపు శ్రమను నిరంతరాయంగా. పెట్టుబడిదారుడు

1. ఫ్రెడరిక్ ఏంగిల్స్.......... పుట. 20.
2. శ్రమ ప్రక్రియనూ, విలువను సృష్టించే ప్రక్రియనూ లోపభూయిష్టంగా విశ్లేషించినందువల్ల సాంప్రదాయక అర్థశాస్త్రం పునరుత్పత్తి యొక్క ఈ ప్రధానమైన అంశాన్ని ఏ సందర్భంలోనూ సక్రమంగా అవగాహన చేసుకోలేకపోయింది; రికార్డో చెప్పిన అంశాన్ని గమనిస్తే ఇది తేటతెల్లమవుతుంది; ఉదాహరణకు, ఉత్పాదక శక్తిలో ఏ విధమైన మార్పు వచ్చినప్పటికీ 'కార్ఖానాల్లో పనిచేసే పది లక్షల మంది వ్యక్తులు అయినా అదే విలువను ఉత్పత్తి చేస్తారు' అని ఆయన అంటాడు. శ్రమ విస్తృతీ, తీవ్రతా స్థాయి స్థిరంగా ఉన్నపుడు ఇది వాస్తవమే. అయితే వారి శ్రమలో విభిన్నమైన ఉత్పాదక శక్తులు వున్న ఆ పది లక్షల

స్వాయత్తం చేసుకోవడం, పెట్టుబడియొక్క నిరంతర స్వీయాభివృద్ధిగా కనిపించినట్లుగానే, సామాజిక శ్రమ యొక్క ఉత్పాదక శక్తులు పెట్టుబడి యొక్క అంతర్గత లక్షణాలుగా కనిపించినట్లుగానే పెట్టుబడిలో ఇమడ్చబడిన శ్రమయొక్క సహజశక్తి పెట్టుబడి యొక్క సహజ లక్షణంగా కనిపిస్తుంది. సరుకుల

---

మంది వ్యక్తులు, విభిన్నమైన ఉత్పత్తి సాధనాల రాశులను ఉత్పాదితాలుగా మార్చడం ద్వారా వాటిలో విభిన్నమైన విలువ రాశులను నిక్షిప్తం చేయడానికి ఇది నిరోధకం కాదు; (రికార్డో చేసిన కొన్ని నిర్ధారణల్లో ఈ అంశం ఉపేక్షించబడుతుంది) పర్యవసానంగా ఉత్పత్తి చేయబడిన ఉత్పాదితాల విలువ గణనీయంగా వేరుగా వుంటుంది. ఆ ఉదాహరణ ద్వారానే ఉపయోగపు విలువకీ (సంపద లేదా భౌతిక సంపన్నత అని ఆయన ఇక్కడ పిలుస్తున్నాడు) మార్పిడి విలువకీ మధ్యనున్న వ్యత్యాసాన్ని జె.బి.సే.కి స్పష్టం చేయడానికి రికార్డో విఫల యత్నం చేశాడని ఈ సందర్భంలో గమనంలోకి తీసుకోవాలి. సే చెప్పిన సమాధానం, మెరుగైన ఉత్పత్తి పద్ధతులను అనుసరించడం ద్వారా ఈ పది లక్షలమంది జనాభా ఏవిధమైన ఎక్కువ విలువను ఉత్పత్తి చేయకుండా, రెండు లేక మూడు రెట్లు ఎక్కువ సంపదను ఉత్పత్తి చేయగలరని రికార్డో లేవనెత్తిన సమస్య - ఉత్పత్తి కూడా మార్పిడిలాంటిదేననీ, మానవుడు ఉత్పాదితాలను సంపాదించడానికి తన శ్రమ యొక్క ఉత్పాదక సేవలనూ, భూమినీ, పెట్టుబడినీ అందిస్తాడనీ ఎవరైనా మనస్సులో ఉంచుకొంటే, అలా ఉంచుకోవాలి గూడా. ఈ సమస్య అదృశ్యమవుతుంది. ఈనాటి ప్రపంచంలో వున్న సకల ఉత్పాదితాలు ఈ సేవల ద్వారానే మనం సంపాదించగలుగుతున్నాం. అందువలన.... మనం ధనికులుగా ఉండగలుగుతున్నాం..... మన ఉత్పాదక సేవలు ఎక్కువ విలువను కలిగి ఉన్నాయి; అందువలన ఉత్పత్తి అనే మార్పిడి ద్వారా ఉపయోగకరమైన వస్తువులను ఎక్కువ పరిమాణంలో అవి తేగలుగుతున్నాయి. (జె.బి.సే. లెటర్స్ టు మాల్తస్, పారిస్, 1820. పుటలు 168-169) ఈ సమస్య జె.బి.సే.కే వుంది గాని రికార్డోకు లేదు. సేకు స్పష్టం చెయ్యాల్సిందే మంటే, శ్రామిక ఉత్పాదక శక్తి పెరిగినందువల్ల, ఉపయోగపు విలువల పరిమాణం పెరిగినప్పటికీ, వాటి మార్పిడి విలువ ఎందుకు పెరగదు? సమాధానం ఉపయోగపు విలువను మార్పిడి విలువగా నీ ఇష్టం వచ్చినట్లుగా పరిగణించినందువల్లనే ఈ సమస్య తలెత్తింది. మారకపు విలువ అనేది ఏరకంగానైనా మార్పిడికి మాత్రమే సంబంధించినది. అందువలన, ఉత్పత్తిని శ్రమ మారకంగానూ, ఉత్పాదితం యొక్క ఉత్పత్తి సాధనంగానూ పరిగణించినట్లయితే, ఉత్పత్తి మూలంగా వచ్చే ఉపయోగపు విలువల నిష్పత్తి కన్నా ఎక్కువ మార్పిడి విలువ వస్తుందని తేటతెల్లమవుతుంది. ఇంకో విధంగా చెప్పాలంటే, ఒక పనిదినం గనుక ఎక్కువ ఉపయోగపు విలువలను, ఉదాహరణకు (నూలుచుట్టలు) ఒక నూలు చుట్టల యజమానికి ఇవ్వగలిగితే, ఆ యజమాని ఆ నూలు చుట్టల్లో ధనికుడు అవుతాడు. అయితే, పోటీ మూలంగా : (ఉత్పత్తిదారుల మధ్య) వారి ఉత్పాదితాలను వాటి తయారీ ధరలకే అమ్మవలసినందువల్ల. ఎక్కువ పరిమాణంలో వున్న ఆ నూలు చుట్టల "ధరలు" (వాటి మార్పిడి విలువలతో ఎట్టి సంబంధమూ లేదు) పడిపోతాయని సే గార్కి అకస్మాత్తుగా జ్ఞప్తికి వస్తుంది. అయితే సరుకులను, వాటి తయారీ ధరకే పెట్టుబడిదారుడు అమ్మినట్లయితే, మరి లాభం ఎప్పుడు వస్తుంది? పరవాలేదు! ఉత్పాదకత పెరగడం మూలంగా, గతంలో ఇచ్చే ఒక జతకు బదులుగా రెండు జతల నూలు చుట్టలను ప్రతి ఒక్కడూ తాను ఇచ్చి సమాన విలువకు ప్రతిఫలంగా పుచ్చుకొంటాడని సే గారు ప్రకటిస్తున్నారు. రికార్డోచే ప్రతిపాదించబడిన ఏ అంశాన్ని అయితే సే తప్పు అని నిరూపించాలని లక్ష్యంగా పెట్టుకున్నాడో, సరిగ్గా ఆ ప్రతిపాదనకు అనుకూలంగానే వస్తాడు. దీనిమీద తనబుద్ధి కుశలతనంతా మహా గొప్పగా ప్రదర్శించిన తర్వాత, విజయగర్వంతో మాల్తస్ గారిని ఈ విధంగా సంబోధిస్తున్నారు : 'అయ్యా! రాజకీయ అర్థశాస్త్రంలోని సమస్యలనూ ప్రత్యేకించి సంపద విలువ అయినప్పటికీ ఒక దేశం యొక్క ఉత్పాదితాల విలువ పడిపోయినప్పటికీ, ఆ దేశం ఏ విధంగా సంపన్నవంతమవుతుందో విశదీకరించడానికీ, ఈ విధంగా నిర్ధారించబడిన సిద్ధాంతం ద్వారా తప్ప మరే విధంగా సాధ్యమవుతుంది!' (అదే గ్రంథం పుట 170) ఈ

యొక్క సకల రూపాలు డబ్బు రూపాలుగా కనిపించినట్లుగానే శ్రమ యొక్క సకల శక్తులూ పెట్టుబడికి వున్న శక్తులుగా కనిపిస్తాయి.

పెట్టుబడి అభివృద్ధి చెందే కొలదీ నియోగించబడిన పెట్టుబడికీ, వినియోగించుకోబడిన పెట్టుబడికీ మధ్య వ్యత్యాసం పెరుగుతుంది. మరొక విధంగా చెప్పాలంటే ప్రత్యేకంగా ఉపయోగకరమైన ఫలితాలను సాధించడానికి సేవ చేసే లేక నిరంతరాయంగా ఆవృత్తమయ్యే ఉత్పత్తి ప్రక్రియలో దీర్ఘకాలంగానీ లేక స్వల్ప కాలంగానీ పనిచేసే భవనాలూ, యంత్రాలూ, మురికినీటి గొట్టాలూ, పనిచేసే పశువులూ లాంటి సకల రకాల సామాగ్రి అయిన శ్రమ పరికరాల భౌతిక పరిమాణమూ, విలువా పెరుగుతుంది. అదే సందర్భంలో శ్రమ పరికరాలు వాటంతట అవే క్రమేపీ శిథిలమవుతూ మాత్రమే, అందువలన తమ విలువను కొద్దికొద్దిగా కోల్పోతూ మాత్రమే ఆ విలువను ఉత్పాదితంలోకి కొద్ది కొద్దిగా మాత్రమే బదిలీ చేస్తాయి. ప్రకృతి శక్తులైన నీళ్ళూ, ఆవిరీ, గాలీ, విద్యుత్ శక్తి వగైరాలు చేసే వెలలేని సేవ ఏ నిష్పత్తిలో వుంటుందో, మనం ఇంతకు ముందు చూసినట్లుగా, ఉత్పాదితానికి ఏ విధమైన విలువా చేర్చకుండానే వస్తూత్పత్తిలో కారకాలుగా సేవచేసే ఈ శ్రమ పరికరాలు కూడా అదే నిష్పత్తిలో ఉచిత సేవ చేస్తాయి. అనగా వాటిని పూర్తిగా అదే నిష్పత్తిలో నియోగించుకున్నప్పటికీ పాక్షికంగా మాత్రమే వినియోగించుకోబడతాయి. గత శ్రమ యొక్క ఈ ఉచితసేవను సజీవ శ్రమ స్వాధీనం చేసుకొని దానిని జవసత్వాలతో పూరించినట్లయితే సంచయనపు పెరుగుదల దశలననుసరించి దానితో పాటుగా ఈ ఉచితసేవ కూడా పెరుగుతుంది.

గత శ్రమ ఎప్పుడూ కూడా పెట్టుబడి రూపంలో ముసుగులో ఉంటున్నందువల్ల, అనగా, క, చ, ట వగైరాల శ్రమకు చెల్లించాల్సిన రుణం 'య' అనే శ్రమ చెయ్యని వాడి ఆస్తుల రూపంలో ముసుగులో ఉంటున్నందువల్ల, బూర్జువాలూ, వారి అర్థశాస్త్రవేత్తలూ, మృతి చెందిన ఆ గతశ్రమ చేసిన సేవకు బ్రహ్మరథం పడుతూ, స్కాట్‌లాండ్ మేధావి అయిన మెక్కులక్ మాటల్లో చెప్పాలంటే, వడ్డీ, లాభం వగైరాల రూపంలో అది ప్రత్యేకమైన బహుమతిని పొందవలసి ఉన్నదని అంటారు.[1] కాబట్టి, సజీవమైన శ్రమ ప్రక్రియకు, ఉత్పత్తి సాధనాల రూపంలో గత శ్రమ అధికాధికంగా ఎప్పుడూ అందించే శక్తివంతమైన సహాయాన్ని, కార్మికుడి నుండి వేతనం లేని శ్రమగా పరాధీనమైన గత శ్రమ

---

విధమైన మాయమాటల మీద ఒక ఇంగ్లీషు అర్థశాస్త్రవేత్త చేసిన వ్యాఖ్యానాలు గూడా సే "ఉత్తరాల్లో" కనిపిస్తాయి. ఈ విధమైన మాయ మాటలను వల్లిస్తూ, తన సిద్ధాంతం చాలా గొప్పదని భావిస్తూ అది ఐరోపా నలుమూలలా బోధించబడుతుందనీ, అందువలన హెర్ట్‌ఫోర్డ్‌లో కూడా బోధించమనీ మాల్థస్‌ను యం.సే. హృదయపూర్వకంగా అర్థిస్తాడు. ఆయన ఇంకా ఇలా అంటున్నాడు: "ఈ ప్రతిపాదనలన్నీ మీకు విపరీత భావాలు గలవిగా కనిపించవచ్చు గాక, అవి వ్యక్తీకరించే అంశాలను పరిశీలిస్తే. అవి చాలా సాధారణమైనవిగానూ, హేతుబద్ధమైనవిగానూ కనిపిస్తాయని నేను చెప్పగలను". సందేహం ఏమీ లేదు! ఆయన అనుసరించిన ప్రక్రియ పర్యవసానంగా అందులో తన సొంత అభిప్రాయాలు తప్ప ఇతర విషయాలన్నీ కనిపిస్తాయనడంలో ఎట్టి సందేహం లేదు! (యాన్ ఎంక్వయిరీ ఇంటు దోజ్ ప్రిన్సిపుల్స్ రెస్పెక్టింగ్ ది నేచర్ ఆఫ్ డిమాండ్...... పుట 116, 110)

1. "వేతనాల వాంఛను విసర్జించా" లనే వాదాన్ని సీనియర్ ప్రారంభించడానికి చాలా కాలం ముందే "గత శ్రమ వేతనాం" వాదానికి మెక్కులక్ అధికారాన్ని పొందాడు.

రూపానికి అనగా దాని పెట్టుబడిదారీ రూపానికి ఆపాదించబడింది. ఒక బానిసగా అతని స్వభావానికి, శ్రామికునికీ మధ్య వ్యత్యాసాన్ని వేరుచేసి చూడలేని బానిస యజమాని వలె ఉత్పత్తి సాధనాలను, అవి ధరించిన శత్రుపూరిత సామాజిక ముసుగు నుండి, పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానపు వాస్తవ ప్రతినిధులూ వారి కుతర్క సిద్ధాంతకర్తలూ వేరు చేసి చూడలేకపోతున్నారు.

శ్రమ దోపిడీ ఒకానొక మోతాదులో ఉన్నపుడు, ఉత్పత్తి చేయబడిన అదనపు విలువ పరిమాణం, ఏకకాలంలో దోపిడీ చేయబడిన కార్మికుల సంఖ్య చేత నిర్ణయించబడుతుంది; ఇది తరతమ నిష్పత్తులలో పెట్టుబడి పరిమాణానికి అనుగుణంగా వుంటుంది. కాబట్టి, క్రమానుగతమైన సంచయనాల మూలంగా పెట్టుబడి ఇంకా వృద్ధి చెందే కొలదీ, వినియోగనిధిగానూ, సంచయన నిధిగానూ విభజించబడిన విలువ మొత్తం ఇంకా పెరుగుతుంది. అందువలన, పెట్టుబడిదారుడు ఇంకా ఆహ్లాదకరమైన జీవితాన్ని గడుపుతూ, అదే సమయంలో ఎక్కువగా "వాంఛా విసర్జన" చేసినట్లుగా ప్రదర్శించవచ్చు. ఇక, చిట్టచివరిగా, ఉత్పత్తి యొక్క బిసతీగలన్నీ (స్ప్రింగ్స్) మరింత వ్యాకోచక శక్తితో పనిచేసే కొలదీ అడ్వాన్సు చేయబడిన పెట్టుబడిరాశితో పాటు ఉత్పత్తి స్థాయి కూడా మరింత విస్తృతమవుతుంది.

### విభాగం - 5

## పేరుకు శ్రామికనిధి అనబడేది

పెట్టుబడి ఒక స్థిరమైన పరిమాణం కాదనీ, అదనపు పెట్టుబడిగానూ, ఆదాయంగానూ తాజా అదనపు విలువ విభజించడం మూలంగా నిరంతరం మారుతూ, వ్యాకోచత్వం గలిగి, సామాజిక సంపదలో అదొక భాగంగా వుంటుందనీ ఈ సమస్యను పరిశీలించే తరుణంలో ఇంతకు ముందే నిరూపించబడింది. ఇవ్వబడిన క్రియాత్మక పెట్టుబడి పరిమాణం స్థిరమని భావించినప్పటికీ శ్రమశక్తికీ, శాస్త్ర విజ్ఞానమూ, భూమీ (మనిషితో సంబంధం లేకుండా ప్రకృతి సమకూర్చిన శ్రమ పరిస్థితులని ఆర్థిక పరిభాషలో మనం అర్థం చేసుకోవాలి) క్రియాత్మక పెట్టుబడి పరిమాణంలో ఇమడ్చబడి, పెట్టుబడి యొక్క వ్యాకోచత్వ శక్తులుగా రూపొందినపుడు, కొన్ని పరిస్థితులకు లోబడి, దాని స్వీయ పరిమాణంతో సంబంధం లేకుండా కార్యాచరణకు అది అవకాశాన్ని కలిగిస్తుందని కూడా మనం చూశాం. అదే పెట్టుబడి పరిమాణంలో భిన్న సామర్థం స్థాయిలను ఉత్పన్నం చేయగలిగిన చలామణి ప్రక్రియ సకల ప్రభావాలనూ మనం ఈ పరిశీలనలో పరిగణలోకి తీసుకోవడం లేదు. పెట్టుబడిదారీ ఉత్పత్తిచే విధించబడిన పరిమితులను మనం ముందుగా ఊహించినందువల్ల అనగా కేవలం ఒక అసంకల్పిత వృద్ధి మూలంగా పెరిగిన రూపంలో సామాజిక ఉత్పత్తి ప్రక్రియను మనం ముందుగా ఊహించినందువల్ల, ప్రస్తుతానికి అందుబాటులో వున్న శ్రమశక్తి పరిమాణాన్ని ఉత్పత్తి సాధనాలతో సూటిగానూ, క్రమబద్ధంగానూ సాధ్యమయ్యే మరి ఏ విధమైన హేతుబద్ధ సముదాయాన్ని కూడా మనం పరిగణనలోకి తీసుకోలేదు. సామాజిక పెట్టుబడిని ఒక స్థిరమైన సామర్థ్య స్థాయి కలిగిన ఒక స్థిర పరిమాణంగా భావించడానికి సాంప్రదాయిక అర్థశాస్త్రం ఎప్పుడూ ఇష్టపడేది. అయితే, మౌలికంగా కువిమర్శకుడైన జెర్మీబెంతామ్ అనే నిస్సారమైన పండితప్రకర్షను ప్రదర్శించే వాగుడుగాయా, అల్పజ్ఞుడూ 19వ శతాబ్దపు సామాన్య బూర్జువా మేథస్సు గలిగిన జ్యోతిష్కుడూ ఈ దురభిప్రాయాన్ని మొదటిసారిగా

ఒక పిడివాదంగా నిరూపించాడు.[1] కవి పండితుల్లో మార్టిన్ టుప్పెర్ ఎట్లాగో, తత్వవేత్తలలో జెర్మీ బెంతామూ అంతే ఇద్దరూ ఇంగ్లాండులో మాత్రమే సృష్టించబడగలరు.[2] ఉత్పత్తి ప్రక్రియ యొక్క అతి సామాన్య ఘటనలను కూడా ఉదాహరణకు, ఊహించని దాని వ్యాకోచ, సంకోచాలూ లేక సంచయనమైనప్పటికీ బెంతామ్‌గారి పిడివాదాన్ననుసరించి స్పష్టంగా అర్థం చేసుకోలేము.[3] ప్రత్యేకించి పెట్టుబడిలో ఒక భాగాన్ని, అనగా అస్థిర పెట్టుబడినీ లేక ఒక స్థిర పరిమాణంగా శ్రమశక్తిని మార్చగలిగిన ఆ భాగాన్ని సిగ్గులేకుండా సమర్పించడానికి ఈ పిడివాదాన్ని బెంతామ్‌తో పాటుగా మాల్తస్, జేమ్స్‌మిల్, మెక్కులక్ మొదలైనవారు ఉపయోగించారు. అస్థిర పెట్టుబడి భౌతికాంశాన్ని అనగా కార్మికుల జీవనాధార సాధనాల పరిమాణాన్ని లేక శ్రామికనిధిని, సహజ నియమాల చేత నిర్ణయించబడిందిగా మార్పు

1. ఉదాహరణకు జెర్మీబెంతామ్. "థియరీస్ ఆఫ్ పెయిన్స్ అండ్ డిస్‌ప్లెషర్స్" ఫ్రెంచి అనువాదం యిటెన్న డుమాంట్, మూడవ ముద్రణ, పారిస్, 1826, రెండవ సంపుటి, నాలుగవ భాగం, అధ్యాయం 2.

2. కేవలం ఇంగ్లీషు వారు సృష్టించిన ఒక వింత వ్యక్తి బెంతామ్. ఏ దేశంలోనూ, ఏ కాలంలోనూ కూడా ఈ విధమైన సాదాసీదా మాటలను ఇంత ఆత్మ సంతృప్తి ధోరణిలో చెప్పినవారు లేరు. మన తత్వవేత్త అయిన క్రిష్టియన్ ఉల్ఫ్ కూడా ఇందుకు మినహాయింపు కాదు. ప్రయోజన సూత్రం బెంతామ్ కనుగొన్న దేమీ కాదు. హెల్‌విటస్ తదితర ఫ్రెంచి దేశీయులు 18వ శతాబ్దంలో అత్యంత చమత్కారంగా చెప్పిన దానినే బెంతామ్ తన నిస్సారమైన పద్ధతిలో కేవలం తిరిగి చెప్పాడు. శునకానికి ఏమి కావాలో తెలుసుకోవడానికి, దాని స్వభావాన్ని పరిశీలించాలి. ప్రయోజన సూత్రాన్నుండే ఈ స్వభావాన్ని నిర్ధారించ లేము. దీనిని మనిషికీ అన్వయిస్తే, ప్రయోజన సూత్రం ద్వారా మానవ కార్యకలాపాలనూ, నడవడికలనూ, సంబంధాలనూ విమర్శించే వ్యక్తి ముందుగా మానవ స్వభావాన్ని సాధారణంగా పరిశీలించి, ఆ తర్వాత ప్రతి చారిత్రక యుగంలోనూ మార్పు చెందినదిగా మానవ స్వభావాన్ని పరిశీలించాలి. చాలా అమాయకంగా ఆధునిక దుకాణాదారుని, ప్రత్యేకించి ఇంగ్లీషు దుకాణాదారుని ఉదాహరణగా తీసుకొని, అతనిని ఒక సాధారణ వ్యక్తిగా పేర్కొంటాడు. వింతైన ఈ సాధారణ వ్యక్తికీ, అతని ప్రపంచానికీ ఏది ఉపయోగ కరంగా వుంటుందో, దానినే సంపూర్ణంగా ఉపయోగకరమని భావిస్తాడు. ఈ కొలబద్దనే భూత, భవిష్యత్, వర్తమాన కాలాలకు అన్వయిస్తాడు. ఉదాహరణకు, "చట్టం పేరుతో శిక్షాస్మృతి దేనినైతే ఖండిస్తుందో, మతం పేరుతో అదే పొరపాట్లను క్రైస్తవ మతం కూడా నిషేధిస్తున్నందువల్ల క్రైస్తవమతం కూడా ఉపయోకరంగా వుంటుంది. మార్టిన్ ట్యూపర్ ద్వారా ఆహ్లాదాన్ని పొందే పెద్దమనుషులకు ఆందోళన కలిగిస్తున్నందువల్ల. కళా విమర్శన "ప్రమాదకరంగా" వుంటుంది. ఈ విధమైన చెత్తనంతా భుజాన వేసుకొని "ఏ ఒక్క రోజు కూడా వ్యర్థం కాకూడదు" అనే లక్ష్యంతో ఈ పెద్దమనిషి కుప్పలు కుప్పలుగా పుస్తకాలు రాసి పారేశాడు. నా మిత్రుడైన హెన్రిక్ హైనే ధైర్యమే గనుక నాకున్నట్లయితే, జెర్మీబెంతామ్ గార్ని బూర్జువా మూర్ఖత్వంలో మహామేధావి అని పిలవాల్సి వుంది.

3. "కొంత పరిమాణంలో పెట్టుబడినీ, మరి కొంత సంఖ్యలో కార్మికులనూ ఒకే విధమైన శక్తి గలిగిన ఉత్పత్తిదాయక సాధనాలుగానో లేక ఒకే విధమైన తీవ్రతతో పని చేస్తాయనో పరిగణించడానికి రాజకీయ అర్థశాస్త్రవేత్తలు ఆరాటపడుతున్నారు.... సరుకులు మాత్రమే ఉత్పత్తికి ప్రతినిధులని భావించే వారంతా..... ఆహార వస్తువులనూ, ముడి సరుకులనూ, సాధనాలనూ అంతకు ముందే ఎక్కువగా వృద్ధి చెయ్యాల్సి ఉన్నందువల్లా, ఆ విధమైన షరతు తప్పనిసరిగా అవసరమైనందువల్లా ఉత్పత్తి ఏ సందర్భంలో కూడా విస్తృతం కాదని రుజువు చేస్తారు. ఆ విధంగా చెప్పడమంటే, అంతకు ముందు ఏ విధమైన వృద్ధీ లేకుండా ఉత్పత్తి పెరగదనీ, లేక వేరే మాటల్లో చెప్పాలంటే పెరుగుదల అసాధ్యమని చెప్పడమే". (యస్.బైలీ, మనీ అండ్ ఇట్స్ విసిస్సీట్యూడ్స్, పుటలు 58, 70). చలామణి ప్రక్రియ దృక్కోణాన్నుండీ బైలీ ఈ పిడివాదాన్ని విమర్శిస్తాడు.

చెందనటువంటిదనీ, సామాజిక సంపదలో భాగంగా వుంటుందనీ, కట్టుకథలు అల్లారు. స్థిర పెట్టుబడిగా క్రియను నిర్వర్తించనున్న సామాజిక సంపదలోని ఆ భాగాన్ని పని చేయించడానికి, లేక భౌతిక రూపంలో చెప్పాలంటే ఉత్పత్తి సాధనాలను పని చేయించడానికి, నిర్దిష్ట పరిమాణంలో సజీవ శ్రమ అవసరమవుతుంది. ఈ పరిమాణం సాంకేతికంగా నిర్ణయించబడుతుంది. అయితే, ఈ శ్రమ శక్తి పరిమాణాన్ని పనిచేయించడానికి అవసరమైన కార్మికుల సంఖ్యనుగానీ (వైయక్తిక శ్రమశక్తి యొక్క దోపిడీ స్థాయి ననుసరించి ఇది మారుతూ వుంటుంది) లేక శ్రమశక్తి యొక్క ధరను గానీ తెలియజేయకుండా అత్యంత అస్థిరమైన దాని కనీస పరిమితి మాత్రమే తెలియజేయబడుతుంది. ఈ పిడివాదంలో వున్న వాస్తవాలు ఇవి : ఒక వైపున సామాజిక సంపద ఉత్పత్తి సాధనాలుగానూ, పనిచెయ్యని వాడి ఆహ్లాదానికి ఉపయోగపడే సాధనాలుగానూ విభజించబడటంలో కలుగజేసుకునే హక్కు కార్మికుడికి లేదు.[1] మరోవైపున, కొన్ని ప్రత్యేకమైన అనుకూల సందర్భాలలో మాత్రమే సంపన్న వర్గాల ఆదాయాన్నుండి "శ్రామికనిధిని" పెంపొందించుకోగలిగిన శక్తిని కార్మికుడు కలిగి వుంటాడు.

శ్రామిక నిధి యొక్క పెట్టుబడిదారీ పరిమితులను,సహజమైన సామాజిక పరిమితులుగా చిత్రించబూనడంలో ఏ విధమైన దౌర్భాగ్యపు పండిత ప్రకర్ష వుంటుందో ప్రొఫెసర్ ఫాసెట్‌లో చూడవచ్చు.[2] "ఒకదేశం యొక్క చలామణి పెట్టుబడే దాని వేతన నిధిగా వుంటుంది. కాబట్టి ప్రతి కార్మికుడూ పొందే సగటు డబ్బు వేతనాన్ని లెక్కించాలంటే, ఈ పెట్టుబడి మొత్తాన్నీ శ్రామిక జనాభాతో భాగించాలి."[3] దీని అర్థం యేమిటంటే, నిజంగా చెల్లించిన వైయక్తిక వేతనాలను మొదట కలిపి కూడి, ఆ విధంగా పొందే మొత్తానికి, దేవుడూ, ప్రకృతీ నిర్ణయానుసారం అనుగ్రహించబడినదని, ఆ తర్వాత దానికి ముద్ర వేయాలి; చివరిగా, ప్రతి కార్మికుడికి సగటున ఎంత మొత్తం వచ్చిందో మరొకసారి తెలుసుకోడానికి, ఆ విధంగా వచ్చిన మొత్తాన్నీ కార్మికుల సంఖ్య చేత భాగించాలి. ఎంత

1. జాన్ స్టువర్ట్ మిల్ తన "ప్రిన్సిపుల్స్ ఆఫ్ పొలిటికల్ ఎకానమీ" అనే గ్రంథంలో ఇలా చెప్తాడు: "నిజంగా కండరాల్ని కరిగిస్తూ, అధమ స్థితిలో వున్న కార్మికులకు ఇతరుల కంటే ఎక్కువగా చెల్లించే బదులుగా, అందరికంటే ఎప్పుడూ తక్కువగానే చెల్లిస్తున్నారు. వృత్తిరీత్యా ఎంత ఎక్కువ కష్టపడాల్సి వస్తే. తమ సేవలకు అంత తక్కువగా ప్రతిఫలాన్ని పొందడం ఖాయం. న్యాయసమ్మతంగా వుండే ఏ సామాజిక వ్యవస్థలోనైనా చేసే సేవా, వచ్చే ప్రతిఫలమూ ఒకదానికొకటి అనులోమానుపాతంలో వుంటాయి; అయితే దానికి బదులుగా అవి సాధారణంగా విలోమ నిష్పత్తిలో వున్నాయి". అపార్థాలను తొలగించడానికి ఇక్కడ ఒక విషయం చెప్పాలి. జాన్ స్టువర్ట్ మిల్ లాంటి వ్యక్తులను, వారి సాంప్రదాయక ఆర్థిక పిడివాదానికి, వారి ఆధునిక ధోరణులకూ మధ్య నున్న వైరుధ్యానికీ నిందించవలసి వచ్చినప్పటికీ, వారిని నాటు అర్థశాస్త్ర వకాల్తాదారుల ముఠా సరసన కూర్చోబెట్టడం చాలా పొరపాటుగా వుంటుంది.
2. హెచ్.ఫాసెట్. కేంబ్రిడ్జి విశ్వవిద్యాలయంలో రాజకీయ అర్థశాస్త్ర ప్రొఫెసర్. "ది ఎకనామిక్ పొజిషన్స్ ఆఫ్ ది బ్రిటిషు లేబరర్" లండన్. 1865. పుట 120
3. "స్థిర పెట్టుబడీ, అస్థిర పెట్టుబడీ" అనే అభివర్గాలను మొదట ఉపయోగించింది నేనేనని పాఠకులకు ఇక్కడ గుర్తు చేయాల్సి వుంది. ఈ అభివర్గాలతో ఇమిడివున్న ప్రధాన వ్యత్యాసాలను, నిశ్చల, చలామణి పెట్టుబడుల యొక్క చలామణి ప్రక్రియ ద్వారా ఉత్పన్నమైన నామమాత్రపు వ్యత్యాసాలతో, ఆడమ్ స్మిత్ కాలం నుండి వచ్చిన రాజకీయ అర్థశాస్త్రం గందరగోళంగా కలగాపులగం చేసింది. ఈ అంశం మీద ఇంకా వివరణ కోసం రెండవ సంపుటిలోని రెండవ భాగం చూడండి.

కృత్రిమంగా వుంది ఈ మోసం! అదే పద్ధతిలో చెప్పడానికి ఫాసెట్ గార్కి ఇవేవీ అడ్డురాలేదు! “ఇంగ్లాండులో సాలీనా పొదుపు చేయబడిన మొత్తం సంపద రెండు భాగాలు చెయ్యబడింది... మన పరిశ్రమను పోషించడానికి ఒక భాగం పెట్టుబడిగా నియోగించబడింది. మరొక భాగం విదేశాలకు ఎగుమతి చేయబడింది. ప్రతి సంవత్సరం మన దేశంలో పొదుపు చేయబడిన సంపదలో ఒక భాగం మాత్రమే బహుశా పెద్ద మొత్తం కాకుండా, మన పరిశ్రమలో మూలధనంగా నియోగించబడింది.[1]

ఇంగ్లాండ్‌లోని కార్మికుల నుండి ఏ విధమైన ప్రతిఫలం లేకుండా గుంజబడుతున్న అదనపు ఉత్పాదితానికి ప్రతి సంవత్సరం చేకూరుతున్న దానిలో ఎక్కువభాగం అపహరింపబడి, ఆ విధంగా ఇంగ్లాండులోగాక, విదేశాల్లో పెట్టుబడిగా ఉపయోగించబడుతుంది. అయితే ఆ విధంగా ఎగుమతి చేయబడిన అదనపు పెట్టుబడితో పాటుగా, దేవుడూ, బెంతామ్ కనుగొన్న “శ్రామికనిధి”లో ఒక భాగం కూడా ఎగుమతి చేయబడుతుంది.[2]

1. ఫాసెట్, ఉదాహృత గ్రంథం. పుటలు 122, 123
2. పెట్టుబడే గాక, వలస వెళ్ళేవారి రూపంలో కార్మికులు కూడా ప్రతి సంవత్సరమూ ఇంగ్లాండ్ నుండి ఎగుమతి చేయబడుతున్నారని చెప్పాల్సి వుంటుంది. వలస వెళ్ళే వారిలో ఎక్కువ భాగం కార్మికులు కానప్పటికీ, వారికి ఏదో - ఒక రూపంలో సంక్రమించిన కొద్దిపాటి ఆస్తిని కూడా తమతో తీసుకువెళ్ళే ప్రశ్నే లేదు. అందులో ఎక్కువ మంది రైతు బిడ్డలు ప్రతి సంవత్సరం పెరిగే జనాభా నిష్పత్తితో పోల్చినపుడు వలస వెళ్ళే దానికంటే ఎక్కువగా ప్రతి సంవత్సరం సంచయనం చేయబడే దానికంటే ఎక్కువగా, ప్రతి సంవత్సరం వడ్డీని ఆర్జించడానికి విదేశాలకు రవాణా చేయబడే అదనపు పెట్టుబడి నిష్పత్తి చాలా ఎక్కువగా వుంటుంది.

## అధ్యాయం - 25

# పెట్టుబడిదారీ సంచయనపు సాధారణ నియమం

### విభాగం 1

### పెట్టుబడి అంతర్నిర్మాణం యధాతథంగా ఉన్నపుడు, సంచయనానికి జోడించబడిన శ్రమశక్తి గిరాకీ పెరుగుదల

**కా**ర్మికవర్గ స్థితిగతుల మీద పెట్టుబడి పెరుగుదల ప్రభావాన్ని ఈ అధ్యాయంలో పరిశీలిస్తాం. పెట్టుబడి అంతర్ నిర్మాణమూ, సంచయన ప్రక్రియ కాలంలో అందులో వచ్చే మార్పులూ ఈ పరిశీలనలో అతి ముఖ్యాంశాలుగా వుంటాయి.

పెట్టుబడి అంతర్ నిర్మాణాన్ని(కాంపోజిషన్ ఆఫ్ క్యాపిటల్) రెండు దృక్పథాల నుండి అర్థం చేసుకోవాలి. విలువను బట్టి ఆలోచిస్తే, స్థిర పెట్టుబడి లేక ఉత్పత్తి సాధనాల విలువా, అస్థిర పెట్టుబడీ లేక వేతనాల మొత్తం సముదాయమైన శ్రమశక్తి విలువలుగా పెట్టుబడి విభజించబడిన నిష్పత్తి ననుసరించి దాని నిర్మాణం నిర్ణయించబడుతుంది. దాని భౌతిక రూపాన్ని బట్టి ఆలోచిస్తే ఉత్పత్తి ప్రక్రియలో పాల్గొనే సకల పెట్టుబడీ ఉత్పత్తి సాధనాలుగానూ సజీవ శ్రమశక్తిగానూ విభజించ బడుతుంది. నియోగించబడిన ఉత్పత్తి సాధనాల మొత్తానికీ, మరోవైపున వాటిని నియోగించుకునేందుకు అవసరమైన శ్రమ మొత్తానికీ మధ్యనున్న సంబంధాన్ని బట్టి రెండవ దృక్కోణాన్నుండి చెప్పిన అంతర్ని ర్మాణం నిర్ణయించబడుతుంది. మొదటి దాని విలువ అంతర్నిర్మాణమనీ రెండవ దానిని పెట్టుబడి యొక్క సాంకేతిక అంతర్నిర్మాణమనీ నేను పిలుస్తాను. ఈ రెండింటి మధ్య స్పష్టమైన సంబంధం వున్నది. దీనిని వ్యక్తం చేయడానికి పెట్టుబడి యొక్క విలువ అంతర్నిర్మాణాన్ని దాని యొక్క సాంకేతిక అంతర్నిర్మాణం చేత అది నిర్ణయించబడిన మేరకు ఇందులోని మార్పులకు అది దర్పణం పట్టిన మేరకు, పెట్టుబడి యొక్క సజీవ అంతర్నిర్మాణమని పిలుస్తాను. ఏ విధమైన పరిమితులు లేకుండా, ఏ సందర్భంలోనైనా నేను పెట్టుబడి అంతర్నిర్మాణాన్ని పేర్కొన్నట్లయితే దానిని పెట్టుబడి యొక్క సజీవ అంతర్నిర్మాణంగానే ఎల్లప్పుడూ అర్థం చేసుకోవలసి వుంటుంది.

ఒక ప్రత్యేకమైన ఉత్పత్తి శాఖలో పెట్టుబడిగా వెచ్చించిన అనేకమైన వైయక్తిక పెట్టుబడులు ఒకదాని కొకటి ఇంచుమించుగా విభిన్నమైన నిర్మాణాలు కలిగి వుంటాయి. వాటి వైయక్తికి నిర్మాణాల సగటు ఈ ఉత్పత్తి శాఖలోని మొత్తం పెట్టుబడి యొక్క అంతర్మిర్మాణాన్ని తెలియజేస్తుంది. చివరగా ఉత్పత్తి యొక్క అన్ని శాఖలలోని సగటుల యొక్క సగటు, ఒక దేశపు సామాజిక పెట్టుబడి యొక్క అంతర్మిర్మాణాన్ని తెలియజేస్తుంది. దీనిని గురించి మాత్రమే ఈ పరిశోధనలో మన తుది ప్రస్తావనగా వుంటుంది.

అస్థిర భాగం లేక శ్రమశక్తికై వెచ్చించబడిన భాగం యొక్క పెరుగుదల పెట్టుబడి పెరుగుదలలో భాగంగా వుంటుంది. అదనపు పెట్టుబడిగా మార్చబడిన అదనపు విలువలోని ఒక భాగాన్ని ఎల్లప్పుడూ అస్థిర పెట్టుబడిగానో లేక అదనపు శ్రామిక నిధిగానో తిరిగి మార్పు చేయవలసి వుంటుంది. మిగతా పరిస్థితులన్నీ యధాతథంగా వున్నాయని భావిస్తే, పెట్టుబడి అంతర్నిర్మాణం కూడా స్థిరంగా వుందని భావిస్తే (అనగా ఒక నిశ్చితమొత్తమైన ఉత్పత్తి సాధనాలను చలనంలోనికి తీసుకురావడానికి అదే మొత్తంలో శ్రమశక్తి ఎల్లప్పుడూ అవసరమవుతుంది.) అప్పుడు పెట్టుబడి నిష్పత్తిలోనే అది ఎంత త్వరితగతిని పెరుగుతుందో అదే నిష్పత్తిలో శ్రమకు కార్మికుల పోషణ నిధికి కూడా అంత స్పష్టంగానూ అంత ఉధృతంగానూ గిరాకీ పెరుగుతుంది. పెట్టుబడిచే ప్రతి సంవత్సరం ఉత్పత్తి చేయబడుతున్న అదనపు విలువలోని ఒక భాగం ప్రతి సంవత్సరం తొలి పెట్టుబడికి (ఒరిజినల్ క్యాపిటల్) చేర్చబడుతున్నందువల్లనూ; అంతకు ముందే వున్న క్రియాత్మక పెట్టుబడి (ఫంక్షనింగ్ క్యాపిటల్) పెరుగుదలతో బాటుగా ప్రతి సంవత్సరం ఈ అదనపు విలువ కూడా పెరుగుతున్నందువల్లనూ; చివరకు కొత్త మార్కెట్లు లభించడం లేక నూతనంగా సామాజిక అవసరాలు తలెత్తడం మూలంగా పెట్టుబడిని వెచ్చించడానికి సరికొత్త రంగాలు లభించడంలాంటి సంపద పెంపొందించే ప్రత్యేక ప్రేరణలు జనించడం వల్లనూ, పెట్టుబడిగానూ లేక ఆదాయంగానూ అదనపు విలువనూ లేక అదనపు ఉత్పాదితాన్ని విభజించడంలో మాత్రమే మార్పు తీసుకురావడం ద్వారా సంచయనపు స్థాయిని అకస్మాత్తుగా విస్తృతం చేయవచ్చు; ఈ కారణాల రీత్యా సంచయనం చేయబడుతున్న పెట్టుబడి అవసరాలు శ్రమశక్తి పెరుగుదలను గానీ లేక కార్మికుల సంఖ్యను గానీ మించిపోవచ్చు; సరఫరాకు మించి కార్మికుల గిరాకీ పెరుగుదల వేతనాలూ పెరగవచ్చు. నిజానికి పైన ఊహించిన పరిస్థితులన్నీ కొనసాగినట్లయితే, తుట్టతుదకు ఇదే విధంగా జరిగి తీరాల్సి వుంటుంది. ఎందుచేతనంటే, ప్రతి సంవత్సరమూ ముందు సంవత్సరం కంటే అధిక సంఖ్యలో కార్మికులు నియామకంగావడం వల్ల, సంచయనపు అవసరాలు వాడుకగా వచ్చే కార్మికుల సరఫరాను మించి పోనారంభించే దశ ఒకటి కాస్త ముందు వెనకగా ఎప్పుడో ఒకప్పుడు వచ్చి తీరుతుంది. కనుక వేతనాలు పెరుగుతాయి. ఈ విధమైన పరిణామం పట్ల పదిహేనవ శతాబ్దం మొత్తంలోనూ పద్దెనిమిదవ శతాబ్దపు పూర్వార్థంలోనూ ఇంగ్లండులో మొత్తుకోళ్ళు (లామెంటేషన్) వినబడతాయి. వేతన కార్మిక వర్గం తన్ను తాను పోషించుకుని పెంపొందించుకొనే పరిస్థితులు మరింత అనుకూలంగా వున్నాయన్నంత మాత్రాన పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానపు మౌలిక స్వభావంలో కలిగే మార్పంటూ ఏమీ వుండదు సామాన్య పునరుత్పత్తి పెట్టుబడిదారీ సంబంధాన్నే స్వయంగా నిరంతరం పునరుత్పత్తి చేస్తున్నందువల్లనూ ఒక వైపున పెట్టుబడిదారులకూ, మరోవైపున వేతన కార్మికులకూ మధ్య గల సంబంధాన్నే పునరుత్పత్తి చేస్తున్నందువల్లనూ పురోగమన స్థాయిలో జరిగే పునరుత్పత్తి అనగా సంచయనం, పురోగమన స్థాయిలో పెట్టుబడిదారీ సంబంధాలనే పునరుత్పత్తి ఎక్కువమంది పెట్టుబడిదారులు లేక పెద్ద పెట్టుబడిదారులు ఒక ధృవాన హెచ్చు సంఖ్యలో వేతన శ్రామికులు మరొక ధృవాన నిలిచేటట్లుగా పునరుత్పత్తి జరుగుతూ వుంటుంది. పెట్టుబడి స్వీయాభివృద్ధికీ దానితో నిరంతరాయంగా తిరిగి కలిసిపోవడానికి శ్రమశక్తి సమూహం పునరుత్పత్తి జరుగుతూ వుండాలి; అది పెట్టుబడి నుండి స్వేచ్ఛను పొందలేదు; తనను

తాను పలు విధాలైన వైయక్తిత్తక పెట్టుబడిదార్లకు అమ్ముకోవడం మూలంగా పెట్టుబడికి దాని బానిసత్వం గోప్యం గావించబడి, పెట్టుబడి యొక్క పునరుత్పత్తిలో శ్రమశక్తి ఒక ముఖ్యమైన భాగంగా రూపొందుతుంది. కనుక పెట్టుబడి సంచయనం అంటే కార్మికవర్గం పెరుగుదలే.[1]

గతంలో ప్రస్తావించినట్లుగా సాంప్రదాయక అర్థశాస్త్రం ఎంత స్పష్టంగా ఈ అంశాన్ని అవగాహన చేసుకున్నదంటే, ఆడమ్ స్మిత్, డేవిడ్ రికార్డో లాంటి వారు సంచయనాన్ని వినియోగంతోనూ ఉత్పాదక కార్మికులను అదనపు ఉత్పాదితంలోని పెట్టుబడీకరించ బడిన భాగం మొత్తంతోనూ లేక దానిని అదనపు వేతన కార్మికులుగా మార్పు చేయడంతోనూ పొరపాటుగా గుర్తించారు. 1696 ప్రాంతాల్లోనే జాబ్ బెల్లర్స్ ఇలా అన్నాడు. "ఎవరి అధీనంలోనైనా లక్ష ఎకరాల భూమీ, లక్ష పౌండ్ల డబ్బూ, అంతే మొత్తంలో పశుసంపద ఉన్నప్పటికీ కార్మికులు లేని పక్షంలో, ఆ ధనాఢ్యుడు ఏమవుతాడు. కార్మికుడు గాక? కార్మికులే వ్యక్తులను సంపన్నులను చేస్తారు. గనుక కార్మికులు ఎంత అధిక సంఖ్యలో ఉంటే ధనవంతులు కూడా అంత ఎక్కువగా వుంటారు...... పేదల శ్రమే ధనవంతుల పెన్నిధి అవుతుంది."[2] ఇదే విధంగా పద్దెనిమిదవ శతాబ్దపు ఆరంభంలో బెర్నార్డ డీ మాండే విలీ కూడా అన్నాడు. "ఆస్తులు బాగా పోగేసుకున్న చోట పేదలు లేకుండా జీవించడం కంటే డబ్బు లేకుండా బ్రతకడమే సులభంగా వుంటుంది; ఎందుకంటే, ఎవరు పనిచేస్తారూ? పేదలు ఆకలికి మాడకుండా వారిని ఆదుకోవడము ఎంత అవసరమో వారేమీ వెనకేసుకోకుండా కనిపెట్టి చూడటం కూడా అంతే అవసరం. అత్యంత నిమ్నవర్గానికి చెందిన వ్యక్తి ఎవరైనా అక్కడక్కడ అసాధారణంగా శ్రమ చేసి కడుపు కట్టుకుని డబ్బు కూడబెట్టడం ద్వారా తాను పుట్టి పెరిగిన పరిస్థితులను మించి ఎదిగితే, ఎవ్వరూ కూడా ఆ వ్యక్తిని అడ్డుకోరాదు; పైగా సమాజంలోని ప్రతి వ్యక్తికీ ప్రతి ప్రైవేటు కుటుంబానికీ పొదుపు చేయడమనేది అత్యవసరమూ అత్యంత వివేకవంతమైన మార్గమూ అనడంలో ఎట్టి సందేహమూ

1. కారల్ మార్క్స్ 'వేతన శ్రమ, పెట్టుబడి' చూడు. ముందు : "శ్రమజీవులను దోపిడీ చేసే స్థాయి యథాతథంగా ఉన్నపుడు, ఒక దేశంలో కార్మికులు ఎంత అధికంగా వుంటే, ఆ దేశం అంత సంపన్న వంతంగా వుంటుంది". (కొలిన్స్; ల ఎకానమీ పాలిటికా సోర్స్‌డెస్ రెవల్యూషన్స్ ఎట్‌డెస్ యుటోపిస్ ప్రింటెండ్యూస్ సోషలిస్ట్ పారిస్ ; 1857; సంపుటి-3. పుట.331) ఆర్థికపరంగా పరిశీలించినపుడు, పెట్టుబడిని సృష్టించి వృద్ధిగావించే వేతన శ్రామికుడే మన "కార్మికుడ"ని బోధపడుతుంది; పెట్టుబడిదారుని స్వీయ అవసరాలు పెరగటం మూలంగా, అదనం గావించబడిన వేతన కార్మికుడు "పెట్టుబడి దొరగారి" (పెట్టుబడిదారుని ఆ విధంగా పెక్కిర్ పిలిచాడు) చేత బజారులోకి గెంటివేయబడతాడు."దుర్బలుడైన ఆదిమ ఆటవిక కార్మికుడు" అనేవాడు రోచర్ సృష్టించిన భ్రాంతి మాత్రమే. ఆదిమ సమాజంలో జీవించిన ఆటవికుడు ఆదిమ కీకారణ్యాలకు అధినేత; ఉరాంగ్‌టాంగ్‌కు వుండే స్వాతంత్ర్యంలో ఆ కీకారణ్యాలను తన సొంత ఆస్తిగా వాడుకున్నాడు. అందువలన అతను కార్మికుడు కాదు. ఆదిమ సమాజంలోని కీకారణ్యాలను అతను దోపిడీ చేసే దానికి బదులుగా ఆ అరణ్యాలే అతన్ని దోపిడీ చేస్తే అతన్ని కార్మికుడనడంలో సందేహించ వలసినవసరం లేదు. అతని ఆరోగ్యానికి సంబంధించినంత వరకు, ఆధునిక కార్మికుడితోనే గాక, క్షయ పీడితుల్లాగా నశించిపోతున్న వున్నత వర్గాలతో కూడా అతన్ని పోల్చవచ్చు. అయితే శ్రీమాన్ విల్‌హెల్మ్ రోచర్‌గారు, "ఆదిమ కీకారణ్యం" అని అన్నపుడు. ఆయన ఉద్దేశ్యంలో, ఆయన జన్మస్థానమైన లునెబర్గ్‌లోని పొదలలో వున్న బంజరు భూమి మాత్రమేనని చెప్పడానికి సందేహించవలసిన అవసరం లేదు.
2. జాన్ బెల్లర్స్ ; అదే గ్రంథం ; పుట 2.

లేదు; అయితే పేదలలో అత్యధిక భాగం ఎల్లప్పుడూ కూడా సోమరులుగా వుండరాదనీ, వారు పొందిన దానిని నిరంతరం ఖర్చు చేస్తూ వుండాలనీ, సంపన్న దేశాలన్నింటికీ అభిలాషగా వుంటుంది..... దైనందిన శ్రమ ద్వారా జీవితాన్ని గడిపే వారిని... సేవా యోగ్యంగా రూపొందించేవి వారి అవసరాలే తప్ప మరేమీ కానందున, వాటిని తగ్గించడం వివేకవంతమైన చర్యేయైనా, తొలగించడం అవివేక మవుతుంది. శ్రమించే వ్యక్తిని కష్టపడి పని చేయించాలంటే ఒక మోస్తరు పరిమాణంలో డబ్బును అతనికి సమకూర్చడం ఒక్కటే మార్గం; ఎందుచేతనంటే ఈ డబ్బు మరీ తక్కువగా వుంటే అతను నిస్పృహ చెందడమో లేక దుస్సాహసానికి పాల్పడటమో జరుగుతుంది లేక మరీ యెక్కువగా వుంటే అతడు అహంకారిగానో లేక సోమరిగానో తయారవుతాడు.... కాబట్టి, బానిస విధానాన్ని అనుమతించని స్వేచ్ఛా రాజ్యంలో కష్టపడి పనిచేసే పేద ప్రజానీకంలోనే నిశ్చయంగా సంపద ఇమిడి వుంటుందని పై వివరాలన్నీ వెల్లడి చేస్తున్నాయి; ఎందుకంటే వారు ఎప్పుడూ కూడా సంపద అనే మహాసామ్రాజ్య విస్తరణకు నావికా దళాలుగానూ, సైన్యాలుగానూ తరగతిని వనరులుగా వుంటారు; వాళ్ళు లేకుంటే ఏ విధమైన సుఖసంతోషాలు వుండవు. ఏ దేశపు ఉత్పాదితానికైనా విలువ వుండదు. సమాజాన్ని (దీనిలో వుండేవారంతా పనిచేయని వారు) అత్యంత హీన పరిస్థితులలో సహితం సుఖ సంతోషాలతో తులతూగేటట్లు చేయాలంటే, ప్రజలు సుఖ జీవనం గడపాలంటే, వాళ్ళల్లో అత్యధికులు అజ్ఞానులుగానో, కడుపేదవారుగానో వుండవలసిన అవసరం ఎంతైనా వుంది; జ్ఞానం మన కోర్కెల్ని విస్తృతం చేయడమేగాక, అధికం చేస్తుంది. గనుక ఏ వ్యక్తియైనా తక్కువగా వస్తువుల్ని వాంఛిస్తే అతనికి అంత తేలికగా అవసరాలు తీర్చుకోవడానికి వీలవుతుంది.[1] పెట్టుబడితోను, వేతన కార్మికుల సమూహంతోనూ సంచయన ప్రక్రియ యొక్క యంత్రాగం కూడా పెరుగుతుందనీ అనగా పెరిగే పెట్టుబడి యొక్క స్వీయాభివృద్ధి శక్తి పెరుగుదలకు వేతన కార్మికులు తమ శ్రమ శక్తిని వెచ్చిస్తారనీ, ఆ విధంగా చేయడం ద్వారా పెట్టుబడిదార్ల రూపంలో సంకేతంగా వున్న తమ స్వీయ ఉత్పాదితం మీద ఆధారపడే సంబంధాన్ని శాశ్వత మొనర్చుకుంటారని మాండవిల్లే లాంటి స్పష్టమైన అవగాహన కలిగిన, నిజాయితీపరుడైన వ్యక్తి ఇంతవరకు గమనించలేదు. "ది స్టేట్ ఆఫ్ ది పూర్ ఆర్ యన్ హిస్టరీ ఆఫ్ ది లేబరింగ్ క్లాసెస్ ఇన్ ఇంగ్లాండ్" అనే పుస్తకంలో సర్ ఎఫ్.యం.ఈడెన్, ఈ ఆధారపడే సంబంధాన్ని గూర్చి ఈ విధంగా అంటాడు; "మన బ్రతుకు తెరువుకు మన భూమి మీద వచ్చే సహజ ఉత్పత్తి నిస్సందేహంగా పూర్తిగా సరిపోదు; తిండికీ, బట్టకూ, తలదాచుకోవడానికీ గత శ్రమ యొక్క ఫలితం లేకుండా అదే మాత్రం సరిపోదు; సామాజిక వ్యవస్థలోని ఒక భాగాన్నైనా కనీసం ఎడతెగని రీతిలో నియోగించవలసి వుంటుంది.... కేవలం నాగరికత, సామాజిక వ్యవస్థ కారణంగా శ్రమ నుండి మినహాయించబడి, ఏ మాత్రం చెమటోడ్చి కష్టపడని' కొంతమంది పారిశ్రామికోత్పత్తి

1. బెర్నాడ్ డీ మాండవిల్లె : "ది ఫేబుల్ ఆఫ్ ది బీస్" 5వ ముద్రణ, లండన్ 1728; సూచనలు;పుటలు 212, 213, 328. "హేతుబద్ధమైన సుఖ సంతోషానికీ" (బహుశా ఆయన వుద్దేశంలో దీర్ఘకాలికమైన పని దివాలూ. అల్ప పరిమాణంలో వుండే జీవనాధార సాధనాలూ) "సంపన్నతకూ, రాజ్య వ్యవస్థ పటిష్టతకూ" (అనగా భూస్వాములూ, పెట్టుబడిదార్లూ వారి రాజకీయ తాబేదార్ల పటిష్టతకూ) "మిత జీవనమూ, నిరంతరం కష్టపడి పనిచేయడమూ పేద వర్గాలకు ప్రత్యక్షమార్గాలుగా వుంటాయి" ("యాన్ యస్సే ఆన్ ట్రేడ్ అండ్ కామర్స్". లండన్, 1770, పుట 54)

మీద అదుపు కలిగి వుంటారు. కష్టపడి పని చేయడంతో పాటు అనేక ఇతర మార్గాల ద్వారా వ్యక్తులు ఆస్తిని సంపాదించవచ్చునని గుర్తించిన పౌర సంస్థలు, సృష్టించిన[1] ప్రత్యేకమైన జీవులు వీరు......స్వతంత్రంగా ఆస్తిపాస్తులు గల వారు, వారి ఉన్నత స్థితికి, వారిలో వుండే ఉన్నతమైన శక్తి సామర్థ్యాలకు ఏ మాత్రముగాక, ఇతరుల శ్రమకు మాత్రమే పూర్తిగా రుణపడి వుంటారు. భూమిపై హక్కు లేదా డబ్బును బట్టి గాక శ్రమమీద పెత్తనాన్ని అనుసరించి సమాజంలోని సంపన్నులకీ శ్రమించే వారికి మధ్య వ్యత్యాసం ఏర్పడుతుంది....... ఇదే (ఈడెన్ అంగీకరించిన పథకం) తమకోసం పనిచేసే వారి మీద సరిపోయినంత అధికారాన్నీ, పలుకుబడినీ (ఏమాత్రం ఎక్కువగా) ఆస్తిగల ప్రజలకిస్తుంది; అది కార్మికులను హీనస్థితిలోనో లేక దాస్య స్థితిలోనో గాకుండా కష్టం కాని సౌమ్య స్థితిలో వుంచుతుంది. మానవ స్వభావమూ, దాని చరిత్రా తెలిసినవారు తాము సౌకర్యంగా వుండేదుకు అవసరంగా దానిని అనుమతిస్తారు"[2]. పద్దెనిమిదవ శతాబ్దంలో ఆర్థిక సిద్ధాంతాలలో ఏ మాత్రమైనా ప్రాధాన్యత కలిగిన కృషి చేసిన వాడూ, ఆడమ్‌స్మిత్ ఒకే ఒక శిష్యుడూ ఈడెన్ మాత్రమేనని ఈ సందర్భంలో మనం గమనించాలి.[3]

---

1. "పౌర సంస్థల"ను ఎవరు సృష్టించారని ఈడెన్ ప్రశ్నించి ఉండవలసింది. న్యాయ వ్యవస్థకు సంబంధించి ఆయనకున్న భ్రమ కారణంగా భౌతిక ఉత్పత్తి సంబంధాల పర్యవసానంగా శాసనాలు రూపుదిద్దు కుంటాయని గమనించలేకపోయాడు. దానికి భిన్నంగా శాసనాలే ఉత్పత్తి సంబంధాలను రూపొందిస్తాయని నమ్ముతాడు. మాంటిష్కూ రాసిన "శాసనాల సారాంశం" అనే గ్రంథాన్ని లింగేట్ "శాసనాల సారాంశం ఆస్తి మాత్రమే" అనే ఒక వాక్యంతో తుత్తునియలు చేశాడు.
2. ఈడెన్, అదే గ్రంథం; మొదటి సంపుటి, మొదటి గ్రంథం; ఒకటవ అధ్యాయం; పుటలు 1, 2; ముందు మాట : పుట 20
3. 1798 సంవత్సరంలో ప్రచురితమైన 'యస్సే ఆన్ పాప్యులేషన్' అనే మాల్తస్ గ్రంథాన్ని గురించి పాఠకుడు ఈ దశలో నా దృష్టికి తెస్తే నేను వారికి జ్ఞప్తికి తెచ్చేయదేమంటే డీఫో, సర్‌జేమ్స్ స్టువర్ట్. టౌన్ సెండ్, ఫ్రాంక్లిన్, వాల్లెస్ వగైరాల భావాలను తస్కరించి, అది కూడా పరిపక్వత లేని స్కూలు పిల్లల స్థాయిలో రచించి మాల్తస్ ఆ గ్రంథం మొదటి రూపాన్ని వెలువరించాడు. అందులో ఏ ఒక్క వాక్యం కూడా ఆయన సొంతంగా ఆలోచించి రాసింది కాదు. ఒక ప్రత్యేకవర్గం ప్రయోజనం కారణంగా ఈ కరపత్రం గొప్ప సంచలనానికి కారణమైంది. యునైటెడ్ కింగ్‌డమ్‌లో ఫ్రెంచి విప్లవానికి ఉత్సాహవంతులైన సమర్థకులు దొరికారు; పద్దెనిమిదవ శతాబ్దంలో అతి మందకొడిగా రూపొందించిన "జనాభా సిద్ధాంతాన్ని" కోండర్‌సెట్ వగైరాల బోధనలకు తిరుగులేని విరుగుడుగా, ఒక బ్రహ్మాండమైన సామాజిక సంక్షోభంలో బాజా భజంత్రీలతో చాటింపు వేశారు; జనాభా పెరుగుదల పర్యవసానంగా సంభవించిన అన్ని రకాలైన దుష్ఫలితాలను గొప్పగా వినాశనం చేసేదిగా భావించిన ఇంగ్లీషు నిరంకుశ పాలకవర్గం, ఆనందోత్సాహాలతో ఆ సిద్ధాంతాన్ని ఆహ్వానించింది. అందువలన, ఆనందపరవశుడై ఆశ్చర్యంలో మునిగిపోయిన మాల్తస్ తాను కొత్తగా ఏమీ చెప్పకపోయినప్పటికీ ఇతర గ్రంథకర్తల నుండి కొన్ని అంశాలనూ, తన సొంత పైత్యంతో మరి కొంత చెత్తనూ తన పుస్తకంలో పొందురిచాడు. పైగా, ఇంగ్లాండులోని ప్రభుత్వ చర్చిలో మత బోధకుడైన మాల్దస్, క్రైస్తవ మతానుసారంగా బ్రహ్మచర్యం పాటిస్తానని శపథం చేశాడు. ప్రొటెస్టెంట్ మతానికి చెందిన కేంబ్రిడ్జి విశ్వ విద్యాలయంలో అధ్యాపక వృత్తిని చేపట్టడానికి ఇదొక షరతు కూడా; "వివాహం అయిన వారికి కేంబ్రిడ్జి విశ్వవిద్యాలయంలో అధ్యాపక వృత్తి చేపట్టడానికి అర్హత లేదు; ఎవరైనా వివాహం చేసుకున్నట్లయితే అతను అధ్యాపక వృత్తిని కోల్పోతాడు ("కేంబ్రిడ్జి విశ్వవిద్యాలయ కమిషన్" నివేదికలు. పుట 172) ఇతర మత బోధకులతో పోల్చినపుడు ఈ పరిస్థితే మాల్తస్‌కు అత్యంత అనుకూలమైంది; మత బోధకులకు నిర్దేశించిన బ్రహ్మచర్య షరతుల్ని కలగాపులగం చేసి ఉపయోగపడే

ఇంతవరకూ ఊహించిన సంచయనపు పరిస్థితుల్లో అంటే కార్మికులకు అత్యంత అనుకూలమైన ఆ పరిస్థితులలో పెట్టుబడిపై ఆధారపడే సంబంధం నిలకడ రూపాన్ని వహిస్తుంది; లేదా ఈడెన్ చెప్పినట్లుగా "సౌమ్య" స్థితిని పొందుతుంది. పెట్టుబడి పెరుగుదలతో పాటుగా, సాంద్రీకృతమయ్యే

---

పద్ధతిలో జనాన్ని పెంపొందించండి!" అనేదే తమ బోధనల కర్తవ్యంగా ఎంచుకొని వీలైనంతవరకు జనాభా వృద్ధికి తమ వంతు కర్తవ్యాన్ని నెరవేర్చడానికి ప్రయత్నించే ఇతర మత బోధకులు, కార్మికులకు మాత్రం "జనాభా సూత్రాన్ని" పాటించమని బోధిస్తూ వుంటారు. 'కడుపు మంట చల్లార్చుకోడానికి ఆదామ్ ఆపిల్ కోసం అర్రులు చాపడంవల్లే మానవుడు ఆర్థికంగా పతనమైనాడని; మత బోధకుడైన టౌన్‌సెండ్ హాస్యాస్పదంగా చెప్పినట్లుగా "మన్మథ వికారాలను నిరోధించడానికి నియంత్రణ మార్గాలను" అన్వేషించాలనే, విలక్షణ పూరితంగా చెప్పబడిన సున్నితాంశాలను ప్రొటెస్టెంట్ మత ప్రతినిధులూ, ఇంకా చెప్పాలంటే ప్రొటెస్టెంట్ చర్చీ గుత్తకు పుచ్చుకున్నారు. ఆలోచనాపరుడూ, తెలివిగల రచయితా, వెనీస్ సగం సన్యాసీ అయిన ఓర్టెస్ తప్ప, జనాభా సిద్ధాంతాన్ని ప్రచారం చేసే అధ్యాపకులంతా ప్రొటెస్టెంట్ మత బోధకులే. ఉదాహరణకు బ్రక్నర్ రాసిన "థియరీస్ ద సిస్టమ్ యానిమల్" (లేడెన్, 1767) అనే గ్రంథంలో ఆధునిక జనాభా సిద్ధాంతానికి సంబంధించిన సకల విషయాలు కూలంకషంగా చర్చించ బడ్డాయి. అందులో క్యూనేకూ, ఆయన శిష్యుడైన మిరాబీకు మధ్య యాదృచ్ఛికంగా ఈ అంశం మీద జరిగిన సంవాదాన్ని కూడా పొందుపరిచాడు; ఆ తర్వాత మత బోధకులైన వాల్లెస్, టౌన్‌సెండ్, మాల్థస్, ఆయన శిష్యుడైన థామస్ చాల్మర్స్, ఇంకా నాసిరకం రచయితల అభిప్రాయాలను కూడా ఆయన పొందుపరిచాడు. ప్రారంభదశలో హాబ్స్, లాక్, హ్యూమ్‌లాంటి తత్వవేత్తలూ, థామస్ మోర్, టెంపుల్, సల్లీ, డేవిడ్, నార్త్, లా, వాండర్‌లింట్, కాంటిల్లాన్, ఫ్రాంక్లిన్ లాంటి వ్యాపారస్తులూ, రాజనీతిజ్ఞులు, ప్రత్యేకించి పెట్టీ, బార్బన్, మాండవిల్లే, క్యూనే లాంటి వైద్యులూ రాజకీయ అర్థశాస్త్రాన్ని దిగ్విజయంగా అధ్యయనం చేశారు. పద్దెనిమిదవ శతాబ్దం మధ్యభాగంలో కూడా ఆ కాలంలో పేరెన్నికగన్న అర్థశాస్త్రవేత్త అయిన రెవరెండ్ టక్కర్ ఈ శాస్త్ర అధ్యనంలో తలదూర్చినందుకు తనను తానే మందలించుకున్నాడు. ఆ తర్వాతనే, ప్రత్యేకించి, ఈ "జనాభా సిద్ధాంతం" రంగం మీదకొచ్చిన తర్వాతనే, ప్రొటెస్టెంటు మత బోధకుల సమయం ఆసన్నమైంది. జనాభాను సంపదకు ప్రాతిపదికగా భావించిన పెటీ, ఆడమ్ స్మిత్‌లాగా మత బోధకులకు ఆగర్భ శత్రువు; వారి గందరగోళాన్ని గురించి తాను ముందే ఊహించినట్లుగా, పెటీ ఈ విధంగా అంటాడు; గతంలో చెప్పినట్లుగా, "న్యాయవాదులు నెరవేర్చవలసిన పని లేనప్పుడు న్యాయం ఏ విధంగా ప్రవర్థిల్లుతుందో, ఆ విధంగానే మతబోధకులు తమ కోర్కెలను పరిత్యజించినపుడు మతం కూడా ఆ విధంగానే ప్రవర్థిల్లుతుంది." అందువలన. మత దూత అయిన పాల్ అడుగుజాడల్లో నడవమనీ, బ్రహ్మచర్యం ద్వారా శారీరక సంబంధమైన కోర్కెలనన్నింటినీ త్యజించమనీ ప్రొటెస్టెంట్ మత బోధకులకు పెటీ సలహా ఇస్తున్నాడు. "దేవుడి మాన్యాన్ని అనుభవించడానికి అవకాశం వున్న దానికన్నా ఎక్కువ మంది మతబోధకులను సృష్టించకూడదు. ఇంగ్లాండ్‌లోనూ, వేల్స్‌లోనూ 12,000 మందికి అవకాశం ఉన్నప్పుడు 24,000 మంది మత బోధకులను సృష్టించినట్లయితే. అదనంగా వున్న ఈ 12,000 మంది, జీవనాధారం కోసం గత్యంతరంలేక విషం పుచ్చుకోవడమో లేక తమ ఆత్మలను క్షోభపెట్టుకుంటూ స్వర్గారోహణకు మార్గాలను అన్వేషిస్తూ ప్రజలను ప్రక్కదోవలు పట్టించడానికి ప్రయత్నించడమో తప్ప గత్యంతరం వుండదు." (పెట్టీ 'ఎ ట్రియటైజ్ ఆఫ్ టాక్సస్ అండ్ కంట్రిబ్యూషన్స్' లండన్, 1667, పు. 57) ఆ కాలంలో వున్న ప్రొటెస్టెంట్‌ల మతాధికారుల ఎడల ఆడమ్ స్మిత్ దృక్పథం ఏ విధంగా వున్నదో ఈ క్రింది అంశాలను బట్టి తెలుసుకోవచ్చు. స్ట్రాహన్‌కు ఆడమ్ స్మిత్ రాసిన బహిరంగ లేఖలో అజ్ఞాతంలో వున్న డేవిడ్ హ్యూమ్‌ను ఆకాశానికెత్తినందుకూ "మరణశయ్య మీద ఉండి కూడా టాసిన్, వెస్టిలతో హ్యూమ్ ఏ విధంగా సంవాదానికి దిగిందీ" ప్రపంచానికి తెలియజేసినందుకూ, హ్యూమ్‌ను గురించి చాలా తెలివితక్కువగా, పుణ్యమూర్తిగా ఉండటానికి హ్యూమ్ ఆయన జీవితకాలంలో

దానికి బదులుగా ఈ ఆధారపడే సంబంధం ఇంకా విస్తృతమవుతుంది. అనగా పెట్టుబడి యొక్క దోపిడీ పరిధీ, అధికారమూ, దాని యొక్క బహుళ రూపాలతో బాటుగా పెక్కు అంశాలకు వ్యాప్తి చెందుతుంది.

కార్మికుల స్వీయ అదనపు ఉత్పాదితంలోని ఒక పెద్ద భాగం సదా అధికమవుతూ అనవరతమూ అదనపు పెట్టుబడిగా మార్చబడుతూ వారి సుఖ సంతోషాల పరిధిని విస్తృతం చేసుకోవడానికి వేతనాల చెల్లింపు రూపంలో తిరిగి వారి దగ్గరకే చేరుతుంది; ఫలితంగా వస్త్రాలు, గృహోపకరణాలు వగైరాలకు మరి కొంత అదనపు మొత్తాలను వారి వినియోగ నిధికి చేర్చగలగడంతో బాటుగా చిన్న మొత్తాలలో కొంత డబ్బును నిల్వనిధిగా వారు పొదుపు చేసుకోగలరు. అయితే కూడూ, గుడ్డా, పని పరిస్థితులూ, కొంత స్వంత ఆస్తి, బానిసకు అమరినంత మాత్రాన దోపిడీ విధానం ఏ విధంగా రద్దు కాదో అదే విధంగా ఈ పరిస్థితులు కూడా వేతన కార్మికునిపై జరిగే దోపిడీని తొలగించలేవు. పెట్టుబడి సంచయనపు పర్యవసానంగా శ్రమ ధర కూడా పెరుగుతున్నదంటే అర్థం, తనను బంధించేందుకని వేతన కార్మికుడు అదివరకే తయారు చేసుకున్న బంగారు సంకెళ్ళ పొడవూ, బరువూ పెరగడం వల్ల దాని బిగువు

---

ప్రయత్నించాడని' ఆయన మరణాంతరం కూడా ' నేను గట్టిగా నమ్ముతున్నానని' చెప్పినందుకూ నార్‌విచ్ బిషప్ అయిన డాక్టర్ హార్నె ఆడమ్ స్మిత్‌ను గట్టిగా మందలించాడు (ఎ లెటర్ టు ఎ. స్మిత్, ఎల్.ఎల్.డి. ఆన్ ది లైఫ్ డెత్ అండ్ ఫిలాసఫీ ఆఫ్ హిజ్ ఫ్రెండ్, డేవిడ్ హ్యూమ్ బై వన్ ఆఫ్ ది పీపుల్ కాల్డ్ క్రిస్టియన్స్. నాల్గవ ముద్రణ, ఆక్స్‌ఫర్డ్ 1784) "మతానికి సంబంధించిన సకల విషయాల ఎడల తిరుగులేని వ్యతిరేకత కలిగిన ఒక వ్యక్తి యొక్క వ్యక్తిత్వాన్ని గురించి ప్రవర్తనను గురించి 'సంపూర్ణమైన పుణ్యమూర్తిగా" దండోరా వేయడంలో గల మీ అభిప్రాయం ఏ మేరకు సమంజసమో సెలవియ్యండి. మహాశయా, ప్రజలలో వున్న మత ప్రోత్సాహకాల నన్నింటినీ పటాపంచలుచేసి, అణగద్రొక్కినాశనం చేయడానికి కంకణం కట్టుకున్న ఒక వ్యక్తిని యీ విధంగా ఆకాశానికెత్తడంలో మీ ఉద్దేశ్యం ఏమిటి మహాశయా? (అదే గ్రంథం. పుట8) అని డాక్టర్ హార్నె గగ్గోలు పెట్టాడు. "సత్యాన్వేషణ ప్రియులు యే మాత్రం నిరుత్సాహపడవలసిన పని లేదు. నాస్తికత్వం ఇక ఏమాత్రం కొనసాగదు" (అదే గ్రంథం.పుట 17) "ఈ ప్రపంచంలో నాస్తికత్వాన్ని ప్రచారం చేయడంలో" (స్మిత్ రాసిన థియరీ ఆఫ్ మోరల్ సెంటిమెంట్స్ ద్వారా) "దారుణమైన క్రూరత్వానికి ఒడిగట్టాడు" ఆడమ్ స్మిత్, "మొత్తం మీద మీ అభిప్రాయం బాగానే వుంది. అయితే ఈసారి మాత్రం మీరు విజయవంతం కాలేరు. డేవిడ్ హ్యూమ్‌ను ఆదర్శంగా పేర్కొని, నాస్తికత్వమే సరైన మార్గమనీ, మరణ భయానికి అదొక్కటే విరుగుడనీ మీరు మమ్మల్ని ప్రలోభపెట్టవచ్చు గాక... శిథిలమైయున్న బాబిలోన్ మహానగరాన్ని చూసి మీరు హేళన చేయవచ్చుగాక, ఎర్ర సముద్రపు తరంగాల మీద ఓటమిని చవిచూసిన 'పరోహా'ను మీరు అభినందించవచ్చుగాక - ఈసారి మాత్రం మీరు విజయవంతులు కాలేరు" (అదే గ్రంథం. పుటలు 21, 22) ఆడమ్ స్మిత్ మరణానంతరం, ఆయన సహాధ్యాయుడైన ఒక ఛాందసుడు స్మిత్‌ను గురించి ఈ విధంగా అన్నాడు. "డేవిడ్ హ్యూమ్ ఎడల ఆడమ్ స్మిత్‌కున్న ప్రేమానురాగాల మూలంగా స్మిత్ క్రైస్తవుడు కాలేకపోయాడు.... ఆయన ఇష్టపడే నిజాయితీ పరులను కలిసినపుడు వారు ఏమి చెప్పినా నమ్మేవాడు. కుశాగ్రబుద్ధి కలిగిన హొరాక్స్‌తో ఆయనకు స్నేహం వున్నట్లయితే, ఏ విధమైన మబ్బులు అడ్డురాకుండానే, తెల్లని ఆకాశం నుండి చంద్రుడు, అదృశ్యమయ్యేడంటే నమ్మేవాడే.... రాజకీయ సిద్ధాంతాలతో రిపబ్లికన్ విధానాలను నమ్మేవాడు" (ది.బీ : బై జేమ్స్ ఆండర్సన్, 18 సంపుటాలు, మూడవ సంపుటి, ఎడిన్ బర్గ్, 1791-93. పుటలు 165.166) నిరంతరం భగవన్నామ స్మరణతోనే కాలం గడుపుతున్న ప్రొటెస్టెంటు మత బోధకులను ఉద్దేశించే "అనుత్పాద కార్మికులు" అనే అభివర్గాన్ని ఆడమ్ స్మిత్ కనుగొన్నాడా అనే సందేహం మత బోధకుడైన థామస్ చాల్మర్స్‌కు లేకపోలేదు.

కొంత సడలిపోతుందని మాత్రమే! ఈ అంశం మీద జరిగిన తర్జన భర్జనల్లో ప్రధానమైన వాస్తవాన్ని అనగా పెట్టుబడిదారీ ఉత్పత్తి యొక్క నిర్దిష్టమైన విశిష్ట లక్షణాన్ని (డిఫరెన్సియా స్పెసిఫికా) ఉపేక్షించారు. శ్రమశక్తి తన సేవ ద్వారా గానీ లేక తన ఉత్పాదితం ద్వారా గానీ కొనుగోలుదారు యొక్క వ్యక్తిగత అవసరాలను సంతృప్తి పరచడమనే దృష్టితో ఈ రోజు అమ్ముడుపోవడంలేదు. పెట్టుబడిని పెంచుకుందా మనీ, తాను చెల్లించే దాని కన్నా ఎక్కువగా శ్రమ ఇమిడి వున్న సరుకులను ఉత్పత్తి చేయాలనీ, అందువలన తనకు ఏవిధమైన ఖర్చు లేకుండా విలువలో ఒక భాగం ఇమిడి వుండి సరుకులను అమ్మగా ఆ ఫలితాన్ని పొందాలనేదే పెట్టుబడిదారుని లక్ష్యం. అదనపు విలువ ఉత్పత్తియే ఈ ఉత్పత్తి విధానం యొక్క అఖండ నియమం. పెట్టుబడిగా తన పాత్రను నిర్వహించే పద్ధతిలో ఉత్పత్తి సాధనాలను భద్రపరచిన మేరకు, తన స్వీయ విలువను పెట్టుబడిగా పునరుత్పత్తి చేసిన మేరకు, అదనపు పెట్టుబడికి మూలాధారంగా వేతనం లేని శ్రమనువెచ్చించ గలిగిన మేరకు మాత్రమే శ్రమశక్తి అమ్ముడుపోగలదు.[1] దాని అమ్మకం పరిస్థితులు కార్మికులకు ఎక్కువగానో లేదా తక్కువగానో అనుకూలంగా వున్నా నిరంతరం తిరిగి శ్రమశక్తిని అమ్ముకోవలసిన ఆవశ్యకతా, పెట్టుబడిరూపంలో సకల సంపద విస్తృత స్థాయిలో నిరంతరం పునరుత్పత్తి అయ్యే పరిస్థితీ, అందులో ఇమిడి వుంటాయి. మనం ఇంతకు ముందే పరిశీలించినట్లుగా వేతనం లేకుండానే కొంత పరిమాణంలో కార్మికుడు శ్రమను సరఫరా చేస్తాడని వేతనాలు వాటి స్వభావం రీత్యా సదా సూచిస్తాయి. వేతనాలు పెరుగుదలతో బాటుగా శ్రమ ధర పడిపోవడంతో నిమిత్తం లేకుండా మొత్తంగా చూసినపుడు, ఆ విధమైన వేతనాల పెరుగుదలకు అర్థమేమంటే, కార్మికుడు సరఫరా చేయవలసిన వేతనం లేని శ్రమ పరిమాణంలో కొంత తగ్గుదల మాత్రమే. ఈ తగ్గుదల ఎప్పటికీ ఆ వ్యవస్థకే అపాయకరంగా పరిణమించే స్థితికి చేరుకోదు. వేతనాల రేటుకు సంబంధించి జరిగిన హింసాత్మక ఘర్షణలతో బాటుగా (ఆడమ్ స్మిత్ గతంలో చెప్పినట్లుగా, మొత్తంగా చూసినపుడు ఆ విధమైన ఘర్షణలో యజమానిదే ఎప్పుడూ పైచేయిగా వుంటుంది) పెట్టుబడి సంచయనం ఫలితంగా శ్రమ ధర పెరుగుదల ఈ క్రింది ప్రత్యామ్నాయాలను సూచిస్తుంది :

శ్రమ ధర పెరుగుతూ ఉన్నప్పటికీ ఆ పెరుగుదల సంచయనపు పురోభివృద్ధిని అడ్డుకోదు. ఇందులో ఆశ్చర్యపడవలసినదేమీ లేదు. ఎందుచేతనంటే, ఆడమ్ స్మిత్ చెప్పినట్లుగా "ఇవి (లాభాలు) తగ్గిన తర్వాత కూడా నిల్వలు మామూలుగానే గాక అంతకు మించి వేగంగా కూడా పెరగవచ్చు... పెద్ద ఎత్తున లాభాలు వచ్చే చిన్నపాటి నిల్వల కంటే కొద్దిపాటి లాభాలే వచ్చినా, భారీ నిల్వలే సాధారణంగా శీఘ్రగతిని పెరుగుతాయి". (చూడు : ఉదాహృతగ్రంథం మొదటి సంపుటి. పుట 189) వేతనం లేని శ్రమలో తగ్గుదల వల్ల పెట్టుబడి పరిధి విస్తరణకు ఏ విధమైన అవరోధమూ ఏర్పడటం లేదనేది ఈ అంశంలో సుస్పష్టమే – లేక, మరోవైపున శ్రమ ధర పెరుగుదల పర్యవసానం

1. "ఏమైనప్పటికీ, యంత్ర నిర్వాహకులకూ కార్మికులకూ వుండే ఉద్యోగావకాశాల పరిమితి, సమానమైనదే, అనగా వీరి శ్రమ ఫలితమైన ఉత్పత్తి మూలంగా యజమానికి లభించే లాభం, పెట్టుబడి యొక్క సగటు లాభాన్ని యజమానికి తగ్గించే విధంగా వేతనాలు ఉన్నట్లయితే, వీరిని యజమాని పనిలో నియోగించుకొనడు; లేక తక్కువ వేతనాలకు వారు అంగీకరించే షరతు మీదే వారిని పనిలో నియమిస్తాడు." (జాన్ వేడ్. అదే గ్రంథం; పుట 241)

గానూ, లాభానికుండే ప్రేరణ మొద్దుబారడం మూలంగానూ, సంచయనం మందగించవచ్చు. సంచయనపు రేటు తగ్గవచ్చు. అయితే దాని తగ్గుదలతో బాటుగా, ఆ తగ్గుదలకుండే ప్రాథమిక కారణం కూడా అదృశ్యమవుతుంది; అనగా పెట్టుబడి దోపిడీ చేయబడటానికి అవకాశమిచ్చే శ్రమశక్తికీ మధ్య అసమతుల్యం అదృశ్యమవుతుంది. పెట్టుబడిదారీ ఉత్పత్తి ప్రక్రియ యొక్క యంత్రాంగం, అది తాత్కాలికంగా సృష్టించిన అడ్డుగోడలను తొలగించి వేస్తుంది. పెట్టుబడి స్వీయాభివృద్ధి అవసరాల రీత్యా, వేతనాల పెరుగుదలకు పూర్వం సాధారణంగా వుండే స్థాయికి ఇంచుమించుగా లేక సమానంగానైనా శ్రమధర తిరిగి పడిపోతుంది. ఈ అంశాన్నంతా ఈ విధంగా చూస్తాం : మొదటి సందర్భంలో శ్రమశక్తి గానీ లేక శ్రామిక జనాభా గానీ నిరపేక్షంగా కానీ లేక ఒకే నిష్పత్తిలో గానీ పెరిగే రేటు క్షీణించడం వల్ల పెట్టుబడి అధికం గావడం లేదు. సరికదా, పైగా అందుకు భిన్నంగా పెట్టుబడి అధికం కావడం వల్లనే వినియోగార్హమైన శ్రమశక్తి సరిపోయినంతగా వుండదు. రెండో సందర్భంలో శ్రమశక్తి శ్రామిక జనాభాగానీ, నిరపేక్షంగా గానీ లేక ఒకే నిష్పత్తిలో గానీ పెరిగే రేటు వృద్ధి గావడం మూలంగా పెట్టుబడి సరిపోయినంతగా వుండదు; అయితే అందుకు భిన్నంగా వినియోగార్హమైన శ్రమశక్తి లేక స్పష్టంగా చెప్పాలంటే దాని ధర అత్యధికంగా వుండటానికి గల కారణం పెట్టుబడి యొక్క సాపేక్ష తగ్గుదలే,. పెట్టుబడి సంచయనం యొక్క ఈ విధమైన నిరపేక్ష చలనాలే వినియోగర్హమైన శ్రమశక్తి మొత్తపు సాపేక్ష చలనాలుగా ప్రతిబింబిస్తున్నందువల్ల, అవి శ్రమశక్తి వల్ల సంభవించినట్లుగా స్వీయ స్వేచ్ఛా చలనాలుగా కనిపిస్తాయి. సంఖ్యాత్మకంగా చెప్పాలంటే సంచయనపు రేటు స్వతంత్ర చలనాంకం కాదు; వేతనాల రేటు పరతంత్ర చలనాంకమే గాని స్వతంత్ర చలనాంకం కాదు. పారిశ్రామిక వలయం సంక్షోభ దశలో ఉన్నప్పుడు సరుకుల ధరల్లో సాధారణ తగ్గుదలని డబ్బు విలువ పెరుగుదలగానూ, ఉచ్ఛ దశలో సరుకుల ధరల్లో సాధారణ పెరుగుదలని డబ్బు విలువ తగ్గుదలగానూ వ్యక్తీకరించబడుతుంది. ధరలు ఎక్కువగా ఉన్నప్పుడు తక్కువగానూ, ధరలు తక్కువగా ఉన్నపుడు ఎక్కువగానూ డబ్బు చలామణిలో ఉంటుందని పై అంశాన్ననుసరించి డబ్బు పరిమాణ సిద్ధాంతవేత్తలు నిర్ధారణలు చేశారు. సంచయనానికి సంబంధించిన ఈ అంశాన్ని ఒక సందర్భంలో మరీ తక్కువమంది మరొక సందర్భంలో మరీ ఎక్కువమంది వేతన కార్మికు లున్నారంటూ వివరింపజూసే అర్థశాస్త్రవేత్తలకు, వాస్తవాల పట్ల[1] పూర్తి దురవగాహన గలిగి అజ్ఞానంతో నిండి వున్న ద్రవ్య పరిమాణ సిద్ధాంతవేత్తలకు మధ్య ఎంతటి సారూప్యత!

"సహజ జనాభా నియమం" (నేచురల్ లా ఆఫ్ పాపులేషన్) అనే బూటకపు సూత్రీకరణకు పునాది అయిన పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానపు నియమాన్ని సంక్షిప్తీకరించినట్లయితే : పెట్టుబడి సంచయనానికీ, వేతనాల రేటుకి మధ్యనున్న పరస్పర సంబంధం, పెట్టుబడిగా మార్చబడిన వేతనం లేని శ్రమకూ, అదనపు పెట్టుబడిని చలనంలో ఉంచడానికి అవసరమైన వేతనం పొందిన అదనపు శ్రమకూ మధ్యగల సంబంధం తప్ప మరేమీ కాదని స్పష్టమవుతుంది. అందువలన అది, రెండు స్వతంత్ర పరిమాణాల మధ్య సంబంధం కాదు; అనగా ఒకవైపు పెట్టుబడి పరిమాణానికీ, మరొకవైపున శ్రామిక జనాభాకీ మధ్య సంబంధం ఏ విధంగానూ కాదు; ఇంకా స్పష్టంగా చెప్పాలంటే అదే

1. కారల్ మార్క్స్ : ''జుర్ క్రిటిక్ డెర్ పొలిటిషెచన్ ఒకొనోమి'' పుట.166

శ్రామిక జనాభాలోని వేతనం లేని శ్రమకూ వేతనం పొందిన శ్రమకూ మధ్య గల సంబంధం మాత్రమే. కార్మికవర్గంచే సరఫరా చేయబడీ పెట్టుబడిదారీ వర్గంచే సంచయనం చేయబడే వేతనం లేని శ్రమ యొక్క పరిమాణం శీఘ్రగతిని పెరిగితే, దానిని పెట్టుబడిగా మార్పుచేయడానికి అత్యధిక స్థాయిలో వేతనం పొందే అదనపు శ్రమ అవసరమవుతుంది; అప్పుడు వేతనాలు పెరిగి, ఇతర పరిస్థితులన్నీ సమానంగా వున్నపుడు, వేతనం లేని శ్రమ నిష్పత్తి క్షీణిస్తుంది. అయితే పెట్టుబడిని పోషించే అదనపు శ్రమ ఇక ఏమాత్రమూ సాధారణంగా సరఫరా చేసే శ్రమ పరిమాణాన్ని సరఫరా చేయలేని స్థితికి వచ్చినపుడు ఈ క్షీణత ఆ స్థితికి చేరుకోగానే ఒక ప్రతిక్రియ ప్రారంభమవుతుంది : ఆదాయంలోని స్వల్ప భాగం మాత్రమే పెట్టుబడీకరించబడి, సంచయనం వెనకడుగు వేసి వేతనాల పెరుగుదల ధోరణి అదుపు చేయబడుతుంది. కాబట్టి వేతనాల పెరుగుదల దాని పరిమితులలో వుంచబడి పెట్టుబడిదారీ వ్యవస్థ యొక్క పునాదులు చెక్కు చెదరకుండా వుంచబడి, పురోగమన స్థాయిలో దాని పునరుత్పత్తి భద్రపరచబడుతుంది,. అర్థశాస్త్రవేత్తలచే ప్రకృతి నియమంగా రూపాంతీకరణ చేయబడిన పెట్టుబడిదారీ సంచయనపు నియమం, దాని సహజ లక్షణంచేత శ్రామిక దోపిడీ స్థాయి ప్రతి తగ్గుదలనూ మినహాయిస్తుందనీ, ఎల్లప్పుడూ విస్తృత స్థాయిలో నిరంతరం పునరుత్పత్తి అయ్యే పెట్టుబడిదారీ సంబంధాలను, శ్రమధరలోని ప్రతి పెరుగుదలా తీవ్ర ప్రమాదానికి గురిచెయ్యగలదనీ, వాస్తవానికి తెలియజేస్తుంది. కార్మికుల పురోభివృద్ధి అవసరాలను తీర్చడానికి భౌతిక సంపద వుండటానికి బదులుగా, దానికి భిన్నంగా, ప్రస్తుత విలువల స్వీయాభివృద్ధి అవసరాలను సంతృప్తి పరచడానికి కార్మికులు జీవనం సాగించే ఉత్పత్తి విధానంలో ఇది మరొక విధంగా వుండదు. మనిషి తన మేధా చిత్రణతో ఏ విధంగా మతంలో నియంత్రణ చేయబడతాడో అదే విధంగా పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానంలో తనే సృష్టించిన ఉత్పాదితాల చేత నియంత్రణ చేయబడతాడు.[1]

### విభాగం - 2

## సంచయన పురోభివృద్ధి, దానిననుసరించి జరిగే కేంద్రీకరణ కాలంలోనే పెట్టుబడి అస్థిర భాగంలో సాపేక్ష క్షీణత

సామాజిక సంపద యొక్క వాస్తవిక విస్తృతిగానీ లేక అంతకు క్రితం నుండే క్రియను నిర్వర్తించే పెట్టుబడి యొక్క పరిమాణం గానీ వేతనాల పెరుగుదలకు దారి తీయవనీ, నిరంతరాయంగా పెరిగే సంచయనమూ, దాని పెరుగుదల స్థాయిలో గల శీఘ్రత మాత్రమే అందుకు కారణమని అర్థశాస్త్రవేత్తలు సైతం భావిస్తారు. (ఆడమ్ స్మిత్; మొదటి సంపుటి; 8వ అధ్యాయం) ఈ ప్రక్రియలోని

1. “మానవ శ్రమ ఫలితమే పెట్టుబడి అనే మన మొదటి విచారణకు తిరిగి మనం వచ్చినట్లయితే... మనిషి, తన ఉత్పాదితమైన పెట్టుబడి ఆధిపత్యంలో నలిగిపోతున్నాడనీ, దానికి తల ఒగ్గేటట్లు చేయగల మనీ చెప్పడంలో అర్థం లేదనిపిస్తుంది. వాస్తవంలో ఇది సందేహించవలసిన సమస్య కానందున, మనకు మరో ప్రశ్న ఉదయిస్తుంది. పెట్టుబడి సృష్టికర్త అయినందున, దానికి యజమానిగా వుండవలసిన కార్మికుడు, దానికి బానిసగా ఎందుకు మారాడు?” వాన్ థునెన్, డెరెయిసోలిర్తే రెండవ భాగం, రెండవ ప్రకరణం, రొసాక్. 1863, పుట 5-6) వాన్‌తునెన్ గొప్పగానే ఈ ప్రశ్న వేశాడు. అయితే దానికి ఆయన ఇచ్చిన సమాధానంలో పరిపక్వత లేదు.

ఒక ప్రత్యేక దశ అనగా పెట్టుబడి సాంకేతిక అంతర్నిర్మాణం స్థిరంగా నున్నపుడు, పెట్టుబడి వృద్ధి జరిగే దశను మాత్రమే మనం ఇంతవరకు పరిశీలించాం. అయితే ఈ దశను మించి ఈ ప్రక్రియ ఇంకా ముందుకు సాగుతుంది.

పెట్టుబడిదారీ వ్యవస్థకు సాధారణ ప్రాతిపదిక ఆవిర్భవించినపుడు సంచయనం జరిగే కాలంలో ఒకానొక దశలో సామాజిక శ్రమ యొక్క ఉత్పాదకత పెరుగుదలే సంచయనానికి అత్యంత శక్తివంతమైన సాధనం కాగలదు. ఆడమ్ స్మిత్ ఇలా అంటాడు. "కార్మికుల వేతనాలను పెంచే, వస్తురాసి నిల్వలను అధికం గావించే కారణాంశమే శ్రమ ఉత్పాదకతా శక్తుల్ని ప్రోత్సహించేందుకు కూడా దోహదం చేస్తుంది; తక్కువ శ్రమ పరిమాణం ఎక్కువ పరిమాణంలో పని చేసేటట్లు చేస్తుంది."

భూసారమూ, స్వతంత్రమై, ప్రత్యేకమైన ఉత్పత్తిదార్ల (వారి ఉత్పాదితాల పరిమాణపు రాసికన్నా. ఆ ఉత్పాదితాల మన్నిక, నాణ్యతను బట్టి నిర్ణయించబడేవారే ఆ ప్రత్యేక ఉత్పత్తిదార్లు) యొక్క సామర్థ్యం లాంటి సహజ సిద్ధమైన పరిస్థితులననుసరించే గాక, ఒకానొక సమాజంలో ఒకానొక కాలంలో ఒక కార్మికుడు అదే స్థాయిలో గల శ్రమశక్తి తీవ్రతలో ఉత్పత్తి సాధనాలను ఉత్పాదితాలుగా మార్పుచేసే సాపేక్ష విస్తృతి ద్వారా శ్రమ యొక్క సామాజిక ఉత్పాదకత వ్యక్తీకరించబడుతుంది. అతని శ్రమ యొక్క ఉత్పాదకతా శక్తితో బాటుగా ఆ విధంగా మార్పు చేయబడిన ఉత్పత్తి సాధనాల పరిమాణమూ పెరుగుతుంది. అయితే ఉత్పత్తి సాధనాలు ద్వంద్వ పాత్రలను నిర్వహిస్తాయి. శ్రామిక ఉత్పాదకత పెరుగుదలకు అందులో కొన్ని పర్యవసానాలు కాగా, మరికొన్ని షరతులుగా వుంటాయి. ఉదాహరణకు, కార్ఖానాదశలో శ్రమ విభజనలతో బాటుగా యంత్రాల వాడకంతో అదే కాలంలో ఎక్కువగా ముడి సరుకులను ఉపయోగించినందువల్ల ఎక్కువ పరిమాణంలో ముడి సరుకూ, ఉప వస్తువులూ, శ్రమ ప్రక్రియల్లో ప్రవేశిస్తాయి. శ్రామిక ఉత్పాదకత పెరుగుదల పర్యవసానంగా అది జరుగుతుంది. మరోవైపున, యంత్ర సమూహాలూ, గాడిద చాకిరీ, రసాయనిక ఎరువులూ, మురికినీటి గొట్టాలు వగైరాలు శ్రామిక ఉత్పాదకతా పెరుగుదలకు షరతులు. అదే విధంగా భవనాలూ, కొలిమి బట్టీ, రవాణా సాధనాలు వగైరాలుగా కేంద్రీకృతమైన ఉత్పత్తి సాధనాలూ కూడా షరతులుగా వుంటాయి. అయితే అవి షరతులైనా లేక పర్యవసానాలైనా ఉత్పత్తి సాధనాల పెరుగుదల విస్తృతి అందులో ఇమిడి వుండే శ్రమశక్తితో పోల్చినపుడు శ్రామిక ఉత్పాదకత పెరుగుదలకు ఒక వ్యక్తీకరణగా వుంటుంది. అందువల్ల దీని పెరుగుదల కార్మికుల చేత నడపబడే ఉత్పత్తి సాధనాల పరిమాణ నిష్పత్తిలోనే శ్రమ పరిమాణ క్షీణత ద్వారా కనిపిస్తుంది. లేక శ్రమ ప్రక్రియ యొక్క బాహ్యాత్మక కారకంతో పోల్చినపుడు దాని స్వీయాత్మక కారకం యొక్క క్షీణత ద్వారా కనిపిస్తుంది.

పెట్టుబడి యొక్క సాంకేతిక అంతర్నిర్మాణంలోని ఈ మార్పు ఉత్పత్తి సాధనాల పరిమాణంలోని ఈ పెరుగుదలా దీనికి ప్రాణం పోసే శ్రమశక్తి యొక్క పరిమాణంతో పోల్చినపుడు పెట్టుబడిలోని అస్థిర భాగాన్ని తగ్గించడం మూలంగా అందులోని స్థిర భాగం పెరుగుదల ద్వారా దానియొక్క విలువ అంతర్నిర్మాణంలో తిరిగి ప్రతిబింబిస్తుంది. ఉదాహరణకు పెట్టుబడిలో 50 శాతం ఉత్పత్తి సాధనాలకూ, మరో 50 శాతం శ్రమ శక్తికీ మొదట వెచ్చించాదనుకుందాం; శ్రామిక ఉత్పాదకత పెరుగుదల మూలంగా ఆ తర్వాత 80 శాతం ఉత్పత్తి సాధనాలకూ మిగిలిన 20 శాతం శ్రమశక్తికి

వెచ్చించబడవచ్చు. విభిన్న ఆర్థిక యుగాలను గానీ లేక అదే యుగంలో వున్న విభిన్న దేశాలను గానీ పోల్చి సరుకుల ధరల తారతమ్యాన్ని విశ్లేషించడం ద్వారా, అస్థిర పెట్టుబడితో పోల్చినపుడు స్థిర పెట్టుబడి పురోగమన స్థాయిలో పెరుగుతుందనే నియమం అడుగడుగునా ధృవపడుతుంది. (ఇంతకు ముందే చెప్పినట్లు) ఉత్పత్తి సాధనాల విలువకు ప్రాతినిధ్యం వహించే ధర యొక్క సాపేక్ష పరిమాణపు భాగం లేక పెట్టుబడి యొక్క స్థిర భాగం సంచయన పురోగమనానికి అనులోమ నిష్పత్తిలోనూ, పెట్టుబడిలోని అస్థిర భాగానికి ప్రాతినిధ్యం వహించే అనగా ధరలోని మిగిలిన సాపేక్ష పరిమాణం లేక శ్రమకు చెల్లించే ధర సంచయనం పురోగమనానికి విలోమ నిష్పత్తిలోనూ వుంటుంది.

పెట్టుబడిలోని స్థిర భాగంతో పోల్చినపుడు అస్థిర భాగంలోని క్షీణత లేక మార్పు చేయబడిన విలువ అంతర్నిర్మాణం, పెట్టుబడి యొక్క భౌతిక అంశాల అంతర్నిర్మాణంలో వచ్చిన మార్పును ఇంచుమించుగా మాత్రమే తెలియజేస్తుంది. ఉదాహరణకు, ఒకవైపు నుండి చూస్తే పద్దెనిమిదవ శతాబ్దపు ప్రారంభంలో నూలు పరిశ్రమలో నియోగించబడ్డ పెట్టుబడి విలువలో 1/2 వంతులు స్థిర భాగంగానూ, 1/2 వంతులు అస్థిర భాగంగానూ వుంటే, ప్రస్తుతం మొత్తం పెట్టుబడి విలువలో 7/8 వంతులు స్థిర భాగంగానూ, 1/8 వంతులు అస్థిర భాగంగానూ వుంది. మరోవైపున దీనికి భిన్నంగా ఈ రోజున నూలు కార్మికులలోని ఒక నిర్దిష్ట పరిమాణం ఉత్పత్తిదాయకంగా వినియోగించే ముడిసరుకు పరిమాణమూ, శ్రమ సాధనాలు వగైరాలు 18వ శతాబ్దపు ప్రారంభంతో పోల్చినపుడు కొన్ని వందల రెట్లు అధికంగా వుంటుంది. దీనికి కారణం సామాన్యమైనదే. శ్రామిక ఉత్పాదకత పెరగడంతో అది ఉపయోగించే ఉత్పత్తి సాధనాల పరిమాణం పెరగడం మాత్రమే గాక దానితో పోల్చినపుడు వాటి విలువ కూడా క్షీణిస్తుండటమే దీనికి కారణం. అందువల్ల వాటి విలువ సంపూర్ణంగా పెరుగుతుంది. అయితే వాటి పరిమాణపు పెరుగుదల నిష్పత్తిలో మాత్రం కాదు. కాబట్టి స్థిర, అస్థిర పెట్టుబడుల మధ్య వ్యత్యాసంలో గల పెరుగుదల, స్థిర పెట్టుబడిగా మార్చబడిన ఉత్పత్తి సాధనాల పరిమాణానికీ, అస్థిర పెట్టుబడిగా మార్చబడిన శ్రమశక్తి పరిమాణానికి మధ్య గల వ్యత్యాసాని కన్నా చాలా తక్కువగా వుంటుంది. మొదట పేర్కొన్న వ్యత్యాసం, తర్వాత వ్యత్యాసంతో బాటు పెరుగుతుంది; అయితే ఇంకా తక్కువ స్థాయిలో పెరుగుతుంది.

అయితే, సంచయన పురోగమనం, పెట్టుబడిలోని అస్థిర భాగం యొక్క సాపేక్ష పరిమాణాన్ని తగ్గిస్తున్నప్పటికీ అది ఆ విధంగా చేయడం మూలంగా దాని యొక్క సంపూర్ణ పరిమాణంలోని పెరుగుదల అవకాశాన్ని ఏ విధంగానూ మినహాయించలేదు. ఉదాహరణకు ఒకానొక విలువ కలిగిన పెట్టుబడి 50 శాతం స్థిర పెట్టుబడిగానూ, 50 శాతం అస్థిర పెట్టుబడిగానూ మొదట విభజించబడిందనుకుందాం. ఆ తర్వాత అది 80 శాతం స్థిర పెట్టుబడిగానూ, 20 శాతం అస్థిర పెట్టుబడిగానూ విభజించబడిందనుకుందాం; ఉదాహరణకు తొలి పెట్టుబడి 6000 పౌండ్లు అనుకుందాం; కొంత కాలానికి 18,000 పౌండ్లకు అది పెరిగితే దాని అస్థిర భాగం కూడా పెరిగినట్లే; ఆ భాగం అప్పుడు 3000 పౌండ్లు కాగా, ఇప్పుడు 3600 పౌండ్లకు మాత్రమే పెరిగింది; 20 శాతం శ్రమ గిరాకీని పెంచడానికి 20 శాతం పెట్టుబడి మొదట సరిపోయినట్లయితే, ఇప్పుడు అదే 20 శాతం శ్రమ గిరాకీని పెంచడానికి మూడు రెట్లు పెట్టుబడిని పెంచవలసిన అవసరం వుంటుంది.

సామాజిక శ్రమ యొక్క ఉత్పాదకత పెరుగుదలకు భారీ స్థాయిలో సహకారం వుండటం ఎంత అవసరమో నాల్గవ భాగంలో పరిశీలించాం; ఈ ప్రమేయం ఆధారంగానే శ్రమ విభజన, శ్రమ సముదాయాల వ్యవస్థీకరణా, ఏ విధంగా చేయవచ్చునో, భారీస్థాయి కేంద్రీకరణ ద్వారా ఉత్పత్తి సాధనాలను ఏ విధంగా పొదుపు చేయవచ్చునో గ్రహించాం. వాటి సహజ స్వభావం రీత్యా శ్రమ సాధనాలను సహకార ప్రాతిపదికగా ఉపయోగించుకోవడానికి ఏ విధంగా వీలవుతుందో, ఆ విధమైన యంత్రాంగపు వ్యవస్థ ఆవశ్యకత ఏమిటో తెల్సుకున్నాం; ఉత్పత్తి సేవలకు బ్రహ్మాండమైన సహజ శక్తులను ఏ విధంగా రంగంలోకి దించవచ్చో చూశాం; ఉత్పత్తి ప్రక్రియను, శాస్త్ర విజ్ఞానాన్ని అన్వయించుకునే సాంకేతిక ప్రక్రియగా ఏ విధంగా మార్చవచ్చునో కూడా గ్రహించాం. ఆనాటి వ్యవస్థ సరుకుల ఉత్పత్తి వ్యవస్థగా వున్నప్పుడు అనగా, ఉత్పత్తి సాధనాలు ప్రైవేటు వ్యక్తుల ప్రైవేటు ఆస్తి కానున్నప్పుడు, చేతిపని కార్మికుడు (అర్టిజన్) ఇతరులతో నిమిత్తం లేకుండా స్వతంత్రంగానైనా సరుకులను ఉత్పత్తి చేస్తాడు. లేదా స్వతంత్రంగా ఉత్పత్తి చేయడానికి కావలసిన సాధనాలు లేనందువల్ల తన శ్రమశక్తిని సరుకుగానైనా అమ్ముకుంటాడు; అందువల్ల ఆ విధమైన సరుకుల ఉత్పత్తి ప్రాతిపదికపై సహకారం వాస్తవంగా రూపొందాలంటే వైయక్తిక పెట్టుబడుల వృద్ధి ద్వారానూ, సామాజిక ఉత్పత్తి సాధనాలనూ, జీవనాధార సాధనాలనూ పెట్టుబడిదారీ ప్రైవేటు ఆస్తిగా మార్చబడే అనుపాతాన్ని బట్టి మాత్రమే అది సాధ్యమవుతుంది. సరుకుల ఉత్పత్తే పునాదిగా నున్నప్పుడు పెట్టుబడిదారీ రూపంలో మాత్రమే భారీ స్థాయిలో ఉత్పత్తి సాగుతుంది. కాబట్టి; వైయక్తిక పెట్టుబడిదార్ల ఆధీనంలో కొంత పెట్టుబడి పోగుపడటమే ప్రత్యేకించి పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానానికి ఆవశ్యకమైన ముందు షరతుగా వుంటుంది. అందువలన చేతి వృత్తుల నుండి పెట్టుబడిదారీ పరిశ్రమకు మార్పు చెందడాన్ని పరిశీలించేటప్పుడు ఈ ప్రమేయాన్ని మనం దృష్టిలో వుంచుకోవలసి వచ్చింది. పెట్టుబడిదారీ ఉత్పత్తి యొక్క చారిత్రక ఫలితంగా కాక, ప్రత్యేకించి దాని యొక్క చారిత్రక పునాదిగా వున్నందువల్లనే దీనిని ప్రాథమిక సంచయనంగా పిలుస్తాం. అది ఏ విధంగా ఉద్భవిస్తుందో ఇక్కడ ఇంకా పరిశీలించాల్సిన అవసరం రాలేదు. అది ప్రారంభ రూపమని చెప్తే ఇక్కడ సరిపోతుంది. శ్రమ యొక్క సామాజిక ఉత్పాదకతా శక్తిని పెంచడానికి ఈ ప్రాతిపదికపై అనుసరించిన పద్ధతులన్నీ కూడా సంచయనానికి రూపాన్నిచ్చే మూలాంశమైన అదనపు విలువా, లేక అదనపు ఉత్పాదితం యొక్క ఉత్పత్తి పెరుగుదలకు అనుసరించే పద్ధతులే. అందువల్ల ఆ పద్ధతులన్నీ కూడా పెట్టుబడి ద్వారా పెట్టుబడిని ఉత్పత్తి చేసే పద్ధతులే లేక సంచయనాన్ని శీఘ్రతరం చేసే పద్ధతులే. అదనపు విలువను నిరంతరాయంగా తిరిగి పెట్టుబడిగా మార్పు చేసే ఈ ప్రక్రియ ఉత్పత్తి ప్రక్రియలో ప్రవేశించే పెట్టుబడి పరిమాణంగా నానాటికీ అధికమవుతుందని స్పష్టమవుతుంది. విస్తృత స్థాయిలో ఉత్పత్తికి, తదనుగుణంగా శ్రామిక ఉత్పాదకతా పెరుగుదలకీ, శీఘ్రగతిని అదనపు విలువను ఉత్పత్తి చేయడానికీ, తిరిగి ఈ పునఃమార్పిడే పునాదిగా వుంటుంది. కాబట్టి కొంత పెట్టుబడి పోగుపడటమే ప్రత్యేకించి పెట్టుబడిదార్ల ఉత్పత్తి విధానానికి ముందు షరతుగా భావించినట్లయితే తిరిగి ఆ పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం, పెట్టుబడిదారీ సంచయనాన్ని శీఘ్రతరం చేయడానికి దోహదపడుతుంది. కాబట్టి పెట్టుబడి సంచయనం వల్ల ప్రత్యేకించి పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానానికి ముందు షరతుగా భావించినట్లయితే తిరిగి ఆ పెట్టుబడిదారీ

ఉత్పత్తి విధానం ఆ పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానంతో బాటుగా పెట్టుబడి సంచయనం అభివృద్ధి చెందుతాయి. తాము పరస్పరం జోక్యం చేసుకునే ప్రేరణల మిశ్రమ నిష్పత్తిలోనే ఈ రెండు ఆర్థిక కారకాంశాలూ పెట్టుబడి యొక్క సాంకేతిక అంతర్నిర్మాణంలో మార్పు తీసుకురావడం ద్వారా స్థిర పెట్టుబడితో పోల్చినపుడు అస్థిర పెట్టుబడి ఎల్లప్పుడూ తక్కువగా వుండటానికి కారణాలవుతాయి.

ప్రతి వైయక్తిక పెట్టుబడి స్వల్పంగా కానీ లేక అధికంగా కానీ ఉత్పత్తి సాధనాల సాంద్రీకరణ గానూ తదనుగుణ్యంగా స్వల్పంగా కానీ, లేక అధికంగా కానీ శ్రామిక సైన్యంపై ఆధిపత్యం కలిగి వుంటుంది. ప్రతి సంచయనం నూతన సంచయనానికి సాధనంగా రూపొందుతుంది. పెట్టుబడిగా క్రియను నిర్వర్తించే సంపద పరిమాణం పెరిగేకొలదీ సంచయనం మూలంగా వైయక్తిక పెట్టుబడిదార్ల ఆధీనంలో ఆ సంపద కేంద్రీకరణ అధికమవువుతుంది; తద్వారా భారీ స్థాయిలో ఉత్పత్తి యొక్క పునాదీ, పెట్టుబడిదారీ ఉత్పత్తికి సంబంధించిన ప్రత్యేక పద్ధతులూ విస్తృతమవుతాయి. అనేకమైన వైయక్తిక పెట్టుబడుల అభివృద్ధి ఫలితంగా సామాజిక పెట్టుబడి పెంపొందుతుంది. ఇతర పరిస్థితులన్నీ యధాతథంగా వున్నప్పుడు వైయక్తిక పెట్టుబడులు వాటితోబాటుగా ఉత్పత్తి సాధనాల కేంద్రీకరణా మొత్తం సామాజిక పెట్టుబడిలో శేషించిన భాగాలుగా అవి ఏ నిష్పత్తిలో వుంటే అదే నిష్పత్తిలో అవి పెరుగుతాయి. అదే సమయంలో తొలి పెట్టుబడిలో కొన్ని భాగాలు పునర్విభజనకు గురై, నూతన స్వతంత్రపెట్టుబడులుగా క్రియను నిర్వర్తిస్తాయి. దీనికి ఇంకా ఇతర కారణాలువున్నా పెట్టుబడిదారీ కుటుంబాలలో జరిగే ఆస్తుల పంపకం ఇందులో ఒక ప్రముఖ పాత్ర వహిస్తుంది. కాబట్టి పెట్టుబడి సంచయనంతో బాటుగా పెట్టుబడిదార్ల సంఖ్య కూడా తగు మోతాదులో పెరుగుతుంది. సంచయనం ద్వారా నేరుగా పెరిగే సాంద్రీకరణ లేక ఇంకా చెప్పాలంటే ఆ సంచయన రూపంలో వుండే ఈ విధమైన సాంద్రీకరణను రెండు లక్షణాలు వర్గీకరిస్తాయి. మొదటిది : మిగతా పరిస్థితులు యధాతథంగా వున్నప్పుడు, వైయక్తిక పెట్టుబడిదార్ల ఆధీనంలో వుండే సామాజిక ఉత్పత్తి సాధనాల సాంద్రీకరణ పెరుగుదల సామాజిక సంపద పెరుగుదల స్థాయి ద్వారా పరిమితం చేయబడుతుంది. రెండవది : ప్రత్యేకమైన ప్రతి ఉత్పత్తి రంగంలోనూ స్థావరం ఏర్పర్చుకున్న సామాజిక పెట్టుబడిలోని ఆ భాగం అనేకమంది పెట్టుబడిదార్ల మధ్య విభజించబడుతుంది; ఆ పెట్టుబడిదార్లు స్వతంత్రమైన సరుకు ఉత్పత్తిదార్లుగా పరస్పరం పోటీపడుతూ ఒకరినొకరు ఎదుర్కొంటారు. కాబట్టి, సంచయనమూ, తదనుసారంగా సంభవించే సాంద్రీకరణా, అనేక స్థానాల్లో వెదజల్లబడి వుండటమే గాక నూతన పెట్టుబడుల ఏర్పాటూ, పాత పెట్టుబడుల ఉప విభజనల ద్వారా ప్రతి క్రియాత్మక పెట్టుబడి పెరుగుదలకు అవరోధం కలుగుతుంది. అందువలన సంచయనం ఒక వైపున ఉత్పత్తి సాధనాల సాంద్రీకరణగానూ, శ్రమపై ఆధిపత్యంగానూ కనిపిస్తే, మరోవైపున అనేకమైన వైయక్తిక పెట్టుబడిదార్ల పరస్పర వికర్షణగా గోచరిస్తుంది.

మొత్తం సామాజిక పెట్టుబడి ఈ విధంగా అనేక వైయక్తిక పెట్టుబడులుగా చీలిపోవడానికి లేక దాని చిన్న చిన్న భాగాలు పరస్పర వికర్షణను వాటి మధ్య గల ఆకర్షణ తటస్థీకరిస్తుంది. ఉత్పత్తి సాధనాల సామాన్య సాంద్రీకరణ గాని, దానికి శ్రమపై గల ఆధిపత్యం గాని లేక వీటికి సమాన రూపంలో వుండే సంచయనం గానీ ఏమాత్రము పెట్టుబడి ఆకర్షణ అనే అర్థం కాదు. ఇదివరకే

ఏర్పడిన పెట్టుబడుల సాంద్రీకరణ, వాటి వైయక్తిక స్వాతంత్ర్యాల విధ్వంసన, పెట్టుబడిదార్ల చేతనే పెట్టుబడి దారుని ఆస్తిహరణం, అనేక చిన్న చిన్న పెట్టుబడులు పెద్ద పెట్టుబడులుగా మారడమే పెట్టుబడుల ఆకర్షణ యొక్క భావం. అదివరకే చేతికందుబాటులో వుండే క్రియాత్మక పెట్టుబడి పంపిణీలో మార్పు జరిగి వుండాలనే అంశంలోనే ఈ ప్రక్రియ సంచయన ప్రక్రియతో విభేదిస్తుంది; అందువలన సామాజిక సంపద యొక్క సంపూర్ణ పెరుగుదల ద్వారా గానీ లేక సంచయనం యొక్క సంపూర్ణ పరిమితుల ద్వారా గానీ దీని కార్యరంగం పరిమితం కాదు. ఒకే స్థానంలో, ఒకరి ఆధీనంలో పెట్టుబడి విస్తారంగా పెరుగుతున్నదంటే, మరొక స్థానంలో అనేక మంది దానిని కోల్పోతున్నట్లే. సాంద్రీకరణకీ, సంచయనానికీ భిన్నంగా వుండే ఈ ప్రక్రియనే కేంద్రీకరణ అంటాం.

పెట్టుబడుల కేంద్రీకరణ లేక పెట్టుబడిని పెట్టుబడి ఆకర్షించడానికి సంబంధించిన సూత్రాలను ఇక్కడ పరిపూర్ణంగా వివరించలేము.అయితే కొన్ని వాస్తవాలను క్లుప్తంగా ఉటంకిస్తే సరిపోతుంది. సరుకుల్ని చౌకగావించడం ద్వారా పోటీ యుద్ధం నడపబడుతుంది. ఇతర పరిస్థితులలో మార్పు లేనప్పుడు సరుకుల చౌకదనం శ్రమ ఉత్పాదకతపై ఆధారపడి వుంటుంది. తిరిగి ఈ శ్రామిక ఉత్పాదకత ఉత్పత్తి స్థాయిపై ఆధారపడి వుంటుంది. అందువలన పెద్ద పెట్టుబడులు చిన్న పెట్టుబడులను దిగమింగుతాయి. ఇంతేగాక పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం అభివృద్ధి చెందే కొలదీ ఏదైనా వ్యాపారాన్ని దాని సాధారణ పరిస్థితులలో కొనసాగించడానికి అవసరమైన కనిష్ట వైయక్తిక పెట్టుబడి మొత్తం కూడా పెరుగుతుందనే అంశాన్ని సహితం గుర్తుంచుకోవాలి. అందువల్ల తక్కువ పరిమాణంలో వుండే పెట్టుబడులన్నీ చెదురుమదురుగా లేక అసంపూర్ణంగా మాత్రమే ఆధునిక భారీ పరిశ్రమ చెప్పుచేతలలోని ఉత్పత్తి రంగాలలో గుంపులుగా వుంటాయి. ఇక్కడ, వైషమ్యం కల్గిన పెట్టుబడుల మధ్య సంఖ్యరీత్యా అనులోమ నిష్పత్తిలోనూ, పరిమాణం రీత్యా విలోమ నిష్పత్తిలోను పోటీ తీవ్రమవుతుంది. ఫలితంగా అనేకమైన చిన్న పెట్టుబడిదార్ల పెట్టుబడులలో కొంత భాగం వారి విజేతల చేజిక్కుతుంది; మిగతా భాగం అదృశ్యమై పోయి చిన్న పెట్టుబడిదార్ల వినాశనంతోనే ఈ పోటీ ఎల్లప్పుడూ అంతమవుతుంది. అదటుంచి, పెట్టుబడిదారీ ఉత్పత్తితో బాటుగా పరపతి వ్యవస్థ అనే పూర్తిగా నూతనమైన శక్తి ఒకటి రంగ ప్రవేశం చేస్తుంది. సామాజిక ఉపరితలంలో పెద్ద మొత్తాలుగానో లేక చిన్న మొత్తాలుగానో చెదురుమదురుగా ఉండే డబ్బు వనరులను కనిపించని మార్గాల ద్వారా వైయక్తిక పెట్టుబడిదార్ల లేక వారి ముఠాల చేజిక్కేటట్లుగానూ, సంచయనానికి వినయపూర్వకమైన బంటుగానూ దాని మొదటి దశలలో* ఈ పరపతి వ్యవస్థ అతి రహస్యంగా చొచ్చుకుపోతుంది; అయితే అనతికాలంలోనే ఇది ఒక నూతనమైన, శక్తివంతమైన ఆయుధంగా పోటీ యుద్ధంలో ప్రవేశించడమే గాక చివరకు పెట్టుబడుల కేంద్రీకరణకు దోహదపడే ఒక సామాజిక మహా యంత్రాంగంగా మారుతుంది.

---

* మూల గ్రంథంలోని అదే పేరాలో ''దాని మొదటి దశ నుండి.... కేంద్రీకరణకు దారితీసే చలనం వరకూ ఏంగిల్స్ రాసి 4వ జర్మన్ ముద్రణకు జోడించాడు. దీనికి అనుగుణంగానే ఇంగ్లీషు మూలం తయారు చేయబడింది.

పెట్టుబడిదారీ ఉత్పత్తి సంచయనాలతో బాటుగా కేంద్రీకరణకు దోహదపడే పోటీ, పరపతి అనే రెండు శక్తివంతమైన సాధనాలు కూడా అదే స్థాయిలో వృద్ధి చెందుతాయి. అదే సమయంలో కేంద్రీకరణకు అనుకూలమైన భౌతికాంశాలను అనగా వైయక్తిక పెట్టుబడులను సంచయన పురోగమనం పెంచుతూ వుంటే అపారమైన సామాజిక ఆవశ్యకత ఒక వైపునా, మరోవైపున సాంకేతిక సాధన సంపత్తీ, పెట్టుబడిదారీ ఉత్పత్తి వ్యాప్తి మూలంగా సృష్టించబడతాయి; ఈ పారిశ్రామిక సంస్థలను పరిపూర్తి గావించడానికీ, అంతకు ముందే పెట్టుబడి కేంద్రీకరణ జరిగి వుండాలి. కాబట్టి ఈ రోజున వైయక్తిక పెట్టుబడులను దగ్గరకు చేర్చే ఆకర్షణ శక్తి, కేంద్రీకరణ ధోరణీ గతంలో కంటే ఎప్పుడూ బలోపేతంగా వున్నాయి. అయితే పెట్టుబడిదారీ సంపద పరిమాణం మూలంగానూ అదివరకే వున్న ఆర్థిక యంత్రాంగం ఉన్నత స్థితికి చేరుకోవడం మూలంగానూ, కేంద్రీకరణవైపుకు వుండే ధోరణుల సాపేక్ష వ్యాప్తీ, శక్తీ ఒక మేరకు నిర్ణయించబడినట్లయితే కేంద్రీకరణ పురోగమనం ఏ విధంగానూ సామాజిక పెట్టుబడి యొక్క పరిమాణంలోని ధనాత్మక పెరుగుదల మీద ఆధారపడి వుండదు. కేంద్రీకరణకు, సాంద్రీకరణకు మధ్య నున్న నిర్దిష్టమైన వ్యత్యాసం ఇదే; విస్తృత స్థాయిలో జరిగే పునరుత్పత్తికి మరొక పేరే సాంద్రీకరణ. అది వరకే వున్నపెట్టుబడుల పంపిణీలో కేవలం మార్పు జరిగిన ఫలితంగానూ, సామాజిక పెట్టుబడిలోని విడి భాగాల పరిమాణాత్మక సముదాయాలలో సామాన్య మార్పు ఫలితంగానూ కేంద్రీకరణ జరగవచ్చును. అనేకమైన వైయక్తిక పెట్టుబడిదార్లు పెట్టుబడిని కోల్పోవడం మూలంగానూ ఒకే వ్యక్తి ఆధీనంలో శక్తివంతమైన పరిమాణాలలో పెట్టుబడి ఇక్కడ పెరుగుతుంది. ఏదైనా ఒక పారిశ్రామిక విభాగంలోని వైయక్తిక పెట్టుబడులన్నీ ఒకే పెట్టుబడిగా కలిపి వేయబడినట్లయితే కేంద్రీకరణ దాని అంతిమ పరిమితికి చేరుకుంటుంది.[1] ఒకానొక సామాజిక వ్యవస్థలోని మొత్తం సామాజిక పెట్టుబడి అంతా కలిపి ఒక వ్యక్తి ఆధీనంలోకి గానీ లేక ఒక పెట్టుబడిదారీ వ్యాపార సంస్థ ఆధీనంలోకి గానీ వచ్చినపుడు మాత్రమే అది ఆ పరిమితికి చేరుకుంటుంది.

పారిశ్రామిక పెట్టుబడిదార్లు వారి కార్యకలాపాలను వ్యాప్తి చేసుకోవడానికి అవకాశం కలిగించడం ద్వారా సంచయనానికి సంబంధించిన ఈ పనిని కేంద్రీకరణ పూర్తి చేస్తుంది. సంచయనం లేక కేంద్రీకరణ పర్యవసానంగా పారిశ్రామిక పెట్టుబడిదార్ల కార్యకలాపాల వ్యాప్తి జరిగినా గానీ లేక బలవంతంగా కలుపుకునే పద్ధతుల ద్వారా కేంద్రీకరణ సాధించబడినా గానీ ఇక్కడ వైయక్తిక పెట్టుబడుల కలయికలను బద్దలు కొట్టే శక్తిమంతమైన ఆకర్షణ కేంద్రాలుగా కొన్ని పెట్టుబడులు తయారై, ఆ ముక్క చెక్కలను తమలో కలుపుకుంటాయి. లేక బహుళంగా వుండే పెట్టుబడులు ఇదివరకే కలిసిపోయినా లేక ఉమ్మడి వాటా కంపెనీలను ఏర్పాటు చేసుకోవడం ద్వారా నెమ్మదిగా కలిసిపోయే క్రమంలో వున్నా గానీ – ఆర్థిక ప్రభావం మాత్రం యధాతథంగా వుంటుంది. ప్రతి సందర్భంలోనూ, అధిక సంఖ్యాకుల సహకారం యొక్క సమగ్ర వ్యవస్థీకరణ కొరకు వారి భౌతిక ప్రేరణల ఉన్నత వికాసానికీ

---

1. (నాల్గవ జర్మన్ ముద్రణకు ఏంగెల్స్ జోడించిన అంశం) ఇంగ్లాండ్‌లోనూ, అమెరికాలోనూ ఉన్న ట్రస్టులనూ, భారీ స్థాయి సంస్థలనూ ఒకే పెద్ద పరిశ్రమలో కలిపి వేయడం ద్వారా భారీ స్థాయి ఉమ్మడి వాటా కంపెనీలుగా మార్పు చేసి గుత్తాధిపత్యాన్ని సంపాదించడానికి ప్రయత్నిస్తున్నారు.

అనగా సాంప్రదాయక పద్ధతుల ద్వారా నిర్వహించబడుతూ, విడివిడిగా ఉండే ఉత్పత్తి ప్రక్రియలను సామాజికంగా సహకరించే రీతిలో శాస్త్రీయ పద్ధతిలో ఏర్పాటు చేయబడిన ఉత్పత్తి ప్రక్రియలుగా క్రమేపీ మార్పు చేయడానికీ ఈ పారిశ్రామిక సంస్థల విస్తరణ స్థాయి ప్రారంభాంశంగా వుంటుంది.

అయితే సామాజిక పెట్టుబడిలోని అంతర్గత భాగాల పరిమాణపు సముదాయాలను మార్చే పనిని మాత్రమే చేసే కేంద్రీకరణతో పోల్చినపుడు, పునరుత్పత్తి ద్వారా వర్తులాకారాన్నుండి (సర్క్యులర్) సర్పిలాకారానికి (స్పైరల్) మార్పు చెందుతూ క్రమేపీ వృద్ధి చెందే పెట్టుబడి అయిన సంచయనము చాలా నిదానమైన ప్రక్రియగా వుంటుంది. ఒక రైల్వే నిర్మాణానికి కావలసినంత మోతాదులో కొన్ని వైయక్తిక పెట్టుబడులు పెరిగి చివరకు సంచయనం జరిగే వరకు మనం వేచి వుండాల్సి వస్తే, ప్రపంచం ఇప్పటి వరకు రైళ్లు లేకుండానే ఉండిపోయేది. దీనికి భిన్నంగా ఉమ్మడి వాటా కంపెనీల ద్వారా రెప్పపాటులో కేంద్రీకరణ దీనిని పూర్తి చేసింది. ఆ విధంగా సంచయన ప్రభావాన్ని కేంద్రీకరణ తీవ్రతరమూ, శీఘ్రతరమూ చేస్తూ అదే సందర్భంలో పెట్టుబడి సాంకేతిక అంతర్నిర్మాణంలోని విప్లవాల పరిధిని విస్తృతం చేస్తూ త్వరిత పరుస్తుంది. ఫలితంగా అస్థిర భాగం నష్టపోయే విధంగా స్థిర భాగం పెరిగి, ఆ విధంగా శ్రామిక సాపేక్ష గిరాకీ క్షీణిస్తుంది.

కేంద్రీకరణ ద్వారా అతి స్వల్ప కాలంలోనే కలిపి వేయబడిన పెట్టుబడి రాశులు ఇతర పెట్టుబడులలాగానే అంతకంటే త్వరితగతిన పునరుత్పత్తి అవుతూ, పెంపొందుతూ తద్వారా సామాజిక సంచయనానికి నూతనమైన, శక్తివంతమైన సాధనాలుగా రూపొందుతాయి. కాబట్టి సామాజిక సంచయన పురోగమనాన్ని ప్రస్తావించే సందర్భంలో కేంద్రీకరణ ప్రభావాలను కూడా సూచన ప్రాయంగా ఇక్కడ తెలియజేస్తాం.

సంచయనపు సాధారణ క్రమంలో రూపొందిన అదనపు పెట్టుబడులు (24 అధ్యాయంలోని ఒకటవ విభాగం చూడండి) నూతన ఆవిష్కరణలను వినియోగించుకోవడానికీ, పారిశ్రామిక రంగ పురోభివృద్ధికీ ప్రత్యేక సాధనాలుగా పని చేస్తాయి. అయితే అనతి కాలంలోనే పాత పెట్టుబడులు కూడా పూర్తిగా పునఃమార్పిడి చేయవలసిన స్థితికి చేరుకుంటాయి. ఆ పెట్టుబడులు తమ పాత రూపాలను వదులుకుని మిగతా వాటిలాగే మెరుగైన సాంకేతిక రూపంలో తిరిగి రంగ ప్రవేశం చేస్తాయి; అప్పుడు పెద్ద పరిమాణంలో యంత్రాలను అత్యధిక మోతాదులో ముడిసరుకులను ఉపయోగించుకోవడానికి తక్కువ పరిమాణంలో శ్రమ సరిపోతుంది. దీనిననుసరించే కేంద్రీకరణ పర్యవసానంగా, అదివరకే రాశి చేయబడిన పెట్టుబడులు పునః మార్పిడి ప్రక్రియ స్థాయి కూడా ఎక్కువగా వుంటుంది; ఫలితంగా తప్పనిసరిగా శ్రమ గిరాకీలో వచ్చే సంపూర్ణ క్షీణత చాలా ఎక్కువగా వుంటుంది.

కాబట్టి ఒక వైపున సంచయన క్రమంలో రూపొందిన అదనపు పెట్టుబడీ, దాని పరిమాణంతో పోల్చినప్పుడు అతి తక్కువ కార్మికులను ఆకర్షిస్తుంది. (పనిలో పెట్టుకోగలుగుతుంది) మరోవైపున కాలక్రమంలో పునరుత్పత్తి చేయబడిన పాత పెట్టుబడి అంతర్నిర్మాణంలో వచ్చిన మార్పులతో అది అంతకుముందే వినియోగించుకున్న కార్మికులను అధికాధికంగా వికర్షిస్తుంది (పనిలో నుండి తీసివేస్తుంది)

## విభాగం - 3

# సాపేక్ష అదనపు జనాభా లేక పారిశ్రామిక రిజర్వు సైన్యం క్రమానుగతంగా పెరుగుదల

ప్రారంభంలో, దాని పరిమాణాత్మక విస్తరణగా మాత్రమే కనిపించే పెట్టుబడి సంచయనాన్ని మనం గతంలో పరిశీలించినట్లుగా, దాని అంతర్నిర్మాణంలో క్రమానుగతంగా గుణాత్మకమైన మార్పు తీసుకురావడం ద్వారా, అనగా దానిని అస్థిర భాగం నష్టపోయే రీతిలో స్థిరభాగాన్ని పెంచడం ద్వారా కోరిన విధంగా ప్రభావితం చేయవచ్చు.[1]

పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానమూ, దాని ననుసరించి వుండే శ్రామిక ఉత్పాదకతా శక్తి పెరుగుదలా, ఫలితంగా అప్పుడు పెట్టుబడి సజీవ అంతర్నిర్మాణంలో సంభవించే మార్పూ, సంచయన పురోగమనంతో గానీ, లేక సామాజిక సంపద పెరుగుదలతో గానీ సమాన స్థాయిలో మాత్రమే ప్రత్యేకించి పెరగవు. అవి అంతకంటే ఎక్కువ శాతంలో త్వరితగతిన పెరుగుతాయి; సాధారణ సంచయనమూ, లేక మొత్తం సామాజిక పెట్టుబడి యొక్క సంపూర్ణ విస్తరణ, దాని వైయక్తిక పెట్టుబడుల కేంద్రీకరణా దాని సరసనే వుంటున్నందువల్లనూ, అదనపు పెట్టుబడి సాంకేతిక అంతర్నిర్మాణంలో వచ్చే మార్పులూ, తొలిపెట్టుబడి సాంకేతిక అంతర్నిర్మాణంలో వచ్చే అదే విధమైన మార్పులూ, చెట్టపట్టాలేసుకుని ప్రయాణిస్తున్నందు వల్లనూ, అవి అంతకు మించి త్వరతగతిని అభివృద్ధి చెందుతాయి. కాబట్టి సంచయనాభివృద్ధితో బాటుగా స్థిర, అస్థిర పెట్టుబడుల నిష్పత్తి కూడా మారుతుంది. ఆరంభంలో, ఉదాహరణకు, ఆ నిష్పత్తి 1:1గా ఉందనుకుందాం; పెట్టుబడి అధికమయ్యే కొలదీ ఆ పెట్టుబడి మొత్తం విలువలో పూర్వపు 1/2 భాగానికి బదులుగా, ఇప్పటి నుండి 1/3, 1/4, 1/5, 1/6, 1/8 వగైరా భాగం మాత్రమే శ్రమశక్తిగా మార్చబడుతుంది. మరోవైపున అందులో 2/3, 3/4, 4/5, 5/6, 7/8 వగైరా భాగం ఉత్పత్తి సాధనాలుగా మార్చబడుతుంది. అనగా స్థిర పెట్టుబడి, అస్థిర పెట్టుబడుల మధ్య నిష్పత్తి, క్రమానుగతంగా ఇప్పుడు 2:1, 3:1, 4:1, 5:1, 7:1, వగైరాగా మారుతుంది. శ్రమకు వుండే గిరాకీ మొత్తం పెట్టుబడి ద్వారా గాక ఆ పెట్టుబడిలో వుండే అస్థిర భాగం ద్వారా మాత్రమే నిర్ణయించబడుతున్నందు వల్ల, మొత్తం పెట్టుబడి పెరిగే కొలదీ గతంలో ఊహించినట్లుగా దాని అనుపాతంలో పెరగటానికి బదులుగా ఆ గిరాకీ క్రమానుగతంగా పడిపోతుంది. మొత్తం పెట్టుబడి పరిమాణానికి సాపేక్షకంగా, ఆ పరిమాణం పెరిగే కొలదీ, శీఘ్రతర శాతంలో అది పడిపోతుంది. మొత్తం పెట్టుబడి పెరుగుదలతో బాటుగా దాని అస్థిర భాగం లేక అందులో ఇమిడి వున్న శ్రమ కూడా కొంత పెరిగినప్పటికీ, ఆ పెరుగుదల నిష్పత్తి నిరంతరం క్షీణిస్తూనే వుంటుంది. ఒకానొక సాంకేతిక పునాదిపై ఉత్పత్తి సాధారణ విస్తరణగా పనిచేసే సంచయనపు మధ్యంతర విరామాలు కుదించబడతాయి. కార్మికులను అదనపు సంఖ్యలో నియమించుకోవాలన్నా లేక పాత పెట్టుబడి

---

1. (మూడవ జర్మన్ ముద్రణకు ఏంగిల్స్ జోడించిన అంశం) మార్క్స్ స్వదస్తూరితోనే మార్జిన్‌లో ఈ అంశం వున్నది : "ఆ తర్వాత పూర్తి చేయబడడానికి ఇక్కడ పొందుపరచిన అంశం : ఈ విస్తరణే గనుక పరిమాణాత్మకమైతే, అదే వ్యాపారంలోని ఎక్కువ పెట్టుబడికైనా, తక్కువ పెట్టుబడికైనా, అడ్వాన్సు చేసిన పెట్టుబడి పరిమాణాలననుసరించి లాభాలు వస్తాయి. ఈ పరిమాణాత్మకమైన విస్తరణ, గుణాత్మక మార్పుకు దారి తీస్తే. అప్పుడు ఎక్కువ పెట్టుబడి మూలంగా వచ్చే లాభాలు పెరుగుతాయి."

నిరంతరం రూపాంతీకరణ జరుగుతూనే వున్నందువల్ల అదివరకే పనిచేస్తున్న కార్మికుల నియమకాన్ని కొనసాగించాలన్నా మొత్తం పెట్టుబడి యొక్క సంచయనం శీఘ్రతరంగా పెరిగింత మాత్రాన సరిపోదు; అది నిరంతరాయంగా పురోగమన రీతిలో శీఘ్రగతిని పెరగాలి. సంచయనంలోని ఈ పెరుగుదలా, కేంద్రీకరణా వీటి వంతుకు ఇవి పెట్టుబడి అంతర్నిర్మాణంలోని నూతన మార్పులకూ, దాని స్థిర భాగంతో పోల్చినపుడు అస్థిర భాగం ఈ క్షీణత, మొత్తం పెట్టుబడిలో శీఘ్రతరంగా వుండే పెరుగుదల ననుసరించే, ఆ పెరుగుదల కంటే ఇంకా వేగంగా విలోమ నిష్పత్తిలో క్షీణిస్తుంది; మరో ధృవాన అస్థిర పెట్టుబడి లేక నియోగ సాధనాల పెరుగుదల కన్నా శ్రామిక జనాభాలోని సంపూర్ణ పెరుగుదల ఎల్లప్పుడూ ఇంకా వేగంగా వున్నట్లుగా కనిపిస్తుంది. అయితే, యధార్థానికి పెట్టుబడిదారీ విధానపు సంచయనమే దాని శక్తి సామర్థ్యాలకు అనులోమ నిష్పత్తిలో కార్మికులలో సాపేక్ష అదనపు జనాభాను నిరంతరాయంగా ఉత్పత్తి చేస్తుంది; అనగా పెట్టుబడి స్వీయాభివృద్ధి సగటు అవసరాలకు సరిపోయేదాని కన్నా అత్యధిక మోతాదులో జనాభాను సృష్టించేది స్వయాన పెట్టుబడిదారీ సంచయనమే; అందువలన అది మాత్రమే అదనపు జనాభాను ఉత్పత్తి చేస్తుంది.

సామాజిక పెట్టుబడిని దాని సమగ్రతలో పరిశీలించినట్లయితే, దాని సంచయనపు ధోరణులే కొన్ని సందర్భాలలో నియమిత కాలంలో ఆ సామాజిక పెట్టుబడిలోని మార్పులకు కారణమవుతాయని స్పష్టమవుతుంది. మరికొన్ని సందర్భాలలో ఉత్పత్తిలోని విభిన్న రంగాలకు దాని వివిధ దశలను ఏకకాలంలో పంపిణీ చేస్తుంది. కొన్ని రంగాలలో సామాన్య కేంద్రీకరణ పర్యవసానంగా పెట్టుబడి యొక్క సంపూర్ణ పరిమాణంలో పెరుగుదల లేకుండానే పెట్టుబడి అంతర్నిర్మాణంలో మార్పు వస్తుంది; మరికొన్ని రంగాలలో పెట్టుబడి యొక్క సంపూర్ణ పెరుగుదల, దాని యొక్క అస్థిర భాగపు సంపూర్ణ క్షీణతలో లేక అది ఇముడ్చుకో కలిగిన శ్రమశక్తిని ఆకర్షిస్తుంది, మరికొన్ని సందర్భాలలో సజీవ అంతర్నిర్మాణం మార్పులకులోనై, దాని అస్థిర భాగాన్ని తగ్గించి వేస్తుంది; అన్ని రంగాలలోనూ పెట్టుబడిలోని అస్థిర భాగపు పెరుగుదలా, అందువలన అది నియోగించుకోగలిగిన కార్మికుల సంఖ్యా, తాత్కాలికంగా ఉత్పత్తి అయిన అదనపు జనాభాతోనూ, నియమరహితమైన తీవ్ర మార్పులతోనూ ఎల్లప్పుడూ సంబంధం కలిగి వుంటుంది; అయితే ఆ సంబంధం అదివరకే నియోగించబడి వున్న కార్మికులను స్పష్టంగా వికర్షించే రూపంలోనైనా వుండవచ్చు లేక అవాస్తవం గాకపోయినా అస్పష్టంగా నైనా సాధారణ మార్గాల ద్వారా అదనపు శ్రామిక జనాభాను అతికష్టం మీద ఇముడ్చుకునే రూపంలోనైనా వుండవచ్చు.[1] అదివరకే క్రియను నిర్వర్తిస్తున్న సామాజిక పెట్టుబడి యొక్క పరిమాణమూ, దాని

1. ఇంగ్లాండ్, వేల్స్ జనాభా లెక్కల ప్రకారం - వ్యవసాయంలో నియోగించబడిన వ్యక్తులు (భూస్వాములూ, రైతులూ, తోటి పనివారూ, గొర్రెలకాపర్లు మొదలగువారు (1851లో 2011447, 1861లో 1924110. తగ్గిన వారి సంఖ్య 87337, వార్స్టెడ్ కార్ఖానాలో 1851లో 102714 మంది వ్యక్తులు వుండగా 1861లో 79242 మంది వున్నారు; పట్టు పరిశ్రమలో 1851లో 111940 మంది వుండగా 1861లో 101678 మంది వున్నారు; కాలికో అద్దకంలో 1851లో 12098 మంది వుండగా 1861లో 12556 మంది వున్నారు. ఈ పరిశ్రమ బ్రహ్మాండంగా పెరిగినప్పటికీ నియోగించుకున్న కార్మికుల సంఖ్యలో కొద్ది పెరుగుదల మాత్రమే వుంది. ఫలితంగా దాని పెరుగుదలతో పోల్చినపుడు నియమించబడిన వారి నిష్పత్తి తగ్గిపోయింది; టోపీల పరిశ్రమలో 1851లో 15957 మంది వుండగా 1861లో 13814 మంది వున్నారు; లుంగటోపీలు,

పెరుగుదల స్థాయితో బాటుగా ఉత్పత్తి స్థాయి విస్తరించడమూ, గణనీయమైన సంఖ్యలో కార్మికులను నియమించడంతో బాటుగా శ్రామిక ఉత్పాదకతా శక్తి పెరుగుదలా, సంపద సకల మూలాధారాల సంపూర్ణ విస్తృతితో బాటుగా ఉత్పత్తి స్థాయిని పెంచడం మూలంగా కార్మికులను అధిక సంఖ్యలో నియమించుకోవడంతో బాటుగా వారిని అధికసంఖ్యలో ఉద్యోగం నుండి తొలగించి వేసే సందర్భాలు కూడా వుంటాయి; పెట్టుబడి యొక్క సజీవ అంతర్నిర్మాణంలోనూ, దాని సాంకేతిక రూపంలోనూ త్వరితగతిని వచ్చే మార్పులలో ఉత్పత్తిలోని అన్ని రంగాలు గణనీయమైన సంఖ్యలో కొన్ని సందర్భాలలో ఏకకాలంలోనూ, మరికొన్ని సందర్భాలలో ప్రత్యామ్నాయంగానూ చిక్కుకుపోతాయి. అందువలన శ్రామిక జనాభా పెట్టుబడి సంచయనాన్ని సృష్టించడమే గాక తనను తానే సాపేక్షికంగా అనావశ్యకం గావించుకునే సాధనాలను కూడా ఉత్పత్తి చేస్తుంది; ఆ విధంగా అది ఎప్పుడూ అత్యధిక మోతాదులో చేస్తూనే వుంటుంది.[1] ఇదే పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానపు విలక్షణ జనాభా సిద్ధాంతం. వాస్తవానికి

---

బోనెట్ టోపీల పరిశ్రమలో 1851లో 20393 మంది వుండగా 1861లో 18176 మంది వున్నారు. కొవ్వొత్తుల తయారీ పరిశ్రమలో 1851లో 4949 మంది వుండగా 1861లో 4686 మంది వున్నారు. ఇతర కారణాలతో పాటుగా గ్యాస్ పరిశ్రమ పెరుగుదల మూలంగా కూడా ఈ పరిశ్రమలో జనం తగ్గిపోయారు; దువ్వెనల తయారీలో 1851లో 2038 వుండగా, 1861లో 1478 మంది వున్నారు, రంపపు కోత పరిశ్రమలో 1851లో 30552 మంది వుండగా 1861లో 31647 మంది వున్నారు. రంపపు యంత్రాలు పెరుగుదల వల్ల ఇందులో కొద్దిగా పెరుగుదల కనిపిస్తుంది. గుండుసూదులు పరిశ్రమలో 1851లో 26940 మంది వుండగా, 1861లో 26130 మంది వున్నారు. యంత్ర పరిశ్రమ పెరుగుదల మూలంగా ఇందులో తరుగుదల కనిపిస్తుంది. తగరం, రాగి గనుల పరిశ్రమల్లో 1851లో 31360 మంది వుండగా, 1861లో 32041 మంది వున్నారు. మరో వైపున నూలు వడికే పరిశ్రమలో 1851లో 371777 మంది వుండగా, 1861లో 456646 మంది వున్నారు. బొగ్గు పరిశ్రమలో 1851లో 183389 మంది వుండగా 1861లో 246613 మంది వున్నారు. "ఇప్పటి వరకూ యంత్రాలను సార్థకంగా ఉపయోగించని పరిశ్రమల్లో 1851 తర్వాత కార్మికుల నియామకంలో ఎక్కువ పెరుగుదల కనిపిస్తుంది" (సెన్సస్ ఆఫ్ ఇంగ్లాండ్ అండ్ వేల్స్ - 1861, సంపుటి III లండన్; 1863, పుట 36)

1. ఫ్రెంచి ముద్రణలో మార్క్స్ చేసిన మార్పును ఆధారంగా చేసుకుని నాల్గవ జర్మన్ ముద్రణలో ఈ కింది బ్రాకెట్లలో ఇచ్చిన పేరాగ్రాఫ్‌ను ఏంగిల్స్ పొందుపరిచాడు. (అస్థిర పెట్టుబడి సాపేక్ష పరిమాణంలో పెరిగే క్షీణత అనే సూత్రాన్ని వేతన కార్మికుల స్థితిగతుల మీద దాని ప్రభావాన్ని అవగాహన చేసుకునే దానికి బదులుగా సాంప్రదాయిక ఆర్థికవేత్తల్లోని కొంతమంది ప్రముఖులు, దానిని ఆధార రహితమైన ఊహాత్మక భావంగా పరిగణించారు. శాశ్వత పెట్టుబడిని, స్థిర పెట్టుబడితోనూ, అస్థిర పెట్టుబడిని చలామణి పెట్టుబడితోనూ, మిగతా ఆర్థిక శాస్త్రవేత్తల వలె కలగాపులగం చేసినప్పటికీ, జాన్ బార్టన్ ఈ విషయంలో గొప్ప సేవ చేశాడు. ఆయన ఇలా అంటాడు : "స్థిర పెట్టుబడి ననుసరించిగాక, చలామణి పెట్టుబడి పెరుగుదల ననుసరించే శ్రమకుండే గిరాకీ నిర్ణయించబడుతుంది. సకల పరిస్థితుల్లోనూ, సకల కాలాల్లోనూ ఈ రెండు పెట్టుబడుల మధ్య నిష్పత్తి అదే విధంగా వుంటుందనే విషయం యదార్థమైతే, అప్పుడు, దేశంలో వుండే సంపద నిష్పత్తిలోనే కార్మికుల నియమాకం జరుగుతుందనేది వాస్తవం. అయితే, ఆ విధమైన ప్రతిపాదన ఏ మాత్రమూ పోలికలేని ఊహ మాత్రమే. వివిధ రకాలైన కళలు వేళ్ళూనే కొలదీ, నాగరికతా సంస్కృతి విస్తృతమయ్యే కొలదీ, చలామణి పెట్టుబడికన్నా స్థిర పెట్టుబడికన్నా అదే మస్లిన్ చీరను బ్రిటన్‌లో ఉత్పత్తి చేయడానికి నియోగించబడే స్థిర పెట్టుబడి కనీసం కొన్ని వందల, బహుశా కొన్ని వేల రెట్లు అధికంగా వుంటుంది; చలామణి పెట్టుబడి నిష్పత్తి కొన్ని వందల రెట్లు, ఇంకా చెప్పాలంటే కొన్ని వేల రెట్లు తక్కువగా వుంటుంది.... ప్రతి సంవత్సరం చేసే పొదుపు మొత్తాలను, స్థిర

ప్రతి చారిత్రక ఉత్పత్తి విధానంలోనూ వాటి పరిమితుల్లో మాత్రమే చారిత్రకంగా చెల్లుబాటు అయ్యే ప్రత్యేక జనాభా సిద్ధాంతాలూ వుంటాయి. మానవుడు జోక్యం చేసుకోనంత మేరకు మొక్కలకూ, జంతువులకూ కూడా ఒక నిర్దిష్టమైన జనాభా సిద్ధాంతం వుంటుంది.

సంచయనం లేక పెట్టుబడిదారీ విధాన పునాదిపై పెరిగిన సంపద యొక్క తప్పనిసరి ఫలితమైన అదనపు శ్రామిక జనాభా పెట్టుబడిదారీ సంచయనాన్ని సుకరం చేసే సాధనంగానూ, ఇంకా స్పష్టంగా చెప్పాలంటే పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానపు మనుగడకే ఒక షరతుగా రూపొందుతుంది. ఈ అదనపు జనాభా పెట్టుబడికి మాత్రమే అందుబాటులో వుండే పారిశ్రామిక రిజర్వు సైన్యంగా రూపొంది ఆ 'పెట్టుబడి సంపూర్ణ అదుపులోనే వుంటూ ఆ పెట్టుబడి స్వంత ఖర్చులతోనే అదనపు జనాభాను పోషిస్తున్నట్లుగా కనిపిస్తుంది. మార్పు చెందే పెట్టుబడి స్వీయాభివృద్ధి అవసరాలకూ, నిరంతరాయంగా దోపిడీ చేయబడటానికి సదా సిద్ధంగా వుండే విధంగా జనాభాలోని వాస్తవిక పెరుగుదల పరిమితులలోనే దానితో నిమిత్తం లేకుండా స్వతంత్రంగా మానవులనే భౌతిక పదార్థపు రాశిని ఈ అదనపు జనాభా సృష్టిస్తుంది. సంచయనమూ, తదనుగుణంగా సంభవించే శ్రామిక ఉత్పాదకతా విలువతో బాటుగా పెట్టుబడి ఆకస్మిక విస్తరణ శక్తి కూడా పెరుగుతుంది, దీని పెరుగుదల అది వరకే క్రియను నిర్వర్తిస్తున్న పెట్టుబడి యొక్క స్థితిస్థాపకత పెరిగినందువల్లనే కాదు; పెట్టుబడి ఒక స్థితిస్థాపకతా భాగంగా మాత్రమే వుండే సామాజిక సంపద, సంపూర్ణ విస్తరణ జరిగినందువల్లనే కాదు; అదనపు పెట్టుబడిరూపంలో, ఈ సంపదలోని గణనీయమైన భాగాన్ని పరపతి వ్యవస్థ ప్రత్యేకమైన ప్రతియొక్క ప్రేరణ మూలంగా వెనువెంటనే ఉత్పత్తికి అందుబాటులో వుంచినందువల్లనే కాదు; ఉత్పత్తి ప్రక్రియ యొక్క సాంకేతిక పరిస్థితులైన యంత్రాలూ, రవాణా సాధనాలు వగైరా అదనపు ఉత్పాదిత రాసులను ఇప్పుడు అదనపు ఉత్పత్తి సాధనాలుగా అత్యంత త్వరితగతిని మార్పు చేస్తున్నందువల్ల కూడా అది పెరుగుతుంది. సంచయనాభివృద్ధితో బాటుగా సమృద్ధిగా వుండేదీ అదనపు పెట్టుబడిగా మార్పు చేయడానికి అవకాశం ఇచ్చేదీ అయిన సామాజిక సంపద పరిమాణం, ఉత్పత్తిలోనే పాత రంగాలకు అతి త్వరతగతిని వ్యాపిస్తుంది. ఫలితంగా దీని మార్కెట్ ఆకస్మికంగా విస్తరిస్తుంది; లేదా ఇప్పుడు పాత రంగాలు

---

పెట్టుబడికి జోడించినప్పటికీ, శ్రమకు వుండే గిరాకీ పెరుగుదల మీద దాని ప్రభావం వుండదు.'' (జాన్ బార్టన్, ''అబ్జర్వేషన్స్ ఆన్ ది సర్కమ్‌స్టెన్సెస్ వుచ్ యిన్‌ఫ్లూయన్స్ ది కండిషన్స్ ఆఫ్ ది లేబరింగ్ క్లాసస్ ఆఫ్ సొసైటీ,'' లండన్. 1817. పుటలు 16, 17) ''ఒక దేశపు నికరాదాయాన్ని పెంచే కారకాలే అదే సందర్భంలో జనాభా అధికం గావించబడటానికి కార్మికుల స్థితిగతులు క్షీణించడానికి కారణాలవుతాయి'' (రికార్డో అదే గ్రంథం. పు. 409). పెట్టుబడి పెరిగే కొలదీ ''(కార్మికుల) గిరాకీ క్షీణ నిష్పత్తిలో వుంటుంది''. (ముందు చెప్పిన గ్రంథం. పుట 480) ''పెట్టుబడి మొత్తంలో వచ్చే ఏ మార్పులతోనూ నిమిత్తం లేకుండా కార్మికులను పోషించడానికి కేటాయించిన పెట్టుబడి మొత్తం మార్పు చెందుతుంది.... పెట్టుబడి సమృద్ధిగా పెరిగే కొలది ఉద్యోగావకాశాలలో గొప్ప ఒడుదుడుకులు సంభవించడంతో పాటుగా కష్టనష్టాలు కూడా తీవ్రస్థాయిలో అతి తరచుగా వస్తాయి''. (రిచర్డ్‌జోన్స్ ''యాన్ ఇంట్రడక్టరీ లెక్చర్ ఆన్ పొలిటికల్ ఎకానమీ'' లండన్. 1833. పు. 13) (శ్రమ కొరకు) గిరాకీ పెరుగుతుంది... అయితే సాధారణ పెట్టుబడి సంచయనపు అనుపాతంలో కాదు.... అందువలన పునరుత్పత్తికై నిర్దేశించబడిన జాతీయాదాయంలోని ప్రతి పెరుగుదలా, సామాజిక పురోగమనంలో, కార్మికుల స్థితిగతుల మీద అతి తక్కువ ప్రభావాన్ని కలిగిస్తుంది'' (రామ్‌సే.... అదే గ్రంథం. పుటలు 90, 91)

అభివృద్ధి చెందినందువల్ల కొత్త రంగాలు అవసరమవుతాయి గనుక, రైల్వేలలాంటి నూతనంగా ఏర్పాటైన రంగాలలోకి ఈ సంపద రాసులు చొచ్చుకుపోతాయి. ఈ విధమైన సందర్భాలన్నిటిలోనూ ఇతర రంగాలలోని ఉత్పత్తి స్థాయికీ ఏ విధమైన నష్టం వాటిల్లకుండా ప్రజలలోని గణనీయమైన భాగాలను కీలక స్థానాలలో ప్రవేశపెట్టడానికి అవకాశం వుండి తీరాలి. అదనపు జనాభాయే ఈ జన సందోహాలను సరఫరా చేస్తుంది. ఆధునిక పరిశ్రమకు సంబంధించిన ఈ విలక్షణ క్రమం అనగా అత్యధిక స్థాయిలో ఉత్పత్తీ, సంక్షోభం, స్తంభన సగటు కార్యకలాపాల దశాబ్దిక వలయం (మధ్య మధ్య స్వల్పమైన వూగిసలాటల పర్యవసానంగా అంతరాయం జరిగినప్పటికీ) పారిశ్రామిక రిజర్వు సైన్యం లేక అదనపు జనాభా సదా ఏర్పడటంపైనా, అధికంగానో, లేక స్వల్పంగానో వారిని పనిలో ఇముడ్చుకోవడంపైనా, ఆ పారిశ్రామిక రిజర్వుసైన్యం తిరిగి ఏర్పడటంపైనా ఆధారపడి వుంటుంది. ఈ పారిశ్రామిక వలయంలోనే మార్పు చెందే దశలు వాటి వంతుకు అవి అదనపు జనాభాను పనిలో నియోగించుకుని దాని పునరుత్పత్తికి అత్యంత శక్తివంతమైన సాధనాలుగా రూపొందుతాయి. మానవ చరిత్రలో ఏ తొలిదశలోనూ సంభవించని ఆధునిక పరిశ్రమ యొక్క ఈ విలక్షణ క్రమం పెట్టుబడిదారీ ఉత్పత్తి బాల్యదశలో కూడా అసాధ్యమే అయి వుండేది. పెట్టుబడి అంతర్నిర్మాణం అతి నెమ్మదిగా మాత్రమే మార్పు చెందింది. కాబట్టి పెట్టుబడి సంచయనంతో బాటుగా తదనుగుణంగా శ్రామిక గిరాకీ కూడా మొత్తం మీద సమవేగంతో పెరిగింది. మరింత ఆధునిక కాలంతో పోల్చినపుడు సంచయనం యొక్క పురోగమనం అతినెమ్మదిగా ఉన్నప్పటికీ వినియోగ శక్యమైన శ్రామిక జనాభా రూపంలో సంభవించిన సహజ ప్రతిబంధకాల నెదుర్కొంటూ అది ముందుకు సాగింది; బలాత్కార సాధనాలను ప్రయోగించడం ద్వారానే ఈ ప్రతిబంధకాలను తొలగించడం సాధ్యమవుతుందని మనం ముందు ముందు తెల్సుకుంటాం. ఉత్పత్తిస్థాయిలో ఆకస్మికంగా, చెదురు మదురుగా సంభవించే వ్యాకోచం, అదే రీతిలో సంభవించే దాని ఆకస్మిక సంకోచానికి కూడా పూర్వాంశాలుగా వుంటాయి, ఈ ఆకస్మిక సంకోచాలు తిరిగి ఆకస్మిక వ్యాకోచాలను కలుగచేస్తాయి; అయితే వినియోగశక్యమైన మానవ బలగం లేకుండా, జనాభా యొక్క సంపూర్ణ పెరుగుదలతో నిర్నిమిత్తంగా, కార్మికుల సంఖ్యలో స్వతంత్రమైన పెరుగుదల లేకుండా ఈ ఆకస్మిక వ్యాకోచాలు అసంభవం; కార్మికుల్లో ఒక భాగాన్ని సదా "స్వతంత్రం గావించే" సామాన్య ప్రక్రియ ద్వారా ఉత్పత్తి పెరిగే నిష్పత్తిలోనే నియమించబడే కార్మికుల సంఖ్యను తగ్గించే పద్ధతుల ద్వారా కార్మికుల సంఖ్యలోని ఈ పెరుగుదల ప్రభావితం చేయబడుతుంది. కాబట్టి ఆధునిక పరిశ్రమ చలనరూపమంతా శ్రామిక జనాభాలోని ఒక భాగాన్ని నిరంతరం నిరుద్యోగులుగానో లేక చిరుద్యోగులుగానో మార్పు చేయడంపై ఆధారపడి వుంటుంది. పారిశ్రామిక వలయంలో అప్పుడప్పుడు సంభవించే మార్పుల లక్షణాలు మాత్రమే అయిన పరపతి వ్యాకోచ సంకోచాలను ఆ మార్పుల కారణాలుగా భావించడమనే వాస్తవంలోనే రాజకీయ అర్థశాస్త్రపు డాబుసరితనం ప్రదర్శితమవుతుంది. ఒక నిర్దిష్ట చలనంలోకి ఒకసారి విసిరి వేయబడిన నక్షత్రాదులు ఆ చలనంలోనే ఏ విధంగా సదా పునరావృత్తం అవుతూ వుంటాయో, అదే విధంగా వ్యాకోచ సంకోచాలనే ప్రత్యామ్నాయ చలనాలలోకి ఒకసారి నెట్టివేయబడిన సామాజిక ఉత్పత్తి కూడా అదే విధంగా పునరావృతమవుతూ వుంటుంది. ఫలితాలే తిరిగి కారాణాలుగా రూపొందుతాయి; ఈ మొత్తం ప్రక్రియలో సంభవించే ఆకస్మిక మార్పులు, నిరంతరం తన నిర్ణాయకాలను పునరుత్పత్తి చేసుకుంటూ, పునరుత్పన్నమయ్యే కాల ప్రవాహ రూపాన్ని

పొందుతాయి. పునరుత్పన్నమయ్యే ఈ కాల ప్రవాహం సంఘటితమైనపుడు, రాజకీయ అర్థశాస్త్రం సహితం, సాపేక్ష అదనపు జనాభా ఉత్పత్తిని అనగా పెట్టుబడి యొక్క స్వీయాభివృద్ధి సగటు అవసరాలతో పోల్చినపుడు అదనంగా వుండే జనాభాను ఆధునిక పారిశ్రామిక రంగానికి అవసరమైన ఒక షరతుగా భావిస్తుంది.

ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయంలో రాజకీయ అర్థశాస్త్ర మాజీ ఆచార్యుడూ, ఆ తర్వాత ఇంగ్లాండ్‌లో వలస వ్యవహారాల శాఖలో అధికారిగా నియమించబడిన హెచ్. మేరీవేల్ ఈ విధంగా అంటాడు. "ఉదాహరణకు ఈ సంక్షోభాలలోని కొన్ని సందర్భాలలో కొన్ని వందల వేల మంది అదనపు జనాభాను వలస పంపడం ద్వారా వదలించుకోవాలనే ప్రయత్నానికి వ్యతిరేకంగా జాతి మొత్తంగా మేల్కొనాల్సి వచ్చినపుడు, దాని పర్యవసానాలేమిటి? కార్మికులకు మరల గిరాకీ ఏర్పడినపుడు వారు కొరతగా వుంటారు. పునరుత్పత్తి ఎంత త్వరితగతిని జరిగినప్పటికీ కోల్పోయిన వయోజన కార్మికులను తిరిగి పెంపొందించుకోవాలంటే ఒక తరం కాలం పడుతుంది. ఇప్పుడు మన కార్ఖానాదారుల లాభాలన్నీ కూడా గిరాకీ సమృద్ధిగా వున్న క్షణాన్ని లాభదాయకంగా ఉపయోగించుకునే శక్తి మీద ఆధారపడి వుంది. గిరాకీ మందగించిన ఆ కాల వ్యవధిలో వచ్చిన నష్టాన్ని ఆ విధంగా పూరించుకుంటారు. యంత్రాల మీద, శారీరక శ్రమ మీద వున్న ఆధిపత్యం ద్వారా మాత్రమే ఈ శక్తిని వారు సమకూర్చుకోగలరు. వారికవసరమైనప్పుడు కార్మికులు సిద్ధంగా వుండాలి; అవసరమైనపుడు వారి కార్యకలాపాలను విస్తరించుకోగలిగి వుండాలి. మార్కెట్ పరిస్థితి ననుసరించి తిరిగి దానిని మందగింప చేయగలగాలి; లేకపోయినట్లయితే దేశానికి మూలాధారమైన సంపద కొరకు జరిగే పోటీ పరుగులో వారు ఆధిక్యతను కలిగి వుండటానికి అవకాశం ఉండదు".[1] ఆధునిక పరిశ్రమకు అదనపు జనాభా అత్యంత ఆవశ్యకమని మాల్థస్ సహితం గుర్తిస్తాడు; అయితే ఆయనకుండే సంకుచిత దృక్పథం రీత్యా, శ్రామిక జనాభాలో వచ్చే సాపేక్ష పెరుగుదల రీత్యాగాక, వారి సంపూర్ణ అదనపు పెరుగుదల రీత్యా దానిని విశదీకరిస్తాడు. ఆయన ఇలా అంటాడు : "కార్ఖానాదారులూ, వ్యాపారస్తులూ గనుక ఒక దేశం యొక్క కార్మిక వర్గంలోకి వివాహానికి సంబంధించిన వివేకవంతమైన అలవాట్లను గణనీయమైన స్థాయిలో తీసుకువెళ్ళినట్లయితే, అది ఈ అదనపు జనాభాకు హాని చేయవచ్చు.... ఒక ప్రత్యేకమైన గిరాకీ పర్యవసానంగా అధిక సంఖ్యలో కార్మికులను మార్కెట్‌లోకి తీసుకురావడానికి జనాభా స్వభావం రీత్యా 16 లేక 18 సంవత్సరాల కాలం గడపవచ్చు... పొదుపు ద్వారా ఆదాయాన్ని పెట్టుబడిగా మార్చడం మరింత శరవేగంతో జరుగుతుంది... జనాభా పెరుగుదల కన్నా వేగంగా కార్మికుల పోషణకు అవసరమైన నిధుల పరిమాణాన్ని పెంచుకోవలసిన అగత్యం ఒక దేశానికి ఎల్లప్పుడూ ఉంటుంది." [2] పెట్టుబడిదారీ విధానపు సంచయనానికి కార్మిక సాపేక్ష అదనపు జనాభా

1. హెచ్. మేరివేల్ : "లెక్చర్స్ ఆన్ కాలనైజేషన్ అండ్ కాలనీస్. "1841, మొదటి సంపుటి; పుట 146
2. మాల్తస్ "ప్రిన్సిపుల్స్ ఆఫ్ పొలిటికల్ ఎకానమీ" పుటలు 215, 319, 320. సిస్మండీగారి సహాయంతో మాల్తస్ పెట్టుబడిదారీ ఉత్పత్తి యొక్క త్రిమూర్తులైన అధికోత్పత్తి. అధిక జనాభా, అధిక వినియోగాలను కనుగొని తన గ్రంథంలో ప్రస్తావించాడు; నిజానికి ఇవి అతి సున్నితంగా వుండే మూడు రకాలైన రాక్షసులు. వివరణకు ఏంగిల్స్ "ఉమ్మరిస్తేజు యైనర్ క్రిటిక్ డెర్ నేషనల్ ఒకానొమి" అదే గ్రంథంలో, పుట 107ను చూడండి.

నిరంతర ఉత్పత్తి యొక్క ఆవశ్యకతను ఈ విధంగా రాజకీయ అర్థశాస్త్రం విశదీకరించిన తర్వాత, అదనపు పెట్టుబడి ద్వారా సృష్టించబడి బజారులోకి నెట్టివేయబడిన అదనపు కార్మికుల నుద్దేశించి వృద్ధ కన్య రూపంలో రాజకీయ అర్థశాస్త్రం "తనకిష్టుడైన" పెట్టుబడిదారుని చెవిలో ఈ విధంగా సందర్భ శుద్ధిగా గుసగుసలాడింది : "కార్ఖానాదారులుగా మేము మీకు చేయగలిగినదంతా చేస్తాము; మీరు బతకడానికి అవసరమైన పెట్టుడిని మేము పెంపొందించేటప్పుడు వున్న జీవనాధార సాధనాలతో మీ జనం అంతా సర్దుబాటు చేసుకుంటూ మిగతా పనిని మీరు చేయాలి."[1]

జనాభా జననాలలోని సహజ పెరుగుదల ద్వారా లభించే వినియోగశక్యమైన శ్రమశక్తి పరిమాణంతోనే పెట్టుబడిదారీ ఉత్పత్తి ఏ మాత్రమూ ఆత్మ సంతృప్తి పొందజాలదు. స్వేచ్ఛగా తన కార్యకలాపాలను కొనసాగించడానికి ఈ సహజ పరిమితులతో నిర్నిమిత్తంగా వుండే స్వతంత్రమైన పారిశ్రామిక రిజర్వు సైన్యం పెట్టుబడిదారీ ఉత్పత్తికి అవసరమవుతుంది.

అస్థిర పెట్టుబడిలో పెరుగుదలా లేక తరుగుదలలు నియోగించబడిన కార్మికుల సంఖ్యల్లో పెరుగుదల లేక తరుగుదలలకు కచ్చితంగా అనుగుణంగా వుంటాయని ఇంతవరకు ఊహించాం.

అస్థిర పెట్టుబడి ఒక వైపున పెరుగుతూ వుండగా పెట్టుబడి ఆధీనంలోని కార్మికుల సంఖ్య స్థిరంగానైనా వుండవచ్చు లేక పడిపోవచ్చును కూడా. ఒక కార్మికుడు ఎక్కువ శ్రమను వెచ్చించ గలిగినపుడు, అందువల్ల అతని వేతనాలు పెరిగినపుడు ఈ విధంగా జరుగుతుంది; శ్రమ పరిమాణం పెరిగే రేటు కంటే ఇంకా నిదానంగానే శ్రమ ధర స్థిరంగా వున్నా లేక పడిపోయినా ఈ విధంగానే జరుగుతుంది. ఈ విషయంలో అస్థిర పెట్టుబడి పెరుగుదల అధిక శ్రమకు ఒక సూచికగానే వుంటుంది గానీ ఎక్కువ కార్మికులను నియోగించడానికి మాత్రం సూచికగా వుండదు. శ్రమ ధర యథాతథంగా వున్నప్పుడు ఎక్కువ సంఖ్యలో వుండే కార్మికుల నుండి గాక తక్కువ సంఖ్యలో నుండే కార్మికుల నుండే ఎక్కువ పరిమాణంలో శ్రమను పిండడమే ప్రతి పెట్టుబడిదారుని యొక్క పరిపూర్ణ ప్రయోజనానికి అనుగుణంగా వుంటుంది. కార్మికుల సంఖ్య అధికంగా వున్నప్పుడు, పనిలో వుంచిన శ్రమ పరిమాణపు అనుపాతంలోనే వెచ్చించబడిన స్థిర పెట్టుబడి పెరుగుతుంది; కార్మికుల సంఖ్య తక్కువగా వున్నప్పుడు ఈ పెరుగుదల ఇంకా తక్కువగా వుంటుంది. ఉత్పత్తి స్థాయి ఎంత విస్తృతంగా వుంటే, ఈ చోదక శక్తి అంత బలంగా వుంటుంది. పెట్టుబడి సంచయనంతో బాటుగా దాని చోదక శక్తి బలం కూడా పెరుగుతుంది.

సంచయనానికున్న కార్య కారణాలైన పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానపు అభివృద్ధి, శ్రామిక ఉత్పాదకతా శక్తి పెరుగుదలా, అదే మొత్తంలో స్థిర పెట్టుబడిని వెచ్చించి, ఎక్కువ మంది కార్మికులను కార్యరంగంలోకి దింపి, ప్రతి వైయక్తిక శ్రమశక్తిని ఎక్కువగా దోపిడీ చేయడానికి (విస్తృతంగానూ, తీవ్రంగానూ) అవకాశం కలిగిస్తుందని మనం గమనించాం. ఇంతేగాక నిపుణులైన కార్మికులకు బదులుగా, తక్కువ నైపుణ్యం గలవారినీ, పరిపక్వ శ్రమశక్తికి బదులుగా అపరిపక్వ శ్రమశక్తినీ, పురుషులకు బదులుగా స్త్రీలనూ, వయోజనులకు బదులుగా తరుణ వయస్కులనూ, లేక చిన్న పిల్లలనూ క్రమేపీ ఎక్కువగా తెచ్చుకోవడం ద్వారా అదే పెట్టుబడితో ఎక్కువ శ్రమశక్తి పరిమాణాన్ని పెట్టుబడిదారుడు

1. హారియట్ మార్టిన్యూ. "ఏ మాంచెస్టర్ స్ట్రైక్' 1832. పుట 101

కొనుగోలు చేస్తాడనే విషయాన్ని కూడా మనం గమనించాం.

కాబట్టి ఒకవైపున సంచయన పురోగమనం జరిగే కొలది, అత్యధిక అస్థిర పెట్టుబడి ఎక్కువ మంది కార్మికులను నియమించకుండానే అత్యధిక శ్రమను పనిలో నియమిస్తుంది; మరో వైపున అదే పరిమాణంలో నున్న అస్థిర పెట్టుబడి, అదే శ్రమశక్తి పరిమాణంతో అత్యధిక శ్రమను పనిలో నియమిస్తుంది; ఇక అంతిమంగా ఉన్నత స్థాయి శ్రమ శక్తులను తొలగించి వాటి స్థానంలో నిమ్న స్థాయి శ్రమశక్తులను అత్యధిక సంఖ్యలో కార్యరంగంలోకి తెస్తుంది.

కాబట్టి సాపేక్ష అదనపు జనాభా సృష్టి లేక కార్మికులను స్వతంత్రులు గావించడం, సంచయన పురోగమనంతో శీఘ్రతరమవుతూ దాని సరసనే వుండే ఉత్పత్తి ప్రక్రియ యొక్క సాంకేతిక విప్లవం కంటే కూడా ఎంతో ఉధృతంగా సాగుతుంది; అంతేగాక స్థిర పెట్టుబడితో పోల్చినపుడు పెట్టుబడి అస్థిర భాగంలో సంభవించే తదనుగుణ్యమైన తరుగుదలకన్నా ఎంతో ఉధృతంగా ఈ సాపేక్ష అదనపు జనాభా సృష్టి జరుగుతుంది. ఉత్పత్తి సాధనాల విస్తృతీ, సామర్థ్య శక్తీ పెరిగేకొలదీ శ్రామిక నియోగ సాధనాలుగా అవి కొంచెం తక్కువ స్థాయిలో వినియోగపడతాయి; శ్రామిక ఉత్పాదకతా శక్తి పెరిగే కొలదీ అదే అనుపాతంలో కార్మికుల కుండే గిరాకీ కంటే కార్మికుల సరఫరాను పెట్టుబడి త్వరగా పెంచడంతో ఈ పరిస్థితి తిరిగి మార్పు చెందుతుంది. కార్మికవర్గంలో పని దొరికిన భాగం యొక్క అధిక శ్రమమూలంగా రిజర్వు సైన్యం సంఖ్యాబలం పెరిగిపోతుంది. అయితే మరోవైపున ఈ రిజర్వు సైన్యం పని దొరికిన కార్మికులతో పోటీ పడి వారిపై ఎక్కువ ఒత్తిడి తేవడం ద్వారా వీరు, పెట్టుబడి యొక్క ఆదేశాలకు తలొగ్గి అధిక శ్రమా, అణిచివేతలకు లొంగిపోవలసిన స్థితి ఏర్పడుతుంది. కార్మికవర్గంలోని ఒక భాగపు అధిక శ్రమ మూలంగా మరొక భాగం నిర్బంధ సోమరితనానికి నెట్టివేయబడుతున్నదంటే, మరో వైపున దీని మూలంగా వైయక్తిక పెట్టుబడిదారులు సుసంపన్నులు గావడానికి సాధనాలు ఏర్పడుతాయి.[1] అదే సమయంలో సామాజిక సంచయన పురోగమనానికి

1. ఫ్యాక్టరీ చట్టాన్ని ప్రవేశపెట్టిన ఫలితంగా వయోజనులైన పురుష కార్మికులు మాత్రమే ఎక్కువగా ఇబ్బందులకు గురైనప్పటికీ, ఆ విధంగా పని గంటలు అధికం గావించడాన్ని తీవ్రంగా విమర్శిస్తూ పత్తి కరువు సంభవించిన 1863 సంవత్సరంలో సహితం, బ్లాక్‌బరన్ పట్టణంలోని నూలు మిల్లు కార్మికులు ఒక కరపత్రాన్ని ప్రచురించారు. తమ కుటుంబాలను రక్షించుకోడానికీ, పనిభారం మూలంగా తమ సహోదరులను అల్పాయుష్కులు గాకుండా రక్షించడానికి వందల సంఖ్యలో పాక్షికంగా పని చేయడానికి సిద్ధంగా వున్నప్పటికీ, వారిని బలవంతపు సోమరితనానికి ఒకవైపు నెట్టివేస్తూ, మరో వైపున వయోజనులైన పురుష కార్మికులను రోజుకు 12 నుండి 13 గంటల వరకు పని చేయమని ఆ మిల్లు కార్మికులను ఆదేశించారు.... ఆ కరపత్రంలో ఈ విధంగా రాయబడింది : "అనేకమంది కార్మికులు ఎక్కువ గంటలు పనిచేయడం వల్ల, యజమానులకూ, కార్మికులకూ మధ్య సత్సంబంధాలు నెలకొబడతాయా? అని మేము ప్రశ్నించదల్చుకున్నాం. పని దొరక్క సోమరులుగా వున్న కార్మికులకు జరుగుతున్న అన్యాయాన్ని ఎక్కువ గంటలు పని చేస్తున్న కార్మికులు అదేవిధంగా పరిగణనలోకి తీసుకోక తప్పదు. పని గంటలను సక్రమమైన పద్ధతిలో పంపిణీ చేసినట్లయితే, పాక్షిక నిరుద్యోగులందరికీ సరిపోయినంత పని ఈ జిల్లాలో వుంది. కొంతమందికి ఎక్కువ గంటలు పని చేయవలసిన స్థితీ, మరికొంత మందికి పని దొరకనందువలన దానధర్మాల మీద ఆధారపడవలసిన స్థితీ అంతరించిపోయి, మాకు మంచి పరిస్థితులు ఏర్పడే వరకూ యజమానులంతా తక్కువ పని గంటల విధానాన్ని సాధారణంగా అనుసరించాలనే న్యాయ సమ్మతమైన కోర్కెను మాత్రమే మేము వ్యక్తం చేస్తున్నాం". ("రిపోర్ట్ ఆఫ్ ది ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్... 31, అక్టోబర్.

అనుగుణ్యమైన స్థాయిలో పారిశ్రామిక రిజర్వు సైన్యం సృష్టి శీఘ్రతరం చేయబడుతుంది. సాపేక్ష అదనపు జనాభా సృష్టిలో ఈ అంశానికి ఎంత ప్రాముఖ్యం ఉన్నదో ఇంగ్లాండ్‌ను ఉదాహరణగా తీసుకుని పరిశీలిస్తే విశదమవుతుంది. ఆ దేశంలో శ్రమను "పొదుపు" చేయడానికి బ్రహ్మాండమైన సాంకేతిక సాధనాలున్నాయి. అయినప్పటికీ రేపు ఉదయమే గనుక ఒక సహేతుకమైన మొత్తానికి సాధారణంగా కార్మికుల సంఖ్య తగ్గించబడి, వయో, లింగ భేదాలను బట్టి కార్మిక వర్గంలోని వివిధ తరగతుల అనుపాతానికి కుదించినట్లయితే, అప్పుడు అందుబాటులో వుండే కార్మిక జనాభా ప్రస్తుత స్థాయిలోనే జాతీయోత్పత్తిని కొనసాగించడానికి ఏ మాత్రమూ సరిపోదు. ప్రస్తుతం "అనుత్పాదక" మైన వారిలో అత్యధికంగా వుండే కార్మికుల్ని "ఉత్పాదక" కార్మికులుగా మార్చవలసిన అవసరం వస్తుంది.

వేతనాల్లో హెచ్చుతగ్గుల సాధారణ మార్పులను మొత్తంగా తీసుకుని ఆలోచిస్తే పారిశ్రామిక రిజర్వు సైన్యం యొక్క వ్యాకోచ సంకోచాల ద్వారా ఈ సాధారణ వేతనాలు ప్రత్యేకించి నియంత్రణ చేయబడతాయి. తిరిగి ఈ సంకోచ వ్యాకోచాలు పారిశ్రామిక వలయంలో నిర్ణీత కాలంలో వచ్చే మార్పులకు అనుగుణ్యంగా వుంటాయి. కాబట్టి శ్రామిక సంఖ్యలో వచ్చే సంపూర్ణ మార్పుల ద్వారా గాక కార్మికవర్గం క్రియాశీలంగానూ, రిజర్వు సైన్యంగానూ విభజించబడి మార్పు చెందే అనుపాతాలను బట్టే, అదనపు జనాభాలోని సాపేక్ష మొత్తంలో పెరుగుదలను లేక తరుగుదలను అనుసరించి ఆ అదనపు జనాభాను ఒకప్పుడు పనిలో ఇముడ్చుకోవడం, మరొకప్పుడు స్వతంత్రులను గావించడం (పనినుండి తొలగించడం) ఏమేరకు జరుగుతుందో ఆ మేరకే వేతనాల గతులు నిర్ణయించబడతాయి. ఆధునిక పరిశ్రమలో సంభవించే దశాబ్దిక వలయాలు నిర్ణీత కాలంలో వచ్చే వివిధ దశలూ సంచయన పురోగమనంలో ఒక దాని తర్వాత ఒకటిగా త్వరతగతిని సంభవించే క్రమరహిత డోలనాలు మూలంగా, ఆధునిక పరిశ్రమకు సంబంధించిన నియమం అనగా పెట్టుబడి విస్తృతమవుతునందు వలన శ్రామిక మార్కెట్ కొన్ని సందర్భాలలో సాపేక్ష అల్ప సరఫరాగాను, మరికొన్ని సందర్భాలలో పెట్టుబడి సంకోచ మవుతున్నందువల్ల శ్రామిక మార్కెట్ అధిక సరఫరాగానూ కనిపిస్తూ, ఆయా సందర్భానుసారంగా పెట్టుబడి స్వీయాభివృద్ధి అవసరాల స్థాయి ననుసరించి, శ్రమగిరాకీ, సరఫరాలను నియంత్రించే నియమమే ఆధునిక పరిశ్రమకు తగిన నియమం. జటిలమవుతుంది; ప్రత్యామ్నాయంగా సంభవించే పెట్టుబడి వ్యాకోచనం సంకోచాల ద్వారా శ్రమ గిరాకీ, సరఫరాలను నియంత్రించే నియమమే ఆధునిక పరిశ్రమకు తగిన నియమం; అనగా పెట్టుబడి విస్తృతమవుతున్నందు వలన శ్రామిక మార్కెట్ కొన్ని

1863'' పుట 8) సాధారణంగా తాను తప్పు చేయలేదనే బూర్జువా వర్గ ధోరణిలోనే 'ఎస్సే ఆన్ ట్రేడ్ అండ్ కామర్స్' వ్యాసకర్త, నియోగించబడిన కార్మికుల మీద గల సాపేక్ష అదనపు జనాభా ప్రభావాన్ని అవగాహన చేసుకున్నాడు. ''ఈ దేశంలో సరిపోయినంత మంది కార్మికులు లేకపోవడమే సోమరితనానికి కారణం... కర్మాగారాలకు అధికస్థాయిలో గిరాకీ ఏర్పడినపుడు, శ్రమకు కొరత ఏర్పడుతుంది. దాని పర్యవసానాలను కార్మికులు గమనించడమే గాక, యజమానులు ఆవిధంగా గమనించేటట్లు చేస్తారు కూడా. ఇది చాలా ఆశ్చర్యంగా వుంది; అయితే, కొంతమంది కార్మికులు మూకుమ్మడిగా ఒకరోజంతా సోమరులుగా వుండటం ద్వారా ఆ యజమానిని తీవ్ర మనస్థాపానికి గురి చేయడంలాంటి సందర్భాలు, కార్యకలాపాలు కార్మికుల హీన స్థితిని మాత్రమే తెలియజేస్తాయి'' (ఎస్సే.... పుట 7, 28) ఈ జనం అంతా వేతనాలను పెంచాలని అడుగుతున్నారు!

సందర్భాలలో సాపేక్ష అల్ప సరఫరా గల, మరికొన్ని సందర్భాలలో పెట్టుబడి సంకోచమవుతున్నందు వల్ల శ్రామిక మార్కెట్ అధిక సరఫరాగానూ కనిపిస్తూ, ఆయా సందర్భానుసారంగా పెట్టుబడి స్వీయాభివృద్ధి అవసరాల స్థాయి ననుసరించి, శ్రమ గిరాకీ, సరఫరాలను నియంత్రించే నియమమే ఆధునిక పరిశ్రమకు తగిన నియమం; ఈ నియమం స్థానంలోనే, జనాభాలో వచ్చే నిరపేక్షమైన మార్పులే పెట్టుబడి కార్యకలాపాలకు ఆధారమన్నట్లుగా చిత్రించబూనే నియమం, యథార్థానికి చాలా అసాధ్యమైన నియమంగా కనిపిస్తుంది. అయినప్పటికీ ఆర్థికవేత్తల పిడివాదం మాత్రం ఇలానే వుంటుంది. వారి ఉద్దేశ్యంలో పెట్టుబడి సంచయనం పర్యవసానంగానే వేతనాలు పెరుగుతాయి. కార్మిక జనాభా మరింత ఉధృతంగా పెంపొందటానికి ఈ అధిక వేతనాలు ప్రేరణనిస్తాయి; ఈ విధంగా శ్రామిక మార్కెట్ మితిమీరినంతగా అయ్యే వరకు ఇది కొనసాగుతుంది; అందువలన శ్రామిక సరఫరాతో పోల్చినపుడు సాపేక్షకంగా పెట్టుబడి అల్పంగా వుంటుంది. వేతనాలు పడిపోయి, ఇక మనకు నాణెంలోని బొరుసు మాత్రమే కనిపిస్తుంది. వేతనాలు పడిపోతున్న ఫలితంగా కార్మిక జనాభా కొద్దికొద్దిగా క్షీణిస్తుంది; అందువలన వారితో పోల్చినపుడు తిరిగి పెట్టుబడి సాపేక్షకంగా అధికంగా వుండే విధంగా లేక ఇతరులు వివరిస్తున్నట్లుగా, పడిపోతున్న వేతనాలూ, తదనుగుణ్యంగా కార్మికుల దోపిడీ పెరుగుదలా తిరిగి సంచయనాన్ని శీఘ్రతరం చేసే విధంగా పరిణమిస్తుంది; అదే సందర్భంలో తక్కువ స్థాయి వేతనాలు కార్మికవర్గ పెంపుదలను నిరోధిస్తాయి. అప్పుడు మళ్ళీ శ్రమ సరఫరా, దాని గిరాకీ కన్నా తక్కువగా వుండే సమయం వచ్చి వేతనాలు మళ్ళీ పెరుగుతాయి. అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ ఉత్పత్తికి ఎంత సోకైన చలన విధానం! వేతనాల పెరుగుదల పర్యవసానంగా నిజంగా పనికి యోగ్యమైన జనాభాతో అనుకూలమైన పెరుగుదల సంభవించే ముందే పారిశ్రామికీకరణ కార్యకలాపాల నిర్వహణా యుద్ధంలో పోరాడి గెలుపొందేందుకు అనువైన కాలం మాత్రం ఎన్నోసార్లు వచ్చి చేజారిపోయింది.

1849–1859 మధ్యకాలంలో ఇంగ్లాండ్ దేశపు వ్యవసాయ జిల్లాల్లో ధాన్యపు ధరలు పడిపోయినప్పటికీ దానితో బాటుగా నిజానికి నామమాత్రంగానే వేతనాలు పెరిగాయి. ఉదాహరణకు విల్ట్‌షైర్‌లో వారపు వేతనాలు 7 నుండి 8 షిల్లింగులకు పెరిగాయి; డార్సెట్‌లో 7 లేక 8 షిల్లింగుల నుండి 9 షిల్లింగులకు పెరిగాయి. యుద్ధావసరాల దృష్ట్యా రైలు, రోడ్లు, ఫ్యాక్టరీలు, గనులు మొదలైనవి భారీస్థాయిలో విస్తరించడం వల్ల వ్యవసాయక అదనపు జనాభా అసాధారణ రీతిలో వలస పోవడం ఫలితంగా ఇది సంభవించింది. వేతనాలు ఎంత తక్కువగా వుంటే వాటిలో వచ్చే స్వల్పమైన పెరుగుదల వ్యక్తమయ్యే నిష్పత్తి కూడా అంత ఎక్కువగా కనిపిస్తుంది. ఉదాహరణకు వారపు వేతనం 20 షిల్లింగులుగా వుండి అది 22 షిల్లింగులకు పెరిగితే అప్పుడు అది 10 శాతం మాత్రమే పెరిగినట్లు; అయితే వారపు వేతనం 7 షిల్లింగులుగా వుండి 9 షిల్లింగులకు పెరిగితే ఆ పెరుగుదల $28\frac{4}{7}$ శాతం అవుతుంది; అప్పుడు ఇది వినసొంపుగా వుంటుంది. ప్రతీచోటా రైతులు మాత్రం మొత్తుకుంటూ వుంటే, ఈ పస్తుల వేతనాలను గురించి లండన్ "ఎకనామిస్ట్" ఎంతో గంభీరంగా "గణనీయమైన సర్వ సాధారణ పురోభివృద్ధి"[1] సాధించబడిందంటూ వాగింది. అప్పుడు రైతులు ఏం చేశారు? ఈ

1. ది ఎకనామిస్టు, 2 జనవరి, 1860

"బ్రహ్మాండమైన" వేతనాల ఫలితంగా వ్యవసాయ కార్మికులు బహుళ సంఖ్యాకంగా పెరిగి పెద్ద అయ్యేంత వరకూ, అందువల్ల తిరిగి వారి వేతనాలు ఈ పిడివాద ఆర్థిక శాస్త్రమేధావి నిర్ణయించినంతగా పడిపోయే వరకూ ఈ రైతులు వేచి వున్నారా? లేదు వారు మరిన్ని యంత్రాలను వ్యవసాయంలో ప్రవేశపెట్టారు. మరుక్షణంలో రైతులు సహితం సంతృప్తిపొందే మోతాదులో శ్రామికులు మళ్ళీ అధికమైపోయారు. ఇప్పుడు వ్యవసాయంలో మునుపటి కంటే "హెచ్చు పెట్టుబడి", మునుపటి కంటే అధికతర ఉత్పాదకతా రూపంలో వెచ్చించబడింది. దీనితో శ్రమ కొరకు గిరాకీ సాపేక్షకంగానే గాక నిరపేక్షంగా కూడా పడిపోయింది.

వేతనాల సాధారణ గతిని నియంత్రించే నియమాలనూ, లేక కార్మికవర్గానికి అనగా మొత్తం శ్రమశక్తికీ, మొత్తం సామాజిక పెట్టుబడికీ మధ్యగల నిష్పత్తిని విభిన్న ఉత్పత్తి రంగాలలో కార్మిక జనాభాను పంపిణీ చేసే నియమాలతో పైన ఉటంకించిన అర్థశాస్త్రవేత్తల ఊహలు తారుమారు చేసి గందరగోళ పరుస్తున్నాయి. ఉదాహరణకు అనుకూలమైన పరిస్థితుల పర్యవసానంగా ఏదైనా ఒక ఉత్పత్తి రంగంలో సంచయనం ప్రత్యేకించి క్రియాశీలంగా సాగినట్లయితే, ఆ రంగంలోని లాభాలు సగటు లాభాలకంటే అధికంగా వుంటున్నందువల్ల, అదనపు పెట్టుబడి ఆకర్షించబటంతో అప్పుడు శ్రమ కొరకు గిరాకీ పెరిగి వేతనాలు కూడా పెరుగుతాయనుకోండి. ఈ అధికవేతనాలు ఎక్కువ అనుకూలంగా వుండే రంగంలోకి శ్రామిక జనాభాలోని ఎక్కువ భాగాన్ని, ఆ రంగంలో శ్రమ శక్తి మితిమీరే వరకు ఆకర్షిస్తాయి. శ్రమశక్తి ఒత్తిడి మరీ ఎక్కువ అయినట్లయితే వేతనాలు మళ్ళీ వాటి సగటు స్థాయికి లేదా అంతకంటే ఇంకా తక్కువ స్థాయికి పడిపోతాయి. అప్పుడు పై పరిశ్రమ శాఖలోకి కార్మికులు తరలిరావడం ఆగిపోతుంది; పైగా కార్మికులు తరలిపోవడానికి అది దారి తీస్తుంది. దీనితో వేతనాల పెరుగుదలతో బాటుగా వచ్చే కార్మికుల నిర్దిష్ట పెరుగుదలకూ, దానితో బాటుగా సంభవించే వేతనాల తరుగుదలకూ గల కారణాలన్నింటినీ తాను గ్రహించగలిగినట్లు గానే రాజకీయ అర్థశాస్త్రవేత్త భావిస్తాడు. అయితే నిజానికి అతడు గమనిస్తున్నది ఒక ప్రత్యేకమైన ఉత్పత్తి రంగంలోని శ్రామిక మార్కెట్ యొక్క స్థానిక డోలనాలను మాత్రమే; పెట్టుబడి అవసరాలు మార్పు చెందే కొలదీ, తదనుసారంగా పెట్టుబడి వెచ్చించబడే విభిన్న రంగాలలో శ్రామిక జనాభా పంపిణీ ననుసరించి సంభవించే పరిణామాలను మాత్రమే రాజకీయ అర్థశాస్త్రవేత్త గమనిస్తాడు.

ఆర్థిక స్తంభన మరియు సగటు అభివృద్ధి స్థితికాలంలో పారిశ్రామిక రిజర్వు సైన్యం క్రియాశీల శ్రామిక సైన్యాన్ని దిగజార్చుతుంది; అధికోత్పత్తి ఆకస్మిక అభివృద్ధి కాలంలో తన కార్యకలాపాలను అదుపులో ఉంచుకుంటుంది. కాబట్టి శ్రమ గిరాకీ సరఫరాల సిద్ధాంతం సాపేక్ష అదనపు జనాభా అనే కీలకాంశం చుట్టూ తిరుగుతుంది. పెట్టుబడి ఆధిపత్యానికి దాని దోపిడీ కార్యకలాపాలకూ పూర్తి అనుకూలంగా ఉండే పరిమితులలోనే ఈ సిద్ధాంతం యొక్క కార్యరంగాన్ని సాపేక్ష అదనపు జనాభా పరిమితం చేస్తుంది.

నేటి వ్యవస్థ సమర్థించే అర్థశాస్త్ర పిడివాదుల ఒకానొక అసాధారణ ప్రజ్ఞను గురించి మరొకసారి అవలోకించవలసిన సందర్భం ఆసన్నమయింది. నూతన యంత్రాలను ప్రవేశపెట్టడం లేదా పాతవాటినే విస్తృత పరిచినపుడు అస్థిర పెట్టుబడిలోని ఒక భాగం స్థిర పెట్టుబడిగా మార్పు చెందడాన్ని అనగా పెట్టుబడిని "స్థిరపర్చడం" ద్వారా కార్మికులను "స్వతంత్రులను గావించడం" అనే కార్యక్రమాన్ని ఈ

అర్థశాస్త్ర పండితులు స్పష్టంగా దానికి వ్యతిరేకమైన అర్థంలో కార్మికుల కొరకే అది పెట్టుబడిని "స్వతంత్రం గావిస్తుందనే" కపటమైన వివరణ ఇచ్చారనే విషయాన్ని ఇక్కడ జ్ఞప్తికి తెచ్చుకోవాలి. అప్పుడు మాత్రమే ఈ సమర్థకుల సిగ్గుమాలినతనాన్ని ఎవరైనా పరిపూర్ణంగా అవగాహన చేసుకోగలరు. "స్వతంత్రులు గావించబడినవారు" యాంత్రికీకరణ మూలంగా వెంటనే నిరుద్యోగులైన కార్మికులు మాత్రమే కాదు, భవిష్యత్తులో వారికి ప్రత్యామ్నాయంగా వుండే రాబోయే తరానికి సంబంధించిన వారూ, పాత ప్రాతిపదికపైనే సాధారణంగా వ్యాపారం విస్తరించడం మూలంగా సదా ఇముడ్చుకోబడ నున్న అదనపు బలగంకూడా. వారంతా యిప్పుడు "విముక్తులైనారు!" నియోగించబడటానికి యెదురు చూస్తున్న పెట్టుబడి యొక్క నూతనమైన ప్రతి చిన్న మొత్తం కూడా వీరిని తగిన రీతిలో "విముక్తులను గావిస్తుంది". యాంత్రికీకరణ మూలంగా మార్కెట్‌లోకి నెట్టివేయబడి, మార్కెట్‌లో లభ్యమైన మేరకు కార్మికులను నియోగించుకోడానికి ఈ పెట్టుబడే గనుక సరిపోయేటట్లయితే, అది వీరిని గానీ లేక మరెవరినైనా గానీ ఆకర్షిస్తే సాధారణ శ్రామిక గిరాకీ మీద దాని ప్రభావం లేశమంతైనా వుండదు. అది తక్కువ సంఖ్యలో కార్మికుల్ని నియోగించుకున్నట్లయితే "అదనపు కార్మికులు" పెరుగుతారు! అదే గనుక ఎక్కువ సంఖ్యలో కార్మికుల్ని నియోగించుకున్నట్లయితే, "విముక్తులైన" వారికన్నా మించి, నియోగించబడిన వారికన్నా ఎక్కువగా ఏ మేరకు కార్మికులు వుంటారో ఆమేరకు మాత్రమే శ్రమ కొరకు సాధారణ గిరాకీ పెరుగుతుంది. మార్గాన్వేషణలోనున్న అదనపు పెట్టుబడి మరో విధంగా సాధారణ శ్రామిక గిరాకీని పెంచుతుందనే దాని గతిశక్తి యాంత్రికీకరణ మూలంగా ఉద్యోగం నుండి కార్మికులను గెంటివేయబడిన మేరకు ప్రతి అంశంలోనూ తటస్థీకరణ చేయబడుతుంది. ఇంకా వివరంగా చెప్పాలంటే పెట్టుబడి పరిపూర్ణ పెరుగుదలకు అనుగుణ్యంగా, అదే స్థాయిలో సాధారణ శ్రామిక గిరాకీ పెరగకుండా పెట్టుబడిదారీ ఉత్పత్తి యంత్రాంగం ఈ కార్యకలాపాలన్నింటినీ బహు చాకచక్యంగా నడిపిస్తుంది. ఆ పరిణామ కాలంలో ఉద్యోగాల నుండి పారిశ్రామిక రిజర్వు సైన్యంలోకి నెట్టివేయబడిన కార్మికుల హీనస్థితికీ, వ్యథలకూ, మరణావస్థకూ ఇదొక నష్టపరిహారంగా భావిస్తున్నారు ఈ సమర్థకులు! పెట్టుబడి పెరుగుదలకు అనుగుణ్యంగా శ్రమ గిరాకీ సమానంగా వుండదు; కార్మికవర్గ పెరుగుదలకు అనుగుణ్యంగా శ్రమ సరఫరా వుండదు. రెండు స్వతంత్రమైన శక్తులు ఒకదానిమీద మరొకటి పనిచేస్తున్నాయనే అంశం కాదిక్కడ. త్రాసు ఒకవైపే తూగేటట్లు చేసే మోసపూరిత చర్య యిది! పెట్టుబడి ఏకకాలంలో రెండు వైపులా పనిచేస్తుంది. ఒకవైపున పెట్టుబడి సంచయనం, శ్రమకుండే గిరాకీని పెంచితే, మరోవైపున ఆ కార్మికులను "విముక్తులను గావించడం" ద్వారా వారి సరఫరాలను కూడా అది పెంచుతుంది; అదే సమయంలో నిరుద్యోగులైన వారి ఒత్తిడి ఫలితంగా ఉద్యోగంలో వున్నవారు హెచ్చు మోతాదులో శ్రమ చేయవలసిన స్థితి ఏర్పడుతున్నందువల్ల కొంత మేరకు శ్రమ సరఫరా, కార్మికుల సరఫరాతో నిమిత్తం లేకుండా స్వతంత్రంగా వుంటుంది. ఈ ప్రాతిపదికమీద ఆధారపడిన శ్రామిక సరఫరా గిరాకీల సూత్రం యొక్క కార్యాచరణ పెట్టుబడి నియంతృత్వాన్ని పరిపూర్తి గావిస్తుంది. కాబట్టి తాము అధికంగా పనిచేసే కొలదీ, యితరుల కోసం ఎక్కువగా సంపదను సృష్టించే కొలదీ, తమ శ్రమ ఉత్పాదకతా శక్తి పెరిగే కొలదీ అదే మోతాదులో పెట్టుబడి స్వీయాభివృద్ధికి దోహదం చేసే సాధనంగా తమ విధులు సహితం అధికాధికంగా అపాయకరంగా పరిణమించినపుడు అందులోని చిదంబర రహస్యమేమిటో కార్మికులు తెలుసుకున్న

వెంటనే, తమ మధ్య తమకు జరిగే పోటీ యొక్క తీవ్రతా స్థాయి, పూర్తిగా సాపేక్ష అదనపు జనాభా ఒత్తిడిపైనే ఆధారపడి వుండటాన్ని వారు కొనుగొన్న వెంటనే, పెట్టుబడిదారీ ఉత్పత్తికి సంబంధించిన ఈ సహజ సూత్రం తమ వర్గంపై కలుగజేసే వినాశకర ఫలితాలను రూపుమాపడానికీ లేక తగ్గించడానికి ఉద్యోగుల, నిరుద్యోగుల మధ్య సహకారం నెలకొల్పుకోవడానికి వారు కార్మిక సంఘాలు వగైరాల ద్వారా ప్రయత్నించిన వెంటనే "శాశ్వతమైన" ఇంకా చెప్పాలంటే "పవిత్రమైన" ఈ శ్రామిక సరఫరా గిరాకీల సూత్రం అతిక్రమించబడుతున్నదని పెట్టుబడి, దాని భట్రాజైన రాజకీయ అర్థశాస్త్రం ఎలాంటి ఆలస్యం లేకుండా గావుకేకలు పెడుతుంది. ఉద్యోగుల, నిరుద్యోగుల మధ్య నెలకొనే ప్రతి సమ్మేళనం ఈ నియమం "పొందికగా" పని చేయడాన్ని ఆటంకపరుస్తుంది. అయితే మరో వైపున ప్రతికూల పరిస్థితుల (ఉదాహరణకు వలస దేశాల్లో) మూలంగా పారిశ్రామిక రిజర్వు సైన్య సృష్టి నిరోధించ బడినపుడు, దానితో బాటుగా పెట్టుబడిదారీ వర్గంపై కార్మికవర్గం పరిపూర్ణంగా ఆధారపడటం నిరోధించ బడినపుడు మాత్రం, పెట్టుబడీ, దానితో బాటుగా దాని సహజ సిద్ధాంత క్షేత్రమైన శాంకోపాంజా (రాజకీయ అర్థశాస్త్రం) తక్షణమే ఈ "పవిత్రమైన" సరఫరా గిరాకీ నియమంపై తిరుగుబాటు చేసి దాని అననుకూల కార్యాచరణను బలాత్కార సాధనాల ద్వారా, ప్రభుత్వ జోక్యం ద్వారా అడ్డుకోవడానికి ప్రయత్నిస్తుంది.

## విభాగం - 4

# సాపేక్ష అదనపు జనాభా విభిన్న రూపాలు - పెట్టుబడిదారీ సంచయనపు సాధారణ నియమం

సాపేక్ష అదనపు జనాభా సాధ్యమైన ప్రతిరూపంలోనూ మనగలిగి ఉంటుంది. కేవలం పాక్షికోద్యోగిగానో, లేక పూర్తి నిరుద్యోగిగానో ఉన్నప్పుడు ప్రతి కార్మికుడు ఈ సాపేక్ష అదనపు జనాభాకు సంబంధించిన వ్యక్తిగానే వుంటాడు. పారిశ్రామిక వలయపు దశలలో సంభవించే మార్పుల ఫలితంగా కాలక్రమంలో బహుళంగా పునరావృత్తమయ్యే నిరుద్యోగం సంక్షోభ కాలంలో తీవ్ర రూపంలోనూ, మాంద్య కాలంలో దీర్ఘకాలిక రుగ్మత రూపంలోనూ వుంటుందనే విషయాన్ని ఇక్కడ పరిగణనలోకి తీసుకోకుండానే సాపేక్ష అదనపు జనాభా ఎల్లప్పుడూ అస్థిర లేక తాత్కాలిక అదనపు జనాభా (ఫ్లోటింగ్) అంతర్గత అదనపు జనాభా (లేటెంట్), నిస్తబ్ద అదనపు జనాభా (స్టాగ్నెంట్) అనే మూడు రూపాలను కలిగి వుంటుందని మనం గమనించవచ్చు.

కర్మాగారాలు, కార్ఖానాలు, ఇనుప పనిముట్ల తయారీ కర్మాగారాలు, గనులు వగైరాల వంటి ఆధునిక పారిశ్రామిక కేంద్రాలో, కొన్ని సందర్భాలలో కార్మికులను పనుల నుండి తొలిగించడమూ, మరికొన్ని సందర్భాలలో ఎక్కువమంది జనాన్ని ఉద్యోగంలో చేర్చుకుంటున్నప్పటికీ మొత్తం మీద ఆ విధంగా నియోగించబడిన వారి సంఖ్య ఉత్పత్తి స్థాయితో పోల్చినపుడు నిరంతరం క్షీణ నిష్పత్తి లోనైనా పెరుగుతూనే వుంటుంది. ఇక్కడ అదనపు జనాభా అస్థిర రూపంలో వుంటుంది.

యంత్రాలు ఒక ముఖ్య కారకంగా ప్రవేశించిన లేక కేవలం ఆధునిక శ్రమ విభజన మాత్రమే అమలు జరిగే కొన్ని వర్క్‌షాప్‌లన్నింటిలోనూ, అదే విధంగా ఆటోమాటిక్ కర్మాగారాలన్నింటిలోనూ,

యవ్వనదశ ప్రవేశించే వరకూ బాలురు గణనీయమైన సంఖ్యలో నియమించబడతారు. వారు యవ్వనంలోకి ప్రవేశించిన తర్వాత పరిశ్రమలోని అదే శాఖల్లో పనిలో కొనసాగే వారు బహు తక్కువ సంఖ్యలో వుంటారు; అత్యధిక సంఖ్యాకుల్ని క్రమబద్ధంగా తొలగించి వేస్తారు. పరిశ్రమలోని ఆ శాఖలు విస్తృతమయ్యే కొలదీ, దానితో బాటుగా పెరిగే అస్థిర అదనపు జనాభాలో ఈ అత్యధిక సంఖ్యాకులు ఒక భాగంగా రూపొందుతారు. అందులో ఒక భాగం వలసపోతారు; యథార్థానికి వలసపోయే పెట్టుబడిననుసరించేవారూ వలసపోతారు. ఇందువల్ల సంభవించే ఒక పర్యవసాన మేమిటంటే పురుష జనాభాకన్నా స్త్రీ జనాభా శీఘ్రగతిని పెరుగుతుంది. ఇందుకు ఉదాహరణ ఇంగ్లాండే. కార్మికుల సంఖ్యలోని సహజ పెరుగుదల పెట్టుబడి సంచయన అవసరాలను సంతృప్తి పరచలేదు; అయినప్పటికీ సర్వవేళలా దాని అవసరాలకు మించే వుంటుంది; అనగా ఇదంతా స్వయంగా పెట్టుబడి చలనంలో సహజంగా వుండే వైరుధ్యాన్ని బహిర్గతం చేస్తుంది. తరుణ వయస్కులైన కార్మికులను అధికసంఖ్యలోనూ, వయోజనులను అల్ప సంఖ్యలోనూ పెట్టుబడి నియమించుకోవాలను కుంటుంది. అయితే ఒక పక్క కార్మికుల కొరత వుండగానే, మరోప్రక్కన శ్రమ విభజన ఫలితంగా కార్మికుల్ని ఏదో ఒక ప్రత్యేక పరిశ్రమ శాఖకి బందీలుగా చేయడం వల్ల, అనేక వేలమంది కార్మికులు అదే సమయంలో నిరుద్యోగంతో సతమతమవుతున్నారనే వైరుధ్యమంత నగ్నంగా పైన చెప్పిన వైరుధ్యం వుండదు.[1]

అంతేగాక, పెట్టుబడి, శ్రమశక్తిని ఎంత ఉధృతంగా వినియోగిస్తున్నదంటే, కార్మికుడింకా తన జీవితంలో సగభాగమైనా పూర్తి చేయకముందే అతని జీవితం ఇంచుమించుగా పూర్తిగా గడిచిపోయి నట్లవుతుంది. అతడింక "అవసరం తీరిన వ్యక్తుల" శ్రేణుల్లో కలిసిపోతాడు. లేదా ఆ శ్రేణిలో ఉన్నత పథాన్నుండి నిమ్నస్థాయికి దిగజార్చబడతాడు. సరిగ్గా ఆధునిక పరిశ్రమలోని కార్మిక ప్రజల్లోనే అతి తక్కువ జీవితకాలం నెలకొని ఉండటాన్ని గమనించగలం, మాంఛెస్టర్ నగర ఆరోగ్య విషయాల వైద్యాధికారైన డా॥ లీ ఈ విధంగా వెల్లడించాడు : "మాంఛెస్టర్‌లో మరణ సమయంలో మృతుల సగటు వయస్సు... పైస్థాయిలోని మధ్యతరగతి విషయంలో 38 సంవత్సరాలు కాగా, మరణ సమయంలో కార్మిక వర్గంలోని మృతుల సగటు వయస్సు 17 సంవత్సరాలు; లివర్‌పూల్‌లో ఈ అంకెలు వరుసగా 35 సం॥, 15 సం॥ లుగా వున్నాయి. దీన్ని బట్టిచూస్తే సంపన్న వర్గాల జీవితకాలం వారి కంటే తక్కువ స్థాయిలోని పౌరులు నోచుకున్న జీవితకాలంకంటే రెండు రెట్లు ఎక్కువగా వున్నట్లు కనిపిస్తుంది.[2] ఈ పరిస్థితుల కనుగుణంగా జరగాలంటే కార్మికవర్గంలోని ఈ విభాగపు పరిపూర్ణ

---

1. 1866 సంవత్సరంలోని చివరి ఆరు నెలల్లో సుమారుగా 80వేల నుండి 90 వేల మంది జనాభాను ఉద్యోగాల నుండి తొలగించారు. ఆ ఆరునెల్లకు సంబంధించిన సమాచారాన్ని ఫ్యాక్టరీ రిపోర్టులు ఈ విధంగా వెల్లడించాయి : "అవసరమైనప్పుడల్లా, గిరాకీ నిరంతర సరఫరాలను సృష్టిస్తుందనే అంశంలో సంపూర్ణమైన వాస్తవం లేదనిపిస్తుంది. శ్రమకు సంబంధించినంత వరకు అది ఎప్పుడూ సంభవించలేదు; ఎందుచేతనంటే గత సంవత్సరం కార్మికులు కొరతగా వున్నందువల్ల యంత్రాలన్నీ పని లేకుండా పడి వున్నాయి." (రిపోర్టు ఆఫ్ ది ఇన్‌స్పెక్టర్స్ ఆఫ్ ఫ్యాక్టరీస్... 31 అక్టోబరు, 1866, పుట 81)

2 (జర్మన్ మూడవ ముద్రణకు ఏంగెల్స్ ఈ అంశాన్ని జోడించాడు) 1875 జనవరి 14వ తేదీన బర్మింగ్ హామ్‌లో జరిగిన ఆరోగ్య మహాసభలో అప్పటి బర్మింగ్ హమ్ మేయరూ ఇప్పటి (1883) బోర్డ్ ఆఫ్ ట్రేడ్ అధ్యక్షులూ అయిన జె. చాంబర్లీన్ చేసిన ప్రారంభోపన్యాసం నుండి గ్రహింపబడింది.

పెరుగుదల మాత్రం వైయక్తిక భాగాలు వేగంగా కరిగిపోయినప్పటికీ, వారి సంఖ్యను పెంపొందించుకునే పరిస్థితులలోనే జరగవలసి వుంటుంది. కాబట్టి కార్మికుల తరాలు వేగంగా పునరావృత్తమవుతూ వుంటాయి. (జనాభాలోని ఇతర వర్గాలకు ఈ సూత్రం వర్తించదు) ఆధునిక పరిశ్రమలో పనిచేస్తూ జీవిస్తున్న కార్మికుల స్థితిగతుల తప్పనిసరి పర్యవసానంగా పిల్లలను దోపిడీ చేయడానికి చెల్లించే మూల్యంగా వారి జననాలను ఉధృతం చేయడానికి బాల్య వివాహాల ద్వారా ఈ సామాజిక ఆవశ్యకత నెరవేర్చబడుతుంది.

పెట్టుబడిదారీ ఉత్పత్తి సంబంధాలు వ్యవసాయ రంగంలో చొచ్చుకుపోయిన వెంటనే, అవి ఏమేరకు ఆ విధంగా చొచ్చుకుపోతాయో ఆ నిష్పత్తిలోనే వ్యవసాయ శ్రామిక జనాభా గిరాకీ పడిపోతుంది; అదే సమయంలో వ్యవసాయంలో నియోగించబడిన పెట్టుబడి సంచయనం పెరుగుతుంది. వ్యవసాయేతర పరిశ్రమలలో మాదిరిగానే ఈ పెరుగుదల పర్యవసానంగా సంభవించే వికర్షణకు ఎక్కువ మందికార్మికులను ఆకర్షించడం ద్వారా నష్ట పరిహారం చెల్లించకుండానే పెట్టుబడి సంచయనం పెరుగుతుంది. కాబట్టి వ్యవసాయ జనాభాలో ఒక భాగం నిరంతరాయంగా పట్టణ లేక కార్ఖానా కార్మికవర్గంగా మార్పుచెందే స్థితిలో ఆ మార్పుకు అనుకూలమైన పరిస్థితుల అన్వేషణలో వుంటుంది. (కార్ఖానా అనేది వ్యవసాయేతర పరిశ్రమలన్నింటి అర్థంలోనే ఇక్కడ వాడాము)[1] సాపేక్ష అదనపు జనాభాకుండే ఈ వనరు నిరంతరం ప్రవహిస్తూనే వుంటుంది. అయితే పట్టణాలకు తరలిపోయే ఈ నిరంతర ప్రవాహం వుండాలంటే, అంతకు ముందే గ్రామీణ ప్రాంతాలలో అంతర్గత అదనపు జనాభా సదా వుండి వుండాలి; అది బయటకు వెళ్ళే మార్గాలు అసాధారణ రీతిలో విశాలమైనప్పుడు మాత్రమే ఈ అంతర్గత అదనపు జనాభా పరిమాణం మనకు బోధపడుతుంది. కాబట్టి వ్యవసాయ కార్మికుడు కనీస వేతనాలు మాత్రమే పొందే స్థితికి నెట్టబడి, ఎల్లప్పుడూ కటిక దారిద్ర్యపు బురదలో ఒక అడుగు వేసి అందులో దిగబడి వుంటాడు.

సాపేక్ష అదనపు జనాభాలోని మూడవ తరగతికి చెందిన నిస్తబ్ద అదనపు జనాభా అత్యంత క్రమరహితమైన ఉద్యోగాలలో క్రియాశీల సైన్యంలో ఒక భాగంగా రూపొందుతుంది. కాబట్టి వినియోగశక్యమైన శ్రమశక్తి అక్షయనిధిని పెట్టుబడికి ఈ భాగం సమకూర్చుతుంది. దీని జీవన స్థితిగతులు కార్మిక వర్గపు సగటు సాధారణ స్థాయికంటే దిగువకు క్రుంగిపోయి వుంటాయి; అందువల్ల ఇది తక్షణమే పెట్టుబడిదారీ దోపిడీకి చెందిన ప్రత్యేక శాఖలకు విశాల ప్రాతిపదిక నేర్పరుస్తుంది.

---

1. 1861 వ సంవత్సరంలో ఇంగ్లండ్, వేల్స్‌లలో సేకరించిన జనాభా లెక్కల సమాచారాన్ననుసరించి, "781 పట్టణాలలో 10,960,998 మంది జనాభా నివసిస్తుండగా గ్రామాల్లోనూ, గ్రామీణ ప్రాంతాల్లో వున్న పారిస్‌లలోనూ 9,105,226 మంది జనాభా జీవిస్తుండేవారు. 1851 జనాభా లెక్కల్లో సేకరించిన సమాచారాన్ననుసరించి 580 పట్టణాల్లో జీవిస్తున్న జనాభా. ఆ పట్టణ పరిసరాల్లో వున్న గ్రామీణ జనాభా దాదాపుగా సమానంగా వున్నారు. అయితే, ఆ తరువాత 10 సంవత్సరాల్లో ఈ 580 పట్టణాల్లో పదిన్నర లక్షల మంది (1,554,067) పెరగ్గా గ్రామీణ ప్రాంతాల్లో కేవలం ఐదు లక్షల మంది జనాభా మాత్రమే పెరిగారు. అనగా, గ్రామీణ ప్రాంతాల్లో 6.5 శాతం జనాభా పెరిగితే, పట్టణాల్లో 17.3 శాతం జనాభా పెరిగారు. జనాభా పెరుగుదల రేట్లలోని ఈ వ్యత్యాసానికి కారణం గ్రామీణ ప్రాంతాల్లో నుండి పట్టణ ప్రాంతాలకు జనాభా వలస పోవడమే. జనాభా మొత్తం పెరుగుదలలో దాదాపు నాల్గింట మూడు వంతులు పట్టణ ప్రాంతాలలోనే కనిపిస్తుంది. (జనాభా లెక్కలు. మూడవ సంపుటి; పుటలు 11, 12)

గరిష్ట పనికాలం, కనిష్ట వేతనాలు ఈ భాగం యొక్క విశేష లక్షణాలుగా వుంటాయి. "గృహ పరిశ్రమ" అనే శీర్షిక కింద దీని ప్రధాన రూపాన్ని గురించి మనం ఇంతకు ముందే తెలుసుకున్నాం. ఆధునిక పరిశ్రమలోనూ, వ్యవసాయంలోనూ అవసరం తీరి అధికంగావున్న శక్తులనుండీ ప్రత్యేకించి చేతివృత్తుల స్థానే తయారీ పరిశ్రమలు, వాటి స్థానే యంత్రాలు ప్రవేశించే ఆయా శిథిల పరిశ్రమల శాఖలనుండీ, నిరంతరాయంగా ఈ తరగతి సైనికులను చేర్చుకుంటూనే వుంటుంది. సంచయనపు శక్తి సామర్థ్యాల నిష్పత్తి కనుగుణ్యంగా ఈ తరగతి పెరుగుదలతో అదనపు జనాభా సృష్టి ఇంకా పెరుగుతుంది. అయితే అదే సమయంలో ఇతర భాగాలకంటే కార్మిక వర్గపు సాధారణ పెరుగుదల నుండే ఈ తరగతి నిష్పత్తి రీత్యా అధిక భాగాన్ని చేర్చుకోవడం ద్వారా అది కార్మిక వర్గపు స్వీయ పునరుత్పాదకమైన, స్వయం పెంపుదల చేసుకోగలిగిన అంశంగా రూపొందుతుంది. యథార్థానికి జనన మరణాల సంఖ్యలు మాత్రమే గాక కుటుంబాల నిరపేక్ష పరిమాణం కూడా వేతనాల స్థాయికి విలోమానుపాతంలో వుంటుంది; అందువల్ల అది వివిధ తరగతుల శ్రామికులు వాడే జీవనాధార సాధనాల మొత్తానికి విలోమానుపాతంలో వుంటుంది. పెట్టుబడిదారీ సమాజపు ఈ నియమం, ఆటవికులకైనా లేక నాగరిక వలస వాదులకైనా అసంబద్ధంగా కనిపించవచ్చు. వైయక్తికంగా బలహీనంగా వుండి, నిరంతరాయంగా వేటాడబడుతూ వున్న జంతువులు అమితంగా పునరుత్పత్తి అవడాన్ని ఈ నియమం గుర్తుకు తెస్తుంది.[1]

సాపేక్ష అదనపు జనాభాలోని నిమ్న స్థాయిలో వుండే అధమ భాగం (సెడిమెంట్) అంతిమంగా కటిక దారిద్ర్యంలో మగ్గుతూ వుంటుంది. తిరుగుబోతులు, నేరస్థులు, వ్యభిచారులు, ఒక్కమాటలో చెప్పాలంటే "ప్రమాదకర" వర్గాలన్నింటినీ మినహాయిస్తే సమాజంలో ఈ పొరలో ఇంకా మూడు తరగతులుంటాయి. పనిచేసే శక్తి సామర్థ్యాలు కలిగిన వారు మొదటి తరగతి. ఇంగ్లాండులోని కటిక దారిద్ర్య పరిస్థితులకు సంబంధించిన గణాంక వివరాలను పరిశీలిస్తే ప్రతి పారిశ్రామిక సంక్షోభంతో పాటు కటిక దరిద్రుల సంఖ్య పెరుగుతుందనీ, ప్రతి పారిశ్రామిక పునరుద్ధరణతో బాటుగా వీరి సంఖ్య తగ్గుముఖం పడుతుందనీ ఎవరైనా గమనించగలరు. అనాథ శిశువులూ, కటిక దరిద్రుల పిల్లలూ రెండవ తరగతి. వీరు పారిశ్రామిక రిజర్వు సైన్యానికి అభ్యర్థులుగా వుంటారు. 1860 సంవత్సరంలోలాగా పారిశ్రామిక రంగంలో ఉచ్చదశ నెలకొన్నప్పుడు, క్రియాశీల శ్రమసైన్యంలో అతి త్వరితగతిన అధిక సంఖ్యలో చేర్చుకోబడతారు. పతితులూ, భ్రష్టులూ, పని చేయడానికి శక్తి లేని అసమర్థులూ, ముఖ్యంగా శ్రమ విభజన మూలంగా మారే పరిస్థితులకు తట్టుకోలేక అసమర్థతతో క్రుంగిపోయే వారూ, కార్మికులుగా సాధారణ జీవితం ముగిసిన వారూ, ప్రమాద భరితమైన యంత్రాలూ, గనులూ, రసాయనిక పరిశ్రమలూ, పెరుగుదలతో బాటుగా వాటికి బలైపోయిన వికలాంగులూ,

1. "ఈ తరానికి పేదరికం అనుకూలమైనదిగా కనిపిస్తుంది" (ఆడమ్ స్మిత్); డాంబికుడూ, హాస్యప్రియుడూ అయిన అబ్బేగాలియానీ ప్రకారం దేవుడే దీన్ని యుక్తిగా ప్రత్యేకంగా ఏర్పాటు చేశాడు. "అత్యంత ప్రయోజనకరమైన వృత్తులను చేపట్టేవారు అధికసంఖ్యలో జన్మించేటట్లుగా దేవుడే ఆజ్ఞాపించాడు" (గాలియానీ; అదే గ్రంథం; పుట 78) "కరువు కాటకాలూ, అంటువ్యాధులూ సంభవించేంతగా పేదరికం పెరుగుదల వల్ల జనాభా నివారింపబడదు సరికదా, దానిని పెంచుతుంది" (యస్. లేయంగ్; నేషనల్ డిస్ట్రెస్, 1844, పుట 69) గణాంక సమాచారం ద్వారా ఈ అంశాన్ని లేయంగ్ విశదీకరించిన తర్వాత ఇలా అంటాడు : "జనాభా అంతా సౌకర్యంగా జీవిస్తూ వుంటే ప్రపంచంలో జనరాహిత్యం త్వరలో సంభవిస్తుంది."

రోగగ్రస్థులూ, వితంతువులు మొదలైనవారు మూడవ తరగతికి చెందుతారు. కటిక దరిద్ర్యం క్రియాశీల శ్రమ సైన్యానికి అవిటి వారి మందిరం. పారిశ్రామిక రిజర్వు సైన్యానికి గుదిబండ. సాపేక్ష అదనపు జనాభా సృష్టే కటిక దారిద్ర్యపు సృష్టికి దారి తీస్తుంది; సాపేక్ష అదనపు జనాభా అవసరమే దాని సృష్టికీ అవసరంగా వుంటుంది. పెట్టుబడిదారీ ఉత్పత్తికీ, పెట్టుబడిదారీ పంథాలో సంపద అభివృద్ధికీ అదనపు జనాభాతో పాటుగా కటిక దారిద్ర్యం కూడా ఒక షరతుగా రూపొందుతుంది. పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానపు మాయా చట్రంలోకి అది చొరబడుతుంది; అయితే ఈ కటిక దరిద్రులలోని అత్యధిక సంఖ్యాకులను తన స్వంత భుజస్కంధాలపై నుండి తొలగించి, కార్మిక వర్గం, దిగువ మధ్యతరగతి వర్గాల భుజస్కంధాలపైకి ఏ విధంగా నెట్టివేయాలో పెట్టుబడికి బాగా తెలుసు.

సామాజిక సంపదా, క్రియాత్మక పెట్టుబడీ, దాని విస్తృతీ శక్తి సామర్థ్యాల పెరుగుదలా ఎంత హెచ్చుగా వుంటే, అందువల్ల కార్మిక వర్గపు నిరపేక్ష పరిమాణమూ దాని శ్రమ యొక్క ఉత్పాదకతా శక్తీ అంత అధికంగా పెరిగే కొలదీ పారిశ్రామిక రిజర్వు సైన్యం కూడా అంత అధికంగానే వుంటుంది. పెట్టుబడి విస్తరణ శక్తిని పెంచే కారణాలే దాని అందుబాటులో వుండే శ్రమశక్తిని కూడా పెంపొందిస్తాయి. అందువల్ల సంపద సంభావ్య శక్తితో బాటుగా పారిశ్రామిక రిజర్వు సైన్యపు సాపేక్ష పరిమాణం కూడా పెరుగుతుంది. అయితే క్రియాశీల శ్రమ సైన్యానికి ఈ రిజర్వు సైన్యం అనుపాతంలో హెచ్చుగా వుంటే, సంఘటితమైన అదనపు జనాభా పరిమాణం కూడా హెచ్చుగానే వుంటుంది. ఆ అదనపు జనాభా హీనస్థితి, వారు చేసిన శ్రమకు విలోమానుపాతంలో వుంటుంది. చివరగా కార్మిక వర్గపు అతి నికృష్ట శ్రేణులూ, పారిశ్రామిక రిజర్వు సైన్యమూ, ఎంత విస్తృతంగా వుంటే అధికారుల నివేదికల్లో కటిక దారిద్ర్యం కూడా అంత విస్తృతంగానే వుంటుంది. ఇదే పెట్టుబడిదారీ సంచయనపు సాధారణ నిరపేక్ష నియమం. ఇతర నియమాలన్నింటి వలెనే ఆచరణలో ఈ నియమాన్ని కూడా అనేక పరిస్థితులు సవరిస్తాయి; దీని విశ్లేషణతో మనకిక్కడ ప్రస్తుతానికి ప్రమేయం లేదు.

పెట్టుబడి అవసరాలకు సరిపోయేటట్లుగా కార్మికుల సంఖ్యా బలాన్ని సర్దుబాటు చేసుకోమని కార్మికులకు ప్రబోధించే అర్థశాస్త్ర విజ్ఞానంలోని అసలు పొరపాటు ఏమిటో ఇప్పుడు స్పష్టంగా కనిపిస్తుంది. పెట్టుబడిదారీ ఉత్పత్తి సంచయనానికి సంబంధించిన యంత్రాంగమే నిరంతరం ఈ సర్దుబాటు చేస్తుంది. ఈ సవరింపులో మొట్టమొదటి అంశం సాపేక్ష అదనపు జనాభా లేక పారిశ్రామిక రిజర్వు సైన్యాన్ని సృష్టించడమే, సదా విస్తరిస్తూ వుండే క్రియాశీల శ్రామిక సైన్య శ్రేణుల దీనస్థితి కటిక దారిద్ర్యమనే గుదిబండలు ఈ సవరింపులో ఆఖరి అంశంగా వుంటాయి.

ఉత్పత్తి సాధనాలను కార్మికుడే నియోగించడానికి బదులుగా ఆ ఉత్పత్తి సాధనాలే కార్మికుని నియోగించే వ్యవస్థ అయిన పెట్టుబడిదారీ విధానం ప్రాతిపదికగా గల నియమం ద్వారా సామాజిక శ్రమ ఉత్పాదకత పెరుగుదల పుణ్యమా అని, క్రమానుగతంగా క్షీణించే మానవశక్తి యొక్క వ్యయం, నిరంతరాయంగా అధికమయ్యే ఉత్పత్తి సాధనాల పరిమాణాన్ని చలనంలోకి తీసుకు వస్తుంది; సంపూర్ణంగా విలోమంగా నున్న ఈ నియమాన్ని ఈ విధంగా వ్యక్తీకరించవచ్చు; శ్రామిక ఉత్పాదకత అధికంగా వుండే కొలదీ నియోగ సాధనాలపై శ్రామిక ఒత్తిడి మరింత హెచ్చుగా వుంటుంది; అందువల్ల వారి మనుగడ పరిస్థితి అనగా పరాయి సంపద పెరుగుదలకూ, లేక పెట్టుబడి స్వీయ విస్తరణ కోసం కార్మికుల స్వీయ శ్రమశక్తిని అమ్మకం చేయడం మరింత అపాయకరంగా తయారవుతుంది.

అందువల్ల ఉత్పత్తి సాధనాలూ, శ్రామిక ఉత్పాదకతా, ఉత్పాదక జనాభా కంటే మరింత ఉద్ధృతంగా అధికమవుతాయనే వాస్తవం, పెట్టుబడి స్వీయ విస్తరణ అవసరాల కంటే శ్రామిక జనాభా మరింత ఉద్ధృతంగా ఎల్లప్పుడూ పెరుగుతూ వుంటుందనే విలోమ రూపంలో పెట్టుబడిదారీ విధానంలో వ్యక్తీకరించబడుతుంది.

పెట్టుబడిదారీ వ్యవస్థలో శ్రమయొక్క సామాజిక ఉత్పాదకతను హెచ్చుగావించే పద్ధతులన్నీ వ్యష్టి కార్మికునికి నష్టదాయకమైన రీతిలోనే రూపొందుతాయనీ, ఉత్పత్తిని అభివృద్ధి చేయడానికి ఉపయోగించే సాధనాలన్నీ ఉత్పత్తిదారులపై ఆధిపత్యం చలాయించి, వారిని దోపిడీ చేసే సాధనాలుగా మారుతాయనీ; ఆ సాధనాలన్నీ కార్మికుణ్ణి మనిషిలో ఒక అల్పాంశంగా మార్చి అతనిని వికలాంగుణ్ణి చేస్తాయనీ; ఒక యంత్రానికి ఉపాంగంగా మారేటేంత నీచ స్థాయికి దిగజార్చి అతనిని కించపరుస్తాయనీ, అతని పనిలో ఏమాత్రం ఉత్సాహం మిగిలినా దానిని అంతం చేసి అసహ్యమైన కఠిన శ్రమగా ఆ పనిని మార్చివేస్తాయనీ, ఒక స్వతంత్ర శక్తిగా శాస్త్ర విజ్ఞానం శ్రమ ప్రక్రియలోకి చొచ్చుకుపోయే నిష్పత్తిలోనే ఆ సాధనాలు, శ్రమ ప్రక్రియకు సంబంధించిన మేధా సంపత్తిని కార్మికుడి నుండి దూరం చేస్తాయనీ, కార్మికుడు పని చేసే పరిస్థితులను వక్రీకరించి శ్రమ ప్రక్రియ కాలంలో నీచాతి నీచమైన నిరంకుశత్వానికి గురి చేస్తాయనీ; అతని జీవిత కాలాన్నంతా శ్రమకాలంగా మార్చి వేస్తాయనీ, అతని భార్యాబిడ్డలను సహితం పెట్టుబడి అనే జగన్నాథ రథ చక్రాల కిందకు నెట్టి వేస్తాయనీ, నాల్గవ భాగంలో సాపేక్ష అదనపు విలువ ఉత్పత్తిని గురించి విశ్లేషించేటప్పుడు తెలుసుకున్నాం. అయితే అదనపు విలువను సృష్టించే పద్ధతులన్నీ అదే సమయంలో సంచయనపు పద్ధతులుగా కూడా వుంటాయి; సంచయనానికి సంబంధించిన ప్రతి విస్తరణా, తిరిగి ఆ పద్ధతులను ఇనుమడింప చేసుకోవడానికి సాధనాలుగా రూపొందుతాయి. అందువల్ల దీనిని బట్టి చూస్తే కార్మికుడికి చెల్లించేది ఎక్కువైనా లేక తక్కువైనా పెట్టుబడి సంచయనం జరిగిన నిష్పత్తిలోనే కార్మికుడి స్థితి మరింత దారుణం కావలసిందే. చిట్టచివరగా సాపేక్ష అదనపు జనాభా లేక పారిశ్రామిక రిజర్వు సైన్యాన్ని ఎల్లప్పుడూ సంచయనపు విస్తృతీ, శక్తి సామర్థ్యాలతో సమతుల్యం గావించే నియమం, హెఫైస్టస్ ఏర్పరిచిన ఉక్కు సంకెళ్లతో ప్రామీథస్‌ను రాతిబండకు కట్టిపడేసిన దానికంటే కూడా ఎంతో బిగువగా ఈ నియమం కార్మికుడ్ని పెట్టుబడికి కట్టిపడేస్తుంది. పెట్టుబడి సంచయనానికి అనుగుణంగానే పుట్టెడు దౌర్భాగ్యాన్ని కూడా ఈ నియమం ప్రసాదిస్తుంది. కాబట్టి ఒక ధ్రువం దగ్గర సంపద సంచయనం చేయడం అంటే, అదే సమయంలో మరో విరుద్ధ ధ్రువం దగ్గర అనగా పెట్టుబడి రూపంలో తన స్వీయ ఉత్పాదితాన్ని ఉత్పత్తి చేసే వర్గం దగ్గర పుట్టెడు దౌర్భాగ్యం, గొడ్డు చాకిరీకి మూలంగా తీవ్రవేదనా, బానిసత్వం, అజ్ఞానం, పాశవికత, నైతిక పతనం సంచయనం గావడమే.

పెట్టుబడిదారీ సంచయనానికి సంబంధించిన ఈ విరుద్ధ లక్షణాన్ని[1] రాజకీయ అర్థశాస్త్రవేత్తలు

---

1. "బూర్జువ వర్గ ఉత్పత్తి సంబంధాలు సరళంగా, ఏకరీతిలో వుండేవిగా గాక ద్వంద్వ స్వభావాన్ని కలిగి ఉంటాయని రోజు రోజుకీ స్పష్టమవుతుంది; ఆ సంబంధాలలోనే సంపదతో పాటుగా పేదరికమూ సృష్టించ బడుతుంది; ఆ సంబంధాలలోనే ఉత్పత్తి శక్తుల అభివృద్ధితో పాటుగా, దోపిడీ శక్తులూ అభివృద్ధి అవుతాయి; ఆ సంబంధాలలోనే బూర్జువావర్గం యొక్క సంపద ఉత్పత్తి చేయబడుతుంది; అనగా నిరంతరాయంగా కార్మికవర్గాన్ని సృష్టించడం ద్వారా బూర్జువా వర్గంలోని వ్యక్తుల సంపద స్వాయత్తం చేసుకోవడం ద్వారా ఆ సంపద ఉత్పత్తి చేయబడుతుంది" (కారల్ మార్క్స్, మిసరీడీలా ఫిలాసఫీ, పుట 116)

తమ పరిశీలనలో, పెట్టుబడిదారీ విధానానికి పూర్వం వున్న ఉత్పత్తి విధానాలకు సంబంధించినదిగా భావించి, వాటి మధ్య కొంత సారూప్యత ఉన్నప్పటికీ, ప్రధానంగా విభిన్నంగా వుండే ఈ విరుద్ధ లక్షణాన్ని వివిధ రూపాలలో వెల్లడించారు.

18వ శతాబ్దపు గొప్ప అర్థశాస్త్రవేత్తలలో ఒకడూ, వెనీస్ నగరానికి చెందిన సన్యాసీ అయిన ఓర్టెస్ పెట్టుబడిదారీ ఉత్పత్తి యొక్క ఈ విరుద్ధ లక్షణాన్ని సామాజిక సంపద యొక్క సార్వత్రికమైన సహజ నియమంగా భావిస్తాడు. "ఒక దేశం యొక్క ఆర్థిక వ్యవస్థలో మంచీ చెడూ ఎప్పుడూ ఒకదానినొకటి సమతుల్యంలో ఉంచుకుంటాయి. కొంతమంది ఆధీనంలో సంపద సమృద్ధిగా వుంటే మరికొంత మంది దగ్గర అందుకు సమానంగా సంపద లేకుండా వుంటుంది. అతి తక్కువ మంది ఎక్కువ సంపదను కలిగి వుండటంతో పాటుగా ఎల్లప్పుడూ ఎక్కువమంది జీవితావసరాలకు కూడా నోచుకోలేని పూర్తి దౌర్భాగ్యస్థితిలో వుంటారు. ఒకదేశం యొక్క జనాభాకి అనుగుణ్యంగా సంపదా, ఆ సంపద కనుగుణ్యంగా దౌర్భాగ్యం వుంటాయి. కొంతమంది చేసే శ్రమ, మరికొంత మందిలో సోమరితనాన్ని ప్రోత్సహిస్తుంది. సుసంపన్నత, క్రియాశీలతల యొక్క తప్పనిసరి పర్యవసానాలే పేదరికం, సోమరితనం"[1] ఓర్టెస్ ఈ విధంగా చేసిన తర్వాత 10 సంవత్సరాలకు చర్చ్ ఆఫ్ ఇంగ్లాండ్ మత బోధకుడు అయిన టౌన్ సెండ్, సంపన్నతకు దౌర్భాగ్యం తప్పనిసరి షరతు అని అత్యంత పాశవికంగా దౌర్భాగ్యాన్ని కీర్తించాడు. "(కార్మికులు) ఆందోళన చేయడానికి, హింసకు పూనుకోవడానికీ, గగ్గోలు పెట్టడానికి చట్టపరమైన ప్రతిబంధకాలువున్నాయి... అదే సమయంలో కడుపు మాడ్చుకోవడానికీ, శాంతియుతమైన, నిశ్శబ్దమైన, ఆటంకం లేని, వత్తిడిని తెచ్చే సాధనమైనప్పటికీ పరిశ్రమ మీద, కార్మికుల మీద అది అత్యంత శక్తివంతమైన ఒత్తిడిని తీసుకువస్తుంది." కాబట్టి కార్మికవర్గంలో ఆకలిని శాశ్వతమొనర్చడం మీదనే ప్రతిదీ ఆధారపడుతుంది; టౌన్‌సెండ్ ప్రకారం ప్రత్యేకించి పేద వర్గాలలోని క్రియాశీల శక్తులలో జనాభా మాత్రమే దీనికి కావలసిన వనరులు సమకూరుస్తుంది. "పేద వర్గాలలో మిత వ్యయం లేకపోవడమే. ప్రకృతి సిద్ధమైన సూత్రంగా కొంతమేరకు కనిపిస్తుంది" (అనగా ఎంత మిత వ్యయం లేకుండా వుండాలంటే ఆగర్భ శ్రీమంతులుగా జనించకుండా ఉండేటంతగా) "సమాజంలో బానిసపరమైన, అత్యంత నీచమైన, అత్యంత తుచ్ఛమైన సేవలనందించడానికి కొంతమంది అవసరమవుతారు. తద్వారా మానవ సంతోషం సమృద్ధిగా పెరుగుతుంది. అదే సమయంలో అతి సున్నితమైన వారు ఈ వెట్టిచాకిరీ నుండి విముక్తి పొందటమే గాక ఎలాంటి ఆటంకం లేకుండా వారు ఆయా పథకాలకు అనుగుణ్యమైన కార్యక్రమాలను నెరవేర్చుకోవచ్చు... ప్రపంచంలో దేవుడూ, ప్రకృతిచేత సృష్టించబడిన ఈ వ్యవస్థలోని సుఖ సంతోషాలనూ, అదుపు ఆజ్ఞలనూ, ఇది (పేదల చట్టం) నాశనం చేయడానికి ప్రయత్నిస్తుంది"[2] క్రైస్తవ మతంలో ఉదారత్వానికీ, బ్రహ్మచర్యానికీ మఠాలూ, పవిత్ర ఆలయాలు వెలయడానికి శాశ్వతమైన దౌర్భాగ్యస్థితే కారణమనీ, ఆ దౌర్భాగ్యస్థితికి కారణం

1. జి. ఓర్టెస్ : "డెల్లా ఎకానమియా వేజనలే" లిబ్రీసే, 1777 ఇన్ కస్టాడి, పార్టె మోడరనా; సంపుటి 21, పుటలు, 6,9,22,25 వగైరాలు. ఓర్టెస్ ఈ విధంగా అంటాడు చూడు అదే గ్రంథం, పుట 32 : "ప్రజల సుఖసంతోషాలను పెంపొందించడానికి నిరుపయోగమైన ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించడానికి బదులుగా వారి నిర్భాగ్యతకు గల కారణాలను శోధించడానికి నేను పరిమితమవుతాను"
2. "ఏ డెసర్వేషన్ ఆన్ పూర్ లాస్, బై ఎ వెల్‌విషర్ ఆఫ్ మాన్‌కైండ్" (ది రెవడెంట్, టౌన్‌సెండ్). 1786. పునర్ముద్రణ లండన్, 1817 పుటలు. 15,39,41 ఇప్పుడు ఉటకించిన వాక్యం "సున్నిత స్వభావం కలిగిన

అదృష్టజాతకమేననీ వెనీస్ నగర సన్యాసి భావించగా, దయనీయమైన ఉపశమనం పొందడానికి పేదలకుండే హక్కును సహితం ఖండించడానికి దేవుడి మాన్యాలను అనుభవించే ప్రొటెస్టంట్ మత పీఠాధిపతులు దీనినొక సాకుగా తీసుకున్నారు.

"సామాజిక సంపద అభివృద్ధే ఉపయోగకరమైన ఈ సామాజిక వర్గాన్ని సృష్టిస్తుంది... అత్యంత శ్రమభరితమైన, నికృష్టమైన, అత్యంత విసుగును కలిగించే క్రియలను ఒక్క మాటలో చెప్పాలంటే జీవితంలో అనంగీకారమైన దాస్యక్రియలను తన భుజస్కంధాలమీద వేసుకుని ఇతర వర్గాలకు విశ్రాంతినీ, మనశ్శాంతినీ, సాంప్రదాయకమైన ఘనత వహించే వ్యక్తిత్వాన్ని ఈ వర్గం చేకూర్చుతుంది"[1] అని స్టార్చ్ అంటాడు. ఆటవిక వ్యవస్థతో పోల్చినపుడు ప్రజానీకం యొక్క దౌర్భాగ్య దైన్యస్థితులతో కూడిన పెట్టుబడిదారీ నాగరికతలోని ఔన్నత్యమేమిటని స్టార్చ్ తనను తానే ప్రశ్నించుకుంటాడు. అప్పుడు ఆయనకున్న సమాధానం ఒకే ఒకటి; రక్షణ!

"పారిశ్రామిక శాస్త్ర రంగాలలో జరిగిన పురోభివృద్ధి పుణ్యమా అని, ప్రతి కార్మికుడు, ప్రతిరోజు తన స్వీయ వినియోగ అవసరాలకంటే అధికంగా ఉత్పత్తి చేయగలడు. అయితే అదే సమయంలో అతని శ్రమ సంపదను ఉత్పత్తి చేసినా, ఆ సంపదనే గనుక అతని వినియోగానికి వదిలినట్లయితే ఆ సంపద అతనిని పనికిమాలిన వానిగా చేస్తుంది" అని సిస్మాండీ అంటాడు. అతని ఉద్దేశ్యంలో కార్మికులు ఎంతో చెమటోడ్చి తయారు చేసిన వాటినే మనుష్యులు (పనిచేయనివారు) కొనుగోలు చేయవలసి వస్తే, పరిశ్రమ సమకూర్చే సౌకర్యాలను వదులుకుని ఎలాంటి నగిషీలు లేకుండానే వాటిని పొందాలనుకుంటారు... ఈరోజున కష్టానికి తగిన ఫలితం లేదు. పనిచేసి విశ్రాంతి పొందాలనేది ఈనాడు మనకు కన్పించడం లేదు; ఒకడు పనిచేస్తూ ఉంటే మరొకడు విశ్రాంతి పొందడమే మనకు కనిపిస్తుంది... శ్రామిక ఉత్పాదకతలో నిరవధికమైన పెరుగుదలే సోమరులైన సంపన్నుల విలాసాలనూ, సౌఖ్యాలనూ పెంపు చేస్తుంది తప్ప మరే విధమైన ఫలితాన్ని ఇవ్వదు."[2]

తడిగుడ్డతో గొంతులు కోసే బూర్జువా సిద్ధాంత ప్రకాండ పండితుడైన డెస్టట్ డీ ట్రేసీ పాశవికంగా వెళ్ళగక్కిన అంశాన్ని చివరగా ఉటంకిస్తాను; "పేద దేశాల్లోని జనం సౌకర్యంగానే జీవిస్తారు; అయితే సంపన్నదేశాల్లో సాధారణంగా వారు పేదవారుగా వుంటారు."[3]

---

ఈ మతాధికారి" రచన నుండే గ్రహించబడింది; ఆయన రాసిన "జర్నీ త్రూ స్పెయిన్" అనే గ్రంథం నుండి తరుచుగా మాల్తస్ పేజీలకు పేజీలే కాపీ చేశాడు. టౌన్‌సెండ్ ప్రతిపాదించిన సిద్ధాంతంలోని ఎక్కువభాగం సర్ జేమ్స్ స్టువర్ట్ రచనల నుండి తిరస్కరించబడి అపభ్రంశం గావించబడింది. ఉదాహరణకు స్టువర్ట్ ఇలా అంటారు: "బలవంతంగా మానవుల చేత పనిచేయించడం బానిసత్వంలో ఒక పద్ధతి." (పని చేయని వాళ్ళ కోసం) "అప్పుడు పని చేయవలసిన స్థితికి మానవులు బలవంతంగా నెట్టబడతారు" (ఇతరుల కోసం ఉచితంగా పని చేయడం) "ఎందుచేతనంటే వారు వారి అవసరాలకు బానిసలు గనుక; వేతన శ్రామికుడు ఎప్పుడూ పస్తులతో కాలక్షేపం చేయాలని భావించే, దేవుడి మాన్యాలను లాభదాయకంగా అనుభవించే, మాన్యాధిపతులలాగా ఆయన ఇంతటితో ముగించలేదు; దీనికి భిన్నంగా వారి కోర్కెలను పెంచాలనీ, ఆ విధంగా పెంపొందే కోర్కెలు ఉన్నత వర్గాల" కోసం వారు చేసే శ్రమకు ప్రేరణ కావాలనీ ఆయన వాంఛిస్తాడు.

1. స్టార్చ్; అదే గ్రంథం; సంపుటి 3, పుట 223.
2. సిస్మాండీ ; అదే గ్రంథం, పుట 79, 80, 85.
3. డెస్టట్ డీ ట్రేసీ; అదే గ్రంథం; పుట 231.

## విభాగం - 5

# ఉదాహరణ సహితంగా పెట్టుబడి సంచయనపు సాధారణ నియమం వివరణ

## (అ) 1846-1866 మధ్యకాలంలో ఇంగ్లాండ్

పెట్టుబడిదారీ విధానపు సంచయనాన్ని అధ్యయనం చేయడానికి ఆధునిక సామాజిక వ్యవస్థలోని ఏ దశ కూడా గత 20 సంవత్సరాలంత అనుకూలంగా లేదు. ఈ దశ ఒక గనిలాగా మనకు ఉపయోగపడుతుంది. అయితే ప్రపంచ మార్కెట్‌లో అత్యున్నత స్థానాన్ని ఆక్రమిస్తున్నందు వల్లా, ఇంగ్లాండులో మాత్రమే పెట్టుబడిదారీ ఉత్పత్తి పరిపూర్ణంగా అభివృద్ధి చెందినందువల్లా, 1846 సంవత్సరానంతరం స్వేచ్ఛా వ్యాపార పరంపరలు ప్రారంభమైన తర్వాత అప్రభంశపు ఆర్థిక సిద్ధాంతాలు (వల్గర్ ఎనాకమీ) తుది ప్రస్థావన అంతమవుతున్నందు వల్లా మిగతా దేశాలకంటే ఇంగ్లాండ్‌నే మరోసారి ప్రామాణికమైన ఉదాహరణగా పేర్కొనవచ్చు. ఆ 20 సంవత్సరాలలోని మొదటి దశకంటే ద్వితీయార్థంలో ఉత్పత్తిలో వచ్చిన బ్రహ్మాండమైన పెరుగుదలను గురించి నాల్గవ భాగంలో సవివరంగా ప్రస్తావించబడింది.

జనాభా లెక్కల నుండి సేకరించిన ఈ క్రింది పట్టికలో చూపించిన విధంగా గత అర్ధ శతాబ్ద కాలంలో ఇంగ్లాండ్ జనాభా పరిపూర్ణంగా పెరిగినప్పటికీ దాని సాపేక్ష పెరుగుదలా, లేక పెరుగుదల రేటు స్థిరంగా పడిపోయింది.

ఇంగ్లాండ్, వేల్సులలో సాలుసరి సగటు జనాభా పెరుగుదల శాతం ఈ క్రింది విధంగా వుంది :

| | | |
|---|---|---|
| 1811 - 1821 | - | 1.533 శాతం |
| 1821 - 1831 | - | 1.446 శాతం |
| 1831 - 1841 | - | 1.326 శాతం |
| 1841 - 1851 | - | 1.216 శాతం |
| 1851 - 1861 | - | 1.141 శాతం |

మరో వైపున సంపదలో వచ్చిన పెరుగుదలను కూడా ఇప్పుడు పరిశీలిద్దాం. ఆదాయపు పన్ను క్రింద జమ చేసే లాభాల వివరాలూ, భూమి, కౌలూ వగైరాలు మనకు నికరమైన ఆధారాలుగా వుంటాయి. 1853 - 1864 మధ్య కాలంలో గ్రేట్ బ్రిటన్‌లో ఆదాయపు పన్ను విధించడానికి అర్హత కలిగిన (ఇందులో వ్యవసాయదారులు, ఇతర తరగతులు మినహాయించబడ్డాయి) లాభాలు 50.47 శాతం పెరిగితే (సాలుసరి సగటున 4.58 శాతం పెరిగితే)[1] అదే కాలంలో జనాభా 12.0 శాతం మాత్రమే పెరిగింది. 1853-1864 మధ్య కాలంలో పన్ను విధించడానికి అర్హత కలిగిన భూమి కౌలు (ఇళ్ళు, రైల్వేలు, గనులు, చేపల పెంపకం వగైరాలను కలుపుకుని) 38 శాతానికి పెరిగింది; లేదా సాలుసరి సగటున $3\frac{5}{12}$ శాతం పెరిగింది. ఈ శీర్షిక క్రింద ఈ క్రింది తరగతులలో అత్యధిక పెరుగుదల కనిపిస్తుంది.[2]

---

1. "టెన్త్ రిపోర్ట్ ఆఫ్ ది కమీషనర్స్ ఆఫ్ హెచ్.యం. ఇన్‌లాండ్ రెవిన్యూ" లండన్, 1866 పుట 38.
2. పై గ్రంథమే; అదే పుట

| వ.నెం. | తరగతి | 1853 సంవత్సరం కంటే 1864 సం॥లో సాలుసరి ఆదాయం పెరుగుదల శాతం | సంవత్సరంలో పెరుగుదల శాతం |
|---|---|---|---|
| 1 | గృహాలు.......................... | 38.60 | 3.50 |
| 2. | రాళ్ళ త్రవ్వకం (క్వారీలు)......... | 84.76 | 7.70 |
| 3. | గనులు .......................... | 68.85 | 6.26 |
| 4. | ఇనుప పరిశ్రమ ................. | 39.92 | 3.63 |
| 5. | చేపల పెంపకం ................. | 57.37 | 5.21 |
| 6. | గ్యాస్ తయారు చేసే పరిశ్రమ.... | 126.02 | 11.45 |
| 7. | రైల్వేలు .......................... | 83.29 | 7.57 |

1853 - 1864 మధ్య కాలాన్ని వరుసగా 4 సంవత్సరాల కాలాన్ని మూడు భాగాలుగా విభజించి పోల్చి చూసినట్లయితే ఆదాయపు పెరుగుదల రేటు నిరంతరాయంగా పెరుగుతున్నట్లు కనిపిస్తుంది. ఉదాహరణకు సాలుసరి సగటున లాభాలు 1853-1857 మధ్య 1.73 శాతం, 1857-1861 మధ్య 2.74 శాతం; 1861 - 1864 మధ్య 9.30 శాతం పెరిగాయి. ఆదాయం పన్ను పరిధిలోకి వచ్చే ఆదాయం యునైటెడ్ కింగ్ డమ్‌లో 1856లో 307,068,898 పౌండ్లు, 1859లో 328,127,416 పౌండ్లు, 1862లో 351,745,241 పౌండ్లు 1863లో 359,142,897 పౌండ్లు, 1864లో 362,462,279 పౌండ్లు, 1865లో 385, 530, 020 పౌండ్లకు పెరిగింది.[1]

అదే సమయంలో పెట్టుబడి సంచయనంతో బాటుగా దాని సాంద్రీకరణా, కేంద్రీకరణా కూడా సాధించబడ్డాయి. ఇంగ్లాండ్‌లో వ్యవసాయ రంగానికి అధికారికమైన గణాంక సమాచారం లేనప్పటికీ (ఐర్లాండ్‌కు వుంది) పది దేశాలు స్వచ్ఛందంగా ఆ సమాచారాన్ని సమకూర్చాయి. ఈ గణాంక సమాచారాన్ని అనుసరించి 1851 నుండి 1861 వరకు 100 ఎకరాల లోపు గల వ్యవసాయ కమతాలు 31,583 నుండి 26,597కు పడిపోయాయి; ఆ విధంగా 5,016 కమతాలు ఇంకా పెద్ద కమతాలలోకి నెట్టివేయబడ్డాయి.[2] 1815 నుండి 1825 వరకు 1,000,000 పౌండ్లకు మించిన ఏ వైయక్తిక సంస్థానమైనా వారసత్వ చట్టం పరిధిలోకి రాలేదు; అయితే 1825 నుండి 1855 వరకు 8

1. పోల్చి పరిశీలించడానికి ఈ సంఖ్యలు సరిపోతాయి; అయితే ప్రతి సంవత్సరమూ సుమారుగా 100,000,000 పౌండ్లు ఆదాయం వెల్లడి కాకపోవడం వల్ల ఈ సంఖ్యలను సంపూర్తిగా అంగీకరించడానికి వీల్లేదు. వ్యాపార, పారిశ్రామిక వర్గాలు ఒక క్రమపద్ధతిలో తప్పుడు లెక్కలను చూపిస్తున్నారని ఇన్‌లాండ్ రెవిన్యూ కమిషనర్స్ తమ నివేదికల్లో పలుమార్లు ఫిర్యాదులు చేశారు. ఉదాహరణకు : ''పన్ను విధింపు పరిధిలోకి వచ్చే లాభాలను ఒక ఉమ్మడి వాటా కంపెనీ 6,000 పౌండ్లుగా ప్రకటిస్తే, ఆదాయ పరిశీలన సర్వేయర్లు ఆ మొత్తాన్ని 88,000 పౌండ్లుగా లెక్కించి దానిమీద పన్ను విధించారు. మరొక కంపెనీ తన ఆదాయాన్ని 190,000 పౌండ్లుగా ప్రకటిస్తే చివరకు అధికార్లు ఆ మొత్తం నిజంగా 250,000 పౌండ్లుగా వుంటుందని ఆ కంపెనీ చేత బలవంతంగా అంగీకరింపజేశారు'' (అదే గ్రంథం పుట 42)
2. ''జనాభా లెక్కలు వగైరా'' అదే గ్రంథం; పుట 29. ఇంగ్లాండ్ భూమిలో సగ భాగం 150 మంది భూస్వాముల ఆధిపత్యంలోనూ, స్కాట్‌లాండ్ భూమిలో సగభాగం 12 మంది భూస్వాముల ఆధిపత్యం లోనూ వుందనే జాన్ బ్రైట్ వక్కాణింపును ఎవ్వరూ ఇంతవరకూ నిరాకరించలేదు.

సంస్థానాలు ఈ పరిధిలోకిరాగా, 1856 నుండి 1859 జూన్ నెల వరకు అనగా $4\frac{1}{2}$ సంవత్సరాల కాలంలో 4 సంస్థానాలు ఈ పరిధిలోకి వచ్చాయి.[1]

ఏమైనప్పటికీ 1864, 1865 సంవత్సరాలోని ఆదాయపుపన్ను పట్టిక "డి"ను (లాభాలు, ప్రత్యేకించి వ్యవసాయం వగైరాలు) సంక్షిప్తంగా పరిశీలించినట్లయితే కేంద్రీకరణ ఏ మేరకు జరిగిందో స్పష్టంగా గమనించవచ్చు. ఈ వనరు నుండి ఆదాయం లభించే వర్గాలు, తమ ఆదాయంలో 60 పౌండ్లుకు మించిన ప్రతి అంశం మీద ఆదాయ పన్ను చెల్లిస్తారని ముందుగానే నేను మీ దృష్టికి తెస్తున్నాను. ఇంగ్లాండ్, వేల్స్, స్కాట్‌లాండ్‌లలో పన్ను పరిధిలోకి వచ్చే ఆదాయాలు 1864లో 95, 844,222 పౌండ్లు కాగా 1865లో 105, 435, 579 పౌండ్లకి పెరిగాయి.[2] 1864లో 23,891,009 గానున్న మొత్తం జనాభాలో 308,416 వ్యక్తుల మీద మాత్రమే పన్ను విధించారు. ఈ రెండు సంవత్సరాలలోని ఆదాయపు పంపిణీ గురించి ఈ క్రింది పట్టిక సమాచారం అందిస్తుంది :

| | 1864 ఏప్రిల్ 5తో ముగిసే సంవత్సరానికి | | 1865 ఏప్రిల్ 5తో ముగిసే సంవత్సరానికి | |
|---|---|---|---|---|
| | లాభాలనుండి ఆదాయం (పౌండ్లలో) | వ్యక్తులు | లాభాల నుండి ఆదాయం (పౌండ్లలో) | వ్యక్తులు |
| మొత్తం ఆదాయం | 95,844,222 | 308,416 | 105,435,738 | 332,431 |
| అందులో......... | 57,028,289 | 23,334 | 64,554,297 | 24,265 |
| " ........... | 36,415,225 | 3,619 | 42,535,576 | 4,021 |
| " ........... | 22,809,781 | 832 | 27,555,313 | 973 |
| " ........... | 8,744,762 | 91 | 11,077,238 | 107 |

యునైటెడ్ కింగ్‌డమ్‌లో 1856 సంవత్సరం 16,113,167 పౌండ్లు విలువ చేసే 61,543,079 టన్నుల బొగ్గు ఉత్పత్తి అయింది; 1864లో 23,197,968 పౌండ్లవిలువ చేసే 92,787,873 టన్నుల బొగ్గు ఉత్పత్తి అయింది; 1855లో 8,045,385 పౌండ్ల విలువ చేసే 3,218,154 టన్నుల ఉక్కు దిమ్మెలు, 1864లో 11,919,877 పౌండ్ల విలువ చేసే 4,767,951 టన్నుల ఉక్కు దిమ్మెలు ఉత్పత్తి అయినాయి. యునైటెడ్ కింగ్‌డమ్‌లో 1854లో 286,068,794 పౌండ్లు చెల్లించిన పెట్టుబడితో వాడకంలో వున్న రైలు మార్గాల పొడవు 8,054 మైళ్ళు కాగా 1864లో 425,719,613 పౌండ్లు చెల్లించిన పెట్టుబడితో వాడకంలో వున్న రైలు మార్గాల పొడవు 12,789 మైళ్ళు. 1854లో యునైటెడ్ కింగ్‌డమ్ ఎగుమతి దిగుమతుల మొత్తం విలువ 268,210,145 పౌండ్లు కాగా, 1865లో వాటి విలువ 489,923,285 పౌండ్లు. ఈ క్రింది పట్టిక ఎగుమతుల వివరాలను తెలియజేస్తుంది.[3]

1. "పోర్త్ రిపోర్ట్ ఆఫ్ ది కమిషనర్స్ ఆఫ్ హెచ్.యం. ఇన్‌లాండ్ రెవిన్యూ" లండన్, 1860. పుట 17
2. చట్టరీత్యా అంగీకరించబడిన కొన్ని మినహాయింపులు పోను, ఈ ఆదాయాలన్నీ నికర ఆదాయాలే.
3. బ్రిటన్ వస్త్ర వ్యాపారస్థుల ఎగుమతుల మూలంగా, 1867 మార్చి మాసంలో భారతదేశంలోనూ, చైనాలోనూ, వున్న మార్కెట్‌లు అధికంగా వస్త్రాలతో ముంచి వేయబడ్డాయి. 1866లో నూలు కార్మికుల వేతనాలలో 5 శాతం తగ్గించబడింది. దీని పర్యవసానంగా 1867లో ప్రెస్టన్‌లో 20,000 మంది కార్మికులు సమ్మె చేశారు. (జర్మన్ నాల్గవ ముద్రణకు ఏంగెల్స్ పొందుపరిచింది - దీని తర్వాత వెంటనే చెలరేగిన గొప్ప సంక్షోభానికి ఇదొక ప్రారంభం)

| సంవత్సరం | | ఎగుమతుల విలువ (పౌండ్లలో) |
|---|---|---|
| 1846 | ...................................... | 58,842,377 |
| 1849 | ...................................... | 63,596,052 |
| 1856 | ...................................... | 115,826,948 |
| 1860 | ...................................... | 135,842,817 |
| 1865 | ...................................... | 165,862,402 |
| 1866 | ...................................... | 188,917,563 |

"జనాభా ఎంతో ఉధృతంగా పెరిగినప్పటికీ ఆ పెరుగుదల పారిశ్రామిక ప్రగతితోనూ, సంపద పెరుగుదలతోనూ సమానంగా లేదు"[1] అని బ్రిటీష్ జనాభా లెక్కల రిజిస్ట్రార్ జనరల్ విజయగర్వంతో ఎందుకు కేరింతలు కొట్టాడో పై ఉదాహరణలను పరిశీలించిన తర్వాతనైనా అవగతమవుతుంది.

ఇక పారిశ్రామిక రంగ రథసారథులూ లేక, సంపద సృష్టికర్తలూ అయిన కార్మికవర్గం వైపు మన దృష్టిని సారిద్దాం. గ్లాడ్‌స్టన్ ఈ విధంగా అంటాడు: "ఒక వైపున ప్రజల యొక్క వినియోగ శక్తి తరిగిపోతూ వుంటే కార్మికవర్గం యొక్క చెమటోడ్చే వారి యొక్క నిర్భాగ్యతా, దారిద్ర్యమూ పెరుగుతూ వుంటే అదే సమయంలో మరోవైపున ఉన్నత వర్గాల యొక్క సంపద నిరంతరాయంగా సంచయనం చేయబడుతూ, పెట్టుబడి పెరుగుతూ ఉండటమనేది ఈ దేశం యొక్క సామాజిక స్థితిలో వుండే అత్యంత విచారకరమైన లక్షణంగా కనిపిస్తుంది"[2] అని 1843 సంవత్సరం ఫిబ్రవరి 13వ తేదీన కామన్సు సభలో ఈ మంత్రిగారు అత్యంత ఉద్రేకపూరితంగా ఉపన్యసించాడు. 20 సంవత్సరాల తర్వాత 1863వ సంవత్సరం ఏప్రిల్ 16వ తేదీన అదే సభలో తన బడ్జెట్‌ను ప్రవేశపెడుతూ ఆయన ఈ విధంగా మాట్లాడాడు : "ఈ దేశంలో 1842 నుండి 1852 వరకు పన్ను విధింపు పరిధిలోకి వచ్చే ఆదాయం 6 శాతం పెరిగింది.... 1853ను ప్రాతిపదికగా చేసుకుని 1853 నుండి 1861 వరకూ అనగా 8 సంవత్సరాల కాలంలో ఈ ఆదాయం 20 శాతానికి పెరిగింది!... ఇది నమ్మశక్యం కానంత ఆశ్చర్యాన్ని గొలిపే వాస్తవం.... ఊహించనలవి గాని ఈ సంపద శక్తి సామర్థ్యాల పెరుగుదల కేవలం ధనాఢ్యవర్గాలకే పరిమితం... సాధారణంగా వినియోగించుకునే సరుకులు ఇందువల్ల చౌకగా లభిస్తున్నందువల్ల పరోక్షంగా శ్రామిక జనాభాకు కూడా ఇది లాభాన్ని చేకూరుస్తుంది. ఒక వైపున ధనికులు ఇంకా సంపన్నులుగా ఎదుగుతూ ఉంటే మరోవైపున పేదవారిలో పేదరికం తగ్గుతూ వుంది. ఏది ఏమైనప్పటికీ పేదరికపు తీవ్రత తక్కువగా నున్నదనే సంశయాన్ని గురించి నేను

---

1. "జనాభా లెక్కలు వగైరా" పుట 11
2. 1843వ సంవత్సరం ఫిబ్రవరి 13వ తేదీ కామన్స్ సభలో గ్లాడ్‌స్టన్ చేసిన ప్రసంగాన్ని "ది టైమ్స్" పత్రిక ఫిబ్రవరి 14,1843న ప్రస్తావించింది. ఈ దేశం యొక్క సామాజిక జీవితంలో నిరాకరించడానికి అవకాశం లేని అత్యంత విచారించదగ్గ విషయాలలో ఇదొకటి; ఈ సమయంలో ఒకవైపున ప్రజల వినియోగ శక్తిలో క్షీణతా మరో వైపు వారి దీనస్థితీ, కష్టాల ఒత్తిడీ పెరిగిపోతున్నాయి; అదే సమయంలో ఉన్నత వర్గాల సంపద నిరంతరాయంగా సంచయనం చేయబడుతూ, వారి ఆడంబర అలవాట్లూ, సుఖ సాధనాలూ పెరిగిపోతున్నాయి". (హాన్ సార్ట్ - ఫిబ్రవరి 13)

చెప్పదల్చుకోలేదు.[1] ఎంత సిగ్గులేని స్వీయ భంగపాటు! కార్మికవర్గం "పేదవారు"గా ఉండటమంటే అది సంపన్న వర్గాలకు నిష్పత్తిచేసే "ఊహించనలవి కాని సంపద శక్తి సామర్థ్యాల పెరుగుదల" నిష్పత్తిలోనే కేవలం "తక్కువ పేదవారు"గా వుండటమంటే, సాపేక్షమైన పేదవారుగా వుండటమే. పేదరికపు తీవ్రత తగ్గకపోతే, సంపద తీవ్రత పెరిగితే పేదరికపు తీవ్రతా పెరిగినట్లే. పోతే జీవనాధార సాధనాలు చౌకగా లభ్యం కావడానికి సంబంధించినంత వరకు, అధికారిక గణాంక సమాచారం ప్రకారం, ఉదాహరణకు లండన్ అనాథ శరణాలయం అందించిన లెక్కల ప్రకారం, 1851 – 1853 సంవత్సరాలతో పోల్చినపుడు 1860 – 1862 మధ్య మూడు సంవత్సరాలలో సగటున 20శాతం ధరలు పెరిగాయి. ఆ తర్వాత మూడు సంవత్సరాలలో 1863– 1865 మధ్య కాలంలో మాంసం, వెన్న, పాలు, పంచదార, ఉప్పు, బొగ్గు తదితరమైన జీవితావసరాల ధరలు క్రమేపీ పెరిగాయి.[2] 1864 సంవత్సరం ఏప్రిల్ 7వ తేదీన తన బడ్జెట్ ఉపన్యాసంలో గ్లాడ్‌స్టన్, అదనపు విలువ పెరుగుదలను గురించే, "పేదరికపు తీవ్రత తగ్గుదల" ఫలితంగా ప్రజల సుఖసంతోసాలను గురించీ చేసిన ప్రసంగం దోపిడీగాంధ్ర ఆటవిక గీతంలా వుంది. కటిక దరిద్రపు "అంచులలో" వున్న సాధారణ ప్రజలను గురించే, "వేతనాలలో పెరుగుదల లేని" వ్యాపార శాఖలను గురించే, కార్మికవర్గం యొక్క సంతోషాలను గురించి సమీక్షిస్తూ "పదింట తొమ్మిది మానవ జీవితాలలో జీవన పోరాటమే" శరణ్యమని గ్లాడ్‌స్టన్ తన ఉపన్యాసాన్ని ముగిస్తాడు.[3] గ్లాడ్‌స్టన్ లాగా అధికారమైన లాంఛనాలతో నిమిత్తం లేని ఆచార్యుడైన ఫాసెట్ నిర్మొగమాటంగా ఈ విధంగా చెప్తాడు; "గత పది సంవత్సరాలలో పెట్టుబడిలో పెరుగుదల వల్ల డబ్బు వేతనాలు పెరిగాయనే అంశాన్ని నేను కాదనలేక పోయినప్పటికీ అనేకమైన జీవితావసరాలు ప్రియం గావడం వల్ల, పైకి కన్పించే ఈ ప్రయోజనం హరించబడింది" (ఖరీదైన లోహాల విలువ పడిపోవడం మూలంగా ఇలా జరిగిందని ఆయన నమ్ముతాడు) .... "ధనికులు త్వరితగతిని

1. 1863 ఏప్రిల్ 16న కామన్స్ సభలో గ్లాడ్‌స్టన్ చేసిన ప్రసంగాన్ని ఏప్రిల్ 17న "మార్నింగ్ స్టార్" పత్రిక ముద్రించింది.
2. పార్లమెంట్‌లో చేసిన ఉపన్యాసాల వివరాలను తెలిపే "బ్లూబుక్"ను చూడండి. "మిస్సీలేనియస్ స్టాటిస్టిక్స్ ఆఫ్ యునైటెడ్ కింగ్‌డమ్" ఆరవభాగం; లండన్, 1866. పుట. 260 - 73. ఫాసిమ్. అనాథ శరణాయాలకు సంబంధించిన గణాంక సమాచారం కన్నా, ఉన్నత వర్గాల పిల్లలకు సమర్పించే కానుకల వివరాలను తెలియజేసే మంత్రిత్వ శాఖలకు సంబంధించిన పత్రికలలోని సమాచారం ఇందుకు దోహదపడవచ్చు. జీవనాధార సాధనాలను అతిప్రియంగా సమకూర్చే విషయాన్ని ఇక్కడ ఎప్పుడూ మరువలేదు.
3. 1864వ సంవత్సరంలో ఏప్రిల్ 7న కామన్స్ సభలో గ్లాడ్‌స్టెన్ ఉపన్యాసం హన్‌సార్ట్ ప్రకారం చివరి వాక్యం ఇలా వుంది: "మరొకసారి ఇంకా చెప్పాలంటే, అత్యధిక సంఖ్యాక మానవ జీవితాలలో జీవన అస్తిత్వం కొరకు పోరాటం తప్ప మరేముంది?" 1863, 1864 సంవత్సరాల గ్లాడ్‌స్టన్ బడ్జెట్ ఉపన్యాసాలలో దొర్లిన నిరంతరాయమైన గావుకేకల వైరుధ్యాల స్వభావాన్ని గురించి ఒక ఇంగ్లీషు రచయిత వివరించ డానికి బాయిలే నుండి ఈ క్రింది విధమైన ఉటంకింపును తీసుకుంటాడు : "ఆ మనిషి, అలాంటివాడు; ఉత్త ఊసరవెల్లి లాంటి వాడు; పూటకొక మాట, రోజుకొక బాట, అందరికీ తలకాయనొప్పి కలిగించి, తాను బురద గుంటలో దిగుతాడు; తాను బట్టలు మార్చుకున్నంత వేగంగానే తన ఆలోచనాధోరణులను మార్చివేస్తాడు". ("ది థీరీ ఆఫ్ ఎక్ఛ్సేంజ్" లండన్, 1864. పు. 135.)

సంపన్నులుగా ఎదుగుతూ వుంటే పారిశ్రామిక వర్గాలు అనుభవించే సౌకర్యాలలో గ్రహించదగిన పెరుగుదల లేదు... తాము రుణపడి వున్న వ్యాపారస్తులకు, వారు (కార్మికులు) దాదాపుగా బానిసలుగా మారిపోతారు.[1]

ఆదాయ వర్గాలకు "ఊహించనలవిగాని సంపద శక్తి సామర్థ్యాలను" బ్రిటీషు కార్మికవర్గం ఏ పరిస్థితులలో సృష్టించిందో "పనిదినం", "యంత్రాలు" అనే అధ్యాయాలలో పాఠకుడు గమనించే వుంటాడు. కార్మికుడి యొక్క సామాజిక క్రియను గురించి ఆ అధ్యాయాలలో ప్రధానంగా చర్చించాం. అయితే సంచయనపు సూత్రాలను సంపూర్ణంగా విశదీకరించాలంటే కార్మికుడు పనిచేసే కర్మాగారంతో నిమిత్తం లేని బయట పరిస్థితులనూ, అతని కూడు, గూడును కూడా అధ్యయనం చేయాలి. అయితే ఈ గ్రంథానికుండే పరిమితుల రీత్యా, కార్మికవర్గంలో ప్రధాన భాగస్వాములుగా ఉండి అతి నికృష్టంగా చెల్లించబడే పారిశ్రామిక కార్మికవర్గాన్ని గురించీ, వ్యవసాయ కార్మికులను గురించీ మన పరిశీలనలో ప్రధానంగా కేంద్రీకరించవలసిన స్థితికి నెట్టబడుతున్నాం.

దీన్ని పరిశీలించబోయే ముందు అధికార్ల నివేదికల మేరకు దారిద్ర్యం (ఆఫీషియల్ పాపరిజమ్) లేక తన జీవన స్థితిని (శ్రమశక్తిని అమ్ముకోవడం) కోల్పోయి ప్రభుత్వ అనాథ శరణాలయాల్లో మాదా కబళంపై జీవిస్తున్న కార్మిక వర్గాన్ని గురించి ఒక్క మాట చెప్పాలి. ఇంగ్లాండులో అధికారికంగా ప్రకటించిన[2] కటిక దరిద్రుల సంఖ్య 1855లో 851,369; 1856లో 877,767 మంది, 1865లో 971,433 మంది. ప్రత్తిపంటలో వచ్చిన కరువు వల్ల ఈ దరిద్రుల సంఖ్య 1863లో 1,079,382 మందికి 1864లో 1,014,978 మందికి పెరిగింది. 1866లో సంభవించిన సంక్షోభం పర్యవసానంగా, ప్రపంచ మార్కెట్‌కు కేంద్రస్థానమూ, స్కాట్‌లాండ్ దేశం మొత్తం జనాభాకన్నా అధిక జనాభా కలిగిన లండన్ మహానగరంలో 1865తో పోలిస్తే 1866లో 19.5 శాతం ఎక్కువగానూ, 1864తో పోలిస్తే 1865లో 24.4 శాతం ఎక్కువగానూ, 1866తో పోలిస్తే 1867లో ఇంకా ఎక్కువగానూ దారిద్ర్యం సృష్టించబడింది... దారిద్ర్యానికి సంబంధించిన గణాంక సమాచారాన్ననుసరించి మనం రెండు నిర్ధారణలకు రావచ్చు. ఒకవైపున దరిద్రుల సంఖ్యలో వచ్చే పెరుగుదలా, లేక తగ్గుదలా పారిశ్రామిక వలయంలో కాల పరిమితిలో వచ్చే మార్పులను ప్రతిబింబిస్తుంది. మరోవైపున పెట్టుబడి సంచయనపు అనుపాతంతోనూ, వర్గపోరాటాల పెరుగుదలతోనూ, పర్యవసానంగా కార్మికులలో పెంపొందే వర్గ చైతన్యంతోనూ పోల్చినపుడు అధికారికంగా ప్రకటించిన గణాంక సమాచారం తప్పు త్రోవ పట్టించేదిగా వుంది. ఉదాహరణకు గత రెండు సంవత్సరాల కాలంలో దరిద్రులను క్రూరంగా హింసించిన విధానాన్ని గురించి ఇంగ్లీషు పత్రికలు (ది టైమ్స్, పాల్ మాల్ గెజిట్ వగైరాలు) గొంతు చించుకున్న సంగతి గంగలో కలిసిపోయింది. సంచలనాత్మక పదజాలంతో, క్షణికమైన భావోద్రేకాలను రెచ్చగొట్టే విధంగా పత్రికలలో ప్రకటించిన ఆ దారుణాలను ఫ్రెడరిక్ ఏంగెల్స్ 1844లోనే బహిర్గతం చేశాడు. గత పది సంవత్సరాల కాలంలో లండన్ నగరంలో సంభవించిన "ఆకలి చావులు" భయానకమైన పెరుగుదల

1. హెచ్.ఫాసెట్. అదే గ్రంథం. పు.67-82. రిటైల్‌షాపు యజమానుల మీద కార్మికులు ఆధారపడిన మేరకు, వారి ఉద్యోగ స్థితిలో వున్న ఒడుదుడుకులకూ, తరచుగా వచ్చే అంతరాయాలకూ ఇది పర్యవసానం.
2. వేల్స్, ఇంగ్లాండ్‌లో ఒక భాగమని ఇక్కడ గుర్తించాలి.

పేదరికానికి శాపనార్థమైన కర్మాగారాలలో[1] కార్మికులు చేసే వెట్టి చాకిరీ ఫలితమైన దారుణాల పెరుగుదలను ఏ విధమైన సందేహం లేకుండా రుజువు చేస్తుంది.

## (ఆ) బ్రిటీష్ పారిశ్రామిక కార్మికవర్గంలో నికృష్టంగా చెల్లించబడే విభాగం

లాంక్‌షైర్, చెషైర్ నగరాలలో కటిక దారిద్ర్యంతో మగ్గుతున్న పత్తి కార్మికులు వినియోగించే పోషక పదార్థాలనూ, వారి జీవన స్థితిగతులనూ పరిశీలించవలసిందిగా 1862లో సంభవించిన పత్తికరువు రోజుల్లో ప్రీవి కౌన్సిల్ డాక్టర్ స్మిత్‌ను ఆదేశించింది. అనేక సంవత్సరాల గత చరిత్ర పరిశీలనానంతరం "ఆకలి మూలంగా సంభవించే రోగాలను నివారించాలంటే" సగటు స్త్రీ ఒక రోజు తీసుకునే ఆహారంలో 3,900 గ్రెయిన్‌ల పిండి పదార్థాలు, 180 గ్రెయిన్‌ల మాంసకృత్తులు, సగటు పురుషుడు ఒక రోజు తీసుకునే ఆహారంలో 4,300 గ్రెయిన్‌ల పిండి పదార్థాలు,200 గ్రెయిన్‌ల మాంసకృత్తులు వుండాలని డా॥ స్మిత్ నిర్ధారించాడు; స్త్రీలకు 2 పౌనుల మంచి గోధుమ రొట్టెలో వుండే పోషక పదార్థాలకు సమానమైన పదార్థాలు కావాలనీ, పురుషులకు అంతకు మించి 1/9 వంతులు ఎక్కువ కావాలనీ, వయోజనులైన స్త్రీ, పురుషులకు ఒక వారానికి సగటున కనీసం 28,600 గ్రెయిన్‌ల పిండి పదార్థాలు 1,330 గ్రెయిన్‌ల మాంసకృత్తులు వారి పోషకపదార్థాలలో అవసరమవుతాయని డా॥ స్మిత్ అంటాడు. అత్యవసర కాలంలో పత్తి కార్మికుల వినియోగంలో విధించబడిన కోత ఫలితంగా వారి పోషక పదార్థాల పరిమాణంలోని దారుణ స్థితి స్మిత్ చేసిన నిర్ధారణలను అత్యంత ఆశ్చర్యకరంగా స్థిరపరిచింది. పైన పేర్కొన్న పోషక పదార్థాల సంఖ్యలు 1862 డిసెంబర్ నాటికల్లా, ఒక వారానికి 29,211 గ్రెయిన్‌ల పిండి పదార్థాలు, 1,295 గ్రెయిన్‌ల మాంసకృత్తులుగా మార్పు చెందడం అవసరమని భావించడింది.

ఇంగ్లీషు కార్మికవర్గంలో నికృష్ట జీవితాన్ని గడుపుతూ నిరాశా నిస్పృహలలో ఉన్న విభాగాన్ని గురించి పరిశీలన చేయవలసిందిగా 1863 సంవత్సరంలో ప్రీవికౌన్సిల్ ఆదేశించింది. ప్రీవికౌన్సిల్ వైద్యాధికారిగానున్న డాక్టర్ సైమన్ ఈ కార్యక్రమం నిమిత్తం పైన పేర్కొన్న డా॥ స్మిత్‌ను ఎంపిక చేశాడు. ఒకవైపున వ్యవసాయ కార్మికులతో ప్రారంభించి, మరోవైపున పట్టు దారం తీసే కార్మికులనూ, కుట్టుపని చేసే స్త్రీలనూ, చిన్న పిల్లల దుస్తులను తయారు చేసే వారినీ, చేతి తొడుగులు తయారు చేసే వారినీ, ఆ విధంగా చెప్పులు కుట్టే వారి వరకు ఆయన పరిశీలించారు. చేతి తొడుగులు తయారు చేసే వారిని మినహాయిస్తే మిగతా వర్గాలన్నీ, కూడా ప్రధానంగా పట్టణవాసులు. ప్రతి తరగతిలోనూ, ఆరోగ్యంగా ఉన్న కుటుంబాలనూ, సాపేక్షకంగా మంచి పరిస్థితిలో నున్న వారిని మాత్రమే ఈ పరిశీలనలో విధిగా ఎంపిక చేసుకోవలసిందిగా ఆదేశించబడింది.

"పరిశీలించిన కుటీర పారిశ్రామికులలోని ఒక వర్గం విషయంలో మాత్రం సగటు మాంసకృత్తుల

---

1. ఆడమ్ స్మిత్ అనంతరం కొంత ప్రత్యేకమైన కృషి జరిగినప్పటికీ, "పని గృహానికి" బదులుగా "కార్ఖానా" అనే పదం ఉపయోగించబడుతున్నప్పటికీ ఇంకా "పని గృహం" అనే పదం అప్పుడప్పుడు వాడుకలోనే ఉంది. ఉదాహరణకు 'శ్రమ విభజన' అనే అధ్యాయం ఈ విధంగా ప్రారంభమవుతుంది. "పనిలోని విభిన్న శాఖలలో నియోగించబడిన కార్మికులు తరచుగా అదే పని గృహంలో నియోగించబడవచ్చు" (ఆడమ్ స్మిత్ వెల్త్ ఆఫ్ నేషన్స్. సంపుటి 1; ఎడింబర్గ్, 1814; పుట 6

సరఫరా కొద్దిగా ఎక్కువగా వుంది; మరొక తరగతిలో బొటాబొటిగా అంచనా వేసిన పరిమాణానికి (ఆకలి జబ్బులను నివారించడానికి సరిపోయినంతగా) దరిదాపులో వుండగా, మరో రెండు వర్గాల ఆహార పదార్థాల వినియోగం లోపభూయిష్టంగా వుంది. అందులో ఒక వర్గానికి మాంసకృత్తులూ, పిండిపదార్థాలూ, రెండూ కూడా లేని లోపం మరీ ఎక్కువగా కనిపిస్తుంది. పైగా పరిశీలించిన వ్యవసాయ కార్మిక కుటుంబాలలో అంచనా వేసిన పిండిపదార్థాల ఆహారం లేని వారు 5 వంతులకు మించి వున్నారనీ, మాంసకృత్తుల ఆహారం లేనివారు మూడు వంతులకు మించి వున్నారనీ, మూడు మండలాలలో (బెరిక్ షైర్, ఆక్స్‌ఫర్డ్ షైర్, సోమర్ సెట్ షైర్) స్థానికంగా సగటున తీసుకునే ఆహారంలో మాంసకృత్తులు చాలా తక్కువగా వున్నాయని"[1] ఈ పరిశీలన పర్యవసానంగా వచ్చిన సాధారణ ఫలితాలు యునైటెడ్ కింగ్‌డమ్‌లో, ఇంగ్లాండు ప్రాంతంలో అత్యంత సంపన్నవంతమైన ప్రాంతమైనప్పటికీ ఈ ప్రాంతంలోని వ్యవసాయ కార్మికులు అతి నికృష్టమైన ఆహారాన్ని పొందుతున్నారు.[2] ఆ వ్యవసాయ కార్మికులలోనే ప్రధానంగా స్త్రీల, చిన్న పిల్లల విషయంలో ఆహారం సరిపోయినంతగా ఉండదు; ఎందుచేతనంటే "పని చేయాలంటే పురుషుడు తప్పనిసరిగా తినాలి గనుక" పరిశీలించిన పట్టణ కార్మికులు వీరికన్నా ఇంకా ఎక్కువ పేదరికంలో మగ్గుతున్నారు. "వారికి ఎంత తక్కువ ఆహారం లభిస్తున్నదంటే అందులో కొంతమంది తీవ్రమైన, ప్రమాదకరమైన లేమితనానికి గురవుతున్నారు.[3] పెట్టుబడిదారునికి సంబంధించినంత వరకు వాంఛా విసర్జనమే లేమితనం! (జీవనాధారాలను కూడా చెల్లించలేనంతగా అతని "చేతులకు" లేమితనం అంటుకుని వుంటుంది)

తీవ్ర దుర్భిక్షకాలంలో పత్తి కార్మికుల ఆహారంతోనూ, డా.స్మిత్ పేర్కొన్న కనీస ఆహారంతోనూ పైన పేర్కొన్న అయిదు వర్గాల పట్టణ కార్మికుల ఆహార పరిస్థితులను పోల్చిన వివరాలు ఈ క్రింది పట్టికలో పొందుపర్చబడ్డాయి.[4]

| స్త్రీ, పురుషులు | వారానికి సగటు పిండి పదార్థాలు (గ్రెయిన్‌లలో) | వారానికి సగటు మాంసకృత్తులు (గ్రెయిన్‌లలో) |
|---|---|---|
| ఐదు కుటీర పారిశ్రామిక తరగతులు | 28,786 | 1,192 |
| నిరుద్యోగులైన లాంక్‌షైర్ కార్మికులు | 28.211 | 1,295 |
| లాంక్‌షైర్ కార్మికులకు అవసరమైన కనీస పరిమాణం.................... (సమాన సంఖ్యలో స్త్రీ, పురుషులు) | 28,600 | 1.330 |

పరిశీలించిన పారిశ్రామిక కార్మికులలో ఇంచుమించుగా సగభాగం లేక 60/125 వంతులు ఏమాత్రం కూడా బీరు పొందలేక పోగా, 28 శాతానికి కనీసం పాలు కూడా లేవు. ఈ కుటుంబాలలో

1. "పబ్లిక్ హెల్త్. సిక్స్ రిపోర్ట్.1864" పుట 13
2. పై గ్రంథమే. పుట 17
3. పై గ్రంథమే. పుట 13
4. పబ్లిక్ హెల్త్ సిక్స్ రిపోర్ట్. 1863, లండన్ 1864; అనుబంధం, పుట 232

కుట్టు పని చేసే స్త్రీలకు 7 ఔన్సులు, గ్లౌజులు తయారు చేసే వారికి $24\frac{3}{4}$ ఔన్సులు మాత్రమే వారికి సగటున ద్రవపరమైన పోషకాహారాలు లభిస్తున్నాయి. లండన్‌లో పాలు పొందలేని వారిలో అధిక సంఖ్యాకులు కుట్టుపనిచేసే స్త్రీలే. వారంలో రొట్టె లాంటివి వినియోగించే పరిమాణం కుట్టు పనిచేసే స్త్రీలకు $7\frac{3}{4}$ పౌన్లు కాగా, చెప్పులు కుట్టేవారికి $11\frac{1}{2}$ పౌనులు, మొత్తం మీద వారంలో సగటున వయోజనుడికి 9.9 పౌనులు రొట్టె లభ్యమవుతుంది. వారంలో వినియోగించుకునే పంచదార (కలకండ) పిల్లల దుస్తులు తయారుచేసే వారికి 4 ఔన్సులు కాగా, గ్లౌజులు తయారు చేసే వారికి 11 ఔన్సులు; మొత్తం మీద అన్ని వర్గాలలోని వయోజనులకు వారంలో సగటున 8 ఔన్సులు పంచదార లభ్యమవుతుంది. వయోజనుడికి వారంలో లభ్యమయ్యే వెన్న (కొవ్వు గైరాలు) సగటున 5 ఔన్సులు. వారంలో పొందగలిగిన మాంసం (పంది) పట్టుదారం తీసే కార్మికులకు సగటున $7\frac{1}{2}$ ఔన్సులు కాగా, పిల్లల దుస్తులు తయారు చేసే వారికి $18\frac{1}{4}$ ఔన్సులు; మొత్తం మీద వివిధ వర్గాలు సగటున 13.6 ఔన్సుల మాంసం పొందగలుగుతున్నారు. వారంలో వయోజనుల కయ్యే ఆహార వ్యయం సగటున పట్టుదారం తీసేవారికి 2 షి. $2\frac{1}{2}$ పెన్నీలు, కుట్టు పని చేసే స్త్రీలకు 2.షి. 7 పెన్నీలు, చిన్న పిల్లల దుస్తులు తయారు చేసే వారికి 2 షి. $9\frac{1}{2}$ పెన్నీలు; చెప్పులు కుట్టేవారికి 2 షి. $7\frac{3}{4}$ పెన్నీలు; చేతి తొడుగులు తయారు చేసే వారికి 2 షి. $6\frac{1}{4}$ పెన్నీలు మాకిల్స్ ఫీల్డ్‌లో పట్టు దారం తీసే వారికి సగటున 1షి. $8\frac{1}{2}$ పెన్నీలు మాత్రమే వ్యయం అవుతుంది. నికృష్టంగా బ్రతికే వారిలో కుట్టుపని చేసే స్త్రీలు, పట్టుదారం తీసేవారూ, చిన్నపిల్లల దుస్తులు తయారు చేసే వారు వున్నారు.[1]

డాక్టర్ సైమన్ ఇచ్చిన సాధారణ ఆరోగ్య నివేదికలో పోషక ఆహారాన్ని గురించి ఈ విధంగా చెప్పాడు; “జబ్బులకు కారణం లేక దానిని ఉధృతం చేసేది లోపభూయిష్టమైన ఆహారమేననీ, అలాంటి కేసులు కోకొల్లలు వున్నాయనీ, పేదల చట్టం క్రింద వైద్య వృత్తి చేపట్టిన వారు గానీ, లేక ఆసుపత్రులలో పడకలను, బయటనుండి వచ్చే రోగులను పరిశీలించేవారుగానీ లేక మరెవరైనాగానీ నిర్ధారించవచ్చు.... అయినప్పటికీ ఈ అంశంలో చాలా ముఖ్యమైన ఆరోగ్య సంబంధిత విషయాన్ని కలిపి పరిశీలించాలని నా అభిప్రాయం. సకలమూ కోల్పోయిన తర్వాతే గుప్పెడు మెతుకులు కూడా పొందలేని స్థితి ఏర్పడుతుందనీ, ఎంతో అసాధ్యమైనప్పటికీ ఆహారం లేమితనం వాస్తవమనీ గుర్తుంచుకోవాలి. ఆహారం లేమితనమనేది ఆరోగ్య సంబంధిత విషయంగా పరిగణించేలోపే, జీవన్మరణాల మధ్య అవసరమైన మాంసకృత్తులు, పిండి పదార్థాల గ్రెయిన్‌లను దేహధర్మ శాస్త్రజ్ఞుడూ తూకం వేసేలోపే, కార్మికుల కొంపల్లో దిక్కులేనితనం తాండవం చేస్తుంది; ఆహారం కన్నా దుస్తులూ, వంట చెరకూ మరీ మృగ్యమైపోయాయి. చలిగాలుల వాతావరణానికి ఏవిధమైన రక్షణా లేకుండా, నివాసముండటానికి సరిపోయినంత స్థలం లేక జనసమ్మర్థం మూలంగా రోగాలు పెరుగుతాయి; గుడిసెలలో వుండే వంట సామానులు. పరికరాలు కొరతగా వుండటమే గాక, పరిశుభ్రత కూడా ఖరీదైతే లేక అసాధ్యమైతే వాటిని తగురీతిలో వుంచుకోడానికి ఆత్మాభిమానంతో ప్రయత్నిస్తే, ఆవిధమైన అదనపు ప్రయత్నాలన్నీ ఆకలి బాధను పెంచుతాయి. తలదాచుకోడానికి అతి చౌకగా దొరికే గృహ సముదాయాల్లో ఏవిధమైన ఆరోగ్య పరిస్థితులు లేకుండా, మురుగు నీటి కాల్వలు లేకుండా, పారిశుధ్యం లేకుండా అభ్యంతరకరమైన

1. “పబ్లిక్ హెల్త్. సిక్స్త్ రిపోర్ట్, 1863”, లండన్, 1864, అనుబంధం, పుట 232, 233.

గొడవలను అణిచే దిక్కులేక, సరైన నీటి సరఫరాలేక ఇంకా పట్టణాలలో అయితే గాలి, వెలుతురు కూడా లేని పరిస్థితులుంటాయి. పేదరికమే ఆహారం లేమితనాన్ని ప్రతిబింబిస్తుంది; ఆ విధంగా పేదరికం బహిర్గమవుతున్నది. అదే ప్రమాదకరమైన అనారోగ్య పరిస్థితులకు దారితీస్తున్నది. అందులో కొన్ని జీవితాన్ని భయంకరమైన దుర్భర స్థితికి నెట్టితే, ఆహార లేమితనం ఈ దుర్భర స్థితిని ఇంకా తీవ్రతరం చేస్తుంది... వారెదుర్కొంటున్న పేదరికం సోమరితనం మూలంగా సంక్రమించినది కాదని గుర్తుంచుకున్నప్పుడు, అవి చాలా బాధాకరమైన స్మృతులుగా మిగిలిపోతాయి. పరిశీలించిన అన్ని కేసులలోనూ శ్రమించే జనాభా యొక్క పేదరికమే కనిపిస్తుంది. కుటీర పారిశ్రామికులకు సంబంధించి నంత వరకు, వారు చేసే శ్రమ ఫలితంగా ఎక్కువ రోజుల్లో, గుప్పెడు మెతుకులు మాత్రమే లభిస్తాయి. అయినప్పటికీ పరిమితార్థంలో మాత్రమే ఈ పని స్వయం పోషకానికి ఉపయోగపడుతుందని భావించవచ్చు... విశాల దృక్పథంతో ఆలోచించినపుడు నామమాత్రమైన స్వీయ పోషణ, దీర్ఘకాలంలో గానీ లేక అల్ప కాలంలోగానీ కటిక దారిద్ర్యాన్ని చేరుకునే చుట్టుతిరుగుడు మార్గమే."[1]

పెట్టుబడిదారీ సంచయనమే ప్రాతిపదికగా కలిగిన ధనాఢ్యవర్గాల విచ్చలవిడితనం లేక గోప్యమైన ఆడంబర వినియోగానికీ, కార్మికవర్గంలో చెమటోడ్చే వర్గాల ఆకలి బాధలకూ మధ్యనున్న సన్నిహిత సంబంధం, ఆర్థిక సూత్రాలను తెలుసుకున్నప్పుడు మాత్రమే ప్రస్ఫుటమవుతుంది. నివాస పరిస్థితులను తెలుసుకోవడం సులభమే. ఉత్పత్తి సాధనాల కేంద్రీకరణ పెరిగే కొలదీ దాని కనుగుణ్యంగానే పరిమిత స్థలంలో కార్మికులను కూడా గుంపుగా పోగేయడం పెరుగుతుంది; పర్యవసానంగా పెట్టుబడిదారీ సంచయనం వేగం పుంజుకునే కొలదీ పేద ప్రజల నివాస యోగ్యాలు ఇంకా దయనీయంగా మారుతాయి. శిథిలావస్థలోనున్న భవనాలను కూలగొట్టడం ద్వారా, బ్యాంకులకు, గిడ్డంగులకు గొప్ప భవనాలను నిర్మించడం ద్వారా, వ్యాపార రవాణాకు విలాస వస్తువుల రవాణాకు అనువుగా వీధులు వెడల్పు చేయడం ద్వారా, పట్టణ రైలు మార్గాలు వగైరాలను నిర్మించడం ద్వారా, పట్టణాలను "అభివృద్ధిచేసి" ఆరోగ్య సౌకర్యాలను మెరుగుపర్చాలనే కార్యక్రమాలు చివరకు పేద వర్గాలను కిక్కిరిసిన మురికి కూపాలకు నెట్టివేస్తాయి. మరోవైపున ఇంటి అద్దె, ఆ ఇండ్ల యొక్క వసతి సౌకర్యాలకు విలోమ నిష్పత్తిలో వుంటుందనీ, పొటాసి గనులను దోపిడీ చేసినట్లుగా, పేదరికపు గనులను ఇండ్ల స్థలాలలో సట్టా వ్యాపారం చేసేవారు ఏ విధమైన ఖర్చు లేకుండా ఎంతో లాభసాటిగా దోపిడీ చేస్తారనీ ప్రతి ఒక్కరూ గమనించగలరు. పెట్టుబడిదారీ శత్రుపూరిత స్వభావం, అందువల్ల పెట్టుబడిదారీ ఆస్తి సంబంధాలు[2] ఇక్కడ ఎంత ప్రస్ఫుటమవుతున్నాయంటే, ఇంగ్లీషు ప్రభుత్వ అధికారిక నివేదికలలో సహితం "ఆస్తి హక్కులు" అనే అంశం సాంప్రదాయ విరుద్ధమైన సమ్మెట పోట్లకు గురవుతూ వుంది.

---

1. "పబ్లిక్ హెల్త్. సిక్స్ రిపోర్ట్, 1863", లండన్, 1864, అనుబంధం, పుట 14,15
2. "శ్రామికవర్గ వసతికి సంబంధించినంత వరకు, ఒక ప్రత్యేకమైన విధమని చెప్పడానికి వీల్లేకుండా మానవ హక్కులను ఎంతో సిగ్గుచేటైన విధంగా, నగ్నంగా ఆస్తి హక్కులకు త్యాగం చేశారు. ప్రతి పెద్ద పట్టణాన్ని ఒక మానవ వధ్యశాలగా పేర్కొనవచ్చు. నీచమైన లోభితనమనే బలిదేవతకు ప్రతి సంవత్సరమూ వందలాది మానవులను కానుకలుగా సమర్పించుకునే ఒక పెద్ద అగ్నిగుండంగా పేర్కొనవచ్చు". యస్. లేయంగ్; అదే గ్రంథం. పుట 150.

పారిశ్రామిక రంగం పెరిగే కొలదీ పెట్టుబడి సంచయనంతో బాటుగా పట్టణాల పెరుగుదలా, వాటి అభివృద్ధి ఇనుమడించే కొలదీ, హానికరమైన పరిస్థితులు కూడా ఎంతగా పెరిగాయంటే, "గౌరవ ప్రదమైన వారిని" సహితం మినహాయించని అంటువ్యాధుల భయం పర్యవసానంగా 1847 నుండి 1864 మధ్యకాలంలో పారిశుధ్యం మీద పార్లమెంటు పదిసట్టాలకు తక్కువ గాకుండా చేసింది; లివర్‌పూల్, గ్లాజ్‌గోలాంటి కొన్ని పట్టణాలలో భయకంపితులైన బూర్జువావర్గం ఆయా నగర పాలక సంస్థల ద్వారా శక్తివంతమైన చర్యలను తీసుకుంది. అయినప్పటికీ 1865 నాటికి తన నివేదికలో డాక్టర్ సైమన్ ఈ విధంగా రాశాడు; "మొత్తంగా పరిశీలించినపుడు, ఇంగ్లాండ్‌లో హానికరమైన రోగాలను నియంత్రణ చేయలేదనే చెప్పాలి" ప్రీవి కౌన్సిల్ ఆదేశాన్ననుసరించి వ్యవసాయ కార్మికుల గృహవసతి పరిస్థితులను గురించి 1864లోనూ, పట్టణాలలోని పేదవారిని గురించి 1865లో పరిశీలన చేశారు. అభినందనీయమైన డాక్టర్ జూలియన్ హంటర్ పరిశీలనా ఫలితాలు "ప్రజారోగ్యం" మీద పార్లమెంట్‌కు సమర్పించిన ఏడవ (1865) ఎనిమిదవ (1866) నివేదికలలో కనిపిస్తాయి. వ్యవసాయ కార్మికులను గురించి తర్వాత ప్రస్తావిస్తాను. పట్టణవాసుల పరిస్థితులను గురించి డా. సైమన్ చేసిన సాధారణ వ్యాఖ్యానాన్ని ముందుగా పేర్కొంటాను. "అధికారికమైన నా అభిప్రాయం కేవలం భౌతిక పరమైనదే అయినప్పటికీ, హానికరమైన ఈ పరిస్థితి యొక్క మరో పార్శ్వాన్ని విస్మరించరాదని సామాన్య మానవత్వం కోరుతుంది... దాని అత్యధిక స్థాయిలో అది కిక్కిరిసి జీవించడం అన్ని రకాలైన సున్నితత్వాలను కోల్పోయి శారీరక సంబంధమైన సకల క్రియలనూ, పరిశుభ్రతనూ విస్మరించి పశుతుల్యమైన లైంగికనగ్నత్వాన్ని బహిర్గతం చేసే రాక్షసత్వమే గాని మానత్వం కాదు. ఈ అంశాల ప్రభావానికిలోనై అందులో ఇంకా కూరుకుపోవడమంటే అధమస్థాయికి దిగజారిపోవడమే. ఈ నికృష్ట పరిస్థితుల మధ్య జన్మించిన పిల్లలను అసహ్యకరమైన పరిస్థితులలో సంప్రోక్షణం గావించడమే. భౌతిక, నైతికపరమైన పరిశుభ్రతే ప్రధాన సారాంశంగా కలిగిన నాగరికత వాతావరణాన్ని ఆశించడానికి అవకాశం లేని పరిస్థితులకు నెట్టి వేయబడిన ఈ ప్రజానీకం యొక్క వాంఛను నెరవేర్చడానికి ఎలాంటి అవకాశాలూ లేవు.[1]

మానవ మాత్రులు జీవించడానికి అవకాశాలు లేని కిక్కిరిసిన నివాసాలకు లండన్ నగరాన్నే మొదట పేర్కొనాలి. డా॥ హంటర్ ఈ విధంగా చెప్పాడు : "రెండు అంశాలకు సంబంధించి నాకు చాలా స్పష్టత వున్నది. మొదటిది : లండన్ మహానగరంలో 20 పెద్ద వాడల్లో ఒక్కొక్క దానిలో 10,000 మంది చొప్పున జనం కిక్కిరిసి జీవించడం వల్ల ఏర్పడిన నికృష్టమైన నివాస పరిస్థితుల మూలంగా దాపురించిన దయనీయ స్థితికన్నా మిన్నగా, ఇంగ్లాండ్ మొత్తం మీద నేనెక్కడా చూడలేదు; రెండవది : ఈ వాడల్లో కిక్కిరిసిన జనంతో శిథిలావస్థలోనున్న ఇళ్ళ పరిస్థితి గత 20 సంవత్సరాల కంటే ఇంకా అధ్వాన్నమైంది."[2] "లండన్, న్యూ కాజిల్ నగరాలలోని కొన్ని ప్రాంతాలలో జీవితం

1. "పబ్లిక్ హెల్త్" 8వ నివేదిక, 1866, పుట 14. నోట్.

2. అదే గ్రంథం పు. 89 ఈ వాడల్లో నివసించే చిన్న పిల్లలను గురించి డా॥ హంటర్ ఈ విధంగా చెప్పాడు: "పేదలు జీవిస్తున్న ఈ క్రిక్కిరిసిన గుడిసెల్లో ఈ తరానికి ముందు. చిన్నపిల్లను ఏ విధంగా పెంచారో చెప్పడానికి జనం ప్రస్తుతం జీవించలేరు. అర్ధరాత్రి వరకు సకల వయస్సులకూ సంబంధించిన వ్యక్తులు



నరకప్రాయంగా తయారయిందని చెప్పడంలో అతిశయోక్తి లేదు".[1]

"అభివృద్ధి కార్యక్రమాల"కు అనుగుణ్యంగా పురాతన వీధులను, గృహాలను ధ్వంసం చేయడమూ, పరిశ్రమలు పెరిగే కొలదీ నగరాలలో పెరిగే మానవ ప్రవాహమూ, భూమి కౌలు పెరిగే కొలదీ ఇంటి అద్దెల పెరుగుదల వగైరాల నిష్పత్తిలోనే కార్మికవర్గంలో కొద్దిగా స్థితిపరులతో బాటుగా చిన్న షాపుల యజమానులు, తదితరమైన క్రింది స్థాయి మధ్యతరగతి ప్రజలు, హానికరమైన నికృష్ట నివాస పరిస్థితులలో మరింత దుర్భరంగా లండన్‌లో జీవితాన్ని వెళ్ళబుచ్చుతున్నారు. "అద్దెలు ఎంతో ఎక్కువగా పెరిగినందువలన శ్రామిక జనాభాలో కొద్దిమంది మాత్రమే ఒక గదికన్నా మించి భరించగలరు."[2] మధ్య దళారీల పెరుగుదల ఫలితంగా అదనపు భారానికి గురికాని గృహ మంటూ లండన్ నగరంలో లేదు. లండన్ నగరంలో ఇండ్ల స్థలాల ధర ఇండ్ల మీద వచ్చే వార్షిక ఆదాయంతో పోలిస్తే చాలా ఎక్కువ; అందువలన ప్రతి కొనుగోలుదారూ కోర్టు ధర లభిస్తుందనే ఆశతో (కోర్టు వారు నిర్ణయించిన ధర) లేక ఆ పరిసరాల్లో ఏదైనా పెద్ద నిర్మాణం జరగడం వల్ల అత్యధిక స్థాయిలో దాని విలువ పెరుగుతుందనైనా భావించి సట్టా వ్యాపారం చేస్తాడు. దీని పర్యవసానంగా "అద్దెకిచ్చిన కాలపరిమితి చివరిలో" ఆ అద్దె ఇండ్ల బాడుగ కొనుగోళ్ళలో నిత్యం వ్యాపారం జరుగుతూనే వుంటుంది. "కౌలుదార్ల నుండి ఏ మేరకైతే సంపాదించాలనుకుంటారో, ఆ మేరకు ఈ వ్యాపారంలో పాల్గొనే పెద్ద మనుష్యులంతా సంపాదించి, ఆ తర్వాత అసలు వాళ్ళకు ఎంత తక్కువ మిగల్చగలిగితే అంత తక్కువ మిగుల్చుతారు."[3]

వారం వారం అద్దెలు వసూలు చేస్తారు గనుక ఈ పెద్ద మనుషులకు ఎలాంటి యిబ్బందీ వుండదు. నగరాలలో రైలు రోడ్డు నిర్మాణం జరిగిన పర్యవసానంగా "తూర్పు లండన్‌లో అసంఖ్యాక కుటుంబాలు సత్రాలు తప్ప తల దాచుకోవడానికి గూడు లేక వారికుండే కొద్ది సామానులను భుజాన వేసుకుని ఒకానొక శనివారం రాత్రి తిరుగుతూ వుండే దృశ్యం కనిపిస్తుంది.[4] అనాధ శరణాలయాలు (వర్క్ హౌసెస్) అంతకు ముందే కిక్కిరిసి వున్నాయి; వాటి "అభివృద్ధి కోసం" పార్లమెంట్ ఆమోదించిన కార్యక్రమాలు అప్పుడే ప్రారంభమయ్యాయి. పాత కొంపలను ధ్వంసం చేయడం ద్వారా కార్మికులను గెంటి వేసినట్లయితే, వారు నివాసముండే పాత గృహ సముదాయాలను విడిచిపోరు; మహాఅయితే వాటి సరిహద్దులలోనే వాటికి ఎంత దగ్గరగా ఉండగలిగితే అంత దగ్గిరగా ఉంటారు. "వారు పని చేసే షాపులకు ఎంత దగ్గరగా ఉండగలిగితే అంత దగ్గరగా ఉండటానికి ప్రయత్నిస్తారు. నివాసితులు రెండు గదులున్న తమ అద్దె కొంపలను విడిచి అంతకు ముందే కిక్కిరిసి వున్న ఒకే గది గల అద్దె

---

అర్ధనగ్నంగా, తాగిన మైకంలో దుర్భాషలాడుకుంటూ జగడాలతో నిండివున్న వాతావరణంలో భవిష్యత్తు జీవనానికి "ప్రమాదకర వర్గాలుగా" తయారు కావడానికి, ఈ దేశ చరిత్రలో కనివిని ఎరుగని రీతిలో జీవిత పాఠాల నభ్యసిస్తున్న చిన్న పిల్లల పెంపకంలో ఉన్న వాతావరణంలో. వారినుండి భవిష్యత్తులో ఏవిధమైన నడవడికను ఊహించవచ్చునో చెప్పడానికి ఒక గొప్ప ప్రవక్తకు మాత్రమే సాధ్యమవుతుంది" (అదే గ్రంథం పు. 56)

1. "పబ్లిక్ హెల్త్" 8వ నివేదిక, 1866, పుట 62.
2. "రిపోర్ట్ ఆఫ్ ది ఆఫీసర్ ఆఫ్ హెల్త్ సెయింట్ మార్టిన్స్ ఇన్ ది ఫీల్డ్స్, 1865".
3. "పబ్లిక్ హెల్త్, ఎయిత్ రిపోర్టు", 1866, పుట 91.
4. పై గ్రంథమే, పుట 88.

ఇంటికి వెళ్ళరు. తమకున్న ఆ కొద్దిపాటి కొంపలను విడిచి కొద్దిగా అద్దె ఎక్కువ చెల్లించి వేరే చోటుకు వెళ్ళడానికి వుండే అవకాశం మృగ్యం... స్ట్రాండ్ జిల్లాలోని కార్మికులలో సగభాగం రెండు మైళ్ళు నడిచి తమ పనులకు వెళ్తారు"[1] లండన్ నగరాన్ని దర్శించే ఆగంతకులకు దాని సిరిసంపదలను గురించి గొప్ప అభిప్రాయాన్ని కలిగించే స్ట్రాండ్ ప్రాంతంలోని రాజమార్గాన్నే ఎప్పుడూ జన సందోహంతో ఆ పట్టణం ఏవిధంగా కిక్కిరిసి ఉంటుందో తెలియచేయడానికి ఉదాహరణగా పేర్కొనవచ్చు. అదే జిల్లాలోని పేదల నివాసానికి కేటాయించిన ఒక ప్రాంతంలోని ఒక ఎకరానికి, అందులో థేమ్సు నది వెడల్పులో సగభాగం కలిసి వున్నప్పటికీ, 581 మంది జనం వున్నారని ఆరోగ్యశాఖాధికారి చెప్పాడు. లండన్ నగరంలో ఇంత వరకు చేపట్టిన ప్రతి పారిశుద్ధ్య కార్యక్రమం, నివాసయోగ్యం కాని కొంపలను కూలగొట్టి, కార్మికులను వెంటాడే ఒక ప్రాంతాన్నుండి మరొక ప్రాంతానికి గుంపుగా నెట్టివేసి అక్కడ కిక్కిరిసి జీవించేటట్లుగా చేయడానికి మాత్రమే ఉపకరిస్తుందని చెప్పవచ్చు. డా. హంటర్ ఇలా అంటాడు : "ఈ మొత్తం కార్యక్రమం అంతా మూఢత్వంతో కూడుకున్నందువల్ల తప్పని సరిగా నిరోధించబడాలి లేదా ప్రజల దయార్ద్రతను (!) ఒక స్పష్టమైన జాతీయ ఆవశ్యకతగా రేకెత్తించడం ద్వారా ఏ విధమైన పెట్టుబడిలేని వారికీ దానిని సమకూర్చుకోలేని వారికీ దశలు వారీగా దానిని తిరిగి రాబట్టుకునే పద్ధతిలో గూడు నిర్మించుకోవడానికి అవకాశాన్ని కలిగించాలి."[2] పెట్టుబడిదారీ విధానపు న్యాయాన్ని వేనోళ్ళ పొగడవలసిందే! రైలు రోడ్ల నిర్మాణం, కొత్త రోడ్లు వేయడం లాంటి "అభివృద్ధి కార్యక్రమాల"కు తమ ఆస్తులను దఖలు పరిచినందుకు భూస్వామీ, గృహయజమానీ, వ్యాపారీ నష్ట పరిహారం పుచ్చుకోవడమే కాదు; మానవ శాసనం రీత్యానూ, దైవశాసనం రీత్యానూ వారు "వాంఛా విసర్జన" చేసినందువల్ల వీటికి మించి అత్యధిక లాభంతో వారిని సంతృప్తిపరచవలసి వుంది. కానీ కార్మికుడు మాత్రం తన భార్యా పిల్లలు తదితర సరంజామాతో, బజారులోకి గెంటివేయబడతాడు – స్థానిక అధికారులు పరిశుభ్రంగా వుంచాలని భావించే ప్రాంతాలలో ఈ కార్మికులు గుమికూడినట్లయితే ప్రజారోగ్యం రీత్యా వారిపై చట్టధిక్కార నేరం మోపబడుతుంది.

19వ శతాబ్దపు ప్రారంభంలో ఇంగ్లాండ్ దేశం మొత్తం మీద లండన్ తప్ప 1,00,000 జనాభాకు మించిన పట్టణం లేదు. 50,000 జనాభాకు మించిన పట్టణాలు ఐదు మాత్రమే వున్నాయి. ఇప్పుడు 50,000కు మించిన జనాభా కలిగిన పట్టణాలు 28 వున్నాయి. "పట్టణ ప్రజానీకం విపరీతంగా పెరగడం మాత్రమే ఈ మార్పు ఫలితం కాదు; కిక్కిరిసి వున్న పాత పట్టణాలన్నీ ఇప్పుడు గాలి కూడా సోకకుండా గజిబిజిగా నిర్మించబడిన కేంద్రాలుగా మారి ధనాఢ్య వర్గాలకు నిరుపయోగమై నందున వారుపట్టణ పరిసర ప్రాంతాలలో విలాసవంతమైన భవన సముదాయాలను నిర్మించుకుని ఆ పాత పట్టణాలను విడిచి పెట్టారు. ఆ ధనాఢ్యవర్గాల తరువాత వచ్చిన వారు ఒక్కొక్క కుటుంబానికి ఒక్కొక్క గది చొప్పున పెద్ద పెద్ద భవనాలను ఆక్రమించుకున్నారు. (ఇద్దరు లేక ముగ్గురు బస చేసేందుకు వీలుగా కూడా వుండే విధంగా) వయోజనుల దీనావస్థను పెంచే చిన్న పిల్లలకు హాని కలిగించే పరిసర ప్రాంతాల్లో నివాసానికి ఏమాత్రం ఉద్దేశించబడని యోగ్యం కాని గృహాలనూ, ప్రజలను ఈ

1. ''పబ్లిక్ హెల్త్, ఎయిత్ రిపోర్టు'', 1866, పుట 88.
2. పై గ్రంథమే, పుట 89.

మార్పు సృష్టించింది"[1] ఒకానొక పారిశ్రామిక లేక వాణిజ్య పట్టణంలో పెట్టుబడి సంచయనం త్వరితగతిన సాగే కొలదీ దోపిడీ చేయడానికి అవకాశం ఇచ్చే మానవ పదార్థమనే ప్రవాహం పొంగుతూ పొర్లుతుంది. దానితో కార్మికులు జీవించే దౌర్భాగ్యపు కొంపలు మరీ దీనస్థితికి దిగజారుతాయి.

బొగ్గు, ఉక్కు పరిశ్రమల ఉత్పాదకతకు పేరెన్నికగన్న కేంద్రమైన న్యూక్యాజిల్ – ఆన్ – టైనేజిల్లా, లండన్ తర్వాత నరకప్రాయమైన గృహాలకు ప్రసిద్ధి గాంచింది. అక్కడ ఒకేగది వున్న కొంపలో సుమారు 34,000 మందికి తక్కువ గాకుండా జీవిస్తున్నారు. సమాజానికి పూర్తి ప్రమాదకరంగా పరిణమించాయని భావించినందువల్ల అధికారులు న్యూ క్యాజిల్, గేట్స్‌హెడ్‌లోని అధిక సంఖ్యాక గృహాలను ఈ మధ్య కాలంలో కూలగొట్టారు. నూతన గృహాల నిర్మాణ కార్యక్రమం అతి మందకొడిగా సాగుతూ వుంటే, వ్యాపారం మాత్రం మహాజోరుగా సాగుతుంది. అందువలన 1865లో ఆ పట్టణం గతంలో కన్నా ఇంకా కిక్కిరిసి పోయింది. అద్దెకివ్వడానికి ఒక్క గది కూడా దొరికే అవకాశం లేకుండాపోయింది. న్యూక్యాజిల్, జ్వరాల ఆసుపత్రిలో డాక్టరుగా పనిచేస్తున్న ఎంబ్లిటన్ ఈ విధంగా అన్నాడు. "హానికరమైన విషజ్వరాలు వ్యాపించడానికీ, కొనసాగటానికి జనసమూహం కిక్కిరిసి ఉండటమూ, వారు కాపురాలుండే ప్రదేశాలు అపరిశుభ్రంగా ఉండటమూ కారణాలని చెప్పడంలో రవ్వంతైనా సందేహం లేదు. కార్మికులు జీవించే గదులు ఎక్కువ భాగం మురికివాడల్లో అపరిశుభ్రంగా కిక్కిరిసి ఉండటమేగాక ఆరోగ్యకరం గాని అస్తవ్యస్త ప్రాంగణాలలో ఏ మాత్రం తగిన స్థలం, వెలుతురు, గాలి, శుభ్రత లేకుండా నాగరికతా ప్రపంచం తలవంచుకొనే రీతిలో ఉన్నాయి; పురుషులు, స్త్రీలు, చిన్నపిల్లలు ఆ గదుల్లో రాత్రిపూట అడ్డదిడ్డాలుగా పోగుపడి వుంటారు. ఎడతెరిపి లేకుండా పగలు, రాత్రి ఒక షిప్టు తర్వాత మరో షిఫ్టులో పనిచేసే పురుషులు కొద్దికాలం పాటు నడుం వాల్చడం మూలంగా వేడెక్కిన పడకలు చల్లబడటానికి అవకాశం లేదు. ఏ విధమైన నీటి సరఫరా లేకుండా, కనీస సంసారజీవితాన్ని కూడా గడపటానికి వీలు లేకుండా ఉన్నాయి. ఆ గదులు, మురికిగా ఏ విధమైన వెలుతురు లేకుండా హానికరమైన రోగాల నిలయాలుగా తయారైనాయి"[2] ఆ విధంగా మురికి కూపాలుగా వుండే ఈ గదులకు వారానికి చెల్లించాల్సిన అద్దె 8 పెన్నీల నుండి 3 షిల్లింగుల వరకూ వుంటుంది. డాక్టర్ హంటర్ ఇలా అంటాడు : "కొంపా గోడూ సందులూ గొందులూ బాహ్య పరిస్థితుల కారణంగా తరచు అధమస్థాయికి దిగజారే విధంగా మన దేశ ప్రజలలోని అత్యున్నత తరహా ఆటవిక జనాభా న్యూక్యాజిల్ – ఆన్ – టైన్ అనే పట్టణంలో జీవిస్తున్నారు."[3]

పెట్టుబడి, శ్రమ ఆటుపోట్ల మూలంగా ఏదైనా ఒక పారిశ్రామిక నగరంలోని నివాసాలు ఈ రోజున భరించశక్యంగా ఉండవచ్చునేమోగాని, రేపు మాత్రం భయంకరంగా తయారవుతాయి. బహుశా పట్టణ పారిశుధ్య అధికారులు ఈ విధమైన హీన పరిస్థితులను చక్కదిద్దడానికి ప్రయత్నించవచ్చు. రేపు ఐర్లండ్ అలగాజనం గానీ, లేక హీనస్థితిలో వున్న ఇంగ్లీషు వ్యవసాయ కార్మికులు గానీ మిడతల

1. "పబ్లిక్ హెల్త్, ఎయిత్ రిపోర్టు", 1866, పుటలు 55, 56
2. పై గ్రంథమే పుట 149
3. పై గ్రంథమే పుట 50

దండులాగా ఈ పట్టణాల మీద వాలిపోతారు. చీకటి గదుల్లోనూ, గూళ్ళ లాంటి గదుల్లోని వారిని సర్దుబాటైనా చేస్తారు. లేదా కార్మికుల నివాసాలుగా ప్రసిద్ధి చెందిన ఆ కొంపలను, 30 సంవత్సరాల యుద్ధంలో సైనిక క్వార్టర్లను ఎంత త్వరగా మార్చి వేశారో అదే విధంగా ఈ కొంపలను కూడా "లాడ్జింగులు"గా మార్చివేస్తారు. ఉదాహరణకు బ్రాడ్ ఫోర్డ్ (యార్క్‌షైర్)నే తీసుకుందాం. ఇక్కడ నగరపాలక సంస్థ నగరాభివృద్ధి కార్యక్రమాలలో తలమునకలై వుంది. పైగా ఈ పట్టణంలోనే 1861 సంవత్సరంలో 1751 పాడుపడిన కొంపలున్నాయి. కొద్దిగా ఉదారవాదీ, నీగ్రోలకు స్నేహితుడూ అయిన ఫోష్టర్‌గారు ఆ మధ్యకాలంలో "ఎంతో దయతో" వ్యాపార పునరుద్ధరణ గురించి కాకిలాగా కూశాడు. వ్యాపార పునరుద్ధరణతో బాటుగా నిరంతరాయంగా మార్పు చెందే "రిజర్వు సైన్యం" లేక "సాపేక్ష అదనపు జనాభా" ప్రవాహ తరంగాలు కూడా వస్తాయి. డాక్టర్ హంటర్ భీమా కంపెనీ నుండి సేకరించిన పట్టికలోని వివరాలననుసరించి[1] భయంకరమైన ఈ చీకటి గదులలో ఎక్కువగా

1. డా॥ హంటర్ సంపాదించిన జీవిత భీమా సంస్థ ఏజెంట్ సేకరించిన సమాచారం (బ్రాడ్ ఫోర్ట్) ఈ క్రింది విధంగా వుంది.

**ఇండ్లు**

| | | |
|---|---|---|
| ఉల్కాన్ వీధి - నెం.122 | 1 గదులు | 16 వ్యక్తులు |
| లుమ్‌లే వీధి - నెం. 13 | 1 గదులు | 11 వ్యక్తులు |
| బోవర్ వీధి -నెం. 41 | 1 గదులు | 11 వ్యక్తులు |
| ఫోర్ట్‌లాండ్ వీధి - నెం. 112 | 1 గదులు | 10 వ్యక్తులు |
| హార్టీ వీధి - నెం. 17 | 1 గదులు | 10 వ్యక్తులు |
| నార్త్ వీధి - నెం. 18 | 1 గదులు | 16 వ్యక్తులు |
| నార్త్ వీధి - నెం.17 | 1 గదులు | 13 వ్యక్తులు |
| వేమర్ వీధి - నెం. 19 | 1 గదులు | 8 వయోజనులు |
| జోవెట్ వీధి - నెం. 56 | 1 గదులు | 12 వ్యక్తులు |
| జార్జి వీధి - నెం. 150 | 1 గదులు | 3 కుటుంబాలు |
| రిఫిల్ కోర్, మేరీ గేట్ నెం. 11 | 1 గదులు | 11 వ్యక్తులు |
| మార్షల్ వీధి - నెం. 28 | 1 గదులు | 10 వ్యక్తులు |
| మార్షల్ వీధి - నెం. 49 | 3 గదులు | 3 కుటుంబాలు |
| జార్జి వీధి - నెం. 128 | 1 గదులు | 18 వ్యక్తులు |
| జార్జి వీధి - నెం. 130 | 1 గదులు | 16 వ్యక్తులు |
| ఎడ్వర్ట్ వీధి - నెం.4 | 1 గదులు | 17 వ్యక్తులు |
| జార్జివీధి - నెం. 49 | 1 గదులు | 2 కుటుంబాలు |
| యార్క్ వీధి - నెం. 34 | 1 గదులు | 2 కుటుంబాలు |
| సాల్ట్‌పై వీధి (క్రింది భాగం) | 2 గదులు | 26 వ్యక్తులు |

**దొంతరులు**

| | | |
|---|---|---|
| రాజంట్ వీధి | 1 సెల్లర్స్ | 8 వ్యక్తులు |
| యేకర్ వీధి | 1 సెల్లర్స్ | 7 వ్యక్తులు |
| 33 రాబర్ట్ కోర్ట్ | 1 సెల్లర్స్ | 7 వ్యక్తులు |
| బాల్‌ప్రాట్ వీధిలో ఇత్తడి సామాన్ల దుకాణంలో వాడబడినది | 1 సెల్లర్స్ | 7 వ్యక్తులు |
| 27 ఎబినైజర్ వీధి | 1 సెల్లర్స్ | 6 వ్యక్తులు |

(పై గ్రంథాన్నుండే ఈ పట్టిక గ్రహించబడింది. పు. 111)

కార్మికవర్గంలోని కొంత స్థితిపరులే జీవిస్తున్నారని గమనించగలం. ఇంతకన్నా మంచిగదులు దొరికితే తాము సంతోషంగా ఆ గదులకు అద్దె చెల్లిస్తామని కార్మికులు ప్రకటించారు. ఈలోగా వారిస్థితి అధమ స్థాయికి దిగజారి వారంతా రోగపీడితులవుతూ వుంటే, కొద్దిగా ఉదారబుద్ధి కలిగిన ఫోస్టర్ యం.పి. స్వేచ్ఛా వ్యాపారం ప్రసాదించే ఫలితాలను గురించీ, ఉన్నిదారంలో వ్యాపారం చేసే బ్రాడ్‌షోర్ట్ 'పెద్దమనుషుల' లాభాలను గురించీ మొసలి కన్నీరు కారుస్తున్నాడు. పేదల చట్టం క్రింద డాక్టరుగా పని చేస్తున్న డాక్టర్ బెల్. 1865 సెప్టెంబర్ మాసపు నివేదికలో విష జ్వరాల ఫలితంగా రోగపీడితులైన వారి భయంకర మరణాలకు ఆ జిల్లాలోని నివాసస్థితులే కారణంగా పేర్కొన్నాడు. "1500 ఘనపుటడుగులు గల ఒక చిన్న చీకటి గదిలో పది మంది జీవిస్తున్నారు. విన్సెంట్ వీధిలో గ్రీన్ ఎయిర్ ప్లేస్ వేయస్ ప్రాంతాలలోని 223 ఇళ్లల్లో 1,450 మంది జనం 435 పడకలతో 36 మరుగుదొడ్లతో కాలం గడుపుతున్నారు... పడకలంటే నా అభిప్రాయంలో పాత గుడ్డలతో కుట్టిన రజాయిలాంటివి. ఒక్కొక్క దానికి సగటున 3.3 వ్యక్తులు వున్నారు; కొన్ని కుటుంబాలలో అయిదుగురికి లేక 6 గురికి 1 మాత్రమే వుండగా, మరి కొంత మందికి అసలు పడకలంటూ లేవు; యువకులూ, యువతులూ, వివాహం కాని వారు అందరూ కలిసి మామూలు దుస్తుల్లోనే ఆ కటిక నేలమీద నిద్రపోతారు. ఈ నివాసాలన్నీ చీకటిగానూ, తేమగానూ, మురికిగానూ, దుర్గంధపూరితంగా వుండి మానవ నివాసానికి పూర్తిగా అననుకూలంగా వున్నాయని నేను ఎక్కువగా చెప్పనవసరం లేదు; ఈ కేంద్రాల నుండే అనారోగ్యాన్ని, మృత్యుకారకాలనూ మంచి స్థితిలో నున్న వారి మధ్య వ్యాపింప జేయడానికి అవకాశాన్ని కలిగించడం ద్వారా మనమే వీటి వ్యాప్తికి కారకులమవుతున్నాము."[1]

హీనస్థితిలో వున్న నివాసాలకు లండన్ తర్వాత మూడవ స్థానాన్ని బ్రిష్టల్ ఆక్రమిస్తుంది. "ఐరోపా ఖండంలో అత్యంత సంపన్నవంతమైన నగరంగా పరిగణించబడే బ్రిష్టల్ పట్టణంలో నిష్ట దారిద్ర్యమూ, దైన్యస్థితీ, విలయ తాండవం చేస్తున్నాయి."[2]

### (ఇ) సంచార జనాభా

గ్రామీణ వాతావరణంలో పుట్టినప్పటికీ వృత్తిరీత్యా పారిశ్రామిక రంగ వాతావరణంలో ఎక్కువ కాలం జీవిస్తున్న తరగతి ప్రజల స్థితిగతులను గురించి ఇప్పుడు తెలుసుకుందాం. పెట్టుబడి అవసరాల రీత్యా ఒక ప్రాంతం నుండి మరొక ప్రాంతానికి నెట్టి వేయబడుతూ వున్న ఈ ప్రజానీకం, ఆ పెట్టుబడికి సునాయాసంగా కదిలే పదాతి సైన్యం లాంటిది. తరలించాల్సిన అవసరం లేనప్పుడు ఒకచోట "మకాం"వేస్తారు. సంచార కార్మికులను భవన నిర్మాణానికీ, మురికి కాల్వల పునర్నిర్మాణానికీ, ఇటుకల తయారీకి, సున్నపు బట్టీలు కాల్చడానికీ, రైలు మార్గం నిర్మాణం లాంటి అనేక కార్యక్రమాలకి ఉపయోగిస్తారు. ఆటలమ్మ, విషజ్వరాలనూ, కలరా, ఎర్రని దద్దుర్లతో వచ్చే జ్వరాలను తమతో బాటుగా మహమ్మారిలాగా తీసుకువచ్చి తామెక్కడ మకాం వేస్తారో ఆ పరిసర ప్రాంతాలలో వ్యాపింప జేస్తారు.[3] పెద్ద మొత్తాలలో పెట్టుబడి పెట్టాల్సిన రైల్వేలలాంటి పరిశ్రమల్లో ఆ కాంట్రాక్టరే సాధారణంగా

---

1. "పబ్లిక్ హెల్త్. ఎయిత్ రిపోర్టు" 1866, పుట 114.
2. పై గ్రంథం, పుట 50.
3. "పబ్లిక్ హెల్త్. సెవెంత్ రిపోర్ట్; 1865, పుట 18.

తన "సైన్యానికి" (ఈ కార్మికులకు) అవసరమైన కొయ్య గుడిసెలను ఏర్పాటు చేయడం ద్వారా ఈ సంచార జనం మకాం వున్న ప్రాంతాలలో ఏ విధమైన పారిశుద్ధ్య సౌకర్యాలు లేకుండా చేస్తాడు; స్థానిక సంస్థల పరిధిలో లేనందు వల్ల ఈ శ్రమజీవులకు అవసరమైన సౌకర్యాలను కల్పించమని స్థానిక అధికారులు కాంట్రాక్టరును ఒత్తిడి చేయలేరు; అందువలన ఈ శ్రమజీవులకూ రెండువైపులా ఆ పరిశ్రమలో పనిచేసే సైనికులకు గానూ, అద్దెకుంటున్న వారుగానూ – ఒకే సమయంలో దోపిడీ చేయడం ఈ కాంట్రాక్టరుకు యెంతో లాభసాటిగా వుంటుంది. ఆ కొయ్య గుడిసెలలో వుండే 1,2 లేక 3 యిరుకు గదుల సంఖ్యననుసరించి వాటిల్లో నివాసముండే కూలీల వద్ద నుండి వారానికి 1, 3 లేక 4 షిల్లింగుల అద్దె వసూలు చేస్తాడు.[1] ఒక ఉదాహరణ ఇస్తే సరిపోతుంది. సెవెనోయక్స్ ప్రాంతంలో అపరిశుభ్రతను తొలగించే కమిటీ అధ్యక్షుడు, 1864 సంవత్సరం సెప్టెంబరు మాసంలో, హోంమంత్రిత్వ శాఖ కార్యదర్శియైన సర్ జార్జిగ్రేకు ఈ క్రింది విధంగా తన తీవ్ర నిరసనను పంపినట్లుగా డాక్టర్ సైమన్ చెబుతున్నారు – "ఒక సంవత్సరం క్రితం ఈ ప్రాంతంలో ఆటలమ్మ రోగాలున్నాయని బహు అరుదుగా విన్నాను. దానికి కొద్ది కాలం ముందు లెవిశామ్ నుండి టన్ బ్రిడ్జికి రైలు మార్గం నిర్మాణం ప్రారంభమయింది; ఈ ప్రధానమైన కార్యక్రమంతో బాటుగా దీనికి సంబంధించిన సామాగ్రిని ఉంచుకోవడానికి ఒక డిపోను కూడా ఇక్కడ ఏర్పాటు చేసినందు వలన అధికసంఖ్యలో జనాన్ని ఇక్కడ ఉద్యోగంలో ఉంచుకోవలసిన ఆవశ్యకత ఏర్పడింది. ఈ జనానికంతా అవసరమైన గుడిసెలు లభ్యం గాకపోవడం వల్ల, పని జరిగే ప్రాంతంలో కొన్ని గుడిసెలను ఈ నిర్మాణ కార్యక్రమాల కాంట్రాక్టరైన 'జే' గారు ఏర్పాటు చేశారు. ఈ గుడిసెల్లో ఏ విధమైన వెలుతురు గానీ, పారిశుద్ధ్య సౌకర్యాలు గానీ లేవు సరికదా, ఆ కుటుంబంలో సభ్యుల సంఖ్యతో నిమిత్తం లేకుండా అందులో అద్దెకుంటున్న వారంతా అక్కడే నివాసముండటం వల్ల, ఒక్కొక్క గుడిసెలో రెండే గదులు వుండడం మూలంగా జనం కిక్కిరిసి వుండేవారు. మేము అందుకొన్న ఆరోగ్య నివేదిక ప్రకారం, దీని పర్యవసానంగా, నిల్వ వున్న మురికి నీటి మూలంగా వచ్చే దుర్గంధపూరితమైన వాసనను భరించలేక కిటికీలను మూసివేసుకుని భయంకరమైన ఉక్కలో రాత్రిపూట ఆ పేదజనం కాలం గడపవలసి వస్తుంది. ఈ గుడిసెలను దర్శించిన ఒక ఆరోగ్యశాఖాధికారి, అపరిశుభ్రతను నిర్మూలించే కమిటీకి అక్కడి స్థితిగతులను గురించి ఫిర్యాదు కూడా చేశాడు; కొన్ని పారిశుధ్య కార్యక్రమాలను గనుక అమలు చేయకపోయినట్లయితే, దీని పర్యవసానాలు చాలా తీవ్రంగా వుంటాయని ఆయన హెచ్చరించాడు కూడా. ఒక సంవత్సరం క్రితం అంటువ్యాధులతో సతమతమవుతూ తన దగ్గర పని చేస్తున్న కూలీలకు తగిన ఏర్పాట్లతో గుడిసెల నిర్మాణం చేస్తానని 'జే' గారు హామీ ఇచ్చారు. జులై 23వ తేదీన ఆయన తన హామీని పునరుద్ఘాటించాడు కూడా; అయినప్పటికీ ఆ తర్వాత అనేక ఆటలమ్మ కేసులు, రెండు మరణాలు సంభవించినట్లుగా తెలిసినప్పటికీ ఆయన తన హామీని నిలబెట్టుకోడానికి ఏవిధమైన చర్యలు తీసుకోలేదు. ఆ గుడిసెలలో ఆటలమ్మ కేసులు ఉన్నట్లుగాను అక్కడ జీవించే వారి పరిస్థితి మిక్కిలి దైన్యంగా వున్నట్లుగానూ మొన్న సెప్టెంబరు 9వ తేదీన డాక్టరు కెల్సన్ (సర్జీన్) నాకు చెప్పాడు. మీ సమాచారం కోసం నేను ఇంకా కొన్ని విషయాలు

1. "పబ్లిక్ హెల్త్. సెవెంత్ రిపోర్ట్; 1865, పుట 165.

మనవి చేసుకోవాలి. అంటురోగాలతో కుమిలిపోతున్న రోగుల నిమిత్తం దూరంగా ఏర్పాటు చేయబడిన 'పెస్ట్ – గృహం' లో ఇప్పటికీ నెలల తరబడి రోగగ్రస్తులున్నారు; ఆటలమ్మ, విషజ్వరం మూలంగా ఒకే కుటుంబంలో ఐదుగురు చిన్న పిల్లలు చనిపోయారు; ఏప్రిల్ మొదటి తేదీ నుండి సెప్టెంబర్ మొదటి తేదీ వరకూ, ఐదు మాసాల కాలంలో ఈ ప్రాంతంలో ఆటలమ్మ మూలంగా పది మందికి తక్కువ గాకుండా చనిపోయారు; అందులో నలుగురు ఈ గుడిసెల్లో జీవించేవారు; ఈ కుటుంబాల్లో వస్తున్న రోగాలను బహిర్గతం చేయడం ఆ కుటుంబ సభ్యులకు ఇష్టం లేనందువల్ల, ఈ రోగం మూలంగా ఎంతమంది బాధపడుతున్నారో తెలుసుకోవడం చాలా అసాధ్యం"[1]

బ్రిటీషు కార్మికవర్గంలో కెల్లా బొగ్గు, తదితరమైన గనుల్లో, పనిచేసే కార్మికులకు బాగా జీతాలు ముట్టుతున్నాయి. వారు పొందే జీతాల వివరాలను ఇంతకు ముందు పుటల్లో పరిశీలించాం.[2] వారి నివాస పరిస్థితులను గురించి మాత్రమే ఇక్కడ ఒకమేరకు పరిశీలించడానికి ప్రయత్నించాను. గని యజమానిగానీ లేక కౌలుదారుగానీ తన కార్మికుల కోసం గుడిసెలను తప్పనిసరిగా ఎక్కువగా నిర్మిస్తాడు. ఆ కార్మికులు, గుడిసెలనూ, వాడకానికి బొగ్గునూ "ఏమీ చెల్లించకుండానే" అనగా వారి జీతంలో భాగంగా వస్తురూపంలో చెల్లించబడటం ద్వారా పుచ్చుకుంటారు. ఆ విధంగా ఆ గుడిసెల్లో నివసించని వారు, నష్టపరిహారంగా పౌండ్లు పుచ్చుకుంటారు. గని కార్మికులనూ, చేతివృత్తులవారినీ, షాపుల్లో పనిచేసేవారిని, ఆ చుట్టు ప్రక్కలుండే తదితరమైన జనాభాను గనులుండే జిల్లాలు చాలా ఎక్కువగా ఆకర్షిస్తాయి. జనసాంద్రత చాలా ఎక్కువగా వుండటం వల్ల సాధారణంగా అక్కడ స్థలాల రేట్లు కూడా చాలా ఎక్కువగా వుంటాయి. అందువలన, తన దగ్గర పనిచేసే కార్మికులకూ, వారి కుటుంబాలకూ కిక్కిరిసి వుండటానికి అవసరమైన మేరకు ఆ గనుల బిలం దగ్గర లభ్యమయ్యే స్థలంలోనే యజమాని గుడిసెల నిర్మాణం చేస్తాడు. ఆ పరిసర ప్రాంతాల్లో క్రొత్త గనులు ప్రారంభించినా లేక పాత గనులను పునరుద్ధరించినా నివాసాలకుండే ఒత్తిడి పెరుగుతుంది. మినహాయించడానికి అవకాశం వుండే అన్ని రకాలైన వ్యయాల నుండీ పెట్టుబడిదారుని "వాంఛా విసర్జనమే" ఈ గుడిసెల నిర్మాణంలో మనం గమనించదగిన ప్రస్తుతాంశం. డాక్టర్ జూలియన్ హంటర్ ఇలా అంటాడు; "నార్త్ అంబర్ లాండ్, డర్హామ్, గనులకు సంబంధించిన గని కార్మికులకూ తదితర శ్రామికులకూ లభ్యమైన గుడిసెలను మొత్తంగా పరిశీలించినపుడు, ఆ గుడిసెలు అతి నికృష్టంగా వుండటమే గాక,

1. "పబ్లిక్ హెల్త్, సెవెంత్ రిపోర్ట్" 1865, పు. 18 నోట్ : - రిజిస్ట్రార్ జనరల్ గార్కి, చాపల్ - ఎన్ - లే - ఫ్రిత్ యూనియన్ యొక్క రిలీవింగ్ ఆఫీసరుగారు యీ విధంగా నివేదించాడు: "చిన్న చిన్న సున్నపురాళ్ళతో సొరంగాల్లాంటి గుడిసెలను ఒక పెద్ద కొండలాగా డోవేహోల్ దగ్గర నిర్మించారు; ఆ ప్రాంతంలో రైల్వే నిర్మాణాల్లో పనిచేస్తున్న కార్మికులంతా ఈ సున్నపురాళ్ళ సొరంగాలను తమ నివాసాలుగా ఏర్పాటు చేసుకున్నారు. ఈ గుడిసెలన్నీ చాలా ఇరుగ్గా తేమతో చిత్తడిగా వుంటాయి. అక్కడ ఏవిధమైన మరుగుదొడ్లులేవు. ఆ గుడిసె మధ్యలో చిమ్నీ కోసం ఏర్పరచిన ఒక చిన్న కన్నం తప్ప వెలుతురు రావడానికి మరే విధమైన మార్గం లేదు. దీని పర్యవసానంగా ఆటలమ్మ వ్యాపించి కొన్ని మరణాలు (ఆదిమవాసుల్లో) కూడా సంభవించాయి." (అదే గ్రంథం. నోట్ పు. 2)

2. నాల్గవ భాగం చివరిలో ఇవ్వబడిన వివరణలో ప్రత్యేకించి బొగ్గుగనుల్లో పనిచేసే కార్మికులను గురించి ప్రస్తావించబడింది. ఇంతకన్న నికృష్టస్థితిలో వున్న లోహపు గనుల కార్మికులను గురించి తెలుసుకోడానికి వివరణాత్మకమైన 1864వ సంవత్సరపు రాయల్ కమిషన్ నివేదికను చూడండి.

ఇంగ్లాండ్ మొత్తం మీద అలాంటి వాటితో పోల్చినపుడు, ఇక్కడున్న గుడిసెలు బహుప్రియంగా కూడా వున్నాయని చెప్పవచ్చు. మన్‌మౌట్ షైర్ ప్రాంతంలో అలాంటివి ఉండవచ్చునని అనుకోవచ్చు... ఒకే గదిలో చాలామంది జనాన్ని కుక్కడంలోనే గాక, అతికొద్ది స్థలంలో దొంతర్ల మీద దొంతర్ల లెక్కన చాలా ఇళ్ళను నిర్మించడంలోనూ, నీటి కొరతలోనూ, ఏ విధమైన మరుగుదొడ్ల సౌకర్యాలను కల్పించకుండా ఉండటంలోనూ అతి తరచుగా ఇళ్ళను కిక్కిరిసి నిర్మించడంలోనూ లేక ఇళ్ల పంపిణీ లోనూ, ఆ మొత్తం ప్రాంతమంతా నివాసాలుండే ప్రాంతాల్లాగా కాక కేవలం మకాముల్లాగా పరిగణించే కాంట్రాక్టరు ధోరణిలోనూ కూడా తీవ్రమైన నికృష్టత గోచరిస్తుంది"[1] డాక్టర్ స్టీవెన్స్ ఇలా అంటాడు: "నాకిచ్చిన ఆదేశాల కనుగుణంగా దర్‌హామ్ బొగ్గుగనుల ప్రాంతంలోని అనేక పెద్ద గ్రామాలను సందర్శించాను... ఆ ప్రాంతాలలో జీవిస్తున్న కార్మికుల ఆరోగ్యాన్ని గురించి తగు చర్యలు తీసుకోవడం లేదనే సాధారణ అభిప్రాయాన్ని అతికొద్ది మినహాయింపులతో నిజమైందిగానే భావించవచ్చు.... గని కార్మికులంతా ఆ గనుల యజమానులకు గానీ లేక వాటిని కౌలుకు తీసుకున్న వారికి గాని ఒక సంవత్సరం పాటు నిబద్ధులై ("నిబద్ధులై" అనే వ్యక్తీకరణ బానిసత్వానికి ప్రతీకగా బానిసయుగం నుండే వాడుకగా వస్తూ వుంది) వుంటారు. ఆ గని కార్మికులు ఏవిధంగానైనా తమ అసంతృప్తిని వ్యక్తం చేసినా లేక తనిఖీ చేసే వ్యక్తికి కోపం తెప్పించినా హాజరు పట్టీలోని వారి పేర్లకు ఎదురుగా ఒక "రిమార్క్" వేస్తారు. సంవత్సరం ప్రారంభంలో పనిలోకి తీసుకుని కట్టుదిట్టం చేసే సందర్భంలో అలాంటి రిమార్కు పొందిన వారిని పనిలో చేర్చుకోకుండా పంపివేస్తారు.... జనసాంద్రత కలిగిన ఈ జిల్లాల్లోని "దిగ్బంధన విధానం" కన్నా నికృష్ట విధానం మరే ప్రాంతాలోనూ వున్నట్లుగా నాకు కనిపించలేదు. విషతుల్యమైన వాతావరణం ఆవరించి ఉన్న గుడిసెలను అద్దెకు తీసుకోవాల్సిన తప్పని పరిస్థితి ప్రతి గని కార్మికుడికీ వుంది; తనకు తానుగానీ లేక మరెవరైనా గానీ, అతని యజమాని తప్ప (ఏ రకంగా చూసినా ఆ యజమాని అర్ధబానిసలకు యజమానిలాగా కనిపిస్తాడు) ఆ గని కార్మికునికి ఈ భూప్రపంచంలో సహాయం చేసేవారు ఎవ్వరూ లేరనిపిస్తుంది. ఆ యజమాని కూడా ముందుకు తన జమాఖర్చుల పట్టిని అంచనా వేసుకుంటాడు. గనుక ఫలితమేమిటో స్పష్టమే. యజమాని కూడా తరుచుగా నీటిని గని కార్మికులకు సరఫరా చేస్తూ వుంటాడు; ఆ నీరు బాగున్నా లేకపోయినా దానికి చెల్లించాల్సింది చెల్లించాల్సిందే! లేకపోతే జీతంలో కోత తప్పదు."[2]

"ప్రజాభిప్రాయానికి" లేక ఆరోగ్యాధికారుల అభిప్రాయాలకూ విరుద్ధంగా, అక్కడ వుండే ప్రమాదకరమైన, నికృష్టమైన పరిస్థితులకు కార్మికుని యొక్క పని విధానాన్నీ, గృహ జీవితాన్ని, లాభావశ్యకత సాకుగా బందీలుగా చేయడానికి "సమర్థించుకోడానికి" పెట్టుబడికి పెద్ద కష్టమేమీ కాదు. కర్మాగారాలలో ప్రమాదకర యంత్రాలనుండి కార్మికులకు రక్షణ కల్పించడానికి పెట్టుబడి ఏవిధంగా "పట్టించుకోదో", గనులలో వెలుతురూ తదితరమైన రక్షణ సౌకర్యాలు ఏర్పాటు చేయడానికి కూడా అదే విధంగా పట్టించుకోదు. గని కార్మికులకు గృహవసతిని కల్పించడంలోనూ అదే విధానాన్ని పాటిస్తుంది. ప్రివీ కౌన్సిల్ అధికారయిన డాక్టర్ సైమన్ తన అధికారిక నివేదికలో ఈ విధంగా

1. పబ్లిక్ హెల్త్. సెవెంత్ రిపోర్ట్. పుట. 180, 182.
2. పై గ్రంథమే. పుట. 515, 517.

చెప్పాడు : నికృష్ట గృహవసతి కల్పించిన దానికి సమర్థించుకునే ప్రయత్నంలో... గనులు సాధారణంగా కౌలు ప్రాతిపదికగా పనులు జరుగుతాయనే వాదన వుంది; పనిలో చేరిన కార్మికులకూ, వ్యాపారస్తులకూ తదితరులకు తగిన సౌకర్యాలతో మంచి వసతి కల్పించడానికి కౌలు కాల పరిమితి దీర్ఘకాలికమైనది కాదు. (గనులలో సాధారణంగా 21 సంవత్సరాలు); ఒకవేళ ఆ యజమాని ఉదారంగా ఈ విషయంలో ముందుకు వచ్చినప్పటికీ, ఆ ప్రాంతంలో నిర్మాణం చేయబడిన గ్రామాల్లో సౌకర్యంగా జీవించే "గౌరవం" కార్మికులకు దక్కిందనే భావంతో, ఇతరులైనా గృహ నిర్మాణం చేసుకోకుండా వుండాలనే ఉద్దేశ్యంతో ఆ భూయజమాని, భరింపశక్యం గాని భూమి కౌలును నిర్ణయించడం మూలంగా, అనుకున్న సౌకర్యాలను కలిగించే కార్యక్రమాలన్నీ అడుగంటిపోతాయి. పైన పేర్కొన్న సమర్థనకు సంబంధించి మంచి చెడులలోకి ఈ నివేదిక వెళ్ళటం దాని పరిధికి మించినది. పైగా పరిశుభ్రమైన సౌకర్యాలను కలిగించడం మూలంగా, అందు నిమిత్తమయ్యే వ్యయం, తుదకు భూ స్వామిపైనా, లేక కౌలుదారు పైనా లేక కార్మికుడి మీద లేక ప్రజల మీద మోపవలసివస్తుందనే మీమాంస కూడా ఈ సందర్భంలో అనవసరం. అయితే, నివేదిక అనుబంధంలో పొందుపరిచిన (డా॥ హంటర్, డా॥ స్టీవెన్స్‌ల నివేదికలు) సిగ్గుచేటైన నగ్న సత్యాలకు పరిష్కార మార్గాలను కనుగొనవలసి వుంది... భూ యజమాన్యపు హక్కులను ప్రజలను హాని చేయడానికే ఎక్కువగా ఉపయోగించుకొంటున్నారు. గని యజమానిగా భూస్వామి తన ఎస్టేటులో ఒక పారిశ్రామిక వాడను కార్మికులకు కేటాయిస్తాడు. ఆ భూమికి అధినేతగా, కార్మికులకు నివాసయోగ్యం గాని రీతిలో గుడిసెలను ఏర్పాటు చేస్తాడు. కౌలుదారు (దోపిడీదారైన పెట్టుబడిదారు) భూమి లావాదేవిలో ఈ విధమైన విభజన వ్యతిరేకించడానికి ఏ విధమైన ఆర్థికపరమైన ప్రేరణలేదు, ఈ పరిస్థితులన్నీ భరింపరానివిగా ఉన్నప్పటికీ, వాటి పర్యవసానాలను తనుగాక, కార్మికులే భరించవలసి వస్తుందని అతనికి బాగా తెలుసు. అయితే అతని దగ్గర పనిచేసే కార్మికులకు ఈ విషయాలను తెలుసుకునేంత అక్షరజ్ఞానం గానీ, వారికి ఉండవలసిన పారిశుద్ధ్య హక్కుల విలువగానీ తెలియదు సరికదా, నికృష్టమైన వసతీ లేక కంపుకొట్టే నీళ్ళులాంటి సమస్యలు కూడా "సమ్మె" చేయడానికి సరైన ప్రోత్సాహకాలనే పరిజ్ఞానం కూడా వారికి లేదు.[1]

### (ఈ) కార్మిక వర్గంలో ఎక్కువ వేతనం పొందే తరగతుల మీద సంక్షోభాల ప్రభావం

వ్యవసాయ కార్మికులను గురించి విశదీకరించబోయే ముందు పారిశ్రామిక రంగంలో వచ్చే ఆకస్మిక మార్పులు కార్మికవర్గంలోని కులీనత్వాన్ని లేక ఎక్కువ వేతనాలను పొందే తరగతులను సహితం ఏవిధంగా ప్రభావితం చేస్తాయో ఒక ఉదాహరణ ద్వారా వివరిస్తాను. 1857వ సంవత్సరంలో సంభవించిన గొప్ప సంక్షోభంతో పాటుగా కాలక్రమంలో పారిశ్రామిక వలయం (ఇండస్ట్రియల్ సైకిల్) ఏ విధంగా ముగిసిందో ఒక్కసారి జ్ఞప్తికి తెచ్చుకోవడం మంచిది. ఆ వలయం 1866లో ముగింపుకు రావలసి వుంది. పారిశ్రామిక జిల్లాలలో ఈ సంక్షోభాల ప్రభావం పత్తి కరువు ద్వారా ముందే ఊహించబడింది. మామూలుగా వుండే రంగాల నుండి పెద్ద మొత్తాలలో పెట్టుబడి, డబ్బు మార్కెట్ ప్రధాన కేంద్రాలకు తరలించబడింది; అందువల్ల ఈ సంక్షోభాలు ప్రధానంగా ద్రవ్య స్వరూపాన్ని

1. "పబ్లిక్ హెల్త్. సెవెంత్ రిపోర్ట్, పుట 16

సంతరించుకొన్నాయి. బ్రహ్మాండమైన లండన్ బ్యాంకు విఫలం కావడంతో దాని వెనువెంటనే అనేక దగాకోరు కంపెనీలు దివాలా తీయడంతో 1866లో సంక్షోభాలు బద్దలు గావడానికి ముందు హెచ్చరికలుగా అవి నిలిచాయి. లండన్ పారిశ్రామిక విభాగాలలోని ఒక ప్రధాన భాగమైన ఇనుప ఓడల నిర్మాణ రంగం ఈ విపత్తులో చిక్కుకున్న రంగాలలో ఒక ప్రధాన పరిశ్రమ. సట్టా వ్యాపారం జోరుగా సాగుతున్న రోజుల్లో ఈ పరిశ్రమాధిపతులు అత్యధిక స్థాయిలో అమితోత్పత్తి చేయడమేగాక, పరపతి ఎక్కువగా లభ్యమవుతుందనే ఊహతో అనేకమైన ఇతర పనులకు కూడా ఒడంబడికలు చేసుకున్నారు; ఇప్పుడు గొప్ప సంక్షోభం సంభవించి, లండన్‌లోని ఇతర పరిశ్రమలను కూడా ఈ పుస్తకం రాస్తున్న సమయంలో (1867 మార్చి మాసాంతం) ఆ సంక్షోభం ముంచేస్తూనే వుంది.[1] ఈ సంక్షోభం ముంచెత్తిన ప్రాంతాలను సందర్శించిన "మార్నింగ్‌స్టార్" విలేఖరి ప్రత్యక్ష కథనాన్ని కార్మికుల స్థితిగతులను గురించి తెలియజేయడానికి ఉటంకిస్తాను. "తూర్పు ప్రాంత జిల్లాలైన పాప్లార్, మిల్‌వాల్, గ్రాన్‌విచ్, డిషోర్ట్, లైమ్ హౌస్, కానింగ్ టౌన్‌లలో సుమారుగా 15,000 మంది శ్రామికులూ, వారి కుటుంబాలూ అత్యంత దయనీయ స్థితిలో కాలం గడుపుతున్నారు; (సంవత్సరంలో సగం కాలం పాటు కడుపు కాల్చుకున్న తర్వాత కూడా) 3000 మంది నైపుణ్యం గలిగిన మెకానిక్కులు "అనాథ శరణాలయాల్లో" (వర్క్ హౌస్) పరిసరాల్లో చప్టా రాళ్ళు గొడుతున్నారు... ఆకలిగొన్న గుంపు చుట్టుముట్టడంతో, ఆ పని గృహం ద్వారా దగ్గరకి చేరుకోడానికి నాకు చాలా కష్టమైంది... వాళ్ళంతా తిండి కోసం పంచిపెట్టే టిక్కెట్ల కోసం ఎదురు చూస్తూ వున్నారు. అయితే ఇంకా వాటి పంపిణీ సమయం రాలేదు. నలచదరంగా వుండే ఆ ప్రాంగణం చుట్టూ లోపలి వైపున షెడ్డు వేయబడి వుంది. ఆ మధ్యలో వున్న రాళ్ళ గుట్టల మీద మంచుదట్టంగా వుంది. ఆమధ్యలోనే గొర్రెదొడ్లూ లాంటివి తీగతో కంచె వేయబడిన చిన్న చిన్న దొడ్లు కూడా వున్నాయి. వాతావరణం అనుకూలంగా వున్నప్పుడు అందులో కూర్చుని కార్మికులు పనిచేస్తారు; అయితే నేను సందర్శించిన రోజున ఆ దొడ్లన్నీ దట్టమైన మంచుతో నిండివున్నందున ఎవరూ అక్కడ కూర్చోలేదు. అందుమూలంగా కార్మికులంతా షెడ్డులోనే కూర్చుని చప్టారాళ్ళను పగలగొట్టి చదరపు రాళ్ళుగా మారుస్తూ పనిలో నిమగ్నమై వున్నారు. ప్రతికార్మికుడి దగ్గర మంచుగడ్డలతో కప్పబడిన పెద్ద చప్టారాయి వుంది; పెద్ద

1. "లండన్‌లో నివసించే పేదవారు మూకుమ్మడిగా పస్తులుంటున్నారు... గత కొన్ని రోజులుగా లండన్ నగరం గోడలపై ఈ క్రింద పేర్కొన్న అద్భుతమైన ప్రకటనలు గల పెద్ద పెద్ద పోస్టర్లు వెలిశాయి. "బలిసిన ఆంబోతుల్లారా! పస్తులుంటున్న మహాప్రజలారా! అద్దాల మేడల్లో జీవించే ధనాఢ్య వర్గాల మృష్టాన్న భోజనానికై, బలిసిన ఆంబోతులను, వారి ఆడంబర నివాసాలకు తరలించబడగా, పస్తులుంటున్న జనం అంతా వారి వారి నికృష్ట కొంపల్లో గోడుగోడు మంటూ విలపిస్తూ మరణావస్థలో వున్నారు." తిరుగుబాటు ధోరణితో కూడిన మాటలతో ఈ "పోస్టర్లు" అక్కడక్కడ వెలిశాయి. మొదట వేసిన వాల్ పోస్టర్లు పాతబడితేనో లేక కనిపించకుండా పోతేనో వెంటనే అదేస్థానంలోనో లేక ప్రధాన ప్రాంతాలలోనో తిరిగి పోస్టర్లు వెలిశాయి.... ఇది.... 1789 సంవత్సరంలో ఫ్రాన్సులో కొన్ని రహస్య విప్లవ సంఘాలు అ దేశం ప్రజానీకాన్ని అప్పుడు జరిగిన ఘటనలకు సిద్ధం చేసిన పద్ధతిని గుర్తుకు తెస్తుంది. ఈ సమయంలో చలి, ఆకలితో అలమటిస్తూ ఇంగ్లాండ్ కార్మికులు వారి భార్యా పిల్లలతో, చస్తూ వుంటే, ఇంగ్లాండ్ కార్మికుల శ్రమ ఫలితమైన కోట్లాది పౌండ్ల సంపద రష్యాలోనూ, స్పెయిన్‌లోనూ, ఇటలీలోనూ, తదితరమైన విదేశీ వ్యాపారాల్లో పెట్టుబడిగా చలామణి చేస్తున్నారు. "- రేనాల్డ్స్ న్యూస్ పేపర్-20, జనవరి, 1867.

సుత్తితో ఆ రాయిని పగలగొట్టి చిన్నచిన్న ముక్కలుగా ఐదు బుట్టలు అయ్యే వరకూ ఆ పనిచేస్తారు. దానితో ఆరోజు పని ముగిస్తుంది. కార్మికుడు చేసిన ఆ పనికి కొద్దిగా తిండీ, మూడు పెన్నీలు రోజు కూలిగా ముడుతుంది. ఆ ఆవరణలోనే మరో భాగంలో కొయ్యతో తయారు చేయబడి శిథిలావస్థలో వున్న కొంప ఒకటి వుంది. దాని తలుపు తెరవగానే అందులో వుండే మనుష్యులు వెచ్చదనం కోసం ఒకరి భుజాలొకరు రాసుకుంటూ కూర్చున్నట్లుగా కనిపిస్తుంది. పాతరాళ్ళ నుండి పీచు తీస్తున్న ఆ జనం కొద్ది తిండితో ఎక్కువకాలం ఎవరూ పని చేయగలరనే విషయాన్ని గురించి సవాళ్ళు విసురుకుంటున్నారు. సహనమే గౌరవప్రదమైంది కదా... ఈ అనాథ శరణాలయంలో ఏడు వేల మంది... ఉపశమనాన్ని పొందుతున్నారు... అందులో అనేక వందల మంది ఆరు లేక ఎనిమిది మాసాల క్రితం చేతివృత్తుల వారికి చెల్లించే దానిలో గరిష్ట వేతనాలను పొందినట్లుగా తెలుస్తుంది... పొదుపు చేసిందల్లా పూర్తిగా ఖర్చయినప్పటికీ తాకట్టు పెట్టుకోవడానికి ఇంకా కొద్దో గొప్పో మిగిలి వుండటం వల్ల మత సంస్థల సహాయాన్ని అందులో చాలామంది అభ్యర్థించలేదు; లేకపోతే ఈ సంఖ్య ఇంకా దానికి రెట్టింపు అయ్యేది. ఆ పని గృహాన్ని విడిచి పెట్టి పొప్లార్ పరిసర ప్రాంతాలోని చిన్న చిన్న ఇళ్ళను చూసుకుంటూ ఆ వీధుల్లో కొంతదూరం నడిచాం. నా సహాయకుడు నిరుద్యోగ కమిటీలో సభ్యుడు... ఏడు నుండి ఇరవై వారాలుగా ఉద్యోగంలేని ఒక ఉక్కు కర్మాగారంలో పనిచేసే కార్మికుడ్ని ముందుగా కలిశాం. అతని ఇంట్లో అతని కుటుంబంతో వెనుక వున్న చిన్న గదిలో కూర్చుని వున్నాడు. ఆ గదిలో కొద్దిగా సామాగ్రితో పాటుగా ఒక మూల చిన్న కుంపటి కూడా వుంది. ఆ రోజు చలి ఎక్కువగా వుండటం మూలంగా కనీసం చిన్న పిల్లల పాదాలు చలిమూలంగా గడ్డ కట్టుకుపోకుండా వుండటానికి ఆ కుంపటి అవసరం. ఆ కుంపటి ముందు చిన్న బుట్టలో వున్న పాత తాళ్ళ పీచును తీస్తూ అతని భార్యా పిల్లలు కూర్చొని వున్నారు. ఆ పని మూలంగా రోజుకు వారికి స్థానిక సంస్థలు కొద్దిగా తిండి పడేస్తాయి. ఆ ప్రాంతంలోనే వున్న రాళ్ళు గొట్టే అనాథ శరణాలయంలో రోజుకి కొద్దిగా తిండి మూడు పెన్నీల కూలికి ఆ కార్మికుడు పని చేస్తాడు. చాలా ఆకలితో భోజనానికి వచ్చినట్లుగా అతడు చాలా విచారవదనంతో చెప్పాడు. రెండు రొట్టె ముక్కలూ, కొద్దిగా కొవ్వునూనె, పాలు లేని టీ మాత్రమే అతని భోజనం... ఆ పక్క తలుపు తట్టంగానే ఒక మధ్య వయస్కురాలు తలుపు తీసింది. ఆరిపోతున్న కుంపటివైపు నిశ్చలంగానూ, నిశ్శబ్దంగానూ చూస్తూ ఆవిడ కుటుంబం మొత్తం కూర్చున్న వెనుక వైపు చావిడిలోకి మాతో ఏమీ మాట్లాడకుండానే తీసుకువెళ్ళింది. ఆ చిన్న గదిలో వున్న జనంలో వ్యాపించిన నిస్సహాయతా నిరాశలను మరోసారి చూడకూడదనిపించింది. ఆ చిన్న పిల్లల వైపు చూస్తూ "గత ఆరువారాల నుండి ఇరవై వారాల వరకు వారికేమీ పని దొరకలేదు."అని ఆమె అన్నది; గతించిన మంచి రోజుల్లో భవిష్యత్తుకు ఉపయోగపడతాయని మేం పొదుపు చేసిన ఇరవై పౌండ్లు ఇప్పుడు హరించుకుపోయాయంటూ చాలా కోపంగా బ్యాంక్ ఖాతా పుస్తకాన్ని చూడమని మాకు అందించింది. బ్యాంకులో జమ చేసిందీ, బ్యాంకులో నుండి తీసుకున్నదీ ఆ పుస్తకంలో చాలా స్పష్టంగా రాయబడింది ప్రారంభంలో చేసిన ఐదు షిల్లింగుల డిపాజిట్ క్రమేపీ ఇరవై పౌండ్లకు పెరిగింది. అదే విధంగా క్రమేపీ ఆ పౌండ్లు, షిల్లింగుల క్రింద కరిగిపోయాయి. చివరి పద్దు నిరుపయోగమైన ఖాళీ పట్టికలా కనిపించింది. అనాథ శరణాలయం నుండి ఈ కుటుంబం రోజుకు

ఒక పూట తిండి పొందడంలో ఉపశమనం పొందుతుంది... ఆ తర్వాత ఒక్క ఉక్కు పరిశ్రమలో పని చేసే కార్మికుని భార్యను కలుసుకున్నాం. ఆవిడ భర్త ఆ ఆవరణలోనే పనిచేస్తున్నాడు. ఆవిడ చిన్న దుప్పటి పీలికలు కప్పుకొని తిండిలేక నీరసించి పోయినట్లుగా ఆ చాప మీద పడివుంది. వాళ్ళ పడక సామాగ్రినంతా తాకట్టు పెట్టారు. నికృష్టస్థితిలో వున్న ఇద్దరు పిల్లలు ఆవిడ మీద దొర్లుతున్నారు. వాళ్ళకూ ఏమీ పోషణ లేనట్లుగా కనిపిస్తుంది. పందొమ్మిది వారాలుగా ఏమీ పని దొరక్క, తిండిలేక వారు ఈ స్థితికి వచ్చారు. గడిచిన కాలం గురించి చెప్తూ భవిష్యత్తు మీద ఏవిధమైన నమ్మకం లేకపోవడంతో, అదే ప్రాయశ్చిత్తమను కొని మూల్గింది. అక్కడనుండి బయట పడగానే ఒక యువకుడు అతని కొంప కూడా చూసి మేము ఏమైనా చేయగలమేమోనని బతిమాలుతూ మావెంట పడ్డాడు. యుక్తవయస్సులో ఉన్న భార్యా యిద్దరు అందమైన పిల్లలూ, తాకట్టు రసీదుల కట్టా తప్ప ఆ ఇంట్లో మాకు చూపించడానికి మరేమీ లేదు."

1866వ సంవత్సరంలో వచ్చిన సంక్షోభం తర్వాత సంక్రమించిన విలాపాగ్నులను వివరించడానికి టోరీ వార్తా పత్రిక నుండి ఉటంకిస్తాను. మనం పరిశీలించే లండన్ తూర్పు ప్రాంతం ఇంతకు ముందే పేర్కొన్న ఉక్కు ఓడల నిర్మాణ కేంద్రమే గాక కనీస వేతనాలను గూడా చెల్లించని "స్వదేశీ పరిశ్రమ" కు కేంద్ర స్థానమనే సంగతి గుర్తుంచుకోవాలి. "ఈ నగరంలోని ఒక భాగంలో నిన్న ఒక భయంకరమైన దృశ్యాన్ని చూశాం. తూర్పు ప్రాంతంలోని వేలాది నిరుద్యోగులంతా నల్ల జెండాలు ధరించి ప్రదర్శన చెయ్యకపోయినా, ఆ జనం యొక్క ప్రచండ ప్రవాహం గొప్పగా వుంది. ఈ జనం ఎందుకు బాధపడుతున్నారో మనం గమనించాలి. వారు తిండి లేక చస్తున్నారు. అతి సామాన్యమైనప్పటికీ భయంకరమైన వాస్తవం అది. అలాంటి వాళ్ళు 40,000 మంది వున్నారు... మహాద్భుతమైన ఈ నగరంలోని ఒక భాగంలో మన కళ్ళముందే బ్రహ్మాండంగా సంపద పోగుపడిన ప్రాంగణంలోనే దాని పక్కనే 40,000 మంది నిస్సహాయులై కడుపు కాలుతున్న జనం కిక్కిరిసి వున్నారు. వేలాదిగా వున్న ఈ జనం ఇప్పుడు ఇతరులపైన విరుచుకుపడుతున్నారు. అర్ధాకలితో గడుపుతున్న వారి నికృష్ట జీవితాన్ని గురించి చెవులు మారుమోగేటట్లు గగ్గోలు పెడుతున్నారు; అలో రామచంద్రా అని అలమటిస్తున్నారు; పని దొరకడం అసాధ్యమనీ, అడుక్కుతినడం నిరుపయోగమనీ వారి దౌర్భాగ్యస్థితిని దేవుడికి మొరపెట్టుకుంటున్నారు. స్థానిక పన్నుల వ్యవస్థ మూలంగా పన్నులు చెల్లించేవారు కూడా కటిక దారిద్ర్యానికి నెట్టబడుతున్నారు" (స్టాండర్డ్, 5 ఏప్రిల్ 1867).

"కార్మికుల స్వాతంత్ర్యం" దీనినే మరొకరకంగా చెప్పాలంటే "పెట్టుబడిదారుల స్వాతంత్ర్యం" బెల్జియం దేశంలో కార్మిక సంఘాల నియంతృత్వం ద్వారా గానీ లేక పారిశ్రామిక సట్టాల సంకెళ్ళ ద్వారా గానీ అదుపు చేయబడటం లేదు గనుక ఆ దేశాన్ని "కార్మికుల స్వర్గంగా" పేర్కొనడం ఇంగ్లీషు పెట్టుబడిదార్లకు ఒక ఆనవాయితి. అందువలన ఆ బెల్జియం దేశపు కార్మికుడి "ఆనందమయ జీవితాన్ని" గురించి ఒకటీ లేక రెండు మాటలు ఇక్కడ చెప్పాలి.

ఈ "ఆనందమయ జీవిత" రహస్యాలను గురించి బెల్జియం దేశపు ధర్మ సంస్థల జైళ్ళ ఇన్స్పెక్టర్ జనరల్, కేంద్ర గణాంకసంఘ సభ్యుడూ అయిన స్వర్గీయ యం.డస్ పేషియస్‌ను మించి మరెవ్వరూ అంత సన్నిహితంగా తెలిసినవారు లేరని రూఢీగా చెప్పవచ్చు. ఆయన రాసిన 'బడ్జెట్ ఎకనామిక్

డెస్‌క్లాసెస్ జీవర్ ఇయర్స్ దిల బెల్జియం' (బ్రస్సెల్స్ 1855) అనే గ్రంథాన్నే తీసుకుందాం. సైనికుడితోనూ, నావికుడితోనూ, ఖైదీతోనూ కార్మికుని పోషకాహార స్థితిగతులను పోల్చి అతని వార్షికాదాయాన్నీ, వ్యయాన్నీ తిరుగులేని గణాంక సమాచారం ఆధారంగా లెక్కించి బెల్జియం కార్మికుని సాధారణ కుటుంబ జీవితాన్ని విశదీకరించడంతో పాటుగా మిగిలిన విషయాలను కూడా ఆయన తన గ్రంథంలో పొందుపరిచాడు. కుటుంబం అనగా "తండ్రి, తల్లి, మరి నలుగురు పిల్లలు", ఆ ఆరుగురిలో "నలుగురికి మాత్రమే సంవత్సరం కాలం పాటు పని దొరుకుతుంది. "అందులో" ఎవరూ రోగిష్టులు లేరనీ, పనిచేయలేని వారు లేరనీ" ఊహించబడింది. దీనితో పాటుగా కుటుంబంలో "చర్చి సంబంధమైన ఖర్చులు మినహా" మత, నైతిక, ఆధ్యాత్మిక, మేధా సంబంధమైన ఖర్చులు ఏవీ లేవనీ, "పొదుపు బ్యాంకు ఖాతాలు వగైరాలు" లేవనీ, "ఆడంబర వినియోగం" గానీ, "దుబారా ఖర్చులు" గానీ లేవనీ కూడా ఊహించబడింది. తండ్రీ, పెద్ద కుమారుడు మాత్రం "చుట్ట కాలుస్తారనీ", ఆదివారాల్లో "క్యాబరే డ్యాన్సు"కి వారానికి 86 సెంటిమెస్ వ్యయం చేస్తారని కూడా భావించబడింది. "వివిధ వ్యాపారాల్లో కార్మికులకు చెల్లించే రోజు వేతనాలను పరిశీలించగా రోజుకు చెల్లించే సగటు వేతనం పురుషులకు 1 ఫ్రాంక్ 56 సెంటిమెస్‌లు, స్త్రీలకు 89 సెంటిమెస్‌లు, బాలురకు 56 సెంటిమెస్‌లు, బాలికలకు 55 సెంటిమెస్‌లని తేలింది. ఈ విధంగా లెక్కించినపుడు ఒక కుటుంబానికి ఒక సంవత్సరానికి గరిష్టంగా 1068 ఫ్రాంకుల ఆదాయం లభిస్తుంది... అన్ని రకాలైన వనరులను పరిగణలోకి తీసుకుని ఇది లెక్కించాం. అయితే తల్లికి వచ్చే వేతనాన్ని తీసుకున్నప్పుడు ఆవిడ తన కుటుంబాన్ని ఏవిధంగా సర్దుకు రాగలదనే ప్రశ్న ఉదయిస్తుంది! కుటుంబంలో పనులు ఎవరు చేస్తారు? చిన్న పిల్లల్ని ఎవరు చూస్తారు? బట్టలు ఉతకడం? ఈ సందేహాలనే నిరంతరం కార్మికులకు వ్యక్తం చేశాం."

ఆయన ఇచ్చిన సమాచారాన్ననుసరించి కుటుంబ ఆదాయం ఈ విధంగా వుంది :

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| రోజుకు | ఫ్రా. | 1.56 | లెక్కన | 300 | రోజులకు | తండ్రి | వేతనం | ఫ్రా. 468 |
| " | " | 0.89 | " | " | " | తల్లి | " | " 267 |
| " | " | 0.56 | " | " | " | బాలుడి | " | " 168 |
| " | " | 0.55 | " | " | " | బాలిక | " | " 165 |
| | | | సంవత్సరంలో కుటుంబ మొత్తం వేతనం | | | | | ఫ్రా. 1068 |

ఈ క్రింది వారి ఆహార వ్యయంతో పోల్చి, ఆ ఆహారాన్నే కార్మికుడి కుటుంబానికి ఇచ్చినట్లుగా భావిస్తే అతని కుటుంబం యొక్క వార్షిక వ్యయం ఈ క్రింది లోటుకు దారితీస్తుందని చెప్పవచ్చు:

| | | | | | | |
|---|---|---|---|---|---|---|
| నావికుడి | ఆహారం | ఫ్రా. | 1828.............. | లోటు | ఫ్రా. | 760 |
| సైనికుడి | " | " | 1473 .............. | " | " | 405 |
| ఖైదీ | " | " | 1112 .............. | " | " | 44 |

"నావికుడూ లేక సైనికుడూ ఆహారం తీసుకునే స్థాయికి కార్మిక కుటుంబాలు పెరుగుతాయని

చెప్పలేము. కాని, కనీసం ఖైదీ తీసుకునే ఆహారం స్థాయికైనా కొన్ని కార్మిక కుటుంబాలు మాత్రమే చేరగలవని చెప్పగలం. జైళ్ళలన్నింటిలోనూ సాధారణంగా సగటున (1847-49 మధ్య కాలంలో వివిధ జైళ్ళల్లో వున్న ప్రతి ఖైదీకి అయ్యే సగటు వ్యయం) ప్రతి ఖైదీకి రోజుకు 63 సెంటిమెస్‌లు వ్యయం అవుతుంది. ప్రతి కార్మికునికి దైనందిన పోషణకయ్యే వ్యయంతో ఈ సంఖ్యను పోల్చినపుడు వాటి మధ్య 13 సెంటిమెస్‌లు వ్యత్యాసం వుంటుంది. పాలనా సంబంధమైన, నిఘా సంబంధమైన వ్యయాలను, ఖైదీకయ్యే సగటు వ్యయంలో చేర్చవలసి వుంటుంది. దీనికి భిన్నంగా ఖైదీలు తమ నివాసానికి ఏమీ చెల్లించనవసరం లేదు. పైగా ఖైదీలు ఫలహారశాలలో చేసే కొనుగోళ్ళను కూడా పోషణ వ్యయాలలో చేర్చలేదు. ఖైదీల పోషణ కవసరమైన ఆహారం తదితరమైన వస్తువులన్నీ టోకుగా కొనుగోలు చేయడం వల్ల వారి పోషణకయ్యే వ్యయం ఇంకా తగ్గిపోతుంది... అలాంటప్పుడు కార్మికులలో గణనీయ భాగం చాలా చాలా పొదుపుగా జీవిస్తున్నారని ఏ విధంగా చెప్పగలం? 'ఉచిత' చర్యలను తీసుకోవడం ద్వారానా? ఆ చర్యల రహస్యమేమిటో కార్మికులకు బాగా తెలుసు; రోజువారీ తీసుకునే ఆహారాన్ని తగ్గించడం ద్వారా, గోధుమ రొట్టెకు బదులు నాసిరకం రొట్టెను తినడం ద్వారా, కొద్దిగా మాంసం లేక అసలు మాంసమే లేకుండా కొద్దిగా వెన్న మరికొంత మిరప్పొడితో కాలక్షేపం చెయ్యడం ద్వారా, ఒకటి లేక రెండు గదుల్లో కుటుంబ సభ్యులంతా కిక్కిరిసి ఆడా మగా తేడా లేకుండా అదే తుంగచాపమీద నిద్రించడంతో సంతృప్తి పడుతూ జీవించడం ద్వారా, బట్టలను పొదుపుగా వాడుకుంటూ పరిశుభ్రతను పరిత్యజించడం ద్వారా, ఆదివారాల్లో ఉండే ఆహ్లాదాలన్నిటినీ త్యాగం చెయ్యడం ద్వారా, ఒక్కమాటలో చెప్పాలంటే సకల బాధలనూ దిగమింగడం ద్వారా జీవించడమే ఆ రహస్యం. ఒకానొక దశలో ఇది తీవ్రస్థాయికి చేరిన తర్వాత ఆహార పదార్థాల ధరలు మూడురెట్లు పెరిగి, నిరుద్యోగం, అనారోగ్యం కార్మికుని దౌర్భాగ్య స్థితిని తీవ్రంగా పెంచి అతన్ని నాశనం చేస్తాయి; అప్పులు పెరిగి, పరపతి పుట్టక అత్యావశ్యకమైన బట్టలూ, సామాగ్రి తాకట్టు పెట్టి చివరకు దరిద్రుల జాబితాలో చేర్చమనే ఆ కుటుంబం దీనాతిదీనంగా వేడుకుంటుంది." (డుస్ స్పేసియస్, ఉదాహృత గ్రంథం. పుట 151.154,155) నిజానికి ఈ "పెట్టుబడిదార్ల స్వర్గంలో" సంభవించే మరణాల, నేరాల సంఖ్య జీవితావసరాల ధరల మార్పులతో అతి సన్నిహితంగా ముడిపడి వుంది. (చూడండి, మానిఫెస్టో ఆఫ్ ది మాట్షఫిజ్, బ్రెజెల్స్, 1860 పుట 15, 16) అధికారిక గణాంక సమాచారా న్ననుసరించి బెల్జియం మొత్తం మీద వున్న 9,30,000 కుటుంబాలలో 4,50,000 మంది జనాభా కలిగిన 90,000 కుటుంబాలు సిరిసంపదలతో తులతూగుతూ వుంటే 19,50,000 మంది జనాభా కలిగిన 1,90,000 కుటుంబాలు క్రింది స్థాయి మధ్య తరగతికి చెంది పట్టణాలలో, పల్లెలలో సాధారణ స్థాయిలో జీవిస్తున్నారు. అందులో గణనీయమైన సంఖ్య దీనస్థాయికి దిగజార్చబడి కార్మిక వర్గంలోకి నెట్టబడుతున్నారు. 22,50,000 మంది జనాభా కలిగిన 4,50,000 కార్మికవర్గ కుటుంబాలున్నాయి. అందులో డన్‌పేషియస్ పేర్కొన్న "సంతృప్తి జీవులను" నమూనాగా మాత్రమే పరిగణించాలి. 4,50,000 కార్మిక కుటుంబాలలో 2,00,000 కుటుంబాలను దరిద్రుల జాబితాలో చేర్చవలసిందే.

## (ఉ) బ్రిటీషు వ్యవసాయ కార్మిక వర్గం

పెట్టుబడిదారీ విధానపు ఉత్పత్తీ, సంచయనం యొక్క శాశ్వత వైరుధ్య లక్షణం, ఇంగ్లండు వ్యవసాయ రంగ (పశు పెంపకంతో సహా) పురోభివృద్ధిలోనూ ఆ దేశ వ్యవసాయ కార్మికుని జీవన పరిస్థితుల క్షీణతలోనూ ధ్రువపడినంత నగ్నంగా మరెక్కడా బహిర్గతం కాలేదు. వ్యవసాయ కార్మికుని ప్రస్తుత పరిస్థితిని పరిశీలించబోయే ముందు, గతాన్ని గురించి ఒక క్షణం ఆలోచిద్దాం. మార్పు చెందిన ప్రస్తుత ఉత్పత్తి విధానానికి పునాదిగా వుండిన భూ ఆస్తి సంబంధాలలో, అంతకు చాలా ముందే విప్లవం వచ్చినప్పటికీ, ఇంగ్లండు దేశపు ఆధునిక వ్యవసాయం 18వ శతాబ్దపు మధ్య భాగంలోనే ప్రారంభమయిందని చెప్పాలి.

లోతైన పరిజ్ఞానం లేనప్పటికీ శ్రద్ధగల పరిశీలకుడైన ఆర్థర్‌యంగ్ వ్యాఖ్యానాన్ననుసరించి, "పట్టణాల్లోనూ, పల్లెల్లోనూ జీవించే ఇంగ్లీషు కార్మికుని స్వర్ణయుగంగా" పేర్కొన్న 15వ శతాబ్దంతో పోలిక లేకపోయినప్పటికీ, "సంపద పోగేసుకుని కార్మికుడు సమృద్ధిగా జీవితాన్ని గడిపిన దశ అయిన"[1] 14వ శతాబ్దంతో పోల్చినపుడు, 1771లో జీవించే వ్యవసాయ కార్మికుడు జాలిపడతగిన పాత్రను మాత్రమే నిర్వహించాడని చెప్పాలి. ఏమైనప్పటికీ గతాన్ని అంతలోతుగా పరిశీలించవలసిన అవసరం ఇక్కడ లేదు. 1777లో ప్రచురితమైన ఒక వివరణాత్మకమైన గ్రంథంలో ఈ వాక్యాలను గమనించండి: "పెద్ద రైతు అతని (పెద్దమనిషి) స్థాయికి పెరిగితే, పేద కార్మికుడు అధమ స్థాయికి దిగజారాడు. ప్రస్తుత స్థితిని, నలభై సంవత్సరాల నాటి స్థితితో పోల్చి చూస్తే అతని దురదృష్ట స్థితి స్పష్టంగా బోధపడుతుంది... భూస్వామి, కౌలుదారు... కార్మికుడిని అధమస్థాయిలో ఉంచడానికి కలిసికట్టుగా ప్రయత్నించారు."[2] 1737-1777 మధ్య కాలంలో వ్యవసాయ రంగంలో నిజ వేతనాలు 1/4 వంతులు లేక 25 శాతం పడిపోయాయని సవిస్తరంగా రుజువు చేయబడింది. డాక్టర్. రిచర్డ్ ప్రైస్ కూడా అన్నట్లు, "నిజానికి ఆధునిక విధానం, ఉన్నత వర్గాల ప్రజానీకానికి అత్యంత అనుకూలంగా వుంది; దీని పర్యవసానంగా, అనతికాలంలోనే దేశం మొత్తం మీద పెద్ద మనుషులూ, అడుక్కు తినేవాళ్ళూ లేక ప్రభువులూ, బానిసలు మాత్రమే వుంటారు."[3]

---

1. జేమ్స్ యి. థోరాల్డ్ రోజర్స్ (ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయంలో రాజకీయ అర్థశాస్త్రంలో ఆచార్యుడుగా పని చేశాడు. ''ఎ హిస్టరీ ఆఫ్ అగ్రికల్చర్ అండ్ ప్రైసెస్ ఇన్ ఇంగ్లాండ్'', ఆక్స్‌ఫర్డ్ 1866, మొదటి సంపుటి; పు.690) ఎంతో శ్రమించి రాసిన ఈ రెండు సంపుటాల (గ్రంథంలో) 1259 నుండి 1400 వరకు మాత్రమే సమాచారం అందించబడింది; రెండవ సంపుటంలో ప్రత్యేకించి గణాంక సమాచారం మాత్రమే ఇవ్వబడింది. ఆకాలానికి సంబంధించిన ఇదొక్కటే ధరల చరిత్రను గురించి ఆధారపడదగిన మొదటి గ్రంథం.
2. ''రీజన్స్ ఫార్ ది లేట్ ఇంక్రీజ్ ఆఫ్ ది పూర్ రేట్స్ : ఆర్ ఎ కంపారిటివ్ వ్యూ ఆఫ్ ది ప్రైసెస్ ఆఫ్ లేబర్ అండ్ ప్రొవిజన్స్'', లండన్.1777; పుట 5-11.
3. డాక్టర్ రిచర్డ్ ప్రైస్ : ''అబ్జర్వేషన్స్ ఆన్ రివిజనరీ పేమెంట్స్'' 6వ ముద్రణ; బై డబ్ల్యు మోర్గాన్; లండన్ 1803; రెండవ సంపుటి; పు.158. 159. ధరలపై వ్యాఖ్యానం. పు.159. ''దిన కార్మికుల యిప్పటి నామమాత్రపు వేతనాలు. 1514వ సంవత్సరంతో పోల్చితే నాలుగు లేక ఐదు రెట్లు కన్నా మించలేవు. అయితే ధాన్యపు ధరలు ఏడు రెట్లు. మాంసం ధరలో పదిహేను రెట్లు ఎక్కువగా వున్నాయి. అందువలన, జీవన వ్యయాల కనుగుణంగా అదే నిష్పత్తిలో శ్రామికవేతనాలు పెరిగే దానికి బదులుగా, వారు భరించ వలసిన వ్యయాలకు అనుగుణంగా కనీసం అందులో సగం నిష్పత్తి లోనైనా పెరిగినట్లు కనిపించదు''.

అయినప్పటికీ, 1770–1780 మధ్యకాలంలో ఇంగ్లీషు వ్యవసాయ కార్మికుల ఆహారం, వసతి, అదే విధంగా అతని ఆత్మ గౌరవం, వినోదం వగైరాలకు సంబంధించిన స్థితి, ఆనాటి నుండి తిరిగి పొందలేని ఆదర్శప్రాయమైన స్థితి అతని సగటు వేతనం 1770 నుండి 1771 వరకు 90 పింట్లు గోధుమలు; ఈడెన్ కాలంలో (1797) 65 పింట్లు కాగా, 1808లో 60 పింట్లు మాత్రమే.[1]

జాకోబియన్లకు వ్యతిరేకంగా జరిగిన యుద్ధం అంతం నాటికీ, వ్యవసాయ కార్మికుల స్థితిగతులను గురించీ, ఆకాలంలో భూస్వాములూ, రైతులూ, కార్ఖానాదారులూ, వ్యాపారస్తులూ, బ్యాంక్ యజమానులూ, సట్టా వ్యాపారస్తులూ, సైనిక కాంట్రాక్టర్లూ వగైరాలు అసాధారణ రీతిలో సంపన్నులైన మార్గాలనుగురించీ గతంలో విశదీకరించాం. కొంతవరకు కరెన్సీ నోటు విలువ పడిపోవడం మూలంగానూ, మరికొంత మేరకు ఈ పడిపోవడంతో సంబంధం లేకుండా ప్రాథమిక జీవితావసరాల ధరలు పెరుగుదల పర్యవసానంగానూ, నామమాత్రపు వేతనాలు పెరిగాయి. అయితే, ఇక్కడ ఏ విధమైన వివరణలలోకి అనవసరంగా వెళ్ళకుండా, వేతనాలలో వచ్చిన వాస్తవిక వ్యత్యాసాలను సూక్ష్మంగా రుజువు చేయవచ్చు. 1795లోనూ, 1814లోనూ పేదల చట్టం, దానికి సంబంధించిన పాలనా వ్యవస్థా ఒకే విధంగా వున్నాయి. ఈ సట్టాన్ని గ్రామీణ జిల్లాల్లో ఏవిధంగా అమలు పరిచిందీ జ్ఞప్తికి తెచ్చుకోవాలి; కార్మికుడు అసాధారణంగా జీవించడానికి అవసరమైన కొద్ది మొత్తాన్ని భిక్షం రూపంలో స్థానిక సంస్థల నామమాత్రపు వేతనాలను చెల్లించేవి. రైతు చెల్లించిన వేతనాలకూ, స్థానిక సంస్థలు చెల్లించే వేతనం లోటుకూ మధ్య నిష్పత్తి రెండు విషయాలను తెలియజేస్తుంది. మొదటిది : కనీస స్థాయికన్నా ఇంకా తక్కువ స్థాయికి వేతనాలు పడిపోవడం; రెండవది : వేతన కార్మికుడిగా, దరిద్రుడిగా వ్యవసాయ కార్మికుడు సమ్మిళితమైన స్థాయి మేరకు లేక స్థానిక సంస్థకు వ్యవసాయ కార్మికుడు అర్ధ బానిసగా మారిన స్థాయి మేరకు ఆ నిష్పత్తి నిర్ణయించబడుతుంది. సకల దేశాలలో వున్న సగటు పరిస్థితికి దర్పణం పట్టే ఒక దేశాన్ని ఉదాహరణంగా పేర్కొందాం. నార్త్ యాంప్టన్ షైర్‌లో 1795లో వారానికి సగటు వేతనం 7 షి.6 పె; ఆరుగురు సభ్యులు గల ఒక కుటుంబపు వార్షిక సగటువ్యయం మొత్తం పౌ.36–12 షి – 5 పె; వారి వార్షిక ఆదాయం పౌ 29.18 షి; స్థానిక సంస్థలు పూరించిన లోటు పౌ 6.14 షి–5పె. అదే ప్రాంతంలో 1814లో వారానికి సగటు వేతనం 12 షి.–2పె. అయిదుగురు వ్యక్తులు గల కుటుంబ వార్షిక వ్యయం పౌ.54–18 షి, 4పె; వారి సాంవత్సరిక ఆదాయం పౌ 36–2 షి; స్థానిక సంస్థలు భర్తీ చేసిన లోటు పౌ. 18 – 6షి. 4పె.[2] 1795లో ఆ లోటు, వేతనంలోని 1/4 వంతులు కన్నా తక్కువ; 1814లో అది సగానికన్నా ఇంకా తక్కువగా వుంది. వ్యవసాయ కార్మిక కుటుంబాలలో, ఈడెన్ కాలంలో వున్న కనీస సౌకర్యాలు కూడా, 1814 సంవత్సరం వచ్చే నాటికి పూర్తిగా మృగ్యమై పోయాయని ఈ పరిస్థితుల ద్వారా స్పష్టమవుతుంది.[3] అప్పటి నుండి రైతు దగ్గర వుండే సమస్త పశుగణంలోనూ అణచివేతకు గురై

1. బార్టన్; అదే గ్రంథం; పు. 26. 18వ శతాబ్దపు చివరి దశకు సంబంధించిన సమాచారం కోసం ఈడెన్ గ్రంథాన్ని చూడాలి.
2. పారీ, అదే గ్రంథం; పు. 80.
3. పై గ్రంథమే; పు. 213.

నికృష్టమైన పోషణతో పశుతుల్యంగా పరిగణించబడుతున్నవాడు కార్మికుడు; అతను మాట్లాడే పరికరం.

"ఇంగ్లాండ్‌లోని కార్ఖానా రంగంలో వలె, వ్యవసాయ రంగంలో కూడా కుతకుతలాడే తిరుగుబాటు తత్వం గల అసంతృప్తి, దైన్యస్థితి దహించుకుపోవడం, 1830వ సంవత్సరపు తిరుగుబాటు సందర్భంలో ధాన్యపు కుప్పల మంటల కాంతుల ద్వారా మనకు (పాలకవర్గాలకు) బోధపడే"[1] వరకూ ఈ పరిస్థితులు నిరాటంకంగా కొనసాగాయి. ఈ సందర్భంలో శాడ్లర్ కామన్స్ సభలో ప్రసంగిస్తూ, వ్యవసాయ కార్మికులను "తెల్ల బానిసలు"గా నామకరణం చేయగా, ప్రభువుల సభలో ఈ విశేషణాన్ని ఒక బిషప్ ఎలుగెత్తి చాటాడు. ఆ కాలంలో ప్రముఖ అర్థశాస్త్రవేత్త అయిన ఇ.జి. వేక్‌ఫీల్డ్ ఈ విధంగా అన్నాడు. "ఇంగ్లాండ్ దక్షిణ ప్రాంతపు రైతు స్వేచ్ఛా జీవికాదు; బానిస కూడా కాదు; అతనొక దరిద్రుడు."[2]

ధాన్యపు సట్టాలను రద్దు చేయడానికి కొద్ది కాలం క్రితమే వ్యవసాయ కార్మికుల జీవన స్థితిగతుల మీద నూతనాంశాలు బహిర్గతమయినాయి. ఒకవైపున మధ్యతరగతి ఆందోళనకారుల స్వప్రయోజనాల రీత్యా ధాన్యపు సట్టాలు ఎంత తక్కువగా నిజమైన ఉత్పత్తిదారులకు రక్షణ కల్పించాయో రుజువు చేయబడింది. మరోవైపున పారిశ్రామిక వ్యవస్థను తూలనాడుతూ కర్మాగార కార్మికుల శోకగ్రస్తమైన జీవితం పట్ల కపట సానుభూతిని ప్రదర్శిస్తూ "రాజకీయ చతురత"తో పారిశ్రామిక చట్టం యొక్క ఆవశ్యకతను వక్కాణించే నీతి బాహ్యమైన, హృదయరహితమైన, నాగరిక సోమరిపోతులైన భూస్వామ్య కులీన వర్గాల వైఖరి పట్ల పారిశ్రామిక బూర్జువా వర్గం అకారణ కోపోద్రేకంతో నురుగులు గక్కుతుంది. 'దొంగలు కొట్లాడునపుడే పెద్ద మనుషుల అసలు రంగు బహిర్గతమవుతుంద'నే ఇంగ్లీషు వారి సామెతలాగా కార్మికులను ఎవరు ఎక్కువ దోపిడీ చేశారనే సమస్యమీద పాలకవర్గంలోని రెండు ముఠాలు సిగ్గు లేకుండా వెర్రికోపంతో కయ్యానికి కాలు దువ్వుతున్న వ్యవహారమంతా నిజాన్ని బయటికి లాగడానికి మంత్రసానిలాగా పనిచేసింది. పారిశ్రామిక యజమానులకు వ్యతిరేకంగా భూస్వామ్య కులీన వర్గాలు చేసిన ఆందోళనకు ఆనాటి లార్డ్ యాష్లే, 'ఎరల్' బిరుదాంకితుడైన ఇప్పటి షాఫ్ట్స్‌బరీ ప్రభువు,సర్వ సైన్యాధిపత్యం వహించాడు. అందుచేతనే వ్యవసాయ కార్మికుల జీవన స్థితిగతులను వెలికి తీసిన "మార్నింగ్ క్రానికల్" పత్రికకు 1845లో ఈయనొక చర్చనీయాంశంగా తయారైనాడు. ఆ రోజుల్లో ఉదారవాద అభిప్రాయాలకు సాధనంగా వున్న ఈ పత్రిక, ప్రత్యేకమైన విలేకరులను వ్యవసాయ జిల్లాలకు పంపింది; ఈ విలేకర్లు కేవలం కార్మికుల స్థితిగతులను గణాంక సమాచారంతో సహా విశదీకరించడంతో సంతృప్తి చెందక, వారు పరిశీలించిన వ్యవసాయ కార్మిక కుటుంబాలనూ, వారి యజమానుల పేర్లతో సహా ప్రచురించారు. బ్లాన్‌ఫోర్ట్, విమ్‌బోర్న్, పూలె పరిసర గ్రామాల్లో వ్యవసాయ కార్మికులకు చెల్లించే వేతనాలను ఈ క్రింది పట్టిక ద్వారా[3] తెలుసుకోవచ్చు. ఈ గ్రామాలు శ్రీ జి.బేంక్స్, ఎరల్ ఆఫ్ షాఫ్ట్స్‌బరీల సొంత ఆస్తులుగా చలామణి అవుతున్నాయి. శ్రీబేంక్స్‌లాగే "లోచర్చి" మతాధికారి, ఇంగ్లీషు దైవభక్తులకు నాయకుడూ అయిన లార్డ్ షాఫ్ట్స్‌బరీ కూడా ఇలాంటి

1. యస్.లేయంగ్, అదే గ్రంథం, పు. 62.
2. "ఇంగ్లాండ్ అండ్ అమెరికా" లండన్, 1833; సంపుటి 1; పుట 47.
3. లండన్ ఎకనామిస్టు. 29 మార్చి. 1845; పుట 290.

అద్దెల రూపంలో, హీనస్థితిలో వున్న వ్యవసాయ కార్మికుల వేతనాలలో అధికభాగం జేబులో వేసుకుంటున్నాడని గుర్తుంచుకోవాలి.

**మొదటి గ్రామం**

| అ | ఆ | ఇ | ఈ | ఉ | ఊ | ఎ | ఏ |
|---|---|---|---|---|---|---|---|
| చిన్న పిల్లలు | కుటుంబ సభ్యుల సంఖ్య | వారంలో పురుషుల వేతనం షి. పె. | వారంలో చిన్నపిల్లల వేతనం షి. పె. | వారంలో మొత్తం కుటుంబ ఆదాయం షి. పె. | వారానికి అద్దె షి. పె. | అద్దె మిన హాయించగా వారంలో మిగిలిన వేతనం షి. పె. | వారంలో తలసరి ఆదాయం షి. పె. |
| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 | 8 |
| 2 | 4 | 8.0 | – | 8.0 | 2.0 | 6.0 | 1.6 |
| 3. | 5 | 8.0 | – | 8.0 | 1.6 | 6.6 | $1.3\frac{1}{2}$ |
| 2 | 4 | 8.0 | – | 8.0 | 1.0 | 7.0 | 1.9 |
| 2 | 4 | 8.0 | – | 8.0 | 1.0 | 7.0 | 1.9 |
| 6 | 8 | 7.0 | 1.0/1.6 | 10.6 | 2.0 | 8.6 | $1.0\frac{3}{4}$ |
| 3 | 5 | 7.0 | 1.0/2.0 | 7.0 | 1.4 | 5.8 | $1.1\frac{1}{2}$ |

**రెండవ గ్రామం**

| | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|
| 6 | 8 | 7.0 | 1.0/1.6 | 10.0 | 1.6 | 8.6 | $1.0\frac{3}{4}$ |
| 6 | 8 | 7.0 | 1.0/1.6 | 7.0 | 1.31/2 | 5.8 1/2 | $0.8\frac{1}{2}$ |
| 8 | 10 | 7.0 | – | 7.0 | 1.3 1/2 | 5.8 1/2 | 0.7 |
| 4 | 6 | 7.0 | – | 7.0 | 1.6 1/2 | 5.5 1/2 | 0.11 |
| 5 | 5 | 7.0 | – | 7.0 | 1.6 1/2 | 5.5 1/2 | 1.1 |

**మూడవ గ్రామం**

| | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|
| 4 | 6 | 7.0 | – | 7.0 | 1.0 | 6.0 | 1.0 |
| 3 | 5 | 7.0 | 1.0/2.0 | 11.6 | 0.10 | 10.8 | $2.1\frac{3}{5}$ |
| 0 | 2 | 5.0 | 1.0/2.6 | 5.0 | 1.0 | 4.0 | 2.0 |

ధాన్యపు సట్టాల రద్దు, వ్యవసాయ రంగానికి అద్భుతమైన ప్రేరణ కలుగజేసింది.[1] విస్తృత స్థాయిలో మురికికాలువల నిర్మాణం, పశు పెంపకంలో నూతన పద్ధతుల ననుసరించడం, కృత్రిమ పద్ధతుల ద్వారా ఆకుపచ్చ పైర్లను సాగు చేయడం, యాంత్రికీకరణ ద్వారా ఎరువుల వాడకాన్ని

1. తక్కువ వడ్డీ రేటుతో ప్రభుత్వ సొమ్మునే అడ్వాన్సు రూపంలో పార్లమెంట్ ద్వారా భూస్వామ్య కులీన వర్గాలు దీనికోసం కేటాయించాయి. ఈ సొమ్మునంతా అధికవడ్డీతో రైతులు తిరిగి చెల్లించాల్సి వుంటుంది.

ప్రవేశపెట్టడం, భూసార సంరక్షణలో నూతన పద్ధతులను ప్రవేశపెట్టడం, రసాయనిక ఎరువుల వాడకం పెరుగుదల, ఆవిరి యంత్రాన్ని వినియోగించడం తదితరమైన అన్నిరకాల యంత్రాలను వాడకంలోకి తీసుకురావడం ద్వారా సాంద్ర వ్యవసాయ కార్యక్రమాలను అమలు పరచడమే సాధారణంగా ఆ యుగం యొక్క ప్రత్యేక లక్షణంగా గోచరిస్తుంది. నూతన యంత్రాలను ప్రవేశపెట్టడం మూలంగా వ్యవసాయ ఖర్చులు (సాపేక్షకంగా) సుమారుగా సగానికి తగ్గిపోయాయని రాయల్ అగ్రికల్చరల్ సొసైటీ అధ్యక్షుడైన పూసె ప్రకటించాడు. మరో వైపున వ్యవసాయం నుండి వచ్చే ప్రతిఫలం త్వరితంగా పెరిగింది. ఎకరాకు వెచ్చించాల్సిన పెట్టుబడి పెరుగుదల పర్యవసానంగా భూకేంద్రీకరణ త్వరితం కావడం నూతన పద్ధతులకు ఆవశ్యకమైన షరతుగా వుంది.[1] అదే సమయంలో తూర్పుప్రాంతపు జిల్లాలోని "తొండలు గుడ్లు పెట్టే" బీడు భూములను అమోఘమైన వ్యవసాయ భూములుగా మార్పు చేయడం మూలంగా పెరిగిన విస్తీర్ణాన్ని పరిగణనలోకి తీసుకోకుండానే 1846 – 1856 మధ్య కాలంలో 4,64,119 ఎకరాల అదనపు భూమి సాగులోకి తీసుకు రాబడిందని చెప్పవచ్చు. గతంలో మనం పేర్కొన్నట్లుగా, అదే సమయంలో వ్యవసాయంలో వినియోగించబడిన కార్మికుల సంఖ్య పడిపోయింది. లింగభేదంతోనూ, వయస్సుతోనూ నిమిత్తం లేకుండా వ్యవసాయ కార్మికుల సంఖ్య 1851–61 మధ్యకాలంలో 12,41,396 నుండి 11,63,217కు పడిపోయింది.[2] ఇంగ్లండ్ జనాభా లెక్కల రిజిస్ట్రార్ జనరల్ స్పష్టంగా పేర్కొన్నట్లు "వ్యవసాయ ఉత్పత్తుల పెరుగుదలకూ 1801 తర్వాత రైతులూ... వ్యవసాయ కార్మికుల పెరుగుదలకూ మధ్య ఏవిధమైన పొంతనా లేదు"[3] అంతకు ముందు దశలో వ్యవసాయ ప్రజానీకం సంఖ్య తరుగుదలతో పాటుగా సాగుభూమి విస్తీర్ణత పెరుగుదలనీ, దాన్ని సాగుచేయడానికి అనుసరించిన సాంద్ర వ్యవసాయ పద్ధతుల పెరుగు దలనీ, కనీవినీ ఎరుగని రీతిలో సంచయించిన పెట్టుబడిని సాగు నిమిత్తం భూముల మీద వెచ్చించడాన్నీ, ఇంగ్లండ్ వ్యవసాయ రంగ చరిత్రలోనే ఎన్నడూ పోలిక లేని విధంగా వ్యవసాయ ఉత్పత్తుల పెరుగుదలనూ, భూస్వాములకు లభించే కౌళ్ళ జాబితాలు సమృద్ధి కావడాన్నీ, పెట్టుబడిదారీ రైతుల సిరిసంపదల పెరుగుదలనూ మనం గమనించినట్లయితే ఈ పొంతన లేనితనం ఇంకా స్పష్టమవుతుంది. ఈ అంశాలన్నింటితో పాటుగా అతి త్వరితగతిన అవిచ్ఛిన్నంగా విస్తృతమయ్యే మార్కెటునూ, అనగా పట్టణాల పెరుగుదలనూ, స్వేచ్ఛావ్యాపార ఆధిపత్యాన్నీ మనం పరిగణనలోకి తీసుకున్నప్పుడు వ్యవసాయ

---

1. మధ్య తరగతి రైతుల క్షీణతను ప్రత్యేకించి జనాభా లెక్కల వర్గీకరణలో గమనించవచ్చు. "రైతు కుమారుడు, మనవడు, సోదరుడు, మేనల్లుడు, కుమార్తె, మనవరాలు, సోదరి, మేనకోడలు" ఒక్కమాటలో చెప్పాలంటే వీరంతా భూస్వాముల దగ్గర పనిచేస్తున్న రైతు కుటుంబ సభ్యులు. ఈ తరగతికి చెందిన వ్యక్తుల సంఖ్య 1851లో 216, 851 కాగా, 1861లో 176, 151 మాత్రమే; 1851 - 71 మధ్యకాలంలో 20 ఎకరాల లోపు నున్న కమతాలలో 900 కమతాలు క్షీణించాయి. 50-75 ఎకరాలు మధ్యగల కమతాలు 8253 నుండి 6370కి క్షీణించాయి; 100 ఎకరాల లోపు గల కమతాలన్నింటికీ ఇదే గతి పట్టింది. ఇదే 20 సంవత్సరాల కాలంలో మరో వైపున పెద్ద కమతాల సంఖ్య పెరిగింది. 300-500 ఎకరాల మధ్య గల కమతాలు 7771 నుండి 8410 కి పెరిగాయి; 500 ఎకరాలకు మించిన కమతాలు 2755 నుండి 3914కు పెరిగాయి; 1000 ఎకరాలకు మించిన కమతాలు 492 నుండి 582కు పెరిగాయి.
2. గొర్రెల కాపర్ల సంఖ్య 12517 నుండి 25559కి పెరిగింది.
3. "జనాభా లెక్కలు" అదే గ్రంథం; పుట 36.

కార్మికుడు అనుభవించిన అష్టకష్టాల్లో మార్పు వచ్చి చివరకు సాంప్రదాయిక నియమాల ననుసరించి ఆనందాతిశయంతో ముంచెత్తబడతాడనడంలో ఎట్టి సందేహమూ లేదని భావించవచ్చు!

అయితే 14వ శతాబ్దపు పూర్వార్ధంలోనూ, 15వ శతాబ్దంలోనూ జీవించిన అతని పూర్వీకులతో పొంతన లేనప్పటికీ, 1771–90 మధ్యకాలంలో అతని పూర్వీకులతో పోల్చినట్లయితే, ప్రస్తుత వ్యవసాయ కార్మికుడి స్థితి ఇంకా ఎక్కువగా దిగజారిపోయిందనీ, 'రైతు తిరిగి అర్ధ బానిస అయ్యాడ'నీ ఆ అర్ధ బానిస తిండి, బట్టలేని నికృష్ట జీవితాన్ని గడుపుతున్నాడనీ ప్రొఫెసర్ రోజెర్స్ నిర్ధారణకు వచ్చాడు.[1] వ్యవసాయ కార్మికుల నివాసాలకు సంబంధించి యిచ్చిన చరిత్రాత్మకమైన నివేదికలో డాక్టర్ జూలియన్ హంటర్ యిలా అంటాడు. "పాలేరు" (అర్ధబానిస కాలం నుండి వ్యవసాయ కార్మికుడికి వారసత్వంగా వచ్చిన పేరు) "బతకడానికి అవసరమైన మేరకు సాధ్యమైనంత కనిష్ట పరిమాణం మాత్రమే అతని జీతంగా నిర్ణయించబడింది. అతనికిచ్చే జీతం, సమకూర్చే నివాసం, అతని నుండి పొందవలసిన లాభం ప్రాతిపదికగా లెక్కించబడదు. వ్యవసాయపు లెక్కల్లో అతనొక పెద్ద గుండుసున్నా[2] (జీవనాధార) సాధనాలు ఎప్పుడూ స్థిరపరిమాణంగానే వుంటాయని భావించబడింది.[3] అతని ఆదాయాన్ని 'ఏమాత్రం తగ్గించినా' నాకేమీ లేదు; దేనినీ నేను లెక్కచేయను అని అతను అనుకుంటాడు. జీవచ్ఛవంలాగా జీవించడానికి మాత్రమే అవకాశం వున్నందువల్ల భవిష్యత్తును గురించి ఏ విధమైన భయాందోళనలూ అతనికి లేవు! ఏ సున్నానుండయితే రైతు లెక్కలేసుకోవడం ప్రారంభించాడో అదే సున్నాకు వ్యవసాయ కార్మికుడు చేరాడు. ఏం జరిగినా అదృష్ట, దురదృష్టాలతో అతనికి నిమిత్తం లేదు."[4]

దేశాంతర వ్యాస శిక్షా, కఠిన కారాగార శిక్షా విధించబడిన నేరస్తుల పోషకాహారాలను గురించీ, శ్రమ స్థితిగతులను గురించీ 1863వ సంవత్సరంలో ప్రభుత్వ విచారణ జరిపింది. ఆ విచారణా ఫలితాలను రెండు పెద్ద సంపుటాలలో పొందుపరిచారు. మిగతా విషయాలతోపాటుగా ఈ క్రింది విషయాలు కూడా అందులో వున్నాయి. "ఇంగ్లాండ్ జైళ్ళల్లోని నేరస్తుల ఆహారంతో, పని గృహాల్లోని దరిద్రుల, పని దొరకని కార్మికుల ఆహారాన్ని సవిస్తరంగా పోల్చినప్పుడు ఈ రెండు వర్గాలకంటే జైళ్ళల్లో ఉన్న నేరస్తులే ఆహారాన్ని మెరుగైన రీతిలో పొందగలుగుతున్నారని చెప్పవచ్చు."[5] అదే సమయంలో "రోజువారీ సాధారణ శ్రామికుడు చేసే శ్రమలో అర్ధభాగం మాత్రమే కఠిన కారాగార శిక్షననుభవిస్తున్న సాధారణ నేరస్తుడు చేయవలసి వుంది."[6] కొన్ని విలక్షణమైన సాక్ష్యాలను చూడండి: ఎడింబర్గ్ జైలు

1. రోజర్స్, అదే గ్రంథం. పు. 693 మరియు పు. 10; రోజర్స్‌గారు ఉదారవాద సిద్ధాంతాల్లో నమ్మకంగలవాడు, కోబన్, బెలిట్‌లకు వ్యక్తిగతమైన స్నేహితుడు; అందువలన అతను గతకాల వైభవాన్ని పొగిడేవాడేమీ కాదు.
2. "పబ్లిక్ హెల్త్ సెవెంత్ రిపోర్ట్" 1865 పు. 242. అందువలన, కార్మికుడు కొంచెం ఎక్కువగా సంపాదిస్తున్నాడని భావించగానే కార్మికుడు చెల్లించాల్సిన ఇంటి అద్దె భూస్వామి పెంచడంలో అసాధారణమైందేమీ లేదు; లేక "కార్మికుడి భార్య క్కూడా పని దొరుకుతున్నందువల్ల" అతనికిచ్చే కూలిని కొద్దిగా తగ్గించడానికి రైతు ప్రయత్నించడంలో కూడా ఆశ్చర్యమేమీ లేదు.
3. పై గ్రంథమే. పు. 135.
4. పై గ్రంథమే పు. 134.
5. "రిపోర్ట్ ఆఫ్ ది కమిషనర్స్ ... రిలేటింగ్ టు ట్రాన్స్ పోర్టేషన్ అండ్ పీనల్ సర్విట్యూడ్". లండన్ 1863; పుట 42, 50.
6. పై గ్రంథమే. పు. 77, "మెమొరాండం బై ది లార్డ్ చీఫ్ జస్టిస్."

అధికారి అయిన జాన్‌స్మిత్ ఇచ్చిన సాక్ష్యం: నెం. 5056: "ఇంగ్లండులోని సాధారణ కార్మికుల ఆహారం కన్నా జైళ్ళల్లోని నేరస్తులు మంచి ఆహారం పొందుతున్నారు" నెం.50: "స్కాట్లండ్‌లోని సాధారణ వ్యవసాయ కార్మికులు చాలా అరుదుగా మాంసం పొందగలరనేది వాస్తవమే..." సమాధానం నెం.3047 "సాధారణ శ్రామికులకన్నా మంచి ఆహారాన్ని నేరస్తుల కివ్వాల్సిన ఆవశ్యకత మీకు ఏమైనా ఉన్నదేమో చెప్పగలరా? – లేదు" నెం. 3048; "రోజువారీ పనిచేసే స్వేచ్ఛా కార్మికుల ఆహారంతో సమానంగా, నేరస్తులుగా ఉండి ప్రభుత్వ పనుల్లో నిత్యమూ పాల్గొంటున్న నేరస్తుల ఆహార క్రమంలో మార్పులు తీసుకు రావడానికి ఏదైనా పరిశోధన చెయ్యాల్సిన అవసరం ఉందని మీరు ఆలోచిస్తున్నారా?"[1]... "అతను (వ్యవసాయ కార్మికుడు) ఇలా చెప్తాడు; "నేను ఎంత కష్టపడి పనిచేసినా తిండికి సరిపోవడం లేదు; జైల్లో ఉన్నప్పుడు ఎక్కువగా కష్టపడకపోయినా, కడుపు నిండా తిండి దొరికేది; అందువలన ఇక్కడ వుండే బదులు తిరిగి జైలుకు వెళ్ళడమే నాకు బాగుంటుంది."[2] నివేదికలోని మొదటి సంపుటానికి ఇచ్చిన అనుబంధం నుండి సంక్షిప్త రూపంలో ఈ క్రింది పట్టికను ఇస్తున్నాను.[3]

**వారంలో పొందే పోషకాహారం**

| | మాంసకృత్తుల పరిమాణం | మాంసకృత్తులు గాక ఇతరమైన పదార్థాల పరిమాణం | ఖనిజపదార్థాల పరిమాణం | మొత్తం |
|---|---|---|---|---|
| | ఔన్సులు | ఔన్సులు | ఔన్సులు | ఔన్సులు |
| 1. పోర్ట్‌లాండ్ (నేరస్తుడు) | 28.95 | 150.06 | 4.68 | 183.69 |
| 2. నావికుడు ............ | 29.63 | 152.91 | 4.52 | 187.06 |
| 3. సైనికుడు ............. | 25.55 | 114.49 | 3.94 | 143.98 |
| 4. పెట్టెలు తయారుచేసేవాడు | 24.53 | 162.06 | 4.23 | 190.82 |
| 5. అక్షరాలను కూర్చేకార్మికుడు | 21.24 | 100.83 | 3.12 | 125.19 |
| 6. వ్యవసాయ కార్మికుడు..... | 17.73 | 118.06 | 3.29 | 139.08 |

అర్ధాకలితో జీవిస్తున్న వర్గాల ఆహార వివరాలను దర్యాప్తు చెయ్యడానికి 1863లో ఏర్పర్చిన ఆరోగ్య విచారణా సంఘ నివేదిక ఫలితాలు పాఠకుడికి ఇంతకు ముందే తెలుసు. వ్యవసాయ కార్మిక వర్గంలోని ఎక్కువ కుటుంబాల ఆహారంలో "ఆకలి మూలంగా సంభవించే రోగాలను నివారించడానికి" అవసరమైన కనిష్ట ఆహారం కన్నా ఇంకా తక్కువ ఆహారాన్నే పొందుతున్నారన్న విషయం పాఠకుడికి గుర్తుండే వుంటుంది. ప్రత్యేకించి కారన్‌వాల్, డివాన్, సోమర్‌సెట్, విల్ట్స్, స్టాఫోర్డ్, బెర్క్స్, హెర్ట్స్‌లాంటి పూర్తి గ్రామీణ జిల్లాల్లో ఈ విధంగానే వుంటుంది. డాక్టర్ ఇ. స్మిత్ ఇలా అంటాడు. "పేద జిల్లాతో

1. "రిపోర్ట్ ఆఫ్ ది కమిషనర్స్ ... రిలేటింగ్ టు ట్రాన్స్ పోర్టేషన్ అండ్ పీనల్ సర్విట్యూడ్". సంపుటి రెండు, "మినిట్స్ ఆఫ్ యెవిడెన్స్"
2. పై గ్రంథమే, సంపుటి ఒకటి; అనుబంధం. పుట 280
3. పై గ్రంథమే. పు. 274, 275

సహా మిగతా ప్రాంతాలన్నింటిలో కూడా వ్యవసాయ కార్మిక కుటుంబాలలోని యితర సభ్యులందరికంటే అందుబాటులో వున్న మొత్తం మాంసం, పంది మాంసంతో సహా ఆహారంలో సగటుకన్నా ఎక్కువ భాగాన్ని కార్మికుడే పొందుతాడనేది... కార్మికుడు శ్రమ చేయవలసిన అవసరం వుందనే దానికి గుర్తింపు మాత్రమే... భార్య తీసుకునే ఆహారపరిమాణం, ప్రత్యేకించి పిల్లలూ, వారు పెరుగుతున్న దశలో తీసుకునే ఆహారం, దాదాపుగా అన్ని ప్రాంతాలలో తరుగ్గాను, ప్రత్యేకించి మాంసకృత్తులు లేని లోపం ఇంకా ఎక్కువగానూ వుంది.[1] రైతులతో పాటే జీవిస్తున్న స్త్రీ పురుష సేవకులు కొంతవరకు సరిపోయినంత ఆహారాన్ని పొందుతున్నారు. వీరి సంఖ్య 1851–61 మధ్యకాలంలో 2,88,277 నుండి, 2,04,962కు పడిపోయింది. డాక్టర్ స్మిత్ ఇలా అంటాడు. "స్త్రీలు పొలాల్లో పనిచేయడం, అందులో ఇబ్బందులు వున్నప్పటికీ, ప్రస్తుత పరిస్థితుల్లో కుటుంబానికి ఎంతో చేదోడువాదుడోగా వుంటుంది; ఆ ఆదాయంతో చెప్పులు, బట్టలు కొనుక్కోడానికేగాక, అద్దె చెల్లించడానికీ, కుటుంబంలో ఆహార పరిస్థితులను కొంత మెరుగుపరచుకోడానికీ ఉపయోగపడుతుంది"[2] యునైటెడ్ కింగ్‌డమ్‌లోని మిగిలిన ప్రాంతాలతో పోలిస్తే, ఇంగ్లాండులోని వ్యవసాయ కార్మికులు "అతి నికృష్టమైన ఆహారాన్ని పొందుతున్నారనే అంశాన్ని ఈ దర్యాప్తు ఫలితాలలో గమనించదగినదిగా పేర్కొనవచ్చు". ఈ క్రింద ఇవ్వబడిన పట్టికలో ఆ అంశం ద్యోతకమవుతుంది.

వ్యవసాయ రంగంలో వయోజనుడైన వ్యక్తి వారానికి సగటున వినియోగించుకునే పిండి పదార్థాలూ, మాంసకృత్తుల పరిమాణాలు :

| | | పిండి పదార్థాలు గ్రెయిన్స్ | మాంసకృత్తులు గ్రెయిన్స్ |
|---|---|---|---|
| 1. | ఇంగ్లాండ్ ........................ | 46,673 | 1594 |
| 2. | వేల్స్ ............................ | 49,354 | 2031 |
| 3. | స్కాట్‌లాండ్ .................... | 48,980 | 2348 |
| 4. | ఐర్లాండ్ ........................ | 43,366 | 2434[3] |

1. "పబ్లిక్ హెల్త్, సిక్స్, రిపోర్టు" 1864; పు. 238, 249, 261, 262.
2. పై గ్రంథమే. పు. 262.
3. పై గ్రంథం; పు. 17 : ఐర్లాండ్ వ్యవసాయ కార్మికులు పొందే పాలలో 1/4 వంతూ, రొట్టెలో 1/2 వంతులు మాత్రమే బ్రిటీష్ వ్యవసాయ కార్మికులు పొందదగలుగుతున్నారు. ఈ శతాబ్దం ప్రారంభదశలో ఆర్థర్ యంగ్ రచించిన "టూర్ ఇన్ ఐర్లాండ్" అనే గ్రంథంలో ఐర్లాండ్ కార్మికుల మెరుగైన జీవన స్థితిని గురించి ఉటంకించాడు. ధనికుడైన ఇంగ్లీషు భూస్వామి కన్నా, పోల్చడానికి కూడా వీలులేని విధంగా మానవత్వం కలిగి వున్న పేదవాడైన ఐర్లాండ్ రైతే దీనికి కారణంగా పేర్కొనవచ్చు. వేల్స్‌కు సంబంధించి నంతవరకు, దక్షిణ ప్రాంతంలోని పశ్చిమానికి మాత్రమే గ్రంథంలో చెప్పబడింది వర్తిస్తుంది. జనాభా భౌతిక స్థితిగతులలోని క్షీణత పర్యవసానంగా క్షయ వ్యాధీ, గండమాల జబ్బులు పెరుగుదలలోని తీవ్రత ఫలితంగా మరణాల రేట్లు పెరిగాయని అక్కడ పనిచేసే డాక్టర్లు అంతా అంగీకరిస్తారు. పైగా దీనికంతా పేదరికమే కారణమని భావిస్తారు. "అతన్ని (పొలంలో పనిచేసే పాలేర్ని) పోషించడానికి రోజుకి ఐదు పెన్నీలు వ్యయం అవుతుంది; అయితే అనేక ఇతర జిల్లాల్లో అతనికి (ఆ రైతు పేదవాడైనప్పటికీ) దీనికన్నా ఇంకా తక్కువ వ్యయం అవుతుందని భావిస్తున్నారు... నల్లకర్ర నాణ్యానికి పోల్చదగిన విధంగా వేపుడేసి ఉప్పులో ఉంచిన మాంసంగానీ లేక పందిమాంసం ఒక కబళం... దీన్ని అరాయించుకోడానికి

డాక్టర్ సైమన్ తన అధికారిక ఆరోగ్య నివేదికలో ఇలా అంటాడు. "వ్యవసాయ కార్మికులకు సాధారణంగా అల్ప పరిమాణంలో సమకూర్చబడిన నికృష్టమైన వసతి సౌకర్యానికి డా॥ హంటర్ నివేదికలోని ప్రతిపూటా సాక్ష్యంగా నిలబడుతుంది. ఈ విషయంలో గత కొన్ని సంవత్సరాలుగా వ్యవసాయ కార్మికుల స్థితి క్రమంగా క్షీణిస్తుంది; ఇప్పుడు ఆ నివాసాన్ని కూడా సంపాదించుకోవడం

---

చేసే శ్రమ భరిత ప్రక్రియ కూడా బహుశా నిరర్థకమవుతుంది.... దీనితో పాటుగా ఒక పళ్లెం నిండా మాంసం చారుగానీ లేక గంజిగానీ, కొద్దిగా దుంపలుగానీ, కలిపి ప్రతినిత్యం పాలేరుకు ఆహారంగా ఇస్తారు" గడ్డు పరిస్థితులతో పాటుగా మంచు వాతావరణాన్నుండి తప్పించుకోడానికి పారిశ్రామికాభివృద్ధి ఫలితంగా" ఇండ్లలో నేసిన వస్త్రానికి బదులుగా చౌకైన నూలు వస్త్రాలనూ 'టీ'కి బదులుగా, మేలైన పానీయాలనూ వాడటానికి అవకాశం ఏర్పడింది. చలిగాల్లో, వర్షంలో అనేక గంటలు పనిచేసిన తర్వాత, వ్యవసాయదారుడు తలదాచుకోడానికి తన గుడిసెలో బొగ్గు పొయ్యి ముందో లేక గడ్డి మంట ముందో కూర్చొని చలి కాచుకుంటాడు; అదే సమయంలో చెప్పలేనంత బొగ్గుపులుసు వాయువుతో నిండిన పొగతో మగ్గిపోతూ వుంటాడు. ఆ గుడిసె గోడలు మట్టితోనూ, రాళ్ళతోనూ నిర్మాణం చేసి వుంటాయి; ఏవిధమైన మెరుగులు లేకుండా గుడిసె నిర్మాణానికి ముందు అందులో నేల ఏ విధంగా వుంటుందో ఇప్పుడు అదే విధంగా, వుంటుంది; గుడిసె పైభాగం పల్చగా వేసిన పూరికప్పుతో తడిసి వుంటుంది. గుడిసెకప్పు మీద వున్న ప్రతి కంత చలి నుండి తప్పించుకోడానికి ఏదో ఒక రకంగా మూసివేయబడి వుంటుంది; ఫలితంగా భరింపశక్యం గాని దుర్వాసనా, దీనికి తోడు మట్టినేల; చల్లబడిన దుస్తులతో గుక్కెడు తాగి, పాలేరు తన భార్యా పిల్లలతో ఆ గుడిసెలో జీవిస్తున్నాడు. ప్రసూతి వైద్యులు ఆ గుడిసెల్లో రాత్రిళ్ళు గడపాల్సి వచ్చినపుడు, గాలి సోకని వాతావరణంలో, చిత్తడి నేల మీద ఏ విధంగా గడిపిందీ చెప్తుంటారు; గాలి కోసం ఆ గుడిసెల గోడలకి కన్నాలు వేసుకోవలసిన స్థితికి నెట్ట బడ్డామని అంటుండేవారు. వివిధ తరగతుల జీవన విధానానికి సంబంధించిన వారిలో అనేక మంది దీనికి సాక్ష్యంగా నిలబడతారు; ఈ విధమైన అపరిశుభ్ర వాతావరణంలో పోషణ లేకుండా రేయింబవళ్ళూ నికృష్ట జీవితాన్ని గడుపుతున్న రైతు క్షయ వ్యాధీ, గండమాల జబ్బుల వాతబడి మరణావస్థలో ఉన్నాడని చెప్పడానికి మరే సాక్ష్యాధారాలు అవసరం లేదు.... కార్ మార్తన్ షైర్, కార్టిగాన్ షైర్‌లకు సంబంధించిన రిలీవింగ్ ఆఫీసర్స్ ఇచ్చిన నివేదికల్లో ఈ విషయాలు అతి నగ్నంగా బహిర్గతమవుతాయి. దీనికి తోడు "భయంకరమైన ప్లేగు వ్యాధితో బాధపడుతున్న అనేక మంది జనాన్ని చూస్తాం". వాతావరణ పరిస్థితులను గురించి ఇక్కడ ఒక్కమాట చెప్పాలి. "తీవ్రమైన దక్షిణ - పశ్చిమ వాయు పవనాల మూలంగా సంవత్సరంలో 8 లేక 9 నెలల పాటు ప్రధానంగా ఈ ప్రాంతంలోని పశ్చిమ కొండల మీద కుంభవృష్టిగా వర్షం పడుతుంది. రక్షణ కల్పించిన ప్రాంతాల్లో తప్ప ఏ మాత్రం చెట్లు కూడా వుండవు. రక్షణ లేనిచోట నానాభీభత్సంగా, చెట్లు విరగబడి వుంటాయి. ఫలితంగా గుడిసెలన్నీ అగాధానికి అణిగిపోయినట్లుగా తయారవుతాయి; పచ్చిక బయళ్ళల్లో గొర్రెలూ, సన్నకారు జంతువులూ అక్కడక్కడా కనిపిస్తాయి... తూర్పు ప్రాంతంలోని గని పరిశ్రమ జిల్లాలైన గ్లామోర్గాన్, మోన్ మౌత్‌కు యువకులంతా వలస పోతారు. గనుల్లో పనిచేసే జనాభాకు కార్‌మార్తన్ షైర్ నిలయమే గాక దానికి ఆసుపత్రి కూడా. అందువలన అక్కడ జనాభా ఎప్పుడూ నిలకడగా వుండదు" ఇదే విధంగా కార్టిగాన్ షైర్‌లో -

| | 1851 | 1861 |
|---|---|---|
| పురుషుల సంఖ్య........................ | 45,155 | 44,446 |
| స్త్రీల సంఖ్య ............................ | 52,459 | 52,955 |
| | 97,614 | 97,401 |

(డా॥ హంటర్ రిపోర్ట్; పబ్లిక్ హెల్త్, సెవెంత్ రిపోర్ట్. 1864 లండన్, 1865,పు. 498 - 502 పాస్సీమ్)

చాలా కష్టంగా వుంది; ఒకవేళ దొరికినా అది ఏమాత్రం అతని అవసరాలకు సరిపోదు; బహుశా కొన్ని శతాబ్దాల తరబడి ఈ పరిస్థితే కొనసాగుతుంది; ప్రత్యేకించి, గత ఇరవై లేక ముప్పై సంవత్సరాలుగా ఈ దురవస్థ ఇంకా వేగంగా పెరిగిపోతోంది; కార్మికుల నివాస పరిస్థితులు, ప్రస్తుతం తీవ్రస్థాయిలో గర్హించదగినవిగా వున్నాయి. వీరి శ్రమ మూలంగా సంపన్నులవుతున్న వారిలో కొద్ది మంది కారుణ్య బుద్ధితో చూపే ఔదార్యంతో సంతృప్తి చెందడం తప్ప, ఈ విషయంలో అతను ఏమీ చెయ్యలేని స్థితిలో పడ్డాడు. అతను శ్రమచేసే పొలంలోనే అతనికి గుడిసె దొరుకుతుందా లేదా ఆ గుడిసె మానవ నివాస యోగ్యంగా వుందా లేక పందులు పొర్లాడే బురద గుంటగా వుందా; అతని పేదరికాన్ని తగ్గించడానికి ఎంతో దోహదపడే పెరడు కొద్దిగానైనా వుందా లేదా అనే అంశాలన్నీ కూడా. అతని అవసరానికి అనుగుణ్యంగా దొరికే నివాసానికి అద్దె చెల్లించే శక్తి సామర్థ్యాల మీద ఆధారపడి వుండదు సరికదా; అది 'ఆ యజమానుల ఇష్టానుసారం' ఉపయోగించుకోడానికి వుండే పరిస్థితులను బట్టి వుంటుంది. ఆ కమతం ఎంత పెద్దదైనప్పటికీ, అందులో కార్మికుల నివాసానికి అవసరమైన గుడిసెలు (అవి శుభ్రంగా లేనప్పటికీ) ఏ నిష్పత్తిలో వుండాలనే దానికి ఏ విధమైన శాసనం లేదు; అతని శ్రమ, ఎండా వానల్లాగా, అత్యంత ఆవశ్యకమనే శాసనబద్ధమైన హక్కును ఏ శ్రామికుడికీ, ఏ సందర్భంలోనూ, ఏ చట్టమూ ప్రసాదించలేదు. నివాసానికీ, జీవితానికీ సంబంధించిన పేదల చట్టంలోని అంశాల ప్రభావం ఎక్కువగా వుంది... అతనికి వ్యతిరేకంగా బాహ్యాంశాలే ఎక్కువగా పనిచేస్తున్నాయి...[1] దీని ప్రభావ ఫలితంగా ప్రతి పారిష్ (Parish) కూడా ఆ ప్రాంతంలో నివాసముంటున్న కార్మికుల సంఖ్యను తగ్గించడంలో ప్రత్యేకమైన ఆసక్తిని కలిగి వుంటుంది. కష్టపడి పనిచేసే కార్మిక కుటుంబాలకు రక్షణ కల్పించే శాశ్వతమైన స్వతంత్రం కావాలనుకునే ఉద్దేశానికి బదులుగా, నిరుత్సాహపూరితమైనప్పటికీ, ఎక్కువ దూరమైనా లేక తక్కువ దూరమైనా అంతిమ దారిద్ర్యానికి మెరుగైన మార్గాన్ని వ్యవసాయ కార్మికుడు అన్వేషిస్తాడు. మొత్తం కాలగమనంలో, రోగగ్రస్తమైనా లేక తాత్కాలికంగా పని దొరక్కపోయినా, ఈ కటిక దారిద్ర్యం వ్యవసాయ కార్మికుడ్ని వెంటనే పాక్షికమైన భిక్షాటనకు నెట్టివేస్తుంది. ఆ విధంగా ఒక పారిష్‌లో జీవించే వ్యవసాయ జనాభా పొందే తక్కువ కూలితో పాటుగా ఈ నివాసాలు వారి జీవన స్థితిగతులకు నగ్న దృశ్యాలు... పెద్ద భూకామందులు[2] వారి సంస్థానాల్లో కార్మికుల గుడిసెలకు అవకాశాన్ని కలిగించకుండా నిర్ణయం తీసుకుంటే, అప్పటినుండి వారి సంస్థానాల్లో పని చేస్తున్న కార్మికుల ఎడల వున్న బాధ్యత సగానికి తగ్గిపోతుంది. ఇంగ్లాండ్ రాజ్యాంగంలోనూ శాసనాల్లోనూ భూస్వాములు ఏ మేరకు ఆస్తిని నిరాటంకంగా సంపాదించవచ్చో, భూస్వామి 'తన ఇష్టానుసారం' సాగుదార్లను ఏ మేరకు పరాయివారిగా పరిగణించవచ్చో, వారిని తన సంస్థానాల నుండి ఏ మేరకు వెళ్ళగొట్టవచ్చునోలాంటి ప్రశ్నలను నేను ఇక్కడ చర్చించదల్చుకోలేదు... భూముల నుండి బేదఖలు

1. 1865లో ఈ చట్టానికి కొంత మెరుగులు దిద్దారు. అయితే ఈ విధమైన అతుకుల బొంత మూలంగా ఏ ప్రయోజనమూ చేకూరదని అనతికాలంలోనే గ్రహించగలరు.
2. దీన్ని అవగాహన చేసుకోవాలంటే, ఒకరూ లేక ఇద్దరు భూస్వాముల ఆధిపత్యంలో గల గ్రామాలను పెత్తందారీ గ్రామాలనీ (క్లోజ్‌డ్ విలేజెస్), అనేకమంది సన్నకారు రైతుల ఆధిపత్యంలో గల గ్రామాలను సన్నకారు గ్రామాలనీ (ఓపెన్ విలేజెస్) మనం జ్ఞాపకం వుంచుకోవాలి. ఈ సన్నకారు గ్రామాల్లోనే గుడిసెలను నిర్మించే సట్టా వ్యాపారులు గుడిసెలనూ, వసతి గృహాలనూ నిర్మాణం చేస్తారు.

చేయించే అధికారం సిద్ధాంతంలో మాత్రమే కాదు; ఆచరణలో కూడా ఎక్కువ స్థాయిలోనే వుంది – వ్యవసాయ కార్మికుల నివాస నిబంధనల్లో కూడా ఒక ప్రధానమైన షరతుగా వుంది... ఈ దుర్మార్గం ఏ మేరకు వ్యాపించిందో తెలియజేయడానికి, గత జనాభా లెక్కల నుండి డా॥ హంటర్ సేకరించిన సాక్ష్యాన్ని పేర్కొంటే సరిపోతుంది; గత పది సంవత్సరాలలో, గుడిసెలకుండే స్థానిక గిరాకీతో నిమిత్తం లేకుండా, వాటిని కూలగొట్టే కార్యక్రమం, ఇంగ్లాండ్‌లోని 821 పట్టణాల్లోనూ లేక ప్రత్యేకమైన గ్రామీణ ప్రాంతాలలోనూ నిర్విఘ్నంగా నెరవేర్చబడుతూనే వుంది. తత్ఫలితంగా ఖాళీ చేయించబడిన వ్యక్తులతో నిమిత్తం లేకుండా, (ఆయా ప్రాంతాలలో పనిచేసే వారితో) 1851తో పోల్చితే 1861లో ఈ పట్టణాలు $5\frac{1}{3}$ శాతం అదనపు జనాభాను, $4\frac{1}{2}$ శాతం తక్కువగావున్న ఇళ్ళల్లోకి ఆకర్షించాయి. జనాభాను తగ్గించే ఈ ప్రక్రియ పూర్తి అయ్యే నాటికి, డా॥ హంటర్ చెప్పినట్లుగా, గుడిసెల సంఖ్య తగ్గిపోయి, గొర్రెల కాపర్లుగానో, తోటమాలీలుగానో లేక పశువుల కాపర్లుగానో జీవితాన్ని గడుపుతున్న వారితో, ఆ గ్రామాలు నామమాత్రపు గ్రామాలుగా (షో విలేజెస్) మారిపోయాయి.[1] అయితే భూమిని సాగు చేయవలసిన అగత్యం రీత్యా, భూమి మీద నియోగించబడిన వారు ఆ యజమానికి కౌలుదార్లు కాదు; ఆ పక్కనే బహుశా మూడు మైళ్ళ దూరంలో వుండే సన్నకారు యజమానుల గ్రామాల నుండి (ఓపెన్ విలేజెస్) వచ్చిన కార్మికులే వారు. అంతకుముందు, ఆ చుట్టుప్రక్కల వున్న పెత్తందారీ గ్రామాల్లో (క్లోజుడ్ విలేజెస్) జీవిస్తూ, అక్కడున్న గుడిసెలను కూలగొట్టడంతో, అక్కడ నుండి వీరంతా సన్నకారు గ్రామాలకు తరలివెళ్ళినపుడు అక్కడుండే చిన్న చిన్న భూ యజమానులంతా వీరికి ఆశ్రయమిచ్చారు. పూర్తిగా నాశనం కాకుండా, నికృష్ట స్థితిలో వున్న గుడిసెలు ఈ పరిస్థితులన్నింటికీ సాక్ష్యాధారాలుగా నిలబడ్డాయి. సహజంగా, తరతమ స్థాయిల్లో వినాశనం గావడానికి సిద్ధంగా వున్నాయి. ఆ గుడిసెలు తలదాచుకోడానికి గత్యంతరం లేని స్థితిలో కార్మికుడు దానిని అద్దెకు తీసుకోడానికి అవకాశం ఇస్తారు; మేలు రకం గుడిసెలు దొరకడానికి అవకాశమున్నపుడు కూడా కార్మికుడు ఈ గుడిసెలనే అద్దెకు తీసుకునే స్థితికి నెట్టబడతాడు. ఆ గుడిసెలను ఏమాత్రం సరిచేయడానికి ప్రయత్నాలు జరక్కపోగా, ఆ దౌర్భాగ్యులే అడపాదడపా ఈ కార్యక్రమాలను చేపడతారు. చివరకు అది మానవులు జీవించడానికి అర్హతను కోల్పోయినపుడు, కనీసం అర్థబానిస జీవించడానికి అవసరమైన అర్హతను కూడా కోల్పోయినపుడు, దానిని కూలగొడ్తారు; భవిష్యత్తులో పేదలకు చెల్లించే కూలి ఆ మేరకు తగ్గిపోతుంది. తమ భూముల మీద వ్యవసాయం చేసే జనాభాను తగ్గించడం ద్వారా, భూస్వాములు,

1. ఈ రకమైన నామమాత్రపు గ్రామాలు (షో విలేజెస్) చూడటానికి చాలా అందంగా కనిపిస్తాయి; అయితే క్రిమియాకు ప్రయాణించే సందర్భంలో రెండవ కాథరిన్ చూసిన గ్రామాలు ఎంత అవాస్తవికమో, ఈ గ్రామాలు కూడా అంతే అవాస్తవికంగా వుంటాయి. ఈ మధ్యకాలంలో ఈ గ్రామాల్లో ప్రవేశించకుండా గొర్రెల కాపర్లను సహితం తరచుగా బహిష్కరిస్తున్నారు. ఉదాహరణకు హర్‌బరో మార్కెట్ దగ్గర "500 ఎకరాల్లో ఉన్న ఒక గొర్రెల దొడ్డిలో ఒక పాలేరును నియమించారు. ఇంత పెద్ద దొడ్డిని నిర్వహించడం లోనూ, లీస్టర్. నార్త్ యామ్‌టన్‌లలో వున్న అందమైన పచ్చిక బయళ్ళను కాపాడడంలోనూ ఉన్న శ్రమను తగ్గించడానికి, ఆ పొలంలోనే గొర్రెల కాపర్లకోసం గుడిసెలను నిర్మించి, వారికి కేటాయించేవారు. ఇప్పుడు వారానికి షిల్లింగులో 13వ వంతు గొర్రెల కాపరి వసతి కోసం ఇస్తారు. దానితో అతను బహుదూరంలో ఉన్న సన్నకారు గ్రామంలో వసతి ఏర్పాటు చేసుకోవాలి".

పేదలకు చెల్లించాల్సిన కనీస కూలిని చెల్లించాల్సిన బాధ్యత నుండి తప్పుకోవడం మూలంగా బేదఖలు చేయబడిన ఆ పేద ప్రజలు సమీపంలో వున్న పెత్తందారీ గ్రామాలకు వెళ్ళారు. సమీపంలో అంటే నా ఉద్దేశ్యంలో కార్మికుడు నిత్యం చాకిరీ చేసే పొలం నుండి మూడు లేక నాలుగు మైళ్ళ దూరం అని అర్థం. కార్మికుడు తన దినబత్యం కోసం రోజువారీ చాకిరితో పాటుగా, ఆరు లేక ఎనిమిది మైళ్ళ నడిచిపోవాలి. అతని భార్యా పిల్లలు కూడా ఏదైనా చాకిరీ చేస్తే అదే విధంగానే పనికిలోకి వెళ్ళాలి. ఇంత దూరం నడవడానికి మాత్రమే అతని శ్రమ పరిమితం కాదు. సన్నకారు గ్రామాల్లో గుడిసెల సట్టా వ్యాపారస్తులు, ఇళ్ళ స్థలాలను కొనుగోలు చేసి అతి చౌకగా, సాధ్యమైనంత క్రిక్కిరిసి వుండే విధంగా పాకలను నిర్మిస్తారు. ఈ విధంగా నిర్మాణం చెయ్యబడిన నికృష్టమైన పాకల్లో ((గ్రామీణ ప్రాంతాలో బహిరంగ ప్రదేశాలలో గుడిసెలలో నిర్మాణం చేసినప్పటికీ, పట్టణ ప్రాంతాలలో వుండే నికృష్ట లక్షణాలన్నీ వాటిల్లో వుంటాయి). ఇంగ్లండ్ దేశపు వ్యవసాయ కార్మికులు కిక్కిరిసిన జీవితాలను గడుపుతున్నారు.[1] కార్మికుడు తాను పనిచేసే పొలంలో వున్న గుడిసెలోనే జీవిస్తున్నాడని ఊహించినప్పటికీ సాధారణంగా అతని నివాస పరిస్థితులు అతని శ్రమ భరితమైన జీవితాన్ననుసరించే ఉంటాయి. మహారాజు సంస్థానాలలో సహితం అతను నివసించే గుడిసెలు నికృష్టంగానే వుంటాయి. కార్మికుడికీ అతని కుటుంబానికీ పందులదొడ్డిలాంటి గుడిసె అయినా చక్కగా సరిపోతుందని భావించే భూస్వాము లున్నారు; అయినప్పటికీ పందులదొడ్డిలాంటి గుడిసె అయినా చక్కగా సరిపోతుందని భావించే

---

1. "సన్నకారు గ్రామాల్లో ఎల్లప్పుడు (కిక్కిరిసి వుండే) కార్మికుల గుడిసెలు సాధారణంగా ఒక దాని పక్కన మరొకటి చొప్పున ఒక వరుసలో నిర్మాణం చేయబడి వుంటాయి. ఆ గుడిసెల వెనుక భాగాలు, వాటిని నిర్మాణం చేసే యజమాని స్థలం సరిహద్దు వరకు వుంటాయి. అందువలన వెనుకవైపునుండి గాలి, వెలుతురు సోకడానికి అవకాశం లేకుండా కేవలం ముందువైపు నుండే ఆ అవకాశాన్ని కలిగిస్తారు" డా. హంటర్ నివేదిక; (అదే గ్రంథం; పు. 135) ఆ గ్రామంలో బీరు అమ్మే వ్యాపారి గానీ లేక చిల్లర వర్తకుడు గానీ ఆ గుడిసెలను అద్దెకిస్తాడు. దీని మూలంగా వ్యవసాయ కార్మికుడికి రెండవ యజమాని తయారవుతాడు; ఈ వ్యాపారికి వ్యవసాయ కార్మికుడు ఖాతాదారే గాక, కౌలుదారు కూడా. "పాలేరుకు కూలి రూపంలో వారానికి వచ్చే 10 షిల్లింగులలో సంవత్సరానికి 4 పౌండ్లు అద్దె చెల్లించడంతో పాటు.... సరుకు అమ్మే వ్యాపారి షరతుల ననుసరించి కొద్దిగా టీ, పంచదార, సబ్బులు, కొవ్వొత్తులూ, బీరు వగైరాలను ఆ పాలేరు కొనుగోలు చేయవలసి వుంటుంది" (పై గ్రంథం. పు. 132) ఇంగ్లీషు వ్యవసాయ కార్మికులకు ఈ సన్నకారు గ్రామాలే "శాపగ్రస్తమైన నివాసాలుగా" రూపొందుతాయి. వాస్తవానికి ఇక్కడ ఉండే గుడిసెలన్నీ ఆ ప్రాంతంలోని అలగాజనం అడపాదడపా ఉపయోగించుకునే తాత్కాలికమైన నివాసాల్లాగా మాత్రమే వుంటాయి. అత్యంత నికృష్టమైన పరిస్థితుల్లో సహితం, పని చేసే శక్తినీ, వ్యక్తిత్వ విశిష్టతనూ, తన కుటుంబాన్ని ఆశ్చర్యకరంగా కాపాడుకోగలిగిన ఈ పల్లెటూరి వ్యవసాయ కార్మికుడు, ఇప్పుడు ఈ "లాడ్జింగ్" గుడిసెల మూలంగా హీన స్థితికి దిగజారాడు. గుడిసెలను నిర్మించే చట్టా వ్యాపారులనూ, సన్నకారు భూస్వాములనూ, సన్నకారు గ్రామాలనూ చూసి మోసపూరితంగా భుజాలు ఎగరేయడం - కులీన వర్గాల "షైలాకుల"కు పరిపాటే. వారి "పెత్తందారీ గ్రామాలు" నామమాత్ర గ్రామాలు" సన్నకారు గ్రామాలకు జన్మస్థలాలనీ అవి లేకుండా ఈ గ్రామాలు మనలేవనే విషయం వారికి బాగా తెలుసు. "సన్నకారు రైతులు పట్టించుకోక పోయినట్లయితే, ఈ కార్మికులందరికీ వారు పనిచేసే పొలాల్లో ఉన్న చెట్ల నీడే గతి అయి వుండేది." (పై గ్రంథమే. పు. 133) ఇంగ్లాండ్ తూర్పు ప్రాంతంలోని మిడ్‌లాండ్ మండలాల్లో ఈ రకమైన "పెత్తందారీ" "సన్నకారు" గ్రామాల వ్యవస్థ కొనసాగుతుంది.

భూస్వాములున్నారు; అయినప్పటికీ అద్దెకోసం సాధ్యమైనంత కఠినంగా బేరమాడటానికి ఏ మాత్రం వెనుదీయరు.[1] చలికాచుకోడానికి కుంపటి లేకుండా, పాయఖానాలు లేకుండా, కిటికీలు లేకుండా, నీటి సరఫరా లేకుండా దానికి మారుగా చిన్న బురదగుంటతో, పెరడు లేకుండా శిథిలావస్థలో వున్న ఒకే గది గుడిసె కావచ్చు - అయినప్పటికీ ఈ దుర్మార్గం ముందు కార్మికుడు నిస్సహాయుడే.... అపరిశుభ్రతను తొలగించడానికి చేసిన శాసనాలు వీటి ముందు ఎందుకు కొరగానివిగా మిగిలిపోయాయి. గుడిసెల యజమానుల పైనే ఆధారపడి ఈ శాసనాలు అమలు పరుచబడతాయి... ఇంగ్లండు నాగరికతకు తలవంపులు తెచ్చే ఈ వాస్తవాలను అత్యధిక స్థాయిలో సమీకరించడం సామాజిక న్యాయం రీత్యా అత్యంత ఆవశ్యకం... ప్రస్తుత నివాసాల స్థితి అత్యంత దుఃఖభాజ్యమైన దయినప్పటికీ, వాటి సర్వవ్యాపితమైన నికృష్టత అపరిమితమైన హానిని కలిగిస్తుంది. సంవత్సరాల తరబడి గ్రామీణ కార్మికులు కిక్కిరిసి జీవిస్తున్న నివాసాల యొక్క ఆరోగ్య సౌకర్యాలను గురించి ఆలోచించే వారికే గాక, నైతిక జీవనం మీద ఆసక్తి కలిగిన వారికి కూడా ఈ గుడిసెల పరిస్థితులు తీవ్ర మనస్తాపాన్ని కలిగిస్తున్నాయి. గ్రామీణ ప్రాంతాలలో ముంచుకొచ్చే అంటువ్యాధులను గురించి నిరంతరం ఒకే రకమైన పదజాలంతో ఊకదంపుడు ఉపన్యాసాలిచ్చే వారు కూడా, కిక్కిరిసిన నివాసాలకు ప్రాధాన్యతనిస్తూ వాటి మూలంగా సంభవించే అంటురోగాలను నివారించడానికి అవకాశాలు మృగ్యమవుతున్నాయని గొణుగుతున్నారు. గ్రామీణ జీవితంలో వున్న ఆరోగ్యకర లక్షణాలను పక్కన పెట్టి, కిక్కిరిసిన పర్యవసానంగా అంటురోగాలు సంభవించడమే గాక, అంటురోగాలు కాని పలువిధాలైన ఇతర రోగాలకు కూడా ఈ కిక్కిరిసిన జీవితం మూలాధారమవుతుందని పలుమార్లు హెచ్చరించాము. గ్రామీణ ప్రజల కిక్కిరిసిన నివాసాలను గర్హించిన వారు ఇంకే మాత్రం నిశ్శబ్దంగా వుండకూడదు. ఆరోగ్యానికి హానికరమనే దృష్టినుంచేకాక మరి ఇతర మానవ సంబంధాల రీత్యా కూడా ఇది అత్యంత ఆవశ్యకం. స్త్రీ పురుషులతో నిమిత్తం లేకుండా, వివాహితులా లేక అవివాహితులా అనే మీమాంస కూడా లేకుండా, అందరూ ఒకే గదిలో క్రిక్కిరిసి జీవిస్తున్నారని ప్రకటించే వారి నివేదికల నిండా, మానవత్వం మంటగలిసిపోయి, నైతిక జీవనం పతనమయిపోయిందన్న అంశాలను కూడా చూడగలం...[2] ఉదాహరణకు గత సంవత్సరం నా నివేదికకు అనుబంధంగా ఇచ్చిన డాక్టర్ హోర్డ్

1. "వారానికి 10 షి. లెక్కన వేతనాన్ని పుచ్చుకునే పేదపాలేరు దగ్గర ప్రత్యక్షంగా గానీ లేక పరోక్షంగాగానీ యజమాని సంవత్సరానికి 4 లేక 5 పౌండ్లు అద్దె రూపంలో లాభాన్ని గుంజుకుంటాడు. నిజమైన స్వేచ్ఛా మార్కెట్‌లో ఆ గుడిసె విలువ 20 పౌ. మించి వుండదు. ఆ యజమాని తన శక్తిని ఉపయోగించి కృత్రిమమైన విలువను సృష్టించి "నా గుడిసెను ఉపయోగించు లేదా నా నుండి ఏమీ ఆశించకుండా మరోచోట అద్దె గుడిసె కోసం తంటాలుపడు" అని నిగ్గదీస్తాడు. ఏ వ్యక్తి అయినా తన స్థితిని మెరుగు పరుచుకోడానికి రైల్వే పనిలోనో లేక మట్టితవ్వకంలోనో జొరబడదామనుకుంటే, అక్కడ గూడా "ఈ తక్కువ జీతంతో పని చెయ్యి లేదా ఒక వారం నోటీసుతో పనిలో నుండి తీసివేస్తాను; నీ పందిని నీవు తీసుకుపోయి నీ తోటలోనే మేపుకో" అనే స్థితి వుంది. అయినప్పటికీ అతనికి ఈ పరిస్థితులు అనుకూలంగా వున్నాయని భావించి నట్లయితే ముందుగా గుడిసె ఖాళీ చేస్తున్నందుకు అధిక మొత్తంలో యజమానికి అద్దె చెల్లించాలి" (డా॥ హంటర్; అదే గ్రంథం; పు. 132)
2. "కొత్తగా వివాహం చేసుకున్న జంటలు వయస్సులో ఉన్న సోదరీ సోదరులకు ఏమాత్రం విజ్ఞాన వికాసాన్ని కలిగించే ఆదర్శంగా ఉండజాలరు; జరిగిన ఘటనలను ఇక్కడ రికార్డు చేయడానికి వీల్లేక పోయినప్పటికీ, రక్త సంబంధీకుల మధ్య గల లైంగిక సంబంధాల మూలంగా సంబంధించిన మానసిక జబ్బులూ, కొన్ని

నివేదికలో బకింగ్ హామ్‌షైర్‌లో గల వింగ్ గ్రామంలో జ్వరం వ్యాపించిందని చెప్తూ ఆయన ఈ విధంగా రాశాడు. వింగ్రేవ్ నుండి జ్వరంతో వచ్చిన ఒక యువకుడు జ్వరం తగిలిన మొదటి రోజునే తొమ్మిది మందితో కలిసి ఒకే గదిలో నిద్రించాడు. పదిహేను రోజులు గడిచేటప్పటికీ అందులో అనేక మంది జ్వరపీడితులై కొన్ని వారాలు గడిచేటప్పటికీ అందులో అయిదుగురు తీవ్రంగా జబ్బు పడి ఒకడు చనిపోయాడు. సెయింట్ జార్జి ఆసుపత్రి వైద్యుడైన డాక్టర్ హార్వే తన సొంత పనిమీద, అంటురోగం వ్యాపించిన సందర్భంలో వింగ్‌ను సందర్శించాడు. ఆయన కూడా పై విధంగానే నివేదించాడు. 'జ్వరం తగిలిన ఒక యువ మహిళ తన తల్లీ, తండ్రీ, తన కుమారుడూ, మరి యిద్దరు యువకులూ (ఆమె సోదరులు) ఇద్దరు సోదరీలతో పాటు వారి ఇద్దరు బిడ్డలతో వెరసి పది మందితో ఆ గదిలో నిద్రించింది. కొన్ని వారాల క్రితం అదే గుడిసెలో పదమూడుమంది నిద్రపోయారు"[1]

ఇంగ్లండులోని వ్యవసాయ జిల్లాలలోనే గాక మిగిలిన మండలాల్లో కూడా 5375 వ్యవసాయ కార్మికుల గుడిసెలను డాక్టర్ హంటర్ పరిశీలించాడు. అందులో 2195 గుడిసెల్లో ఒకే పడక గది వుంది; (తరచుగా ఆ గదే డ్రాయింగ్ రూముగా కూడా వినియోగించుకోబడుతుంది) 2930 గుడిసెల్లో రెండు గదులు మాత్రమే వున్నాయి; 250లో మాత్రం రెండు కంటే ఎక్కువ గదులు వున్నాయి. ఒక డజను మండలాల నుండి సేకరించిన కొన్ని నమూనాలను మీ ముందుంచుతాను.

### (1) బెడ్‌ఫోర్డ్ షైర్

**రెజిలింగ్ వర్త్ :** 12 అడుగుల పొడవూ, 10 అడుగుల వెడల్పూ గలిగిన పడక గదులు; చాలా గదులు వీటికన్నా ఇంకా చిన్నవి. ఒక దొంతరతో వున్న అనేకమైన చిన్న గుడిసెలను తరచుగా రెండు పడక గదులు చేస్తారు. అందులో ఒకటి తరచుగా వంట గదిలోనే వుంటుంది, ఆ పడక గది 5 అ. 6 అం. ఎత్తు వుంటుంది. సంవత్సరానికి 3 పౌండ్ల అద్దె. అద్దె కుండే వాళ్ళు వాళ్ళ పాయఖానాలను వాళ్ళే తయారు చేసుకోవాలి. ఒకటి తయారవగానే ఆ చుట్టుపక్కల వుండేవాళ్లంతా దానిని ఉపయోగిస్తారు. రిచర్డ్‌సన్ కుటుంబానికి సంబంధించిన ఒక గుడిసె చూడటానికి చాలా అసహ్యంగా వుంటుంది. "మెత్తిన దాని గోడలు వంగి దండం పెడుతున్న స్త్రీ ధరించిన దుస్తులులా ఉబ్బి వున్నాయి. దాని కప్పులో ఒక భాగం కుంభాకారంగానూ, మరొక భాగం పుటాకారంగానూ వున్నాయి. అందులో ఒక చివర చిమ్నీ వేలాడుతుంది. తడిక మీద మట్టితో మెత్తిన గొట్టం ఏనుగు తొండంలాగా వుంది. ఆ చిమ్నీ పడిపోకుండా ఒక కర్రముక్క అడ్డంపెట్టారు. ఆ గుడిసె వాకిలీ, కిటికీ చతుర్భుజాకృతిలో వున్నాయి. సందర్శించిన పదిహేడు గుడిసెల్లో నాల్గింటిలో మాత్రమే ఒకటికన్నా ఎక్కువ పడగ్గదులు న్నాయి. అవి కూడా కిక్కిరిసి వున్నాయి. ఒకే గది వున్న ఒక గుడిసెలో ముగ్గురు యుక్తవయస్కులూ,

సందర్భాలలో మరణాలనూ జ్ఞప్తికి తెచ్చుకోడానికి కావలసిన గణాంక సమాచారం వుంది" (డా॥ హంటర్; అదే గ్రంథం, పు. 137) గ్రామీణ పోలీసుల్లో బహుకాలం పాటు నేరపరిశోధకుడుగా పని చేసిన ఒక వ్యక్తి లండన్ నగరంలోని నికృష్ట గుడిసెల్లో జీవించిన ఆడపిల్లలను గురించి ఈ విధంగా అంటాడు : "ఈ ఆడపిల్లలకుండే సిగ్గూ బిడియంలేనితనం, లండన్ నగరంలోని నికృష్టభాగాల్లో కూడా నా పోలీసు జీవితంలో నేనెప్పుడూ గమనించలేదు... ఆడామగ తేడా లేకుండా, అమ్మా, అబ్బా, అన్నా, చెల్లెలూ అనే వ్యత్యాసం లేకుండా పందుల్లాగా అందరూ అదే గుడిసెలో నిద్రపోతారు" చిల్డ్రన్ ఎంప్లాయిమెంట్ కమిషన్, సిక్స్‌రిపోర్టు. 1867, అనుబంధం. పుట 77; నోట్ 155)

1. "పబ్లిక్ హెల్త్ సెవెంత్ రిపోర్ట్", 1865, పుట 9; 14 పాస్సిమ్.

ముగ్గురు పిల్లలూ కాక, ఆరుగురు పిల్లలతో ఒక పెళ్ళైన జంట కూడా అందులో కాపురం చేస్తున్నారు.

**డన్‌టన్ :** అద్దెలు చాలా ఎక్కువ; 4 పౌ॥ నుండి 5 పౌండ్లు వరకూ వుంటాయి; వారానికి పురుషుడి వేతనం 10షి; ఇతర కుటుంబ సభ్యులు గడ్డి అల్లకం చేయడం ద్వారా సంపాదించే దానితో అద్దె చెల్లించాలనుకుంటారు. అద్దె ఎక్కువయితే ఎక్కువ మంది కలిసి పనిచేయడం ద్వారా దాన్ని చెల్లించాలనుకుంటారు. ఆరుగురు పెద్దవాళ్ళు నలుగురు పిల్లలతో ఒక చిన్న గదిలో కాలం గడుపుతూ దానికి 3 పౌ. 10 షి. అద్దె చెల్లిస్తున్నారు. డన్‌టన్‌లో ఉన్న చౌకైన గుడిసె వెలుపలి కొలత 15 అ॥ పొడవు, 10 అ॥ వెడల్పు. దానికి 3 పౌ.అద్దె. పరిశీలించిన గుడిసెల్లో ఒక దానిలో మాత్రమే రెండు పడక గదులున్నాయి. ఆ గ్రామానికి కొంచెం దూరంలో వున్న ఒక గుడిసెలో అద్దెకుంటున్న వారి పక్కనే పేడకుప్ప వుంది. దాని తలుపు క్రింది భాగం 9 అం॥ మేరకు చెదలు తింది. రాత్రిపూట ఆ తలుపు సందుకు నేర్పుగా రాళ్ళు అడ్డం పెట్టి దానిమీద ఒక చాప పడేస్తారు. కిటికీ తలుపుకున్న గ్లాసు సగభాగం పగిలిపోయింది. ఈ గుడిసెలో ఏ విధమైన సామాగ్రి లేకుండా ముగ్గురూ పెద్దవాళ్ళూ, అయిదుగురు చిన్న పిల్లలూ కాలక్షేపం చేస్తున్నారు. బిగిల్స్ వేడ్ యూనియన్‌లోని మిగిలిన ప్రాంతాలకన్నా డంటన్ నికృష్టంగా లేదని చెప్పాలి.

### (2) బెర్క్‌షైర్

**బీన్‌హామ్ :** 1864 జూన్‌లో ఒకాయన, ఆయన భార్యా, నలుగురు పిల్లలతో ఒక గుడిసెలో వుండేవాడు. విష జ్వరంతో ఆయన పెద్ద కూతురు ఇంటికి వచ్చింది. ఆమె అక్కడ చనిపోయింది. ఒక బిడ్డ రోగగ్రస్థమై చనిపోయింది. డాక్టర్ హంటర్ ఆ గుడిసె కెళ్ళే సమయానికి తల్లీ, ఒక బిడ్డ విష జ్వరంతో బాధపడుతున్నారు. తండ్రి మరొక బిడ్డా గుడిసె బయట నిద్రపోతున్నారు. ఆ నికృష్టమైన గ్రామంలోని కిక్కిరిసిన మార్కెట్‌లో జ్వరపీడితులైన ఒక కుటుంబం బట్టలుతుకుతూ బతుకుతున్నారు. ఆ గుడిసెకు చెల్లించే అద్దె వారానికి 1 షి. అందులోని ఒకే గదిలో భార్యా, భర్తా ఆరుగురు చిన్న పిల్లలూ నివాసముంటున్నారు. 14 అ.6 అం. పొడవూ, 7 అ. వెడల్పూ కలిగిన ఒక గుడిసెలో వంటగది ఎత్తు 6అ. దానికి వారానికి 8 పెన్నీల లెక్కన అద్దె చెల్లిస్తున్నారు. పడకగదికి కిటికీ గానీ తలుపుగానీ లేదు. ప్రవేశ నిష్క్రమణలన్నీ ముందు గదినుండే. పెరడు కూడా లేదు. ఇద్దరు ఎదిగిన కుమార్తెలతో, ఒక కుమారుడితో ఒక కార్మికుడు అక్కడ నివాసముంటున్నాడు. తండ్రీ కొడుకులు మంచం మీద నిద్రపోతే, కూతుళ్ళు వాకిట్లో నిద్రపోయేవారు. ఆ కుమార్తెలిద్దరికీ చిన్నపిల్లలున్నారు. అందులో ఒకామె పని గృహానికి పోయి వస్తుండేది.

### (3) బకింగ్‌హామ్ షైర్

1000 ఎకరాల భూమిలో 30 గుడిసెలున్నాయి; అందులో 130–140 మంది కాపురముంటు న్నారు. బ్రాడెన్‌హామ్ ప్రాంతములో 1000 ఎకరాలున్నాయి. 1851లో అక్కడ 36 గుడిసెలూ, 84 మంది పురుషులూ, 54 మంది స్త్రీలు వుండేవారు. 1861 నాటికి స్త్రీ పురుషుల సంఖ్యలో మార్పు వచ్చింది. ఆనాటికి 98 మంది పురుషులూ, 87 మంది స్త్రీలు వున్నారు. 10 సంవత్సరాల్లో 14 మంది పురుషులూ, 33 మంది స్త్రీలు పెరిగారు. అయితే అదే కాలంలో అక్కడ వుండే గుడిసెల సంఖ్య తగ్గిపోయింది.

**విన్‌స్లో :** ఇందులో ఎక్కువ భాగం గుడిసెలు కొత్తగా నిర్మాణం చేసినవే. అద్దె ఇళ్ళ గిరాకీ చాలా ఎక్కువగా వుంది. అతి నికృష్టమైన గుడిసెకు కూడా వారానికి 1 షి. నుండి 1 షి. 3 పె.ల చొప్పున అద్దె చెల్లించాలి.

**వాటర్ ఈటన్ :** జనాభా పెరుగుదల రీత్యా అప్పటి వరకూ అక్కడ వున్న గుడిసెల్లో 20 శాతం గుడిసెలను భూస్వాములు కూలగొట్టారు. నాలుగు మైళ్లు నడిచి, తన పనిలోకి పోవలసిన ఒక పేద కార్మికుడు, గుడిసె దొరకలేదా అనే ప్రశ్నకు ఈ విధంగా జవాబు చెప్పాడు : "లేదు; యింత పెద్ద కుటుంబంతో నన్ను ఏ విధంగా వాడుకోవాలో వారికి బాగా తెలుసు"

**టింకర్స్ ఎండ్ :** ఇది విన్‌స్లో దగ్గరే వుంది. ఒకే పడకగదిలో నలుగురు పెద్దవాళ్ళూ, నలుగురు చిన్నపిల్లలూ వుండాలి. ఆ గది 11 అ॥ పొడవూ, 9 అ॥ వెడల్పూ, 6 అ॥5 అం. ఎత్తూ వుంటుంది. మరొక దాంట్లో 6 గురు నివాసముంటున్నారు. దాని పొడవు 11 అ॥ 3 అం. వెడల్పు 9 అ॥, ఎత్తు 5 అ॥ 10 అం. కనీసం నేరస్తుని కుండే వసతి కూడా ఈ కుటుంబ సభ్యులలో ఏ ఒక్కరికీ లేదు. ఏ గుడిసెలో కూడా ఒక పడకగది కన్నా మించి లేదు; ఏ ఒక్కదానికీ వెనక తలుపు లేదు; నీళ్ళు దొరకవు. వారానికి అద్దె 1 షి. 4 పె. నుండి 2 షి. తనిఖీ చేసిన 16 గుడిసెల్లో వున్న కార్మికుల్లో ఒక్క వ్యక్తి మాత్రమే వారానికి 10 షి. సంపాదిస్తున్నాడు. 4 అ॥ నలుచదరం గల ఒక పెట్టెలో ఒక వ్యక్తిని ఒక రాత్రి బందిస్తే ఎంత గాలి వస్తుందో అంతే గాలి ఈ గుడిసెల్లో జీవించే ప్రతి వ్యక్తికీ ఈ పరిస్థితుల్లో లభిస్తుంది. కనీసం ఆదిమ యుగంలోని చీకటి గదులన్నా కొంత వెలుతురు నిస్తాయేమో!

### (4) కేంబ్రిడ్జి షైర్

**గ్లాంబ్లింగే :** ఇక్కడ చాలా మంది భూస్వాములున్నారు. ఎక్కడా లేని నికృష్టమైన గుడిసెలు ఇక్కడున్నాయి. ఇక్కడ జనం ఎక్కువగా గడ్డి అల్లకం మీద బతుకుతుంటారు. "చచ్చేంత నీరసం, కంపుకొట్టే పరిసరాలూ ఈ చుట్టుప్రక్కల విలయతాండవం చేస్తున్నాయి" నడికొప్పు చెదలు పట్టడం మూలంగా ఉత్తర దక్షిణాలు కూడా కుళ్ళిపోయి గుడిసెలన్నీ శిథిలావస్థలో వున్నాయి. ఈ ప్రజానీకపు మూలుగుల్ని అక్కడున్న గైర్హాజర్ భూస్వాములు పీల్చి వేస్తున్నారు. అద్దెలు చాలా ఎక్కువ; 8 లేక 9 మంది ఒకే గదిలో నివాసముంటున్నారు; 2 గుడిసెల్లో మాత్రం ఆరుగురు చొప్పున అందులో ఒక్కొక్కరికీ ఒకరూ లేక ఇద్దరు పిల్లలతో, ఒక చిన్న గదిలో వుంటున్నారు.

### (5)ఎస్సెక్స్

ఈ మండలంలో వ్యక్తుల సంఖ్యతో పాటుగా గుడిసెల సంఖ్య కూడా తగ్గిపోయింది. అందులో 22 ప్రాంతాలలో గుడిసెలను కూలగొట్టినప్పటికీ జనాభా పెరుగుదల నివారించబడలేదు. లేక పట్టణాలకు వలసపోవడం అనే పేరుతో నెట్టివేయడం జరగలేదు. 3443 ఎకరాలు గల ఫింగ్‌రింగ్‌హో అనే ప్రాంతంలో 1851లో 145 గుడిసెలున్నాయి; 1861లో 110 మాత్రమే వున్నాయి. అయినప్పటికీ అక్కడి జనం దాన్ని విడిచి వెళ్ళాలనుకోవడం లేదు. 1851లో వున్న 61 గుడిసెల్లో 252 మంది నివాసముండగా 1861లో వున్న 49 గుడిసెల్లో 262 మంది కాపురముంటున్నారు. బాసిల్‌డన్‌లో 1851లో 1827 ఎకరాల్లో 35 గుడిసెల్లో 157 మంది నివాసముండగా, 10 సంవత్సరాల తర్వాత 27 గుడిసెల్లో 180 మంది వున్నారు. 1851లో షింగ్‌రింగ్‌హో, సౌత్ ఫారిన్ బ్రిడ్జ్, విడ్‌ఫోర్డ్, బాసిల్‌డన్,

రామ్స్‌డన్ క్రాగ్స్ ప్రాంతాలలోని 8,449 ఎకరాలలో 316 గుడిసెలలో 1392 మంది నివాసముంటున్నారు, 1861లో అదే విస్తీర్ణంలో 240 గుడిసెల్లో 1473 మంది నివాసముంటున్నారు.

### (6) హిర్‌ఫోర్డ్ షైర్

'బేదఖళ్ళ ఉత్సాహం' మూలంగా ఇంగ్లాండ్‌లోని ఏ ప్రాంతం కూడా ఈ చిన్న మండలం కంటే ఎక్కువ ఇబ్బందులకు గురికాలేదు. నాడ్బీ ప్రాంతంలో రైతులకు సంబంధించిన ప్రతి గుడిసె రెండు పడక గదులతో కిక్కిరిసి వుండేది. వాటికి సంవత్సరానికి 3 పౌ లేక 4 పౌ. లెక్కన అద్దె వసూలు చేసేవారు; వారానికి 9 షి. లెక్కన కార్మికులకు కూలి ఇచ్చేవారు.

### (7) హన్‌టింగ్ డన్

1851లో హార్ద్ ఫోర్డ్‌లో 87 గుడిసెలుండేవి. 1720 ఎకరాలున్న ఈ ప్రాంతంలో కొంత కాలానికి 19 గుడిసెల్ని కూలగొట్టారు; 1831లో దాని జనాభా 452; 1852లో 832; 1861లో 341. అందులో ఒకే పడకగది వున్న 14 గుడిసెలను తనిఖీ చేశాం. అందులో ఒక దాంట్లో ఒక పెళ్ళయిన జంటా, యుక్త వయస్కులైన ముగ్గురు కుమారులూ, యుక్తవయస్కురాలైన ఒక కూతురూ, నలుగురు పిల్లలూ వెరసి 10 మంది కాపురముంటున్నారు; మరొకదానిలో ముగ్గురు పెద్దవాళ్ళూ, 6గురు చిన్న పిల్లలు వున్నారు. 8 మంది కాపురముంటున్న ఒక గుడిసె పొడవు 12 అ॥10 అం॥; వెడల్పు 12 అ 2 అం. ఎత్తు 6 అ 9 అం. మొత్తం ఆ గుడిసె కొలతను తీసుకుంటే తలసరి 130 ఘ. అ. స్థలం లభ్యమయింది. 14 పడక గదుల్లో 34 మంది పెద్దవాళ్ళూ 33 మంది పిల్లలూ కాపురం చేస్తున్నారు. ఈ గుడిసెల్లో దేనికీ కూడా పెరడు లేదు గానీ, అందులో నివసించే వారు మాత్రం 10 షి. లేక 12 షి. ఖర్చుతో మరుగుదొడ్లను ఏర్పరచుకున్నారు. పాయఖానాలు లేని ఇళ్ళకు దూరంగా మరుగుదొడ్లు ఏర్పరచబడ్డాయి. అక్కడుండే కుటుంబాలు "ఈ మరుగుదొడ్లనే తమ కాలకృత్యాలకు వినియోగించుకోవాలి" లేదా ఈ ప్రాంతంలో అప్పుడప్పుడూ జరుగుతున్నట్లుగా "ఒక పెద్ద తొట్టిలో మూతగల పెట్టెను వుంచి, దానిని ఉపయోగించుకొని, వారానికొకసారి నిర్దేశించిన ప్రదేశంలో ఆ పెట్టెను శుభ్రం చేసి మరలా వాడుకోవడం". జపాన్‌లో జీవన పరిస్థితుల చక్రం దీనికన్నా ఇంకా శుభ్రంగా నడుస్తుంది!

### (8) లింకన్ షైర్

**లాంగ్‌టాఫ్ట్ :** రైట్‌గారి గుడిసెలో ఒకాయన, ఆయన భార్యా, అత్తగారితో పాటుగా, 5 గురు పిల్లలతో గడుపుతున్నాడు. ఆ గుడిసెలోని ముందు గదినే వంటకీ, అంట్లకీ ఉపయోగించి దానిమీద అటకలాగా వున్న దానిని పడగ్గదిగా ఉపయోగిస్తున్నారు. దాని పొడవు 12 అ. 2 అం. వెడల్పు 9 అ. 5 అం. మొత్తం క్రింది భాగమంతా కలిపి 21 అ. 2 అం. పొడవూ 9 అ. 5 అం. వెడల్పూ వుంటుంది. చుట్టు గోడలు చెరకు గడల్లాగా కప్పులోకి చొచ్చుకుపోయాయి; ముందువైపు మాత్రం చిన్న కిటికీ వుంది. "అతనెందుకుంటున్నాడిక్కడ? పెరడు కోసమా? కాదు; అది చాలా చిన్నది. అద్దె? చాలా ఎక్కువ; వారానికి 1 షి 3 పె. ఆయన పనిచేసే పొలానికి దగ్గరగా వుందా? లేదు; రోజు రాను పోనూ 12 మైళ్ళదూరం వుంటుంది. అది అద్దెకివ్వదగింది గనుకనే ఆయన దాంట్లో వుంటున్నాడు." ఆయన సొంతంగా ఎంత ఖర్చయినా భరించి ఒక గుడిసె వేసుకోవాలనుకుంటున్నాడు.

లాంగ్‌టాఫ్ట్‌లో 12 గుడిసెల్లోని 12 గదుల్లో మొత్తం 38 మంది పెద్దవాళ్ళూ, 36 గురు చిన్న పిల్లలు నివాసముంటున్నారు. ఆ వివరాలను ఈ క్రింది పట్టికలో ఇస్తున్నాను.

**లాంగ్‌టాఫ్ట్‌లోని 12 గుడిసెలు**

| గుడిసెల నెం. | పడక గదులు | పెద్దలు | పిల్లలు | మొత్తం జనం |
|---|---|---|---|---|
| 1 | 1 | 3 | 5 | 8 |
| 2 | 1 | 4 | 3 | 7 |
| 3 | 1 | 4 | 4 | 8 |
| 4 | 1 | 5 | 4 | 9 |
| 5 | 1 | 2 | 2 | 4 |
| 6 | 1 | 5 | 3 | 8 |

| గుడిసెల నెం. | పడక గదులు | పెద్దలు | పిల్లలు | మొత్తం జనం |
|---|---|---|---|---|
| 7 | 1 | 3 | 3 | 6 |
| 8 | 1 | 3 | 2 | 5 |
| 9 | 1 | 2 | 0 | 2 |
| 10 | 1 | 2 | 3 | 5 |
| 11 | 1 | 3 | 3 | 6 |
| 12 | 1 | 2 | 4 | 6 |

## (9) కెంట్

1859లో కెన్సింగ్‌టన్ ప్రాంతంలో డిఫ్తీరియా జబ్బు వ్యాపించినపుడు అక్కడ జనం సమ్మర్ధం చాలా ఎక్కువగా వుంది. ఆ ప్రాంతంలోని పేద వర్గాల ఆరోగ్య స్థితిగతులను పరిశీలించడానికి ఒక దర్యాప్తు సంఘాన్ని నియమించారు. ఎక్కువగా కూలిపనిచేసేవాళ్లు ఆ ప్రాంతంలో వున్నప్పటికీ గుడిసెల్లో ఎక్కువ భాగం కూలగొట్టబడి వున్నాయి. కొత్తవి నిర్మాణం కావడం లేదు. ఒక మండలంలో పక్షి గూడుల్లాగా నాలుగు గుడిసెలున్నాయి. ప్రతి గుడిసెలోనూ నాలుగు గదులు ఈ క్రింది కొలతల ప్రకారం వున్నాయి.

| గదులు | అ.అం. | అ.అం. | అ.అం. |
|---|---|---|---|
| వంటగది | 9.5 | 8.11 | 6.6 |
| అంట్లగది | 8.6 | 4.6 | 6.6 |
| పడకగది | 8.5 | 5.10 | 6.3 |
| పడక గది | 8.3 | 8.4 | 6.3 |

## (10) నార్త్ యామ్‌టన్ షైర్

**బ్రిన్‌వర్త్, పిక్‌పోర్ట్, ఫ్లోరె :** ఈ గ్రామాల్లోని వీధుల్లో శీతాకాలంలో 20 నుండి 30 మంది పని లేకుండా తిరుగుతున్నారు. పొలాల్లో యింకా గోధుమ, దుంపకూరల్లాంటి పైర్లు పూర్తిగా వేయలేదు; అక్కడుండే భూస్వాములంతా చిన్న చిన్న కమతాలను కలిపి రెండు లేక మూడు పెద్ద కమతాల కింద పని చేయించుకుంటున్నారు. అందువలన నిరుద్యోగం ఎక్కువగావుంది. ఒకవైపున భూమిని సేద్యం చేయాల్సిన అవసరం వుంటే, మరో వైపున కార్మికులు పని కోసం అర్రులు చాస్తున్నారు. వేసవికాలంలో గొడ్డు చాకిరీ చేయడం, శీతాకాలంలో అర్ధాకలితో జీవించడం వారికి మామూలయిపోయింది. అందువలన వాళ్ళ భాషలోనే చెప్పాలంటే, "మేం చావాలని ఈ భూస్వాములు చూస్తున్నారు" అని అనుకోవడంలో ఆశ్చర్యం లేదు. ఉదాహరణకు ఫ్లోరెలో ఒక చిన్న గదిలో 4, 5, 6 మంది పిల్లలతో

ఒక జంట, లేక ముగ్గురు పెద్దలు అయిదుగురు పిల్లలతోనూ లేక తాత మరి ఆరుగురు పిల్లలతో రెండు గదుల్లోనో మరొకదానిలో 8 మంది, ఇంకొక దానిలో 9 మంది పెద్దలు నివాసముంటున్నారు.

## (11) విల్ షైర్

**స్టాటన్ :** 31 గుడిసెలు తనిఖీ చేయగా అందులో ఎనిమిదింటిలో ఒకే గది వుంది; అదే ప్రాంతంలోనే పెంటిల్‌లో ఒక గుడిసెకు వారానికి ఇచ్చే అద్దె 1 షి. 3 పె. అందులో నలుగురు పెద్దలూ, నలుగురు పిల్లలూ వుంటున్నారు. గందరగోళంగా ఒకదానిమీద ఒకటి అమర్చిన రాళ్లూ, శిథిలమై పోతున్న పూరి కప్పుగోడలూ తప్ప అందులో ఏమీ లేవు.

## (12) వోర్‌సెస్టర్ షైర్

గుడిసెలు కూలగొట్టడం ఇక్కడ ఎక్కువగా లేదు; 1851–61 మధ్య కాలంలో ప్రతి గుడిసెకూ సగటున కాపురముంటున్న వారి సంఖ్య 4.2 నుండి 4.6 వరకు పెరిగింది.

**బాడ్‌సే :** ఇక్కడ చాలా గుడిసెలు వున్నాయి. ఇక్కడి గుడిసెలుండడం "పెద్ద తలకాయ నొప్పిగా వుంది; ఎందుచేతనంటే అక్కడికి అలగా జనం వస్తారు" అని కొంతమంది రైతులు అంటున్నారు. ఒక పెద్దమనిషి ఇలా అన్నాడు. "పేదవాళ్ళు మాకన్నా తక్కువగా ఏం లేరు. మీరు 500 గుడిసెలు నిర్మిస్తే వెంటనే అద్దెకు తీసుకుంటారు. మీరు ఎన్ని ఎక్కువగా గుడిసెలు నిర్మిస్తే అంత ఎక్కువగా అద్దె తీసుకుంటారు" (ఆయన అభిప్రాయంలో గుడిసెలు వేయడం మూలంగా జనం వస్తారు. ఆ తర్వాత సహజంగా "నివాస సౌకర్యాల కోసం" వత్తిడి చేస్తారు) డా॥ హంటర్ ఇలా అంటాడు. "బాడ్‌సేలో వున్న దురదృష్టంకన్నా ఇంకా నికృష్టంగా వుండే ప్రాంతాల నుంచే ఈ పేద జనం అంతా రావాలి. అతను పని చేసేచోట ఒక గుడిసె గనక దొరికితే ఎవరు కూడా బాడ్‌సేకు రావాలని అనుకోరు. ఇక్కడ గోచిపాతంత స్థలం కోసం అతనికిచ్చే కూలికన్నా ఎక్కువగా అద్దె చెల్లిస్తాడు."

పట్టణ ప్రాంతాలకు నిరంతరాయంగా వలసపోవడమూ, భూసాంద్రీకరణ పర్యవసానంగా నిరంతరాయంగా దేశంలో అదనపు జనాభా ఏర్పడటమూ, సాగులో వున్న భూములను పచ్చిక బయళ్లుగా మార్చివేయడమూ, వ్యవసాయ రంగాన్ని యాంత్రికీకరణ చేయడమూ వగైరాలన్నీ వ్యవసాయ కార్మికులు నివాసాలుండే గుడిసెలను కూలగొట్టడం ద్వారా వారిని నిరంతరాయంగా బే దఖల్ చేయడంతో పెనవేసుకుని వుంటాయి. జిల్లాలో జనం ఎంత తక్కువగా వుంటే దాని 'సాపేక్ష అదనపు జనాభా' అంత ఎక్కువగా వుంటుంది; పని కోసం వత్తిడి ఎంత ఎక్కువగా వుంటే వ్యవసాయ జనాభాకు అవసరమైన గుడిసెల నిర్మాణం కోసం వుండే ఒత్తిడి అంతకంటే ఎక్కువగా వుంటుంది. అందువల్ల గ్రామీణ ప్రాంతాలలో స్థానిక అదనపు జనాభా మరీ ఎక్కువగా వుండటంతో, ఆ మానవ మాత్రులు ప్రాణాంతకంగా కిక్కిరిసి జీవిస్తుంటారు. పలచగా వున్న చిన్న చిన్న గ్రామాల్లోనూ, పట్టణాల్లోనూ జన సమూహాన్ని కిక్కిరిసి వుండేటట్లు చేయడం, భూముల నుండి జనాన్ని బలవంతంగా నెట్టివేయడానికి అనుగుణ్యంగానే జరుగుతుంది. వ్యవసాయ కార్మికుల సంఖ్య తగ్గిపోతున్నప్పటికీ, వారి ఉత్పాదితం నిరంతరం పెరుగుతున్నప్పటికీ, వారిని అదనపు జనాభాగా నిరంతరం మార్పు చేసే ప్రక్రియ కటిక దారిద్ర్యానికి జన్మస్థానంలాంటిది. వ్యవసాయ కార్మికుల కటిక దారిద్ర్యమే వారు బేదఖలు కావడానికి ప్రేరకశక్తిగా వుంటుంది; ఆ కటిక దారిద్ర్యమే వారి నికృష్టమైన నివాసాలకు ప్రధాన మూలాధారంగా

వుంటుంది. అదే ఆ కార్మికుల ప్రతిఘటించే అంతిమ శక్తిని నిర్వీర్యం చేసి భూస్వాములకూ[1] రైతులకూ కేవలం బానిసలుగా ఉండేటట్లు చేస్తుంది. ఈ విధంగా కనీస వేతనాలు వారికొక ప్రకృతిసిద్ధమైన నియమంగా రూపొందుతాయి. దీనికి భిన్నంగా భూమి మీద నిరంతరం "సాపేక్ష అదనపు జనాభా" ఉన్నప్పటికీ, అదే సమయంలో ఆ భూములను సాగు చేయడానికి సరిపోయినంత జనం లేరు. స్థానికంగా వుండే పట్టణాలకూ, గనులకూ, రైలు, రోడ్ల నిర్మాణం వగైరాలకు గణనీయంగా జన ప్రవాహం తరలి వెళ్ళడాన్ని గమనించడం ద్వారా మాత్రమే కాదు మనం ఈ అంశాన్ని చూడగల్గు తుంది. కోతల కాలంలోనే గాక, వేసవి కాలంలోనూ, శీతాకాలంలోనూ సాంద్ర వ్యవసాయ కార్యక్రమాలు ముమ్మరంగా జరుగుతున్న రోజుల్లోనూ, ఇంకా అలాంటి సందర్భాలలోనూ అదనపు జనం కావాల్సి వచ్చినపుడు అన్ని ప్రాంతాలలోనూ మనం ఈ అంశాన్ని చూడగల్గుతున్నాం. సాధారణ వ్యవసాయ కార్యక్రమాలకు ఎల్లప్పుడూ బహు ఎక్కువగానూ, ప్రత్యేకమైన అసాధారణ అవసరాలకు బహు తక్కువగానూ వ్యవసాయ కార్మికులు లభ్యమవుతుంటారు.[2] కాబట్టి ఒకే సందర్భంలో, ఒకే ప్రాంతం

1. "పాలేరుకు సంక్రమించిన ఈ దైవదత్తమైన ఉద్యోగం అతని స్థితికి సహితం ఔన్నత్యాన్ని చేకూరుస్తుంది. అతను బానిస కాడు; ఒక శాంతి సైనికుడు. దేశం సైనికుడి నుండి ఏమి కోరుతుందో, అదే విధంగా కార్మికుల నుండి బలవంతంగా శ్రమను గ్రహించడానికి శక్తి గలిగినవాడు భూస్వామి; గృహస్తులకు ఇళ్ళలో స్థానం కల్పించడానికి అర్హత కలిగిన వాడు కూడా ఆ భూస్వామే. ఆ పాలేరు సైనికుడిలాగా తన శ్రమను తగిన మార్కెట్ ధరను ఏ మాత్రమూ పొందలేడు. తన పరిసర ప్రాంతాలలో బ్రతుకుతెరువు కోసం తంటాలుపడుతూ అమాయకంగా తిరుగుతూ యుక్త వయస్సులో వున్నప్పుడు సైనికున్ని పట్టుకున్న ట్లుగా ఇతన్ని పట్టుకుంటారు. వివిధ రకాలైన నివాస నియమాలూ, బాల్య వివాహమూ ఒకడ్ని వెంటాడితే, తిరుగుబాటు చట్టం మరొకన్ని వెంటాడుతుంది" (డా॥ హంటర్; అదే గ్రంథ; పు.132) కొన్ని సందర్భాలలో అసాధారణమైన సున్నిత హృదయం గల భూస్వామి తను సృష్టించిన ఏకాంతానికి తానే విచారపడతాడు. "తన దేశంలో తానొక్కడే ఏకాంతంగా వుండడం చాలా విచారించదగిన విషయం" అని హుకుమ్ పరిపూర్తి అయిన సందర్భంలో లార్డ్ లైనెస్టర్ అన్నాడు. "నా చుట్టుప్రక్కల పరిసరాలను పరిశీలిస్తే నా ఇల్లుతప్ప మరే ఇల్లూ కనిపించదు". ఈ అమోఘమైన సౌధానికి నేనే రాజును; నా చుట్టుపక్కల జనాన్నంతా తినేసేననుకోండి!

2. ఈ విధమైన పరిస్థితి గత పది సంవత్సరాల కాలం నుండి ఫ్రాన్సులో కూడా కొనసాగుతుంది; పెట్టుబడిదారీ ఉత్పత్తి అక్కడ వ్యవసాయ రంగాన్ని ఆవరించిన మేరకు, "అదనపు" వ్యవసాయ జనాభాను అదే నిష్పత్తిలో పట్టణ ప్రాంతాలకు తరిమివేస్తుంది. "అదనపు జనాభా" పర్యవసానంగా ఇక్కడ కూడా గృహవసతి సౌకర్యాలలో, తదితర స్థితిగతులలో దైన్యస్థితిని గమనించగలం. కమతాల విభజన మూలంగా అవతరించిన ఈ ప్రత్యేకమైన "కూలిరైతుల"లను గురించి మనం ఇదివరకే పేర్కొన్న కాలిన్స్ గ్రంథా లనూ, కారల్‌మార్క్స్ రాసిన 'డెర్ అబిజెంట్‌బ్రుమైర్ డెస్ లూయీ బోనాపార్టీ" రెండవ ముద్రణ, హామ్‌బర్గ్, 1869, పు. 56ను చూడండి. ఫ్రాన్స్‌లో 1846లో పట్టణ ప్రాంత జనాభా 24.42 శాతంకాగా, వ్యవసాయ జనాభా 75.58 శాతం; 1861లో పట్టణ జనాభా 28.86 శాతం కాగా, వ్యవసాయ జనాభా 71.14 శాతం వుంది. గత ఐదు సంవత్సరాల కాలంలో వ్యవసాయ జనాభా శాతం క్షీణత ఇంకా ఎక్కువగా వుంది. 1846లోనే పియర్రీ డుపాంట్ తన "లే బాంట్ డెస్ జీరియర్స్"లో ఈ క్రింది విధంగా రాశాడు;

"చింపిరి చీలికల్లాంటి వస్త్రాలతో నికృష్టమైన గుడిసెల్లో,
బురద గుంటల్లో, మురికి వాడల్లో,
గుడ్లగూబలతో, దొంగలతో సహజీవనం చేస్తూ
అంధకారంలో జీవిస్తున్నాం"

నుండి అత్యధిక లేక అత్యల్ప కార్మికులున్నారనే ఫిర్యాదులను అధికారిక పత్రాలలో మనం చూడగలం. స్థానికంగా ఒక ప్రాంతంలో తాత్కాలికంగా కార్మికులకు కొరత ఏర్పడితే, అది వేతనాల పెరుగుదలకు దారితీయదు సరికదా; స్త్రీలు, చిన్న పిల్లలూ పొలం పనిలోకి నిర్బంధంగా తీసుకెళ్ళ బడతారు; తత్ఫలితంగా చిన్న పిల్లల దోపిడీ చేయబడే వయస్సు ప్రారంభమై ఆ వయస్సు నిరంతరం క్షీణిస్తుంది. చిన్న పిల్లలనూ, స్త్రీలనూ భారీ స్థాయిలో దోపిడీ చేయడం ప్రారంభించిన తర్వాత, ఆ విధానం పురుష కార్మికులను "అదనం గావించ"డానికి నూతన సాధనంగా మారి వారి వేతనాలను తగ్గించడానికి దోహదపడుతుంది. ఈ విషవలయం యొక్క అత్యున్నత ఫలితమైన 'ముఠా విధానం' లండన్ తూర్పు ప్రాంతంలో కొనసాగుతుంది. దీనిని గురించి ఇక్కడ కొద్దిగా వివరిస్తాను.[1]

లింకన్, హన్‌టింగ్‌డన్ కేంబ్రిడ్జి, నార్‌ఫోక్, సఫోక్, నాటింగ్ హామ్ మండలాల్లో ప్రధానంగానూ, నార్త్ యామ్‌టన్, బెడ్ ఫోర్ట్, రట్‌లాండ్ పరిసర ప్రాంతాల్లో చెదురుమదురుగానూ, ఈ ముఠా విధానం వుంది. లింకన్‌షైర్‌ను ఉదాహరణగా పేర్కొనవచ్చు. ఈ ప్రాంతంలో వుండే భూమిలో ఎక్కువ భాగం కొత్తగా సాగులోకి తీసుకురాబడింది. గతంలో చిత్తడి నేలగా వుండో లేక తూర్పు ప్రాంతాలలోని 'సముద్రం నుండి సంపాదించిన భూమి' అనే పేరుతో పిలవబడుతున్న భూముల్లాగా లింకన్‌షైరులో కూడా భూములున్నాయి. దీనిని బాగు చేయడంలో ఆవిరియంత్రం అద్భుతంగా తోడ్పడింది. ఒకానొకప్పుడు చిత్తడి భూములుగానో, ఇసుక తిప్పలుగానో వున్న భూమి, ఇప్పుడు ధాన్యపు సముద్రంలాగా మారి అత్యధిక కౌలును సంపాదించగలుగుతుంది. యాక్స్‌హెూమ్ ద్వీపంలోనూ, ట్రెంట్ గట్టున వున్న భూముల్లో మాదిరిగా, మానవ శ్రమ ద్వారా సారవంతమైన భూములుగా మార్చిన వాటి విషయంలో కూడా ఇది వర్తిస్తుంది. నూతన భూములను సాగులోకి తీసుకొచ్చిన మేరకు – నూతనంగా గుడిసెల నిర్మాణం జరగలేదు. సరికదా, అదే నిష్పత్తిలో పాత వాటిని కూలగొట్టారు; శీతాకాలంలో వచ్చే నిరంతర వరదల మూలంగా కార్మికులు కొండ ప్రాంతాలకెళ్ళి తలదాచుకునేవారు. సుదూర ప్రాంతాలైన ఈ కొండల పరిసర ప్రాంతాలలో వున్న సన్నకారు గ్రామాల నుండి శ్రామికులు సరఫరా చేయబడేవారు. 400 నుండి 1000 ఎకరాల కమతాలలో పనిచేస్తున్న కార్మికులు (వారిని బందీలైన కార్మికులంటారు) కేవలం వ్యవసాయ పనులకే పరిమితమయ్యేవారు; గుర్రాల సహాయంతో తప్ప ఆ వ్యవసాయం సాధ్యమయ్యేది కాదు. ప్రతి 100 ఎకరాలకు సగటున అరుదుగా ఒక గుడిసె వుండేది. ఉదాహరణకు, ఒక చిత్తడి భూమి రైతు విచారణాసంఘం ముందు ఈ విధంగా సాక్ష్యం చెప్పాడు. "నేను 320 ఎకరాల సాగుకు లాయకైన చిత్తడి భూమిలో వ్యవసాయం చేస్తాను. నా పొలంలో ఒక్క గుడిసె కూడా లేదు. నా పొలంలో ఇప్పుడు ఒక్కడే కార్మికుడు పనిచేస్తున్నాడు. నా దగ్గర గుర్రాలతో వ్యవసాయం చేసేవారు నల్గురున్నారు. తేలికరకం పనులన్నీ ముఠాతో చేయిస్తాను"[2] కలుపు తీయడం, చదును చేయడం, ఎరువులు వేయడం, రాళ్ళు ఏరడం లాంటి తేలికరకం పనులు ఈ భూమికి చాలా అవసరం. ఈ పనులన్నీ కూడా ముఠా కూలీలతోనో లేక సన్నకారు గ్రామాల్లో జట్లుగా ఏర్పడిన కార్మికులతోనో చేయిస్తారు.

---

1. "సిక్స్ అండ్ లాస్ట్ రిపోర్ట్ ఆఫ్ ది చిల్డ్రన్స్ ఎంప్లాయిమెంట్ కమిషన్" 1867 మార్చి మాసాంతంలో ముద్రించబడింది. వ్యవసాయంలో ముఠా కార్మిక విధానాన్ని గురించి ఈ గ్రంథం విశదీకరిస్తుంది.
2. పై గ్రంథమే ; సాక్ష్యం 173. పు. 37.

ఈ ముఠాల్లో 10 నుండి 40 లేక 50 మంది వ్యక్తులుంటారు. అందులో స్త్రీలు, యువకులూ, యువతులూ (13–18 సంవత్సరాల మధ్య వయస్సున్న వారు) ఉంటారు. వారిలో కూడా 13 సంవత్సరాల పైబడిన యువకులను దాదాపుగా మినహాయిస్తారు. చిన్న పిల్లలే (6–13 సంవత్సరాల మధ్య వయస్సు గలవారు) ఎక్కువగా వుంటారు. దీని నాయకుణ్ణి ముఠా మేస్త్రీ అంటారు. సాధారణంగా తక్కువ స్థాయి మనిషిగా భావించబడే వ్యవసాయ కార్మికుడే అతను. నిలకడ లేకుండా, దుడుకుగా తాగిన మత్తులో వున్నప్పటికీ, వ్యవహార దక్షతతో సమయోచితంగా ప్రవర్తిస్తాడు. ముఠాను అతనే కూడగడతాడు; రైతు ఆధ్వర్యంలో గాక. అతని ఆధ్వర్యంలోనే ముఠా పని చేస్తుంది. ఈ ముఠా చేత కట్టుకూలికి పని చేయించడానికి రైతుతో ఒప్పందానికి వస్తాడు. "సాధారణ వ్యవసాయ కార్మికుడికి వచ్చే ఆదాయానికి మించి అతని సగటు ఆదాయం ఎక్కువగా వుండదు.[1] అదీ కూడా అతని ముఠా ద్వారా అతి స్వల్పకాలంలో అవకాశమున్న మేరకు నేర్పరితనంతో చేయించే పనిని బట్టి వుంటుంది. పురుషుల పెత్తనం కిందే స్త్రీలు సక్రమంగా పని చేస్తారనీ, అయితే ఒకసారి పనిలోకి దిగిన తర్వాత స్త్రీలు గానీ, పిల్లలు గానీ ఫోరియర్ చెప్పినట్లుగా జవసత్వాలొడ్డి చాలా చురుగ్గా పని చేస్తారనీ అదే సమయంలో పురుషులు మాత్రం చాలా తెలివిగా తమ శక్తిని అవకాశమున్న మేరకు ఆదా చేసుకుంటారనీ రైతులకు బాగా తెలుసు. ముఠా మేస్త్రీ ఒక్కొక్క కమతం చుట్టూ తిరిగి సంవత్సరంలో 6 లేక 8 నెలల పాటు తనముఠా జనానికి పనులు ఏర్పాటు చేస్తాడు. అందువలన అడపాదడపా చిన్న పిల్లలను మాత్రమే కమతంలో పెట్టుకునే రైతు చుట్టూ తిరిగే దానికి బదులుగా వ్యవసాయ కార్మిక కుటుంబాలకు ముఠా మేస్త్రీ ద్వారా సంపాదించే పని ఖాయంగానూ ఎక్కువ ఆకర్షణీయంగానూ వుంటుంది. ఈ పరిస్థితి మూలంగా సన్నకారు గ్రామాల్లో, అతని పలుకుబడి బాగా "బిగిసిపోయినందు వల్ల" అతని ద్వారా మాత్రమే చిన్న పిల్లలకు కమతాలకు మాట్లాడుకోవడం కుదురుతుంది. ముఠాతో నిమిత్తం లేకుండా కుర్రకారుని ఈ పద్ధతిలో కమతాలకు కుదర్చడం అతని రెండవ వ్యాపారంగా వుంటుంది.

చిన్న పిల్లలకూ, యువకులకూ పని భారం ఎక్కువ గావడం, రోజూ 5, 6 కొన్ని సందర్భాలలో 7 మైళ్ళు పర్యంతం నడిచి పొలం పనులకు వెళ్ళడం, పర్యవసానంగా ముఠాను అలుముకొని వుండే నిరుత్సాహం ఈ విధానంలో వుండటం ప్రధాన 'లోపం'. కొన్ని జిల్లాల్లో "చోదకుడుగా" పిలవబడే ఈ ముఠా మేస్త్రీ కర్రచేత పట్టుకుని జనాన్ని పనులకు అదలాయిస్తూన్నప్పటికీ, దానిని బహు అరుదుగా ఉపయోగిస్తాడు; పాశవికంగా ప్రవర్తించాడనే ఫిర్యాదు అరుదుగా వింటాం. అతనొక ప్రజాస్వామ్యయుతమైన చక్రవర్తి లేక హామ్లెన్‌కు చెందిన పెడ్ వైపర్ లాంటి వాడు. అందువలన అతను తన ముఠా జనంతో చాలా కలుపుగోలుగా వుంటాడు; అతని ఆధ్వర్యంలో నిర్విఘ్నంగా సాగుతున్న సంచార జీవితపు ఆకర్షణలో ఆ జనాన్ని తనకు బందీలను చేసుకుంటాడు. మొరటైన స్వాతంత్ర్యం, ఉల్లాసంతో కూడిన కేరింతలూ, అరమరికలు లేని అశ్లీలం ఆ ముఠాను ఆకర్షిస్తాయి. సాధారణంగా అక్కడున్న సారాయి దుకాణం దగ్గరే తన ముఠా సభ్యులతో అతను లావాదేవీలను పరిష్కరించుకుంటాడు. ఆ తర్వాత ముఠా సభ్యులంతా మేస్త్రీ నాయకత్వంలో గుంపుగా బయలు దేరతారు; తాగిన మైకంలో

1. ముఠా కార్మిక నాయకులలో కొంతమంది 500 ఎకరాల పొలాన్ని సంపాదించే వరకూ పెరిగారు; లేక అనేకమైన ఇండ్ల సముదాయాలను నిర్మించేవరకూ సంపాదించారు.

తూలుతూ మగరాయుళ్ళు లాంటి యుక్తవయస్సులో వున్న ఇద్దరు స్త్రీలు అతనికిరువైపులా ఆసరా ఇవ్వగా ఆ మేస్త్రి ముందు నడుస్తాడు. చిన్నపిల్లలూ, యువకులూ ఉత్సాహంతో గందరగోళంగా కల్పితమైన అశ్లీల పాటలు పాడుకుంటూ వెనుక భాగంలో నడుస్తారు. ఫోరియర్ చెప్పినట్లుగా "విశృంఖల లైంగిక సంబంధాల"లో మునిగితేలుతూ తిరుగు ప్రయాణం కడతారు. 13 లేక 14 సంవత్సరాల వయస్సు కలిగిన ఆడపిల్లలకు ఆ ముఠాలోనే అదే వయస్సులో వున్న కుర్రకారుతో శారీరక సంబంధాలున్నందువల్ల చిన్న వయస్సులోనే గర్భిణీలవుతారు. పర్యవసానంగా ఈ ముఠాలకు జనాన్ని సమకూర్చే ఆ సన్నకారు గ్రామాలు సోడామ్యగానూ, గొంమొర్రాస్‌గానూ తయారవుతాయి.[1] ఫలితంగా దేశంలో ఎక్కడా లేనంత ఎక్కువగా, దాదాపు రెండురెట్లు ఎక్కువ శాతంలో అక్రమ సంతానం జన్మించేది. ఈ ముఠాలలో జీవిత పాఠాలు నేర్చుకున్న బాలికలకు వివాహమైన తర్వాత అలవడే నైతిక లక్షణాలను గతంలో పరిశీలించాం. వారి పిల్లలను నల్లమందు మట్టుపెట్టకపోతే భవిష్యత్తులో ఈ ముఠాలకు ఆ పిల్లలే జన్మతహా సభ్యులవుతారు.

దాని సాంప్రదాయక రూపంలో ఇంతకు ముందే విశదీకరించబడిన ఈ ముఠాను బహిరంగ ముఠా అనీ లేక సాధారణ ముఠా అనీ లేక సంచార ముఠా అని పిలుస్తారు. వీటితో పాటు ప్రయివేటు ముఠాలు కూడా వున్నాయి. ఈ ముఠాలు కూడా సాధారణ ముఠాల్లాగే ఏర్పరచబడతాయి; అయితే ఇందులో తక్కువ మంది జనం వుంటారు; పైగా ముఠా మేస్త్రీ ఆధ్వర్యంలో ఇవి పని చెయ్యవు; రైతు దగ్గర ఎందుకూ కొరగాకుండా వున్న ఒక వృద్ధునిగానూ ఆధ్వర్యంలో ఈ ముఠా పని చేస్తుంది. సంచార ముఠాల్లో వుండే ఉల్లాస కేరింతలు ఇందులో వుండవు సరికదా సాక్ష్యాధారాలను బట్టి ఇందులో చిన్న పిల్లలను చాలా క్రూరంగా హింసిస్తారని చెప్పాలి.

గత కొంతకాలంగా అమలులో వుండి అభివృద్ధి చెందుతూ వున్న ఈ ముఠా విధానం కేవలం ముఠా మేస్త్రీ కోసం అవతరించలేదనేది స్పష్టమే.[2] ధనిక రైతుల[3] సంపన్నతను వృద్ధి చేయడానికి పరోక్షంగా భూస్వామ్య వర్గాల[4] సిరిసంపదలను పెంపొందించడానికీ ఈ విధానం అమలులో వుంది. కార్మికులను సాధారణ స్థాయికన్నా తక్కువస్థాయిలో వుంచడానికి ఏ సందర్భంలోనైనా అదనపు పని

---

1. "లుడ్‌ఫోర్డ్‌లోని సగం మంది బాలికలు నాశనమై పోయారు" (ముఠాల్లో చేరడం మూలంగా) పై గ్రంథమే. పు. 6. స. 32.
2. "ఈ మధ్యకాలంలో అవి (ముఠాలు) చాలా ఎక్కువగా పెరిగాయి. కొన్ని ప్రదేశాల్లో ఈ విధానం ఈ మధ్యకాలంలోనే ప్రవేశిస్తుంది; ఇతర ప్రదేశాల్లో ఈ ముఠాలు.... బహుకాలం నుండి అమల్లో వున్నాయి... అందులో ఎక్కువగా చిన్నపిల్లలు నియోగించబడేవారు" (పై గ్రంథమే. పు. 79; స. 174)
3. "సన్నకారు రైతులు ఈ ముఠాలను ఎప్పుడూ నియమించరు" "40 నుండి 50 షిల్లింగులు కౌలు సంపాదించగలిగిన భూముల్లో తప్ప, తక్కువ సారవంతమైన భూముల్లో స్త్రీలను గానీ, పిల్లలను గానీ ఎక్కువ సంఖ్యలో నియమించరు" (పై గ్రంథమే. పుటలు 17, 14)
4. విచారణ సంఘం ఎదుట సాక్ష్యం ఇచ్చిన పెద్ద మనుషుల్లో ఒకాయనకు మాత్రం ఈ కౌలు ఎంత లాభదాయకంగా ఉందంటే ముఠా విధానం అనే పేరు మూలంగానే ఈ గడబిడ అంతా జరుగుతుందని చాలా కోపంగా అన్నాడు. దానికి బదులుగా "ఈ ముఠాను" అధునాతన వ్యవసాయ పారిశ్రామిక స్వయం పోషక సంఘం"గా పిలిచినట్లయితే అన్ని విషయాలు చక్కబడతాయి!

చేయడానికి అదనపు కార్మికుడు సిద్ధంగా దొరికే దానికి అతి తక్కువ వ్యయంతో[1] సాధ్యమైనంత ఎక్కువ శ్రమను దోపిడీ చేయడానికి వయోజనుడైన పురుష కార్మికుణ్ణి "అదనం గావించడానికి" ఇంతకన్నా తెలివైన పద్ధతి మరొకటి లేదు. ఒకవైపున వ్యవసాయ కార్మికులకు తక్కువగానీ లేక ఎక్కువగానీ పని దొరకడం లేదని చెప్పడంలోనూ అదే సమయంలో దానికి భిన్నంగా వయోజనులైన పురుష కార్మికులు కొరతగా వున్నారనీ, వారు పట్టణ ప్రాంతాలకు వలస పోతున్నారనీ చెప్పడంలోనూ వున్న ఆంతర్యాన్ని పై విశ్లేషణ ద్వారా గ్రహించగలం.[2] లింకన్‌షైర్‌లో కలుపు తియ్యబడి శుభ్రంగా వున్న భూములూ అపరిశుభ్రంగా వున్న మానవ కలుపు మొక్కలూ పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానానికి ఉత్తర దక్షిణ ధ్రువాలుగా వున్నాయి.[3]

---

1. "ఇతర పని కన్నా ముఠాతో చేయించే పనే చౌకగా వుంటుంది. అందువల్లనే వారిని నియమిస్తారు" అని మాజీ ముఠా మేస్త్రీ అంటాడు. (పై గ్రంథమే. పు. 17 సా. 14) "ఈ ముఠా విధానం నిస్సందేహంగా రైతుకి చౌకగా వుంటుంది; నిస్సందేహంగా చిన్న పిల్లలకు నికృష్టమైంది"అని ఒక రైతు అంటాడు. (అదే గ్రంథం. పు. 16, స. 3)
2. "గతంలో పురుషులూ స్త్రీలు చేసేపనిలో ఎక్కువ భాగాన్ని ఇప్పుడు ముఠాలో వున్న చిన్నపిల్లలు చేస్తున్నారనడంలో ఎట్టి సందేహం లేదు. గతంలోకన్నా ఇప్పుడు ఎక్కడైతే స్త్రీలు, చిన్నపిల్లలూ ఎక్కువగా పనిలో నియమించబడ్డారో అక్కడే ఎక్కువగా పురుషులు నిరుద్యోగులైనారు" (అదే గ్రంథం పు. 43, సా. 202) మరో వైపున "కొన్ని వ్యవసాయ జిల్లాల్లో ప్రత్యేకించి సాగుకు లాయకైన భూములున్న ప్రాంతాల్లో శ్రామికులు వలసపోతున్న పర్యవసానంగా "శ్రామిక సమస్య" రానురాను తీవ్రరూపం ధరించింది. నా అభిప్రాయంలో" (నా అనగా ఇక్కడ సాక్ష్యం చెప్తున్న పెద్ద భూస్వామి) పెద్ద పట్టణాలకు రవాణా చేయడానికి రైల్వేలు సౌకర్యాలను కలిగిస్తున్నందువల్ల చిన్నపిల్లల సేవలు అత్యంత ఆవశ్యకంగా వుంటాయి" (అదే గ్రంథం; పుట 80. సా. 180) నాగరిక ప్రపంచంలోని ఇతర ప్రాంతాలకు విభిన్నంగా ఇంగ్లీషు వ్యవసాయ జిల్లాల్లోని "శ్రామిక సమస్య" అంటూ భూస్వాముల, రైతుల సమస్యే! అనగా నిరంతరాయంగా వలసపోతున్న వ్యవసాయ జనాభా పెరుగుతున్నప్పటికీ, వ్యవసాయ కార్మికులకు కనిష్ట వేతనాలివ్వడం ద్వారా, సరిపోయినంత సాపేక్ష అదనపు జనాభాను వుంచడం ఏ విధంగా సాధ్యమవుతుంది?
3. చిన్నపిల్లల మరణాలకు సంబంధించిన అంశాలను గురించి విశదీకరించేటప్పుడు సందర్భవశాత్తూ ముఠా విధానాన్ని గురించి తెలియజేసిన "పబ్లిక్ హెల్త్ రిపోర్ట్" వార్తాపత్రికలకు తెలియనందున ఇంగ్లీషు ప్రజానీకానికి కూడా తెలియడానికి అవకాశం లేదు. మరోవైపున "చైల్డ్ ఎంప్లాయిమెంట్ కమిషన్" చివరి నివేదిక మాత్రం వార్తాపత్రికలు సంచలనాత్మక వార్తలనందిలచే ఆహ్వానించదగిన నివేదికగా మారిపోయింది. ఈ విధమైన విధానం వారికళ్ళ ముందే తమ సంస్థానాల్లో ఏ విధంగా అవతరించిందో తెలియజేయమంటూ లింకన్ షైర్‌లో "గుంపుగా" సంచరించే నాగరికమైన పెద్ద మనుషులనూ, 'దక్షిణ సముద్రతీర ప్రాంతాలలో జీవించే ద్వీపవాసులకు నీతివాక్యాలను పంపుతూ, బాగా ఆదాయాలార్జించే మతాధికారులనూ, ఉదారవాద భావాలు గలిగిన పత్రికలు నిగ్గదీయగా తమ పిల్లలను బానిసలుగా అమ్ముకోడానికి వెనుదీయని వ్యవసాయ జనాభా నికృష్ట జీవితాన్ని మాత్రమే దర్పం పట్టడంతో సరిపుచ్చు కొన్నాయి. మరికొన్ని నాజుకైన పత్రికలు! "నాజూకైన" పెద్ద మనుషుల చేత ఈ విధమైన హేయమైన స్థితికి నెట్టబడిన వ్యవసాయ కార్మికులకు తమ పిల్లలను తామే "భక్షించడంలో" ఇసుమంతైనా ఆశ్చర్యంలేదు! మానవ వ్యక్తిత్వంలోని ఆరోగ్యకరమైన ఔన్నత్యంలోని ఎక్కువ భాగాన్ని ఆ వ్యవసాయ కార్మికుడు ఇంకా పుణికి పుచ్చుకొని వుండటమే ఆశ్చర్యం! ఈ ముఠా విధానం పనిచేసే జిల్లాల్లో పిల్లల తల్లిదండ్రులు సహితం, ఈ విధానాన్ని అసహ్యించుకుంటున్నారని అధికారిక నివేదికలు వెల్లడిస్తున్నాయి. "తరచుగా అనేక ప్రలోభాలకూ, వత్తిళ్ళకూ లొంగిపోకుండా నిలబడటానికి అవసరమైన చట్టపరమైన సలహాలను పొందటానికి చిన్నపిల్లల తల్లిదండ్రులు అనేకమంది ముందుకు వస్తున్నారని చెప్పడానికి అనేక ఉదంతాలు ఈ సాక్ష్యాల్లో కనిపిస్తాయి. ఉద్యోగం నుండి తొలగిస్తారనే భయంతో "పారిష్"లో వుండే

## (ఊ) ఐర్లండ్

ఈ ప్రకరణాన్ని ముగించబోయే ముందు ఐర్లండ్‌ను గురించి కొంత తెలుసుకోవాలి. ముందుగా ప్రధానాంశాలను పరిశీలిద్దాం.

1841 నాటికి ఐర్లండ్ జనాభా 82,22,644కు చేరుకుంది. 1851లో అది 66,23,985కు తగ్గిపోయింది; 1861లో 58,50,309కు, 1866లో 55 లక్షలకూ పడిపోయి, చివరికి 1801 స్థాయికి క్షీణించింది. 1846లో సంభవించిన క్షామంతో ఈ క్షీణత ప్రారంభమయింది. 20 సంవత్సరాలలో తన జనాభాలో 5/16 వంతులకు మించి ఐర్లండ్ కోల్పోయింది.[1] 1851 మే నెల నుండి 1865 జులై మాసం వరకూ వున్న మధ్యకాలంలో ఐర్లండ్ జనాభాలో 15,91,487 మంది వలసపోయారు. 1861–65 మధ్యకాలంలో 5 లక్షలకు మించి వలస పోయారు. మధ్య కాలంలో నివాసముంటున్న ఇండ్లలో 52,990 ఇండ్లు తగ్గిపోయాయి. 1851–61 మధ్య కాలంలో 15 నుంచి 30 ఎకరాలున్న కమతాలు 61,000 కూ, 30 ఎకరాలు పై చిలుకున్న కమతాలు 1,09,000కి పెరిగితే మొత్తం వ్యవసాయ కమతాలలో 1,20,000 క్షీణించాయి. 15 ఎకరాలలోపు వున్న కమతాలు నాశనమై పోవడం మూలంగానే, మరో విధంగా చెప్పాలంటే భూ కేంద్రీకరణ మూలంగానే, మరో విధంగా చెప్పాలంటే భూ కేంద్రీకరణ మూలంగానే కమతాల సంఖ్య క్షీణించింది.

**పట్టిక (అ)**

**పశు గుణం**

| సంవత్సరం | గుర్రాలు | | పశువులు | | |
|---|---|---|---|---|---|
| | మొత్తం సంఖ్య | తరుగుదల | మొత్తం సంఖ్య | తరుగుదల | పెరుగుదల |
| 1860 | 6,19,811 | | | 36,06,374 | |
| 1861 | 6,14,232 | 5,579 | 34,71,688 | 1,34,686 | |
| 1862 | 6,02,894 | 11,338 | 32,54,890 | 2,16,798 | |
| 1863 | 5,79,978 | 22,916 | 31,44,231 | 1,10,659 | |
| 1864 | 5,62,158 | 17,820 | 32,62,294 | | 1,18,063 |
| 1865 | 5,47,867 | 14,291 | 34,93,414 | | 2,31,120 |

ఉన్నతోద్యోగులూ, అప్పుడప్పుడూ సామాన్య ఉద్యోగులు... సహితం పాఠశాలల్లో పిల్లలకు అవసరమైన హాజరు సరిపోలేదనే నెపంతో... ఆ చిన్న వయస్సులోనే పిల్లలను పనిలోకి పంపించమని వారిని తప్పక అర్థిస్తారు... కార్మికుడూ, అతని పిల్లలూ చేసిన అదనపు శ్రమకు ఏ విధమైన లాభం చేకూరదు. సరికదా ఆ సమయమూ, శక్తి నిరుపయోగమవుతాయి; గుడిసెల్లో కిక్కిరిసి జీవించడం మూలంగా శ్రామికుల పిల్లల్లో వున్న సున్నితత్వం నైతికంగా పతనంగావడాన్నీ లేక ఈ ముఠాల మూలంగా సంక్రమించిన అంటువ్యాధులు వగైరాలు శ్రమజీవుల మస్తిష్కాలకు ఎనలేని ప్రోత్సాహకాలుగా వుంటాయనీ మనం సులభంగానే గ్రహించవచ్చు. దీనిని ప్రత్యేకంగా పేర్కొనవలసిన అవసరం కూడా లేదు. తమతో ఏ మాత్రమూ సంబంధం లేని కారణాల మూలంగా తాము శారీరక మానసిక బాధలకు గురిచెయ్యబడు తున్నామనే చైతన్యం వారిలో తప్పకవుండి వుంటుంది. వారి ఆధీనంలోనే ఈ కారణాలన్నీ ఉన్నట్లయితే, బహుశా వారు ఆ పనికి నిరాకరించి ఉండేవారేమో! అయితే వీటికి వ్యతిరేకంగా పోరాడటానికి వారు శక్తిహీనులు'' (చూడు, పై గ్రంథం పు. 20 సా. 82 మరియు 23, సా. 96)

1. ఐర్లాండ్ జనాభా 1801లో 5,319,867 మంది; 1811లో 6,084,996 మంది; 1821లో 6,869,54 మంది; 1831లో 7,828,347 మంది; 1841లో 8,222,664 మంది.

పట్టిక (ఆ)

**పశు గుణం**

| సంవత్సరం | గొర్రెలు | | | పందులు | | |
|---|---|---|---|---|---|---|
| | మొత్తం సంఖ్య | తరుగుదల | పెరుగుదల | మొత్తం సంఖ్య | తరుగుదల | పెరుగుదల |
| 1860 | 35,42,080 | ... | .... | 12,71,072 | ... | ... |
| 1861 | 35,56,050 | ... | 13,970 | 11,02,042 | 1,69,030 | ... |
| 1862 | 34,56,132 | 99,918 | ... | 11,54,324 | ... | 52,282 |
| 1863 | 33,08,204 | 1,47,982 | ... | 10,67,458 | 86,866 | ... |
| 1864 | 33,66,941 | ... | 58,737 | 10,58,480 | 8,978 | .... |
| 1865 | 36,88,742 | ... | 3,21,801 | 12,99,893 | ... | 2,41,413 |

జనాభా క్షీణతతో పాటుగా సహజంగా ఉత్పాదితాలు కూడా క్షీణించాయి. 5 లక్షల మంది వలసపోయి, మొత్తం ప్రజానీకంలో సుమారుగా మూడున్నర లక్షల మంది క్షీణించిన కాలమైన 1861-65 మధ్య 5 సంవత్సరాల కాలాన్ని మనం పరిగణనలోకి తీసుకుంటే మన పరిశీలనకు సరిపోతుంది. పై పట్టికలను బట్టి ఈ క్రింది ఫలితాలు వస్తాయి. :

| గుర్రాలు | పశువులు | గొర్రెలు | పందులు |
|---|---|---|---|
| నిరపేక్ష తరుగుదల | నిరపేక్ష తరుగుదల | నిరపేక్ష పెరుగుదల | నిరపేక్ష పెరుగుదల |
| 71,944 | 1,12,960 | 1,46,662 | 28,821[1] |

మనుషులకూ, పశువులకూ, జీవనాధారమైన వ్యవసాయాన్ని గురించి ఇప్పుడు కొన్ని వివరాలు తెలుసుకుందాం. దిగువ ఇచ్చిన పట్టికలో ప్రతి సంవత్సరంలోని పెరుగుదలనూ, తరుగుదలనూ; అంతకు ముందు సంవత్సరాలతో పోల్చుతూ వివరాలు పొందుపరచబడ్డాయి. గోధుమ, ఓట్సు, బార్లీ, రై, చిక్కుళ్ళూ, బఠానీలూ లాంటి ఆహార ధాన్యాలూ, బంగాళా దుంపలూ, టర్నిప్స్, మాంగోల్డ్స్, బీట్‌రూట్, క్యాబేజీ, క్యారెట్, పార్స్నిప్స్, వెచెస్ లాంటి వాణిజ్యపు పంటలూ ప్రధానమైనవి.

**పంట భూములూ, పశుగ్రాస భూముల విస్తీర్ణంలో పెరుగుదలా లేక తరుగుదల**

పట్టిక (ఇ)

| సంవత్సరం | ఆహార ధాన్యాలు | వాణిజ్య పంటలు | | పశుగ్రాసం | | నార | | సాగులో వున్న మొత్తం భూమి | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| | తరుగుదల | తరుగుదల | పెరుగుదల | తరుగుదల | పెరుగుదల | తరుగుదల | పెరుగుదల | తరుగుదల | పెరుగుదల |
| 1861 | 15,701 | 36,974 | | 47,969 | | | 19,271 | 81,373 | |
| 1862 | 72,734 | 74,785 | | | 6,623 | | 2,055 | 1,38,841 | |
| 1863 | 1,44,719 | 19,358 | | | 7,724 | | 63,922 | 92,431 | |
| 1864 | 1,22,437 | 2,317 | | | 47,486 | | 87,761 | | 10,493 |
| 1865 | 72,450 | | 25,241 | | 68,970 | 50,159 | | 28,398 | |
| 1861-65 | 4,28,041 | 1,08,193 | | | 82,834 | | 1,22,850 | 3,30,350 | |

1. ఇంకా వెనక్కు వెళ్ళినట్లయితే, ఈ ఫలితం ఇంకా అననుకూలంగా వుంటుంది. ఆ విధంగా చూసినపుడు

'ఎవరూ ఆక్రమించని నిరుపయోగమైన చిత్తడి భూములు" 1,01,543 ఎకరాలకు తగ్గిపోయి నందుచేతనే 1865లో 1,27,470 ఎకరాలు అదనపు భూమి పచ్చిక భూముల ఖాతాలో చేరింది. 1864లో 1865వ సంవత్సరాన్ని పోల్చినట్లయితే ఆహార ధాన్యాల పంట భూములు 2,46,667 పాతికలు (పాతిక అనగా ఎకరాకన్నా కొద్దిగా తక్కువ – అనువాదకుడు) తగ్గిపోయాయి; అందులో 48,999 పాతికలు (క్వార్టర్స్) గోధుమ పంట, 1,60,605 పాతికలు వోట్సు, 29,892 పాతికలు బార్లీ భూములూ వున్నాయి. బంగాళా దుంపలు పండించే భూమి 1865లో పెరిగినప్పటికీ వాటి ఉత్పత్తి, 4,46,398 టన్నులు పడిపోయింది.

ఐర్లండ్ దేశ జనాభానూ, వ్యవసాయ ఉత్పత్తుల వివరాలనూ పరిశీలించిన తర్వాత ఆ దేశ భూస్వాముల, పెద్ద రైతుల, పారిశ్రామిక పెట్టుబడిదార్ల ఆదాయాలను గురించి తెలుసుకుందాం. వారి ఆదాయాల పెరుగుదల లేక తరుగుదల వారు చెల్లించే ఆదాయం పన్ను ద్వారా కొంత విదితమవుతుంది. ఆదాయ పన్ను వివరాలకున్న అనుబంధం 'ఈ'లో న్యాయవాదుల, డాక్టర్ల తదితరులైన వారి ఆదాయాలు కూడా వున్నాయని మనం గుర్తుంచుకోవాలి. (ఇందులో రైతుల ఆదాయాలు మినహాయించబడ్డాయి) అనుబంధ అనుబంధం 'ఇ' మరియు 'ఉ'లలో ఏ ప్రత్యేక వివరాలనూ ఇవ్వనప్పటికీ అందులో ఉద్యోగస్తుల, అధికారుల, ఫించనుదార్ల తదితరమైన గౌరవ వేతనాలు పొందే వారి ఆదాయాలూ, బ్యాంకర్ల ఆదాయ వివరాలు కూడా వున్నాయి.

| ఉత్పాదితం | సాగులో వున్న భూమి (ఎకరాలలో) | | 1865లో | | ఎకరా దిగుబడి | | |
|---|---|---|---|---|---|---|---|
| | 1864 | 1865 | పెరుగుదల | తరుగుదల | 1864 | | 1865 |
| గోధుమలు | 2,76,483 | 2,66,989 | | 9,494 | హండ్రడ్ వెయిల్ | 13.3 | 13.0 |
| ఓట్లు | 18,14,886 | 17,45,228 | | 69,658 | హండ్రడ్ వెయిల్ | 12.1 | 12.3 |
| బార్లీ | 1,72,700 | 1,77,102 | 4,402 | | హండ్రడ్ వెయిల్ | 15.9 | 14.9 |
| బేర్ } | 8,894 | 10.091 | 1,197 | | హండ్రడ్ వెయిల్ | 16.4 | 14.8 |
| రై } | | | | | హండ్రడ్ వెయిల్ | 18.5 | 10.4 |
| బంగాళదుంప | 10,39,724 | 10,66,260 | 26,536 | | టన్నులు | 4.1 | 3.6 |
| టర్నిప్స్ | 3,37,355 | 3,34,212 | | 3,143 | టన్నులు | 10.3 | 9.9 |
| మాంగోల్డ్ | 14,075 | 14,339 | 316 | | టన్నులు | 9.3 | 13.3 |
| క్యాబేజి | 31,821 | 33,622 | 1,801 | | పౌన్లు | 9.3 | 10.4 |
| నార | 3,01,693 | 2,51,433 | | 50,260 | పౌన్లు | 34.2 | 25.2 |
| హే | 16,09,569 | 16,78,493 | 68,924 | | టన్నులు | 1.6 | 1.8 |

గొర్రెలు 1865లో 3,688,742 కాగా, 1856లో 3,694,294. పందులు 1865లో 1,299,893 కాగా 1858లో 1,409,883.

| 1865లో | | మొత్తం ఉద్పాదితం | | | |
|---|---|---|---|---|---|
| పెరుగుదల, తరుగుదల | | 1864 | 1865 | 1865 లో | |
| | | | | పెరుగుదల | తరుగుదల |
| - | 03 | 8,75,782 పాతికలు | 8,26,783 పాతికలు | | 48,999 పాతికలు |
| 0.2 | | 7,82,332 పాతికలు | 76,59,727 పాతికలు | | 1,66,605 పాతికలు |
| | 1.0 | 7,61,909 పాతికలు | 7,32,017 పాతికలు | | 29,892 పాతికలు |
| | 1.6 | 15,160 పాతికలు | 13,989 పాతికలు | | 1,171 పాతికలు |
| 1.9 | | 12,680 పాతికలు | 18,364 పాతికలు | 5,684 పాతికలు | - |
| | 0.5 | 4,312,388 టన్నులు | 3,865,990 టన్నులు | - | 4,46,398 టన్నులు |
| | 0.4 | 3,467,659 టన్నులు | 3,301,683 టన్నులు | - | 1,65,976 టన్నులు |
| 2.8 | | 1,47,284 టన్నులు | 1,91,937 టన్నులు | 44,653 టన్నులు | - |
| 1.1 | | 2,97,375 టన్నులు | 3,50,252 టన్నులు | 52,877 టన్నులు | - |
| | 9.0 | 64,506 స్టోన్ | 39,561 స్టోన్ | - | 24,945 స్టోన్ [1] |
| 0.2 | | 2,607,153 టన్నులు | 3,068,707 టన్నులు | 4,61,554 | - |

**పట్టిక (ఈ)**

**అనుబంధంలో చేర్చిన ఆదాయాలపై ఆదాయపు పన్ను (పౌండ్లలో)**

| | 1860 | 1861 |
|---|---|---|
| అనుబంధం (అ) | | |
| భూమి కౌలు | 13,893,829 | 13,003,554 |
| అనుబంధం (ఆ) | | |
| రైతుల లాభాలు | 2,765,387 | 2,773,644 |
| అనుబంధం (ఈ) | | |
| పారిశ్రామిక రంగం వగైరా లాభాలు | 4,891,652 | 4,836,203 |
| "అ" నుండి "ఉ" వరకు | 22,962,885 | 22,998,394 |

1. "అగ్రికల్చరల్ స్టాటిస్టిక్స్. ఐర్లండ్ జనరల్ అబ్‌స్ట్రాక్టు : డబ్లిన్ 1860" నుండి మరియు "అగ్రికల్చరల్ స్టాటిటిక్స్, ఐర్లాండ్, టేబుల్స్ షోయింగ్ ది ఎస్టిమేటెడ్ ఆవరేజ్ ప్రొడ్యూస్, డబ్లిన్, 1866" నుండి ఈ సమాచారమంతా సేకరించబడింది. ఈ గణాంక సమాచారమంతా అధికారయుతంగా ప్రతి సంవత్సరం పార్లమెంట్‌కు సమర్పించేది. (రెండవ ముద్రణకు ఒక నోట్ : 1871వ సంవత్సరంతో పోల్చితే 1872 సాగులోవున్న భూమి 134,915 ఎకరాలకు తగ్గిపోయిందని గణాంక సమాచారం తెలియజేస్తుంది. వాణిజ్య పంటలూ, దినుసులూ వగైరాల సాగులో కొంత పెరుగుదల కనిపించింది. గోధుమ పంట సాగు భూమిలో 16,000 ఎకరాలు, ఓట్సు 14,000 ఎకరాలు, బార్లీ 400 ఎకరాలు, బంగాళాదుంపలు 66,632 ఎకరాలు, నార 34,667 ఎకరాలు, గడ్డి వగైరాలు 30,00 ఎకరాలు తగ్గిపోయింది. 1868లో 285,000 ఎకరాలు, 1872లో 228,000 ఎకరాలు; 1872లో 2600 గుర్రాలు; 80,000 పశువులూ, 68,609 గొర్రెలూ పెరగ్గా, 2,36,000 పందులు తగ్గిపోయాయి)

అనుబంధం 'ఈ' ప్రకారం 1853–64 మధ్య కాలంలో ఆదాయం, సంవత్సరానికి సగటున ఐర్లాండ్‌లో 0.93 శాతం పెరిగితే, అదే కాలంలో గ్రేట్ బ్రిటన్‌లో 4.58 శాతం పెరిగింది. పట్టిక 'ఉ'లో 1864–65 సంవత్సరాలలో లాభాల పంపిణీ వివరాలు ఇవ్వబడ్డాయి. (ఇందులో రైతులు మినహాయించబడ్డారు)

**పట్టిక (ఉ)**

**లాభాల నుండి 60 పౌ. మించి అనుబంధం'ఈ'కి వచ్చిన ఆదాయం**

| | 1864 | | 1865 | |
|---|---|---|---|---|
| | పౌండ్లు | ఈ క్రింది వ్యక్తుల మధ్య పంపిణీ చేయబడింది | పౌండ్లు | ఈ క్రింది వ్యక్తుల మధ్య పంపిణీ చేయబడింది |
| 1. వార్షిక మొత్తం ఆదాయం | 4,368,610 | 17,467 | 4,669,979 | 18,081 |
| 2. వార్షిక ఆదాయం ..... 60 పౌ. మించి 100 పౌ.లోపు | 2,38,726 | 5,015 | 222,575 | 4,703 |
| 3. వార్షిక ఆదాయంలోని ఈ భాగాన్ని | 1,979,066 | 11,321 | 2,028,571 | 12,184 |
| 4. వార్షిక ఆదాయంలో మిగిలిన భాగం | 2,150,818 | 1,131 | 2,418,833 | 1,194 |
| అందులో ........ | 1073906 | 1010 | 1097927 | 1044 |
| | 1076912 | 121 | 1320996 | 150 |
| | 430535 | 95 | 584458 | 122 |
| | 646377 | 26 | 736448 | 28 |
| | 262,819 | 3 | 274,528 | 3[1] |

**అనుబంధంలో చేర్చిన ఆదాయాలపై ఆదాయపు పన్ను (పౌండ్లలో)**

| 1862 | 1863 | 1864 | 1865 |
|---|---|---|---|
| 13,398,938 | 13,494,091 | 13,470,700 | 13,801,616 |
| 2,937,899 | 2,938,923 | 2,930,874 | 2,946,072 |
| 4,858,800 | 4,846,497 | 4,546,147 | 4,850,199 |
| 23,597,574 | 23,658,631 | 23,236,298 | 23,930,340[2] |

పెట్టుబడిదారీ ఉత్పత్తి బాగా అభివృద్ధి చెందిన ప్రధాన పారిశ్రామిక దేశం అయిన ఇంగ్లండ్ నుండి కూడా ఐర్లండ్‌లో వలె జనాభా వలస పోయినట్లయితే, ఆ దేశం జనాభా హరించుకుపోయి

1. గత పట్టికలో పొందుపరచిన దానికన్నా అనుబంధం 'ఈ'లో పొందుపరిచిన వార్షిక ఆదాయాలు కొన్ని మినహాయింపులు రీత్యా విభిన్నంగా వున్నాయి.
2. టెన్త్ రిపోర్ట్ ఆఫ్ ది కమిషనర్స్ ఆప్ ఇన్‌లాండ్ రెవిన్యూ, లండన్, 1866.

నశించిపోయి వుండేది. అయితే ఇంగ్లండూ, ఐర్లండూ విశాలమైన పెద్ద కాలువ చేత వేరుచేయబడిన ప్పటికీ ఇంగ్లండుకు ధాన్యాన్నీ, ఉన్నిని, పశువులనూ, కార్మికులనూ, సైనికులనూ సరఫరా చేసే ఐర్లండ్, ఇంగ్లండ్‌లోని ఒక వ్యవసాయ జిల్లాగా మాత్రమే మిగిలిపోయిది.

ఐర్లండ్ జనాభా తగ్గిపోవడం మూలంగా ఎక్కువ భాగం భూమి సాగుబడికి దూరమైపోయింది; ఫలసాయం గణనీయంగా క్షీణించింది;[1] పశుపెంపకాని కవసరమైన గ్రాసానికి ఎక్కువ భూమిని కేటాయించినప్పటికీ అందులో కొన్నిశాఖల్లో పూర్తి క్షీణతా మరికొన్నిటిల్లో నిరంతరాయమైన అవరోధాలతో చెప్పుకోడానికి కూడా సిగ్గుచేటైన అభివృద్ధి సాధించబడింది. అయినప్పటికీ భూమి కౌలూ, రైతుల లాభాలూ, జనాభా క్షీణించిన విధంగా కాకపోయినప్పటికీ, మొత్తానికి పెరిగాయి. దీనికి కారణమేమిటో సులభంగానే గ్రహించవచ్చు. ఒకవైపున చిన్న కమతాలను పెద్ద కమతాలలో బలాత్కారంగా కలిపివేయడమూ, సాగు చేస్తున్న భూములను పచ్చిక బయళ్ళుగా మార్చివేయడంతో మొత్తం ఉత్పాదితంలోని గణనీయమైన భాగం అదనపు ఉత్పాదితంగా మార్చివేయబడింది. మొత్తం ఉత్పాదితం క్షీణించినప్పటికీ దానిలో భాగమైన అదనపు ఉత్పాదితం మాత్రం పెరిగింది. మరోవైపున గత ఇరవై సంవత్సరాల కాలంలో, ప్రత్యేకించి గత పది సంవత్సరాల కాలంలో ఇంగ్లాండ్ మార్కెట్‌లో మాంసం, ఉన్నీ వగైరాలు ధరలు పెరగడంలో ఈ అదనపు ఉత్పాదితం యొక్క డబ్బు విలువ దాని వాస్తవిక పరిమాణం కంటే ఇంకా వేగంగా పెరిగింది.

వివిధ ఉత్పత్తిదార్ల అధీనంలో నియోగ సాధనాలుగానూ, జీవనాధార సాధనాలుగాను ఉపకరించే ఉత్పత్తి సాధనాలు, పరాయి శ్రమను తమలో ఇముడ్చుకోవడం ద్వారా తమ విలువను పెంచుకోనంత మేరకు, ఉత్పత్తిదారు వినియోగించుకునే సరుకు మాత్రం కాగలవు కానీ 'పెట్టుబడి' మాత్రం కాజాలవు. జనాభా క్షీణతతో పాటుగా వ్యవసాయరంగంలో నియోగించబడిన ఉత్పత్తి సాధనాలరాశి కూడా క్షీణించినట్లయితే, గతంలో వివిధ ఉత్పత్తిదార్ల అధీనంలో వుండే ఉత్పత్తి సాధనాలలో కొంత భాగం సాంద్రీకరించబడి పెట్టుబడిగా మార్చబడినందువల్ల, వ్యవసాయంలో నియోగించబడిన పెట్టుబడి రాశి పెరుగుతుంది.

వ్యవసాయేతర రంగాలైన పారిశ్రామిక, వ్యాపార రంగాలలో నియోగించబడిన ఐర్లండ్ మొత్తం పెట్టుబడి గత రెండు దశాబ్దాల కాలంలో నియమరహితంగా సంభవించే నిరంతరాయమైన ఒడుదుడుకులతో మందకొడిగా సంచయించబడింది; మరోవైపున దాని వైయక్తిక భాగాల సాంద్రీకరణ వేగంగా జరిగింది. జనాభా క్షీణత నిష్పత్తితో పోల్చినపుడు, దాని నిరపేక్ష పెరుగుదల ఎంత తక్కువైనప్పటికీ గణనీయంగానే పెరిగింది.

నిరపేక్ష అదనపు జనాభా మూలంగానే దౌర్భాగ్యం సంక్రమిస్తుందనీ జన క్షీణత పర్యవసానంగా తిరిగి సమతుల్య స్థితిని పొందవచ్చుననే సాంప్రదాయక అర్థశాస్త్ర పిడివాద సూత్రాన్ని సమర్థించుకో డానికి దాని అభీష్టాల కనుగుణంగానే మన కళ్ళముందే భారీ స్థాయిలో ఈ ప్రక్రియ రూపు దిద్దుకుంటుంది. 14వ శతాబ్దపు మధ్యభాగంలో సంభవించిన ప్లేగు జాఢ్యం కంటే కూడా అత్యంత

1. ఎకరా దిగుబడి సాపేక్షకంగా తగ్గిపోయిందంటే, దాదాపుగా ఒకటిన్నర శతాబ్దాల పాటు ఐర్లాండ్ భూసారా న్నంతా ఆ దేశ రైతులు కనీసం పూడ్చుకోవడానికి అవకాశాన్ని గూడా కలుగజేయకుండా, పరోక్షంగా ఇంగ్లాండ్‌కు ఎగుమతి చేసుకున్న విషయాన్ని మనం ఇక్కడ మరిచిపోరాదు.

ప్రమాదకరమైన ఈ ప్రయోగాన్ని మాల్థస్ అనుచరులంతా ప్రశంసించారు. 14వ శతాబ్దపు ప్రమాణాన్ని 19వ శతాబ్దంలో వున్న ఉత్పత్తి సంబంధాలకూ దాని కనుగుణ్యమైన జనాభా సంబంధాలకూ అన్వయించడానికి ఒక బడిపంతులు యొక్క మానసిక దౌర్బల్యాన్ని వినియోగించాల్సి వస్తే, ఇంగ్లండ్, ఫ్రాన్స్‌దేశాలలో సంభవించిన దాని పర్యవసానాల మధ్య వ్యత్యాసాన్ని తక్కువగా అంచనా వేసి చూడటం ద్వారా జరిగే పొరపాటుకు చక్రవడ్డీతో సహా చెల్లించాల్సి వుంటుందని ఈ సందర్భంలో గమనించాలి. ఈ ప్లేగు వ్యాధి పర్యవసానంగా సంభవించిన వినాశనం తర్వాత ఇంగ్లీషు ఛానల్‌కు ఇవతల పక్కనున్న ఇంగ్లండ్‌లో వ్యవసాయ జనాభా స్వాతంత్ర్య సౌభాగ్యాలతో ప్రవర్థిల్లగా అవతలి పక్కనున్న ఫ్రాన్సు దేశం నికృష్టమైన బానిసత్వమూ, దీనావస్థలతో క్రుంగిపోయింది.[1]

1846లో ఇంగ్లండ్‌లో సంభవించిన క్షామం 1,000,000 మందికి పై చిలుకు పేద ప్రజానీకాన్ని బలి తీసుకుంది. అది దేశ సంపన్న వర్గాలకు అణుమాత్రమైన హాని కలిగించలేదు. ఆ తర్వాత 20 సంవత్సరాల కాలంలో జనాభా వలస పోవడం మూలంగా ప్రస్తుతానికి ఆ వలసపోవడం ఇంకా పెరుగుతూనే వున్నప్పటికీ, 30 సంవత్సరాల యుద్ధానంతరం జరిగినట్లుగా కాక మానవమాత్రులతో సహా ఉత్పత్తి సాధనాలు వినాశనం చేయబడలేదు. ఈ ఘోరకలి జరిగిన ప్రాంతానికి సుదూరంగా వేల మైళ్ళ దూరానికి నెట్టే విధంగా ఈ పేద ప్రజానీకాన్ని ప్రోత్సాహపరిచే ఒక నూతన మార్గాన్ని ఐర్లండ్ కుశాగ్రబుద్ధి కనుగొన్నది. అమెరికాకు బ్రతకడానికి వెళ్ళిన ఈ నిర్వాసితులు ప్రతి సంవత్సరం కొంత డబ్బును ప్రయాణ ఖర్చు కింద స్వదేశంలో తమ వెనుకనున్న వారికి పంపేవారు. ఒక సంవత్సరంలో వలసపోయిన ప్రతిముఠా ఆ తర్వాత సంవత్సరం మరో ముఠాను వలస తీసుకుపోయేది. ఆ విధంగా వలస పోవడం మూలంగా ఐర్లండ్‌కు నష్టం జరక్కపోగా అది ఆదేశ ఎగుమతి వ్యాపారంలో లాభదాయకమైన భాగంగా రూపొందింది. చివరగా చెప్పాలంటే, అదొక క్రమరూపంలో జరిగే ప్రక్రియ; దాని మూలంగా జనాభాలో తాత్కాలికమైన కొరతలు మాత్రమే సంభవించడం కాక ప్రతి సంవత్సరం జననాల రేటు ద్వారా భర్తీ చేయబడే జనానికంటే అధిక స్థాయిలో జనాన్ని వలసపోయే రూపంలో పీల్చివేయడం ద్వారా జనాభా నిరపేక్ష స్థాయి, గడిచే ప్రతి సంవత్సరానికీ పడిపోతుంది.[2]

వలసపోయిన వారిని మినహాయించగా జనాభా ఒత్తిడికి లోనుకానటువంటి ఐర్లండ్‌లోని మిగతా వ్యవసాయ కార్మికుల మీద ఈ వలస పర్యవసాన ప్రభావమేమిటి? 1846లో ఎంత ఎక్కువగా సాపేక్ష అదనపు జనాభా ఉందో ఈ రోజున కూడా అదే విధంగా వుంది. వేతనాలు తక్కువ స్థాయిలోనే వున్నాయి; కార్మికులను దోపిడీ చేయడం పెరిగింది; ఈనాటి దైన్యస్థితి ఒక నూతనమైన సంక్షోభంలోకి నెడుతుంది. వీటన్నింటికీ కారణాలు చాలా సామాన్యమైనవే! వ్యవసాయక విప్లవానికి వలసపోవడం

1. "జనాభా సూత్రాన్ని" పరీక్షించుకోడానికి ఐర్లండ్ పేరెన్నికగన్న భూమిగావడం చేత థామస్ శాడ్లర్, జనాభా మీద తన సిద్ధాంత గ్రంథాన్ని వెలువరించబోయే ముందు "ఐర్లండ్ : ఇట్స్ ఈవిల్ అండ్ దెయిర్ రెమిడీస్" రెండవ ముద్రణ; లండన్; 1829 అనే ప్రఖ్యాత గ్రంథాన్ని ముద్రించాడు. ప్రతి రాష్ట్రంలోని, ప్రతి మండలంలోనూ వున్న విభిన్న ప్రాంతాల్లోనూ, నెలకొనివున్న పేదరికం, మాల్తస్ భావించినట్లుగా జనాభా నిష్పత్తిలోనే వున్నట్లుగా కాక, దానికి అనులోమ నిష్పత్తిలో వున్నట్లుగా గణాంక సమాచారాన్ని పోల్చుతూ రుజువు చేశాడు.

2. 1851-74 మధ్య కాలంలో మొత్తం వలస పోయిన జనాభా 2,325,922 మంది వున్నారు.

తోడైంది. జనాభా నిరపేక్ష క్షీణతకన్నా సాపేక్ష అదనపు జనాభా ఉత్పత్తి ఎక్కువగా వుంది. పట్టిక 'ఆ'లో చూపించిన విధంగా ఇంగ్లండ్‌లో కంటే ఐర్లండ్‌లోనే సాగుభూములను పచ్చిక భూములుగా మార్చివేసిన ప్రభావం యొక్క తీవ్రత ఎక్కువగా కనిపిస్తుంది. ఇంగ్లండ్‌లో పశువుల పెంపకంతో పాటుగా వాణిజ్య పంటల సాగు కూడా పెరిగింది; అయితే ఐర్లండ్‌లో అది తగ్గిపోయింది. గతంలో సాగులో వున్న విశాలమైన భూభాగం నిరుపయోగంగానైనా పడి వుండిందీ లేక శాశ్వతమైన పచ్చిక భూములుగానైనా మార్చబడింది; గతంలో వినియోగించుకోకుండా నిరుపయోగంగా పడి వున్న చిత్తడి నేలను ఇప్పుడు పశువుల పెంపకాన్ని విస్తరించడానికి ఉపయోగిస్తున్నారు. సన్నకారు, మధ్య తరగతి రైతులు, నా ఉద్దేశంలో 100 ఎకరాలకు మించని వారు ఇప్పటికి మొత్తం సంఖ్యలో 8/10 వంతులు వున్నారు.[1] పెట్టుబడి ద్వారా నిర్వహించబడే తీవ్రమైన పోటీ వ్యవసాయం మూలంగా గతంలో కనీ వినీ ఎరుగని రీతిలో నిర్దాక్షిణ్యమైన వత్తిడితో ఈ సన్నకారు మధ్య తరగతి రైతులంతా ఒకరి తర్వాత మరొకరు అణగదొక్కబడ్డారు; అందువలన వారు నిరంతరాయంగా వ్యవసాయ కార్మికవర్గానికి నూతనసైనికుల్ని సమకూర్చుతూనే వుంటారు. ఐర్లాండ్‌లో వుండే ఒక పెద్ద పరిశ్రమ అయిన నూలు పరిశ్రమ 1861-66 మధ్యకాలంలో పత్తి ధర పెరిగిన తర్వాత విస్తృతమైనప్పటికీ సాపేక్షకంగా తక్కువ సంఖ్యలో మాత్రమే వయోజనులకు పని కల్పించింది; ఆ విధంగా పని దొరికే వారు మొత్తం జనాభాలో నామమాత్రమైన భాగమే! అన్ని అధునాతన పరిశ్రమల్లాగే నిరంతరాయంగా సంభవించే ఒడిదుడుకుల మూలంగా ఈ పరిశ్రమ కూడా దాని పరిధిలో అది దానిలో ఇముడ్చుకునే జనాభా నిరపేక్ష పెరుగుదలతో నిమిత్తం లేకుండా సాపేక్షక అదనపు జనాభాను సృష్టిస్తుంది. వ్యవసాయ జనాభా దైన్య స్థితే బ్రహ్మాండమైన చొక్కాల పరిశ్రమకు ప్రాతిపదికగా రూపొందింది; ఈ పరిశ్రమలో పనిచేసే కార్మికుల్లో ఎక్కువభాగం దేశంలోని వివిధ ప్రాంతాలలో చెదురుమదురుగా వుంటారు. గతంలో విశదీకరించబడిన "గృహ పరిశ్రమ" విధానం ఇక్కడ కూడా మనకు ఎదురవుతుంది; తక్కువ వేతనాలూ, ఎక్కువనీ అనే రూపంలో ఈ పరిశ్రమ కార్మికులను "అదనం గావించే" క్రమ రూప సాధనాలను కలిగి వుంది. జనక్షీణత మూలంగా సంభవించే వినాశకర ఫలితాలు, పెట్టుబడిదారీ విధానం పూర్తిగా అభివృద్ధి చెందిన దేశాల్లోలాగా ఇక్కడ ఎక్కువగా లేనప్పటికీ, స్వదేశీ మార్కెట్టు మీద మాత్రం ఏ ప్రభావాన్ని చూపకుండా వుండవు. వలసపోవడం మూలంగా ఏర్పడే కొరత స్థానికంగా కార్మికులకు వుండే గిరాకీని మాత్రమే గాక చిన్న షాపు యజమానుల, చేతివృత్తుల, వ్యాపారస్తుల ఆదాయాలను కూడా పరిమితం చేస్తుంది. దీని పర్యవసానంగానే 60 పౌ॥ నుండి 100 పౌ॥ మధ్య ఆదాయం కలిగిన వారి ఆదాయాలు పట్టిక 'ఉ'లో చూపించిన విధంగా పడిపోయాయి.

ఐర్లండ్ వ్యవసాయ కార్మికుల పరిస్థితులకు సంబంధించిన స్పష్టమైన ప్రతిపాదనలను 'రిపోర్ట్స్ ఆఫ్ ది ఐరిష్ పూర్‌లా ఇన్‌స్పెక్టర్స్ (1870)'లో చూడవచ్చును.[2] తీవ్ర నిర్బంధం ద్వారా తుపాకులతో

1. మర్ఫీ సమకూర్చిన పట్టిక '''ఐర్లండ్, ఇండస్ట్రీయల్, పొలిటికల్ అండ్ సోషల్ 1870,''ను అనుసరించి 94.6 శాతం కమతాలు 100 ఎకరాలకు లోపు వుంటే; 5.4 శాతం కమతాలు 100 ఎకరాలకు మించి వున్నాయి.
2. చూడండి ''రిపోర్ట్ ఫ్రమ్ ది పూర్ లా ఇన్‌స్పెక్టర్స్ ఆన్ ది వేజెస్ ఆఫ్ అగ్రికల్చరల్ లేబరర్స్ ఇన్ డబ్లిన్.'' 1870నూ, ''అగ్రికల్చరల్ లేబరర్స్ (ఐర్లాండ్) రిటర్న్'' 8 మార్చి 1861, లండన్ 1862.

పరిపాలించే ప్రభుత్వానికి సంబంధించిన అధికారులు అన్ని విధాలైన భాషాపరమైన జాగ్రత్తలను ఇంగ్లండ్‌లోని వారి సహోద్యోగులు తగదని భావించినప్పటికీ, పాటించాలి. అయినప్పటికీ కూడా తమ ప్రభుత్వం భ్రమలనే ఆనందడోలికల్లో మునిగి తేలకుండా ఈ అధికారులు తగు జాగ్రత్తలు తీసుకున్నారు. వీరి అభిప్రాయాల ప్రకారం, దేశంలోని వేతనాల రేట్లు ఇప్పటికీ తక్కువైనప్పటికీ, గత 20 సంవత్సరాలలో 50 నుండి 60శాతం పెరిగాయి; ఇప్పుడు సగటున వారానికి 6 షి / నుండి 9 షి / వరకూ వేతనాలు పొందుతున్నారు. అయితే, పైకి కనిపించే ఈ పెరుగుదల ఈ మధ్యకాలంలో జీవితావసరాల ధరలలోని పెరుగుదలను దాచిపెడుతున్నాయి. ఐరిష్ వర్క్ హౌస్ అధికారిక లెక్కల నుండి సేకరించిన ఈ కింది పట్టికే దీనికి రుజువు;

**వారంలో తలసరి పోషణకయ్యే సగటు వ్యయం**

| సంవత్సరాంతం | పచారి–జీవితావసరాలు | వస్త్రాలు | మొత్తం |
|---|---|---|---|
| 29–9–1849 | 1 షి. 3 1/4 పె | 3 పె | 1 షి. 6 1/4 పె. |
| 29–9–1869 | 2 షి. 7 1/4 పె | 6 పె | 3 షి. 1 1/4 పె |

గత 20 సంవత్సరాలలో జీవితావసరాల ధరలు సుమారుగా రెండు రెట్లు పెరగ్గా, వస్త్రాల ధరలు స్పష్టంగా రెండు రెట్లు పెరిగాయి.

ఈ అసమతుల్య స్థితిని పరిగణనలోకి తీసుకోనట్లయితే కేవలం డబ్బు రూపంలో వ్యక్తీకరించబడిన వేతనాలను మాత్రమే పోల్చినట్లయితే సత్యదూరమైన ఫలితాలు వస్తాయి. ఈ క్షామానికి పూర్వం, వ్యవసాయ వేతనాలను ఎక్కువగా వస్తురూపంలోనే చెల్లించేవారు. అతి కొద్ది భాగం మాత్రమే డబ్బు రూపంలో చెల్లించేవారు; ఈ రోజున డబ్బు రూపంలో చెల్లించడమే రివాజు. దీనిననుసరించి నిజ వేతనాలు పరిమాణం ఏమైనప్పటికీ డబ్బు వేతనాలు పెరుగుతూ వుండాలి. "ఈ క్షామానికి పూర్వం, కార్మికుడికి పొలంలో చిన్న గుడిసె వుండేది... ఒక పాతిక లేక అర ఎకరా లేక ఒక ఎకరా పొలంలో బంగాళదుంపలు పండించుకోడానికి సౌకర్యాలుండేవి. పందుల్ని, కోళ్ళనూ, పెంచుకోడానికి అతనికి అవకాశముండేది... అయితే ఇప్పుడు రొట్టెను కొనుక్కోవాలి. పందుల్ని, కోళ్ళనూ పెంచుకోడానికి తగిన అవకాశం లేదు. పర్యవసానంగా పందుల్ని, కోళ్ళనూ, గుడ్లనూ అమ్ముకోవడం మూలంగా గతంలో లభించే ఆదాయం వారికి ఇప్పుడు చేకూరడం లేదు."[1] వాస్తవానికి గతంలో సన్నకారు రైతుల్లో వ్యవసాయ కార్మికులు ఒక చిన్న భాగంగా వుండి, వారు పని చేస్తున్న మధ్యరకం, పెద్ద తరగతి కమతాలకు ఒక రకమైన వెనుక దళంగా వుండేవారు. 1846లో సంభవించిన ఘోరకలి తర్వాత మాత్రమే వారికి వేతనం చెల్లించే యజమానులతో డబ్బు సంబంధాల ద్వారా మాత్రమే ముడివేయబడిన ఒక ప్రత్యేక వర్గమైన పరిపూర్ణ వేతన కార్మిక వర్గంలో ఒక భాగంగా వ్యవసాయ కార్మికులు రూపుధరించడం ప్రారంభించారు.

1846లో వారి జీవనస్థితిగతులు ఏ విధంగా వున్నాయో మనకు తెలుసు. అప్పటినుండి వారి స్థితి ఇంకా దిగజారిపోయింది. ఈ వ్యవసాయ కార్మికుల్లో కొంతమంది, వారి సంఖ్య నిత్యమూ

1. చూడండి "రిపోర్ట్ ఫ్రమ్ ది పూర్ లా ఇన్‌స్పెక్టర్స్ ఆన్ ది వేజెస్ ఆఫ్ అగ్రికల్చరల్ లేబరర్స్ ఇన్ డబ్లిన్." 1870నూ, "అగ్రికల్చరల్ లేబరర్స్ (ఐర్లాండ్) రిటర్న్" 8 మార్చి 1861, లండన్ 1862. పుట 29.1

తక్కువగా పెరుగుతున్నప్పటికీ, ఇంకా ఆయా రైతుల కమతాల్లోని కిక్కిరిసి వున్న గుడిసెల్లో కాపురం చేస్తూనే వున్నారు. ఇంగ్లండ్ వ్యవసాయపు జిల్లాల్లోని అతి నికృష్టమైన ఉదాహరణలతో పోల్చినట్లయితే ఆల్‌స్టర్‌లోని కొన్ని ప్రాంతాలను మినహాయిస్తే, వీరి అధ్వాన్న స్థితి సర్వ సాధారణంగా ఇంకా మించి పోయిందని చెప్పాలి; దక్షిణ ప్రాంతంలోని కోర్క్, లిమిరిక్, కిల్‌కెన్ని వగైరా మండలాల్లోనూ, తూర్పు ప్రాంతంలోని విక్‌లో వెక్స్‌ఫోర్ట్, గైరా మండలాల్లోనూ, మధ్యభాగంలోని కింగ్స్, క్వీన్స్, డబ్లిన్ మండలాల్లోనూ, పశ్చిమ ప్రాంతాలలోని స్లిగో, రోస్కోమాన్, మెమె, గాల్‌వే వగైరా మండలాల్లోనూ వున్న నికృష్ట స్థితికన్నా ఇక్కడ ఇంకా దిగజారిపోయింది. "వ్యవసాయ కార్మికులు నివాసముండే ఈ గుడిసెలు క్రైస్తవ మతానికీ, దేశ నాగరికతకూ తలవంపులు తెచ్చేవిగా వున్నాయి"[1] అని ఒక ఇన్‌స్పెక్టర్ గగ్గోలు పెట్టాడు. ఈ పాకలను ఇంకా ఆకర్షణీయంగా వుండేట్లు చేయడానికి తరతరాలుగా కార్మికులకు వున్న ఆ కొద్దిపాటి స్థలాలను కూడా ఒక పద్ధతి ప్రకారం జప్తు చేయించారు. "భూస్వాములూ, వారి గులాములూ వీరినొక బహిష్కరింపబడిన జాతిగా మాత్రమే మనగలిగే స్థితికి నెట్టారన్న ఆలోచనే వారిని బహిష్కరింపబడిన జాతిగా పరిగణించే వారి ఎడల ఆ కార్మికుల మేధస్సులో దాని కనుగుణ్యమైన అసంతృప్తీ, శత్రుపూరిత వైఖరీ జనించాయి."[2]

వారు పని చేస్తున్న ప్రాంతాలలో వున్న గుడిసెలను నేలమట్టం చేయడమే వ్యవసాయక విప్లవం యొక్క మొదటి చర్యగా వుండేది. పై స్థాయి నుండి వచ్చిన ఆదేశాలను పాటించినట్లుగా, అత్యధిక స్థాయిలో అతి నమ్రతతో ఈ కార్యక్రమాన్ని నెరవేర్చారు. ఈ విధంగా అనేక మంది కార్మికులు గ్రామాల్లోనూ, పట్టణాల్లోనూ తలదాచుకోవలసిన స్థితికి బలవంతంగా నెట్టబడ్డారు. అక్కడున్న మొండి కొంపల్లోకి, పాకల్లోకీ, గొందుల్లోకీ, సందుల్లోకీ, మురికివాడల్లోకీ కాందిశీకుల్లాగా నెట్టివేయబడ్డారు. వంటయింటికే పరిమితమై, ఆనందదాయకంగా కుటుంబ జీవితాన్ని గడిపే వేలాది ఐరిష్ కుటుంబాలు అవినీతికి ఆలవాలమైన వాతావరణంలోకి మరో విధంగా బతుకు వెల్లబోయడానికి ఊహింపశక్యం కాని రీతిలో నెట్టివేయబడ్డారు. జాత్యహంకారంతో కళ్ళు మూసుకుపోయినప్పటికీ, ఇంగ్లీషు వారు సహితం దీనికి సాక్షులుగా నిలబడ్డారు. ఈజనం అంతా తమ ఇరుగుపొరుగు పొలాల్లో రోజుకూలికి అర్రులు జాస్తూ వుండేవారు; ఆ రోజు కూలీ విధానం వేతన శ్రమలో ఒక ప్రమాదకరమైన రూపం. అందువలన "వారు కొన్ని సందర్భాలలో సుదూర ప్రాంతాల నుండి పనికోసం రాకపోకలతో తరుచుగా విపరీతమైన చలితో బాధపడుతూ, జ్వరపీడితులై తిండి లేక విపరీతంగా కష్టాల పాలయ్యేవారు."[3]

"గ్రామీణ ప్రాంతాలలో అదనపు కార్మికులుగా పరిగణించబడే వారిని సంవత్సరం తర్వాత పట్టణ ప్రాంతాలు ఇముడ్చుకోవలసి వచ్చింది."[4] "ఆ తర్వాత పట్టణాల్లోనూ, గ్రామాల్లోనూ ఇంకా అదనపు కార్మికులు వున్నారనీ, దేశంలోని కొన్ని ప్రాంతాల్లో కొరత గానీ లేక కొరత ఏర్పడే ప్రమాదం గానీ ముంచుకొస్తుందని"[5] జనం ఇంకా ఆశ్చర్యపోతుండేవారు. నిజానికి ఈ కొరత "కోతల

1. చూడండి "రిపోర్ట్ ఫ్రమ్ ది పూర్ లా ఇన్‌స్పెక్టర్స్ ఆన్ ది వేజెస్ ఆఫ్ అగ్రికల్చరల్ లేబరర్స్ ఇన్ డబ్లిన్." 1870నూ, "అగ్రికల్చరల్ లేబరర్స్ (ఐర్లాండ్) రిటర్న్" 8 మార్చి 1861, లండన్ 1862. పు. 12
2. పై గ్రంథమే, పు. 12
3. పై గ్రంథమే, పు. 25
4. పై గ్రంథమే, పు. 27
5. పై గ్రంథమే. పు. 25

కాలంలోగానీ, లేక వసంతకాలంలోగానీ, లేక వ్యవసాయ కార్యక్రమాలు ముమ్మరంగా జరిగేటప్పుడు గానీ, తాత్కాలికంగా ఏర్పడుతుంది. మిగతా కాలంలో చాలామంది పని లేకుండా వుంటారు."[1] "అక్టోబర్ మాసంలో బంగాళాదుంపల త్రవ్వకం అయిపోయిన తర్వాత వసంతకాలం వచ్చే వరకూ వారికి పని దొరకదు."[2] ఇంకా చెప్పాలంటే ముమ్మర కార్యక్రమాల రోజుల్లో కూడా "అడపాదడపా పని దొరక్కుండా మధ్యమధ్యలో అన్ని రకాలైన విఘాతాలూ ఏర్పడేవి."[3]

గైర్హాజర్ భూస్వాములు తమ కొంచ్చిన కౌళ్ళ సొమ్మును ఇతర దేశాల్లో ఖర్చు చేసుకోడానికి బదులుగా, ఐర్లాండ్‌లోనే తమ సంస్థానాల్లో ఆ సొమ్మును జీవించవలసిన స్థితికి దిగజార్చబడ్డంతో వ్యవసాయ విప్లవ ఫలితాలు – అనగా సాగు భూములను పచ్చిక భూములుగా మార్చివేయడం, యాంత్రీకరణ, శ్రమ వాడకంలో తీవ్రమైన పొదుపు చర్యలూ వగైరాల తీవ్రత ఇంకా పెరిగింది. సరఫరా, గిరాకీల సూత్రానికి ఏ విధమైన విఘ్నం కలగకుండా "భూస్వాములకు అవసరమైనప్పుడల్లా వారి అవసరాలను తీర్చడానికి సన్నకారు కౌలుదార్లంతా ఎక్కువ సందర్భాలలో ఆనాడు సాధారణ కార్మికులకు చెల్లించే వేతనాలకన్నా తక్కువ వేతనాలతో తమ అభీష్టాలకు నష్టం వాటిల్లినా లేక నాట్ల కాలం, లేక కోతలకాలం లాంటి ముమ్మర కార్యక్రమాలున్నప్పుడు కూడా శ్రమను సరఫరా చేయవలసిన స్థితికి నెట్టబడినందువల్ల"[4] వారి ద్వారా ఈ పెద్ద మనుషులంతా శ్రమను దోచుకునేవారు.

పని దొరకడంలో అనిశ్చితతత్వం, అసంబద్ధతా, దీర్ఘకాలంగానూ, నిరంతరాయంగానూ శ్రామిక మార్కెట్‌లో ఏర్పడే గిరాకీకి మించిన సరఫరాలాంటి సాపేక్ష అదనపు జనాభా లక్షణాలన్నీ పేదల సట్టాన్ని అమలు పరిచే అధికార యంత్రాంగ నివేదికల్లో, వ్యవసాయ కార్మికుల దీనావస్థలుగా కనిపిస్తాయి. ఇంగ్లాండ్ వ్యవసాయ కార్మికవర్గంలో కూడా ఈ విధమైన దీనావస్థలనే చూసిన విషయాన్ని మనం జ్ఞప్తికి తెచ్చుకోవాలి. అయితే వీటి మధ్య చాలా వ్యత్యాసాలున్నాయి; పారిశ్రామిక దేశమైన ఇంగ్లాండ్‌లో గ్రామీణ ప్రాంతాల నుండి పారిశ్రామిక కార్మికులను నియోగించుకోగా, వ్యవసాయ దేశమైన ఐర్లాండ్‌లో వ్యవసాయ రంగానికి అవసరమైన రిజర్వు కార్మికులను, వ్యవసాయ రంగాన్నుండి నెట్టివేయబడి పట్టణాలలో నికృష్ట జీవితాన్ని గడుపుతున్న వారి నుండి నియోగించుకున్నారు. ఇంగ్లాండ్‌లో గ్రామీణ అదనపు శ్రామికులు పారిశ్రామిక కార్మికులుగా మార్చబడితే, ఐర్లాండ్ పట్టణాలకు బలాత్కారంగా నెట్టివేయబడినవారు, పట్టణ కార్మికుల వేతనాలను దిగజార్చడానికి దోహదపడిన వారైనప్పటికీ, వ్యవసాయ కార్మికులుగానే మిగిలిపోయి పనికోసం తిరిగి గ్రామీణ ప్రాంతాలకు నిరంతరాయంగా పంపబడ్డారు.

వ్యవసాయ కార్మికుల భౌతిక పరిస్థితులను గురించి సమీక్షిస్తూ తనిఖీ చేసిన అధికారులు ఈ విధంగా అన్నారు. "అతి నికృష్టమైన పొదుపరితనంతో జీవిస్తున్నప్పటికీ, అతనికి వచ్చే వేతనం సాధారణ కుటుంబానికి తిండిపెట్టడానికీ, అద్దె చెల్లించడానికీ సరిపోయేదీ కాదు; తనకూ తన

1. చూడండి ''రిపోర్ట్ ఫ్రమ్ ది పూర్ లా ఇన్‌స్పెక్టర్స్ ఆన్ ది వేజెస్ ఆఫ్ అగ్రికల్చరల్ లేబరర్స్ ఇన్ డబ్లిన్.'' 1870నూ, ''అగ్రికల్చరల్ లేబరర్స్ (ఐర్లాండ్) రిటర్న్'' 8 మార్చి 1861, లండన్ 1862. పు. 1
2. పై గ్రంథమే, పు. 31, 32
3. పై గ్రంథమే, పు. 25
4. పై గ్రంథమే, పు. 30

భార్యాపిల్లలకూ వస్త్రాలను కొనాలంటే ఇతర పద్ధతుల మీద ఆధారపడవలసి వచ్చేది. వారు నివాసముండే గుడిసెల వాతావరణం, దానికి తోడు వారు అనుభవిస్తున్న పేదరికం మూలంగా ఈ వర్గం జ్వరపీడితులై శ్వాసకోశ జబ్బుల వాతపడేవారు"[1] తనిఖీ చేసిన అధికారుల ఏకగ్రీవ సాక్ష్యాన్ననుసరించి, ఈ వర్గంలోని జనంలో కనిపించని రీతిలో వుండే అసంతృప్తీ, గతించిన రోజులు రావాలనే ఆలోచనా, వర్తమాన స్థితిని అసహ్యించుకోవడమూ, భవిష్యత్తు మీద నిరాశా నిస్పృహ పర్యవసానంగా వారిలో "ఆందోళనకారుల ప్రమాదభరితమైన ప్రభావం" నుండి బయటపడి, అమెరికాకు వలసపోవాలనే ఒకస్థిరమైన భావం రావడంతో ఇసుమంతైనా ఆశ్చర్యం లేదు. జన క్షీణత అనే మాల్థూజియన్ "సర్వ రోగ నివారిణి" అన్నపూర్ణలాంటి ఐర్లాండ్‌ను భోగలాలసతకు ఆలవాలమైన దేశంగా మార్చివేసింది.

ఐర్లండ్ పారిశ్రామిక కార్మికుల సంతోషదాయకమైన జీవితాన్ని గురించి ఒక ఉదాహరణిస్తే సరిపోతుంది. ఇంగ్లండ్ ఫ్యాక్టరీ ఇన్‌స్పెక్టర్ అయిన రాబర్ట్ బేకర్ చెప్పిన ఉదంతాన్ని ఇక్కడ పేర్కొంటాను: "ఈ మధ్య నేను ఉత్తర ఐర్లండ్‌కు వెళ్ళిన సందర్భంలో నైపుణ్యం గలిగిన ఒక కార్మికుడ్ని కలిసినపుడు, అతని పిల్లల చదువును గురించీ అతని నిత్య జీవితాన్ని గురించే అతను చెప్పిన విషయం యధాతథంగా ఇస్తున్నాను. మాంచెస్టర్ మార్కెట్‌లో అతను నైపుణ్యం గలిగిన కార్మికుడుగా పని చేస్తున్నాడు. "జాన్సన్: నేను దిమ్మెస కొడతాను; ఉదయం 6 గంటల నుండి రాత్రి 11 గంటల వరకు సోమవారం నుండి శుక్రవారం వరకూ రోజూ ఆ పనే చేస్తాను. శనివారం మాత్రం సాయంత్రం 6 గంటలకే ఇంటికి వెళతాను. తిండికీ తిప్పలకూ 3 గంటల వ్యవధి వుంటుంది. నాకు మొత్తం ఐదుగురు సంతానం. నేను చేసే పనికి వారానికి 10 షి.6 పె. చెల్లిస్తారు; నా భార్య కూడా పని చేస్తుంది. ఆమెకు వారానికి 5 షి. చెల్లిస్తారు. 12 సంవత్సరాల వయస్సు గల నా పెద్ద కూతురు ఇంటి పని చూసుకుంటుంది. ఆమె వంటా, వార్పూ సకలమూ చేసుకుంటుంది; చిన్న పిల్లల్ని స్కూలుకి తయారు చేస్తుంది. నేను ఉదయం ఐదున్నర గంటలకు నిద్ర లేస్తాను. నాతోపాటే నా భార్య కూడా తయారై పనిలోకి వస్తుంది. పనిలోకి పోయే ముందు మాకు తినడానికి ఏమీ వుండదు. మా పెద్దమ్మాయే చిన్న పిల్లల్ని రోజంతా సముదాయిస్తుంది. ఉదయం 8గంటలకు మాకు తినడానికి ఏదన్నా దొరుకుతుంది. అప్పుడు ఇంటికి వెళతాం. వారానికొకసారి టీ తాగుతాం; మిగిలిన రోజుల్లో కొన్నిసార్లు గంజీ, మరికొన్ని సార్లు ఓట్సు భోజనం, కొన్ని సందర్భాలలో భారతీయ భోజనం మాత్రమే మేము చేయగలం. వేసవిలో కొద్దిగా బంగాళాదుంపలు తింటాం. అవీ అయిపోయిన తర్వాత మళ్ళీ గంజే గతి. కొన్నిసార్లు కొద్దిగా పాలు దొరుకుతాయి. సంవత్సరంలో ప్రతిరోజూ ఆదివారంతో సహా ఇదే మా భోజనం. రాత్రి అయ్యేటప్పటికీ విపరీతమైన అలసట నన్ను ఆవరిస్తుంది. అప్పుడప్పుడూ, మహా అరుదుగా కొద్దిగా మాంసం ముక్క దొరుకుతుంది. మా ముగ్గురు పిల్లలూ స్కూలుకి పోతారు. వారికి వారానికి ఒక్కరికి 1 షి. 6 పె. ఫీజు చెల్లిస్తాం. వారానికి 9 పె. అద్దె ఇస్తాం. చలి కాచుకోడానికి కట్టెలకు పక్షానికి 1 షి. 6 పె. ఖర్చు అవుతుంది."[2] ఐర్లండ్ కార్మికుల వేతనాలూ, వారి జీవితమూ అలా వుంది!

1. చూడండి "రిపోర్ట్ ఫ్రమ్ ది పూర్ లా ఇన్‌స్పెక్టర్స్ ఆన్ ది వేజెస్ ఆఫ్ అగ్రికల్చరల్ లేబరర్స్ ఇన్ డబ్లిన్." 1870నూ, "అగ్రికల్చరల్ లేబరర్స్ (ఐర్లాండ్) రిటర్న్" 8 మార్చి 1861, లండన్ 1862. పు. 21, 13
2. "రిపోర్ట్ ఆఫ్ ది ఇన్‌స్పెక్టర్స్ ఆఫ్ ఫ్యాక్టరీస్ 31. అక్టోబర్ 1866" పు. 96

ఐర్లండ్‌లోని నికృష్ట జీవితాన్ని గురించి తిరిగి ఇంగ్లాండ్‌లో చర్చ ప్రారంభమయింది. ఐర్లాండ్‌లోని పెద్ద భూస్వాముల్లో ఒకడైన లార్డ్ డఫ్రీన్, ఈ నికృష్ట జీవిత పరిష్కార మార్గాలను గురించి 1866 చివరిలో 1867 ప్రారంభంలో "ది టైమ్స్" పత్రికలో వ్యాసాలు రాయడం ప్రారంభించాడు. "ఈ పెద్ద భూస్వామిలో ఎంత మానవత్వం వుంది!"

పట్టిక 'ఉ'లో చూపించిన విధంగా 1864 సంవత్సరంలో 4,368,610 పౌండ్ల మొత్తం లాభాలలో ముగ్గురు అదనపు విలువ దోపిడీదారులు మాత్రమే 262,610 పౌండ్లు కాజేస్తున్నారు. 1865లో 4,669,979 పౌండ్లు అయిన మొత్తం లాభాలలో, 'వాంఛా విసర్జనను' సమర్థించే ఈ ముగ్గురు 'పెద్ద మనుషులే' 274,448 పౌండ్లు లాభాన్ని జేబులో వేసుకుంటున్నారు. 1864లో 26 మంది అదనపు విలువ దోపిడీదారులకు వచ్చిన మొత్తం లాభాలు 646,377 పౌండ్లు, 1865లో 28 మంది అదనపు విలువ దోపిడీ దార్లకు సంక్రమించిన మొత్తం లాభం 736,448 పౌ; 1864లో 121 మంది దోపిడీదార్లకు 1,066,912 పౌ॥ లాభాలు వస్తే, 1865లో 186 మందికి 1,320,996 పౌండ్లు లాభాలను జేబులో వేసుకున్నారు. 1864లో 1131 మందికి మొత్తం వార్షిక ఆదాయంలో సుమారుగా సగభాగం అనగా 2,150,818 పౌండ్లు లాభాలు వచ్చాయి. 1865లో 1194 మంది, మొత్తం లాభాలలో సగానికి మించి అనగా సుమారుగా 2,418,933 పౌండ్లు కాజేశారు. సంవత్సరం మొత్తం మీద భూమి కౌలు రూపంలో వచ్చే దేశ ఆదాయంలో గణనీయమైన భాగాన్ని, ఇంగ్లాండ్, స్కాట్‌లాండ్, ఐర్లండ్‌లోని ఊహించశక్యంగానంత తక్కువ మంది భూస్వాములు స్వాహా చేస్తూ వుంటే, లాభాల పంపిణీకి సంబంధించిన గణాంక సమాచారాన్ని ఇచ్చినట్లుగా, భూమి కౌలు పంపిణీకి సంబంధించిన గణాంక సమాచారాన్ని ఇవ్వవలసిన అవసరం లేదని భావించే ఇంగ్లీషు రాజనీతిజ్ఞుల వైఖరి నయవంచనతో కూడిన రాక్షస స్వభావంగా భావించాలి. లార్డ్ డఫ్రీన్ ఆ భూకామాందుల్లో ఒకడు. భూమికౌళ్ళు,లాభాలు ఎప్పుడూ 'అధికంగా' వుండవనీ లేక భూమి కౌళ్ళూ, లాభాలు అత్యధికంగా వుండే 'అవాంఛనీయ' లక్షణం ఏ విధంగానూ ప్రజాజీవితంలో దైన్యస్థితి అనే లక్షణంతో సంబంధం కలిగి వుండదనీ భావించడం 'అపఖ్యాతిపాలైన' ఆలోచనకు ప్రతీకే గాక, 'వివేకరాహిత్యమైంది'. లార్డ్ డఫ్రీన్ వాస్తవాలకు లోబడే వ్యక్తి! వాస్తవమేమిటంటే, ఐర్లండ్ జనాభా తరిగిపోతూ వుంటే భూమి కౌళ్ళు పెరిగిపోతూ వున్నాయి. జన క్షీణత భూస్వాములకు లాభదాయకం గనుక వ్యవసాయానికీ లాభదాయకమే! కాబట్టి భూమికి భారమైన ప్రజలకు కూడా లాభదాయకమే! అందువలన, ఐర్లండ్‌లో ఇంకా అదనపు జనాభా వున్నారనీ, వలసపోయే ప్రవాహం చాలా మందకొడిగా వుందనీ ఆయన ప్రకటిస్తున్నారు. సంతోషదాయకంగా వుండాలంటే, సుమారుగా మూడున్నర లక్షల మంది శ్రమజీవులను ఐర్లండ్ నుండి గెంటివెయ్యాలి! కవితావేశం కూడా లేశమంత వున్న ఈ భూస్వామి 'గిల్ బ్లాస్' నాటకంలోని డా॥ శాంగ్రోడోలాంటి వైద్యుడేం కాదు. తన రోగికి ఏ విధమైన స్వస్థత చేకూరనందు వల్ల రక్తస్రావణ చికిత్సను పలుసార్లు అమలు పరచడం ద్వారా చివరకు రోగి చనిపోవడంతో రోగగ్రస్తుడికీ రోగం కుదిరేట్టు ప్రయత్నించిన డా. శాంగ్రాడో లాంటి వాడు కాదు. లార్డ్ డఫ్రీన్, ఇరవై లక్షల మంది జనానికి బదులుగా కేవలం మూడున్నర లక్షలమంది జనానికే రక్తస్రావణ చికిత్స అవసరమని భావిస్తాడు లార్డ్ డఫ్రీన్! అయితే వాస్తవానికి, ఈ ఇరవై లక్షల మంది జనాన్ని 'గెంటి' వేయకుండా ఐర్లండ్‌లో "స్వర్గతుల్యమైన" పరిపాలన రాదు! దీన్ని రుజువు చేయడం సులభమే!

**1864లో కమతాల సంఖ్య, విస్తృతి**[1]

| 1 | | 2 | | 3 | | 4 | |
|---|---|---|---|---|---|---|---|
| 1 ఎకరాకు మించిన కమతాలు | | 1 ఎకరాకు మించిన 5 ఎకరాలలోపు కమతాలు | | 5 ఎకరాలకు మించిన 15 ఎకరాలలోపు కమతాలు | | 15 ఎకరాలపైన-30 ఎకరాలలోపు కమతాలు | |
| సంఖ్య | ఎకరాలు | సంఖ్య | ఎకరాలు | సంఖ్య | ఎకరాలు | సంఖ్య | ఎకరాలు |
| 48,653 | 25,394 | 82,037 | 2,88,916 | 1,76,368 | 18,36,310 | 1,36,578 | 30,51,343 |

| 5 | | 6 | | 7 | | 8 | |
|---|---|---|---|---|---|---|---|
| 30 ఎకరాలకుపైన-50 ఎకరాలలోపు కమతాలు | | 50 ఎకరాలకుపైన-100 ఎకరాలలోపు కమతాలు | | 100 ఎకరాలపైబడిన కమతాలు | | మొత్తం విస్తీర్ణం | |
| సంఖ్య | ఎకరాలు | సంఖ్య | ఎకరాలు | సంఖ్య | ఎకరాలు | సంఖ్య | ఎకరాలు |
| 71,961 | 29,06,274 | 54,247 | 39,83,880 | 31,927 | 82,27,807 | - | 26319924 |

1851-61 మధ్య కాలంలో జరిగిన కేంద్రీకరణ పర్యవసానంగా, పై పట్టికలో ఉదాహరించిన, 15 ఎకరాల లోపు భూములు కలిగిన మూడు తరగతులలోని వ్యవసాయ కమతాలు ప్రధానంగా నాశనమైపోయాయి. దీని పర్యవసానంగా "అదనం గావించబడిన 3,07,058 మంది రైతు కమతాలను పరిగణనలోకి తీసుకుంటే, కుటుంబానికి నలుగురు లెక్కన మొత్తం 12,28,232 మంది వ్యక్తులు బలైనారు. వ్యవసాయ విప్లవం పూర్తి అయిన తర్వాత ఇందులోని నాల్గవ వంతుకు తిరిగి పునరావాసం కల్పించబడుతుందనే మితిమీరిన ప్రమేయంతో ఆలోచించినప్పటికీ, ఇంకా 9,21,174 మంది వ్యక్తులు వలసపోవలసి వుంది. 15 ఎకరాల పైబడి 100 ఎకరాలలోపు వున్న 4,5,6 తరగతులలోని కమతాలు, ఇంగ్లాండ్‌లోని చాలా కాలంగా మనం గమనిస్తున్నట్లుగానే, పెట్టుబడిదారీ పంథాలో వ్యవసాయం చేయడానికీ, గొర్రెలు పెంపకానికీ చాలా చిన్నవిగా వుంటాయి. కాబట్టి అదే ప్రమేయాలను ఆధారం చేసుకుని చెప్పాల్సి వస్తే, 7,88,761 మంది వ్యక్తులు వలసపోవలసి వుంటుంది. వెరసి మొత్తం మీద 1,709,532 మంది అదనపు జనాభా వలసపోవలసివుంది. తినే కొలదీ ఆకలి పెరిగినట్లుగా, 35 లక్షలమంది జనాభాతో ఐర్లండ్ ఇంకా పేదరికంలోనే మ్రగ్గుతుందనీ, అదనపు జనాభా మూలంగానే పేదరికం కొనసాగుతుందనీ, ఇంగ్లాండ్ గొర్రెల పెంపకానికీ, పశుగ్రాసానికీ అవసరమైన పచ్చిక భూమిగా ఐర్లాండ్‌ను మార్చాలనే అంతిమ లక్ష్యానికి చేరుకోడానికీ జన క్షీణతా విధానం ఇంకా కొనసాగాలనీ, భూమి కౌళ్ళను వసూలు చేసుకునే భూస్వాములు అతి తొందరలోనే కనుగొనగలరు."[2]

1. బంజరు భూములూ, పడావు భూములూ, చిత్తడి భూములతో సహా మొత్తం భూమి.
2. క్షామాన్ని, దాని పర్యవసానాలనూ, ఏ విధంగా ఉద్దేశపూర్వకంగా భూస్వాములూ, శాసనాల ద్వారా ఇంగ్లీషు పార్లమెంటూ, బల ప్రయోగం ద్వారా వ్యవసాయ విప్లవాన్ని సాధించడానికీ, భూస్వాములకు అనుగుణంగా ఐర్లాండ్ జనాభాను తగ్గించడానికీ, అనుసరించిన విధానాలను నా మూడవ సంపుటిలో భూస్వామ్య

ఈ దుష్ట ప్రపంచంలో అన్ని మంచి విషయాలకూ కొన్ని బలహీనతలున్నట్లుగానే లాభదాయకమైన ఈ విధానానికి కూడా కొన్ని బలహీనతలున్నాయి. ఐర్లాండ్‌లో భూమి కౌళ్ళు సంచయనం జోరుగా సాగుతూ వుంటే, అమెరికాలోని ఐర్లండ్‌వాసుల సంఖ్య అదే వరవడిలో పెరుగుతూ వుంది. రైతులు సాగు చేసుకుంటున్న భూములు గొర్రెల కోసం, దున్నల కోసం పచ్చిక బయళ్ళుగా మార్చడం ద్వారా, ఆ రైతులను ఐర్లాండ్‌నుండి బహిష్కరించారు. ఆ విధంగా బహిష్కరించబడిన వారు, అట్లాంటిక్ సముద్రం ఆవలివైపున ఐర్లండ్ స్వాతంత్ర్య సమరయోధుల్లాగా తిరిగి అవతరిస్తున్నారు. ఆ విధంగా సముద్ర తరంగాల గత కాలపు మహారాజ్ఞిని ముక్తకంఠంతో, ధీరోదాత్తంగా ఎదిరించగలిగిన యుక్త వయస్సులో వున్న గొప్ప గణతంత్ర రాజ్యం ఆవిర్భవిస్తుంది.

*"సహోదరుల హత్యానేరం – నిర్దాక్షిణ్యమైన దురదృష్టం*
*రోమన్ సామ్రాజ్య మహాజనాన్ని వెంటాడుతూనే వుంది."*

---

ఆస్తిని గురించి ప్రస్తావించే ప్రకరణలో విశదీకరిస్తాను. సన్నకారు రైతులను గురించీ, వ్యవసాయ కార్మికుల స్థితిగతులను గురించీ అక్కడ మరోసారి పరిశీలిస్తాను. ప్రస్తుతానికి ఈ ఉటంకింపుతో సరిపుచ్చుకుంటాను. మిగిలిన విషయాలతో పాటుగా, ఈక్రింది విషయాన్ని కూడా నాసూ విలియమ్ సీనియర్ తన ప్రఖ్యాత గ్రంథమైన "జర్నల్స్, కన్‌వర్జేషన్స్ అండ్ ఎస్సేస్ రిలేటింగ్ టు ఐర్లండ్" (2 సంపుటాలు, లండన్, 1868, పు.282) పేర్కొంటాడు. డా॥ జి. ఇలా అంటాడు : "పేదల చట్టం అమల్లోకి వచ్చినందువల్ల భూస్వాముల విజయానికి అదొక గొప్ప ఆయుధంగా ఉపయోగపడుతుంది. దీనికంటే కూడా ఇంకా గొప్ప శక్తివంతమైన ఆయుధం వలసపోవడం... ఐర్లాండ్‌మిత్రుడెవడైనా లీ యుద్ధం (భూస్వాములకూ, సెల్టిక్ రైతులకూ మధ్య జరుగుతున్న) కొనసాగాలని కోరుకోడు; పైగా కౌలుదార్లకు విజయం చేకూరే విధంగా అది అంతం కావాలని భావిస్తాడు. ఇది ఎంత త్వరగా ముగిస్తే, అన్ని వర్గాలకూ అనుకూలంగా వుండే విధంగా, పచ్చిక బయలుగా వుండే ఒక దేశానికి ఎంత జనాభా కావాలో అంత జనాభాతో ఐర్లండ్ అతి త్వరగా పచ్చిక బయళ్ల భూమిగా మారుతుంది"

1815వ సంవత్సరపు ఇంగ్లాండ్ ధాన్యపు చట్టాల ఫలితంగా, ధాన్యాన్ని గ్రేట్ బ్రిటన్‌కు స్వేచ్ఛగా ఎగుమతి చేయడానికి ఐర్లండ్‌కు గుత్తాధిపత్యం లభించింది. అందువలన, కృత్రిమ మార్గాల ద్వారా ధాన్యాన్ని పండించడానికి వారు ప్రోత్సహించారు. 1846లో ధాన్యపు చట్టాలను రద్దు చేసినందువల్ల, వీరికున్న ఈ గుత్తాధిపత్యం ఆకస్మికంగా తొలగించబడింది. మిగిలిన పరిస్థితులతో పాటుగా, ఈ అంశం ఒక్కటే ఐర్లండ్‌లో వున్న సాగు భూములను పచ్చిక బయళ్ళుగా మార్చడానికీ, భూసాంద్రీకరణకూ, సన్నకారు రైతుల బేదఖల్‌కూ ఎనలేని ప్రేరణ యిచ్చింది. 1815-1846 మధ్య కాలంలో ఐర్లాండ్ వ్యవసాయ భూముల ఫలసాయాన్ని పొగుడుతూ, గోధుమపిండి ఉత్పత్తికి ఆ భూములు ఏ విధంగా ప్రకృతి సిద్ధమైనవో వేనోళ్ళ కొనియాడుతూ, గొంతులు చించుకున్న ఇంగ్లీషు వ్యవసాయ శాస్త్రవేత్తలూ, అర్థశాస్త్రవేత్తలూ, రాజకీయ వాదులూ ఆకస్మికంగా, ఆ భూములు, "గుర్రాల మేత పెంచడానికి తప్ప మరే విధంగానూ పనికి రావంటూ" ఒక క్రొత్త విషయాన్ని కనుగొన్నారు! ఇంగ్లీషు చానల్‌కు ఆవలివైపున ఈ అంశాన్ని అతి త్వరితగతిని వక్కాణించడానికి యం. లియోన్సి ది లవర్నె ముందుకు వచ్చాడు. ఈ విధమైన బాల్య చాపల్యంలో లావర్నెలాంటి "కుశాగ్రబుద్ధి గలిగిన" వ్యక్తి కూడా చిక్కుకుపోయాడు.

## ఎనిమిదవ భాగం

# పెట్టుబడి పుట్టుక

## అధ్యాయం - 26

# ఆదిమ సంచయనపు రహస్యం

డబ్బు ఎలా పెట్టుబడిగా మారేదీ, పెట్టుబడ్డి ఎలా అదనపు విలువగా ఏర్పడేదీ, అదనపు విలువ నుండి ఎలా మరింత పెట్టుబడి ఏర్పడేదీ చూశాము. కానీ, పెట్టుబడి సంచయనం (ప్రోగుపడడం) జరగాలంటే, అదనపు విలువ వుండాలి. అదనపు విలువ వుండాలంటే, పెట్టుబడిదారీ ఉత్పత్తి వుండాలి. పెట్టుబడిదారీ ఉత్పత్తి ఉండాలంటే దానికి ముందు సరుకుల ఉత్పత్తిదారుల చేతుల్లో పెట్టుబడీ, శ్రమశక్తీ గణనీయమైన మొత్తాలలో వుండాలి. కనుక ఇదంతా ఒక విషవలయంలా కనిపిస్తుంది. పెట్టుబడిదారీ సంచయనానికి ముందు ఆదిమ సంచయనం (ఆడమ్ స్మిత్ చెప్పినట్లు "previous accumulation) ఉందనీ, ఆదిమ సంచయనమనేది పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానపు ఫలితం కాదు, దాని ప్రారంభ స్థానం అనీ అనుకుంటేనే ఈ విషవలయం నుండి మనం బయట పడగలం.

మతశాస్త్రంలో మొదటి పాపం నిర్వహించే పాత్రే అర్థశాస్త్రంలో ఆదిమ సంచయనం నిర్వహిస్తుంది. ఆదాం ఆపిల్‌పండు తిన్నాడు. అప్పుడు మానవజాతికి పాపం అంటుకుంది. అది గతకాలపు ఘటనగా చెప్పబడినప్పుడు దాని మూలం వివరించబడినట్లు ఊహించబడుతుంది. ఎప్పుడో గడిచిపోయిన కాలంలో రెండు రకాల మనుషులు వుండినారట, ఒక రకం శ్రమశీలురూ, తెలివిపరులూ, అన్నిటినీ మించి, మితవ్యయం చేసే బుద్ధిమంతులూ, మరొక రకం సోమరి వెధవలు, తమకు ఉన్న దాన్నీ, అంతకు మించి జల్సాలకు ఖర్చు పెట్టేవాళ్ళు, మానవుడు తిండి కొరకు చెమట కార్చవలసిన దుర్గతికి ఎలా వచ్చిందీ మత శాస్త్రంలోని మొదటి పాపపు కథ మనకు నిశ్చయంగా తెలియజేస్తోంది. కానీ, అర్థశాస్త్రంలోని మొదటి పాపపు చరిత్ర మనకు వెల్లడించేది ఏమిటంటే, చెమట కార్చనవసరం లేనివాళ్ళు కొందరున్నారని, అది పోనీలెండి! ఆ విధంగా జరిగింది ఏమిటంటే, మొదటి రకం మనుషులు ఐశ్వర్యం సంచయనం చేసినారు. రెండవరకం వాళ్ళకు చివరకు అమ్ముకోడానికి తమ ఒళ్ళు తప్ప ఏమీ మిగలలేదు. ఈ మొదటిపాపం నాటినుండి అత్యధిక సంఖ్యాకుల బీదరికం ఏర్పడింది; వాళ్ళు ఎంత శ్రమ చేసినా ఈనాటి వరకు తమను తాము అమ్ముకోవలసిందే తప్ప అమ్ముకోడానికి వాళ్ళకి మరేమీ లేదు. ఆనాటి నుండే కొద్దిమందికి ఐశ్వర్యం ఏర్పడింది; వాళ్ళు ఏనాడో పనిచేయడం మానుకున్నా వాళ్ళ ఐశ్వర్యం నిత్యం పెరుగుతూ వుంటుంది. ఆస్తిని సమర్థించడానికి ఈ నిస్సారమైన కాకమ్మకథలు మనకు రోజూ ఉపదేశింపబడుతున్నాయి. ఉదాహరణకు, ఒకప్పుడు భావుకతకు పేరుగన్న

ఫ్రెంచి ప్రజలకు, రాజనీతిజ్ఞునికి సహజమైన సమస్త గాంభీర్యంతోనూ దీనిని పునశ్చరణ చేసే ధీమా థీర్స్‌కు వుండింది. కానీ, ఆస్తి సమస్య మాటకు వస్తే, పసిపిల్లల బౌద్ధిక ఆహారాన్ని సకల యుగాలకూ, సకల అభివృద్ధి స్థాయిలకూ యోగ్యమైనదిగా ఉద్ఘోషించడం పవిత్రధర్మం అవుతోంది. వాస్తవ చరిత్రలో ఇతరులను జయించడమూ, బానిసలను చేయడమూ, దారి దోపిడీ, హత్యలూ – టూకీగా చెప్పాలంటే దౌర్జన్యం– విశేషమైన పాత్ర నిర్వహించినాయనేది జగద్విదితం. అర్థశాస్త్రపు సుకుమార చరిత్రలో, అనాది కాలంనుండి ఋష్యాశ్రమ నీతులురాజ్యం చేస్తున్నాయి. హక్కూ, "శ్రమా" ఎల్లప్పుడూ ధన సంపాదనకు ఏకైక మార్గాలుగా వుండినాయి. "ఈ సంవత్సరం" ఎప్పుడూ మినహాయింపే అనుకోండి. వాస్తవానికి, ఆదిమ సంచయనపు పద్ధతులు ఋష్యాశ్రమ పద్ధతులు ఏ మాత్రమూ కావు.

డబ్బూ, సరుకులూ స్వతహాగా పెట్టుబడి కావు – ఉత్పత్తి సాధనాలూ, జీవనాధారాలూ పెట్టుబడి కానట్లే. అవి పెట్టుబడిగా రూపాంతరం చెందవలసి వుంది. కానీ, ఈ రూపాంతరీకరణ అనేది కొన్ని నిర్దిష్ట పరిస్థితులలో మాత్రమే జరుగుతుంది. ఆ పరిస్థితులలో ముఖ్యమైనది ఏమంటే, చాలా భిన్నమైన సరుకుల సొంతదార్లు ఇద్దరు ఎదురుబదురుగా దగ్గరకు రావాలి. ఒకవైపున డబ్బూ, ఉత్పత్తి సాధనాలూ, జీవనాధారాలూ, కలిగి, ఇతరుల శ్రమశక్తిని కొనడం ద్వారా తమవద్ద వున్న విలువల మొత్తాన్ని పెంచుకోవాలని ఉబలాటపడేవాళ్ళు; మరొకవైపున స్వేచ్ఛాయుత శ్రామికులు, తమ సొంత శ్రమశక్తిని అమ్ముకునేవాళ్ళు, కనుక శ్రమను అమ్మేవాళ్ళు. రెండు అర్థాలలో వాళ్లు స్వేచ్ఛాయుత కార్మికులు – బానిసలూ, ఫ్యూడల్ దాసులూ, వగైరాల లాగ వాళ్ళు స్వయంగా ఉత్పత్తి సాధనాలతో భాగం కాదు; సొంత ఆస్తి గల రైతుల విషయంలో లాగ ఉత్పత్తి సాధనాలు వాళ్ళకు చెందవు, కనుక వాళ్లు సొంత ఉత్పత్తి సాధనాల నుండి విముక్తులు, వాటి భారం లేనివాళ్ళు. సరుకుల మార్కెట్‌లో ఈ ద్విధా కేంద్రీకరణ (polarisation) జరగడంతో పెట్టుబడిదారీ ఉత్పత్తికి కావలసిన మౌలిక పరిస్థితులు ఏర్పడినాయి. పెట్టుబడిదారీ వ్యవస్థ వుండాలంటే, శ్రామికులు ఏ సాధనాల ద్వారా తమ శ్రమను వాస్తవీకరించగలరో ఆ సాధనాలకు చెందిన ఆస్తినుండి వాళ్ళు పూర్తిగా వేరుపడి వుండాలి. పెట్టుబడిదారీ ఉత్పత్తి తన కాళ్ళ మీద తాను నిలబడిన వెంటనే, అది ఈ వేరుపాటును కొనసాగించడమే కాక, నిరంతరం విస్తరించే ప్రమాణంలో దానిని పునరుత్పత్తి చేస్తుంది. కనుక, పెట్టుబడిదారీ వ్యవస్థకు దారితీసే క్రమం కార్మికుని నుండి తన ఉత్పత్తి సాధనాల మీద అతనికి గల ఆధిపత్యాన్ని లాక్కునే క్రమం తప్ప మరేమీ కాదు. ఇది ఒకవైపున సామాజిక జీవనాధారాలనూ, ఉత్పత్తి సాధనాలనూ పెట్టుబడిగానూ, మరొకవైపున ప్రత్యక్ష ఉత్పత్తిదారులను వేతన కార్మికులుగానూ మార్చే క్రమం. కనుక ఆదిమ సంచయనం అనేది ఉత్పత్తి సాధనాల నుండి ఉత్పత్తి దారుని విడదీసే చారిత్రక క్రమం తప్ప మరేమీ కాదు. అది ఆదిమంగా ఎందుకు కనపడుతుందంటే, అది పెట్టుబడి యొక్కా, దానికి అనురూపమైన ఉత్పత్తి విధానం యొక్కా పూర్వదశ గనుక.

పెట్టుబడిదారీ సమాజపు ఆర్థిక నిర్మాణం ఫ్యూడల్ సమాజపు ఆర్థిక నిర్మాణం నుండి పుట్టి పెరిగింది. ఫ్యూడల్ సమాజపు విచ్ఛిత్తి పెట్టుబడిదారీ సమాజపు మూల శక్తులను విడుదల చేసింది.

ప్రత్యక్ష ఉత్పాదకుడు, అనగా శ్రామికుడు, భూమికి అనుబంధింపబడడం ముగిసిన తర్వాత, మరొకరికి బానిసగా, ఫ్యూడల్ దాసుడుగా, నిర్బంధ సేవకుడుగా ఉండడం ముగిసిన తర్వాత మాత్రమే తన్ను తాను అమ్ముకోగలడు. శ్రమశక్తిని స్వేచ్ఛగా అమ్మేవాడు కావడానికి, ఎక్కడ మార్కెట్ లభ్యమైతే అక్కడికి తన సరుకును తీసుకుపోయేవాడు కావడానికి, అతను వృత్తిసంఘాల వ్యవస్థ నుండీ,

అప్రెంటిస్‌ల మీదా, వృత్తి సంఘ కార్మికుల మీదా ఆ సంఘాలు పెట్టే నియమాల నుండీ, వాటి శ్రమ నిబంధనల ఆటంకాలనుండీ కూడా తప్పించుకొని వుండాలి. కనుక, ఉత్పాదకులను వేతన కార్మికులుగా మార్చే ఈ చారిత్రక గతి, ఒకవైపున, ఫ్యూడల్ దాస్యంనుండీ, వృత్తి సంఘ శృంఖలాల నుండీ వాళ్ళ విమోచనగా కనిపిస్తుంది; మన బూర్జువా చరిత్రకారులకు వున్నది ఈ పార్శ్వం మాత్రమే. కానీ, మరొకవైపున, ఈ కొత్త విముక్తులు వాళ్ళ ఉత్పత్తి సాధనాలన్నీ, పాత ఫ్యూడల్ ఏర్పాట్లు సమకూర్చిన జీవితపు హామీలన్నీ దోచుకోబడిన తర్వాత మాత్రమే. తమను తాము అమ్ముకునే వాళ్ళు అయినారు. వాళ్ళ ఈ ఆస్తిహరణపు చరిత్ర మానవేతిహాసంలో రక్తసిక్త, అగ్ని దగ్ధ అక్షరాలతో లిఖింపబడింది.

పారిశ్రామిక పెట్టుబడిదారులు, ఈ కొత్త రాజులు, తమ వంతుకు చేతిపనుల వృత్తి సంఘ సభ్యులను మాత్రమేకాక, సంపద మూలాధారాల సొంతదారులైన ఫ్యూడల్ ప్రభువులను కూడా తొలగించ వలసి వుండింది. ఈ విషయంలో వాళ్ళు సామాజిక అధికారాన్ని గెలుచుకోవడం ఇటు ఫ్యూడల్ పెత్తనం మీదా, దాని అసహ్యకరమైన అధిక సౌకర్యాల మీదా, అటు వృత్తి సంఘాల మీదా, ఉత్పత్తి స్వేచ్ఛగా అభివృద్ధి కాకుండానూ, మనిషిని మనిషి స్వేచ్ఛగా దోపిడీ చేయకుండానూ ఆ సంఘాలు పెట్టిన ఆటంకాల మీద జరిగిన విజయవంతమైన పోరాటపు ఫలితంగా కనిపిస్తుంది. కానీ, పరిశ్రమల వీరులు తమకు బొత్తిగా ఏమీ ప్రమేయం లేని ఘటనలను ఉపయోగించుకోవడం ద్వారా మాత్రమే ఖడ్గవీరులను తొలగించగలిగినారు. ఒకప్పుడు రోమన్ విముక్త బానిస ఎంత నీచమైన పద్ధతులద్వారా తన పోషకుని మీద అధికారి అయినాడో అంత నీచమైన పద్ధతుల ద్వారా వీళ్ళు పైకి వచ్చినారు.

వేతన కార్మికుడినీ, పెట్టుబడిదారునీ ఉత్పన్నం చేసిన పరిణామం యొక్క ప్రారంభ స్థానం శ్రామికుని దాస్యం. ఈ దాస్య రూపంలో వచ్చిన మార్పు, అనగా ఫ్యూడల్ దోపిడీ పెట్టుబడిదారీ దోపిడీగా రూపాంతరం చెందడమే ఆ పురోగతి. దాని గమనాన్ని అర్థం చేసుకోడానికి మనం చాలా దూరం వెనక్కి పోనక్కరలేదు. పెట్టుబడిదారీ ఉత్పత్తి యొక్క మొదటి ప్రారంభాలు మధ్యధరా సముద్ర తీరంలోని కొన్ని పట్టణాలలో చెదురుమదురుగా 14వ శతాబ్దిలోనే, లేదా 15వ శతాబ్దిలోనే మనకు కనిపించినా, పెట్టుబడిదారీ యుగం 16వ శతాబ్దిలో ప్రారంభమైంది. అది కనిపించిన చోటల్లా ఫ్యూడల్ దాస్యం చాలా కాలం క్రితమే రద్దు చేయబడి వుండింది. మధ్యయుగాల అత్యున్నత అభివృద్ధి అయిన సర్వసత్తాక పట్టణాల ఉనికి చాలా కాలంగా క్షీణిస్తూ వుండింది.

ఆదిమ సంచయన చరిత్రలో, రూపొందే పెట్టుబడిదారీ వర్గానికి దోహదాలుగా పనిచేసే విప్లవాలన్నీ యుగప్రవర్తకాలే: కానీ, అన్నిటినీ మించి, అపారమైన జనసముదాయాలు తమ జీవనాధారాల నుండి హఠాత్తుగా, బలవంతంగా గుంజివేయబడి, స్వేచ్ఛాయుత, "అననుబంధిత" కార్మికులుగా కార్మిక మార్కెట్‌లోకి విసరి వేయబడిన ఆ తరుణాలే యుగ ప్రవర్తకాలు, వ్యవసాయ ఉత్పాదకుని, అనగా రైతును, భూమినుండి తొలగించిన ఆస్తిహరణం ఈ మొత్తం క్రమం యొక్క ప్రాతిపదిక. భిన్న దేశాలలో ఈ ఆస్తిహరణపు చరిత్ర భిన్నరూపాలు ధరిస్తుంది. తన వివిధ దశలను భిన్నక్రమాలలో, భిన్న కాలాలలో ఇది గడుస్తుంది. మనం ఉదాహరణగా తీసుకోబోయే ఇంగ్లండులో మాత్రమే దానికి లాక్షణిక రూపం వుంది.[1]

1. పెట్టుబడిదారీ ఉత్పత్తి అన్ని చోట్ల కంటె ముందు అభివృద్ధి చెందిన ఇటలీలో ఫ్యూడల్ దాస్య విచ్ఛిత్తి కూడా ఇతరచోట్ల కంటె ముందు జరిగింది. ఆ దేశంలో ఫ్యూడల్ దాసునికి భూమి మీద పరంపరాగతమైన హక్కు లభించకముందే అతను విముక్తుడైనాడు. అతని విముక్తి అతన్ని వెంటనే స్వేచ్ఛాయుత కార్మికునిగా

## అధ్యాయం - 27

# వ్యవసాయ ప్రజానీకాన్ని భూమినుంచి తొలగించిన ఆస్తిహరణం

ఇంగ్లండులో, 14వ శతాబ్ది చివరి భాగంలో ఫ్యూడల్ దాస్యం దాదాపుగా అదృశ్యమైంది. అప్పుడూ, అంతకంటే ఎక్కువగా 15వ శతాబ్దిలోనూ, తమ ఆస్తి హక్కు ఏ ఫ్యూడల్ పేరు మరుగన వుండినప్పటికీ, స్వేచ్ఛాయుత ఆస్తిపర రైతులు ప్రజానీకంలో అపారమైన మెజారిటీగా వుండినారు.[1] పెద్ద ఫ్యూడల్ ఎస్టేట్లలో, తానే ఫ్యూడల్ దాసుడుగా వుండిన పాతకాలపు bailiff (మేనేజర్) పోయి, అతని స్థానంలో స్వేచ్ఛాయుత వ్యవసాయదారు వచ్చినాడు. వ్యావసాయిక వేతన శ్రామికులుగా వుండింది కొందరు రైతులు, తమ తీరిక కాలాన్ని పెద్ద ఎస్టేట్లలో పనిచేయడానికి వినియోగించిన వాళ్ళు; మరి కొందరు స్వతంత్రమైన ప్రత్యేక వర్గానికి చెందిన వేతన శ్రామికులు, సాపేక్షంగానూ, పరమంగానూ తక్కువ సంఖ్యలో వుండినవాళ్ళు; ఈ రెండవ రకం వాళ్ళు అర్థాత్తూ అదే సమయంలో రైతు వ్యవసాయదారులు, ఎందుకంటే, వేతనం కాక వాళ్ళకు 4 ఎకరాలు లేక అంతకంటే ఎక్కువ సాగుభూమి వాటిలోని గుడిసెలతో సహా, ఇవ్వబడేది. అంతేకాక, వాళ్ళు ఇతర రైతులతో కలిసి

---

మార్చింది. అంతేకాక, అతని యజమాని కూడా పట్టణాలలో అతని కోసం కాచుకుని సిద్ధంగా వుండినాడు; ఆ పట్టణాలు చాలా మేరకు రోమన్ కాలం నుండి వచ్చిన వారసత్వాలు. రమారమిగా 15వ శతాబ్ది అంతంలో ప్రపంచ మార్కెట్‌లో జరిగిన విప్లవ ఉత్తర ఇటలీ వాణిజ్య ఆధిక్యాన్ని అంతం జేసినప్పుడు, వ్యతిరేక దిశలో గమనం ప్రారంభమైంది. పట్టణాలలోని కార్మికులు మూకుమ్మడిగా గ్రామాలకు తరుమబడి, తోటల సాగురూపంలో జరిగిన సన్నకారు వ్యవసాయానికి కనివిని ఎరుగని ప్రేరణ ఇచ్చినారు.

1. "తాము తమ సొంత పొలాలను సాగు చేసుకుంటూ చిన్న ఆదాయంతో తృప్తిపడే వాళ్ళు.... జాతిలో ఇప్పటికంటే అప్పుడు మరింత గణనీయమైన భాగంగా వుండినారు. ఆ కాలపు ఉత్తమ గణాంక రచయితలను మనం నమ్మవచ్చుననుకుంటే, 1,60,000కు తక్కువ కాని ఆస్తిపరులు చిన్న ఫ్రీ హోల్డ్ భూములనుండి (రైతుకు సంపూర్ణస్వామ్యం గల భూములనుండి) జీవనభృతి పొందినారు; వాళ్ళ కుటుంబాలతో కలిసి వాళ్ళు మొత్తం జనాభాలో ఏడవ భాగానికి పైగా వుండి వుండాలి. ఈ సన్నకారు భూస్వాముల సగటు ఆదాయం ఏటా 60, 70 పౌండ్ల మధ్య వున్నట్లు అంచనా వేయబడింది. ఇతరుల భూమిని సాగుచేసేవాళ్ళకంటె సొంత భూమిని సాగుచేసుకునేవాళ్ళు ఎక్కువగా వుండినట్లు లెక్కవేయబడింది. (Macaulay, "History of England" [మెకాలే, "ఇంగ్లండు చరిత్ర"], 10వ కూర్పు, లండన్, 1854, I, పుటలు 333, 334) 17వ శతాబ్ది చివరి మూడింటి భాగంలో కూడా ఇంగ్లీషు ప్రజలలో 4/5 వంతుల మంది వ్యావసాయికులు (అదే గ్రంథం, పుట 413) నేను మెకాలేను ఉటంకించడం ఎందుకంటే చరిత్రను క్రమపద్ధతిగా అబద్ధీకరించేవాడుగా అతను ఇలాంటి వాస్తవాలను సాధ్యమైనంత ఎక్కువగా తక్కువ పరుస్తాడు.

ఉమ్మడి భూమిని ఉపయోగించుకొనే వాళ్ళు. ఈ భూమి వాళ్ళకు కలపా, వంట చెరకూ, గడ్డీ, వగైరాలను సమకూర్చేది.[1] యూరప్ దేశాలన్నిటిలోనూ ఫ్యూడల్ ఉత్పత్తి యొక్క లక్షణం ఏమిటంటే, భూమి వీలైనంత ఎక్కువమంది సామంతుల మధ్య పంపకమైంది. ఫ్యూడల్ ప్రభువు యొక్క బలం, రాజు బలం లాగే, అతని మక్తాబకాయిల జాబితామీద కాక, తన సామంతుల సంఖ్య మీద ఆధారపడింది, ఆ సామంతుల సంఖ్య ఆస్తిపర రైతుల సంఖ్య మీద ఆధారపడింది.[2] కనుక, నార్మన్ విజయం తర్వాత ఇంగ్లండు భూమి బ్రహ్మాండమైన బేరనీలుగా, తరుచుగా ఒక్కొక్కటి తనలో 900 పాత ఆంగ్లో శాక్సన్ ప్రభు మండలాలను ఇముడ్చుకొన్నట్టి బేరనీలుగా విభజింపబడినప్పటికీ, అక్కడక్కడ మాత్రమే పెద్ద ఫ్యూడల్ ఎస్టేట్లను కలిగి, దాని నిండా సన్నకారు రైతు క్షేత్రాలు వుండినాయి. ఆ పరిస్థితులు, 15వ శతాబ్దికి ఎంతో విలక్షణంగా వుండిన పట్టణాల వికాసంతో కలిసి, ప్రజల సంపదను ఉండనిచ్చినాయి. ఛాన్సలర్ ఫోర్టెస్క్యూ తన "Laudibus legum Angliae"లో ఆ సంపదను ఎంతో ఉత్సాహంగా చిత్రిస్తాడు. కానీ ఆ పరిస్థితుల్లో పెట్టుబడిదారీ సంపదకు అవకాశం లేదు.

పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానానికి పునాది వేసిన విప్లవ నాందీ ప్రస్తావన 15వ శతాబ్ది చివరి మూడవ భాగంలోనూ, 16వ శతాబ్ది మొదటి దశకంలోనూ జరిగింది. సర్ జేమ్స్ స్టూవర్ట్ చక్కగా చెప్పినట్టు "ప్రతిచోటా నిరుపయోగంగా ఇల్లూ, కోటా నిండిన"[3] ఫ్యూడల్ పరిచారక బృందాల విచ్ఛిత్తితో విస్తారమైన స్వేచ్ఛాయుత నిరాస్తిపరులు (Proletariat) శ్రమ మార్కెట్లోకి నెట్టబడినారు. తానే బూర్జువా అభివృద్ధి యొక్క సృష్టి అయిన రాజాధికారం నిరవధిక సర్వసత్తాకత కొరకు తాను చేసిన ప్రయత్నంలో ఈ పరిచారక దళాల విచ్ఛిత్తిని బలవంతంగా త్వరపరచినప్పటికీ, దానికిదే ఏకైక కారణం కాదు. రాజుకూ, పార్లమెంటుకూ తీవ్ర వ్యతిరేకులైన బడా ఫ్యూడల్ ప్రభువులు భూమి మీద ప్రభువుకెంత హక్కు వుందో అంతే ఫ్యూడల్ హక్కుగల రైతులను భూమినుండి బలవంతంగా తరిమివేయడం ద్వారానూ, ఉమ్మడి భూములను దురాక్రమణ చేసుకోవడం ద్వారానూ, సాటిలేనంత ఎక్కువ సంఖ్యలో నిరాస్తిపరులను సృష్టించినారు. ఫ్లెమిష్ ఉన్ని ఉత్పత్తులు వేగంగా పెరగడమూ, ఇంగ్లండులో ఉన్ని ధర తదనుగుణంగా పెరగడమూ భూమి నుండి రైతులను ఇలా తరిమివేయడానికి

---

1. ఫ్యూడల్ దాసుడు, కప్పం చెల్లించే సొంతదారుడే అయినా, తన ఇంటికి అనుబంధింపబడిన పొలానికి సొంతదారుడు మాత్రమే కాక, ఉమ్మడి భూమిలో భాగస్వామి కూడా అని మరిచిపోకూడదు. "రైతు (సైలీషియాలో, రెండవ ఫ్రెడరిక్ రాజ్యంలో) ఫ్యూడల్ దాసుడుగా వుంటాడు. "అయినప్పటికీ, ఈ ఫ్యూడల్ దాసులకు ఉమ్మడి భూములు ఉంటాయి. ఈ కాలం వరకు తమ ఉమ్మడి భూములను పంచుకోలేదు. మరి, నెయ్మార్క్లో ప్రతి గ్రామంలోనూ ఈ పంపకం జరిగింది, ఎంతో విజయవంతంగా కూడా." (Mirabeau, "De la Monarchie Prussienne" [మిరబో, "ప్రష్యన్ రాజరికం"] Londres, 1788, సంపుటి 11, పుటలు 125 - 26.
2. భూ ఆస్తిలో శుద్ధ ఫ్యూడల్ వ్యవస్థీకరణ కలిగి, అభివృద్ధి చెందిన సన్నకారు వ్యవసాయం గల జపాన్ యూరపియన్ మధ్యయుగాలను గురించి మన చరిత్ర పుస్తకాలన్నిటికంటె ఎంతో వాస్తవమైన చిత్రాన్ని ఇస్తుంది. మన పుస్తకాలలో అత్యధిక భాగం బూర్జువా దురభిప్రాయాలకు లోబడినాయి. మధ్యయుగాలతో పోల్చుతూ "ఉదారంగా" వుండడం చాలా వీలు.
3. J. Steaurat, "An Inquiry into the Principles of Politcal Economy" ("అర్థశాస్త్ర సూత్రాల పరిశీలన"), సంపుటి I, Durblin 1770, పుట 52 - సం.

ప్రత్యక్ష ప్రేరణ అయినాయి. పాత ప్రభువర్గం ఫ్యూడల్ మహా యుద్ధాలచేత భక్షింపబడింది. కొత్త ప్రభువర్గం తన కాలపు సంతతి, దానికి డబ్బే శక్తులలో కెల్ల శక్తి, కనుక సాగు భూమిని గొర్రెల మేత భూమిగా మార్చడం దాని నినాదంగా వుండింది, హారిసన్ తన Description of England, Prefixed to Holinshed's Chronicles లో... సన్నకారు రైతుల ఆస్తిహరణం దేశాన్ని ఎలా ఆర్థికంగా నాశనం చేస్తున్నదీ వర్ణిస్తాడు. "మన మహా దురాక్రమణ దారులకేం లెక్క?" అంటాడు. రైతుల నివాస గృహాలూ, శ్రామికుల గుడిసెలూ నేలమట్టం చేయబడినాయి. లేదా శిధిలమైపోయే దుర్గతికి వదలిపెట్టబడినాయి. హారిసన్ ఇలా అంటాడు :

"ప్రతి ఎస్టేటుకీ చెందిన పాత రికార్డులు చూస్తే... కొన్ని మండలాలలో పదేడు, పద్దెనిమిది, ఇరవై ఇండ్లు కూలిపోయినట్లూ, ఇంగ్లండులో ఈనాటికంటే తక్కువ జనం ఎన్నడూ లేనట్లూ కనిపిస్తుంది... పూర్తిగా క్షీణించిన, లేదా పాతిక కంటె ఎక్కువో, అర్ధయో తగ్గిపోయిన నగరాల గురించీ, పట్టణాల గురించీ, అక్కడక్కడ వాటిలో ఏదైనా ఒకటీ అరా కాస్త పెరిగినప్పటికీ, గొర్రెల మేత భూములుగా మార్చేందుకుగాను కూలదోయబడి, ఇప్పుడు ప్రభు భవనాలు తప్ప ఏమీ లేనట్టి పట్టణాల గురించి నేను కొంత చెప్పగలను.

ఈ పాత కైఫీయతుదారుల ఫిర్యాదులు ఎప్పుడూ అతిశయోక్తులుగానే వుంటాయి; కానీ అవి ఉత్పత్తి సంబంధాలలో వచ్చిన విప్లవం సమకాలికుల మీద కలిగించిన ముద్రను విశ్వసనీయంగా ప్రతిబింబిస్తాయి. ఛాన్సలర్ ఫోర్టెస్క్యూ రచనలనూ, థామస్ మూర్ రచనలనూ పోల్చి చూస్తే 15వ, 16వ శతాబ్దుల మధ్య గల అఘాతం వెల్లడౌతుంది. తార్న్టన్ సరిగా చెప్పినట్లు, ఇంగ్లీషు కార్మికవర్గం మధ్యలో పరివర్తన దశ ఏదీ లేకుండా తన స్వర్ణయుగం నుండి ఇనుప యుగంలోకి హఠాత్తుగా తోయబడింది.

ఈ విప్లవం పట్ల శాసనావళి భయ కంపితురాలైంది. అది ఇంకా "జాతి సంపద" (అనగా పెట్టుబడి ఏర్పడడమూ, ప్రజా బాహుళ్యాన్ని నిర్లక్ష్యంగా దోచుకోవడమూ, బీదరికంలోకి తోయడమూ) సమస్త రాజనీతి యొక్క ultima Thulel"* వుండే నాగరికతా శిఖరంమీద నిలుచోలేదు. తన ఏడవ హెన్రీ చరిత్రలో బేకన్ ఇలా అంటాడు :

"ఉమ్మడి భూములను సొంతపరచుకోవడం ఆ కాలంలో (1489) మరింత తరుచుగా జరగసాగింది, దాని ద్వారా సాగు భూమి (మనుషులు, కుటుంబాలూ లేకుండా ఎరువు పెట్టడం సాధ్యం కానట్టి భూమి) పశువుల బీడుగా మార్చబడింది; ఇది కొద్దిమంది గొర్రెలకాపరులు సులభంగా చూసుకోగలట్టిది. నిర్ణీత సంవత్సరాలకూ, జీవితాంతం వరకూ, ఇష్టం వచ్చినన్నాళ్ళ వరకూ కౌలు కివ్వబడిన భూములు (చాలా మంది రైతులు వీటిమీద జీవించేవాళ్ళు) పెద్ద ఎస్టేట్లుగా మార్చబడినాయి. ఇది జన క్షీణతనూ, (తత్పర్యవసానంగా) పట్టణాల, చర్చీల, పన్నుల, వగైరాల క్షీణతనూ కలిగించింది.... ఈ అసౌకర్యాన్ని తొలగించడానికి రాజూ, పార్లమెంటూ చూపిన విజ్ఞత ప్రశంసనీయమైనది.... వాళ్ళు జనక్షయం కలిగించే ఉమ్మడి భూ ఆక్రమణలనూ, జనక్షయం కలిగించే పశువుల బీళ్ళ ఆక్రమణనూ తొలగించసాగినారు."

---

* అంతిమ లక్ష్యం - సం.

1489లో ఏడవ హెన్రీ చేసిన చట్టం, నిబంధన 19 కనీసం 20 ఎకరాల భూమి కలిగి వుండిన సకల "వ్యవసాయ గృహాల" విధ్వంసాన్నీ నిషేధించింది. ఎనిమిదవ హెన్రీ 25వ పాలన సంవత్సరంలో జారీ చేసిన చట్టం ద్వారా అదే నియమం పునరుద్ధరించబడింది. అది మిగతా విషయాలతో బాటు ఇలా పేర్కొంది.

"అనేక క్షేత్రాలూ, విస్తారమైన పశువుల మందలూ, ముఖ్యంగా గొర్రెల మందలూ కొద్దిమంది చేతుల్లో కేంద్రీకరింపబడ్డాయి. తద్వారా భూమిశిస్తు చాలా పెరిగింది. సాగుభూమి తగ్గిపోయింది. చర్చీలూ, గృహాలూ కూలదోయబడినాయి. నివ్వెరపాటు కలిగించేటంతమంది జనాలకు తమనూ, తమ కుటుంబాలనూ పోషించుకొనే మార్గాలు లేకుండా పోయినాయి"

కనుక, క్షీణించిన క్షేత్రాలను పునర్నిర్మించాలని ఆ చట్టం శాసించి, ధాన్యం భూమికీ, పశువుల బీడుకూ మధ్య ఒక నిష్పత్తిని నిర్ణయించడం వగైరాలను చేసింది. 1533 నాటి ఒక చట్టం కొంత మంది సొంతదార్లకు 24,000 గొర్రెలు వున్నాయని పేర్కొని, 2000 కంటె ఎక్కువ గొర్రెలు ఎవరికీ ఉండకూడదని పరిమితి విధించింది.[1] ఏడవ హెన్రీ తర్వాత 150 ఏండ్లపాటు, సన్నకారు వ్యవసాయదారుల, రైతుల ఆస్తిహరణకు వ్యతిరేకంగా జరిగిన ప్రజల గోలా, చట్టాలూ రెండూ నిష్ఫలమైనాయి. బేకన్ తనకు తెలియకుండానే వాటి అసమర్థత యొక్క రహస్యాన్ని మనకు వెల్లడిస్తాడు.

తన "Essays, Civil and Moral" లోని 29వ వ్యాసంలో బేకన్ యిలా అంటాడు; "క్షేత్రాలకూ, వ్యవసాయ గృహాలకూ ఒక ప్రమాణం విధించడంలో ఏడవ హెన్రీ చిట్కా విజ్ఞతాయుతమైనది, ప్రశంసనీయమైనది; ఆది మనిషి బతకడానికి సమృద్ధి అయిన పంటనిచ్చి, దాస్య స్థితి లేకుండా చేసేటంత భూమిని అతనికి సమకూర్చి నాగలిని వట్టి గులాముల చేతుల్లో కాక, సొంతదారుల చేతుల్లో పెట్టింది."[2]

---

1. ఇంగ్లండులో "అంత అణుకువగా, అంత సాధువుగా వుండిన మీ గొర్రెలు, అంత తక్కువ తినేవి, ఇప్పుడు ఎంత గొప్ప భక్షకులుగా, ఎంత క్రూరంగా తయారైనాయంటే, అవి మనుషులనే తినేస్తున్నాయనీ దిగమింగుతున్నాయనీ అంటున్నారు" అని థామస్ మూర్ తన "ఊహాస్వర్గం"లో అంటాడు. ("uto-pia" అనువాదం రాబిన్సన్, ప్రచురణకర్త ఆర్బర్, London 1869, పుట 41)

2. బేకన్ స్వేచ్ఛాయుత, సంపన్న రైతాంగానికీ, మంచి కాల్బలానికీ గల సంబంధం చూపిస్తాడు. "దృఢ శరీరాన్ని బీదరికం లేకుండా పోషించడానికి చాలినంత ప్రమాణం గల క్షేత్రాలను కలిగివుండడం రాజ్యం యొక్క శక్తికీ, నీతికీ అద్భుతంగా సరిపోయింది. క్రియలో ఇది రాజ్యంలోని భూములలో విస్తారమైన భాగాన్ని పెద్ద రైతులకు, అనగా ఇటు కులీలకూ, అటు పొలంలోని గుడిసెలలో నివసించే వ్యవసాయ దారులకూ, రైతులకూ, మధ్య వున్న మధ్య తరగతి వాళ్ళకు, ఇచ్చింది... యుద్ధాలలో మంచి జ్ఞానం గల వాళ్ళ సాధారణ అభిప్రాయం ఏమంటే... సైన్యంలో, ప్రధానమైన బలం కాల్బలం, మంచి కాల్బలం తయారు కావాలంటే, దాస్యంలోనూ, దారిద్ర్యంలోనూ పెరిగినవాళ్ళు కాక, స్వేచ్ఛలోనూ, సమృద్ధిలోనూ పెరిగిన వాళ్ళు కావాలి. కనుక, రాజ్యం అత్యధికంగా ప్రభువుల కొరకూ, కులీనుల కొరకూ నడిపించబడితే, రైతులూ, హాలికులూ వాళ్ళ పనిమనుషులుగానో, కూలివాళ్ళుగానో, లేదా పొలంలోని గుడిసెలలో వుండేవాళ్ళుగానో (వాళ్ళు బిచ్చగాళ్ళు మాత్రమే) వుంటే, మంచి అశ్విక సైన్యం వుండవచ్చు గానీ, మంచి స్థిరమైన కాల్బడం వుండదు.... ఫ్రాన్సులోనూ, ఇటలీలోనూ, మరికొన్ని విదేశాలలోనూ ఇది కనపడు తుంది; అక్కడ క్రియలో అందరూ ప్రభువులూ, బీద రైతులూ.... ఫలితంగా వాళ్ళు కాల్బల దళాలకు స్విట్జర్లాండు, మొదలైన దేశాల కిరాయి సైనికులను చేర్చుకోక తప్పలేదు; మరొక ఫలితమేమిటంటే, ఆ

కాని పెట్టుబడిదారీ వ్యవస్థ డిమాండ్ చేసింది ఏమిటంటే, ప్రజా బాహుళ్యానికి హీనమైన, దాదాపు దాస్యం లాంటి స్థితి, వాళ్ళు కిరాయి మనుషులుగానూ, వాళ్ళ శ్రమ సాధనాలు పెట్టుబడిగానూ రూపాంతరం చెందడమూ, ఈ రూపాంతీకరణ కాలంలో శాసనావళి వ్యవసాయ శ్రామికుడి గుడిసె పక్కన 4 ఎకరాల భూమిని నిలపడానికి కూడా ప్రయత్నించింది. అతను తన గుడిసెలో అద్దెకు ఎవరినీ ఉంచుకోకుండా నిషేధించింది. మొదటి జేమ్స్ పాలనలో, 1627లో ఫ్రాంట్ మిల్ ఫ్యూడల్ ఎస్టేటులో 4 ఎకరాల భూమిని శాశ్వతంగా అనుబంధించబడని గుడిసె నిర్మించినందుకు రోజర్ క్రోకర్ అభిశంసింపబడినాడు. 1638లో మొదటి చార్లెస్ పాలనలో కూడా, పాత శాసనాలు, ముఖ్యంగా 4 ఎకరాల భూమికి సంబంధించిన శాసనం, అమలు జరిగేటట్లు చూడడానికి ఒక రాయల్ కమిషన్ నియమించబడింది. క్రామ్‌వెల్ కాలంలో కూడా, 4 ఎకరాల భూమి వుంటే తప్ప, లండన్‌కు 4 మైళ్ళ లోపల ఇల్లు కట్టడం నిషేధింపబడింది. 18వ శతాబ్ది ప్రథమార్థంలో కూడా, వ్యవసాయ శ్రామికుని గుడిసెకు ఒకటి రెండు ఎకరాల భూమి అనుబంధంగా లేకపోతే ఫిర్యాదు చేయబడేది. ఈ రోజుల్లో దానికి చిన్న తోట వుంటే, లేదా తన గుడిసెకు కాస్త దూరాన అతను కొద్ది సెంట్లు కౌలుకు తీసుకోగలిగితే, అతను అదృష్టవంతుడు.

"భూస్వాములూ, రైతులూ ఇక్కడ ఒకరి సరసన ఒకరు పనిచేస్తారు. గుడిసెకు కొద్ది ఎకరాలు వుంటే, శ్రామికులు మరి స్వతంత్రులౌతారు" అని డాక్టర్ హంటర్ అంటాడు.[1]

రిఫర్మేషన్ నుండి, తత్పర్యవసానంగా చర్చి ఆస్తికి జరిగిన బ్రహ్మాండమైన విధ్వంసం నుండీ, 16వ శతాబ్దిలో ప్రజల బలవంతపు ఆస్తి మరణపు క్రమానికి కొత్త, భయంకరమైన ప్రేరణ వచ్చింది. రిఫర్మేషన్ కాలంలో కాథలిక్ చర్చి ఇంగ్లండు భూముల్లో విస్తారమైన భాగానికి ఫ్యూడల్ సొంతదారుగా వుండింది. మఠాలు, మొదలైన వాటి అణచివేత వాటిలో వున్న వాళ్ళను నిరాస్తిపరులలోకి దిగదోసింది. చర్చి ఎస్టేట్లు చాలా మేరకు దురాశాపూరిత రాజాభిమానితులకు ఉచితంగా ఇవ్వడినాయి, లేదా సట్టా వ్యాపారం చేసే వ్యవసాయదారులకూ, పట్టణవాసులకూ నామకార్థపు ధరకు అమ్మబడినాయి. వాళ్ళు వంశపారంపర్యపు కౌలుదార్లను మొత్తంగా తరిమివేసి, వాళ్ళ కమతాలను ఒకటిగా కలిపినారు. చర్చి దశాంశ పన్ను మాన్యాలలో కొంత భాగం బీదలకు చట్టం ద్వారా హామీ ఇవ్వబడిన ఆస్తి హక్కు చల్లగా స్వాధీనం చేసుకోబడింది.[2] ఇంగ్లండులో సంచాయం చేసిన తర్వాత, "Pauper ubique jacet"

---

జాతులకు దండిగా జనమూ, కొద్ది సైనికులూ వున్నారు. "The Reign of Henry VII Etc. "Verbatim reprint from Kennet's England ("ఏడవ హెన్రీ పాలన." కెన్నెట్ యొక్క ఇంగ్లండ్ నుండి యధాతథ పునర్ముద్రణ London, 1870, పుట 308)

1. Dr. Hunter, "Public Health, 7th Report 1864" ("పౌర ఆరోగ్యం, 7వ నివేదిక 1864), London 1865 పుట 134. "(పాత శాసనాలలో) కేటాయించబడిన భూమి పరిమాణం శ్రామికులకు మరీ ఎక్కువగా వున్నట్లూ, వాళ్ళను చిన్న వ్యవసాయదారులుగా మార్చడానికి అభిముఖంగా వున్నట్లూ ఈనాడు పరిగణింపబడుతుంది" (George Roberts, "The Social History of the People of the Southern Countries of England in Past Centuries" (గత శతాబ్దులలో ఇంగ్లండు దక్షిణ కౌంటీల ప్రజల సామాజిక చరిత్ర") London, పుటలు 184-85

2. "చర్చి దశాంశ పన్ను మాన్యాలలో భాగం పంచుకోడానికి బీదలకు గల హక్కు ప్రాచీన శాసనాలచేత నెలకొల్పబడింది. (Tuckett, "A History of the Past and Present State of the Labouring Population" [శ్రామిక ప్రజానీకపు, గత, వర్తమాన స్థితి చరిత్ర] London 1846 సంపుటం, II, పుటలు 804-805).

అని ఎలిజబెత్ రాణి అన్నది. ఆమె పాలనలోని 43వ ఏట, బీదల సహాయక పన్నును ప్రవేశపెట్టడం ద్వారా జాతి అధికారికంగా బుక్కా పకీరుతనాన్ని గుర్తించవలసి వచ్చింది.

"ఈ శాసనకర్తలు దీనికి కారణాలను ప్రకటించడానికి సిగ్గుపడినట్లుంది, ఎందుకంటే (సాంప్రదాయిక ఆచారానికి విరుద్ధంగా) దీనికి ఉపోద్ఘాతం Preamble (లేదు)"[1]

మొదటి చార్లెస్ చేసిన 16వ చట్టం 4వ నిబంధన ద్వారా అది శాశ్వతం చేయబడింది; వాస్తవంలో 1834లో మాత్రమే అది మరింత కఠినమైన కొత్త రూపం ధరించింది.[2] రిఫర్మేషన్

---

1. William Cobbett, "A History of the Protestant Reformation" ("ప్రొటెస్టెంట్ రిఫర్మేషన్ చరిత్ర" 471).

2. ఇతర విషయాలతో పాటు ఈ క్రింది విషయం నుండి ప్రొటెస్టెంటిజం "సారాన్ని" గ్రహించవచ్చు. దక్షిణ ఇంగ్లండులో కొంత మంది భూస్వాములూ ధనిక రైతులూ కలిసి ఆలోచించి, ఎలిజబెత్ రాణి చేసిన బీదల సహాయక చట్టం యొక్క సరైన వ్యాఖ్యానం గురించి పది ప్రశ్నలు సిద్ధం చేసినారు. వీటిని వాళ్ళు ఆనాటి ప్రసిద్ధ న్యాయశాస్త్రవేత్త (తదనంతరం మొదటి జేమ్స్ కింద జడ్జి) అయిన సార్జెంట్ స్నిగ్గెకు ఆయన అభిప్రాయార్థం సమర్పించినారు. "9వ ప్రశ్న - ఈ చట్టాన్ని (ఎలిజబెత్ రాణి 43వ పాలన సంవత్సరంలో జారిచేసిన చట్టాన్ని) అమలు పరిచే భారాన్ని పరిహరించడానికి పారిష్ (చర్చికి సంబంధించిన ప్రాంతం)లోని ధనిక రైతులు కొందరు నేర్పుగా ఒక పద్ధతిని రూపొందించినారు. మనం పారిష్‌లో ఒక జైలు కట్టించి, తరువాత, ఈ పారిష్‌లోని బీదలతో పని చేయించుకోడానికి ఎవరైనా ఇష్టపడితే వాళ్ళు బీదలను ఏ కనీస మొత్తం డబ్బుకు మన చేతులలో నుండి తీసుకొనేదీ నిర్ణీత దినాన సీలు చేసిన ప్రతిపాదనలలో తెలియజేయాలనీ, ఆ జైలులో నిర్బంధింపబడిన వాళ్ళకు తప్ప ఇతరులకు సహాయం నిరాకరించడానికి వాళ్ళకు అధికారం వుంటుందనీ ఆ ప్రాంతంలో ప్రకటించాలని వాళ్ళు ప్రతిపాదించినారు. పని చేయడానికి ఇష్టపడక, భూమి కౌలుకు తీసుకోడానికీ, లేదా నౌక అద్దెకు తీసుకోడానికీ డబ్బూ, పరపతీ లేనట్టి వ్యక్తులు, పారిష్‌కు అనుకూలమైన మొత్తం ఇస్తామనే వాళ్ళు, ఇరుగు పొరుగు కౌంటీలలో వుంటారని ఈ పథకం ప్రతిపాదకులు ఊహించినారు. బీదలెవరైనా కంట్రాక్టర్ రక్షణలో మరణిస్తే, ఆ పాపం అతనికే చెందుతుంది; పారిష్ వాళ్ళ పట్ల తన ధర్మాన్ని నెరవేర్చివుంటుంది. కానీ, ప్రస్తుత చట్టం (ఎలిజిబెత్ రాణి 43వ పాలన సంవత్సరంలో జారీ చేసినట్టిది) ఇలాంటి వివేకవంతమైన పథకాన్ని అనుమతించదని మాకు అనుమానంగా వుంది. కానీ, బీదలను జైలులో పెట్టి, వాళ్ళతో పని చేయించుకోడానికి ఒక వ్యక్తి కంట్రాక్టు ఇవ్వడానికి పారిష్‌కు అధికారం ఇచ్చి, అలా జైలులో వుండడానికీ, పనిచేయడానికీ ఎవరైనా నిరాకరిస్తే, వాళ్ళకు ఏ సహాయం పొందడానికీ హక్కు వుండదని ప్రకటించే శాసనాన్ని ప్రతిపాదించాలని తమ సభ్యులకు సూచించడంలో ఈ కౌంటీకీ, పొరుగున వున్న కౌంటీకి చెందిన ఇతర ఫ్రీ హోల్డ్ రైతులు ఏకమౌతారని మీరు తెలుసుకోవాలి. బీదలు సహాయం కోరడాన్నీ, పారిష్‌లను నష్టపరిచే సాధనాలుగా వుండడాన్నీ ఈ చట్టం అరికట్టుతుందని ఆశిస్తున్నాము" (R. Blakey, "The History of Political Literature from the Earliest Times") "ప్రాచీన కాలం నుండి రాజకీయ సారస్వత చరిత్ర" (London, 1855, సంపుటం II, పుటలు 84, 85), స్కాట్లండులో ఫ్యూడల్ దాస్యం రద్దు ఇంగ్లండులో జరిగిన తర్వాత కొన్ని శతాబ్దాలకు జరిగింది. 1698లోనే, సాల్టౌన్‌కు చెందిన ఫ్లెచర్ స్కాచ్ పార్లమెంటులో ఇలా ప్రకటించినాడు: "స్కాట్లండులోని బిచ్చగాళ్ళ సంఖ్య 2,00,000కు తక్కువ కానట్లు అంచనా వెయ్యబడింది. సూత్ర దృష్ట్యా రిపబ్లికన్ అయిన నేను సూచించగల ఒకే నివారణోపాయం ఏమిటంటే, పాత ఫ్యూడల్ దాస్య స్థితిని పునరుద్ధరించడమూ, స్వయంగా బతకలేని వాళ్ళనందరినీ బానిసలను చేయడమూ. "Eden, The State of the Poor" ("బీదల స్థితి"). London 1797, సంపుటి I, ప్రకరణం 1, పుటలు 60, 61లో ఈడెన్ ఇలా అంటాడు: "ఫ్యూడల్ దాస్యం తగ్గిపోవడం ఆవశ్యంగా బీదలు పుట్టిన యుగంగా వున్నట్లు కనపడుతుంది. కార్ఖానాలూ, వాణిజ్యమూ మన జాతి బీదలకు

యొక్క ఈ తక్షణ ఫలితాలు దాని అత్యంత చిరస్థాయి అయిన ఫలితాలు కావు. చర్చికి గల ఆస్తి భూ ఆస్తికి చెందిన సాంప్రదాయక పరిస్థితులకు మత నిర్మితమైన కోటగా వుండింది. దాని పతనంతో ఈ పరిస్థితులకు కాలం తీరింది.[1]

17వ శతాబ్దపు చివరి దశకంలో కూడా స్వతంత్ర రైతుల వర్గం ఫ్యూడల్ రైతుల వర్గం కంటే బహుళంగా వుండింది. క్రామ్‌వెల్ బలానికి వాళ్లు వెన్నముకగా వుండినారు; మెకాలే ఒప్పుదల ప్రకారం కూడా వాళ్ళు త్రాగుబోతు ప్రభువులకంటే, ఆ ప్రభువులు వదిలేసిన ఉంపుడుకత్తెలను పెండ్లాడవలసి వుండిన సేవకులైన గ్రామీణ మతగురువుల కంటే మేలైనవాళ్ళుగా వుండినారు. 1750 ప్రాంతంలో స్వతంత్ర రైతులు అదృశ్యమైనారు;[2] అలాగే, 18వ శతాబ్ది చివరి దశకంలో వ్యవసాయ శ్రామికుని ఉమ్మడి భూమి యొక్క చివరి మట్టు అదృశ్యమైంది. వ్యవసాయ విప్లవం యొక్క శుద్ధ ఆర్థిక కారణాలను ఇక్కడ మేము వదలేస్తాం. వినియోగించబడిన బలవంతపు పద్ధతులను గురించి మాత్రము చెప్తాం.

స్టూవర్టు రాజులు పునరుద్దరించబడిన తర్వాత భూస్వాములు, యూరప్ భూఖండంలో ప్రతిచోటా చట్టబద్ధమైన లాంఛనం ఏదీ లేకుండా జరిగినట్టి ఆక్రమణ చర్యను, చట్టబద్ధ పద్ధతుల ద్వారా నిర్వహించినారు. వాళ్ళు భూమి మీద ఫ్యూడల్ ఆస్తి హక్కును రద్దు చేసినారు. అనగా రాజ్యం పట్ల భూమికి గల బాధ్యతలన్నిటినీ వదలించుకున్నారు. రైతులమీదా, ఇతర ప్రజా బాహుళ్యంమీద వేసే పన్నుల ద్వారా ప్రభుత్వానికి "నష్టపరిహారం" చెల్లించినారు. తమకు ఫ్యూడల్ హక్కు మాత్రమే వుండిన ఎస్టేట్ల మీద ఆధునిక సొంత ఆస్తి హక్కును సంపాదించుకున్నారు. చివరి విషయం, తాతార్ బోరీస్ గోధునోవ్ శాసనానికి రష్యన్ రైతాంగం మీద ఎలాంటి ప్రభావం వుండిందో తగు మార్పులతో అలాంటి ప్రభావమే ఇంగ్లీషు వ్యవసాయ శ్రామికుని మీద కలిగిన భూ పరిష్కార చట్టాలు చేసినారు.

---

తల్లిదండ్రులు. "సూత్రదృష్ట్యా రిపబ్లికన్" అయిన మన స్కాచ్ రిపబ్లికన్ లాగే ఈడెన్ చేసే పొరపాటు ఇదే: ఫ్యూడల్ దాస్యం రద్దు కాదు, వ్యవసాయ శ్రామికునికి భూమి ఆస్తి, రద్దు అతన్ని నిరాస్తిపరుని చేసి, తదనంతరం బుక్కా పకీరును చేసింది. ఆస్తి హరణం మరొక విధంగా జరిగిన ఫ్రాన్సులో 1571 నాటి మౌలిన్స్ ఉత్తరవూ, 1656 నాటి శాసనమూ ఇంగ్లీషు బీదల సహాయక చట్టాలకు అనురూపమైనవి.

1. ప్రొఫెసర్ రోజర్స్, నైష్ఠిక ప్రొటెస్టెంటు మతానికి నారుమడి అయిన ఆక్స్‌ఫర్డ్ యూనివర్శిటీలో మాజీ అర్థశాస్త్ర ప్రొఫెసర్ అయినప్పటికీ, "History of Agriculture" ("వ్యవసాయ చరిత్ర")లోని తన ఉపోద్ఘాతంలో, రిఫర్మేషన్ ప్రజా బాహుళ్యాన్ని బుక్కా పకీరులను చేసిన విషయాన్ని నొక్కి చెపుతాడు.

2. " A Letter to Sir T.C.Bunury Bart.. on the High Price of Provisions. By a Suffolk Gentleman" ("ఆహార పదార్థాల అధిక ధరను గురించి సర్ టి. బారొనెట్ సి. బన్‌బెరీకి లేఖ. ఒక సఫోక్ పౌరుని రచన") Ipswich 1795, పుట 4. పెద్ద క్షేత్రాల పద్ధతికి మొండి సమర్థకుడైన కూడా, "Inquiry into the connexion between the present Price of Provisions" ("ఆహార పదార్థాల ప్రస్తుత ధరల సంబంధం గురించి దర్యాప్తు"), London, 1773 రచయిత ఇలా అంటాడు; "ఈ జాతి స్వాతంత్ర్యాన్ని నిజంగా నిలబెట్టిన మన స్వతంత్ర రైతులు నశించినందుకు నేను ఎంతో దుఃఖిస్తున్నాను. వాళ్ళ భూములు ఇప్పుడు గుత్త ప్రభువులు చేతుల్లో ఉన్నందుకు నేను విచారిస్తున్నాను: ఆ భూములు చిన్న వ్యవసాయ దారులకు కౌలు కివ్వబడుతున్నాయి: ప్రతి పేచీకోరు సందర్భంలోనూ తరిమివేయబడడానికి సిద్ధంగా వుండే దాస రైతులకంటే ఏమీ మెరుగుకాని షరతుల మీద ఆ వ్యవసాయదారులు వాటిని కౌలుకు తీసుకుంటున్నారు."

"మహత్తర విప్లవం" ఆరంజ్ రాజవంశానికి చెందిన విలియంతో పాటు అదనపు విలువను సంగ్రహించే భూస్వామినీ, పెట్టుబడిదారునీ అధికారంలోకి తెచ్చింది.[1] ఇంతకు ముందు తక్కువ ప్రమాణంలో జరుగుతూ ఉండిన ప్రభుత్వ భూముల అపహరణలను వాళ్ళు బ్రహ్మాండమైన ప్రమాణంలో సాగించడం ద్వారా కొత్త యుగాన్ని ప్రారంభించినారు. ఈ ఎస్టేట్లు ఉచితంగా ఇవ్వబడినాయి. లేదా పరిహాసాస్పదమైన మొత్తానికి అమ్మబడినాయి. లేదా నేరుగా ఆక్రమించుకోవడం ద్వారా సొంత ఎస్టేట్లకు కలుపుకోబడినాయి కూడా.[2] న్యాయశాస్త్ర సంబంధమైన మర్యాదలు కించిత్తు కూడా పాటించకుండా ఇదంతా జరిగింది. ఈ విధంగా మోసంగా సొంతపరచుకోబడిన ప్రభుత్వ భూములూ, చర్చి ఎస్టేట్ల అపహరణలూ, రిపబ్లికన్ విప్లవంలో ఇవి మళ్ళీ పోకుండా నిలిచినంత మేరకు, ఇవి రెండూ కలిసి ఇంగ్లీషు ప్రభుమండలి యొక్క ఈనాటి అపారమైన ఆస్తులకు ప్రాతిపదిక అయినాయి.[3] బూర్జువా పెట్టుబడిదారులు, ఇతర ఉద్దేశాలతో పాటు, భూమిలో నిర్నిబంధ వర్తకాన్ని పెంపొందించ డానికీ, పెద్ద క్షేత్రాల పద్ధతిలో ఆధునిక వ్యవసాయపు పెత్తనాన్ని విస్తృతపరచడానికీ, చేతికి అందుబాటులో వుండే స్వేచ్ఛాయుత వ్యావసాయిక నిరాస్తిపరుల సరఫరాను పెంచుకోడానికీ, ఈ చర్యలను అభిమానించినారు. అంతేకాక, ఈ కొత్త భూస్వామ్య ప్రభువర్గం కొత్త బ్యాంకి ప్రభువులకూ కొత్తగా పుట్టిన ఫైనాన్స్ ప్రభువులకూ అప్పుడు రక్షణ సుంకాలమీద ఆధారపడుతూ వుండిన పెద్ద కార్ఖానా సొంతదారులకూ సహజమైన పొత్తుదారుగా వుండింది. ఇంగ్లీషు బూర్జువావర్గం తన సొంత ప్రయోజనాల కొరకు స్వీడిష్ బూర్జువా వర్గం ప్రవర్తించినంత విజ్ఞతతో ప్రవర్తించింది. స్వీడిష్ బూర్జువావర్గం ఈ క్రమాన్ని తిరగదిప్పి, తన ఆర్థిక పొత్తుదార్లయిన రైతులతో కలిసి, ప్రభు మండలి నుండి ప్రభుత్వ భూములను బలవంతంగా రాజులు తిరిగి తీసుకోడానికి తోడ్పడినారు. ఇంగ్లీషు బూర్జువాల ఈ చర్య 1604 నుండి పదవ చార్లెస్ పాలనలోనూ, పదకొండవ చార్లెస్ పాలనలోనూ జరిగింది.

---

1. ఇతర విషయాలతో పాటు, ఈ బూర్జువా వీరుని వ్యక్తిగత నైతికస్వభావం గురించి; "1695లో లేడీ ఒర్క్నికి ఐర్లండులోని విస్తారమైన భూముల దానం రాజు అనురాగానికీ, ఆ మహిళ పలుకుబడికీ బహిరంగ ఉదాహరణ.....లేడీ ఒర్క్నీ యొక్క ప్రీతిజనకమైన పనులు foeda labiorum ministeria [గలీజు ప్రేమ వ్యవహారాలు] గా వున్నట్లు ఊహించబడినాయి." (బ్రిటిష్ మ్యూజియంలోని స్లోన రాతప్రతుల సంచయనంలోని నం.4224. ఆ రాతప్రతి పేరు : "The Character of Behaviour of King William, Sunderland, etc., as Represented in Original Letters to the Duck of Shrewsbury from Somers, Halifax, Oxford, Secretary Vernon, etc." ("సామర్స్, హాలిఫాక్స్, ఆక్స్‌ఫర్డ్, కార్యదర్శి వెర్నన్, వగైరాల నుండి ష్రూన్‌బెరీ ప్రభువుకు వచ్చిన ఉత్తరాల మాతృకలతో కనిపించే విలియం రాజు, సుందర్‌లండ్, వగైరాల వ్యక్తిత్వాలు, ప్రవర్తనా"). దానినిండా వింత విషయాలు వున్నాయి.
2. "పాక్షికంగా అమ్మకం ద్వారానూ, పాక్షికంగా దానం ద్వారానూ జరిగిన ప్రభుత్వ ఎస్టేట్ల చట్టవ్యతిరేక పరాధీనం ఇంగ్లీషు చరిత్రలో ఒక అపకీర్తికరమైన ప్రకరణం: జాతిపైన బ్రహ్మాండమైన దగా. (F.W. Newman, "Lectures on Political Economy" ["అర్థశాస్త్రం మీద ఉపన్యాసాలు"] London 1851,పుటలు 129, 130). ఇంగ్లండులోని ఈనాటి పెద్ద భూస్వాములకు వాళ్ళ ఆస్తులు ఎలా వచ్చిందీ వివరాలకు "Our Old Nobility" చూడండి (మన పాత ప్రభువర్గం) రచన "Noblesse Oblige, "London, 1879 - ఫెడరిక్ ఎంగెల్స్.
3. ఉదాహరణకు బెడ్‌ఫర్డ్ ప్రభు వంశం మీద ఎడ్మండ్ బర్క్ పుస్తకం చదవండి. ఈ వంశం నుండి వచ్చిన వాడే "ఉదారవాదపు పెంపుడు చిలక అయిన లార్డ్ జాన్ రసెల్."

ఉమ్మడి ఆస్తి – ఇంతవరకు చెప్పిన ప్రభుత్వ ఆస్తికంటే ఎల్లప్పుడూ భిన్నమైనట్టిది – ఫ్యూడల్ ముసుగుకింద కొనసాగిన పాత ట్యుటానిక్ వ్యవస్థ. దీని బలవంతపు ఆక్రమణ, సాధారణంగా సాగు భూమిని పశువుల బీడుగా మార్చడంతో కలిసినట్టిది, – 15వ శతాబ్ది అంతంలో ప్రారంభమై, 16వ శతాబ్దిలోకి విస్తరించినట్లు చూసినాము. కానీ, ఆ కాలంలో, ఈ క్రమం వ్యష్టి దౌర్జన్య చర్యల ద్వారా సాగింపబడింది; వాటికి వ్యతిరేకంగా నూట యాభై ఏండ్ల పాటు శాసనాలు నిరర్థకంగా పోరాడినాయి. 18వ శతాబ్దిలో జరిగిన పురోగతి ఏమిటంటే, ఇప్పుడు న్యాయశాసనావళి ప్రజల భూముల అపహరణకు పరికరమైంది. పెద్ద వ్యవసాయదారులు తమ చిన్న స్వతంత్ర పద్ధతులను కూడా ఉపయోగించినప్పటికీ[1] దొంగతనానికి పార్లమెంటరీ రూపం ఏమిటంటే, "Bills for Enclosure of Commons" ("ఉమ్మడి భూముల ఆక్రమణల కొరకు చేయబడిన చట్టాలు"), మరొక విధంగా చెప్పాలంటే, భూస్వాములు ప్రజల భూములను సొంత ఆస్తిగా తమకే మంజూరు చేసుకోడానికీ చేసిన చట్టాలు, ప్రజల ఆస్తిహరణ చట్టాలు. ఉమ్మడి ఆస్తిని ఫ్యూడల్ ప్రభువుల స్థానంలోకి వచ్చిన గొప్ప భూస్వాముల సొంత ఆస్తిగా చూపించడానికి సర్. యఫ్.యమ్. ఈడెన్ ఫ్యూడల్ కుయుక్తులతో కూడిన ప్రత్యేకవాదం చేస్తాడు; కానీ, అతను "ఉమ్మడి భూముల ఆక్రమణ కొరకు సాధారణ పార్లమెంట్ చట్టం" చేయాలని డిమాండ్ చేసి (తద్వారా, వాటిని సొంత ఆస్తిగా మార్చడానికి పార్లమెంటరీ కుట్ర అవసరమని ఒప్పుకుంటూ), అంతే కాక ఆస్తిహరణకు గురైన బీదలకు నష్టపరిహారం ఇవ్వాలని శాసనసభను కోరినప్పుడు, తన వాదాన్ని తానే పూర్వపక్షం చేస్తాడు.[2]

స్వతంత్ర రైతులు అంతరించి వాళ్ళ స్థానంలోకి ఎప్పటి tenants - at - wille, సాలుసరి కౌలుకు సాగుచేసే సన్నకారు వ్యవసాయదారులు, భూస్వాముల దయాధర్మాలమీద ఆధారపడే దాస్యభావపు మంద, రాగా, ఉమ్మడి భూముల క్రమపద్ధతి అపహరణ, ప్రభుత్వ భూముల అపహరణ తర్వాత, 18వ శతాబ్దిలో పెట్టుబడి క్షేత్రాలు[3] అనిగానీ, వర్తక క్షేత్రాలు[4] అని గానీ అనబడిన పెద్ద క్షేత్రాలు ఉబకడానికీ, వ్యావసాయిక ప్రజానీకాన్ని కార్ఖానా కొరకు కార్మికులనుగా "విముక్తి చేయ" డానికీ తోడ్పడింది.

---

1. "గుడిసెలలోని వాళ్ళు, తామూ, తమ పిల్లలూ కాక ఏ జీవజాలాన్నీ ఉంచుకోకూడదని వ్యవసాయదారులు నిషేధిస్తారు; పశువులను గానీ, కోళ్ళను గానీ ఉంచుకుంటే, వాళ్ళు వాటి పోషణకు వ్యవసాయదారుల గాదుల నుండి దొంగిలిస్తారని సాకు చెప్పబడింది. వాళ్లను బీదరికంలో ఉంచితే బాగా పనిచేస్తారు, వగైరాలు కూడా వ్యవసాయదారులు చెప్తారు. కానీ, నా అభిప్రాయంలో అసలు వాస్తవం ఏమిటంటే, ఉమ్మడి భూమిమీద మొత్తం హక్కును వ్యవసాయదారులు తమకే వుంచుకోవాలన్నదే." ("A Political Inquiry into the Consequences of Enclosing Waste Lands") ["బంజరు భూముల దురాక్రమణ పర్యవసానాల మీద రాజకీయ దర్యాప్తు.] London 1785, పుట 75)
2. ఈడెన్ పూర్వోక్త గ్రంథం, ప్రవేశిక.
3. "Capital Farms." Two Letters on the Flour Trade and the Dearness of Corn. By a person in business ("పెట్టుబడి క్షేత్రాలు," గోధుమపిండి వ్యాపారం మీదా, ధాన్యం హెచ్చు ధర మీదా రెండు లేఖలు, ఒకవర్తకుడు), London 1767, పుటలు 19, 20
4. "Merchant Farms" "An Inquiry into the Causes of the Present High Priceof Provisions" ("వర్తక క్షేత్రాలు." "ఆహార పదార్థాల ప్రస్తుత అధిక ధరల మీద దర్యాప్తు") 1767, పుట 11. గమనిక - పేరు లేకుండా ప్రచురింపబడిన ఈ ఉత్తమ గ్రంథం రచయిత మతగురువు నథానియల్ ఫార్స్టెటర్.

కానీ, జాతీయ సంపదనూ, ప్రజల బీదరికాన్నీ ఒకటిగా 19వ శతాబ్ది గుర్తించినంత పూర్తిగా 18వ శతాబ్ది ఇంకా గుర్తించలేదు. అందుకనే ఆనాటి ఆర్థిక సారస్వతంలో "ఉమ్మడి భూముల ఆక్రమణ" మీద అత్యంత చురుకైన వాదోపవాదాలు వుండడం, నా ఎదుట వున్న బండెడు సమాచారం నుండి ఆనాటి పరిస్థితులను స్పష్టపరచే కొద్ది ఉల్లేఖనలు ఇస్తాను.

"హెర్డ్ ఫర్డ్ షైర్‌లోని పలు పారిస్‌లలో, 24 క్షేత్రాలు, సగటున 50 నుండి 150 ఎకరాల దాకా గలవి, 3 క్షేత్రాలుగా కలిపివేయబడినాయి" అని ఒక కోపోద్రిక్తుడు రాస్తాడు.[1] "నార్తాంప్టన్ షైర్‌లోనూ, లెయ్ సెస్టర్ షైర్‌లోనూ ఉమ్మడి భూముల ఆక్రమణ చాలా భారీ ఎత్తున జరిగింది. ఆక్రమణ ఫలితంగా ఏర్పడిన కొత్త ప్రభు ఎస్టేట్లలో అత్యధిక భాగం పశువుల బీళ్ళుగా మార్చబడినాయి. తత్పర్యవసానంగా, మునుపు 1500 ఎకరాలు సాగుచేయబడుతూ వుండిన అనేక ప్రభు ఎస్టేట్లలో ఇప్పుడు ఏటా 50 ఎకరాలు కూడా సాగుచేయబడడం లేదు. మునుపటి నివాసగృహాలు, ధాన్యాగారాలు, గుర్రపు సాలలు, వగైరాల శిథిలాలు" మాత్రమే మునుపటి నివాసుల సూచనలుగా వున్నాయి. "కొన్ని ఉమ్మడి భూముల గ్రామాలలోని వంద గృహాలూ, కుటుంబాలూ... ఎనిమిదికో, పదికో సన్నగిల్లినాయి... 15, లేదా 20 ఏండ్లుగా మాత్రమే ఆక్రమించబడిన పారిష్‌లలోని అత్యధిక భాగం వీటిలో రైతుల సంఖ్య, ఉమ్మడి భూముల స్థితిలో వుండిన సంఖ్యతో పోలిస్తే, చాలా స్వల్పంగా వుంది. మునుపు 20, 30 మంది వ్యవసాయదారులకూ ఇంకొక 20, 30 మంది చిన్నకౌలుదార్లకూ, సొంతదార్లకూ చెంది, ఇప్పుడు ఆక్రమించబడిన పెద్ద ప్రభు ఎస్టేటు మీద నలుగురైదుగురు ధనిక పశువర్తకులకు గుత్త హక్కు వుండడం అసాధారణ విషయం కాదు. వాళ్ళందరూ వాళ్ళ కుటుంబాలతోనూ, ప్రధానంగా వాళ్ళ కింద పనిచేస్తూ, వాళ్ళ మీద ఆధారపడిన అనేక కుటుంబాలతోనూ కలిసి తమ జీవనాధారాల నుండి దూరంగా విసరివేయబడినారు.[2]

బంజరుగా వున్న భూమి మాత్రమే కాక, ఉమ్మడిగా సాగుచేయబడే భూమి, లేదా గ్రామ సమాజానికి నిశ్చితమైన కౌలు చెల్లిస్తూ సాగు చేయబడే భూమికూడా తరచుగా, ఆక్రమణ సాకుతో, ఇరుగుపొరుగు భూస్వాములు తమ భూములకు కలుపుకున్నారు.

"ఇక్కడ నా దృష్టిలో ఉన్నది ఆక్రమిత వెలి భూములు, ఇప్పటికే మెరుగుపరచబడిన ఉమ్మడి పొలాలూ, ఈ క్షీణించిన గ్రామాలు క్షేత్రాల మీద గుత్తాధిపత్యాలను పెంచుతాయనీ, ఆహార పదార్థాల ధరలను పెంచుతాయనీ, జన క్షయాన్ని కలిగిస్తాయనీ... బంజరు భూముల ఆక్రమణ కూడా (ఇప్పుడు సాగుతున్నట్టిది) బీదల జీవనాధారంలో కొంత భాగాన్ని తొలగించడం ద్వారా వాళ్ళకు కష్టం కలిగిస్తుందనీ, ఇప్పటికే పెద్దవిగా వున్న క్షేత్రాలను ఇంకా పెంచడానికి మాత్రమే తోడ్పడుతుందనీ"[3]

1. Thomas Wright, "Ashort Address to he Public on the Monopoly of Large Farms ("పెద్ద క్షేత్రాల గుత్తాధిపత్యం మీద ప్రజలకు చిన్న విజ్ఞప్తి") 1779 పుటలు 2, 3.
2. మత గురువు Addington, "Inquiry into the Reasons for and against Enclosing Open Fields" ("ఉమ్మడి క్షేత్రాల ఆక్రమణకు అనుకూలంగానూ, ప్రతికూలంగానూ వున్న కారణాల పరిశీలన") London 1772, పుటలు 37-43.
3. Dr. R. Price "Observation on Reversionary Payments" ("నష్టపరిహారపు చెల్లింపులమీద అభిప్రాయాలు") 6వ కూర్పు. London, 1803 సంపుటం 11, పుట 155. ఫార్‌స్టర్, ఆడింగ్టన్, కెంట్, ప్రైస్, జేమ్స్ ఆండర్సన్‌ల రచనలను చదివి, "The Literature of Political Economy" ("అర్థశాస్త్ర సారస్వతం"), London 1845, అనే తన కేటలాగులో స్తోత్రపరాయణుడైన మెక్‌కుల్లాక్ చెప్పే దౌర్భాగ్యపు జొల్లు కబుర్లతో పోల్చిచూడాలి.

ఆక్రమణలను సమర్థించే రచయితలు కూడా ఒప్పుకున్నారు. డాక్టర్ ప్రైస్ ఇలా అంటాడు : "ఈ భూమి కొద్దిమంది పెద్ద వ్యవసాయదారుల చేతుల్లోకి పోయినప్పుడు, తప్పక కలిగే పర్యవసానం ఏమిటంటే, చిన్న వ్యవసాయదారులు" ("తమ ఆక్రమణలోని భూమిలో పండిన పంటద్వారానూ, ఉమ్మడి భూమి మీద బతికే గొర్రెల ద్వారానూ, కోళ్ళూ, పందులూ, వగైరాల ద్వారానూ తమనూ, తమ కుటుంబాలనూ పోషించుకొంటూ జీవనాధారాలు ఏవీ కొనవలసిన అవసరం లేనివాళ్ళూ అయిన సన్నకారు ఆస్తిపరుల, కౌలుదార్ల బాహుళ్యం"గా ఇంతకు ముందు అతని చేత వర్ణింపబడిన వాళ్ళు) "ఇతరుల కొరకు పని చేయడం ద్వారా జీవనాధారం సంపాదించుకొనే వాళ్ళూ, తమకు కావలసిన వాటికన్నిటికీ మార్కెట్‌కు పోవలసిన అవసరం వుండేవాళ్లూ అయిన వ్యక్తుల సమూహంగా మార్చబడతారు... బహుశా శ్రామికులు ఎక్కువ వుంటారు. ఎందుకంటే వారికి ఎక్కువ నిర్బంధం వుంటుంది ... పట్టణాలూ, కార్ఖానాలూ పెరుగుతాయి, ఎందుకంటే ఉద్యోగాల కొరకూ, ఉపాధి కొరకూ ఎక్కువ మంది వాటికి తరమబడతారు. క్షేత్రాల మీద గుత్త హక్కు సహజంగా పనిచేసే విధం ఇది. ఈ రాజ్యంలో అనేక సంవత్సరాలుగా అది వాస్తవంలో పనిచేస్తున్న విధం ఇదే."[1]

అతను ఆక్రమణల ఫలితాన్ని ఈ విధంగా క్రోడీకరిస్తాడు :

"మొత్తం మీద, కింది శ్రేణుల మనుషుల పరిస్థితులు దాదాపు ప్రతి విషయంలోనూ హీనస్థితికి మారినాయి. కొద్దిపాటి భూమిని సాగుచేసుకునే స్థితి నుండి వాళ్ళు దిన కూలివాళ్ళ, నౌకర్ల స్థితికి కుదించబడినారు. అదే సమయంలో వాళ్ళ బతుకుదెరువు మరింత కష్టమైంది."[2]

వాస్తవంలో, ఉమ్మడి భూముల దురాక్రమణా, దీనివెంట వచ్చిన వ్యావసాయిక విప్లవమూ వ్యవసాయ శ్రామికులకు ఎంత తీవ్ర నష్టం కలిగించినాయంటే, ఈడెన్ రాసిన దాని ప్రకారం కూడా, 1765కూ 1780కీ మధ్య వాళ్ళ వేతనాలు కనీస స్థితి కంటె తక్కువకు పడసాగినాయి.

---

1. Dr. R. Price. పూర్వోక్త గ్రంథం, పుట 147.
2. పై గ్రంథం, పుట 159. మనకు ప్రాచీన రోమ్ జ్ఞాపకం వస్తుంది. "అవిభజిత భూమిలో అధికభాగం ధనికుల ఆస్తి అయింది. ఆనాటి పరిస్థితులను బట్టి, వాళ్ళు ఆ ఆస్తులు మళ్ళీ తమ నుండి తీసుకోబడవని నమ్మినారు. అందువలన తమ పొలాలకు పక్కన వున్న పొలాలను, బీదలకు చెందిన వాటిని, కొన్నిటిని వాటి సొంతదార్ల సమ్మతితో కొన్నారు. కొన్నిటిని బలవంతంగా లాక్కునారు. ఫలితంగా, ఏకాకి పొలాలకు బదులు ఎంతో విశాలంగా పెరిగిన ఎస్టేట్లను వాళ్ళు ఇప్పుడు సాగుచేస్తూ వుండినారు. తరువాత వాళ్ళు వ్యవసాయంలోనూ, పశుపోషణలోనూ బానిసలను వినియోగించుకున్నారు; ఎందుకంటే, స్వతంత్రులైతే మిలిటరీ కొలువుకు తీసుకుపోబడతారు. బానిసలను కలిగి వుండడం వాళ్ళకు గొప్ప లాభం చేకూర్చింది; ఎందుకంటే, మిలిటరీ కొలువు బాధ్యత లేనందు వలన వాళ్ళు నిర్నిబంధంగా వృద్ధి అయి, గంపెడు పిల్లలను కనవచ్చు. ఆ విధంగా బలవంతులు సంపదనంతటినీ తామే సంగ్రహించు కున్నారు. దేశమంతా బానిసలతో నిండిపోయింది. మరొక వైపున ఇటాలియనులు బీదరికం చేతా, పన్నుల చేతా, మిలిటరీ కొలువు చేతా, నాశనమై నిత్యం సంఖ్యలో తగ్గిపోతూ వుండినారు. శాంతికాలం వచ్చినప్పుడు కూడా సంపూర్ణ నిర్వ్యాపారత్వమే వాళ్ళ గతి. ఎందుకంటే భూమి ధనికుల ఆస్తిగా వుండింది. వాళ్ళు దానిని సాగుచేయడానికి స్వతంత్రులకు బదులు బానిసలను ఉపయోగించుకున్నారు. [Appian, "Romische Burge krieg" ("రోమన్ అంతర్యుద్ధాలు") 1.7] ఈ ఖండిక లిసినియన్ చట్టాలకు ముందు కాలానికి సంబంధించినది. రోమన్ సామాన్యుల ఆర్థిక వినాశనాన్ని అంత ఎక్కువగా త్వరపరచిన మిలటరీ కొలువు స్వతంత్ర జర్మన్ రైతులను ఫ్యూడల్ దాసులుగానూ, బానిసలుగానూ మార్చడానికి చార్లె మాగ్నే ఉపయోగించిన ప్రధాన సాధనంగా కూడా వుండింది.

వాళ్ళకు అధికారిక బీదల చట్టపు సహాయం కూడా అందసాగింది. వాళ్ళ వేతనాలు "జీవితపు పరమ అవసరాలకు చాలినంతకంటె ఎక్కువ కావు" అని అతను అంటాడు.

ఆక్రమణల సమర్థకుడూ, డాక్టర్ ప్రైస్‌కు వ్యతిరేకీ అయినవాడు చెప్పేది క్షణం సేపు విందాం.

"జన క్షయం ముఖ్యమైనది కాదు, ఎందుకంటే మనుషులు ఉమ్మడి భూమిలో తమ శ్రమను వ్యర్థం చేయడం కనపడదు ... సన్నకారు వ్యవసాయదారులను ఇతరుల కొరకు పని చేయవలసిన మనుషులుగా మార్చడం ద్వారా ఎక్కువ శ్రమ ఉత్పత్తి అయితే, అది జాతి" (తప్పనిసరిగా, "మార్చబడిన" వాళ్ళు చెందని జాతి) "కోరదగిన సౌకర్యం... వాళ్ళ సంయుక్త శ్రమలు ఒక క్షేత్రంలో వినియోగింప బడినప్పుడు ఉత్పత్తి ఎక్కువ వుంటుంది గనుక కార్ఖానాలకు మిగులు వుంటుంది. అనగా జాతి యొక్క సంపదలలో ఒకటైన పరిశ్రమలు ఉత్పత్తి అయిన ధాన్యం పరిమాణానికి అనుగుణంగా పెరుగుతాయి"[1]

"పవిత్ర ఆస్తి హక్కుల'కు జరిగిన అత్యంత లజ్జా రహితమైన ఉల్లంఘననూ, వ్యక్తులకు జరిగిన ఘోరమైన దౌర్జన్య చర్యలనూ, అవి పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానపు పునాదులు వేయడానికి అవసరమైన వెంటనే అర్థశాస్త్రజ్ఞులు ఎలా విరాగుల మనస్తత్వంతో చూసేదీ సర్.యఫ్.యమ్. ఈడెన్ వెల్లడిస్తారు. అతను దానశీలీ, టోరీ కూడా. 15వ శతాబ్ది చివరి మూడవ భాగం నుండి 18వ శతాబ్ది అంతందాకా, ప్రజల బలవంతపు ఆస్తిహరణం వెంట జరిగిన దొంగతనాలూ, ఘోరాలూ, ప్రజాదారిద్ర్యమూ అనే పరంపర అంతా అతన్ని ఈ కింది సుఖమైన నిర్ధారణకు మాత్రమే తీసుకువస్తాయి.

"సాగుభూమికీ, పశువుల బీడుకూ మధ్య ఉచితమైన నిష్పత్తి నెలకొల్పబడవలసి వుండింది. మొత్తం 14వ శతాబ్దిలోనూ, 15వ శతాబ్దిలో అధిక భాగంలోనూ ఒక ఎకరా పశువుల బీడుకు 2,3,4 ఎకరాలు కూడా సాగుభూమి వుండింది. సుమారు 16వ శతాబ్ది మధ్యలో ఈ నిష్పత్తి మారి 2 ఎకరాల పచ్చి బీడుకు 2 ఎకరాల సాగుభూమీ, తరువాత ఒక ఎకరా సాగుభూమీ అయి, చివరకు 3 ఎకరాల పశువుల బీడుకు ఒక ఎకరా సాగుభూమి అనే న్యాయమైన నిష్పత్తి సాధింపబడింది."

నిజమే, 19వ శతాబ్దిలో, వ్యవసాయదారునికీ, ఉమ్మడి ఆస్తికీ మధ్యగల సంబంధం యొక్క స్మృతే అదృశ్యమైంది. మరీ ఇటీవలి కాలపు మాట అటుంచి, 1801కి 1830కీ మధ్య వ్యవసాయ ప్రజానీకం నుండి దొంగలించబడి, పార్లమెంటరీ పన్నాగాల ద్వారా భూస్వాముల చేత భూస్వాములకు కానుకగా ఇవ్వబడిన 35,11,770 ఎకరాల ఉమ్మడి భూమికి గాను ఆ ప్రజానీకానికి ఒక ఫార్దింగు నష్టపరిహారమైనా ముట్టిందా?

వ్యవసాయ ప్రజానీకాన్ని భూమి నుండి తొలగించిన సామూహిక ఆస్తిహరణపు చివరి క్రమమే,

1. (J. Arbuthno) "An Inquiry into the Connexion between the Present Price of Provisions, etc." (ఆహార పదార్థాల ప్రస్తుత, ధర, వగైరాల మధ్య సంబంధం మీద పరిశీలన"), పుటలు 124, 129. అదే అర్థం, కానీ వ్యతిరేక ధోరణితో : "శ్రామికులు తమ గుడిసెలలో నుండి తరిమివేయబడి, పట్టణాలలో ఉద్యోగం వెదక్కునేటట్లు చేయబడినారు. కానీ ఆ విధంగా ఎక్కువ అదనపు ఉత్పత్తి జరుగుతుంది. తద్వారా పెట్టుబడి పెరుగుతుంది. ([R.B. Seeley] "The Perils of the Nation" ("జాతి విపత్తులు") 2వ కూర్పు London 1843, పుట XIV)

అంతిమంగా "ఎస్టేట్ల ప్రక్షాళన" (Clearing of Estates) అనబడేది, అనగా వాటి నుండి మనుషులను పూడ్చివేయడం. ఇంతవరకు చూసిన ఇంగ్లీషు పద్ధతులన్నీ "ప్రక్షాళన"లో పరాకాష్ట పొందినాయి. వెనుకటి ఒక ప్రకరణంలో ఇచ్చిన ఆధునిక పరిస్థితుల చిత్రంలో మనం చూసినట్లు, తొలగించవలసిన స్వతంత్ర రైతులు ఇక లేనిచోట, గుడిసెల "ప్రక్షాళన" ప్రారంభమౌతుంది; ఫలితంగా, వ్యవసాయ శ్రామికులకు తాము సాగు చేసిన నేలమీద తమ సొంత ఇంటికి కావలసిన జాగా కూడా కనిపించదు. కానీ,"ఎస్టేట్ల ప్రక్షాళన"కు నిజమైన, సరైన అర్థం ఏమైందీ ఆధునిక రొమాన్సుకు స్వర్గభూమి అయిన స్కాట్లండు పీఠభూములలో మాత్రమే మనకు తెలుస్తుంది. అక్కడ ఈ క్రమం యొక్క విలక్షణ గుణం ఏమిటంటే, క్రమపద్ధతిగా జరగడమూ, ఒక్క దెబ్బతో విస్తారమైన ప్రమాణంలో జరగడమూ (ఐర్లండులో భూస్వాములు ఒకేసారి పలు గ్రామాలను పూడ్చివేసేటంత వరకు పోయినారు; స్కాట్లండులో జర్మన్ సంస్థానాలంత పెద్ద ప్రాంతాలు ఒకేసారి ఈ చర్యకు గురైనాయి), చివరన, అపహరించబడిన భూములు విశిష్టమైన ఆస్తి రూపం ధరించడమూ.

పీఠభూమి కెల్టులు కుటుంబ తెగలుగా ఏర్పడివుండినారు. ప్రతి తెగా తాను ఏ భూమి మీద స్థిరపడిందో ఆ భూమికి సొంతదారు. తెగ ప్రతినిధి, లేదా తెగ నాయకుడు, లేదా "పెద్దవాడు" ఈ ఆస్తికి నామకపు సొంతదారు మాత్రమే – ఇంగ్లండు రాణి జాతి భూమి కంతటికీ నామకపు సొంతదారు అయినట్లు. ఇంగ్లీషు ప్రభుత్వం ఈ పెద్దవాళ్ళ అంతర్యుద్ధాలనూ, పల్లపు మైదానాల మీద వాళ్ళ నిత్య దాడులనూ అణచివేసినప్పుడు, తెగల నాయకులు సంప్రదాయ సన్నుతమైన తమ దారిదోపిడీ వృత్తిని వదిలి పెట్టనేలేదు. దాని రూపాన్ని మాత్రం వాళ్ళు మార్చినారు. తమ సొంత అధికారంతోనే వాళ్ళు తమ నామకపు హక్కును సొంత ఆస్తి హక్కుగా రూపాంతీకరించినారు. దీని మూలంగా తమ తెగ మనుషులతో ఘర్షణ వచ్చినపుడు, వాళ్ళను బాహాటపు బలప్రయోగంతో తరిమి వేయడానికి నిశ్చయించు కున్నారు. "ఇంగ్లండు రాజు తన పాలితులను సముద్రంలోకి తరిమి వేసే హక్కు తనకు వుందని చెప్పగలడు" అని ప్రొఫెసర్ న్యూమన్ అంటాడు.[1] సింహాసన వారసుడు అనబడే వాని అనుచరుల చివరి తిరుగుబాటు తర్వాత స్కాట్లండులో ప్రారంభమైన ఈ విప్లవం యొక్క మొదటి దశలను సర్ జేమ్స్ స్టూవర్ట్[2] జేమ్స్ అండర్సన్ల[3] రచనలలో గమనించవచ్చు. 18వ శతాబ్దిలో, తరిమివేయబడిన గాల్‌లు (స్కాట్లండు కెల్టులు) విదేశాలకు పోకుండా నిషేధించబడినారు; ఉద్దేశం ఏమిటంటే, వాళ్ళను

1. F.W. Newman, "Lectures on Political Economy" (అర్థశాస్త్రం మీద ఉపన్యాసాలు) London, 1851, పుట 132.

2. స్టూవర్ట్ ఇలా అంటాడు : "ఈ భూముల కౌలును"ను (తెగ నాయకునికి మక్తా కూలీలు కట్టే కప్పాన్ని అతను పొరపాటుగా కౌలులో కలుపుతాడు) "భూముల విస్తీర్ణంతో పోలిస్తే, అది చాలా కొద్దిగా కనపడుతుంది. విస్తీర్ణాన్ని భూమి మీద బతికే మనుషుల సంఖ్యతో పోలిస్తే బహుశా, మంచి సారవంతమైన రాష్ట్రంలో అదే విలువ గల భూమి మీద బతికేటంత పదింతల మంది ఇక్కడ బతుకుతున్నట్లు కనపడుతుంది. (James Steuart, "An Inquiry in to the Principles of Political Economy" ["అర్థశాస్త్ర సూత్రాల మీద పరిశీలన'] London , 1767, సంపుటల I ప్రకరణం XVI, పుట 104)

3. James Anderson, "Observation on the Means of Exciting a Sprit of National Industry" ("జాతీయ పరిశ్రమల తత్వాన్ని రేకెత్తించే సాధనాలు, వగైరాల మీద అభిప్రాయాలు"), Edinburgh, 1977.

బలవంతంగా గ్లాస్గో, తదితర పారిశ్రామిక పట్టణాలకు తరమడం.[1] 19వ శతాబ్దిలో వుండిన పద్ధతికి[2] ఉదాహరణగా, సదర్‌లండ్ డచెస్ చేసిన "ప్రక్షాళన" గురించి చెబితే ఇక్కడ చాలు. అర్థశాస్త్రం బాగా తెలిసిన ఈ వ్యక్తి అధికారానికి వస్తూనే తీవ్రమైన చికిత్స చేయాలనీ, అదేవిధమైన వెనుకటి క్రమాల ద్వారా 15,000కు పడిపోయిన జనాభా గల మొత్తం దేశాన్ని గొర్రెల బీడుగా మార్చాలనీ నిర్ణయించింది. ఈ 15,000 జనం, సుమారు 3,000 కుటుంబాలు, 1814 నుండి 1820 దాకా క్రమపద్ధతిలో తరిమివేయబడి, పెకలించి వేయబడినారు. వాళ్ళ గ్రామాలన్నీ ధ్వంసం చేయబడి, కాల్చి వేయబడినాయి. వాళ్ళ పొలాలన్నీ పశువుల బీళ్ళుగా మార్చబడినాయి. బ్రిటిష్ సైనికులు ఈ తొలగింపును అమలుపరచినారు, ప్రజలతో ఘర్షణ పడినారు. గుడిసెను వదలిపెట్టడానికి నిరాకరించిన ఒక ముసలిది గుడిసె మంటలలో మరణించింది. అనాది నుండి తెగకు చెందిన 7,94,000 ఎకరాల భూమిని ఈ భద్ర మహిళ ఇలా సొంత పరచుకుంది. వెళ్ళగొట్టబడిన వాళ్ళకు ఈమె సముద్రతీరంలో 6,000 ఎకరాలు కేటాయించింది – కుటుంబానికి 2 ఎకరాల వంతున. ఆనాటి వరకు ఆ 6,000 ఎకరాలూ బంజరుగా వుండినాయి. అవి వాటి సొంతదార్లకు ఏ ఆదాయమూ ఇవ్వలేదు. మహా ఉదార హృదయం గల ఈ డచెస్ సగటున ఎకరాకు రెండున్నర షిల్లింగుల వంతున ఆ ఎకరాలను తెగ మనుషులకు కౌలు కిచ్చేటంత వరకు పోయింది –శతాబ్దాలుగా తన కుటుంబం కొరకు రక్తం

1. బలవంతంగా ఆస్తిహరణకు గురైనవాళ్ళు 1860లో కెనడాకు బూటకపు సాకులతో ఎగుమతి చేయబడే వాళ్ళు. కొంతమంది పర్వతాలలోకీ, పరిసర ద్వీపాలకూ పారిపోయినారు. వాళ్ళు పోలీసులచేత తరుమబడి, పోలీసులతో దెబ్బలాడి, తప్పించుకున్నారు.

2. ఆడమ్‌స్మిత్‌కు వ్యాఖ్యాత అయిన బుకనన్, 1814లో ఇలా అంటాడు: ''స్కాట్లండు పీఠభూములలో ప్రాచీన ఆస్తి వ్యవస్థ రోజూ తలకిందులు చేయబడుతున్నది. అనువంశిక కౌలుదారునితో (ఈ ధాతువు ఇక్కడ వాడడం తప్పు) నిమిత్తం లేకుండా భూస్వామి ఇప్పుడు తన భూమిని అందరి కంటే యెక్కువ డబ్బు యిచ్చేవానికి యిస్తానంటాడు. అతను మెరుగుపరచేవాడైతే వెంటనే కొత్త పద్ధతి వ్యవసాయాన్ని అవలంబిస్తాడు. మునుపు సన్నకారు కౌలుదార్లూ, శ్రామికులూ ఆక్రమించిన భూమిమీద దాని ఉత్పాదితానికి అనుగుణంగా జనం వుండినారు; కానీ మెరుగు పరచబడిన వ్యవసాయమూ, పెరిగిన శిస్తులూ గల కొత్త పద్ధతిలో సాధ్యమైనంత తక్కువ ఖర్చుతో సాధ్యమైనంత ఎక్కువ ఉత్పాదితం పొందబడుతుంది; ఈ దృష్టితో నిరుపయోగపు మనుషులు తొలగింపబడడం వలన, భూమి పోషించగల మేరకు కాక భూమి వినియోగించుకోగల మేరకు జనాభా తగ్గుతుంది. ఆస్తి పోగొట్టుకున్న కౌలుదార్లు పరిసర పట్టణాలలో జీవనాధానం వెదుక్కుంటారు లేదా'' వగైరా. (David Buchanan, "Observations on etc. A. Smith's Wealth of Nations" [''ఎ.స్మిత్ రాసిన జాతుల సంపద మీద అభిప్రాయాలు, వగైరా''] Edinburgh, 1814, సంపుటం IV , పుట 144). ''స్కాచ్ ప్రభువులు కలుపు మొక్కలను త్రవ్వివేసినట్లు కుటుంబాలను నిరాస్తి పరులను చేసినారు. గ్రామాలనూ, వాటి ప్రజలనూ ఎలా చేసినారంటే, దుష్ట జంతువుల చేత బాధింపబడిన భారతీయులు కసితో పెద్దపులుల అడవిని చేసినట్లు చేసినారు... మనిషి గొర్రె బొచ్చుకు, లేదా మాంసపు కళేబరానికి సాటా చేయబడినాడు, కాదు, అంతకంటే చౌకగా చూడబడినాడు .... మొగలులు చైనా ఉత్తర రాష్ట్రాలలో ప్రవేశించినప్పుడు, ప్రజలను హతమార్చి, భూమిని పశువుల బీడుగా మార్చాలని ప్రతిపాదన చేసినారు; వాళ్ళ ఉద్దేశం కంటె యిది ఎంత హీనమైనది! పీఠభూమి ఆస్తిపరులు చాలా మంది ఈ ప్రతిపాదనను తమ సొంత దేశంలోనే, తమ సొంత దేశీయుల మీదనే అమలు పరిచినారు'' (George Ensor, "An Inquiry Concerning the Population of Nations" [జాతుల జనాభాను గురించి పరిశీలన] London" 1818 పుటలు 215, 216.)

ధారబోసిన తెగ మనుషులకు, అపహరించబడిన మొత్తం తెగ భూమిని ఆమె 29 పెద్ద గొర్రెల క్షేత్రాలుగా విభజించింది; ఒక్కొక్క క్షేత్రంలో ఒక కుటుంబం కాపురముండింది; ఆ కుటుంబాలలో అత్యధిక భాగం ఇంగ్లండు నుండి దిగుమతి చేయబడిన పాలేళ్ళు. 1825లో అప్పటికే 15,000 మంది గాల్‌ల స్థానంలోకి 1,31,000 గొర్రెలు వచ్చినాయి. సముద్ర తీరానికి విసిరివేయబడిన ఆదిమ జనులలో మిగిలిన వాళ్ళు చేపలు పట్టుకోవడం ద్వారా బతకడానికి ప్రయత్నించినారు. వాళ్ళు ఉభయచరులై, ఒక ఇంగ్లీషు రచయిత అన్నట్లు, సగం నేల మీదా, సగం నీటి మీదా బతికినారు. రెండిటి మీదా కలిసి సగం బతుకు బతికినారు.[1]

కానీ, ధీరులైన గాల్‌లు తెగ "పెద్దవాళ్ళ" పట్ల చూపిన పర్వత సహజమైన, కాల్పనికవాదపు ఆరాధనకు మరింత దారుణంగా ప్రాయశ్చిత్తం చెల్లించవలసి వుండింది. వాళ్ళ చేపల వాసన పెద్ద వాళ్ళ ముక్కులకెక్కింది. వాళ్ళు అందులో లాభాన్ని పసిగట్టి, సముద్ర తీరాన్ని లండన్‌కు చెందిన పెద్ద చేపల వర్తకులకు కౌలుకిచ్చినారు. గాల్‌లు రెండవసారి తరిమివేయబడినారు.[2]

కానీ, అంతిమంగా, గొర్రెల బీళ్ళలో కొంతభాగం వేట పార్కులుగా మార్చబడినాయి. ఇంగ్లండులో నిజమైన అడవులు లేవని అందరికీ తెలుసు. పార్కులలోని జింకలు పెంపుడు జంతువులు, లండన్ అల్డర్‌మెన్‌లాగా బలిసినవి. కనుక, ఈ 'వాంఛ'కు చివరి ఆశ్రమం స్కాట్లండు. 1848లో సోమర్స్ ఇలా అంటాడు :

"పీఠభూములలో కొత్త అడవుల విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. ఇక్కడ, గేక్‌కు ఒక పక్కన గెలెన్‌ఫెషీ కొత్త అడవి వుంది; అక్కడ, మరొక పక్కన అర్డ్వెరికీ కొత్త అడవి వుంది. అదే వరుసలో 'నల్ల మిట్ట' వుంది. అది కూడా ఇటీవలనే నిర్మించబడిన విస్తారమైన బంజరు. తూర్పు నుండి పడమటి దాకా – ఆబెర్డీన్ పరిసరాల నుండి ఓబన్ కొండల దాకా – ఎడతెగని అడవుల శ్రేణి వుంది; పీఠభూములలోని ఇతర భాగాలలో లాక్ ఆర్కేగ్, గ్లెన్‌గారీ, గ్లెన్‌మోరిస్టన్, వగైరాల అడవులు వున్నాయి. సన్నకారు రైతుల సమాజాలకు స్థానాలుగా వుండిన కోనలలోకి గొర్రెలు ప్రవేశపెట్టబడినాయి; ఆ రైతులు మరింత కరకైన, మరింత నిస్సారమైన నేలలలో జీవనాధారం సంపాయించుకోడానికి

---

1. సదర్‌లండ్ యొక్క ప్రస్తుత డచెస్ అమెరికన్ రిపబ్లిక్ లోనీ నీగ్రో బానిసల పట్ల తన సానుభూతిని చూపడానికి "టామ్ కొట్టం" రచయిత్రి అయిన బీచర్ స్టౌసతికి మహాదర్జాగా లండన్‌లో విందు చేసింది. కాగా ప్రతి "గొప్ప" ఇంగ్లీషు హృదయమూ బానిస యజమాని కోసం రెపరెపలాడిన అంతర్యుద్ధ కాలంలో తోటి ప్రభువర్గీయులతో కలిసి ఈమె సానుభూతిని చూపడానికి వివేకవంతంగా విస్మరించింది. అప్పుడు సదర్‌లండ్ బానిసల గురించి వాస్తవాలను "న్యూయార్క్ ట్రిబ్యూన్"లో ఇచ్చినాము. (ఇవి పాక్షికంగా కేరీచేత "The Slave trade" లో సంక్షేపించబడినాయి. Philadelphia, 1853, పుటలు 203, 204). నా వ్యాసం ఒక స్కాచ్ వార్తాపత్రికలో ముద్రించబడి, ఆ పత్రికకూ, సదర్‌లండ్ డచెస్ భజనపరులకూ మధ్య తగుపాటి వివాదానికి దారితీసింది.
2. డేవిడ్ ఉర్కుహర్ట్ రాసిన "Portfolio. New Series" లో చేపల వర్తకం గురించి ఆసక్తికరమైన వివరాలు కనిపిస్తాయి. నాసౌ డబ్ల్యు. సీనియర్, ఇప్పటికే ఉటంకించబడిన అతని మరణానంతర ప్రచురణలో, "సదర్‌లండ్ షైర్ ఘటనలు మానవ స్మృతిలోకెల్ల అత్యంత ఉపకారకమైన ప్రక్షాళనలలో ఒకటి" అని వర్ణిస్తాడు. ("Journals, Conversations and Essays Relating to Ireland" "ఐర్లండుకు సంబంధించిన జర్నల్స్, సంభాషణలూ, వ్యాసాలూ" London, 1868.

తరిమివేయబడినారు. ఇప్పుడు జింకలు గొర్రెలను తొలగిస్తున్నాయి. జింకలు మరొకసారి సన్నకారు కౌలుదార్లను నిరాస్తిపరులను చేస్తున్నాయి; వీళ్ళు ఆవశ్యంగా మరింత కర్కశైన, భూమిలోకీ, మరింత ఘోరమైన దారిద్ర్యంలోకి తరమబడతారు. వేట పార్కులూ,[1] మనుషులూ సహజీవనం చేయజాలరు. రెండింటిలో ఏదో ఒకటి లొంగాలి. గత పావుశతాబ్దిలో లాగే వచ్చే పావు శతాబ్దిలో అడవులు సంఖ్య లోనూ, విస్తీర్ణంలోనూ పెరిగితే, గార్‌లు తమ జన్మభూమిలో నశిస్తారు... పీఠభూమి ఆస్తిపరులలోని ఈ క్రమం కొంతమందికి చాపల్యం... మరి కొందరికి క్రీడాభిలాషకు సంబంధించిన వ్యవహారం... కార్యవాదులైన ఇతరులు కేవలం లాభ దృష్టితో జింకల వర్తకం సాగిస్తారు. ఎందుకంటే వేట ప్రదేశంగా చేయబడిన పర్వత శ్రేణి, అనేక సందర్భాలలో, గొర్రెల బీడుగా కౌలు కివ్వబడినప్పటి కంటే సొంతదారునికి ఎక్కువ లాభకరంగా వుండడం వాస్తవం... వేట ప్రదేశాన్ని కోరే వేటకాడు ఇస్తాననే డబ్బుకు పరిమితి లేదు, అతని డబ్బు సంచి పరిమితి తప్ప ... నార్మన్ రాజుల విధానం చేత కలిగిన బాధలకంటె ఏమీ తక్కువ కాని బాధలు పీఠభూములలో కలిగించబడినాయి. జింకలకు విస్తారమైన ప్రదేశాలు లభించగా, మనుషులు అంతకంతకూ ఇరుకైన వలయంలో వేటాడబడినారు ... ప్రజల హక్కులు ఒకదాని వెంట ఒకటి తుంచివేయబడినాయి... పీడనలు దినదినానికీ పెరుగుతున్నాయి. ప్రక్షాళనమూ, మనుషులను వెళ్ళగొట్టడమూ ఆస్తిపరులచేత నిశ్చితమైన సూత్రంగా, వ్యావసాయిక అవసరంగా అనుసరించబడుతున్నది. అమెరికాలోనో, ఆస్ట్రేలియాలోనో బంజరు భూముల నుండి చెట్లనూ, పొదలనూ ప్రక్షాళనం చేసినట్లు. ఈ చర్య గడబిడ లేకుండా, వ్యవహార సరళిలో సాగుతూ వుంది, వగైరా."[2]

1. స్కాట్లండు "deer forests" ("వేట పార్కుల)లో ఒక్కగానొక్క చెట్టు కూడా లేదు. బోడి కొండలలో నుండి గొర్రెలను తరిమివేసి, అక్కడికి జింకలను తోలినారు : అప్పుడు దానిని "deer forests" అన్నారు. కలప చెట్లు నాటడమూ, ఆటవీ పోషణా కూడా లేవు.
2. Robert Somers, "Letters from the Highlands : or the Famine of 1847 ("పీఠభూముల నుండి లేఖలు: లేక 1847 కరువు"), London, 1848 : 12 -28వ పుటలలో భిన్న స్థలాలు. ఈ లేఖలు మొదట "Times" పత్రికలో వచ్చినాయి. 1847 లోని గాల్‌ల కరువుకు వాళ్ళ అధిక జనాభా కారణమనీ సహజంగానే ఇంగ్లీషు అర్థశాస్త్రజ్ఞులు వివరించినారు. ఏమైనప్పటికీ, వాళ్ళు "తమ ఆహార సరఫరా మీద ఒత్తిడి తెస్తూ వుండినా"రట. "ఎస్టేట్ల ప్రక్షాళన," లేదా జర్మనీలో అన్నట్లు "Bauern legen" (రైతులను నపుంసకులను చేయడం") జర్మనీలో ముఖ్యంగా 30 ఏండ్ల యుద్ధం తర్వాత జరిగి, 1790లో కూడా కుర్సాక్సెన్‌లో రైతుల తిరుగుబాట్లకు దారి తీసింది. అది ముఖ్యంగా తూర్పు జర్మనీలో జరిగింది. అత్యధిక భాగం ప్రష్యన్ రాష్ట్రాలలో రెండవ ఫ్రెడరిక్ మొదటిసారిగా రైతులకు ఆస్తి హక్కు సంపాయించినాడు. సైలీషియాను జయించిన తర్వాత అతను గుడిసెలూ,ధాన్యాగారాలూ, వగైరాలను పునర్నిర్మించేటట్లూ, రైతులకు పశు వులనూ, పనిముట్లనూ సమకూర్చేటట్లూ భూస్వాములను నిర్బంధించినాడు. అతడు సైన్యానికి సైనికులూ, తన ఖజానాకు పన్ను చెల్లించేవాళ్ళూ వుండాలని కోరినాడు. ఇక, రెండవ ఫ్రెడరిక్ యొక్క ఆర్థిక వ్యవస్థ కింద, నిరంకుశత్వం, బ్యూరాక్రసీ, ఫ్యూడలిజంల పంచకూళ్ళ కషాయపు పాలన కింద రైతులు అనుభవించిన సుఖ జీవితం ఎలాంటిదైందీ అతన్ని మెచ్చుకునే మిరాబో రచనలోని ఈ క్రింద ఉల్లేఖన నుండి గమనించవచ్చు. "ఉత్తర జర్మనీలో రైతుల ప్రధాన సంపదలలో ఫ్లాక్స్ ఒకటి. కాని, మానవాళికి గొప్ప దౌర్భాగ్యంగా వుంటూ, అది దారిద్ర్యం నుండి తప్పించుకొనే సాధనంగా మాత్రమే వుంది. సౌభాగ్యానికి సాధనంగా కాదు. ప్రత్యక్ష పన్నులూ, కార్వే, ఎస్టేటు సేవలూ రైతును నాశనం చేస్తాయి; ఇవి కాక, అతను కొనే ప్రతిదాని మీదా పరోక్ష పన్నులు చెల్లించాలి. అతని స్థితిని ఇంకా అధ్వాన్నం చేసేది ఏమిటంటే,

చర్చి ఆస్తిని దొంగలించడమూ, ప్రభుత్వ ఎస్టేట్లను మోసంగా పరాధీనం చేయడమూ, సమష్టి భూముల అపహరణా, ఫ్యూడల్, కుటుంబ తెగల ఆస్తి దురాక్రమణా, నిర్లక్ష్య భయానకత్వపు పరిస్థితులలో దానిని ఆధునిక సొంత ఆస్తిగా మార్చడమూ, యివన్నీ ఆదిమ సంచయనం యొక్క రుష్యాశ్రమ పద్ధతులు. ఇవి పెట్టుబడిదారీ వ్యవసాయానికి రంగాన్ని జయించుకొని, నేలను పెట్టుబడితో అఖండమైన భాగంగా చేసి, పట్టణ పరిశ్రమలకు అవసరమైన "స్వేచ్ఛాయుత" సంఘ బహిష్కృత శ్రామికవర్గాన్ని సృష్టించినాయి.

---

అతను తన ఉత్పాదితాన్ని తన ఇష్టం వచ్చినచోట, తన ఇష్టం వచ్చిన ధరకు అమ్ముకోకూడదు; తనకు అవసరమైన సరుకులను అత్యంత అనుకూలమైన ధరలకు అమ్మేవాళ్ళతో అతను కొనకూడదు. ఈ పరిస్థితులన్నీ క్రమక్రమంగా అతన్ని నాశనం చేస్తున్నాయి. నూలు వడక్కపోతే అతను ప్రత్యక్ష పన్నులు చెల్లించలేకపోయేవాడు. ఈ వృత్తి అతనికి తన భార్యాబిడ్డల శ్రమశక్తినీ, స్త్రీ, పురుష సేవకుల శ్రమశక్తినీ, తన సొంత శ్రమశక్తినీ వినియోగించు కోడానికి అవకాశం కలిగించి, అదనపు ఆదాయాన్ని ఇస్తుంది. కానీ, ఈ అదనపు జీవనాధారంతో కూడా అతను ఎంత దౌర్భాగ్యపు జీవితం గడుపుతున్నాడో! వేసవిలో అతను కఠిన నరకం అనుభవించే ఖైదీలాగా పనిచేస్తాడు. పొలం దున్నే కాలంలోనూ, మాసూలు కాలంలోనూ అతను రాత్రి 9 గంటలకు పడుకొని తెల్లవారుజామున 2 గంటలకు లేచి, పనికి వంగుతాడు. చలికాలంలో అతను ఎక్కువ విశ్రాంతి తీసుకొని, బలం కూడగట్టుకోవచ్చు. కానీ, అతను పన్నులు చెల్లించేటందుకు తన ధాన్యంలో కొంత భాగాన్ని అమ్మాలి, అతనికి తిండికీ, విత్తనానికీ చాలినంత ధాన్యం మిగలదు. ఈ లోటును భర్తీ చేయడానికి అతను నూలు వడకాలి - కష్టపడి వడకాలి. కనుక అతను చలికాలం రాత్రి 12 కో, ఒంటిగంటకో పడుకొని, ప్రొద్దున్నే 5కో, 6కో లేస్తాడు. లేదా 9కి పండుకొని 2 కు లేస్తాడు. ఆదివారాలు తప్ప యిలా జీవితాంతం ప్రతిదినమూ, ఇలా ఏండ్ల తరబడి నిద్ర కాయడమూ, బరువైన పనీ మనిషిని క్రుంగదీస్తాయి. అందువల్లనే గ్రామాలలో మగవాళ్ళూ, ఆడవాళ్ళూ పట్టణాలలో కంటె త్వరగా ముసలివాళ్ళౌతారు. (Mirabeau, పూర్వోక్త గ్రంథం, సంపుట III , పుట 212, తరువాతి పుటలు).

రెండవ కూర్పుకు గమనిక. 1866 ఏప్రిల్‌లో, పైన ఉల్లేఖించిన రాబర్ట్ సోమర్స్ రచన ప్రచురించబడిన 18 ఏండ్ల తర్వాత, గొర్రెల బీళ్ళు వేట పార్కులుగా రూపాంతరం చెందడం గురించి ప్రొఫెసర్ లియోన్ లెవీ కళా సమాజంలో ఉపన్యాసం ఇచ్చినాడు. దానిలో ఆయన స్కాటిష్ పీఠభూముల విధ్వంసంలో జరిగిన పురోగతిని చిత్రించినాడు. ఇతర విషయాలతో పాటు ఆయన ఇలా అంటాడు: "ఖర్చు లేకుండా ఆదాయం సంపాయించడానికి జన క్షయమూ, గొర్రెల బీళ్ళుగా మార్చడమూ అత్యంత అనుకూలమైన మార్గంగా వుండినాయి ... గొర్రెల బీడు స్థానంలో వేట పార్కులు వుండడం పీఠభూములలో వచ్చిన సాధారణ మార్పు, భూస్వాములు తమ ఎస్టేట్ల నుండి ఒకప్పుడు మనుషులను తొలగించినట్లు, గొర్రెలను తొలగించి, కొత్త నివాసులకు స్వాగతం ఇచ్చినారు - అడవి జంతువులకూ, ఈకల పక్షులకూ... ఫార్‌ఫార్ షైర్‌లోని డల్‌హౌసీ ప్రభువు ఎస్టేట్ల నుండి జాన్ ఓగ్రోట్స్ దాకా అడవి నేల ఎడతెగకుండా వుంది ... ఈ అడవులలో చాలా వాటిలో నక్కలూ, అడవి పిల్లులూ, విలువైన బొచ్చు గల మార్టెన్, పోల్‌కాట్, వీసెల్ జాతుల జంతువులూ, ఆల్ప్స్ పర్వతపు కుందేళ్ళూ సాధారణంగా కనిపిస్తాయి; కుందేళ్ళూ, ఉడుతలూ, ఎలుకలూ ఇటీవల ఆ ప్రదేశంలో ప్రవేశించినాయి. అపారమైన వైశాల్యం గల భూములు - వాటిలో అధికభాగం ఉన్నతమైన సారమూ, విస్తీర్ణమూ గల పశువుల బీళ్ళను కలిగినట్లు స్కాట్లండు గణాంక లెక్కలలో వర్ణించబడినట్టివి - ఈ విధంగా సమస్త వ్యవసాయానికీ, మెరుగుదలకూ దూరం చేయబడి, ఏడాదిలో అతిస్వల్ప కాలం పాటు కొద్దిమంది క్రీడ కొరకు సంపూర్ణంగా అంకితమైనాయి" 1866 జూన్ 2 నాటి లండన్ "Economist" పత్రిక ఇలా అంటుంది. "గత వారానికి చెందిన ఒక స్కాచ్ పత్రికలోని వార్తలలో ఒకటి ఇది... నెదర్లాండు షైర్‌లోని అత్యుత్తమమైన గొర్రెల బీళ్ళలో ఒకటి, కౌలుదార్లు

## అధ్యాయం - 28

# నిరాస్తిపరులుగా చేయబడినవాళ్ల మీద 15వ శతాబ్ది అంతం నుండి రక్తసిక్తమైన చట్టాలు

### పార్లమెంటు చట్టాల ద్వారా వేతనాలను దిగదోయడం

**ఫ్యూ**డల్ హరిజనుల బృందాల విచ్ఛిత్తిచేతా, ప్రజలను భూమినుండి తొలగించిన బలవంతపు ఆస్తిమరణంచేతా సృష్టించబడిన శ్రామికవర్గం – ఈ "స్వేచ్ఛాయుత" నిరాస్తిపరులు ప్రపంచం మీదికి తోయబడినంత వేగంగా, అప్పుడప్పుడే పుట్టుతున్న కార్ఖానాలలో ఇమడడం అసంభవమైన విషయంగా వుండింది. మరొకవైపున, అలవాటుపడిన జీవిత విధానం నుండి హఠాత్తుగా లాగివేయబడిన ఈ మనుషులు అంత హఠాత్తుగా కొత్త స్థితి యొక్క దురవస్థకు అనుగుణంగా మారలేకపోయినారు. వాళ్ళు పాక్షికంగా యిష్టపడీ, అత్యధిక సందర్భాలలో పరిస్థితుల ఒత్తిడిచేతా, సామూహికంగా బిచ్చగాళ్ళుగానూ, దొంగలుగానూ దేశదిమ్మరులుగానూ మారినారు. అందువలన 15వ శతాబ్ది అంతంలో, 16వ శతాబ్ది పొడవునా పశ్చిమ యూరప్ అంతటా దేశదిమ్మరితనం మీద రక్తసిక్తమైన చట్టాలు చేయబడినాయి. ఈ నాటి కార్మికవర్గపు పితరులు బలవంతంగా దేశదిమ్మరులుగానూ, బుక్కా పకీరులుగానూ రూపాంతరం చెందినందుకే శిక్షింపబడినారు. శాసనావళి వాళ్ళను "ఐచ్ఛిక" నేరస్తులుగా

---

ఇటీవల ఏడాదికి 1200 పౌండ్లు శిస్తు ఇస్తామన్నట్టిది, ప్రస్తుత కౌలు ఈ ఏడు ముగిసినప్పుడు వేట పార్కుగా మార్చబడుతుంది. ఇక్కడ ఫ్యూడలిజం యొక్క ఆధునిక అంతఃప్రవృత్తులు కనిపిస్తాయి. న్యూ ఫారెస్టును సృష్టించడానికి నార్మన్ విజేత 36 గ్రామాలను ధ్వంసం చేసినప్పుడు అవి ఎలా పని చేసినాయో అలాగే పనిచెయ్యడాన్ని మనం చూస్తాం ... ఇరవై లక్షల ఎకరాలు ... సంపూర్ణంగా బీడు పట్టబడ్డాయి. స్కాట్లండులో కెల్ల సారవంతమైన భూములలో కొన్ని అందులో వున్నాయి. గ్లెన్ టిల్ట్‌లో సహజమైన గడ్డి మొత్తం పెర్త్ జిల్లాలోని అత్యంత పోషకమైన గడ్డి రకాలలో ఒకటి. బెన్ ఆల్డర్‌లోని వేట పార్కు విశాలమైన బాడెనొఖ్ జిల్లాలో సాటిలేని పశువుల బీడూ వుండింది; బ్లాక్‌మౌంట్ అడవిలోని వేట పార్కు స్కాట్లండులో నల్లమూతి గొర్రెలకు అత్యుత్తమమైన పశువుల బీడుగా వుండింది. మొత్తం పెర్త్ జిల్లాకంటె విస్తారమైన ప్రాంత బంజరుగా మార్చబడడాన్ని బట్టి, స్కాట్లండులో కేవలం క్రీడల కొరకు ఎంత భూమి బంజరుగా మార్చబడిందీ ఒక అవగాహన కలగవచ్చు. ఈ బలవంతపు ఆక్రమణల ద్వారా కలిగిన నష్టం గురించిన బెన్ ఆల్డర్ అటవీ వనరులుగా ఒక అవగాహనను కలిగించవచ్చు. ఆ నేలలో 15,000 గొర్రెలు మేయవచ్చు. స్కాట్లండులోని పాత అడవి నేలలో అది ముప్పయ్యింటి భాగం కంటె ఎక్కువ కాదు గనుక... అడవి నేల అంతా సంపూర్ణంగా అనుత్పాదకంగా వుంది.. కనుక, అదంతా జర్మన్ సముద్ర జలాల కింద మునిగిపోయినా ఒకటే ... క్షణాల మీద తయారు చెయ్యబడే ఇలాంటి బంజరులను, లేదా ఎడారులను శాసనసభ కృతనిశ్చయంతో జోక్యం కలిగించుకొని తుదముట్టించాలి."

చూసింది, వాళ్ళు ఇష్టపడితే పాత పరిస్థితులలో పనిచేయడం కొనసాగించవచ్చునని ఊహించింది – ఇక ఎంత మాత్రమూ లేనట్టి పాత పరిస్థితులలో.

ఇంగ్లండులో ఈ శాసనావళి ఏడవ హెన్రీ కింద ప్రారంభమైంది.

**ఎనిమిదివ హెన్రీ. 1530 :** ముసలి బిచ్చగాళ్ళకూ, పనిచేయలేని బిచ్చగాళ్ళకూ బిచ్చగాళ్ళ లైసెన్సులు ఇవ్వబడ్డాయి. మరొక వైపున, పని చేయగల దేశ దిమ్మరులకు కొరడా దెబ్బలూ, జైలూ, వాళ్ళను బండి వెనుక కట్టివేసి, శరీరం నుండి రక్తం కారిందాకా కొరడాతో కొట్టాలి. తరువాత వాళ్ళు తమ జన్మస్థలానికి, లేదా గత మూడేండ్లుగా నివసించిన చోటికి తిరిగిపోయి, "పని చేస్తాం" అని ప్రమాణం చేయాలి. ఎంత కఠోరమైన వైపరీత్యం! ఎనమిదవ హెన్రీ 27వ చట్టంలో మునుపటి చట్టం పునశ్చరణ చేయబడింది. కానీ కొత్త నిబంధనలతో బలీయం చేయబడింది. దేశ దిమ్మరితనానికి గాను రెండవ సారి అరెస్టయితే, కొరడా దెబ్బలు తిరిగి వడ్డించి, సగం చెవి కోసివేయాలి. మూడవసారి అతన్ని కరుడు గట్టిన నేరస్తునిగా, ఉమ్మడి క్షేమానికి శత్రువుగా ఉరితీయాలి.

**ఆరవ ఎడ్వర్డు :** అతని పరిపాలనలోని మొదటి సంవత్సరంలో, 1547లో చేయబడిన చట్టం ప్రకారం, ఎవడైనా పనిచేయడానికి నిరాకరిస్తే, అతన్ని సోమరిగా ప్రభుత్వానికి ఫిర్యాదు చేసినవానికి అతను బానిస కావాలి. యజమాని అతను తినడానికి బ్రెడ్డూ, నీళ్లూ, పల్చని గంజీ, తనకు తోచిన పనికిరాని మాంసమూ ఇవ్వాలి. కొరడా, సంకెళ్ళూ ఉపయోగించి అతనితో ఎంత అసహ్యమైన పని అయినా చేయించుకోడానికి యజమానికి హక్కు వుంది. బానిస పక్షం రోజులు కనిపించకుంటే, అతన్ని యావజ్జీవిత బానిసగా చేసి, అతని నొసటిమీద గానీ, చెంపమీద గానీ "S" గుర్తు వాత వేయాలి; అతను మూడుసార్లు పారిపోతే, ద్రోహిగా అతన్ని ఉరితీయాలి. సొంత సామానుల లాగా, లేదా పశువులలాగా అతన్ని యజమాని అమ్మవచ్చు. తన వారసులకు ఇవ్వవచ్చు. ఇతరులకు అద్దెకివ్వవచ్చు. బానిసలు యజమానులకు వ్యతిరేకంగా ఏ ప్రయత్నం చేసినా, వాళ్ళను ఉరితీయాలి. వార్త తెలుస్తూనే, న్యాయాధికారులు ఆ దొంగవెధవలను వేటాడి పట్టుకోవాలి. దేశదిమ్మరి ఎవడైనా మూడు రోజుల పాటు పనిచేయకుండా వుంటే, అతన్ని అతని జన్మస్థలానికి తీసుకుపోయి, కాల్చిన ఇనుముతో రొమ్ముమీద "V" గుర్తు వాత వేసి, సంకెళ్ళతో వీధులలో గానీ, మరొకచోట గానీ పనికి పెట్టాలి. దేశదిమ్మరి తప్పు జన్మ స్థలం చెప్పితే, అతను ఆ స్థలానికీ, దాని ప్రజలకూ, దాని కార్పొరేషన్‌కూ యావజ్జీవిత బానిస కావాలి. అతనికి "S" గుర్తు వాత వేయాలి. దేశదిమ్మరుల పిల్లలను తీసుకుపోయి, మగ పిల్లలను 24వ ఏడు దాకా, ఆడపిల్లలను 20వ ఏడుదాకా అప్రెంటిస్‌లుగా పెట్టుకునే హక్కు అందరికీ వుంది. వాళ్ళు పారిపోతే, ఆ వయసు దాకా ఆ యజమానుల బానిసలు కావాలి. యజమానులు ఇష్టమైతే వాళ్ళను సంకెళ్ళతో పెట్టవచ్చు. కొరడాలతో కొట్టవచ్చు. వగైరా. ప్రతి యజమానీ తన బానిస మెడకు గానీ, చేతులకు గానీ, కాళ్ళకు గానీ ఇనప కడియం వేయవచ్చు. అతను ఎవరైందీ మరింత సులభంగా తెలుసుకోడానికీ, పొరపాటు పడకుండా వుండడానికి వీలుగా.[1] ఈ చట్టంలోని

1. "Essay on Trade etc., ("వర్తకం, వగైరా మీద వ్యాసం") రచయిత ఇలా అంటాడు; "ఆరవ ఎడ్వర్డు పాలనలో ఇంగ్లీషు వాళ్ళు కార్ఖానాలను ప్రోత్సహించడానికీ, బీదలను వినియోగించుకోడానికీ శ్రద్ధగా పూనుకున్నట్లుంది. ఈ క్రింది విధంగా వున్న ఒక అసాధారణ చట్టం నుండి మనకీ విషయం తెలుస్తుంది: "దేశదిమ్మరులందరికీ వాతలు వేయాలి, వగైరా. ("An Essay on Trade and Commerce," London. 1770, పుట 5)

చివరి భాగం ప్రకారం, కొంతమంది బీదలను వాళ్ళకు తిండి తీర్థాలు ఇచ్చి, పని చూపించడానికి ఇష్టపడే స్థలంగానీ, వ్యక్తులు గానీ వినియోగించుకోవచ్చు. ఇలాంటి పారిష్ బానిసలు roundsmen అనే పేరుతో ఇంగ్లండులో 19వ శతాబ్దిలో చాలా కాలందాకా వుండినారు.

**ఎలిజబెత్, 1572 :** 14 ఏండ్ల వయసుకు పైబడిన బిచ్చగాళ్ళను రెండేండ్ల పాటు ఎవరో ఒకరు కొలువులో పెట్టుకుంటే తప్ప, వాళ్ళను తీవ్రంగా కొరడాతో కొట్టి, వాళ్ళచెవుల మీద వాతలు వేయాలి. నేరం మళ్ళీ చేస్తే, వాళ్ళు 18 ఏండ్ల వయసుకు పైన వుంటే, వాళ్ళను రెండేండ్ల పాటు ఎవరో ఒకరు కొలువులోకి తీసుకుంటే తప్ప. వాళ్ళను ఉరితీయాలి; కానీ, మూడవసారి నేరం చేస్తే, ద్రోహులుగా వాళ్ళను నిర్ధాక్షిణ్యంగా ఉరితీయాలి. అలాంటివే అయిన చట్టాలు : ఎలిజబెత్ 18వ పాలన సంవత్సరంలో జారీచేసిన చట్టం, నిబంధన 13, 1597లో మరొకటి.[1]

**మొదటి జేమ్స్ :** స్థిర నివాసం లేకుండా, బిచ్చమెత్తుకునే వాడెవడైనా దొంగగానూ, దేశదిమ్మరి గానూ ప్రకటింపబడతారు. వాళ్ళను బహిరంగంగా కొరడాలతో కొట్టడానికీ, మొదటి నేరానికి 6

---

1. థామస్ మోర్ తన "ఊహాస్వర్గం"లో ఇలా అంటాడు: "కనుక, దురాశా, హద్దు లేని ఆకలీ గల దుష్టుడు, తన దేశానికి మహమ్మారి అయినట్టివాడు, ఒకే కంచెలోపల అనేక వేల ఎకరాలను లోబరచవచ్చు. రైతులను స్వస్థానం నుండి బయటకి తోచవచ్చు. లేదా కుయుక్తిచేతా, మోసంచేతా, లేదా వాటికి తోడుగా దౌర్జన్యపు పీడనచేతా, లేదా అపకారాల చేతా, హానిచేతా వాళ్ళను హింసించి, అన్నీ అమ్ముకునేటట్లు చేయవచ్చు: కనుక ఏదో ఒక మార్గం వలన, కుట్ర వల్లనో, కుహకం వల్లనో వాళ్ళు వెళ్ళిపోవాలి. దరిద్రపు దౌర్భాగ్యులు, పురుషులు, స్త్రీలు, భర్తలు, భార్యలు, తండ్రులు లేని పిల్లలు, వితంతువులు, పసిబిడ్డలు గల దుఃఖిత మాతలు, కొద్దిపాటి విలువ చేసే మొత్తం సంసారంతో, పెద్ద సంఖ్యలో - ఎందుకంటే, వ్యవసాయానికి మనుషులు చాలా మంది వుండాలి - కాళ్ళీడ్చుకుంటూ వాళ్ళు దూరం పోతారు. తమకు తెలిసిన, అలవాటు పడిన ఇండ్లనుండి, ఎక్కడా విశ్రమించడానికి చోటు కనపడక. అతి స్వల్ప విలువ గల వాళ్ళ సంసారపు సామగ్రి అంతా, అమ్మకానికి యోగ్యమైనప్పటికీ, వాళ్ళు హఠాత్తుగా వెళ్ళగొట్టబడి నందున, కారు చౌకగా అమ్ముకోవలసి వస్తుంది. అది ఖర్చయిందాకా సంచారం చేసిన తర్వాత, వాళ్ళు చేయగలది ఏముంది. దొంగతనం చేసి, న్యాయంగా ఉరితీయబడడం తప్ప. లేదా బిచ్చమెత్తుకోవడం తప్ప! అప్పుడు కూడా దేశదిమ్మరులుగా వాళ్ళను జైలులో వేస్తారు, ఎందుకంటే, వాళ్ళు సంచారం చేస్తూ పని చేయరు గనుక : వాళ్ళు పనిచేస్తామని ఎంత మనస్ఫూర్తిగా పూనుకున్నా, ఎవరూ వాళ్ళకు పని ఇవ్వరు. "వాళ్ళు దొంగతనం చేయక తప్పలేదని థామస్ మోర్ చెప్పిన ఈ దౌర్భాగ్యపు దేశదిమ్మరులలో, ఎనిమిదవ హెన్రీ పాలనలో, "72,000 మంది పెద్ద, చిన్నదొంగలు ఉరి తీయబడినారు. (Holinshed, "Description of England" ["ఇంగ్లండు వర్ణన"] సంపుటం I పుట 186) ఎలిజబెత్ కాలంలో "దొంగలను మీద మీద ఉరితీసే వాళ్ళు : ఉరికొయ్యలచేత మూడు, నాలుగు వందల మంది భక్షింపబడని సంవత్సరం మామూలుగా వుండేది కాదు." (Strype, "Annals of the Reformation and Establishment of Religion, and Other Various Occurrences in the Church of England during Queen Elizabeth's Happy Reign" ["రిఫర్మేషన్ యొక్కా, మతస్థాపన యొక్కా ఎలిజబెత్ రాణి సంతోషమయ పాలన కాలంలో ఇంగ్లండుచర్చిలో జరిగిన ఇతర వివిధ ఘటనల యొక్కా చరిత్ర"], రెండవ కూర్పు 1725, సంపుటం II) ఇదే స్ట్రైప్ ప్రకారం, సామర్సెట్ షైర్‌లో, ఒక ఏడాదిలో, 40 మంది ఉరితీయబడినారు, 35 మంది దారిదోపిడీ దొంగలకు చేతులు కాల్చబడినాయి. 37 మందిని కొరడాలతో కొట్టినారు. "బాగుపరచరాని దేశదిమ్మరులు"గా 183 మంది వదిలివేయబడినారు. అయినప్పటికీ, న్యాయాధిపతుల నిర్లక్ష్యం మూలంగానూ, ప్రజల మతిహీనపు భూతదయ మూలంగానూ, ఈ ఖైదీల పెద్ద సంఖ్యలో వాస్తవంగా ఉండిన నేరస్తులలో అయిదింటి భాగంగా కూడా వుండదని అతని అభిప్రాయం. ఇంగ్లండులోని ఇతర కౌంటీలు ఈ విషయంలో సామర్సెట్‌షైర్ కంటె మేలుగా లేవు. కొన్ని ఇంకా అధ్వాన్నంగా కూడా వుండినాయి.



నెలలూ, రెండవ నేరానికి 2 ఏండ్లూ జైలులో పెట్టడానికి న్యాయాధిపతులకు అధికారం ఇవ్వబడింది. వాళ్ళు జైలులో వున్నప్పుడు న్యాయాధిపతులకు తోచినంత ఎక్కువగా, తోచినంత తరుచుగా వాళ్ళను కొరడాలతో కొట్టవచ్చు ... బాగుపరచరాని, ప్రమాదకరమైన దేశద్రిమ్మరులకు ఎడమ భుజం మీద "R" గుర్తు వాత వేసి, వాళ్ళతో కఠినమైన పనిచేయించాలి; వాళ్ళు మళ్ళీ బిచ్చమెత్తుకుంటూ దొరికితే, వాళ్ళను నిర్దయగా ఉరి తీయాలి. 18వ శతాబ్ది ప్రారంభం దాకా అమలులో వుండిన ఈ చట్టాలు ఆన్ రాణి 12వ పాలన సంవత్సరంలో జారీ చేసిన చట్టంలోని 23వ నిబంధన చేత మాత్రమే రద్దు చేయబడినాయి.

ఫ్రాన్సులో ఇలాంటివే చట్టాలు! అక్కడ 17వ శతాబ్ది మధ్యనాటికి పారిస్‌లో "దేశదిమ్మరుల రాజ్యం" (royaume des trunds) ఏర్పడింది. పదహారవ లూయీ పాలన ప్రారంభంలో కూడా (1777 జూలై 13 నాటి ఉత్తరువు) 16 నుండి 60 వరకు వయస్సు గల ప్రతి ఆరోగ్యవంతుణ్ణీ, అతనికి బతుకు దెరువు లేక, ఏ వృత్తి చేయకుండా ఉంటే, పడవలలో తెడ్డు వేయడానికి పంపించాలి. ఇలాంటి స్వభావం గలవే నెదర్లాండ్స్ కొరకు అయిదవ చార్లెస్ చేసిన చట్టమూ (అక్టోబర్, 1537), హాలండ్ రాష్ట్రాల, పట్టణాల మొదటి శాసనమూ (మార్చి19, 1614), సమైక్య రాష్ట్రాల "ప్లకాట్" (జూన్ 25, 1649), వగైరా.

ఈ విధంగా వ్యావసాయిక జనం మొదట భూమినుండి తొలగించిన ఆస్తిహరణకు గురై, తమ స్వగృహాల నుండి తరిమివేయబడి, తరువాత వికృత భయానకమైన శాసనాలచేత కొరడాలతో కొట్టబడి, వాతలు వేయబడి, చిత్రహింసలకు గురై, వేతన వ్యవస్థకు అవసరమైన క్రమశిక్షణకు మలచబడినారు.

సమాజపు ఒక ధ్రువంలో శ్రమ సాధనాలు పెట్టుబడి రూపంలో రాశిగా కేంద్రీకరించబడడమూ, మరొక ధ్రువంలో తమ శ్రమశక్తి తప్ప అమ్ముకోడానికి ఏమీ లేని జన సమూహాలు పోగై వుండడమూ చాలదు. వాళ్ళు ఆ శ్రమశక్తిని విధిగా ఐచ్ఛికంగా అమ్మవలసి వుండడమూ చాలదు. విద్య ద్వారానూ, సంప్రదాయం ద్వారానూ, అలవాటు ద్వారానూ ఉత్పత్తి విధానపు పరిస్థితులను స్వయంవ్యక్తమైన ప్రకృతి నియమాలుగా చూసే కార్మికవర్గాన్ని పెట్టుబడిదారీ ఉత్పత్తి పురోగమనం అభివృద్ధి చేస్తుంది. పెట్టుబడిదారీ ఉత్పత్తి క్రమ వ్యవస్థీకరణ, ఒకసారి పూర్తిగా అభివృద్ధి అయిందంటే, సమస్త ప్రతిఘటననూ బ్రద్దలు చేస్తుంది. సాపేక్షమైన అదనపు ప్రజానీకపు నిత్య ఉత్పత్తి శ్రమయొక్క సరఫరా డిమాండుల నియమాన్నీ, తత్కారణంగా వేతనాలనూ పెట్టుబడి అవసరాలకు అనుగుణమైన గాడిలో ఉంచుతుంది. ఆర్థిక సంబంధాల మొరటు నిర్బంధం శ్రామికుడు పెట్టుబడిదారునికి లోబడడాన్ని పూర్తి చేస్తుంది. ఆర్థిక పరిస్థితులకు వెలిగా సూటి బలప్రయోగం ఇంకా ఉపయోగించబడే మాట నిజమే, కానీ అది అపవాదంగా మాత్రమేవుంది. మామూలు పరిస్థితులలో శ్రామికుడిని "ఉత్పత్తి యొక్క సహజ నియమాల"కు వదిలిపెట్టవచ్చు. అనగా పెట్టుబడిమీద అతని పరాధీనతకు – ఉత్పత్తి పరిస్థితులనుండే ఉత్పన్నమై, ఆ పరిస్థితుల చేతనే శాశ్వతంగా ధృవీకరణ చేయబడినట్టి పరాధీనతకు. పెట్టుబడిదారీ ఉత్పత్తి పుట్టినట్టి చరిత్రాత్మక కాలంలో ఇందుకు భిన్నంగా వుండింది. బూర్జువావర్గం పుట్టినప్పుడు, అది వేతనాలను "నియంత్రించ"డానికి రాజ్యాధికారాన్ని కోరుతుంది, ఉపయోగించుకుంటుంది – అనగా, అదనపు విలువను ఉత్పత్తి చేయడానికి అనుకూలమైన పరిమితులలో వేతనాలను "నియంత్రితం చెయ్యడానికీ", పనిదినాన్ని పొడిగించడానికీ, కార్మికుణ్ణే మామూలు పరాధీనతా స్థాయిలో వుంచడానికీ

ఉపయోగించుకుంటుంది. ఆదిమ సంచయనం అనబడేదానిలో ఇది ఒక అత్యంత ముఖ్యమైన అంశం.

14వ శతాబ్ది ఉత్తరార్ధంలో ఉద్భవించిన వేతన కార్మికులవర్గం అప్పుడూ, ఆ తరువాతి శతాబ్దిలోనూ ప్రజానీకంలో అతి స్వల్ప భాగంగా మాత్రమే ఉండింది; గ్రామంలోని స్వతంత్ర రైతు ఆస్తి వ్యవస్థచేతా, పట్టణంలోని వృత్తి సంఘ వ్యవస్థచేతా దాని స్థానం బాగా సంరక్షించబడింది. గ్రామంలోనూ, పట్టణంలోనూ యజమానీ, పనివాళ్లూ సామాజికంగా దగ్గరగా వుండినారు. పెట్టుబడికి శ్రమలోబడి వుండడం అనేది లాంఛనప్రాయం మాత్రమే. అనగా, ఉత్పత్తి విధానానికే అప్పటికింకా నిర్దిష్టమైన పెట్టుబడిదారీ స్వభావం లేదు. స్థిర పెట్టుబడికంటె అస్థిర పెట్టుబడి చాలా ఎక్కువగా వుండింది. కనుక, ప్రతి పెట్టుబడి సంచయనంతోనూ వేతనశ్రమ కొరకు డిమాండు వేగంగా పెరగగా, వేతనశ్రమ సరఫరా నిదానంగా మాత్రమే పెరిగింది. జాతీయ ఉత్పాదితంలో పెద్ద భాగం, తదనంతర కాలంలో పెట్టుబడిదారీ సంచిత నిధిగా మారినట్టిది. అప్పటికే శ్రామికుని వినియోగనిధిలో ప్రవేశించింది.

వేతన శ్రమ మీద శాసనాలు చేయటం (మొదటి నుండి శ్రామికుని దోపిడీ చేయడానికి ఉద్దేశింపబడి, పురోగమించే కొద్దీ ఎల్లప్పుడూ అతనికి అంతే వ్యతిరేకంగా వుండి నట్టిది[1] ఇంగ్లండులో మూడవ ఎడ్వర్డు యొక్క 1349 నాటి "శ్రామిక చట్టం" చేత ప్రారంభమైంది. ఫ్రాన్సులో 1350 నాటి ఉత్తరువు, జాన్ రాజు పేరు మీద జారీ చేయబడినట్టిది, పైదానికి అనురూపమైనది. ఇంగ్లీషు, ఫ్రెంచి శాసనావళి సమాంతరంగా అభివృద్ధి చెందుతూ ఉద్దేశంలో ఏకీభవిస్తాయి. శ్రమ చట్టాలకు పని దినాన్ని నిర్బంధంగా పొడిగించే లక్ష్యం వుండడం గురించి వెనుక చెప్పినాను (ప్రకరణం X, సెక్షన్ 5) కనుక ఆ అంశం గురించి మళ్ళీ చెప్పను.

కామన్స్‌సభ జరూరుగా కోరినందువల్ల "శ్రామిక చట్టం" చేయబడింది. ఒక టోరీ అమాయకంగా ఇలా అంటాడు :

"మునుపు బీదలు పరిశ్రమలకూ, సంపదకూ ప్రమాదం కలిగించేటంత ఎక్కువ వేతనాలు డిమాండు చేసినారు. ఆ తరువాత, వాళ్ళ వేతనాలు పరిశ్రమలకూ, సంపదకూ అంతే ప్రమాదం, బహుశా ఎక్కువ ప్రమాదం – కానీ మరొక విధంగా – కలిగించేటంత తక్కువగా వున్నాయి."[2]

పట్టణానికీ, గ్రామానికీ, కట్టు పనికీ, రోజు పనికీ వేతనాల పట్టీ శాసనం చేత నిర్ణయించబడింది. వ్యవసాయ శ్రామికులు ఏడాది కాలానికీ, పట్టణాల వాళ్ళు "బహిరంగ మార్కెట్"లోనూ తమను తాము అద్దెకిచ్చుకోవాలి. శాసనం చేత నిర్ణయించబడిన వేతనాల కంటె ఎక్కువ చెల్లించడం నిషేధింప బడి, శిక్షార్హమైంది;

అయితే ఎక్కువ వేతనాలు ఇవ్వడం కంటె తీసుకోవడం ఎక్కువ కఠినంగా శిక్షింపబడింది.

---

1. "శాసనసభ యజమానులకూ, వాళ్ళ పనివాళ్ళకూ మధ్య గల విభేదాలను సర్దుబాటు చేయడానికి ప్రయత్నించినప్పుడల్లా, దాని సలహాదారులు ఎప్పుడూ యజమానులే" అంటాడు ఆడమ్ స్మిత్. లింగే ఇలా అంటాడు : "L'esprit des lois, c'est la propriete" ("ఆస్తి అనేదే చట్టాల సారాంశం").
2. (J.B. Byles) "Sophisms of Free Trade. "By a Barrister ("నిర్నిబంధ వర్తకపు కూటవాదాలు." ఒక బారిస్టర్ రచన). London 1850, పుట 206, కసితో ఇలా జోడిస్తాడు : "యజమాని తరపున జోక్యం కలిగించుకోడానికి మనం తగినంత సిద్ధంగా ఉండినాము: శ్రామికుల కొరకు ఇప్పుడు ఇక చేయగలిగిందేమీ లేదా?'

(అలాగే, ఎలిజబెత్ యొక్క "అప్రెంటిస్‌ల చట్టం"లోని 18వ, 19వ సెక్షన్లలో ఎక్కువ వేతనాలు ఇచ్చిన వారికి పదిరోజుల జైలు శిక్షా, తీసుకున్న వాళ్ళకు ఇరవై ఒక్క రోజుల జైలు శిక్షా నిర్ణయించబడింది) 1360 నాటి చట్టం జరిమానాలను పెంచి, శారీరక శిక్ష ద్వారా చట్టబద్ధమైన వేతనాలకు పని చేయించుకొనే అధికారం యజమానులకు ఇచ్చింది. బేలుదార్లూ, వడ్రంగులూ పరస్పరం అనుకూలంగా ఉండడాన్ని చేసుకున్న సమస్త కలయికలూ, ఒప్పందాలూ, ప్రమాణాలు రద్దు చేయబడినాయి. శ్రామికులు సంఘటితం కావడం 14వ శతాబ్దినుండి 1825లో ట్రేడ్ యూని యన్లను నిషేధించే చట్టాలు రద్దు చేయబడిందాకా ఘాతుకమైన నేరంగా పరిగణించ బడింది. ప్రభుత్వం గరిష్ట వేతనాలను నిర్ణయించింది గానీ, కనీస వేతనాలను నిర్ణయించనే లేదనే విషయాన్ని బట్టి 1349 నాటి "శ్రామిక చట్టం" యొక్కా, తరువాతి చట్టాల యొక్క తత్వం స్పష్టంగా బయట పడుతుంది.

16వ శతాబ్దిలో శ్రామికుల పరిస్థితి, మనకు తెలిసినట్లు, చాలా అధ్వాన్నం అయింది. డబ్బు వేతనం పెరిగింది. కానీ డబ్బు విలువ తరిగినంతగా, తదనురూపంగా సరుకుల ధరలు పెరిగినంతగా కాదు. కనుక, వాస్తవంలో వేతనాలు పడిపోయినాయి. అయినప్పటికీ, వాటిని తక్కువగా వుంచే చట్టాలు అమలులో వుండినాయి. "పనిలోకి తీసుకోడానికి ఎవరూ ఇష్టపడని" వాళ్ళకు చెవులు కత్తిరించడమూ, వాతలు వేయడమూతో సహా, ఎలిజబెత్ 5వ పాలన సంవత్సరంలో జారీ చేసిన "అప్రెంటిస్‌లచట్టం"లోని 3వ నిబంధన ద్వారా కొన్ని వేతనాలు నిర్ణయించడానికీ, వాటిని రుతువును బట్టీ, సరుకుల ధరలను బట్టీ మార్చడానికి న్యాయాధిపతులకు అధికారం ఇవ్వబడింది. మొదటి జేమ్స్ ఆ శ్రమ నిబంధనలను నేత కార్మికులకూ, వడికేవాళ్ళకూ, సాధ్యమైనన్ని రకాల కార్మికులకూ విస్తృతపరచినాడు.[1] రెండవ జార్జి శ్రామికుల సంఘటనను నిషేధించే చట్టాలను పరిశ్రమలకు విస్తృతపరిచినాడు.

ప్రత్యేకంగా కార్ఖానా దశలో పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం ఎంతగా బలపడిందంటే, చట్టం ద్వారా వేతనాల నియంత్రణ అనాచరణీయమూ, అనవసరమూ అయింది. కానీ, అవసరం ఏర్పడే పక్షంలో పాత ఆయుధాగారపు ఆయుధాలు లేకుండా వుండడానికి పాలక వర్గాలు ఇష్టపడలేదు. అంతేకాదు, రెండవ జార్జి తన 8వ పాలన సంవత్సరంలో జారీ చేసిన చట్టం వృత్తి సంఘ కార్మికులైన దర్జీలకు, సార్వత్రిక శోక సందర్భాలలో తప్ప, రోజు కూలీ 2 షిల్లింగులా $7\frac{1}{2}$ పెన్నీల కంటె ఎక్కువ

1. కొంతమంది బట్టల ఉత్పత్తిదారులు న్యాయాధికారులు గనుక ఆ హోదాలో వాళ్ళు తమ సొంత కార్ఖానాలలో అధికారిక వేతనాల పట్టీని నిర్ణయించడానికి పూనుకున్నారని మొదటి జేమ్స్ యొక్క 2వ చట్టంలోని 6వ నిబంధనలో మనకు కనపడుతుంది. జర్మనీలో, ముఖ్యంగా ముప్పైయేండ్ల యుద్ధం తర్వాత, వేతనాలను తగ్గించివుంటే చట్టాలు సాధారణంగా వుండినాయి. "నౌకర్ల, శ్రామికుల కొరత జనక్షయమైన జిల్లాలోని భూస్వాములకు చాలా ఇబ్బందిగా వుండింది. ఒంటరి పురుషులకూ, స్త్రీలకూ గదులు అద్దెకివ్వకుండా గ్రామస్థులందరూ నిషేధింపబడినారు. అలాంటి స్త్రీ, పురుషుల ఉనికిని అధికార్లకు తెలియజేయాలి. వాళ్ళు దినకూలికి రైతులకు విత్తనం వేయడమూ, లేదా ధాన్యం కొనడమూ, అమ్మడమూ లాంటి ఇతర పనిలో వినియుక్తులైనా సరే, నౌకర్లు కావడానికి ఇష్టపడకపోతే జైల్లో తోయబడతారు. ("Kaiscrliche Privilegien und Sanctionen fur Schlesien" ["సైలీషియాకు సామ్రాజ్య హక్కులూ, ఉత్తరువులూ"], I, 125) తమ కష్ట స్థితి పట్ల వైరాగ్యం వహించకుండా, చట్టబద్ధ వేతనంతో తృప్తిపడకుండా వుండే దుష్ట, అసంబద్ధపు చిల్లర జనానికి వ్యతిరేకంగా మొత్తం ఒక శతాబ్దం పొడవునా చిన్న జర్మన్ సంస్థానాలలోని ఉత్తర్వులలో ఆక్రోశపు కేకలు వినపడతాయి. ప్రభుత్వం నిర్ణయించిన వేతనాలకంటె ఎక్కువ చెల్లించ కూడదని వ్యష్టి భూస్వాములు నిషేధింపబడినారు. కానీ యుద్ధం తర్వాత పనివాళ్ళ పరిస్థితులు 100

వుండకూడదని నిషేధించినాడు. అంతేకాదు. మూడవ జార్జి 13వ పాలన సంవత్సరంలో జారీ చేసిన చట్టంలోని 68వ నిబంధన పట్టు నేత కార్మికుల వేతనాల నియంత్రణను న్యాయాధిపతులకు అప్పగించింది. అంతేకాదు. 1796లో, వేతనాల గురించి న్యాయాధిపతులు చేసిన ఉత్తరువులు వ్యవసాయేతర శ్రామికులకు కూడా వర్తిస్తాయో అనేదాన్ని నిర్ణయించడానికి పెద్ద కోర్టుల తీర్పులు రెండు అవసరమైనాయి. 1799లో స్కాట్లండు గని కార్మికులు వేతనాలు ఎలిజబెత్ చేసిన ఒక చట్టం చేతా, 1661లోనూ, 1671లోనూ చేయబడిన రెండు స్కాచ్ చట్టాలచేతా నియంత్రించబడాలని ఒక పార్లమెంటు చట్టం విధించింది. ఆ మధ్యకాలంలో పరిస్థితులు ఎంత పూర్తిగా మారిందీ ఇంగ్లీషు కామన్సు సభలో జరిగిన ఒకఘటన, గతంలో కనివిని ఎరుగనట్టిది, తెలుపుతుంది. 400 పై చిలుకు సంవత్సరాలుగా ఇంతకు మించి వేతనాలు ఎట్టి పరిస్థితులలోనూ ఎక్కకూడదని గరిష్ఠ ప్రమాణాలు నిర్ణయించిన ఆ కామన్సు సభలో, వ్యావసాయక శ్రామికులకు చట్టబద్ధమైన కనీస వేతనాన్ని 1796లో విట్‌బ్రెడ్ ప్రతిపాదించినాడు. పిట్ దీనిని వ్యతిరేకించినాడు, కానీ "బీదల పరిస్థితి క్రూరంగా వుంది" అని ఒప్పుకున్నాడు. చివరకు, 1813లో, వేతనాల నియంత్రణ చట్టాలు రద్దుచేయబడినాయి. అవి అసంబద్ధంగా అవకతవకగా వుండినాయి; ఎందుకంటే, పెట్టుబడిదారు తన శాసనావళిద్వారా తన ఫ్యాక్టరీలోని శ్రమను నియంత్రించుకొన్నాడు, బీదల సహాయక పన్ను ద్వారా వ్యవసాయ శ్రామికుని వేతనాన్ని ఆవిసర్జనీయమైన కనీస స్థితికి సర్దగలిగినాడు. యజమానికీ, పనివానికీ మధ్య ఒప్పందాలకూ, నోటీసు ఇవ్వడం లాంటి వాటికీ సంబంధించిన శ్రామిక చట్టాల నిబంధనలు ఈనాటివరకు అమలులో వున్నాయి; అవి ఒప్పందం భగ్నం చేసిన యజమాని మీద సివిల్ కేసును మాత్రమే అనుమతిస్తాయి, కానీ, తద్వ్యతిరేకంగా, ఒప్పందం భగ్నం చేసే పనివానిమీద క్రిమినల్ కేసును అనుమతిస్తాయి.

ట్రేడ్ యూనియన్లకు వ్యతిరేకమైన కిరాతక శాసనాలు కార్మికవర్గపు ప్రమాదకర భంగిమ ముందు 1825లో భగ్నమైనాయి. అయినప్పటికీ, అవి పాక్షికంగా మాత్రమే భగ్నమైనాయి. పాత చట్టంలోని కొన్ని సుందరమైన మొక్కలు 1859లో మాత్రమే అదృశ్యమైనాయి. చివరకు, 1871 జూన్ 29 నాటి పార్లమెంట్ చట్టం ట్రేడ్ యూనియన్లను చట్టబద్ధంగా గుర్తించడంద్వారా, ఆ రకం శాసనాల చివరి అవశేషాలను తొలగించే నటనచేసింది. కానీ, అదే తేదీ నాటి ఒక పార్లమెంటు చట్టం (దౌర్జన్యానికీ, బెదరింపులకూ, బలప్రయోగానికీ సంబంధించిన క్రిమినల్ లా ని సవరించే చట్టం). వాస్తవంలో, మునుపటి పరిస్థితులను కొత్త రూపంలో పునస్థాపించింది. ఈ పార్లమెంటరీ ఎత్తుగడ ద్వారా సమ్మెలోగానీ, లాకౌట్‌లో గాని శ్రామికులు ఉపయోగించే సాధనాలు పౌరులందరికీ సామాన్యమైన చట్టాల నుండి ఉపసంహరింపబడి, అసాధారణ శిక్షాత్మక శాసనాల కింద పెట్టబడినాయి; వీటిని వ్యాఖ్యానించే హక్కు న్యాయాధిపతుల హోదాలో యజమానులకు ఇవ్వబడింది. రెండేండ్లకు ముందు, అదే కామన్సు సభలో అదే గ్లాడ్‌స్టన్ ప్రసిద్ధమైన సూటి పద్ధతిలో, కార్మికవర్గానికి వ్యతిరేకమైన అసాధారణమైన శిక్షాత్మక చట్టాల నన్నిటినీ రద్దు చేయడానికి బిల్లు తెచ్చినాడు. కానీ ఇది రెండవ

ఏండ్ల తరువాత కంటె మేలుగా వుండినాయి. సైలీషియా పాలేళ్ళకు, 1652లో, వారానికి రెండుసార్లు మాంసం వుండింది; కానీ మన శతాబ్దిలో కూడా ఏడాదికి మూడుసార్లు మాత్రమే మాంసం తినేవాళ్ళు గల జిల్లాలు మనకు తెలుసు. అంతేకాక, యుద్ధం తరువాత వేతనాలు ఆ తరువాతి శతాబ్దిలో కంటె ఎక్కువగా వుండినాయి". (G. Froytag)

పతనందాటి పోకుండా చేసి, సమస్యను ఈ విధంగా ఎంతవరకు సాగదీసినారంటే, చివరకు "మహనీయ లిబరల్ పార్టీ" టోరీల పొత్తుతో, తనను అధికారంలోకి తెచ్చిన కార్మికవర్గానికే ఎదురు తిరిగే ధైర్యం పొందేదాకా. ఈ ద్రోహంతో తృప్తిపడకుండా "మహనీయ లిబరల్ పార్టీ" "కుట్ర"కు వ్యతిరేకమైన మునుపటి శాసనాలను మళ్ళీ పైకి తీయడానికీ, వాటిని శ్రామికుల సంఘటనలకు వర్తింప జేయడానికి ఇంగ్లీషు జడ్జీలకు, పాలకవర్గాల కొలువులో ఎల్లప్పుడూ విధేయంగా ఉండే వాళ్ళకు, అనుమతి ఇచ్చింది. ఇంగ్లీషు పార్లమెంటు తానే 500 ఏండ్ల పాటు సిగ్గు విడిచిన అహంభావంతో శ్రామికులకు వ్యతిరేకమైన పెట్టుబడిదార్ల శాశ్వత ట్రేడ్ యూనియన్ స్థానంలో ఉండిన తర్వాత, తన అభీష్టానికి వ్యతిరేకంగా, జనాల ఒత్తిడి వల్ల మాత్రమే సమ్మెలకూ, ట్రేడ్ యూనియన్లకూ వ్యతిరేకమైన చట్టాలను వదిలిపెట్టినట్లు మనకు కనపడుతుంది.

మొట్టమొదటి విప్లవ తుఫానుల కాలంలోనే, ఫ్రెంచి బూర్జువావర్గం అప్పుడప్పుడే సంపాయించుకోబడిన కార్మికుల సంఘ నిర్మాణ హక్కును లాక్కోడానికి సాహసించింది. 1791 జూన్ 14 నాటి ఉత్తరువు ద్వారా వాళ్లు కార్మికుల సంఘటన అంతా "స్వేచ్ఛకూ, మానవ హక్కుల పత్రానికీ వ్యతిరేకమైన ప్రయత్నం" అనీ, 500 లివర్ల జరిమానాతోనూ, ఏడాదిపాటు క్రియాశీల పౌరుని హక్కుల తొలగింపుతోనూ శిక్షార్హం అనీ ప్రకటించినారు.[1] ప్రభుత్వం నిర్బంధం ద్వారా, పెట్టుబడికీ, శ్రమకూ మధ్య జరిగే పోరాటాన్ని పెట్టుబడికి సుఖంగా ఉండే పరిమితులకు లోబరచిన ఈ చట్టం విప్లవాలు వచ్చినా, రాజవంశాలు మారినా సజీవంగా వుండింది. బీభత్స పాలన కూడా దానిని తాక లేదు. అది ఇటీవలనే శిక్షా స్మృతి నుండి కొట్టివేయబడింది. ఈ బూర్జువా రాజకీయ కుట్రకు చెప్పిన కారణం కంటె మరింత విలక్షణమైనది వుండదు. ఈ చట్టం మీద సెలెక్టు కమిటీని గురించి రాసిన పత్రికా విలేఖరి షపెల్యే ఇలా అంటాడు : "వేతనాలు ఇప్పుడున్నంత కంటె కాస్త ఎక్కువగా ఉండాలనీ ... వేతనాలు పొందేవాడు జీవితావసరాల లేమిడివల్ల కలిగే పరమపరాధీనతా స్థితి నుండి, దాదాపు బానసత్వమైనట్టి స్థితి నుండి, విముక్తుడుగా ఉండడానికి తగినంత ఎక్కువగా వేతనాలు వుండాలనీ అంగీకరించినప్పటికీ," కార్మికులు తమ సొంత ప్రయోజనాలను గురించి ఎలాంటి అవగాహనకైనా రావడానికీ, కలిసికట్టుగా వ్యవహరించి, తద్వారా తమ "పరమ పరాధీనతను, దాదాపు బానిసత్వమైనట్టి దాన్ని" తగ్గించడానికీ వీలు కలిగించకూడదు; ఎందుకంటే, నిజంగా ఇలా చేయడంలో వాళ్ళు "తమ మునుపటి యజమానుల, ప్రస్తుత కార్ఖానా సొంతదారుల స్వేచ్ఛకు" హాని కలిగిస్తారు గనుకా, కార్పొరేషన్ల మాజీ యజమానుల నియంతృత్వానికి వ్యతిరేకమైన సంఘటన – ఈ మాట అర్థం ఏమిటో ఊహించగలరా! – ఫ్రెంచి రాజ్యాంగంచేత రద్దు చేయబడిన కార్పొరేషన్ల పునరుద్ధరణ అవుతుంది గనుకా.[2]

---

1. ఈ చట్టంలోని మొదటి నిబంధన ఇలా వుంది : "ఒకే స్థాయికి గానీ, వృత్తికిగానీ చెందిన ఎలాంటి కూటమినైనా నిర్మూలించడం ఫ్రెంచి రాజ్యాంగపు మౌలిక సూత్రాలలో ఒకటి. కనుక, అలాంటి కూటములను ఏ సాకుతోనైనా, ఏ రూపంలోనైనా పునస్థాపించడం నిషేధించబడింది. "నిబంధన IV లో ఇలా వుంది : "ఒకే విధమైన పనిలో గానీ, వృత్తిలో గానీ నిమగ్నులైన పౌరులు తాము తమ ఉత్పాదక కార్యాచరణ ద్వారానూ, పనిద్వారానూ సేవ చేయడానికి సొంతం నిరాకరించాలని గానీ, లేదా తాము కోరినంతకంటె తక్కువ కూలి ఇస్తే నిరాకరించాలని గానీ ఒప్పందం చేసుకుంటే, అలాంటి ఒప్పందాలు రాజ్యాంగ విరుద్ధమైనవిగా, స్వేచ్ఛకూ మానవ హక్కుల పత్రానికీ, భంగకరమైనవిగా ప్రకటింపబడాలి, వగైరా, "కనుక పాత కార్మిక చట్టాలలో ఉన్నట్లు అవి ఘోరమైన నేరం. ("Revolutions de Paris," Paris, 1791, సంపుటం III, పుట 523)
2. Buchez et Roux, "Histoire Parlementaire సంపుటం X, పుటలు 193-195.

## అధ్యాయం - 29

# పెట్టుబడిదారీ వ్యవసాయదారుని పుట్టుక

**సం**ఘ బహిష్కృతులైన నిరాస్తిపరుల వర్గపు బలవంతపు సృష్టినీ, వాళ్ళను వేతన శ్రామికులుగా మార్చిన రాక్షస పద్ధతినీ, శ్రమ మీద దోపిడీ ప్రమాణాన్ని పెంచడం ద్వారా పెట్టుబడి సంచయనాన్ని త్వరపరచడానికి పోలీసులను వినియోగించిన రాజ్యాం యొక్క సిగ్గుమాలిన చర్యనూ మనం పరిశీలించినాం గనుక, ఇక మిగిలిన ప్రశ్న ఏమిటంటే : పెట్టుబడిదారులు మొదట ఎక్కడ నుండి వచ్చినారన్నది. ఎందుకంటే వ్యవసాయ ప్రజానీకపు ఆస్తిహరణం సూటిగా పెద్ద భూస్వాములకు తప్ప మరెవరినీ సృష్టించదు. పెట్టుబడిదారీ వ్యవసాయదారుని పుట్టుకకు సంబంధించినంతవరకు, మనం దానిని తెలుసుకోవచ్చు. ఎందుకంటే, అది అనేక శతాబ్దాల గుండా పరిణమించిన నిదానమైన క్రమం. ఫ్యూడల్ దాసులూ, చిన్న స్వతంత్ర ఆస్తిపరులూ చాలా భిన్నమైన హక్కులతో భూమిని కలిగి వుండినారు : అందువలన వాళ్ళు చాలా భిన్నమైన ఆర్థికపరిస్థితులలో విమోచన చెందినారు.

ఇంగ్లండులో వ్యవసాయదారుని మొదటి రూపం అయిన bailiff (ఎస్టేటు మేనేజరు), తానే ఫ్యూడల్ దాసుడుగా వుండినాడు. అతని స్థానం పాత రోమన్ villicus స్థానం లాంటిది, కాని మరికొంత పరిమితమైన ఆచరణ రంగంలో, 14వ శతాబ్ది ఉత్తరార్ధంలో అతని స్థానంలోకి వచ్చినవారు భూస్వామి నుండి విత్తనాలనూ, పశువులనూ, పనిముట్లనూ పొందే వ్యవసాయదారుడు. అతని స్థితి ఫ్యూడల్ రైతు పరిస్థితి కంటె చాలా భిన్నమైనది కాదు. కాకపోతే, అతను మరింత వేతన శ్రమకు దోపిడీ చేస్తాడు. త్వరలో అతను (metayer), భూమి మీద పూర్తి హక్కులేని వ్యవసాయదారుడు అవుతాడు. వ్యవసాయ పెట్టుబడిలో అతను ఒక భాగమూ, భూస్వామి మరొక భాగమూ పెడతారు. మొత్తం ఉత్పాదితాన్ని ఒప్పందం ద్వారా నిర్ణయమైన నిష్పత్తులలో ఇద్దరూ పంచుకుంటారు. ఇంగ్లండులో ఈ రూపంలో త్వరలో అదృశ్యమై, ఆ స్థానంలోకి వేతన శ్రామికులను వినియోగించు కోవడం ద్వారా తన సొంత పెట్టుబడిని వృద్ధి చేసుకునేవాడూ, అదనపు ఉత్పాదితంలో కొంత భాగాన్ని డబ్బు రూపంలో గానీ, వస్తురూపంలో గానీ కౌలుగా భూస్వామికి చెల్లించేవాడూ అయిన అచ్చమైన వ్యవసాయదారుడు వస్తాడు.

15వ శతాబ్దిలో స్వతంత్ర రైతూ, సొంతానికీ, వేతనం కోసమూ పనిచేసే వ్యవసాయ శ్రామికుడూ తమ సొంత శ్రమ ద్వారా ధనవంతులైనంత కాలం, వ్యవసాయదారుని పరిస్థితులూ, అతని ఉత్పత్తి రంగమూ రెండూ అంతంత మాత్రంగా వుండినాయి. 15వ శతాబ్ది చివరి మూడింటి భాగంలో ప్రారంభమై, దాదాపు 16వ శతాబ్ది అంతటా (దాని చివరి దశాబ్దిలో తప్ప) కొనసాగిన వ్యావసాయిక

విప్లవం వ్యావసాయిక ప్రజాబాహుళ్యాన్ని ఎంత వేగంగా దరిద్రులను చేసిందో అంత వేగంగానూ అతన్ని ధనవంతుని చేసింది.[1] ఉమ్మడి భూముల ఆక్రమణ దాదాపు ఖర్చులేకుండా అతను తన పశువుల మందను ఎంతో పెంచుకోడానికి వీలిచ్చింది; కాగా పశువులు పొలానికి కావలసిన ఎరువును ఇంకా ఎక్కువగా ఇచ్చినాము.

16వ శతాబ్దిలో చాలా ముఖ్యమైన ఒక అంశం దీనికి తోడైంది. ఆ కాలంలో పొలాలకు ఒప్పందాలు దీర్ఘ కాలానికి, తరుచుగా 99 ఏండ్లకు వుండేవి. వెండి బంగారాల విలువా, అందువలన డబ్బు విలువ అంతకంతకూ పడిపోవడంతో వ్యవసాయదారులకు సువర్ణావకాశం వచ్చింది. పైన చర్చించిన అన్ని పరిస్థితులూ కాక, అది వేతనాలను తగ్గించింది. వాటిలో కొంతభాగం ఇప్పుడు పొలం లాభాలలో కలిసింది. ధాన్యం ధరా, ఉన్ని ధరా, మాంసం ధరా, ఒక్క మాటలో చెప్పాలంటే వ్యవసాయ ఉత్పాదితాలన్నిటి ధరా పెరగడంతో, వ్యవసాయదారుడు ఏమీ చేయకుండానే అతని డబ్బు పెట్టుబడి ఉబికింది; మరొకవైపున అతను చెల్లించే కౌలు (డబ్బు యొక్క పాత విలువ ప్రకారం లెక్కిస్తే) వాస్తవంలో తగ్గింది.[2] ఆ విధంగా వాళ్ళు తమ శ్రామికులను నష్టపరచీ, తమ భూస్వాములను

---

1. తన "Description of England" ("ఇంగ్లండు వర్ణన")లో హారిసన్ ఇలా అంటాడు: "నాలుగు పౌండ్ల పాత కౌలు ఒకవేళ నలభైకి పెరిగినా, తన కౌలు కాలం అంతంలో వ్యవసాయదారునికి ఆరేడు సంవత్సరాల కౌలు, యాభై లేదా వంద పౌండ్లు, మిగలకపోతే, అతను తన లాభం చాలా స్వల్పమని అనుకుంటాడు".
2. సమాజంలోని భిన్న వర్గాల మీద 16వ శతాబ్దిలోని డబ్బు విలువ తగ్గదల యొక్క ప్రభావానికి చూ : A Compendious or Briefe Examination of Certayne Ordinary Complaints of Diverse of Our Countrymen in These Our days. "By W.S. Gentleman ("ఈ మన రోజుల్లో మన వివిధ దేశీయుల కొన్ని సాధారణ ఫిర్యాదుల సంక్షిప్త పరిశీలన. "డబ్లు.యు. ఎస్. జెంటిల్‌మన్. London 1581) ఈ రచన సంభాషణ రూపంలో వున్నందువలన, జనం దీనిని చాలా కాలం షేక్స్పియర్‌కు ఆపాదించినారు; 1751లో కూడా అది షేక్స్పియర్ పేరుతో ప్రచురించబడింది. దాని రచయిత విలియం స్టాఫర్ట్. ఒకచోట కులీనుడు ఇలా వాదిస్తాడు :

**కులీనుడు** : "నా పొరుగువానివైన రైతూ, వర్తకుడా, మంచివాడివైనా కమ్మరీ, మీరు ఇతర చేతిపనివాళ్ళతో పాటు మీ ప్రయోజనాలను సమర్థించుకోవచ్చు. అని వస్తువులూ మునుపటికంటె ప్రియంగా వున్నాయి గనుక, మీ సరుకుల ధరలనూ, వృత్తుల ధరలను ఎంతగా పెంచుతారంటే, మీకు రెండంతలు వస్తుంది. కానీ, మేము రెండంతలు పెట్టి కొన్న ఆ వస్తువులకు నష్టపరిహారంగా రెండంతలు ధరకు అమ్మడానికి మావద్ద ఏమీ లేదు. 'మరొక చోట కులీనుడు డాక్టర్‌ను ఇలా అడుగుతాడు : "మీరనేది ఏ రకాలవాళ్ళో దయచేసి చెప్పండి. మొదట, మీ ఉద్దేశంలో దాని ద్వారా నష్టపడని వాళ్ళు ఎవరో చెప్పండి." డాక్టరు : "నష్టపడనివాళ్ళు ఎవరంటే, కొనడం, అమ్మడం ద్వారా బతికేవాళ్లందరూ. ఎందుకంటే, వాళ్ళు ప్రియంగా కాని, తరువాత అలాగే అమ్ముతారు." కులీనుడు :"దాని వలన లాభపడే మరొక రకం వాళ్లు ఎవరు?" డాక్టరు : "పాత కౌలుకు పొలాలను సాగు చేసేవాళ్ళందరూ, ఎందుకంటే, వాళ్ళు పాత రేటు ప్రకారం చెల్లిస్తారు, కొత్తరేటు ప్రకారం అమ్ముతారు - అనగా, తమ పొలాలకు చౌకగా కౌలు చెల్లిస్తారు. వాటిలో పండేవాటి నన్నిటినీ ప్రియంగా అమ్ముతారు." కులీనుడు : "మీ అభిప్రాయంలో, వీళ్లు సంపాయించే లాభం కంటే ఎక్కువగా నష్టపడేవాళ్ళు ఎవరు?" డాక్టరు : "ప్రభువులూ, కులీనులూ, కుదించబడిన కౌలుమీద గానీ, జీతం మీద గానీ బతికే ఇతరులందరూ, లేదా వ్యవసాయం చేయని వాళ్ళు వర్తకంలో నిమగ్నులు కాని వాళ్ళు."

నష్ట పరచీ ధనికులైనారు. కనుక, 16వ శతాబ్ది అంతంలో ఇంగ్లండులో పెట్టుబడిదారీ వ్యవసాయ దారుల వర్గం, ఆనాటి పరిస్థితులను లెక్కలోకి తీసుకుంటే ధనికులైన వర్గం వుండడంలో ఆశ్చర్యం లేదు.[1]

1. ఫ్రాన్సులో మధ్యయుగాల తొలి భాగంలో ఫ్యూడల్ ప్రభువుల కొరకు పన్నుల వసూలు చేసే regisseur, నిగామాను త్వరలో మేనేజరై బలవంతపు వసూళ్ళూ, మోసమూ, వగైరాల ద్వారా పెట్టుబడిదారుడైనాడు. ఈ నిగామానులే ఒకోసారి ప్రభువులుగా ఉండినారు. ఉదాహరణకు : "పైన చెప్పిన వ్యవసాయదారులు 1359 డిసెంబరు 25 నుండి 1360 డిసెంబర్ 28 వరకు చెల్లించవలసిన కౌలును గురించి బెజన్‌సాన్‌లోని వ్యవసాయదారుల కులీనుడైన జాక్ డి తొరెస్ తన పోషకునికి డిజోన్‌లో బూర్గుందియా ప్రభువులకు లోబడినవానికి, చెప్పిన విషయం ఇది" (Alexis Monteil, "Traite des Materiaux Manuscripts etc.," పుటలు 234, 235). సామాజిక జీవితపు అన్ని రంగాలలోనూ అధిక భాగం దళారీలకు పోవడం ఇప్పటికే ఇక్కడ స్పష్టమైంది. ఆర్థిక రంగంలో ఫైనాన్సర్లూ, స్టాక్ ఎక్స్ఛేంజి సట్టా వ్యాపారస్తులూ, వర్తకులు, దుకాణదారులూ తేట లాక్కుంటారు; సివిల్ వ్యవహారాలలో లాయరు తన కక్షిదారులను పిండుతాడు; రాజకీయాలలో ప్రతినిధి ఓటర్లకంటే ముఖ్యం, మంత్రి రాజుకంటె ముఖ్యం : మతంలో దేవుడు "మధ్యవర్తి" చేత వెనక్కి తోయబడతాడు, అతను మళ్ళీ మతగురువుల చేత వెనక్కి నెట్టబడతాడు, మంచి గొర్రెల కాపరికీ అతని గొర్రెలకూ మధ్యన వున్న తప్పనిసరి దళారులచేత ఇంగ్లండులో లాగే ఫ్రాన్సులో గొప్ప ఫ్యూడల్ భూభాగాలు అసంఖ్యాకమైన చిన్న కుటుంబ క్షేత్రాలుగా విభజింపబడినాయి. కానీ పోలికే లేనంత ఎక్కువగా ప్రజలకు ప్రతికూలమైన షరతులమీద. 14వ శతాబ్దిలో క్షేత్రలు, లేదా terriers ఉద్భవించినాయి. అవి నిత్యం పెరుగుతూ 100,000కు చాలా పైబడినాయి. వాటికి ఉత్పాదితంలో 1/12 నుండి 1/5 దాకా డబ్బు రూపంలో గానీ, వస్తురూపంలో గానీ కౌలు చెల్లించబడింది. ఈ క్షేత్రాలు, వాటి విలువనూ, విస్తీర్ణానన్నీ బట్టి కౌలు భూములూ, ఉప కౌలు భూములూ, వగైరాగా వుండినాయి; వాటిలో అనేకం కొద్ది ఎకరాల విస్తీర్ణం మాత్రమే వుండినాయి. కానీ ఈ వ్యవసాయదారులకు ఆ నేల మీద తిరిగేవాళ్ళ మీద కొంత వరకు న్యాయాధికారపు హక్కులు వుండినాయి; వాటిలో నాలుగు స్థాయిలు వుండినాయి. ఈ చిల్లర నియంతల కింద వ్యవసాయ ప్రజానీకపు పీడనను అర్థం చేసుకోవచ్చు. ఫ్రాన్సులో ఈనాడు బెంచి మేజిస్ట్రేట్లతో కూడా కలిసి 4000 కోర్టులు చాలగా, ఒకప్పుడు 1,60,000 జడ్జీలు వుండినారని మాంటేల్ అంటాడు.

## అధ్యాయం - 30

# పరిశ్రమల మీద వ్యవసాయ విప్లవం యొక్క ప్రభావం, పారిశ్రామిక పెట్టుబడికి ఆంతరంగిక మార్కెట్ సృష్టి

**వ్య**వసాయ ప్రజానీకాన్ని నిరాస్తిపరులను చేయడమూ, భూమినుండి వెళ్ళగొట్టడమూ, విరామాలు వుండినా మళ్ళీ మళ్ళీ పునరుద్ధరించబడినట్టీ ఈ క్రమం, మనం గమనించినట్లు, వృత్తి సంఘాలతో బొత్తిగా సంబంధం లేనివాళ్ళూ, వాటి సంబంధాలు లేనివాళ్లూ అయిన నిరాస్తిపరుల సముదాయాన్ని పట్టణ పరిశ్రమలకు సరఫరా చేసినాయి. ఎ. ఆండర్సన్ (జేమ్స్ అండర్సన్ కాదు) తన "వాణిజ్య చరిత్ర"లో భగవంతుని సూటి జోక్యాన్ని నమ్మేటట్లు చేసిన శుభ పరిస్థితి ఇది. ఆదిమ సంచయనపు ఈ అంశం వద్ద మనం ఒక క్షణం ఆగాలి. అంతరిక్ష పదార్థం ఒకచోట పల్చబడడం ద్వారా మరొకచోట గుమికూడిందని జోఫ్రువా సెంట్ ఇలేర్ వివరించినట్లు[1] స్వతంత్ర, స్వావలంబిత వ్యవసాయ ప్రజానీకం పల్చబడడం ద్వారా పారిశ్రామిక కార్మికవర్గం గుమికూడడం మాత్రమే జరగలేదు. భూమిని సాగుచేసే వాళ్ళ సంఖ్య తక్కువైనప్పటికీ, భూమి మునుపటంత పంట, లేదా ఇంకా ఎక్కువ పంట ఇచ్చింది. ఎందుకంటే, భూ ఆస్తి పరిస్థితులలో వచ్చిన విప్లవంతో పాటు మెరుగైన వ్యవసాయ పద్ధతులూ, ఎక్కువ సహకారమూ, ఉత్పత్తి సాధనాల కేంద్రీకరణా, వగైరా వచ్చినాయి గనుకా, వ్యవసాయ వేతన శ్రామికులతో మరింత తీవ్రంగా పని చేయించుకోవడమే కాక,[2] వాళ్ళు సొంతానికి పనిచేసిన ఉత్పత్తి రంగం అంతకంతకూ కుదించుకుపోయింది గనుకా, అందువలన, వ్యయసాయ ప్రజానీకంలో కొంత భాగం విడుదల చేయబడడంతో, వాళ్ళ మునుపటి ఆహార పదార్థాలు కూడా విడుదల చేయబడి నాయి. అవి ఇప్పుడు అస్థిర పెట్టుబడి యొక్క పాదార్థిక అంశాలుగా రూపాంతరం చెందినాయి. ఆస్తి హరించబడి, నిరాధారుడుగా వేతనాల రూపంలో వాటి విలువను కొనాలి. జీవనాధారాలకు వర్తించేది దేశీయ వ్యవసాయం మీద ఆధారపడిన పరిశ్రమల ముడి పదార్థాలకు కూడా వర్తిస్తుంది. అవి స్థిర పెట్టుబడి యొక్క ఒక అంశంగా రూపాంతరం చెందినాయి.

ఉదాహరణకు వెస్ట్ ఫాలియా రైతులలో ఒక భాగం, రెండవ ఫ్రెడరిక్ కాలంలో ఫ్లాక్స్ వడుకుతూ వుండిన వాళ్ళు, బలవంతంగా ఆస్తిహరణకు గురై, భూమి నుండి తరిమివేయబడినారు; మిగిలిన భాగం పెద్ద వ్యవసాయదారుల కింద దిన కూలీలుగా మారినారు. అదే సమయంలో ఫ్లాక్స్ వడకడానికీ, నేయడానికి పెద్ద పారిశ్రామిక సంస్థలు ఉత్పన్నమైనాయి: "భూమి నుంచి విముక్తి చేయబడిన" మనుషులు ఇప్పుడు వాటిలో వేతనాల కొరకు పనిచేస్తారు. ఫ్లాక్స్ సరిగ్గా మునుపటిలాగే కనపడుతుంది.

1. తన "Notions de Philosophie Naturelle" లో, పారిస్, 1838.
2. సర్ జేమ్స్ స్ట్యూవర్ట్ నొక్కి చెప్పే అంశం ఇది.

దానిలో ఒక పోగు కూడా మారలేదు. కానీ దాని శరీరంలోకి కొత్త సామాజిక ఆత్మ దూరింది. అది ఇప్పుడు కార్ఖానా యజమాని స్థిర పెట్టుబడిలో భాగంగా వుంది. తామే పండించి, తమ కుటుంబాలతో కలిసి చిల్లర పద్ధతిలో వడికిన పలు సన్నకారు ఉత్పత్తిదారుల మధ్య పంపకమై వుండిన ఆ ఫ్లాక్సు ఇప్పుడు ఇతరులను తన కొరకు వడకడానికీ, నేయడానికీ నియమించే ఒక పెట్టుబడిదారుని చేతిలో కేంద్రీకరింపబడింది. ఫ్లాక్సు వడకడంలో ఖర్చు అయిన శ్రమ మునుపు పలు రైతు కుటుంబాలకు అదనపు ఆదాయంగా ఫలించింది, లేదా, బహుశా, రెండవ ఫ్రెడరిక్ కాలంలో Pour le roi de Prusse[1] పన్నులుగా ఫలించింది. అది ఇప్పుడు కొద్దిమంది పెట్టుబడిదార్లకు లాభంగా ఫలిస్తున్నది. మునుపు దేశమంతటా వెదజల్లబడిన కదుర్లూ, మగ్గాలూ ఇప్పుడు శ్రామికులతోనూ, ముడి పదార్థాలతోనూ కలిసి కొద్ది పెద్ద శ్రామిక బారకాసులలో పోగుపడ్డాయి. వడికేవాళ్ళకూ, నేతగాళ్లకూ స్వతంత్ర జీవనాధారాలుగా వుండి కదుర్లూ, మగ్గాలూ ముడి పదార్థాలూ ఇప్పుడు వాళ్ళపై పెత్తనం చలాయించడానికీ, వాళ్ళ నుండి ప్రతిఫలం లేని శ్రమను పీల్చడానికీ సాధనాలుగా రూపాంతరం చెందినాయి.[2] పెద్ద కార్ఖానాలనూ, పెద్ద క్షేత్రాలనూ చూస్తే, అవి అనేక చిన్న ఉత్పత్తి కేంద్రాలను ఒకటిగా గుదిగుచ్చడం ద్వారా పుట్టినాయనీ, అనేక చిన్న ఉత్పత్తిదారుల ఆస్తిహరణం ద్వారా పెరిగినాయనీ కనపడదు. అయినప్పటికీ ప్రజల అంతర్దృష్టి పొరబడలేదు. విప్లవ సింహమైన మిరాబో కాలంలో పెద్ద కార్ఖానాలనూ ఇంకా manufactures reunies, గుదిగుచ్చిన కార్ఖానాలు, అనేవాళ్ళు – మనం గుదిగుచ్చిన పలాలు అన్నట్లు. మిరబో ఇలా అంటాడు:

“ఒక డైరెక్టరు కింద వందలమంది పనిచేస్తూ, మామూలుగా గుదిగుచ్చిన యంత్రాగారాలు అనబడే గొప్ప కార్ఖానాలకే మనం శ్రద్ధ అర్పిస్తున్నాము. శ్రామికులు విస్తారమైన సంఖ్యలో, ప్రతి ఒకడూ విడిగా, తన సొంతానికి తాను పనిచేసే కార్ఖానాలు లెక్కలోకి రావడం లేదు. ఇవి పైవాటికి అనంతమైన దూరాన ఉంచబడినాయి. ఇది పెద్ద పొరపాటు; ఎందుకంటే, ఇవే నిజంగా ముఖ్యమైన జాతీయ సౌభాగ్య అంశం.

“గుదిగుచ్చిన ఫాక్టరీ (fabrique reunie) ఒకరిద్దరు పెట్టుబడిదార్లను అపారంగా ధనవంతులను చేస్తుంది; కానీ శ్రామికులు ఎక్కువో తక్కువో కూలి యివ్వబడే కూలివాళ్ళుగా మాత్రమే వుంటారు. వాళ్ళకు కార్ఖానా విజయంలో ఏమీ భాగం వుండదు. తద్వ్యతిరేకంగా, విడివిడిగా ఫ్యాక్టరీ (fabrique separee)లో ఎవడూ ధనికుడూ కాడు, కానీ అనేక శ్రామికులు సుఖంగా వుంటారు; ఖర్చు చేయనివాళ్ళూ, శ్రమశీలురూ చిన్న మొత్తం కూడబెట్టుకోగలుగుతారు. కాన్పు కొరకో, జబ్బు కొరకో, తమ కొరకో, తమ సామాగ్రి కొరకో కాస్త డబ్బు కూడబెట్టుకోగలుగుతారు. ఖర్చు చేయని, శ్రమశీల శ్రామికుల సంఖ్య పెరుగుతుంది; ఎందుకంటే, సత్ప్రవర్తనలో, క్రియాత్మకతలో వాళ్ళకు తమ స్థితిని సారభూతంగా మెరుగుపరచుకునే మార్గం కనపడుతుంది. వేతనంలో చిన్న పెరుగుదలను సంపాయించుకొనే మార్గం కాక, ఇది భవిష్యత్తుకు ఏమీ ప్రాముఖ్యం గలది కాజాలనిది, దీని ఏకైక ఫలితం వాళ్ళను కాస్త మేలైన

1. ప్రష్యా రాజుకు, (ప్రష్యా రాజుకు పన్నులుగా ఫలించిందంటే, రైతుల కేమీ మిగలలేదని అర్థం) - సం.
2. పెట్టుబడిదారుడు ఇలా అంటాడు. “ఒక షరతుమీద, మీకు నా కొరకు పనిచేసే గౌరవం కలిగిస్తాను - మిమ్మల్ని నేను శ్రమపడి ఆజ్ఞాపించినందుకు గాను మీరు మీకున్నది కాస్తా నా కిచ్చే షరతుమీద. (J.J. Rousseau, "Discours sur I''Economie Politique" [అర్థశాస్త్రంపై చర్చలు”])

జీవితం జీవించే స్థితిలో పెట్టడం, కానీ ఏ రోజు కారోజు మాత్రమే.... పెద్ద కార్ఖానాలు తమ లాభం కోసం పనిచేయడానికి శ్రామికులకు రోజువారీ కూలి ఇచ్చే కొందరు సొంత వ్యక్తుల సంస్థలు, ఈ సొంత వ్యక్తులను సుఖపెట్టవచ్చు. కానీ అవి ఎప్పుడూ ప్రభుత్వాల శ్రద్ధకు అర్హం కావు. విడివిడి కార్ఖానాలు, వాటిలో అత్యధికభాగం చిన్న కమతాల వ్యవసాయంతో కలిసినట్టివి, మాత్రమే స్వేచ్ఛాయుతమైనవి."[1]

వ్యవసాయ ప్రజానీకంలో కొంత భాగాన్ని నిరాస్తిపరులను చేయడమూ, భూమినుండి వెళ్ళగొట్టడమూ అనేవి పారిశ్రామిక పెట్టుబడి కొరకు శ్రామికులనూ, వాళ్ళ జీవనాధారాలనూ, శ్రమ సాధనాలనూ విడుదల చేయడం మాత్రమే కాదు; దేశీయ మార్కెట్‌ను కూడా సృష్టించినాయి.

వాస్తవంలో, చిన్న రైతులను వేతన శ్రామికులుగానూ, వాళ్ళ జీవనాధారాలనూ, శ్రమ సాధనాలనూ పెట్టుబడి యొక్క పాదార్థిక అంశాలుగానూ రూపాంతరీకరించిన అంశాలు అదే సమయంలో వాటికి దేశీయ మార్కెట్‌ను సృష్టించినాయి. మునుపు రైతు కుటుంబం జీవనాధారాలనూ, ముడి పదార్థాలనూ ఉత్పత్తిచేసి, వాటిలో అత్యధిక భాగాన్ని వాళ్లే వినియోగించుకొనేవాళ్ళు. ఈ ముడి పదార్థాలూ, జీవనాధారాలూ ఇప్పుడు విక్రయసరుకులైనాయి. పెద్ద వ్యవసాయదారుడు వాటిని అమ్ముతాడు. కార్ఖానాలలో అతనికి మార్కెట్ దొరుకుతుంది. నూలు, బట్టా , ముతక ఉన్ని బట్టలూ – వేటి ముడి పదార్థాలు ప్రతి రైతు కుటుంబానికీ అందుబాటులో వుండి, దాని సొంత ఉపయోగార్థం వడకబడి, నేయబడినాయో – అవి ఇప్పుడు పారిశ్రామిక వస్తువులైనాయి; గ్రామీణ జిల్లాలు వెంటనే వాటికి మార్కెట్లుగా పనిచేసినాయి. తమ సొంతానికి పనిచేసే అనేక చిన్న ఉత్పత్తిదార్లు ఇంతవరకు అరుదైన చేతిపనివాళ్ళకు చెల్లాచెదరైన అనేక కొనుగోలుదార్లుగా వుండినారు; వాళ్లిప్పుడు పారిశ్రామిక పెట్టుబడి ఏర్పరచిన ఒకే గొప్ప మార్కెట్‌గా కేంద్రీకృతమౌతారు.[2] ఈవిధంగా స్వయంపోషక రైతుల ఆస్తి హరణతో, వాళ్ళను వాళ్ళ ఉత్పత్తి సాధనాల నుండి విడదీయడంతో కలిసి గ్రామీణ గృహ పరిశ్రమల విధ్వంసమూ, పరిశ్రమలనూ, వ్యవసాయాన్నీ విడదీసే క్రమాలు జరుగుతాయి. ఇక, గ్రామీణ గృహ పరిశ్రమల విధ్వంసం మాత్రమే దేశం యొక్క ఆంతరంగిక మార్కెట్‌కు పెట్టుబడిదారీ విధానం ఆపేక్షించే విస్తృతినీ, స్థిరత్వాన్ని ఇవ్వగలదు.

సరైన అర్థంలో కార్ఖానా ఉత్పత్తి దశ అనేది ఈ రూపాంతరీకరణను సమూలంగానూ, సంపూర్ణంగానూ నిర్వహించడంలో ఇంకా విజయం పొందదు. సరైన అర్థంలో కార్ఖానా ఉత్పత్తి

---

1. Mirabeau, "De la Monarchie prussienne," పుటలు 20-109, అక్కడక్కడ, మిరబో విడివిడి కార్ఖానాలను "సమ్మిళిత' మైన వాటికంటె పొదుపైనవిగా, ఉత్పాదకమైనవిగా పరిగణించి, ఈ రెండవ వాటిని కేవలం ప్రభుత్వం పోసించే కృత్రిమ వృక్షాలుగా చూస్తాడు. దీనికి కారణం ఏమిటంటే, ఆనాడు యూరపియన్ భూఖండంలోని కార్ఖానాలలో అధికభాగం యొక్క స్థితి.

2. ఇరవై పౌండ్ల ఉన్ని, ఇతర పనుల మధ్యగల విరామాలలో శ్రామికుని కుటుంబం చేసే సొంత పరిశ్రమతో, కండ్లకు కనిపించకుండా, ఆ కుటుంబానికి సాలుసరి దుస్తులుగా మారడం - దీనికి ఏ ఆడంబరమూ లేదు. కాని దానిని మార్కెట్‌కు తెచ్చి, ఫ్యాక్టరీకి, అక్కడ నుండి బ్రోకర్‌కూ, అక్కడినుండి వర్తకునికీ పంపితే, గొప్ప వాణిజ్య లావాదేవీలు ఏర్పడుతాయి. నామకపు పెట్టుబడి తన విలువకు ఇరవై రెట్లున్న మొత్తం వ్యాపారం చేస్తుంది... ఈ విధంగా కార్మికవర్గం దౌర్భాగ్యపు ఫ్యాక్టరీ ప్రజానీకాన్నీ, పరరక్తోప జీవనపు దుకాణదారుల వర్గాన్నీ ... కల్పితమైన వాణిజ్య, ఆర్థిక, ఫైనాన్షల్ వ్యవస్థనూ పోషించడంలో నిమగ్నమైంది. (David Urquharst, పూర్వోక్త గ్రంథం, పుట 120)

అనేది జాతీయ ఉత్పత్తి రంగాన్ని పాక్షికంగా మాత్రమే జయిస్తుందనీ, తన అంతిమ ప్రాతిపదికగా పట్టణంలోని చేతిపనుల మీదా, గ్రామీణ జిల్లాలలోని గృహ పరిశ్రమల మీద ఎల్లప్పుడూ ఆధారపడు తుందనీ జ్ఞాపకం పెట్టుకోవాలి. అది వీటిని ఒక రూపంలో, నిర్దిష్ట శాఖలలో, కొన్ని చోట్ల ధ్వంసంచేస్తే, మరొకచోట మళ్ళీ సృష్టిస్తుంది; ఎందుకంటే, ఒకదశ వరకు ముడి పదార్థాన్ని తయారు చేయడానికి ఇవి దానికి అవసరం. కనుక అది చిన్న గ్రామీణుల కొత్త వర్గాన్ని ఉత్పత్తి చేస్తుంది; ఎలాంటి వర్గమంటే, వాళ్ళు వ్యవసాయాన్ని అనుబంధ వృత్తిగా అనుసరిస్తూ, పారిశ్రామిక శ్రమను ప్రధాన వృత్తిగా పెట్టుకుంటారు; దీని ఉత్పాదితాలను వాళ్ళు నేరుగా, గానీ, మధ్యనున్న వర్తకుల ద్వారా గానీ కార్ఖానా ఉత్పత్తిదార్లకు అమ్ముతారు. ఇంగ్లండు చరిత్ర పరిశీలకుణ్ణి మొదట తికమక పెట్టే ఒక ఘటనకు ఇది ప్రధాన కారణం కాకపోయినా, ఒక కారణం. 15వ శతాబ్ది చివరి మూడింట భాగం నుండి, మధ్య కొన్ని విరామాలతో, ఎడతెగకుండా అతనికి గ్రామీణ జిల్లాలలో పెట్టుబడిదారీ వ్యవసాయపు అభివృద్ధి గురించీ, రైతుల ప్రవర్ధమాన విధ్వంసం గురించీ ఫిర్యాదులు కనపడతాయి. మరొకవైపున, అంతకంతకూ వాళ్ళ స్థితి హీనమౌతున్నప్పటికీ, తగ్గిపోయిన సంఖ్యలోనే అయినా, రైతులు ఎల్లప్పుడూ వున్నారని అతను గమనిస్తాడు.[1] ప్రధాన కారణం ఏమిటంటే; ఇంగ్లండులో ఒక కాలంలో ప్రధానంలో ధాన్యం ఉత్పత్తిదారుగానూ, ఒక కాలంలో ప్రధానంగా పశుపోషకురాలు గానూ మారుతూ మారుతూ వచ్చింది; ఈ మార్పులతో రైతు వ్యవసాయపు విస్తృతిని హెచ్చుతగ్గు లౌతుంది. ఆధునిక పరిశ్రమలు మాత్రమే అంతిమంగా, పెట్టుబడిదారీ వ్యవసాయపు శాశ్వత ప్రాతిపదిక అయిన యంత్రాలను సరఫరా చేసి, వ్యవసాయిక ప్రజానీకంలో అపారమైన మెజారిటీని సమూలంగా ఆస్తిహరణం చేసి, వ్యవసాయం నుండి గ్రామీణ గృహ పరిశ్రమల ఎడబాటును పూర్తిచేస్తాయి. ఈ పరిశ్రమల వేర్లు అయిన నూలు వడకడాన్నీ, నేతనూ పెకలించి వేస్తాయి.[2] కనుక అవి మొదటిసారిగా పారిశ్రామిక పెట్టుబడికొరకు యావత్తు దేశీయ మార్కెట్‌నూ జయిస్తాయి.[3]

---

1. క్రామ్‌వెల్ కాలం దీనికి మినహాయింపుగా వుంది. ట్యూడర్ రాజుల కింద అనుభవించిన పతనావస్థ నుండి అన్ని రకాల ఇంగ్లీషు ప్రజా బాహుళ్యమూ రిపబ్లిక్ ఉండినంత కాలం పైకి లేచింది.
2. యంత్రాలను ప్రవేశపెట్టడంతో, అచ్చమైన కార్ఖానా నుండీ, గ్రామీణ, గృహ పరిశ్రమల విధ్వంసం నుండీ ఆధునిక వున్ని పరిశ్రమ ఉద్భవించిందని టుకెట్‌కు తెలుసు. (Tuckett పూర్వోక్త గ్రంథం, సంపుటి , పుట 144) ''మకడా, కాడీ 'దేవతల సృజన, వీరుల వృత్తి'; మగ్గమూ, కదురూ, రాట్నమూ అంతకంటె తక్కువ వంశంలో పుట్టినాయా; రాట్నాన్నీ, మడకనూ వేరు చేయండి. కదురునూ, కాడినీ వేరు చేయండి. మీకు ఫ్యాక్టరీలు, బిచ్చగాళ్ళ చావళ్ళూ, రుణమూ, భయ విహ్వలతా లభిస్తాయి. రెండు జాతులు లభిస్తాయి. వ్యావసాయిక వాణిజ్య జాతీ'' (David Urquhart పూర్వోక్త గ్రంథం, పుట 122), కానీ, ఇప్పుడు కేరీ వచ్చి, ఇంగ్లండును ఖండిస్తాడు. సమంజసంగానే - అది ప్రతి ఇతర దేశాన్నీ కేవలం వ్యావసాయిక దేశంగా మార్చి, తాను దానికి పారిశ్రామికదారుగా ఉండాలని ప్రయత్నిస్తున్నది. ''మడకకూ, మగ్గానికీ మధ్య, సుత్తెకూ, గొర్రుకూ మధ్య సహజమైన పొత్తు ఏర్పరచడం ద్వారా భూమి సొంతదార్లూ, భూమిమీద బతికేవాళ్ళూ బలపడడానికి ఇంగ్లండు ఎప్పుడూ అనుమతించలేదు.'' గనుక టర్కీ చితికిపోయిందని అతను నటిస్తాడు. ("The Slave Trade" బానిస వర్తకం, పుట 125) కేరీ ప్రకారం, టర్కీ చితికిపోవడానికి ముఖ్య కారకులలో ఉర్కుహార్ట్ ఒకడు, అక్కడ అతను ఇంగ్లండు ప్రయోజనం కోసం నిర్నిబంధ వర్తక ప్రచారం చేసినాడు. కేరీ చెప్పే దానిలో కెల్ల ఉత్తమమైనది ఏమిటంటే, అతను- అన్నట్లు అతను గొప్ప రష్యా అభిమాని - ఆ ఎడబాటు క్రమాన్ని ఏ రక్షణ పద్ధతి త్వరపరుస్తుందో సరిగ్గా ఆ పద్ధతి ద్వారా దానిని నివారించ గోరుతాడు.
3. అబెల్ ఎక్కడకి పోయినాడని, భగవంతుడు కేన్‌ను అడిగినట్లు, మన వేలకొలది ఫ్రీహోల్డ్ రైతులు

## అధ్యాయం - 31

# పారిశ్రామిక పెట్టుబడిదారుని పుట్టుక

పారిశ్రామిక** పెట్టుబడిదారుని పుట్టుక జరిగినంత క్రమపద్ధతిలో జరగలేదు. నిస్సందేహంగా చాలా మంది వృత్తి సంఘ సభ్యులూ, అంతకంటే చాలా మంది చిన్న, స్వతంత్ర చేతిపనివాళ్ళూ, వేతన శ్రామికులు కూడానూ చిన్న పెట్టుబడిదారులుగా రూపాంతరం చెంది, (క్రమక్రమంగా వేతన శ్రమ మీద దోపిడీని తదనురూపమైన సంచయనాన్నీ విస్తృతపరచడం ద్వారా) పూర్తి పెట్టుబడిదారులు అయినారు. పెట్టుబడిదారీ ఉత్పత్తి యొక్క శైశవదశలో మధ్యయుగ పట్టణాల శైశవదశలో లాగే తరచుగా ఘటనలు జరిగినాయి; ఆ పట్టణాలలో, తప్పించుకొని పోయిన ఫ్యూడల్ దాసులలో ఎవరు యజమాని అయినారు, ఎవరు సేవకులు అయినారు అనేది, చాలా మేరకు, వాళ్ళలో ఎవడు ముందు పారిపోయినాడు, ఎవడు తరువాత పారిపోయినాడు అనే దానిచేత నిర్ణయించబడింది. ఈ పద్ధతి యొక్క నత్తనడక 15వ శతాబ్ది అంతంలోని మహత్తర ఆవిష్కరణలు సృష్టించిన కొత్త ప్రపంచ మార్కెట్‌యొక్క వాణిజ్య అవసరాలకు ఏవిధంగానూ అనుగుణంగా లేదు. కానీ, మధ్య యుగాలు రెండు స్పష్టమైన రకాల పెట్టుబడిని అందించి పోయినాయి; అవి అత్యంత భిన్నమైన ఆర్థిక సాంఘిక నిర్మాణ రూపాలలో పక్వమౌతాయి, అయినప్పటికీ, పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానపు యుగానికి ముందు, అవి పెట్టుబడిగా పరిగణింపబడతాయి. అవి వడ్డీ వ్యాపారి పెట్టుబడి, వర్తకుని పెట్టుబడి.

"ప్రస్తుతం సమాజపు సంపద అంతా మొదట పెట్టుబడిదారుని ఆస్తి అవుతుంది .... అతను భూస్వామికి అతని శిస్తు చెల్లించి, శ్రామికునికి అతని వేతనం చెల్లించి, పన్నులు వసూలుచేసే వాళ్ళకు పన్నులు చెల్లించి, శ్రమ యొక్క సాలుసరి ఉత్పత్తిలో పెద్ద భాగాన్ని, నిజానికి అన్నిటికంటె పెద్ద భాగాన్ని, నిరంతరం పెరిగే భాగాన్ని, తానే వుంచుకుంటాడు. పెట్టుబడిదారుడు ఇప్పుడు సమాజపు సంపద అంతటికీ సొంతదారుడనవచ్చు. ఏ చట్టమూ అతనికి ఈ ఆస్తిమీద హక్కును ప్రసాదించక పోయినప్పటికీ... పెట్టుబడిమీద వడ్డీ తీసుకోవడం ద్వారా ఈ మార్పు జరిగింది... యూరప్ శాసన కర్తలందరూ శాసనాల ద్వారా దీనిని నివారించడానికి ప్రయత్నించడం తక్కువ చిత్రమైనదేమీ కాదు...

---

ఎక్కడికి పోయినారని మిల్, రోజర్స్, గోల్డ్విన్, స్మిత్, ఫాసెట్, వగైరాల లాంటి భూతదయాపరులైన ఇంగ్లీషు అర్థశాస్త్రజ్ఞులూ, జాన్ బ్రైట్ అండ్‌కో లాంటి ఉదారవాద పారిశ్రామికులూ ఇంగ్లీషు భూస్వాములను అడుగుతారు. మరి, మీరు ఎక్కడి నుండి వచ్చినారు? ఆ ఫ్రీహోల్డ్ రైతుల విధ్వంసం నుండే, ఆపైన ఎందు కడగరు, స్వతంత్ర నేతగాళ్ళూ, వడికేవాళ్ళూ, చేతిపని వాళ్ళూ, ఎక్కడికి పోయినారని?

** "పారిశ్రామిక" అంటే ఇక్కడ "వ్యావసాయికం" కానిది అని అర్థం. "ధాతు" అర్థంలో వ్యవసాయదారుడు కార్ఖానాదారునిలాగే పారిశ్రామిక పెట్టుబడిదారుడు.

దేశ సంపద అంతటిమీదా పెట్టుబడిదారుని అధికారం ఆస్తి హక్కులో సంపూర్ణమైన మార్పు; మరి ఏ శాసనం ద్వారా, లేక ఏ శాసనాల పరంపర ద్వారా ఇది జరిగింది?"[1]

శాసనాల ద్వారా విప్లవాలు జరగవని రచయిత జ్ఞాపకం వుంచుకొని వుండవలసింది. వడ్డీ వ్యాపారం చేతా, వాణిజ్యం చేతా ఏర్పడిన డబ్బు పెట్టుబడి, గ్రామాలలో ఫ్యూడల్ వ్యవస్థ చేతా, పట్టణాలలో వృత్తి సంఘ వ్యవస్థ చేతా, పారిశ్రామిక పెట్టుబడిగా మారకుండా అరికట్టబడింది.[2] ఫ్యూడల్ పరిజనుల బృందాల విచ్ఛిత్తితో, గ్రామీణ ప్రజానీకాన్ని నిరాస్తిపరులనుచేసి, పాక్షికంగా భూముల నుండి వెళ్ళగొట్టడంతో, ఈ సంకెళ్ళు అద్భుతమైనాయి. కొత్త కార్ఖానాలు ఓడ రేవుల వద్ద గానీ, పాత మునిసిపాలిటీల యొక్కా, వాటి వృత్తి సంఘాల యొక్కా అజమాయిషీకి దూరమైన చోట్ల గానీ నెలకొల్పబడినాయి. అందుకనే ఇంగ్లండులో ఈ కొత్త పారిశ్రామిక నారుమళ్ళమీద వృత్తి సంఘాల నిర్మాణం గల పట్టణాలు అంత కసిగా పోరాడడం.

అమెరికాలో వెండి, బంగారుల ఆవిష్కరణా, ఆదిమ ప్రజానీకాన్ని నిర్మూలించడమూ, గనులలో భూస్థాపితం చేయడమూ, ఈస్ట్ ఇండియా కంపెనీ ప్రాంతాలను జయించుకోవడమూ, కొల్లగొట్టడమూ ప్రారంభం కావడమూ, నల్ల చర్మాల వ్యాపారపు వేటకు గాను ఆఫ్రికాను వేట క్షేత్రంగా మార్చడమూ పెట్టుబడిదారీ ఉత్పత్తి యుగానికి బంగారు వేకువ అయినాయి. ఈ రుష్యాశ్రమ క్రమాలు ఆదిమ సంచయనంలో ప్రధానమైన అంశాలు. వాటి వెనువెంబడే వచ్చింది యూరపియన్ జాతుల వాణిజ్య యుద్ధం, ప్రపంచమంతటినీ యుద్ధ రంగంగా చేసుకున్నట్టిది. అది స్పెయిన్ మీదికి నెదర్లండ్స్ తిరుగుబాటుతో ప్రారంభమై, ఇంగ్లండు చేసిన జాకొబిన్ వ్యతిరేక యుద్ధంలో బ్రహ్మాండమైన ప్రమాణాలు అందుకొని, చైనామీద జరిగే నల్లమందు యుద్ధాలూ, వగైరాలలో ఇంకా కొనసాగుతున్నది.

ఆదిమ సంచయనపు భిన్న అంశాలు ఇప్పుడు ముఖ్యంగా స్పెయిన్, పోర్చుగల్, హాలండ్, ఫ్రాన్సు, ఇంగ్లండులకు దాదాపు కాలానుక్రమణిలో వ్యాపిస్తాయి. ఇంగ్లండులో అవి 17వ శతాబ్ది అంతంలో క్రమపద్ధతి గల సమ్మేళనానికి చేరుకుంటాయి. వాటిలో వలసలూ, జాతీయ రుణమూ, ఆధునిక పన్నుల పద్ధతీ, రక్షణ సుంకాల వ్యవస్థా చేరుతాయి. ఈ పద్ధతులు పాక్షికంగా, పశుబలం మీద ఆధారపడతాయి – ఉదాహరణకు వలస వ్యవస్థ. కానీ, అవన్నీ ఫ్యూడల్ ఉత్పత్తి విధానం పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానంగా రూపాంతరం చెందే పరివర్తన క్రమాన్ని, కృత్రిమ నారుమడిలో లాగా, త్వరపరచడానికి, పరివర్తన కాలాన్ని తగ్గించడానికి రాజ్యాధికారాన్ని, అనగా సమాజపు కేంద్రీకృత, వ్యవస్థీకృత దౌర్జన్యాన్ని వినియోగించుకుంటాయి. కొత్త సమాజాన్ని కనబోయే ప్రతి పాత సమాజానికీ బలప్రయోగమే మంత్రసాని. అదే ఒక ఆర్థిక శక్తి.

---

1. The Natural and Artificial Rights of Property Contrasted" ("ఆస్తి మీద సహజ హక్కులనూ, కృత్రిమ హక్కులనూ పోల్చడం") London 1832, పుటలు 98-99, రచయిత పేరులేని ఈ పుస్తకం రచయిత : టి.హెచ్. హాడ్జ్స్కిన్.

2. 1794 కూడా లీడ్స్ పట్టణానికి చెందిన బట్టల ఉత్పత్తిదారులు పార్లమెంట్‌కు ప్రతినిధివర్గాన్ని పంపినారు. వర్తకుడెవడూ పారిశ్రామికుడు కాకుండా నిషేధించే చట్టం చేయాలనే విజ్ఞప్తితో. (Dr. Aikin, "Description of the Country from 30 to 40 Miles round manchester" ["మాంచెస్టర్‌కు 30, 40 మైళ్ళ చుట్టూ వున్న గ్రామీణ ప్రాంతపు వర్ణన"], London 1795).

క్రైస్తవ మతాన్ని ప్రత్యేకంగా అధ్యయనం చేసే డబ్ల్యు. హౌవిట్ క్రైస్తవ వలస వ్యవస్థను గురించి ఇలా అంటాడు.

"క్రైస్తవ జాతి అనబడేది ప్రపంచంలోని ప్రతి ప్రాంతంలోను, అది అణచగలిగిన ప్రతి జాతి మీదా సాగించిన కిరాతకత్వాలూ, దారుణ అత్యాచారాలూ ఏ ఇతర జాతి సాగించివాటితోనూ పోలిక లేనట్టివి, ఆ ఇతర జాతి ఈ భూమి చరిత్రలో ఏ యుగానికి చెందినదైనా, ఎంత భయంకర మైనదైనా, ఎంత విద్యాహీనమైనదైనా, ఎంత కనికరం లేనిదీ, సిగ్గుమాలినదీ ఐనా."[1]

హాలండు వలస పరిపాలన చరిత్ర – మరి హాలండు 17వ శతాబ్దిలోని అగ్ర పెట్టుబడిదారీ దేశం – "ద్రోహ, లంచం, హత్య, నీచత్వాలతో నిండిన అత్యంత అసాధారణ సంబంధాల చరిత్ర"[2] జావాకు బానిసలను సంపాయించడానికి మనుషులను దొంగిలించినట్టి వాళ్ళ పద్ధతి కంటె విలక్షణ మైనది మరొకటి ఉండదు. ఈ పనికిగాను మనుషులను దొంగిలించేవారికి తర్ఫీదు ఇవ్వబడింది. దొంగా... దుబాసీ అమ్మేవాడూ ఈ వర్తకంలో ప్రధానమైన ఏజంట్లు : స్థానిక ప్రభువులు అమ్మే వాళ్ళు. దొంగిలించబడిన యువజనులను సెలిబీస్ దీవిలోని రహస్య చీకటి గూళ్ళతో తోసి తరువాత బానిస ఓడలకు పంపేవాళ్ళు. ఒక అధికారిక నివేదిక ఇలా చెపుతుంది :

"ఉదాహరణకు ఈ ఒక్క మకస్సార్ పట్టణం నిండా రహస్య బంధిఖానాలు ఉన్నాయి, ఒకదానికంటె మరొకటి దారుణమైనట్టివి, తమ కుటుంబాల నుండి బలవంతంగా తెంచివేయబడి, గొలుసులతో బంధించబడి, దురాశకూ, క్రౌర్యానికీ, గురైన దౌర్భాగ్యులను కూరినట్టి బందిఖానాలు".

మలక్కాను సంపాదించుకోడానికి డచ్చివాళ్ళు పోర్చుగీసు గవర్నర్‌కు లంచమిచ్చినారు. అతను 1641లో వాళ్ళను పట్టణంలోకి రానిచ్చినాడు. వాళ్ళు వెంటనే అతని ఇంటికి పోయి అతన్ని హత్యచేసి, అతని ద్రోహానికి గాను అతనికి చెల్లించవలసిన 21,875 పౌండ్లను మిగిలించుకున్నారు. వాళ్ళు అడుగుపెట్టిన చోటల్లా విధ్వంసమూ, జనక్షయమూ వెంట వచ్చినాయి. జావాలో ఒక రాష్ట్రమైన బంజువాంగిలో 1750లో 80,000 మంది జనం వుండినారు, 1811లో 8,000 మంది మాత్రం వుండినారు. మధురమైన వాణిజ్యం!

ఇంగ్లీషు ఈస్ట్ ఇండియా కంపెనీ, అందరికీ తెలిసినట్లు, భారతదేశంలో రాజకీయ పరిపాలనకు తోడుగా, తేయాకు వర్తకం మీదా, మొత్తంగా చైనా వర్తకం మీదా, యూరప్‌కూ, యూరప్ నుండి సరుకుల రవాణా మీదా సంపూర్ణ గుత్తాధిపత్యం సంపాదించింది. కానీ, భారత సముద్రతీర వర్తకమూ,

1. William Howitt, "Colonisation and Christianity : A Popular History of the Treatment of the Natives by the Europeans in All Their Colonies" ("వలస కరణా, క్రైస్తవ మతమూ : యూరోపియన్లు తమ వలస లన్నింటిలోనూ స్థానిక ప్రజల కిచ్చిన మన్ననయొక్క సరళ చరిత్ర") London,1838 పుట 9, బానిసల కిచ్చిన మన్ననమీద Charles Comte మంచి సంకలనం ఇచ్చినాడు : "Traite de la Legislation" 3 meed, Bruyelles, 1837, బూర్జువావర్గం చేతనైనచోటల్లా అదుపు లేకుండా తాను ఎలా మారేది, శ్రామికుని ఎలా మార్చేది, ప్రపంచాన్ని తనలాగే ఎలా రూపుదిద్దేదీ తెలుసుకోడానికి ఈ విషయాన్ని సవివరంగా అధ్యయనం చేయాలి.

2. Thomas Samford Raffles, జావా మాజీ లెఫ్టినెంట్ గవర్నర్, "The History of Java" ("జావా చరిత్ర") London, 1817.

దీవుల మధ్య వర్తకమూ, భారతదేశంలోని ఆంతరంగిక వర్తకమూ కంపెనీ యొక్క ఉన్నతోద్యోగుల గుత్తహక్కుగా వుండింది. ఉప్పు, నల్లమందు, వక్కలు, తదితర సరుకుల మీద గుత్తాధిపత్యం తరగని ఐశ్వర్య నిధిగా వుండింది. ఉద్యోగులే ధరలు నిర్ణయించి, దౌర్భాగ్యపు భారతీయులను కొల్లగొట్టే వాళ్లు. ఈ సొంత వ్యాపారంలో గవర్నర్ జనరల్ పాల్గొనేవాడు. అతని అభిమానులకు ఎలాంటి షరతులతో కాంట్రాక్టులు ఇవ్వబడేవంటే, ఆ షరతుల ద్వారా వాళ్ళు, పరుసవేదిని మించిన నేర్పుతో, శూన్యం నుండి బంగారు సృష్టించేవాళ్ళు. పుట్టగొడుగులలాగా ఒక్క రోజులో గొప్ప ధననిధులు ఉత్పన్నమయ్యేవి: ఒక్క షిల్లింగు కూడా పెట్టుబడి లేకుండా ఆదిమ సంచయనం సాగింది. వారెన్ హేస్టింగ్స్ విచారణ నిండా ఇలాంటి ఘటనలు వున్నాయి. ఒక ఉదాహరణ చూడండి. సుల్లివాన్ అనే ఒకనికి, అతను ప్రభుత్వ పనిమీద నల్లమందు జిల్లాకు చాలా దూరంలో వున్న మరొక భారతదేశ ప్రాంతానికి పోయే తరుణంలో, నల్లమందుకు కాంట్రాక్టు ఇవ్వబడింది. అతను తన కాంట్రాక్టును బిన్ అనేవానికి 40,000 పౌండ్లకు అమ్మినాడు; బిన్ దానిని అదే రోజున 60,000 పౌండ్లకు అమ్మినాడు. కాంట్రాక్టును నిర్వహించిన అంతిమ కొనుగోలుదారుడు తనకు చివరకు అపారమైన లాభం వచ్చినట్లు చెప్పినాడు. పార్లమెంట్ ముందర పెట్టబడిన ఒక పట్టీ ప్రకారం, 1757కూ 1766కూ మధ్య కంపెనీకీ, దాని ఉద్యోగులకూ భారతీయుల నుండి 60,00,000 పౌండ్లు కానుకలుగా వచ్చినాయి. 1769కీ 1770కీ మధ్య ఇంగ్లీషు వాళ్ళు బియ్యమన్నీ కొనేసి ఊహాతీతమైన ధరలకు తప్ప అమ్మడానికి నిరాకరించడం ద్వారా కరువును సృష్టించినారు.[1]

ఎగుమతి వ్యాపారానికి మాత్రమే అంకితమైన పశ్చిమ ఇండీస్ లాంటి ప్లాంటేషన్ వలసలలోనూ, కొల్లకు అప్పగించబడిన మెక్సికో, భారతదేశం లాంటి ధనిక, జన సంకీర్ణపు దేశాలలోనూ, సహజంగానే, స్థానిక ప్రజలకు ఇచ్చిన మన్నన అత్యంత భయంకరంగా వుండింది. కానీ, సరైన అర్థంలో వలస లనబడేవాటిలో కూడా ఆదిమ సంచయనపు క్రైస్తవ స్వభావం స్పష్టంగా వుంది. ప్రొటెస్టెంటు మతానికి చెందిన ఆస్తిమిత మనస్కపు విజ్ఞానులు, న్యూ ఇంగ్లండులోని ప్యూరిటన్లు, 1703లో, తమ శాసనసభ నిర్ణయాల ద్వారా, ప్రతి ఎర్ర ఇండియన్ పునుక చర్మానికీ, పట్టుబడిన ప్రతి ఎర్ర ఇండియన్‌కూ 40 పౌండ్ల బహుమతి ప్రకటించినారు; 1720లో ప్రతి పునుక చర్మానికి 100 పౌండ్ల బహుమతి ప్రకటించబడింది. 1774లో ఒకానొక తెగను తిరుగుబాటుదార్లుగా మసచూసెట్‌బే ప్రకటించిన తర్వాత ఈ ధరలు పెట్టబడినాయి : 12 ఏండ్ల వయసుకు పై బడిన మగ పునుక చర్మానికి 100 పౌండ్లు (కొత్త కరెన్సీ), మగ ఖైదీకి 105 పౌండ్లు, ఆడ ఖైదీలూ, పిల్ల ఖైదీలకూ 55 పౌండ్లు, ఆడవాళ్ళ,పిల్లల పునుక చర్మాలకు 50 పౌండ్లు, కొన్ని దశాబ్దాల తర్వాత, పవిత్ర పిల్గ్రిమ్ ఫాదర్ల సంతతి ఈ మధ్యలో ప్రతికూల ప్రచారకులు కాగా, వాళ్ళమీద వలస వ్యవస్థ కసి తీర్చుకుంది. ఇంగ్లీషు వాళ్ళ ప్రేరణతో, ఇంగ్లీషు వాళ్ళ లంచంతో, ఎర్ర ఇండియన్లు వాళ్ళను నరికినారు. వేటకుక్కలూ, పునుక చర్మాలు తీయడమూ "భగవంతుడూ, ప్రకృతీ తన చేతలో పెట్టిన సాధనాలుగా" బ్రిటిష్ పార్లమెంట్ ఉద్ఘాటించింది.

---

1. 1866లో ఒక్క ఒరిస్సా రాష్ట్రంలోనే పది లక్షల మందికి పైగా భారతీయులు ఆకలితో మరణించారు. అయినప్పటికీ, పస్తులున్న ప్రజలకు జీవితావసరాలను అమ్మి, తద్వారా భారత ఖజానాకు సంపన్నం చేసే ప్రయత్నం జరిగింది.

వలస వ్యవస్థ కృత్రిమ నారుమడి లాగా, వర్తకాన్నీ, సముద్రయానాన్నీ పక్వం చేసింది. లూథర్‌కు చెందిన "గుత్త సంస్థలు" పెట్టుబడి కేంద్రీకరణకు శక్తివంతమైన కీళ్ళుగా వుండినాయి. వలసలు శైశవ పరిశ్రమలకు మార్కెట్‌ను సంపాయించి, మార్కెట్ల మీద గుత్తాధిపత్యం ద్వారా సంచయనాన్ని పెంచినాయి. యూరప్ వెలుపల ముసుగు లేని కొల్లద్వారా, బానిసీకరణ ద్వారా, హత్యద్వారా పట్టుబడిన సంపద నిధులు మాతృదేశానికి పోయి, అక్కడ పెట్టుబడిగా మారినాయి. వలస వ్యవస్థను మొదట పూర్తిగా అభివృద్ధి చేసిన హాలండు 1648లో అప్పటికే తన వాణిజ్య ఔన్నత్యపు శిఖరంలో వుండింది.

"తూర్పు ఇండీస్ దీవుల వర్తకమూ, నైరుతి యూరప్‌కూ, ఈశాన్య యూరప్‌కూ మధ్య వాణిజ్యమూ దాదాపు పూర్తిగా దాని చేతిలో వుండినాయి. దాని చేపల పరిశ్రమలూ, ఓడలూ,కార్ఖానాలూ మిగతా అన్ని దేశాలవాటినీ అధిగమించినాయి. ఆ రిపబ్లిక్ యొక్క మొత్తం పెట్టుబడి బహుశా తక్కిన యూరప్ అంతటికీ కలిసి ఉండినంత పెట్టుబడికంటె ఎక్కువ ముఖ్యమైనదిగా వుండింది."

1648 నాటికి హాలండు ప్రజలు తక్కిన యూరప్ ప్రజలందరికంటె ఎక్కువ పనిచేస్తూ, ఎక్కువ దరిద్రంగా, ఎక్కువ పాశవికంగా పీడింపబడినారని చెప్పడం గూలిహ్ మరిచిపోతాడు.

ఈనాడు పారిశ్రామిక ఆధిక్యంలో వాణిజ్య ఆధిక్యం ఇమిడివుంది. కానీ, సరైన అర్థంలో కార్ఖానాలు అనబడేవాటి కాలంలో, వాణిజ్య ఆధిక్యమే పారిశ్రామిక ఆధిక్యాన్ని ఇచ్చేది. అందుకనే ఆనాడు వలస వ్యవస్థ అంత సర్వాధికమైన పాత్ర నిర్వహించడం. యూరప్ యొక్క పాత దేవతల పక్కనే కూర్చొని, ఒక శుభముహూర్తాన ఒక తోపుతో, ఒక తాపుతో అందరినీ కుప్పగా కూలదోసినవాడు "వింత దేవుడు". అదనపు విలువను సృష్టించడం మానవజాతి యొక్క ఏకైక గమ్యంగా, లక్ష్యంగా ఆ దేవుడు ఉద్ఘాటించినాడు.

దేని ప్రారంభం మధ్య యుగాలలోనే జెనీవాలోనూ, వెనిస్‌లోనూ మనకు కనపడుతుందో ఆ ప్రభుత్వ రుణం, అనగా జాతీయ రుణ వ్యవస్థ, పారిశ్రామిక కాలంలో యూరప్‌నూ వశపరచుకుంది. వలస వ్యవస్థ, దాని సముద్ర వర్తకంతోనూ, వాణిజ్య యుద్ధాలతోనూ కలిసి, ప్రభుత్వ రుణాన్ని వేగంగా పెంచింది. ఆ విధంగా అది మొదట హాలెండులో వేరూనింది. జాతీయ రుణాలు, అనగా రాజ్యం యొక్క అన్యధాకరణ – అది నియంతృత్వమైనా, రాజ్యాంగబద్ధమైనదైనా, రిపబ్లికన్ ఐనా, ఏ రాజ్యమైనా సరే – పెట్టుబడిదారీ యుగం మీద తమ ముద్ర వేసినాయి. జాతీయ సంపద అనే దానిలో ఆధునిక ప్రజానీకాల సమష్టి ఆస్తిలో చేరే ఏకైక భాగం ఏదంటే – వాళ్ళ జాతీయ రుణం.[1] కనుక, ఆవశ్య పర్యవసానంగా, ఏ జాతైనా ఎంత ఎక్కువగా రుణంలో వుంటే అంత సంపన్నం అవుతుంది అనే ఆధునిక సిద్ధాంతం ఏర్పడింది. ప్రభుత్వ రుణం పెట్టుబడి యొక్క మతం అవుతుంది. జాతీయ రుణం చేయడం పెరగడంతో, జాతీయ రుణంలో విశ్వాసం లేకపోవడం దైవ దూషణ స్థానాన్ని ఆక్రమించి, క్షమించరానిదవుతుంది.

ప్రభుత్వ రుణం ఆదిమ సంచయనం యొక్క అత్యంత శక్తివంతమైన కీళ్ళలో ఒకటి అవుతుంది. మంత్రశక్తితో లాగా, అది గొడ్డు డబ్బుకు పిల్లల కనే శక్తి నిచ్చి, దానిని పరిశ్రమలలోనో, వడ్డీ

1. ఇంగ్లండులో ప్రజా సంస్థల కన్నిటికీ ''రాయల్'' అనే పేరు పెట్టబడిందని విలియం కాబెట్ అంటాడు. కానీ దీనికి నష్ట పరిహారంగా ''జాతీయ'' రుణం వుంది.

వ్యాపారంలోనో వినియోగిస్తే తప్పనిసరిగా వుండే ఇబ్బందులకూ, ప్రమాదాలకూ గురి కావలసిన అవసరం లేకుండా దానిని పెట్టుబడిగా మారుస్తుంది. ప్రభుత్వ రుణదాతలు వాస్తవంగా ఇచ్చేదేమీ లేదు; ఎందుకంటే, రుణంగా ఇవ్వబడిన మొత్తం సులభంగా చేతులు మారగల ప్రభుత్వ బాండ్లుగా రూపాంతరం చెంది, వాళ్ళ చేతుల్లో అంత మొత్తం నగదు డబ్బు లాగే పనిచేస్తూనే వుంటుంది. కానీ ఇంకా, ఆ విధంగా సృష్టింపబడిన సోమరి వడ్డీ జీవులను కాక, ప్రభుత్వానికీ, జాతికీ మధ్య దళారులైన ఫైనాన్షర్ల అప్రయత్నపు ఐశ్వర్యాన్ని కాక – ప్రతి జాతీయ రుణంలోనూ సుమారైన భాగం ఆకాశం నుండి రాలిపడిన పెట్టుబడిగా ఎవరికి పనిచేస్తుందో ఆ పన్నుల కాంట్రాక్టర్లనూ, వర్తకులనూ, సొంత పారిశ్రామికులనూ కూడా కాక – జాతీయ రుణం జాయింట్ స్టాక్ కంపెనీలనూ, చేతులు మారగల అన్ని రకాల వస్తువులలో వ్యాపారాన్నీ, స్టాక్ ఎక్స్ఛేంజి వ్యాపారాన్నీ, ఒక్క మాటలో చెప్పాలంటే, స్టాక్ ఎక్స్ఛేంజి జూదాన్నీ, ఆధునిక బ్యాంక్ ప్రభు మండలినీ సృష్టించింది.

జాతీయ బిరుదులతో అలంకరింబడిన పెద్ద బ్యాంక్‌లు అవి పుట్టినప్పుడు, వ్యక్తిగత సట్టా వ్యాపారస్తుల సంఘాలు మాత్రమే, వాళ్ళు ప్రభుత్వాల పక్షాన నిలబడి, వాళ్ళు పొందిన అధిక హక్కుల మూలంగా, రాజ్యానికి డబ్బు అప్పుగా ఇచ్చే స్థితిలో వుండినారు. కనుక జాతీయ రుణ సంచయనానికి పొరపాటు లేని కొలమానం ఏమిటంటే, ఈ బ్యాంకుల ప్రభుత్వ బాండ్ల క్రమ క్రమ పెరుగుదల. 1694లో ఇంగ్లండు బ్యాంక్ స్థాపించబడినప్పటి నుండి ఈ బ్యాంక్‌ల పూర్తి అభివృద్ధి ప్రారంభమైంది. ఇంగ్లండు బ్యాంక్ తన డబ్బును 8%తో ప్రభుత్వానికి అప్పు ఇవ్వడంతో ప్రారంభించింది. అదే సమయంలో, బ్యాంక్ నోట్ల రూపంలో దానిని ప్రజలకు మళ్ళీ అప్పు ఇవ్వడం ద్వారా అదే పెట్టుబడి నుండి డబ్బును ముద్రించడానికి పార్లమెంట్ ఆ బ్యాంక్‌కు అధికారం ఇచ్చింది. బిల్లులు డిస్కౌంటు చేయడానికీ, సరుకుల మీద అడ్వాన్సులు యివ్వడానికీ, వెండి, బంగారులను కొనడానికీ ఈ నోట్లను వినియోగించుకోడానికి అది అనుమతించబడింది. చాలా కాలం గడవకముందే, ఇంగ్లండు బ్యాంకిచేతనే తయారు చేయబడిన ఈ ఖాతా డబ్బు ఆ బ్యాంక్ రాజ్యానికి ఇచ్చే రుణాలకూ, రాజ్యం తరఫున ప్రభుత్వ రుణాల మీద చెల్లించే వడ్డీకి నాణ్యం అయింది. బ్యాంక్ ఒక చేతితో ఇచ్చి మరొక చేతితో అంతకంటే ఎక్కువ పుచ్చుకోవడమే కాదు: పుచ్చుకుంటూ కూడా అది తాను ఇచ్చిన చివరి షిల్లింగు దాకా జాతికి శాశ్వత రుణదాతగా నిలిచింది. క్రమక్రమంగా అది అనివార్యంగా దేశం యొక్క వెండి, బంగారుల నిధికి నిధానమూ, వాణిజ్య ఖాతాల కన్నిటికీ ఆకర్షణ కేంద్రమూ అయింది. బ్యాంక్ ప్రభువులూ, ఫైనాన్షర్లూ, వడ్డీ జీవులూ, బ్రోకర్లూ, ప్రభుత్వ బాండ్ల వర్తకులూ, వగైరాల ఈ ముఠా హఠాత్తు విజృంభణ వల్ల సమకాలికుల మీద ఎలాంటి ప్రభావం కలిగించిందీ ఆనాటి రచనలలో, ఉదాహరణకు బోలింగ్ బ్రోక్ రచనలలో రుజువైంది.[1]

జాతీయ రుణంతో అంతర్జాతీయ రుణ వ్యవస్థ ఉత్పన్నమైంది; తరుచుగా ఇది ఏ జాతిలోనైనా జరిగిన ఆదిమ సంచయనపు మూలాలలో ఒక దానిని మరుగుపరుస్తుంది. ఆ విధంగా వెనిస్ చౌర్యపద్ధతిలోని ద్రోహాలు హాలండ్ యొక్క పెట్టుబడి సంపదకు ఒక రహస్య ఆధారంగా వుండినాయి;

1. "మన కాలంలో తాతార్లు యూరప్‌ను పట్టుకుంటే, ఫైనాన్షర్ అనే పదాన్ని వాళ్ళకు వివరించడం చాలా కష్టంగా వుంటుంది. (Montesquieu, "Esprit des lois" ["శాసనాల తత్వం"], Londres,1769, సంపుటి IV, పుట 33)

హాలండుకు వెనిస్ తన క్షీణదశలో పెద్ద మొత్తాల డబ్బు అప్పు యిచ్చింది. హాలండుకూ, ఇంగ్లండుకూ మధ్య అలాగే జరిగింది. 18వ శతాబ్ది ప్రారంభానికల్లా డచ్చి పారిశ్రామికులు ఎంతో వెనుకబడినారు. హాలండు వాణిజ్యంలోనూ, పరిశ్రమలలోనూ అగ్రజాతిగా ఉండడం ఆగిపోయింది. కనుక, 1701–1776 మధ్య దాని ప్రధాన వర్తక రంగాలలో ఒకటి ఏమిటంటే, అపారమైన పెట్టుబడి మొత్తాలు అప్పు ఇవ్వడం, ముఖ్యంగా తన గొప్ప ప్రత్యర్థి అయిన ఇంగ్లండుకు, ఈనాడు ఇంగ్లండుకూ, సంయుక్త రాష్ట్రాలకూ మధ్య ఇదే జరుగుతున్నది. జనన సర్టిఫికెట్ లేకుండా ఈనాడు సంయుక్త రాష్ట్రాలలో కనిపించే పెట్టుబడిలో పెద్ద భాగం నిన్న ఇంగ్లండులో పెట్టుబడిగా మారిన పిల్లల రక్తమే.

వడ్డీ వగైరాలకుగాను చేసే సాలుసరి చెల్లింపుల బాధ్యత గల ప్రభుత్వ ఆదాయం జాతీయ రుణానికి అండ కావడంతో, ఆధునిక పన్నుల వ్యవస్థ జాతీయ రుణాల వ్యవస్థకు ఆవశ్యకమైన పూరకం అయింది. రుణాల ద్వారా ప్రభుత్వం, పన్ను చెల్లింపుదారులకు వెంటనే ఆ బరువు కనపడకుండా, అసాధారణ ఖర్చులను ఎదుర్కోగలుగుతుంది; కానీ, వాటి పర్యవసానంగా ఎక్కువ పన్నులు తప్పని సరి అవుతాయి. మరొకవైపున, ఒకటి తర్వాత ఒకటి చేయబడిన రుణాల సంచయనం వలన కలిగిన పన్నుల పెరుగుదల మూలంగా, ప్రభుత్వం కొత్త అసాధారణ ఖర్చుల కొరకు కొత్త రుణాలు చేయకతప్పదు. ఈ విధంగా, అత్యవసర జీవనాధారాల మీద విధించే పన్నులు (తద్వారా వాటి ధరలను పెంచేటట్టివి) కీలకాంశంగా గల ఆధునిక బడ్జెట్ విధానంలోనే పన్నులు వాటంతటఅవి పెరిగేటట్లు చేసే మూల కారణం వుంది. అధిక పన్నులు ఒక ఘటన కాదు, అదొక సూత్రం. కనుక, ఈ పద్ధతి మొదట ప్రారంభించబడిన హాలండులో, గొప్ప దేశభక్తుడైన డి విట్ తన "ప్రవర్తన నియమాలు"లో వేతన శ్రామికునికి అణుకువా, పొదుపూ, శ్రమశీలతా, శ్రమ భారమూ కలిగించడానికి ఇది అత్యుత్తమ పద్ధతి అని దీనిని పొగడినాడు. కానీ, అది వేతన శ్రామికుని మీద కలిగించే విధ్వంసక ప్రభావం మనకిక్కడ అంత ముఖ్యం కాదు; మనకు ముఖ్యమైనది ఏమిటంటే, దాని ఫలితంగా ఏర్పడే రైతుల యొక్కా, చేతిపనివాళ్ళ యొక్కా, ఒక్క మాటలో చెప్పాలంటే, కింది మధ్యతరగతిలోని అందరి యొక్కా బలవంతపు ఆస్తిహరణం. బూర్జువా అర్థశాస్త్రజ్ఞులలో కూడా దీని మీద భిన్నాభిప్రాయాలు లేవు. దీని అఖండ భాగాలలో ఒకటైన రక్షణ సుంకాల పద్ధతి దీని ఆస్తిహరణపు సామర్థ్యాన్ని ఇంకా ఎక్కువ చేస్తుంది.

ప్రభుత్వ రుణమూ, దానికి అనురూపంగా వున్న బడ్జెట్ విధానమూ ఐశ్వర్యాన్ని పెట్టుబడిగా మార్చడంలోనూ, జనాల ఆస్తిహరణంలోనూ నిర్వహించిన పెద్ద పాత్రను బట్టి, కాబెట్, డబుల్‌డే, మొదలైన అనేక రచయితలు దీనిని ఆధునిక ప్రజానీకాల దారిద్ర్యానికి మౌలిక కారణమని తప్పుగా పరిగణించినారు.

రక్షణ సుంకాల పద్ధతి పారిశ్రామికులను ఉత్పత్తి చేయడానికీ, స్వతంత్ర శ్రామికులను ఆస్తిహరణం చేయడానికీ, జాతికి చెందిన ఉత్పత్తి సాధనాలనూ, జీవనాధారాలనూ పెట్టుబడిగా మార్చడానికీ, మధ్యయుగ ఉత్పత్తి విధానం నుండి, ఆధునిక ఉత్పత్తి విధానానికి మారే పరివర్తన కాలాన్ని బలవంతంగా తగ్గించడానికీ అసహజమైన మార్గంగా వుండింది. ఈ రక్షణ సుంకాల పద్ధతిని వినియోగించుకొనే హక్కును గురించి యూరపియన్ రాజ్యాలు ఒకదానితో ఒకటి పోట్లాడుకున్నాయి. అవి అదనపు

విలువను సృష్టించే పారిశ్రామికుల కొలువులో ప్రవేశించినపుడు, పరోక్షంగా రక్షణ సుంకాల ద్వారానూ, ప్రత్యక్షంగా ఎగుమతి బోనస్‌లద్వారానూ తమ సొంత ప్రజలను దోచుకోవడంతో తృప్తి పడలేదు. అవి తమ మీద ఆధారపడిన దేశాలలో అన్ని పరిశ్రమలనూ బలవంతంగా నిర్మూలించినాయి కూడా – ఉదాహరణకు, ఇంగ్లండు ఐరిష్ ఉన్ని పరిశ్రమను నిర్మూలించినట్లు. యూరపియన్ భూఖండంలో, కోల్బర్ట్ ఉదాహరణ ననుసరించి, ఈ క్రమం చాలా సంక్షేపించబడింది. ఇక్కడ, ఆదిమ పారిశ్రామిక పెట్టుబడి పాక్షికంగా ప్రభుత్వ ఖజానా నుండి నేరుగా వచ్చింది. మిరాబో ఇలా అంటాడు :

"యుద్ధానికి ముందు శాక్సనీయొక్క పారిశ్రామిక యశస్సుకు కారణం వెదకడానికి అంత దూరం పోవడమెందుకు? రాజులు 18,00,00,000 రుణాలు చేసినారని గమనిస్తే చాలు :"[1]

వలస వ్యవస్థా, ప్రభుత్వ రుణాలూ, భారమైన పన్నులూ రక్షణ సుంకాలూ, వాణిజ్య యుద్ధాలూ, మొదలైనవి అచ్చమైన కార్ఖానాల కాలం యొక్క ఈ సంతానం – ఆధునిక పరిశ్రమల శైశవ దశలో బ్రహ్మాండంగా పెరుగుతాయి. ఆధునిక పరిశ్రమల పుట్టుకకు ముందు అమాయకుల సామూహిక ఊచకోత జరుగుతోంది. రాయల్ నౌకాదళంలోకి లాగే, ఫ్యాక్టరీలలోకి మనుషులు ఏజంట్ల బలాత్కారం ద్వారా రిక్రూట్ చేసుకోబడినారు. 15వ శతాబ్ది చివరి మూడింటి భాగం నుండి తన కాలం దాకా వ్యవసాయ ప్రజానీకాన్ని భూమి నుండి తొలగించిన ఆస్తిహరణపు బీభత్సాలను సర్ యఫ్.యం. ఈడెన్ నిర్లిప్తంగా గమనిస్తాడు : పెట్టుబడిదారీ వ్యవసాయాన్నీ, "సాగుభూమికీ, పశువుల బీళ్ళకూ మధ్య ఉచితమైన నిష్పత్తినీ" నెలకొల్పడానికి "అత్యవసరమైన" ఈ క్రమాన్ని మహా ప్రశంసిస్తాడు: కానీ, అతను కార్ఖానా దోపిడీని ఫ్యాక్టరీ దోపిడీగా మార్చడానికీ, పెట్టుబడికీ, శ్రమశక్తికీ మధ్య "ఉచితమైన సంబంధాన్ని" నెలకొల్పడానికి పిల్లల అపహరణ యొక్కా, పిల్లల బానిసత్వం యొక్కా అవసరం విషయంలో అదే ఆర్థిక విజ్ఞతను ప్రదర్శించడు. అతను ఇలా అంటాడు :

"ఏ కార్ఖానా అయినా, తాను విజయవంతంగా నిర్వహించబడేటందుకు బీద పిల్లల కొరకు గుడిసెలనూ, బీదలకు తిండిపెట్టే సత్రాలనూ గాలించాలనీ, వాళ్లను రాత్రి కాలంలో అధికభాగం పాటు విశ్రాంతి లేకుండా వంతుల వారీగా పనిచేయించాలనీ; భిన్న వయస్సులకూ, భిన్న మనస్తత్వాలకూ చెందిన స్త్రీ పురుషులను అంతమందినీ అంటువ్యాధి లాంటి అనుకరణ నైతిక పతనానికీ, వ్యభిచారానికీ దారితీయక తప్పని పద్ధతిలో ఒకచోట చేర్చాలనీ ఆపేక్షించే ఏ కార్ఖానా అయినా, వ్యక్తి సంతోషాన్ని గానీ, జాతి సంతోషాన్ని గానీ పెంచుతుందా అనేది, బహుశా, ప్రజలు శ్రద్ధగా పరిశీలించవలసిన విషయం కావచ్చు"[2] ఫిల్డన్ ఇలా అంటాడు: "డెర్బీషైర్, నాటింగ్ హామ్ షైర్ కౌంటీలలోనూ, అంతకంటె ముఖ్యంగా లాంకషైర్ కౌంటీలలోనూ, నీటి చక్రాలను తిప్పగల వాగుల గట్టుల మీద నిర్మించబడిన పెద్ద ఫ్యాక్టరీలలో, కొత్తగా సృజింపబడిన యంత్రాలు ఉపయోగించబడినాయి. పట్టణాలకు దూరంగా వుండిన ఈ స్థలాలలో వేలకొలది పనివాళ్ళు అవసరమైనారు ముఖ్యంగా లాంకషైర్ అప్పటివరకు సాపేక్షంగా తక్కువ జనాభా గలిగి, నిస్సారంగా ఉండినందున, దాని కప్పుడు కావలసి వుండిందల్లా జనాభా ఒక్కటే. చిన్న పిల్లల, చిన్న చురుకైన వేళ్ళు అన్నిటికంటే చాలా ఎక్కువగా డిమాండులో ఉండినందున, లండన్, బర్మింగ్‌హామ్, మొదలైనచోట్ల ఉండిన సంపాయించే ఆచారం ఉత్పన్నమైంది.

1. Mirabeau, "De la Monarchie Prussienne," Londres, 1788, సంపుటం VI, పుట 101.
2. Eden పూర్వోక్త గ్రంథం, సంపుటి I, భాగం II, ప్రకరణం 1, పుట 421.

7 మొదలు 12, 14 ఏండ్ల దాకా వయసు గల ఈ చిన్న, దౌర్భాగ్య జీవులు వేలకు వేలమంది ఉత్తరాదికి పంపబడినారు. యజమాని వీళ్ళకు తిండీ, బట్టా ఇచ్చి ఫ్యాక్టరీ సమీపంలోని 'అప్రెంటిస్ గృహం'లో వుంచడం ఆచారం. వాళ్లపైన మేస్త్రీలు నియమించబడేవాళ్ళు : పిల్లలతో గరిష్టంగా పనిచేయించడం వాళ్ళ ప్రయోజనంగా వుండింది : ఎందుకంటే, పిల్లలతో రాబట్టగలిగిన పని ప్రమాణాన్ని బట్టి వుండేది వాళ్ళ జీతం. సహజంగానే, క్రౌర్యం దాని పర్యవసానమైంది. అనేక పారిశ్రామిక జిల్లాలలో, ముఖ్యంగా మా దుష్ట కౌంటీ (లాంకషైర్)లో, ఆ విధంగా కార్ఖానా యజమానుల బాధ్యతకు అప్పగించబడిన, ఏ పాపము ఎరగని, ఏ దిక్కూలేని ఆ జీవుల మీద మహా హృదయ విదారకమైన క్రౌర్యాలు సాగించబడినాయి. మితిమీరిన శ్రమచేత వాళ్ళు చచ్చేలా హింసింపబడినారు… కొరడాలకూ, సంకెళ్ళకూ గురైనారు, మహా నాజూకైన క్రౌర్య పద్ధతులచేత చిత్రహింసకు గురైనారు… అనేక సందర్భాలలో వాళ్ళు తిండి లేక శల్యావశిష్టులై, కొరడా దెబ్బలు తింటూ పనిచేసినారు…. కొన్ని సందర్భాలలో… విధి లేక ఆత్మహత్య కూడా చేసుకునే స్థితికి తరుమబడ్డారు. ప్రజల దృష్టికి దూరంగా వున్న అందమైన, కవితామయమైన డెర్బీషైర్, నాటింగ్ హామ్ షైర్, లాంకషైర్ లోయలు చిత్రహింసకూ, అనేక హత్యలకూ నియమైన కఠోర ఏకాంత ప్రదేశాలైనాయి. పారిశ్రామికుల లాభాలు అపారంగా వుండినాయి. కానీ ఇది వాళ్ల ఆకలిని తీర్చడానికి బదులు ఎగదోసింది. కనుక వాళ్ళు మితిలేని లాభాలు వచ్చేటట్లు కనిపించిన పద్ధతికి దిగినారు; వాళ్లు 'రాత్రి పని' అనే ఆచారం ప్రారంభించినారు. అనగా ఒక జట్టుతో పగలంతా పనిచేయించి, వాళ్ళు అలసిన తర్వాత, రాత్రంతా పనిచేయడానికి మరొక జట్టును సిద్ధంగా వుంచేవారు. రాత్రి జట్టు అప్పుడే వదలిపెట్టిన పడకల మీదికి పగటి జట్టు వెళ్ళేవారు; మళ్లీ వంతు ప్రకారం, ప్రొద్దున్నే పగటి జట్టు వదిలిపెట్టిన పడకల మీదికి రాత్రి జట్టు వెళ్ళేవాళ్ళు. పడకలు ఎప్పుడూ చల్లబడకపోవడం లాంకషైర్ మామూలు సంప్రదాయం"[1]

---

1. John Fielden, "The Course of the Factory System" ("ఫ్యాక్టరీ వ్యవస్థ అనే శాపం")London, 1836, పుటలు 5,6. అంతకు మునుపటి ఫ్యాక్టరీ వ్యవస్థ యొక్క అత్యాచారాలను గురించి చూ :Dr. Aikin, పూర్వోక్త గ్రంథం. పుట. 219,Gisbome, "Inquiry into the Duties of Men" ("మానవుల విధుల పరిశీలన"), 1795. సంపుటం II. ఆవిరి ఇంజన్లు ఫ్యాక్టరీలను పల్లెలలోని వాగులవద్ద నుండి తీసుకుపోయి, పట్టణాల మధ్యలో తిరగనాటినప్పుడు, "వైరాగ్యపు" అదనపు విలువ సృష్టికర్తకు, బీదలకు తిండిపెట్టే సత్రాల నుండి బానిసలను తెచ్చుకోవలసిన నిర్బంధం లేకుండా, పిల్లలు సిద్ధంగా అందుబాటులో వుండినారు. సర్ ఆర్. పీల్ ("తియ్యనిమాటల మంత్రి" తండ్రి) 1815లో, పిల్లల సంరక్షణార్థమైన తన బిల్లును ప్రవేశపెట్టినప్పుడు, బుల్లియన్ కమిటీలో ముఖ్యుడూ, రికార్డోకు ఆప్త మిత్రుడూ అయిన ఫ్రాన్సిస్ హోర్నర్ కామన్స్ సభలో ఇలా అన్నాడు : "ఒక దివాలా తీసినవాని ఆస్తితో పాటు ఈ పిల్లల బృందం అమ్మకానికి పెట్టడమూ, ఆస్తిలో భాగంగా బహిరంగంగా అడ్వర్టైజ్ చేయడమూ దుష్ప్రసిద్ధమే. రెండేండ్ల క్రితం మహా దారుణమైన ఘటన ఒకటి కింగ్స్ బెంచి కోర్టుకు కొని రాబడింది. ఆ ఘటన ఏమిటంటే, లండన్‌లోని ఒక పారిష్‌చేత ఒక పారిశ్రామికకునికి అప్రెంటిస్‌గా పంపబడిన కొందరు పిల్లలు మరొక పారిశ్రామికునికి బదలాయించబడినారు : తిండి లేక శుష్కించిపోయిన స్థితిలో వాళ్ళను కొందరు పరోపకారులు కనుక్కున్నారు. అతను (పార్లమెంటరీ) కమిటీలో వుండగా, అంతకంటె దారుణమైన ఘటన అతని దృష్టికి వచ్చింది ... అదేమిటంటే, కొద్ది ఏండ్ల క్రితం, ఒక లండన్ పారిష్‌కూ, ఒక లాంకషైర్ పారిశ్రామికునికీ మధ్య జరిగిన ఒప్పందంలోని ఒక షరతు ప్రకారం, ప్రతి 20 మంది మంచి కుర్రవాళ్లతో పాటు ఒక జడుని తీసుకోవాలి."

కార్ఖానాల కాలంలో పెట్టుబడిదారీ ఉత్పత్తి అభివృద్ధితో యూరప్‌లోని ప్రజాభిప్రాయం సిగ్గుకూ, అంతరాత్మకూ చెందిన చివరి అవశేషాలను కోల్పోయింది. పెట్టుబడిదారీ సంచయనానికి సాధనంగా ఉపకరించే ప్రతి అత్యాచారం గురించీ జాతులు సిగ్గుమాలి డంబాలు కొట్టినాయి. ఉదాహరణకు, యోగ్యుడైన ఎ. ఆండర్సన్ రచించిన అమాయకపు "వాణిజ్య చరిత్ర" చదవండి. ఆఫ్రికాకు, ఇంగ్లీషు పశ్చిమ ఇండీస్ దీవులకూ మధ్య అంతవరకూ సాగుతూవుండిన బానిస వర్తకాన్ని ఆఫ్రికాకు, స్పానిష్ అమెరికాకూ మధ్య కూడా సాగించే హక్కును అసియెంతో ఒప్పందం ద్వారా ఇంగ్లండు ఉట్రెఖ్ట్ శాంతి సంధిలో స్పానియర్డుల నుండి సంపాయించడం ఇంగ్లీషు, రాజనీతికి దిగ్విజయంగా యిక్కడ దాకా ఊదబడింది. తద్వారా ఇంగ్లండు స్పానిస్ అమెరికాకు 1743 దాకా ఏటా 4,800 నీగ్రో బానిసలను సరఫరా చేసే హక్కు పొందింది. అదే సమయంలో బ్రిటిష్ దొంగ వర్తకం (స్మగ్లింగ్) మీద అధికారికంగా ఇది ముసుగు కప్పింది. బానిస వర్తకంతో లివర్ పూల్ తెగ బలిసింది. ఇది దాని ఆదిమ సంచయనపు పద్ధతి. ఇక, ఈనాటికీ లివర్‌పూల్ "గౌరవనీయత" బానిస వర్తకపు "పిండార్"గా వుంది: ఈ బానిస వర్తకం – ఇంతకు ముందు ఉటంకించబడిన ఐకిన్ రచన (1795)ను పోల్చండి – "లివర్‌పూల్ వర్తకానికి విలక్షణమైన నిర్భయ సాహసిక తత్వంతో కలిసి దానిని వేగంగా ఈనాటి ఐశ్వర్య స్థితికి తీసుకువచ్చింది. నౌకా రవాణాకూ, నావికులకూ విస్తారమైన వినియోగం కలిగించింది. దేశ ఉత్పాదితాల కొరకు డిమాండ్‌ను చాలా పెంచింది" (పుట 339). బానిస వర్తకంలో లివర్‌పూల్ 1730లో 15 ఓడలను వినియోగించింది. 1751లో 53, 1760లో 74, 1770లో 96, 1792లో 132.

జవుళి పరిశ్రమ ఇంగ్లండులో బాల బానిసత్వాన్ని ప్రవేశపెట్టగా, అది సంయుక్త రాష్ట్రాలలో మునుపటి దాదాపు పితృస్వామికమైన బానిసత్వం వాణిజ్య దోపిడీ వ్యవస్థగా రూపాంతం చెందడానికి దోహదం చేసింది. వాస్తవంలో, యూరప్‌లోని వేతన కార్మికుల ప్రచ్ఛన్న బానిసత్వానికి, దాని వేదికగా, కొత్త ప్రపంచంలో అసలైన బానిసత్వం అవసరమైంది.[1]

పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానపు "నిత్య ప్రకృతి నియమాలను" వ్యక్తం చేయడానికీ, శ్రామికులకూ, శ్రమ సాధనాలకూ మధ్య ఎడబాటు క్రమాన్ని పూర్తి చేయడానికీ, ఒక ధృవం వద్ద సామాజిక ఉత్పత్తి సాధనాలనూ, జీవనాధారాలనూ పెట్టుబడిగానూ, ఎదురు ధృవం వద్ద ప్రజా బాహుళ్యాన్ని వేతన శ్రామికులుగా, ఆధునిక సమాజపు కృత్రిమ ఉత్పాదితమైన "స్వేచ్ఛాయుత శ్రామిక బీదలు"గా రూపాంత రీకరించడానికీ ఎంతో శ్రమ అవసరమైంది.[2]

---

1. 1790లో, ఇంగ్లీషు పశ్చిమ ఇండీస్ దీవులలో ఒక్కొక్క స్వతంత్ర వ్యక్తికి పది బానిసలు వంతున వుండినారు. ఫ్రెంచి పశ్చిమ ఇండీస్‌లో ఒకరికి పద్నాలుగురు, డచ్చి పశ్చిమ ఇండీస్‌లో ఒకరికి ఇరవై ముగ్గురు. (Henry Brougham, "An Inquiry into the Colonial Policy of the European Powers" [''యూరపియన్ రాజ్యాల వలస విధానం మీద దర్యాప్తు''] Edinburgh, 1803, సంపుటం II , పుట 74).
2. వేతన శ్రామికుల వర్గం గమనార్హంగా రూపొందినప్పటినుండి ''శ్రామిక బీదలు'' ("Labouring Poor") అనే నుడికారం ఇంగ్లీషు శాసనాలలో కనిపిస్తుంది. ఈ పదం ఒక వైపున ''నిర్వ్యాపారపు బీదల''కూ ("idle poor") బిచ్చగాళ్ళకూ, వగైరాలకు భిన్నంగానూ, మరొకవైపున ఇంకా ఈకలు పూడబెరకని పావురాల లాగా ఇంకా తమ సొంత ఉత్పత్తి సాధనాలు గలిగిన శ్రామికులకు భిన్నంగానూ ఉపయోగించబడింది.

ఒజ్యే అన్నట్లు "డబ్బు అనేది పుట్టుకతోనే ఒక చెంపమీద రక్తపు మరకతో జన్మిస్తే"[1] పెట్టుబడి అనేది నఖశిఖ పర్యంతం ప్రతిరోమ కూపం నుండి రక్తమూ, మురికీ కారుతూ జన్మిస్తుంది.[2]

---

ఇది శాసనాల నుండి అర్థశాస్త్రంలోకి పోయి, కల్పెపెర్, జె. చైల్డ్, వగైరాల నుండి ఆడమ్ స్మిత్, ఈడెన్‌లకు అందివ్వబడింది. దీని తర్వాత, "శ్రామిక బీదలు" అనే పదాన్ని "అసహ్యమైన రాజకీయ పడికట్టు పదం" అని ఎడ్మండ్ బర్క్ అన్నప్పుడు, ఆ "అసహ్యమైన రాజకీయ పడికట్టు పద ప్రియుని" నిజాయితీ ఎలాంటిదో ఎవరైనా గ్రహించవచ్చు. అమెరికన్ గలాటాల ప్రారంభంలో ఉత్తర అమెరికా వలసలతో లంచం తీసుకుని ఇంగ్లీషు ప్రభుమండలికీ వ్యతిరేకంగా లిబరల్ పాత్ర వహించినట్లే. ఇంగ్లీషు ప్రభు మండలితో లంచం తీసుకుని ఫ్రెంచి విప్లవానికి వ్యతిరేకంగా ఇంగ్లీషు ప్రభుమండలి యొక్క తాత్కాలిక భజనపరుని పాత్ర వహించిన ఈ స్తోత్ర పాఠకుడు ఆమూలాగ్రం వెకిలి బూర్జువా." వాణిజ్య నియమాలు ప్రకృతి నియమాలు, కనుక దైవ నియమాలు. (E. Burke, "Thoughts and Details of Scarcity" ("వస్తువుల కొరత మీద ఆలోచనలూ, వివరాలూ"). London 1800 పుటలు, 31, 32) దైవ, ప్రకృతి, నియమాలకు విధేయంగా అతను ఎప్పుడూ అత్యుత్తమ మార్కెట్‌లో అమ్ముడుబోవడంలో ఆశ్చర్యం లేదు. ఈ ఎడ్మండ్ బర్క్ ఉదారవాదిగా వుండిన కాలంలో, ఇతని గురించిన చాలా మంచి చిత్రణ టక్కర్ రచనలలో ఉంది. టక్కర్ మతగురువు, టోరీ, కాని ఇతరత్రా గౌరవనీయుడూ, సమర్థుడైన అర్థశాస్త్రజ్ఞుడూ, ఈనాడు రాజ్యం చేస్తున్న "వాణిజ్య నియమాలను" మహాభక్తితో విశ్వసించే అసహ్యమైన పిరికితనం ఎదుట బర్క్‌లను పదే పదే ఖండించడం మన విద్యుక్త ధర్మం: బర్క్‌లకూ, వాళ్ళ తదనంతరులకూ మధ్య గల భేదం ఒక్కటే - ప్రజ్ఞ అనేది.

1. Marie Augier, "Du Credit Public, పారిస్, 1842
2. "పెట్టుబడి కల్లోలం నుండీ, ఘర్షణ నుండీ పారిపోతుందనీ, పిరికిదనీ 'Quarterly Reviewer' అంది. ఈ మాట నిజమే. కానీ 'చాలా అసంపూర్ణ వర్ణన. ప్రకృతి నిర్వాతాన్ని సహించదని మునుపు అన్నట్లు, పెట్టుబడి ఏ లాభాన్నీ వద్దనదు లేదా చాలా స్వల్ప లాభాన్ని మాత్రమే వద్దంటుంది. తగినంత లాభం వుంటే పెట్టుబడి చాలా ధైర్యం గలది. నిశ్చయమైన 10 శాతం లాభం వుంటే, అది ఎక్కడైనా వ్యాపారం చేస్తుంది: నిశ్చయమైన 20 శాతం దానికి ఉబలాటాన్ని కలిగిస్తుంది. 50 శాతం సాహసాన్ని కలిగిస్తుంది. 100 శాతంవుంటే అది మానవ నియమాల నన్నిటినీ కాలరాయడానికి సిద్ధపడుతుంది : 300 శాతం వుంటే, అది ఏ నేరం చేయడానికీ సంకోచించదు, ఏ ప్రమాదావకాశానికీ వెనుదీయదు, దాని సొంతదా రునికి ఉరిశిక్షపడే అవకాశానికి కూడా. కల్లోలమూ, ఘర్షణా లాభం తెచ్చేటట్లైతే,అది నిరభ్యంతరంగా రెంటినీ ప్రోత్సహిస్తుంది. ఇక్కడ చెప్పినదాని నంతటినీ దొంగ వర్తకమూ, బానిస వర్తకమూ సమృద్ధిగా రుజువు చేసినాయి. (T.J. Dunning "Trades' Unions and Strikes" ["ట్రేడ్ యూనియన్లూ సమ్మెలూ"] 1860, పుటలు 35-36)

## అధ్యాయం - 32

# పెట్టుబడిదారీ సంచయనం యొక్క చారిత్రక ధోరణి

పెట్టుబడి యొక్క ఆదిమ సంచయనాన్ని అనగా దాని చారిత్రక పుట్టుకను పరిశీలిస్తే, అది ఏమిగా తేలుతుంది? అది వేతన శ్రామికులుగా బానిసల, ఫ్యూడల్ దాసుల తక్షణ రూపాంతరీకరణ కానంత మేరకు, కనుక కేవలం రూపం మార్పు మాత్రమే కానంత మేరకు, దాని అర్థం ప్రత్యక్ష ఉత్పత్తిదారుల ఆస్తిహరణం మాత్రమే, అనగా సొంతదారుని శ్రమ మీద ఆధారపడిన సొంత ఆస్తి విచ్ఛిత్తి మాత్రమే.

సామాజిక, సమష్టి ఆస్తికి విరుద్ధమైన సొంత ఆస్తి ఎక్కడ వుంటుందంటే, శ్రమ సాధనాలూ, శ్రమకు అవసరమైన బాహ్య పరిస్థితులూ ప్రైవేటు వ్యక్తులకు చెందినచోట మాత్రమే. కానీ, ఈ ప్రైవేటు వ్యక్తులు శ్రామికులా, శ్రామికులు కాదా అనే దాన్ని బట్టి, సొంత ఆస్తికి భిన్న స్వభావాలు వుంటాయి. మొదటి చూపుకు అది ప్రదర్శించే అసంఖ్యాకమైన ఛాయలు ఈ రెండు కొసలమధ్య వున్న మధ్యంతర దశలకు అనురూపమైనవి.

శ్రామికునికి తన ఉత్పత్తి సాధనాలమీద గల సొంత ఆస్తి సన్నకారు ఉత్పత్తికి పునాది, అది వ్యావసాయిక పరిశ్రమ అయినా, కార్ఖానా ఉత్పత్తి అయినా, రెండూ కలిసినదైనా, మళ్ళీ సన్నకారు ఉత్పత్తి సామాజిక ఉత్పత్తి అభివృద్ధికీ, శ్రామికుని స్వేచ్ఛాయుత వ్యక్తిత్వపు అభివృద్ధికీ అత్యవసరమైన పరిస్థితి. ఈ సన్నకారు ఉత్పత్తి విధానం బానిసత్వంలోనూ, ఫ్యూడల్ దాస్యంలోనూ, ఇతర పరాధీనతా స్థితులలోనూ కూడా వుండే మాట నిజమే. కానీ, అది ఎక్కడ వర్థిల్లుతుందంటే, ఎక్కడ తన యావచ్ఛక్తినీ విడుదల చేస్తుందంటే, ఎక్కడ తగినంతగా తన లాక్షణిక రూపం ధరిస్తుందంటే, శ్రామికుడు తానే నడిపించే తన సొంత ఉత్పత్తి సాధనాలకు సొంతదారుడుగా వున్నచోట మాత్రమే: తాను సాగుచేసే భూమికి సొంతదారుడైన రైతూ, నిపుణుడుగా తాను ఉపయోగించే పనిముట్టుకు సొంతదారుడైన చేతిపని వాడూ వున్నచోట మాత్రమే.

ఈ ఉత్పత్తి విధానం ఉండాలంటే, భూమి పంపకం కావడమూ, ఇతర ఉత్పత్తి సాధనాలు చెల్లా చెదురు కావడమూ జరిగి వుండాలి. యిది ఈ ఉత్పత్తి సాధనాల కేంద్రీకరణను పరిహరిస్తుంది గనుక, అదే విధంగా ఇది సహకారాన్నీ, ప్రతి విడివిడి ఉత్పత్తిక్రమం లోపలా శ్రమ విభజననూ, సమాజం ప్రకృతి శక్తులను అదుపులో పెట్టుకోవడాన్నీ, వాటిని ఉత్పత్తికి వినియోగించడాన్నీ, సామాజిక ఉత్పాదిక శక్తుల స్వేచ్ఛాయుత అభివృద్ధినీ పరిహరిస్తుంది. సంకుచితమైన, దాదాపు ఆదిమమైన హద్దులలో వుండే ఉత్పత్తి వ్యవస్థకూ, సమాజానికీ మాత్రమే ఇది అనుగుణంగా వుంటుంది. దీనిని శాశ్వతపరచడమంటే పెక్కేర్ సరిగా అన్నట్లు. "సార్వత్రిక అల్పయోగ్యత ఉండాలని శాసించడమే". దీని అభివృద్ధిలోని ఒకానొక దశలో ఇది తన విచ్ఛిత్తినే కలిగించే పాదార్థిక కర్తలను ఉత్పన్నం

చేస్తుంది. ఆ తరుణం నుండి సమాజ గర్భంలో కొత్త శక్తులూ, కొత్త ఉద్రేకాలూ ఉద్భవిస్తాయి. కానీ పాత సామాజిక వ్యవస్థ వాటిని బంధించి, అణచిపెట్టుతుంది. అది నిర్మూలించబడాలి; అది నిర్మూలించ బడుతుంది. దాని నిర్మూలన, వ్యష్టిగా, చెల్లాచెదురుగా వున్న ఉత్పత్తి సాధనాలను సామాజికంగా కేంద్రీకృతమైనవిగా రూపాంతరీకరించడం, అనేకుల అల్పమైన ఆస్తిని కొద్దిమంది బ్రహ్మాండమైన ఆస్తిగా రూపాంతరీకరించడం, అపారమైన ప్రజా బాహుళ్యాన్ని భూమి నుండీ, జీవనాధారాల నుండీ, శ్రమ సాధనాల నుండీ తొలగించే ఆస్తిహరణం, ప్రజా బాహుళ్యపు ఈ భయంకర బాధాకర ఆస్తిహరణం పెట్టుబడి చరిత్రకు నాంది అవుతుంది. దీనిలో బలాత్కారపు పద్ధతుల పరంపర వుంది; వీటిలో పెట్టుబడి యొక్క ఆదిమ సంచయనపు పద్ధతులుగా యుగకర్తలైన వాటిని మాత్రమే మనం పరిశీలించినాం. ప్రత్యక్ష ఉత్పత్తిదారుల ఆస్తిహరణం నిర్ణయాత్మకమైన కిరాతకత్వంతోనూ, మహా అసహ్యమైన, మహానీచమైన, మహా క్షుద్రమైన, మహా ఏహ్యమైన కోర్కెల ప్రేరణతోనూ నిర్వహించ బడింది. ఒంటరి, స్వతంత్ర శ్రమ జీవి యొక్కా, అతని శ్రమ సాధనాల యొక్కా సంలీనం అనదగిన దానిమీద ఆధారపడిన స్వీయార్జిత సొంత ఆస్తి ఇతరుల నామకార్థంగా స్వేచ్ఛాయుతమైన శ్రమను దోపిడీ చేయడం మీద, అనగా వేతనశ్రమ మీద, ఆధారపడి పెట్టుబడిదారీ సొంత ఆస్తి చేత తొలగించబడింది.[1]

ఈ రూపాంతరీకరణ క్రమం పాత సమాజాన్ని పైనుండి కిందిదాకా తగినంతగా విచ్ఛిత్తి చేసిన వెంటనే, శ్రామికులు నిరాస్తిపరులుగానూ, వాళ్ళ శ్రమసాధనాలు పెట్టుబడిగానూ మార్చబడిన వెంటనే, పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం తన సొంత కాళ్లమీద నిలబడిన వెంటనే, అప్పుడు శ్రమ యొక్క ఇతోధిక సామాజికీకరణా, సామాజికంగా వినియోగింపబడే ఉత్పత్తి సాధనాలుగానూ, అందువలన సమష్టి ఉత్పత్తి సాధనాలుగానూ భూమి యొక్కా, యితర ఉత్పత్తి సాధనాల యొక్కా ఇతోధిక రూపాంతరీకరణా, సొంత ఆస్తిపరుల ఇతోధిక ఆస్తిహరణా కొత్త రూపం ధరిస్తాయి. ఇప్పుడు ఆస్తి హరణకు గురి కావలసింది తన సొంతానికి పనిచేసే శ్రామికుడు ఇక ఎంత మాత్రమూ కాదు, మరి ఎవరంటే, అనేక శ్రామికులను దోపిడీచేసే పెట్టుబడిదారుడు.

పెట్టుబడిదారీ ఉత్పత్తిలోనే అంతర్నిహితంగా వున్న నియమాలచేత, పెట్టుబడి కేంద్రీకరణ చేత, ఈ ఆస్తిహరణ నిర్వహించబడుతుంది. ఒక పెట్టుబడిదారుడు అనేక పెట్టుబడిదారులను అంతం చేస్తాడు. ఈ సాంద్రీకరణ చేత, లేదా కొద్ది మంది పెట్టుబడిదార్ల చేత జరిగే ఈ అనేక పెట్టుబడిదార్ల ఆస్తిహరణతో కలిసి శ్రమ క్రమం యొక్క సహకార రూపమూ, శాస్త్ర విజ్ఞానాన్ని బుద్ధి పూర్వకంగా సాంకేతికంగా వినియోగించడమూ, భూమిని పద్ధతిగా సాగు చేయడమూ, శ్రమ పరికరాలను సమష్టిగా మాత్రమే ఉపయోగించదగిన శ్రమ పరికరాలుగా రూపాంతరీకరించడమూ, సంయుక్త, సామాజికీకృత శ్రమ యొక్క ఉత్పత్తి సాధనాలుగా ఉపయోగించడం ద్వారా సకల ఉత్పత్తి సాధనాలనూ పొదుపు చేయడమూ, సకల జాతులూ ప్రపంచ మార్కెట్ అనే వలలో ఇరుక్కోవడమూ, దీనితో పెట్టుబడిదారీ వ్యవస్థ యొక్క అంతర్జాతీయ స్వభావమూ అంతకంతకూ విస్తరించే ప్రమాణంలో అభివృద్ధి చెందుతాయి.

1. మనం సంపూర్ణంగా కొత్తదైన సామాజిక వ్యవస్థలో ప్రవేశించినాము - అన్ని రూపాల ఆస్తినీ అన్ని రూపాల శ్రమ నుంచీ వేరుచేయాలని చూస్తున్నాం. (Sismondi, "Nouveaux Principles de I" Economie Politique" ("నూతన అర్థశాస్త్ర సూత్రాలు") సంపుటం 1828,పుట 434)

ఈ రూపాంతరీకరణ క్రమం యొక్క సకల సౌకర్యాలనూ దురాక్రమించి, గుత్తగొనే పెట్టుబడి ప్రభువుల నిత్యం క్షీణించే సంఖ్యతో పాటు దారిద్ర్యం, పీడన, బానిసత్వం, పతనం, దోపిడీల పరిమాణం పెరుగుతుంది. కాని దీనితోపాటు కార్మికవర్గం యొక్క నిరసన కూడా పెరుగుతుంది. ఈ వర్గం నిత్యం సంఖ్యలో పెరుగుతూ, పెట్టుబడిదారీ ఉత్పత్తి క్రమం యొక్క సంవిధానం చేతనే క్రమశిక్షితమై, సమైక్యమై, వ్యవస్థీకృతమైన వర్గమౌతుంది. ఉత్పత్తి విధానంతో పాటు, ఉత్పత్తి విధానంలో పుట్టి, వర్ధిల్లిన పెట్టుబడి గుత్తాధిపత్యం ఆ ఉత్పత్తి విధానానికి శృంఖలం అవుతుంది. ఉత్పత్తి సాధనాల కేంద్రీకరణా, శ్రమ సామాజికీకరణా చివరకు ఏ దశకు చేరుకుంటాయంటే, అక్కడ వాటికీ, వాటి పెట్టుబడిదారీ పై పెంకుకూ పొత్తు కుదరదు. దానితో ఈ పై పెంకు బ్రద్దలౌతుంది. పెట్టుబడిదారీ సొంత ఆస్తికి ఆయువు మూడుతుంది. ఆస్తిహర్తల ఆస్తి హరింపబడుతుంది.

సొంతపరచుకొనే పెట్టుబడిదారీ పద్ధతి, పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానపు ఫలితమైనట్టిది, పెట్టుబడిదారీ సొంత ఆస్తిని ఉత్పత్తిచేస్తుంది. సొంతదారుని శ్రమ మీద ఆధారపడిన వ్యక్తిగత ఆస్తికి ఇది మొదటి నాస్తికరణ. కాని, పెట్టుబడిదారీ ఉత్పత్తి, ప్రకృతి నియమపు దుర్వార్తతో, తన నాస్తికరణనే ఉత్పత్తి చేస్తుంది. అది నాస్తికరణ యొక్క నాస్తికరణ. అది ఉత్పత్తిదారునికి సొంత ఆస్తిని పునఃస్థాపించదు, కానీ అతనికి పెట్టుబడిదారీ యుగపు ఆర్జితాల మీద – అనగా, సహకారం మీదా, భూమి యొక్కా ఉత్పత్తి సాధనాల యొక్కా సమష్టిస్వామ్యం మీదా – ఆధారపడిన వ్యక్తిగత ఆస్తిని సృష్టిస్తుంది.

వ్యష్టి శ్రమ నుండి ఉత్పన్నమయ్యే చెల్లా చెదురు సొంత ఆస్తి పెట్టుబడిదారీ సొంత ఆస్తిగా రూపాంతరం చెందడం, సహజంగానే, సామాజికీకృత ఉత్పత్తి మీద అప్పటికే ఆచరణలో ఆధార పడుతున్న పెట్టుబడిదారీ సొంత ఆస్తి సామాజికీకృత ఆస్తిగా రూపాంతరం చెందడం కంటె పోలికే లేనంత దీర్ఘమైన, హింసాపూరితమైన కష్టమైన క్రమం. మొదటి దానిలో కొద్దిమంది ఆస్తిహర్తల చేత ప్రజాబాహుళ్యపు ఆస్తిహరణ వుండింది; రెండవ దానిలో ప్రజా బాహుళ్యంచేత కొద్దిమంది ఆస్తిహర్తల ఆస్తిహరణ వుంటుంది.[1]

1. "బూర్జువా వర్గపు అనుద్దిష్ట కార్యంగా పరిశ్రమల పురోగమనం సాగుతుంది; పరిశ్రమల పురోగమనం మూలంగా కార్మికులలో పరస్పర పోటీవల్ల ఏర్పడే అనైక్యతపోయి, పరస్పర సాహచర్య ఫలితమైన విప్లవకర సమ్మేళనం వస్తుంది. అనగా, ఏ పునాదుల మీద బూర్జువావర్గం వస్తుసంపదను ఉత్పత్తి చేసి సొంతపరచుకుంటున్నదో ఆ పునాదులనే ఆధునిక పరిశ్రమాభివృద్ధి కూల్చివేస్తుంది. కాబట్టి బూర్జువా వర్గం ఉత్పత్తిచేసే వాటిలోకెల్ల ముఖ్యమైనదేదంటే బూర్జువా వర్గానికే గోరీకట్టేవాళ్లు. బూర్జువా వర్గ పతనమూ అనివార్యమే, కార్మికవర్గ విజయమూ అనివార్యమే... ఈనాడు బూర్జువా వర్గానికి ముఖాముఖిగా నిలబడిన వర్గాలన్నిటిలోకీ కార్మికవర్గం ఒకటే నిజమైన విప్లవవర్గం. తక్కిన వర్గాలు ఆధునిక పరిశ్రమల ప్రభావం వల్ల క్షీణించి క్షీణించి చివరకు అదృశ్యమౌతాయి. కార్మికవర్గం ఆధునిక పరిశ్రమల ప్రత్యేక సృష్టి. ఆధునిక పరిశ్రమల అతిముఖ్య సృష్టి. మధ్యతరగతిలో కింది శ్రేణి వాళ్ళు - చిన్న చిన్న పరిశ్రమల యజమానులూ, దుకాణదారులూ, చేతిపనుల వాళ్ళూ రైతులూ - వీళ్ళందరూ బూర్జువా వర్గంతో పోరాడు తారు; కాని వీళ్ళ పోరాటం మధ్యతరగతిలో భాగాలుగానే తాము బతుకుతూ వుండడానికి, అనగా వీళ్ళు విప్లవకారులు కాదు, యథాస్థితి వాదులు. అంతేకాదు, ప్రగతి వ్యతిరేకులు కూడా. ఎందుకంటే వీళ్ళు చరిత్రగతిని వెనక్కు తిప్పడానికి ప్రయత్నిస్తారు. (K. Marx and F. Engles. "Manifest der Kommunistischen Partei," London, 1848 పుటలు 9, 11 "కమ్యూనిస్టు పార్టీ ప్రణాళిక," "ప్రగతి" ప్రచురణాలయ, మాస్కో, పుటలు 47, 49-50)

## అధ్యాయం - 33

# ఆధునిక వలసకరణ సిద్ధాంతం**

**అ**ర్థశాస్త్రం పరస్పర భిన్నమైన రెండు రకాల సొంత ఆస్తిని సూత్రదృష్ట్యా గందరగోళపరుస్తుంది. ఒకటి ఉత్పాదకుల సొంత శ్రమ మీద ఆధారపడేది, మరోటి ఇతరుల శ్రమను వినియోగించుకోవడం మీద ఆధారపడేది. రెండవది మొదటిదానికి నేరుగా విరుద్ధమైనది మాత్రమే కాక, మొదటిదాని గోరీ మీద మాత్రమే నిర్నిబంధంగా పెరుగుతుందని అర్థశాస్త్రం మరిచిపోతుంది.

అర్థశాస్త్రపు జన్మస్థలమైన పశ్చిమ యూరప్‌లో ఆదిమ సంచయనపు క్రమం దాదాపు పూర్తి చేయబడింది. ఇక్కడ పెట్టుబడిదారీ వ్యవస్థ మొత్తం జాతీయ ఉత్పత్తి రంగాన్ని సూటిగా జయించుకోనైనా జయించుకొంది, లేదా, కనీసం, ఆర్థిక పరిస్థితులు తక్కువగా అభివృద్ధి చెందిన చోట, సమాజపు ఏ పొరలు కాలంతీరిన ఉత్పత్తి విధానానికి చెందినప్పటికీ క్రమం క్రమంగా క్షీణిస్తూ తన పక్కన జీవించడం కొనసాగిస్తాయో ఆ పొరలను పరోక్షంగా అజమాయిషీ చేయనైనా చేస్తుంది. పెట్టుబడిదారీ పూర్వ ప్రపంచం నుండి సంక్రమించిన న్యాయశాస్త్ర భావాలనూ, ఆస్తి హక్కు భావాలనూ అర్థశాస్త్రజ్ఞుడు తయారుగా చేసిపెట్టిన ఈ పెట్టుబడి ప్రపంచానికి అన్వయిస్తాడు – వాస్తవాలు తన భావాలను ఎంత బిగ్గరగా ఖండిస్తే అంత తహతహతో కూడిన ఉబలాటంతో, అంత కంఠ గాంభీర్యంతో అతను అన్వయిస్తాడు.

వలసలలో మరొక విధంగా వుంది. అక్కడ ప్రతిచోటా పెట్టుబడిదారీ వ్యవస్థ ఉత్పాదకుని ప్రతిఘటనతో ఘర్షిస్తుంది : అతను తన సొంత శ్రమ సాధనాల సొంతదారుడుగా శ్రమను పెట్టుబడి దారుని ధనవంతుని చేయడానికి బదులు తానే ధనవంతుడు కావడానికి వినియోగిస్తాడు. సూటిగా పరస్పర వ్యతిరేకమైన ఈ రెండు ఆర్థిక వ్యవస్థల వైరుధ్యం ఆచరణలో ఈ రెండింటి మధ్య పోరాటం రూపంలో ఇక్కడ వ్యక్తమౌతుంది. పెట్టుబడిదారునికి మాతృదేశపు శక్తి అండగా వున్నచోట, అతను ఉత్పాదకుని స్వతంత్ర శ్రమమీద ఆధారపడిన ఉత్పత్తి విధానాన్నీ, ఆస్తి సంపాదనా విధానాన్నీ బలప్రయోగంతో తన మార్గం నుండి తొలగించడానికి ప్రయత్నిస్తాడు. పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానమూ, తద్వ్యతిరేకమైనదీ సైద్ధాంతికంగా ఒకటేనని ఉద్ఘాటించేటట్లు పెట్టుబడి భజనపరుడైన అర్థశాస్త్రజ్ఞున్ని మాతృదేశంలో ఏ ప్రయోజనం నిర్బంధిస్తుందో, అదే ప్రయోజనం వలసలలో అతన్ని తన తప్పు ఒప్పుకొనేటట్లూ, ఆ రెండు ఉత్పత్తి విధానాల మధ్య గల వైరుధ్యాన్ని బిగ్గరగా ఉద్ఘాటించేటట్లూ నిర్బంధిస్తుంది. ఈ లక్ష్యంతో అతను శ్రామికుల ఆస్తిహరణమూ, తదనురూపంగా వాళ్ళ ఉత్పత్తి

** ఇక్కడ మేము స్వేచ్ఛాయుత విదేశీయ ఆగంతుకులు స్థిరపడిన నిజమైన వలసలను గురించి, పాండవ బీళ్ళను గురించి చెప్తాము. సంయుక్త రాష్ట్రాలు ఆర్థికంగా ఇంకా యూరప్ యొక్క వలస మాత్రమే. అంతేకాక, ఎక్కడైతే బానిసత్వపు రద్దు మునుపటి పరిస్థితులను సంపూర్ణంగా మార్చిందో ఆ పాత ప్లాంటేషన్లు కూడా ఈ ధాతువుకు చెందుతాయి.

సాధనాలు పెట్టుబడిగా రూపాంతరం చెందడమూ లేకుండా శ్రమయొక్క సామాజిక ఉత్పాదక శక్తి అభివృద్ధీ, సహకారమూ, శ్రమ విభజనా, భారీ ఎత్తున యంత్రాల వినియోగమూ, వగైరాలు ఎలా అసాధ్యమయ్యేదీ రుజువు చేస్తాడు. జాతీయ సంపద అనబడేదాని ప్రయోజనం కొరకు అతను ప్రజల దారిద్ర్యాన్ని కట్టుదిట్టం చేసే కృత్రిమ పద్ధతుల కోసం అన్వేషిస్తాడు. ఇక్కడ అతని క్షమాపణ ధోరణి తుప్పు మాదిరిగా కొంచెం కొంచెమే రాలిపోతుంది.

ఇ.జి. వేక్‌ఫీల్డ్ యొక్క గొప్ప సుగుణం ఏమిటంటే, అతను వలసల గురించి కొత్తదేమీ ఆవిష్కరించలేదు గానీ,[1] మాతృదేశంలోని పెట్టుబడిదారీ ఉత్పత్తి పరిస్థితుల గురించిన సత్యాన్ని వలసలలో ఆవిష్కరించినాడు. తన జన్మస్థలంలోని రక్షణ పరిస్థితుల వ్యవస్థ[2] మాతృదేశంలో కృత్రిమంగా పెట్టుబడిదార్లను తయారుచేయడానికి ప్రయత్నించగా, వేక్ ఫీల్డ్ యొక్క వలసకరణ సిద్ధాంతం, దేనిని పార్లమెంటు చట్టాల ద్వారా అమలు పరచడానికి కొంత కాలంపాటు ఇంగ్లండు ప్రయత్నించిందో అది, వలసలలో వేతన శ్రామికులను తయారు చేయడానికి ప్రయత్నించింది. దీనిని అతను "systematic colonization" ("క్రమపద్ధతి వలసకరణ") అంటాడు.

మొట్టమొదట, వలసలలో డబ్బూ, జీవనాధారాలూ, యంత్రాలూ, తదితర ఉత్పత్తి సాధనాలలో ఆస్తి వున్నంత మాత్రాన, దాని అనుబంధి అయిన వేతన శ్రామికుడు, అనగా స్వబుద్ధితో తన్ను తాను అమ్ముకోక తప్పని అవతలి మనిషి లేకపోతే, ఒక మనిషి ఇంకా పెట్టుబడిదారుడు కాదు, అని వేక్‌ఫీల్డ్ కనుగొన్నాడు. పెట్టుబడి అనేది ఒక వస్తువు కాదనీ, వస్తువుల ద్వారా మనుషుల మధ్య నెలకొల్పబడిన సామాజిక సంబంధం అనీ అతను కనుగొన్నాడు.[3] ఇంగ్లండు నుండి పశ్చిమ ఆస్ట్రేలియాలోని స్వాన్ రివర్‌కు పీల్ 50,000 పౌండ్ల విలువచేసే జీవనాధారాలనూ ఉత్పత్తి సాధనాలనూ తనవెంట తీసుకుపోయినాడనీ వేక్‌ఫీల్డ్ దుఃఖిస్తాడు. అంతేకాక పీల్ దూరదృష్టితో కార్మికవర్గానికి చెందిన స్త్రీలనూ, పురుషులనూ, పిల్లలనూ 3,000 మందిని తనవెంట తీసుకుపోయినాడు. గమ్యం చేరినప్పుడు "పీల్‌కు పడక వేయడానికి గానీ, ఏటి నుండి నీళ్ళు తేవడానికి గానీ ఒక సేవకుడు లేడు".[4] దురదృష్టపు పీల్ స్వాన్ రివర్‌కు ఇంగ్లీషు ఉత్పత్తి విధానాల ఎగుమతి తప్ప అన్ని ఏర్పాట్లు చేసుకున్నాడు!

---

1. ఆధునిక వలసకరణ గురించి వేక్‌ఫీల్డ్ తెలుసుకొన్న కొద్ది విషయాలు గతంలో మిరాబో (తండ్రి), సహజ ప్రభుత్వవాదులూ, అంతకంటె కూడా ముందు ఇంగ్లీషు అర్థశాస్త్రజ్ఞులూ చెప్పినవే.
2. తదనంతరం అది అంతర్జాతీయ పోటీ పోరాటంలో తాత్కాలిక అవసరం అయింది. కానీ దాని ఉద్దేశం ఏవైనా, ఫలితాలు అవే.
3. "నీగ్రో అంటే నీగ్రో, నిర్దిష్టసంబంధాలలో మాత్రమే అతను బానిస అవుతాడు. నూలు వడికే జెన్నీ అంటే నూలు వడికే యంత్రం. నిర్దిష్ట సంబంధాలలో మాత్రమే అది పెట్టుబడి అవుతుంది. ఈ సంబంధాల నుండి విడదీసినప్పుడు అది పెట్టుబడి కాదు - బంగారం దానిపాటికది ఎలా డబ్బు కాదో, చక్కెర ఎలా చక్కెర ధర కాదో అలాగే ... పెట్టుబడి కూడా ఉత్పత్తి యొక్క ఒక సామాజిక సంబంధం. అది ఉత్పత్తి యొక్క ఒక చారిత్రక సంబంధం. (Karl Marx, "Lohnarbeit und Kapital", "Neue Rheinische Zeitung" సంచిక 226, ఏప్రిల్ 7, 1849. "వేతన శ్రమా, పెట్టుబడీ" "ప్రగతి" ప్రచురణాలయం, మాస్కో, 1979, పుట 26).
4. E.G. Wakefield, "England and America" ("ఇంగ్లండూ, అమెరికా") London, 1833 సంపుటంII, పుట 33.

వేక్‌ఫీల్డ్ యొక్క ఈ క్రింది ఆవిష్కరణలు అర్థం చేసుకోడానికి, రెండు విషయాలు ముందు చెపుతాను: ఉత్పత్తి సాధనాలూ, జీవనాధారాలూ సూటి ఉత్పాదకుని ఆస్తిగా ఉన్నంత కాలం పెట్టుబడి కావని మనకు తెలుసు. అవి ఎప్పుడు పెట్టుబడి అవుతాయంటే, ఏక సమయంలో శ్రామికుని దోపిడీ చేయడానికీ, అణచివుంచడానికీ సాధనాలుగా ఉపకరించే పరిస్థితులలో మాత్రమే. కానీ అర్థశాస్త్రజ్ఞుని బుర్రలో, వాటి ఈ పెట్టుబడిదారీ ఆత్మ నాటి భౌతిక దేహంతో ఎంత సన్నిహితంగా ముడిపడి వుందంటే, అతను అన్ని పరిస్థితులలోనూ అవి సూటిగా తద్వ్యతి రేకమైనప్పుడు కూడా వాటిని పెట్టుబడి అనే పేరు పెడతాడు. వేక్‌ఫీల్డూ అలాగే చేస్తాడు. ఇంకా : ఉత్పత్తి సాధనాలు తమ సొంతానికి పనిచేసే అనేక స్వతంత్ర కార్మికులమధ్య వ్యష్టి ఆస్తిగా చీలిపోవడాన్ని అతను పెట్టుబడి యొక్క సమాన విభజన అంటాడు. ఫ్యూడల్ న్యాయ శాస్త్రజ్ఞుడెంతో అర్థశాస్త్రజ్ఞుడంతే. ఫ్యూడల్ న్యాయశాస్త్రజ్ఞుడు ఫ్యూడల్ న్యాయశాస్త్రం సరఫరా చేసిన పేర్లను శుద్ధ డబ్బు సంబంధాలకు అతికించినాడు.

వేక్‌ఫీల్డ్ ఇలా అంటాడు :

"సమాజ సభ్యులందరికీ పెట్టుబడిలో భాగాలున్నాయని అనుకుంటే... తన సొంత చేతులతో ఉపయోగించగలదానికంటే ఎక్కువ పెట్టుబడిని పోగుచేసుకోవాలనే (సంచయనం చేసుకోవాలనే) ఉద్దేశం ఏ మనిషికీ ఉండదు. కొంతవరకు కొత్త అమెరికన్ జనావాసాలలోని పరిస్థితి ఇది. ఇక్కడ, సొంత భూమి కలిగి ఉండాలనే కాంక్ష కూలికి పనిచేసే శ్రామికుల వర్గం ఉండడాన్ని అరికట్ట బడుతుంది."[1]

కనుక శ్రామికుడు తన సొంతానికి సంచయనం చేసుకోగలిగినంత కాలం – మరి అతను తన ఉత్పత్తి సాధనాల సొంతదారుడుగా ఉన్నంత కాలం అలా చేయగలడు – పెట్టుబడిదారీ సంచయనమూ, పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానమూ అసాధ్యం. వీటికి అత్యవసరమైన వేతన శ్రామికుల వర్గం లేదు. అయితే మరి పాత యూరప్‌లో, శ్రామికుని తన శ్రమసాధనాల నుండి తొలగించిన ఆస్తిహరణం, అనగా పెట్టుబడి, వేతన శ్రమల సహజీవనం, ఎలా సాధింపబడింది? సరికొత్త రకం సామాజిక ఒప్పందం ద్వారా. "మానవాళి పెట్టుబడిని పెంపొందించడానికీ, సంచయనం చేసుకోవడా నికీ సరళమైన పద్ధతిని అవలంబించింది" ఇది, సహజంగానే వాళ్ళ జీవితపు ఏకైక, అంతిమ లక్ష్యంగా ఆదాం నాటి నుండి వాళ్ళ ఊహలో ఆడుతూ వుండింది : "వాళ్ళు పెట్టుబడి సొంతదారులు గానూ, శ్రమదారులుగానూ తమను తామే విభజించుకున్నారు. ఈ విభజన సామరస్య, సంయోగాల ఫలితం.[2] "ఒక్క మాటలో చెప్పాలంటే : మావన బాహుళ్యం" పెట్టుబడి సంచయనం గౌరవార్థం తన్ను తాను ఆస్తిహరణం చేసుకుంది. ఈ మొండి వైరాగ్యపు అంతఃప్రవృత్తి ముఖ్యంగా వలసలలో స్వైర విహారం చేయాలని ఎవరైనా అనుకుంటారు : సామాజిక ఒప్పందం అనే కలను వాస్తవంగా మార్చగల మనుషులూ, పరిస్థితులూ అక్కడ మాత్రమే వున్నాయి. అయితే మరి ఎందుకు "క్రమపద్ధతి వలసకరణ"ను వినియోగించుకొని, దానికి వ్యతిరేకమైన, స్వయంజనితమైన, అనియంత్రితమైన వలసకరణను తొలగించాలి? కానీ – కానీ –

1. పూర్వోక్త గ్రంథం, పుట 17.
2. పూర్వోక్త గ్రంథం, సంపుటి I పుట 18.

"అమెరికన్ యూనియన్‌లోని ఉత్తర రాష్ట్రాలలో, ప్రజలలో పదింటి భాగమైన వేతన శ్రామికులు అనే వర్ణన కిందికి వస్తారనేది సందేహమే ... ఇంగ్లండులో ... ప్రజలలో అత్యధిక భాగం శ్రామిక వర్గంగా వున్నారు."[1]

పెట్టుబడి కీర్తి కొరకు స్వీయ ఆస్తిహరణం చేసుకొనే ధోరణి శ్రామిక మానవాళిలో ఎంత తక్కువగా వుందంటే, వేక్‌ఫీల్డ్ ప్రకారమే, బానిసత్వం వలస సంపద యొక్క ఏకైక సహజ ప్రాతిపదికగా వుంది. అతని క్రమపద్ధతి వలసకరణ అనేది pis aller (తప్పనిసరి కీడు) మాత్రమే; ఎందుకంటే, దురదృష్టవశాత్తూ అతను వ్యవహరించవలసి వున్నది బానిసలతో కాదు, స్వేచ్ఛాయుత మానవులతో.

"సెంట్ డొమింగొలో స్థిరపడిన మొదటి స్పానిష్ వాళ్ళు స్పెయిన్ నుండి శ్రామికులను తెచ్చుకోలేదు. కానీ, శ్రామికులు లేకుండా, వాళ్ళ పెట్టుబడి నశించిపోయి వుండాలి, లేదా, కనీసం, ప్రతి వ్యక్తీ తన సొంత చేతులతో ఉపయోగించుకోగలిగినంత చిన్న మొత్తానికి తగ్గిపోయి వుండాలి. ఇంగ్లీషు వాళ్ళు స్థాపించిన చివరి వలస అయిన స్వాన్‌రివర్ జనావాసంలో ఇది వాస్తవంగా జరిగింది. అక్కడ పెద్ద మొత్తం పెట్టుబడీ, విత్తనాలూ, పరికరాలూ, పశువులూ, వాటిని ఉపయోగించే శ్రామికులు లేనందున, నశించిపోయినాయి; అక్కడ స్థిరపడిన ఎవరూ తన సొంత చేతులతో ఉపయోగించు కోగలిగినంత కంటె చాలా ఎక్కువ పెట్టుబడిని నిలుపుకోలేదు.[2]

ప్రజా బాహుళ్యాన్ని భూమి నుండి తొలగించే ఆస్తిహరణం పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానానికి ప్రాతిపదిక అవుతుందని మనం చూసినాం. తద్వ్యతిరేకంగా, స్వేచ్ఛాయుత వలసయొక్క సారం ఏమిటంటే – భూమిలో అత్యధిక భాగం ఇంకా ప్రజా ఆస్తిగా వుంటుంది. కనుక దానిమీద స్థిరపడే ప్రతివాడూ దానిలో కొంత భాగాన్ని తన సొంత ఆస్తిగానూ, వ్యక్తిగత ఉత్పత్తి సాధనంగానూ, తరువాత స్థిరపడేవాళ్ళు అదే పని చేయడానికి అభ్యంతరం లేకుండా, మార్చుకోగలడు.[3] వలసల సౌభాగ్యానికీ, పెట్టుబడి స్థాపనకు వ్యతిరేకత అనే వాటి నుండి దుర్గుణానికీ, రెండిటికీ ఇదే రహస్యం.

"భూమి అతి చౌకగావుండి, మనుషులందరూ స్వేచ్ఛగా వున్నచోట, ఇష్టం వచ్చిన ప్రతివాడూ సులభంగా కొంత భూమిని సొంతానికి సంపాయించుకోగలచోట, ఉత్పాదితంలో శ్రామికుని భాగం విషయంలో శ్రమ చాలా ప్రియంగా వుండడం మాత్రమే కాక, సంయుక్త శ్రమను ఏ ధరకైనా సంపాయించడం కష్టంగా వుంటుంది.[4]

వలసలలో శ్రమకు అవసరమైన పరిస్థితులనుండీ, వాటి పునాది అయిన భూమి నుండీ శ్రామికుని వేరుపాటు ఇంకా వుండదు గనుక, లేదా అరుదుగా మాత్రమే వుంటుంది గనుక, లేదా చాలా పరిమితమైన ప్రమాణంలో వుంటుంది గనుక, పరిశ్రమల నుండి వ్యవసాయం యొక్క వేరు పాటు గానీ, రైతుల గృహ పరిశ్రమల విధ్వంసం గానీ వుండదు. ఇక పెట్టుబడికి అంతరంగిక మార్కెట్ ఎక్కడ నుండి రావాలి?

---

1. పూర్వోక్త గ్రంథం, పుటలు 42-44.
2. పూర్వోక్త గ్రంథం, సంపుటి II, పుట 5.
3. "వలసకరణ జరగడానికి భూమి బంజరుగా ఉండడం మాత్రమే కాదు. అది సొంత ఆస్తిగా మార్చుకోడానికి వీలైన సమష్టి ఆస్తిగా ఉండాలి." (పూర్వోక్త గ్రంథం, సంపుటి II, పుట 125)
4. పూర్వోక్త గ్రంథం, సంపుటి I, పుట 247.

"బానిసలూ, నిర్దిష్ట పనులలో పెట్టుబడినీ, శ్రమనూ సమ్మేళనం చేసే బానిస యజమానులూ తప్ప, అమెరికా ప్రజానీకంలో ఏ భాగమూ కేవలం వ్యావసాయికం కాదు. భూమిని సాగుచేసే స్వేచ్ఛాయుత అమెరికన్లు అనేక ఇతర వృత్తులను అనుసరిస్తారు. వాళ్ళు వాడుకునే ఫర్నిచర్‌లోనూ, పనిముట్లలోనూ కొంత భాగాన్ని మామూలుగా వాళ్ళే చేస్తారు. తరుచుగా వాళ్ళు తమ ఇండ్లను తామే స్వయంగా కట్టుకుంటారు. తమ సొంత పరిశ్రమ యొక్క ఉత్పాదితాన్ని మార్కెట్ ఎంత దూరంలో ఉన్నా తామే తీసుకుపోతారు. వాళ్ళు వడుకుతారు, నేస్తారు. సబ్బులూ, కొవ్వొత్తులూ చేసుకుంటారు. అనేక సందర్భాలలో సొంత ఉపయోగానికి పాదరక్షలూ, దుస్తులూ తయారు చేసుకుంటారు. అమెరికాలో తరచుగా వ్యవసాయం కమ్మరికో, మిల్లర్‌కో, దుకాణదారునికో ఉపవృత్తిగా వుంటుంది."[1]

ఇలాంటి విడ్డూరపు మనుషులతో, పెట్టుబడిదార్లకు వైరాగ్యపు రంగం ఎక్కడుంది; పెట్టుబడిదారీ ఉత్పత్తి యొక్క గొప్పతనం ఎందులో ఉందంటే అది వేతనకార్మికుని వేతనకార్మికునిగా నిత్యం పునరుత్పత్తి చేయడమే కాక, పెట్టుబడి సంచయనానికి అనుగుణంగా, వేతన కార్మికుల సాపేక్ష అదనపు సంఖ్యను నిత్యం ఉత్పత్తి చేస్తుంది. ఆ విధంగా శ్రమయొక్క సరఫరా, డిమాండుల నియమం సరైన గాడిలో పెట్టబడుతుంది; వేతనాలకెగుడు దిగుడులు పెట్టుబడిదారీ దోపిడీకి తృప్తికరమైన పరిమితుల లోపల బంధించబడతాయి ; చివరి విషయం, పెట్టుబడిదారుని మీద శ్రామికుని సామాజిక పరాధీనత, ఆ అవిసర్జనీయమైన అవసరం సాధించబడుతుంది. పొరపడడానికి వీలులేని ఈ పరాధీనతా సంబంధాన్ని స్వయం ప్రీతుడైన అర్థశాస్త్రజ్ఞుడు, స్వదేశంలో, కొనుగోలుదారునికీ, అమ్మకం దారునికీ మధ్య సరుకుల యొక్క సమానంగా స్వతంత్రులైన సొంతదారుల మధ్య పెట్టుబడి అనే సరుకు యొక్క సొంతదారునికీ శ్రమ అనే సరుకు యొక్క సొంతదారునికీ మధ్య, స్వేచ్ఛాయుత ఒప్పందంగా పరకాయ ప్రవేశం చేయించగలడు. కానీ, వలసలలో ఈ అందమైన భ్రమ వీడిపోతుంది. ఇక్కడ మొత్తం జనసంఖ్య మాతృదేశంలో కంటె చాలా వేగంగా పెరుగుతుంది; ఎందుకంటే, అనేక శ్రామికులు తయారుగా చేసిపెట్టిన వయస్కులుగా ఈ ప్రపంచంలో ప్రవేశిస్తారు; అయినా శ్రమ మార్కెట్‌లో సరుకు ఎప్పుడూ కొరతగానే వుంటుంది. శ్రమ యొక్క సరఫరా, డిమాండుల నియమం ముక్కచెక్క లౌతుంది. ఒకవైపున పాత ప్రపంచం దోపిడీ, "వైరాగ్యా"ల దాహంతో నిత్యం పెట్టుబడిని అక్కడికి తోస్తుంది; మరొకవైపు, వేతన కార్మికుడుగా వేతన శ్రామికుని క్రమబద్ధమైన పునరుత్పత్తి మహా అసంబద్ధమైన, పాక్షికంగా అజేయమైన ఆటంకాలతో ఘర్షిస్తుంది. పెట్టుబడి సంచయనంతో పోలిస్తే అధిక సంఖ్యలో వున్న వేతన శ్రామికుల ఉత్పత్తి ఏమౌతుంది? ఈనాటి వేతన శ్రామికుడు రేపు సొంతానికి పనిచేసుకునే స్వతంత్ర రైతో, చేతిపనివాడో అవుతాడు. అతను శ్రమ మార్కెట్ నుండి అదృశ్యమౌతాడు. కానీ బీదల శ్రమ శరణాలయాల్లోకి కాదు. వేతన శ్రామికులు స్వతంత్ర ఉత్పాదకులుగా, పెట్టుబడిదారునికి బదులు సొంతానికి పనిచేసుకుంటూ, పెట్టుబడిదారీ పెద్దలను కాక తమనే సంపన్నం చేసుకునే వాళ్ళుగా, మారే ఈ నిత్య రూపాంతరీకరణ, తిరిగి శ్రమ మార్కెట్‌కు అవసరమైన పరిస్థితులమీద

1. పూర్వోక్త గ్రంథం, పుటలు 21, 22.

చాలా వికటంగా పనిచేస్తుంది. వేతన శ్రామికుని దోపిడీ ప్రమాణం చాలా తక్కువగా వుండడమే కాదు, వేతన శ్రామికుడు పరాధీనతా సంబంధంతో పాటు, వైరాగ్యపు పెట్టుబడిదారునికి తాను పరాధీనుడిననే భావాన్ని కూడా కోల్పోతాడు. మన ఇ.జి. వేక్‌ఫీల్డ్ అంత ధైర్యంగా, అంత కంఠోక్తిగా, అంత కరుణాజనకంగా చిత్రించే అసౌకర్యాన్నీ అందువల్లనే కలుగుతున్నాయి.

వేతన శ్రమ సరఫరా నిలకడగానూ వుండదు, క్రమబద్ధంగానూ వుండదు, చాలినంతగానూ వుండదు అని అతను వాపోతాడు. "శ్రమ సరఫరా ఎప్పుడూ స్వల్పంగానే కాక, అనిశ్చితంగా వుంటుంది."[1]

"పెట్టుబడిదారునికీ, శ్రామికునికీ మధ్య పంపకమయ్యే ఉత్పాదితం ఎక్కువగా వున్నప్పటికీ శ్రామికుడు త్వరలో తానే పెట్టుబడిదారుడయ్యేటంత పెద్ద భాగం తీసుకుంటాడు. అసాధారణంగా దీర్ఘమైనంత కాలం బతికేవాళ్ళలో కూడా కొద్దిమందే గొప్ప ధనరాసులను సంచయనం చేసుకోగలరు?"[2]

తమ శ్రమలో అధిక భాగానికి పెట్టుబడిదారుడు డబ్బు చెల్లించకుండా వుండడాన్ని సాగనిచ్చేందుకు శ్రామికులు అతి కచ్చితంగా తిరస్కరిస్తారు. అతను యుక్తిపరుడై తన సొంత పెట్టుబడితో పాటు సొంత వేతన శ్రామికులను యూరప్ నుండి దిగుమతి చేసుకుంటే, అదేమీ అతనికి ఉపకరించదు.

త్వరలో వాళ్ళు "వేతన శ్రామికులుగా వుండడం మానుకుంటారు; వాళ్ళు .... స్వతంత్ర భూయజమానులౌతారు. తమ మునుపటి యజమానులకు శ్రమ మార్కెట్‌లో పోటీదారులు కారనుకున్నా."[3]

ఎంత ఘోరం! ప్రశస్థమైన పెట్టుబడిదారుడు తన విలువైన సొంత డబ్బుతో తన పోటీదార్లనే యూరప్ నుండి దిగుమతి చేసుకున్నాడు! ప్రపంచానికి ప్రళయం దాపురించింది! వలసలలోని వేతన శ్రామికులకు పరాధీనతే కాకుండా, పరాధీనతా భావం కూడా బొత్తిగా లేదని వేక్‌ఫీల్డ్ వాపోవడంలో ఆశ్చర్యం లేదు. అతని శిష్యుడైన మెరివేల్ ఇలా అంటాడు : "ఎక్కువ వేతనాల మూలంగా వలసలలో మరింత చౌకగా, మరింత అణకువగా వుండే శ్రామికులు – పెట్టుబడిదారునికి షరతులు విధించడానికి బదులు పెట్టుబడిదారుని షరతులకు లోబడేవర్గం – కావాలనే జరూరు కాంక్ష వుంది. ప్రాచీన నాగరిక దేశాలలో శ్రామికుడు స్వేచ్ఛగా వున్నప్పటికీ, ప్రకృతి నియమం చేత పెట్టుబడిదారునికి అధీనుడుగా వున్నాడు : వలసలలో ఈ పరాధీనతను కల్పిత పద్ధతుల ద్వారా సృష్టించాలి."[4]

---

1. పూర్వోక్త గ్రంథం, సంపుటం II, పుట 116.
2. పూర్వోక్త గ్రంథం, సంపుటం I, పుట 131.
3. పూర్వోక్త గ్రంథం, సంపుటం II, పుట 5.
4. Merivale, "Lectures on colonisation and colonies (వలసకరణమీదా, వలసలమీదా ఉపన్యాసాలు) London 1841 సంపుటం II, పుటలు 235-314లో అక్కడక్కడ మెత్తని, నిర్నిబంధ వర్తకపు, అపభ్రంశ అర్థశాస్త్రజ్ఞుడైన మొలివారి కూడా ఇలా అంటాడు : "వలసలలో బానిసత్వం రద్దు చేయబడింది. గానీ, తొలగించబడిన నిర్బంధ శ్రమ స్థానంలో అదే ప్రమాణ స్వేచ్ఛాయుత శ్రమ రాలేదు. అందువలన అక్కడ మనకు నిత్యం పరిచితమైన పరిస్థితి కంటె భిన్నమైనది వుంది. మాములూ కార్మికులు ఫ్యాక్టరీ

వేక్‌ఫీల్డ్ ప్రకారం, వలసలలో ఈ దురదృష్టకర పరిస్థితుల పర్యవసానం ఏమిటి? ఉత్పాదకుల యొక్కా, జాతీయ సంపదయొక్కా "ఆటవికతాకారకమైన చెదిరిపోయే ధోరణి"[1] ఉత్పత్తి సాధనాలు తమ సొంతానికి పనిచేసుకునే అసంఖ్యాక సొంతదారుల మధ్య ముక్కలు కావడం పెట్టుబడి కేంద్రీకరణతో పాటు సంయుక్త శ్రమ యొక్క పునాదుల నన్నిటినీ నిర్మూలిస్తుంది. పెట్టుబడి ఖర్చును డిమాండు చేస్తూ, పలు సంవత్సరాలు పట్టే దీర్ఘ ప్రయత్నం ప్రతిదీ నిర్వహించబడకుండా అరికట్ట బడుతుంది. యూరప్‌లో ఒక క్షణం తటపటాయించకుండా పెట్టుబడి పెట్టబడుతుంది; ఎందుకంటే, దాని సజీవ అనుబంధంగా వుంది కార్మికవర్గం, ఎప్పుడూ మిగులుగా, ఎప్పుడూ అమ్మకానికి సిద్ధంగా, మరి వలసలలోనో! వేక్‌ఫీల్డ్ మహా విషాదకరమైన సంఘటన ఒకటి చెప్తాడు. అతను కెనడాకూ, న్యూయార్క్ రాష్ట్రానికీ చెందిన కొందరు పెట్టుబడిదారులతో మాట్లాడుతూ వుండినారట. అక్కడ విదేశీ అగంతకుల రాక తరచుగా ఆగిపోయి, "పైపనులు చేసే" మిగులు శ్రామికులను నిలుపుతుంది. ఈ విషాద గాథలోని ఒక పాత్ర ఇలా అంటాడు :

"పూర్తి చేయడానికి గణనీయమైన కాలం పట్టే అనేక చర్యలకు మా పెట్టుబడి సిద్ధంగా వుండింది. కానీ, త్వరలో మమ్మల్ని వదిలిపోతారని మాకు తెలిసిన శ్రామికులతో ఆ చర్యలు మేము ప్రారంభించలేకపోయినాము. అలాంటి విదేశీయ ఆగంతకుల శ్రమను నిలుపుకోగలమని మాకు నమ్మకం వుండివుంటే, మాకు అవసరమైనప్పుడల్లా కొత్త శ్రమ సరఫరా అందుతుందని మాకు నమ్మకం వుండివుంటే, ఆ శ్రమను ఎక్కువ ధరకు అయినా సరే, మేము వెంటనే సంతోషంగా వినియోగించుకొనేవాళ్ళం. వాళ్ళు మమ్మల్ని వదలిపోతారని మాకు నమ్మకంగా తెలిసినా కూడా వాళ్ళను వినియోగించుకొనేవాళ్ళం."[2]

వేక్‌ఫీల్డ్ ఇటు ఇంగ్లీషు పెట్టుబడిదారీ వ్యవసాయానికీ, దాని "సంయుక్త" శ్రమకూ, అటు

---

సొంతదార్లను దోపిడీ చేయడమూ, ఉత్పాదితంలో తమకు రావలసిన భాగం కంటె, న్యాయమైన భాగంకంటె ఎక్కువ వేతనాలను డిమాండ్ చేయడమూ అక్కడ మనకు కనపడతుంది. పెరుగుతున్న వేతనాలను చెల్లించడానికి తగినంత ధర తమ చక్కెరకు రానందున, ప్లాంటర్లు ఈ లోటును భర్తీ చేయడానికి మొదట తమ ఆదాయాన్నీ, తరువాత తమ పెట్టుబడినీ పోగొట్టుకోవలసి వచ్చింది. చాలామంది ప్లాంటర్లు ఆర్థికంగా నాశనమైనారు. మరికొందరు అనివార్యమైన నాశనాన్ని తప్పించుకొనేటందుకు వ్యాపారం మానుకొన్నారు ... నిస్సందేహంగా, మానవుల తరాలు మొత్తంగా ధ్వంసం కావడం కంటే పెట్టుబడి ధ్వంసం కావడం మేలు (మొలినారి ఎంత ఉదారుడో!) కానీ, రెండూ రక్షింపబడితే ఇంకా మేలు కాదా?" (Molinari పూర్వోక్త గ్రంథం, పుటలు 5,152), అయ్యో మొలినారీ, అయ్యయ్యో మొలినారీ! యూరప్‌లో పెట్టుబడిదారుడు శ్రామికుని న్యాయమైన భాగాన్ని కత్తిరించ గలిగితే, పశ్చిమ ఇండీస్‌లో శ్రామికుడు పెట్టుబడిదారుని న్యాయమైన భాగాన్ని కత్తిరించగలిగితే, ఇక బైబిల్ ఆదేశాలు ఏమౌతాయి. మోజెసూ, ప్రవక్తలూ ఏమౌతారు. సరఫరా డిమాండుల నియమం ఏమౌతుంది. మీరు చెప్పినదాన్ని బట్టే యూరప్‌లో పెట్టుబడిదారులు ప్రతిరోజూ చెల్లించకుండా వుండే ఈ "న్యాయమైన భాగం" ఏమిటో సెలవిస్తారా? ఆ దూరాన, శ్రామికులు పెట్టుబడిదారుని" దోపిడీచేసే "టంత" "సరళంగా" వున్న వలసలలో, ఇతర చోట్ల తనంతకు తానే పనిచేసే సరఫరా డిమాండుల నియమాన్ని పోలీసుల ద్వారా సరైన దారిలో పెట్టాలని మొలినారికి చాలా దురదగా వుంది.

1. E.G. Wakefield, పూర్వోక్త గ్రంథం, సంపుటం, II, పుట 52.
2. పూర్వోక్త గ్రంథం, సంపుటం, II, పుటలు 191, 192.

అమెరికన్ రైతుల చెల్లాచెదరు వ్యవసాయానికీ మధ్య భేదాన్ని చూపిన తర్వాత, తనకు తెలియకుండానే పతకం యొక్క ఆవలివైపును కాస్త చూపిస్తాడు. అమెరికన్ ప్రజా బాహుళ్యం సంపన్నంగా, స్వతంత్రంగా, చొరవగా, సాపేక్షంగా సంస్కృతీపరులుగా వున్నారని అతను చిత్రిస్తాడు. అదే సమయంలో :

"ఇంగ్లీషు వ్యవసాయ శ్రామికుడు పరమ దౌర్భాగ్యుడు, బుక్కాపకీరు.... ఉత్తర అమెరికాలోనూ, కొన్ని కొత్త వలసలలోనూ తప్ప ఏ దేశంలో వ్యవసాయంలో వినియుక్తమైన శ్రమకు ఇచ్చే వేతనం శ్రామికుని బొటాబొటి జీవనాన్ని మించి ఎక్కువగా వుంది?.... ఇంగ్లండులో పొలం పనిచేసే గుర్రాలు విలువైన ఆస్తి గనుక, అవి ఇంగ్లీషు రైతులకంటె నిస్సందేహంగా మంచి తిండి తింటున్నాయి."[1]

అయినా పరవాలేదు – జాతీయ సంపద అంటే, స్వభావతః ప్రజల దౌర్భాగ్యమే కదా. అయితే మరి. వలసల్లోని పెట్టుబడిదారీ వ్యతిరేక రాచపుండును మాన్పడం ఎలా? ఒక్క దెబ్బతో ప్రజా ఆస్తిగా వున్న భూముల నన్నిటినీ సొంత ఆస్తిగా మార్చడానికి మనుషులు ఒప్పుకుంటే, రోగ కారణం నిశ్చయంగా ధ్వంసమౌతుంది, కానీ – వలసలు కూడా ధ్వంసమౌతాయి. ఒక్క రాయితో రెండు పక్షులను చంపడం ఎలా అనేదే సమస్య. సరఫరా, డిమాండుల నియమంతో సంబంధం లేకుండా, ప్రభుత్వం పొందవ బీడుకు కృత్రిమమైన ధరను నిర్ణయించనీ; విదేశీయ ఆగంతకుడు దీర్ఘకాలం వేతన కార్మికుడుగా పనిచేస్తే తప్ప అతను భూమిని కొని, స్వతంత్ర రైతుగా మారడానికి[2] సాధ్యం కానట్టిదిగా వుండాలి ఆ ధర. వేతన కార్మికులను సాపేక్షంగా అసాధ్యమైన ధరకు భూమిని అమ్మడం ద్వారా ఏర్పడిన నిధిని – సరఫరా, డిమాండుల పవిత్రమైన నియమాన్ని ఉల్లంఘించి, శ్రమ యొక్క వేతనాల నుండి పిండిన డబ్బుతో ఏర్పడిన ఈ నిధిని – అటువైపున ప్రభుత్వం ఎలా వినియోగించాలంటే, అది ఏ మేరకు పెరిగితే ఆ మేరకు, యూరప్ నుండి బీదలను వలసలకు దిగుమతి చేసి, పెట్టుబడిదార్ల అవసరానికి తగినంత పుష్కలంగా వేతన శ్రమ మార్కెట్‌ను నింపేటట్లుగా వినియోగించాలి. ఈ పరిస్థితులలో "tout sera pour le mieux dans le meilleur des mondes possibles" ("ఈ అత్యుత్తమ ప్రపంచంలో ప్రతిదీ మేలు కలిగిస్తుంది") "క్రమపద్ధతి వలసకరణ" యొక్క మహత్తర రహస్యం ఇదే.

> ఈ పథకం ద్వారా "శ్రమ సరఫరా సుస్థిరంగా, క్రమబద్ధంగా వుండక తప్పదు" అని వేక్‌ఫీల్డ్ విజయగర్వంతో ఉద్ఘోషిస్తాడు. "ఎందుకంటే, మొదటి విషయం, డబ్బుకోసం పనిచేసి వుంటే తప్ప ఏ శ్రామికుడూ భూమిని సంపాయించజాలడు; విదేశీయ ఆగంతక శ్రామికులందరూ కొంతకాలం వేతనానికి పనిచేసి, సంయుక్తంగా, మరికొంత మంది శ్రామికులను వినియోగించు

---

1. పూర్వోక్త గ్రంథం, సంపుటం, I, పుటలు 47, 246
2. "తన చేతులు తప్ప ఏమీ లేనట్టి మనిషి భూమినీ, పెట్టుబడినీ సొంతపరచుకొంటే, అతనికి పని దొరుకుతుంది. అతను ఆదాయాన్ని సృష్టించుకొంటాడు అని మీరంటారు... కానీ, తద్విరుద్ధంగా, భూమి మీద వ్యష్టి స్వామ్యం ఉండడం వల్లనే తమ చేతులు తప్ప ఏమీ లేనట్టి మనుషులు వున్నారు... మనిషిని నిర్వాతం (vacuum)లో పెట్టితే, అతనికి ఊపిరి ఆడడానికి అవసరమైన గాలి వుండదు. భూమి మీద స్వామ్యం విషయంలో మీరు యిలాగే ప్రవర్తిస్తున్నారు .... మనిషి జీవితాన్ని మీ యిచ్ఛకు లోబరచుకోడానికి మీరు అతనికి సంపద లేకుండా చేస్తున్నారు" (Colins, పూర్వోక్త గ్రంథం, సంపుటం III, పుటలు 268-271, అక్కడక్కడ)

కోడానికి పెట్టుబడిని ఉత్పత్తి చేస్తారు; రెండవ విషయం, వేతనానికి పనిచేయడం మానుకొని, భూయజమాని అయిన ప్రతి శ్రామికుడూ, భూమిని కొనడం ద్వారా, వలసకు కొత్త శ్రమను తీసుకురావడానికి అవసరమైన నిధిని సమకూరుస్తాడు."[1]

ప్రభుత్వం నిర్ణయించిన భూమి ధర, సహజంగానే, "తగినంత ధర" గా వుండాలి – అనగా, "ఇతరులు తమ స్థానంలోకి వచ్చిందాకా, స్వతంత్ర శ్రామికులు భూయజమానులు కాకుండా నివారించేటంత" ఎక్కువగా వుండాలి.[2] ఈ "భూమి యొక్క తగినంత ధర" అనేది శ్రామికుడు వేతన శ్రమ మార్కెట్ నుండి విరమించుకొని భూమికి మారడానికి అనుమతి కొరకు పెట్టుబడిదారునికి చెల్లించే విముక్తి ధనానికి అలంకారికమైన డొంక తిరుగుడు తప్ప మరేమీ కాదు. మొదట శ్రామికుడు పెట్టుబడిదారుని కొరకు "పెట్టుబడిని" సృష్టించాలి, దానితో అతను మరింత మంది శ్రామికులను దోపిడీ చేయగలిగేటట్లుగా; తరువాత అతను, తన సొంత ఖర్చుతో, శ్రమ మార్కెట్‌లో తనకు బదులు మరొక మనిషిని పెట్టాలి. తన పాత యజమాని అయిన పెట్టుబడిదారుని సౌకర్యం కొరకు ప్రభుత్వం ఆ మరొక మనిషిని సముద్రం మీద పంపిస్తుంది.

వేక్‌ఫీల్డ్ ప్రత్యేకంగా వలసల ఉపయోగార్థం సూచించిన ఈ "ఆదిమ సంచయన" పద్ధతిని ఇంగ్లీషు ప్రభుత్వం ఏండ్ల తరబడి అమలుపరచడం చాలా విలక్షణమైనది. దీని వైఫల్యం సర్ రాబర్ట్ పీల్ బ్యాంక్ చట్టం యొక్క వైఫల్యం ఎంత సంపూర్ణంగా ఉండిందో అంత సంపూర్ణంగానూ వుండిన మాట నిజమే. విదేశ గమన ప్రవాహం ఇంగ్లీషు వలసల నుండి సంయుక్త రాష్ట్రాలకు మళ్ళింపబడింది. అంతే, ఈమధ్యలో, యూరప్‌లోని పెట్టుబడిదారీ ఉత్పత్తి పురోగతి, పెరుగుతున్న ప్రభుత్వ ఒత్తిడితో కలిసి, వేక్‌ఫీల్డ్ ఔషధాన్ని అప్రస్తుతం చేసినాయి. ఒకవైపున, ప్రతి ఏడూ అమెరికా మీదికి తోలబడిన అపారమైన, నిరంతరాయమైన జన ప్రవాహం సంయుక్త రాష్ట్రాల తూర్పు భాగంలో నిలిచిపోయే మడ్డిని వదిలిపెడుతుంది. విదేశ గమన తరంగం అక్కడి నుండి వాళ్ళను పశ్చిమానికి తోసుకుపోయేటంత కంటె ఎక్కువ వేగంతో యూరప్ నుండి వచ్చే విదేశీయ ఆగమన తరంగం అక్కడి శ్రమ మార్కెట్‌లోకి మనుషులను తోస్తుంది. మరొకవైపున, అమెరికా అంతర్యుద్ధం వెంట అపారమైన జాతీయ రుణం వచ్చింది. దాని వెంట పన్నుల ఒత్తిడీ, మహా నీచమైన ఫైనాన్షల్ ప్రభుమండలి పెరుగుదలా, రైల్వేలూ, గనులూ, వగైరాల నిర్వహణ కొరకు సట్టా కంపెనీల మీద ప్రజా భూమిలో గొప్ప భాగాన్ని దుర్వ్యయం చేయడమూ, టూకీగా చెప్పాలంటే, మహా సత్వరమైన పెట్టుబడి కేంద్రీకరణా వచ్చినాయి. అందువలన, ఆ గొప్ప రిపబ్లిక్ విదేశ గామి శ్రామికులకు స్వర్గభూమిగా ఉండడం ఆగిపోయింది. వేతనాల తరుగుదలా, వేతన కార్మికుని పరాధీనతా మామూలు యూరోపియన్ స్థాయికి రావడానికి ఇంకా చాలా దూరంలో వున్నప్పటికీ, పెట్టుబడిదారీ ఉత్పత్తి అక్కడ బ్రహ్మాండమైన అంగలతో పురోగమిస్తుంది. సాగుచేయని భూమిని ప్రభుత్వం లజ్జా రహితంగా ప్రభు వంశీయులకూ, పెట్టుబడిదార్లకూ ధారబోయడం, వేక్‌ఫీల్డ్ కూడా అంత బిగ్గరగా ఖండించినట్టిది, ముఖ్యంగా ఆస్ట్రేలియాలో, బంగారు త్రవ్వకాలు ఆకర్షించే జన ప్రవాహంతో కలిసి, ఇంగ్లీషు సరుకుల దిగుమతి

1. Wakefield పూర్వోక్త గ్రంథం,సంపుటం , పుట 192
2. పూర్వోక్త గ్రంథం, పుట 45.

అతి చిన్న చేతిపనివానికి కూడా కలిగించే పోటీతో కలిసి, "సాపేక్షంగా అదనపు శ్రామిక ప్రజానీకాన్ని" పుష్కలంగా సృష్టించింది; ఫలితంగా, ప్రతి టపాలోనూ, "ఆస్ట్రేలియా శ్రమ మార్కెట్‌లో డిమాండు లేదు" అనే దుర్వార్త వస్తున్నది. అక్కడ కొన్ని చోట్ల లండన్ హేమార్కట్‌లోలాగ వ్యభిచారం విశృంఖలంగా వర్ధిల్లుతున్నది.[1]

అయినా ఇక్కడ మనకు వలసల పరిస్థితి రాబట్టదు. మనకు ఆసక్తిగల ఒకే ఒక విషయం పాత ప్రపంచపు అర్థశాస్త్రంచేత కొత్త ప్రపంచంలో ఆవిష్కరించబడి, మిద్దె కప్పు మీద నుండి ఉద్ఘోషింపబడే రహస్యం. అదేమిటంటే, పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానానికీ, పెట్టుబడిదారీ సంచయనానికీ, అందుకని పెట్టుబడిదారీ సొంత ఆస్తికీ అవసరమైన మౌలిక పరిస్థితి స్వార్జితమైన సొంత ఆస్తి నిర్మూలనం; మరొక విధంగా చెప్పాలంటే, శ్రామికుని ఆస్తిహరణం.



1. ఆస్ట్రేలియా తన సొంత శాసనకర్త అయిన వెనువెంటనే, అది అక్కడ స్థిరపడినవాళ్ళకు అనుకూలమైన శాసనాలు చేసింది. కానీ, ఇంగ్లీషు ప్రభుత్వం అప్పటికే భూమిని దుర్వ్యయం చేయడం ఆటంకంగా వుంది. "ప్రజలు స్థిరపడడానికి అధిక సౌకర్యాలు ఇవ్వడం 1862 నాటి కొత్త భూమి చట్టంయొక్క ప్రథమ ప్రధాన లక్ష్యం." ("The Land Law of Victoria" (విక్టోరియా భూమి చట్టం") రచన : C.G. Duffy , ప్రజాభూముల మంత్రి London 1862)

# రచయితల సూచిక

## ఎ

ఎడింగ్టన్ స్టీఫెన్ – (1729 – 1796) 689
ఐకిన్ జాన్ – (1747–1822) 557, 713, 721
ఎనాచర్‌సిస్ – (VI – బిసి) 92
ఆండర్‌సన్ ఆడమ్ – (1692 – 1765) 708, 721
ఆండర్‌సన్ జేమ్స్ – (1739 – 1808) 471, 521, 582, 689, 692, 708
ఆనీ – (1665 – 1714) క్వీన్ – (1702 – 1714) 150, 700
అంటీ సెట్రోస్ – (సి. II. ఎ.డి.) 377
ఎప్పిన్ – (II ఎ.డి.) 690
ఆర్కిలోకస్ – VII బి.సి. మొదట్లో జన్మించెను. 338
ఆర్కిమిడిస్ ఆఫ్ సైరాకస్ – (287 – 212 బి.సి.) 280
అరిస్టాటిల్ – (384–322. బి.సి) 54, 55, 78, 140, 152, 301, 376
ఆర్క్‌రైట్ రిచర్డ్ – (1732–1792) 341, 347, 352, 391, 396, 453
ఆష్లే ఆంథోనీ కూపర్, ఎర్ల్ ఆఫ్ షాఫ్టెన్ బరీ (1801–1885) 381, 640
ఎథెన్యుయస్ ఆఫ్ న్యూక్రటిస్ ( A.D. 3వ శతాబ్దం మొదట్లో) 92, 122
ఆగీర్ మేరీ – 722
ఎవెలింగ్ ఎడ్వర్డ్ – (1851 – 1898) 1

## బి

బాబేజ్ చార్లెస్ – (1792 – 1871) 320, 323, 346, 361, 373
బేకన్ ఫ్రాన్సిస్ – (1561 – 1626) 359, 682, 683
బెయిలీ శామ్యూల్ – (1791 – 1870) 44, 57, 76
బాల్జాక్ హానిరె డీ – (1799 – 1850) 551
బార్బన్ నికోలస్ – (1640 – 1698) 31, 32, 33, 113, 119, 132, 133, 581
బార్టన్ జాన్ – (18వ శతాబ్దం చివరిలో మరియు 19వ శతాబ్దం మొదట్లో) 596, 639
బాసెడో జోహాన్ బెర్న్ హార్డ్ – (1723–1790) 453
బాస్టియట్ ఫ్రెడెరిక్ – (1801–1850) 55, 74, 177, 377, 524
బేనస్ జాన్ – 358, 360

బెబెల్ ఆగస్ట్ – (1840–1913) 25
బెకారియా సిసరె – (1738 – 1794) 338
బెక్కర్ స్టోవ్, హరియట్ ఎలిజబెత్ – (1811–1896) 684
బెల్ చార్లెస్ – (1774–1842) 257
బెల్లర్స్ జాన్ – (1654 – 1725) 120, 127, 134, 301, 321, 395, 444, 453, 578
బెంతమ్ జెర్మీ – (1748–1832) 162, 573, 575
బర్క్ లీ జార్జ్ – (1685–1753) 327
బైడట్ జె.యన్. (బిదో) (19వ శతాబ్దం మొదటి భాగంలో) 295
బీసే ఫ్రాన్జ్ – (1803–1895) 376
బ్లాకీ రాబర్ట్ – (1795–1878) 685
బ్లాంక్వీ జెరోమ్ ఆడాల్ఫ్ – (1798–1854) 255, 311
బ్లాక్ మారిస్ – (1816 – 1901) 14
బాయ్‌లూ ఎటినే (1200–1270) 450
బాయి ల్యూ నికోలస్ – (1636–1711) 617
బాయిస్ గిల్లెబర్ట్ పియర్రె – (1646–1714) 119, 129
బాలింగ్ బ్రోక్, హెన్రీ సెయింట్ జాన్ – (1678–1751) 717
బోనపార్టీ లూయీస్ – (1808–1873) 254, 657
బౌల్టన్ మాథ్యూ – (1728–1809) 348, 358
బాక్స్‌హార్న్, మార్కస్, స్యురియస్ – (1612–1653) 396
బ్రే జాన్ ఫ్రాన్సిస్ – (1809–1895) 62
బ్రెంటన్ లూజో – (1844–1931) 27, 28
బ్రైట్ జాన్ – (1811–1889) 12, 234, 260, 519, 614, 712
బ్రింద్ లే జేమ్స్ – (1716–1772) 322
బ్రాడ్ హార్ట్స్ జె. 48
బ్రాడీ బెంజమిన్ కొల్లిన్స్ – (1783–1862) 257
బ్రాగ్‌హమ్ హెన్రీ – (1778–1868) 721
బ్రక్‌నర్ జాన్ – (1726–1804) 581
బ్రన్నర్ – 447
బచానన్ డేవిడ్ – (1779–1848) 116, 520, 693
బుచెజ్, ఫిలిప్పె బెంజిమిన్ జోసెఫ్ – (1796–1866) 704
బర్క్ ఎడ్మండ్ – (1729–1797) 190, 215, 298, 687, 722
బట్లర్ శామ్యూల్ – (1612 – 1680) 32

## సి


కైర్నెస్ జాన్ ఇలియట్ – (1823–1875) 181, 245, 306
క్యాంప్ బెల్ జార్జ్ – (1824–1892) 331
కాంటిలాన్ రిచర్డ్ – (1680–1734) 516, 517, 581
కారీ హెన్రీ చార్లెస్ – (1793–1879) 200, 523, 694, 711
కార్లీ జియోవన్నీ రినాల్డో – (1720–1795) 304
కార్లయిల్ థామస్ – (1795–1881) 234
కేథరీన్ II – (1729–1796) 648
క్యాజ్ సాల్మన్ డి – (1576–1626) 347
చాల్మర్స్ థామస్ – (1780–1847) 141, 150, 581, 582
ఛాంబర్ లైన్ జోసెఫ్ – (1836–1914) 606
చార్లమన్ – (గ్రేట్ చార్లెస్) – (742–814)
రాజుగా ఉండినది 768, చక్రవర్తిగా – 800–681
చార్లెస్ I – (1600–1649) రాజు (1625–1648) 684, 685
చార్లెస్ II – (1630–1685) రాజుగా (1660–1685) 115
చార్లెస్ V – హబ్స్‌బర్గ్ – (1500–1558) చక్రవర్తి – (1519–1556) 700
చార్లెస్ VI – (1685–1740) చక్రవర్తి – (1711–1740) 396
చార్లెస్ X – గస్టవస్ (1622–1660) రాజు (1654–1660) 687
చార్లెస్ XI – (1655–1697) రాజు (1660–1697) 687
చెర్బులీజ్ ఆంథోనీ ఎలిసీ – (1797–1869), 167, 170, 546
చెర్నిసోవ్‌స్కీ నికోలాయ్ గావ్‌రిలోవిచ్ – (1828–1889) 13
చెవలియర్ జీన్ బాప్టిస్ట్ ఆల్ఫాన్స్ – (1793–1879) 228
చైల్డ్ జోషయ్య – (1630–1699) 722
సిసిరో మార్కస్ టులియస్ – (106–43 **B.C.**) 377
కోబెట్ విలియన్ – (1762–1835) 265, 6854, 716, 718
కోబ్‌డెన్ రిచర్డ్ – (1804–1865) 12, 234, 643
కాల్ బర్ట్ జీన్ బాప్టిస్టే – (1619–1683) 285, 719
కాలిన్స్ జీన్ గైల్యూమ్ సీజర్ అలెగ్జాండర్ హిప్పోలిట్ – (1783–1859) 578, 657, 733
కొలంబస్ క్రిష్టఫర్ – (సి. 1446–1506) 121
కోమ్టే ఆగస్టే – (1798–1857) 307
కోమ్టే ఫ్రాంకోయిస్ చార్లెస్ లూయిస్ – (1782–1837) 714
కాండిలాక్ ఎటిన్నె బానెట్ డి–(1750–1780) 147
కాండిర్సట్ మేరీ మార్కిస్ డీ – (1813 – 1892) 580

కార్బెట్ థామస్ – 138, 551
కార్బన్ క్లాడ్ ఎంథైమ్ – (1808–1891) 452
కూర్‌సిల్లె, సెన్యుల్ జీన్ గుస్తవ్ – (1813–1892) 213, 560
క్రామ్‌వెల్ ఆలివర్ – (1599–1658) 684, 686, 711
కల్ పెపర్ థామస్ – (1578–1662) 722
కవియర్ జార్జ్ – (1769–1832) 477

డి

డాంటె ఆల్టీరీ – (1265–1321) 94, 226
డార్విన్ చార్లెస్ – (1809–1882) 315, 343
డామర్ జార్జ్ ఫ్రెడ్‌రిక్ – (1800–1875) 264
డెఫో డేనియల్ (1660–1731) 580
డెస్కార్టెస్ రేనీ – (1596–1650) 360
డెస్టర్ ది ట్రేసీ ఆంటోనీ లూయిస్ క్లాడ్ కోమ్టే – (1754–1836) 72, 145, 150, 300, 302, 612
డిడెరాట్ డెనిస్ – (1713–1784) 123
డిట్జెన్ జోసెఫ్ – (1828–1888) 14
డియోడరస్ సైకలస్, డయోడర్ వన్ సిసిలియన్ – (I, బి.సి.) 131, 215, 314, 340, 476
డబుల్ డే థామస్ – (1790–1870) 718
డ్రైడెన్ జాన్ – (1631–1700) 222
డక్ పెటెయక్స్ ఎడ్వర్డ్ – (1804 – 1868) 635, 637
డఫరిన్, బ్లాక్ ఫుడ్ ఫ్రెడరిక్ టెంపుల్, లార్డ్ – (1826–1902) 674
డఫ్ఫీ చార్లెస్ గవాన్ – (1816–1903) 735
డన్నింగ్ టి.జె – (1799–1873) 512, 515, 516, 722
డ్యుపాంట్ పియర్రె – (1821–1870) 657

ఇ

ఎడెన్ ఫ్రెడరిక్ మార్టన్ – (1766–1809) 223, 564, 580, 639, 685, 688, 691, 719
ఎడ్వర్డ్ III – (1312–137) రాజు (1322–1377) 88, 250, 701
ఎడ్వర్డ్ VI – (1537–1553) రాజు (1547–1553) 698
ఎలిజబెత్ – (1533–1603) క్వీన్ (1558–1603) 250, 685, 699, 702, 703
ఏంగెల్స్ ఫ్రెడరిక్ – (1820–1895) 5, 23, 28, 68, 132, 133, 140, 151, 198, 219, 224, 233, 246, 268, 278, 311, 325,366, 368, 390, 393, 398, 419, 452, 469, 494, 569, 590, 598, 615, 618, 687, 725
ఎన్సర్ జార్జ్ – (1769 – 1843) 693

ఎపిక్యురస్ – (బి.సి. 341–271) 72
ఎస్చ్వేజ్ విల్‌హమ్ లుడ్విగ్ – (1777–1855) 36
ఎవరట్ – 396

**యఫ్**

ఫాల్ హబర్ జోహాన్ – (1580–1635) 347
ఫౌసెట్ హెన్రీ – (1833–1884) 519, 574, 618
ఫర్గ్గసన్ ఆడమ్ – (1723–1816) 113, 327, 334, 335
ఫెరియర్ ఫ్రాంకోయిస్ లూయిస్ ఆగస్టే – (1777–1861) 55
ఫిక్టే జోహాన్ గాట్ లీబ్ – (1762–1814) 46
ఫీల్డెన్ జీన్ – (1784–1849) 372, 381, 719
ఫ్లీట్‌వుడ్ విలియమ్ – (1656–1723) 250
ఫాంటరెట్ ఆంటోనీ లూయిస్ – 336
ఫార్బ్నేన్నాయిస్ ఫ్రాంకోయిస్ – (1722–1800) 83
ఫార్‌స్టర్ నథానియల్ – (సి. 1726–1790) 252, 395, 688, 689
ఫారెస్క్యూ జాన్ – (సి. 1394–1476) 681, 682
ఫ్లోరియర్ చార్లెస్ – (1772–1837) 267, 660
ఫ్రాంక్లిన్ బెంజెమిన్ – (1706–1790) 45, 151, 165, 301, 581
ఫ్రెడరిక్ II – (1712–1786) రాజు (1740–1786) 695, 709
ఫ్ర్యటాగ్ గుస్టవ్ – (1816–1895) 703
ఫలార్టన్ జాన్ – (1780–1849) 118, 130
ఫల్టన్ రాబర్ట్ – (1765–1815) 453

**జి**

గలియని ఫెర్నాండో – (1728–1787) 67, 81, 82, 91, 141, 146, 290, 608
గనిల్ చార్లెస్ – (1758–1836), 55, 73, 84, 160, 165, 414
గాస్కెల్ పి. – 403, 411
జినోవసీ ఆంటోనియో – (1712 – 1769) 141
జియోఫ్‌రాయ్ సెయింట్ హిలర్, ఎటిన్నే – (1772–1844) 709
జార్జ్ II – (1683–1760) రాజు (1727–1760) 35, 88, 702
జార్జ్ III – (1738–1820) రాజు (1760–1820) 702
జర్హర్ట్ చార్లెస్ ఫ్రెడరిక్ – (1816–1856) 284
జిస్‌బార్న్ థామస్ – (1758–1846) 720
గ్లాడ్‌స్టన్ విలియమ్ – (1809–1898) 25, 26, 27, 28, 616, 617, 703
గాడ్నవ్ (గాడ్నష్), బోరిస్ ఫ్రెడరిక్ (1551–1605) 686

గోతే జోహాన్ వాఫ్‌గాంగ్ – (1749–1832) 62, 556
గ్రే జాన్ – (1798–1850) 62
గ్రెగ్ రాబర్ట్ హైడ్ – (1795–1875) 268
గ్రెగొయిర్ హెచ్ – 517
గ్రే జార్జ్ – (1799–1882) 265, 629
గ్రోవ్ విలియమ్ రాబర్ట్ – (1811–1896) 489
గలిక్ గస్టవ్‌వన్ – (1791–1847) 11, 716

హెచ్

హేలర్ కార్ల్ లుడ్విగ్‌వన్ – (1768–1854) 359
హన్‌స్సెన్ జార్జ్ – (1809 – 1894) 217
హాౖరిస్ జేమ్స్ – (1709–1780) 338
హౖరిస్ జేమ్స్ ఫస్ట్ – (1746–1820) 338
హారిసన్ విలియమ్ – (1534–1593) 682, 706
హాస్సల్ ఆర్థర్ హిల్ – (1817–1894) 227
హెగెల్ జార్జ్ ఫ్రెడరిక్ విల్‌హెల్మ్ – (1770–1831) 17, 39, 52, 83, 155, 164, 241, 284, 551
హైన్ హీన్రిచ్ – (1797–1856) 573
హెల్వేషియస్ క్లాడ్ ఎడ్రిన్ – (1715–1771) 573
హెన్రీ III – (1551–1589) రాజు (1485–1509) 121
హెన్రీ VII (1457–1509) 250, 683, 698
హెన్రీ VIII – (1491–1547) రాజు (1509–1547) 683, 698, 699
హెరాక్లిటస్ – (C.V.B.C.) 96
హెరెన్స్‌వండ్ జా – (1728–1811) 111
హాబ్స్ థామస్ – (1558–1679) 157, 360
హాడ్గ్‌స్కిన్ థామస్ – (1787–1869) 313, 326, 328, 535, 713
హాలిన్ షెడ్ రాఫెల్ – (డి. 1580) 699
హోమర్ – (C, IX, VIII, B.C.) 56
హాప్‌కిన్స్ థామస్ – 210
హార్నర్ ఫ్రాన్సిస్ – (1787–1817) 720
హార్నర్ లియొనార్డ్ – (1785–1864) 206, 221, 256, 262, 265, 267, 271, 369, 370, 382, 513
హాటన్ జాన్ – (డి.1705) 395
హవిట్ విలియమ్ – (1792–1879) 714
హ్యూమ్ డేవిడ్ – (1711–1776) 113, 478, 517, 582

హంటర్ హెన్రీ జూలియన్ – 367, 623, 626, 630, 632, 646, 648, 650, 651, 652, 657, 684
హట్టన్ చార్లెస్ – (1737–1823) 342
హక్స్ లే థామస్ హెన్రీ – (1825–1895) 447

ఐ

ఐసోక్రాట్స్ – (436–338–బి.సి) 339

జె

జాకబ్ విలియమ్ – (1762–1851) 36, 201
జేమ్స్ I – (1566–1625) రాజు (1603–1625) 684, 685, 699, 702
జెరోమ్ సెయింట్ (యెజ్ బియస్, సోఫ్రోని యస్, హైరానమస్) (సి. 340–420 ఎ.డి.) 94
జాన్ II – (1319–1364) రాజు (1350–1364) 701
జోన్స్ రిచర్డ్ – (1790–1855), 24, 284, 296, 303, 308, 530, 550, 561, 596
జారెజ్ బెనిటో – (1806–1872) 155

కె

కార్స్ వన్ కార్స్ – మిలియమ్స్, విలియమ్స్ ఫెన్విక్, బారోనట్ "ఆఫ్‌కార్స్" – (1800–1883) 114
కెన్నెట్ వైట్ – (1660 – 1728) 684
కెంట్ నథానియల్ – (1737–1810) 689
కిసెల్లోవ్ (కిస్సెలిఫ్) పావెల్ డిమిట్రివిచ్ కౌంట్ – (1788–1872) 216
కాప్ హెర్మన్ – (1817–1892) 285
కుగెల్మాన్ లుడ్విగ్ – (1830–1902) 10
కూసా అలెగ్జాండర్ జోహాన్ – (1820–1873) 155

యల్

లాబోర్డే అలెగ్జాండర్, మార్క్విస్ డీ – (1774–1842) 495
లాకెటర్ మారిస్ – (1814–1900) 2, 18,
లైంగ్ శామ్యూల్ – (1810–1897) 182, 608, 622, 640
లాన్సెల్లోటి – (1575–1643) 396
లస్కర్ ఎడ్వర్డ్ – (1829–1884) 25
లాస్సల్లీ ఫెర్డినాండ్ – (1825–1864) 6, 96
ల్యాడర్ డాల్ జేమ్స్ ఎర్ల ఆఫ్ – (1759–1839) 322
ల్యారంట్ ఆగస్టే – (1807–1853) 284
లావెరిన్ లూయిస్ గేబ్రియల్ లియోన్సడీ – (1809–1880) 495, 676
లా జాన్ – (1671–1729) 82, 581

లెమాన్టే పైరే ఎడ్వర్డ్ – (1762–1826) 335
లెస్సింగ్ గాట్ హోల్డ్ ఎఫ్రైమ్ – (172–1781) 17
లె ట్రాస్నే గైల్యూమ్ ఫ్రాంకోయిస్ – (1728–1780) 32, 35, 83, 92, 102, 106, 109, 133, 146, 147, 149, 151, 193
లెవి లియోన్ – (1821–1888) 696
లిచినోవ్ స్కీ ఫెలిక్స్, ప్రిన్స్ – (1814–1848) 554
లిసినియస్ గయాస్ లిసినియస్ స్టోల్ – (**IV, B.C.**) 690
లైబిగ్ జస్టస్ వన్ – (1803–1873) 219, 303, 356, 471, 534
లింగ్వెట్ సైమన్ నికోలస్ హెన్రీ – (1736–1794) 213, 264, 308, 580
లాక్ జాన్ – (1632–1704) 32, 82, 92, 114, 139, 360, 581
లూయిస్ XIV – (1638–1715) రాజు (1643–1715) 129
లూయిస్ XVI – (1754–1793) రాజు (1774–1792) 700
లూయిస్ ఫిలిప్పె – (1773–1850) రాజు (1830–1848) 256
లాయిడ్ – చూ. ఓవర్ స్టోన్
ల్యూసియన్ – (125–180 ఎ.డి.) 573
ల్యూక్రెటియస్ – టైటస్ ల్యూక్రెటియస్ కారస్ – (98–55 బిసి) 197
లూథర్ మార్టిన్ – (1483–1546) 177, 285, 556, 716
లైకారగస్ – (సి IX బి.సి.) 390

## యమ్

మెకాలే థామస్ బాబింగ్టన్ – (1800–1859) 251, 255, 680, 686
మాక్కుల్లోచ్, జాన్ రామ్ సే – (1789–1864) 132, 138, 141, 176, 252, 296, 377, 405, 409, 484, 571, 573, 689
మాక్ గ్రెగర్ జాన్ – (1797–1857) 252
మాక్ లారెన్ జేమ్స్ – 89
మాక్లియడ్ హెన్రీ డన్నింగ్ – (1821–1902) 556, 142
మాల్తస్ థామస్ రాబర్ట్ – (1766–1834) 150, 195, 289, 326, 471, 490, 518, 534, 541, 550, 551, 558, 561, 570, 573, 580, 598, 612, 668, 658
మండేవిల్లే బెర్నార్డ్ డీ – (1670–1753) 328, 578, 579, 581
మార్టిన్యూ హరియట్ – (1802–1876) 599
మార్క్స్ కార్ల్ – (1818–1883) 1, 2, 4, 6, 9, 14, 15, 16, 17, 18, 19, 20, 21, 22, 23, 24, 25, 26, 27, 31, 35, 68, 69, 70, 74, 81, 88, 92, 127, 131, 140, 285, 311, 330, 333, 388, 452, 494, 499, 540, 578, 584, 593, 610, 657, 725, 727

మార్క్స్ ఎవెలింగ్, ఎలియనర్ (టస్సీ) (1855–1898) 1, 23, 26, 27
మాస్సీ జోసెఫ్ – (మరణం–1784) 478
మాడ్స్ లీ హెన్రీ – (1771–1831) 354
మారర్ జార్జ్ లుడ్విగ్ వన్ – (1790–1872) 65, 217
మాక్సిమిలియన్ (ఆర్క్‌డ్యూక్ ఆఫ్ ఆస్ట్రియా) ఎంపరర్ ఆఫ్ మెక్సికో – (1832–1867) 155
మేయర్ సిగ్మండ్ – 11
మీట్జన్ ఆగస్ట్ – (1822–1910) 217
మెండల్స్ సోన్ మోసెస్ – (1729–1786) 17
మెనినియస్ ఎగ్రిప్ప లానాటస్ – (డి–493–బిసి) 333
మెర్సియర్ డి లా రివెరె, పాల్ పైర్రే – (1720–1793) 100, 101, 120, 136, 138, 145, 149, 175
మెరివేల్ హెర్మన్ – (1806–1874) 598, 731
మిల్ జేమ్స్ – (1773–1836) 104, 114, 142, 170, 182, 326, 405, 471, 528, 532, 534, 573
మిల్ జాన్ స్టువార్ట్ – (1806–1873) 13, 114, 123, 342, 405, 471, 480, 481, 553, 559, 563, 574, 712
మిరాబి హానోర్, కోమ్టే డీ – (1749–1791) 442,681, 696, 709, 710, 719
మిరాబ్యూ విక్టర్, మార్క్విస్ డీ – (1715–1789) 581, 727
మోలినరీ గస్టవ్ డీ – (1819–1912) 390, 560, 732
మామ్మ్‌సెన్ థియొడర్ – (1817–1903), 155, 157
మాంటాలెమ్‌బర్ట్, చార్లెస్ కోమ్టేడీ – (1810–1870) 435
మాన్‌టీల్ అమాన్స్ అలెగ్జిస్ – (1769–1850) 607
మాంటెస్క్యూ చార్లెస్ డీ – (1689–1755) 83, 114, 580, 717
మూర్ శామ్యూల్ – (1830–1912) 1
మోర్ థామస్ – (1478–1535) 581, 683, 699
మార్టన్ జోన్ చాల్మర్స్ – (1821–1888) 347, 515
ముల్లర్ ఆడమ్ హెన్రీక్ – (1779–1829) 115
మన్ థామస్ – (1571–1641) 477
మర్ఫీ జాన్ నికోలస్ 669
ముర్రే హూ – (1779 –1846) 314

## యన్

నాస్మిత్ జేమ్స్ – (1808–1890) 355, 382, 404
న్యూమ్యాన్ ఫ్రాన్సిస్ విలియమ్ – (1805–1897) 687, 692

న్యూమ్యాన్ శామ్యూల్ ఫిలిప్స్ – (1797–1842) 147, 190
న్యూమార్చ్ విలియమ్ – (1820 – 1882) 272
న్యూన్ హమ్ జి.బి. – 565
నీబర్ బార్ట్‌హోల్డ్ జార్జ్ – (1776–1831) 215
నార్త్ డడ్లీ – (1641–1691) 92, 111, 115, 123, 360, 581

ఓ

ఓమ్‌స్టెడ్ ఫ్రెడరిక్ లా – (1822–1903) 181
ఓప్‌డిక్ జార్జ్ – (1805–1880) 151
ఓర్టస్ జిమేరియా – (1713–1790) 581, 611
ఓవర్ స్టోన్ శామ్యూల్ జోన్స్ లాయిడ్, లార్డ్ – (1796–1883) 114, 132
ఓవెన్ రాబర్ట్ – (1771–1858) 69, 86, 275, 372, 449, 468

పి

పాగ్నిని జియోవన్నీ ఫ్రాన్సిస్కో – (1715–1789) 83
పామర్స్ టన్ హెన్రీ జాన్ టెంపుల్, లార్డ్ – (1784–1865) 422
ప్యారీ విలియమ్ ఎడ్వర్డ్ – (1790–1855) 87
పెక్యూర్ కాన్‌స్టాంటిన్ – (1801–1887) 578
పీల్ రాబర్ట్ – (1750–1830) 720
పీల్ రాబర్ట్ – (1788–1850) 13, 131, 212, 720, 734
పెరికిల్స్ – (సి.490–429 బి.సి.) 338
పెట్టీ విలియమ్ – (1623–1687) 38, 45, 74, 84, 92, 112, 130, 134, 158, 251, 289, 316, 397, 517, 581
ఫిలిఫ్ VI ఆఫ్ వాలోయిస్ – (1293–1350) రాజు (1328–1350) 83
పిండార్ – (సి. 522–443 బి.సి) 139, 387
పింటో ఐజాక్ – (1715–1787) 139
పిట్ విలియమ్, జూనియర్ – (1759–1806) 190, 703
ప్లేటో – (427–347 బి.సి) 338
పాస్ట్ లెథ్వెట్ మాలాచీ – (1707–1767) 252
ప్రైస్ రిచర్డ్ – (1723–1791) 252, 689, 690
ప్రోటో గారస్ – (సి. 485–415) (బి.సి) 228
ప్రొధాన్ పియరే జోసఫ్ – (1809–1865) 62, 77, 390, 478, 499, 549

క్యూ

క్యూనే ఫ్రాంకోయిస్ – (1694–1774) 12, 99, 516, 581
క్విన్ సీ థామస్ డీ – (1785–1859) 365

## ఆర్

రాఫిల్స్ థామస్ స్టామ్ ఫోర్డ్ – (1781–1826) 331, 714
రామాజ్జినీ బెర్నార్డినో – (1633–1714) 336
రామ్‌సే జార్జ్ – (1800–1871) 149, 152, 291, 475, 596
రావెన్‌స్టోన్ పియర్సీ – (డి–1830) 398, 475
రీడ్ జార్జి – 230
రెడ్ గ్రేవ్ అలెగ్జాండర్ – 246, 247, 348, 366, 371, 384, 401, 415, 422, 423, 509, 522, 523
రెగ్నాల్ట్ ఎలియాస్ – (1801–1868) 218
రీచ్ ఎడ్వర్డ్ – (1836–1919) 336
రికార్డో డేవిడ్ – (1772–1823) 11, 12, 14, 49, 69, 72, 73, 76, 114, 132, 150, 153, 154, 188, 189, 210, 283, 357, 362, 363, 376, 398, 400, 405, 408, 471, 479, 483, 486, 490, 497, 524, 534, 552, 558, 562, 569, 578, 596, 720
రిచర్డ్‌సన్ బెంజమిన్ వార్డ్ – (1828–1896) 233, 234, 235
రాబర్ట్స్ జార్జ్ – (డి 1860) 684
రాడ్ బర్టస్ జోహాన్ కార్ల్ – (1805–1875) 494
రోజర్స్ జేమ్స్ ఎడ్విన్ థరోల్డ్ – (1823–1890) 638, 643, 686, 712
రోజియర్ చార్లెస్ – (1800–1885) 255
రోశ్చర్ విల్హెమ్ – (1817–1894) 84, 147, 1898, 199, 242, 299, 337, 578
రాస్సీ పెల్లెగ్రినో – (1787–1848) 159, 533
రార్డ్ డీకార్డ్ పైమేరీ – 228
రూసో జీన్ జాక్యుస్ – (1712–1778) 709
రాక్స్ లావెరిన్, పియర్రెనెలెస్టిన్ – (1802–1874) 704
రాయ్ జె. – 2, 19
రూబెన్స్ పీటర్ పాల్ – (1577–1640) 273
రూజ్ ఆర్నాల్డ్ – (1802–1880) 68, 140
రమ్‌ఫోర్డ్, థాంప్సన్ బెంజామిన్ 564
రస్సెల్ జాన్ లార్డ్ – (1792–1878) 550, 687

## యస్

శాండర్స్ రాబర్ట్. జె. – 268, 277, 372
సే జీన్ బాప్టిస్టే – (1767–1832) 73, 104, 141, 151, 177,189, 335, 357, 408, 484, 558, 570

స్కార్ లెమ్మర్ కర్ల్ – (1834 – 1892) 285
స్క్యూ జోకిన్ ఫ్రెడరిక్ – (1789–1852) 479
షూల్జ్, డెలిజ్ఛ్ హెర్మాన్ – (1808–1883) 6
స్ట్రోఫ్ రార్జ్ జాలియస్ పొలెట్ – (1797–1876) 560
సీనియర్ నాసూ విలియమ్ – (1790–1864) 205, 206, 208, 209, 242, 296, 374, 405, 448, 457, 505, 510, 559, 676, 694
సెక్స్టస్ ఎంపిరికస్ – (రెండవ శతాబ్దం చివరిలో ఎ.డి.) 338
షాఫ్టెన్ బరీ ఆష్ లీ – (చూడుము)
షేక్స్పియర్ విలియమ్ – (1564–1616) 121, 452, 706
సిద్మౌత్ హెన్రీ ఎడింగ్టన్ – (1757–1844) 397
సియబర్ నికోలయ్ ఇవాన్ విచ్ – (1844–1888) 14
సైమన్ జాన్ – (1816–1904) 430, 621, 623, 629, 631, 646
సిస్మాండీ, జాన్ చార్లెస్ లియొనార్డ్ సిమాండె డీ – (1773–1842) 12, 143, 160, 215, 290, 498, 539, 544, 547, 548, 558, 612, 724
స్కార్బెక్ ఫ్రెడరిక్ – (1792–1866) 302, 324
స్మిత్ ఆడమ్ – (1723–1790) 42, 73, 113, 114, 153, 322, 328, 335, 336, 337, 357, 378, 426, 471, 484, 496, 498, 500, 503, 520, 521, 530, 552, 553, 558, 574, 578, 581, 582, 583, 585, 586, 608, 619, 677, 701, 722
స్మిత్ గోల్డ్ విన్ – (1823–1910) 712
సోయట్ బీర్ జార్జ్ అడాల్ఫ్ – (1814–1892) 22
సోమర్స్ రాబర్ట్ – (1822–1891) 695, 696
సోఫోకల్స్ – (సి.496–406) బి.సి) 122
సార్జ్ ఫ్రెడరిక్ ఆడాల్ఫ్ – (1828–1906) 2
స్పినోజా బెనెడిక్టస్ డీ – (1632–1677) 17, 283, 559
స్టాఫోర్డ్ విలియమ్ – (1554–1612) 706
స్టువర్ట్ జేమ్స్ – (1712–1780) 24, 113, 133, 137, 164, 306, 326, 397, 574, 580, 612, 681, 708
స్టువర్ట్ డుగాల్డ్ – (1753–1828) 295, 318, 333, 450
స్టార్ఛ్ హీన్‌రిక్ ఫ్రెడరిక్ – (1766–1835) 167, 324, 333, 334, 553, 612
స్ట్రైప్ జాన్ – (1643–1737) 699
స్టువర్ట్ జె – 265, 287
స్టువర్ట్ – 686
సల్లీ మాక్సిమిలన్ డీ బెత్యూన్ – (1559–1641) 581

సూథర్‌లాండ్, ఎలిజబెత్, డచెస్ ఆఫ్ – (చివర, మధ్య శతాబ్దము) 693, 694
సూథర్ లాండ్, హరియట్ ఎలిజబెత్, డచెస్ ఆఫ్ – (1806–1868) 694

**టి**

టేలర్ సెడ్లీ – 26, 27
టెంపుల్ విలియమ్ – (1628–1699) 581
థీర్స్ లూయిస్ అడాల్ఫ్ – (1797–1877) 409, 678
థాంప్సన్ బెంజమిన్, కౌంట్ రమ్‌ఫోర్డ్ – (1753–1814) 564
థాంప్సన్ విలియమ్ – (1785–1833) 334
థార్న్‌టన్ విలియమ్ థామస్ – (1813–1880) 158, 248
థుసిడిడెస్ – (460–400 బి.సి) 338
థువెన్ జోహాన్ హెన్‌రిక్ వన్ – (1783–1850) 585
టైటస్ ఫ్లేవియస్ వెస్పాసైనస్ – (39–81) ఎ.డి) 365
టూకి థామస్ – (1774–1858) 272
టోరెన్స్ రాబర్ట్ – (1780–1864) 149
టౌన్ సెండ్ జోసఫ్ – (1739–1816) 326, 581, 611
చెర్నిషేవిస్కీ – 13
టక్కర్ జోసయ్య – (1712–1799) 252, 581, 722
టుక్కెట్ జాన్ డెబిల్ – (డి.1864) 334, 684, 711
ట్యూడర్స్ – 711
ట్యూపర్ మార్టిన్ – (1810–1889) 573
టర్గోట్ అనీరాబర్ట్ – (1727–1781) 165, 289, 496

**యు**

ఉరే ఆంద్ర్యూ – (1778–1857) 24, 208, 242, 251, 276, 296, 322, 323, 340, 350, 356, 373, 387, 388, 389, 391, 400, 401, 404, 405, 514, 518, 522
ఉర్కుహార్ట్ – డేవిడ్ – (1805–1877) 91, 336, 470, 694, 710, 711

**వి**

వాలెంటెన్ గేబ్రియల్ గుస్టవ్ – (1810–1883) 447
వాండర్ లింట్ జాకబ్ । (డి.1740) 113, 120, 133, 252, 254, 289, 305, 321, 581
వ్యాబన్ సెబస్టిన్ లీ ప్రీస్టర్ డీ – (1633–1707) 129
వ్యాకన్ సన్ జాక్యుస్ డీ – (1709–1782) 352
వెర్రీ పియత్రో – (1728–1797) 38, 82, 123, 304
వికో జియొవన్నీ బాటెస్టా – (1668–1744) 343
విస్సరింగ్ యస్ – (1818–1888) 468

## డబ్ల్యు


వేడ్ జాన్ – (1788–1875) 223, 250, 583
వేక్ ఫీల్డ్ ఎడ్వర్డ్ గిబ్బన్ – (1796–1862) 247, 300, 498, 545, 640, 727, 728, 729, 731, 732, 733, 734
వ్యాలస్ రాబర్ట్ – (1697–1771) 326, 581
వార్డ్ జాన్ – 245
వాట్సన్ జాన్ ఫోర్బ్స్ – (1827–1892) 361
వాట్ జేమ్స్ – (1736–1819) 346, 348, 358, 453
వాట్స్ జాన్ – (1818–1887) 512, 515
వేలాండ్ ఫ్రాన్సిస్ – (1796–1865) 151, 191
వెడ్జ్‌వుడ్ జోసయ్య – (1730–1795) 245, 248
వెల్లింగ్‌టన్ ఆర్థర్ వెల్లెస్లీ – (1769–1852) 114
వెస్ట్ ఎడ్వర్డ్ – (1782–1828) 471, 490, 504, 505
వైట్ జె.ఇ. – 226, 236, 240, 242, 371, 435, 436
వైట్నీ ఎలి – (1765–1825) 353, 361
విల్క్స్ మార్క్ – (1760–1831) 331
విలియమ్ III ఆఫ్ ఆరంజ్ – (1650–1702) రాజు – (1689–1702) 687
విలియమ్ IV – (1765–1837) రాజు (1830–1837) 266
విల్సన్ జేమ్స్ – (1805–1860) 314
విట్ జాన్ డీ – (1625–1672) 572, 718
వాల్ఫ్ క్రిస్టియన్ – (1679–1754) 573
రైట్ థామస్ – (Wright Thomas) 689
వ్యాట్ జాన్ – (1700–1766) 343


## ఎక్స్


గ్జెనోఫోన్ – (సి. 430–354–బిసి) 339


## వై


యర్రాంటన్ ఆండ్ర్యూ – (1616–1684) 321
యంగ్ ఆర్థర్ – (1741–1820) 113, 210, 252, 638, 645

# వార్తపత్రికలు, ఇతర పత్రికల సూచిక

Bayerische Zeitung, మే 9, 1862

బెంగాల్ హుర్కరు – ద్వైమాసిక, వార్తా సంక్షిప్త ప్రతి, జూలై 22, 1861

బరీగార్డియన్, మే 12, 1860

కంకార్డియా, మార్చ్ 7, 1872; జూలై, 4, 1872; జూలై, 11, 1872

డెయిలీ టెలిగ్రాఫ్, జనవరి 17, 1860

Deutsch - Fran Zosiche Jahrbuchrer, సంపాదకులు

ఎ.రూజ్ & కె. మార్క్స్, పారిస్, 1844

ఎకనామిస్ట్, లండన్ మార్చి 29, 1845; ఏప్రిల్ 15, 1848; జూలై 19, 1859;
జనవరి 21, 1860; జూన్ 2, 1866

ది యూరోపియన్ మెసెంజర్, మే 1872

ఈవినింగ్ స్టాండర్డ్, లండన్ నవంబర్ 1, 1866

గ్లాస్గో డైలీమెయిల్, ఏప్రిల్ 25, 1849

జర్నల్ ఆఫ్ ది సొసైటీ ఆఫ్ ఆర్ట్స్, లండన్, జనవరి 5, 1872

మాక్మిలన్స్ మేగజైన్, ఆగస్టు 1863

మార్నింగ్ అడ్వర్‌టైజర్, లండన్ ఏప్రిల్ 17, 1863

మార్నింగ్ క్రానికల్ (1845)

మార్నింగ్ స్టార్, లండన్ ఏప్రిల్ 13, 1863; జూన్ 23, 1863; జనవరి 7, 1867

Neue Rheinische Zeitung, Politisch Okonomische Reveu.

హాంబర్గ్, ఏప్రిల్ 1850

Neue rheinische Zeitung, Koln, ఏప్రిల్ 7, 1849

న్యూయార్క్ డైలీ ట్రిబ్యూన్, ఫిబ్రవరి 9, 1853

ది అబ్జర్వర్, లండన్ ఏప్రిల్ 24, 1864

పాల్ మాల్ గెజెట్

పారిస్ విప్లవం, పారిస్ 1791 (Revolution de paris, 1791)

Revue Positiviste, paris, Nov/Dec 1863-14

రేనాల్డ్స్ న్యూస్ పేపర్, జనవరి 1866; ఫిబ్రవరి 4, 1866; జనవరి 20, 1867

Sankt - Peterburgskie Viedomosti, ఏప్రిల్ 20, 1872

సాటర్డే రెవ్యూ – ఏప్రిల్ 8, 1872
సోషల్ సైన్స్ రెవ్యూ – జూలై 18, 1863
స్పెక్టేటర్, జూన్ 3, 1866
స్టాండర్డ్, అక్టోబర్, 26 1861; ఆగస్టు, 15, 1863; ఏప్రిల్ 5, 1867
ది టైమ్స్, లండన్, ఫిబ్రవరి 14, 1843; నవంబర్ 5, 1861; నవంబర్ 26, 1862
మార్చి 24, 1863; ఏప్రిల్ 17, 1863; జూలై 2, 1863; ఫిబ్రవరి 26, 1864
జనవరి 26, 1867; సెప్టెంబర్ 3, 1873; నవంబర్ 29, 1883
టుడే, పిబ్రవరి 1884; మార్చి 1884
Volksstaat, లీఫ్జింగ్ జూన్ 1, 1872; ఆగస్టు 7, 1872
వెస్ట్ మినిస్టర్ రెవ్యూ
వర్క్ మాన్స్ అడ్వొకేట్, జనవరి 13, 1866

## పార్లమెంటరీ నివేదికలు – ఇతర అధికార ప్రచురణలు

అడల్టరేషన్ ఆఫ్ బ్రెడ్ సెలెక్ట్ కమిటీ నివేదిక, లండన్ 1855
అడల్టరేషన్ ఆఫ్ బ్రెడ్ సెలెక్ట్ కమిటీ నివేదిక, లండన్ 1855
అగ్రికల్చరల్ లేబరర్స్ (డబ్లిన్) రిపోర్ట్స్ బై పూర్‌లా ఇన్స్పెక్టర్స్ ఆన్ వేజెస్ 1870
అగ్రికల్చరల్ లేబరర్స్ (ఐర్లాండ్) రిటర్న్ ఆఫ్ ది యావరేజ్ రేట్ ఆఫ్ వీక్లీ ఎర్నింగ్స్ ఆఫ్ అగ్రికల్చరల్ లేబరర్స్ ఇన్ ఐర్లాండ్ 1862
అగ్రికల్చరల్ స్టాటిస్టిక్స్, ఐర్లాండ్, టేబుల్స్ షోయింగ్ ది ఎస్టిమేటెడ్ యావరేజ్ ప్రొడ్యూస్ ఆఫ్ ది క్రాప్ ఫర్ ది ఇయర్, 1866 డబ్లిన్, 1867
బేకర్స్ రిపోర్ట్ ఆన్ ది గ్రీ వెన్సెస్ ఆఫ్ జెర్నీ మెన్ బేకర్స్, లండన్, 1862
బేకింగ్ ట్రేడ్ (ఐర్లాండ్) రిపోర్ట్ ఆఫ్ కమిటీ ఆన్ లండన్, 1861
బ్యాంక్‌యాక్ట్స్, సెలెక్ట్ కమిటీ నివేదిక, జూలై 1858
బర్త్స్, డెత్స్ అండ్ మేరేజెస్, ఇంగ్లాండ్, అక్టోబర్ 1861 రిపోర్ట్ ఆఫ్ రిజిస్ట్రార్ – జనరల్
సెన్సస్ ఆఫ్ ఇంగ్లాండ్ అండ్ వేల్స్ ఫర్ ది ఇయర్ 1861 లండన్ 1863, సంపుటం III
చిల్డ్రన్స్ ఎంప్లాయ్‌మెంట్ కమిషన్ రిపోర్ట్స్ 1 –VI– వాణిజ్యం, కార్ఖానాల్లో నియుక్తం కాబడిన పిల్లల, తరుణ వయస్కుల వివరాలు, వీరి నియామకాలు చట్టబద్ధం కావు

ఫస్ట్ రిపోర్ట్, లండన్ (మొదటి నివేదిక) 1863

సెకెండ్ రిపోర్ట్, లండన్ (రెండవ నివేదిక) 1864

థర్డ్ రిపోర్ట్, లండన్ (మూడవ నివేదిక) 1864

ఫోర్త్ రిపోర్ట్, (నాలుగో నివేదిక) లండన్ 1865

ఫిఫ్త్ రిపోర్ట్ (అయిదో నివేదిక) లండన్, 1866

సిక్స్త్ రిపోర్ట్, లండన్ (ఆరో నివేదిక) లండన్ 1867

కార్న్‌లాస్ (ధాన్యం చట్టాలు) సెలెక్ట్ కమిటీ నివేదిక 1813

పారిశ్రామిక వివరాలకు, ట్రేడ్ యూనియన్లకు సంబంధించి విదేశాల్లోని బ్రిటీష్ రాణిగారి దౌత్య కార్యాలయాలతో జరిపిన ప్రత్యుత్తరాలు

ఫ్యాక్టరీలు : ఫ్యాక్టరీలలో పిల్లల నియామకంపై దర్యాప్తు కమిషన్, లండన్, 1833

ఫ్యాక్టరీల క్రమబద్ధీకరణ చట్టాలు, 1833, 1859, 1867, 1878

ఫ్యాక్టరీలు, హెచ్.ఎం. ఇన్‌స్పెక్టర్ల నివేదికలు వగైరా

1841, డిసెంబర్ 31 నాటికి ఆరు మాసాల నివేదికలు లండన్, 1842

1844 సంవత్సరంలోనివీ, 1845లో మొదటి మూడు మాసాల నివేదికలు 1845

1848 ఏప్రిల్ 30తో ముగిసిన అర్ధ సంవత్సరాంత నివేదికలు లండన్, 1848

1848 అక్టోబర్ 31తో ముగిసే త్రైమాసికాంత నివేదికలు లండన్, 1848

1849 ఏప్రిల్ 30తో ముగిసే అర్ధవార్షిక నివేదికలు లండన్, 1849

1849 అక్టోబర్ 31 నాటికి ముగిసినవి – లండన్, 1850

1850 ఏప్రిల్ 30, లండన్, 1850

1850 అక్టోబర్ 31 నాటికి, లండన్, 1851

1852 ఏప్రిల్ 30 లండన్, 1851

1853 అక్టోబర్ 31 నాటికి, లండన్, 1854

1855 ఏప్రిల్ 30 నాటికి, లండన్, 1855

1855 అక్టోబర్31 నాటికి, లండన్, 1856

1856 అక్టోబర్ 31 నాటికి, లండన్, 1856

1857 జూన్ 30 నాటికి, లండన్, 1856

1857 అక్టోబర్ 31 నాటికి, లండన్, 1857-58

1858 ఏప్రిల్ 30 నాటికి, లండన్, 1858

1858 అక్టోబర్ 31 నాటికి, లండన్, 1859

1859 ఏప్రిల్ 30 నాటికి లండన్, 1859

1859 అక్టోబర్ 31 నాటికి, లండన్ 1860

1860 ఏప్రిల్ 30 నాటికి, లండన్, 1860

1860 అక్టోబర్ 31 నాటికి, లండన్, 1861

1861 ఏప్రిల్ 30 నాటికి, లండన్, 1861

1861 అక్టోబర్ 31 నాటికి, లండన్, 1862

1862 అక్టోబర్ 31 నాటికి, లండన్, 1863

1863 ఏప్రిల్ 30 నాటికి, లండన్ 1863

1863 అక్టోబరు 31 నాటికి, లండన్, 1864

1864 ఏప్రిల్ 30 నాటికి, లండన్, 1864

1864 అక్టోబర్ 31 (డిసెంబర్) నాటికి, లండన్, 1864

1865 అక్టోబర్ 31 నాటికి, లండన్, 1866

1866 అక్టోబర్ 31 నాటికి, లండన్, 1866

హాన్సర్డ్ పార్లమెంటరీ చర్చలు – బడ్జెట్‌పై గ్లాడ్‌స్టన్ ప్రసంగం. ఫిబ్రవరి,14, 1843, లండన్ 1843

1863, ఏప్రిల్ 16న గ్లాడ్‌స్టన్ బడ్జెట్ ప్రసంగం లండన్ 1863

1863 ఏప్రిల్ 27న ఫెరాండ్ ప్రసంగం, లండన్ 1863

1864, ఏప్రిల్ 7న గ్లాడ్‌స్టన్ ప్రసంగం లండన్, 1864

లార్డ్స్ సభ, వాణిజ్యం, ధాన్యాల వినియోగంపై సెలెక్ట్ కమిటీ నివేదిక (1814–1815)

1860లో ఇన్‌లాండ్ రెవిన్యూ నివేదికలు

1866లో ఇన్‌లాండ్ రెవిన్యూ నివేదికలు

వడకే యజమానుల, కార్ఖానా యజమానుల రక్షణ నిధి, కమిటీ నివేదిక, మాంచెస్టర్ 1854

గనులపై సెలెక్ట్ కమిటీ నివేదిక

గనులపై రాయల్ కమిషన్ 1864

మిస్లేనియస్ స్టాటిస్టిక్స్ ఆఫ్ ది యు.కె. పార్ట్ VI, 1866

పార్లమెంటరీ రిటర్న్లు 1839, 1850, 1856, 1862

పబ్లిక్ హెల్త్, ప్రివీ కౌన్సిల్ తాలూకు మెడికల్ ఆఫీసర్ నివేదికలు

మూడో నివేదిక లండన్ 1860

నాలుగో నివేదిక 1861

ఆరో నివేదిక లండన్ 1863

ఏడో నివేదిక 1864 లండన్, 1865

ఎనిమిదో నివేదిక 1865; లండన్, 1866

రైల్వేలపై రాయల్ కమిషన్ లండన్ 1867

పీనల్ సర్విట్యూడ్‌కూ ట్రాన్స్‌పోర్టేషన్‌కూ సంబంధించిన కమిషనర్ల నివేదిక లండన్, 1863

సోషల్ సైన్స్ కాంగ్రెస్ నివేదికలు, ఎడింబరో, అక్టోబర్ 1863

స్టాటిస్టికల్ యాబ్‌స్ట్రాక్స్, లండన్ 1861, 1865

స్టాటిస్టిక్స్ – మిస్లేనియస్ స్టాటిస్టిక్స్ చూడండి

శ్రమజీవుల చట్టాలు (1349–1496)

మెసచ్యూట్స్ చట్టాలు

న్యూజెర్సీ చట్టాలు

రోడ్ ఐలాండ్ చట్టాలు



**PETTUBADI (CAPITAL)** KARL MARX

Volume 1 ( Telugu)

"పెట్టుబడి" గ్రంథం వెలువడి నూటయాభై సంవత్సరాలైనా, దాని ప్రాధాన్యత నానాటికీ పెరుగుతూనే ఉందిగాని, తరగడం లేదు. అందులో విశ్లేషించిన అంశాలు, ప్రతిపాదించిన సూత్రీకరణలు సజీవంగా నేటికీ మన సామాజిక జీవనంలో ప్రస్ఫుటంగా కనిపిస్తున్నందువల్లనే ఆ గ్రంథానికి అంత ప్రాధాన్యత ఉంది. 2008లో అమెరికాతో ప్రారంభమై ప్రపంచంలోని పెట్టుబడిదారీ దేశాలనూ, వాటితో వ్యాపార లావాదేవీలు కలిగిన అభివృద్ధి చెందుతున్న దేశాలను సహితం కుదిపివేసిన ఆర్థిక సంక్షోభం అనంతరం మార్క్సిస్టు మేధావులతోపాటుగా ఇతర మేధావులు, ఆర్థికవేత్తలు పెట్టుబడి గ్రంథాన్ని తిరిగి అధ్యయనం చేస్తున్నారన్న వార్తలు ఆ గ్రంథ ప్రాధాన్యతను నొక్కి వక్కాణిస్తున్నాయి. ప్రపంచ వ్యాపితంగా లక్షల సంఖ్యలో పెట్టుబడి గ్రంథ కాపీలు పునర్ముద్రించబడ్డాయి.

చరిత్రగతినీ, మన కాలపు మహద్విజయాలనూ, అపజయాలనూ అవగాహన చేసుకోడానికి సహాయపడగలిగిన భావాలకు "పెట్టుబడి" గ్రంథం ఒక అక్షయనిధి. చారిత్రక పరిణామ నూతన అనుభవాలనుపయోగించి, భావజాలాన్ని, ఘటనలను సృజనాత్మకంగా వివరించగలిగిన మార్క్సిస్టు-లెనినిస్టు మూల సూత్రాలకు "పెట్టుబడి" గ్రంథం పునాదిరాయి. అలాంటి గ్రంథాన్ని అధ్యయనం చేయడం ప్రతి సామాజిక శాస్త్రవేత్తకూ, ప్రత్యేకించి ప్రతి మార్క్సిస్టు-లెనినిస్టుకూ శ్రమభరితమైనా, సంతోషకరమైన ఉత్తమ కర్తవ్యం కావాలి.


వెల : ₹ 600/-
(మూడు సంపుటాల వెల ₹ 1699/-)


విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్
చంద్రం బిల్డింగ్స్, చుట్టుగుంట, విజయవాడ-520 004

రెండవ సంపుటం

# కార్ల్ మార్క్స్

# పెట్టుబడి





## కార్ల్ మార్క్స్

# పెట్టుబడి

## రెండవ సంపుటం


**అనువాదకులు**

బిట్రగుంట రామచంద్రరావు

ఎ. గాంధీ

సోదుం రామ్మోహన్



**మొదటి ముద్రణ**

**సంపాదకులు**

వై.వి. కృష్ణారావు

బిట్రగుంట రామచంద్రరావు

**రెండవ ముద్రణ**

(సవరించబడినది)

**సంపాదకుడు**

గడ్డం కోటేశ్వరరావు

విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్

విజయవాడ

**PETTUBADI (CAPITAL) KARL MARX** *Vol. II (Telugu)*

ప్రచురణ నెం. : 2350/2-1R
ప్రతులు : 1000
మొదటి ముద్రణ : నవంబర్, 1998
రెండవ ముద్రణ : ఫిబ్రవరి, 2017

**© విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్**

వెల : **₹ 419/-**
**(మూడు సంపుటాల వెల ₹ 1699/-)**

**ప్రతులకు**

**విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్**
33-22-2, చంద్రం బిల్డింగ్స్
చుట్టుగుంట, విజయవాడ-520004
ఫోన్ : 0866-2430302
Email : vphpublish@gmail.com

**విశాలాంధ్ర బుక్‌హౌస్**
విజయవాడ, విశాఖపట్నం,
అనంతపురం, గుంటూరు
తిరుపతి, కాకినాడ, ఒంగోలు
శ్రీకాకుళం, కడప, విజయనగరం

**హెచ్చరిక :** ఈ పుస్తకంలో ఏ భాగాన్నైనా పూర్తిగా కానీ, పాక్షికంగా కానీ కాపీరైట్ హక్కు కలిగినవారి నుండి లేక ప్రచురణకర్తల నుండి ముందుగా రాతపూర్వక అనుమతి పొందకుండా ఏ రూపంగా వాడుకున్నా కాపీరైట్ చట్టరీత్యా నేరం.

**ముద్రణ : విశాలాంధ్ర విజ్ఞాన సమితి ముద్రణాలయం - విజయవాడ**

# Das Kapital.

## Kritik der politischen Oekonomie.

Von

**Karl Marx.**

Zweiter Band.

**Buch II: Der Cirkulationsprocess des Kapitals.**

**Zweite Auflage.**

Herausgegeben von **Friedrich Engels.**

Das Recht der Uebersetzung ist vorbehalten.

**Hamburg**
**Verlag von Otto Meissner.**
**1893.**

# కృతజ్ఞతలు

ఆంధ్రప్రదేశ్ కమ్యూనిస్టు సమితి చొరవతో, దాతల సహకారంతో మార్క్స్ మహాశయుని "కాపిటల్" గ్రంథాన్ని తెలుగులో "పెట్టుబడి" గ్రంథంగా వెలువరించాలని విశాలాంధ్ర విజ్ఞాన సమితి 1984 సం॥రంలో బృహత్కార్యాన్ని చేపట్టింది. దాని ఫలితంగా 1996-2000 సం॥రాల మధ్య కాలంలో పెట్టుబడి గ్రంథం మూడు సంపుటాలు వెలువడినాయి. ఆ పుస్తకాలన్నీ చెల్లిపోవడంతో వాటిని విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ సహకారంతో పునర్ముద్రణ చేయాలనే సంకల్పంతో కామ్రేడ్స్ ఈడ్పుగంటి నాగేశ్వరరావు (ఛైర్మన్), గడ్డం కోటేశ్వరరావు (కన్వీనర్/సమన్వయ కర్త), రావు కృష్ణారావు, ఆచార్య నన్నపనేని అంజయ్య, ఆచార్య చేకూరి నరసింహారావులతో ఒక ఉపసంఘాన్ని ఆంధ్రప్రదేశ్ కమ్యూనిస్టు సమితి 26-2-2011న నియమించింది.

ఆ ఉపసంఘం 2011వ సం॥రం ఫిబ్రవరి 26, మార్చి 14, మార్చి 16 తేదీలలో సమావేశాలు జరిపి, పునర్ముద్రణకు అవసరమైన ప్రాతిపదికలను, విధి విధానాలను నిర్ణయించి, క్రింద పేర్కొన్న విధంగా పని విభజన చేసింది.

1. మొదటి ముద్రణ సమగ్రంగా రూపొందించబడినప్పటికీ, వాక్య నిర్మాణంలోనూ, భావ స్పష్టతలోనూ, వాక్యం నడకలోనూ అక్కడక్కడ యాదృచ్ఛికంగా దొర్లిన తప్పలను సరిచేసి అవసరమైనచోట్ల సవరణలు, మార్పులు చేర్పులు చేయాలి. అనువాదం వీలైనంత వరకూ ఒకే విధంగా (Uniform) ఉండేటట్లు చూడాలి.
2. సరఫరా చేయబడిన పారిభాషిక పదకోశంలోని పదజాలాన్ని వాడటం ద్వారా అనువాదం ఒకే విధంగా ఉండటానికి అందరూ ప్రయత్నించాలి. తప్పనిస్థితిలో, పదకోశంలో లేని, తాము వాడిన పదానికి పక్కనే ఇంగ్లీషు పదాన్ని బ్రాకెట్లో తప్పనిసరిగా రాయాలి.
3. మొదటి సంపుటానికి గడ్డం కోటేశ్వరరావు, రెండవ సంపుటానికి ఆచార్య సి. నరసింహారావు, ఆచార్య నన్నపనేని అంజయ్య, మూడవ సంపుటానికి రావు కృష్ణారావు, ఎ. గాంధీలు సంపాదక బాధ్యతలు నిర్వర్తించాలి.

2011వ సం॥రంలోనే పునర్ముద్రణ బాధ్యతలను విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ సంపాదకవర్గం స్వీకరించింది. అయితే పునర్ముద్రణకు సంపాదక బాధ్యతలు స్వీకరించిన ఆచార్య సి. నరసింహారావు, ఆచార్య ఎన్. అంజయ్య, మిత్రులు ఎ. గాంధీలు తమ వ్యక్తిగత కారణాల రీత్యా ఆ బాధ్యతలను నెరవేర్చలేమని తమ అశక్తతను వెల్లడిచేసినందున, మొదటి రెండు సంపుటాల సంపాదక బాధ్యతలను కామ్రేడ్ గడ్డం కోటేశ్వరరావు, మూడవ సంపుటం బాధ్యతలను కామ్రేడ్ రావు కృష్ణారావు, కామ్రేడ్ గడ్డం కోటేశ్వరరావులు స్వీకరించవలసి వచ్చింది.

మొదటిసారి అనువాదానికి మూలగ్రంథాలుగా స్వీకరించినవి :

1. 1887వ సం॥రపు శామ్యూల్ మూర్, ఎడ్వర్డ్ ఆవలింగ్‌ల ఇంగ్లీషు అనువాద గ్రంథాన్ని, 1954వ సం॥రంలో ఫారిన్ లాంగ్వేజస్ పబ్లిషింగ్ హౌస్, మాస్కో వారు పునర్ముద్రణ చేశారు. ఇది మొదటి సంపుటానికి మూలాధారం.
2. 1893వ సం॥రంలో జర్మన్ భాషలో ముద్రించబడిన "దాస్ కాపిటల్" (రెండవ సంపుటం) గ్రంథాన్ని ఫారిన్ లాంగ్వేజస్ పబ్లిషింగ్ హౌస్, మాస్కో వారు ఇంగ్లీషులోకి అనువదింపజేసి 1961వ సం॥రంలో ముద్రించారు. ఇది రెండవ సంపుటానికి మూలాధారం.
3. 1894వ సం॥రంలో జర్మన్ భాషలో ముద్రించబడిన "దాస్ కాపిటల్" (మూడవ సంపుటం) గ్రంథాన్ని ప్రోగ్రెస్ పబ్లిషర్స్, మాస్కో వారు ఇంగ్లీషులోకి అనువదింపజేసి 1966 సం॥రంలో ముద్రించారు. ఇది మూడవ సంపుటానికి మూలాధారం.

ఈ పుస్తకాలలోని ఇంగ్లీషేతర భాషల వాక్యాలు, పదాలు (జర్మన్, ఫ్రెంచి, ఇటాలిన్, స్పానిష్ వగైరాలు) ఆనాటి అనువాదానికి చాలా క్లిష్ట సమస్యలైనాయి. ప్రత్యేకించి పాదసూచికల్లోని అంశాలు మిక్కిలి క్లిష్టంగా మారాయి. అనువైనచోట్ల ఆనాడు అనువదించారు. తప్పని స్థితిలో కొన్నిచోట్ల ఆ భాషనే యథాతథంగా అక్కడ రాశారు. అయితే ప్రస్తుత రెండవ ముద్రణలో ఆ సమస్యలను పరిష్కరించడానికి మరికొన్ని ఇంగ్లీషు గ్రంథాలను ఆశ్రయించాము. అందుకు దోహదపడిన గ్రంథాలు : బెన్‌ఫోక్స్, డేవిడ్ ఫెరన్‌బాక్ లు ఇంగ్లీషులోకి అనువదించి, పెంగ్విన్, న్యూలెఫ్ట రెవ్యూ వారు ముద్రించిన "కాపిటల్" గ్రంథం మూడు సంపుటాలు; జి.డి.హెచ్. కోల్ ఉపోద్ఘాతంతో, ఈడెన్ అండ్ సిడార్‌పాల్‌లు ఇంగ్లీషులోకి అనువదించిన ఎవ్విరిమాన్ లైబ్రరీ వారు ముద్రించిన రెండు పుస్తకాలు; వీటితోపాటు, కాపిటల్ గ్రంథం మీద వివరణలు, వ్యాఖ్యానాలు, విశ్లేషణల రూపాల్లో రాసిన గ్రంథాలు; సి.జె. ఆర్థర్ రాసిన "మార్క్స్ కాపిటల్"; డేవిడ్ హార్వే రాసిన "ఎ కంపానియన్ టు మార్క్స్ కాపిటల్"; మైకేల్ హీన్‌రిక్ రాసిన "యన్ ఇన్‌ట్రడక్షన్ టు త్రి వాల్యూమ్స్ ఆఫ్ కారల్ మార్క్స్ కాపిటల్"; లూయీ ఆల్తూజర్, బలిబార్ రాసిన "రీడింగ్ కాపిటల్"; ఫ్రాన్సిస్ వీన్ రాసిన "మార్క్స్ దాస్ కాపిటల్" వగైరా గ్రంథాలు బాగా ఉపకరించాయి.

రెండవ ముద్రణ దాదాపుగా సమగ్రంగా అనువదించబడిందని వినయపూర్వకంగా మనవి చేస్తున్నాం. వాక్య నిర్మాణంలోనూ, భావ స్పష్టతలోనూ యాదృచ్ఛికంగా దొర్లిన పొరపాట్లను దాదాపుగా సరిచేశాం. మొదటి ముద్రణలో కనుగప్పి తప్పిపోయిన (Missing lines) వాక్యాలను తిరిగి చేర్చాము. ఇంగ్లీషేతర భాషల్లోని వాక్యాలనూ, పదాలనూ వీలైనంతవరకు అనువదించాము.

బహుభాషాకోవిదుడైన మార్క్స్ రచనలను అనువదించడం అంత సులభమైన పని కాదు. ఆయన రాసిన ప్రతి వాక్యంలోనూ దాదాపుగా సామెతలు, అలంకారాలు మెండుగా ఉంటాయి. అందులో పలురకాలైన భాషల్లో చెణుకులూ, వ్యంగ్యాలు ఉంటాయి. వాటి అనువాదం మాకు సంక్లిష్ట సమస్యగా మారింది. పలువురు భాషా కోవిదులను సంప్రదించవలసి వచ్చింది. మా శక్తి స్తోమతల మేరకు అనువదించాం. అయితే అందుకు సమయం పట్టింది.

మూడు సంపుటాల పునర్ముద్రణకు సంపాదక బాధ్యతలను గడ్డం కోటేశ్వరరావు, రావు కృష్ణారావులు మాత్రమే నెరవేర్చవలసివచ్చినందున, ఐదు సం॥రాలకు గానీ పునర్ముద్రణకు సిద్ధం చేయలేకపోయాము. మధ్యలో పునర్ముద్రణపై నీలినీడలు వ్యాపించడం కూడా ఆలస్యానికి మరో కారణం. వాటిని అధిగమించాం. ఆరోగ్యం సహకరించనప్పటికీ, పట్టుదలతో తన బాధ్యతను



నిర్విఘ్నంగా నెరవేర్చిన కామ్రేడ్ రావు కృష్ణారావు అభినందనీయులు. వారికి హృదయపూర్వక కృతజ్ఞతాభివందనాలు.

సక్రమంగా డి.టి.పి. చేయించడానికీ, ప్రూఫులు దిద్దడానికి కూడా సుదీర్ఘకాలం పట్టింది. సాంకేతిక పదాలు, శాస్త్ర సంబంధిత అంశాలు, గణాంకాలు, పట్టికలు వగైరాలను మూలగ్రంథ విధేయంగా తీసుకురావడానికి కూడా సమర్థులైన డి.టి.పి. ఆపరేటర్ల, ప్రూఫ్‌రీడర్ల ఆవశ్యకత ప్రత్యేకంగా పేర్కొనవలసిన అవసరంలేదు. విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్‌కున్న పరిమిత వనరులతోనే ఈ అంశాలన్నింటిలోనూ జాగ్రత్తపడ్డాం. ఎంతో ఓర్పుతో సంపాదకులు, సిబ్బంది శ్రమించి ఈ గ్రంథాన్ని ముద్రణకు సిద్ధం చేశారు.

యజ్ఞంలాగా సాగిన ఈ బృహత్తర కార్యక్రమానికి స్ఫూర్తినిచ్చిన భారత కమ్యూనిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ సురవరం సుధాకరరెడ్డిగార్కి, సి.పి.ఐ. ఆంధ్రప్రదేశ్ సమితి మాజీ కార్యదర్శి, నేటి కేంద్ర కార్యదర్శివర్గ సభ్యులు కామ్రేడ్ డా॥ కె. నారాయణగార్కి, సి.పి.ఐ. కేంద్ర కంట్రోల్ కమిషన్ ఛైర్మన్, పెట్టుబడి గ్రంథం పునర్ముద్రణ ఉపసంఘం ఛైర్మన్ కామ్రేడ్ ఈడ్పుగంటి నాగేశ్వరరావుగార్కి, సి.పి.ఐ. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమితి కార్యదర్శి కామ్రేడ్ కె. రామకృష్ణగారికి విప్లవాభివందనాలు.

విశాలాంధ్ర విజ్ఞాన సమితి రథసారథులు, రాష్ట్ర కమ్యూనిస్టు సమితి కార్యదర్శివర్గ సభ్యులు, కమ్యూనిస్టు పార్టీ నాయకులైన కామ్రేడ్స్ ముప్పాళ నాగేశ్వరరావు, జె.వి.వి. సత్యనారాయణమూర్తి, రావుల వెంకయ్య, పి. హరినాథరెడ్డి, జల్లి విల్సన్, జి. ఓబులేసు, పి.జె. చంద్రశేఖరరావు, మానం ఆంజనేయులు, నల్లూరి వెంకటేశ్వర్లు గార్లు వెన్నుతట్టి ప్రోత్సహించినందుకు కృతజ్ఞతాభివందనాలు.

అవిభక్త రాష్ట్రంలో విశాలాంధ్ర విజ్ఞాన సమితి అధ్యక్షులు కామ్రేడ్ చాడా వెంకటరెడ్డి, కార్యదర్శి కామ్రేడ్ బి.ఎస్.ఆర్. మోహన్‌రెడ్డి, కోశాధికారి కామ్రేడ్ డా॥ వి. రాంప్రసాద్, జనరల్ మేనేజర్ కామ్రేడ్ వై. చెంచయ్యగార్లకు కృతజ్ఞతలు.

ఈ ఐదు సం॥రాల కాలంలో ఈ ప్రాజెక్టు పూర్తిచేయడానికి సహాయపడిన విశ్రాంత అసోసియేట్ ఆచార్యులు గడ్డం సుశీలకు, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ డి.టి.పి. సిబ్బందికి, ప్రూఫ్‌రీడింగ్ చేసినవారికి, ప్రింటింగ్ ప్రెస్ సిబ్బందికి, ప్రత్యక్షంగాను, పరోక్షంగాను ఈ బృహత్ కార్యక్రమంలో సహాయ, సహకారాన్ని అందించిన వారందరికి హృదయపూర్వక ధన్యవాదాలు.

**కృతజ్ఞతాభివందనాలతో**

**టి. మనోహర్ నాయుడు**
**మేనేజర్**
**విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్**

**గడ్డం కోటేశ్వరరావు**
**సంపాదకుడు**
**విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ &**
**డిప్యూటీ జనరల్ మేనేజర్, విశాలాంధ్ర విజ్ఞాన సమితి**

## తెలుగులో రెండవ ముద్రణకు

# ముందుమాట

పెట్టుబడిదారీ వ్యవస్థను గురించిన మార్క్స్ విశ్లేషణలో, పెట్టుబడి గ్రంథ రెండవ సంపుటం స్థానాన్ని చాలామంది పరిపూర్ణంగా అవగాహన చేసుకోలేదనే అంశాన్ని పరిగణలోకి తీసుకోవాలని ఆధునిక మార్క్సిస్టు అర్థశాస్త్రవేత్తలు కొంతమంది అంటున్నారు. 1884 సం॥ ఫిబ్రవరి 5వ తేదీన ఎంగెల్స్ లవ్‌రోవ్‌కు రాసిన ఉత్తరంలో రెండవ సంపుటం ఆర్థికశాస్త్ర/సాంకేతిక జ్ఞానానికి సంబంధించిందనీ (Purely Scientific), పెట్టుబడిదార్ల మధ్య ఉత్పన్నమయ్యే ప్రశ్నలకు జవాబులను అన్వేషిస్తుందనీ అన్నాడు. ఆ తర్వాత కూడా సోర్జ్, డేనియల్‌సన్‌కు రాసిన ఉత్తరాల్లో కూడా ఆ విషయాన్నే పునరుద్ఘాటించాడని మార్క్సిస్టు అర్థశాస్త్రవేత్తలు రాశారు. పైగా సాంప్రదాయక అర్థ శాస్త్రవేత్తల శిష్యగణం ఈ రెండవ సంపుటంలోని విషయాలను అసలు చర్చకు రానియ్యకుండా ఆ రోజుల్లో దురుద్దేశపూర్వకమైన మూగనోము పట్టారని కూడా రాశారు.

ఎంగెల్స్ వ్యక్తీకరించిన ఆందోళనలో కొంత వాస్తవం లేకపోలేదని తర్వాత కాలపు మార్క్సిస్టు అర్థశాస్త్రవేత్తలు అన్నారు. ఎంగెల్స్ రాసిన ఉత్తరాల తర్వాత కాలంలో రష్యన్ మార్క్సిస్టు లైన తుగాన్-బరనోవస్కీలు, బుల్గాకోవ్ లాంటివారు రెండవ సంపుటంలోని సూత్రీకరణలను అన్వయిస్తూ కొన్ని ప్రతిపాదనలు చేశారు. ఆ తర్వాత దశాబ్ద కాలానికి జర్మనీతో సహా పశ్చిమ ఐరోపాలో జరిగిన చర్చ అంతర్జాతీయ స్థాయికి చేరిందని మార్క్సిస్టు పండితులు రాశారు. అయినప్పటికీ ఆ చర్చలు అంతటితో అప్పుడు ముగిశాయి.

**1990వ దశకం తర్వాత ప్రపంచాన్ని ఆవరించిన ఆర్థిక సంక్షోభ పర్యవసానంగా తిరిగి మార్క్స్ సూత్రీకరణలపై చర్చ ప్రారంభమైంది. వ్యాపార (విష) వలయాలు లేక వ్యాపార/పారిశ్రామిక వలయాలు (Trade Cycles/Industrial Crisis) పెట్టుబడిదారీ దేశాలను కుదిపేయడంతో పెట్టుబడిదారీ వ్యవస్థకు అనివార్యమైన సంక్షోభాలను గూర్చి, తరచుగా పునరావృతమవుతున్న సంక్షోభాల సమాహారమైన (విష) వలయాలను గూర్చి ఇప్పటికీ చర్చలు జరుగుతూనే ఉన్నాయి. అందువల్ల పెట్టుబడి గ్రంథంలోని రెండవ సంపుటంలో మార్క్స్ ప్రస్తావించిన లేక విశదీకరించిన అంశాలు మనకు శిరోధార్యం. వాటి పునశ్చరణ అత్యంత ఆవశ్యకం.**

1868 ఏప్రిల్ 30వ తేదీన ఎంగెల్స్‌కు మార్క్స్ రాసిన ఉత్తరంలో రెండవ సంపుటం ప్రాధాన్యతను ప్రస్తావించారు. పెట్టుబడి వివిధ రూపాలు సామాజికంగా ఏ విధంగా పెనవేసుకు పోయాయో వివరించాననీ, దాన్నే సరుకులు మరియు ద్రవ్య చలనంగా (Movement of Commodities and of Money) భావిస్తూ రెండవ సంపుటంలో విశదీకరించాననీ ఆ ఉత్తరంలో

మార్క్స్ రాశాడు. వ్యాపార చక్రాల (Trade Cycle) సిద్ధాంతపు మౌలిక లక్షణాలకు ఈ సంపుటంలోనే మార్క్స్ పునాదులేశాడని ఎంగెల్స్ రాశాడు. **పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానంలో సరఫరా (సప్లయ్), గిరాకీ (డిమాండ్)ల మధ్య అనివార్యంగా తరచుగా సంభవించే అసమతౌల్యం (Disequilibrium) స్థితి వల్లనే సంక్షోభాలు పునరావృతమవుతాయని శాస్త్ర సాంకేతిక అంశాలను జోడిస్తూ మార్క్స్ రెండవ సంపుటంలో విశదీకరించాడు.** సరుకుల ఉత్పత్తిలోని అంతర్గత వైరుధ్యాలను మొదటి సంపుటంలో ప్రస్తావించినా మార్కెట్ సమస్యలు, అదనపు విలువను రాబట్టుకోవడం (realization) లాంటి సమస్యలను రెండవ సంపుటంలోనే మార్క్స్ సుదీర్ఘంగా చర్చించాడు. మరో విధంగా చెప్పాలంటే పెట్టుబడి పునరుత్పత్తి ప్రక్రియను సమగ్రంగా పరిశీలించినందువల్లనే, పెట్టుబడిదార్ల సంపన్నతకు బీజరూపమైన సరుకు ఉత్పత్తిలోని సంక్లిష్టమైన, అనివార్యమైన వైరుధ్యాలను రెండవ సంపుటంలో మార్క్స్ అత్యంత ప్రతిభావంతంగా విశ్లేషించాడని మార్క్సిస్టు అర్థశాస్త్రవేత్తలు అంటున్నారు. విజ్ఞత కలిగిన, మేధోపరంగా నిజాయితీపరులైన బూర్జువా అర్థశాస్త్ర పండితులు కూడా ఈ విషయాన్ని ప్రస్తావిస్తుంటారు.

పెనవేసుకుపోయిన పెట్టుబడి వివిధ రూపాలనూ (Intertwining of different capitals) వాటి అంతర్గత భాగాలనూ, రాబడులనూ (Revenue), విలువ ద్వంద్వ చలనాలైన ఉపయోగపు విలువ, మారకపు విలువలనూ, సరఫరా, గిరాకీలనూ కూడా పరిశీలించినందువల్లనే, పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థనూ, బూర్జువా సమాజాన్నీ రెండవ సంపుటంలో సమగ్రంగా మార్క్స్ మనకు చూపించగలిగాడు. అయితే పెట్టుబడిదారీ పునరుత్పత్తికీ, అందులోని సకల సమస్యలకూ మార్క్స్ పరిష్కారాలను చూపించాడని మనం పొరపాటున కూడా అవగాహన చేసుకోకూడదు. **ఆధునిక స్థూల ఆర్థిక విశ్లేషణకు అవసరమైన సాంకేతిక పునాదులను పెట్టుబడి రెండవ సంపుటంలో మార్క్స్ వేశాడని మార్క్సిస్టు అర్థశాస్త్ర పండితులు అంటున్నారు. మార్క్స్‌కు పూర్వీకులైన సాంప్రదాయక ఆర్థిక శాస్త్రవేత్తల నుండి, మార్క్స్ తర్వాత వచ్చిన వాల్రాస్, లియోంటియోవ్, కీన్స్ తదితర నయా ఉదారవాద ఆర్థిక శాస్త్రవేత్తల వరకూ అనుసరించిన స్థూల ఆర్థిక విశ్లేషణలో మార్క్స్ వినియోగించిన సాంకేతిక అంశాలు మరో రూపంలో చోటుచేసుకున్నాయని మార్క్సిస్టు అర్థశాస్త్రవేత్తలంటున్నారు. నిజాయితీపరులైన బూర్జువా ఆర్థిక శాస్త్రవేత్తలు కూడా మార్క్స్ విశ్లేషణలను తోసిపుచ్చలేకపోతున్నారు.**

పెట్టుబడి మొదటి సంపుటానికి ఉపశీర్షిక పెట్టుబడి ఉత్పత్తి క్రమం (The process of Production of Capital) కాగా రెండవ సంపుటానికి ఉపశీర్షిక పెట్టుబడి చలామణి క్రమం (The process of Circulation of Capital). చూడగానే రెండు సంపుటాల మధ్య వ్యత్యాసం స్పష్టంగా కనిపిస్తుంది. కర్మాగారం (Factory) తత్సంబంధిత శ్రమ స్థితిగతులను మొదటి సంపుటం వివరిస్తుంది. అనగా పెట్టుబడిదారీ విధానంలో సరుకుల ఉత్పత్తి భౌతిక స్వభావాన్నీ, అదనపు విలువ ఉత్పత్తి క్రమాన్నీ వివరిస్తుంది. దీనికి భిన్నంగా రెండవ సంపుటంలో మార్కెట్, తత్సంబంధిత అంశాలు చర్చించబడినాయి. విలువ, అదనపు విలువ ఏ విధంగా ఉత్పత్తి జరుగుతుందో గాక, మార్కెట్ ద్వారా వాటిని పెట్టుబడిదార్లు ఏ విధంగా నగదు రూపంలో రాబట్టు కుంటారో (Realization) రెండవ సంపుటంలో వివరించబడింది. ఇందులోని ప్రధాన పాత్రధార్లు కార్మికులూ,

పారిశ్రామికవేత్తలు (Industrialists) గాక, ద్రవ్యాధిపతులు లేక వడ్డీ వ్యాపారులు (Money owners / Money lenders), టోకు వ్యాపారస్తులు (Wholesale merchants), చిల్లర వ్యాపారులు (Traders) వ్యవస్థాపకులు లేక వ్యాపార నిర్వాహకులు లేక వాణిజ్యాన్ని నిర్వహించే పెట్టుబడిదార్లు (Entrepreneurs or functioning Capitalists). వాణిజ్యాన్ని లేక వ్యాపారాన్ని నిర్వహించే వ్యవస్థాపకుడు లేక వ్యాపారి అనగా సామాన్య పారిశ్రామికవేత్తగా కాక (Simple Industrialist) పరిపతి ద్వారా గానీ లేక స్వయంగా గానీ కొంత ద్రవ్య పెట్టుబడిని చేతబుచ్చుకొని శ్రమశక్తినీ, ఉత్పత్తి సాధనాలనూ కొనుగోలు చేసి, ఉత్పత్తి ప్రక్రియను పూర్తిచేసి అనగా సరుకులను ఉత్పత్తి చేయించి, ఆ సరుకులను మార్కెట్లో అమ్ముకోవడం ద్వారా అదనపు విలువను నగదుగా రాబట్టుకొని తిరిగి అందులో కొంత భాగాన్ని పెట్టుబడిగా పెట్టి అదనంగా యంత్రాలను, ముడిసరుకులను, శ్రమశక్తిని కొనుగోలు చేసి, ఉత్పత్తి ప్రక్రియను కొనసాగించి, తిరిగి సరుకులను ఉత్పత్తి చేయించి, వాటిని మార్కెట్‌లో అమ్ముకొని నిరంతరాయంగా లాభాలను గుంజుకొనే పెట్టుబడిదారు. అనగా **మార్కెట్ లావాదేవీలను నిర్వహించే పెట్టుబడిదారు. ఇతడే ఈ సంపుటంలో ప్రధాన పాత్రధారి.** కేవలం సరుకులను కొనుగోలు చేసే వినియోగదార్లుగా మాత్రమే కార్మికులు రెండవ సంపుటంలో ప్రత్యక్షమవుతారు.

పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానంలో పెట్టుబడి చలామణి క్రమాన్నీ దాని ప్రాధాన్యతనూ లోతుగా తెలుసుకోవాలంటే అదనపు విలువ ఉత్పత్తినీ, దాన్ని నగదు రూపంలోనో, మరో విధంగానో పొందే క్రమాన్ని (realisation) తప్పనిసరిగా అధ్యయనం చేయాలి. సరుకుల ఉత్పత్తి ఒకానొక సామాజిక నిర్మాణ వ్యక్తీకరణ. అందులో మౌలిక వైరుధ్యాలున్నాయి. ఉత్పత్తిదార్లే వినియోగదార్లుగా, జీవనాధార వ్యవసాయం, చేతివృత్తుల ప్రాథమిక స్థితి నుండి మానవ సమాజం ఉత్పత్తి ప్రక్రియను ఇబ్బడి ముబ్బడిగా పెంచుకుంది. శ్రమ విభజన, శ్రామిక ఉత్పాదక శక్తి, సాంకేతిక విజ్ఞానం పెరగడంతోపాటు, రవాణా, కమ్యూనికేషన్లు, నిరంతరాయంగా పెరిగి సామాజికంగా పరస్పరం ఆధారపడవలసిన స్థితికి మానవ సమాజం మరింతగా నెట్టబడింది. ఆ సామాజిక ఆవశ్యకత కూడా రాను రాను పెరుగుతూనే ఉంది. స్థానిక, ప్రాంతీయ, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ముడిసరుకులు, శ్రమ సాధనాలు, సాంకేతిక నైపుణ్యతల సరఫరా, గిరాకీల ఆవశ్యకతవల్ల మానవ సమాజం నానాటికీ పరస్పరం ఆధారపడితేగాని జీవనం కొనసాగలేని స్థితి వచ్చింది. ఆధునిక సమాజం ప్రపంచ స్థాయి గ్రామంగా (Globalised Village) మారిందనేది అతిశయోక్తి కాదనిపిస్తుంది. మరో విధంగా చెప్పాలంటే శ్రమ (శారీరక, మానసిక) ప్రక్రియ రాను రాను మరింతగా సామాజీకరించబడింది (Socialisation). అదే సమయంలో ఉత్పత్తి సాధనాల యాజమాన్యం, చలామణి రంగాలు మరింతగా ప్రైవేటీకరించ (Privatisation) బడుతున్నాయి. వీటితోపాటుగా ద్రవ్య పెట్టుబడి (Money Capital) పెరుగుదల వల్ల అంతర్జాతీయ స్థాయిలో లాభార్జనే అంతిమ లక్ష్యంగా ఉత్పత్తి చలామణి ప్రక్రియలు కొనసాగుతున్నాయి. ఆ విధంగా లాభాలను ప్రైవేటుగా స్వాయత్తం చేసుకోవడం (Private appropriation) వల్ల కుబేరులు, కోటీశ్వరులు సంఖ్య ప్రపంచ స్థాయిలో పెరుగుతూనే వుంది. ఆ విధంగా నానాటికీ ఒకవైపున శ్రమ ప్రక్రియ సామాజికీకరణ (Socialisation) పెరుగుతుంటే, మరోప్రక్కన ఉత్పత్తి, చలామణి ప్రక్రియల ప్రైవేటీకరణ ఆ నిష్పత్తికి మించి పెరుగుతుంది. మొదటి సంపుటంలోనే

మార్క్స్ చెప్పినట్లు సరుకుల ఉత్పత్తి, విలువ ఉత్పత్తి అనే విలువ రూపాలు ఈ మౌలిక వైరుధ్యంలోనే ఉన్నాయి. సామాజిక శ్రమ లేకుండా ఉత్పత్తి అసాధ్యం. శ్రామిక ఉత్పాదక శక్తి గరిష్ట స్థితిలో కూడా వేలకు వేలు శ్రామికుల పరస్పర సహకారం లేకుండా ఒక సరుకును ఉత్పత్తి చేయడం అంత సులభం కాదు. సరుకులను ప్రైవేటుగా అమ్ముకోడానికి వీలుగా ఉత్పత్తి ప్రక్రియ నిర్వహణ జరుగుతున్నందువల్ల సామాజిక శ్రమ అంత సులభంగా అదే పద్ధతిలో వ్యవస్థీకరించబడదు. అందువల్ల శ్రమశక్తి ప్రైవేటు శ్రమగానే (Private Labour) వినియోగించుకోబడుతుంది. సరుకులు మార్కెట్‌లో అమ్ముడుపోయి వాటి విలువ చేతికందిన తర్వాతనే అనగా అదనపు విలువ లాభంగా మారి పెట్టుబడిదారుని స్వాయత్తమైనపుడే శ్రమ సామాజిక స్వభావం పెట్టుబడిదారీ విధానంలో బహిర్గతమవుతుంది. సరుకులో ఇమిడి వుండే సామాజిక శ్రమ, ప్రైవేట్ శ్రమ అనే వైరుధ్యం, విలువ ఉత్పత్తి లేక సరుకుల ఉత్పత్తి ద్వారా వ్యక్తీకరించబడుతుంది. సరుకుల ఉత్పత్తి ఒకవైపున సామాజిక శ్రమ ఫలితంగా, మరోవైపున ప్రైవేట్ శ్రమ ఫలితంగానూ జరిగినట్లు కనిపిస్తుంది. ప్రైవేట్ శ్రమలోని సామాజిక స్వభావం సరుకుల ఉత్పత్తి జరిగిన వెంటనే బహిర్గతం కాదు. తయారైన సరుకులు చలామణి రంగంలోకి ప్రవేశించాలి; మార్కెట్‌లో వాటి విలువ రాబట్టబడాలి; అప్పడే ఆ సరుకులో ఇమిడివున్న ప్రైవేట్ శ్రమ, దాని సామాజిక స్వభావం తెలుస్తుంది.

విలువ, అదనపు విలువల ఉత్పత్తికీ, సరుకుల ఉత్పత్తి, వాటి విలువను రాబట్టుకోడానికీ (అమ్మకానికి) మధ్య విడదీయరాని సంబంధం ఉన్నది. మరో విధంగా చెప్పాలంటే, ఉత్పత్తికీ, అమ్మకానికీ మధ్య విడదీయలేని ఐక్యత (Indissoluble Unity) ఉన్నదని భావించాలి. పెట్టుబడిదారీ సమాజంలో లేక సరుకుల ఉత్పత్తి సమాజంలో ఉత్పత్తిగానీ, అమ్మకంగానీ లేకుండా వ్యవస్థ నడవదు. అవి రెండు పరస్పర ఆధారాలు. ఉత్పత్తి రంగానికిచ్చినంత ప్రాధాన్యత చలామణి రంగానికి (Circulation sector) మార్క్సిస్టు అర్థశాస్త్రవేత్తలు ఇవ్వడంలేదనే అపవాదు ఉన్నది. పెట్టుబడిదారీ వ్యవస్థలో సరుకుల చలామణిని పరిశీలించడం ప్రారంభమైన తర్వాత కేవలం సరుకుల సామాన్య చలామణితోనే మనం సరిపుచ్చుకోలేం. అంతకుమించి చలామణి రంగాన్ని లోతుగా పరిశీలన చేయాల్సిన స్థితికి సహజంగా నెట్టబడతాం. అదే శాస్త్రీయ విశ్లేషణ అవుతుంది. ఇక్కడ సరుకుల చలామణిని పెట్టుబడి చలామణిగానే పరిగణించి పరిశీలిస్తాం. ఈ విధమైన పరిశీలన పర్యవసానంగా మార్క్స్ అప్పట్లో ఒక కొత్త అంశాన్ని ప్రతిపాదించాడు. అదే మొత్తం సామాజిక పెట్టుబడి (Total Social Capital) పునరుత్పత్తి మరియు చలామణి (reproduction and circulation). దాన్నే ఆయన టర్నోవర్ (Turnover)గా నామకరణం చేశాడు. రెండవ సంపుటంలోని మూడవ భాగం శీర్షిక అదే. నిజానికి రెండవ సంపుటంలోని చర్చనీయాంశంలోని గణనీయ భాగం ఈ విషయం కేంద్రంగానే నడుస్తుంది.

సామాజిక పెట్టుబడి సమాహారమైన పెట్టుబడి పునరుత్పత్తి, చలామణి రంగాలను లోతుగా అధ్యయనం చేయాలి. అందుకు వివిధ పెట్టుబడి రూపాల మధ్య పోటీనీ, అదనపు విలువ పంపకాన్నీ క్రమానుగతంగా పరిశీలించాలి. (Private determination of investment). పెట్టుబడి పెట్టే నిర్ణయాన్నీ, ఉత్పత్తి కారకాల (Factors of production) నిష్పత్తినీ, మొత్తం ఉత్పత్తినీ ప్రైవేట్‌గా నిర్ణయించే అరాచక

సామాజిక వ్యవస్థలోని అంతర్గత వైరుధ్యాలను అవగాహన చేసుకోవాలి. అలాంటి ఆర్థిక వ్యవస్థలో అభివృద్ధికి ఆటంకాలను, చోదక శక్తులను గుర్తించాలి. అభివృద్ధికి అవసరమైన అపేక్షితాలనూ, సంపూర్ణమైన లేక అడ్డంకులులేని నిబంధనలు/షరతులనూ (absolute preconditions) కనుగొనాలి. ఆధునిక స్థూల ఆర్థిక శాస్త్రంలో ఈ విషయాలన్నీ చర్చించబడుతూనే ఉన్నాయి. ఈ విషయాలలో గణనీయ భాగాన్ని మార్క్స్ రెండవ సంపుటంలో చర్చించాడు. ఆ విధంగా ఆయన పెట్టుబడిదారీ విధాన సిద్ధాంతాన్ని (Theory of Capitalism) పరిపుష్టం చేశాడు.

పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానానికి ఇరుసు లాభమే! ఆ వ్యవస్థ అందుకోసమే పనిచేస్తుందని, అదే కేంద్రస్థానమని ఒకటిన్నర శతాబ్దాల క్రితమే మార్క్స్ చెప్పాడంటే బూర్జువా శాస్త్రవేత్తల్లో కొంత మందికి మింగుడుపడదు. ప్రస్తుతం ఎదురవుతున్న ఆర్థిక సంక్షోభాలకు కారణాలను అన్వేషిస్తున్న బూర్జువా అర్థశాస్త్రజ్ఞుల్లో కొంతమంది నిజాయితీగానే ఆ విషయాన్ని (మార్క్స్ చెప్పిన విషయాన్ని) ఒప్పకుంటున్నారు. ఆ సూత్రాల అన్వయింపుకు తమ ధోరణిలో ప్రయత్నిస్తున్నారు. 1998 సం॥ తర్వాత మార్క్స్ రచనలపై తిరిగి మమకారం పెరగడానికి కారణం అదే! లాభం, పెట్టుబడి సమీకరణ, ఆర్థికాభివృద్ధి, పరస్పరం పెనవేసుకొని ఉంటాయి. మొదటి సంపుటంలోనే మార్క్స్ ఈ విషయాలను లేవనెత్తాడు. అయితే ఆ విషయాలను దాదాపు సమగ్రంగా రెండవ సంపుటంలో చర్చించాడు. **విస్తృత స్థాయిలో పునరుత్పత్తీ, అదనపు విలువ పెట్టుబడీకరించబడటమే కీలకాంశాలు (Capitalization of surplus value and expanded reproduction). ఆర్థికాభివృద్ధి జరగాలంటే, కార్మికవర్గం ఉత్పత్తి చేసిన, పెట్టుబడిదారీ వర్గం స్వాయత్తం చేసుకున్న అదనపు విలువను దుర్వినియోగం చేయకుండా, ఉత్పత్తిదాయకంగా (productively) వినియోగించుకోవాలి. కొద్దిమంది పెట్టుబడిదార్ల ఆడంబర వినియోగానికీ, అవసరానికి మించిన అనుత్పాదకమైన వినియోగ వస్తువుల ఉత్పత్తికై, పెట్టుబడిదార్లు పోటీలుపడి అదనపు విలువను దుర్వినియోగం చేయకూడదు. అయితే లాభాపేక్ష వాళ్ళను అలా నెడుతుంది, అలా నడిపిస్తుంది. జీవనానికవసర మైన వినియోగ వస్తువులుగాక, ఆడంబరం కోసం సరుకుల ఉత్పత్తి కోసం పోటీ వాళ్ళ మధ్య అనివార్యమవు తుంది. ఆ విధంగా పాలకవర్గాలు, వారి భృత్యులు దుర్వినియోగం చేసినపుడు కొన్ని సరుకులు అమ్ముడుబోక పోవడం వల్ల సంక్షోభాలు రావడానికి మార్గాలు సుగమమవుతాయి. పెట్టుబడి సమీకరణలో అంతర్లీనంగా ఉండాల్సిన అంశం అదనపు విలువ పెట్టుబడీకరించబడటమే!** అనగా లాభాన్ని ఉత్పత్తిదాయకమైన అదనపు పెట్టుబడిగా మార్చుకోవాలి. అప్పడు ఆర్థికాభివృద్ధికి ఆస్కారం మెండుగా ఉంటుంది. ప్రైవేట్ పెట్టుబడి, ప్రైవేట్ నిర్ణయాలపై ఆధారపడిన అరాచకపు సామాజిక, ఆర్థిక వ్యవస్థల్లో నిరాటంకమైన అభివృద్ధి సాధ్యం కాదు; పైగా సంక్షోభాలు వెంటాడి సామాన్య జనాన్ని అతలాకుతలం చేస్తాయి.

పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానంలో **పెట్టుబడి మూడు రూపాల్లో కనిపిస్తుంది. అవి : ద్రవ్య పెట్టుబడి (Money Capital), ఉత్పత్తిదాయక పెట్టుబడి (Productive Capital), మరియు సరుకు పెట్టుబడి (Commodity Capital).** ద్రవ్య పెట్టుబడి ప్రారంభ రూపంగానూ, అంతిమ లక్ష్యంగానూ పెట్టుబడిదారీ వ్యవస్థలో ఉంటుంది. పెట్టుబడి రూపంలో మార్పును (Metamorphosis) సీతాకోకచిలక రంగులు మార్పుతో పోల్చి చెప్పాడు ఒక మార్క్సిస్టు అర్థశాస్త్రవేత్త.

పెట్టుబడి ప్రత్యేక రూపాలను రెండవ సంపుటంలో మార్క్స్ విశ్లేషించాడు. ఇందులో

పారిశ్రామిక బూర్జువాలతోపాటు, వ్యాపార బూర్జువాలు, బ్యాంకర్లు, వ్యవసాయ పెట్టుబడిదార్లు, పెద్ద భూస్వాములు ప్రధాన పాత్రదార్లుగా ఉంటారు. వీరంతా కలిసే కార్మికవర్గాన్ని దోపిడీ చేస్తారు. కార్మికులు సృష్టించిన అదనపు విలువ కాజేస్తారు. అందరూ తరతమ స్థాయిల్లో స్వాయత్తం చేసుకున్న అదనపు విలువను పంచుకుంటారు. ఈ విషయాన్నంతా పెట్టుబడి వర్తులాకార చలనంలో (Circular movement of Capital) చూడవచ్చు. వీటినే పెట్టుబడి ఆవృత్తాలని కూడా అంటారు.

పెట్టుబడి చలన క్రమంలో అనేక దశలను దాటి వివిధ రూపాలను సంతరించుకుంటుంది. **మొట్టమొదటి దశలో చలామణి రంగంలో (Sphere of Circulation) పెట్టుబడి ద్రవ్య రూపంలో పనిచేస్తుంది.** ఆ ద్రవ్యంతో ఉత్పత్తి సాధనాలనూ, శ్రమశక్తినీ కొనుగోలు చేసి ఉత్పత్తికి సిద్ధమవుతాడు. ఆ చలనాన్ని ఈ క్రింది విధంగా చూపించవచ్చు.

**ద్రవ్యం-సరుకు < శ్రమశక్తి / ఉత్పత్తి సాధనాలు**

ఈ దశలో పెట్టుబడి ద్రవ్య రూపం వదలి ఉత్పత్తిదాయక పెట్టుబడి రూపం ధరిస్తుంది.

**రెండవ దశలో పెట్టుబడి ఉత్పత్తిరంగంలో (Sphere of Production) పనిచేస్తుంది.** శ్రమశక్తి ఉత్పత్తి సాధనాలతో నూతన విలువ గల సరుకులను ఉత్పత్తి చేస్తుంది. ఈ దశలో పెట్టుబడి చలనం ఈ క్రింది విధంగా ఉంటుంది.

**సరుకు < శ్రమశక్తి / ఉత్పత్తి సాధనాలు ... ఉత్పత్తి ... సరుకు$^1$**

ఈ దశలో పెట్టుబడి తన ఉత్పత్తిదాయక రూపం వదలి సరుకు పెట్టుబడి రూపం ధరిస్తుంది.

**మూడవ దశలో పెట్టుబడి తిరిగి చలామణి రంగంలో పనిచేస్తుంది.** ఈ దశలో సరుకులను అమ్ముకుంటారు. అనగా సరుకు రూపంలో ఉన్న పెట్టుబడి ద్రవ్య రూపంలో పెట్టుబడిగా మార్చబడుతుంది. ఆ చలనాన్ని ఈ క్రింది విధంగా చెప్పవచ్చు.

సరుకు$^1$ - ద్రవ్యం$^1$

పైన వివరించిన పెట్టుబడి చలనక్రమాన్ని పరిశీలిస్తే మనకు ఒక విషయం అవగత మవుతుంది. పెట్టుబడి ద్రవ్య రూపంతో ప్రారంభమై తిరిగి ద్రవ్య రూపానికి చేరుతుంది. అయితే ప్రారంభ ద్రవ్యంకన్నా అనగా మొదట చలామణిలో పెట్టిన ద్రవ్యంకన్నా తిరిగి ద్రవ్య రూపాన్ని పొందిన పెట్టుబడి ఎక్కువగా ఉంటుంది. ఆ చలన క్రమాన్ని ఈ క్రింది విధంగా చూపవచ్చు.

**ద్రవ్యం - సరుకు < శ్రమశక్తి / ఉత్పత్తి సాధనాలు ... ఉత్పత్తి ... సరుకు$^1$... ద్రవ్యం$^1$**

ఈ మొత్తం చలన క్రమాన్నే మార్క్స్ పెట్టుబడి పరిభ్రమణం (Circuit of Capital) లేక ఆవృత్తి అంటాడు. ఈ పరిభ్రమణంలో రెండు చలామణి దశలు, ఒక ఉత్పత్తి దశ ఉంటాయి. అయితే ఇందులో కీలకమైంది ఉత్పత్తి క్రమమే! అదే నిర్ణాయక పాత్ర వహిస్తుంది. **పెట్టుబడిదారీ విధానం అభివృద్ధిచెందే కొలదీ వివిధ రూపాల పెట్టుబడులు ఒకదాన్నుండి మరోటి వేరుపడతాయి. వాణిజ్య**

**పెట్టుబడులు, అరువు పెట్టుబడులు, ఉత్పత్తిలోని పెట్టుబడి నుండి వేరుపడి స్వతంత్రంగా పనిచేస్తాయి. ఈ రకమైన వేరు వేరు పెట్టుబడులవల్లనే బూర్జువా వర్గంలోని వివిధ రకాల పెట్టుబడిదారులుంటారు.**

పారిశ్రామిక పెట్టుబడిదారు అదనపు విలువను గుంజితే, సరుకు రూపంలోని పెట్టుబడిని ద్రవ్య పెట్టుబడిగా వ్యాపార పెట్టుబడిదారు మార్చుతాడు. ద్రవ్య రూపంలో సాధ్యమైనంత పెట్టుబడిని పోగేసి దానిని ఇతర పెట్టుబడిదార్లకు పంచుతుంది (అరువు పెట్టుబడి) ద్రవ్య పెట్టుబడి. ఆ విధంగా అదనపు విలువ బూర్జువా వర్గంలోని వివిధ పొరల మధ్య పంపిణీ చేయబడుతుంది.

మార్క్స్ అనంతర కాలంలో వచ్చిన కొంతమంది అర్థశాస్త్రవేత్తలు, ప్రత్యేకించి కొంతమంది మార్క్సిస్టు అర్థశాస్త్రవేత్తలు, ప్రతిపాదించిన మార్క్స్ కొన్ని సూత్రీకరణలను అందులోనూ రెండవ సంపుటంలో ప్రతిపాదించిన ఆర్థిక సంక్షోభ సిద్ధాంతాన్ని (Theory of Economic Crises) పునః పరిశీలన చేశారు. మార్క్స్ రాసిన పెట్టుబడి నాలుగు సంపుటాల్లో (నాల్గవ సంపుటం అదనపు విలువ సిద్ధాంతాలు - మూడు భాగాలు, ప్రోగ్రెస్ పబ్లిషర్స్ మాస్కో, 1975) ఆర్థిక సంక్షోభ సిద్ధాంతం సమగ్రంగా పరిశీలించబడనందువల్ల కాలానుగుణ్యంగా పునఃపరిశీలన చేసి, పరిపుష్టం చేశామని మార్క్సిస్టు అర్థశాస్త్రవేత్తలు కొంతమంది చెప్పారు. మార్క్సిజాన్ని అంగీకరించనివారు, మార్క్స్ సూత్రీకరణలు అంతగా ఉపయోగపడవని 20వ శతాబ్దపు మూడవ దశకంలో వచ్చిన సంక్షోభ అనంతర కాలంలో చెప్పారు. అయితే 21వ శతాబ్దపు ప్రారంభ దశకంలో వచ్చిన ఆర్థిక సంక్షోభం ప్రపంచాన్ని తిరిగి కుదిపివేసింది. దాంతో అటు మార్క్సిస్టు పండితులు, ఇటు బూర్జువా అర్థ శాస్త్రవేత్తలు పెట్టుబడి గ్రంథ పుటలను, ప్రత్యేకించి రెండవ సంపుటాన్ని తిరిగి అధ్యయనం చేస్తున్నారు.

పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానాన్ని ఆనాటి పరిస్థితుల్లో ఆయనకు ఆనాడు అందుబాటులోని సమాచారాన్ని ఆధారంగా చేసుకొని మార్క్స్ తన గ్రంథంలో కొన్ని కీలక సూత్రీకరణలు చేశాడు. దానర్థం అవన్నీ సమగ్రమూ, మార్పుకు అతీతమూ అని కాదు. పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానంలో అనివార్యంగా తరచుగా ఆర్థిక సంక్షోభాలు (Inevitable periodic occurrence of economic crises) సంభవిస్తాయనేది ఆ కీలక సూత్రీకరణల్లో ఒకటి. నిజానికి ఈ అంశాన్ని మార్క్స్ సమగ్రంగా చర్చించాలనే భావనతోనే తన అధ్యయనంలోనూ, తన రచనా ప్రణాళికలోనూ పొందుపర్చు కున్నట్లుగా మార్క్స్ రాతప్రతులు తెలియజేస్తున్నాయి. అందులో ప్రపంచ మార్కెట్‌ను కూడా అధ్యయనం చేయాలనే అంశం ఉన్నట్లుగా చాలామంది మార్క్సిస్టు పండితులు అంటున్నారు.

రెండవ సంపుటంలో పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానంలోని అమితోత్పత్తి (Over-production) సంక్షోభాన్ని మార్క్స్ లోతుగానే విశ్లేషణ చేశాడు. పారిశ్రామిక పెట్టుబడిదారుకు, తుది వినియోగ దారుకు మధ్య వాణిజ్య పెట్టుబడిదారు (Commercial Capital) నిర్వహించే పాత్రను (Intermediary role) ఆయన ప్రస్తావించాడు. సరుకుల చలామణి వేగాన్ని పెంచడానికీ, కాలాన్ని కుదించడానికీ ఉత్పత్తిదాయక పెట్టుబడి టర్నోవర్‌ను త్వరితపరచడానికీ వాణిజ్య పెట్టుబడి పాత్ర ఉపయోగ పడుతుందని చెప్తూనే, విస్తృత స్థాయి ఉత్పత్తికీ, తరిగే తుది గిరాకికీ (Final demand) మధ్య పెరిగే అసమానుపాతానికి / అసమతౌల్యానికి (disproportion) ముసుగు (mask) వేయబడుతుందని మార్క్స్ హెచ్చరించాడు. ఉత్పత్తి చేయబడిన సరుకు, దాని విలువను మార్కెట్ ద్వారా రాబట్టుకునే

కాలంలో ఏర్పడే సంక్షోభాన్ని గురించి మార్క్స్ చెప్పాడు. దాన్నే కొంతమంది అమితోత్పత్తి కాలంగా పరిగణిస్తారు. సరుకుల ఉత్పత్తికీ దాన్ని సరుకు పెట్టుబడిగానూ, అదనపు విలువగానూ మార్చుకోవడానికీ అడ్డంకిగా నిలబడేది నాటి సమాజంలోని వినియోగదార్ల అవసరాలు కాదు (Consumer needs of the Society). దానికి భిన్నంగా, ఒక ప్రత్యేక రకమైన ఉత్పత్తి విధానంలో పేదరికంలో జీవిస్తున్న గణనీయమైన సంఖ్యలోని (నికృష్ట) పేదలు. వారూ, వారి సాపేక్ష పేదరికం నిరంతరాయంగా ఉన్నందువల్లనే ఆ ప్రత్యేక ఆర్థిక వ్యవస్థ ఆ విధంగా మనగలుగుతుంది. అదే పెట్టుబడిదారీ వ్యవస్థ అని మార్క్స్ అన్నాడు. **అదనపు విలువా, తద్వారా లాభాన్నీ, ఆదాయాన్నీ అడ్డూ, అదుపు లేకుండా పెంపొందించుకోవడానికై ప్రజా బాహుళ్యపు పేదరికాన్ని, వారి వినియోగాన్ని నియంత్రించే, నిరోధించే విధానాలవల్లే ఆర్థిక సంక్షోభాలు తలెత్తుతున్నాయని మార్క్స్ ఒకటిన్నర శతాబ్దాలకు పూర్వమే ప్రతిపాదించి నిర్ధారించాడు.** ఆ వ్యవస్థ నడకలోనే సంక్షోభం గర్భీకృతమైయున్నదనే సత్యాన్ని గురించి ఆయన సూత్రీకరించాడు.

సార్థకమైన గిరాకీ (effective demand) లేక సార్థకమైన లేక ఉపయుక్తమైన వినియోగం (effective consumption) లోపించినందువల్లనే (దానివల్ల మాత్రమే) పెట్టుబడిదారీ వ్యవస్థలో సంక్షోభాలు తరచూ సంభవిస్తాయని చెప్పే సిద్ధాంతం కేవలం అనవసరమైన పునరుక్తి మాత్రమే (Tautology) అని మార్క్స్ రెండవ సంపుటంలో చెప్పాడు. కొనుగోలు చేయగలిగిన వారిని లేక ధనాఢ్య వర్గాలను మాత్రమే పెట్టుబడిదారీ వ్యవస్థ కొనుగోలుదార్లుగా గుర్తిస్తుంది గాని ఇతరులను కాదు. అందులో బికార్ల, దగాకోర్ల వినియోగాన్ని కూడా మినహాయించాలి (Consumption of paupers and swindlers). సరుకులు అమ్ముడుపోవడంలేదంటే అర్థం వాటిని కొనే నాథులు లేరనీ, కార్మికవర్గం తక్కువ వేతనాలు పొందడంవల్ల, వారి కొనుగోలు శక్తి పడిపోయినందువల్ల సరుకుల కొనుగోళ్ళు పడిపోయి, అందువల్ల సంక్షోభాలు తలెత్తాయి అనేది కూడా ఆ పునరుక్తి కథల్లో భాగమే! మరోవిధంగా చెప్పాలంటే కార్మికవర్గ వేతనాలు సాపేక్షికంగా పెరిగిన కాలంలో కూడా సంక్షోభాలు తలెత్తాయి. ఇదంతా సాధారణ ఇంగిత జ్ఞానంగా భావించేవాళ్ళూ ఉన్నారు. పెట్టుబడిదారీ వ్యవస్థలో కార్మికవర్గ వేతనాలు ఎల్లప్పుడూ మార్పు లేకుండా స్థిరంగా ఉంటాయనేది అబద్ధం. వేతనాలు కూడా సాపేక్షంగా పెరుగుతూనే ఉంటాయి. అయినా సంక్షోభాలు తరచుగా వస్తూనే ఉన్నాయి. అనగా సంక్షోభాలు వ్యవస్థీకృతమైన అంశాల పర్యవసానంగా సంభవిస్తున్నాయనే విషయాన్ని మన బూర్జువా అర్థశాస్త్ర పండితులు అంగీకరించరు. పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానంలో కొన్ని నిబంధనలున్నాయి; వాటి మూలంగా కార్మికులు తాత్కాలికంగా తమ వేతనాలను సాపేక్షికంగా పెంచుకోగలుగుతారు.

పెట్టుబడిదారీ వ్యవస్థ సంక్షోభంపై మార్క్స్ చెప్పిన అల్పస్థాయి వినియోగం (under-consumption) అమితోత్పత్తి (over-production) అనే భావనల మధ్య వైరుధ్యం ఉన్నదా? వైరుధ్యం లేదనే మార్క్సిస్టు శాస్త్రవేత్తలు చెప్తారు. సంస్కరణవాదులుగానీ, సరళీకరణ విధానాలను సమర్థించే వారుగానీ, మామూలు మాటలను (Platitude) గొప్ప సిద్ధాంతాలుగా పునరుక్తి చేస్తూ ప్రత్యామ్నాయాలుగా చెప్పే పసలేని సిద్ధాంతాలను మార్క్సిజం లేక మార్క్సిస్టు అర్థశాస్త్రం తిరస్కరిస్తుంది.

జనబాహుళ్యానికి తక్షణమే ద్రవ్యపరమైన కొనుగోలు శక్తిని పెంచి, సంక్షోభాన్ని నివారించవచ్చుననే ప్రత్యామ్నాయం కూడా తాత్కాలికమైనదే! గాల్లో దీపం లాంటిది.

పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానంలో ఉత్పత్తి అయ్యే సరుకులన్నీ కార్మికులు కొనుగోలు చేసే వినియోగ వస్తువులు మాత్రమే కాదు (Consumer goods); ఈ ఉత్పత్తి విధానంలోని సరుకుల మహా పర్వతంలో (Commodity mountain) ఉత్పాదక వస్తువులు అనగా ఉత్పత్తి సాధనాలు (Means of production) కూడా ఉంటాయి. సాధారణ ప్రజలు లేక కార్మికులు వినియోగార్థం వీటిని ఉత్పత్తి చేయరు. కేవలం వినియోగ వస్తువుల కొనుగోలు పెరుగుదల వల్ల మనకేమీ తెలియదు. అదే విధంగా కొన్ని సాధనాల (equipment) లేక ముడి సరుకుల అమ్మకం వల్ల కూడాను. వీటి అమ్మకాల కొనుగోళ్ల వల్ల ఆటోమేటిక్‌గా (automatic) ఉత్పత్తిదాయక పెట్టుబడి (Productive investment) పెరగదు. జాతీయాదాయం (National Income) పునఃపంపిణీ జరిగి, అనగా జీతాలు ఆకస్మికంగా (sudden) పెరిగి, లాభాలు తగ్గినప్పడు పెట్టుబడిగా పెట్టేది (investment) తాత్కాలికంగా, సాపేక్షికంగా తగ్గిపోతుంది. అనగా ఉత్పత్తి సాధనాల కొనుగోళ్ళు పడిపోతాయి. వీటి పర్యవసానంగా లాభం రేటు పడిపోతే, పెట్టుబడి సమీకరణ కూడా తగ్గుతుంది (contract). అందువల్ల సంక్షోభం పరిష్కారం కాదు; వ్యవస్థ అందులో నుండి అంతమాత్రంతో బయటపడదు. కాబట్టి అమితోత్పత్తి, అల్పస్థాయి కొనుగోలు శక్తి సిద్ధాంతాలకు పరిమితులున్నాయని అర్థశాస్త్రవేత్తలు గుర్తించాలి. అదే సమయంలో మరో అంశాన్ని కూడా ఇక్కడ పేర్కొనాలి. రెండు డిపార్టుమెంట్ల (వినియోగ వస్తువుల డిపార్టుమెంటు, ఉత్పాదక వస్తువుల డిపార్టుమెంటు) మధ్య అసమతౌల్యం లేక అసమాన నిష్పత్తి (disproportion) సిద్ధాంతాన్ని ఇక్కడ ప్రస్తావించాలి. ఈ రెండింటి మధ్య సరైన పాళ్లలో ఉత్పత్తి జరగకపోవడం వల్ల అనగా అరాచక ఉత్పత్తి వల్ల సంక్షోభం సంభవిస్తుందని కొంతమంది పేర్కొంటున్నారు. మరోరకంగా చెప్పాలంటే పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానంలో అరాచకం లేకుండా, సంఘటిత పెట్టుబడిదారీ వ్యవస్థగా (Organised Capitalism) ఆ వ్యవస్థను నిర్వహించినపుడు సంక్షోభాలు రావని ఈ సిద్ధాంతాన్ని సమర్థించే వారంటారు. మార్క్స్ అనంతర కాలంలో ఈ వాదనను సమర్థించే బూర్జువా అర్థశాస్త్రవేత్తలలో ప్రముఖుడు కీన్స్ కాగా, మార్క్సిస్టు అర్థశాస్త్ర వేత్తలుగా గణతికెక్కిన పాల్ స్వీజీ లాంటివారు కూడా ఉన్నారు. అదనపు విలువ సిద్ధాంతాల సంపుటాల్లోనూ, గ్రుండ్రిస్సేలోనూ మార్క్స్‌పై సిద్ధాంతాలను ప్రస్తావించాడు. ఒకవైపున అపరిమితంగా (Unlimited) ఉత్పత్తి శక్తులను అభివృద్ధిపరిచే ధోరణీ, మరోవైపున బూర్జువా ఉత్పత్తి పద్ధతివల్ల వినియోగంపై సంకుచితమైన (Narrow) నిరోధకాల (Constraints) పర్యవసానంగా డిపార్టుమెంట్ల మధ్య అసమతౌల్యం (disequilibrium) ఏర్పడుతుందని మార్క్స్ వివరించాడు. కాబట్టి అసమతౌల్యం, అమితోత్పత్తి, అల్పస్థాయి కొనుగోలు శక్తి సిద్ధాంతాలు పరిమితమైనవనీ, అందులో ఏ ఒక్కటి కూడా పెట్టుబడిదారీ వ్యవస్థ సంక్షోభాన్ని సమగ్రంగా సమీక్షించలేదనీ మార్క్స్, ఆ తర్వాత వచ్చిన మార్క్సిస్టు అర్థశాస్త్రవేత్తలు సోదాహరణంగా రుజువు చేశారు. **పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానంలో సంక్షోభాలకు మౌలిక కారణాలుగా (basic causes) ఉత్పత్తిలో అరాచకం, అమితోత్పత్తితో పాటుగా లాభం రేటు సాపేక్షంగా పడిపోవడం, పెట్టుబడులకు అవసరమైన సమీకరణలు సాపేక్షంగా తరిగిపోవడం, ఉత్పత్తి శక్తుల**

**అభివృద్ధికి అనుగుణ్యంగా** (correlation) **సామాన్య జన వినియోగాన్ని ఆ నిష్పత్తిలో పెంచడానికి ప్రతిబంధకాలు ఏర్పడటం, వగైరాలను పేర్కొనవచ్చు.** ప్రపంచ వ్యాపితంగా 21వ శతాబ్దపు మొదటి దశకం చివరి భాగంలో వచ్చిన సంక్షోభానికి పైన పేర్కొన్నవన్నీ తరతమ స్థాయిల్లో కారణాలే! మరో విధంగా చెప్పాలంటే సాంప్రదాయవాదుల భాషలో పెట్టుబడిదారీ వ్యవస్థ శాపగ్రస్తమైంది (cursed). సరుకులు మార్కెట్‌లో అమ్ముడుపోయి సరుకులో ఇమిడి వున్న అదనపు విలువ రాబట్టుకోబడినపుడే తిరిగి విస్తృత స్థాయి పునరుత్పత్తికి అవకాశం ఏర్పడుతుంది. సంక్షోభాలు తరచుగా సంభవిస్తున్నాయంటే, ఆ ఉత్పత్తి వ్యవస్థలో మౌలిక వైరుధ్యం ఉండి వుండాలి. దాన్నే వాళ్ళు శాపగ్రస్తమన్నారు! మార్క్సిస్టులేమో మౌలిక వైరుధ్యమన్నారు. ఆ వ్యవస్థ మారినప్పుడే ఆ మౌలిక వైరుధ్యాలు పరిష్కరించబడతాయి.

పెట్టుబడిదారీ వ్యవస్థ అభివృద్ధీ, దాని సంపన్నతా పెరగాలంటే లాభం రేటు కూడా పెరుగుతూ ఉండాలి! మార్కెట్ విస్తృతి జరుగుతూ ఉండాలి. అయితే ఈ రెండు జోడుగుర్రాలుగా ఎప్పుడూ ప్రయాణం చేయలేవు. ఆ రెండింటినీ ప్రారంభించిన శక్తులే ఒకానొక దశలో (వ్యాపార చక్రంలో - Trade Cycle) వాటికి అడ్డంకిగా తయారవుతాయి. ఇందులో కేవలం ఆర్థికాంశాలేగాక వ్యాపార చక్రం లేక పారిశ్రామిక వలయం (Trade Cycle)తో పెనవేసుకుపోయిన వర్గ పోరాటాలు కూడా కారణం. పెట్టుబడిదారీ పునరుత్పత్తి ప్రక్రియ ఉన్నత స్థాయిలో జరగాలంటే నిరంతరాయంగా సాంకేతిక రంగంలో (Technology) విప్లవం రావాలి; పోటీ పోరాటంలో తట్టుకొని పెట్టుబడిదారు నిలబడాలంటే తన ఉత్పత్తి వ్యయాలను (Costs of production) తగ్గించుకోగలగాలి; శారీరక శ్రమ స్థానే యంత్రాలు రావాలి. కార్మికుల సగటు ఉత్పాదకత పెరగాలి; ఇవన్నీ జరిగినపుడు సహజంగా సరుకు విలువ (ధర) పడిపోయే ధోరణి తలెత్తవచ్చు. అందువల్ల పెట్టుబడిదారు నష్టాలను ఎదుర్కోవాలి (Devalorization of Capital). ఇది ప్రత్యక్షంగా గానీ లేక పరోక్షంగా గానీ జరుగవచ్చు. సరుకుల విలువ పడిపోవడం ప్రత్యక్ష కారణం కాగా, అసమర్థతతో దివాళాతీసిన (bankruptcy and closure of the least efficient firms) కొన్ని కర్మాగారాలు/పరిశ్రమలు పరోక్ష కారణం. ఈ అంశాన్ని మార్క్స్ తన రెండవ సంపుటంలో విశదీకరించాడు. దీనితోపాటు మార్క్స్ మరో అంశాన్ని కూడా ఈ సంపుటంలో ప్రస్తావించాడు. పారిశ్రామిక వలయానికి/వ్యాపార వలయానికి (Trade Cycle) స్థిర పెట్టుబడి టర్నోవర్ వలయానికీ (Turnover Cycle of fixed Capital) మధ్య ఉన్న సంబంధాన్ని (Nexus) కూడా మార్క్స్ ఇక్కడ ప్రస్తావించాడు. ఒక పరిశ్రమలోని కర్మాగారంలోని యంత్రాన్ని ముక్కలు ముక్కలుగా మార్పు చేయరు; ఏడేళ్ళ నుండి పదేళ్ళ కొకసారి యంత్రాన్ని సాధారణంగా మార్చాలి. ఆ మార్పు (replacement) కేవలం ఒక కర్మాగారంలో గాక, ఆ పరిశ్రమలోని అనేక కర్మాగారాల్లో జరగాలి. అందుకు భారీ స్థాయిలో పెట్టుబడులు కావాలి; దానికి పెట్టుబడులను సమీకరించాలి (Accumulation); దానికి మార్కెట్ విస్తృతి జరగాలి; చివరికి పెట్టుబడి సజీవ అంగ నిర్మాణంలో (Organic Composition of Capital) మార్పులకు పూనినపుడు లాభం రేటు పడిపోయే ధోరణి, తిరిగి పెట్టుబడికి కొరత ఏర్పడటం యథావిధిగా జరుగుతుందని మార్క్స్ రెండవ సంపుటంలో ప్రస్తావించాడు. స్థిర పెట్టుబడి నిరంతరాయ సరఫరాకు అంతరాలు ఏర్పడటం కూడా వ్యాపార చక్రాలకు (Trade Cycle) ఒక మౌలిక కారణం అని కూడా మార్క్స్ పేర్కొన్నాడు.

ద్రవ్యానికీ, సరుకుకూ మధ్య గతితర్కాన్నీ (dialectic), సామాజిక పెట్టుబడి (Social Capital) పునరుత్పత్తి సమస్యలనూ, వ్యాపార చక్రాలనూ మార్క్స్ రెండవ సంపుటంలో విశదీకరించిన పద్ధతి (Method) ఆధునిక అర్థశాస్త్ర సమస్యల అవగాహనకు ఉపయోగపడుతుంది. ద్రవ్యాన్ని ఉత్పత్తిదాయక చలామణి ప్రక్రియ నుండి (Process of Productive Circulation) ఉపసంహరించుకోవడం ద్వారా నగదు రూపంలో ద్రవ్యాన్ని దాచుకోవడం (Money hoarding) లేక "దొంగతనంగా" ఉంచుకోవడం ఆధునిక అర్థశాస్త్రం ఎదుర్కొనే సమస్యల్లో ఒక ప్రధాన సమస్య. కీన్స్ లాంటి అర్థశాస్త్రవేత్తలు 20వ శతాబ్దపు మూడవ దశకంలో ఈ అంశాన్ని లోతుగా పరిశీలించారు. సరుకుల చలామణి ప్రక్రియ విస్తృతీ, సంకోచాల (Expansion and contraction) మధ్య కాల వ్యవధి పర్యవసానంగా వ్యాపార చక్రాలు, దాని పర్యవసానంగా ద్రవ్య పెట్టుబడి విస్తృతీ, సంకోచాలు తరచుగా వస్తాయని మార్క్స్ చెప్పాడు. ఉత్పత్తి ప్రక్రియ కుదింపుగానీ, విస్తృతిగానీ జరిగినపుడు చలామణిలోని ద్రవ్య పెట్టుబడి పరిమాణం కూడా ఆ మేరకు కుదింపుకూ, విస్తృతికీ లోనవుతుంది.

రెండవ సంపుటంలో ప్రస్తావించిన అంశాలను పరిగణలోకి తీసుకొని సరుకుల ధరల పెరుగుదలకు గల కారణాలను కొన్నింటిని గుర్తించవచ్చు.

1. ఉత్పత్తి వ్యవస్థలోని ఒకానొక శాఖలో శ్రామిక సగటు ఉత్పాదక శక్తి పడిపోవడం;
2. బంగారు గనుల పరిశ్రమలో ఆకస్మికంగా (sudden) శ్రామిక ఉత్పాదకశక్తి పెరుగుదల;
3. మార్కెట్ ధరల పెరుగుదల ధోరణి (Upward trend of the market-price)లో అస్థిరత్వం (Fluctuations);
4. ద్రవ్య పరిమాణం పెరుగుదల ఫలితంగా ద్రవ్యోల్బణ సూచనలు;

ఉత్పత్తి ప్రక్రియలో నిరంతరాయంగా అదనపు విలువ కోసం పెట్టుబడి ఎందుకు, ఏ విధంగా వేటాడుతుందో అవధులులేని (unquenchable thirst) లాభార్జనే లక్ష్యంగా పెట్టుబడి ఏ విధంగా ప్రయత్నిస్తుందో, అదనపు విలువను ఏ విధంగా గుంజుకుంటుందో పెట్టుబడి మొదటి సంపుటంలో మార్క్స్ సమగ్రంగా వివరించాడు. ఆర్థికాభివృద్ధికీ, సాంకేతిక విప్లవానికీ, పరిశోధన-అభివృద్ధికయ్యే వ్యయానికీ, రవాణా కమ్యూనికేషన్లకూ, కొనుగోళ్ళ పెంపుదలకయ్యే ప్రచారానికీ, మార్కెట్ పరిశోధనలకయ్యే వ్యయానికీ మౌలికమైన వాహిక (fundamental motor) అదనపు విలువే! అదే విధంగా బూర్జువా సమాజంలో వ్యక్తులుగా సంపన్నులు కావడానికీ, కార్మికులు, తదితర సామాన్య మానవులు పరాయీకరణకూ కూడా ఆ అదనపు విలువే కేంద్ర స్థానం. మార్క్స్‌కు పూర్వపు శాస్త్రవేత్తలు ప్రతిపాదించిన ఆర్థిక సిద్ధాంతాలనూ, వాటి లోటుపాట్లనూ మార్క్స్ వివరించి, విమర్శించాడు. అటు మొదటి సంపుటంలోనే గాక, నాల్గవ సంపుటమైన అదనపు విలువ సిద్ధాంతాలు (Theories of Surplus Value - Part I, II, III) మూడు భాగాల్లోనూ సాంప్రదాయక లేక ప్రామాణిక (Classical Economists) అర్థశాస్త్రవేత్తల అభిప్రాయాలనూ, వారు ప్రతిపాదించిన సిద్ధాంతాలనూ అద్భుతమైన సమగ్రతతో మార్క్స్ విశ్లేషించాడు.

కార్మికులు ఉత్పత్తి చేసిన సరుకులోని అదనపు విలువ కర్మాగారం సరిహద్దులు దాటిన తర్వాత, దాని ప్రయాణపు విన్యాసాలను రెండవ సంపుటంలో మార్క్స్ విశ్లేషించాడు. ఆ తర్వాత



ప్రయాణంలో అదనపు విలువ వృత్తాకార ఊర్ధ్వచలనంలో (Spiralling movement) తన ప్రభంజనాన్ని చూపిస్తుంది. కొండమీద నుండి జారిపడే అదొకరకమైన మంచుగడ్డ లాంటిది (avalanche). వృత్తాకార అభివృద్ధి అనే భావనను (spiral) సిసిమాండి అనే అర్థశాస్త్రవేత్త ప్రతిపాదించాడనీ, ఆయన్నుండి మార్క్స్ ఈ భావాన్ని గ్రహించాడనీ కొంతమంది మార్క్సిస్టు పండితులంటారు. సరుకులు వాటి విలువకు అమ్ముడుపోయి, లాభాలు వచ్చినపుడు అదనపు పెట్టుబడికి అవసరమైన పెట్టుబడి సమీకరించబడుతుంది. అదనపు పెట్టుబడి, అదనపు విలువను పెంచుతుంది; అది తిరిగి అదనపు పెట్టుబడిని పెంచుతుంది. పెట్టుబడి స్వీయ వెల్లువ వ్యాప్తికున్న సకల అడ్డంకులూ ఆ వెల్లువలో కొట్టుకుపోతాయి. పెట్టుబడిదారీ వర్గాల్లోని సామాజిక శ్రమ విభజన, వాణిజ్య, పరపతి పెట్టుబడుల పెరుగుదలా (Commercial and banking Capital), నిరంతరాయంగా సరుకుల రవాణాను పెంచే సాధనాల పెరుగుదలా, ప్రపంచ వ్యాపితంగా నిర్మితమైన సమాచార వ్యవస్థ, సాధనాల పెరుగుదలా, సరుకుల చలామణి క్రమ సమయాన్ని త్వరితంగా తగ్గించివేస్తాయి. సరుకులనే మహా పర్వతాలను పిడుగు పడినంత వేగంగా ప్రపంచ వ్యాపితంగా పంపిణీ చేయగలిగిన సామర్థ్యాన్ని సాంకేతిక జ్ఞానం పెంపొందించింది. ఆ విధంగా ద్రవ్య రూపంలో పెట్టుబడి కొద్దిమంది హస్తగతం కావడానికి భూమిక సిద్ధమయింది. వెయ్యి లేక రెండు వేలమంది కుబేరుల స్వాధీనంలో ప్రపంచ సంపదలో గణనీయ భాగం పోగుపడిపోయింది. మానవ విలువలనూ, మానవత్వాన్ని సహితం అణగదొక్కి అదనపు సంపదను పోగేసుకునే రీతిలో ద్రవ్య పెట్టుబడి (Finance Capital) ప్రపంచ వ్యాపితంగా తన కార్యకలాపాలను కొనసాగిస్తుంది. అది ఎంత ప్రయత్నించినా పెట్టుబడిదారీ వ్యవస్థ మౌలిక వైరుధ్యాన్ని అధిగమించలేకపోతుంది. అందువల్లనే సంక్షోభాల పరంపరలు సాక్షాత్కరిస్తున్నాయి. 1968లో పశ్చిమ దేశాల్లో వచ్చిన కల్లోలం 1974-75లోని ఆర్థిక మాంద్యం, 2008లో వచ్చిన ఆర్థిక సంక్షోభం మార్క్స్ సూత్రీకరణలకు ప్రబల తార్కాణాలు. ఆచరణలోగానీ, సిద్ధాంత రీత్యాగానీ, పెట్టుబడిదారీ వ్యవస్థ మౌలిక వైరుధ్యాలకు పరిష్కారం ఆ వ్యవస్థ కూలిపోవడంతోనే సాధ్యమవుతుంది. అదే మార్క్స్ చెప్పింది. ఆచరణలో రుజువయింది.

**గడ్డం కోటేశ్వరరావు**

విజయవాడ **సంపాదకుడు**

15-8-2016

## తెలుగులో మొదటి ముద్రణకు

# ముందుమాట

సామాజిక పరిణామక్రమంపై మనిషి ఆలోచనా ధోరణిని మూలమట్టంగా ప్రభావితం చేసిన అతి కొద్ది పుస్తకాలలో కార్ల్‌మార్క్స్ – 'పెట్టుబడి' ఒకటి. కార్ల్‌మార్క్స్ తన ఆయుష్షును పణంగా బెట్టి దీనిని రచించాడు. పెట్టుబడి మొదటి సంపుటం తెలుగు అనువాదం ప్రచురించి ఇప్పటికి దాదాపు రెండు సంవత్సరాలయింది. మేము ఆశించిన ఫలితాలనే మొదటి సంపుటి అందించింది. పలువురు మేధావులు ఆ సంపుటిపై తమ అభిప్రాయాలను, సూచనలను నిర్మొహమాటంగా వ్యక్తం చేస్తూ మాకు లేఖలు రాశారు. మా బృహత్ కృషిని చాలామంది అభినందించారు. ఒకరిద్దరు విమర్శనాత్మక వ్యాఖ్య చేశారు. శాస్త్ర గ్రంథాల అనువాద ప్రమాణంతో పోలిస్తే తర్జుమా బాగున్నట్లే అని కొందరు అభిప్రాయపడ్డారు. ఏమైనా సానుకూల విమర్శలతోపాటు ప్రతికూల విమర్శలను సైతం మేము సహృదయంతోనే స్వీకరించాము. అట్టి విమర్శనలను ఇకముందు కూడా ఆహ్వానిస్తాము. ఇది ప్రయోజనాత్మకమైన మహత్తర రచన కనుక నలుగురు నాలుగు విధాలుగా వ్యాఖ్యానించడం సహజమని మాకు తెలుసు.

'పెట్టుబడి' మొదటి సంపుటం నాలుగో భాగంలోని ఫ్యాక్టరీ చట్టాల ప్రస్తావన ఉన్న భాగాల అనువాదం చక్కగా శక్తివంతంగా ఉందని ఒక మేధావి మాకు లేఖ రాశారు. ఫ్యాక్టరీ చట్టాలు ప్రస్తావన ఉన్న భాగాల్లో ఇంగ్లీషు అనువాదం (జర్మన్‌నుంచి) లో స్పష్టమైన, శక్తివంతమైన వ్యక్తీకరణ కనిపిస్తుంది. తెలుగు అనువాదంలో కూడా అదే వ్యక్తీకరణ చోటు చేసుకున్నది. తెలుగు ప్రతి శ్రద్ధగా చదివిన వారికి ఈ విషయం తెలిసే వుంటుంది.

ఇక్కడొక ముఖ్యమైన విషయం ప్రస్తావించడం అప్రస్తుతం కాదనిపిస్తున్నది. 1873కి ముందే "క్యాపిటల్" జర్మన్ నుంచి ఫ్రెంచి భాషలోకి తర్జుమా అయింది. ఫ్రెంచి భాషలో సైతం నిష్ణాతుడయిన ఫ్రెడరిక్ ఎంగెల్స్ 1873 నవంబర్‌లో కార్ల్‌మార్క్స్‌కు రాసిన లేఖలో ఇలా విచారం వ్యక్తం చేశారు.

"Yesterday I read the Chapter on the factory legislation in he French translation of Capital. With all the due respect for the skill with which it has been translated into elegant French, I am sorry for that beautiful Chapter. All its power and life's blood have been sent into devil. The mediocre writer castrates the language in order to express himself with a certain degree of elegance."

మార్క్స్‌కు ఎంగెల్స్ రాసిన లేఖలోని సారాంశం ఇది. "పెట్టుబడి గ్రంథంలోని ఫ్యాక్టరీ చట్టాల అధ్యాయం తాలూకు ఫ్రెంచ్ అనువాదాన్ని నిన్న నేను చదివాను. సొగసైన ఫ్రెంచ్ భాషలోకి నైపుణ్యంతో

అనువదించినందుకు ఆయన్ను అరుదైన రీతిలో గౌరవిస్తూనే, ఆ అందమైన అధ్యాయానికి అన్యాయం జరిగినందుకు విచారిస్తున్నాను. ఆ అధ్యాయంలోని జనం, జీవం అన్నీ గాలికి వదిలేశారు. మితిమీరిన జ్ఞానం గల ఆ రచయిత తన్నుతాను సొగసుగా వ్యక్తీకరించుకోవడం కోసం భాషలోని జీవాన్ని నాశనం చేశాడు." సమర్థుడయిన అనువాదకుడు భాషనీ, భావాన్నీ సరిగ్గా సమ్మేళనం చేస్తాడు. అసమర్థుడయితే మూల భాషలోని పటుత్వాన్ని విస్మరిస్తాడు. ఎంగెల్స్ చెబుతున్నదదే. మార్క్స్ రచించిన క్యాపిటల్ గ్రంథాన్ని ఎడిట్ చేయడానికి ఆయన ఎంత శ్రద్ధ తీసుకున్నాడో, వివిధ భాషల్లో క్యాపిటల్ అనువాదాల పట్ల కూడా అంతే శ్రద్ధ వహించాడు.

ఎంగెల్స్ అన్న ఈ వ్యాక్యాలను దృష్టిలో పెట్టుకుని పరిశీలిస్తే తెలుగు అనువాదకులు కొంతలో కొంతయినా కృతకృత్యులయ్యారనే అనిపిస్తుంది.

రెండవ సంపుటంలో కూడా అనువాదం సాఫీగా, సరళంగా సాగిందనే భావిస్తున్నాం. అయితే సారళ్యం గురించి ఒక విషయం గుర్తు చేయడం అవసరం. అనువాదం సరళంగా సాగినంతమాత్రాన సాధారణ పాఠకులకి సైతం తేటతెల్లంగా అర్థమై తీరాలన్న నియమమేదీ లేదు. ఆడమ్‌స్మిత్, డేవిడ్‌కార్డో, సిస్మాండీ, జె.ఎస్. మిల్ లాంటి మేధావులు కేవలం అర్థశాస్త్రవేత్తలే కాదు. వారి రచనల్లో అక్కడక్కడా తాత్వికాంశాలు కూడా కనిపిస్తుంటాయి. వారు తమ భావాలను వ్యక్తం చేస్తున్నప్పుడూ, ఆ భావాలను మార్క్స్ విశ్లేషిస్తున్నప్పుడూ ఒక్కోసారి రచన తాత్విక స్థాయిని సంతరించుకోవడం కద్దు. అలాంటి సందర్భాలలో ఎంత సరళంగా అనువదించినా తెలుగు పాఠకుడికి అసలు విషయం వెనువెంటనే అర్థం కాకపోయే ప్రమాదం వుంది. నిజం చెప్పాలంటే, క్లాసికల్ అర్థశాస్త్రవేత్తల గ్రంథాలను, వివిధ దేశాల ఆర్థిక, సామాజిక చరిత్రలను క్షుణ్ణంగా కాకపోయినా కనీసం సీరియస్‌గానైనా చదివి వుండకపోతే పెట్టుబడి గ్రంథం అవగాహన కాదు. అంటే ఎంతోకొంత 'హోమ్‌వర్క్' చేసి ఉన్న పాఠకులకు ఇందులోని విషయం అర్థమవుతుంది. అంతేకాదు మార్క్స్ అనేక సందర్భాలలో షేక్స్‌పియర్, బాల్జాక్, మనువు లాంటి వారిని విస్తారంగా ఉల్లేఖిస్తాడు.

Capital is one of the important factors of production అని సంప్రదాయ పద్ధతిలో అర్థశాస్త్రం చదువుకున్నవారికి మార్క్స్ ప్రవచించిన ఈ క్రింది నిర్వచనం అంత తేలిగ్గా బోధపడకపోవచ్చు.

"Capital is not the sum of the material and produced means of production.Capitl is rather means of production transformed into capital, which in themselves are no more capital than gold or silver in itself is money. It is the means of production monopolised by a certain section of society, confronting living labour-power as products and working conditions rendered independent of this labour - power which are personified through this anti - thesis in capital."

"పెట్టుబడి అన్నది పాదార్థికమైనది. ఉత్పత్తి చేయబడిన ఉత్పత్తి సాధనాల సమాహారం కాదు. అది పెట్టుబడిగా పరివర్తితమైనట్టి ఉత్పత్తి సాధనాలు బంగారం లేదా వెండి స్వతహాగా డబ్బుకానట్లే ఉత్పత్తి సాధనాలు కూడా స్వతహాగా పెట్టుబడి కాదు. ఉత్పత్తి సాధనాలు సమాజంలోని ఒక భాగం

యొక్క గుత్త సొమ్మె, ఉత్పాదితాలుగానూ, సజీవ శ్రమశక్తితో ప్రమేయం లేనట్టి పని పరిస్థితులుగానూ, ఆ సజీవ శ్రమశక్తికి ఎదురైనప్పుడు మాత్రమే, ఉత్పత్తి సాధనాలు పెట్టుబడి అవుతాయి. ఈ వైరుధ్యం ద్వారా అవి పెట్టుబడిగా మూర్తీభవిస్తాయి."

ఇందులో భాష సరళంగానే ఉన్నప్పటికీ భావన కొత్తది కాబట్టి మామూలు పాఠకుడికి చదవగానే విషయం అర్థం కాకపోవచ్చు. అయితే శ్రద్ధగా చదివి అర్థం చేసుకోవాలన్న ఆకాంక్ష ఉన్న పాఠకుడికి ఈ గ్రంథం తేలికగానే అర్థం అవుతుంది. కాకపోతే ఈ పుస్తకం పాఠకుని గ్రహణశక్తిని కాస్త ఎక్కువ డిమాండ్ చేస్తుంది.

ఈ గ్రంథాన్ని అవగాహన చేసుకోవటంలో పాఠకుడికి కొన్ని ఇబ్బందులెదురవుతున్నట్లే అనువాదకుడికీ ఎదురవుతాయి. 1885లలో ఫ్రెడరిక్ ఎంగెల్స్ 'ది కామన్‌వీల్' అనే పత్రికలో ఇంగ్లీషులో రాసిన వ్యాసంలో క్యాపిటల్ గ్రంథాన్ని అనువదించడంలో ఎదురయ్యే సమస్యల గురించి ఇలా వివరించారు. "ఈ గ్రంథాన్ని అనువదించడానికి జర్మన్ సాహిత్యంలో ఎంత పరిజ్ఞానమున్నా చాలదు. కార్ల్‌మార్క్స్ తన రచనలో దైనందిన జీవితంలో వాడే పదబంధాలను, ప్రాంతీయ భాషల పలుకుబళ్లను విరివిగా ఉపయోగిస్తాడు. ఆయన కొత్త పదాలను కూడా సృష్టించి వాడతాడు. ప్రతి విజ్ఞాన శాస్త్రం తాలూకు ఉదాహరణలను స్వీకరిస్తాడు. పది పండ్రెండు భాషా సాహిత్యాల్లోని ఉదాహరణలను స్వీకరిస్తాడు. మార్క్స్‌ను అవగాహన చేసుకోవాలంటే, జర్మన్ లిఖిత భాషలోనూ, మౌఖిక భాషలోనూ నిష్ణాతుడై ఉండాలి. అంతేకాదు, జర్మన్ జీవితం గురించి కూడా ఎంతో కొంత తెలిసివుండాలి..... శక్తివంతమైన జర్మన్‌ను అనువదించాలంటే శక్తిమంతమైన ఇంగ్లీషు అవసరం."

ఎంగెల్స్ రాసిన ఈ వాక్యాలను వివరణ అవసరం లేదు కదా! మేము మొదటి సంపుటంలో వివరించినట్లు తెలుగు అనువాదకులు, 'క్యాపిటల్' హిందీ ప్రతిని, పెంగ్విన్ ప్రచురణకర్తలు ఇంగ్లీషులో ప్రచురించిన క్యాపిటల్ ప్రతినీ, వీటితోపాటు సంపాదకవర్గం తయారుచేసిన ప్రత్యేక పదకోశాన్నీ ఉపయోగించుకున్నారు. క్యాపిటల్‌లో కనిపించే అనేక ముఖ్యమైన ఇంగ్లీషు పదాలను సమానమైన తెలుగు పదాలతో రూపొందించిన ఈ పదకోశాన్ని యధాతథంగా గుడ్డెద్దుచేలో పడ్డట్లు కాకుండా – సందర్భాన్ని దృష్టిలో పెట్టుకుని వాడుకున్నారు. మనీ అంటే డబ్బు, ద్రవ్యం రెండు పదాలు పదకోశంలో ఇచ్చాము. అలాగే యాబ్సల్యూట్ (Absolute) అన్న పదానికి పరమ, అఖండ, సంపూర్ణ, నిరపేక్ష అనే తెలుగు తుల్యపదాలిచ్చాము. సందర్భానికి తగినట్లుగా పదాన్ని ఎంపిక చేసుకోవడం అనువాదకుని బాధ్యత.

అనువాదంలోగాని, మరే విషయంలోగాని చిన్న లోపాలేమయినా వున్నా, క్యాపిటల్‌కు ఇది సంపూర్ణ యధాతథ అనువాదం. తెలుగులో ఇది తొలి ప్రయత్నం కనుక దీని విలువ దీనికుంటుందని భావిస్తున్నాము. మొదటి సంపుటం తర్వాత రెండేళ్ళు ఆలస్యంగానైనా రెండో సంపుటం ప్రచురిస్తు న్నందుకు సంతోషంగా వుంది. సంపాదకులలో ఒకరైన శ్రీ బిట్రగుంట రామచంద్రరావు, ఈ ప్రచురణను చూడకుండానే చనిపోవడం దురదృష్టకరం. ఆయన మరణంపట్ల మా ప్రగాఢ సంతాపాన్ని తెలియ జేస్తున్నాం. త్వరలో మూడవ సంపుటం కూడా మీ ముందు ఉంచగలమని సవినయంగా మనవి చేసుకుంటున్నాం.

రెండవ సంపుటం అనువాదయజ్ఞానికి శ్రీయుతులు బిట్రగుంట రామచంద్రరావు, ఎ. గాంధీ, సొదుం రామ్మోహన్‌లు తమ వంతు సమిధలు సమర్పించారు. ఈ సంపుటి అనువాద పథకానికీ, సంపాదకత్వానికి ప్రచురణ కృషికి నేను సమన్వయకర్తగా వ్యవహరించాను. ఈ బృహత్‌కృషిలో బిట్రగుంట రామచంద్రరావు, సొదుం రామ్మోహన్ గార్లు శాయశక్తులా సహకరించారు. వారికి కృతజ్ఞతాభివందనాలు. ఎవరేపని విడిగా చేసినా మొత్తానికి ఇది సమష్టి కృషి. అనేక సందర్భాలలో అందరూ అందరితో చర్చించారు. పరస్పరం అభిప్రాయాలను మార్చుకున్నారు. మాస్కో – రాదుగ ప్రచురణాలయంలో అనువాదకుడిగా పనిచేసిన మిత్రులు ఆర్మియార్, తెలుగు అనువాదంలో ఉపయోగించిన పదాలను సరిజూడటంలోనూ, విశాలాంధ్ర ప్రచురణాలయం మేనేజర్ పి. రాజేశ్వరరావు శుద్ధ ప్రతిని అచ్చుకు సిద్ధం చేయడంలోనూ తోడ్పడ్డారు. అలాగే అన్నిటినీ మించి, **తమ్మారెడ్డి సత్యనారాయణ మెమోరియల్ ట్రస్ట్,** హైదరాబాద్ వారు ఈ గ్రంథ ప్రచురణకు రూ. 25,000/– ఆర్థిక సహాయం చేసి తోడ్పడ్డారు. వీరికి కృతజ్ఞతలు. ఈ గ్రంథ ప్రచురణ కృషిలో అనేక రూపాల్లో సహకరించిన మిత్రులకు మా హృదయపూర్వక అభివందనలు తెలియజేస్తున్నాం.

హైదరాబాదు,
తేది : 1–11–1998.

**వై.వి. కృష్ణారావు**
**(సంపాదకుడు)**

# విషయసూచిక


పీఠిక xxvi

రెండవ ముద్రణకు ఉపోద్ఘాతం (ఎంగెల్స్) xlv

## రెండవ సంపుటి - పెట్టుబడి చలామణి క్రమం

**మొదటి భాగం : పెట్టుబడి రూప పరివర్తనలు, వాటి ఆవృత్తులు 3**

**అధ్యాయం-1 : డబ్బు పెట్టుబడి ఆవృత్తి 3**

I. మొదటి దశ డ-స$^2$ 4

II. రెండవ దశ, ఉత్పాదక పెట్టుబడి విధి 12

III. మూడవ దశ, సరుకు, డబ్బు 15

IV. మొత్తం ఆవృత్తి 25

**అధ్యాయం-2 : ఉత్పాదక పెట్టుబడి ఆవృత్తి 38**

I. సామాన్య పునరుత్పత్తి 39

II. విస్తృత స్థాయిలో సంచయనం, పునరుత్పత్తి 51

III. డబ్బు సంచయనం 55

IV. సంచయన నిధి (Reserve Fund) 57

**అధ్యాయం-3 : సరుకు పెట్టుబడి ఆవృత్తి 59**

**అధ్యాయం-4 : ఆవృత్తి తాలూకు మూడు సూత్రాలు 72**

**అధ్యాయం-5 : చలామణికి పట్టే కాలం 91**

**అధ్యాయం-6 : చలామణి ఖర్చులు 98**

I. చలామణికయ్యే నిజమైన ఖర్చులు 98

1. కొనుగోలు, అమ్మకం కాలం 98

2. జమా ఖర్చులు (బుక్-కీపింగ్) 102

3. డబ్బు 104

II. సరుకులను నిల్వ చేసేందుకయ్యే ఖర్చులు 105

1. సాధారణంగా సరఫరా రూపొందే క్రమం 105

2. అసలైన సరుకు - సరఫరా 111

III. రవాణా ఖర్చులు 116

**రెండవ భాగం : పెట్టుబడి టర్నోవరు 119**

**అధ్యాయం-7 : టర్నోవరు కాలం, టర్నోవర్ల సంఖ్య** **119**
**అధ్యాయం-8 : నిశ్చల పెట్టుబడి, చలామణి పెట్టుబడి** **123**
I. రూపంలో తేడాలు 123
II. నిశ్చల పెట్టుబడి అంతర్భాగాలు, దాని భర్తీ, మరమ్మతు, సంచయనం 134
**అధ్యాయం-9 : మదుపు పెట్టిన పెట్టుబడి సగటు టర్నోవరు, టర్నోవరు ఆవృత్తాలు** **147**
**అధ్యాయం-10 : నిశ్చల పెట్టుబడి, చలామణి పెట్టుబడి సిద్ధాంతాలు ఫిజియోక్రాట్లు, ఆడమ్ స్మిత్** **153**
**అధ్యాయం-11 : నిశ్చల మరియు చలామణి పెట్టుబడుల సిద్ధాంతాలు : రికార్డో** **177**
**అధ్యాయం-12 : పనికిపట్టే కాలం** **189**
**అధ్యాయం-13 : ఉత్పత్తికి పట్టే కాలం** **198**
**అధ్యాయం-14 : చలామణి కాలం** **207**
**అధ్యాయం-15 : అడ్వాన్స్ చేసిన పెట్టుబడి పరిమాణంపై టర్నోవర్ కాలం నెరపే ప్రభావం** **215**
I. చలామణి కాలంతో సమానమైన పనికాలం 224
II. చలామణి కాలాన్ని మించి వున్న పనికాలం 228
III. చలామణి కాలంకన్నా తక్కువగా వున్న పనికాలం 233
IV. నిర్ధారణలు 236
V. ధరల మార్పు కలిగించే ప్రభావం 241
**అధ్యాయం-16 : అస్థిర పెట్టుబడి టర్నోవరు** **249**
I. అదనపు విలువ వార్షిక రేటు 249
II. వ్యష్టి అస్థిర పెట్టుబడి టర్నోవరు 263
III. సమాజం దృష్టి నుంచి అస్థిర పెట్టుబడి టర్నోవరు 267
**అధ్యాయం-17 : అదనపు విలువ చలామణి** **273**
I. సామాన్య పునరుత్పత్తి 278
II. విస్తృత స్థాయిలో సంచయనమూ, పునరుత్పత్తీ 296

**మూడవ భాగం : మొత్తం సామాజిక పెట్టుబడి యొక్క పునరుత్పత్తి చలామణీ** **302**

**అధ్యాయం-18 : ఉపోద్ఘాతం** **302**
I. పరిశోధితాంశం 302
II. డబ్బు పెట్టుబడి పాత్ర 305
**అధ్యాయం -19 : ఈ విషయంపై మునుపటి అర్థశాస్త్రవేత్తలు** **310**
I. ఫిజియోక్రాట్లు 310
II. ఆడమ్ స్మిత్ 313
1. స్మిత్ సాధారణ దృక్పథాలు 313
2. ఆడమ్ స్మిత్ మార్పిడి విలువను అ.పె.+అ.వి.గా విభజిస్తాడు 320
3. పెట్టుబడి యొక్క స్థిరభాగం 323

4. ఆడమ్ స్మిత్ రచనలో పెట్టుబడి, ఆదాయం 328
5. సింహావలోకనం 334
III. తదనంతర అర్థశాస్త్రవేత్తలు 338

**అధ్యాయం-20 : సామాన్య పునరుత్పత్తి 341**

I. సమస్య గురించిన సూత్రీకరణ 341
II. సామాజిక ఉత్పత్తిలోని రెండు శాఖలు 344
III. రెండు శాఖల మధ్య మార్పిడి 347
I (అ.పె.+అ.వి.)కి బదులుగా II స్థి.పె.
IV. IIవ శాఖలో అంతర్గత మార్పిడి 351
జీవనావసర వస్తువులు, విలాస వస్తువులు
V. మార్పిడికి మాధ్యస్థం వహిస్తున్న డబ్బు చలామణి 360
VI. Iవ శాఖ స్థిర పెట్టుబడి 370
VII. రెండు శాఖల్లోనూ అస్థిర పెట్టుబడి, అదనపు - విలువ 373
VIII. రెండు శాఖల్లోనూ స్థిర పెట్టుబడి 377
IX. ఆడమ్ స్మిత్, స్టార్చ్, రామ్సేలపై పునరావలోకన 382
X. పెట్టుబడి, ఆదాయం : అస్థిర పెట్టుబడి, వేతనాలు 385
XI. నిశ్చల పెట్టుబడి భర్తీ అయ్యే క్రమం 396
1. విలువలోని తరుగుదల భాగం డబ్బు రూపంలో భర్తీ అయ్యే క్రమం 400
2. వస్తురూపంలో నిశ్చల పెట్టుబడి భర్తీ అయ్యే క్రమం 405
3. ఫలితాలు 414
XII. డబ్బు మూలపదార్థాల పునరుత్పత్తి 417
XIII. పునరుత్పత్తి గురించి డెస్టట్ డీ ట్రేసీ సిద్ధాంతం 428

**అధ్యాయం-21 : విస్తృత స్థాయిలో సంచయనం మరియు పునరుత్పత్తి 437**

I. I వ శాఖలో సంచయనం 440
1. నిల్వ నిధి ఏర్పడే క్రమం 440
2. అదనంగా చేరే స్థిర పెట్టుబడి 443
3. అదనపు అస్థిర పెట్టుబడి 448
II. IIవ శాఖలో సంచయనం 449
III. సంచయనం : పథకంవారీ చిత్రణ 453
1. మొదటి ఉదాహరణ 457
2. రెండవ ఉదాహరణ 461
3. సంచయనంలో II స్థి.పె. భర్తీ అయ్యే క్రమం 467
IV అనుబంధ వ్యాఖ్యలు 469

రచయితల సూచిక 471

పెట్టుబడి రెండవ సంపుటంలో ఉల్లేఖించిన ప్రామాణిక రచయితల, పత్రాల సూచిక 473

# పీఠిక

పెట్టుబడి రెండవ సంపుటాన్ని ప్రచురణకు సిద్ధపరచడం, అందునా, దాన్ని ఒక అవిచ్ఛిన్నమైన, సాధ్యమైనంత మేరకు సంపూర్ణమైన రచనగా తీర్చిదిద్దుతూ, మరోవైపు అది సంపాదకుని రచనగా కాక, తత్ గ్రంథకర్త రచనగా వెలువరించడం సులభంగా జరిగిన పనికాదు. ప్రచురణకు సిద్ధపరచడానికి లభించిన గ్రంథపాఠాలు చాలా వున్నాయి. వాటిలో అధికభాగం అసమగ్రమైనవి. ఇందువల్ల కూడా ఈ పని మరింత కష్టమైపోయింది. మహా అయితే, ఆమూలాగ్రంగా సరిచూచిన ఒకే ఒక రాతప్రతి మాత్రమే (రాతప్రతి IV) అచ్చుకివ్వడానికి సిద్ధంగా వుండింది. కానీ ఎక్కువ భాగం, మార్క్స్ తదనంతరం సరిచూచి చేసిన దిద్దుబాట్ల వల్ల, పాతబడిపోయాయి. ఈ రాతప్రతులు ఎక్కువ వాటిలో విషయాల వివరణ సమగ్రంగా ఉన్నప్పటికీ, భాష విషయంలో వీటికి చాలావరకు, తుది మెరుగులు పడలేదు. అవి, ఇతరుల రచనల నుంచి ఎత్తి రాసుకొనేందుకు మార్క్స్ వాడే భాషలో వున్నాయి, శైలిపట్ల శ్రద్ధ కనిపించదు; అందులో సామాన్య సంభాషణలో వాడుకలోని పదాలు కోకొల్లలు; మోటు హాస్యపు మాటలు, పదబంధాలు తరచుగా కనిపిస్తాయి; అక్కడక్కడ ఇంగ్లీషు, ఫ్రెంచి సాంకేతిక పదాలు, లేదా ఇంగ్లీషు వాక్యాలకు వాక్యాలే, పుటలకు పుటలే కద్దు. గ్రంథకర్త మెదడులో ఆలోచనలు రూపుగొన్నవి రూపుగొన్నట్లుగానే కాగితంపై పెట్టడం జరిగింది. వాదనలోని కొన్ని భాగాలు సమగ్రంగా వుండగా, వాటంతటి ముఖ్యమైన తక్కిన భాగాలు కేవలం సూచనప్రాయంగా పేర్కొనబడ్డాయి. ఉదాహరణ లివ్వడానికై వాస్తవ సమాచారాన్ని సేకరించడం జరిగిందే కానీ వాటిని క్రమపద్ధతిలో పెట్టలేదు; అధ్యాయాల ముగింపులో, తరువాత అధ్యాయానికి వెళ్ళాలన్న ఆదుర్దాతో గ్రంథకర్త, ఇక్కడ అసంపూర్తిగా వదిలిన వాటి తదుపరి విపులీకరణకు గుర్తుగా ఒకదానితో ఒకటి లంకె లేని కొన్ని వాక్యాలను మాత్రమే తరచు రాసుకొన్నాడు. ఆఖరు విషయం, గ్రంథకర్త జగద్విదితమైన దస్తూరి, కొన్ని సందర్భాల్లో ఆయనే దాన్ని చదవలేకపొయ్యేవాడు.

ఈ రాతప్రతులను సాధ్యమయినంతగా, ఉన్నదున్నట్లు తిరిగి రాయడంతో తృప్తిపడ్డాను; పోతే, మార్క్స్ స్వయంగా ఎక్కడెక్కడ శైలిని మార్చి వుండేవాడో అక్కడ మాత్రమే దాన్ని మార్చాను; తప్పనిసరిగా అవసరమైన చోట్లా, అర్థం సందేహానికి తావివ్వనంత స్పష్టంగా వున్నచోట్ల మాత్రమే వివరణాత్మక వాక్యాలను, లేదా పూర్వోత్తర భాగాలను కలిపే వాక్యాలను మధ్యలో చేర్చాను. అర్థం విషయంలో ఏకాస్త సందేహానికైనా తావున్న వాక్యాలను మాటకు మాట యెత్తి రాశాను. నేను మార్చిన భాగాలు, లేదా కొత్తగా చేర్చిన భాగాలు కలిసి అచ్చులో పది పుటలు కూడా వుండవు; అవి కూడా రచనా రీతికి సంబంధించినవే.

ద్వితీయ సంపుటి కోసం మార్క్స్ వదిలి వెళ్ళిన రాతప్రతులను లెక్కపెడితే చాలు, తాను కనుగొన్న గొప్ప ఆర్థిక విషయాలను ప్రచురించే ముందు వాటిని ఆయన అనన్యమైన చిత్తశుద్ధితో, ఖచ్చితమైన ఆత్మ విమర్శనా దృష్టితో తుదమట్టంగా వివరించడానికి పూనుకొన్నారని రుజువవుతుంది. నిరంతర అధ్యయనం వల్ల ఆయన దృఙ్మండలం అంతకంతకు విస్తరిస్తూండేది. ఇతివృత్తింలోనూ, రీతిలోనూ దీనికి అనుగుణంగా వుండేలా విషయాన్ని పాఠకుల ముందుంచేందుకు, ఈ ఆత్మ విమర్శ ఆయన్ను అనుమతించేది కాదు. పైన పేర్కొన్న రాతప్రతులివి:

మొదటిది, "జుర్ క్రిటిక్ డెర్ పొలిటిష్చెన్ ఒయికొనామిక్"[1] అనే శీర్షిక గల రాతప్రతి. ఇందులో 1472 పావుటావు కాగితాలున్న 23 నోట్ పుస్తకాలు వున్నాయి. ఇది 1861 ఆగస్టు నుంచి 1863 జూన్ వరకు రాసినది; 1859లో బెర్లిన్‌లో అదే పేరుతో వెలువడిన గ్రంథం తదుపరి భాగమే; 1859 నాటిది మొదటి భాగం. పెట్టుబడి ఒకటవ సంపుటిలో పరిశీలించిన విషయాలనే, పెట్టుబడిగా డబ్బు పరివర్తన చెందినప్పటి నుంచి తుది వరకు, ఈ రాతప్రతి 1–220 పుటల్లోనూ (నోట్ పుస్తకాలు I నుంచి V) మళ్ళీ 1159–1472 (నోట్ పుస్తకాలు XIX నుంచి XXIII) పుటల్లోనూ వివరిస్తూంది. ఈ విషయాలపై లభించిన మొదటి చిత్తుప్రతి ఇది. దీనిలో 973–1158 పుటలు (నోట్ పుస్తకాలు XVI - XVIII), పెట్టుబడి, లాభం, లాభం రేటు, వర్తకుని పెట్టుబడి, డబ్బు – పెట్టుబడి గురించి చెబుతున్నాయి; అంటే, మూడవ సంపుటికి ఉద్దేశించిన రాతప్రతుల్లో, ఆ తరువాత విపులీకరించిన విషయాలను గురించి చెబుతున్నాయన్నమాట. రెండవ సంపుటిలో చర్చించిన విషయాలను, ఆ తరువాత మూడవ సంపుటిలో చర్చించిన అనేకానేక విషయాలను వేరుపరచి చూపలేదు. వాటిని ప్రాసంగికంగా చర్చించడం జరిగింది. నిర్దిష్టంగా చెప్పాలంటే, "అదనపు విలువ సిద్ధాంతాలు" అనే శీర్షిక గల విభాగంలో చర్చించబడ్డాయి. దీని పాఠంలోని ప్రధాన భాగమున్నది, 220–972 పుటల్లో (నోట్ పుస్తకాలుVI–XV). ఈ విభాగంలో, రాజకీయ అర్థశాస్త్రపు సారభూతాంశమైన అదనపు విలువ సిద్ధాంతం యొక్క విపుల, సవిమర్శక చరిత్ర వుంది. దీనితోపాటుగా, ఉత్తరోత్తరా, రెండవ, మూడవ సంపుటాల్లో ఏ ఏ శాస్త్రాంశాలు విడిగానూ, వాటి తార్కిక పరస్పర సంబంధం దృష్ట్యానూ పరిశోధించబడ్డాయో, వాటిలోని అత్యధిక అంశాలను, మునుపటి అర్థశాస్త్రజ్ఞుల వాదనలను ప్రతివాదాలతో, ఈ విభాగం ఆవిష్కరిస్తోంది. రెండవ, మూడవ సంపుటాల్లో తిరిగి చర్చించిన అనేక పాత భాగాలను తొలగించిన తరువాత, ఈ రాతప్రతిలోని విమర్శనాత్మక భాగాన్ని పెట్టుబడి నాల్గవ సంపుటంగా ప్రకటించదలచాను.[2]

---

1. ఇది యిక ముందు **జుర్/క్రిటిక్** అని పేర్కొనబడింది - ఫ్రెడరిక్ ఎంగెల్స్.

2. **అదనపు విలువ సిద్ధాంతాలను పెట్టుబడి** నాల్గవ సంపుటంగా ప్రచురించడానికి ముందే ఎంగెల్స్ చనిపోయారు. 1905-10లో కౌట్స్కీ ఈ పుస్తకం జర్మన్ కూర్పును వెలువరించాడు; ఇందులో, అకారణమైన మూలాతిక్రమణలూ, పాత భాగాల స్థానవ్యత్యయాలూ, తొలగింపులూ ఎన్నో వున్నాయి. అదనపు విలువ సిద్ధాంతాలు మొట్టమొదటి ప్రామాణికమైన కూర్పును సోవియట్ యూనియన్ కమ్యూనిస్టు పార్టీ కేంద్ర కమిటీకి చెందిన మార్క్సిజం - లెనినిజం ఇన్‌స్టిట్యూట్ 1954-61లో రష్యన్ భాషలో వెలువరించింది. అనువాదంలో కొన్ని దిద్దుబాట్లతో, ఆ గ్రంథ అనుబంధ విషయ సామగ్రికి చేసిన కొన్ని చేర్పులతో అది, మార్క్స్, ఎంగెల్స్‌ల సంకలిత రచనల రెండవ రష్యన్ కూర్పు తాలూకు 26వ సంపుటిలోని మూడు భాగాలుగా (మాస్కో 1962-64) ప్రచురితమైంది. 1954-61 రష్యన్ కూర్పు పద్ధతిలోనే, ఒక జర్మన్

కాలక్రమంలో దీని తరువాత వచ్చేది 3వ సంపుటి రాతప్రతి, మార్క్స్ దాన్ని, కనీసం దానిలో ఎక్కువ భాగాన్ని 1864, 1865లలో రాశారు. ఈ రాతప్రతిలోని అతి ముఖ్య భాగాలను పూర్తిచేసిన తరువాతనే ఆయన 1వ సంపుటిని పూర్తిచేసే పనికి ఉపక్రమించాడు. అది 1867లో వెలువడింది. నేనిప్పుడు ఈ 3వ సంపుటి రాతప్రతిని అచ్చుకివ్వడానికై దానికి ఒక సక్రమ రూపమిస్తున్నాను.

తరువాత కాలం నాటివి – అంటే 1వ సంపుటి ప్రచురణ తరువాతవి 2వ సంపుటికి సంబంధించిన నాలుగు అరఠావు సైజు రాతప్రతుల సంకలనం. వాటికి మార్క్స్ స్వయంగా I–IV అని వరుస అంకెలు వేశాడు. రాతప్రతి I (150 పుటలు) బహుశా 1865 లేదా 1867లో రాసినది. అది, ఇప్పటి రూపంలోని 2వ సంపుటికి ఉద్దేశించిన మొదటి విడిరచన. కానీ ఇంచుమించు అసంపూర్ణంగా వుంది. దీన్ని సైతం ఉపయోగించుకో వీలులేకపోయింది. రాతప్రతి III లో వున్నవి: ఇతరుల రచనల నుంచి ఉల్లేఖనల సంకలనం, ఎక్కువగా 2వ సంపుటి మొదటి భాగానికి సంబంధించిన మార్క్స్ రచన భాగాలు గల నోట్ పుస్తకాల ప్రస్తావనలు, కొంతవరకు కొన్ని ప్రత్యేకాంశాలను గురించి, ముఖ్యంగా స్థిర పెట్టుబడి, చలామణిలోని పెట్టుబడి, లాభమూలం – వీటిపై ఆడమ్ స్మిత్ ప్రతిపాదనల గురించిన విమర్శ. ఇవి కాక, లాభం రేటుకు, అదనపు విలువ రేటుకు గల సంబంధం గురించిన వివరణ కూడా ఇందులో వుంది; ఇది 3వ సంపుటికి చెందిన విషయం. ఆయన పేర్కొన్న నోట్ పుస్తకాల నుంచి సంగ్రహించ దగిన కొత్త విషయాలేవీ లేవు; 2వ, 3వ సంపుటాలకు ఉద్దేశించిన రచనా భాగాలను తదుపరి తిరిగి రాయటం వల్ల, మొదటివి నిరుపయోగమయాయి. కాబట్టి వాటిలో కూడా ఎక్కువ భాగాన్ని వదలివేయవలసి వచ్చింది.

రాతప్రతి IV, 2వ సంపుటి 1వ భాగానికీ 2వ భాగంలోని మొదటి అధ్యాయాలకూ సంబంధించినది; ఇది అచ్చుకివ్వడానికి సిద్ధపరచిన ప్రతి. దీన్ని అనువైన చోట్ల ఉపయోగించాను. ఇది రాత ప్రతి II కన్నా ముందుగానే రాసినది. అయినప్పటికీ, మరింత సమగ్రమైన రూపంలో వున్నందువల్ల, దాన్ని ఈ పుస్తకంలో ప్రయోజనకరంగా తత్సంబంధిత భాగానికి ఉపయోగించుకో వీలయింది. అవసరమయినదల్లా రాతప్రతి II నుంచి కొన్ని భాగాలు చేర్చడమే. కొంతవరకు, రాతప్రతి II ఒక్కటే, 2వ సంపుటికి సంబంధించిన సమగ్ర రచన. దీన్ని రాసినది 1870 నాటి నుంచీ. తుది కూర్పును తయారు చేయడానికి (దీని గురించి త్వరలో చెప్పబోతున్నాను) ఉద్దేశించిన షరా, "ఈ రెండవ విపులీకరణను ప్రాతిపదికగా ఉపయోగించాలి" అని స్పష్టంగా చెబుతోంది.

1870 తరువాత, ప్రధానంగా జబ్బువల్ల, మార్క్స్ రచన మరొకసారి ఆగిపోయింది. ఈ కాలాన్ని ఆయన తన మామూలు పద్ధతిలో వినియోగించుకొన్నారు. గ్రామీణ ఆర్థిక విషయాలను, అమెరికాలో, ప్రత్యేకించి రష్యాలో గ్రామీణ సంబంధాలను, డబ్బు మార్కెట్, బ్యాంకింగ్‌లను, భూగర్భ, శరీర శాస్త్రాలను అధ్యయనం చేశారు. ఈ కాలంలో ఆయన రాసుకొన్న అనేక నోట్ పుస్తకాల్లో,

---

కూర్పు 1956-62లో జర్మన్ ప్రజాతంత్ర రిపబ్లిక్‌లో వెలువడింది. ప్రస్తుతం జి.డి.ఆర్.లో, అదనపు విలువ సిద్ధాంతాలు కొత్త కూర్పును, మార్క్స్, ఎంగెల్స్‌ల సంకలిత రచనల 26వ సంపుటిగా వెలువరించడానికి కృషి జరుగుతోంది. మాస్కోలోని ప్రగతి ప్రచురణాలయం ఈ గ్రంథం మొదటి భాగాన్ని ఇదివరకే ప్రకటించింది: రెండవ, మూడవ భాగాలను ప్రచురణార్థం సిద్ధం చేస్తోంది.

స్వతంత్రమైన గణిత శాస్త్రాధ్యయన విషయాలు కూడా ప్రముఖంగా కనిపిస్తాయి.[1] 1877 ప్రారంభం నాటికల్లా ఆయన తన ప్రధానమైన పని తిరిగి చేపట్ట గలిగినంత కోలుకొన్నాడు. 1877 మార్చి ఆఖరు నాటి నుంచి, పైన పేర్కొన్న నాలుగు రాతప్రతులకు సంబంధించిన ప్రస్తావనలు, వ్యాఖ్యానాలు ఉన్నాయి. ఇవి, 2వ సంపుటి కొత్త రచనకు ప్రాతిపదికగా ఉద్దేశితమైనాయి. ఈ రచన, రాతప్రతి 4తో (56 అరఠావు పుటలు) ప్రారంభమవుతుంది. ఇందులో మొదటి నాలుగు అధ్యాయాలున్నాయి. అయితే దీనికింకా ఒక సమగ్ర రూపమివ్వలేదు. ముఖ్యమైన విషయాలు పాదటీకల్లో వివరించబడ్డాయి. విషయ సామాగ్రిని సేకరించడం జరిగిందే కానీ, వాటిని వడబోయలేదు. అయితే 1వ భాగంలోని ఈ అతి ముఖ్య విభాగపు చివరి సమగ్ర రచన ఇదే.

అచ్చుకు ఒక రాతప్రతిని సిద్ధం చేయడానికి మొదటి ప్రయత్నం రాతప్రతి VI లో జరిగింది. (1877 అక్టోబరు తరువాత 1878 జులై ముందు). 17 పావుఠావు పుటలే వున్న ఈ ప్రతి, మొదటి అధ్యాయంలోని ఎక్కువ భాగానికి సంబంధించినది. రెండవ ప్రయత్నం – అదే ఆఖరుది – "1878 జులై 2" తేదీ గల రాతప్రతి VIIలో జరిగింది. దాని పుటలు 7 అరఠావులు మాత్రమే.

తన ఆరోగ్యంలో సంపూర్ణమైన విప్లవకర మార్పు వస్తే తప్ప రెండవ, మూడవ సంపుటాలను తనకు సంతృప్తికరంగా రాసే పని పూర్తి చేయలేనని మార్క్స్, ఈ దశలో, గుర్తించినట్లుంది. నిజానికి, రాతపత్రులు V–VIIIలను బట్టి, మార్క్స్, మానసికంగా తన్ను కుంగదీస్తున్న జబ్బును ఎదుర్కొని తీవ్రంగా పోరాడిన జాడలు మరీ తరచుగా వెల్లడి అవుతున్నాయి. ఒకటవ భాగంలోని అతికష్టమైన ఖండాన్ని రాతప్రతి Vలో పూర్తి చేశాడు. ఒకటవ భాగంలో మిగతాది, అధ్యాయం XVII తప్ప రెండవ భాగమంతా పెద్ద సైద్ధాంతిక క్లిష్టతలున్నవి కాదు. కానీ పునరుత్పత్తి, సామాజిక పెట్టుబడి చలామణీలను వివరించే మూడవ భాగాన్ని తిరిగి సరిచూడవలసిన అవసరమెంతో ఉందని ఆయనకు తోచింది. ఎందువల్లనంటే, అంతకుముందే రాతప్రతి II పునరుత్పత్తికి సాధనమైన డబ్బు చలామణీని పరిగణనకు తీసుకోకుండా పునరుత్పత్తిని విశదీకరించింది. ఆ తరువాత, డబ్బు చలామణీని పరిగణనకు తీసుకొని అదే సమస్యను మళ్ళీ వివరించింది. దీన్ని తొలగించి వేసి, విస్తరిల్లిన గ్రంథకర్త విజ్ఞానానికి అనుగుణమైన రీతిలో ఈ భాగాన్ని మొత్తంగా తిరిగి రాయవలసి వచ్చింది. ఆ విధంగా రాతప్రతి VIII ఆవిర్భవించింది. ఇది కేవలం 70 పావుఠావు పుటలున్న నోట్‌పుస్తకం. రాతప్రతి II లో చేర్చిన భాగాలను వదలివేసిన తరువాత, అచ్చయిన మూడవ భాగంతో ఆ రాతప్రతిని పోల్చి చూస్తే, మార్క్స్ ఆ కొద్ది స్థలంలో ఎన్ని విషయాలను ఇమడ్చగలిగాడో స్పష్టమవుతుంది.

ఈ రాతప్రతి సైతం, అదేవిధంగా ఈ ఇతివృత్తం గురించిన కేవల ప్రాథమిక వివరణే. కొత్తగా యేర్పరచుకొన్న నూతన దృక్కోణాలను, రాతప్రతి II తో, కొత్తగా చెప్పడానికి ఏమీ లేనందు వల్ల, అందులో వదలి వేసిన అంశాలతో పోల్చి చేస్తే, సరికొత్తగా ఏర్పరచుకొన్నట్టి నూతన దృక్పథాలను స్థిరపరచి, అభివృద్ధి చేయడం ఈ రాతప్రతి ప్రధానోద్దేశం. రెండవ భాగంలోని అధ్యాయం XVIIలో

---

1. సోవియట్ యూనియన్ కమ్యూనిస్టు పార్టీ కేంద్ర కమిటీకి చెందిన మార్క్సిజం - లెనినిజం ఇన్‌స్టిట్యూట్, రష్యన్ మూలాధారాల నుంచి మార్క్స్ రాసుకొన్న గ్రంథ భాగాలను ప్రచురించింది. (మార్క్స్, ఎంగెల్స్ పురాపత్ర భాండాగారాన్ని చూడండి) సం. XI మాస్కో, 1948; సం. XII, మాస్కో, 1952, సం. XIII, మాస్కో, 1955 - సం.

ఒక ముఖ్య భాగాన్ని ఆయన మరోసారి తిరిగి రాసి పెంచాడు. తర్కబద్ధమైన విషయానుక్రమానికి తరచు అంతరాయమేర్పడింది. విషయ వివరణ కొన్ని స్థలాల్లో తెగిపోయి చాలా అసమగ్రంగా వుంది. ఇది ప్రత్యేకించి ముగింపుకు వర్తిస్తుంది. కానీ మార్క్సు తను చెప్పదలచుకొన్నది ఇక్కడ ఎలాగైతేనేమి, చెప్పాడు.

ఇదీ, రెండవ సంపుటికి ఉద్దేశించిన విషయ సామాగ్రి. మార్క్సు చనిపోవడానికి కాస్త ముందు, తన కుమార్తె ఎలియనార్‌తో అన్న మాటల్లో చెప్పాలంటే, దీన్నుంచి నేను "ఏదో ఒకటి చేస్తాననీ" అన్నాడు. ఈ కర్తవ్యాన్ని దాని అత్యంత సంకుచితార్థంలో తీసుకొన్నాను. సాధ్యమయినంత మేరకు, వున్న వివిధ పాఠాంతరాల నుంచి ఒక దాన్ని కేవలం ఎంచుకొనేందుకు నా పనిని పరిమితం చేశాను. ఉన్నవాటితో, సవరింపబడిన చివరి రాతపత్రినే ఎల్లప్పుడూ నా కృషికి ప్రాతిపదికగా చేసుకొని, దాన్ని మునుపటి రాతప్రతులతో పోల్చి చూస్తూ వచ్చాను. నిజమైన చిక్కులు, ఎదురైంది అంటే యెక్కువగా కేవలం సాంకేతికమైన చిక్కులు ఏవైనా మొదటి భాగంలోనూ, మూడవ భాగంలోనూనే. ఇవి, నిజంగా గణనీయమైనవి. వాటిని కేవలం గ్రంథకర్త స్ఫూర్తితోనే పరిష్కరించడానికి ప్రయత్నించాను.

గ్రంథపాఠంలో, వాస్తవాల ధ్రువీకరణకై ఇతర గ్రంథాల నుంచి ఉల్లేఖనలున్న సందర్భాల్లో వాటిని అనువదించాను. లేదా, విషయాన్ని అమూలాగ్రంగా పరిశీలించాలనుకొనే ప్రతి ఒక్కరికీ మూలం లభిస్తున్నప్పుడు – ఆడమ్ స్మిత్ గ్రంథం నుంచి ఉల్లేఖించిన వాక్యాల వంటి వాటిని అనువదించాను. పదవ అధ్యాయంలో మాత్రమే ఇది సాధ్యం కాలేదు; ఎందువల్లనంటే, అక్కడ మార్క్సు విమర్శించింది ఇంగ్లీషు పాఠాన్నే.

మొదటి సంపుటి నుంచి ఉదహరించిన భాగాలున్న పుటల సంఖ్యను, ఆ గ్రంథం రెండవ కూర్పును బట్టి – మార్క్సు జీవితకాలంలోని ఆఖరు కూర్పు అదే – ఇచ్చాను.

జుర్ క్రిటిక్ రాతప్రతి రూపంలోని తొలి రచన, రాతప్రతి III లోని పైన పేర్కొన్న భాగాలు, వివిధ ఉల్లేఖనలున్న నోట్ పుస్తకాల్లో అక్కడక్కడ చెదరుమదురుగా వున్న సంగ్రహ టిప్పణులు – యివి తప్పితే, మూడవ సంపుటికి ఉద్దేశించిన విషయ సామాగ్రి అంతా కింద పేర్కొన్నవి మాత్రమే లభించాయి; ఇంతకు ముందు పేర్కొన్న 1864–65 అరఠావు పుటల రాతప్రతి – రెండవ సంపుటికి సంబంధించిన రాతప్రతి II లాగా ఇది కూడా దాదాపు సమగ్ర రూపంలో వుంది; ఇదిగాక, 1875 తేదీ గల ఒక నోట్ పుస్తకం – లాభం రేటుకు, అదనపు విలువకు గల సంబంధాన్ని గురించి చర్చించిన ఈ రచన ఈ విషయాన్ని గణితశాస్త్ర పరిభాషలో (సమీకరణల్లో) వివరిస్తోంది. ఈ సంపుటిని ప్రచురణకు సిద్ధపరచే పని త్వరితగతిన సాగుతోంది. ఇప్పటివరకు నేను అంచనా వేయగలిగిన దాన్ని బట్టి చూస్తే చాలా ముఖ్యమైన కొన్ని భాగాల్లో తప్ప, ఇందులో ఎదురైన చిక్కులు ప్రధానంగా సాంకేతికమైనవి మాత్రమే.

మార్క్సుపై వచ్చిన ఒకానొక నిందారోపణను ఖండించడం ఇక్కడ సందర్భోచితమని భావిస్తున్నాను. మొదట ఆ విషయమై గుసగుసలు బయలుదేరాయి. ఇటీవల, మార్క్సు మరణానంతరం జర్మన్ ఉన్నత విద్యాసంస్థలోని సోషలిస్టులు, ప్రభుత్వ రంగాన్ని సోషలిజంగా చిత్రించే సోషలిస్టులు, వారి ఆశ్రితులు ఇది నిరూపితమైన వాస్తవమని ప్రకటించారు. రాడ్‌బెర్టస్ గ్రంథంలోని విషయాలను మార్క్సు దొంగిలించారని వారి అభియోగం. ఈ విషయమై తక్షణమే చెప్పవలసినది, నేను ఇదివరకే

మరోచోట చెప్పాను.[1] కానీ ఇంతవరకు దీనికి తిరుగులేని రుజువులు చూపలేకపోయాను.

నాకు తెలిసినంత వరకు, ఈ ఆరోపణ మొట్టమొదటిసారిగా, ఆర్. మెయర్ గ్రంథం, ఎమాన్సిపేషన్ స్కాంఫ్ డెస్ వియర్‌టెన్ స్టాండెస్ లోని 43వ పుటలో వుంది. "మార్క్స్ తన సవిమర్శక సమీక్షలోని అధికభాగం, ఈ ప్రచురణల నుంచి గ్రహించనదే అని రుజువు చేయవచ్చు" అని అందులో వుంది. ఈ ప్రచురణలు అంటే, 1830 దశాబ్ది చరమార్థం నాటి రాడ్‌బెర్టస్ రచనలని అర్థం. ఇతర సాక్షాధారాలను చూపే వరకు, ఇలా నొక్కి చెప్పిన దానికి "మొత్తం రుజువు", శ్రీమాన్ మెయర్‌కు ఇలా జరిగిందని రాడ్‌బెర్టస్ నమ్మజెప్పడమే అని భావిస్తున్నాను.

1879లో రాడ్‌బెర్టస్ స్వయంగా రంగంపైకి వచ్చి జె. జెల్లర్‌కు ఇలా రాస్తున్నాడు. (జీట్‌స్ట్రాఫ్ట్ ఫర్ గెసామ్‌టీ స్టాట్ స్విన్‌స్‌నెన్ స్ట్రాఫ్ట్, ట్యుబిన్‌జెన్, 1879, పుట 219)[2] జుర్ యెర్కెనట్నిస్ ఉన్ స్రర్ స్టాట్స్ విర్ట్ స్ట్రాఫ్ట్‌లిచెన్ జుస్టాండే, 1842. అన్న తన రచనను గురించి ప్రస్తావిస్తూ రాసిన ఉత్తరమిది. దీన్ని (అందులో విపులీకరించిన ఆలోచనా సరళిని) మార్క్స్ బహుచక్కగా వుపయోగించు కొన్నాడనీ.... కానీ అది నాదని ఆయన చెప్పలేదనీ మీకు తెలిసిపోతుంది". రాడ్‌బర్టస్ మరణానంతరం ఆయన రచనలను ప్రకటించిన టి. హెచ్. కొజాక్, ఈ తప్పుడు అభిప్రాయాన్ని, యే నియమ నిబంధనలను పాటించకుండా వల్లించాడు. (దాస్ కాపిటల్. వాన్ రాడ్‌బెర్టస్, బెర్లిన్, 1884, ప్రవేశిక, పుటXV).

ఆఖరు విషయం. 1881లో ఆర్. మెయర్ ప్రకటించిన బ్రీఫే అండ్ సొజియాపొలిటిశ్చే ఆఫ్ సాట్జే వాన్ డాక్టర్ రాడ్‌బెర్టస్ – జగెట్ జౌలో, రాడ్‌బెర్టస్ సూటిగా ఇలా చెబుతున్నాడు : "స్కాఫెల్, మార్క్స్‌లు నా పేరు చెప్పకుండా, నా భావాలను దొంగిలించారని నేడు కనుగొన్నాను" (60వ లేఖ, పుట 134). మరోచోట రాడ్‌బెర్టస్ వాదన మరింత స్పష్టమైన రూపంలో వుంది: "పెట్టుబడిదారుని అదనపు విలువకు మూలం ఏమిటో, దాదాపు మార్క్స్ అనుసరించిన పద్ధతిలోనే, కానీ అంతకన్నా సంక్షిప్తంగానూ, స్పష్టంగానూ నేను, నా మూడవ సామాజిక లేఖలో నిరూపించాను" (48వ లేఖ, పుట III)

గ్రంథచౌర్యం గురించిన ఈ ఆరోపణల్లో దేన్ని గురించీ మార్క్స్ ఎన్నడూ యేమీ వినలేదు. తనవద్ద వున్న ఎమాన్సిపేషన్ స్కాంఫ్ పుస్తకంలో, ఇంటర్నేషనల్‌కు సంబంధించిన భాగం పుటలు మాత్రమే కోయబడి వున్నాయి.[3] మిగతా పుటలను, ఆయన చనిపోయిన తరువాత, నేను స్వయంగా కోసే వరకు, అవి తెరవబడలేదు. ఆయన ట్యుబిన్‌జెన్ రచన జీట్‌స్ట్రాఫ్ట్‌ను చూచి ఎరుగడు. ఆర్. మెయర్‌కు రాసిన బ్రీఫే అండ్ సోజియా పొలిశ్చే వగైరా గురించి కూడా ఆయనకు తెలీదు. "చౌర్యం" గురించి ప్రస్తావించిన భాగాన్ని, 1884లో డాక్టర్ మేయర్ నా దృష్టికి తీసుకొచ్చే వరకు, ఆ విషయం

1. కార్ల్‌మార్క్స్ దాస్ ఎలెండ్ డెర్ ఫిలాసఫీ. ఆన్ట్‌వర్ట్ ఆఫ్ ప్రౌడాన్స్ ఫిలాసఫీ డెస్ ఎలెండ్స్, ద్యుట్‌శ్చే వాన్ ఇ. బర్న్‌స్టీన్ అండ్ కె. కాట్స్కి. స్టుట్‌గార్ట్, 1885. (ఇంగ్లీషు కూర్పు : కె. మార్క్స్, తాత్విక దారిద్ర్యం. ఇది "పేదరికతత్వం" అన్న ఎమ్. ప్రౌడాన్ రచనకు సమాధానం. మాస్కో, 1963, పుటలు 7-23 - సం.)
2. రాడ్‌బెర్టస్ 1875లో చనిపోయాడు. జెల్లర్‌కు ఆయన రాసిన ఉత్తరం 1879లో ప్రచురితమైంది. ఎంగిల్స్ పేర్కొంటున్న ఉత్తరమిదే.
3. ఆ రోజుల్లో పుస్తకాలను చదవడానికి ముందు పాఠకులే పేజీలు కోసుకొనేవారు.

నాకూ తెలీదు. కానీ 48వ లేఖను మార్క్స్ చూచాడు. అసలు లేఖనే డాక్టర్ మెయర్ మార్క్స్ ఆఖరు కూతురికి దయతో పంపించాడు. తన సవిమర్శక సమీక్షకు రహస్య మూలాధారం రాడ్‌బెర్టస్ రచనలో కనిపిస్తుందన్న నిగూఢమైన గుసగుసలు కొన్ని మార్క్స్ చెవిన పడినప్పుడు, ఆయన ఆ లేఖను నాకు చూపించాడు. రాడ్‌బెర్టస్ తనదని చెప్పుకొనేదేమిటో సాధికార సమాచారం తుదకు తనకందిందనీ, రాడ్‌బెర్టస్ నొక్కి చెప్పేదంతా అదే అయితే, తనకెట్టి అభ్యంతరం లేదనీ మార్క్స్ అన్నాడు. రాడ్‌బెర్టస్ తాను చెప్పినదే మరింత సంక్షిప్తంగానూ, స్పష్టంగానూ ఉందని పాపం సంతోషించనీ, నాదేమి పోయింది, అన్నాడు మార్క్స్. వాస్తవంలో, ఈ రాడ్‌బెర్టస్ లేఖతో ఈ వ్యవహారం పరిష్కారమైనట్లు మార్క్స్ భావించాడు.

ఆయన అలా భావించడానికి మరో కారణం కూడా వుంది – 1859 వరకు ఆయనకు రాడ్‌బెర్టస్ రచనా కార్యకలాపాలను గురించి ఏమాత్రమూ తెలీదు. 1859 నాటికి మార్క్స్ రాజకీయ అర్థశాస్త్రం గురించిన తన సవిమర్శక సమీక్ష మూలాంశాల రేఖామాత్ర చిత్రణనే కాక, దాని మరింత ముఖ్యమైన వివరాల నిరూపణను కూడా పూర్తి చేశాడు. మార్క్స్, తన అర్థశాస్త్ర అధ్యయనాన్ని 1843లో పారిస్‌లో ప్రారంభించాడు. దానిని, ఇంగ్లీషు, ఫ్రెంచి మహారచయితల గ్రంథాలతో మొదలు పెట్టాడు. జర్మన్ అర్థశాస్త్రజ్ఞులలో రామ్ మరియు లిస్ట్ రచనలు మాత్రమే ఆయనకు తెలుసు. ఇక ఏ జర్మన్ అర్థశాస్త్రజ్ఞుడిని ఆయన చదవదలుచుకోలేదు. రాడ్‌బెర్టస్ బెర్లిన్ డిప్యూటీగా చేసిన ప్రసంగాలను మంత్రిగా తీసుకొన్న చర్యలను 1848లో న్యూ రీనిశ్చే జీటుంగ్[1]లో మేము విమర్శించవలసి వచ్చేవరకు అలాంటి వ్యక్తి ఒకడు వున్నాడని కూడా మార్క్స్‌కు గానీ, నాకు గానీ తెలీదు. ఆయన్ను గురించిన మా అజ్ఞానం ఎంతటిదంటే, అంత హఠాత్తుగా మంత్రి అయిన ఈ రాడ్‌బెర్టస్ ఎవరని మేము రెనిష్ ప్రతినిధులను అడగవలసి వచ్చింది కానీ, వీరు కూడా రాడ్‌బెర్టస్ అర్థశాస్త్ర రచనలను గురించి ఏమీ చెప్పలేకపోయారు. అయితే, "పెట్టుబడిదారు యొక్క అదనపు ఇలువ" ఎక్కడ నుంచి వస్తుందనేదే కాక, ఎలా వస్తుందనేది కూడా మార్క్స్‌కు, రాడ్‌బెర్టస్ సహాయం లేకుండానే అప్పటికే బాగా తెలుసు. 1847 నాటి మార్క్స్ రాసిన 'తాత్విక దారిద్ర్యం',[2] అదే సంవత్సరం బ్రస్సెల్స్‌లో ఆయన వేతన శ్రమ, పెట్టుబడిపై యిచ్చిన ఉపన్యాసాలు ఇందుకు రుజువు. ఈ ఉపన్యాసాలు న్యూ రీనిశ్చే జీటుంగ్ 264–69 సంచికల్లో 1849లో[3] ప్రచురితమయ్యాయి. రాడ్‌బెర్టస్ అనే పేరుగల అర్థ శాస్త్రజ్ఞుడొకడు వున్నాడని మార్క్స్‌కు తెలిసింది 1859లోనే. ఆ సంగతి ఆయనకు లాస్యాల్ ముఖతః తెలిసింది. దానిపై ఆయన బ్రిటీష్ పురావస్తు పత్ర నిలయంలో "మూడవ సామాజిక లేఖ"ను చూచారు.

జరిగిన వాస్తవ విషయాలివీ. ఇక మార్క్స్ "దొంగిలించాడని" చెప్పే రాడ్‌బెర్టస్ రచనలోని

1. న్యూ రీనిశ్చే జీటుంగ్, ఆర్గన్ డెర్‌డెమొక్రట్ - 1848 జూన్ 1 నుండి 1849 మే 19 వరకు, కొలోన్‌లో మార్క్స్ సంపాదకత్వాన వెలువడిన దినపత్రిక. పత్రిక సంపాదకుల్లో కిందివారున్నారు : ఫ్రెడరిక్ ఎంగెల్స్, విలియమ్ ఉల్ఫ్, జార్జ్‌వీర్త్, ఫెర్లినాండ్ ఉల్ఫ్, యెర్నెస్ట్ డ్రాంకే, ఫెర్డినాండ్ ఫ్రీలిగ్రాత్, హీన్‌రిచ్ బ్యుర్గర్స్. ప్రష్యన్ ప్రభుత్వం మార్క్స్‌ను, తదితరులను వేధిస్తూ వచ్చినందువల్ల, ఈ పత్రిక ప్రచురణను నిలిపివేశారు. - సం.
2. కార్ల్‌మార్క్స్, తాత్విక దారిద్ర్యం, మాస్కో, 1962 - సం.
3. కార్ల్‌మార్క్స్, వేతన శ్రమ, పెట్టుబడి, మాస్కో, 1961 - సం

విషయమేమిటో ఇప్పుడు చూద్దాం. రాడ్‌బెర్టస్ ఇలా అంటున్నాడు: "పెట్టుబడిదారుని అదనపు విలువకు మూలమేమిటో, మార్క్స్ అనుసరించిన పద్ధతిలోనే, కానీ ఆయనకన్నా మరింత సంక్షిప్తంగానూ, స్పష్టంగానూ నా మూడవ సామాజిక లేఖలో నేను నిరూపించాను." కాబట్టి, అసలు విషయం అదనపు విలువ సిద్ధాంతం రాడ్‌బెర్టస్ తనదైనట్లు వాదించవీలున్నది.మార్క్స్ రచనల్లో మరేదుందో చెప్పడం నిజంగాకష్టం. ఈ విధంగా రాడ్‌బెర్టస్ అదనపు విలువ సిద్ధాంతానికి నిజమైన మూలకర్తను తానే అనీ, మార్క్స్ దాన్ని తన నుంచి దొంగిలించారనీ చెబుతున్నాడు.

అదనపు విలువ మూలమని, మూడవ లేఖ చెబుతున్న దేమిటి? కేవలం యింతే, "కౌలు" – భూమి కౌలును, లాభాన్ని కలగలుపుతున్న ఆయన పదమది – ఒక సరుకు విలువకు "ఒక అదనపు విలువ చేరడం వల్ల ఉత్పన్నం కాదు." అది వేతనాల నుంచి విలువను పట్టుకోవడం వల్ల ఉత్పన్న మవుతుంది; వేరు మాట్లో చెప్పాలంటే, వేతనాలు ఒక ఉత్పాదితపు విలువలో ఒక భాగం మాత్రమే. అందువల్ల "వేతనాలకు తగినంత వుత్పాదక శక్తే వుంటే, వ్యయమైన పెట్టుబడిని భర్తీ చేయడం కోసమూ (!), కౌలు కోసమూ, శ్రమ ఉత్పాదితం యొక్క సహజమైన మార్పిడి విలువలో తగినంత మిగలడానికి," వేతనాలు "ఆ విలువకు సమానంగా ఉండనవసరం లేదు."[1] కానీ, "వ్యయమైన పెట్టుబడిని భర్తీ చేయడానికీ, "తత్కారణంగా వ్యయమైన ముడి పదార్థాల భర్తీకీ, పరికరాల అరుగుదలకై పరిహారానికి ఏమీ మిగల్చని ఉత్పాదితపు "సహజమార్పిడి విలువ" ఎలాంటిదో ఆయన మనకు తెలపడం లేదు.

రాడ్ బెర్టస్ కనుగొన్న ఈ అత్యద్భుత విషయం గురించి మార్క్స్ అభిప్రాయమేమిటో, అదృష్టవశాత్తు, మనం చెప్పగల స్థితిలో వున్నాము. జుర్ క్రిటిక్ రాతప్రతి, నోట్ పుస్తకం X లో 445వ పుటలో, ఒక "అప్రస్తుతాంశం. శ్రీమాన్ రాడ్‌బెర్టస్. ఒక కొత్త భూమి కౌలు సిద్ధాంతం", అనే మాటలు కనిపిస్తున్నాయి. మూడవ సామాజిక లేఖను మార్క్స్ చూస్తున్నది ఈ దృక్పథంతో మాత్రమే. మొత్తం అదనపు విలువను గురించిన రాడ్‌బెర్టస్ సిద్ధాంతాన్ని అపహాస్యం చేసే కింది వ్యాఖ్యతో ఆయన తోసిపారేస్తున్నాడు : "భూమి రూపంలోని ఆస్తి, పెట్టుబడి రూపంలో ఆస్తి ఒకదాని నుంచి ఒకటి వేరుపడని ఒక దేశంలో పరిస్థితిని రాడ్‌బెర్టస్ మొదట విశ్లేషిస్తున్నాడు; ఆ తరువాత, కౌలు (కౌలంటే, మొత్తం అదనపు విలువ అని ఆయన భావం), ప్రతిఫలం చెల్లించబడని శ్రమకు మాత్రమే సమానం, లేక ఈ శ్రమను వ్యక్తం చేసే ఉత్పాదితాల పరిమాణానికి సమానం, అన్న ముఖ్యమైన నిర్ధారణకు వస్తున్నాడు.[2]

పెట్టుబడిదారుగా వున్న మనిషి కొన్ని వందల సంవత్సరాలుగా అదనపు విలువను ఉత్పత్తి చేస్తూ, దాని మూలాన్ని గురించి ఆలోచించే దశకు క్రమంగా చేరుకొన్నాడు. మొదటి ప్రాతిపదికపైన కింది భావం, వర్తక కార్యకలాపాల నుంచి ప్రత్యక్షంగా ఉత్పన్నమైంది : అదనపు విలువ ఉత్పాదితపు

---

1. రాడ్‌బెర్టస్ - జగెట్ జౌ కార్ల్, సోజియలే బ్రీఫె యాన్ వాన్ కిర్చ్‌మాన్ డ్రిట్టర్ బ్రీఫ్ : వైడిర్ లేగుంగ్ దీర్ రైకార్డోశ్చన్ లెహ్రె వాక్ డెర్ గ్రున్ డ్రెంట్ అండ్ బ్రెగుండంగ్ యెయినర్ న్యుయెన్ రెంటెన్ థియరీ, బెర్లిన్, 1851, యస్ - 87 - సం.
2. కార్ల్‌మార్క్స్, థియేరియన్ యుబెర్‌డెన్ మెర్ వెర్ట్ (వియర్టెర్ బాండ్ డెస్ కాపిటల్స్) 2, టీల్, బెర్లిన్, 1959, యస్.యస్. 7-8 -సం.

విలువకు అదనంగా చేర్చిన విలువ నుంచి ఉత్పన్నమవుతుంది. ఇది వర్తకవాదుల్లో వ్యాప్తిలో వుండేది. కానీ, అలాంటి సందర్భంలో, ఒకడు లాభపడితే, ఆ మేరకు రెండవవాడు ఆవశ్యంగా నష్టపోతాడని జేమ్స్ స్టువర్ట్ అప్పటికే గుర్తించాడు. అయినా, ఆ తరువాత సైతం చాలా కాలం, ఈ భావం, ప్రత్యేకించి సోషలిస్టుల్లో గట్టిగా పాదుకొని వుండేది. కానీ ఆడమ్ స్మిత్ దీన్ని ప్రామాణిక శాస్త్రం నుంచి గెంటి వేశాడు.

ఆయన దేశాల సంపద, 1వ సంపుటి, ఆరవ అధ్యాయంలో ఇలా చెబుతున్నాడు : "కొంతమంది చేతుల్లో డబ్బు దస్కం పోగుపడిన వెంటనే, వారిలో కొందరు దాన్ని శ్రమశీలురిని పనికి నియమించ డానికై సహజంగా వినియోగిస్తారు;" వారికి వస్తు సామాగ్రినీ, జీవితావసరాలను సరఫరా చేస్తారు. వారి కృషి ఫలితాన్ని అమ్మడం ద్వారా, లేక, ఆ వస్తు సామగ్రికి వారి శ్రమ చేర్చిన దాని ద్వారా లాభం గడించాలని వారి వుద్దేశం.... కాబట్టి ఆ వస్తు సామాగ్రికి శ్రామికులు చేర్చిన విలువ, ఈ సందర్భంలో రెండు భాగాలుగా విడిపోతుంది; వాటిలో ఒకటి, వారి వేతనాలను ముట్టజెప్పుతుంది, రెండవది, మొత్తం వస్తు సామాగ్రికి, వేతనాలకు పెట్టిన డబ్బుపై, వారి యజమానికి లాభాలు ముట్టజెప్పుతుంది.[1] ఇంకా కొంత ముందుకు పోతే, ఇలా చెబుతున్నాడు: "ఏ దేశమైనా సరే, దాని భూమి యావత్తూ ప్రైవేటు ఆస్తి అయిన వెంటనే, భూస్వాములు ఇతర మనుషులందరి లాగానే, తామెన్నడూ పెట్టి ఎరుగని పంటను కోసుకోవాలని ఉబలాటపడతారు. భూమి సహజంగా ఉత్పత్తి చేసిన దానికి సైతం కౌలు ఇమ్మంటారు...." శ్రామికుడు "తన శ్రమ సేకరించిన దానిలో, లేదా ఉత్పత్తి చేసిన దానిలో ఒక భాగాన్ని భూస్వామికి అప్పగించి తీరాలి. భూమి కౌలు అనేది, ఈ భాగమే, లేదా, వేరుమాటల్లో చెప్పాలంటే ఈ భాగం వెలే."[2]

పైన పేర్కొన్న రాతప్రతి, జుర్ క్రిటిక్ వగైరా లోని 253వ పుటలో, మార్క్స్ ఈ వాక్యాలపై ఇలా వ్యాఖ్యానిస్తున్నాడు:

"అదనపు విలువ అంటే అదనపు శ్రమ; మూల్యం చెల్లింపబడిన శ్రమకు వేతనాల రూపంలో ప్రతిఫలంగా శ్రామికుడు పొందిన శ్రమకు మించి శ్రామికుడు చేసినట్టి, సరకులో వాస్తవ రూపం ధరించినట్టి శ్రమ; అలాంటి అదనపు విలువ సాధారణ అభివర్గమనీ, లాభమూ (దాని ఖచ్చితమైన అర్థంలో) భూమి కౌలూ దాని శాఖలూ మాత్రమేనీ ఆడమ్ స్మిత్ భావం".[3]

ఆడమ్ స్మిత్ ఇంకా ఇలా అంటున్నాడు. (సం.1, అధ్యాయంVIII) "భూమి ప్రైవేటు ఆస్తి అయిన వెంటనే, శ్రామికుడు దానిలో పండించే, లేక, సేకరించే దాదాపు యావత్తు పంటలోనూ భాగమిమ్మని భూస్వామి కోరుతాడు. భూమిపై నియుక్తమైన శ్రమ ఉత్పత్తి చేసిన దాని నుంచి మొదట తీసివేయ వలసినది అతని కౌలు. భూమిదున్నే వానికి, పంట చేతికందే వరకు తన పోషణకు కావలసిన జీవనాధారాలు ఉండటం బహు అరుదు. వాటిని మామూలుగా ఒక యజమాని, అంటే,

1. ఎ.స్మిత్, దేశాల సంపద స్వభావాన్నీ, కారణాలను గురించిన పరిశీలన, లండన్, 1843, సం. 1, పుటలు 131 - 132 - సం.
2. పూర్వోక్త గ్రంథం, పుట 134 - సం.
3. కార్ల్ మార్క్స్, అదనపు విలువ సిద్ధాంతాలు (పెట్టుబడి నాల్గవ సంపుటి), మాస్కో, 1963, 1వ భాగం, పుటలు 80-81- సం.

అతణ్ణి పనిలో పెట్టుకొనే భూకామందు తన డబ్బా దస్కం నుంచి అతనికి ముందుగా ఇస్తాడు. అతని శ్రమ ఉత్పత్తి చేసిన దానిలో పాలు పంచుకొంటేే తప్ప, లేదా వ్యయమైన తన డబ్బు లాభంతో తిరిగి భర్తీ అయితే తప్ప, అతణ్ణి పనిలో పెట్టుకోవాలనే ఆసక్తి ఆ భూకామందుకు వుండదు. భూమిపై నియుక్తమైన శ్రమ ఉత్పత్తి చేసిన దానినుంచి తీసివేయవలసిన రెండవది ఈ లాభం. దాదాపు ఇతర అన్ని రకాల శ్రమ ఉత్పత్తి చేసిన దాని నుంచి లాభం ఇలా తీసుకోవడానికి వీలుంది. అన్ని చేతి వృత్తులలోనూ, కార్ఖానా ఉత్పత్తులోనూ, కార్మికుల్లో అత్యధికులకు తమ పని పూర్తి అయ్యేదాకా దానికి కావలసిన పదార్థాలను, తమ జీతాలను, జీవనాధారాలను ముందుగా యిచ్చే ఒక యజమాని అవసరం. అతను వారి శ్రమ వుత్పాదితంలో లేదా శ్రమ గ్రహీత పదార్థాలకు ఆ శ్రమ చేర్చే విలువలో పాలుపంచుకొంటాడు. ఈ పాలే అతని లాభం.[1]

దీనిపై మార్క్స వ్యాఖ్య ఇదీ : (రాతప్రతి పుట 256) "కాబట్టి, కౌలూ, పెట్టుబడిపై లాభం, కార్మికుని ఉత్పాదితం నుంచి, లేదా అతని వుత్పాదితం యొక్క విలువ నుంచి తీసేసుకొనేవి మాత్రమేననీ, ఈ ఉత్పాదితం విలువ, అతను పదార్థాలకు చేర్చిన శ్రమ పరిమాణానికి సమానమనీ ఆడమ్ స్మిత్ ఇక్కడ స్పష్టంగా చెబుతున్నాడు. కానీ ఆయనే అంతకు ముందు వివరించినట్లు, యిలా తీసేసుకొనేది, కార్మికుడు తన వేతనాల చెల్లింపునకు మాత్రం సరిపడిన, లేక వేతన తౌల్యాన్నీ సమకూర్చిన శ్రమ పరిమాణానికి మించి పదార్థాలకు చేర్చే శ్రమ భాగమే. ఈ భాగమే కార్మికుని అదనపు శ్రమ, అతని శ్రమలో మూల్యం చెల్లింపబడని భాగం".[2] కాబట్టి "పెట్టుబడిదారుని అదనపు విలువకు మూలం" అంతేకాక, భూస్వామి యొక్క అదనపు విలువకు మూలం యేమిటో ఆడమ్ స్మిత్‌కు సైతం తెలుసు. ఈ విషయం మార్క్స 1861లోనే అంగీకరించాడు. కానీ, రాడ్‌బెర్టస్, ప్రభుత్వ సోషలిజం యొక్క నులివెచ్చని ఎండాకాలపు వానజల్లువల్ల పుట్టగొడుగుల్లా పెంపొందిన అతని ప్రశంసకుల మూక ఇదంతా మరిచిపోయినట్లుంది.

మార్క్స ఇంకా ఇలా చెబుతున్నాడు. "కానీ, అదనపు విలువను ఒక అదనపు విలువగా, స్వతంత్రమైన అభివర్గంగా, లాభంలో, కౌలులో అది ధరించే నిర్దిష్ట రూపాలకు భిన్నమైనదిగా ఆయన (ఆడమ్ స్మిత్) విడమరచి చూపడు. ఇది ఆయన పరిశీలనలో, అంతకన్నా కూడా ఎక్కువగా రికార్డో రచనలో, చాలా తప్పులకు, లోపాలకు మూలకారణమయింది."[3]

ఈ మాటలు రాడ్‌బెర్టస్‌కు అతికినట్లు సరిపోతాయి. అతను చెప్పే "కౌలు", కేవలం భూమి కౌలు, లాభం, ఈ రెండూ వెరసే. భూమి కౌలును గురించి ఆయన పూర్తిగా ఒక తప్పు సిద్ధాంతాన్ని రూపొందించాడు. ఏ విధమైన అవలోకన లేకుండా, లాభం గురించిన సిద్ధాంతాన్ని తన మునుపటి వారి రచనల్లో వున్నది వున్నట్లుగా ఆమోదించాడు.

కానీ మార్క్స చెప్పే అదనపు విలువ అలాకాక, ఉత్పత్తి సాధనాల సొంతదారులు ఏ విధమైన

1. ఎ.స్మిత్, దేశాల సంపద స్వభావాన్నీ, కారణాలనూ గురించిన పరిశీలన, లండన్, 1843, సం.1, పుటలు 172 - 173 - సం.
2. కార్ల్‌మార్క్స, అదనపు విలువ సిద్ధాంతాలు (పెట్టుబడి నాల్గవ సంపుటి) మాస్కో, 1963, 1వ భాగం,పుట 83 - సం.
3. పూర్వోక్త గ్రంథం. పుట 81 - సం.

సమతౌల్యాన్ని ఇవ్వకుండా స్వాయత్తం చేసుకొనే అదనపు విలువల సమాహారం యొక్క సాధారణ రూపం. ఈ రూపం అత్యంత నిర్దిష్టమైన నియమాల ననుసరించి, లాభం, కౌలు అనే వేరు వేరు, పరివర్తిత రూపాలుగా చీలిపోతుంది. ఈ నియమాలను మొదట కనుగొన్నది మార్క్సే. ఇవి మూడవ సంపుటంలో వివరించబడుతాయి. సాధారణ అదనపు విలువను గురించిన అవగాహన నుంచి, లాభంగా, భూమి కౌలుగా దాని పరివర్తన గురించిన అవగాహనకు రావడానికి, వేరు మాటల్లో చెప్పాలంటే, పెట్టుబడిదారీ వర్గంలో అదనపు విలువ పంపిణీ నియమాల గురించిన అవగాహనకు రావడానికి, అనేక మధ్యంతర కొలుకులు అవసరమని అందులో తెలుసుకొంటాము.

రికార్డో ఆడమ్ స్మిత్ కన్నా ఎంతో ముందుకెళ్ళాడు. ఆయన అదనపు విలువ గురించిన తన భావనకు, విలువ గురించిన ఒక కొత్త సిద్ధాంతాన్ని ప్రాతిపదికగా చేసుకొంటున్నాడు. ఈ సిద్ధాంతం ఆడమ్ స్మిత్ రచనలో బీజ రూపంలో వున్నదే, కానీ, దాన్ని వర్తింపజేసే విషయానికి వస్తే మామూలుగా ఆ విషయం మరచిపోవడం కద్దు. విలువ గురించిన ఈ సిద్ధాంతం ఆ తరువాతి అర్థశాస్త్రాని కంతటికీ నాంది అయింది. సరకుల విలువ వాటిలో మూర్తీభవించిన శ్రమ పరిమాణాన్ని బట్టి ఉంటుందన్న నిర్ధారణ నుంచి ఆయన ముడిపదార్థాలకు శ్రమచేర్చే విలువ ఎలా కార్మికుల పెట్టుబడిదారుల మధ్య పంపిణీ అవుతున్నది తేలుస్తున్నాడు; ఈ విలువ వేతనాలుగా, లాభంగా (అంటే ఇక్కడ అదనపు విలువగా) విభజితమవుతున్నదని చూపుతున్నాడు. ఈ రెండు భాగాలు ఏ నిష్పత్తిలో ఉన్నప్పటికీ, సరకుల విలువ మాత్రం మారదని నిరూపిస్తున్నాడు. ఈ నియమానికి గల మినహాయింపులు బహు తక్కువ అని ఆయన అభిప్రాయం. వేతనాలకు, అదనపు విలువకు (లాభ రూపంలోనిది) గల పరస్పర సంబంధాలను గురించి, కొన్ని మూల నియమాలను సైతం ఆయన నిరూపిస్తున్నాడు. వాటిని మరీ అనిర్దిష్ట పదజాలంలో చెప్పినప్పటికీ (మార్క్స్),దాస్ కాపిటల్, (బుక్ 1, కాపిటల్ XV, A )[1] భూమి కౌలు, లాభం పోగా వున్నది మిగులనీ, కొన్ని నిర్దిష్ట పరిస్థితుల్లో లాభం చేకూరదనీ రుజువు చేస్తున్నాడు.

వీటిలోని ఏ అంశంలోనూ రాడ్‌బెర్టస్, రికార్డో కన్నా ముందుకు వెళ్ళలేదు. రికార్డో మత పతనానికి దారితీసిన ఆయన సిద్ధాంత అంతర్గత వైరుధ్యాలు రాడ్‌బెర్టస్‌కు బొత్తిగా తెలీదు; లేదా అవి ఆర్థిక పరిష్కారాలను కనుగొనేందుకు ఆయన్ను ప్రోత్సహించడానికి బదులు, కేవలం ఊహావాదపు కోర్కెలను ప్రతిపాదించే పెడతోవ పట్టించాయి, అంతే (ఆయన జుర్ ఎర్కెన్ ట్నిస్ వగైరా, పుట 130).

కానీ విలువ, అదనపు విలువల గురించిన రికార్డో సిద్ధాంతం సోషలిస్టు ప్రయోజనాల కోసం వినియోగింపబడటానికి, రాడ్‌బెర్టస్‌కు రచన జుర్ ఎర్కెన్ట్నిస్ కోసం వేచివుండవలసిన అవసరం లేకపోయింది. దాస్ కాపిటల్ (రెండవ కూర్పు)[2] మొదటి సంపుటి 609వ పుటలో, "అదనపు ఉత్పత్తి, లేక పెట్టుబడి కలవారు" అనే వుల్లేఖన కనిపిస్తుంది. ఇది "జాతి కష్టాలకు మూలకారణం, వాటిని పోగొట్టే మార్గం, లార్డ్‌జాన్ రస్సెల్‌కు లేఖ, లండన్, 1821 అనే కరపత్రం నుంచి ఉల్లేఖన.,

1. ఇంగ్లీషు కూర్పు : కార్ల్ మార్క్స్, కాపిటల్, సం.1, అధ్యాయం XVII, i మాస్కో 1954 -సం.
2. ఇంగ్లీషు కూర్పు : పుట 588 - సం.

40 పుటలు గల ఈ కరపత్రం ప్రాముఖ్యాన్ని, "అదనపు ఉత్పత్తి లేక పెట్టుబడి" అన్న పదజాలాన్ని బట్టే గుర్తించవలసి వుండింది. కానీ, దీన్ని విస్మృతిపథంలో పడిపోకుండా మార్క్స్ కాపాడారు. ఇందులో కింది వాక్యాలున్నాయి :

"…. పెట్టుబడిదారుకు (పెట్టుబడిదారు దృష్టిలో) చెందవలసినదేమైనా అతనికి కార్మికుని అదనపు శ్రమ మాత్రమే అందగలదు; ఎందుకంటే కార్మికుడు బతకాలికదా." (పుట 23). కానీ కార్మికుడు ఎలా బతుకుతాడు, పెట్టుబడిదారు స్వాయత్తం చేసుకొనే అదనపు శ్రమ ఎంత వుండగలదు అనేవి చాలా సాపేక్షమైన విషయాలు. "పెట్టుబడి మొత్తం పెరిగే కొద్దీ దాని విలువ తగ్గనట్లయితే, కార్మికుడు బొటాబొటిగా బతకటానికి వీలయినదానికి మించి, ప్రతి గంట శ్రమ చేసే ఉత్పత్తిని కార్మికుల నుంచి పెట్టుబడిదారులు గుంజుతారు…. తుదకు పెట్టుబడిదారు…. కార్మికునికి ఇలా చెప్పవచ్చు. 'నీవు ఇక రొట్టె తినరాదు…. ఎందుకంటే, బీట్ దుంపలు, బంగాళదుంపలు తిని బతకడం సాధ్యమే'. మనం ఇప్పుడీ స్థితికి వచ్చాం!" (పుటలు 23 – 24) "మరి కార్మికుణ్ణి, రొట్టెకు బదులు బంగాళాదుంపలు తిని జీవించే స్థితికి తేగలిగితే, అతని శ్రమ నుంచి ఇంకా ఎక్కువ గుంజవచ్చు ననేది నిస్సందేహం. దాని అర్థమేమిటంటే, అతను రొట్టెపై బతికినప్పుడు తన పోషణకు, తన కుటుంబ పోషణకు అతను సోమ, మంగళవారాల శ్రమను తన కోసం అట్టిపెట్టుకోవలసి వచ్చింది. బంగాళా దుంపలపై బతికినట్లయితే, సోమవారంలో సగం మాత్రమే అతనికి సరిపోతుంది; సోమవారంలో మిగతా సగం, మొత్తం మంగళవారం ప్రభుత్వ సేవకో, లేదా పెట్టుబడిదారు సేవకో లభిస్తాయి (పుట 26). "పెట్టుబడిదారులకు చెల్లించబడే వడ్డీ –అది కౌళ్ళు, డబ్బుపై వడ్డీలు, లేదా వర్తక లాభాల వంటి ఏ రూపంలో వున్నా – ఇతరుల శ్రమ నుంచి చెల్లించినదే". (పుట 23) "కౌలు"కు బదులు "వడ్డీ" అనే మాటను వాడారన్నది తప్పిస్తే, "కౌలు" గురించి రాడ్‌బెర్టస్‌కు గల భావమే సరిగ్గా, మనకిక్కడ కనిపిస్తుంది.

మార్క్స్ ఇలా వ్యాఖ్యానిస్తున్నారు. (రాతప్రతి, జుర్ క్రిటిక్, పుట 852) : "దాదాపు ఎవరూ ఎరుగని ఈ కరపత్రం, అబ్బురం గొలిపే ముచ్చీ,[1] మాక్‌కుల్లోచ్‌ను గురించి పలువురు చెప్పుకొనే రోజుల్లో వెలువడింది. ఇది రికార్డో కన్నా ఒక ముఖ్యమైన ముందడుగు. అదనపు విలువను, లేక, రికార్డో భాషలో 'లాభాన్ని' (తరచూ ఆయన చెప్పే అదనపు ఉత్పత్తిని) లేక, ఈ కరపత్రం రచయిత మాటల్లో చెప్పాలంటే వడ్డీని ఈ కరపత్రం అదనపు శ్రమగా, సూటిగా నిర్వచిస్తూంది. అంటే దాన్ని కార్మికుడు ఉచితంగా చేసే శ్రమగా, నిర్వచిస్తూంది. తన శ్రమశక్తి విలువ స్థానాన్ని భర్తీ చేసే శ్రమ పరిమాణానికి అంటే తన వేతనానికి సమానమైన దాన్ని ఉత్పత్తి చేసే శ్రమ పరిమాణానికి మించి అతడు చేసే శ్రమగా నిర్వచిస్తూంది. విలువను శ్రమగా తేల్చడం ఎంత ముఖ్యమైన విషయమో, అదనపు ఉత్పత్తికి ప్రతీక అయిన అదనపు విలువను అదనపు శ్రమగా తేల్చడం కూడా అంతే ముఖ్యమైన విషయం. దీన్ని ఆడమ్ స్మిత్ ఇదివరకే చెప్పాడు. రికార్డో విశ్లేషణలోని ప్రధాన విషయమిదే. కానీ వారు అక్షరాలా అలా చెప్పలేదు; ఎక్కడా దాని సంపూర్ణ రూపాన్ని నిర్ధారణ చేయలేదు."[1] ఈ

1. రాజకీయ అర్థశాస్త్రం గురించిన యం. కుల్లోచ్ సూత్రాల నుండి కొన్ని ఉదాహరణలు అనే కరపత్రం రచయిత, మాక్ కుల్లోచ్‌కి ఎగతాళిగా పెట్టిన పేరది. ఈ కరపత్రం యెడింబరోలో, 1826లో వెలువడింది. దీని రచయిత పేరు యం. ముల్లియన్ అని వుంది. జాన్ విల్సన్ కలం పేరు - సం.

రాతప్రతి 859వ పుటలో ఇంకా ఇలా వుంది: "అంతేకాక, ఈ రచయిత గతం నుంచి తనకు సంక్రమించిన ఆర్థిక అభివర్గాలకు బందీ అయాడు. అదనపు విలువనూ లాభాన్నీ గందరగోళ పరచడం వల్ల రికార్డో పెడదోవ పట్టి, విచారకరమైన వైరుధ్యాల్లో పడ్డట్లుగానే, ఈ రచయిత కూడా అదనపు విలువకు 'పెట్టుబడి యొక్క వడ్డీ' అని నామకరణం చేయడం వల్ల, అలాంటి చిక్కుల్లోనే పడిపోయాడు. అదనపు విలువనంతటినీ అదనపు శ్రమగా తేల్చి చెప్పిన మొట్టమొదటి వ్యక్తి ఈయనే. ఆ విధంగా ఈయన రికార్డో కన్నా ఒక అడుగు ముందుకు వేసిన మాట నిజమే. అంతేకాదు అదనపు విలువను 'పెట్టుబడి యొక్క వడ్డీ' అని పేర్కొంటూనే, ఈ పదం వాడటం వల్ల తన మనస్సులో వున్నది, అదనపు శ్రమ యొక్క ప్రత్యేక రూపాలైన కౌలుకు, డబ్బుపై వడ్డీకి, పరిశ్రమాది సంస్థల లాభానికి భిన్నమైన దాని సాధారణ రూపమని నొక్కి చెబుతున్నాడు. కానీ, ఈ ప్రత్యేక రూపాల్లో ఒకటయిన వడ్డీని, సాధారణ రూపానికి ఎంచుకొన్నాడు. నాటు అర్థశాస్త్ర పరిభాషలోకి అతణ్ణి తిరిగి దిగజార్చడానికి యింతకన్నా వేరేది అవసరం లేకపోయింది.[2]

పైన ఉదహరించిన ఆఖరు మాటలు రాడ్ బెర్టస్‌కు అతికినట్లు వర్తిస్తాయి. ఆయన కూడా గతం నుంచి తనకు సంక్రమించిన ఆర్థిక అభివర్గాలకు బందీ. ఆయన కూడా అదనపు విలువకు, దాని పరివర్తిత ఉపరూపాల్లో ఒకటైన కౌలు అనే పేరును వర్తింపజేస్తాడు. అందునా, దాన్ని పూర్తిగా అస్పష్టం చేస్తాడు. ఈ రెండు తప్పుల ఫలితంగా అతను నాటు అర్థశాస్త్ర పరిభాషలో దిగబడిపోతాడు; రికార్డోను దాటి తాను వేసిన ముందడుగును ఉపయోగించుకొని ముందుకు సాగడానికి మారు, ఆయన తన అసంపూర్ణ సిద్ధాంతం, ఇంకా బీజరూపంలో వుండగానే దాన్ని తన ఊహాస్వర్గానికి ప్రాతిపదికగా చేసుకొనే పెడతోవ తొక్కాడు. ఎప్పటిలాగే ఈ ఊహా స్వర్గ ప్రతిపాదనలో కూడా ఆయన వెనుకబడిపోయాడు. ఎందుకంటే 1821లో వెలువడిన పై కరపత్రం 1842 నాటి రాడ్‌బెర్టస్ "కౌలు"ను గురించి పూర్తిగా ముందే చెప్పింది.

విలువ, అదనపు విలువల గురించిన రికార్డో సిద్ధాంతాన్ని కార్మికవర్గ ప్రయోజనాల కోసం 1820లో పెట్టుబడిదారీ ఉత్పత్తికి వ్యతిరేకంగా తిప్పి, బూర్జువా వర్గాన్ని దాని ఆయుధాలతోనే ఎదుర్కొని పోరాడిన మొత్తం సాహిత్యంలో, మన ఈ కరపత్రం అత్యగ్ర స్థావరం మాత్రమే. ఓవెన్ కమ్యూనిజమంతా, అది ఆర్థిక సమస్యలపై వాద ప్రతివాదాలకు దిగిన మేరకు, రికార్డో రచనపై ఆధారపడినది. ఓవెన్ మాత్రమే కాదు. ఇంకా అలాంటి రచయితలు పలువురున్నారు. వీరిలో కొందరిని ప్రౌధాన్‌కు వ్యతిరేకంగా మార్క్స్ 1847లోనే ఉదహరించారు. (మిజరీ డిలా ఫిలాసఫీ. పుట 49[3]) వారు యెడ్మండ్స్, థామ్సన్, హాడ్గ్‌స్కిన్ వగైరా, వగైరా, "ఇంకా నాలుగు పుటల వగైరాలు." బహుళంగా వున్న ఈ రచనల నుంచి నేను స్థాలీపులాక న్యాయంగా కింద ఉదహరిస్తున్నాను. మానవ కళ్యాణానికి అత్యనుగుణంగా సంపదను పంపిణీ చేసే సూత్రాల పరిశీలన, రచయిత విలియం థామ్సన్, కొత్తకూర్పు, '1850, 1822లో రాసిన ఈ గ్రంథం 1824లో వెలువడింది. ఉత్పాదకేతర వర్గాలు స్వాయత్తం

1. కార్ల్ మార్క్స్, థియరియెన్ ఉబెర్ డెన్ మెర్ వర్ట్, (వియెర్టర్ బాండ్ డిస్ కాపిటల్స్) 3, టీల్, బెర్లిన్, 1962, యస్.యస్. 236-37 - సం.
2. పూర్వోక్త గ్రంథం, పుటలు 252, 253
3. మార్క్స్, తాత్విక దారిద్ర్యం, మాస్కో, 1962 - సం.

చేసుకొనే సంపద కార్మికుని ఉత్పాదితం నుంచి తీసేసుకొన్నదే అని ఈ గ్రంథంలో కూడా ప్రతీచోటా చెప్పడం జరిగింది.' రచయిత కొంత ఘాటైన మాటలే వాడాడు. ఆయన ఇలా అంటున్నాడు : "తన సొంత శ్రమ ఉత్పత్తి చేసిన దానిలో సాధ్యమైనంత స్వల్పభాగం కోసం ఉత్పాదక కార్మికుడు పని చేయడానికై, సమాజమనేది నిరంతరం పడుతున్న పాట్లు ఏమిటంటే, అతణ్ణి మోసగించడం, హడలగొట్టడం, బలాత్కరించడం," (పుట 28) "అతని శ్రమ ఉత్పత్తి చేసినదంతా, పూర్తిగా అతనికే ఎందుకివ్వరాదు?" (పుట 32) "పెట్టుబడిదారులు ఈ పరిహారపు మొత్తాన్ని ఉత్పాదక కార్మికుల నుంచి, కౌలు, లేదా లాభాల పేరుతో గుంజుతున్నారు; భూమి, లేదా ఇతర వస్తువులను వినియోగించినందుకు ఈ మొత్తం తమకు రావాలని వాదిస్తున్నారు..... అతని ఉత్పాదక శక్తులు వేటిమీద, లేదా వేటిద్వారా ఉపయోగించడానికి వీలవుతున్నదో ఆ భౌతిక పదార్థాలన్నీ, అతని ప్రయోజనాలకు విరుద్ధమైన ప్రయోజనాలు గల వారి చేతుల్లో వున్నాయి; అతను వాటితో ఏ పనైనా చేయడానికి ముందు వారి సమ్మతి అవసరం; అందువల్ల, అతని కష్టానికి పరిహారంగా, అతని సొంత శ్రమ ఫలితాల్లో ఎంత భాగం అతనికి వదిలి వేయడం సముచితమని ఈ పెట్టుబడిదారులు అనుకొంటారో ఆ భాగానికి అతడు వారి దయా దాక్షిణ్యాలపై ఆధారపడుతున్నాడు కదా, అలా ఎల్లప్పుడూ ఆధారపడక తప్పదు కదా?" (పుట 125) "..... బిగబట్టుకొన్న ఉత్పాదితాలకు – వాటిని లాభాలనండి, పన్నులనండి లేదా దొంగిలించినవనండి – అనుగుణంగా" (పుట. 126).... ఇంకా ఇలాంటివి వున్నాయి.

కాస్త సిగ్గు పడకుండా ఈ పంక్తులు రాయటం లేదని నేను ఒప్పుకోక తప్పదు. 1820, 1830లలో ఇంగ్లండులోని పెట్టుబడిదారీ వ్యతిరేక సాహిత్యం గురించిన ప్రత్యక్ష ప్రస్తావనలు, తాత్విక దారిద్ర్యం అన్న మార్క్స్ గ్రంథంలో వున్నాయి. ఆ సాహిత్యం నుంచి పెట్టుబడి మొదటి సంపుటిలో పదే పదే ఉల్లేఖనలున్నాయి. 1821 నాటి కరపత్రం నుంచే, రావెన్‌స్టోన్, హాడ్గ్‌స్కిన్ మొదలైన వారి గ్రంథాల నుంచీ ఉల్లేఖించిన భాగాలు ఇందుకు ఉదాహరణ. అయినా, ఆ సాహిత్యం గురించి జర్మనీలో బొత్తిగా తెలీక పోవడం క్షమించరాని నేరమని చెప్పను. కానీ, రాడ్‌బెర్టస్ అడుగుజాడను మహా ఆదుర్దాతో అంటి పెట్టుకొని, "నిజంగా ఏమీ నేర్చుకోని" లిటరేటస్ వల్గరిస్[1] బట్టే కాక, సాధికారికంగా, సకల లాంఛనాలతో పదవిలో ప్రతిష్ఠితుడైన విశ్వవిద్యాలయ ఆచార్యుని బట్టి కూడా[2] అధికార రాజకీయ అర్థ శాస్త్రం తీవ్ర పతనావస్థ రుజువవుతోంది. "తన పాండిత్యం గురించి ప్రగల్భాలు పలికే" ఈయన ప్రామాణిక రాజకీయ అర్థశాస్త్రాన్ని ఎంత మరిచిపోయాడంటే, ఆడమ్ స్మిత్ రికార్డో రచనల్లో కనిపించే విషయాలను రాడ్‌బెర్టస్ నుంచి మార్క్స్ కొట్టేశాడని నిజంగా ఆరోపిస్తున్నాడు.

కానీ, అదనపు విలువపై మార్క్స్ చెప్పిన దానిలో కొత్తయేమిటి? రాడ్‌బెర్టస్‌తో సహా అతనికి ముందున్న సోషలిస్టులందరి సిద్ధాంతాలు ఎటువంటి ప్రభావం నెరపకుండా అదృశ్యమైపోగా, అదనపు విలువను గురించిన మార్క్స్ సిద్ధాంతం, నిర్మలాకాశం నుంచి పడ్డ పిడుగులా అన్ని నాగరిక దేశాలనూ దద్దరిల్ల చేయడానికి కారణం ఏమిటి?

---

1. ఎంగెల్స్, ఆర్. మెయర్‌ను గురించి ప్రస్తావిస్తున్నారు - సం.
2. ఇది జర్మన్ నాటు అర్థ శాస్త్రజ్ఞుడు యె. వాగ్నర్‌ను గురించిన ప్రస్తావన - సం.

రసాయన శాస్త్ర చరిత్రను ఒక దృష్టాంతంగా తీసుకొంటే, కారణమేమిటో విశదమవుతుంది.

గత శతాబ్దం చివరి రోజుల్లో సైతం ఫ్లోజిస్టన్ సిద్ధాంతం పాదుకొని ఉండేదని మనకు తెలుసు. కేవలం మండే స్వభావం కల ఫ్లోజిస్టన్ అనే ఒక పదార్థముందనీ, అది మండుతున్న వస్తువునుంచి వేరైపోవడమే ప్రజ్వలన మనీ 'ఈ సిద్ధాంత తాత్పర్యం. కొన్ని సందర్భాల్లో ఈ సిద్ధాంతం చాలా ఇరుకులో పడినా, ఆనాడు తెలిసిన రసాయనిక పరిణామాలు ఎక్కువ వాటిని విశదీకరించడానికి ఈ సిద్ధాంతం సరిపోయింది. కానీ 1774లో ప్రీస్ట్లీ ఒకానొక విధమైన గాలిని ఉత్పత్తి చేశాడు. "అది ఎంత స్వచ్ఛమైనదనీ, లేదా దానిలో ఫ్లోజిస్టన్ ఎంత బొత్తిగా లేదని ఆయన కనుగొన్నాడంటే, దానితో పోలిస్తే మామూలు గాలి కల్తీగా కనిపించింది." దానికి "ఫ్లోజిస్టన్ రహితమైన గాలి" అని ఆయన పేరు పెట్టాడు. ఆయన తరువాత కొన్నాళ్ళకు షీలే, స్వీడన్‌లో అదే రకమైన గాలిని తయారు చేసి, వాతావరణంలో అది వుందని నిరూపించాడు. ఈ రకమైన గాలిలోనూ, లేదా మామూలు గాలిలోనూ ఏదైనా వస్తువు మండినట్లయితే, ఈ రకం గాలి అదృశ్యమవుతుందని కూడా ఆయన కనుగొన్నాడు. అందువల్ల దాన్ని "అగ్ని-గాలి" అని పిలిచాడు. "వాతావరణ అంతర్భాగాల్లోని ఒక దానితో ఫ్లోజిస్టన్ ఐక్యం కావడం వల్ల" (అంటే ప్రజ్వలన వల్ల) ఉత్పన్నమయ్యే సంసర్గమే అగ్ని, లేక గ్లాసు నుంచి బయటికి పోయే వేడిమి; అంత తప్ప మరేమీ కాదు, అని ఆయన ఈ వాస్తవాల నుంచి నిర్ధారణ చేశాడు.[1]

ప్రీస్ట్లీ, షీలే ఉత్పత్తి చేసింది ఆక్సిజన్‌ను. కానీ, తాము ఉత్పత్తి చేసిందేమిటో వారికి తెలియదు. వారు "తమకు గతం నుంచి సంక్రమించిన" "అభివర్గాలకు బందీలుగా ఉండిపోయారు" ఫ్లోజిస్టన్ గురించిన భావాలనన్నిటినీ తలకిందులుచేసి, రసాయన శాస్త్రంలో విప్లవం తేనున్న మూలపదార్థం వారి చేతుల్లో నిష్ఫలంగా వుండిపోయింది. కానీ ప్రీస్ట్లీ తాను కనుగొన్న విషయాన్ని వెంటనే, పారిస్‌లోని లవాయ్‌సియర్‌కు తెలిపాడు. దీన్ని ఆధారంగా చేసుకొని, లవాయ్‌సియర్ ఫ్లోజిస్టిన్ రసాయన శాస్త్రాన్ని మొత్తంగా విశ్లేషించి, ఈ కొత్తరకం గాలి, ఒక కొత్త రసాయన మూలపదార్థమనీ, ప్రజ్వలన మనేది మండే వస్తువు నుంచి ఏదో నిగూఢమైన ఫ్లోజిస్టన్ వెళ్ళిపోవడం కాదు సరికదా, ఆ వస్తువుతో ఈ కొత్త మూలపదార్థం సంయోగం కావడమనీ నిర్ధారించాడు. అంతవరకు ఫ్లోజిస్టిన్ రూపంలో తలకిందులుగా నిల్చున్న సమస్త రసాయన శాస్త్రాన్ని మొట్టమొదట దాని కాళ్లపై దృఢంగా నిల్చోబెట్టిన వ్యక్తి లవాయ్‌సియర్. ఆ తరువాత లవాయ్‌సియర్ తాను కూడా పై మిగతా ఇద్దరూ ఆక్సిజన్‌ను ఉత్పత్తి చేసిన కాలంలోనే, వారితో నిమిత్తం లేకుండానే ఉత్పత్తి చేసినట్లు చెప్పుకొన్నారు. అది నిజం కాదు. అయితే ఆక్సిజన్‌ను నిజంగా కనుగొన్నది ఆయనే కాగా, మిగతా ఇద్దరూ కాదు; వారు దాన్ని కేవలం ఉత్పత్తి చేశారే కానీ, తాము ఉత్పత్తి చేసినదేమిటో వారికి తెలీలేదు.

ప్రీస్ట్లీ, షీలేలకు సంబంధించి, లవాయ్‌సియర్ స్థానమేమిటో, అదనపు విలువ సిద్ధాంతంలో, తన మునుపటి వారికి సంబంధించిన మార్క్స్‌కు గల స్థానం అదే. ఉత్పాదితాల విలువలో ఇప్పుడు మనం అదనపు విలువగా పేర్కొంటున్న భాగం వుంది అని మార్క్స్ కన్నా చాలా ముందే నిశ్చితమైంది. అదేమిటో ఇంచుమించు ఖచ్చితంగా, చెప్పడమూ జరిగింది. అంటే, దాన్ని స్వాయత్తం చేసుకొన్న

1. రోస్కో - స్కోర్లెమ్మెర్, అస్ ఫ్యూర్లిచెస్ లెర్‌బుచ్ డెర్ కెమి, బ్రాన్‌ష్వెవెల్గ్ 1877, 1, పుటలు 13, 18.

వ్యక్తిచే సమాన విలువ చెల్లించబడని శ్రమ ఉత్పాదితం అని చెప్పడమూ జరిగింది. కానీ అంతకు మించి యెవరూ ముందుకు పోలేదు. కొందరు – ప్రామాణిక బూర్జువా అర్థశాస్త్రజ్ఞులు – మహా అయితే, కార్మికునికీ ఉత్పత్తి సాధనాల సొంతదారుకూ మధ్య శ్రమ వుత్పాదితం ఏ నిష్పత్తిలో పంపిణీ అయ్యేదీ పరిశోధించారు. మిగతావారు – సోషలిస్టులు – ఈ పంపిణీ అన్యాయమైనదని తెలుసుకొని, ఈ అన్యాయాన్ని నిర్మూలించడానికి ఊహాత్మక సాధనాలకోసం వెదికారు. తమకు గతం నుంచి సంక్రమించిన ఆర్థిక అభివర్గాలకు వారంతా బందీలుగా వుండిపోయారు.

ఆ సమయంలో మార్క్స్ రంగప్రవేశం చేశాడు. ఆయన తన మునుపటి వారందరికీ పూర్తిగా భిన్నమైన వైఖరి అవలంబించాడు. వారు ఒక పరిష్కారంగా పరిగణించిన దాన్ని ఆయన ఒక సమస్యగా భావించాడు. తన పని ఫ్లోజిస్టన్ రహితమైన గాలితోనూ కాదు, అగ్గి – గాలితోనూ కాదు; ఆక్సిజన్‌తో అని ఆయన గ్రహించాడు – ఇక్కడ చేయవలసినది, ఒక ఆర్థిక వాస్తవాన్ని కేవలం చెప్పడం గాదు, ఒక వైపు ఈ వాస్తవానికీ, మరోవైపు శాశ్వత న్యాయానికీ, నిజమైన నీతికీ మధ్య గల ఘర్షణను చూపించడమూ కాదు, ఒక వాస్తవానికి కారణాలను విశదం చేయడం అని గుర్తించాడు. ఉత్తరోత్తరా మొత్తం అర్థశాస్త్రాన్ని విప్లవీకరించిందీ, మొత్తం పెట్టుబడిదారీ ఉత్పత్తిని అర్థం చేసుకొనేందుకు కీలకాన్ని – దాన్ని ఎలా ఉపయోగించాలో తెలిసిన వ్యక్తికి ఇవ్వజూపిందీ ఈ వాస్తవమే. లవాయ్‌సియర్ ఆక్సిజన్‌ను ప్రాతిపదికగా చేసుకొని తనకు కనిపించిన ఫ్లోజిస్టన్ రసాయన శాస్త్ర అభివర్గాలను అవలోడన చేసినట్లుగానే, మార్క్స్, పై వాస్తవంతో ప్రారంభించి, తనకు కనిపించిన ఆర్థిక అభివర్గాలను అవలోకన చేశాడు. మార్క్స్ అదనపు విలువ ఏమిటనేది అర్థం చేసుకోవడానికి విలువ ఏమిటనేది, కనుక్కోవలసి వచ్చింది; అన్నిటికన్నా ముఖ్యంగా విలువను గురించిన రికార్డో సిద్ధాంతాన్ని విమర్శించ వలసి వచ్చింది. కాబట్టి ఆయన విలువను ఉత్పత్తి చేసే శ్రమ స్వభావాన్ని విశ్లేషించాడు; విలువను ఉత్పత్తిచేసేది ఎటువంటి శ్రమో, అది ఎందుకు, ఎలా దాన్ని ఉత్పత్తి చేస్తుందో నిశ్చింతగా తెలుసుకొన్నది ఆయనే. విలువనేది ఘనీభవించిన ఈ రకమైన శ్రమ తప్పమరొకటి కాదని ఆయన కనుక్కొన్నాడు. ఈ విషయాన్ని రాడ్‌బెర్టస్ ఆజన్మాంతం గ్రహించలేదు. తరువాత మార్క్స్ సరకులకు, డబ్బుకు మధ్య సంబంధాన్ని పరిశోధించాడు. సరకుల్లో అంతర్గతంగా విలువ గుణం వున్న కారణంగా, సరుకులూ, సరకుల మార్పిడీ తప్పనిసరిగా సరకూ, డబ్బూ అన్న వైరుధ్యాన్ని ఉత్పన్నం చేస్తాయని చూపించాడు. ఈ ప్రాతిపదికపై డబ్బును గురించి ఆయన రూపొందించిన సిద్ధాంతం అటువంటి మొట్టమొదటి సర్వ సమగ్ర సిద్ధాంతం. డబ్బు పెట్టుబడిగా పరివర్తన చెందడాన్ని ఆయన విశ్లేషించి, శ్రమశక్తి కొనుగోలు, అమ్మకాలపై ఈ పరివర్తన ఆధారపడిందని నిరూపించాడు. శ్రమస్థానంలో శ్రమశక్తిని, విలువను ఉత్పత్తిచేసే గుణాన్ని ప్రవేశపెట్టడం ద్వారా, ఆయన ఒక్క దెబ్బతో, రికార్డో మత పతనానికి దారి తీసిన ఒక చిక్కుముడిని విడదీశాడు. శ్రమను బట్టి విలువ నిర్ణయమవుతుందన్న రికార్డో నియమంతో, పెట్టుబడి, శ్రమల పరస్పర మార్పిడిని సమన్వయపరచడం అసాధ్యం కావడం వల్ల ఏర్పడిన చిక్కు అది. పెట్టుబడిలో స్థిర పెట్టుబడి, అస్థిర పెట్టుబడి అనే తేడా వుందని నిరూపించడంవల్ల, ఆయన అదనపు విలువ రూపొందే పరిణామం యొక్క వాస్తవ గతిక్రమాన్ని అత్యంత సూక్ష్మ వివరాలతో సహా చూపి, ఆ విధంగా ఆ పరిణామ క్రమానికి కారణాలను చెప్పగలిగాడు. ఆయనకు ముందు

ఎవరూ చేయని అద్భుత కృత్యమిది. కాబట్టి, పెట్టుబడిలోనే వున్నట్టు ఆయన నిరూపించిన తేడా గురించి, అంతకు ముందు రాడ్‌బెర్టస్‌కు గాని, బూర్జువా అర్థశాస్త్రజ్ఞులకు గాని ఏమి చేయాలో బొత్తిగా తెలీదు; అయితే, అతి క్లిష్టమైన ఆర్థిక సమస్యల పరిష్కారానికి అది మార్గం చూపుతుంది. దీన్ని రెండవ సంపుటం స్ఫుటంగా మళ్ళీ నిరూపిస్తోంది. మూడవ సంపుటం మరింత ప్రస్ఫుటంగా నిరూపించనుంది. మార్క్స్ అదనపు విలువను ఇంకా విశ్లేషించి, దాని రెండు రూపాలను – నిరపేక్ష, సాపేక్ష అదనపు విలువలను – కనుగొన్నాడు. పెట్టుబడిదారీ వుత్పత్తి యొక్క చారిత్రక అభివృద్ధిలో అవి భిన్న పాత్రను, అయితే, ప్రతిసారీ నిర్ణయాత్మక పాత్రను నిర్వహించాయని ఆయన నిరూపించాడు. ఈ అదనపు విలువ ప్రాతిపదికపై, ఆయన వేతనాలను గురించి మనకున్న మొదటి సహేతుక సిద్ధాంతాన్ని రూపొందించాడు: మొట్టమొదటి సారిగా, పెట్టుబడి సంచయన చరిత్రను రేఖామాత్రంగా చిత్రించాడు; దాని చారిత్రక ధోరణిని విశదీకరించాడు.

మరి రాడ్‌బెర్టస్? ఆయన అదంతా చదివిన తరువాత – ఎల్లప్పుడూ పక్షపాతంతో వ్యవహరిస్తూ వచ్చిన ఆర్థికవేత్త కాబట్టి – దాన్ని "సమాజంపై దాడిగా పరిగణించాడు;"[1] అదనపు విలువ దేన్నుంచి ఉత్పన్నమవుతుందో తాను ఇంతకన్నా క్లుప్తంగా, స్పష్టంగా ఇదివరకే చెప్పాననుకొంటున్నాడు; ఇదంతా "పెట్టుబడి ప్రస్తుత రూపానికి", అంటే, చారిత్రకంగా ఉనికిలో వున్న పెట్టుబడికి వర్తిస్తున్న మాట నిజమే, కానీ ఇది, "పెట్టుబడిని గురించిన భావనకు," అంటే, పెట్టుబడిని గురించిన శ్రీమాన్ రాడ్‌బెర్టస్‌కు గల ఊహావాద భావానికి వర్తించదని, తుదకు ప్రకటిస్తున్నాడు – వృద్ధుడైన ప్రీస్ట్‌లీ చచ్చేవరకూ ఫ్లోపస్టన్‌ను పెట్టుకొని, వేలాడుతూ, ఆక్సిజన్ పేరెత్తితే మండిపడినట్లుగానే – అయితే ఒక్క భేదం వుంది – ప్రీస్ట్‌లీ ఆక్సిజన్‌ను వాస్తవంగా మొదట ఉత్పత్తి చేశాడు. కానీ రాడ్‌బెర్టస్ అదనపు విలువలోని ఒక మామూలు అంశాన్ని, లేక "కౌలును" పునరావిష్కరించాడు; మార్క్స్ అదనపు విలువ ఉన్నదనే వాస్తవాన్ని తొలుత కనిపెట్టింది తానే అని, లవాయ్‌సియర్ లాగా చెప్పుకోలేదు. అది గర్వనీయమని భావించాడు. రాడ్‌బెర్టస్ ఆర్థిక రంగంలో సాధించిన ఇతర అద్భుత కృత్యాలు కూడా దాదాపు ఇదే స్థాయిలో వున్నాయి. అదనపు విలువను ఒక ఊహా స్వర్గంగా ఆయన ఇచ్చిన వివరణను మార్క్స్, తాత్విక దారిద్ర్యం అన్న తన రచనలో, అనుకోకుండానే విమర్శించాడు. దాన్ని గురించి ఇంకా ఏమి చెప్పవచ్చునో, ఆ గ్రంథం[2] జర్మన్ కూర్పుకు నా ఉపోద్ఘాతంలో చెప్పాను. వర్తక సంక్షోభాలకు కారణం కార్మిక వర్గంచే వస్తు వినియోగం తగ్గుదలే అన్న రాడ్‌బెర్టస్ వాదం, సిస్మండీ గ్రంథం న్యువే ప్రిన్సిప్స్ డి.యల్. ఎకానమీ పొలిటిక్, సంపుటి IV, అధ్యాయం IVలో అదివరకు వున్నదే.[3] కానీ సస్మండీ ఎల్లప్పుడూ ప్రపంచ మార్కెట్‌ను దృష్టిలో ఉంచుకోగా, రాడ్ బెర్టస్ దృఙ్మండలం

1. డ్‌బెర్టస్ - జగెట్ జౌ, బ్రీఫీ అండ్ సోజియల్ పొలిటి సోహె ఔఫ్‌సాట్జే, హెరౌస్ గెగెబెన్ వాన్ డాక్టర్ ఆర్.మెయర్, బెర్లిన్, 1881, బి.డి. 1, యస్. III- సం.
2. కార్ల్ మార్క్స్, తాత్విక దారిద్ర్యం, మాస్కో, 1962 - సం.
3. "ఆ విధంగా, కొద్దిమంది కామందుల చేతుల్లో సంపద కేంద్రీకృతమవడం వల్ల దేశీయ మార్కెట్ అంతకంతకు కుచించుకుపోతుంది; పరిశ్రమలు తమ సరుకులను అమ్ముకోవడానికి విదేశీ మార్కెట్ల కోసం వెదకవలసిన స్థితి అంతకంతకు యేర్పడుతుంది. కానీ ఆ విదేశాల్లోనేమో పెద్ద విప్లవాలు సంభవించే ప్రమాదం వాటికి ఎదురవుతుంది''. (ఉదాహరణకు 1817 సంక్షోభం; దీన్ని రచయిత ఆ తరువాత వర్ణించాడు) న్యువే ప్రిన్సిప్స్ 1819 నాటి కూర్పు, 1, పుట 336.

ప్రష్యన్ సరిహద్దులను దాటిపోలేదు. వేతనాలకు మూలం పెట్టుబడా లేక ఆదాయమా అనే ఆయన ఊహాగానాలు విశ్వవిద్యాలయ శుష్క పాండిత్య విశేషాలే. ఈ పెట్టుబడి రెండవ సంపుటిలోని 3వ భాగంలో వీటికి తిరుగులేని సమాధానాలున్నాయి. కౌలును గురించిన రాడ్‌బెర్టస్ సిద్ధాంతం ఆయనొక్కరి ఆస్తిగానే వుండిపోయింది. దాన్ని విమర్శిస్తూన్న మార్క్స్ రాతప్రతి వెలువడే వరకూ అది ప్రశాంతంగా అలాగే వుండనీ[1] ఆఖరు మాట; పాత ప్రష్యన్ భూస్థితి, పెట్టుబడి పీడన నుంచి విముక్తం కావడానికి ఆయన చేసే సూచనలు కూడా పూర్తిగా పగటికలలే; ఎందువల్లనంటే, ఈ సందర్భంలో ఆచరణకు సంబంధించి ఉత్పన్నమైన ఒకే ఒక ప్రశ్నను అవి దాటవేస్తున్నాయి; ఆ ప్రశ్న ఇది : ఒక పాత కాలపు ప్రష్యన్ భూస్వామికి, యేడాదికి 20,000 మార్కుల ఆదాయం, ఏటా 30,000 మార్కుల ఖర్చు వుంటే అతను అప్పులో పడకుండా వుండగలడా?

రికార్డో ఆర్థిక ఆలోచనా విధాన నౌక 1839లో అదనపు విలువ అనే బండను ఢీకొని బద్ధలయింది. ఈ ఆలోచనా విధానం పరిష్కరించలేకపోయిన సమస్య, దాని తరువాత వచ్చిన నాటు అర్థ శాస్త్రానికి మరింత కొరకరానికొయ్య అయింది. కింది రెండు అంశాలూ దాని వైఫల్యానికి కారణం :

1. విలువకు శ్రమ కొలమానం. కానీ పెట్టుబడితో మార్పిడి అయ్యే సజీవ శ్రమకు గల విలువ, దానిలో మార్పిడి అయ్యే వస్తు రూప శ్రమకు గల విలువ కన్నా తక్కువ వేతనాలు ఒక నిర్దిష్ట పరిమాణంలోని సజీవ శ్రమ యొక్క విలువ; యివి ఇదే పరిమాణం గల సజీవ శ్రమ ఉత్పత్తి చేసిన దానికి, లేక ఈ శ్రమ పరిమాణం యొక్క మూర్తీభావమైన ఉత్పాదితానికి గల విలువ కన్నా ఎప్పుడూ తక్కువే. ఈ రూపంలో ప్రతిపాదిస్తే ఈ సమస్య నిజంగా పరిష్కరించరానిది. దీన్ని మార్క్స్ సరియైన రూపంలో ప్రతిపాదించాడు. అందువల్ల దాన్ని పరిష్కరించాడు. విలువ వున్నది శ్రమకు కాదు. విలువను సృష్టించే కార్యకలాపంగా దానికి యెటువంటి ప్రత్యేకతా లేదు. గురుత్వాకర్షణకు ప్రత్యేకమైన బరువు, ఉష్ణానికి ప్రత్యేక ఉష్ణోగ్రత, విద్యుచ్ఛక్తికి ప్రత్యేకమైన విద్యుత్ ప్రసరణ స్థాయి లేనట్లుగానే ఒక సరుకుగా కొనేది, అమ్మేదీ శ్రమను కాదు, శ్రమ శక్తిని, శ్రమశక్తి ఒక సరుకుగా రంగంపైకి రాగానే, ఒక సామాజిక ఉత్పాదితంగా, ఆ సరుకులో మూర్తిమంతమైన శ్రమను బట్టి దాని విలువ నిర్ధారణ అవుతుంది. ఈ విలువ, ఈ సరుకు ఉత్పత్తి, పునరుత్పత్తులకు సామాజికంగా అవసరమైన శ్రమకు సమానం. కాబట్టి, శ్రమశక్తిని ఈ విధంగా నిర్వచితమైన దాని విలువను బట్టి కొనుగోలూ, అమ్మకం కావడం, విలువ గురించిన అర్థశాస్త్ర నియమానికి విరుద్ధం కాదు.
2. విలువను గురించి రికార్డో ప్రతిపాదించిన నియమాన్ని అనుసరించి, సమాన మూల్యం చెల్లింపబడిన సమాన పరిమాణపు సజీవ శ్రమను నియోగించిన రెండు పెట్టుబడులు, తక్కిన పరిస్థితులన్నీ సమానంగా వున్నప్పుడు, సమాన విలువ గల సరుకులను, అదే విధంగా, సమాన పరిమాణం గల అదనపు విలువను, లేదా లాభాన్ని సమాన వ్యవధుల్లో ఉత్పత్తి

1. తరువాత **థియరియన్ ఉబెరో డెన్ మెర్‌వెర్ట్** అనే పేరుతో ప్రకటితమైన రాతప్రతిని గురించిన ప్రస్తావన ఇది....

చేస్తాయి. కానీ ఆ పెట్టుబడులు అసమ పరిమాణాల్లోని సజీవ శ్రమను నియోగించినట్లయితే, అవి సమానమైన అదనపు విలువలను, లేదా రికార్డో అనుయాయుల మాటల్లో, సమానమైన లాభాలను ఉత్పత్తి చేయజాలవు; కానీ వాస్తవంలో జరుగుతున్నది యిందుకు పూర్తి విరుద్ధంగా వుంది. ఆచరణలో, సమాన పెట్టుబడులు, అవి వినియోగిస్తున్న సజీవ శ్రమ యెక్కువ తక్కువలతో నిమిత్తం లేకుండా, సమాన వ్యవధుల్లో, సమాన సగటు లాభాలను వుత్పత్తి చేస్తున్నాయి. కాబట్టి, ఇక్కడ విలువ నియమానికి విరుద్ధమైనది కనిపిస్తోంది. దీన్ని రికార్డోయే గమనించాడు. కానీ ఆయన మత అనుయాయులు ఈ వైరుధ్యాన్ని సమన్వయపరచలేక పోయారు. అదే విధంగా రాడ్‌బెర్టస్ కూడా ఈ వైరుధ్యాన్ని గుర్తించక తప్పలేదు. కానీ, దాన్ని పరిష్కరించడానికి బదులు, తన ఊహాస్వర్గానికి తొలిమెట్లలో ఒకటిగా చేసుకొన్నాడు. (జుర్ ఎర్కెన్‌ట్నిస్, పుట 131). మార్క్స్ తన జుర్ క్రిటిక్[1] రాతప్రతిలో అదివరకే ఈ సమస్యను పరిష్కరించాడు. పెట్టుబడి గ్రంథ ప్రణాళిక ప్రకారం, ఈ పరిష్కారాన్ని దాని మూడవ సంపుటి చూపుతుంది.[2] అది వెలువడడానికి కొన్ని నెలలు పడుతుంది. కాబట్టి, మార్క్స్ చెప్పిన విషయాలకు రహస్య మూలాధారం ఆయన్ని మించిన ఆయన పూర్వీకుడు రాడ్‌బెర్టస్ అని తాము కనిపెట్టినట్లు చాటుకొనే అర్థశాస్త్రజ్ఞులకు, రాడ్‌బెర్టస్ లాంటి వాని అర్థశాస్త్రం యేమి సాధించగలదో నిరూపించడానికి యిప్పుడు అవకాశం కలుగుతుంది కదా. విలువ నియమాన్ని ఉల్లంఘించకుండానే కాక, ఆ నియమం ప్రాతిపదికపైనే లాభం సగటు రేటు ఎలా సమానంగా వుండగలదు? వుండకతప్పదు అని వారు రుజువు చేయగలిగితే, ఈ విషయం వారితో తదుపరి చర్చించడానికి నేను సిద్ధం. ఈలోగా వారు త్వరపడటం మంచిది. ఈ రెండవ సంపుటిలోని మహోజ్వల పరిశోధనలు, ఇంతవరకు ఎవరూ ప్రవేశించని రంగాల్లో అది సాధించిన సరికొత్త ఫలితాలు మూడవ సంపుటిలోని ఇతివృత్తానికి ప్రవేశిక మాత్రమే. మూడవ సంపుటి పెట్టుబడిదారీ ప్రాతిపదికపై సామాజిక పునరుత్పత్తి క్రమం గురించిన మార్క్స్ విశ్లేషణ అంతిమ నిర్ధారణలను విపులీకరిస్తుంది. మూడవ సంపుటి వెలువడినప్పుడు రాడ్‌బెర్టస్ అనే అర్థ శాస్త్రవేత్తను గురించిన ప్రస్తావనే వినిపించబోదు.

**పెట్టుబడి రెండవ, మూడవ సంపుటాలను, మార్క్స్ పదే పదే చెప్పినట్లు, ఆయన భార్యకు అంకితమివ్వవలసి వుంది.**

లండన్, మార్క్స్ పుట్టినరోజు, ఫ్రెడరిక్ ఎంగెల్స్
1885 మే 5

1. కార్ల్ మార్క్స్, **థియరియెన్ ఉబెర్ డెన్ మెర్‌వెర్ట్,** (వియర్టర్ బాండ్ డెస్ కాపిటల్స్), 2, టియల్, బెర్లిన్, 1959 - సం.
2. ఇంగ్లీషు కూర్పు, కార్ల్‌మార్క్స్, **కాపిటల్,** సం. III, 2వ భాగం, మాస్కో 1959 - సం.

# రెండవ ముద్రణకు ఉపోద్ఘాతం*

**ఈ** రెండవ కూర్పు, దాదాపు మొదటి కూర్పు యధాతథ పునర్ముద్రణే. అచ్చుతప్పులను సరిదిద్దాము. శైలికి సంబంధించిన కొన్ని దోషాలను తొలగించాము. కేవలం చర్విత చరణంగా వున్న చిన్న పేరాలను తీసివేశాము.

మూడవ సంపుటిలో, ముందుగా ఊహించని చాలా చిక్కులే ఎదురయ్యాయి. ఇప్పుడు దీని రాతప్రతి దాదాపు తయారైంది. నా ఆరోగ్యం బాగుంటే, ఇది ఈ ఆకురాలు కాలానికి ప్రచురణకు సిద్ధంగా వుంటుంది.

లండన్, **ఫ్రెడరిక్ ఎంగెల్స్**

1893, జులై 15

* * *

రాతప్రతులు II–VII నుంచి తీసుకొన్న భాగాల పట్టికను క్లుప్తంగా, పాఠకుల అనుకూలం కోసం, కింద పొందుపరచి, ప్రతి భాగం ఏ రాతప్రతి నుంచి తీసుకొన్నదీ సూచించాము.

**1వ భాగం**

పుటలు 23–24 రాతప్రతి II నుంచి, పుటలు 24–34, రాతప్రతి VII, పుటలు 34–38, రాతప్రతి VI; పుటలు 38–117 రాతప్రతి V; పుటలు 117–120, ఇతర గ్రంథాలనుంచి ఉల్లేఖించిన భాగాల మధ్య కనిపించిన నోట్; పుట 121 నుంచి ఆఖరు వరకు, రాతప్రతి IV; కానీ మధ్యలో చేర్చిన భాగాలివి; పుటలు 129–130 అన్నిచోట్లా రాతప్రతి VIII నుంచి తీసుకొన్నవే; పుటలు 134, 140–141 రాతప్రతి నుంచి తీసుకొన్నవి.

**2వ భాగం**

ప్రారంభం, పుటలు 153–163, ఇవి రాతప్రతి IV చివరివి: ఇక్కడ నుంచి ఈ భాగం ముగింపు వరకు, పుటలు 163–350, ఇవన్నీ రాతప్రతి II లోనివి.

**3వ భాగం**

అధ్యాయం 18 : (పుటలు 351–358) రాతప్రతి II నుంచి. అధ్యాయం 19 : I, II (పుటలు 359–389) అన్నిచోట్లా రాతప్రతి VII నుంచి; III (పుటలు 389–391) రాతప్రతి II నుంచి అధ్యాయం 20 : I (పుటలు 392–394) రాతప్రతి II నుంచి, ముగింపు పేరా మాత్రమే రాతప్రతి VIII నుంచి.

II (పుటలు – 395–398) దాదాపు మొత్తంగా రాతప్రతి II నుంచి.

III, IV, V (పుటలు 398–421) రాతప్రతి VIII నుంచి.

VI, VII, VIII, IX (పుటలు 427–437) రాతప్రతి VIII నుంచి.

XIII (పుటలు 480–488) రాతప్రతి II నుంచి అధ్యాయం 21: (పుటలు 489–522) పూర్తిగా రాతప్రతి VIII నుంచి.

---

* ఇది సంపాదకుడు (ఎంగెల్స్) పెట్టిన శీర్షిక.

## రెండవ సంపుటం

# పెట్టుబడి చలామణీ క్రమం

## మొదటి భాగం

# పెట్టుబడి రూప పరివర్తనలు (Metamorphoses of Capital) వాటి ఆవృత్తాలు (Circuits)

## అధ్యాయం 1

# డబ్బు పెట్టుబడి ఆవృత్తి (భ్రమణం)

పెట్టుబడి ఆవృత్త గమనం[1] మూడు దశల్లో జరుగుతుంది. 1వ సంపుటంలో చూపిన ప్రకారం, ఆ దశల పరంపరలివి :

**మొదటి దశ :** పెట్టుబడిదారు సరుకుల మార్కెట్‌లోనూ, శ్రామిక మార్కెట్‌లోనూ కొనుగోలుదారుగా ప్రవేశిస్తాడు. అతని డబ్బు, సరుకులుగా మారుతుంది. అంటే, అది డ (డబ్బు) – స (సరుకు) చలామణి క్రియకు లోనవుతుందన్న మాట.

**రెండవ దశ :** పెట్టుబడిదారు తాను కొన్న సరుకులను ఉత్పాదకంగా వినియోగిస్తాడు. అతను సరుకులను ఉత్పత్తి చేసే పెట్టుబడిదారుగా వ్యవహరిస్తాడు; అతని పెట్టుబడి ఉత్పత్తి ప్రక్రియకు లోనవుతుంది. ఫలితంగా, సరుకు ఉత్పత్తిలో వినియోగమైన మూల పదార్థాల మొత్తం విలువకన్నా ఎక్కువ విలువ గల సరుకు తయారవుతుంది.

**మూడవ దశ :** పెట్టుబడిదారు అమ్మకందారుగా మార్కెట్‌కు మళ్ళీ వస్తాడు. అతడు తన సరుకులను డబ్బుగా మార్చుకొంటాడు. అంటే అవి సరుకు – డబ్బు చలామణి క్రియకు లోనవుతాయి.

కాబట్టి, డబ్బు–పెట్టుబడి[2] ఆవృత్తి సూత్రమిది : డబ్బు–సరుకు... ఉత్పత్తి ...సరుకు'...డబ్బు'... ఇక్కడ చుక్కలు చలామణి క్రమానికి అంతరాయం కలిగినట్లు సూచిస్తాయి. సరుకు, డబ్బులు అదనపు విలువ వల్ల హెచ్చిన సరుకు, డబ్బులను సూచిస్తాయి.

---

1. రాతప్రతి II నుంచి - ఫ్రెడరిక్ ఎంగెల్స్
2. ద్రవ్యరూప పెట్టుబడిని, డబ్బు పెట్టుబడి అనీ; సరుకు రూప పెట్టుబడిని, సరుకు పెట్టుబడి అనీ పేర్కొన్నాం - తెలుగు అనువాదం సంపాదకుడు.

రెండవ దశను అంటే, పెట్టుబడి ఉత్పత్తి క్రమాన్ని అవగాహన చేసుకోవడానికి అవసరమైన మేరకే మొదటి, మూడవ దశలను గూర్చి 1వ సంపుటంలో చర్చించడం జరిగింది. ఈ కారణాన, పెట్టుబడి, తన వివిధ దశల్లో ధరించిన వివిధ రూపాలను గురించి, అంటే తన ఆవృత్తి పునశ్చరణలో ధరించే రూపాలని, తరువాత విసర్జిస్తూ వచ్చే రూపాలను గురించి అక్కడ చర్చించలేదు. ఇప్పుడీ రూపాలనే మనం పరిశీలించనున్నాము.

ఈ రూపాలను, వాటి స్వచ్ఛ స్థితిలో ఊహించుకోవాలంటే, ఈ రూపాలు మారడంతో లేదా ఏర్పడటంతో ఎలాంటి సంబంధం లేని అంశాలన్నింటినీ మనం మొదట వదలివేయాలి. కాబట్టి, సరుకులు వాటి విలువలకే అమ్మకమవుతాయనే కాక, అది ఆసాంతం ఒకే విధమైన పరిస్థితుల్లో జరుగుతుందని కూడా మనం ముందుగా ఊహించుకొంటున్నాము. అదే విధంగా, ఆవృత్తుల గతిక్రమంలో సంభవించగల విలువ మార్పులను కూడా వదలి వేస్తున్నాము.

## I. మొదటి దశ, డ (డబ్బు) - స (సరుకు)[1]

డబ్బు – సరుకు ఒకానొక మొత్తం డబ్బు ఒక సరుకుల రాశిగా మారటాన్ని సూచిస్తుంది. కొనుగోలుదారు తన డబ్బును సరుకులుగా మార్చుకొంటాడు; అమ్మకందారులు తమ సరుకులను డబ్బుగా మార్చుకొంటారు. సరుకుల సాధారణ చలామణికి సంబంధించిన ఈ క్రియను, అదే సమయంలో ఒక వ్యష్టి పెట్టుబడి యొక్క స్వతంత్ర ఆవృత్తిలో ఒక విధిని నిర్వర్తించే నిర్దిష్ట భాగంగా చేస్తున్నది ఈ క్రియ స్వరూపం కాదు, దీని పాదార్థిక స్వభావం; డబ్బుతో స్థానాలను మార్చుకొనే సరుకుల నిర్దిష్ట ఉపయోగపు లక్షణం, ఈ సరుకులు ఒక వంక ఉత్పత్తి సాధనాలూ, మరో వంక శ్రమశక్తిని, అంటే సరుకుల ఉత్పత్తిలోని పాదార్థిక, వైయక్తిక కారకాలు, వీటి నిర్దిష్ట స్వభావం ఉత్పత్తి చేయవలసిన ఆయా ప్రత్యేక రకం వస్తువులకు అనుగుణంగా వుండాలి. శ్రమశక్తిని **శ.** అనీ, ఉత్పత్తి సాధనాలను **ఉ.సా.** అనీ మనం పేర్కొన్నట్లయితే, కొనవలసిన సరుకుల రాశి, సరుకు అప్పుడు శ్రమ + ఉత్పత్తి సామర్థ్యంకు సమానం. దీన్ని మరింత సంక్షిప్తంగా చెప్పాలంటే సరుకు < శ్రమ / ఉ.సా. కాబట్టి డబ్బు – సరుకును, దాని సారభూతాంశాన్ని బట్టి, ఇలా చూపుతాం : డబ్బు–సరుకు < శ్రమ / ఉ.సా. డబ్బు–శ్రమ, డబ్బు–ఉ.సా., ఈ రెండూ కలిసి డబ్బు–సరుకు అవుతాయి. మొత్తం డబ్బు, అంటే డబ్బు రెండు భాగాలుగా విడిపోతుంది; ఒక భాగం శ్రమశక్తిని, రెండవ భాగం ఉత్పత్తి సాధనాలను కొంటాయి. ఈ రెండు కొనుగోళ్ళ పరంపరలు పూర్తిగా భిన్నమైన మార్కెట్లకు సంబంధించినవి. ఒకటి అసలైన సరుకు మార్కెట్‌కు, రెండవది శ్రామిక మార్కెట్‌కు చెందినది.

డబ్బు సరుకుల రాశిగా మారిపోయింది. డబ్బు–సరుకు < శ్రమ / ఉ.సా. అన్నది వాటి ఈ గుణాత్మక విభజననే కాక, ఒక అత్యంత విలక్షణమైన పరిమాణాత్మ సంబంధాన్ని కూడా తెలుపుతూంది.

తన శ్రమశక్తిని ఒక సరుకుగా అమ్మజూపే దాని సొంతదారుకు, దాని విలువను, లేక ధరను వేతనాల రూపంలో చెల్లిస్తారని మనకు తెలుసు. అంటే వేతనాలు, అదనపు శ్రమ అంతర్గతంగా వున్న ఒక నిర్దిష్ట పరిమాణంలోని శ్రమ యొక్క ధర అన్నమాట. ఉదాహరణకు, శ్రమశక్తి రోజువారీ

1. 1878లో మొదలు పెట్టిన రాతప్రతి VII ప్రారంభం.

విలువ మూడు షిల్లింగులనీ, అది అయిదు గంటల శ్రమ ఉత్పాదితానికి సమానమనీ అనుకొందాం. అప్పుడు కొనుగోలుదారుకు, అమ్మకందారుకు మధ్య ఒప్పందంలో, ఈ మొత్తం, ఉదాహరణకు, పది గంటల శ్రమ ధరగా, లేదా వేతనంగా నమోదవుతుంది. అలాంటి ఒప్పందం 50 మంది కార్మికులతో కుదుర్చుకొన్నట్లయితే, వారంతా కలిసి కొనుగోలుదారు కోసం రోజుకు మొత్తంగా 500 గంటల పని చేయవలసి వుంటుంది. ఈ కాలంలో సగం, లేక 250 గంటల శ్రమ, అంటే రోజుకు 10 గంటల చొప్పున 25 రోజుల శ్రమ అదనపు శ్రమే తప్ప మరొకటి కాదు. కొనుగోలు చేసే ఉత్పత్తి సాధనాల మొత్తం పరిమాణం ఈ మొత్తం శ్రమను వినియోగించుకొనేందుకు సరిపోవాలి.

కాబట్టి, ఒక నిర్దిష్ట మొత్తం డబ్బును (ఇది 422 పౌండ్లు అనుకొందాం) తదనుగుణమైన పరిమాణం గల ఉత్పత్తి సాధనాలకూ, శ్రమశక్తికీ మార్పిడి అవుతుందని సూచించే గుణాత్మక సంబంధాన్ని మాత్రమే డబ్బు–సరుకు < శ్రమ / ఉ.సా. వ్యక్తం చేయడం లేదు : ఆ డబ్బులో శ్రమశక్తికోసం వ్యయమైన భాగం శ్రమకూ, ఉత్పత్తి సాధనాల కోసం వ్యయమైన భాగం ఉ.సా.కూ, మధ్యగల పరిమాణాత్మక సంబంధాన్ని కూడా వ్యక్తం చేస్తుంది. ఈ సంబంధాన్ని మొదట్లోనే అదనపు శ్రమ పరిమాణం, అంటే ఒక నిర్దిష్ట సంఖ్యలోని కార్మికులు చేసే అదనపు శ్రమ పరిమాణం నిర్ణయిస్తుంది.

ఉదాహరణకు, ఒక నూలు మిల్లులో, దాని 50 మంది కార్మికుల వారపు వేతనం 50 పౌండ్లయితే, ఉత్పత్తి సాధనాల కోసం 372 పౌండ్లు ఖర్చు చేయవలసి వుంటుంది. ఈ మొత్తం 3000 గంటల వారపు శ్రమ వల్ల నూలుగా మారే ఉత్పత్తి సాధనాల విలువ అని అనుకొంటే ఈ శ్రమ కాలంలో 1,500 గంటలు అదనపు శ్రమ అవుతుంది.

అదనంగా వున్న శ్రమ వినియోగానికి, పారిశ్రామిక రంగంలోని వేరు వేరు శాఖల్లో ఉత్పత్తి సాధనాల రూపంలో అదనంగా ఎంత విలువ కావలసి వస్తుందనే దానితో ఇక్కడ నిమిత్తం లేదు. ఉత్పత్తి సాధనాలకై, డబ్బులో వెచ్చించిన భాగం డబ్బు – ఉ.సా.లో కొన్న ఉత్పత్తి సాధనాలకై ఖర్చయిన భాగం సరిగ్గా సరిపోవాలి అనేదే ఇక్కడి విషయం. అంటే, మొదట్లోనే ఆ మేరకు లెక్క వేసుకోవాలి. తదనుగుణమైన నిష్పత్తిలో సమకూర్చుకోవాలి. దీన్ని మరో విధంగా చెప్పాలంటే, ఉత్పత్తి సాధనాల పరిమాణం, ఆ శ్రమను మొత్తంగా గ్రహించడానికి, ఆ శ్రమచే ఉత్పాదితాలుగా మారడానికి సరిపోవాలన్న మాట. చేతిలో వున్న ఉత్పత్తి సాధనాలు అలా చాలకపోతే, కొనుగోలుదారు వద్ద అదనంగా వున్న శ్రమను వినియోగించుకోడానికి వీలుండదు; దాన్ని వినియోగించుకొనేందుకు ఆయనకు గల హక్కు నిరర్థకమవుతుంది. ఉత్పత్తి  సాధనాలు, లభిస్తున్న శ్రమకన్నా ఎక్కువగా వున్నట్లయితే, అవి శ్రమచే పూర్తిగా నిబిడీకృతం కావు, అంటే ఉత్పాదితాలుగా మారవు.

డబ్బు–సరుకు < శ్రమ / ఉ.సా. పూర్తి అయిన వెంటనే, కొనుగోలుదారు చేతిలో వున్నది, కేవలం ఒక ఉపయోగకరమైన వస్తువును ఉత్పత్తి చేయడానికి కావలసిన ఉత్పత్తి సాధనాలు, శ్రమశక్తి మాత్రమే కాదు. ఈ శ్రమశక్తి విలువను భర్తీ చేయడానికి అవసరమైన దానికన్నా ఎక్కువగా శ్రమశక్తిని ప్రచలితం చేయగల సత్తా, లేక ఎక్కువ పరిమాణం గల శ్రమ అతని చేతిలో వుందన్న మాట, అదే సమయంలో ఈ పరిమాణం గల శ్రమ అతని చేతిలో వుందన్న మాట. అదే సమయంలో ఈ పరిమాణంలోని శ్రమ ఆచరణ రూపం లేక భౌతిక రూపం ధరించేందుకు అవసరమైన ఉత్పత్తి సాధనాలు కూడా

అతనికున్నాయి. వేరు మాటల్లో చెబితే ఉత్పత్తి మూల పదార్థాలకన్నా ఎక్కువ విలువ గల వస్తువులను ఉత్పత్తి చేసే కారకాలు – అదనపు విలువ నిక్షిప్తమైన సరుకుల రాశిని ఉత్పత్తి చేసే కారకాలు – అతని చేతిలో వున్నాయి. డబ్బు రూపంలో అతడు ముందుగా వెచ్చించిన విలువ ఇప్పుడు వస్తురూపం ధరించింది. అదనపు విలువను సరుకుల రూపంలో సృష్టించే విలువగా అది అందులో మూర్తీభవించే వీలుంది. ఒక్క ముక్కలో చెప్పాలంటే, విలువ ఇక్కడ **ఉత్పాదక పెట్టుబడి (ఉ.పె.)** స్థితిలో లేక రూపంలో వుంది; ఇది విలువనూ, అదనపు విలువనూ సృష్టించే శక్తి గలది. **ఈ రూపంలోని పెట్టుబడిని ఉ.పె. అని పిలుద్దాం.**

ఉ.పె. విలువ శ్రమ+ఉ.సా.ల విలువకు సమానం; శ్రమ, ఉ.సా.లకు మార్పిడి అయిన డబ్బుకు సమానం. డబ్బు, ఉ.పె.లు రెండు ఒకే పెట్టుబడి విలువే అయితే డబ్బు అస్తిత్వ రూపం భిన్నమైనది, అంటే, అది డబ్బు స్థితి లేదా రూపంలోని పెట్టుబడి విలువ; అంటే, డబ్బు పెట్టుబడి.

కాబట్టి, డబ్బు–సరుకు < శ్రమ / ఉ.సా. లేదా దాని సాధారణ రూపమైన డబ్బు–సరుకు, అంటే సరుకుల కొనుగోళ్ళ సముదాయం, సరుకుల సాధారణ చలామణి క్రియ అన్నది, పెట్టుబడి స్వతంత్ర ఆవృత్తిలో ఒక దశగా, డబ్బు రూపం నుంచి ఉత్పాదక రూపానికి పెట్టుబడి విలువ పరివర్తన కూడా. మరింత క్లుప్తంగా చెప్పాలంటే, అది ఉత్పాదక పెట్టుబడిగా డబ్బు పెట్టుబడి పరివర్తన చెందడం. మనం ఇక్కడ చర్చిస్తున్న ఆవృత్తి రేఖా చిత్రంలో డబ్బు, పెట్టుబడి విలువకు మొదటి వాహిక కాబట్టి డబ్బు పెట్టుబడి అన్నది పెట్టుబడిని మదుపు చేసే రూపమన్నమాట.

డబ్బు – పెట్టుబడి రూపంలోని పెట్టుబడి, డబ్బు విధులను, ప్రస్తుత సందర్భంలో కొనుగోళ్ళ విశ్వజనీన సాధనం విధులను, చెల్లింపుల విశ్వజనీన సాధనం విదులను నిర్వర్తించే స్థితిలో వుంటుంది. (శ్రమశక్తిని మొదట కొన్నప్పటికీ, దాన్ని పనిలో పెట్టేవరకూ డబ్బు చెల్లించబడకపోయినా, అది చెల్లింపు సాధనంగా వుంది. అదే విధంగా, ఉత్పత్తి సాధనాలు మార్కెట్‌లో సిద్ధంగా లేనప్పుడు వాటికోసం పురమాయింపు చేయవలసి వచ్చినా, ఆ మేరకు డబ్బు–ఉ.సా.లో డబ్బు చెల్లింపు సాధనంగా పని చేస్తుంది) డబ్బు పెట్టుబడికి ఈ శక్తి వుండటానికి కారణం అది డబ్బు కావడమే తప్ప, పెట్టుబడి కావడం కాదు.

మరో వైపు డబ్బు రూపంలోని పెట్టుబడి విలువ డబ్బు విధులను తప్ప మరేవిధమైన విధులను నిర్వర్తించజాలదు. డబ్బు విధులను పెట్టుబడి విధులుగా మార్చేది ఏమిటంటే, పెట్టుబడి గమనంలో అవి నిర్వహించే పాత్రా, ఆ కారణం వల్ల, ఈ విధులు నిర్వర్తింపబడే దశకు, పెట్టుబడి ఆవృత్తిలోని ఇతర దశలకు మధ్య సంబంధమూ. ఉదాహరణకు ప్రస్తుతం మనం చర్చిస్తున్న సందర్భాన్నే తీసుకొందాం. ఇక్కడ డబ్బు సరుకులుగా మారుతుంది. ఈ సరుకుల సమ్మేళన ఉత్పాదక పెట్టుబడి భౌతికరూపం, ఈ రూపంలో అప్పుడే పెట్టుబడిదారీ ఉత్పత్తి ప్రక్రియ ఫలితం అంతర్గతంగా, సంభావ్యంగా వుంది.

డబ్బు–సరుకు < శ్రమ / ఉ.సా. లో డబ్బు పెట్టుబడి యొక్క విధిని నిర్వర్తించే డబ్బులోని ఒక భాగం. ఈ చలామణి క్రియను తుదకంటా నెరవేర్చడం ద్వారా, చేపడుతున్న ఒక విధిలో, అది తన పెట్టుబడి లక్షణాన్ని కోల్పోతుంది; కానీ తన డబ్బు లక్షణాన్ని అట్టిపెట్టుకొంటుంది. డబ్బు పెట్టుబడి డబ్బు

చలామణి డబ్బు – ఉ.సా.గానూ, డబ్బు – శ్రమగానూ, అంటే, ఉత్పత్తి, సాధనాల కొనుగోలుగానూ శ్రమశక్తి కొనుగోలుగానూ విభజితమవుతుంది. శ్రమశక్తి కొనుగోలును మాత్రమే తీసుకొని పరిశీలిద్దాం. డబ్బు – శ్రమ అనేది పెట్టుబడిదారుచే శ్రమశక్తి కొనుగోలు. అది శ్రమ శక్తి సొంతదారైన కార్మికునిచే శ్రమశక్తి అమ్మకం కూడా – వేతన రూపాన్ని మనం ముందుగానే ఊహించుకొన్నాము కాబట్టి శ్రమ అమ్మకమని కూడా చెప్పవచ్చు. ఇక్కడ కొనుగోలుదారుకు డబ్బు–సరుకుగా (= డబ్బు–శ్రమ) వున్నది. తక్కిన ప్రతి కొనుగోలులోలాగానే, అమ్మకందారుకు (కార్మికునికి) శ్రమ–డబ్బు (= శ్రమ–డబ్బు) అవుతుంది. అది అతని శ్రమశక్తి అమ్మకమన్నమాట. ఇది సరుకు చలామణి మొదటి దశ. లేక దాని మొదటి రూప పరివర్తన. (పెట్టుబడి సం. I, అధ్యాయం III, 2 అ)[1] శ్రమ అమ్మకందారు విషయంలో ఇది, డబ్బుగా అతని సరుకు చెందిన రూప పరివర్తన. ఆ విధంగా లభించిన డబ్బును అతడు, తన అవసరాలను తీర్చుకొనేందుకు అవసరమైన పలు సరుకులను, వినియోగ వస్తువులను కొనేందుకు క్రమేణా వెచ్చిస్తాడు. కాబట్టి అతని సరుకు సంపూర్ణ చలామణి శ్రమ–డబ్బు–సరుకుగా, అంటే మొదట శ్రమ–డబ్బు (= సరుకు–డబ్బు)గా, తదుపరి డబ్బు–సరుకుగా వ్యక్తమవుతుంది. ఈ సందర్భంలో డబ్బు కేవలం చలామణి తాత్కాలిక సాధనంగా, ఒక సరుకును మరో సరుకుకు మార్పిడి చేయడానికి కేవలం సాధనంగా వుంది.

డబ్బు పెట్టుబడి ఉత్పాదక పెట్టుబడిగా పరివర్తనం చెందడంలో డబ్బు–శ్రమ ఒక విలక్షణమైన క్రియ. ఎందువల్లనంటే, డబ్బు రూపంలో మదుపు పెట్టిన విలువ పెట్టుబడిగా, అదనపు విలువను ఉత్పత్తి చేసే విలువగా నిజంగా పరివర్తన చెందడానికి అది తప్పనిసరిగా అవసరం. డబ్బు–శ్రమ ప్రక్రియలో కొన్న పరిమాణంలోని శ్రమ వస్తు రూపం ధరించడానికి మాత్రమే డబ్బు–ఉ.సా. అవసరం. ఈ విషయాన్ని ఈ దృక్కోణం నుంచి ఒకటవ సంపుటంలోని 2వ భాగంలో "పెట్టుబడిగా డబ్బు పరివర్తన" అనే శీర్షిక కింద చర్చించాము. ఇక్కడ ఈ విషయాన్ని మరో కోణం నుంచి, ప్రత్యేకించి, పెట్టుబడి వ్యక్తీకరణ రూపంగా డబ్బు పెట్టుబడికి సంబంధించిన దృక్కోణం నుంచి పరిశీలిస్తాము.

సాధారణంగా, డబ్బు–శ్రమ పెట్టుబడిదారీ ఉత్పత్తి పద్ధతి లక్షణంగా పరిగణింపబడుతోంది. కానీ దానికి కారణం పైన చెప్పినది కాదు. శ్రమశక్తి కొనుగోలు అన్నది చెల్లించిన శ్రమశక్తి ధర స్థానాన్ని అంటే వేతనాల స్థానాన్ని భర్తీ చేసేందుకు అవసరమైన దానికి మించిన పరిమాణంలో శ్రమను అందజేయాలన్న షరతు గల కొనుగోలు ఒప్పందం కావడం వల్ల కాదు; ముందుగా మదుపు పెట్టిన విలువ పెట్టుబడి అయేందుకు, వేరు మాటల్లో, అదనపు విలువ ఉత్పత్తికి మౌలికావసరమైన అదనపు శ్రమ చేయాలన్న షరతు గల – ఒప్పందం కావడం వల్ల కాదు. డబ్బు–శ్రమను పెట్టుబడిదారీ ఉత్పత్తి పద్ధతి లక్షణంగా అలా పరిగణించడానికి దాని రూపం కారణం; ఎందువల్లనంటే వేతనాల రూపంలో శ్రమను కొంటుంది. మరి ఇది ద్రవ్య వ్యవస్థ విశిష్ట లక్షణం.

ఈ రూపం అసంబద్ధత కూడా విశిష్ట లక్షణంగా పరిగణించబడటం లేదు సరికదా, ఆ అసంబద్ధతను ఉపేక్షిస్తారు కూడా. ఆ అసంబద్ధత ఏమిటంటే, విలువను సృష్టించే అంశంగా శ్రమకు స్వతహాగా ఎటువంటి విలువ వుండజాలదు. కాబట్టి ఏ నిర్దిష్ట పరిమాణం గల శ్రమకూ దాని

1. ఇంగ్లీషు కూర్పు : అధ్యాయం, III, అ - సం.

ధరలో, తత్తుల్యమైన ఒక నిర్దిష్ట మొత్తంగా వున్న డబ్బులో వ్యక్తమయ్యే ఏ విలువ ఉండదు. కానీ వేతనాలు కేవలం ఒక ప్రచ్ఛన్న రూపమని మనకు తెలుసు. ఉదాహరణకు ఒక రోజు శ్రమశక్తి ధర, ఈ శ్రమశక్తిచే ఒక రోజులో ప్రచోదితమైన శ్రమ యొక్క ధరగా ఆ రూపంలో ప్రదర్శితమవుతుందని మనకు తెలుసు. ఈ శ్రమశక్తి, ఉదాహరణకు ఆరు గంటల్లో ఉత్పత్తి చేసే విలువ, దాని పన్నెండు గంటల పని విలువగా, ఆ విధంగా వ్యక్తమవుతుంది.

డబ్బు–శ్రమను ద్రవ్య వ్యవస్థ అనే దాని విశిష్ట లక్షణంగా, దాని ప్రధాన చిహ్నంగా పరిగణిస్తున్నామంటే, అందుకు కారణం, ఆ సందర్భంలో శ్రమ దాని సొంతదారుని సరుకుగాను, డబ్బు దాని కొనుగోలుదారుగానూ రంగంపైకి రావడమే. కాబట్టి డబ్బు సంబంధం (అంటే మనిషి క్రియాశీలాన్ని అమ్మడం, కొనడం) కారణంగా అలా పరిగణిస్తున్నాము. కానీ డబ్బు పెట్టుబడిగా పరివర్తన చెందకుండానే, ఆర్థిక వ్యవస్థ సార్వత్రిక లక్షణంలో ఎలాంటి మార్పు లేకుండానే, డబ్బు చాలా కాలం ముందే సేవలనబడే వాటి కొనుగోలుదారుగా రంగంపైకి వచ్చింది.

డబ్బు ఎలాంటి సరుకులుగా పరివర్తన చెందిందనేదానితో దానికి ప్రమేయంలేదు. అది సరుకులకు సార్వజనీకమైన తుల్యవస్తువు. అవి ఒక నిర్దిష్ట మొత్తంలోని డబ్బుకు భావాత్మక ప్రతీకలనీ, డబ్బుగా పరివర్తన చెందనున్నాయనీ, డబ్బుతో మార్పిడి అయ్యేవరకు అవి తమ సొంతదారులకు ఉపయోగపు విలువలుగా మారగల రూపం ధరించవనీ, వాటి ధరలను బట్టి రుజువవుతోంది. శ్రమశక్తి, దాని సొంతదారుని సరుకుగా మార్కెట్‌లో ప్రవేశించిన తరువాత, దాని అమ్మకం శ్రమకై చేసే చెల్లింపు రూపాన్ని, వేతన రూపాన్ని ధరించిన తరువాత, దాని కొనుగోలు, అమ్మకం, ఇతర సరుకు కొనుగోలు, అమ్మకం వంటిదే తప్ప అందులో అబ్బురమైనదేమీ లేదు. ఇక్కడి విశేషం, సరుకుగా వున్న శ్రమశక్తి కొనదగినది కావటం కాదు; శ్రమశక్తి సరుకుగా రంగంపైకి రావడం విశేషం.

డబ్బు–సరుకు $< \begin{matrix} \text{శ్రమ} \\ \text{ఉ.సా.} \end{matrix}$ ద్వారా, డబ్బు పెట్టుబడిని ఉత్పాదక పెట్టుబడిగా మార్చడం ద్వారా పెట్టుబడిదారు ఉత్పత్తిలోని వస్తురూప, వైయక్తిక కారకాలను, అవి సరుకులుగా వున్న మేరకు, సమ్మిళితం చేస్తాడు. డబ్బు మొదటిసారిగా ఉత్పాదక పెట్టుబడిగా పరివర్తన చెందినట్లయితే, అది తన సొంతదారుకు డబ్బు పెట్టుబడి కర్తవ్యాన్ని మొదటిసారిగా నిర్వర్తిస్తున్నట్లయితే, అతడు శ్రమశక్తిని కొనడానికి ముందే భవనాలు, యంత్రాలు మొదలయిన ఉత్పత్తి సాధనాలను కొనడంతో పని ప్రారంభించాలి. ఎందువల్లనంటే శ్రమశక్తి తను ఆదేశం ఇచ్చినంతనే విధేయత పాటించి, చేయక తప్పని స్థితిలో శ్రమశక్తిని వుంచిన వెంటనే దాన్ని శ్రమశక్తిగా వినియోగించేందుకు ఉత్పత్తి సాధనాలు అతని వద్ద వుండాలి.

ఇదీ పెట్టుబడిదారు ఈ వ్యవహారాన్ని చిత్రిస్తున్న తీరు. కార్మికుని దృష్టికి ఇలా కనిపిస్తుంది : అతని శ్రమశక్తి అమ్మకమై ఉత్పత్తి సాధనాలతో దానికి సంబంధం కల్పించే వరకు దాన్ని ఉత్పాదకంగా వినియోగించడానికి వీలుపడదు. కాబట్టి శ్రమశక్తి అమ్మకం కావడానికి ముందు, అది ఉత్పత్తి సాధనాల నుంచి, దాని వినియోగానికి అవసరమైన భౌతిక పరిస్థితుల నుంచి వేరుపడి వుంటుంది. ఈ విధంగా వేరుపడివున్న స్థితిలో, దాని సొంతదారుకు ఉపయోగపు విలువను నేరుగా ఉత్పత్తి చేయడానికిగానీ,

లేదా అమ్ముకొని బతికేందుకు సరుకులను ఉత్పత్తి చేయడానికి గాని ఆ శ్రమశక్తి ఉపయోగపడదు. కానీ దాన్ని అమ్ముకొన్న ఫలితంగా అది ఉత్పత్తి సాధనాలతో అనుసంధితమైన క్షణం నుంచి, దాని కొనుగోలుదారు ఉత్పత్తి సాధనాల్లాగానే ఉత్పాదక పెట్టుబడిలో భాగమవుతుంది.

డబ్బు-శ్రమశక్తి క్రియలో డబ్బు సొంతదారు, శ్రమశక్తి సొంతదారు – వీరిద్దరు కొనుగోలుదారు, అమ్మకందారుల సంబంధం ఏర్పరచుకొంటారనేది, డబ్బు సొంతదారుగా, సరుకు సొంతదారుగా మాత్రమే ఎదురుబదురవుతారనేది నిజమే. ఈ విషయంలో వారు కేవలం డబ్బు సంబంధం ఏర్పరచుకొంటారు. కానీ అదే సమయంలో, కొనుగోలుదారు మొదటినుంచే, ఉత్పత్తి సాధనాల సొంతదారుని హోదాలో కూడా రంగంపైకి వస్తాడు. శ్రమశక్తి సొంతదారు దాన్ని ఉత్పాదకంగా వ్యయం చేసేందుకు భౌతిక పరిస్థితులు అవే. వేరు మాటల్లో చెప్పాలంటే, ఈ ఉత్పత్తి సాధనాలు మరొకరి ఆస్తి అయినందువల్ల అవి శ్రమశక్తి సొంతదారుకు ఎదురు స్థానంలో వుంటాయి. మరోవైపు, శ్రమ అమ్మకందారు మరొకరి శ్రమశక్తిగా, కొనుగోలుదారు ఆజ్ఞను శిరసావహించక తప్పని శ్రమశక్తిగా అతని పెట్టుబడి నిజంగా ఉత్పాదక పెట్టుబడిగా రూపొందాలంటే, దానితో ఏకీకృతంకాక తప్పని శ్రమశక్తిగా అతని ఎదుట నిల్చుంటాడు. కాబట్టి, ఈ బిద్దరూ డబ్బు-శ్రమ క్రియలో (కార్మికుని విషయంలోమిది శ్రమ-డబ్బు) ఎదురుబదురుగా నిల్చున్న క్షణం నుంచి పెట్టుబడిదారుకు, వేతన కార్మికునికీ మధ్య వర్గ సంబంధం వుంటుంది. అది గర్భితంగా వుంటుంది. అదొక కొనుగోలూ, అమ్మకం ఒక డబ్బు సంబంధం. అయితే ఆ కొనుగోలూ, అమ్మకంలో కొనుగోలుదారు పెట్టుబడిదారనీ, అమ్మకందారు వేతన కార్మికుడనీ భావన వుంది. శ్రమశక్తి వాస్తవ రూపం ధరించడానికి అవసరమైన పరిస్థితుల మూలంగా, అంటే జీవనాధారాలు, ఉత్పత్తి సాధనాలు మరొకరి ఆస్తి అయినందువల్ల, శ్రమశక్తి సొంతదారు నుంచి అవి వేరుపడి ఉన్నాయన్న వాస్తవం మూలంగా ఈ సంబంధం ఉత్పన్నమవుతుంది.

ఈ వేర్పాటుకు మూలమేమిటనే దానితో మనకు ఇక్కడ నిమిత్తం లేదు. డబ్బు-శ్రమ ప్రారంభమయిందంటే ఇది ఉనికిలో వున్నట్లే. ఇక్కడ మనకు ఆసక్తికరమైన విషయమిదీ : ఇక్కడ డబ్బు-శ్రమ, డబ్బు పెట్టుబడి యొక్క క్రియగా కనపడుతూందంటే, లేదా డబ్బు అనేది పెట్టుబడి యొక్క అస్తిత్వ రూపంగా కనపడుతుందంటే, డబ్బు ఇక్కడ ఉపయోగకరమైన మానవ కార్యకలాపానికి లేదా సేవకు చెల్లించే సాధనం యొక్క పాత్ర వహించడమొక్కటే అందుకు కారణం కాదు; కాబట్టి, చెల్లింపు సాధనంగా డబ్బు పని చేసిన ఫలితంగా కానేకాదు. డబ్బును ఈ రూపంలో వ్యయం చేయగలగటానికి కారణమేమిటంటే, శ్రమశక్తి ఉత్పత్తి సాధనాల నుంచీ (శ్రమశక్తినే ఉత్పత్తి చేసే సాధనమైన జీవనాధారాల నుంచీ కూడా) వేర్పడి వున్న స్థితిలో వుండటం; శ్రమశక్తిని ఉత్పత్తి సాధనాల సొంతదారుకు అమ్మడం ద్వారా మాత్రమే ఈ వేర్పాటును అంతమొందించ వీలుండటం; తన ధర పునరుత్పత్తికి అవసరమైనంత శ్రమకు మాత్రమే పరిమితం కాని శ్రమశక్తి పని, అటు దాని కొనుగోలుదారుకూ కావలసి వుండటం. ఉత్పత్తి ప్రక్రియ సందర్భంగా పెట్టుబడి సంబంధం ఉత్పన్నం  కావడానికి ఒకే ఒక కారణముంది – ఆ సంబంధం చలామణి క్రియలో, కొనుగోలుదారు, అమ్మకందారు ఒకరికొకరు ఎదురైన మౌలికంగా భిన్నమైన వారి ఆర్థిక పరిస్థితుల్లో, వారి వర్గ సంబంధంలో అంతర్గతంగా వుంది. ఈ సంబంధం, తన స్వభావాన్ని బట్టి డబ్బు సృష్టించినది కాదు

సరికదా, ఈ సంబంధం వున్నందువల్లనే కేవలం డబ్బు క్రియ, పెట్టుబడి క్రియగా పరివర్తన చెందడానికి వీలవుతుంది.

డబ్బు పెట్టుబడి గురించిన భావనలో (ప్రస్తుతానికి, ఇక్కడ మనకు ఎదురవుతున్న ప్రత్యేక క్రియ పరిధిలోనే, దీన్ని పరిశీలిస్తున్నాం). రెండు తప్పులు ఒక దానికొకటి సమానాంతరంగా, లేదా ఒకదానికొకటి అడ్డంగా నడుస్తున్నాయి. మొదటి విషయం డబ్బు పెట్టుబడిగా పెట్టుబడి విలువ నిర్వహించే విధులు అది డబ్బు రూపంలో ఉన్నందువల్లనే నిర్వహించగలుగుతూంది. కానీ దాని పెట్టుబడి స్వభావం నుంచి ఈ విధులు ఉత్పన్నమవుతున్నట్లు పొరపడుతున్నారు. అయితే, పెట్టుబడి విలువ యొక్క డబ్బు రూపమే, ఆ విలువు డబ్బు రూపంలో రంగంపైకి రావడమే, ఈ విధులకు కారణం. రెండవ విషయం, ఇందుకు భిన్నంగా, డబ్బు విధిలోని ప్రత్యేక అంతర్విషయానికి – ఆ విధిని అదే సమయంలో పెట్టుబడి విధిగా చేస్తున్న ఈ విషయానికి మూలం డబ్బు స్వభావమని అనుకొంటున్నారు. (ఇక్కడ డబ్బును పెట్టుబడితో గందరగోళపరుస్తున్నారు) కాని, డబ్బు–శ్రమ క్రియ సూచించే లాంటి సామాజిక పరిస్థితులు ఈ డబ్బు క్రియలో గర్భితం. కేవలం సరుకుల చలామణిలో, తదనుగుణమైన డబ్బు చలామణిలో, ఇలాంటి పరిస్థితులు సుతరామూ వుండవు.

బానిసల కొనుగోలు అమ్మకం కూడా వాటి రూపాన్ని బట్టి సరుకుల కొనుగోలు, అమ్మకమే. కానీ బానిస వ్యవస్థ అనేది లేనిదే, డబ్బు ఈ విధి నిర్వహించలేదు. బానిస వ్యవస్థ ఉన్నట్లయితే, బానిసల కొనుగోలుకై డబ్బు మదుపు పెట్టవచ్చు. కాని, కేవలం డబ్బు కలిగి ఉండటమే బానిస వ్యవస్థకు అవకాశం కల్పించదు.

వ్యక్తి తన సొంత శ్రమశక్తిని అమ్ముకోవడం (సొంత శ్రమను అమ్ముకొనే రూపంలో లేక వేతనాల రూపంలో) ఒక సకృత్తు పరిమాణం కాక, సరుకుల ఉత్పత్తికి సామాజికంగా నిర్ణయాత్మకమైన ఒక మూలాధారంగా వుంది. కాబట్టే పైన చర్చించిన డబ్బు–సరుకు < శ్రమ / ఉ.సా. క్రియను డబ్బు పెట్టుబడి సామాజిక స్థాయిలో నిర్వహిస్తున్నదంటే, శ్రమశక్తితో ఉత్పత్తి సాధనాలకు ఆదిలో వున్న బంధాన్ని విచ్ఛిన్నం చేసిన చారిత్రక పరిణామ క్రమాలు అంతకు ముందే సంభవించాయన్న మాట – ఈ పరిణామ క్రమాల ఫలితంగా, బహుళ సంఖ్యాక ప్రజలు, అంటే శ్రామికులు ఉత్పత్తి సాధనాలు లేనివారుగా, ఉత్పత్తి సాధనాల సొంతదారులైన శ్రామికేతరులకు ఎదురుబదురవుతారు. ఈ సంబంధం నిర్మూలన కాకముందు, శ్రామికుడు తానే ఒక ఉత్పత్తి సాధనంగా వున్నందువల్ల తదితర ఉత్పత్తి సాధనానికి చెంది వుండవచ్చు. లేదా అతనే వాటి సొంతదారుగానూ వుండి వుండవచ్చు. ఉత్పత్తి సాధనాలతో అతని సంబంధం ఈ రెంటిలో ఏ రూపంలో వుండినా ఇక్కడ ఒక్కటే.

డబ్బు–సరుకు < శ్రమ / ఉ.సా. వెనుక ఉన్నదేమిటంటే పంపిణీ. ఇది, వినియోగ వస్తువుల పంపిణీ అనే మామూలు అర్థంలోని పంపిణీ కాదు; అసలు ఉత్పత్తిలోని మూలాంశాల పంపిణీ. వీటిలోని పాదార్థిక అంశాలు ఒకవైపు కేంద్రీకృతమై వుండగా, శ్రమశక్తి వాటినుంచి వేర్పడిపోయి, మరోవైపు వుంటుంది.

కాబట్టి, డబ్బు–శ్రమ క్రియ సార్వత్రిక క్రియగా, సామాజిక క్రియగా రూపొందగలగాలంటే, అంతకు ముందు ఉత్పత్తి సాధనాలు ఉత్పాదక పెట్టుబడిలోని పాదార్థిక భాగం – శ్రామికునికి పెట్టుబడిగా ఎదురుపడాలి.

పెట్టుబడిదారీ ఉత్పత్తి స్థాపితమైన తరువాత, దాని తదనంతర అభివృద్ధిలో అది ఈ వేర్పాటును పునఃసృష్టించడమే కాక, అది ప్రబలమైన సామాజిక స్థితి అయ్యే వరకు దాని పరిధిని అంతకంతకు విస్తరింపజేస్తుందని మునుపటి సందర్భాల్లో చూచాము.[1] కానీ ఈ సమస్యకు ఇంకొక పార్శ్వం కూడా వుంది. పెట్టుబడి తలెత్తి, ఉత్పత్తిని తన అధీనంలోకి తెచ్చుకోవాలంటే, వర్తకం ఒక నిర్దిష్ట స్థాయికి అభివృద్ధి చెంది వుండాలి. కాబట్టి ఇది సరుకుల చలామణికి కూడా, కనుక సరుకుల ఉత్పత్తికి కూడా వర్తిస్తుంది. ఎందువల్లనంటే, వస్తువులు అమ్మకానికై ఉత్పత్తి అయితే తప్ప, అంటే అవి సరుకులుగా తప్ప, చలామణిలో ప్రవేశించజాలవు. కాని, సరుకుల ఉత్పత్తికి పెట్టుబడిదారీ ఉత్పత్తి ప్రాతిపదిక అయితే తప్ప, అది సార్వత్రిక ఉత్పత్తిగా, ప్రబలమైన ఉత్పత్తిగా రూపొందదు.

రైతుల విముక్తి అని పేర్కొనబడే దాని ఫలితంగా రష్యన్ భూస్వాములు నేడు తమ వ్యవసాయాన్ని, ఫ్యూడల్ దాసుల నిర్బంధ శ్రమకు మారు తప్పనిసరిగా వేతన కార్మికుల సహాయంతో వ్యవసాయాన్ని సాగించవలసి వచ్చింది. వారిప్పుడు రెండు విషయాలను గురించి గోలపెడుతున్నారు. డబ్బు పెట్టుబడి లేదనేది మొదటిది. ఉదాహరణకు, తమ పంటను అమ్ముకోక మునుపే తాము వేతన కార్మికులకు సాపేక్షంగా పెద్ద మొత్తాలు చెల్లించవలసి వస్తూందనీ, కానీ, దీనికి ప్రధానావసరమైన నగదు తమ చేతిలో తగినంత ఉండటం లేదని వారంటున్నారు. పెట్టుబడిదారీ పద్ధతిలో ఉత్పత్తిని సాగించగలగాలంటే, ఎల్లప్పుడూ ప్రత్యేకించి వేతనాల చెల్లింపుకై, డబ్బు రూపంలో పెట్టుబడి వుండి వుండాలి. కానీ భూస్వాములు నిరాశ చెందనవసరం లేదు. ఓపికతో వేచివున్న వారికి సర్వం సమకూరుతుంది. కాలక్రమేణా, పారిశ్రామిక పెట్టుబడిదారు వ్యయం చేయడానికి, తన సొంత డబ్బు కాకుండా, ఇతరుల డబ్బు కూడా చేతిలో వుండబోతుంది.

వారి రెండవ ఫిర్యాదు మరింత విలక్షణమైనది. అదేమిటంటే, డబ్బు ఉన్నప్పటికీ, తగినంత మంది కార్మికులు ఎప్పుడూ దొరకక్కపోవడం. దానికి కారణమిది : గ్రామ ప్రజకు భూమి ఉమ్మడిగా వున్నందువల్ల రష్యన్ వ్యవసాయ కార్మికుడు తన ఉత్పత్తి సాధనాలనుంచి పూర్తిగా వేరైపోలేదు. కాబట్టి ఇంకా అతను "స్వేచ్ఛగల వేతన కార్మికుడు" కాదు. ఆ మాటలకు గల సంపూర్ణార్థంలో అయితే, సరుకులుగా డబ్బు పరివర్తనను సూచించే డబ్బు–సరుకు ఉత్పాదక పెట్టుబడిగా **(ఉ.పె.)** డబ్బు పెట్టుబడి పరివర్తనను సూచించగలగడానికి అలాంటి కార్మికుడు సామాజిక స్థాయిలో వుండటం తప్పనిసరిగా అవసరం.

కాబట్టి, డబ్బు పెట్టుబడి ఆవృత్తి సూత్రమైన డబ్బు–సరుకు ... ఉ.పె. ... సరుకు–డబ్బు. అదివరకే అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ ఉత్పత్తి ప్రాతిపదికపై మాత్రమే పెట్టుబడి ఆవృత్తి యొక్క సహజసిద్ధ రూపమనేది సుస్పష్టమే. ఎందువల్లనంటే, సామాజిక స్థాయిలో వేతన కార్మికుల వర్గం ఉనికి దానిలో గర్భితం. పెట్టుబడిదారీ ఉత్పత్తి సరుకులను, అదనపు విలువను మాత్రమే ఉత్పత్తి చేయదనీ, ప్రత్యక్ష ఉత్పత్తిదారుల్లో అత్యధిక సంఖ్యాకులను వేతన కార్మికులుగా మార్చి, వేతన కార్మికుల వర్గాన్ని కూడా అధికాధికంగా పునరుత్పత్తి చేస్తుందని కూడా మనం చూశాము. డబ్బు–సరుకు ... ఉ.పె. ... సరుకు–డబ్బు, ఆచరణలోకి రావడానికి వేతన కార్మికులవర్గం ఖాయంగా ఉండటం ప్రథమావసరం కాబట్టి, ఆ సూత్రంలో ఉత్పాదక పెట్టుబడి రూపంలో పెట్టుబడి వునికి, అందువల్ల, ఉత్పాదక పెట్టుబడి ఆవృత్తి రూపం గర్భితం.

---

1. ఇంగ్లీషు కూర్పు : కార్ల్‌మార్క్స్, **పెట్టుబడి,** సం. 1, 7వ భాగం, మాస్కో, 1954, - సం

## II. రెండవ దశ, ఉత్పాదక పెట్టుబడి విధి

మనం ఇక్కడ పరిశీలించిన పెట్టుబడి ఆవృత్తి, డబ్బు–సరుకు చలామణి క్రియతో ప్రారంభమవుతుంది, అంటే డబ్బు సరుకులుగా రూప పరివర్తన చెందడంతో – కొనుగోలుతో ప్రారంభమవుతుంది. కాబట్టి తద్విరుద్ధ రూప పరివర్తన అయిన సరుకు–డబ్బుతో, అంటే సరుకులు డబ్బుగా పరివర్తన చెందడంతో – అమ్మకంతో చలామణి పూర్తికావాలి. కానీ, డబ్బు–సరుకు < శ్రమ / ఉ.సా. ప్రత్యక్ష పర్యవసానం డబ్బు రూపంలో మదుపుపెట్టిన పెట్టుబడి విలువ యొక్క చలామణికి అంతరాయం కలగటం, ఉత్పాదక పెట్టుబడిగా డబ్బు పెట్టుబడి పరివర్తన చెందడం వల్ల, పెట్టుబడి విలువ వినియోగంలోకి, అంటే ఉత్పాదక వినియోగంలోకి ప్రవేశించాలే తప్ప, చలామణిని కొనసాగించ వీలులేని భౌతిక రూపం సంతరించుకొంది. శ్రమ ప్రక్రియ ద్వారా మాత్రమే శ్రమశక్తి వినియోగం, అంటే శ్రమ వస్తురూపం ధరించగలదు. పెట్టుబడిదారు కార్మికుణ్ణి తిరిగి అమ్మలేడు. ఎందువల్లనంటే, అతను పెట్టుబడిదారుని బానిస కాదు; పెట్టుబడిదారు అతని శ్రమశక్తిని ఒక నిర్ణీత కాలం పాటు వినియోగించే హక్కును తప్ప మరి దేన్నీ కొనలేడు. మరోవైపు, శ్రమశక్తి సహాయంతో సరుకులను సృష్టించేందుకు ఉత్పత్తి సాధనాలను వినియోగించడం ద్వారా తప్ప మరే విధంగానూ శ్రమశక్తిని పెట్టుబడిదారు వాడుకోజాలడు. కాబట్టి ప్రథమ దశ ఫలితం, రెండవ దశలోకి – పెట్టుబడి యొక్క ఉత్పాదక దశలోకి ప్రవేశించడమే.

ఈ గమనాన్ని డబ్బు–సరుకు < శ్రమ / ఉ.సా. .... ఉ.పె. సూచిస్తుంది. పెట్టుబడి వర్తుల గమనం కొనసాగుతున్నప్పటికీ, దాని చలామణికి అంతరాయం కలిగిందని ఇందులోని చుక్కలు సూచిస్తున్నాయి. పెట్టుబడి ఇప్పుడు సరుకుల చలామణి రంగం నుంచి ఉత్పత్తి రంగంలోకి ప్రవేశించినందువల్ల దాని చలామణి ఆగిపోయింది. కాబట్టి మొదటి దశ, అంటే డబ్బు పెట్టుబడి ఉత్పాదక పెట్టుబడిగా పరివర్తన చెందే దశ రెండవ దశకు, అంటే ఉత్పాదక పెట్టుబడి క్రియకు ప్రవేశిక మాత్రమే.

డబ్బు–సరుకు < శ్రమ / ఉ.సా. క్రియను నిర్వహిస్తున్న వ్యక్తివద్ద వినియోగానికున్న విలువలు ఏదో ఒక ఉపయోగపు రూపంలో వుండటమే కాక, డబ్బు రూపంలో కూడా వున్నాయని ఆ క్రియలో గర్భితం. అంటే అతడు డబ్బు కలవాడన్న మాట. కానీ, ఈ క్రియ డబ్బును ఇచ్చివేయడం కాబట్టి, ఆ ఇచ్చివేయటంలో డబ్బు తిరిగి వస్తుందనేది అంతర్గర్భితమైతేనే ఆ వ్యక్తి డబ్బు కలవాడుగా నిలవగలడు. కానీ సరుకుల అమ్మకం ద్వారా మాత్రమే డబ్బు అతనికి తిరిగి వస్తుంది. కాబట్టి పై క్రియలో అతను సరుకుల ఉత్పత్తిదారుడన్న భావం ఊహ్యం.

డబ్బు–శ్రమ వేతన కార్మికుడు తన శ్రమశక్తిని అమ్ముకోవడం ద్వారా మాత్రమే జీవిస్తాడు. ఆ శ్రమశక్తిని భద్రంగా ఉంచుకొనేందుకు – అతని స్వయంపోషణకు – దైనందిన వినియోగం అవసరం. కాబట్టి, దానికి చాలా స్వల్ప వ్యవధుల్లో, నిరంతరాయంగా, మూల్యం మళ్ళీ మళ్ళీ చెల్లించవలసి వుంటుంది. అప్పుడు మాత్రమే, అతడు శ్రమ–డబ్బు–సరుకు, లేక సరుకు–డబ్బు–సరుకు క్రియలను, అంటే స్వయంపోషణకు అవసరమైన కొనుగోళ్ళను మళ్ళీ మళ్ళీ చేయగలడు. ఈ కారణం వల్ల పెట్టుబడిదారు ఎల్లప్పుడూ డబ్బు పెట్టుబడిదారుగా, అతని పెట్టుబడి డబ్బు పెట్టుబడిగా వేతన

కార్మికుణ్ణి కలుసుకోవాలి. మరోవంక, వేతన కార్మికులు, ప్రత్యక్ష ఉత్పత్తిదారుల సందోహం శ్రమ–డబ్బు–సరుకు క్రియను నిర్వహించగలగాలంటే, అవసరమైన జీవనాధారాలు, కొనడానికి అర్హమైన రూపంలో, అంటే సరుకుల రూపంలో వారికి నిరంతరం అందుబాటులో వుండాలి. ఈ పరిస్థితి మూలంగా సరుకుల రూపంలో ఉత్పాదితాల చలామణి, ఉత్పత్తి అయిన సరుకుల పరిమాణమూ, ఉన్నత స్థాయిలో పెంపొందడం అవసరమవుతుంది. వేతన కార్మికుని ద్వారా జరిగే ఉత్పత్తి సార్వత్రిక మైనప్పుడు, సరుకు ఉత్పత్తి సర్వసాధారణ రూపం కాకతప్పదు. ఈ విధమైన ఉత్పత్తి పద్ధతి సర్వ సాధారణమైతే, దాని వెనువెంటనే, సామాజిక శ్రమ విభజన అంతకంతకు పెంపొందుతుంది. అంటే, ఒక నిర్దిష్ట పెట్టుబడిదారు సరుకుల రూపంలో ఉత్పత్తి చేసే వస్తువుల వైవిధ్యం అంతకంతకు పెరుగుతుంది. ఉత్పాదన పూరక ప్రక్రియలుగా వున్నవి, అంతకంతకు ఎక్కువగా స్వతంత్ర ప్రక్రియలుగా విభజితమవుతాయి. కాబట్టి, డబ్బు–ఉ.సా. కూడా డబ్బు–శ్రమ అంతగానే అభివృద్ధి చెందుతుంది. అంటే, ఉత్పత్తి సాధనాల ఉత్పత్తి, అవి ఏ సరుకులకైతే ఉత్పత్తి సాధనాలో, వాటి ఉత్పత్తి నుంచి, ఆ మేరకు వేరైపోతుంది. అప్పుడు ఉత్పత్తి సాధనాలు, సరుకుల యొక్క ప్రతి ఉత్పత్తిదారునికి సరుకులుగా ఎదురవుతాయి. వాటిని అతడు తన ప్రత్యేక ఉత్పత్తి ప్రక్రియ కోసమై కొంటాడే తప్ప, తను ఉత్పత్తి చేయడు. అవి అతని సొంత ఉత్పత్తి శాఖ నుంచి పూర్తిగా వేరైపోయి, స్వతంత్రంగా, పనిచేసే ఉత్పత్తి శాఖల నుంచి వచ్చి, అతని శాఖలోకి సరుకులుగా ప్రవేశిస్తాయి. కాబట్టి వాటిని కొనక తప్పదు. సరుకుల ఉత్పత్తి తాలూకు భౌతిక పరిస్థితులు, ఇతర సరుకుల ఉత్పత్తిదారుల ఉత్పాదితాలుగా, సరుకులుగా అతనికి ఎదురవుతాయి. అదే మేరకు పెట్టుబడిదారు డబ్బు పెట్టుబడిదారు పాత్ర వహించాల్సి వుంటుంది. వేరు మాటల్లో చెప్పాలంటే, అతని పెట్టుబడి, డబ్బు పెట్టుబడి విధులను నిర్వహించవలసిన స్థాయి హెచ్చుతుంది.

మరోవంక, పెట్టుబడిదారీ ఉత్పత్తికి మూలవసరమైన వేతన కార్మిక వర్గపు ఉనికికి కారణభూత మైన పరిస్థితులే సమస్త సరుకు ఉత్పత్తీ, పెట్టుబడిదారీ ఉత్పత్తిగా మారటానికి దోహదం చేస్తాయి. పెట్టుబడిదారీ ఉత్పత్తి అభివృద్ధి చెందేకొద్దీ, దాని ప్రభావం పాత ఉత్పాదక రూపాలను శిథిలం చేస్తుంది, అంతరింపజేస్తుంది. ఈ పాత రూపాలు ఎక్కువ భాగం, ఉత్పత్తిదారుని అవసరాలను తీర్చడానికి ఉద్దేశించినవైనందున, అవి తీరగా మిగిలిన ఉత్పత్తిని మాత్రమే సరుకులుగా మార్చుతుంది. పెట్టుబడిదారీ ఉత్పత్తి మొదట్లో ఉత్పత్తి పద్ధతినే ప్రభావితం చేస్తున్నట్లు కనిపించదు. ఉత్పాదితాల అమ్మకంపైనే దాని ప్రధాన ఆసక్తి. ఉదాహరణకు చైనా, ఇండియా, అరబ్ తదితర దేశాలపై పెట్టుబడిదారీ ప్రపంచ వాణిజ్యం మొదట్లో నెరిపిన ప్రభావం అలాగే వుండేది. కాని, పెట్టుబడిదారీ ఉత్పత్తి ఎక్కడెక్కడ వేరూనుతుందో అక్కడ అది, ఉత్పత్తిదారుల స్వయం ఉపాధిపై గాని, కేవలం అదనపు ఉత్పాదితాలను మాత్రమే సరుకులుగా అమ్మడంపై గానీ ఆధారపడిన సరుకు ఉత్పత్తి రూపాలన్నిటినీ నాశనం చేస్తుంది. పెట్టుబడిదారీ ఉత్పత్తి సరుకుల ఉత్పత్తిని మొదట సర్వసాధారణమైనదిగా చేసి, తరువాత మెట్టు మెట్టుగా సమస్త సరుకు ఉత్పత్తినీ పెట్టుబడిదారీ సరుకు ఉత్పత్తిగా మార్చుతుంది.[1]

ఉత్పత్తి సామాజిక రూపమేదైనప్పటికీ, శ్రామికులు, ఉత్పత్తి సాధనాలు ఎల్లప్పుడూ ఉత్పత్తి

1. రాతప్రతి VII ముగింపు, రాతప్రతి VI ప్రారంభం - ఫ్రెడరిక్ ఎంగెల్స్.



కారకాలుగా ఉంటున్నమాట నిజం. కానీ ఇవి ఒకదాని నుండి ఒకటి వేర్వేరై వున్న స్థితిలో సంభావ్యతా కారకాలుగా వుండగల అవకాశం మాత్రమే వుంది. ఉత్పత్తి అసలు సాగడానికి అవి ఏకం కావాలి. ఈ సంయోగం జరిగే నిర్దిష్ట రీతి, సమాజ నిర్మాణ స్వరూపానికి సంబంధించిన భిన్న ఆర్థిక శకాలను ఒకదాని నుండి మరొకదాన్ని వేరు చేసి చూపుతుంది. ప్రస్తుత సందర్భంలో ఉత్పత్తి సాధనాల నుంచి స్వేచ్ఛాయుతుడైన కార్మికుని వేర్పాటు, నిర్ణీతమైన ప్రారంభ దశ. ఈ రెండు మూలాంశాలు పెట్టుబడిదారు చేతిలో ఎలా, ఏ పరిస్థితుల్లో ఏకమయ్యాయో చూశాము. అవి అతని పెట్టుబడి ఉత్పాదకశీల అస్తిత్వంలో వుండే తీరుగా ఏకమవుతాయి. కాబట్టి సరుకు ఉత్పత్తి చేసే వ్యక్తులను, పదార్థాలను ఒకచోటికి తెచ్చినపుడు అవి ప్రారంభించే ప్రక్రియే పెట్టుబడి క్రియ. అంటే పెట్టుబడిదారీ ఉత్పత్తి ప్రక్రియ అవుతుంది. దీని స్వభావాన్ని ఈ గ్రంథం మొదటి సంపుటిలో పూర్తిగా విశ్లేషించాము. సరుకుల ఉత్పత్తిలో నిమగ్నమైన ప్రతి వ్యాపారమూ అదే సమయంలో శ్రమశక్తిని దోపిడీ చేసే వ్యాపారమవుతుంది. కానీ సరుకుల పెట్టుబడిదారీ ఉత్పత్తి మాత్రమే ఒక నూతన యుగారంభకమైన దోపిడీ అయింది; ఇది, తన చారిత్రక పరిణామ గతిక్రమంలో, శ్రమ ప్రక్రియ వ్యవస్థీకరణ ద్వారా, సాంకేతిక పద్ధతులను బ్రహ్మాండంగా అభివృద్ధి చేయడం ద్వారా సమాజపు ఆర్థిక నిర్మాణాన్ని మొత్తంగా విప్లవీకరించింది. మునుపటి యుగాలన్నీ వెలవెలపోయేలా ఈ విప్లవీకరణ జరిగింది.

ఉత్పత్తి సాధనాలూ, శ్రమశక్తీ ముందుగా మదుపు పెట్టిన పెట్టుబడి విలువ యొక్క అస్తిత్వ రూపాలుగా వున్న మేరకు అవి, ఉత్పాదక ప్రక్రియ సందర్భంగా జరిగే విలువ సృష్టిలో, కాబట్టి, అదనపు విలువ సృష్టిలో కూడా భిన్న పాత్రలను – స్థిర పెట్టుబడి, అస్థిర పెట్టుబడి పాత్రలను వహిస్తున్నాయి. ఈ పాత్రలు వాటిని వేరు చేసి చూపుతున్నాయి. ఉత్పాదక పెట్టుబడిలోని భిన్న భాగాలైన ఉత్పత్తి సాధనాలకు శ్రమశక్తికీ మధ్య భేదాన్ని కనపరచే మరో విషయం కూడా వుంది. అదేమిటంటే, పెట్టుబడిదారు అధీనంలో వున్న ఉత్పత్తి సాధనాలు ఉత్పత్తి ప్రక్రియ వెలుపల అతని పెట్టుబడిగానే వుండగా, శ్రమశక్తి ఈ ప్రక్రియలో మాత్రమే ఒక వ్యష్టి పెట్టుబడి అస్తిత్వ రూపమవుతుంది. శ్రమశక్తి దాని అమ్మకందారైన కార్మికుని చేతిలో మాత్రమే ఒక సరుకుగా వుంది. కానీ దాని కొనుగోలుదారు చేతిలో, అంటే, దాన్ని తాత్కాలికంగా వినియోగించే హక్కును సంపాదించిన పెట్టుబడి దారు చేతిలో మాత్రమే అది పెట్టుబడి అవుతుంది. ఉత్పాదక పెట్టుబడి వైయక్తిక రూపమైన శ్రమశక్తి తమలో నిక్షిప్తం కాగలిగే వరకు ఉత్పత్తి సాధనాలు ఉత్పాదక పెట్టుబడి యొక్క పాదార్థిక రూపాలు కావు. అంటే ఉత్పాదక పెట్టుబడి కావు. కాబట్టి ఉత్పత్తి సాధనాలలాగానే మానవుని శ్రమశక్తి కూడా స్వభావతః పెట్టుబడి కాదు. కనుక చారిత్రకంగా అభివృద్ధి చెందిన పరిస్థితుల్లో విలువైన లోహాలపై డబ్బు లక్షణం, డబ్బుపై డబ్బు పెట్టుబడి లక్షణం ముద్రితమైనట్లుగానే, అటువంటి పరిస్థితుల్లో మాత్రమే శ్రమశక్తి, ఉత్పత్తి సాధనాలు ఈ నిర్దిష్ట సామాజిక లక్షణాన్ని సంతరించుకొంటాయి.

ఉత్పాదక పెట్టుబడి, తన విధులను నిర్వర్తించడంలో, తన అంతర్భాగాలను మరింత ఎక్కువ విలువ గల ఉత్పాదితాల సముదాయంగా మార్చేందుకై, వాటిని వినియోగం చేస్తుంది. శ్రమశక్తి ఈ పెట్టుబడిలోని ఒక అంగంగా మాత్రమే వ్యవహరిస్తుంది. కాబట్టి, ఉత్పాదక పెట్టుబడి అంతర్భాగ మూలాంశాల విలువకు మించి, అదనపు శ్రమ ఉత్పత్తి చేసే వస్తువుల యొక్క అదనపు విలువ కూడా పెట్టుబడి ఫలితం. శ్రమశక్తి యొక్క అదనపు శ్రమ, పెట్టుబడి కోసం చేసిన ఉచిత శ్రమ

అవుతుంది. ఆ విధంగా అది పెట్టుబడిదారుని అదనపు విలువ అవుతుంది. సమాన ప్రతిఫలం చెల్లించకుండా అతనికి లభ్యమైన విలువ కాబట్టి ఆ ఉత్పాదితం ఒక సరుకు మాత్రమే కాదు, అదనపు విలువ గర్భంలోగల సరుకు కూడా. దాని విలువ ఉత్పాదక పెట్టుబడి + అదనపు విలువ సమానం; అంటే, సరుకు ఉత్పత్తిలో వినియోగమైన ఉత్పాదక పెట్టుబడి ప్లస్ అది సృష్టించిన అదనపు విలువకు సమానం. ఈ సరుకు 10,000 పౌనుల తూకం నూలు అనీ, ఈ పరిమాణం గల నూలును తయారు చేయడంలో 372 పౌండ్ల సొమ్ము విలువ గల ఉత్పత్తి సాధనాలు, 50 పౌండ్ల సొమ్ము విలువ గల శ్రమశక్తి వినియోగమయిందని అనుకొందాం. నూలు వడికే ప్రక్రియ సందర్భంగా, కార్మికులు తమ శ్రమ వినియోగించిన ఉత్పత్తి సాధనాల విలువను, అంటే 372 పౌండ్ల విలువను నూలుకు బదలాయించారు. అదే సమయంలో, తాము వ్యయం చేసిన శ్రమశక్తికి అనుగుణమైన కొత్త విలువను సృష్టించారు. ఈ కొత్త విలువ 128 పౌండ్లని అనుకొందాం. కాబట్టి 10,000 పౌనుల నూలు విలువ 500 పౌండ్లు.

## III. మూడవ దశ. సరుకు - డబ్బు

సరుకులు, అదివరకే అదనపు విలువను ఉత్పత్తి చేసిన పెట్టుబడి విలువ అస్తిత్వపు క్రియా రూపమైన సరుకు పెట్టుబడి విలువ (సరుకు రూపంలోని పెట్టుబడి – సరుకు పెట్టుబడి) అవుతాయి. అసలు ఉత్పాదన ప్రక్రియ నుంచి ప్రత్యక్షంగా ఈ రూపం ఉత్పన్నమవుతుంది. సరుకుల ఉత్పత్తి సమాజంలో సర్వత్రా పెట్టుబడిదారీ పద్ధతిలోనే జరిగినట్లయితే, సరుకులన్నీ – అవి ముడి ఇనుమైనా బ్రస్సెల్స్ జల్తారైనా, సల్ఫ్యూరిక్ యాసిడైనా లేక చుట్టలైనా – ఆది నుంచే సరుకు పెట్టుబడి మూలకాలవుతాయి. అసంఖ్యాక సరుకుల్లో ఏ విధమైన సరుకులు స్వభావతః పెట్టుబడి స్థాయినందుకొంటాయి, ఏ ఇతర రకాలు మామూలు సరుకులవుతాయి అనే సమస్య విశ్వవిద్యాలయాల రాజకీయ అర్థశాస్త్రం తనకు తానై సృష్టించుకొన్న ముచ్చటైన చిక్కుల్లో ఒకటి.

సరుకుల రూపంలోని పెట్టుబడి, సరుకుల విధిని నిర్వర్తించవలసి వుంటుంది. పెట్టుబడిగా వున్న వస్తువులు ప్రత్యేకించి మార్కెట్ కోసం ఉత్పత్తి అవుతాయి. అవి అమ్మకమై డబ్బుగా పరివర్తన చెందాలి; కాబట్టి సరుకు–డబ్బు ప్రక్రియకు లోనుకావాలి.

పెట్టుబడిదారుని సరుకు 10,000 పౌనుల నూలు అని అనుకొందాం. వడికే ప్రక్రియలో వినియోగమైన ఉత్పత్తి సాధనాల విలువ 372 పౌండ్లు, కొత్తగా సృష్టి అయిన విలువ 128 పౌండ్లు అయితే, ఈ నూలు విలువ 500 పౌండ్లు అవుతుంది. ఈ విలువను దాని ధరగా చెబుతాము. ఈ ధర సరుకు–డబ్బు ద్వారా, అంటే దాని అమ్మకం ద్వారా చేతికందుతుందని అనుకొందాం. సమస్త సరుకు చలామణికి సంబంధించిన ఈ సామాన్య క్రియను, అదే సమయంలో పెట్టుబడి క్రియగా చేస్తున్నదేమిటి? దానిలో అంతర్గతంగా సంభవించిన మార్పు కాదు; ఆ సరుకు ఉపయోగపు స్వభావంలో మార్పులేదు. ఎందువల్లనంటే అది కొనుగోలుదారు చేతిలోకి ఉపయోగకర వస్తువుగానే వెడుతుంది; దాని విలువలో మార్పు లేదు; ఎందువల్లనంటే, దాని విలువ యొక్క పరిమాణంలో మార్పు రాలేదు. మారిందల్లా దాని రూపమే. మొదట అది నూలు రూపంలో వుండింది. ఇప్పుడేమో అది డబ్బు రూపంలో వుంది. కాబట్టి, మొదటి దశ డబ్బు–సరుకుకూ, ఆఖరు దశ సరుకు–డబ్బుకూ మధ్య

గణనీయమైన భేదం కనిపిస్తుంది. అక్కడ మదుపుపెట్టిన డబ్బు, డబ్బు పెట్టుబడిగా పని చేస్తుంది. ఎందువల్లనంటే, అది చలామణి ద్వారా ఒక నిర్దిష్టమైన ఉపయోగ విలువ గల సరుకులుగా పరివర్తన చెందింది. ఇక్కడ, సరుకుల చలామణి ప్రారంభం కావడానికి ముందు, అవి ఉత్పత్తి ప్రక్రియ నుంచి ఈ స్వభావాన్ని పూర్తిగా తయారైన రూపంలో తను వెంట తెచ్చుకొన్న మేరకే పెట్టుబడిగా ఉపయోగ పడగలవు. వడికే ప్రక్రియ సందర్భంగా కార్మికులు 128 పౌండ్ల మొత్తం మేరకు నూలు విలువను సృష్టిస్తున్నారు. ఈ మొత్తంలో 50 పౌండ్లు కేవలం శ్రమశక్తికై పెట్టుబడిదారు వెచ్చించిన మొత్తానికి సమానమనీ, 78 పౌండ్లు అదనపు విలువ అనీ అనుకొందాం. (శ్రమశక్తిని దోపిడీ చేసే స్థాయి 156 శాతంగా వున్న స్థితిలో) కాబట్టి మొదటి విషయం, 10,000 పౌనుల నూలు విలువలో, వినియోగమైన ఉత్పాదక పెట్టుబడి ఉ.పె. విలువ మూర్తిమంతమై వుంది. ఇందులో స్థిర పెట్టుబడి విలువ 372 పౌండ్లు, అస్థిర పెట్టుబడి విలువ 50 పౌండ్లు. వాటి మొత్తం 422 పౌండ్లు. కాబట్టి ఇది 8,440 పౌనుల నూలుకు సమానం. మరి, ఉత్పాదక పెట్టుబడి విలువ ఉ.పె. దాని అంతర్భాగాలయిన మూలాంశాల విలువ అయిన సరుకుకు సమానం. ఇవి డబ్బు-సరుకు దశలో వాటి అమ్మకందారుల చేతిలోని సరుకులుగా పెట్టుబడిదారు ముందుకు వచ్చాయి.

కానీ, రెండవ విషయమేమిటంటే, నూలు విలువలో 78 పౌండ్ల అదనపు విలువ వుంది. ఇవి 1,560 పౌనుల నూలుకు సమానం. కాబట్టి 10,000 పౌనుల నూలు విలువకు వ్యక్తీకరణ అయిన సరుకు అనేది సరుకు + $\Delta$ సరుకుకు లేక సరుకు + సరుకు యొక్క పెరుగుదలకు (ఇది 78 పౌండ్లు) సమానం. ఎందువల్లనంటే, ఇది మొదటి విలువ సరుకు వున్న సరుకు రూపంలోనే వుంది. ఈ పెరుగుదలను స.పె. అని పిలుద్దాం. కాబట్టి, 500 పౌండ్లకు సమానమైన 10,000 పౌనుల నూలు విలువను సరుకు + స.పె. చూపుతూంది. సరుకు + స.పె. = సరుకు. 10,000 పౌనుల నూలు విలువ అభివ్యక్తి అయిన సరుకును సరుకుగా మార్చేది, దాని విలువ యొక్క నిరపేక్ష పరిమాణం (500 పౌ) కాదు. ఎందుచేతనంటే, ఇతర సరుకుల రాశి విలువ యొక్క అభివ్యక్తిగా వున్న ఇతర సరుకు లాగానే, అందులో మూర్తిమంతమైన శ్రమ పరిమాణం దాన్ని నిర్ణయిస్తుంది. మరి అది దాని విలువ సాపేక్ష పరిమాణం; దాని ఉత్పత్తిలో వినియోగమైన పెట్టుబడి విలువ పరిమాణం ఉ.పె.తో పోల్చి చూడగా, దానికి గల విలువ పరిమాణం. దానిలో ఈ పెట్టుబడి విలువా, ఉత్పాదక పెట్టుబడి సరఫరా చేసిన అదనపు విలువా కలిసి వున్నాయి. ఈ విలువ, పెట్టుబడి విలువకన్నా ఎక్కువ. అదనపు విలువ స.పె. ఎంత వుందో ఆ మేరకు ఎక్కువ. '10,000 పౌనుల నూలు, ఈ అదనపు విలువచే విస్తృతమైన, పరిపుష్టమైన పెట్టుబడి విలువ యొక్క వాహిక. పెట్టుబడిదారీ ఉత్పత్తి ప్రక్రియ ఫలితమైనందు వల్లనే అది అలా వుంది. సరుకు ఒక విలువ సంబంధాన్ని వ్యక్తం చేస్తుంది. ఉత్పత్తి అయిన సరుకుల విలువకు, వాటి ఉత్పత్తికై వ్యయమైన పెట్టుబడి విలువకు గల సంబంధాన్ని వ్యక్తం చేస్తుంది. వేరు మాటల్లో చెప్పాలంటే, దాని విలువలో పెట్టుబడి విలువ, అదనపు విలువ కలిసి వున్నాయన్న వాస్తవాన్ని వ్యక్తం చేస్తుంది. 10,000 పౌనుల నూలు, ఇక్కడ సరుకు పెట్టుబడి అయిన సరుకుగా వుండటానికి ఏకైక కారణం, అది ఉత్పాదక పెట్టుబడి ఉ.పె. యొక్క పరివర్తిత రూపంగా వుండటం; కాబట్టి, తొలుత ఈ వ్యష్టి పెట్టుబడి ఆవృత్తికి సంబంధించి మాత్రమే, లేక తన పెట్టుబడి సహాయంతో ఈ నూలును ఉత్పత్తి చేసిన పెట్టుబడిదారుకు సంబంధించి మాత్రమే అది అలా వుందన్న

మాట. ఒక విధంగా చెప్పాలంటే, విలువకు వాహికగా వున్న స్థితిలో 10,000 పౌనుల నూలును సరుకు పెట్టుబడిగా మారుస్తున్నది, ఒక అంతర్గత సంబంధమే తప్ప బాహ్య సంబంధం కాదు. అది తన పుట్టుమచ్చను, తన విలువ నిరపేక్ష పరిమాణంలో కాక, దాని సాపేక్ష పరిమాణంలో వ్యక్తం చేస్తుంది. దానిలో మూర్తిమంతమైన ఉత్పాదక పెట్టుబడి సరుకులుగా మారక ముందు, దానికి గల విలువతో పోల్చి చూడగా ఆ నూలుకున్న విలువ పరిమాణంలో వ్యక్తం చేస్తుంది. కాబట్టి, ఈ 10,000 పౌనుల నూలు దాని విలువైన 500 పౌండ్లుకు అమ్మితే, ఈ చలామణి క్రియ – దాన్ని మాత్రమే తీసుకొని చూచినపుడు – అచ్చం సరుకు–డబ్బు వంటిదే. మార్పు చెందని ఒక విలువ సరుకు రూపం నుంచి డబ్బు రూపానికి కేవలం పరివర్తనే; కానీ ఒక వ్యష్టి పెట్టుబడి ఆవృత్తిలోని ఒక ప్రత్యేక దశగా అదే క్రియ, ఆ సరుకులో మూర్తిమంతమైన 422 పౌండ్ల పెట్టుబడి విలువా, అదే విధంగా దానిలో మూర్తిమంతమైన 78 పౌండ్ల అదనపు విలువా, ఈ రెండూ డబ్బుగా మారడమే. అంటే ఆ క్రియ సరుకు–డబ్బు అవుతుంది. సరుకు పెట్టుబడి దాని సరుకు రూపం నుంచి డబ్బు రూపానికి పరివర్తన అవుతుంది.[1]

ఇప్పుడు, సరుకు విధి సమస్త సరుకులు నిర్వర్తించే విధే; అంటే, డబ్బుగా మారడం, అమ్మబడటం, చలామణి దశ సరుకు–డబ్బును గడిచి వెళ్ళడం. పెట్టుబడి ఇప్పుడు విస్తృతి పొందింది. ఇది సరుకు పెట్టుబడి రూపంలో వున్నంత కాలం, మార్కెట్‌లో నిశ్చలంగా పడి వున్నంత కాలం, ఉత్పాదన ప్రక్రియ నిద్రాణంగా వుంటుంది. సరుకు పెట్టుబడి ఉత్పాదితాలనూ సృష్టించజాలదు, విలువనూ సృష్టించజాలదు. సరుకు పెట్టుబడి తన సరుకు రూపాన్ని విసర్జించి, డబ్బు రూపం ధరించే నిర్దిష్ట వేగాన్ని బట్టి, అంటే అమ్మకాలు జరిగే వేగాన్ని బట్టి, ఆ పెట్టుబడి బహువిధ స్థాయిల్లో, ఉత్పాదితాల స్రష్టగా, విలువ స్రష్టగా పనిచేస్తుంది. ఆ వేగాన్ని బట్టి పునరుత్పత్తి పరిధి విస్తృతం కావడమో, లేదా కుంచించుకుపోవడమో జరుగుతుంది. ఏ పెట్టుబడిని తీసుకొని చూసినా, దాని సామర్థ్యం ఉత్పాదన ప్రక్రియకు గల అవకాశాలపై ఆధారపడి వుంటుందని, వీటికి ఆ పెట్టుబడి విలువ పరిమాణంతో కొంత మేరకు ప్రమేయం లేదని I వ సంపుటంలో నిరూపించాము.[2] చలామణి క్రియ పెట్టుబడి విలువ పరిమాణంతో నిమిత్తం లేని కొత్త శక్తులను ప్రచలితం చేస్తుందనీ, అవి ఆ పెట్టుబడి సామర్థ్యం స్థాయినీ, దాని పెరుగుదల, తగ్గుదలలను నిర్ణయిస్తాయనీ ఆక్కడ అగుపిస్తుంది.

విస్తరించిన పెట్టుబడికి సరుకుల రాశి సరుకు వాహికగా వున్నందువల్ల అది మొత్తంగా, తదనంతరం, రూప పరివర్తన అయిన సరుకు–డబ్బుకు లోనుకావాల్సి వుంటుంది. ఇక్కడ అమ్మకమైన సరుకు రాశి ప్రధానమైన నిర్ణాయకం. విడి విడి సరుకు, మొత్తం రాశిలోని అంతర్భాగంగా మాత్రమే వ్యవహరిస్తుంది. 500 పౌండ్ల విలువ వున్నది, 10,000 పౌనుల నూలులో, పెట్టుబడిదారు 7,440 పౌనుల నూలును మాత్రమే వాటికున్న విలువకు అమ్మగలిగితే, అతను తన స్థిర పెట్టుబడి విలువను, వ్యయమైన ఉత్పత్తి సాధనాల విలువను భర్తీ చేసుకొన్నాడన్న మాట. అతను 8,440 పౌనుల నూలును అమ్మితే, తాను ముందుగా మదుపు పెట్టిన మొత్తం పెట్టుబడిని తిరిగి రాబట్టుకొన్నాడన్న మాట. అదనపు విలువలో కొంత చేతికందాలంటే, అతను ఇంకా ఎక్కువ నూలు అమ్మాలి. మొత్తం అదనపు

1. రాతప్రతి VI ముగింపు, రాతప్రతి V ప్రారంభం - ఫ్రెడరిక్ ఎంగిల్స్.
2. ఇంగ్లీషు కూర్పు : కార్ల్‌మార్క్స్, పెట్టుబడి, సం. I పుటలు 602 - 08. సం.

విలువ అయిన 78 పౌండ్లు (1,560 పౌనుల నూలు) డబ్బుగా తన చేతికందాలంటే, అతను మొత్తం 10,000 పౌనుల నూలును అమ్మాలి. 500 పౌండ్ల డబ్బులో అతనికి అందుతున్నది, అమ్మిన సరుకుకు ఒక సమతుల్యమైనది మాత్రమే. చలామణిలో ఈ కార్యం కేవలం సరుకు–డబ్బు అవుతుంది. అతను తన కార్మికులకు 50 పౌండ్లు కాకుండా, 64 పౌండ్లు చెల్లించి వున్నట్లయితే, అప్పుడు అతని అదనపు విలువ 78 పౌండ్లకు బదులు 64 పౌండ్లే అయ్యేది. దోపిడీ స్థాయి 156 శాతం కాక 100 శాతం మాత్రమే వుండేది. కానీ నూలు విలువ మాత్రం మారదు. దాని అంతర్భాగాల మధ్య సంబంధం మాత్రం భిన్నంగా వుంటుంది. అప్పటికీ కూడా చలామణి క్రియ సరుకు–డబ్బు వ్యక్తం చేస్తున్నది, 10,000 పౌనుల నూలు 500 పౌండ్లకు అంటే దాని విలువకు అమ్మకమయిందనే.

సరుకేమో, సరుకు + సపెకు (లేక 422 పౌండ్లు ప్లస్ 78 పౌండ్లు) సమానం. సరుకు ఉత్పాదక పెట్టుబడి ఉ.పె.కు సమానం. ఇది, ఉత్పత్తి మూలకాల కొనుగోలు అయిన డబ్బు–సరుకులో మదుపు పెట్టిన డబ్బు విలువకు సమానం. మనం పేర్కొన్న ఉదాహరణలో ఈ మొత్తం 422 పౌండ్లు. మొత్తం సరుకు దాని విలువకు అమ్మినట్లయితే, సరుకు 422 పౌండ్లకు సమానం. స.పె. 78 పౌండ్లకు, అంటే అదనపు ఉత్పాదితమైన 1,560 పౌనుల నూలు విలువకు సమానం. స.పె.ను డబ్బు రూపంలో వ్యక్తం చేసినప్పుడు దాన్ని ధ అని పిలుద్దాం. అప్పుడు స'–డ' = (స + సపె) – (డ+ధ). ఇక డ–స .... ఉపె... స'–డ' అనే ఆవృత్తి విస్తృత రూపానికి డ–స < శ్రమ / ఉ.సా. ....ఉపె.... (స+సపె) – (డ+ధ) ప్రాతినిధ్యం వహిస్తుంది.

మొదటి దశలో పెట్టుబడిదారు వినియోగ వస్తువులను అసలైన సరుకుల మార్కెట్ నుంచీ, శ్రామిక మార్కెట్ నుంచీ తీసుకొస్తాడు. మూడవ దశలో, సరుకులను మళ్ళీ మార్కెట్‌లో వుంచుతాడు. కానీ అలా వుండేది ఒక మార్కెట్‌లోనే. అది అసలు సరుకుల మార్కెట్. కానీ అతను మొదట మార్కెట్‌లో వుంచిన దానికన్నా ఎక్కువ విలువను, తన సరుకుల ద్వారా రాబడతాడు. దీనికి ఒకే ఒక కారణముంది – తాను మొదట తెచ్చుకొన్నదాని కన్నా ఎక్కువ సరుకు విలువను మళ్ళీ దానిలో ఉంచుతాడు. దానిలో విలువ 'డ' ను వుంచి, దానికి సమతుల్యమైన 'స' ను తెచ్చుకొంటాడు; దానిలో మళ్ళీ స + సపెను వుంచి దానికి సమతుల్యమైన డ + ధను తీసుకొంటాడు.

మన ఉదాహరణలో డ 8,440 పౌనుల నూలు విలువకు సమానం. కానీ అతను మార్కెట్‌లో 10,000 పౌనుల నూలును వుంచుతాడు. కాబట్టి, అతను మార్కెట్ నుంచి తెచ్చుకొన్న దానికన్నా ఎక్కువ విలువను దానిలో తిరిగి వుంచుతున్నాడు; అయితే, అతను మార్కెట్‌లో అధికతర విలువను వుంచాడంటే, ఉత్పాదన ప్రక్రియలో శ్రమశక్తిని దోచుకోవడం ద్వారా అతను అదనపు విలువను సృష్టించి వుండటమే అందుకు కారణం. (ఈ విలువ అదనపు ఉత్పాదితంగా అభివ్యక్తమయ్యే ఉత్పాదిత భాగం) సరుకుల రాశి వరకు పెట్టుబడిగా, విస్తరించిన పెట్టుబడి విలువ వాహికగా రూపొందేది, అది ఈ ప్రక్రియ ఉత్పాదితంగా వున్నందువల్లనే. సరుకు–డబ్బు క్రియను నిర్వర్తించడం ద్వారా, మదుపు పెట్టిన పెట్టుబడి విలువా, అదనపు విలువా డబ్బు రూపంలో చేతికందుతాయి. అమ్మకాల పరంపరలో, లేదా ఒకేసారి మొత్తం సరుకుల రాశి అమ్మకం కావడంలో ఈ రెండూ ఏకకాలంలో ఇలా చేతికందుతాయి. దీన్ని సరుకు–డబ్బు వ్యక్తం చేస్తుంది. కానీ అదే చలామణి

క్రియ స' – డ' పెట్టుబడి విలువకు ఒక విధంగానూ, అదనపు విలువకు మరో విధంగానూ వుంటుంది. ఎందువల్లనంటే, అది ఆ రెంటిలో ప్రతిదాని చలామణి యొక్క భిన్న దశను వ్యక్తంచేస్తుంది. అంటే చలామణి రంగంలో అవి గడపవలసిన రూప పరివర్తనా పరంపరలలో వేరు వేరు విభాగాన్ని వ్యక్తం చేస్తుంది. ఉత్పత్తి ప్రక్రియలోనే అదనపు విలువ స.పె. ప్రాదుర్భవించింది. అది మొదటిసారిగా సరుకు మార్కెట్‌ను సరుకుల రూపంలో సాక్షాత్కరించింది. ఇది దాని చలామణి మొదటి రూపం. కాబట్టి సపె–ధ దాని మొదటి చలామణి క్రియ. లేక దాని మొదటి రూప పరివర్తన. ఇది తద్విరుద్ధ చలామణి క్రియతో, అంటే అపరివర్తనా క్రియ వివర్తన అయిన (Reverse Metamorphosis) ధ–సపెతో పరిపూర్తి కావలసి వుంటుంది.[1]

అదే చలామణి క్రియ సరుకు–డబ్బులో పెట్టుబడి విలువ సరుకు నిర్వర్తించే చలామణి ఇందుకు భిన్నమైనది. ఇది దాని విషయంలో సరుకు–డబ్బు చలామణి క్రియే. దీనిలో సరుకు అన్నది ఉ.పె.కు సమానం, మొదట్లో మదుపు పెట్టిన డబ్బుకు సమానం. పెట్టుబడి విలువ తన మొదటి చలామణి క్రియను డబ్బు రూపంలో, డబ్బు పెట్టుబడి రూపంలో నిర్వర్తించి, సరుకు–డబ్బు క్రియ ద్వారా అదే రూపాన్ని తిరిగి ధరిస్తుంది. కాబట్టి, అది రెండు విరుద్ధ చలామణి దశలను – మొదట సరుకు–డబ్బును, రెండవసారి సరుకు–డబ్బును గడచి వచ్చింది. అది మళ్ళీ తన వర్తుల గమనాన్ని ప్రారంభించ వీలున్న తన తొలి రూపంలో వుందన్నమాట. అదనపు విలువ విషయంలో, సరుకు రూపం నుంచి డబ్బు రూపానికి మొదటి పరివర్తనగా వున్నది. పెట్టుబడి విలువ విషయంలో దాని వివర్తనగా (return) వుంది. అంటే తన మునుపటి డబ్బు రూపానికి పునఃపరివర్తనగా వుంది.

డబ్బు–సరుకు < శ్రమ / ఉ.సా. ద్వారా డబ్బు పెట్టుబడి తత్ సమతుల్యమైన సరుకుల రాశిగా, అంటే, శ్రమగానూ, ఉ.సా.గాను మారుతుంది. ఈ సరుకులు ఇక సరుకుల విధులను, అంటే అమ్మకానికి ఉంచిన సరుకుల విధులను నిర్వహించవు. ఇప్పుడు వాటి విలువ, ఆ సరుకులను కొన్న పెట్టుబడిదారు చేతిలో వుంది. అవి అతని ఉత్పాదక పెట్టుబడి ఉ.పె. విలువగా వున్నాయి. ఉత్పాదక పెట్టుబడి ఉ.పె. నిర్వహించే క్రియలో, అంటే ఉత్పాదక వినియోగంలో అవి ఉత్పత్తి సాధనాలకు పాదార్థికంగా భిన్నమైన సరుకుగా, అంటే నూలుగా పరివర్తన చెందుతాయి. దీనిలో ఉత్పత్తి సాధనాల విలువ భద్రంగా నిక్షిప్తమై వుండటమే కాక, అది 422 పౌండ్ల నుంచి 500 పౌండ్లకు హెచ్చుతుంది కూడా. మొదటి దశ డబ్బు–సరుకులో మార్కెట్ నుంచి తీసుకొచ్చిన సరుకులకు బదులు, నిజమైన ఈ రూపపరివర్తన ద్వారా వాటికి భిన్నమైన వస్తుగుణమూ, విలువా గల సరుకులను మార్కెట్‌లో వుంచడం జరుగుతుంది. ఇప్పుడివి సరుకుల విధిని నిర్వర్తించాలి. డబ్బుగా మారాలి. అమ్ముడుకావాలి. కాబట్టి, ఉత్పాదన ప్రక్రియ పెట్టుబడి విలువ చలామణి ప్రక్రియలో కేవలం ఒక అంతరాయంగా మాత్రమే కనిపిస్తుంది. అప్పటి వరకు, పెట్టుబడి చలామణి ప్రక్రియ మొదటి దశ అయిన డబ్బు–సరుకును మాత్రమే గడిచి రావడం జరిగింది. సరుకు, వస్తు గుణంలోనూ, విలువలోనూ

1. మనం పెట్టుబడి విలువను ఏ విధంగా విడదీసినా, ఇదే వర్తిస్తుంది. 10,000 పౌనుల నూలులో 1,560 పౌనులు లేక, 78 పౌండ్ల అదనపు విలువ వుంది; అదే విధంగా ఒక పౌను నూలులో/ లేదా ఒక షిల్లింగు విలువ గల నూలులో 2.496 ఔన్సుల, లేదా 1.872 పెన్నీల అదనపు విలువ వుంది.

మారిన తరువాత, ఆ ప్రక్రియ రెండవదైన ఆఖరు దశ సరుకు–డబ్బును గడుస్తుంది. కాని, కేవలం పెట్టుబడి విలువనే తీసుకొని చూసినప్పుడు, ఉత్పాదన ప్రక్రియలో దాని ఉపయోగపు రూపం మాత్రమే మారింది. అది మునుపు 422 పౌండ్ల విలువ గల శ్రమశక్తి, ఉత్పత్తి సాధనాల (శ్ర. ఉ.సా.ల) రూపంలో ఉండగా, ఇప్పుడు 422 పౌండ్ల విలువ గల 8,440 పౌనుల నూలు రూపంలో వుంది. కాబట్టి పెట్టుబడి విలువ చలామణి యొక్క రెండు దశలను మాత్రమే, దాని అదనపు విలువతో నిమిత్తం లేకుండా పరిశీలిస్తే, అది రెండు దశలను 1) డబ్బు–సరుకును, 2) సరుకు–డబ్బును గడుస్తుందనీ, వాటితో రెండవ 'సరుకు' మొదటి 'సరుకు'కు భిన్నమైన ఉపయోగ రూపంలో వుంది. కానీ దాని విలువ మాత్రం అదే అనీ స్పష్టమవుతుంది. కాబట్టి అది గడిచివచ్చే చలామణి ప్రక్రియ డబ్బు–సరుకు–డబ్బులో సరుకు రెండుసార్లు, పరస్పర విరుద్ధ దిశలో స్థానం మారుస్తుంది. (డబ్బు సరుకులుగా పరివర్తన, ఆ సరుకులు మళ్ళీ డబ్బుగా పరివర్తన). కాబట్టి ఈ చలామణి రూపం వల్ల, డబ్బు రూపంలో మదుపు పెట్టిన విలువ మళ్లీ డబ్బు రూపాన్ని ధరించడం – ఆ విలువ తిరిగి డబ్బుగా మార్పు చెందడం అవసరమవుతోంది.

అదే సరుకు–డబ్బు చలామణి క్రియ, డబ్బు రూపంలో మదుపు పెట్టిన పెట్టుబడి విలువకు రెండవదీ, తుదిదీ అయిన రూప పరివర్తన, తిరిగి అది డబ్బు రూపాన్ని చేపట్టే క్రమం. ఈ చలామణి క్రియే అదనపు విలువకేమో దాని మొదటి రూప పరివర్తన అవుతుంది. సరుకు రూపం నుంచి డబ్బు రూపానికి పరివర్తన అవుతుంది. దాని చలామణి మొదటి దశ అయిన సరుకు–డబ్బు అవుతుంది. (ఈ అదనపు విలువను సరుకు పెట్టుబడే మోసుకెడుతుంది. ఆ సరుకు పెట్టుబడి డబ్బు రూపానికి మారినప్పుడే, దానితో పాటు ఇదీ డబ్బు రూపం ధరిస్తుంది).

కాబట్టి ఇక్కడ మనం రెండు రకాల వ్యాఖ్యలు చేయవలసి వుంది. మొదటిది, పెట్టుబడి విలువ తుదకు దాని మొదటి రూపమైన డబ్బు రూపానికి తిరిగి మారడం అనేది సరుకు పెట్టుబడి యొక్క విధి. రెండవది, ఈ విధిలో, అదనపు విలువ యొక్క మొదటి పరివర్తన కూడా చేరి వుంది. అది మొదట్లో ధరించిన సరుకు రూపం నుంచి డబ్బు రూపానికి మారుతుంది. కాబట్టి డబ్బు రూపం ఇక్కడ ద్వంద్వ పాత్రను నిర్వహిస్తోంది. ఒకవైపు, మొదట్లో డబ్బు రూపంలో మదుపు పెట్టిన ఒక విలువ తిరిగి ధరించే రూపమది. కాబట్టి, విలువ ఈ ప్రక్రియను ఏ రూపంతో ప్రారంభించిందో ఆ రూప పునర్ధారణ అది. మరోవైపు, సరుకు రూపంలో మొదటిసారిగా చలామణిలోకి ప్రవేశించిన ఒక విలువ ప్రథమ రూపాంతరమది. మనం ఊహించుకొన్నట్లు, సరుకు పెట్టుబడిగా వున్న సరుకులు వాటి విలువలకు అమ్మకమైతే, అప్పుడు సరుకు+స.పె. దాని సమతుల్యమైన డ+ధ గా మారుతుంది. డబ్బు రూపంలో చేతికందిన సరుకు పెట్టుబడి ఇప్పుడు అతని చేతిలో డ–ధ (422 పౌండ్లు + 78 పౌండ్లు = 500 పౌండ్లు) రూపంలో వుంటుంది. పెట్టుబడి విలువ, అదనపు విలువ ఇపుడు సమతుల్య సార్వత్రిక రూపమైన డబ్బు రూపంలో వున్నాయి.

కాబట్టి ఈ ప్రక్రియ పూర్తి అయ్యేటప్పటికి, దానిలో పెట్టుబడి విలువ ఏ రూపంతో ప్రవేశించిందో ఆ రూపమే తిరిగి ధరించింది. ఇప్పుడు డబ్బు పెట్టుబడిగా అది మళ్ళీ కొత్త ప్రక్రియను ప్రారంభించి దాన్ని ఆసాంతం గడిచి రాగలదు. ఈ ప్రక్రియ యొక్క తొలి, తుది రూపాలు డబ్బు పెట్టుబడి డబ్బు యొక్క ప్రక్రియలే కాబట్టి, ఈ చలామణి ప్రక్రియ రూపాన్ని డబ్బు పెట్టుబడి ఆవృత్తి అని అంటున్నాము.

ఇది ముగిసేటప్పటికి మారినది, మదుపు పెట్టిన విలువ పరిమాణమే తప్ప, దాని రూపం కాదు.

ద+ధ, ఒక నిర్దిష్ట పరిమాణం గల డబ్బు తప్ప మరేమీ కాదు. ప్రస్తుత సందర్భంలో అది 500 పౌండ్లు. కానీ పెట్టుబడి చలామణి ఫలితంగా, డబ్బు రూపంలో చేతికందిన సరుకు పెట్టుబడిగా, ఈ మొత్తంలో పెట్టుబడి విలువ, అదనపు విలువ వున్నాయి. కానీ నూలులోలాగా ఇప్పుడీ విలువలు అవిభాజ్యంగా ఐక్యమై లేవు. అవి పక్క పక్కనే వున్నాయి. వాటి అమ్మకం ఆ రెంటికీ ఒక స్వతంత్రమైన డబ్బు రూపం సంతరించి పెట్టింది. ఈ డబ్బులో 211/250 భాగం పెట్టుబడి విలువైన 422 పౌండ్లు; 39/250 భాగం అదనపు విలువైన 78 పౌండ్లు. సరుకు పెట్టుబడి డబ్బుగా చేతికందడం వల్ల జరిగిన ఈ వేర్పాటు, కేవలం రూపానికి సంబంధించిన విషయమొక్కటే కాదు. (ఆ సంగతి గురించి త్వరలోనే ప్రస్తావిస్తాము) పెట్టుబడి పునరుత్పత్తి ప్రక్రియలో, ఈ వేర్పాటు ప్రాముఖ్యం సంతరించుకొంటుంది. దతో ధను పూర్తిగా, లేక పాక్షికంగా కలిపి వేస్తారా, లేక అసలే కలిపి వేయరా అనేదానిపై, అది ఆధారపడి వుంటుంది. అంటే, ధ మదుపు పెట్టిన పెట్టుబడిలో అంతర్భాగంగా పనిచేస్తూనే వుంటుందా లేదా అనేదానిపై ఆధారపడి వుంటుందన్న మాట. ధ, ద రెండూ పూర్తిగా భిన్నమైన చలామణి ప్రక్రియలను గడపవచ్చు.

ద'లో, పెట్టుబడి తన మొదటి రూపమైన ద' రూపాన్ని, అంటే డబ్బు రూపాన్ని తిరిగి ధరించింది. కానీ పెట్టుబడి, పెట్టుబడిగా చేతికందని రూపమది.

మొదటి విషయం, పరిమాణం మారింది. అప్పుడది ద, 422 పౌండ్లు. ఇప్పుడది ద', 500 పౌండ్లు. ఈ భేదాన్ని ద....ద' వ్యక్తం చేస్తోంది. ఈ రెండూ ఆవృత్తికి పరిమాణ రీత్యా భిన్నమైన ఆద్యంతాలు. వీటి గమనాన్ని నాలుగు చుక్కలు సూచిస్తున్నాయి. ద'>ద, ద----ద= అవి, అదనపు విలువ. కానీ ఈ వర్తుల గమనం ద....ద' ఫలితంగా ఇప్పుడు ద' మాత్రమే వుంది. ఈ ఉత్పాదితంలో ఇది రూపొందిన క్రమం అంతరించింది. ఇప్పుడు ద' స్వతహాగా, తన ఉనికికి కారణభూతమైన గమనంతో నిమిత్తం లేకుండా నిలిచి వుంది. ఆ గమనం అంతరించింది. దాని స్థానంలో ద' వుంది.

అయితే ద' యేమో ద ప్లస్ ధ; అంటే, ముందుగా మదుపు పెట్టిన పెట్టుబడి 422 పౌండ్లు ప్లస్ దాని పెరుగుదల అయిన 78 పౌండ్లు కాబట్టి, అది ఒక గుణాత్మక సంబంధాన్ని కూడా చూపుతుంది. అయితే ఈ గుణాత్మక సంబంధం ఒకే మొత్తంలోని భాగాల మధ్య సంబంధంగా మాత్రమే, అంటే ఒక పరిమాణాత్మక సంబంధంగా ఉన్నప్పటికీ అది, అదే సమయంలో, గుణాత్మక సంబంధం కూడా. మదుపు పెట్టిన పెట్టుబడి ద ఇప్పుడు మరోసారి తన మొదటి రూపంలో (422 పౌండ్లు) ప్రత్యేకమైంది. అది డబ్బు రూపంలో తిరిగి చేతికందిన పెట్టుబడిగా వుంది. అది పదిలంగా వుండటమే గాక, ద.కు (78 పౌండ్లకు) భిన్నమైనదిగా పరిగణింపబడటం వల్ల పెట్టుబడిగా తిరిగి చేతికందింది. దానికి ధ.తో గల సంబంధం, తనదైన పెరుగుదలతో, తనదైన ఫలంతో, తాను ఉద్భవింపచేసిన పెరుగుదలతో దానికి గల సంబంధమే. విలువను సృష్టించిన విలువగా డబ్బు రూపంలో తిరిగి చేతికందింది. కాబట్టి అది, తిరిగి చేతికందిన పెట్టుబడి అన్నమాట. ద' ఒక పెట్టుబడి - సంబంధంగా రంగంపై వుంది. ద ఇప్పుడు కేవలం డబ్బుగా గోచరించదు. స్పష్టంగా డబ్బు పెట్టుబడి పాత్రను నిర్వహిస్తుంది. అది స్వయం విస్తృత విలువగా అభివ్యక్తమవుతుంది. కాబట్టి, స్వయం విస్తరణ లక్షణం గల విలువ పాత్రను, తనకు గల విలువకన్నా ఎక్కువ విలువను పొదిగే

పాత్రను నిర్వర్తిస్తుంది. డ, తాను ఉద్భవింప చేసిన డ' లోని ఇతర భాగంతో తనకు గల సంబంధాన్ని బట్టి పెట్టుబడి అయింది. డ'లోని ఆ ఇతర భాగం ఫలితమైతే, దానికి డ కారణం; అది పర్యవసానమైతే దానికి ప్రాతిపదిక డ. ఆ విధంగా డ' తనలోనే వేర్పడి వున్న విలువల సమాహారంగా, తనలోని విధి నిర్వహణ రీత్యా (భావనలో) దీనికి దాని ప్రత్యేకత గల విలువల సమాహారంగా రంగంపైకి వచ్చి, పెట్టుబడి సంబంధాన్ని వ్యక్తం చేస్తుంది.

కానీ విది దేని ఫలితమో ఆ ప్రక్రియ జోక్యం లేకుండా, కేవలం ఒక ఫలితంగా అభివ్యక్త మవుతూంది.

విలువలోని భాగాలు వివిధ వస్తువుల, నిర్దిష్ట శాల్తీల విలువలుగా గోచరవుతాయి. కాబట్టి, వివిధ ఉపయోగపు రూపాల్లో, తత్కారణంగా వేరు వేరు సరుకుల విలువలుగా కనిపిస్తాయి. అంతే తప్ప, విలువ భాగాలు గుణాత్మకంగా ఒకదానికొకటి భిన్నమైనవి కావు. వేరు వేరు సరుకుల విలువలుగా వాటి పరస్పర భిన్నత్వం, కేవలం విలువ భాగాలుగా ఉన్నందువల్ల ఉత్పన్నమైనది కాదు. సరుకుల మధ్య గల తేడాలన్నీ డబ్బులో అంతరించిపోతాయి. ఎందువల్లనంటే డబ్బు వాటన్నిటికీ ఉమ్మడిగా వున్న సమతుల్య రూపం. 500 పౌండ్ల మొత్తంలో ఏకరూపతగల పౌండ్లు 500 వున్నాయి. ఈ మొత్తం యొక్క కేవల అస్తిత్వంలో, దానికి మూలభూతమైన మధ్యంతర కొలుకులు తుడిచిపెట్టుక పోయాయి; ఉత్పత్తి ప్రక్రియలోని పెట్టుబడి యొక్క భిన్న అంతర్భాగాల మధ్య గల నిర్దిష్ట భేదం జాడ కూడా లేకుండాపోయింది. కాబట్టి 422 పౌండ్లకు సమానమైన అసలు మొత్తానికీ, అంటే మదుపు పెట్టిన పెట్టుబడికి, 78 పౌండ్ల అదనపు విలువకు మధ్య భావనాత్మక రూప భేదం మాత్రమే ఇప్పుడు మిగిలింది. డ' 110 పౌండ్లకు సమానమని, దీనిలో 100 పౌండ్లు డ కు, అంటే అసలుకు సమానమనీ, 10 పౌండ్ల అ.వి.కి, అంటే అదనపు విలువకు సమానమనీ అనుకొందాం. 110 పౌండ్ల మొత్తంలోని రెండు అంతర్భాగాల మధ్య సంపూర్ణమైన ఏకరూపత వుంది, భావనాత్మక భేదాలు లేవు. ఈ మొత్తంలో ఏ పది పౌండ్లు అయినా సరే 110 పౌండ్లు వెరసి మొత్తంలో ఎల్లప్పుడు 1/11వ భాగంగానే వుంటాయి – అవి మదుపు పెట్టిన 100 పౌండ్ల అసలులో 1/10వ భాగమైనా, లేక ఆ అసలుకు మించి మిగులుగా వున్న 10 పౌండ్లయినా. కాబట్టి, అసలునూ, మిగులు మొత్తాన్నీ అంటే పెట్టుబడినీ, అదనపు మొత్తాన్నీ మొత్తం డబ్బులో భాగాలుగా వ్యక్తం చేయవచ్చు. మన ఉదాహరణలో 10/11 అసలు లేదా పెట్టుబడి; 1/11 అదనపు మొత్తం. కాబట్టి, చేతికందిన పెట్టుబడిని డబ్బుగా వ్యక్తం చేసినప్పుడు, అది దాని ప్రక్రియ చివరిలో పెట్టుబడి సంబంధం యొక్క అసంబద్ధ అభివ్యక్తీకరణగా గోచరిస్తుంది.

ఇది స'కు (స+సపె) కూడా వర్తిస్తుంది నిజమే. కానీ ఒక్క తేడా వుంది : స' (దీనిలోని స, సపె ఏకరూపత గల ఒకే సరుకు రాశిలో కేవలం విలువ నైష్పత్తిక భాగాలు మాత్రమే) తనకు మూలమైన ఉపె ని, తాను దేని ప్రత్యక్ష ఉత్పాదితమో ఆ ఉపెని సూచించగా, చలామణి నుంచి నేరుగా నిష్పన్నమైన రూపంలో డ'లో, ఉపెతో దాని ప్రత్యక్ష సంబంధం తుడిచిపెట్టుక పోయింది.

డ'లో భాగాలైన అసలుకూ, పెరిగిన మొత్తానికీ మధ్యగల అసంబద్ధ భేదం, డ...డ' గమన ఫలితాన్ని వ్యక్తం చేస్తున్న ఈ భేదం, డ' మళ్ళీ డబ్బు పెట్టుబడిగా క్రియాశీలంగా పని చేయనారంభించిన వెంటనే అదృశ్యమవుతుంది. కాబట్టి ఇది విస్తరించిన పారిశ్రామిక పెట్టుబడి యొక్క డబ్బు వ్యక్తీకరణగా

స్థిరంగా వుండదు. డ' ఇప్పుడు డ విధిని నిర్వహిస్తున్నప్పటికీ, డబ్బు పెట్టుబడి ఆవృత్తి ఎన్నటికీ డ'తో ప్రారంభం కాదు. అది డ తోనే ప్రారంభం కాగలదు. వేరు మాటల్లో చెప్పాలంటే, అది పెట్టుబడి సంబంధం యొక్క వ్యక్తీకరణగా ప్రారంభం కాగలదు. మదుపు పెట్టిన పెట్టుబడి విలువ రూపంగా మాత్రమే ప్రారంభమవుతుంది. మళ్ళీ అ.వి.ను ఉత్పత్తి చేసేందుకై 500 పౌండ్లను మళ్ళీ పెట్టుబడిగా మదుపు పెట్టిన వెంటనే, ఆ మొత్తం ప్రారంభ స్థానంగా ఉంటుందే తప్ప, తిరిగి చేరుకొన్న స్థానంగా ఉండదు. 422 పౌండ్ల పెట్టుబడికి బదులు, ఇప్పుడు 500 పౌండ్లు పెట్టుబడి మదుపు పెట్టబడుతుంది. ఇప్పుడది మునుపటి కన్నా ఎక్కువ డబ్బు; ఎక్కువ పెట్టుబడి విలువ. కానీ దాని రెండు అంతర్భాగాల మధ్యగల సంబంధం అంతర్ధానమయింది. వాస్తవంలో, మొదట్లోనే 42 పౌండ్లకు బదులు, 500 పౌండ్ల మొత్తం పెట్టుబడిగా ఉపకరించి వుండవచ్చు.

డ' గా రంగంపైకి రావటం డబ్బు పెట్టుబడి యొక్క క్రియాశీల విధి కాదు. డ', గా రంగంపైకి రావటం స' విధి. సరుకుల సాధారణ చలామణిలో సైతం, మొదట స–డలోనూ, రెండవసారి డ–$స_2$ లోనూ, డబ్బు డ రెండవ క్రియ అయిన డ–$స_2$ వరకు క్రియాశీల పాత్ర వహించదు. డ రూపంలో అది రంగంపైకి రావటం మొదటి క్రియ ఫలితమే. ఈ క్రియ కారణంగా అప్పుడది కేవలం $స_1$ యొక్క పరివర్తిత రూపంగా రంగంపైకి వస్తుంది. డ'లో నిక్షిప్తమైన పెట్టుబడి సంబంధం, అంటే, దానిలోని ఒక భాగమైన పెట్టుబడి విలువకు దానిలోని మరో భాగమైన విలువ పెరుగుదలతో గల సంబంధం, నిరంతరం మళ్ళీ మళ్ళీ జరిగే డ....డ' ఆవృత్తితో, డ' రెండు చలామణిలుగా చీలిన మేరకు, క్రియాత్మక ప్రాముఖ్యం సంతరించుకొంటుంది. ఈ రెండు చలామణీల్లో ఒకటి పెట్టుబడి చలామణి, రెండవది అదనపు విలువ చలామణి. ఫలితంగా ఈ రెండు భాగాలు పరిణామాత్మకంగానే కాక గుణాత్మకంగా కూడా విభిన్నమైన విధులను నిర్వహిస్తాయి. డ విధులు వేరు, డ' విధులు వేరు. కానీ డ....డ' రూపాన్ని మాత్రమే తీసుకొని చూస్తే, దానిలో పెట్టుబడిదారు వ్యక్తిగతంగా వినియోగించుకొనేది చేరదు. అందులో స్పష్టంగా చేరేది పెట్టుబడి స్వయం విస్తరణం, దాని సంచయనం మాత్రమే. అన్నిటికన్నా ముఖ్యంగా, ఎప్పటికప్పుడు తిరిగి మదుపు పెట్టే డబ్బు పెట్టుబడి నియత కాలాల్లో పొందే వృద్ధిగా ఈ సంచయనం వ్యక్తమవుతున్న మేరకు అది అందులో చోటుచేసుకొంటుంది.

డ + ధకు సమానమైన డ' అన్నది పెట్టుబడి అసంబద్ధ రూపమైనప్పటికీ, అది అదే సమయంలో తిరిగి చేతికందిన డబ్బు పెట్టుబడి రూపంలో మాత్రమే, అంటే అది డబ్బును ఉత్పత్తి చేసిన డబ్బు రూపంలో వుంది. అయితే ఈ క్రియ మొదటి దశలో, అంటే డ – స $<$ శ్రమ / ఉ.సా. లో, డబ్బు పెట్టుబడి నిర్వహించిన క్రియకు భిన్నమైనది. ప్రథమ దశలో డ డబ్బుగా చలామణి అవుతుంది. అది డబ్బు పెట్టుబడి విధులను ఎందుకు స్వీకరిస్తుందంటే, డబ్బుగా వున్న స్థితిలో మాత్రమే అది డబ్బు విధిని నిర్వహించగలదు. ఉ.పె. మూలకాలైన శ్ర గా ఉసా తనకు సరుకులుగా ఎదురైన ఈ మూలాంశాలుగా మారగలదు. ఈ చలామణి క్రియలో అది డబ్బుగా మాత్రమే పనిచేస్తుంది. కాని, ఈ క్రియ పెట్టుబడి విలువ క్రియలోని మొదటి దశ కాబట్టి, డబ్బు పెట్టుబడి క్రియ కూడా. అది కొన్న శ్ర, ఉ.సా. లన్న సరుకుల నిర్దిష్ట ఉపయోగపు రూపం వల్ల అది డబ్బు పెట్టుబడి క్రియ అవుతోంది. కాని, పెట్టుబడి విలువ అయిన డ, అది ఉత్పత్తి చేసిన అదనపు విలువ అయిన ధ – ఈ రెండూ కలిపి ఏర్పడ్డ డ'

స్వయం విస్తృత పెట్టుబడి విలువకు ప్రతీక. అంటే పెట్టుబడి మొత్తం ఆవృత్తి యొక్క లక్ష్యం ఫలితం, విధి – వీటికి ప్రతీక. డ' ఈ ఫలితాన్ని డబ్బు రూపంలో, తిరిగి చేతికందిన డబ్బు పెట్టుబడిగా వ్యక్తం చేస్తుందన్న వాస్తవానికి కారణం, అది డబ్బు రూపంలోని పెట్టుబడిగా, డబ్బు పెట్టుబడిగా వుండటం కాదు. అలా కాక, అది డబ్బు పెట్టుబడిగా వుండటం, డబ్బు రూపంలోని పెట్టుబడిగా వుండటం, పెట్టుబడిగా ఈ క్రియను ఈ రూపంలో ప్రారంభించడం, అది డబ్బు రూపంలో మదుపు పెట్టబడటం – ఇదీ కారణం. డబ్బు రూపానికి దాని పునఃపరివర్తన మనం ఇదివరకే చూచినట్లు, సరుకు పెట్టుబడి స' క్రియే తప్ప, డబ్బు పెట్టుబడి క్రియ కాదు. డ కు డ'కు మధ్య తేడాను తీసుకొంటే, అది (ఢ) కేవలం సపె యొక్క, అంటే స పెరుగుదల యొక్క డబ్బు రూపం డ' = డ + ఢ, కావడానికి కారణం స' = స + సపె కావడమే. అందువల్ల, పెట్టుబడి విలువ, అది ఉత్పత్తి చేసిన అదనపు విలువ, ఈ రెండూ డ'గా పరివర్తన చెందక ముందే, ఆ విలువలోని ఈ రెండు భాగాలు స్వతంత్రంగా ఒక దానికొకటి ఎదురుపడి, ఆ కారణంగా అవి వేరు వేరు, భిన్న విధుల్లో నియుక్తమయ్యే అవకాశం కల్పించే ఒక డబ్బు మొత్తంగా పరివర్తితం కాకముందే, స'లో ఈ తేడా, ఈ రెండు భాగాల మధ్య సంబంధం ప్రత్యక్షంగా వుంది, అభివ్యక్తమవుతుంది.

డ' కేవలం స' డబ్బుగా చేతికందిన ఫలితమే. డ' స' ఈ రెండూ స్వయం విస్తృతమైన పెట్టుబడి విలువ యొక్క భిన్న రూపాలు మాత్రమే. వాటిలో ఒకటి సరుకు రూపం, రెండవది డబ్బు రూపం. ఆ రెంటికీ మధ్య ఒక సామ్యం వుంది. అవి స్వయం విస్తృత పెట్టుబడి విలువే. అవి రెండూ మూర్తిమంతమైన పెట్టుబడి. ఎందువల్లనంటే, ఇక్కడ పెట్టుబడి విలువ, పెట్టుబడి విలువగా అదనపు విలువతో పాటు వుంది. ఈ అదనపు విలువ పెట్టుబడి విలువ మూలంగా లభించినదీ, దానికి భిన్నమైనదీ. కానీ ఈ సంబంధం కొంత మొత్తంలోని, లేదా ఒక సరుకుల విలువలోని రెండు భాగాల మధ్య సంబంధమనే అసంబద్ధ రూపంలో మాత్రమే వ్యక్తీకరింపబడుతూంది. అయితే తాను ఉత్పత్తి చేసిన అదనపు విలువతో సంబంధం గలిగినట్టి, తద్భిన్నమైనట్టి పెట్టుబడి యొక్క వ్యక్తీకరణలుగా, తత్కారణాన, స్వయం విస్తృత విలువ వ్యక్తీకరణలుగా డ', స'లు ఒకటే, అవి ఒకే విషయాన్నే, అయితే భిన్న రూపాల్లో వ్యక్తం చేస్తున్నాయి. ఇవి భిన్నంగా వుండటానికి కారణం, ఒకటి డబ్బు పెట్టుబడి, మరొకటి సరుకు పెట్టుబడి కావటం కాదు. ఒకటి డబ్బు, మరొకటి సరుకులు కావటం వల్ల ఇవి భిన్నమైనవి. ఇవి స్వయం విస్తృత విలువకీ, పెట్టుబడిగా, పని చేస్తున్న పెట్టుబడికీ ప్రతీకలుగా వున్నందువల్ల, ఇవి ఉత్పాదక పెట్టుబడికి క్రియ యొక్క ఫలితాన్ని వ్యక్తం చేస్తాయి. అంటే పెట్టుబడి విలువ, విలువను సృష్టించేది ఈ క్రియలో మాత్రమే. ఒకటి డబ్బు రూపంలోని పెట్టుబడి, రెండోది సరుకు రూపంలోని పెట్టుబడి. కాబట్టి వాటి మధ్య భేదాన్ని చూపే నిర్దిష్ట విధులు, డబ్బు విధులకు, సరుకుల విధులకు మధ్య గల భేదాలు తప్ప, మరొకటి కాజాలదు. పెట్టుబడిదారీ ఉత్పాదక ప్రక్రియ ప్రత్యక్ష ఫలితమైన సరుకు పెట్టుబడి తన మూలాన్ని జ్ఞాపకం చేస్తూంది; అందువల్ల, డబ్బు పెట్టుబడి కన్నా దాని రూపం మరింత సహేతుకమైనది, తక్కువ దుర్గ్రాహ్యమైనది. డబ్బులో సరుకుల ప్రత్యేక ఉపయోగపు రూపాలన్నీ సర్వత్రా అదృశ్యమైనట్లుగానే, డబ్బు పట్టుబడిలో ఈ ఉత్పాదక ప్రక్రియ జాడ ప్రతి ఒక్కటీ అంతర్ధానమవుతుంది. కాబట్టి, డ' స్వయంగా సరుకు పెట్టుబడిగా పనిచేసినప్పుడు మాత్రమే, ఉత్పాదక ప్రక్రియ ప్రత్యక్ష ఫలితం యొక్క పరివర్తిత రూపంగా ఉండకుండా, ప్రత్యక్ష

ఫలితంగా (ఉత్పాదితంగా) ఉన్నప్పుడు మాత్రమే అది దాని విపరీత రూపాన్ని కోల్పోతుంది. అంటే డబ్బు పదార్థపు ఉత్పత్తిలో ఇలా జరుగుతుంది. ఉదాహరణకు, బంగారం ఉత్పత్తిలో ఈ సూత్రీకరణ ద – స < శ్రమ / ఉ.సా. ....ఉ.పె....ద. (ద + ధ). ఇందులో ద' ఉత్పత్తి అయిన సరుకు పాత్ర వహిస్తుంది. ఎందువల్లనంటే, డబ్బు పెట్టుబడి అయిన మొదటి ద లో ఎక్కువ బంగారాన్ని చేకూర్చుతుంది. ఈ సందర్భంగా ద.....ద' (ద + ధ) అనే సూత్రం యొక్క అసంబద్ధ స్వభావం అదృశ్యమవుతుంది. ఇక్కడ డబ్బు మొత్తంలోని ఒక భాగం అదే మొత్తంలోని మరో భాగానికి తల్లిగా గోచరిస్తుంది.

## IV. మొత్తం ఆవృత్తి

చలామణి క్రమానికి, దాని ప్రథమ దశ అయిన ద – స < శ్రమ / ఉ.సా. చివరిలో, ఉ.పె.వల్ల అంతరాయం కలుగుతుందని చూశాము. ఈ దశలో మార్కెట్‌లో కొన్న శ్ర, ఉసా అనే సరుకులు పదార్థాలుగానూ, ఉత్పాదక పెట్టుబడిలోని అంతర్భాగాలుగానూ వినియుక్తమవుతాయి. ఈ వినియోగ ఫలితంగా, ఒక కొత్త సరుకు స' ఉత్పత్తి అవుతుంది. అది పాదార్థికంగా మారింది. దాని విలువా మారింది. మధ్యలో నిల్చిపోయిన చలామణి క్రమం 'ద–స' ను 'స–ద'తో పూర్తి చేయవలసి వుంటుంది. కానీ చలామణిలో ఈ రెండవ, ముగింపు దశకు వాహికగా వున్నది స'. అది పాదార్థికంగానూ, విలువలోనూ మునుపటి స కు భిన్నమైనది. కాబట్టి చలామణి పరంపర 1) ద–స$_1$; 2) స'$_2$–ద' గా రంగంపైకి వస్తుంది. ఇందులో, ఉపె క్రియ వల్ల, అంటే స లోని అంశాలతో అంటే, ఉత్పాదక పెట్టుబడి ఉపె అస్తిత్వ రూపాలనుంచి స'ను ఉత్పత్తి చేయడం వల్ల, అంతరాయమేర్పడిన కాలంలో, మొదటి సరుకు స$_1$ స్థానంలో యెక్కువ విలువ, భిన్న ఉపయోగపు రూపం గల మరో సరకు స$_2$ వస్తుంది. ఇది మొదటి సరుకు యొక్క రెండవ దశలో జరుగుతుంది. కాని, పెట్టుబడి మన ముందుకు వచ్చినప్పటి మొదటి రూపం (పెట్టుబడి, సంపుటి. I, అధ్యాయం IV,1)[1] అయిన ద–స–ద' (విస్తృత రూపం :1) ద–స$_1$; 2) స$_2$–ద,) ఒకే సరుకును రెండుసార్లు చూపుతోంది. రెండుసార్లూ, సరుకు అదే. మొదటి దశలో డబ్బు సరుకుగా పరివర్తన చెందగా, రెండవ దశలో ఆ సరుకే అంతకన్నా ఎక్కువ డబ్బుగా తిరిగి పరివర్తన చెందుతుంది. ఈ ప్రధానమైన తేడా ఉన్నప్పటికీ, పై రెండు చలామణీలకు ఒక ఉమ్మడి లక్షణముంది: వాటి మొదటి దశలో డబ్బు సరుకులుగా పరివర్తన చెందుతుంది: రెండవ దశలో సరుకులు డబ్బుగా పరివర్తన చెందుతాయి. మొదటి దశలో వెచ్చించిన డబ్బు రెండవ దశలో తిరిగి వస్తుంది. ఒకవైపు, రెండిటిలోనూ డబ్బు దాని ప్రారంభ స్థానానికి తిరిగి ప్రవహిస్తుంది. మరోవైపు మదుపు పెట్టిన మొత్తానికన్నా అధిక మొత్తం తిరిగి వస్తుంది. ఆ మేరకు, ద–స....స' ద' అనే సూత్రం, ద–స–ద, అనే సాధారణ సూత్రంలో అంతర్లీనంగా వుంది.

దీన్నుంచి మరొక విషయం కూడా స్పష్టమవుతోంది – ఏకకాలంలో ఉనికిలోగల సమానమైన భారీ విలువలు, చలామణికి చెందిన ద–స, స'–ద' అనే రెండు రూప పరివర్తనల్లో ఒకదానికొకటి ఎదురై, ఒకదాని స్థానాన్ని మరొకటి ఆక్రమిస్తాయి. విలువ మార్పు కేవలం ఉపె రూప పరివర్తనకు, అంటే ఉత్పత్తి ప్రక్రియకు సంబంధించినది. చలామణికి సంబంధించిన కేవల లాంఛన ప్రాయమైన

1. ఇంగ్లీషు కూర్పు, అధ్యాయం VIII - సం.

రూపపరివర్తనతో పోల్చి చూస్తే, ఇది ఆ విధంగా పెట్టుబడిగా యొక్క నిజమైన రూప పరివర్తనగా గోచరిస్తుంది.

ఇప్పుడు మొత్తం గమన క్రమమైన డ స.... ఉపె....స' – డ'ను, లేక దాని విస్తృతరూపమైన డ – స < శ్రమ / ఉ.సా ....ఉపె....స' (స + సపె) – డ' (డ + ధ)ను తీసుకొని చూద్దాం. ఇక్కడ పెట్టుబడి ఒకదానితో ఒకటి ముడిపడివున్న, ఒక దానిపై ఒకటి ఆధారపడి వున్న, పరివర్తనల పరంపరకు లోనయ్యే విలువగా గోచరమవుతుంది. ఈ రూప పరివర్తనలు మొత్తం గమనక్రమంలోని ఆయా దశలుగా, అంచెలుగా వున్నాయి. వీటిలో రెండు దశలు చలామణి రంగానికీ, ఒకటి ఉత్పత్తి రంగానికి చెందినవి. ఈ దశలు ప్రతి ఒక్కదానిలోనూ పెట్టుబడి విలువకు భిన్నరూపం వుంది. ప్రతి రూపానికీ, దానికి సంబంధించిన భిన్న ప్రత్యేక క్రియ వుంది. ఈ గమన క్రమంలో మదుపుపెట్టిన విలువ పదిలంగా వుండటమే కాక, పెరుగుతుంది; దాని పరిమాణం హెచ్చుతుంది. ఆఖరున, ముగింపు దశలో ఆ విలువ, మొత్తం గమన క్రమ ప్రారంభంలో తానున్న రూపాన్నే తిరిగి ధరిస్తుంది. కాబట్టి ఈ మొత్తం క్రమం, ఆవృత్తుల్లో సాగే గమన క్రమమవుతుంది.

డబ్బు పెట్టుబడి – సరుకు పెట్టుబడి ఇవి పెట్టుబడి విలువ తన చలామణిలోని వివిధ దశల్లో ధరించే రూపాలు. ఉత్పత్తి దశకు సంబంధించిన రూపం, ఉత్పాదక పెట్టుబడి రూపం తన ఈ యావత్తు ఆవృత్తి గతిక్రమంలో ఈ రూపాలను ధరిస్తూ తరువాత వాటిని విసర్జిస్తూ, ఆయా రూపాల్లో తదనుగుణమైన విధిని నిర్వర్తించే పెట్టుబడే పారిశ్రామిక పెట్టుబడి. ఇక్కడ పారిశ్రామిక అనేమాట, పెట్టుబడిదారీ ప్రాతిపదికపై నిర్వహించబడే ప్రతి పారిశ్రామిక శాఖకూ వర్తిస్తుంది.

కాబట్టి, డబ్బు పెట్టుబడి, సరుకు పెట్టుబడి, ఉత్పాదక పెట్టుబడి ఇవి ఒకదాని నుంచి ఒకటి వేరుపడిన స్వతంత్ర పారిశ్రామిక శాఖల సారభూతాంశంగా వున్న వాటి విధులను నిర్వర్తించే స్వతంత్ర రకాలకు చెందిన పెట్టుబడుల పేర్లు కావు. ఇక్కడ ఇవి పారిశ్రామిక పెట్టుబడి ప్రత్యేక క్రియా రూపాలను సూచిస్తాయి, అంతే. పారిశ్రామిక పెట్టుబడి ఈ మూడు రూపాలను ఒకదాని తరువాత మరొకదాన్ని ధరిస్తుంది.

పెట్టుబడి విలువ యొక్క వేరు వేరు దశలు నిరంతరాయంగా, ఒకటి మరొక దశగా మారిపోతున్నంతసేపే మామూలుగా పెట్టుబడి తన ఆవృత్తిని సాగిస్తుంది. పెట్టుబడి తన మొదటి దశ అయిన డ – స లోనే ఆగిపోతే, డబ్బు పెట్టుబడి నిల్వ నిధిగా కరుడుగట్టిన రూపం ధరించిందన్న మాట. అది ఉత్పాదక దశలో ఆగిపోతే, ఉత్పాదక సాధనాలు పనిలేకుండా ఒకవైపు పడివుండగా, మరోవైపు శ్రమశక్తి నిరుద్యోగంలో మగ్గుతుంది. పెట్టుబడి ఆఖరు దశ అయిన స' – డ'లో ఆగిపోతే, అమ్మకంకాని సరుకులు పేరుకునిపోయి, చలామణి స్రవంతిని అడ్డుకొంటుంది.

కానీ, ఈ ఆవృత్తి వల్లనే, వేరు వేరు దశల్లో పెట్టుబడి కొంతకాలంపాటు వుండిపోవలసిన అవసరం కలగటం సహజసిద్ధం. ఈ దశలో ప్రతి ఒక్కదానిలోనూ పెట్టుబడి ఒక నిర్దిష్ట రూపానికి, అంటే డబ్బు పెట్టుబడి, ఉత్పాదక పెట్టుబడి, సరుకు పెట్టుబడి రూపాల్లో ఒకదానికి అంటి పెట్టుకొని వుంటుంది. ఈ నిర్దిష్ట రూపాల్లో ప్రతి ఒక్కటీ దానికి సంబంధించిన క్రియను నిర్వహించే వరకు, అది కొత్త పరివర్తనా దశలోకి ప్రవేశించడానికి వీలు కల్పించే రూపం సంతరించుకోదు. దీన్ని స్పష్టం

చేసేందుకు, మన ఉదాహరణలో ఒక విషయాన్ని ఊహించుకొన్నాము. ఉత్పాదక దశలో సృష్టి అయిన సరుకుల పరిమాణం యొక్క పెట్టుబడి విలువ డబ్బు రూపంలో మొదట మదుపు పెట్టిన మొత్తం విలువకు సమానమనేది మనం ఊహించుకొన్న విషయం. వేరు మాటల్లో చెప్పాలంటే, డబ్బు రూపంలో ముందుగా మదుపు పెట్టిన యావత్తు పెట్టుబడి విలువ మొత్తంగా ఒక దశ నుంచి మరొక దశకు తరలిపోతుందన్న మాట. కానీ, స్థిర పెట్టుబడిలో ఒక భాగం, అసలైన శ్రమ సాధనాలు (అంటే యంత్రాలు) పలుసార్లు జరిగే ఒకే ఉత్పాదక క్రియలో మళ్ళీ మళ్ళీ నిరంతరం సరికొత్తగా ఉపయోగింపబడతాయని చూచాము. (సం. I అధ్యాయం VI) కాబట్టి, అవి తమ విలువను కొద్ది కొద్దిగా ఉత్పాదితాలకు బదలాయిస్తుంటాయి. ఇది పెట్టుబడి ఆవృత్త గమనాన్ని ఎంతవరకు ప్రభావితం చేసేదీ, ఉత్తరోత్తరా మనం తెలుసుకొంటాం. ప్రస్తుతం క్రింది సంగతి చెబితే చాలు : మన ఉదాహరణలో, 422 పౌండ్ల ఉత్పాదక పెట్టుబడి విలువలో, ఫ్యాక్టరీ భవనాలు, యంత్రాలు మొదలైన వాటి సగటు తరుగుదల మాత్రమే వుంది. అంటే, 10,600 పౌనుల ప్రత్తి 60 గంటల వారం శ్రమ ఉత్పాదితమైన 10,000 పౌనులు నూలుగా మారడంలో అవి నూలుకు బదలాయించిన విలువ భాగం మాత్రమే వుంది. మదుపు పెట్టిన 372 పౌండ్ల స్థిర పెట్టుబడి ఉత్పాదక సాధనాలుగా మారాయి. వాటిలో శ్రమ సాధనాలు, భవనాలు, యంత్రాలు మొదలైనవి మార్కెట్‌లో వారం వారం అద్దెకు తీసుకోబడ్డాయా అన్నట్లు కనిపించింది,[1] కానీ, ఇది ఈ వ్యవహారంలోని సారాంశాన్ని ఏ విధంగానూ మార్చదు. కొన్ని సంవత్సరాల్లో కొని, వినియోగించిన శ్రమ సాధనాల మొత్తం విలువను నూలుకు బదలాయించడానికి మనం, ఒక వారంలో ఉత్పత్తి అయిన నూలు పరిమాణాన్ని, అంటే 10,000 పౌనుల నూలును, ఆ సంవత్సరాల్లో ఎన్ని వారాలున్నాయో వాటి సంఖ్యతో హెచ్చించాలి. అందువల్ల, మదుపు పెట్టిన డబ్బు పెట్టుబడి ఉత్పాదక పెట్టుబడి, ఉపె గా పని చేయగలగాలంటే, అంతకుముందు అది, మొదట ఈ శ్రమ సాధనాలుగా మారవలసి వుంటుంది. కాబట్టి, మొదటిదశ అయిన డ – స ను గడవవలసి వుంటుందనేది స్పష్టమే. అందువల్ల మన ఉదాహరణలో, ఉత్పాదక ప్రక్రియ సందర్భంగా నూలులో మూర్తిమంతమైన 422 పౌండ్ల పెట్టుబడి విలువ, 10,000 పౌనుల నూలు తయారై వుంటే తప్ప, దాని విలువలో భాగం కాజాలదనీ, చలామణి దశ స' – డ'లో ప్రవేశించజాలదనీ, అదేవిధంగా మన ఉదాహరణలో స్పష్టమే. ఆ నూలును వడికే వరకు దాన్ని అమ్మే వీలులేదు కదా.

సాధారణ సూత్రంలో, ఉ.పె యొక్క ఉత్పాదితాన్ని, ఉత్పాదక పెట్టుబడి మూలకాలకు భిన్నమైన పదార్థంగా, ఉత్పాదక ప్రక్రియతో ప్రమేయం లేనట్టి, ఉత్పత్తి మూలకాల ఉపయోగపు విలువకు భిన్నమైన ఉపయోగపు విలువ గలిగినట్టి వస్తువుగా పరిగణిస్తున్నాము. ఉత్పాదక ప్రక్రియ ఫలితం ఒక వస్తురూపం ధరించినప్పుడు ఆ ఉత్పాదితంలో ఒక భాగం పునఃప్రారంభమయిన ఉత్పత్తిలో, ఒక మూలద్రవ్యంగా ప్రవేశించినా సరే – దాన్ని పై విధంగా పరిగణించడం కద్దు. ఉదాహరణకు, ధాన్యం ఉత్పత్తికి ధాన్యమే విత్తనాలుగా ఉపకరిస్తున్నాయి. కానీ ఉత్పాదితమేమో ఒక్క ధాన్యమే. కాబట్టి అది తత్సంబంధిత మూలకాలైన శ్రమశక్తికీ, పరికరాలూ, ఎరువులూ వంటి వాటికి భిన్నమైన రూపం గలది. అయితే కొన్ని స్వతంత్ర పారిశ్రామిక శాఖల్లో ఉత్పాదక ప్రక్రియ వల్ల తయారయేది,

1. తెలుగు కూర్పు అధ్యాయం VIII - సం.



కార్ల్‌మార్క్స్ - పెట్టుబడి రెండవ భాగం

రాతప్రతి ఒక పేజీ - ఫాసిమైల్ ప్రతి (తగ్గించబడింది)

కొత్త పాదార్థిక ఉత్పాదితమూ కాదు, సరుకూ కాదు. వీటిలో కమ్యూనికేషన్ల పరిశ్రమ – అది అసలు రవాణాకు, అంటే సరుకుల, ప్రయాణీకుల, రవాణాకు సంబంధించినదైనా, లేక కేవలం కమ్యూనికేషన్లు, అంటే ఉత్తరాలు, టెలిగ్రాములు మొదలైన వాటి ప్రసారానికి సంబంధించినదైనా – ఆర్థికంగా ముఖ్యమైనది.


ఎ. చుప్రొవ్[1] దీన్ని గురించి ఇలా అంటున్నాడు: "పరిశ్రమదారు మొదట వస్తువులను ఉత్పత్తి చేసి, తరువాత వినియోగదార్ల కోసం వెదకవచ్చు" (తయారయిన తరువాత, ఉత్పత్తి ప్రక్రియ నుంచి బయటపడిన అతని ఉత్పాదితం, ఉత్పత్తి ప్రక్రియ నుంచి వేరుపడిన ఒక సరుకుగా చలామణిలో ప్రవేశిస్తుంది.) "ఆ విధంగా ఉత్పత్తి, వినియోగమూ, స్థల, కాలాల వల్ల వేరుచేయబడిన రెండు క్రియలుగా కనిపిస్తాయి. రవాణా పరిశ్రమ ఏ విధమైన కొత్త ఉత్పాదితాలను సృష్టించదు. అది మనుషులను, వస్తువులను ఒకచోటి నుంచి మరోచోటికి తరలిస్తుందంతే. కాబట్టి ఆ పరిశ్రమలో ఈ రెండు క్రియలు ఒకేసారి జరుగుతాయి. దాని సేవలు (స్థలం మార్పు) ఉత్పత్తి అయిన క్షణమే వినియోగింపబడుతున్నాయి. ఈ కారణాన, రైల్వేలు తమ సేవలను అమ్మగల ప్రాంతం, మహా అయితే, తమ రైలు పట్టాలకు ఇరువైపులా 50 వెర్స్టులు (53 కిలోమీటర్లు) వ్యాపించి వుంటుంది."

రవాణా అయ్యేది మనుష్యులైనా సరుకులైనా ఫలితం, వారి లేదా వాటి స్థలం మార్పే. ఉదాహరణకు నూలు, అది ఉత్పత్తి అయిన ఇంగ్లండులో ఉండటానికి బదులు ఇప్పుడు ఇండియాలో వుండవచ్చు.

అయితే రవాణా పరిశ్రమ అమ్మేది స్థలం మార్పునే. దాని ఉపయోగకర ఫలితం, రవాణా ప్రక్రియతో, అంటే రవాణా పరిశ్రమ నిర్వహించే ఉత్పాదక ప్రక్రియతో అవిభాజ్యంగా ముడిపడి వుంది. మనుషుల, వస్తువుల తరలింపు రవాణా సాధనాలతో పాటుగానే జరుగుతుంది. ఈ ప్రయాణమే, ఈ గమనమే ఈ సాధనాలు నిర్వహించే ఉత్పాదక ప్రక్రియ. ఉపయోగకర ఫలితం, ఈ ఉత్పాదక ప్రక్రియ సాగుతున్న కాలంలో మాత్రమే వినియోగం కాగలదు. ఈ ప్రక్రియకు భిన్నమైన ఉపయోగంగా దాని ఫలితానికి ఉనికి లేదు. ఉత్పత్తి అయిన తరువాత తప్ప, వాణిజ్య వస్తువుగా పనిచేయని సరుకుగా చలామణి కానీ ఉపయోగకర వస్తువుగా ఆ ఫలితానికి ఉనికి లేదు. కానీ తక్కిన సరుకుల మార్పిడి విలువలాగానే, ఈ ఉపయోగకర ఫలితం యొక్క మార్పిడి విలువ, దానిలో వినియోగమైన ఉత్పాదన మూలకాల శ్రమ శక్తి, ఉత్పత్తి సాధనాల విలువ + రవాణాలో నియుక్తులైన కార్మికుల అదనపు శ్రమ సృష్టించిన అదనపు విలువను బట్టి నిర్ణయమవుతుంది. ఈ ఉపయోగకర ఫలితానికి వినియోగంతో గల సంబంధం కూడా ఇతర సరుకుల విషయంలో వున్నటువంటిదే. ఇది వ్యక్తిగతంగా వినియోగమైతే, దాని విలువ, వినియోగ కాలంలో అంతరిస్తుంది. లేక, ఉత్పాదకంగా వినియోగమైతే, అంటే, రవాణా అవుతున్న సరుకుల ఉత్పత్తిలో ఇదే ఒక దశగా వుండేలాగా వినియోగమయితే, దీని విలువ ఆ సరుకుకే అదనంగా చేరిన విలువగా బదిలీ అవుతుంది. కాబట్టి రవాణా పరిశ్రమకు సూత్రమిది :

డ–స < శ్రమ / ఉ.సా. ....ఉపె.....డ'. ఎందువల్లనంటే, మూల్యం చెల్లించబడేదీ, వినియోగింపబడేదీ ఉత్పాదక ప్రక్రియే తప్ప, దానినుంచి వేరుపడిన దానికి భిన్నంగా వున్న ఉత్పాదితం కాదు. కాబట్టి

1. ఎ. చుప్రొవ్, రైల్ రోడింగ్, మాస్కో, 1875, పుటలు 69, 70



పెట్టుబడి – రెండవ సంపుటిలోని రాతప్రతిలో ఫ్రెడరిక్ ఎంగెల్స్ ఎడిటింగు చేసి
కాపీ చేసిన ఒక పేజీ – ఫాసిమైల్ ప్రతి (తగ్గించబడింది)

దాదాపు ఈ సూత్ర రూపం, విలువైన లోహాల ఉత్పత్తి సూత్రానికి గల రూపమే. రెంటికీ ఒక తేడా మాత్రముంది. ప్రస్తుత సందర్భంలో డ' ఉత్పాదక ప్రక్రియ సందర్భంగా సృష్టి అయిన ఉపయోగకర ఫలితం యొక్క పరివర్తిత రూపాన్ని సూచిస్తుంటే తప్ప ఈ ప్రక్రియలో ఉత్పత్తి అయి, దాని నుంచి బయటికి వచ్చి వేసిన బంగారం, లేదా వెండి యొక్క సాక్ష్యాత్ రూపాన్ని కాదు.

పెట్టుబడి పారిశ్రామిక పెట్టుబడిగా వున్న స్థితిలో మాత్రమే, అదనపు విలువను, లేదా అదనపు ఉత్పాదితాన్ని స్వాయత్తం చేసుకోవడమేకాక, అదే సమయంలో దాన్ని సృష్టించడం కూడా పెట్టుబడి విధిగా వుంటుంది. కాబట్టి పారిశ్రామిక పెట్టుబడికి పెట్టుబడిదారీ ఉత్పత్తి లక్షణం వుండటం తప్పనిసరిగా అవసరం. దాని అస్తిత్వంలో, పెట్టుబడిదారులకు, వేతన కార్మికులకు మధ్య వర్గ వైరుధ్యం గర్భితం. అది సామాజిక ఉత్పత్తిని, తన అధీనంలోకి ఏ మేరకు తెచ్చుకొంటుందో ఆ మేరకు శ్రమ ప్రక్రియ యొక్క సాంకేతిక పద్ధతులు, శ్రమ ప్రక్రియ, సామాజిక వ్యవస్థీకరణ విప్లవకరంగా మారుతాయి. వాటితోపాటు సమాజపు ఆర్థిక – చారిత్రక పరిస్థితుల తరహా కూడా విప్లవకరంగా మారుతుంది. పారిశ్రామిక పెట్టుబడికి ముందున్న పెట్టుబడి యొక్క ఇతర రకాలు, ఇదివరకే కాలగర్భంలో కలిసిపోయిన, లేదా ఇప్పుడు అడుగంటిపోతున్న సామాజిక ఉత్పత్తి పరిస్థితుల మధ్య అవతరించినవి. ఈ రకాలు పారిశ్రామిక పెట్టుబడికి లోనుకావడమేకాక, వాటి విధి నిర్వహణ యంత్రాంగం తదనుగుణంగా మారిపోవడమే కాక, పారిశ్రామిక పెట్టుబడి యొక్క ప్రాతిపదికపై మాత్రమే ముందుకు సాగుతాయి; కాబట్టి ఈ ప్రాతిపదికతో బతుకుతాయి; అంతరిస్తాయి, నిలదొక్కుకొని వుంటాయి, పతనమవుతాయి. డబ్బు పెట్టుబడి, సరుకు పెట్టుబడి ప్రత్యేక వ్యాపార శాఖల వాహికలుగా, పారిశ్రామిక పెట్టుబడి సరసనే పనిచేస్తున్న మేరకు, అవి చలామణి రంగంలో పారిశ్రామిక పెట్టుబడి ఒకప్పుడు ధరిస్తూ, మరొకప్పుడు విసర్జించే వివిధ క్రియా రూపాల అస్తిత్వ రీతులు తప్ప మరొకటి కాదు – శ్రమ సామాజిక విభజన వల్ల, స్వతంత్రమైన ఉనికిని సాధించి, ఏకముఖాభివృద్ధి చెందిన రీతులివి.

డ.....డ' ఆవృత్తి ఒకవైపు, సరుకుల సాధారణ చలామణిలో కలిసిపోతుంది; దాని నుంచి బయలుదేరి దానిలోకి తిరిగి వస్తుంది; దానిలో భాగంగా వుంటుంది. మరొవైపు, అది వ్యష్టి పెట్టుబడిదారుకు పెట్టుబడి విలువ యొక్క స్వతంత్ర గమనమవుతుంది. ఈ గమనం కొంత వరకు సరుకుల సాధారణ చలామణిలోనూ, కొంతవరకు దానికి వెలుపలా సాగుతుంది. కానీ తన స్వతంత్ర లక్షణాన్ని సదా నిలుపుకొంటుంది. ఎందువల్లనంటే, మొదటి విషయం, చలామణి రంగంలోని దాని రెండు దశలు, అంటే డ – స, స' పెట్టుబడి గమన దశలు కాబట్టి, వాటికి క్రియాపరమైన నిర్దిష్ట లక్షణాలున్నాయి. డ–స లో స శ్రమశక్తిగానూ, ఉత్పత్తి సాధనాలుగానూ పాదార్థికంగా నిర్ణయమవుతాయి. స'–డ'లో పెట్టుబడి విలువ అదనపు విలువతో పాటు, డబ్బు రూపంలో తిరిగి చేతికందుతుంది. రెండవ విషయం, ఉత్పాదక ప్రక్రియ అయిన ఉ ఉత్పాదక వినియోగానికి ఆవరించినది. మూడవ విషయం, డబ్బు తన ప్రారంభ స్థానానికి తిరిగి రావడం వల్ల డ.....డ' గమనం, స్వయంగా ఒక సంపూర్ణమైన ఆవృత్తి అవుతుంది.

కాబట్టి ప్రతి వ్యష్టి పెట్టుబడి, తన చలామణిలోని రెండు అర్ధభాగాలైన డ – స, స' – డ'ల్లో సరుకుల సాధారణ చలామణికి, ఒకవైపు, కర్తగా వుంది; ఈ చలామణిలో ఇది డబ్బుగానూ, లేక సరుకుగానూ పనిచేస్తుంది, లేదా వాటి జోడింపుగా వుంటుంది. సరుకుల జగత్తులో సంభవిస్తున్న

రూప పరివర్తనల మొత్తం గొలుసులో ఆ విధంగా అది ఒక కొలికి. మరోవైపు, అది సాధారణ చలామణిలో తనదైన స్వతంత్ర ఆవృత్తిని పూర్తి చేస్తుంది. ఈ ఆవృత్తిలో ఉత్పత్తి రంగం ఒక అవస్థాంతర దశ అవుతుంది; ఈ పెట్టుబడి తన ప్రారంభ స్థానాన్ని వదిలి వెళ్ళిన రూపంలోనే తిరిగి చేరుకుంటుంది. తన ఆవృత్తిలో ఉత్పత్తి ప్రక్రియ సందర్భంగా తాను చెందే వాస్తవరూప పరివర్తన చేరి వున్నందున, ఆ పెట్టుబడి విలువ పరిమాణం కూడా అదే సమయంలో మారుతుంది. అది కేవలం డబ్బు విలువగానే కాకుండా, పెరిగిన, హెచ్చిన డబ్బు విలువగా తిరిగి స్వస్థానానికి వస్తుంది.

డ – స....ఉపె....స' – డ'ను పెట్టుబడి ఆవృత్తి యొక్క ప్రత్యేక రూపంగా, దాని ఇతర రూపాలతో పాటు, ఇప్పుడు పరిశీలిద్దాం. ఈ ఇతర రూపాలను ఉత్తరోత్తరా విశ్లేషిస్తాము. ఈ ఆవృత్తికి ప్రత్యేకించి కింది లక్షణాలున్నాయని మనకు తెలుస్తుంది.

1. అది డబ్బు పెట్టుబడి ఆవృత్తిగా రంగం పైకి వస్తుంది. ఎందువల్లనంటే డబ్బు రూపంలోని పారిశ్రామిక పెట్టుబడి, డబ్బు పెట్టుబడిగా, దాని మొత్తం ప్రక్రియకు ప్రారంభ స్థానం, అది తిరిగి చేరుకొనే స్థానం అవుతోంది. డబ్బు ఇక్కడ డబ్బుగా వ్యయం కాదు, కేవలం మదుపు పెట్టబడుతూంది. కాబట్టి అది కేవలం పెట్టుబడి యొక్క డబ్బు రూపం, డబ్బు పెట్టుబడి, అనే వాస్తవాన్ని ఈ సూత్రమే వ్యక్తం చేస్తోంది. అంతేకాదు, ఉపయోగపు విలువ కాక, మార్పిడి విలువ ఈ గమన నిర్ణాయక లక్ష్యం అనే సంగతిని కూడా ఇది వ్యక్తం చేస్తోంది. విలువ యొక్క డబ్బు రూపం, విలువ ధరించే స్వతంత్రమైన, ప్రత్యక్షమైన రూపం కాబట్టి, డబ్బే ప్రారంభ, అంతిమ స్థానాలుగా ఉన్న చలామణి రూపం, డ....డ'. పెట్టుబడిదారీ ఉత్పత్తికి ప్రజల ప్రేరణ ధనార్జనే అని ప్రస్ఫుటంగా వ్యక్తం చేస్తుంది. ఉత్పత్తి ప్రక్రియ కేవలం అనివార్యమైన మధ్యంతర కొలికిగా, డబ్బు సంపాదనకు తప్పనిసరియైన చెడుగుగా కనిపిస్తుంది. కాబట్టి పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం గల దేశాలన్నీ ఉత్పత్తి ప్రక్రియ ప్రమేయం లేకుండానే డబ్బు సంపాదించే ఉన్మత్త ప్రయత్నాలకు కొన్నాళ్ళకొకసారి లోనుకావడం కద్దు.

2. ఉపె క్రియ అయిన ఉత్పాదన దశ ఈ ఆవృత్తిలో, చలామణి క్రమమైన డ – స ....స' ....డ' లోని రెండు దశల మధ్య అంతరాయంగా వుంది. కానీ ఇది సాధారణ చలామణి డ–స–డ' లోని మధ్యంతర కొలికి మాత్రమే. ఉత్పాదన ప్రక్రియ ఇక్కడ ఆవృత్త నిర్వహణ ప్రక్రియా రూపంలో గోచరమవుతోంది; పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానంలో దానికే పాత్ర వుందో ఆ పాత్రలోనే, అంటే మదుపు పెట్టిన విలువను పెంచే కేవల సాధనంగా సలాంఛనంగా, విస్పష్టంగా గోచరిస్తోంది. కాబట్టి, ఉత్పత్తి లక్ష్యం ఇతోధిక ధనార్జనే అని తెలుపుతోంది.

3. డ–స చలామణి దశల పరంపరను ప్రారంభిస్తోంది కనుక, స'–డ' చలామణిలోని రెండవ కొలికిగా వుంది. వేరు మాటల్లో చెప్పాలంటే, డ, స్వయం విస్తృతం కానున్న డబ్బు పెట్టుబడి దీని ప్రారంభ స్థానం; డ' స్వయం విస్తృతమైన డబ్బు పెట్టుబడి, (డ + ధ) దీని అంతిమ స్థానం. దీనిలో డ' డబ్బు రూపంలో చేతికందిన పెట్టుబడిగా, ధ దాని సంతానంగా వ్యక్తమవుతుంది. ఇది ద ఆవృత్తిని తక్కిన రెండు ఆవృత్తులు ఉపె, స'ల నుంచి వేరుచేసి చూపుతోంది; రెండు విధాలుగా ఆ పని చేస్తుంది. ఒకవైపు ఆద్యంతాలని డబ్బు రూపం ద్వారా డబ్బు అన్నది విలువ యొక్క స్వతంత్ర, ప్రత్యక్ష అస్తిత్వ రూపం. ఇక్కడ ఉత్పాదితపు విలువ తన స్వతంత్రమైన విలువ రూపంలో వుంది.

ఇందులో సరుకుల ఉపయోగపు విలువ జాడ ఏదీ లేకుండా అంతరించింది. మరోవైపు, ఉపె.... ఉపె రూపం ఆవశ్యంగా ఉపె....ఉపె' (ఉపె+అపె) రూపం తీసుకోదు; స'....స' రూపంలో ఈ రెండు ఆద్యంతాల్లో ఏ విధమైన తేడా కనిపించదు. కాబట్టి, డ –––డ' సూత్ర విశిష్ట లక్షణమేమిటంటే, మొదటిది, పెట్టుబడి విలువ దాని ప్రారంభ స్థానం; విస్తృతమైన పెట్టుబడి విలువ దాని పునరాగమన స్థానం. ఫలితంగా, ఈ మొత్తం ప్రక్రియకు, మదుపు పెట్టిన పెట్టుబడి విలువ సాధనంగానూ, విస్తృత పెట్టుబడి విలువ ఫలితంగానూ కనిపిస్తాయి. రెండవది, ఈ సంబంధం డబ్బు రూపంలో, స్వతంత్రమైన విలువ రూపంలో అభివ్యక్తమవుతుంది. కాబట్టి, డబ్బు పెట్టుబడి డబ్బును కంటున్న డబ్బుగా వ్యక్తమవుతుంది. విలువ అదనపు విలువను ఉత్పత్తి చేయడం ఈ మొత్తం ప్రక్రియ పరమార్థమనేదే కాక, అది నిగనిగ మెరిసే డబ్బు రూపంలో స్పష్టంగా వ్యక్తమవుతుంది.

4. డ–స దశను పూర్తి చేసేదాని చివరి దశ అయిన స'–డ' ఫలితంగా తిరిగి చేతికందిన డబ్బు పెట్టుబడి డ' రూపం అది తన మొదటి ఆవృత్తిని ప్రారంభించిన రూపమే. కాబట్టి, అది ఆవృత్తి నుంచి బయటికి వచ్చిన వెంటనే అదే ఆవృత్తిని హెచ్చిన (సంచిత) డబ్బు పెట్టుబడి, డ'గా (డ+ఢ) మళ్లీ ప్రారంభించగలదు. కనీసం, ఢ చలామణి డ చలామణి నుంచి విడిపోతుందనేది డ....డ' రూపం వ్యక్తం చేయదు. కాబట్టి దాని ఒకప్పటి రూపాన్ని దృష్టిలోకి తీసుకొంటే, డబ్బు పెట్టుబడి ఆవృత్తి కేవలం స్వయం విస్తరణ, సంచయన క్రమాన్ని మాత్రమే వ్యక్తం చేస్తుంది. దానిలో వినియోగం కేవలం ఉత్పాదక వినియోగంగా మాత్రమే డ–స < శ్రమ / ఉ.సా. వ్యక్తం చేస్తుంది. వ్యష్టి పెట్టుబడి యొక్క ఈ ఆవృత్తిలో చేరినది డ–శ్ర కార్మికునికి సంబంధించినంత వరకు, శ్ర–డ, లేక స–డ అవుతుంది. కాబట్టి అది, అతని వ్యక్తిగత వినియోగానికి శ్ర–డ–స (జీవనాధారాలు) ద్వారా దారితీసే చలామణి ప్రథమ దశ. రెండవ దశ డ–స వ్యష్టి పెట్టుబడి ఆవృత్తిలో ఇక భాగంగా వుండదు. కానీ ఆ రెండవ దశను ప్రారంభించేదే, దానికి ఆధారంగా వుండేది వ్యష్టి పెట్టుబడి ఆవృత్తే. ఎందువల్లనంటే, పెట్టుబడిదారు దోచుకోవడానికి వీలైన పదార్థంగా కార్మికుడు ఎల్లప్పుడూ మార్కెట్‌లో ఉండాలంటే అతను అన్నిటికన్నా ముందు జీవించాలి. కాబట్టి, వ్యక్తిగత వినియోగం ద్వారా తన్ను తాను పోషించుకోవాలి. కానీ ఈ వినియోగం, శ్రమశక్తిని, పెట్టుబడి ఉత్పాదకంగా వినియోగించడానికి తప్పనిసరియైనదని ఇక్కడ కేవలం ఊహించుకొంటున్నాము. కాబట్టి, కార్మికుడు తన వ్యక్తిగత వినియోగం ద్వారా శ్రమశక్తిగా తన్ను తాను పోషించుకొనే మేరకు, పునరుత్పత్తి చేసుకొనే మేరకు మాత్రమే ఈ వినియోగం జరుగుతుందని ఊహించుకొంటున్నాము. కానీ ఉసా, పెట్టుబడి ఆవృత్తిలో ప్రవేశించే అసలు సరుకులు, ఉత్పాదక వినియోగానికి మాత్రమే పోషకాలు. శ్ర–డ క్రియ కార్మికుని వైయక్తిక వినియోగానికి తోడ్పడుతుంది. జీవితావసరాలు అతని రక్త మాంసాలుగా మారటానికి తోడ్పడుతుంది. పెట్టుబడిదారు కూడా ఉండాలనేది నిజమే; పెట్టుబడిదారుని విధిని నిర్వర్తించగలగాలంటే, అతను కూడా జీవించాలి, జీవనానికి అవసరమైనవి వినియోగించాలి. ఇందుకు అతను, వాస్తవంలో కార్మికుడు వినియోగించినంత మాత్రమే వినియోగించవలసి వుంటుంది; ఈ చలామణి రూపంలో గర్భితమైనదంతా ఇంతే. కానీ ఇది కూడా నియత రూపంలో అభివ్యక్తం కావడం లేదు. ఎందువల్లనంటే, ఈ సూత్రం డ'తో ముగుస్తుంది; అంటే ఇప్పుడు హెచ్చిన డబ్బు పెట్టుబడి, తన పెట్టుబడి విధిని వెంటనే తిరిగి చేపట్ట వీలు కలిగించే ఫలితంతో ముగుస్తుంది.

స'–డ'లో స' అమ్మకం ప్రత్యక్షంగా వుంది. కానీ ఒకవైపు, అమ్మకంగా వున్న స'–డ' మరో వైపు కొనుగోలు కూడా. తుదకంటా విశ్లేషించి చూస్తే, ఏ సరుకైనా సరే కొనేది, దాని ఉపయోగపు విలువ కోసమే. కొన్న వస్తు స్వభావాన్ని బట్టి, ఈ వినియోగ క్రియ వ్యక్తిగతమైనదైనా, లేక ఉత్పాదక మైనదైనా, ఆ వస్తువును కొనుగోలు చేసేది వినియోగ ప్రక్రియలో ప్రవేశపెట్టడానికే (ఇక్కడ మధ్యంతర అమ్మకాలను పరిగణనకు తీసుకోవడం లేదు). కానీ ఈ వినియోగం, స'ను ఉత్పత్తి చేసిన వ్యష్టి పెట్టుబడి యొక్క ఆవృత్తిలో చోటుచేసుకోదు. స' అమ్మకానికి ఉద్దేశించిన సరుకు కాబట్టే, దానికి ఆవృత్తిలో స్థానం లేదు. ఉత్పత్తిదారు కాక, తదితరుల వినియోగం కోసం ఉద్దేశించినవి స'. ఉదాహరణకు, వాణిజ్య వ్యవస్థ ప్రతినిధులు కొందరు (ఇది డ – స.....ఉపె....స – డ'పై ఆధారపడిన వ్యవస్థ) ఇలా సుదీర్ఘమైన ధర్మపన్నాలు పలుకుతారు : కార్మికుడు వినియోగించుకొన్నంతే పెట్టుబడిదారు కూడా వ్యక్తిగతంగా వినియోగించుకోవాలి. పెట్టుబడిదారుల దేశం తమ సొంత సరుకుల వినియోగాన్ని, మొత్తం వినియోగ ప్రక్రియను తమకన్నా తక్కువ తెలివిగల దేశాలకు వదలివేసి, తాము మాత్రం ఉత్పాదక వినియోగాన్ని తమ జీవిత కర్తవ్యంగా పెట్టుకోవాలి. ఈ ధర్మ పన్నాల రూపమూ, ఇతివృత్తమూ సర్వ సుఖ పరిత్యాగాన్ని బోధించే క్రైస్తవ మత గురువుల ప్రచారాన్ని తరచూ గుర్తు చేస్తున్నాయి.

★ ★ ★

కాబట్టి ఆవృత్తులలో సాగే పెట్టుబడి గమనం చలామణి, ఉత్పత్తుల సమైక్యత. డ–స, స'–డ', ఈ రెండు దశలు చలామణి క్రియలు కాబట్టి, పెట్టుబడి చలామణి సరుకుల సాధారణ చలామణిలో భాగమే. కానీ తాము నిర్వహించే విధులను బట్టి అవి చలామణి రంగానికే కాక, ఉత్పత్తి రంగానికి కూడా సంబంధించిన పెట్టుబడి ఆవృత్తిలో నిర్దిష్టమైన విభాగాలు, దశలు. అందువల్ల పెట్టుబడి, సరుకుల సాధారణ చలామణిలోనే తన సొంత ఆవృత్తిని నిర్వర్తిస్తుంది. ప్రథమ దశలో సరుకుల సాధారణ చలామణి పెట్టుబడి, ఉత్పాదక పెట్టుబడి యొక్క విధిని నిర్వర్తించగల రూపం వహించేందుకు సాధనంగా ఉపకరిస్తుంది. రెండవ దశలో, పెట్టుబడి తన ఆవృత్తిని సరికొత్తగా ప్రారంభించ వీలులేని సరుకు విధిని త్యజించేందుకు ఆ చలామణి ఉపకరిస్తుంది. అదే సమయంలో, తనలో వచ్చిచేరిన అదనపు విలువ యొక్క చలామణి నుంచి తన సొంత ఆవృత్తిని వేరు చేసుకొనే అవకాశాన్ని పెట్టుబడికి కల్పిస్తుంది.

కాబట్టి పారిశ్రామిక పెట్టుబడి ఆవృత్తి ధరించే పూర్తిగా ఏకముఖమైన, ఆ విధంగా అత్యంత ప్రస్ఫుటమైన, స్వీయ లక్షణ లక్షితమైన రూపం డబ్బు పెట్టుబడి ఆవృత్తే. పారిశ్రామిక పెట్టుబడి లక్ష్యమూ, ఒత్తిడి పెట్టే ఉద్దేశమూ విలువ స్వయం విస్తరణ, డబ్బు చేసుకోవడం, ధన సంచయనం. కనుక ఆ లక్ష్యమూ, ఉద్దేశమూ ఆవిధంగా కొట్టవచ్చినట్లు వెల్లడి అవుతుంది. (అది ఎక్కువ ధరకు అమ్ముకొనేందుకు కొనడం) డ–స మొదటిదశగా ఉందన్న వాస్తవాన్ని బట్టి ఉత్పాదక పెట్టుబడి అంతర్భాగాలు సరుకు మార్కెట్‌లోనుంచి వస్తున్నాయనీ, పెట్టుబడిదారీ ఉత్పత్తి ప్రక్రియ సర్వత్రా చలామణిపై, వాణిజ్యంపై ఆధారపడి వుందనీ కూడా వెల్లడి అవుతుంది. డబ్బు పెట్టుబడి ఆవృత్తి కేవలం సరుకుల ఉత్పత్తి మాత్రమే కాదు; అసలు ఆ ఆవృత్తి చలామణి ద్వారా మాత్రమే జరగడానికి వీలుంది; దానిలో చలామణి గర్భితం. చలామణికి చెందిన డ రూపం మదుపు పెట్టిన పెట్టుబడి

విలువ యొక్క మొట్టమొదటి, స్వచ్ఛమైన రూపంగా రంగంపైకి వస్తుందన్న ఒక్క వాస్తవాన్ని బట్టి చూచినా, ఇది స్పష్టమే. తక్కిన రెండు ఆవృత్తి రూపాల్లో ఇలా లేదు.

డబ్బు పెట్టుబడి ఆవృత్తే ఎల్లప్పుడూ, పారిశ్రామిక పెట్టుబడి యొక్క సార్వత్రిక అభివ్యక్తీకరణగా వుంటుంది. ఎందువల్లనంటే, మదుపు పెట్టిన విలువ స్వయం విస్తరణ అందులో ఎల్లప్పుడూ చేరి వుంటుంది. ఉపె....ఉపెలో పెట్టుబడి యొక్క డబ్బు రూపం, ఉత్పత్తి మూల ద్రవ్యాల వెలగా మాత్రమే గోచరిస్తొంది; కాబట్టి లెక్కల్లో చూపే డబ్బు రూపంలో వ్యక్తమయ్యే విలువగా గోచరిస్తుంది. ఈ రూపంలో అది జమాఖర్చుల చిట్టాలో (Book keeping) నమోదవుతుంది.

కొత్తగా కార్యరంగంలో ప్రవేశించిన పెట్టుబడి మొదట డబ్బు రూపంలో మదుపు పెట్టి, తరువాత దాన్ని – ఒక పారిశ్రామిక శాఖ నుంచి మరో శాఖకు బదలాయించడం ద్వారానో, వ్యాపారం నుంచే పారిశ్రామిక పెట్టుబడిని వెనక్కు తీసుకోవడం ద్వారానో అదే రూపంలో ఉపసంహరించు కొన్నప్పుడు, డ....డ' పారిశ్రామిక పెట్టుబడి యొక్క ఆవృత్తికి ఒక ప్రత్యేక రూపమవుతుంది. మొదట డబ్బు రూపంలో మదుపు పెట్టిన అదనపు విలువ పెట్టుబడిగా పని చేయటం కూడా ఇటువంటిదే. అదనపు విలువ మొదట ఏ వ్యాపారంలో ఉత్పన్నమైందో, దానిలో కాకుండా మరో వ్యాపారంలో పని చేసినప్పుడు ఇది అతి స్పష్టంగా కనిపిస్తుంది. డ....డ' ఒకానొక పెట్టుబడి యొక్క మొదటి ఆవృత్తిగా వుండవచ్చు, లేదా అదే ఆఖరుదీ కావచ్చు. అది మొత్తం సామాజిక పెట్టుబడి రూపంగా పరిగణింప బడవచ్చు; డబ్బు రూపంలో ఇటీవల సంచితమైన పెట్టుబడిని, లేదా ఒక పారిశ్రామిక శాఖ నుంచి మరో పారిశ్రామిక శాఖకు బదలాయించేందుకై పూర్తి డబ్బుగా మార్చబడిన ఏదో ఒక పాత పెట్టుబడిని కొత్తగా మదుపు పెట్టినప్పటి పెట్టుబడి రూపమది.

అన్ని ఆవృత్తుల్లోనూ ఎల్లప్పుడూ వున్న రూపం కాబట్టి, డబ్బు పెట్టుబడి, అదనపు విలువను సృష్టించే పెట్టుబడి భాగం విషయంలోనే, అంటే అస్థిర పెట్టుబడి విషయంలోనే ఈ ఆవృత్తిని నిర్వహిస్తుంది. డబ్బు చెల్లింపు వేతనాలను అందజేసే మామూలు రూపం. కార్మికునికి రెక్కాడితే గానీ డొక్కాడదు కాబట్టి, ఈ చెల్లింపు సాపేక్షంగా తక్కువ వ్యవధుల్లో మళ్ళీ మళ్ళీ చేయవలసి వుంటుంది. అందువల్ల పెట్టుబడిదారు కార్మికునితో ఎల్లప్పుడూ డబ్బు పెట్టుబడిదారుగానూ, అతని పెట్టుబడి డబ్బు పెట్టుబడిగానూ వ్యవహరించవలసి వుంటుంది. ఉత్పత్తి సాధనాల కొనుగోలులోనూ, ఉత్పత్తి అయిన సరుకుల అమ్మకంలోనూ వున్నట్లుగా, ఈ సందర్భంలో జమాఖర్చుల లెక్కలను ప్రత్యక్షంగా గానీ, పరోక్షంగా గానీ తేల్చి చూచుకోవడం వుండదు. (ఈ కొనుగోలు, అమ్మకాల్లో డబ్బు పెట్టుబడిలో అధిక భాగం, ఆచరణలో సరుకుల రూపంలో మాత్రమే వుంటుంది; డబ్బు చిట్టాలో కెక్కిన డబ్బు రూపంలోనూ వుంటుంది) మరోవైపు, అస్థిర పెట్టుబడి నుంచి ఉత్పన్నమైన అదనపు విలువలో కొంత భాగాన్ని పెట్టుబడిదారు తన వ్యక్తిగత వినియోగానికి ఖర్చు చేస్తాడు. ఇది చిల్లర వర్తకానికి సంబంధించిన విషయం. ఎన్ని సుళ్ళు తిరిగినా, ఈ భాగం ఎల్లప్పుడూ నగదు రూపంలోనే, అదనపు విలువ యొక్క డబ్బు రూపంలోనే వ్యయమవుతుంది. అదనపు విలువలోని ఈ భాగం పెద్దదా, చిన్నదా అనేది ఇక్కడ సమస్య కాదు. అస్థిర పెట్టుబడి ఎల్లప్పుడూ వేతనాల్లో (డ–శ్ర) మదుపు పెట్టిన డబ్బు పెట్టుబడిగానూ, ధ పెట్టుబడిదారు వ్యక్తిగత వినియోగపు ఖర్చులకై వెచ్చించిన అదనపు

విలువగానూ ఎప్పటికప్పుడు కొత్తగా సాక్షాత్కరిస్తాయి. కాబట్టి, మదుపు పెట్టిన అస్థిర పెట్టుబడి విలువ అయిన డ ను, దాని పెరుగుదల అయిన ధ ను, డబ్బు రూపంలో వ్యయం చేయడానికై ఆ రూపంలోనే ఉంచుకోక తప్పదు.

డ-స....ఉపె....స' - డ', ఈ సూత్రాన్ని, తత్ఫలితమైన డ' = డ+ధతో పాటు తీసుకొని చూస్తే, దాని రూపం నిజాన్ని కప్పిపుచ్చుతుంది; దాని స్వభావం భ్రాంతిని కలుగజేస్తుంది. కారణమేమిటంటే, మదుపు పెట్టిన స్వయం విస్తృతమైన విలువ దాని సమతుల్యమైన డబ్బు రూపంలో వుంది. ఇక్కడ ప్రాధాన్యమున్నది విలువ స్వయం విస్తరణకు కాదు, ఈ ప్రక్రియ యొక్క డబ్బు రూపానికి, చలామణిలో మొదట్లో వుంచిన దానికన్నా ఎక్కువ విలువను డబ్బు రూపంలో ఆఖరున, దాని నుంచి రాబట్టడం జరిగిందన్న వాస్తవానికి ఇది ప్రాముఖ్యమిస్తుంది. కాబట్టి, పెట్టుబడిదారుకు చెందిన బంగారం, వెండి ఇబ్బడి ముబ్బడిగా పెరగటానికి ప్రాముఖ్యమిస్తుందన్న మాట. ద్రవ్య వ్యవస్థ అనేది కేవలం డ-స-డ' అనే అసంబద్ధ రూపం యొక్క వ్యక్తీకరణే. ఇది కేవలం చలామణిలోనే సాగే గమనం కాబట్టి, డ-స, స-డ' అనే రెండు క్రియల్లోని రెండవ దానిలో స తన విలువకన్నా ఎక్కువ విలువకు అమ్మకమైందని, కాబట్టి స కొనుగోలు వల్ల చలామణిలో ప్రవేశించిన దానికన్నా ఎక్కువ డబ్బును చలామణి నుంచి రాబట్టడం జరిగిందనీ చెప్పడం ద్వారా తప్ప మరే విధంగానూ ద్రవ్య వ్యవస్థ ఆ క్రియలను వివరించజాలదు. కానీ ఏకైక రూపంగా నిర్ధారణ అయిన డ - స...ఉ పె...స' - డ' మరింత ఎక్కువ అభివృద్ధి చెందిన వ్యాపార వ్యవస్థకు ప్రాతిపదికగా వుంది. దానిలో సరుకుల చలామణి మాత్రమే కాక, వాటి ఉత్పత్తి కూడా అవశ్య అంశంగా గోచరమవుతుంది.

డ-స....ఉపె....స'-డ' ఒక్కసారి మాత్రమే సంభవించేదే తప్ప, ధారావాహికంగా జరిగేదీ, సదా పునఃప్రారంభమయ్యేదీ కాదనీ, అందువల్ల ఈ రూపం, ఆవృత్తి యొక్క ఏకైక రూపమే తప్ప, దాని రూపాల్లో ఒకటి కాదనీ నిర్ధారణ చేసినప్పుడు, దానికా భ్రాంతి జనక లక్షణముంటుంది; తదనుగుణమైన భ్రాంతిజనక అర్థమూ వుంటుంది. కానీ ఈ రూపమే ఇతర రూపాలను సూచిస్తుంది.

మొదటి విషయం. ఈ మొత్తం ఆవృత్తిలో ఉత్పత్తి ప్రక్రియ యొక్క పెట్టుబడిదారీ లక్షణం గర్భితం. కాబట్టి ఆ ఆవృత్తి ఈ ప్రక్రియనూ, దాన్ని ఆవిర్భవింపచేసిన నిర్దిష్ట సామాజిక పరిస్థితులను ప్రాతిపదికగా పరిగణిస్తూంది. డ - స = డ-స < $\frac{\text{శ్రమ}}{\text{ఉ.సా.}}$; కానీ డ-శ్ర లో వేతన శ్రామికుని ఉనికీ, తత్కారణంగా ఉత్పాదక పెట్టుబడిలో భాగంగా ఉత్పత్తి సాధనాల ఉనికీ వూహ్యం. కాబట్టి, శ్రమ, ప్రక్రియ, స్వయం విస్తరణ, ఉత్పత్తి ప్రక్రియ ఇది పెట్టుబడి విధి అనేది డ-శ్ర లో వూహ్యం.

రెండవ విషయం. డ.....డ' మళ్లీ జరిగినట్లయితే, డబ్బు రూప పునర్ధారణ మొదటిదశలో డబ్బు రూపమున్నంత క్షణికమైనదిగా కనిపిస్తుంది. ఉపెకు స్థానం కల్పించి డ-స అదృశ్యమవుతుంది. డబ్బు రూపంలో నిరంతరం మదుపు పెట్టడం, మళ్లీ మళ్లీ డబ్బు రూపంలో చేతికందడం ఈ ఆవృత్తిలోని కేవల క్షణిక ఘటనలుగా కనిపిస్తాయి.

మూడవ విషయం. డ-స...ఉపె...డ'-స. స.-డ...ఉపె...డ'-స. డ-స...ఉపె...వగైరా.

M-C....P....C' - M. M-C... P...C' - M'. M-C... P... etc.

ఆవృత్తి రెండవసారి పునఃప్రారంభమయినది మొదలుకొని, ఉపె....స' –డ', ద –స...ఉపె అనే ఆవృత్తి, ద యొక్క రెండవ ఆవృత్తి పూర్తికాక ముందే జరుగుతుంది; తదుపరి ఆవృత్తులన్నిటినీ ఉపె....స'–ద–స...ఉపె అన్న రూపంగా పరిగణించవచ్చు. ఫలితంగా, ద–స మొదటి ఆవృత్తి ప్రథమ దశ కాబట్టి, అది ఉత్పాదక పెట్టుబడి యొక్క నిరంతర పునరావృత్తికి కేవలం తాత్కాలికంగా జరిగిన సన్నాహం మాత్రమే. డబ్బు పెట్టుబడి రూపంలో మొదటిసారిగా మదుపు పెట్టిన పారిశ్రామిక పెట్టుబడి విషయంలో నిజానికి జరిగేదిదే.

కానీ, ఉపె రెండవ ఆవృత్తి పూర్తికాక ముందే, సరుకు పెట్టుబడి మొదటి ఆవృత్తి, స'–డ'. ద– స....ఉపె....స' (క్లుప్తంగా చెప్పాలంటే స'....స') పూర్తి అయి వుంటుంది. ఆ విధంగా మొదటి రూపంలో అప్పటికే ఇతర రెండు రూపాలున్నాయి. ఆ విధంగా డబ్బు రూపం కేవలం విలువ వ్యక్తీకరణగానే కాక, సమతుల్య రూపంలో, అంటే డబ్బు రూపంలో విలువ వ్యక్తీకరణగా వున్న మేరకు, అది అదృశ్యమవుతుంది.

ఆఖరు విషయం. కొత్తగా మదుపు పెట్టిన ఏదో ఒక వ్యష్టి పెట్టుబడి మొదటి సారిగా ద – స....ఉపె....స' – డ' అనే ఆవృత్తిని సాగిస్తుందనుకొందాం. అప్పుడు ఈ వ్యష్టి పెట్టుబడి ఉత్తరోత్తరా గడిచే ప్రథమ ఉత్పాదక ప్రక్రియకు ద–స సన్నాహక దశ, తదాగమన సూచిక. అందువల్ల, ఈ దశ, అంటే ద–స ఉత్పాదక ప్రక్రియలో గర్భితం కాదు; అది పైపెచ్చు ఉత్పాదక ప్రక్రియ వల్ల నిర్దేశితమవుతుంది, అవసరమవుతుంది. కానీ ఇది ఈ వ్యష్టి పెట్టుబడికి మాత్రమే వర్తిస్తుంది. పెట్టుబడిదారీ ఉత్పత్తి పద్ధతి ఉందనుకొన్నప్పుడు, తత్కారణంగా పెట్టుబడిదారీ ఉత్పత్తి నిర్ధారించిన సామాజిక పరిస్థితులున్నాయనుకున్నప్పుడు, పారిశ్రామిక పెట్టుబడి ఆవృత్తి సాధారణ రూపం డబ్బు పెట్టుబడి ఆవృత్తే. కాబట్టి కొత్తగా మదుపు పెట్టిన పారిశ్రామిక పెట్టుబడి, డబ్బు పెట్టుబడిగా నిర్వహించే మొదటి ఆవృత్తిలో కాకపోయినా దాని వెలుపల అయినా, పెట్టుబడిదారీ ఉత్పత్తి ప్రక్రియ ప్రాథమికావసరం. ఈ ఉత్పత్తి ప్రక్రియ నిరంతరం కొనసాగుతూందంటే, ఉపె....ఉపె ఆవృత్తి స్థిరంగా మళ్ళీ మళ్ళీ సాగుతూందన్న మాటే. మొదటి దశ ద–స < శ్రమ / ఉ.సా. లో సైతం, మనం ఊహించుకొన్న ఈ ప్రాథమికావసరానికి కొంత పాత్ర వుంది. ఎందువల్లనంటే, ఒకవైపు వేతన కార్మికుల వర్గం వుందనేది అందులో గర్భితం. మరోవైపు ఉత్పత్తి సాధనాల కొనుగోలుదారుకు ద–సగా (మొదటి దశ) వున్నది వాటి అమ్మకందారుకు స' – డ' అవుతుంది. కాబట్టి, స'లో సరుకు పెట్టుబడి గర్భితం; కాబట్టి, పెట్టుబడిదారీ ఉత్పత్తి ఫలితమైన సరుకులూ, తత్కారణంగా ఉత్పాదక పెట్టుబడి క్రియా స'లో గర్భితం.

★ ★ ★

## అధ్యాయం - 2

# ఉత్పాదక పెట్టుబడి ఆవృత్తి

# (The Circuit of Productive Capital)

ఉత్పాదక పెట్టుబడి ఆవృత్తి (Circuit) సాధారణ సూత్రమిది: ఉపె....స' –డ' – స'...ఉపె. ఉత్పాదక పెట్టుబడి క్రియ నియమిత వ్యవధుల్లో పునఃప్రారంభమవుతూంటుందని అది సూచిస్తుంది. అంటే, ఉత్పాదక పెట్టుబడి పునరుత్పత్తిని, లేక విలువ స్వయం విస్తరణ లక్ష్యంగా గల పునరుత్పత్తి ప్రక్రియగా సాగే దాని ఉత్పత్తి ప్రక్రియను సూచిస్తుంది; అదనపు విలువ ఉత్పత్తినే కాక, నియమిత వ్యవధుల్లో దాని పునరుత్పత్తిని, తన ఉత్పాదక రూపంలోని పారిశ్రామిక పెట్టుబడి క్రియను సూచిస్తుంది. ఈ క్రియ ఒక్కసారి మాత్రమే జరిగేది కాదు. నియమిత వ్యవధుల్లో మళ్లీ మళ్ళీ జరిగేది. అందువల్ల, ఉత్పాదక పెట్టుబడి క్రియ పునరారంభాన్ని దాని ప్రారంభ స్థానమే నిర్ణయిస్తుంది. స'లో ఒక భాగం (కొన్ని సందర్భాల్లో పారిశ్రామిక పెట్టుబడి మదుపునకు సంబంధించిన వివిధ శాఖల్లో) తనకు సరుకు రూపమిచ్చిన శ్రమ ప్రక్రియలోనే ఉత్పత్తి సాధనాలుగా నేరుగా తిరిగి ప్రవేశించవచ్చు. ఇందువల్ల, విలువలోని ఈ భాగాన్ని నిజమైన డబ్బుగా లేదా సంకేత రూపంలోని డబ్బుగా మార్చవలసిన అవసరం తప్పుతుందంతే. వేరు మాటల్లో చెప్పాలంటే, ఆ సరుకు చిట్టాకెక్కిన డబ్బుగా మాత్రమే స్వతంత్రంగా అభివ్యక్తమవుతుంది. విలువలోని ఈ భాగం చలామణిలో ప్రవేశించదు. ఈ విధంగా, చలామణి క్రమంలో ప్రవేశించని విలువలు ఉత్పత్తి ప్రక్రియలో ప్రవేశిస్తాయి. అదనపు ఉత్పాదితంలో భాగంగా పెట్టుబడిదారు వస్తు రూపంలో వినియోగించే స'లోని భాగానికి కూడా ఇదే వర్తిస్తుంది. కానీ ఇది పెట్టుబడిదారీ ఉత్పత్తి విషయంలో లెక్కలోకి రానంత స్వల్పంగా వుంటుంది. దీన్ని లెక్కలోకే తీసుకోవలసి వస్తే, ఒక్క వ్యవసాయ రంగంలో మాత్రమే పరిగణనకు తీసుకోదగినది.

ఈ రూపంలో రెండు విషయాలు వెంటనే కొట్టవచ్చినట్లు కనిపిస్తాయి.

మొదటి విషయం, ప్రథమ రూపమైన డ....డ'లో ఉపె క్రియ అయిన ఉత్పాదన ప్రక్రియ డబ్బు పెట్టుబడి చలామణికి అడ్డుతగులుతుంది; ఆ చలామణిలోని రెండు దశలైన డ–స కూ, స'–డ'కూ మధ్య కేవలం సంధానకర్తగా పనిచేస్తుంది. ఇక్కడ పారిశ్రామిక పెట్టుబడి యొక్క మొత్తం చలామణి ప్రక్రియ, చలామణి దశలో ఆ పెట్టుబడి మొత్తం గమనం, ఆవృత్తిని ప్రారంభించే ఉత్పాదక పెట్టుబడికీ, అదే రూపంలో ఆవృత్తిని పూర్తిచేసే ఆ ఉత్పాదక పెట్టుబడికీ మధ్య కేవలం అంతరాయంగా తత్కారణంగా వాటి మధ్య లంకెగా వుంది. ఉత్పాదక పెట్టుబడి ఆవృత్తిని ప్రారంభించిన రూపంలోనే దాన్ని పూర్తి చేస్తుంది కాబట్టి ఆ రూపంలో మళ్ళీ ఆవృత్తిని ప్రారంభిస్తుంది. అసలు

చలామణి, నియమిత వ్యవధుల్లో కొత్త పునరుత్పత్తికి తోడ్పడే సాధనంగా మాత్రమే కనిపిస్తుంది. ఈ పునఃప్రారంభం వల్ల పునరుత్పత్తి నిర్విరామంగా సాగుతుంది.

మరో విషయం, మొత్తం చలామణి, డబ్బు పెట్టుబడి ఆవృత్తిలో చలామణికి గల రూపానికి విరుద్ధమైన రూపంలో ప్రదర్శితమవుతుంది. డబ్బు పెట్టుబడి ఆవృత్తిలో చలామణి రూపమది. డ–స–డ (డ–స' స–డ). (ఇందులో విలువ నిర్ధారణను పరిగణనకు తీసుకోలేదు) ఇక్కడ ఆ రూపం స–డ–స (స–డ' డ–స) అంటే సరుకుల సాధారణ చలామణి రూపం – ఇక్కడా విలువ నిర్ధారణను పరిగణనకు తీసుకోలేదు.

## I. సామాన్య పునరుత్పత్తి

ఉపె....ఉపె -- ఈ రెండు ఆద్యంతాల మధ్య చలామణి రంగంలో జరిగే ప్రక్రియ, స'–డ'–సను మొదట పరిశీలించి చూద్దాం.

ఈ చలామణి ప్రారంభమయ్యేది, సరుకు పెట్టుబడి స'తో: స' = స+సపె = ఉపె+సపె. సరుకు పెట్టుబడి క్రియ అయిన స'–డ'ను దాని ఆవృత్తి మొదటి రూపంలో పరిశీలించాము. (దానిలో వున్న పెట్టుబడి విలువ, డబ్బు రూపంలో చేతికందినప్పుడు ఉపె కు సమానం. ఉపె ఇప్పుడు స'లోని స గా, స'లో నిక్షిప్తమై వున్న అదనపు విలువగా, ఈ అదనపు విలువ అదే పరిమాణంలోని సరుకుల అంతర్భాగంగా వుంది; దాని విలువ స.పె) అక్కడ ఈ క్రియ అడ్డుకోబడిన చలామణి రెండవ దశగా, మొత్తం ఆవృత్తి యొక్క ముగింపు దశగా వుంది. ఇక్కడ ఇది ఆవృత్తి రెండవ దశగానూ, కానీ చలామణి మొదటి దశగానూ వుంది. మొదటి ఆవృత్తి డ'తో ముగుస్తుంది. డ', ఆదిలో వున్న డ, ఈ రెండూ కూడా డబ్బు పెట్టుబడిగా మళ్ళీ రెండవ ఆవృత్తిని ప్రారంభించగలవు కాబట్టి, డ, డ'లో నిక్షిప్తమైన ధ (అదనపు విలువ) రెండూ కలిసికట్టుగా తమ గతిక్రమాన్ని కొనసాగిస్తాయా, లేక దేనికది తన సొంత గతిక్రమాన్ని అనుసరిస్తాయా అని పరిశీలించవలసిన అవసరం అప్పుడు కలుగలేదు. మొదటి ఆవృత్తి పునఃప్రారంభమైనప్పుడు దాని గతిక్రమాన్ని మనం గమనించి వుంటేనే ఇది అవసరమై వుండేది. కానీ ఈ విషయాన్ని ఉత్పాదక పెట్టుబడి ఆవృత్తిలో నిర్ణయించాల్సి వుంది. ఎందువల్లనంటే, దాని తొట్ట తొలి ఆవృత్తి నిర్ణయమయ్యేది, దీన్నిబట్టే. అంతేకాక, అందులో, స'–డ' చలామణి మొదటి దశగా వుంటుంది. డ–స చే ఆ చలామణి పూర్తికావలసి వుంటుంది. పై సూత్రం సాధారణ ఉత్పత్తిని సూచిస్తుందా, లేక విస్తృత స్థాయిలో పునరుత్పత్తిని సూచిస్తుందా అనేది ఈ నిర్ణయంపై ఆధారపడి వుంది. ఉత్పాదక పెట్టుబడి ఆవృత్తి స్వభావం, ఈ నిర్ణయానికి అనుగుణంగా మారుతుంది.

కాబట్టి మనం మొదట ఉత్పాదక పెట్టుబడి సామాన్య పునరుత్పత్తిని పరిశీలిద్దాం. పరిస్థితులు స్థిరంగా వుంటాయనీ, సరుకులు వాటి విలువలకే అమ్మకం, కొనుగోలు అవుతాయనీ మొదటి అధ్యాయంలో మనం ఊహించుకొన్నట్లుగానే, ఇక్కడా ఊహించుకొందాం.

ఈ ఊహను ప్రాతిపదికగా తీసుకొన్నప్పుడు, మొత్తం అదనపు విలువ పెట్టుబడిదారుని వ్యష్టి వినియోగంలో ప్రవేశిస్తుంది. సరుకు పెట్టుబడి స' డబ్బుగా పరివర్తన చెందిన వెంటనే, ఆ డబ్బులో పెట్టుబడి విలువగా వున్న భాగం పారిశ్రామిక పెట్టుబడి ఆవృత్తిలో చలామణి కావడం కొనసాగుతుంది. మిగతా భాగం, అంటే డబ్బుగా మారిన అదనపు విలువ సరుకుల సాధారణ చలామణిలో ప్రవేశిస్తుంది.

అది పెట్టుబడిదారు నుంచి ఉత్పన్నమైన డబ్బు చలామణి అవుతుంది; కానీ అది అతని వ్యక్తిగత పెట్టుబడి యొక్క చలామణి వెలుపల జరుగుతుంది.

మన ఉదాహరణలోని సరుకు పెట్టుబడి స' 500 పౌండ్ల సొమ్ము విలువ గల 10,000 పౌనుల తూకం నూలు. దీనిలో 422 పౌండ్లు ఉత్పాదక పెట్టుబడి విలువ; 8,440 పౌనుల నూలు యొక్క డబ్బు రూపంలో ఇది స' చే ప్రారంభించబడిన పెట్టుబడి చలామణిని కొనసాగిస్తుంది. కానీ 78 పౌండ్ల అదనపు విలువ, అంటే 1,560 పౌనుల అదనపు సరుకు ఉత్పాదితం (Commodity Product) యొక్క డబ్బు రూపం ఈ చలామణి నుంచి బయటికి పోయి, సరుకుల సాధారణ చలామణిలోనే వేరే గమనమార్గం అవలంబిస్తుంది.

$$\text{స}' \begin{pmatrix} \text{స} \\ + \\ \text{సపె} \end{pmatrix} \begin{matrix} - \\ -- \\ - \end{matrix} \quad \text{డ}' \begin{pmatrix} \text{డ} \\ + \\ \text{ధ} \end{pmatrix} \begin{matrix} \\ - \\ - \end{matrix} \begin{matrix} \\ \text{స} \\ \text{సపె} \end{matrix} \quad < \begin{matrix} \text{శ్రమ} \\ \text{ఉ.సా.} \end{matrix}$$

ధ – సపె అనేది, పెట్టుబడిదారు తన సొంతానికి, లేక తన కుటుంబానికి కావలసిన అసలు సరుకుల కోసం, లేదా వ్యక్తిగత సేవల కోసం వెచ్చించే డబ్బుతో చేసే కొనుగోళ్ళ పరంపరను సూచిస్తుంది. ఈ కొనుగోళ్ళు విడివిడిగా, వివిధ సమయాల్లో జరుగుతాయి. కాబట్టి ఈ డబ్బు వర్తమాన వినియోగానికి ఉద్దేశించిన సరఫరా రూపంలో, లేదా సంచిత నిధి రూపంలో (hoard) తాత్కాలికంగా వుంటుంది. ఎందువల్లనంటే, డబ్బు చలామణికి అంతరాయమేర్పడినప్పుడు ఆ డబ్బు సంచిత నిధి రూపం ధరిస్తుంది. చలామణికి సాధనంగా అది నిర్వహించే నిధి (తాత్కాలిక సంచిత నిధి రూపం కూడా ఇందులో చేరివుంది) డబ్బు రూపంలో పెట్టుబడి డ యొక్క చలామణిలో ప్రవేశించదు. ఈ డబ్బు మదుపు పెట్టుబడదు, వ్యయమవుతుంది.

మదుపు పెట్టిన మొత్తం పెట్టుబడి ఎల్లప్పుడూ ఒక దశను గడిచి మరొక దశను సంపూర్ణంగా చేరుకొంటుందని ఊహించుకొన్నాము. కాబట్టి, ఉపె ఉత్పత్తి చేసే సరుకులు ఉత్పాదక పెట్టుబడి ఉపె యొక్క మొత్తం విలువకు, లేదా 422 పౌండ్లూ + ఉత్పాదక ప్రక్రియలో సృష్టి అయిన 78 పౌండ్ల అదనపు విలువకు ప్రాతినిధ్యం వహిస్తాయని ఇక్కడ కూడా ఊహించుకొంటున్నాము. మన ఉదాహరణలోని సరుకు విడివిడిగా వుంటుంది. దానిలో ఈ అదనపు విలువ 1,560 పౌనుల నూలు రూపంలో వుంటుంది. ఒక పౌను నూలును ప్రాతిపదికగా చేసుకొని లెక్కగడితే, అది 2.496 ఔన్సుల నూలు రూపంలో వుంటుంది. కానీ ఈ సరుకు ఉదాహరణకు, 500 పౌండ్లు విలువ చేసే యంత్రమనీ, దాని విలువ యంత్రమంతటా సమానంగా విస్తరించి వుందనీ అనుకుందాం. ఈ యంత్రం విలువలో భాగమైన 78 పౌండ్లు అదనపు విలువగా వుంటుంది. కానీ ఈ 78 పౌండ్లు మొత్తం యంత్రమంతటా నిక్షిప్తమై వుంటుంది. ఈ యంత్రాన్ని ముక్కలుగా పగులగొట్టి ఆ విధంగా దాని ఉపయోగపు విలువతో పాటు దాని విలువను కూడా నాశనం చేస్తే తప్ప, ఈ యంత్రాన్ని పెట్టుబడి విలువ కింద అదనపు విలువ కింద విభజించలేము. కాబట్టి, ఈ విలువలోని ఈ రెండు భాగాలను సరుకులోని భాగాలుగా కేవలం ఊహించుకోగలమే తప్ప, 10,000 పౌనుల నూలు నుంచి వేరుచేయ వీలున్న స్వతంత్ర అంతర్భాగమైన ఒక పౌను నూలులాగా, స' సరుకులోని స్వతంత్ర భాగంగా విడదీసి చూపలేము. మొదటి ఉదాహరణలో, మొత్తం సరుకును అంటే, సరుకు పెట్టుబడిని, అంటే యంత్రాన్ని మొత్తంగా

అమ్మితే తప్ప, ధ తన సొంత చలామణిలో ప్రవేశించజాలదు. కానీ పెట్టుబడిదారు 8,440 పౌనుల నూలును అమ్మినప్పుడు, మిగతా 1,560 పౌనుల నూలు అమ్మకం, సపె (1560 పౌనులు) – ధ (78 పౌండ్లు) – స (వినియోగ వస్తువులు) రూపంలో, అదనపు విలువ విడిగా నిర్వహించే చలామణి అవుతుంది. కానీ 10,000 పౌనుల నూలు (ఉత్పాదితం) లోని ప్రతి విడి విడి భాగపు విలువలను ఆ ఉత్పాదిత భాగాలచే సూచించవచ్చు; మొత్తం ఉత్పాదితం చేత కూడా సూచించవచ్చు. 10,000 పౌనుల నూలును స్థిర పెట్టుబడి విలువ (స్థి.పె)గానూ (అంటే 372 పౌండ్ల వెల చేసే 7,440 పౌనుల నూలుగా), అస్థిర పెట్టుబడి విలువ (అ.పె)గానూ, (అంటే 50 పౌండ్ల వెల చేసే 1000 పౌనుల నూలుగానూ) అదనపు విలువ (అ.వి)గానూ, (అంటే, 78 పౌండ్ల వెల చేసే 1,560 పౌనుల నూలుగా) విభజించ వీలుంది. అదే విధంగా ప్రతి పౌను నూలును 8.928 పెన్నీల వెల చేసే 11.906 ఔన్సుల నూలుకు సమానమైన స్థిపె గానూ, 1.200 పెన్నీల విలువ చేసే 1.600 ఔన్సుల నూలుకు సమానమైన అపె గానూ, 1.872 పెన్నీల వెల చేసే 2.496 ఔన్సుల నూలుకు సమానమైన అదనపు విలువగానూ విభజించవచ్చు. పెట్టుబడిదారు 10,000 పౌనుల నూలులోని వివిధ భాగాలను ఒకదాని తరువాత మరొకటి అమ్మవచ్చు కూడా. వాటిలో నిక్షిప్తమై వున్న అదనపు విలువలోని భాగాలను వరుసగా వినియోగించవచ్చు. ఆ విధంగా వరుస క్రమంలోనే స్థిపె+అపె మొత్తాన్ని డబ్బు రూపంలో పొందవచ్చు. కానీ తుదకంటా విడమర్చి చూస్తే, ఈ చర్యలో కూడా మొత్తం 10,000 పౌనుల నూలు అమ్మకమవుతుందనీ, కాబట్టి స్థిర పెట్టుబడి, అస్థిర పెట్టుబడుల విలువ 8,840 పౌనుల నూలు అమ్మకం ద్వారా భర్తీ అవుతుందనీ ముందుగానే ఊహించుకొంటున్నాము. (సంపుటి I, కాపిటల్ – VII, 2).[1]

అదెలా వున్నా, స'లోని పెట్టుబడి విలువ, అదనపు విలువ రెండూ కూడా, స' – ధ' ద్వారా, విడదీయ వీలున్న ఉనికిని, వేరువేరు మొత్తాల్లో ఉనికిని సంతరించుకొంటాయి. ఈ రెండు సందర్భాల్లోనూ డ, ధలు, మునుపు సరుకు ధరగా స'లో ఒక ప్రత్యేకమైన, భావాత్మకమైన అభివ్యక్తీకరణ గల విలువ యొక్క పరివర్తిత రూపమే.

సపె–ధ–సపె సరుకుల సాధారణ చలామణిని సూచిస్తుంది. దీనిలోని మొదటి దశ అయిన సపె–ధ, సరుకు పెట్టుబడి చలామణి అయిన స'–ధ'లో చేరి వుంది. అంటే పెట్టుబడి ఆవృత్తిలో చేరి వుంది. కానీ ఆ దశను పూర్తి చేసే దశ అయిన ధ–సపె అలాకాక, ఆవృత్తికి వెలుపలనే వుండిపోతుంది. ఎందువల్లనంటే ఇది సరుకుల సార్వత్రిక చలామణిలోని వేరే ప్రక్రియ. స చలామణి, సపె చలామణి, అంటే పెట్టుబడి విలువ, అదనపు విలువల చలామణి, డ'గా స' పరివర్తన చెందిన తరువాత చీలి పోతుంది. దీన్ని బట్టి తేలుతున్నదిదీ :

మొదటి విషయం : స'–డ' = స' – (డ+ధ) ద్వారా సరుకు పెట్టుబడి డబ్బు రూపంలో చేతికందగా, స'–డ'లో ఇంకా ఒకే రాశిగా వున్న సరుకుల వల్ల ఐక్యంగా సాగుతున్న పెట్టుబడి విలువ, అదనపు విలువల గమనం విడిపో వీలవుతుంది; అప్పటినుంచీ, అవి విడి విడి మొత్తాలుగా స్వతంత్ర రూపాలు ధరిస్తాయి.

---

1. తెలుగు కూర్పు అధ్యాయం IX, 2 - సం.

రెండవది, ధ పెట్టుబడిదారుని ఆదాయంగా ఖర్చు కావడం వల్లనూ, డ, పెట్టుబడి విలువ విధిని నిర్వహించే రూపంగా తన ఆవృత్తిచే నిర్ణీతమైన గతిక్రమాన్ని కొనసాగించడం వల్లనూ అవి రెండూ వేరుపడితే, మొదటి క్రియ అయిన స'–డ'ను తదుపరి క్రియలైన డ–స, ధ–సపెల దృష్ట్యా రెండు భిన్న చలామణిలుగా చూపవచ్చు. అవి స–డ–స, సపె–ధ–సపె. ఈ రెండూ వాటి సార్వత్రిక రూపానికి సంబంధించినంత వరకు, సరుకుల మామూలు చలామణికి చెందినవి.

సందర్భవశాత్తు ఒక మాట – నిరంతరాయమూ, అవిభాజ్యమూ అయిన సరుకుల విషయంలో, వాటి విలువ యొక్క అంతర్భాగాలను భావాత్మకంగా విడదీయడం ఆచారం. ఉదాహరణకు, ప్రధానంగా పరపతిపై సాగే లండన్ భవన నిర్మాణ వ్యాపారంలో కాంట్రాక్టరుకు, నిర్మాణం పని అందుకొన్న దశను బట్టి, ముందు మొత్తం చెల్లించడం రివాజు. ఈ దశల్లో ఏదీ ఒక ఇల్లు కాదు. అప్పుడు యథార్థంగా వున్నది, ప్రారంభదశలో వున్న భావి గృహంలోని అంతర్భాగం మాత్రమే. అందువల్ల అది యథార్థంగా ఉన్నప్పటికీ, మొత్తం ఇంటిలోని భావాత్మక ఖండమే. అయినప్పటికీ, అదనపు బయానాకు (అడ్వాన్సుకు) పూచీగా ఉండగలిగినంత యథార్థమైనది. (ఈ అంశంపై కింది 12వ అధ్యాయం చూడండి.)

మూడవ విషయం. స, డలలో ఇంకా ఐక్యంగానే సాగుతున్న పెట్టుబడి విలువ, అదనపు విలువల గమనం పాక్షికంగా మాత్రమే విడిపోతే, (అదనపు విలువలో ఒక భాగం పెట్టుబడిదారుని ఆదాయంగా వ్యయం కానందువల్ల), లేక బొత్తిగా విడిపోనట్లయితే, పెట్టుబడి విలువ ఆవృత్తి పూర్తికాక ముందే ఆ విలువలో మార్పు వస్తుంది. మన ఉదాహరణలో ఉత్పాదక పెట్టుబడి విలువ 422 పౌండ్లకు సమానం. ఆ పెట్టుబడి, మాట వరుసకు 480 పౌండ్లుగానో, లేక 500 పౌండ్లుగానో డ–సను కొనసాగిస్తే, అప్పుడు అది తన ఆవృత్తి అనంతర దశలను, తన మునుపటి విలువకన్నా 58, లేక 78 పౌండ్లు ఎక్కువ విలువగల పెట్టుబడిగా గడుస్తుంది. దీనితోపాటు దాని విలువ అంతర్నిర్మాణంలో మార్పు రావచ్చు కూడా.

చలామణిలో రెండవ దశా, మొదటి ఆవృత్తి (డ–డ') యొక్క తుది దశ అయిన స'–డ', మన ప్రస్తుత ఆవృత్తిలో రెండవ దశగా సరుకుల చలామణిలో మొదటి దశగా వుంది. చలామణి సంగతికి వస్తే, అది డ'–స'తో పూర్తికావలసి వుంటుంది. కానీ స'–డ'కు ముందే స్వయం విస్తరణ ప్రక్రియ (ఈ సందర్భంలో ఉపె ప్రక్రియ మొదటి దశ) జరిగిపోవడమే కాకుండా, దాని ఫలితమైన సరుకు స' కూడా డబ్బు రూపంలో చేతికందింది. కాబట్టి పెట్టుబడి స్వయం విస్తరణా, విస్తృత పెట్టుబడి విలువకు ప్రతీక అయిన సరుకులు డబ్బుగా చేతికందడమూ స'–డ'లో పూర్తి అవుతాయి.

ఆ విధంగా మనం సామాన్య పునరుత్పత్తిని, అంటే డ–స నుంచి ధ–సపె పూర్తిగా వేరై పోతుందని ఊహించుకొన్నాము. సపె–ధ–సపె, స–డ–స, ఈ రెండు చలామణిలు వాటి సాధారణ రూపానికి సంబంధించినంత వరకు (ఆ కారణం వల్ల వాటి ఆద్యంతాలలో విలువకు సంబంధించిన ఎటువంటి భేదాలను చూపవు), సరుకుల చలామణిలే కాబట్టి, వాటిని నాటు అర్థశాస్త్రాన్ని అనుసరించి, పెట్టుబడిదారీ ఉత్పత్తి క్రమం కేవలం సరుకుల ఉత్పత్తిగా ఏదో ఒక విధమైన వినియోగానికి ఉద్దేశించిన ఉపయోగ విలువల ఉత్పత్తిగా భావించడం సులభమే. నాటు అర్థశాస్త్రం పొరపడి చెబుతున్నట్లుగా, భిన్న ఉపయోగపు విలువలు గల సరుకులను ఉత్పత్తి చేయడం తప్ప, లేదా అటువంటి

సరుకులుగా వాటిని మార్పిడి చేయడం తప్ప పెట్టుబడిదారుకు మరే ఉద్దేశమూ లేదని భావించడం సులభమే.

స' మొట్టమొదటి నుంచీనే సరుకు పెట్టుబడిగా పనిచేస్తుంది. పెట్టుబడిదారుని అదనపు విలువ (తత్కారణంగా అతని పెట్టుబడి) పెరిగే కొద్దీ, అతని వినియోగం పెరుగుతూపోవడానికి ఈ మొత్తం ప్రక్రియ ఉద్దేశమయిన ఇతోధిక ధనార్జన (అదనపు విలువ ఉత్పత్తి) ఆస్కారం లేకుండా చేయదు సరికదా, అది ఇందులో ఖచ్చితంగా అంతర్భాగమవుతుంది.

పెట్టుబడిదారుని ఆదాయపు చలామణిలో, అంటే ఉత్పత్తి అయిన సరుకు సపె (లేదా ఉత్పత్తి అయిన సరుకు స'లో తదనుగుణమైన భావాత్మక భాగం) ఆ ఆదాయాన్ని మొదట డబ్బుగా మార్చడానికీ, ఆ డబ్బును, వ్యక్తిగత వినియోగానికి ఉపయోగపడే పలు సరుకులుగా మార్చడానికీ మాత్రమే ఉపయోగపడుతుంది. కానీ ఈ సందర్భంలో మనం ఒక చిన్న విషయాన్ని విస్మరించరాదు. అదేమంటే, సపె పెట్టుబడిదారుకు ఏ మాత్రమూ ఖర్చు లేకుండా లభించిన సరుకు విలువ; అదనపు విలువ యొక్క మూర్తీభావం. ఆ కారణం వల్ల, అది ప్రారంభంలో సరుకు రూపంలోని పెట్టుబడి స'లో అంతర్భాగంగా రంగంపైకి వచ్చింది. ఈ సపె, దాని ఉనికి యొక్క స్వభావం వల్లనే, పెట్టుబడి విలువ ఆవృత్తి క్రమంతో ముడిపడి వుంది. ఈ ఆవృత్తి స్తంభించిపోనారంభిస్తే, లేదా చెదిరితే, సపె వినియోగం పరిమితం కావడం, లేదా పూర్తిగా ఆగిపోవడం మాత్రమే కాదు, సపె స్థానంలో రాగల సరుకుల అమ్మకానికి కూడా అదే గతిపడుతుంది. స'–డ' విఫలమైతే, లేదా స'లో కొంత భాగమే అమ్మకమైతే, అప్పుడు కూడా ఇలాగే జరుగుతుంది.

స' విలువలో, అంటే సరుకు పెట్టుబడిగా క్రియాత్మక రూపం ధరించిన పెట్టుబడిలో సపె భాగంగా ఉన్నంతవరకే, పెట్టుబడిదారుని ఆదాయపు చలామణి అయిన సపె–ధ–సపె పెట్టుబడి చలామణిలో ప్రవేశిస్తుందని ఇంతకుముందు చూశాం. కానీ ఆ ఆదాయం, పెట్టుబడిదారు మదుపు పెట్టిన పెట్టుబడి గమనం నుంచి ఉత్పన్నమైనప్పటికీ, ధ–సపె ద్వారా అది స్వతంత్రమైన వెనువెంటనే, తత్కారణంగా సపె–ధ–సపె రూపంలో ఆసాంతం, ఆ ఆదాయపు చలామణి ఆ పెట్టుబడి గమన క్రమంలో ప్రవేశించదు. పెట్టుబడి ఉనికిలో పెట్టుబడిదారుని ఉనికి గర్భితం; అతను అదనపు విలువను వినియోగించడంపై అతని ఉనికి ఆధారపడి వుంది – ఈ దృష్టితో చూచినప్పుడు పై ఆదాయపు చలామణి మదుపు పెట్టిన పెట్టుబడి గమనంతో ముడిపడి వుంది.

సాధారణ చలామణి లోపల స' ఉదాహరణకు నూలు, ఒక సరుకుగా మాత్రమే పనిచేస్తుంది. కానీ పెట్టుబడి చలామణిలోని ఒక అంశంగా అది సరుకు పెట్టుబడి క్రియను నిర్వహిస్తుంది. సరుకు పెట్టుబడి అనేది, పెట్టుబడి విలువ మారుతూ త్యజిస్తూ వుండే రూపం. ఈ నూలు ఒక వర్తకునికి అమ్మకమైన తరువాత, తన్ను ఉత్పత్తి చేసిన పెట్టుబడి ఆవృత్తి గమనం నుంచి నిర్గమిస్తుంది. కానీ ఒక సరుకుగా అది సార్వత్రిక చలామణి రంగంలో సదా చరిస్తూనే వుంటుంది. ఒకే రాశిగా వున్న ఈ సరుకు చలామణి నూలు ఉత్పత్తిదారుని పెట్టుబడి యొక్క స్వతంత్ర ఆవృత్తిలో ఒక దశగా ఇక ఉండనప్పటికీ, ఈ చలామణి కొనసాగుతుంటుంది. కాబట్టి, పెట్టుబడిదారు చలామణిలోకి ప్రవేశపెట్టిన సరుకుల రాశి నిజంగా, నిర్దిష్టంగా రూపాంతరీకరణ చెందుతుంది. అది, స–డ తుదకు అది వినియోగ రంగంలోకి దాని నిష్క్రమణను, ఈ సరుకు రాశి అతని సరుకు పెట్టుబడిగా పని చేసేటప్పటి దాని

రూపాంతరీకరణ నుంచి కాలరీత్యా, స్థలరీత్యా పూర్తిగా వేరుచేయ వీలుంది. పెట్టుబడి చలామణిలో సంభవించిన రూప పరివర్తన సాధారణ చలామణి రంగంలో ఇంకా జరగవలసే వుంటుంది.

ఈ నూలు ఏదో మరొక పారిశ్రామిక పెట్టుబడి ఆవృత్తిలోకి ప్రవేశిస్తే, దానివల్ల ఈ పరిస్థితి ఎంత మాత్రమూ మారదు. సామాజిక పెట్టుబడిలో భాగాలయిన స్వతంత్ర పెట్టుబడుల, అంటే వ్యష్టి పెట్టుబడుల సమాహారం యొక్క ఆవృత్తులు ఒకదానితో ఒకటి పెనవేసుకోవడమూ, పెట్టుబడిగా మార్కెట్‌లో ప్రవేశించకుండా, వ్యక్తిగత వినియోగంలో ప్రవేశించే విలువల చలామణి ఈ రెండూ కలిసి సాధారణ చలామణి అవుతాయి.

సాధారణ చలామణిలో భాగంగా వున్న పెట్టుబడి ఆవృత్తికీ, ఒక స్వతంత్ర ఆవృత్తిలో లంకెలుగా వున్న ఆవృత్తికీ మధ్య సంబంధమేమిటో, మున్ముందు ద+థకు సమానమైన ద' చలామణిని పరిశీలించేటప్పుడు తెలుసుకొంటాము. డబ్బు పెట్టుబడిగా ద పెట్టుబడి ఆవృత్తిని కొనసాగిస్తుంది. థ ఆదాయంగా ఖర్చయి (థ–సపె) సాధారణ చలామణిలో ప్రవేశిస్తుంది. కానీ పెట్టుబడి ఆవృత్తి నుంచి బయటికి వచ్చేస్తుంది. కానీ, దానిలో అదనపు డబ్బు పెట్టుబడి క్రియను నిర్వహించే భాగం మాత్రమే పెట్టుబడి ఆవృత్తిలో ప్రవేశిస్తుంది. సపె–థ–సపెలో డబ్బు కేవలం రూకగా ఉపయోగపడుతుంది. పెట్టుబడిదారుని వైయక్తిక వినియోగం ఈ చలామణి లక్ష్యం. పెట్టుబడి యొక్క ఆవృత్తిలో ప్రవేశించని ఈ చలామణిని – ఉత్పాదిత విలువలో ఆదాయంగా వినియోగమయ్యే భాగం యొక్క చలామణిని – పెట్టుబడి ఆవృత్తి లక్షణంగా చెప్పడం నాటు అర్థశాస్త్రజ్ఞుల బుద్ధిమాంద్యానికి మచ్చుతునక.

రెండవ దశ ద–సలో, ఉపెకు (ఈ దశలో పారిశ్రామిక పెట్టుబడి యొక్క ఆవృత్తిని ప్రారంభించే ఉత్పాదక పెట్టుబడి విలువకు) సమానమైన పెట్టుబడి విలువ ద మళ్ళీ ప్రత్యక్షమవుతుంది; తన అదనపు విలువను అది వదలించుకొని వుంటుంది. కనుక, డబ్బు పెట్టుబడి ఆవృత్తి మొదటి దశ ద–సలో దానికి ఉండిన పరిమాణంలోనే ఇప్పుడూ వుంటుంది. స్థాన భేదమున్నప్పటికీ, సరుకు పెట్టుబడి యొక్క ప్రస్తుత పరివర్తిత రూపమైన డబ్బు పెట్టుబడి మునుపటి పనినే నిర్వహిస్తుంది. ఉసా గానూ, శ్ర గానూ, అంటే ఉత్పత్తి సాధనాలుగానూ, శ్రమశక్తిగానూ పరివర్తన చెందుతుంది.

అందువల్ల సరుకు పెట్టుబడి క్రియా నిర్వహణ స'–ద'లో, సపె–థతో పాటుగా పెట్టుబడి విలువ స–ద దశను గడిచి, ఇప్పుడు తత్పూరక దశ ద–స < శ్రమ/ఉ.సా. లో ప్రవేశిస్తుంది. కాబట్టి దాని సంపూర్ణ చలామణి ఇదీ : స – ద – స < శ్రమ/ఉ.సా.

మొదటి విషయం : డబ్బు పెట్టుబడి, ద, Iవ రూపంలో (ఆవృత్తి ద.....ద'), పెట్టుబడి విలువ మదుపు పెట్టబడ్డ మొదటి రూపంలో రంగంపైకి వచ్చింది. మొదటి చలామణి దశ స'–ద'లో సరుకు పెట్టుబడి చెందిన రూపాంతరమైన డబ్బులో ఒక భాగంగా మొదటి నుంచీ ఇక్కడ సాక్షాత్కరిస్తూంది. కాబట్టి, సరుకుల అమ్మకం ద్వారా, ఉత్పాదక పెట్టుబడి ఉపె డబ్బు రూపంలోకి పరివర్తనగా మొదటి నుంచే కనిపిస్తుంది. డబ్బు పెట్టుబడి ఇక్కడ మొదటి నుంచే, పెట్టుబడి విలువ యొక్క ఆది రూపమూ కానీ, అంతిమ రూపమూ కాని రూపంలో వుంది. ఎందువల్లనంటే, స–ద దశను పూర్తి చేయగల ద–స దశ నిర్వహణ డబ్బు రూపాన్ని మళ్ళీ త్యజించడం ద్వారా మాత్రమే సాధ్యం. కాబట్టి, ద–సలో, ద–శ్రగా వున్న భాగం, శ్రమశక్తి కొనుగోలుకై మదుపుపెట్టిన డబ్బుగా మాత్రమే ఇప్పుడు కనిపించదు.

50 పౌండ్ల విలువ చేసే 1,000 పౌనుల నూలును డబ్బు రూపంలో శ్రమశక్తికై ఇచ్చే బయానాకు (Advance) సాధనంగా మాత్రమే కనిపిస్తుంది. ఇక్కడ మదుపు పెట్టిన డబ్బు, కార్మికుడు ఉత్పత్తి చేసే సరుకు విలువలో ఒక భాగానికి సమానమైన పరివర్తిత రూపం మాత్రమే. మరే కారణం వల్ల కాకపోయినా, కేవలం ఈ కారణం వల్ల, డ–స క్రియకు అర్థం డ–శ్ర కాబట్టి, అది డబ్బు రూపంలోని ఒక సరుకు స్థానంలో కేవలం, ఉపయోగపు రూపంలోని మరో సరుకును వుంచడం మాత్రమే కాదు; అందులో సాధారణ సరుకు చలామణితో నిమిత్తం లేని ఇతర అంశాలు కూడా చేరి వున్నాయి.

స' యొక్క రూపాంతరంగా డ' రంగం పైకి వస్తుంది. అసలు స', మునుపు ఉపె నిర్వహించిన క్రియ ఫలితం, అంటే ఉత్పత్తి క్రియ ఫలితం. అందువల్ల, మొత్తంగా డ', గత శ్రమకు డబ్బు రూపపు అభివ్యక్తీకరణ. మన ఉదాహరణలో, 500 పౌండ్ల విలువ చేసే 10,000 పౌనుల నూలు, వడికే ప్రక్రియ ఫలితం. దీనిలో 7,440 పౌనుల నూలు, మదుపు పెట్టిన 372 పౌండ్ల స్థిర పెట్టుబడికి (స్థిపె) సమానం. 1,000 పౌనుల నూలు, మదుపు పెట్టిన 50 పౌండ్ల అస్థిర పెట్టుబడికి (అపె) సమానం. 1,560 పౌనుల నూలు 78 పౌండ్ల అదనపు విలువ అ.వి.కి ప్రతీక. డ'లో మొదట వున్న 422 పౌండ్ల పెట్టుబడిని మాత్రమే మళ్ళీ మదుపు పెట్టినట్లయితే, ఇతర పరిస్థితులు యధాతథంగా వున్నప్పుడు తరువాత వారం డ–శ్రలో, కార్మికునికి ఆ వారంలో ఉత్పత్తి అయిన 10,000 పౌనుల నూలులో కొంత భాగం ముందుగా ఇవ్వబడుతుంది. (ఇది 1,000 పౌండ్ల నూలుకు డబ్బు రూపపు విలువ) స–డ ఫలితంగా, డబ్బు ఎల్లప్పుడూ గత శ్రమ యొక్క అభివ్యక్తీకరణే. తత్పూరక క్రియ అయిన డ–స సరుకు మార్కెట్‌లో వెంటనే జరిగినట్లయితే, అంటే, మార్కెట్‌లో వున్న వస్తువులకు మూల్యంగా డ చెల్లించబడినట్లయితే, ఇది మళ్ళీ గత శ్రమ ఒక రూపం నుంచి (డబ్బు) మరో రూపానికి (సరుకులు) మారడమే. కానీ డ–స కూ, స–డ కూ మధ్య కాల వ్యత్యాసముంటుంది. అవి అపురూపంగా ఒకేసారి జరగవచ్చు. ఉదాహరణకు, డ–స కార్యాన్ని నిర్వహించే పెట్టుబడిదారూ, ఈ కార్యం తనకు స–డగా వున్న పెట్టుబడిదారూ తమ సరుకులను ఒకరికొకరు ఒకేసారి సరఫరా చేసుకొని, డ ను, ఈ లావాదేవీల్లోని శేషాన్ని చెల్లించేందుకు మాత్రమే వినియోగించినప్పుడు ఇలా జరుగుతుంది. స–డ, డ–స కార్యాల మధ్య కాల భేదం ఇంచుమించు గణనీయంగా వుండవచ్చు. స–డ ఫలితంగా డ గత శ్రమకు ప్రతీక అయినప్పటికీ, డ–స క్రియలో అది అప్పటికింకా మార్కెట్‌కు చేరనట్టి, భవిష్యత్తులో మాత్రమే మార్కెట్‌కు రానున్నట్టి సరుకుల పరివర్తిత రూపానికి ప్రతీక కావచ్చు. ఎందువల్లనంటే, స కొత్తగా ఉత్పత్తి అయ్యే వరకు డ–స జరగనవసరం లేదు. అదే విధంగా స ఉత్పాదన కాలంలోనే ఉత్పత్తి అయ్యే సరుకులకు డ చిహ్నం కావచ్చు. అది వాటి డబ్బు రూపపు అభివ్యక్తీకరణ. ఉదాహరణకు, డ–స అనే మార్పిడిలో (ఉత్పత్తి సాధనాల కొనుగోలులో) బొగ్గు తవ్వకం కాకముందే దాన్ని కొనివేయవచ్చు. ధ ఆదాయంగా ఖర్చు కాకుండా, డబ్బు సంచయన పాత్ర వహించిన మేరకు, అది వచ్చే సంవత్సరం వరకు ఉత్పత్తి కాబోని పత్తికి ప్రతీక కావచ్చు. పెట్టుబడిదారుని ఆదాయం ఖర్చయ్యే క్రమానికి, అంటే ధ–సపెకు ఇదే వర్తిస్తుంది. ఇది వేతనాలకు, అంటే, మన ఉదాహరణలోని 50 పౌండ్లు సమానమైన శ్రమకు కూడా వర్తిస్తుంది. ఈ డబ్బు కార్మికుని గత శ్రమ యొక్క రూపం మాత్రమే కాదు. అదే సమయంలో అది, అప్పుడప్పుడే వాస్తవ రూపం ధరిస్తున్న లేదా భవిష్యత్తులో వాస్తవ రూపం ధరించగల వర్తమాన, లేదా భావిశ్రమకు డబ్బు

చెల్లింపు పత్రం (డ్రాఫ్ట్). కార్మికుడు తన వేతనంతో, వచ్చేవారం వరకు తయారుకాని ఒక కోటును కొనవచ్చు. చెడిపోకుండా నివారించడానికై ఉత్పత్తి అయిన వెంటనే అప్పటికప్పుడు వినియోగించ వలసిన అనేకానేక జీవితావసరాలకు ఇది ప్రత్యేకించి వర్తిస్తుంది. ఆ విధంగా, కార్మికునికి వేతనంగా చెల్లించబడిన డబ్బు ద్వారా అతనికి అందేది అతని లేదా, ఇతర కార్మికుల భావి శ్రమ యొక్క పరివర్తిత రూపమన్న మాట. కార్మికునికి అతని గత శ్రమలో ఒక భాగాన్ని ఇవ్వడం ద్వారా, పెట్టుబడిదారు అతని భావి శ్రమపై ఒక డ్రాఫ్టు ఇస్తున్నాడు. కాబట్టి కార్మికుని వర్తమాన, లేదా భావి శ్రమ, ఇంకా ఉనికిలోకి రాని నిధి అవుతుంది. అతని గత శ్రమకై చెల్లించేది దానినుంచే. ఈ సందర్భంలో నిల్వ చేయడం అన్న భావమే పూర్తిగా అదృశ్యమవుతోంది.[1]

రెండవ విషయం. స–డ–స < శ్రమ / ఉ.సా. అనే చలామణిలో ఒకే డబ్బు రెండుసార్లు తన స్థానం మారుస్తుంది. మొదట అమ్మకందారుగా పెట్టుబడిదారుకు అది అందుతుంది. తరువాత అతడు దాన్ని కొనుగోలుదారుగా ఇచ్చివేస్తాడు. డబ్బు రూపంలోకి సరుకుల పరివర్తన, ఆ డబ్బు తిరిగి సరుకు రూపానికి పరివర్తన చెందడానికే ఉపయోగపడుతుంది. కాబట్టి, పెట్టుబడి యొక్క డబ్బు రూపం, డబ్బు పెట్టుబడిగా దాని ఉనికి, ఈ గమనంలో ఒక తాత్కాలిక దశ మాత్రమే. లేక ఈ గమనం నిరాఘాటంగా సాగుతున్నందువల్ల డబ్బు పెట్టుబడి, చలామణికి వాహికగా మాత్రమే అగుపిస్తుంది. అప్పుడది కొనుగోలుకు సాధనంగా పనిచేస్తుంది. పెట్టుబడిదారులు ఒకరి నుంచి మరొకరు కొంటుంటారు కాబట్టి, తమ లావాదేవీ లెక్కలను ఫైనల్ చేసుకోవలసివున్నప్పుడు మాత్రమే ఆ డబ్బు అసలైన చెల్లింపు సాధనంగా పని చేస్తుంది.

మూడవ విషయం : డబ్బు పెట్టుబడి కేవలం చలామణికి వాహికగా ఉన్నా, లేదా చెల్లింపు సాధనంగా ఉన్నా, అది నిర్వహించే పని స స్థానంలో శ్ర, ఉసా లను తీసుకురావడం మాత్రమే, అంటే, నూలు స్థానంలో, ఉత్పాదక పెట్టుబడి ఫలితమైన ఆ సరుకు స్థానంలో (ఆదాయంగా వాడే అదనపు విలువను మినహాయించుకొన్న తరువాత) దాని ఉత్పత్తి మూలకాలను తీసుకురావడమే. వేరు మాటల్లో చెప్పాలంటే, సరుకు రూపంలో ఉన్న పెట్టుబడి విలువను ఈ సరుకును నిర్మించే మూలకాలుగా తిరిగి మార్చడమే. తుదకంటా విశ్లేషించి చూస్తే, సరుకు పెట్టుబడిని ఉత్పాదక పెట్టుబడిగా తిరిగి మార్చడానికి మాత్రమే డబ్బు పెట్టుబడి క్రియ తోడ్పడుతుంది.

ఆవృత్తి మామూలుగా పూర్తి కావాలంటే, స'ను యావత్తూ, దాని విలువకు అమ్మాలి. అంతే కాదు, స–డ–స లో, కేవలం ఒక సరుకు స్థానంలో మరో సరుకు రావడమే కాక, అలా రావడంలో విలువ సంబంధాలు యథాతథంగా వుంటాయనేది కూడా గర్భితం. ఇక్కడ ఇలాగే జరుగుతుందని మనం ఊహించుకొంటున్నాము. కానీ వాస్తవంలో ఉత్పాదక సాధనాల విలువలు మారుతుంటాయి. విలువ సంబంధాలు నిరంతరం మారటం ఖచ్చితంగా, పెట్టుబడిదారీ ఉత్పత్తి ప్రత్యేకత; తక్కిన విషయాలను అలా వుంచినా, శ్రమ ఉత్పాదకత ఎల్లప్పుడూ మారుతూండటం ఈ ఉత్పత్తి విధాన లక్షణం కావడం ఇందుకు కారణం. ఉత్పత్తి మూలకాల విలువలో వచ్చే ఈ మార్పును గురించి

1. ఇక్కడ మార్క్స్ రాతప్రతిలో కింది వివరణ ఇచ్చాడు; "కానీ ఇదంతా రెండవ సంపుటి ఆఖరు భాగానికి సంబంధించినది." - సం.

మున్ముందు చర్చిస్తాము.[1] ఇక్కడ దీన్ని కేవలం పేర్కొంటున్నాము. ఉత్పత్తి మూలకాలు సరుకు రూపంలోని ఉత్పాదితాలుగా పరివర్తన చెందడం, ఉపె స'గా పరివర్తన చెందడం ఉత్పత్తి రంగంలో జరుగుతుంది; ఉపెగా స' పునఃపరివర్తన చలామణి రంగంలో జరుగుతుంది. కేవలం సరుకుల రూపవర్తన ద్వారా ఇది జరుగుతుంది. కానీ దాని సారభూతాంశం మొత్తం పునరుత్పత్తి ప్రక్రియలో ఒక దశ. స–డ, స పెట్టుబడి చలామణి రూపం కాబట్టి, అందులో క్రియా నిర్ణీతమైన పదార్థపు మార్పిడి అంతర్లీనంగా వుంది. అంతేకాక, స–డ–స అన్న పరివర్తన జరగాలంటే, సరుకు రాశి అయిన స' ను ఉత్పత్తి చేసే మూలకాలకు స సమానంగా ఉండాలి; ఈ మూలకాల పరస్పర విలువ సంబంధాలు మునుపున్నట్లుగానే ఉండాలి. కాబట్టి సరుకులు వాటి వాటి విలువలకే కొనుగోలు అవుతాయనే కాక, ఆ ఆవృత్త గమనంలో వాటి విలువలు మారవని కూడా ఊహించుకొంటున్నాము. లేకపోతే, ఈ ప్రక్రియ మామూలుగా కొనసాగజాలదు.

డ....థ లో, డ పెట్టుబడి మొదటి రూపం. ఈ రూపత్యజం (discarded) జరిగేది దాని పునర్థారణకే. ఉపె ...స'–డ–స .... ఉపెలో, డ ఈ ప్రక్రియలో ధరించి, అది పూర్తిగాక ముందే త్యజించే ఒక రూపాన్ని సూచిస్తుంది. ఇక్కడ డబ్బు రూపం పెట్టుబడి విలువ యొక్క ఒక తాత్కాలిక, స్వతంత్ర రూపంగా రంగంపైకి వస్తుంది. స' రూపంలోని పెట్టుబడి డబ్బు రూపాన్ని ధరించడానికి ఎంత తొందరపడుతుందో, డ'లో దాన్ని త్యజించడానికి అంత తొందరపడుతుంది. ఆ రూపం ధరించిందో లేదో, వెంటనే ఉత్పాదక పెట్టుబడిగా మారడానికై దాన్ని త్యజించాలని దాని ఆదుర్దా. డబ్బు రూపంలో ఉన్నంత కాలం అది పెట్టుబడిగా వ్యవహరించదు. కాబట్టి దాని విలువ విస్తరించదు. పెట్టుబడి నిష్ఫలంగా పడి వుంటుంది. ఇక్కడ డ ఒక చలామణి సాధనంగా, అయితే పెట్టుబడి యొక్క చలామణి సాధనంగా పని చేస్తోంది.[2] పెట్టుబడి విలువ యొక్క ఆవృత్తి మొదటి రూపంలో దానికి గల డబ్బు రూపం (డబ్బు పెట్టుబడి రూపం) స్వతంత్రమైనదిగా పైకి కనిపిస్తుంది. కానీ ఈ రెండవ రూపంలో ఆ స్వాతంత్ర్య ఛ్చాయలు అదృశ్యమవుతాయి. కాబట్టి ఇది మొదటి రూపానికి విమర్శ అయి, దాన్ని కేవలం ఒక ప్రత్యేక రూపంగా తేల్చివేస్తుంది. రెండవ రూపాంతరీకరణకు ఏవైనా అడ్డంకులు ఎదురైతే – ఉదాహరణకు, మార్కెట్‌లో ఉత్పత్తి సాధనాలు లేకపోతే – ఆ వృత్తి, అంటే పునరుత్పత్తి ప్రక్రియ స్రవంతి, సరుకు పెట్టుబడి రూపంలోనే పెట్టుబడి నిలిచిపోయినప్పటంతగానే, మధ్యలో ఆగిపోతుంది. కానీ ఒక తేడా వుంది. అది సరుకుల తాత్కాలిక రూపంలో కన్నా డబ్బు రూపంలో ఎక్కువ కాలం వుండగలదు. అది డబ్బు పెట్టుబడి విధులను నిర్వర్తించకపోయినా డబ్బు కాకుండాపోదు. కానీ సరుకు పెట్టుబడి విధి నిర్వహణలో చాలా ఆలస్యం జరిగితే, ఇక అది సరుకుగా లేదా మొత్తంపై ఒక ఉపయోగపు విలువగా ఉండదు. అంతేకాదు, అది అలా డబ్బు రూపంలో ఉన్నప్పుడు, తన మునుపటి ఉత్పాదక పెట్టుబడి రూపానికి బదులు మరో రూపం ధరించగలదు. కాని స' రూపంలో వుంటే దానికి ఆ విధమైన వెసులుబాటు లేదు.

స'–డ,–సలో స'కు సంబంధించి మాత్రమే, దాని రూపాలకు అనుగుణమైన, చలామణి

1. ఈ సంపుటి 15వ అధ్యాయంలోని 5వ విభాగం చూడండి - సం.
2. ఇక్కడ మార్క్స్ "టూకేకి వ్యతిరేకంగా" అని రాతప్రతిలో రాశారు.

క్రియలు చేరి వున్నాయి. ఇవి దాని పునరుత్పత్తి దశలు. కానీ స'–డ'–స అమలుకు, స' రూపాంతరీకరణ అయిన స యొక్క వాస్తవ పునరుత్పత్తి అవసరం. కానీ ఇది, స' చే సూచితమైన, వ్యష్టి పెట్టుబడి యొక్క పునరుత్పత్తి ప్రక్రియ పరిధికి వెలుపల గల పునరుత్పత్తి ప్రక్రియలపై ఆధారపడి వుంటుంది.

రెండవ రూపంలో డ–స, డ–స < శ్రమ / ఉ.సా. క్రియ, ఉత్పాదక పెట్టుబడిగా డబ్బు పెట్టుబడిని మొదటిసారి పరివర్తన చెందించే సన్నాహక క్రియ మాత్రమే. రెండవ రూపంలో, అది సరుకు పెట్టుబడిని ఉత్పాదక పెట్టుబడిగా పునఃపరివర్తన చెందించే సన్నాహక క్రియ. అంటే మదుపు పెట్టిన పారిశ్రామిక పెట్టుబడి మారకుండా ఉన్నంత మేరకు, సరుకు పెట్టుబడికి కారణభూతమైన అదే ఉత్పత్తి మూలకాలుగా మళ్ళీ ఆ సరుకు పెట్టుబడిని పరివర్తన చెందించే సన్నాహక క్రియ. ఫలితంగా, మొదటి రూపంలో లాగానే ఇక్కడ కూడా, ఆ క్రియ ఉత్పత్తి ప్రక్రియకు సన్నాహక దశగా, అయితే దానికి కేవలం తిరిగి పూనుకోవడంగా, దాని పునఃప్రారంభంగా గోచరిస్తుంది. కాబట్టి పునరుత్పత్తి క్రియకు ముందు సూచనగా, ఆ కారణం వల్ల విలువ స్వయం విస్తరణ క్రమ పౌనఃపున్యంగా గోచరిస్తుంది.

ఒక విషయం మరోసారి చెప్పాలి : డ–శ్ర మామూలు సరుకుల మార్పిడి కాదు. అది అదనపు విలువ ఉత్పత్తికి ఉపయోగపడే సరుకు శ్రమ కొనుగోలు – ఈ లక్ష్య సాధనకు డ – ఉసా పాదార్థికంగా తప్పనిసరియైన ఒక క్రియా విధానమైనట్లుగా.

డ–స < శ్రమ / ఉ.సా. పూర్తి కావడంతో డ మళ్ళీ ఉత్పాదక పెట్టుబడి అయిన ఉపెగా మారుతుంది. ఈ ఆవృత్తి మళ్లీ ప్రారంభమవుతుంది.

కాబట్టి ఉపె ... స'–డ'–స...ఉపె యొక్క విస్తృత రూపమిది : ఉపె .... స'

( స + సపె ) –– ( డ + ధ ) –– స / సపె –– శ్రమ / ఉ.పె. ....ఉపె

ఉత్పాదక పెట్టుబడిగా డబ్బు పెట్టుబడి పరివర్తన సరుకుల ఉత్పత్తికై సరుకుల కొనుగోలు అన్నమాట. వినియోగం ఉత్పాదత వినియోగంగా వున్న మేరకు మాత్రమే ఈ వినియోగం అసలు పెట్టుబడి ఆవృత్తిలో అంతర్భాగమవుతుంది. ఆ విధంగా వినియోగమయ్యే సరుకుల ద్వారా అదనపు విలువ ఉత్పత్తి అవుతుందనేది ఇందులో గర్భితం. ఇది ఉత్పత్తికి, ఉత్పత్తిదారుని ఉనికి లక్ష్యంగా గల సరుకు ఉత్పత్తికి సైతం పూర్తిగా భిన్నమైనది. ఇక్కడ ఒక సరుకు స్థానాన్ని మరొక సరుకుతో భర్తీ చేయడమనేది, ఆ విధంగా అదనపు విలువ ఉత్పత్తిపై ఆధారపడి వుంది. కనుక ఇది కేవలం డబ్బు ద్వారా ఉత్పాదితాల మామూలు మార్పిడికి పూర్తిగా భిన్నమైనది. కానీ అదనపు ఉత్పత్తి సాధ్యం కాదనడానికి ఇది రుజువని ఆర్థికవేత్తలు భావిస్తున్నారు.

శ్ర, ఉసా లుగా పరివర్తన చెందిన డ ఉత్పాదకంగా వినియోగమవుతుందనేదే కాక, ఈ ఆవృత్తిలో దాని మొదటి అంతర్భాగమైన డ–శ్ర కూడా కార్మికుని దృష్టి నుంచి చూచినపుడు ఇది శ్ర–డ అవుతుంది. ఇది స–డ కు సమానం. కార్మికునికి సంబంధించిన చలామణి, శ్ర–డ–స లో

(దీనిలో అతని వినియోగం చేరి వుంది), డ–శ్ర ఫలితంగా, మొదటి అంతర్భాగం మాత్రమే పెట్టుబడి ఆవృత్తి పరిధిలోకి వస్తుంది. రెండవ క్రియ అయిన డ–స, వ్యష్టి పెట్టుబడి చలామణి నుంచి ఉత్పన్నమైనప్పటికీ దాని పరిధిలోకి రాదు. కానీ పెట్టుబడిదారీ వర్గానికి కార్మికవర్గం అనవరతం వుండటం అవసరం కాబట్టి డ–స మూలంగా జరిగే కార్మికుని వస్తు వినియోగం దానికి అవసరం.

పెట్టుబడి విలువ తన ఆవృత్తి కొనసాగించడానికీ, పెట్టుబడిదారు అదనపు విలువను వినియోగించుకోవడానికి స'–డ' క్రియ విధించే ఒకే ఒక షరతు స' డబ్బుగా పరివర్తన చెందడం, అంటే అది అమ్మకం కావడం, స'ను కొనడానికి కారణం ఆ వస్తువు ఉపయోగపు విలువ కావడమే, అందువల్ల ఏ విధమైన వినియోగానికైనా, ఉత్పాదక వినియోగానికైనా లేదా వ్యక్తిగత వినియోగానికైనా అది ఉపయోగపడటమే అని వేరే చెప్పనవసరం లేదు. కానీ, స' యొక్క చలామణి కొనసాగుతూ పోయినా, ఉదాహరణకు ఆ నూలు కొన్న వర్తకుని చేతిలో అలా జరిగినా, ఆ నూలును ఉత్పత్తి చేసి, ఆ వర్తకునికి అమ్మిన వ్యష్టి పెట్టుబడి యొక్క ఆవృత్తి కొనసాగడానికి ఇది ఏ మాత్రమూ అడ్డురాదు. ఈ మొత్తం ప్రక్రియ కొనసాగుతూనే వుంటుంది. తత్కారణంగా ఆవశ్యకమైన పెట్టుబడిదారుని, కార్మికుని వ్యక్తిగత వినియోగమూ ఆ ఆవృత్తితో పాటు కొనసాగుతుంది. ఇది సంక్షోభాల చర్చలో ఒక ముఖ్యాంశం.

ఎందువల్లనంటే స' అమ్మకమయిన వెంటనే, అది డబ్బుగా మారిన వెనువెంటనే దాన్ని శ్రమ ప్రక్రియ యొక్క, ఆ విధంగా పునరుత్పత్తి ప్రక్రియ యొక్క వాస్తవ కారకాలుగా తిరిగి మార్చవచ్చు. స' ను దాని అంతిమ వినియోగదారు కొంటాడా, లేక దాన్ని తిరిగి అమ్మడానికై ఒక వర్తకుడు, కొంటాడా అనేది దీన్ని ఏ విధంగానూ ప్రభావితం చేయదు. పెట్టుబడిదారీ ఉత్పత్తి వల్ల సామూహికంగా సృష్టి అయ్యే సరుకుల పరిమాణం, ఉత్పత్తి స్థాయిపైనా, ఈ ఉత్పత్తిని నిరంతరం విస్తరించవలసిన అవసరంపైనా ఆధారపడి వుంటుందే తప్ప, ముందుగా నిర్ధారణ అయిన సరఫరా, గిరాకీ వలయంపై కాదు; తీర్చవలసిన అవసరాలపై కాదు. ఇతర పారిశ్రామిక పెట్టుబడిదారులను మినహాయిస్తే, సామూహిక ఉత్పత్తికి టోకు వర్తకుడు తప్ప ఇతర ప్రత్యక్ష కొనుగోలుదారు వుండడు. పునరుత్పత్తి నుంచి బయటికి నెట్టివేయబడ్డ సరుకులు, వ్యక్తి వినియోగంలో లేదా ఉత్పాదక వినియోగంలో నిజంగా ప్రవేశించకపోయినప్పటికీ, కొన్ని పరిమితుల్లో పునరుత్పత్తి అదే స్థాయిలో లేదా అంతకు మించిన స్థాయిలో జరగవచ్చు. సరుకులను ప్రాదుర్భవింపచేసిన పెట్టుబడి ఆవృత్తిలో ఆ సరుకుల వినియోగం చేరదు. ఉదాహరణకు నూలు అమ్మకమయిన వెంటనే, ఆ నూలు దేనికి ప్రతీకో ఆ పెట్టుబడి విలువ యొక్క ఆవృత్తి, అమ్మకమైన ఆ నూలు తరువాత ఏమవుతుందనే దానితో నిమిత్తం లేకుండా, మళ్ళీ ప్రారంభం కావచ్చు. ఉత్పాదితం అమ్మకమవుతున్నంత కాలం, పెట్టుబడిదారుని దృష్టిలో ప్రతి ఒక్కటీ దాని క్రమగతితో సాగుతున్నట్లు లెక్క. పెట్టుబడిదారునికి అనన్యమైనదిగా పరిగణింపబడుతున్న పెట్టుబడి విలువ యొక్క ఆవృత్తికి అంతరాయం కలుగదు. ఈ ప్రక్రియను విస్తరింపచేస్తే (ఇందులో ఉత్పత్తి సాధనాల అధికతర ఉత్పాదక వినియోగం భాగంగా వుంటుంది), పెట్టుబడి యొక్క ఈ పునరుత్పత్తితో పాటు, కార్మికుల వ్యక్తిగత వినియోగం (కాబట్టి వస్తువుల గిరాకీ) పెరుగుతుంది. ఎందువల్లనంటే ఈ ప్రక్రియ ప్రారంభమయేదీ, నెరవేరేదీ ఉత్పాదక వినియోగం మూలంగానే. ఆ విధంగా అదనపు

విలువ ఉత్పత్తీ, దానితోపాటు పెట్టుబడిదారుని వ్యక్తిగత వినియోగమూ పెరగవచ్చు. పునరుత్పత్తి ప్రక్రియ మొత్తంగా ప్రవర్థమాన దశలో వుండవచ్చు; అయినా, సరుకుల్లో పెద్ద భాగం వినియోగమవుతున్నట్లు పైకి మాత్రమే కనిపిస్తూ, వాస్తవంలో అమ్మకం కాకుండా వ్యాపారస్తుల చేతుల్లోనే వుండవచ్చు, అంటే మార్కెట్‌లోనే పడి వుండవచ్చు. ఒక సరుకుల స్రవంతి మరో సరుకుల స్రవంతిని వెన్నంటి సాగిపోతూనే వుంటుంది, కానీ మునుపటి స్రవంతులు వినియోగమైనట్లు పైకి మాత్రమే కనిపించవచ్చు. తుదకు బహిర్గతమవుతుంది. సరుకు పెట్టుబడులు మార్కెట్లో స్థానానికై ఒకదానితో ఒకటి పోటీపడతాయి. ఆలస్యంగా మార్కెట్‌లో ప్రవేశించినవి అసలు అమ్మకమంటూ జరిగితే, తక్కువ ధరలకు మాత్రమే అమ్మకమవుతాయి. మునుపు వచ్చిన సరుకుల స్రవంతులకు డబ్బు చెల్లించవలసిన సమయం వచ్చేసరికి, అవి ఇంకా అమ్మకం కాకుండా వుంటాయి. వాటి సొంతదారులు తాము దివాళా తీసినట్లు ప్రకటించనైనా ప్రకటించాలి. లేదా తమ బాకీలను చెల్లించేందుకు ఆ సరుకులను అయినకాడికి అమ్ముకోవాలి. ఈ అమ్మకానికీ, గిరాకీ వాస్తవ స్థితికీ బొత్తిగా సంబంధం లేదు. ఇది డబ్బు చెల్లించవలసిన అవసరానికి, సరుకులను డబ్బుగా మార్చుకోవలసిన తక్షణ ఆవశ్యకతకు మాత్రమే సంబంధించినది. దానితో సంక్షోభం ప్రారంభమవుతుంది. ఇది ద్యోతకమయ్యేది వినియోగదారీ, గిరాకీ, వ్యక్తిగత వినియోగానికి గల గిరాకీ ప్రత్యక్షంగా తగ్గిపోవడంలో కాదు; పెట్టుబడుల మధ్య మార్పిడులు, పెట్టుబడి పునరుత్పత్తి ప్రక్రియ తగ్గిపోవడంలో ఈ సంక్షోభం వ్యక్తమవుతుంది.

ద డబ్బు పెట్టుబడిగా, ఉత్పాదక పెట్టుబడి రూపంలోకి తిరిగి మార్పు చెందనున్న పెట్టుబడిగా తన విధిని నిర్వర్తించడానికై దాన్ని ఉసా, శ్ర అన్న సరుకులుగా మార్చాలి. ఈ సరుకులను వేరు వేరు సమయాల్లో కొంటే, లేదా వాటికి డబ్బు చెల్లిస్తే, డ–స ఆ కొనుగోళ్ళు, చెల్లింపుల పరంపరలను సూచిస్తుంది. అప్పుడు ద లో ఒక భాగం డ–స క్రియను నిర్వహించగా, మరో భాగం డబ్బు రూపంలోనే వుండిపోతుంది; ఈ కొనుగోలు, చెల్లింపుల క్రమమే నిర్ణయించిన కాలం వరకు, అది డ–స ప్రక్రియలను ఒకేసారిగానీ, వరుసగాగానీ నిర్వహించడానికి ఉపకరించదు. తగుకాలంలో ఈ భాగం కార్యరంగంలో ప్రవేశించేలా, తన విధిని నిర్వహించేలా చూడటానికై దీన్ని తాత్కాలికంగా మాత్రమే చలామణి నుంచి బిగపట్టడం జరుగుతుంది. కాబట్టి దీన్ని నిల్వ వుంచడం, అనేది దీని చలామణి వల్ల నిర్ణయమైన క్రియే, చలామణి కోసం ఉద్దేశించిన క్రియే. కాబట్టి కొనుగోలు, చెల్లింపులకై ఒక నిధిగా దీనికి ఉనికి, తాత్కాలికంగా దాని గమనం ఆపుదల, దాని చలామణికి అంతరాయమేర్పడిన స్థితి – ఇది, డబ్బు పెట్టుబడిగా తన విధుల్లో ఒకదాన్ని, డబ్బు నిర్వహించే ఒక స్థితి అవుతుంది. డబ్బు పెట్టుబడిగా అని ఎందుకు అంటున్నానంటే, ఈ సందర్భంలో, తాత్కాలికంగా నిశ్చల స్థితిలో వున్న ఈ డబ్బు, డబ్బు పెట్టుబడి ద లో ఒక భాగం (డ'–ధలో భాగం, ఇది దకు సమానం) అంటే, సరుకు పెట్టుబడి విలువలో ఉపెకు సమానమైన భాగం; ఆవృత్తి దేనినుంచి ప్రారంభమవుతుందో ఆ ఉత్పాదక పెట్టుబడి విలువకు సమానమైన భాగం. మరోవైపు, చలామణి నుంచి ఉపసంహరింపబడిన డబ్బంతా నిల్వ నిధి (hoard) రూపం ధరిస్తుంది. కాబట్టి, డ–సలో కొనుగోలు సాధనంగా, లేదా చెల్లింపు సాధనంగా డబ్బు నిర్వర్తించే విధి, డబ్బు పెట్టుబడి విధుల్లో ఒకటి అయినట్లుగానే, ఇక్కడ కూడా, నిల్వనిధి రూపం ధరించడం డబ్బు పెట్టుబడి విధుల్లో ఒకటి అవుతోంది. దీనికి కారణమేమిటంటే, ఇక్కడ పెట్టుబడి విలువ డబ్బు రూపంలో వుంది; ఇక్కడ డబ్బుగా వున్న స్థితి, పారిశ్రామిక పెట్టుబడి గడిచే

దశల్లో ఒకానొక దానిలో అది వున్న స్థితి. దీన్ని ఆవృత్తిలోని అంతస్సంబంధాలు నిర్దేశిస్తాయి. పారిశ్రామిక పెట్టుబడి యొక్క ఆవృత్తిలో డబ్బు పెట్టుబడి, డబ్బు విధులను తప్ప మరే విధులను నిర్వర్తించదనీ, ఈ డబ్బు విధులకు ఈ ఆవృత్తిలోని ఇతర దశలతో గల పరస్పర సంబంధాలు మూలంగానే వీటికి పెట్టుబడి విధుల ప్రాముఖ్యం ఏర్పడుతోందనీ ఇక్కడ మరోసారి రుజువవుతోంది.

డ తో ఢకు గల సంబంధంగా, ఒక పెట్టుబడి సంబంధంగా డ' అభివ్యక్తం కావడం, డబ్బు పెట్టుబడి ప్రత్యక్షంగా నిర్వర్తించే విధి కాదు. అది సరుకు పెట్టుబడి స' ప్రత్యక్ష విధి. స' ఏమో, సతో సపె కు గల సంబంధంగా, కేవలం ఉత్పత్తి ప్రక్రియ ఫలితాన్ని, ఆ ప్రక్రియలో సంభవించిన పెట్టుబడి విలువ స్వయం విస్తరణ ఫలితాన్ని వ్యక్తం చేస్తోంది.

చలామణి క్రమం కొనసాగింపునకు ఆటంకాలు ఏర్పడి, మార్కెట్ స్థితిగతులు మొదలైన బాహ్య పరిస్థితుల మూలంగా డ తన క్రియ అయిన డ–స ను తాత్కాలికంగా మానుకోవలసివస్తే, తత్కారణంగా, అది కొద్ది కాలమో లేక చాలా కాలమో డబ్బు రూపంలోనే వుండవలసివస్తే, డబ్బు మళ్ళీ నిల్వ నిధి రూపం ధరిస్తుంది. స–డ నుంచి డ–స కు సాగిపోయే పరిణామ క్రమానికి బాహ్య పరిస్థితుల వల్ల అంతరాయం ఏర్పడినప్పుడల్లా సాధారణ సరుకు చలామణిలో సైతం ఇలాగే జరుగుతుంది. ఇది అసంకల్పితంగా జరిగే డబ్బు సంచయనం. ప్రస్తుత సందర్భంలో డబ్బు, వినియోగింపబడకుండా ఉన్నట్లే గుప్తమైనట్టి డబ్బు పెట్టుబడి రూపంలో వుంది. అయితే, ప్రస్తుతానికి ఈ విషయాన్ని ఇంతకు మించి చర్చించడం లేదు.

కాని, ఈ రెండు సందర్భాల్లోనూ డబ్బు పెట్టుబడి డబ్బు స్థితికే అంటిపెట్టుకొని వుండటం, దాని గమన క్రమానికి అవరోధమేర్పడిన ఫలితం – ఇది ఆవశ్యకమా, అనావశ్యకమా, సంకల్పితమా, అసంకల్పితమా, దాని విధులకు అనుగుణమా, లేదా అనేదానితో ఇక్కడ నిమిత్తం లేదు.

## II. విస్తృత స్థాయిలో సంచయనం, పునరుత్పత్తి

ఉత్పాదక ప్రక్రియ ఇష్టమొచ్చిన పరిమాణాల్లో విస్తరించదు. ఆ విస్తరణ పరిమాణాలను సాంకేతిక విధానం నిర్ణయిస్తుంది. కాబట్టి డబ్బు రూపంలో చేతికందిన అదనపు విలువ, పెట్టుబడీకరణకు ఉద్దేశించినదైనా, పలు ఆవృత్తుల పరంపర ద్వారా మాత్రమే అదనపు పెట్టుబడిగా పనిచేయడానికీ, లేక క్రియాశీలమైన పెట్టుబడి విలువ ఆవృత్తిలో ప్రవేశించడానికి తగినంత పరిమాణాన్ని అందుకోగలదు. (కాబట్టి, అంతవరకు దాన్ని కూడబెడుతూ వుండక తప్పదు) ఆ విధంగా అదనపు విలువ సంచిత నిధిగా ఘనీభవించి వుంటుంది. ఈ రూపంలో అది గుప్తమైన (latent) డబ్బు పెట్టుబడిగా వుంటుంది. ఎందుకు గుప్తమైనదంటే, అది డబ్బు రూపానికి అంటిపెట్టుకొని వున్నంత కాలం పెట్టుబడిగా పని చేయజాలదు.[1] ఆ విధంగా ఇక్కడ సంచిత నిధి రూపుగొనడం పెట్టుబడి సంచయన క్రమంలో చేరే

1. "గుప్తమైన" (latent) - అన్న పదం భౌతికశాస్త్రంలోని గుప్తమైన ఉష్ణం అన్న భావం నుంచి అరువు తెచ్చుకొన్నది. ఇప్పుడు దీని స్థానాన్ని శక్తి రూపపరివర్తన సిద్ధాంతం దాదాపు ఆక్రమించింది. కాబట్టి, మార్క్స్ మూడవ భాగంలో (ఇది తరువాత రాసినది) మరో పదం వాడారు. అది సంభవనీయ శక్తి (Potential energy) అన్న భావం నుంచి అరువుతెచ్చుకొన్న "సంభవనీయ" అన్న పదం, లేక, డి.అలెంబర్గ్ పేర్కొన్న "కార్యరూపం ధరించగల వేగాల" (Virtual Velocities) వంతుగానే మార్క్స్ "కార్యరూపం ధరించగల పెట్టుబడి" (Virtual Capital) అని వాడాడు. - **ఫ్రెడరిక్ ఎంగిల్స్**

ఒక అంశంగా రంగంపైకి వస్తోంది. ఇది పెట్టుబడి సంచయనాన్ని వెన్నంటి ఉన్నా, స్వతహాగా భిన్నమైనది. ఎందువల్లనంటే, అసలు పునరుత్పత్తి ప్రక్రియ, గుప్త డబ్బు పెట్టుబడి ఏర్పడటం వల్లనే విస్తరించదు. అలా విస్తరించదు సరికదా, పెట్టుబడిదారీ ఉత్పాదకుడు ప్రత్యక్షంగా తన ఉత్పత్తి స్థాయిని విస్తరించలేకపోవడం వల్ల గుప్త డబ్బు పెట్టుబడి సృష్టి అవుతోంది. అతను గనుక తన అదనపు ఉత్పాదితాన్ని చలామణిలో బంగారం లేదా వెండిని ప్రవేశపెట్టే ఈ లోహాల ఉత్పత్తిదారుకు అమ్మినట్లయితే, లేదా దేశ అదనపు ఉత్పాదితంలో కొంత భాగానికి విదేశాల నుంచి అదనంగా బంగారం లేదా వెండిని దిగుమతి చేసుకొనే ఒక వర్తకునికి అమ్మినట్లయితే (ఇతనికి అమ్మినా, పై ఉత్పత్తిదారుకు అమ్మినా ఫలితం ఒకటే), అప్పుడు అతని గుప్త డబ్బు పెట్టుబడి, దేశంలోని బంగారం లేదా వెండి నిల్వను పెంచుతుంది. మిగతా అన్ని సందర్భాల్లో, ఉదాహరణకు కొనుగోలుదారు చేతిలో చలామణి సాధనంగా వుండిన 78 పౌండ్లు పెట్టుబడిదారు చేతిలో కేవలం నిల్వ నిధి రూపం ధరిస్తుంది. అందువల్ల, జరిగిందల్లా, దేశంలోని బంగారం లేదా వెండి నిల్వల పంపిణీలో మార్పు, అంతకు తప్ప మరేమీ కాదు.

మన పెట్టుబడిదారుని లావాదేవీల్లో డబ్బు గనుక చెల్లింపు సాధనంగా ఉపకరిస్తే, (కొనుగోలు దారు ఉత్తరోత్తరా త్వరగానో, ఆలస్యంగానో సరుకులకు డబ్బు చెల్లించవలసి వున్న కారణాన) అప్పుడు పెట్టుబడీకరణకు ఉద్దేశించిన అదనపు ఉత్పాదితం డబ్బుగా పరివర్తన చెందదు. దాన్ని పరపతిదారుని స్వామ్యపు హక్కుగా మార్చడం జరుగుతుంది. అప్పటికే కొనుగోలుదారుని అధీనంలో వుండే లేదా తన అధీనంలోకి రాగలదని అతను ఆశించే తత్తుల్యమైన విలువపై స్వామ్యపు హక్కుగా అది ఇతర వ్యష్టి పారిశ్రామిక పెట్టుబడుల ఆవృత్తుల్లో ప్రవేశించినా, వడ్డీ లభించే రుణపత్రాలు మొదలైన వాటిలో మదుపు పెట్టిన డబ్బు లాగానే, ఈ ఆవృత్తిలోని పునరుత్పాదక క్రమంలో ప్రవేశించదు.

పెట్టుబడిదారీ ఉత్పత్తి స్వభావమంతటినీ నిర్ణయించేది మదుపుపెట్టిన పెట్టుబడి విలువ స్వయం విస్తరణే. అంటే మొదట్లో, సాధ్యమయినంత పరిమాణంలో అదనపు విలువ ఉత్పత్తి కానీ, తరువాత పెట్టుబడి ఉత్పత్తి (పెట్టుబడి మొదటి సంపుటి, అధ్యాయం XXII చూడండి.[1]) కాబట్టి పెట్టుబడిగా అదనపు విలువ పరివర్తన నిర్ణయిస్తాయన్న మాట. సంచయనం, లేదా విస్తృత స్థాయిలో ఉత్పత్తి నిరంతరం అధికాధికంగా అదనపు విలువను ఉత్పత్తి చేసే సాధనంగా, అందుచేత పెట్టుబడిదారుని వ్యక్తిగత ధ్యేయమైన అధికాధిక ధనసంపాదనకు సాధనంగా రంగంపైకి వస్తుంది. ఇది పెట్టుబడిదారీ ఉత్పత్తిలోని సార్వత్రిక ధోరణి అవుతుంది. కానీ ఇది, మొదటి సంపుటిలో నిరూపించినట్లు, తదభివృద్ధి వల్ల, ప్రతి వ్యష్టి పెట్టుబడిదారునికీ ఆవశ్యకమవుతుంది. స్థిరంగా అతని పెట్టుబడి పెరగడం, దాని మనుగడకు తప్పనిసరి అవుతుంది. కానీ ఇదివరకే వివరించిన ఈ విషయాన్ని మేము ఇంతకన్నా ఎక్కువగా తిరిగి తరచవలసిన అవసరం లేదు.

అదనపు విలువ యావత్తూ ఆదాయంగా ఖర్చవుతుందని ఊహించుకొని, మొదట సామాన్య పునరుత్పత్తిని పరిశీలించాము. వాస్తవంలో మామూలు పరిస్థితుల్లో ఎల్లప్పుడూ అదనపు విలువలో కొంత భాగం ఆదాయంగా ఖర్చు అయి, మిగతా భాగం పెట్టుబడి అయి తీరాలి. ఏ నిర్దిష్ట కాలంలోనైనా, ఉత్పత్తి అయిన ఒకానొక అదనపు విలువ పూర్తిగా వినియోగమయిందా లేక పూర్తిగా పెట్టుబడిగా

1. తెలుగు కూర్పు, అధ్యాయం XXIV.

మారిందా అనేది ముఖ్యం కానేకాదు. సాధారణ సూత్రం సగటు గమనాన్ని మాత్రమే సూచించగలదు – సగటున రెండూ సంభవమే. కానీ సూత్రం క్లిష్టం కాకుండా ఉండేందుకు, అదనపు విలువ యావత్తూ సంచితమవుతుందని ఊహించుకోవడం మంచిది. ఉపె....స'–డ'–స' < శ్రమ / ఉ.సా. ....ఉపె' విస్తృత స్థాయిలో ఎక్కువ విలువతో పునరుత్పత్తి అయ్యే ఉత్పాదక పెట్టుబడిని వ్యక్తం చేస్తూంది. పెరిగిన ఉత్పాదక పెట్టుబడిగా తన రెండవ ఆవృత్తిని లేదా వేరు మాటల్లో చెప్పాలంటే, తన మొదటి ఆవృత్తిని కొత్తగా తిరిగి ప్రారంభించే ఉత్పాదక పెట్టుబడి ఇది. రెండవ ఆవృత్తి మొదలైన వెంటనే ఉపె మళ్ళీ ప్రారంభ స్థానంలో వుంటుంది. కానీ, ఈ ఉపె మొదటి ఉపె కన్నా ఎక్కువగా వున్న ఉత్పాదక పెట్టుబడి. కాబట్టి, డ...డ' సూత్రంలో రెండవ ఆవృత్తి గనక డ' తో ప్రారంభమయితే, డ' అన్నది డ గా ఒక నిర్దిష్ట పరిమాణంలో మదుపు పెట్టిన డబ్బు పెట్టుబడిగా పనిచేస్తుంది. మొదటి ఆవృత్తి గమనాన్ని ప్రారంభించిన డబ్బు పెట్టుబడికన్నా ఇది పెద్దది. కానీ ఇది మదుపు పెట్టిన డబ్బు పెట్టుబడి యొక్క విధుల నిర్వహణకు పూనుకొన్న వెంటనే, అదనపు విలువ యొక్క పెట్టుబడీకరణ వల్ల దీని పెరుగుదల గురించిన ప్రస్తావనలన్నీ ఆగిపోతాయి. తన ఆవృత్తిని ప్రారంభించిన డబ్బు పెట్టుబడి రూపంలో దాని మూలం తుడిచిపెట్టుకుపోతుంది. ఉపె' ఒక కొత్త ఆవృత్తికి ప్రారంభ స్థానంగా పనిచేయడం మొదలైన వెంటనే దాని విషయంలోనూ ఇదే జరుగుతుంది.

ఉపె.....ఉపె', ను డ....డ'తో, లేక మొదటి ఆవృత్తితో పోల్చితే, ఆ రెంటి భావమూ ఒకటే కాదని తెలుస్తుంది. డ....డ'ను మాత్రమే తీసుకొంటే, మరి దేనితోనూ నిమిత్తంలేని ఆవృత్తిగా అది వ్యక్తం చేస్తున్నదంతే; డబ్బు పెట్టుబడి అయిన డ (లేక డబ్బు పెట్టుబడిగా తన ఆవృత్తిలో సాగిస్తున్న పారిశ్రామిక పెట్టుబడి) డబ్బును ఉత్పత్తి చేసే డబ్బు; విలువను ఉత్పత్తి చేసే విలువ; వేరు మాటల్లో చెప్పాలంటే, డ అదనపు విలువను ఉత్పత్తి చేస్తుంది. కానీ, ఉపె ఆవృత్తిలో, మొదటి దశ అయిన ఉత్పాదన ప్రక్రియ ముగియడంతో అదనపు విలువను ఉత్పత్తి చేసే ప్రక్రియ అప్పటికే పూర్తి అయి వుంటుంది. రెండవ దశ (చలామణి మొదటి దశ) అయిన స'–డ' ను గడిచిన తరువాత, పెట్టుబడి విలువా, దానితోపాటు అదనపు విలువా అప్పటికే డ'గా చేతికందిన డబ్బు పెట్టుబడిగా ఉనికిలోకి వచ్చాయి. మొదటి ఆవృత్తిలో తుది స్థానంలో వున్న డ' ఇది. మొదట పరిశీలింపబడిన ఉపె....ఉపె సూత్రంలో, సపె–ధ–సపె అదనపు విలువ ఉత్పత్తి అయిందని తెలుపుతుంది. ఇది తన రెండవ దశలో, పెట్టుబడి చలామణి వెలుపల వుండిపోయి, ఆదాయంగా వ్యయమయ్యే అదనపు విలువ యొక్క చలామణిని సూచిస్తుంది. ఈ రూపంలో మొత్తం గమనాన్ని ఉపె.... ఉపె.... తెలుపుతూంది కాబట్టి, ఈ సూత్రంలోని ఆద్యంతాల విలువలో తేడా లేదు. అందువల్ల మదుపు పెట్టిన విలువ యొక్క స్వయం విస్తరణ, అంటే అదనపు విలువ ఉత్పత్తి, డ....డ'లో లాగానే సూచితమవుతుంది. కానీ తేడా ఏమిటంటే, డ....డ'లో ఆఖరు దశగానూ, ఆవృత్తిలో రెండవ దశగానూ వున్న స'–డ' క్రియ ఉపె....ఉపెలో చలామణి మొదటి దశగా వుంటుంది.

ఉపె...ఉపె'లో, అదనపు విలువ ఉత్పత్తి అయినదని ఉపె' సూచించదు. అది ఉత్పత్తి అయిన అదనపు విలువ యొక్క పెట్టుబడీకరణను సూచిస్తుంది. కాబట్టి, పెట్టుబడి పోగుబడిందని సూచిస్తుంది. కనుక, ఉపెలోలా కాక ఉపె'లో, మొదట్లో వున్న పెట్టుబడి విలువా, దాని గమనం మూలంగా సంచితమైన పెట్టుబడి విలువా కలిసి వున్నాయని సూచిస్తుంది.

డ...డ'ను మామూలుగా ముగించే డ'ను కానీ, ఆ ఆవృత్తులన్నింలో రంగంపైకి వచ్చే స'ను కానీ తీసుకొంటే, అవి వ్యక్తం చేసేది గమనాన్ని కాదు, ఆ గమన ఫలితాన్ని. అంటే సరుకుల రూపంలో, లేదా డబ్బు రూపంలో చేతికందిన పెట్టుబడి విలువ స్వయం విస్తరణను అవి వ్యక్తం చేస్తాయి. కాబట్టి డ+ధగా లేదా స+సపె గా వున్న పెట్టుబడి విలువను, తన అదనపు విలువతో పెట్టుబడి విలువ సంబంధాన్ని, అదనపు విలువ పెట్టుబడి విలువ ఉత్పాదితమే అన్న సంగతిని వ్యక్తం చేస్తాయి. ఈ ఫలితాన్ని స్వయం విస్తృతమైన పెట్టుబడి విలువ యొక్క వివిధ చలామణి రూపాలుగా అవి వ్యక్తం చేస్తున్నాయి. కానీ సంభవించిన స్వయం విస్తరణ, స' రూపంలోగానీ, డ' రూపంలోగానీ, డబ్బు పెట్టుబడి యొక్క లేదా సరుకు పెట్టుబడి యొక్క క్రియ కాదు. పారిశ్రామిక పెట్టుబడి యొక్క ప్రత్యేక క్రియలకు అనుగుణమైన ప్రత్యేక, విభిన్న రూపాలుగా, అస్తిత్వ రీతులుగా, డబ్బు పెట్టుబడి డబ్బు క్రియలను మాత్రమే, సరుకు పెట్టుబడి సరుకు క్రియలను మాత్రమే నిర్వహించ గలవు. వాటి మధ్య భేదమల్లా డబ్బుకూ, సరుకుకూ గల భేదం మాత్రమే. అదే విధంగా, తన ఉత్పాదక పెట్టుబడి రూపంలోని పారిశ్రామిక పెట్టుబడిలో ఉన్నదల్లా, ఉత్పాదితాలను సృష్టించే ఏ శ్రమ ప్రక్రియలోనైనా సరే వున్న మూలకాలే. అవి ఒకవైపు శ్రమ వస్తుగత అవసరాలు (ఉత్పత్తి సాధనాలు), మరోవైపు ఉత్పాదకంగా (ప్రయోజనకరంగా) పనిచేసే శ్రమశక్తి. ఉత్పత్తిరంగంలో పారిశ్రామిక పెట్టుబడి, మొత్తంపై ఉత్పత్తి ప్రక్రియ అవసరాలకు, అందువల్ల పెట్టుబడిదారీ విధానేతర ఉత్పత్తి ప్రక్రియ అవసరాలకు కూడా అనుగుణమైన అంతర్నిర్మాణంతో మాత్రమే వుండగలదు. అదే విధంగా అది చలామణి రంగంలో దానికి సంబంధించిన రెండు రూపాల్లో మాత్రమే, అంటే సరుకు రూపంలోనూ, డబ్బు రూపంలోనూ మాత్రమే వుండగలదు. అయితే శ్రమశక్తి ఇతరులకు చెందిన శ్రమశక్తి; పెట్టుబడిదారు తన ఉత్పత్తి సాధనాలను ఇతర సరుకుల సొంతదారుల నుంచి కొన్న విధం గానే శ్రమశక్తిని కూడా దాని సొంతదారుల నుంచి కొన్నాడు, అన్న ఈ వాస్తవం ముఖతః, ఉత్పత్తి మూలకాల సమాహారం. తాను ఉత్పాదక పెట్టుబడినని ఆదిలోనే చాటినట్లుగానే; కాబట్టి, ఉత్పత్తి ప్రక్రియే పారిశ్రామిక పెట్టుబడి యొక్క ఉత్పాదక క్రియగా ప్రస్ఫుటమవుతున్నట్లుగానే, డబ్బూ, సరుకులూ సైతం అదే పారిశ్రామిక పెట్టుబడి యొక్క చలామణి రూపాలుగా ప్రస్ఫుటమవుతున్నాయి. అందువల్ల వాటి విధులు దాని చలామణి విధులుగా ప్రస్ఫుటమవుతున్నాయి. ఈ చలామణి విధులు ఉత్పాదక పెట్టుబడి విధులను ప్రవేశపెడుతున్నాయి. లేదా వాటినుంచి ఉత్పన్నమవుతున్నాయి. ఇక్కడ డబ్బు నిర్వహించే విధీ, సరుకు నిర్వహించే విధీ డబ్బు పెట్టుబడి, సరుకు పెట్టుబడి విధులే తప్ప మరొకటి కావు. పారిశ్రామిక పెట్టుబడి తన ఆవృత్తిలోని వివిధ దశల్లో నిర్వహించవలసిన విధుల తాలూకు రూపాలుగా అవి ఒకదానితో ఒకటి ముడిపడి వుండటమొక్కటే ఇందుకు కారణం. కాబట్టి డబ్బుగా డబ్బుకు, సరుకులుగా సరుకులకు గల ప్రత్యేక గుణాలు, విధులు, పెట్టుబడిగా వాటికి గల లక్షణం నుంచి ఉత్పన్నమయినవని చెప్ప ప్రయత్నించడం తప్పు. అదే విధంగా, ఉత్పాదక పెట్టుబడి గుణాలకు, ఉత్పాదక సాధనాల రూపంలో అది వున్న తీరు కారణమని చెప్పడం కూడా అంతగానూ తప్పు.

డ', లేదా స' ఇవి డ+ధ గా, స+సపె గా అంటే పెట్టుబడి విలువకు దాని నుంచి పుట్టిన అదనపు విలువకు మధ్య సంబంధంగా స్థిరపడిన వెంటనే ఈ సంబంధం ఆ రెంటిలోనూ అభివ్యక్తమవుతుంది – మొదటి సందర్భంలో డబ్బు రూపంలో, రెండవ సంబంధంలో సరుకు రూపంలో.

కానీ దీనివల్ల అసలు విషయమేమీ మారదు. కాబట్టి, ఈ సంబంధానికి డబ్బుగా డబ్బుకుగాని, సరుకుగా సరుకుకుగాని గల గుణాలు లేదా విధులు మూలకారణం కాదు. ఈ రెండు సందర్భాల్లోనూ పెట్టుబడి విశిష్ట గుణం. అది విలువను ఉత్పత్తి చేసే విలువగా వుండటం ఒక ఫలితంగా మాత్రమే వ్యక్తమవుతుంది. స' ఎల్లప్పుడూ ఉపె క్రియ ఉత్పాదితమే. డ' ఎల్లప్పుడూ, పారిశ్రామిక పెట్టుబడి ఆవృత్తిలో స' రూపాంతరమే. కాబట్టి, తిరిగి చేతికందిన డబ్బు పెట్టుబడి, డబ్బు పెట్టుబడిగా ప్రత్యేక విధిని తిరిగి ప్రారంభించిన వెంటనే, అది డ' = డ + ధలో గల పెట్టుబడి సంబంధాన్ని ఇక వ్యక్తం చేయదు. డ....డ' ను గడిచి, తరువాత డ' సరికొత్తగా ఆవృత్తిని ప్రారంభించిన తరువాత, డ'లో ఉండే మొత్తం అదనపు విలువ పెట్టుబడిగా మారినప్పటికీ, అది రంగంపైకి వచ్చేది డ గానే తప్ప, డ'గా కాదు. మన ఉదాహరణలో, రెండవ ఆవృత్తి, మొదటి ఆవృత్తిలోలాగా 422 పౌండ్లకు బదులు, 500 పౌండ్ల డబ్బు పెట్టుబడితో ప్రారంభమవుతుంది. ఈ ఆవృత్తిని ప్రారంభించే డబ్బు పెట్టుబడి మునుపటి దానికన్నా 78 పౌండ్లు ఎక్కువ. ఈ ఆవృత్తిని ఇతర ఆవృత్తితో పోల్చి చూచినప్పుడు మాత్రమే ఈ తేడా వుంటుంది. కానీ ప్రత్యేక ఆవృత్తిలో అంతర్గతంగా అలా పోల్చి చూడటం వుండదు. డబ్బు పెట్టుబడిగా మదుపు పెట్టిన 500 పౌండ్లు (ఇందులో 78 పౌండ్లు, మునుపు అదనపు విలువగా వుండేది) ఇంకో పెట్టుబడిదారు తన మొదటి ఆవృత్తిని ప్రారంభించడానికి వాడే 500 పౌండ్ల పాత్రనే నిర్వహిస్తుంది. ఉత్పాదక పెట్టుబడి ఆవృత్తిలో కూడా జరిగేది ఇదే. సామాన్య పునరుత్పత్తి అయిన ఉపె....ఉపెలో ఉపె లాగానే, పెరిగిన ఉపె' తిరిగి ఆవృత్తిని ప్రారంభించడంతో, ఉపె గానే పనిచేస్తుంది.

డ', – స' < {శ్రమ / ఉ.సా.} దశలో, పెరిగిన పరిమాణం సూచితమవుతున్నది, స'చే తప్ప శ్ర'చే, లేదా ఉసా' చే కాదు. స అనేది, శ్ర, ఉసాల వెరసి కాబట్టి, స'లో వున్న శ్ర, ఉసాల వెరసి మొదట్లో వున్న ఉపె కన్నా ఎక్కువ అని స' నిస్సంశయంగా సూచించగలదు. రెండవ విషయం, శ్ర', ఉసా' అనే మాటలు తప్పు. ఎందువల్లనంటే, పెట్టుబడి పెరుగుదలతో దాని విలువ యొక్క అంతఃనిర్మాణం మారుతుందనీ, ఈ మార్పు కొనసాగేకొద్దీ ఉసా విలువ పెరుగుతూ, శ్ర' సదా సాపేక్షంగానూ, తరచూ నిరపేక్షంగానూ తగ్గుతూంటుందని మనకు తెలుసు.

## III. డబ్బు సంచయనం

డబ్బుగా మారిన అదనపు విలువ ధ స్వీయ ప్రక్రియ సాగిస్తూన్న పెట్టుబడి విలువకు వెంటనే కలిపివేయబడి, ఇప్పుడు డ' పరిమాణంలో వున్న పెట్టుబడి డ తో పాటుగా ఆవృత్తిలో ప్రవేశిస్తుందా, లేక అలా కలపబడదా అనేది కేవలం ధ ఉనికితో నిమిత్తంలేని పరిస్థితులపై ఆధారపడి వుంటుంది. మొదటి వ్యాపారంతో పాటుగా నిర్వహింపబడే రెండవ స్వతంత్ర వ్యాపారంలో ధ డబ్బు పెట్టుబడిగా ఉపకరించాల్సి వస్తే, ఆ వ్యాపారానికి అవసరమైన కనీస పరిమాణంలో వుంటే తప్ప దాన్ని అందుకై ఉపయోగించ వీలులేదనేది విదితమే. లేక దాన్ని మొదటి వ్యాపార విస్తరణకై వినియోగించాలనుకొంటే, ఉపె లోని పాదార్థిక అంశాల మధ్య సంబంధాల వల్లనూ, వాటి విలువ సంబంధాల వల్లనూ ధ ఒక కనీస పరిమాణంలో వుండటం అవసరం. ఈ వ్యాపారంలో నియుక్తమయిన అన్ని ఉత్పత్తి సాధనాల మధ్య గుణాత్మకమైన సంబంధాలే కాక, నిర్దిష్టమైన పరిమాణాత్మక సంబంధాలు కూడా వుంటాయి. వాటి పరిమాణాలు ఒక నిర్దిష్టమైన నిష్పత్తిలో వుంటాయి. ఉత్పాదక పెట్టుబడిని పెంచే అదనపు

ఉత్పాదక సాధనాలుగానూ, అదనపు శ్రమశక్తిగానూ లేదా ఉత్పాదక సాధనాలుగా మాత్రమే పరివర్తన చెందగలగడానికి ధకు ఉండవలసిన కనీస పరిమాణాన్ని ఉత్పాదక పెట్టుబడిలో ప్రవేశించే అంశాల పాదార్థిక సంబంధాలూ, వాటి విలువ సంబంధాలూ నిర్ణయిస్తాయి. ఉదాహరణకు, ఒక నూలు మిల్లు యజమాని తన కదుళ్ళ సంఖ్యను పెంచాలనుకొంటే, తదనుగుణమైన సంఖ్యలో పత్తి యేకే పరికరాలను (Carders) పురిపెట్టే చక్రాలను (roving frames) పెంచకుండా, వాటితోపాటు, ఆ విధమైన తన వ్యాపార విస్తరణకు అవసరమైన పత్తికీ, వేతనాలకు అదనంగా ఖర్చు చేయకుండా కదుళ్ళను పెంచలేడు. ఈ పని చేయాలంటే, అదనపు విలువ గణనీయమైన మొత్తాన్ని అందుకొని వుండాలి. (కొత్తగా అమర్చిన ప్రతి కదురుకు ఇది ఒక పౌండు చొప్పున ఉండాలని సాధారణంగా అంచనా వస్తుంటారు) ధ కనుక ఈ కనీస మొత్తానికి చేరుకోకుంటే, పెట్టుబడి ఆవృత్తి వల్ల వరుసగా ఉత్పత్తి అయ్యే ధ మొత్తం, డతో పాటు, (కాబట్టి డ'– స' < శ్రమ / ఉ.సా. రూపంలో) పని చేయగలిగే వరకు ఆ పెట్టుబడి ఆవృత్తి మళ్ళీ మళ్ళీ సాగుతూండవలసిందే. చిన్న చిన్న మార్పుల కోసం సైతం, ఉదాహరణకు, వడికే యంత్రాలను మరింత ఉత్పాదకంగా చేయడానికై వాటిలో ప్రవేశపెట్టే మార్పుల కోసం, వడికే సామాగ్రిపైనా, మరిన్ని పురిపెట్టే యంత్రాలు, మొదలైన వాటి పైనా మరింత ఎక్కువ ఖర్చు చేయవలసి వుంటుంది. ఈలోగా ధ పోగవుతూంటుంది. ఈ సంచయనం దాని సొంత క్రియ కాదు. అది ఉపె....ఉపె పౌనఃపున్య నిర్వహణ ఫలితం. ఒక దశ వరకు డబ్బు రూపానికి అంటిపెట్టుకొని వుండటమే ధ పని. తన క్రియాత్మక విధి నిర్వహణకు అవసరమైన కనీస పరిమాణానికి, అంటే డబ్బు పెట్టుబడిగా – ప్రస్తుత ఉదాహరణలో క్రియాశీలమైన డబ్బు పెట్టుబడి డ యొక్క సంచిత భాగంగా – డ క్రియలో ప్రవేశించడానికి అవసరమైన పరిమాణానికి, అదనపు విలువను సృష్టించే ఆవృత్తుల పునఃపుననిర్వహణ ద్వారా, (అంటే బయటి క్రియల ద్వారా) పెరిగే వరకు ధ పని అదే. కానీ ఈ మధ్యంతర కాలంలో అది పోగవుతూంటుంది. అది రూపుగొంటున్న, వృద్ధి అవుతున్న నిల్వ నిధిగానే వుంటుంది. కాబట్టి ఇక్కడ డబ్బు సంచయనం, కూడబెట్టడం (hoarding) అనేది, నిజమైన సంచయనంగా, పారిశ్రామిక పెట్టుబడి పని చేసే స్థాయి పెరుగుదలను తాత్కాలికంగా అంటిపెట్టుకొని వుండే ప్రక్రియగా గోచరిస్తుంది. తాత్కాలికంగా అని ఎందుకు అంటున్నామంటే నిల్వ నిధి, నిల్వ నిధి రూపంలో వున్నన్నాళ్ళూ, అది పెట్టుబడి క్రియను నిర్వహించదు; అదనపు విలువ సృష్టించే ప్రక్రియలో పాల్గొనదు. అది డబ్బుగానే వుంటుంది. అది వృద్ధి అవుతున్నదంటే, అందుకొకే ఒక కారణముంది – ఏ పని చేయకుండా వచ్చిచేరే డబ్బును ఒకే గల్లాపెట్టెలో వేసి వుంచడం.

నిల్వ నిధి రూపం చలామణిలో లేని డబ్బు మామూలు రూపం తన చలామణికి అంతరాయమేర్పడిన డబ్బు రూపం, కాబట్టి తన డబ్బు రూపంలో నిలబడిపోయిన మొత్తమది. ఇక నిల్వచేయడం అనే ప్రక్రియ, అన్ని సరుకుల ఉత్పత్తి విషయంలోనూ మామూలుగా జరిగేదే. అభివృద్ధి చెందని, పెట్టుబడిదారీ పూర్వపు ఉత్పత్తి రూపాల్లో ఇదే ఒక పరమ లక్ష్యంగా వుండేది. కానీ ప్రస్తుత సందర్భంలో నిల్వ నిధి, డబ్బు పెట్టుబడి రూపాల్లో ఒకటిగా రంగంపైకి వస్తోంది. డబ్బు ఇక్కడ గుప్త (latent) డబ్బు పెట్టుబడి పాత్ర వహిస్తున్న కారణాన, ఆ మేరకు పెట్టుబడి సంచయనంతో పాటు నిల్వ నిధి రూపుగొనడం తాత్కాలిక ప్రక్రియగా కనిపిస్తోంది. మరో కారణం కూడా వుంది. నిల్వ నిధి ఏర్పడటం, డబ్బు రూపంలోని అదనపు విలువ నిల్వ నిధి స్థితిలో వుండటం, అదనపు విలువ నిజంగా

క్రియాశీలమైనా పెట్టుబడిగా పరివర్తన చెందేందుకోసం, పెట్టుబడి ఆవృత్తి వెలుపల గడపవలసిన క్రియా నిర్ణీత సన్నాహక దశ. కాబట్టి దాని నిర్వచనాన్ని బట్టి, అది గుప్త డబ్బు పెట్టుబడి. అందువల్ల ఉత్పత్తి ప్రక్రియలో అది పాల్గొనగలగడానికి ముందు, దాని పరిమాణాన్ని, ప్రతి సందర్భంలోనూ ఉత్పాదక పెట్టుబడి యొక్క విలువ అంతర్నిర్మాణం నిర్ణయిస్తుంది. కానీ, ఒక నిల్వ నిధిగా ఉన్నంత కాలం అది డబ్బు పెట్టుబడి నిధులను నిర్వహించదు; అది ఇంకా క్రియాశూన్యమైన డబ్బు పెట్టుబడిగానే వుంటుంది. అది మునుపటిలాగా తన విధికి అంతరాయమేర్పడిన డబ్బు పెట్టుబడికాదు. ఆ విధిని ఇంకా చేయజాలని డబ్బు పెట్టుబడి అది.

డబ్బును వాస్తవంగా కూడబెట్టేదాని మొదటి, నిజమైన రూపంలో డబ్బు సంచయనాన్ని మనం ఇక్కడ చర్చిస్తున్నాము. అది కేవలం చెల్లించబడవలసిన డబ్బు రూపంలో, అంటే స'ను అమ్మిన పెట్టుబడిదారులకు కొనుగోలుదార్లు చెల్లించవలసిన బాకీల రూపంలో కూడా వుండవచ్చు. ఈలోగా, ఈ గుప్త డబ్బు పెట్టుబడి ఇతర రూపాల్లో, డబ్బును ఈనే డబ్బు రూపంలో సైతం వుండవచ్చు. వడ్డీ చెల్లించబడే బ్యాంకు డిపాజిట్లు, ఎక్స్ఛేంజి బిల్లులు, ఇతర రకాల రుణ పత్రాలు ఇందుకు ఉదాహరణ. ఇక్కడ చర్చిస్తున్నది ఈ రూపాల గురించి కాదు. అటువంటి సందర్భాల్లో డబ్బు రూపంలో చేతికందే అదనపు విలువ తనకు మూలమైన పారిశ్రామిక పెట్టుబడి నిర్వర్తించే ఆవృత్తి వెలుపల ప్రత్యేక పెట్టుబడి విధులను నెరవేరుస్తుంది. మొదటి విషయం, ఆ ఆవృత్తితో నిమిత్తం లేని విధులివి. కానీ రెండవ విషయమేమిటంటే పారిశ్రామిక పెట్టుబడి విధులకు భిన్నమైన పెట్టుబడి విధులు వీటిలో గర్భితం. వాటి సంగతి ఇక్కడ ఇంకా ఎత్తుకోలేదు.

## IV. సంచయన నిధి (Reserve Fund)

మనం పైన చర్చించిన రూపంలో నిల్వ నిధి, అదనపు విలువకు అస్తిత్వ రూపంగా వున్న ఈ నిధి డబ్బును పోగుచేయడానికి వున్న నిధి; పెట్టుబడి సంచయనం తాత్కాలికంగా ధరించిన డబ్బు రూపం. ఆ మేరకు ఈ సంచయనానికి అది తప్పనిసరి. కానీ ఈ సంచయనిధి ప్రత్యేకమైన కొన్ని అనుబంధ క్రియలను కూడా నిర్వహించగలదు. అంటే, పెట్టుబడి ఆవృత్తి ఉపె....ఉపె' రూపం ధరించనట్టి, తత్కారణంగా పెట్టుబడిదారీ పునరుత్పత్తి విస్తరణ జరగనట్టి దాని ఆవృత్తుల గమనంలో ఈ నిధి ప్రవేశించవచ్చు.

స'–డ' ప్రక్రియకు గనుక మామూలుకన్నా ఎక్కువకాలం పడితే, ఆ కారణం వల్ల సరుకు పెట్టుబడి డబ్బు పెట్టుబడిగా పరివర్తన చెందడంలో మరీ ఎక్కువ జాప్యం జరిగితే, లేదా ఉదాహరణకు, ఈ పరివర్తన పూర్తి అయిన తరువాత, డబ్బు పెట్టుబడి చెందవలసి వున్న రూపాంతరమైన ఉత్పత్తి సాధనాల ధరలు ఆవృత్తి ప్రారంభం నాటికన్నా పెరిగివున్నట్లయితే, సంచయనిధిగా పనిచేస్తున్న నిల్వ నిధిని డబ్బు పెట్టుబడి స్థానంలో, లేదా దానిలోని ఒక భాగం స్థానంలో వాడవచ్చు. ఆ విధంగా డబ్బు పోగుదలగా వున్న నిధి, ఆవృత్తిలోని ఆటుపోట్లను అడ్డుకొనేందుకు సంచయ నిధిగా (Reserve Fund) ఉపకరిస్తుంది.

అటువంటి సంచయ నిధిగా అది, ఉపె....ఉపె ఆవృత్తిలో చర్చించిన కొనుగోలు, చెల్లింపులకు వుపకరించే నిధికి భిన్నమైనది. కొనుగోలు, చెల్లింపు సాధనాలు క్రియాశీలమైన డబ్బు పెట్టుబడిలో

ఒక భాగం. (అందువల్ల, తన ప్రక్రియను నిర్వహిస్తున్న సాధారణ పెట్టుబడిలో ఒక భాగం యొక్క అస్తిత్వ రూపాలు.) ఈ పెట్టుబడిలోని వివిధ భాగాలు వేరు వేరు సమయాల్లో మాత్రమే తమ విధులను వరుసగా ప్రారంభిస్తాయి. నిరంతరాయమైన ఉత్పత్తి ప్రక్రియలో నిల్వ – డబ్బు పెట్టుబడి ఎల్లప్పుడూ ఏర్పడుతూనే వుంటుంది. ఎందువల్లనంటే, ఒకానొక రోజు డబ్బు అందుతుంది. అయితే ఆ తరువాత ఎప్పుడోగానీ చెల్లింపులు చేయవలసిన అవసరం వుండదు. మరో రోజు పెద్ద ఎత్తున సరుకులు అమ్మకమవుతాయి. అయితే, పెద్ద ఎత్తున ఇతర సరుకులను తరువాత ఏదో రోజునకానీ కొనవలసి వుండదు. ఈ మధ్యకాలాల్లో, చలామణిలోని పెట్టుబడిలో ఒక భాగం నిరంతరం డబ్బు రూపంలో వుంటుంది. కానీ సంచయ నిధి, తన విధులను అదివరకే నిర్వహిస్తున్న పెట్టుబడిలో, మరింత ఖచ్చితంగా చెప్పాలంటే, డబ్బు పెట్టుబడిలో అంతర్భాగం కాదు. అది, తన సంచయన ప్రాథమిక దశలో వున్న పెట్టుబడిలో క్రియాత్మక పెట్టుబడిగా ఇంకా మారని అదనపు విలువలో భాగం. మిగతా విషయాలకు వస్తే, డబ్బు చిక్కుల్లో వున్న పెట్టుబడిదారు తన చేతిలో వుండే డబ్బు విధులేమిటీ అనే సంగతిని పట్టించుకోడని ప్రత్యేకించి వివరించనవసరం లేదు. తన పెట్టుబడిని చలామణిలో వుంచ డానికి, తన వద్ద వున్న ఏ డబ్బునైనా అతను నిస్సంకోచంగా వినియోగిస్తాడు. మన ఉదాహరణనే తీసుకొందాం. దానిలో డ 422 పౌండ్లకు, డ' 500 పౌండ్లకు సమానం. 422 పౌండ్లు పెట్టుబడిలో ఒక భాగం చెల్లింపునకు, కొనుగోలుకు ఉపకరించే నిధిగా, నిల్వ వుంచిన డబ్బుగాను వున్నట్లయితే, ఇతర పరిస్థితులు యథాతథంగా వున్న స్థితిలో, అది ఆవృత్తిలో పూర్తిగా ప్రవేశపెట్టడానికి ఉద్దేశించినదే. అంతేకాదు, దీనికది సరిపోవాలనేది కూడా పెట్టుబడిదారు ఉద్దేశం. కానీ సంచయ నిధి, 78 పౌండ్లు అదనపు విలువలో భాగం. 422 పౌండ్ల విలువగల పెట్టుబడి యొక్క ఆవృత్తి పరిస్థితులు మారిన మేరకే అది ఆ ఆవృత్తి క్రమంలో ప్రవేశించగలదు. ఎందువల్లనంటే, అది సంచయ నిధిలో భాగంగా వుంది; పునరుత్పత్తి స్థాయిలో ఎటువంటి విస్తరణ లేకుండానే అది ఈ పాత్ర వహిస్తోంది.

డబ్బు సంచయ నిధిలో, గుప్త డబ్బు పెట్టుబడి ఉనికి గర్భితం. కాబట్టి డబ్బు, డబ్బు పెట్టుబడిగా పరివర్తన చెందగలదు అన్నది గర్భితం.

ఉత్పాదక పెట్టుబడి ఆవృత్తికి సార్వత్రిక సూత్రం కింద ఇవ్వబడింది. దీనిలో సామాన్య పునరుత్పత్తీ, క్రమానుగతంగా పెరిగే పునరుత్పత్తీ మిళితమై వున్నాయి.

(1: స' – డ') (2: డ – స)

ఉపె.... స' – డ' డ – స < శ్రమ / ఉ.సా. ........ఉపె (ఉపె')

ఉపె గనుక ఉపెకు సమానమైతే, (2)లోని డ, డ' మైనస్ ధకు సమానం. ఉపె గనుక ఉపె'కు సమానమైతే (2) లోని డ, డ' మైనస్ ధ కన్నా పెద్దది. అంటే, ధ పూర్తిగానో లేదా దానిలోని కొంత భాగమో డబ్బు పెట్టుబడిగా మారిందన్న మాట.

సాంప్రదాయ అర్థశాస్త్రం పారిశ్రామిక పెట్టుబడి వర్తులాకార గమనాన్ని పరిశీలిస్తున్నది, ఉత్పాదక పెట్టుబడి ఆవృత్తి రూపంలోనే.

★ ★ ★

## అధ్యాయం - 3

# సరుకు పెట్టుబడి ఆవృత్తి

సరుకు పెట్టుబడి ఆవృత్తికి సంబంధించిన సాధారణ సూత్రమిది :

స'–డ' – స......ఉపె.....స' (C' - M' - C ... P ... C')

స' అంతకు మునుపు రెండు ఆవృత్తుల ఫలితంగానే కాక, ఆ ఆవృత్తులకు మూలంగా కూడా అగుపిస్తుంది. ఎందువల్లనంటే, ఒక పెట్టుబడికి డ–సగా వున్నది మరో పెట్టుబడికి స'–డ' అవుతుంది. ఉత్పత్తి సాధనాల్లో కనీసం కొంత భాగం, తమ ఆవృత్తులను నిర్వహిస్తున్న ఇతర వ్యష్టి పెట్టుబడులు ఉత్పత్తి చేసిన సరుకే కావడం ఇందుకు కారణం. మన ఉదాహరణనే తీసుకొందాం. ఇందులో బొగ్గు యంత్రాలు మొదలైనవి, గని యజమాని, పెట్టుబడిదారీ యంత్ర పరిశ్రమదారులు మొదలైన వారి సరుకు పెట్టుబడి. అదీ కాక, డ....డ' మొదటి పునరావృత్తిలోనే, డబ్బు పెట్టుబడి యొక్క ఈ రెండవ ఆవృత్తి పూర్తికాకముందే, ఉపె....ఉపె ఆవృత్తే కాక, స'.....స' ఆవృత్తి కూడా జరిగిపోయిందని ఊహించుకొంటున్నామని అధ్యాయం–1 (4)లో నిరూపించాము.

పునరుత్పత్తి విస్తృత స్థాయిలో జరిగితే, అంతిమ స' మొదటి స' కన్నా ఎక్కువగా వుంటుంది. కాబట్టి దాన్ని స''గా సూచించవలసి వుంటుంది.

మూడవ రూపానికి, మొదటి రెండు రూపాలకు మధ్య గల భేదమిది :

మొదటి విషయం : ఇక్కడ మొత్తం చలామణి తన రెండు విరుద్ధ దశలతో ఆవృత్తిని ప్రారంభిస్తుంది. కాని, 1వ రూపంలో చలామణికి ఉత్పాదక ప్రక్రియ వల్ల అంతరాయమేర్పడుతుంది. 2వ రూపంలో, పరస్పర పూరకమైన రెండు దశలు గల చలామణి, పునరుత్పత్తి ప్రక్రియను ఆచరణలోకి తెచ్చే సాధనంగా మాత్రమే కనిపిస్తుంది, కాబట్టి అది ఉపె....ఉపె మధ్య అనుసంధాయక గమనమవుతుంది. డ....డ' విషయంలో చలామణి రూపమిది : డ....స.... స'–డ' = డ–స – డ. ఉపె..... ఉపె విషయంలో దాని రూపం తలకిందులుగా వుంటుంది. అది స'–డ'. డ–స = స – డ–స. పోతే స'–స' విషయంలో కూడా దాని రూపమిదే.

రెండవ విషయం : 1వ, 2వ ఆవృత్తులు మళ్ళీ జరిగినప్పుడు, తుది స్థానాలైన డ, ఉపె'లు కొత్త ఆవృత్తికి ప్రారంభక స్థానాలయినప్పటికీ, డ', ఉపె'లు ఏ రూపంలో ఉత్పత్తి అయ్యాయో ఆ రూపం అదృశ్యమవుతుంది. డ' = డ + ధ, ఉపె' = ఉపె + అపె –– ఇవి డ గాను ఉపె గాను కొత్త ప్రక్రియను ప్రారంభిస్తాయి. కానీ 3వ రూపంలో ఈ ఆవృత్తి అదే స్థాయిలో పునఃప్రారంభమయినప్పటికీ ప్రారంభ స్థానం స ను స'గా పేర్కొనవలసి వుంటుంది. దానికి కారణమిది : 1వ రూపంలో, డ' ఒక కొత్త ఆవృత్తిని డ'గా ప్రారంభించిన వెంటనే, అది డబ్బు పెట్టుబడి డ గా, అదనపు విలువను ఉత్పత్తి

చేయడానికై డబ్బు రూపంలో పెట్టుబడి విలువ మదుపుగా పనిచేస్తుంది. ఇలా మదుపు పెట్టిన పెట్టుబడి విలువ పరిమాణం. మొదటి ఆవృత్తిలో సాధించిన విలువ పెరుగుదల వల్ల హెచ్చింది. కాని, మదుపు పెట్టిన డబ్బు పెట్టుబడి 422 పౌండ్లయినా లేక 500 పౌండ్లయినా, అది మామూలు పెట్టుబడి విలువగా వుందనే వాస్తవం మారదు. డ' స్వయం విస్తృతమైన పెట్టుబడిగా లేక అదనపు విలువను తనలో పొందుపరుచుకొన్న పెట్టుబడిగా, పెట్టుబడి సంబంధంగా ఇక వుండదు. నిజానికి, తన ప్రక్రియలోనే అది తన్ను తాను విస్తృతపరచుకోవలసి వుంటుంది. ఉపె....ఉపె'కు కూడా ఇదే వర్తిస్తుంది. ఉపె' స్థిరంగా ఉపె గా, అదనపు విలువను ఉత్పత్తి చేయవలసి వున్న పెట్టుబడి విలువగా పని చేస్తూనే వుండాలి, తన ఆవృత్తిని పునఃప్రారంభించాలి.

ఇందుకు భిన్నంగా సరుకు పెట్టుబడి తన ఆవృత్తిని కేవలం పెట్టుబడి విలువతో ప్రారంభించదు. సరుకు రూపంలో పెరిగిన పెట్టుబడి విలువతో ప్రారంభిస్తుంది. కాబట్టి, సరుకుల రూపంలో వున్న పెట్టుబడి విలువ ఆవృత్తి మాత్రమే కాక, అదనపు విలువ ఆవృత్తి కూడా ప్రారంభం నుంచే అందులో చేరి వుంది. అందువల్ల, ఈ రూపంలో సామాన్య పునరుత్పత్తి జరిగితే, అంతిమ స్థానంలో వున్న స' ప్రారంభ స్థానంలో వున్న స'కు సమానమైన పరిమాణంలో వుంటుంది. అదనపు విలువలో కొంత భాగం పెట్టుబడి ఆవృత్తిలో ప్రవేశిస్తే, ఆవృత్తి ముగింపులో స'కు మారు, స" అంటే మరింత విస్తృతమైన స' ప్రత్యక్షమవుతుంది. కానీ తదుపరి ఆవృత్తి మళ్ళీ స' తో ప్రారంభమవుతుంది. ఇవి మునుపటి ఆవృత్తిలోని స' కన్నా ఎక్కువ పరిమాణం గల స' అంతే. దానిలో పోగయిన పెట్టుబడి విలువ మునుపటికన్నా ఎక్కువ. కాబట్టి అది సాపేక్షంగా అధికమైన, కొత్తగా సృష్టి అయిన అదనపు విలువతో తన కొత్త ఆవృత్తిని ప్రారంభిస్తుంది. ఏ పరిస్థితిలో కూడా స' ఎల్లప్పుడూ పెట్టుబడి విలువ + అదనపు విలువకు సమానమైన సరుకు పెట్టుబడిగా ఆవృత్తిని ప్రారంభిస్తుంది.

ఉత్పత్తి సాధనాలు ఇతర పారిశ్రామిక పెట్టుబడి ఉత్పాదితంగా వున్న మేరకు, వ్యష్టి పారిశ్రామిక పెట్టుబడి తాలూకు ఆవృత్తిలో స గా స' ఈ పెట్టుబడి రూపంగా కాక, మరేదో పారిశ్రామిక పెట్టుబడి రూపంగా ప్రత్యక్షమవుతుంది. మొదటి పెట్టుబడికి సంబంధించిన డ–స క్రియ (అంటే డ–ఉసా రెండవ పెట్టుబడికి స'–డ' అవుతుంది)

చలామణి క్రియ డ–స $<$ శ్రమ / ఉ.సా. లో, శ్ర, ఉసా, ఈ రెండూ ఒకే విధమైన సంబంధాలు గలవి. ఎందువల్లనంటే, అవి, వాటి అమ్మకందారుల చేతిలోని సరుకులు – వారు తమ శ్రమ శక్తిని అమ్ముకొనే కార్మికులు, ఉత్పత్తి సాధనాలను అమ్ముకొనే వాటి సొంతదారులు. కొనుగోలుదారుని డబ్బు ఇక్కడ డబ్బు పెట్టుబడిగా పని చేస్తుంది. శ్ర, ఉసా లను అతడు కొనే వరకు అవి అతనికి కేవలం సరుకులుగానే వుంటాయి. కాబట్టి డబ్బు రూపంలో వున్న అతని పెట్టుబడికి అవి ఇతరుల సరుకులుగా ఎదురయినంత కాలం అవి అతని దృష్టిలో సరుకులే. ఉసా కు, శ్ర కు మధ్య ఒక్క విషయంలో మాత్రమే తేడా వుంది – ఉసా దాని అమ్మకందారుని పెట్టుబడి ధరించిన సరుకు రూపమైతే, అది అతని చేతిలోని స'గా, కాబట్టి పెట్టుబడిగా వుండవచ్చు. కానీ శ్ర శ్రామికునికి ఎల్లప్పుడూ సరుకే తప్ప మరొకటి కాదు. అది దాని కొనుగోలుదారు చేతిలో మాత్రమే, ఉపెలో అంతర్భాగంగా, పెట్టుబడి అవుతుంది.

ఈ కారణం వల్ల స' ఎన్నటికీ కేవలం స గా, కేవలం పెట్టుబడి విలువ యొక్క సరుకు రూపంగా ఎటువంటి ఆవృత్తినీ ప్రారంభించజాలదు. సరుకు పెట్టుబడిగా అది ఎల్లప్పుడు ద్విముఖమైనది. ఉపయోగపు విలువ దృష్ట్యా అది క్రియాశీలమైన ఉపె యొక్క ఉత్పాదితం (ప్రస్తుత ఉదాహరణలో నూలు). ఈ ఉపె మూలకాలైన శ్ర, ఉసా లు, చలామణి రంగం నుంచి సరుకులుగా వచ్చి, ఈ ఉత్పాదితం తయారీలో కేవలం కారకాలుగా (factors) పని చేశాయి. రెండవ విషయం, విలువ దృష్ట్యా చూస్తే ఇది, పెట్టుబడి విలువ ఉపె + ఆ ఉపె క్రియ వల్ల ఉత్పత్తి అయిన అదనపు విలువ అవి.

ఉపె కు, పెట్టుబడి విలువకు సమానమైన స, స'లో అదనపు విలువ నిక్షిప్తమై వున్న భాగం నుంచి, ఆ అదనపు విలువ నిక్షిప్తమైన అదనపు ఉత్పాదితం నుంచి వేరుపడ్డ వీలున్నదీ, వేరై తీరవలసినదీ స' నిర్వహించే ఆవృత్తిలోనే. నూలులోలాగా, ఈ రెంటినీ యథార్థంగా వేరుచేయ వీలుందా, లేక యంత్రంలోలాగా, అలా వాటిని వేరుచేయ వీలులేదా అనేది ముఖ్యం కాదు. స' తను డ'గా పరివర్తన చెందిన వెంటనే వాటిని ఎల్లప్పుడూ వేరుచేయ వీలుంది.

సరుకు రూపంలోని ఉత్పాదితమంతటినీ, మన ఉదాహరణలోని 10,000 పౌనుల నూలులోలాగా ఒకే రూపంలో వున్న స్వతంత్రమైన ఉత్పాదిత ఖండాలుగా వేరుచేయ వీలుంటే, అందువల్ల స'–డ' క్రియను వరుసగా జరిగే పలు అమ్మకాలు సూచిస్తే, అప్పుడు అదనపు విలువ పూర్తిగా డబ్బు రూపంలో చేతికందకముందే, అంటే స' పూర్తిగా డబ్బు రూపంలో చేతికందకముందే, సరుకుల రూపంలోని పెట్టుబడి విలువ స గా పని చేయగలదు. స' నుంచి పెట్టుబడి విలువను వేరు చేయ వీలవుతుంది.

500 పౌండ్ల విలువ గల 10,000 పౌనుల నూలులో, 8,440 పౌనుల నూలు విలువ, 422 పౌండ్లకు సమానమైన ఈ విలువ, అదనపు విలువ మినహాయించబడ్డ పెట్టుబడి విలువకు సమానం. పెట్టుబడిదారు మొదట 8,440 పౌనుల నూలును 422 పౌండ్లకు అమ్మితే, అప్పుడు ఈ 8,440 పౌనుల నూలు స గా సరుకు రూపంలోని పెట్టుబడి విలువగా వుంటుంది. స'లో, ఇది కాక, అదనపు ఉత్పాదితం అయిన 1,560 పౌనుల నూలు కూడా వుంది. ఇది 78 పౌండ్ల అదనపు విలువకు సమానం. ఈ అదనపు ఉత్పాదితం ఆ తరువాత గానీ చలామణి కాదు. అదనపు ఉత్పాదితం చలామణి సపె – ధ – సపె జరగక ముందే పెట్టుబడిదారు స–డ–స < శ్రమ / ఉ.సా. ను నిర్వర్తించగలిగాడు.

లేక, అతను 372 పౌండ్ల వెల చేసే 7,440 పౌనుల నూలును మొదట అమ్మి, తరువాత 50 పౌండ్లు వెల చేసే 1,000 పౌనుల నూలును అమ్మితే, స లోని మొదటి భాగంతో ఉత్పత్తి సాధనాలకైన వ్యయాన్ని (స్థిర పెట్టుబడి, స్థిపె), స లోని రెండవ భాగంతో అస్థిర పెట్టుబడి అపెను (శ్రమశక్తి కైన వ్యయాన్ని) భర్తీ చేసుకుని తరువాత మునుపటిలాగే పని సాగించవచ్చు.

వరుసగా అటువంటి అమ్మకాలు జరిగి, ఆవృత్తి పరిస్థితులు అనుమతిస్తే, పెట్టుబడిదారు స'ను స్థిపె + అపె + అవి లుగా విడదీయడానికి బదులు స' లోని శేషించిన (aliquot) భాగాలను కూడా అలా విడదీయవచ్చు.

ఒక ఉదాహరణను తీసుకొందాం. 373 పౌండ్లకు సమానమైన 7,440 పౌనుల నూలు, స'లో (అంటే 500 పౌండ్లు వెలచేసే 10,000 పౌనుల నూలులో) భాగంగా పెట్టుబడిలో స్థిర భాగానికి ప్రాతినిధ్యం వహిస్తోంది. దీన్ని కింది విధంగా విడగొట్టవచ్చు. 276.768 పౌండ్లు వెల చేసే 5,535.360 పౌనుల నూలు (ఇది పెట్టుబడిలోని స్థిరభాగాన్ని, అంటే 7,440 పౌనుల నూలును ఉత్పత్తి చేయడంలో వినియోగమైన ఉత్పత్తి సాధనాల విలువ స్థానాన్ని మాత్రమే భర్తీ చేస్తుంది), 37,200 పౌండ్లు వెలచేసే 744 పౌనుల నూలు (ఇది అస్థిర పెట్టుబడి స్థానాన్ని మాత్రమే భర్తీ చేస్తుంది); 58.032 పౌండ్లు వెల చేసే 1,160.640 పౌనుల నూలు (ఇది అదనపు ఉత్పాదితం కాబట్టి అదనపు విలువ ఇందులో నిక్షిప్తమై వుంది). కాబట్టి 7,440 పౌనుల నూలును అమ్మినప్పుడు, అతను దానిలో నిక్షిప్తమైన పెట్టుబడి విలువను, 313.968 పౌండ్లను 6,279.360 పౌనుల నూలు అమ్మకంతో భర్తీ చేసుకోవచ్చు. 1,160.640 పౌనుల అదనపు ఉత్పాదితం విలువను లేదా 58.032 పౌండ్లను తన ఆదాయంగా ఖర్చు చేసుకోవచ్చు.

అదే విధంగా 50 పౌండ్లకు సమానమైన, అంటే అస్థిర పెట్టుబడికి సమానమైన మరో 1,000 పౌనుల నూలును విభజించి కింది విధంగా అమ్మవచ్చు. 37.200 పౌండ్లు వెల చేసే 744 పౌనుల నూలు (ఈ వెల 1,000 పౌనుల నూలులో నిక్షిప్తమైన స్థిర పెట్టుబడి విలువకు సమానం), 5.000 పౌండ్లు వెల చేసే 100 పౌనుల నూలు (ఇది దానిలోని అస్థిర పెట్టుబడి విలువ); కాబట్టి 42.200 పౌండ్లు వెల చేసే ఈ 844 పౌనుల నూలు 1000 పౌనుల నూలులో నిక్షిప్తమైన పెట్టుబడి విలువ స్థానాన్ని భర్తీ చేస్తుంది. ఆఖరున 7.800 పౌండ్లు వెల చేసే 156 పౌనుల నూలు. ఇది అందులోని అదనపు ఉత్పాదితం. దీన్ని అదనపు ఉత్పాదితంగా వినియోగించుకోవచ్చు.

ఆఖరున, అతను 78 పౌండ్లు వెల చేసే మిగతా 1,560 పౌనుల నూలును అమ్ముకోగలిగా డనుకొంటే, ఆ నూలును కింది విధంగా అతను విడగొట్టవచ్చు. 58.032 పౌండ్లు వెల చేసే 1,160.640 పౌనుల నూలు – దీని అమ్మకం ఆ 1,560 పౌనుల నూలులో నిక్షిప్తమైన ఉత్పత్తి సాధనాల విలువను భర్తీ చేస్తుంది. 7.800 పౌండ్లు వెల చేసే 156 పౌనుల నూలు – దాని అమ్మకం దానిలోని అస్థిర పెట్టుబడిని భర్తీ చేస్తుంది; అంటే, 65.832 పౌండ్లకు సమానమైన 1,316.640 పౌనుల నూలు అమ్మకం మొత్తం పెట్టుబడి విలువను భర్తీ చేస్తుందన్న మాట; ఆఖరున 12.168 పౌండ్లకు సమానమైన 243.360 పౌనుల అదనపు ఉత్పాదితం మిగిలి వుంటుంది; దీన్ని ఆదాయంగా వ్యయం చేయవచ్చు.

నూలులోని అన్ని అంశాలను – స్థిపె, అపె, అవి – అదే అంతర్భాగాలుగా విభజించవచ్చు. 1 షిల్లింగు, లేదా 12 పెన్నీలు వెల చేసే ప్రతి ఒక్క పౌను నూలునూ ఇలాగే విభజించవచ్చు.

| | | | | | | |
|---|---|---|---|---|---|---|
| స్థి.పె. | = | 0.744 | పౌను నూలు | = | 8.928 | పెన్నీలు |
| అ.పె. | = | 0.100 | పౌను నూలు | = | 1.200 | పెన్నీలు |
| అ.వి. | = | 0.156 | పౌను నూలు | = | 1.872 | పెన్నీలు |
| స్థి.పె + అపె + అవి | = | 1 | పౌను నూలు | = | 12 | పెన్నీలు |

పై మూడు పాక్షిక అమ్మకాల ఫలితాలను కూడితే, మొత్తం 10,000 పౌనుల నూలును ఒకేసారి అమ్మిన ఫలితమే వస్తుంది.

**స్థిర పెట్టుబడి ఇలా భర్తీ అవుతుంది :**

| | | | | | |
|---|---|---|---|---|---|
| మొదటి అమ్మకంతో : | 5,535.360 | పౌనుల నూలు | = | 276.768 | పౌండ్లు |
| రెండవ అమ్మకంతో : | 744.000 | పౌనుల నూలు | = | 37.200 | పౌండ్లు |
| మూడవ అమ్మకంతో : | 1,160.000 | పౌనుల నూలు | = | 58.032 | పౌండ్లు |
| మొత్తం............... | 7,440 | పౌనుల నూలు | = | 372 | పౌండ్లు |

**అస్థిర పెట్టుబడి యిలా భర్తీ అవుతుంది :**

| | | | | | |
|---|---|---|---|---|---|
| మొదటి అమ్మకంతో : | 744.000 | పౌనుల నూలు | = | 37.200 | పౌండ్లు |
| రెండవ అమ్మకంతో : | 100.000 | పౌనుల నూలు | = | 5.000 | పౌండ్లు |
| మూడవ అమ్మకంతో : | 156.000 | పౌనుల నూలు | = | 7.800 | పౌండ్లు |
| మొత్తం............... | 1000 | పౌనుల నూలు | = | 50 | పౌండ్లు |

**అదనపు విలువ ఇలా చేతికందుతుంది**

| | | | | | |
|---|---|---|---|---|---|
| మొదటి అమ్మకంతో : | 1,160.640 | పౌనుల నూలు | = | 58.032 | పౌండ్లు |
| రెండవ అమ్మకంతో : | 156.000 | పౌనుల నూలు | = | 7.800 | పౌండ్లు |
| మూడవ అమ్మకంతో : | 243.360 | పౌనుల నూలు | = | 12.168 | పౌండ్లు |
| మొత్తం............... | 1,560 | పౌనుల నూలు | = | 78 | పౌండ్లు |

**పై మూటి వెరసి :**

| | | | | | |
|---|---|---|---|---|---|
| స్థిర పెట్టుబడి -- | 7,440 | పౌనుల నూలు | = | 372 | పౌండ్లు |
| అస్థిర పెట్టుబడి -- | 1,000 | పౌనుల నూలు | = | 57 | పౌండ్లు |
| అదనపు విలువ -- | 1,560 | పౌనుల నూలు | = | 78 | పౌండ్లు |
| మొత్తం-- | 10,000 | పౌనుల నూలు | = | 500 | పౌండ్లు |

స'–డ'నే తీసుకొంటే అది 10,000 పౌనుల నూలు అమ్మకాన్ని సూచిస్తుందంతే. ఈ 10,000 పౌనుల నూలు, తక్కిన అన్ని నూలుల్లాగానే ఒక సరుకు, నూలు ధర, పౌనుకు 1 షిల్లింగు, లేక 10,000 పౌనులకు 500 పౌండ్లు అనేదొక్కటే కొనుగోలుదారు పట్టించుకొనే విషయం. బేరమాడే టప్పుడు అతను నూలు విలువ అంతర్ నిర్మాణాన్ని గురించి తరచడానికి పూనుకొంటే, నూలును పౌనుకు 1 షిల్లింగ్ కన్నా తక్కువ ధరకే అమ్మవచ్చుననీ, అప్పటికీ అది అమ్మకందారుకు మంచి బేరమేననీ రుజువు చేయాలనే కుబుద్ధితో ఆ పని చేస్తాడు. కానీ అతను కొనే నూలు పరిమాణం అతని అవసరాలను బట్టి వుంటుంది. ఉదాహరణకు అతను బట్టల మిల్లు యజమాని అయితే, మిల్లులో పనికి నియుక్తమైన అతని పెట్టుబడి అంతర్నిర్మాణంపై ఆ పరిమాణం ఆధారపడి వుంటుందే తప్ప, తను ఎవరి నుంచి నూలు కొంటున్నాడో, ఆ నూలు మిల్లు యజమాని పెట్టుబడి అంతర్నిర్మాణంపై

ఆధారపడి వుండదు. స'ను ఉత్పత్తి చేయడంలో వ్యయమై పోయిన పెట్టుబడిని (లేదా ఈ పెట్టుబడిలోని వివిధ అంతర్భాగాలను) స' ఒకవైపు భర్తీ చేయడం, మరోవైపు అదనపు విలువను ఖర్చు పెట్టేందుకు, లేదా పెట్టుబడిని పోగు చేసేందుకు అదనపు ఉత్పాదితంగా అది ఉపయోగపడటం – ఇవి జరగవలసిన నిష్పత్తులు 10,000 పౌనుల నూలు రూపంలో వున్న సరుకు పెట్టుబడి ఆవృత్తిలో మాత్రమే వున్నాయి. నూలు అమ్మకంతో ఈ నిష్పత్తులకు సంబంధం లేదు. ప్రస్తుత సందర్భంలో, స' దాని విలువకే అమ్మకమవుతుందనీ, తత్ఫలితంగా, ఇది సరుకు రూపం నుంచి డబ్బు రూపానికి పరివర్తన చెందడానికి సంబంధించిన సమస్య మాత్రమే అనీ ఊహించుకొంటున్నాము. స' ఈ వ్యష్టి పెట్టుబడి యొక్క క్రియాత్మక రూపం. దీని నుంచే ఉత్పాదక పెట్టుబడి స్థానాన్ని భర్తీ చేయవలసి వుంటుంది. కాబట్టి, అమ్మకంలో పలికిన ధరకు, విలువకు మధ్య తేడా వున్నట్లయితే, అది ఏ మేరకు ఉందనేది స'కు సంబంధించినంత వరకు, నిర్ణయాత్మక ప్రాముఖ్యం గల విషయమే. కానీ కేవలం రూప భేదాలకు సంబంధించిన పరిశీలనలో ఈ విషయంతో మనకు నిమిత్తం లేదు.

Iవ రూపంలో, లేదా డ....డ'లో, ఉత్పాదన క్రియ, పెట్టుబడి చలామణిలోని రెండు పరస్పర పూరక, పరస్పర విరుద్ధ దశల మధ్యలో అడ్డుతగులుతుంది. ముగింపు దశ అయిన స'–డ' ప్రారంభం కాకముందే, ఆ ప్రక్రియ గడిచిపోతుంది. పెట్టుబడిగా మదుపు పెట్టిన డబ్బు మొదట ఉత్పత్తి మూలాంశాలుగా పరివర్తన చెందుతుంది. ఇవి సరుకు రూపంలోని ఉత్పాదితంగా మారుతుంది. ఈ ఉత్పాదితం ఇటు మళ్ళీ డబ్బుగా మారుతుంది. ఇది సంపూర్ణమైన, సమగ్రమైన వ్యాపార చక్రం, దీని ఫలితం డబ్బు. ఈ డబ్బును ప్రతి ఒక్కరూ ప్రతిదానికీ వాడుకోవచ్చు. కాబట్టి ఆవృత్తి కొత్తగా ప్రారంభం కావడం సంభవనీయం మాత్రమే. డ...ఉపె...డ' అనేది, వ్యాపారం నుంచి ఉపసంహరింపబడుతున్న ఒక వ్యష్టి పెట్టుబడి పనికే స్వస్తి చెప్పే ఆఖరు ఆవృత్తైనా కావచ్చు లేదా, తన పని ప్రారంభిస్తున్న ఒక కొత్త పెట్టుబడి తొట్టతొలి ఆవృత్తైనా కావచ్చు. ఇక్కడ సార్వత్రిక గమన క్రమం డ....డ; డబ్బునుంచి మరింత ఎక్కువ డబ్బువైపుగా సాగే గమనం.

2వ రూపం ఉపె....స' – డ' – స.....ఉపె (ఉపె')లో, మొత్తం చలామణి క్రమం మొదటి ఉపె తరువాత, రెండవ ఉపెకు మునుపూ సాగుతుంది. కానీ ఇది Iవ రూపంలో ఉన్నదానికి వ్యతిరేకమైన వరుస క్రమంలో జరుగుతుంది. మొదటి ఉపె ఉత్పాదక పెట్టుబడి, దాని విధి ఉత్పాదక ప్రక్రియ. ఇది తరువాతి చలామణి క్రమానికి తప్పనిసరియైన పూర్వావసరం. కానీ ముగింపు స్థానంలో వున్న ఉపె ఉత్పాదక క్రియ కాదు. అది తన ఉత్పాదక పెట్టుబడి రూపంలో పారిశ్రామిక పెట్టుబడి పునరావతరణ మాత్రమే. చలామణి ఆఖరు దశలో పెట్టుబడి విలువ శ్ర + ఉపెగా, అంటే, తమ సమ్మేళన ద్వారా ఉత్పాదక పెట్టుబడి అస్తిత్వ రూపం అవుతున్న ఆత్మగత, వస్తుగత అంశాలుగా పరివర్తన చెందినందువల్ల అది అలాంటిదైంది. ఆ పెట్టుబడి, ఉపె కాని, ఉపె' కానీ ఉత్పాదక పెట్టుబడిగా మళ్ళీ పనిచేసే రూపంలో, ఉత్పాదక ప్రక్రియను మళ్ళీ నిర్వర్తించి తీరాల్సిన రూపంలో చివర వుంది. గమన క్రమ సాధారణ రూపం ఉపె....ఉపె అనేది పునరుత్పత్తి రూపం. అది డ....డ' లాగా, ఈ ప్రక్రియ లక్ష్యం విలువ స్వయం విస్తరణే అని సూచించదు. ఈ రూపం మూలంగా, ఉత్పత్తి ప్రక్రియ యొక్క ఖచ్చితమైన పెట్టుబడిదారీ రూపాన్ని ఉపేక్షించడం, కేవలం ఉత్పత్తే ఈ ప్రక్రియ ఉద్దేశమైనట్లు చిత్రించడం సాంప్రదాయక అర్థశాస్త్రానికి మరింత సులభమవుతుంది. అంటే,

సాధ్యమయినంత ఉత్పత్తి చేయడం, అందులోనూ సాధ్యమైనంత చౌకగా ఉత్పత్తి చేయడం దాని ఉద్దేశమనీ, కొంత ఉత్పత్తి పునరారంభం కోసం (డ-స), కొంత వినియోగం కోసం (ధ-సపె) ఉత్పాదితాన్ని అనేకానేక రకాల ఉత్పాదితాలతో మార్పిడి చేయడం తప్పనిసరి అని అది చెబుతోంది. అలా చిత్రించినప్పుడు డబ్బుకు, డబ్బు పెట్టుబడికి గల ప్రత్యేక లక్షణాలను దాటవేయడం సాధ్యమవుతుంది. ఎందువల్లనంటే, ఇక్కడ డ, ధలు చలామణికి తాత్కాలిక సాధనాలుగా మాత్రమే అగుపిస్తాయి. ఈ ప్రక్రియ మొత్తం సామాన్యమైనదిగా, సహజమైనదిగా కనిపిస్తుంది. అంటే మిడి మిడి హేతువాదానికి వున్న సహజత్వం దానికీ వుంది. అదే విధంగా, సరుకు పెట్టుబడిలోని లాభాన్ని కూడా అప్పుడప్పుడు మరిచిపోవడం కద్దు. ఉత్పత్తి ఆవృత్తిని మొత్తంగా చర్చిస్తున్నప్పుడు సరుకు పెట్టుబడిని సరుకుగానే చిత్రిస్తారు. కానీ విలువలోని అంతర్భాగాలను గురించిన చర్చ రాగానే, సరుకు పెట్టుబడిని సరుకు పెట్టుబడిగా చూపుతారు. ఉత్పత్తిని చూచిన దృక్పథంతోనే పెట్టుబడి సంచయనాన్ని కూడా చూస్తారని వేరే చెప్పనవసరంలేదు.

3వ రూపం, స'-డ'-డ.... ఉపె....స'లో చలామణి క్రమంలోని రెండు దశలూ ఆవృత్తిని ప్రారంభిస్తాయి; అది 2వ రూపం ఉపె....ఉపె లోని వరుస క్రమంలోనే జరుగుతుంది. తరువాత ఉపె తన విధి అయిన ఉత్పాదక క్రియతో Iవ రూపంలో లాగానే రంగంపైకి వస్తుంది. ఈ ఆవృత్తి ఉత్పాదక ప్రక్రియ ఫలితమైన స'తో ముగుస్తుంది. IIవ రూపంలో ఆవృత్తి ఉపె తో, అంటే ఉత్పాదక పెట్టుబడి యొక్క కేవల పునస్సాక్షాత్కారంతో ముగుస్తున్నట్లుగానే ఇక్కడ ఆవృత్తి స'తో అంటే సరుకు పెట్టుబడి యొక్క కేవల పునస్సాక్షాత్కారంతో ముగుస్తుంది. IIవ రూపంలో తన ఆవృత్తిని ముగించినప్పటి ఉపె రూపంలోని పెట్టుబడి ఈ ప్రక్రియను ఉత్పాదన క్రియగా మళ్ళీ ప్రారంభించవలసినట్లుగానే, ఇక్కడ కూడా, పారిశ్రామిక పెట్టుబడి సరుకు పెట్టుబడి రూపంలో పునరావిర్భావం చెందడంతో, ఆ వృత్తి చలామణి దశ స'-డ' తో పునఃప్రారంభం కావలసి వుంటుంది. ఆవృత్తి యొక్క ఈ రెండు రూపాలు అసంపూర్ణమైనవి. ఎందువల్లనంటే, అవి డ'తో అంటే, డబ్బుగా పునఃపరివర్తన చెందినట్టి, స్వయం విస్తృతమైనట్టి పెట్టుబడి విలువతో ముగియవు. కాబట్టి ఈ రెండు కొనసాగక తప్పదు; ఫలితంగా వాటిలో పునరుత్పత్తి చేరి వుంటుంది. IIIవ రూపంలో మొత్తం ఆవృత్తి స'....స'.

ఈ మూడవ రూపానికి మొదటి రెండు రూపాలకు గల భేదమిది; అదనపు విలువను ఇంకా ఉత్పత్తి చేయవలసి వున్న మొదటి పెట్టుబడి కాక, స్వయం విస్తృతమైన పెట్టుబడి విలువే తన స్వయం విస్తరణను ప్రారంభించేదిగా రంగంపైకి వచ్చేది, ఈ మూడవ రూపంలోనే. ఒక పెట్టుబడి సంబంధంగా స ఇక్కడ ప్రారంభ స్థానంలో వుంది. అట్టి సంబంధానికి మొత్తం ఆవృత్తిపై నిర్ణయాత్మక ప్రభావం వుంటుంది. ఎందువల్లనంటే, మొదటి విషయం, దానిలో పెట్టుబడి విలువ ఆవృత్తే కాకుండా అప్పటికే తన మొదటి దశలో వున్న అదనపు విలువ ఆవృత్తి కూడా చేరి వుంది. రెండవది, ఈ అదనపు విలువలో కొంత భాగం ప్రతి ఒక్క ఆవృత్తిలో కాకపోయినా, కనీసం సగటున, ఆదాయంగా ఖర్చు కావలసివున్నందున సపె-ధ-సపె అన్న చలామణిని గడపవలసి వుంటుంది; మిగతా భాగం పెట్టుబడి సంచయనంలోని ఒక అంశంగా పనిచేయవలసి వుంటుంది.

స'....స' రూపంలో, పెట్టుబడి ఆవృత్తి మామూలు గతిక్రమానికీ, సరుకు రూపంలోని మొత్తం ఉత్పాదితం వినియోగం కావడం తప్పనిసరి అని ఊహించుకొంటున్నాము. కార్మికుని వ్యక్తిగత

వినియోగం అదనపు ఉత్పాదితంలోని అసంచిత భాగపు వ్యక్తిగత వినియోగం కలిసి దానిలోని యావత్తు వ్యక్తిగత వినియోగమవుతుంది. కాబట్టి మొత్తం వినియోగం – వ్యక్తిగతమైనదీ, ఉత్పాదకమైనదీ – స' ఆవృత్తికి, తప్పనిసరియైనదై ఆ ఆవృత్తిలో ప్రవేశిస్తుంది. ఉత్పాదక వినియోగాన్ని ప్రతి వ్యష్టి పెట్టుబడీ కొనసాగిస్తుంది. (శ్రమశక్తి, కొన్ని పరిమితుల్లో, కార్మికుని వ్యక్తిగత వినియోగం ప్రధానంగా చేరి వుంది) వ్యక్తిగత వినియోగం, వ్యష్టి పెట్టుబడిదారు ఉనికికి అవసరమైన మేరకు మాత్రమే, ఇక్కడ ఒక సామాజిక చర్యగా వుంది. అంతేకాని, వ్యష్టి పెట్టుబడిదారు చర్య కాదని వూహ్యం.

Iవ, IIవ రూపంలో మొత్తం గమనం, మదుపు పెట్టుబడి విలువ గమనంగా అగుపిస్తుంది. 3వ రూపంలో, స్వయం విస్తృతమైన పెట్టుబడి మొత్తం సరుకు – ఉత్పాదితం యొక్క రూపంలో ప్రారంభ స్థానం అవుతుంది. దాని రూపం సంచార పెట్టుబడి, సరుకు పెట్టుబడి రూపం. అది డబ్బుగా పరివర్తన చెందే వరకు, ఈ గమనం పెట్టుబడి, ఆదాయాల గమనాలుగా విడిపోవు. ఒకవైపు వ్యక్తిగత వినియోగ నిధిగానూ, మరోవైపు పునరుత్పత్తి నిధిగానూ మొత్తం సామాజిక ఉత్పాదిత పంపిణీ, ప్రతి వ్యష్టి సరుకు పెట్టుబడి కోసం ఉత్పాదితపు ప్రత్యేక పంపిణీ, పెట్టుబడి ఆవృత్తిలోని ఈ రూపంలో చేరి వుంటాయి.

డ...డ'లో పునఃప్రారంభమైన ఆవృత్తిలో ప్రవేశించే ధ పరిమాణాన్ని బట్టి, ఆవృత్తి చెందగల విస్తరణ చేరి వుంది.

ఉపె...ఉపెలో, కొత్త ఆవృత్తిని ఉపె అదే పరిమాణంతోనో, లేక అంతకన్నా తక్కువ విలువ తోనో ప్రారంభించవచ్చు. అయినా, అది విస్తృత స్థాయిలో పునరుత్పత్తి కావచ్చు. ఉదాహరణకు, శ్రమ ఉత్పాదకత పెరిగినందువల్ల సరుకుల మూలకాలు కొన్ని చౌక అయినప్పుడు ఇలా జరగవచ్చు. కాని, విలువ పెరిగిన ఒక ఉత్పాదక పెట్టుబడి, పాదార్థికంగా తగ్గిపోయిన పునరుత్పత్తికి ప్రాతినిధ్యం వహించవచ్చు. ఉదాహరణకు, ఉత్పత్తి మూలకాల ధర మునుపటికన్నా పెరిగినప్పుడు ఇలా జరుగుతుంది. స'....స'కు కూడా ఇదే వర్తిస్తుంది.

స'–స'లో, సరుకుల రూపంలోని పెట్టుబడి ఉత్పత్తికి పూర్వ నిర్ణీతావసరం. ఈ ఆవృత్తిలోని రెండవ స లో అది పూర్వ నిర్ణీతావసరంగా తిరిగి వ్యక్తమవుతుంది. ఈ స గనుక ఇంకా ఉత్పత్తి కాకుండా, లేదా పునరుత్పత్తి కాకుండా ఉన్నట్లయితే ఈ ఆవృత్తికి అంతరాయమేర్పడుతుంది. ఈ సలో ఎక్కువ భాగం మరేదో పారిశ్రామిక పెట్టుబడి యొక్క స'గా పునరుత్పత్తి అయితీరాలి. ఈ ఆవృత్తిలో స' ప్రారంభ స్థానంగా, పరివర్తన స్థానంగా, గమన క్రమం ముగింపు స్థానంగా వుంటుంది. కాబట్టి అది ఎల్లప్పుడూ అక్కడ ఉండక తప్పదు. అది పునరుత్పత్తి క్రియకు శాశ్వతావసరం.

స'....స' కూ I, II రూపాలకూ, మరొక విషయంలో కూడా భేదముంది. ఈ మూడు ఆవృత్తులకు ఉమ్మడిగా వున్న అంశమేమిటంటే, పెట్టుబడి, తన ఆవృత్తిని పూర్తిచేసే రూపంలోనే ఆ ఆవృత్తిని ప్రారంభిస్తుంది. ఆ విధంగా అది కొత్త ఆవృత్తిని తన మునుపటి రూపంలోనే ప్రారంభిస్తుంది. ఎల్లప్పుడూ మొదటి రూపం డ, ఉపె, స' పెట్టుబడి విలువ మదుపు పెట్టబడిన రూపమే (రూపం 3లో ఇది తన అదనపు విలువ వల్ల పెరిగి వుంటుంది) వేరు మాటల్లో చెప్పాలంటే, ఆవృత్తికి సంబంధించినంత వరకు ఇది దాని, మునుపటి రూపమే. డ', ఉపె, స'లు, ఆవృత్తిని ముగించే

రూపం, ఆవృత్తిలో దానికి ముందున్న క్రియాశీల రూపం యొక్క పరివర్తిత రూపం; అది తొలుతటి రూపం కాదు.

ఆ విధంగా, Iలో డ', స యొక్క పరివర్తిత రూపం. IIలో తుది ఉపె, డ యొక్క పరివర్తిత రూపం (Iలోనూ, IIలోనూ ఈ పరివర్తన, సరుకుల చలామణి సామాన్య క్రియ వల్ల, సరుకు డబ్బు స్థానాలు నామకః మారడం వల్ల జరుగుతుంది.) IIIలో స' ఉత్పాదక పెట్టుబడి ఉపె యొక్క పరివర్తన చలామణి క్రియలో, కేవలం పెట్టుబడి క్రియాత్మక రూపానికే కాక, దాని విలువ పరిమాణానికి కూడా సంబంధించినది. ఇది మొదటి విషయం. కానీ రెండవ విషయమేమిటంటే, ఈ పరివర్తన చలామణి క్రియలో, కేవలం నామకః స్థానాలు మారిన ఫలితం కాదు. ఉత్పత్తి ప్రక్రియలో, ఉత్పాదక పెట్టుబడి అంతర్భాగాలయిన సరుకుల ఉపయోగపు రూపమూ, వాటి విలువా పొందిన నిజమైన పరివర్తన ఫలితమిది.

ఆది స్థానంలోని డ, ఉపె, స' రూపం తత్సంబంధిత I, II, III ఆవృత్తులకు పూర్వ నిర్ణీతావసరం. తుదిస్థానంలో తిరిగి పొందే రూపం ఆవృత్తిలో వరుసగా జరిగే రూపాంతరీకరణల పూర్వావసరమూ అవి తెచ్చి పెట్టినదే. వ్యష్టి పారిశ్రామిక పెట్టుబడి ఆవృత్తిలోని అంతిమ స్థానమైన స'లో తన్ను ఉత్పత్తి చేసిన అదే పారిశ్రామిక పెట్టుబడి ధరించే చలామణి క్రియేతర రూపం ఉపె మాత్రమే గర్భితం. Iలో అంతిమ స్థానంగానూ 'స యొక్క పరివర్తిత రూపంగానూ (స'–డ') వున్న డ'ను బట్టి, డ కొనుగోలుదారు చేతిలో వుందనీ, అది డ....డ' ఆవృత్తి వెలుపల వుందనీ, స' అమ్మకం వల్ల అది ఆ ఆవృత్తిలోకి వచ్చి దాని అంతిమ రూపమవుతుందనీ ముందుగానే నిర్ణీతమవుతోంది. ఆ విధంగా, II లోని అంతిమ స్థానంలోని ఉపె ను బట్టి, శ్ర, ఉసాలు (స) ఈ ఆవృత్తి బయట వుండటం, డ–స ద్వారా దాని అంతిమ స్థాన రూపంగా అవి మూర్తీభవించడం ముందే నిర్ణీతమయిందన్న మాట. అయితే, తుది అంతిమ రూపాన్ని వదలివేస్తే వ్యష్టి డబ్బు పెట్టుబడి ఆవృత్తిలో సార్వత్రికమైన డబ్బు పెట్టుబడి ఉనికి గర్భితం కాదు. అదే విధంగా వ్యష్టి ఉత్పాదక పెట్టుబడి ఆవృత్తిలో ఉత్పాదక పెట్టుబడి ఉనికీ గర్భితం కాదు. I లో డ మొదటి డబ్బు పెట్టుబడి కావచ్చు. IIలో, ఉపె, చారిత్రక రంగంపై ఆవిర్భవించిన మొదటి ఉత్పాదక పెట్టుబడి కావచ్చు. కానీ III లో

స' { స –
  –డ'
సపె –– }   { డ – స
ధ – సపె }   < శ్రమ / ఉసా   ........ఉపె....స'

రూపంలోని ఆవృత్తిని బట్టి దాని వెలుపల స రెండుసార్లు వుందని ముందుగానే వూహ్యం. మొదటిసారి స'–డ'–స < శ్రమ / ఉ.సా. ఆవృత్తిలో వుంది. ఈ సలో ఉసా వుంది కాబట్టి ఇది అమ్మకందారు చేతిలోని సరుకు. పెట్టుబడిదారీ ఉత్పత్తి ప్రక్రియ ఫలితం కాబట్టి అదీ సరుకు పెట్టుబడే. అలాంటిది కాకపోయినప్పటికీ, వర్తకుని చేతిలో అది సరుకు పెట్టుబడిగానే రంగంపైకి వస్తుంది. సపె–ధ–సపెలోని రెండవ సపెలో స, ఆవృత్తి వెలుపల రెండవసారి ప్రత్యక్షమవుతుంది. ఈ సపె కూడా కొనడానికి వీలుగా సరుకు రూపంలో అందుబాటులో వుండాలి. ఏది యేమైనా, అది సరుకు పెట్టుబడి అయినా,

కాకపోయినా, శ్ర, ఉసాలు, స అంతగానే సరుకులు. వాటి మధ్య వున్నది సరుకుల సంబంధాలే. సపె–ధ–సపెలోని రెండవ సపెకు కూడా ఇదే వర్తిస్తుంది. స' అన్నది సకు (శ్ర+ఉసా) సమానం కాబట్టి, దాని ఉత్పత్తికి సరుకులు మూలకాలుగా వుంటాయి. చలామణిలో వాటి స్థానాన్ని అదే సరుకులచే భర్తీ చేయవలసి వుంటుంది. అదే విధంగా, సపె, ధ–సపెలో రెండవ సపె స్థానం చలామణిలో అటువంటి సరుకులచే భర్తీ కావలసి వుంటుంది.

అదీ కాక, పెట్టుబడిదారీ ఉత్పత్తి పద్ధతి స్థిరపడిన పద్ధతిగా వున్న స్థితిలో, అమ్మకందారు చేతిలోని అన్ని సరుకులు సరుకు పెట్టుబడిగానే వుండి తీరాలి. అంతకుముందు అవి సరుకు పెట్టుబడిగా వుండకుంటే, వర్తకుని చేతిలో ఉన్నంత కాలం అలా వుంటాయి. లేదా అలా అవుతాయి. లేదా మునుపటి సరుకు పెట్టుబడి స్థానాన్ని భర్తీచేసే సరుకులుగా తత్కారణాన, దానికి కేవలం మరో విధమైన అస్తిత్వ రూపమిచ్చే సరుకులుగానైనా వుండాలి. దిగుమతి చేసుకొన్న సరుకులు ఇందుకు ఉదాహరణ.

ఉత్పాదక పెట్టుబడి ఉపె, సరుకులైన శ్ర, ఉసాలతో ఏర్పడినది; ఉపె అస్తిత్వ రూపాలుగా ఈ సరుకుల రూపాలు, వాటిని తీసుకొచ్చిన వేరు వేరు మార్కెట్లలో ఉండిన రూపాలు కాదు. అవి ఇప్పుడు ఏకమయ్యాయి. అలా సమ్మిళితమై, ఉత్పాదక పెట్టుబడి విధులను నిర్వర్తించగలవు.

ఈ III వ రూపంలో మాత్రమే ఆవృత్తిలోనే స కు పూర్వనిర్ణీతావసరంగా స రంగంపైకి వస్తుందంటే సరుకు రూపంలోని పెట్టుబడి తత్ ఆవృత్తికి ప్రారంభ స్థానంలో వుండటమే అందుకు కారణం. అదనపు విలువ వచ్చి చేరినందువల్ల హెచ్చిందా లేదా అనేదానితో నిమిత్తం లేకుండా, స' పెట్టుబడి విలువ యొక్క విధులను నిర్వర్తించిన మేరకు, తన ఉత్పత్తి మూలకాలైన సరుకులుగా అది పరివర్తన చెందడంతో ఈ ఆవృత్తి ప్రారంభమవుతుంది. కానీ ఈ పరివర్తనే, మొత్తం చలామణి ప్రక్రియ స–డ–స (= శ్ర+ఉసా) అవుతుంది; అది ఆ చలామణి ఫలితం కూడా. స ఇక్కడ ఆద్యంత స్థానాల్లో వుంది. కానీ అంత్యస్థానంలో స కు ఆ రూపమిచ్చేది డ–స ద్వారా, అంటే బయటి నుంచి, సరుకు మార్కెట్ ద్వారా. కానీ అది ఆవృత్తి అంత్యస్థానం కాదు; చలామణి ప్రక్రియగా వున్న దాని మొదటి రెండు దశల అంత్యస్థానం మాత్రమే. దాని ఫలితం ఉపె. అప్పుడది తన విధి అయిన ఉత్పత్తి క్రియను నిర్వహిస్తుంది. స', ఆవృత్తికి అంత్యస్థానంగానూ, అదే రూపంలో ప్రారంభ స్థానంగానూ ఉండేది. ఈ ఉత్పత్తి ప్రక్రియ వల్లనే తప్ప చలామణి ప్రక్రియ మూలంగా కాదు. కానీ డ....డ'లోనూ, ఉపె...ఉపెలోనూ అంతిమ స్థానాలైన డ', ఉపెలు చలామణి ప్రక్రియ ప్రత్యక్ష ఫలితాలు. కాబట్టి, మొదటి సందర్భంలో డ' రెండవ సందర్భంలో ఉపె ఇతరుల చేతిలో వున్నాయనేది, చివరిలో మాత్రమే వూహ్యం. ఆవృత్తి ఈ ఆద్యంతాల మధ్య జరుగుతుంది. కాబట్టి, అటు డ కాని, ఇటు ఉపె కానీ (అంటే, మరొకరి డబ్బుగా డ ఉనికి, మరొక పెట్టుబడి యొక్క ఉత్పాదక ప్రక్రియగా ఉపె ఉనికి) ఈ ఆవృత్తులకు పూర్వావసరంగా కనిపించవు. కానీ స'....స'లో ఇతరుల సరుకులుగా, ఇరుతల చేతిలో వున్న సరుకులుగా స (= శ్ర + ఉసా) ఉనికి గర్భితం. చలామణి ప్రారంభ ప్రక్రియవల్ల ఆవృత్తిలోకి ప్రవేశించి, ఉత్పాదక పెట్టుబడిగా మారిన సరుకులివి. ఉత్పాదక పెట్టుబడి తన విధిని నిర్వర్తించిన ఫలితంగా స' మళ్ళీ ఆవృత్తి అంతిమ రూపం అవుతుంది.

ఆవృత్తి స.....స' కు, దాని రంగంలో, ఇతర పారిశ్రామిక పెట్టుబడి స (= శ్ర+ఉసా) రూపంలో వుండటం విధాయకమని చూచాము. (ఇక్కడ ఉసా బహు విధమైన ఇతర పెట్టుబడులతో ఏర్పడినది. మన ఉదాహరణలో ఇవి యంత్రాలు, బొగ్గు నూనె మొదలయినవి.) కాబట్టి దీన్ని ఆవృత్తి సార్వత్రిక రూపంగా, అంటే మొదటిసారిగా మదుపు పెట్టినది మినహా, మిగతా ప్రతి ఒక్క పారిశ్రామిక పెట్టుబడిని పరిశీలింప వీలున్న ఒక సామాజిక రూపంగా, కనుక, అన్ని వ్యష్టి పెట్టుబడులకు ఉమ్మడిగా వున్న గమన రూపంగా పరిగణించడం అవసరమవుతుంది. అంతేకాదు. దీన్ని అదే సమయంలో, వ్యష్టి పెట్టుబడుల సమాహార గమన రూపంగా కూడా, అంటే పెట్టుబడిదారీ వర్గానికి గల మొత్తం పెట్టుబడి గమన రూపంగా కూడా పరిగణించడం అవసరం. అట్టి గమన క్రమంలో, ప్రతి వ్యష్టి పెట్టుబడి గమనం, ఇతర గమనాలతో కలగలిసిపోయిన కేవల పాక్షిక గమనంగా, వాటివల్ల ఆవశ్యకమైనదిగా కనిపిస్తుంది. ఉదాహరణకు, ఒక దేశంలో ఏటా ఉత్పత్తి అయ్యే సరుకుల సమాహారాన్ని తీసుకొందాం. దాని గమనం వల్ల దానిలోని ఒక భాగం సమస్త వ్యష్టి వ్యాపారాల్లోని ఉత్పాదక పెట్టుబడి స్థానాన్ని భర్తీ చేయగా, మిగతా భాగం వివిధ వర్గాల వ్యక్తిగత వినియోగంలో ప్రవేశిస్తుంది. ఆ గమనాన్ని మనం విశ్లేషిస్తే, స'....స' ను, సామాజిక పెట్టుబడీ, అదనపు విలువ, లేదా ఆ పెట్టుబడి ఉత్పత్తి చేసిన అదనపు ఉత్పాదితం నిర్వహించే గమనంగా పరిగణిస్తున్నామన్నమాట. సామాజిక పెట్టుబడి, వ్యష్టి పెట్టుబడుల సమాహారానికి సమానం. (వీటిలో, జాయింట్ స్టాక్ పెట్టుబడీ, గనులూ, రైల్వేలు మొదలైన వాటిలో ప్రభుత్వాలు ఉత్పాదక వేతన శ్రమను నియమించడం వల్ల అవి పారిశ్రామిక పెట్టుబడిదారుల విధులను నిర్వర్తిస్తున్న మేరకు ప్రభుత్వ పెట్టుబడీ దీనిలో చేరుతాయి.) సామాజిక పెట్టుబడి మొత్తం గమనం వ్యష్టి పెట్టుబడుల గమనాల బీజ గణితపు సమాహారానికి సమానం. అంతమాత్రాన, ఒక వ్యష్టి పెట్టుబడి గమనంగా ఈ గమనం ప్రదర్శించే పరిణామ క్రమాలు, అదే గమనాన్ని సామాజిక పెట్టుబడి మొత్తం గమనంలో భాగమనే దృష్టితో, అంటే ఇతర భాగాల యొక్క గమనాలతో దాని పరస్పర సంబంధాల దృష్టితో చూచినప్పుడు అది ప్రదర్శించే పరిణామ క్రమాలకు భిన్నంగా వుండే ఆస్కారం లేకుండాపోదు. విడిగా వున్న ఒక వ్యష్టి పెట్టుబడి ఆవృత్తిని పరిశీలిస్తున్నప్పుడు ఎదురయ్యే సమస్యలు అటువంటి పరిశీలన ఫలితంగా పరిష్కరింపబడటానికి బదులు, వాటి పరిష్కారాలను ఊహించుకోవలసి వుంటుంది. కానీ పైన పేర్కొన్న గమనం, ఈ సమస్యలను పరిష్కరించే అవకాశం కూడా వుంది.

మునుపు మదుపు పెట్టిన పెట్టుబడి విలువ, గమనారంభక స్థానంలోని విలువలో ఒక భాగంగా మాత్రమే వుండేదీ, ఆ గమనం, తదారంభం నుంచే పారిశ్రామిక పెట్టుబడి యొక్క మొత్తం గమనంగా అలా వ్యక్తమయేదీ ఒక్క స'....స' ఆవృత్తిలో మాత్రమే. మొత్తం గమనం అంటే, ఉత్పాదితంలో, ఉత్పాదక పెట్టుబడి స్థానాన్ని భర్తీ చేసే భాగం యొక్క గమనమూ, దానిలో అదనపు ఉత్పాదితంగా వున్న భాగం గమనమూ అన్నమాట. సగటున, ఈ అదనపు ఉత్పాదితంలో కొంత ఆదాయంగా వ్యయమవుతుంది, కొంత పెట్టుబడి సంచయనంగా వినియుక్తమవుతుంది. ఆదాయంగా అదనపు విలువ వ్యయం ఈ ఆవృత్తిలో చేరి వుంటుంది. ఆ మేరకు వ్యక్తిగత వినియోగం అదే విధంగా చేరి వుంటుంది. వ్యక్తిగత వినియోగం దీనిలో చేరడానికి మరో కారణం, ఆవృత్తిని ప్రారంభించే సరుకు

స ఏదో ఒక ఉపయోగపు వస్తు రూపంలో వుండటం. కాని, పెట్టుబడిదారీ పద్ధతుల్లో, ఉత్పత్తి అయ్యే ప్రతి వస్తువూ, దాని ఉపయోగపు రూపం వల్ల అది ఉత్పాదకంగా వినియోగమైనా, లేక వ్యక్తిగతంగా వినియోగమైనా, లేక రెండు విధాలా వినియోగమైనా, అది సరుకు పెట్టుబడే. డ....డ' విలువ సంగతిని మాత్రమే సూచిస్తుంది. మదుపు పెట్టిన పెట్టుబడి విలువ స్వయం విస్తరణే మొత్తం ప్రక్రియ ఉద్దేశమని సూచిస్తుంది. ఉపె....ఉపె (ఉపె') పెట్టుబడి ఉత్పత్తి ప్రక్రియను అదే పరిమాణం గల, లేదా అధికతర పరిమాణం గల (సంచయనం) ఉత్పాదక పెట్టుబడితో జరిగే పునరుత్పత్తి ప్రక్రియగా చూపుతుంది. తన ప్రారంభక స్థానంలోనే పెట్టుబడిదారీ సరుకు ఉత్పత్తి రూపంగా అభివ్యక్తమవుతూన్న స'....స'లో ఆది నుంచే ఉత్పాదక, వ్యక్తిగత వినియోగాలున్నాయి. ఉత్పాదక వినియోగం, అందులో చేరిన విలువ స్వయం విస్తరణ, ఈ గమనంలోని ఒక శాఖగా మాత్రమే అగుపిస్తాయి. ఆఖరు విషయం, స' ఇక ఏ ఉత్పాదన ప్రక్రియలోను చేర వీలులేని ఉపయోగపు రూపంలో ఉండవచ్చు. కాబట్టి, స'....స'ను మొత్తం సామాజిక పెట్టుబడి గమన రూపంగా పరిగణిస్తున్నామా, లేక ఒక వ్యష్టి పారిశ్రామిక పెట్టుబడి యొక్క స్వతంత్ర గమనంగా పరిగణిస్తున్నామా అనేదాన్ని బట్టి, ఉత్పాదితపు భాగాలచే ప్రతిబింబితమైన స' విలువ అంతర్భాగాలు భిన్న స్థానం వహిస్తాయని, ప్రారంభంలోనే స్పష్టమవుతుంది. ఈ ఆవృత్తి యొక్క ఈ ప్రత్యేకతలు మనల్ని కేవలం ఏదో ఒక వ్యష్టి పెట్టుబడి, వేటితోనూ నిమిత్తం లేకుండా నిర్వహించే ఆవృత్తిగా దానికి గల పరిధి వెలుపలకు తీసుకుపోతాయి.

స'....స' సూత్రంలో, సరుకు పెట్టుబడి గమనం, అంటే పెట్టుబడిదారీ పద్ధతిలో సృష్టి అయిన మొత్తం ఉత్పాదితం యొక్క గమనం వ్యష్టి పెట్టుబడి స్వతంత్ర ఆవృత్తికి పూర్వావసరంగానే కాక, దానికి అవసరమైనదిగా కూడా అగుపిస్తుంది. కాబట్టి ఈ సూత్రాన్నీ, దాని ప్రత్యేకతలను అవగాహన చేసుకొన్నట్లయితే, స'–డ', స–డ అన్న రూపం పరివర్తనలను, అటు పెట్టుబడి రూప పరివర్తనలో క్రియా నిర్ణీత విభాగాలుగానూ, ఇటు సరుకుల సాధారణ చలామణిలోని కొలుకులుగానూ సూచించడం చాలదు; ఒక వ్యష్టి పెట్టుబడి చెందే రూప పరివర్తనలు ఇతర వ్యష్టి పెట్టుబడుల రూప పరివర్తనలతోనూ, మొత్తం ఉత్పాదితంలో వ్యక్తిగత వినియోగానికి ఉద్దేశించిన భాగంతోనూ ఎలా పెనవేసుకొంటున్నాయో వివరించడం అవసరమవుతుంది. అందువల్లనే, ఒక వ్యష్టి పారిశ్రామిక పెట్టుబడి యొక్క ఆవృత్తి గురించిన విశ్లేషణకు మనం ప్రధానంగా మొదటి రెండు రూపాల పరిశీలనను ఆధారంగా చేసుకొన్నాము.

స'....స' ఆవృత్తి ఒకే వ్యష్టి పెట్టుబడి రూపంగా ఉదాహరణకు, పంట పంటకూ లెక్కలు తయారు చేసుకునే వ్యవసాయంలో కనిపిస్తుంది. విత్తటం II వ సూత్రంలో, పంటకోత III వ సూత్రంలో ప్రారంభ స్థానం, ఫిజియోక్రాట్ల (సంపదకు భూమే మూలమనే అర్థ శాస్త్రజ్ఞులు – అను) మాటల్లో చెప్పాలంటే, II వ సూత్రం పెట్టుబడి మదుపులతో, III వ సూత్రం తత్ఫలితాలతో ప్రారంభమవుతుంది. III వ సూత్రంలో పెట్టుబడి విలువ గమనం, ఆరంభం నుంచే ఉత్పాదితాల సార్వత్రిక రాశి గమనంలో భాగంగా మాత్రమే గోచరం కాగా, I, II సూత్రాల్లో స' గమనం, ఏదో విడి పెట్టుబడి గమనంలోని ఒక దశ మాత్రమే.

III వ సూత్రంలో, మార్కెట్‌లో సరుకులు వుండటం, ఉత్పత్తి, పునరుత్పత్తి ప్రక్రియలలో సదా

వూహ్యం. కాబట్టి, కేవలం ఈ సూత్రంపైనే దృష్టి నిలిపామంటే, ఉత్పత్తి ప్రక్రియలోని సమస్త మూలకాలు సరుకుల చలామణిలోనే ఉత్పన్నమవుతున్నాయనీ, అవి కేవలం సరుకులేననీ తోస్తుంది. ఈ పాక్షిక భావన సరుకు మూలకాలతో నిమిత్తం లేని ఉత్పాదన ప్రక్రియాంశాలను విస్మరిస్తుంది.

స'...స'లో మొత్తం ఉత్పాదితం (మొత్తం విలువ) ప్రారంభ స్థానంలో వుంది. అందువల్ల అదనపు ఉత్పాదితంలో, పెట్టుబడిగా మార్చవలసిన భాగం, అదనపు ఉత్పాదక పెట్టుబడి యొక్క పాదార్థిక మూలకాలను కలిగి వున్నప్పుడే, విస్తృత స్థాయిలో పునరుత్పత్తి జరుగగలదని తేలుతుంది. (ఇక్కడ విదేశీ వర్తకాన్ని పరిగణనకు తీసుకోవడం లేదు; ఉత్పాదకత స్థిరంగా వుందని కూడా ఊహించుకొంటున్నాము) కాబట్టి, ఒక సంవత్సరంలోని ఉత్పత్తి మరుసటి సంవత్సరం ఉత్పత్తికి మూలభూతంగా వున్న మేరకు, లేదా ఇది ఒక సంవత్సరంలోని సామాన్య పునరుత్పత్తి క్రమంతో పాటుగా జరిగిన మేరకు, అదనపు పెట్టుబడి క్రియలను నిర్వహించగలిగిన రూపంలో అదనపు ఉత్పాదితం వెనువెంటనే సృష్టి అవుతుందని కూడా స్పష్టమవుతోంది. ఉత్పాదకత పెరుగుదల వల్ల పెట్టుబడిగా వున్న పదార్థాలు పెరుగుతాయే తప్ప పెట్టుబడి విలువ పెరగదు. కానీ దానివల్ల, ఆ విలువ స్వయం విస్తరణకు అదనపు పదార్థాలు ఉత్పత్తి అవుతాయి.

స'....స' క్వెస్నే రచన టాబ్లే ఎకనామిక్‌కు ప్రాతిపదిక. వ్యాపారవాద వ్యవస్థనేర్పరచి, సుస్థిరంగా అట్టిపెట్టుకొన్న దాని రూపమైన డ...డ'కు ప్రతిగా క్వెస్నే, ఉపె....ఉపెను కాక, ఈ రూపాన్ని ఎంచుకోవడం, ఆయనకు గల గొప్ప నిజమైన విచక్షణా దృష్టికి తార్కాణం.

★ ★ ★

## అధ్యాయం - 4

# ఆవృత్తి తాలూకు మూడు సూత్రాలు
# (The three formulas of the Circuit)

"**మొ**త్తం చలామణి" క్రమానికి **మొ.చ.**ను సంకేతంగా వాడుతూ, ఈ మూడు సూత్రాలనూ క్రింది విధంగా చూపవచ్చు.

I. డ –స....ఉపె....స'–డ'

II. ఉపె....మొచ....ఉపె

III. మొచ....ఉపె (స')

ఈ మూడు రూపాలను సమ్మిళితం చేస్తే, ఈ క్రమ పూర్వావసరాలన్నీ ఈ క్రమం ఫలితంగా, ఈ క్రమమే సృష్టించిన పూర్వావసరాలుగా కనిపిస్తాయి. ప్రతి అంశమూ ఒక ప్రారంభ స్థానంగా, మధ్యలో గడిచిపోతున్న స్థానంగా, తిరిగి చేరుకున్న స్థానంగా కనిపిస్తుంది. ఈ మొత్తం క్రమం ఉత్పత్తి, చలామణి క్రమాల ఏకతగా అగుపిస్తుంది. ఉత్పత్తి క్రమం చలామణి క్రమ సంధానకర్తగా, చలామణి క్రమం ఉత్పత్తి క్రమ సంధాన కర్తగా అవుతోంది.

ఈ మూడు ఆవృత్తులకు ఒక ఉమ్మడి లక్షణముంది : అది నిర్ణాయక ప్రయోజనంగా, మీరరాని ప్రేరణగా వున్న విలువ స్వయం విస్తరణ. I వ సూత్రంలో, ఇది తద్రూపంలో వ్యక్తీకరింపబడింది. II వ సూత్రం – అదనపు విలువను సృష్టించే అసలు ప్రక్రియ అయిన ఉపెతో ప్రారంభమవుతుంది. III వ సూత్రంలో ఆవృత్తి స్వయం విస్తృత విలువతో ప్రారంభమై, గమనం అదే స్థాయిలోనే తిరిగి జరిగినా, నూతన స్వయం విస్తృత విలువతో పూర్తి అవుతుంది.

స–డ కొనుగోలుదారుకు డ–స అవుతుంది : డ–స అమ్మకందారుకు స–డ అవుతుంది. కాబట్టి, పెట్టుబడి చలామణిలో సరుకుల సాధారణ రూపపరివర్తన మాత్రమే ప్రదర్శితమవుతుంది. చలామణిలోని మొత్తం డబ్బుకు సంబంధించి ఈ సందర్భంగా రూపొందించిన నియమాలు (పెట్టుబడి, సం.I అధ్యాయం III , 2వ విభాగం) ఇక్కడ చెల్లుతాయి. కానీ, రూపానికి సంబంధించిన ఈ అంశానికి అంటిపెట్టుకోకుండా మనం వేరు వేరు వ్యష్టి పెట్టుబడుల రూప పరివర్తనల మధ్య గల వాస్తవ సంబంధాన్ని పరిశీలించినట్లయితే, వేరు మాటల్లో చెప్పాలంటే, మొత్తం సామాజిక పెట్టుబడి పునరుత్పత్తి క్రమంలోని పాక్షిక గమనాలైన వ్యష్టి పెట్టుబడి ఆవృత్తుల మధ్య సంబంధాన్ని లోతుగా పరిశీలించినట్లయితే, డబ్బు, సరుకులు కేవలం రూపాంతరం చెందడమే ఈ సంబంధానికి కారణం కాదని తేలుతుంది.

నిరంతర భ్రమణంలో వున్న ఒక వృత్తంలో ప్రతి బిందువు ఏకకాలంలో బయలుదేరే బిందువు,

తిరిగి వచ్చిన బిందువు కూడా. వృత్త భ్రమణాన్ని ఆపితే, బయలుదేరే బిందువు ప్రతి ఒక్కటీ తిరిగి వచ్చిన బిందువు కాదు. ఆ విధంగా ప్రతి విడి విడి ఆవృత్తిలో ఇతర ఆవృత్తులు గర్భితమే (అంతర్లీనం) కాక, ఒక రూపంలో పునరావృత్తి ఇతర రూపాల్లో ఆవృత్తి అవుతుంది కూడా అని మనం తెలుసుకున్నాము. కాబట్టి, భేదమంతా కేవలం రూపసంబంధమైనదిగా, లేక పరిశీలకునికి మాత్రమే సంబంధించిన కేవల ఆత్మాశ్రయ భేదంగా కనిపిస్తుంది.

ఈ ఆవృత్తుల్లో ప్రతి ఒక్కటీ, వివిధ వ్యష్టి పారిశ్రామిక పెట్టుబడుల ప్రత్యేక గమన రూపంగా పరిగణింపబడుతున్నందు వల్ల, ఈ భేదం ఎల్లప్పుడూ ఒక వ్యష్టి భేదంగా మాత్రమే వుంటుంది. కానీ వాస్తవంలో ప్రతి వ్యష్టి పారిశ్రామిక పెట్టుబడీ ఏకకాలంలో ఈ మూడు ఆవృత్తులలోనూ వుంటుంది. ఈ మూడు ఆవృత్తులూ – పెట్టుబడి మూడు రూపాలు ధరించే ఈ పునరుత్పత్తి రూపాలూ – నిరంతరం పక్క పక్కనే సాగుతుంటాయి. ఉదాహరణకు, పెట్టుబడి విలువలో, సరుకు పెట్టుబడి విధిని నిర్వహించే ఒక భాగం డబ్బు పెట్టుబడిగా పరివర్తన చెందుతుంది. కానీ, అదే సమయంలో మరో భాగం ఉత్పత్తి ప్రక్రియ నుంచి బయటికి వచ్చి ఒక కొత్త సరుకు పెట్టుబడిగా చలామణి క్రమంలో ప్రవేశిస్తుంది. ఆ విధంగా స'....స' రూపంలోని ఆవృత్తి నిరంతరాయంగా సాగుతూంటుంది; మిగతా రెండు రూపాలూ కూడా అంతే. పెట్టుబడి యొక్క ఈ మూడు రూపాల పరివర్తనా, ఈ మూడు దశలను అది వరుసగా గడవడమూ ఎంత నిరంతరాయంగా జరుగుతుందో, ఈ రూపాలూ, దశల్లోని ప్రతి ఒక్కదానిలో పెట్టుబడి పునరుత్పత్తి కూడా అంత నిరంతరాయంగా జరుగుతుంది.

పెట్టుబడి విలువ మొత్తం పరిమాణం, డబ్బు పెట్టుబడిగానో, ఉత్పాదక పెట్టుబడిగానో లేదా సరుకు పెట్టుబడిగానో పనిచేస్తుందని మనం ఈ విశ్లేషణలో ఊహించుకొన్నాము. ఉదాహరణకు, ముందు పేర్కొన్న 422 పౌండ్లు మొదట పూర్తిగా పెట్టుబడిగా వుంది. తరువాత ఆ మొత్తాన్ని మనం పూర్తిగా ఉత్పాదక పెట్టుబడిగా మార్చాము. ఆఖరుకు సరుకు పెట్టుబడిగా, 500 పౌండ్లు విలువగల నూలుగా మార్చాము. (దీనిలో 78 పౌండ్ల అదనపు విలువ కూడా ఉంది) ఇక్కడ వివిధ దశలు కేవలం అంతరాయాలే. ఉదాహరణకు, ఆ 422 పౌండ్లు డబ్బు రూపంలో వున్నంతకాలం, అంటే డ–స (శ్ర+ఉసా) రూపంలో కొనుగోళ్ళు జరిగే వరకు, మొత్తం పెట్టుబడి డబ్బు పెట్టుబడిగానే వుంది. డబ్బు పెట్టుబడిగానే పనిచేస్తుంది. అది ఉత్పాదక పెట్టుబడిగా మారిన వెనువెంటనే, డబ్బు పెట్టుబడి విధులను గాని, సరుకు పెట్టుబడి విధులను గాని నిర్వహించదు. పెట్టుబడి తన చలామణి దశలు రెంటిలో దేనిలోనైనా సరే, అంటే డ గానో, లేక స' గానో పని చేయనారంభించిన వెంటనే మొత్తం ఉత్పత్తి ప్రక్రియకు అంతరాయం ఏర్పడిన విధంగానే, అది ఉత్పాదక పెట్టుబడిగా మారినప్పుడు మొత్తం చలామణి క్రమం ఆగిపోతుంది. కాబట్టి ఉపె....ఉపె అన్న ఆవృత్తి, నియమిత కాలానుసారం జరిగే ఉత్పాదక పెట్టుబడి పునరావిర్భావాన్ని మాత్రమే తెలుపదు. చలామణి క్రమం పూర్తి అయ్యేదాకా, పెట్టుబడి విధి అయిన ఉత్పత్తి ప్రక్రియకు ఎదురయ్యే అంతరాయాన్ని కూడా చూపుతుంది. ఉత్పత్తి అవిచ్ఛిన్నంగా సాగడానికి బదులు, ఆగి ఆగి జరుగుతుంది. చలామణి రెండు దశలు త్వరగా గడుస్తాయా లేక నిదానంగా గడుస్తాయా అనేదాన్ని బట్టి వుండే యాదృచ్ఛిక వ్యవధులలో మాత్రమే అది పునః ప్రారంభమవుతుంది. ఉదాహరణకు ప్రైవేటు ఖాతాదారుల కోసం మాత్రమే పనిచేసే చైనా హస్త కళాకారునికి ఇది వర్తిస్తుంది. కొత్త ఆర్డరు పొందే వరకు అతని ఉత్పాదక ప్రక్రియ ఆగిపోతుంది.

గమనంలో వున్న పెట్టుబడిలోని ప్రతి ఒక్క భాగానికీ ఇది నిజంగా వర్తిస్తుంది. పెట్టుబడిలోని అన్ని భాగాలూ వరుసగా ఈ గమన క్రమాన్ని గడవవలసిందే. నూలు వడికే ఒక వ్యక్తి వారానికి 10,000 పౌనుల నూలు ఉత్పత్తి చేస్తాడని అనుకొందాం. ఈ 10,000 పౌనుల నూలు మొత్తంగా ఉత్పత్తి రంగం వదిలి చలామణి రంగంలో ప్రవేశిస్తుంది. దానిలోని పెట్టుబడి విలువను డబ్బు పెట్టుబడిగా మార్చవలసి వుంటుంది. ఈ విలువ డబ్బు పెట్టుబడి రూపంలో వున్నంతకాలం అది తిరిగి ఉత్పత్తి ప్రక్రియలో ప్రవేశించజాలదు. అది మొదట చలామణిలో ప్రవేశించి ఉత్పాదక పెట్టుబడి మూలాంశాలైన శ్ర+ఉసా లుగా తిరిగి మార్చబడాలి. పెట్టుబడి ఆవృత్తి క్రమమంటే, ఎడతెరిపిలేని అంతరాయాలన్న మాటే; ఒక దశను వదలి తరువాతి దశలో ప్రవేశించడమే; ఒక రూపాన్ని త్యజించి మరో రూపాన్ని ధరించడమే. ఈ దశల్లోని ప్రతి ఒక్కదానిలో తరువాతి దశ గర్భితమే కాక, ఒక దశ వుండగా మరొక దశకు ఆస్కారం వుండదు.

కాని అవిచ్ఛిన్నత అనేది పెట్టుబడిదారీ ఉత్పత్తి విశిష్ట లక్షణం. అవిచ్ఛిన్నతను ఎల్లప్పుడూ పూర్తిగా సాధించ వీలులేకపోయినా, పెట్టుబడిదారీ ఉత్పత్తి సాంకేతిక ప్రాతిపదిక వల్ల అది ఆవశ్యక మవుతున్నది. వాస్తవంలో ఏమి జరుగుతుందో చూద్దాం. మన ఉదాహరణలోని 10,000 పౌనుల నూలు మార్కెట్‌లోకి సరుకు పెట్టుబడిగా ప్రవేశించి, డబ్బుగా పరివర్తన చెందుతుంది. (ఈ డబ్బు చెల్లింపా, లేదా కొనుగోలు సాధనమా లేక, అకౌంటు పుస్తకంలో చూపే డబ్బా అనేదానితో ఇక్కడ నిమిత్తం లేదు.) అదే సమయంలో కొత్త పత్తి, బొగ్గు మొదలైనవి ఉత్పత్తి ప్రక్రియలో ఈ నూలు స్థానాన్ని ఆక్రమిస్తాయి. కాబట్టి డబ్బు రూపం, సరుకు రూపంలోని నూలు అప్పటికే ఉత్పాదక పెట్టుబడిగా పునఃపరివర్తన చెంది, అలా పని చేయనారంభిస్తుంది. ఈ 10,000 పౌనుల నూలు డబ్బుగా మారుతున్న సమయంలోనే, అంతకు మునుపటి 10,000 పౌనుల నూలు తన చలామణిలోని రెండవ దశను గడుస్తూ, డబ్బు రూపం నుంచి ఉత్పాదక పెట్టుబడి యొక్క మూలాంశాలుగా పునః పరివర్తన చెందుతుందన్న మాట. పెట్టుబడిలోని అన్ని భాగాలూ వరుసగా ఆవృత్తాలను నిర్వర్తిస్తాయి; ఏకకాలంలో వేరు వేరు దశల్లో వుంటాయి. పారిశ్రామిక పెట్టుబడి తన కక్ష్యలో పురోగమిస్తూ, ఆ విధంగా ఏకకాలంలో తన అన్ని దశల్లో, ఆ దశలకు సంబంధించిన భిన్న క్రియారూపాల్లో వుంటుంది. పెట్టుబడిలోని ఏ భాగమైతే, మొట్టమొదటిసారిగా సరుకు పెట్టుబడి రూపం నుంచి డబ్బుగా మారిందో అది స'....స' అనే ఆవృత్తిని ప్రారంభించగా, పారిశ్రామిక పెట్టుబడి, గమన క్రమంలోని ఒక అఖండాంశంగా అదివరకే ఆ ఆవృత్తిని గడిచింది. ఒక చేయి డబ్బు ఇవ్వగా మరో చేయి దాన్ని తీసుకొంటుంది. ఒకచోట డ...డ' అనే ఆవృత్తి ప్రారంభమైన సమయాన్నే మరోచోట డబ్బు తిరిగి చేతికందుతుంది. ఉత్పాదక పెట్టుబడికి కూడా ఇదే వర్తిస్తుంది.

కాబట్టి, అవిచ్ఛిన్నంగా సాగిపోయే పారిశ్రామిక పెట్టుబడి వాస్తవ ఆవృత్తి, కేవలం చలామణి, ఉత్పత్తి ఏకత మాత్రమే కాదు, దాని మూడు ఆవృత్తులన్నింటి ఏకత కూడా. అయితే అటువంటి ఏకత వుండాలంటే, పెట్టుబడిలోని వేరు వేరు భాగాలన్నీ ఆవృత్తిలో వరుసగా వున్న దశలన్నిటిని గడవగలగాలి. ఒక దశనుంచి, ఒక క్రియా రూపం నుంచి మరో దశకు, మరో క్రియారూపానికి సాగిపోగలగాలి; పారిశ్రామిక పెట్టుబడి ఈ అన్ని భాగాల సమాహారం కాబట్టి, అలా జరిగినప్పుడే ఏకకాలంలో అది తన వివిధ దశల్లో వుంటుంది, పని చేస్తుంది. ఆ విధంగా ఒకేసారి ఈ మూడు

ఆవృత్తులను నిర్వర్తిస్తుంది. ఈ భాగాల సహజీవనం కారణంగానే, వేరు మాటల్లో చెప్పాలంటే ఆ విధమైన పెట్టుబడి విభజన కారణంగానే అవి ఒకదాని స్థానాన్ని మరొకటి వరుసగా ఆక్రమిస్తుంటాయి. శాఖోపశాఖలుగా వున్న ఫ్యాక్టరీ వ్యవస్థలో ఉత్పాదితం తనకు రూపుదిద్దే ప్రక్రియలోని వివిధ దశల్లో నిరంతరం వుంటూ, ఒక ఉత్పాదక దశ నుంచి మరొక ఉత్పాదక దశలో ప్రవేశిస్తుంది. పెట్టుబడిదారుని సాధన సంపత్తిని బట్టి వ్యష్టి పారిశ్రామిక పెట్టుబడి ఒక నిర్దిష్ట పరిమాణంలో వుంటుంది. పరిశ్రమలోని ప్రతి శాఖ విషయంలోనూ దానికొక నిర్దిష్టమైన కనీస పరిమాణం వుంటుంది. కాబట్టి ఆ పెట్టుబడి విభజన నిర్దిష్ట నిష్పత్తుల ననుసరించి జరగాలి. చేతిలో వున్న పెట్టుబడి పరిమాణం ఏ మోతాదులో ఉత్పత్తి ప్రక్రియ జరిగేదీ నిర్ధారణ చేస్తుంది. ఇది మళ్ళీ, ఉత్పత్తి ప్రక్రియతో సమానాంతరంగా తమ విధులను నిర్వర్తించే మేరకు సరుకు పెట్టుబడీ, డబ్బు పెట్టుబడుల పరిమాణాన్ని నిర్ధారిస్తుంది. కానీ ఉత్పత్తిని అవిచ్ఛిన్నమైనదిగా చేస్తున్న సహజీవనానికి తమ వివిధ దశలను వరుసగా గడిచే పెట్టుబడి భాగాల గమనమే కారణం. ఉదాహరణకు, ఒక భాగానికి సంబంధించి స'–డ' స్తంభిస్తే, అంటే సరుకు అమ్మకం కాకపోతే, అప్పుడు ఈ భాగం యొక్క ఆవృత్తికి అంతరాయమేర్పడుతుంది; ఆ సరుకు స్థానంలో దాని ఉత్పత్తి సాధనాలు రావు. ఉత్పత్తి ప్రక్రియ నుంచి, స' రూపంలో వెలువడే తదనంతర భాగాల విధులు మారటానికి వాటి మునుపటి భాగాలు అడ్డుపడతాయి. ఇది కొంతకాలం కొనసాగితే ఉత్పత్తికి అవరోధం కలిగి మొత్తం ప్రక్రియ ఆగిపోతుంది. వరుసగా సంభవించే ప్రతి ఒక్క స్తంభనా సహజీవనాన్ని అస్తవ్యస్తం చేస్తుంది; ఒక దశలోని ప్రతి ఒక్క స్తంభనా, పెట్టుబడిలోని ఆ స్తంభిత భాగం యొక్క ఆవృత్తినే కాక మొత్తం వ్యష్టి పెట్టుబడి ఆవృత్తిని కూడా ఇంచుమించు స్తంభింపచేస్తుంది.

చలామణి క్రమం ప్రదర్శితమయ్యే తరువాతి రూపం వివిధ దశల పరంపరత – ఫలితంగా, పెట్టుబడి ఒక దశనుంచి నిష్క్రమించడం వల్ల అది కొత్త దశకు మారడం అవసరమవుతోంది. కాబట్టి, ప్రతి విడి ఆవృత్తిలో, పెట్టుబడి యొక్క క్రియారూపాల్లో ఒకటి దాని గమనారంభ స్థానంగానూ, పునరాగమన స్థానంగానూ వుంటుంది. మరోవైపు, మొత్తం క్రమం అంతా ఈ మూడు ఆవృత్తుల ఏకతే. ఇవి ఈ క్రమ అవిచ్ఛిన్నత అభివ్యక్తమయ్యే భిన్న రూపాలు. మొత్తం ఆవృత్తి, పెట్టుబడి తాలూకు ప్రతి క్రియారూపానికీ దాని ప్రత్యేక ఆవృత్తిగా దర్శనమిస్తుంది. ఈ ఆవృత్తుల్లో ప్రతి ఒక్కటీ మొత్తం క్రమం అవిచ్ఛిన్నంగా సాగడానికి తప్పనిసరిగా అవసరం. ప్రతి క్రియారూప ఆవృత్తీ ఇతర క్రియారూపాలపై ఆధారపడి వుంది. మొత్తం ఉత్పాదన ప్రక్రియకు, ప్రత్యేకించి సామాజిక పెట్టుబడి విషయంలో, తప్పనిసరియైన పూర్వావసర మేమిటంటే అది అదే సమయంలో పునరుత్పత్తి ప్రక్రియగా వుండటం; కాబట్టి పెట్టుబడిలోని ప్రతి భాగం యొక్క ఆవృత్తిగా వుండటం, పెట్టుబడిలోని వివిధ భాగాలు వివిధ దశలను, వివిధ క్రియారూపాలను వరుసగా గడిచిపోతాయి. ఈ కారణం వల్ల, ప్రతి క్రియా రూపం, ఇతర రూపాలతో పాటు ఏకకాలంలో తన సొంత ఆవృత్తిలో సాగిపోతుంది – కానీ పెట్టుబడిలోని వేరే భాగం ఇందులో ఎల్లప్పుడూ అభివ్యక్తమవుతుందనుకోండి. పెట్టుబడిలోని ఒక భాగం నిరంతరం మారుతూ, నిరంతరం పునరుత్పత్తి అవుతూ, సరుకు పెట్టుబడిగా వుండి, డబ్బుగా పరివర్తన చెందుతూ వుంటుంది. మరో భాగం డబ్బు పెట్టుబడిగా వుండి ఉత్పాదక పెట్టుబడిగా పరివర్తన చెందుతూ వుంటుంది. మూడవది ఉత్పాదక పెట్టుబడిగా వుండి సరుకు పెట్టుబడిగా

పరివర్తన చెందుతూ వుంటుంది. ఈ మూడు దశలనూ గడవడంలో మొత్తం పెట్టుబడి నిర్వర్తించే ఆవృత్తే ఈ మూడు రూపాల అవిచ్ఛిన్న అస్తిత్వానికి కారణం. కాబట్టి, మొత్తం పెట్టుబడి ఏకకాలంలో, ప్రాదేశికంగా పక్కపక్కనే, తన భిన్న దశల్లో వుంటుంది. కానీ ప్రతి భాగం నిరంతరం, వరుసగా ఒక దశనుంచి ఒక క్రియారూపం నుంచి తరువాతి దశకు, తరువాతి క్రియారూపానికి సాగిపోతూంటుంది. ఆ విధంగా ఆ అన్ని దశల్లో రూపాల్లో పని చేస్తుంటుంది. కాబట్టి దాని రూపాలు అస్థిరమైనవి; వాటి పారంపర్యమే వాటి ఏకకాలికతకు కారణం. ప్రతి ఒక్క రూపమూ మరొక్క రూపం తరువాతా వస్తుంది, దానికి ముందూ వస్తుంది. అందువల్ల, ఒక పెట్టుబడి భాగం ఒకానొక రూపాన్ని తిరిగి ధరించడానికి, మరో భాగం ఇంకొక రూపాన్ని తిరిగి ధరించడమే కారణం. ప్రతి ఒక్క భాగం నిరంతరాయంగా తన సొంత ఆవృత్తిని నిర్వర్తిస్తూంటుంది. కానీ ఇది ఎల్లప్పుడూ ఈ రూపంలో వున్న పెట్టుబడి యొక్క మరో భాగం. ఈ ప్రత్యేక ఆవృత్తులు ఒకే సమయంలో, వరుస క్రమంలో వచ్చే మొత్తం ప్రక్రియ భాగాలే.

మొత్తం ప్రక్రియలో పైన పేర్కొన్న అంతరాయానికి బదులు దాని ఈ అవిచ్ఛిన్నత మూడు ఆవృత్తుల ఏకతలో మాత్రమే సిద్ధిస్తున్నది. మొత్తం సామాజిక పెట్టుబడికి ఎల్లప్పుడూ ఈ అవిచ్ఛిన్నత వుంటుంది. దాని ప్రక్రియ ఎల్లప్పుడూ ఈ మూడు ఆవృత్తుల ఏకతను వ్యక్తం చేస్తూంటుంది.

వ్యష్టి పెట్టుబడులకు సంబంధించినంత వరకు, పునరుత్పత్తి అవిచ్ఛిన్నతకు కొన్ని సమయాల్లో కొద్దో గొప్పో అంతరాయం ఏర్పడుతుంది. మొదటి విషయం, వివిధ సమయాల్లో, విలువ రాశులు వివిధ దశల మధ్య, వివిధ క్రియారూపాల మధ్య తరచు అసమ భాగాల్లో పంపిణీ అవుతాయి. రెండవ విషయం, ఉత్పత్తి చేయవలసిన సరుకు స్వభావాన్ని బట్టి, ఆ కారణం వల్ల పెట్టుబడి మదుపు పెట్టబడిన ఆయా ప్రత్యేక ఉత్పత్తి రంగాన్ని బట్టి, ఈ భాగాలు భిన్నంగా పంపిణీ అయి వుండవచ్చు. మూడవ విషయం, సహజ పరిస్థితుల వల్లనో (వ్యవసాయం, హెర్రింగ్ చేపల వేట మొదలయినవి) లేదా ఆయా రుతువుల్లో మాత్రమే పని చేయడం వంటి సాంప్రదాయిక పద్ధతుల వల్లనో, రుతువులపై ఆధారపడిన ఉత్పత్తి శాఖల్లో అవిచ్ఛిన్నత తరతమ స్థాయిల్లో భగ్నం కావచ్చు. ఫ్యాక్టరీల్లో, గనుల్లో ఉత్పాదన ప్రక్రియ అత్యంత క్రమబద్ధంగానూ, ఒకే రీతిలోనూ కొనసాగుతుంది. కానీ వివిధ ఉత్పత్తి శాఖల్లోని ఈ తేడా వల్ల ఆవృత్త ప్రక్రియ సాధారణ రూపాల్లో తేడా రాదు.

స్వయం విస్తృత విలువగా పెట్టుబడి ఆవరించేది వర్గ సంబంధాలనే కాదు; వేతన శ్రమ రూపంలో వున్న, శ్రమపై ఆధారపడిన, ఒక నిర్దిష్ట స్వభావం కల సమాజాన్ని మాత్రమే కాదు, అది ఒక గమనం, వివిధ దశలను గడిచే ఒక ఆవృత్తి నిర్వహణ క్రమం. అసలు ఈ క్రమమే దాని మూడు భిన్న రూపాలతో కూడినది. కాబట్టి పెట్టుబడిని, నిశ్చల స్థితిలోని ఒక వస్తు విశేషంగా కాకుండా, ఒక గమనంగా మాత్రమే అవగాహన చేసుకోగలం. విలువ ఒక స్వతంత్ర అస్తిత్వాన్ని పొందటమనేది, కేవలం ఒక అనిర్దిష్ట భావనగా పరిగణించేవారు, పారిశ్రామిక పెట్టుబడి గమనమే ఆ అనిర్దిష్ట భావన ఆచరణాత్మక రూపమనే సంగతి మరచిపోతున్నారు. ఇక్కడ విలువ వివిధ రూపాలను, వివిధ గమన క్రమాలను గడుస్తుంది. వీటితో ఆ విలువ తన అస్తిత్వాన్ని నిలుపుకొంటూ, అదే సమయంలో విస్తరిస్తుంది, పెరుగుతుంది. ఇక్కడ మనం ముఖ్యంగా పరిశీలిస్తున్నది, కేవలం ఈ గమన రూపాన్నే కాబట్టి, పెట్టుబడి విలువ తన ఆవృత్తుల సందర్భంగా లోనయ్యే విప్లవాలను పరిగణనకు తీసుకోవడం లేదు.

కానీ, విలువలో ఎన్ని విప్లవాలు వచ్చినా, పెట్టుబడి విలువ అదనపు విలువను సృష్టించేలా చేసినంత కాలమే, అంటే, స్వతంత్ర ప్రతిపత్తిని పొందిన విలువగా అది తన ఆవృత్తిని నిర్వర్తించినంత కాలమే, కాబట్టి విలువలోని పరిభ్రమణలు ఏదో ఒక విధంగా అధిగమింపబడి, వాటి మధ్య సమతూకం ఏర్పడినంతకాలమే పెట్టుబడిదారీ ఉత్పత్తి వుంటుంది, కొనసాగుతూంది. సరుకు, శ్రమల కొనుగోలు దారుని, సరుకుల అమ్మకందారుని, ఉత్పాదక పెట్టుబడి సొంతదారుని పనులను నిర్వహిస్తున్నట్టి, అందువల్ల, తన కార్యకలాపాల ద్వారా పెట్టుబడి ఆవృత్తికి దోహదం చేస్తున్నట్టి ఎవరో ఒక వ్యష్టి పారిశ్రామిక పెట్టుబడిదారుని కార్యాచరణగా పెట్టుబడి గమనాలు కనిపిస్తాయి. విలువలోని విప్లవానికి సామాజిక పెట్టుబడిలోదైతే, ఒక వ్యష్టి పెట్టుబడిదారుని పెట్టుబడి ఈ విలువల గమన పరిస్థితులకు అనుగుణంగా సర్దుకోలేనందు వల్ల, దిగుబడిపోయి, పని చేయలేకపోవచ్చు. విలువలో పరిభ్రమణలు మరింత తీవ్రంగా తరచుగా వచ్చేకొద్దీ, ఇప్పుడు స్వతంత్రమైన విలువ యొక్క స్వయం ప్రవర్తక గమనం వ్యష్టి పెట్టుబడిదారుని దూరదృష్టికీ, అంచనాకు వ్యతిరేకంగా ప్రకృతి పరిణామ క్రమ అమోఘ శక్తితో పనిచేయడం హెచ్చుతుంది; సాధారణ ఉత్పత్తి గతిక్రమం అసాధారణమైన సట్టా వ్యాపారానికి మరింత లోనైపోతుంది; వ్యష్టి పెట్టుబడుల అస్తిత్వానికి ప్రమాదం మరింత పెరుగుతుంది. కాబట్టి, నిర్ణీత వ్యవధుల్లో సంభవించే ఈ పరిభ్రమణలు ఏ వాదనను పూర్వపక్షం చేస్తున్నట్లు భావిస్తున్నారో దాన్నే ధ్రువపరుస్తున్నాయి. అదేమిటంటే, పెట్టుబడిగా విలువ స్వతంత్ర అస్తిత్వాన్ని సంతరించు కొంటుంది; తన గమనం ద్వారా తన స్వతంత్ర అస్తిత్వాన్ని కాపాడుకొంటూ, మరింత ప్రస్ఫుటం చేస్తుంది.

ఆవృత్తి క్రమంలో, పెట్టుబడి విలువ పరిమాణంలో వచ్చే మార్పును మొదటి విలువతో నిరంతరం సరిపోల్చడం, గమన క్రమంలోని పెట్టుబడి రూప పరివర్తనల ఈ పరంపరతలో చేరి వుంది. విలువను సృష్టించే శక్తికి, అంటే శ్రమ శక్తికి సంబంధించి, విలువ సంతరించుకొనే స్వతంత్ర ప్రతిపత్తిని డ–శ క్రియ (శ్రమశక్తి కొనుగోలు) ప్రారంభిస్తుంది; ఇది ఉత్పాదక ప్రక్రియ సందర్భంగా, శ్రమశక్తిని దోచుకోవడంగా ఆచరణ రూపం ధరిస్తుంది. అయితే, విలువ ఈ స్వతంత్ర ప్రతిపత్తిని సంతరించు కోవడమనేది, గమన క్రమంలోని పెట్టుబడి విలువకు డబ్బు, సరుకులు, ఉత్పాదక మూల పదార్థాలు కేవలం మారి మారి వచ్చే రూపాలుగా వున్న ఆవృత్తిలో తిరిగి పొడసూపదు. ఇందులో విలువ మునుపటి పరిమాణాన్ని, ప్రస్తుతం పెట్టుబడి విలువకు గల మారిన పరిమాణంతో సరిపోల్చడం జరుగుతుంది.

విలువ స్వతంత్ర ప్రతిపత్తిని సంతరించుకోవడం, పెట్టుబడిదారీ ఉత్పత్తి లక్షణం. బైలీ దీన్ని కొంతమంది ఆర్థిక శాస్త్రవేత్తల భ్రమగా పరిగణిస్తున్నారు. విలువ స్వతంత్ర ప్రతిపత్తిని సంతరించుకో దంటూ ఆయన ఇలా వాదిస్తున్నారు : "విలువ సమకాలీన సరుకుల మధ్యగల సంబంధం. ఎందువల్లనంటే, అటువంటిది మాత్రమే పరస్పర మార్పిడికి వీలు కలిగిస్తుంది".[1] వేరు వేరు యుగాల సరుకు విలువలను పోల్చి చూడటాన్ని వ్యతిరేకిస్తూ ఆయన ఈ మాటలంటున్నారు. కానీ ఈ పోల్చి

1. శామ్యూల్ బైలీ రచన, "విలువ స్వభావం, కొలమానాలు, కారణాలపై సవిమర్శక వివరణ; ప్రధానంగా రికార్డో, ఆయన అనుయాయుల రచనలకు సంబంధించినది; అభిప్రాయాల ఆవిర్భావ, ప్రకటనలపై వ్యాసాలు రచయితచే విరచితం" లండన్, 1825, పుట 72 - సం.

చూడటమనేది ప్రతి కాలంలోనూ డబ్బు విలువ నిర్ణీతమైనప్పుడు, ఆయా కాలాల్లో ఒకే రకమైన సరుకుల ఉత్పత్తికి అవసరమైన శ్రమ వ్యయాన్ని పోల్చి చూడటం తప్ప మరొకటి కాదు. ఆయన మొత్తం అవగాహనలోని పొరపాటే ఈ వ్యతిరేకతకు కారణం. ఏమంటే, ఆయన, విలువా, మార్పిడి విలువా సమానమని, విలువ రూపమే విలువ అనీ అనుకొంటున్నారు. అందువల్ల సరుకు విలువ ఆచరణలో మార్పిడి విలువలుగా పని చేయనప్పుడు, ఆ విధంగా అవి వాస్తవంలో మార్పిడి కాజాలనప్పుడు, సరుకు విలువను ఒకదానితో ఒకటి పోల్చరాదని ఆయన భావం. ఆవృత్తిలో, "సమకాలీనమైనవి" కాక, వరుసగా ఒకటి తరువాత ఒకటి వచ్చే వేరు వేరు దశల్లో విలువ అభిన్నంగా వుండి, దాన్ని దానితోనే పోల్చడం జరిగిన మేరకు మాత్రమే విలువ పెట్టుబడి విలువగా లేదా పెట్టుబడిగా పని చేస్తుంది. ఈ వాస్తవం బైల్‌కి బొత్తిగా అవగాహన కాలేదు.

స్వచ్ఛమైన ఆవృత్తి తాలూకు సూత్రాలను అధ్యయనం చేయడానికి, సరుకులు వాటి విలువకే అమ్మకమవుతున్నాయని ప్రతిపాదించడం చాలదు. ఇతర విషయాలు కూడా సమానంగా వున్న స్థితిలోనే ఇది జరుగుతుందని కూడా ఊహించుకోవాలి. ఉదాహరణకు, ఉపె....ఉపె రూపాన్ని తీసుకొందాం; అయితే, ఒకానొక పెట్టుబడిదారుని ఉత్పాదక పెట్టుబడి విలువ తగ్గుదలకు దారితీసే ఉత్పాదక ప్రక్రియాంతర్గత సాంకేతిక విప్లవాలన్నిటినీ పక్కకు పెడదాం. చేతిలో సరుకు – పెట్టుబడి నిల్వ వుంటే, దాని విలువ పెరుగుదలకు లేదా తగ్గుదలకు దారితీస్తూ, ఉత్పాదక పెట్టుబడి విలువ భాగాల్లో వచ్చే మార్పు ప్రభావాన్ని కూడా ఉపేక్షిద్దాం. 10,000 పౌనుల నూలు, స', దాని విలువ అయిన 500 పౌండ్లకు అమ్మకమయిందనుకొందాం. 422 పౌండ్లకు సమానమైన 8,440 పౌనుల నూలు, స'లో నిక్షిప్తమైన పెట్టుబడి విలువను భర్తీ చేస్తుంది. కానీ, పత్తి, బొగ్గు మొదలైన వాటి విలువ పెరిగి ఉన్నట్లయితే (ఇక్కడ కేవలం ధరలోని ఒడిదుడుకులను పరిగణనకు తీసుకోవడం లేదు. ఈ 422 పౌండ్లు ఉత్పాదక పెట్టుబడి భాగాలను పూర్తిగా భర్తీచేయడానికి చాలకపోవచ్చు. అదనపు డబ్బు పెట్టుబడి అవసరమవుతుంది; ఇక్కడ డబ్బు పెట్టుబడి చిక్కుకుపోయింది. వాటి ధరలు పడిపోయినప్పుడు దీనికి విరుద్ధమైన స్థితి ఏర్పడుతుంది. డబ్బు పెట్టుబడి విడుదల అవుతుంది. విలువ సంబంధాలు స్థిరంగా వున్నప్పుడు మాత్రమే ఉత్పాదన ప్రక్రియ మామూలుగా గతిక్రమాన్ని అనుసరిస్తుంది. ఆవృత్తి పునశ్చరణల సందర్భంగా వచ్చే అడదడులు పరస్పరం సమతూకంగా ఉన్నంతకాలం ఈ గతిక్రమం దాదాపు మామూలుగా వుంటుంది. కానీ ఈ అడదడులు తీవ్రమయ్యేకొద్దీ, మళ్ళీ సర్దుబాటు చేసుకోవలసిన దశ నుంచి బయటపడటానికి పారిశ్రామిక పెట్టుబడిదారు వద్ద మరింత ఎక్కువ డబ్బు పెట్టుబడి వుండవలసి వస్తుంది. ప్రతి విడివిడి ఉత్పాదన ప్రక్రియ స్థాయీ, దానితో పాటు మదుపు పెట్టవలసిన పెట్టుబడి కనీస పరిమాణం పెట్టుబడిదారీ ఉత్పత్తి ప్రక్రియలో హెచ్చడంతో, పారిశ్రామిక పెట్టుబడిదారుని విధిని బడా డబ్బు పెట్టుబడిదారుల గుత్తసొమ్ముగా మార్చే ఇతర పరిస్థితులకు ఇది కూడా తోడవుతుంది. ఈ బడా డబ్బు పెట్టుబడిదారులు ఎవరికి వారుగా, లేదా ఒక సంఘంగా ఏర్పడి పని చేయవచ్చు.

సందర్భవశాత్తూ, ఒక విషయం పేర్కొనాలి. ఉత్పత్తి మూలాంశాల విలువలో మార్పు వచ్చినట్లయితే, ఒకవైపు డ....డ' రూపానికీ, మరోవైపు ఉపె.... ఉపె, స'.....స' రూపాలకూ మధ్య భేదం ఏర్పడుతుంది.

కొత్తగా మదుపు పెట్టిన పెట్టుబడి మొదట డబ్బు పెట్టుబడిగా రంగంపైకి వస్తుంది; ఈ పెట్టుబడి సూత్రమైన డ...డ'లో, ముడిపదార్థాలు, సహాయక సామాగ్రి మొదలైన ఉత్పత్తి సాధనాల విలువ పడిపోవడం వల్ల, ఒక నిర్దిష్ట పరిమాణంలో ఒక పరిశ్రమను ప్రారంభించడానికి, విలువ పడిపోక ముందుకన్నా తక్కువ డబ్బు పెట్టుబడి ఖర్చయ్యే వీలు కలుగుతుంది. ఎందువల్లనంటే, (ఉత్పాదక శక్తి అభివృద్ధి స్థిరంగా వున్నప్పుడు) ఒక నిర్దిష్ట పరిమాణంలోని శ్రమశక్తి నిర్వహించగల ఉత్పత్తి సాధనాల రాశి, పరిమాణాలపై ఉత్పత్తి ప్రక్రియ స్థాయి ఆధారపడి ఉంటుందే తప్ప, ఈ ఉత్పత్తి సాధనాల విలువపైనగానీ, శ్రమశక్తి విలువపైగానీ ఆధారపడి వుండదు (శ్రమశక్తి విలువ, స్వయం విస్తరణ పరిమాణాన్ని మాత్రమే ప్రభావితం చేస్తుంది) దీనికి విరుద్ధమైన సందర్భాన్ని తీసుకొందాం. ఉత్పాదక పెట్టుబడి మూలాంశాలుగా వున్న సరుకుల యొక్క ఉత్పత్తి మూలకాల విలువ పెరిగితే, ఒక నిర్దిష్ట పరిమాణం గల పరిశ్రమ స్థాపనకు మరింత డబ్బు పెట్టుబడి అవసరమవుతుంది. ఈ రెండు సందర్భాల్లోనూ మారేది కొత్త మదుపునకు అవసరమైన డబ్బు పెట్టుబడి మొత్తమే. మొదటి సందర్భంలో డబ్బు పెట్టుబడి కొంత మిగిలిపోతుంది; రెండవ సందర్భంలో మరింత డబ్బు పెట్టుబడి చిక్కుకుపోతుంది – ఒక నిర్ణీత ఉత్పత్తి శాఖలోకి కొత్త వ్యష్టి పారిశ్రామిక పెట్టుబడి వచ్చి చేరడం మామూలు పద్ధతిన జరిగినప్పుడు మాత్రమే ఇది వర్తిస్తుంది.

ఉపె....ఉపె, స' – ఈ ఆవృత్తుల్లో ఉపె, స'ల గమనం పెట్టుబడి సంచయనంగా వున్న మేరకు, అంటే, అదనపు మొత్తమైన ధ డబ్బు – పెట్టుబడిగా మారిన మేరకు మాత్రమే ఆ రెండు ఆవృత్తులూ డ.....ధ' లాగా వ్యవహరిస్తాయి. ఇదేకాక, ఉత్పాదక పెట్టుబడి మూలాంశాల విలువలో వచ్చే మార్పు వాటిపై నెరపే ప్రభావం, డ....డ'పై నెరపే ప్రభావానికి భిన్నమైనది. ఇక్కడ కూడా మనం, ఉత్పాదన ప్రక్రియలో నియుక్తమైన పెట్టుబడి అంతర్భాగాలపై, అటువంటి విలువలో వచ్చే మార్పుల ప్రభావాన్ని పరిగణనకు తీసుకోవడం లేదు. ఇక్కడ ప్రత్యక్షంగా ప్రభావితమయ్యేది మొదట వ్యయమైన మొత్తం కాదు; తన మొదటి ఆవృత్తిలో కాకుండా, పునరుత్పత్తి క్రమంలో నిమగ్నమైన పారిశ్రామిక పెట్టుబడి. ఆ క్రమం స'.....స < శ్రమ / ఉ.సా; అంటే సరుకు – పెట్టుబడి ఉత్పత్తి ప్రక్రియలోని మూలాంశాలుగా (అవి సరుకులుగా వున్న మేరకు) పునఃపరివర్తన చెందే క్రమం. విలువలు (లేదా ధరలు) పడిపోతే మూడు పరిణామాలు సంభవించవచ్చు; పునరుత్పత్తి క్రమం మునుపటి స్థాయిలోనే కొనసాగవచ్చు; అప్పుడు అంతవరకు వున్న డబ్బు పెట్టుబడిలో కొంత భాగం విడుదలవుతుంది. అంతకుముందు నిజమైన సంచయనం (విస్తృత స్థాయిలో ఉత్పత్తి) లేదా అటువంటి సంచయనానికి శ్రీకారం చుడుతూ, దాన్ని వెంటనంటి వుండే సంచయన నిధిగా ధ (అదనపు విలువ) పరివర్తన జరక్కపోయినా డబ్బు పెట్టుబడి సంచితమవుతుంది. లేక, సాంకేతిక నిష్పత్తులు అనుమతించినట్లయితే, మామూలుగా జరిగి వుండే దానికన్నా విస్తృత స్థాయిలో పునరుత్పత్తి క్రమం నిర్వహింపబడవచ్చు. లేక, మరింత ఎక్కువగా ముడి పదార్థాలూ మొదలైన వాటిని నిల్వ చేయవచ్చు.

సరుకు పెట్టుబడిని భర్తీ చేసే మూలాంశాల విలువ పెరిగితే, పై చెప్పిన దానికి భిన్నమైన పరిణామాలు సంభవిస్తాయి. అప్పుడు పునరుత్పత్తి దాని మామూలు స్థాయిలో ఇక జరగదు. (ఉదాహరణకు, పని దినం తగ్గిపోతుంది) లేక, మునుపటి పరిమాణంలో పని కొనసాగడానికి అదనపు

డబ్బు పెట్టుబడిని మదుపు పెట్టవలసి వుంటుంది (డబ్బు పెట్టుబడి చిక్కుకుపోతుంది). లేక, పునరుత్పత్తి క్రమాన్ని విస్తృతపరచడానికి బదులు, దాన్ని కేవలం పాత స్థాయిలో నిర్వహించడానికై, సంచయన ద్రవ్యనిధి (అలాంటిది వుంటే) పూర్తిగానో లేక పాక్షికంగానో వినియోగించబడుతుంది. ఇది కూడా డబ్బు పెట్టుబడి చిక్కుకుపోవడమే; కానీ ఇక్కడ అదనపు డబ్బు పెట్టుబడి వచ్చేది, పారిశ్రామిక పెట్టుబడిదారుని సాధన సంపత్తి నుంచే తప్ప, బయటినుంచి, డబ్బు మార్కెట్ నుంచి కాదు.

కాని ఉపె.....ఉపె లోనూ, స'....స'లోనూ కొంత మార్పునకు కారణభూతమైన పరిస్థితులుండవచ్చు. ఉదాహరణకు, మన నూలుమిల్లు యజమాని వద్ద పెద్ద ఎత్తున పత్తి నిల్వ వుంటే (అతని ఉత్పాదక పెట్టుబడిలోని ఒక పెద్ద భాగం పత్తి రూపంలో నిల్వ వుంటే), పత్తి ధరలు పడిపోయినందువల్ల అతని ఉత్పాదక పెట్టుబడిలోని ఒక భాగం విలువ తగ్గిపోతుంది. కానీ అలా కాకుండా ధరలు పెరిగితే, అతని ఉత్పాదక పెట్టుబడిలోని ఒక భాగం విలువ హెచ్చుతుంది. మరో వైపు అతని వద్ద సరుకు పెట్టుబడి రూపంలో, ఉదాహరణకు నూలు రూపంలో పెద్ద ఎత్తున నిల్వలు వుంటే, అతని సరుకు పెట్టుబడిలో ఒక భాగం విలువ తత్ఫలితంగా, మొత్తంపై ఆవృత్తి నిర్వాహక పెట్టుబడి విలువ, ప్రత్తి ధరల తగ్గుదల వల్ల పడిపోతుంది; పెరుగుదల వల్ల హెచ్చుతుంది. ఆఖరున, స'–డ–స < శ్రమ / ఉ.సా. క్రమాన్ని తీసుకొని చూద్దాం. స'–డ, అంటే సరుకు పెట్టుబడి డబ్బు రూపంలో చేతికందడం, స మూలాంశాల విలువలో మార్పు రాకముందు జరిగినట్లయితే, అప్పుడు పెట్టుబడిపై దాని ప్రభావం, మొదటి సందర్భంలో సూచించినట్లు మాత్రమే, అంటే, చలామణి రెండవ ప్రక్రియ డ–స < శ్రమ / ఉ.పె. లోనే వుంటుంది. కానీ స'–డ ప్రక్రియకు ముందే ఆ మార్పు జరిగినట్లయితే, తక్కిన పరిస్థితులను సమానంగా వున్నప్పుడు, పత్తి ధర పడిపోవడం వల్ల, నూలు ధర తదనుగుణంగా పడిపోతుంది; పత్తి ధర పెరుగుదల వల్ల, నూలు ధర కూడా తదనుగుణంగా పెరుగుతుంది. ఒకే ఉత్పత్తి శాఖల్లో మదుపు పెట్టిన వేరు వేరు వ్యష్టి పెట్టుబడులపై దాని ప్రభావం అవి వున్న పరిస్థితులను బట్టి, చాలా భిన్నంగా వుండవచ్చు.

చలామణి క్రమానికి పట్టే కాలంలో తేడాల వల్ల, తత్కారణంగా చలామణి వేగంలో తేడాల వల్ల కూడా డబ్బు పెట్టుబడి విడుదల కావచ్చు, లేదా చిక్కుకుపోవచ్చు. అయితే, ఇది టర్నోవర్ గురించిన చర్చకు సంబంధించిన విషయం. కానీ, ప్రస్తుతం మనం దృష్టి నిల్పుతున్నది, ఉత్పాదక పెట్టుబడి మూలాంశాల విలువల్లోని మార్పులకు సంబంధించి, డ.....డ' కు, తక్కిన రెండు ఆవృత్తులకు మధ్య వ్యక్తమవుతున్న వాస్తవ భేదం పైనే.

ఇదివరకే అభివృద్ధి చెంది, తత్కారణంగా స్థిరపడిపోయిన పెట్టుబడిదారీ ఉత్పత్తి విధాన యుగంలో, చలామణి విభాగం డ–స < శ్రమ / ఉ.సా. లో ఉసాగా వున్న సరుకుల్లోని ఒక పెద్ద భాగం, అంటే ఉత్పత్తి సాధనాలు మరెవ్వరివో అయిన సరుకు పెట్టుబడిగా పని చేస్తోంది. కాబట్టి, అమ్మకందారు దృక్కోణం నుంచి చూచినప్పుడు, స'–డ', (అంటే) సరుకు పెట్టుబడి డబ్బు పెట్టుబడిగా పరివర్తితమవుతోంది. కానీ ఇది పరమ నియమం కాదు. పైపెచ్చు, తద్విరుద్ధంగా జరగడం కద్దు. తన చలామణి ఆ క్రమంలో డబ్బు పెట్టుబడిగానూ లేదా సరుకులుగానూ పనిచేసే పారిశ్రామిక పెట్టుబడి ఆ క్రమంలో డబ్బు పెట్టుబడిగా, లేదా సరుకు – పెట్టుబడిగా నిర్వర్తించే ఆవృత్తి సామాజిక

ఉత్పత్తికి చెందిన నానా పద్ధతుల్లోని సరుకు చలామణిలో – ఆ పద్ధతులు సరుకులను ఉత్పత్తి చేసిన మేరకు – జొరబడుతుంది. ఈ సరుకుల ఉత్పత్తికి ప్రాతిపదిక బానిస విధానమా, రైతులా (చైనా, భారత దేశాల రైతులు) కమ్యూన్లా (డచ్ ఈస్టిండీస్) ప్రభుత్వ పరిశ్రమలా (రష్యన్ చరిత్రలోని మునుపటి శకాల్లో భూ బానిసలపై ఆధారపడిన వంటివి) వేటాడే అర్ధ ఆటవిక తెగలా, లేక మరేవైనానా అనే దానితో నిమిత్తం లేదు. పారిశ్రామిక పెట్టుబడి ధరించే రూపాలైన డబ్బుకు, సరుకులకు ఇవి సరుకులుగా, డబ్బుగా ఎదురుపడి ఆ పారిశ్రామిక పెట్టుబడి ఆవృత్తిలో ప్రవేశిస్తాయి; ఆ పారిశ్రామిక పెట్టుబడిలో నిక్షిప్తమైన అదనపు విలువ ఆదాయంగా వ్యయమైనట్లయితే ఆ అదనపు విలువ ఆవృత్తిలో కూడా ప్రవేశిస్తాయి. కాబట్టి అవి సరుకు పెట్టుబడి చలామణి శాఖలు రెంటిలోనూ ప్రవేశిస్తాయన్న మాట. ఈ సరుకుల ఉత్పత్తి ప్రక్రియ స్వభావంతో ఇక్కడ నిమిత్తం లేదు. ఇవి మార్కెట్‌లో సరుకులుగా పనిచేస్తాయి. సరుకులుగానే పారిశ్రామిక పెట్టుబడి ఆవృత్తిలోనూ, ఆ పెట్టుబడిలో పొందుపడి వున్న అదనపు విలువ చలామణిలోనూ ప్రవేశిస్తాయి. అందువల్ల, సరుకుల మూలకారణం యొక్క సార్వత్రిక లక్షణం, ప్రపంచ మార్కెట్‌గా మార్కెట్ ఉనికి – ఇదీ పారిశ్రామిక పెట్టుబడి చలామణి క్రమ ప్రత్యేకత. ఇతరుల సరుకులకు వర్తించేదే ఇతరుల డబ్బుకూ కూడా వర్తిస్తుంది. సరుకు పెట్టుబడి డబ్బు ముందు కేవలం సరుకులుగానే వున్నట్లుగా, ఈ డబ్బు కూడా సరుకు – పెట్టుబడి పట్ల కేవలం డబ్బుగానే వ్యవహరిస్తుంది. ఇక్కడ డబ్బు ప్రపంచపు డబ్బు విధులను నిర్వర్తిస్తుంది.

రెండు విషయాలను ఇక్కడ పేర్కొనాలి.

మొదటిది : డ–ఉసా క్రియ పూర్తి అయిన వెంటనే సరుకులు ఉసా ఇక సరుకులుగా వుండవు. తన విధి నిర్వహణ రూపం, ఉపెగా, ఉత్పాదక పెట్టుబడిగా పారిశ్రామిక పెట్టుబడి తాలూకు అస్తిత్వ రూపం తీసుకొంటాయి. కానీ అందువల్ల వాటి మూలం మరుగైపోతుంది. అవి అప్పటి నుంచి పారిశ్రామిక పెట్టుబడి అస్తిత్వ రూపాలుగా మాత్రమే వుంటాయి. అవి పెట్టుబడి ఆకారం ధరిస్తాయి. అయితే, వాటి స్థానాన్ని భర్తీ చేయాలంటే, వాటిని మళ్ళీ ఉత్పత్తి చేయాల్సి వుంటుందనేది నిజం. ఈ మేరకు, పెట్టుబడిదారీ ఉత్పత్తి పద్ధతి, తన అభివృద్ధి దశ వెలుపల వున్న ఉత్పత్తి పద్ధతులపై ఆధారపడి వుంటుంది. కానీ ఉత్పత్తినంతటినీ సరుకు ఉత్పత్తిగా సాధ్యమైనంత వరకు మార్చడం పెట్టుబడిదారీ ఉత్పత్తి పద్ధతి ధోరణి. ఉత్పత్తినంతటినీ పెట్టుబడిదారీ చలామణి క్రమంలోకి లాక్కురావడమే ఈ పని నెరవేర్చే ప్రధాన సాధనం. అసలు, అభివృద్ధి చెందిన సరుకు ఉత్పత్తే పెట్టుబడిదారీ సరుకు ఉత్పత్తి. పారిశ్రామిక పెట్టుబడి జోక్యం సర్వత్రా ఈ పరివర్తనకు దోహదం చేస్తుంది. కానీ దీనితోపాటు, ప్రత్యక్ష ఉత్పాదకులంతా వేతన కార్మికులుగా పరివర్తన చెందడానికి కూడా ఇది దోహదం చేస్తుంది.

రెండవది : పారిశ్రామిక పెట్టుబడి తాలూకు చలామణి క్రమంలో ప్రవేశిస్తున్న సరుకులు (అస్థిర పెట్టుబడిని కార్మికులకు చెల్లించిన తరువాత, శ్రమశక్తి పునరుత్పత్తి కోసం వారు దాన్ని అవసరమైన ఏ జీవనాధారాలుగా మారుస్తారో వాటితో సహా) తమ మూలంతో, తమని ఉనికిలోకి తెచ్చిన ఉత్పత్తి ప్రక్రియ సామాజిక రూపంతో నిమిత్తం లేకుండా, అదివరకే సరుకు – పెట్టుబడి రూపంలో, సరుకుల వ్యాపారి లేక వర్తకుని పెట్టుబడి రూపంలో వున్న పారిశ్రామిక పెట్టుబడికి ఎదురుపడుతుంది. వర్తకుని పెట్టుబడిగా వున్నది, దాని స్వభావాన్ని బట్టి, అన్ని రకాల ఉత్పత్తి పద్ధతులకు చెందిన సరుకులే.

పెట్టుబడిదారీ ఉత్పత్తి పద్ధతిలో ఉత్పత్తి భారీ స్థాయిలో జరగడమే కాదు, అమ్మకాలు కూడా అవశ్యంగా భారీస్థాయిలో వుంటాయి. కాబట్టి వాటి అమ్మకం వర్తకునికే తప్ప విడి విడి వినియోగదారులకు కాదు. ఈ వినియోగదారే ఉత్పాదక వినియోగదారైతే, అంటే, ఒక ఉత్పత్తి శాఖకు చెందిన పెట్టుబడిదారు మరో పారిశ్రామిక శాఖకు ఉత్పత్తి సాధనాలను సరఫరా చేస్తే, ఒక పారిశ్రామిక పెట్టుబడిదారు ఇతర అనేక పారిశ్రామిక పెట్టుబడిదారులకు నేరుగా అమ్ముతున్నాడన్నమాట (ఆర్డర్లు వగైరా రూపంలో). ఈ మేరకు ప్రతి పారిశ్రామిక పెట్టుబడిదారూ ప్రత్యక్ష విక్రేత, తానే తన వర్తకుడు కూడా. ఒక వర్తకునికి అమ్మినప్పుడు కూడా ఆ పెట్టుబడిదారు వర్తకుడే కదా.

వర్తకుని పెట్టుబడి విధియైన సరుకుల వ్యాపారం, పెట్టుబడిదారీ ఉత్పత్తికి ఒక పూర్వావసరం. ఆ ఉత్పత్తి అభివృద్ధి గతిక్రమంలో సరుకుల వ్యాపారమూ అంతకంతకు పెంపొందుతుంది. కాబట్టి, పెట్టుబడిదారీ చలామణి క్రమంలోని ప్రత్యేక పార్శ్వాలను సోదాహరణంగా చూపడానికై, మనం సరుకుల వ్యాపారం వున్న సంగతిని నిర్వివాదమైనదిగా పరిగణించడం కద్దు. కానీ, ఈ చలామణి క్రమాన్ని, మొత్తంగా విశ్లేషించడంలో, వర్తకుని ప్రమేయం లేకుండా అమ్మకం నేరుగా జరిగినట్లు ఊహించుకొంటాము. ఎందువల్లనంటే, వర్తకుని ప్రమేయం చలామణి గమనంలోని వివిధ పార్శ్వాలను మరుగుపుచ్చుతుంది.

ఈ విషయాన్ని కొంత అమాయకంగా చూపుతున్న సిస్మండీని ఉటంకిస్తున్నాను :

"వ్యాపారం గణనీయమైన పెట్టుబడిని వినియోగిస్తుంది. మొదట చూస్తే, ఈ పెట్టుబడి మనం దేని గమనాన్ని వర్ణించామో ఆ పెట్టుబడిలో భాగంగా కనిపించదు. బట్టలు వర్తకుని గిడ్డంగిలో పోగుపడివున్న వస్త్రాల విలువ, పని చేయించుకొనేందుకై పేదలకు ధనికులు వేతనాలుగా, వార్షిక ఉత్పత్తి నుంచి ఇచ్చే భాగానికి పూర్తిగా అన్యమైనదిగా మొదట్లో కనిపిస్తుంది. కానీ ఈ పెట్టుబడి మనం ఇదివరకు పేర్కొంటూ వచ్చిన పెట్టుబడి స్థానాన్ని భర్తీ చేసినదే తప్ప మరొకటి కాదు. సంపద ప్రగతిని స్పష్టంగా అవగాహన చేసుకొనేందుకు మనం దాని ఉత్పత్తితో ప్రారంభించి, అది వినియోగమయ్యేదాకా గమనిస్తూపోయాము. ఉదాహరణకు, వస్త్రాల ఉత్పత్తిలో నియుక్తమయ్యేది, ఎల్లప్పుడూ అదే పెట్టుబడి అని మనకు అప్పుడు అనిపించింది. వినియోగదారుని ఆదాయంతో అది మార్పిడి అయినప్పుడు, అది రెండు భాగాలుగా విభజితమయింది. ఒకటి లాభాల రూపంలో పరిశ్రమదారుని ఆదాయం; రెండవది కార్మికులు కొత్త వస్త్రాలను తయారు చేస్తున్న కాలానికి వేతనాల రూపంలో పొందే ఆదాయం.

"కాని, ఈ పెట్టుబడిలోని వేరు వేరు భాగాలు ఒకటి మరొకదాని ఖాళీ స్థానాన్ని భర్తీ చేస్తే, అది అందరికీ ప్రయోజనకరంగా వుంటుందనీ, పరిశ్రమదారునికీ, వినియోగదారునికీ మధ్య చలామణి కోసం 100,000 యెక్యూలు (5 ఫ్రాంకులకు సమానమైన ఫ్రెంచి నాణెం – అను) సరిపోతే, వాటిని పరిశ్రమదారు, టోకు వర్తకుడు, చిల్లర వర్తకుడు – వీరి మధ్య సమానంగా పంచవలసి వుంటుందనీ త్వరలో కనుగొన్నారు. అప్పుడు పరిశ్రమదారు తన మొత్తం పెట్టుబడితో చేసిన పనినే దానిలోని మూడో వంతుతో చేయగలిగాడు. ఎందువల్లనంటే, అతడు తన ఉత్పాదన పనిని పూర్తి చేసిన వెంటనే, వినియోగదారుని కన్నా వర్తకుడే వచ్చి తన సరుకు కొంటాడని అతనికి తెలిసి వచ్చింది. మరోవైపు

ఖాళీ అయిన టోకు వర్తకుని పెట్టుబడి స్థానాన్ని చిల్లర వర్తకుని పెట్టుబడి మరింత త్వరగా భర్తీ చేసింది.... వేతనాల కోసం ఇచ్చిన మొత్తాలకు, తుది వినియోగదారుని కొనుగోలు ధరకు మధ్య తేడా ఆ పెట్టుబడులపై వచ్చిన లాభంగా పరిగణించారు. పరిశ్రమదారు, టోకు వర్తకుడు, చిల్లర వ్యాపారి తమ పనులను విభజించుకొన్న క్షణం నుంచి ఈ లాభాన్ని వారు తమ మధ్య పంచుకొన్నారు. ఈ పనికి ఒక్క వ్యక్తికి బదులు ముగ్గురూ వ్యక్తులూ, ఒకే పెట్టుబడికి బదులు దానిలోని మూడు భాగాలు కావలసివచ్చినప్పటికీ, జరిగిన పనేమో అదే" (నోవేప్రిన్సిపే, 1, పుటలు 139, 140)

"వారందరూ (వర్తకులు) ఉత్పత్తికై పరోక్షంగా దోహదం చేశారు. ఎందువల్లనంటే, ఉత్పాదిత వస్తువు వినియోగదారుని అందుబాటులోకి వచ్చేవరకు, వినియోగమే లక్ష్యంగా గల ఉత్పత్తి పూర్తి అయినట్లు పరిగణించలేము" (అదే గ్రంథం, పుట 137)

ఆవృత్తి (Circuit) సాధారణ రూపాల చర్చలోనూ, మొత్తం రెండవ సంపుటి అంతటా, డబ్బు అంటే, నాణేల రూపంలోని డబ్బు అనే మన అర్థం. విలువకు కేవలం చిహ్నాలయిన సాంకేతిక డబ్బు, పరపతి డబ్బు ఇందుకు మినహాయింపు. కొన్ని రాజ్యాల్లో ప్రత్యేక వినియోగం కోసం సాంకేతికపు డబ్బును రూపొందించారు. పరపతి డబ్బు ఇంకా వృద్ధి చెందలేదు. మొదటి విషయం, ఇది చారిత్రక క్రమపద్ధతి. పెట్టుబడిదారీ ఉత్పత్తి తాలూకు మొదటి యుగంలో పరపతి డబ్బు చాలా కొద్దిపాటి పాత్ర నిర్వహిస్తుంది, లేదా దాని కెటువంటి పాత్రా లేదు. రెండవ విషయం. ఈ క్రమగతి ఆవశ్యకతను ఒక విషయం సైద్ధాంతికంగా నిరూపిస్తోంది; అదేమిటంటే, పరపతి డబ్బు చలామణిని గురించి టూకే, తదితరులు వివరించిన విమర్శనాత్మకమైనదంతా, నాణేల రూపంలోని డబ్బు తప్ప మరేదీ చలామణిలో లేకపోతే పరిస్థితి ఎలా వుండేదనే ప్రశ్న వారు పదే పదే తడిమేలా చేసింది. కానీ నాణేల రూపంలోని డబ్బు, కొనుగోలు సాధనంగానే కాకుండా చెల్లింపు సాధనంగా కూడా ఉపకరించగలదని మరువరాదు. సౌలభ్యం కోసం, తన మొదటి విధి నిర్వహించే రూపంలోనే దాన్ని స్థూలంగా ఈ రెండవ సంపుటిలో పరిశీలిస్తున్నాము.

పారిశ్రామిక పెట్టుబడి చలామణి క్రమం దాని వ్యష్టి ఆవృత్తిలో (Individual Circuit) కేవలం ఒక భాగం. ఆ క్రమం సరుకుల సాధారణ చలామణి పరిధిలోని ఒక ప్రక్రియా పరంపరగా వున్న మేరకు, దాన్ని మునుపు వివరించిన సాధారణ నియమాలు (పెట్టుబడి, సంపుటి I, అధ్యాయం III) శాసిస్తున్నాయి. డబ్బు చలామణి వేగం ఎక్కువగా వున్నకొద్దీ, ప్రతి వ్యష్టి పెట్టుబడి తన సరుకు లేదా డబ్బు రూపాంతరీకరణ పరంపరలను మరింత త్వరితగతిలో గడిచే కొద్దీ, ఒక నిర్ణీత పరిమాణంలోని డబ్బు, ఉదాహరణకు 500 పౌండ్లు వరుసగా చలామణిలో ప్రవేశపెట్టే పెట్టుబడుల సంఖ్య (లేక, సరుకు –పెట్టుబడి రూపంలోని వ్యష్టి పెట్టుబడుల సంఖ్య) ఎక్కువవుతుంది. డబ్బు చెల్లింపు సాధనంగా పని చేయడం ఎక్కువయ్యేకొద్దీ, లోటు మిగుళ్ళను సర్దుబాటు చేయడం తప్ప (ఉదాహరణకు, ఖాళీ అయిన సరుకు – పెట్టుబడి స్థానాన్ని దాని ఉత్పత్తి సాధనాలతో భర్తీ చేయడంలో) మరేమీ చేయవలసిన అవసరం వుండదు, చెల్లింపుల వ్యవధులు తగ్గుతాయి; కాబట్టి ఒక నిర్ణీత పరిమాణంలోని పెట్టుబడి విలువ చలామణికి కావలసిన డబ్బు తగ్గుతుంది. మరోవైపు, చలామణి వేగం, తదితర పరిస్థితులు ఒకే విధంగా వున్నవని అనుకొన్నప్పుడు, డబ్బు – పెట్టుబడిగా చలామణి కావడానికి ఎంత డబ్బు

అవసరం అనేది, సరుకుల ధరల మొత్తాన్ని బట్టి (ధరను సరుకుల పరిమాణంతో హెచ్చించగా వచ్చిన మొత్తాన్ని) వుంటుంది; లేదా, సరుకుల పరిమాణమూ, వాటి విలువ స్థిరంగా వుంటే, అది అసలు డబ్బు విలువను బట్టి వుంటుంది.

కాని, పెట్టుబడి చలామణి క్రమం మామూలు చలామణి క్రియల పరంపరగా వున్నప్పుడు మాత్రమే, సరుకుల సాధారణ చలామణికి సంబంధించిన నియమాలు చెల్లుతాయి. ఈ క్రియలు, వ్యష్టి పారిశ్రామిక పెట్టుబడుల ఆవృత్తిలో, ఆయా విధుల వల్ల నిర్ధారణ అయిన భాగాలుగా వున్నప్పుడు, ఈ నియమాలు వర్తించవు.

దీన్ని స్పష్టం చేయడానికి, ఈ చలామణి క్రమాన్ని, దాని నిరంతరాయ అంతస్సంబంధం దృష్ట్యా పరిశీలించడం ఉత్తమం. అది కింది రెండు రూపాల్లో కనిపిస్తుంది.

(II) ఉపె....స' { స – / –డ' / సపె } { డ – స < శ్రమ / ఉసా ....ఉపె (ఉపె') / ధ – సపె }

(III) స' { స – / –డ / సపె – } { డ – స < శ్రమ / ఉసా ....ఉపె....స' / డ – సపె }

మొత్తం పైన, చలామణి ప్రక్రియల పరంపర అయిన చలామణి క్రమం (స–డ–స రూపంలోగానీ, డ–స–డ రూపంలో గానీ) కేవలం రెండు పరస్పర విరుద్ధమైన సరుకు రూపాంతరీకరణల పరంపరే. కాబట్టి, వీటిలో ప్రతి ఒక్కదానిలో, ఇతరుల సరుకో లేదా ఆ సరుకుకు ఎదురైన ఇతరుల డబ్బుకో చెందిన విరుద్ధ రూపాంతరీకరణ ఇమిడి వుంది.

సరుకు సొంతదారుకు స–డగా వున్నది, దాని కొనుగోలుదారుకు డ–స అవుతుంది. స–డలోని సరుకు మొదటి రూపాంతరీకరణ, డబ్బు రూపంలో ప్రత్యక్షమవుతున్న సరుకు యొక్క రెండవ రూపాంతరీకరణ. దీని విపర్యాసము (తల్లక్రిందులు కావడం) డ–సకు వర్తిస్తుంది. పెట్టుబడిదారు సరుకుల కొనుగోలుదారుగానూ, అమ్మకందారుగానూ వ్యవహరిస్తున్నాడు. ఆ కారణం వల్ల, అతని పెట్టుబడి, మరొకరి సరుకులకు ఎదురైన డబ్బుగానూ, మరొకరి డబ్బుకు ఎదురైన సరుకులుగానూ పని చేస్తుంది; ఈ మేరకు, పెట్టుబడి చలామణికి కూడా, ఒక దశలోని ఒకానొక సరుకు రూపాంతరీకరణ, మరొక దశలోని మరో సమగ్ర రూపాంతరీకరణతో పెనవేసుకొనడాన్ని గురించి చెప్పినది వర్తిస్తుంది. కానీ ఈ పెనవేసుకోవడం, పెట్టుబడుల రూపపరివర్తనలు పెనవేసుకోవడంగా భావించరాదు.

మొదటి విషయం. మనం ఇదివరకే చూచినట్లు, డ–స (ఉసా) వేరు వేరు వ్యష్టి పెట్టుబడుల రూపాంతరీకరణల కలయిక కావచ్చు. ఉదాహరణకు, నూలు మిల్లు సొంతదారుని సరుకు పెట్టుబడి అయిన నూలు స్థానాన్ని పాక్షికంగా బొగ్గు భర్తీ చేస్తుంది. అతని పెట్టుబడిలో ఒక భాగం డబ్బు రూపంలో వుండి, సరుకులుగా రూపాంతరీకరణ చెందగా, బొగ్గును ఉత్పత్తి చేసే పెట్టుబడిదారుని

పెట్టుబడి, సరుకుల రూపంలో వుంది కాబట్టి డబ్బు రూపంలోకి మార్చబడుతుంది. ఈ సందర్భంలో, చలామణి తాలూకు, ఒకే క్రియ, రెండు పారిశ్రామిక పెట్టుబడుల (భిన్న ఉత్పాదక శాఖలోనివి) విరుద్ధ రూపాంతరీకరణ పరంపరలను, అంటే ఈ పెట్టుబడుల రూపాంతరీకరణలు పెనగొన్న స్థితిని ప్రతిబింబిస్తుంది. కానీ, మనం ఇదివరకే చూచినట్లు, డ తాలూకు పరివర్తిత రూపమైన ఉసా, అభివర్గార్థంలో సరుకు – పెట్టుబడిగా ఉండనవసరం లేదు; అంటే, పారిశ్రామిక పెట్టుబడి తాలూకు విధి నిర్వాహక రూపంలో ఉండనవసరం లేదు; పెట్టుబడిదారు ఉత్పత్తి చేసినది కానవసరం లేదు. అది ఎల్లప్పుడూ ఒకేవైపు, డ–సగా, మరోవైపు స–డ గా వుంది. కానీ ఎల్లప్పుడూ పెట్టుబడుల రూపాంతరీకరణల కలయిక కాదు. అంతేకాదు. డ–శ్ర, అంటే శ్రమశక్తి కొనుగోలు ఎన్నటికీ, పెట్టుబడుల రూపాంతరీకరణల కలయిక కాజాలదు. ఎందువల్లనంటే, శ్రమశక్తి కార్మికుని సరుకే అయినప్పటికీ, పెట్టుబడిదారునికి అమ్మకమయ్యే వరకు అది పెట్టుబడిగా రూపొందదు. మరోవైపు డ'–స' ప్రక్రియలో, డ' అనేది, సరుకు పెట్టుబడి రూప పరివర్తన కానవసరం లేదు; అది సరుకుగా వున్న శ్రమశక్తి (వేతనాలు) లేదా ఏదో ఒక స్వతంత్ర కార్మికుడో, బానిసో, భూస్వామ్యదాసుడో లేదా జనసముదాయమో ఉత్పత్తి చేసిన వస్తువు, డబ్బు రూపంలో చేతికందినది కావచ్చు.

కాని రెండవ విషయమేమిటంటే ప్రపంచ మార్కెట్‌లోని యావత్తు ఉత్పత్తి పెట్టుబడిదారీ పద్ధతిలోనే జరుగుతూందని మనం ఊహించుకొన్నప్పుడు, ఏదో ఒక వ్యష్టి పెట్టుబడి చలామణి క్రమంలో సంభవించే ప్రతి రూపాంతరీకరణ తన విధి నిర్ణీత పాత్రను నిర్వహించాలంటే, ఆ రూపాంతరీకరణ వేరే పెట్టుబడి ఆవృత్తిలో తద్విరుద్ధ రూపాంతరీకరణగా వుండాలనేమీ లేదు. ఉదాహరణకు ఉపె....ఉపె ఆవృత్తిలో, స' ను డబ్బుగా మార్చే డ కొనుగోలుదారునికి, అతని అదనపు విలువ డబ్బుగా చేతికందడం కావచ్చు. (సరుకు కనుక వినియోగ వస్తువైతే). లేదా, డ'–స'< శ్రమ / ఉసా లో (దీన్నిబట్టి అదివరకే సంచితమైన పెట్టుబడి ప్రవేశిస్తున్న ఈ ప్రక్రియలో), ఉసా ను అమ్మిన వ్యక్తికి సంబంధించినంత వరకు, డ', అతడు మదుపు పెట్టిన పెట్టుబడి స్థానాన్ని భర్తీ చేసేందుకు మాత్రమే అతని పెట్టుబడి చలామణిలో ప్రవేశించవచ్చు. లేక, వచ్చిన ఆదాయాన్ని ఖర్చు చేయడానికి మళ్ళించడం వల్ల, అది అతని పెట్టుబడి చలామణిలో మళ్ళీ ప్రవేశించకుండా పోవచ్చు.

కాబట్టి, మొత్తం సామాజిక పెట్టుబడిలోని వేరు వేరు అంతర్భాగాలు (వ్యష్టి పెట్టుబడులు కేవలం స్వతంత్రంగా పని చేస్తున్న తదంతర్భాగాలే తప్ప మరొకటికాదు) పెట్టుబడి చలామణి క్రమంలోనూ, అదనపు విలువ చలామణి క్రమంలోనూ, ఖాళీ అయిన ఒకదాని స్థానాన్ని మరొకటి భర్తీ చేసే తీరును సరుకుల చలామణిలోని రూపాంతరీకరణలు మామూలుగా పెనవేసుకొనటాన్ని బట్టి నిర్ధారణ చేయరాదు – ఇలా పెనగొనడమన్నది, పెట్టుబడి చలామణి క్రియలకూ, సరుకు చలామణి తాలూకు తదితర క్రియలకూ ఉమ్మడిగా వున్నదే. ఈ భర్తీ చేసే తీరును తరచి చూచే వేరే పద్ధతి అవసరం. ఇంతవరకు కొన్ని పదజాలాలను వాడటంతో తృప్తిపడుతూ వచ్చాము. కానీ మరింత నిశితంగా విడమరచి చూస్తే సమస్త సరుకు చలామణికి సమానంగా వున్న రూపాంతరీకరణలు పెనగొంటున్న క్రమం నుంచి అరువు తెచ్చుకొన్న అనిర్దిష్ట భావాలు తప్ప ఇంకేమీ వీటిలో లేవని తెలుతుంది.

పారిశ్రామిక పెట్టుబడి ఆవృత్తుల్లోని గమనానికీ, ఆ కారణం వల్ల పెట్టుబడిదారీ ఉత్పత్తికీ కూడా గల అతి స్పష్టమైన ప్రత్యేకతలలో ఒకటి ఏమిటంటే : ఒకవైపు, ఉత్పాదక పెట్టుబడి అంతర్భాగాలను సరుకు మార్కెట్ నుంచి గ్రహిస్తున్నారు, దాన్నుంచి నిరంతరం సరికొత్తగా గ్రహిస్తూండాలి, వాటిని సరుకులుగా కొనాలి; మరొకవైపు, శ్రమ ప్రక్రియ ఉత్పాదితం, దాని నుంచి సరుకుగా బయటికొస్తుంది. దాన్ని నిరంతరం సరుకుగా ఎప్పటికప్పుడు అమ్మాలి. ఉదాహరణకు, స్కాట్లండ్ పల్లపు భూముల్లోని ఒక ఆధునిక వ్యవసాయదారుణ్ణి యూరపు ఖండంలోని ఒక పాత తరహా సన్నకారు రైతుతో పోల్చి చూడండి. పై వ్యవసాయదారు తాను ఉత్పత్తి చేసిన దానినంతటినీ అమ్ముకొంటాడు. కాబట్టి, దాని అంతర్భాగాలన్నిటినీ, తన విత్తనాలను సైతం మార్కెట్ నుంచి భర్తీ చేసుకొనవలసి వుంటుంది. మరి సన్నకారు రైతేమో తన ఉత్పాదితంలో ఎక్కువ భాగం నేరుగా తానే వాడుకొంటాడు. సాధ్యమైనంత తక్కువ కొంటాడు, అమ్ముతాడు, సాధ్యమైనంత మేరకు పరికరాలను, దుస్తులు వగైరాలను తయారు చేసుకొంటాడు.

కాబట్టి సామాజిక ఉత్పత్తి గమనం తాలూకు మూడు విలక్షణ ఆర్థిక రూపాలుగా నిసర్గ ఆర్థిక వ్యవస్థ, డబ్బు – ఆర్థిక వ్యవస్థ, పరపతి ఆర్థిక వ్యవస్థలను ఒకదానికొకటి ఎదురొడ్డుతున్నారు.

మొదటి విషయం, ఈ మూడు రూపాలు సమానమైన అభివృద్ధి దశలు కావు. పరపతి – ఆర్థిక వ్యవస్థ అని పేర్కొనబడుతూన్నది కేవలం డబ్బు – ఆర్థిక వ్యవస్థ రూపమే. ఎందువల్లనంటే, ఈ రెండు పదాలూ ఉత్పత్తిదారుల మధ్య మార్పిడి విధులను లేదా పద్ధతులను వ్యక్తం చేస్తున్నాయి. అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ ఉత్పత్తిలో డబ్బు – ఆర్థిక వ్యవస్థ పరపతి – ఆర్థిక వ్యవస్థ పెట్టుబడిదారీ ఉత్పత్తి అభివృద్ధిలోని భిన్న దశలకు సంబంధించినవి. అంతే తప్ప, నిసర్గ ఆర్థిక వ్యవస్థకు ఎదురొడ్డిన స్వతంత్ర మార్పిడి రూపాలు కానే కావు. అదే కారణం చూపి, ఆ రెండు ఆర్థిక వ్యవస్థలకు, నిసర్గ ఆర్థిక వ్యవస్థ తాలూకు విభిన్న రూపాలు సమానమైనవిగా పోటీ పెట్టవచ్చు.

రెండవ విషయం. డబ్బు – ఆర్థిక వ్యవస్థ, పరపతి – ఆర్థిక వ్యవస్థ – ఈ రెండు అభివర్గాల మధ్య తేడాను చూపేది, ఆర్థిక వ్యవస్థ. అంటే ఉత్పత్తి ప్రక్రియ కాదు, వివిధ ఉత్పత్తి కారకుల లేక ఉత్పత్తిదారుల మధ్య, ఆ ఆర్థిక వ్యవస్థకు అనుగుణంగా జరిగే మార్పిడి పద్ధతి వీటి మధ్య తేడాను చూపుతుంది అని నొక్కి చెబుతున్నారు. కాబట్టి, ఇది మొదటి అభివర్గానికి కూడా వర్తించాలి. కాబట్టి అది నిసర్గ ఆర్థిక వ్యవస్థకు బదులు మార్పిడి వ్యవస్థ అవుతుంది. పెరూలోని ఇన్ కా రాజ్యంలాగా పూర్తిగా ఏకాకిగా వున్న నిసర్గ ఆర్థిక వ్యవస్థ ఈ అభివర్గాల్లో దేనికిందా రాదు.

మూడవ విషయం. డబ్బు – ఆర్థిక వ్యవస్థ అన్ని రకాల సరుకుల ఉత్పత్తికీ ఉమ్మడి అంశం. ఉత్పాదితం సామాజిక ఉత్పత్తి తాలూకు నానావిధ వ్యవస్థలో సరుకుగా రంగంపైకి వస్తుంది. కాబట్టి, ఉత్పాదితం వర్తకపు వస్తువుగా అంటే సరుకుగా ఉత్పత్తి అయ్యే స్థాయి ఒక్కటే పెట్టుబడిదారీ ఉత్పత్తి విశిష్ట లక్షణంగా వుందన్నమాట. కాబట్టి ఉత్పాదితాన్ని రంగంపైకి తెచ్చిన ఆర్థిక వ్యవస్థలో ఆ త్పాదిత నిర్మాణ భాగాలు మళ్ళీ ప్రవేశించవలసిన స్థాయి కూడా పెట్టుబడిదారీ ఉత్పత్తి విశిష్ట లక్షణం అన్నమాట.

వాస్తవానికి, పెట్టుబడిదారీ ఉత్పత్తి అంటే, ఉత్పాదన సార్వత్రిక రూపంగా వున్న సరుకు ఉత్పత్తే. కానీ పెట్టుబడిదారీ ఉత్పత్తి అలా వుండటానికీ, దాని అభివృద్ధి గతిక్రమంలో అధికాధికంగా

అలా కావడానికీ, అసలు శ్రమ ఒక సరుకుగా రంగంపైకి రావడమే కారణం; కార్మికుడు తన శ్రమను అంటే తన శ్రమశక్తి క్రియను అమ్ముకోవడమే కారణమన్నమాట. అతడు తన శ్రమశక్తిని దాని విలువకు అమ్ముకొంటాడనీ, దాని పునరుత్పత్తికయ్యే వ్యయం ఆ విలువను నిర్ణయిస్తుందనీ ఇక్కడ మనం ఊహించుకొంటున్నాము. శ్రమ వేతనశ్రమగా రూపొందిన మేరకు ఉత్పత్తిదారు పారిశ్రామిక పెట్టుబడిదారుగా రూపొందుతాడు. ఈ కారణం వల్ల, ప్రత్యక్ష వ్యవసాయక ఉత్పత్తిదారు వేతన శ్రామికుడుగా రూపొందేవరకు పెట్టుబడిదారీ ఉత్పత్తి (ఆ కారణం వల్ల సరుకు ఉత్పత్తి) తన సంపూర్ణ స్థాయిని అందుకోదు. పెట్టుబడిదారుడికీ, వేతన శ్రామికునికీ మధ్య సంబంధంలో, డబ్బు సంబంధం, కొనుగోలుదారునికీ, అమ్మకందారునికీ మధ్య సంబంధం ఉత్పత్తిలోని ఒక స్వతస్సిద్ధమైన సంబంధంగా రూపొందుతుంది. కానీ ఈ సంబంధానికి ప్రాతిపదికగా వున్నది, ఉత్పత్తి సామాజిక స్వభావమే తప్ప, మార్పిడి పద్ధతి కాదు. తద్భిన్నంగా, మార్పిడి పద్ధతి ఉత్పత్తి సామాజిక స్వభావం నుంచి ఉత్పన్నమవుతోంది. కానీ, ఉత్పత్తి పద్ధతి దానికి సంబంధించిన మార్పిడి పద్ధతికి ప్రాతిపదిక అనే సంగతిని చూడకుండా, మార్పిడి పద్ధతినే ఉత్పత్తి పద్ధతికి ప్రాతిపదికగా చూడటం బూర్జువా దృక్పథానికి అనుగుణమైనదే. ఎందువల్లనంటే అందులో ప్రతి ఒక్కరూ నీతి నియమం లేని వ్యాపారపు బేసారాల్లో తలమునకలై వున్నారు.[1]

పెట్టుబడిదారు చలామణిలో నుంచి గ్రహించిన దానికన్నా తక్కువ విలువను దానిలోకి డబ్బు రూపంలో ప్రవేశపెడతాడు. ఎందువల్లనంటే, అతడు సరుకుల రూపంలో చలామణి నుంచి గ్రహించిన దానికన్నా ఎక్కువ విలువను సరుకుల రూపంలో అందులోకి ప్రవేశపెడుతున్నాడు. అతడు కేవలం మూర్తీభావంగా, పారిశ్రామిక పెట్టుబడిదారునిగా పని చేస్తాడు కాబట్టి, అతడు సరఫరా చేసే సరుకు విలువ అతడు డిమాండ్ చేసే సరుకు విలువకన్నా ఎల్లప్పుడూ ఎక్కువగానే వుంటుంది. ఈ విషయంలో అతని సరఫరా, డిమాండ్ ఒకదానికొకటి సమానంగా వుంటే, అతని పెట్టుబడి ఏ విధమైన అదనపు విలువను సృష్టించలేదన్న మాట; అది ఉత్పాదక పెట్టుబడిగా పని చేయలేదన్నమాట; ఆ ఉత్పాదక పెట్టుబడిగా అదనపు విలువను గర్భంలో ధరించిన సరుకు పెట్టుబడిగా పరివర్తితం కాలేదన్నమాట. ఉత్పాదన ప్రక్రియ సందర్భంగా అది శ్రమశక్తి నుంచి సరుకు రూపంలో ఎట్టి అదనపు విలువనూ గ్రహించలేదన్నమాట. పెట్టుబడిగా పనిచేయలేదన్నమాట. పెట్టుబడిదారు "తాను కొన్నదానికన్నా ప్రియంగా అమ్మాలి." నిజమే. కానీ పెట్టుబడిదారీ ఉత్పాదన ప్రక్రియ వల్ల, అతడు చౌకగా కొన్న దాన్ని (అందులో తక్కువ విలువ వున్నందువల్ల అది చౌక) ఎక్కువ విలువైన సరుకుగా, కాబట్టే ప్రియమైనదిగా మార్చగలుగుతున్నాడు. అతడు ప్రియంగా అమ్ముతున్నాడంటే, అందుకు కారణం, అతను తన సరుకును, దాని విలువకు మించిన ధరకు అమ్మడం కాదు. అతను సరుకు నిర్మాణ భాగాల్లో ఉన్నదానికన్నా ఎక్కువ విలువ ఆ సరుకులో వుండటమే కారణం.

పెట్టుబడిదారుని సరుకు విలువ సరఫరాకు, అతని డిమాండ్‌కూ మధ్య తేడా ఎక్కువగా వున్న కొద్దీ, అంటే అతను సరఫరాచేసే సరుకు – విలువ, అతను డిమాండ్ చేసే వరకు – విలువకన్నా

1. దీనితో రాతప్రతి ముగుస్తుంది. ఇక్కడ నుంచి ఈ అధ్యాయం తుదిదాకా వున్న పాఠం, 1877 లేదా 1878 నాటి ఒక నోట్ పుస్తకంలోనిది. ఇది వివిధ గ్రంథాల నుంచి ఎత్తి రాసుకొన్న భాగాల మధ్యలో వున్న మార్క్స్ వ్యాఖ్య.

ఎక్కువగా వున్న కొద్దీ, పెట్టుబడిదారు తన పెట్టుబడి విలువను విస్తరింపజేసే రేటు పెరుగుతుంది. అతని లక్ష్యం తన సరఫరా, డిమాండ్లను సమానం చేయటం కాదు. వాటి మధ్య అసమానతను, తన డిమాండ్‌కు మించి వున్న సరఫరా మిగులును సాధ్యమైనంత పెంచడం అతని లక్ష్యం.

వ్యష్టి పెట్టుబడిదారుకు వర్తించేదే పెట్టుబడిదారీ వర్గానికీ వర్తిస్తుంది.

పెట్టుబడిదారు పారిశ్రామిక పెట్టుబడికి కేవలం మూర్తీభవంగా వున్న మేరకు, అతని డిమాండ్ ఉత్పత్తి సాధనాలకూ, శ్రమశక్తికీ పరిమితమై వుంటుంది. విలువ దృష్ట్యా, ఉపె విషయంలో అతని డిమాండ్ అతడు మదుపు పెట్టిన పెట్టుబడికన్నా తక్కువ; అతడు తన పెట్టుబడి విలువకన్నా తక్కువ విలువ వున్న ఉత్పత్తి సాధనాలను కొంటాడు. కాబట్టి, అవి తాను సరఫరా చేసే సరుకు – పెట్టుబడి విలువకన్నా మరింత తక్కువ విలువగలవన్నమాట.

శ్రమశక్తి విషయంలో అతని డిమాండ్ సంగతికి వస్తే, అతని మొత్తం పెట్టుబడితో విలువ రీత్యా అతని అస్థిర పెట్టుబడికి గల సంబంధాన్ని బట్టి అది నిర్ణయమవుతుంది. కాబట్టి అది అపె:స కు సమానం. పెట్టుబడిదారీ ఉత్పత్తిలో ఈ డిమాండ్ ఉత్పత్తి సాధనాల విషయంలో అతని డిమాండ్‌కన్నా సాపేక్షంగా తక్కువ రేటుతో పెరుగుతుంది. అతని ఉసా కొనుగోళ్ళు అతని శ్ర కొనుగోళ్ళకన్నా స్థిరంగా పెరుగుతాయి.

కార్మికుడు మామూలుగా తన వేతనాలను జీవనాధారాలుగా మార్చుకొంటాడు. కాబట్టి, ఆ వేతనాల్లో అత్యధిక భాగాన్ని జీవిత పరమావసరాలుగా మార్చుకొంటాడు. కాబట్టి, శ్రమశక్తి విషయంలో పెట్టుబడిదారుని డిమాండ్, కార్మికవర్గ అత్యవసర వినియోగ వస్తువులకై పరోక్షమైన డిమాండ్ కూడా. కానీ ఈ డిమాండ్ అపెకు సమానం; దానికన్నా అణు రేణువు కూడా ఎక్కువ కాదు (కార్మికుడు తన వేతనాల్లో కొంత భాగాన్ని ఆదా చేసుకొంటే – ఇక్కడ మనం సమస్త పరపతి సంబంధాలను పరిగణనకు తీసుకోవడం లేదు – అతను తన వేతనాల్లో కొంత భాగాన్ని నిల్వ డబ్బుగా మార్చుకొంటున్నాడన్నమాట; ఆ మేరకు, అతను కొనుగోలుదారుగా వ్యవహరించడు). పెట్టుబడిదారుని డిమాండ్ తాలూకు గరిష్ట పరిమితి స. ఇది స్థిపె + అపెకు సమానం. కానీ అతని సరఫరా స్థిపె+అపె+అవి. కాబట్టి, అతని సరుకు – పెట్టుబడిగా రూపొందిన అంశాలు $80_{\text{స్థిపె}} + 20_{\text{అపె}} + 20_{\text{అవి}}$ అయితే, అతని డిమాండ్ $80_{\text{స్థిపె}} + 20_{\text{అపె}}$ సమానం. కాబట్టి అందులో నిక్షిప్తమైన విలువ దృష్ట్యా పరిశీలించినప్పుడు, అతని డిమాండ్ అతని సరఫరాకన్నా అయిదో వంతు తక్కువ. అతను ఉత్పత్తి చేసే అదనపు విలువ పరిమాణపు శాతం (లాభం రేటు), ఎక్కువైన కొద్దీ, అతని సరఫరాకన్నా అతని డిమాండ్ రాను రాను తగ్గుతూంటుంది. ఉత్పత్తి మరింత అభివృద్ధి చెందినప్పటికీ, శ్రమశక్తికై పెట్టుబడిదారుని డిమాండ్, తత్కారణంగా జీవితావసరాలకై పరోక్షమైన అతడి డిమాండ్, ఉత్పత్తి సాధనాలకై అతని డిమాండ్‌తో పోల్చితే స్థిరంగా తగ్గుతూంటుంది. కానీ, మరోవైపు ఉసాకై అతని డిమాండ్ అతని పెట్టుబడికన్నా ఎల్లప్పుడూ తక్కువగానే వుంటుందనే సంగతిని మరువరాదు. కాబట్టి ఉత్పత్తి సాధనాలకై అతని డిమాండ్ విలువ, సమాన విలువగల పెట్టుబడితోనూ, సమాన పరిస్థితులతోనూ పని చేస్తూ, అతనికి ఉత్పత్తి సాధనాలను సరఫరా చేసే పెట్టుబడిదారు ఉత్పత్తి చేసే సరుకు విలువకన్నా తక్కువగా వుండక తప్పదు. ఒక పెట్టుబడిదారుకాక, పలువురు వీటిని సరఫరా చేస్తారనే వాస్తవం ఈ విషయాన్ని మార్చదు. అతని పెట్టుబడి 1,000 పౌండ్లనీ, దానిలోని స్థిర పెట్టుబడి 800 పౌండ్లనీ అనుకొందాం.

అప్పుడు ఈ పెట్టుబడిదారులకు అతని నుంచే వచ్చే డిమాండ్ 800 పౌండ్లకు సమానం. వీరందరి లాభం రేటు ఒకటే అని అనుకొందాం. వారంతా కలిసి ప్రతి 1,000 పౌండ్లకు 1,200 పౌండ్ల విలువ చేసే ఉత్పత్తి సాధనాలను సరఫరా చేస్తారు. (ప్రతి 1,000 పౌండ్లల్లోనూ, వారిలోని ప్రతి ఒక్కరి వాటా ఎంత, ఈ వాటా అతని మొత్తం పెట్టుబడిలో ఎంత భాగం అనేదానితో ఇక్కడ ప్రమేయం లేదు) కనుక అతని డిమాండ్ వారి సరఫరాలో కేవలం మూడింట రెండు వంతులు మాత్రమే కాగా, అతని మొత్తం డిమాండ్, విలువ లెక్కన, తన సొంత సరఫరాలో అయిదింట నాలుగు వంతులే.

ఈ సందర్భంగా టర్నోవర్ సమస్యను మనమింకా పరిశీలించలేదు. పెట్టుబడిదారు మొత్తం పెట్టుబడి 5,000 పౌండ్లనీ, దానిలోని స్థిర పెట్టుబడి 4,000 పౌండ్లనీ, చలామణిలోని పెట్టుబడి 1,000 పౌండ్లనీ అనుకొందాం. పైన మనం ఊహించుకొన్నట్లు ఈ 1,000 పౌండ్లు $800_{\text{స్థిపె}}$+ $200_{\text{అపె}}$ అని అనుకొందాం. అతని మొత్తం పెట్టుబడి ఏడాదికి ఒకసారి టర్నోవర్ అవాలంటే, అతని చలామణి పెట్టుబడి ఆ ఏడాదిలో అయిదుసార్లు తిరుగుడు పడాలి. అప్పుడు సరుకు రూపంలోని అతని ఉత్పాదితం 6,000 పౌండ్లకు సమానమవుతుంది. ఇది అతను మదుపు పెట్టిన దానికన్నా 1,000 పౌండ్లు ఎక్కువ, ఫలితంగా అదనపు విలువ పైన చెప్పిన నిష్పత్తిలోనే వుంటుంది.

$$5000\ \text{స} : 1{,}000_{\text{అవి}} = 100_{\text{స్థిపె+అపె}} : 200_{\text{అవి}}$$

కాబట్టి, ఈ టర్నోవర్ అతని మొత్తం సరఫరాకూ అతని మొత్తం డిమాండ్‌కు గల నిష్పత్తిని ఏ విధంగానూ మార్చదు. ఆ డిమాండ్ అతని సరఫరాకన్నా అయిదో వంతు తక్కువ.

అతని స్థిర పెట్టుబడి 10 ఏళ్ళలో పునర్నిర్మాణం కావలసి వుంటుందనుకొందాం. కాబట్టి పెట్టుబడి ఏటా పదో వంతు లేక 400 పౌండ్లను అరుగుదల నిధి కింద చెల్లిస్తాడు. అందువల్ల అతనికి (ఒక ఏడాది తరువాత) స్థిర పెట్టుబడి విలువ కింద 3,600 పౌనులు మాత్రమే మిగిలి, మిగతా 400 పౌండ్లు డబ్బు రూపంలో వుంటుంది. మరమ్మతులు అవసరమై, సగటు స్థాయిని మించకుండా వుంటే, అవి ఉత్తరోత్తరా మదుపు పెట్టిన పెట్టుబడే తప్ప మరొకటి కాదు. అతడు తాను మదుపు పెట్టవలసిన పెట్టుబడిని లెక్కగట్టేటప్పుడే, మరమ్మతు ఖర్చులు, వార్షిక సరుకు ఉత్పత్తిలో చేరే మేరకు, వాటికి కూడా ముందుగానే డబ్బు కేటాయించి, దాన్ని పదోవంతు అరుగుదల నిధి చెల్లింపులో చేర్చినట్లుగా మనం భావించినా ఒకటే. (ఈ మరమ్మతుల విషయంలో అతని అవసరాలు సగటు స్థాయికి తక్కువగా వుంటే అతనికి ఆ మేరకు డబ్బు ఆదా అవుతుంది. లేదా ఎక్కువగా వుంటే అదనపు ఖర్చు అవుతుంది. కానీ ఒకే పారిశ్రామిక శాఖలో నిమగ్నులైన పెట్టుబడిదారుల మొత్తం వర్గానికి ఈ హెచ్చు తగ్గులు సమానమవుతాయి) ఏది యేమైనా అప్పటికే, అతని వార్షిక డిమాండ్ 5,000 పౌండ్లుగా, అంటే తాను ఆదిలో మదుపు పెట్టిన పెట్టుబడి విలువకు సమానంగా వున్నప్పటికీ, (అతని మొత్తం పెట్టుబడి ఏడాది కొకసారి టర్నోవర్ అవుతుందని ఊహించుకొంటున్నాము) ఈ డిమాండ్, పెట్టుబడిలోని చలామణి భాగానికి సంబంధించి పెరుగుతుంది; దాని స్థిర భాగానికి సంబంధించి, నిలకడగా తగ్గుతుంది.

ఇప్పుడు పునరుత్పత్తికి వద్దాం. పెట్టుబడిదారు అదనపు విలువ, ధ నంతటినీ వినియోగించుకొని, మొదట ఉన్నంతే పరిమాణం గల పెట్టుబడి స ను మాత్రమే ఉత్పాదక పెట్టుబడిగా మార్చుతా

డనుకొందాం. అప్పుడు పెట్టుబడిదారుని డిమాండ్ విలువ అతని సరఫరా విలువకు సమానంగా వుంటుంది. కానీ ఇది అతని పెట్టుబడి గమనానికి వర్తించదు. పెట్టుబడిదారుగా అతడు డిమాండ్ చేసేది తన సరఫరాలో అయిదింట నాల్గువంతులకే (విలువ లెక్కన). మిగతా అయిదో వంతును అతడు వినియోగించేది పెట్టుబడిదారునిగా కాదు; తదన్యుడుగా. పెట్టుబడిదారుగా నిర్వహించే విధులకు కాదు; తన వ్యక్తిగత అవసరాల కోసమో లేదా, తన విలాసాల కోసమో.

కాబట్టి అతని లెక్కాచారం, శాతాల్లో వ్యక్తం చేసినప్పుడు ఇలా వుంటుంది :

| | | | | |
|---|---|---|---|---|
| పెట్టుబడిదారుగా డిమాండ్ | ........ | 100, | సరఫరా | 120 |
| విలాస పురుషుడుగా డిమాండ్ | ........ | 20, | సరఫరా | – |
| మొత్తం డిమాండ్ | ........ | 120, | సరఫరా | 120 |

ఈ విధంగా ఊహించడమంటే, పెట్టుబడిదారీ ఉత్పత్తి లేదనుకోవడమే. కాబట్టి, పారిశ్రామిక పెట్టుబడిదారీ లేదనుకోవడమే. ఎందువల్లనంటే ఒత్తిడి పెడుతున్న ప్రేరణ వ్యక్తిగత వినియోగ కాంక్షే తప్ప ధనార్జన కాదనుకొంటే చాలు. పెట్టుబడిదారీ విధానం ఆమూలాగ్రం పొడలేకుండా పోతుంది.

అయితే, అలా ఊహించడం సాంకేతికంగా కూడా చెల్లదు. ధరల ఒడిదుడుకులకు తట్టుకోవడానికీ, సానుకూలమైన క్రయ విక్రయ పరిస్థితుల కోసం వేచి వుండగలగడానికై పెట్టుబడిదారు నిల్వ పెట్టుబడిని తప్పనిసరిగా ఏర్పరచుకోవడమే కాదు; తన ఉత్పత్తిని విస్తరింపచేయడానికై, తన ఉత్పత్తి వ్యవస్థలో సాంకేతిక ప్రగతికి స్థానం కల్పించడానికై పెట్టుబడిని పోగుచేసుకోవాలి కూడా.

పెట్టుబడిని పోగుచేసుకోవాలంటే అతడు చలామణి నుంచి తనకు లభించిన అదనపు విలువలో కొంత భాగాన్ని ఆ చలామణి నుంచి డబ్బు రూపంలో, మొదట, వెనుక్కు తీసుకోవాలి; తన పాత పరిశ్రమ విస్తరణకు లేదా కొత్త పరిశ్రమను ప్రారంభించడానికి తగినంతగా ఆ మొత్తం పెరిగేదాకా దాన్ని నిల్వ చేయాలి. ఆ నిల్వ నిధిని నిర్మించే క్రమం కొనసాగినంత కాలం అది పెట్టుబడిదారుని డిమాండ్‌ను పెంచదు. ఆ డబ్బు స్తంభితమై వుంటుంది. సరఫరా చేసిన సరుకులకై మార్కెట్ నుంచి తీసుకొన్న తత్తుల్య ధనానికి సమానమైన ఎటువంటి సరుకులను అది సరుకుల మార్కెట్ నుంచి తిరిగి తీసుకోదు.

ఇక్కడ పరపతిని పరిగణనలోకి తీసుకోవడం లేదు. ఉదాహరణకు, పెట్టుబడిదారు తాను పోగుచేస్తున్న డబ్బును బ్యాంకులో, వడ్డీ వచ్చే కరెంట్ అకౌంట్‌లో డిపాజిట్ చేస్తాడు. ఆ డిపాజిట్లు పరపతి కిందికి వస్తాయి.

★ ★ ★

## అధ్యాయం - 5

# చలామణికి పట్టే కాలం[1]

# (The Time of Circulation)

"ఉత్పత్తి రంగంగుండా, చలామణి రంగంలోని రెండు దశలగుండా పెట్టుబడి గమనం వరుసగా నియత కాలాల్లో జరుగుతుందని చూశాము. ఉత్పత్తి రంగంలో దాని గమన కాలం దాని ఉత్పత్తికి పట్టే కాలం, చలామణి రంగంలో అది వున్న కాలం దాని చలామణి కాలం. కాబట్టి, అది తన ఆవృత్తిని నిర్వర్తించడానికయ్యే మొత్తం కాలం దాని ఉత్పత్తి, చలామణి కాలాలు రెంటి మొత్తానికి సమానం.

ఉత్పత్తి కాలంలో సహజంగా, శ్రమ ప్రక్రియ కాలం చేరి వుంటుంది. కానీ, ఉత్పత్తి కాలం శ్రమ ప్రక్రియ కాలంలో ఇమడదు. స్థిర పెట్టుబడిలో ఒక భాగం యంత్రాలు, భవనాలు మొదలైన శ్రమ పరికరాల రూపంలో వుంటుందనీ, పూర్తిగా అరిగిపోయేదాకా అవి పదే పదే సాగే అదే శ్రమ ప్రక్రియలకు వినియోగమవుతాయని గుర్తుంచుకోవాలి. శ్రమ ప్రక్రియకు నియత కాలాల్లో సంభవించే అంతరాయాలు, ఉదాహరణకు, రాత్రి విరామాలు ఈ శ్రమ పరికరాల పనికి అంతరాయమవుతాయి. కానీ, ఉత్పత్తి స్థలంలో వాటి ఉనికికి అడ్డురావు. అవి పనిచేస్తున్నప్పుడూ, పని చేయనప్పుడూ ఆ స్థలంలోనే వుంటాయి. మరోవైపు, ఉత్పత్తి ప్రక్రియ మార్కెట్ నుంచి రోజువారీ సరఫరాల యాదృచ్ఛిక పరిణామాలపై ఆధారపడకుండా, ముందుగా నిర్ణయించుకొన్న స్థాయిలో ఎక్కువ కాలమో, లేక తక్కువ కాలమో కొనసాగాలంటే, పెట్టుబడిదారు నిర్దిష్ట పరిమాణంలో ముడి పదార్థాలను, సహాయక సామాగ్రిని సిద్ధంగా వుంచుకోవాలి. ఈ ముడి పదార్థాలూ మొదలైనవి ఉత్పాదనకు మెట్టు మెట్టుగా మాత్రమే వినియోగింపబడతాయి. కాబట్టి వాటి ఉత్పాదన కాలానికి, అవి పనిచేసే కాలానికీ మధ్య తేడా వుంది.[2] కాబట్టి, సాధారణంగా కింద పేర్కొన్నవన్నీ కలిపి ఉత్పత్తి సాధనాల ఉత్పాదన కాల మవుతాయి : 1) అవి ఉత్పత్తి సాధనాలుగా పనిచేసే కాలం, కాబట్టి ఉత్పాదక ప్రక్రియలో పనిచేసే కాలం. 2) ఉత్పాదక ప్రక్రియకు ఆ విధంగా ఆ ప్రక్రియలో మూర్తీభవించిన ఉత్పత్తి సాధనాల పనికి, అంతరాయం కలిగించే విరామ కాలాలు. 3) ఆ ఉత్పాదన ప్రక్రియకు పూర్వావసరాలుగా వాటిని

---

1. రాతప్రతి IV ప్రారంభం - ఫ్రెడరిక్ ఎంగెల్స్

2. ఇక్కడ ఉత్పాదన కాలం అనే మాట కర్తృర్థకంగా వాడబడింది. ఉత్పత్తి సాధనాల ఉత్పాదన కాలం అంటే ఇక్కడ, వాటి ఉత్పాదనకు పట్టే కాలమని అర్థం కాదు. ఒకానొక సరుకు ఉత్పాదన క్రమంలో అవి పాల్గొనే కాలమని దాని అర్థం. - ఫ్రెడరిక్ ఎంగెల్స్

సిద్ధంగా వుంచిన కాలం; అలా సిద్ధంగా వుంచినందువల్ల అవి అప్పటికీ ఉత్పాదక పెట్టుబడిగా వుంటాయి కానీ ఇంకా ఉత్పాదన ప్రక్రియలో ప్రవేశించి ఉండవు.

ఇంతవరకు మనం గమనించిన తేడా, ప్రతి సందర్భంలోనూ, ఉత్పాదక పెట్టుబడి ఉత్పాదన రంగంలో వున్న కాలానికీ, అసలు ఉత్పాదన ప్రక్రియలో అవి వున్న కాలానికీ మధ్య గల తేడా. కానీ ఉత్పాదన ప్రక్రియే శ్రమ ప్రక్రియలోని అంతరాయాలకు, ఆ విధంగా శ్రమ కాలంలోని అంతరాయాలకు కారణం కావచ్చు. మరింత మానవ శ్రమ ప్రమేయం లేకుండానే, శ్రమ గ్రహీత వస్తువు భౌతిక క్రమాల క్రియలకు లోనయ్యే విరామ కాలాలే ఈ అంతరాయాలు, శ్రమ ప్రక్రియకు, ఆ విధంగా శ్రమ పరికరాలుగా ఉత్పత్తి సాధనాల పనికి అంతరాయం కలిగినప్పటికీ, ఉత్పత్తి ప్రక్రియ, ఆ విధంగా ఉత్పత్తి సాధనాల పని ఈ సందర్భంలో కొనసాగుతుంది. ఉదాహరణకు విత్తిన తరువాత ధాన్యానికీ, పాతరలో పులుస్తున్న ద్రాక్ష సారాయికీ, తోళ్ళ ఫ్యాక్టరీల వంటి అనేక ఫ్యాక్టరీల్లోని శ్రమ సామాగ్రికీ ఇది వర్తిస్తుంది. ఈ వస్తువులు రసాయన క్రమాల క్రియకు లోనవుతున్నాయి. ఈ సందర్భంలో, ఉత్పాదన కాలం శ్రమ కాలంకన్నా ఎక్కువ. శ్రమ కాలానికి మించి అదనంగా వున్న ఉత్పాదన కాలమే ఈ రెంటి మధ్య గల తేడా. ఉత్పాదన ప్రక్రియలో పని చేయకుండా ఉత్పాదక పెట్టుబడి ఉత్పాదన రంగంలో గుప్తంగా వుంచటం లేదా శ్రమ ప్రక్రియలో పాల్గొనకుండా ఉత్పాదన ప్రక్రియలో అది పనిచేయటం, ఈ అదనపు కాలానికి ఎల్లప్పుడూ మూలం.

గుప్త పెట్టుబడిలో ఉత్పాదన ప్రక్రియకు పూర్వావసరంగా సిద్ధంగా వుంచిన భాగం – ఉదాహరణకు నూలు మిల్లులోని పత్తి, బొగ్గు మొదలయినవి – ఉత్పాదితాల లేదా విలువల సృష్టికర్తగా వ్యవహరించదు. అది నిష్క్రియగా వున్న పెట్టుబడి – అలా నిష్క్రియగా వుండటం ఉత్పత్తి ప్రక్రియ నిరంతరాయ గమనానికి తప్పనిసరి అయినప్పటికీ, ఉత్పాదక సరఫరాలను (గుప్త పెట్టుబడి) నిల్వచేసి వుంచడానికి అవసరమైన భవనాలు, సాధనాలు మొదలైనవి ఉత్పాదన ప్రక్రియకు తప్పనిసరియైనవి. అందువల్ల అవి మదుపు పెట్టిన ఉత్పాదక పెట్టుబడి అంతర్భాగాలు, అవి ప్రాథమిక దశలో, ఉత్పాదకమైన అంతర్భాగాలను భద్రపరచే తమ విధులను నిర్వర్తిస్తాయి. ఈ దశలో శ్రమ ప్రక్రియలు అవసరం కాబట్టి, వాటివల్ల ముడిపదార్థాలు మొదలైన వాటి ధర పెరుగుతుంది. కాని అవి ఉత్పాదక శ్రమ; అదనపు విలువను ఉత్పత్తి చేస్తాయి. ఎందువల్లనంటే, తక్కిన అన్ని రకాల వేతన శ్రమలాగానే ఈ శ్రమలో ఒక భాగానికి డబ్బు చెల్లించబడును. మొత్తం ఉత్పాదక ప్రక్రియలోని ఈ మామూలు అంతరాయాలు, ఉత్పాదక పెట్టుబడి పని చేయని మధ్యంతర కాలాల విలువనూ సృష్టించవు, అదనపు విలువనూ సృష్టించవు. రాత్రిళ్ళు కూడా పనిచేయించాలన్న ఆకాంక్షకు కారణమిదే. (సం. 1, పెట్టుబడి, VIII, 4)[1]

ఉత్పత్తి ప్రక్రియలోనే శ్రమ గ్రహీత వస్తువు లోనయ్యే శ్రమ కాల విరామాలు విలువను గానీ, అదనపు విలువను గానీ సృష్టించవు. కాని అవి ఉత్పాదితాన్ని పురోగమింప చేస్తాయి; దాని జీవితంలో భాగమవుతాయి. ఆ క్రమాన్ని అది గడవక తప్పదు. పరికరాలూ వగైరాల విలువ, అవి పనిచేసిన మొత్తం కాలానికి అనుగుణమైన నిష్పత్తిలో ఉత్పాదితానికి బదిలీ అవుతుంది. శ్రమే ఉత్పాదితాన్ని ఈ

1. తెలుగు ముద్రణ, అధ్యాయం X, - 4 - సం.

దశకు తెస్తుంది. పత్తిలో ఒక భాగం నుసి అయిపోయి, ఉత్పాదితంలో చోటుచేసుకోకపోయినా, తన విలువను ఉత్పాదితానికి బదలాయించినట్లుగానే, ఈ పరికరాల వినియోగం ఉత్పత్తికి తప్పనిసరి. గుప్త పెట్టుబడిలోని మిగతా భాగం – భవనాలు, యంత్రాలు వగైరా, అంటే ఉత్పాదక ప్రక్రియలోని క్రమానుసార విరామ సమయాలు కలిగించే అంతరాయాలను మినహాయిస్తే సదా పనిచేసే శ్రమ సాధనాలు, ఉత్పాదితం తయారయ్యే క్రమంలో ప్రవేశించకుండా విలువను పెంచుతాయి. (ఉత్పత్తిపై విధించే పరిమితులు, సంక్షోభాలు మొదలైన క్రమ విరుద్ధ అంతరాయాలు పూర్తిగా నష్టాలే). పెట్టుబడిలోని ఈ భాగం ఉత్పాదితానికి చేర్చే మొత్తం విలువ, దాని సగటు మన్నిక కాలాన్ని బట్టి వుంటుంది. అది పని చేసే కాలంలోనూ, పని చేయని కాలంలోనూ తన ఉపయోగపు విలువను కోల్పోతుంటుంది కాబట్టి విలువను కోల్పోతుంటుంది.

ఆఖరు విషయం, శ్రమ ప్రక్రియకు అంతరాయం ఏర్పడినప్పటికీ, పెట్టుబడిలోని స్థిర భాగపు విలువ ఉత్పాదక ప్రక్రియలో కొనసాగుతూ, ఉత్పాదక ప్రక్రియ ఫలితంలో తిరిగి ప్రత్యక్షమవుతుంది. అసలు శ్రమే ఉత్పత్తి సాధనాలు తమంతకు తామే కొన్ని సహజ పరిణామ క్రమాలను గడిచే స్థితిలో వాటిని వుంచింది. ఇందువల్ల ఒక నిర్దిష్టమైన ఉపయోగకర ఫలితం లభిస్తుంది లేదా, వాటి ఉపయోగపు విలువ రూపంలో మార్పు వస్తుంది. ఉత్పత్తి సాధనాలను అనువైన రీతిలో ఉత్పత్తి సాధనాలుగా శ్రమ నిజంగా వినియోగించిన మేరకు అది వాటి విలువను ఉత్పాదితానికి సదా బదలాయిస్తుంది. ఈ ఫలితమివ్వడానికి శ్రమ తన పరికరాల ద్వారా శ్రమ గ్రహీత వస్తువుపై నిరంతరాయంగా పనిచేయవలసి వచ్చినా, ఒకటే; లేదా ఉత్పత్తి సాధనాలు, శ్రమ సహాయం లేకుండా సహజ క్రమాల ఫలితంగా, ఉద్దేశించిన మార్పునకు లోనయ్యే పరిస్థితులను వాటికి కల్పించడం ద్వారా, శ్రమ<sup></sup>కేవలం మొదటి ఊపు ఇవ్వవలసివచ్చినా ఒకటే – మారేదేమీ లేదు.

శ్రమ కాలంకన్నా ఉత్పత్తి కాలం ఎక్కువగా వుండటానికి కారణం, ఉత్పత్తి సాధనాలు కేవలం గుప్త ఉత్పాదక పెట్టుబడిగానే వుండి, అందువల్ల వాస్తవ ఉత్పాదన ప్రక్రియ పూర్వపు దశలోనే వుండటం కావచ్చు; లేక, ఉత్పత్తి ప్రక్రియలోనే విరామాల వల్ల ఉత్పత్తి సాధనాల పనికి అంతరాయ మేర్పడటం కావచ్చు; లేక ఉత్పత్తి ప్రక్రియ వల్లనే శ్రమ ప్రక్రియకు అంతరాయాలు అవశ్యంగా కలగడం కావచ్చు. కారణమేదైనా, ఈ అన్ని సందర్భాలలో ఉత్పత్తి సాధనాలు శ్రమ గ్రహీతలుగా పని చేయవు. అవి శ్రమను గ్రహించకుండా వున్నప్పుడు, అదనపు శ్రమ కూడా గ్రహించవన్న మాటే. కాబట్టి ఈ విరామాలు స్వయం విస్తరణ క్రమ నిర్వహణ నుంచి ఎంత అవిభాజ్యమైనవిగా వున్నప్పటికీ, ఉత్పాదక పెట్టుబడి శ్రమ కాలానికి పైబడిన ఉత్పాదన కాలభాగంలో వున్నంతసేపూ ఆ పెట్టుబడి విలువ విస్తరించదు. ఉత్పాదన కాలం శ్రమ కాలం ఒకదానికొకటి సమానమయ్యే కొద్దీ, ఒక నిర్ణీత కాల పరిధిలో ఒక నిర్ణీత ఉత్పాదక పెట్టుబడి తాలూకు ఉత్పాదక శక్తీ, స్వయం విస్తరణ పెరుగుతాయి. శ్రమకాలంకన్నా అదనంగా వున్న ఉత్పాదన కాలాన్ని సాధ్యమైనంత తగ్గించే ధోరణి పెట్టుబడిదారీ ఉత్పత్తికి వుండటానికి కారణమిదే. కాని ఒక నిర్దిష్ట పెట్టుబడి ఉత్పాదన కాలం దాని శ్రమ కాలానికి భిన్నంగా వున్నప్పటికీ ఆ ఉత్పాదన కాలం శ్రమకాలమే. ఈ అదనపు కాలం ఉత్పాదక ప్రక్రియకు ఒక ఆవశ్యకత కాబట్టి పెట్టుబడి గుప్తంగా వున్నట్టి లేక తన విలువను పెంచకుండా ఉత్పత్తి చేస్తున్నట్టి కాలం ఉత్పాదన కాలంలో చేరి వున్నప్పటికీ, ఉత్పాదన కాలమంటే, పెట్టుబడి

ఉపయోగపు విలువలను ఉత్పత్తి చేస్తూ, విస్తరించే కాలమే, కాబట్టి ఉత్పాదక పెట్టుబడిగా పనిచేసే కాలమే.

చలామణి రంగంలో, పెట్టుబడి సరుకు – పెట్టుబడిగా, డబ్బు – పెట్టుబడిగా వుంటుంది. సరుకు రూపం నుంచి డబ్బు రూపంలోకి, డబ్బు రూపం నుంచి సరుకు రూపంలోకి దాని పరివర్తన దాని చలామణిలోని రెండు క్రమాలు. సరుకు డబ్బుగా పరివర్తన చెందడమంటే, ఇక్కడ, సరుకుల్లో నిక్షిప్తమైన అదనపు విలువ చేతికి అందడం కూడా. డబ్బు సరుకులుగా పరివర్తన చెందడమంటే, పెట్టుబడి విలువ దాని ఉత్పాదన మూలాంశాలుగా పరివర్తితం లేక పునఃపరివర్తితం కావడం కూడా. కాని ఈ కారణాన, చలామణి క్రమాలుగా ఇవి, సరుకుల సామాన్య రూప పరివర్తనా క్రమాలన్న వాస్తవం ఎంతమాత్రమూ మారదు.

చలామణి కాలం, ఉత్పాదన కాలం పరస్పరం వేర్పడి వుంటాయి. చలామణి కాలంలో పెట్టుబడి ఉత్పాదక పెట్టుబడి విధులను నిర్వహించదు; కాబట్టి సరుకులను గానీ, అదనపు విలువను గానీ సృష్టించదు. అత్యంత సరళరూపంలో వున్న ఆవృత్తిని, అంటే మొత్తం పెట్టుబడి విలువ ఒక్కసారిగా ఒక దశ తరువాత మరో దశను గడిచిపోతూన్నప్పుడు దాన్ని పరిశీలిస్తే, మనకు ఒక విషయం స్పష్టమవుతుంది; అదేమంటే, పెట్టుబడి విలువ చలామణిలో వున్నంతకాలం ఉత్పత్తి ప్రక్రియకు, తత్కారణంగా దాని స్వయం విస్తరణకు అంతరాయం కలుగుతుంది; చలామణి కాల పరిమాణాన్ని బట్టి, ఉత్పత్తి ప్రక్రియ సత్వర గతితోనో, మందగతితోనో సాగుతుంది. అలా కాకుండా, పెట్టుబడిలోని వివిధ భాగాలు ఒకదాని తరువాత ఒకటి ఆవృత్తిని గడిస్తే, తత్ఫలితంగా మొత్తం పెట్టుబడి విలువ ఆవృత్తి, దాని వివిధ అంతర్భాగాల ఆవృత్తుల ద్వారా వరుసగా పూర్తి అయితే, దాని నిశ్శేష భాగాలు చలామణి రంగంలో ఎక్కువ కాలం పాటు వుండే కొద్దీ ఉత్పాదన ప్రక్రియలో పనిచేసే భాగం తగ్గుతూంటుందనేది స్పష్టమే. కాబట్టి చలామణి కాలం పెరుగుదల, తగ్గుదలలు ఉత్పత్తి కాలం తగ్గుదల, పెరుగుదలలపై లేదా ఒక నిర్ణీత పరిమాణం గల పెట్టుబడి ఉత్పాదక పెట్టుబడిగా పనిచేయగల స్థాయిపై వ్యతిరిక్త పరిమితులుగా పనిచేస్తాయి. ఒక నిర్దిష్ట పెట్టుబడి చలామణి తాలూకు రూప పరివర్తనలు కేవల భావనగానే వున్నకొద్దీ, అంటే చలామణి కాలం శూన్యంగానో లేక శూన్యానికి దగ్గరగానో వున్నకొద్దీ, పెట్టుబడి పనిచేయడం పెరుగుతుంది. ఉదాహరణకు దాని ఉత్పాదకత, దాని విలువ స్వయం విస్తరణ పెరుగుతుంది. ఉత్పాదితాన్ని సరఫరా చేసిన వెంటనే డబ్బు చెల్లించే షరతుపై ఒక పెట్టుబడిదారు సరుకులకు వచ్చిన గిరాకీ ఉత్తర్వును నెరవేర్చడం, ఆ డబ్బు అతనికి ఉత్పత్తి సాధనాల రూపంలో చెల్లించడం జరిగితే, చలామణి కాలం సున్నాకు దగ్గరగా వుంటుంది.

కాబట్టి, మొత్తంపై చెప్పవలసి వస్తే, పెట్టుబడి చలామణి కాలం దాని ఉత్పాదన ప్రక్రియ కాలానికి, తత్కారణంగా అదనపు విలువను సృష్టించే దాని ప్రక్రియకు పరిమితి విధిస్తుంది. అది తనకు పట్టే కాలానికి అనుగుణమైన నిష్పత్తిలో ఈ పరిమితి విధిస్తుంది. చలామణికి పట్టే ఈ కాలం గణనీయంగా పెరగవచ్చు లేక తగ్గవచ్చు. కాబట్టి పెట్టుబడి ఉత్పాదన కాలంపై అది పెట్టే పరిమితి బహువిధ స్థాయిలో వుంటుంది. కాని అర్థశాస్త్రం పైకి కనిపించేదాన్ని మాత్రమే చూస్తుంది. అంటే అదనపు విలువను సృష్టించే పెట్టుబడి ప్రక్రియపై చలామణి కాలం నెరపే ప్రభావాన్ని మాత్రమే చూస్తుంది. ఈ వ్యతిరేక ప్రభావాన్ని అది సానుకూల ప్రభావంగా పరిగణిస్తుంది. ఎందువల్లనంటే ఆ

ప్రభావ ఫలితాలు సానుకూలమైనవి. ఉత్పాదన ప్రక్రియతో నిమిత్తం లేనట్టి, అందువల్ల శ్రమను దోచుకోవడంతో నిమిత్తం లేనట్టి ఒక నిగూఢమైన స్వయం విస్తరణ మూలాధారం పెట్టుబడికి వుందనీ, అది చలామణి రంగం నుంచి పెట్టుబడిలోకి ప్రవహించే ఊట కాలువవంటిదనీ, పైకి కనిపించే ఈ దృశ్యం రుజువు చేస్తున్నట్లుంది. కాబట్టి అర్థశాస్త్రం దానికి మరింత గట్టిగా అంటిపెట్టుకొని వుంది. శాస్త్రీయ దృక్పథం గల అర్థశాస్త్రం సైతం పైకి కనిపించే ఈ విషయాల వల్ల మోసపోయిందని ఉత్తరోత్తరా మనకు వెల్లడి కాగలదు. వివిధ ఘటనలు ఈ మిథ్యకు ప్రస్ఫుటమైన ఆకృతిని సంతరిస్తున్నాయి; అవి; 1) లాభాన్ని లెక్కగట్టే పెట్టుబడిదారీ పద్ధతి; ఇందులో వ్యతిరేక కారణం సానుకూలమైనదిగా కనిపిస్తుంది. ఎందువల్లనంటే, కేవలం చలామణి కాలంలో మాత్రమే తేడాలున్న వేరు వేరు రంగాల్లో మదుపు పెట్టిన పెట్టుబడుల విషయంలో, చలామణి కాలం పెరుగుదల ధరల పెరుగుదలకు దారితీస్తుంది; ఒక్క మాటలో చెప్పాలంటే, లాభాలను సమం చేసే కారణాల్లో ఒకటిగా పనిచేస్తుంది. 2) చలామణి కాలం టర్నోవర్ కాలంలోని ఒక దశ మాత్రమే. కాని టర్నోవర్ కాలంలో ఉత్పత్తి లేదా పునరుత్పత్తి కాలం కూడా చేరి వుంది. నిజంగా ఉత్పత్తి లేదా పునరుత్పత్తి ఫలితం చలామణి ఫలితంగా కనిపిస్తుంది. 3) సరుకులు అస్థిర పెట్టుబడిగా (వేతనాలుగా) పరివర్తన చెందడం, అంతకు మునుపు అవి డబ్బుగా పరివర్తన చెందడం వల్ల అవసరమవుతుంది. కాబట్టి పెట్టుబడి సంచయనంలో అదనపు అస్థిర పెట్టుబడిగా పరివర్తన, చలామణి రంగంలో లేదా చలామణి కాలంలో జరుగుతుంది. అందువల్ల ఈ సంచయనానికి చలామణియే కారణమని అనిపిస్తుంది.

చలామణి రంగంలో, పెట్టుబడి రెండు పరస్పర విరుద్ధ దశలను, (స–డ, డ–స) గడుస్తుంది. వీటిలో దేని తరువాత ఏది అనేది ముఖ్యం కాదు. కాబట్టి చలామణి కాలం అదే విధంగా, రెండు భాగాలుగా విభజితమవుతుంది. పెట్టుబడి సరుకుల రూపం నుంచి డబ్బు రూపంలోకి మారడానికి పట్టే కాలం, అది డబ్బు రూపం నుంచి సరుకు రూపంలోకి మారటానికి పట్టే కాలం. సరుకుల సాధారణ చలామణిని గురించిన విశ్లేషణ నుంచి (పెట్టుబడి సంపుటి I, 3వ అధ్యాయం) మనం ఒకటి తెలుసుకొన్నాము: స–డ, అంటే అమ్మకం దాని రూప పరివర్తనలోని అతి కష్టమైన భాగం; అందువల్ల, మామూలు పరిస్థితుల్లో దాని చలామణి కాలంలో ఎక్కువ భాగం దీనికే పడుతుంది. డబ్బుగా విలువ, సదా పరివర్తనీయ రూపంలో వుందన్నమాట. సరుకు విలువ నేరుగా పరివర్తన చెందగల ఈ రూపాన్ని ధరించగలగడానికి మునుపు, అంటే, కార్యాచరణకు నిరంతరం సంసిద్ధంగా వున్న రూపాన్ని ధరించగలగడానికి మునుపు, డబ్బుగా మారవలసి వుంటుంది. కాని పెట్టుబడి చలామణి క్రమంలో దాని డ–స దశ, ఒక కర్మాగారంలోని ఉత్పాదక పెట్టుబడి అంతర్భాగాలైన సరుకులుగా దాని పరివర్తనకు సంబంధించిన దశ. ఉత్పాదక సాధనాలు మార్కెట్‌లో సిద్ధంగా వుండకపోవచ్చు. అప్పుడు వాటిని మొదట తయారు చేయవలసి వుంటుంది లేదా దూరంగా వున్న మార్కెట్ల నుంచి సేకరించవలసి వుంటుంది; లేదా వాటి మామూలు సరఫరా సక్రమంగా లేకపోవడం లేదా ధరలు మారడం జరుగుతూంటుంది. ఒక్క ముక్కలో చెప్పాలంటే, ఇందులో సాధారణ రూపాంతరీకరణలు అయిన డ–సలో దృష్టికి రాని అనేక పరిస్థితులున్నాయి; ఐతే చలామణి దశలోని ఈ భాగానికి ఒకప్పుడు ఎక్కువ కాలం, మరొకప్పుడు తక్కువ కాలం పట్టడం రివాజు. డ–స, స–డ ఈ రెండూ కాలక్రమంలోనే కాకుండా ప్రాదేశికంగా కూడా వేరుపడి వుండవచ్చు. కొనుగోలుకు

మార్కెట్, అమ్మకానికి మార్కెట్ దూరదూరంగా వుండవచ్చు. ఉదాహరణకు ఫ్యాక్టరీల విషయంలో తరచుగా కొనుగోలుదారు వేరు, అమ్మకందారు వేరు. సరుకుల ఉత్పత్తిలో, అసలు ఉత్పాదన ఎంత అవసరమో చలామణి అంత అవసరం. ఫలితంగా, ఉత్పాదన కర్తలు ఎంత అవసరమో చలామణి కర్తలు కూడా అంత అవసరం. పునరుత్పత్తి ప్రక్రియలో పెట్టుబడి తాలూకు రెండు విధులూ వున్నాయి. కాబట్టి ఈ రెండు విధులకు అసలు పెట్టుబడిదారు రూపంలోనో లేదా అతని ఏజంట్లయిన వేతన కార్మికుల రూపంలోనో ప్రతినిధులు వుండవలసిన ఆవశ్యకత పునరుత్పత్తి ప్రక్రియలో వుంది. అయితే ఈ కారణాన, చలామణి కర్తలను ఉత్పాదకులు, అదేవిధంగా సరుకు పెట్టుబడి విధులను, డబ్బు - పెట్టుబడి విధులను ఉత్పాదక పెట్టుబడి విధులుగా భావించే గందరగోళంలో పడరాదు. చలామణి కర్తలకు ఉత్పాదన కర్తలు డబ్బు చెల్లించవలసి వుంటుంది. పెట్టుబడిదారులు ఒకరికొకరు అమ్మడం, ఒకరినుంచి ఒకరు కొనడం వల్ల విలువలను కానీ, ఉత్పాదితాలను గాని సృష్టించనప్పుడు, వారు తమ వ్యాపార పరిమాణం వల్ల, ఈ విధిని ఇతరులకు అప్పజెప్పగలిగితే లేదా అప్పజెప్పవలసివస్తే, అప్పుడు కూడా ఈ పరిస్థితి మారదు. కొన్ని వ్యాపారాల్లో కొనుగోలుదారులకు, అమ్మకందారులకు లాభాల్లో శాతాల చొప్పున చెల్లించడం జరుగుతుంది. వారికీ వినియోగదారు చెల్లిస్తున్నాడన్న వాదన కొరగాదు. వినియోగదారులు ఉత్పత్తి కర్తలుగా తమ కోసం సరుకుల రూపంలో సమాన విలువను ఉత్పత్తి చేసిన మేరకు లేదా శాసనరీత్యా పొందిన హక్కు ప్రాతిపదికపై (వారి సహభాగస్వాములుగానో, ఇతర విధాలుగానో) లేదా వ్యక్తిగత సేవలవల్ల ఉత్పత్తి కర్తల నుంచి ఆ విలువను స్వాయత్తం చేసుకొన్న మేరకు మాత్రమే వినియోగదారులు అలా చెల్లించగలరు.

సరుకులకు, డబ్బుకు మధ్యగల రూప భేదంతో సంబంధం లేని ఒక భేదం స-డ కు, డ-సకు మధ్య వుంది. అది ఉత్పత్తి యొక్క పెట్టుబడిదారీ స్వభావం నుంచి ఉత్పన్నమైన భేదం. స-డ, డ-స రెండూ స్వభావసిద్ధంగా విలువ ఒక రూపం నుంచి మరో రూపానికి కేవలం పరివర్తనలు మాత్రమే. కాని స'-డ' అదే సమయంలో, స'లో గల అదనపు విలువ డబ్బుగా చేతికందే క్రమం. కానీ, డ-స అలాంటిది కాదు. కాబట్టి అమ్మకం కొనుగోలుకన్నా ముఖ్యమైనది. మామూలు పరిస్థితుల్లో, డ-స అనేది, డ వ్యక్తం చేసే విలువ స్వయం విస్తరణకు అవసరమైన క్రియ. కానీ అది అదనపు విలువ డబ్బుగా చేతికందడం కాదు. అది ఉత్పత్తికి నాందీవాక్యమే తప్ప భరతవాక్యం కాదు.

సరుకు అస్తిత్వ రూపం, ఉపయోగపు విలువగా దాని అస్తిత్వం సరుకు - పెట్టుబడి యొక్క చలామణికి, అంటే స'-డ'కు ఖచ్చితమైన పరిమితులను విధిస్తుంది. ఉపయోగపు విలువలు స్వభావతః, కాలగతితో పాడయిపోతాయి. కాబట్టి, వాటి ప్రయోజనాన్ని బట్టి అవి ఒక నిర్దిష్ట వ్యవధిలో ఉత్పాదకంగానో లేదా వ్యక్తులచేతనో వినియోగం కాకుంటే, చెడిపోతాయి. తమ ఉపయోగపు విలువతో పాటు, మార్పిడి విలువ వాహికలుగా వుండే తమ గుణాన్ని కూడా కోల్పోతాయి. వాటిలో వున్న పెట్టుబడి విలువ, అందువల్ల దానితో సంచితమైన అదనపు విలువ కూడా నష్టమైపోతుంది. ఉపయోగపు విలువల స్థానంలో అదే రకం లేదా మరో రకం కొత్త ఉపయోగపు విలువలను తెచ్చి పెడుతూంటే తప్ప, ఉపయోగపు విలువలు నిత్య స్వయం విస్తరణశీలమైన పెట్టుబడి - విలువ వాహికలుగా వుండవు. కాని పూర్తిగా తయారైన సరుకుల రూపంలో విలువలు అమ్మకం కావడం, అలా వాటి అమ్మకం ద్వారా అవి ఉత్పాదక లేదా వ్యక్తిగత వినియోగంలో ప్రవేశించడం అనేది, వాటి

పునరుత్పత్తికి అవశ్యంగా ఎల్లప్పుడూ మళ్ళీ మళ్ళీ జరుగుతుండాలి. ఒక కొత్త ఉపయోగపు రూపంలో వాటి ఉనికి కొనసాగాలంటే, వాటి పాత ఉపయోగపు రూపం ఒక నిర్దిష్ట వ్యవధిలో మారుతుండాలి. మార్పిడి విలువ నిలదొక్కుకొని వుండటానికి, అది నిరంతరం సరికొత్త రూపం ధరించడ మొక్కటే మార్గం. వివిధ సరుకుల ఉపయోగపు విలువలు త్వరగానో, ఆలస్యంగానో చెడిపోతాయి. కాబట్టి వాటి ఉత్పత్తికీ, వినియోగానికీ మధ్య గడిచే కాలం, తరతమ స్థాయిలో ఎక్కువగానైనా వుండవచ్చు, తక్కువగానైనా వుండవచ్చు. అందువల్ల, ఉపయోగపు విలువలు చలామణి దశలో, అంటే స–డలో చెడిపోకుండా సరుకు పెట్టుబడిగా నిలబడగలిగిన కాలం ఎక్కువగానైనా వుండవచ్చు, తక్కువగానైనా వుండవచ్చు. సరుకులుగా అవి నిలబడగలిగిన చలామణి కాలం ఎక్కువగానైనా వుండవచ్చు; తక్కువగానైనా వుండవచ్చు: సరుకు భౌతికంగా చెడిపోవడమనే పరిణామం ఒక సరుకు పెట్టుబడి చలామణి కాలంపై విధించే పరిమితే దాని చలామణి కాలంలోని ఈ భాగంపై లేక సరుకు పెట్టుబడిగా దాని చలామణి కాలంపై విధించే సంపూర్ణ పరిమితి అవుతుంది. ఒక సరుకు ఎంత త్వరగా చెడిపోయేదయితే, ఆ కారణం వల్ల దాన్ని ఎంత త్వరగా వినియోగించవలసి వుంటే, కాబట్టి అంత త్వరగా అమ్మవలసి వుంటే, దాని చలామణి ప్రాదేశిక పరిధి అంత సంకుచితమవుతుంది. దాన్ని అమ్మవీలున్న మార్కెట్లు అంత స్థానికమైనవవుతాయి. ఈ కారణం వల్ల ఒక సరుకు ఎంత త్వరగా చెడిపోయేదైతే, దాని భౌతిక లక్షణాల వల్ల సరుకుగా దాని చలామణికి గల సంపూర్ణ పరిమితి ఎంత ఎక్కువగా వుంటే, పెట్టుబడిదారీ ఉత్పత్తికి వస్తువుగా వుండే అర్హత దానికంత తక్కువగా వుంటుంది. ఎక్కువ జనసాంద్రత వున్న జిల్లాల్లో మాత్రమే లేదా, అభివృద్ధి చెందిన రవాణా సౌకర్యాలు దూరాభార సమస్యను తొలగించిన మేరకు, అటువంటి సరుకు పెట్టుబడిదారీ ఉత్పత్తి పట్టులోకి రాగలదు. కానీ, ఏ వస్తువు ఉత్పత్తి అయినా కొద్దిమంది చేతుల్లో బాగా జనసాంద్రత గల జిల్లాలో కేంద్రీకృతమైనందు వల్ల, పెద్ద సారా బట్టీలూ, పాడి పరిశ్రమలు మొదలైన వాటి ఉత్పాదితాల వంటి వస్తువులకు సైతం సాపేక్షంగా పెద్ద మార్కెట్ ఏర్పడవచ్చు.

★ ★ ★

## అధ్యాయం - 6

# చలామణి ఖర్చులు

# (The Costs of Circulation)

## I. చలామణికయ్యే నిజమైన ఖర్చులు

## (Genuine Costs of Circulation)

### 1. కొనుగోలు, అమ్మకం కాలం

సరుకుల నుంచి డబ్బుగా, డబ్బు నుంచి సరుకులుగా పెట్టుబడి రూపాంతరీకరణలు అదే సమయంలో పెట్టుబడిదారుని వ్యాపార లావాదేవీలు, అమ్మకం, కొనుగోళ్ళు అవుతున్నాయి. ఈ రూపాంతరీకరణలకు పట్టే కాలం ఆత్మాశ్రయ దృష్ట్యా, అంటే పెట్టుబడిదారుని దృష్టిలో కొనుగోలు, అమ్మకాలకు పట్టే కాలం. అతను మార్కెట్‌లో అమ్మకందారుగానూ, కొనుగోలుదారుగానూ పనిచేసే కాలమిది. పెట్టుబడి చలామణి కాలం పునరుత్పత్తి కాలంలో అవశ్యక భాగమైనట్టుగానే, పెట్టుబడిదారు అమ్మడానికీ, కొనడానికీ ఆ పనులపై మార్కెట్‌లో అటూ ఇటూ తిరగడానికీ పట్టే కాలం అతడు పెట్టుబడిదారుగా, అంటే వ్యక్తిరూపం దాల్చిన పెట్టుబడిగా పనిచేసే కాలంలోని అవశ్యక భాగమవుతుంది.

[సరుకులను వాటి విలువలకే కొనడం, అమ్మడం జరుగుతుందని మనం ఊహించుకొన్నాము కాబట్టి ఈ ప్రక్రియలు ఒక నిర్దిష్ట విలువ కేవలం ఒక రూపం నుంచి మరొక రూపానికి మారడమే; సరుకు రూపం నుండి డబ్బు రూపానికి, డబ్బు రూపం నుంచి సరుకు రూపానికి మారడం – అస్తిత్వ స్థితిలో మార్పు. సరుకులు వాటి విలువలకే అమ్మకమైనప్పుడు, కొనుగోలుదారుని అమ్మకందారుని చేతుల్లోని విలువ పరిమాణాలు మార్పు లేకుండా యథాతథంగా వుంటాయి. విలువ అస్తిత్వ రూపం మాత్రమే మారుతుంది. సరుకులు వాటి విలువల ప్రకారం అమ్మకం కానప్పుడు, రూప పరివర్తన చెందిన విలువల సమాహారం మారకుండా యథాతథంగా వుంటుంది. ఒకవైపు లాభం, రెండోవైపు నష్టం అవుతుంది.

రూపాంతరీకరణలైన స–డ, డ–స కొనుగోలుదార్లకు, అమ్మకందార్లకు మధ్య జరిగిన వర్తక లావాదేవీలు. ప్రతివాళ్లూ అవతలివాళ్ళని బోల్తాకొట్టించచూచే పెనుగులాట సాగుతుంది కాబట్టి తమ బేరాలు కుదుర్చుకోడానికి వారికి కొంత వ్యవధి అవసరం. పైగా ఇక్కడ ముఖాముఖిగా వున్నది, వ్యాపారాలు. “ఒక గ్రీకు మరో గ్రీకును కలుసుకొన్నప్పుడు శిగపట్లు ప్రారంభమవుతాయి”[1] అస్తిత్వ

1. నాథనీల్ రాసిన 17వ శతాబ్దం నాటి విషాదాంత నాటకం “పోటీపడ్డ రాణులు, లేక మహాపురుషుడు అలెగ్జాండర్ మరణం” లోని మాటల యథాతథ అనువాదం - సం.

స్థితిలో మార్పు తీసుకురావటానికి వ్యవధి పడుతుంది. శ్రమశక్తి వ్యయమవుతుంది. కానీ వీటి అవసరం విలువను సృష్టించడానికి కాదు; ఒక రూపంలోని విలువను మరో రూపంలోకి మార్చడానికి. ఈ విలువలో కాస్త అదనంగా స్వాయత్తం చేసుకొనేందుకు ఈ సందర్భంలో ఉభయత్రా జరిగే ప్రయత్నం వల్ల ఏమీ మారదు. కోర్టు విచారణలో జరిగే కార్యకలాపం లేదా జాప్యం వల్ల వ్యాజ్యంలో వున్న ఆస్తి విలువ ఏమాత్రమూ పెరగనట్లుగానే, పై సందర్భంలో కూడా, ఉభయ పక్షాల దురుద్దేశాల మూలంగా హెచ్చిన శ్రమ, విలువను సృష్టించదు. ఈ శ్రమ మొత్తం పెట్టుబడిదారీ ఉత్పత్తి క్రమంలోని అవశ్యాంశం; దీనిలో చలామణి కూడా చేరి వుంది. లేదా చలామణి వల్ల ఈ శ్రమ అందులో చేరుతుంది. ఈ శ్రమ, ఉష్ణోత్పాదనకు వాడే ఒక పదార్థం మండేలా చేసే కృషి వంటిది. ఈ కృషి ప్రజ్వలన ప్రక్రియలో అవశ్యాంశమైనప్పటికీ, వేడిని పుట్టించేది అది కాదు. ఉదాహరణకు బొగ్గును ఇంధనంగా వాడాలంటే, అది ఆక్సిజన్‌తో సంయోగమయ్యేలా చేయాలి. ఇందుకు, మనం దాన్ని ఘనస్థితి నుంచి వాయు స్థితికి మార్చాలి. (ఎందువల్లనంటే, ప్రజ్వలన ఫలితమైన కార్బానిక్ ఆసిడ్ గ్యాస్‌లో, బొగ్గు వాయుస్థితిలో వుంటుంది) కాబట్టి, దాని అస్తిత్వ రూపంలో, లేదా దాని అస్తిత్వ స్థితిలో మనం భౌతికమైన మార్పు తేవలసి వుంటుంది. ఘన పదార్థంగా ఏకమై వున్న కర్బన కణాలు విడిపోవడం, ఈ కణాలు అణువులుగా చీలడం – ఇదంతా కొత్త సంయోగానికి ముందు జరగాలి. దీనికి కొంత శక్తి వ్యయం కావాలి. కాబట్టి ఇది ఉష్ణంగా మారిన శక్తిగాదు సరికదా, ఉష్ణం నుంచి గ్రహించబడిన శక్తి. అందువల్ల, సరుకుల సొంతదారులు పెట్టుబడిదారులు కాక, స్వతంత్రులైన ప్రత్యక్ష ఉత్పాదకులైతే, కొనుగోలు, అమ్మకాల్లో వినియోగమయ్యే కాలం ఆ మేరకు వారి శ్రమ కాలాన్ని కోతపెడుతుంది. ఈ కారణం వల్ల, అటువంటి బేరసారాలను (ప్రాచీన, మధ్యయుగాల కాలంలో) సెలవు రోజులకు వాయిదా వేసేవారు.

పెట్టుబడిదారుల చేతుల్లో సరుకుల రూప పరివర్తన సంతరించుకొనే పరిమాణాలు, సహజంగానే, ఈ శ్రమను – విలువ రూపాన్ని మార్చడంలో కేవల సాధనం కావడం తప్ప, ఎట్టి విలువనూ సృష్టించని ఈ శ్రమను – విలువ ఉత్పాదక శ్రమగా మార్చవు. ఈ గుణ పరివర్తన అనే అద్భుత కృత్యాన్ని స్థితి మార్పిడి ద్వారా నెరవేర్చ వీలులేదు. అంటే, పారిశ్రామిక పెట్టుబడిదారు ఈ "ప్రజ్వలన కృషిని" తాము స్వయంగా నిర్వహించడానికి బదులు, డబ్బిచ్చి పెట్టుకొన్న మూడో మనిషి ఏకైక వ్యాపారంగా చేయటం ద్వారా నెరవేర్చ వీలులేదు. ఈ మూడో మనిషి పెట్టుబడిదారుపై కేవల ప్రేమ వల్ల అతనికి తన శ్రమశక్తిని అర్పించడం. స్థిరాస్తుల సొంతదారు అద్దెలు వసూలు చేయడానికి పెట్టుకొన్న వ్యక్తి లేదా బ్యాంకు బంట్రోతు తన శ్రమ అద్దెకు గానీ, లేదా మరో బ్యాంకుకు చేరవేయబడే మోపెడు బంగారు నాణేలకు గాని అణుమాత్రమైనా విలువను చేర్చడం లేదనే సంగతిని పట్టించుకోడు. ][1]

తనకోసం పనిచేసే వారున్న పెట్టుబడిదారుకు కొనడమూ, అమ్మడమే ఒక ప్రధానమైన పని అవుతుంది. అతడు అనేకుల ఉత్పాదితాన్ని విస్తార సామాజిక స్థాయిలో స్వాయత్తం చేసుకొంటాడు. కాబట్టి, దాన్ని అదే స్థాయిలో అమ్మి, ఆ తరువాత డబ్బు రూపంలో వున్నదాన్ని ఉత్పత్తి అంతర్భాగాలుగా మార్చవలసి వుంటుంది. మునుపటి లాగే ఇప్పుడు కూడా కొనుగోలుకు గానీ, అమ్మకానికి గానీ పట్టే

1. బ్రాకెట్లలోని పాఠం, రాతప్రతి VIII చివర వున్న టిప్పణి నుంచి తీసుకొన్నది - **ఫ్రెడరిక్ ఎంగిల్స్.**

కాలం ఏ విలువనూ సృష్టించదు. వర్తకుని పెట్టుబడి నిర్వర్తించే విధి ఒక భ్రమను కలుగజేస్తుంది. కానీ దీన్ని ఇక్కడ లోతుగా తరిచి చూడకుండానే, కింది విషయం ఆదిలోనే స్పష్టమవుతుంది: పునరుత్పత్తిలో అవశ్యాంశమైనప్పటికి, స్వభావతః అనుత్పాదకమైన ఒకపని, అనేకులకు పనిలో పనిగా వున్న స్థితి నుంచి, శ్రమ విభజన వల్ల, కొద్దిమంది ఏకైక వృత్తిగా, వారి ప్రత్యేక వ్యాపారంగా మారితే, ఆ పని స్వభావం మారదు. ఒక్క వర్తకుడు (ఇక్కడ ఇతడు సరుకుల రూపాంతరీకరణ వ్యవహారాన్ని చూచే ఏజంటుగా మాత్రమే, కొనుగోలుదారుగా, అమ్మకందారుగా మాత్రమే వ్యవహరిస్తున్నట్లు భావిస్తున్నాము) తన పని ద్వారా అనేకమంది ఉత్పత్తిదారులకు, కొనుగోలు అమ్మకాలకు పట్టే కాలాన్ని తగ్గిస్తున్నాడు. (అతణ్ణి అటువంటి సందర్భంలో శ్రమ నిరుపయోగ వ్యయాన్ని తగ్గించే యంత్రంగా లేక ఉత్పత్తి కాలం విడుదలకు తోడ్పడే యంత్రంగా పరిగణించాలి.)[1]

ఈ విషయాన్ని తేటపరచడానికై, ఈ అమ్మకం, కొనుగోళ్ళ వ్యవహర్త తన శ్రమను అమ్ముకొనే వ్యక్తి అని అనుకొందాం. (ఎందువల్లనంటే, ఉత్తరోత్తరా గానీ, మనం పెట్టుబడిదారుగా వున్న వర్తకుణ్ణి గురించి, వర్తకుని పెట్టుబడిని గురించి చర్చించడం లేదు.) అతడు తన శ్రమశక్తినీ, శ్రమ కాలాన్నీ స–డ, డ–స ప్రక్రియల్లో వెచ్చిస్తాడు. వడకడం లేదా మాత్రలు చేయడం బతుకుతెరువులుగా వున్నట్లే ఇదీ అతనికి బతుకుతెరువు. పునరుత్పత్తి ప్రక్రియలోనే అనుత్పాదక విధులున్నాయి కాబట్టి, అతడూ అవశ్యకమైన విధిని నిర్వరిస్తున్నాడు. అతడు తోటివారంత బాగా పని చేస్తాడు. కానీ అతని శ్రమ స్వభావసిద్ధంగానే విలువను గానీ, ఉత్పాదితాన్నీ గానీ సృష్టించదు. అతడు ఉత్పత్తికి సంబంధించిన అనుత్పాదక ఖర్చుల కింద లెక్క. అతని ఉపయుక్తత అనుత్పాదక విధిని ఉత్పాదక విధిగా లేదా అనుత్పాదక శ్రమను ఉత్పాదక శ్రమగా మార్చడంలో లేదు. ఒక విధిని బదలాయించడం ద్వారా అటువంటి మార్పును తేగలిగితే, అదొక అద్భుత కార్యమే అవుతుంది. సమాజ శ్రమశక్తిలో, సమాజ శ్రమ కాలంలో కొద్ది భాగం ఈ అనుత్పాదక విధిలో చిక్కుకుపోయిందన్న వాస్తవంలో వుంది అతని ఉపయుక్తత. అంతేకాదు, అతడు కేవలం వేతన కార్మికుడని, అందులోనూ మంచి వేతనం ముట్టే కార్మికుల్లో ఒకరనే అనుకొందాం. అతని వేతనమెంతైనా, వేతన కార్మికుడుగా అతడు తన కాలంలో కొంతసేపు ఉచితంగా పనిచేస్తాడు. అతనికి ఎనిమిది పని గంటల ఉత్పాదితపు విలువ రోజూ

1. “వర్తకం ఖర్చులు అవసరమైనవే. కాని వాటిని భారమైన వ్యయంగా పరిగణించాలి.” (క్వెస్నే, ఫిజియోక్రాట్, పారిస్, 1846లోని అనెలిసే దు లాబ్లె ఎకానిమికే, పుట 71) వర్తకులు, తమ మధ్య పోటీ వల్ల “తగిన ప్రతిఫలంతో, లేదా సంపాదనతో తృప్తి చెందక తప్పదు”. ఈ పోటీ నుంచి ఉత్పన్నమైన “లాభం.... ఖచ్చితంగా చెప్పాలంటే, మొట్టమొదటి అమ్మకందారుకు, కొనుగోలుదారైన వినియోగదారుకు నష్ట నివారణ (ప్రైవేషన్ డి పర్టే) తప్ప మరొకటి కాదు; మరి, వర్తకపు ఖర్చుల్లో నష్ట నివారణ నిజమైన ఉత్పాదితమూ కాదు, లేదా వర్తకాన్ని, రవాణా ఖర్చులతో కూడినదైనా, అవి లేనిదైనా, కేవలం ఒక మార్పిడిగా పరిగణించినట్లయితే, ఆ నష్ట నివారణ వర్తకుల ద్వారా చేకూరిన సంపదా కాదు.” (పుటలు 145, 146) ఉత్పాదితాలను అమ్ముకొని, వాటికి సంపూర్ణ ధరలను రాబట్టుకొనే అమ్మకందారులే ఎల్లప్పుడూ వర్తకపు ఖర్చులను భరిస్తారు - మధ్యంతర ఖర్చులు లేకపోతే, (పుట 163) సొంతదారులు, ఉత్పత్తిదారులు “శాలరియంట్స్” (వేతనాలను చెల్లించేవారు); వర్తకులు “శాలరియేస్” (వేతన గ్రహీతలు) (పుట 164, క్వెస్నే, డైలాగ్ సర్ లే కామర్స్ ఎట్ సర్ లే త్రవే ది ఆర్టిసాన్స్. డైరీలో, ఫిజియోక్రాట్స్ 1వ భాగం, పారిస్, 1846).

ముట్టవచ్చు. కానీ పది గంటలు పని చేస్తాడు. అయితే అతను చేసే రెండు గంటల అదనపు శ్రమ, అతని ఎనిమిది గంటల అవసర శ్రమలాగానే విలువను సృష్టించదు. ఈ అవసర శ్రమ వల్ల సామాజిక ఉత్పాదితంలో ఒక భాగం అతనికి బదలాయించడం జరిగినా, మొదటి విషయం, దీన్ని సమాజ దృక్కోణం నుంచి చూస్తే, శ్రమశక్తి మునుపటిలాగానే పది గంటలపాటు, కేవలం చలామణి క్రియలో వ్యయమవుతుంది. దాన్ని మరి దేనికీ, ఉత్పాదక శ్రమకు అసలే వినియోగించ వీలులేదు. కానీ రెండవ విషయమేమిటంటే, ఆ వ్యక్తి రెండు గంటలు అదనపు శ్రమ చేసినా, సమాజం అందుకతనికి ఏమీ చెల్లించదు. దానివల్ల ఏ విధమైన అదనపు ఉత్పాదితం లేదా విలువ సమాజానికి లభించదు. కానీ అతడు దేనికి ప్రతీకో ఆ చలామణి ఖర్చులు అయిదో వంతు, పది గంటల నుంచి ఎనిమిది గంటలకు తగ్గుతాయి. అతడు ప్రతినిధిగా వున్న ఈ చలామణి క్రియాశీల కాలంలోని అయిదో వంతుకు సమతుల్యమైన దేన్నీ సమాజం చెల్లించదు. కానీ ఈ వ్యక్తిని ఒక పెట్టుబడిదారు పనిలో పెట్టుకొంటే, ఈ రెండు గంటలకు డబ్బు చెల్లించనందువల్ల, అతని పెట్టుబడి తాలూకు చలామణి ఖర్చులు తగ్గుతాయి. చలామణి ఖర్చులు పెట్టుబడిదారు ఆదాయంలో కోత కాబట్టి, ఈ తగ్గుదల అతనికి సానుకూలమైన లబ్ధి; ఎందుకంటే, అతని పెట్టుబడి విలువ స్వయం విస్తరణకు గల ప్రతికూల పరిమితి తద్వారా తగ్గుతుంది. సరుకుల సన్నకారు స్వతంత్ర ఉత్పాదకులు తమ కాలంలో కొంత భాగం క్రయ విక్రయాల్లో గడిపిన మేరకు అది వారి ఉత్పాదక విధుల మధ్య గడిచిన కాలం తప్ప మరొకటి కాదు. అటే, వారి ఉత్పాదన కాలంలో కోత.

ఎట్టి పరిస్థితుల్లోనైనా, ఇందుకోసం వెచ్చించిన కాలం చలామణి ఖర్చుల్లో ఒకటి. ఇది రూపాంతరం చెందిన విలువలను ఏ మాత్రమూ పెంచదు; అది వాటిని సరుకు రూపం నుంచి డబ్బు రూపానికి మార్చేందుకు అయిన ఖర్చు. చలామణి ప్రతినిధిగా వ్యవహరించే సరుకుల పెట్టుబడిదారీ ఉత్పాదకునికీ, సరుకుల ప్రత్యక్ష ఉత్పాదకునికీ మధ్య తేడా ఒకటే – పెట్టుబడిదారీ ఉత్పాదకుడు మరింత పెద్ద ఎత్తున కొనడం, అమ్మడం సాగిస్తాడు; కాబట్టి చలామణి ప్రతినిధిగా అతని విధి మరింత భారీస్థాయిలో వుంటుంది. తన వ్యాపార పరిమాణం వల్ల అతడు వేతన శ్రామికులుగా పని చేసేందుకై తన సొంత చలామణి ప్రతినిధులను తప్పనిసరిగా కొనవలసివస్తేనో, లేదా కొనగలిగితేనో (కిరాయికి పెట్టుకోవలసి వస్తేనో, లేదా పెట్టుకోగలిగితేనో), అందువల్ల పరిస్థితి స్వభావం మారదు. చలామణి క్రమంలో (అది కేవలం రూప పరివర్తనగా వున్న మేరకు) ఒక నిర్దిష్ట పరిమాణం గల శ్రమశక్తీ, శ్రమ కాలమూ వ్యయమై తీరాలి. కానీ ఇప్పుడిది అదనపు పెట్టుబడి మదుపుగా అగుపిస్తుంది. కేవలం చలామణి రంగంలోనే పని చేసే ఈ శ్రమశక్తి కొనుగోలుకై అస్థిర పెట్టుబడిలో ఒక భాగాన్ని మదుపు పెట్టాలి. ఈ పెట్టుబడి మదుపు ఎటువంటి సరుకును గాని, విలువను గానీ సృష్టించదు. మదుపు పెట్టిన పెట్టుబడి ఉత్పాదకంగా పనిచేసే స్థాయిని ఆ మేరకు తగ్గిస్తుంది. ఉత్పాదితంలోని ఒక భాగం మిగతా భాగాన్ని అమ్ముకొనే యంత్రంగా మారిందా అని అనిపిస్తుంది. ఈ యంత్రం ఉత్పాదితం తగ్గేలా చేస్తుంది. ఇది చలామణికై వ్యయమయ్యే శ్రమశక్తి వగైరాలను తగ్గించగలిగినా, ఉత్పాదన ప్రక్రియలో పాల్గొనదు. ఇది కేవలం చలామణి ఖర్చుల్లో భాగమవుతుందంతే.

## 2. జమా ఖర్చులు (Book-Keeping)

యథార్థమైన కొనుగోలు, అమ్మకమే కాక, జమాఖర్చుల లెక్కాచారానికి కూడా శ్రమ కాలం వ్యయమవుతుంది. ఈ లెక్కాచారం, శ్రమకాలాన్నే కాక, కలాలు, ఇంకు, కాగితం, డెస్కులు, ఆఫీసు సరంజామా వంటి వస్తురూపం ధరించిన శ్రమను కూడా వినియోగించుకొంటుంది. కాబట్టి ఈ విధి ఒకవైపు శ్రమశక్తినీ, మరోవైపు శ్రమ పరికరాలను వ్యయం చేస్తుంది. కొనుగోలు, అమ్మకపు కాల సందర్భంలో వున్న పరిస్థితులే ఇక్కడా వున్నాయి.

తన ఆవృత్తుల్లో ఏకతగా, ఉత్పత్తి రంగంలో గానీ లేక చలామణికి చెందిన ఉభయ రంగాల్లోగానీ గమనశీలమైన విలువగా పెట్టుబడి భావాత్మకంగా వుండేది, చిట్టాలోని డబ్బు రూపంలోనే. ప్రధానంగా సరుకుల ఉత్పాదకుని, సరుకుల పెట్టుబడిదారీ ఉత్పాదకుని బుర్రలోనే. జమాఖర్చు లెక్కలు ఈ గమనాన్ని నిర్ధారించి నియంత్రిస్తాయి. ఇందులో ధరల నిర్ధారణ లేక సరుకుల ధరల మదింపు చేరి వుంది. ఉత్పత్తి గమనం, ప్రత్యేకించి అదనపు విలువ గమనం ఊహాపథంలో ఇలా సాంకేతికంగా ప్రతిబింబితమవుతుంది. (సరుకులు, ఈ గమనంలో కేవలం విలువ వాహికలుగా మాత్రమే, వస్తువుల పేరుగా మాత్రమే వుంటాయి. విలువలుగా, ఈ వస్తువుల భావనాత్మక అస్తిత్వం చిట్టా డబ్బులో ప్రస్ఫుటమవుతుంది) సరుకుల వ్యష్టి ఉత్పత్తిదారు ఈ లెక్కాచారం తన బుర్రలో మాత్రమే వుంచుకొన్న వాళ్ళు (దీనికి రైతు ఉదాహరణ. పెట్టుబడిదారీ వ్యవసాయం ఆవిర్భవించే వరకు, జమాఖర్చు లెక్కలు వుంచే వ్యవసాయదారు రంగం పైకి రాలేదు) లేదా అతడు తన ఖర్చులు, జమలు, చెల్లింపుల తేదీలు మొదలైన వాటిని చిట్టా కెక్కించడం, పనిలో పనిగా పెట్టుకొన్నన్నాళ్ళూ, అంటే తన ఉత్పాదనేతర కాలంలో ఈ పని చేసినన్నాళ్ళు, ఈ పనీ, దీనికి వినియోగించిన కాగితం మొదలైన శ్రమ పరికరాలు – ఇవి అదనంగా వినియోగమైన శ్రమ కాలం, శ్రమ పరికరాలనేది స్పష్టమే. ఇవి అవశ్యమే కానీ, ఉత్పాదకంగా వినియోగించడానికి వున్న కాలాన్నీ, యథార్థ ఉత్పత్తి ప్రక్రియలో పాత్ర వహించి, ఉత్పాదితాల, విలువల సృష్టిలో ప్రవేశించే శ్రమ పరికరాలను ఆ మేరకు కోతపెడతాయి.[1] సరుకుల పెట్టుబడిదారీ ఉత్పాదకుని చేతుల్లో ఈ పని కేంద్రీకృతమైనందువల్ల, పలువురు సన్నకారు సరుకు ఉత్పత్తిదారు పనిగా వుండటానికి బదులు, ఒకే పెట్టుబడిదారుని పనిగా, భారీ ఉత్పత్తి క్రమంలోని పనిగా వుండటం వల్ల దీని స్వభావం మారదు. ఉత్పాదక విధులకు అనుబంధంగా ఏర్పడిన ఈ పని

---

1. మధ్యయుగాల్లో, వ్యవసాయానికి జమాఖర్చుల లెక్కలు వుంచడం క్రైస్తవ మతాల్లో మాత్రమే మనకు కనిపిస్తుంది. కానీ ఆదిమ భారతీయ సమాజాల కాలంలోనే వ్యవసాయానికై జమాఖర్చు లెక్కలు రాసే వ్యక్తి నియమింపబడినట్లు మనం ఇదివరకే తెలుసుకొన్నాం. అక్కడ జమాఖర్చు లెక్కలు తయారు చేసే పనిని సమాజపు ఉమ్మడి అధికారి యొక్క స్వతంత్ర, ఏకైక విధిగా చేశారు. ఈ శ్రమ విభజనవల్ల కాలం, శ్రమ, ఖర్చులు ఆదా అవుతాయి. కానీ ఒక ఓడలోని సరుకులు, వాటిని ఓడకెత్తిన ఖర్చుల బిల్లు ఎంత భిన్నమైనవో, ఉత్పత్తి రంగంలో ఉత్పత్తి, జమాఖర్చుల లెక్కల తయారీ అంత భిన్నమైనవి. లెక్కలు రాసే వ్యక్తి, సమాజ శ్రమశక్తిలో, ఉత్పత్తి నుంచి ఉపసంహరింపబడ్డ భాగానికి మూర్తీభావం. అతని పనికయ్యే వ్యయం సామాజిక ఉత్పాదితం నుంచి పట్టుకోవడం వల్ల భర్తీ అవుతుందే తప్ప, అతని శ్రమ వల్ల కాదు. భారతీయ సమాజంలోని గణకునికి వర్తించేదే కొద్ది మార్పులతో, పెట్టుబడిదారుని గణకునికీ వర్తిస్తుంది. (రాతప్రతి II నుంచి)

ఆ విధుల నుంచి వేరుపడినందువల్ల గానీ, దీనికోసం మాత్రమే నియమితులైన ప్రత్యేక వ్యక్తుల స్వతంత్ర విధిగా మారినందువల్ల గానీ ఈ పని స్వభావం మారదు.

ఒక పని స్వభావితః ఉత్పాదితాలను, విలువలను సృష్టించలేకపోతే, అది స్వతంత్ర ప్రతిపత్తిని సంతరించుకోవడానికి మునుపు అలా చేయలేకపోతే, శ్రమ విభజన మూలంగా, అది స్వతంత్ర ప్రతిపత్తిని సంతరించుకొన్నందువల్ల వాటిని సృష్టించలేదు. ఒక పెట్టుబడిదారు తన పెట్టుబడిని కొత్తగా మదుపు పెడితే, అతను దానిలో కొంతభాగాన్ని గణకునికీ, జమాఖర్చుల లెక్కల తయారీకై కావలసిన వాటికీ మదుపు పెట్టవలసి వుంటుంది. అతని పెట్టుబడి అదివరకే పనిచేస్తుంటే, తన నిరంతర పునరుత్పత్తి క్రమంలో అది నియుక్తమై వుంటే, అతడు తన ఉత్పాదనలో కొంత భాగాన్ని గణకుడు, గుమాస్తాలు, వగైరాలుగా ఎడతెగకుండా మళ్ళీ మారుస్తుండాలి. అందుకై అతడు ఆ భాగాన్ని డబ్బుగా మార్చాలి. అతని పెట్టుబడిలోని ఆ భాగం ఉత్పత్తి ప్రక్రియ నుంచి ఉపసంహరింపబడుతుంది. అది చలామణి ఖర్చుల కిందికి వస్తుంది. మొత్తం ప్రతిఫలం నుంచి (కేవలం ఈ ప్రక్రియకై వ్యయమైన శ్రమశక్తి కూడా ఇందులోనిదే) తీసివేసుకొన్నది.

కానీ, జమాఖర్చుల లెక్కల తయారీ సందర్భంగా లేక అనుత్పాదక శ్రమ కాల సందర్భంగా అయ్యే ఖర్చులకు, కేవలం కొనుగోలు, అమ్మకం కాలానికి సంబంధించిన ఖర్చులకు మధ్య ఒకానొక భేదముంది. కొనుగోలు, అమ్మకం కాలపు ఖర్చులు ఉత్పత్తి ప్రక్రియ యొక్క నిర్దిష్ట సామాజిక రూపం నుంచి మాత్రమే, అంటే ఆ ఉత్పత్తి ప్రక్రియ సరుకుల ఉత్పత్తి ప్రక్రియగా వుందన్న వాస్తవం నుంచి మాత్రమే ఉత్పన్నమైనవి. జమాఖర్చు లెక్కల తయారీ, ఉత్పత్తి ప్రక్రియలపై అజమాయిషీగా, ఆ ప్రక్రియలోని వివిధ విభాగాల భావనాత్మక సమ్మేళనగా వున్నందువల్ల, ఆ ప్రక్రియ సామాజిక స్థాయి సంతరించుకొని, తన అచ్చమైన వైయక్తిక లక్షణాన్ని కోల్పోయిన కొద్దీ, ఈ లెక్కల తయారీ మరింత అవసరమవుతుంది. కాబట్టి, చేతివృత్తుల, రైతాంగ ఆర్థిక వ్యవస్థలోని చెల్లాచెదురుగా జరిగే ఉత్పత్తిలోకన్నా పెట్టుబడిదారీ ఉత్పత్తిలో జమాఖర్చుల లెక్కల తయారీ మరింత అవసరం. పెట్టుబడిదారీ ఉత్పత్తిలోకన్నా సమష్టి ఉత్పత్తిలో మరింత అవసరం. అయితే, ఉత్పత్తి కేంద్రీకృతమైన కొద్దీ, జమాఖర్చుల లెక్కల తయారీ సామాజిక క్రమమైన కొద్దీ, ఆ లెక్కల తయారీ ఖర్చులు తగ్గుతూపోతాయి.

కేవలం రూపాంతరీకరణల నుంచి ఉత్పన్నమయ్యే చలామణి ఖర్చుల సార్వత్రిక స్వభావం మాత్రమే ఇక్కడ మన చర్చనీయాంశం. వాటి అన్ని రూపాలను గురించి ఇక్కడ సవివరంగా చర్చించడం అనవసరం. కానీ కేవలం విలువ రూపాంతరీకరణ రంగానికి చెందిన రూపాలు, అలా, ఉత్పత్తి ప్రక్రియ తాలూకు ప్రత్యేక సామాజిక రూపం నుంచి ఉత్పన్నమైన ఈ రూపాలు, సరుకు వ్యష్టి ఉత్పత్తిదారు విషయంలో క్షణికమై, అంతగా దృష్టికే రాకుండా, అతని ఉత్పాదక విధులతో పాటు సంభవిస్తూ, వాటితో పెనవేసుకొన్న ఈ రూపాలు బ్రహ్మాండమైన చలామణి ఖర్చులుగా ఎలా కొట్టొచ్చినట్లు కనిపిస్తాయో ఒకటి స్పష్టం చేస్తుంది. అదేమిటంటే, లావాదేవీలు స్వతంత్ర ప్రతిపత్తినొంది, బ్యాంకుల, వ్యష్టి వ్యాపారాల్లోని షరాబుల ఏకైక విధిగా భారీ స్థాయిలో కేంద్రీకృతమైనప్పుడు ఇచ్చి పుచ్చుకొనే డబ్బు. కానీ, ఈ చలామణి ఖర్చుల రూపంలో వచ్చిన మార్పు వల్ల, వాటి స్వభావం మారదని, గట్టిగా జ్ఞాపకం వుంచుకోవాలి.

## 3. డబ్బు

ఒక ఉత్పాదితం సరుకుగా తయారైనా, కాకపోయినా, అది ఎల్లప్పుడూ సంపదకు ఒక భౌతిక రూపం; వ్యక్తిగతమైన లేదా ఉత్పాదకమైన వినియోగానికి ఉద్దేశించిన ఒక ఉపయోగపు విలువ. సరుకుగా దాని విలువకు, దాని ధర భావాత్మక వ్యక్తీకరణ. ఇది దాని యథార్థమైన ఉపయోగపు రూపాన్ని ఎంతమాత్రమూ మార్చదు. బంగారం, వెండి లాంటి కొన్ని సరుకులు డబ్బుగా పని చేస్తున్నాయి. డబ్బుగా అవి కేవలం చలామణి క్రమంలోనే నెలకొని వున్నాయి (దాచిన నిక్షేపాలు, రిజర్వు నిధులు మొదలైన వాటి రూపంలో అవి గుప్తంగానే అయినా చలామణి రంగంలో వుంటాయి.) కానీ ఈ వాస్తవం ఉత్పత్తి ప్రక్రియ యొక్క ప్రత్యేక సామాజిక రూప ఫలితం, సరుకుల ఉత్పత్తి ప్రక్రియ ఫలితం.

పెట్టుబడిదారీ ఉత్పత్తిలో, ఉత్పాదితాలు సరుకుల సార్వత్రిక రూపాన్ని సంతరించుకొంటాయి. ఉత్పాదితాల్లో అత్యధిక భాగం సరుకులుగానే తయారవుతాయి. కాబట్టి అవి డబ్బు రూపం ధరించవలసి వుంటుంది. పైగా సరుకుల అపారమైన పరిమాణం, అంటే సమాజ సంపదలో సరుకులుగా పని చేస్తున్న భాగం నిరంతరాయంగా పెరుగుతుంటుంది. ఈ అన్ని కారణాలవల్ల, చలామణి సాధనాలుగా, చెల్లింపు మాధ్యమంగా, రిజర్వు నిధి వగైరాగా పని చేస్తున్న బంగారం, వెండి పరిమాణం, అదే విధంగా పెరుగుతుంటుంది. డబ్బు విధి నిర్వర్తిస్తున్న ఈ సరుకులు వ్యక్తిగత వినియోగంలోగానీ, ఉత్పాదక వినియోగంలోగానీ ప్రవేశించవు. కేవలం చలామణి యంత్రంగా ఉపకరించే రూపంలో స్థిరపడిన సామాజిక శ్రమకు అవి ప్రతీకలు. సామాజిక సంపదలో ఒక భాగం ఈ అనుత్పాదక రూపం ధరించే దుస్థితికి గురికావడమే కాక, ఈ డబ్బు అరిగిపోతూండటం వల్ల, అరిగిపోయిన వాటి స్థానాన్ని ఎప్పటికప్పుడు భర్తీ చేయవలసి వుంటుంది. అంటే, ఉత్పాదితాల రూపంలోని సామాజిక శ్రమను బంగారం, వెండి రూపంలోకి మరింత మార్చవలసి వుంటుందన్న మాట. ఇలా భర్తీ చేయడానికి అయ్యే ఖర్చులు, పెట్టుబడిదారీ పంథాలో అభివృద్ధి చెందిన దేశాల్లో గణనీయంగా వుంటాయి. ఎందువల్లనంటే సంపదలో చాలా భాగం డబ్బు రూపంలో ఇరుక్కుపోతుంది. బంగారం, వెండి, డబ్బు – సరుకులుగా వుండటమంటే, సమాజానికి అయ్యే చలామణి ఖర్చులన్నమాట. ఉత్పత్తి సామాజిక రూపమొక్కటే వీటికి మూలం. అవి మొత్తంపై సరుకు ఉత్పత్తికి సంబంధించిన అనుత్పాదక కార్యకలాపాల ఖర్చులు. అవి ఈ ఉత్పత్తి అభివృద్ధితో పాటు, ప్రత్యేకించి పెట్టుబడిదారీ ఉత్పత్తి అభివృద్ధితో పాటు పెరుగుతాయి. అవి, చలామణి ప్రక్రియకోసం బలిపెట్టక తప్పని సామాజిక సంపద భాగం.[1]

---

1. ఒక దేశంలో చలామణిలో వున్న డబ్బు ఆ దేశంలోని పెట్టుబడిలో ఒక నిర్దిష్ట భాగం - మిగతా భాగం ఉత్పాదకతకు దోహదం చేయడానికి లేదా దాన్ని పెంచడానికి, ఉత్పాదక రంగం నుండి పూర్తిగా ఉపసంహరింపబడిన భాగం. కాబట్టి, ఒక యంత్రాన్ని తయారు చేయడం, ఇతర ఏ ఉత్పత్తినైనా సులభతరంగా చేయడానికి అవసరమైనట్లుగానే, బంగారాన్ని చలామణి మాధ్యమంగా చేయడానికి సంపదలో ఒక నిర్దిష్ట భాగం అవసరం (ఎకనమిస్ట్, సం.V , పుట. 520)

# II. సరుకులను నిల్వ చేసేందుకయ్యే ఖర్చులు

కేవలం విలువ రూపంలో మార్పు మూలంగా, అంటే అచ్చమైన చలామణి మూలంగా ఉత్పన్నమయ్యే చలామణి ఖర్చులు సరుకుల విలువలో ప్రవేశించవు. పెట్టుబడిలో అటువంటి ఖర్చుల కోసం వ్యయమయ్యే భాగాలు, పెట్టుబడిదారుకు సంబంధించినంత వరకు, ఉత్పాదకంగా వ్యయమైన పెట్టుబడి నుంచి కేవలం కోసివేతలే. ఇప్పుడు మనం పరిశీలించబోయే చలామణి ఖర్చులు స్వభావ రీత్యా వీటికి భిన్నమైనవి. అవి ఉత్పత్తి ప్రక్రియల నుంచే ఉత్పన్నం కావచ్చు. ఆ ప్రక్రియలు చలామణిలో కొనసాగుతాయంతే. కాబట్టే వాటి ఉత్పాదక స్వభావం చలామణి రూపం వల్ల కేవలం మరుగవుతోంది. అయితే, సమాజ దృక్కోణం నుంచి చూస్తే అవి దండుగ ఖర్చులు కావచ్చు. సజీవ శ్రమ, వస్తు రూపం దాల్చిన శ్రమల అనుత్పాదక వ్యయం కావచ్చు. కానీ ఆ కారణం వల్లనే అవి వ్యష్టి పెట్టుబడిదారునికి విలువ ఉత్పాదకాలు కావచ్చు. అతని సరుకుల అమ్మకం ధరకు చేరేవి కావచ్చు. ఈ ఖర్చులు వేరు వేరు ఉత్పాదక రంగాల్లో వేరు వేరుగా, ఒకే ఉత్పాదక రంగంలోనే వేరు వేరు వ్యష్టి పెట్టుబడిదారులకు సైతం వేరు వేరుగా వుండటమే ఇందుకు రుజువు. సరుకుల ధరలకు ఈ ఖర్చులను చేర్చడం ద్వారా అవి, ప్రతి వ్యష్టి పెట్టుబడిదారు భరించే ఖర్చుల మోతాదును బట్టి పంపిణీ అవుతాయి. కానీ విలువను పెంచే సమస్త శ్రమ అదనపు విలువను కూడా పెంచగలదు. పెట్టుబడిదారీ ఉత్పత్తిలో, ఇది తప్పనిసరిగా అదనపు విలువను పెంచుతుంది. ఎందువల్లనంటే, శ్రమ సృష్టించే విలువ, ఈ శ్రమ పరిమాణంపై ఆధారపడగా, శ్రమ సృష్టించే అదనపు విలువేమో, పెట్టుబడిదారు ఆ శ్రమకు ఏమేరకు చెల్లించాడనే దానిపై ఆధారపడుతుంది. అందువల్ల, ఒక సరుకు ఉపయోగపు విలువకు ఏమీ చేర్చకుండానే ఆ సరుకు ధరను పెంచే ఖర్చులు, తత్కారణంగా సమాజానికి సంబంధించినంతవరకు అనుత్పాదక వ్యయం కిందికి వచ్చే ఖర్చులు, వ్యష్టి పెట్టుబడిదారుకు ధనార్జనకు మూలం కావచ్చు. అయితే, సరుకు ధరకు చేరిన ఈ మొత్తం చలామణి ఖర్చులను సమానంగా కేవలం పంపిణీ చేస్తున్నంత మాత్రాన అవి అనుత్పాదకమైనవి కాకపోవు. ఉదాహరణకు బీమా కంపెనీలు వ్యష్టి పెట్టుబడిదారుల నష్టాలను పెట్టుబడిదారీ వర్గం మధ్య పంపిణీ చేస్తుంది. కానీ ఈ నష్టాలు ఇలా సమానంగా పంపిణీ అయినంత మాత్రాన మొత్తం సామాజిక పెట్టుబడికి సంబంధించినంత వరకు, ఇవి నష్టాలు కాకపోవు.

## 1. సాధారణంగా సరఫరా రూపొందే క్రమం

ఉత్పాదితం సరుకు – పెట్టుబడిగా వున్న కాలంలో లేక అది మార్కెట్‌లో వున్న కాలంలో, వేరు మాటల్లో చెప్పాలంటే, దాన్ని ఆవిర్భవింపచేసే ఉత్పత్తి ప్రక్రియకు, అది ప్రవేశించే వినియోగ క్రియకు మధ్య కాలంలో, ఉత్పాదితం సరుకు సరఫరాగా వుంటుంది. సరుకు – పెట్టుబడి మార్కెట్‌లో ఒక సరుకుగా, కాబట్టి సరఫరా రూపంలో ప్రతి ఆవృత్తిలోనూ రెండు పాత్రలు నిర్వహిస్తుంది. దేని ఆవృత్తి పరిశీలనలో వుందో ఆ పెట్టుబడి యొక్క సరుకు – ఉత్పాదితం పాత్రను ఒకసారి నిర్వహిస్తుంది. కొనుగోలై, ఉత్పాదక పెట్టుబడిగా మార్పు చెందేందుకు మార్కెట్‌లో సిద్ధంగా వుండవలసిన మరో పెట్టుబడి యొక్క సరుకు – ఉత్పాదితం పాత్రను మరొకసారి నిర్వహిస్తుంది. చివర పేర్కొన్న సరుకు – పెట్టుబడి ఆర్డర్ వచ్చే వరకు అంతరాయం ఏర్పడుతుంది. కానీ ఉత్పత్తి, పునరుత్పత్తి ప్రక్రియ

సాగిపోతుండాలంటే, ఒక నిర్దిష్ట ప్రమాణం గల సరుకులు (ఉత్పత్తి సాధనాలు) ఎల్లప్పుడూ మార్కెట్‌లో వుండాలి; కాబట్టి సరఫరాగా రూపొంది వుండాలి. ఉత్పాదక పెట్టుబడిలో అదే విధంగా శ్రమశక్తి కొనుగోలు చేరి వుంది. ఇక్కడ డబ్బు రూపం, జీవితావసరాల విలువ రూపం తప్ప వేరు కాదు. వీటిలో ఎక్కువ భాగం కార్మికునికి మార్కెట్‌లో లభ్యం కావాలి. దీన్ని గురించి వివరంగా ఈ పేరాలోనే ముున్ముందు చర్చిస్తాము. ప్రస్తుతం కింది విషయం ఇప్పటికే స్పష్టం. గమన క్రమంలోని పెట్టుబడి – విలువకు సంబంధించినంత వరకు అది అప్పటికే సరుకుగా మారింది. ఇది ఇక అమ్మకం కావలసి వుంది; అంటే తిరిగి డబ్బుగా మారవలసి వుంది. కాబట్టి ఆ సమయంలో అది మార్కెట్‌లో సరుకు–పెట్టుబడిగా పని చేస్తుంది. ఆ పెట్టుబడి – విలువ అలా సరఫరాగా వున్న స్థితిని, అది మార్కెట్‌లో అనవసరంగా, అసంకల్పితంగా వున్నట్టుగా చెప్పాలి. దాని అమ్మకం ఎంత త్వరగా జరిగితే పునరుత్పత్తి ప్రక్రియ అంత సాఫీగా సాగుతుంది. రూప పరివర్తన స'–డ'లో విలంబన, పెట్టుబడి ఆవృత్తిలో జరగవలసిన నిజమైన వస్తు మార్పిడికీ, ఉత్పాదక పెట్టుబడిగా దాని తదుపరి విధి నిర్వహణకు ఆటంకం కలిగిస్తుంది. కానీ, డ –సకు సంబంధించినంత వరకు, మార్కెట్‌లో సరుకులు ఎడతెగకుండా వుండటం, అంటే సరుకు – సరఫరా పునరుత్పత్తి ప్రక్రియ సాగిపోతూ వుండేందుకు, కొత్త లేదా అదనపు మదుపునకు తప్పనిసరిగా అని గోచరమవుతుంది.

సరుకు–పెట్టుబడి మార్కెట్‌లో సరుకు – సరఫరాగా స్థిరంగా వుండాలంటే, భవనాలు, కొట్లు, సరుకులు నిల్వ చేసే స్థలాలు, గోదాములు అవసరం; వేరు మాటల్లో చెప్పాలంటే స్థిర పెట్టుబడి వ్యయం అవసరం; ఇంతకంటే సరుకులను గోదాముల్లో ఉంచేందుకై శ్రమశక్తికి డబ్బు చెల్లించడం కూడా అవసరం. మరొకటేమిటంటే సరుకులు చెడిపోవడం కద్దు. అవి ప్రకృతి శక్తుల హానికర ప్రభావానికి గురి అవుతాయి. సరుకులను వీటినుంచి కాపాడటానికి అదనపు పెట్టుబడిని శ్రమ పరికరాల్లో, అంటే వస్తురూపంలో కొంత, శ్రమశక్తికై కొంత మదుపు పెట్టవలసి వుంటుంది.[1]

కాబట్టి పెట్టుబడి తన సరుకు – పెట్టుబడి రూపంలో వుండటం వల్ల, తత్కారణంగా సరుకు – సరఫరాగా వుండటం వల్ల, ఖర్చులు తగులుతాయి; వాటిని చలామణి ఖర్చులుగా వర్గీకరించాలి. ఎందుకంటే, అవి ఉత్పత్తి రంగంలోనివి కాదు. ఈ చలామణి ఖర్చులు Iవ ఉపశీర్షిక కింద పేర్కొన్న వాటికి భిన్నమైనవి. దానికి కారణమిది: అవి సరుకుల ధరల్లో కొంతమేరకు చేరుతాయి; అంటే సరుకుల ధరలను పెంచుతాయి. అన్ని పరిస్థితుల్లోనూ, సరుకు – సరఫరాను భద్రపరిచి, గోదాముల్లో నిల్వ చేయడానికి అవసరమైన పెట్టుబడీ, శ్రమశక్తీ ప్రత్యక్ష ఉత్పాదన ప్రక్రియ నుంచి ఉపసంహరించ బడతాయి. మరోవైపు పెట్టుబడిలో భాగమైన శ్రమశక్తితో సహా ఆ విధంగా నియుక్తమైన పెట్టుబడుల

---

1. గోధుమను గోదాములో 9 నెలలపాటు నిల్వ చేయడానికి అయ్యే ఖర్చులను కోర్బెట్ 1841లో ఇలా లెక్కగట్టారు. పరిమాణంలో తరుగువల్ల వచ్చే నష్టం దాని ఖరీదులో 1/2 శాతం వుంటుంది; వడ్డీ 3 శాతం, గోదాముకు అద్దె 2 శాతం, జల్లించడానికి, ఆరబెట్టడానికి 1 శాతం, ధాన్యం అందజేతకు 1/2 శాతం, మొత్తం 7 శాతం లేదా 50 షిల్లింగులు ఖరీదు చేసే క్వార్టర్ గోధుమను నిల్వ చేయడానికి అయ్యే వ్యయం 3 షి. 6 పె.లు. (టి.హెచ్. కోర్బెట్, వ్యక్తుల సంపద మూలాలు, రూపాలు మొదలైన వాటి పరిశీలన, లండన్ 1841) రైల్వే కమిషన్ ముందు లివర్‌పూల్ వర్తకుల వాంగ్మూలం ప్రకారం, 1865లో ధాన్యం గోదాముల్లో నిల్వ చేయడానికి అయిన వ్యయం క్వార్టర్ ధాన్యానికి నెలకు 2 పె.లు లేదా టన్నుకు 9 - 10 పెన్నీలు (రైల్వేలపై రాయల్ కమిషన్, 1867. సాక్ష్యం, పుట. 19, నెం. 331)

స్థానాన్ని సామాజిక ఉత్పాదితంతో భర్తీ చేయవలసి వుంటుంది. కాబట్టి ఈ వ్యయం, శ్రమ ఉత్పాదక శక్తిని, ఆ మేరకు తగ్గించడం వంటిదే. ఫలితంగా నిర్దిష్టమైన ఒక ఉపయోగకర ఫలితం లభించేందుకు మరింత ఎక్కువ పరిమాణంలో పెట్టుబడీ, శ్రమ అవసరమవుతాయి. అవి అనుత్పాదకమైన ఖర్చులు.

ఒక సరుకు – సరఫరా రూపొందటం వల్ల తప్పనిసరియైన చలామణి ఖర్చులకు మూలకారణం, అప్పుడు సరుకుల రూపంలో వున్న విలువలను డబ్బు రూపంలోకి మార్చేందుకు పట్టే కాలమే తప్ప మరొకటి కాదు. కాబట్టి, ఉత్పాదక ప్రక్రియ తాలూకు నిర్దిష్ట సామాజిక రూపమే (అంటే, ఉత్పాదితాన్ని సరుకుగా రంగంపైకి తెస్తున్నారు. కాబట్టి దాన్ని డబ్బుగా మార్చుకోవలసి వుంటుందన్న వాస్తవమే) తప్ప మరొకటి కాదు. అందువల్ల ఈ ఖర్చుల స్వభావమూ Iవ ఉపశీర్షిక కింద వివరించిన చలామణి ఖర్చుల స్వభావమూ అచ్చంగా ఒకటే. అయితే, ఇక్కడ సరుకుల విలువను భద్రపరచడం లేక పెంచడం జరుగుతోంది. దానికి ఒకే ఒక కారణముంది – అది ఉపయోగపు విలువను, అంటే అసలు ఉత్పాదితాన్ని, పెట్టుబడిని వ్యయం చేయవలసిన నిర్దిష్ట భౌతిక పరిస్థితుల్లో వుంచడం, ఉపయోగపు విలువలను అదనపు శ్రమ ప్రభావానికి లోనుచేసే చర్యలకు ఉత్పాదితాన్ని గురిచేయడం. కానీ, సరుకుల విలువల గురించిన లెక్కాచారం – ఈ క్రమానికి సంబంధించిన జమాఖర్చుల లెక్కల తయారీ, కొనుగోలు, అమ్మకపు లావాదేవీలు ఈ సరుకు – విలువను తనలో పొందుపరచుకొన్న ఉపయోగపు విలువను ప్రభావితం చేయవు. అవి సరుకు – విలువ తాలూకు రూపానికి మాత్రమే సంబంధించినవి. పైన పేర్కొన్న సందర్భంలో[1] సరఫరాను ఏర్పరచే ఖర్చులకు (ఈ ఏర్పాటు ఇక్కడ అసంకల్పితమైనది), రూప పరివర్తనలో విలంబన, రూప పరివర్తన ఆవశ్యకత మాత్రమే కారణభూత మైనప్పటికీ, ఈ ఖర్చులు Iవ ఉప శీర్షికలో పేర్కొన్న వాటికి భిన్నమైనవి. ఎందువల్లనంటే, సరఫరా ఖర్చుల ఉద్దేశం, ఆ సరుకులో ఒక ఉత్పాదితంగా, ఒక ఉపయోగంగా వున్న విలువను భద్రపరచడమే తప్ప ఆ విలువ రూపాన్ని మార్చడం కాదు. ఉత్పాదితాన్ని, ఉపయోగపు విలువను భద్రపరచడం ద్వారా తప్ప ఆ విలువను భద్రపరచే మరో మార్గం లేదు. ఈ సందర్భంలో ఉపయోగపు విలువ పెరగదు, అధికం కాదు. పైపెచ్చు అది తగ్గుతుంది. కానీ దాని తగ్గుదల అరికట్టబడుతుంది. దాన్ని భద్రపరచడం జరుగుతుంది. అడ్వాన్స్ చేసిన విలువ – సరుకులో పొందుపడి వున్న ఈ విలువ పెరగదు కూడా. అయితే, కొత్త శ్రమ – వస్తు రూపంలోనిదీ, సజీవమైనదీ – దీనికి చేరుతుంది.

మొత్తంపై సరుకు ఉత్పాదన ప్రత్యేక స్వభావం మూలంగానూ, తన సాధారణ, సంపూర్ణ రూపంలోని సరుకు ఉత్పత్తి మూలంగానూ, అంటే పెట్టుబడిదారీ సరుకు ఉత్పత్తి మూలంగానూ ఈ ఖర్చులు యే మేరకు తగులుతాయో, మరోవైపు, ఇవి సమస్త సామాజిక ఉత్పత్తికి యే మేరకు సర్వ సామాన్య లక్షణంగా వుంటూ, పెట్టుబడిదారీ ఉత్పత్తిలో కేవలం ఒక ప్రత్యేక రూపం ధరిస్తాయో, ఒక ప్రత్యేక ఆకృతిలో దర్శనమిస్తాయో, ఇప్పుడు పరిశోధించవలసి వుంది. సరఫరా రూపుగొనడం, పెట్టుబడిదారీ ఉత్పత్తికి విలక్షణమైన పరిణామమన్న అద్భుత భావం ఆడమ్ స్మిత్ ఏర్పరచుకొన్నారు.[2] ఇటీవల అర్థశాస్త్రజ్ఞులు, ఉదాహరణకు, లాలర్ నొక్కి చెబుతున్న అభిప్రాయం అందుకు విరుద్ధమైనది.

---

1. వెనుకటి పాదటిప్పణిలో ఉదహరించిన కోర్బెట్ అంచనాలు - సం.
2. సంపుటి II, ఉపోద్ఘాతం (ఎ.స్మిత్, ''దేశాల సంపద స్వభావమూ, కారణాలు, నాల్గు సంపుటాల్లో కొత్త కూర్పు,'' సం. II , 249 - 52, సం)

పెట్టుబడిదారీ ఉత్పత్తి అభివృద్ధి చెందడంతో, సరఫరా రూపొందడం తగ్గుముఖం పడుతుందని వారు బల్లగుద్ది చెబుతున్నారు.[1] ఈ పరిణామం పెట్టుబడిదారీ ఉత్పత్తిలోని లోపాల్లో ఒకటని కూడా సిస్మండి అభిప్రాయం.[2]

వాస్తవంలో, సరఫరాలు మూడు రూపాల్లో వుంటాయి : ఉత్పాదక పెట్టుబడి రూపంలో; వ్యక్తిగత వినియోగానికై ఒక నిధిరూపంలో, సరుకు – సరఫరా లేక సరుకు – పెట్టుబడి రూపంలో – సరఫరా పరిమాణం అన్ని రూపాల్లో ఒకేసారి నిరపేక్షంగా పెరిగినప్పటికీ, ఒక రూపంలోని సరఫరా పెరిగినప్పుడు, మరో రూపంలోని సరఫరా సాపేక్షంగా తగ్గుతుంది.

ప్రారంభంలోనే ఒక సంగతి స్పష్టమవుతుంది. ఉత్పత్తి నేరుగా ఉత్పత్తిదారుని అవసరాలను తీర్చడానికే జరుగుతూ, మార్పిడి లేదా అమ్మకం కోసం కొద్దిమేరకు మాత్రమే జరిగేచోటల్లా అంటే, సామాజిక ఉత్పాదితం బొత్తిగా సరుకుల రూపమే వహించనప్పుడు లేదా చాలా కొద్ది మోతాదులోనే ఆ రూపం ధరించినప్పుడు, సరుకుల రూపంలోని సరఫరా లేక సరుకు – సరఫరా, సంపదలో లెక్కలోకే రానంత కొద్ది భాగం వుంటుంది. కానీ ఈ సందర్భంలో వినియోగపు నిధి, ప్రత్యేకించి అసలైన జీవితావసరాల నిధి సాపేక్షంగా విస్తారమైనది. పాత కాలపు రైతాంగ ఆర్థిక వ్యవస్థను చూస్తే చాలు ఇది స్పష్టమవుతుంది. ఆ సందర్భంలో ఉత్పాదితంలో అత్యధిక భాగం దాని సొంతదారు చేతుల్లోనే వుంటుంది. కాబట్టి అది సరుకుల సరఫరాలుగా రూపొందకుండా, నేరుగా ఉత్పత్తి సాధనాలుగా లేదా జీవితావసరాలుగా మారిపోతుంది. అది సరుకు – సరఫరా రూపం ధరించదు. ఈ కారణం వల్ల, ఈ విధమైన ఉత్పత్తిపై ఆధారపడిన సమాజాల్లో సరఫరా వుండదని ఆడమ్ స్మిత్ చెబుతున్నారు. ఆయన సరఫరా రూపాన్నే సరఫరాగా భావించి గందరగోళంలో పడ్డారు. ఇదివరకూ, సమాజం బొటాబొటి జీవితం గడిపేదని లేక నేడు గడిస్తే చాలు, రేపెలాగో గడవకపోదనే నమ్మకంతో వుండేదనీ ఆయన అభిప్రాయం.[3] ఇది అమాయకమైన అపోహ.

---

1. జె. లాలర్, "డబ్బు, నీతి; నేటి కాలానికి అవసరమైన పుస్తకం", లండన్, 1852, పుటలు 43, 44 - సం.
2. జె.సి.యల్. సిస్మండీ డి.సిస్మండి, "ఎ టుడే సర్ లా ఎకనమీ పొలిటిక్," టోమ్, ఐ. బ్రుక్సెల్స్, 1837, పుట 49, వగైరా. సం.
3. ఉత్పాదితాన్ని సరుకుగా, వినియోగ నిధిని సరుకు సరఫరాగా మార్చిన మీదటే, మార్చినందువల్లనే సరఫరా సృష్టి అవుతుందని ఆడమ్ స్మిత్ పొరపడుతున్నారు. కాని, అలా జరగదు సరికదా, స్వీయావసరాలకై జరిగే ఉత్పత్తి సరుకు ఉత్పత్తిగా పరివర్తన చెందే దశలో, ఉత్పత్తిదారుల ఆర్థిక వ్యవస్థలో ఈ రూపాంతరీకరణ అతి తీవ్రమైన సంక్షోభాలను తెచ్చిపెడుతుంది. ఉదాహరణకు, భారతదేశంలో "పంటలు పుష్కలంగా పండిన సంవత్సరాల్లో ధాన్యానికి ధర పలకనందువల్ల దాన్ని పెద్ద ఎత్తున నిల్వ చేసే ధోరణి" ఇటీవల వరకు కనిపించింది. (-నివేదిక, బెంగాల్, ఒరిస్సాల్లో కరువు, కామన్స్ సభ, 1867, 1, పుటలు 230-31, సం.74). అమెరికా అంతర్యుద్ధం వల్ల, పత్తి, జనపనార మొదలైన వాటికి గిరాకీ హఠాత్తుగా పెరగడంతో, భారతదేశంలోని అనేక ప్రాంతాల్లో వరిసాగు బాగా తగ్గింది. బియ్యం ధర పెరిగింది. ఉత్పత్తిదారుల పాత బియ్యం సరఫరాలు అమ్మకమయ్యాయి. 1864-66 తరువాత ఆస్ట్రేలియా, మడగాస్కర్ వగైరా దేశాలకు మునుపెన్నడూ లేనంత బియ్యం ఎగుమతి దీనికి తోడైంది. 1866 నాటి క్షామం తీవ్రరూపం ధరించడానికి ఇదీ కారణం. ఇది ఒక్క ఒరిస్సా జిల్లాలోనే ఒక మిలియను ప్రాణాలను బలిగొంది. (పూర్వోదాహృత పత్రం, పుటలు, 174, 175, 213, 214, III): బీహార్‌లో కరువుకు సంబంధించిన పత్రాలు, పుటలు 32, 33; "పాత నిల్వలు ఖాళీ కావడం," ఈ కరువుకు కారణాల్లో ఒకటని ఈ పత్రాల్లో నొక్కి చెప్పారు. (రాత ప్రతి II నుంచి)

ఉత్పాదక పెట్టుబడి రూపంలోని ఒక సరఫరా, అప్పటికే ఉత్పత్తి ప్రక్రియలో నియుక్తమైన ఉత్పత్తి సాధనాలుగా వుంటుంది; లేక కనీసం ఉత్పత్తిదారుని చేతిలో వుండి, తత్కారణాన, ఉత్పత్తి ప్రక్రియలో అప్పటికే గుప్తంగా వున్న ఉత్పత్తి సాధనాలుగానో వుంటుంది. శ్రమ ఉత్పాదకత అభివృద్ధి చెందడంతో, అందువల్ల పెట్టుబడిదారీ ఉత్పత్తి పద్ధతి అభివృద్ధి చెందడం వల్ల కూడా (ఇది మునుపటి ఉత్పత్తి పద్ధతులన్నిటికన్నా శ్రమ యొక్క సామాజిక ఉత్పాదనా శక్తిని పెంపొందిస్తుంది) భవనాలు, యంత్రాలు మొదలైన ఉత్పత్తి సాధనాల రాశి స్థిరంగా పెరుగుతుంది. ఇవి, శ్రమ పరికరాల రూపంలో ఖాయంగా ఉత్పత్తి ప్రక్రియలో అంగమై, తమ విధిని చాలా కాలమో లేక కొద్ది కాలమో నిర్వర్తిస్తాయి. ఉత్పత్తి సాధనాల రాశి ఇలా పెరగడం, శ్రమ యొక్క సామాజిక ఉత్పాదనా శక్తి పెరుగుదలకు మూలమూ, తత్పర్యవసానమూ అని కూడా చూచాము. ఈ రూపంలో సంపద నిరపేక్షంగానే కాకుండా సాపేక్షంగా కూడా పెరగడం (పెట్టుబడి, సం. 1, అధ్యాయం XXV, 2), అన్నిటికన్నా ముఖ్యంగా పెట్టుబడిదారీ ఉత్పత్తి పద్ధతి విశిష్ట లక్షణం. కానీ స్థిరపెట్టుబడి అస్తిత్వ భౌతిక రూపాలు, అంటే ఉత్పత్తి సాధనాలు అలాంటి శ్రమ సాధనాలు మాత్రమే కాదు. వివిధ ప్రక్రియ దశల్లో వున్న శ్రమ పదార్థాలు, సహాయక పదార్థాలు కూడా అందులోనివే. ఉత్పత్తి స్థాయి విస్తరణతోనూ, సహకారం, శ్రమ విభజన, యంత్రాలు మొదలైన వాటి ద్వారా శ్రమ ఉత్పాదక శక్తి పెరుగుదలతోనూ, పునరుత్పత్తి దైనందిన ప్రక్రియలో ప్రవేశించే ముడి పదార్థాలు, సహాయక పదార్థాలు మొదలైన వాటి పరిమాణం కూడా హెచ్చుతుంది. ఇవన్నీ ఉత్పత్తి స్థలంలో సిద్ధంగా వుండాలి. కాబట్టి ఉత్పాదక పెట్టుబడి రూపంలో వున్న ఈ సరఫరా పరిమాణం నిరపేక్షంగా పెరుగుతుంది. సరఫరా అందజేయ వీలున్నది రోజువారీ గానా, లేక నిర్దిష్ట వ్యవధుల్లోనా అనే సంగతిని అలా వుంచుదాం. ఈ క్రమం నిరంతరాయంగా సాగుతుండాలంటే, ముడిపదార్థాలు మొదలైనవి – ఉదాహరణకు, రోజుకో లేదా వారానికో ఎంత వినియోగమవుతాయో అంతకన్నా ఎక్కువగా ఉత్పత్తి స్థలంలో ఎప్పుడూ సంచితమై వుండాలి. ఈ క్రమం అవిచ్ఛిన్నంగా కొనసాగాలంటే, తదవసరమైన పరిస్థితుల ఉనికికి, రోజువారీ కొనుగోళ్ళలో సంభవించగల అంతరాయాలు ప్రమాదం తెచ్చిపెట్టరాదు. ఉత్పాదితాన్ని అమ్మేది ప్రతి దినమూనా, లేక వారం వారమా అనేదానితో అంటే, ఉత్పాదితం దాని ఉత్పాదక భాగాలుగా పునఃపరివర్తన చెందడం క్రమానుసారం జరగదనే దానితో ఆ పరిస్థితులకు ప్రమేయం వుండరాదు. కానీ, ఉత్పాదక పెట్టుబడి అంతర్గతంగా వుండవచ్చుననీ లేదా పూర్తిగా భిన్నమైన నిష్పత్తుల్లో సరఫరా రూపం ధరించ వచ్చుననీ స్పష్టమవుతూనే వుంది. ఉదాహరణకు, ఒక నూలుమిల్లు యజమాని చేతుల్లో పత్తి లేక బొగ్గు సరఫరా మూడు నెలలకు సరిపోయేంత వుండాలా అనేదానికీ లేక ఒక నెలకు సరిపోయేంత వుండాలా అనేదానికీ మధ్య చాలా తేడా వుంది. ఈ సరఫరా నిరపేక్షంగా పెరుగుతూనే, సాపేక్షంగా తగ్గవచ్చుననేది స్పష్టమే.

ఇది అవసరమైన వివిధ పరిస్థితులపై ఆధారపడి వుంటుంది. ఎప్పటికీ అంతరాయమే సంభవించకుండా వుండేందుకు, కావలసిన పరిమాణంలో ముడిసరుకులు మరింత త్వరితగతితో, మరింత క్రమానుసారంగా, నమ్మకంగా అందజేయవలసిన ఆవశ్యకతే ఈ అవసర పరిస్థితులన్నిటి సారాంశం. వీటిని పాటించడం కొరవడిన కొద్దీ, ఉత్పాదక పెట్టుబడి అంతర్గర్భిత భాగం ఎక్కువగా వుండాలి. అంటే, ఉత్పత్తిదారు చేతిలో, ఉత్పత్తి ప్రక్రియకై సిద్ధంగా వున్న ముడిసరుకుల సరఫరా

ఎక్కువగా వుండాలి. ఈ అవసరాల పరిస్థితులు, పెట్టుబడిదారీ ఉత్పత్తి అభివృద్ధి చెందిన స్థాయికీ, సామాజిక శ్రమ ఉత్పాదక శక్తికీ, విలోమానుపాతంతో వుంటాయి. కాబట్టి, ఈ రూపంలోని సరఫరాకు కూడా ఇదే వర్తిస్తుంది.

కానీ, ఇక్కడ సరఫరా తగ్గుదలగా (ఉదాహరణకు లాలర్ గ్రంథంలో) కనిపించేది, కొంత వరకు, సరుకు – పెట్టుబడి రూపంలోని సరఫరా తగ్గుదలే లేక అసలైన సరుకు – సరఫరా తగ్గుదల మాత్రమే. కాబట్టి, ఇది ఒకే సరఫరా రూపంలో వచ్చిన మార్పు మాత్రమే. ఉదాహరణకు, ఒక దేశంలో రోజూ ఉత్పత్తి అయ్యే బొగ్గు పరిమాణం ఎక్కువగా వుంటే, తత్కారణంగా బొగ్గు పరిశ్రమ స్థాయి, అది పనిచేసే శక్తి ఎక్కువగా వుంటే, నూలుమిల్లు యజమాని తన ఉత్పత్తి అవిచ్ఛిన్నంగా సాగేలా చూడటానికి బొగ్గును పెద్ద ఎత్తున నిల్వ చేయవలసిన అవసరం వుండదు. బొగ్గు సరఫరా ఖాళీ అయినకొద్దీ స్థిరంగా, నమ్మకంగా భర్తీ అవుతూంటుంది. కాబట్టి ఈ అవసరం వుండదు. రెండవ విషయం, ఒక ప్రక్రియ ఉత్పాదితాన్ని ఉత్పత్తి సాధనంగా మరో ప్రక్రియకు ఎంత త్వరగా బదలాయించ వీలున్నదనేది రవాణా, వార్తా ప్రసార సదుపాయాల అభివృద్ధిపై ఆధారపడి వుంటుంది. ఈ విషయంలో సరుకు రవాణా చౌకగా వుండటం చాలా ముఖ్యం. ఉదాహరణకు సరుకు రవాణా సాపేక్షంగా చౌకగా వున్నప్పుడు ఎక్కువ కాలానికి సరిపోయే బొగ్గు సరఫరాను పెద్ద ఎత్తున నిల్వ చేయడానికన్నా, గని నుంచి బొగ్గును నూలు మిల్లుకు నిరంతరాయంగా రవాణా చేయడానికి ఎక్కువ ఖర్చవుతుంది.

ఇంతవరకు పరిశీలించిన ఈ రెండు పరిస్థితులు ఉత్పత్తి ప్రక్రియ నుంచి ఉత్పన్నమైనవే. మూడవ, విషయం పరపతి వ్యవస్థ అభివృద్ధి కూడా కొంత ప్రభావం నెరపుతుంది. నూలు మిల్లు యజమాని తన పత్తి, బొగ్గు వగైరాల సరఫరాలను భర్తీ చేసుకొనేందుకు తన నూలు ప్రత్యక్ష అమ్మకంపై ఆధారపడి వుండటం తగ్గినకొద్దీ (పరపతి వ్యవస్థ అభివృద్ధి చెందినకొద్దీ, ఇలా ప్రత్యక్షంగా ఆధారపడటం తగ్గుతుంది.) ఈ సరఫరాలు సాపేక్షంగా తక్కువ పరిమాణంలో వుండవీలుంది. అయినప్పటికీ అవి ఒక నిర్ణీత స్థాయిలో నూలు నిరంతరాయ ఉత్పత్తికి హామీ కల్పించగలవు. ఆ ఉత్పత్తి, నూలు అమ్మకంలోని ఒడిదుడుకులపై ఆధారపడదు. కానీ, నాల్గవ విషయమేమిటంటే, అనేక ముడి పదార్థాలు, సగం తయారైన సరుకులు, మొదలైన వాటి ఉత్పత్తికి కొంత ఎక్కువ కాలమే పడుతుంది. ముఖ్యంగా వ్యవసాయ రంగం అందజేసే అన్ని ముడిపదార్థాలకు ఇది వర్తిస్తుంది. ఉత్పత్తి క్రమానికి అంతరాయం ఏర్పడకుండా ఉండాలంటే, పాత ఉత్పాదితాల స్థానాన్ని కొత్తవాటితో భర్తీచేయ వీలులేని కాలమంతటికీ కావలసిన నిర్దిష్ట పరిమాణంలో ముడిపదార్థాలు చేతిలో వుండాలి. పారిశ్రామిక పెట్టుబడిదారుని చేతిలో వున్న ఈ సరఫరా తగ్గిందంటే, అది వర్తకుని చేతిలో సరుకు సరఫరా రూపంలో పెరిగిందని ఇందువల్ల రుజువవుతుందంతే. ఉదాహరణకు, రవాణా సాధనాలు అభివృద్ధి చెందడం వల్ల, లివర్‌పూల్ లోని దిగుమతి సరుకుల గిడ్డంగుల్లో వున్న పత్తిని మాంచెస్టర్‌కు త్వరగా తరలించ వీలవుతుంది. ఫలితంగా పరిశ్రమదారు అవసరమైనప్పుడల్లా తన సరఫరాను సాపేక్షంగా కొద్దిపాటి పరిమాణాల్లో భర్తీ చేసుకోగలడు. కానీ ఆ సందర్భంలో, లివర్‌పూల్ వర్తకుల చేతుల్లో పత్తి, ఆ మేరకు ఎక్కువ పరిమాణాల్లో సరుకు సరఫరాగా వుండిపోతుంది. కాబట్టి ఇది సరఫరా రూపంలో కేవలం మార్పే. ఈ విషయం లాలర్, తదితరులు గమనించలేదు. సామాజిక పెట్టుబడి దృష్ట్యా చూస్తే, ఈ రెండు

సందర్భాలలోనూ సరఫరా రూపంలో వుండేది అదే పరిమాణంలోని ఉత్పాదితాలే. ఒక దేశానికి, ఉదాహరణకు ఒక సంవత్సర కాలంలో అవసరమైన పరిమాణం, రవాణా సదుపాయాలు మెరుగయ్యేకొద్దీ తగ్గుతుంది. అమెరికా, ఇంగ్లండు మధ్య తిరిగే ఓడలూ, స్టీమర్ల సంఖ్య పెద్దగా వుంటే, ఇంగ్లండు తరిగిపోయిన తన పత్తి సరఫరాను ఎప్పటికప్పుడు భర్తీచేసుకొనే అవకాశాలు పెరుగుతాయి. అదే సమయంలో ఇంగ్లండులో నిల్వ వుంచవలసిన సరుకు సగటు పరిమాణం తగ్గుతుంది. ప్రపంచ మార్కెట్ అభివృద్ధీ, తత్పర్యవసానంగా ఒకే సరుకు సరఫరా మూలాధారాల సంఖ్య పెరుగుదలా ఇదే ఫలితమిస్తాయి. వేరు వేరు దేశాల నుంచి, వేరు వేరు కాల వ్యవధుల్లో ఆ వస్తువు కొద్ది కొద్దిగా సరఫరా అవుతుంది.

## 2. అసలైన సరుకు - సరఫరా

పెట్టుబడిదారీ ఉత్పత్తిలో ఉత్పాదితం, సర్వ సాధారణంగా సరుకు రూపం ధరిస్తుంది. ఉత్పత్తి విస్తృతీ, ప్రగాఢతా హెచ్చినకొద్దీ, ఈ క్రమం మరింత పుంజుకొంటుంది. ఫలితంగా ఉత్పత్తి ఒకే పరిమాణంలో సాగినా; మునుపటి ఉత్పత్తి పద్ధతులతో గానీ, తక్కువ అభివృద్ధి దశలోని పెట్టుబడిదారీ పద్ధతితో గానీ పోల్చి చూస్తే సరుకుల రూపంలోని ఉత్పాదితాల భాగం చాలా ఎక్కువగా వుంటుంది. ప్రతి సరుకు – పెట్టుబడీ, కేవలం సరుకులే అయితే, పెట్టుబడి – విలువ అస్తిత్వ రూపంగా ఉపకరించే సరుకులవి. అందువల్ల ప్రతి సరుకూ, అదే విధంగా ప్రతి సరుకు – పెట్టుబడీ వెనువెంటనే ఉత్పత్తి రంగం నుంచి ఉత్పాదకమైన లేదా వ్యక్తిగతమైన వినియోగంలో ప్రవేశించకుంటే తప్ప, అంటే, మధ్యలో మార్కెట్‌లో ఉండకుండాపోతే తప్ప, సరుకు – సరఫరాలో భాగమవుతుంది. ఉత్పత్తి ఒకే పరిమాణంలో ఉన్నప్పటికీ, పై కారణం వల్ల సరుకు – సరఫరా (అంటే, ఉత్పాదితపు సరుకు – రూపం ఇలా వేర్పడి, స్థిరపడిన స్థితి) అదంతకదే, పెట్టుబడిదారీ ఉత్పత్తితో పాటుగా పెరుగుతుంది. ఇది కేవలం సరఫరా రూపంలో వచ్చిన మార్పు మాత్రమే అని, పైన చూశాము. అంటే, ఒకవైపు ప్రత్యక్షంగా ఉత్పత్తి కోసం లేదా వినియోగం కోసం ఉద్దేశించిన రూపంలో సరుకు – సరఫరా తగ్గుతుంది. కాబట్టి, మరోవైపు సరుకుల రూపంలో సరఫరా పెరుగుతుంది. అది కేవలం సరఫరా సామాజిక రూపంలో వచ్చిన మార్పే. మొత్తం సామాజిక ఉత్పాదితంతో పోల్చి చూచినప్పుడు, సరుకు – సరఫరా సాపేక్ష పరిమాణమే కాదు, దాని నిరపేక్ష పరిమాణం కూడా పెరుగుతుంది. ఎందువల్లనంటే, పెట్టుబడిదారీ ఉత్పత్తి పెరుగుదలతో, మొత్తం ఉత్పాదితపు రాశి కూడా పెరుగుతుంది.

పెట్టుబడిదారీ ఉత్పత్తి అభివృద్ధితో, ఉత్పాదితానికి గల ప్రత్యక్ష గిరాకీ ఉత్పత్తి స్థాయిని నిర్ణయించడం అంతకంతకు తగ్గిపోతుంది. వ్యష్టి పెట్టుబడిదారు చేతిలో వున్న పెట్టుబడి మొత్తం, అతని పెట్టుబడికి స్వతస్సిద్ధంగా వున్న స్వయం విస్తరణ ప్రేరణ, ఉత్పత్తి క్రమం అవిచ్ఛిన్నంగా సాగవలసిన, విస్తరించవలసిన ఆవశ్యకత – ఇవి ఉత్పత్తి స్థాయిని నిర్ణయించడం అంతకంతకు ఎక్కువవుతుంది. ఆ విధంగా, సరుకుల రూపంలో మార్కెట్‌లో లభ్యమయ్యే ఉత్పాదితాల రాశి, అంటే కొనుగోలుదార్ల కోసం అన్వేషించే ఉత్పాదితాల రాశి, ప్రతి ఉత్పత్తి శాఖలోనూ అవశ్యంగా పెరుగుతుంది. సరుకు – పెట్టుబడి రూపంలో కొద్ది కాలమో, ఎక్కువ కాలమో స్థిరపడిన పెట్టుబడి మొత్తం పెరుగుతుంది. కాబట్టి సరుకు – సరఫరా కూడా పెరుగుతుంది.

మొదటి విషయం, సమాజ సభ్యుల్లోని అధిక సంఖ్యాకులు వేతన శ్రామికులుగా, రెక్కాడితేగాని డొక్కాడని జనంగా మారిపోతారు. వారం వారం ముట్టిన తమ వేతనాలను రోజూ వెచ్చిస్తారు కాబట్టి, వారికి జీవితావసరాలు సరఫరా రూపంలో ఎప్పటికప్పుడు లభ్యమయ్యేలా చూడవలసి వుంటుంది. ఈ సరఫరాలోని వేరు వేరు అంతర్భాగాలు ధారాప్రవాహంగా వున్నప్పటికీ, మొత్తం సరఫరా చలనంలో వుండాలంటే, ఈ అంతర్భాగాల్లో కొంత సదా స్తబ్దంగా వుండాలి.

ఈ విశిష్ట లక్షణాలకన్నిటికీ మూలం, ఉత్పత్తి రూపమూ, చలామణి క్రమంలో ఉత్పాదిత రూపం తప్పనిసరిగా లోనయ్యే మార్పు కూడా.

ఉత్పాదితాల – సరఫరా తాలూకు సామాజిక రూపం ఎలా వున్నప్పటికీ, దాన్ని భద్రపరచడానికై ఉత్పాదితాన్ని నిల్వచేసే సదుపాయాలైన భవనాలు, పాత్రలు మొదలైన వాటి కోసం మదుపులు అవసరం. ఇవికాక ఉత్పత్తి సాధనాల కోసం, శ్రమకోసం సైతం, మదుపులు అవసరం. హానికరమైన పరిసర ప్రభావాలను అడ్డుకొనేందుకై, ఆయా ఉత్పాదితపు స్వభావాన్ని బట్టి వీటిని తరతమ స్థాయిలో వెచ్చించవలసి వుంటుంది. సరఫరా సామాజికంగా కేంద్రీకృతమైన కొద్దీ, ఖర్చులు సాపేక్షంగా తగ్గుతాయి. ఈ మదుపులు ఎల్లప్పుడూ, వస్తురూపంలోని లేదా సజీవ రూపంలోని (అందువల్ల పెట్టుబడి మదుపుల యొక్క పెట్టుబడిదారీ రూపంలోని) సామాజిక శ్రమగా వుంటాయి. ఇవి ఉత్పాదితాన్ని రూపొందించడంలో ప్రవేశించవు. కాబట్టి, ఉత్పాదితంలో కోతలు, సామాజిక సంపదలోని ఈ అనుత్పాదక వ్యయాలు అవసరం. ఇవి సామాజిక ఉత్పాదితాన్ని జాగ్రత్తపరచడానికయ్యే ఖర్చులు. సామాజిక ఉత్పాదితం సరుకు సరఫరాలో ఒక అంశంగా వుండటానికి కారణం కేవలం ఉత్పత్తి సామాజిక రూపమా అంటే, సరుకు రూపమా, దాని అవశ్య రూపాంతరీకరణా అనే దానితో గానీ, సరుకు సరఫరాను ఉత్పాదితాల సరఫరా తాలూకు ప్రత్యేక రూపంగా మనం పరిగణిస్తున్నామా అనే దానితోగానీ నిమిత్తం లేని ఖర్చులివి. చలామణి క్రమంలోని ఉత్పాదితాల సరఫరా రూపమైన సరుకు – సరఫరా రూపంలో కాకపోయినప్పటికీ, ఉత్పాదితాల సరఫరా అన్ని సమాజాలకూ సమానంగా వున్నదే.

ఈ ఖర్చులు ఏ మేరకు సరుకుల విలువలను పెంచుతాయనే ప్రశ్న కూడా ఇక్కడ రావచ్చు.

ఉత్పత్తిదారు ఉత్పత్తి సాధనాల, శ్రమశక్తి రూపంలో తాను మదుపు పెట్టిన పెట్టుబడిని ఉత్పాదితంగా, అంటే అమ్మకానికి సిద్ధంగా వున్న, ఒక నిర్దిష్ట పరిమాణంలోని సరుకులుగా మార్చి వుంటే, ఇవి అమ్మకం కాకుండా, నిల్వగా వుండిపోతే, అలా వున్నంత కాలం, అతని పెట్టుబడి – విలువ యొక్క స్వయం విస్తరణ క్రమం స్తంభించిపోవడమే కాదు, ఈ సరఫరాను భద్రపరచడానికి భవనాలు, అదనపు శ్రమ, మొదలైన వాటి రూపంలో అయ్యే ఖర్చులు కూడా ఖచ్చితంగా నష్టం కిందే లెక్క. తుదకు వీటికి కొనుగోలుదారు లభించినప్పుడు అతనితో "నా సరుకులను ఆరు నెలల పాటు అమ్మలేకపోయాను. వాటిని అన్ని రోజులు భద్రపరచడం వల్ల నా పెట్టుబడిలో ఇంత మొత్తం అదనంగా ఖర్చయింది" అని పెట్టుబడిదారు అంటే, కొనుగోలుదారు అతని ముఖాన్నే నవ్వి, ఇలా సమాధానమిస్తాడు : "అది నీకు మరింత చేటు, అదిగో నీ పక్కనే మరో అమ్మకందారున్నాడు. అతని సరుకు మొన్ననే తయారైంది. నీ వస్తువులు కొట్టులో పాతపడి, బహుశా కాలగతివల్ల కొద్దో గొప్పో దెబ్బతిని వుంటాయి. కాబట్టి వాటిని మీరు మీ పోటీదారుకన్నా చౌకగా అమ్మవలసి వుంటుంది."

ఒక సరుకు ఉత్పత్తిదారు నిజమైన ఉత్పత్తిదారా లేక పెట్టుబడిదారీ ఉత్పత్తిదారా అంటే, నిజమైన ఉత్పత్తిదారునికి ఆచరణలో ప్రతినిధా అనే విషయం ఆ సరుకు అస్తిత్వ పరిస్థితులను ఎంత మాత్రమూ ప్రభావితం చేయవు. అతడు తన ఉత్పాదితాన్ని డబ్బుగా మార్చుకోవలసి వుంటుంది. ఉత్పాదితాన్ని సరుకుల రూపంలో వుంచడం వల్ల అతడు భరించే ఖర్చులు అతని వ్యక్తిగత అంచనాలకు సంబంధించినవి. వాటితో సరుకుల కొనుగోలుదారుకు సంబంధం లేదు. పెట్టుబడిదారుని సరుకుల చలామణికి పట్టిన కాలానికై కొనుగోలుదారు అతనికి ఏమీ చెల్లించడు. విలువల్లో విప్లవం వాస్తవంగా వచ్చిన కాలంలో లేదా వస్తుందని ఆశించిన కాలంలో, పెట్టుబడిదారు ఉద్దేశపూర్వకంగా తన సరుకులను మార్కెట్‌లో వుంచకుండా వున్నప్పుడు సైతం, అతడు తన అదనపు ఖర్చులను రాబట్టుకొంటాడా లేదా అనేది, ఈ విప్లవం రావటంపై దీన్ని గురించిన అతని అంచనా సరియైనదా కాదా అనే దానిపై ఆధారపడి వుంటుంది. కానీ, విలువలోని ఈ విప్లవం అతని అదనపు ఖర్చుల ఫలితంగా సంభవించదు. కాబట్టి, సరఫరా ఏర్పడటం చలామణి స్తంభనకు దారితీసిన మేరకు, దానికయ్యే ఖర్చులు సరుకుల విలువకు చేరవు. మరోవైపు, చలామణి రంగంలో ఈ నిలుపుదల లేకుండా, పెట్టుబడి తన సరుకు రూపంలో ఎక్కువ కాలమో, తక్కువ కాలమో నిలవకుండా సరఫరా అనేదే వుండజాలదు. కాబట్టి, డబ్బు – నిల్వ రూపొందకుండా డబ్బు చలామణి లేనట్లు, చలామణి స్తంభన లేకుండా సరఫరా వుండజాలదు. కాబట్టి, సరుకు – సరఫరా లేకుండా సరుకు చలామణి వుండజాలదు. పెట్టుబడిదారునికి ఈ అవశ్యకత స'–డ'లో ఎదురుకాకుంటే, డ–సలో ఎదురవుతుంది. తన సరుకు – పెట్టుబడి సందర్భంలో కాకపోయినా, తనకు ఉత్పత్తి సాధనాలను తన కార్మికులకు జీవితావసరాలను ఉత్పత్తి చేసే ఇతర పెట్టుబడిదారుల సరుకు – పెట్టుబడి సందర్భంలోనైనా అతనికిది ఎదురవుతుంది.

సరఫరా ఏర్పడటం ఇచ్ఛాపూర్వకమా, అనిచ్ఛాపూర్వకమా, వేరు మాటల్లో చెప్పాలంటే, సరుకు – ఉత్పత్తిదారు సరఫరాను ఉద్దేశపూర్వకంగానే వుంచుకొంటాడా లేక అసలు, చలామణి క్రమ పరిస్థితులవల్ల అమ్మకాలకు ప్రతిఘటన ఏర్పడిన ఫలితంగా అతని ఉత్పాదితాలు సరఫరాగా ఏర్పడ్డామా అనేదానితో ఇక్కడ నిమిత్తం లేదని తోస్తుంది. కానీ ఈ సమస్య పరిష్కారానికి, ఇచ్ఛాపూర్వకమైన సరుకు ఏర్పాటును, అనిచ్ఛాపూర్వకమైన సరుకు ఏర్పాటును వేరు చేసి చూపేదేమిటో తెలుసుకోవడం ఉపయోగకరం. అనిచ్ఛాపూర్వకమైన సరుకు ఏర్పాటు, సరకు ఉత్పత్తిదారు విషయ పరిజ్ఞానంతో ప్రమేయం లేకుండా, అతని సంకల్పాన్ని భగ్నం చేసే చలామణి స్తంభనవల్ల ఉత్పన్నమయ్యేది; లేదా అలాంటి స్తంభన వంటిది. మరి ఇచ్ఛాపూర్వకమైన సరఫరా ఏర్పాటు లక్షణమేమిటి? ఈ రెండు సందర్భాల్లోనూ అమ్మకందారు తన సరుకును ఎప్పటంత త్వరగా వదిలించుకోజూస్తాడు. అతడు తన ఉత్పాదితాన్ని సదా సరుకుగా అమ్మకానికి పెడతాడు. దాన్ని అమ్మకం నుంచి ఉపసంహరించుకొంటే అది సరుకు – సరఫరా కాగల వీలున్నదే తప్ప, యథార్థమైన సరుకు – సరఫరా కాదు. అతని దృష్టిలో సరుకు, సరుకుగా ఎప్పటిలాగే మార్పిడి విలువ వాహిక. కాబట్టి, సరుకుగా అది తన సరుకు రూపాన్ని విసర్జించి, డబ్బు రూపం ధరించడం ద్వారా మాత్రమే, తదనంతరం పని చేయగలదు.

ఒక నిర్ణీత కాలంలో గిరాకీని తీర్చాలంటే సరుకు – సరఫరా ఒక నిర్దిష్ట పరిమాణంలో వుండాలి. కొనుగోలుదార్ల బృందం నిరంతరాయంగా పెరుగుతుందని నమ్ముకొని వుండటం రివాజు.

ఉదాహరణకు, సరుకులు ఒక రోజుకు చాలినంత వుండాలంటే, వాటిలో కొంత భాగం చలనశీలమై డబ్బుగా మారుతుండగా, మిగతా భాగం సరుకు రూపంలో మార్కెట్‌లో స్థిరంగా వుండాలి. ఒక భాగం చలన స్థితిలో వుండగా, స్తంభించిన మిగతా భాగం క్రమంగా తగ్గుతూంటుంది. అంతా అమ్మకమయ్యేదాకా సరఫరా పరిమాణం తగ్గిపోయినట్లుగానే ఆ విధంగా, సరుకుల స్తంభన వాటి అమ్మకానికి తప్పనిసరిగా అవసరం. అంతేకాదు దాని పరిమాణం సగటు అమ్మకంకన్నా లేక సగటు గిరాకీకన్నా ఎక్కువగా వుండాలి. లేకపోతే సగటుకు మించిన గిరాకీలను తీర్చడం సాధ్యం కాదు. మరోవైపు సరఫరా స్థిరంగా ఖర్చవుతుంది. కాబట్టి, ఖాళీ అయిన దాని స్థానాన్ని స్థిరంగా భర్తీ చేయాలి. ఆఖరున, భర్తీ చేసే కొత్త సరుకు ఉత్పత్తి నుంచి తప్ప సరుకుల సరఫరా నుంచి తప్ప మరెక్కడి నుండి రాజాలదు. ఈ వచ్చేది దేశం వెలుపల నుంచా, కాదా అనేది ముఖ్యం కాదు. ఈ సరుకుల పునరుత్పత్తికి పట్టే వ్యవధులపై ఈ భర్తీ చేయడం ఆధారపడి ఉంటుంది. సరుకు – సరఫరా ఈ కాలమంతటా ఉండాలి. అయితే ఇది ఉత్పత్తిదారుని చేతిలోనే వుండదు, టోకు వ్యాపారస్తుని మొదలుకొని చిల్లర వర్తకుని వరకు గల వివిధ నిల్వస్థలాలను గడిచి వెడుతుంది. ఈ వాస్తవం ఈ వ్యవహార స్వరూపాన్ని మార్చుతుందే తప్ప దాని స్వభావాన్ని మార్చదు. సమాజ దృక్కోణం నుంచి చూస్తే, సరుకులు ఉత్పాదక లేదా వ్యక్తిగత వినియోగంలోకి ప్రవేశించే వరకు, పెట్టుబడిలోని ఒక భాగం, పైన చెప్పిన రెండు సందర్భాల్లోనూ సరుకు – సరఫరా రూపంలోనే వుంటుంది. ఉత్పత్తిపై ప్రత్యక్షంగా ఆధారపడకుండా ఉండేందుకూ, తనకు బేరగాళ్ళు స్థిరంగా వుండేలా చూచేందుకూ ఉత్పత్తిదారు తన సగటు గిరాకీకి అనుగుణంగా సరుకు నిల్వ ఉంచుకోవడానికి ప్రయత్నిస్తాడు. ఉత్పత్తి కాలానికి అనుగుణమైన కొనుగోలు కాలాలు ఏర్పడుతుంటాయి. చెల్లిన సరుకుల స్థానాన్ని అదేరకం కొత్త సరుకులతో భర్తీ చేయగలిగే వరకు, ఆ సరుకులు ఎక్కువ కాలమో, తక్కువ కాలమో సరఫరాలుగా వుంటాయి. అటువంటి సరఫరాల ఏర్పాటు ద్వారానే చలామణి క్రమస్థిరతకు, అవిచ్ఛిన్నతకు రక్షణ వుంటుంది; కాబట్టి, చలామణి క్రమం అంతర్భాగంగా గల పునరుత్పత్తికీ రక్షణ వుంటుంది.

స తాలూకు ఉత్పత్తిదారు విషయంలో, స మార్కెట్‌లోనే ఇంకా వున్నప్పటికీ స'–డ' ప్రక్రియ జరిగిపోయి వుండవచ్చునని గుర్తుంచుకోవాలి. ఉత్పత్తిదారు తన సరుకుల తుది వినియోగదారుకు అమ్మకమయ్యే వరకు నిల్వ వుంచుకొంటే, అతను రెండు పెట్టుబడులను, ఒకటి సరుకుల ఉత్పత్తిదారుగా, రెండవది వ్యాపారస్తుడుగా చలనంలో ఉంచవలసి వుంటుంది. ఇక సరుకుకు సంబంధించినంత వరకు, దాన్ని మనమొక విడిసరుకుగా చూచినా, సామాజిక పెట్టుబడిలో భాగంగా చూచినా, సరఫరా ఏర్పాటుకైన ఖర్చులు దాని ఉత్పత్తిదారు భరిస్తాడా లేక వరుసగా ఎందరెందరో వర్తకులు భరిస్తారా అనేది అప్రధానం.

సరుకు – సరఫరా కేవలం ఉత్పాదితం తాలూకు సరుకు రూపం తప్ప మరేమీ కాదు. సామాజిక ఉత్పత్తి అందుకొన్న నిర్దిష్ట స్థాయిలో, అది సరుకు – సరఫరాగా వుండనట్లయితే, ఉత్పాదక సరఫరాగానో (గుప్త ఉత్పాదక నిధిగానో) లేక వినియోగ నిధిగానో (వినియోగ సాధనాల నిల్వగానో) వుంటుంది. కాబట్టి దాన్ని భద్రపరచడానికి అవసరమైన ఖర్చులు, వేరుమాటల్లో చెప్పాలంటే,

సరఫరా ఏర్పాటుకయ్యే ఖర్చులు – అంటే, ఇందుకోసం వ్యయమైన వస్తురూప లేదా సజీవ శ్రమ – ఉత్పత్తికి ఉద్దేశించిన సామాజిక నిధిని లేక వినియోగానికి ఉద్దేశించిన సామాజిక నిధిని జాగ్రత్తగా వుంచడానికి అయిన ఖర్చులు తప్ప మరేమీ కాదు. ఈ ఖర్చులు వేరు వేరు రకాల సరుకులకు వేరు వేరుగా వుంటాయి కాబట్టి, వీటివల్ల సరుకుల విలువలో వచ్చే పెరుగుదల తదనుగుణమైన నిష్పత్తిలో ఆయా సరుకుల మధ్య పంపిణీ అవుతుంది. సరఫరా ఏర్పాటు ఖర్చులు, సామాజిక సంపద ఉనికికి అవశ్యకమైన వాటిలో ఒకటి అయినప్పటికీ అవి సామాజిక సంపదలో ఎప్పటిలాగే కోతలే.

డబ్బు నిల్వనిధి ఏర్పడటం డబ్బు చలామణికి పూర్వావసరమైనట్లుగా, సరుకు – సరఫరా వరకు చలామణికి పూర్వావసరం; సరుకు చలామణిలో అవశ్యంగా ఉత్పన్నమైన రూపంగా వున్న మేరకు మాత్రమే, కాబట్టి, పైకి కనిపించే ఈ స్తంభన అసలు గమన క్రమం రూపంగా వున్న మేరకు మాత్రమే – ఆ మేరకు మాత్రమే అటువంటి స్తంభన సర్వసాధారణమైనది. కానీ, చలామణి నిల్వ స్థాయిల్లో వున్న సరుకులు శీఘ్రగతిలో వస్తున్న తదనంతర ఉత్పత్తి తరంగానికి చోటు ఇవ్వకపోయాయా, వెనువెంటనే నిల్వస్థలాల్లో సరుకులు పేరుకుపోతాయి. డబ్బు చలామణికి ఆటంకం కలిగినప్పుడు డబ్బు నిల్వలు పెరిగినట్లుగానే, సరుకు చలామణిలోని స్తంభన ఫలితంగా సరుకు సరఫరా పెరిగిపోతుంది. సరుకు ఇలా పేరుకుపోవడం పారిశ్రామిక పెట్టుబడిదారుని గోదాముల్లో జరిగినా ఒకటే, వర్తకుని దుకాణం గదుల్లో జరిగినా ఒకటే. అటువంటి సందర్భంలో సరుకు – సరఫరా, సరుకులను అమ్మడం సాధ్యపడనందువల్ల కలిగిన ఫలితమే తప్ప, నిరంతరాయమైన అమ్మకానికి పూర్వావశ్యకం కాదు. అయ్యే ఖర్చులు ఒకటే కానీ, ఇవి ఉత్పన్నమవుతున్నది వాటి రూపం వల్లనే. వేరు మాటల్లో, కేవలం సరుకులను డబ్బుగా మార్చవలసిన అవశ్యకత వల్లా, అవి ఈ రూపాంతరం చెందడం కష్టమైనందు వల్లనే. కాబట్టి, ఇవి సరుకుల విలువలో చేరవు సరికదా, విలువలో కోతలు; విలువ డబ్బుగా చేతికందడంలో విలువ నష్టాలు. సరఫరా తాలూకు సాధారణ రూపానికి, అసాధారణ రూపానికి మధ్య రూపంలో తేడా లేనందువల్ల, రెండూ చలామణికి అడ్డుపడుతున్నందువల్ల, వీటిని ఒకటి మరొకటిగా గందరగోళపడే అవకాశముంది. అసలు ఉత్పత్తిదారే మరింతగా మోసపోయే అవకాశముంది. ఎందువల్లనంటే, చేతులు మారి ఇప్పుడు వర్తకుని వద్ద వున్న సరుకుల చలామణి ఆగిపోయినా, ఉత్పత్తిదారునికి సంబంధించినంత వరకు అతని పెట్టుబడి చలామణి క్రమమేమో కొనసాగుతూండవచ్చు. తక్కినవన్నీ సమానంగా వుంటూ, ఉత్పత్తి వినియోగం జరిగినట్లయితే, సరుకు – సరఫరా కూడా అదే విధంగా పెరుగుతుంది. సరఫరా భర్తీ కావడం ఖాళీ కావడం అంత వేగంగానూ జరుగుతుంది. కానీ దాని పరిమాణం ఇప్పుడు ఎక్కువ. కాబట్టి, స్తంభించిన చలామణి కారణంగా సరుకు – సరఫరా పరిమాణంలో వచ్చిన పెరుగుదలను పునరుత్పత్తి ప్రక్రియ విస్తరణ సూచకంగా పొరపడే వీలుంది. ప్రత్యేకించి, పరపతి వ్యవస్థ అభివృద్ధి వల్ల, వాస్తవ గమన క్రమాన్ని నిగూఢ వాతావరణం కమ్ముకొనే అవకాశం ఏర్పడినప్పుడు ఈ పొరపాటు జరుగవచ్చు.

సరఫరా ఏర్పాటు ఖర్చులివి : 1) ఉత్పాదితాల పరిమాణంలో తగ్గుదల (ఉదాహరణకు పిండి సరఫరాలో ఇది జరుగుతుంది); 2) నాణ్యతలో క్షీణత; 3) సరఫరాను జాగ్రత్తగా వుంచడానికి అవసరమైన వస్తురూప శ్రమ, సజీవ శ్రమ.

## III. రవాణా ఖర్చులు

చలామణి ఖర్చుల్లో, ప్యాక్ చేయటం, సరుకును రకాల వారీగా వేరుచేయటం వంటి వివరాల్లోకి, ఇక్కడ పోవలసిన పనిలేదు. సరుకుల రూపాల్లోని మార్పుల వల్ల మాత్రమే తగిలే చలామణి ఖర్చులేవీ వాటి విలువకు చేరవు అనేది సాధారణ సూత్రం. విలువ, డబ్బుగా చేతికందడంలో లేదా విలువ ఒక రూపం నుంచి మరొక రూపంలోకి మారడంలో అయ్యే ఖర్చులవి, అంతే. ఆ ఖర్చుల కోసం వ్యయమయ్యే పెట్టుబడి (దాని నియంత్రణ కింద జరిగిన శ్రమతో సహా) పెట్టుబడిదారీ ఉత్పత్తికి సంబంధించిన అనుత్పాదక కార్యకలాపాల ఖర్చుల కిందికి వస్తుంది. మొత్తం పెట్టుబడిదారీ వర్గానికి సంబంధించినంత వరకు, ఆ ఖర్చులను అదనపు ఉత్పాదితం నుంచి భర్తీ చేయవలసి వుంటుంది. తన జీవితావసరాలను కొనేందుకు కార్మికునికి పట్టే కాలం ఏవిధంగా వృధా అయిన కాలమో, అదే విధంగా ఈ ఖర్చులు అదనపు విలువలో లేదా అదనపు ఉత్పాదితంలో కోతలవుతాయి. కానీ రవాణా ఖర్చులు ఎంత ముఖ్యమైన పాత్ర వహిస్తున్నాయంటే వాటిని గురించి క్లుప్తంగా వ్యాఖ్యానించకుండా దాటవేయరాదు.

పెట్టుబడి ఆవృత్తీ, తదావృత్తిలో భాగమైన సరుకుల రూపాంతరీకరణలు – వీటి పరిధిలో సామాజిక శ్రమకు సంబంధించిన పదార్థ మార్పిడి జరుగుతుంది. ఈ పదార్థ మార్పిడి కారణంగా, ఉత్పాదితాలకు స్థల చలనం కలగవచ్చు. అవి ఒకచోటి నుంచి మరో చోటికి నిజంగా తరలింపబడవచ్చు. కానీ, సరుకుల భౌతిక గమనం లేకుండానే, వాటి చలామణి జరగవచ్చు; సరుకుల చలామణి లేకుండానే, ఉత్పాదితాల ప్రత్యక్ష మార్పిడి లేకుండానే అవి రవాణా కావచ్చు. ఒక వ్యక్తి మరో వ్యక్తికి అమ్మిన ఇల్లు ఒకచోట నుంచి మరోచోటికి పోదు. కానీ అది సరుకుగా చలామణి అవుతోంది. తరలించడానికి వీలైన పత్తి, దుక్క ఇనుములాంటి సరుకు – విలువను డజన్లకొద్దీ చలామణి క్రమాలను గడిచిపోతూ, అంటే సట్టా వ్యాపారులచే కొనుగోలై, తిరిగి అమ్మకమవుతూ, అదే గోదాములో పడి వుండవచ్చు.[1] వాస్తవంలో ఇక్కడ కదిలిపోతూన్నది సరుకులపై యాజమాన్యమే తప్ప, అసలు సరుకులు కాదు. కానీ, ఇన్కాల దేశంలో (రెడ్ ఇండియన్ల ప్రాచీన పెరూలో – అను) సామాజిక ఉత్పాదితం సరుకుగా చలామణి కాకపోయినా లేదా వస్తుమార్పిడి ద్వారా పంపిణీ కాకపోయినా, రవాణా ప్రముఖ పాత్ర వహించింది.

కాబట్టి రవాణా పరిశ్రమ పెట్టుబడిదారీ ఉత్పత్తిపై ఆధారపడినప్పుడు అది చలామణి ఖర్చులకు మూలంగా కనిపించినా, ఈ ప్రత్యేకమైన గోచర రూపం విషయాన్నే మాత్రమూ మార్చదు.

రవాణా వల్ల ఉత్పాదితాల పరిమాణాలు పెరగవు. కొన్ని సందర్భాల్లో తప్ప, రవాణా వల్ల వాటి సహజ గుణాల్లో రాగల మార్పు, ఉద్దేశపూర్వకంగా తీసుకొచ్చిన ఉపయోగకర ఫలితం కాదు. అది అనివార్యమైన చెడుగు. కానీ, వస్తువుల ఉపయోగపు విలువ వాటి వినియోగంలో మాత్రమే భౌతిక వాస్తవమవుతుంది; వాటి వినియోగం కోసం వాటి స్థలాన్ని మార్చవలసిన అవసరమేర్పడవచ్చు; కాబట్టి, రవాణా పరిశ్రమలో అదనపు ఉత్పత్తి ప్రక్రియ అవసరం కావచ్చు. ఈ పరిశ్రమలో మదుపు పెట్టిన ఉత్పాదక పెట్టుబడి రవాణా చేయబడిన ఉత్పాదితాలకు విలువను చేకూర్చుతుంది. కొంతవరకు, రవాణా సాధనాల నుంచి విలువను బదలాయించడం వల్ల, కొంతవరకు, రవాణా క్రమంలో చేసిన

1. దీన్ని స్టార్చ్ "సర్క్యులేషన్ ఫాక్టిస్" (మిథ్యా చలామణి) అని పేర్కొంటున్నాడు.

శ్రమ ద్వారా విలువను చేర్చడం వల్ల ఇది జరుగుతుంది. శ్రమ చేర్చే విలువలో, సమస్త పెట్టుబడిదారీ ఉత్పత్తిలో లాగానే, వేతనాల స్థానాన్ని భర్తీ చేసేదీ, అదనపు విలువ స్థానాన్ని భర్తీ చేసేదీ వున్నాయి.

ప్రతి ఉత్పత్తి ప్రక్రియలోనూ, శ్రమ గ్రహీత వస్తువు వున్న స్థలం మార్పూ, దాని కవసరమైన శ్రమ పరికరాలూ, శ్రమశక్తీ పెద్ద పాత్ర వహిస్తాయి; పత్తి యేకే గది నుంచి కదుళ్ళ గదికి ట్రక్కుల్లో తరలించే పత్తి, గని నుంచి బయటికి చేరవేసే బొగ్గు ఇందుకు ఉదాహరణలు. పూర్తిగా తయారైన ఉత్పాదితాన్ని తయారైన సరుకులుగా స్వతంత్రమైన ఒక ఉత్పత్తి స్థలం నుంచి దూరంగా వున్న మరో స్థలానికి తరలించడం కూడా ఇటువంటి పరిణామమే. పోతే అది మరింత విస్తృత స్థాయిలో జరిగేది. ఉత్పాదితాలను ఒక ఉత్పాదక సంస్థనుంచి మరొక ఉత్పాదక సంస్థకు తరలించిన తరువాత, పూర్తిగా తయారైన ఆ ఉత్పాదితాలు ఉత్పాదన రంగం నుంచి వినియోగ రంగాన్ని చేరుకొంటాయి. ఉత్పాదితం ఈ గమన క్రమాలను పూర్తిచేసే వరకు, అది వినియోగానికి సిద్ధమైనది కాదు.

పైన నిరూపించినట్లు, సరుకు ఉత్పత్తి సార్వత్రిక నియమం ఇక్కడా చెల్లుతుంది. శ్రమ ఉత్పాదక శ్రమ సృష్టించిన విలువకు విలోమానుపాతంలో వుంటుంది. ఇది తక్కిన పరిశ్రమలకులాగా రవాణా పరిశ్రమకూ వర్తిస్తుంది. సరుకులను ఒక నిర్దిష్ట దూరానికి రవాణా చేసేందుకు అవసరమైన మృత, సజీవ శ్రమ ఎంత తక్కువగా వుంటే, శ్రమ ఉత్పాదక శక్తి అంత ఎక్కువగా వుందన్న మాట. అదేవిధంగా అలా రవాణా చేసేందుకు అవసరమైన మృత, సజీవ శ్రమ ఎంత ఎక్కువగా వుంటే, శ్రమ ఉత్పాదకత అంత తక్కువగా ఉందన్నమాట.[1]

మిగతా విషయాలన్నీ యధాతథంగా వున్నప్పుడు, సరుకులకు రవాణా చేకూర్చే విలువ నిరపేక్ష పరిమాణం రవాణా పరిశ్రమ ఉత్పాదక శక్తికి విలోమానుపాతంలోనూ, అవి తరలింపబడిన దూరానికి అనులోమానుపాతంలోనూ ఉంటుంది.

మిగతా పరిస్థితులన్నీ యధాతథంగా వున్నప్పుడు, రవాణా ఖర్చులవల్ల సరుకుల ధరలకు అదనంగా చేరే విలువ భాగం ఆ సరుకు ఘనపరిమాణానికీ, బరువుకు అనులోమానుపాతంలోనూ, వాటి విలువకు విలోమానుపాతంలోనూ వుంటుంది. కానీ దీనికి సవరణలుగా వున్న కారకాలెన్నో వున్నాయి. ఉదాహరణకు తరతమ స్థాయిల్లో ముఖ్యమైన జాగరూక చర్యలు సరుకుల రవాణాకు

---

1. వాణిజ్యం రవాణా ఖర్చుల ద్వారా ఉత్పాదితాల ధరను లేదా విలువను పెంచడం, దాని వరప్రసాదాల్లో ఒకటని భావించే సే మాటలను రికార్డో ఉటంకిస్తున్నారు. సే ఇలా రాస్తున్నారు : "సరుకును, అది ఉన్నచోట సేకరించడానికీ, దాన్ని వినియోగించే చోటుకు తరలించడానికి వాణిజ్యం మనకు వీలు కలిగిస్తోంది. కాబట్టి సరుకుకు మొదటి స్థలంలో వున్న ధరకూ, రెండవ స్థలంలో వున్న ధరకూ మధ్యగల తేడా మేరకు దాని విలువను పెంచే శక్తిని మనకిస్తోంది." (జె.బి. సే, "ట్రై యిటే డి ఎకానమీ పొలిటిక్", ట్రోయిసీమే కూర్పు, పారిస్, 1817, టోమీ 11, పుట 433 - సం) దీన్ని ప్రస్తావిస్తూ రికార్డో ఇలా వ్యాఖ్యానిస్తున్నారు. "నిజమే. కానీ, దానికి ఈ అదనపు విలువ ఎలా చేకూర్చబడుతుంది? మొదటి విషయం, ఉత్పత్తి వ్యయానికి, రవాణా ఖర్చులను చేర్చడం ద్వారా, రెండవ విషయం, వర్తకుడు మదుపు పెట్టిన పెట్టుబడిపై లాభాన్ని చేర్చడం ద్వారా, సరుకును వినియోగదారు కొనడానికి ముందు, దాని ఉత్పత్తికీ, రవాణాకూ మరింత శ్రమ వ్యయమవుతున్న కారణం వల్లనే, ఏ ఒక్క సరుకైనా సరే మరింత విలువైనదవుతోంది. దీన్ని వాణిజ్యం వల్ల చేకూరే సదుపాయాల్లో ఒకటిగా పేర్కొనరాదు" (రికార్డో, "రాజకీయ అర్థశాస్త్ర సూత్రాలు", 3వ కూర్పు, లండన్ 1821, పుటలు 309, 310).

అవసరం. కాబట్టి, తరతమ స్థాయిలో శ్రమ, శ్రమ పరికరాల వ్యయం అవసరం. అవి ఆయా వస్తువుల పెళుసుదనం, త్వరగా చెడిపోయే గుణం, పేలిపోయే స్వభావం, మొదలైన వాటిని బట్టి వుంటుంది. ఈ సందర్భంలో, సరుకుల్లో ఊహాతీతమైన రకాలున్నట్టు కనిపెట్టడంలో రైల్వే కంపెనీల అధినేతలు వృక్షశాస్త్రజ్ఞులకన్నా, జంతుశాస్త్రజ్ఞులకన్నా ఎక్కువ బుద్ధి నైశిత్యం ప్రదర్శిస్తున్నారు. ఉదాహరణకు బ్రిటీష్ రైల్వేలు రవాణా చేసే సరుకుల వర్గీకరణతో సంపుటాలకు సంపుటాలే నిండిపోతున్నాయి. సరుకుల నానావిధమైన సహజ ధర్మాలను వాటి రవాణాకు పెద్ద గండాలుగానూ, దగాకోరు రుసుముల వసూలుకు మామూలు సాకులుగానూ మార్చే సర్వసాధారణ ధోరణిపై ఆధారపడిన వర్గీకరణ ఇది. ఒక బుట్టెడు గాజు సామాను ధర మునుపు 11 పౌండ్లు. పారిశ్రామిక ఉత్పత్తుల్లో మెరుగుదలల తరువాత, సుంకం రద్దయిన తరువాత ఇది 2 పౌండ్లు మాత్రమే. కానీ, ఇప్పుడు దాని రవాణా ఛార్జీ మునుపున్నంతే వుంది. అవి కాలువ ద్వారా రవాణా అయిన మునుపటికన్నా ఇప్పుడిది ఎక్కువ. బర్మింగ్‌హామ్‌కు 50 మైళ్ళ పరిధిలో గాజు, ప్లంబర్ వృత్తికి సంబంధించిన గాజు సామాను టన్నుకు దాదాపు 10 షి. చొప్పున రవాణా అయ్యేదని పరిశ్రమదారులు నాకు తెలియజేస్తున్నారు. అవి పగిలిపోయే ప్రమాదాన్ని – ఈ ప్రమాదానికి వీలున్నది బహు అరుదు – అరికట్టే జాగ్రత్తల కోసమని ఆ మొత్తానికి మూడింతలు వసూలు చేస్తున్నారు.... సామాను పగిలినందుకు పరిహారం చెల్లించాలన్న డిమాండ్‌ను రైల్వే కంపెనీలు ఎప్పుడూ అడ్డుకొంటూనే వున్నాయి.[1] అంతే కాకుండా, రవాణా ఖర్చులు ఒక వస్తువుకు చేర్చే విలువ భాగం దాని విలువకు విలోమానుపాతంలో వుంటుందన్న వాస్తవం వాటి విలువలకు అనులోమానుపాతంలో రుసుము విధించేందుకు రైల్వే అధినేతలకు ప్రత్యేక అవకాశమిస్తోంది. ఈ విషయమై పరిశ్రమదారులూ, వర్తకులూ చేస్తున్న ఫిర్యాదులు పైన ఉటంకించిన నివేదికలో, వాంగ్మూలాలున్న ప్రతి పుటలో కనిపిస్తాయి.

రవాణా, వార్తా ప్రసార సాధనాలను అభివృద్ధిచేయడం ద్వారానూ, రవాణా సాంద్రీకరణ ద్వారానూ – అంటే దాని స్థాయిని పెంచడం ద్వారానూ పెట్టుబడిదారీ ఉత్పత్తి పద్ధతి విడి విడి సరుకు రవాణా ఖర్చులను తగ్గిస్తుంది. అది సజీవ, వస్తురూప సామాజిక శ్రమలో, సరుకుల రవాణాకై వ్యయమయ్యే భాగాన్ని పెంచుతుంది. దీనికి కారణం, మొదటిది, ఉత్పాదితాల్లో అత్యధిక భాగం సరుకులుగా మారడం, రెండవది, స్థానిక మార్కెట్లకు బదులు, దూర ప్రాంతపు మార్కెట్లు ఏర్పడటం.

చలామణి అంటే, స్థలావరణలో సరుకుల వాస్తవ గమనం సరుకుల రవాణాగా తేలుతుంది. ఒకవైపు, రవాణా పరిశ్రమ ఉత్పత్తిలోని ఒక స్వతంత్ర శాఖగా ఏర్పడుతుంది. ఆ విధంగా, ఉత్పాదక పెట్టుబడి మదుపునకు ఒక ప్రత్యేక రంగమవుతుంది. మరోవైపు, అది చలామణి క్రమంలోపల, చలామణి క్రమం కోసం ఉత్పత్తి ప్రక్రియ కొనసాగింపుగా కనిపించడం దాని విశిష్ట లక్షణం.

★ ★ ★

---

* రైల్వేలపై రాయల్ కమిషన్, పుట 31, నెం. 630.

## రెండో భాగం

# పెట్టుబడి టర్నోవరు
# (The Turnover of Capital)

## అధ్యాయం - 7

# టర్నోవరు కాలం, టర్నోవర్ల సంఖ్య

**ఒ**క నిర్ణీతమైన పెట్టుబడి చలామణి కాలాన్ని దాని ఉత్పత్తి కాలంతో కలిపితే దాని మొత్తం టర్నోవరు కాలం వస్తుందని మనం గ్రహించాము. ఒక నిర్దిష్ట రూపంలో పెట్టుబడి విలువను అడ్వాన్స్ చేసిన క్షణం నుంచే అది రూపంలో ఆ క్రియాశీల పెట్టుబడి విలువ తిరిగి చేతికందే దాకా పట్టే కాలం అది.

అడ్వాన్సు చేయబడిన విలువ ద్వారా అదనపు విలువను సృష్టించడమే ఎప్పుడూ పెట్టుబడిదారీ ఉత్పత్తి తప్పనిసరి లక్ష్యం. ఈ విలువ దాని స్వతంత్ర రూపంలో, అంటే డబ్బు రూపంలో అడ్వాన్సు చేయబడినా లేదా సరుకుల రూపంలో అడ్వాన్సు చేయబడినా, లక్ష్యమదే. అప్పుడు దాని విలువ రూపం అడ్వాన్సు చేయబడిన సరుకుల ధరలో కేవలం ఊహాత్మకమైన స్వాతంత్ర్యాన్ని కలిగి వుంటుంది. ఈ రెండు సందర్భాల్లోనూ ఈ పెట్టుబడి విలువ దాని వృత్తాకార చలన కాలంలో అనేక అవతారాలు ధరిస్తుంది. పెట్టుబడిదారుల ఖాతా పుస్తకాల్లో లేదా ఖాతా డబ్బు రూపంలో దానిని ఇదమిత్థంగా నమోదు చేస్తారు.

మనం డ....డ' రూపం తీసుకున్నా, ఉపె....ఉపె రూపం తీసుకున్నా అంతరార్థమేమంటే, (1) అడ్వాన్సు చేయబడిన విలువ పెట్టుబడి విలువ విధిని నిర్వహించి, అదనపు విలువను సృష్టించింది; (2) అది తన ప్రక్రియని పూర్తి చేశాక, ఏ రూపంలో దానిని ప్రారంభించిందో అదే రూపానికి తిరిగి వచ్చింది. అడ్వాన్సు చేయబడిన విలువ డ స్వయం విస్తరణా, అదే సమయంలో ఈ రూపానికి (డబ్బు రూపానికి) పెట్టుబడి తిరిగి రావడమూ డ....డ'లో స్పష్టంగా కనపడుతుంది. అయితే ఇదే విషయం రెండో రూపంలో జరుగుతుంది. ఎందువల్లనంటే, ఉపె ఆరంభ స్థానం ఉత్పత్తి అంశాల నిర్ణీత విలువ గలిగిన సరుకుల ఉనికే. ఈ రూపంలో ఈ విలువ స్వయం విస్తరణా (స', డ') ఉంటుంది; దాని మూలరూపానికి తిరిగి రావడమూ ఉంటుంది. ఎందుకంటే, రెండో ఉపె లో, అడ్వాన్సు చేయబడిన విలువ తొలుత అడ్వాన్సు చేయబడిన ఉత్పత్తి అంశాల రూపంలోనే వుంది.

"ఉత్పత్తి పెట్టుబడిదారీ రూపంలో ఉంటే పునరుత్పత్తి కూడా అదే రూపంలో వుంటుంది.

ఉత్పత్తిలో శ్రమ ప్రక్రియ అనేది పెట్టుబడి స్వయం విస్తరణకు సాధనంగా పనిజేసినట్టే, పునరుత్పత్తిలో కూడా అది పెట్టుబడిగా, అడ్వాన్సు చేయబడిన విలువను పునరుత్పత్తి చేసే సాధనంగా, అంటే స్వయం విస్తరణ విలువగా వ్యవహరిస్తుంది" (పెట్టుబడి, మొదటి సంపుటం, అధ్యాయం 23). ఈ విషయాన్ని ఇంతకు ముందు మనం గ్రహించాం.

(I) డ–డ', (II) ఉపె–ఉపె, (III) స'–డ', అనే మూడు రూపాలూ ఈ క్రింది భేదాలను వ్యక్తం చేస్తాయి. ఉపె–ఉపె అనే రెండో రూపంలో ఈ ప్రక్రియ పునఃప్రారంభం, అంటే పునరుత్పత్తి ప్రక్రియ అన్నది ఒక వాస్తవంగా వ్యక్తమవుతుంది. కాగా I వ రూపంలో అది సాధ్యతగా వ్యక్తమవుతుంది. ఈ రెండు రూపాలూ మూడోదానికంటే భిన్నంగా వుంటాయి. వీటిలో అడ్వాన్సు చేయబడిన పెట్టుబడి విలువ డబ్బు రూపంలో అడ్వాన్సు చేయబడినా, ఉత్పత్తి యొక్క పాదార్థిక అంశాల రూపంలో అడ్వాన్సు చేయబడినా – ప్రారంభ స్థానమూ అదే, తిరిగి చేరుకొనే స్థానమూ అదే. డ–డ'లో తిరిగి రావడమన్నది డ' = డ + ధగా వ్యక్తమవుతుంది. అదే పరిమాణంలో ప్రక్రియ పునరారంభమయితే డ అన్నదే మళ్ళీ ప్రారంభ స్థానం అవుతుంది. దానిలో ధ చేరదు. అంటే పెట్టుబడిగా డ స్వయంగా విస్తరించిందనీ, కనుక అదనపు విలువ ధని సృష్టించిందనీ, కాని దాన్ని త్యజించిందనీ మాత్రమే అర్థం. ఉపె–ఉపె రూపంలో ఉత్పత్తి అంశాల రూపంలో, అడ్వాన్సు చేయబడిన పెట్టుబడి విలువ ఉపె కూడా అలాగే ప్రారంభ స్థానమే. ఈ రూపంలో స్వయం విస్తరణ ఇమిడి వుంటుంది. సాధారణ పునరుత్పత్తి జరిగితే, అదే పెట్టుబడి విలువ అదే క్రమాన్ని ఉపె అనే అదే రూపంలో తిరిగి ప్రారంభిస్తుంది. పెట్టుబడి సంచయనం జరిగితే, అప్పుడు ఉపె' (విలువ పరిమాణంలో డ'కి, స'కి సమానం) ఆ క్రమాన్ని విస్తృత పెట్టుబడి విలువగా పునఃప్రారంభిస్తుంది. అయితే ఇంతకు ముందుకంటే పెట్టుబడి విలువ పెరిగినప్పటికీ ఆ క్రమం దాని తొలి రూపంలోనే పునఃప్రారంభమవుతుంది. అందుకు విరుద్ధంగా III వ రూపంలో పెట్టుబడి విలువ ఆ ప్రక్రియను అడ్వాన్సుగా కాక, అప్పటికే విస్తరించిన విలువగా, సరుకుల రూపంలో ఉన్న మొత్తం సంపదగా ప్రారంభిస్తుంది. అడ్వాన్సు చేయబడిన పెట్టుబడి విలువ దానిలో ఒక అంతర్భాగం మాత్రమే. మొత్తం సామాజిక పెట్టుబడి చలన సందర్భంగా విడి విడి పెట్టుబడుల చలనాలను చర్చించే III వ భాగానికి ఈ చివరి రూపం ప్రధానం. పెట్టుబడి టర్నోవరు డబ్బు రూపంలోగానీ, సరుకుల రూపంలోగానీ పెట్టుబడి విలువ అడ్వాన్సుతో ఎప్పుడూ ప్రారంభమవుతుంది. అది చక్రగతిలో ఉన్న పెట్టుబడి విలువను తొలుత అడ్వాన్సు చేయబడిన రూపంలోనే తప్పనిసరిగా తిరిగి వచ్చేలా చేస్తుంది. అయితే ఈ పెట్టుబడి టర్నోవరు సందర్భంగా ఈ మూడో రూపాన్ని వాడరాదు. I వ ఆవృత్తి అదనపు విలువ ఏర్పడటంలో ప్రధానంగా టర్నోవరు ప్రభావాన్ని అధ్యయనం చేయడానికి, II వ ఆవృత్తి ఉత్పాదితాన్ని సృష్టించడంలో టర్నోవరు ప్రభావాన్ని అధ్యయనం చేయటానికి తోడ్పడుతుంది.

ఆర్థికవేత్తలు ఈ భిన్న రూపాల ఆవృత్తుల మధ్య తేడాలను బొత్తిగా గమనించలేదు. పెట్టుబడి టర్నోవరు సందర్భంగా వాటిని విడివిడిగా పరిశీలించనూ లేదు. వారు సాధారణంగా పరిగణించే రూపం డ–డ'. ఎందుకంటే ఆ రూపమే విడి పెట్టుబడిదారునిపై పెత్తనం చేస్తుంది, అతని జమాఖర్చుల లెక్కల్లో సాయపడుతుంది. డబ్బు కేవలం ఖాతా డబ్బుగా ప్రారంభమైనా సరే అది అంతే. మరికొందరు

ఉత్పత్తి అంశాల రూపంలోని మదుపుతో ప్రారంభిస్తారు. తత్ఫలితాలు తిరిగి చేతికి వచ్చేవరకు గమనిస్తారు. తిరిగి వచ్చిన ప్రతిఫలం సరుకుల రూపంలో ఉందా లేక డబ్బు రూపంలో ఉందా అన్న అంశాన్ని వీరు పేర్కొనరు. ఉదాహరణకు, "ఆర్థిక చక్రం .... మదుపు పెట్టిన దగ్గర్నుండి తత్ఫలితం తిరిగి వచ్చిందాకా సాగే మొత్తం ఉత్పత్తి గతిక్రమం. వ్యవసాయంలో ఇది నాట్లతో ప్రారంభమై కోతలతో అంతమవుతుంది" (ఎస్.పి. న్యూమన్, ఎలిమెంట్స్ ఆఫ్ పొలిటికల్ ఎకానమీ, ఆండోవర్, న్యూయార్క్, పుట 81). మరికొందరు స' (మూడో రూపం)తో ప్రారంభిస్తారు: "వ్యాపార ప్రపంచం ఆర్థిక చక్రం అనేదానిలో తిరుగుతుందని ఊహించవచ్చు. వ్యాపార చక్రం వరుసగా లావాదేవీల ద్వారా ఒక వాణిజ్య ఆవృత్తిని పూర్తి చేసి, మళ్ళీ ప్రారంభించిన స్థానానికే వస్తుంది. పెట్టుబడిదారుని మదుపు తిరిగి చేతికి రాగానే ఆర్థిక చక్రం మళ్ళీ ప్రారంభమైందనవచ్చు; అతడు మళ్ళీ తన కార్మికుల్ని నియమించ ప్రారంభిస్తాడు. వేతనాల రూపంలో వారి భత్యాన్నీ, ఇంకా బాగా చెప్పాలంటే, ఆ చక్రాన్ని ఎత్తే శక్తిని వారికి పంచుతాడు. అతను వారితో, తాను వ్యాపారం చేసే వస్తువులను తయారు చేయిస్తాడు. వాటిని మార్కెట్‌కి తెస్తాడు. ఆ సరుకు అమ్మి, ఆ కాలమంతటిలోనూ దానిపై పెట్టిన మదుపు ఫలితాన్ని తిరిగి పొందడం ద్వారా ఒక చలన సముదాయ చక్రగతిని సమాప్తం చేస్తాడు" (థామస్ చామర్స్, ఆన్ పొలిటికల్ ఎకానమీ, 2వ కూర్పు గ్లాస్గో, 1832, పుట 85).

ఏ ఉత్పత్తి శాఖలోనైనా సరే, ఒక వ్యష్టి పెట్టుబడిదారుడు మదుపు పెట్టిన మొత్తం పెట్టుబడి విలువ తన ఆవృత్తిని పూర్తి చేయగానే, అది మళ్ళీ తన తొలి రూపంలో వుంటుంది; ఇప్పుడది మళ్ళీ అదే ప్రక్రియను నిర్వహించగలదు. ఆ విలువ పెట్టుబడి విలువగా తనని తాను సుస్థిరం చేసుకుని అదనపు విలువను సృష్టించాలంటే అది ఆ ప్రక్రియను మళ్ళీ మళ్ళీ చేయాలి. ఒక విడి ఆవృత్తం అన్నది పెట్టుబడి జీవితంలో నిరంతరాయంగా పునరావృత్తం అయ్యే ఒక విభాగం, కాబట్టి ఒక నియత కాలవ్యవధి. డ–ఢ'కు పట్టే వ్యవధి చివరిలో పెట్టుబడి మరోసారి డబ్బు పెట్టుబడి రూపంలో వుంటుంది. అది మళ్ళీ రూపపరివర్తనా పరంపరను గడుస్తుంది. ఆ ప్రక్రియలో పునరుత్పత్తి లేదా స్వయం విస్తరణ ఇమిడి వుంటుంది. ఉపె–ఉపెకు పట్టే వ్యవధి చివర పెట్టుబడి ఉత్పత్తి అంశాల రూపాన్ని తిరిగి సంతరించుకుంటుంది. దాని ఆవృత్తి పునఃప్రారంభం కావాలంటే అవి తప్పనిసరిగా ఉండాలి. పెట్టుబడి పూర్తి చేసిన ఒక ఆవృత్తి, ఒక విడి చర్యగాక, ఒక నియత కాలవ్యవధుల్లో సాగే ప్రకియ అయినట్లయితే దాన్ని టర్నోవర్ అంటారు. ఈ టర్నోవర్ కాలవ్యవధిని పెట్టుబడి ఉత్పత్తి కాలమూ, దాని చలామణి కాలమూ కలిసి నిర్ణయిస్తాయి. ఈ మొత్తం కాలం పెట్టుబడి టర్నోవరు కాలం అవుతుంది. అది మొత్తం పెట్టుబడి విలువ యొక్క ఒక ఆవృత్తికీ, తదుపరి ఆవృత్తికీ మధ్య గడిచిన కాలాన్ని కొలుస్తుంది. అంటే పెట్టుబడి జీవిత క్రమంలో ఈ పునః పునరావృత్తి కాలాన్ని లేదా ఒకే పెట్టుబడి విలువ యొక్క స్వయం విస్తరణ లేదా ఉత్పత్తి పునరారంభానికి, పునరావృత్తికి పట్టే కాలాన్ని కొలుస్తుంది.

కొన్ని పెట్టుబడుల టర్నోవరు కాలం వ్యక్తిగత సాహసాల కారణంగా త్వరితం కావచ్చు లేదా తగ్గవచ్చు. అదలా వుంచితే ఈ కాల వ్యవధి మదుపు పెట్టబడే విభిన్న రంగాలలో విభిన్నంగా వుంటుంది.

శ్రమ ప్రక్రియను కొలవడానికి పని దినం సహజ ప్రమాణం అయినట్టే మదుపు పెట్టబడిన పెట్టుబడి టర్నోవరులను కొలవడానికి సంవత్సరం సహజ ప్రమాణం. పెట్టుబడిదారీ ఉత్పత్తికి జన్మస్థానమైన సమశీతోష్ణ మండలంలో అత్యంత ప్రధానమైన పంటలు వార్షిక ఉత్పాదితాలు కావడమే ఈ వార్షిక ప్రమాణానికి సహజ ప్రాతిపదిక.

టర్నోవరు కాలాన్ని కొలిచే ప్రమాణంగా ఏడాదిని 'ఏ' గానూ, కాలాన్ని 'ఎ' గానూ, దాని టర్నోవర్ల సంఖ్యను 'సం' గానూ మనం గుర్తిస్తే, అప్పుడు సం $= \frac{ఏ}{ఎ}$. ఉదాహరణకు టర్నోవరు కాలం ఎ మూడు నెలలైతే అప్పుడు సం $= \frac{12}{3}$ లేదా 4. అంటే ఏడాదిలో పెట్టుబడి టర్నోవరు 4 సార్లు జరిగింది. ఎ = 18 నెలలైతే అప్పుడు సం $= \frac{12}{18} = \frac{2}{3}$. అంటే పెట్టుబడి టర్నోవరులో మూడింట రెండు వంతులు మాత్రమే పూర్తి చేసింది. దాని టర్నోవరు కాలం అనేక సంవత్సరాలయితే, ఎన్ని సంవత్సరాలయితే సంవత్సరంలో అన్నో వంతు టర్నోవరు జరిగిందని లెక్కించబడుతుంది.

పెట్టుబడిదారుని దృష్టి నుంచి తన పెట్టుబడి టర్నోవరు కాలం అన్నది, తన పెట్టుబడిని అదనపు విలువ సృష్టించడానికీ, మళ్ళీ దాని మూలరూపంలో తిరిగి పొందడానికీ అడ్వాన్సు చేయాల్సిన కాలం.

ఉత్పత్తి, స్వయం విస్తరణ ప్రక్రియల మీద టర్నోవరు ప్రభావాన్ని మరింత క్షుణ్ణంగా పరిశీలించే ముందు, చలామణి ప్రక్రియ నుండి పెట్టుబడికి సంక్రమించి, దాని టర్నోవరు రూపాన్ని ప్రభావితం చేసే రెండు కొత్త రూపాలను మనం పరిశీలించాలి.

★ ★ ★

# అధ్యాయం - 8

# నిశ్చల పెట్టుబడి, చలామణి పెట్టుబడి
# (Fixed Capital and Circulating Capital)

## I. రూపంలో తేడాలు

స్థిర పెట్టుబడి వస్తువులను సృష్టించడానికి తోడ్పడుతుంది, వాటికి సంబంధించి దానిలో ఒక భాగం, తాను ఉత్పత్తి ప్రక్రియలోకి ప్రవేశించినప్పటి నిర్దిష్ట ఉపయోగ రూపాన్ని నిలబెట్టుకుంటుంది అని మనం గ్రహించాము (మొదటి సంపుటం, ఎనిమిదో అధ్యాయం). కనుక అది తక్కువ కాలం లేదా ఎక్కువ కాలం పాటు నిత్య పునరావృత్త శ్రమ ప్రక్రియలలో (Repeated Labour Process) అవే విధులను నిర్వహిస్తుంది. ఉదాహరణకు ఇది పారిశ్రామిక భవనాలు, యంత్రాలు వగైరాలకూ, క్లుప్తంగా చెప్పాలంటే, మనం శ్రమ పరికరాలు అని పిలిచే వాటన్నిటికీ వర్తిస్తుంది. స్థిర పెట్టుబడిలో ఈ భాగం తాను తన సొంత ఉపయోగ విలువతోపాటు తన మార్పిడి విలువను కోల్పోయిన మేరకు ఉత్పాదితానికి విలువను అందజేస్తుంది. ఈ విలువను అందజేయడాన్ని, ఉత్పత్తి సాధనం నుంచి అది సృష్టించడానికి తోడ్పడే వస్తువుకు ఈ విలువ బదిలీ కావటాన్ని సగటున లెక్కాచారం ద్వారా నిర్ధారణ అవుతుంది. అది సగటున ఎంత కాలం పని చేస్తుంది అన్నదాన్ని బట్టి, అంటే, ఉత్పత్తి సాధనం ఉత్పత్తి ప్రక్రియలో ప్రవేశించిన క్షణం నుంచీ అది పూర్తిగా వ్యయమై, హరించుకుపోయి, దాని స్థానంలో అదే రకం కొత్త సాధనాన్ని తెచ్చిపెట్టవలసి వచ్చిన క్షణందాకా లేదా అది పునరుత్పత్తి చేయబడేదాకా గడిచే కాలాన్ని బట్టి కొలవబడుతుంది.

కాబట్టి స్థిర పెట్టుబడిలోని ఈ భాగం యొక్క, అసలైన శ్రమ పరికరాల యొక్క విశేషం ఇదీ;

పెట్టుబడిలో ఒక భాగం స్థిర పెట్టుబడి రూపంలో, అనగా ఉత్పత్తి సాధనాల రూపంలో అడ్వాన్స్ చేయబడింది. శ్రమ ప్రక్రియలో ఉత్పత్తి సాధనాలు ప్రవేశించినప్పటి తమ ఉపయోగ రూపాన్ని నిలబెట్టుకున్నంత వరకూ అవి శ్రమ ప్రక్రియ కారకాలుగా వ్యవహరిస్తాయి. తయారైన వస్తువుకూ, తత్కారణంగా, ఆ వస్తువుగా రూపాంతరం చెందిన మేరకు దాన్ని సృష్టించినవీ, ఉత్పత్తి ప్రక్రియ నుండి నెట్టివేయబడతాయి. ఆ వస్తువు ఉత్పత్తిరంగం నుండి చలామణి రంగంలోకి ఒక సరుకుగా ప్రవేశిస్తుంది. అయితే శ్రమ పరికరాలు మాత్రం ఉత్పత్తి రంగంలో ప్రవేశించాక దాన్ని ఎప్పుడూ విడిచి వెళ్ళవు. వాటి విధులు వాటిని అక్కడే నిలిపి వుంచుతాయి. అడ్వాన్సు చేయబడిన పెట్టుబడి విలువలో ఒక భాగం ఈ ప్రక్రియలో శ్రమ పరికరాల విధులవల్ల నిర్ణయమైన ఈ రూపంలో

నిశ్చల మవుతాయి. ఈ విధుల నిర్వహణలో, ఆ రకంగా శ్రమ పరికరాల అరుగుదల వల్ల వాటి విలువలో కొంత భాగం ఉత్పాదితానికి చేరుతుంది. కాగా మిగిలిన భాగం శ్రమ పరికరాల్లో నిశ్చలంగా వుంటుంది. ఆ విధంగా ఉత్పత్తి ప్రక్రియలోనే నిశ్చలంగా ఉండిపోతుంది. ఈ రకంగా నిశ్చలమైన విలువ క్రమంగా తగ్గుతుంది. శ్రమ పరికరం అరిగిపొయ్యేదాకా, తక్కువో, ఎక్కువో కాలంపాటు నిరంతరాయంగా పునరావృత్తమయ్యే శ్రమ ప్రక్రియల పరంపరల నుండి ఉద్భవించే ఉత్పాదితాల రాశికంతా దాని విలువ పూర్తిగా పంపిణీ అయ్యేదాకా అది క్రమేణా తగ్గుతూ పోతుంది. అయితే అవి ఇంకా శ్రమ పరికరాల రూపంలో పని చేయగలిగినంత కాలం, అదే రకం పరికరాలు వాటి స్థానాన్ని ఆక్రమించుకోనవసరం లేనంత కాలం వాటిలో కొంత స్థిర పెట్టుబడి విలువ నిశ్చలంగానే వుంటుంది. వాటిలో మొదట నిశ్చలమైన విలువలో మిగిలిన భాగం ఉత్పాదితానికి బదిలీ అయి, సరుకు సరఫరాలో భాగంగా చలామణి అవుతుంది. శ్రమ పరికరం ఎంత ఎక్కువ కాలం మన్నితే అది అంత తక్కువగా అరుగుతుంది; అంత ఎక్కువ కాలం ఈ ఉపయోగ రూపంలో దాని స్థిర పెట్టుబడి విలువ నిశ్చలంగా వుంటుంది. అయితే, దాని మన్నిక కాలం ఏమయినప్పటికీ అది ఉత్పాదితాలకు ఇచ్చే విలువ, అది మొత్తం పని చేయగలిగిన కాలానికి విలోమ నిష్పత్తిలో వుంటుంది. ఒకే విలువ గలిగిన రెండు యంత్రాల్లో ఒకటి అయిదేళ్ళలో అరిగిపోయి మరొకటి పదేళ్ళలో అరిగిపోతే, మొదటిది రెండో దానికంటే, అదే కాలంలో రెట్టింపు విలువ ఇస్తోందని అర్థం.

శ్రమ పరికరాల్లో నిశ్చలమైన పెట్టుబడి విలువ యొక్క ఈ భాగం మిగిలిన భాగాలలానే చలామణి అవుతుంది. పెట్టుబడి విలువ అంతా నిరంతరాయంగా చలామణిలో వుంటుందనీ, ఈ అర్థంలో పెట్టుబడి అంతా చలామణి పెట్టుబడేనని మనం మొత్తంపై గ్రహించాము. అయితే మనం ఇప్పుడు పరిశీలిస్తున్న పెట్టుబడి భాగం యొక్క చలామణి విశిష్టమైనది. మొదటి అంశం, అది తన ఉపయోగ రూపంలో చలామణి కాదు. దాని విలువ మాత్రమే చలామణిలో వుంటుంది. సరుకుగా చలామణిలో వుండే ఉత్పాదితానికి తన విలువను బదిలీ చేసే నిష్పత్తిలో క్రమక్రమంగా, కొద్ది కొద్దిగా ఈ విలువ చలామణి అవుతుంది. అది పని చేస్తున్న కాలమంతటిలోనూ, తాను ఉత్పత్తి చేయడానికి తోడ్పడే సరుకులతో ప్రమేయం లేకుండా దాని విలువలో కొంత భాగం దానిలో నిశ్చలంగా వుంటుంది. సరిగ్గా ఈ విశేష లక్షణమే స్థిర పెట్టుబడి యొక్క ఈ భాగానికి నిశ్చల పెట్టుబడి రూపం ఇస్తుంది. ఉత్పత్తి ప్రక్రియలో అడ్వాన్సు చేయబడిన పెట్టుబడి యొక్క మిగిలిన పాదార్థిక భాగాలన్నీ ఇందుకు భిన్నంగా చలామణి పెట్టుబడి లేదా చలనశీల పెట్టుబడి అవుతాయి.

కొన్ని ఉత్పత్తి సాధనాలు ఉత్పాదితంలోకి పాదార్థికంగా ప్రవేశించవు. సహాయక పదార్థాలు అటువంటివే. శ్రమ పరికరాలే తమ విధి నిర్వహణలో వాటిని వినియోగిస్తాయి. ఉదాహరణకు, ఆవిరి యంత్రం వినియోగించే బొగ్గు లేదా కేవలం పనిలో సాయపడేవి; ఉదాహరణకు వెలిగించడానికి కావలసిన గ్యాస్ వగైరా. వాటి విలువ మాత్రమే ఉత్పాదితాల విలువలో ఒక భాగం అవుతుంది. ఉత్పాదితం తన సొంత చలామణిలో ఈ ఉత్పత్తి సాధనాల విలువను కూడా చలామణి చేస్తుంది. ఇది నిశ్చల పెట్టుబడికీ వీటికీ ఉన్న ఉమ్మడి లక్షణం. అయితే ఇవి ప్రతి శ్రమ ప్రక్రియలో పూర్తిగా వినియోగించబడతాయి. ప్రతి శ్రమ ప్రక్రియలోనూ అదే రకం కొత్త ఉత్పత్తి సాధనాలు వీటి స్థానాన్ని ఆక్రమిస్తాయి. వాటి విధిని నిర్వహిస్తున్నప్పుడు తమ స్వతంత్ర ఉపయోగ రూపాన్ని కాపాడుకోవు.

కనుక అవి పనిచేస్తున్నప్పుడు పెట్టుబడి విలువలో ఏ భాగమూ వాటి పాత ఉపయోగ రూపంలో, వాటి భౌతిక రూపంలో నిశ్చలంగా ఉండదు కూడా. ఈ సహాయక పదార్థాల్లోని ఈ భాగం ఉత్పాదితంలో భౌతికంగా ప్రవేశించదు. కాని తన విలువను బట్టి ఉత్పాదితం విలువలో ఒక భాగంగా మాత్రమే ప్రవేశిస్తుంది. దీనికితోడు ఈ పదార్థాల విధులు కేవలం ఉత్పత్తి రంగానికి మాత్రమే పరిమితమవుతాయి. ఈ పరిస్థితి రామ్సే (స్థిర పెట్టుబడినీ, నిశ్చల పెట్టుబడినీ కలగాపులగంగా అర్థం చేసుకున్నాడు) లాంటి ఆర్థికవేత్తలు తప్పుదారి పట్టి, ఈ పదార్థాలను నిశ్చల పెట్టుబడిగా వర్గీకరించేలా చేసింది.[1]

ఉత్పత్తి సాధనాల్లో మరో భాగమైన ముడి పదార్థాలు వగైరా భౌతికంగా ఉత్పాదితంలో ప్రవేశిస్తాయి. ఆ భాగం ఆ విధంగా ఉపయోగకర వస్తువులుగా ఉత్తరోత్తరా వ్యష్టి వినియోగంలో ప్రవేశించడానికి వీలైన రూపాలు ధరిస్తుంది. నిశ్చల పెట్టుబడికి పాదార్థిక వాహికలై, శ్రమ పరికరాలుగా సరిగా పేర్కొనబడుతున్నవేమో ఉత్పత్తిలో మాత్రమే వినియోగమవుతాయి. కనుక వ్యష్టి వినియోగ రంగంలో ప్రవేశించవు. ఎందుకంటే అవి ఉత్పాదితంలోగాని, ఉపయోగ విలువలో గాని ప్రవేశించవు. ఉత్పాదితాన్ని సృష్టించడంలో తోడ్పడినప్పటికీ, అవి అరిగిపోయేదాకా తమ సొంత స్వతంత్ర రూపాన్ని నిలబెట్టుకుంటాయి. ఈ సూత్రానికి రవాణా సాధనాలు ఒక మినహాయింపు. అవి తమ ఉత్పాదక ధర్మాన్ని నిర్వహించేటప్పుడు, అంటే ఉత్పత్తి రంగంలో ఉన్నప్పుడు, అంటే స్థానం మార్పు జరుగుతున్నప్పుడు ఆ ఉపయోగకర ఫలితం వ్యష్టి వినిమయంలోకి, ఉదాహరణకు ప్రయాణీకుని వినియోగంలోకి అప్పటికప్పుడే వస్తుంది. అతడు ఇతర వినియోగ వినిమయంలోకి, వస్తువులకి చెల్లించినట్టే వాటిని ఉపయోగించినందుకూ చెల్లిస్తాడు. ఉదాహరణకు, రసాయనిక పరిశ్రమలో ముడి పదార్థాలూ, సహాయక పదార్థాలూ సమ్మిళితమవుతాయని మనం చూశాం.[2] శ్రమ పరికరాలకూ, సహాయక పదార్థాలకూ, ముడిపదార్థాలకూ ఇదే వర్తిస్తుంది. అదే విధంగా వ్యవసాయంలో నేలను సారవంతం చెయ్యడానికి ఉపయోగించే పదార్థాల్లో కొంత భాగం మొక్కల్లో ప్రవేశించి ఉత్పాదితం తయారు కావడానికి తోడ్పడుతుంది. మరోప్రక్క, వాటి ప్రభావం దీర్ఘకాలం పాటు, ఉదాహరణకు నాలుగయిదేళ్ళపాటు ఉంటుంది. కనుక వాటిలో ఒక భాగం ఉత్పాదితంలోకి భౌతికంగా ప్రవేశించి దానికి కొంత విలువను బదిలీ చేస్తుంది. మిగిలిన భాగం తన పాత ఉపయోగ రూపంలో నిశ్చలంగా వుండి తన విలువను నిలబెట్టుకుంటుంది. అది ఒక ఉత్పత్తి సాధనంగా కొనసాగుతుంది. పర్యవసానంగా నిశ్చల పెట్టుబడి రూపాన్ని ఉంచుకుంటుంది. దుక్కిటెద్దు నిశ్చల పెట్టుబడి. కాగా దాన్ని మాంసానికి ఉపయోగిస్తే ఇక అది శ్రమ పరికరంగా గాని, నిశ్చల పెట్టుబడిగా గాని పనిచేయదు.

ఉత్పత్తి సాధనాలలో మదుపు పెట్టబడిన పెట్టుబడి విలువలో ఒక భాగానికి నిశ్చల పెట్టుబడి స్వభావం సిద్ధించడానికి కారణం ఈ విలువ చలామణి అయ్యే ప్రత్యేక తీరు తప్ప మరొకటి కాదు. ఈ ప్రత్యేక తరహా చలామణికి మూలం, శ్రమ పరికరం తన విలువను ఉత్పాదితానికి అందించే ప్రత్యేక తీరే లేదా ఉత్పత్తి ప్రక్రియలో విలువల సృష్టికర్తగా అది వ్యవహరించే ప్రత్యేక తీరే. మళ్ళీ ఈ తీరుకు మూలం, శ్రమ ప్రక్రియలో శ్రమ పరికరాలు పని చేసే ప్రత్యేక పద్ధతే.

1. కార్ల్ మార్క్స్, అదనపు విలువ సిద్ధాంతాలు, 3 టీల్, బెర్లిన్, 1962, పుటలు 323 - 25-సం.
2. కార్ల్ మార్క్స్, పెట్టుబడి ఒకటో సంపుటం.

ఒక శ్రమ ప్రక్రియ నుంచి బయటికొచ్చిన ఉత్పాదితం మరో శ్రమ ప్రక్రియలో ఉత్పత్తి సాధనంగా ప్రవేశిస్తుందని మనకు తెలుసు.[1] ఒక ఉత్పాదితం ఉత్పత్తి ప్రక్రియలో శ్రమ పరికరంగా వ్యవహరించడం వల్లే అది నిశ్చల పెట్టుబడి అవుతుంది. అయితే అది ఆ ప్రక్రియ నుంచి బయటికి రాగానే నిశ్చల పెట్టుబడి కాదు. ఉదాహరణకు ఒక యంత్రం పారిశ్రామికుని ఉత్పాదితంగా లేదా సరుకుగా అతని సరుకు పెట్టుబడి అవుతుంది. దాని కొనుగోలుదారుడైన పెట్టుబడిదారు దాన్ని ఉత్పాదకంగా వినియోగించేంత వరకూ అది నిశ్చల పెట్టుబడి కాదు.

మార్పు లేదు అనుకుంటే, మిగిలిన పరిస్థితుల్లో శ్రమ పరికరం మన్నికను బట్టి దాని నిశ్చలత్వం స్థాయి పెరుగుతుంది. శ్రమ పరికరాల్లో నిశ్చలమైన పెట్టుబడి విలువకూ, నిత్యపునరావృత్త శ్రమ ప్రక్రియల్లో అది ఉత్పాదితానికి అప్పగించే విలువకూ మధ్య తేడా మోతాదును నిర్ణయించేది ఈ మన్నికే. శ్రమ ప్రక్రియ మళ్ళీ మళ్ళీ జరిగే ప్రతిసారీ, శ్రమ పరికరం కొంత విలువను బదిలీ చేస్తుంది. ఈ విలువ బదలాయింపు ఎంత నిదానంగా సాగితే, నిశ్చల పెట్టుబడి అంత ఎక్కువగా వుంటుంది. ఉత్పత్తి ప్రక్రియలో వినియోగించిన పెట్టుబడికీ, దానిలో వినియోగం అయిన పెట్టుబడికీ మధ్య తేడా అంత ఎక్కువగా వుంటుంది. ఈ తేడా మాయమవగానే శ్రమ పరికరం నిరుపయోగ మవుతుంది. తన ఉపయోగ విలువనూ, విలువనూ కూడా కోల్పోతుంది. అది విలువకు నిలయంగా వుండటం అంతమవుతుంది. నిశ్చల పెట్టుబడి యొక్క పాదార్థిక వాహకాలన్నిటిలాగే శ్రమ పరికరం కూడా తన ఉపయోగ విలువతో పాటు, తన విలువను కోల్పోయిన మేరకే అది ఉత్పాదితానికి విలువను ఇచ్చివేయ గలుగుతుంది. కనుక అది తన ఉపయోగ విలువను ఎంత నెమ్మదిగా కోల్పోతే అంత ఎక్కువ కాలం ఉత్పత్తి క్రమంలో నిలబడగలుగుతుంది. దానిలో స్థిర పెట్టుబడి విలువ అంత ఎక్కువ కాలం నిశ్చలంగా వుంటుంది.

సహాయక పదార్థాలూ, ముడి పదార్థాలూ, సగం తయారైన వస్తువులూ వగైరా ఖచ్చితంగా చెప్పవలసి వస్తే శ్రమ పరికరాలు కాని ఉత్పత్తి సాధనాలు గనుక తమ విలువను ఇవ్వడంలో, తత్కారణంగా చలామణి తరహాలో శ్రమ పరికరాలలాగే ప్రవర్తిస్తే, అవి కూడా నిశ్చల పెట్టుబడికి పాదార్థిక నిలయమే లేదా దానికి ఒక అస్తిత్వ రూపమే. నేలను సారవంతం చేయడానికి వాడే రసాయనిక పదార్థాల ప్రభావం అనేక సంవత్సరాల పాటు ఉంటుంది. దీని విషయంలోనూ అదే వర్తిస్తుంది. ఇక్కడ విలువలో ఒక భాగం ఉత్పాదితం పక్కనే తన స్వతంత్ర రూపంలో లేదా నిశ్చల పెట్టుబడి రూపంలో ఉంటూనే వుంటుంది. కాగా మిగిలిన భాగం ఉత్పాదితానికి బదిలీ అయింది కనుక దానితో పాటు చలామణిలో వుంటుంది. ఈ సందర్భంలో ఉత్పాదితంలోకి ప్రవేశించేది కేవలం నిశ్చల పెట్టుబడి విలువలోని ఒక భాగం మాత్రమే కాదు. ఆ భాగం విలువ వున్న ఉపయోగ విలువ కూడా, ఆ పదార్థం కూడా ప్రవేశిస్తుంది.

'నిశ్చల పెట్టుబడి', 'చలామణి పెట్టుబడి' అనే అభివర్గాలను 'స్థిర పెట్టుబడి' 'అస్థిర పెట్టుబడి' అనే వాటితో కలగాపులగం చేశారు. ఆ మౌలికమైన పొరపాటుతో పాటు, ఇంతవరకూ ఈ భావనల నిర్వచనాలలో ఆర్థికవేత్తలు పడిన గందరగోళానికి ప్రధాన కారణాలివి :

---

1. కార్ల్ మార్క్స్, పెట్టుబడి, ఒకటో సంపుటం.

శ్రమ పరికరాల్లో పాదార్థికంగా అంతర్నిహితమై ఉన్న కొన్ని లక్షణాలను నిశ్చల పెట్టుబడి ప్రత్యక్ష లక్షణాలుగా ఊహించడం కద్దు. ఉదాహరణకు, ఒక ఇంటి యొక్క చలనరాహిత్యం. అయితే ఇటువంటి సందర్భాల్లో, నిశ్చల పెట్టుబడి రూపాలైన శ్రమ పరికరాల్లో మరి కొన్నిటికి ఇందుకు విరుద్ధమైన లక్షణముంటుందని రుజువు చేయడం సదా సులభమే. ఉదాహరణకు, ఒక నౌక భౌతిక చలనశీలత.

లేదా విలువ చలామణి వల్ల తలెత్తే ఆర్థిక రూప నిర్దిష్టతను ఒక వస్తు లక్షణంగా గందరగోళ పడటం కద్దు – వస్తువులు, స్వభావరీత్యానే, ఏదో ఒక నిర్దిష్ట రూపంలో – నిశ్చల రూపంలోనో, చలామణి రూపంలోనో – పెట్టుబడి అయినట్టు. కాని అవి స్వయంగా పెట్టుబడి కానేకావు. కొన్ని నిర్దిష్ట సామాజిక పరిస్థితుల్లో మాత్రమే పెట్టుబడిగా రూపొందుతాయి. ఏ సామాజిక పరిస్థితుల్లో జరుగుతోందనే దానితో ప్రమేయం లేకుండా ప్రతి శ్రమ ప్రక్రియలోనూ ఉత్పత్తి సాధనాలు శ్రమ పరికరాలుగానూ, శ్రమ వస్తువులుగానూ విభజించబడతాయని గ్రహించాము.[1] అయితే ఆ రెండూ పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానంలోనే, ఇంతకు ముందు భాగంలో చూపించినట్టు, 'ఉత్పాదక పెట్టుబడి' అయినప్పుడు మాత్రమే పెట్టుబడిగా మారతాయి. ఆ రకంగా శ్రమ పరికరాలకూ, శ్రమ వస్తువులకూ మధ్య శ్రమ ప్రక్రియ స్వభావం మూలంగా ఉన్న తేడా ఒక కొత్త రూపంలో, నిశ్చల పెట్టుబడికీ చలామణి పెట్టుబడికీ మధ్య తేడాగా ప్రతిబింబిస్తుంది. అప్పుడు మాత్రమే శ్రమ పరికరం పాత్ర వహించే వస్తువు నిశ్చల పెట్టుబడి అవుతుంది. దాని భౌతిక లక్షణాల కారణంగా అది శ్రమ పరికరంగా గాక ఇతర విధులుగా పని చేయగలిగితే తాను నిర్వహించే ప్రత్యేకమైన పనిని బట్టి అది నిశ్చల పెట్టుబడి అయివుండవచ్చు, కాకపోనూవచ్చు. పశువులు వ్యవసాయంలో వినియోగించబడితే నిశ్చల పెట్టుబడి, ఆహారానికి వినియోగించబడితే, అవి ఒక ఉత్పాదితంగా చలామణిలో చివర ప్రవేశించే ముడిపదార్థాలవుతాయి. కనుక అప్పుడు అవి చలామణి పెట్టుబడి అవుతాయి. నిశ్చల పెట్టుబడి కావు.

పదే పదే జరిగినా, ఒకదానితో ఒకటి ముడిపడిన, నిరంతరాయమైన శ్రమ ప్రక్రియలుగా వున్నప్పుడు అవి ఒక ఉత్పత్తి కాలవ్యవధిని అంటే, ఒకానొక ఉత్పాదితాన్ని పూర్తి చేయడానికి పట్టే మొత్తం ఉత్పత్తి కాలాన్ని నిర్ధారణ చేస్తాయి. ఈ శ్రమ ప్రకియల్లో గణనీయమైన కాలం పాటు ఉత్పత్తి సాధనాలను నిశ్చలంగా అట్టేపెట్టి ఉంచాల్సిన అవసరం వల్ల పెట్టుబడిదారు నిశ్చల పెట్టుబడి విషయంలో లాగానే తన పెట్టుబడిని ఎక్కువ లేదా తక్కువ కాలం పాటు అడ్వాన్సు చేయాల్సి వస్తుంది. అయితే కేవలం దానివల్లనే, అతని పెట్టుబడి నిశ్చల పెట్టుబడి కాజాలదు. ఉదాహరణకు, ఉత్పత్తి క్రమంలో ఏడాదిపాటు వుండే విత్తనాలు నిశ్చల పెట్టుబడి కావు. అవి కేవలం ముడి పదార్థాలు మాత్రమే. మొత్తం పెట్టుబడి ఉత్పాదక పెట్టుబడిగా పని చేసినంత కాలం ఉత్పత్తి ప్రక్రియలోనే ఉంటుంది. కనుక మొత్తం ఉత్పాదక పెట్టుబడి అంశాల పాదార్థిక రూపాలూ, వాటి విధులూ, వాటి చలామణి తీరులూ ఏమయినప్పటికీ అవి కూడా అంతే. నిశ్చలంగా ఉండే కాలం ఎక్కువగా లేదా తక్కువగా ఉండటం అన్నది ఆ ఉత్పత్తి ప్రక్రియ తీరుతెన్నుల మీద, ఉద్దేశించబడిన ఉపయోగకర

1. కార్ల్ మార్క్స్, పెట్టుబడి మొదటి సంపుటి, ఏడో అధ్యాయం. సం.

ప్రభావంపైన ఆధారపడి వుంటుంది. అయితే ఈ నిశ్చలత్వం అన్నది నిశ్చల పెట్టుబడికీ, చలామణి పెట్టుబడికీ మధ్య ఉన్న తేడాను ప్రభావితం చేయదు.[1]

సాధారణ శ్రమ పరిస్థితులతో సహా, శ్రమ పరికరాల్లో ఒక భాగం ఒక శ్రమ పరికరంగా ఉత్పత్తి ప్రక్రియలో ప్రవేశించగానే, అంటే, దాని ఉత్పాదక కార్యానికి సిద్ధం చేయగానే అక్కడ స్థానికమవుతుంది. ఉదాహరణకు యంత్రాలు లేదా మొదటే కదల్చ వీలుకాని, స్థానిక రూపంలో ఉత్పత్తి చేయబడతాయి. ఉదాహరణకు, నేలను మెరుగుపరచుకోవడం, ఫ్యాక్టరీ భవనాలు, బ్లాస్ట్ ఫర్నేసులు, కాలవలు, రైలు మార్గాలు వగైరా. తాను పని చేసే ఉత్పత్తి ప్రక్రియకు శ్రమ పరికరం అంటిపెట్టుకుని ఉండటానికి కారణం, అది భౌతికంగా వున్న తీరు కూడా. మరోవైపున ఒక శ్రమ పరికరం ఒక స్థానం నుండి మరో స్థానానికి భౌతికంగా నిరంతరాయంగా మారవచ్చు, తిరగవచ్చు. అయినప్పటికీ అది ఉత్పత్తి ప్రక్రియలోనే ఉంటుంది. ఉదాహరణకు రైలింజను, ఓడ, దుక్కిటెద్లు వగైరా, శ్రమ పరికరాలకు నిశ్చల పెట్టుబడి స్వభావం కదలలేకపోవడం వల్ల వచ్చింది కాదు. కదల గలగడం వల్లనూ వచ్చింది కాదు. అయితే కొన్ని శ్రమ పరికరాలు స్థావర రూపం ధరించి, నేలలో వేళ్ళు పాతుకుని ఉండటమన్నది నిశ్చల పెట్టుబడిలోని ఈ విభాగానికి దేశాల ఆర్థిక రంగంలో ఒక విశిష్టమైన పాత్ర వుంది. వాటిని విదేశాలకు పంపడం సాధ్యం కాదు. ప్రపంచ మార్కెట్‌లో సరుకులుగా చలామణి కాజాలవు. ఈ నిశ్చల పెట్టుబడి హక్కుభుక్తాలు మారొచ్చు. వాటిని కొనవచ్చు, అమ్మవచ్చు. ఈ మేరకు భావరూపేణా చలామణిలో వుండొచ్చు. ఈ హక్కుభుక్తాలు విదేశీ మార్కెట్లో చలామణి కూడా కావచ్చు – ఉదాహరణకు స్టాకుల రూపంలో. ఈ తరహా నిశ్చల పెట్టుబడిపై స్వామ్యం వహించే వ్యక్తులు మారినప్పటికీ పాదార్థికంగా నిశ్చలమైన భాగానికీ, జాతీయ సంపదలో కదల వీలులేని, కదల వీలున్న భాగానికీ మధ్య ఉండే సంబంధంలో మార్పేమీ ఉండదు.[2]

నిశ్చల పెట్టుబడి యొక్క విశిష్టమైన చలామణి విశిష్టమైన టర్నోవరుకు దారితీస్తుంది. తన భౌతిక అరుగుదల వల్ల కోల్పోయే విలువ భాగం ఉత్పాదితం విలువలో ఒక భాగంగా చలామణి అవుతుంది. ఉత్పాదితం తన చలామణి ద్వారా డబ్బుగా మారుతుంది. కనుక ఉత్పాదితం వల్ల చలామణిలో ఉంచబడిన శ్రమ పరికరం యొక్క విలువ భాగం కూడా డబ్బుగా మారుతుంది. ఈ విలువ డబ్బు రూపంలో చలామణి రంగం నుంచి తప్పుకుంటుంది. ఉత్పత్తి ప్రక్రియలో ఒక విలువ నిలయంగా ఉన్న స్థితిని శ్రమ పరికరం ఏ నిష్పత్తిలో కోల్పోతుందో ఆ నిష్పత్తిలోనే ఇది జరుగుతుంది. ఆ రకంగా దాని విలువకు ద్వంద్వ అస్తిత్వం సిద్ధిస్తుంది. దానిలోని ఒక భాగం ఉత్పత్తి ప్రక్రియలో దాని ఉపయోగ రూపానికి, తన భౌతిక రూపానికి అంటిపెట్టుకొని వుంటుంది. మరోభాగం ఆ రూపం నుండి డబ్బురూపంలో విడిపోతుంది. తన విధి నిర్వహణలో తన వస్తురూపంలో వుండే శ్రమ పరికరపు విలువ భాగం నిరంతరాయంగా తగ్గుతుంది; కాగా డబ్బుగా మారిన భాగం నిరంతరాయంగా పెరుగుతుంది. తుదకు శ్రమ పరికరం హరించుకుపోయి దాని మొత్తం విలువ దాని కళేబరం నుండి విడిపోయి డబ్బుగా మారుతుంది. ఇక్కడ ఉత్పాదక పెట్టుబడి యొక్క ఈ

1. ఏది నిశ్చల పెట్టుబడి, ఏది చలామణి పెట్టుబడి అనేది నిర్ణయించటం కష్టమవడం వల్ల హెర్‌లోరెంజ్ స్టీయిన్, ఈ తేడాని కేవలం విషయ పరిశీలనకు తోడ్పడే అంశంగా పరిగణిస్తాడు.
2. నాలుగో రాత ప్రతి చివర, రెండో రాత ప్రతి మొదలు - **ఎంగెల్స్.**

అంశం టర్నోవరులోని విశిష్టత ద్యోతకమవుతుంది. దాని విలువ డబ్బుగా మారడం, దాని విలువకు వాహకమైన సరుకు డబ్బుగా మారే క్రమంలో అడుగు కలిపి సాగుతుంది. అయితే డబ్బు రూపం నుండి మళ్ళీ దాని ఉపయోగ రూపానికి మారడం అన్నది, సరుకులు మళ్ళీ వాటి ఇతర ఉత్పత్తి అంశాలుగా మారడంతో పాటు గాక, విడిగా జరుగుతుంది. దాని సొంత పునరుత్పత్తి కాల వ్యవధిని బట్టి అంటే, శ్రమ పరికరం పూర్తిగా అరిగిపోయి మరో అదే రకం పరికరంచే స్థానభ్రంశం పొందడానికి పట్టే కాలవ్యవధిని బట్టి జరుగుతుంది. 10,000 పౌండ్ల విలువ గల యంత్రం పదేళ్ళపాటు పనిచేస్తుంది అనుకుంటే, దానికోసం మొదట అడ్వాన్సు చేసిన విలువ టర్నోవరు కాలం పదేళ్ళవుతుంది. ఈ కాల వ్యవధి పూర్తయ్యేదాకా తన భౌతిక రూపంలో అది పని చేస్తూనే వుంటుంది. దాన్ని పునరుద్ధరించాల్సిన అవసరం లేదు. ఈలోగా దాని విలువ నిరంతరాయంగా ఉత్పత్తి కావటానికి అది సాయపడుతున్న సరుకుల విలువలో ఒక భాగంగా, కొంచెం కొంచెంగా చలామణిలో వుంటుంది. చివరికి, పది సంవత్సరాల ఆఖరున అది పూర్తిగా డబ్బు రూపం సంతరించుకొనేదాకా, డబ్బు మళ్ళీ యంత్రంగా మారేదాకా, అంటే దాని టర్నోవరు పూర్తయేదాకా అది క్రమేణా డబ్బుగా మారుతూనే వుంటుంది. ఈ పునరుత్పత్తి సమయం వచ్చేదాకా దాని విలువ క్రమేణా రిజర్వు నిధిగా డబ్బు రూపంలో పోగవుతుంది.

మిగిలిన ఉత్పాదక పెట్టుబడి అంశాలు ఇవీ : సహాయక, ముడి పదార్థాల రూపంలో ఉండే స్థిర పెట్టుబడీ, శ్రమ శక్తిపై మదుపు పెట్టిన అస్థిర పెట్టుబడి.

ఈ విభిన్న అంతర్భాగాలు ఉత్పాదితాల సృష్టికర్తలుగా, విలువల సృష్టికర్తలుగా విభిన్నంగా ప్రవర్తిస్తాయనే విషయాన్ని శ్రమ ప్రక్రియ అదనపు విలువ ఉత్పత్తి ప్రక్రియల విశ్లేషణ (మొదటి సంపుటి, ఏడో అధ్యాయం) రుజువు చేసింది. స్థిర పెట్టుబడిలో సహాయక, ముడి పదార్థాలుండే భాగం విలువ, శ్రమ పరికరాలుండే భాగం విలువ లాగానే ఉత్పాదితం విలువలో కేవలం బదిలీ అయిన విలువగా పునః ప్రత్యక్షమవుతుంది. కాగా శ్రమశక్తి ఉత్పాదితానికి శ్రమ ప్రక్రియ ద్వారా, తన విలువకు సమానమైన విలువను కలుపుతుంది. మరోలా చెప్పాలంటే తన విలువను పునరుత్పత్తి చేస్తుంది. అంతేకాదు, సహాయక పదార్థాల్లో ఒక భాగం అనగా ఇంధనం, వెలిగించే గ్యాస్ లాంటివి భౌతికంగా ఉత్పాదితంలోకి ప్రవేశించకుండానే శ్రమ ప్రక్రియలో వినియోగించబడతాయి. కాగా వాటిలో మరో భాగం సహాయక పదార్థాలు ఉత్పాదితంలోకి భౌతికంగా ప్రవేశించి, దాని పాదార్థిక సారాంశాన్ని రూపొందిస్తాయి. అయితే చలామణి టర్నోవరు జరిగే తీరుకి సంబంధించి, ఈ తేడాలతో ప్రమేయం లేదు. సహాయక పదార్థాలూ, ముడిపదార్థాలూ ఉత్పాదితం సృష్టిలో పూర్తిగా వినియోగించ బడతాయి గనక, అవి తమ విలువను ఉత్పాదితానికి పూర్తిగా బదిలీ చేస్తాయి. కనుక ఈ విలువ మొత్తంగా ఉత్పాదితంచేత చలామణిలో ఉంచబడుతుంది; అది డబ్బుగా రూపాంతరం చెందుతుంది. తిరిగి సరుకు యొక్క ఉత్పత్తి అంశాలుగా రూపొందుతుంది. నిశ్చల పెట్టుబడి టర్నోవరులాగా దీని టర్నోవరు ఎక్కడా ఆపుచేయబడదు. దాని వివిధ రూపాల ఆవృత్తిలో అది నిరంతరాయంగా పయనిస్తుంది. ఫలితంగా ఉత్పాదక పెట్టుబడి యొక్క ఈ అంశాలు నిరంతరాయంగా పునరుద్ధరించ బడతాయి.

శ్రమ శక్తిపై మదుపు పెట్టబడిన అస్థిర ఉత్పాదక పెట్టుబడి సంగతికి వస్తే, శ్రమ శక్తి, ఒక

నిర్ణీత కాలానికి కొనబడుతుందనే విషయాన్ని గమనించాలి. పెట్టుబడిదారు దాన్ని కొని, ఉత్పత్తి ప్రక్రియలో ఉంచగానే అది అతని పెట్టుబడిలో అంతర్భాగం అవుతుంది. అస్థిర అంతర్భాగం అవుతుంది. ఒక నిర్ణీత కాలం పాటు శ్రమశక్తి రోజూ పనిచేస్తుంది. ఉత్పాదితానికి మొత్తం రోజుకి సరిపడా తన సొంత విలువను మాత్రమే గాక, అదనపు విలువను కూడా జోడిస్తుంది. ప్రస్తుతానికి మనం ఈ అదనపు విలువను పరిగణనలోకి తీసుకోవద్దు. శ్రమశక్తి, ఉదాహరణకు, ఒక వారానికి కొనబడి, తన పని తాను నిర్వహించింది అనుకుందాం. దాని కొనుగోలు అదే కాల వ్యవధి లోపల నిరంతరాయంగా తిరిగి జరుగుతుండాలి. శ్రమ శక్తి తాను పనిచేస్తున్నప్పుడు ఉత్పాదితానికి తన విలువకు సమానమైనదాన్ని జోడిస్తుంది. ఉత్పాదితం చలామణిలో వున్న కారణంగా అది డబ్బుగా మారుతుంది. అది తిరిగి డబ్బు నుండి శ్రమశక్తిగా మార్చబడాలి. లేదా దాని వివిధ రూపాలు సంపూర్ణ ఆవృత్తిలో నిరంతరాయంగా పయనించాలి అంటే, నిరంతరాయమైన ఉత్పత్తికి అంతరాయం కలగకుండా వుండాలంటే, అది టర్నోవర్‌ని పూర్తి చేయాలి.

కనుక ఉత్పాదక పెట్టుబడిలో శ్రమ శక్తి కోసం అడ్వాన్సు చేయబడిన భాగం ఉత్పాదితానికి పూర్తిగా బదిలీ అయి (ఇక్కడ కూడా అదనపు విలువ సమస్యను పరిగణనకు తీసుకోకుండా వదిలి వేద్దాం), దానితో పాటు చలామణి రంగానికి చెందిన రెండు రూపాంతరీకరణలను దాటుతుంది. ఈ నిరంతరాయమైన పునరుద్ధరణ కారణంగా అది సదా ఉత్పత్తి ప్రక్రియలోనే అంతర్భాగంగా వుంటుంది. విలువను సృష్టించే విషయంలో శ్రమశక్తికీ, స్థిర పెట్టుబడిలో నిశ్చల పెట్టుబడి కాని అంతర్భాగానికీ మధ్య ఎంత తేడా ఉన్నప్పటికీ, విలువ టర్నోవర్ విషయంలో నిశ్చల పెట్టుబడికి విరుద్ధంగా, ఆ అంతర్భాగాలకూ శ్రమ శక్తికీ పోలిక ఉంది. ఉత్పాదక పెట్టుబడిలోని ఈ అంతర్భాగాలు – శ్రమ శక్తిపైన, నిశ్చల పెట్టుబడి కాని ఉత్పత్తి సాధనాలపైన మదుపు పెట్టబడిన దాని విలువ భాగాలు – వాటి ఉమ్మడి టర్నోవరు లక్షణాల రీత్యా, నిశ్చల పెట్టుబడికి చలామణి పెట్టుబడిగా లేదా చలనశీల పెట్టుబడిగా ఎదురవుతాయి.

శ్రమ శక్తిని వినియోగించుకున్నందుకు కార్మికునికి పెట్టుబడిదారు చెల్లించే డబ్బు కార్మికునికి అవసరమైన జీవితాధార వస్తువులకు సాధారణ సమ విలువ తప్ప, మరొకటి కాదని మనం ఇదివరకే నిరూపించాము.[1] ఈ మేరకు అస్థిర పెట్టుబడి, సారాంశం రీత్యా జీవితాధార వస్తువులన్న మాట. అయితే మనం టర్నోవరు గురించి చర్చిస్తున్న ఈ సందర్భంలో, ఇది రూపానికి సంబంధించిన సమస్య. పెట్టుబడిదారు కొనేది కార్మికుని జీవితాధార వస్తువులను కాదు, అతని శ్రమ శక్తిని మాత్రమే. అతని అస్థిర పెట్టుబడిగా ఉండేది, కార్యాచరణలో వున్న కార్మికుని శ్రమశక్తి. అంతేగాని అతని జీవితాధార వస్తువులు కాదు. శ్రమ ప్రక్రియలో పెట్టుబడిదారు ఉత్పాదకంగా వినియోగించేది శ్రమశక్తిని మాత్రమే. అతని జీవితాధార వస్తువుల్ని కాదు. కార్మికుడే తన శ్రమ శక్తికి లభించిన డబ్బుని జీవితాధార వస్తువులుగా మారుస్తాడు. వాటిని తిరిగి శ్రమ శక్తిగా మార్చడంకోసం, బతికి ఉండడం కోసం ఈ పని చేస్తాడు; అచ్చం పెట్టుబడిదారు లాగానే. ఉదాహరణకు అతడు కూడా తాను డబ్బుకు అమ్మిన సరుకుల అదనపు విలువలో కొంత భాగాన్ని తన జీవితాధార వస్తువులుగా మారుస్తాడు. ఇక్కడ

1. కార్ల్ మార్క్స్, పెట్టుబడి సం. I, అధ్యాయం VI - సం.

అతని సరుకులు కొన్నవాడు అతనికి జీవితాధార వస్తువుల రూపంలో చెల్లిస్తున్నాడని చెప్పలేము కదా! కార్మికుని వేతనంలో ఒక భాగాన్ని జీవితాధార వస్తువుల రూపంలో అంటే, వస్తు రూపేణా చెల్లించినప్పటికీ, అది ఈనాడు రెండో లావాదేవీ అవుతుంది. అతడు తన శ్రమ శక్తిని ఒక నిర్దిష్టమైన ధరకి, ఈ ధరలో ఒక భాగం జీవితాధార వస్తువుల రూపంలో పొందే ఒడంబడికతో అమ్ముతాడు. ఇది చెల్లింపు రూపాన్ని మాత్రమే మారుస్తుంది. అతను వాస్తవంలో అమ్మేది అతని శ్రమ శక్తిని అన్న అంశాన్ని మార్చదు. ఇది రెండో లావాదేవీ. ఇది జరిగేది కార్మికునికీ పెట్టుబడిదారుకీ మధ్య కాదు. సరుకుల కొనుగోలుదారుగా కార్మికునికీ, సరుకుల అమ్మకందారుగా పెట్టుబడిదారునికీ మధ్య ఈ లావాదేవీ జరుగుతుంది. కాగా మొదటి లావాదేవీలో కార్మికుడు ఒక సరుకు (తన శ్రమ శక్తి) అమ్మకందారుడు. పెట్టుబడిదారు దాని కొనుగోలుదారుడు, ఒక పెట్టుబడిదారు ఒక ఇనుప కర్మాగారానికి తన సరుకును, ఉదాహరణకు, ఒక యంత్రాన్ని అమ్మి దానికి బదులు మరో సరుకును, ఉదాహరణకు, ఇనుముని తీసుకోవడం ఎటువంటిదో సరిగ్గా ఇదీ అలాంటిదే. కనుక నిశ్చల పెట్టుబడికి విరుద్ధంగా చలామణి పెట్టుబడి స్వభావాన్ని సంతరించుకునేది కార్మికుని జీవితాధార వస్తువులు కాదు. అతని శ్రమ శక్తి కూడా కాదు. అది ఉత్పాదక పెట్టుబడిలో, శ్రమ శక్తిపై మదుపు పెట్టబడిన విలువ భాగం. అది తన టర్నోవరు రూపం కారణంగా నిశ్చల పెట్టుబడిలోని కొన్ని అంతర్భాగాలతో ఉమ్మడిగానూ, మరికొన్ని అంతర్భాగాలకి విరుద్ధంగానూ ఈ స్వభావాన్ని సంతరించుకుంటుంది.

శ్రమశక్తిలోనూ, ఉత్పత్తి సాధనాల్లోనూ ఉన్న చలామణి పెట్టుబడి విలువ అనేది, ఉత్పాదితం ఉత్పత్తి ప్రక్రియలో ఉన్న కాలానికి మాత్రమే, నిశ్చల పెట్టుబడి పరిమాణంచే నిర్ణయించబడిన ఉత్పత్తి స్థాయికి అనుగుణంగా అడ్వాన్సు చేయబడుతుంది. ఈ విలువ ఉత్పాదితంలో మొత్తంగా ప్రవేశిస్తుంది. కనుక అది అమ్మకం కాగానే చలామణి రంగంనుండి పూర్తిగా తిరిగి చేతికి వస్తుంది. దాన్ని మళ్ళీ కొత్తగా అడ్వాన్సు చేయవచ్చు. పెట్టుబడి యొక్క చలామణి భాగం ఇమిడి ఉన్న శ్రమశక్తి, ఉత్పత్తి సాధనాలూ పూర్తిగా ఉత్పాదితం తయారీకీ, దాని అమ్మకానికీ అవసరమైన మేరకు చలామణి నుండి ఉపసంహరించబడతాయి. అయితే, వాటిని తిరిగి కొనుగోలు చేయడం ద్వారా, డబ్బు రూపం నుండి ఉత్పత్తి అంశాలుగా తిరిగి మార్చడం ద్వారా వాటిని నిరంతరాయంగా భర్తీచేయాలి, పునరుద్ధరించాలి. అవి నిశ్చల పెట్టుబడి అంశాలకంటే తక్కువ పరిమాణాలలో దఫదఫాలుగా మార్కెట్ నుండి ఉపసంహరించబడతాయి. అయితే వాటిని మళ్ళీ మరింత తరచుగా దాని నుంచి ఉపసంహరించాలి. వాటిపై మదుపు పెట్టబడిన పెట్టుబడి తక్కువ వ్యవధుల్లో పునరుద్ధరించబడాలి. వాటి మొత్తం విలువను చలామణిలో ఉంచే ఉత్పాదితం యొక్క నిరంతరాయమైన రూప మార్పిడి వల్ల ఈ నిరంతరాయమైన పునరుద్ధరణ జరుగుతుంది. ఆఖరు విషయం, మొత్తం రూపాంతరీకరణల ఆవృత్తిని గడిచేది వాటి విలువలే కాదు, వాటి పాదార్థిక రూపాలు కూడా. అవి నిరంతరాయంగా సరుకుల రూపం నుండి అవే సరుకుల ఉత్పత్తి అంశాలుగా మార్చబడుతూనే వుంటాయి.

శ్రమశక్తి తన సొంత విలువతో పాటు ఎప్పుడూ ఉత్పాదితానికి, వేతనం చెల్లించబడని శ్రమకి, సాకార రూపమైన అదనపు విలువను చేరుస్తుంది. తయారైన వస్తువు, తన విలువలో ఉన్న ఇతర అంశాలతో పాటు, దీన్ని కూడా నిరంతరాయంగా చలామణిలో పెడుతుంది; డబ్బుగా మారుస్తుంది.

అయితే ఇక్కడ మనం ప్రధానంగా పరిశీలిస్తున్నది, పెట్టుబడి విలువ యొక్క టర్నోవరునే తప్ప అదనపు విలువ టర్నోవర్‌ని కాదు. కనుక ప్రస్తుతానికి ఈ రెండోదాన్ని పక్కన పెడదాం.

పై చెప్పినదాన్ని బట్టి ఈ కింది నిర్ధారణలు చేయవచ్చు.

1. నిశ్చల పెట్టుబడి, చలామణి పెట్టుబడి రూపాలు నిర్దిష్టత, ఉత్పత్తి ప్రక్రియలో పనిచేసే పెట్టుబడి విలువ అంటే ఉత్పాదక పెట్టుబడి విలువ విభిన్న టర్నోవరుల ఫలితంగా మాత్రమే తలెత్తుతుంది. టర్నోవరులో తేడా యేమో, ఉత్పాదక పెట్టుబడిలోని వివిధ అంతర్భాగాలు ఉత్పాదితానికి తమ విలువను బదిలీ చేసే విభిన్న తరహాలను బట్టి తలెత్తుతుంది. ఉత్పాదితపు విలువను సృష్టించడంలో ఈ విభిన్న అంతర్భాగాల విభిన్న పాత్రల వల్ల లేదా స్వయం విస్తరణ క్రమంలో వాటి ప్రత్యేక ప్రవర్తన వల్ల ఇది తలెత్తదు. చివరి విషయం, ఉత్పాదితానికి విలువను బదిలీ చేయడంలో తేడా, అలాగే ఈ విలువ ఉత్పాదితం చేత చలామణి చెయ్యబడి, ఉత్పాదితం యొక్క రూపాంతరాల ద్వారా తన మునుపటి రూపంలో పునరుద్ధరించబడే తీరులోని తేడా, ఉత్పాదక పెట్టుబడి ఉండే పాదార్థిక రూపాల భిన్నత్వం వల్ల తలెత్తుతుంది. ఉత్పాదక పెట్టుబడిలో ఒక భాగం ఆయా ఉత్పాదితం సృష్టిలో పూర్తిగా వినియోగించబడుతుంది. మరో భాగం క్రమక్రమంగా మాత్రమే వినియోగించబడుతుంది. కనుక ఉత్పాదక పెట్టుబడిని మాత్రమే నిశ్చల, చలామణి పెట్టుబడులుగా విభజించ వీలవుతుంది. అయితే ఈ వైరుధ్యం పారిశ్రామిక పెట్టుబడి యొక్క ఇతర రెండు అస్తిత్వ రూపాలైన సరుకు పెట్టుబడికీ, డబ్బు పెట్టుబడికీ వర్తించదు. పైగా ఈ రూపాలకీ ఉత్పాదక పెట్టుబడికీ మధ్య ఇది వైరుధ్యంగా కూడా ఉండదు. అది ఉత్పాదక పెట్టుబడికీ, దాని రంగంలోనూ మాత్రమే వర్తిస్తుంది. ఎంత సరుకు పెట్టుబడి లేదా ఎంత డబ్బు పెట్టుబడి పెట్టుబడిగా పని చేసినప్పటికీ, అవి ఎంత వేగంగా చలామణి అయినప్పటికీ అవి ఉత్పాదక పెట్టుబడి యొక్క చలామణి అంతర్భాగాలుగా మారనంతవరకూ, నిశ్చల పెట్టుబడికి విభిన్నంగా, చలామణి పెట్టుబడి కాజాలవు. అయితే పెట్టుబడి యొక్క ఈ రెండు రూపాలూ చలామణి రంగంలో ఉండటం వల్ల, ఆడమ్ స్మిత్ కాలం నుంచీ రాజకీయ అర్థశాస్త్రం వాటిని ఉత్పాదక పెట్టుబడి యొక్క చలామణి భాగంతో కలగాపులగం చేసి, చలామణి పెట్టుబడి అభివర్గంలో చేర్చిందని మనం ముమ్మందు తెలుసుకొంటాం. నిజానికి అవి ఉత్పాదక పెట్టుబడికి విరుద్ధమైన చలామణి పెట్టుబడే; కాని నిశ్చల పెట్టుబడికి విరుద్ధమైన చలామణి పెట్టుబడి కావు.

2. పెట్టుబడి నిశ్చల భాగం యొక్క టర్నోవరులో, అలాగే, దానికి అవసరమైన టర్నోవరు కాలంలో పెట్టుబడిలోని చలామణి భాగాల అనేక టర్నోవర్లు వుంటాయి. నిశ్చల పెట్టుబడి ఒకసారి టర్నోవరు అయ్యే కాలంలో చలామణి పెట్టుబడి అనేకసార్లు టర్నోవరు అవుతుంది. ఒక ఉత్పదితం తయారై ఒక సరుకుగా అది ఉత్పత్తి ప్రక్రియ నుండి బయటికి నెట్టబడటానికి పట్టే కాల పరిమితిలో నిశ్చల పెట్టుబడికి నిలయమైన ఉత్పత్తి సాధనం పూర్తిగా అరిగిపోకుండా ఉన్న సందర్భంలో మాత్రమే, ఉత్పాదక పెట్టుబడి విలువలో ఒక అంతర్భాగం నిశ్చల పెట్టుబడి రూపం యొక్క నిర్దిష్టతని సంతరించుకుంటుంది. దాని విలువలో ఒక భాగం తన పాత ఉపయోగ రూపంలోనే బంధించబడి ఉండాలి; కాగా మరో భాగం తయారైన ఉత్పాదితంతో

పాటు చలామణి అవుతుంది. ఇందుకు విరుద్ధంగా ఈ చలామణి, పెట్టుబడిలోని చలనశీల అంతర్భాగాల మొత్తం విలువను ఏకకాలంలో చలామణిలో ఉంచుతుంది.

3. ఉత్పాదక పెట్టుబడియొక్క విలువ భాగం, నిశ్చల పెట్టుబడిగా మదుపు పెట్టబడిన ఆ భాగం, నిశ్చల పెట్టుబడిగా ఉండే ఉత్పత్తి సాధనాల వినియోగ కాలానికంతటికి సరిపడా ఒకే మొత్తంగా అడ్వాన్సు చేయబడుతుంది. కనుక ఈ విలువను పెట్టుబడిదారు ఒక్కసారిగా చలామణిలోకి నెడతాడు. అయితే నిశ్చల పెట్టుబడి కొంచెం కొంచెంగా ఉత్పాదితాలకు జోడించే విలువ భాగాలను డబ్బుగా మార్చుకోవడం ద్వారా దీన్ని కొంచెం కొంచెంగా, క్రమేణా చలామణి నుండి ఉపసంహరించడం జరుగుతుంది. మరోవైపున, ఉత్పాదక పెట్టుబడి యొక్క ఒక అంతర్భాగం ఏ ఉత్పత్తి సాధనాల్లో నిశ్చలమయినదిగా మారిందో, అవి తాము పని చేసే మొత్తం కాలానికిగాను ఉత్పత్తి ప్రక్రియలో అంగంగా వుండటానికై ఒకేసారి చలామణి నుండి ఉపసంహరింపబడతాయి. అయితే ఈ కాల వ్యవధిలో అదే రకం ఉత్పత్తి సాధనాలు వాటి స్థానాన్ని ఆక్రమించాల్సిన అవసరం లేదు; అంటే వాటి పునరుత్పత్తి అవసరం లేదు. చలామణి రంగం నుండి వాటి పునరుద్ధరణ అంశాలను ఉపసంహరించకుండానే అవి చలామణిలోకి నెట్టబడిన సరుకుల సృష్టికి ఎక్కువ కాలమో, తక్కువ కాలమో దోహదం చేయడం కొనసాగిస్తాయి. కనుక ఈ కాల వ్యవధిలో తన అడ్వాన్సును పునరుద్ధరించాల్సిన అవసరం పెట్టుబడిదారుకి ఉండదు. ఆఖరు విషయం, నిశ్చల పెట్టుబడిగా మదుపు పెట్టబడిన పెట్టుబడి విలువ వున్న ఉత్పత్తి సాధనాలు పని చేస్తున్న దశలో తన రూపాలు ఆవృత్తి గుండా యధాతథంగా పయనించదు. దాని విలువ మాత్రమే, అదీ క్రమక్రమంగా, భాగాలుగా మాత్రమే పయనిస్తుంది. మరో రకంగా చెప్పాలంటే, దాని విలువలో ఒక భాగం నిరంతరాయంగా చలామణిలో ఉంటుంది. డబ్బుగా మార్చబడుతుంది. కాగా సరుకుల విలువలో ఈ భాగం, డబ్బు రూపం నుండి తిరిగి దాని అసలు భౌతిక రూపానికి మార్చబడటం జరగదు. డబ్బు ఈ రకంగా ఉత్పత్తి సాధనాల రూపంలోకి మారడం అనేది దాని పని చేసే కాల పరిమితి ముగిసే దాకా, ఉత్పత్తి సాధనాలు పూర్తిగా వినియోగించబడేదాకా జరగదు.

4. ఉత్పత్తి ప్రక్రియ నిరంతరాయంగా జరగాలంటే, దానిలో చలామణి పెట్టుబడి అంశాలు కూడా నిశ్చల పెట్టుబడి అంశాలంతగానూ శాశ్వతంగా, నిశ్చలంగా ఉండాలి. అయితే అలా నిశ్చలంగా ఉన్న చలామణి పెట్టుబడి అంశాలు నిరంతరాయంగా అవే తరహా అంశాలతో (ఉత్పత్తి సాధనాలు అనే తరహా కొత్త వస్తువులతోనూ, శ్రమ శక్తి నిరంతరాయంగా సరికొత్త కొనుగోళ్ళ ద్వారానూ) పునరుద్ధరించబడతాయి. కాగా నిశ్చల పెట్టుబడి అంశాల విషయంలో అవి ఉన్నంత వరకూ పునరుద్ధరించబడవు. వాటి కొనుగోళ్ళు తిరిగి జరగవు. ఉత్పత్తి ప్రక్రియలో సహాయక, ముడిపదార్థాలు ఎప్పుడూ ఉంటాయి. అయితే ఎప్పటికప్పుడు పాత అంశాలు ఉత్పాదితం తయారీలో వినియోగించబడగానే అవే తరహా కొత్త అంశాలు వస్తాయి. శ్రమశక్తి కూడా ఉత్పత్తి ప్రక్రియలో ఎల్లప్పుడూ ఉంటుంది. అయితే ఎప్పటికప్పుడు శ్రమశక్తి కొనుగోలు ద్వారా, తరచుగా వ్యక్తుల మార్పు ద్వారా ఇది జరుగుతుంది. అయితే అవే భవనాలు, యంత్రాలు వగైరా మళ్ళీ మళ్ళీ జరిగే అవే ఉత్పత్తి ప్రక్రియల్లో పని కొనసాగిస్తాయి.

## II. నిశ్చల పెట్టుబడి అంతర్భాగాలు, దాని భర్తీ, మరమ్మతు, సంచయనం

పెట్టుబడి యొక్క ఏ మదుపులోనైనా నిశ్చల పెట్టుబడిలోని వేరు వేరు అంశాలకు భిన్న జీవిత కాలాలుంటాయి. కనుక వాటికి భిన్న టర్నోవరు కాలాలు ఉంటాయి. ఉదాహరణకు, రైల్వేలో పట్టాలు, స్లీపర్లు, మట్టికట్టలు, టెర్మినల్సు, వంతెనలు, సొరంగాలు, ఇంజన్లు, పెట్టెలు పనిచేసే కాల వ్యవధులు విభిన్నంగా ఉంటాయి. వాటి పునరుత్పత్తి కాలాలు కూడా విభిన్నంగా ఉంటాయి కనుక వాటికై అడ్వాన్సు చేయబడిన పెట్టుబడికి విభిన్న టర్నోవరు కాలాలుంటాయి. అనేక సంవత్సరాల పాటు భవనాలు, ప్లాట్‌ఫాంలు, నీటి టాంకులు, వంతెనలు, సొరంగాలు, తొలిచిన మార్గాలు, డ్యాములు వగైరాలకు, క్లుప్తంగా చెప్పాలంటే ఇంగ్లీషువారి రైల్వే పరిశ్రమలో "కళాఖండాలు"గా పిలవబడే వాటికి పునరుద్ధరణ అవసరముండదు. అన్నిటికన్నా ఎక్కువగా అరిగిపోయేవి ఏవంటే రైలు మార్గాలూ, రైలు బళ్ళూ.

రైలు మార్గం వందేళ్ళు వుంటుంది. పట్టాల అరుగుదల కంటికి కనిపించనంత తక్కువగా, ఆర్థికపరంగానూ, ఆచరణపరంగానూ పట్టించుకోనవసరం లేనంత తక్కువగా వుంటుంది అనే అభిప్రాయం అత్యంత ప్రముఖులూ, ఆచరణశూరులూ అయిన ఇంజనీర్లలో, ఆధునిక రైల్వేల నిర్మాణం తొలి దశలో ప్రబలంగా వుండేది. మంచి పట్టాల జీవిత కాలం 100 లేదా 150 ఏళ్లు అని భావించారు. అయితే పట్టాల జీవిత కాలం సగటున 20 సంవత్సరాలు మించడం లేదని త్వరలోనే అర్థమైంది. అది రైలింజన్ల వేగాన్ని బట్టి, రైళ్ళ బరువుని బట్టి, సంఖ్యను బట్టి, పట్టాల వ్యాసాన్ని బట్టి, అనేక తదితర పరిస్థితుల్ని బట్టి వుంటుంది. కొన్ని రైల్వే టెర్మినల్స్‌లోనూ, రైళ్ళ రద్దీ గల కేంద్రాల్లోనూ పట్టాలు ప్రతి ఏడాది కూడా అరిగిపోతాయి. 1867 ప్రాంతంలో ఉక్కు పట్టాలను ప్రవేశపెట్టడం ప్రారంభమైనది. వాటి ఖరీదు ఇనుప పట్టాలకంటే రెట్టింపు. కాని అవి వాటికంటే రెట్టింపు కాలం పనిచేస్తాయి. చెక్కతో చేసిన స్లీపర్ల జీవితకాలం 12 నుండి 15 సంవత్సరాలుంటుంది. రైలుబళ్ళ సంగతికి వస్తే, ప్రయాణీకుల పెట్టెలకంటే వ్యాగన్లు తొందరగా అరిగిపోతున్నాయని కూడా నిర్ధారణ అయింది. ఓ రైలింజను జీవితకాలం 12, 15 సంవత్సరాలని 1867లో అంచనా వేయబడింది.

అరుగుదల ముఖ్యంగా వాడకం వల్ల జరుగుతుంది. విధిగా "పట్టాల అరుగుదల రైలు బళ్ళ సంఖ్యకు అనులోమానుపాతంలో ఉంటుంది" (ఆర్.సి. నెం. 17645).[1] వేగం పెరిగితే పెరిగిన వేగం యొక్క వర్గం కంటే ఎక్కువ నిష్పత్తిలో అరుగుదల ఉంటుంది. అంటే, ఇంజన్ వేగాన్ని రెట్టింపు చేస్తే రైలు మార్గం అరుగుదల ఖర్చుని నాలుగు రెట్లు పెంచినట్లే అవుతుంది. (ఆర్.సి. నెం.17046).

అరుగుదల ప్రకృతి శక్తుల ప్రభావం వల్ల కూడా జరుగుతుంది. ఉదాహరణకు, స్లీపర్లు అసలైన అరుగుదల వల్లే కాక పుచ్చిపోవడం వల్ల కూడా దెబ్బతింటాయి. "రైలు మార్గాన్ని మంచి స్థితిలో వుంచడానికి అయ్యే ఖర్చు, దానిపై ప్రయాణించే బళ్ళ రాకపోకల వల్ల జరిగే అరుగుదలపై కంటే, వాతావరణాన్ని తట్టుకోవాల్సిన కలప, ఇనుము, ఇటుకలు, సున్నపు గచ్చులు వగైరాల నాణ్యతపై

1. ఆర్.సి. అని పేర్కొనబడిన ఉల్లేఖనలు, రైల్వేలపైన రాయల్ కమిషన్ నివేదికలోనివి. కమిషనర్ల సమ్ముఖంలో సాక్షుల వాఙ్మూలాల వివరాలివి. వాటిని 1867లో లండన్ పార్లమెంట్‌కి సమర్పించడం జరిగింది. ప్రశ్నలకు, జవాబులకు వరుస అంకెలివ్వబడ్డాయి. ఇక్కడ ఇచ్చింది ఆ అంకెలనే.

ఆధారపడి వుంటుంది. ఒక నెల తీవ్రంగా కురిసిన వానలు రైలు మార్గానికి హాని చేస్తాయి". (ఆర్.పి. విలియమ్స్, "ఆన్ ది మేంటెనెన్స్ ఆఫ్ పర్మనెంట్ వే." 1867 ఆకురాలు కాలంలో సివిల్ ఇంజనీర్సు ఇన్స్టిట్యూట్‌లో చదవబడిన పత్రం.)[1]

చివరి విషయం, ఆధునిక పరిశ్రమలో ఇతరత్రా లాగానే ఇక్కడ కూడా నైతిక తరుగుదల తన పాత్ర నిర్వహిస్తుంది. పదేళ్లు గడిచాక ఇంతకుముందు 40 వేల పౌండ్లకు కొన్న అదే సంఖ్య గల రైలు పెట్టెలను, ఇంజన్లను ఇప్పుడు 30 వేల పౌండ్లకు కొనవచ్చు. రైలు బళ్ళ విషయంలో వాటి ఉపయోగ విలువలో తరుగుదల లేనప్పటికీ మార్కెట్ ధరలో 25 శాతం నైతిక తరుగుదల వుంటుంది. (లార్డెనర్, రైల్వే ఎకానమీ)

"ట్యూబ్ బ్రిడ్జీల స్థానాన్ని వాటి ప్రస్తుత రూపంలో ఉన్న వాటితో భర్తీ చేయబోదు" (ఎందుకంటే, అటువంటి బ్రిడ్జీలకు, అంతకంటే మేలైన రూపాలు ఇప్పుడు వచ్చాయి) "సాధారణ మరమ్మతులు క్రమక్రమంగా తొలగించివేయడం, పాత వాటి స్థానాన్ని భర్తీచేయడం ఇప్పుడు ఆచరణ యోగ్యం కాదు." (డబ్ల్యు.పి. ఆడమ్స్, రోడ్స్ అండ్ రైల్స్, లండన్, 1862) పరిశ్రమ ప్రగతి శ్రమ పరికరాలను నిరంతరాయంగా మార్చుతోంది. కనుక వాటి పాత రూపంలోనివి గాక మారిన రూపంలోనివి వాటి స్థానాన్ని భర్తీ చేస్తున్నాయి. ఒకవైపున నిశ్చల పెట్టుబడి మొత్తం ఒకానొక వస్తురూపంలో మదుపు పెట్టబడి వుండటం, ఆ రూపానికి ఒకానొక సగటు జీవిత కాలం వుండటం – ఇది, కొత్త యంత్రాలూ వగైరా క్రమక్రమంగా మాత్రమే రంగంలో ప్రవేశించడానికి కారణం. కనుక మెరుగైన శ్రమ పరికరాలు శీఘ్రంగా ప్రవేశపెట్టబడకపోవడానికి ఇది ఒక ఆటంకం అన్నమాట. మరోవైపున పోటీ వల్ల ముఖ్యంగా నిర్ణయాత్మకమైన మార్పులు వచ్చినపుడు, పాత శ్రమ పరికరాలను వాటి జీవిత కాలానికి ముందే తొలగించి వాటికంటే మెరుగైన పరికరాలతో వాటి స్థానాన్ని భర్తీచేయాల్సి వస్తుంది. ఫ్యాక్టరీ పాత యంత్రాదుల స్థానాన్ని పెద్ద ఎత్తున సామాజిక స్థాయిలో, వాటి జీవిత కాలానికంటే ముందుగానే కొత్త వాటితో భర్తీ చేయడం, ప్రధానంగా దుర్ఘటన వల్లనో, సంక్షోభాల వల్లనో తప్పనిసరి అవుతోంది.

అరుగుదల (నైతిక తరుగుదలను మినహాయించి) అంటే, నిశ్చల పెట్టుబడి ఉపయోగింపబడుతూ రాగా, అది సగటున కోల్పోయే ఉపయోగ విలువకు అనులోమంగా ఉత్పాదితానికి క్రమక్రమంగా బదిలీ అయ్యే విలువ భాగం అని అర్థం.

కొంతవరకు ఈ అరుగుదల నిశ్చల పెట్టుబడికి కొంత సగటు మన్నిక ఉండేలాగా జరుగుతుంది. ఈ కాల వ్యవధి అంతటికీ కలిసి, అది ఒకేసారి ఒకే మొత్తంగా అడ్వాన్సు చేయబడుతుంది. ఈ కాల వ్యవధి పూర్తవగానే అది మొత్తంగా మళ్ళీ భర్తీ చేయబడాలి. గుర్రాలు వగైరాల వంటి సజీవ శ్రమ పరికరాలకు సంబంధించినంత వరకూ, వాటి పునరుత్పత్తి కాలాన్ని ప్రకృతే నిర్ణయిస్తుంది. శ్రమ పరికరాలుగా వాటి సగటు జీవన ప్రమాణాన్ని ప్రకృతి నియమాలే నిర్ణయిస్తాయి. ఈ కాల వ్యవధి అయిపోగానే కొత్త గుర్రాలతో వాటి స్థానాన్ని భర్తీ చేయాలి. ఒక గుర్రం స్థానాన్ని కొంచెం కొంచెంగా భర్తీ చేయడం సాధ్యం కాదు. మరో కొత్త గుర్రంతోనే దాన్ని భర్తీ చేయాలి.

నిశ్చల పెట్టుబడిలోని ఇతర అంశాల స్థానాన్ని దఫదఫాలుగానూ లేదా పాక్షికంగానూ భర్తీ

---

1. ఆర్.పి. విలియమ్స్ పత్రం 'మనీ మార్కెట్ రివ్యూ'లో 1867 డిసెంబర్ 2వ తేదీన ప్రచురించబడింది - సం.

చేయటానికి వీలవుతుంది. ఈ సందర్భంలో పాక్షికంగానో, దఫదఫాలుగానో జరిగే భర్తీ క్రమక్రమంగా వ్యాపారం విస్తరించడం నుంచి వేరుచేసి చూడాలి.

నిశ్చల పెట్టుబడిలో ఒక భాగంగా ఒకే రకపు అంతర్భాగాలుంటాయి. అయితే అవి ఒకే కాల పరిమితి వరకూ నిలబడలేవు. వివిధ కాల వ్యవధుల్లో అవి కొంచెం కొంచెంగా పునరుద్ధరించబడతాయి. ఉదాహరణకు, రైల్వే స్టేషన్లలో పట్టాలకు ఇది వర్తిస్తుంది. రైలు మార్గంలోని తక్కిన పట్టాలకంటే వీటి స్థానం మరింత తరచుగా భర్తీకావలసి వుంటుంది. ఇది స్లీపర్లకి కూడా వర్తిస్తుంది. లార్డెనర్ అంచనా ప్రకారం 40వ దశకంలో బెల్జియన్ రైల్వే మార్గంలో 8 శాతం స్లీపర్లను పునరుద్ధరించాల్సి వచ్చింది. అంటే, 12½ ఏళ్ళల్లో మొత్తం స్లీపర్లు పునరుద్ధరించబడ్డాయన్నమాట. కనుక ఈ క్రింది పరిస్థితి ఎదురవుతుంది. ఒక తరహా నిశ్చల పెట్టుబడికి పదేళ్ళపాటు కొంత మొత్తం అడ్వాన్సు చేయబడింది అనుకుందాం. ఇది ఒకేసారి వ్యయమైంది. అయితే ఈ నిశ్చల పెట్టుబడిలో ఒక నిర్దిష్ట భాగం యొక్క విలువ ఉత్పాదితం విలువలో ప్రవేశించి అది డబ్బుగా మారుతుంది. ఈ భాగం ప్రతి ఏడాదీ వస్తు రూపంలో పునరుద్ధరించబడుతుంది. కాగా మిగిలిన భాగం తన తొలి భౌతిక రూపంలోనే ఉంటుంది. నిశ్చలమైన ఈ పెట్టుబడిని చలామణి పెట్టుబడి నుంచి వేరుచేసి చూపేది, ఒకే మొత్తంగా చేయబడిన అడ్వాన్సు, భౌతిక రూపంలో కేవలం పాక్షికమైన పునరుత్పత్తే.

నిశ్చల పెట్టుబడిలోని ఇతర భాగాలు నానా రకాలుగా ఉంటాయి. అవి అసమాన కాల వ్యవధుల్లో అరిగిపోతాయి. కనుక ఆ రకంగానే వాటిని భర్తీ చేయాలి. ఇది ముఖ్యంగా యంత్రాలకు వర్తిస్తుంది. నిశ్చల పెట్టుబడిలో విభిన్న అంతర్భాగాల మన్నిక విభిన్నంగా ఉంటుందని మనం ఇప్పుడు చెప్పుకున్న విషయం, ఈ నిశ్చల పెట్టుబడిలో ఒక భాగమైన ఏ యంత్రంలోని అంతర్భాగాల మన్నికకైనా వర్తిస్తుంది.

పాక్షిక పునరుద్ధరణ గతిక్రమంలో వ్యాపార క్రమ విస్తరణకు సంబంధించి ఈ క్రింది అంశాలను పేర్కొనవచ్చు : ఉత్పత్తి ప్రక్రియలో నిశ్చల పెట్టుబడి వస్తు రూపేణా తన విధుల నిర్వహణను కొనసాగించినప్పటికీ, దాని విలువలో ఒక భాగం సగటు అరుగుదలకు అనులోమంగా ఉత్పాదితంతో పాటు చలామణిలో ఉండి, డబ్బుగా మార్చబడి, భవిష్యత్తులో, తన వస్తు రూపంలో పునరుత్పత్తి అయ్యే వరకు, పెట్టుబడిని భర్తీ చేయడానికి ఉద్దేశించిన డబ్బు రిజర్వు నిధిలో భాగంగా ఉంటుంది. డబ్బుగా మారిన నిశ్చల పెట్టుబడి యొక్క ఈ విలువ భాగం వ్యాపారాన్ని విస్తరించడానికి దోహదం చెయ్యొచ్చు. లేదా యంత్రాల సమర్థత పెరిగేలాగా వాటిని మెరుగుచేయడానికి తోడ్పడవచ్చు. ఆ రకంగా పునరుత్పత్తి ఎక్కువగానైనా, తక్కువగానైనా వున్న కాల వ్యవధుల్లో జరుగుతుంది. సమాజం దృష్టి నుంచి ఇది మరింత ఎక్కువ స్థాయిలో పునరుత్పత్తి. ఉత్పత్తి రంగాన్ని పెంచితే అది విస్తృత పునరుత్పత్తి. ఉత్పత్తి సాధనాలను మరింత ఫలప్రదమైనవిగా మారిస్తే అది సాంద్రతర పునరుత్పత్తి. పెరిగిన స్థాయిలోని ఈ పునరుత్పత్తి సంచయన ఫలితం కాదు. అంటే అదనపు విలువ పెట్టుబడిగా మారిన ఫలితం కాదు. ఇది పక్కకు తప్పుకున్న విలువను, వస్తురూపపు నిశ్చల పెట్టుబడి నుండి డబ్బు రూపంలో వేరైపోయిన విలువను తిరిగి కొత్త అదనపు లేదా కనీసం మరింత ఫలప్రదమైన అదే తరహా నిశ్చల పెట్టుబడిగా మార్చిన ఫలితం. అయితే ఆ వ్యాపారం యొక్క ప్రత్యేక స్వభావాన్ని బట్టి, ఏ మేరకు, ఏ నిష్పత్తుల్లో అది క్రమక్రమంగా అదనపు నిశ్చల పెట్టుబడిని సమకూర్చుకోగలదు,

ఏ మొత్తంలో రిజర్వు నిధిని ఈ రకంగా మళ్ళీ మదుపు పెట్టడానికై పోగు చెయ్యాలి, ఇందుకు ఎంత కాలం పడుతుంది అనేవి నిర్ణయమవుతాయని వేరే చెప్ప పనిలేదు. యంత్రాలలోని విడి భాగాల విషయంలో ఎటువంటి మెరుగుదలలు ఏ మేరకు సాధ్యం అన్నది, సహజంగానే ఈ మెరుగుదల స్వభావంపైన, అసలు యంత్ర నిర్మాణంపైన ఆధారపడి వుంటుంది. ఈ అంశాన్ని రైల్వేల నిర్మాణంలో, మొట్టమొదటే ఎంత బాగా గ్రహించారో ఆడమ్స్ తెలియజేస్తాడు : "ఈ మొత్తం నిర్మాణాన్ని నిరవధికంగా విస్తరించేందుకు వీలుగా, తేనెగూడు సూత్రం మీద ప్రారంభించాలి. మార్పువీలులేని ఏ నిశ్చల, నిర్ణీత సమకార నిర్మాణాన్నైనా సరే విడనాడాలి. విస్తరించాల్సి వచ్చినప్పుడు దాన్ని పడగొట్టాల్సి వస్తుంది" (పుట 123).

అది ప్రధానంగా, ఎంత స్థలం దొరుకుతుందీ అన్న దానిమీద ఆధారపడుతుంది. కొన్ని భవనాల విషయంలో అదనపు అంతస్తులు కట్టవచ్చు. మరికొన్ని భవనాల విషయంలో పక్కన విస్తరించవచ్చు. కాబట్టి మరింత నేల అవసరమవుతుంది. పెట్టుబడిదారీ ఉత్పత్తిలో వ్యాపార క్రమ విస్తరణలో ఒకవైపున పదార్థాలు పెద్ద ఎత్తున వృథా అవుతాయి. మరోవైపున ఈ రకమైన ఆచరణ యోగ్యంకాని విస్తరణ అడ్డదిడ్డంగా జరుగుతుంది. (ఇది పాక్షికంగా శ్రమ శక్తికి నష్టం చేస్తుంది). ఎందుకంటే ఏదీ ఒక సామాజిక పథకం ప్రకారం జరగదు కనుక, ప్రతిదీ ఆయా పెట్టుబడిదారు పని చేసే అనంతమైన ఆయా విభిన్న పరిస్థితులూ, సాధనాలూ వగైరాలపైన ఆధారపడి వుంటుంది. కనుక దీనివల్ల ఉత్పాదక శక్తులు అతిగా వృథా అవుతాయి.

డబ్బు రిజర్వు నిధి (అనగా డబ్బుగా మారిన నిశ్చల పెట్టుబడి భాగం) కొంచెం కొంచెంగా తిరిగి మదుపు పెట్టబడటం, అన్నింటికంటే వ్యవసాయంలో తేలిక. ఒక నిర్ణీత విస్తీర్ణం గల ఉత్పాదక క్షేత్రం, పెట్టుబడిని క్రమక్రమంగా సాధ్యమైనంత ఎక్కువగా గ్రహించగలదు. పశుపోషణ లాంటి ప్రకృతిసిద్ధమైన పునరుత్పత్తికి కూడా ఇది వర్తిస్తుంది.

నిశ్చల పెట్టుబడిని మంచి స్థితిలో ఉంచేందుకు ప్రత్యేక ఖర్చులుంటాయి. ఈ పనిలో కొంత, శ్రమ ప్రక్రియే చేస్తుంది. శ్రమ ప్రక్రియలో వినియోగించకపోతే నిశ్చల పెట్టుబడి పాడవుతుంది. (పెట్టుబడి మొదటి సంపుటిలో, వాడని యంత్రాల అరుగుదలను గురించిన ఎనిమిదో అధ్యాయం, పదిహేనో అధ్యాయం) కౌలుకు తీసుకున్న భూములు దేశ సాంప్రదాయం ప్రకారం సాగుచేయబడక పోతే, అది స్పష్టంగా వృథా అని ఇంగ్లీషు చట్టాలు పరిగణిస్తాయి. (డబ్ల్యు.ఎ. హోల్డ్స్‌వర్త్, బారిస్టర్ ఎట్ లా, ది లా ఆఫ్ లాండ్‌లార్డ్ అండ్ టెనెంట్, లండన్, 1857, పుట. 96) శ్రమ ప్రక్రియలో ఉపయోగించడం ద్వారా ఇలా మంచి స్థితిలో వుంచడం అన్నది, సజీవ శ్రమలో అంతర్నిహితంగా వున్న ఉచిత బహుమానం. అంతేగాక, శ్రమకున్న ఈ భద్రపరిచే శక్తికి ద్వంద్వ స్వభావం వుంది. ఒకవైపు అది శ్రమ పదార్థాల విలువను ఉత్పాదితానికి బదిలీ చేయడం ద్వారా ఆ విలువను కాపాడుతుంది. మరోవైపున అది శ్రమ పరికరాల విలువను ఉత్పాదితానికి బదిలీ చేయకుండానే ఆ విలువనూ కాపాడుతుంది. ఉత్పత్తి ప్రక్రియలో వాటి కార్యకలాపం ద్వారా వాటి ఉపయోగ విలువను కాపాడటం వల్ల ఈ పని జరుగుతుంది.

అయితే నిశ్చల పెట్టుబడి ఎప్పుడూ బాగుచేయబడిన మెరుగైన పని స్థితిలో ఉంచడానికి, అందుకే ఉద్దేశించిన శ్రమ వ్యయం కూడా అవసరం. ఎప్పటికప్పుడు యంత్రాలను శుభ్రం చేయాలి.

ఉత్పత్తి ప్రక్రియ నుండి వేరుచేయడానికి వీలులేని ప్రకృతి శక్తుల దుష్ప్రభావాలను కేవలం అరికట్టడానికి, యంత్రాలు నిరుపయోగమైపోకుండా ఉంచడానికి చేసే అదనపు శ్రమకు సంబంధించిన సమస్య ఇది. "కనుక యంత్రాలను అక్షరాలా పనిచేసే స్థితిలో ఉంచడానికి సంబంధించిన సమస్య. ఒక మనిషి సగటు ఆయుర్దాయం 30 ఏళ్ళు అని మనం అంటున్నప్పుడు ఆ కాలంలో అతడు ఒళ్ళు కడుక్కొంటూ వుంటాడని ఊహిస్తున్నట్లే, నిశ్చల పెట్టుబడి సాధారణ మన్నికను, ఆ కాలంలో అది తన విధుల్ని మామూలుగా నిర్వహించడానికి అవసరమైన పరిస్థితులు నెలకొల్పబడ్డాయన్న ఊహలతో అంచనా వేస్తున్నామని వేరుగా చెప్పనక్కర్లేదు. ఇక్కడ సమస్య యంత్రంలో నిక్షిప్తమైన శ్రమని భర్తీ చేయడం కాదు. దానిని ఉపయోగించడం వల్ల అవసరమైన నిరంతరాయమైన అదనపు శ్రమకు సంబంధించిన సమస్య. ఇది యంత్రం నిర్వహించే శ్రమ కాదు. దానిపై వ్యయమైన శ్రమ. ఈ శ్రమ ఉత్పత్తికి ప్రతినిధి కాదు. కేవలం ముడిపదార్థం మాత్రమే. ఉత్పాదితం సృష్టించబడే శ్రమ ప్రక్రియలోకి ఈ శ్రమ ప్రవేశించకపోయినప్పటికీ, ఈ శ్రమకి వెచ్చించబడిన పెట్టుబడిని చలామణి పెట్టుబడిగా వర్గీకరించాలి. ఈ శ్రమని ఉత్పత్తిలో నిరంతరాయంగా వెచ్చించాలి. కనుక దీని విలువను ఎప్పటికప్పుడు ఉత్పాదితం విలువ భర్తీ చేయాలి. దీనిలో మదుపు పెట్టబడిన పెట్టుబడి, అనుత్పాదక ఖర్చులను భర్తీ చేయవలసిన చలామణి పెట్టుబడి భాగానికి చెందుతుంది. ఒక వార్షిక సగటు చలామణిని బట్టి ఉత్పాదిత విలువలపైన దీనిని పంచాల్సి వస్తుంది. అసలు పరిశ్రమలో ఈ శుభ్రం చేసే పనిని విరామ సమయంలో కార్మికులే ఉచితంగా చేస్తారని గ్రహించాం.[1] ఆ కారణంగానే తరచుగా ఉత్పత్తి ప్రక్రియ జరుగుతున్నప్పుడు కూడా వారు శుభ్రం చేస్తుంటారు. ప్రమాదాల్లో ఎక్కువ వాటికి కారణం ఇదే. ఉత్పాదితం ధరలో ఈ శ్రమ కనిపించదు. ఆ మేరకు వినియోగదారు దానిని ఉచితంగా పొందుతాడు. మరోవైపున తన యంత్రం మంచి స్థితిలో వుండటానికయ్యే ఖర్చులను పెట్టుబడిదారు చెల్లించడు. కార్మికుడే వ్యక్తిగతంగా చెల్లిస్తాడు. పెట్టుబడి ఆత్మరక్షణలోని నిగూఢతల్లో ఇది ఒకటి. దీనివల్ల నిజానికి కార్మికునికి కూడా యంత్రాల మీద చట్టబద్ధమైన హక్కు వుంది. దానిని బట్టి, బూర్జువా చట్టం దృష్టి నుంచి చూసినా, యంత్రాలకు కార్మికుడు కూడా సహ యజమాని. అయితే కొన్ని ఉత్పత్తి శాఖల్లో యంత్రాలను శుభ్రం చేయడానికి వాటిని ఉత్పత్తి క్రమం నుంచి తొలగించాల్సి వస్తుంది. కనుక అటువంటిచోట్ల శుభ్రం చేయడం, ఉత్పత్తి ప్రక్రియ మధ్యలో సాధ్యం కాదు. ఉదాహరణకు, రైలింజన్లు. అటువంటి సందర్భాల్లో యంత్రాలను మంచి స్థితిలో వుంచే పని నిత్యముండే ఖర్చుల్లో లెక్కించబడుతుంది. కనుక అది చలామణి పెట్టుబడిలో ఒక అంశం. ఉదాహరణకు, ఒక గూడ్సు ఇంజన్ మధ్యలో ఒక రోజు షెడ్‌లో ఉంచకుండా, వరుసగా మూడు రోజులకు మించి పనిచేయరాదు. బాయిలర్‌ను చల్లబడకముందే కడగటానికి ప్రయత్నిస్తే అది చాలా హానికరం. (ఆర్.సి. నెం. 17823)

వాస్తవంలో మరమ్మతులకూ, చెడిపోయిన భాగాల స్థానే కొత్త వాటిని అమర్చడానికీ అవసరమైన పెట్టుబడి, శ్రమల వ్యయం మొదట అడ్వాన్సు చేయబడిన పెట్టుబడిలో ఉండవు. కాబట్టి, నిశ్చల పెట్టుబడి విలువను క్రమక్రమంగా భర్తీ చేయడం ద్వారా వాటిని పూడ్చటం సాధ్యం కాదు. కనీసం

1. కార్ల్ మార్క్స్ : పెట్టుబడి మొదటి సంపుటం, పదిహేనో అధ్యాయం - సం.

ఎల్లవేళలా సాధ్యం కాదు. ఉదాహరణకు, నిశ్చల పెట్టుబడి విలువ 10 వేల పౌండ్లూ దాని మన్నిక కాలం 10 ఏళ్ళూ అని అనుకొందాం. అప్పుడు 10 వేల పౌండ్లూ పూర్తిగా పదేళ్ళ తర్వాత డబ్బుగా మార్చబడతాయి. ఆ మొత్తం మొదట మదుపు పెట్టబడిన పెట్టుబడి విలువను మాత్రమే భర్తీ చేస్తుంది. అది ఈలోగా మరమ్మతుల కోసం వెచ్చించబడిన పెట్టుబడిని కానీ, శ్రమని కానీ భర్తీ చేయదు. ఇది విలువలో ఒక అదనపు అంతర్భాగం. దీన్నంతటినీ ఒకేసారి అడ్వాన్సు చేయడం జరగదు. అయితే దాని అవసరం తలెత్తినప్పుడల్లా వివిధ సమయాల్లో దానిని అడ్వాన్సు చేయడం జరుగుతుంది. యాదృచ్ఛిక ఘటనల స్వభావంలోనే ఇది ఉంది. నిశ్చల పెట్టుబడికి, తర్వాత కాలంలో శ్రమ పరికరాల మీదా, శ్రమశక్తి మీదా అటువంటి దశల వారీ, అదనపు పెట్టుబడి కేటాయింపు అవసరం అవుతుంది.

యంత్రాల విడిభాగాలు వగైరాలు దెబ్బతినటం యాదృచ్ఛికంగా జరిగేది. కాబట్టి వాటి మరమ్మతులు కూడా అంతే. అయితే ఈ మరమ్మతులన్నిటి నుంచీ, అంతో ఇంతో నిశ్చల స్వభావం ఉన్న రెండు రకాల మరమ్మతులను వేరుచేయవచ్చు. ఇవి నిశ్చల పెట్టుబడి జీవితకాలంలో వివిధ దశలకు వర్తిస్తాయి. ఇవి బాలారిష్టాలు. మన్నిక కాలం సగం దాటాక వచ్చే జబ్బులు. ఉదాహరణకు, ఒక యంత్రం ప్రారంభించినప్పుడు ఎంతో సక్రమంగా వుండవచ్చు. కాని వాడటం మొదలయ్యాక కొన్ని లోపాలు బయటపడతాయి. వాటిని, తర్వాత మరికొంత శ్రమను వెచ్చించి తొలగించాల్సి వుంటుంది. మరోవైపున, ఒక యంత్రం మన్నిక కాలం సగం దాటాక రోజులు గడుస్తున్నకొద్దీ, ఆ కారణం వల్ల మామూలు అరుగుదల స్థాయి హెచ్చిన కొద్దీ, దాని నిర్మాణంలోని సామాగ్రి అరిగిపోయి, క్షీణించిన కొద్దీ, దాని మిగతా సగటు మన్నిక కాలంలో దాన్ని పనిచేయించడానికి మరమ్మతుల సంఖ్యా, విస్తృతీ పెరుగుతాయి. ఒక వృద్ధుని విషయంలో కూడా అంతే. అకాల మరణం ప్రాప్తించకుండా ఉండటానికి ఒక యువకునికీ, దృఢకాయుడికీ అయ్యే దానికంటే ఎక్కువ వైద్యానికి ఖర్చవుతుంది. కనుక, మరమ్మతు పని యాదృచ్ఛికమే. అయినప్పటికీ, నిశ్చల పెట్టుబడి జీవితంలోని వివిధ కాల వ్యవధుల్లో ఆ పని అసమానంగా పంపిణీ అవుతుంది.

పైన చెప్పిన దాన్నిబట్టీ, సాధారణంగా యంత్రాల మరమ్మతు పనుల యాదృచ్ఛిక స్వభావాన్ని బట్టి ఈ క్రింది విషయాలు స్పష్టమవుతాయి :

ఒక విధంగా మరమ్మతులకు అయ్యే శ్రమశక్తి, శ్రమ పరికరాల వ్యయం, ఈ వ్యయాన్ని అవసరమయ్యేలా చేసే పరిస్థితులలాగానే యాదృచ్ఛికం. నిశ్చల పెట్టుబడి కాలపరిమితి వివిధ దశల్లో అవసరమయ్యే మరమ్మతులు అసమంగా పంపిణీ అవుతాయి. నిశ్చల పెట్టుబడి సగటు కాలపరిమితిని అంచనా వేయడంలో, శుభ్రం చేయడం ద్వారానూ (ఆవరణను శుభ్రం చేయడంతో సహా), అవసర మైనప్పుడల్లా తరచూ మరమ్మతు చేయబడటం ద్వారానూ, అది నిరంతరం పని చేయగలిగిన స్థితిలో ఉంచబడుతుందనేది నిస్సంశయమనుకొంటున్నాము. నిశ్చల పెట్టుబడి అరుగుదల ద్వారా బదిలీ అయ్యే విలువ దాని సగటు జీవిత కాలాన్ని బట్టి అంచనా వేయబడుతుంది. అయితే ఈ సగటు జీవిత కాలం సైతం, దాన్ని పనిచేసే స్థితిలో ఉంచేందుకు అదనపు పెట్టుబడిని నిరంతరాయంగా అడ్వాన్సు చేయడం జరుగుతుందనే ఊహపై ఆధారపడి వుంటుంది.

అయితే ఈ అదనపు ఖర్చు జరిగినప్పుడే, ఈ అదనపు పెట్టుబడీ, శ్రమా చేర్చిన విలువ సంబంధిత సరుకుల ధరలో ప్రవేశించదనేది కూడా స్పష్టమే. ఉదాహరణకు, నూలు ఉత్పత్తిదారు ఈ

వారం తన యంత్రంలో ఒక చక్రం విరిగిపోవడం వల్లనో లేదా బెల్టు తెగిపోవడం వల్లనో ఎక్కువ వ్యయం అయింది. కనుక, తన నూలును పోయిన వారంకంటే ఈ వారం ఎక్కువ ధరకు అమ్మలేడు. ఏదో ఒక విడి ఫ్యాక్టరీలో జరిగిన ఈ దుర్ఘటన వల్ల ఏ రకంగానూ నూలు పరిశ్రమలో సాధారణ ఖర్చులు మారలేదు. విలువ నిర్ణయం జరిగే ఇతర సందర్భాల్లో లాగానే ఇక్కడ కూడా సగటు అన్నది నిర్ణయిస్తుంది. ఒక వ్యాపార శాఖలో మదుపు పెట్టబడిన నిశ్చల పెట్టుబడి సగటు కాలపరిమితిలో అటువంటి దుర్ఘటనలు సగటున ఎన్ని జరుగుతాయో, యంత్రాలను మంచి స్థితిలో ఉంచడానికీ, వాటి మరమ్మతుకూ సగటున ఎంత ఖర్చవుతుందో అనుభవం తెలియజేస్తుంది. ఈ సగటు వ్యయం దాని సగటు కాలపరిమితికి పంపకమై, ఉత్పాదితం ధరకి ఆ మేరకు కలుస్తుంది. కనుక ఆ ఉత్పాదితం అమ్మకం ద్వారా అది భర్తీ అవుతుంది.

ఆ రకంగా భర్తీ అయిన అదనపు పెట్టుబడి వ్యయమయ్యే తీరు క్రమబద్ధమైనది కానప్పటికీ, చలామణి పెట్టుబడికే చెందుతుంది. యంత్రానికి జరిగే ప్రతి నష్టాన్ని తక్షణమే చక్కదిద్దడం అత్యంత ప్రాధాన్యం ఉన్న అంశం గనుక ప్రతి పెద్ద ఫ్యాక్టరీ రోజూ దాని పనికి అవసరమైన సిబ్బందికి తోడు ఇంజనీర్లు, వడ్రంగులు, మెకానిక్కులూ, కమ్మరులూ మొదలైన ప్రత్యేక సిబ్బందిని కూడా పనిలో పెట్టుకుంటుంది. వారి వేతనాలు అస్థిర పెట్టుబడిలో భాగం. వారి శ్రమ విలువ ఉత్పాదితానికంతా పంపిణీ అవుతుంది. మరోవైపున ఉత్పత్తి సాధనాలకయ్యే ఖర్చులు పైన పేర్కొన్న సగటుని బట్టి అంచనా వేయబడతాయి. దానిని బట్టి అవి నిరంతరాయంగా ఉత్పాదితం విలువలో భాగమవుతాయి. అవి క్రమబద్ధరహితంగా అడ్వాన్స్ చేయబడినప్పటికీ, ఉత్పాదితంలోకి లేదా నిశ్చల పెట్టుబడిలోకి క్రమబద్ధరహితమైన కాల వ్యవధుల్లో ప్రవేశించినప్పటికీ, ఉత్పాదితం సగటు విలువలో భాగమవుతాయి. అసలైన మరమ్మతులకై వెచ్చించబడిన ఈ పెట్టుబడి చాలా విషయాల్లో ఒక ప్రత్యేక తరహా పెట్టుబడి. దీన్ని చలామణి పెట్టుబడి అనలేము. నిశ్చల పెట్టుబడి అనీ అనలేము. అయితే ఇది ఎప్పటికప్పుడు ఎదురయ్యే ఖర్చుల్లో భాగం కనుక చలామణి పెట్టుబడికే చెందడం సబబు.

ఖాతా పుస్తకంలో రాసే పద్ధతి అన్నది రాయబడిన అంశాల పరిస్థితిని ఏ రకంగానూ మార్చలేదని వేరే చెప్పనిలేదు. అయితే సాంప్రదాయకంగా అనేక వ్యాపార శాఖలు మరమ్మతు ఖర్చులను నిశ్చల పెట్టుబడి యొక్క అరుగుదలలో భాగంగా క్రింది విధంగా నమోదు చేస్తాయని గమనించడం ముఖ్యం : అడ్వాన్సు చేయబడిన నిశ్చల పెట్టుబడి 10 వేల పౌండ్లు, దాని మన్నిక కాలం 15 ఏళ్ళు అనుకుందాం. అప్పుడు దాని వార్షిక అరుగుదల $666\frac{2}{3}$ పౌండ్లు. అయితే తరుగుదలను లెక్కగట్టేది, మన్నిక పదేళ్ళు మాత్రమే అనే ప్రాతిపదికపైనే. మరోలా చెప్పాలంటే, నిశ్చల పెట్టుబడి అరుగుదల నిమిత్తం, తయారైన సరుకుల ధరకి ఏడాదికి $666\frac{2}{3}$ పౌండ్లకి బదులు వెయ్యి పౌండ్లు కలపబడుతుంది. ఆ రకంగా $333\frac{1}{3}$ పౌండ్లు మరమ్మతులు మొదలైన వాటి కోసం తీసి వుంచుతారు. (10, 15 అన్న అంకెలు కేవలం ఉదాహరణ కోసం తీసుకొన్నవే) నిశ్చల పెట్టుబడి 15 ఏళ్ళు నిలబడి ఉండటానికిగాను ఈ మొత్తం మరమ్మతులకై సగటున ఖర్చు చేస్తారు. అటువంటి లెక్క రాసే పద్ధతి వల్ల నిశ్చల పెట్టుబడీ, మరమ్మత్తుల మీద ఖర్చయిన అదనపు పెట్టుబడీ వేరు వేరు అభివర్గాలు కాకుండా పోవు. ఈ లెక్కగట్టే పద్ధతి ప్రకారం, ఉదాహరణకు, ఓడలను మంచి స్థితిలో ఉంచడానికీ, వాటి స్థానాన్ని కొత్త వాటితో భర్తీ చేయడానికీ తక్కువలో తక్కువ ఖర్చు, ఏడాదికి దాని

ఖరీదులో 15 శాతం వుంటుందని అంచనా వేశారు. కాబట్టి, దాని పునరుత్పత్తి కాలం $6\frac{2}{3}$ సంవత్సరాలు. పునరుత్పత్తి కాలం $6\frac{1}{4}$ సంవత్సరాలనే లెక్కన 1860లలో, ఇంగ్లీషు ప్రభుత్వం వెనినుబలర్ అండ్ ఓరియంటల్ కంపెనీకి 16 శాతం చొప్పున పరిహారం చెల్లించింది. రైల్వేలలో, రైలింజనుల సగటు జీవిత కాలం 10 సంవత్సరాలు. అయితే మరమ్మతులను దృష్టిలో వుంచుకొని విలువ తరుగుదల 12½ శాతంగా అంచనా వేస్తున్నారు. దాని మన్నిక కాలం 8 ఏళ్ళకు తగ్గించారన్నమాట. ప్రయాణీకుల పెట్టెలు, వాగన్ల విషయంలో తరుగుదల 9 శాతం అంటే వాటి మన్నిక కాలం $11\frac{1}{9}$ ఏళ్ళు. అద్దెకివ్వబడే ఇళ్ళు, ఇతర వస్తువుల విషయంలో చట్టం, సర్వత్రా, ఒక తేడాను స్పష్టం చేసింది. ఇళ్ళు వాటి యజమానులకు నిశ్చల పెట్టుబడులు. నిశ్చల పెట్టుబడులుగానే వారు వాటిని అద్దెకిస్తారు. కాలగతి, ప్రకృతి శక్తుల ప్రభావం వల్ల జరిగే సాధారణ విలువ తరుగుదల, సాధారణ అరుగుదల ఒకవైపూ, ఇంటి సాధారణ జీవిత కాలంలోనూ, దాని సాధారణ వినియోగ కాలంలోనూ దాన్ని మంచి స్థితిలో ఉంచేందుకోసం అప్పుడప్పుడూ అవసరమయ్యే మరమ్మతులు మరోవైపూ జరుగుతాయి. ఈ రెంటి మధ్య చట్టం తేడాని చూపింది. మొదట పేర్కొన్న వాటి ఖర్చులను ఇంటి యజమాని, రెండో వాటిని అద్దెకున్న వారు విధిగా భరించాలి. మరమ్మతులు కూడా రెండు రకాలుగా విభజించబడ్డాయి. సాధారణమైన మరమ్మతు, పెద్ద మరమ్మతులు. పెద్ద మరమ్మతులంటే నిశ్చల పెట్టుబడిని కొంతమేరకు పునరుద్ధరించడానికి చేసేవి. కనుక అవి ఇంటి యజమాని బాధ్యత. అద్దె పత్రంలో అందుకు విరుద్ధంగా వుంటే అది వేరు. ఉదాహరణకు ఇంగ్లీషు చట్టాన్ని చూడండి : "మరోవైపున అద్దెకుంటున్న వ్యక్తి ఏడాది ఏడాదికీ తాను ఉంటున్న ఆవరణను గాలి, నీరు జొరబడకుండా ఉంచడం తప్ప అంతకు మించి చేయాల్సిన బాధ్యత లేదు. అది కూడా 'పెద్ద' మరమ్మతులు అవసరం లేనంతమేరకే. న్యాయంగా 'సాధారణ' మరమ్మతుల కిందికి వచ్చే వాటిని మాత్రమే అతను చేయాల్సి వుంటుంది. 'సాధారణ' రిపేర్లు వర్తించే ఆవరణ భాగాల విషయంలో కూడా, అతను వాటిని తీసుకున్నప్పుడు వాటి వయసు, మొత్తంపై వాటి పరిస్థితి వగైరాలను పరిగణనలోకి తీసుకోవాలి. ఎందుకంటే పాతబడి, అరిగిపోయిన సామానులకు బదులు కొత్తవాటిని తేవాల్సిన బాధ్యత అతనికి లేదు. కాలగతితో అనివార్యమైన విలువ తరుగుదలను, మామూలు అరుగుదలను భర్తీ చేయాల్సిన బాధ్యత కూడా అతనికి లేదు". (హోల్డ్స్‌వర్త్, లా ఆఫ్ లాండ్‌లార్డ్ అండ్ టెనెంట్, పుటలు 90, 91)

అరుగుదలను భర్తీ చేయడం, మంచి స్థితిలో వుంచడం, మరమ్మతులు వగైరాలకు పూర్తిగా భిన్నమైనది బీమా. అది అసాధారణ సంఘటన వల్ల జరిగిన విధ్వంసనకు సంబంధించింది. దీన్ని అదనపు విలువ నుంచి భర్తీ చేయాలి. కాబట్టి అది అదనపు విలువలో కోత. లేదా మొత్తం సమాజం దృష్టి నుంచి చూస్తే, ఎప్పుడూ నిరంతరాయమైన అధికోత్పత్తి ఉండాలి. అంటే, ఉన్న సంపదను కేవలం భర్తీ చేయడానికి – పునరుత్పత్తి చేయడానికి – అవసరమైన దానికన్నా ఎక్కువ స్థాయిలో ఉత్పత్తి జరగాలి. జనాభా పెరుగుదల మాట అటుంచి, దుర్ఘటనల వల్ల, ప్రకృతి ఉత్పాతాల వల్ల, అసాధారణమైన విధ్వంసన జరగవచ్చు. వాటివల్ల వచ్చే నష్టాన్ని భర్తీ చేయడానికి కావలసిన ఉత్పత్తి సాధనాలు సమాజానికి ఉండేలా ఉత్పత్తి జరగాలి.

నిజానికి, భర్తీ చేయడానికి అవసరమైన పెట్టుబడిలో అతి కొద్ది భాగం మాత్రమే రిజర్వు

నిధిగా ఉంటుంది. అత్యంత గణనీయమైన భాగం ఉత్పత్తి స్థాయీ విస్తరణ రూపంలో వుంటుంది. అది పాక్షికంగా వాస్తవ విస్తరణగా, పాక్షికంగా నిశ్చల పెట్టుబడిని ఉత్పత్తి చేసే పారిశ్రామిక శాఖల మామూలు ఉత్పత్తి పరిమాణంగా వుంటుంది. ఉదాహరణకు, ఒక యంత్ర నిర్మాణ ఫ్యాక్టరీ, తన ఖాతాదారుల ఫ్యాక్టరీలు ఏటా విస్తరించేలా, వాటిలో కొన్నిటికి పూర్తిగానో, పాక్షికంగానో పునరుత్పాదన అవసరం ఎల్లప్పుడూ వుండేలా, వ్యవహారాలను నడపాల్సి వుంటుంది.

అరుగుదల, మరమ్మతు ఖర్చులు సామాజిక సగటును బట్టి నిర్ణయించబడినప్పుడు, తప్పకుండా అసమానత తలెత్తుతుంది. ఒకే ఉత్పత్తి శాఖల్లో ఒకే పరిస్థితుల్లో ఒకే పెట్టుబడి మొత్తాలతో పని చేసే ఫ్యాక్టరీల మధ్య సైతం తేడా తలెత్తుతుంది. ఆచరణలో యంత్రాలు వగైరా ఒక పెట్టుబడిదారుని వద్ద సగటు కాలం కంటే ఎక్కువ కాలం నిలబడవచ్చు. మరో పెట్టుబడిదారుని వద్ద అంతకాలం ఉండక పోవచ్చు. మరమ్మతు ఖర్చులు ఒకరి దగ్గర సగటు కంటే ఎక్కువగానూ, మరొకరి దగ్గర సగటు కంటే తక్కువగానూ అవచ్చు. ఇలాంటి తేడాలు ఇంకా వుంటాయి. అయితే అరుగుదల వల్ల, మరమ్మతుల ఖర్చుల వల్ల ధరకు జతయ్యే మొత్తం రెండు సందర్భాల్లోనూ ఒకటే. అది సామాజిక సగటును బట్టి నిర్ణయమవుతుంది. కనుక ధర పెరగటం వల్ల, తాను నిజంగా చేర్చినదానికంటే ఒకరికి ఎక్కువ ముడుతుంది. మరొకరికి తక్కువ ముడుతుంది. ఈ విషయమూ, ఒకే వ్యాపార శాఖలో ఒకే స్థాయిలో శ్రమ శక్తిని దోపిడీ చేసే వివిధ పెట్టుబడిదారులకు వేరు వేరు లాభాలు రావడానికి దారితీసే ఇతర విషయాలూ అదనపు విలువ అసలు స్వభావాన్ని అర్థం చేసుకోవడంలో ఉన్న క్లిష్టతను మరింత పెంచుతాయి.

మరమ్మతులకూ, భర్తీకీ మధ్య వున్న సరిహద్దు, అలాగే యంత్రాలను మంచి స్థితిలో ఉంచేందుకు ఖర్చులకూ, పునరుద్ధరణ ఖర్చులకూ మధ్య వున్న సరిహద్దు అనిశ్చితమైనది. ఉదాహరణకు రైల్వేలలో ఒక నిరంతర వివాదానికి ఇదే కారణం. కొన్ని రకాల ఖర్చులు మరమ్మతు ఖర్చులా, భర్తీ ఖర్చులా వాటిని ప్రస్తుత ఖర్చు కింద జమగట్టాలా లేక తొలి పెట్టుబడి నిధి కింద జమకట్టాలా అన్నది ఈ వివాదం. మరమ్మతు ఖర్చులను రెవెన్యూ (రాబడి) ఖాతానుండి, పెట్టుబడి ఖాతాకు బదిలీ చేయడం ద్వారా రైల్వే డైరెక్టర్ల బోర్డు తన డివిడెండ్లను కృత్రిమంగా పెంచుకోవడం అందరికీ తెలిసిన పద్ధతే. అనుభవం దీనికి సంబంధించిన అత్యంత ప్రధానమైన కిటుకుల్ని అందజేస్తోంది. ఉదాహరణకు, ఒక రైల్వే ఆరంభ దశలో అవసరమయ్యే శ్రమని "మరమ్మతులుగా పరిగణించరాదు. దానిని రైల్వే నిర్మాణంలో అత్యవసర భాగంగానే పరిగణించాలి. జమా ఖర్చుల లెక్కల్లో దాన్ని పెట్టుబడి ఖాతాకింద ఖర్చుగా చూపాలే తప్ప రాబడి పద్దు కింద చూపరాదు. ఎందువల్లనంటే, అది అరుగుదల వల్ల తగిలిన ఖర్చు కాదు. బళ్ళ సక్రమ ప్రమాణాల వల్ల అయిన ఖర్చు కూడా కాదు. అది రైల్వే నిర్మాణంలో ముందుగానే ఉన్న అనివార్య అసంపూర్ణత కారణంగా తలెత్తిన ఖర్చు" అని లార్డ్నర్ అన్నాడు. (లార్డ్నర్, పూర్వోక్త గ్రంథం, పుట 40) "ఆదాయాన్ని గడించడంలో అవశ్యంగా జరిగే అరుగుదల, వాస్తవంలో ఆ మొత్తం ఖర్చయినా, కాకపోయినా, ప్రతి సంవత్సరపు రెవెన్యూ (రాబడి) ఖాతా కింద ఖర్చుగా చూపడమొక్కటే సరియైన పద్ధతి." (కాప్టెన్, ఫిజ్‌మారిస్, 1867 మనీ మార్కెట్ రివ్యూలో ప్రచురించబడిన "కమిటీ ఆఫ్ ఎంక్వయిరీ ఆన్ కెలడోనియన్ రైల్వే")

నిశ్చల పెట్టుబడిని భర్తీ చేయడం, వాటిని మంచి స్థితిలో వుంచడం – ఈ రెంటినీ వేరు చేయడం ఆచరణ రీత్యా వ్యవసాయంలో అసాధ్యమూ, అర్థరహితమూ అవుతుంది – కనీసం ఆవిరి శక్తి ఉపయోగించనప్పుడు కిర్కాఫ్ ప్రకారం (హాండ్ బుక్ డెర్ లాండ్ విర్ట్ స్కాఫ్ట్ లిచెన్ బెట్రియబ్ స్లేర్, డ్రెస్‌డన్, 1852 పుట 137), "అతిగా కాకున్నా సంపూర్ణంగా పరికరాల (వ్యవసాయం, తదితర పరికరాలు, పొలాల్లో వినియోగించే అన్ని రకాల సాధనాలు) సరఫరా ఉన్న చోటల్లా, ఏడాదిలో పరికరాల అరుగుదలనూ, వాటిని మంచి స్థితిలో ఉంచడానికయ్యే ఖర్చులనూ, ఆయా పరిస్థితులను బట్టి సగటున మొత్తం పరికరాల్లో 15–25 శాతం చొప్పున అంచనా వేయడం సంప్రదాయం."

రైలింజన్లు, పెట్టెలు, వాగన్ల విషయంలో మరమ్మతుల్నీ, భర్తీని వేరుచేయడం సాధ్యమే కాదు. "మా వద్ద రైలింజన్లు, పెట్టెలు ఇన్ని వుండాలనే దృష్టితో వాటిని సరియైన స్థితిలో వుంచుతాము. మావద్ద వున్న ఇంజన్లు ఎన్నైనాసరే, వాటిని సరియైన స్థితిలో వుంచుతాము. ఒకటి పాతదైపోయి కొత్తదాన్ని తయారు చేసుకోవడమే మేలనిపిస్తే మేము రెవెన్యూ పద్దు కింద ఖర్చుతో తయారు చేస్తాం. పాత ఇంజన్‌లలోని సామాగ్రిని ఎంతవరకు సాధ్యమైతే అంతవరకూ తీసి కొత్తదానిలో ఉపయోగిస్తాం. అందులో చాలా మిగిలి వుంటుంది. చక్రాలు, ఇరుసులు, బాయిలర్లు, నిజానికి పాత ఇంజన్లోనివి ఎన్నో మిగిలి వుంటాయి." (టి. గూచ్, గ్రేట్ వెస్టరన్ రైల్వే కంపెనీ ఛైర్మన్, ఆర్.సి. ఆన్, రైల్వేస్, పుట 858. 17327 – 17329) ".....మరమ్మతు చేయడం అంటే పునరుద్ధరణే. భర్తీ అన్న పదాన్ని నేను నమ్మను. ఒక రైల్వే కంపెనీ రైలు పెట్టెను లేదా ఇంజన్‌ను కొన్నదీ అంటే, దాన్ని మరమ్మతు చేస్తూనే వుండాలి. ఆ విధంగా అది సదా నడుస్తూనే వుండటానికి వీలవుతుంది" (నెం.17784) "...... ఈ $8\frac{1}{2}$ పెన్నీలతో, ఇంజన్లను మంచి స్థితిలో ఉంచుతున్నాడు. మేము మా ఇంజన్లను పునర్నిర్మిస్తాం. మొత్తం ఇంజన్‌నే కొంటే అవసరమైన దానికంటే ఎక్కువ డబ్బు ఖర్చు పెట్టినట్టే.... కాని ఎప్పుడూ ఒక జత చక్రాలో, ఒక ఇరుసో, ఇంజన్‌లోని ఏదో ఒక భాగం పనికి వస్తాయి. కాబట్టి కొత్త ఇంజన్ నిర్మాణాన్ని అది చౌక చేస్తుంది". (నెం. 17790) "నేను ప్రస్తుతం ప్రతి వారం ఒక కొత్త ఇంజన్‌ను, దాదాపు ఒక కొత్త ఇంజన్ను తయారు చేస్తున్నాను. ఎందుకంటే దానిలో ఒక కొత్త బాయిలర్, సిలెండర్ లేదా చట్రం ఉంటుంది" (నెం.17823 అర్చిబాల్డ్ స్టర్రాక్, గ్రేట్ నార్తరన్ రైల్వే, లోకోమోటివ్ సూపరింటెండెంట్, ఆర్.సి. 1867)

రైలు పెట్టెలకూ అదే వర్తిస్తుంది. "కాలక్రమంలో ఇంజన్లూ, బళ్ళూ నిరంతరాయంగా రిపేరు చేయబడుతుంటాయి. ఒకప్పుడు కొత్త చక్రాలు తగిలించబడతాయి, మరొకప్పుడు కొత్త చట్రం బిగించబడుతుంది. తిరిగే భాగాలు ఎక్కువ అరుగుదలకు గురవుతూ వుంటాయి. అవి క్రమక్రమంగా పునరుద్ధరించబడతాయి. ఇంజన్లూ, పెట్టెలు కూడా వరుసగా అలాంటి ఎన్ని మరమ్మతులకు గురి అవుతాయంటే, చాలావాటిలో పాతరూపం అవశేషాలేమీ మిగలవు... ఈ సందర్భంలో కూడా పెట్టెలూ, ఇంజన్లకు సంబంధించిన సామగ్రి ఇతర పెట్టెలకూ, ఇంజన్లకూ బిగించడం జరుగుతుంది. రైలు మార్గం నుంచి అవి పూర్తిగా ఎప్పుడూ తప్పుకోవు. కనుక చలనశీల పెట్టుబడి నిరంతరాయంగా పునరుత్పత్తి స్థితిలో వుంటుందని పరిగణించవచ్చు. శాశ్వత రైలు మార్గం విషయంలో, మొత్తం మార్గాన్ని తిరిగి నిర్మించాల్సిన అవసరం భవిష్యత్తులో ఎప్పుడో ఏర్పడేది. రైలు ఇంజన్లు పెట్టెల

విషయంలో ప్రతి ఏడాదీ క్రమక్రమంగా జరుగుతుంది. వాటి మనుగడ నిరంతరమైనది. అవి నిత్య పునరుజ్జీవన స్థితిలో వుంటాయి." (లార్డ్నర్, అదే గ్రంథం, పుటలు. 115-16.)

రైల్వేలకు సంబంధించి లార్డ్నర్ చెబుతున్న ఈ ప్రక్రియ ఒక విడి ఫ్యాక్టరీకి వర్తించదు. అయితే మొత్తం ఒక పారిశ్రామిక శాఖలో లేదా సామాజిక స్థాయిలో పరిశీలించినప్పుడు మొత్తం ఉత్పత్తిలో సైతం, మరమ్మతులు మిళితమై వున్న నిశ్చల పెట్టుబడి యొక్క నిరంతరాయమైన, పాక్షిక పునరుత్పత్తికి ఒక ఉదాహరణగా ఇది పనికొస్తుంది.

తెలివైన డైరెక్టర్ల బోర్డులు మరమ్మతులు, భర్తీ అన్న పదాలను తమ డివిడెండ్లు పెంచుకోడానికి గాను ఏ మేరకు తారుమారు చేయగలరో చూపటానికి ఇక్కడ రుజువుంది : పైన పేర్కొన్న ఆర్.పి. విలియమ్స్ పత్రం ప్రకారం వివిధ ఇంగ్లీషు రైల్వే కంపెనీలు ఈ క్రింది మొత్తాలను రైలు మార్గాల, భవనాల మరమ్మతులకూ, వాటిని మంచి స్థితిలో వుంచడానికీ అయ్యే ఖర్చుని (ఒక మైలు ఇంగ్లీషు రైలు మార్గానికి) రెవెన్యూ (రాబడి) ఖాతా నుంచి అనేక ఏళ్ళ సగటు ఖర్చుగా తొలగించి వేశారు.

| | |
|---|---|
| లండన్ అండ్ నార్త్ వెస్టరన్ ........ | 370 పౌండ్లు |
| మిడ్‌లాండ్ ............ | 225 పౌండ్లు |
| లండన్ అండ్ సౌత్ వెస్టరన్ ......... | 257 పౌండ్లు |
| గ్రేట్ నార్తరన్ ............. | 360 పౌండ్లు |
| లాంకెషైర్ అండ్ యార్క్ షైర్ ........... | 377 పౌండ్లు |
| సౌత్ ఈస్టరన్ ............ | 263 పౌండ్లు |
| బ్రైటన్ ............ | 266 పౌండ్లు |
| మాంచెస్టర్ అండ్ షెఫీల్డ్........ | 200 పౌండ్లు |

ఈ తేడాలు బహు కొద్దివి మాత్రమే. అసలు ఖర్చుల్లో తేడాల వల్ల తలెత్తుతాయి. దాదాపు పూర్తిగా, అవి లెక్కగట్టే పద్ధతుల్లో ఉన్న తేడాల వల్ల తలెత్తేవి. వివిధ రకాల ఖర్చుల్ని రెవెన్యూ ఖాతాలో చేర్చారా, పెట్టుబడి ఖాతాలో చేర్చారా అన్నదాన్ని బట్టి ఈ తేడాలు వస్తాయి. మంచి డివిడెండ్ కోసం తక్కువ ఛార్జీ నమోదు చేయబడుతుందనీ, భరించగలిగిన రెవెన్యూ ఎక్కువ కాబట్టి ఎక్కువ ఖర్చు నమోదు చేయబడుతుందనీ విలియమ్స్ అక్షరాలా చెప్పాడు.

కొన్ని సందర్భాల్లో అరుగుదలా, దాన్ని భర్తీ చేయవలసిన అవసరమూ అతి తక్కువగా వుంటుంది. కాబట్టి మరమ్మతు ఖర్చులు మాత్రమే లెక్కించాల్సి వుంటుంది. రైలు మార్గాలలో కళాఖండాలనబడే వాటి గురించి లార్డ్నర్ పేర్కొన్న ఈ కింది అంశాలు ఓడలు మరమ్మతు చేసే దొరువులు, కాలవలు, ఇనుప రాతి వంతెనలు, ఏళ్ళతరబడి నిలిచివుండే ఇలాంటి వాటికి వర్తిస్తుంది. "మన్నిక గలిగిన భారీ కట్టడాలపైన కాలగతి నెమ్మదిగా పనిచేయడం వల్ల సంభవించే అరుగుదల ప్రభావం కొద్దిపాటి వ్యవధుల్లో గమనిస్తే దాదాపు కనిపించదు. అయితే దీర్ఘకాల వ్యవధి తర్వాత, ఉదాహరణకు, శతాబ్దాల తర్వాత మహాదృఢమైన కొన్ని కట్టడాలను లేదా అన్నిటినీ పునర్నిర్మించాల్సి వుంటుంది. నిర్ణీత వ్యవధిని బట్టి, యుగాల లెక్కన విశ్వ బృహత్ గోళాల చలనంలో సంభవించే అసమానతలతో ఈ మార్పులను

పోల్చడం అసమంజసం కాదు. బ్రిడ్జీలూ, సొరంగాలూ, లోయలపై వంతెనలూ వగైరాలపైన కాల ప్రభావం, యుగ సంబంధమైన అరుగుదల అనే దానికి ఉదాహరణ. మరింత త్వరితగతితో, కళ్ళకి కనిపించేటట్టు జరిగే వస్తు క్షీణతను మరింత తరచుగా, మరమ్మతులు లేదా పునర్నిర్మాణం ద్వారా చక్కదిద్దుతారు. ఇలాంటి క్షీణతలు నిర్ణీత వ్యవధుల్లో వచ్చే అసమానతల వంటివి. మరింత దీర్ఘకాలం పాటు నిలిచి ఉండే మరింత గట్టి కట్టడాల ఉపరితలం అప్పుడప్పుడు యాదృచ్ఛికంగా దెబ్బతినడం కద్దు. వార్షిక మరమ్మతుల్లో దాన్ని చేరుస్తారు. అయితే ఈ మరమ్మతులతో ప్రమేయం లేకుండానే కాలం ఈ కట్టడాలపైన సైతం తన ప్రభావం చూపిస్తుంది. ఈ కట్టడాలను పూర్తిగా పునర్నిర్మించడం అవసరమైన స్థితికి అవి దిగజారిపోయే యుగం, అది ఎంత దూరంలో వున్నా, రాక తప్పదు. ఆర్థిక, ద్రవ్య వ్యవహారాల దృష్ట్యా, ఆ యుగం బహుశా ఎంత దూరంలో ఉంటుందంటే, దాన్ని ఆచరణాత్మకమైన అంచనాల్లోకి తీసుకురావలసిన అవసరం లేదు. అందుకే, ఇక్కడ దాన్ని ప్రసంగవశాత్తు కేవలం పేర్కొంటే చాలు." (లార్డ్నర్, పైన పేర్కొన్న పత్రం పుటలు 38–39)

ఎప్పుడో యుగానికొకసారి పునర్నిర్మించాల్సిన కట్టడాలన్నిటికీ ఇది వర్తిస్తుంది. కాబట్టి, వాటి కోసం అడ్వాన్సు చేయబడిన పెట్టుబడిని వాటి అరుగుదలను బట్టి క్రమేణా భర్తీ చేయవలసిన అవసరం లేదు. కేవలం వాటిని మంచి స్థితిలో ఉంచడానికి, మరమ్మతులకు అయ్యే వార్షిక సగటు ఖర్చులను మాత్రమే ఉత్పాదితం ధరకి బదిలీ చేస్తే చాలు.

నిశ్చల పెట్టుబడి అరుగుదలను భర్తీ చేయడానికి, తిరిగి వచ్చే డబ్బులో అధిక భాగం ఏడాదికో లేదా ఇంకా తక్కువ కాల పరిమితిలోనే తిరిగి దాని వస్తు రూపంలోకి మార్చబడినప్పటికీ, ప్రతి పెట్టుబడిదారునికీ ఒక నిల్వ నిధి అవసరం. కొన్నేళ్ళ తర్వాత మొత్తంగా భర్తీ చేయాల్సిన నిశ్చల పెట్టుబడి యొక్క ఆ భాగం పునరుత్పత్తికి ఇది అవసరం. నిశ్చల పెట్టుబడిలో ఒక గణనీయమైన భాగం, తన ప్రత్యేక లక్షణాల కారణంగా తన క్రమ క్రమ పునరుత్పత్తికి అవకాశమివ్వదు. అదీగాక, చిన్న చిన్న కాలవ్యవధుల్లో తరిగిపోతున్న పాత సామాగ్రికి కొత్త సామాగ్రిని జతచేసే విధంగా పునరుత్పత్తి కొంచెం కొంచెంగా జరిగే సందర్భాల్లో, ఆయా పారిశ్రామిక శాఖల ప్రత్యేక స్వభావాన్ని బట్టి, భర్తీ చేయడానికి ముందు కొంత డబ్బు పోగుబడి వుండాలి. దీనికి ఎంతో కొంత మొత్తం సరిపోదు. ఒక నిర్దిష్టమైన మొత్తం అవసరం.

పరపతి వ్యవస్థతో ప్రమేయం లేకుండా, డబ్బు సాదా చలామణిలో ఉందనే ఊహతో ఈ సమస్యను పరిశీలిస్తే, ఈ చలనం ఈ కింది విధంగా వుంటుంది; (పరపతి వ్యవస్థ గురించి తర్వాత పరిశీలిద్దాం.)[1] సమాజంలో లభ్యమయ్యే డబ్బులో ఒక భాగం కూడబెట్టిన ధనరాశిగా, నిరంతర నిరుపయోగంగా వున్న, మిగిలిన భాగం చలామణి సాధనంగానో లేదా ప్రత్యక్షంగా చలామణిలో వున్న డబ్బుకి తక్షణ రిజర్వు నిధిగానో వ్యవహరిస్తున్నపుడు, మొత్తం డబ్బంతా కూడబెట్టిన ధనరాశిగానూ, చలామణి సాధనంగానూ పంపిణీ అయ్యే నిష్పత్తి స్థిరంగా మారుతుంటుందని చూశాం.[2] ఈ

1. పెట్టుబడిదారీ పరపతి వ్యవస్థ పెట్టుబడి మూడో సంపుటం నాలుగు, ఐదు భాగాల్లో పరిశీలించబడింది - సం.

2 మొదటి సంపుటం, అధ్యాయం III , 3 వి - సం.

సందర్భంలో, సాపేక్షంగా పెద్ద పెట్టుబడిదారుని చేతిలో పోగుబడే ధనరాశి నిశ్చల పెట్టుబడి కొనుగోలుకై, ఒక్కసారిగా పెద్ద మొత్తాల్లో చలామణిలోనికి నెట్టబడుతుంది. అది మళ్ళీ సమాజంలో చలామణి సాధనంగానూ, కూడబెట్టిన ధనరాశిగానూ విడిపోతుంది. నిశ్చల పెట్టుబడి విలువ దాని అరుగుదలకి అనులోమంగా తన తొలి స్థానానికి, నిల్వ నిధికి మళ్ళీ చేరుతుంది. ఆ నిల్వ నిధి ద్వారా, చలామణి డబ్బులో ఒక భాగం అదే పెట్టుబడిదారు మళ్ళీ కూడబెట్టిన ధనరాశిగా మారుతుంది. అది ఎక్కువ కాలం పాటు కావచ్చు లేదా తక్కువ కాలం పాటు కావచ్చు. నిశ్చల పెట్టుబడిని కొనుగోలు చేశాక చలామణి సాధనంగా మారి, ఆ పెట్టుబడిదారుని చేతి నుండి బయటికి పోయిన ధనరాశే అది. సమాజంలో కూడబెట్టిన ధనరాశి నిరంతరాయ పంపిణీ ఇలా మారుతూంటుంది. అది చలామణి సాధనంగా పని చేస్తుంది. చలామణి సాధనంగా వున్న డబ్బు మొత్తం నుండి మళ్ళీ విడిపోయి, కూడబెట్టిన ధనరాశిగా మారుతుంది. ఆధునిక పరిశ్రమ, పెట్టుబడిదారీ ఉత్పత్తి – వీటితోపాటు సమాంతరంగా పరపతి వ్యవస్థ కూడా అభివృద్ధి చెందుతుంది. దాని అభివృద్ధితో, డబ్బు ఇక ఏ మాత్రమూ కూడబెట్టిన ధనరాశిగా వ్యవహరించదు. పెట్టుబడిగా మాత్రమే వ్యవహరిస్తుంది. అయితే దాని యజమాని చేతిలో కాదు, వినియోగానికి వీలుగా, అది ఎవరి చేతిలో ఉంచబడుతుందో ఆ మిగతా పెట్టుబడిదారుల చేతుల్లో పెట్టుబడిగా వ్యవహరిస్తుంది.

★ ★ ★

## అధ్యాయం - 9

# మదుపు పెట్టిన పెట్టుబడి సగటు టర్నోవరు, టర్నోవరు ఆవృత్తాలు

# (The aggregate turnover of Advanced Capital Cycles of Turnover)

ఉత్పాదక పెట్టుబడి యొక్క నిశ్చల, చలామణి భాగాలు వేరు వేరు విధాలుగా, విభిన్న వ్యవధుల్లో టర్నోవరు అవుతాయని మనం చూశాం. నిశ్చల పెట్టుబడిలోని వేరు వేరు అంతర్భాగాలకు సైతం వాటి మన్నిక కాలాన్ని బట్టి తత్కారణంగా వాటి వేరు వేరు పునరుత్పత్తి కాల వ్యవధుల్ని బట్టి వేరు వేరు టర్నోవరు కాల వ్యవధులుంటాయి. (చలామణి పెట్టుబడిలోని వేరు వేరు అంతర్భాగాల టర్నోవర్లలో వాస్తవమైన లేదా పైకి కనిపించే, భేదం గురించి ఈ అధ్యాయం చివరి 6వ అంశంలో చూడండి).

1. మదుపు పెట్టిన పెట్టుబడి యొక్క సగటు టర్నోవరు అంటే, దాని వివిధ అంతర్భాగాల సగటు టర్నోవరన్నమాట. దాన్ని లెక్కగట్టే విధానం తర్వాత వివరించబడుతుంది. అది విభిన్న కాల వ్యవధులకు సంబంధించిన విషయం కనుక దాన్ని లెక్కగట్టడం అంత తేలికైనది మరొకటుండదు. అయితే;
2. ఇక్కడ ఉన్నది కేవల పరిమాణాత్మకమైన భేదం మాత్రమే కాదు. గుణాత్మకమైనది కూడా.

ఉత్పత్తి ప్రక్రియలోకి ప్రవేశించే చలామణి పెట్టుబడి తన మొత్తం విలువను ఉత్పాదితానికి బదిలీ చేస్తుంది. కనుక ఉత్పత్తి ప్రక్రియ నిరంతరాయంగా సాగాలంటే ఉత్పాదితం అమ్మకం ద్వారా అది నిరంతరాయంగా వస్తు రూపేణా భర్తీ అవుతూ వుండాలి. ఉత్పత్తి ప్రక్రియలోకి ప్రవేశించే నిశ్చల పెట్టుబడి తన విలువలో ఒక భాగాన్ని (అరుగుదలని) మాత్రమే ఉత్పాదితానికి జోడిస్తుంది. అయితే ఈ అరుగుదల ఉన్నప్పటికీ అది ఉత్పత్తి ప్రక్రియలో పని చేస్తూనే వుంటుంది. కనుక వివిధ కాల పరిమాణాలు గల వ్యవధులు పూర్తయ్యేదాకా దాన్ని వస్తు రూపేణా భర్తీ చేయాల్సిన అవసరం లేదు. ఏది ఏమైనప్పటికీ, చలామణి పెట్టుబడి అంత తరచుగా భర్తీ చేయాల్సిన అవసరం రాదు. ఈ భర్తీ అవసరం, ఈ పునరుత్పత్తి కాల పరిమితి, నిశ్చల పెట్టుబడి వివిధ అంతర్భాగాల విషయంలో పరిమాణం రీత్యా వేరు వేరుగా వుండటం మాత్రమే కాదు, మనం ఇదివరకే చూచినట్లు, నిరంత రాయంగా ఉండే నిశ్చల పెట్టుబడిలో ఒక భాగం; ప్రతి ఏడాదీ లేదా మరింత తక్కువ కాల వ్యవధుల్లో భర్తీ అయి, పాత నిశ్చల పెట్టుబడికి వస్తు రూపేణా తోడు కావచ్చు. వేరు వేరు లక్షణాలు గల నిశ్చల పెట్టుబడి విషయంలో దాని మన్నిక కాలం చివర, ఒకేసారి మాత్రమే దాని భర్తీ జరిగేవీలుంది.

కనుక నిశ్చల పెట్టుబడిలోని వివిధ భాగాల ప్రత్యేక టర్నోవరులను ఒకే రూపంలోని టర్నోవరుగా మార్చడం అవసరం. అప్పుడు టర్నోవరు కాల పరిమితిని బట్టి అవి కేవలం పరిమాణం రీత్యా మాత్రమే భిన్నంగా వుంటాయి.

ఈ గుణాత్మక అభిన్నత, నిరంతరాయమైన ఉత్పత్తి ప్రక్రియకి రూపం అయిన ఉపె–ఉపెతో మనం ప్రారంభిస్తే రాదు. ఎందుకంటే ఉపె యొక్క నిర్దిష్ట అంశాలు నిరంతరాయంగా వస్తు రూపేణా భర్తీ కావాలి. కాగా ఇతర అంశాలు అలా కానవసరం లేదు. అయితే డ....డ రూపం నిస్సందేహంగా టర్నోవరులో ఈ అభిన్నతను ఇస్తుంది. ఉదాహరణకు, 10 వేల పౌండ్ల విలువ కలిగి, పదేళ్ళపాటు పనిచేసే యంత్రాన్ని తీసుకుందాం. అంటే, వెయ్యి పౌండ్ల విలువను ఏటా తిరిగి డబ్బుగా మారుస్తుంది. ఈ వెయ్యి పౌండ్లు ఒక ఏడాదిలో డబ్బు పెట్టుబడి రూపంనుంచి ఉత్పాదక పెట్టుబడిగా, సరుకు పెట్టుబడిగా మారి, తిరిగి డబ్బు పెట్టుబడిగా మార్చబడుతుంది. చలామణి పెట్టుబడి లాగానే అది తన మూల రూపమైన డబ్బు రూపానికి తిరిగి వస్తుంది – మనం చలామణి పెట్టుబడిని ఈ రూపంలో పరిశీలిస్తే, ఇక్కడ ఏడాది చివరన ఈ వెయ్యి పౌండ్ల డబ్బు పెట్టుబడి మరోసారి యంత్ర రూపం ధరించిందా లేదా అన్నదానితో ప్రమేయం లేదు. కనుక అడ్వాన్సు చేయబడిన ఉత్పాదక పెట్టుబడి యొక్క మొత్తం టర్నోవరు లెక్కగట్టడంలో మనం దాని అంశాలన్నింటినీ డబ్బు రూపంలో పెడతాము. కనుక ఆ రూపానికి తిరిగి రావడంతో టర్నోవరు పూర్తి అవుతుంది. విలువ ఎప్పుడూ డబ్బు రూపంలో అడ్వాన్సు చేయబడినట్టుగా మనం ఊహించుకొంటాం. విలువ యొక్క ఈ డబ్బు రూపం కేవలం ఖాతా డబ్బుగా ఉండే నిరంతరాయమైన ఉత్పత్తి ప్రక్రియకి కూడా ఇదే వర్తిస్తుంది. ఆ రకంగా మనం సగటుని లెక్కగట్టగలుగుతాం.

3. అడ్వాన్సు చేయబడిన ఉత్పాదక పెట్టుబడిలో చాలా ఎక్కువ భాగం నిశ్చల పెట్టుబడిగా వుండి, దాని పునరుత్పత్తికీ, తత్కారణంగా దాని టర్నోవరుకు అనేక సంవత్సరాల ఆవృత్తి అవసరమైనప్పటికీ, ఒక ఏడాదిలో టర్నోవరు అయ్యే పెట్టుబడి విలువ, అదే ఏడాదిలో చలామణి పెట్టుబడి అనేక మార్లు టర్నోవరు కావడం వల్ల అడ్వాన్సు చేయబడిన పెట్టుబడి యొక్క మొత్తం విలువకంటే ఎక్కువ కావచ్చు.

నిశ్చల పెట్టుబడి 80 వేల పౌండ్లనీ, దాని పునరుత్పత్తి కాలం పదేళ్లనీ అనుకుందాం. అంటే 8 వేల పౌండ్లు ఏటా డబ్బు రూపంలోకి తిరిగి వస్తాయి. లేదా అది ఏడాదిలో పదోవంతు టర్నోవరును పూర్తి చేస్తుంది. చలామణి పెట్టుబడి 20 వేల పౌండ్లనీ, దాని టర్నోవరు ఏడాదిలో ఐదుసార్లు పూర్తి అవుతుందనీ అనుకుందాం. అప్పుడు మొత్తం పెట్టుబడి లక్ష పౌండ్లవుతుంది. టర్నోవరయిన నిశ్చల పెట్టుబడి 8 వేల పౌండ్లు, టర్నోవరయిన చలామణి పెట్టుబడి 20 వేలకు ఐదు రెట్లు, అంటే లక్ష పౌండ్లు. ఒక ఏడాదిలో టర్నోవరయిన పెట్టుబడి లక్షా ఎనిమిది వేల పౌండ్లు లేదా అడ్వాన్సు చేయబడిన పెట్టుబడి కంటే 8 వేల పౌండ్లు ఎక్కువ. 1 + 2/25 పెట్టుబడి టర్నోవరయింది.

4. కనుక అడ్వాన్సు చేయబడిన పెట్టుబడి విలువ యొక్క టర్నోవరు కాలం, దాని పునరుత్పత్తి వాస్తవ కాలానికి, లేదా దాని అంతర్భాగాలు టర్నోవరు అయ్యే వాస్తవ కాలానికి భిన్నంగా ఉంటుంది. ఉదాహరణకు 4 వేల పౌండ్ల పెట్టుబడిని తీసుకొందాం. అది ఏడాదిలో 5 సార్లు టర్నోవరయింది అనుకుందాం. టర్నోవరయిన పెట్టుబడి 4 వేలకు 5 రెట్లు లేదా

20 వేల పౌండ్లు. అయితే మళ్ళీ కొత్తగా అడ్వాన్సు చేయటానికి ప్రతి టర్నోవరు చివరా తిరిగి వచ్చే మొత్తం, మొదట అడ్వాన్సు చేయబడిన 4 వేల పౌండ్లు. దాని టర్నోవరు కాలాల సంఖ్య వల్ల, మళ్లీ అది పెట్టుబడిగా తన విధులు కొత్తగా నిర్వహించే ఆ కాలాల సంఖ్య వల్ల దాని పరిమాణంలో మార్పు రాదు. (ఇక్కడ మళ్లీ, అదనపు విలువను పరిగణనకు తీసుకోవడం లేదు)

నెం.3లో ఇవ్వబడిన ఉదాహరణలో పెట్టుబడిదారుని చేతికి ఏడాది చివర వస్తాయని మనం అనుకొన్న మొత్తాలు అ) 20 వేల పౌండ్ల విలువల మొత్తం. దాన్ని అతడు చలామణి పెట్టుబడి భాగాలలో మళ్ళీ మదుపు చేస్తాడు. ఆ) అడ్వాన్సు చేయబడిన పెట్టుబడి విలువ నుండి అరుగుదల వల్ల బయటపడిన 8 వేల పౌండ్ల మొత్తం. అదే సమయంలో అదే నిశ్చల పెట్టుబడి ఉత్పత్తి ప్రక్రియలో ఉంటుంది. అయితే దాని విలువ ఇప్పుడు 80 వేల పౌండ్లు కాదు, 72 వేల పౌండ్లు మాత్రమే. కనుక ఉత్పత్తి ప్రక్రియ మరో తొమ్మిదేండ్లు కొనసాగుతుంది. అడ్వాన్సు చేయబడిన నిశ్చల పెట్టుబడి ఉత్పాదితాల విలువల సృష్టికర్తగా తన కాలం చెల్లిపోవడంతో, తన్ను భర్తీ చేయాల్సి వచ్చేదాకా అలా కొనసాగుతుంది. అడ్వాన్సు చేయబడిన పెట్టుబడి విలువ టర్నోవర్ల వలయాన్ని గడపవలసి వుంటుంది. ప్రస్తుత ఉదాహరణలో అది పది వార్షిక వలయాలు, ఈ వలయం వినియుక్త పెట్టుబడి యొక్క జీవితకాలాన్ని బట్టి, కనుక పునరుత్పత్తి, టర్నోవరు కాలాన్ని బట్టి నిర్ణయమవుతుంది.

పెట్టుబడిదారీ ఉత్పత్తి విధాన అభివృద్ధితో పాటు పనిలో పెట్టబడిన నిశ్చల పెట్టుబడి విలువ పరిమాణమూ, మన్నికా వృద్ధి అవుతాయి. కనుక, మదుపు పెట్టబడే ప్రతి రంగంలోనూ పరిశ్రమ యొక్క పారిశ్రామిక పెట్టుబడి యొక్క, జీవిత కాలం అనేక ఏళ్ళకు, ఉదాహరణకు సగటున పదేళ్ళకు పెరుగుతుంది. నిశ్చల పెట్టుబడి అభివృద్ధి ఈ జీవిత కాలాన్ని ఒకవైపు పెంచుతుంది. మరోవైపు ఉత్పత్తి సాధనాల్లో నిరంతరాయమైన విప్లవం దాన్ని తగ్గిస్తుంది. పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానంతో పాటు ఈ విప్లవం కూడా ఎడతెరపి లేకుండా వేగాన్ని పుంజుకుంటుంది. దానివల్ల ఉత్పత్తి సాధనాలలో మార్పు అవసరమవుతుంది. అవి భౌతికంగా ఉడిగిపోకముందే నైతికంగా తరిగిపోవడం వల్ల నిరంతరాయంగా వాటిని మార్చి కొత్తవాటితో భర్తీ చేయాల్సి వస్తుంది. ఆధునిక పరిశ్రమ ప్రధాన శాఖల్లో ఈ జీవిత చక్రం సగటున పదేళ్ళని ఊహించవచ్చు. అయితే ఇక్కడ మనకి ఖచ్చితమైన సంఖ్యతో ప్రమేయం లేదు. ఒక విషయం ఖాయం. పెట్టుబడి తన నిశ్చల అంతర్భాగం వల్ల అనేక సంవత్సరాలు దేనికి అంటిపెట్టుకొని వుంటుందో పరస్పరం ముడిపడిన ఈ టర్నోవర్ల వలయం, నిర్ణీత కాల వ్యవధుల్లో వచ్చే సంక్షోభాలకు భౌతిక ప్రాతిపదికను సమకూరుస్తుంది. ఈ వలయంలో వ్యాపారం ఒక దాని తర్వాత ఒకటిగా మాంద్యం, ఒక మోస్తరు కార్యకలాపాలు, ఉధృతి, సంక్షోభం వగైరాలను చవిచూస్తుంది. పెట్టుబడి మదుపు పెట్టబడే కాలవ్యవధుల్లో చాలా తేడా వుంటుంది. అవి ఏకకాలంలో జరగవు నిజమే. అయితే సంక్షోభం ఎప్పుడూ పెద్ద ఎత్తున కొత్త మదుపులకు ప్రారంభ స్థానం అవుతుంది. కనుక మొత్తం సామాజిక దృష్టినుండి చూస్తే, అది తర్వాతి టర్నోవరు వలయానికి కొత్త పాదార్థిక ప్రాతిపదిక.[1]

1. నగరాల్లో ఉత్పత్తి రోజుల వలయానికీ, అందుకు విరుద్ధంగా గ్రామీణ ఉత్పత్తి సంవత్సరాల వలయానికీ కట్టుబడి ఉంటాయి. I ఆడమ్ జి. ముల్లర్, డై ఎలిమెంట్స్ డెర్ స్టాట్స్‌కుంస్ట్, బెర్లిన్ (1809, III పుట 178) పరిశ్రమ, వ్యవసాయాల గురించి కాల్పనిక ఆర్థికవేత్తలకున్న అమాయకపు భావన ఇది. సం.

5. టర్నోవర్లను లెక్కించే విషయంలో ఒక అమెరికా అర్థశాస్త్రవేత్త ఇలా అన్నాడు. "కొన్ని పారిశ్రామిక రంగాల్లో పెట్టిన మొత్తం పెట్టుబడి సంవత్సరంలో అనేకసార్లు టర్నోవరు లేదా చలామణి అవుతుంది. మరికొన్ని వాటిలో ఒక భాగం ఒక ఏడాదిలో ఒకసారికన్నా ఎక్కువ తరచుగా టర్నోవరవుతుంది. మరో భాగం తక్కువ తరచుగా టర్నోవరవుతుంది. తన మొత్తం పెట్టుబడి తన చేతులగుండా పోయే సగటు కాలాన్ని బట్టి లేదా ఒక ఆవృత్తాన్ని పూర్తిచేయడానికి పట్టే సగటు కాలాన్నిబట్టి పెట్టుబడిదారు తన లాభాలను అంచనా వేసుకోవాలి. ఉదాహరణకు, ఒక వ్యాపారంలో ఒకరు తన పెట్టుబడిలో సగం భవనాలూ, యంత్రాలపైన, నాలుగోవంతు తనపరికరాలూ వగైరాల ఖర్చుపైన, మిగతా నాలుగోవంతు వేతనాలు చెల్లించడంపైన, పరికరాల కొనుగోలుపైన పెట్టాడనుకుందాం. అందులో మొదటి సగం భాగం పదేళ్ల కొకసారీ, తర్వాతి పావు భాగం రెండేళ్లకోసారీ, ఆఖరు పావు భాగం ఏడాదికి రెండుసార్లూ టర్నోవరు అవుతుంది అనుకుందాం. అతని మొత్తం పెట్టుబడి 50 వేల డాలర్లు అనుకుందాం. అప్పుడు అతని వార్షిక వ్యయం ఇలా ఉంటుంది.

| | | | |
|---|---|---|---|
| 25,000 డాలర్లు : 10 | = | 2,500 | డాలర్లు |
| 12,500 డాలర్లు : 2 | = | 6,250 | డాలర్లు |
| 12,500 డాలర్లు × 2 | = | 25,000 | డాలర్లు |
| | | 33,750 | డాలర్లు |

..... అతని పెట్టుబడి టర్నోవరు కావడానికి పట్టిన సగటు కాలం పదహారు నెలలు[2].... మరో ఉదాహరణ తీసుకుందాం..... మొత్తం పెట్టుబడిలో నాలుగో వంతు పదేళ్ళకొకసారీ, నాలుగో భాగం ఏడాదికొకసారీ, మిగిలిన సగభాగం ఏడాదిలో రెండుసార్లు చలామణి అవుతుందనుకుందాం. అప్పుడు వార్షిక వ్యయం ఇలా వుంటుంది:

| | | | |
|---|---|---|---|
| 12,500 డాలర్లు : 10 | = | 1,250 | డాలర్లు |
| 12,500 డాలర్లు | = | 12,500 | డాలర్లు |
| 25,000 డాలర్లు × 2 | = | 50,000 | డాలర్లు |
| ఒక ఏడాదిలో టర్నోవరు | | 63,750 | డాలర్లు |

(స్క్రోప్, పొలిటికల్ ఎకానమీ, సంపాదకులు : అలంజో పోటర్, న్యూయార్క్, 1841 పుటలు, 142, 143)[2]

---

1. పెట్టుబడి టర్నోవరును లెక్కించే విషయంలో ఈ పద్ధతి పొరపాటని మార్క్స్ తన రాత ప్రతిలో పేర్కొన్నాడు. ఈ ఉదాహరణలో ఇవ్వబడిన టర్నోవరు సగటు కాలం (16 నెలలు) అన్నది, మొత్తం 50 వేల డాలర్ల సగటు పెట్టుబడి పైన లాభం 7.5 శాతం అని పరిగణించడం ద్వారా వచ్చింది. లాభాన్ని పరిగణన నుంచి తొలగిస్తే పెట్టుబడి టర్నోవరు 18 నెలలకి సమానం - సం.
2. ఇక్కడ పేర్కొన్న గ్రంథం, ఎ.పోటర్ రాసిన "పొలిటికల్ ఎకానమీ, ఇట్స్ అబ్జక్ట్స్, యూజెస్, అండ్ ప్రిన్సిపుల్స్", న్యూయార్క్, 1840. పోటర్ ప్రకటన ప్రకారం ఈ గ్రంథం యొక్క రెండో భాగం చాలావరకు (పోటర్ చేసిన అనేక సవరణలతో) జి.జె.పి. స్క్రోప్ రాసిన 'ది ప్రిన్సిపుల్స్ ఆఫ్ పొలిటికల్ ఎకానమీ, లండన్, 1833, పునర్ముద్రణ - సం.

6. పెట్టుబడి వివిధ భాగాల టర్నోవరులో వాస్తవమైన తేడాలు, పైకి కనిపించే తేడాలు.

అదే పేరాలో అదే స్రోప్ ఇలా అంటాడు : "పారిశ్రామికుడు, రైతు, వ్యాపారి తన కార్మికుల వేతనాల కోసం పెట్టే పెట్టుబడి, తన బిల్లుల పైన లేదా అమ్మకాలపైన వారం వారం వచ్చే వసూళ్ళ ద్వారా బహుశా వారానికొకసారి (అతను తన కార్మికులకు వారానికొకసారి వేతనాలు చెల్లిస్తే) టర్నోవరు కాలం వలన, అత్యంత శీఘ్రంగా చలామణి అవుతుంది. అతని సామాగ్రిపైనా, నిల్వలపైనా పెట్టిన పెట్టుబడి బహుశా ఏడాదికి రెండుసార్లు లేదా నాలుగుసార్లు టర్నోవరు కావడం వల్ల తక్కువ శీఘ్రంగా చలామణి అవుతుంది. అతడు సమానమైన పరపతులపైనా క్రయ విక్రయాలు చేస్తున్నాడనుకుంటే, కొనుగోళ్ళకు అమ్మకాలకు మధ్య గడిచే కాలాన్ని బట్టి ఇది జరుగుతుంది. అతని పరికరాలపైనా, యంత్రాలపైనా మదుపు పెట్టిన పెట్టుబడి మరింత నెమ్మదిగా చలామణి అవుతుంది. ఎందుకంటే ఒక్క విడతలోనే అరిగిపోయే పరికరాలు అనేకం ఉన్నప్పటికీ సగటున అవి బహుశా ఐదేళ్ళకో, పదేళ్ళకో ఓసారి టర్నోవరవుతాయి, అంటే వినియోగమై పునరుద్ధరించబడతాయి. మిల్లులు, షాపులు, గిడ్డంగులు, కొఠారుల వంటి భవనాలపైనా, నీటిపారుదల సదుపాయాలు వగైరాలపైనా పెట్టిన పెట్టుబడి అసలు చలామణి అవుతున్నట్లే కనిపించదు. అయితే నిజానికి, మనం ముందు పేర్కొన్న అంశాల్లాగానే ఇవి కూడా ఉత్పత్తికి దోహదపడుతూ వినియోగమవుతాయి. ఉత్పత్తిదారు తన కార్యకలాపాలను కొనసాగించాలంటే వీటిని పునరుత్పత్తి చేయాల్సిందే. అయితే తేడా ఒక్కటే. ఇవి మిగతా వాటికంటే నెమ్మదిగా వినియోగమై, పునరుత్పత్తి అవుతాయి. వీటిపై పెట్టిన పెట్టుబడి బహుశా ప్రతి ఇరవై లేదా ఏభై ఏళ్ళకి ఒక్కసారిగా టర్నోవరవుతుంది." (పుటలు 141 - 142)

చెల్లింపు షరతుల్ని బట్టి, పరపతి పరిస్థితుల్ని బట్టి, చలామణి పెట్టుబడిలోని కొన్ని భాగాల గమన వేగంలో వ్యష్టి పెట్టుబడిదారునికి అనుభూతమయ్యే తేడాని, పెట్టుబడి స్వభావం వల్ల టర్నోవర్లలో తలెత్తే తేడాగా స్రోప్ ఇక్కడ గందరగోళపడుతున్నాడు. వారం వారం అమ్మకాల వల్ల, బిల్లుల వల్ల వచ్చే సొమ్ములో నుంచి వేతనాలు చెల్లించబడాలని అతనంటాడు. వేతనాలు చెల్లించే కాల పరిమితిని బట్టి, అనగా కార్మికుడు పెట్టుబడిదారునికి అరువు ఇచ్చి తీరవలసిన కాల పరిమితిని బట్టి, వేతనాలు చెల్లించేది ప్రతి వారానికా, నెలకా, మూడు నెలలకా, ఆర్నెల్లకా అన్న దాన్నిబట్టి, వేతనాలకు సంబంధించి కూడా కొన్ని తేడాలు తలెత్తుతాయనే విషయాన్ని ఇక్కడ ముఖ్యంగా గమనించాలి. నిర్ణీత కాల వ్యవధులకు అవసరమైన చెల్లింపు సాధనాల పరిమాణం ఆ వ్యవధుల కాల పరిమాణానికి విలోమానుపాతంలో[1] ఉంటుందని అంతకు ముందు పేర్కొనబడిన నియమం[2] (అధ్యాయం III, I వ సంపుటి) ఈ సందర్భంలో వర్తిస్తుంది.

రెండో అంశమేమంటే, ఉత్పత్తి క్రమంలో ఆ వారం శ్రమ ఆ వారం ఉత్పాదితానికి పూర్తిగా కలిపే నూతన విలువ మాత్రమే దానిలో ప్రవేశించదు. ఆ ఉత్పాదితం వినియోగం చేసిన ముడిపదార్థాల, సహాయక పదార్థాల విలువ కూడా ప్రవేశిస్తుంది. ఈ విలువ దాని ఉత్పాదితంతో పాటు చలామణి అవుతుంది. ఆ ఉత్పాదితాన్ని అమ్మడం ద్వారా అది డబ్బు రూపం ధరిస్తుంది. మళ్ళీ అవే ఉత్పత్తి

1. పొరపాటున అనులోమం అని రాయడానికి బదులు విలోమం అని రాయబడిందనేది స్పష్టం - సం.
2. మొదటి సంపుటం, అధ్యాయం III 3బి. పేజి 141 - సం.

అంశాలుగా మారాలి. ఇది ముడి పదార్థాలకూ, సహాయక పదార్థాలకూ ఎంత వర్తిస్తుందో శ్రమ శక్తికి కూడా అంతే వర్తిస్తుంది. ఉత్పత్తి నిరంతరాయంగా కొనసాగటానికి విభిన్న పారిశ్రామిక శాఖల్లో విభిన్న ఉత్పత్తి సాధనాలు, ఒకే శాఖలో చలామణి పెట్టుబడిలోని ఈ అంశానికి సంబంధించిన విభిన్న భాగాలు, ఉదాహరణకు బొగ్గు, పత్తి సరఫరా కావడం అవసరం అని మనం ఇంతకు ముందే (అధ్యాయం VI, II, I) చూశాం. అయితే ఈ వస్తువులు నిరంతరాయంగా భర్తీ అవాల్సి ఉన్నప్పటికీ ప్రతిసారీ వాటిని కొత్తగా కొనాల్సిన అవసరముండదు. ఈ కొనుగోళ్ళు ఎంత తరచుగా జరుగుతాయన్నది నిల్వల పరిమాణాన్ని బట్టి, అవి అయిపోటానికి పట్టే వ్యవధిని బట్టి ఉంటుంది. శ్రమ శక్తి విషయంలో సరఫరాని అలా నిల్వ చేసే అవకాశం లేదు. శ్రమ శక్తి కోసం వెచ్చింపబడిన పెట్టుబడి భాగం, ముడి, సహాయక పదార్థాలపైన పెట్టిన పెట్టుబడి భాగంతో పాటు డబ్బుగా తిరిగి మారుతుంది. అయితే ఆ డబ్బు తిరిగి ఒకవైపున శ్రమ శక్తిగానూ, మరోవైపున ముడి పదార్థాలుగానూ మారడం మాత్రం వేర్వేరుగా జరుగుతుంది. వీటిని కొనుగోలు చేసే షరతులు భిన్నం కావడం, అంటే వాటిలో ఒక దాన్ని దీర్ఘకాలం పాటు ఉండే ఉత్పాదక సరఫరాగానూ, మరోదాన్ని శ్రమశక్తిని తక్కువ కాలం పాటు, ఉదాహరణకు, ఒక వారంపాటు ఉండే సరఫరాగానూ కొనుగోలు చెయ్యడం ఇందుకు కారణం. మరోవైపున పెట్టుబడిదారు ఉత్పత్తికి అవసరమైన సామాగ్రి నిల్వలతోపాటు తయారైన సరుకుల నిల్వలను కూడా ఉంచుకోవాలి. అమ్మకాల్లో సాధక బాధకాల్ని వదిలేద్దాం. కొన్ని సరుకుల్ని నిర్దిష్ట పరిమాణంలో, ముందే కుదిరిన బేరం కోసం తయారు చేయాల్సి వుంటుందనుకొందాం. వాటిలో చివరి భాగం ఉత్పత్తి అవుతున్నప్పుడు, అప్పటికే తయారైన వస్తువులు, బేరం సరుకంతా ఉత్పత్తి అయ్యేవరకు ఊరికే పడివుంటాయి. చలామణి పెట్టుబడిలోని వేర్వేరు అంశాలలో కొన్ని ఉత్పత్తి ప్రక్రియ తొలిదశలో మిగిలిన వాటికంటే ఎక్కువ కాలం ఉండాల్సి వచ్చినప్పుడల్లా (కలపను ఎండబెట్టడం, వగైరా) చలామణి పెట్టుబడి టర్నోవరులో ఇతర తేడాలు తలెత్తుతాయి.

ఇక్కడ స్త్రోపు పేర్కొంటున్న పరపతి వ్యవస్థ, దానితో పాటు వ్యాపార పెట్టుబడి వ్యష్టి పెట్టుబడిదారునికి సంబంధించి టర్నోవరుని మారుస్తాయి. కేవలం ఉత్పత్తిని మాత్రమే గాక, వినియోగాన్ని కూడా శీఘ్రతరం చేసే మేరకు మాత్రమే సామాజిక స్థాయిలో అవి టర్నోవరుని మారుస్తాయి.

★ ★ ★

## అధ్యాయం - 10

# నిశ్చల పెట్టుబడి, చలామణి పెట్టుబడి సిద్ధాంతాలు

# ఫిజియోక్రాట్లు, ఆడమ్ స్మిత్

క్వెస్నే (Quesnay) రచనల్లో నిశ్చల పెట్టుబడికీ, చలామణి పెట్టుబడికీ మధ్య తేడా తొలి అడ్వాన్సులకీ, వార్షిక అడ్వాన్సులకీ మధ్యగల తేడాగా వ్యక్తమవుతుంది. ఈ తేడా ఉత్పాదక పెట్టుబడిలోనే, అంటే ఉత్పత్తి ప్రక్రియలో ప్రత్యక్షంగా నిమగ్నమైన పెట్టుబడిలోనే వుంటుందని అతడు సరిగా పేర్కొన్నాడు. వ్యవసాయంలో వినియోగించిన పెట్టుబడి అంటే, వ్యవసాయదారుని పెట్టుబడి మాత్రమే నిజంగా ఉత్పాదక పెట్టుబడి అని ఆయన భావం. కనుక ఈ తేడాలను వ్యవసాయదారుని పెట్టుబడి విషయంలో మాత్రమే పేర్కొంటాడు. దీనివల్ల ఒక భాగం పెట్టుబడి యొక్క వార్షిక టర్నోవరు కాలమూ, మరో భాగం యొక్క ఏడాది కంటే ఎక్కువ (దశవర్ష) టర్నోవరు కాలమూ తలెత్తుతున్నాయి. అభివృద్ధిగతి క్రమంలో, ఫిజియోక్రాట్లు ఈ తేడాలను ఇతర రకాల పెట్టుబడులకు కూడా, సాధారణ పారిశ్రామిక పెట్టుబడికి వర్తింపజేశారు. వార్షిక అడ్వాన్సులకీ, మరింత ఎక్కువ కాలానికై చేసే అడ్వాన్సులకీ మధ్య వున్న తేడా ఎంత సామాజిక ప్రాధాన్యాన్ని నిలుపుకుందంటే, చాలామంది ఆర్థికవేత్తలు, ఆడమ్ స్మిత్ తర్వాత కూడా ఈ నిర్వచనాన్ని పేర్కొంటున్నారు.

అడ్వాన్సు చేయబడిన డబ్బు ఉత్పాదక పెట్టుబడి అంశాలుగా మారనంత వరకూ ఈ రెండు రకాల అడ్వాన్సుల మధ్య తేడా తలెత్తదు. ఇది కేవలం ఉత్పాదక పెట్టుబడిలో మాత్రమే ఉండే తేడా. కనుక డబ్బును తొలి లేదా వార్షిక అడ్వాన్సుల కింద వర్గీకరించాలని క్వెస్నేకి ఎప్పుడూ తట్టలేదు. ఉత్పత్తి కోసం చేసే అడ్వాన్సులుగా వుంటే, ఉత్పాదక పెట్టుబడిగా అవి రెండూ కూడా డబ్బుకీ, మార్కెటులో ఉన్న సరుకులకీ భిన్నంగా ఉంటాయి. అంతేగాక, ఉత్పాదక పెట్టుబడిలోని ఈ రెండు అంశాల మధ్య ఉన్న తేడాను తయారైన ఉత్పాదితం విలువలో అవి ప్రవేశించే తీరులో తేడాగా, కనుక ఉత్పాదితం యొక్క విలువలతో పాటు వాటి విలువలు చలామణి అయ్యే తీరులో తేడాగా, ఆ కారణాన అవి భర్తీ లేదా పునరుత్పత్తి అయ్యే తీరులో తేడాగా క్వెస్నే సరిగానే తేల్చారు. ఎందువల్లనంటే, వాటిలో ఒకదాని విలువ ప్రతి ఏడాదీ మొత్తంగా భర్తీ అవుతుంది, మరోదాని విలువ పాక్షికంగా, దీర్ఘ వ్యవధుల్లో భర్తీ అవుతుంది.[1]

---

1. చూ. క్వెస్నే, ఎనాలిస్ డూ టాబ్లూ ఎకనామిక్ (ఫిజియోక్రాట్స్, ఎడ్. డెయిరీ, 1. పార్టీ, పారిస్, 1846) ఉదాహరణకు అక్కడ మనం ఇలా చదువుతాం: "వ్యవసాయ శ్రమపైన సంవత్సరం అంతా పెట్టే ఖర్చులు వార్షిక అడ్వాన్సుల కిందకి వస్తాయి. అయితే వ్యవసాయ క్షేత్ర స్థాపనకు విధిగా వుండే తొలి అడ్వాన్సుల

ఆడమ్ స్మిత్ సాధించిన ప్రగతి అల్లా అభివర్గాలను సామాన్యీకరించడం మాత్రమే. ఆయన దృష్టిలో అది కేవలం పెట్టుబడి యొక్క ఒక ప్రత్యేక రూపానికి, అనగా వ్యవసాయదారుని పెట్టుబడికి మాత్రమే గాక ఉత్పాదక పెట్టుబడి యొక్క ప్రతి రూపానికీ వర్తిస్తుంది. కనుక వార్షిక టర్నోవర్‌కీ, రెండు లేదా అంతకంటే ఎక్కువ సంవత్సరాల టర్నోవర్‌కీ మధ్య తేడానూ, వ్యవసాయం నుండి విస్పష్టమైన ఈ తేడాను, రాను రాను విభిన్న వ్యవధుల టర్నోవర్ల మధ్య సాధారణ తేడాగా చూడటం సహజమే. ఎందువల్లనంటే, నిశ్చల పెట్టుబడి తాలూకు ఒక టర్నోవరులో చలామణి పెట్టుబడి తాలూకు టర్నోవరులు ఎప్పుడూ ఒకటి కంటే ఎక్కువ వుంటాయి. చలామణి పెట్టుబడి టర్నోవరు కాలం సంవత్సరమా, అంతకంటే ఎక్కువా, తక్కువా అన్నదానితో ప్రమేయం లేదు. ఆ రకంగా ఆడమ్ స్మిత్ రచనల్లో, వార్షిక అడ్వాన్సులు చలామణి పెట్టుబడిగానూ, తొలి అడ్వాన్సులు నిశ్చల పెట్టుబడిగానూ మారుతున్నాయి. అయితే ఆయన ప్రగతి కేవలం ఈ అభివర్గాల సమాన్యీకరణకే పరిమితం. వాటిని ఆయన వర్తింపజేసిన పద్ధతి మాత్రం క్వెస్నే పద్ధతి కంటే నాసిగా వుంది.

పరిశోధనకు పూనుకోవడంలో స్మిత్ అనుసరించిన మొరటు అనుభవవాద పద్ధతి మొదట్లోనే అస్పష్టతకు దారితీసింది. "పెట్టుబడి యజమానికి ఆదాయం లేదా లాభం తెచ్చిపెట్టడానికి దాన్ని వినియోగించే రెండు మార్గాలున్నాయి". [వెల్త్ ఆఫ్ నేషన్స్, పుస్తకం II, అధ్యాయం 1, పుట 189 అబర్డీన్ ఎడిషన్, 1848.][1]

పెట్టుబడి తాలూకు విధులు నిర్వహించడానికి, దాని యజమానికి అదనపు విలువను ఇవ్వడానికి విలువను మదుపు పెట్టే మార్గాలు పెట్టుబడి మదుపు పెట్టే రంగాలంతటి భిన్నమైనవి, బహువిధమైనవి. అది పెట్టుబడి మదుపు పెట్టడానికి వీలైన విభిన్న ఉత్పత్తి శాఖలకు సంబంధించిన సమస్య. ఇట్లా చూస్తే ఈ సమస్యలో ఇంకా కొన్ని విషయాలు ఇమిడి ఉన్నాయి. విలువను ఉత్పాదక మదుపు పెట్టకపోయినప్పటికీ, దాని యజమానికి పెట్టుబడిగా, ఉదాహరణకు వడ్డీ తెచ్చిపెట్టే పెట్టుబడిగా, వ్యాపారుల పెట్టుబడిగా వగైరాలుగా వ్యవహరించే తీరుకి సంబంధించిన సమస్య కూడా ఇందులో

---

నుండి దీన్ని వేరు చేసి చూడాలి." (పుట 59) తర్వాతి ఫిజియోక్రాట్ల రచనల్లో, ఈ అడ్వాన్సుల్ని కొన్నిసార్లు నేరుగా పెట్టుబడి అని పేర్కొనడం జరిగింది. "కాపిటల్ జౌ ఎనౌన్సెస్" డూ పాంట్ డి నెమోర్స్, "మాక్సిమెస్ డూ డాక్టియర్ క్వెస్నే జౌ రేసుము డి నెస్ ప్రిన్సిపెస్ డి ఎకనామీ సోషియాల్" (డెయిరీ, 1, పు,. 391) అంతేగాక లేట్రొన్నే ఇలా రాశాడు : "మానవ శ్రమతో తయారైన వస్తువులకు అంతో ఇంతో మన్నిక ఉండటం వల్ల, ప్రతి జాతికి తన వార్షిక ఉత్పత్తిలో ప్రమేయం లేకుండా గణనీయమైన సంపద నిధి వుంటుంది. ఈ నిధే పెట్టుబడి. ఇది దీర్ఘకాలంగా సంచితమైనది. ఆదిలో ఉత్పాదితాలతో ప్రతిఫలం చెల్లించబడింది. దీన్ని నిరంతరాయంగా భద్రపరుస్తూ, పెంచుతున్నారు" (డెయిరీ, II పుటలు 928-29) అడ్వాన్సుకి బదులు పెట్టుబడి అన్నపదాన్ని టర్గోట్ మరింత తరచుగా వినియోగిస్తాడు. పారిశ్రామికుల అడ్వాన్సులను వ్యవసాయదారుల అడ్వాన్సుల వంటివే అని మరింత గుర్తిస్తున్నాడు (టర్గోట్, రిఫ్లెక్షన్స్ సర్ లా ఫార్మేషన్ ఎట్ లా డిస్ట్రిబ్యూషన్ డెస్ రిచెనెస్, 1766)

1. స్మిత్ రచనలనుంచి ఉల్లేఖనలలో మార్క్స్ పుటలను పేర్కొన్నప్పుడల్లా, "యాన్ ఎంక్వయిరీ ఇంటు ది నేచర్ అండ్ కాజెస్ ఆఫ్ ది వెల్త్ ఆఫ్ నేషన్స్ ఎ న్యూ ఎడిషన్ ఇన్ ఫోర్ వాల్యూమ్స్" తాలూకు లండన్ 1843 కూర్పులో ఈ ఉల్లేఖనలున్న పుటలు ఇక్కడ స్క్వేర్ బ్రాకెట్లలో ఇచ్చాము. ఈ ఉల్లేఖనతో పాటు ఈ తరువాత వచ్చే వాటన్నింటినీ ఆ గ్రంథం ఆధారంగా సవరించడం జరిగింది - సం.

వుంది. ఉత్పాదక పెట్టుబడిలోని భాగాలు మదుపు పెట్టబడే వేరు వేరు రంగాల మాట అటుంచి, ఉత్పాదక పెట్టుబడి విభిన్న అంశాలుగా విభజించడం వల్ల వాటి టర్నోవరు ఎలా ప్రభావితం అవుతుంది అన్న అంశానికి – ఇదీ ఈ విశ్లేషణలోని అసలు విషయం. మనం ఇక్కడ ఇప్పటికీ చాలా దూరంగా వున్నాము.

ఆడమ్ స్మిత్ పైన ఉదహరించిన వాక్యం తరువాత ఇలా కొనసాగిస్తాడు. "మొదట అది సరుకులను పండించడంలో వాటి తయారీలో లేదా వాటిని కొనుగోలు చేసి తిరిగి లాభానికి అమ్మడంలో వినియోగించబడవచ్చు." [సం. II , పుట 254] పెట్టుబడిని వ్యవసాయంలో, పరిశ్రమల్లో, వాణిజ్యంలో వినియోగించవచ్చునడం తప్ప ఆయన ఇక్కడ మరేమీ చెప్పలేదు. పెట్టుబడి నేరుగా ఉత్పత్తి ప్రక్రియలో లేదు కాబట్టి, ఉత్పాదక పెట్టుబడిగా వ్యవహరించని వ్యాపారం లాంటి వాటితో సహా, పెట్టుబడి మదుపు పెట్టడానికి వీలైన విభిన్న రంగాల గురించి మాత్రమే ఆయన మాట్లాడుతున్నాడు. అలా చెప్పడం ద్వారా, ఫిజియోక్రాట్లు ఉత్పాదక పెట్టుబడిలోనే ఉన్న తేడాలకూ టర్నోవరు పైన వాటి ప్రభావానికి ఆధారంగా చేసిన పునాదిని ఆయన వదిలేస్తున్నాడన్న మాట. అంతేగాదు, ఉత్పాదితమూ, విలువా సృష్టించబడే ప్రక్రియలో కేవలం ఉత్పాదక పెట్టుబడి అంతర్గత భేదాలకీ, వీటి మూలంగా దాని టర్నోవరులోనూ, పునరుత్పత్తిలోనూ తలయెత్తే భేదాలకూ మాత్రమే సంబంధించిన సమస్యలో ఆయన, వ్యాపారుల పెట్టుబడిని ఉదాహరణగా పేర్కొంటాడు.

ఆయన ఇలా కొనసాగిస్తాడు : "ఈ రకంగా వినియోగించబడిన పెట్టుబడి దాని యజమాని స్వాధీనంలో ఉన్నప్పుడు, లేదా అదే ఆకారంలో కొనసాగినప్పుడు అతనికి ఆదాయంగానీ, లాభాన్ని గానీ తెచ్చిపెట్టదు." [సం. II, పుట 254] "ఈ రకంగా వినియోగించబడిన పెట్టుబడి!" అయితే స్మిత్ వ్యవసాయంలోనూ, పరిశ్రమలోనూ మదుపు పెట్టబడిన పెట్టుబడి గురించి మాట్లాడుతున్నాడు. తర్వాత ఆయన, ఆ రకంగా వినియోగించబడిన పెట్టుబడి నిశ్చల పెట్టుబడిగానూ, చలామణి పెట్టుబడిగానూ విభజించబడుతుందంటున్నాడు. కనుక ఈ రకంగా మదుపు పెట్టబడిన పెట్టుబడి నిశ్చల లేదా చలామణి పెట్టుబడి కాజాలదు.

లేక సరుకులను ఉత్పత్తి చేసి వాటిని లాభానికి అమ్మటానికై వినియోగించే పెట్టుబడి, సరుకులుగా రూపాంతరం చెందాక అమ్మబడాలనీ, ఆ అమ్మకం ద్వారా ప్రప్రథమంగా అమ్మకందారుని స్వాధీనం నుండి కొనుగోలుదారుని స్వాధీనంలోకి పోవాలనీ, అది తన వస్తు రూపం అనగా సరుకుల రూపం నుండి డబ్బు రూపంలోకి మారాలనీ అంటే, అది అతని స్వాధీనంలో ఉన్నంత కాలం లేదా అదే ఆకారంలో ఉన్నంత కాలం తన యజమానికి ఉపయోగపడదనీ ఆయన చెప్పదలుచుకున్నాడా? అట్లా అయితే ఇదిగో మొత్తం సంగతి ఇలా చెప్పొచ్చు; ఉత్పాదక పెట్టుబడి రూపంలో, అంటే ఉత్పత్తి ప్రక్రియకి ప్రత్యేకమైన రూపంలో ఇంతకు ముందు వ్యవహరించిన పెట్టుబడి ఇప్పుడు సరుకు పెట్టుబడిగానూ, డబ్బు పెట్టుబడిగానూ అంటే, చలామణి ప్రక్రియకు ప్రత్యేకమైన రూపాలలో వ్యవహరిస్తుంది. అది అక్కడ నిశ్చల పెట్టుబడీ కాదు, చలామణి పెట్టుబడీ కాదు. ముడిపదార్థాలూ, సహాయక పదార్థాలూ, అంటే, విలువలో, చలామణి పెట్టుబడి చేర్చే అంశాలకూ, శ్రమ పరికరాల అరుగుదల, తరుగుదల, అంటే నిశ్చల పెట్టుబడి చేర్చే అంశాలకూ ఇది వర్తిస్తుంది. నిశ్చల పెట్టుబడికీ,

చలామణి పెట్టుబడికీ మధ్య తేడా తెలుసుకోటానికి ఈ పద్ధతి ఏ మాత్రం ఉపకరించదు.

తరువాత ఆయన ఇలా అంటున్నాడు : "వ్యాపారి తన సరుకుల్ని డబ్బుకి అమ్మేదాకా అవి అతనికి లాభాన్ని గానీ, ఆదాయం గానీ ఇవ్వవు. ఆ డబ్బు తిరిగి సరుకులుగా మార్పిడి అయ్యేదాకా అది ఏమీ ఇవ్వదు. అతని పెట్టుబడి అతని నుండి నిరంతరాయంగా ఒక ఆకారంలో వెళ్ళిపోయి, మళ్ళీ మరో ఆకారంలో తిరిగి వస్తోంది. అటువంటి చలామణి ద్వారా మాత్రమే కాదు ఈ మార్పిడుల పరంపర ద్వారా మాత్రమే అతనికి లాభాన్ని ఇస్తుంది. కనుక అటువంటి పెట్టుబడులను చలామణి పెట్టుబడులని పిలవొచ్చు." (సంపుటి II, పుట 254)

చలామణి పెట్టుబడి అని ఇక్కడ ఆడమ్ స్మిత్ నిర్వచిస్తున్న దాన్ని నేను చలామణి తాలూకు పెట్టుబడి అంటాను. అది చలామణి ప్రక్రియకు సంబంధించిన రూపంలో ఉన్న పెట్టుబడి అన్నమాట. మార్పిడి (పదార్థ మార్పిడి, చేతుల మార్పిడి) ద్వారా చెందే రూప పరివర్తనకు సంబంధించినది అన్నమాట. అంటే, ఉత్పత్తి ప్రక్రియకు సంబంధించిన ఉత్పాదక పెట్టుబడికి భిన్నమైన సరుకు పెట్టుబడి, డబ్బు పెట్టుబడి అన్నమాట. ఇవి పారిశ్రామిక పెట్టుబడిదారు తన పెట్టుబడిని విభజించే రెండు రకాలు కాదు. అడ్వాన్సు చేయబడిన తన జీవిత కాలంలో వరుసగా ధరించి వదిలేసే రెండు రూపాలు మాత్రమే. పెట్టుబడి విలువ ఉత్పాదక పెట్టుబడి రూపంలో ఉండగా, దాని రూప పరంపరల ద్వారా దాని ఆవృత్తి మార్గంలో, చలామణి రంగంలో తలెత్తే రూపభేదాలతో దీన్ని ఆడమ్ స్మిత్ కలగాపులగం చేస్తాడు. ఫిజియోక్రాట్లతో పోలిస్తే ఇది పెద్ద వెనకడుగు. ఉత్పాదక పెట్టుబడిలోని వివిధ అంశాలు విభిన్న మార్గాల్లో విలువల సృష్టిలో పాల్గొనడం వల్లా, భిన్నమార్గాల్లో ఉత్పాదితానికి తమ విలువను బదిలీ చేయడం వల్లా ఈ రూప భేదం తలెత్తుతుంది. ఒకవైపున ఉత్పాదిత పెట్టుబడినీ, చలామణి రంగంలో ఉన్న పెట్టుబడినీ (సరుకు పెట్టుబడినీ, డబ్బు పెట్టుబడినీ) మరోవైపున నిశ్చల పెట్టుబడినీ, చలామణి పెట్టుబడినీ ఒకదానితో ఒకటి గందరగోళపర్చడం వల్ల తలెత్తే పర్యవసానాలను మనం కింద చూస్తాం. చలామణి పెట్టుబడిలో అడ్వాన్సు చేయబడిన పెట్టుబడి విలువ అంతగానూ నిశ్చల పెట్టుబడిలో అడ్వాన్సు చేయబడిన పెట్టుబడి కూడా ఉత్పాదితం చేత చలామణిలో ఉంచబడుతుంది. ఈ రెండూ కూడా సరుకు పెట్టుబడి చలామణి ద్వారా డబ్బు పెట్టుబడిగా మారతాయి. అందులో తేడా లేదు. తేడా తలెత్తేది ఎక్కడంటే, నిశ్చల పెట్టుబడి విలువ కొద్ది కొద్దిగా చలామణి అవుతుంది కనుక, కొద్ది కొద్దిగానో, తక్కువ వ్యవధిలోనో, ఎక్కువ వ్యవధిలోనో, భర్తీ కావాల్సి రావడంలో, తిరిగి వస్తురూపంలో పునరుత్పత్తి చేయబడాల్సి వుండటంలో.

ఇక్కడ ఆడమ్ స్మిత్ చలామణి పెట్టుబడి అంటున్నది చలామణి తాలూకు పెట్టుబడి మాత్రమే. అంటే చలామణి రంగానికి సంబంధించిన రూపాల్లో ఉన్న పెట్టుబడి విలువ (సరుకు పెట్టుబడి, డబ్బు పెట్టుబడి). దీన్ని ఆయన ఎంచుకున్న పొరపాటు ఉదాహరణే స్పష్టం చేస్తుంది. అతడు ఎంచుకున్న తరహా పెట్టుబడి ఏ మాత్రం ఉత్పత్తి రంగానికి చెందదు. దాని నివాసం కేవలం చలామణి రంగం. దానిలో కేవలం చలామణి తాలూకు పెట్టుబడి – వ్యాపారుల పెట్టుబడి మాత్రమే ఉంటుంది.

పెట్టుబడి ఏమాత్రం ఉత్పాదక పెట్టుబడిగా ఉండని ఒక ఉదాహరణతో ప్రారంభించడం ఎంత అసంబద్ధమో, తర్వాత వెంటనే అతని ఈ మాటల ద్వారానే తెలుస్తుంది. "ఉదాహరణకు, ఒక

వ్యాపారి పెట్టుబడి మొత్తంగా చలామణి పెట్టుబడే." (సంపుటి II, పుట 255) అయినా, ఆ తర్వాత ఆయన, చలామణి పెట్టుబడికీ, నిశ్చల పెట్టుబడికీ మధ్య తేడా ఉత్పాదక పెట్టుబడిలో అంతర్గతంగా ఉండే తేడాల నుండే తలెత్తుతుందని అంటున్నాడు. ఒకవైపున ఆడమ్ స్మిత్ మనసులో ఫిజియోక్రాట్లు చెప్పిన తేడాలున్నాయి. మరోవైపున పెట్టుబడి విలువ దాని ఆవృత్తంలో ధరించే వివిధ రూపాలు ఉన్నాయి. ఈ రెంటినీ అవకతవకగా కలగాపులగం చేయడం జరిగింది.

కాని డబ్బు, సరుకుల రూపం మారడం వల్ల, విలువ ఈ రూపాల్లో ఒకదాని నుండి మరో దానిలోకి కేవలం పరకాయ ప్రవేశం చేయడం ద్వారా లాభం అనేది ఎలా వస్తుందో ఎవరూ చెప్పలేరు. ఆయన ఇక్కడ వ్యాపారుల పెట్టుబడితో ప్రారంభిస్తాడు. అది కేవలం చలామణి రంగంలోనే తిరుగుతుంది. కనుక లాభానికి కారణం చెప్పడం అసాధ్యమవుతుంది. దీన్ని గురించి తర్వాత చర్చిద్దాం. ముందు, ఆయన నిశ్చల పెట్టుబడి గురించి ఏం చెబుతాడో విందాం (సంపుటి II, పుట 254–255).

"రెండోది, దాన్ని (పెట్టుబడిని), భూమిని అభివృద్ధి పరచడంలోనూ, ఉపయోగకరమైన యంత్రాలను, వ్యాపార పరికరాలను కొనుగోలు చెయ్యడంలోనూ వినియోగించవచ్చును. లేదా యజమానులను మార్చకుండా లేదా ఇక ఏమాత్రం చలామణిలో ఉండకుండా ఆదాయం గానీ, లాభం గానీ ఇచ్చేటటువంటి వస్తువులు కొనడానికి వినియోగించవచ్చు. కనుక వాటిని నిశ్చల పెట్టుబడులని అనడం పూర్తిగా సరియైనదే. భిన్నవృత్తుల్లో వినియోగించే నిశ్చల, చలామణి పెట్టుబడుల నిష్పత్తి భిన్నంగా వుంటుంది... ప్రతి వృత్తి యజమాని లేదా పరిశ్రమదారుని పెట్టుబడిలో కొంత భాగం అతని వ్యాపార పరికరాల్లో నిశ్చలంగా ఉండాలి. అయితే ఈ భాగం కొన్నిటిలో చాలా తక్కువ, మరికొన్నిటిలో చాలా ఎక్కువ ఉంటుంది. అయితే అటువంటి వృత్తి (కుట్టుపని, పాదరక్షల తయారీ, నేతపని) యజమానుల పెట్టుబడిలో అత్యధిక భాగం చలామణిలో వుంటుంది. వారి కార్మికుల వేతనాల రూపంలోనో లేదా వారి పదార్థాల ధరల రూపంలోనో చలామణి అవుతుంది. పని యొక్క ధర ద్వారా వచ్చే లాభంతో అది తిరిగి చెల్లించబడుతుంది."

లాభానికి మూలాన్ని నిర్ణయించడంలో అమాయకత్వం మాట అలా వుంచి, ఈ క్రింది అంశాన్ని చూస్తే బలహీనతా, గందరగోళమూ వెంటనే కన్పిస్తాయి. ఉదాహరణకు, ఒక యంత్ర పారిశ్రామికునికి యంత్రమే అతని ఉత్పాదితం. అది సరుకు పెట్టుబడిగా చలామణి అవుతుంది లేదా ఆడమ్ స్మిత్ మాటల్లో "ఒకరి నుండి విడిపోయి, యజమానులను మారుస్తుంది. మరింతగా చలామణి అవుతుంది." కనుక అతని నిర్వచనం ప్రకారమే, ఈ యంత్రం నిశ్చల పెట్టుబడి కాదు, చలామణి పెట్టుబడే. ఈ గందరగోళానికి మరో కారణం ఏమంటే, స్మిత్ ఉత్పాదక పెట్టుబడి యొక్క వివిధ అంశాల బహువిధ చలామణి నుండి నిశ్చల, చలామణి పెట్టుబడుల మధ్య రూపొందిన తేడాని, ఉత్పత్తి ప్రక్రియలో ఉత్పాదక పెట్టుబడిగానూ, చలామణి రంగంలో చలామణి పెట్టుబడిగానూ, అంటే సరుకు పెట్టుబడి గానూ లేదా డబ్బు పెట్టుబడిగానూ వ్యవహరిస్తూ, అదే పెట్టుబడి ధరించే రూప భేదాలతో కలగాపులగం చేస్తాడు. అందువల్ల ఆడమ్ స్మిత్ దృష్టిలో, పెట్టుబడి జీవిత క్రమంలో ఆయా వస్తువులు ఆక్రమించే స్థానాన్ని బట్టి అవి నిశ్చల పెట్టుబడిగా (శ్రమ పరికరాలుగా, ఉత్పాదక పెట్టుబడి అంశాలుగా) లేదా 'చలామణి' పెట్టుబడిగా, సరుకు పెట్టుబడిగా (ఉత్పత్తి రంగం నుండి బయటికి నెట్టబడిన ఉత్పాదితాల్లా) వ్యవహరించగలవు.

అయితే ఆడమ్ స్మిత్ హఠాత్తుగా తన వర్గీకరణ మొత్తం పునాదినే మార్చేస్తాడు. కొన్ని పంక్తులకు ఆవల ఆయన తన మొత్తం పరిశోధనను ఏ మాటలతో ప్రారంభించాడో వాటిని కాదంటాడు. ఇది ముఖ్యంగా కింది వాక్యానికి వర్తిస్తుంది : "ఒక పెట్టుబడి తన యజమానికి ఆదాయాన్ని లేదా లాభాన్ని ఇవ్వడానికి దాన్ని వినియోగించే రెండు పద్ధతులున్నాయి." [సంపుటి II, పుట 254] దాన్ని చలామణి పెట్టుబడిగా లేదా నిశ్చల పెట్టుబడిగా వినియోగించవచ్చు. కాబట్టి దీన్నిబట్టి, ఇవి పరిశ్రమలో అయినా, వ్యవసాయంలో అయినా వినియోగించే పెట్టుబడుల్లాగా, ఒకదానితో మరొకదానికి ప్రమేయం లేని రెండు విభిన్న పెట్టుబడులను వినియోగించే రెండు విభిన్న పద్ధతులన్నమాట. తరువాత ఇలా రాశాడు : [సంపుట II, పుట 255] "విభిన్న వృత్తుల్లో నిశ్చల పెట్టుబడీ, చలామణి పెట్టుబడీ విభిన్న నిష్పత్తుల్లో అవసరమవుతాయి". ఇప్పుడు నిశ్చల, చలామణి పెట్టుబడులు ఇక ఏమాత్రం విభిన్న, స్వతంత్ర పెట్టుబడి యొక్క మదుపులు కాదు. అవి ఒకే ఉత్పాదక పెట్టుబడిలోని విభిన్న భాగాలు. విభిన్న మదుపు రంగాల్లోని ఈ పెట్టుబడి మొత్తం విలువలోని విభిన్న భాగాలు. కనుక ఇక్కడ ఉత్పాదక పెట్టుబడినే సక్రమంగా విభజించడం వల్ల తలెత్తిన భేదాలను చూస్తాము. కనుక దానికి సంబంధించి మాత్రమే ఇవి వర్తిస్తాయి. కాని ఇది, వ్యాపారుల పెట్టుబడి, కేవలం చలామణి పెట్టుబడి మాత్రమే కావడం వల్ల, నిశ్చల పెట్టుబడికి విరుద్ధంగా వున్న స్థితికి భిన్నమైనది. ఎందువల్లనంటే, ఆడమ్ స్మిత్ స్వయంగా ఇలా చెప్పాడు. "ఉదాహరణకు, ఒక వ్యాపారి పెట్టుబడి మొత్తంగా చలామణి పెట్టుబడే" [సంపుటి II, పుట 255] అది నిజంగా కేవలం చలామణి రంగంలో తన విధులను నిర్వహించే పెట్టుబడే. అందువల్ల ఉత్పత్తి ప్రక్రియలో సాకార రూపం ధరించిన పెట్టుబడికి, అంటే ఉత్పాదక పెట్టుబడికి విరుద్ధమైనది. అయితే ఈ కారణం చేతనే, ఈ పెట్టుబడిని ఉత్పాదక పెట్టుబడిలోని చలామణి భాగంలాగా, దాని నిశ్చల భాగంతో పోటీపెట్టి చూపరాదు.

స్మిత్ ఇచ్చే ఉదాహరణల్లో "వ్యాపార పరికరాలను" నిశ్చల పెట్టుబడిగానూ, వేతనాలు, సహాయక పదార్థాలతో సహా ముడి పదార్థాల్లో వెచ్చించిన పెట్టుబడి భాగాన్ని చలామణి పెట్టుబడిగానూ ("శ్రమ యొక్క ధర ద్వారా వచ్చే లాభంతో తిరిగి చెల్లించబడుతుంది") పేర్కొంటాడు.

కనుక ఆయన, ముఖ్యంగా, శ్రమ ప్రక్రియ యొక్క వివిధ అంతర్భాగాలతో ఒకవైపున శ్రమ శక్తి (శ్రమ), ముడిపదార్థాలతో, మరోవైపున శ్రమ పరికరాలతో ప్రారంభిస్తాడు. అయితే ఇవి పెట్టుబడి అంతర్భాగాలు, ఎందుకంటే పెట్టుబడిగా వ్యవహరించనున్న విలువలో ఒక మొత్తం వాటిలో మదుపు పెట్టబడింది. ఈ మేరకు అవి పాదార్థిక అంశాలు, ఉత్పాదక పెట్టుబడి అస్తిత్వ రూపాలు. అంటే, ఉత్పత్తి ప్రక్రియలో పని చేసే పెట్టుబడి అస్తిత్వ రూపాలు. అయితే వాటిలో ఒకటి నిశ్చలమైనదని ఎందుకు అంటున్నాము? ఎందుకంటే "పెట్టుబడిలోని కొన్ని భాగాలు పరిశ్రమ పరికరాల్లో నిశ్చలం కావాలి" (సంపుటి II, పుట 254) కాని మరో భాగం కూడా వేతనాల్లోనూ, ముడి పదార్థాల్లోనూ నిశ్చలమైనదే. అయితే యంత్రాలు, "పరిశ్రమ పరికరాలూ ..... లేదా అటువంటివి..... యజమానులను మార్చకుండానే, ఇంకా చలామణి కాకుండానే ఆదాయాన్ని, లేదా లాభాన్ని ఇస్తాయి. కనుక అటువంటి పెట్టుబడులను నిశ్చల పెట్టుబడులనవచ్చు." (సంపుటి II, పుట 254)

ఉదాహరణకు గని పరిశ్రమను తీసుకుందాం. అక్కడ ముడి పదార్థమనేదేమీ వినియోగించ

బడదు. ఎందుకంటే రాగిలాంటి శ్రమ గ్రహీత ప్రకృతి ఉత్పాదితం. అది మొదట శ్రమాధీనమవ్వాలి. మొదట రాగి స్వాయత్తం కావడానికి, ఆ ప్రక్రియ యొక్క ఉత్పాదితం, తర్వాత సరుకుగా లేదా సరుకు పెట్టుబడిగా చలామణి అయ్యే ఆ ఉత్పాదితం ఉత్పాదక పెట్టుబడిలో ఒక అంశం కాదు. దానిలో దాని విలువ భాగమేదీ మదుపు పెట్టబడలేదు. మరోవైపు, ఉత్పాదక ప్రక్రియలోని ఇతర అంశాలు, అంటే శ్రమ శక్తి, బొగ్గు, నీరు వగైరా, సహాయక పదార్థాలు కూడా ఉత్పాదితంలోనికి పాదార్థికంగా ప్రవేశించవు. బొగ్గు మాత్రం వినియోగమవుతుంది. కేవలం దాని విలువ మాత్రమే ఉత్పాదితంలోకి ప్రవేశిస్తుంది. యంత్రం వగైరాల విలువలోని ఒక భాగం దానిలోకి ప్రవేశించినట్టుగానే చివరికి, కార్మికుడు, ఉత్పాదితానికి, అంటే రాగికి సంబంధించి, యంత్రం లాగానే స్వతంత్రంగా ఉంటాడు. అయితే అతడు తన శ్రమ ద్వారా ఉత్పత్తి చేసే విలువ ఇప్పుడు రాగి విలువలో ఒక అంతర్భాగం. కనుక ఈ ఉదాహరణలో ఉత్పాదక పెట్టుబడిలోని ఏ ఒక్క అంతర్భాగమూ "యజమానుల"ను మార్చదు. లేదా ఏ ఒక్కటీ తదుపరి చలామణి కాదు. ఎందుకంటే వాటిలో ఏదీ ఉత్పాదితంలోకి పాదార్థికంగా ప్రవేశించదు. ఈ సందర్భంలో చలామణి పెట్టుబడి ఏమవుతుంది? ఆడమ్ స్మిత్ నిర్వచనం ప్రకారం ఒక రాగి గనిలో పెట్టిన మొత్తం పెట్టుబడి నిశ్చల పెట్టుబడి తప్ప మరొకటి కాదు.

ఇంధనపు బొగ్గులా కేవలం విలువను మాత్రమే ఉత్పాదితంలోనికి బదిలీ చేసేవిగాక పాదార్థికంగా ఉత్పాదితంలోనికి ప్రవేశించే ముడిపదార్థాలనూ, సహాయక పదార్థాలనూ ఉపయోగించే మరో విధమైన పరిశ్రమను తీసుకుందాం. ఉదాహరణకు, నూలు అనే ఉత్పాదితం దానిలో వున్న ముడి పదార్థమైన దూదితో పాటు చేతులు మారుతుంది; ఉత్పత్తి ప్రక్రియ నుండి వినియోగ ప్రక్రియకు ప్రవేశిస్తుంది. అయితే ఉత్పాదక పెట్టుబడిలో దూది ఒక అంశంగా ఉన్నంతవరకు దాని యజమాని దాన్ని అమ్మడు. దాన్ని ఉత్పత్తి ప్రక్రియలో నూలుగా మారుస్తాడు. దాన్ని అతడు వదులుకోడు. లేదా స్మిత్ వాడిన అషామాషీ, తప్పు పదజాలంతో చెప్పాలంటే "దానిని వదులుకోవడం ద్వారా, అది యజమానులను మార్చడం ద్వారా లేదా దాన్ని చలామణిలో పెట్టడం ద్వారా," అతను ఏమీ లాభం సంపాదించడు. అతడు తన యంత్రాలలాగానే, తన సామాగ్రిని కూడా చలామణి కానివ్వడు. వడికే యంత్రాలు, ఫ్యాక్టరీ భవనాలలాగానే అవి కూడా ఉత్పత్తి ప్రక్రియలో నిశ్చలమై వుంటాయి. నిజానికి ఉత్పాదిత పెట్టుబడిలో ఒక భాగం శ్రమ పరికరాల రూపంలో నిరంతరాయంగా నిశ్చలమై వున్నట్టే బొగ్గు, దూది వగైరాల రూపంలో నిశ్చలమై వుండాలి. ఇక్కడ తేడా ఒక్కటే. ఉదాహరణకు ఒక వారం నూలు ఉత్పత్తికి అవసరమైన దూది, బొగ్గు వగైరాలు ఆ వారం ఉత్పాదితం తయారీలో ఎప్పుడూ పూర్తిగా వినియోగమవుతాయి. కనుక కొత్త దూది, బొగ్గు వగైరాలు వాటి స్థానంలో సరఫరా కావాల్సి వుంటుంది. మరోలా చెప్పాలంటే, ఈ ఉత్పాదక పెట్టుబడి అంశాలు ఒకే రకమైన వస్తువు రూపంలో నిలిచివున్నప్పటికీ అవి ఎల్లప్పుడూ అదేరకపు కొత్త వస్తువులుగా ఉంటాయి. కాగా అదే వడికే యంత్రం, లేదా అదే ఫ్యాక్టరీ భవనం, తమ స్థానంలో అలాంటివే కొత్తవి రాకుండానే ఆ వారపు ఉత్పత్తుల పరంపరలో, పని చేస్తూనే వుంటాయి. ఉత్పాదక పెట్టుబడి అంశాలుగా దాని అంతర్భాగాలన్నీ ఉత్పత్తి ప్రక్రియలో నిరంతరాయంగా నిశ్చలమై వుంటాయి. ఎందుకంటే అవి లేకుండా ఆ ప్రక్రియ

సాగదు. ఉత్పాదక పెట్టుబడిలోని అంశాలన్నీ అవి నిశ్చలమైనవైనా, చలామణిలో వున్నా, ఉత్పాదక పెట్టుబడిగా చలామణి తాలూకు పెట్టుబడికి, అంటే సరుకు పెట్టుబడికీ, డబ్బు పెట్టుబడికీ సమానంగా ముఖాముఖమై వుంటాయి.

శ్రమ శక్తి విషయంలోనూ అంతే. ఉత్పాదక పెట్టుబడిలో ఒక భాగం నిరంతరాయంగా దానిలో నిశ్చలమై వుండాలి. అవే యంత్రాల్లాగానే, అదే తరహా శ్రమ శక్తులు అదే పెట్టుబడిదారుని చేత ఒక నిర్దిష్ట కాలం పాటు నియమించబడతాయి. ఈ సందర్భంలో శ్రమ శక్తికీ యంత్రాలకూ ఉన్న తేడా, యంత్రాలు ఒకేసారి కొనబడడం, శ్రమశక్తి అలా కొనబడకపోవడమూ కాదు. (యంత్రాలను ఒక్కోసారి వాయిదాల మీద కొనవచ్చు కూడా) మరి ఈ రెంటి మధ్య తేడా ఏమంటే, కార్మికుడు వెచ్చించిన శ్రమ ఉత్పాదితంలో పూర్తిగా ప్రవేశిస్తుంది. కాగా యంత్రాల విలువ కొద్ది కొద్దిగా మాత్రమే ప్రవేశిస్తుంది.

స్మిత్ నిశ్చల పెట్టుబడికి చలామణి పెట్టుబడి భిన్నమైనదంటూ, దాన్ని గురించి చెప్పే సందర్భంలో విభిన్న నిర్వచనాలను గందరగోళపరుస్తాడు : "ఈ విధంగా వినియోగించబడిన పెట్టుబడి అతని స్వాధీనంలో వున్నప్పుడు లేదా అదే ఆకారంలో కొనసాగుతున్నప్పుడు తన యజమానికి ఆదాయాన్ని గానీ, లాభాన్ని గానీ ఇవ్వదు." (సంపుటి II, పుట 254) ఆయన సరుకు చెందే కేవల రూపాంతరీకరణలను, వాటిలో భౌతికంగా వచ్చే మార్పులతో సమానంగా పరిగణిస్తాడు. మొదటివి, ఉత్పాదితం సరుకు పెట్టుబడిగా చలామణి రంగంలో గురయ్యేవి, సరుకులు చేతులు మారటానికి దారితీసేవి; భౌతికమైన మార్పులేమీ ఉత్పత్తి ప్రక్రియలో ఉత్పాదక పెట్టుబడి యొక్క వివిధ అంశాలు గురయ్యేవి. సరుకులు డబ్బుగానూ, డబ్బు సరుకులుగానూ మారడాన్ని లేదా క్రయ విక్రయాలను ఆయన ఉత్పాదక అంశాలు ఉత్పాదితంగా మారడాన్నీ విచక్షణారహితంగా కలగలుపుతున్నాడు. చలామణి పెట్టుబడికి అతని ఉదాహరణ ఏమంటే సరుకుల నుండి డబ్బుగానూ, డబ్బు నుండి సరుకుగానూ మారే వ్యాపారి పెట్టుబడి. అనగా స–డ–స సూచించే రూప మార్పిడి, సరుకుల చలామణికి సంబంధించినది. అయితే చలామణి లోపల ఈ రూపం మార్పు, క్రియాశీలంగా ఉన్న పారిశ్రామిక పెట్టుబడి విషయంలో, డబ్బు యొక్క పునఃపరివర్తిత రూపమైన సరుకులు ఉత్పత్తి అంశాలని (శ్రమ పరికరాలు, శ్రమశక్తి) సూచిస్తుంది. కనుక ఈ రూపం మార్పు పారిశ్రామిక పెట్టుబడి విధిని, ఉత్పత్తి ప్రక్రియను నిరంతరాయమైనదిగా లేదా పునరుత్పత్తి ప్రక్రియగా చేస్తుంది. మొత్తంగా ఈ రూపం మార్పు చలామణి రంగంలో జరుగుతుంది. ఈ రూపం మార్చే సరుకులను ఒక చేతి నుండి మరో చేతికి మారేలా చేస్తుంది. అయితే ఉత్పాదక పెట్టుబడి తన ఉత్పత్తి ప్రక్రియలో గురయ్యే రూప పరివర్తనలు అలా కాక, శ్రమ ప్రక్రియకు సంబంధించినవి. అవి ఉత్పత్తి అంశాలను కోరిన ఉత్పాదితంగా మార్చడానికి అవసరం. ఉత్పత్తి సాధనాల్లో ఒక భాగం (అసలైన శ్రమ పరికరాలు) శ్రమ ప్రక్రియలో తమ భౌతిక రూపాన్ని మార్చకుండా, క్రమ క్రమంగా మాత్రమే అరిగిపోతూ పని చేస్తాయని, (స్మిత్ తప్పు పదజాలంలో చెప్పాలంటే "తమ యజమానికి లాభమిస్తాయని") కాగా మిగిలిన భాగం, అంటే సామాగ్రి మారుతుందని, ఈ మార్పు వల్లనే ఉత్పత్తి సాధనాలుగా తమ లక్ష్యాన్ని అవి సాధిస్తాయనీ స్మిత్ గట్టిగా అభిప్రాయపడుతున్నాడు. కాని శ్రమ ప్రక్రియలో ఉత్పాదక

పెట్టుబడి అంశాల ప్రవర్తనలో వున్న భేదం నిశ్చల, అనిశ్చల పెట్టుబడుల మధ్య వున్న తేడాకు, ప్రారంభ బిందువు మాత్రమే. అంతే తప్ప అదే అసలు తేడా కాదు. ఈ భిన్న ప్రవర్తన పెట్టుబడిదారీ విధాన, పెట్టుబడిదారీ విధానేతర ఉత్పత్తి పద్ధతులన్నింటిలోనూ సమానంగానే వుందన్న వాస్తవమే దీనికి నిరూపణ. కాని పాదార్థిక అంశాల ఈ భిన్న ప్రవర్తనకు ఉత్పాదితానికి విలువ మారడం అనుగుణంగా వుంటుంది. మళ్ళీ దీనికి అనుగుణంగా, ఉత్పాదిత విక్రయం ద్వారా విలువను భర్తీ చేయడం అన్నది వుంటుంది. అదే, కేవలం అది మాత్రమే ఈ రెండింటి మధ్య గల భేదం. కనుక పెట్టుబడి నిశ్చల పెట్టుబడిగా పిలవబడడానికి కారణం అది శ్రమ పరికరాల్లో నిశ్చలమై వుండడం వల్ల కాదు. శ్రమ పరికరాల్లో మదుపు పెట్టిన పెట్టుబడి విలువలో ఒక భాగం వాటిలో నిశ్చలమై వుండగా, మిగతా భాగం ఉత్పాదితపు విలువలో అంతర్భాగంగా చలామణి కావడం వల్ల అది నిశ్చల పెట్టుబడి అని పిలవబడుతోంది.

"అది (వస్తు సంచయం) భవిష్యత్ లాభార్జనకు నియుక్తమైతే అది అతనితో (దాని యజమానితో) వుండడం ద్వారా గానీ, లేదా అతని నుండి వెళ్ళిపోవడం ద్వారా గానీ ఈ లాభాన్ని గడించాలి. ఇది మొదటి సందర్భంలో నిశ్చల పెట్టుబడి, రెండో సందర్భంలో చలామణి పెట్టుబడి అవుతుంది" (పుట. 189)

ఆడమ్ స్మిత్‌లో అంతర్గతంగా వున్న మెరుగైన అవగాహనకు భిన్నంగా ఇక్కడ మనకు కొట్టొచ్చినట్టు కనిపించేది ఏమంటే, ఒక సాధారణ పెట్టుబడిదారుని దృష్టి నుంచి ధరను గురించి ఉత్పన్నమైన మోటు అనుభవవాద భావన. కేవలం సామాగ్రి ధర, శ్రమ శక్తి ధర మాత్రమే గాక, అరుగుదల ద్వారా శ్రమ పరికరాల నుండి ఉత్పాదితానికి బదిలీ అయిన విలువ భాగం కూడా ఉత్పాదితం ధరలో భర్తీ అవుతుంది. ఏ పరిస్థితుల్లోనూ, ఇలా భర్తీ కావడం వల్ల లాభం రాదు. ఒక సరుకు ఉత్పత్తికి అడ్వాన్సు చేయబడిన విలువ ఆ సరుకు అమ్మకం ద్వారా ఒకేసారి భర్తీ అయ్యిందా, కొద్ది కొద్దిగా భర్తీ అయ్యిందా అనేది ఆ భర్తీ అయ్యే పద్ధతిని, కాలాన్ని తప్ప మరి దేన్నీ మార్చలేదు. అయితే ఏ సందర్భంలోనూ ఈ రెండింటికీ ఉమ్మడి అంశమైన విలువ భర్తీని అదనపు విలువ సృష్టిగా మార్చలేదు. దీని అంతటికీ అడుగున ఒక సర్వ సామాన్యమైన భావన వుంది. ఉత్పాదితం అమ్మబడనంతవరకూ, అది చలామణి కానంత వరకూ అదనపు విలువ చేతికందదు. కనుక, అది అమ్మకాల నుంచే, అంటే చలామణి నుంచే ఉత్పన్నమవుతుంది అన్నది ఈ భావన. భిన్న తరహాలో లాభం ఉత్పన్నమవుతుందనడం, ఇక్కడ ఉత్పాదక పెట్టుబడి యొక్క భిన్న అంశాలు భిన్నంగా ఉపకరిస్తాయి. అవి ఉత్పాదక అంశాలుగా శ్రమ ప్రక్రియలో భిన్నంగా వ్యవహరిస్తాయి, అనే వాస్తవాన్ని తప్పుగా చిత్రించడమే. చివరి విషయం, ఈ భేదం శ్రమ ప్రక్రియ నుంచిగానీ, స్వయం విస్తరణ ప్రక్రియ నుంచి గానీ, అంటే ఉత్పాదక పెట్టుబడి విధి నిర్వహణ నుంచి ఉత్పన్నమైనట్లు చూపడు. పెట్టుబడిలో ఒక భాగం ఒక రకంగానూ, మరో భాగం మరో రకంగానూ ఉపయోగపడతాయి. కనుక, ఆ భేదం వ్యష్టి పెట్టుబడిదారునికి కేవలం ఆత్మగతమైనదని ఆయన భావం.

కాని, క్వెస్నే ఈ భేదాలను పునరుత్పత్తి ప్రక్రియ నుండి, దాని ఆవశ్యకతల నుండి ఉత్పన్నమైనట్లు చూపాడు. ఈ ప్రక్రియ నిరంతరాయంగా కొనసాగేందుకు వార్షిక అడ్వాన్సుల విలువ వార్షిక

ఉత్పాదితం విలువ ద్వారా ప్రతి ఏడాది భర్తీ కావాలి. పెట్టుబడి మదుపు విలువ కేవలం కొద్ది కొద్దిగా మాత్రమే భర్తీ అవుతుంది కనుక దాని పూర్తి పునరుత్పత్తికి అదే రకం కొత్త సామాగ్రితో భర్తీ చేయడానికి కొంత కాల వ్యవధి ఉదాహరణకు పది సంవత్సరాలు పడుతుంది. పర్యవసానంగా ఆడమ్ స్మిత్, క్వెస్నేకి చాలా వెనుకబడిపోతాడు.

నిశ్చల పెట్టుబడి, అంటే శ్రమ పరికరాలు ఉత్పత్తి ప్రక్రియలో అవి తమ ఆకారాన్ని మార్చుకోవు. తమ సహాయంతో తయారయ్యే ఉత్పాదితాల్లా కాక, ఉత్పత్తి రంగంలో, తాము అరిగిపోయేదాకా పని చేస్తూనే వుంటాయి. నిశ్చల పెట్టుబడి నిర్వచనం కోసం ఇంతకంటే వేరే విషయం ఏదీ ఆడమ్ స్మిత్‌కి మిగల్లేదు. ఉత్పాదక పెట్టుబడి అంశాలన్నీ తమ వస్తు రూపంలో (శ్రమ పరికరాలుగా, పదార్థాలుగా, శ్రమ శక్తిగా) ఉత్పాదితానికి, సరుకుగా చలామణి అవుతున్న ఉత్పాదితానికి ముఖాముఖమై వుంటాయన్న సంగతిని అతను మర్చిపోతున్నాడు. దానిలోని పదార్థాల, శ్రమ శక్తి భాగానికీ, శ్రమ పరికరాల భాగానికి మధ్య వున్న తేడా ఇది మాత్రమే: శ్రమ శక్తికి సంబంధించినంత వరకూ అది ఎప్పుడూ ఎప్పటికప్పుడు కొనబడుతుంది. (శ్రమ పరికరాల్లాగా, పని చేసినంత కాలానికి అది ఒకేసారి కొనబడదు) పదార్థాలకు సంబంధించి ఒకేలాంటి, అవే పదార్థాలు శ్రమ ప్రక్రియ అంతటిలోనూ వుండవు. అదే తరహా కొత్త పదార్థాలు ఎప్పుడూ ప్రక్రియలో వుంటాయి. కాని, నిశ్చల పెట్టుబడి విలువ చలామణిలో పాల్గొనదనే ఒక పొరపాటు అభిప్రాయం ఆయన కలుగజేస్తున్నాడు. అయితే ఆడమ్ స్మిత్ అంతకు మునుపు, నిశ్చల పెట్టుబడిలో అరుగుదల కూడా ఉత్పాదితం ధరలో ఒక భాగమేనన్న విషయాన్ని చెప్పకపోలేదు.

చలామణి పెట్టుబడిని నిశ్చల పెట్టుబడికి భిన్నమైనదిగా చూపిస్తున్నప్పుడు ఈ భిన్నత్వం ఎందువల్ల వచ్చిందో ఆయన నొక్కి చెప్పలేదు. ఉత్పాదక పెట్టుబడిలోని చలామణి భాగం ఉత్పాదితం విలువ ద్వారా పూర్తిగా భర్తీ చేయబడాలి. కనుక అది దాని రూపాంతరీకరణలో పూర్తిగా పాలుపంచుకుంటుంది. కాగా నిశ్చల పెట్టుబడి విషయంలో ఇలా కాదు. ఇదీ ఆ భిన్నత్వానికి కారణమని చెప్పడానికి బదులు, పెట్టుబడి ఉత్పత్తి రంగం నుంచి చలామణి రంగానికి వెళ్ళిపోయిన తరువాత అది ధరించే సరుకు పెట్టుబడి, డబ్బు పెట్టుబడుల రూపాలతో చలామణి పెట్టుబడినీ కలగలుపుతున్నాడు. అయితే ఈ రెండు రూపాలు – సరుకు పెట్టుబడి, డబ్బు పెట్టుబడి కూడా ఉత్పాదక పెట్టుబడి యొక్క నిశ్చల, చలామణి భాగాల విలువ వాహకాలు. ఇవి రెండూ ఉత్పాదక పెట్టుబడికి భిన్నమైన చలామణి తాలూకు పెట్టుబడి. అంతే తప్ప, నిశ్చల పెట్టుబడికి భిన్నంగా చలామణి (చలనశీలమైన) పెట్టుబడి కాదు.

ఆఖరు విషయం. ఉత్పత్తి ప్రక్రియలో నిశ్చల పెట్టుబడి వుండడం ద్వారానూ, చలామణి పెట్టుబడి దాని నుండి వెళ్ళిపోవడం ద్వారానూ లాభం వస్తుందనే పొరపాటు అవగాహన వల్లనూ, టర్నోవర్ అస్థిర పెట్టుబడి, స్థిర పెట్టుబడి యొక్క చలామణి భాగం ధరించే రూప సాదృశ్యం వల్లనూ, స్వయం విస్తరణ ప్రక్రియలో, అదనపు విలువ ఏర్పడటంలో వాటి మధ్య గల అసలు తేడా మరుగున పడుతుంది. దానివల్ల పెట్టుబడిదారీ ఉత్పత్తిలోని మొత్తం రహస్యం మరింత మరుగున పడుతుంది. "చలామణి పెట్టుబడి" అనే ఉమ్మడి నామధేయం ఈ అసలు తేడాను రద్దు చేసేస్తోంది. పైగా

రాజకీయ అర్థశాస్త్రం మరింత దూరంపోయి, అసలు, ఏకైక వైరుధ్యం స్థిర, అస్థిర పెట్టుబడుల మధ్య గాక, నిశ్చల, చలామణి పెట్టుబడుల మధ్య వుందని గట్టిగా అభిప్రాయపడింది.

నిశ్చల, చలామణి పెట్టుబడులు మదుపుచేసే రెండు ప్రత్యేక మార్గాలనీ, ప్రతీదీ తన సొంత పద్ధతిలో లాభాన్ని ఇస్తుందనీ ఆడమ్ స్మిత్ పేర్కొన్న తరువాత, ఇలా అన్నాడు : "ఏ నిశ్చల పెట్టుబడైనా సరే, చలామణి పెట్టుబడి ద్వారా తప్ప, ఆదాయం ఇవ్వజాలదు. అత్యంత ఉపయోగకరమైన యంత్రాలు, వ్యాపార పరికరాలు చలామణి పెట్టుబడి లేకుండా ఏమీ ఉత్పత్తి చేయలేవు. ఆ యంత్రాదులు వినియోగించే సామాగ్రినీ, వాటితో పనిచేసే కార్మికుల పోషణావసరాలను చలామణి పెట్టుబడి సమకూర్చుతోంది." (పుట 188.)

అంతకు ముందు స్మిత్ వాడిన "ఆదాయాన్ని ఇవ్వడం", "లాభం సంపాదించడం" వగైరా మాటలకు అర్థం ఇక్కడ తెలుస్తుంది. అంటే, పెట్టుబడిలోని రెండు భాగాలూ ఉత్పాదితాన్ని సృష్టించడంలో తోడ్పడతాయని వాటి అర్థం.

ఆడమ్ స్మిత్ ఆ తర్వాత ఈ కింది ఉదాహరణ ఇచ్చాడు. "వ్యవసాయ పరికరాల్లో వినియోగించిన వ్యవసాయదారు పెట్టుబడి నిశ్చల పెట్టుబడి. శ్రమించే జీతగాళ్ళ వేతనాలకూ, పోషణకూ వినియోగించిన భాగం చలామణి పెట్టుబడి." (ఇక్కడ నిశ్చల, చలామణి పెట్టుబడుల మధ్య వున్న తేడాను చలామణిలోని తేడాకు సంబంధించి మాత్రమే, ఉత్పాదక పెట్టుబడి యొక్క విభిన్న భాగాల టర్నోవర్లకు సంబంధించి మాత్రమే సరిగా చెప్పడం జరిగింది) "ఒక భాగాన్ని అతడు తన స్వాధీనంలో వుంచుకోవడం ద్వారానూ, మరో భాగాన్ని వదిలిపెట్టడం ద్వారానూ అతను లాభాన్ని సంపాదిస్తాడు. వ్యవసాయ పరికరాల విలువలాగా, పని చేసే అతని పశువుల వెల లేదా విలువ నిశ్చల పెట్టుబడే." (ఈ తేడా వర్తించేది విలువకే గాని పదార్థానికి కాదు అని అతను సరిగానే చెప్పాడు) "వాటి" (పని చేసే పశువుల) "పోషణ, జీతగాళ్ళ పోషణ లాగానే చలామణి పెట్టుబడి. పని చేసే పశువులను వ్యవసాయదారు వుంచుకోవడం ద్వారానూ, వాటి పోషణను వదలుకోవడం ద్వారానూ లాభం సంపాదిస్తాడు." (వ్యవసాయదారు పశువుల దాణాను అమ్మడు, వుంచుకుంటాడు. దాన్ని పశువుల్ని మేపడానికి ఉపయోగిస్తాడు. ఇక్కడ వున్న తేడా ఒక్కటే. పనిచేసే పశువుల పోషణార్థం ఉపయోగించే దాణా మొత్తంగా వినియోగమవుతుంది. కనుక వ్యవసాయ ఉత్పాదితాల ద్వారా లేదా వాటి విక్రయం ద్వారా ఈ దాణాను నిరంతరాయంగా భర్తీ చేయాల్సి వుంటుంది. ఒక పశువు పూర్తిగా పని చేయలేని స్థితికి వచ్చినప్పుడు దాన్ని కూడా భర్తీ చేయాల్సి వుంటుంది). "పని కోసం కాక, అమ్మడానికై కొనుగోలు చేసి, మేపే పశువుల వెల, వాటి పోషణ ఖర్చు – రెండూ చలామణి పెట్టుబడి అవుతాయి. వాటిని తన వద్ద నుంచి పంపివేయడం ద్వారా వ్యవసాయదారు లాభం సంపాదిస్తాడు." (సంపుటి II, పుట 255–56)

(ప్రతి సరుకుల ఉత్పత్తిదారుడూ, అలాగే పెట్టుబడిదారీ ఉత్పత్తిదారుడూ తన ఉత్పత్తి ప్రక్రియ ఫలితమైన ఉత్పాదితాన్ని అమ్ముతాడు. అయితే ఈ వస్తువు అతని ఉత్పాదక పెట్టుబడిలో నిశ్చల లేదా చలామణి భాగం కావడానికి ఇది కారణం కానక్కర్లేదు. ఆ ఉత్పాదితం ఉత్పత్తి ప్రక్రియ నుంచి బయటకు నెట్టబడి సరుకు పెట్టుబడిగా పని చేయాల్సిన రూపంలో వుంటుంది. బలియబెట్టిన

పశువులు ఉత్పత్తి ప్రక్రియలో పని చేసే పశువుల్లా శ్రమ పరికరాలుగా గాక, ముడి పదార్థంగా మాత్రమే పని చేస్తాయి. కనుక బలియబెట్టిన పశువులు ఉత్పాదితంలోకి ఒక పదార్థంగా ప్రవేశిస్తాయి. సహాయక పదార్థాల (దాణా) విలువ లాగానే వాటి విలువ మొత్తంగా ఉత్పాదితంలోకి ప్రవేశిస్తుంది. కనుక బలియబెట్టిన పశువులు ఉత్పాదక పెట్టుబడిలో చలామణి భాగం. అంతేగాని అమ్మబడిన ఈ పశువులు ఇంకా బలియని పశువుల రూపంలో వున్నందువల్ల మాత్రం కాదు. ఒకే రూపం వుండడం ఇక్కడ యాదృచ్ఛికం మాత్రమే. ఈ ఉదాహరణతో ఆడమ్ స్మిత్‌కి ఒక విషయం అర్థమై వుండాల్సింది. అదేమంటే, ఉత్పత్తి అంశం యొక్క పాదార్థిక రూపంగాక ఉత్పత్తి ప్రక్రియల్లో దాని పాత్రను బట్టి మాత్రమే దానిలో వున్న విలువ నిశ్చల విలువా లేక చలామణి అయ్యే విలువా అనేది నిర్ణయమవుతుంది) "విత్తనాల మొత్తం విలువ కూడా నిశ్చల పెట్టుబడే. అది నేల నుండి ధాన్యాగారానికి, ధాన్యాగారం నుండి నేలకూ, ముందుకీ వెనక్కీ ప్రయాణించినప్పటికీ, యజమానులను మార్చదు. కనుక అది చలామణి కాదు. వ్యవసాయదారు తన లాభాన్ని దాని అమ్మకం ద్వారా గాక దాని వృద్ధి ద్వారా పొందుతాడు" (సంపుటి II, పుట 256)

ఇక్కడ స్మిత్ నిర్వచించిన తేడాలు పూర్తిగా ఆలోచనారహితమైనవని వెల్లడవుతుంది. అతని అభిప్రాయం ప్రకారం యజమానులను మార్చకపోతే, అంటే వార్షిక ఉత్పాదితం నుండి విత్తనాన్ని ప్రత్యక్షంగా భర్తీ చేస్తే, తీసివేసుకొంటే, విత్తనం నిశ్చల పెట్టుబడి అవుతుంది. కాని మొత్తం ఉత్పాదితాన్ని అమ్మి, దాని విలువలో ఒక భాగంతో మరో యజమాని విత్తనాలను కొంటే, అది చలామణి పెట్టుబడన్న మాట. ఒక దానిలో యజమానులు మారతారు; మరో దానిలో మారరు. స్మిత్ ఇక్కడ మరోసారి చలామణి పెట్టుబడినీ, సరుకు పెట్టుబడినీ గురించి గందరగోళంలో పడుతున్నాడు. ఉత్పాదితమనేది సరుకు పెట్టుబడికి పాదార్థిక వాహకం. అయితే అందులో చలామణి రంగంలోకి వాస్తవంలో ప్రవేశించే భాగం మాత్రమే, తాను వెలువడిన ఉత్పత్తి ప్రక్రియలోకి తిరిగి నేరుగా ప్రవేశించినప్పుడు మాత్రమే అది సరుకు పెట్టుబడి అవుతుంది.

విత్తనాన్ని, ఉత్పాదితం నుండి ఒక భాగంగా నేరుగా తీసివేసుకోవడం జరిగినా, లేక మొత్తం ఉత్పాదితాన్ని అమ్మి, దాని విలువలో ఒక భాగాన్ని మరో మనిషి విత్తనం కొనుగోలులోకి మార్చినా రెండు సందర్భాల్లోనూ జరిగింది, కేవలం భర్తీ మాత్రమే. ఈ భర్తీ వల్ల లాభం రాదు. ఒక సందర్భంలో విత్తనం ఉత్పాదితంలోని మిగిలిన భాగంతో పాటు చలామణి రంగంలోకి సరుకుగా ప్రవేశిస్తుంది. రెండో దానిలో, అడ్వాన్స్ చేయబడిన పెట్టుబడి విలువలో ఒక భాగంగా ఖాతా పుస్తకాల్లోకి ఎక్కుతుంది. ఈ రెండు సందర్భాల్లోనూ ఇది ఉత్పాదక పెట్టుబడి యొక్క చలామణి భాగంగా మాత్రమే వుంటుంది. ఉత్పాదితాన్ని తయారు చేయడానికి విత్తనం పూర్తిగా వినియోగించబడుతుంది. పునరుత్పత్తి సాధ్యం కావాలంటే, దాన్ని ఉత్పాదితం నుండి పూర్తిగా భర్తీ చేయాల్సి వుంటుంది.

"కనుక ముడి పదార్థాలూ, సహాయక పదార్థాలు శ్రమ ప్రక్రియలో ప్రవేశించడంతో తమ ప్రత్యేక రూపాన్ని కోల్పోతాయి. శ్రమ పరికరాల విషయంలో అలా కాదు. పనిముట్లు, యంత్రాలు, వర్క్‌షాపులు, పాత్రలు తమ తొలి రూపాన్ని కాపాడుకున్నంత కాలం మాత్రమే శ్రమ ప్రక్రియలో ఉపయోగకరంగా వుంటాయి. ప్రతి ఉదయం ఆ ప్రక్రియను, తమ రూపాన్ని మార్చుకోకుండా, మళ్ళీ

కొనసాగించడానికి సిద్ధంగా వుంటాయి. వాటి జీవిత కాలంలో లాగానే, అంటే తాము తోడ్పడుతున్న శ్రమ ప్రక్రియలో లాగానే, తమ కాలం చెల్లిన తర్వాత కూడా, తమ రూపాన్ని ఉత్పాదితంతో ప్రమేయం లేకుండా స్వతంత్రంగా కాపాడుకుంటాయి. పనిముట్లు, వర్క్‌షాపులు, యంత్రాలు తాము తయారు చేసిన ఉత్పాదితాల నుండి ఎప్పుడూ వేరై, వాటికి భిన్నంగా వుంటాయి." (పెట్టుబడి సంపుటి – I, అధ్యాయం VIII – సం.)

ఉత్పాదితం తయారుచేయడానికి ఉత్పత్తి సాధనాలు వినియోగమయ్యే ఈ విభిన్న పద్ధతులుండటం, వాటిలో కొన్ని ఉత్పాదితానికి ముఖాముఖమై స్వతంత్ర ఆకారాన్ని కాపాడుకోవడం, మరికొన్ని దాన్ని మార్చుకోవడం లేదా పూర్తిగా కోల్పోవడం అన్నవేవీ లేనట్లు ఆడమ్ స్మిత్ చిత్రించాడు. అసలు ఏ శ్రమ ప్రక్రియకైనా, ఉదాహరణకు, ఎటువంటి మార్పిడీ, సరుకుల ఉత్పత్తీ లేకుండా, కేవలం తమ సొంత అవసరాలను ఉదాహరణకు, పితృస్వామిక కుటుంబ అవసరాలను తీర్చడానికి ఉద్దేశించిన శ్రమ ప్రక్రియకు సైతం సంబంధించిన ఈ తేడాను ఆయన హుళక్కి చేశాడు. అందుకు ఆయన అనుసరించిన పద్ధతి ఇదీ : 1) ఇక్కడ పూర్తిగా అప్రస్తుతమైన లాభ నిర్వచనాన్ని స్మిత్ ప్రవేశపెట్టి, కొన్ని ఉత్పత్తి సాధనాలు వాటి ఆకారాన్ని కాపాడుకోవడం ద్వారానూ, మరికొన్ని తమ ఆకారాలను కోల్పోవడం ద్వారానూ తమ యజమానులకు లాభాన్ని తెచ్చిపెడతాయని వాదించడం : 2) శ్రమ ప్రక్రియలో, ఉత్పత్తి అంశాల్లోని ఒక భాగంలో వచ్చే మార్పులనూ, ఉత్పాదితాల మార్పిడికి, సరుకు చలామణికి సహజసిద్ధమైనట్టి, చలామణి సరుకుల యాజమాన్యంలో మార్పు అంతర్లీనంగా వున్నట్టి రూప పరివర్తననూ (క్రయ విక్రయాలను) కలగాపులగం చేయటం.

టర్నోవర్ జరగాలంటే చలామణి ఫలితమైన పునరుత్పత్తి జరగాలి. అంటే ఉత్పాదితం అమ్మబడాలి. అది డబ్బుగా మారాలి. ఆ డబ్బు తిరిగి ఉత్పాదక అంశాలుగా మారాలి. అయితే పెట్టుబడిదారీ ఉత్పత్తిదారుని సొంత ఉత్పాదితంలో ఒక భాగం అతనికి ఉత్పత్తి సాధనంగా నేరుగా ఉపకరిస్తుంది కనుక దాన్ని అతను తనకే అమ్ముతున్నట్లు కనిపిస్తాడు. అతని ఖాతా పుస్తకాల్లో అలా వుంటుంది. ఆ సందర్భంలో ఈ పునరుత్పత్తి భాగం చలామణి మూలంగా జరిగినది కాదు. నేరుగా జరిగినది. అయితే మళ్ళీ ఉత్పత్తి సాధనాలుగా వ్యవహరిస్తున్న ఉత్పాదిత భాగం నిశ్చల పెట్టుబడిని గాక చలామణి పెట్టుబడిని భర్తీ చేస్తుంది. ఎందుకంటే, 1) దాని విలువ ఉత్పాదితంలోకి పూర్తిగా ప్రవేశిస్తుంది; 2) అసలు అదే తనలాంటి కొత్త పదార్థాలతో పూర్తిగా భర్తీ అయినదే.

ఇప్పుడు నిశ్చల పెట్టుబడి అంటే ఏమిటో, చలామణి పెట్టుబడి అంటే ఏమిటో ఆడమ్ స్మిత్ చెబుతున్నాడు. ఫలానా వస్తువులు, పాదార్థిక అంశాలు నిశ్చల పెట్టుబడి అనీ, ఫలానివి చలామణి పెట్టుబడి అనీ వరుసగా పేర్కొన్నాడు – ఈ నిర్దిష్టత పెట్టుబడిదారీ ఉత్పత్తి ప్రక్రియలో అవి నిర్వహించే పనిని బట్టి తలెత్తినది కాక, ఈ వస్తువుల్లోనే భౌతికంగా, ప్రకృతిసిద్ధంగా అంతర్ నిహితమై వున్నట్లు! అయితే అదే అధ్యాయంలో (సంపుటి II, అధ్యాయం I) అతను ఒక విషయాన్ని పేర్కొన్నాడు. ఉదాహరణకు, "తక్షణ వినియోగానికై అట్టిపెట్టిన "నిల్వ"గా ఒక నివాస భవనం దాని యజమానికి "ఆదాయం సంపాదించి పెట్టవచ్చు". తద్వారా అతనికి పెట్టుబడి విధి నిర్వహణలో పనికిరావచ్చు. అయితే అది ప్రజలకు ఏమీ ఇవ్వజాలదు. వారికి పెట్టుబడి విధి నిర్వహణలో పనికిరాదు. మొత్తం

ప్రజల ఆదాయం దానివల్ల ఏ మాత్రం పెరగదు". (పుట 186) ఇక్కడ ఆడమ్ స్మిత్, పెట్టుబడిగా వుండే స్వభావం ఏ సందర్భంలోనూ, ఏ వస్తువుల్లోనూ అంతర్గతంగా లేదనీ, అదొక విధి, ఆయా పరిస్థితులను బట్టి వస్తువులను ఆ విధి నిర్వహణలో ఉంచవచ్చు, ఉంచకపోవచ్చు అని స్పష్టంగా చెబుతున్నాడు. పెట్టుబడికి వర్తించే ఈ సూత్రం దాని ఉప విభాగాలకు కూడా వర్తించాలి కదా మరి. శ్రమ ప్రక్రియలో వస్తువులు నిర్వహించే పాత్రను బట్టి అవి చలామణి లేదా నిశ్చల పెట్టుబడిలో భాగాలుగా వుంటాయి. ఉదాహరణకు ఒక పశువు పని చేసే పశువుగా (శ్రమ పరికరంగా), నిశ్చల పెట్టుబడి యొక్క భౌతిక అస్తిత్వ విధానానికి ప్రతీక. కాగా బలియబెట్టడానికి ఉద్దేశించిన పశువు (ముడి పదార్థం) వ్యవసాయదారుని చలామణి పెట్టుబడిలో భాగం అవుతుంది. మరోవైపున ఒకే వస్తువు ఒకసారి ఉత్పాదక పెట్టుబడిలో భాగంగా పనిచేయవచ్చు. మరోసారి ప్రత్యక్ష వినియోగ నిధికి చెందవచ్చు. ఉదాహరణకు వర్క్‌షాప్‌గా వున్న ఒక ఇల్లు ఉత్పాదక పెట్టుబడి యొక్క నిశ్చల భాగం. ఒక నివాస స్థలంగా వున్నప్పుడు అదో పరిస్థితిలోనూ పెట్టుబడి కాదు. ఒకే శ్రమ పరికరం అనేక సందర్భాల్లో ఉత్పత్తి సాధనంగా ఉపయోగపడవచ్చు లేదా వినియోగ సాధనంగానూ వుండొచ్చు.

నిశ్చల పెట్టుబడిగా, లేదా చలామణి పెట్టుబడిగా వుండే గుణం వస్తువుల్లోనే అంతర్ నిహితంగా వుండదనేది, ఆడమ్ స్మిత్ భావన నుంచి నిష్పన్నమైన పొరపాటుల్లో ఒకటి. శ్రమ ప్రక్రియను విశ్లేషించి చూస్తే (పెట్టుబడి, సంపుటి – I, అధ్యాయం VII) శ్రమ పరికరాలూ, శ్రమ పదార్థాలూ, ఉత్పాదితాలకు సంబంధించిన నిర్వచనాలు శ్రమ ప్రక్రియలో ఒకే వస్తువు నిర్వహించే వివిధ పాత్రలను బట్టి మారుతుంటాయి. నిశ్చల, అనిశ్చల పెట్టుబడి నిర్వచనాలు శ్రమ ప్రక్రియలోనూ, కనుక విలువ రూపుగొనే ప్రక్రియలోనూ ఈ అంశాలు నిర్వహించే నిర్దిష్ట పాత్రలపైనా ఆధారపడి వుంటాయి.

రెండవ విషయం. నిశ్చల, చలామణి పెట్టుబడులుగా వుండే వస్తువులను ఏకరువుపెట్టిన తరువాత స్మిత్, వాటి నిశ్చల, చలామణి భాగాల మధ్య వున్న తేడాను, ఉత్పాదక పెట్టుబడికి, చలామణి రంగంలో వుండే పెట్టుబడి రూపాలకు అంటే సరుకు పెట్టుబడి, డబ్బు పెట్టుబడి రూపాలకు మధ్య వున్న తేడాతో గందరగోళపరుస్తున్నాడని పూర్తిగా స్పష్టమవుతోంది. వస్తువుల నిశ్చల పెట్టుబడి, చలామణి భాగాల మధ్య తేడా చూపడం ఉత్పాదక పెట్టుబడి విషయంలో (ఉత్పాదక రూపంలో వున్న పెట్టుబడి విషయంలో) మాత్రమే చెల్లుతుంది; దానికి అర్థముంది. అదే పేరాలో (పుటలు 187, 188) ఆయన ఇలా అంటాడు. "చలామణి పెట్టుబడిగా వున్నది .... ఆయా వ్యాపారస్తుల చేతుల్లో వున్న ఆహార పదార్థాలు, సామాగ్రి తయారైన వస్తువులు, వాటిని చలామణీ, పంపిణీ చేయడానికి అవసరమైన డబ్బు, మొదలైనవి."

నిజానికి ఇక్కడ మనం కొంత లోతుగా పరిశీలిస్తే, తాను ముందు చెప్పిన దానికి భిన్నంగా ఆయన, చలామణి పెట్టుబడిని మళ్ళీ, సరుకు పెట్టుబడికీ డబ్బు పెట్టుబడికీ సమానమైనదిగా పరిగణిస్తున్నాడని మనకు కనిపిస్తుంది. అంటే, ఉత్పత్తి క్రమానికి ఏ మాత్రం సంబంధం లేనట్టి, నిశ్చల పెట్టుబడికి భిన్నంగా చలామణి (చలనశీల) పెట్టుబడిగా ఏర్పడనట్టి ఈ రెండు పెట్టుబడి రూపాలకు సమానమైనవిగా చూస్తున్నాడన్న మాట. కాని అవి కేవలం ఉత్పాదక పెట్టుబడికి భిన్నంగా చలామణి తాలూకు పెట్టుబడి మాత్రమే. పాదార్థిక రూపంలో (ముడి పదార్థాలు, సగం తయారైన

ఉత్పాదితాలు) అడ్వాన్స్ చేయబడిన ఉత్పత్తి ప్రక్రియలో నిజంగా చేర్చబడిన ఉత్పాదక పెట్టుబడి భాగాలు వీటి సరసన మాత్రమే అప్పుడు ఒక పాత్ర నిర్వహిస్తాయి. ఆయన ఇలా అంటాడు :

"..... సమాజంలోని మొత్తం భండారం (స్టాక్) సహజంగా విభజితమైవున్న మూడు భాగాల్లో మూడోది, చివరిది చలామణి పెట్టుబడి. దాని స్వభావం ఏమంటే, అది చలామణి ద్వారా లేదా యజమానులను మార్చడం ద్వారా మాత్రమే ఆదాయం చేకూర్చుతుంది. అలాగే, దానిలో నాలుగు భాగాలు వుంటాయి. మొదటిది డబ్బు..." (అయితే డబ్బు ఎప్పుడూ ఉత్పాదక పెట్టుబడి రూపం కాదు. అంటే ఉత్పాదక ప్రక్రియలో పని చేసే పెట్టుబడి రూపం కాదు. అది చలామణి ప్రక్రియలో పెట్టుబడి ధరించే రూపాల్లో ఒకటి మాత్రమే) "కసాయివాడు, పశు పోషకుడు, వ్యవసాయదారు – వీరి స్వాధీనంలో ఉండే ఆహార వస్తు రాశి రెండోది. వాటి అమ్మకం ద్వారా వారు లాభం ఆశిస్తారు.... నాలుగోది, ఆఖరిది ఏమంటే తయారై, పూర్తి అయినప్పటికీ, ఇంకా వ్యాపారి లేదా కార్ఖానాదారుని చేతిలోని వున్న వస్తుజాలం. మూడో అంశం ఏమంటే, వస్త్రాలకు, ఫర్నిచర్‌కూ, భవనాలకూ సంబంధించిన ముడి, లేదా తయారయ్యీ, కాని వస్తువులు. అవి ఈ మూడు రూపాలు ఇంకా ధరించివుండవు. వ్యవసాయదారులు, కార్ఖానాదారులు, వస్త్ర వ్యాపారులు, కలప వ్యాపారులు, వడ్రంగులు, వడ్ల పనివారు, ఇటుకలు చేసేవారు మొదలైన వారి చేతిలో వుంటాయి."

పైన పేర్కొన్న 2వ, 4వ భాగాల్లో వున్నవి ఉత్పత్తి ప్రక్రియ నుంచి బయటకు నెట్టబడి అమ్మబడాల్సిన వస్తువులు. క్లుప్తంగా చెప్పాలంటే అవి సరుకులు. అంటే అవి సరుకు పెట్టుబడి. వాటికొక రూపం వుంది. తాము ఉత్పాదక అంశాలుగా లేని ప్రక్రియలో వాటికో స్థానం వుంది. వాటి అంతిమ గమ్యం ఏమైనప్పటికీ, వాటి లక్ష్యాన్ని (ఉపయోగ విలువగా) సాధించడం కోసం చివరికి అవి వ్యక్తిగత వినియోగానికి కేటాయించబడినా లేక ఉత్పాదకత వినియోగానికి కేటాయించబడినా, వాటికా స్థానం వుంది. 2లో పేర్కొనబడిన ఉత్పాదితాలు ఆహార పదార్థాలు. 4లో వున్నవన్నీ మిగతా తయారైన వస్తువులు. అంటే తయారైన శ్రమ పరికరాలు లేదా తయారైన వినియోగ వస్తువులు (2లో పేర్కొనబడిన ఆహార పదార్థాలుగాక మిగతావి).

స్మిత్ అదే సమయంలో వ్యాపారిని గురించి కూడా మాట్లాడడమన్నది ఆయన గందరగోళాన్ని తెలియజేస్తోంది. ఒకసారి ఉత్పత్తిదారు వ్యాపారికి ఉత్పాదితాన్ని అమ్మివేస్తే అది ఇంకెంత మాత్రమూ అతని పెట్టుబడిగా వుండజాలదు. అది సమాజం దృష్టిలో ఇంకా సరుకు పెట్టుబడే కాని ఉత్పత్తిదారునికి కాదు. ఇతరులకు మాత్రమే సరుకు పెట్టుబడి. అది సరుకు పెట్టుబడి కనుకే అది నిశ్చల పెట్టుబడీకాదు, చలామణి పెట్టుబడీ కాదు.

ఉత్పత్తిదారుని ప్రత్యక్ష అవసరాలను తీర్చడానికి ఉద్దేశించని అన్ని రకాల ఉత్పత్తుల్లోనూ, ఉత్పాదితం ఒక సరుకుగా చలామణి కావలసిందే; అంటే దాన్ని అమ్మవలసిందే – దాన్నుంచి లాభం గడించడానికి కాదు, ఉత్పత్తిదారు కనీసం బతకగలగడానికి అలా చేయక తప్పదు. పెట్టుబడిదారీ ఉత్పత్తిలో దీనికి తోడు మరో విషయం కూడా వుంది. అదేమంటే, ఒక సరుకును అమ్మినప్పుడు, దానిలో పొందుపడి వున్న అదనపు విలువ కూడా డబ్బుగా చేతికందుతుంది. ఆ ఉత్పాదితం ఉత్పత్తి ప్రక్రియ నుంచి సరుకుగా బయటికి వస్తుంది. కాబట్టి అది ఈ ప్రక్రియకు చెందిన నిశ్చల అంశమూ కాదు, చలామణి అంశమూ కాదూ.

సందర్భవశాత్తూ ఒక మాట. స్మిత్ తన వాదనను తానే ఇక్కడ పూర్వపక్షం చేస్తున్నాడు. తయారైన ఉత్పాదితాలు అన్నీ, వాటి పాదార్థిక రూపం లేదా వాటి ఉపయోగ విలువ, వాటి ఉపయోగకర ప్రభావం ఏమైనప్పటికీ, ఇక్కడ సరుకు పెట్టుబడే. కాబట్టి చలామణి ప్రక్రియ స్వభావోచితమైన రూపంలో వున్న పెట్టుబడన్నమాట. ఈ రూపంలో వుండడం వల్ల, వాటి యజమానికి వున్న ఉత్పాదక పెట్టుబడిలో అవి భాగాలు కాదు. అయితే అవి అమ్మబడిన వెంటనే వాటి కొనుగోలు దారుని చేతిలో నిశ్చల లేదా చలామణి పెట్టుబడిలో, అనగా ఉత్పాదక పెట్టుబడిలో భాగం కాకుండా ఈ అంశం ఏ రకంగానూ నిరోధించదు. కనుక ఇక్కడ ఒక విషయం స్పష్టం. ఉత్పాదక పెట్టుబడికి భిన్నంగా మార్కెట్‌లో సరుకు పెట్టుబడిగా కొంతకాలం కనిపించే వస్తువులు, మార్కెట్ నుంచి తొలగించబడిన తర్వాత ఉత్పాదక పెట్టుబడిలోని చలామణి లేదా నిశ్చల పెట్టుబడి భాగాలుగా పని చేయనూవచ్చు, లేదా పనిచేయకపోనూవచ్చు.

దూది వడికే వాని ఉత్పాదితమైన నూలు అతనికి సంబంధించినంత వరకూ అతని పెట్టుబడి తాలూకు సరుకు రూపం. అది మళ్ళీ అతని ఉత్పాదక పెట్టుబడిలో భాగంగా పనిచేయలేదు – శ్రమ పదార్థంగానూ పని చేయలేదు, శ్రమ పరికరంగానూ పని చేయలేదు. అయితే దాన్ని కొనుగోలు చేసే నేతగాని చేతిలో అది అతని ఉత్పాదక పెట్టుబడిలో చలామణి భాగంగా చేర్చబడుతుంది. అయితే వడికేవానికి ఆ నూలు, అదనపు విలువకే కాక, అతని చలామణి, నిశ్చల పెట్టుబడిలోని కొంత భాగం యొక్క విలువకు నిలయం. అలాగే, ఒక యంత్ర కార్ఖానాదారుని ఉత్పాదితమైన యంత్రం అతని పెట్టుబడి యొక్క సరుకు రూపం, అతని సరుకు పెట్టుబడి. అది ఈ రూపంలో ఉన్నంతవరకూ చలామణి పెట్టుబడీ కాదు, నిశ్చల పెట్టుబడీ కాదు. అయితే దాన్ని ఒక కార్ఖానాదారుని ఉపయోగార్థం అమ్మితే అది అతని ఉత్పాదక పెట్టుబడిలో భాగమవుతుంది. దాని ఉపయోగపు రూపం కారణంగా దానిలో కొంత భాగం, అది వెలువడిన ప్రక్రియలోకే ఉత్పత్తి సాధనాలుగా తిరిగి ప్రవేశించవచ్చు. ఉదాహరణకు బొగ్గు తిరిగి బొగ్గు ఉత్పత్తిలో ప్రవేశించవచ్చు. అయినప్పటికీ, అమ్మడానికి ఉద్దేశించిన బొగ్గు చలామణి పెట్టుబడీ కాదు, నిశ్చల పెట్టుబడీ కాదు. అది సరుకు పెట్టుబడి మాత్రమే.

మరోవైపు ఒక ఉత్పాదితం దాని ఉపయోగపు రూపం వల్ల, ఉత్పాదక పెట్టుబడి అంశంగా ఏర్పడలేకపోవచ్చు. అంటే, శ్రమ పదార్థంగా గానీ, శ్రమ పరికరంగా గానీ మారలేకపోవచ్చు. నిత్య జీవితావసర వస్తువుల్లో ఏదైనా సరే ఇందుకు ఉదాహరణ. అయినప్పటికీ అది తన ఉత్పత్తిదారునికి సరుకు పెట్టుబడి; అతని నిశ్చల, చలామణి పెట్టుబడుల విలువ వాహకం. దాని ఉత్పత్తిలో ఉపయోగించబడిన పెట్టుబడి పూర్తిగా భర్తీ చేయవలసి వుంటుందా లేక పాక్షికంగానా, ఆ పెట్టుబడి తన విలువను ఉత్పాదితానికి పూర్తిగా బదిలీ చేసిందా లేక పాక్షికంగానా అన్న దాన్నిబట్టి, అది నిశ్చల లేదా చలామణి పెట్టుబడి విలువ వాహకంగా వుంటుంది.

స్మిత్ చెబుతున్న దాని ప్రకారం 3వ దానిలో ముడి పదార్థం (తయారు కాని పదార్థాలు, సగం తయారైన ఉత్పాదితాలు, సహాయక పదార్థాలు) ఒకవైపున ఉత్పాదక పెట్టుబడిలో అంతర్భాగంగా ఉండవు. వాస్తవంలో సామాజిక ఉత్పాదితాల రాశిలో కేవలం ఒక ప్రత్యేక తరహా ఉపయోగ విలువలుగా మాత్రమే ఉంటాయి; 2వ 3వ శాఖల కింద పేర్కొనబడిన ఇతర పాదార్థిక అంతర్భాగాలు, నిత్య

జీవితావసర వస్తువులతో పాటు, ప్రత్యేక తరహా సరుకులుగా వుంటాయి. మరోవైపున ఈ పదార్థాలు ఉత్పాదక పెట్టుబడిలో అంతర్భాగంగా, ఆ కారణం వల్ల ఉత్పత్తిదారుని చేతిలో ఉత్పాదక అంశాలుగా పేర్కొనబడుతున్నాయి. అవి కొంతవరకూ ఉత్పత్తిదారుని చేతుల్లో ("వ్యవసాయదారులు, కార్ఖానాదారులు మొదలైన వారి చేతుల్లో") కొంత వరకు వ్యాపారస్తుల ("వస్త్ర వ్యాపారులూ, కలప వ్యాపారులు") చేతుల్లో పని చేస్తున్నట్లు భావించడం వల్ల ఈ గందరగోళం తలెత్తింది. కాని వ్యాపారుల చేతుల్లో అవి కేవలం సరుకు పెట్టుబడి మాత్రమే. అవి అక్కడ ఉత్పాదక పెట్టుబడి అంతర్భాగాలు కావు.

చలామణి పెట్టుబడి అంశాలను వరుసగా పేర్కొనడంలో ఉత్పాదక పెట్టుబడి విషయంలో మాత్రమే వర్తించే తేడాను – నిశ్చల, చలామణి పెట్టుబడుల మధ్య తేడాను ఆడమ్ స్మిత్ ఇక్కడ పూర్తిగా మర్చిపోతున్నాడు. సరుకు పెట్టుబడి, డబ్బు పెట్టుబడి చలామణి ప్రక్రియకు చెందిన రెండు పెట్టుబడి రూపాలు. వాటిని ఉత్పాదక పెట్టుబడికి పోటీపెట్టి చూపిస్తున్నాడు – కాని ఆ ఎరుక లేకుండానే.

ఆఖరు విషయం. చలామణి పెట్టుబడి భాగాలను లెక్కించేటప్పుడు ఆడమ్ స్మిత్ శ్రమ శక్తిని పేర్కొనడం మర్చిపోవడం కొట్టొచ్చినట్లు కనిపించే వాస్తవం. దానికి రెండు కారణాలు వున్నాయి.

డబ్బు పెట్టుబడి సంగతి అలా వుంచి, చలామణి పెట్టుబడి సరుకు పెట్టుబడికి మరో పేరు మాత్రమే (స్మిత్ దృష్టిలో) అని మనమిప్పుడే చూశాం. అయితే శ్రమశక్తి మార్కెట్‌లో చలామణిలో వున్న మేరకు, అది పెట్టుబడి కాదు. అది సరుకు పెట్టుబడికి రూపమూ కాదు. అది పెట్టుబడి కానేకాదు. శ్రామికుడు తన శరీరమనే ఒక సరుకుని మార్కెట్‌కి తీసుకొచ్చినప్పటికీ, అతను పెట్టుబడిదారు కాదు. శ్రమశక్తి అమ్మబడనంత వరకూ, ఉత్పత్తి ప్రక్రియలో చేర్చబడనంత వరకూ, ఒక సరుకుగా చలామణి కావడం ఆగిపోయే వరకూ అది ఉత్పాదక పెట్టుబడిలో అంతర్భాగం కాజాలదు – అదనపు విలువకు మూలమైన అస్థిర పెట్టుబడి కాజాలదు. దానిలో మదుపు పెట్టిన పెట్టుబడి టర్నోవరుకు సంబంధించి ఉత్పాదక పెట్టుబడిలోని చలామణి భాగం కాజాలదు. ఇక్కడ స్మిత్ చలామణి పెట్టుబడిని సరుకు పెట్టుబడిగా గందరగోళపడుతున్నాడు. కనుక, శ్రమ శక్తిని చలామణి పెట్టుబడి శీర్షిక కింద చేర్చలేకపోతున్నాడు. కనుక అస్థిర పెట్టుబడి ఇక్కడ కార్మికుడు తన వేతనాలతో కొనే సరుకుల రూపంలో, అంటే నిత్య జీవితావసర సాధనాల రూపంలో కనిపిస్తుంది. ఈ రూపంలో వేతనాల్లో మదుపు పెట్టబడిన విలువ చలామణి పెట్టుబడి కిందికి వస్తుందని ఆయన భావం. ఉత్పాదక ప్రకియలో చేర్చబడింది శ్రమ శక్తే. అంటే స్వయంగా కార్మికుడే. అంతే తప్ప, కార్మికుడు తన పోషణకు తాను ఉపయోగించే నిత్య జీవితావసర వస్తువులు కాదు. కార్మికుని వ్యక్తిగత వినియోగం ద్వారా జరిగే అతని పునరుత్పత్తి, సమాజం దృష్టి నించి చూస్తే, సామాజిక పెట్టుబడి యొక్క పునరుత్పత్తి ప్రప్రకియలో భాగమని తెలుసుకొన్నాము. (పెట్టుబడి, సం I, అధ్యాయం XXIII) నిజమే. అయితే మనమిక్కడ అధ్యయనం చేస్తున్న వ్యష్టి ఉత్పత్తి ప్రక్రియకు ఇది వర్తించదు. నిశ్చల పెట్టుబడి శీర్షిక కింద స్మిత్ "సంతరించుకున్న, ఉపయోగకరమైన శక్తి సామర్థ్యాలను" పేర్కొన్నాడు (పుట 187). కాని అవి చలామణి పెట్టుబడి భాగాలే తప్ప నిశ్చల పెట్టుబడి కిందికి రావు. ఎందుకంటే, అవి వేతన కార్మికుని "సామర్థ్యాలు". అతను తన శ్రమను, దాని సామర్థ్యాలతో పాటు అమ్ముకున్నాడు.

మొత్తం సామాజిక సంపదనంతటినీ స్మిత్ 3 భాగాలుగా విభజించాడు. 1) తక్షణ వినియోగ నిధి 2) నిశ్చల పెట్టుబడి 3) చలామణి పెట్టుబడి. ఈ విభజన ఆయన చేసిన పెద్ద పొరపాటు. పై విభజన ప్రకారం, మొత్తం సంపదను 1) సామాజిక పెట్టుబడిలో ఎలాంటి భాగమూకాని వినియోగ నిధిగానూ, 2) పెట్టుబడిగానూ విభజించాల్సి వుంటుంది. వినియోగ నిధిలోని భాగాలు నిరంతరాయంగా పెట్టుబడిగా పని చేయగలిగినా సరే. ఆ ప్రకారం, ఒక భాగం సంపద పెట్టుబడిగానూ రెండో భాగం వినియోగ నిధిగానూ పని చేస్తాయి. స్తన్య జాతి జంతువు ఆడదైనా లేక మగదైనా అయి తీరవలసిన ప్రకృతి ఆవశ్యకతలాగా, పెట్టుబడి అంతా నిశ్చల పెట్టుబడన్నా లేక చలామణి పెట్టుబడన్నా అయి తీరవలసిన పరమావశ్యకత మనకిక్కడ గోచరిస్తుంది. అయితే నిశ్చల, చలామణి పెట్టుబడుల మధ్య వైరుధ్యం ఉత్పాదక పెట్టుబడి అంశాలకు మాత్రమే వర్తిస్తుందని మనం చూశాం. ఈ పెట్టుబడులు గాక, గణనీయమైన మొత్తంలో పెట్టుబడి – సరుకు పెట్టుబడి, డబ్బు పెట్టుబడి – అటు నిశ్చల పెట్టుబడీ కాని, ఇటు చలామణి పెట్టుబడీ కాని రూపంలో వుండ గలదు.

పెట్టుబడిదారీ ఉత్పత్తిలో సామాజిక ఉత్పత్తుల రాశి యావత్తూ మార్కెట్‌లో సరుకు పెట్టుబడిగా చలామణి అవుతుంది. దానిలో కొంత భాగం అమ్మకం గానీ, కొనుగోలు గానీ కాకుండా వ్యష్టి పెట్టుబడిదారులచే వస్తు రూపంలో మళ్ళీ ఉత్పత్తి సాధనాలుగా నేరుగా వినియోగమవుతుంది. ఈ భాగం అందుకు మినహాయింపు. దీన్ని బట్టి, కేవలం ఉత్పాదక పెట్టుబడిలోని నిశ్చల, చలామణి అంశాలే గాక మొత్తం వినియోగ నిధి అంశాలన్నీ సరుకు పెట్టుబడి నుండే ఉత్పన్నమవుతాయనేది స్పష్టమే. పెట్టుబడిదారీ ఉత్పత్తి పునాదిపైన ఉత్పత్తి సాధనాలు, వినియోగ వస్తువులు ఉత్తరోత్తరా ఉత్పత్తి సాధనాలుగా, వినిమయ వస్తువులుగా వాడటానికి ఉద్దేశించినవైనప్పటికీ మొదట సరుకు పెట్టుబడిగా రంగంపైకి వస్తాయనీ, శ్రమ శక్తి సరుకు పెట్టుబడి కాకపోయినప్పటికీ మార్కెట్‌లోకి సరుకుగా వచ్చినట్లే ఇవి కూడా వస్తాయనీ పైన చెప్పిన దాని తాత్పర్యం.

ఇదీ, ఆడమ్ స్మిత్ ఈ కింది కొత్త గందరగోళానికి కారణం. ఆయన ఇలా అంటాడు.

"ఈ నాలుగు భాగాల్లోనూ" ("చలామణి" "పెట్టుబడి యొక్క", అంటే, చలామణి ప్రక్రియకు చెందిన సరుకు, డబ్బు పెట్టుబడుల రూపాల్లోని పెట్టుబడి యొక్క నాలుగు భాగాల్లోనూ – సరుకు పెట్టుబడి అంతర్భాగాల మధ్య ఆడమ్ స్మిత్ చూపే పాదార్థిక భేదాల వల్ల రెండు భాగాలు నాలుగు భాగాలుగా మారాయి.) "మూడు భాగాలు – ఆహార పదార్థాలు, సామాగ్రి, పూర్తిగా తయారైనవి ఏటేటానో, అంతకన్నా తక్కువ కాలంలోనో, ఎక్కువ కాలంలోనో చలామణి నుంచి క్రమానుసారం ఉపసంహరింపబడతాయి. వాటిని నిశ్చల పెట్టుబడిలో గానీ, తక్షణ వినియోగం కోసం కేటాయించిన నిల్వలో గానీ వుంచుతారు. ప్రతి నిశ్చల పెట్టుబడీ చలామణి పెట్టుబడి నుండే వస్తుంది. దాని నిరంతరాయమైన అండ ప్రతి నిశ్చల పెట్టుబడికీ అవసరం. ఉపయోగకర యంత్రాలు, వ్యాపార పరికరాలు ఆదిలో చలామణి పెట్టుబడి నుండే ఉత్పన్నమవుతాయి. ఈ పెట్టుబడి వాటి తయారీకి అవసరమైన సామాగ్రిని, వాటిని తయారు చేసే కార్మికుల పోషకావసరాలను చేకూర్చుతుంది. వాటిని నిరంతరం మంచి స్థితిలో వుంచడానికి సైతం అదే తరహా పెట్టుబడి అవసరం." (పుట 188).

ఉత్పత్తి సాధనాలుగా దాని ఉత్పత్తిదారు నిరంతరం నేరుగా వినియోగం చేసే ఉత్పాదిత

భాగాన్ని మినహాయిస్తే, కింది సాధారణ సూత్రం పెట్టుబడిదారీ ఉత్పత్తికి వర్తిస్తుంది. మొత్తం ఉత్పాదితాలన్నీ మార్కెట్‌లోకి సరుకులుగా ప్రవేశిస్తాయి. కనుక అవి పెట్టుబడిదారుని దృష్ట్యా అతని పెట్టుబడి యొక్క సరుకు రూపంలో సరుకు పెట్టుబడిగా చలామణిలో వుంటాయి. ఈ ఉత్పాదితాలు వాటి వస్తురూపంలో, వాటి ఉపయోగపు విలువలను బట్టి, ఉత్పాదక పెట్టుబడి అంశాలుగా, (ఉత్పత్తి ప్రక్రియకు చెందిన అంశాలుగా) అంటే ఉత్పత్తి సాధనాలుగా, కనుక ఉత్పాదక పెట్టుబడిలోని నిశ్చల లేదా చలామణి అంశాలుగా పనిచేస్తాయా, లేక ఉత్పాదక వినియోగ సాధనాలుగా కాక, వ్యక్తి వినియోగ సాధనాలుగా పని చేస్తాయా అన్న దానితో ప్రమేయం లేదు. ఉత్పాదితాలన్నీ మార్కెట్‌లోకి సరుకులుగా వచ్చి పడతాయి. కనుక ఉత్పత్తి లేదా వినియోగ సాధనాలన్నింటినీ, ఉత్పాదక లేదా వినియోగ అంశాలన్నిటినీ, సరుకులుగా కొనుగోలు చేయడం ద్వారా, మార్కెట్ నుండి సేకరించ వలసిందే. ఇది స్వయం విదిత సత్యమని చెప్ప పనిలేదు. ఈ కారణంగా ఇది ఉత్పాదక పెట్టుబడి యొక్క నిశ్చల, చలామణి అంశాలకూ, అన్ని రూపాల్లోని శ్రమ పరికరాలకూ, శ్రమ వస్తువులకూ వర్తిస్తుంది. (అయితే, ఉత్పాదక పెట్టుబడిలో కొన్ని అంశాలను ప్రకృతే సమకూరుస్తుందని, అవి ఉత్పాదితాలు కాదనీ ఇది గమనించదు.) దూదిలాగే ఒక యంత్రాన్ని కూడా మార్కెట్‌లోనే కొంటారు. అయితే దీన్ని బట్టి, ప్రతి నిశ్చల పెట్టుబడి ఆదిలో ఏదో ఒక చలామణి పెట్టుబడి నుండి ఉత్పన్న మవుతుందని నిర్ధారించరాదు. చలామణి తాలూకు పెట్టుబడిని చలామణిలోని పెట్టుబడిగా, చలనశీల లేదా నిశ్చలేతర పెట్టుబడిగా అర్థం చేసుకున్న స్మిత్ తరహా గందరగోళం ఈ నిర్ధారణకు కారణం. పైగా స్మిత్ తన మాటనే తరువాత కాదంటున్నాడు. ఆయన ప్రకారమే యంత్రాలు సరుకులుగా, చలామణి పెట్టుబడి యొక్క 4వ భాగానికి చెందుతాయి. కనుక అవి చలామణి పెట్టుబడి నుంచి వస్తున్నాయని చెప్పడమంటే, అవి యంత్రాలుగా వ్యవహరించడానికి మునుపు సరుకు పెట్టుబడిగా వ్యవహరించాయనీ, అయితే పాదార్థికంగా అవి తమకు తామే మూలమని చెప్పడమే. ఒక నూలు ఉత్పత్తిదారుని పెట్టుబడిలో చలామణి అంశంగా దూది, అదే విధంగా, మార్కెట్‌లోని దూది నుండి గ్రహించబడిందన్న మాట. ఆడమ్ స్మిత్ తన తదుపరి వివరణలో, చలామణి పెట్టుబడి నుండి నిశ్చల పెట్టుబడిని రాబడుతున్నాడు. ఎందుకంటే, యంత్రాలు నిర్మించడానికి శ్రమ, ముడి పదార్థాలు కావాలి కదా. అయితే మొదటి విషయం, ముడి పదార్థాలు తయారు చేయాలంటే యంత్రాలలాంటి నిశ్చల పెట్టుబడి కావాలి. ఎందుకంటే, ఉత్పాదక పెట్టుబడిలో ఎప్పుడూ పరికరాలు తప్పనిసరిగా వుంటాయి. అయితే వాటిలో శ్రమ పదార్థం తప్పనిసరిగా వుండకపోవచ్చు. దాని తర్వాత ఆయన వెంటనే ఇలా అంటాడు – "భూమి, గనులు, మత్స్య పరిశ్రమ – వీటన్నిటినీ పనిలో పెట్టడానికి నిశ్చల, చలామణి పెట్టుబడులు రెండూ కావాలి." (కనుక ఆయనే ముడి పదార్థాల ఉత్పత్తికి కేవలం చలామణి పెట్టుబడే గాక నిశ్చల పెట్టుబడి కూడా కావాలని అంగీకరిస్తున్నాడు. "వాటి ఉత్పాదితం లాభంతో సహా (మళ్ళీ కొత్త పొరపాటు ప్రారంభం) ఆ పెట్టుబడుల స్థానాన్ని మాత్రమే గాకుండా, సమాజంలోని అన్ని పెట్టుబడుల స్థానాన్ని భర్తీ చేస్తుంది." (పుట 188) ఇది పూర్తిగా పొరపాటు. వాటి ఉత్పాదితం మిగిలిన పారిశ్రామిక శాఖలన్నింటికీ ముడి పదార్థాన్ని, సహాయక పదార్థాన్ని సమకూరుస్తుంది. అంతే తప్ప వాటి విలువ మిగిలిన సామాజిక పెట్టుబడుల విలువనంతటినీ భర్తీ చేయదు. అది తన

సొంత పెట్టుబడి విలువను మాత్రమే (అదనపు విలువను కూడా) భర్తీ చేస్తుంది. ఇక్కడ కూడా ఆడమ్ స్మిత్‌ని ఫిజియోక్రాటిక్ స్మృతులు పట్టి పీడిస్తున్నాయి.

సామాజిక దృష్టితో పరిశీలించి చూస్తే కేవలం శ్రమ పరికరాలుగానే పనిచేయగల ఉత్పాదితాలున్న సరుకు పెట్టుబడి భాగం – అవి ఒక లక్ష్యంతో ఉత్పత్తి అయినవి కాక, అమ్మడానికి వీలు లేనివైతే తప్ప – ఎప్పుడైనా శ్రమ పరికరాలుగా పని చేయాల్సి వుంటుంది. అంటే, పెట్టుబడిదారీ ఉత్పత్తి తమ పునాదిగా గల అవి సామాజిక ఉత్పాదిక పెట్టుబడిలో నిశ్చల భాగపు భావి అంశాలుగా మునుపు వున్నట్లుగానే, సరుకులుగా వుండటం ఆగిపోయిన వెనువెంటనే సాక్షాత్తు ఆ అంశాలయి తీరాలి.

అయితే ఉత్పాదితం యొక్క భౌతిక రూపాన్ని బట్టి ఇక్కడొక ప్రత్యేకత వుంది.

ఉదాహరణకు ఒక వడికే యంత్రం వడకడానికి ఉపయోగించబడితే తప్ప, అంటే అది ఒక ఉత్పత్తి అంశంగా పని చేస్తే తప్ప, పెట్టుబడిదారుని దృష్టి నుంచి ఉత్పాదక పెట్టుబడిలోని నిశ్చల అంతర్భాగంగా పని చేస్తే తప్ప, దానికి ఉపయోగపు విలువ లేదు. కాని వడికే యంత్రాన్ని ఎక్కడికైనా తరలించవచ్చు. అది ఉత్పత్తి అయిన దేశం నుంచి మరో దేశంలో ప్రత్యక్షంగానో పరోక్షంగానో ముడి పదార్థాలు వగైరా కోసం లేదా షాంపైన్ కోసం ఎగుమతి చేయబడవచ్చు. ఆ సందర్భంలో అది ఉత్పత్తి అయిన దేశంలో సరుకు పెట్టుబడిగా మాత్రమే పని చేసింది. ఎప్పుడూ, దాని అమ్మకం తర్వాత సైతం, ఆ దేశంలో నిశ్చల పెట్టుబడిగా వ్యవహరించలేదు.

అయితే ఫ్యాక్టరీ భవనాలు, రైలు మార్గాలు, వంతెనలు, సొరంగాలు, ఓడల నిర్మాణ స్థావరాలు మొదలైనవి, భూసారం మెరుగుదలలు వగైరాల లాంటివి స్వస్థానం నుంచి కదలించ వీలులేనివి. కాబట్టి వాటిని స్థానికంగా మాత్రమే ఉపయోగించ వీలుంది. కనుక వాటిని భౌతికంగా ఎగుమతి చేయడం సాధ్యం కాదు. వాటిని కదల్చడం సాధ్యపడదు. అవి తయారు కాగానే ఉపయోగరహితమైనా కావాలి, లేదా అవి తయారైన దేశంలో నిశ్చల పెట్టుబడిగానైనా పని చేయాలి. అధిక ధరకు అమ్మటం కోసం ఫ్యాక్టరీలను నిర్మించే లేదా నేలను సారవంతం చేసే పెట్టుబడిదారీ ఉత్పత్తిదారునికి అవి సరుకు పెట్టుబడి రూపాలు లేదా ఆడమ్ స్మిత్ అభిప్రాయం ప్రకారం, చలామణి పెట్టుబడి రూపాలు. అయితే ఈ వస్తువులను సామాజికంగా చూస్తే, అవి ఆ దేశంలో తుదకు ఏదో ఒక స్థానిక ఉత్పత్తి ప్రక్రియలో పని చేయాలి లేదా నిరుపయోగమైనా కావాలి. దీన్ని బట్టి, కదల్చ వీలులేనివన్నీ స్వతస్సిద్ధంగానే నిశ్చల పెట్టుబడి అని అనుకోవడానికి ఏ మాత్రం వీల్లేదు. నివాస గృహాలు వగైరాలలాంటివి వినియోగ నిధికి చెందవచ్చు. అటువంటప్పుడు అవి, పెట్టుబడి కేవలం ఒక భాగంగా గల సామాజిక సంపదలో అంతర్భాగాలైనప్పటికీ సామాజిక పెట్టుబడిలో ఎటువంటి భాగం కాదు. వీటి ఉత్పత్తిదారులు, వాటి అమ్మకం ద్వారా, ఆడం స్మిత్ మాటల్లో చెప్పాలంటే, లాభం సంపాదిస్తాడు. కనుక చలామణి లాభం సంపాదిస్తాడు. కనుక అవి చలామణి పెట్టుబడి! ఆచరణలో వాటిని ఉపయోగించే వ్యక్తి, వాటి కొనుగోలుదారుడు ఉత్పత్తి ప్రక్రియలో వాటిని పని చేయించడం ద్వారానే ఉపయోగించుకోగలడు. కనుక అవి నిశ్చల పెట్టుబడి!

ఆస్తి హక్కు పత్రాలు, ఉదాహరణకు రైల్వే షేర్లు ప్రతిరోజూ చేతులు మారొచ్చు. వాటి యజమాని

విదేశాల్లో సైతం వాటిని అమ్మడం ద్వారా లాభం సంపాదించవచ్చు. కనుక రైల్వేలు ఎగుమతి చేయ వీలులేనివైనా, వాటి ఆస్తి హక్కు పత్రాలను ఎగుమతి చేయవచ్చు. అయితే, ఇవి తయారైన దేశంలో యివి నిరుపయోగంగానైనా పడివుండాలి లేదా ఉత్పాదక పెట్టుబడి యొక్క నిశ్చల భాగాలుగానైనా పని చేయాలి. అదే విధంగా కార్ఖానాదారుడు ఎ తన ఫ్యాక్టరీని కార్ఖానాదారుడు బి కి అమ్మడం ద్వారా లాభం సంపాదించవచ్చు. అయితే ఆ ఫ్యాక్టరీ ఇంతకు ముందు లాగానే నిశ్చల పెట్టుబడిగా వ్యవహరించకుండా ఇది నిరోధించదు.

స్థానికంగా నిశ్చలంగా వున్న శ్రమ పరికరాలు ఆ గడ్డ నుండి వేరుచేయబడజాలనివి. అయినా అవి అదే దేశంలో నిశ్చల పెట్టుబడిగా బహుశా పనిచేయవలసి వుంటుంది. కానీ అవి తమ ఉత్పత్తిదారునికి సరకు పెట్టుబడి మాత్రమే. అవి అతని నిశ్చల పెట్టుబడిలోని ఏ అంశమూ కాదు (అతనికి సంబంధించినంత వరకూ భవనాలు, రైల్వేలు మొదలైన వాటి నిర్మాణానికై అవసరమైన శ్రమ పరికరాలు ఈ నిశ్చల పెట్టుబడిగా వుంటుంది) దీనంతటినిబట్టి నిశ్చల పెట్టుబడి తప్పనిసరిగా కదల్చ వీలులేని అంశాలతో కూడి వుంటుందని నిర్ధారించుకోరాదు. ఒక ఓడ, ఒక రైలింజను తమ కదలిక ద్వారానే పని చేయగలవు. కానీ వాటిని తయారు చేసిన వానికి గాక, వాటిని నిశ్చల పెట్టుబడిగా వినియోగించే వ్యక్తికి అవి పని చేస్తాయి. మరోవైపున ఉత్పత్తి ప్రక్రియలో అత్యంత నిశ్చలంగా వుంటూ ఒకసారి ఆ ప్రక్రియలో ప్రవేశించాక బయటికి పోకుండా అక్కడే జీవించి మరణించే అంశాలు కొన్ని ఉత్పాదక పెట్టుబడిలో చలామణి భాగాలు. ఉదాహరణకు యంత్రాన్ని నడపడానికి ఉత్పత్తి ప్రక్రియలో ఉపయోగించే బొగ్గు, ఫ్యాక్టరీని వెలిగించడానికి ఉపయోగించే గ్యాస్ మొదలైనవి. అవి చలామణి పెట్టుబడిగా వున్నాయంటే, ఉత్పత్తి ప్రక్రియను ఉత్పాదితంతో పాటు వదిలిపెట్టి సరుకులుగా చలామణి అవడం వల్లగాదు; తమ సహాయంతో తయారైన సరుకు విలువలో వాటి విలువ పూర్తిగా ప్రవేశించడం వల్లా, ఆ సరుకును అమ్మగా వచ్చిన దానితో ఆ విలువ పూర్తిగా భర్తీ కావడం వల్లా అవి చలామణి పెట్టుబడి అవుతున్నాయి.

ఆడమ్ స్మిత్ రచన నుంచి, చివర ఉల్లేఖించిన భాగంలో కింది పదజాలాన్ని గమనించాల్సిన అవసరం వుంది : “వాటిని (యంత్రాలు వగైరాను) తయారు చేసే కార్మికుల పోషకావసరాలను సమకూర్చే చలామణి పెట్టుబడి.”

“వేతనాల కోసం అడ్వాన్సు చేయబడిన పెట్టుబడిని, తొలి అడ్వాన్స్‌లకు భిన్నమైన వార్షిక అడ్వాన్సుల్లో భాగంగా ఫిజియోక్రాట్లు చూపుతున్నారు. ఇది సరియైనదే. మరోవైపున వ్యవసాయదారు ఉపయోగించే ఉత్పాదక పెట్టుబడిలో అంతర్భాగంగా వారికి కనిపించేది శ్రమ శక్తి కాదు. వారి నిత్య జీవితావసర వస్తువులు (దాన్ని కార్మికుల పోషణ అంటాడు స్మిత్). ఇది వారి ప్రత్యేక సిద్ధాంతానికి బాగా అతుకుతుంది. ఎందుకంటే వారు చెప్పేదాన్నిబట్టి, ఉత్పాదితానికి ముడిపదార్థాలు, శ్రమ పరికరాలు మొదలైన స్థిర పెట్టుబడి యొక్క పాదార్థిక భాగాలన్నీ జమ చేస్తున్న విలువ భాగం లాగానే శ్రమ దానికి జమ చేసే విలువ భాగం; కార్మికులకు చెల్లించబడుతున్నట్టి, శ్రమ శక్తిగా పనిచేయగలిగే తమ సామర్థ్యాన్ని కాపాడుకోవడానికి అవశ్యంగా వారు వినియోగం చేస్తున్నట్టి నిత్య జీవితావసరాల విలువతో మాత్రమే సమానం. వారి సిద్ధాంతమే స్థిర, అస్థిర పెట్టుబడుల మధ్య వున్న తేడాను

కనుగొనడానికి వారికి అడ్డుగా వుంది. అదనపు విలువను ఉత్పత్తి చేసేది శ్రమ అయితే (తమ సొంత ధరను పునరుత్పత్తి చేయడంతో పాటు), అది వ్యవసాయంలోనే కాదు, పరిశ్రమల్లో కూడా ఆ పని చేస్తుంది. కానీ వారి సిద్ధాంతం ప్రకారం, ఒకే ఒక్క ఉత్పత్తి శాఖలో మాత్రమే అంటే వ్యవసాయంలో మాత్రమే శ్రమ అదనపు విలువను సృష్టిస్తుంది. కాబట్టి అది శ్రమ నుంచి ఉత్పన్నం కాదు. ఈ శాఖలో ప్రకృతి ప్రత్యేక కార్యకలాపం (సాయం) వల్ల అదనపు విలువ ఉత్పన్నమవుతుంది. కేవలం ఈ కారణంచేతనే వారి దృష్టిలో ఇతర రకాల శ్రమకు భిన్నంగా వ్యవసాయ శ్రమ మాత్రమే ఉత్పాదక శ్రమ.

కార్మికుల నిత్యజీవితావసర వస్తువుల్ని ఆడమ్ స్మిత్ నిశ్చల పెట్టుబడికి భిన్నమైన చలామణి పెట్టుబడిగా వర్గీకరిస్తాడు.

1) ఎందుకంటే నిశ్చల పెట్టుబడికి భిన్నమైన చలామణి పెట్టుబడిని, చలామణి రంగానికి సంబంధించిన పెట్టుబడి రూపాలతో, చలామణి తాలూకు పెట్టుబడితో గందరగోళం పరుస్తాడు. (ఈ గందరగోళం విమర్శనారహితంగా ఆమోదం పొందింది.) కనుక అతడు సరుకు పెట్టుబడిని, ఉత్పాదక పెట్టుబడి యొక్క చలామణి భాగాన్ని కలగాపులగం చేస్తున్నాడు. ఇక అటువంటప్పుడు సామాజిక ఉత్పాదితం సరుకుల రూపం ధరించగానే కార్మికుల, కార్మికేతరుల నిత్య జీవితావసర వస్తువులు, శ్రమ పరికరాలు, పదార్థాలు సరుకు పెట్టుబడి నుండి సరఫరా కాక తప్పదు మరి.

2) స్మిత్ వివరణలో గర్భితంగా వున్న, నిజంగా శాస్త్రీయమైన భాగానికి ఫిజియోక్రాట్ల భావన విరుద్ధంగా వున్నప్పటికీ, స్మిత్ విశ్లేషణలో ఈ భావన తొంగిచూస్తుంది.

స్థూలంగా చెప్పాలంటే, అడ్వాన్స్ చేయబడిన పెట్టుబడి ఉత్పాదక పెట్టుబడిగా మార్చబడుతుంది. అంటే, ఉత్పాదక అంశాల రూపం ధరిస్తుంది. ఆ అంశాలు గత శ్రమ ఉత్పాదితాలే. (వాటిలో శ్రమ శక్తి ఒకటి.) ఈ రూపంలోనే పెట్టుబడి ఉత్పత్తి ప్రక్రియలో పని చేయగలదు. ఇప్పుడు శ్రమ శక్తి బదులు కార్మికుల నిత్య జీవితావసర వస్తువులను తీసుకుంటే, విలువ రూపొందడానికి సంబంధించినంత వరకు, ఈ వస్తువులు ఉత్పాదక పెట్టుబడిలో ఇతర అంశాలకు – ముడి పదార్థాలకు, పనిచేసే పశువుల ఆహారానికి భిన్నంగా వుండవు. ఈ కారణంగా, స్మిత్ ఫిజియోక్రాట్ల లాగానే వీటినీ, నిత్య జీవితావసర వస్తువుల్నీ ఒకే స్థాయిలో వుంచుతాడు. నిత్య జీవితావసర వస్తువులు తమ విలువను తామే విస్తరించుకోలేవు. దానికి ఏ అదనపు విలువను జత చేయలేవు. వాటి విలువ ఉత్పాదక పెట్టుబడి యొక్క విలువలో మాత్రమే పునఃప్రత్యక్షం కాజాలదు. తమకున్న విలువను గాక, అంతకు మించిన విలువను అవి దానికి చేర్చలేవు. ముడి పదార్థాలు, సగం తయారైన వస్తువులు వగైరాల్లాగానే, అవీ ఉత్పాదితంలో సంపూర్ణంగా (కనీసం వాటికై డబ్బు చెల్లించే పెట్టుబడిదారుకు సంబంధించినంత వరకు) వినియోగం కావడమే, వాటికీ శ్రమ పరికరాల రూపంలోని నిశ్చల పెట్టుబడికీ గల తేడా. ఉత్పాదితాన్ని తయారు చేసే క్రమంలో వాటి విలువ అలా పూర్తిగా వినియోగం అవుతుంది. కాబట్టి దాన్ని పూర్తిగా భర్తీ చేయవలసి వుంటుంది. కాగా నిశ్చల పెట్టుబడి విషయంలో దాని విలువ క్రమ క్రమంగా వినియోగమవుతుంది. కాబట్టి అదే విధంగా భర్తీ కావలసి వుంటుంది. శ్రమ శక్తి కోసం లేదా కార్మికుని జీవితావసరాల కోసం అడ్వాన్స్ చేయబడిన ఉత్పాదక పెట్టుబడి భాగం ఇక్కడ

ఉత్పాదక పెట్టుబడి యొక్క ఇతర అంశాలకు పాదార్థికంగా మాత్రమే భిన్నమైనది. అంతేగాని శ్రమ ప్రక్రియలో గాని, అదనపు విలువ ఉత్పత్తిలోగాని భిన్నమైనది కాదు. భేదమల్లా, అది ఉత్పాదితం యొక్క వస్తురూప స్రష్టల్లో ఒక భాగంతో పాటు చలామణి పెట్టుబడి అభివర్గం కింద చేరగా, దాని ఇతర వస్తురూప స్రష్టలు అలా కాక నిశ్చల పెట్టుబడి అభివర్గానికి చెందినవి. (ఈ వస్తు రూపంలోని స్రష్టలనే ఆడమ్ స్మిత్ స్థూలంగా "సామాగ్రి" అని అంటున్నాడు)

వేతనాల కోసం ఖర్చు పెట్టిన పెట్టుబడి, ఉత్పాదక పెట్టుబడిలో చలామణి భాగానికి చెందుతుంది. ఉత్పాదక పెట్టుబడి యొక్క నిశ్చల భాగంలాగా కాకుండా, దానికి ఉత్పాదితం యొక్క వస్తురూపంలోని సృష్టికర్తలైన ముడి పదార్థాలు వగైరాలకు చలనశీలత వుంటుంది. అయితే పెట్టుబడిలోని ఈ అస్థిర భాగం, స్థిర భాగానికి భిన్నంగా, స్వయం విస్తరణ ప్రక్రియలో నిర్వహించే పాత్రకూ, పై వాస్తవానికీ ఏమీ సంబంధం లేదు. అడ్వాన్స్ చేయబడిన పెట్టుబడి విలువలోని ఈ భాగాన్ని చలామణి ద్వారా ఉత్పాదితం విలువనుంచి ఎలా భర్తీ చేయాలి, పునరుద్ధరించాలి, ఎలా పునరుత్పత్తి చేయాలి అన్నదానితో మాత్రమే ఈ వాస్తవానికి సంబంధం వుంది. శ్రమ శక్తి యొక్క క్రయ, పునఃక్రయలు చలామణి రంగానికి చెందుతాయి. అయితే, శ్రమ శక్తి కోసం వెచ్చించబడిన విలువ ఒక నిర్దిష్ట నిశ్చల పరిమాణం నుంచి అస్థిర పరిమాణంగా ఉత్పత్తి ప్రక్రియలో మాత్రమే మారుతుంది. (కార్మికుని కోసం కాదు, పెట్టుబడిదారునికి) ఆ రకంగా మాత్రమే అడ్వాన్స్ చేయబడిన విలువ పూర్తిగా పెట్టుబడి విలువగా, పెట్టుబడిగా, స్వయంగా విస్తరించే విలువగా మారుతుంది. అయితే, స్మిత్ వర్గీకరించినట్లు, శ్రమ శక్తి కోసం వెచ్చించబడిన విలువకు బదులు, కార్మికుల నిత్య జీవితావసర వస్తువుల కోసం వెచ్చించిన విలువను ఉత్పాదక పెట్టుబడి యొక్క చలామణి భాగంగా వర్గీకరిస్తే, స్థిర, అస్థిర పెట్టుబడుల మధ్య భేదాన్ని గాని, మొత్తం పెట్టుబడిదారీ ఉత్పత్తి ప్రక్రియను గానీ అర్థం చేసుకోవడం అసాధ్యమవుతుంది. శ్రమ శక్తిలో మదుపు చేయబడిన పెట్టుబడి భాగం టర్నోవర్‌కు సంబంధించినంత వరకూ ఉత్పాదక పెట్టుబడి యొక్క చలామణి భాగానికి చెందుతుందనే నిర్ధారణ కింద, స్థిర పెట్టుబడికి భిన్నంగా ఈ పెట్టుబడి భాగం అస్థిర పెట్టుబడి అవుతుందనే నిర్ధారణ మరుగున పడిపోతుంది. ఈ మరుగున పడడం అన్నది, కార్మికుని శ్రమ శక్తిని గాక కార్మికుని జీవితావసర వస్తువుల్ని ఉత్పాదక పెట్టుబడి అంశాలుగా లెక్కించడం వల్ల పూర్తవుతుంది. శ్రమ శక్తి విలువ డబ్బుగా అడ్వాన్స్ చేయబడిందా లేక నిత్యజీవితావసర వస్తువులుగానా అన్నది ఇక్కడ అప్రస్తుతం. కానీ, పెట్టుబడిదారీ విధానంలో ఈ రెండోది చాలా సకృత్తు."[1]

శ్రమ శక్తి కోసం వెచ్చించబడిన పెట్టుబడి విలువను చలామణి పెట్టుబడి నిర్ణయిస్తుందని నిర్వచించడం ద్వారా (స్మిత్ ఫిజియోక్రాట్ల సిద్ధాంతాన్ని స్వీకరించకుండానే వారి ఈ నిర్వచనాన్ని

---

1. విలువ స్వయం విస్తరణ ప్రక్రియలో శ్రమ శక్తి పాత్రను అర్థం చేసుకోవడంలో తన మార్గాన్ని తానే ఎలా మూసేసుకున్నాడో, ఫిజియోక్రాట్ల మాదిరిగా స్మిత్ కూడా కార్మికుల శ్రమను పనిచేసే పశువుల శ్రమతో సమానం చేస్తున్నట్లు ఆయన క్రింది వాక్యం స్పష్టం చేస్తుంది: "ఇతని (వ్యవసాయదారుని) జీతగాళ్ళు మాత్రమే కాదు పనిచేసే అతని పశువులు కూడా ఉత్పాదక కార్మికులే. (పుస్తకం-II , అధ్యాయం -V , పుట-243) కార్ల్ మార్క్స్, పెట్టుబడి సంపుటి I, పుటలు 609 -11-సం

స్వీకరించాడు) స్మిత్ తన అనుయాయుల్లో, శ్రమ శక్తిపై వెచ్చించబడిన పెట్టుబడి భాగం అస్థిర పెట్టుబడి అవుతుందనే అవగాహనను అదృష్టవశాత్తు చంపివేశాడు. ఇతరచోట్ల స్మిత్ రూపొందించిన లోతైన, సరియైన భావాలు నిలబడలేదు గాని ఈ దారుణమైన పొరపాటు మాత్రం నిలిచిపోయింది. ఆయన తర్వాత ఇతర రచయితలూ అదే మార్గంలో మరికొంత ముందుకు పోయారు కూడా. శ్రమ శక్తిపై ఖర్చుపెట్టిన పెట్టుబడి భాగం నిశ్చల పెట్టుబడికి భిన్నమైన చలామణి పెట్టుబడి అన్నదే దాని నిర్ణయాత్మకమైన నిర్వచనమని వారు వక్కాణించడంతో సంతృప్తిపడలేదు. కార్మికుల నిత్యజీవితావసర వస్తువులపై మదుపు పెట్టబడడమే చలామణి పెట్టుబడి మౌలిక నిర్వచనమని వారు చాటారు. దీనితో సహజంగానే శ్రమ నిధి సిద్ధాంతం ముడివేసుకుని వుంది. అవసరమైన నిత్యజీవితావసర వస్తువులున్న ఈ శ్రమ నిధి ఒక నిర్దిష్ట పరిమాణం గలదనీ, అందువల్ల సామాజిక ఉత్పాదితంలో కార్మికుల వాటాను ఇది ఒకవైపున భౌతికంగా పరిమితం చేస్తుందనీ, అయితే మరోవైపున శ్రమశక్తి కొనుగోలులో దీన్ని పూర్తిగా వెచ్చించవలసి వుంటుందనీ చెప్పే సిద్ధాంతమిది.

★ ★ ★

## అధ్యాయం - 11

# నిశ్చల మరియు చలామణి పెట్టుబడుల సిద్ధాంతాలు : రికార్డో

విలువ సూత్రానికి మినహాయింపుగా ఉదాహరణలు ఇవ్వడానికి మాత్రమే, అంటే వేతనాల రేటు ధరలను ప్రభావితం చేసే సందర్భాల్లో మాత్రమే రికార్డో నిశ్చల, చలామణి పెట్టుబడుల మధ్య భేదాన్ని ప్రవేశపెడతాడు. ఈ అంశం సంపుటి III లో చర్చించబడుతుంది.[1]

కానీ కింది అంశాలను అప్రస్తుతంగా పక్క పక్కనే పేర్కొన్న తీరును గమనిస్తే అసలు స్పష్టతే లేదని ప్రారంభంలోనే కనిపిస్తుంది. "నిశ్చల పెట్టుబడి మన్నికలో వున్న ఈ తేడాను రెండు రకాల పెట్టుబడులను కలపవీలున్న నిష్పత్తులలోని ఈ వైవిధ్యం...."[2]

ఆయన పేర్కొంటున్నవి ఏ రెండు రకాల పెట్టుబడులు అని అడిగితే, ఆయన ఇలా చెబుతాడు. "శ్రమను పోషించే పెట్టుబడికి, పనిముట్లు, యంత్రాలు, భవనాలు వగైరాలపై మదుపు పెట్టబడే పెట్టుబడికి మధ్య నిష్పత్తులను కూడా వివిధ రకాలుగా కలపవచ్చు."[3] వేరు మాటల్లో చెప్పాలంటే, నిశ్చల పెట్టుబడి శ్రమ పరికరాలకు, చలామణి పెట్టుబడి శ్రమ కోసం వెచ్చించబడిన పెట్టుబడికి సమానం. "శ్రమను పోషించే పెట్టుబడి" అనేది అర్థరహితమైన మాట. ఇది ఆడమ్ స్మిత్ నుంచి అరువు తెచ్చుకొన్నది. ఒకవైపున, చలామణి పెట్టుబడి అస్థిర పెట్టుబడితో, అంటే ఉత్పాదక పెట్టుబడిలో శ్రమ కోసం వెచ్చించబడిన భాగంతో ఇక్కడ కలగాపులగం చేయబడింది. కానీ మరోవైపున వైరుధ్యం, విలువ స్వయం విస్తరణ ప్రక్రియ నుంచి గాక, స్థిర, అస్థిర పెట్టుబడుల నుంచి గాక, చలామణి ప్రక్రియ నుంచి ఉత్పన్నమవుతున్నట్లు చెబుతున్నాడు. (ఇది ఆడమ్ స్మిత్ పాత గందరగోళం) ఇది రెండు తప్పు నిర్వచనాలకు దారితీస్తోంది.

***మొదటిది :*** నిశ్చల పెట్టుబడి మన్నిక స్థాయిలో వున్న తేడాలు, పెట్టుబడి స్థిర, అస్థిర భాగాలుగా వుండడం వల్ల తలెత్తే తేడాలు సమాన ప్రాముఖ్యం గలవని ఆయన అనుకొంటున్నాడు. కానీ వీటిలో ఆఖరున పేర్కొన్న తేడా అదనపు విలువ ఉత్పత్తిలోని తేడాను నిర్ణయిస్తుంది. కానీ నిశ్చల పెట్టుబడి మన్నికలో తేడాలు, స్వయం విస్తరణ ప్రక్రియకు సంబంధించినంత వరకూ, ఒక నిర్దిష్టమైన విలువ ఉత్పత్తి సాధనాల నుండి ఉత్పాదితానికి బదిలీ అయిన తీరును మాత్రమే తెలియజేస్తాయి. చలామణి

1. కారల్ మార్క్స్, పెట్టుబడి-సం. III, - అధ్యాయం XI - సం.
2. రికార్డో Principles etc (ప్రిన్సిపుల్స్ వగైరా)... పుట 25.
3. అదే గ్రంథం.

ప్రక్రియకు సంబంధించినంత వరకూ ఈ తేడా, ఖర్చయిన పెట్టుబడి పునరుద్ధరణ కాలాన్ని తెలియజేస్తుంది. మరో దృష్టితో చూస్తే అది ఎంత కాలం కోసం అడ్వాన్స్ చేయబడిందో తెలుపుతుంది. పెట్టుబడిదారీ ఉత్పత్తి ప్రక్రియ అంతర్గత యంత్రాంగాన్ని గమనించకుండా, పూర్తి అయిన దృశ్యమాన పరిణామాలను మాత్రమే పరిశీలిస్తే ఈ తేడాలన్నీ ఒకేలా కనిపిస్తాయి. సామాజిక అదనపు విలువను వివిధ పారిశ్రామిక శాఖల పెట్టుబడులకు పంపిణీ చేయడంలో, పెట్టుబడి అడ్వాన్స్ చేయబడిన విభిన్న కాలాల మధ్య వున్న తేడాలు (ఉదాహరణకు నిశ్చల పెట్టుబడి యొక్క వివిధ మన్నిక స్థాయిలు), పెట్టుబడి అంగాంగిక నిర్మాణ స్వరూపంలోని వైవిధ్యం (కనుక స్థిర, అస్థిర పెట్టుబడుల విభిన్న చలామణులు కూడా) సాధారణ లాభం రేటును సమానం చేయడానికి, విలువలను ఉత్పత్తి ధరలుగా మార్చడానికి సమానంగా దోహదపడతాయి.

***రెండోది :*** చలామణి ప్రక్రియ దృష్టితో చూస్తే, ఒకవైపున శ్రమ పరికరాలు వుంటాయి. అంటే నిశ్చల పెట్టుబడి వుంటుంది. రెండోవైపున శ్రమ పదార్థాలూ, వేతనాలూ వుంటాయి. అంటే చలామణి పెట్టుబడి వుంటుంది. అయితే శ్రమ ప్రక్రియ, స్వయం విస్తరణల దృష్టితో చూస్తే ఒకవైపున ఉత్పత్తి సాధనాలు (శ్రమ పరికరాలు, శ్రమ పదార్థం) వుంటాయి. అంటే స్థిర పెట్టుబడి వుంటుంది. మరోవైపున శ్రమ శక్తి వుంటుంది. అంటే అస్థిర పెట్టుబడి వుంటుంది. పెట్టుబడి ఆంగిక నిర్మాణ స్వరూపానికి సంబంధించినంత వరకూ (పెట్టుబడి సంపుటి – I, అధ్యాయం–XXV) స్థిర పెట్టుబడి యొక్క నిర్దిష్ట పరిమాణంలో ఎక్కువ శ్రమ పరికరాలు, తక్కువ శ్రమ పదార్థం వుందా లేక ఎక్కువ శ్రమ పదార్థం, తక్కువ శ్రమ పరికరాలు వున్నాయా అన్నదానితో ఏ మాత్రం ప్రమేయం లేదు. కాగా, ఉత్పత్తి సాధనాలపైన పెట్టిన పెట్టుబడికి, శ్రమ శక్తి కోసం కేటాయించిన పెట్టుబడికి మధ్య వున్న నిష్పత్తిపైన ప్రతిదీ ఆధారపడుతుంది. దీన్ని తిరగేసి చెబుతాను; చలామణి ప్రక్రియ దృష్టితో చూస్తే, నిశ్చల, చలామణి పెట్టుబడుల మధ్య గల తేడా దృష్ట్యా చూస్తే, చలామణి పెట్టుబడి యొక్క నిర్దిష్ట విలువ పరిమాణం శ్రమ పదార్థంగానూ, వేతనాలుగానూ ఏ నిష్పత్తిలో విభజితమవుతుంది అన్నదానితో ప్రమేయం లేదు. ఈ దృక్కోణాల్లో ఒకదాని నుంచి చూస్తే శ్రమ శక్తికి కేటాయించబడిన పెట్టుబడి విలువకు వ్యతిరేకంగా, శ్రమ పదార్థాన్నీ, శ్రమ పరికరాలనూ ఒకే అభివర్గం కింద జమకడతారు. మరో దృక్కోణం నుంచి చూస్తే, శ్రమ పరికరాలపై వెచ్చించబడిన పెట్టుబడికి వ్యతిరేకంగా, శ్రమ శక్తికి కేటాయించబడిన పెట్టుబడి భాగం, శ్రమ పదార్థానికి కేటాయించిన పెట్టుబడి భాగంతోపాటు అదే అభివర్గం కిందికి వస్తుంది.

ఈ కారణం వల్లనే రికార్డో రచనల్లో శ్రమ పదార్థం (ముడి, సహాయక పదార్థాల)పై కేటాయించబడిన పెట్టుబడి విలువ భాగం ఇరువైపులా కనిపించదు. అది పూర్తిగా మాయమైపోతుంది. ఎందువల్లనంటే, దాని చలామణి పద్ధతి శ్రమ శక్తి కోసం కేటాయించబడిన పెట్టుబడి భాగంతో ఏకీభవిస్తుంది కనుక దాన్ని నిశ్చల పెట్టుబడితో పాటు వర్గీకరించడం సాధ్యం కాదు. మరో వైపున, దాన్ని చలామణి పెట్టుబడితోపాటు ఉంచడం కూడా సాధ్యపడదు. ఎందువల్లనంటే అలా చేస్తే నిశ్చల, చలామణి పెట్టుబడుల మధ్య వున్న వైరుధ్యమే స్థిర, అస్థిర పెట్టుబడుల మధ్య వున్న వైరుధ్యం అనే స్మిత్ భావం – అంతవరకు మౌనాంగీకారం పొందిన ఆ భావం రద్దయిపోతుంది. రికార్డోకు

సహజసిద్ధంగా వున్న గరిష్ఠ తార్కిక దృష్టికి ఇది అనుభూతం కాకుండా వుండజాలదు. ఈ కారణంగానే ఆ పెట్టుబడి భాగం ఆయన దృష్టి నుంచి పూర్తిగా మాయమైపోయింది.

రాజకీయ అర్థశాస్త్ర పడికట్టు పదాల్లో చెప్పాలంటే, పెట్టుబడిదారు వేతనాల కోసం కేటాయించ బడిన పెట్టుబడిని, వివిధ కాల వ్యవధులకు అతడు వేతనాలను చెల్లించేది వారానికొకసారా, నెలకోసారా, లేదా మూడు నెలలకొకసారా అనేదాన్నిబట్టి అడ్వాన్స్ చేస్తాడు. అయితే వాస్తవంలో ఇది తారుమా రవుతుంది. తనకు జీతం ఇచ్చేది వారానికొకసారా, నెలకొకసారా, మూడు నెలలకొకసారా అనే దాన్నిబట్టి కార్మికుడే ఒక వారానికి, నెలకి లేదా మూడు నెలలకు తన శ్రమను పెట్టుబడిదారుడికి అడ్వాన్స్ చేస్తాడు. పెట్టుబడిదారు వేతనాలను చెల్లించడం కాకుండా శ్రమ శక్తిని కొన్నట్లయితే, వేరు మాటల్లో చెప్పాలంటే, ఒక రోజుకీ, ఒక వారానికి, ఒక నెలకు, మూడు నెలలకుగాను అతడు ముందే వేతనాలను అడ్వాన్స్ చేసి వుంటే అప్పుడు అతడు వేతనాలను ఆ కాలాలకు అడ్వాన్స్ చేసినట్లు చెప్పుకోవడం న్యాయమవుతుంది. అయితే కొన్ని రోజులు, వారాలు లేక నెలలపాటు పని జరిగిన తరువాతనే అతడు చెల్లిస్తాడు. అంతేగాని, పని జరగవలసిన కాలానికి చెల్లించడు లేదా కొనడు. ఇది పెట్టుబడిదారీ పద్ధతిలో ఇచ్చిపుచ్చుకోవడం. పెట్టుబడిదారుడికి కార్మికుడు ఇచ్చే అడ్వాన్స్‌ని పెట్టుబడిదారుడు కార్మికునికిచ్చే అడ్వాన్స్‌గా మార్చడం జరిగింది. అయితే, పెట్టుబడిదారునికి ఉత్పాదితం లేదా దాని విలువ (దానిలో నిక్షిప్తమైన అదనపు విలువతో పాటు) చలామణి నుండి తిరిగి రావటానికి లేదా డబ్బు రూపంలో చేతికందడానికి కొంతకాలం పడుతుంది. ఈ కాలం దాని ఉత్పత్తికీ, చలామణికీ అయ్యే కాలం మీద ఆధారపడి వుంటుందనేది పైన చెప్పిన వాస్తవాన్ని మార్చదు. సరుకును అమ్మే శక్తి ఆ సరుకును కొనే వ్యక్తి దాన్ని ఏమి చేస్తాడనే విషయం ఏ మాత్రం పట్టించుకోదు. పెట్టుబడిదారు ఒక యంత్రం మొత్తం విలువను ఒకేసారి అడ్వాన్స్ చేయవలసి వుండగా, దాని విలువ అతనికి కొద్ది కొద్దిగా క్రమక్రమంగా మాత్రమే తిరిగి వచ్చినప్పటికీ ఆ యంత్రం అతనికి చౌకగా లభించదు. అలాగే దూది విలువ ఉత్పాదితం విలువలో పూర్తిగా ప్రవేశించినందు వల్ల ఉత్పాదితం అమ్మకం ద్వారా ఆ విలువ పూర్తిగా భర్తీ అయి, తిరిగి ఒక్కసారిగా చేతికి వచ్చినప్పటికీ, పెట్టుబడిదారు దూదిని కొనేటప్పుడు ఎక్కువేమీ చెల్లించడు.

మళ్లీ రికార్డో సంగతికి వద్దాం.

1. అస్థిర పెట్టుబడి విశిష్ట లక్షణమేమంటే, పెట్టుబడిలోని ఖచ్చితమైన, నిర్ణీతమైన (అందువల్ల స్థిరమైన) ఒక భాగం, ఈ నిర్ణీత విలువల మొత్తం (శ్రమ శక్తి విలువకు ఇది సమానమైన ఊహ్యం. అయితే శ్రమ శక్తి విలువకంటే వేతనాలు ఎక్కువా, తక్కువా లేక సమానమా అన్నదానితో ఇక్కడ ప్రమేయం లేదు) స్వయంగా విస్తరించే, విలువను సృష్టించే శక్తితో, అంటే శ్రమ శక్తితో మార్పిడి అవుతుంది. శ్రమ శక్తి తనకు పెట్టుబడిదారు చెల్లించిన విలువను పునరుత్పత్తి చేయడమే గాక అదే కాలంలో అదనపు విలువను కూడా ఉత్పత్తి చేస్తుంది. ఈ అదనపు విలువ ఇంతకుముందు లేని విలువ. ఏ సమతుల్యంతోనూ చెల్లించబడని విలువ. వేతనాల కోసం కేటాయించబడిన పెట్టుబడికి వున్న ఈ విశిష్టమైన లక్షణం దాన్ని స్థిర పెట్టుబడి నుండి అస్థిర పెట్టుబడిగా పూర్తిగా వేరు చేసి చూపుతుంది. అయితే చలామణి ప్రక్రియ దృష్టితో మాత్రమే చూస్తే ఈ లక్షణం మాయమైపోతుంది.

శ్రమ పరికరాలపై వెచ్చించబడిన నిశ్చల పెట్టుబడికి భిన్నమైన చలామణి పెట్టుబడిగా కనిపిస్తుంది. దీన్ని స్థిర పెట్టుబడిలో అంతర్భాగంగా వున్న శ్రమ పదార్థంతో పాటు, స్థిర పెట్టుబడి యొక్క మరో అంతర్భాగానికి – శ్రమ పరికరాలకై వెచ్చించిన పెట్టుబడి భాగానికి వ్యతిరేకంగా, చలామణీ పెట్టుబడి పద్దు కిందికి తీసుకురావడంలోనే ఇది స్పష్టమవుతుంది. ఆ విధంగా అదనపు విలువే, వెచ్చించబడిన మొత్తం విలువని పెట్టుబడిగా మార్చే అసలు పరిస్థితే బొత్తిగా లెక్కలోకి రాకుండా పోతోంది. వేతనాల్లో మదుపు పెట్టిన పెట్టుబడి ఉత్పాదితానికి చేర్చే విలువ భాగం కొత్తగా ఉత్పత్తి చేయబడినది కాగా (కాబట్టి నిజంగా పునరుత్పత్తి చేయబడినది కాగా), ముడి పదార్థాలు ఉత్పాదితానికి చేర్చే విలువ భాగం కొత్తగా ఉత్పత్తి చేయబడినది కాదు, నిజంగా పునరుత్పత్తి అయినది కాదు, అది ఉత్పాదితపు విలువలో కేవలం భద్రపరచబడినది, నిల్వ చేయబడినది కాబట్టి ఉత్పాదితపు విలువ అంతర్భాగంలో అది పునఃప్రత్యక్షమవుతుంది, అనే వాస్తవం కూడా, అదే విధంగా ఉపేక్షించబడుతోంది. నిశ్చల, చలామణి పెట్టుబడుల మధ్య వున్న భేదం ఏమిటనే దృష్టితో చూస్తే ఆ భేదం కేవలం ఇంత మాత్రమే: సరుకు ఉత్పత్తి కోసం ఉపయోగించిన శ్రమ పరికరాల విలువ సరుకు విలువలోకి కేవలం పాక్షికంగా మాత్రమే ప్రవేశిస్తుంది. కనుక సరుకు అమ్మకం ద్వారా అది పాక్షికంగా మాత్రమే భర్తీ అవుతుంది. కొద్దికొద్దిగా, క్రమక్రమంగా మాత్రమే పూర్తి భర్తీ అవుతుంది. కానీ, సరుకు ఉత్పత్తి కోసం ఉపయోగించబడిన శ్రమ శక్తి విలువ శ్రమ పదార్థాల విలువ సరుకులో మొత్తంగా ప్రవేశిస్తుంది. కనుక దాని అమ్మకం ద్వారా మొత్తంగా భర్తీ అవుతుంది. ఈ విషయంలో చలామణి ప్రక్రియకు సంబంధించినంత వరకూ, పెట్టుబడిలో ఒక భాగం నిశ్చలంగానూ, మరో భాగం చలనశీలంగానూ లేదా చలామణి అయ్యేదిగానూ కనిపిస్తాయి. ఒక నిర్ణీత పరిమాణంలో అడ్వాన్సు చేయబడిన విలువలు ఉత్పాదితానికి బదిలీ కావడమూ, ఆ ఉత్పాదితం అమ్మకం ద్వారా ఆ విలువలు భర్తీ కావడమూ రెండు సందర్భాల్లోనూ జరుగుతున్న విషయం. ఇక్కడ తేడా ఏమిటంటే, విలువ బదిలీ, విలువ భర్తీ కొద్ది కొద్దిగా, క్రమక్రమంగా జరుగుతుందా లేక ఒకేసారి మొత్తంగా జరుగుతుందా అన్నదొక్కటే. ఈ పద్ధతి వల్ల స్థిర, అస్థిర పెట్టుబడుల మధ్య వున్న సర్వ నిర్ణాయక భేదం తుడిచిపెట్టుకుపోతుంది. ఆ రకంగా అదనపు విలువ ఉత్పత్తి, పెట్టుబడిదారీ ఉత్పత్తి – ఈ రెంటి రహస్యం, కొన్ని విలువలను, ఆ విలువలకు ప్రతీకలైన కొన్ని వస్తువులను పెట్టుబడిగా మార్చివేసే పరిస్థితుల రహస్యం తుడిచి పెట్టుకుపోతుంది. అప్పుడు పెట్టుబడి యొక్క అంతర్భాగాలన్నింటినీ కేవలం వాటి చలామణి తీరును బట్టి వేరుచేసి చూపడం జరుగుతుంది. (సరుకుల చలామణి అప్పటికే వున్న విలువలకు మాత్రమే సంబంధించిన వ్యవహారమని వేరే చెప్పపని లేదు) వేతనాల కోసం వెచ్చించబడిన పెట్టుబడి శ్రమ పరికరాల కోసం వెచ్చించబడిన పెట్టుబడి భాగానికి భిన్నంగా, ముడి పదార్థాలు, సగం తయారైన ఉత్పాదితాలు, సహాయక పదార్థాల కోసం వెచ్చించబడిన పెట్టుబడి భాగంతో పాటు ఒక ప్రత్యేకమైన చలామణి పద్ధతిలో పాలుపంచుకుంటుంది.

"స్థిర, అస్థిర పెట్టుబడి" అభివర్గాలను "నిశ్చల, చలామణి పెట్టుబడి" అభివర్గాలుగా భావించిన ఆడమ్ స్మిత్ గందరగోళాన్ని బూర్జువా రాజకీయ అర్థశాస్త్రం సహజ ప్రేరణతో ఎందుకు అంటి పెట్టుకుందో తరతరాలుగా, విమర్శనారహితంగా ఎందుకు చిలకలా వల్లిస్తూ వచ్చిందో, దీన్నిబట్టి

అర్థం చేసుకోవచ్చు. వేతనాలకై కేటాయించబడిన పెట్టుబడి భాగాన్ని, ముడి పదార్థాలకై కేటాయించబడిన పెట్టుబడి భాగానికి ఏ మాత్రమూ భిన్నమైనదిగా బూర్జువా అర్థశాస్త్రం చూడలేదు. ఈ పెట్టుబడి భాగానికి, స్థిర పెట్టుబడికి మధ్య తేడా అల్లా ఒక్క విషయంలోనే. అదీ లాంఛనప్రాయమైనది. ఉత్పాదితం వాటిని కాస్త కాస్త చలామణి చేస్తుందా, లేక మొత్తంగానా అన్నదాన్నిబట్టి మాత్రమే అవి వేరుచేసి చూపబడ్డాయి. ఆ రకంగా పెట్టుబడిదారీ ఉత్పత్తి వాస్తవ గమన క్రమాన్ని, తద్వారా పెట్టుబడిదారీ దోపిడీని అర్థం చేసుకోవడానికి గల ప్రాతిపదిక ఒక్క దెబ్బతో పాతిపెట్టబడింది. అది కేవలం, అడ్వాన్స్ చేయబడిన విలువలు పునఃప్రత్యక్షమయ్యే సమస్యగా కుదించబడింది.

స్మిత్ తదనంతర వకాల్తాదారుల్లో భావాల గందరగోళం, మనకు ఏ మాత్రం ఆందోళన కలిగించదు. కానీ స్మిత్ గందరగోళాన్ని విమర్శనా దృష్టి లేకుండా రికార్డో స్వీకరించడం స్మిత్ వకాల్తాదారుల గందరగోళంకన్నా, అసలు స్మిత్ గందరగోళంకన్నా కూడా ఆందోళన కలిగిస్తుంది. ఎందుకంటే, స్మిత్‌తో పోలిస్తే విలువ, అదనపు విలువల గురించిన రికార్డో విశ్లేషణ మరింత నిలకడైనదీ, నిశితమైనదీ. రికార్డో నిజంగా ఆడమ్ స్మిత్ బహిర్గత భావాలకు వ్యతిరేకంగా ఆయన అంతర్గత భావాలను సమర్థించాడు.

ఫిజియోక్రాట్లలో ఇలాంటి గందరగోళం కనిపించదు. వార్షిక అడ్వాన్స్‌లకు, తొలి అడ్వాన్స్‌లకు మధ్య వున్న తేడా పెట్టుబడి యొక్క, ముఖ్యంగా వ్యవసాయ పెట్టుబడి యొక్క విభిన్న అంతర్భాగాల పునరుత్పత్తికి పట్టే విభిన్న కాల వ్యవధులకు మాత్రమే సంబంధించినది. కాగా అదనపు విలువ ఉత్పత్తిపై వారి భావాలు ఈ తేడాలతో ప్రమేయం లేని వారి సిద్ధాంతంలోని ఒక భాగం. వారు దాన్ని తమ సిద్ధాంతంలోని ఒక పటుతర అంశంగా భావిస్తారు. అదనపు విలువ రూపొందేది పెట్టుబడి నుండి కాదనీ, పెట్టుబడిదారీ ఉత్పత్తికి ఒక ప్రత్యేక రంగమైన వ్యవసాయం నుండీనే అనీ వారి వివరణ.

రెండోది, అస్థిర పెట్టుబడి నిర్వచనంలోని అతి ముఖ్యాంశం (ఏ విలువల మొత్తాన్నయినా, పెట్టుబడిగా మార్చడానికి అతి ముఖ్యమైన అంశం) ఏమంటే, పెట్టుబడిదారు ఒక విలువను సృష్టించే శక్తికి, ఒక నిర్దిష్ట పరిమాణం గల (ఈ అర్థంలో స్థిర పరిమాణం గల) విలువను మార్పిడి చేస్తాడు. అంటే, విలువ ఉత్పత్తి, స్వయం విస్తరణలకు, ఒక విలువ పరిమాణాన్ని మార్పిడి చేస్తాడు. పెట్టుబడిదారు కార్మికునికి వేతనాలను డబ్బు రూపంలో చెల్లిస్తాడా, నిత్య జీవితావసర రూపంలో చెల్లిస్తాడా అన్నది ఈ ప్రాథమిక నిర్వచనాన్ని ప్రభావితం చేయదు. అది కేవలం పెట్టుబడిదారు అడ్వాన్స్ చేసిన విలువ అస్తిత్వ రూపాన్ని మారుస్తుంది. అది ఒక సందర్భంలో ఈ డబ్బు రూపంలో వుంటుంది. దానితో కార్మికుడు నిత్య జీవితావసర వస్తువుల్ని కొనుక్కుంటాడు. రెండో సందర్భంలో అది నిత్య జీవితావసర వస్తువుల రూపంలో వుంటుంది. అప్పుడు కార్మికుడు దాన్ని నేరుగా వినియోగం చేస్తాడు. అయితే అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ ఉత్పత్తి, డబ్బు రూపంలోనే కార్మికుని వేతనాలు చెల్లించబడతాయనే ఊహపై ఆధారపడి వుంది – చలామణి ప్రక్రియ ఉత్పత్తి ప్రక్రియను రంగం పైకి తెచ్చిందనేదీ, అందువల్ల ద్రవ్య వ్యవస్థ ఉందనేదీ ఆ ఉత్పత్తిలో గర్భితమైనట్లు. కానీ, అదనపు విలువ సృష్టికి (అడ్వాన్స్ చేయబడిన విలువల మొత్తం పెట్టుబడిగా మారడానికి) కారణం, వేతనాలను డబ్బు రూపంలో

చెల్లించడమో, లేదా వస్తు రూపంలో చెల్లించడమో కాదు. శ్రమ శక్తి కొనుగోలుకు మదుపు పెట్టిన పెట్టుబడీ కాదు. విలువను సృష్టించే శక్తికై విలువను మార్పిడి చేయడం, ఒక స్థిర పరిమాణాన్ని అస్థిర పరిమాణంగా మార్చడం అదనపు విలువ సృష్టికి మూల కారణం.

శ్రమ పరికరాల నిశ్చలత్వ తారతమ్యాలు వాటి మన్నిక స్థాయిని బట్టి వుంటాయి. కనుక అవి ఒక భౌతిక గుణాన్ని బట్టి వుంటాయి. ఇతర పరిస్థితుల్లో మార్పు లేనంత వరకూ, అవి నిశ్చల పెట్టుబడిగా వాటి మన్నికను బట్టి తొందరగానో, ఆలస్యంగానో అరిగిపోతాయి. తక్కువ కాలమో, ఎక్కువ కాలమో పనిచేస్తాయి. అయితే కేవలం ఈ భౌతిక గుణమైన మన్నిక కారణం వల్ల అవి నిశ్చల పెట్టుబడిగా పని చేస్తాయని అనుకోరాదు. లోహ కర్మాగారాల్లో ముడి పదార్థం, ఉత్పత్తి ప్రక్రియలో వాడే యంత్రాలంతగానూ మన్నికైనవే. ఈ యంత్రాల అంతర్భాగాలయిన తోలు, కలపలాంటి వాటికన్నా ఎక్కువ మన్నికైనవి. అయినప్పటికీ, ముడి పదార్థంగా వ్యవహరిస్తున్న లోహం చలామణి పెట్టుబడిలో భాగంగా వుంటుంది. కాగా అదే లోహంతో తయారైన శ్రమ పరికరం ఉపయోగించ బడినప్పుడు నిశ్చల పెట్టుబడిలో భాగమవుతుంది. కాబట్టి ఒక లోహం ఒకసారి నిశ్చల పెట్టుబడిలోనూ, మరోసారి చలామణి పెట్టుబడిలోనూ భాగం కావడం కారణం దాని పాదార్థిక, భౌతిక స్వభావమూ కాదు, లేదా అరిగిపోయే వేగం సాపేక్షంగా ఎక్కువా లేక తక్కువా అనేదీ కాదు. ఈ భేదానికి ఉత్పత్తి ప్రక్రియలో దాని పాత్ర కారణం; ఒక సందర్భంలో అది శ్రమ పదార్థంగానూ, మరో సందర్భంలో అది శ్రమ పరికరంగానూ వుండటం కారణం.

ఉత్పత్తి ప్రక్రియలో శ్రమ పరికరం పని చేయడానికి నిత్య నూతన శ్రమ ప్రక్రియల్లో అది సగటున ఎక్కువ కాలమో, తక్కువ కాలమో పని చేయగలిగి వుండాలి. దాని పని స్వభావం వల్లనే దాని నిర్మాణానికి వాడిన పదార్థం ఎంతో కొంత మన్నికైనదిగా ఉండాలి. అయితే ఆ పదార్థం యొక్క మన్నికే దాన్ని నిశ్చల పెట్టుబడిగా చేయజాలదు. అదే పదార్థం ముడి పదార్థంగా వ్యవహరించినప్పుడు, చలామణి పెట్టుబడి అవుతుంది. సరుకు పెట్టుబడికి, ఉత్పాదక పెట్టుబడికి మధ్య వున్న తేడాను చలామణి పెట్టుబడికి నిశ్చల పెట్టుబడికి మధ్య వున్న తేడాగా గందరగోళపడే అర్థశాస్త్రవేత్తలకు అదే యంత్రం, అదే పదార్థం ఉత్పాదితంగా వున్నప్పుడు చలామణి పెట్టుబడిగానూ, శ్రమ పరికరంగా వున్నప్పుడు నిశ్చల పెట్టుబడిగానూ కనిపిస్తుంది.

ఒక శ్రమ పరికరాన్ని నిశ్చల పెట్టుబడిగా చేసేది, దాని తయారీకి వాడిన పదార్థం యొక్క మన్నిక గుణం కానప్పటికీ, శ్రమ పరికరంగా దాని పాత్రను బట్టి అది సాపేక్షంగా మన్నికైన పదార్థంతో తయారు చేయబడాలి. కాబట్టి శ్రమ పరికరంగా అది పనిచేయడానికి ఆ పదార్థం మన్నిక ఒక అవసరం. కనుక దాన్ని నిశ్చల పెట్టుబడిగా చేస్తున్న చలామణి తీరుకు భౌతిక పునాది. మిగిలిన విషయాల్లో తేడా లేనప్పుడు, దాని నిర్మాణ పదార్థం అరుగుదల యొక్క తరతమ స్థాయిలు దాని నిశ్చలత్వ తరతమ స్థాయిలను నిర్ణయిస్తుంది. కనుక అరుగుదల స్థాయి నిశ్చల పెట్టుబడిగా వుండే గుణంతో సన్నిహితంగా ముడిపడి వుంది.

శ్రమ శక్తికై మదుపు పెట్టిన పెట్టుబడిని పూర్తిగా చలామణి దృష్టితో మాత్రమే పరిశీలిస్తే, కాబట్టి నిశ్చల పెట్టుబడికి అది భిన్నమైనదనే దృష్టితో పరిశీలిస్తే, తత్పర్యవసానంగా స్థిర, అస్థిర

పెట్టుబడుల మధ్య వున్న తేడాను నిశ్చల, చలామణి పెట్టుబడుల మధ్య వున్న తేడాగా గందరగోళ పరిస్తే, అప్పుడు (శ్రమ పరికరం యొక్క పాదార్థిక వాస్తవికత నిశ్చల పెట్టుబడి లక్షణానికి అత్యవసరమైన ఆధారమన్న భావంతో) నిశ్చల పెట్టుబడికి భిన్నంగా, దాని చలామణి లక్షణం శ్రమ శక్తి కోసం మదుపు పెట్టబడిన పెట్టుబడి యొక్క పాదార్థిక వాస్తవికత నుండి నిష్పన్నమైందని తేల్చడం సహజమే. అలాగే, అస్థిర పెట్టుబడి పాదార్థిక వాస్తవికతతో చలామణి పెట్టుబడిని నిర్ణయించడం కూడా సహజమే.

వేతనాల కోసం వెచ్చించే పెట్టుబడి నిజమైన సారాంశం శ్రమే. అది క్రియాశీలమైనదీ, విలువను సృష్టించేదీ అయిన శ్రమ శక్తి, సజీవ శ్రమ. దాన్ని పెట్టుబడిదారు పదార్థ రూపం ధరించిన మృత శ్రమతో మార్పిడి చేస్తాడు. దాన్ని తన పెట్టుబడిలో చేర్చుకుంటాడు. తద్వారా మాత్రమే అతని చేతిలో వున్న విలువ స్వయం విస్తరణశీలమైన విలువగా మారుతుంది. అయితే ఈ స్వయం విస్తరణ శక్తిని పెట్టుబడిదారు అమ్మడు. అది అతని ఉత్పాదక పెట్టుబడిలో, అతని శ్రమ పరికరాలలాగానే ఎల్లప్పుడూ ఒక అంతర్భాగం మాత్రమే. అతడు అమ్మే పూర్తి తయారైన ఉత్పాదితంలా, అది ఎన్నడూ సరుకు పెట్టుబడి కాదు. ఉత్పాదక ప్రక్రియలో ఉత్పాదక పెట్టుబడి అంశాలుగా శ్రమ పరికరాలు శ్రమ శక్తికి వ్యతిరేకంగా నిశ్చల పెట్టుబడి పాత్ర నిర్వహించవు. అలాగే, శ్రమ పదార్థాలు, సహాయక పదార్థాలు చలామణి పెట్టుబడిగా శ్రమ శక్తితో మమేకం కావు. ఇక్కడ శ్రమ శక్తి వస్తువు అంశాలైన ఆ రెండింటికీ మానుషాంశంగా సమ్ముఖీనమవుతుంది. కాగా అవి భౌతిక అంశాలు – శ్రమ ప్రక్రియ దృక్కోణం నుంచి చూస్తే ఇదీ పరిస్థితి. విలువ స్వయం విస్తరణ ప్రక్రియ దృష్టితో చూస్తే అవి రెండూ అస్థిర పెట్టుబడి అయిన శక్తికి భిన్నంగా స్థిర పెట్టుబడిగా వ్యవహరిస్తాయి. లేక, ఇక్కడ పాదార్థిక భేదాన్ని, అది చలామణి ప్రక్రియను ప్రభావితం చేసే మేరకు పేర్కొనాలంటే, ఇలా చెప్పాల్సి వుంటుంది. విలువ పదార్థ రూపం ధరించిన శ్రమ తప్ప మరొకటి కాదు. క్రియాశీల శ్రమశక్తి పదార్థ రూపం ధరించే ప్రక్రియలోని శ్రమ తప్ప మరేమీ కాదు. పై విలువ స్వభావాన్ని క్రియాశీల శ్రమశక్తి స్వభావాన్ని బట్టి, శ్రమశక్తి పని చేస్తున్నప్పుడు, విలువను, అదనపు విలువను నిరంతరాయంగా సృష్టిస్తుందని తెలుతుంది; శ్రమ శక్తి విషయంలో చలనంగా, విలువను సృష్టించే ప్రక్రియగా కనిపించేది నిశ్చలంగా వున్న ఉత్పాదితం విషయంలో, సృష్టింపబడిన విలువగా కనిపిస్తుందని కూడా తేలుతుంది. శ్రమ శక్తి తన పనిని నిర్వహించి వుంటే, పెట్టుబడి ఇక ఏమాత్రం ఒకవైపున శ్రమశక్తిగానూ, రెండోవైపున ఉత్పత్తి సాధనాలుగానూ వుండదు. శ్రమశక్తిపైన మదుపు పెట్టిన పెట్టుబడి విలువ ఇప్పుడు, ఉత్పాదితానికి జత చేయబడిన విలువ (+ అదనపు విలువ). ఈ ప్రక్రియ పునరావృత్తం అయ్యేందుకు ఉత్పాదితాన్ని అమ్మాలి, వచ్చిన డబ్బుతో కొత్త శ్రమశక్తిని నిరంతరాయంగా కొనాలి. దాన్ని ఉత్పాదక పెట్టుబడిలో అంతర్భాగంగా చేయాలి. శ్రమశక్తిపై మదుపు పెట్టిన పెట్టుబడి భాగానికి, అలాగే శ్రమ పదార్థం వగైరాలపై మదుపు పెట్టిన పెట్టుబడి భాగానికి, శ్రమ పరికరాల్లో మిగిలి వున్న నిశ్చల పెట్టుబడికి భిన్నమైన చలామణి పెట్టుబడి లక్షణాన్ని చేకూర్చేది ఇదే.

అలాకాక, చలామణి పెట్టుబడి గురించిన అప్రధాన నిర్వచనం కిందికి శ్రమశక్తిపై మదుపు పెట్టిన పెట్టుబడి భాగంతో పాటు, స్థిర పెట్టుబడిలో ఒక భాగం (ముడి–సహాయక పదార్థాలు) కూడా వస్తుంది. అంటే శ్రమశక్తిపై వెచ్చించబడిన విలువ, తాను సంపూర్ణంగా వినియోగమైనందు

వల్ల తయారైన ఉత్పాదితానికి, నిశ్చల పెట్టుబడి విషయంలోలా కొద్దికొద్దిగా కాక, పూర్తిగా ఒకేసారి బదిలీ అవుతుంది. కనుక, ఉత్పాదితం అమ్మకం ద్వారా దాన్ని పూర్తిగా భర్తీ చేయాల్సి వుంటుందని చెప్పే నిర్వచనాన్ని శ్రమశక్తి మౌలిక నిర్వచనంగా చేస్తే, వేతనాలకై వెచ్చించబడిన పెట్టుబడి భాగం క్రియాశీల శ్రమశక్తిగా వుండదు. ఆ వేతనాలతో కార్మికుడు కొనే పదార్థాల రూపంలో వుంటుంది. అంటే సమాజపు సరుకు పెట్టుబడిలో కార్మికుని వినియోగంలోకి వెళ్ళే భాగంగా, అంటే నిత్య జీవితావసరాలుగా వుంటుందన్న మాట. ఆ సందర్భంలో, నిశ్చల పెట్టుబడి మరింత నెమ్మదిగా నశించే శ్రమ పరికరాలుగా వుంటుంది. కనుక అది నెమ్మదిగానే భర్తీ అవుతుంది. శ్రమశక్తిపై వెచ్చించబడిన పెట్టుబడి నిత్య జీవితావసర వస్తువులుగా వుంటుంది కనుక అది మరింత త్వరితంగా భర్తీ కావాల్సి వుంటుంది.

అయితే త్వరితంగా చెడిపోవడానికి, ఆలస్యంగా చెడిపోవడానికి మధ్య సరిహద్దు రేఖ చాలా అనిశ్చితమైనదీ, అస్పష్టమైనదీ.

"కార్మికుడు వినియోగం చేసే ఆహారం, బట్టలు, అతను పనిచేసే భవనాలు, అతని శ్రమకు తోడ్పడే పరికరాలు ఇవన్నీ నశించిపొయ్యేవే. అయితే ఈ విభిన్న పెట్టుబడులు నిలిచివుండే కాల వ్యవధుల మధ్య ఎంతో వ్యత్యాసం వుంది. ఒక ఓడకంటే ఆవిరి యంత్రం ఎక్కువ కాలం వుంటుంది. ఒక ఓడ కార్మికుని బట్టకంటే ఎక్కువ కాలం వుంటుంది. అతడు కట్టే బట్ట అతని ఆహార పదార్థాల కంటే ఎక్కువ కాలం వుంటుంది."[1]

కార్మికుడు నివసించే ఇంటిని, అతని ఫర్నీచర్‌ని, కత్తులు, ఫోర్కులు, పాత్రలు మొదలైన అతని వినియోగ పరికరాలను పేర్కొనడం రికార్డో మర్చిపోతున్నాడు. శ్రమ పరికరాలుగా వాటన్నింటికీ ఒకేలాంటి మన్నిక గుణం వుంది. అవే వస్తువులు, అదే తరహా వస్తువులు ఒకచోట వినియోగ వస్తువులుగానూ, మరోచోట శ్రమ పరికరాలుగానూ కనిపిస్తాయి.

రికార్డో చెప్పే తేడా ఇది : "పెట్టుబడి త్వరితగతిని అంతమై, దాన్ని తరచుగా పునరుత్పత్తి చేయవలసి వుంటుందా లేక నెమ్మదిగా వినియోగం అవుతుందా అన్నదాన్ని బట్టి, అది చలామణి పెట్టుబడిగా లేదా నిశ్చల పెట్టుబడిగా వర్గీకరించబడుతుంది."[2]

ఆయన దీనికి ఈ వ్యాఖ్యను చేర్చాడు. "అవసరం లేని విభజన, వేరుపరచే రేఖను ఖచ్చితంగా గీయవీలులేని విభజన."[3]

ఆ రకంగా మనం ఆనందంగా మళ్ళీ ఫిజియోక్రాట్ల శిబిరానికి చేరుకున్నాం. వారి దృష్టిలో కూడా వార్షిక అడ్వాన్స్‌లు, తొలి అడ్వాన్స్‌ల మధ్య వున్న తేడా వినియోగ కాలానికి సంబంధించింది. అలాగే వినియోగించబడిన పెట్టుబడి పునరుత్పత్తికి పట్టే విభిన్న కాలాలకు సంబంధించింది కూడా. అయితే వారికి సంబంధించినంత వరకూ అది సామాజిక ఉత్పత్తిలోని ఒక ప్రధాన పరిణామం; వారి అర్థశాస్త్ర పట్టికలో చలామణి ప్రక్రియకు సంబంధించి వివరించబడిన విషయం. కానీ ఇక్కడది ఒక ఆత్మాశ్రయ విషయమైంది; రికార్డో మాటల్లో చెబితే, మనకు అవసరమైన తేడా అయింది.

---

1. రికార్డో Principles etc (ప్రిన్సిపుల్స్ వగైరా)... పుట 26.
2. అదే గ్రంథం.
3. అదే గ్రంథం.

శ్రమ కోసం మదుపు పెట్టబడిన పెట్టుబడి భాగం కేవలం తన పునరుత్పత్తి కాలం విషయం లోనూ, అందువల్ల తన చలామణి కాలం విషయంలోనూ మాత్రమే శ్రమ పరికరాలకై మదుపు పెట్టిన పెట్టుబడి భాగానికి భిన్నంగా వున్నప్పుడు, ఒక భాగం నిత్యావసర వస్తువులుగానూ, మరో భాగం శ్రమ పరికరాలుగానూ వుండి, మొదటిది, రెండవ వాటికన్నా తొందరగా నశించిపోవడ మొక్కటే రెంటి మధ్యగల భేదమయినప్పుడు, (మొదటి వస్తు సముదాయంలోనే మన్నిక గుణం వివిధ స్థాయిల్లో వున్నప్పుడు) శ్రమశక్తిపై మదుపు పెట్టిన పెట్టుబడికి, ఉత్పత్తి సాధనాలపై మదుపు పెట్టిన పెట్టుబడికి మధ్య ప్రత్యేక భేదాలన్నీ సహజంగానే తుడిచిపెట్టుకుపోతాయి.

ఇది రికార్డో విలువ సిద్ధాంతానికీ, అలాగే లాభం గురించిన అతని సిద్ధాంతానికీ పూర్తిగా విరుద్ధమైనది. లాభం గురించిన అతని సిద్ధాంతం వాస్తవంలో అదనపు విలువను గురించిన ఒక సిద్ధాంతమే. నిశ్చల, చలామణి పెట్టుబడులు విభిన్న ఉత్పత్తి శాఖల్లో సమానమైన పెద్ద మొత్తాల్లో వేరు వేరు నిష్పత్తుల్లో మదుపు పెట్టబడినందువల్ల, వాటి భిన్న నిష్పత్తులు విలువ సిద్ధాంతాన్ని ప్రభావితం చేసిన మేరకు ప్రత్యేకించి ఈ పరిస్థితుల ఫలితంగా వేతనాల పెరుగుదల, తరుగుదలలు ధరలను ప్రభావితం చేసిన మేరకు మాత్రమే రికార్డో నిశ్చల, చలామణి పెట్టుబడుల మధ్య వున్న భేదాన్ని పరిగణనకు తీసుకొంటున్నాడు. అయితే ఈ అత్యంత పరిమితమైన పరిశీలనలో సైతం, ఆయన దారుణమైన పొరపాట్లు చేస్తాడు. ఆయన నిశ్చల చలామణి పెట్టుబడులను స్థిర, అస్థిర పెట్టుబడులుగా గందరగోళపడటమే దానికి కారణం. నిజానికి ఆయన తన విశ్లేషణను పూర్తిగా తప్పు పునాదిపై ప్రారంభిస్తాడు. మొదటిది, శ్రమ శక్తికై కేటాయించబడిన పెట్టుబడి విలువ భాగాన్ని ఆయన చలామణి పెట్టుబడిగా వర్గీకరించవలసివచ్చినందువల్ల చలామణి పెట్టుబడి నిర్వచనాలనే పొరపాటుగా రూపొందించాడు. ముఖ్యంగా, శ్రమకై వ్యయం చేసిన పెట్టుబడిని చలామణి పెట్టుబడి పద్దు కిందికి తెచ్చే పరిస్థితుల విషయంలో పొరపాటు చేశాడు. రెండోది, శ్రమ కోసం మదుపు పెట్టిన అస్థిర పెట్టుబడి అని చెప్పే నిర్వచనాన్ని, అది నిశ్చల పెట్టుబడికి భిన్నమైన చలామణి పెట్టుబడి అని చెప్పే నిర్వచనాన్ని, ఒకదాని కొకటి గందరగోళపరుస్తున్నాడు.

శ్రమశక్తిపైన వెచ్చించబడిన పెట్టుబడి చలామణి, లేదా చలనశీల పెట్టుబడి అనే నిర్వచనం ప్రధానమైనది కాదు. అది ఉత్పత్తి ప్రక్రియలో దాని ప్రత్యేక భేదాన్ని తుడిచిపెట్టివేస్తుందని మొదటే స్పష్టమవుతోంది. ఎందుకంటే ఈ నిర్వచనంలో ఒకవైపున శ్రమ కోసం మదుపు పెట్టబడిన పెట్టుబడులు ముడిపదార్థాలు మొదలైన వాటిపై పెట్టబడిన పెట్టుబడులంతటి ప్రాధాన్యం కలిగినవి. ఈ రకంగా, స్థిర పెట్టుబడిలోని ఒక భాగం అస్థిర పెట్టుబడి లాంటిదే అని చెప్పే వర్గీకరణ స్థిర పెట్టుబడికి వ్యతిరేకంగా అస్థిర పెట్టుబడికి వున్న ప్రత్యేక తేడాను వివరించదు. ఈ వర్గీకరణ ప్రకారం, శ్రమపై వెచ్చించబడిన పెట్టుబడి భాగాలు శ్రమ పరికరాలపై వెచ్చించబడిన భాగాలకు భిన్నమైనవే కానీ, అభిన్నత్వం వున్నది, ఈ రెండు భాగాలు విలువ ఉత్పత్తిలో విభిన్న తరహాల్లో ప్రవేశించడంలో కాదు, ఈ రెండూ ఉత్పాదితానికి విభిన్న కాల వ్యవధుల్లో తమ విలువను బదిలీ చేయడంలోనే.

ఈ అన్ని సందర్భాల్లోనూ, సరుకుల ఉత్పత్తి ప్రక్రియలో వెచ్చించిన ఒక నిర్దిష్ట విలువ, అది వేతనాలు కావచ్చు, ముడి పదార్థాల ధర కావచ్చు లేదా శ్రమ పరికరాల ధర కావచ్చు, ఉత్పాదితానికి ఎలా బదిలీ అయిందీ, ఉత్పాదితం దాన్ని ఎలా చలామణిలో వుంచిందీ, ఉత్పాదితం అమ్మకం ద్వారా

అది తిరిగి తన ప్రారంభ స్థానానికి ఎలా వచ్చిందీ లేదా ఎలా భర్తీ అయ్యిందీ అన్నది చర్చనీయాంశం. తేడా అల్లా "ఎలా" అనేదే. ఈ విలువ ఏ తీరులో బదిలీ అయిందీ, కాబట్టి ఏ తీరున చలామణీ అయిందీ అనేదే.

ప్రతి సందర్భంలో ఒప్పందం ముందే నిర్దేశించిన శ్రమశక్తి ధర డబ్బు రూపంలో చెల్లించబడిందా, లేక నిత్య జీవితావసర వస్తువుల రూపంలోనా అన్నది. అదొక స్థిరమైన ధరగా స్థితిని మార్చదు. అయితే, డబ్బు రూపంలో వేతనాలు చెల్లించబడినప్పుడు ఉత్పత్తి ప్రక్రియలో ఉత్పత్తి సాధనాల విలువా, పదార్థమూ కూడా ప్రవేశించినట్లుగా స్వయంగా డబ్బు ప్రవేశించదు. అయితే కార్మికుడు తన వేతనాలతో కొనుగోలు చేసే నిత్యజీవితావసర వస్తువులను ముడి పదార్థాలు వగైరాతో పాటు చలామణి పెట్టుబడి యొక్క పాదార్థిక రూపంగా వర్గీకరించి, శ్రమ పరికరాలకు భిన్నమైనవిగా చూపితే, అప్పుడు విషయానికి మరో లక్షణం వస్తుంది. ఈ వస్తువుల, అంటే ఉత్పత్తి సాధనాల విలువ శ్రమ ప్రక్రియలో ఉత్పాదితానికి బదిలీ అయితే, మిగిలిన వస్తువుల, అంటే నిత్య జీవితావసర వస్తువుల విలువ వాటిని వినియోగించిన శ్రమశక్తిలో పునఃప్రత్యక్షమై, ఆ శక్తి పనిచేయడం ద్వారా ఉత్పాదితానికి బదిలీ అవుతుంది. ఈ రెండు సందర్భాల్లోనూ, సమస్య, ఉత్పత్తి కాలంలో అడ్వాన్స్ చేయబడిన విలువలు ఉత్పాదితంలో కేవలం పునఃప్రత్యక్షం కావడమే. (ఫిజియోక్రాట్లు దీన్ని అక్షరాలా నిజమనుకొన్నారు. కనుక పారిశ్రామిక శ్రమ అదనపు విలువను సృష్టిస్తుంది అన్న విషయాన్ని వారు తిరస్కరించారు.) ఉదాహరణకు, ఇంతకు ముందు వేలాండ్ నుండి ఉల్లేఖించిన గ్రంథ భాగంలో ఇలా వుంది.[1] "కాని, రూపానికి ఏమీ ప్రాధాన్యం లేదు.... మానవుడి ఉనికికీ, సౌకర్యానికీ అవసరమైన వివిధ రకాల ఆహారమూ, బట్టలు, ఇల్లు అన్నీ కూడా మారతాయి. అవి ఎప్పటికప్పుడు వినియోగం అవుతాయి. వీటి విలువ పునఃప్రత్యక్ష మవుతుంది...." Elements of Political Economy (ఎలిమెంట్స్ ఆఫ్ పొలిటికల్ ఎకానమీ, పుటలు 31, 32) ఉత్పత్తి సాధనాల, జీవితావసర వస్తువుల రూపంలో ఉత్పత్తి కోసం అడ్వాన్స్ చేయబడిన పెట్టుబడి విలువలు ఉత్పాదితం విలువలో ఇక్కడ సమంగా పునఃప్రత్యక్షమవుతాయి. ఆ రకంగా, ఏ చిక్కులేకుండా, పెట్టుబడిదారీ ఉత్పత్తి ప్రక్రియ పూర్తి నిగూఢ వ్యవహారంగా మార్చబడింది. ఉత్పాదితంలో వుండే అదనపు విలువ పుట్టుక దృష్టి నుంచి పూర్తిగా తప్పించబడింది.

అంతేగాక, ఇది బూర్జువా రాజకీయ అర్థశాస్త్రానికి ప్రత్యేక లక్షణమైన వస్త్వారాధనను పూర్తి చేస్తుంది. సామాజిక ఉత్పత్తి ప్రక్రియలో వస్తువులపై ముద్రితమైన సామాజిక ఆర్థిక లక్షణాన్ని ఆ వస్తువుల పాదార్థిక స్వభావం నుంచి తలెత్తే సహజ లక్షణంగా ఈ మూఢారాధన మారుస్తుంది. ఉదాహరణకు "శ్రమ పరికరాలు నిశ్చల పెట్టుబడి" అనేది ఒక పండితవాద నిర్వచనం. అది వైరుధ్యాలకు, గందరగోళానికి దారితీస్తుంది. ఒక నిర్దిష్ట శ్రమ ప్రక్రియలో ఆయా పాదార్థిక భాగాలు నిర్వహించే పాత్రపైన, అంటే వాటి పనిపైన, అవి శ్రమ పరికరాలుగా వ్యవహరిస్తున్నాయా, శ్రమ పదార్థాలుగా లేక ఉత్పాదితాలుగా వ్యవహరిస్తున్నాయా అనేది ఆధారపడి వుంటుందని మనం శ్రమ ప్రక్రియ సందర్భంగా (పెట్టుబడి సం. I, అధ్యాయం–VII) నిరూపించినట్లుగానే, ఉత్పత్తి ప్రక్రియ

1. కారల్ మార్క్స్ పెట్టుబడి, సంపుటి - I - సం.

నిజంగా పెట్టుబడిదారీ ఉత్పత్తి ప్రక్రియ అయినప్పుడు మాత్రమే ఆ కారణాన, ఉత్పత్తి సాధనాలు నిజంగా పెట్టుబడి అయినప్పుడు మాత్రమే, వాటికి ఆర్థిక నిర్దిష్టత, పెట్టుబడి యొక్క సామాజిక స్వభావం వున్నప్పుడు మాత్రమే శ్రమ పరికరాలు నిశ్చల పెట్టుబడి అవుతాయి. రెండోది, అవి తమ విలువను ఉత్పాదితానికి ఒక ప్రత్యేక పద్ధతిలో బదిలీ చేసినప్పుడు మాత్రమే నిశ్చల పెట్టుబడి అవుతాయి. అలా కాకుంటే అవి నిశ్చల పెట్టుబడి కాకుండానే కేవలం శ్రమ పరికరాలుగా వుంటాయి. అదే విధంగా ఎరువులాంటి సహాయక పదార్థాలు శ్రమ పరికరాల్లో ప్రధాన భాగంగానే ఒక ప్రత్యేక తరహాలో విలువను బదిలీ చేసినప్పుడు అవి శ్రమ పరికరాలు కాకున్నా, నిశ్చల పెట్టుబడి అవుతాయి. ఇక్కడ సమస్య వస్తువులను నిర్వచనాలకు అనుగుణంగా ఉండేలా చూడటం కాదు. ఇది నిర్దిష్ట విధులకు సంబంధించిన వ్యవహారం. కనుక వాటిని నిర్దిష్ట అభివర్గాల్లో వ్యక్తం చేయాలి.

వేతనాల కోసం వెచ్చించిన పెట్టుబడిగా వుండటం నిత్య జీవితావసరాల గుణాల్లో ఒకటి అని భావిస్తే "శ్రమను పోషించేవిగా" వుండటం కూడా ఈ "చలామణి" పెట్టుబడి గుణాల్లో ఒకటవుతుంది. (రికార్డో, పుట 25) నిత్య జీవితావసర వస్తువులు 'పెట్టుబడి' కాకుంటే అవి శ్రమశక్తిని పోషించవు. కాగా పెట్టుబడిగా వుండే వాటి గుణమే పరాయి శ్రమతో పెట్టుబడిని పోషించే శక్తిని వాటికి సమకూరుస్తుంది.

చలామణి పెట్టుబడి వేతనాలుగా మారిన తర్వాత నిత్య జీవితావసర వస్తువులు చలామణి పెట్టుబడి అయితే వేతనాల పరిమాణం కార్మికుల సంఖ్యకూ, చలామణి పెట్టుబడికీ మధ్య వున్న నిష్పత్తిపై ఆధారపడి వుంటుందని నిర్ధారణ అవుతోంది. ఇది చాలా అభిమానపాత్రమైన ఆర్థిక ప్రతిపాదన. కాగా నిజానికి మార్కెట్ నుండి కార్మికుడు తీసేసుకున్న నిత్య జీవితావసర వస్తువుల పరిమాణం పెట్టుబడిదారుడి వినియోగానికి లభించే జీవితావసర వస్తువుల పరిమాణం అదనపు విలువకీ, శ్రమ ధరకీ మధ్య వుండే నిష్పత్తిపై ఆధారపడి వుంటాయి.

బార్టన్[1] లాగానే, రికార్డో కూడా ప్రతిచోటా స్థిర, అస్థిర పెట్టుబడుల సంబంధాన్ని నిశ్చల, చలామణి పెట్టుబడుల సంబంధంతో గందరగోళ పరుస్తాడు. లాభం రేటుపై ఆయన పరిశోధనను ఇది ఎంతవరకూ పాడు చేస్తుందో తర్వాత పరిశీలిద్దాం.[2]

అంతేకాదు. స్థిర, చలామణి పెట్టుబడుల మధ్య గల తేడా వల్ల కాక, ఇతర కారణాల వల్ల టర్నోవర్‌లో తలెత్తే తేడాలను స్థిర, చలామణి పెట్టుబడుల మధ్య తేడాగానే రికార్డో చెబుతున్నాడు. "చలామణి పెట్టుబడి చాలా అసమాన కాల వ్యవధుల్లో చలామణి కావచ్చు, దాని యజమానికి తిరిగి రావచ్చు అని కూడా గోచరిస్తుంది. విత్తడం కోసం ఒక వ్యవసాయదారు కొన్న గోధుమ, రొట్టెల కార్ఖానాదారు రొట్టెలు చేయడానికి కొన్న గోధుమతో పోలిస్తే నిశ్చల పెట్టుబడి. వ్యవసాయదారు భూమిలో విత్తుతాడు. ఏడాదిపాటు అతను ఏ ప్రతిఫలాన్ని పొందడు. రెండోవాడు దాన్ని పిండిగా మార్చి ఖాతాదారులకు రొట్టెగా సరఫరా చేస్తాడు. ఆ రకంగా రొట్టె కార్ఖానాదారుని పెట్టుబడి విడుదల

1. అబ్జర్వేషన్స్ ఆన్ ది సర్కమ్‌స్టెన్సెస్ విచ్ ఇన్‌ఫ్లుయెన్స్ ది కండిషన్ ఆఫ్ ది లేబరింగ్ క్లాసెస్ ఆఫ్ సొసైటీ, లండన్ 1817. దీనిలో సందర్భోచితమైన భాగం పెట్టుబడి సంపుటి I లో ఉల్లేఖించబడింది.

2. కారల్ మార్క్స్, పెట్టుబడి, సంపుటి - III, అధ్యాయం 3 - సం.

అవుతుంది. అతను దానితో ఒక వారంలో అదే ప్రక్రియను మళ్ళీ ప్రారంభించవచ్చు లేదా మరేదో విధంగా ఉపయోగించవచ్చు."[1]

ఇక్కడో విశేషముంది. గోధుమను విత్తినప్పుడు అది నిత్యజీవితావసర వస్తువుగా కాక, ముడి పదార్థంగా ఉపయోగపడుతున్నప్పటికీ, స్వయంగా నిత్య జీవితావసర వస్తువే అయినందువల్ల, మొదటి విషయం, అది చలామణి పెట్టుబడి. తిరిగి రావడానికి ఏడాది పడుతుంది కనుక, రెండవ విషయం, అది నిశ్చల పెట్టుబడి కూడా. అయితే అంతో ఇంతో నెమ్మదిగా, లేక శీఘ్రంగా తిరిగి రావడమన్న దాన్ని బట్టి మాత్రమేగాక, తన విలువను ఉత్పాదితానికి ఏ నిర్దిష్ట రీతిలో బదిలీ చేస్తుంది అన్నదాన్ని బట్టి, అది ఉత్పత్తి సాధనం యొక్క నిశ్చల పెట్టుబడి అవుతుంది.

ఆడమ్ స్మిత్ సృష్టించిన గందరగోళం ఈ కింది ఫలితాలకు దారితీసింది.

1. నిశ్చల, చలామణి పెట్టుబడుల మధ్య వున్న తేడా ఉత్పాదక పెట్టుబడికి, సరుకు పెట్టుబడికి మధ్య తేడాగా గందరగోళమైంది. ఉదాహరణకు ఒక యంత్రం మార్కెట్‌లో సరుకుగా వున్నప్పుడు చలామణి పెట్టుబడిగానూ, ఉత్పత్తి ప్రక్రియలో వున్నప్పుడు నిశ్చల పెట్టుబడిగానూ పరిగణించ బడుతుంది. అంతేకాదు ఒక తరహా పెట్టుబడి మరో తరహా పెట్టుబడికంటే మరింత నిశ్చలంగానో లేదా మరింత చలామణిలోనో ఎందుకుంటుందో తెలుసుకోవడం పూర్తిగా అసాధ్యం.

2. చలామణి పెట్టుబడినంతా, వేతనాలకై వ్యయమైన లేదా వ్యయం కానున్న పెట్టుబడిగా నిర్ణయించారు. ఇది జాన్ స్టువార్ట్ మిల్[2] మొదలైన వారికి వర్తిస్తుంది.

3. స్థిర, అస్థిర పెట్టుబడుల మధ్య తేడాను బార్టన్, రికార్డో మొదలైన వారంతా నిశ్చల, చలామణి పెట్టుబడుల మధ్య వున్న తేడాగా అపోహపడ్డారు. చివరికి అది ఆఖరున పేర్కొన్న ఈ తేడాగా కుదించారు : అదేమంటే (ఉదాహరణకు రామ్‌సే చెబుతున్నట్టు) ఉత్పత్తి సాధనాలు, ముడిపదార్థాలు, శ్రమ పరికరాలు మొదలైనవన్నీ నిశ్చల పెట్టుబడి; కేవలం వేతనాలకై వెచ్చించబడే పెట్టుబడి మాత్రమే చలామణి పెట్టుబడి.[3] కానీ ఈ కుదింపు ఈ రూపంలో జరిగింది కనుక స్థిర, అస్థిర పెట్టుబడుల మధ్య తేడాను వారు అర్థం చేసుకోలేదు.

4. బ్యాంక్ గుమాస్తాకున్న చెప్పరానంత సంకుచిత దృష్టితో, అన్ని విషయాలను పరిశీలించే మెక్‌లియోడ్,[4] పాటర్సన్[5] లాంటి తర్వాత కాలపు బ్రిటిష్, ముఖ్యంగా స్కాచ్ ఆర్థికవేత్తలు నిశ్చల, చలామణి పెట్టుబడుల మధ్య వున్న తేడాను నోటీస్ లేకుండా వెనక్కు తీసుకోగలిగిన డబ్బుకీ నోటీస్ లేకుండా వెనక్కు తీసుకో వీలులేని డబ్బుకీ మధ్య గల తేడాగా మార్చివేశారు.

★ ★ ★

1. ప్రిన్సిపుల్స్ ఎట్సెట్రా... పుటలు : 26, 27.
2. జె. స్టువర్ట్‌మిల్, ఎస్సే ఆన్ సమ్ అన్‌సెటిల్డ్ క్వెశ్చన్స్ ఆఫ్ పొలిటికల్ ఎకానమీ, లండన్, 1844 పుట 164).
3. జి. రామ్సే, యాన్ ఎస్సే ఆన్ ది డిస్ట్రిబ్యూషన్ ఆఫ్ వెల్త్, ఎడిన్‌బరో 1833, పుటలు 21-24.
4. హెచ్.డి. మెక్‌లియోడ్, ది ఎలిమెంట్స్ ఆఫ్ పొలిటికల్ ఎకానమీ, 1858, పుటలు, 76-80.
5. ఆర్.హెచ్. పాటర్సన్, ది సైన్స్ ఆఫ్ ఫైనాన్స్. ఎ ప్రాక్టికల్ ట్రిటైజ్, ఎడిన్‌బరో, లండన్, 1868, పుటలు 129-144. - సం.

## అధ్యాయం - 12

# పనికి పట్టే కాలం

సమానమైన పని దినాలు, ఉదాహరణకు పది గంటలు పని దినాలు వున్న రెండు పారిశ్రామిక శాఖలను తీసుకుందాం : ఒకటి నూలుమిల్లు, రెండోది రైలు ఇంజన్ల కార్ఖానా. మొదటి శాఖలో ఒక నిర్దిష్ట పరిమాణం కలిగిన నూలు ప్రతి రోజూ లేదా ప్రతి వారం తయారవుతుంది. రెండో శాఖలో ఒక సంపూర్ణ ఉత్పాదితం, రైలు ఇంజను తయారు కావడానికి శ్రమ ప్రక్రియ బహుశా మూడు నెలల పాటు కొనసాగాల్సి రావచ్చు. మొదటిదాని విషయంలో ఉత్పాదితం స్వభావరీత్యా విడివిడిగా వుంటుంది. ప్రతి రోజూ, ప్రతి వారం అదే శ్రమ మళ్లీ ప్రారంభమవుతుంది. అయితే రెండోదానిలో శ్రమ ప్రక్రియ నిరంతరాయంగా వుంటుంది. దానిలో రోజువారీ శ్రమ ప్రక్రియలు అనేకం వుంటాయి. వాటి అంతస్సంబంధం వల్లనేమి, వాటి నిర్వహణ నిరంతరాయత వల్లనేమి పూర్తిగా తయారైన వస్తువు బయటపడడానికి చాలా కాలం పడుతుంది. ఇక్కడ రోజువారీ పనికాలం సమానమే అయినప్పటికీ, ఉత్పాదక కార్యానికి పట్టే కాలంలో గణనీయమైన తేడా వుంది. అంటే పూర్తిగా తయారైన ఉత్పాదితాన్ని బయటకు తేవడానికి అవసరమైన శ్రమ ప్రక్రియలకు పట్టే కాలంలో దాన్ని ఒక సరుకుగా మార్కెట్‌లో అమ్మడానికి, అంటే ఉత్పాదక పెట్టుబడి నుంచి సరుకు పెట్టుబడిగా మార్చడానికి పట్టే కాలంలో చాలా తేడా వుంది. దీనికి నిశ్చల, చలామణి పెట్టుబడుల మధ్య వున్న తేడాతో ప్రమేయం లేదు. ఒకే నిష్పత్తిలో రెండు శాఖల్లోనూ నిశ్చల, చలామణి పెట్టుబడులు పెట్టినప్పటికీ ఇక్కడ పేర్కొన్న తేడా వుంటుంది.

ఉత్పాదక క్రియకు పట్టే కాలంలో వున్న ఈ తేడాలు కేవలం విభిన్న ఉత్పత్తి శాఖల మధ్యనే గాక, ఒకే ఉత్పత్తి శాఖలో కూడా చూడవచ్చు. ఎంత పరిమాణంలో ఉత్పాదితం తయారవుతుంది అన్నదానిపై అది ఆధారపడి వుంటుంది. ఒక పెద్ద ఫ్యాక్టరీ కంటే ఒక మామూలు నివాస భవనం కట్టడానికి తక్కువ కాలం పడుతుంది. కనుక దానికి నిరంతరాయమైన శ్రమ ప్రక్రియలు తక్కువ అవసరమవుతాయి. ఒక రైలు ఇంజను తయారు చేయడానికి మూడు నెలలు పడితే ఒక యుద్ధ నౌకను తయారు చేయడానికి ఏడాది లేదా అంతకన్నా ఎక్కువ కాలం పట్టవచ్చు. ధాన్యం పండించడానికి ఒక ఏడాది పడుతుంది. పెద్ద పెద్ద పశువుల్ని పెంచడానికి కొన్ని సంవత్సరాలు పడుతుంది. కాగా కలప చెట్లు పెంచడానికి పన్నెండు నుంచి వందల సంవత్సరాల వరకూ పట్టవచ్చు. గ్రామసీమలో రోడ్డు వేయడానికి కొన్ని నెలలు చాలు. అదే రైలు మార్గం వేయడమన్నది కొన్ని ఏళ్ళ వ్యవహారం. మామూలు తివాచీ తయారు చేయడానికి ఒక వారం పడుతుంది. కానీ ఒక పట్టు జలతారు తెరకు సంవత్సరాలు అవసరం. ఇలా ఎన్నైనా ఉదాహరణలివ్వవచ్చు. కనక ఉత్పాదక కార్యానికి పట్టే కాల వ్యవధుల మధ్య అనంతమైన భేదాలు వున్నాయి.

మదుపు పెట్టబడిన పెట్టుబడులు సమానంగా వున్నప్పుడు ఈ ఉత్పాదక కార్యానికి పట్టే కాలాల్లో తేడా టర్నోవర్ వేగంలో తేడాకు కారణమవుతుంది. మరోలా చెప్పాలంటే, ఒకానొక పెట్టుబడి ఎంతకాలానికి అడ్వాన్స్ చేయబడినదో ఆ కాలంలో తేడాకు కారణం కాక తప్పదు. నూలు మిల్లు, రైలు ఇంజన్ కార్ఖానా ఒకే మొత్తాల్లో పెట్టుబడిని వినియోగిస్తాయని అనుకుందాం. అలాగే నిశ్చల, చలామణి పెట్టుబడుల మధ్య నిష్పత్తి, ఆ రెండు శాఖల పనిదిన పరిమాణం, దానిలోని అవసర, అదనపు శ్రమల విభజన సమానంగా వున్నాయని అనుకుందాం. ప్రస్తుత సందర్భానికి సంబంధం లేని, చలామణి ప్రక్రియలో తలెత్తే పరిస్థితులన్నింటినీ తొలగించడానికి నూలు, రైల్ ఇంజన్ కొనుగోలు ఆర్డర్ల ప్రకారం తయారవుతున్నాయనీ, ఉత్పాదితం తయారు కాగానే కొనుగోలుదారు వాటికి డబ్బు చెల్లిస్తాడనీ అనుకొందాం. తయారైన నూలుని అమ్మడం ద్వారా వారాంతంలో నూలు మిల్లు యజమాని చలామణి పెట్టుబడి కోసం మదుపు పెట్టిన మొత్తాన్ని (ఇక్కడ అదనపు విలువను పరిగణనలోకి తీసుకోవడంలేదు) తిరిగి పొందుతాడు. అలాగే నూలు విలువలో చేరిన నిశ్చల పెట్టుబడి అరుగుదలను కూడా తిరిగి పొందుతాడు. కనుక అతడు అదే ఆవృత్తిని అదే పెట్టుబడితో కొత్తగా ప్రారంభించగలడు. ఆ పెట్టుబడి తన టర్నోవర్‌ను పూర్తి చేసింది. అయితే, రైలు ఇంజన్ ఉత్పత్తిదారుడు వేతనాల కోసం, ముడి పదార్థాల కోసం వరుసగా మూడు నెలలపాటు ప్రతి వారం ఎప్పటికప్పుడు పెట్టుబడిని ఖర్చు చేయవలసి వుంటుంది. మూడు నెలల తర్వాత మాత్రమే, అంటే రైలు ఇంజనును సరఫరా చేసిన తర్వాత మాత్రమే, ఒకే ఉత్పాదక కార్యంలో, ఒకే సరుకు తయారీ కోసం క్రమంగా వ్యయం అయిన చలామణి పెట్టుబడి తిరిగి తన ఆవృత్తాన్ని పునఃప్రారంభించడానికి వీలైన రూపంలో మళ్ళీ వుంటుంది. ఈ మూడు నెలల కాలంలోనూ అతని యంత్రాల అరుగుదల కూడా ఇప్పుడే భర్తీ అవుతుంది. కనుక ఒకదానికి ఖర్చు ఒక వారంపాటు పెట్టబడుతుంది. రెండోదానికి పన్నెండు వారాల పాటు పెట్టబడుతుంది. కనుక మిగిలిన పరిస్థితులన్నీ సమానంగా వున్నాయనుకుంటే, మొదటివాని కంటే రెండోవాని దగ్గర పన్నెండు రెట్లు చలామణి పెట్టుబడి వుండాలి.

వారం వారం అడ్వాన్స్ చేసే పెట్టుబడులు సమానంగా వున్నాయనే దానితో ఇక్కడ ప్రమేయం లేదు. అడ్వాన్స్ చేయబడిన పెట్టుబడి మొత్తం ఎంతైనప్పటికీ, మొదటిదానిలో కేవలం ఒక వారానికి, రెండోదానిలో పన్నెండు వారాలకు అడ్వాన్స్ చేయబడింది. కాబట్టి పైన పేర్కొన్న ఈ కాల వ్యవధులు గడిస్తేనే ఆ పెట్టుబడి ఒక కొత్త కార్యానికి, అదే కార్యం పునరావృత్తికి లేదా వేరే కార్యం ప్రారంభించడానికి వినియోగించడం సాధ్యమవుతుంది.

టర్నోవర్ వేగంలో తేడా లేదా అడ్వాన్స్ చేసిన ఒక పెట్టుబడి విలువ కొత్త శ్రమ ప్రక్రియలోనో, లేక స్వయం విస్తరణ ప్రక్రియలోనో వినియోగించబడడానికి ముందు, దాన్ని అడ్వాన్స్ చేయాల్సిన కాలపరిమితిలో తేడా ఈ కింది పరిస్థితుల వల్ల తలెత్తుతుంది :

ఒక రైలింజన్ లేదా మరో యంత్రం తయారు కావడానికి వంద పనిదినాలు పడుతుందని అనుకుందాం. నూలు మిల్లులోనూ, రైల్ ఇంజన్ కార్ఖానాలోనూ పని చేసే కార్మికులకు సంబంధించి నంత మేరకు, వంద పని దినాలు అంటే, వరుసగా వంద విడి, విడి పది గంటల శ్రమ ప్రక్రియలన్న మాట. అయితే ఉత్పాదితమైన యంత్రానికి సంబంధించినంత వరకూ, ఈ వంద పని దినాలు ఒక నిరంతరాయమైన పరిమాణంగా ఒక వెయ్యి పని గంటల పనిదినంగా, ఒకే అనుసంధిత ఉత్పత్తి

కార్యంగా ఉంటాయి. అలాంటి పని దినాన్ని, అంటే వరుసగా, ఒకదానితో ఒకటి ముడిపడి వున్న పలు పనిదినాల మొత్తాన్ని నేను పనికి పట్టే కాలం అంటాను. మనం పని దినమని అంటున్నప్పుడు, కార్మికుడు రోజూ తమ శ్రమ శక్తిని ఖర్చు పెట్టాల్సిన కాలమని, ప్రతిరోజు పని చేయవలసిన కాలమనీ అర్థం. అయితే మనం పనికి పట్టే కాలం అంటున్నప్పుడు ఒక పారిశ్రామిక శాఖలో పూర్తిగా ఒక వస్తువును తయారు చేయడానికి పట్టే, పరస్పరం ముడిపడి వున్న పనిదినాల మొత్తమని మన అర్థం. ఈ సందర్భంలో ప్రతి పని దినం యొక్క ఉత్పాదితం పాక్షికమైనది మాత్రమే. ప్రతిరోజూ దానిపై పని జరగాలి. పనికి పట్టే కాలమంతా గడిచాకనే అది తన సంపూర్ణ రూపం పొందుతుంది; తయారైన ఉపయోగపు విలువగా ఉంటుంది.

అందువల్ల, సామాజిక ఉత్పత్తి ప్రక్రియలో సంక్షోభాల్లాంటి వాటి వల్ల ఏర్పడే అంతరాయాలూ, విడి విడి శ్రమ ప్రక్రియలు అవసరమైన ఉత్పాదితాలపైన, సుదీర్ఘమూ, పరస్పరం ముడిపడి వున్నవీ అయిన శ్రమ ప్రక్రియలు అవసరమైన ఉత్పాదితాలపైన వేర్వేరు ప్రభావాల్ని నెరుపుతాయి. ఒక సందర్భంలో జరిగేదేమంటే – ఒక నిర్దిష్ట పరిమాణం గల నూలు, బొగ్గు వగైరాల నేటి ఉత్పత్తి తర్వాత నూలు, బొగ్గు వగైరాల రేపటి ఉత్పత్తి కొనసాగదు అంతే. అయితే ఓడలు, భవనాలు, రైలు మార్గాలు వగైరాల విషయంలో అలా కాదు. ఇక్కడ కేవలం రోజు పని మాత్రమే గాక, పరస్పరానుసంధితమైన మొత్తం ఉత్పాదక కార్యానికి కూడా అంతరాయం కలుగుతుంది. పని కొనసాగించకపోతే, ఉత్పాదక సాధనాలు, అదివరకే వ్యయమైన శ్రమ వృధా అయిపోతాయి. పని తిరిగి మొదలుపెట్టినప్పటికీ, ఈలోగా జరిగిన పని పాడయిపోవడం అనివార్యం.

పనికి పట్టే కాలమంతటిలోనూ ఉత్పాదితానికి రోజువారీ బదిలీ అయ్యే నిశ్చల పెట్టుబడి విలువ ఉత్పాదితం తయారీ పూర్తయ్యేదాకా, ఒక విధంగా చెప్పాలంటే పొరలుగా పోగుపడుతుంది. ఇక్కడ నిశ్చల, చలామణి పెట్టుబడుల మధ్య వుండే తేడాకి గల ఆచరణాత్మక ప్రాధాన్యం అదే సమయంలో వెల్లడి అవుతుంది. ఉత్పత్తి ప్రక్రియలో నిశ్చల పెట్టుబడి సాపేక్షంగా దీర్ఘకాలానికి సరిపడా అడ్వాన్స్ చేయబడుతుంది. బహుశా కొన్ని సంవత్సరాల వరకూ దాన్ని పునరుద్ధరించాల్సిన అవసరం లేదు. ఒక ఆవిరి యంత్రం, విడివిడి శ్రమ ప్రక్రియల ఉత్పాదితమైన నూలుకి ప్రతిరోజూ తన విలువను కొద్ది కొద్దిగా బదిలీ చేస్తుందా లేక నిరంతరాయ ఉత్పాదక క్రియా ఫలితమైన రైలు ఇంజన్‌కి మూడునెలల పాటు బదిలీ చేస్తుందా అన్న అంశానికి, ఆవిరి యంత్రం కొనుగోలుకు వెచ్చించే పెట్టుబడికి సంబంధించినంత వరకు ప్రాధాన్యమేమీ లేదు. ఒక సందర్భంలో దాని విలువ, కాస్త కాస్త ఉదాహరణకు ప్రతి వారం కొంత తిరిగి చేతికందుతుంది. రెండో సందర్భంలో అది మరింత ఎక్కువ పరిమాణంలో, ఉదాహరణకు మూడు నెలలకొకసారి చేతికందుతుంది. ఈ రెండు సందర్భాల్లోనూ కూడా ఆవిరి యంత్రాన్ని పునరుద్ధరించడం ఇరవై ఏళ్ళ తర్వాతే జరగవచ్చు. ఉత్పాదితం అమ్మకం ద్వారా ఆవిరి యంత్రం విలువను కొద్ది కొద్దిగా తిరిగి అందజేసే ప్రతి కాల వ్యవధి ఇంజన్ జీవితకాలం కంటే తక్కువగా వున్నంత వరకూ ఉత్పత్తి ప్రక్రియలో ఆ ఇంజన్, పనికి పట్టే అనేక కాల వ్యవధుల పాటు పనిచేస్తూనే వుంటుంది.

అయితే, అడ్వాన్స్ చేయబడిన పెట్టుబడిలోని చలామణి భాగం సంగతి అలా వుండదు. ఒక నిర్దిష్ట వారానికి కొన్న శ్రమ శక్తి అదే వారంలో వ్యయమైన ఉత్పత్తిలో పదార్థ రూపం ధరిస్తుంది.

వారాంతంలో ఆ శ్రమశక్తికి డబ్బు చెల్లించాలి. ప్రతి వారం శ్రమశక్తికై పెట్టుబడిని మదుపు పెట్టడం, మూడు నెలలపాటు పదే పదే జరుగుతూ వుండాలి. కానీ ఒక వారంలో వ్యయమైన ఈ పెట్టుబడి భాగం మరుసటి వారం శ్రమ కొనుగోలుకు వీలుకల్పించదు. ప్రతి వారం శ్రమశక్తిని కొనుగోలు చేయడానికి అదనపు పెట్టుబడిని ఖర్చు చేయాల్సి వుంటుంది. పరపతి సమస్యను పక్కకు పెట్టి చూస్తే, పెట్టుబడిదారు మూడు నెలలపాటు వేతనాలకు డబ్బును కేటాయించాలి. అతను వేతనాలను వారం వారం చెల్లించినా ఇది తప్పదు. చలామణి పెట్టుబడిలోని మిగతా భాగమైన ముడి పదార్థాలు, సహాయక పదార్థాల విషయంలో కూడా ఇంతే. ఉత్పాదితంపైన ఒక శ్రమ దొంతర దొంతరులుగా పేరుకుంటుంది. కేవలం శ్రమశక్తికి వెచ్చించిన విలువ మాత్రమేగాక, అదనపు విలువ కూడా శ్రమ ప్రక్రియలో ఉత్పాదితానికి నిరంతరాయంగా బదిలీ అవుతూంటుంది. అయితే ఈ ఉత్పాదితం కూడా తయారైనది కాదు. దానికి పూర్తి సరుకు రూపం రాలేదు. కనుక అది ఇంకా చలామణి కాలేదు. ముడి, సహాయక పదార్థాల నుండి ఉత్పాదితానికి బదిలీ అయ్యే పెట్టుబడి విలువకు కూడా ఇదే వర్తిస్తుంది.

ఉత్పాదితం యొక్క ప్రత్యేక స్వభావాన్ని అనుసరించి లేదా దాని తయారీలో సాధించాల్సిన ఉపయోగకర ఫలితాన్ని అనుసరించి, పనికి పట్టే కాల పరిమాణాన్ని బట్టి ఒక నిరంతరాయమైన అదనపు చలామణి పెట్టుబడి మదుపు (వేతనాలు, ముడి సహాయక పదార్థాలు) అవసరం. దానిలో ఏ భాగమూ ఈలోగా చలామణి కాజాలదు. కనుక అదే ఉత్పాదన ప్రక్రియ పునఃప్రారంభానికి తోడ్పడజాలదు సరికదా, ప్రతి భాగమూ తయారవుతున్న ఉత్పాదితం యొక్క అంతర్భాగంగా ఉత్పత్తి రంగంలోనే ఉత్పాదక పెట్టుబడి రూపంలో అంటకరుచుకొని వుంటుంది. ఉత్పత్తి కాలమూ, చలామణి కాలమూ కలిపితే టర్నోవర్ కాలం అవుతుంది. కనుక ఉత్పత్తి కాలాన్ని పొడిగిస్తే, చలామణి కాలాన్ని పొడిగించిన సందర్భంలో లాగానే టర్నోవర్ వేగం తగ్గిపోతుంది. అయితే ప్రస్తుతం కింది రెండు అంశాలను దృష్టిలో పెట్టుకోవాల్సి వుంటుంది.

మొదటిది, ఉత్పత్తి రంగంలో దీర్ఘకాలం వుండడం. శ్రమ, ముడిపదార్థాలు వగైరాలకై మొదటి వారంలో అడ్వాన్స్ చేయబడిన పెట్టుబడి, ఉత్పాదితానికి నిశ్చల పెట్టుబడి బదిలీ చేసిన విలువ భాగాలూ మొత్తం మూడు నెలలపాటు ఉత్పత్తి రంగంలోనే వుండిపోతాయి. అంతవరకూ అవి ఇంకా తయారుకాని ఉత్పాదితంలో అంతర్భాగంగా వున్నందువల్ల సరుకులుగా చలామణిలో ప్రవేశించలేవు.

రెండోది, ఈ ఉత్పాదక కార్యం పూర్తి కావడానికి పట్టే కాల వ్యవధి మూడు నెలలు కాబట్టి, అది ఒకే నిరంతరాయమైన శ్రమ ప్రక్రియే కాబట్టి, ప్రతి వారం నిరంతరాయంగా ఒక కొత్త చలామణి పెట్టుబడి మొత్తాన్ని పాత మొత్తానికి జోడించాల్సి వుంటుంది. అందువల్ల పనికి పట్టే కాల వ్యవధితోపాటు, వరుసగా అడ్వాన్సు చేసే అదనపు పెట్టుబడి మొత్తం కూడా పెరుగుతుంది.

నూలు మిల్లుల్లోనూ, యంత్ర నిర్మాణ పరిశ్రమలోనూ సమానమైన పరిమాణంలో పెట్టుబడులు వున్నాయనీ, ఈ పెట్టుబడుల స్థిర, అస్థిర భాగాల విషయంలోనూ నిశ్చల, చలామణి పెట్టుబడుల భాగాల విషయంలోనూ నిష్పత్తులు రెండు శాఖల్లోనూ సమానంగా వున్నాయనీ, పని దినాల పరిమాణం కూడా సమానమనీ, క్లుప్తంగా చెప్పాలంటే, పనికి పట్టే కాల వ్యవధి తప్ప మిగిలిన అన్ని విషయాలు సమానంగా ఉన్నాయనీ భావించాం. మొదటి వారంలో పెట్టుబడి కేటాయింపు సమానంగానే వుంటుంది. అయితే నూలు మిల్లు యజమాని తన ఉత్పాదితాన్ని అమ్మి, తద్వారా వచ్చిన డబ్బుతో రెండో వారం

ప్రారంభంలోనే కొత్త శ్రమశక్తిని, కొత్త ముడి పదార్థాలు వగైరాలను కొనగలుగుతాడు. క్లుప్తంగా చెప్పాలంటే, అదే స్థాయిలో ఉత్పత్తి పునఃప్రారంభం కాగలదు. మరోవైపున, యంత్రం తయారుచేసే యజమాని తాను మొదటి వారంలో ఖర్చు పెట్టిన చలామణి పెట్టుబడిని మూడు నెలల వరకూ, తన ఉత్పాదితం పూర్తిగా తయారయ్యే వరకు తిరిగి డబ్బుగా మార్చలేడు. అదే పనిని పునరుద్ధరించలేడు. కనుక, మొదటి విషయం, ఒకే మొత్తాల్లో మదుపుపెట్టిన పెట్టుబడులు తిరిగి చేతికి రావడంలో తేడా వుంది. కానీ రెండో విషయమేమిటంటే, నూలు మిల్లులోనూ, యంత్ర నిర్మాణంలోనూ మూడు నెలల కాలంలో ఒకేలాంటి ఉత్పాదక పెట్టుబడి మొత్తాలు వినియుక్తమయ్యాయి. అయినప్పటికీ నూలుమిల్లు యజమాని విషయంలో, మదుపు పెట్టిన పెట్టుబడి పరిమాణం, యంత్రం ఉత్పత్తిదారుని విషయంలో కంటే భిన్నంగా వుంటుంది. ఎందుకంటే, ఒక సందర్భంలో అదే పెట్టుబడి త్వరితగతితో పునరుద్ధరించ బడింది. అదే ఉత్పాదక ప్రక్రియ పునరావృత్తమైంది. రెండో సందర్భంలో పెట్టుబడి పునరుద్ధరణ సాపేక్షంగా నెమ్మదిగా సాగింది. ఫలితంగా దాని పునరుద్ధరణ జరిగేటంతవరకూ కొత్త పెట్టుబడి మొత్తాలను పాత మొత్తానికి జతచేస్తూనే వుండాలి. కనుక పెట్టుబడిలోని నిర్దిష్ట భాగాల పునరుద్ధరణకు పట్టే కాల పరిమాణంలోనే గాక, లేదా పెట్టుబడి అడ్వాన్స్ చేయబడిన కాల పరిమాణంలోనే గాక, శ్రమ ప్రక్రియ కాల వ్యవధిని బట్టి అడ్వాన్స్ చేయవలసిన పెట్టుబడి మొత్తంలో కూడా (ప్రతి రోజూ లేదా ప్రతి వారమూ ఉపయోగించిన పెట్టుబడులు సమానమైనప్పటికీ) తేడా వుంది. ఈ పరిస్థితి గమనార్హం. ఎందువల్లనంటే, అడ్వాన్స్ చేయవలసిన పెట్టుబడి మొత్తాలను పెంచకుండానే అడ్వాన్స్ చేసే కాల వ్యవధిని పెంచవచ్చునని తర్వాత అధ్యాయంలో వివరించిన సందర్భాల్లో మనకు అవగతమవుతుంది. ఎక్కువ కాలం పాటు పెట్టుబడిని అడ్వాన్స్ చేయాల్సి వుంటుంది. ఉత్పాదక పెట్టుబడి రూపంలో ఎక్కువ మొత్తం పెట్టుబడి ఆ ప్రక్రియలో వుండిపోతుంది.

పెట్టుబడిదారీ ఉత్పత్తి తక్కువగా అభివృద్ధి చెందిన దశల్లో, పనికి పట్టే కాల వ్యవధి ఎక్కువగా వుండి, ఆ కారణం వల్ల, దీర్ఘ కాలంపాటు పెద్ద మొత్తాల్లో పెట్టుబడి మదుపు పెట్టడం అవసరమైన పనులు, ఉదాహరణకు, రోడ్లు, కాలువలు మొదలయిన వాటి నిర్మాణం, ప్రధానంగా భారీ స్థాయిలో మాత్రమే నిర్వహించవీలున్న పనులు పెట్టుబడిదారీ ప్రాతిపదికపై జరగలేదు. సాముదాయక లేదా ప్రభుత్వ ఖర్చుతో జరిగాయి. (ప్రారంభంలో శ్రమశక్తికి సంబంధించినంత వరకూ, సాధారణంగా నిర్బంధ శ్రమ ద్వారా అమలు జరిగేది) సుదీర్ఘమైన పని కాలం అవసరమైన వస్తువుల ఉత్పత్తిలో కొద్ది భాగం మాత్రమే పెట్టుబడిదారుని ప్రైవేట్ సాధనాల ద్వారా జరిగేది. ఉదాహరణకు ఒక ఇంటి నిర్మాణంలో, ఇల్లు కట్టించుకుంటున్న వ్యక్తి బిల్డింగ్ కాంట్రాక్టర్‌కు దశలవారీగా అనేక పాక్షిక మొత్తాలను చెల్లిస్తాడు. కానీ అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ యుగంలో, పెద్ద మొత్తాల్లో పెట్టుబడులు వ్యక్తుల చేతిలో ఒకవైపున కేంద్రీకృతమై, మరోవైపున సాముదాయక పెట్టుబడిదారు (జాయింట్ – స్టాక్ కంపెనీలు) వ్యష్టి పెట్టుబడిదారుడితో పాటు రంగంలోకి వస్తాడు. అదే సమయంలో ఒక పరపతి వ్యవస్థ అభివృద్ధిచెంది వుంటుంది. అటువంటి యుగంలో ఒక పెట్టుబడిదారీ బిల్డింగ్ కాంట్రాక్టర్ ప్రైవేట్ వ్యక్తుల ఆర్డర్‌పై చాలా సకృత్తుగా మాత్రమే ఇళ్ళు నిర్మిస్తాడు. ప్రస్తుతం అతను ఇళ్ళ వరసలకు వరసలనే, నగర భాగాలకు భాగాలనే మార్కెట్ కోసం నిర్మిస్తున్నాడు – ఇప్పుడు వ్యష్టి పెట్టుబడిదారులు కాంట్రాక్టర్లుగా రైలు మార్గాలను నిర్మిస్తున్నట్లుగా.

పెట్టుబడిదారీ ఉత్పత్తి లండన్‌లో భవన నిర్మాణాన్ని ఎంత విప్లవాత్మకంగా మార్చిందో 1857 నాటి బ్యాంకింగ్ కమిటీ ముందు ఒక భవన నిర్మాత ఇచ్చిన సాక్ష్యాన్ని బట్టి అర్థం చేసుకోవచ్చు. తన చిన్నతనంలో ఇళ్ళు సాధారణంగా ప్రైవేట్ వ్యక్తుల ఆర్డర్లపై నిర్మించబడేవని, పనిలో కొన్ని దశలు పూర్తి అవుతూరాగా వాయిదాల వారీగా డబ్బుగా చెల్లించబడేదని అతను అన్నాడు. సట్టా వ్యాపార పద్ధతిలో జరిగే నిర్మాణం ఆనాడు బహు తక్కువ. అలాంటి భవన నిర్మాణం జరిగినా, తన పని వాళ్ళకు నిరంతరం పని చూపించడానికి, వారిని తనతో అట్టేపెట్టి ఉంచడానికి మాత్రమే జరిగేది. గత నలభై ఏళ్ళల్లో అదంతా మారిపోయింది. ఇప్పుడు ఆర్డర్‌పైన నిర్మించేవి చాలా తక్కువ. ఇల్లు కావలసిన వ్యక్తి అదివరకే మార్కెట్ కోసం నిర్మించబడిన లేదా నిర్మించబడుతున్న ఏదో ఒక ఇంటిని ఎంపిక చేసుకొంటాడు. ప్రస్తుతం భవన నిర్మాత తన ఖాతాదారుల కోసం కాక, మార్కెట్ కోసం నిర్మిస్తాడు. అతడు మిగిలిన పారిశ్రామిక పెట్టుబడిదారులందరి లాగానే, పూర్తిగా తయారైన వస్తువులను మార్కెట్‌లో వుంచక తప్పడం లేదు. ఇంతకుముందు ఒక భవన నిర్మాత మార్కెట్ కోసం మహా అయితే ఏకకాలంలో మూడు నాలుగు ఇళ్ళు కట్టేవాడు. ఇప్పుడు అతను పెద్ద స్థలాన్ని కొనాల్సి వుంటుంది. (యూరప్ ఖండ భాషలో చెప్పాలంటే ఆ స్థలాన్ని విధిగా 99 ఏళ్ళపాటు అద్దెకు తీసుకోవాలి.) ఆ స్థలంలో వంద రెండొందల ఇళ్ళు ఒకేసారి కట్టాల్సి వుంటుంది. ఆ విధంగా తన వనరుల స్థాయికి ఇరవై లేదా యాభై రెట్లు మించి వున్న పనిని అతను చేపట్టాల్సి వుందన్నమాట. తనఖా పద్ధతి ద్వారా అతను నిధులను సేకరిస్తాడు. భవన నిర్మాణం ముందుకు సాగుతున్న కొద్దీ, దశలవారీగా అతనికి డబ్బు అందుతుంది. అయితే ఏదైనా సంక్షోభం వచ్చి, అడ్వాన్స్ చేసే వాయిదాలకు ఆటంకం కలిగితే, మొత్తం వ్యాపారం సాధారణంగా కుప్పకూలిపోతుంది. మహా అయితే ఇళ్ళు మళ్ళీ మంచి కాలం వచ్చేదాకా అసంపూర్ణంగా మిగిలిపోతాయి. గత్యంతరం లేని పరిస్థితిలో వాటిని సగానికి సగం రేటుకి వేలంలో అమ్ముకోవాల్సి వస్తుంది. ఈ రోజున సట్టా వ్యాపారం లేకుండా, అదీ పెద్ద ఎత్తున ఆ వ్యాపారం సాగించకుండా ఏ కాంట్రాక్టరూ రంగంలో నిలబడలేడు. కేవలం నిర్మాణం వల్ల వచ్చే లాభం చాలా తక్కువే. అతని ప్రధానమైన లాభం నేల కిరాయిని పెంచడం ద్వారా, భవన నిర్మాణ స్థలాన్ని జాగ్రత్తగా ఎంపిక చేసుకోవడం ద్వారా, దాన్ని నేర్పుగా ఉపయోగించుకోవడం ద్వారా వస్తుంది. ఇళ్ళకోసం డిమాండ్‌ను ముందుగా అంచనా వేసుకొని, ఈ సట్టా వ్యాపార పద్ధతిలోనే, దాదాపు మొత్తం బెల్ గ్రెవియా, టైబర్నియాలు, లండన్ చుట్టూ వున్న అసంఖ్యాకమైన బంగళాలు నిర్మాణమయ్యాయి. (బ్యాంకు చట్టాలపై సెలెక్ట్ కమిటీలోని విషయాల సంగ్రహం. 1వ భాగం, 1857, సాక్ష్యం, ప్రశ్నలు, 5413–18, 5435–36)

పెట్టుబడి కేంద్రీకరణ బాగా ప్రస్ఫుటమైన దశనందుకొనే వరకు, మరోవైపు పరపతి వ్యవస్థ అభివృద్ధి చెంది, పెట్టుబడిదారునికి తన పెట్టుబడిని కాక, పరుల పెట్టుబడిని అడ్వాన్స్ చేసేందుకు, ఆ విధంగా జూదంలాంటి ఈ వ్యాపారంలో పరుల పెట్టుబడిని ఫణంగా ఒడ్డేందుకు అవకాశాన్ని కల్పించే వరకు, సుదీర్ఘమైన పని కాల వ్యవధులూ, భారీస్థాయి పనులు అవసరమైన పరిశ్రమల నిర్వహణ పెట్టుబడిదారీ ఉత్పత్తిరంగం కిందికి పూర్తిగా రావు. అయితే ఉత్పత్తిలో అడ్వాన్స్ చేసిన పెట్టుబడి దాన్ని వినియోగించేవాడిదా, పరులదా అనేది టర్నోవర్ వేగాన్ని, దాని కాలాన్ని ప్రభావితం చేయదు.

సహకారం, శ్రమ విభజన, యంత్రాల ఉపయోగం – ఇవి ప్రతి పనిదిన ఉత్పాదితాన్ని

పెంచుతాయి. అదే సమయంలో పరస్పరం ముడిపడి వున్న ఉత్పాదక క్రియల పనికి పట్టే కాలాన్ని తగ్గిస్తాయి. ఆ రకంగా ఇళ్ళు, బ్రిడ్జీలు మొదలైన వాటి నిర్మాణానికి పట్టే కాలాన్ని యంత్రాలు తగ్గిస్తాయి. పంట కొచ్చిన ధాన్యాన్ని పూర్తిగా తయారైన సరుకుగా చేయడంలో కోత, నూర్పిడి యంత్రాలు పని కాలవ్యవధిని తగ్గిస్తాయి. నౌకా నిర్మాణపు పని మెరుగుదల వల్ల పని వేగం పెరిగినందుకు నౌకా నిర్మాణంలో మదుపు పెట్టిన పెట్టుబడి టర్నోవర్ కాలం తగ్గుతుంది. అయితే పనికాల వ్యవధిని తగ్గించి, తద్వారా చలామణి పెట్టుబడిని అడ్వాన్సు చేయవలసిన కాలాన్ని తగ్గించే మెరుగుదలలతో పాటు, సాధారణంగా నిశ్చల పెట్టుబడి మదుపు కూడా పెరుగుతుంది. మరోవైపున కొన్ని శాఖల్లో కేవలం సహకార విస్తరణ ద్వారా పనికి పట్టే కాలాన్ని తగ్గించవచ్చు. రైలు మార్గాల నిర్మాణంలో పెద్ద కార్మిక బృందాలను వినియోగించి, ఆ విధంగా అనేక ప్రాంతాల్లో ఒకేసారి పని సాగించడం ద్వారా నిర్మాణం త్వరితంగా పూర్తి అవుతుంది. అలా చేసినప్పుడు అడ్వాన్సు చేసిన పెట్టుబడి పెరుగుదలవల్ల టర్నోవర్ కాలం తగ్గుతుంది. పెట్టుబడిదారుని కింద మరిన్ని ఉత్పత్తి సాధనాలను, మరింత శ్రమశక్తిని కూడదీయవలసి వుంటుంది.

పనికి పట్టేకాలం తగ్గుదల ఆ విధంగా చాలావరకూ, ఆ తగ్గిన కాలానికి అడ్వాన్స్ చేయబడిన పెట్టుబడి పెరుగుదలతో ముడిపడి వుంటుంది. పెట్టుబడి ఎంత కాలానికి అడ్వాన్స్ చేయాలో ఆ కాలం తగ్గిన కొద్దీ అడ్వాన్స్ చేయబడే మొత్తం పెరుగుతుంది. కాగా ఇక్కడ ఒక విషయాన్ని గుర్తుంచుకోవాలి. సామాజిక పెట్టుబడి ఎంత వుంది అనే దానితో ప్రమేయం లేకుండా, ఉత్పత్తి సాధనాలు, నిత్య జీవితావసరాలు వ్యష్టి పెట్టుబడిదారుల చేతుల్లో ఏ మేరకు చెల్లాచెదరై వున్నాయి లేక కేంద్రీకృతమై వున్నాయి అన్నదే ప్రధాన అంశం. వేరు మాటల్లో చెప్పాలంటే, పెట్టుబడుల కేంద్రీకరణ అదివరకే ఏ స్థాయిలో వుందనేది ప్రధాన అంశం. పరపతి వ్యవస్థ ఒకరి చేతిలో పెట్టుబడి కేంద్రీకరణకు దోహదం చేస్తుంది. దాన్ని త్వరితం చేస్తుంది; పెంచుతుంది. అందువల్ల అది పనికి పట్టే కాలాన్ని, టర్నోవర్ కాలాన్ని తగ్గించడానికి తోడ్పడుతుంది.

అయితే పనికి పట్టే కాలం నిరంతరాయంగా సాగినా, దానిలో అంతరాయాలు వున్నా, అది నిర్దిష్ట ప్రకృతి పరిస్థితులపై ఆధారపడి వున్న ఉత్పత్తి శాఖల్లో, పైన పేర్కొన్న పద్ధతుల ద్వారా పనికి పట్టే కాలం తగ్గదు. డబ్ల్యు. వాల్డర్ గుడ్ ఇలా అంటున్నాడు : (Political Agricultural and Commercial Fallacies, London, 1866, పుట – 325) "సత్వర ప్రతిఫలానికి సంబంధించి, ఈ పదం ధాన్యం పంటలకు వర్తించదు. ఎందుకంటే ప్రతిఫలం ఏడాదికి ఒక్కసారి మాత్రమే చేతికి వస్తుంది. పశువులకు సంబంధించి నేను ఈ ప్రశ్న అడగదల్చాను : రెండు మూడేళ్ళ గొర్రెల నుంచి, నాలు గైదేళ్ళ ఎద్దుల నుంచి ప్రతిఫలాన్ని ఎలా త్వరితం చేయాలి?"

సాధ్యమైనంత త్వరగా నగదును సేకరించుకోవలసిన ఆవశ్యకతే, ఉదాహరణకు పన్నులు, భూమి కౌలు మొదలయిన వాటిని చెల్లించవలసిన నిర్ణీత బాధ్యతలను నెరవేర్చవలసిన ఆవశ్యకతే ఈ సమస్యను పరిష్కరిస్తుంది. ఆర్థికంగా సక్రమమైన వయసు రాకముందే, పశువులను అమ్మడం ద్వారానో లేదా వ్యవసాయానికి ఎంతో నష్టం కల్గిస్తూ, వాటిని కబేళాలకు తోలడం వల్లనో సమస్య పరిష్కారం అవుతుందన్న మాట. దానివల్ల తుదకు మాంసం ధర కూడా పెరుగుతుంది. "వేసవిలో మధ్య ప్రాంతాల పచ్చిక బయళ్లకూ, శీతాకాలంలో తూర్పు ప్రాంతాల దొడ్లకూ పశువుల్ని తోలే వ్యవసాయదారులు

ధాన్యం ధరల అనిశ్చితము వల్లా, ధరలు పడిపోవడం వల్లా, ఎంత దెబ్బతిన్నారంటే, వెన్నకి, జున్నుకి వున్న ఎక్కువ ధరలను ఉపయోగించుకోగలిగినందుకు సంతోషిస్తున్నారు. తక్షణ ఖర్చులకోసం వారు వారం వారం మార్కెట్‌లో వెన్నను అమ్ముతారు. జున్నుని దళారీ వ్యాపారస్తుడు, తాను తరలడానికి సిద్ధమైనప్పుడు కొంటాడు. అయితే అతను నిర్ణయించిన ధరకే అని వేరే చెప్ప పనిలేదు; ఈ కారణం వల్ల (వ్యవసాయం రాజకీయ అర్థశాస్త్ర సూత్రాలకు లోబడి వుంటుందని గుర్తుంచుకోవాలి) పాడి పరిశ్రమ ప్రాంతాలనుండి దక్షిణాది ప్రాంతాలకు పెంపకం కోసం ఏటా వచ్చే లేగదూడల్ని ఇప్పుడు బర్మింగ్‌హాం, మాంచెస్టర్, లివర్‌పూల్ తదితర పట్టణాల్లోని కబేళాల్లో వారం, రెండు వారాల వయసులోనే చంపేయడం జరుగుతోంది. మాల్ట్ ధాన్యంపైన పన్ను లేకుండా వుంటే రైతులు మరింత లాభాలు సంపాదించేవారు. అందువల్ల వ్యవసాయదారులు తమ పశువులు బాగా పెరిగి, బలిసేవరకు వాటిని తమవద్దే ఉంచుకోగలిగేవారు. అంతేకాదు; ఇవి, ఆవులు లేనివారు పాల కోసం పెంచుకోవడానికి ఉపయోగపడేవి. ప్రస్తుతం దేశానికి ఏర్పడిన ప్రమాదకరమైన లేగదూడల కొరత తలెత్తేది కాదు. పశువుల్ని పెంచండి అన్న సిఫారసులకు ఈ బడుగు వారి ప్రతిస్పందన ఇది : దూడల్ని పాలతో పెంచితే లాభదాయకంగా వుంటుందని మాకు తెలుసు. దానికి ముందు డబ్బు అవసరం – అది మావద్ద లేదు. పాడి పరిశ్రమ నుంచి మా ఖర్చులకు వెంటనే డబ్బు సంపాదించడానికి బదులు, ప్రతిఫలం కోసం చాలా కాలం మేము వేచి వుండాల్సి వస్తుంది" (అదే గ్రంథం, పుటలు – 11–12.)

టర్నోవర్ కాలం సుదీర్ఘం కావడం వల్ల సన్నకారు ఇంగ్లీషు వ్యవసాయదారులకు ఇలాంటి పర్యవసానాలు ఎదురైనప్పుడు, యూరప్ ఖండంలోని సన్నకారు రైతులకు అది ఎటువంటి ఇబ్బందులను కలిగిస్తుందో తేలిగ్గానే అర్థం చేసుకోవచ్చు.

నిశ్చల పెట్టుబడి ఉత్పాదితానికి పొరలు పొరలుగా బదిలీ చేసిన విలువ భాగం పేరుకుంటుంది. ఈ భాగం తిరిగి రావడం ఆలస్యమవుతుంది. పనికి పట్టే కాలాన్ని బట్టీ, ఆ విధంగా చలామణికి వీలున్న సరుకు పూర్తిగా తయారు కావడానికి పట్టే కాలాన్ని బట్టీ వుంటుందీ జాప్యం. అయితే ఈ ఆలస్యం వల్ల నిశ్చల పెట్టుబడిని పునరుద్ధరించనక్కరలేదు. ఒక యంత్రం యొక్క అరుగుదల డబ్బు రూపంలో తిరిగి భర్తీ కావడం నెమ్మదిగా జరిగినా, వేగంగా జరిగినా యంత్రం ఉత్పత్తి ప్రక్రియలో పనిచేస్తూనే వుంటుంది. చలామణి పెట్టుబడి విషయం వేరు. పనికి పట్టే కాలం పరిమాణాన్ని బట్టి పెట్టుబడి దీర్ఘకాలం పాటు చిక్కుకొనిపోవడమే గాక వేతనాలు, ముడి, సహాయక పదార్థాల రూపంలో కొత్త పెట్టుబడి నిరంతరాయంగా అడ్వాన్స్ చేయబడాలి. పెట్టుబడి తిరిగి చేతికందడంలో జరిగే జాప్య ప్రభావం నిశ్చల, చలామణి పెట్టుబడులపై భిన్నంగా వుంటుంది. తిరిగి రావడం శీఘ్రంగా జరిగినా, నెమ్మదిగా జరిగినా, నిశ్చల పెట్టుబడి పని చేస్తూనే ఉంటుంది. కానీ, తిరిగి రావడం ఆలస్యమైతే అంటే, అమ్మకంకాని లేదా పూర్తిగా తయారు కానందువల్ల ఇంకా అమ్మేవీలులేని ఉత్పాదితాల రూపంలో చలామణి పెట్టుబడి చిక్కడిపోతే, దాన్ని వస్తురూపంలో పునరుద్ధరించడానికి అదనపు పెట్టుబడి లేకుంటే అది తన పనిని నిర్వహించలేదు.

"రైతు తిండిలేక మాడుతుండగా అతని పశువులు బలుస్తున్నాయి. దేశంలో బాగా వాన జల్లులు పడ్డాయి. పశుగ్రాసం పుష్కలంగా వుంది. హిందూ రైతు బాగా బలిసిన ఎద్దుపక్కనే ఆకలితో చస్తాడు. వ్యక్తి విషయంలో క్రూరంగా కనిపిస్తున్న మూఢ విశ్వాసాల నిర్దేశనలు సమాజానికి రక్షగా

వున్నాయి. పనిచేసే పశువుల్ని భద్రపర్చడం వ్యవసాయం చేసే శక్తికి హామీ కల్పిస్తుంది. అంటే భవిష్యత్ జీవనానికి, సంపదకు మూలభూతమైన వాటికి హామీ కల్పిస్తుంది. ఇలా చెప్పడం కొంత కఠినంగానూ, విచారకరంగానూ వుండవచ్చు. కానీ ఇండియాలో ఒక ఎద్దు పోతే దాని స్థానాన్ని భర్తీ చేయడం కంటే మనిషి పోతే అతని స్థానాన్ని భర్తీ చేయడం తేలిక". (Return. East India, Madras and Orissa famine. నెం.4, పుట 44) ఈ ఉల్లేఖనను మనుధర్మశాస్త్రం[1]లోని పదో అధ్యాయంలోని ఈ మాటలతో పోల్చి చూడండి. "ఒక పూజారిని లేదా ఒక ఆవుని కాపాడడం కోసం ప్రతిఫలం ఆశించకుండా నీచ జాతులవారు ప్రాణత్యాగం చేస్తే వారికి ముక్తి లభిస్తుంది."

అయిదేళ్ళ వయసున్న జంతువును ఐదేళ్ళకు ముందే అందజేయడం సహజంగానే సాధ్యం కాదు. అయితే కొన్ని పరిమితులకు లోబడి సాధ్యమయ్యే విషయమేమంటే, పశువుల్ని పోషించే పద్ధతిని మార్చడం ద్వారా వాటిని అంతకన్నా తక్కువ కాలంలోనే వాటి నిర్ణీత గమ్యస్థానానికి వాటిని సిద్ధం చేయడం. బేక్‌వెల్ సాధించింది ఇదే. 1855 వరకూ ఫ్రెంచి గొర్రెలలాగానే ఇంగ్లీషు గొర్రెలు కూడా నాలుగైదేళ్ళ వరకు కబేళాలకు పంపడానికి యోగ్యంగా వుండేవి కాదు. బేక్‌వెల్ పద్ధతి ప్రకారం, గొర్రెను ఏడాది నిండినప్పుడే బలిపించడం ప్రారంభించాలి. రెండో ఏడు పూర్తయ్యేసరికి ఇది పూర్తిగా పెరుగుతుంది. చాలా జాగ్రత్తగా యెంపిక చేయడం ద్వారా,డిష్లే గ్రాంగే వ్యవసాయ దారుడైన బేక్‌వెల్ గొర్రెల అస్థిపంజరాన్ని వాటి అస్తిత్వానికి అవసరమైన కనీస స్థాయికి కుదించాడు. అతని గొర్రెలను న్యూ లీస్టర్స్ అని పిలుస్తారు. ".... గొర్రెల పెంపకందారుడు ఇంతకుముందు ఒక గొర్రెను మార్కెట్‌కు తయారుచేయడానికి పట్టిన కాలంలో ఇప్పుడు మూడు గొర్రెలను పంపగలడు. ఈ కొత్త గొర్రెలు మునుపటంత ఎత్తుగా వుండకపోయినా, మరింత లావుగా, గుండుగా వుంటాయి. వాటిలో అన్నిటికన్నా ఎక్కువ మాంసం ఇచ్చే భాగాలు మరింత అభివృద్ధి చెంది వుంటాయి. ఎముకకు సంబంధించినంత వరకూ అవసరమైన దానికంటే ఒక్క పిసరు ఎక్కువ వుండదు. దాదాపు వాటి బరువంతా మాంసమే". (Lavergne, The Rural Economy of England, 1855, పుట 20)

పనికిపట్టే కాలవ్యవధులను తగ్గించే పద్ధతులు వివిధ పారిశ్రామిక శాఖలకు చాలా భిన్నమైన స్థాయిల్లో వర్తింపచేయవచ్చు. అయితే అవి వివిధ పని వ్యవధుల మధ్య వున్న తేడాలను రద్దు చేయవు. మన పాత ఉదాహరణే తీసుకుంటే, కొత్త యంత్ర పరికరాలను ఉపయోగించడం ద్వారా రైల్ ఇంజన్ నిర్మాణానికి పట్టే కాల వ్యవధిని బాగా తగ్గించవచ్చు. అయితే అదే సమయంలో, ఒక నూలుమిల్లు మెరుగైన ప్రక్రియల ద్వారా, మునుపు రోజుకు లేదా వారానికి తయారయ్యే ఉత్పాదితాన్ని మరింత త్వరగా పెంచితే అటువంటప్పుడు యంత్ర నిర్మాణంలో పనికి పట్టే కాలం నూలు పరిశ్రమలలోని దానితో పోల్చి చూస్తే, సాపేక్షంగా పెరిగినట్లే అవుతుంది.

★ ★ ★

1. మానవ ధర్మం లేక మనుస్మృతి - ఇది ప్రాచీన ఇండియన్ మత, న్యాయ, కర్మకాండ నియమావళి. బ్రాహ్మణ మత సూత్రాలకు అనుగుణంగా ప్రతి హిందువు నిర్వర్తించవలసిన విధులను ఇది నిర్ణయించింది; ఈ సూత్రాలను క్రోడీకరించినది, మనువని సాంప్రదాయకంగా వున్న ప్రథ. అతడు మానవజాతి మూలపురుషుడని పురాణాల కథనం. (Manava Dharma Sastra or the Institutes of Manu According to the Gloss of Kulluka, comprising the Indian System of Duties, Religious and Civil) కూర్పు 3, మద్రాస్ 1863, పుట 281 - సం.

## అధ్యాయం - 13

# ఉత్పత్తికి పట్టేకాలం

పనికి పట్టే కాలం ఎప్పుడూ ఉత్పత్తికి పట్టే కాలమే. అంటే పెట్టుబడి ఉత్పత్తిరంగంలో వున్న కాలం. అయితే, దీన్ని తిరగేసి చెపితే, ఉత్పత్తి రంగంలో పెట్టుబడి వున్న కాలమంతా పనికి పట్టే కాలం కానక్కర్లేదు.

శ్రమశక్తికున్న సహజమైన పరిమితుల దృష్ట్యా, శ్రమ ప్రక్రియకు కలిగే అంతరాయాల ప్రశ్న కాదిది. అయితే, ఫ్యాక్టరీ భవనాలు, యంత్రాలు వగైరా నిశ్చల పెట్టుబడి, శ్రమ ప్రక్రియలో వచ్చే అంతరాయాల మూలంగా ఖాళీగా పడివుండటం వల్ల శ్రమ ప్రక్రియను అసహజంగా పొడిగించడానికీ రాత్రింబవళ్ళూ పనిచేయించడానికీ ఇది ఏ మేరకు ఒకే ప్రేరణ అయిందో మనం ఇంతకుముందు గ్రహించాం.[1] ఇక్కడ మనం చర్చిస్తున్నది శ్రమ ప్రక్రియ కాలపరిమితితో సంబంధంలేని అంతరాయాలను గురించి, ఉత్పాదితాన్ని తయారు చేస్తున్నప్పుడు శ్రమ వస్తువు ఎంతో కొంత కాలం ప్రకృతి ప్రక్రియలకు లోనవుతుంది. భౌతిక, రసాయనిక, శారీరక మార్పులకు గురవుతుంది. ఆ కాలంలో శ్రమ ప్రక్రియ పూర్తిగానో, పాక్షికంగానో నిలిపివేయబడుతుంది. కనుక, ఉత్పాదితం స్వభావం వల్లనూ, దాని తయారీ స్వభావం వల్లనూ కలిగే అంతరాయాలకు సంబంధించిన విషయమిది.

ఉదాహరణకు, ద్రాక్షను పిండిన తర్వాత అది కొంతకాలం పులియాలి, తరువాత కొంతకాలం కదల్చకుండా వుంచాలి. ఒకనొక మోతాదు పరిపక్వతకు చేరుకోవడానికి ఇది అవసరం. చాలా పారిశ్రామిక శాఖల్లో ఉత్పాదితాన్ని ఆరబెట్టడం అవసరం కావచ్చు. ఉదాహరణకు కుమ్మరం లేదా బ్లీచింగ్ పనులలోలాగా, ఉత్పాదితం తన రసాయనిక ధర్మాలను మార్చుకోవడానికి దాన్ని కొన్ని పరిస్థితులకు లోనుచేయాల్సి వుంటుంది. శీతాకాలం ధాన్యప్పంట కోతకు సిద్ధం కావడానికి తొమ్మిది నెలలు పడుతుంది. విత్తడానికి పంట కోతకు మధ్య శ్రమ ప్రక్రియ దాదాపు పూర్తిగా నిలిపివేయ బడుతుంది. కలప చెట్టు పెంచడంలో విత్తడం, దానికి సంబంధించిన ప్రాథమిక కృషీ జరిగిన తర్వాత ఆ విత్తనం సంపూర్ణ ఉత్పాదితంగా (వృక్షంగా) మారడానికి వందేళ్ళు పట్టవచ్చు. శ్రమ ప్రక్రియ ఆ కాలమంతా దాదాపు అవసరం వుండదు.

ఈ సందర్భాలన్నింటిలోనూ సుదీర్ఘమైన ఉత్పత్తి కాలంలో కేవలం అప్పుడప్పుడూ మాత్రమే అదనపు శ్రమ అవసరమవుతుంది. ఇంతకు ముందు అధ్యాయంలో, ఉత్పత్తి ప్రక్రియతో అదివరకే ముడిపడి వున్న పెట్టుబడికి, అదనపు పెట్టుబడి, శ్రమల సరఫరా అవసరమయిన స్థితిని వర్ణించాము. అదే పరిస్థితి ఇక్కడ కూడా ఎక్కువ లేదా తక్కువ విరామ కాలాలతో నెలకొని వుంటుంది.

1. పెట్టుబడి సంపుటం - II, పుటలు - 256-63.

కనుక ఈ సందర్భాలన్నింటిలోనూ, అడ్వాన్స్ చేయబడిన పెట్టుబడి నిర్వహించే ఉత్పత్తికి పట్టే కాలంలో రెండు దశలు ఉంటాయి : ఒకటి – శ్రమ ప్రక్రియలో ఆ పెట్టుబడి నిమగ్నమైన కాలం. రెండోది – పెట్టుబడి యొక్క అస్తిత్వ రూపాన్ని, అంటే పాక్షికంగా తయారైన ఉత్పాదిత రూపాన్ని, శ్రమ ప్రక్రియలో ఉంచకుండా ప్రకృతి ప్రక్రియల స్వభావానికి వదిలివేసే కాలం. అక్కడక్కడా ఈ రెండు కాల వ్యవధులూ ఒకేదానిలోకి మరొకటి చొచ్చుకుపోతాయన్న దానితో ఇక్కడ ప్రమేయం లేదు. పనికి పట్టే కాలం, ఉత్పత్తికి పట్టే కాలం ఈ సందర్భాల్లో ఏకీభవించవు. ఉత్పత్తి కాలం పని కాలం కంటే దీర్ఘంగా వుంటుంది. ఉత్పత్తి కాలం పూర్తయ్యేదాకా ఉత్పాదితం పూర్తిగా తయారుకాదు. కనుక ఇది ఉత్పాదక పెట్టుబడి నుంచి సరుకు పెట్టుబడిగా మారడానికి తగినట్లు ఉండదు. పర్యవసానంగా పనికాలం లేని ఉత్పత్తి కాల పరిమాణాన్నిబట్టి టర్నోవర్ కాలం పెరుగుతుంది. పనికాలాన్ని మినహాయించగా మిగిలిన ఉత్పత్తి కాలం ప్రకృతి నియమాలచే శాశ్వతంగా నిర్ణీతం కానంత మేరకు, ఉత్పత్తి కాలాన్ని కృత్రిమంగా తగ్గించడం ద్వారా, టర్నోవర్ కాలాన్ని కొద్దో, గొప్పో తగ్గించవచ్చు. ఉదాహరణకు ధాన్యం పంటకు రావడం, వృక్షాలు పెరగడం ఇలా ప్రకృతి నియమాలచే నిర్ణీతమైనవి. అలాంటివి కాక, మిగిలిన అంశాల్లో ఇది సాధ్యం. ఇందుకు ఉదాహరణ, ఆరుబయట బ్లీచింగ్‌కు బదులు రసాయనిక బ్లీచింగ్ మరింత సమర్థమైన నిర్జలీకరణ యంత్రాలు, అలాగే తోళ్ళ పరిశ్రమల్లో పాత పద్ధతిలో తోళ్ళలోకి టానిక్ యాసిడ్ ఇంకడానికి ఆరు నుంచి పద్దెనిమిది నెలలు పట్టేది. ఇప్పుడు ఒక గాలి పంపు ద్వారా ఒకటిన్నర రెండు నెలల్లో ఈ పని జరుగుతుంది. *(J.G. Courcelle- Seneuil, Traite theorique etc. pratique des enterprises industrielles etc. Paris, 1857.)* ఇనుప పరిశ్రమ చరిత్ర, ముఖ్యంగా వందేళ్ళుగా పోత ఇనుమును ఉక్కుగా మార్చే ప్రక్రియ చరిత్రే. అంటే 1780లో ఉపయోగించిన పుడ్లింగ్ ప్రక్రియ మొదలుకొని, నేటి ఆధునిక బెసెమెర్ ప్రక్రియ తదితర తాజా పద్ధతుల వరకు గల దాని చరిత్ర కేవలం ప్రకృతి ప్రక్రియల ద్వారా జరిగే ఉత్పత్తి కాలాన్ని కృత్రిమ పద్ధతుల ద్వారా కుదించడానికి మంచి ఉదాహరణ. ఉత్పత్తికాలం బాగా తగ్గించబడింది. అయితే, నిశ్చల పెట్టుబడి మదుపు అదే నిష్పత్తిలో పెరిగింది.

పనికాలం నుంచి ఉత్పత్తి కాలం వేరుపడిపోవడానికి, పాదరక్షలకు నమూనా మడమలను తయారుచేసే అమెరికా పరిశ్రమ ఒక ప్రత్యేకమైన ఉదాహరణ. ఈ సందర్భంలో కలప ఉపయోగపడటానికి, ఆ తరువాత వంకరపోకుండా నివారించడానికి తగినంత ఎండాలంటే, కనీసం పద్దెనిమిది మాసాలు పడుతుంది. దీనివల్ల గణనీయమైన మొత్తంలో అనుత్పాదకమైన ఖర్చులు తలెత్తుతాయి. ఈ కాలమంతటిలోనూ ఆ కలప ఏ ఇతర శ్రమ ప్రక్రియకూ లోనుకాదు. కనుక మదుపు పెట్టబడిన పెట్టుబడి టర్నోవర్ కాలం, కేవలం నమూనా మడమలు తయారు చేయడానికి పట్టే కాలంపైనే గాక, కలప ఎండుతున్న కలప రూపంలో ఆ పెట్టుబడి అనుత్పాదకంగా పడివున్న కాలాన్ని బట్టి కూడా ఆధారపడి వుంటుంది. అది శ్రమ ప్రక్రియలోకి ప్రవేశించడానికి ముందు 18 నెలలపాటు ఉత్పత్తి ప్రక్రియలో వుంటుంది. మొత్తం చలామణి పెట్టుబడిలోని వివిధ భాగాల టర్నోవర్ కాలాలు, చలామణి రంగంలోగాక, ఉత్పత్తి ప్రక్రియలో తలెత్తే పరిస్థితుల పర్యవసానంగా భిన్నంగా వుండవచ్చునని ఈ ఉదాహరణ నిరూపిస్తోంది.

ఉత్పత్తి కాలానికి, పని కాలానికి మధ్య తేడా వ్యవసాయంలో ప్రత్యేకించి స్పష్టంగా కనిపిస్తుంది.

మన సమశీతోష్ణ వాతావరణంలో ధాన్యం ఏడాదికి ఒక్కసారే పండుతుంది. ఉత్పత్తి కాలాన్ని (శీతాకాలపు ధాన్యానికి తొమ్మిది నెలలు పడుతుంది) కుదించడమైనా, పెంచడమైనా రుతువుల మంచి చెడ్డలపై ఆధారపడి వుంటుంది. కనుక పరిశ్రమలోలాగా ముందే ఖచ్చితంగా వీటిని నిర్ణయించడం సాధ్యం కాదు. నియంత్రించడమూ సాధ్యం కాదు. పాలు, జున్ను లాంటి ఉప ఉత్పాదితాలను మాత్రమే సాపేక్షంగా తక్కువ కాల వ్యవధుల్లో స్థిరంగా ఉత్పత్తి చేయవచ్చు, అమ్మవచ్చు. మరోవైపున పనికి పట్టే కాలానికి సంబంధించిన సమాచారం ఇలా వుంది : "జర్మనీలోని వివిధ ప్రాంతాల్లో పనిదినాల సంఖ్య శీతోష్ణాది నిర్ణాయక పరిస్థితులను బట్టి, ప్రధానమైన మూడు పనికాలాల్లో ఇలా వుంటుంది : వసంత కాలంలో మార్చి మధ్య నుంచి లేదా ఏప్రిల్ మొదటి నుంచి ఆగస్ట్ చివరి వరకూ, 65 నుంచి 80 శాతం వరకూ పనిదినాలు వుంటాయి. వేసవిలో జూన్ ప్రారంభం నుంచి ఆగస్ట్ చివరి వరకూ, 65 నుంచి 80 వరకూ పనిదినాలు వుంటాయి. ఇక శీతాకాలంలో ఎరువులు, మార్కెట్ వస్తువులు, కలప, భవన నిర్మాణ వస్తువులు మొదలైన వాటి రవాణా వంటి ఆ కాలానుగుణమైన పనులు మాత్రమే అగుపిస్తాయి." (F. Kirchhof hendbuck derlandwint - schaftlicheh bertriebslehre, dessah, 1852)

శీతోష్ణ పరిస్థితి ఎంత ప్రతికూలంగా వుంటే వ్యవసాయరంగంలో పనికాలం అంత కుంచించుకు పోతుంది. కనుక, పెట్టుబడి, శ్రమ వ్యవసాయమయ్యే కాలం కూడా అంతగానే తక్కువగా వుంటుంది. ఉదాహరణకు రష్యాను తీసుకుందాం. ఆ దేశంలో కొన్ని ఉత్తరాది జిల్లాల్లో ఏడాదిలో మొత్తం 130 నుంచి 150 రోజులు మాత్రమే పొలం పని జరగడం సాధ్యం. 6 నుండి 8 నెలల పాటు శీతాకాలంలో వ్యవసాయ శ్రమ స్తంభించిపోయినప్పుడు, ఆ దేశం యూరప్ భాగంలో వున్న ఆరు కోట్ల యాభై లక్షల ప్రజల్లోనూ ఐదు కోట్ల మంది ఖాళీగా వుండడం వల్ల దానికి ఎంత నష్టం జరుగుతుందో ఊహించవచ్చు. అక్కడున్న పది వేల ఐదు వందల ఫ్యాక్టరీల్లో పనిచేస్తున్న రెండు లక్షలమంది రైతులు గాక స్థానిక పరిశ్రమలు గ్రామాల్లో ప్రతిచోటా అభివృద్ధి చెందాయి. కొన్ని గ్రామాల్లో మొత్తం రైతులంతా తరతరాలుగా నేత పని, తోళ్ళను పదునుచేసే పని, పాదరక్షల తయారీ, తాళాలు బాగుచేయడం, కత్తులకు సానబట్టడం మొదలైన వృత్తుల్లో వున్నారు. ఇది ముఖ్యంగా మాస్కో, వ్లాదిమిర్, కలుగ, కాస్త్రోమా, పీటర్స్‌బర్గ్ ప్రాంతాలకు వర్తిస్తుంది. సందర్భవశాత్తూ ఒక మాట – కుటీర పరిశ్రమలను రానురాను పెట్టుబడిదారీ ఉత్పత్తికి ఉపయోగించుకోవడం జరుగుతోంది. ఉదాహరణకు నేత పనివారికి అవసరమైన పడుగు పేకలను వ్యాపారులు నేరుగా లేదా దళారీల ద్వారా సరఫరా చేస్తున్నారు. (పరిశ్రమలు, వాణిజ్యంపై రాయబారి కార్యాలయ కార్యదర్శుల నివేదికల నుంచి క్లుప్తంగా ఇవ్వబడింది. నివేదిక నెం. 8, 1865, పుటలు 86–87). ఉత్పత్తి కాలం నుంచి దానిలో భాగమైన పనికాలం వేరై వుండటమన్నది వ్యవసాయంలో సహాయక గ్రామీణ పరిశ్రమల సమ్మేళనకు సహజమైన ప్రాతిపదిక అయిందనీ, అదే విధంగా వ్యాపారి రూపంలో జొరబడే పెట్టుబడిదారుడికీ ఈ సహాయక పరిశ్రమలు బాగా అనుకూలంగా వున్నాయనీ మనకు అవగతమవుతుంది. తర్వాత కాలంలో పరిశ్రమలను, వ్యవసాయాన్ని, పెట్టుబడిదారీ ఉత్పత్తి విడదీసినప్పుడు గ్రామీణ కార్మికుడు అడపా దడపా మాత్రమే దొరికే సహాయక పనిపై మరింత ఆధారపడతాడు. కాబట్టి అతని పరిస్థితి పాడవుతుంది. పెట్టుబడికి

సంబంధించినంత వరకూ టర్నోవర్‌లో వున్న తేడాలన్నీ సమానమైపోతాయి. ఇది తర్వాత వివరించ బడుతుంది. అయితే శ్రామికుని విషయంలో మాత్రం అలా కాదు.

గని తవ్వకం, రవాణా వగైరా వంటి అసలైన పారిశ్రామిక శాఖల్లో ఉత్పత్తి ప్రక్రియలు సమంగా జరుగుతాయి. ప్రతి ఏడాది పని కాలం ఒక్కటే. ధరల్లో ఎగుడుదిగుళ్ళు, వాణిజ్యంలో వచ్చే ఇబ్బందుల్లాంటి అసాధారణ అంతరాయాలను మినహాయిస్తే, మదుపు పెట్టిన పెట్టుబడి రోజూ ఒకే పరిమాణంలో చలామణి ప్రక్రియలోకి ప్రవేశిస్తుంది. చలామణి పెట్టుబడి పునరుద్ధరణ లేదా తిరిగి రావడం, మార్కెట్ పరిస్థితులు యధాతథంగా వున్న మేరకు, ఏడాది పొడుగునా సమానంగా పంపిణీ అవుతుంది. కానీ, పని కాలం ఉత్పత్తి కాలంలో కేవలం ఒక భాగంగా వుండి, పెట్టుబడి ఒకే పెద్ద మొత్తంలో ప్రకృతి పరిస్థితులు నిర్ణయించిన సమయాన తిరిగి రావడం ఎలాంటి మదుపుల్లో జరుగుతుందో, వాటిలో చలామణి పెట్టుబడి కేటాయింపు ఏడాదిలోని వివిధ నియమిత కాలాల్లో అసమంగా వుంటుంది. వాణిజ్య పరిమాణం ఒకటే అయినప్పుడు, అంటే అడ్వాన్స్ చేయబడిన చలామణి పెట్టుబడి మొత్తం ఒకటే అయినప్పుడు, నిరంతరాయంగా పని కాలాలు వుండే పరిశ్రమల్లోకంటే, ఒకేసారి ఎక్కువ చలామణి పెట్టుబడి ఎక్కువ కాలానికి అడ్వాన్స్ చేయవలసి వస్తుంది. అంతేకాదు, నిశ్చల పెట్టుబడి జీవితానికీ, అది నిజంగా ఉత్పాదకంగా పనిచేసే కాలానికి మధ్య చాలా తేడా వుంటుంది. పని కాలానికి, ఉత్పత్తి కాలానికి మధ్య వున్న తేడా వల్ల మదుపు పెట్టిన నిశ్చల పెట్టుబడిని పనిలో పట్టే కాలానికి వరుసగా తరతమ స్థాయిల్లో అంతరాయం కలుగుతూ వుంటుంది. ఇందుకు ఉదాహరణగా, వ్యవసాయంలో పనిచేసే పశువులు, పరికరాలు, యంత్రాలను తీసుకోవచ్చు. దుక్కిటెద్దులు నిశ్చల పెట్టుబడిగా వున్న మేరకు, అవి పనిచేస్తున్న కాలంలోలాగానే పని చేయనప్పుడు కూడా మేత వగైరాలకు ఒకే మొత్తం ఖర్చవుతుంది. నిర్జీవమైన సామాగ్రిని ఉపయోగించకపోవడం వల్ల కూడా కొంత తరుగుదల వుంటుంది. అందువల్ల ఉత్పాదితం ధర సాధారణంగా పెరుగుతుంది. ఎందుకంటే ఉత్పాదితానికి విలువ బదిలీని నిశ్చల పెట్టుబడి పనిచేసే కాలాన్నిబట్టి గాక, దాని విలువ తరిగిపోయే కాలాన్ని బట్టి లెక్కగడతారు. ఇటువంటి ఉత్పత్తి శాఖల్లో నిశ్చల పెట్టుబడి ఖాళీగా పడివుండటం, దానికి రోజువారీ ఖర్చులను కలిపినా, కలపకపోయినా దాని మామూలు వినియోగానికి తప్పనిసరియైన పరిస్థితే అవుతుంది. ఉదాహరణకు నూలు వడికేటప్పుడు కొంత దూది నష్టం కావడం దాని మామూలు వినియోగానికి ఎలా తప్పనిసరో ఇదీ అంతే. అలాగే అనుత్పాదకమే అయినా అనివార్యంగా ఏ శ్రమ ప్రక్రియలోనైనా మామూలు సాంకేతిక పరిస్థితుల్లో వ్యయమైన శ్రమశక్తి ఉత్పాదకంగా వ్యయమైన దానితో సమానంగానే పరిగణించబడుతుంది. శ్రమ పరికరాల ముడి పదార్థాలు, శ్రమశక్తి – వీటి అనుత్పాదక వ్యయాన్ని తగ్గించే ఏ మెరుగుదలైనా ఉత్పాదితం విలువను కూడా తగ్గిస్తుంది.

వ్యవసాయంలో సుదీర్ఘమైన పని కాలం ఒకవైపున, మరోవైపున పని కాలానికి, ఉత్పత్తి కాలానికి మధ్య పెద్ద తేడా – ఈ రెండూ సమ్మిళితమై వుంటాయి. హాడ్జ్‌స్కిన్ సరిగ్గానే ఇలా పేర్కొన్నాడు. "వ్యవసాయ ఉత్పాదితాలను ఇతర శ్రమ ఉత్పాదితాలను పూర్తిచేయడానికి పట్టే కాలంలో ఉన్న తేడా" (ఇక్కడ అతను పని కాలాన్ని, ఉత్పత్తి కాలాన్ని వేరు చేసి చూపడం లేదు) "వ్యవసాయదారుల పరాధీనతకు మూల కారణం. వారు తమ సరుకుల్ని ఏడాదిలోగా మార్కెట్‌కి తేలేరు. ఆ కాలమంతా, ముచ్చీ, దర్జీ, కమ్మరి, వడ్రంగి అలాగే ఇతర రకాలైన శ్రామికుల నుండి వస్తువులను ఎరువు తెచ్చుకోవాలి.

అవి లేకుంటే అతనికి పని జరుగదు. కానీ అవి కొద్ది రోజుల్లోనో, కొద్ది వారాల్లోనో తయారయ్యే వస్తువులు. ఈ సహజ పరిస్థితివల్ల, అలాగే వ్యవసాయ శ్రమకంటే ఇతర శ్రమ వేగంగా సంపదను సృష్టించడం వల్ల, భూమిపై గుత్తాధిపత్యం వున్నవారు, చట్టాలపైన గుత్తాధిపత్యం తమకు ఉన్నప్పటికీ తమనూ, తమ సేవకులైన రైతుల్ని సమాజంలోకెల్లా అత్యంత పరాధీనపరమయ్యే స్థితి నుండి కాపాడుకోలేకపోతున్నారు" (Thomas, Hodgskin, Popular Political Economy, లండన్, 1827, పుట 147).

ఒకవైపున సంవత్సరం పొడవునా వేతనాలపైన, శ్రమ పరికరాలపైన అయ్యే ఖర్చును సమానంగా పంపిణీ చేస్తూనే, మరోవైపున నానా విధమైన పంటల్ని పండించడం, ఆ విధంగా సంవత్సరం పొడవునా వివిధ పంటల నూర్పిళ్ళను సాధ్యం చేయడం ద్వారా టర్నోవర్ కాలాన్ని కుదించటానికి ఉపయోగించే అన్ని పద్ధతులకు ఉత్పత్తిలో, వేతనాలూ, విత్తనాలూ, ఎరువులూ వగైరాలపై మదుపు పెట్టే చలామణి పెంచడం అవసరం. కొంత భూమిని పడావుగా వుంచే, మూడు క్షేత్రాల వ్యవస్థ నుంచి భూమిని పడావుగా వుంచని పంట రొటేషన్ పద్ధతికి మారడంతో ఇదే జరిగింది. ఫ్లాండర్స్‌లోని డెరోబీ పంట పద్ధతికి[1] కూడా ఇది వర్తిస్తుంది. "డెరోబీ పంట పద్ధతిలో దుంప పంటలు పెడతారు. ఒకే పొలంలో మొదట ధాన్యం, ఎల్లెగిసె నార, కోల్జా విత్తులు[2] చేతికందుతాయి. కోతల తర్వాత పశువుల పోషణకోసం దుంప పంటలు ఈ పద్ధతి ద్వారా వేస్తారు. పశువుల్ని కొట్టాల్లోనే వుంచడం సాధ్యమవుతుంది. అందువల్ల గణనీయమైన పరిమాణంలో ఎరువు లభిస్తుంది. ఆ రకంగా అది పంట రొటేషన్‌కు మూలస్తంభమవుతుంది.

"ఇసుక ప్రాంతాల్లో మూడో వంతుకుపైగా సాగుభూమిలో డెరోబీ పంట పద్ధతి వ్యాపించింది. ఇది సాగునేల విస్తీర్ణం మూడోవంతు పెరిగినట్లుగా వుంది. "ఇందుకోసం దుంప పంటలే కాక, పశువుల దాణాకు ఉపయోగపడే క్లోవర్ తదితర గడ్డి మొక్కల్ని వేయడం జరుగుతుంది." వ్యవసాయం ఆ రకంగా తోటపనిగా పరిణమించడం వల్ల, సహజంగానే పెట్టుబడి గణనీయమైన మొత్తంలో అవసరమవుతుంది. ఇంగ్లండ్‌లో ఈ పెట్టుబడి హెక్టార్‌కి రెండు వందల ఫ్రాంక్‌లని అంచనా. కాగా ఫ్లాండర్స్‌లో ఇది దాదాపు ఐదువందల ఫ్రాంక్‌లు వుండి తీరుతుంది. మంచి వ్యవసాయదారులు తమ నేలలను బట్టి అంచనా వేసుకొని ఈ మొత్తం మరీ తక్కువని నిస్సందేహంగా అనుకొంటారు." (Emile de Laveleye, Essais sur I' economic rurale de la Belgique, Paris, 1863, పుట 45, 46, 48)

చివరగా కలప పెంపకాన్ని తీసుకుందాం. "కలప ఉత్పత్తి అతి ముఖ్యాంశాల్లో ఇతర ఉత్పత్తి శాఖల కంటే భిన్నమైనది. ఎందువల్లనంటే, ఇక్కడ ప్రకృతి శక్తులు స్వతంత్రంగా పనిచేస్తాయి. పెరుగుదల సహజంగా వున్నప్పుడు దీనికి మానవశక్తి లేదా పెట్టుబడి అవసరం లేదు. కృత్రిమంగా పెంచిన అడవుల విషయంలో సైతం ప్రకృతి శక్తుల పనితో పోల్చితే మానవుడి, పెట్టుబడి యొక్క శక్తి వ్యయం లెక్కలోకి వచ్చేది కాదు. పైగా ధాన్యం ఇక పండని నేలల్లో లేదా వాటి సాగు ఇక లాభదాయకంగాని నేలల్లో కూడా అడవులు పెరుగుతూనే వుంటాయి. అంతేగాక అటవీ పెంపకం క్రమబద్ధమైన ఆర్థిక

1. తక్కువ మోతాదులో విత్తనం వేసే పద్ధతి - అనువాదకుడు.
2. ఒక రకం నూనె విత్తనాలు - అనువాదకుడు.

విధానంగా వుండటానికి ధాన్యప్పంటకు అవసరమైన దానికంటే విస్తారమైన నేలలు కావాలి. ఎందుకంటే చిన్న చిన్న కండ్రికలు సరైన అటవీ పద్ధతులకు అనుకూలంగా వుండవు. అవి అటవీ రక్షణను కష్టతరం చేస్తాయి; ద్వితీయ శ్రేణి ఉపయోగాలను నేల నుండి పొందకుండా నిరోధిస్తాయి. ఇంకా ఇలాంటి నష్టాలుంటాయి. కానీ ఉత్పాదక ప్రక్రియ ఒక వ్యష్టి వ్యవసాయ క్షేత్ర ప్రణాళికకన్నా చాలా దీర్ఘకాలం కొనసాగుతుంది. ఒక్కొక్కసారి మానవుడి జీవిత కాలానికి మించి వుంటుంది. అడవి భూమి కొనడానికి మదుపు పెట్టిన పెట్టుబడి" (సాముదాయక ఉత్పత్తి విషయంలో ఈ పెట్టుబడి అనవసరం. అప్పుడు, సమాజం పంటలు వేయడానికి, పశువులను మేపడానికి గల భూమిలో ఎన్ని ఎకరాల భూమిని అడవుల పెంపకానికి వదిలి పెట్టవీలున్నదనేది ప్రశ్న). "చాలా కాలం వరకూ గణనీయమైన ప్రతిఫలమేదీ తెచ్చిపెట్టదు. ఇచ్చినా, ఆ పెట్టుబడి కేవలం పాక్షికంగా మాత్రమే టర్నోవర్ అవుతుంది. కొన్ని రకాల వృక్షాలు గల అడవుల విషయంలో సంపూర్ణమైన టర్నోవరుకు 150 ఏళ్ళు పడుతుంది. అంతేకాదు, సక్రమంగా నిర్వహించబడే కలప పెంపకపు సంస్థకు ఏటా వచ్చే కలప దిగుబడి పది నుంచి నలభై రెట్లు కలప వృక్షాలు సరఫరా వుండాలి. కాబట్టి, ఇతర రకాల ఆదాయ మార్గాలు లేకుండా, విస్తారమైన అటవీ భూములు లేకుండా ఎవరూ క్రమబద్ధమైన అడవుల పెంపకం చేపట్టజాలరు." (Kirchhof, పుట. 58)

సుదీర్ఘమైన ఉత్పత్తి కాలం (సాపేక్షంగా తక్కువ కాలం గల అటువంటి ఉత్పత్తి కాలం), సుదీర్ఘమైన టర్నోవర్ కాలాల కారణంగా, అటవీ పెంపకం వ్యక్తిగత చొరవను, కాబట్టి పెట్టుబడిదారీ పరిశ్రమను ఏమాత్రం ఆకర్షించలేకపోయింది. ఎందువల్లనంటే, వ్యష్టి పెట్టుబడిదారుని స్థానాన్ని సామూహిక పెట్టుబడిదారు తీసుకున్నప్పటికీ పెట్టుబడిదారీ పరిశ్రమ వ్యక్తిగతమైనదే. సంస్కృతి అభివృద్ధి, మొత్తంపై పరిశ్రమల అభివృద్ధి అడవుల్ని ఎంత శక్తివంతంగా నాశనం చేసిందంటే, ఆ అభివృద్ధి తన వైపు నుంచి అడవులను కాపాడడం కోసం పునరుద్ధరించడం కోసం చేసిన కృషి అల్పాతి అల్పం.

కిర్కాఫ్ రచన నుంచి ఈ కింది ఉల్లేఖన ప్రత్యేకించి గమనార్హం. "అంతేగాక సక్రమంగా నిర్వహించబడే కలప పెంపకపు సంస్థకు, ఏటా వచ్చే కలప దిగుబడికి పది నుండి నలభై రెట్ల కలప వృక్షాల సరఫరా వుండాలి". మరో రకంగా చెప్పాలంటే టర్నోవర్‌కు పది లేదా నలభై లేదా అంతకంటే ఎక్కువ ఏళ్ళు పడుతుంది.

పశువుల పెంపకానికీ ఇదే వర్తిస్తుంది. పశువుల మందల్లో (పశువుల సరఫరా) ఒక భాగం ఉత్పత్తి ప్రక్రియలోనే వుంటుంది. మరో భాగం ఉత్పాదితంగా ప్రతి ఏడాది అమ్మబడుతుంది. ఈ సందర్భంలో ప్రతి ఏటా పెట్టుబడిలో ఒక భాగం మాత్రమే టర్నోవర్ అవుతుంది – నిశ్చల పెట్టుబడి అయిన యంత్రాలు, పనిచేసే పశువులు వగైరాల విషయంలో లాగానే. ఈ పెట్టుబడి ఉత్పత్తి ప్రక్రియలో దీర్ఘకాలం పాటు నిశ్చలంగా ఉన్నప్పటికీ, ఆ కారణంగా మొత్తం పెట్టుబడి టర్నోవర్ కాలాన్ని పెంచినప్పటికీ, అది ఖచ్చితమైన నిర్వచనం ప్రకారం నిశ్చల పెట్టుబడి కాదు.

ఇక్కడ సరఫరా అనబడుతున్నది (కలప వృక్షాలు లేదా పశువుల మంద) సాపేక్షంగా ఉత్పత్తి ప్రక్రియలో వుంటుంది. (ఏకకాలంలో శ్రమ పరికరాలుగానూ, శ్రమ పదార్థంగానూ) సక్రమమైన నిర్వహణ పద్ధతులకింద, సహజమైన పునరుత్పత్తి పరిస్థితులను బట్టి, ఈ సరఫరాలో ఒక గణనీయమైన భాగం. ఈ రూపంలో ఎప్పుడూ అందుబాటులో వుండాలి.

టర్నోవర్‌పైన ఇటువంటి ప్రభావమే మరోరకం సరఫరాకూ వుంది.

అది ఉత్పాదక పెట్టుబడి కాగల వీలున్నది మాత్రమే. అయితే ఈ ఆర్థిక విధానం యొక్క స్వభావం వల్ల, దాన్ని కొద్దో గొప్పో గణనీయమైన మొత్తాల్లో సంచయనం చేయాలి. కాబట్టి దీర్ఘకాలం పాటు ఉత్పత్తి లక్ష్యాల కోసం అడ్వాన్స్ చేయాలి. అయితే అది వాస్తవ ఉత్పత్తి ప్రక్రియలో క్రమక్రమంగా మాత్రమే ప్రవేశిస్తుంది. ఇంకా పొలానికి తోలని ఎరువు, అలాగే పశువుల ఉత్పత్తిలో వినియోగించే ధాన్యం, గడ్డి, వగైరాలు ఇలాంటివే. "పని నిర్వాహక పెట్టుబడిలో గణనీయమైన ఒక భాగం ఈ పొలం సరఫరాల్లో వుంటుంది. అయితే వాటిని భద్రపర్చడానికి, మంచి స్థితిలో వుంచడానికి అవసరమైన జాగ్రత్త తీసుకోకపోతే అవి తమ విలువను ఎంతో కొంత కోల్పోతాయి. అశ్రద్ధ వల్ల పొలానికి సరఫరా అయ్యే ఉత్పాదితం యొక్క ఒక భాగం పూర్తిగా నష్టమైపోవచ్చు కూడా. ఈ కారణంగానే ధాన్యం కొట్లు, ధాన్యాదులను ఎత్తి దించే సాధనాలు, మాళిగలు ఎప్పటికప్పుడు తనిఖీ చేయబడాలి. గోదాములను ఎప్పుడూ మూసి వుంచాలి. అదే సమయంలో పరిశుభ్రంగా వుండాలి. గాలి ఆడేలా చూడాలి. నిల్వ వుంచిన ధాన్యం, ఇతర వ్యవసాయోత్పత్తుల్ని ఎప్పటికప్పుడు తిరగబోయడం అవసరం. బంగాళాదుంపలు, బీట్ దుంపలు మంచువల్ల, వానవల్ల తడిసి కుళ్ళిపోకుండా కాపాడాలి." (Kirchhof, పుట. 292) "సొంత అవసరాలను లెక్కవేసేటప్పుడు, ముఖ్యంగా పశువుల పోషణావసరాల విషయంలో లభ్యమైన ఉత్పాదితాన్నీ, దాని వినియోగాన్నీ బట్టి, వాటి పంపిణీ జరగాలి. కేవలం తమ సాధారణ అవసరాలకు మాత్రమే గాకుండా అసాధారణ పరిస్థితులకు కూడా తగిన నిల్వ వుండేలా చూడాలి. సొంత ఉత్పత్తి ద్వారా ఈ అవసరాలు తీరవనుకుంటే ఈ లోటును, ఇతర ఉత్పాదితాల (ప్రత్యామ్నాయాలు) ద్వారా లేదా కొరత వున్న వాటిని చౌకగా సేకరించడం ద్వారా తీర్చడం సాధ్యమేమో ఆలోచించాలి. ఒకవేళ గడ్డి కొరత వచ్చిందనుకుందాం. దాన్ని దుంపలతోనూ, ఎండుగడ్డి మిశ్రమం తోనూ తీర్చవచ్చు. సాధారణంగా వివిధ రకాల పంట యొక్క సహజ విలువను, వాటి మార్కెట్ ధరను అటువంటి సందర్భంలో దృష్టిలో వుంచుకోవాలి. వినియోగాన్ని తదనుగుణంగా క్రమబద్ధం చేసుకోవాలి. ఉదాహరణకు వోట్స్‌కి ఎక్కువ ధర, బటాణీకి, రై ధాన్యానికి తక్కువ ధర పలుకుతున్నప్పుడు గుర్రాల దాణాలో వోట్స్‌లో కొంత భాగానికి బదులు బటాణీనో, రై ధాన్యాన్నో వాడి, ఆ విధంగా ఆదా అయిన వోట్స్‌ని మార్కెట్‌లో అమ్మడం లాభదాయకమవుతుంది" (అదే గ్రంథం, పుట 300)

ఉత్పాదకం కాగల పెట్టుబడి, నిర్దిష్టమైన కొద్దో గొప్పో పరిమాణంలో వున్న అలాంటి పెట్టుబడి, అంటే ఉత్పత్తిలో వినియోగించడానికి ఉద్దేశించిన ఉత్పత్తి సాధనాలు అవసరమనీ, భవిష్యత్తులో ఉత్పాదక ప్రక్రియలో ప్రవేశపెట్టడానికి అని అందుబాటులో వుండాలనీ, సరఫరా రూపుగొనే విషయం చర్చిస్తున్న సందర్భంలో లోగడ చెప్పాము. అంతర్భాగాలు ఒక నిర్దిష్టమైన నిష్పత్తుల్లో వున్న ఒక వ్యాపారం లేదా పెట్టుబడిదారీ సంస్థ ఉందనుకొందాం. ఈ ఉత్పాదక సరఫరా పరిమాణం, అది ఎంత తేలిగ్గా లేదా ఎంత కష్టంగా పునరుద్ధరించబడుతుంది అన్నదానిమీద అంటే, సరఫరా మార్కెట్లు సాపేక్షంగా ఎంత దగ్గరగా వున్నాయి, రవాణా, వార్తా ప్రసార సాధనాలు ఎంత అభివృద్ధి చెందాయి, మొదలైన వాటి మీద ఆధారపడి వుంటుంది అని కూడా ఆ సందర్భంలోనే చెప్పాము. ఈ పరిస్థితులన్నీ ఉత్పాదక సరఫరా రూపంలో లభ్యం కావలసిన కనీస పెట్టుబడిని నిర్ణయిస్తాయి. కనుక ఈ పెట్టుబడిని ఎంత కాలానికి అడ్వాన్స్ చేయాలో, దఫాకు ఎంత మొత్తం అడ్వాన్స్ చేయాలో నిర్ణయిస్తాయి. టర్నోవర్‌ను

కూడా ప్రభావితం చేసే మొత్తాన్ని చలామణి ఉత్పాదక సరఫరా రూపంలో, కేవలం భవిష్యత్తులో ఉత్పాదకం కాగల పెట్టుబడిగా చిక్కుకొని వుండే కాలం ఎక్కువా, తక్కువా అనేది నిర్ణయిస్తుంది. మరోవైపు, అది ఇలా స్తంభించిపోవడం, అది త్వరగా భర్తీ అయ్యే అవకాశం ఎక్కువ, తక్కువలను బట్టి, మార్కెట్ పరిస్థితులను బట్టి వుంటుంది. అందువల్ల, చలామణి కాలం చలామణి రంగ పరిస్థితులు ఈ స్తంభనకు మూలకారణం. "అంతేగాక చేతి పరికరాలు, జల్లెళ్ళు, బుట్టలు, తాళ్ళు, బండి కందెన, మేకులు వగైరా పనిముట్లు, అనుబంధ ఉపకరణాలు, పాతవాటి స్థానాన్ని కొత్తవాటితో భర్తీ చేయడానికి వీలుగా అప్పటికప్పుడు లభ్యం కావాలి. ఆలస్యం లేకుండా, దగ్గర్లో వాటిని కొనడానికి వీలులేనప్పుడు ఇది మరింత అవసరం. ఆఖరు విషయం, పరికరాలన్నింటినీ ప్రతి శీతాకాలం జాగ్రత్తగా తనిఖీ చేస్తుండాలి. అవసరమైన కొత్త కొనుగోళ్ళకు, మరమ్మతులకు వెంటనే ఏర్పాటు చేయాలి. ఈ పరికరాల సరఫరా ఎక్కువగా వుండాలా, తక్కువగా వుండాలా అన్నది స్థానిక పరిస్థితులపై ఆధారపడి వుంటుంది. చేతివృత్తుల వాళ్లు లేదా విక్రయశాలలు దగ్గర్లో లేనప్పుడు వీటిని అక్కడికక్కడే లేక దగ్గరలో దొరికే చోట్లలోకన్నా ఎక్కువ సంఖ్యలో వుంచుకోవాలి. అయితే అవసరమైన సరఫరాలను ఒకేసారి పెద్ద సంఖ్యలో కొనుగోలు చేస్తే, మిగతా పరిస్థితులన్నీ యధాతథంగా వున్న స్థితిలో సాధారణంగా, ఈ పరికరాలు కొంత చౌకగా దొరుకుతాయి. అయితే వాటిని తగిన అదనులో కొనుక్కోవాలి. అందువల్ల, తిరుగుడుపడే పని నిర్వాహక పెట్టుబడిలో, దానికి అనుగుణంగా పెద్ద మొత్తం ఒక్కసారిగా కోత పడుతుంది నిజమే. అంత మొత్తాన్ని వ్యాపారంలో వదులుకోవడం ఎల్లప్పుడూ సాధ్యం కాదు." (Kirchhof, పుట 301)

మనం ఇంతకు ముందు గమనించినట్లుగా ఉత్పత్తి కాలానికి, పని కాలానికి మధ్య వున్న తేడాలో చాలా వైవిధ్యాలు వున్నాయి. చలామణి పెట్టుబడి అసలైన శ్రమ ప్రక్రియలోకి ప్రవేశించక ముందుకాలం (మడమల నమూనాల ఉత్పత్తిలో లాగా) దానికి ఉత్పత్తి కాలం కావచ్చు లేదా (ద్రాక్షాసవం, ధాన్యపు విత్తనాల విషయంలోలాగా) శ్రమ ప్రక్రియలోకి ప్రవేశించిన తరువాతి కాలం దానికి ఉత్పత్తి కాలం కావచ్చు. లేదా ఉత్పత్తి కాలానికి అప్పుడప్పుడూ పనికాలం అంతరాయం కలిగించవచ్చు (వ్యవసాయం, కలప పెంపకం). చలామణికి అనువైన ఉత్పాదితంలో ఒక పెద్ద భాగం క్రియాశీల ఉత్పాదక ప్రక్రియలో పొందుపడి వుండగా చాలా చిన్నభాగం ఏటా చలామణిలో ప్రవేశిస్తుంది (కలప పెంపకం, పశువుల పెంపకంలో లాగా). ఉత్పాదకం కాగల పెట్టుబడి రూపంలో ఎంత కాలానికి చలామణి పెట్టుబడిని మదుపు పెట్టాలి, ఆ కారణంగా, ఒకసారి ఎంత మొత్తం పెట్టుబడి అడ్వాన్స్ చేయబడాలి అన్నది, ఉత్పాదక ప్రక్రియ తరహాపైన (వ్యవసాయం) కొంత, మార్కెట్ల సామీప్యం వగైరాలపైన, అంటే చలామణి రంగంలోని పరిస్థితులపైన ఆధారపడి వుంటుంది.

పనికాలం నుంచి వేరుపడిన ఉత్పత్తి కాలాన్ని పని కాలంగా నిర్ధారించ ప్రయత్నించిన ఫలితంగా మాక్కుల్లోచ్, జేమ్స్ మిల్ తదితరులు ఎంత అర్థరహితమైన సిద్ధాంతాలను ప్రతిపాదించారో మనం తర్వాత (మూడో సంపుటిలో) పరిశీలిద్దాం. వారి ఈ ప్రయత్నానికి కారణం, విలువ సిద్ధాంతాన్ని తప్పుగా వర్తింపజేయడమే.

★ ★ ★

మనం పైన పరిశీలించిన టర్నోవర్ చక్రం ఉత్పత్తి ప్రక్రియలో అడ్వాన్స్ చేయబడిన నిశ్చల పెట్టుబడి మన్నికపైన ఆధారపడి వుంటుంది. ఈ చక్రం అనేక సంవత్సరాల పాటు కొనసాగుతుంది. కనుక దానిలో అనేక నిశ్చల పెట్టుబడి వార్షిక టర్నోవర్‌లు వుంటాయి లేదా ఏడాది లోపల పునరావృత్త మయ్యే టర్నోవర్‌లు వుంటాయి.

వ్యవసాయంలో పంట రొటేషన్ పద్ధతిలో నుండి అటువంటి టర్నోవర్‌ల చక్రం తలెత్తుతుంది. "ఈ పంట రొటేషన్ పద్ధతి పూర్తవడానికి పట్టే కాలానికంటే భూమిని కౌలుకు తీసుకొన్న కాలం ఎప్పుడూ తక్కువ వుండకూడదు. కనుక దాన్ని మూడు క్షేత్రాల పద్ధతిలో ఎప్పుడూ మూడు, ఆరు, తొమ్మిది వగైరా సంవత్సరాల్లో లెక్కిస్తారు. ఆ పద్ధతిలో ఒక పొలం ఆరేళ్ళలో నాలుగుసార్లు మాత్రమే సాగుచేయబడుతుంది. సాగు సంవత్సరాల్లో శీతాకాలపు ధాన్యాన్ని, వేసవి కాలపు ధాన్యాన్ని పండిస్తారు. నేల అనువుగా వుంటే వరుసగా గోధుమ, రై, బార్లీ, వోట్ ధాన్యాన్ని పండిస్తారు. అదే నేలలో ప్రతి పంట మిగతావాటికి భిన్నమైన దిగుబడినిస్తుంది. ప్రతిదానికీ ఒక భిన్నమైన విలువ వుంది. భిన్నమైన ధరకు అమ్మబడుతుంది. ఈ కారణంగా ఒక పొలం దిగుబడి, అది సాగులో వున్న ప్రతి ఏడాది విభిన్నంగా వుంటుంది. అది రొటేషన్‌లోని మొదటి సగంలో (మొదటి మూడు సంవత్సరాలు) రెండో సగంలో కంటే భిన్నంగా వుంటుంది. ఒక రొటేషన్ కాలంలోని సగటు దిగుబడి సైతం, మరో రొటేషన్ కాలంలోని దానికి భిన్నంగా వుంటుంది. ఎందుకంటే దిగుబడి నివ్వగల శక్తి కేవలం నేల నాణ్యతపైనే కాక ప్రతి ఏడాది వుండే వాతావరణంపై కూడా ఆధారపడి వుంటుంది – నిరంతరం మారే అనేక పరిస్థితులపైన ధరలు ఆధారపడినట్టే. ఇప్పుడు ఎవరైనా మొత్తం ఆరేళ్ళ రొటేషన్ కాలంలోనూ సగటు ఫలదాయకతను, సగటు ధరలను లెక్కలోకి తీసుకుంటే, ఈ రొటేషన్‌లోని ఏ అర్ధభాగంలోనైనా వార్షిక ఆదాయం ఎంతో తెలుసుకోవచ్చు. అయితే రొటేషన్‌లోని అర్ధభాగానికి మాత్రమే అంటే మూడు సంవత్సరాల కాలానికి మాత్రమే సగటు లెక్కకడితే అలా తెలుసుకోలేము. ఎందుకంటే రెండు భాగాల్లోని మొత్తం ఆదాయం లెక్కలు ఏకీభవించవు. కాబట్టి మూడు క్షేత్రాల పద్ధతిలో పనిచేస్తూ, భూమిని కౌలుకు తీసుకోవాలంటే, కనీసం ఆరు సంవత్సరాల పాటు తీసుకోవాల్సి వుంటుంది. కానీ కౌలుకు ఇచ్చే వ్యక్తికీ పుచ్చుకునే వ్యక్తికీ కౌలు కాలం ఆరు సంవత్సరాలకు కొన్ని రెట్లు ఎక్కువ వుండడం వాంఛనీయం. (ఆయన అన్నమాటే!) కాబట్టి మూడు క్షేత్రాల పద్ధతుల్లో ఆరు సంవత్సరాలకు బదులుగా పన్నెండు, పద్దెనిమిది సంవత్సరాలు, ఇంకా ఎక్కువ కాలానికి సైతం, ఏడు క్షేత్రాల పద్ధతిలో ఏడు సంవత్సరాలకు బదులు పధ్నాలుగు, ఇరవై ఎనిమిది సంవత్సరాలకు కౌలుకు తీసుకోవడం అవసరం (Kirchhof, పుటలు 117–118).

(రాతప్రతిలో ఇక్కడ కింది మాటలున్నాయి : "ఇంగ్లీషు తరహా పంట మార్పిడి పద్ధతి – ఇక్కడ వివరణ ఇవ్వాలి" – ఫ్రెడరిక్ ఎంగెల్స్.)

★ ★ ★

# అధ్యాయం - 14
# చలామణి కాలం

మనమింత వరకు పరిశీలించిన పరిస్థితులు వివిధ పారిశ్రామిక శాఖల్లో మదుపు పెట్టిన వేరు వేరు పెట్టుబడుల టర్నోవర్ కాలాలనూ, అలాగే పెట్టుబడిని ఎంత కాలానికి అడ్వాన్స్ చేయాలో ఆ కాలాలనూ కూడా వేరుపరచి చూపుతున్నాయి. ఇవి అసలు ఉత్పత్తి ప్రక్రియలోనే ఉత్పన్నమవుతున్నాయి. ఉదాహరణకు, స్థిర, చలామణి పెట్టుబడుల మధ్య తేడా, పనికాలాల మధ్య తేడా మొదలైనవి. అయితే పెట్టుబడి టర్నోవర్ కాలం దాని ఉత్పత్తి కాలాన్ని, చలామణి కాలాన్ని కలిపితే వచ్చే మొత్తం కాలం, కనుక దాని ఆవృత్తి కాలం. కనుక చలామణి కాలంలో తేడా టర్నోవర్ కాలంలో తేడాకు, కాబట్టి టర్నోవర్‌కు పట్టే మొత్తం కాల పరిమాణంలో తేడాకు కారణమవుతుంది. దీన్ని రెండు పద్ధతుల్లో చూపించవచ్చు. టర్నోవర్‌ను మార్చే పరిస్థితులన్నీ ఒకేలా వుంటూ చలామణి కాలం మాత్రం భిన్నంగా వుండే రెండు వేరు వేరు పెట్టుబడుల మదుపులను పోల్చి చూడటం ఒక పద్ధతి. లేదా నిర్దిష్టమైన నిష్పత్తిలో నిశ్చల, చలామణి పెట్టుబడి భాగాలూ, ఒక నిర్దిష్టమైన పని కాలమూ వున్న ఒక పెట్టుబడిని తీసుకొని, కేవలం దాని చలామణి కాలం మాత్రం మారుతున్నదని ఊహించి పరిశీలించడం మరో పద్ధతి.

చలామణి కాలంలో ఒక విభాగం సాపేక్షంగా చాలా నిర్ణయాత్మకమైన విభాగం అమ్మకానికి పట్టేకాలం. ఆ కాలంలో పెట్టుబడి సరుకు పెట్టుబడి రూపంలో వుంటుంది. చలామణి కాలం, అలాగే మొత్తం మీద టర్నోవర్ కాలం ఈ విక్రయాల సాపేక్ష పరిమాణంపై ఆధారపడతాయి. నిల్వ చేయడం మొదలైన వాటికి అయ్యే ఖర్చులు కారణంగా మరింత అదనపు పెట్టుబడుల మొత్తాలు అవసరం కావచ్చు. ఒకే పారిశ్రామిక శాఖలో వున్న వ్యష్టి పెట్టుబడిదారుల విషయంలో తయారైన వస్తువుల్ని అమ్మడానికి పట్టే కాలంలో ఎంతో తేడా వుండవచ్చునని ఆదిలోనే స్పష్టమవుతోంది. కనుక వివిధ పారిశ్రామిక శాఖల్లో పెట్టిన మొత్తం పెట్టుబడుల విషయంలోనేగాక, స్వతంత్రమైన వేరు వేరు పెట్టుబడుల విషయంలో కూడా ఈ విక్రయ కాలం భిన్నంగా వుండవచ్చు. ఇవి వాస్తవంలో ఒకే ఉత్పత్తిరంగంలో వున్న మొత్తం పెట్టుబడిలోని విడి విడి భాగాలు మాత్రమే. కాకపోతే ఇవి స్వతంత్రంగా వ్యవహరిస్తున్నాయంతే.

మిగిలిన పరిస్థితులన్నీ యథాతథంగా వున్నప్పుడు ఒకే విడి పెట్టుబడికి విక్రయ కాలం మారుతూ వుంటుంది. అది మొత్తం మార్కెట్ ఎగుడు దిగుడుల వల్ల కావచ్చు. లేదా ప్రత్యేకంగా ఆ ప్రత్యేక వ్యాపారంలో మార్కెట్ ఎగుడు దిగుడుల వల్లనైనా కావచ్చు. ఈ అంశంపై ఇక వివరించబోము. కేవలం ఒక సామాన్య వాస్తవాన్ని మాత్రం పేర్కొందాము : విభిన్న పారిశ్రామిక శాఖల్లో పెట్టబడిన

పెట్టుబడి టర్నోవర్ కాలాల్లో తేడాలకు కారణభూతమైన పరిస్థితులన్నీ ఒకే వ్యాపారంలో పనిచేసే వేరు వేరు పెట్టుబడుల టర్నోవర్‌లలో సైతం తేడాలు తెస్తాయి. అయితే ఈ పరిస్థితులు స్వతంత్రంగా వ్యవహరించాలి. (ఉదాహరణకు ఒక పెట్టుబడిదారు తన పోటీదారునికన్నా త్వరగా అమ్మే అవకాశం వున్నప్పుడు, ఒకడు పని కాలాలను తగ్గించే పద్ధతులను మరొకరికన్నా ఎక్కువగా ఉపయోగించినప్పుడు, ఇంకా ఇలాంటి పరిస్థితులు సంభవించినప్పుడు.)

ఈ విక్రయ కాలాలను, అందువల్ల మొత్తం మీద టర్నోవర్ కాలాలను మార్చే ఒక శాశ్వత అంశం ఒక సరుకు ఉత్పత్తి స్థానం నుండి అది అమ్మకమయ్యే మార్కెట్ వున్న దూరం. మార్కెట్‌కి తన ప్రయాణ కాలమంతటా పెట్టుబడి సరుకు పెట్టుబడి రూపంలో బందీ అయి వుంటుంది. సరుకుల ఆర్డర్ ప్రకారం తయారై వుంటే అవి కొనుగోలుదారుని చేరేటంత వరకూ అలా బందీ అయివుంటాయి. ఒకవేళ ఆర్డర్ లేకుండానే తయారైవుంటే, మార్కెట్‌కి వెళ్ళడానికి పట్టే కాలంతో పాటు సరుకులు అమ్మకానికై మార్కెట్‌లో ఎదురు చూస్తున్న కాలం కూడా కలపాలి. అయితే రవాణా, వార్తా ప్రసార సాధనాల మెరుగుదల సరుకుల ప్రయాణ కాలాన్ని నిరపేక్షంగా తగ్గిస్తుంది. కానీ ఈ ప్రయాణాలవల్ల విభిన్న సరుకు పెట్టుబడుల చలామణి కాలాల్లో తలెత్తే సాపేక్ష భేదాన్ని కానీ, అదే విధంగా వేరు వేరు మార్కెట్లకు వెళ్ళే ఒకే సరుకు పెట్టుబడి భాగాల చలామణి కాలాల్లోని సాపేక్ష భేదాన్ని కానీ అది తొలగించదు. ఉదాహరణకు, మెరుగైన ఓడలు, పొగ ఓడలు ప్రయాణ కాలాన్ని తగ్గిస్తాయి. దాన్ని దగ్గరి రేవులకూ తగ్గిస్తాయి, దూరపు రేవులకూ సమానంగా తగ్గిస్తాయి. సాపేక్ష భేదం మాత్రం వుంటుంది. అయితే రవాణా వార్తా ప్రసారాల అభివృద్ధి ఈ సాపేక్ష భేదాలను భౌగోళిక దూరాలకు అనుగుణంగా లేని విధంగా మారవచ్చు. ఉదాహరణకు ఉత్పత్తి స్థానం నుంచి ఎక్కడో దూరంగా వున్న జనావాస ప్రాంతానికి పోయే రైలు మార్గంవల్ల, ఆ ప్రాంతానికి గల దూరంకన్నా, అటువంటి రైలు మార్గం లేని ఒక దగ్గర ప్రాంతానికి గల దూరం సాపేక్షంగా లేదా నిరపేక్షంగా ఎక్కువ కావచ్చు. అదే రకంగా, ఇవే పరిస్థితులు ఉత్పత్తి స్థానాల నుంచి పెద్ద మార్కెట్‌లకున్న సాపేక్ష దూరాలను మార్చవచ్చు. రవాణా సాధనాలూ, ప్రసార సాధనాల్లో వచ్చిన మార్పు వల్ల పాత ఉత్పత్తి కేంద్రాలు క్షీణించి, కొత్త కేంద్రాలు తలెత్తడానికి కారణమిదే (దీనికి తోడు, దూర ప్రాంతానికి రవాణా, దగ్గర ప్రాంతానికి రవాణాకన్నా సాపేక్షంగా చౌక). అంతే కాదు, రవాణా సౌకర్యాల అభివృద్ధితో కేవలం రవాణా వేగం పెరగడమే కాదు, అందువల్ల భౌగోళిక దూరాలు కాలరీత్యా తగ్గడమే కాదు. విస్తృతమైన వార్తా ప్రసార సాధనాల అభివృద్ధివల్ల, అనేక నౌకలు ఒకే నౌకాశ్రయానికి ఏకకాలంలో ప్రయాణించగలుగుతున్నాయి, లేదా అనేక రైళ్ళు రెండు స్థానాల మధ్య విభిన్న రైలు మార్గాలపై ప్రయాణిస్తున్నాయి. లివర్‌పూల్ నుంచి న్యూయార్క్‌కి ఒకే వారంలోని ప్రతిరోజూ నౌకలు సరుకులను తీసుకెళ్ళవచ్చు లేదా గూడ్స్ బళ్లు మాంచెస్టర్ నుంచి లండన్‌కు ఒకే రోజు వేరు వేరు సమయాల్లో బయలుదేరవచ్చు. అయితే, రవాణా సాధనాల స్తోమతు నిర్ణీతమైనప్పుడు, నిరపేక్ష వేగం ఈ పరిస్థితి వల్ల మారదు. కనుక చలామణి కాలంలోని ఈ భాగమూ మారదు. అయితే సరుకులను వరుసగా తీసుకెళ్లే నౌకలు బయలుదేరే సమయాల మధ్య గడువు బాగా తగ్గిపోతుంది. ఓడలకు ఎత్తక ముందు సరుకులు సరుకు పెట్టుబడి కాదు. అవి సరుకు పెట్టుబడి కాగల స్థితిలో మాత్రమే వుంటాయి.

అలాంటి స్థితిలో పెద్ద ఎత్తున సరుకులు పోగుబడిపోకుండా మార్కెట్‌కి ఈ నౌకలు ఒకదాని తర్వాత ఒకటి వేగంగా చేర్చడం సాధ్యమవుతుంది. కనుక పెట్టుబడి తిరిగి చేతికి రావడం కూడా తక్కువ కాల వ్యవధులలో వెంటవెంటనే జరుగుతుంది. కనుక ఒక భాగం నిరంతరాయంగా డబ్బు పెట్టుబడిగా మారుతూండగా మరో భాగం సరుకు పెట్టుబడిగా చలామణి అవుతుంది. డబ్బు చేతికందడం, వరుసగా పలు నియమిత కాలాల పొడుగునా జరుగుతూంటుంది కనుక చలామణి మొత్తం కాలం, అదేవిధంగా టర్నోవర్ కాలం కుదించబడుతుంది. అదివరకే ఉన్న ఉత్పత్తి స్థలాలు అధికాధికంగా ఉత్పత్తి చేసేకొద్దీ, పెద్ద ఉత్పత్తి కేంద్రాలయ్యేకొద్దీ, అన్నిటికన్నా ముందు రవాణా సాధనాల రాకపోకలు మరింత తరచూ అవుతాయి. ఉదాహరణకు, రైళ్ళ సంఖ్య పెరుగుతుంది. అప్పటికే వున్న మార్కెట్ దిశగా అభివృద్ధి జరుగుతుంది. అంటే ఉత్పత్తి కేంద్రాలు, జనాభా కేంద్రాల వైపుగా, ఎగుమతి జరిగే రేవులు మొదలైన వాటివైపుగా జరుగుతుంది. మరోవైపున, బాగా వృద్ధిచెందిన రవాణా వసతుల వల్ల, తత్ఫలితంగా పెట్టుబడి టర్నోవర్ వేగం పెరగడం వల్ల (టర్నోవర్ వేగం చలామణి కాలంపై ఆధారపడుతుంది కనుక) ఉత్పత్తి కేంద్రాలు, మార్కెట్‌లు, రెండూ మరింత త్వరితంగా కేంద్రీకృత మవుతాయి. ఇలా కొన్నిచోట్ల ప్రజలు, పెట్టుబడి పెద్ద ఎత్తున కేంద్రీకృతం కావడంతో పాటు, కొద్దిమంది చేతుల్లో ఈ పెట్టుబడి పోగుబడుతుంది. అదే సమయంలో ఉత్పత్తి కేంద్రాల, మార్కెట్ల స్థలాలు మళ్ళీ మారడం గమనించవచ్చు. ఈ మార్పులు, రవాణా వసతుల్లోని మార్పుల మూలంగా ఉత్పత్తి కేంద్రాల, మార్కెట్ల సాపేక్ష స్థానాలు మారిన ఫలితం. ఒక ప్రధాన రహదారి పక్కనో, కాల్వ పక్కనో వుండడం వల్ల ఒకప్పుడు ప్రత్యేక సదుపాయాలు కలిగిన ఒక ఉత్పత్తి కేంద్రం, ఆ కేంద్రానికి అడపా దడపా మాత్రమే రైళ్ళు నడిచే ఒక మారుమూల రైలు మార్గం పక్కనే వుండిపోవచ్చు. అదే సమయంలో ఇంతకు ముందు రవాణా మార్గాలకు దూరంగా వుండిన మరో ఉత్పత్తి కేంద్రం అనేక రైలు మార్గాల కూడలిలో వుండవచ్చు. ఇది రెండో ప్రాంతానికి అభివృద్ధి దశ. మొదటి దానికి క్షీణ దశ. ఆ రకంగా రవాణా సాధనాల్లో వచ్చే మార్పులు సరుకులు స్థానికంగా చలామణి అయ్యే కాలంలో, క్రయ విక్రయాది అవకాశాల్లో తేడాలను సృష్టిస్తాయి లేదా అదివరకే వున్న స్థానికమైన తేడాలను తారుమారు చేస్తాయి. పెట్టుబడి టర్నోవర్ విషయంలో దీనికి గల ప్రాముఖ్యానికి, వివిధ ప్రాంతాలకు చెందిన పారిశ్రామిక, వ్యాపార ప్రతినిధులు రైల్వే యాజమాన్యాలతో పెట్టుకొంటున్న పేచీలే సాక్ష్యం (ఉదాహరణకు, రైలు మార్గాలపైన రాయల్ కమిషన్ నివేదికను పరిశీలించండి).

స్వభావతః స్థానిక వినియోగంపైన ప్రధానంగా ఆధారపడే ఉత్పాదితాలకు సంబంధించిన ఉత్పత్తి శాఖలన్నీ – సారాబట్టీల వంటివి – చాలా వరకూ ప్రధానమైన జనాభా కేంద్రాలలోనే అభివృద్ధి చెందాయి. భవన నిర్మాణ స్థలాలు మొదలైన అనేక ఉత్పత్తి పరిస్థితులు మరింత వ్యయ భారంతో కూడుకొన్నందువల్ల కలిగే నష్టాన్ని, ఇక్కడ మరింత సత్వర గతితో జరిగే టర్నోవర్ కొంత మేరకు పూడుస్తుంది.

ఒకవైపున పెట్టుబడిదారీ ఉత్పత్తి ప్రగతి ఫలితమైన రవాణా వార్తాప్రసార సాధనాల మెరుగుదల వల్ల కొన్ని రకాల సరుకుల చలామణి కాలం తగ్గుతుంది. అయితే అదే ప్రగతివల్ల, రవాణా ప్రసార సాధనాల అభివృద్ధి సృష్టించిన అవకాశాల వల్ల అంతకంతకు, మరింత దూరంగా వున్న మార్కెట్‌ల

కోసం, ఒక్క మాటలో చెప్పాలంటే, ప్రపంచ మార్కెట్ కోసం పనిచేయడం, ఇటువైపు నుంచి అవసరమవుతుంది. దానివల్ల దూర ప్రాంతాలకు వెడుతూన్న సరుకుల పరిమాణం బ్రహ్మాండంగా పెరుగుతుంది. కాబట్టి దానితోపాటు, చలామణి కాలంలో సరుకు పెట్టుబడి దశలోనే, నిరంతరాయంగా దీర్ఘకాలం పాటు ఉండే సామాజిక పెట్టుబడి భాగం నిరపేక్షంగానూ, సాపేక్షంగానూ పెరుగుతుంది. సామాజిక సంపదలో, నేరుగా ఉత్పత్తి సాధనాలుగా ఉపకరించడానికి బదులు, రవాణా, వార్తాప్రసార సాధనాలలోనూ, వాటిని పనిలో పెట్టడానికి అవసరమైన స్థిర, చలామణి పెట్టుబడులలోనూ మదుపు పెట్టబడే భాగం, అదే సమయంలో పెరుగుతుంది.

సరుకులు ఉత్పత్తి కేంద్రం నుంచి మార్కెట్‌కి చేరేందుకు పయనించవలసిన సాపేక్ష దూరమే, చలామణి కాలంలోని మొదటి భాగంపైనే గాక, అంటే విక్రయ కాలంపైనే గాక రెండో భాగంపై కూడా, అంటే డబ్బుని ఉత్పాదక పెట్టుబడి అంశాలుగా తిరిగి వచ్చే భాగంపై కూడా, అంటే కొనుగోలు కాలంపై కూడా ప్రభావం నెరపుతుంది. ఒక సరుకు ఇండియాకు రవాణా అయిందనుకుందాం. దానికి నాలుగు నెలలు పడుతుందనుకుందాం. విక్రయ కాలం సున్నా అనుకుందాం. అంటే, సరుకులు ముందే వున్న ఆర్డర్ ప్రకారం తయారుచెయ్యబడ్డాయని, అవి సరఫరా కాగానే ఉత్పత్తిదారుని ఏజెంట్‌కు డబ్బు చెల్లించబడుతుందని అనుకుందాం. డబ్బు (ఏ రూపంలోనైనా సరే) మళ్ళీ తిరిగి రావడానికి నాలుగు నెలలు పడుతుంది. కనుక ఒక పెట్టుబడి ఉత్పాదక పెట్టుబడిగా పని చేయాలంటే, తిరిగి అదే ఉత్పత్తి ప్రక్రియను మళ్ళీ ప్రారంభించాలంటే ఎనిమిది నెలలు పడుతుందన్నమాట. ఆ రకంగా టర్నోవర్‌లో వున్న ఈ తేడాలు పరపతికి సంబంధించిన వివిధ నియమిత కాలాలకు పాదార్థిక పునాదుల్లో ఒకటి – మొత్తం మీద సముద్రాంతర వాణిజ్యం, ఉదాహరణకు వెనీస్, జెనీవాల్లో వాణిజ్యం, అసలైన పరపతి వ్యవస్థకు మూల కారణాల్లో ఒకటి అయినట్టుగా. "ఇండియా, చైనాలకు, యూరపునకు మధ్య ఎక్స్ఛేంజి బిల్లుల చెల్లుబాటుకు అనుమతించిన కాలం వాటి తేదీ నుంచి తొమ్మిది నెలలదాకా వున్నది. వాటిని బ్యాంకులో ఇచ్చిన నాటి నుంచి ఆరు నెలలకు తగ్గించేందుకు, 1847 సంక్షోభం బ్యాంకుల యజమానులకు, ఈ వాణిజ్య వర్గాలకు వీలుకల్పించింది. తరువాత గడిచిన ఈ 20 ఏళ్ళలో రవాణా వేగం పెరుగుదలవల్ల, తంతి వార్తా ప్రసార సదుపాయాల స్థాపనవల్ల వాటి చెల్లుబాటు కాలాన్ని మరింత తగ్గించడం అవసరమైంది." అంటే, బిల్లులను బ్యాంకులో ఇచ్చిననాటి నుంచి ఆరు నెలల దాకా వున్న వాటి చెల్లుబాటు కాలాన్ని, వాటి తేదీ నుంచి నాలుగు నెలలకు తగ్గించడం అవసరమైందన్నమాట. వాటిని బ్యాంకులో ఇచ్చిన నాటినుంచి నాలుగు నెలలకు తగ్గించేందుకు ఇది వారి తొలి చర్య. "కలకత్తా నుంచి కేప్ ఆఫ్ గుడ్ హోప్ ద్వారా లండన్‌కు ఓడ ప్రయాణం కాలం ఇప్పుడు సగటున 90 రోజులకు లోపే. బ్యాంకులో దాఖలు పరచిన నాటి నుండి నాలుగు నెలల చెల్లుబాటు కాలం, సుమారు 150 రోజుల చెల్లుబాటు కాలానికి సమానమవుతుంది. దాఖలుపరచిన నాటినుంచి ఆరు నెలలున్న ఇప్పటి చెల్లుబాటు కాలం, సుమారు 210 రోజుల చెల్లుబాటు కాలానికి సమానం." (లండన్ ఎకనామిస్ట్ – London Economist, 1866 జూన్ 16)

మరోవైపు, "బ్రెజిలియన్ ఎక్స్ఛేంజ్ బిల్లుల చెల్లుబాటు కాలం, వాటిని బ్యాంకుల్లో ఇచ్చిన నాటి నుంచి రెండు, మూడు నెలలు, అంట్వర్ప్ వర్తకులు" (లండన్ బ్యాంకులపై) "జారీ చేస్తున్న

బిల్లుల చెల్లుబాటు కాలం, వాటి తేదీ నుంచి మూడు నెలలు. మాంచెస్టర్, బ్రాడ్‌ఫోర్డ్ వర్తకులు సైతం లండన్ బ్యాంకులపై జారీ చేస్తున్న బిల్లుల చెల్లుబాటు కాలం, వాటి తేదీ నుంచి మూడు నెలలు, ఇంకా ఎక్కువే వుంటోంది. తన సరుకుల అమ్మకం వల్ల వచ్చే డబ్బు, వాటి బిల్లుల చెల్లింపు తేదీకన్నా ముందుగానే కాకపోయినా, యుక్తమైన కాలంలో వర్తకునికి చేతికందుతుంది. ఈ దృష్టితో చూస్తే ఇండియన్ బిల్లులకు ప్రస్తుతం అనుమతించిన చెల్లుబాటు కాలం మరీ ఎక్కువ అని అనుకోలేము. భారతీయ ఉత్పాదితాలు చాలావరకు, లండన్‌లో తప్పకుండా మూడు నెలల్లో అమ్మకమవుతున్నాయి. అమ్మకం జరగడంలో కొంతకాలం వృధా అవుతుందనుకొన్నప్పటికీ, వాటి మొత్తం అయిదు నెలలకన్నా చాలా ముందుగానే చేతికందజాలదు. అదే సమయంలో అంతకు ముందే ఇండియాలో వాటి కొనుగోలుకూ, ఇంగ్లండులోని గోదాములకు వాటిని చేరవేయడానికి మధ్య (సగటున) అయిదు నెలలు గడిచిపోయి వుంటాయి. అంటే మొత్తం పది నెలలవుతుంది. కానీ సరుకుల బిల్లు ఏడు నెలలకు మించి చెల్లుబాటు కాదు" (అదే పత్రిక, 1866, జూన్ 30). 1866 జూలై 2న, లండన్‌లో రెండు పెద్ద బ్యాంకులు, పారిస్‌లోని కాంప్‌టాయిర్ డి ఎస్కాంప్టీ, "ప్రాచ్య ప్రపంచంలో వున్న తమ శాఖలూ, ఏజెన్సీలూ, బ్యాంకుకు దాఖలుపరచిన నాటి నుంచి నాలుగు నెలలకు మించని చెల్లుబాటు గల ఎక్స్‌ఛేంజ్ బిల్లులను మాత్రమే కొంటాయి, అమ్ముతాయి" అని ప్రకటించాయి (అదే పత్రిక, 1866, జూలై 7). కానీ ఈ తగ్గింపు ప్రయత్నం విఫలమై, వదలుకోవలసి వచ్చింది. (దరిమిలా, సూయెజ్ కాలువ ఈ వ్యవహారమంతటినీ సమూలంగా మార్చివేసింది.)

సరుకుల చలామణికి ఎక్కువ కాలం పట్టినకొద్దీ ధరలు మారడానికి వీలున్న కాలం పెరగడం వల్ల, మార్కెట్‌లో ధరలు మారే ప్రమాదం కూడా పెరగడం సహజమే.

చలామణి కాలంలో తేడాలు, ఒకే వ్యాపార శాఖలోని వేర్వేరు పెట్టుబడుల మధ్య వైయక్తికంగా కొంత, అక్కడికక్కడ నగదు చెల్లించనప్పుడు, ఎక్స్‌ఛేంజ్ బిల్లుల చెల్లుబాటు కాలాల్లోని తేడాలను బట్టి వివిధ వ్యాపార శాఖల మధ్య కొంత, క్రయ విక్రయాలలో విభిన్న చెల్లింపు షరతుల నుండి తలెత్తుతాయి. దీనికి సంబంధించి ఇక్కడ ఎక్కువ వివరించనక్కరలేదు. అది పరపతి వ్యవస్థకు సంబంధించి ప్రధానమైనది.

టర్నోవర్ కాలంలో తేడాలు, సరుకుల అందజేతకు సంబంధించిన ఒప్పందాల పరిమాణం నుంచి కూడా ఉత్పన్నమవుతాయి. ఈ పరిమాణం పెట్టుబడిదారీ ఉత్పత్తి విస్తృతి స్థాయిలతో పాటు పెరుగుతుంది. సరుకుల అందజేత ఒప్పందం కొనుగోలుదారుడికి, అమ్మకందారుడికి లావాదేవీ. ఇది మార్కెట్‌కి సంబంధించిన కార్యకలాపం. అంటే చలామణి రంగానికి సంబంధించినది. కనుక టర్నోవర్ కాలంలో వుండే తేడాలు చలామణి రంగం నుండి తలెత్తుతున్నాయి. అయితే ఇవి ఉత్పత్తి రంగంపైన తక్షణ ప్రభావం నెరపుతాయి. ఈ ప్రభావం చెల్లింపుల షరతులపైన, పరపతి షరతులపైన ఆధారపడినది కాదు. నగదు చెల్లించినా విషయం మారదు. ఉదాహరణకు బొగ్గు, పత్తి, నూలు వగైరాలు విడి విడి ఉత్పాదితాలు. ప్రతిరోజూ పూర్తిగా తయారైన ఉత్పాదితం బయటకు వస్తుంది. అయితే ఒక నూలు యజమాని లేదా గని యజమాని నాలుగు లేదా ఆరు వారాలకు సరిపడా ఉత్పాదితాలు సరఫరా చేయడానికి ఒప్పందాలు కుదుర్చుకొన్నాడనుకుందాం. పెట్టుబడి అడ్వాన్స్

చేయాల్సిన కాలానికి సంబంధించి ఇక్కడ తేడా ఏమీ వుండదు. శ్రమ ప్రక్రియలో నాలుగు లేదా ఆరు వారాల నిరంతరాయమైన పనికాలం ప్రవేశించినట్లే అవుతుంది. ఆర్డర్ చేయబడిన మొత్తం సరుకు ఒకేసారి సరఫరా చేయాల్సి వుంటుందనీ లేదా రోజూ సరఫరా చేసినా డబ్బులు చెల్లించేది మొత్తం సరఫరా పూర్తయ్యాక మాత్రమేనని అనుకొందాం. విడిగా చూసుకుంటే ప్రతిరోజూ ఒక నిర్దిష్ట పరిమాణంలో ఉత్పాదితాన్ని తయారు చేస్తుంది. అయితే ఈ తయారైన ఉత్పాదితం ఒప్పందంలోని మొత్తం ఉత్పాదితంలో ఒక భాగం మాత్రమే. కాగా, ఈ సందర్భంలో పూర్తయిన భాగం ఉత్పత్తి ప్రక్రియలో లేదు. అది పెట్టుబడి కాగల ఉత్పాదితంగా మాత్రమే గోదాములో పడి వుంటుంది.

ఇక చలామణి కాలంలోని రెండో దశ అయిన కొనుగోలు కాలాన్ని అంటే, పెట్టుబడి డబ్బు రూపం నుండి ఉత్పాదక పెట్టుబడి అంశాలుగా మళ్ళీ మారే కాలాన్ని చూద్దాం. ఈ కాలంలో అది ఎంతో కొంతకాలం డబ్బు పెట్టుబడిగా వుండాలి. అడ్వాన్స్ చేయబడిన మొత్తం పెట్టుబడిలో కొంత భాగం సదా డబ్బు రూపంలో వుండాలి. అయితే ఈ భాగంలో నిరంతరాయంగా మారే అంశాలు వుంటాయి. ఉదాహరణకు ఒకానొక వ్యాపారంలో అడ్వాన్స్ చేయబడిన మొత్తం పెట్టుబడిలో వంద పౌండ్లకు క రెట్లు డబ్బు రూపంలో లభ్యం కావాలి. ఈ వంద పౌండ్లకు క రెట్ల మొత్తంలో వున్న అంతర్భాగాలన్నీ నిరంతరాయంగా ఉత్పాదక పెట్టుబడిగా మారుతూ వుంటాయి. అయినప్పటికీ, ఈ మొత్తం చలామణి రంగం నుంచి, డబ్బు రూపంలో చేతికందిన సరుకు పెట్టుబడి నుంచి ఎప్పటికప్పుడు భర్తీ అవుతూంటుంది. కనుక అడ్వాన్స్ చేయబడిన పెట్టుబడిలోని ఒక నిర్దిష్ట భాగం డబ్బు పెట్టుబడి రూపంలో వుంటుంది. ఈ రూపం ఉత్పత్తి రంగానిది కాదు, చలామణి రంగానిది.

మార్కెట్ దూరంగా వున్న కారణాన పెట్టుబడి సరుకు పెట్టుబడి రూపంలో బందీ అయిన కాలం పెరగడం వల్ల డబ్బు తిరిగి రావడం కూడా ఆలస్యమవుతుంది. ఫలితంగా డబ్బు పెట్టుబడి ఉత్పాదక పెట్టుబడిగా మారడంలో కూడా ఆలస్యం జరుగుతుంది.

మనం ఆరో అధ్యాయంలో, సరుకుల కొనుగోలుకు సంబంధించి మరో సంగతి చూశాం : ముడి పదార్థాల ప్రధాన వనరులున్న ఎక్కువో, తక్కువో దూరాన్ని బట్టి, కొనుగోలు కాలాన్ని బట్టి, ముడి పదార్థాన్ని ఎక్కువ కాలానికి కొని ఉత్పాదక సరఫరా రూపంలో, అంటే ఉత్పాదక పెట్టుబడి కాగల రూపంలో అందుబాటులో వుంచుకోవాలి. దానివల్ల ఒకేసారి అడ్వాన్స్ చేయాల్సిన పెట్టుబడి మొత్తం పెరుగుతుంది. దాన్ని అడ్వాన్స్ చేయాల్సిన కాలం కూడా పెరుగుతుంది. ఉత్పత్తి స్థాయిలో మార్పు లేనంత వరకూ ఇది వర్తిస్తుంది.

అంతో ఇంతో దీర్ఘకాలం పాటు మార్కెట్‌లో పెద్ద పరిమాణాల్లో ముడి పదార్థాలను ఉంచినప్పుడు వివిధ వ్యాపార శాఖల్లో అదే ఫలితం కలుగుతుంది. ఉదాహరణకు లండన్‌లో ప్రతి మూడు నెలలకొకసారి వేలంపాటల ద్వారా పెద్ద ఎత్తున ఉన్ని అమ్మకాలు జరుగుతుంటాయి. ఆ పాటలు మార్కెట్‌ను నియంత్రిస్తుంటాయి. మరోవైపు మొత్తంపై పత్తి మార్కెట్‌లో అయిపోయిన సరుకు స్థానంలో కొత్త సరుకు నిరంతరాయంగా వస్తూంటుంది. ఇది ఏకరీతిగా జరగకపోవచ్చు. కానీ పంట పంటకూ జరుగుతుంటుంది. అది ముడి పదార్థాలను కొనే ప్రధానమైన తేదీలను నిర్ణయిస్తుంది. సట్టా వ్యాపారుల కొనుగోళ్ళపై దాని ప్రభావం చాలా వుంటుంది. కనుక ఈ ఉత్పాదక అంశాల కోసం పెట్టుబడి

ఆయా కాలాలకు, వాటి వ్యవధులను బట్టి అడ్వాన్స్ చేయవలసి వస్తుంది. ఉత్పత్తి అయిన సరుకుల స్వభావం సట్టా వ్యాపారానికై ఒక ఉత్పాదితాన్ని సరుకు పెట్టుబడి కాగల రూపంలో కావాలని ఎలా ఆపి వుంచేలా చేస్తుందో, ఇక్కడ అలాగే జరుగుతుంది. "కొంత మేరకు వ్యవసాయదారుడు కూడా సట్టా వ్యాపారిలాగా వ్యవహరించాలి. ఉన్న పరిస్థితుల వల్ల అవసరమని తోస్తే, తన సరుకుల అమ్మకాన్ని ఆపి వుంచాలి.... "తరువాత పేర్కొన్న కొన్ని సాధారణ నిబంధనలవి...." కాని, ఉత్పాదితాల అమ్మకంలో ప్రతిదీ ఆ వ్యక్తి మీద, అసలు ఆ ఉత్పాదితం మీద, ఆ ప్రదేశం మీద ఆధారపడి వుంటుంది. ఎవరైనా నిపుణుడు అదృష్టవంతుడు (!) మాత్రమేగాక, సరిపడా పని నిర్వాహక పెట్టుబడి కూడా అతనికి వున్నట్లయితే, ఒక ఏడాదిపాటు తన ధాన్యం పంటలను ధర పలకని కారణంగా అట్టిపెట్టి వుంచితే అతన్ని నిందించాల్సిన అవసరం లేదు. మరోవైపున పని నిర్వాహక పెట్టుబడి లేనివాడు లేదా సట్టా వ్యాపారం చేసే సాహసం బొత్తిగా లేనివాడు నాడున్న సగటు ధరలకు అమ్ముకో జూస్తాడు. అమ్మడానికి అవకాశం వచ్చినప్పుడల్లా, వెంటనే అతను అమ్ముకోక తప్పదు. ఉన్నిని ఒక ఏడాదికి మించి నిల్వ ఉంచడమంటే ఖాయంగా నష్టమొచ్చినట్లే లెక్క. కాగా ధాన్యాన్ని, నూనె విత్తులను చాలా ఏళ్ళపాటు నిల్వచేయవచ్చు. వాటి ధర్మాలుగానీ, నాణ్యతగానీ తగ్గవు. వేగంగా ధరల ఎగుడు దిగుడులకు గురయ్యే నూనె విత్తులలాంటి వాటిని, ఉత్పత్తి ధరకంటే అమ్మకం ధర తక్కువగా వున్న సంవత్సరాల్లో నిల్వ వుంచడం మంచిది. బలియబెట్టిన పశువులలాంటి వాటిని ఉంచుకుంటే వాటికి ప్రతిరోజూ డబ్బు ఖర్చవుతూ వుంటుంది. కనుక వాటిని గడువులోగా అమ్మేయాలి. అలాగే పాడైపోయే వస్తువులు, ఉదాహరణకు పళ్ళు, బంగాళాదుంపలు వగైరాలను కూడా త్వరితంగా అమ్మేయాలి. కొన్ని ఉత్పాదితాలు కొన్ని రుతువుల్లో కొన్ని ప్రాంతాల్లో అతి తక్కువ ధర పలుకుతాయి. మరికొన్ని ప్రాంతాల్లో ఎక్కువ ధర పలుకుతాయి. ఉదాహరణకు, క్రిస్మస్ – ఈస్టర్‌ల మధ్య కాలం కంటే సెయింట్ మార్టిన్ డే జరిగే కాలంలో, కొన్ని ప్రాంతాల్లో ధాన్యం సగటు ధర తక్కువ వుంటుంది. అంతేగాక కొన్ని ఉత్పాదితాలు కొన్ని ప్రాంతాల్లో కొన్ని సమయాల్లో మాత్రమే బాగా అమ్ముడవుతాయి. ఉదాహరణకు, మూడు నెలలకొకసారి ఉన్ని అమ్మకం జరిగే ప్రాంతాలు. మిగిలిన సమయాల్లో అక్కడ వ్యాపారం మందకొడిగా వుంటుంది." (Kirchhof, పుట 302)

చలామణి కాలంలో రెండో అర్ధభాగాన్ని, అంటే డబ్బు ఉత్పాదక పెట్టుబడిగా తిరిగి మారే కాలాన్ని పరిశీలిస్తున్నప్పుడు పరిగణనకు తీసుకోవలసినది ఈ పరివర్తనను మాత్రమే కాదు, ఉత్పాదితం అమ్మకమయిన మార్కెట్‌కు గల దూరాన్ని బట్టి డబ్బు తిరిగి ఎంత కాలంలో చేతికందిందనే విషయాన్ని మాత్రమే కాదు, అడ్వాన్సు చేసిన పెట్టుబడిలో ఎల్లప్పుడూ డబ్బు రూపంలో, డబ్బు పెట్టుబడి రూపంలో లభ్యం కావలసివున్న భాగానికి సంబంధించిన మొత్తాన్ని కూడా పరిగణనకు తీసుకోవాలి; ప్రధానంగా పరిగణనకు తీసుకోవలసింది అదే.

సట్టా వ్యాపారంతో ప్రమేయం లేకుండా, ఎప్పుడూ ఉత్పాదక సరఫరాగా లభ్యం కావాల్సిన సరుకుల కొనుగోలు పరిమాణం, ఈ సరఫరా పునరుద్ధరణ కాలాలపైన ఆధారపడి వుంటుంది. ఇవి మార్కెట్ పరిస్థితులపైన ఆధారపడి వుంటాయి. ఈ పరిస్థితులు విభిన్న ముడి పదార్థాల విషయంలో విభిన్నంగా వుంటాయి. ఈ సందర్భాల్లో డబ్బును దఫదఫాలుగా పెద్ద మొత్తాల్లో అడ్వాన్స్ చేయాల్సి

వుంటుంది. అది పెట్టుబడి టర్నోవర్‌ను బట్టి దాదాపు త్వరగా, కానీ ఎల్లప్పుడూ, వాయిదాల్లో తిరిగి వస్తుంది. దీనిలో ఒక భాగం, వేతనాలుగా తిరిగి మార్పు చెందిన భాగం తక్కువ విరామాల్లో నిరంతరాయంగా మళ్ళీ వ్యయం చేయబడుతుంది. మరో భాగం, అంటే ముడిపదార్థాలుగా తిరిగి మార్చవలసిన భాగం మాత్రం చాలాకాలం పాటు పోగుపడాలి. కొనుగోలు చేయడానికి గానీ, చెల్లించడానికి గానీ ఇక్కడ నిల్వ నిధిగా పోగుబడాలి. కనుక అది డబ్బు పెట్టుబడి రూపంలో వుంటుంది. అయితే అది వుండే పరిమాణం మాత్రం మారుతుంది.

ఉత్పత్తి ప్రక్రియ నుండి గానీ, చలామణి రంగం నుండి గానీ తలెత్తే పరిస్థితుల వల్ల అడ్వాన్స్ చేయబడే పెట్టుబడిలో కొంత భాగం డబ్బు రూపంలోనే వుండాలనే విషయాన్ని మనం తర్వాత అధ్యాయంలో చూస్తాం. వ్యాపారంలో అవసరమైన పెట్టుబడిలో ఒక భాగం డబ్బు పెట్టుబడి, ఉత్పాదక పెట్టుబడి, సరుకు పెట్టుబడి అనే దశలను, ఒకదాని తరువాత మరొకదాన్ని గడుస్తుందనే విషయాన్ని ఆర్థికవేత్తలు మర్చిపోవడం కద్దు; అంతేగాదు, దానిలోని వివిధ భాగాలు ఈ రూపాలను నిరంతరాయంగా ఏకకాలంలో కలిగి వుంటాయన్న సంగతిని కూడా మర్చిపోతూ వుంటారు; ఇది గమనార్హం. అయితే ఈ భాగాల సాపేక్ష పరిమాణాలు నిరంతరం మారుతూ వుంటాయి. ఎప్పుడూ డబ్బు పెట్టుబడిగా లభ్యమయ్యే భాగాన్ని ప్రత్యేకించి, ఆర్థికవేత్తలు మర్చిపోతూ వుంటారు. కానీ ఇది బూర్జువా ఆర్థిక వ్యవస్థను అర్థం చేసుకోవడానికి అత్యంత అవసరం. కాబట్టి దాని ప్రాముఖ్యం ఆచరణలో కూడా అనుభూతమవుతుంది.

★ ★ ★

## అధ్యాయం - 15

# అడ్వాన్స్ చేసిన పెట్టుబడి పరిమాణంపై టర్నోవర్ కాలం నెరపే ప్రభావం

ఈ అధ్యాయంలోనూ, దీని తర్వాతదైన 16వ అధ్యాయంలోనూ పెట్టుబడి స్వయం విస్తరణపైన టర్నోవర్ కాలం నెరపే ప్రభావాన్ని పరిశీలిస్తాం.

ఒక పనికాలం ఫలితంగా ఉదాహరణకు, 9 వారాల పనికాలం ఫలితంగా తయారైన సరుకు పెట్టుబడిని తీసుకుందాం. ఉత్పాదితానికి, నిశ్చల పెట్టుబడి యొక్క సగటు అరుగుదల చేర్చిన దాని విలువ భాగాన్ని, అలాగే ఉత్పత్తి ప్రక్రియలో ఉత్పాదితానికి జతకూడే అదనపు విలువను మనం ప్రస్తుతానికి పరిగణనలో నుంచి వదిలేద్దాం. అప్పుడు, ఉత్పాదితం విలువ దాని ఉత్పత్తికోసం అడ్వాన్స్ చేయబడిన చలామణి పెట్టుబడి విలువతో సమానం. అంటే, దాని ఉత్పత్తిలో వినియోగమైన వేతనాలు, ముడి సహాయక పదార్థాల విలువతో సమానం. ఈ విలువ 9 వందల పౌండ్లని అనుకుందాం. కనుక వారం వారం అయ్యే ఖర్చు వంద పౌండ్లు. ఇక్కడ పనికాలం ఉత్పత్తి కాలం ఒకటే కాబట్టి, ఉత్పత్తి కాలం 9 వారాలు. ఇది నిరంతరాయమైన ఉత్పాదితం యొక్క పనికాలమా లేక విడి విడి ఉత్పాదితాలను తయారు చేయడానికి నిరంతరాయంగా పట్టిన పనికాలమా అన్నది ఇక్కడ ప్రస్తుతం (అయితే ఈ విడి విడి ఉత్పాదితాలను ఒకేసారి మార్కెట్‌కు తెచ్చి వుండాలి. వాటికి 9 వారాల శ్రమ వ్యయమై వుండాలి.) చలామణి కాలం మూడు వారాలు అనుకుందాం. ఇప్పుడు మొత్తం టర్నోవర్ కాలం 12 వారాలు. అడ్వాన్స్ చేయబడిన ఉత్పాదక పెట్టుబడి 9 వారాల తర్వాత సరుకు పెట్టుబడిగా మార్చబడి, మూడు వారాల పాటు చలామణి కాలంలో వుంటుంది. కనుక 13వ వారం ప్రారంభం దాకా ఉత్పత్తి కాలం తిరిగి ప్రారంభం కాదు. మూడు వారాల పాటు లేదా నాలుగో వంతు కాలం ఉత్పత్తి స్తంభించిపోతుంది. ఇక్కడ ఉత్పాదితాన్ని అమ్మడానికి అంతకాలం పట్టిందా, లేక మార్కెట్ దూరంగా వుండడం వల్లనో, అమ్మిన సరుకులకు డబ్బు చెల్లింపు షరతుల కారణంగానో అంతకాలం పట్టిందా అన్నది ఇక్కడ అప్రస్తుతం. ప్రతి మూడు నెలలకూ మూడు వారాల పాటు అటువంటి నాలుగు మూడేసి నెలలకు, అంటే ఏడాదికి 12 వారాల పాటు ఉత్పత్తి స్తంభించిపోతుంది. స్తంభించిన కాలం ఏడాదిలో నాల్గో వంతు. కనుక అదే స్థాయిలో ఉత్పత్తి నిరంతరాయంగా వారం వారం కొనసాగాలంటే వున్న ప్రత్యామ్నాయం ఇదొక్కటే.

9 వందల పౌండ్లు పనికాలంలోనూ, మొదటి టర్నోవరు యొక్క చలామణి కాలంలోనూ, పని కొనసాగడానికి సరిపోయేలా ఉత్పత్తి స్థాయిని తగ్గించనైనా తగ్గించాలి. రెండో పని కాలాన్ని,

అంటే ఒక కొత్త టర్నోవరు కాలాన్ని, మొదట టర్నోవర్ కాలం పూర్తి కావడానికి ముందే (టర్నోవర్ కాలం 12 వారాలు అవడంచేత, పనికాలం 9 వారాలు అవడంచేత) పదో వారంతో మొదలు పెట్టాలి. 9 వందల పౌండ్లను పది వారాలకు సర్దితే వారానికి 75 పౌండ్లవుతుంది. ఆ రకంగా వ్యాపార స్థాయిని తగ్గించడం అంటే, నిశ్చల పెట్టుబడి పరిమాణం కూడా తగ్గించినట్లే. మొత్తం మీద వ్యాపారాన్ని కూడా తగ్గించినట్లే అవుతుంది. అయితే అలా తగ్గించడం అసలు సాధ్యమా అన్నది ప్రశ్న. ఎందువల్లనంటే, ప్రతి వ్యాపారానికీ పోటీ చేయగల శక్తి వుండాలంటే, దాని అభివృద్ధి స్థాయికి అనుగుణంగా అందులో ఒక మామూలు కనీస ప్రమాణం గల పెట్టుబడి మదుపు అవసరం. పెట్టుబడిదారీ ఉత్పత్తి పురోగమనంతో పాటు ఈ పెట్టుబడి కూడా పెరుగుతూ వుంటుంది. కనుక అది స్థిరమైనది కాదు. ఏ నిర్దిష్ట సమయంలోనైనా వుండే ఈ కనీస మొత్తానికి, నిరంతరాయంగా పెరిగే గరిష్ట మొత్తానికి నడుమ అనేక మధ్యంతర స్థాయిలున్నాయి. ఈ రెంటి అవధుల మధ్య పెట్టుబడి మదుపు ఎన్నో భిన్న భిన్న స్థాయిల్లో వుండవచ్చు. ఈ అవధుల లోపల తగ్గుదలలు జరగవచ్చు. ఆ తగ్గుదలల కనీస పరిమితే ఆనాడున్న మామూలు కనీస స్థాయి.

ఉత్పత్తికి ఏదైనా అడ్డంకి కలిగినప్పుడు, మార్కెట్ నిండా అతిగా సరుకులు పోగుపడటం, ముడి పదార్థాల ధరలు పెరగడం మొదలైనవి సంభవించినప్పుడు చలామణి పెట్టుబడి మామూలు మదుపు కుదించబడుతుంది. నిశ్చల పెట్టుబడి ఏ రీతిలో వుండాలో నిర్ణయమైన తరువాత, పని జరిపించే కాలాన్ని కుదించడం ద్వారా, ఉదాహరణకు సగానికి తగ్గించడం ద్వారా, చలామణి పెట్టుబడి మదుపును తగ్గించడం జరుగుతుంది. మరోవైపున సంక్షేమ కాలంలో, నిశ్చల పెట్టుబడి ఫలానా రీతిలో వుండాలని నిర్ణయమై వున్నప్పుడు, చలామణి పెట్టుబడి అపరిమితంగా పెరుగుతుంది. పాక్షికంగా, పని జరిపించే కాలాన్ని పెంచడం ద్వారా, పాక్షికంగా, పని తీవ్రతను పెంచడం ద్వారా ఇది జరుగుతుంది. మొదటి నుంచి అటువంటి ఎగుడు దిగుడులను దృష్టిలో ఉంచుకోవలసిన వ్యాపారాల్లో, పై చర్యల ద్వారానూ, ఒకేసారి అధిక సంఖ్యలో కార్మికుల్ని పనిలో పెట్టడం ద్వారానూ, దానితో పాటుగా నిల్వ వుంచిన నిశ్చల పెట్టుబడి వినియోగం ద్వారానూ ఒత్తిడిని తగ్గించడం కద్దు. రైల్వేలలో నిల్వ వున్న ఇంజన్లను బయటికి తీయడం మొదలైనవి ఇందుకు ఉదాహరణ. అయితే ఇక్కడ అటువంటి అసాధారణ ఎగుడు దిగుడులను మనం పరిశీలించడం లేదు. మామూలు పరిస్థితులున్నట్లు మాత్రమే మనం ఊహిస్తున్నాం.

కాబట్టి ఉత్పత్తి నిరంతరాయంగా సాగడం కోసం, ఇక్కడ అదే చలామణి పెట్టుబడిని మరింత ఎక్కువ కాలానికి, అంటే 9 నెలల బదులు 12 నెలలకు సర్దుతారు. ఫలితంగా ప్రతి కాల విభాగంలోనూ తగ్గిన పరిమాణంలో ఉత్పాదక పెట్టుబడి పనిచేస్తుంది. ఉత్పాదక పెట్టుబడి యొక్క చలామణి భాగం 100 నుంచి 75కు, అంటే నాలుగో వంతు తగ్గించబడుతుంది. పనికి పట్టే కాలం 9 వారాలనుకొన్నాం. ఆ 9 వారాల పాటు పనిచేసే ఉత్పాదక పెట్టుబడిలో మొత్తంగా తగ్గించబడినది 25×9 లేదా రెండు వందల ఇరవై అయిదు పౌండ్లు. అంటే, ఇది 9 వందల పౌండ్లలో నాలుగో వంతు. అయితే, చలామణి కాలానికి టర్నోవర్ కాలానికి వున్న నిష్పత్తి 3:12, అంటే నాలుగో వంతు. దీన్నిబట్టి తేలేదేమిటంటే : సరుకు పెట్టుబడిగా మారిన ఉత్పాదక పెట్టుబడి యొక్క చలామణి కాలంలో ఉత్పత్తికి అంతరాయం కలగకుండా వుండాలంటే, దాన్ని వారం వారం ఏకకాలంలోనూ,

నిరంతరాయంగానూ కొనసాగించాలంటే, దీనికోసం ప్రత్యేకమైన చలామణి పెట్టుబడి లభ్యం కానప్పుడు, ఉత్పాదక కార్యకలాపాలను తగ్గించం ద్వారా మాత్రమే, పనిచేస్తున్న ఉత్పాదక పెట్టుబడిలోని చలామణి భాగాన్ని తగ్గించడం ద్వారా మాత్రమే సాధ్యం. ఆ రకంగా చలామణి కాలంలో ఉత్పత్తికోసం విడుదల చేయబడిన పెట్టుబడి భాగం మొత్తం అడ్వాన్స్ చేయబడిన చలామణి పెట్టుబడికి ఎలాంటిదో, చలామణి కాలం టర్నోవర్ కాలానికి అలాంటిది. ఇంతకుముందే చెప్పినట్లుగా, శ్రమ ప్రక్రియ ప్రతివారం ఒకే స్థాయిలో నిర్వహించబడే ఉత్పత్తి శాఖలకు మాత్రమే ఇది వర్తిస్తుంది. కాబట్టి వ్యవసాయంలోలాగా, విభిన్న పనికాలాల్లో విభిన్న మొత్తాల పెట్టుబడులను ఇక్కడ మదుపు పెట్టనక్కర్లేదు.

అలాకాక, ఆ వ్యాపార స్వభావం రీత్యా, ఉత్పత్తి స్థాయిని, ప్రతి వారం అడ్వాన్స్ చేయబడే చలామణి పెట్టుబడి స్థాయిని తగ్గించడం సాధ్యం కాదని మనం ఊహించుకొన్నప్పుడు ఉత్పత్తి నిరంతరాయంగా సాగడానికి అదనపు చలామణి పెట్టుబడిని జత చేయడం ఒక్కటే మార్గం. పైన పేర్కొన్న ఉదాహరణలో 3 వందల పౌండ్లు జత చేయాల్సి వస్తుంది. 12 వారాల టర్నోవర్ కాలంలో వరుసగా 12 వందల పౌండ్లు మదుపు పెట్టబడతాయి. 12 వారాల్లో మూడు వారాలు నాల్గోవంతు అయినట్లే, ఈ మొత్తంలో 3 వందల పౌండ్లు నాలుగో వంతు. 9 వారాల పనికాలం తర్వాత 9 వందల పౌండ్ల పెట్టుబడి విలువ ఉత్పాదక పెట్టుబడి రూపం నుండి సరుకు పెట్టుబడి రూపంలోకి మారుతుంది. దాని పనికాలం పూర్తయింది. కాని అదే పెట్టుబడితో పనిని పునఃప్రారంభించలేము. చలామణి రంగంలో సరుకు పెట్టుబడిగా అది వుండే మూడు వారాల్లో ఉత్పత్తి ప్రక్రియకు సంబంధించి నంత వరకూ, అది లేనిదానితో సమానమే. ప్రస్తుత ఉదాహరణలో మనం పరపతి వ్యవస్థ సంబంధాలను పరిగణనలోకి తీసుకోం. పెట్టుబడిదారు తన సొంత డబ్బుతో మాత్రమే పనిచేస్తున్నాడని అనుకుందాం. అయితే మొదటి పనికాల వ్యవధికి అడ్వాన్స్ చేయబడిన పెట్టుబడి తన ఉత్పత్తి ప్రక్రియను పూర్తి చేసుకుని, చలామణి ప్రక్రియలో వున్న మూడు వారాల కాలంలో ఉత్పత్తి అవిచ్ఛిన్నతకు భంగం కలుగకుండా వుండేలా, మూడు వందల పౌండ్ల అదనపు పెట్టుబడి పనిచేస్తుంటుంది.

దీనికి సంబంధించి, ఈ క్రింది అంశాలను గమనించాలి.

మొదటిది – ప్రారంభంలో అడ్వాన్స్ చేయబడిన 9 వందల పౌండ్ల పెట్టుబడి పనికాల వ్యవధి 9 వారాల చివరిలో పూర్తవుతుంది. మరో మూడు వారాలు గడవనిదే అనగా 13వ వారం ప్రారంభం వరకూ అది తిరిగి రాదు. అయితే మరో 3 వందల పౌండ్లు అదనపు పెట్టుబడి సాయంతో కొత్త పనికాలం తక్షణమే ప్రారంభమైంది. ఆ రకంగా ఉత్పత్తి నిరంతరాయంగా కొనసాగించబడింది.

రెండోది – మొదట పెట్టిన 9 వందల పౌండ్ల పెట్టుబడి విధులనూ, మొదటి 9 వారాల పని నియతకాలం చివరిలో రెండో వారం పనికాలం ప్రారంభం కావడానికి పెట్టిన 3 వందల పౌండ్ల పెట్టుబడి విధుల మొదటి టర్నోవర్ కాలంలో స్పష్టంగా వేరు చేసి చూపడం జరుగుతుంది లేదా కనీసం వేరు చేసి చూపవచ్చు. అయితే రెండో టర్నోవర్ కాలంలో అవి ఒకదాని విధుల్లో మరొకటి పాల్గొంటాయి.

ఈ విషయాన్ని మరింత స్పష్టం చేద్దాం.

12 వారాలు మొదటి టర్నోవరు కాల వ్యవధి. 9 వారాలు మొదటి పనికాల వ్యవధి. ఈ కాలానికి అడ్వాన్స్ చేయబడిన పెట్టుబడి టర్నోవర్ 13వ వారం ప్రారంభానికి పూర్తయింది. చివరి 3

వారాల్లోనూ 3 వందల పౌండ్ల అదనపు పెట్టుబడి 9 వారాల రెండో పనికాల వ్యవధిని ప్రారంభిస్తుంది.

టర్నోవర్ యొక్క రెండో కాల వ్యవధి, 13వ వారం ప్రారంభంలో 9 వందల పౌండ్లు తిరిగి వచ్చి మరో కొత్త టర్నోవర్‌ను ప్రారంభించడానికి సిద్ధంగా వున్నాయి. అయితే రెండో పనికాల వ్యవధిని పదోవారం ప్రారంభంలో 3 వందల పౌండ్ల అదనపు పెట్టుబడి అప్పటికే ప్రారంభించింది. దీనివల్ల, 13వ వారం ప్రారంభం అయ్యేటప్పటికి పనికాల వ్యవధిలో మూడోభాగం అయిపోయింది. 3 వందల పౌండ్లు ఉత్పాదక పెట్టుబడి నుండి ఉత్పాదితంగా మారింది. కనుక రెండో పనికాల వ్యవధి పూర్తి కావడానికి మరో ఆరు వారాలు మాత్రమే పడుతుంది. కనుక తిరిగి వచ్చిన 9 వందల పౌండ్లలో మూడింట రెండు వంతులు, అంటే ఆరు వందల పౌండ్లు మాత్రమే రెండో పనికాల వ్యవధికి సంబంధించిన ఉత్పాదక ప్రక్రియలో ప్రవేశించగలదు. మొదటి పనికాల వ్యవధిలో అదనపు పెట్టుబడి అయిన మూడు వందల పౌండ్లు నిర్వహించిన పాత్రనే నిర్వహించడానికి మొదట పెట్టిన 9 వందల పౌండ్లలో 3 వందల పౌండ్లు విడుదల అయ్యాయి. రెండో టర్నోవరు కాల వ్యవధిలోని ఆరో వారం ముగిసేసరికి, రెండో పనికాల వ్యవధి పూర్తవుతుంది. దానిలో పెట్టబడిన 9 వందల పౌండ్ల పెట్టుబడి 32 వారాల తరువాత తిరిగి వస్తుంది. అంటే 12 వారాల రెండో టర్నోవర్ వ్యవధిలోని 9వ వారాంతానికి అది తిరిగి వస్తుంది. విడుదలైన మూడు వందల పౌండ్ల పెట్టుబడి దాని మూడు వారాల చలామణి కాల వ్యవధిలో రంగంలోకి వస్తుంది. ఇది రెండో టర్నోవర్ కాల వ్యవధిలోని ఏడో వారంలో లేదా ఆ సంవత్సరంలోని 19వ వారంలో, 9 వందల పౌండ్ల పెట్టుబడి యొక్క 3వ పనికాల వ్యవధిని ప్రారంభిస్తుంది.

3వ టర్నోవర్ కాలం, రెండో టర్నోవర్ వ్యవధిలోని 9వ వారం చివర 9 వందల పౌండ్ల పెట్టుబడి తిరిగి కొత్తగా చలామణిలోకి వస్తుంది. అయితే అప్పటికే, అంతకు ముందున్న టర్నోవర్ వ్యవధిలోని ఏడో వారంలో మూడో పనికాల వ్యవధి ప్రారంభమై ఆరు వారాలు గడిచింది. కనుక మూడో పనికాల వ్యవధిలో మరో 3 వారాలు మాత్రమే వుంటుంది. కనుక తిరిగి వచ్చిన 9 వందల పౌండ్ల మొత్తంలో 3 వందల పౌండ్లు మాత్రమే ఉత్పత్తి ప్రక్రియలో ప్రవేశిస్తాయి. నాలుగో పని వ్యవధి మిగిలిన ఈ 9 వారాల టర్నోవర్ కాలాన్ని పూర్తి చేస్తుంది. ఆ రకంగా, ఆ ఏడాదిలోని 37వ వారం ఏకకాలంలో నాలుగో టర్నోవర్ కాల వ్యవధినీ, ఐదో పనికాల వ్యవధినీ ప్రారంభిస్తుంది.

సులభంగా లెక్కగట్టడం కోసం పని వ్యవధిని 5 వారాలుగానూ, చలామణి కాలాన్ని 5 వారాలుగానూ తీసుకుందాం. మొత్తం టర్నోవర్ కాలం 10 వారాలు. ఏడాదికి యాభై వారాలు మాత్రమే వున్నాయనుకుందాం. వారంలో పెట్టే పెట్టుబడి వంద పౌండ్లు అనుకొందాం. పని వ్యవధికి అప్పుడు ఐదు వందల పౌండ్ల చలామణి పెట్టుబడి అవసరమవుతుంది. చలామణి కాలానికి మరో 5 వందల పౌండ్ల పెట్టుబడి కావాలి. పనికాల వ్యవధులు, టర్నోవర్ కాలాలు అప్పుడు ఈ కింది విధంగా వుంటాయి.

1వ పనికాల వ్యవధి 1వ వారం నుంచి 5వ వారం వరకు (500 పౌండ్లు, సరుకులుగా) 10వ వారం చివర తిరిగి వచ్చాయి.

2వ పనికాల వ్యవధి 6వ వారం నుండి 10వ వారం వరకు (500 పౌండ్లు, సరుకులుగా) 15వ వారం చివర తిరిగి వచ్చాయి.

3వ పనికాల వ్యవధి 11వ వారం నుండి 15వ వారం వరకు (500 పౌండ్లు, సరుకులుగా) 20వ వారం చివర తిరిగి వచ్చాయి.

4వ పనికాల వ్యవధి 16వ వారం నుంచి 20వ వారం వరకు (500 పౌండ్లు, సరుకులుగా) 25వ వారం చివర తిరిగి వచ్చాయి.

5వ పనికాల వ్యవధి 21వ వారం నుంచి 25వ వారం వరకు (500 పౌండ్లు, సరుకులుగా) 30వ వారం చివర తిరిగి వచ్చాయి.

ఇలాగే మిగిలినవి కూడా.

చలామణి కాలం '0' అయితే, టర్నోవర్ కాలం పనికాలం వ్యవధితో సమానమవుతుంది. అప్పుడు టర్నోవర్ల సంఖ్య సంవత్సరంలోని పనికాల వ్యవధుల సంఖ్యతో సమానం. పనికాల వ్యవధి 5 వారాలయినప్పుడు, ఏడాదికి 50/5 వారాలు లేదా పది టర్నోవర్‌లు జరుగుతాయి. టర్నోవర్ అయిన పెట్టుబడి విలువ పదికి 5 వందల రెట్లు లేదా 5 వేలు వుంటుంది. పై పట్టికలో వున్న చలామణి కాలాన్ని 5 వారాలని అంచనా వేశాం. ఏడాదికి ఉత్పత్తి అయ్యే సరుకుల విలువ కూడా 5 వేల పౌండ్లు వుంటుంది. అయితే, దీనిలో పదోవంతు అంటే 5 వందల పౌండ్లు ఎప్పుడూ సరుకు పెట్టుబడి రూపంలో వుంటుంది. అది 5 వారాలు గడిచే వరకూ తిరిగి రాదు. ఏడాది చివరలో, పదో పనికాల వ్యవధి (46 నుంచి 50వ పని వారం వరకు) యొక్క ఉత్పాదితం తన టర్నోవర్ కాలంలో సగమే పూర్తి చేసి వుంటుంది. దాని చలామణి కాలం మాత్రం రెండో సంవత్సరం మొదటి 5 వారాల్లో వుంటుంది.

మూడో ఉదాహరణ తీసుకుందాం. పనికాల వ్యవధి ఆరు వారాలు, చలామణి కాలం మూడు వారాలు, శ్రమ ప్రక్రియలో వారం వారం అడ్వాన్స్ చేసేది వంద పౌండ్లని అనుకొందాం.

**మొదటి పనికాల వ్యవధి :** మొదటి వారం నుండి ఆరో వారం వరకు. ఆరోవారం చివరిలో ఆరు వందల పౌండ్ల సరుకు పెట్టుబడి 9వ వారం చివర తిరిగి వస్తుంది.

**రెండో పనికాల వ్యవధి :** ఏడవ వారం నుంచి 12వ వారం వరకు, 7వ వారం నుంచి 9వ వారం వరకు 3 వందల పౌండ్ల అదనపు పెట్టుబడి అడ్వాన్స్ చేయబడింది. 9వ వారం చివరిలో ఆరు వందల పౌండ్లు తిరిగి వచ్చాయి. దీనిలో 3 వందల పౌండ్లు 10వ వారం నుంచి 12వ వారం వరకు అడ్వాన్స్ చేయబడ్డాయి. కనుక 12వ వారం చివరిలో 3 వందల పౌండ్లు పని లేకుండా చేతిలో వున్నాయి. ఆరు వందల పౌండ్లు సరుకు పెట్టుబడి రూపంలో వున్నాయి. 15వ వారాంతంలో అవి తిరిగి వస్తాయి.

**మూడవ పనికాల వ్యవధి :** 13వ వారం నుంచి 18వ వారం వరకు 3 వందల పౌండ్లు అడ్వాన్స్ చేయబడింది. ఆరు వందల పౌండ్లు తిరిగి వచ్చాయి. వాటిలో 3 వందల పౌండ్లు 16వ వారం నుంచి 18వ వారం వరకు అడ్వాన్స్ చేయబడ్డాయి. 18వ వారం చివరిలో 5 వందల పౌండ్లు డబ్బు రూపంలో పని లేకుండా చేతిలో వున్నాయి. ఆరు వందల పౌండ్లు వరకు పెట్టుబడిగా వుంది. అది 21వ వారం తిరిగి వస్తుంది (మరింత వివరంగా దీన్ని రెండో శీర్షికలో చూడండి).

మరో రకంగా చెప్పాలంటే, 9 పనికాల వ్యవధుల్లోనూ (54 వారాలు) మొత్తం 9కి 6 వందల రెట్లు అంటే, 5 వేల 4 వందల పౌండ్లు విలువైన సరుకులు ఉత్పత్తి చేయబడ్డాయి. 9వ పనికాల

వ్యవధి చివరిలో పెట్టుబడిదారుని చేతిలో 3 వందల పౌండ్లు డబ్బు రూపంలో వున్నాయి. ఇంకా చలామణిని పూర్తి చేయని 6 వందల పౌండ్లు సరుకు రూపంలో వున్నాయి.

ఈ మూడు ఉదాహరణలను పోల్చి చూస్తే, ఈ విషయాలు స్పష్టమవుతాయి : మొదటిది – 5 వందల పౌండ్ల పెట్టుబడి–I, 5 వందల పౌండ్ల అదనపు పెట్టుబడి–II వరుసగా ఒకటి మరొకదాని స్థానాన్ని భర్తీ చేసి, దాన్ని విడుదల చేయడం రెండో ఉదాహరణలో మాత్రమే చూస్తాం. ఈ రెండు పెట్టుబడి భాగాలు విడి విడిగా ఒక దానితో ఒకటి సంబంధం లేకుండా కదులుతాయి. అయితే మనం టర్నోవర్ కాలంలో, పనికి పట్టే కాలం, చలామణి కాలం సరిగ్గా సగం సగం వుంటాయని (ఇలా సాధారణంగా వుండదు) ఊహించాం. కనుక ఇలా జరుగుతుంది. మిగిలిన అన్ని సందర్భాల్లోనూ టర్నోవర్ కాలంలోని రెండు అంతర్భాగాల మధ్య తేడా ఎంత వున్నప్పటికీ, ఈ రెండు పెట్టుబడుల చలనాలు 1, 3 ఉదాహరణలలోలాగా ఒకదానిలో ఒకటి ప్రవేశిస్తాయి. ఇది రెండో టర్నోవర్ కాలంతో మొదలవుతుంది. అదనపు పెట్టుబడి–II పెట్టుబడి–I లోని ఒక భాగంతో కలిసి రెండో టర్నోవర్ కాలంలో పెట్టుబడిగా వ్యవహరిస్తుంది. కాగా పెట్టుబడి–I లో మిగిలిన భాగం విడుదలై పెట్టుబడి–II యొక్క తొలి విధిని నిర్వహిస్తుంది. సరుకు పెట్టుబడి యొక్క చలామణి పనిచేసే పెట్టుబడి, ఈ సందర్భంలో, ఇందుకోసం అడ్వాన్స్ చేయబడిన పెట్టుబడి–II కి సదృశమయినది కాదు. అయితే అది అంతే విలువ గలది. మొత్తం అడ్వాన్స్ చేయబడిన మొత్తం పెట్టుబడిలో అంతే వంతులో వుంటుంది.

రెండో విషయం – పనికాలంలో తన విధి నిర్వహించిన పెట్టుబడి, చలామణి కాలంలో ఖాళీగా వుంటుంది. రెండో ఉదాహరణలో, పెట్టుబడి 5 వారాల పాటు పనికాలంలో తన విధి నిర్వహిస్తూ వుంటుంది. మరో 5 వారాల పాటు చలామణి రంగంలో ఖాళీగా వుంటుంది. కనుక పెట్టుబడి–I ఖాళీగా వుండే మొత్తం కాలం సంవత్సరంలో సగమన్న మాట. ఈ కాలంలో పనిచేసేది అదనపు పెట్టుబడి–II. అది కూడా సంవత్సరంలో సగభాగం ఖాళీగా వుండిందే. అయితే చలామణి కాలంలో ఉత్పత్తి కొనసాగడం కోసం అవసరమైన అదనపు పెట్టుబడి, మొత్తం పెట్టుబడిపై గానీ, ఏడాదిలో చలామణి కాలాల మొత్తంపై గానీ ఆధారపడి వుండదు. అది చలామణి కాలానికి, టర్నోవర్ కాలానికి మధ్య వున్న నిష్పత్తిపై ఆధారపడి వుంటుంది. (ఇక్కడ మనం టర్నోవర్‌లన్నీ ఒకే పరిస్థితుల్లో జరుగుతున్నట్లు ఊహిస్తున్నాం). అందుకే, రెండో ఉదాహరణలో అవసరమైన అదనపు పెట్టుబడి 5 వందల పౌండ్లు మాత్రమే తప్ప, 2 వేల 5 వందల పౌండ్లు కాదు. ఎందుకంటే, అదనపు పెట్టుబడి కూడా మొదట అడ్వాన్స్ చేయబడిన పెట్టుబడిలాగే టర్నోవర్‌లో ప్రవేశిస్తుంది. కాబట్టి అది కూడా మొదట అడ్వాన్స్ చేసిన పెట్టుబడిలాగానే, తన టర్నోవర్‌ల సంఖ్యను బట్టి తన పరిమాణాన్ని భర్తీ చేసుకొంటుంది.

మూడోది – పనికి పట్టే కాలం కంటే ఉత్పత్తి కాలం ఎక్కువగా వుందా, లేక తక్కువగా వుందా అనేది మనం ఇక్కడ పరిశీలిస్తూన్న పరిస్థితులను ప్రభావితం చేయదు. దానివల్ల టర్నోవర్ కాలం మొత్తం పెరుగుతున్న మాట నిజమే. అయితే, ఈ పెరుగుదల వల్ల శ్రమ ప్రక్రియకు అదనపు పెట్టుబడి ఏదీ అవసరం కాదు. అదనపు పెట్టుబడి, చలామణి కాలం వల్ల శ్రమ ప్రక్రియలో తలెత్తే ఖాళీలను పూరించడం మాత్రమే చేస్తుంది. కనుక చలామణి కాలం మూలంగా తలెత్తే అంతరాయాల

నుంచి ఉత్పత్తిని రక్షించడానికి మాత్రమే అది వుంది. ఉత్పత్తి ప్రత్యేక పరిస్థితుల వల్ల వచ్చే అంతరాయాలను మరో రకంగా తొలగించాల్సి వుంటుంది. అది ఇక్కడ చర్చనీయాంశం కానక్కర్లేదు. అయితే, కొన్ని సంస్థల్లో పని, ఆర్డర్లను బట్టి విడిచి విడిచి జరుగుతుంది. కాబట్టి పని వ్యవధుల మధ్య విరామాలు వుంటాయి. అటువంటి సందర్భాల్లో అదనపు పెట్టుబడి యొక్క అవసరం తదనుగుణంగా తొలగించబడుతుంది. మరోవైపున రుతువును బట్టి జరిగే పనిలో, అత్యధిక సందర్భాల్లో, డబ్బు తిరిగి రావడానికి పట్టే కాలానికి ఒక నిర్దిష్ట పరిమితి వుంటుంది. ఒక పెట్టుబడి చలామణి కాలం గడిచిపోకుంటే, ఈలోగా అదే పని రెండో సంవత్సరం అదే పెట్టుబడితో తిరిగి నిర్వహించడం సాధ్యం కాదు. మరోవైపున, చలామణి కాలం రెండు ఉత్పత్తి కాలాల మధ్య వున్న విరామం కంటే తక్కువగా వుండవచ్చు. ఆ సందర్భంలో పెట్టుబడిని మరోరకంగా ఉపయోగించుకోలేకపోతే అది ఖాళీగా వుంటుంది.

నాలుగోది – ఒక నిర్దిష్ట పనికాల వ్యవధికి అడ్వాన్స్ చేయబడిన పెట్టుబడి. ఉదాహరణకు, పై మూడో ఉదాహరణలోని ఆరువందల పౌండ్లు పనికాల వ్యవధికి ఉత్పాదక సరఫరా కోసం, ముడి సహాయక పదార్థాల్లో కొంత, అంటే స్థిరమైన చలామణి పెట్టుబడిలోనూ, అస్థిర చలామణి పెట్టుబడిలో, అంటే శ్రమకు వేతనం చెల్లించడంలో కొంత మదుపు పెట్టబడుతుంది. స్థిర చలామణి పెట్టుబడిపై వెచ్చించబడిన భాగం అంతేకాలం పాటు ఒక ఉత్పాదక సరఫరా రూపంలో వుండకపోవచ్చు. ఉదాహరణకు, ముడిపదార్థం మొత్తం పనికాలానికి సరిపడా చేతిలో వుండకపోవచ్చు. బొగ్గును ప్రతి రెండు వారాలకు ఓసారి చొప్పున కొనుగోలు చేయాల్సి రావచ్చు. కాని, ఇక్కడ పరపతి వ్యవస్థను పరిగణనలోకి తీసుకోవడం లేదు కనుక, పెట్టుబడి యొక్క ఈ భాగం ఉత్పాదక సరఫరా రూపంలో లభ్యంకాని మేరకు, డబ్బు రూపంలో చేతిలో వుండాలి. అవసరమైనప్పుడు దాన్ని ఉత్పాదక సరఫరాగా మార్చడానికి ఇది అవసరం. ఆరు వారాల పాటు అడ్వాన్స్ చేయబడిన స్థిర – చలామణి పెట్టుబడి విలువ పరిమాణం దీనివల్ల మారదు. మరోవైపు ముందు ఊహించని ఖర్చుల కోసం అవసరమైన డబ్బు సరఫరాతో అంటే, ఆటంకాలను తొలగించడానికి ఏర్పాటు చేసిన అసలు రిజర్వు నిధితో ప్రమేయం లేకుండా, వేతనాలను స్వల్ప విరామాల్లో, చాలా వరకూ వారం వారం చెల్లించడం జరుగుతుంది. కనుక పెట్టుబడిదారుడు కార్మికుడ్ని తన శ్రమను మరింత ఎక్కువ కాలానికి అడ్వాన్స్ చేసేలా ఒత్తిడి చేస్తే తప్ప, వేతనాలకు అవసరమైన పెట్టుబడి, డబ్బు రూపంలో చేతిలో సిద్ధంగా వుండాలి. పెట్టుబడి తిరిగి వచ్చినప్పుడు, కొంత భాగాన్ని శ్రమకు చెల్లించడం కోసం డబ్బు రూపంలో వుంచుకోవాలి. కాగా మిగిలిన భాగాన్ని ఉత్పాదక సరఫరాగా మార్చవచ్చు.

అదనపు పెట్టుబడి అచ్చంగా తొలి పెట్టుబడిలాగానే విభజితమవుతుంది. అయితే దీన్ని తొలి పెట్టుబడి నుంచి వేరు చేసి చూపే అంశం (పరపతి సంబంధాలుగాక) ఒకటి వుంది; తన సొంత పనికాల వ్యవధికి అందుబాటులో వుండటం కోసం, పెట్టుబడి–I యొక్క మొదటి పనికాలంలో అది ప్రవేశించదు కానీ, ఆ కాలమంతటా అది అడ్వాన్స్ చేయబడాలి. ఈ కాలంలో, ఈ మొత్తంలో కనీసం కొంతైనా అదివరకే స్థిర–చలామణి పెట్టుబడిగా మారి వుండవచ్చు. ఎందువల్లనంటే అది టర్నోవర్ కాలానికంతటికీ అడ్వాన్స్ చేయబడిన మొత్తం. అది ఏ మేరకు ఈ రూపాన్ని ధరిస్తుంది లేదా ఈ పరివర్తన అవసరమయ్యే దాకా అదనపు డబ్బు – పెట్టుబడి రూపంలోనే నిలిచి వుంటుంది,

అన్న విషయం నిర్దిష్ట వ్యాపార శాఖలలోని ప్రత్యేక ఉత్పత్తి పరిస్థితులపైన కొంత, ముడిపదార్థాల ధరల్లో ఎగుడుదిగుళ్ళు, వగైరా లాంటి వాటిపైన మరికొంత ఆధారపడి వుంటుంది. సామాజిక పెట్టుబడిని మొత్తంగా పరిగణనలోకి తీసుకొంటే, ఈ అదనపు పెట్టుబడిలో దాదాపు గణనీయమైన భాగం కాస్త దీర్ఘకాలమే డబ్బు పెట్టుబడి రూపంలో వుంటుందనేది విదితమే. అయితే పెట్టుబడి–IIలో వేతనాల కోసం చెల్లించే భాగాన్ని తీసుకుంటే, కొద్దిపాటి వ్యవధి గల పనికాలాలు పూర్తి అయి చెల్లించబడుతూంటాయి. కాబట్టి ఆ భాగం క్రమక్రమంగా మాత్రమే శ్రమశక్తిగా మారుతూంటుంది. అందువల్ల పెట్టుబడి–IIలోని ఈ భాగం ఉత్పాదక పెట్టుబడి యొక్క పనిలో పాల్గొని శ్రమశక్తిగా మారేంత వరకూ మొత్తం పనికాలంలో డబ్బు పెట్టుబడి రూపంలోనే వుంటుంది.

పెట్టుబడి–I యొక్క చలామణి కాలాన్ని ఉత్పత్తి కాలంగా మార్చడానికి అవసరమైన అదనపు పెట్టుబడి రంగప్రవేశం, అడ్వాన్స్ చేయబడిన పెట్టుబడి పరిమాణాన్నీ, మొత్తం పెట్టుబడి అడ్వాన్స్ చేయబడవలసిన కాలాన్నీ మాత్రమే కాకుండా, డబ్బు రూపంలో వున్న పెట్టుబడి భాగాన్ని ప్రత్యేకించి పెంచుతుంది. డబ్బు సరఫరా రూపంలో వున్నందువల్ల దీనికి డబ్బు పెట్టుబడి కాగల రూపముంది.

చలామణి కాలం వల్ల పెట్టుబడి రెండు భాగాలుగా విడిపోవడం, అంటే మొదటి పనికాలానికి పెట్టుబడిగానూ, చలామణి కాలంలో దాని స్థానాన్ని భర్తీ చేసే పెట్టుబడిగానూ విడిపోవడం, పెట్టుబడి మదుపును పెంచడం వల్లగాక, ఉత్పత్తి స్థాయిని తగ్గించడం వల్ల జరిగిన సందర్భంలో కూడా ఉత్పాదక సరఫరా రూపంలోనూ, డబ్బు సరఫరా రూపంలోనూ అడ్వాన్స్ అయిన మొత్తాలు రెంటికీ ఇదే వర్తిస్తుంది. డబ్బు రూపంలో చిక్కడిపోయిన పెట్టుబడి మొత్తం ఇక్కడ ఉత్పత్తి స్థాయిని బట్టి ఇంకా ఎక్కువ పెరుగుతుంది.

ఇలా పెట్టుబడిని తొలి ఉత్పాదక పెట్టుబడిగా, అదనపు పెట్టుబడిగా విభజించడం వల్ల సాధించింది ఏమంటే, పనికాల వ్యవధులు నిరంతరాయంగా ఒకదాని తర్వాత ఒకటి సాగుతూంటాయి. అడ్వాన్స్ చేయబడిన పెట్టుబడిలో ఒక సమానమైన భాగం ఉత్పాదక పెట్టుబడిగా నిరంతరం పని చేస్తూంటుంది.

రెండో ఉదాహరణ చూద్దాం. ఉత్పత్తి ప్రక్రియలో నిరంతరాయంగా వినియోగించబడిన మొత్తం పెట్టుబడి 5 వందల పౌండ్లు. పనికి పట్టే కాలం 5 వారాలు కనుక అది యాభై వారాల్లోనూ (సంవత్సరానికి 50 వారాలనుకొంటున్నాం) పదిసార్లు పనిచేస్తుంది. అదనపు విలువగాక, దాని ఉత్పాదితం 5 వందల పౌండ్లకు పది రెట్లు లేదా 5 వేల పౌండ్లు, నేరుగా నిర్విఘ్నంగా ఉత్పత్తి ప్రక్రియలో పని చేస్తున్న పెట్టుబడి దృష్టి నుంచి (పెట్టుబడి విలువ 5 వందల పౌండ్లు) చలామణి కాలం అసలే లేనట్లుంది. టర్నోవర్ కాలం పనికాలంతో ఏకీభవిస్తుంది. ఇక్కడ చలామణి కాలం సున్నాగా ఊహించుకొంటున్నాము.

అయితే, 5 వందల పౌండ్ల పెట్టుబడి యొక్క ఉత్పాదక కార్యకలాపానికి 5 వారాల చలామణి కాలం వల్ల క్రమం తప్పకుండా అంతరాయం కలిగితే మరో పదివారాల టర్నోవర్ కాలం పూర్తయిన తర్వాత మాత్రమే మళ్ళీ ఉత్పత్తి ప్రారంభమవుతుంది. అప్పుడు యాభై వారాల సంవత్సరంలో పది వారాల టర్నోవర్‌లు 5 వుంటాయి. ఇందులో 5 వారాల ఉత్పత్తి కాలాలు అయిదు వుంటాయి లేదా

మొత్తం 25 ఉత్పాదక వారాలు, 5 వందల పౌండ్లకు 5 రెట్ల ఉత్పాదితం లేదా 2 వేల 5 వందల పౌండ్ల ఉత్పాదితం వుంటాయి. అలాగే 5 వారాల చలామణీలు అయిదు, అంటే మొత్తం 25 వారాల చలామణి కాలం వుంటుంది. ఈ సందర్భంలో 5 వందల పౌండ్ల పెట్టుబడి సంవత్సరంలో 5 సార్లు టర్నోవర్ అయిందని అంటే, ప్రతి టర్నోవర్ కాలంలోనూ సగం కాలం ఈ 5 వందల పౌండ్ల పెట్టుబడి ఉత్పాదక పెట్టుబడిగా వ్యవహరించలేదని, మొత్తంపై అది ఏడాదిలో సగం కాలమే పని చేసిందనీ, మిగతా సగం కాలంలో బొత్తిగా పని చేయలేదనీ స్పష్టమవుతుంది.

మన ఉదాహరణలో 5 వందల పౌండ్ల స్థానాన్ని భర్తీ చేసే పెట్టుబడి ఆ 5 చలామణి కాలాల్లో రంగం మీదకు వస్తుంది. ఆ రకంగా టర్నోవర్ రెండువేల ఐదు వందల పౌండ్ల నుండి 5 వేల పౌండ్లకు పెరిగింది. అయితే ఇప్పుడు అడ్వాన్స్ అయిన పెట్టుబడి 5 వందల పౌండ్లు కాదు, వెయ్యి పౌండ్లు. 5 వేలను వెయ్యితో భాగిస్తే 5 వస్తుంది. కనుక టర్నోవర్‌లు పది కాదు 5 మాత్రమే. ఆ రకంగానే జనం వాటిని లెక్కిస్తారు. అయితే వెయ్యి పౌండ్ల పెట్టుబడి ఏడాదిలో 5 సార్లు టర్నోవర్ అయిందని పెట్టుబడిదారులు అంటున్నప్పుడు, చలామణి కాలం స్మృహే పెట్టుబడిదారుల ఖాళీ బుర్రలో మాయమైపోతుంది. వరుసగా వచ్చే ఈ 5 టర్నోవర్ల కాలంలో ఈ పెట్టుబడి నిరంతరాయంగా ఉత్పత్తి ప్రక్రియలోనే పనిచేసిందనే గందరగోళపు భావం వీరికి ఏర్పడుతుంది. అయితే వెయ్యి పౌండ్లు పెట్టుబడి 5 సార్లు టర్నోవర్ అయిందని మనం అంటున్నామంటే, దానిలో ఉత్పత్తి కాలం, చలామణి కాలం రెండూ వుంటాయి. నిజానికి వెయ్యి పౌండ్లు నిరంతరాయంగా ఉత్పత్తి ప్రక్రియలో వుండి వుంటే, మనం ఇంతకుముందు ఊహించిన దాని ప్రకారం, ఉత్పాదితం 5 వేల పౌండ్లకు బదులు 10 వేల పౌండ్లు అయి వుండాలి. పైగా ఉత్పత్తి ప్రక్రియలో వెయ్యి పౌండ్లు నిరంతరాయంగా వుండాలంటే, రెండు వేల పౌండ్లను అడ్వాన్స్ చేయాలి. టర్నోవర్ పనితీరుకు సంబంధించి ఏ మాత్రం స్పష్టతలేని ఆర్థికవేత్తలు ఒక ప్రధాన అంశాన్ని సదా ఉపేక్షిస్తున్నారు. అదేమంటే, ఉత్పత్తి నిరంతరాయంగా కొనసాగాలంటే, పారిశ్రామిక పెట్టుబడిలో ఒక భాగం మాత్రమే ఉత్పత్తి ప్రక్రియలో నిమగ్నమై వుండగలదు. ఒక భాగం ఉత్పత్తి కాలంలో వుండగా, మరో భాగం చలామణి కాలంలో వుండి తీరాలి. మరోరకంగా చెప్పాలంటే, ఒక భాగం ఉత్పత్తి నుంచి ఉపసంహరించబడి సరుకు పెట్టుబడి లేదా డబ్బు పెట్టుబడి రూపంలో వున్నప్పుడు మాత్రమే, మరో భాగం ఉత్పాదక పెట్టుబడిగా తన విధిని నిర్వహించగలుగుతుంది. దీన్ని పట్టించుకోకపోవడం వల్ల, డబ్బు పెట్టుబడికి గల ప్రాధాన్యమూ, పాత్రా పూర్తిగా విస్మరించబడ్డాయి.

టర్నోవర్ కాలంలోని రెండు విభాగాలు అనగా పనికి పట్టే కాలం, చలామణి కాలం సమానంగా వున్నప్పుడు, లేదా పనికి పట్టేకాలం చలామణి కాలం కంటే ఎక్కువగా వున్నప్పుడు, లేదా తక్కువగా వున్నప్పుడు టర్నోవర్‌లో ఎటువంటి తేడాలు తలెత్తుతాయి, పెట్టుబడి డబ్బు రూపంలో బంధించబడి వుండడంపైన దీని ప్రభావం ఎలా వుంటుంది, అన్న అంశాలను ఇప్పుడు మనం పరిశీలించాలి.

వారం వారం అడ్వాన్స్ చేయబడే పెట్టుబడి అన్ని సందర్భాల్లోనూ వంద పౌండ్లు అనుకుందాం. టర్నోవర్ కాలం 9 వారాలు అనుకొందాం. కనుక ప్రతి టర్నోవర్ కాలంలోనూ అడ్వాన్స్ చేయాల్సిన పెట్టుబడి 9 వందల పౌండ్లు.

## I. చలామణి కాలంతో సమానమైన పనికాలం

వాస్తవంలో ఇటువంటిది కేవలం కాకతాళీయంగా, చాలా అరుదుగా మాత్రమే జరుగుతుంది. కానీ ఇక్కడ సంబంధాలు అత్యంత సరళంగానూ, అతి స్పష్టంగా అర్థమయ్యే రీతిలోనూ రూపుగొంటాయి. కనుక, మన విశ్లేషణ దీనితోనే ప్రారంభిద్దాం.

ఈ రెండు పెట్టుబడులు (మొదటి పని కాలానికి అడ్వాన్స్ చేయబడిన పెట్టుబడి-I, అది చలామణి కాలంలో వున్నప్పుడు పనిచేసే అనుబంధ పెట్టుబడి-II) ఒకదానిలోకి ఒకటి ప్రవేశించకుండా తమ గమన క్రమాల్లో ఒకటి ఖాళీ చేసిన స్థానాన్ని మరొకటి భర్తీ చేయడం ద్వారా ఒకదాన్ని ఒకటి విడుదల చేసుకుంటాయి. మొదటి కాలాన్ని మినహాయించి, వీటిలో ప్రతి పెట్టుబడి తన సొంత టర్నోవర్ కాలం కోసమే అడ్వాన్స్ చేయబడుతుంది. కింది ఉదాహరణలో సూచించినట్లు, టర్నోవర్ కాలం 9 వారాలు అనుకుందాం. కాగా, పనికాలం నాలుగున్నర వారాలు, చలామణి కాలం నాలుగున్నర వారాలు. అప్పుడు వార్షిక పట్టికలు ఇలా వుంటాయి.

**పట్టిక-I - పెట్టుబడి-I**

| | టర్నోవరు కాలాలు | పని కాలాలు | అడ్వాన్సు | చలామణి కాలాలు |
|---|---|---|---|---|
| I | 1వ వారం నుంచి 9వ వారం వరకు | 1వ వారం నుంచి 4½ వారం వరకు | 450 పౌండ్లు | 4½ వ వారం నుంచి 9వ వారం వరకు |
| II | 10వ వారం నుంచి 18వ వారం వరకు | 10వ వారం నుంచి 13½ వ వారం వరకు | 450 పౌండ్లు | 13½ వ వారం నుంచి 18వ వారం వరకు |
| III | 19వ వారం నుంచి 27వ వారం వరకు | 19వ వారం నుంచి 22 ½ వ వారం వరకు | 450 పౌండ్లు | 22½ వ వారం నుంచి 27వ వారం వరకు |
| IV | 28వ వారం నుంచి 36వ వారం వరకు | 28వ వారం నుంచి 31 ½ వ వారం వరకు | 450 పౌండ్లు | 31 ½ వ వారం నుంచి 36వ వారం వరకు |
| V | 37వ వారం నుంచి 45వ వారం వరకు | 37వ వారం నుంచి 40 ½ వ వారం వరకు | 450 పౌండ్లు | 40 ½ వ వారం నుంచి 45వ వారం వరకు |
| VI | 46వ వారం నుంచి 54వ వారం వరకు | 46వ వారం నుంచి 49 ½ వ వారం వరకు | 450 పౌండ్లు | 49 ½ వ వారం నుంచి (54వ) వారం వరకు |

**పెట్టుబడి-II**

| | టర్నోవరు కాలాలు | పనికాలాలు | అడ్వాన్సు | చలామణి కాలాలు |
|---|---|---|---|---|
| I | 4½ వ వారం నుంచి 13½ వ వారం వరకు | 4½ వారం నుంచి 9వ వారం వరకు | 450 పౌండ్లు | 10వ వారం 13½ వారం వరకు |
| II | 13½ వ వారం నుంచి 22½ వ వారం వరకు | 13½ వారం నుంచి 18వ వారం వరకు | 450 పౌండ్లు | 19వ వారం నుంచి 22½ వ వారం వరకు |
| III | 22½ వ వారం నుంచి 31½ వ వారం వరకు | 22½ వారం నుంచి 27వ వారం వరకు | 450 పౌండ్లు | 28వ వారం నుంచి 31½ వ వారం వరకు |

| | | | | |
|---|---|---|---|---|
| IV | 31½ వ వారం నుంచి 40½ వ వారం వరకు | 31½ వారం నుంచి 36వ వారం వరకు | 450 పౌండ్లు | 37వ వారం నుంచి 40½ వ వారం వరకు |
| V | 40½ వ వారం నుంచి 49½ వ వారం వరకు | 40½ వారం నుంచి 45వ వారం వరకు | 450 పౌండ్లు | 46వ వారం నుంచి 49½ వారం వరకు |
| VI | 49½ వ వారం నుంచి (58½ వ) వారం వరకు | 49½ వారం నుంచి (54వ) వారం వరకు | 450 పౌండ్లు | (55వ వారం నుంచి 58½) వ వారం వరకు |

బ్రాకెట్లలో ఉన్నవి, రెండో ఏడాది టర్నోవర్‌లో ప్రవేశిస్తున్న వారాలు.

ఇక్కడ ఏడాదికి యాభై ఒక్క వారాలు. ఆ కాలంలో పెట్టుబడి-I ఆరు పూర్తి పని కాలాల్లో పని చేస్తుంది. నాలుగు వందల యాభైకి ఆరు రెట్లు, అంటే రెండు వేల ఏడు వందల పౌండ్ల సరుకులను ఉత్పత్తి చేస్తుంది. పెట్టుబడి-II తను పని చేసిన ఐదు పూర్తి పని కాలాల్లోనూ నాలుగు వందల యాభైకి 5 రెట్లు అంటే, 2,250 పౌండ్ల సరుకులు ఉత్పత్తి చేస్తుంది. దానితో పాటు పెట్టుబడి-II చివరి ఒకటిన్నర వారంలో (50వ వారం మధ్య నుంచి 51వ వారం చివరి వరకూ) నూట యాభై పౌండ్ల సరుకులను అదనంగా ఉత్పత్తి చేస్తుంది. 51 వారాల్లోనూ మొత్తం ఉత్పత్తి అయింది 5 వేల 100 పౌండ్ల సరుకులు. అదనపు విలువ ప్రత్యక్ష ఉత్పత్తి కేవలం పనికాలంలో మాత్రమే జరుగుతుంది. దానికి సంబంధించినంత వరకూ, మొత్తం 9 వందల పౌండ్ల పెట్టుబడి $5\frac{2}{3}$ సార్లు టర్నోవర్ అవుతుంది (9 వందలకు $5\frac{2}{3}$ రెట్లు అంటే 5,100 పౌండ్లు) అయితే మనం నిజమైన టర్నోవర్‌ని పరిశీలిస్తే పెట్టుబడి-I $5\frac{2}{3}$ సార్లు టర్నోవర్ అయ్యింది, యెందుకంటే 51వ వారం చివరిలో, ఆరో టర్నోవర్ పూర్తి చేయడానికి ఇంకా 3 వారాలు గడపవలసి వుంది. నాలుగు వందల యాభైకి $5\frac{2}{3}$ రెట్లు అంటే 2,550 పౌండ్లు. పెట్టుబడి-II $5\frac{1}{6}$ రెట్లు టర్నోవర్ అయింది. ఎందుకంటే, అది ఆరో టర్నోవర్ కాలంలో 1½ వారం మాత్రమే పూర్తి చేసింది కనుక మిగిలిన 7½ వారాలు తర్వాత సంవత్సరంలో ప్రవేశిస్తాయి. నాలుగు వందల యాభైకి $5\frac{1}{6}$ రెట్లు అంటే, 2,326 పౌండ్లు. వాస్తవంగా మొత్తం టర్నోవర్ అయింది 4,875 పౌండ్లు.

పెట్టుబడి-I, పెట్టుబడి-II లను రెండు స్వతంత్ర పెట్టుబడులుగా పరిగణిద్దాం. వాటి గమనాల్లో అవి పూర్తి స్వతంత్రంగా వుంటాయి. వాటి పనికాలాలు, చలామణి కాలాలు ఒకటి మరొకదాని స్థానంలో రావడం ద్వారా నేరుగా ఒకదాన్ని ఒకటి విముక్తి చేసుకొంటున్న మేరకే అవి పరస్పర పూరకాలు. వాటిని ఇద్దరు పెట్టుబడిదారులకు చెందిన రెండు స్వతంత్ర పెట్టుబడులుగా పరిగణించవచ్చు.

పెట్టుబడి-I, 5 పూర్తి టర్నోవర్‌లను, 6వ టర్నోవర్ కాలంలో మూడింట రెండొంతులను పూర్తి చేసింది. ఏడాది చివరిలో అది సరుకు పెట్టుబడి రూపంలో వుంది. అయితే అది డబ్బుగా తిరిగి చేతికందడానికి ఇంకా మూడు వారాలు గడపవలసి వుంది. ఈ కాలంలో అది ఉత్పత్తి ప్రక్రియలోకి ప్రవేశించలేదు. అది సరుకు పెట్టుబడిగా పనిచేస్తుంది. చలామణిలో వుంటుంది. అది తన చివరి టర్నోవర్ కాలంలో మూడింట రెండు వంతులు మాత్రమే పూర్తి చేసింది. దీన్ని ఇలా వ్యక్తం చేస్తున్నాము. అది మూడింట రెండు వంతుల కాలం మాత్రమే టర్నోవర్ అయింది; దాని మొత్తం విలువలో మూడింట రెండు వంతులు మాత్రమే ఒక పూర్తి టర్నోవర్‌ను పూర్తి చేసింది. నాలుగు వందల యాభై

పౌండ్లు టర్నోవర్ కావడానికి తొమ్మిది వారాలు పడుతుందని మనం అంటున్నాము. అందువల్ల, మూడు వందల పౌండ్లకు, 6 వారాలు పడుతుంది. అయితే విషయాన్ని వ్యక్తం చేసే ఈ పద్ధతిలో, టర్నోవర్ కాలంలోని, ప్రత్యేకించి భిన్నమైన రెండు భాగాల మధ్య వున్న అంగాంగిక సంబంధాలను ఉపేక్షిస్తున్నాము. అడ్వాన్స్ చేసిన నాలుగు వందల యాభై పౌండ్ల పెట్టుబడి $5\frac{2}{3}$ టర్నోవర్ చేసింది అనే మాటలకు అర్థమేమిటంటే అది పూర్తిగా 5 టర్నోవర్లు చేసిందని, 6వ టర్నోవర్‌లో మూడింట రెండు వంతులు చేసిందని, మరోవైపున టర్నోవర్ అయిన పెట్టుబడి అడ్వాన్స్ చేయబడిన పెట్టుబడికి $5\frac{2}{3}$ రెట్లకు సమానం కనుక పైన చెప్పిన సందర్భంలో నాలుగు వందల యాభై పౌండ్లకి $5\frac{2}{3}$ రెట్లకు సమానం. అంటే 2,2250 పౌండ్లకి సమానం అని చెప్పడం సరియైనదే. అంటే, నాలుగు వందల యాభై పౌండ్ల పెట్టుబడి తోడుగాకపోతే అందులో ఒక భాగం ఉత్పత్తి ప్రక్రియలో వుండగా, మరో భాగం చలామణి ప్రక్రియలో వుండాల్సి వస్తుందని అన్నమాట. టర్నోవర్ కాలాన్ని టర్నోవర్ అయిన పెట్టుబడిగా వ్యక్తం చేయవలసివస్తే దాన్ని ఎప్పుడూ దాని ప్రస్తుత విలువగానే (తయారైన వస్తువు విలువ) వ్యక్తం చేయాలి. అడ్వాన్స్ అయిన పెట్టుబడి ఉత్పత్తి ప్రక్రియను పునఃప్రారంభించలేని పరిస్థితి వున్నప్పుడు అది ఈ వాస్తవంలో వ్యక్తమవుతుంది; దానిలో ఒక భాగం మాత్రమే ఉత్పత్తి చేయడానికి అనువుగా వుంది; లేదా నిరంతరాయమైన ఉత్పత్తిలో వుండడం కోసం పెట్టుబడిని నిరంతరాయంగా ఉత్పత్తి కాలంలో వుండే భాగంగానూ, నిరంతరాయంగా చలామణి కాలంలో వుండే భాగంగానూ, ఈ రెండు కాలాల మధ్య గల నిష్పత్తిని బట్టి విభజించాల్సి వుంటుంది. చలామణి కాలానికి, టర్నోవర్ కాలానికి మధ్య వున్న నిష్పత్తి స్థిరంగా పనిచేసే ఉత్పాదక పెట్టుబడి పరిమాణాన్ని నిర్ణయిస్తుంది అన్న నియమమే ఇది కూడా.

51వ వారం చివరిలో, అంటే, ఇక్కడ ఏడాది చివరిలో, పెట్టుబడి-II లోని 150 పౌండ్లు, ఇంకా పూర్తిగా తయారుకాని సరుకుల ఉత్పత్తి కోసం అడ్వాన్స్ చేయబడ్డాయి. దానిలో మరో భాగం చలామణి అయ్యే స్థిర పెట్టుబడి రూపంలో – ముడి పదార్థాలు వగైరాల రూపంలో వుంటాయి. ఈ రూపంలో అవి ఉత్పత్తి ప్రక్రియలో ఉత్పాదక పెట్టుబడిగా వ్యవహరించగలవు. మూడో భాగం డబ్బు రూపంలో వుంటుంది. ఇది కనీసం మిగిలిన మూడు వారాలకు చెల్లించాల్సిన వేతనాలకు చాలినంత పరిమాణంలో వుంటుంది. (అయితే ప్రతి వారం చివరిలోగాని ఇది చెల్లించబడదు) కొత్త సంవత్సరం ప్రారంభంలో, అంటే కొత్త టర్నోవర్ చక్రం ప్రారంభంలో ఈ పెట్టుబడి భాగం ఉత్పాదక పెట్టుబడి రూపంలో వుండకుండా, ఉత్పత్తి ప్రక్రియలో పాలుపంచుకోలేని డబ్బు పెట్టుబడి రూపంలో వున్నప్పటికీ, చలామణి అయ్యే అస్థిర పెట్టుబడి, అంటే సజీవ శ్రమశక్తి ఉత్పత్తి ప్రక్రియలో క్రియాశీలంగానే వుంటుంది. దీనికి కారణమేమంటే శ్రమశక్తిని పనికాలం ప్రారంభంలో, వారానికి వారానికి కొనుగోలు చేసినప్పటికీ, అలాగే ఆ శ్రమశక్తిని వినియోగించుకొన్నప్పటికీ, వారాంతం వరకు దానికి డబ్బు చెల్లించడం జరుగదు. డబ్బు ఇక్కడ చెల్లింపు సాధనంగా పని చేస్తుంది. ఆ కారణంగానే అది పెట్టుబడిదారు చేతుల్లోనే ఇంకా డబ్బుగా వుంటుంది. మరోవైపున శ్రమశక్తి – డబ్బు యొక్క పరివర్తిత రూపమైన ఆ సరుకు అప్పటికే ఉత్పత్తి ప్రక్రియలో పాల్గొంటుంది. కాబట్టి అదే పెట్టుబడి విలువ ఇక్కడ రెండింతలుగా కనిపిస్తుంది.

కేవలం మనం పని కాలాలను పరిశీలిస్తే,

పెట్టుబడి–I 450కి 6 రెట్లు, లేదా 2,700 పౌండ్లు ఉత్పత్తి చేస్తుంది.

పెట్టుబడి–II 450కి $5\frac{1}{3}$ రెట్లు, 2,400 పౌండ్లు ఉత్పత్తి చేస్తుంది.

---

కనుక రెండూ కలిసి 900 కి $5\frac{2}{3}$ రెట్లు, లేదా 5,100 పౌండ్లు ఉత్పత్తి చేస్తాయి.

---

కనుక అడ్వాన్స్ అయిన మొత్తం పెట్టుబడి 9 వందల పౌండ్లు ఏడాది పొడవునా ఉత్పాదక పెట్టుబడిగా $5\frac{2}{3}$ రెట్లు పనిచేసింది. ఉత్పత్తి ప్రక్రియలో ఎల్లప్పుడూ నాలుగు వందల యాభై పౌండ్లు, చలామణి ప్రక్రియలో నాలుగు వందల యాభై పౌండ్లు వున్నాయో లేక 9 వందల పౌండ్లు నాలుగున్నర వారాల పాటు ఉత్పత్తి ప్రక్రియలోనూ, మరో నాలుగున్నర వారాల పాటు చలామణి ప్రక్రియలోనూ వున్నాయో అనేదానితో అదనపు విలువ ఉత్పత్తికి ప్రమేయం లేదు.

మరోవైపున మనం టర్నోవరు కాలాలను పరిశీలిస్తే,

పెట్టుబడి–I 450కి $5\frac{2}{3}$ రెట్లు, లేదా 2,550 పౌండ్లు

పెట్టుబడి–II 450కి $5\frac{1}{6}$ రెట్లు, లేదా 2,325 పౌండ్లు

---

టర్నోవరు చేస్తాయి. కనుక 900 కి $5\frac{5}{12}$ రెట్లు, లేదా 4,875 పౌండ్లు టర్నోవరవుతుంది.

ఎందువల్లనంటే, I, II పెట్టుబడులు టర్నోవరు చేసిన మొత్తాలను I, II ల మొత్తంతో భాగిస్తే మొత్తం పెట్టుబడి టర్నోవర్ల సంఖ్య వస్తుంది.

పెట్టుబడి–I, పెట్టుబడి–II పరస్పర సంబంధం లేకుండా, స్వతంత్రంగా వుంటే అవి ఒకే ఉత్పత్తి రంగంలో అడ్వాన్స్ చేయబడిన సామాజిక పెట్టుబడిలోని రెండు వేరు వేరు స్వతంత్ర భాగాలుగా మాత్రమే ఉంటాయని ఇక్కడ గుర్తించాలి. ఈ ఉత్పత్తిరంగ పరిధిలోని సామాజిక పెట్టుబడి కేవలం I, II మాత్రమే వుంటే, ఒకే వ్యక్తిగత పెట్టుబడిలోని, I, II అంతర్భాగాలకు వర్తించే ఈ లెక్కాచారమే ఈ రంగంలోని సామాజిక పెట్టుబడి టర్నోవరుకూ వర్తిస్తుంది. ఇంకా ముందుకెళ్లి చెప్పాలంటే, ఏ ప్రత్యేక ఉత్పత్తి రంగంలోనైనా మదుపు పెట్టబడిన సామాజిక పెట్టుబడిలోని ప్రతి భాగాన్నీ ఆ రకంగానే లెక్కగట్టవచ్చు. అయితే తుదకంటా విశ్లేషిస్తే, వివిధ ఉత్పత్తి రంగాల్లో టర్నోవర్ అయిన పెట్టుబడుల మొత్తాన్ని ఆ రంగాల్లో అడ్వాన్సు చేసిన పెట్టుబడి మొత్తాలతో భాగిస్తే, మొత్తం సామాజిక పెట్టుబడి చేసిన టర్నోవర్‌ల సంఖ్య వస్తుంది.

ఒకే వ్యక్తిగత వ్యాపారంలో I, II పెట్టుబడుల టర్నోవర్ సంవత్సరాలు ఇక్కడ, ఖచ్చితంగా చెప్పాలంటే, భిన్నమైనవి. (పెట్టుబడి–II టర్నోవర్ చక్రం, పెట్టుబడి–I చక్రం కంటే నాలుగున్నర వారాల తర్వాత మొదలైంది. కనుక I యొక్క సంవత్సరం II వ సంవత్సరం కంటే నాలుగున్నర వారాల ముందుగా పూర్తవుతుంది.) అదే విధంగా ఒకే ఉత్పత్తి రంగంలోని వివిధ వ్యక్తిగత పెట్టుబడులు తమ కార్యకలాపాలను పూర్తిగా విభిన్న కాలాల్లో ప్రారంభిస్తాయి. కాబట్టి సంవత్సరంలో వేరు వేరు సమయాల్లో తమ టర్నోవర్ సంవత్సరాలను పూర్తి చేస్తాయి. I, II విషయంలోని సగటులను లెక్క గట్టడానికి మనం పైన ఉపయోగించిన పద్ధతే, సామాజిక పెట్టుబడిలోని వివిధ స్వతంత్ర భాగాల యొక్క టర్నోవర్ సంవత్సరాలను ఒకే రకపు టర్నోవర్ సంవత్సరంగా మార్చడానికి సరిపోతుంది.

## II. చలామణి కాలాన్ని మించి వున్న పనికాలం

ఇక్కడ, I, II పెట్టుబడుల పనికాలం, టర్నోవర్ కాలం ఒకదాని తరువాత ఒకటి వచ్చే బదులు, ఒకదానిలో మరొకటి ప్రవేశిస్తాయి. అదే సమయంలో కొంత పెట్టుబడి విడుదల అయి ఖాళీగా వుంటుంది. ఇంతకు ముందు పరిశీలించిన ఉదాహరణలో ఇలా జరుగలేదు.

అయితే ఈ అంశం ఈ కింది వాస్తవాన్ని మార్చదు : 1) అడ్వాన్స్ చేయబడిన పెట్టుబడి యొక్క రెండు భాగాల వార్షిక ఉత్పాదితం మొత్తం విలువను అడ్వాన్స్ చేయబడిన మొత్తం పెట్టుబడితో భాగిస్తే వచ్చేది, అడ్వాన్స్ చేయబడిన మొత్తం పెట్టుబడి పనికాలాల సంఖ్యకు సమానం. 2) టర్నోవర్ అయిన రెండు మొత్తాలను కూడా వచ్చిన మొత్తాన్ని అడ్వాన్స్ చేయబడిన రెండు పెట్టుబడుల మొత్తంతో భాగిస్తే వచ్చేది, మొత్తం పెట్టుబడి టర్నోవర్ల సంఖ్యకు సమానం. ఇక్కడ కూడా రెండు పెట్టుబడి భాగాలు ఒకదానితో ఒకదానికి ప్రమేయం లేకుండా స్వతంత్రంగా టర్నోవర్ గమన క్రమాలను నిర్వహించాయని మనం ఊహించుకోవాలి.

* * *

ఆ రకంగా మరోసారి మనం శ్రమ ప్రక్రియలో ప్రతి వారం వంద పౌండ్లు అడ్వాన్స్ చేయబడుతుందని భావిద్దాం. పనికి పట్టే కాలం ఆరు వారాలనుకొందాం. కనుక ప్రతిసారీ ఆరు వందల పౌండ్లు (పెట్టుబడి–I) అవసరమవుతుంది. చలామణి కాలం మూడు వారాలనుకొందాం. కనుక టర్నోవర్ కాలం ఇంతకు ముందులాగే 9 వారాలు అవుతుంది. పెట్టుబడి–I యొక్క మూడు వారాల చలామణి కాలంలో 3 వందల పౌండ్ల పెట్టుబడి–IIలో ప్రవేశిస్తుందనుకొందాం. ఈ రెండు పెట్టుబడులు ఒకదానితో ఒకటి ప్రమేయం లేని స్వతంత్రమైనవిగా భావిద్దాం. వాటి వార్షిక టర్నోవర్ కాల పట్టిక ఈ రకంగా వుంటుంది.

### పట్టిక–II
### పెట్టుబడి–I, 600 పౌండ్లు

| టర్నోవరు కాలాలు | పని కాలాలు | అడ్వాన్సు | చలామణి కాలాలు |
|---|---|---|---|
| 1. 1వ వారం నుంచి 9వ వారం వరకు | 1వ వారం నుంచి 6వ వారం వరకు | 600 పౌండ్లు | 7వ వారం నుంచి 9వ వారం వరకు |
| 2. 10వ వారం నుంచి 18వ వారం వరకు | 10వ వారం నుంచి 15వ వారం వరకు | 600 పౌండ్లు | 16వ వారం నుంచి 18వ వారం వరకు |
| 3. 19వ వారం నుంచి 27వ వారం వరకు | 19వ వారం నుంచి 24వ వారం వరకు | 600 పౌండ్లు | 25వ వారం నుంచి 27వ వారం వరకు |
| 4. 28వ వారం నుంచి 36వ వారం వరకు | 28వ వారం నుంచి 33వ వారం వరకు | 600 పౌండ్లు | 34వ వారం నుంచి 36వ వారం వరకు |
| 5. 37వ వారం నుంచి 45వ వారం వరకు | 37వ వారం నుంచి 42వ వారం వరకు | 600 పౌండ్లు | 43వ వారం నుంచి 45వ వారం వరకు |
| 6. 46వ వారం నుంచి (54వ) వారం వరకు | 46వ వారం నుంచి 51వ వారం వరకు | 600 పౌండ్లు | (52వ వారం నుంచి 54వ వారం వరకు) |

## అదనపు పెట్టుబడి-II, 300 పౌండ్లు

| టర్నోవరు కాలాలు | పనికాలాలు | అడ్వాన్సు | చలామణి కాలాలు |
|---|---|---|---|
| 1. 7వ వారం నుంచి 15వ వారం వరకు | 7వ వారం నుంచి 9వ వారం వరకు | 300 పౌండ్లు | 10వ వారం నుంచి 15వ వారం వరకు |
| 2. 16వ వారం నుంచి 24వ వారం వరకు | 16వ వారం నుంచి 18వ వారం వరకు | 300 పౌండ్లు | 19వ వారం నుంచి 24వ వారం వరకు |
| 3. 25వ వారం నుంచి 33వ వారం వరకు | 25వ వారం నుంచి 27వ వారం వరకు | 300 పౌండ్లు | 28వ వారం నుంచి 33వ వారం వరకు |
| 4. 34వ వారం నుంచి 42వ వారం వరకు | 34వ వారం నుంచి 36వ వారం వరకు | 300 పౌండ్లు | 37వ వారం నుంచి 42వ వారం వరకు |
| 5. 43వ వారం నుంచి 51వ వారం వరకు | 43వ వారం నుంచి 45వ వారం వరకు | 300 పౌండ్లు | 46వ వారం నుంచి 51వ వారం వరకు |

ఉత్పత్తి ప్రక్రియ అదే స్థాయిలో సంవత్సరం పొడవునా నిర్విఘ్నంగా కొనసాగుతుంది. పెట్టుబడి -I, II పూర్తిగా విడి విడిగా వుంటాయి. అయితే వాటిని వేర్వేరుగా చూపడానికి వాటి వాస్తవ సంగమాలను, సమ్మేళనాలను విడగొట్టవలసి వచ్చింది. ఆ రకంగా మనం టర్నోవర్‌ల సంఖ్యను కూడా మార్చాల్సి వచ్చింది. ఎందువల్లనంటే, పై పట్టిక ప్రకారం టర్నోవర్ అయిన మొత్తాలు ఇలా వుంటాయి.

పెట్టుబడి I 600 పౌండ్లను $5\frac{2}{3}$ రెట్లు, లేదా 3,400 పౌండ్లను,

పెట్టుబడి II 300 ని 5 రెట్లు, లేదా 1,500 పౌండ్లను టర్నోవరు చేస్తుంది.

---

కనుక మొత్తం పెట్టుబడి 900 $5\frac{4}{9}$ లేదా 4,900 పౌండ్లను టర్నోవరు చేస్తుంది.

అయితే ఇది సరిగా లేదు. ఎందువల్లనంటే వాస్తవ ఉత్పత్తి, చలామణి కాలాలు పై పట్టికలో పేర్కొన్న కాల వ్యవధులతో ఇంత సంపూర్ణంగా ఏకీభవించవు. అందులో I, II పెట్టుబడులను రెండు స్వతంత్ర అంశాలుగా ప్రదర్శించడమే ప్రధాన అంశం.

వాస్తవంలో పెట్టుబడి-II పనికాలం, చలామణి కాలం పెట్టుబడి-I నాటికి వేరుగా, భిన్నంగా లేవు. పనికాలం ఆరు వారాలు, చలామణి కాలం మూడు వారాలు. పెట్టుబడి-II కేవలం మూడు వందల పౌండ్లు మాత్రమే కనుక, పనికి పట్టే కాలంలో అది కొంతకాలానికే సరిపోతుంది. ఇక్కడ జరిగేది ఇదే. ఆరో వారాంతంలో ఆరు వందల పౌండ్ల ఉత్పాదితం చలామణిలోకి ప్రవేశించి 9వ వారాంతంలో డబ్బు రూపంలో తిరిగి వస్తుంది. అప్పుడు 7వ వారం ప్రారంభంలో పెట్టుబడి-II తన కార్యకలాపాన్ని ప్రారంభించి, తరువాతి పనికాలంలోని 7వ, 8వ, 9వ వారాల అవసరాన్ని తీరుస్తుంది. అయితే మన ఊహ ప్రకారం 9వ వారాంతంలో పనికాలం సగం మాత్రమే పూర్తయింది. ఆరు వందల పౌండ్ల పెట్టుబడి-I అప్పుడే తిరిగి వచ్చింది. కాబట్టి పదో వారం ప్రారంభంలో మరోసారి పనిలో ప్రవేశించి, తన మూడు వందల పౌండ్లకు 10వ, 11వ, 12వ వారాలకు అవసరమైన అడ్వాన్స్‌లను సరఫరా చేస్తుంది. దీనితో రెండో పనికాలం పూర్తవుతుంది. ఆరు వందల పౌండ్ల

ఉత్పాదక విలువ చలామణిలో వుంది. 15వ వారాంతంలో అది తిరిగి వస్తుంది. అదే సమయంలో పెట్టుబడి–II యొక్క మూడు వందల పౌండ్ల తొలి మొత్తం విడుదలై, ఆ తర్వాతి పనికాలం యొక్క మొదటి సగభాగంలో, అంటే 13వ, 14వ, 15వ వారాల్లో పని చేస్తుంది. ఈ వారాలు గడిచాక ఆరు వందల పౌండ్లు తిరిగి వస్తాయి. మిగిలిన పని కాలానికి, వాటిలో మూడు వందల పౌండ్లు చాలు. ఆ తర్వాత పని కాలానికి మూడు వందల పౌండ్లు మిగిలి వుంటాయి.

కనుక ఇదంతా ఇలా జరుగుతుంది.

మొదటి టర్నోవర్ కాలం : 1వ వారం నుంచి 9వ వారం వరకు.

మొదటి పనికాలం : 1వ వారం నుంచి 6వ వారం వరకు. పెట్టుబడి–I, 6 వందల పౌండ్లు తన విధిని నిర్వహిస్తుంది.

మొదటి చలామణి కాలం : 7వ వారం నుంచి 9వ వారం వరకు. 9వ వారాంతంలో 6 వందల పౌండ్లు తిరిగి వస్తాయి.

రెండో టర్నోవర్ కాలం : 7వ వారం నుంచి 15వ వారం వరకు.

రెండో పనికాలం: 7వ వారం నుంచి 12వ వారం వరకు.

మొదటి అర్ధభాగం : 7వ వారం నుంచి 9వ వారం వరకు పెట్టుబడి–II, 3 వందల పౌండ్లు తన పాత్రను నిర్వహిస్తుంది.

9వ వారాంతంలో 6 వందల పౌండ్లు మొత్తం (పెట్టుబడి–I) డబ్బు రూపంలో తిరిగి వస్తుంది.

రెండో అర్ధభాగం : 10వ వారం నుంచి 12వ వారం వరకు పెట్టుబడి–I లోని 3 వందల పౌండ్లు తమ పాత్ర నిర్వహిస్తాయి. పెట్టుబడి–I లోని మిగతా భాగమైన 3 వందల పౌండ్లు విడుదలై వుంటాయి.

రెండో చలామణి కాలం : 13వ వారం నుంచి 15వ వారం వరకు.

15వ వారాంతంలో డబ్బు రూపంలో ఆరు వందల పౌండ్లు (పెట్టుబడి–I నుంచి సగం, పెట్టుబడి–II నుంచి సగం తీసుకోబడింది) తిరిగి వస్తాయి.

3వ టర్నోవర్ కాలం : 13వ వారం నుంచి 21వ వారం వరకు.

3వ పనికాలం : 13వ వారం నుంచి 18వ వారం వరకు.

మొదటి అర్ధభాగం : 13వ వారం నుంచి 15వ వారం వరకు. విడుదల అయిన 3 వందల పౌండ్లు తమ పాత్రను నిర్వహిస్తున్నాయి. 15వ వారాంతంలో 6 వందల పౌండ్లు డబ్బు రూపంలో తిరిగి వస్తాయి.

రెండో అర్ధభాగం : 16వ వారం నుంచి 18వ వారం వరకు. తిరిగి వచ్చిన 6 వందల పౌండ్లలో 3 వందల పౌండ్లు పని చేస్తాయి. మరో 3 వందల పౌండ్లు మరోసారి విడుదలై వుంటాయి.

3వ చలామణి కాలం : 19వ వారం నుంచి 21వ వారం వరకు, దాని చివరిలో 6 వందల పౌండ్లు డబ్బు రూపంలో తిరిగి వస్తాయి. ఈ 600 పౌండ్లు, పెట్టుబడి–I, పెట్టుబడి–II, రెంటినీ వేరు చేయ వీలులేనంతగా సమైక్యమయ్యాయి.

కనుక ఇక్కడ 51వ వారాంతం వరకు ఆరు వందల పౌండ్ల పెట్టుబడికి చెందిన ఎనిమిది

టర్నోవర్ కాలాలు వున్నాయి. [(1) 1వ వారం నుంచి 9వ వారం వరకు, (2) 7వ వారం నుంచి 15వ వారం వరకు, (3) 13వ వారం నుంచి 21వ వారం వరకు, (4) 19వ వారం నుంచి 27వ వారం వరకు, (5) 25వ వారం నుంచి 33వ వారం వరకు, (6) 31వ వారం నుంచి 39వ వారం వరకు, (7) 37వ వారం నుంచి 45వ వారం వరకు, (8) 43వ వారం నుంచి 51వ వారం వరకు] అయితే 49వ వారం నుంచి 51వ వారం వరకూ గల కాలం ఎనిమిదవ చలామణి కాలంలోకి వస్తుంది. కనుక విడుదలైన మూడు వందల పౌండ్లు పెట్టుబడి రంగంలోకి ప్రవేశించి ఉత్పత్తి కొనసాగేలా చేయాలి. ఆ రకంగా ఏడాది చివర టర్నోవర్ ఇలా వుంటుంది. ఆరు వందల పౌండ్లు తమ ఆవృత్తిని ఎనిమిదిసార్లు పూర్తిచేసి నాలుగు వేల ఎనిమిది వందల పౌండ్లు టర్నోవర్ అయ్యేలా చేశాయి. దీనికి తోడు 3 వారాల (49వ వారం నుంచి 51వ వారం వరకు) ఉత్పాదితం జమ అవుతుంది. అయితే అది తన 9 వారాల ఆవృత్తిలో 3వ వంతు మాత్రమే పూర్తి చేసింది. కనుక టర్నోవర్ అయిన మొత్తంలో అది 3వ వంతు మాత్రమే అంటే వంద పౌండ్లే. అప్పుడు 51 వారాల వార్షిక ఉత్పాదితం 5,100 పౌండ్లయితే, టర్నోవర్ అయిన పెట్టుబడి 4,800 + 100 పౌండ్లు లేదా 4,900 పౌండ్లు మాత్రమే. మొత్తం అడ్వాన్స్ అయిన పెట్టుబడి 9 వందల పౌండ్లు $5\frac{4}{9}$ సార్లు టర్నోవర్ అయింది. ఇది మొదటి ఉదాహరణలోకంటే కొంచెం ఎక్కువ.

ప్రస్తుత ఉదాహరణలో టర్నోవరు కాలంలో పనికాలం 2/3 గానూ, చలామణి కాలం 1/3 గానూ మనం ఊహించాం. అంటే పనికాలం చలామణి కాల గుణిజం అని ఊహించుకొన్నాం. ఇలా ఊహించనప్పుడు పైన పేర్కొన్న విధంగా పెట్టుబడి విడుదల అవుతుందా అనేది ప్రస్తుత సమస్య.

పనికాలం 5 వారాలుగానూ, చలామణి కాలం నాలుగు వారాలుగానూ, వారం వారం అడ్వాన్స్ అయ్యే పెట్టుబడి వంద పౌండ్లుగానూ ఊహిద్దాం.

మొదటి టర్నోవర్ కాలం : 1వ వారం నుంచి 9వ వారం వరకు.

1వ పనికాలం : 1వ వారం నుంచి 5వ వారం వరకు. పెట్టుబడి–I లేదా 5 వందల పౌండ్లు తన పాత్రను నిర్వహిస్తుంది.

మొదటి చలామణి కాలం : 6వ వారం నుంచి 9వ వారం వరకు. 9వ వారాంతంలో 5 వందల పౌండ్లు డబ్బు రూపంలో తిరిగి వస్తాయి.

రెండో టర్నోవర్ కాలం : 6వ వారం నుంచి 14 వారం వరకు.

రెండో పనికాలం : 6వ వారం నుంచి 10వ వారం వరకు.

మొదటి విభాగం : 6వ వారం నుంచి 9వ వారం వరకు, పెట్టుబడి–II, నాలుగు వందల పౌండ్లు తన పాత్రను నిర్వహిస్తుంది. 9వ వారం చివర, పెట్టుబడి–I 5 వందల పౌండ్లు డబ్బు రూపంలో తిరిగి వస్తాయి.

రెండో విభాగం : 10వ వారం. 5 వందల పౌండ్లలో తిరిగి వచ్చిన వంద పౌండ్లు తమ పాత్ర నిర్వహిస్తాయి. మిగిలిన నాలుగు వందల పౌండ్లు తర్వాత పనికాలం కోసం విడుదలవుతాయి.

రెండో చలామణి కాలం : 11వ వారం నుంచి 14వ వారం వరకు. 14వ వారం చివర 5 వందల పౌండ్లు డబ్బు రూపంలో తిరిగి వస్తాయి.

14వ వారం చివరి వరకూ (11వ వారం నుంచి 14వ వారం వరకు). పైన విడుదలైన నాలుగు వందల పౌండ్లు తన పాత్రను నిర్వహిస్తాయి. 5 వందల పౌండ్లలో తిరిగి వచ్చిన వంద పౌండ్లు 3వ పనికాలపు (11వ వారం నుంచి 15వ వారం వరకు) అవసరాలను నెరవేరుస్తాయి. ఫలితంగా మరోసారి నాలుగు వందల పౌండ్లు నాలుగో పని కాలానికి విడుదలవుతాయి. ప్రతి పనికాలంలోనూ ఇదే పునరావృత్తి అవుతుంది. ప్రారంభంలో చేతిలో నాలుగు వందల పౌండ్లు వుంటాయి. అవి నాలుగు వారాలకు సరిపోతాయి. నాలుగో వారం చివరిలో 5 వందల పౌండ్లు డబ్బు రూపంలో తిరిగి వస్తాయి. అయితే దానిలో వంద పౌండ్లు మాత్రమే చివరి వారానికి అవసరం. కాగా మిగిలిన నాలుగు వందల పౌండ్లు తర్వాత పనికాలం కోసం విడుదలై వుంటాయి.

ఏడు వందల పౌండ్లు పెట్టుబడి-I తో ఏడు వారాల పని కాలాన్ని రెండు వందల పౌండ్ల పెట్టుబడి-II తో రెండు వారాల చలామణి కాలాన్ని ఊహిద్దాం.

అటువంటప్పుడు మొదటి టర్నోవర్ కాలం 1వ వారం నుంచి 9వ వారం వరకు వుంటుంది. దాని మొదటి పనికాలం 1వ వారం నుంచి 7వ వారం వరకూ ఉంటుంది. దాని అడ్వాన్స్ పెట్టుబడి ఏడు వందల పౌండ్లు. దాని మొదటి చలామణి కాలం 8వ వారం నుంచి 9వ వారం వరకూ వుంటుంది. 9వ వారం చివర ఏడు వందల పౌండ్లు డబ్బు రూపంలో తిరిగి వస్తాయి.

8వ వారం నుంచి 16వ వారం వరకూ వున్న రెండో టర్నోవర్ కాలంలో 8వ వారం నుంచి 14వ వారం వరకు గల రెండో పనికాలం వుంటుంది. 8, 9వ వారాల అవసరాలను పెట్టుబడి-II తీరుస్తుంది. 9వ వారం చివర పై 7 వందల పౌండ్లు తిరిగి వస్తాయి. ఈ పనికాలం (10వ వారం నుంచి 14వ వారం వరకు) పూర్తయ్యేసరికి ఈ మొత్తంలో 5 వందల పౌండ్లు వినియోగమవుతాయి. దానిలో రెండు వందల పౌండ్లు తర్వాత పనికాలం కోసం విడుదలై వుంటాయి. రెండో చలామణి కాలం 15వ వారం నుంచి 16వ వారం వరకూ వుంటుంది. 16వ వారం చివర మరోసారి 7 వందల పౌండ్లు తిరిగి వస్తాయి. ఇక్కడ నుంచి ప్రతి పనికాలంలోనూ ఇదే మళ్ళీ మళ్ళీ జరుగుతుంది. మొదటి రెండు వారాలలోనూ అవసరమైన పెట్టుబడి అంతకు ముందు పనికాలంలో విడుదలైన రెండు వందల పౌండ్లు సమకూరుస్తాయి. రెండో వారం చివరిలో ఏడు వందల పౌండ్లు తిరిగి వస్తాయి. అయితే పనికాలంలో 5 వారాలు మాత్రమే మిగిలి వున్నాయి. కనుక అది 5 వందల పౌండ్లను మాత్రమే ఉపయోగించుకుంటుంది. కనుక ఎప్పుడూ రెండు వందల పౌండ్లు తర్వాత పనికాలం కోసం విడుదలై వుంటాయి.

ఈ ఉదాహరణలో చలామణి కాలం కంటే పనికాలం ఎక్కువ ఉన్నట్టు ఊహించుకొన్నాము. ప్రతి సందర్భంలోనూ ప్రతి పనికాలం చివర కొంత డబ్బు మొత్తం విడుదలై వుంటుంది. అది చలామణి కాలానికై అడ్వాన్స్ చేయబడిన పెట్టుబడి-II పరిమాణంతో సమానంగా వుంటుందని స్పష్టమవుతూంది. మన మూడు ఉదాహరణల్లో, పెట్టుబడి-II మొదటిదానిలో 3 వందల పౌండ్లు, రెండోదానిలో 4 వందల పౌండ్లు, మూడోదానిలో 2 వందల పౌండ్లు. ఆ ప్రకారమే, ప్రతికాలం చివర విడుదలై వున్న పెట్టుబడులు వరుసగా 3 వందల పౌండ్లు, 4 వందల పౌండ్లు, 2 వందల పౌండ్లు.

## III. చలామణి కాలంకన్నా తక్కువగా వున్న పనికాలం

మనం మరోసారి 9 వారాల టర్నోవర్ కాలాన్ని ఊహించుకోవడంతో ప్రారంభిద్దాం. దానిలో పనికాలం 3 వారాలనీ, పెట్టుబడి-I 3 వందల పౌండ్లనీ ఊహించుకొందాం. చలామణి కాలం ఆరు వారాలు వుంటుంది. దీనికి అదనపు పెట్టుబడి ఆరు వందల పౌండ్లు అవసరమవుతుంది. దాన్ని చెరి 3 వందల పౌండ్ల పరిమాణం గల రెండు పెట్టుబడులుగా విభజిద్దాం. అందులో ప్రతి ఒక్కటీ పనికాలం అవసరాన్ని తీరుస్తుంది. అప్పుడు మనకు 3 వందల పౌండ్ల పెట్టుబడులు మూడు వుంటాయి. వాటిలో 3 వందల పౌండ్లు ఎప్పుడూ ఉత్పత్తిలోనూ, 6 వందల పౌండ్లు ఎప్పుడూ చలామణిలోనూ వుంటాయి.

**పట్టిక-III - పెట్టుబడి-I**

| టర్నోవరు కాలాలు | పని కాలాలు | చలామణి కాలాలు |
|---|---|---|
| 1. 1 నుంచి 9వ వారం వరకు | 1 నుంచి 3వ వారం వరకు | 4 నుంచి 9వ వారం వరకు |
| 2. 10 నుంచి 18వ వారం వరకు | 10 నుంచి 12వ వారం వరకు | 13 నుంచి 18వ వారం వరకు |
| 3. 19 నుంచి 27వ వారం వరకు | 19 నుంచి 21వ వారం వరకు | 22 నుంచి 27వ వారం వరకు |
| 4. 28 నుంచి 36వ వారం వరకు | 28 నుంచి 30వ వారం వరకు | 31 నుంచి 36వ వారం వరకు |
| 5. 37 నుంచి 45వ వారం వరకు | 37 నుంచి 39వ వారం వరకు | 40 నుంచి 45వ వారం వరకు |
| 6. 46 నుంచి (54వ) వారం వరకు | 46 నుంచి 48వ వారం వరకు | 49 నుంచి 54వ వారం వరకు |

**పెట్టుబడి-II**

| టర్నోవరు కాలాలు | పని కాలాలు | చలామణి కాలాలు |
|---|---|---|
| 1. 4 నుంచి 12వ వారం వరకు | 4 నుంచి 6వ వారం వరకు | 7 నుంచి 12వ వారం వరకు |
| 2. 13 నుంచి 21వ వారం వరకు | 13 నుంచి 15వ వారం వరకు | 16 నుంచి 21వ వారం వరకు |
| 3. 22 నుంచి 30వ వారం వరకు | 22 నుంచి 24వ వారం వరకు | 25 నుంచి 30వ వారం వరకు |
| 4. 31 నుంచి 39వ వారం వరకు | 31 నుంచి 33వ వారం వరకు | 34 నుంచి 39వ వారం వరకు |
| 5. 40 నుంచి 48వ వారం వరకు | 40 నుంచి 42వ వారం వరకు | 43 నుంచి 48వ వారం వరకు |
| 6. 49 నుంచి (57వ) వారం వరకు | 49 నుంచి 51వ వారం వరకు | (52 నుంచి 57వ వారం వరకు) |

**పెట్టుబడి-III**

| టర్నోవరు కాలాలు | పని కాలాలు | చలామణి కాలాలు |
|---|---|---|
| 1. 7 నుంచి 15వ వారం వరకు | 7 నుంచి 9వ వారం వరకు | 10 నుంచి 15వ వారం వరకు |
| 2. 16 నుంచి 24వ వారం వరకు | 16 నుంచి 18వ వారం వరకు | 19 నుంచి 24వ వారం వరకు |
| 3. 25 నుంచి 33వ వారం వరకు | 25 నుంచి 27వ వారం వరకు | 28 నుంచి 33వ వారం వరకు |
| 4. 34 నుంచి 42వ వారం వరకు | 34 నుంచి 36వ వారం వరకు | 37 నుంచి 42వ వారం వరకు |
| 5. 43 నుంచి 51వ వారం వరకు | 43 నుంచి 45వ వారం వరకు | 46 నుంచి 51వ వారం వరకు |

ఇది మొదటి ఉదాహరణలో చెప్పిన దానికి సరిగ్గా ప్రతిరూపంగా వుంది. అయితే ఒక తేడా వుంది. రెండు పెట్టుబడులకు బదులు ఇక్కడ మూడు పెట్టుబడులు ఒకదాన్ని ఒకటి విడుదల

చేసుకుంటూ దాని స్థానం భర్తీ చేస్తాయి. ఇవి ఒకదానిలో ఒకటి ప్రవేశించవు. సమ్మిళితం కావు. సంవత్సరం చివరిదాకా వాటిలో ప్రతిదాని గమనాన్ని విడిగా గుర్తుపట్టవచ్చు. ఒకటో ఉదాహరణలో లాగానే, ఒక పనికాలం చివర పెట్టుబడి ఏదీ విడుదలై వుండదు. పెట్టుబడి–I మూడోవారం చివర పూర్తిగా వినియోగమవుతుంది. అది 9వ వారం చివర పూర్తిగా తిరిగి వస్తుంది. 10వ వారం ప్రారంభంలో తన పనులను తిరిగి ప్రారంభిస్తుంది. పెట్టుబడి–II, III విషయంలో కూడా ఇదే జరుగుతుంది. క్రమం తప్పకుండా, పూర్తిగా ఒకదాని స్థానాన్ని మరొకటి భర్తీ చేయడం వల్ల, కొంత పెట్టుబడి విడుదలై వుండటానికి ఆస్కారం లేదు.

మొత్తం టర్నోవర్ ఈ కింది విధంగా వుంటుంది.

పెట్టుబడి–I 300 పౌండ్లను $5\frac{2}{3}$ సార్లు లేదా 1,700 పౌండ్లను

పెట్టుబడి–II 300 పౌండ్లను $5\frac{1}{3}$ సార్లు లేదా 1,600 పౌండ్లను

పెట్టుబడి–III 300 పౌండ్లను 5 సార్లు, లేదా 1,500 పౌండ్లను

టర్నోవరు చేస్తాయి. మొత్తం పెట్టుబడి 900ని $5\frac{1}{3}$ సార్లు లేదా 4,800 పౌండ్లను టర్నోవరు చేస్తుంది.

చలామణి కాలం పని కాలానికి సరిగ్గా గుణిజంగా లేని ఉదాహరణ తీసుకొందాం. పనికాలం నాలుగు వారాలు, చలామణి కాలం 5 వారాలు వుండే ఉదాహరణ తీసుకుందాం. ఇప్పుడు అవసరమైన పెట్టుబడి–I నాలుగు వందల పౌండ్లు, పెట్టుబడి–II నాలుగు వందల పౌండ్లు, పెట్టుబడి–III వంద పౌండ్లు. కేవలం ఇక్కడ మొదటి మూడు టర్నోవరులు మాత్రమే చూపుతున్నాము.

**పట్టిక–IV – పెట్టుబడి–I**

| టర్నోవరు కాలాలు | పని కాలాలు | చలామణి కాలాలు |
|---|---|---|
| 1. 1 నుంచి 9వ వారం వరకు | 1 నుంచి 4వ వారం వరకు | 5 నుంచి 9వ వారం వరకు |
| 2. 9 నుంచి 17వ వారం వరకు | 9, 10 నుంచి 12వ వారం వరకు | 13 నుంచి 17వ వారం వరకు |
| 3. 17 నుంచి 25వ వారం వరకు | 17,18 నుంచి 20వ వారం వరకు | 21 నుంచి 25వ వారం వరకు |

**పెట్టుబడి–II**

| టర్నోవరు కాలాలు | పని కాలాలు | చలామణి కాలాలు |
|---|---|---|
| 1. 5 నుంచి 13వ వారం వరకు | 5 నుంచి 8వ వారం వరకు | 9 నుంచి 13వ వారం వరకు |
| 2. 13 నుంచి 21వ వారం వరకు | 13, 14 నుంచి 16వ వారం వరకు | 17 నుంచి 21వ వారం వరకు |
| 3. 21 నుంచి 29వ వారం వరకు | 21, 22 నుంచి 24వ వారం వరకు | 25 నుంచి 29వ వారం వరకు |

**పెట్టుబడి–III**

| టర్నోవరు కాలాలు | పని కాలాలు | చలామణి కాలాలు |
|---|---|---|
| 1. 9 నుంచి 17వ వారం వరకు | 5 నుంచి | 10 నుంచి 17వ వారం వరకు |
| 2. 17 నుంచి 25వ వారం వరకు | 17 నుంచి | 18 నుంచి 25వ వారం వరకు |
| 3. 25 నుంచి 33వ వారం వరకు | 25 నుంచి | 26 నుంచి 33వ వారం వరకు |

ఈ ఉదాహరణలో పెట్టుబడి–III పనికాలానికి సంబంధించినంత వరకు, పెట్టుబడులు పెనవేసుకోవడం కనిపిస్తుంది. పెట్టుబడి–III కు స్వతంత్రమైన పనికాలం లేదు. ఎందువల్లనంటే అది ఒక్క వారానికి మాత్రమే సరిపోతుంది. ఆ పనికాలం పెట్టుబడి–I యొక్క మొదటి పనివారంతో ఏకీభవిస్తుంది. మరోవైపున పెట్టుబడి–III కు సమానమైన వంద పౌండ్ల పెట్టుబడి–I, II లు రెంటి పనికాలం చివరిలో విడుదలై వుంటుంది. ఎందువల్లనంటే, పెట్టుబడి–III, పెట్టుబడి–I యొక్క రెండవ పనికాలంలోని, తర్వాత వచ్చే అన్ని పనికాలాల్లోని మొదటి వారం అవసరం పూరిస్తుంది; ఈ మొదటి వారం చివరిలో మొత్తం పెట్టుబడి–I నాలుగు వందల పౌండ్లు తిరిగి వస్తాయి. కనుక, అప్పటికింకా పెట్టుబడి–I లోని పనికాలంలో 3 వారాలు మాత్రమే వుంటాయి. దానికి పెట్టుబడి–I 3 వందల పౌండ్లు మదుపు సరిపోతుంది. ఆ రకంగా విడుదలై వున్న వంద పౌండ్లు ఆ వెంటనే ప్రారంభమయ్యే పెట్టుబడి–II యొక్క పనికాలంలో మొదటి వారానికి సరిపోతుంది. ఆ వారం చివర మొత్తం పెట్టుబడి–II నాలుగు వందల పౌండ్లు తిరిగి వస్తాయి. అయితే అప్పటికే ప్రారంభమైన పనికాలం 3 వందల పౌండ్లను మాత్రమే స్వీకరించగలదు. దాని చివరిలో మళ్ళీ వంద పౌండ్లు విడుదల అవుతుంది. ఈ క్రమం ఇలాగే కొనసాగుతుంది. కాబట్టి చలామణి కాలం పనికాలానికి సామాన్య గుణిజం కానప్పుడు ప్రతి పనికాలం చివరిలోనూ కొంత పెట్టుబడి విడుదలవుతుంది. అలా విముక్తమైన పెట్టుబడి, పనికాలానికి లేదా పనికాలాలకు మించి వున్న చలామణి కాలానికి సరిపడే పెట్టుబడి భాగానికి సమానంగా వుంటుంది.

ఇక్కడ మనం పరిశోధించిన ఉదాహరణలన్నింటిలోనూ పనికాలం, చలామణి కాలం ఇక్కడ తీసుకొన్న ఏ వ్యాపారంలోనైనా ఏడాది పొడవునా ఒకేలా వుంటాయని ఊహించుకొంటున్నాం. టర్నోవర్ పైనా, అడ్వాన్స్ చేయబడే పెట్టుబడిపైనా చలామణి కాలానికి వుండే ప్రభావాన్ని తెలుసుకోవాలంటే ఇలా ఊహించుకోవడం అవసరం. వాస్తవంలో ఈ ఊహ భేషరతుగా చెల్లుబాటయ్యేది కాదు. తరచు చెల్లదు కూడా. కానీ అంతమాత్రాన పైన చెప్పిన విషయం మారదు.

ఈ మొత్తం విభాగంలో మనం కేవలం చలామణి టర్నోవర్‌ల గురించి మాత్రమే చర్చించాం తప్ప నిశ్చల పెట్టుబడి గురించి కాదు. ఎందుకంటే ఇక్కడ విషయం ఏ మాత్రం నిశ్చల పెట్టుబడికి సంబంధించినది కాదు. ఉత్పత్తిలో నియుక్తమయ్యే శ్రమ పరికరాల వినియోగ కాలం చలామణి పెట్టుబడి యొక్క టర్నోవర్ కాలాన్ని మించి వున్న మేరకు, ఈ శ్రమ పరికరాలు నిరంతరాయంగా పునరావృత్తమయ్యే శ్రమ ప్రక్రియలో కొనసాగే కాలం చలామణి పెట్టుబడి టర్నోవర్ కాలం కంటే ఎక్కువగా వున్న మేరకు, కనుక చలామణి టర్నోవర్ యొక్క 'క' కాలాలకు అది సమానంగా వున్న మేరకు ఆ శ్రమ పరికరాలు నిశ్చల పెట్టుబడి అవుతాయి. ఈ 'క' టర్నోవర్ కాలాలు ప్రాతినిధ్యం వహించే మొత్తం కాలం ఎంత వున్నప్పటికీ, ఈ కాలానికి నిశ్చల పెట్టుబడిగా అడ్వాన్స్ చేయబడిన ఉత్పాదక పెట్టుబడి ఈ కాలక్రమంలో కొత్తగా అడ్వాన్స్ చేయబడదు. అది తన పాత ఉపయోగపు రూపంలోనే పనిచేస్తుంది. ఉన్న తేడా ఇది మాత్రమే. చలామణి పెట్టుబడి నిర్వహించే ప్రతి టర్నోవర్ కాలంలోని ఒక పనికాలం యొక్క మారే పరిమాణాన్ని బట్టి నిశ్చల పెట్టుబడి తన తొలి విలువలో ఎంతో కొంత భాగాన్ని ఆ పనికాలపు ఉత్పాదితానికి ఇస్తుంది. నిశ్చల పెట్టుబడి ఉత్పాదితానికి ఇచ్చిన ఈ విలువ భాగం, తన ప్రతి టర్నోవర్ కాలపు చలామణి కాలాన్ని బట్టి త్వరగానో, నిదానంగానో

డబ్బు రూపంలో తిరిగి వస్తుంది. ఈ విభాగంలో మనం చర్చిస్తున్న విషయ స్వభావం – ఉత్పాదక పెట్టుబడిలోని చలామణి భాగపు టర్నోవర్ స్వభావం – ఆ భాగానికున్న స్వభావం నుంచే నిష్పన్న మవుతోంది. ఒక పనికాలంలో ఉపయోగించబడిన చలామణి పెట్టుబడి తన టర్నోవర్‌ని పూర్తి చేసేటంత వరకూ, అది సరుకు పెట్టుబడిగా మారేంత వరకూ సరుకు పెట్టుబడి నుంచి డబ్బు పెట్టుబడిగానూ, డబ్బు పెట్టుబడి నుంచి ఉత్పాదక పెట్టుబడిగానూ మారేంత వరకూ, అది కొత్త పనికాలంలో వినియోగించబడజాలదు. కనుక మొదటి పనికాలం వెంటనే రెండో పనికాలం ప్రారంభం కావాలంటే, కొత్తగా పెట్టుబడి అడ్వాన్స్ చేయాలి. అది ఉత్పాదక పెట్టుబడి యొక్క చలామణి అంశాలుగా మార్చబడాలి. దాని పరిమాణం మొదటి పనికాలంలో అడ్వాన్స్ చేయబడిన చలామణి పెట్టుబడి యొక్క చలామణి కాలం వల్ల ఏర్పడిన శూన్యాన్ని భర్తీ చేయగలగాలి. శ్రమ ప్రక్రియ స్థాయిపైన, అడ్వాన్స్ అయిన పెట్టుబడి విభజన పైన లేదా కొత్త పెట్టుబడి భాగాలు చేరడంపైన చలామణి పెట్టుబడి పనికాలం పరిమాణం నెరపే ప్రభావానికి ఇదే మూలం. ఈ విభాగంలో మనం పరిశీలించాల్సి వచ్చిన అంశం సరిగ్గా ఇదే.

## IV. నిర్ధారణలు

ఇంతవరకూ చేసిన పరిశోధన వల్ల ఈ అంశాలు స్పష్టమవుతున్నాయి.

(అ) పెట్టుబడిలో ఒక భాగం నిరంతరాయంగా పనికాలంలోనూ, మిగతా భాగాలు చలామణి కాలంలోనూ ఉండేలా అది విభజితమై వుండాలి. అప్పుడా భాగాలు వేరు వేరు స్వతంత్రమైన విడి పెట్టుబడులలాగా ఒకదానినొకటి కింది రెండు సందర్భాల్లో విడుదల చేసుకొంటాయి. 1. పనికాలం, చలామణి కాలం సమానంగా వున్నప్పుడు, అంటే టర్నోవర్ కాలం రెండు సమాన భాగాలుగా విభజితమై వున్నప్పుడు; 2. పనికాలం కంటే చలామణి కాలం పెద్దదిగా వుంటూ అది పనికాలానికి సామాన్య గుణిజంగా వున్నప్పుడు; ఒక చలామణి కాలం అప్పుడు 'క' పని కాలాలకు సమానంగా 'క' ఒక పూర్ణ సంఖ్యగా వుంటుంది. ఈ సందర్భాల్లో, వరుసగా అడ్వాన్స్ చేయబడిన పెట్టుబడిలో ఏ భాగమూ ఖాళీగా వుండదు.

(ఆ) మరోవైపున 1. పనికాలం కంటే చలామణి కాలం పెద్దదిగా వుంటూ పనికాలానికి సామాన్య గుణిజంగా వుండనప్పుడు, 2. చలామణి కాలం కంటే పనికాలం ఎక్కువగా వుంటూ, రెండవ టర్నోవర్ ప్రారంభం అయినప్పటి నుంచీ ప్రతి పనికాలం చివర ఎప్పటికప్పుడు, నిరంతరాయంగా మొత్తం చలామణి పెట్టుబడిలో ఒక భాగం ఖాళీగా వుంటుంది. చలామణి కాలం కంటే పనికాలం పెద్దదిగా వున్నప్పుడు, ఇలా ఖాళీగా వున్న పెట్టుబడి చలామణి కాలానికి అడ్వాన్స్ చేయబడిన మొత్తం పెట్టుబడి భాగానికి సమానంగా వుంటుంది; చలామణి కాలం పనికాలం కంటే పెద్దదిగా వున్నప్పుడు, పని కాలానికి లేదా అనేక పని కాలాలకు మించి వున్న అదనపు చలామణి కాలాన్ని భర్తీ చేయవలసిన పెట్టుబడి భాగంతో సమానంగా వుంటుంది.

(ఇ) దీన్ని బట్టి తెలుస్తున్నదేమిటంటే, మొత్తం సామాజిక పెట్టుబడి విషయంలో దాని చలామణి భాగానికి సంబంధించినంత వరకు పెట్టుబడి విడుదల విధిగా జరగాలి. ఉత్పత్తి ప్రక్రియలో వరుసగా పనిచేస్తున్న పెట్టుబడి భాగాలు కేవలం ఒకదాని స్థానంలో మరొకటి రావడం సకృత్తుగా జరిగేది.

ఎందువల్లనంటే పనికాలం, చలామణి కాలం సమానంగా ఉండడం లేదా చలామణి కాలం పనికాల సామాన్య గుణిజానికి సమానంగా వుండడం, అంటే టర్నోవర్ కాలంలోని ఈ రెండు భాగాలు క్రమబద్ధమైన నిష్పత్తిలో వుండటం ఇక్కడ చర్చిస్తున్న విషయ స్వభావంతో ప్రమేయం లేదు. అందువల్ల అది మొత్తం మీద సకృత్తుగా మాత్రమే సంభవిస్తుంది.

కాబట్టి, సామాజిక చలామణి పెట్టుబడిలో ఒక గణనీయమైన భాగం. ఏడాదికి అనేకసార్లు టర్నోవర్ అయ్యే ఈ భాగం వార్షిక టర్నోవర్ చక్రకాలంలో, నియమిత వ్యవధుల్లో విడుదలైన పెట్టుబడి రూపంలో వుంటుంది.

మిగిలిన పరిస్థితులన్నీ యధాతథంగా వున్నంత మేరకు, శ్రమ ప్రక్రియ పరిమాణంతో పాటు లేదా ఉత్పత్తి స్థాయితో పాటు, అంటే, మొత్తంపై పెట్టుబడిదారీ ఉత్పత్తి అభివృద్ధితో పాటు ఇలా విడుదల అయిన పెట్టుబడి పరిమాణం పెరుగుతుంది; ఆ (2) వ ఉదాహరణలో, అడ్వాన్స్ చేయబడిన పెట్టుబడి పెరగడం వల్ల ఇలా విడుదల అయిన పెట్టుబడి పెరుగుతుంది. ఆ (1)వ ఉదాహరణలో, పెట్టుబడిదారీ ఉత్పత్తి అభివృద్ధితో పాటు చలామణి కాల పరిమాణం కూడా పెరగడం వల్లనేమి, దానితో పాటు చలామణి కాలంకంటే పనికాలం తక్కువగా వున్న సందర్భాల్లో టర్నోవర్ కాలం కూడా పెరగడం వల్లనేమి, ఈ రెండు కాలాలు ఒక క్రమబద్ధమైన నిష్పత్తిలో వుండనందు వల్లనేమి విడుదల అయిన పెట్టుబడి పరిమాణం పెరుగుతుంది.

మొదటి ఉదాహరణలో వారానికి వంద పౌండ్లు మదుపు పెట్టబడింది. ఆరు వారాల పని కాలానికి ఆరు వందల పౌండ్లు అవసరమయ్యాయి. మూడు వారాల చలామణి కాలానికి మూడు వందల పౌండ్లు అవసరమయ్యాయి. ఈ మొత్తం 9 వందల పౌండ్లు. ఆ ఉదాహరణలో వరుసగా మూడు వందల పౌండ్లు నిరంతరాయంగా విడుదల అవుతాయి. మరోవైపు, వారానికి మూడు వందల పౌండ్లు మదుపుపెట్టబడితే, పని కాలానికి 18 వందల పౌండ్లు, చలామణి కాలానికి 9 వందల పౌండ్లు అవుతాయి. అటువంటప్పుడు 3 వందల పౌండ్లకు బదులు 9 వందల పౌండ్లు నియమిత కాలాల్లో విడుదలవుతాయి.

(ఈ) పైన పేర్కొన్న విధంగా 9 వందల పౌండ్ల మొత్తం పెట్టుబడిని పనికాలానికి 6 వందలు, చలామణి కాలానికి 3 వందల పౌండ్లు విభజించాలి. ఈ విధంగా శ్రమ ప్రక్రియలో నిజంగా మదుపు పెట్టబడిన భాగం మూడో వంతు, అంటే 9 వందల పౌండ్ల నుంచి 6 వందల పౌండ్లకు కుదించబడింది. దానివల్ల ఉత్పత్తి స్థాయి మూడో వంతు కుదించబడుతుంది. కానీ, 3 వందల పౌండ్లు నిర్వర్తించే విధి, పని కాలాన్ని నిరంతరాయంగా సాగేలా చేయడానికి మాత్రమే; శ్రమ ప్రక్రియకు ప్రతివారం వంద పౌండ్లు మదుపు పెట్టడానికి వీలయ్యేలా చేయడమే.

ఊహించుకొని చూస్తే, ఆరు వందల పౌండ్లు 6×8 వారాల కాలం లేదా 48 వారాల పాటు (ఉత్పాదితం 4 వేల 8 వందల పౌండ్లు) పని చేసినా, లేక 9 వందల పౌండ్లు శ్రమ ప్రక్రియలో 6 వారాలు వినియోగమై 3 వారాలు చలామణి కాలంలో ఖాళీగా వున్నా ఒకటే. రెండో ఉదాహరణలో అది 48 వారాలలోనూ, $5\frac{1}{3}$×6 వారాలు లేదా 32 వారాలు (ఉత్పాదితం 9 వందలకు $5\frac{1}{3}$ రెట్లు, లేదా 4 వేల 8 వందల పౌండ్లు) పనిచేసి, 16 వారాల పాటు ఖాళీగా వుంటుంది. అయితే ఈ 16

వారాల కాలంలోనూ నిశ్చల పెట్టుబడి మరింత పాడవడమే కాక, శ్రమను ఏడాదిలో కొంతకాలమే వినియోగించుకొన్నప్పటికీ దానికి ఏడాది పొడుగునా చెల్లించవలసి వుంటుంది. కాబట్టి శ్రమ మూల్యం పెరగడమే కాక, అటువంటి అంతరాయాలకు ఆధునిక భారీ పరిశ్రమ ఉత్పత్తి ప్రక్రియలతో ఏ మాత్రం పొత్తులేదు. నిరంతరాయత సైతం శ్రమ యొక్క ఒక ఉత్పాదక శక్తి.

ఇప్పుడు మనం విడుదలైన లేదా ఖాళీగా వున్న పెట్టుబడిని మరికొంత జాగ్రత్తగా పరిశీలిద్దాం. దానిలో ఒక గణనీయమైన భాగం ఎల్లప్పుడూ డబ్బు పెట్టుబడి రూపంలో వుంటుంది. మన పాత ఉదాహరణనే తీసుకుందాం. పనికాలం ఆరు వారాలు, చలామణి కాలం 3 వారాలు, వారానికి మదుపు వంద పౌండ్లు. రెండో పనికాలం మధ్యలో, 9వ వారం చివర 6 వందల పౌండ్లు తిరిగి వస్తాయి. మిగిలిన పనికాలానికి దానిలో 3 వందల పౌండ్లు మాత్రమే అవసరమవుతుంది. రెండో పనికాలం చివర 3 వందల పౌండ్లు విడుదలవుతాయి. ఈ 3 వందల పౌండ్లు ఏ స్థితిలో వుంటాయి? దీనిలో 3వ వంతు వేతనాల కోసం, మిగిలిన రెండు వంతులు ముడి, సహాయక పదార్థాల కోసం వ్యయమవుతాయనుకుందాం. అప్పుడు తిరిగి వచ్చిన 6 వందల పౌండ్లలో రెండు వందల పౌండ్లు వేతనాల కోసం డబ్బు రూపంలోనూ, 4 వందల పౌండ్లు ఉత్పాదక సరఫరా రూపంలోనూ అంటే స్థిరమైన, చలామణి అయ్యే ఉత్పాదక పెట్టుబడి అంశాల రూపంలో వుంటాయి. అయితే, ఈ ఉత్పాదక సరఫరాలో సగం మాత్రమే రెండో పనికాలంలోని రెండో అర్థ భాగానికి అవసరం. మరో అర్థ భాగం 3 వారాల పాటు అదనపు ఉత్పాదక సరఫరా రూపంలో అంటే, ఒక పనికాలపు అవసరాలకు మించిన సరఫరా రూపంలో వుంటుంది. అయితే ప్రస్తుత పని కాలానికి తిరిగి వచ్చిన పెట్టుబడిలోని ఈ భాగంలో (400 పౌండ్లు) సగం మాత్రమే, అంటే రెండు వందల పౌండ్లు మాత్రమే తనకు అవసరమన్న సంగతి పెట్టుబడిదారునికి తెలుసు. కనుక అతను ఈ రెండు వందల పౌండ్లను పూర్తిగానో లేదా పాక్షికంగానో ఉత్పాదక పెట్టుబడిగా వెంటనే మారుస్తాడా లేక మార్కెట్‌లో మరింత సానుకూల పరిస్థితులు రాగలవనే అంచనాతో అలాగే డబ్బు పెట్టుబడి రూపంలోనే పూర్తిగా లేదా పాక్షికంగా ఉంచుతాడా అన్నది మార్కెట్ పరిస్థితులపైన ఆధారపడి వుంటుంది. కానీ వేతనాల కోసం ఖర్చు చేయవలసిన భాగాన్ని (200 పౌండ్లు) డబ్బు రూపంలోనే వుంచుకొంటాడని వేరే చెప్ప పనిలేదు. పెట్టుబడిదారు శ్రమశక్తిని కొన్న తర్వాత దాన్ని గిడ్డంగులలో, ముడిపదార్థాల విషయంలో చేసినట్లు, నిల్వ చేయలేడు. దాన్ని ఉత్పత్తి ప్రక్రియలో వెంటనే చేర్చాలి. దానికి వారాంతంలో డబ్బు చెల్లించాలి. ఏది ఏమైనప్పటికీ విడుదలైన 3 వందల పౌండ్ల పెట్టుబడిలో ఈ వంద పౌండ్లు విడుదలై డబ్బు పెట్టుబడి రూపంలో వుంటాయి. వాటితో పనికాలానికి అవసరం లేదు. డబ్బు పెట్టుబడి రూపంలో పెట్టుబడి కనీసం, వేతనాల్లో మదుపు పెట్టే పెట్టుబడి యొక్క అస్థిర భాగంతోనైనా సమానంగా వుండాలి. గరిష్ట స్థాయిలో, అది విడుదలైన మొత్తం పెట్టుబడిగా వుండవచ్చు. వాస్తవంలో అది ఈ కనీస, గరిష్ట స్థాయిల మధ్య హెచ్చుతూ, తగ్గుతూ వుంటుంది.

టర్నోవర్ యంత్రాంగ గమనం ద్వారా విడుదలైన డబ్బు పెట్టుబడి (వరుసగా తిరిగి వచ్చిన నిశ్చల పెట్టుబడిచేత విడుదలైన భాగమూ, అలాగే ప్రతి శ్రమ ప్రక్రియలోనూ అస్థిర పెట్టుబడి కోసం అవసరమైన భాగము – ఈ రెంటితో కలిసి), పరపతి వ్యవస్థ అభివృద్ధి కాగానే ఒక ప్రధానమైన

పాత్ర నిర్వహిస్తుంది; అదే సమయంలో పరపతి వ్యవస్థ పునాదుల్లో ఒకటిగా రూపొందుతుంది.

మన ఉదాహరణలో చలామణి కాలం 3 నుంచి 2 వారాలకు తగ్గిందని అనుకుందాం. ఇది మామూలు మార్పు కాకుండా, ఆర్థిక వికాస కాలం వల్ల త్వరితంగా జరిగిన చెల్లింపుల వల్ల తగ్గిందని అనుకుందాం. కనుక మొదట పనికాలంలో పెట్టబడిన ఆరు వందల పౌండ్ల పెట్టుబడి, అవసరమైనదాని కంటే ఒక వారం ముందే వస్తుంది. కాబట్టి ఈ వారం ఖాళీగా వుంటుంది. అంతేగాక పనికాలం మధ్యలో 3 వందల పౌండ్లు మునుపటిలాగే విడుదలవుతాయి. (ఇవి ఆరు వందల పౌండ్లలో ఒక భాగం.) అయితే ఇవి 3 వారాలకు బదులు 4 వారాలకు విడుదలయ్యాయి. అంటే, డబ్బు మార్కెట్‌లో ఒక వారంపాటు ఆరు వందల పౌండ్లూ, 3 వారాలకు బదులు నాలుగు వారాల పాటు 3 వందల పౌండ్లు వున్నాయన్నమాట. ఇది ఒక పెట్టుబడిదారుడికి సంబంధించిన వ్యవహారం కాదు. అనేక మంది పెట్టుబడిదారులకు సంబంధించినది. ఇవి విభిన్న వ్యాపారాల్లో వివిధ కాలాల్లో జరుగుతుంది. కాబట్టి మార్కెట్‌లో మరింత ఎక్కువ డబ్బు పెట్టుబడి అందుబాటులో వుంటుంది. ఈ పరిస్థితి కొంత కాలం కొనసాగితే, వీలైన ప్రతిచోటా ఉత్పత్తి విస్తరిస్తుంది. అప్పు తెచ్చిన డబ్బుతో పని చేస్తున్న పెట్టుబడిదారుల నుంచి డబ్బు మార్కెట్‌పై వచ్చే డిమాండ్ తగ్గుతుంది. ఇది పెరిగిన సరఫరాను బట్టి డబ్బు కటకటను సడలిస్తుంది. లేదా కార్యకలాపాల యంత్రాంగానికి అవసరం లేని మొత్తాలు డబ్బు మార్కెట్‌లోకి ఖచ్చితంగా నెట్టివేయబడతాయి.

చలామణి కాలం 3 వారాల నుంచి 2 వారాలకు తగ్గడం వల్ల టర్నోవర్ కాలం 9 వారాల నుంచి 8 వారాలకు తగ్గుతుంది. అందువల్ల అడ్వాన్స్ చేయబడిన పెట్టుబడిలో 9వ వంతు అవసరమవుతుంది. 6 వారాల పనికాలం ఇదివరకు 9 వందల పౌండ్లతో పని చేసినట్లే, ఇప్పుడు 8 వందల పౌండ్లతో పని చేస్తుంది. సరుకు పెట్టుబడి విలువలో వంద పౌండ్లకు సమానమైన భాగం డబ్బు రూపంలోకి మారిన తర్వాత, ఉత్పత్తి ప్రక్రియ కోసం అడ్వాన్స్ చేయబడిన పెట్టుబడిగా ఏ మాత్రం వ్యవహరించకుండా, కేవలం డబ్బు పెట్టుబడి రూపంలోనే వుండిపోతుంది. ఉత్పత్తి స్థాయి, ధరలు, వగైరా వంటి ఇతర పరిస్థితులు యధాతథంగా వున్న మేరకు, అడ్వాన్స్ చేయబడిన పెట్టుబడి విలువ మొత్తం 9 వందల పౌండ్ల నుంచి 8 వందల పౌండ్లకు తగ్గించబడుతుంది. మొదట అడ్వాన్స్ చేయబడిన మొత్తంలో మిగిలిన వంద పౌండ్ల డబ్బు పెట్టుబడి రూపంలో తొలగించబడుతుంది. అది అదే రూపంలో డబ్బు మార్కెట్‌లోకి ప్రవేశిస్తుంది. అక్కడ పనిచేస్తున్న పెట్టుబడుల్లో ఒక అదనపు భాగమవుతుంది.

డబ్బు పెట్టుబడి కుప్పతెప్పలుగా వుండే స్థితి ఎలా తలఎత్తుతుందో ఇది తెలియజేస్తుంది. ఇది, గిరాకీ కంటే డబ్బు పెట్టుబడి సరఫరా ఎక్కువగా వుండటమన్న అర్థంలోనే కాదు, ఇది ఎల్లప్పుడూ కేవలం సాపేక్షంగా తలెత్తిన అమిత సమృద్ధి మాత్రమే. ఉదాహరణకు అలాంటిది సంక్షోభం అయిపోయాక కొత్త వ్యాపార ఆవృత్తిని ప్రారంభించే 'విచారగ్రస్త కాలం'లో తలెత్తుతుంది. అడ్వాన్స్ చేయబడిన పెట్టుబడి విలువలో ఒక నిర్దిష్ట భాగం సామాజిక పునరుత్పత్తి యొక్క మొత్తం ప్రక్రియలో పనిచేయడానికి అవసరం కావడమన్న అర్థంలో కూడా డబ్బు పెట్టుబడి అమితంగా వుంటుంది. కనుక అది డబ్బు పెట్టుబడి రూపంలో రంగం నుంచి తొలగించబడుతుంది. ఉత్పత్తి స్థాయి, ధరలు

వగైరా యధాతథంగా వున్న స్థితిలో, టర్నోవర్ కాలం తగ్గిపోవడం వల్ల మాత్రమే డబ్బు పెట్టుబడి ఇలా కుప్పతెప్పలుగా వుంటుంది. చలామణిలో వున్న డబ్బు పెద్దదైనా, చిన్నదైనా, దాన్ని ఏ మాత్రం ప్రభావితం చేయలేదు.

ఇందుకు విరుద్ధంగా చలామణి కాలం 3 వారాల నుంచి 5 వారాలకు పెరిగిందని అనుకుందాం. అటువంటప్పుడు దాని తర్వాత టర్నోవర్‌లో, అడ్వాన్స్ అయిన పెట్టుబడి తిరిగి రావడం రెండు వారాలు ఆలస్యంగా జరుగుతుంది. ఈ పనికాలం యొక్క ఉత్పత్తి ప్రక్రియ ఆఖరి భాగం, అడ్వాన్స్ చేయబడిన పెట్టుబడి టర్నోవర్ యంత్రాంగం వల్ల మాత్రమే కొనసాగించబడజాలదు. ఇది ఎక్కువ కాలం కొనసాగితే ఉత్పత్తి ప్రక్రియ కుదించబడవచ్చు. ఇంతకు ముందు ఉత్పత్తి పరిమాణం పెరిగినట్లే ఇప్పుడు దాని పరిమాణం తగ్గవచ్చు. అయితే అదే స్థాయిలో ఉత్పత్తిని కొనసాగించడానికి అడ్వాన్స్ చేయబడిన పెట్టుబడిని తొమ్మిదింట రెండు వంతులు, అంటే రెండు వందల పౌండ్లు పెంచాల్సి వుంటుంది. ఇప్పుడు పెరిగిన చలామణి కాలానికి సరిపడా పెంచాల్సి వుంటుంది. ఈ అదనపు పెట్టుబడిని ఒక్క పెట్టుబడి మార్కెట్ నుంచీ మాత్రమే సేకరించ వీలుంది. చలామణి కాలం పెరగడమన్నది ఒకటి లేదా అనేక పెద్ద వ్యాపార శాఖల్లో జరిగితే, ప్రతికూల ప్రభావం గల మరేదో అడ్డుకొంటే తప్ప, డబ్బు మార్కెట్‌పై ఒత్తిడి రాక తప్పదు. ఇంతకు ముందు ఉదాహరణలో డబ్బు పెట్టుబడి కుప్పతెప్పలుగా వున్న స్థితిలాగానే, ఇప్పటి ఒత్తిడికి కూడా సరుకుల ధరల గమనంతోగాని, అప్పుడున్న చలామణి సాధన పరిమాణంతో గాని నిమిత్తం లేదు, అనేది స్పష్టమే.

[ఈ అధ్యాయాన్ని ప్రచురణకు తయారు చేయడంలో నాకు ఎదురైన ఇబ్బందులేం తక్కువ కాదు. మార్క్స్ ఆల్జీబ్రాలో నిష్ణాతుడైనప్పటికీ, ఆయనకు అంకెలతో వ్యవహరించడం, ముఖ్యంగా వాణిజ్య గణాంకాలతో వ్యవహరించడం పూర్తిగా వంటబట్టలేదు. అయితే ఆయన వదలి వెళ్ళిన అనేక కాపీ పుస్తకాల్లో, నానారకాల వాణిజ్యపు లెక్కలను తానే స్వయంగా చేసి సమాధానాలు కనుగొన్న ఉదాహరణలు బోలెడున్నాయి. అయితే వివిధ పరిస్థితుల్లో లెక్కించడం, నిత్యజీవితంలోని ఆచరణాత్మక వ్యాపారపు లెక్కలు ఒకటి కాదు. దానివల్ల టర్నోవర్‌లకు సంబంధించి తన లెక్కల్లో మార్క్స్ చిక్కుముడుల్లో పడ్డాడు. అసంపూర్ణంగా వదిలేసిన కొన్ని అంశాలేకాక, ఆయన లెక్కాచార పద్ధతులు కొన్ని తప్పుగానూ, పరస్పర విరుద్ధంగానూ వున్నాయి. పైన ఇవ్వబడిన పట్టికల్లో నేను అతి సులభమైనవి, శాస్త్ర రీత్యా సరైనవి మాత్రమే ఎంచి ప్రచురించాను. అలా చేయడానికి కారణం ఇది.

శ్రమతో కూడిన ఈ లెక్కల నుంచి తాను చేసిన నిర్ధారణలను బట్టి, మార్క్స్ ఒక విషయానికి అనవసర ప్రాధాన్యమిచ్చారు. వాస్తవంలో దాని కెటువంటి ప్రాముఖ్యం లేదని నా అభిప్రాయం. ఆయన డబ్బు పెట్టుబడి 'విడుదల' అని పేర్కొన్న దాన్ని గురించి నేను ఇక్కడ ప్రస్తావిస్తున్నాను. పై ఊహల మీద ఆధారపడి వున్న వాస్తవ పరిస్థితి ఇది.

పని కాలానికి, చలామణి కాలానికి మధ్య వున్న నిష్పత్తి ఏమైనప్పటికీ, అలాగే పెట్టుబడి–I, పెట్టుబడి–II ల మధ్య నిష్పత్తి ఏమైనప్పటికీ, మొదటి టర్నోవర్ చివరిలోనూ, అటు పిమ్మటా, ఒక పని కాలానికి సమానమైన వ్యవధుల్లో క్రమం తప్పకుండా, ఒక పని కాలానికి అవసరమైన పెట్టుబడి, అంటే పెట్టుబడి–I కి సమానమైన మొత్తం డబ్బు రూపంలో పెట్టుబడిదారుడికి తిరిగి వస్తుంది.

పనికాలం 5 వారాలు, చలామణి కాలం 4 వారాలు, పెట్టుబడి–I 5 వందల పౌండ్లు అయితే, 5 వందల పౌండ్లకు సమానమైన మొత్తం ప్రతీసారీ, 9వ, 14వ, 19వ, 24వ, 29వ వగైరా వారాల చివర తిరిగి వస్తుంది.

పనికాలం 6 వారాలు, చలామణి కాలం 3 వారాలు, పెట్టుబడి–I 6 వందలు అయితే, 6 వందల పౌండ్లు 9వ, 15వ, 21వ, 27వ, 33వ వగైరా వారాల చివర తిరిగి వస్తుంది.

చివరగా పనికాలం 4 వారాలు, చలామణి కాలం 5 వారాలు, పెట్టుబడి–I 4 వందలు అయితే, 4 వందల పౌండ్లు మొత్తం 9వ, 13వ, 17వ, 21వ, 25వ, వగైరా వారాల చివర తిరిగి వస్తుంది.

ఈ తిరిగి వచ్చిన డబ్బులో కొంత అవసరమైనది వుందా, ఆ రకంగా అది విడుదలై ఖాళీగా వుందా, ఉంటే అది ఎంత అన్నదానితో ఇక్కడ ప్రమేయం లేదు. వర్తమాన స్థాయిలోనే ఉత్పత్తి నిరంతరాయంగా కొనసాగించబడుతుందని ఊహించుకొన్నాము. ఇలా సాగడానికి డబ్బు సిద్ధంగా వుండాలి. కనుక అది తిరిగి రావాలి – అది 'విడుదల' అయినా, కాకున్నా ఉత్పత్తికి అంతరాయం కలిగితే అలాగే డబ్బు విడుదల కూడా ఆగిపోతుంది.

మరో మాటల్లో చెప్పాలంటే : నిజానికి డబ్బు విడుదల జరిగింది, కాబట్టి అది డబ్బు రూపంలో వున్న గుప్త పెట్టుబడి, కేవలం పెట్టుబడి కాగల అవకాశమున్న మొత్తం. అయితే ఇది ఈ గ్రంథంలో ఊహించుకొన్న ప్రత్యేక పరిస్థితుల్లోనేగాక, అన్ని పరిస్థితుల్లోనూ జరుగుతుంది. చలామణి పెట్టుబడి–Iకి సంబంధించినంత వరకూ పారిశ్రామిక పెట్టుబడిదారు, తాను తన పరిశ్రమను స్థాపించినప్పుడున్న పరిస్థితిలోనే, ప్రతి టర్నోవర్ చివరిలో కూడా వుంటాడు. అతని చేతిలో డబ్బు ఒక్కసారిగా వస్తుంది. కానీ అతను దాన్ని ఉత్పాదక పెట్టుబడిగా క్రమ క్రమంగా మాత్రమే మార్చగలడు.

గ్రంథంలో వున్న అతి ముఖ్యమైన అంశం ఏమిటంటే, పారిశ్రామిక పెట్టుబడిలో ఒక గణనీయమైన భాగం ఒకవైపు ఎప్పుడూ డబ్బు రూపంలో వుండాలి. మరోవైపున, అంతకంటే గణనీయమైన భాగం తాత్కాలికంగా డబ్బు రూపం ధరించాలి. ఈ వాస్తవ నిరూపణ, నా ఈ వ్యాఖ్యానం వల్ల మరింత బలపడింది – [ఫ్రెడరిక్ ఎంగెల్స్]

## V. ధరల మార్పు కలిగించే ప్రభావం

మనం ఇంతకు ఒకవైపున మారని ఈ ధరలను, మారని ఉత్పత్తి స్థాయిని, మరోవైపున తగ్గుతూ లేదా హెచ్చుతూ మారే చలామణి కాలాన్ని ఊహించాం. అందుకు భిన్నంగా ఇప్పుడు మారని టర్నోవర్ కాలాన్ని, మారని ఉత్పత్తి స్థాయిని, మరోవైపున మారే ధరలను ఊహించుకొందాం. అంటే, ముడి పదార్థాలు, సహాయక పదార్థాలు, శ్రమ ధరలు పెరిగాయి, లేదా తరిగాయి లేదా మొదటి రెంటి ధరలు మాత్రమే పెరిగాయి లేదా తరిగాయి అనుకుందాం. ముందు, ఈ మూడింటి ధరలు సగం తగ్గాయనుకొందాం. దాని ప్రకారం, మనం పేర్కొన్న ఉదాహరణలో, వారానికి వంద పౌండ్లకు బదులు యాభై పౌండ్లు పెట్టుబడి అడ్వాన్స్ చేయవలసి వస్తుంది. 9 వారాల టర్నోవర్ కాలానికిగాను 9 వందల పౌండ్లకు బదులు నాలుగు వందల యాభై పౌండ్లు అడ్వాన్స్ చేయబడతాయి. అడ్వాన్స్ చేయబడిన పెట్టుబడి విలువలో నాలుగు వందల యాభై పౌండ్లు, డబ్బు పెట్టుబడి రూపంలో తొలగించ బడతాయి. అయితే ఉత్పత్తి క్రమం అదే స్థాయిలో, అదే టర్నోవర్ కాలంతో, టర్నోవర్ యొక్క అదే

విభజనతో కొనసాగుతుంది. వార్షిక ఉత్పాదితం అదే విధంగా అంతే వుంటుంది. అయితే దాని విలువ సగానికి పడిపోయింది. డబ్బు పెట్టుబడి సరఫరా, గిరాకీల్లో మార్పుతో పాటు వచ్చిన ఈ మార్పు చలామణి వేగం పెరగడం వల్లగానీ, చలామణి డబ్బు మొత్తంలో వచ్చిన మార్పు వల్లగానీ తలెత్తలేదు. అది అందుకు విరుద్ధంగా తలెత్తింది. ఉత్పాదక పెట్టుబడి అంశాల విలువ లేదా ధర సగం పడిపోతే, దానివల్ల మొదట కలిగే ప్రభావం ఏమిటంటే, వ్యాపారం పని అదివరకులాగే అదే స్థాయిలో కొనసాగించడం కోసం అడ్వాన్స్ చేయబడే పెట్టుబడి విలువ సగానికి పడిపోతుంది. కనుక వ్యాపారం 'ప' సగం డబ్బును మాత్రమే మార్కెట్‌లోకి తెస్తుంది. ఎందుకంటే, అది ఈ పెట్టుబడి విలువను డబ్బు రూపంలో, అంటే డబ్బు పెట్టుబడిగా అడ్వాన్స్ చేస్తుంది. చలామణిలోకి నెట్టబడిన డబ్బు మొత్తం, ఉత్పత్తి అంశాల ధరలు పడిపోవడం వల్ల తగ్గుతుంది. ఇది మొదటి ప్రభావం.

రెండో విషయం ఏమిటంటే మొదట అడ్వాన్స్ చేసిన 9 వందల పౌండ్లలో సగం లేదా నాలుగు వందల యాభై పౌండ్లు డబ్బు పెట్టుబడి, ఉత్పాదక పెట్టుబడి, సరుకు పెట్టుబడి రూపాలను వరుసగా గడిచిపోయింది. దానితోపాటు, అది ఏకకాలంలో, నిరంతరాయంగా, కొంత భాగం డబ్బు పెట్టుబడిగానూ, కొంత భాగం ఉత్పాదక పెట్టుబడిగానూ, కొంత భాగం సరుకు పెట్టుబడిగానూ వుండింది. ఇప్పుడది వ్యాపారం యొక్క ఆవృత్తి నుంచి తొలగించబడి, డబ్బు మార్కెట్‌లోకి అదనపు డబ్బు పెట్టుబడిగా ప్రవేశిస్తుంది. డబ్బు మార్కెట్‌లోని అదనపు మొత్తంగా ప్రభావితం చేస్తుంది. ఇలా విడుదలైన నాలుగు వందల యాభై పౌండ్లు డబ్బు పెట్టుబడిగా వ్యవహరించడానికి కారణం, వ్యాపారం యొక్క కార్యకలాపాలకు అది అనవసరమైన డబ్బుగా మారడం వల్ల కాదు; అవి తొలి పెట్టుబడి విలువలో ఒక అంతర్భాగమై వుండడం వల్ల. పైగా అవి కేవలం చలామణి సాధనాలుగా ఖర్చు చేయబడడానికిగాను, పెట్టుబడిగా వ్యవహరించడానికిగాను ఉద్దేశించబడినాయి కనుక, అవి డబ్బు పెట్టుబడిగా వ్యవహరిస్తాయి. అవి పెట్టుబడిగా వ్యవహరించేలా చేయడానికి వాటిని డబ్బు పెట్టుబడిగా డబ్బు మార్కెట్‌లోకి నెట్టివేయడమే అత్యుత్తమమైన పద్ధతి. మరోవైపున, ఉత్పత్తి స్థాయిని (నిశ్చల పెట్టుబడిగాక) రెట్టింపు చేయవచ్చు. ఆ సందర్భంలో అదే 9 వందల పౌండ్ల పెట్టుబడితో ఇంతకు ముందు ఉన్నదానికి రెట్టింపు పరిమాణంలో ఉత్పాదక ప్రక్రియని కొనసాగించవచ్చు.

మరోవైపున, ఉత్పాదక పెట్టుబడి యొక్క చలామణి భాగాల ధరలు సగం పెరిగాయనుకుందాం. వారానికి వంద పౌండ్లకు బదులు నూటయాభై పౌండ్లు అవసరమవుతాయి. అలాగే 9 వందల పౌండ్లకు బదులు, 1,350 పౌండ్లు అవసరమవుతాయి. అదే స్థాయిలో వ్యాపారాన్ని కొనసాగించాలంటే నాలుగు వందల యాభై పౌండ్లు అదనపు పెట్టుబడి అవసరమన్న మాట. తదనుగుణంగా ఇది డబ్బు మార్కెట్‌పైన ఒత్తిడి కలుగజేస్తుంది. ఎంత ఒత్తిడి అన్నది పరిస్థితులపైన ఆధారపడి వుంటుంది. ఈ మార్కెట్‌లో దొరికే పెట్టుబడి అంతా అప్పటికే పనిలో వుంటే అప్పుడు పెట్టుబడిని దొరకపుచ్చు కోవడానికి పోటీ పెరుగుతుంది. అందులో కొంత భాగం మాత్రమే పనిలో వుంటే మిగిలిన భాగం రంగంపైకి వస్తుంది.

అయితే మూడో విషయం ఏమిటంటే, ఉత్పత్తి స్థాయి, టర్నోవర్ వేగం, ఉత్పాదక పెట్టుబడి యొక్క చలామణి అంశాల ధరలు యధాతథంగా వున్నాయనుకుందాం. వ్యాపారం ప యొక్క

ఉత్పాదితాల ధరలు పెరగవచ్చును లేదా పడిపోవచ్చును. వ్యాపారం ప సరఫరా చేసే సరుకుల ధర పడిపోతే, అది చలామణిలోకి నిరంతరాయంగా నెట్టిన ఆరు వందల పౌండ్ల సరుకు పెట్టుబడి ధర పడిపోతుంది. అది 5 వందల పౌండ్లకి పడిపోయిందనుకుందాం. కనుక అడ్వాన్స్ చేయబడిన పెట్టుబడి విలువలో 6వ వంతు భాగం చలామణి క్రమం నుంచి తిరిగి రాదు. (సరుకు పెట్టుబడిలో వుండే అదనపు విలువను ఇక్కడ పరిగణనకు తీసుకోవడం లేదు) అది ఆ ప్రక్రియలో నష్టమైపోయింది. అయితే ఉత్పత్తి అంశాల విలువ లేదా ధర మునుపటి లాగానే వుంది కనుక అలా తిరిగి వచ్చిన ఐదు వందల పౌండ్లు, నిరంతరాయంగా ఉత్పత్తి ప్రక్రియలో పని చేయాల్సిన 6 వందల పౌండ్ల పెట్టుబడి స్థానంలో 5/6 వంతు మాత్రమే భర్తీ చేస్తుంది. కనుక ఉత్పత్తి అదే స్థాయిలో కొనసాగడానికి వంద పౌండ్లు డబ్బు పెట్టుబడి అదనంగా కావాలి.

దానికి వ్యతిరేకంగా, వ్యాపారం ప యొక్క ఉత్పాదితం ధర పెరిగినందువల్ల, 6 వందల పౌండ్ల సరుకు పెట్టుబడి ధర 7 వందల పౌండ్లకు పెరిగిందనుకుందాం. దీనిలో వంద పౌండ్లు ఉత్పత్తి ప్రక్రియలో పుట్టలేదు. అందులో అడ్వాన్స్ చేయబడలేదు. అది చలామణి ప్రక్రియ నుంచి తలెత్తింది. అయితే ఇక్కడి ఉత్పత్తి అంశాలను భర్తీ చేయడానికి 600 పౌండ్లు చాలు. కనుక డబ్బు విడుదలవుతుంది.

టర్నోవర్ కాలం ఎందుకు తరిగింది, పెరిగింది; ముడి పదార్థాల, శ్రమ ధరలు ఎందుకు పెరిగాయి, తరిగాయి; సరఫరా అయిన ఉత్పాదితాల ధరలు ఎందుకు పెరిగాయి, తరిగాయి అన్న అంశాలు ఇంతవరకూ చేసిన పరిశోధనల పరిధిలోకి రావు.

అయితే, కింద పేర్కొన్న సందర్భాలు ఈ పరిశోధనకు కచ్చితంగా సంబంధించినవే.

మొదటి సందర్భం – మారని ఉత్పత్తి స్థాయి, మారని ఉత్పత్తి అంశాలు, ఉత్పాదితాల ధరలు, మారే చలామణి కాలం, కనుక మారే టర్నోవర్ కాలం.

మన ఉదాహరణలోని ఊహల ప్రకారం, చలామణి కాలం తగ్గడం వల్ల అడ్వాన్స్ చేయబడిన మొత్తం పెట్టుబడిలో 9వ వంతు తక్కువ అవసరమవుతుంది. దానివల్ల మొత్తం పెట్టుబడి 9 వందల పౌండ్ల నుంచి 8 వందల పౌండ్లకు తగ్గుతుంది. వంద పౌండ్ల డబ్బు – పెట్టుబడి తొలగించబడుతుంది.

వ్యాపారం ప ఇంతకు ముందులాగే అదే 6 వందల పౌండ్ల విలువ కలిగిన అదే 6 వారాల ఉత్పాదితాన్ని సరఫరా చేస్తుంది. ఏడాది పొడవునా అంతరాయం లేకుండా పని కొనసాగింది కనుక యాభై ఒక్క వారాల్లో 5,100 పౌండ్ల విలువ గలిగిన అంతే పరిమాణం గల ఉత్పాదితాలను సరఫరా చేస్తుంది. అప్పుడు, ఈ వ్యాపారం చలామణిలోకి నెట్టిన ఉత్పాదితం ధరలో గానీ, పరిమాణంలో గానీ మార్పులేదు. దాన్ని మార్కెట్‌లోకి తోసే సమయాల్లో కూడా మార్పు లేదు. అయితే చలామణి కాలం తగ్గడం వల్ల ఆ ప్రక్రియ యొక్క అవసరాలు ఇదివరకటి 9 వందల పౌండ్లకు బదులు ఇప్పుడు 8 వందల పౌండ్లతోనే తీరిపోతాయి. కనుక వంద పౌండ్లు తొలగించబడతాయి. ఇలా తొలగించబడిన వంద పౌండ్ల డబ్బు పెట్టుబడి రూపంలో వుంటాయి. అయితే అవి అడ్వాన్స్ చేయబడిన పెట్టుబడిలో నిరంతరాయంగా డబ్బు పెట్టుబడి రూపంలో పని చేయాల్సిన భాగాలకు ఏ రకంగానూ ప్రాతినిధ్యం వహించవు. అడ్వాన్స్ చేయబడిన చలామణి పెట్టుబడి–I 6 వందల పౌండ్లు. దానిలో 4/5 వంతు, అంటే 480 పౌండ్లు నిరంతరాయంగా ఉత్పాదక పదార్థాల్లోనూ, 1/5 వంతు, అంటే 120 పౌండ్లు

వేతనాలలోనూ మదుపు పెట్టబడ్డాయని అనుకుందాం. అప్పుడు ఉత్పాదక పదార్థాలపై వారానికి మదుపు పెట్టిన పెట్టుబడి 80 పౌండ్లు, వేతనాల కోసం పెట్టింది 20 పౌండ్లు. పెట్టుబడి-II 3 వందల పౌండ్లు, దాన్ని కూడా ఉత్పత్తి పదార్థాలకు, వేతనాలకు మధ్య అదే నిష్పత్తిలో విభజించాలి. అంటే 4/5వ వంతు, లేదా 240 పౌండ్లు ఉత్పత్తి పదార్థాలకు, 1/5వ వంతు లేదా 60 పౌండ్లు వేతనాలకు వ్యయమవుతాయి. వేతనాల్లో మదుపు పెట్టే పెట్టుబడి ఎప్పుడూ డబ్బు రూపంలోనే అడ్వాన్స్ చేయబడాలి. సరుకు ఉత్పాదితం విలువ 6 వందల పౌండ్లు. అది డబ్బు రూపంలోకి మళ్ళీ మార్చబడగానే, అంటే అమ్మకం కాగానే దానిలో 480 పౌండ్లని ఉత్పత్తి పదార్థాలుగా (ఉత్పాదక సరఫరాగా) మార్చవచ్చు. అయితే 120 పౌండ్లు 6 వారాల పాటు వేతనాలు చెల్లించడం కోసం డబ్బు రూపంలోనే వుండిపోతాయి. ఈ 120 పౌండ్లు తిరిగి వచ్చే 6 వందల పెట్టుబడిలో డబ్బు రూపంలోనే పునరుద్ధరించబడి భర్తీ కావలసిన కనీస మొత్తం. కనుక ఆ మొత్తాన్ని అడ్వాన్స్ చేయబడిన పెట్టుబడిలో భాగంగా ఎప్పుడూ డబ్బు రూపంలోనే చేతిలో వుంచుకోవాలి.

ఇప్పుడు 3 వారాల కొకసారి విడుదలై, ఉత్పాదిత సరఫరాకై 240 పౌండ్లుగా, వేతనాలకై 60 పౌండ్లుగా విభజించవలసిన 3 వందల పౌండ్లలో, వంద పౌండ్ల మొత్తంగా తొలగించబడి, చలామణి కాలం తగ్గడం వల్ల టర్నోవర్ యంత్రాంగం నుంచి డబ్బు పెట్టుబడి రూపంలో బయటకు నెట్టబడితే, ఈ వంద పౌండ్ల డబ్బు, పెట్టుబడి కోసం డబ్బు, ఎక్కడనుంచి వస్తుంది? దీనికి టర్నోవర్‌లలో వారానికొకసారి విడుదలయ్యే డబ్బు పెట్టుబడిలో 1/5 వంతు మాత్రమే వుంటుంది. దీనిలో ఐదింట నాలుగు వంతులు లేదా 80 పౌండ్ల స్థానాన్ని ఇంతే విలువ గలిగిన అదనపు ఉత్పాదక సరఫరా అదివరకే భర్తీ చేసింది. ఈ అదనపు ఉత్పాదక సరఫరా డబ్బుగా ఏ రకంగా మారింది, ఈ మార్పుకి అవసరమైన డబ్బు ఎక్కడ నుండి వచ్చింది?

చలామణి కాలం తగ్గడమన్నది వాస్తవమయితే, పైన పేర్కొనబడిన 6 వందల పౌండ్లలో 480 పౌండ్లకు బదులు 4 వందల పౌండ్ల ఉత్పాదక సరఫరాగా మళ్ళీ మార్చబడుతుంది. మిగిలిన 80 పౌండ్లు డబ్బు రూపంలో అట్టిపెట్టడం జరుగుతుంది. వేతనాల కోసం ఉంచిన పై 20 పౌండ్లతో కలిసి ఇది 100 పౌండ్లవుతుంది. ఇదే తొలగించబడిన వంద పౌండ్ల పెట్టుబడి. 6 వందల పౌండ్ల విలువ కలిగిన సరుకు పెట్టుబడిని అమ్మడం ద్వారా చలామణి రంగం నుంచి ఈ వంద పౌండ్లు వచ్చినప్పటికీ, అవి ఆ రంగం నుంచి ఉపసంహరించబడతాయి. అవి మళ్ళీ వేతనాల్లోనూ, ఉత్పత్తి అంశాల్లోనూ మదుపు పెట్టబడవు. అయితే అవి డబ్బు రూపంలో ఉన్నందువల్ల చలామణి రంగంలోకి తొలుత నెట్టబడిన రూపంలో వున్నాయన్న సంగతిని మరువరాదు. మొదట్లో ఉత్పాదక సరఫరాల్లోనూ, వేతనాల్లోనూ 9 వందల పౌండ్లు మదుపు పెట్టబడ్డాయి. అదే ఉత్పత్తి ప్రక్రియ కొనసాగించబడాలంటే ఇప్పుడు 8 వందల పౌండ్లు చాలు. ఆ రకంగా విడుదలైన వంద పౌండ్లు పనిలో ప్రవేశించ కోరే ఒక కొత్త డబ్బు పెట్టుబడి అవుతాయి. డబ్బు మార్కెట్‌లో ఒక కొత్త భాగం అవుతాయి. ఇంతకుముందే అవి నిర్ణీత కాలానికొకసారి విడుదలైన డబ్బు పెట్టుబడి రూపంలోనూ, అదనపు ఉత్పాదక పెట్టుబడి రూపంలోనూ వున్నాయి నిజమే. అయితే గర్భితంగా వున్న ఈ స్థితులు ఉత్పత్తి ప్రక్రియ నిర్వహణకు తప్పనిసరిగా అవసరం అయ్యాయి. ఎందువల్లనంటే, అవి దాని కొనసాగింపునకు తప్పనిసరిగా

అవసరం. కానీ ఇప్పుడు ఉత్పత్తి ప్రక్రియ నిర్వహణకు అవి అవసరం లేదు. అందువల్ల అవి కొత్త పెట్టుబడిగా మారుతున్నాయి. అవి డబ్బు మార్కెట్‌లో ఓ భాగంగా రూపొందుతున్నాయి. అయితే లభ్యమయ్యే సామాజిక డబ్బు సరఫరాలో అవి అదనపు భాగం కాదు. (ఎందుకంటే అవి వ్యాపారం ప్రారంభించినప్పుడే వున్నాయి. అప్పుడే చలామణిలోకి నెట్టబడ్డాయి.) అది కొత్తగా సంచితమైన నిధి.

ఈ వంద పౌండ్లు ఆ వ్యాపారంలో అడ్వాన్స్ చేయబడిన డబ్బు పెట్టుబడిలో, పనికి నియుక్తంకాని భాగమైనందువల్ల, అవి చలామణి రంగం నుంచి ఉపసంహరించబడ్డాయి. సరుకు పెట్టుబడిని డబ్బుగానూ, ఈ డబ్బును ఉత్పాదక పెట్టుబడిగానూ మార్చే క్రమం, స'-డ-స త్వరితగతివల్ల ఒక వారం ముందే అది పూర్తి అయింది కనుక, ఈ ప్రక్రియలో పనిచేస్తున్న డబ్బు చలామణి క్రమ గతి కూడా త్వరితమైంది. అందువల్ల ఈ ఉపసంహరణ సాధ్యమైంది. పెట్టుబడి ప టర్నోవర్‌లో దాని అవసరం ఇకలేదు కనుక అది ఉపసంహరించబడింది.

అడ్వాన్స్ చేయబడిన పెట్టుబడి, దాన్ని ఉపయోగించే వ్యక్తిదే అని ఊహించుకొన్నాము. ఆ మొత్తాన్ని అతను అప్పు తీసుకున్నప్పటికీ, విషయం మారదు. చలామణి కాలం తగ్గడంతో, అతను 9 వందల పౌండ్లకు బదులు 8 వందల పౌండ్లే అప్పు చేయాల్సి వుంటుంది. వంద పౌండ్లు అప్పు ఇచ్చిన వానికి తిరిగి ఇచ్చేస్తే, అవి ఇంతకు ముందులాగే కొత్త డబ్బు పెట్టుబడిగా ఏర్పడతాయి. అయితే ఇది ప చేతిలో గాక బ చేతిలో అలా ఏర్పడతాయి. పెట్టుబడిదారుడు ప నాలుగు వందల పౌండ్ల విలువైన ఉత్పత్తి పదార్థాలను అప్పుగా పొందగలిగితే ఇక 120 పౌండ్లను మాత్రమే వేతనాల కోసం తన జేబు నుంచి వెచ్చించాల్సి వుంటుంది. ఇప్పుడు అతను 80 పౌండ్ల విలువైన పదార్థాలను తక్కువగా అప్పు తీసుకోవచ్చు. ఈ మొత్తం అప్పు ఇచ్చే పెట్టుబడిదారుని చేతిలో అవసరం లేని సరుకు పెట్టుబడి. కాగా పెట్టుబడిదారు డబ్బు రూపంలో 20 పౌండ్లను తొలగించి వుంటాడు.

ఉత్పత్తి కోసం అదనపు సరఫరా ఇప్పుడు మూడో వంతు తగ్గిపోయింది. అది, ఇంతకు ముందు 3 వందల పౌండ్ల అదనపు పెట్టుబడి-II లో ఐదింట నాలుగు వంతులు, అంటే 240 పౌండ్లు. కాని అది ఇప్పుడు 160 పౌండ్లు మాత్రమే. అంటే, అది 3 వారాలకు బదులు 2 వారాల సరఫరా మాత్రమే. ఇప్పుడు ప్రతి 3 వారాలకు గాక ప్రతి 2 వారాలకొకసారి, అలాగే 3 వారాల కోసం గాక 2 వారాల కోసం అది పునరుద్ధరించబడుతుంది. ఉదాహరణకు దూది మార్కెట్‌లో కొనుగోళ్ళు మరింత తరచుగానూ, మరింత చిన్న పరిమాణాల్లో జరుగుతాయి. ఉత్పాదితం యొక్క పరిమాణం యధాతథంగా వుంటుంది. కనుక మార్కెట్ నుంచి అదే పరిమాణంలో దూది ఉపసంహరించబడుతుంది. అయితే ఈ ఉపసంహరణల వ్యవధులు విభిన్నంగా వుంటాయి. అది మూడు నెలల కాలమో లేదా రెండు నెలల కాలమో అనుకుందాం. దూది యొక్క వార్షిక వినియోగం 12 వందల బేళ్ళు అనుకుంటే మొదటి సందర్భంలో అమ్మకాలు ఇలా వుంటాయి.

జనవరి 1, అమ్మినవి 300 బేళ్ళు, నిల్వ ఉన్నవి 900 బేళ్ళు.

ఏప్రిల్ 1, అమ్మినవి 300 బేళ్ళు, నిల్వ వున్నవి 600 బేళ్ళు.

జూలై 1, అమ్మినవి 300 బేళ్ళు, నిల్వ వున్నవి 300 బేళ్ళు.

అక్టోబర్ 1, అమ్మినవి 300 బేళ్ళు, నిల్వ వున్నవి 0 బేళ్ళు.

కానీ రెండో ఉదాహరణలో :

జనవరి 1, అమ్మిన బేళ్ళు 200, నిల్వ ఉన్న బేళ్ళు 1000.

మార్చి 1, అమ్మిన బేళ్ళు 200, నిల్వ ఉన్న బేళ్ళు 800.

మే 1, అమ్మిన బేళ్ళు 200, నిల్వ ఉన్న బేళ్ళు 600.

జూలై 1, అమ్మిన బేళ్ళు 200, నిల్వ ఉన్న బేళ్ళు 400.

సెప్టెంబర్ 1, అమ్మిన బేళ్ళు 200, నిల్వ వున్న బేళ్ళు 200.

నవంబర్ 1, అమ్మిన బేళ్ళు 200, నిల్వ వున్న బేళ్ళు 0.

కనుక దూదిలో మదుపు పెట్టబడిన డబ్బు పూర్తిగా తిరిగి రావడం అక్టోబర్‌లో గాక నవంబర్‌లో, ఒక నెల ఆలస్యంగా జరుగుతుంది. అడ్వాన్స్ చేయబడిన పెట్టుబడిలో 9వ వంతు, అంటే చలామణి కాలం అలాగే టర్నోవర్ కాలం తగ్గడం వల్ల, వంద పౌండ్లు డబ్బు పెట్టుబడి రూపంలో తొలగించబడితే, అలాగే ఈ వంద పౌండ్లు, వారం వారం వేతనాల చెల్లింపులకు అవసరమయ్యే డబ్బు పెట్టుబడి అయిన 20 పౌండ్లూ, వారం వారం అనవసరంగా మిగిలిపోయే 80 పౌండ్ల ఉత్పాదక సరఫరాగాను వుంటే, అప్పుడు పారిశ్రామికవేత్త చేతిలో తగ్గిపోయిన అనవసర ఉత్పాదక సరఫరా, ఈ 80 పౌండ్లకు సంబంధించినంత వరకూ, దూది వ్యాపారి చేతిలో సరుకు సరఫరా పెరగడానికి దారితీస్తుంది. దూది వ్యాపారి గిడ్డంగిలో ఇది ఒక సరుకుగా ఎంత ఎక్కువ కాలం వుంటే, పారిశ్రామికవేత్త స్టోర్ రూపంలో ఒక ఉత్పాదక సరఫరాగా అంత తక్కువ కాలం వుంటుంది.

ఇంతవరకూ మనం ఊహించినది : వ్యాపారం ప యొక్క చలామణి కాలం తగ్గడానికి కారణం ప తన వస్తువులను తొందరగా అమ్మడం, వాటికి డబ్బుని తొందరగా పొందడం లేదా అప్పు తెచ్చి ఉంటే, తక్కువ వాయిదాల్లో చెల్లింపు అవకాశం వుండటం. కనుక సరుకులు తొందరగా విక్రయమవడం, సరుకు పెట్టుబడి డబ్బు పెట్టుబడిగా తొందరగా పరివర్తన చెందడం, అంటే చలామణి ప్రక్రియలో మొదటి దశ, స'–డ త్వరితంగా పూర్తి కావడం చలామణి కాలం తగ్గుదలకు మూలం. అయితే ఆ తగ్గుదల, రెండోదశ, డ–స నుంచీ కూడా తలెత్తవచ్చు. లేదా రెండు దశల నుంచి తలెత్తవచ్చు. లేదా ప కి చలామణి పెట్టుబడి యొక్క ఉత్పాదక అంశాలను సరఫరా చేసే ప, బ వగైరా పెట్టుబడుల పనికాలంలో, లేదా వాటి చలామణి కాలంలో మార్పు వల్ల కూడా ఇది జరగవచ్చు.

ఉదాహరణకు దూది, బొగ్గు వగైరాలు పాత రవాణా పద్ధతులలోనే రవాణా చేయబడడం వల్ల వాటి ఉత్పత్తి స్థానాల నుంచి పెట్టుబడిదారు ప కార్ఖానాకు చేరడానికి 3 వారాలు పడుతూ వుండవచ్చు. అటువంటప్పుడు ప యొక్క ఉత్పాదక సరఫరా కనీసం 3 వారాలకు, కొత్త సరఫరా వచ్చేటంత వరకూ సరిపోవాలి. బొగ్గు, దూది రవాణాలోనే వున్నంత కాలం అవి ఉత్పత్తి సాధనాలుగా వ్యవహరించలేవు. అవి రవాణా పరిశ్రమకు, అందులో పెట్టిన పెట్టుబడికి శ్రమ వస్తువులు మాత్రమే. బొగ్గు ఉత్పత్తిదారునికి లేదా దూది వ్యాపారికి అవి చలామణి ప్రక్రియలో వున్న సరుకు పెట్టుబడి కూడా. రవాణా రంగంలో మెరుగుదల వల్ల, వాటిని చేరవేసే కాలం రెండు వారాలకు తగ్గిందనుకుందాం. అప్పుడు ఉత్పాదక సరఫరా 3 వారాల సరఫరా నుంచి రెండు వారాల సరఫరాగా మారవచ్చు. అది ఇందుకు అదనంగా అడ్వాన్స్ చేయబడిన 80 పౌండ్ల పెట్టుబడిని, అలాగే వేతనాల కోసం ఉంచిన 20 పౌండ్ల పెట్టుబడిని విడుదల చేస్తుంది. ఎందుకంటే టర్నోవర్ అయిన 6 వందల పౌండ్ల పెట్టుబడి

ఒక వారం ముందుగా వస్తుంది.

మరోవైపున, ఉదాహరణకు ముడి పదార్థాలను సరఫరా చేసే పెట్టుబడి యొక్క పనికాలం తగ్గితే (దీనికి సంబంధించిన వివరాలు ముందు అధ్యాయాల్లో ఇవ్వబడ్డాయి), ముడి పదార్థాల సరఫరాను తక్కువ కాలంలో పునరుద్ధరించడం సాధ్యమవుతుంది. అప్పుడు కూడా ఉత్పాదక సరఫరాను తగ్గించవచ్చు. ఈ పునరుద్ధరణ కాలాల మధ్య వున్న వ్యవధిని కూడా తగ్గించవచ్చు.

ఇందుకు విరుద్ధంగా చలామణి కాలం, టర్నోవర్ కాలం పొడిగించబడితే, అప్పుడు అదనపు పెట్టుబడిని అడ్వాన్స్ చేయడం అవసరమవుతుంది. పెట్టుబడిదారు దగ్గర అదనపు పెట్టుబడి వుంటే, అది అతని జేబు నుండే రావాల్సి వుంటుంది. అయితే అది ఏదో ఒక రూపంలో డబ్బు మార్కెట్‌లో భాగంగా మదుపు పెట్టబడుతుంది. అది లభ్యం కావాలంటే, దాని పాత రూపాన్ని వదులుకోవాల్సి వుంటుంది. ఉదాహరణకు నిల్వలను అమ్మివేయాలి. డిపాజిట్లను ఉపసంహరించుకోవాలి. ఫలితంగా ఈ సందర్భంలో కూడా డబ్బు మార్కెట్‌లో పరోక్షంగా ప్రభావితమవుతుంది. లేదా దాన్ని అప్పుగా తీసుకోవాల్సి వుంటుంది. వేతనాల కోసం అవసరమైన అదనపు పెట్టుబడికి సంబంధించినంత వరకూ, మామూలు పరిస్థితుల్లో అది ఎప్పుడూ డబ్బు పెట్టుబడి రూపంలో అడ్వాన్స్ చేయబడాలి. అందుకోసం, పెట్టుబడిదారు ప డబ్బు మార్కెట్‌పైన తన వంతు ఒత్తిడిని ప్రత్యక్షంగా తెస్తాడు. అయితే ఉత్పత్తి పదార్థాల్లో మదుపు పెట్టబడే భాగం కోసం అతను నగదు చెల్లించాల్సి వుంటేనే అది అనివార్యం. దాన్ని అతను అప్పుగా పొందగలిగితే, డబ్బు మార్కెట్‌పైన దానికి ప్రత్యక్ష ప్రభావం ఏమీ వుండదు. ఎందుకంటే ఈ అదనపు పెట్టుబడి ఉత్పత్తి సరఫరాగా ప్రత్యక్షంగా అడ్వాన్స్ చేయబడుతుందే తప్ప, మొదటే డబ్బు పెట్టుబడిగా కాదు. అయితే, అప్పు ఇచ్చే వ్యక్తి ప పంపిన ఎక్స్చేంజి బిల్లును ప్రత్యక్షంగా మార్కెట్‌లోకి తెస్తే దానికి డిస్కౌంట్ ఇచ్చి మారిస్తే ఇంకా ఇలాంటివి జరిగితే అది డబ్బు మార్కెట్‌ను పరోక్షంగా, మరొకరి ద్వారా ప్రభావితం చేస్తుంది; అయితే ఇంకా వాయిదాకు రాని అప్పును తీర్చడానికి ఈ బిల్లును అతను ఉపయోగిస్తే, అదనంగా అడ్వాన్స్ చేయబడిన ఈ పెట్టుబడి ప్రత్యక్షంగాగానీ, పరోక్షంగాగానీ డబ్బు మార్కెట్‌ను ప్రభావితం చేయదు.

రెండో సందర్భం – ఉత్పత్తి పదార్థాల ధరలో మార్పు, మిగిలిన పరిస్థితులన్నీ యధాతథం.

మొత్తం పెట్టుబడి 9 వందల పౌండ్లలో ఐదింట నాలుగు వంతులు (ఏడు వందల ఇరవై పౌండ్లు) ఉత్పత్తి పదార్థాల్లోనూ, ఐదో వంతు (180 పౌండ్లు) వేతనాలలోనూ మదుపు పెట్టబడినట్లు మనం ఊహించుకొన్నాం.

ఉత్పత్తి పదార్థాల ధరలు సగానికి పడిపోతే 6 వారాల పనికాలానికిగాను 480 పౌండ్లకు బదులు 240 పౌండ్లు, అదనపు పెట్టుబడి–II విషయంలో 240 పౌండ్లకు బదులు 120 పౌండ్లు అవసరమవుతాయి. ఆ రకంగా పెట్టుబడి–I 6 వందల పౌండ్ల నుంచి 360 పౌండ్లకు (240+120), పెట్టుబడి–II 3 వందల పౌండ్లు నుంచి 180 పౌండ్లకు (120+60) తగ్గింది. కనుక మొత్తం పెట్టుబడి 9 వందల పౌండ్లు నుంచి 540 పౌండ్లకు (360+180) తగ్గింది. కనుక 360 పౌండ్ల మొత్తం విడుదలైంది.

తొలగించబడిన, పనిలేని ఈ పెట్టుబడి లేదా డబ్బు మార్కెట్‌లో పనికోసం వెతుకుతున్న ఈ డబ్బు పెట్టుబడి, మొదట డబ్బు పెట్టుబడిగా అడ్వాన్స్ చేయబడిన 9 వందల పౌండ్లలో ఒక భాగం

మాత్రమే. నిర్ణీత కాలానికొకసారి ఉత్పత్తి పదార్థాలుగా తిరిగి మార్చబడాల్సిన ఈ పెట్టుబడి, ఆ పదార్థాల ధరలు పడిపోవడం వల్ల, వ్యాపారం విస్తరించబడకుండా అదే స్థాయిలో కొనసాగించ బడినందు వల్ల అనవసరమైంది. ధరలు ఇలా పడిపోవడానికి కారణం యాధృచ్ఛిక పరిస్థితులు (మంచి పంట, అధిక సరఫరా వగైరా) కాక, ముడిపదార్థాలను సమకూర్చే ఉత్పత్తి శాఖలో ఉత్పాదక శక్తి పెరుగుదల అయినప్పుడు, ఈ డబ్బు పెట్టుబడి అప్పటికే మదుపు పెట్టబడిన పెట్టుబడిలో భాగం కాదు కనుక, డబ్బు మార్కెట్‌లోనూ, డబ్బు పెట్టుబడిగా లభ్యమయ్యే పెట్టుబడిలోనూ చేరిన అదనపు మొత్తం అవుతుంది.

మూడో సందర్భం : ఉత్పాదితం యొక్క మార్కెట్ ధరలోనే మార్పు.

ధరలు పడిపోతే ఒక భాగం నష్టమవుతుంది. పెట్టుబడిని కొత్తగా అడ్వాన్స్ చేయడం ద్వారా ఈ నష్టాన్ని పూడ్చవలసి వుంటుంది. అమ్మేవానికి జరిగిన ఈ నష్టమే కొనేవానికి లాభం కావచ్చు. కేవలం ఒక యాధృచ్ఛికమైన ఎగుడుదిగుడుల వల్ల ఉత్పాదితం యొక్క మార్కెట్ ధర పడిపోయి, తర్వాత కాలంలో మామూలు స్థాయికి పెరిగితే, అతను ప్రత్యక్షంగా లాభపడతాడు. ఈ ధర మార్పు అన్నది పాత ఉత్పాదితాన్ని ప్రభావితం చేసే విలువ మార్పిడివల్ల జరిగితే, ఈ ఉత్పాదితం ఒక ఉత్పత్తి అంశంగా మరో ఉత్పత్తి రంగంలోకి పెట్టుబడిగా విడుదలై అక్కడ మునుపటి నిష్పత్తిలోనే పెట్టుబడిని విడుదల చేస్తే అతను పరోక్షంగా లాభపడతాడు. ఈ రెండు సందర్భాల్లోనూ కోల్పోయిన పెట్టుబడిని భర్తీ చేసుకొనేందుకు డబ్బు మార్కెట్‌పై అతని నుంచి ఒత్తిడి వస్తుంది. దాన్ని, వాణిజ్య రంగంలోని అతని మిత్రుల అదనపు పెట్టుబడిగా సరఫరా చేయవచ్చు. అప్పుడు జరిగేదంతా బదిలీ మాత్రమే.

అలా కాక, ఉత్పాదితం ధర పెరిగితే, అడ్వాన్స్ చేయబడని పెట్టుబడిలో ఒక భాగం చలామణి రంగం నుంచి తీసివేసుకోవడం జరుగుతుంది. ఇది ఉత్పత్తి రంగంలో అడ్వాన్స్ చేయబడిన పెట్టుబడిలోని అంగాంగిక భాగం కాదు – ఉత్పత్తి విస్తరించబడి, ఆ కారణాన అది తొలగించబడిన డబ్బు పెట్టుబడి అయితే తప్ప. ఉత్పాదితాన్ని మార్కెట్‌కి సరుకు పెట్టుబడిగా తీసుకురావడానికి ముందు ఉత్పాదితం యొక్క అంశాల ధరలు నిర్ణీతమైనట్లు ఊహించుకొన్నాము. కాబట్టి విలువలో వాస్తవమైన మార్పు ధరల పెరుగుదలకు కారణమై వుండవచ్చు. ఎందువల్లనంటే, ఈ మార్పు ప్రభావం, అందుకు ముందే ఉత్పాదితంలో అంతర్భాగాలుగా వున్నవాటిపై పడుతుంది కాబట్టి, ఆ తరువాత ముడి పదార్థాల ధరల పెరుగుదలకు దారితీసి వుండవచ్చు. అటువంటి సందర్భంలో పెట్టుబడిదారు ప, సరుకు పెట్టుబడిగా చలామణి అవుతున్న తన ఉత్పాదితంపైన, అప్పటికే తన వద్ద వున్న ఉత్పాదక సరఫరాపైన లాభం పొందుతాడు. ఈ లాభం అతనికి అదనపు పెట్టుబడిని ఇస్తుంది. ఉత్పత్తి అంశాల ధరలు పెరగడం వల్ల తన వ్యాపారాన్ని కొనసాగించడం కోసం అతనికి అవసరమైన అదనపు పెట్టుబడిగా ఇది వుంటుంది.

లేదా ఈ ధరల పెరుగుదల తాత్కాలికం అయి వుండవచ్చు. అప్పుడు పెట్టుబడిదారు ప కి అవసరమైన అదనపు పెట్టుబడి మరో పెట్టుబడిదారునికి విడుదలైన పెట్టుబడి అవుతుంది. పెట్టుబడిదారు ప యొక్క ఉత్పాదితం ఇతర వ్యాపార శాఖల ఉత్పత్తి అంశాల్లో ఒకటైనంత మేరకు ఇది వర్తిస్తుంది. ఒకరు కోల్పోయిన దాన్ని మరొకరు పొందుతారు.

★ ★ ★

## అధ్యాయం - 16

# అస్థిర పెట్టుబడి టర్నోవరు

### 1. అదనపు విలువ వార్షిక రేటు

చలామణి పెట్టుబడి 2,500 పౌండ్లు అనుకుందాం. దాన్లో ఐదింట నాల్గోవంతు, అంటే 2,000 పౌండ్లు స్థిర పెట్టుబడి (ఉత్పత్తి పదార్థాలు) ఐదోవంతు అంటే 500 పౌండ్లు వేతనాలపై మదుపు పెట్టబడిన అస్థిర పెట్టుబడి అనుకొందాం.

టర్నోవరు కాలం ఐదు వారాలు, పనికాలం నాలుగు వారాలు, చలామణి కాలం ఒక వారం అనుకొందాం. అప్పుడు పెట్టుబడి–I 2,000 పౌండ్లు. దాన్లో 1,600 పౌండ్లు స్థిర పెట్టుబడి, 400 పౌండ్లు అస్థిర పెట్టుబడి, పెట్టుబడి–II 500 పౌండ్లు. దాన్లో 400 పౌండ్లు స్థిర పెట్టుబడి, 100 పౌండ్లు అస్థిర పెట్టుబడి; ప్రతి పని వారంలోనూ 500 పౌండ్లు మదుపు పెట్టబడతాయి. 50 వారాల సంవత్సరంలో, 500 లకు, 50 రెట్లు, అంటే 25,000 పౌండ్లు వార్షిక ఉత్పాదితం తయారవుతుంది. పెట్టుబడి–I, అంటే 2,000 పౌండ్లు పనికాలంలో స్థిర పెట్టుబడిగా వినియోగించబడుతుంది. కనుక అది 12 ½ సార్లు టర్నోవరైంది. 2,000 లకి 12 ½ రెట్లు అంటే 25,000 పౌండ్లు టర్నోవరైంది. ఈ 25,000 పౌండ్లనూ ఐదింట నాలుగు వంతులు లేదా 20,000 పౌండ్లు స్థిర పెట్టుబడి. అది ఉత్పత్తి సాధనాలకై కేటాయించబడిన మొత్తం. ఐదో వంతు లేదా 5,000 పౌండ్లు అస్థిర పెట్టుబడి; అది వేతనాలకై వెచ్చించబడిన మొత్తం. ఆ విధంగా మొత్తం పెట్టుబడి 2,500 పౌండ్లు $\frac{25,000}{2,500}$ సార్లు, లేదా 10 సార్లు టర్నోవరైంది.

ఉత్పత్తిలో వెచ్చించబడిన అస్థిర చలామణి పెట్టుబడి చలామణి రంగంలో మళ్ళీ పని చేయాలి అంటే, దాని విలువ ఎందులో పునరుత్పత్తి అయిందో, ఆ ఉత్పాదితం అమ్మబడాలి. అది సరుకు పెట్టుబడి నుంచి డబ్బు పెట్టుబడిగా మారాలి. శ్రమశక్తి కోసం మరోసారి వెచ్చించడానికి ఇలా మారటం అవసరం. అయితే ఉత్పత్తిలో మదుపు పెట్టిన స్థిర చలామణి పెట్టుబడికి (ఉత్పత్తి పదార్థాలు) కూడా ఇదే వర్తిస్తుంది. దాని విలువ ఉత్పాదితం విలువలో భాగంగా పునఃప్రత్యక్షమవుతుంది. చలామణి పెట్టుబడిలో స్థిర, అస్థిర భాగాలైన ఈ రెంటికీ ఉమ్మడిగా వుంటూ, వీటిని నిశ్చల పెట్టుబడి నుంచి వేరుచేసే అంశమేది? వాటినుంచి ఉత్పాదితానికి బదిలీ అయిన విలువ, సరుకు పెట్టుబడి ద్వారా చలామణిలో ఉండటం కాదు; అంటే సరుకుగా ఉత్పాదితం చలామణి కావడం ద్వారా వాటి విలువ చలామణిలో వుండటం కాదు. ఉత్పాదితం యొక్క విలువలో, అలాగే సరుకుగా చలామణిలో వున్న ఉత్పాదితం విలువలో ఒక భాగం ఎల్లప్పుడూ నిశ్చల పెట్టుబడి అరుగుదలకు సంబంధించినది.

అంటే, ఉత్పత్తి ప్రక్రియ సందర్భంగా నిశ్చల పెట్టుబడి విలువలో, ఉత్పాదితానికి బదిలీ అయిన భాగమిది. చలామణి పెట్టుబడిలోని స్థిర, అస్థిర భాగాలకూ, నిశ్చల పెట్టుబడికీ మధ్య గల అసలు తేడా ఏమిటంటే, ఉత్పత్తి ప్రక్రియలో నిశ్చల పెట్టుబడి తన పాత ఉపయోగ రూపంలో, చలామణి పెట్టుబడి (స్థిర చలామణి + అస్థిర చలామణి పెట్టుబడులు) టర్నోవరు కాలచక్రాల్లో పనిచేస్తూనే వుంటుంది. కాగా, ఉత్పత్తి రంగం నుంచి – సరుకు పెట్టుబడి రూపంలో – చలామణి రంగంలోకి వెళ్ళే మొత్తం చలామణి పెట్టుబడి స్థానాన్ని భర్తీ చేయడం, ప్రతి ఒక్క టర్నోవర్‌కు తప్పనిసరిగా అవసరం. స్థిర చలామణి పెట్టుబడి, అస్థిర చలామణి పెట్టుబడి చలామణిలో మొదటి దశను ఉమ్మడిగా పూర్తి చేస్తాయి. ఇది స'–డ' రెండో దశలో అవి విడిపోతాయి. సరుకు డబ్బుగా మారింది. డబ్బులో కొంత భాగం ఉత్పాదక సరఫరాగా (స్థిర చలామణి పెట్టుబడి) మార్చబడుతుంది. దాని విడివిడి భాగాలు కొనుగోలు చేయబడే పరిస్థితులను బట్టి, డబ్బులో ఒక భాగం తొందరగానో, ఆలస్యంగానో ఉత్పత్తి పదార్థాలుగా మార్చబడుతుంది. అయితే అది ఆ రకంగానే పూర్తిగా వినియోగమవుతుంది. డబ్బులో మరో భాగం అంటే సరుకుని అమ్మటం ద్వారా వచ్చిన డబ్బులోని మరో భాగం డబ్బు సరఫరా రూపంలోనే కొనసాగుతుంది. ఇది ఉత్పత్తి ప్రక్రియలో అంతర్భాగంగానే పొందుపరచబడే శ్రమశక్తి చెల్లించడానికై క్రమక్రమంగా వినియోగించబడుతుంది. ఈ భాగం అస్థిర చలామణి పెట్టుబడి అయినప్పటికీ ఈ భాగాల్లో దేని స్థానాన్ని భర్తీ చేయడమైనా, ఎల్లప్పుడూ పెట్టుబడి టర్నోవరు ద్వారానే జరుగుతుంది. అంటే, పెట్టుబడి ఉత్పాదితంగానూ, ఉత్పాదితం సరుకుగానూ, సరుకు డబ్బుగానూ మారటం ద్వారానే జరుగుతుంది. ఈ కారణం చేతనే ఇంతకు ముందు అధ్యాయంలో నిశ్చల పెట్టుబడి గురించి పట్టించుకోకుండా, కేవలం చలామణి పెట్టుబడి గురించి, దాని స్థిర, అస్థిర భాగాల గురించి సంయుక్తంగానూ, విడివిడిగానూ పరిశీలించాము.

ఇప్పుడు తీసుకోబోయే అంశంలో మనం మరో అడుగు ముందుకు వేయాలి. చలామణి పెట్టుబడిలో కేవలం అస్థిర భాగం మాత్రమే ఉన్నట్టు ఊహించి పరిశోధన కొనసాగించాలి. మరోలా చెప్పాలంటే, దాంతోపాటే టర్నోవరయ్యే స్థిర చలామణి పెట్టుబడిని మనం పరిగణనకు తీసుకోకుండా వదలివేస్తున్నాం.

25,000 పౌండ్ల మొత్తం అడ్వాన్సు చేయబడింది. మొత్తం వార్షిక ఉత్పాదితం విలువ 25,000 పౌండ్లు. ఐతే చలామణి పెట్టుబడిలోని అస్థిర భాగం 500 పౌండ్లు. కాబట్టి 25,000 పౌండ్లలో వున్న అస్థిర భాగం $\frac{25,000}{5}$ లేదా 5,000 పౌండ్లు. ఈ 5,000 పౌండ్లను 500 పౌండ్లతో భాగిస్తే టర్నోవర్ల సంఖ్య 10 అని తేలుతుంది. మొత్తం పెట్టుబడి 2,500 పౌండ్లు విషయంలో కూడా ఇంతే.

కేవలం అదనపు విలువ ఉత్పత్తి సమస్యకు మాత్రమే సంబంధించిన ఈ సందర్భంలో ఈ సగటు అంచనా పూర్తిగా సరైనదే. అంటే వార్షిక ఉత్పాదితం విలువను ఒక పనికాలంలో స్థిరంగా వినియోగించబడిన పెట్టుబడి భాగం యొక్క విలువతో (అంటే, ప్రస్తుత ఉదాహరణలో 400తో కాక, అడ్వాన్స్ చేయబడిన పెట్టుబడి విలువతో, ప్రస్తుత ఉదాహరణ ప్రకారం 500తో, అంటే పెట్టుబడి–I చేతగాక, పెట్టుబడి–I + పెట్టుబడి–II చేత) భాగిస్తున్నాము. మరో దృష్టినుంచి ఇలా లెక్కించడం అంత సరికాదన్న సంగతి మనం తరువాత గమనిస్తాం. ఈ సగటు అంచనా పద్ధతి మొత్తంపై అంత

ఖచ్చితమైనది కానట్లుగానే. అంటే, పెట్టుబడిదారుని ఆచరణాత్మక అవసరానికి ఇది ఉపయోగపడుతుందే కాని, టర్నోవరు యొక్క వాస్తవ పరిస్థితులన్నిటినీ, ఖచ్చితంగా లేదా సక్రమంగానూ ఇది వ్యక్తం చేయదన్నమాట.

సరుకు పెట్టుబడి విలువలో ఒక భాగాన్ని మనం ఇంత వరకూ పట్టించుకోలేదు. అదేమంటే, ఉత్పత్తి ప్రక్రియలో ఉత్పత్తి అయి, ఉత్పాదితంలో చేరిన అదనపు విలువ. ఇప్పుడు మన దృష్టిని దానిపై నిల్పాలి.

100 పౌండ్ల అస్థిర పెట్టుబడి వారం వారం మదుపు పెడుతున్నారనీ 100% అదనపు విలువను లేదా 100 పౌండ్లని ఉత్పత్తి చేసిందనీ అనుకుందాం. అప్పుడు 5 వారాల టర్నోవరు కాలంలో మదుపు పెట్టబడిన అస్థిర పెట్టుబడి 500 పౌండ్లు అదనపు విలువని ఉత్పత్తి చేస్తుంది. అంటే సగం పనిదినం అదనపు శ్రమ అన్నమాట.

500 పౌండ్ల అస్థిర పెట్టుబడి 500 పౌండ్ల అదనపు విలువను ఉత్పత్తి చేస్తే 5,000 పౌండ్లు, 5,000 పౌండ్ల అదనపు విలువను ఉత్పత్తి చేస్తాయి. అయితే అడ్వాన్స్ చేయబడిన అస్థిర పెట్టుబడి 500 పౌండ్లు. మొత్తం ఏడాదిలో ఉత్పత్తయిన మొత్తం అదనపు విలువకు అడ్వాన్స్ చేయబడిన మొత్తం అస్థిర పెట్టుబడికి ఉన్న నిష్పత్తిని మనం అదనపు విలువ వార్షిక రేటు అంటాం. ప్రస్తుత ఉదాహరణలో అది 5,000:500 లేదా 1,000 శాతం. ఈ రేటుని మనం మరింత జాగ్రత్తగా పరిశీలిస్తే, అడ్వాన్సు చేయబడిన అస్థిర పెట్టుబడి ఒక టర్నోవరు కాలం ఉత్పత్తి చేసే అదనపు విలువ రేటుని అస్థిర పెట్టుబడి టర్నోవర్ల సంఖ్యతో హెచ్చించగా వచ్చిన ఫలితంతో సమానమని తెలుస్తుంది. (ఈ టర్నోవర్ల సంఖ్య మొత్తం చలామణి పెట్టుబడి యొక్క టర్నోవర్ల సంఖ్యతో సమానంగా ఉంటుంది)

ఒక టర్నోవరు కాలానికి అడ్వాన్సు చేయబడిన అస్థిర పెట్టుబడి 500 పౌండ్లు. ఉత్పత్తయిన అదనపు విలువ కూడా 500 పౌండ్లే. కనుక ఒక టర్నోవరు కాలంలో ఉత్పత్తయిన అదనపు విలువ రేటు $\frac{500 \text{ అ.వి.}}{500 \text{ అ.పె.}}$ అంటే 100%. ఈ 100% ని ఒక ఏడాదిలో జరిగే టర్నోవర్ల సంఖ్యతో అంటే 10తో హెచ్చిస్తే, 1,000% అవుతుంది.

అది వార్షిక అదనపు విలువ రేటు. ఒక నిర్దిష్ట టర్నోవరు కాలంలో వచ్చిన అదనపు విలువ మొత్తం, ఆ కాలంలో అడ్వాన్సు చేయబడిన అస్థిర పెట్టుబడి విలువను (ప్రస్తుత ఉదాహరణలో 500 పౌండ్లను) అదనపు విలువ రేటుతో హెచ్చిస్తే వస్తుంది. (ప్రస్తుత ఉదాహరణ ప్రకారం ఇది $500\times\frac{100}{100}$) అంటే $500\times1 = 500$ పౌండ్లు. అడ్వాన్సు చేయబడిన అస్థిర పెట్టుబడి 1,500 పౌండ్లయితే, అదే అదనపు విలువ రేటుతో అదనపు విలువ మొత్తం $500\times\frac{100}{100}$, అంటే 1,500 పౌండ్లు అవుతుంది.

ఏడాదికి 10 సార్లు టర్నోవర్రై, ఏడాదికి 5,000 పౌండ్ల అదనపు విలువను ఉత్పత్తి చేస్తున్న 500 పౌండ్ల అస్థిర పెట్టుబడిని పెట్టుబడి క అని పిలుద్దాం. దీని వార్షిక అదనపు విలువ రేటు 1000%.

5,000 పౌండ్లున్న మరో అస్థిర పెట్టుబడిని ఊహిద్దాం. దీన్ని పెట్టుబడి గ అని పిలుద్దాం. ఇది 50 వారాల సంవత్సరానికి అడ్వాన్సు చేయబడిందని అనుకొందాం. ఇది ఏడాదిలో ఒకే ఒకసారే

టర్నోవరవుతుందని ఊహించుకొందాం. ఏడాది చివర ఉత్పాదితం తయారు కాగానే, అదే రోజున చెల్లించబడుతుందని అనుకుందాం. అంటే, అది డబ్బు పెట్టుబడిగా మారి అదే రోజున తిరిగి వస్తుందన్న మాట. అప్పుడు చలామణి కాలం సున్న. టర్నోవరు కాలం పని కాలంతో అంటే ఏడాదితో (50 వారాలతో) సమానమవుతుంది. ఇంతకు ముందు ఉదాహరణలో లాగానే ప్రతి వారం శ్రమ ప్రక్రియలో వెచ్చించబడే అస్థిర పెట్టుబడి 100 పౌండ్లు. అంటే 50 వారాల్లో వెచ్చించబడిన మొత్తం అస్థిర పెట్టుబడి 5,000 పౌండ్లు. అదనపు విలువ రేటు ఇక్కడా 100 శాతమే అనుకుందాం. ఒకే పరిమాణం గల పనిదినంలో సగం అదనపు శ్రమ అని అనుకొందాం. మనం 5 వారాల్ని పరిశీలిస్తే, మదుపు పెట్టబడిన అస్థిర పెట్టుబడి 500 పౌండ్లు. అదనపు విలువ రేటు 100% కనుక 5 వారాల్లో ఉత్పత్తయిన అదనపు విలువ మొత్తం 500 పౌండ్లు. దోపిడీ చేయబడిన శ్రమశక్తి పరిమాణం, దోపిడీ తీవ్రత, పెట్టుబడి క విషయంలోలాగే ఇక్కడా ఉన్నాయనుకుందాం.

ప్రతి వారం మదుపు పెట్టబడిన అస్థిర పెట్టుబడి 100 పౌండ్లు, 100 పౌండ్ల అదనపు విలువను ఉత్పత్తి చేస్తుంది. కనుక 50 వారాల్లో మదుపు పెట్టబడిన పెట్టుబడి 50×100=5,000 పౌండ్లు. అది 5,000 పౌండ్లు అదనపు విలువను ఉత్పత్తి చేస్తుంది. ఏడాదిలో ఉత్పత్తి అవుతున్న అదనపు విలువ ఇంతకు ముందు ఉదాహరణలోలాగే 5,000 పౌండ్లు. అయితే వార్షిక అదనపు విలువ రేటు పూర్తిగా భిన్నం. ఏడాదిలో ఉత్పత్తయిన అదనపు విలువను అడ్వాన్సు చేయబడిన అస్థిర పెట్టుబడితో భాగించగా వచ్చే ఫలితంతో అది సమానం. అనగా $\frac{5,000 \text{ అ.వి.}}{5,000 \text{ అ.పె.}}$ లేదా 100% కాగా పెట్టుబడి క విషయంలో ఇది 1,000%.

పెట్టుబడి క విషయంలోనూ పెట్టుబడి *గ* విషయంలోనూ కూడా వారానికి మదుపు పెట్టిన అస్థిర పెట్టుబడి100 పౌండ్లు మాత్రమే. స్వయం విస్తరణ స్థాయి లేదా అదనపు విలువ రేటు కూడా ఒకటే. అది 100%. అస్థిర పెట్టుబడి పరిమాణం కూడా సమానమే. అది వంద పౌండ్లు. అదే పరిమాణంలోని శ్రమశక్తి దోపిడీకి గురైంది. దోపిడీ పరిమాణమూ, స్థాయీ రెండూ సమానమే. పని దినాలు కూడా సమానంగానే వున్నాయి. అవసర శ్రమగానూ, అదనపు శ్రమగానూ పనిదినం యొక్క విభజన ఈ రెంటిలోనూ ఒకే తీరుగా వుంది. మొత్తం ఏడాదిలో వినియోగించబడిన అస్థిర పెట్టుబడి రెంటిలోనూ 5,000 పౌండ్లే. ఒకే పరిమాణంలోని శ్రమని ఇవి చలనంలో ఉంచుతున్నాయి. అదనపు విలువను కూడా ఒకే పరిమాణంలో, అంటే 5,000 పౌండ్లనే రాబడుతున్నాయి. అయినప్పటికీ, పెట్టుబడి క, పెట్టుబడి *గ* ల వార్షిక అదనపు విలువ రేట్ల మధ్య 900% తేడా వుంది.

ఈ పరిణామం వల్ల, అదనపు విలువ అనేది కేవలం చలనంలోని శ్రమశక్తి పరిమాణంపైన, దోపిడీ తీవ్రతపైన మాత్రమే కాక, చలామణి ప్రక్రియలో తలెత్తే ప్రభావాలపైన, కారణమేమిటో తెలీని ఈ ప్రభావాలపైన కూడా ఆధారపడి ఉంటుందనే ఒక అభిప్రాయం కలుగుతోంది. నిజానికి దానికి అలాగే భాష్యం చెప్పబడింది. అచ్చంగా ఈ రూపంలో కాకపోయినప్పటికీ, మారు రూపంలో, సంక్లిష్ట రూపంలో, వార్షిక లాభం రేటు రూపంలో ఇలా భాష్యం చెప్పారు. దీనివల్ల 1820ల ప్రారంభం నుంచి రికార్డో సిద్ధాంతాలు పూర్తిగా తుడిచిపెట్టుకుపోయాయి.

పెట్టుబడి క ని, పెట్టుబడి *గ* ని ఒకే పరిస్థితుల్లో ఉత్పత్తిగా కాకుండా, వాస్తవంగానే

ఉంచినట్లయితే ఈ పరిణామంలో పైకి కనిపించే వింత మటుమాయమవుతుంది. అస్థిర పెట్టుబడి గ మొత్తం అంతా పెట్టుబడి క లాగానే, అదే కాలంలో శ్రమశక్తి యొక్క వేతనాల కోసం వెచ్చించినప్పుడు మాత్రమే ఈ సమాన పరిస్థితులు వుంటాయి.

ఆ సందర్భంలో పెట్టుబడి గ 5,000 పౌండ్లు 5 వారాల్లో వెచ్చించబడింది. వారానికి 1,000 పౌండ్ల చొప్పున ఏడాదికి 50,000 పౌండ్లు మదుపుతో సమానమైంది. అప్పుడు, మనం ఊహించుకొన్న వాటిని బట్టి, అదనపు విలువ కూడా 50,000 పౌండ్లవుతుంది. టర్నోవరైన పెట్టుబడి 50,000 పౌండ్లని అడ్వాన్సు చేయబడిన పెట్టుబడి 5,000 పౌండ్లతో భాగిస్తే టర్నోవర్ల సంఖ్య 10 వస్తుంది. అదనపు విలువరేటు $\frac{5000 \text{ అ.వి.}}{5000 \text{ అ.పె.}}$ లేదా 100%. దీనిని టర్నోవర్ల సంఖ్య 10తో హెచ్చిస్తే వార్షిక అదనపు విలువ రేటు 1,000 శాతమవుతుంది. ఇప్పుడు పెట్టుబడి క, పెట్టుబడి *గ* ల యొక్క వార్షిక అదనపు విలువ రేట్లు సమానంగా ఉన్నాయి, అంటే 1,000%. కాని అదనపు విలువ మొత్తాలు పెట్టుబడి *గ* విషయంలో 50,000 పౌండ్లు. పెట్టుబడి క విషయంలో 5000 పౌండ్లు. ఉత్పత్తయిన అదనపు విలువ మొత్తాలు కూడా అడ్వాన్సు చేయబడిన పెట్టుబడి విలువలు *గ,* క ఉన్న నిష్పత్తిలోనే, అంటే 5,000:500=10:1 నిష్పత్తిలో వున్నాయి. అయితే పెట్టుబడి క చలనంలో ఉంచిన శ్రమశక్తి కంటే పది రెట్లు ఎక్కువ. శ్రమశక్తిని అదే కాలంలో పెట్టుబడి గ చలనంలో ఉంచింది.

శ్రమ ప్రక్రియలో వాస్తవంగా వినియోగించబడిన పెట్టుబడి మాత్రమే అదనపు విలువను ఉత్పత్తి చేస్తుంది. అదనపు విలువకు సంబంధించిన నియమాలన్నీ దాని రేటు నిర్ణీతమైనపుడు, దాని పరిమాణం అస్థిర పెట్టుబడి యొక్క సాపేక్ష పరిమాణాన్ని బట్టి ఉంటుందనే నియమం కూడా దానికి వర్తిస్తుంది.[1]

అసలు, శ్రమ ప్రక్రియకు కాలం కొలమానం. పనిదిన పరిమాణం నిర్ణీతమైనప్పుడు (మనం క, గ లకు సంబంధించిన వార్షిక అదనపు విలువ రేట్ల మధ్య తేడాని కనుక్కోవడం కోసం అన్ని పరిస్థితులు సమానంగా వున్నాయని ఊహించినట్లే, ఇక్కడ అలాగే వుంటుంది) పనివారంలో పనిదినాలు నిర్దిష్ట సంఖ్యలో ఉంటాయి. లేదా, మనమేదైనా పనికాలాన్ని (పనికి పట్టే కాలాన్ని) పరిగణనలోకి తీసుకోవచ్చు. ఉదాహరణకు, ఈ 5 వారాల పనికాలాన్ని తీసుకొందాం. ఒక పనిదినంలో 10 గంటలు ఉంటే, వారానికి 6 రోజులు పని జరిగితే, ఈ 5 వారాల పనికాలాన్ని 300 గంటలు గల ఒకే పనిదినంగా పరిగణించవచ్చు. అదే శ్రమ ప్రక్రియలో ఏకకాలంలో ప్రతిదినం కలిసి పనిచేసే శ్రామికుల సంఖ్యతో ఈ సంఖ్యను గుణించాలి. ఆ సంఖ్య 10 అయితే, అపుడు ఒకే వారంలో 60×10 లేదా 600 పనిగంటలు ఉంటాయి. 5 వారాల పనికాలంలో 600×5=3,000 గంటలుంటాయి. అదనపు విలువ రేటు, పనికాలం యొక్క పరిమాణం ఒకలాగే వున్నాయి. కాబట్టి, సమాన పరిమాణాలు గల శ్రమశక్తిని (ఒకే ధర కలిగిన శ్రమశక్తిని ఒకే సంఖ్య కార్మికులతో గుణించగా వచ్చే మొత్తం శ్రమశక్తి) సమాన కాలంలో చలనంలో ఉంచినపుడు, సమాన పరిమాణం గల అస్థిర పెట్టుబడులు వినియోగించబడతాయి.

ఇప్పుడు మన పాత ఉదాహరణలను తీసుకుందాం. క, గ రెంటిలోనూ ఏడాది పొడుగునా

1. కార్ల్ మార్క్స్, పెట్టుబడి, 1వ సంపుటం, 11వ అధ్యాయం.

ప్రతివారం, 100 పౌండ్లు చొప్పున అస్థిర పెట్టుబడి మదుపు పెట్టారు. కనుక శ్రమ ప్రక్రియలో వాస్తవంగా పనిచేస్తున్న అస్థిర పెట్టుబడులు సమానం. అయితే అడ్వాన్సు చేయబడిన అస్థిర పెట్టుబడులు చాలా అసమానంగా వున్నాయి. పెట్టుబడి క విషయంలో ప్రతి 5 వారాలకు 500 పౌండ్ల అడ్వాన్సు చేయబడ్డాయి. అడ్వాన్సు చేయబడిన మొత్తంలో 100 పౌండ్లు మాత్రమే ప్రతివారం వినియోగించ బడతాయి. పెట్టుబడి గ విషయంలో మొదటి 5 వారాల పనికాలానికి 5,000 పౌండ్లు అడ్వాన్సు చేయబడాలి. దానిలో వారానికి 100 పౌండ్ల చొప్పున, మొదటి 5 వారాలకు 500 పౌండ్లు మాత్రమే వినియోగమవుతాయి. అంటే అడ్వాన్సు చేయబడిన మొత్తంలో పదోవంతు మాత్రమే వినియోగించ బడుతుంది. రెండో 5 వారాల కాలంలో, 4,500 పౌండ్లు అడ్వాన్సు చేయబడాలి. అయితే దీనిలో 500 పౌండ్లు మాత్రమే వినియోగించబడతాయి. అలాగే మిగిలిన పనికాలాలకు కూడా. ఒక నిర్దిష్ట కాలం కోసం అడ్వాన్స్ చేయబడిన అస్థిర పెట్టుబడి శ్రమ ప్రక్రియకు పట్టే పనికాలాల విభాగాల్లో ప్రవేశించిన మేరకు, శ్రమ ప్రక్రియలో వినియోగించబడే, అంటే వాస్తవంగా పనిచేసే అస్థిర పెట్టుబడిగా మారుతుంది. ఈ మధ్యకాలంలో దానిలో ఒక భాగం తర్వాత వినియోగించబడటం కోసం అడ్వాన్సు చేయబడుతుంది. ఈ భాగం శ్రమ ప్రక్రియకు సంబంధించి, ఆచరణలో లేనట్టే లెక్క. అందుకనే విలువగానీ, అదనపు విలువగానీ ఏర్పడటంలో దాని ప్రభావమేమీ ఉండదు. ఉదాహరణకు 500 పౌండ్ల పెట్టుబడి క ని తీసుకుందాం. ఇది 5 వారాలకోసం అడ్వాన్స్ చేయబడింది. అయితే ప్రతివారం 100 పౌండ్లు మాత్రమే శ్రమ ప్రక్రియలో వరుసగా ప్రవేశిస్తాయి. మొదటి వారం ఈ పెట్టుబడిలో 5వ వంతు వినియోగించబడింది. మిగతా ఐదింట నాలుగు వంతులు అడ్వాన్స్ చేయబడింది కాని వినియోగించబడలేదు. అయితే అది నిలవలో ఉండాల్సిందే. కాబట్టి అడ్వాన్సు చేయబడాల్సిందే. మిగిలిన నాలుగు వారాల శ్రమ ప్రక్రియలు కొనసాగించడానికి ఇది అవసరం.

అడ్వాన్సు చేయబడిన అస్థిర పెట్టుబడికి, వినియోగించబడిన అస్థిర పెట్టుబడికి మధ్య సంబంధాన్ని వేరుపరిచి చూపే పరిస్థితులు – అదనపు విలువ రేటు నిర్ణీతమైనప్పుడు – అదనపు విలువ ఉత్పత్తిని ప్రభావితం చేసేది, ఒక నిర్దిష్ట పనికాలంలో వాస్తవంగా వినియోగించబడిన అస్థిర పెట్టుబడి పరిమాణాన్ని అవి వేరు చేసి చూపిన మేరకే, ఆ కారణం వల్లనే. ఆ పనికాలం ఒక వారముండొచ్చు, 5 వారాలుండొచ్చు. మరెన్ని వారాలైనా వుండవచ్చు. అడ్వాన్సు చేయబడిన అస్థిర పెట్టుబడి వాస్తవంగా వినియోగించబడిన కాలంలో మాత్రమే అస్థిర పెట్టుబడిగా వ్యవహరిస్తుంది. అది అడ్వాన్స్ చేయబడి వినియోగించబడకుండా, కేవలం నిల్వగా ఉన్నప్పుడు అలా వ్యవహరించదు. అడ్వాన్స్ చేయబడిన అస్థిర పెట్టుబడికి, వినియోగించబడిన అస్థిర పెట్టుబడికి మధ్య సంబంధాన్ని వేరుచేసి చూపే పరిస్థితులన్నీ (పనికాలంచేత లేదా చలామణి కాలంచేత లేదా రెంటిచేతా నిర్ణయించబడే) టర్నోవరు కాలాల్లో ఉన్న తేడాగా తేలుతాయి. అదనపు విలువ రేటు ఒకటే అయిన సందర్భంలో, పనిచేసే అస్థిర పెట్టుబడుల పరిమాణాలు సమానంగా వున్నప్పుడు అవి సమాన పరిమాణాల్లో అదనపు విలువను సృష్టిస్తాయని అదనపు విలువ ఉత్పత్తి నియమం తెలియజేస్తుంది. అటువంటప్పుడు పెట్టుబడి క పెట్టుబడి గ సమానమైన పనికాలాల్లో, సమానమైన అదనపు విలువ రేట్లతో సమాన పరిమాణాల్లో అస్థిర పెట్టుబడులు వినియోగించినపుడు, అవి సమానమైన పనికాలాల్లో సమానమైన అదనపు విలువ

పరిమాణాన్ని ఉత్పత్తి చేయాలి. ఒక నిర్దిష్ట కాలంలో వినియోగించబడిన అస్థిర పెట్టుబడికీ, అదేకాలంలో అడ్వాన్స్ చేయబడిన అస్థిర పెట్టుబడికీ మధ్య నిష్పత్తి ఎంత భిన్నంగా ఉన్నప్పటికీ, అలాగే ఉత్పత్తయిన అదనపు విలువల పరిమాణాలకు, వినియోగించిన అస్థిర పెట్టుబడితో గాక అడ్వాన్స్ చేయబడిన అస్థిర పెట్టుబడితో గల నిష్పత్తి ఎంత భిన్నంగా ఉన్నప్పటికీ, దానితో ఇక్కడ ప్రమేయం లేదు. ఈ నిష్పత్తిలో ఉన్న తేడా అదనపు విలువ ఉత్పత్తి నియమాలకు విరుద్ధమైనది కాదు సరికదా, ఆ నియమాలను పూర్తిగా ధ్రువపరుస్తున్నది. అది వాటి అనివార్య పర్యవసానం.

పెట్టుబడి గ యొక్క మొదటి 5 వారాల ఉత్పాదక కాలాన్ని పరిశీలిద్దాం. ఐదవ చివర 500 పౌండ్లు నియుక్తమయ్యాయి, వినియోగమయ్యాయి. దాని ఉత్పాదితం యొక్క విలువ 1,000 పౌండ్లు. కాబట్టి $\frac{500 \text{ అ.వి.}}{500 \text{ అ.పె.}} = 100\%$. ఇది పెట్టుబడి క విషయంలో కూడా ఇంతే. పెట్టుబడి క విషయంలో అడ్వాన్స్ చేయబడిన పెట్టుబడితో పాటు అదనపు విలువ కూడా చేతికందుతుంది. కాగా గ విషయంలో అలా జరగదు. అయితే ఇక్కడ మనకి ఈ విషయంతో ప్రమేయం లేదు. ఎందువల్లనంటే అదనపు విలువ ఉత్పత్తిని గురించి ఆ ఉత్పత్తి కాలంలో అడ్వాన్స్ చేయబడిన అస్థిర పెట్టుబడికీ, అదనపు విలువకీ మధ్య నిష్పత్తి గురించి మాత్రమే ఇక్కడ పరిశీలిస్తున్నాము. అలాకాక, గ విషయంలో అదనపు విలువ నిష్పత్తిని, అడ్వాన్స్ చేయబడిన 5,000 పౌండ్లలో నియుక్తమై, తత్కారణంగా వినియోగమయిన భాగాన్ని బట్టికాక, అడ్వాన్సు చేయబడిన మొత్తం పెట్టుబడిని బట్టే అంచనా కడితే అది $\frac{5,000 \text{ అ.వి.}}{5,000 \text{ అ.పె}}$ లేక $\frac{1}{10}$ లేక 10 శాతం అవుతుంది. కనుక అది *గ* పెట్టుబడి విషయంలో 10%, క పెట్టుబడి విషయంలో 100%, అంటే పది రెట్లు ఎక్కువ. సమాన పెట్టుబడులు సమాన పరిమాణాల్లో శ్రమని చలనంలో ఉంచాయి. అది వేతనం చెల్లించబడిన శ్రమగా, వేతనం చెల్లించబడని శ్రమగా సమానంగా విభజితమైంది. అయినా, వాటి అదనపు విలువ రేటుతో ఇలా తేడా రావడం అదనపు విలువ ఉత్పత్తి నియమాలకు వ్యతిరేకమని ఎవరైనా అంటే, సులభంగా దానికి సమాధానమివ్వవచ్చు. ఒక్కసారి వాస్తవ సంబంధాల్ని చూస్తే చాలు ఆ సమాధానం లభ్యమవుతుంది. క విషయంలో అదనపు విలువ వాస్తవ రేటు వ్యక్తమైంది. 500 పౌండ్ల అస్థిర పెట్టుబడిచేత 5 వారాల్లో ఉత్పత్తయిన అదనపు విలువకీ, 500 పౌండ్ల అస్థిర పెట్టుబడికీ మధ్య నిష్పత్తి ద్వారా వ్యక్తమవుతుంది. మరోవైపున గ విషయంలో ఈ లెక్కాచారం అదనపు విలువ ఉత్పత్తిలో గాని, అందుకనుగుణమైన అదనపు విలువ రేటు నిర్ణయంలో గాని సంబంధం లేనిది. ఎందుచేతనంటే, 500 పౌండ్ల అస్థిర పెట్టుబడిచేత ఉత్పత్తి చేయబడిన 500 పౌండ్ల అదనపు విలువను, వాటి ఉత్పత్తి సందర్భంగా అడ్వాన్స్ చేసిన 500 పౌండ్ల అస్థిర పెట్టుబడినిబట్టి లెక్కగట్టబడలేదు. ఇది 5,000 పౌండ్ల పెట్టుబడిని బట్టి లెక్కగట్ట బడుతుంది. దీన్లో 4,500 పౌనులకు ఈ 500 పౌండ్ల అదనపు విలువ ఉత్పత్తితో ఎటువంటి ప్రమేయం లేదు. అది క్రమక్రమంగా మిగిలిన 45 వారాల్లో పని చేయడానికి ఉద్దేశించబడిన మొత్తం. కనుక మొదటి 5 వారాల ఉత్పత్తికి సంబంధించిన వరకు ఈ 4,500 పౌండ్లు లేనట్టే లెక్క. కానీ ఇప్పుడు మన పరిశీలనలో వున్నది ఈ 5 వారాల ఉత్పత్తే కాబట్టి ఈ సందర్భంలో క, గ ల అదనపు విలువ రేట్ల మధ్య వున్న తేడా ఒక సమస్యే కాదు.

ఇప్పుడు పెట్టుబడి క, గ ల అదనపు విలువ వార్షిక రేట్లను పోల్చి చూద్దాం. పెట్టుబడి గ విషయంలో అది $\frac{5,000 \text{ అ.వి.}}{5,000 \text{ అ.పె}}$ = 100%. పెట్టుబడి క విషయంలో అది $\frac{5,000 \text{ అ.వి.}}{500 \text{ అ.పె}}$ = 1,000%. అయితే ఈ అదనపు విలువ రేట్ల మధ్య నిష్పత్తి ఇంతకు ముందున్నదే. ఇంతకు ముందు నిష్పత్తి :

$$\frac{\text{పెట్టుబడి గ అదనపు విలువ రేటు}}{\text{పెట్టుబడి క అదనపు విలువ రేటు}} = \frac{10\%}{100\%}$$

ఇప్పటి నిష్పత్తి :

$$\frac{\text{పెట్టుబడి గ అదనపు విలువ వార్షిక రేటు } 100\%}{\text{పెట్టుబడి క అదనపు విలువ వార్షిక రేటు } 1,000\%}$$

కాని, 10% : 100% = 100% : 1,000%. కనుక నిష్పత్తి సమానంగానే ఉంది.

అయితే ఇప్పుడు సమస్య మారింది. పెట్టుబడి గ వార్షిక రేటు $\frac{5,000 \text{ అ.వి.}}{5,000 \text{ అ.పె.}}$ = 100%. ఇంతవరకు, మనకు తెలిసిన ఉత్పత్తి నియమాలకు గానీ, ఉత్పత్తికి సంబంధించిన అదనపు విలువ రేటు యొక్క నియమాలకు గానీ ఇది ఏమాత్రమూ భిన్నంగా లేదు. భిన్నంగా వుందన్న పొడ కూడా లేదు. ఏడాది పొడుగునా 5,000 అస్థిర పెట్టుబడి అడ్వాన్స్ చేయబడింది. ఉత్పాదకంగా వినియోగం అయింది. అది 5,000 అదనపు విలువను ఉత్పత్తి చేసింది. కనుక అదనపు విలువ రేటుపై భిన్నాంకమైన $\frac{5,000 \text{ అ.వి.}}{5,000 \text{ అ.పె}}$ = 100% కి సమానమవుతుంది. ఇక్కడ వార్షిక రేటు అదనపు విలువ వాస్తవ రేటుతో ఏకీభవిస్తుంది. కాబట్టి కారణం వివరించాల్సిన ఒక వైపరీత్యం, గ విషయంగాక, పెట్టుబడి క విషయంలో ఎదురవుతుంది.

ఇక్కడ అదనపు విలువ రేటు $\frac{5,000 \text{ అ.వి.}}{500 \text{ అ.పె.}}$ = 1,000%. మొదట ఉదాహరణలో 5 వారాల ఉత్పాదితమైన 500ల అదనపు విలువను అడ్వాన్స్ చేయబడిన 5,000 పౌండ్ల పెట్టుబడి మీద లెక్కగట్టాము. ఈ మొత్తంలో పదింట తొమ్మిది వంతులు దాని ఉత్పత్తిలో వినియోగించబడలేదు. ఇప్పుడు 500 అస్థిర పెట్టుబడికి 5,000 అదనపు విలువ లెక్కవేశాము. అంటే, 5,000 అదనపు విలువ ఉత్పత్తిలో వాస్తవంగా వినియోగించబడిన అస్థిర పెట్టుబడిలో పదోవంతుకు మాత్రమే ఇలా లెక్కగట్టాము. ఎందుకంటే 5,000 అదనపు విలువ 50 వారాల కాలంలో ఉత్పాదకంగా వినిమయమైన 5000 పౌండ్ల అస్థిర పెట్టుబడి యొక్క ఉప్పాదితం అంతేగాని 5 వారాల ఒకే పనికాలంలో వినిమయమైన 500 పౌండ్ల పెట్టుబడి ఉత్పాదితం కాదిది. మొదటి ఉదాహరణలో 5 వారాలు ఉత్పత్తి అయిన అదనపు విలువ 50 వారాలకు అడ్వాన్స్ చేయబడిన పెట్టుబడిపై లెక్క వేయబడింది. ఇప్పుడు 50 వారాల్లో ఉత్పత్తయిన అదనపు విలువను 5 వారాలకోసం అడ్వాన్స్ చేయబడిన పెట్టుబడిపై లెక్కగడుతున్నాము. ఈ పెట్టుబడి 50 వారాల్లో వినియోగమయ్యే పెట్టుబడిలో పదోవంతు మాత్రమే.

500 పౌండ్ల పెట్టుబడి క 5 వారాలకు మించి ఎప్పుడూ అడ్వాన్స్ చేయబడదు. ఈ కాలం చివర అది తిరిగి వచ్చి, ఏడాదిలో అదే ప్రక్రియను 10 సార్లు కొత్తగా ప్రారంభించగలదు. ఎందుకంటే అది 10 టర్నోవర్లు చేస్తుంది. దీని నుంచి రెండు నిర్ధారణలు ఉత్పన్నమవుతాయి.

మొదటిది : క విషయంలో అడ్వాన్స్ చేయబడిన పెట్టుబడి ఒక వారంపాటు జరిగే ఉత్పాదక ప్రక్రియలో స్థిరంగా వినియోగించబడిన పెట్టుబడికి 5 రెట్లు మాత్రమే అధికం. మరోవైపున,

పెట్టుబడి గ 50 వారాల్లో ఒక్కసారి మాత్రమే టర్నోవరవుతుంది. కనుక అది 50 వారాలకోసం అడ్వాన్స్ చేయబడాలి. కనుక అది, ఒక వారం కోసం స్థిరంగా వినియోగించబడే తన భాగానికి 50 రెట్లు అధికం. కనుక ఉత్పత్తి ప్రక్రియ కోసం ఏడాదిలో అడ్వాన్స్ చేయబడిన పెట్టుబడికి ఒక నిర్దిష్ట ఉత్పత్తి కాలంలో, ఉదాహరణకు ఒక వారంలో, స్థిరంగా వినియోగించదగిన పెట్టుబడికి మధ్య ఉన్న సంబంధాన్ని ఈ టర్నోవర్ మారుస్తుంది. అటువంటప్పుడు, మొదటి ఉదాహరణలో మనం 5 వారాల అదనపు విలువను ఈ 5 వారాల్లో వినియోగించబడిన పెట్టుబడిపై కాక, దానికి పదింతలు పెద్దదైన పెట్టుబడిపై, 50 వారాలలో వినియోగించబడిన పెట్టుబడిపై లెక్కగట్టాము.

రెండోది : పెట్టుబడి క యొక్క 5 వారాల టర్నోవరు కాలం ఏడాదిలో పదోవంతు మాత్రమే. కాబట్టి ఏడాదికి అటువంటి 10 టర్నోవర్లుంటాయి. వాటిలో 500 పౌండ్లు పెట్టుబడి క వరుసగా మళ్ళీ, మళ్ళీ మదుపు పెట్టబడుతుంది. ఇక్కడ వినియోగించబడిన పెట్టుబడి, 5 వారాలకోసం అడ్వాన్స్ చేయబడిన పెట్టుబడిని ఏడాదిలో జరిగే టర్నోవర్ కాలాల సంఖ్యతో గణించగా వచ్చే మొత్తంతో సమానం. ఏడాదిలో వినియోగించిన పెట్టుబడి 500 కి 10 రెట్లు లేదా 5,000ల పౌండ్లు. ఏడాదిలో అడ్వాన్స్ చేయబడిన పెట్టుబడి $\frac{5,000}{10}$ = 500 పౌండ్లు. నిజానికి, 500 పౌండ్లు పదే పదే వినియోగించ బడినప్పటికీ, ప్రతి 5 వారాలకూ అడ్వాన్స్ చేయబడే సొమ్ము ఈ 500 పౌండ్లకెప్పుడూ మించదు. మరోవైపున పెట్టుబడి గ విషయంలో, 5 వారాల కాలంలో కేవలం ఈ 5 వారాలకోసం 500 పౌండ్లు మాత్రమే వినియోగించబడింది. ఈ 5 వారాలకు అంత మొత్తమే అడ్వాన్స్ చేయబడింది. ఐతే ఈ ఉదాహరణలో టర్నోవరు కాలం 50 వారాలవటం వల్ల, ఏడాదిలో అడ్వాన్స్ చేయబడిన పెట్టుబడితో సమానం అవుతుంది. అంతేగానీ ప్రతి 5 వారాలకు అడ్వాన్స్ చేయబడిన పెట్టుబడితో సమానం కాదు. అదనపు విలువ రేటు నిర్ణీతమైనప్పుడు, ఏడాదిలో ఉత్పత్తయిన అదనపు విలువ పరిమాణం ఆ ఏడాదిలో వినియోగించబడిన పెట్టుబడికి మాత్రమే అనుగుణంగా వుంటుంది. అంతే తప్ప, ఆ ఏడాదిలో అడ్వాన్స్ చేయబడిన పెట్టుబడికి అనుగుణంగా ఉండదు. అందుకే ఈ పరిమాణం ఏడాదిలో ఒక్కసారి మాత్రమే టర్నోవరయ్యే 5,000 పౌండ్ల పెట్టుబడి విషయంలో, ఏడాదిలో 10 సార్లు టర్నోవరయ్యే 500 పౌండ్ల పెట్టుబడి విషయం కంటే అధికంగా ఉండదు. ఏడాదికి ఒక్కసారి మాత్రమే టర్నోవరయ్యే పెట్టుబడి ఏడాదిలో పదిసార్లు టర్నోవరయ్యే పెట్టుబడికంటే పది రెట్లు అధికంగా వున్నందువల్లనే దాని అదనపు విలువ కూడా రెండో అదనపు విలువతో సమానంగా వుంది.

ఏడాదిలో టర్నోవరైన అస్థిర పెట్టుబడి (వార్షిక ఉత్పాదితంలో భాగం లేదా ఆ భాగంతో సమానమైన వార్షిక వ్యయంలోని భాగం) ఆ ఏడాదిలో వాస్తవంగా నియోగించబడి, ఉత్పాదకంగా వినియోగమైన మొత్తం దానిని బట్టి వార్షికంగా టర్నోవరైన అస్థిర పెట్టుబడి క, వార్షికంగా టర్నోవరైన అస్థిర పెట్టుబడి గ – ఈ రెండు సమానంగా వుంటే, అవి సమానమైన స్వయం విస్తరణ పరిస్థితుల్లో వినియోగించబడితే, ఆ రకంగా రెంటికీ అదనపు విలువ రేటు సమానమైతే, వార్షికంగా ఉత్పత్తి అయ్యే అదనపు విలువ పరిమాణం రెంటి విషయంలోనూ సమానంగా వుంటుంది. కాబట్టి, వినియోగించబడిన పెట్టుబడి మొత్తాలు కూడా సమానం అయినందువల్ల, అదనపు విలువ రేటును



$\frac{\text{ఏడాదిలో ఉత్పత్తయిన అదనపు విలువ పరిమాణం}}{\text{ఏడాదిలో టర్నోవరైన అస్థిర పెట్టుబడి}}$ వ్యక్తం చేస్తున్న మేరకు, ఒక ఏడాదిలో ఉత్పత్తైన అదనపు విలువ రేటు కూడా రెంటికీ సమానంగానే వుంటుంది. లేదా, దీన్ని సామాన్యీకరిస్తే, ఇలా వ్యక్తం చేయొచ్చు : టర్నోవరైన అస్థిర పెట్టుబడుల సాపేక్ష పరిమాణాలేమైనప్పటికీ, ఏడాదిలో అవి ఉత్పత్తి చేసిన అదనపు విలువ రేటు సగటు నియమిత కాలాల్లో (సగటున ఒక వారం లేదా ఒక రోజు అనుకుందాం) ఆయా పెట్టుబడులు ఏ అదనపు విలువ రేటుతో పనిచేస్తాయో ఆ రేటును బట్టి నిర్ణయమవుతుంది.

అదనపు విలువ ఉత్పత్తి నియమాలు, అదనపు విలువ రేటును నిర్ధారించే నియమాలు ఈ పర్యవసానానికి మాత్రమే దారితీస్తాయి.

ఇంతకు ముందు చెప్పినట్లుగా కేవలం అస్థిర పెట్టుబడిని మాత్రమే పరిగణనలోకి తీసుకుని,

$$\frac{\text{ఏడాదిలో టర్నోవర్ అయిన పెట్టుబడి}}{\text{అడ్వాన్స్ చేయబడిన పెట్టుబడి}}$$

అన్న నిష్పత్తి ఏమి వ్యక్తం చేస్తుందో చూద్దాం. ఈ భాగహారం ఒక ఏడాదిలో అడ్వాన్స్ చేయబడిన పెట్టుబడి టర్నోవర్‌ల సంఖ్యను చూపుతుంది.

పెట్టుబడి క విషయంలో ఇలా వుంటుంది.

$$\frac{\text{ఏడాదిలో టర్నోవర్ అయిన పెట్టుబడి 5,000 పౌండ్లు}}{\text{అడ్వాన్స్ చేయబడిన పెట్టుబడి 500 పౌండ్లు}}$$

పెట్టుబడి గ విషయంలో ఇలా వుంటుంది.

$$\frac{\text{ఏడాదిలో టర్నోవర్ అయిన పెట్టుబడి 5,000 పౌండ్లు}}{\text{అడ్వాన్స్ చేయబడిన పెట్టుబడి 5,000 పౌండ్లు}}$$

ఈ రెండు నిష్పత్తులలోనూ లవం అడ్వాన్స్ చేయబడిన పెట్టుబడిని టర్నోవర్ల సంఖ్యతో గుణించగా వచ్చిన ఫలితాన్ని వ్యక్తం చేస్తుంది. ఇది క విషయంలో $500 \times 10$, గ విషయంలో $5,000 \times 1$. లేదా దాన్ని వార్షిక టర్నోవర్ కాలాన్ని తిరగేసి దానితో గుణించవచ్చు. క విషయంలో ఏడాదిలో టర్నోవర్ కాలం $\frac{1}{10}$ సంవత్సరం. ఈ టర్నోవర్ కాలాన్ని తిరగవేస్తే $\frac{10}{1}$ సంవత్సరాలు అవుతుంది. కనుక $500 \times \frac{10}{1} = 5,000$. గ విషయంలో $5,000 \times \frac{1}{1} = 5,000$. హారం టర్నోవర్ అయిన పెట్టుబడిని టర్నోవర్‌ల సంఖ్యతో తిరగేసి గుణించగా వచ్చిన ఫలితం. క విషయంలో ఇది $5,000 \times \frac{1}{10}$, ఇది గ విషయంలో $5,000 \times \frac{1}{1}$ .

ఏడాదిలో టర్నోవర్ అయిన రెండు అస్థిర పెట్టుబడులు చలనంలో వుంచిన శ్రమ పరిమాణాలు (చెల్లించబడిన శ్రమ + చెల్లించబడని శ్రమ) ఈ ఉదాహరణలో సమానం. ఎందుకంటే టర్నోవర్ అయిన పెట్టుబడులు సమానం. వాటి స్వయం విస్తరణ రేట్లు కూడా సమానమే.

ఏడాదిలో టర్నోవర్ అయిన అస్థిర పెట్టుబడికి అడ్వాన్స్ చేయబడిన అస్థిర పెట్టుబడికి మధ్య నిష్పత్తి ఈ క్రింది విషయాలను తెలియజేస్తుంది. 1) ఒక నిర్దిష్ట పనికాలంలో అడ్వాన్స్ చేయాల్సిన పెట్టుబడికి, వినియోగించబడిన అస్థిర పెట్టుబడికి మధ్య నిష్పత్తి. క విషయంలోలాగా టర్నోవర్‌ల సంఖ్య పది అయితే, ఏడాదిలో 50 వారాలు వున్నాయనుకుంటే, అప్పుడు టర్నోవర్ కాలం 5 వారాలు అవుతుంది. ఈ 5 వారాలకు సరిపడా అస్థిర పెట్టుబడిని అడ్వాన్సు చేయాలి. ఈ 5

వారాలలో అడ్వాన్సు చేయబడిన అస్థిర పెట్టుబడి ఒక వారంలో వినియోగించబడే అస్థిర పెట్టుబడికి 5 రెట్లు వుండాలి. అంటే అడ్వాన్స్ చేయబడిన పెట్టుబడిలో (ఇక్కడ 500 పౌండ్లు) 5వ వంతు మాత్రమే ఒక వారంలో వినియోగించబడగలదు. కానీ పెట్టుబడి గ విషయంలో టర్నోవర్ కాలం ఒక సంవత్సరం లేదా యాభై వారాలు. టర్నోవర్‌ల సంఖ్య 1/1. కనుక అడ్వాన్స్ చేయబడని పెట్టుబడికి వారంలో వినియోగించబడే పెట్టుబడికి వున్న నిష్పత్తి 50:1. గ కూ అన్ని విషయాలూ క లాగే వుండి వుంటే, వారానికి 100 పౌండ్లకు బదులు 1,000 పౌండ్లు మదుపు పెట్టాల్సి వుంటుంది.

2) ఒకే పరిమాణంలోని అస్థిర పెట్టుబడిని చలనంలో ఉంచడం కోసం, అలాగే ఏడాదిలో ఒకే పరిమాణంలో అదనపు విలువను సృష్టించడం కోసం (అదనపు విలువ రేటు నిర్ణీతమైనప్పుడు) క పెట్టిన పెట్టుబడికంటే గ పది రెట్లు ఎక్కువ వినియోగించిందని తేలుతూంది. అదనపు విలువ వాస్తవ రేటు వ్యక్తం చేసేది, ఒక నిర్దిష్ట కాలంలో వినియోగించబడిన అస్థిర పెట్టుబడికి అదే కాలంలో ఉత్పత్తి చేయబడిన అదనపు విలువకి వున్న నిష్పత్తి తప్ప మరొకటి కాదు. లేదా ఈ కాలంలో వినియోగించబడిన అస్థిర పెట్టుబడి చలనంలో వుంచిన చెల్లించబడని శ్రమ పరిమాణం తప్ప మరొకటి కాదు. ఆ కాలంలో అడ్వాన్స్ చేయబడి, వినియోగించబడని అస్థిర పెట్టుబడి భాగంతో దానికేమాత్రం సంబంధం లేదు. అలాగే ఒక నిర్దిష్ట కాలంలో అడ్వాన్స్ చేయబడిన పెట్టుబడి భాగానికి, అదేకాలంలో వినియోగించబడిన పెట్టుబడి భాగానికి వున్న నిష్పత్తితో దానికి సంబంధం లేదు. ఆ నిష్పత్తి టర్నోవర్ కాలాన్ని బట్టి విభిన్న పెట్టుబడులకు విభిన్నంగా వుంటుంది.

పైన చెప్పిన దాన్నిబట్టి ఈ విషయం విదితమవుతుంది : వార్షిక అదనపు విలువ రేటు శ్రమను దోచుకొనే స్థాయిని తెలిపే వాస్తవ అదనపు విలువ రేటుతో ఒకే సందర్భంలో ఏకీభవిస్తుంది. అడ్వాన్స్ చేయబడిన పెట్టుబడి ఏడాదిలో ఒక్కసారి మాత్రమే టర్నోవర్ అయినప్పుడు, అడ్వాన్స్ చేయబడిన పెట్టుబడీ, ఏడాదిలో టర్నోవర్ అయిన పెట్టుబడీ సమానమవుతాయి. కనుక అప్పుడు ఏడాదిలో ఉత్పత్తి అయిన అదనపు విలువ పరిమాణానికీ, ఈ ఉత్పత్తిలో ఏడాదిలో వినియోగించబడిన పెట్టుబడికీ మధ్య నిష్పత్తి ఏడాదిలో ఉత్పత్తి అయిన అదనపు విలువ పరిమాణానికి ఏడాదిలో అడ్వాన్స్ చేయబడిన పెట్టుబడికీ మధ్య నిష్పత్తితో సమానమవుతుంది.

క) అదనపు విలువ వార్షిక రేటు

$$= \frac{\text{ఏడాదిలో ఉత్పత్తి అయ్యే అదనపు విలువ పరిమాణం}}{\text{అడ్వాన్స్ చేయబడిన అస్థిర పెట్టుబడి}}$$

అయితే ఏడాదిలో ఉత్పత్తి అయిన అదనపు విలువ పరిమాణం అదనపు విలువ వాస్తవ రేటును దాని ఉత్పత్తిలో వినియోగించబడిన అస్థిర పెట్టుబడితో గుణించగా వచ్చిన ఫలితంతో సమానం. అదనపు విలువ వార్షిక పరిమాణాన్ని ఉత్పత్తి చేయడంలో వినియోగించబడిన పెట్టుబడి – అడ్వాన్స్ చేయబడిన పెట్టుబడిని టర్నోవర్‌ల సంఖ్యతో (న) గుణించగా వచ్చే ఫలితంతో సమానం. కనుక సూత్రం క ఇలా మారుతుంది.

గ) అదనపు విలువ వార్షిక రేటు

$$= \frac{\text{అదనపు విలువ వాస్తవ రేటు} \times \text{అడ్వాన్స్ చేయబడిన అస్థిర పెట్టుబడి} \times \text{న}}{\text{అడ్వాన్స్ చేయబడిన అస్థిర పెట్టుబడి}}$$

ఉదాహరణకు పెట్టుబడి గ విషయంలో అది $100 \times 5{,}000 \times \frac{1}{5{,}000} = 100\%$· న 1తో సమానమైనప్పుడు మాత్రమే, అంటే అడ్వాన్స్ చేయబడిన అస్థిర పెట్టుబడి ఏడాదిలో ఒక్కసారి మాత్రమే టర్నోవర్ అయినప్పుడు, అంటే అది వినియోగించబడిన లేదా ఏడాదిలో టర్నోవర్ అయిన పెట్టుబడితో సమానమయినప్పుడు అదనపు విలువ వార్షిక రేటు దాని వాస్తవ రేటుతో సమానంగా వుంటుంది.

అదనపు విలువ వార్షిక రేటును వి' అనీ, అదనపు విలువ వాస్తవ రేటును వి అనీ, అడ్వాన్స్ చేయబడిన అస్థిర పెట్టుబడి పె అనీ, టర్నోవర్‌ల సంఖ్యను న అనీ పిలుద్దాం.

అప్పుడు వి' = $\frac{\text{వి} \times \text{పె} \times \text{న}}{\text{పె}}$ = వి న. మరోలా చెప్పాలంటే, న = 1 అయినప్పుడు మాత్రమే వి' = వి అవుతుంది. కాబట్టి వి' = 1×వి, లేక వి.

అంతేకాదు, అదనపు విలువ వార్షిక రేటు వి×న కి ఎప్పుడూ సమానంగా వుంటుంది. అంటే, ఒక నిర్దిష్ట కాలంలో వినియోగమైన అస్థిర పెట్టుబడి యొక్క టర్నోవర్ కాలంలో ఉత్పత్తి అయ్యే అదనపు విలువ యొక్క వాస్తవ రేటును ఒక ఏడాది కాలంలో ఈ అస్థిర పెట్టుబడి చేసే టర్నోవర్‌ల సంఖ్యతో గుణించగా వచ్చే ఫలితానికి సమానంగా వుంటుంది. ఒక సంవత్సరానికి లెక్కగట్టిన కాలాన్ని తిరగేస్తే వచ్చిన సంఖ్యతో గుణించగా అదే ఫలితం వస్తుంది. (అస్థిర పెట్టుబడి ఏడాదిలో పదిసార్లు టర్నోవర్ అయితే దాని టర్నోవర్ కాలం 1/10 సంవత్సరం. కనుక దాన్ని తిరగేస్తే 10 సంవత్సరాలు అవుతుంది)

న = 1 అయినప్పుడు, వి' = వి అని కూడా స్పష్టమవుతుంది. న 1 కంటే పెద్దదిగా వుంటే, వి కంటే వి' పెద్దదిగా వుంటుంది. అంటే ఏడాదిలో అడ్వాన్స్ చేయబడిన పెట్టుబడి ఒకసారికంటే ఎక్కువ టర్నోవర్ అయితే లేదా అడ్వాన్స్ చేయబడిన పెట్టుబడికంటే టర్నోవర్ అయిన పెట్టుబడి ఎక్కువగా వుంటే, అప్పుడు వి కంటే వి' పెద్దదిగా వుంటుంది.

ఆఖరు విషయం, న 1 కంటే చిన్నదిగా వున్నప్పుడు వి కంటే వి' చిన్నదిగా వుంటుంది. అడ్వాన్స్ చేయబడిన పెట్టుబడిలో ఏడాదిలో టర్నోవర్ అయిన పెట్టుబడి కేవలం ఒక భాగమైనప్పుడు, అంటే టర్నోవర్ కాలం ఏడాదికంటే ఎక్కువగా వున్నప్పుడు వి కంటే వి' చిన్నదిగా వుంటుంది.

ఈ చివరి అంశాన్ని వివరంగా పరిశీలిద్దాం.

ఇంతకు ముందు ఉదాహరణలో వున్న అంశాలన్నీ యధాతథంగా వున్నాయనుకొని, టర్నోవర్ కాలం మాత్రం 55 వారాలకు హెచ్చిందని ఊహించుకొందాం. శ్రమ ప్రక్రియలో ప్రతి వారం 100 పౌండ్ల అస్థిర పెట్టుబడి అవసరం. కనుక మొత్తం టర్నోవర్ కాలానికి 5,500 పౌండ్లు అవసరం. ప్రతి వారం అది 100 వి ని ఉత్పత్తి చేస్తుంది. కనుక మునుపటిలాగే వి = 100%. టర్నోవర్‌ల సంఖ్య (న) ఇక్కడ $\frac{50}{55}$ లేదా $\frac{10}{11}$. ఎందుకంటే టర్నోవర్ కాలం $1+\frac{1}{10}$ సంవత్సరాలు. లేదా $\frac{11}{10}$ సంవత్సరాలు.

$$\text{వి} = \frac{100\% \times 5{,}500 \times \frac{10}{11}}{5{,}500}$$

$$= 100 \times \frac{10}{11} = \frac{1000}{11} = 90\ \frac{10}{11}\ \%$$

కనుక ఇది 100% కంటే తక్కువ. ఒకవేళ వార్షిక అదనపు రేటు 100% అయితే, అప్పుడు ఏడాదిలో 5,500 పె 5,500 వి ని ఉత్పత్తి చేస్తుంది. కాని దానికి $\frac{10}{11}$ సంవత్సరాలు పడుతుంది. ఒక ఏడాదిలో 5,500 పె కేవలం 5,000 వి ని మాత్రమే ఉత్పత్తి చేస్తుంది. కనుక అదనపు విలువ వార్షిక రేటు $\frac{5,000 \text{ వి}}{5,500 \text{ వి}}$ లేదా $\frac{10}{11}$ లేదా $90\frac{10}{11}\%$

కనుక, అదనపు విలువ వార్షిక రేటు లేదా ఏడాదిలో ఉత్పత్తి అయిన విలువను సాధారణంగా అడ్వాన్స్ చేయబడిన అస్థిర పెట్టుబడితో (ఏడాదిలో టర్నోవర్ అయిన అస్థిర పెట్టుబడికి భిన్నంగా) పోల్చి చూడటం స్వీయాత్మకమైనది కాదు. పెట్టుబడి యొక్క వాస్తవ చలనమే ఇలా పోల్చి చూడటానికి కారణభూతమవుతోంది. పెట్టుబడి క యజమానికి సంబంధించినంత వరకూ అతను అడ్వాన్స్ చేసిన అదనపు పెట్టుబడి 500 పౌండ్లు ఏడాది చివర అతనికి తిరిగి రావడంతో పాటు 5,000 పౌండ్లు అదనపు విలువ కూడా అందుతోంది. ఏడాదిలో అతను వినియోగించిన పెట్టుబడి పరిమాణం గాక నిర్ణీత కాలానికొకసారి అతనికి తిరిగివచ్చే పెట్టుబడి పరిమాణం మాత్రమే అతను అడ్వాన్స్ చేసిన పెట్టుబడి పరిమాణాన్ని వ్యక్తం చేస్తుంది. ఏడాది చివర పెట్టుబడి ఉత్పాదక సరఫరాగా వుంటుందా లేక పాక్షికంగా డబ్బు పెట్టుబడి రూపంలోనో లేక సరుకు పెట్టుబడి రూపంలోనో ఉంటుందా, అది ఏ నిష్పత్తిలో ఈ విభిన్న భాగాలుగా విభజితమైంది అన్న విషయాలతో ఇక్కడ ప్రమేయం లేదు. పెట్టుబడి గ యజమానికి సంబంధించినంత వరకూ, అతను అడ్వాన్స్ చేసిన పెట్టుబడి 5,000 పౌండ్లు, మరో 5,000 పౌండ్లు అదనపు విలువతో పాటు తిరిగి వచ్చింది. పెట్టుబడి చ యజమానికి (చివరిలో పరిశీలించిన 5,500 పౌండ్లు) ఏడాదిలో 5,000 పౌండ్లు అదనపు విలువ ఉత్పత్తి అయింది. (5,000 పౌండ్లు మదుపు పెట్టబడింది. అదనపు విలువ రేటు 100%) అయితే అతను అడ్వాన్స్ చేసిన పెట్టుబడి గాని, ఉత్పత్తి అయిన అదనపు విలువ గాని ఇంకా తిరిగి రాలేదు.

ఒక టర్నోవర్ కాలంలో వినియోగించబడిన అస్థిర పెట్టుబడి యొక్క అదనపు విలువ రేటును, అంతే టర్నోవర్ కాలాల సంఖ్యతో $\frac{\text{ఒక టర్నోవర్ కాలంలో ఉత్పత్తి అయిన వి పరిమాణం}}{\text{ఒక టర్నోవర్ కాలంలో వినియోగించబడిన వి}}$ ని గుణించాలని, లేదా అడ్వాన్స్ చేయబడిన అస్థిర పెట్టుబడి యొక్క పునరుత్పత్తి కాలాల సంఖ్యతో, టర్నోవర్ చక్రంతో, అస్థిర పెట్టుబడి పునరుద్ధరణ కాలాల సంఖ్యతో గుణించాలని వి' = వి × న తెలియజేస్తోంది.

పెట్టుబడి విలువ తన టర్నోవర్ వలయంలో వివిధ దశలను గడుస్తూ మళ్ళీ ప్రారంభ స్థానానికి తిరిగి వస్తుంది. కనుక, అది వ్యయం కాలేదు, అడ్వాన్స్ చేయబడింది. అది తిరిగి వచ్చేటప్పుడు అదనపు విలువతో కలిసి వస్తుంది. ఈ స్వభావం వల్లనే అది అడ్వాన్స్ చేయబడ్డ పెట్టుబడి అవుతోంది. ఈ అంశాన్ని గురించి ఇంతకు ముందే పెట్టుబడి మొదటి సంపుటిలో భాగం II తో పాటు అధ్యాయం XXIIIలోనూ కూడా చర్చించబడింది. ఈ పెట్టుబడి తన ప్రారంభ స్థానం నుండి తిరిగి వచ్చేవరకూ పట్టే కాలం పెట్టుబడి అడ్వాన్స్ చేయబడిన కాలం. పెట్టుబడి విలువ నిర్వర్తించే మొత్తం వలయాకార గమనం – అది అడ్వాన్స్ చేయబడినప్పటినుండి తిరిగి వచ్చేదాకా పట్టిన కాలంతో కొలవబడుతున్న ఈ గమనం – దాని టర్నోవర్. దానికి పట్టే కాలమే టర్నోవర్ కాలం. ఈ కాలం ముగిసి, ఆవృత్తి పూర్తయినపుడు, అదే పెట్టుబడి విలువ అదే ఆవృత్తిని తిరిగి ప్రారంభిస్తుంది. కనుక కొత్తగా మళ్ళీ

విస్తరిస్తుంది. అదనపు విలువను సృష్టిస్తుంది. ఏడాదిలో పెట్టుబడి పదిసార్లు టర్నోవర్ అయితే (పెట్టుబడి క విషయంలోలాగా), అప్పుడు అడ్వాన్స్ చేయబడిన అదే పెట్టుబడి ఏడాది కాలంలో, ఒక్క టర్నోవర్ కాలంలో ఉత్పత్తి అయ్యే అదనపు విలువ పరిమాణానికి పది రెట్లు ఎక్కువ అదనపు విలువను సృష్టిస్తుంది.

ఈ అడ్వాన్స్ యొక్క స్వభావాన్ని గురించిన స్పష్టమైన భావన, పెట్టుబడిదారీ సమాజపు దృష్టి నుంచి లభిస్తుంది.

పెట్టుబడి క ఏడాదిలో పదిసార్లు టర్నోవర్ అవుతుంది. కనుక అది ఏడాదిలో పదిసార్లు అడ్వాన్స్ చేయబడుతుంది. ప్రతి కొత్త టర్నోవర్ కాలానికి కొత్తగా అడ్వాన్స్ చేయబడుతుంది. అదే సమయంలో ఏడాదిలో ఎప్పుడూ కూడా క ఈ 500 పౌండ్ల పెట్టుబడికంటే ఎక్కువ అడ్వాన్స్ చేయదు. ఉత్పాదక ప్రక్రియలో ఈ 500 పౌండ్లకు మించి పెట్టదు. ఈ 500 పౌండ్లు ఒక ఆవృత్తిని పూర్తి చేయగానే అదే ఆవృత్తిని మళ్ళీ ప్రారంభించేలా క చూస్తుంది. పెట్టుబడి వరుసగా జరిగే ఉత్పత్తి ప్రక్రియల్లో పెట్టుబడిగా ఎల్లప్పుడూ పని చేస్తుంది కాబట్టి అది స్వభావరీత్యానే తన పెట్టుబడి లక్షణాన్ని కాపాడుకొంటుంది. అంతేకాక, 5 వారాలకు మించి అది ఎప్పుడూ అడ్వాన్స్ చేయబడదు. టర్నోవర్ కాలం పెరిగితే అది సరిపోదు. టర్నోవర్ కాలం తగ్గితే అందులో ఒక భాగం అనవసరమవుతుంది. అడ్వాన్స్ చేయబడింది, 500 పౌండ్ల పెట్టుబడులు పది కాదు. 500 పౌండ్ల పెట్టుబడి ఒకటే ఆయా గడువుల్లో వరుసగా పదిసార్లు అడ్వాన్స్ చేయబడింది కనుక అదనపు విలువ వార్షిక రేటు 500 పౌండ్ల పెట్టుబడి యొక్క పది అడ్వాన్స్‌లకు గాక, అంటే 5,000 పౌండ్లపైన గాక 500 పౌండ్ల ఒక అడ్వాన్స్‌కు లెక్కగట్టడం జరుగుతుంది. ఒక షిల్లింగ్ పదిసార్లు చలామణి అవుతూనే, చలామణిలో ఎప్పుడూ ఒకే షిల్లింగ్‌కి మించి ప్రాతినిధ్యం వహించనట్టే ఇది కూడా. అది పది షిల్లింగ్‌ల పని నిర్వహించినప్పటికీ అంతే. కాని ప్రతిసారీ చేతులు మారిన తర్వాత అది ఒక జేబులోకి చేరినప్పుడు ఇంతకు ముందులాగే దాని విలువ ఒక షిల్లింగ్ వుంటుంది.

అదేవిధంగా, ప్రతిసారీ తిరిగి వచ్చినప్పుడల్లా, అలాగే ఏడాది చివర తిరిగి వచ్చినప్పుడు కూడా, పెట్టుబడి క, ఎప్పుడూ 500 పౌండ్ల అదే పెట్టుబడి విలువతో తన యజమాని పని నిర్వహించాడని సూచిస్తుంది. కనుక ప్రతిసారీ అతనికి తిరిగి వచ్చేది 500 పౌండ్లు మాత్రమే. అతను అడ్వాన్స్ చేసిన పెట్టుబడి ఎప్పుడూ 500 పౌండ్లకు మించి వుండదు. కనుక అడ్వాన్స్ చేయబడిన 500 పౌండ్ల పెట్టుబడి అదనపు విలువ వార్షిక రేటును వ్యక్తం చేసే భిన్నాంకంలో హారమవుతుంది. దానికి మనం ఇంతకు ముందు ఓ సూత్రం రూపొందించాము.

అది, వి' = $\frac{\text{వి పె న}}{\text{పె}}$ = వి న. అదనపు విలువ వాస్తవ రేటు వి = $\frac{\text{అ.వి.}}{\text{అ.పె.}}$ అంటే అస్థిర పెట్టుబడితో భాగించబడిన తదుత్పాదిత అదనపు విలువ పరిమాణానికి సమానం కనుక, మనం వి న లోని వి కి బదులు $\frac{\text{అ.వి.}}{\text{అ.పె.}}$ ని వాడవచ్చు. దాన్నిబట్టి మరో సూత్రం వస్తుంది. వి' = $\frac{\text{అ.వి.న.}}{\text{అ.పె.}}$

కాని, 500 పౌండ్ల పెట్టుబడి తన పది టర్నోవర్‌ల కారణంగా ఆ విధంగా పదిసార్లు అడ్వాన్స్ చేయబడడం వల్ల, దానికంటే పది రెట్లు పెద్దదైన 5,000 పౌండ్ల పెట్టుబడి చేసే పని చేస్తుంది. ఏడాదిలో పదిసార్లు చలామణి అయ్యే 500 షిల్లింగ్‌లు ఒకసారి చలామణి అయ్యే 5,000 షిల్లింగ్‌లతో సమానమైన పని చేసినట్లే ఇది కూడా.

## II. వ్యష్టి అస్థిర పెట్టుబడి టర్నోవరు

"సమాజంలో ఉత్పత్తి ప్రక్రియ రూపం ఏదైనప్పటికీ, ఆ ప్రక్రియ నిరంతరాయంగా ఉండాలి. అవే దశలను నిర్ణీత కాలానికోసారి గడుస్తూ ఉండాలి. దీన్ని పరస్పర సంబంధం గల అఖండ క్రమంగా ఎడతెగని పునరుద్ధరణలతో ప్రవహించేదిగా చూసినప్పుడు, ప్రతి సామాజిక ఉత్పత్తి ప్రక్రియ అదే సమయంలో ఒక పునరుత్పత్తి ప్రక్రియ కూడా.... అడ్వాన్స్ చేయబడిన పెట్టుబడిలో నిర్ణీత కాలానికోసారి వచ్చే పెరుగుదలగా, ప్రక్రియలోని పెట్టుబడి వల్ల నిర్ణీత కాలానికోసారి లభించే ప్రతిఫలంగా, అదనపు విలువ పెట్టుబడి నుంచి ప్రవహించే ఆదాయం యొక్క రూపం సంతరించు కుంటుంది" (పెట్టుబడి 1వ సంపుటి, అధ్యాయం XXI).

పెట్టుబడి క విషయంలో 5 వారాల టర్నోవరు కాలాలు 10 ఉన్నాయి. మొదటి టర్నోవరు కాలంలో 500 పౌండ్ల అస్థిర పెట్టుబడి అడ్వాన్స్ చేయబడింది. అంటే, ప్రతివారం 100 పౌండ్ల శ్రమశక్తిగా మారింది. మొదటి టర్నోవరు కాలం ముగిసేసరికి 500 పౌండ్లు శ్రమశక్తికై ఖర్చయ్యాయి. మొత్తం అడ్వాన్స్ చేయబడిన పెట్టుబడిలో మునుపు ఒక భాగమైన ఈ 500 పౌండ్లు ఇక పెట్టుబడిగా ఉండదు. ఆ మొత్తం వేతనాల కోసం చెల్లించబడింది. కార్మికులు దానిని జీవితావసర వస్తువుల కొనుగోలు కోసం ఖర్చు పెట్టారు. 500 పౌండ్ల జీవితావసర వస్తువులను వినియోగించుకొన్నారు. కనుక ఆ విలువతో సమానమైన పరిమాణంలో సరుకులు తుడిచిపెట్టుకుపోయాయి. (డబ్బు మొదలైన వాటి రూపంలో కార్మికుడు పొదుపు చేయగలిగినది సైతం పెట్టుబడి కాదు.) కార్మికునికి సంబంధించి నంత వరకు ఈ సరుకుల పరిమాణం, పెట్టుబడిదారునికీ ఓ తప్పనిసరి సాధనమైన అతని శ్రమశక్తి సామర్థ్యాన్ని కాపాడిన మేరకు తప్ప, అది అనుత్పాదకంగా వినియోగమైనట్టే.

కానీ, పెట్టుబడిదారుని విషయంలో ఈ 500 పౌండ్లు అదే విలువ గలిగిన (లేదా అదే ధర పలికే) శ్రమశక్తిగా మారిపోయాయి. శ్రమ ప్రక్రియలో అతడు శ్రమశక్తిని ఉత్పాదకంగా వినియోగం చేశాడు. 5 వారాల చివరిలో 1,000 పౌండ్ల ఉత్పాదితం సృష్టించబడింది. దీనిలో సగం 500 పౌండ్లు శ్రమశక్తి కోసం చెల్లించడానికి వెచ్చించబడిన అస్థిర పెట్టుబడి యొక్క పునరుత్పాదిత విలువ. మిగిలిన సగం 500 పౌండ్లు కొత్తగా ఉత్పత్తయిన అదనపు విలువ. కానీ అయిదు వారాల శ్రమశక్తి (ఈ శ్రమశక్తితో మార్పిడి చేసుకొనేందుకై పెట్టుబడిలో ఒక భాగం అస్థిర పెట్టుబడిగా మార్చబడింది.) ఉత్పాదకంగానే అయినా, అదే విధంగా వ్యయమైంది, వినియోగమయింది. నిన్న క్రియాశీలంగా వున్న శ్రమ, ఈనాడు క్రియాశీలంగా ఉన్న శ్రమ ఒకటి కావు. దాని విలువ, దానితోపాటు అది నిన్న సృష్టించిన అదనపు విలువ ఇప్పుడు శ్రమశక్తితో సంబంధం లేని ఒక వస్తువు యొక్క విలువగా, ఒక ఉత్పాదితంగా ఉంది. అయితే ఆ ఉత్పాదితాన్ని డబ్బుగా మార్చటం ద్వారా అడ్వాన్స్ చేయబడిన అస్థిర పెట్టుబడి విలువతో సమానమైన దాని విలువ భాగం మరోసారి శ్రమశక్తిగా మార్పిడి కావచ్చు. ఆ రకంగా మరోసారి అది అస్థిర పెట్టుబడిగా పని చేయవచ్చు. పునరుత్పత్తి అయిన పెట్టుబడి విలువ మాత్రమే కాకుండా, డబ్బు రూపంలోకి మారిన పెట్టుబడి విలువ కూడా అదే కార్మికుడిని, అదే శ్రమశక్తి కలిగిన వానిని, పనిలో పెడుతుంది అన్నది ఇక్కడ అప్రస్తుతం. పెట్టుబడిదారు రెండో టర్నోవరు కాలంలో వేరే కార్మికుల్ని నియమించడం కూడా సాధ్యమే.

కనుక వాస్తవంలో 10 ఐదు వారాల టర్నోవరు కాలాల్లో వరుసగా వేతనాల్లో వెచ్చించిన మొత్తం 500 పౌండ్లు కాదు. అది 5,000 పౌండ్లు. ఈ వేతనాలను కార్మికులు నిత్య జీవితావసర వస్తువులను కొనటానికై వెచ్చించారు. ఆ రకంగా వెచ్చించిన 5,000 పౌండ్ల పెట్టుబడి వినియోగమైంది. అది ఇకలేదు. మరోవైపున, వరుసగా ఉత్పాదక ప్రక్రియలో అంతర్భాగంగా చేరినది, 500 పౌండ్ల విలువ గల శ్రమశక్తి కాదు. అది 5,000 పౌండ్ల విలువ గల శ్రమశక్తి. అది తన సొంత విలువ 5,000 పౌండ్లను మాత్రమే ఉత్పత్తి చేయదు. అంతకు మించి మరో 5,000 పౌండ్ల అదనపు విలువను ఉత్పత్తి చేస్తుంది. రెండో టర్నోవరు కాలంలో అడ్వాన్స్ చేయబడిన 500 పౌండ్ల అస్థిర పెట్టుబడీ, మొదటి టర్నోవరు కాలంలో అడ్వాన్సు చేయబడిన 500 పౌండ్ల పెట్టుబడీ ఒకటి కావు. మొదటిది వేతనాల్లో ఖర్చయి, వినియోగమయింది. దాని స్థానాన్ని 500 పౌండ్ల కొత్త అస్థిర పెట్టుబడి భర్తీ చేస్తుంది. ఈ కొత్త మొత్తం మొదటి టర్నోవర్ కాలంలో సరుకుల రూపంలో ఉత్పత్తి అయి, తిరిగి డబ్బు రూపంలో కూర్చబడినదే. కనుక ఈ కొత్త డబ్బు పెట్టుబడి 500 పౌండ్లూ మొదటి టర్నోవర్ కాలంలో ఉత్పత్తయిన సరుకుల పరిమాణానికి డబ్బు రూపం. మునుపటిలాంటి 500 పౌండ్లు మరోసారి పెట్టుబడిదారి చేతుల్లో ఉండటం అనే వాస్తవం, అంటే, అదనపు విలువ కాకుండా, అతడు మునుపు అడ్వాన్స్ చేసినంతటి డబ్బు పెట్టుబడే అతని చేతిలో వుండటం, అతడు కొత్తగా ఉత్పత్తయిన పెట్టుబడితో పని నిర్వహిస్తున్నాడన్న సంగతిని దాస్తుంది. (సరుకు పెట్టుబడి విలువకు సంబంధించిన ఇతర భాగాలు పెట్టుబడి యొక్క స్థిర భాగాలను భర్తీ చేస్తాయి. వాటి విలువ కొత్తగా ఉత్పత్తి కాదు, ఈ విలువ అస్తిత్వ రూపం మాత్రం మారింది.)

మూడో టర్నోవరు కాలం తీసుకుందాం. ఇక్కడ మూడోసారి అడ్వాన్స్ చేయబడిన 500 పౌండ్ల పెట్టుబడి పాతది కాదు. కొత్తగా ఉత్పత్తయిన పెట్టుబడి. రెండో టర్నోవరు కాలంలో ఉత్పత్తయిన సరుకుల పరిమాణానికి అది డబ్బు రూపం. అంతేగాని మొదటి టర్నోవరు కాలంలో ఉత్పత్తయిన దాని డబ్బు రూపం కాదు. అంటే ఈ సరుకుల పరిమాణంలో, అడ్వాన్స్ చేయబడిన అస్థిర పెట్టుబడికి సమానమైన భాగం యొక్క డబ్బు రూపమన్నమాట. మొదటి టర్నోవరు కాలంలో ఉత్పత్తయిన సరుకుల పరిమాణం అమ్మబడింది. అడ్వాన్స్ చేయబడిన పెట్టుబడి యొక్క విలువలోని అస్థిర భాగానికి సమానమైన విలువ భాగం రెండవ టర్నోవరు కాలంలో కొత్త శ్రమశక్తిగా రూపాంతరం చెందింది. అది కొత్త సరుకుల పరిమాణాన్ని ఉత్పత్తి చేసింది. ఆ సరుకులు అమ్మబడ్డాయి. దాని విలువలోని ఒక భాగం మూడో టర్నోవరు కాలంలో అడ్వాన్స్ చేయబడిన 500 పౌండ్ల పెట్టుబడిగా వుంటుంది.

ఇలాగే 10 టర్నోవరు కాలాల్లోనూ జరుగుతుంది. ఈ క్రమంలో కొత్తగా ఉత్పత్తి చేయబడిన పరిమాణాల్లోని సరుకులు (అవి అస్థిర పెట్టుబడి స్థానంలో ప్రవేశిస్తాయి కనుక వాటి విలువ కూడా కొత్తగా ఉత్పత్తి అవుతుందే కాని పెట్టుబడిలో స్థిర చలామణి భాగంలాగా కేవలం పునఃప్రత్యక్షం కావు.) ఉత్పత్తి ప్రక్రియలోకి ఎప్పటికప్పుడు కొత్త శ్రమశక్తిని చేర్చటం కోసం, ప్రతి 5 వారాలకోసారి మార్కెట్లోకి నెట్టబడతాయి.

కనుక అడ్వాన్స్ చేయబడిన 500 పౌండ్ల అస్థిర పెట్టుబడి నిర్వర్తించే పది టర్నోవర్లు సాధించేది, ఈ 500 పౌండ్లను 10సార్లు ఉత్పాదకంగా వినియోగం చేయగలగటం కాదు. 5 వారాలకు సరిపడే

అస్థిర పెట్టుబడిని 50 వారాలపాటు పనిలో ఉంచగలగటం కూడా కాదు. 500 పౌండ్లకు పది రెట్లున్న అస్థిర పెట్టుబడి 50 వారాల్లో వినియోగించబడింది. 500 పౌండ్ల పెట్టుబడి కేవలం 5 వారాలకు మాత్రమే సరిపోతుంది. ప్రతి 5 వారాల చివర కొత్తగా ఉత్పత్తయిన 500 పౌండ్ల పెట్టుబడితో దాన్ని భర్తీ చేయవలసి వుంటుంది. ఇది పెట్టుబడి క, గ లకు సమానంగా వర్తిస్తుంది. అయితే ఈ అంశం దగ్గర తేడా ప్రారంభమవుతుంది.

మొదటి 5 వారాల కాలం చివరిలో 500 పౌండ్ల అస్థిర పెట్టుబడిని గ, కలు రెండూ అడ్వాన్స్ చేశాయి; ఖర్చు చేశాయి. క, గలు రెండూ దాని విలువను శ్రమశక్తిగా మార్చాయి. ఈ శ్రమశక్తి కొత్తగా సృష్టించిన ఉత్పాదితం యొక్క విలువ భాగంతో దాన్ని భర్తీ చేశాయి. అది అడ్వాన్స్ చేయబడిన 500 పౌండ్ల అస్థిర పెట్టుబడి విలువతో సమానం. గ, కలు రెంటికీ శ్రమశక్తికి వ్యయమైన అస్థిర పెట్టుబడి 500 పౌండ్లను దానికి సమానమైన విలువతో భర్తీ చేయటం మాత్రమే కాక, అదనపు విలువను కూడా జోడించింది. మన ఊహ ప్రకారం జోడించబడిన అదనపు విలువ పరిమాణం కూడా అంతే.

అయితే గ విషయంలో అడ్వాన్స్ చేయబడిన అస్థిర పెట్టుబడిని భర్తీ చేసి, దానికి అదనపు విలువను జోడించే విలువ – ఉత్పాదితం మళ్ళీ ఉత్పాదకంగా పని చేయగలిగిన రూపంలో లేదా అస్థిర పెట్టుబడి రూపంలో వుండదు. కానీ క విషయంలో అది ఆ రూపంలో ఉంది. గ విషయంలో, మొదటి 5 వారాల్లో లేదా ఆ తరువాత 5 వారాల్లో ఖర్చు చేయబడిన అస్థిర పెట్టుబడి మళ్ళీ ఉత్పాదకంగా పని చేయగలిగిన రూపంలో లేదా అస్థిర పెట్టుబడి రూపంలో ఏడాది చివరి వరకూ ఉండదు. (వ్యయమైన అస్థిర పెట్టుబడి స్థానాన్ని కొత్తగా ఉత్పత్తి అయిన విలువ, అదనపు విలువ, ఆ రెండూ భర్తీ చేసినప్పటికీ, అవి తిరిగి అస్థిర పెట్టుబడిగా పని చేయగల రూపంలో వుండవు.) దాని విలువను కొత్త విలువ భర్తీ చేసినమాట నిజమే. ఆ విలువను పునరుద్ధరించిన మాటా నిజమే. కాని ఆ విలువ రూపాన్ని (అంటే డబ్బు రూపాన్ని) అది పునరుద్ధరించదు.

రెండో 5 వారాల కాలానికి (అలాగే ఏడాదిలో ఉన్న మిగిలిన 5 వారాల కాలానికీ) మొదటి కాలంలో లాగానే మరో 500 పౌండ్లు ప్రతిసారీ లభ్యం కావాలి. పరపతి పరిస్థితులతో ప్రమేయం లేకుండా, ఏడాది ప్రారంభంలోనే అడ్వాన్స్ చేయబడగల ద్రవ్య పెట్టుబడిగా 5,000 పౌండ్లు సిద్ధంగా వుండాలి. అవి ఏడాది పొడుగునా కేవలం క్రమేణా మాత్రమే వ్యయమైన శ్రమశక్తిగా మార్చబడినా, అవి సిద్ధంగా వుండవలసిందే.

క విషయంలో ఈ ఆవృత్తి అంటే, అడ్వాన్స్ చేయబడిన పెట్టుబడి టర్నోవర్ పూర్తయింది కనుక, 5 వారాల మొదటి కాలం ముగిసిన తరువాత, ఆ పెట్టుబడి స్థానాన్ని భర్తీ చేసే విలువ మరో 5 వారాల కాలం కొత్త శ్రమశక్తిని చలనంలో ఉంచే రూపంలో, దాని మొదటి రూపమైన డబ్బు రూపంలో సిద్ధంగా ఉంటుంది.

క, గ లు రెంటి విషయంలోనూ రెండో 5 వారాల కాలంలో కొత్త శ్రమశక్తి వినియోగమైంది. ఈ శ్రమశక్తికి చెల్లించడం కోసం కొత్త పెట్టుబడి 500 పౌండ్లు వ్యయమైంది. కార్మికుల నిత్య జీవితావసర వస్తువులకు 500 పౌండ్లు చెల్లించబడ్డాయి. ఆ వస్తువులు అయిపోయాయి. ఏ రకంగా చూసినా వాటి విలువ పెట్టుబడిదారుడి చేతుల్నుంచి మాయమైంది. రెండో 500 పౌండ్లతో కొత్త

శ్రమశక్తి కొనబడింది. కొత్త జీవితావసర వస్తువులు మార్కెట్ నుంచి ఉపసంహరించబడ్డాయి. క్లుప్తంగా చెప్పాలంటే, ఇప్పుడు వ్యయం చేస్తున్నది పాత పెట్టుబడి కాదు. అది 500 పౌండ్ల కొత్త పెట్టుబడి. అయితే క విషయంలో ఈ కొత్త పెట్టుబడి 500 పౌండ్లు. ఇంతకు ముందు వెచ్చించబడిన 500 పౌండ్ల విలువకు కొత్తగా ఉత్పత్తయిన ప్రత్యామ్నాయం యొక్క డబ్బు రూపం మాత్రమే. కాగా గ విషయంలో ఈ ప్రత్యామ్నాయం అస్థిర పెట్టుబడిగా వ్యవహరించలేని రూపంలో వుంది. అది అక్కడ వుంది. అయితే అస్థిర పెట్టుబడి రూపంలో మాత్రం కాదు. ఉత్పత్తి ప్రక్రియ తరువాత 5 వారాలలో కొనసాగాలంటే, మరో 500 పౌండ్ల అదనపు పెట్టుబడి లభ్యం కావాలి, దాన్ని డబ్బు రూపంలోనే అడ్వాన్స్ చేయాలి. ఆ రకంగా 50 వారాల కాలంలో క, గ లు రెండూ సమాన మొత్తంలో అస్థిర పెట్టుబడిని వ్యయం చేశాయి. సమానంగా చెల్లించి, సమాన పరిమాణంలో శ్రమశక్తిని వినియోగం చేశాయి. అయితే గ తన మొత్తం విలువ 5,000 పౌండ్లకు సమానమైన పెట్టుబడిని అడ్వాన్స్ చేయాలి. కాగా, క ప్రతి 5 వారాలకూ అడ్వాన్స్ చేసిన 500 పౌండ్లు, ఆ 5 వారాల్లో ఉత్పత్తి చేసే విలువ – ప్రత్యామ్నాయం ఎప్పటికప్పుడు తిరిగి ధరించే డబ్బు రూపంలో వేతనాలు చెల్లిస్తుంది. ఇక్కడ 5 వారాలకు అవసరమైన దానికంటే ఎక్కువ డబ్బు పెట్టుబడి ఏ సందర్భంలోనూ అడ్వాన్స్ చేయబడదు. అంటే మొదటి 5 వారాల్లో అడ్వాన్స్ చేసిందానికంటే, అనగా 500 పౌండ్లకంటే ఎప్పుడూ ఎక్కువ చెల్లించడం జరగదు. ఈ 500 పౌండ్లే ఏడాదికంతటికీ సరిపోతాయి. కనుక శ్రమ దోపిడీ స్థాయీ, అదనపు విలువ వాస్తవ రేటూ సమానంగా ఉన్నప్పుడు క, గల అదనపు విలువ వార్షిక రేట్లు ఏడాది పొడుగునా ఒకే మొత్తంలో శ్రమశక్తిని చలనంలో ఉంచడం కోసం అడ్వాన్స్ చేయబడే అస్థిర డబ్బు పెట్టుబడుల పరిమాణాలకు విలోమానుపాతంలో ఉండాలనేది స్పష్టమే.

$$\text{క} : \frac{5{,}000 \text{ అ.వి.}}{500 \text{ అ.పె}} = 1{,}000\%$$

$$\text{గ} : \frac{5{,}000 \text{ అ.వి.}}{5{,}000 \text{ అ.పె}} = 100\%$$

కాని 500 అ.పె. : 5,000 అ.పె. = 1:10 = 100% : 1,000%

ఈ తేడా టర్నోవరు కాలాల్లో వచ్చిన తేడాని బట్టి తలెత్తింది. అంటే, ఒక నిర్దిష్ట కాలానికి వినియోగించిన అస్థిర పెట్టుబడి యొక్క విలువ ప్రత్యామ్నాయం మళ్ళీ పెట్టుబడిగా, కనుక, సరికొత్త పెట్టుబడిగా పనిచేసే కాలాల్లోని తేడా వల్ల తలెత్తిందన్న మాట. గ విషయంలోనూ, క విషయంలోనూ ఒకే కాలాలలో వినియోగించబడిన అస్థిర పెట్టుబడి విలువ – ఒకేలా భర్తీ అయింది. అదే కాలాల్లో అదనపు విలువ పెరుగుదల కూడా అంతే ఉంది. కానీ, గ విషయంలో ప్రతి 5 వారాలకూ ఒకసారి 500 పౌండ్ల విలువ, 500 పౌండ్ల అదనపు విలువ భర్తీ అయినా, ఈ విలువ ప్రత్యామ్నాయం కొత్త పెట్టుబడిగా ఉండదు. ఎందుకంటే ఇది డబ్బు రూపంలో లేదు. క విషయంలో పాత పెట్టుబడి స్థానాన్ని కొత్త పెట్టుబడి భర్తీ చేయడమే కాక, దాన్ని డబ్బు రూపంలో యథాస్థితికి తెచ్చింది. కనుక అది ఒక కొత్త పెట్టుబడిగా తన పాత్ర నిర్వహించగలిగిన రీతిలో దాని స్థానాన్ని భర్తీ చేసింది.

ఈ విలువ ప్రత్యామ్నాయం డబ్బుగా మారటం, అంటే – అస్థిర పెట్టుబడి అడ్వాన్స్ చేయబడిన రూపంలోకి మారటం త్వరగా జరుగుతుందా లేక ఆలస్యంగా జరుగుతుందా అనేది అదనపు విలువ ఉత్పత్తికి సంబంధించిన మేరకు అప్రస్తుతమని కనిపిస్తూనే వుంది. అదనపు విలువ ఉత్పత్తి

వినియోగించబడే అస్థిర పెట్టుబడి పరిమాణంపైన, శ్రమ దోపిడి స్థాయిపైన ఆధారపడి వుంటుంది. అయితే విలువ ప్రత్యామ్నాయం డబ్బుగా మారడానికి పట్టే కాలం, ఒక నిర్దిష్ట పరిమాణం గల శ్రమశక్తిని ఏడాదిలో చలనంలో ఉంచడానికై అడ్వాన్సు చేయాల్సిన డబ్బు పెట్టుబడి పరిమాణాన్ని ప్రభావితం చేస్తుంది. కనుక అది అదనపు విలువ వార్షిక రేటుని నిర్ణయిస్తుంది.

## III. సమాజం దృష్టి నుంచి అస్థిర పెట్టుబడి టర్నోవరు

ఈ విషయాన్ని ఒక క్షణం, సమాజం దృష్టి నుంచి పరిశీలిద్దాము. ఒక కార్మికుని ఒక వారం వేతనం 1 పౌండు అనీ, పనిదినం 10 గంటలనీ అనుకొందాం. క, గ లు రెంటి విషయంలోనూ ఏడాది పొడుగునా 100 మంది కార్మికులు పనిలో నియమితులయ్యారు. (వారానికి 100 మంది కార్మికులకు 100 పౌండ్లు లేదా 5 వారాలకు 500 పౌండ్లు లేదా 50 వారాలకు 5,000 పౌండ్లు వేతనం) వారిలో ప్రతి ఒక్కరూ వారానికి 6 రోజుల చొప్పున 60 గంటలు పని చేస్తారు. కనుక 100 మంది కార్మికులు వారానికి 6,000 గంటలు పని చేస్తారు. 50 వారాల్లో 5,00,000 గంటలు పని చేస్తారు. ఈ శ్రమశక్తిని క, గలు ఉపయోగిస్తున్నాయి. కనుక వాటిని సమాజం మరోరకంగా వినియోగించలేదు. ఈ మేరకు సామాజికంగా చూస్తే ఇది క, గ ల విషయంలో ఒకటే. అంతేకాదు, క, గలు రెంటి విషయంలోనూ పనిలో నియుక్తులైన కార్మికుల సంఖ్య 100. వారికి ఏడాదికి 5 వేల పౌండ్ల చొప్పున లభిస్తుంది. (లేదా మొత్తం 200 మంది కార్మికులకు 10,000 పౌండ్లు లభిస్తాయి) ఆ మేరకు వారు మార్కెట్ నుండి నిత్యజీవితావసర వస్తువులను తీసేసుకుంటారు. ఇంతవరకు, సమాజానికి సంబంధించి క, గల విషయంలో తేడా ఏమీ లేదు. ఎందుకంటే, ఈ రెండు ఉదాహరణల్లోనూ కార్మికులకు వారానికోసారి వేతనం లభిస్తుంది. వారానికోసారి వారు సమాజం నుండి జీవితావసర వస్తువుల్ని తీసేసుకుంటారు. రెండు సందర్భాల్లోనూ సమానమైన మొత్తాల్లో డబ్బును చలామణిలో ఉంచుతారు. కాని ఇక్కడే తేడా మొదలవుతుంది.

***మొదటిది :*** క కార్మికుడు చలామణిలోకి నెట్టిన డబ్బు గ కార్మికుని విషయంలోలాగా, అతని శ్రమశక్తి విలువకు డబ్బు రూపం మాత్రమే కాదు. (అప్పటికే నిర్వహించబడిన శ్రమకి అది చెల్లింపు సాధనం) రెండో టర్నోవర్ కాలం మించి లెక్కించగా అది అతని సొంత విలువ యొక్క డబ్బు రూపం (అంటే శ్రమశక్తి ధర + అదనపు విలువ). అది మొదటి టర్నోవర్ కాలంలో సృష్టించబడింది. దానితోనే రెండో టర్నోవర్ కాలంలో అతని శ్రమకు చెల్లించడం జరిగింది. అయితే గ కార్మికుని విషయంలో అలా కాదు. గ కి సంబంధించినంత వరకు, కార్మికుడు అప్పటికే చేసిన పనికిగాను చెల్లింపు సాధనంగా డబ్బు ఉన్న మాట నిజమే. అయితే జరిగిన పనికి, అది స్వయంగా ఉత్పత్తి చేసినట్టి, డబ్బు రూపంలోకి మారినట్టి విలువతో చెల్లించబడలేదు. (శ్రమ స్వయంగా ఉత్పత్తి చేసిన విలువ యొక్క డబ్బు రూపంతో చెల్లించబడలేదు.) రెండో సంవత్సరం మొదలయ్యేదాకా అలా జరగదు. గ కార్మికుడు మొదటి సంవత్సరంలో ఉత్పత్తి చేసిన విలువ డబ్బుగా మారేది అప్పుడు మాత్రమే.

పెట్టుబడి టర్నోవర్ కాలం ఎంత తక్కువ ఉంటే (కనుక ఏడాది పొడుగునా అది పునరుత్పత్తి చేయడానికి అవసరమైన కాల వ్యవధులు ఎంత తక్కువగా ఉంటే) డబ్బు రూపంలో పెట్టుబడిదారులు

మొదట అడ్వాన్స్ చేసిన అస్థిర పెట్టుబడి భాగం, ఈ అస్థిర పెట్టుబడిని భర్తీ చేయడానికి కార్మికుడు సృష్టించిన విలువ (అదనపు విలువ కూడా) అంత త్వరగా డబ్బు రూపంలోకి మారుతుంది. పెట్టుబడిదారు తన సొంత నిధుల్నుండి డబ్బును అడ్వాన్స్ చేయాల్సిన కాలం కూడా అంత తక్కువగా ఉంటుంది. నిర్ణీత ఉత్పత్తి స్థాయికి అనుగుణంగా అతడు అడ్వాన్స్ చేసిన పెట్టుబడి అతి తక్కువగా ఉంటుంది. నిర్ణీత అదనపు విలువ రేటుతో ఒక ఏడాదిలో అతను పొందగలిగిన అదనపు విలువ పరిమాణం సాపేక్షంగా అంత ఎక్కువగా వుంటుంది. ఎందుకంటే కార్మికుణ్ణి, అతడే సృష్టించిన విలువ యొక్క డబ్బు రూపంతోనే అంత తరచుగా పెట్టుబడిదారు కొనవచ్చు. అంత తరచుగా అతని శ్రమని మళ్ళీ చలనంలో ఉంచవచ్చు.

ఉత్పత్తి స్థాయి నిర్ణీతమైతే, టర్నోవరు కాలం ఏ నిష్పత్తిలో తగ్గిందో అదే నిష్పత్తిలో అడ్వాన్స్ చేయబడిన అస్థిర డబ్బు పెట్టుబడి (మొత్తం చలామణి పెట్టుబడి) యొక్క మొత్తం పరిమాణం తగ్గుతుంది. కాగా అదనపు విలువ వార్షిక రేటు పెరుగుతుంది. అడ్వాన్స్ చేయబడిన పెట్టుబడి పరిమాణం నిర్ణీతమై వుంటే ఉత్పత్తి స్థాయి పెరుగుతుంది. కాబట్టి అదనపు విలువ రేటు నిర్ణీతమైతే, ఒక టర్నోవరు కాలంలో సృష్టించబడిన అదనపు విలువ మొత్తం పరిమాణం, పునరుత్పత్తి కాల వ్యవధులు తగ్గటం వల్ల పెరిగిన అదనపు విలువ వార్షిక రేటుతో పాటుగా పెరుగుతుంది. ఒకే పరిమాణంలోని ఉత్పాదక చలామణి పెట్టుబడిని, ఒకే పరిమాణంలోని శ్రమని, ఒకే శ్రమ దోపిడీ స్థాయిలో చలనంలో ఉంచడానికి, టర్నోవర్ కాలాల విభిన్న పరిమాణాల కారణంగా విభిన్న మొత్తాలలో డబ్బు పెట్టుబడి అడ్వాన్స్ చేయాల్సి వస్తుందని పై పరిశీలన వల్ల, మొత్తంపై నిర్ధారణ అవుతుంది.

***రెండోది :*** ఇది మొదటి తేడాతో అంతస్సంబంధమున్న అంశం. గ, క కార్మికులు, తమ చేతుల్లో చలామణి సాధనంగా మారిన అస్థిర పెట్టుబడితో తాము కొనే జీవితావసర వస్తువులకు డబ్బు చెల్లిస్తారు. ఉదాహరణకు వారు మార్కెట్ నుంచి గోధుమలు ఉపసంహరించటమే కాక దానికి సమానమైన విలువ గల డబ్బుతో మార్కెట్‌లో వాటి స్థానాన్ని భర్తీ చేస్తారు. అయితే గ కార్మికుడు మార్కెట్ నుంచి తీసేసుకున్న తన జీవితావసర వస్తువుల కోసం చెల్లించే డబ్బు క కార్మికునిలాగా తాను సృష్టించి, మార్కెట్‌లోకి నెట్టిన విలువ యొక్క డబ్బు రూపం కాదు. జీవితావసరాల అమ్మకందారు నికి డబ్బు సరఫరా చేస్తాడు. కానీ సరుకులు సరఫరా చేయడు. (అవి, ఉత్పత్తి సాధనాలు కావచ్చు, నిత్య జీవితావసర వస్తువులూ కావచ్చు.) జీవితావసర వస్తువుల అమ్మకందారు వాటి అమ్మకం ద్వారా వచ్చిన డబ్బుతో కొనటానికి, గ ఉత్పత్తి చేసిన సరుకులు ఇంకా మార్కెట్‌లో లేవు (క విషయంలో లాగా). కనుక మార్కెట్ నుంచి శ్రమశక్తి, ఆ శ్రమశక్తి కవసరమైన జీవితావసర వస్తువులు, గ విషయంలో వినియోగమైన శ్రమ పరికరాల రూపంలోని స్థిర పెట్టుబడి, ఉత్పత్తి పదార్థాలు తొలగించ బడ్డాయి. వాటిని భర్తీ చేయడానికి, సమాన విలువ గల డబ్బు మార్కెట్‌లోకి నెట్టబడింది. అయితే ఆ సంవత్సరం మార్కెట్ నుంచి ఉపసంహరించబడిన ఉత్పాదక పెట్టుబడి యొక్క పాదార్థిక అంశాలను భర్తీ చేయడానికి కొత్త ఉత్పాదితం ఇంకా మార్కెట్‌లోకి నెట్టబడలేదు. సమాజం పెట్టుబడిదారీ సమాజం కాదనీ, కమ్యూనిస్టు సమాజమనీ ఊహిద్దాం. అప్పుడు మొదటి విషయం, డబ్బు పెట్టుబడి అనేదేమీ ఉండదు. దానివల్ల తలెత్తే లావాదేవీలను కప్పిపుచ్చే మారురూపాలు ఉండవు. అప్పుడు సమాజం

ముందున్న సమస్య ఇది : చాలా కాలం వరకూ ఎటువంటి ఉత్పత్తి సాధనాలనూ, జీవితావసర వస్తువులనూ సమకూర్చనట్టి, ఉపయోగకరమైన ఫలితాన్ని ఇవ్వనట్టి, రైల్వే నిర్మాణం లాంటి వ్యాపార శాఖలు తమ నిర్మాణ సందర్భంగా మొత్తం వార్షిక ఉత్పత్తి నుంచి శ్రమను, ఉత్పత్తి సాధనాలను, జీవితావసర వస్తువుల్ని లాగివేస్తుండగా, వాటికి ముందుగానే ఎంత శ్రమను, ఎన్ని ఉత్పత్తి సాధనాలను, ఎన్ని నిత్య జీవితావసర వస్తువుల్ని తనకు నష్టం కలగని విధంగా మదుపు పెట్టగలదో సమాజం ముందుగానే లెక్కగట్టవలసి వుంటుంది; అయితే పెట్టుబడిదారీ సమాజంలో పుణ్యకాలం అయిపోయాకే సమాజ ఇంగిత జ్ఞానం నిలదొక్కుకుంటుంది. కనుక నిరంతరాయంగా పెద్ద పెద్ద కుదుపులు తప్పవు. ఒకవైపున డబ్బు మార్కెట్‌పైన ఒత్తిడి పడుతుంది. మరొకవైపున తేలిగ్గా డబ్బు దొరికే మార్కెట్ వల్ల, దీర్ఘకాలం తర్వాత గాని ఉత్పత్తినివ్వని పరిశ్రమలు పెద్ద ఎత్తున స్థాపితమవుతాయి. దానివల్ల తిరిగి డబ్బు మార్కెట్‌పైన ఉత్తరోత్తరా ఒత్తిడి పెరిగే పరిస్థితులు తలెత్తుతాయి. దీర్ఘకాలంపాటు నిరంతరాయంగా పెద్ద మొత్తాలలో డబ్బు పెట్టుబడులను ఇక్కడ అడ్వాన్స్ చేయాలి కనుక డబ్బు మార్కెట్‌పైన ఒత్తిడి పెరుగుతుంది. పారిశ్రామికవేత్తలు, వ్యాపారులు తమ వ్యాపారానికవసరమైన డబ్బు పెట్టుబడిని సట్టా వ్యాపారం లాంటి రైల్వే పథకాలు, వగైరాలకు వాడేసి, ఆ లోటును పూడ్చుకోవడానికి డబ్బు మార్కెట్ నుంచి అరువు తెచ్చుకుంటారనే దానితో నిమిత్తం లేకుండానే ఈ ఒత్తిడి పెరుగుతుంది.

మరోవైపున సమాజంలో లభించే ఉత్పాదక పెట్టుబడిపై ఒత్తిడి పెరుగుతుంది. ఉత్పాదక పెట్టుబడి అంశాలు మార్కెట్ నుండి వైదొలగుతుంటాయి. వాటి స్థానంలో, సమానమైన డబ్బు మాత్రమే వచ్చి పడుతుంటుంది. కనుక తగిన సరఫరాని సృష్టించకుండా గిరాకీ పెరుగుతుంది. ఫలితంగా ఉత్పాదక పదార్థాలు, నిత్యజీవితావసర వస్తువుల ధరలు పెరుగుతాయి. దీనికి తోడు స్టాక్ ఎక్స్ఛేంజి లావాదేవీలు మామూలు వ్యవహారమవుతాయి. దీనితో పెట్టుబడి పెద్ద ఎత్తున బదిలీ అవుతుంటుంది. సట్టా వ్యాపారులు, కాంట్రాక్టర్లు, ఇంజనీర్లు, లాయర్లు తదితరుల్లో ఒక ముఠా బాగా డబ్బు గడిస్తుంది. వారివల్ల మార్కెట్లో వినియోగ సరుకులకు విపరీతమైన గిరాకీ ఏర్పడుతుంది. అదే సమయంలో వేతనాలు పెరుగుతాయి. ఆహార పదార్థాలకు సంబంధించినంత మేరకు వ్యవసాయానికి కూడా ప్రోద్బలం లభిస్తుంది. అయితే ఏడాదిలో ఆ ఆహార పదార్థాల సరఫరాను హఠాత్తుగా పెంచలేరు కాబట్టి వాటి దిగుమతులు పెరుగుతాయి. అలాగే విలాస వస్తువులు, కాఫీ, పంచదార, ద్రాక్ష సారాయి వంటి విదేశీ వస్తువుల దిగుమతులు కూడా పెరుగుతాయి. కనుక మితిమీరిన దిగుమతులు, దాంతో పాటు దిగుమతి వ్యాపారంలో కూడా సట్టా వ్యాపారం మొదలవుతుంది. ఈలోగా త్వరితగతిన ఉత్పత్తి విస్తరించడానికి వీలున్న పారిశ్రామిక శాఖల్లో (గనులు, వస్తూత్పత్తి వగైరాల్లో), ధరల పెరుగుదల వల్ల విస్తరణ ఆకస్మికంగా జరుగుతుంది. అంత ఆకస్మికంగా అవి కుప్పకూలిపోతాయి. శ్రమ మార్కెట్లో కూడా అదే జరుగుతుంది. సాపేక్షంగా అదనమైన జనాభా నుంచి పెద్ద సంఖ్యలో కార్మికులను, అప్పటికే ఉద్యోగాల్లో ఉన్నవారిని సైతం కొత్త వ్యాపార శాఖలు ఆకర్షిస్తాయి. సాధారణంగా రైల్వేల్లాంటి భారీ పరిశ్రమలు శ్రమ మార్కెట్ నుండి నిర్దిష్ట పరిమాణంలో శ్రమశక్తిని పరిగ్రహిస్తాయి. బలమైన యువకులు మాత్రమే అవసరమయ్యే వ్యవసాయం లాంటి శాఖల నుండి మాత్రమే ఆ శ్రమశక్తి లభ్యం కాగలదు. కొత్త పరిశ్రమలు సువ్యవస్థిత వ్యాపార శాఖలుగా మారి, వాటి కవసరమైన సంచార

కార్మిక వర్గం సృష్టించబడిం తర్వాత కూడా, రైల్వే నిర్మాణం వంటి వాటి స్థాయిలో సగటుకు మించిన తాత్కాలిక పెరుగుదల సందర్భంగా జరిగినట్లే, శ్రమ మార్కెట్ నుంచి శ్రమశక్తి ఉపసంహరింప బడుతూనే వుంటుంది. వేతనాల తగ్గుదలకు అంతవరకు కారణభూతమైన రిజర్వు కార్మిక సైన్యంలో ఒక భాగానికి అలా పనులు దొరుకుతాయి. మంచి పనుల్లో వున్న శ్రామిక విభాగాలక్కూడా సర్వత్రా వేతనాలు పెరుగుతాయి. పరిశ్రమలు అనివార్యంగా మళ్ళీ కుప్పకూలి, రిజర్వు కార్మిక దళాలు పనుల నుండి నెట్టివేయబడే వరకు ఈ పరిస్థితి కొనసాగుతూనే వుంటుంది. వారి నెట్టివేతతో వేతనాలు కనీస స్థాయికి, అంతకన్నా తక్కువ స్థాయికీ పడిపోతాయి.[1]

టర్నోవరు కాల పరిమాణం – అది పెద్దదైనా, చిన్నదైనా – అసలు పని కాలాన్ని బట్టి వుంటుంది. అంటే ఉత్పాదితాన్ని మార్కెట్‌కి సిద్ధం చేయడానికి అవసరమైన కాలంపై ఆధారపడి వుంటుంది. కాబట్టి పెట్టుబడి వివిధ మదుపులకు ప్రత్యేకమైన ఆనాటి ఉత్పత్తి పాదార్థిక పరిస్థితులపైన ఇది ఆధారపడుతుంది. వ్యవసాయంలో ఈ పరిస్థితులు ఎక్కువగా, ఉత్పత్తికి సంబంధించిన ప్రకృతి పరిస్థితుల స్వభావాన్ని సంతరించుకుంటాయి. కర్మాగార వస్తూత్పత్తిలోనూ, గనుల పరిశ్రమలోని అత్యధిక భాగంలోనూ అవి ఉత్పత్తి ప్రక్రియ సామాజికంగా అందుకొన్న అభివృద్ధి స్థాయిని బట్టి మారుతుంటాయి.

పనికాల పరిమాణం సరఫరా పరిమాణాన్ని బట్టి (అంటే, ఉత్పాదితం సాధారణంగా మార్కెట్‌లోకి సరుకులుగా నెట్టబడే పరిమాణాన్ని బట్టి) ఉంటుంది కాబట్టి అది సాంప్రదాయక స్వభావం గలది. అయితే ఆ సంప్రదాయానికి గల ప్రాతిపదిక కూడా ఉత్పత్తి స్థాయిని బట్టి ఉంటుంది. కనుక విడిగా పరిశీలించినపుడు మాత్రమే అది యాదృచ్ఛికమైనదిగా కనిపిస్తుంది.

**చివరి అంశం :** టర్నోవరు కాల పరిమాణం చలామణి పరిమాణంపై ఆధారపడినది. కాబట్టి, కొంతవరకు అది, నిరంతరం మారే మార్కెట్ పరిస్థితులపైన ఆధారపడి వుంటుంది. అంటే విక్రయ సౌలభ్య తరతమ స్థాయిలపై ఆధారపడి వుంటుంది. ఫలితంగా, ఉత్పాదితంలో కొంత భాగం దగ్గర లేదా దూరపు మార్కెట్లలో అమ్మవలసిన ఆవశ్యకతపై ఆధారపడి వుంటుంది. మొత్తంమీద గిరాకీ పరిమాణం ఒక్కటే కాకుండా, ఇక్కడ ధరల గమనం కూడా చాలా ప్రధానమైనది. ఎందువల్లనంటే,

---

1. రాతప్రతిలో, తర్వాత వివరించడం కోసం ఉద్దేశించిన ఈ కింది నోట్ వుంది. "పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానంలోని వైరుధ్యం : సరుకుల కొనుగోలుదారులుగా కార్మికులు మార్కెట్‌కు ముఖ్యం. కానీ తమ సొంత సరుకు అయిన శ్రమశక్తి అమ్మకందార్లుగా వారిని, పెట్టుబడిదారీ సమాజం కనీస ధరకు లభ్యమయ్యే స్థితిలో తొక్కిపెట్ట చూస్తుంది.
మరో వైరుధ్యం : పెట్టుబడిదారీ ఉత్పత్తి తన శక్తులన్నిటినీ ఒడ్డిన కాలాలన్నీ అమితోత్పత్తి కాలాలుగా మారతాయి. ఎందుకంటే, ఎక్కువ విలువ ఉత్పత్తి కావడం మాత్రమే కాక, అది డబ్బు రూపంలో తిరిగి చేతికందేటంత స్థాయిలో ఉత్పత్తి శక్తులు ఎన్నటికీ వినియోగించబడజాలవు. కానీ సరుకుల అమ్మకం, అంటే సరుకు పెట్టుబడి, అలాగే అదనపు విలువ డబ్బుగా చేతికందడం ఏ పరిమితిలో ఉండాలో నిర్ణయించేది మొత్తం సమాజం యొక్క వినియోగదారీ అవసరాలు కాదు; అత్యధిక సంఖ్యాక ప్రజలు ఎల్లప్పుడూ పేదలుగానే వుండే, పేదలుగా ఉండక తప్పని సమాజం యొక్క వినియోగదారీ అవసరాలు ఆ పరిమితిని నిర్ణయిస్తాయి. కానీ ఈ విషయం ఈ సంపుటిలోని తరువాతి విభాగానికి సంబంధించినది."

ధరలు పడిపోతుంటే అమ్మకాలు ఉద్దేశపూర్వకంగా పరిమితం చేయబడతాయి కానీ, ఉత్పత్తి కొనసాగుతూనే వుంటుంది. అలాగే ధరలు పెరుగుతున్నప్పుడు ఉత్పత్తి అమ్మకాలు పెరుగుతూనే వుంటాయి. లేదా ముందుగా అమ్మకాలకు ఒప్పందాలు జరిగిపోతాయి. అయితే ఉత్పత్తి కేంద్రానికి మార్కెట్ ఎంత దూరంలో వుందనేదాన్ని వాస్తవమైన పాదార్థిక పునాదిగా పరిగణించాలి.

ఉదాహరణకు ఇంగ్లీషు నూలు వస్త్రాలు లేదా నూలు ఇండియాకి అమ్ముతున్నారు. ఎగుమతి దారుడే ఇంగ్లీషు వస్త్ర పారిశ్రామికవేత్తకి చెల్లిస్తాడనుకుందాం. (డబ్బు మార్కెట్ బలంగా ఉన్నప్పుడు మాత్రమే ఎగుమతిదారుడు అలా నిస్సంకోచంగా చేస్తాడు. అయితే పరిశ్రమ యజమాని స్వయంగా తన డబ్బు పెట్టుబడిని ఏదో ఒక పరపతి లావాదేవీల్తో భర్తీ చేసినపుడు విషయాలింత సాఫీగా వుండవు.) ఎగుమతిదారుడు తన నూలు వస్త్రాలను తరువాత ఇండియన్ మార్కెట్లో అమ్ముతాడు. అతడు అడ్వాన్స్ చేసిన డబ్బు తిరిగి అతనికి ఆ మార్కెట్ నుంచి వస్తుంది. ఇలా తిరిగి వచ్చేంత వరకు వ్యవహారం, ఉత్పత్తి ప్రక్రియను ఒక నిర్ణీత స్థాయిలో కొనసాగించడానికి పనికాల పరిమాణం వల్ల కొత్త డబ్బు పెట్టుబడి అడ్వాన్స్ చేయవలసి వచ్చిన సందర్భంలో నడిచినట్లుగానే నడుస్తుంది. పారిశ్రామికవేత్త కార్మికులకు చెల్లించడానికీ, తన చలామణి పెట్టుబడి యొక్క ఇతర అంశాలను పునరుద్ధరించడానికీ ఉపయోగించే డబ్బు పెట్టుబడి అతడు ఉత్పత్తి చేసిన నూలు యొక్క డబ్బు రూపం కాదు. ఇండియా నుంచి ఇంగ్లాండ్‌కు ఈ నూలు యొక్క విలువ డబ్బు రూపంలోగాని, ఉత్పాదితాల రూపంలోగాని తిరిగి రానంతవరకు, అలా ఉండదు. అది ఇంతకు ముందులాగానే అదనపు డబ్బు పెట్టుబడి. ఇక్కడ తేడా ఏమంటే దాన్ని పారిశ్రామికవేత్త అడ్వాన్స్ చేయడానికి బదులు వ్యాపారవేత్త అడ్వాన్స్ చేశాడు. ఆ వ్యాపారి దాన్ని తన పరపతి కార్యకలాపాల ద్వారా పొంది ఉండవచ్చు. అదేవిధంగా, ఈ డబ్బు మార్కెట్‌లోకి నెట్టబడక ముందు లేదా నెట్టబడటంతో పాటు, ఈ డబ్బుతో కొనదగిన లేదా ఉత్పాదిత రంగంలోగాని, వ్యక్తిగత వినియోగంలోగాని ప్రవేశించగలిగిన అదనపు ఉత్పాదితమేదీ ఇంగ్లీషు మార్కెట్‌లో ఉంచబడలేదు. ఈ పరిస్థితి చాలా కాలంపాటు, చాలా విస్తృత స్థాయిలో కొనసాగితే పని కాలాన్ని పొడిగించటం వల్ల ఎటువంటి ప్రభావం కలుగుతుందో అటువంటి ప్రభావమే కలుగుతుంది. దీన్నింతకు ముందు వివరించాం.

ఇండియాలో నూలు పరపతి ప్రాతిపదికన అమ్మబడి ఉండవచ్చు. ఈ పరపతితో ఇండియాలో ఉత్పాదితాలను కొని ఓడ తిరుగు ప్రయాణంలో ఇంగ్లండుకు పంపవచ్చు. లేదా ఈ మొత్తానికి డ్రాఫ్టులు రావచ్చు. ఈ పరిస్థితి ఎక్కువ కాలం కొనసాగితే, ఇండియాలోని డబ్బు మార్కెట్టుపైన ఒత్తిడి పెరుగుతుంది. ఇంగ్లండుపైన దాని ప్రభావం ఇక్కడ సంక్షోభాన్ని సృష్టించవచ్చు. ఈ సంక్షోభం, ఒకవేళ ఇండియాకి వెండి, బంగారాల ఎగుమతితో ముడిపడి ఉన్నప్పటికీ, ఇండియన్ బ్యాంకుల నుంచి రుణం తీసుకున్న ఇంగ్లీషు సంస్థలు, వాటి ఇండియన్ శాఖలు దివాళా తీయటం వల్ల ఒక కొత్త సంక్షోభం ఇండియాలో కూడా తలెత్తవచ్చు. ఆ రకంగా విదేశీ ఎగుమతి దిగుమతుల తేడా అనుకూలంగా వున్న దేశం మార్కెట్‌లోనూ, అది ప్రతికూలంగా వున్న దేశం మార్కెట్‌లోనూ, ఒకేసారి సంక్షోభం రావచ్చు. ఈ పరిణామం మరింత సంక్లిష్టం కూడా కావచ్చు. ఇంగ్లండు వెండిని ఇండియాకు పంపిందని అనుకుందాం. అయితే ఇంగ్లీషు రుణదాతలు ఇప్పుడు ఆ దేశంలో తమ బాకీలను

తక్షణమే వసూలు చేస్తున్నారు. అప్పుడు ఇండియా వెంటనే తన వెండిని తిరిగి ఇంగ్లండుకు పంపవలసి వుంటుంది.

ఇండియాతో జరిగే ఎగుమతి వ్యాపారం, దిగుమతి వ్యాపారం దాదాపు సమతూకంలో ఉండే వీలుంది. పత్తి కొరత లాంటి ప్రత్యేక పరిస్థితుల్లో మినహా, దిగుమతి వ్యాపార పరిమాణాన్ని ఎగుమతి వ్యాపారం నిర్ణయించడానికి ప్రోద్బలమిచ్చినప్పటికీ అలా వుండే వీలుంది. ఇంగ్లండు, ఇండియాల మధ్య వాణిజ్యం సమతూకంలో ఉండినట్లు కనిపించవచ్చు. లేదా అందులో కొద్దిపాటి ఎగుడుదిగుడులు అటో ఇటో వుండవచ్చు. కానీ ఇంగ్లండులో సంక్షోభం తలెత్తగానే, అమ్ముబడని నూలూ, నూలు వస్త్రాలూ ఇండియాలో నిలువ ఉన్నాయని (కనుక సరుకు పెట్టుబడి నుంచి అది డబ్బు పెట్టుబడిగా మారలేదని, ఆ మేరకు అది అమితోత్పత్తి అని) తేలిపోతోంది. మరోవైపున, ఇంగ్లండులో అమ్మకంగాని ఇండియన్ సరుకుల సరఫరా నిలువ ఉందని, అంతేగాక, చాలావరకు అమ్మబడిన, వినియోగమైన సరఫరాలకు చెల్లిచటం జరగలేదని విదితమవుతుంది. కనుక, డబ్బు మార్కెట్‌లో సంక్షోభంగా కనిపించేది, వాస్తవంలో, ఉత్పత్తి, పునరుత్పత్తి క్రమాల్లోనే వున్న అసాధారణ పరిస్థితుల వ్యక్తీకరణే.

**మూడు :** వినియోగించబడిన (స్థిర, అస్థిర) చలామణి పెట్టుబడికి సంబంధించిన మేరకు, టర్నోవర్ కాల పరిమాణం పనికాలం నుంచి నిష్పన్నమైనది కనుక అది ఈ భేదానికి దారితీస్తోంది; ఒక ఏడాదిలో అనేక టర్నోవర్లు జరిగే సందర్భంలో, అస్థిర, స్థిర చలామణి పెట్టుబడి యొక్క ఒక అంశం దాని సొంత ఉత్పాదితం నుంచే సరఫరా కావచ్చు. ఉదాహరణకు, బొగ్గు ఉత్పత్తి, రెడీమెడ్ వస్త్రాల వ్యాపారం వగైరాలు. ఇతర సందర్భాల్లో ఇలా జరగదు, కనీసం ఆ ఏడాదిలో జరగదు.

★ ★ ★

# అధ్యాయం - 17

# అదనపు విలువ చలామణి

వార్షికంగా ఉత్పత్తయిన మొత్తం అదనపు విలువ ఒకే పరిమాణంలోనే ఉన్నప్పటికీ, టర్నోవరు కాలంలో తేడా వల్ల ఆ అదనపు విలువ వార్షిక రేటులో తేడా వస్తుందని మనమింతకు ముందే గమనించాము.

అయితే, అదనపు విలువ రేటు యధాతథంగా ఉన్నప్పటికీ అదనపు విలువ పెట్టుబడిగా మారటంలో, పెట్టుబడి సంచయనంలో, ఏడాదిలో ఉత్పత్తయ్యే అదనపు విలువ పరిమాణంలో కూడా ఆవశ్యంగా తేడాలున్నాయి.

మొదటి విషయం. క పెట్టుబడికి (మునుపటి అధ్యాయంలోని ఉదాహరణల్లో) నిర్ణీత కాలానికోసారి లభించే ఆదాయం ఉంది. ఫలితంగా వ్యాపారం ప్రారంభించే టర్నోవర్ కాలాన్ని మినహాయిస్తే, మిగిలిన కాలాల్లో తన సొంత వినియోగాన్ని ఏడాదిలో అదనపు విలువ ఉత్పత్తి ద్వారా అదే చెల్లిస్తుంది. తన సొంత నిధులలోనుంచి అదనపు మొత్తాలను అది అడ్వాన్సు చేయాల్సిన అవసరం లేదు. అయితే గ విషయంలో అలా అదనపు అడ్వాన్సుల్ని చేయక తప్పదు. అదే నిర్ణీత వ్యవధుల్లో అది క ఉత్పత్తి చేసినంత అదనపు విలువను ఉత్పత్తి చేస్తుంది. అయితే ఆ అదనపు విలువ డబ్బుగా ఆ వ్యవధుల్లో చేతికందదు. కనుక అది ఉత్పాదకంగా గానీ, వ్యక్తిగతంగా గానీ వినియోగం అయ్యే వీలు లేదు. వ్యక్తిగత వినియోగానికి సంబంధించినంత మేరకు అదనపు విలువ లభిస్తుందని ముందే తెలుసు. దాని కోసం నిధులను అడ్వాన్స్ చేయాల్సి ఉంది.

ఉత్పాదక పెట్టుబడిలో ఒక భాగాన్ని వర్గీకరించడం కష్టం. అదేమంటే, నిశ్చల పెట్టుబడి మరమ్మతులకు, దాన్ని మంచి స్థితిలో ఉంచేందుకు అవసరమైన అదనపు పెట్టుబడి. దాన్ని కూడా ఇప్పుడు కొత్త దృష్టితో చూస్తారు.

క విషయంలో, పెట్టుబడిలోని ఈ భాగం ఉత్పత్తి ప్రారంభంలో మొత్తంగా కాని, అత్యధిక భాగంగా కాని అడ్వాన్స్ చేయబడదు. అప్పటికి అది అందుబాటులో ఉండవలసిన అవసరం లేదు. అది అసలే ఉండవలసిన అవసరం కూడా లేదు. అదనపు విలువను పెట్టుబడిగా నేరుగా మార్చడం వల్ల, అంటే దాన్ని పెట్టుబడిగా నేరుగా వినియోగించడం వల్ల అది వ్యాపారం నుంచే లభ్యమవుతుంది. నిర్ణీత కాలానికి ఒకసారి సృష్టించబడటమే కాక, ఏడాది కాలంలో డబ్బుగా చేతికందే అదనపు విలువలో ఒక భాగం మరమ్మతులు వగైరాలకు ఖర్చు చేయవచ్చు. వ్యాపారం తన తొలి స్థాయిలో కొనసాగడానికి అవసరమైన పెట్టుబడిలోని ఒక భాగం వ్యాపార క్రమంలోనే, వ్యాపారం చేతనే, అదనపు విలువలో ఒక భాగాన్ని పెట్టుబడిగా మార్చడం ద్వారా ఉత్పత్తి అవుతుంది. ఇది గ విషయంలో

అసాధ్యం. దాని విషయంలో ఈ పెట్టుబడి భాగం మొదట అడ్వాన్స్ చేయబడిన పెట్టుబడిలో ఒక భాగంగా ఉండాలి. ఈ రెండు సందర్భాల్లోనూ పెట్టుబడిదారుల ఖాతా పుస్తకాలలో ఈ భాగం అడ్వాన్స్ చేయబడిన పెట్టుబడిగానే గుర్తించబడుతుంది. వాస్తవానికి అది అలాంటిదే. ఎందుకంటే, మన ఊహ ప్రకారం వ్యాపారం ఒక నిర్దిష్ట స్థాయిలో కొనసాగటం కోసం అవసరమైన ఉత్పాదక పెట్టుబడిలో అది ఒక భాగమవుతుంది. అయితే ఈ భాగం ఏ నిధుల నుండి అడ్వాన్స్ చేయబడుతుంది అన్న అంశానికి చాలా ప్రాముఖ్యముంది. గ విషయంలో మొదట అడ్వాన్స్ చేయబడాల్సిన లేదా అందుబాటులో ఉంచుకొన్న పెట్టుబడిలో ఇది వాస్తవంగా ఒక అంతర్భాగం. మరోవైపున క విషయంలో పెట్టుబడిగా ఉపయోగించబడిన అదనపు విలువలో అది ఒక భాగం. కేవలం సంచితమైన పెట్టుబడి మాత్రమే కాక, మొదట అడ్వాన్స్ చేయబడిన పెట్టుబడిలో ఒక భాగం సైతం, పెట్టుబడిగా మార్చబడిన అదనపు విలువే కావచ్చునన్న సంగతిని ఈ ఆఖరి విషయం తెలియజేస్తుంది.

పరపతి వ్యవస్థ అభివృద్ధి జోక్యం కలిగించుకోగానే, మొదట అడ్వాన్స్ చేయబడిన పెట్టుబడికి, పెట్టుబడిగా మారిన అదనపు విలువకు మధ్య సంబంధం మరింత సంక్లిష్టమవుతుంది. ఉదాహరణకు తొలిదశలోనే క తనకు తగినంత పెట్టుబడి లేకపోవడం వల్ల చ అనే బ్యాంకర్ నుంచి ఉత్పాదక పెట్టుబడిలో ఒక భాగాన్ని అప్పు తీసుకొంటాడు. దానితో అతడు వ్యాపారం ప్రారంభిస్తాడు లేదా సంవత్సరం పొడవునా కొనసాగిస్తాడు. ఈ మొత్తం డబ్బు, పెట్టుబడిదారులు ట, త, ప వగైరా తన వద్ద డిపాజిట్ చేసిన అదనపు విలువ నుంచి ఆ బ్యాంకర్ తీసి యిచ్చినదే. క కు సంబంధించినంత వరకు, అప్పటికి ఇంకా పెట్టుబడి సంచితమయ్యే సమస్యే లేదు. ట, త, ప మొదలైన వారికి సంబంధించినంత వరకు, క అనే వ్యక్తి, వారు స్వాయత్తం చేసుకొన్న అదనపు విలువను పెట్టుబడిగా మార్చే ఒక ఏజెంటు మాత్రమే.

సంచయనం లేదా అదనపు విలువను పెట్టుబడిగా మార్చడం అన్నది, ప్రధానంగా, రాను రాను అధికాధిక స్థాయిలో కొనసాగే పునరుత్పత్తి ప్రక్రియ మాత్రమే; అది మనం ఇంతకు ముందు (మొదటి సంపుటి, 24వ అధ్యాయంలో) చూశాము. ఈ విస్తరణ ఫ్యాక్టరీలకు కొత్త ఫ్యాక్టరీలను జోడించటం ద్వారా, విస్తృత రూపంలో వ్యక్తం కావచ్చు. లేదా ఉన్న కార్యకలాపాల స్థాయిని పెంచడం ద్వారా సాంద్రరూపంలో వ్యక్తం కావచ్చు.

ఉత్పత్తి స్థాయి విస్తరణ చిన్న చిన్న భాగాలలో జరగవచ్చు. ఇందుకు శ్రమ ఉత్పాదక శక్తిని కేవలం పెంచేందుకు లేదా అదే సమయంలో మరింత తీవ్రస్థాయిలో శ్రమను దోచుకునేందుకు అనుమతించే మెరుగుదలల కోసం అదనపు విలువలో ఒక భాగాన్ని ఉపయోగించవచ్చు. లేదా పనిదినం చట్టబద్ధంగా పరిమితం కానపుడు, చలామణి పెట్టుబడి యొక్క అదనపు వ్యయం (ఉత్పత్తి పదార్థాల పైన, వేతనాల పైన పెట్టే వ్యయం) నిశ్చల పెట్టుబడిని విస్తరించకుండానే ఉత్పత్తి స్థాయిని పెంచడానికి సరిపోతుంది. ఇక్కడ నిశ్చల పెట్టుబడి రోజూ వినియోగించే కాలపరిమితి మాత్రమే పెంచబడింది. కాగా దాని టర్నోవర్ కాలం తదనుగుణంగా తగ్గుతుంది. లేదా పెట్టుబడిగా మార్చబడిన అదనపు విలువ, మార్కెట్ పరిస్థితులు అనుకూలంగా ఉన్నప్పుడు, ముడి పదార్థాలలో సట్టా వ్యాపారానికి అవకాశమివ్వచ్చు. ఇంకా ఇలాంటివి జరగవచ్చు. మొదట అడ్వాన్స్ చేయబడిన పెట్టుబడి అటువంటి కార్యకలాపాలకు చాలివుండేది కాదు.

టర్నోవర్ కాలాల సంఖ్య పెరిగినప్పుడు ఏడాదిలో అదనపు విలువ మరింత తరచుగా డబ్బు రూపంలో తిరిగి చేతికందుతుంది. అటువంటి సందర్భాలలో పనిదినాన్ని పొడిగించేందుకు గానీ, ఆయా ప్రత్యేక అంశాలలో మెరుగుదలలు ప్రవేశపెట్టేందుకు గానీ వీలులేని కాల వ్యవధులు ఉంటాయి. మరోవైపున మొత్తం ఫ్యాక్టరీని, ఉదాహరణకు భవనాలను విస్తరించడం ద్వారా కొంతవరకు, వ్యవసాయంలోనైతే సాగు నేలలను విస్తరించడం ద్వారా కొంతవరకు, మొత్తం వ్యాపారాన్ని తదనుగుణంగా విస్తరింపజేయడం దాదాపు బహు కొద్దిపాటి పరిమితుల్లోనే సాధ్యం. అంతేకాదు దీనికి అవసరమైన అదనపు పెట్టుబడి అనేక సంవత్సరాల అదనపు విలువ సంచయనం ద్వారా మాత్రమే సాధ్యం.

వాస్తవ సంచయనం లేదా అదనపు విలువ ఉత్పాదక పెట్టుబడిగా మారటం అన్నదానితో పాటు (దాని కనుగుణం అయిన పునరుత్పత్తి మరింత విస్తృతమయిన స్థాయిలో జరగటంతో పాటు), డబ్బు సంచయనం కూడా జరుగుతుంది. అది అదనపు విలువలో నుంచి జమచేసి ఉంచిన భాగం; ఒక పరిమాణానికి పెరగనంత కాలం అదనపు క్రియాశీల పెట్టుబడిగా పని చేయడానికి ఉద్దేశించిన భాగం. అంతవరకు అది ముమ్ముందు డబ్బు పెట్టుబడి కాగల రూపంలో ఉంటుంది.

విడి పెట్టుబడిదారుని దృష్టిలో, ఈ విషయం కనిపించే తీరు ఇదీ. కానీ పెట్టుబడిదారీ ఉత్పత్తి అభివృద్ధితో పాటు పరపతి వ్యవస్థ కూడా అభివృద్ధి చెందుతుంది. పెట్టుబడిదారు తన సొంత వ్యాపారంలో ఇక ఉపయోగించలేని డబ్బు పెట్టుబడి ఇతరులచేత వినియోగించబడుతుంది. దీని వినియోగానికి గాను వారు అతనికి వడ్డీ చెల్లిస్తారు. అతనికది తన ప్రత్యేక అర్థంలో డబ్బు పెట్టుబడిగా పనిచేస్తుంది. అంటే ఉత్పాదక పెట్టుబడికి భిన్నమైన పెట్టుబడిగా వ్యవహరిస్తుంది. అయితే అది ఇతరులకు పెట్టుబడిగా ఉపయోగపడుతుంది. అదనపు విలువ మరింత తరచుగా తిరిగి చేతికందడం వల్ల, అది ఉత్పత్తి అయ్యే స్థాయికి పెరగటం వల్ల, కొత్త డబ్బు పెట్టుబడి నిష్పత్తి పెరుగుతుంది. అంటే, డబ్బు మార్కెట్‌లోనికి పెట్టుబడిగా నెట్టబడి, విస్తృత ఉత్పత్తికి మొత్తంగానో లేదా ప్రధాన భాగమో వినియోగమయ్యే డబ్బు నిష్పత్తి పెరుగుతుంది.

అదనపు డబ్బు పెట్టుబడి కాగలిగినదాని అతి సాధారణ రూపానికి నిల్వ డబ్బు ప్రతీక. ఈ నిల్వ డబ్బు విలువైన లోహాలు ఉత్పత్తి చేసే దేశాలతో జరిగిన మార్పిడిలో ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా పొందిన అదనపు వెండి, బంగారాలు కావచ్చు. ఈ విధంగా మాత్రమే ఒక దేశంలో ఉన్న నిల్వ డబ్బు నిరపేక్షంగా పెరుగుతుంది. మరోవైపున చాలా సందర్భాలలో ఈ నిల్వ డబ్బు స్వదేశంలో చలామణి రంగం నుంచి ఉపసంహరించబడి, విడి పెట్టుబడిదారుల చేతులలో నిల్వ డబ్బుగా రూపొందినది కావచ్చు. అధిక సందర్భాల్లో అది అలాంటిదే. డబ్బు పెట్టుబడి కాగలిగినది కేవలం విలువ ప్రతీకల రూపంలో ఉండవచ్చు. (ఈ సందర్భంలో మనం ఇంకా పరపతి డబ్బుని పరిగణనలోకి తీసుకోవడం లేదు.) లేదా తమకు ఇతరులు చెల్లించాల్సి ఉన్న మొత్తం విషయంలో ఆయా పెట్టుబడి దారులకు గల చట్టబద్ధమైన హక్కుపత్రాల రూపంలో ఉండవచ్చు. ఇటువంటి సందర్భాలన్నింటిలోను, ఈ అదనపు డబ్బు పెట్టుబడి యొక్క అస్తిత్వ రూపం ఏమైనప్పటికీ, అది భావి పెట్టుబడిగా, వార్షిక అదనపు సామాజిక ఉత్పత్తిపై పెట్టుబడిదారులకు నిల్వలో ఉన్న, చట్టబద్ధమైన అదనపు హక్కులకు ప్రతీకలు తప్ప మరొకటి లేదు.

"పరిమాణం రీత్యా వాస్తవ సంచిత సంపద రాశి, సమాజ ఉత్పత్తి శక్తులతో పోల్చి చూస్తే లెక్కకురానంత స్వల్పమైనది. అది ఏ నాగరికతా దశలోని సమాజమైనా అంతే. కొన్ని సంవత్సరాల్లో ఆ సమాజ వినియోగం పోల్చి చూసినా అది అంత స్వల్పమైనదే. కనుక శాసనకర్తలు, రాజకీయ అర్ధశాస్త్రవేత్తలు తమ దృష్టిని 'ఉత్పాదక శక్తుల'పైన, వాటి స్వేచ్ఛాయుతమైన భవిష్యదభివృద్ధిపైన కేంద్రీకరించాలే తప్ప, ఇంతవరకు చేసినట్లు, కంటికి నదురుగా కనిపించే సంచిత సంపదపైన కాదు. సంచిత సంపద అనబడే దానిలో అధిక భాగం నామమాత్రమైనది. అది వాస్తవ వస్తువులు అయిన నౌకలు, ఇళ్ళు, వస్త్రాలు, నేలల మెరుగుదల వగైరాలు కాక, సామాజిక భవిష్యత్ వార్షిక ఉత్పత్తి శక్తులపైన హక్కులు మాత్రమే. వీటిని తాత్కాలిక ఆవశ్యకతలు, భద్రతారాహిత్యం వల్ల ఏర్పడ్డ సంస్థలు సృష్టించి, చిరస్థాయిగా చేశాయి.... అటువంటి వస్తువుల ఉపయోగం (భౌతిక వస్తువుల, వాస్తవ సంపద, సంచయనం) వాటి యజమానులకు, భవిష్యత్తులో సామాజిక ఉత్పత్తి శక్తులు సృష్టించే సంపదను కేవలం స్వాయత్తం చేసుకునే సాధనంగా ఉండటమే. కనుక పంపిణీ సహజ నియమాలు, బలప్రయోగం అవసరం లేకుండానే క్రమక్రమంగా, సహకార శ్రమ సాయంతో అయితే కొద్ది సంవత్సరాలలోనే, వాటికా ఉపయోగం లేకుండా చేస్తుంది." (విలియమ్ థాంప్సన్, An inquiry in to the principles of the distribution of wealth, London, 1850, పుట 453. ఈ పుస్తకం మొదట 1824లో వెలువడింది.)

"సమాజం యొక్క వాస్తవ సంచయనం పరిమాణంలో గాని, ప్రభావంలో గాని మానవ ఉత్పాదక శక్తులకు, ఒక తరం యొక్క కొద్ది సంవత్సరాల సాధారణ వినియోగానికి సైతం ఎంత తక్కువ నిష్పత్తిలో ఉందో అత్యధిక సంఖ్యాకులు ఆలోచించడం లేదు. వారికి అనుమానం కూడా రాలేదు. (యాన్ ఎంక్వైరీ ఇంటు ది ప్రిన్సిపల్స్ ఆఫ్ ది డిస్ట్రిబ్యూషన్ ఆఫ్ వెల్త్.) దీనికి కారణం స్పష్టమే. కానీ దాని ప్రభావం మాత్రం చాలా వినాశకరమైనది. ప్రతి ఏడాది వినియోగమయ్యే సంపద ఆ వినియోగంతో పాటు మాయమవుతుంది. అది ఒక్క క్షణం మాత్రమే కనిపిస్తుంది. దాన్ని అనుభవించేటప్పుడు లేదా ఉపయోగించేటప్పుడు తప్ప, దాని ముద్ర మనసుపై పడదు. అయితే నెమ్మదిగా వినియోగమయ్యే ఫర్నిచర్, యంత్రాలు, భవనాలు, వగైరా సంపద భాగాలు బాల్యం నుండి వృద్ధాప్యం వరకు మన కళ్ళముందు కనిపిస్తూనే ఉంటాయి. అది మానవ శ్రమ వ్యయానికి చిరకాల జ్ఞాపికలు. జాతీయ సంపదలోని ఈ నిశ్చలమైన, శాశ్వతమైన లేదా నెమ్మదిగా వినియోగ మవుతున్న భాగం తమ ఆధీనంలో ఉండటం వల్ల, అలాగే భూమి, శ్రమ గ్రహీత పదార్థాలు, పని పరికరాలు, పని చేస్తున్నప్పుడు ఆశ్రయమిచ్చే ఇళ్ళు తమ ఆధీనంలో ఉండటం వల్ల, ఈ వస్తువుల సొంతదారులు తమ ప్రయోజనం కోసం, నిజంగా సమర్థులైన సమస్త సమాజ ఉత్పాదక శ్రామికుల వార్షిక ఉత్పాదక శక్తులను తమ చెప్పుచేతల్లో ఉంచుకోగలుగుతున్నారు. బ్రిటన్, ఐర్లాండ్‌ల జనాభా 2 కోట్లు. ప్రతి వ్యక్తి ఆడ, మగ, పిల్లా, పాప యొక్క సగటు వినియోగం బహుశా దాదాపు 20 పౌండ్లు ఉంటుంది. అంతా కలిపితే ఏడాదికి వినియోగం అవుతున్న శ్రమ ఉత్పాదితం 40 కోట్ల పౌండ్లు. ఈ దేశాల సంచిత పెట్టుబడి మొత్తం, 120 కోట్ల పౌండ్లకు మించదని అంచనా వేయబడింది. అంటే అది ఆ దేశాల సమాజ వార్షిక శ్రమకి 3 రెట్లకు మించదనీ లేదా సమానంగా పంచితే ప్రతి వ్యక్తికి 60 పౌండ్ల పెట్టుబడికి మించదని అంచనా. ఇక్కడ మనకు కావలసినది, అంచనా వేసిన

మొత్తాలు ఖచ్చితంగా ఎంత అనేది కాదు. వాటి నిష్పత్తులే మనకు ప్రధానం. మొత్తం జనాభాని, ఈ పెట్టుబడి నిల్వపై వచ్చే వడ్డీ ఏడాదిలో దాదాపు రెండు నెలలు ఇప్పుడున్న సదపాయాలను కలుగజేస్తూ పోషించగలుగుతుంది. వారు పని చేయాల్సిన అవసరం లేకుండా మొత్తం సంచిత సంపద (ఎవరైనా కొనేవారుంటే) మూడేళ్ళ పాటు పోషించగలుగుతుంది! ఆ మూడేళ్ళ తరువాత, ఇళ్ళు, బట్టా, తిండి లేకుండా వారు పస్తు పడుకోవాలి లేదా తమల్ని మూడేండ్లపాటు పని లేకుండా కూర్చోబెట్టి పోషించిన వారికి వారు బానిసలైనా కావాలి. ఒక ఆరోగ్యకరమైన తరం జీవిత కాలం 40 ఏండ్లు అనుకుందాము. దానిలో మూడేండ్లు ఎంతో, కేవలం ఒకే ఒక తరం యొక్క ఉత్పాదక శక్తులతో పోల్చినపుడు, అత్యంత సంపన్నమయిన సమాజం యొక్క సంచిత పెట్టుబడి, అంటే, వాస్తవ సంపద యొక్క పరిమాణమూ, ప్రాధాన్యమూ కూడా అంతే. ఇక్కడ పేర్కొంటున్నది, లోపభూయిష్టమై మనసును కుంగదీసే భద్రతారహిత ఆవశ్యకాలకు లోనైన తరం పూర్తిగా ఉత్పత్తి చేసేదే తప్ప, సమాన భద్రత ఉన్న విజ్ఞతాయుతమైన పరిస్థితుల్లో, ప్రత్యేకించి సహకార శ్రమ సహాయం గల తరం వారి ఉత్పాదక శక్తులను కాదు! సమస్త యంత్రాలను, పాపాలను, నేరాలను, భద్రతా రహిత స్థితిలోని కష్టాలను చిరస్థాయిగా చేసే ప్రయత్నాల ఉద్దేశం, పైకి బ్రహ్మాండమైనదిగా కనిపించే ఈ పెట్టుబడిని (లేదా మరింత స్పష్టంగా చెప్పాలంటే, దాని తోడ్పాటుతో వార్షిక శ్రమ ఉత్పాదితాలపై పట్టును) నిలబెట్టి, చిరస్థాయిగా చేయడమే. మొదట అవసరాలను సరఫరా చేయకుండా సంచయనం సాధ్యం కానందు వల్లనూ, మానవుడి మొగ్గు సుఖజీవనంపైనే ఉండటం వల్లనూ, ఏ నిర్దిష్ట దశలోనయినా సరే సమాజం యొక్క వాస్తవ సంపద సాపేక్షంగా చాలా తక్కువగా ఉంటుంది. ఇది నిజానికి ఉత్పత్తి వినియోగాల యొక్క శాశ్వత వలయం. ఈ వార్షిక ఉత్పత్తి వినియోగాల మొత్తంలో ఒక గుప్పెడు వాస్తవ సంచయనం లెక్కలోకే రానంత స్వల్పం. అయితే ఈ గుప్పెడు సంచయనంపైనే ప్రధానంగా దృష్టి కేంద్రీకరించ బడుతోంది. అంతే తప్ప, ఉత్పాదక శక్తుల సముదాయంపై కాదు. కానీ ఈ గుప్పెడు సంపదలను కొద్దిమంది వ్యక్తులు స్వాధీనం చేసుకోవటం వల్లా, తమ సహవ్యక్తులలో అత్యధిక భాగం యొక్క శ్రమ సృష్టించే ప్రతి వార్షిక ఉత్పాదితాలను తమకు ఉపయోగపడేదిగా మార్చే పరికరంగా దాన్ని తయారు చేసుకోవడం వల్లా, ఆ కొద్దిమంది దృష్టిలో ఆ పరికరానికి అంతటి ప్రాధాన్యం వచ్చింది. ఈ దేశాల వార్షిక శ్రమ ఉత్పాదితాల నుండి సుమారు మూడో వంతు భాగాన్ని పౌరభారాల పేరుతో ఉత్పత్తిదారుల నుండి సంగ్రహిస్తున్నారు. ఉత్పత్తిదారులకు సంతృప్తి కలిగించే ఎటువంటి సమవిలువలను ఇవ్వకుండా వారు దాన్ని, అనుత్పాదకంగా వినియోగం చేస్తున్నారు. సంచిత వస్తురాశి, ప్రత్యేకించి కొద్దిమంది వ్యక్తుల చేతులలో ఉండటం చూచినపుడు, కుసంస్కారులు ఎల్లప్పుడూ సమ్మోహితులవుతారు. వార్షికంగా ఉత్పత్తి అయి, వినియోగమయ్యే వస్తురాశి ఒక మహానదీ నిరత, సంఖ్యాతీత తరంగాల్లాగా దొరలిపోతూ, వినియోగమనే విస్తృత మహాసముద్రంలో నామరూపాలు లేకుండాపోతుంది. కాని ఈ నిరత వినియోగంపైనే మొత్తం మానవజాతి సకల సుఖాలే కాక దాని అస్తిత్వం సైతం ఆధారపడి ఉంది. ఈ వార్షిక ఉత్పాదితాల పరిమాణమూ, పంపిణీలు పరిశీలించవలసిన అతి ముఖ్య విషయాలు కావాలి. వాస్తవ సంచయనం కేవలం ద్వితీయ ప్రాధాన్యం కలది మాత్రమే. దానికి ఆ ప్రాధాన్యం కూడా ఎందుకొచ్చిందంటే, వార్షిక ఉత్పత్తుల పంపిణీపైన అది కలిగించే ప్రభావంవల్ల..... వాస్తవ సంచయనాలు, పంపిణీలు ఎల్లప్పుడూ ఉత్పాదక శక్తి సందర్భంగానూ, దానికి లోబడినదిగానూ

మాత్రమే (థాంప్సన్ రచనలలో) పరిగణింపబడుతూ వచ్చాయి. దాదాపు మిగతా వ్యవస్థలన్నింటిలోనూ ఉత్పత్తి శక్తి అనేది వాస్తవ సంచయన సందర్భంగానూ, దానికి లోబడి ఉండేదిగానూ, ప్రస్తుతం అమలులో ఉన్న పంపిణీ పద్ధతులను శాశ్వతమొనర్చేదిగా పరిగణించడం జరిగింది. ఈ వాస్తవ పంపిణీని భద్రపరచడంతో పోల్చిచూస్తే, మొత్తం మానవ జాతి నిరంతర కష్టసుఖాలు పరిశీలనార్హం కావని అభిప్రాయపడ్డారు. బలప్రయోగం, వంచన, విధి విలాసాలను శాశ్వతం చేయడమే భద్రత అని అంటున్నారు. ఈ బూటకపు భద్రతను బలపర్చడానికి మానవజాతి సకల ఉత్పాదక శక్తులను నిర్దాక్షిణ్యంగా బలిపెట్టడం జరుగుతోంది." (అదే గ్రంథం, పుటలు 440–43)

★ ★ ★

నిశ్చిత స్థాయిలో సైతం జరిగే పునరుత్పత్తికి అడ్డుతగిలే అవాంతరాలను అటుంచి, పునరుత్పత్తి రెండు విధాలుగా మాత్రమే జరగడం సాధ్యం.

సామాన్య స్థాయిలో పునరుత్పత్తి లేదా అదనపు విలువను పెట్టుబడిగా మార్చడం, అంటే సంచయనం.

## 1. సామాన్య పునరుత్పత్తి

ప్రతి సంవత్సరమూ లేదా సంవత్సరంలో పలు టర్నోవర్‌లు ఉన్నట్లయితే ప్రతిసారీ ఉత్పత్తి అయి, తిరిగి డబ్బు రూపంలో చేతికందే అదనపు విలువ సామాన్య పునరుత్పత్తి విషయంలో వ్యక్తిగతంగా వినియోగం అవుతుంది. అంటే, దాని సొంతదారైన, పెట్టుబడిదారునిచేత అనుత్పాదితంగా వినియోగం అవుతుంది.

ఉత్పాదితం యొక్క విలువగా ఉన్నది ఇవీ : అదనపు విలువా, ఉత్పాదితంలో పునరుత్పత్తి అయిన అస్థిర పెట్టుబడి విలువ భాగమూ, ఉత్పాదితం వినియోగం చేసిన స్థిర పెట్టుబడీ. అయితే ఈ పరిస్థితి, నిరంతరం సరుకు పెట్టుబడిగా చలామణిలోకి ప్రవేశిస్తూ, ఉత్పాదకంగానూ, వ్యక్తిగతంగానూ వినియోగం కావటంకోసం, అంటే ఉత్పత్తి సాధనంగానూ, వినియోగ సాధనంగానూ ఉపకరించడం కోసం నిరంతరాయంగా చలామణి నుండి ఉపసంహరింపబడుతూన్న మొత్తం ఉత్పాదితం యొక్క పరిమాణంలో కానీ, దాని విలువలో కానీ ఏ అంశాన్నీ మార్చదు. స్థిర పెట్టుబడిని అలా ఉంచితే, వార్షిక ఉత్పాదితం కార్మికులకూ, పెట్టుబడిదారులకూ మధ్య పంపిణీ మాత్రమే దీని వల్ల ప్రభావితం అవుతుంది.

సామాన్య పునరుత్పత్తి జరుగుతున్నట్లు ఊహించినప్పటికీ, అదనపు విలువలో ఒక భాగం ఉత్పాదితం రూపంలో కాక ఎప్పుడూ డబ్బు రూపంలో ఉండాలి. ఎందుకంటే మరోలా, వినియోగం అవసరాల కోసం డబ్బు నుంచి ఉత్పాదితాలుగా అది మార్చబడజాలదు. ఈ రకంగా అదనపు విలువను దాని తొలి సరుకు రూపం నుంచి డబ్బు రూపంలోకి మార్చడం అన్న అంశాన్ని ఇక్కడ మరింత విశ్లేషించాల్సి ఉంది. విషయ సారళ్యంకోసం, ఈ సమస్యకున్న అత్యంత ప్రాథమిక రూపాన్ని, అంటే లోహ నాణెం మాత్రమే చలామణి అవుతున్నట్లు ఊహిద్దాం. అది నిజమైన సమవిలువగా ఉన్న డబ్బు.

సరుకుల సామాన్య చలామణి నియమాల ప్రకారం (సంపుట-I, అధ్యాయం-3లో ఇవి వివరించబడ్డాయి.) ఒక దేశంలో ఉన్న మొత్తం లోహపు నాణేలు సరుకులను చలామణి చేయడానికి మాత్రమే కాక, చలామణి ద్రవ్యం ఎగుడుదిగుడులను తట్టుకోవడానికి కూడా సరిపోయినంత ఉండాలి. ఈ ఎగుడు దిగుడులు కొంతవరకు, చలామణి వేగంలో వచ్చే ఆటుపోట్ల వల్ల తలెత్తుతాయి. మరికొంత, సరుకుల ధరలలో వచ్చే మార్పుల వల్లనూ, మరికొంత చెల్లింపు సాధనంగానూ చలామణి సాధనంగానూ డబ్బు పని చేసే వివిధ నిష్పత్తుల వల్లనూ, ఆ నిష్పత్తులు మారుతూండటం వల్లనూ తలెత్తుతుంది. అస్తిత్వంలో ఉన్న డబ్బు మొత్తం, నిల్వ డబ్బుగానూ, చలామణిలో ఉన్న డబ్బుగానూ విభజితమయ్యే నిష్పత్తి నిరంతరాయంగా మారుతుంది. అయితే మొత్తం డబ్బు ఎల్లప్పుడూ నిల్వ డబ్బూ, చలామణి అవుతున్న డబ్బూ ఈ రెంటి వెరసికి సమానం. ఈ డబ్బు పరిమాణం (విలువయిన లోహ పరిమాణం) క్రమక్రమంగా పోగయిన సమాజం యొక్క నిల్వ డబ్బు. ఈ నిల్వ డబ్బులో కొంత భాగం అరుగుదల వల్ల వినియోగమవుతుంది. కనుక ప్రతి ఏడాది తక్కిన ఉత్పాదితాలలాగానే దాన్ని కూడా భర్తీ చేయాల్సి ఉంటుంది. ఇది వాస్తవంగా ఒక నిర్దిష్ట దేశం తన వార్షిక ఉత్పాదితంలో ఒక భాగాన్ని వెండి, బంగారాలు ఉత్పత్తి చేసే దేశాల ఉత్పాదితంలో ప్రత్యక్షంగానో, పరోక్షంగానో మార్పిడి చేయడం ద్వారా జరుగుతుంది. కానీ, ఈ లావాదేవీ అంతర్జాతీయ స్వభావం దీని సామాన్య గతిక్రమాన్ని మరుగుపరుస్తుంది. ఈ సమస్యను అతి సరళమైన, స్పష్టమైన రూపానికి మార్చడం కోసం, వెండి, బంగారాల ఉత్పత్తి అదే దేశంలో జరుగుతున్నట్లు ఊహించుకోవాలి. వెండి, బంగారాల ఉత్పత్తి, ఆ రకంగా ప్రతి దేశంలోనూ మొత్తం సామాజిక ఉత్పత్తిలో ఒక భాగంగా ఉందని ఊహించుకోవాలి.

విలాస వస్తువులకోసం ఉత్పత్తి అయ్యే వెండి, బంగారాల విషయం అలా ఉంచితే, వాటి కనీస వార్షిక ఉత్పత్తి డబ్బు చలామణి వల్ల లోహపు నాణెం యొక్క వార్షిక అరుగుదలను సమానంగా ఉండాలి. అంతేకాక, వార్షికంగా ఉత్పత్తి అయి, చలామణి అయ్యే సరుకుగా పరిమాణం యొక్క విలువల మొత్తం పెరిగితే వెండి, బంగారాల వార్షిక ఉత్పత్తి కూడా అలాగే పెరగాలి. చలామణిలో ఉన్న సరుకుల విలువల మొత్తం పెరుగుదలకూ, వాటి చలామణికోసం (అందుకు అనుగుణమైన డబ్బు నిల్వకోసం) కావలసిన అదనపు మొత్తాల ఆవశ్యకతకూ విరుగుడుగా, డబ్బు చలామణి వేగం పెరగని మేరకు, చెల్లింపు సాధనంగా డబ్బు మరింత సమగ్రమైన పాత్ర నిర్వహించని మేరకు, అంటే, వాస్తవమైన డబ్బు జోక్యం లేకుండా కొనుగోళ్ళు, అమ్మకాలు మరింత సమతూకంగా జరగని మేరకు, వెండి, బంగారాల వార్షికోత్పత్తి అలా పెరగాల్సి ఉంటుంది.

కనుక సామాజిక శ్రమశక్తిలో ఒక భాగం, సామాజిక ఉత్పత్తి సాధనాలలో ఒక భాగం, ప్రతి ఏడాది వెండి, బంగారాల ఉత్పత్తిలో వ్యయం కాక తప్పదు.

వెండి, బంగారాల ఉత్పత్తిలో నిమగ్నమైన పెట్టుబడిదారులు, మనం ఊహిస్తున్న సామాన్య పునరుత్పత్తి ప్రకారం, తమ ఉత్పత్తిని వెండి బంగారాల సగటు వార్షిక అరుగుదల యొక్క, దాని పర్యవసానమైన సగటు వార్షిక వినియోగం యొక్క పరిధిలో మాత్రమే ఉత్పత్తి కొనసాగిస్తారు. వారు స్వయంగా వినియోగం చేసే అదనపు విలువను (మన ఊహ ప్రకారం ఆ అదనపు విలువలో ఏ అంశాన్ని పెట్టుబడిగా మార్చరు.) దాని సహజ రూపమైన డబ్బు రూపంలోనే మార్కెట్‌లోనికి ప్రత్యక్షంగా పంపిస్తారు. ఇతర ఉత్పత్తి శాఖలలో ఇది ఉత్పాదితం యొక్క మారిన రూపం. కానీ ఇక్కడ అలా కాదు.

అంతేకాక, వేతనాలకు సంబంధించినంత వరకు (అడ్వాన్సు చేసిన అస్థిర పెట్టుబడి యొక్క డబ్బు రూపమే వేతనాలు.) అవి కూడా ఉత్పాదితం యొక్క అమ్మకం వల్ల, అంటే దాన్ని డబ్బుగా మార్చడం వల్ల భర్తీకావు. మొదటినుంచీ డబ్బు రూపమే తన సహజ రూపంగా ఉన్న ఉత్పాదితం చేత భర్తీ అవుతాయి.

చివరి విషయం, విలువయిన లోహాల రూపంలో ఉన్న, ఉత్పాదితంలోని మరో భాగానికి కూడా ఇదే వర్తిస్తుంది. నిర్ణీత కాలానికి ఒకసారి వినియోగమయ్యే స్థిర పెట్టుబడి విలువకు అంటే, ఏడాదిలో వినియోగమయ్యే స్థిర చలామణి పెట్టుబడి, స్థిర నిశ్చల పెట్టుబడుల విలువకు సమానమైన భాగమిది.

విలువయిన లోహాల ఉత్పత్తిలో మదుపుపెట్టిన పెట్టుబడి యొక్క ఆవృత్తిని లేదా టర్నోవర్‌ని, మొదట, డ – స....ఉ.పె....డ' అనే రూపంలో పరిశీలిద్దాం. డ–సలోని సలో శ్రమశక్తి, ఉత్పత్తి సాధనాలు మాత్రమేకాక, నిశ్చల పెట్టుబడి కూడా ఉంది. నిశ్చల పెట్టుబడిలో ఒక భాగం మాత్రమే ఉ.పె.లో వినియోగమవుతుంది. కనుక డ' అంటే, ఉత్పాదితం అనేది, వేతనాలకై వెచ్చించబడిన అస్థిర పెట్టుబడీ, ఉత్పత్తి సాధనాలకై వెచ్చింపబడిన చలామణి స్థిర పెట్టుబడీ, నిశ్చల పెట్టుబడి అరుగుదలకు సమానమైన విలువ భాగమూ, అదనపు విలువా – వీటన్నింటికి సమానమైన డబ్బు. ఆ మొత్తం కనుక చిన్నదిగా ఉండి, బంగారం యొక్క సాధారణ విలువ యధాతథంగా ఉంటే, ఆ బంగారపుగని అనుత్పాదకంగా ఉన్నది అని అర్థం. లేదా ఇది సర్వత్రా అలాగే ఉంటే, యధాతథంగా ఉన్న సరుకుల విలువతో పోలిస్తే బంగారం విలువ పెరుగుతుంది. అంటే, సరుకుల ధరలు పడిపోతాయి. అప్పటి నుంచి, డ–స లో వ్యయమయ్యే డబ్బు మొత్తం తగ్గుతుంది.

మొదట, మనం డ–స.... ఉ.పె...డ'లో ప్రారంభస్థానమైన డ అడ్వాన్స్ చేయబడిన చలామణి పెట్టుబడి భాగాన్ని మాత్రమే పరిశీలిస్తే, కొంత డబ్బు అడ్వాన్స్ చేయబడిందని, అది శ్రమశక్తి చెల్లించటం కోసం, ఉత్పత్తి పదార్థాలను కొనుగోలు చేయడం కోసం వెచ్చించబడిందనీ గమనిస్తాము. అయితే ఈ పెట్టుబడి ఆవృత్తి, మరోసారి చలామణిలోకి నెట్టడం కోసం ఈ మొత్తాన్ని చలామణి నుంచి ఉపసంహరించలేదు. ఉత్పాదితం, దాని వస్తు రూపంలో సయితం డబ్బే కనుక మార్పిడి ద్వారా, చలామణి ప్రక్రియ ద్వారా దానిని డబ్బుగా మార్చాల్సిన అవసరం లేదు. అది ఉత్పత్తి ప్రక్రియ నుంచి చలామణి రంగంలోకి ప్రవేశించేది, డబ్బు పెట్టుబడిగా మార్చబడాల్సిన సరుకు పెట్టుబడి రూపంలో కాదు; ఉత్పాదక పెట్టుబడిగా మార్చబడాల్సిన డబ్బు పెట్టుబడి రూపంలో అలా ప్రవేశిస్తుంది. ఈ ఉత్పాదక పెట్టుబడి కొత్తగా శ్రమశక్తిని, ఉత్పత్తి పదార్థాలను కొనాల్సి ఉంది. శ్రమశక్తిలోనూ, ఉత్పత్తి సాధనాలలోనూ వినియోగమైన చలామణి పెట్టుబడి యొక్క డబ్బు రూపం. ఉత్పాదితం యొక్క విక్రయం ద్వారా కాక, ఉత్పాదితం యొక్క వస్తురూపంచేత భర్తీ అవుతుంది. కాబట్టి అది డబ్బు రూపంలో, చలామణి నుంచి తన విలువను ఉపసంహరించుకోవడం కాక, కొత్తగా, అదనంగా ఉత్పత్తి చేయబడిన డబ్బుచేత అది భర్తీ అవుతుంది.

ఈ చలామణి పెట్టుబడి 500 పౌండ్లు అనుకుందాం. టర్నోవర్ కాలం 5 వారాలు, పనికాలం 4 వారాలు, చలామణి కాలం ఒక వారం అనుకొందాం. మొదటనుంచి 5 వారాల కవసరమైన డబ్బు ఉత్పాదక సరఫరా కోసం కొంత అడ్వాన్స్ చేయబడాలి. మరికొంత భాగాన్ని క్రమక్రమంగా

వేతనాలు చెల్లించడానికి సిద్ధంగా ఉంచాలి. ఆరోవారం ప్రారంభంలో 400 పౌండ్లు తిరిగి వస్తాయి. 100 పౌండ్లు విడుదలవుతాయి. ఇదే నిరంతరాయంగా పునరావృత్తమవుతుంది. ఇంతకు ముందు సందర్భాలలో లాగానే, ఇక్కడ కూడా టర్నోవర్ యొక్క ఏ నిర్దిష్ట కాలంలోనైనా సరే, 100 పౌండ్లు ఎప్పుడూ విడుదలయిన రూపంలోనే ఉంటాయి. అయితే మిగతా 400 వందల పౌండ్లలో లాగానే, ఈ 100 పౌండ్లు కూడా కొత్తగా ఉత్పత్తి అయిన అదనపు డబ్బుగానే ఉంటుంది. ఈ ఉదాహరణలో ఏడాదికి పది టర్నోవర్లు ఉన్నాయి. వార్షిక ఉత్పాదితం 5,000 పౌండ్ల బంగారం (ఈ సందర్భంలో చలామణి కాలం, సరుకులు డబ్బుగా మారటానికి పట్టే కాలం కాక, డబ్బు ఉత్పత్తి అంశాలుగా మారటానికి పట్టే కాలం.)

ఇదే పరిస్థితులలో టర్నోవర్ అయిన 500 పౌండ్లు ఇతర పెట్టుబడుల విషయంలో, ఎప్పటికప్పుడు పునరుద్ధరించబడే డబ్బు రూపం, సరుకు పెట్టుబడి యొక్క మారిన రూపం. ఈ సరుకు పెట్టుబడి ప్రతి నాలుగు వారాలకు ఒకసారి ఉత్పత్తి అయి చలామణిలోనికి నెట్టబడినది. దాని విక్రయం ద్వారా, అంటే అది మొదట ప్రక్రియలో ప్రవేశించినపుడు ప్రాతినిధ్యం వహించిన డబ్బు మొత్తాన్ని నిర్ణీత కాలానికి ఒకసారి ఉపసంహరించుకోవటం ద్వారా, పదే పదే అదే డబ్బు రూపాన్ని సంతరించుకొంటుంది. కానీ ఇక్కడ అందుకు విరుద్ధంగా ప్రతి టర్నోవర్ కాలంలోనూ కొత్తగా 500 పౌండ్లు అదనపు డబ్బు మొత్తం ఉత్పత్తి ప్రక్రియ నుంచే చలామణి రంగంలోనికి నెట్టబడుతుంది. దాని నుంచి నిరంతరాయంగా ఉత్పత్తి పదార్థాలను, శ్రమశక్తిని ఉపసంహరించడానికై ఇలా నెట్టబడుతుందన్న మాట. చలామణిలోనికి నెట్టబడిన ఈ డబ్బును దానినుంచి ఈ పెట్టుబడి నిర్వహించిన ఆవృత్తి మళ్ళీ ఉపసంహరించదు సరికదా, నిరంతరం సరికొత్తగా ఉత్పత్తి చేయబడే బంగారు పరిమాణాల ద్వారా దాన్ని మరింత పెంచుతుంది.

ఈ చలామణి పెట్టుబడి యొక్క అస్థిర భాగాన్ని చూద్దాం. అది 100 పౌండ్లని అనుకొందాం. అప్పుడు ఈ 100 పౌండ్లు, 10 టర్నోవర్‌లతో, శ్రమశక్తికి నిరంతరాయంగా చెల్లించటం కోసం సాధారణ సరుకుల ఉత్పత్తిలో సరిపోతాయి. బంగారం ఉత్పత్తిలో కూడా అదే మొత్తం సరిపోతుంది. అయితే, తిరిగివచ్చి, ప్రతి 5 వారాలకు ఒకసారి శ్రమశక్తి కోసం చెల్లించడానికి వాడే ఈ 100 పౌండ్లు ఆ శ్రమశక్తి ఉత్పాదితం యొక్క మారిన రూపం కాదు. అది నిరంతరాయంగా పునరుద్ధరించబడే ఉత్పాదితంలోని భాగం మాత్రమే. బంగారం ఉత్పత్తిదారులు, కార్మికులకు స్వయంగా వారు ఉత్పత్తి చేసిన బంగారంలో ఒక భాగాన్ని నేరుగా చెల్లిస్తారు. ఆ రకంగా శ్రమశక్తి కోసం ఏడాదిలో వ్యయమైన 1,000 పౌండ్లు కార్మికులు చలామణిలోనికి నెడతారు. కనుక అవి ఈ చలామణిగుండా తమ ప్రారంభ స్థానానికి రావు.

అంతేకాక, నిశ్చల పెట్టుబడికి సంబంధించినంత వరకు, దానికి వ్యాపార ప్రారంభంలో సాపేక్షంగా పెద్ద మొత్తంలో డబ్బు పెట్టుబడి అవసరం. ఆ రకంగా ఈ పెట్టుబడి చలామణి రంగంలోనికి నెట్టబడుతుంది. మిగిలిన నిశ్చల పెట్టుబడులు అన్నిటిలాగే, అది కూడా అనేక సంవత్సరాల గతిక్రమంలో కొద్ది కొద్దిగా తిరిగి వస్తుంది. అయితే, అది ప్రత్యక్ష ఉత్పాదితమైన బంగారంలో ఒక భాగంగా తిరిగి వస్తుందే తప్ప ఉత్పాదితం యొక్క విక్రయం ద్వారాను, అది డబ్బుగా మార్చబడటం ద్వారానూ మాత్రం కాదు. మరోలా చెప్పాలంటే, అది క్రమంగా డబ్బు రూపం సంతరించుకొనేది, చలామణి

నుంచి డబ్బును ఉపసంహరించడం వల్ల కాదు. ఉత్పాదితం యొక్క ఆ భాగం పోగుపడటం వల్ల ఆ రూపం సంతరించుకొంటుంది. ఆ రకంగా పునరుద్ధరింపబడిన డబ్బు పెట్టుబడి, నిశ్చల పెట్టుబడి కోసం చలామణిలోనికి మొదట నెట్టబడిన మొత్తానికి బదులుగా చలామణి నుంచి క్రమక్రమంగా ఉపసంహరించబడిన మొత్తం కాదు. అది అదనపు డబ్బు మొత్తం.

చివరి విషయం. అదనపు విలువకు సంబంధించినంత వరకూ అది కూడా కొత్త బంగారం ఉత్పాదితంలోని ఒక నిర్దిష్ట భాగానికి సమానం. ఈ ఉత్పాదితం ప్రతి కొత్త టర్నోవర్ కాలంలోనూ, మన ఊహ ప్రకారం నిత్య జీవితావసర వస్తువుల కోసం, విలాస వస్తువుల కోసం అనుత్పాదకంగా వ్యయం కావడానికి చలామణిలోకి నెట్టబడుతుంది.

మొత్తం వార్షిక బంగారం ఉత్పత్తి మార్కెట్ నుంచి నిరంతరాయంగా శ్రమశక్తిని, ఉత్పత్తి పదార్థాలను ఉపసంహరిస్తుంది కానీ డబ్బును ఉపసంహరించదు. పైగా కొత్త డబ్బును నిరంతరాయంగా దానికి జోడిస్తుంది. మన ఊహ ప్రకారం అది ఏడాదిలో అరిగిపోయిన డబ్బును భర్తీ చేస్తుంది. కనుక అది నిరంతరాయంగా సమాజంలో ఉండే డబ్బు పరిమాణాన్ని యధాతథంగా ఉంచుతుంది. అయితే అది నిల్వ డబ్బు, చలామణిలో ఉన్న డబ్బు అనే రెండు రూపాల్లో విభిన్న నిష్పత్తుల్లో ఉంటుంది.

సరుకుల చలామణి నియమం ప్రకారం, డబ్బు పరిమాణం చలామణికి అవసరమైన డబ్బూ, నిల్వ రూపంలో ఉండే డబ్బూ ఈ రెంటి మొత్తానికి సమానం. ఈ నిల్వ డబ్బు చలామణి తగ్గినప్పుడు పెరుగుతూ, చలామణి విస్తరించినప్పుడు తరుగుతూ ఉంటుంది. చెల్లింపు సాధనంగా ఉండే రిజర్వు నిధుల ఏర్పాటుకు ప్రత్యేకించి ఉపకరిస్తుంది. లావాదేవీ ఖాతాల సమతూకం లేనప్పుడు డబ్బుగా చెల్లించాల్సింది సరుకు విలువే. ఈ విలువలో ఒక భాగం అదనపు విలువ, అంటే సరుకుల అమ్మకందారునికి ఏమీ ఖర్చు కాకుండా ఏర్పడిన విలువ అనే వాస్తవం ఈ విషయాన్ని ఏ మాత్రం మార్చదు. ఉత్పత్తిదారులంతా తమ ఉత్పత్తి సాధనాల స్వతంత్ర యజమానులని భావిద్దాం. అప్పుడు చలామణి నేరుగా ఉత్పత్తిదారుల మధ్యే జరుగుతుంది. వారి పెట్టుబడుల్లో స్థిరభాగాన్ని అటుంచి, వారి వార్షిక విలువ ఉత్పాదితాన్ని పెట్టుబడిదారీ పరిస్థితులకు అనుగుణంగా రెండు భాగాలుగా విభజించవచ్చు : మొదటి భాగం అవసరమైన నిత్య జీవితావసర వస్తువులను భర్తీ చేస్తుంది. రెండో భాగం కొంత విలాస వస్తువుల రూపంలోనూ, మరికొంత ఉత్పత్తి విస్తరణ కోసమూ వినియోగ మవుతుంది. మొదటి భాగం అస్థిర పెట్టుబడికి, రెండో భాగం అదనపు విలువకు ప్రాతినిధ్యం వహిస్తాయి. అయితే మొత్తం ఉత్పాదితం యొక్క చలామణి కోసం అవసరమైన డబ్బు పరిమాణం పైన ఈ విభజనకు ఎటువంటి ప్రభావం ఉండదు. తక్కిన పరిస్థితులన్నీ యధాతథంగా ఉన్న మేరకు, చలామణిలో ఉన్న మొత్తం సరుకుల విలువ, ఆ విలువకు అవసరమైన మొత్తం డబ్బు యధాతథంగా ఉంటాయి. టర్నోవర్ కాలాలు సమానంగా విభజితమైతే వాటికి ఒకే పరిమాణంలో డబ్బు నిల్వలు అవసరమవుతాయి. అంటే, వాటి పెట్టుబడిలోని ఒకే భాగాలు ఎప్పుడూ డబ్బు రూపంలో ఉండాల్సి వస్తుంది. ఎందుకంటే మన ఊహ ప్రకారం వాటి ఉత్పత్తి ఇంతకు ముందులాగే, సరుకు ఉత్పత్తే. కనుక సరుకుల విలువలో ఒక భాగం అదనపు విలువ అన్న వాస్తవం, వ్యాపారాన్ని నిర్వహించడానికి అవసరమైన డబ్బు పరిమాణంలో ఎటువంటి మార్పు తీసుకురాదు.

డ–స–డ' సూత్రాన్ని సమర్థించే టూకే ని ఆయన ప్రత్యర్థి ఒకరు ఇలా ప్రశ్నిస్తాడు : పెట్టుబడిదారు తాను చలామణిలోకి నెట్టిన డబ్బుకంటే ఎప్పుడూ ఎక్కువ మొత్తాన్ని ఎలా ఉపసంహరించగలుగుతున్నాడు? గమనించండి! ఇక్కడ చర్చనీయాంశం అదనపు విలువ రూపొందడం కాదు. ఇది ఈ ఏకైక రహస్యం పెట్టుబడిదారీ దృష్టిలో మామూలు విషయం. పనిలో పెట్టబడిన విలువల మొత్తం అదనపు విలువతో పరిపుష్టం కాకపోతే వారి దృష్టిలో అది పెట్టుబడే కాదు. అది పెట్టుబడి అని ఊహిస్తున్నాము కనుక అదనపు విలువ ఉన్నట్లే లెక్క.

కాబట్టి, ఇక్కడ ప్రశ్న అదనపు విలువ ఎక్కడనుంచి వచ్చింది అన్నది కాదు. అదనపు విలువ డబ్బుగా మారుతుంది కదా, ఆ డబ్బు ఎక్కడనుంచి వచ్చిందన్నదే ఇక్కడ సమస్య.

కాని, బూర్జువా అర్థశాస్త్రంలో, అదనపు విలువ ఉన్నదనేది స్వయం విదితం. కాబట్టి అది ఉన్నట్లు ఊహించడమే కాదు. చలామణిలోకి నెట్టబడిన సరుకుల మొత్తంలో ఒక భాగం అదనపు ఉత్పాదితం అన్న ఊహతో ముడిపెట్టబడింది. కనుక పెట్టుబడిదారు తన పెట్టుబడిలో భాగంగా చలామణిలోకి నెట్టని విలువకు అది ప్రాతినిధ్యం వహిస్తుందనీ, పర్యవసానంగా పెట్టుబడిదారు తన ఉత్పాదితంతోపాటు చలామణి రంగంలోకి తన పెట్టుబడికి మించిన అదనపు మొత్తాన్ని నెడుతున్నాడనీ, కనుక అదనపు మొత్తాన్ని దానినుంచి ఉపసంహరించుకుంటున్నాడనీ బూర్జువా అర్థశాస్త్రం భావిస్తుంది.

పెట్టుబడిదారు చలామణిలోకి నెట్టే సరుకు పెట్టుబడి, అతడు చలామణి నుండి శ్రమశక్తి రూపంలోనూ, ఉత్పత్తి సాధనాల రూపంలోనూ ఉపసంహరించే ఉత్పాదక పెట్టుబడి కంటే ఎక్కువ విలువ కలిగి ఉంటుంది. (ఈ అదనపు విలువ ఎలా వస్తుందో పై రాజకీయ అర్థశాస్త్రం చెప్పదు. ఎక్కడ నుంచి వస్తుందనేది అగోచరంగానే ఉంటుంది. కానీ ఆ అర్థశాస్త్రం దాన్ని ఒక వాస్తవంగా పరిగణిస్తుంది.) కేవలం పెట్టుబడిదారు క మాత్రమే గాక గ చ ట తదితరులు కూడా తమ సరుకుల మార్పిడి ద్వారా తాము మొదట, ఆ తర్వాత పదేపదే అడ్వాన్స్ చేసిన పెట్టుబడి విలువకంటే ఎక్కువ విలువను ఎలా ఉపసంహరించగులుతున్నారన్నది ఈ ఊహను బట్టి స్పష్టం. క, గ, చ, ట తదితరులు చలామణిలో నుంచి ఉత్పాదక పెట్టుబడి రూపంలో తాము వెనక్కు తీసుకుని దానికంటే ఎక్కువ సరుకు విలువను సరుకుకు పెట్టుబడి రూపంలో నిరంతరాయంగా నెడతారు. ఈ కార్యకలాపం స్వతంత్రంగా పనిచేసే వివిధ పెట్టుబడులంత బహువిధ రీతుల్లో ఉంటుంది. కనుక పెట్టుబడిదారులంతా ఎవరికి వారు అడ్వాన్స్ చేసిన ఉత్పాదక పెట్టుబడుల విలువల మొత్తంతో సమానమైన మొత్తాన్ని నిరంతరాయంగా తమలో తాము విభజించుకోవాలి. (ప్రతి ఒక్కరూ తమ వంతుగా చలామణి నుంచి ఉత్పాదక పెట్టుబడిని ఉపసంహరించుకోవాలి.) వారంతా అన్నివైపుల నుంచి చలామణి రంగంలోకి తమ తమ సరుకుల యొక్క ఉత్పత్తి అంశాల విలువలకు మించిన అదనపు సరుకు విలువలను నెట్టుతున్నారు. సరుకుల రూపంలో చలామణిలోకి నెట్టిన ఈ విలువల మొత్తాన్ని కూడా తమలో తాము అంత నిరంతరాయంగానూ విభజించుకోవాలి.

కానీ, సరుకు పెట్టుబడి ఉత్పాదక పెట్టుబడి కావడానికి ముందు, అలాగే దానిలో ఉన్న అదనపు విలువ ఖర్చుగాక ముందు, డబ్బుగా మారాలి. దీనికోసం డబ్బు ఎక్కడ నుండి వస్తుంది? మొదట చూస్తే, ఇది క్లిష్టమైన ప్రశ్నగా కనిపిస్తుంది. టూకే గానీ, ఇతరులు గానీ ఇంతవరకూ దీనికి సమాధానం చెప్పలేదు.

5 వందల పౌండ్ల చలామణి పెట్టుబడి, దాని టర్నోవర్ కాలం ఏమైనప్పటికీ, డబ్బు పెట్టుబడి రూపంలో అడ్వాన్స్ చేయబడిందనీ, అది సమాజం యొక్క అంటే పెట్టుబడిదారీ వర్గం యొక్క మొత్తం చలామణి పెట్టుబడికి ప్రాతినిధ్యం వహిస్తుందనీ అనుకొందాం. అదనపు విలువ వంద పౌండ్లని అనుకుందాం. మొత్తం పెట్టుబడిదారీ వర్గం నిరంతరాయంగా కేవలం 5 వందల పౌండ్లని మాత్రమే చలామణిలోకి నెట్టుతూ, నిరంతరాయంగా 6 వందల పౌండ్లని దానినుంచి ఎలా తీసుకోగలుగుతుంది?

5 వందల పౌండ్ల డబ్బు పెట్టుబడి ఉత్పాదక పెట్టుబడిగా మార్చబడిన తర్వాత అది ఉత్పత్తి ప్రక్రియలో 6 వందల పౌండ్ల విలువైన సరుకులుగా మారుతుంది. ఇప్పుడు చలామణిలో 5 వందల పౌండ్ల విలువైన లేదా మొదట అడ్వాన్స్ చేయబడిన డబ్బు పెట్టుబడికి సమానమైన సరుకులు మాత్రమే గాక, దానిలో కొత్తగా ఉత్పత్తి అయిన అదనపు విలువ కూడా ఉంటుంది. ఈ అదనపు వంద పౌండ్ల అదనపు విలువ సరుకుల రూపంలో చలామణిలోకి నెట్టబడుతుంది. అందుకు సందేహం లేదు. అయితే అటువంటి కార్యకలాపం ఏ రకంగానూ ఈ అదనపు సరుకు విలువ చలామణికి కావలసిన అదనపు డబ్బును సమకూర్చదు.

వీలున్న కుయుక్తులతో ఈ క్లిష్టతను తొలగించడం వల్ల ఉపయోగం లేదు.

ఉదాహరణకు : స్థిర – చలామణి పెట్టుబడికి సంబంధించినంత వరకూ, దాన్ని అందరూ ఏకకాలంలో మదుపు పెట్టరనేది స్పష్టం. పెట్టుబడిదారు క తన సరుకుల్ని అమ్ముతున్నప్పుడు అతను అడ్వాన్స్ చేసిన పెట్టుబడి డబ్బు రూపం ధరిస్తుంది. అలా అమ్ముతున్నప్పుడు, మరోవైపున కొనుగోలుదారుడు గ యొక్క డబ్బు పెట్టుబడి సిద్ధంగా ఉంటుంది. అది అతని ఉత్పత్తి సాధనాల రూపం సంతరించుకుంటుంది. అవి సరిగ్గా క ఉత్పత్తి చేసిన సాధనాలే. క తాను ఉత్పత్తి చేసిన సరుకు పెట్టుబడిని తిరిగి డబ్బు రూపంలోకి మారుస్తాడు. అదే చర్య మూలంగానే, గ తన పెట్టుబడిని ఉత్పాదక రూపంలోకి మారుస్తాడు; డబ్బు రూపం నుంచి ఉత్పత్తి సాధనాలుగానూ, శ్రమశక్తిగానూ మారుస్తాడు. ఒకే మొత్తం డబ్బు, ప్రతి సాధారణ విక్రయం, స–డలోనూ జరిగినట్టే, ఈ ద్విముఖ ప్రక్రియలో పనిచేస్తుంది. మరోవైపున క తన డబ్బును ఉత్పత్తి సాధనాలుగా మారుస్తున్నప్పుడు, అతను చ నుంచి కొనుగోలు చేస్తాడు. చ ఆ మొత్తంతో గ కి చెల్లిస్తాడు. ఇలా లావాదేవీని వివరించవచ్చు. అయితే :

సరుకుల చలామణిలో చలామణి డబ్బు పరిమాణానికి సంబంధించిన నియమాలేవీ కూడా (సంపుటి–I, అధ్యాయం–III) ఉత్పత్తి ప్రక్రియ యొక్క పెట్టుబడిదారీ స్వభావం వల్ల ఏ రకంగానూ మారవు.

కాబట్టి డబ్బు రూపంలో అడ్వాన్స్ చేయబడిన సమాజపు చలామణి పెట్టుబడి 5 వందల పౌండ్లని అన్నప్పుడు, అది ఏకకాలంలో అడ్వాన్స్ చేయబడిన మొత్తం, మరోవైపు అది వివిధ ఉత్పాదక పెట్టుబడులకు, ఒకదాని తర్వాత మరొకదానికి డబ్బు నిధిగా (నిల్వగా) ఉపకరిస్తుంది. కాబట్టి, 500 పౌండ్లకు మించిన ఉత్పాదక పెట్టుబడిని అది చలనంలో ఉంచుతుందనీ, అదివరకే వారి దృష్టిలో ఉందన్నమాట. ఏ డబ్బు ఉండటానికి కారణం వివరించవలసి ఉందో, ఆ డబ్బు అదివరకే ఉన్నట్లు, ఈ రకమైన వివరణ ఊహించుకొంటుంది.

వారు ఇంకా ఇలా చెప్పవచ్చు : పెట్టుబడిదారు క ఉత్పత్తి చేసే వస్తువులను పెట్టుబడిదారు గ వ్యక్తిగతంగా, అనుత్పాదకంగా వినియోగం చేస్తాడు. కనుక, గ డబ్బు క సరుకు పెట్టుబడిని డబ్బుగా మారుస్తుంది. ఆ రకంగా, ఒకే డబ్బు గ యొక్క అదనపు విలువను క యొక్క స్థిర చలామణి పెట్టుబడిని డబ్బుగా చేతికి అందేలా చేస్తుంది. అయితే ఈ సందర్భంలో, సమాధానం కోసం వేచివున్న ప్రశ్నకు అదివరకే సమాధానం లభించినట్లు మరింత ప్రత్యక్షంగా ఊహించుకొంటున్నారు. ఆ ప్రశ్న ఏమిటంటే, గ ఆదాయంగా ఉన్న డబ్బు ఎక్కడనుండి వచ్చింది? అతని ఉత్పాదితంలోని ఈ అదనపు విలువ భాగం డబ్బు రూపంలో అతని చేతికి తిరిగి ఎలా వచ్చింది?

ఇంకా యిలా చెప్పవచ్చు : క స్థిరంగా తన కార్మికులకు అడ్వాన్స్ చేసే అస్థిర చలామణి పెట్టుబడి భాగం అంతే స్థిరంగా అతనికి చలామణి రంగం నుంచి తిరిగి వస్తుంది; వేతనాలు చెల్లించడం కోసం దానిలో ఎప్పటికప్పుడు మారుతుండే భాగం మాత్రం అతని వద్ద ఉంటుంది. అయితే, వ్యయానికి, తిరిగి రావడానికి మధ్య కొంత వ్యవధి ఉంటుంది. ఈలోగా వేతనాలకై చెల్లించిన డబ్బు, ఇతర ఉపయోగాలతో పాటు, అదనపు విలువ తిరిగి డబ్బుగా చేతికందడానికి ఉపకరించవచ్చు.

అయితే ఈ వ్యవధి పెరిగిన కొద్దీ పెట్టుబడిదారు సిద్ధంగా నిల్వలో ఉంచాల్సిన డబ్బు సరఫరా పెరగాలి. రెండో అంశమేమిటంటే, కార్మికుడు డబ్బును ఖర్చు పెడతాడు. దానితో సరుకులు కొంటాడు. ఆ రకంగా వాటిలో ఉన్న అదనపు విలువను అదే నిష్పత్తిలో డబ్బుగా మారుస్తాడు. కనుక, అస్థిర పెట్టుబడి రూపంలో అడ్వాన్స్ చేసిన డబ్బే అదనపు విలువను, ఆ మేరకు డబ్బుగా మార్చడానికి కూడా ఉపకరిస్తుంది. ఇక్కడ ఈ ప్రశ్నను మరింత తరచి చూడకుండా, ఇలా చెబితే చాలు : మొత్తం పెట్టుబడిదారీ వర్గం, దాని అనుచర బృందం కార్మికవర్గంతో అడుగు కలిపి వ్యవహరిస్తారు. కనుక కార్మికులు చలామణి రంగంలోకి డబ్బు నెట్టినప్పుడే, పెట్టుబడిదారులు కూడా తమ అదనపు విలువను ఆదాయంగా ఖర్చు చేయడం కోసం చలామణి రంగంలోకి నెట్టాలి. కనుక అందుకోసం చలామణి రంగం నుంచి డబ్బును ఉపసంహరించాల్సి ఉంటుంది. ఈ వివరణ, అవసరమైన డబ్బు పరిమాణాన్ని తగ్గిస్తుందే కాని తొలగించదు.

చివరికి వారు ఇలా చెప్పవచ్చు. మొదట నిశ్చల పెట్టుబడి మదుపు పెట్టినప్పుడు నిరంతరాయంగా భర్తీ మొత్తంలో డబ్బు చలామణిలోకి నెట్టబడుతుంది. అది చలామణిలోకి నెట్టిన వ్యక్తిచేతనే చలామణి నుంచి క్రమంగా కొద్దికొద్దిగా కొన్నేళ్ళు గడిచాక, ఉపసంహరించబడుతుంది. అదనపు విలువను డబ్బుగా మార్చడానికి ఈ మొత్తం సరిపోదా?

ఈ ప్రశ్నకు సమాధానం ఇలా ఉండాలి. ఈ 500 పౌండ్ల మొత్తం (దీనిలో రిజర్వు నిధుల కోసం అవశ్యంగా కూడబెట్టే డబ్బు కూడా చేరి ఉంటుంది.) బహుశా చలామణి రంగంలోకి నెట్టిన వ్యక్తిచేతగాక మరొకనిచేత నిశ్చల పెట్టుబడిగా నియోగించబడి ఉండవచ్చుననేది ఇందులో గర్భితం. అంతేకాక, నిశ్చల పెట్టుబడిగా పనిచేసే ఉత్పాదితాల సేకరణకు వెచ్చించే మొత్తానికి సంబంధించి, వాటిలో ఉన్న అదనపు విలువ కూడా చెల్లించబడిందని అదివరకే ఊహిస్తున్నారు. మరి ఈ డబ్బు ఎక్కడ నుంచి వస్తుందనేదే ప్రశ్న.

దీనికి స్థూలంగా సమాధానం ఇప్పటికే ఇవ్వబడింది. వెయ్యి పౌండ్లకు య రెట్లు విలువైన సరుకుల రాశి చలామణి కావాలంటే, అది ఈ చలామణికి అవసరమైన డబ్బు మొత్తాన్ని ఏ రకంగానూ

మార్చదు; ఈ సరుకుల రాశి యొక్క విలువలో అదనపు విలువ ఉన్నా, లేకున్నా; ఈ సరుకులు పెట్టుబడిదారీ విధానంలోనే ఉత్పత్తి అయినా, కాకపోయినా అది మార్చదు. కనుక అసలు ఈ సమస్య లేనేలేదు. మిగిలిన అన్ని పరిస్థితులు – డబ్బు చలన వేగం వగైరాలన్నీ నిర్ణీతమైనప్పుడు, 1000 పౌండ్లకు య రెట్లు విలువ గల సరుకుల చలామణి కోసం ఒకానొక నిర్దిష్ట మొత్తం అవసరమవుతుంది. దీనిలో ప్రత్యక్ష ఉత్పత్తిదారులకు ఎంత విలువ వారి వాటాగా లభిస్తుంది అన్నదానితో ఇక్కడ ప్రమేయం లేదు. ఇక్కడ ఏదైనా సమస్య ఉంటే, అది ఒక దేశంలోకి సరుకుల చలామణికి అవసరమైన డబ్బు ఎక్కడనుండి వస్తుందనే సార్వత్రిక సమస్యే తప్ప మరొకటి కాదు.

కాని, పెట్టుబడిదారీ ఉత్పత్తి దృక్కోణం నుంచి చూస్తే ఒక ప్రత్యేక సమస్య వంటిది నిజంగా ఉంది. ప్రస్తుత ఉదాహరణలో, పెట్టుబడిదారే చలామణిలోకి డబ్బును నెట్టే ప్రారంభ బిందువుగా కనిపిస్తాడు. కార్మికుడు తన నిత్య జీవితావసర వస్తువుల కోసం ఖర్చు పెట్టే డబ్బు, ఇంతకుముందే అస్థిర పెట్టుబడి యొక్క డబ్బు రూపంలో ఉంది. కనుక దాన్ని ఇంతకుముందే పెట్టుబడిదారు శ్రమశక్తిని కొనే లేదా శ్రమశక్తికి చెల్లించే సాధనంగా చలామణిలోకి నెట్టాడు. పైగా, పెట్టుబడిదారు తన స్థిర, నిశ్చల, చలామణి పెట్టుబడి యొక్క తొలిరూపమైన డబ్బును చలామణిలోకి నెడతాడు. అతడు దాన్ని శ్రమ పరికరాలను, ఉత్పత్తి పదార్థాలను కొనడం కోసం ఖర్చు పెడతాడు. అయితే ఆ తరువాత చలామణిలో ఉన్న డబ్బు పరిమాణానికి పెట్టుబడిదారు ఎప్పుడూ ప్రారంభ బిందువుగా కనిపించడు. ఇక్కడ రెండే రెండు ప్రారంభ బిందువులు ఉన్నాయి : పెట్టుబడిదారు, కార్మికుడు. మూడో అభివర్గానికి చెందిన వ్యక్తులందరూ తమ సేవకులకు గాను ఈ రెండు వర్గాల నుంచి డబ్బు పొందాలి. లేదా, తమ సేవలకు కాకుండా వేరేరకంగా పొందుతున్న మేరకు వారు వడ్డీ, కౌలు వగైరాల రూపంలోని అదనపు విలువకు సహయజమానులు. అదనపు విలువ అంతా పారిశ్రామిక పెట్టుబడిదారుని జేబులోనే నిలిచి ఉండదు, దాన్ని అతను ఇతరులతో కలిసి పంచుకోవాల్సి ఉంటుంది, అనే వాస్తవానికి ప్రస్తుత ప్రశ్నతో ఎలాంటి ప్రమేయం లేదు. అతడు తన అదనపు విలువను డబ్బుగా ఎలా మారుస్తాడన్నదే ప్రశ్న. ఆ డబ్బు ఆ తర్వాత ఎలా విభజించబడుతుందన్నది ఇక్కడ ప్రశ్న కాదు. మన విశ్లేషణకు, ఇక్కడ పెట్టుబడిదారుణ్ణి అదనపు విలువకు ఏకైక యజమానిగా పరిగణించవచ్చు. కార్మికునికి సంబంధించినంత వరకూ, అతను చలామణి రంగంలోకి నెట్టిన డబ్బుకు కేవలం ద్వితీయ ప్రారంభ బిందువనీ, ప్రథమ ప్రారంభ బిందువు పెట్టుబడిదారు అనీ ఇదివరకే చెప్పాము. మొదట అస్థిర పెట్టుబడిగా అడ్వాన్స్ చేయబడిన డబ్బును కార్మికుడు తన నిత్య జీవితావసర వస్తువుల కోసం ఖర్చు చేస్తున్నప్పుడు, అది తన రెండో చలామణి క్రమంలో ఉంది.

కాబట్టి పెట్టుబడిదారీ వర్గం ఒక్కటే డబ్బు చలామణి యొక్క ప్రారంభ బిందువు. ఉత్పత్తి సాధనాల కోసం 4 వందల పౌండ్లూ, శ్రమశక్తి కొనుగోలు కోసం 100 పౌండ్లూ అవసరమైతే, వారు 500 పౌండ్లను చలామణిలోకి నెడతారు. అయితే 100% అదనపు విలువ రేటు ప్రకారం వారు ఉత్పాదితంలో చేర్చే అదనపు విలువ 100 పౌండ్ల విలువకు సమానం. వారు నిరంతరాయంగా చలామణిలోకి 5 వందల పౌండ్లను మాత్రమే నెడుతూ, 6 వందల పౌండ్లను ఎలా వెనక్కి తీసుకో గలుగుతారు? శూన్యం నుంచి ఏదీ రాదు. మొత్తం పెట్టుబడిదారీ వర్గం అంతకు ముందు చలామణిలోకి నెట్టబడనిదాన్ని వెనక్కి తీసుకోలేదు.

10 సార్లు టర్నోవర్ అయినప్పుడు 4 వందల పౌండ్ల మొత్తం 4 వేల పౌండ్ల ఉత్పత్తి సాధనాలను, 1,000 పౌండ్ల శ్రమశక్తిని చలామణిలో ఉంచడానికి సరిపోతుంది. అలాగే 1,000 పౌండ్ల అదనపు విలువను చలామణిలో ఉంచడానికి 100 పౌండ్ల మొత్తం సరిపోతుంది. అయితే ఈ వాస్తవాన్ని ఇక్కడ పరిగణనకు తీసుకోవడం లేదు. డబ్బు మొత్తానికి, అది చలామణిలో ఉంచే సరుకుల విలువ మొత్తానికి మధ్య ఉన్న నిష్పత్తి ఇక్కడ అప్రస్తుతం. కనుక సమస్య యధాతథంగానే ఉంది. అదే మొత్తం నాణేలు అనేకసార్లు చలామణి అయితే తప్ప చలామణిలోకి 5 వేల పౌండ్ల పెట్టుబడిని నెట్టాల్సి ఉంటుంది. అదనపు విలువ డబ్బుగా మార్చడానికి 1,000 పౌండ్లు అవసరమవుతుంది. అది 1,000 పౌండ్లయినా, 100 పౌండ్లయినా ఈ డబ్బు ఎక్కడనుంచి వస్తుందన్నదే ప్రశ్న. ఏది ఏమైనా, చలామణిలోకి నెట్టబడిన డబ్బు పెట్టుబడికి మించి అదనంగా ఉండే డబ్బు అది.

మొదట చూచినప్పుడు అది విడ్డూరంగా కనిపించవచ్చు కాని వాస్తవమేమిటంటే, సరుకుల్లో నిక్షిప్తమైన అదనపు విలువ, డబ్బు రూపంలో తిరిగి చేతికందడానికి ఉపకరించే డబ్బును చలామణిలోకి నెట్టేది పెట్టుబడిదారీ వర్గమే. అయితే ఇక్కడ ఓ విషయం గమనించాలి. అది దాన్ని అడ్వాన్స్ చేయబడిన డబ్బుగా, అంటే పెట్టుబడిగా చలామణిలోకి నెట్టదు. ఆ వర్గం తన వ్యక్తిగత వినియోగానికి అవసరమైన కొనుగోళ్ళ సాధనంగా దాన్ని ఖర్చు పెడుతుంది. కాబట్టి పెట్టుబడిదారీ వర్గం చలామణికి ప్రారంభ బిందువే అయినప్పటికీ, ఈ డబ్బును అడ్వాన్స్ చేసింది అది కాదు.

వ్యాపారాన్ని ప్రారంభిస్తున్న ఏదో ఒక వ్యష్టి పెట్టుబడిదారుని తీసుకుందాం. ఉదాహరణకు ఒక వ్యవసాయదారుణ్ణి తీసుకుందాం. మొదటి సంవత్సరంలో అతను 5 వేల పౌండ్ల డబ్బు పెట్టుబడిని అడ్వాన్స్ చేశాడనుకుందాం. దానిలో 4 వేల పౌండ్లను ఉత్పత్తి సాధనాలకు, 1,000 పౌండ్లను శ్రమశక్తికి వెచ్చించాడనుకుందాం. అదనపు విలువ రేటు 100% అయితే, అతను పొందిన అదనపు విలువ మొత్తం 1,000 పౌండ్లు అవుతుంది.  పైన పేర్కొన్న 5 వేల పౌండ్లు అతను డబ్బు పెట్టుబడిగా అడ్వాన్స్ చేసిన మొత్తం డబ్బు. అయితే ఆ మనిషి కూడా బతకాలి. ఏడాది చివరివరకూ అతను దానినుంచి ఏమీ డబ్బును తీసుకోడు. అతని వినియోగం 1,000 పౌండ్లని అనుకుందాం. ఆ డబ్బు అతని వద్ద ఉండాలి. మొదటి సంవత్సరంలో తనకోసం తాను ఈ 1,000 పౌండ్లను అడ్వాన్స్ చేయాల్సి ఉంటుందని అతను చెప్పవచ్చు. అయితే ఈ అడ్వాన్స్‌కి ఇక్కడ స్వీయాత్మకమైన అర్థం మాత్రమే ఉంది. అంటే అతను తన వ్యక్తిగత వినియోగం కోసం ఆ ఏడాదిలో తన కార్మికులు ఉచితంగా చేసే ఉత్పత్తి నుండి కాకుండా, తన జేబునుండే ఖర్చు చేయాల్సి ఉంటుందని అర్థం. ఈ డబ్బును అతను పెట్టుబడిగా అడ్వాన్స్ చేయడు, అతను దాన్ని ఖర్చుచేస్తాడు. అతను స్వయంగా వినియోగం చేసే జీవితావసర వస్తువులకు సమానమైన మొత్తాన్ని చెల్లిస్తాడు. ఈ విలువను అతను డబ్బు రూపంలో ఖర్చు చేస్తాడు. ఈ విలువను చలామణిలోకి నెట్టి చలామణి నుంచి సరుకు విలువల రూపంలో తీసేసుకొంటాడు. ఈ సరుకు విలువలను అతను వినియోగం చేస్తాడు. కనుక వాటి విలువతో అతనికి ఇక ఎటువంటి సంబంధం లేదు. ఈ విలువ కోసం అతను చెల్లించిన డబ్బు ఇప్పుడు చలామణి డబ్బులోని ఒక అంశంగా ఉంది. అయితే అతను ఈ డబ్బు యొక్క విలువను చలామణి రంగం నుంచి ఉత్పాదితాల రూపంలో వెనక్కు తీసుకున్నాడు. ఆ ఉత్పాదితాలతో పాటు వాటిలో ఉండిన విలువ కూడా అంతమైపోయింది. అదంతా అయిపోయింది. అయితే సంవత్సరం

చివర అతను చలామణిలోకి 6 వేల పౌండ్ల సరుకుల్ని పంపుతాడు, వాటిని అమ్ముతాడు. దీనివల్ల అతను తాను అడ్వాన్స్ చేసిన డబ్బు పెట్టుబడి 5 వేల పౌండ్లను, 1,000 పౌండ్ల అదనపు విలువను డబ్బు రూపంలో తిరిగి పొందుతాడు. అతను పెట్టుబడిగా అడ్వాన్స్ చేసింది, చలామణిలోకి నెట్టింది 5 వేల పౌండ్లు, వెనక్కు తీసుకున్నది 6 వేల పౌండ్లు. దానిలో 5 వేల పౌండ్లు అతని పెట్టుబడి, 1,000 పౌండ్లు అదనపు విలువ. ఈ చివరి 1,000 పౌండ్ల అదనపు విలువ, అతను స్వయంగా చలామణిలోకి నెట్టిన డబ్బుతోనే డబ్బుగా మార్చబడుతుంది. అది, మొదట అతను వినియోగదారుడుగా ఖర్చు పెట్టిన డబ్బు కానీ పెట్టుబడిదారుగా అడ్వాన్సు చేసినది కాదు. ఇప్పుడు ఆ మొత్తం తాను ఉత్పత్తి చేసిన అదనపు విలువ యొక్క డబ్బు రూపంగా అతనికి తిరిగి వచ్చింది. ఈ కార్యకలాపం ఆ మీదట ప్రతి ఏడాది పునరావృత్తం అవుతుంది. అయితే అది రెండో సంవత్సరం మొదలుకొని, అతడు ఏటా ఖర్చు చేసే 1,000 పౌండ్లు, అతను ఉత్పత్తి చేసిన అదనపు విలువ పరివర్తిత రూపమైన డబ్బు రూపం. అతను దాన్ని ప్రతి ఏడాది ఖర్చు చేస్తాడు. ప్రతి ఏడాది ఆ మొత్తం అతనికి తిరిగి వస్తుంది.

అతని పెట్టుబడి ఏడాదిలో మరింత తరచుగా టర్నోవర్ అయినప్పటికీ, పరిస్థితిలో మార్పు రాదు. కానీ అతడు అడ్వాన్స్ చేసే డబ్బు పెట్టుబడి కాక, అదనంగా, తన వ్యక్తిగత వినియోగం కోసం చలామణిలోకి డబ్బును ఎంత కాలానికి నెట్టాలి, ఆ డబ్బు ఎంత పరిమాణంలో ఉండాలి అనే వాటిపై దీని ప్రభావం ఉంటుంది.

పెట్టుబడిదారు ఈ డబ్బును చలామణిలోకి పెట్టుబడిగా ప్రవేశపెట్టడం లేదు. అయితే, అదనపు విలువ తిరిగి వచ్చేదాకా తన దగ్గరున్న సాధన సంపత్తితో బ్రతకగల్గటం అన్నది, పెట్టుబడిదారుని నిశ్చిత లక్షణం.

ప్రస్తుత ఉదాహరణలో పెట్టుబడిదారు ఉత్పత్తి చేసిన అదనపు విలువకు సమానమైన పెట్టుబడి యొక్క మొదటి ఫలితం తిరిగి వచ్చేదాకా తన సొంత, వ్యక్తిగత వినియోగం కోసం చలామణిలోకి నెట్టే డబ్బు, తను ఉత్పత్తి చేసిన అదనపు విలువకు సమానమనీ, అది ఉత్పత్తి అయిన అదనపు విలువ కనుక డబ్బుగా మారి తీరుతుందనీ మనం ఊహించాము. వ్యష్టి పెట్టుబడిదారునికి సంబంధించినంత వరకు ఇది చిత్తాయత్తంగా చేసిన ఊహ మాత్రమే. అయితే సామాన్య పునరుత్పత్తి జరుగుతున్నట్లు ఊహించినపుడు, ఇది మొత్తం పెట్టుబడిదారీ వర్గం విషయంలో సరైందే అవుతుంది. మొత్తం అదనపు విలువ, అదొక్కటే అనుత్పాదకంగా వినియోగమవుతుంది. మొదట పెట్టిన పెట్టుబడిలో ఏకాస్త కూడా అలా వినియోగం కాదు అనే ఊహలోని విషయాన్నే ఇది వ్యక్తం చేస్తున్నదంతే.

విలువైన లోహాల మొత్తం ఉత్పత్తి (500 పౌండ్లకు సమానం అని అనుకున్నాం.) డబ్బు అరుగుదలను భర్తీ చేయడానికి మాత్రమే సరిపోయిందని ఇంతకుముందు ఊహించుకొన్నాం.

బంగారం ఉత్పత్తి చేసే పెట్టుబడిదారుల చేతిలో ఉన్న మొత్తం ఉత్పాదితం బంగారం రూపంలోనే ఉంటుంది. అంటే స్థిర పెట్టుబడినీ, అస్థిర పెట్టుబడినీ భర్తీ చేసే ఉత్పాదిత భాగం, అలాగే అదనపు విలువ భాగం బంగారం రూపంలోనే ఉంటుంది. కనుక, సామాజిక అదనపు విలువలో ఒక భాగం బంగారమే. అంతేకానీ, చలామణి ప్రక్రియలో బంగారంగా మారిన ఉత్పాదితం కాదు. అది మొదటినించి, బంగారంగానే ఉంటుంది. రంగం నుంచి ఉత్పాదితాలను వెనక్కి తీసుకోవడానికి

చలామణి రంగంలోనికి అది నెట్టబడుతుంది. వేతనాలకు, అస్థిర పెట్టుబడికి అడ్వాన్స్ చేయబడిన స్థిర పెట్టుబడి భర్తీకి ఇదే వర్తిస్తుంది. కనుక పెట్టుబడిదారీ వర్గంలో ఒక భాగం చలామణి రంగంలోకి తాము అడ్వాన్స్ చేసిన డబ్బు పెట్టుబడి కంటే ఎక్కువ (అదనపు విలువ మొత్తం ఉన్న మోతాదులో) విలువయిన సరుకులను ప్రవేశపెట్టగా, పెట్టుబడిదారులలో మరో భాగం చలామణి రంగం నుంచి బంగారం ఉత్పత్తి కోసం, వారు నిరంతరాయంగా వెనక్కి తీసుకునే సరుకుల విలువకంటే ఎక్కువ (అదనపు విలువ మొత్తం ఉన్న మోతాదులో ఎక్కువ) విలువయిన డబ్బును చలామణిలోకి ప్రవేశపెడుతుంది. పెట్టుబడిదారులలో ఒక భాగం చలామణిలో ప్రవేశపెట్టేదాని కంటే ఎక్కువ డబ్బు దాని నుండి ఉపసంహరిస్తున్నారు. పెట్టుబడిదారులలో మరో భాగం, అంటే బంగారం ఉత్పత్తి చేసే భాగం తాము చలామణి రంగం నుంచి వెనక్కి తీసుకునే ఉత్పత్తి సాధనాల కంటే ఎక్కువ మొత్తాన్ని నిరంతరాయంగా దానిలో ప్రవేశపెడుతున్నారు.

ఈ 500 పౌండ్ల ఉత్పాదితంలో ఒక భాగం బంగారం ఉత్పత్తిదారుల అదనపు విలువే అయినప్పటికీ, మొత్తం బంగారం సరుకుల చలామణికి అవసరమైన డబ్బును భర్తీ చేయడానికి మాత్రమే ఉద్దేశింపబడింది. దీనికోసం, ఈ బంగారంలో ఎంత భాగం సరుకులలో ఉన్న అదనపు విలువను డబ్బుగా మారుస్తుంది, ఎంత భాగం వాటిలోని ఇతర విలువ భాగాలను డబ్బుగా మారుస్తుంది అన్నది ఇక్కడ అప్రస్తుతం.

బంగారం ఉత్పత్తిని ఒక దేశం నుండి మరొక దేశానికి బదిలీ చేయటం వల్ల కూడా ఈ విషయం ఏమీ మారదు. క అనే దేశంలో సామాజిక శ్రమశక్తిలోను, సామాజిక ఉత్పత్తి సాధనాలలోనూ ఒక భాగం ఉత్పాదితంగా, ఉదాహరణకు 500 పౌండ్ల విలువయిన వస్త్రంగా మారుతుంది. అది గ అనే దేశంలో బంగారం కొనటం కోసం ఆ దేశానికి ఎగుమతి చేయబడుతుంది. ఆ రకంగా క దేశంలో పనిలో పెట్టబడిన ఉత్పాదక పెట్టుబడి బంగారం ఉత్పత్తిలో ప్రత్యక్షంగా పనిలో నియుక్తమై ఉంటే, క మార్కెట్‌లోకి నెట్టే సరుకుల కంటే ఎక్కువగా అది నెట్టి ఉండేది కాదు. క యొక్క ఈ ఉత్పాదితం బంగారంగా ఉన్న 500 పౌండ్లకి ప్రాతినిధ్యం వహిస్తుంది. కేవలం డబ్బుగానే అది ఆ దేశం చలామణిలోకి ప్రవేశిస్తుంది. ఈ ఉత్పాదితంలో నిక్షిప్తమైన సామాజిక అదనపు విలువ యొక్క భాగం క దేశంలో ప్రత్యక్షంగా డబ్బు రూపంలో ఉంటుంది, మరే రూపంలోనూ ఉండదు. బంగారం ఉత్పత్తి చేసే పెట్టుబడిదారులకు ఉత్పాదితంలో ఒక భాగం మాత్రమే అదనపు విలువకు, మరో భాగం భర్తీ కానున్న పెట్టుబడికి ప్రాతినిధ్యం వహిస్తున్నప్పటికీ, ఈ బంగారంలో ఎంత భాగం చలామణి స్థిర పెట్టుబడి కాకుండా, అస్థిర పెట్టుబడిని భర్తీ చేస్తుంది, ఎంత భాగం అదనపు విలువకు ప్రాతినిధ్యం వహిస్తుంది అన్నది, చలామణిలో ఉన్న సరుకుల విలువకూ వేతనాలూ, అదనపు విలువకూ మధ్య ఉన్న ఆయా నిష్పత్తులపైన ఆధారపడి ఉంటుంది. అదనపు విలువగా ఉన్న భాగం పెట్టుబడిదారీ వర్గంలోని వేరు వేరు సభ్యుల మధ్య పంపిణీ అవుతుంది. ఆ భాగాన్ని వారు నిరంతరాయంగా, వ్యక్తిగతంగా వినియోగించుకుంటూ, కొత్త ఉత్పాదితాల అమ్మకం ద్వారా తిరిగి రాబట్టుకొంటారు. (సరిగ్గా ఈ క్రయ విక్రయాలే అదనపు విలువ డబ్బుగా మారటానికి అవసరమైన డబ్బును చలామణిలో ఉంచుతాయి.) అయినప్పటికీ, పెట్టుబడిదారుల జేబుల్లో, వివిధ నిష్పత్తుల్లోనే కావచ్చు, సామాజిక అదనపు విలువలోని ఒక భాగం డబ్బు రూపంలో ఉంటూనే ఉంటుంది. సరిగ్గా వేతనాలలో ఒక

భాగం కనీసం వారంలో కొన్ని రోజులు కార్మికుల జేబుల్లో డబ్బు రూపంలో ఉన్నట్లుగానే ఇదీ ఉంటుంది. ఈ భాగాన్ని బంగారం ఉత్పత్తి చేసే పెట్టుబడిదారుల అదనపు విలువగా మొదట్లో ఉన్న డబ్బు ఉత్పాదితంలోని భాగం పరిమితం చేయదు. ఇంతకు ముందు చెప్పినట్లుగా, పైన పేర్కొన్న 500 పౌండ్ల ఉత్పాదితం సాధారణంగా పెట్టుబడిదారులకు, కార్మికులకు మధ్య విభజితమయ్యే నిష్పత్తీ, చలామణి కావలసిన సరుకు సరఫరాలో అదనపు విలువకూ, ఇతర విలువలకూ మధ్య ఉన్న నిష్పత్తీ ఈ భాగాన్ని పరిమితం చేస్తాయి.

ఇతర సరుకులలో కాకుండా వాటి ప్రక్కనే డబ్బు రూపంలో ఉండే అదనపు విలువ భాగం, అదనపు విలువ తిరిగి చేతికందడం కోసం, బంగారం వార్షిక ఉత్పత్తిలోని ఒక భాగం ఏ మేరకు చలామణి అవుతుందో ఆ మేరకు మాత్రమే ఉంటుంది. అదనపు విలువ యొక్క డబ్బు రూపంలో వివిధ నిష్పత్తుల్లో పెట్టుబడిదారీ వర్గం చేతుల్లో ఉండే డబ్బులోని మరో భాగం వార్షికంగా ఉత్పత్తి అయ్యే బంగారంలోని భాగం కాదు. దేశంలో అంతకు ముందే సంచితమైన డబ్బు మొత్తంలోని భాగమిది.

మన ఊహ ప్రకారం, వార్షిక బంగారం ఉత్పత్తి అయిన 500 పౌండ్లు డబ్బులోనయ్యే వార్షిక అరుగుదలను మాత్రమే భర్తీ చేస్తుంది. ఈ 500 పౌండ్లను మాత్రమే మనం దృష్టిలో ఉంచుకొని, ఇంతకు ముందే సంచితమైన డబ్బుచేత చలామణి అయ్యే వార్షిక ఉత్పాదిత సరుకుల రాశిలోని భాగాన్ని ప్రస్తుతానికి విస్మరిద్దాం. అప్పుడు సరుకు రూపంలో ఉత్పత్తి అయిన అదనపు విలువ చలామణి ప్రక్రియలో డబ్బుగా మార్చడానికి అవసరమైన డబ్బు ఉందని తేలుతుంది. ఎందుకంటే, మరొకవైపున అదనపు విలువ వార్షికంగా బంగారం రూపంలో ఉత్పత్తి చేయబడుతూ ఉంటుంది. అడ్వాన్స్ చేయబడిన డబ్బు పెట్టుబడిని భర్తీ చేసే 500 పౌండ్ల బంగారు ఉత్పాదితానికి చెందిన ఇతర భాగాలకు కూడా ఇదే వర్తిస్తుంది.

ఇప్పుడు, రెండు విషయాలను ఇక్కడ గమనించాలి.

మొదటిది, పెట్టుబడిదారులు డబ్బుగా ఖర్చు పెట్టిన అదనపు విలువతో పాటు, వారు డబ్బు రూపంలో అడ్వాన్స్ చేసిన అస్థిర, ఇతర ఉత్పాదక పెట్టుబడి కూడా వాస్తవానికి కార్మికులు, అంటే బంగారం ఉత్పత్తిలో నిమగ్నమైన కార్మికులు ఉత్పత్తి చేసినదే. వారు తమకు వేతనాల రూపంలో 'అడ్వాన్స్' చేయబడిన బంగారు ఉత్పాదితంలోని భాగాన్ని మాత్రమే కాక, బంగారం పెట్టుబడిదారుల అదనపు విలువకు ప్రత్యక్షంగా ప్రాతినిధ్యం వహించే బంగారం ఉత్పత్తి భాగాన్ని కూడా కొత్తగా ఉత్పత్తి చేస్తారు. చివరి విషయం, బంగారం ఉత్పత్తి కోసం అడ్వాన్స్ చేయబడిన స్థిర పెట్టుబడి విలువను మాత్రమే భర్తీ చేసే బంగారం ఉత్పాదితపు భాగం సంగతికి వస్తే, అది కార్మికుల ఏడాది పని ద్వారా, డబ్బు రూపంలో (లేదా, స్థూలంగా ఉత్పాదిత రూపంలో) పునఃప్రత్యక్షమవుతుంది. వ్యాపారం ప్రారంభమైనప్పుడు మొదట పెట్టుబడిదారు దాన్ని డబ్బు రూపంలో ఖర్చుపెడతాడు. అది కొత్తగా ఉత్పత్తి అయిన డబ్బు కాదు. అది అంతకు ముందే చలామణిలో ఉన్న సామాజిక ధనరాశిలో భాగం. అయితే కొత్త ఉత్పాదితంచేత, అంటే అదనపు బంగారంచేత అది భర్తీ అయిన మేరకు అది కార్మికుని యొక్క వార్షిక ఉత్పాదితమే. ఇక్కడ కూడా పెట్టుబడిదారు అడ్వాన్స్ చేసే డబ్బు ఆ రూపంలో రంగంపైకి రావడానికి కారణం, కార్మికుడు తన సొంత ఉత్పత్తి సాధనాలకు యజమాని కాకపోవడమూ,

ఉత్పత్తి కాలంలో అతని చేతిలో ఇతర కార్మికులు ఉత్పత్తి చేసే నిత్య జీవితావసర వస్తువులు లేకపోవడమూను.

రెండవది – ఈ 500 పౌండ్లు తిరిగి భర్తీ కావడంతో నిమిత్తం లేకుండా, నిల్వ డబ్బు రూపంలోనూ, చలామణి డబ్బు రూపంలోనూ ఉన్న మొత్తానికి కూడా ఈ 500 పౌండ్ల విషయంలో జరిగిందే జరుగుతుంది. మరింత ఖచ్చితంగా చెప్పాలంటే జరిగి ఉండాలి. ఈ ఉప విభాగం చివర ఈ అంశాన్ని తిరిగి పరిశీలిద్దాం. అయితే దానికి ముందు మరికొన్ని అంశాల్ని పేర్కొనాల్సి ఉంది.

★ ★ ★

మనం టర్నోవర్‌ను పరిశీలిస్తున్నప్పుడు ఒక విషయం గమనించాము. తక్కిన అన్ని పరిస్థితులు యధాతథంగా ఉన్నప్పుడు, టర్నోవర్ కాలాల పరిమాణంలో మార్పులు జరగాలంటే, ఉత్పత్తిని అదే స్థాయిలో నిర్వహించడానికి డబ్బు పెట్టుబడి మొత్తాలలో మార్పులవసరం. కనుక ఈ హెచ్చు, తగ్గులకు అనుగుణంగా డబ్బు చలామణి మారుతూంటే సరిపోతుంది.

పనిదిన పరిమాణం, పని తీవ్రత, ఉత్పాదకత మొదలైన వాటితో సహా ఇతర పరిస్థితులన్నీ యధాతథంగా ఉన్నవని అనుకొందాం. అయితే వేతనాలకు, అదనపు విలువకు మధ్య ఉత్పాదితపు విలువ విభజన భిన్నంగా ఉందని అనుకొందాం. ఫలితంగా మొదటిది పెరిగి రెండవది తరగవచ్చు. లేదా రెండవది పెరిగి మొదటిది తరగవచ్చు. అయితే దీనివల్ల చలామణిలో ఉన్న డబ్బు పరిమాణం ప్రభావితం కాదు. డబ్బు పరిమాణంలో ఎటువంటి హెచ్చు తగ్గులు లేకుండానే ఈ మార్పు జరగవచ్చు. వేతనాలలో సార్వత్రిక పెరుగుదల ఉందనుకొందాం. అంటే, మన ఊహ ప్రకారం, అదనపు విలువ రేటు సార్వత్రికంగా పడిపోతుంది. అయితే దానితోపాటు, మన ఊహ ప్రకారం, చలామణిలో ఉన్న సరుకుల మొత్తం విలువలో మార్పు ఏమీ ఉండదు. ఈ సందర్భంలో అస్థిర పెట్టుబడిగా అడ్వాన్స్ చేయాల్సిన డబ్బు పెట్టుబడి సహజంగానే పెరుగుతుంది. కనుక ఈ పని నిర్వహించే డబ్బు పరిమాణం పెరుగుతుంది. అయితే అదనపు విలువ, దాన్ని తిరిగి చేతికి వచ్చేలా చేసే డబ్బు మొత్తం – ఇవి అస్థిర పెట్టుబడి పాత్ర నిర్వహించడానికి అవసరమైన డబ్బు మొత్తం ఎంత పెరిగిందో సరిగ్గా అంతే తగ్గుతాయి. సరుకు విలువ తిరిగి చేతికందడానికి అవసరమైన డబ్బు మొత్తం మారదు – సరుకు విలువ మారనట్లుగానే; సరుకు ఉత్పత్తి ఖర్చు వ్యష్టి పెట్టుబడిదారునికి పెరుగుతుంది. కానీ దాని సామాజిక ఉత్పత్తి ధర మాత్రం మారదు. విలువలోని స్థిర భాగం అటుంచి, మారేదేమంటే, సరుకుల ఉత్పత్తి ధర వేతనాలుగా, లాభాలుగా విభజితమయ్యే నిష్పత్తి మాత్రమే.

కానీ, అస్థిర డబ్బు పెట్టుబడి ఎక్కువగా వ్యయమయినప్పుడు (డబ్బు విలువ స్థిరంగా ఉన్నట్లు ఇక్కడ భావిస్తున్నాం.) కార్మికుల చేతులలో ఎక్కువ మొత్తంలో డబ్బు ఉంటుంది గదా అనే వాదన ఉంది. దీనివల్ల కార్మికుల వైపునుంచి సరుకులకు గిరాకీ పెరుగుతుంది. దీనివల్ల సరుకుల ధరలు పెరుగుతాయి లేదా వేతనాలు పెరిగితే పెట్టుబడిదారులు సరుకుల ధరలు పెంచుతారు అనవచ్చు. ఈ రెండు సందర్భాలలోనూ వేతనాలలో సార్వత్రిక పెరుగుదల సరుకుల ధరల పెరుగుదలకు దారి తీస్తుంది. కనుక, ధరల పెరుగుదలకు ఏ కారణం చెప్పినా, సరుకుల చలామణికి ఎక్కువ మొత్తంలో డబ్బు అవసరమవుతుంది.

మొదటి సూత్రీకరణకు సమాధానం : వేతనాల పెరుగుదల కారణంగా, ప్రత్యేకించి జీవితావసర వస్తువులకు కార్మికుల నుండి గిరాకీ పెరుగుతుంది. వారివల్ల విలాస వస్తువులకు గిరాకీ అంతకన్నా తక్కువ స్థాయిలో పెరుగుతుంది. లేదా వారు ఇంతకు ముందు వినియోగించని వస్తువులకు గిరాకీ పెరుగుతుంది. నిత్య జీవితావసర వస్తువులకు గిరాకీ పెద్దయెత్తున హఠాత్తుగా పెరగటం వల్ల, తక్షణమే వాటి ధరలు కూడా పెరుగుతాయనడంలో సందేహం లేదు. పర్యవసానం ఏమంటే, సామాజిక పెట్టుబడిలో ఎక్కువ భాగం జీవితావసర వస్తువుల ఉత్పత్తిలో పెట్టబడుతుంది. విలాస వస్తువుల ఉత్పత్తిలో పెట్టుబడులు తగ్గుతాయి. ఎందుకంటే, అదనపు విలువ తరుగుదల మూలంగా, పెట్టుబడిదారులవైపు నుంచి ఈ వస్తువులకు గిరాకీ తగ్గినందువల్ల వాటి ధరలు పడిపోతాయి. మరోవైపున కార్మికులే కొన్ని విలాస వస్తువులను కొనడం వల్ల, ఆ మేరకు వారి వేతనాల పెరుగుదల, జీవితావసర వస్తువుల ధరల పెరుగుదలకు దారితీయదు. విలాస వస్తువుల పాత కొనుగోలుదారుల స్థానాలను కొత్తవారితో భర్తీ చేస్తుంది. అంటే ముందుకంటే ఎక్కువగా విలాస వస్తువులు కార్మికులచేత, మునుపటి కంటే తక్కువ వస్తువులు పెట్టుబడిదారులచేత వినియోగమవుతాయి, అంతే. కొంత ఎగుడుదిగుళ్ళ తరువాత చలామణిలో ఉన్న సరుకుల మొత్తం విలువ మునుపటంతే ఉంటుంది. తాత్కాలిక మార్పిళ్ళకు సంబంధించినంత మేరకు, ఇంతకు ముందు వినియోగింపబడని డబ్బు పెట్టుబడి (సట్టా వ్యాపారాల లోనూ, స్టాక్ ఎక్స్ఛేంజిలోనూ, విదేశాలలోనూ ఉన్న పెట్టుబడి) ఇప్పుడు దేశీయ చలామణిలోకి నెట్టబడటం తప్ప, వీటికి మరే ప్రభావమూ ఉండదు.

రెండవ సూత్రీకరణకు సమాధానం : పెట్టుబడిదారులు తమకు ఇష్టం వచ్చిన రీతిలో సరుకుల ధరలను పెంచగలిగితే, వారు వేతనాలు పెరగనప్పుడు కూడా ఆ పని చేస్తారు. సరుకుల ధరలు పడిపోతే వేతనాలు ఎప్పుడూ పెరగవు. పెట్టుబడిదారీ వర్గం ఇప్పుడు నిర్దిష్టమైన, ప్రత్యేకమైన, స్థానిక పరిస్థితులలో చేస్తున్న విధంగా, అంటే, వేతనాలలో ప్రతి పెరుగుదలను అవకాశంగా తీసుకుని పెట్టుబడిదారులు సరుకుల ధరలను మరింతగా పెంచి, మరింత ఎక్కువ లాభాలను జేబులో వేసుకుంటున్న విధంగా, అన్ని పరిస్థితుల్లోనూ చేయగలిగి ఉంటే అది ట్రేడ్ యూనియన్లను ఎప్పుడూ వ్యతిరేకించేది కాదు.

విలాస వస్తువులకు గిరాకీ పడిపోవడం వల్ల (పెట్టుబడిదారుల కొనుగోలు సాధనాలు తగ్గటంతో వారి నుండి విలాస వస్తువులకు గిరాకీ తగ్గటం వల్ల) పెట్టుబడిదారులు విలాస వస్తువుల ధరలు పెంచుతారు – అన్న తర్కం సరఫరా గిరాకీల నియమాన్ని వింతగా వర్తింప చేయటమే. ఇది కేవలం, విలాస వస్తువుల కొనుగోలుదార్లు మారడం కాదు. అంటే పెట్టుబడిదారులకు బదులు కార్మికులు వాటిని కొనుగోలు చేయడం కాదు. (ఈ మార్పు జరిగిన మేరకు కార్మికుల నుంచి వచ్చే గిరాకీ జీవితావసరాల ధరల పెరుగుదలకు దారితీయదు. ఎందువల్లనంటే, తాము విలాస వస్తువుల కోసం తమ జీవితంలో వెచ్చించే ఆ అదనపు భాగాన్ని జీవితావసర కొనుగోలుకు వెచ్చించలేరు కదా!) కాబట్టి, తగ్గిన గిరాకీ వల్ల విలాస వస్తువుల ధరలు కూడా తగ్గుతాయి. కనుక విలాస వస్తువుల ఉత్పత్తి నుంచి పెట్టుబడి ఉపసంహరించబడుతుంది. సామాజిక ఉత్పత్తి ప్రక్రియలో విలాస వస్తువులు మారిన పాత్రకి అనుగుణంగా వాటి సరఫరా పరిమాణం తగ్గేవరకు ఇది జరుగుతుంది. ఆ రకంగా వాటి ఉత్పత్తి తగ్గటంతో వాటి ధరలు మామూలు స్థాయికి పెరుగుతాయి. (వాటి విలువ ఇతర

కారణాలవల్ల మారని స్థితిలో). ఈ తగ్గుదల లేదా ఈ సమ స్థాయికి రావటమనే పరిణామ క్రమం కొనసాగినంత కాలం, నిత్య జీవితావసర వస్తువుల ధరలు పెరుగుతూ వచ్చినంత కాలం, ఇతర శాఖలనుంచి ఉపసంహరింపబడిన పెట్టుబడి జీవితావసరాల ఉత్పత్తి రంగానికి సరఫరా అవుతూంటుంది. వాటికి గల గిరాకీ తీరేంత వరకు ఇది కొనసాగుతుంది. అప్పుడు మళ్ళీ సమతూకం నెలకొంటుంది. ఈ మొత్తం పరిణామక్రమం తుది పర్యవసానమేమిటంటే, సామాజిక పెట్టుబడి, డబ్బు పెట్టుబడి కూడా నిత్య జీవితావసర వస్తువుల ఉత్పత్తికీ, విలాస వస్తువుల ఉత్పత్తికీ మధ్య విభిన్న నిష్పత్తులలో విభజితమవడం.

మొత్తం అభ్యంతరం అంతా పెట్టుబడిదారులూ, వారి ఆర్థిక వందిమాగధులూ సృష్టించిన బూచి మాత్రమే. మూడు రకాల వాస్తవాలు ఈ బూచికి సాకుగా ఉపయోగపడుతున్నాయి.

1) ఇతర అంశాలన్నీ యధాతథంగా ఉన్నప్పుడు, చలామణిలో ఉన్న సరుకుల ధరల మొత్తం పెరిగితే చలామణిలో ఉన్న డబ్బు పరిమాణం కూడా పెరుగుతుంది అన్నది డబ్బు చలామణి సాధారణ నియమం. ఈ ధరల మొత్తం పెరుగుదల, అదే పరిమాణం గల సరుకులకు వర్తిస్తుందా లేక అంతకంటే ఎక్కువ పరిమాణం గల వాటికి వర్తిస్తుందా అన్న దానితో ఇక్కడ ప్రమేయం లేదు. అప్పుడు కార్యం కారణంగా గందరగోళపడతారు. జీవితావసర వస్తువుల ధరల పెరుగుదలతో పాటు వేతనాలు కూడా పెరుగుతాయి. (ఈ పెరుగుదల ధరల పెరుగుదలకు అనుగుణంగా ఉండటం చాలా అరుదు అనుకోండి.) వేతనాల పెరుగుదల నిజంగా ధరల పెరుగుదల ఫలితమే తప్ప దానికి కారణం కాదు.

2) పాక్షిక లేదా స్థానిక వేతనాల పెరుగుదల విషయంలో, అంటే కొన్ని ఉత్పత్తి శాఖలలో మాత్రమే ఈ పెరుగుదల ఉన్నప్పుడు, దాని ఫలితంగా ఈ శాఖలలోని ఉత్పాదితాల ధరలు స్థానికంగా పెరగవచ్చు. అయితే, ఇది కూడా అనేక పరిస్థితులపై ఆధారపడి ఉంటుంది. ఉదాహరణకు, వేతనాలను మరీ తక్కువ స్థాయిలో ఉండేలా తొక్కిపెట్టకుండా ఉండటం, కాబట్టి లాభం రేటు విపరీతమైన హెచ్చు స్థాయిలో ఉండక పోవడం, ధరల పెరుగుదల మూలంగా, ఈ సరుకులకున్న మార్కెట్ కుంచించుకుపోకుండా ఉండటం (కనుక ధరల పెరుగుదలకు ముందున్న వాటి సరఫరాను తగ్గించ వలసిన అవసరం లేకపోవడం) మొదలైన వాటిపై ఇది ఆధారపడి ఉంటుంది.

3) వేతనాలలో సార్వత్రిక పెరుగుదల ఉన్నప్పుడు ఉత్పత్తి అయిన సరుకుల ధర, అస్థిర పెట్టుబడి ప్రబలంగా ఉన్న పారిశ్రామిక శాఖలలో పెరుగుతుంది; స్థిర పెట్టుబడి, నిశ్చల పెట్టుబడి ప్రబలంగా ఉన్న శాఖలలో పడిపోతుంది.

చలామణి రంగంలో ఏ నిర్దిష్ట పరిమాణంలోనైనా ఉన్న సరుకుల డబ్బు రూపం తాత్కాలికమే అయినప్పటికీ, ఒకరి చేతులలో ఒకానొక సరుకు రూపాంతరం చెందుతున్నప్పుడు డబ్బు తాత్కాలికంగానే మరొకరి చేతులలోకి వెళుతుంది. ఫలితంగా సరుకులు అన్ని దిశల నుంచి మార్పిడి కావడమే కాదు, అంటే ఒకదాని స్థానంలో మరొకటి ప్రవేశించడమే కాదు, ఈ ప్రక్రియకు, అన్నివైపుల నుంచి తోసుకు వచ్చిన డబ్బు దోహదం చేస్తుంది. దాని వెంటనంటి ఉంటుంది. ఈ సంగతిని మనం సరుకుల సాధారణ చలామణిని అధ్యయనం చేసినపుడు (సంపుటి–I, అధ్యాయం–3) గ్రహించాం. "ఒక సరుకు మరొక సరుకు స్థానంలో ప్రవేశించినపుడు డబ్బు – సరుకు ఎప్పుడూ ఏ మూడో వ్యక్తి చేతుల్లోనో ఉంటుంది. చలామణి, ప్రతి రంధ్రం గుండా డబ్బును కక్కుతుంది". (సంపుటి–I) సరుకుల

పెట్టుబడిదారీ ఉత్పత్తి ప్రాతిపదికపై, పెట్టుబడిలో ఒక భాగం స్థిరంగా డబ్బు పెట్టుబడి రూపంలో ఉండటం, అదనపు విలువలో ఒక భాగం దాని సొంతదారుల చేతుల్లో అదే విధంగా డబ్బు - పెట్టుబడి రూపంలో కనిపించడం అన్న వాస్తవం ఇదే విషయాన్ని వ్యక్తం చేస్తుంది.

ఇది కాక, డబ్బు ఆవృత్తి, అంటే డబ్బు తాను బయలుదేరిన ప్రారంభ స్థానానికి తిరిగి రావటం అన్నది పెట్టుబడి టర్నోవర్‌లో ఒక దశ అయినందువల్ల అది డబ్బు చలామణికి[1] పూర్తిగా భిన్నమైన పరిణామ క్రమం, తద్విరుద్ధమైన క్రమం కూడా. డబ్బు పదే పదే చేతులు మారుతూ తన ప్రారంభ స్థానం నుంచి వైదొలగిపోతుందని డబ్బు చలామణి వ్యక్తం చేస్తుంది. (సంపుటం-I) అయినప్పటికీ వేగం అధికంగా ఉన్న టర్నోవర్‌లో డబ్బు చలామణి వేగం అధికంగా ఉంటుందనేది గర్భితం.

మొదట, అస్థిర పెట్టుబడికి సంబంధించిన విషయం : కొంత డబ్బు పెట్టుబడి, ఉదాహరణకు, 500 పౌండ్లు అస్థిర పెట్టుబడి రూపంలో ఏడాదికి 10 సార్లు టర్నోవర్ అయింది అనుకొందాం. చలామణిలో ఉన్న ఈ డబ్బు పరిమాణం తన విలువకు 10 రెట్లు ఎక్కువ విలువను చలామణి చేస్తుంది. అంటే, 5,000 పౌండ్లతో సమానమైన విలువను చలామణి చేస్తుంది. అది పెట్టుబడిదారునికి కార్మికునికి మధ్య 10 సార్లు చలామణి అవుతుంది. ఏడాదిలో ఈ డబ్బునే 10 సార్లు కార్మికునికి చెల్లించడం, అతడు దాన్ని తిరిగి చెల్లించడం జరుగుతుంది. అదే మొత్తం అస్థిర పెట్టుబడి ఏడాదిలో ఒక్కసారే టర్నోవర్ అయితే, ఉత్పత్తి స్థాయి యధాతథంగా ఉన్నప్పుడు, 5,000 పౌండ్ల ఒకే ఒక్క పెట్టుబడి టర్నోవర్ అవుతుంది.

అంతేకాదు : చలామణి పెట్టుబడి యొక్క స్థిర భాగం వెయ్యి పౌండ్లు అనుకొందాం. పెట్టుబడి పదిసార్లు టర్నోవర్ అయింది అనుకొందాం. పెట్టుబడిదారు తన సరుకును, తత్కారణంగా దాని విలువలోని స్థిర చలామణి భాగాన్ని, ఏడాదికి 10 సార్లు అమ్ముతాడు. అదే పరిమాణం గల డబ్బు (1,000 పౌండ్లు) ఏడాదికి దాని యజమానుల చేతుల నుండి పెట్టుబడిదారుని చేతులలోకి 10 సార్లు పోతుంది. ఈ డబ్బు 10 సార్లు చేతులు మారుతుంది. రెండవది, పెట్టుబడిదారు ఉత్పత్తి

---

1. ఈ రెండు అంశాలను ఫిజియోక్రాట్లు ఇప్పటికీ గందరగోళపరుస్తున్నప్పటికి, డబ్బు బయలుదేరిన స్థానానికి తిరిగి రావటం, పెట్టుబడి చలామణి యొక్క అత్యవసర రూపంగా, పునరుత్పత్తిని పెంచే చలామణి రూపంగా నొక్కిచెప్పిన వారిలో వారు ప్రథములు. "Tableau Economique గ్రంథాన్ని ఒకసారి చూడండి. ఉత్పాదక వర్గం తన నుంచి ఇతర వర్గాల ఉత్పాదితాలను కొనటానికి అవసరమైన డబ్బును సమకూరుస్తుందనీ, వారు రెండో ఏడాది అవే కొనుగోళ్ళు చేయటానికి తిరిగి వచ్చినప్పుడు ఆ డబ్బును దానికి తిరిగి చెల్లిస్తారనీ మీరు గ్రహిస్తారు.... కాబట్టి, ఇక్కడ ఉన్న ఆవృత్తి ఒకటే. అది వ్యయాల్ని అనుసరించే పునరుత్పత్తి, పునరుత్పత్తిని అనుసరించే వ్యయం అనే ఆవృత్తి. ఇది వ్యయానికీ పునరుత్పత్తికీ కొలమానమయిన డబ్బు చలామణి నిర్వహించే ఆవృత్తి" (క్వెస్నే, Dialogues sur le commerce et sur les Travaux des Artisans, దిరే కూర్పు, ఫిజియోక్రాట్లు I, పుటలు 208-209). "పెట్టుబడులను ఇలా నిరంతరాయంగా అడ్వాన్స్ చేయడం, అది తిరిగి రావడమే డబ్బు చలామణిగా పేర్కొనబడాలి." "ఈ ఉపయోగకరమైన ఫలప్రదమైన చలామణి సామాజిక శ్రమలన్నింటికీ ఊపిరిపోస్తుంది. రాజకీయ వ్యవస్థ కార్యకలాపాలను, జీవికను సంరక్షిస్తుంది. దానిని, భౌతిక శరీరంలోని రక్త ప్రసరణతో పోల్చడం సరియైనదే." (Turgot, Reflexions, etc. Oeuvres Daire edition సంపుటి-I, పుట 45)

సాధనాలను ఏడాదికి 10 సార్లు కొంటాడు. దీనివల్ల ఆ డబ్బు ఒకరిచేతి నుండి మరొకరిచేతికి మళ్ళీ 10 సార్లు చలామణి అవుతుంది. 1,000 పౌండ్ల డబ్బుతో పారిశ్రామిక పెట్టుబడిదారు 10,000 పౌండ్ల విలువ గల సరుకులను అమ్ముతాడు. తిరిగి 10,000 పౌండ్ల విలువగల సరుకులను కొంటాడు. 1,000 పౌండ్ల డబ్బు 20 చలామణిల ద్వారా 20,000 పౌండ్ల సరుకు సరఫరాను చలామణిలో ఉంచుతుంది.

చివరి అంశం : టర్నోవర్ వేగం పెరగటంతో, అదనపు విలువ తిరిగి చేతికందేలా చేసే డబ్బు భాగం కూడా వేగంగా చలామణి అవుతుంది.

అయితే, డబ్బు చలామణి వేగం పెరిగినప్పటికీ పెట్టుబడి టర్నోవర్ వేగం పెరగనక్కరలేదు. కాబట్టి డబ్బు టర్నోవర్ వేగం కూడా పెరగవలసిన అవసరం లేదు. అంటే డబ్బు చలామణి వేగం పెరిగితే, పునరుత్పత్తి ప్రక్రియ వ్యవధి తగ్గుదలా, ఆ ప్రక్రియ మరింత త్వరత్వరగా పునఃప్రారంభం కావడమూ తప్పనిసరి కాదు.

ఒకే పరిమాణం గల డబ్బుతో ఎక్కువ సంఖ్యలో లావాదేవీలు నిర్వహించబడినప్పుడల్లా, డబ్బు చలామణి వేగం మరింత పెరుగుతుంది. డబ్బు చలామణికి సాంకేతిక సదుపాయాలు మారడం వల్ల కూడా, పెట్టుబడి పునరుత్పత్తి యొక్క అదే కాల వ్యవధుల్లో డబ్బు చలామణి వేగం పెరగవచ్చు. అంతేకాక, సరుకుల వాస్తవ మార్పిడులకు ప్రాతినిధ్యం వహించకుండానే, డబ్బు చలామణి అయ్యే లావాదేవీల సంఖ్య పెరగవచ్చు. (అమ్మకం, కొనుగోలు ధరల మధ్య తేడాను చెల్లించే స్టాక్ ఎక్స్చేంజి లావాదేవీలు వగైరా.) మరోవైపున, కొన్ని రకాల డబ్బు చలామణులు అసలే లేకుండాపోవచ్చు కూడా. ఉదాహరణకు వ్యవసాయదారుడే, భూస్వామి అయినప్పుడు రైతుకు, భూస్వామికి మధ్య డబ్బు చలామణి ఉండదు. పారిశ్రామిక పెట్టుబడిదారే పెట్టుబడి సొంతదారుడు అయినప్పుడు అతనికి రుణదాతలకు మధ్య డబ్బు చలామణి ఉండదు.

★ ★ ★

ఒక దేశంలో డబ్బు నిల్వ ఆదిమంగా ఏర్పడటం, దానిని కొద్దిమంది స్వాయత్తం చేసుకోవడం – వీటిని ఇక్కడ వివరంగా చర్చించవలసిన అవసరం లేదు.

వేతన శ్రమ, డబ్బు రూపంలో కార్మికుని వేతనం చెల్లింపు, మొత్తం వస్తు రూపేణా జరిగే చెల్లింపులు డబ్బు రూపేణా చెల్లింపులుగా మారటం – ఇవీ, పెట్టుబడిదారీ ఉత్పత్తి పద్ధతికి ప్రాతిపదిక. కనుక, చలామణికి, దాని తోడ్పాటుతో డబ్బు నిల్వ (రిజర్వు నిధి వగైరాలు) ఏర్పడటానికి తగినంత పరిమాణంలో డబ్బు లభ్యమయ్యే దేశంలో మాత్రమే, పెట్టుబడిదారీ ఉత్పత్తి పద్ధతి మరింత విస్తృత స్థాయిని, మరింత పరిపూర్ణతను సాధించగలుగుతుంది. ఇది చారిత్రక నిర్దేశం. అయితే, దీన్నిబట్టి మొదట చాలినంత డబ్బు నిల్వ అయిందని, ఆ తరువాతనే పెట్టుబడిదారీ ఉత్పత్తి ప్రారంభమయిందనీ అనుకోరాదు. పెట్టుబడిదారీ ఉత్పత్తి, తనకు అవసరమైన పరిస్థితులు పెంపొందడంతో పాటు అభివృద్ధి చెందుతుంది. ఈ పరిస్థితులలో ఒకటి, విలువైన లోహాలు లభ్యం కావటం, కనుకనే, 16వ శతాబ్దం నుంచి విలువైన లోహాల సరఫరా పెరగటం, పెట్టుబడిదారీ ఉత్పత్తి అభివృద్ధి చరిత్రలో ఒక ప్రధానమైన అంశంగా ఉంది. అయితే పెట్టుబడిదారీ ఉత్పత్తి ప్రాతిపదికపై అవసరమైన విలువైన లోహాల ఇతోధిక

సరఫరాకు సంబంధించినంత వరకు, ఒకవైపు, ఉత్పాదితాలలో నిక్షిప్తమైన అదనపు విలువ ఆ ఉత్పాదితాలను డబ్బుగా మార్చుకొనేందుకు అవసరమైన డబ్బు లేకుండానే చలామణిలోకి నెట్టబడుతుందనీ, మరొకవైపు, బంగారం రూపంలో ఉన్న అదనపు విలువ, ముందుగా తదుత్పాదితాలు డబ్బుగా పరివర్తన చెందకుండానే చలామణిలోకి నెట్టబడుతుందనీ మనం గమనిస్తాం.

డబ్బుగా మార్చాల్సిన అదనపు సరుకులకు అవసరమైన డబ్బు మొత్తం దొరుకుతుంది. ఎందుకంటే, అవతలివైపున అదనపు బంగారం (వెండి) సరుకులుగా మార్చబడటానికి, చలామణిలోకి మార్పిడి ద్వారా కాక, ఉత్పత్తి ద్వారానే నెట్టబడ్డాయి.

## II. విస్తృత స్థాయిలో సంచయనమూ, పునరుత్పత్తీ

సంచయనం విస్తృత పునరుత్పత్తి రూపంలో జరుగుతుంది. కనుక, డబ్బు చలామణికి సంబంధించి, అది ఎటువంటి కొత్త సమస్యను సృష్టించదనేది స్పష్టం.

మొదటిది, పెరిగే ఉత్పాదక పెట్టుబడి కార్యకలాపానికి అవసరమైన అదనపు డబ్బు పెట్టుబడికి సంబంధించినంత వరకు, దాన్ని, డబ్బుగా తిరిగి చేతికందని అదనపు విలువలోని ఒక భాగం సరఫరా చేస్తుంది. పెట్టుబడిదారులు ఆదాయం యొక్క డబ్బు రూపంగా కాక, డబ్బు పెట్టుబడి రూపంగా చలామణిలోకి నెట్టే భాగం అది. ఆ డబ్బు అప్పటికే పెట్టుబడిదారుల చేతుల్లో ఉంది. అయితే దాని వినియోగం మాత్రం భిన్నమైనది.

అదనపు ఉత్పాదక పెట్టుబడి పర్యవసానంగా ఇప్పుడు అదనపు సరుకుల రాశి చలామణిలోకి నెట్టబడింది. ఈ అదనపు సరుకుల పరిమాణంతో పాటు, అది తిరిగి డబ్బుగా చేతికందడానికి అవసరమైన అదనపు డబ్బులో ఒక భాగం కూడా చలామణిలోకి నెట్టబడింది. ఈ సరుకుల రాశి యొక్క విలువ, వాటి ఉత్పత్తిలో వినియోగమైన ఉత్పాదక పెట్టుబడి విలువతో సమానమైనది కనుక ఇది జరిగింది. ఈ అదనపు డబ్బు మొత్తం సరిగ్గా అదనపు డబ్బు పెట్టుబడిగా అడ్వాన్స్ చేయబడింది. కనుక అది పెట్టుబడిదారుడికి అతని పెట్టుబడి టర్నోవర్ ద్వారా తిరిగి వస్తుంది. ఇక్కడ, పైన తలెత్తిన ప్రశ్నే పునఃప్రత్యక్షమవుతుంది; సరుకుల రూపంలో అదనంగా ఉన్న అదనపు విలువను వాస్తవ రూపం ధరింపజేసే అదనపు డబ్బు ఎక్కడనుంచి వస్తుంది?

దీనికి మొత్తం మీద సమాధానం మళ్లీ ఇంతకు ముందులాంటిదే. చలామణిలో ఉన్న సరుకుల ధరలు మొత్తం పెరగటానికి కారణం ఒక నిర్ణీత పరిమాణంలోని సరుకుల ధరలు పెరగటం కాదు. ఇప్పుడు చలామణిలో ఉన్న సరుకుల ధరలు తగ్గకుండా, వాటి పరిమాణం మునుపు చలామణిలో ఉన్న దానికన్నా పెరగటమే కారణం. అధిక విలువ గల ఈ అధిక పరిమాణంలోని సరుకులను చలామణిలో ఉంచడానికి అవసరమైన అదనపు డబ్బును, చలామణిలో ఉన్న డబ్బు పరిమాణాన్ని మరింత పొదుపుగా వాడటం వల్ల చేకూర్చవచ్చు; చెల్లింపుల మధ్య సమతూకం ఉండేటట్లు చేయటం ద్వారా, అదే నాణేల చలామణి వేగాన్ని పెంచే చర్యల ద్వారా చేకూర్చవచ్చు. లేదా నిల్వ రూపంలోని డబ్బును, చలామణి సాధనంగా మార్చడం ద్వారా కూడా అదనపు డబ్బు చేకూర్చవచ్చు. ఇలా మార్చడమంటే అర్థం, పని లేకుండా ఉన్న డబ్బు పెట్టుబడి కొనుగోలు సాధనంగాను, చెల్లింపు సాధనంగానూ పని చేస్తున్నదని మాత్రమే కాదు. అప్పటికే రిజర్వు నిధిగా తన యజమానికి, పని

చేస్తున్న డబ్బు పెట్టుబడి, సమాజానికి సంబంధించి, చురుకుగా చలామణి ద్వారా (నిరంతరాయంగా అప్పు ఇవ్వబడే బ్యాంకు డిపాజిట్ల లాగా) ద్వంద్వ విధులను నిర్వహిస్తుందని మాత్రమే కాదు. స్తబ్ధుగా ఉన్న నాణెపు రిజర్వు నిధులు మరింత పొదుపుగా వాడబడుతున్నాయని కూడా దీని అర్థం.

"డబ్బు నిరంతరాయంగా నాణేల రూపంలో ప్రవహించడానికి, నాణేలు నిరంతరాయంగా డబ్బు రూపంలో గడ్డకట్టాలి. నాణేల నిరంతరాయమైన చలామణి, అవి చిన్న లేదా పెద్ద మొత్తాలలో, నాణేల రిజర్వు నిధులలో నిరంతరాయంగా స్తంభించటంపైన ఆధారపడి ఉంటుంది. ఈ రిజర్వు నిధులు చలామణి రంగమంతటా తల ఎత్తుతాయి; చలామణిని ఆవశ్యకమైనదిగా చేస్తాయి కూడా. ఈ నిధులు రూపొందటం, పంపిణీ కావటం, అంతరించటం, తిరిగి రూపొందటం అన్నవి నిరంతరం ఒకదాని తరువాత ఒకటి జరుగుతూ ఉంటాయి. వాటి అస్తిత్వం స్థిరంగా అంతర్థానమవుతూ ఉంటుంది. వాటి అంతర్థానం స్థిరంగా అస్తిత్వంలో ఉంటుంది. నాణెం డబ్బుగాను, డబ్బు నాణెంగానూ అనంతంగా జరిగే ఈ రూపాంతరీకరణను ఆడమ్ స్మిత్ ఇలా వ్యక్తం చేశాడు, 'సరుకుల యొక్క ప్రతి యజమాని తను అమ్మే ప్రత్యేకమైన సరుకుతో పాటు తాను కొనటానికి వీలుగా కొంత పరిమాణంలో సార్వత్రిక సరుకు కూడా అతని వద్ద ఉంచుకోవాలి.' స-డ-స చలామణిలో రెండవ భాగమయిన డ-స వరుసగా జరిగే కొనుగోళ్ళుగా నిరంతరం విడిపోతుంది. ఆ కొనుగోలు ఒకేసారి జరగదు. వరుసగా కొన్ని వ్యవధుల్లో జరుగుతుంది. ఫలితంగా డ లోని ఒక భాగం నాణెంగా చలామణిలో ఉండగా, మరో భాగం డబ్బుగా నిశ్చలంగా ఉంటుంది. నిజానికి ఆ డబ్బు ఆ సందర్భంలో స్తంభించిన నాణెం. చలామణిలో ఉన్న నాణేల రాశిలోని విడి భాగాలు ఒకప్పుడు ఒక రూపంలోను, మరొకప్పుడు మరో రూపంలోను ఒకదాని తరువాత ఒకటి నిరంతరాయంగా కనిపిస్తాయి. కనుక చలామణి సాధనంగా ఇలా మొదటిసారిగా డబ్బుగా మారటం అన్నది, డబ్బు చలామణి తాలూకు సాంకేతిక అంశం మాత్రమే." (కార్ల్ మార్క్స్, Zur Kritik der politisehen oekonomie, 1859) (డబ్బుకు భిన్నమైన అంశంగా ఇక్కడ 'నాణెం' కేవలం చలామణి సాధనంగా వ్యవహరించే డబ్బును అంటే, తన ఇతర విధులకు భిన్నమైన ఈ విధిని నిర్వహించే డబ్బును సూచించడానికి వాడబడింది.)

ఈ చర్యలన్నీ చాలనప్పుడు అదనపు బంగారాన్ని ఉత్పత్తి చేయాల్సి ఉంటుంది. లేదా అదనపు ఉత్పాదితాల్లో ఒక భాగాన్ని విలువయిన లోహాలు ఉత్పత్తి చేసే దేశాల ఉత్పాదితమైన బంగారంతో మార్పిడి చేయాల్సి ఉంటుంది. ఈ రెంటిలో ఏది చేసినా ఒకటే.

చలామణి సాధనాలుగా ఉద్దేశించబడిన వెండి, బంగారాల వార్షిక ఉత్పత్తిలో వ్యయమైన మొత్తం శ్రమశక్తీ, సామాజిక ఉత్పత్తి సాధనాలూ పెట్టుబడిదారీ విధానం, అంటే సరుకుల సర్వ సాధారణ ఉత్పత్తి భరించే పై ఖర్చుల్లో అదే ఒక పెద్ద మొత్తం. ఇది, సాధ్యమయినన్ని ఉత్పత్తి, వినియోగ అదనపు సాధనాల యొక్క, అంటే వాస్తవ సంపద యొక్క సామాజిక వినియోగం నుంచి గ్రహించిన తత్తుల్యమైన మొత్తం. వ్యయభారంతో కూడుకున్న ఈ చలామణి యంత్రాంగం ఖర్చులు తగ్గిన మేరకు, ఉత్పత్తి స్థాయి, దాని విస్తరణ స్థిరంగా ఉన్న స్థితిలో, సామాజిక శ్రమ యొక్క ఉత్పాదక శక్తి తదనుగుణంగా పెరుగుతుంది. కనుక పరపతి వ్యవస్థతో పాటు అభివృద్ధి చెందే సదుపాయాలు ఈ ఫలితమిచ్చిన మేరకు అవి పెట్టుబడిదారీ సంపదను ప్రత్యక్షంగా పెంచుతాయి.

నిజమైన డబ్బు జోక్యం లేకుండానే సామాజిక ఉత్పత్తి, శ్రమ ప్రక్రియల్లో గణనీయమైన భాగాన్ని నిర్వహించటం ద్వారా లేక వాస్తవంగా పని చేస్తున్న డబ్బు పరిమాణం యొక్క విధి నిర్వాహక శక్తిని పెంచడం ద్వారా అలా పెంచుతాయి.

పెట్టుబడిదారీ ఉత్పత్తి దాని ప్రస్తుత పరిమాణంలో, పరపతి వ్యవస్థ లేకుండా (కేవలం ఈ దృష్టితో మాత్రమే చూచినప్పటికీ) అంటే, లోహపు నాణెం చలామణి ద్వారా మాత్రమే సాధ్యమా అన్న అసంబద్ధ ప్రశ్నకు కూడా దీనితో సమాధానం ఇచ్చినట్లే. అది సాధ్యం కాదనేది విదితమే. విలువైన లోహాల ఉత్పత్తి పరిమాణం దానికొక అడ్డంకిగా తయారై ఉండేది. మరోవైపు, పరపతి వ్యవస్థ డబ్బు పెట్టుబడిని సరఫరా చేస్తున్న కారణాన లేదా చలామణిలో ఉంచుతున్న కారణాన, పరపతి వ్యవస్థ యొక్క ఉత్పాదక శక్తిని గురించి లేనిపోని భ్రమలు పెట్టుకోరాదు. ఈ విషయాన్ని ఇంతకన్నా లోతుగా విశ్లేషించడం ఇక్కడ అప్రస్తుతం.

★ ★ ★

నిజమైన సంచయనం, అంటే ఉత్పత్తి స్థాయి యొక్క ప్రత్యక్ష విస్తరణ ఏదీ జరగకుండా, డబ్బుగా చేతికందిన అదనపు విలువ, ఉత్తరోత్తరా, ఉత్పాదక పెట్టుబడిగా మార్చబడటం కోసం, డబ్బు రిజర్వు నిధిగా సంచితమయ్యే సందర్భాన్ని ఇప్పుడు పరిశీలించవలసి ఉంది.

అలా సంచితమైన డబ్బు అదనపు డబ్బుగా ఉన్న మేరకు, ఆ విషయాన్ని వివరించాల్సిన అవసరం లేదు. బంగారం ఉత్పత్తి చేసే దేశాల నుండి తెచ్చిన అదనపు బంగారంలో అదొక భాగం, అంతే. ఈ సందర్భంలో బంగారంతో మార్పిడి అయిన స్వదేశ ఉత్పాదితం ఆ దేశంలో లేదు. అది బంగారం కోసం ఇతర దేశాలకు ఎగుమతి అయింది.

అయితే మునుపున్నంత పరిమాణంలోనే డబ్బు దేశంలో ఇప్పుడూ ఉందని అనుకుంటే సంచయనం అయిన, సంచయనం అవుతున్న డబ్బు చలామణి నుంచి సమకూడిందని అనుకోవచ్చు. దాని క్రియ మాత్రమే మారింది. అది చలామణిలో ఉన్న డబ్బు రూపం నుండి డబ్బు పెట్టుబడి కాగలిగిన రూపానికి క్రమక్రమంగా మార్చబడింది.

ఈ సందర్భంలో సంచయనమైన డబ్బు అమ్మకమైన సరుకుల డబ్బు రూపం. పైగా అది తమ యజమానులకు అదనపు విలువగా ఉన్న వాటి విలువ భాగం (ఇక్కడ పరపతి వ్యవస్థ లేదనుకొందాం). ఈ డబ్బును సంచయనం చేసిన పెట్టుబడిదారు కొనుగోలు చేయకుండా ఆ మేరకు అమ్మాడు అన్నమాట.

దీన్ని కేవలం ఒక విడి పరిణామంగా పరిగణిస్తే, ఇందులో వివరించాల్సింది ఏమీ లేదు. పెట్టుబడిదారులలో ఒక భాగం ఉత్పాదితాల అమ్మకం ద్వారా చేతికందిన డబ్బులో ఒక భాగాన్ని తన వద్ద ఉంచుకొంటారు. దానితో మార్కెట్ నుంచి ఉత్పాదితాలను ఉపసంహరించరు. మరొకవైపున పెట్టుబడిదారుల్లో మరో భాగం తమ డబ్బును పూర్తిగా ఉత్పాదితాలుగా మారుస్తారు. వ్యాపారం నడవడానికి పదే పదే అవసరమైన డబ్బు పెట్టుబడిని మాత్రం దగ్గర ఉంచుకొంటారు. ఉత్పాదితాల్లో మార్కెట్‌లోకి అదనపు విలువ వాహికలుగా నెట్టబడిన ఒక భాగం, ఉత్పత్తి సాధనాలుగా లేదా అస్థిర పెట్టుబడి యొక్క నిజమైన అంశాలుగా, అంటే నిత్య జీవితావసర వస్తువులుగా ఉంటాయి. కనుక

అది ఉత్పత్తి విస్తరణకు తక్షణమే తోడ్పడగలదు. ఎందువల్లనంటే, పెట్టుబడిదారుల్లో ఒక భాగం డబ్బు పెట్టుబడిని సంచయనం చేస్తారనీ, మరొక భాగం తమ అదనపు విలువను మొత్తం వినియోగిస్తారని మనం ఊహించుకోవడం లేదు. ఒక భాగం డబ్బు రూపంలో సంచయనం అవుతుందని, డబ్బు పెట్టుబడిగా వ్యవహరించగలిగిన నిల్వను ఏర్పరచుకొంటుందనీ మరొక భాగం నిజంగా సంచయనం చేయిస్తుందనీ, ఉత్పత్తి స్థాయిని పెంచుతుందనీ, తన ఉత్పాదక పెట్టుబడిని నిజంగా విస్తరింపచేస్తుందనీ మనం ఊహించుకొంటున్నాం. పెట్టుబడిదారులలో ఒక భాగం ఉత్పత్తి స్థాయిని పెంచుతుండగా మరొక భాగం డబ్బును కూడబెడుతున్నప్పటికీ లేదా ఒక భాగం డబ్బును కూడబెడుతుండగా మరో భాగం ఉత్పత్తి స్థాయిని పెంచినప్పటికీ, లభ్యమయ్యే డబ్బు పరిమాణం చలామణి అవసరాలకు సరిపోతుంది. అంతేకాక, ఒకవైపున కూడబెట్టిన డబ్బు నగదు డబ్బు కాకుండా, అతనికి రావలసిన బాకీల రూపంలో అది పోగవుతూ ఉండవచ్చు.

అయితే వ్యష్టి పెట్టుబడిదారు కాక, మొత్తం పెట్టుబడిదారీ వర్గం ఈ డబ్బు పెట్టుబడిని కూడబెట్టుతున్నట్లు మనం ఊహించుకొన్నప్పుడు చిక్కు ఎదురవుతుంది. మన ఊహ ప్రకారం పెట్టుబడిదారీ ఉత్పత్తి సార్వత్రికంగా పూర్తిగా ప్రాబల్యం వహిస్తుంది. అప్పుడు ఈ వర్గం, కార్మికవర్గం మినహా మరో వర్గమేదీ ఉండదు. కార్మికవర్గం కొనగలిగిందంతా కేవలం తమ మొత్తం వేతనాలకు సమానమైన దాన్ని మాత్రమే, అంటే మొత్తం పెట్టుబడిదారీ వర్గం అడ్వాన్స్ చేసిన అస్థిర పెట్టుబడి మొత్తానికి సమానమైనదాన్ని మాత్రమే. కార్మికవర్గానికి తన ఉత్పాదితాన్ని అమ్మడం ద్వారానే పెట్టుబడిదారీ వర్గానికి ఈ డబ్బు తిరిగి వస్తుంది. దాని అస్థిర పెట్టుబడి ఆ రకంగా తన డబ్బు రూపాన్ని తిరిగి పొందుతుంది. అస్థిర పెట్టుబడి మొత్తం 100 పౌండ్లకు 6 రెట్లు ఉందనుకొందాం. అంటే ఇది ఏడాదిలో అడ్వాన్స్ చేయబడిన మొత్తం కాదు. వినియోగించబడిన అస్థిర పెట్టుబడి అన్నమాట. ఈ అస్థిర పెట్టుబడిని ఏడాదిలో అడ్వాన్స్ చేయడానికి, టర్నోవర్ వేగాన్నిబట్టి ఎంత డబ్బు అవసరమవుతుందనేది, ఇక్కడ పరిశీలిస్తున్న సమస్యకు సంబంధించినది కాదు. 100 పౌండ్లకు 'ర' రెట్లు మొత్తంతో పెట్టుబడిదారీ వర్గం ఒక నిర్దిష్ట పరిమాణంలో శ్రమశక్తిని కొంటుంది లేదా ఒక నిర్దిష్ట సంఖ్యలోని కార్మికులకు వేతనాలు చెల్లిస్తుంది – ఇది మొదటి లావాదేవీ. కార్మికులు ఈ మొత్తంతోనే పెట్టుబడిదారుల నుంచి ఒక నిర్దిష్ట పరిమాణం గల సరుకులను కొంటారు. కాగా 100 పౌండ్లకు 'ర' రెట్లు మొత్తం కార్మికులకు, స్థిర పెట్టుబడిలో ఒక భాగాన్ని కొనగలిగిన శక్తిని ఎప్పటికీ ఇవ్వదు. పెట్టుబడిదారీ వర్గం యొక్క అదనపు విలువకు ప్రాతినిధ్యం వహించే భాగం గురించి వేరే చెప్పాల్సిన పనిలేదు. ఈ 100 పౌండ్ల 'ర' రెట్లు మొత్తంతో కార్మికులు సామాజిక ఉత్పాదితం యొక్క విలువలో ఒక భాగం, అంటే అడ్వాన్స్ చేయబడిన అస్థిర పెట్టుబడి విలువకు సమానమైన భాగాన్ని మాత్రమే వారు కొనగలుగుతారు.

అదనంగా ప్రవేశపెట్టబడిన విలువైన లోహం వేరు వేరు పెట్టుబడిదారుల మధ్య, ఏదో ఒక నిష్పత్తిలో పంపిణీ అయిన సంగతి, డబ్బు ఇలా సార్వత్రికంగా సంచయనం కావడం వ్యక్తం చేస్తోంది. అంతే తప్ప మరేమీ కాదు. మరి, మొత్తం పెట్టుబడిదారీ వర్గం డబ్బును ఎలా సంచయనం చేస్తుందని అనుకోవాలి?

వారంతా తమ ఉత్పాదితంలో కొంత భాగాన్ని అమ్మి, తాము మాత్రం ఏమీ కొనుగోలు చేయకుండా ఉండాలన్నమాట. వారందరికీ కొంత డబ్బు నిధి ఉంచటం, దాన్ని వారు తమ వినియోగం కోసం చలామణి సాధనంగా చలామణిలోకి నెట్టడం, చలామణి నుంచి దానిలో కొంత భాగం వారిలో ప్రతి ఒక్కరికి తిరిగి రావటం అనే వాస్తవంలో అంతుపట్టని విషయమేమీ లేదు. అటువంటప్పుడు, ఈ డబ్బు నిధి, అదనపు విలువను డబ్బుగా మార్చిన ఫలితంగా ఏర్పడిన చలామణి నిధిగానే ఉంటుంది. అంతేకాని అది ఏ రకంగానూ డబ్బు పెట్టుబడి కాగలిగిన స్థితిలో ఉండదు.

వాస్తవంలో జరిగేదేమిటనే దృష్టితో పరిశీలిస్తే, భవిష్యత్తులో ఉపయోగించేందుకోసం సంచితమై, డబ్బు పెట్టుబడి కాగలిగిన స్థితిలో ఉన్నది, కింద పేర్కొన్నవని తెలుస్తున్నది :

1) బ్యాంకులలో డిపాజిట్లు : బ్యాంక్ నిజంగా వాడుకోగలిగిన చాలా చిన్న మొత్తమిది. డబ్బు పెట్టుబడి ఇక్కడ నామమాత్రంగానే సంచితమయి ఉంటుంది. వాస్తవంగా సంచితమయినది డబ్బుపై హక్కులు మాత్రమే. వాటిని డబ్బుగా మార్చుకోవీలుందంటే (అలా ఎప్పుడైనా మార్చుకోవడమే జరిగితే) అందుకు కారణం బ్యాంక్ నుంచి ఉపసంహరించబడే డబ్బుకూ, డిపాజిట్ అయ్యే డబ్బుకూ కొంత సమతూకం ఉండటమే. కేవలం సాపేక్షంగా చిన్న మొత్తాన్ని మాత్రమే బ్యాంక్ డబ్బు రూపంలో తన చేతిలో ఉంచుకుంటుంది.

2) ప్రభుత్వ సెక్యూరిటీలు : ఇవి పెట్టుబడి కానేకాదు. జాతి యొక్క వార్షిక ఉత్పాదితంపైన హక్కులు మాత్రమే.

3) కంపెనీ వాటాలు : బూటకమైనవి, కానీ వాటాలు ఏదో ఒక కంపెనీ యొక్క నిజమైన పెట్టుబడిపై యాజమాన్యపు హక్కు పత్రాలు, వార్షికంగా దాని నుండి వచ్చే అదనపు విలువపై డ్రాఫ్టులు.

ఈ సందర్భాల్లో దేనిలోనూ డబ్బు సంచయనం లేదు. ఒకవైపున డబ్బు పెట్టుబడి సంచయనంగా కన్పించేది, మరోవైపున నిరంతరం వాస్తవంగా జరిగే డబ్బు వ్యయం. ఆ డబ్బు దాని యజమాని చేతిలో ఖర్చు అయినదా లేక అతన్నించి అప్పు తీసుకున్నవారి చేతుల్లో ఖర్చు అయినదా అన్నది ఇక్కడ ముఖ్యం కాదు.

పెట్టుబడిదారీ ఉత్పత్తి ప్రాతిపదికపై నిల్వ డబ్బు రూపొందటమే పరమ లక్ష్యం కాదు. అది చలామణి స్తంభించటం వల్ల కాని (మామూలుకన్నా ఎక్కువగా ఉన్న డబ్బు నిల్వ డబ్బు రూపం ధరిస్తుంది), టర్నోవర్‌ను బట్టి అవసరమైన సంచయనాల వల్ల కానీ ఏర్పడినదే. చివరి విషయం, తాత్కాలికంగా గుప్తరూపంలో ఉన్నట్టి, ఉత్తరోత్తరా ఉత్పాదక పెట్టుబడిగా పని చేయడానికి ఉద్దేశించినట్టి డబ్బు పెట్టుబడే.

కనుక, ఒకవైపున డబ్బుగా తిరిగి చేతికందిన అదనపు విలువ భాగం చలామణి నుంచి ఉపసంహరించబడి నిల్వ డబ్బుగా సంచితమయితే, అదనపు విలువలోని మరో భాగం, అదే సమయంలో నిరంతరాయంగా ఉత్పాదక పెట్టుబడిగా మార్చబడుతూంటుంది. అదనంగా ఉన్న విలువైన లోహాలు పెట్టుబడిదారీ వర్గ సభ్యుల మధ్య పంపిణీ కావటం వల్ల, డబ్బు రూపంలో సంచయనం, అన్ని స్థానాల్లోనూ ఏకకాలంలో ఎన్నడూ జరగదు.

సరుకుల రూపంలో అదనపు విలువకు ప్రాతినిధ్యం వహించే వార్షిక ఉత్పాదిత భాగానికి వర్తించేదే తదితర భాగానికీ వర్తిస్తుంది. దాని చలామణికి ఒక నిర్దిష్ట మొత్తంలో డబ్బు కావాలి. ఏటా ఉత్పత్తి అయ్యే సరుకుల పరిమాణంలో అదనపు విలువకు ప్రాతినిధ్యం వహించే భాగం లాగానే, ఈ డబ్బు కూడా పెట్టుబడిదారీ వర్గానికి చెందుతుంది. దాన్ని మొదట పెట్టుబడిదారీ వర్గమే చలామణిలోకి నెడుతుంది. దాని చలామణి ద్వారానే ఆ వర్గ సభ్యుల మధ్య దాని పునఃపంపకం నిరంతరం జరుగుతుంది. మొత్తం మీద నాణేల చలామణిలోలాగానే, ఈ మొత్తంలో ఒక భాగం వేరు వేరు స్థానాల్లో స్తంభిస్తుంది. ఆ స్థానాలు కూడా నిరంతరం మారుతుంటాయి. కాగా మరొక భాగం నిరంతరాయంగా చలామణిలో ఉంటుంది. ఈ సంచయనంలో ఒక భాగం ఉద్దేశపూర్వకంగా, డబ్బు పెట్టుబడిని రూపొందించటం కోసం జరిగిందా, లేదా అన్నదానితో ఇక్కడ ప్రమేయం లేదు.

ఒక పెట్టుబడిదారు ఇతరుల అదనపు విలువలో ఒక భాగాన్ని లేదా పెట్టుబడిలో భాగాన్ని సైతం గుంజుకోవడం ద్వారా డబ్బు పెట్టుబడి, ఉత్పాదక పెట్టుబడుల ఏకపక్ష సంచయనం, వాటి కేంద్రీకరణ సంభవమే. అలాంటి చలామణి దుస్సాహసాల గురించి ఇక్కడ మనం చర్చించటం లేదు. ఉదాహరణకు 'క' డబ్బు పెట్టుబడిగా సంచయనం చేసిన అదనపు విలువలోని కొంత భాగం, 'గ' యొక్క అదనపు విలువ నుండి గుంజుకోబడినది అయి ఉండవచ్చు. అది అతనికి తిరిగిరాదు.

★ ★ ★

## మూడవ భాగం

# మొత్తం సామాజిక పెట్టుబడి యొక్క పునరుత్పత్తీ, చలామణీ

## అధ్యాయం - 18[1]

# ఉపోద్ఘాతం

### 1. పరిశోధితాంశం

పెట్టుబడి యొక్క ప్రత్యక్ష ఉత్పత్తి ప్రక్రియ ఏమిటంటే, దాని శ్రమ ప్రక్రియ, స్వయం - విస్తరణ ప్రక్రియ; ఈ ప్రక్రియ ఫలితమేమో సరుకు - ఉత్పాదితం; దాని నిర్ణయాత్మక ప్రేరణ మాత్రం అదనపు విలువ ఉత్పత్తి.

పెట్టుబడి యొక్క పునరుత్పత్తి క్రమంలో ఈ ప్రత్యక్ష ఉత్పత్తి క్రమంతో పాటు అసలైన చలామణి ప్రక్రియకు సంబంధించిన రెండు దశలు కూడా ఉన్నాయి; అంటే, పెట్టుబడి టర్నోవర్‌గా ఉన్న మొత్తం ఆవృత్తి క్రమమే, నియమిత కాలవ్యవధుల్లో నిరంతరం మళ్ళీ మళ్ళీ జరిగే ఆ క్రమమే దాని పునరుత్పత్తి క్రమమన్నమాట.

మనం ఆవృత్తిని డ....డ' రూపంలో కానీ, ఉ.పె..... ఉ.పె. రూపంలో కానీ, ఏ రూపంలో అధ్యయనం చేసినప్పటికీ ఉ.పె. అనే ఉత్పత్తి ప్రత్యక్ష క్రమం ఎల్లప్పుడూ ఈ ఆవృత్తిలో ఒక లంకెగానే ఉంటుంది. అది ఒక రూపంలో చలామణి ప్రక్రియకు దోహదకారిగా కనిపిస్తుంది; కాగా మరో రూపంలోనేమో చలామణి ప్రక్రియ దానికి దోహదకారిగా కనిపిస్తుంది. ఇందులో ఏ సందర్భంలోనైనా దాని నిరంతరాయ పునరుద్ధరణనూ, ఉత్పాదక పెట్టుబడిగా, పెట్టుబడి నిరంతరాయం పునః పునస్సాక్షాత్కారాన్ని, చలామణి ప్రక్రియలో దాని రూప పరివర్తనలు నిర్ణయిస్తాయి. మరోవైపు, చలామణి రంగంలో పెట్టుబడి మళ్ళీ మళ్ళీ రూప పరివర్తనలకు సదా లోనుకావాలంటే, అది డబ్బు పెట్టుబడిగానూ, సరుకు పెట్టుబడిగానూ మళ్ళీ మారి రంగంపైకి రావాలంటే, ఉత్పాదక ప్రక్రియ నిరంతరాయంగా పునరుద్ధరింపబడుతూండటం అవసరం.

కానీ ప్రతి వ్యష్టి పెట్టుబడిదారూ పెట్టుబడిదారీ వర్గంలోని వ్యష్టి అంశంగా ఉన్నట్లే, ప్రతి వ్యష్టి

1. రాతప్రతి-II నుంచి - ఫ్రెడరిక్ ఎంగెల్స్

పెట్టుబడీ మొత్తం సామాజిక పెట్టుబడిలోని వ్యష్టీకృత విభాగంగా, తన ప్రత్యేక మనుగడ సంతరించుకొన్న విభాగమా అన్నట్లుగా ఉంటుంది. సామాజిక పెట్టుబడి చలనం అన్నది దాని వ్యష్టీకృత భాగాల యొక్క చలనాల సమాహారం, వ్యష్టి పెట్టుబడుల టర్నోవర్ల సమాహారం. వ్యష్టి సరుకు రూపాంతరీకరణ, సరుకు ప్రపంచ రూపాంతరీకరణ పరంపరలో, అంటే సరుకుల చలామణిలో – ఒక లంకెగా ఉన్నట్టే, వ్యష్టి పెట్టుబడి రూపాంతరీకరణ, దాని టర్నోవరు, సామాజిక పెట్టుబడి తాలూకు ఆవృత్తిలో ఒక లంకెగా ఉంటుంది.

ఈ సంపూర్ణ ప్రక్రియలో ఉన్నవివీ : ఉత్పాదక వినియోగమూ (ఉత్పాదన ప్రత్యక్ష ప్రక్రియ), దానితోపాటు ఆ వినియోగానికి దారితీసే రూప పరివర్తనలూ (పాదార్థిక దృష్ట్యా ఇవి మార్పిడులు), వ్యష్టి వినియోగం, దానితోపాటు ఆ వినియోగానికి దారితీసే రూప పరివర్తనలు లేదా మార్పిడులు. ఈ సంపూర్ణ ప్రక్రియలో ఒకవైపు, అస్థిర పెట్టుబడి శ్రమశక్తిగా మారడం ఉంది. కాబట్టి పెట్టుబడిదారీ ఉత్పత్తి ప్రక్రియలో శ్రమ–శక్తి అంగాంగికంగా పొందుపడటం ఉంది. ఇక్కడ కార్మికుడు తన సరుకు అయిన శ్రమశక్తిని అమ్ముకునేవాడిగా వ్యవహరిస్తాడు; కాగా పెట్టుబడిదారు శ్రమశక్తి కొనుగోలుదారుగా వ్యవహరిస్తాడు. కానీ, మరోవైపేమో, సరుకుల అమ్మకం అంటే కార్మికవర్గం వాటిని కొనుగోలు చేయడం కూడా. కాబట్టి వాటి వ్యక్తిగత వినియోగం కూడా. ఇక్కడ కార్మికవర్గం సరుకుల కొనుగోలుదారుగానూ, పెట్టుబడిదారులేమో శ్రామికులకు సరుకుల అమ్మకందారుగానూ కనిపిస్తారు.

సరుకు పెట్టుబడి చలామణిలో, అదనపు విలువ చలామణి కూడా చేరి ఉంది. కాబట్టి పెట్టుబడిదార్ల వ్యక్తిగత వినియోగానికి, కాబట్టి అదనపు విలువ వినియోగానికి వీలు కల్పించే అమ్మకాలు, కొనుగోళ్ళు కూడా అందులో చేరి ఉన్నాయి.

సామాజిక పెట్టుబడిగా ఉన్న మొత్తం వ్యష్టి పెట్టుబడుల ఆవృత్తిని ఆసాంతం తీసుకుని చూస్తే, దాని కిందికి పెట్టుబడి చలామణి మాత్రమే కాక, సరుకుల సాధారణ చలామణి కూడా వస్తుంది. సరుకుల సాధారణ చలామణిలో మౌలికంగా రెండు భాగాలు మాత్రమే ఉండగలవు. 1) పెట్టుబడి ఆవృత్తి 2) వ్యక్తిగత వినియోగంలోకి ప్రవేశించే సరుకుల ఆవృత్తి. కాబట్టి కార్మికుడు వేటికోసం తన వేతనాలను వెచ్చిస్తాడో, పెట్టుబడిదారు తన అదనపు విలువను (లేక అందులో ఒక భాగాన్ని) వెచ్చిస్తాడో అట్టి సరుకుల యొక్క ఆవృత్తి, ఏ విధంగా చూసినప్పటికీ, పెట్టుబడి ఆవృత్తి కిందికి అదనపు విలువ చలామణి కూడా వస్తుంది. ఎందుచేతనంటే, అదనపు విలువ సరుకు పెట్టుబడిలో ఒక భాగం. అదే విధంగా పెట్టుబడి ఆవృత్తిలో అస్థిర పెట్టుబడి శ్రమశక్తిగా మారటం, వేతనాల చెల్లింపు కూడా చేరి ఉంది. అయితే సరుకుల కోసం ఈ అదనపు విలువ, వేతనాలను వెచ్చించడం పెట్టుబడి చలామణిలో – ఒక లంకెగా ఉండదు. అయితే కనీసం వేతనాల వ్యయం ఈ చలామణికి తప్పనిసరిగా అవసరమే.

మొదటి సంపుటంలో, పెట్టుబడిదారీ ఉత్పత్తి ప్రక్రియను వ్యష్టి చర్యగానూ, పునరుత్పత్తి ప్రక్రియగానూ, అంటే అదనపు విలువ ఉత్పత్తిగానూ, పెట్టుబడి ఉత్పత్తిగానూ పరిశీలించి విశ్లేషించాము. చలామణి రంగంలో పెట్టుబడి రూపంలోనూ, అంతస్సారంలోనూ చెందే మార్పులను ఊహించుకొన్నామే కానీ వాటిని లోతుగా పరిశీలించలేదు. పెట్టుబడిదారు ఒకవైపేమో ఉత్పాదితాన్ని దాని విలువకు అమ్ముతాడనీ, మరోవైపేమో ఉత్పత్తి ప్రక్రియను పునఃప్రారంభించడానికి లేక కొనసాగించడానికి

అవసరమైన పాదార్థిక ఉత్పత్తి సాధనాలను చలామణి రంగంలో కనుగొంటాడనీ మనం ముందుగానే ఊహించుకొన్నాము. చలామణి రంగంలో, మనం లోతుగా చర్చించిన ఏకైక చర్య ఏమిటంటే, పెట్టుబడిదారీ ఉత్పత్తికి మౌలికంగా ఆవశ్యకమైన శ్రమశక్తి అమ్మకమూ, కొనుగోలూను.

ఈ రెండవ సంపుటం మొదటి భాగంలో, పెట్టుబడి తన వృత్తాకార చలనంలో ధరించే వివిధ రూపాలు, ఆ చలనం యొక్క వివిధ రూపాలు పరిశీలించబడ్డాయి. మొదటి సంపుటంలో చర్చింపబడిన పనికాలానికి ఇప్పుడు చలామణి కాలం కూడా చేర్చాలి.

ఈ సంపుటం రెండవ భాగంలో, ఆవృత్తిని, నియత కాలాల్లో జరిగేదిగా, అంటే టర్నోవర్‌గా పరిశీలించాము. ఒకవైపేమో, పెట్టుబడిలోని వివిధ భాగాలు నిశ్చలమైనవీ, చలామణి అయ్యేవి వివిధ కాల వ్యవధుల్లో, వివిధ పద్ధతుల్లో ఏవిధంగా వివిధ రూపాల ఆవృత్తిని పూర్తిచేస్తాయో చూపబడింది; మరోవైపేమో, పనికీ, చలామణికీ పట్టే వివిధ కాల వ్యవధులను నిర్ణయించే పరిస్థితులు పరిశీలించబడినాయి. ఉత్పత్తి ప్రక్రియల ప్రమాణంపైనా, అదనపు విలువ వార్షిక రేటుపైనా ఆవృత్తి కాలానికీ, దాని అంతర్భాగాల మధ్య గల వివిధ నిష్పత్తులకూ ఉన్న ప్రభావం ఎలాంటిదో చూపించాము. వాస్తవానికి మొదటి భాగంలో పెట్టుబడి తన ఆవృత్తిలో నిరంతరం, వరుసగా ధరించి, విసర్జించే రూపాలను పరీక్షించి చూచాము. రెండవ భాగంలోనేమో, నిర్ణీత ప్రమాణం గల పెట్టుబడి ఏకకాలంలో, అయితే వేరు వేరు నిష్పత్తుల్లో ఈ రూప పరంపరా ప్రవాహంలోనే, వివిధ రూపాలుగా, అంటే ఉత్పాదక పెట్టుబడిగా, డబ్బు పెట్టుబడిగా, సరుకు పెట్టుబడిగా ఎలా విభజితమవుతుందో చూపాము. అలా విభజింపబడినందు వల్ల, ఆ రూపాలు ఒకదాని తర్వాత మరొకటి రావటమే కాక, మొత్తం పెట్టుబడి విలువలోని విభిన్న భాగాలు నిరంతరం పక్కపక్కనే ఉంటాయనీ, ఆ విభిన్న దశల్లో తద్విధి నిర్వహిస్తాయనీ చూపాము. ముఖ్యంగా, డబ్బు పెట్టుబడి ఇక్కడ విశిష్ట లక్షణాలతో రంగంపైకి వచ్చింది. వీటిని ప్రథమ సంపుటలో చూపలేదు. నిర్ణీత మొత్తంలోని ఉత్పాదక పెట్టుబడి నిరంతరం పని చేయగలిగేందుకు, ఆ పెట్టుబడిలోని వివిధ భారీ భాగాలను, టర్నోవర్ పరిస్థితులను బట్టి, ఏ నియమాల మేరకు నిరంతరం డబ్బు పెట్టుబడి రూపంలో అడ్వాన్స్ చేయాల్సి ఉంటుందో, పునరుద్ధరించాల్సి ఉంటుందో ఆ నియమాలను కనుగొన్నాము.

అయితే మొదటి, రెండవ భాగాలు రెంటిలో కూడా, మనం పరిశీలించింది కేవలం వ్యష్టి పెట్టుబడి సమస్యనే, సామాజిక పెట్టుబడిలోని వ్యష్టి భాగం యొక్క చలనం గురించిన సమస్యనే.

కానీ, వ్యష్టి పెట్టుబడుల ఆవృత్తులు, ఒకదానితో ఒకటి పెనవేసుకొంటాయి. ఒకటి ఉందంటే మరొకటి ఉన్నట్లే లెక్క. ఒకదాని ఆవశ్యకతకు మరొకటి కారణమవుతుంది. సరిగ్గా ఈ పారాస్పర్య చర్యలోనే మొత్తం సామాజిక పెట్టుబడి చలనం రూపుగొంటుంది. సరుకుల సామాన్య చలామణి విషయంలో ఒక సరుకు మొత్తం రూపాంతరీకరణ, మొత్తం సరుకుల రూపాంతరీకరణల పరంపరలో ఒక లంకెగా కనిపించినట్లే, వ్యష్టి పెట్టుబడి రూపాంతరీకరణ కూడా సామాజిక పెట్టుబడి రూపాంతరీకరణ పరంపరలో ఒక లంకెగా దర్శనమిస్తుంది. కానీ, సామాన్య సరుకు చలామణిలో తప్పనిసరిగా పెట్టుబడి చలామణి ఉంటుందనుకోరాదు. ఎందుచేతనంటే పెట్టుబడిదారీ విధానేతర ఉత్పత్తి ప్రాతిపదికపై సామాన్య సరుకు చలామణి జరగవచ్చు. కాగా, మనం ఇంతకు మునుపే

పేర్కొన్నట్లు, మొత్తం సామాజిక పెట్టుబడి ఆవృత్తిలో వ్యష్టి పెట్టుబడి ఆవృత్తికి వెలుపలి సరుకు చలామణి కూడా ఉండవచ్చు. అంటే పెట్టుబడికి ప్రాతినిధ్యం వహించని సరుకుల చలామణి కూడా ఉండవచ్చు.

ఇప్పుడిక మనం, మొత్తం సామాజిక పెట్టుబడిలో భాగాలుగా ఉన్న వ్యష్టి పెట్టుబడుల చలామణి ప్రక్రియను (దీన్ని మొత్తంగా తీసుకున్నట్లయితే, ఇది పునరుత్పత్తి ప్రక్రియా రూపమే) అధ్యయనం చేయాలి. అంటే ఈ మొత్తం సామాజిక పెట్టుబడి యొక్క చలామణి ప్రక్రియను అధ్యయనం చేయాలి.

## II. డబ్బు పెట్టుబడి పాత్ర

[ఈ క్రింది అంశం, అంటే మొత్తం సామాజిక పెట్టుబడిలో అంతర్భాగమైన డబ్బు పెట్టుబడి ఈ భాగంలోని తరువాతి విభాగానికి చెందినదైనప్పటికీ, మనం దాన్ని ఇక్కడే విశ్లేషిద్దాం.]

వ్యష్టి పెట్టుబడి టర్నోవర్ పరిశీలనలో డబ్బు పెట్టుబడి గురించిన రెండు అంశాలు వెల్లడి అయ్యాయి.

మొదటి విషయం, ప్రతి వ్యష్టి పెట్టుబడి రంగంలో దర్శనమిచ్చేదీ, పెట్టుబడిగా తన ప్రక్రియలను ప్రారంభించేదీ డబ్బు పెట్టుబడి రూపంలోనే. అందుచేత మొత్తం ప్రక్రియకు ఊపు కల్పించే ప్రాథమిక చాలకంగా అది కనిపిస్తుంది.

ఇక రెండవ విషయం, అడ్వాన్స్ చేయబడిన పెట్టుబడి విలువలో, నిరంతరాయంగా డబ్బు లేదా అడ్వాన్సూ, పునరుద్ధరణ చేయవలసిన భాగానికీ, అది చలనంలోకి తెచ్చే ఉత్పాదక పెట్టుబడికీ, అంటే ఉత్పత్తి నిరంతరాయ స్థాయికీ మధ్య నిష్పత్తి, టర్నోవర్ కాల పరిమాణాన్ని బట్టీ, ఆ కాల అంతర్భాగాలైన పని కాలమూ, చలామణి కాలమూ మధ్య గల నిర్దిష్ట నిష్పత్తిని బట్టీ మారుతూంటుంది. ఈ నిష్పత్తి ఏదయినప్పటికీ, పని చేస్తున్న పెట్టుబడి విలువలో నిరంతరాయంగా ఉత్పాదక పెట్టుబడిగా వ్యవహరించగలిగే భాగం యొక్క పరిమితిని, అడ్వాన్స్ చేసిన పెట్టుబడి విలువలో ఉత్పాదక పెట్టుబడి ప్రక్కనే డబ్బు రూపంలో నిరంతరం ఉండాల్సిన భాగం నిర్ణయిస్తుంది. ఇక్కడ తీసుకొన్నది మామూలు టర్నోవర్ సంగతే. అంటే, ఒక అనిర్దిష్ట సగటును మాత్రమే. చలామణి తాలూకు అంతరాయాల వల్ల అవసరమైన అదనపు డబ్బు పెట్టుబడిని పరిగణనకు తీసుకోవడం లేదు.

మొదటి అంశాన్ని తీసుకొందాం. సరుకు ఉత్పత్తి ఉండాలంటే అంతకు ముందే సరుకు చలామణి ఉండాలి. సరుకు చలామణి ఉండాలంటే అంతకు ముందే డబ్బు రూపంలో సరుకుల వ్యక్తీకరణా, డబ్బు చలామణి ఉండాలి; సరుకు సరుకుగాను, డబ్బుగానూ చీలడమన్నది, సరుకుగా ఉత్పాదితం యొక్క వ్యక్తీకరణ నియమం. అదే విధంగా సరుకుల పెట్టుబడిదారీ ఉత్పత్తి ఉండాలంటే – సామాజికంగా చూచినా, వ్యష్టిపరంగా చూచినా – అంతకు ముందే డబ్బు రూపంలో పెట్టుబడి లేక డబ్బు పెట్టుబడి ప్రారంభ దశలోని ప్రతి వ్యాపారం యొక్క ప్రాథమిక చాలకంగానూ, నిరంతర చాలకంగానూ ఉండాలి. చలామణి పెట్టుబడిలో, డబ్బు పెట్టుబడి స్వల్ప వ్యవధులతో సంచాలకంగా నిరంతరం పదే పదే పనిచేస్తుందనేది గర్భితం. అడ్వాన్సు చేయబడిన యావత్ పెట్టుబడి విలువనూ, అంటే పెట్టుబడిలోని సమస్త భాగాలనూ, సరుకులు, శ్రమ శక్తి, శ్రమ సాధనాలు, ఉత్పత్తి పరికరాలు

అన్నింటినీ – పదే పదే డబ్బుతో కొనుగోలు చేయవలసిందే. ఇక్కడ వ్యష్టి పెట్టుబడికి వర్తించేదే అనేక వ్యష్టి పెట్టుబడుల రూపంలో మాత్రమే వ్యవహరించే సామాజిక పెట్టుబడికి కూడా వర్తిస్తుంది. అయితే మనం మొదటి సంపుటంలోనే స్పష్టం చేసినట్లుగా, పెట్టుబడి కార్యరంగం, అంటే ఉత్పత్తి స్థాయి, పెట్టుబడిదారీ ప్రాతిపదికపై సైతం జరిగే ఉత్పత్తి స్థాయి తన నిరపేక్ష అవధుల విషయంలో, పని చేస్తున్న డబ్బు పెట్టుబడిపై ఆధారపడుతుందని, దీన్నిబట్టి అనుకోరాదు.

పెట్టుబడిలో అంతర్భాగంగా ఉన్న ఉత్పాదక అంశాల విస్తరణ కొన్ని పరిమితులకు లోబడి, స్వతంత్రంగా, అంటే అడ్వాన్స్ చేయబడిన డబ్బు–పెట్టుబడి పరిమాణంతో ప్రమేయం లేకుండా సాగుతుంది. శ్రమ–శక్తికి చెల్లించే మొత్తం మారనప్పటికీ, దాన్ని తరతమ స్థాయిల్లో విస్తృతంగా కానీ, తీవ్రంగా కానీ దోచుకోవడం జరగవచ్చు. ఈ హెచ్చిన దోపిడీతో డబ్బు–పెట్టుబడి పెరిగితే (అంటే వేతనాలు పెరిగితే) అది ఆ నిష్పత్తిలోనే పెరగదు. అందుచేత అది తదనుగుణమైన పెరుగుదల కాదు.

ఉత్పాదకంగా వినియుక్తమవుతున్న ప్రకృతిసిద్ధ వస్తువులు, అంటే నేల, సముద్రాలు, ఖనిజాలు, అడవులు మొదలైనవి పెట్టుబడి విలువలో అంతర్భాగాలు కావు. అడ్వాన్స్ చేసే డబ్బు–పెట్టుబడిని పెంచకుండానే, శ్రమశక్తితో మరింత తీవ్రంగా పని చేయించడం ద్వారా, ఆ వస్తువులను మరింత ప్రగాఢంగా లేదా విస్తృతంగా వినియోగించుకొంటున్నారు. ఈ విధంగా అదనపు డబ్బు, పెట్టుబడి అవసరం లేకుండానే, ఉత్పాదక పెట్టుబడిలోని అంశాలు ఇబ్బడిముబ్బడి అవుతాయి. అయితే అదనపు అనుబంధ పదార్థాల కోసం అలాంటి అదనపు డబ్బు–పెట్టుబడి అవసరమైన మేరకు, పెట్టుబడి – విలువగా అడ్వాన్స్ చేసే డబ్బు–పెట్టుబడి ఉత్పాదక పెట్టుబడి యొక్క పెరిగిన ఫలదాయకతకు అనుగుణమైన నిష్పత్తిలో పెరగదు.

అవే శ్రమ సాధనాలను, కాబట్టి అదే నిశ్చల పెట్టుబడిని రోజూ వాడే కాలాన్ని పొడిగించటం ద్వారానూ, వాటి వినియోగ తీవ్రతను పెంచడం ద్వారానే, నిశ్చల పెట్టుబడి కోసం అదనపు డబ్బు వ్యయం చేయకుండానే, మరింత ఫలప్రదంగా వినియోగించవచ్చు. ఇలా జరిగినప్పుడు నిశ్చల పెట్టుబడి మరింత త్వరగా టర్నోవర్ అవుతుంది, అంతే. దాని పునరుత్పత్తి యొక్క అంశాలు కూడా మరింత త్వరితగతిలో సరఫరా అవుతాయి.

ప్రకృతి పదార్థాలే కాకుండా, బొత్తిగా ఖర్చు చేయనవసరం లేని ప్రాకృతిక శక్తులను, ఫలదాయకతను పెంచే సాధనాలుగా ఉత్పాదక ప్రక్రియలో పొందుపరచవచ్చు. వీటి ఫలప్రదత స్థాయి, పెట్టుబడిదారుకు ఏ విధంగానూ ఖర్చుకాని పద్ధతులపైనా, శాస్త్రీయ అభివృద్ధులపైనా ఆధారపడి ఉంటుంది.

ఉత్పత్తి ప్రక్రియలో శ్రమశక్తి సామాజిక సమ్మేళనకూ, వ్యష్టి కార్మికుల సంచిత నైపుణ్యానికీ కూడా ఇది వర్తిస్తుంది. భూస్వామికి ఎన్నడూ తగినంత ప్రతిఫలం లభించడం లేదని కారే అంచనా వేస్తున్నాడు. ఎందుచేతనంటే, భూమికి ఈనాడున్న ఉత్పాదకతను చేకూర్చడం కోసం అతడు అనాది కాలం నుంచి భూమిపై మదుపు పెట్టిన మొత్తం పెట్టుబడికీ లేక మొత్తం శ్రమకుగాను అతనికి ఏమీ చెల్లించబడలేదని ఆయన వాదన. (భూమినుంచి హరించిన ఉత్పాదకత గురించిన ప్రస్తావన

సహజంగానే లేదు) ఆ సూత్రం ప్రకారం, ఆటవికుడుగా ఉన్న మనిషి ఆధునిక మెకానిక్‌గా పరిణామం చెందడానికి మానవ జాతి పడిన శ్రమకుగానూ, ప్రతి శ్రామికునికీ చెల్లించవలసి ఉంటుంది. భూ యజమాని, పెట్టుబడిదారు భూమిపై వెచ్చించి, డబ్బుగా మార్చుకొన్నట్టి శ్రమను – మూల్యం చెల్లించబడని ఈ శ్రమనంతటినీ – మొత్తం లెక్కకట్టితే, ఈ భూమిపై మదుపు చేయబడిన మొత్తం పెట్టుబడి అధిక వడ్డీరేట్లతో సహా ఎన్నోసార్లు తిరిగి చెల్లించబడింది. అందువల్ల సమాజం భూమి రూపంలోని ఆస్తిని ఎన్నోసార్లు భూస్వాముల నుంచి విడిపించుకొందని భావించవలసి ఉంటుంది.

పెట్టుబడి–విలువను అదనంగా మదుపుపెట్టని స్థితిలో, శ్రమ ఉత్పాదక శక్తి పెరుగుదల మొదట, ఉత్పాదితం రాశిని మాత్రమే పెంచుతుంది తప్ప దాని విలువను పెంచదు, నిజమే. కానీ అదే శ్రమతో మరింత స్థిర పెట్టుబడిని పునరుత్పత్తి చేయడానికి, దాని విలువను పరిరక్షించడానికి ఇది వీలు కల్పిస్తుంది. అయితే, అదే సమయంలో అది పెట్టుబడికి గాను నూతన పాదార్థిక సృష్టి చేస్తుంది; అందుచేత పెట్టుబడి అధికతర సంచయనానికి అది ప్రాతిపదికగా ఉంది.

కాగా సామాజిక శ్రమ వ్యవస్థీకరణకు, తద్వారా శ్రమకు గల సామాజిక ఉత్పాదక శక్తి పెరుగుదలకూ భారీస్థాయి ఉత్పత్తి అవసరం; అందుచేత వ్యష్టి పెట్టుబడిదారులు పెద్ద పెద్ద మొత్తాలలో డబ్బు–పెట్టుబడిని అడ్వాన్సు చేయడం అవసరం. క్రియాపూర్వక పెట్టుబడి–విలువల పరిమాణాన్ని నిరపేక్షంగా పెంచనవసరం లేకుండానే, కనుక, పెట్టుబడి–విలువలు అడ్వాన్సు చేయబడే రూపమైన డబ్బు–విలువ యొక్క పరిమాణాన్ని పెంచనవసరం లేకుండానే, కొద్దిమంది చేతుల్లో పెట్టుబడుల కేంద్రీకరణ వల్ల ఇది పాక్షికంగా సాధింపబడుతుందని ప్రథమ సంపుటంలో నిరూపించాం. కొద్ది మంది చేతుల్లో వ్యష్టి పెట్టుబడులు కేంద్రీకరింపబడటం ద్వారా వాటి సామాజిక మొత్తం పెరుగుదల లేకుండానే వ్యష్టి పెట్టుబడుల పరిమాణం పెరగగలదు. అది వ్యష్టి పెట్టుబడుల పంపిణీలో జరిగిన మార్పు మాత్రమే.

ఇక చివరి విషయం – టర్నోవర్ కాలం తగ్గుదల వల్ల, తక్కువ డబ్బు–పెట్టుబడితో అదే ఉత్పాదక పెట్టుబడిని చలనంలో ఉంచడానికి లేక అదే డబ్బు–పెట్టుబడితో ఎక్కువ ఉత్పాదక పెట్టుబడిని చలనంలో ఉంచడానికి వీలవుతుందని, మునుపటి భాగంలో మనం నిరూపించాం.

అయితే దీనికంతటికీ డబ్బు–పెట్టుబడి సమస్యతో ఎలాంటి సంబంధమూ లేదని కనిపిస్తూనే ఉంది. అది తెలుపుతున్నదేమిటంటే, అడ్వాన్సు చేయబడిన పెట్టుబడి, అంటే తన స్వేచ్ఛారూపమైన, విలువ రూపమైన డబ్బుగా ఉన్న నిర్ణీత విలువల మొత్తం, ఉత్పాదక పెట్టుబడిగా మారిన అనంతరం, దానిలో ఉత్పాదక శక్తుల పరిమితులకు లోబడి, వాటి పని విస్తృతీ, తీవ్రతా స్థాయిలు బహువిధంగా ఉంటాయి. ఉత్పాదక అంశాల ధరలు, అంటే ఉత్పత్తి సాధనాల యొక్క శ్రమ–శక్తి యొక్క ధరలు నిర్ణీతమైనప్పుడు, సరుకుల రూపంలో ఉన్న ఈ ఉత్పాదక అంశాలను నిర్దిష్ట పరిమాణంలో కొనుగోలు చేసేందుకు అవసరమైన డబ్బు పెట్టుబడి పరిమాణం ఎంతో నిర్ధారణ అవుతుంది. అంటే అడ్వాన్సు చేయవలసిన పెట్టుబడి విలువ పరిమాణం నిర్ణయింపబడుతుంది. అయితే విలువల, ఉత్పాదితాల సృష్టికర్తగా ఈ పెట్టుబడి పనిచేసే స్థాయి వెసులుబాటు గలదీ, అస్థిరమైనదీ.

**ఇక రెండవ విషయం :** అరిగిపోయిన నాణేల స్థానంలో కొత్త నాణేలు ప్రవేశపెట్టడానికి

అవసరమైన డబ్బును ఉత్పత్తి చేసేందుకు కానీ, లేక కొనుగోలు చేసేందుకు కానీ ఏటా ఖర్చు పెట్టవలసి ఉన్న సామాజిక శ్రమలోని భాగం, ఉత్పత్తి సాధనాల్లోని భాగం – ఇవి సామాజిక ఉత్పత్తి పరిమాణంలో ఆ నిష్పత్తిలో కోత అనేది సుస్పష్టం. కాగా పాక్షికంగా చలామణి సాధనంగానూ, పాక్షికంగా నిల్వ ధనంగానూ వ్యవహరించే డబ్బు–విలువ విషయానికి వస్తే, అది ఇప్పటికే సేకరింపబడి ఉంది; అది, శ్రమ–శక్తి తయారైవున్న ఉత్పత్తి సాధనాలు, ప్రాకృతిక సంపద వనరులు – వీటి సరసనే ఉంటుంది. వీటికి నిర్దేశించిన పరిమితిగా దాన్ని పరిగణించలేము. అది ఉత్పత్తి సాధనాలుగా పరివర్తన చెందడం వల్లనూ, ఇతర దేశాలతో మార్పిడి చెందడం వల్లనూ ఉత్పత్తి స్థాయి విస్తరింప బడవచ్చు. అయితే ఇలా జరగడానికి ముందు డబ్బు ఎప్పటిలాగా ప్రపంచ – డబ్బు పాత్రను నిర్వహించవలసి ఉంటుంది.

ఉత్పాదక పెట్టుబడిని చలనంలో ఉంచేందుకు ఎంతో కొంత డబ్బు – పెట్టుబడి అవసరం; అయితే ఇది టర్నోవర్‌కు పట్టే కాల పరిమాణంపై ఆధారపడి ఉంటుంది. టర్నోవర్ కాలం పని కాలంగానూ, చలామణి కాలంగానూ విభజితమైనందువల్ల, పెట్టుబడి కాగలిగినది లేక డబ్బు రూపంలో తాత్కాలికంగా ఉండే పెట్టుబడి పెరగవలసి ఉంటుందని కూడా మనం గమనించాం.

ఇక పనికాల పరిమాణం టర్నోవర్ కాలాన్ని నిర్ణయిస్తుంది కాబట్టి, ఇతర పరిస్థితులు సమంగా ఉన్నప్పుడు, దాన్ని ఉత్పత్తి ప్రక్రియ భౌతిక స్వభావం నిర్ణయిస్తుందే తప్ప ఈ ప్రక్రియ ప్రత్యేక సామాజిక స్వభావం నిర్ణయించదు. కానీ, పెట్టుబడిదారీ ఉత్పత్తి ప్రాతిపదికపై, సాపేక్షంగా దీర్ఘకాలం పాటు సాగే విస్తృతమైన కార్యకలాపాలకు, దీర్ఘకాలం పాటు డబ్బు–పెట్టుబడి పెద్ద మొత్తాల్లో అడ్వాన్సు చేయాల్సి ఉంటుంది. అందుచేత ఇలాంటి రంగాలలో ఉత్పత్తి, వ్యష్టి పెట్టుబడిదారు ఖర్చు పెట్టగల డబ్బు–పెట్టుబడి పరిమాణంపై ఆధారపడి ఉంటుంది. పరపతి వ్యవస్థ, దానితో సంబంధం గల సంస్థలు, అంటే స్టాక్ కంపెనీలు ఈ అవరోధాన్ని తొలగిస్తాయి. అందుచేత, డబ్బు–మార్కెట్‌లోని అలజడులు ఇలాంటి సంస్థల వ్యాపార కార్యకలాపాలను ఆపివేస్తాయి; కాగా ఈ సంస్థలే అటు డబ్బు మార్కెట్‌లో అలజడులను సృష్టిస్తాయి.

దీర్ఘకాలం శ్రమశక్తినీ, ఉత్పత్తి సాధనాలను ఉపసంహరిస్తూ ఉపయోగకరమైనదిగా ఉన్న ఎలాంటి ఉత్పాదితాన్నీ ఈలోగా సరఫరా చేయని పనులు కొన్ని ఉన్నాయి. నిరంతరాయంగా కానీ, ఒక సంవత్సర కాలంలో పలుమార్లు కానీ శ్రమశక్తిని, ఉత్పత్తి సాధనాలను ఉపసంహరించుకోవడమే కాక, జీవనభృతి సాధనాలను, ఉత్పత్తి సాధనాలను కూడా సరఫరా చేసే ఉత్పత్తి శాఖలకు హాని కలిగించకుండా, సామాజికీకృత ఉత్పత్తి ప్రాతిపదికపై అలాంటి పనులను ఏ స్థాయిలో నిర్వహించ వచ్చునో ముందుగా తేల్చుకోవాలి. సామాజికీకృత ఉత్పత్తిలోనూ, పెట్టుబడిదారీ ఉత్పత్తిలోనూ తక్కువ పనికాల వ్యవధులు గల వ్యాపార శాఖల్లోని శ్రామికులు, అంతకు మునుపులాగే, స్వల్ప కాలాలకు మాత్రమే ఉత్పాదితాలను ఉపసంహరిస్తూ, దానికి ప్రతిగా ఎలాంటి ఉత్పాదితాలనూ ఇవ్వరు. కాగా, దీర్ఘమైన పనికాల వ్యవధులు గల వ్యాపార శాఖలు దీర్ఘకాలం పాటు ఉత్పాదితాలను ఉపసంహరిస్తూ, ఈలోగా, అందుకు ప్రతిగా ఏమీ ఇవ్వవు. కాబట్టి, ఈ పరిస్థితి, నిర్దిష్ట శ్రమ – ప్రక్రియ పాదార్థిక స్వభావం నుంచి ఉద్భవించిందే తప్ప, దాని సామాజిక రూపం నుంచి తలెత్తింది కాదు. సామాజికీకృత

ఉత్పత్తిలో డబ్బు – పెట్టుబడి పూర్తిగా తొలగింపబడుతుంది. సమాజం, వివిధ ఉత్పత్తి శాఖలకు శ్రమ–శక్తినీ, ఉత్పత్తి సాధనాలను పంపిణీ చేస్తుంది. ఉత్పత్తిదారులు తమ శ్రమ కాలానికి అనుగుణమైన పరిమాణంలో వినియోగ సరుకులను వాటి సామాజిక సరఫరాల నుండి పరిగ్రహించడానికి హక్కు నిచ్చే కాగితం ఓచర్‌లను పొందుతారు. కానీ, ఈ ఓచర్‌లు డబ్బు కాదు. అవి చలామణి కావు.

డబ్బు–పెట్టుబడి ఆవశ్యకతకు మూలం పనికాల వ్యవధి పరిమాణం నుంచి ఉత్పన్న మవుతుందని తెలుసుకొన్నాము. కాబట్టి ఆ ఆవశ్యకతను రెండు విషయాలు నిర్ణయిస్తాయి. మొదటిది – ప్రతి వ్యష్టి పెట్టుబడీ (పరపతి మినహా) తన్ను తాను ఉత్పాదక పెట్టుబడిగా మార్చుకోవాలంటే, అది సాధారణంగా డబ్బు రూపంలో రంగంపైకి రావాలి. ఇందుకు కారణం పెట్టుబడిదారీ ఉత్పత్తి స్వభావమూ, మొత్తం మీద, సరుకు ఉత్పత్తి స్వభావమూను. రెండవ విషయం – సాపేక్షంగా దీర్ఘకాలం పాటు శ్రమశక్తీ, ఉత్పత్తి సాధనాలు సమాజం నుంచి నిరంతరాయంగా ఉపసంహరించుకోబడుతూ ఉంటాయి. కానీ వాటికి ప్రతిగా, ఈ లోపల, డబ్బుగా మార్చుకో వీలున్న ఉత్పాదితాలు సమాజానికి అందవు. ఈ కారణం వల్లనే, ఒక నిర్దిష్ట పరిమాణంలో అవసరమైన డబ్బును అడ్వాన్సు చేయవలసి వస్తోంది. అడ్వాన్సు చేయవలసి ఉన్న పెట్టుబడిని డబ్బు రూపంలోనే అడ్వాన్సు చేయాల్సిన మొదటి పరిస్థితిని డబ్బు రూపమే – అది లోహరూపంలోని డబ్బు కావచ్చు, పరపతి రూపంలోని డబ్బు కావచ్చు, సంకేత రూపంలోని డబ్బు కావచ్చు – తొలగించదు. ఏ రూపం డబ్బు ద్వారా, ఏ రూపం ఉత్పత్తిలో, శ్రమ, జీవనాధారాలు, ఉత్పత్తి సాధనాలు, చలామణికి తత్తుల్యమైన విలువను తిరిగి ఇవ్వకుండానే ఉపసంహరింపబడతాయనేది, పైన పేర్కొన్న రెండవ విషయాన్ని ఏ విధంగానూ ప్రభావితం చేయదు.

★ ★ ★

## అధ్యాయం - 19[1]

# ఈ విషయంపై మునుపటి అర్థశాస్త్రవేత్తలు

### I. ఫిజియోక్రాట్లు

ఇతర విషయాలు సమంగా ఉన్నట్లయితే, సామాన్య పునరుత్పత్తి, అంటే అదే స్థాయిలో పునరుత్పత్తి జరిగే విధంగా, ఒక నిర్దిష్ట విలువకు ప్రాతినిధ్యం వహించే జాతీయ ఉత్పత్తి యొక్క వార్షిక ఫలితం చలామణి ద్వారా ఎలా పంపిణీ అవుతుందో క్వెస్నే (Quesnay) రచించిన Tableau Economique స్థూలంగా వివరించింది. ఉత్పత్తి కాల వ్యవధికి ప్రారంభ స్థానం మునుపటి సంవత్సరపు పంట; ఇది సబబే. చలామణి యొక్క అసంఖ్యాకమైన వ్యష్టి కార్యకలాపాలన్నీ, వాటి స్వభావసిద్ధమైన సామాజిక, రాశీభూత చలనంలో, అంటే, తమ విధులనుబట్టి నిర్ణయమైన సమాజపు ఆర్థిక వర్గాల మధ్య చలామణిలో ఏకమవుతాయి. మనకు ఇక్కడ ఈ క్రింది అంశమే ఆసక్తికరమైంది : మొత్తం ఉత్పాదితంలోని ఒక భాగం ప్రతి ఇతర భాగంలాగానే అది ఒక ఉపయోగకర వస్తువు – గత సంవత్సరపు శ్రమ యొక్క నూతన ఫలితం; అది, అదే సమయంలో అదే భౌతిక రూపంలో పునర్దర్శనమిస్తున్న పాత పెట్టుబడి విలువకు వాహిక మాత్రమే. అది చలామణిలో ఉండదు. పెట్టుబడిగా తన సేవలను తిరిగి కొనసాగించేందుకు ఉత్పత్తి చేసినవారి చేతుల్లో, అంటే రైతు వర్గం చేతుల్లో ఉండిపోతుంది. వార్షిక ఉత్పాదితంలోని ఈ భాగంలో, అంటే స్థిర పెట్టుబడిలో క్వెస్నే దానికి చెందని అంశాలను కూడా చేర్చుతున్నాడు. అయితే తన దృఙ్మండల పరిమితుల పుణ్యమా అని, ఆయన దృష్టి ప్రధానమైన విషయంపై పడింది. ఆ దృఙ్మండల పరిధిలో, శ్రమ వినియోగం వల్ల అదనపు విలువ ఉత్పత్తి అయ్యే ఏకైక రంగం వ్యవసాయమే; అందుచేత పెట్టుబడిదారీ దృష్టిలో నిజంగా ఉత్పాదకమైన రంగమదే. ఈ రంగంలో (వ్యవసాయం) పునరుత్పత్తి తాలూకు ఆర్థిక ప్రక్రియ, దాని నిర్దిష్ట సామాజిక స్వభావం ఏదైనప్పటికీ, ఎల్లప్పుడూ పునరుత్పత్తి ప్రాకృతిక ప్రక్రియతో పెనగొంటుంది. ఈ ప్రకృతి ప్రక్రియకు సంబంధించిన స్పష్టమైన పరిస్థితులు ఆర్థిక ప్రక్రియకు సంబంధించిన పరిస్థితులపై వెలుగును ప్రసరింపజేసి, చలామణి అనే ఎండమావి సృష్టించిన ఆలోచనా గందరగోళాన్ని దూరంగా ఉంచుతుంది.

వస్తువులపై ముద్రకూ, ఒక భావ వ్యవస్థపై ముద్రకూ మధ్య గల పలుతేడాల్లో ఒకటేమిటంటే, భావ వ్యవస్థపై ముద్ర దాని గ్రహీతనే కాక, ప్రదాతను కూడా మోసగిస్తుంది. క్వెస్నే, ఆయన ప్రత్యక్ష శిష్యులు తమ ఫ్యూడల్ సైన్‌బోర్డును విశ్వసించారు. మన విద్యాసంస్థల పండితులు ఈనాడు కూడా

1. VIII రాతప్రతి ప్రారంభం - ఫ్రెడరిక్ ఎంగెల్స్.

అదే విధంగా వ్యవహరిస్తున్నారు. అయితే వాస్తవానికి ఫిజియోక్రాట్ల భావ వ్యవస్థే, పెట్టుబడిదారీ ఉత్పత్తి గురించి ఒక పద్ధతిలో ఉన్న ప్రప్రథమ భావన. పారిశ్రామిక పెట్టుబడి తాలూకు ప్రతినిధి, అంటే కౌల్దారీ వర్గం యావత్ ఆర్థిక గమనాన్ని నడిపిస్తుంది. వ్యవసాయం పెట్టుబడిదారీ పద్ధతిలో నిర్వహించబడుతుంది అంటే, అది భారీ స్థాయిలో సాగే పెట్టుబడిదారీ వ్యవసాయదారుని వ్యాపారం అన్నమాట. భూమిని ప్రత్యక్షంగా సాగుచేసే వ్యక్తి ఇక్కడ వేతన కార్మికుడు. ఉత్పత్తి అన్నది ఉపయోగం గల వస్తువులను మాత్రమే కాక వాటి విలువను కూడా సృష్టిస్తుంది; దానికి బలీయమైన ప్రేరణ అదనపు విలువను సంపాదించడం. అదనపు విలువ యొక్క ఆవిర్భావ స్థానం ఉత్పత్తి రంగమే తప్ప చలామణి రంగం కాదు. పునరుత్పత్తి తాలుకు సామాజిక ప్రక్రియకు వాహికలుగా వ్యవహరించే మూడు వర్గాలలోనూ, "ఉత్పాదక" శ్రమను ప్రత్యక్షంగా దోచుకొనే వ్యక్తి, అదనపు విలువ[1] ఉత్పత్తి దారూ అయిన పెట్టుబడిదారీ వ్యవసాయదారుకూ, కేవలం అదనపు విలువను స్వాయత్తం చేసుకొనే ఇతరులకూ మధ్య స్పష్టమైన తేడా ఉంది.

ఫిజియోక్రాట్ వ్యవస్థలోని పెట్టుబడిదారీ స్వభావం, ఆ వ్యవస్థ వికసన దశలోనే, వ్యతిరేకతను రేకెత్తించింది; ఒకవైపు లింగెట్, మాబ్లీ, మరోవైపు సన్నకారు భూకామందుల సమర్థకులు దాన్ని సవాలు చేశారు.

★ ★ ★

పునరుత్పత్తి ప్రక్రియ గురించి ఆడమ్ స్మిత్ చేసిన విశ్లేషణలో తిరోగమన దృక్పథం[2] మరింత కొట్టవచ్చినట్లు కనిపిస్తుంది. ఉదాహరణకు ఆయన క్వెస్నే సరియైన విశ్లేషణను విశదీకరించారు. క్వెస్నే చెప్పిన "avances primitives"ను, "avances annuelles"ను సాధారణీకరిస్తూ, వాటిని వరుసగా "స్థిర" పెట్టుబడి, "చలామణి అవుతున్న" పెట్టుబడి[3] అని పేర్కొన్నారు. అంతేకాదు, ఫిజియోక్రాట్లు చేసిన పొరపాట్లనే ఈయనా పూర్తిగా తిరిగి చేశారు. ఉదాహరణకు, ఇతర రకపు పెట్టుబడిదారు కంటే వ్యవసాయదారు ఎక్కువ విలువను ఉత్పత్తి చేస్తాడని నిరూపించేందుకు ఈయన ఇలా అంటారు: "వ్యవసాయదారుని పెట్టుబడికన్నా ఎక్కువ పరిమాణంలో ఉత్పాదక శ్రమను మరే సమాన పెట్టుబడీ చలనంలో పెట్టదు. అతని తాలూకు శ్రమించే సేవకులే కాదు, శ్రమచేసే అతని పశువులు కూడా ఉత్పాదక శ్రామికులే." (శ్రమించే సేవకులకు భేషైన కితాబే!) "వ్యవసాయంలో, అదీకాక, మనిషితో

1. మార్క్స్ - తన "అదనపు విలువ సిద్ధాంతాలు"లో క్వెస్నే రచన, Tableau Economiqueను మరింత సవివరంగా విశ్లేషించారు. Karl Marx, Theories of surplus Value [Volume IV of Capital] Part-I, Moscow, (1963, 299-333, 367-369) ఇంగ్లీషు ప్రతి - సం.
2. Kapital Band I, 2 Ausgabe, S.612, Note 32 (Eng, ed, Moscow, 1983, P. 554, Note.I).
3. కొంతమంది ఫిజియోక్రాట్లు ముఖ్యంగా ట్యూర్గో (Turgot) ఇక్కడ ఆయనకు మార్గం ఏర్పరిచారు. ట్యూర్గో avances అన్న పదం స్థానంలో పెట్టుబడి అనే పదాన్ని క్వెస్నే కంటే, ఇతర ఫిజియోక్రాట్ల కంటే ఎక్కువగా వాడతాడు. avances తో మరింత ఎక్కువగా మమేకం చెందాడు. ఉదాహరణకు "కార్ఖానా ఉత్పత్తిదార్లలాగే పెట్టుబడిదారీ వ్యవసాయదారులకు కూడా తిరిగివచ్చే పెట్టుబడులకు తోడు అందవలసిన అదనపు మొత్తాలు....." (Turgot, Oeuvres, Daire edition, Paris, 1844, సం.I, పుట 40)

పాటు ప్రకృతి శ్రమిస్తుంది; ప్రకృతి శ్రమకు ఖర్చు లేనప్పటికీ, అత్యధిక వ్యయంతో కూడిన పనివారి ఉత్పాదితానికి విలువ ఉన్నట్లే, ప్రకృతి ఉత్పాదితానికి కూడా విలువ ఉంది. వ్యవసాయపు అతి ముఖ్యమైన కార్యకలాపాలు ప్రకృతి యొక్క ఫలదాయకతను పెంచే మాట వాస్తవమే అయినప్పటికీ, వాటి ఉద్దేశం దానిని పెంచడంకన్నా మనిషికి అత్యంత లాభదాయకమైన మొక్కలను ఉత్పత్తి చేసే తీరులో ప్రకృతి ఫలదాయకతను దిద్ది తీర్చడంగా కనిపిస్తుంది. చాలా బాగా సాగు చేయబడిన ద్రాక్షతోట లేక ధాన్యం పండే భూమి ఎంత పెద్ద పంటనిస్తుందో ముండ్లపొదలతో, గచ్చపొదలతో నిండిన భూమి కూడా తరచుగా అంత పెద్ద పరిమాణంలో కూరగాయలను ఇస్తుంది. మొక్కలు నాటడం, దున్నడం అన్నవి ప్రకృతి క్రియాశీల ఫలదాయకతను పెంపొందించడం కంటే తరచుగా దాన్ని క్రమబద్ధం చేస్తాయి; వాటికెంత శ్రమ వ్యయమైనప్పటికీ, పనిలో ఎక్కువ భాగం ప్రకృతి నిర్వహించవలసి ఉంటుంది. కార్ఖానాలోని కార్మికులు తమ వినియోగానికి సమంగా లేక తమను నియమించే పెట్టుబడికీ, దాని యజమానుల లాభాలకూ కూడా సమంగా ఉన్నట్టి విలువను మాత్రమే పునరుత్పత్తి చేస్తారు. కానీ వ్యవసాయంలోని శ్రామిక జనావళి, శ్రమించే పశువులు (!) అలా పునరుత్పత్తి చేయడమే కాదు, అంతకంటే చాలా ఎక్కువ విలువను పునరుత్పత్తి చేస్తాయి. వ్యవసాయదారుని పెట్టుబడికీ, దాని లాభాలకీ మించి అవి క్రమం తప్పకుండా భూస్వామికి చెందే కౌలును కూడా పునరుత్పత్తి చేస్తాయి. ఈ భూమి కౌలును ప్రకృతి శక్తుల ఉత్పత్తిగా పరిగణించవచ్చు. భూస్వామి వ్యవసాయదారుకు అద్దెకిచ్చేది ఈ ప్రకృతిశక్తుల వినియోగాన్నే. ఈ శక్తులు ఏ మోతాదులో ఉన్నాయనుకొంటారో ఆ మోతాదును బట్టి కౌలు ఎక్కువ మొత్తంలోనో, తక్కువ మొత్తంలోనో ఉంటుంది. మరోవిధంగా చెప్పాలంటే, సహజసిద్ధమైన లేదా మెరుగుపరచిన భూసారం ఎంత ఉందనుకొంటారో దాన్నిబట్టే కౌలు ఉంటుంది. మనిషి పనిగా పరిగణింపబడే ప్రతిదాన్నీ మినహాయించుకొన్నా తరువాత, లేక దానికి పరిహారం చెల్లించాక మిగిలినది ప్రకృతి పని ఫలితమే. అది మొత్తం ఉత్పత్తిలో నాల్గోవంతుకు తక్కువగా ఉండదు. తరచూ మూడోవంతుకన్నా ఎక్కువగానే ఉంటుంది. కార్ఖానాల్లో ఇంతే పరిమాణంలో నియుక్తమైన ఉత్పాదక శ్రమ ఎన్నటికీ ఇంత ఎక్కువ పునరుత్పత్తి చేయజాలదు. కార్ఖానాల్లో ప్రకృతి చేసేదేమీ లేదు; మనిషే అంతా చేస్తాడు; పునరుత్పత్తి ఎల్లప్పుడూ దాని సృష్టికర్తల శక్తికి అనుగుణమైన దామాషాలో ఉంటుంది. అందుచేత వ్యవసాయంలో వినియోగింపబడిన పెట్టుబడి, కార్ఖానాల్లో వినియోగింపబడిన తత్సమానమైన పెట్టుబడి కంటే ఎక్కువ పరిమాణంలో ఉత్పాదక శ్రమను చలనంలో ఉంచడమే కాక, అది వినియోగించే ఉత్పాదక శ్రమ పరిమాణానికి అనుగుణమైన నిష్పత్తిలో దేశంలో సాగుభూమి, శ్రమల వార్షిక ఉత్పాదితానికీ, దేశవాసుల వాస్తవ సంపదకు, ఆదాయానికి మరింత పెద్ద ఎత్తున అదనపు విలువను చేకూర్చుతుంది." (సంపుటం II, అధ్యాయం-5)

ఆడమ్ స్మిత్ సం. II, 1వ అధ్యాయంలో, ఇలా అంటాడు. "విత్తనం యొక్క మొత్తం విలువ కూడా వాస్తవానికి స్థిర పెట్టుబడే." కాబట్టి ఎక్కువ పెట్టుబడి అంటే, పెట్టుబడి విలువ అన్నమాట. అది 'నిశ్చల' రూపంలో ఉంటుంది. "అది (విత్తనం) భూమి, గాదెల మధ్య వెనక్కూ ముందుకూ ప్రయాణం చేసినప్పటికీ, దాని యజమానులు మాత్రం మారరు. అందుచేత అది వాస్తవంలో

చలామణిలో ఉండదు. వ్యవసాయదారు తన లాభాన్ని పొందేది దాని అమ్మకం ద్వారా కాదు, దాని పెరుగుదల ద్వారానే." ఇక్కడ ఉన్న అసంబద్ధత ఇదీ : తనకు మునుపు క్వెస్నే లాగానే, ఆడమ్ స్మిత్ కూడా స్థిర పెట్టుబడి విలువ పునరుద్ధరింపబడిన రూపంలో పునర్దర్శనమిస్తుందని భావించడు; అందువల్ల పునరుత్పత్తి ప్రక్రియలోని ఒక ముఖ్యమైన అంశాన్ని గమనించలేకపోతున్నాడు. కానీ, చలామణిలో ఉన్న పెట్టుబడికీ, నిశ్చల పెట్టుబడికీ మధ్య తాను చూపే వ్యత్యాసానికి మరో ఉదాహరణ మాత్రం ఇస్తున్నాడు. అది కూడా తప్పు ఉదాహరణ. స్మిత "avances primitives" అన్న పదాలను "నిశ్చల పెట్టుబడి"గాను, "avances annuelles" అన్న పదాలను "చలామణిలోని పెట్టుబడి" గానూ అనువదించాడు. ఈ అనువాదంలోని పురోగతి "పెట్టుబడి" అన్న పదంలో ఉంది; పెట్టుబడి గురించిన భావన సాధారణీకరించబడింది. ఫిజియోక్రాట్లు "వ్యవసాయ" రంగానికి వర్తింపజేసినప్పుడు ఈ పదానికి గల ప్రత్యేకార్థంలో ఇక దానికి ప్రమేయం లేకుండా పోయింది. కాగా ఇక ఆ అనువాదం వాదంలో తిరోగమనం ఎక్కడున్నదంటే, "నిశ్చల", "చలామణిలోని" అన్న భావనల మధ్య నిర్ణయాత్మకమైన తేడా ఉన్నట్లు పరిగణించడమూ, ఆ భావనలను అలాగే కొనసాగించడమూను.

## II. ఆడమ్ స్మిత్

### 1. స్మిత్ సాధారణ దృక్పథాలు

ఆడమ్ స్మిత్ సం. 1, అధ్యాయం–6లో ఇలా అంటారు : "ప్రతి సమాజంలోనూ ప్రతి సరుకు ధర ఆ మూడు భాగాలుగా (వేతనాలు, లాభం, కౌలుగా) లేదా వాటిలో ఏదో ఒకటిగా విభజితమవుతుంది. అభివృద్ధి చెందిన ప్రతి సమాజంలో ఈ మూడూ అంతకన్నా చాలా ఎక్కువ సరుకుల ధరలో దాదాపు అంతర్భాగాలుగా ప్రవేశిస్తాయి."[1] మరోపుటలో ఆయన ఇలా కొనసాగించారు: వేతనాలు, లాభం, కౌలు – ఇవి సమస్త ఆదాయాల, మార్పిడికాగల సమస్త విలువల యొక్క "మూడు అసలైన మూలాధారాలు." "సరుకుల ధరలోని అంతర్భాగాలు" గురించి, లేక "మార్పిడికాగల సమస్త విలువల" గురించి ఆడమ్ స్మిత్ నిర్వచించిన ఈ సిద్ధాంతాన్ని కింద మరింత వివరంగా చర్చిద్దాం.

ఆయన ఇంకా ఇలా అంటారు. "పరిస్థితి ఇలా ఉంది కాబట్టి విడిగా తీసుకున్న ప్రతి సరుకుకు సంబంధించి ఈ విషయం గమనించబడింది. మొత్తంగా తీసుకున్న ప్రతి దేశంలోని భూమి యొక్క శ్రమ యొక్క సమస్త వార్షిక ఉత్పాదితంగా ఉన్నట్టి అన్ని సరుకులను మొత్తంగా తీసుకొన్నా, ఇలాగే ఉంటుంది. ఆ వార్షిక ఉత్పాదితం మొత్తం ధర లేక మార్పిడి విలువ అదే మూడు భాగాలుగా విభజితం కావాలి. తమ శ్రమకు వేతనాలుగా కానీ, తమ పెట్టుబడికి లాభాలుగా కానీ లేక తమ

---

1. "అంతకన్నా చాలా ఎక్కువ సరుకుల ధర" అన్న పదాన్ని పాఠకుడు అపార్థం చేసుకోకుండా ఉండేందుకు ఆడమ్ స్మిత్ ఆ పదాన్ని ఎలా వివరిస్తాడో కింది విషయం తెలుపుతుంది : ఉదాహరణకు, సముద్రపు చేప ధరలో కౌలు మిళితమై లేదు. అందులో వేతనాలు, లాభం మాత్రమే వున్నాయి. స్మిత్ ఇలా అంటారు : "స్కాట్‌లాండ్‌లోని కొన్ని ప్రాంతాల్లో కొంతమంది పేద ప్రజలు సముద్రతీరంలో స్కాచ్ గులకరాళ్లు అనే పేరుగల రంగు రంగుల చిన్ని రాళ్ళను ఏరుకుని అమ్ముకుంటుంటారు. అదే వారి జీవిక. ఆ రాళ్ళ కొనుగోలుదార్లు వాటికి చెల్లించే ధరలో ఆ పేద ప్రజల వేతనాలు మాత్రమే మిళితమై వున్నాయి; కౌలు కానీ, లాభం కానీ అందులో భాగంగా లేవు."

భూమికి కౌలుగా కానీ దేశంలోని వివిధ నివాసులందరికీ అది విభజింపబడాలి." (సం. 2, అధ్యాయం-2)

ఆడమ్ స్మిత్ ఈ విధంగా విడివిడిగా అన్ని సరుకుల ధరను, "ప్రతి దేశంలోని భూమి యొక్క శ్రమ యొక్క వార్షిక ఉత్పాదితం మొత్తం ధరను లేక మార్పిడి విలువను" వేతనాలుగా, లాభంగా, కౌలుగా, అంటే వేతన శ్రామికులకు, పెట్టుబడిదార్లకు, భూ యజమానులకు గల ఈ మూడు ఆదాయ వనరులుగా విడగొట్టిన అనంతరం, ఆయనకు నాలుగవ అంశాన్ని, పెట్టుబడి అనే అంశాన్ని డొంక తిరుగుడు మార్గాన, చాటుగా చొప్పించవలసిన అవసరం ఏర్పడింది. మొత్తం ఆదాయం, నికరాదాయం మధ్య విభజన రేఖను గీయడం ద్వారా ఆయన ఆ పని చేశారు : "ఒక మహా దేశంలోని సర్వజనుల మొత్తం ఆదాయం అంటే, వారి భూమి యొక్క శ్రమ యొక్క సమస్త వార్షిక ఉత్పాదితం కాగా, నికర ఆదాయం అంటే నిర్వహణ-వ్యయాన్ని మినహాయించిన తరువాత వారికి మిగిలి ఉన్నది; అంటే మొదటిది, వారి నిశ్చల పెట్టుబడి, రెండవది వారి చలామణి పెట్టుబడి మినహాయించగా మిగిలినది; లేక తమ పెట్టుబడి జోలికి పోకుండా, తమ తక్షణ వినియోగం కోసం కేటాయించుకున్న నిల్వలో ఉంచుకొన్నది లేక తమ జీవిక కోసం, సౌకర్యాల కోసం, వినోదాల కోసం వారు ఖర్చు పెట్టుకోగల మొత్తం. వారి వాస్తవ సంపద కూడా వారి మొత్తం ఆదాయానికి కాక నికరాదాయానికి మాత్రమే అనుగుణమైన నిష్పత్తిలో ఉంటుంది." (అదే గ్రంథం)

దీనిపై మా వ్యాఖ్య ఇదీ : 1) ఆడమ్ స్మిత్ ఇక్కడ స్పష్టంగా సామాన్య పునరుత్పత్తిని గురించే చెబుతున్నారు తప్ప విస్తృత స్థాయిలోని పునరుత్పత్తిని లేక సంచయనాన్ని గురించి కాదు. పని చేస్తున్న పెట్టుబడి "నిర్వహణ"కు అయ్యే ఖర్చుల గురించి మాత్రమే ఆయన ప్రస్తావిస్తున్నారు. సమాజానికి లేదా వ్యష్టి పెట్టుబడిదారుకు సంబంధించిన "నికర ఆదాయం" అన్నది, వార్షిక ఉత్పాదితం నుంచి "వినియోగ నిధి"లోకి చేర్చగలిగిన భాగానికి సమానమైనది. అయితే, ఈ నిధి పరిమాణం, పని చేస్తున్న "పెట్టుబడి జోలికి పోరాదు". కాబట్టి వ్యష్టి ఉత్పాదితం, సామాజిక ఉత్పాదితం - ఈ రెంటి విలువలోని ఒక భాగం వేతనాలుగా కానీ, లాభంగా కానీ, కౌలుగా కానీ విభజితం కాదు. అది పెట్టుబడిగా మాత్రమే విభజితమవుతుంది.

2) మాటల గారడీ ద్వారా, "మొత్తం ఆదాయం, నికర ఆదాయం" మధ్య వ్యత్యాసం చూపడం ద్వారా ఆడమ్ స్మిత్ తన సిద్ధాంతం నుంచి పారిపోతున్నాడు. వ్యష్టి పెట్టుబడిదారుకు, మొత్తంగా పెట్టుబడిదారీ వర్గానికి లేక జాతి అనబడే దానికి, ఉత్పత్తిలో వినియోగమైన పెట్టుబడి స్థానంలో ఒక సరుకు-ఉత్పాదితం లభిస్తుంది. ఆ ఉత్పాదితంలో వివిధ నిష్పత్తుల్లో ఉన్న దాని భాగాలకు ప్రాతినిధ్యం వహించే దాని విలువ, ఒకవైపు, వ్యయమైన పెట్టుబడి-విలువ స్థానాన్ని భర్తీ చేస్తుంది. ఆ విధంగా అది ఆదాయమవుతుంది. శబ్దార్థం ప్రకారం రాబడి (రెవెన్యూ) అవుతుంది. (ఫ్రెంచి భాషలో revenir అంటే తిరిగివచ్చు అని అర్థం. Revenir అనే పదానికి పాస్ట్ పార్టిసిపుల్ revenue) అయితే మన మొక విషయం గమనించాలి - అది పెట్టుబడిపై రాబడి లేక పెట్టుబడిపై ఆదాయం. అది మరోవైపు తమ శ్రమకు వేతనాలుగా కానీ, తమ నిల్వలకు లాభాలుగా కానీ, తమ భూమికి కౌలుగా కానీ దేశవాసుల మధ్య విభజింపబడిన విలువలోని భాగాలుగా ఉంటుంది. దైనందిన జీవితంలో ఈ విలువను ఆదాయంగా వ్యవహరిస్తున్నారు. అందుచేత సమస్త ఉత్పాదితం విలువ అన్నది, ఎవరో

ఒకరి ఆదాయంగా ఉంటుంది; అది వ్యష్టి పెట్టుబడిదారుది కావచ్చు లేదా మొత్తం దేశానిది కావచ్చు. అయితే ఒకవైపు అది పెట్టుబడి మీద వచ్చిన ఆదాయం, మరోవైపు ఆదాయాని (income)కి భిన్నంగా ఉండే 'రాబడి' (రెవెన్యూ). పర్యవసానంగా తేలిన విషయం ఏమిటంటే, సరుకు విలువను, దాని అంతర్భాగాలుగా విశ్లేషించే సందర్భంలో తొలగింపబడిన దాన్ని దొడ్డిదారిన, అంటే 'రాబడి' ('రెవెన్యూ') అనే అస్పష్ట పదం ద్వారా తిరిగి చొప్పించడం జరిగింది. అయితే ఒక ఉత్పాదితం విలువలో అప్పటికే ఉన్నట్టి దాని భాగాలను మాత్రమే "తిరిగి తేవచ్చు". పెట్టుబడి రెవెన్యూగా తిరిగి రావాలంటే, పెట్టుబడిని అంతకు ముందే ఖర్చుపెట్టి ఉండక తప్పదు.

ఆడమ్ స్మిత్ ఇంకా ఇలా అంటారు : "అతి తక్కువగా ఉన్న సాధారణ లాభం రేటు ఎల్లప్పుడూ ప్రతి పెట్టుబడి వినియోగంలోనూ సంభవించే నష్టాలను పూడ్చడానికి సరిపడే మొత్తం కంటే ఎంతో కొంత ఎక్కువగానే ఉండి తీరుతుంది. నికర లాభం లేక స్పష్టమైన లాభం అంటే ఈ అదనపు మొత్తమే." (లాభం అంటే, అవసరమైన పెట్టుబడి వ్యయం. అంటే, పెట్టుబడిదారు అర్థం చేసుకొంటున్నదా?) "మొత్తం లాభం అనే దానిలో ఈ అదనపు మొత్తమే కాదు, ఇలాంటి అసాధారణ నష్టాలను పూడ్చడానికి మిగుల్చుకున్న మొత్తం చేరుతుంది కూడా". (సం. 1, అధ్యాయం-9, పుట 72) అంటే దీని అర్థం మొత్తం లాభంలోని ఒక భాగం, అంటే అదనపు విలువలోని ఒక భాగం, ఉత్పత్తి కోసం బీమా నిధిగా రూపొందాలి. అదనపు శ్రమలోని ఒక భాగం ఈ బీమా నిధిని సృష్టిస్తుంది; ఈ మేరకు అది నేరుగా పెట్టుబడిని, అంటే పునరుత్పత్తికి ఉద్దేశింపబడిన నిధిని సృష్టిస్తుంది. నిశ్చల పెట్టుబడి "నిర్వహణ"కు అయ్యే ఖర్చుకు సంబంధించి (పై ఉల్లేఖనలు చూడండి), వినియోగమైన నిశ్చల పెట్టుబడి స్థానాన్ని తిరిగి భర్తీచేసేది. కొత్త పెట్టుబడి కేటాయింపు కాదు; కొత్త రూపంలో పాత పెట్టుబడి-విలువ పునరుద్ధరణ మాత్రమే. ఇక నిశ్చల పెట్టుబడి మరమ్మతు విషయానికి వస్తే (ఆడమ్ స్మిత్ ఇది నిర్వహణ వ్యయాలలాంటిదే అంటాడు) అడ్వాన్సు చేసిన పెట్టుబడి మూల్యంలో ఈ వ్యయం కూడా ఒక భాగమే. అయితే పెట్టుబడిదారు ఈ మదుపునంతా ఒకేసారి పెట్టకుండా పెట్టుబడి పని చేస్తున్నప్పుడు, అవసరమైన సందర్భాలలో వీటిని క్రమేణా మదుపు పెడుతుంటాడు; అదివరకే జేబులో వేసుకున్న లాభాలలో నుంచి ఖర్చు పెడతాడు. ఈ వాస్తవం ఈ లాభం యొక్క మూలాధారాన్ని ఏ మాత్రం మార్చదు. అటు బీమా నిధి కోసమూ, ఇటు మరమ్మతు నిధి కోసమూ కార్మికుడు అదనపు శ్రమను అందిస్తాడని మాత్రమే లాభంలో భాగమైన ఈ విలువ నిరూపిస్తోంది.

నికరాదాయం నుంచి, అంటే నిర్దిష్ట అర్థంలోని రాబడి (Revenue) నుంచి, యావత్ నిశ్చల పెట్టుబడిని, అంతేకాక నిశ్చల పెట్టుబడిని నిర్వహించడానికి, మరమ్మతు చేయడానికి పునరుద్ధరించ డానికి, చలామణిలో ఉన్న యావత్ పెట్టుబడిని మినహాయించవలసి ఉంటుందని ఆడమ్ స్మిత్ చెబుతాడు; వాస్తవానికి, వినియోగ నిధి కోసం భౌతిక రూపంలో లేని యావత్ పెట్టుబడిని మినహాయించ వలసి ఉంటుంది అంటాడు ఆడమ్ స్మిత్.

"నిశ్చల పెట్టుబడి నిర్వహణకు అయిన మొత్తం ఖర్చును సమాజం యొక్క నికర రాబడి నుంచి మినహాయించవలసి ఉంటుందనేది స్పష్టమే. ఉపయోగకరమైన యంత్రాలకు, వాణిజ్య పరికరాలకు అండగా అవసరమైన పదార్థాలు కానీ .... ఆ పదార్థాలను సముచిత రూపంలోకి

తీసుకురావడానికి అవసరమైన శ్రమ ఉత్పాదితాలు కానీ, అందులో భాగం కాజాలవు. అయితే ఆ శ్రమ మూల్యం (Price) మాత్రం అందులో భాగంగా ఉండవచ్చు. ఎందుచేతనంటే, ఆ విధంగా నియమింపబడిన పనివారు తమ వేతనాల సమస్త విలువనూ ప్రత్యక్ష వినియోగానికి కేటాయించిన తమ నిల్వలో ఉంచుకోవచ్చు. కానీ ఇతర రకాల శ్రమలో మాత్రం అటు మూల్యమూ (అంటే, ఈ శ్రమకు చెల్లింపబడిన వేతనాలు), ఇటు ఉత్పాదితాలు (అంటే, ఈ శ్రమ పొందుపడి ఉన్న ఉత్పాదితాలు) రెండూ కూడా ఆ నిల్వలోకే చేరుతాయి; మూలమేమో పనివారి నిల్వలోకీ, ఉత్పాదితమేమో ఆ పనివారి శ్రమ మూల్యంగా తమ జీవనభృతి, సౌకర్యాలు, వినోదాలను పెంపొందించుకొన్న ఇతర ప్రజల నిల్వలోకీ చేరుతాయి. (సం. II, అధ్యాయం 2, పుట 190–191)"

ఆడమ్ స్మిత్ ఇక్కడ, ఉత్పత్తి సాధనాల ఉత్పత్తిలో నియమితులైన కార్మికులకూ, వినియోగ వస్తువుల తక్షణ ఉత్పత్తిలో నియమితులైన కార్మికులకు మధ్య ఉన్న ఒక ముఖ్యమైన తేడాను పేర్కొంటున్నాడు. మొదట పేర్కొన్న కార్మికులు ఉత్పత్తి చేసిన సరుకుల విలువలో, వేతనాల మొత్తానికి సమానమైన ఒక అంతర్భాగం ఉంటుంది; అది పెట్టుబడిలో శ్రమశక్తి కొనుగోలుకు మదుపు పెట్టిన భాగం విలువకు సమానం. ఈ విలువ భాగం, శ్రామికులు ఉత్పత్తి చేసిన ఉత్పత్తి సాధనాల్లో ఒక భాగంగా భౌతిక రూపంలో ఉంటుంది. వారు వేతనాలుగా తీసుకొన్న డబ్బు వారి ఆదాయం; కానీ వారి సొంతానికి కానీ, లేక ఇతరులకు కానీ వినియోగార్హమైన ఎలాంటి సరుకులనూ వారి శ్రమ సృష్టించడం జరగలేదు. అందుచేత వార్షిక ఉత్పాదితంలో సామాజిక వినియోగ నిధిని ఏర్పాటు చేయడానికి ఉద్దేశించిన భాగంలో ఈ ఉత్పాదితాలు ఒక అంశంగా ఉండవు; ఈ సామాజిక వినియోగ నిధే "నికరమైన రాబడి" ధరించగల వాస్తవ రూపం. వేతనాలకు అన్వయించేదే, ఉత్పత్తి సాధనాల విలువలో, అదనపు విలువగా ఉన్న భాగానికి కూడా అన్వయిస్తుందని చెప్పడం ఆడమ్ స్మిత్ ఇక్కడ విస్మరిస్తున్నాడు; అది అదనపు విలువగా ఉండడం వల్ల (అన్నిటికన్నా ముందు) పారిశ్రామిక పెట్టుబడిదారుకు లాభం, కౌలు కింద లభించే రాబడి అవుతుంది. ఈ విలువ–భాగాలు వినియోగం కాజాలని ఉత్పత్తి సాధనాలలో కూడా ఉన్నాయి. అవి డబ్బుగా పరివర్తన చెందితే తప్ప తమ ధరకు అనుగుణమైన పరిమాణంలో వినియోగ వస్తువులను – రెండవ రకం కార్మికులు ఉత్పత్తి చేసిన వినియోగ వస్తువులను అందజేయలేవు. అవి డబ్బుగా పరివర్తన చెందాకనే, ఆ వస్తువులను తమ యజమానుల వ్యక్తిగత వినియోగ – నిధికి బదలాయించగలుగుతాయి. అంతకన్నా కూడా ఆడమ్ స్మిత్ ఈ క్రింది విషయాన్ని గమనించి ఉండవలసింది; ఏటా తయారయ్యే ఉత్పత్తి సాధనాల విలువలోని ఒక భాగం, అంటే ఉత్పత్తి రంగంలో పనిచేసే ఉత్పత్తి సాధనాల విలువకు సమానంగా ఉన్న భాగం – ఉత్పత్తి సాధనాలను సృష్టించే ఉత్పత్తి – సాధనాలు. అందుచేత, ఇక్కడ నియుక్తమైన స్థిర పెట్టుబడి విలువకు సమానమైన విలువ భాగం, రాబడిగా ఏర్పడే విలువ భాగంగా ఉండజాలదు. అందుకు కారణం, దాని భౌతిక రూపమొక్కటే కాదు, అది పెట్టుబడిగా వ్యవహరించడం కూడా.

ఇక రెండవ తరహా కార్మికులకు సంబంధించి, అంటే వినియోగ వస్తువులను నేరుగా ఉత్పత్తి చేసే కార్మికులకు సంబంధించి ఆడమ్ స్మిత్ చేసిన నిర్వచనాలు, పూర్తి ఖచ్చితమైనవి కావు. ఎందుచేతనంటే, ఈ తరహా శ్రమలలో, శ్రమ, శ్రమ తాలూకు మూల్యమూ, ఉత్పాదితమూ రెండూ కూడా ప్రత్యక్ష వినియోగం కోసం కేటాయించబడిన నిల్వలోకి "చేరుతా"యని ఆయన అంటాడు.

"మూల్యమేమో" (అంటే వేతనాలుగా పొందే డబ్బు) "పనివారి నిల్వలోకి, ఉత్పాదితమేమో ఆ పనివారి శ్రమ మూలంగా తమ జీవన భృతి, సౌకర్యాలు, వినోదాలను పెంపొందించుకొనే ఇతర ప్రజల నిల్వలోకి చేరుతాయి" అంటాడు. కానీ కార్మికుడు తన శ్రమ "మూల్యం" తినలేడు; అంటే తన వేతనాలకై చెల్లించే డబ్బును తినడు. వినియోగ వస్తువులను కొనుగోలు చేయడం ద్వారా అతడా డబ్బును వినియోగించుకుంటాడు. ఇందులో కొన్ని వస్తువులు తాను ఉత్పత్తి చేసినవంటివి కావచ్చు. మరోవైపు, అతని ఉత్పాదితం, శ్రమ దోపిడీదార్లు మాత్రమే వినియోగం చేసే వాటిలో ఒకటి కావచ్చు.

ఆడమ్ స్మిత్ ఒక దేశం యొక్క "నికర రాబడి" నుంచి నిశ్చల పెట్టుబడిని సంపూర్ణంగా మినహాయించిన అనంతరం ఇలా చెప్పుకుపోతాడు :

"ఈ విధంగా నిశ్చల పెట్టుబడికి అయ్యే యావత్తు నిర్వహణ ఖర్చు సమాజం యొక్క నికర రాబడి నుంచి తప్పనిసరిగా మినహాయించబడినప్పటికీ, చలామణి పెట్టుబడికి అయ్యే నిర్వహణ ఖర్చుకు ఇది వర్తించదు. చలామణి పెట్టుబడిలో, నాలుగు భాగాలు – డబ్బు, ఆహార పదార్థాలు, సామాగ్రి, పూర్తిగా తయారైన వస్తువులు – ఉన్నాయి. వీటిలో ఆఖరి మూడు భాగాలు దానినుంచి క్రమానుసారం ఉపసంహరింపబడుతుంటాయనీ, అవి సమాజం యొక్క నిశ్చల పెట్టుబడిలో కానీ, ప్రత్యక్ష వినియోగానికి కేటాయింపబడిన నిల్వలో నియుక్తం కానట్టి ఈ వినియోగార్హ సరుకుల్లోని భాగం, ప్రత్యక్ష వినియోగ నిధిలో చేరి, సమాజం యొక్క నికర రాబడిలో ఒక భాగమవుతుంది. అందుచేత చలామణి పెట్టుబడిలోని ఆ మూడు భాగాల నిర్వహణకు, సమాజం యొక్క నికర రాబడి నుంచి వార్షిక ఉత్పత్తి భాగమేదీ, నిశ్చల పెట్టుబడి నిర్వహణకు అవసరమైనది తప్ప, ఉపసంహరింపబడదు". (సం. II, అధ్యాయం 2, పుట 192)

ఉత్పత్తి సాధనాల ఉత్పత్తికి ఉపయోగపడని చలామణి పెట్టుబడి భాగం వినియోగ వస్తువుల ఉత్పత్తిలో అంటే, సమాజ వినియోగ నిధిగా ఏర్పడటానికి ఉద్దేశించిన వార్షిక ఉత్పాదిత భాగంలో చేరుతుందని అనడం, చెప్పినదే వేరుమాటల్లో చెప్పడం తప్ప మరొకటి కాదు. కానీ పై వాక్యాల వెనువెంటనే కనిపించే ఈ క్రింది వాక్యాలు ముఖ్యమైనవి :

"ఈ విషయంలో, సమాజ చలామణి పెట్టుబడికీ, ఒక వ్యక్తి యొక్క చలామణి పెట్టుబడికీ తేడా ఉంది. వ్యక్తి యొక్క చలామణి పెట్టుబడి, అతని నికర ఆదాయంలో భాగంగా ఏర్పడకుండా ఎడంగా ఉంచబడుతుంది; ఆ ఆదాయమయ్యేది కేవలం అతని లాభాలే. అయితే ప్రతి వ్యక్తి యొక్క చలామణి పెట్టుబడీ, అతడు సభ్యుడుగా ఉన్న సమాజం యొక్క చలామణి పెట్టుబడిలో ఒక భాగమే అయినప్పటికీ, ఆ కారణంగా అది వారి నికర ఆదాయంలో ఒక భాగంగా ఉండకుండాపోదు. ఒక వ్యాపారి దుకాణంలోని సరుకులన్నీ అతని ప్రత్యక్ష వినియోగానికి కేటాయించబడ్డ నిల్వలో ఉండవచ్చు. వారు ఇతర నిధుల ద్వారా పొందిన రాబడి నుంచి ఆ సరుకుల విలువను, దానిలోని లాభాలతో సహా అతనికి భర్తీ చేసి ఇస్తారు. ఇందువల్ల అతని పెట్టుబడిగానీ, వారి పెట్టుబడిగానీ ఏ మాత్రమూ తగ్గదు." (అదే సంపుటి, అదే పుట).

కాబట్టి మనకిక్కడ కింది విషయాలు తెలుస్తున్నాయి :

1. నిశ్చల పెట్టుబడీ, దాని పునరుత్పత్తికీ, దాని నిర్వహణకు అవసరమైన చలామణి పెట్టుబడి (దీని విధినీ ఆయన మర్చిపోయాడు). రెండూ కూడా ప్రతి వ్యష్టి పెట్టుబడిదారుని నికరాదాయం

నుంచి కేవలం అతని లాభమైన ఆ నికరాదాయం నుంచి పూర్తిగా మినహాయించబడతాయి; పై విధంగానే వినియోగ వస్తువుల ఉత్పత్తిలో నియుక్తమైన చలామణి పెట్టుబడి కూడా అతని నికరాదాయం నుంచి మినహాయించబడుతుంది. అందుచేత అతని పెట్టుబడిని భర్తీ చేసే అతని సరుకు ఉత్పాదితంలోని భాగం, అతనికి ఆదాయంగా ఏర్పడే విలువ అంతర్భాగాలుగా విభజితం కాదు.

2. ప్రతి వ్యష్టి నిశ్చల పెట్టుబడీ సమాజం యొక్క నిశ్చల పెట్టుబడిలో ఒక భాగంగా ఉన్నట్లే, ప్రతి వ్యష్టి పెట్టుబడిదారుని చలామణి పెట్టుబడి కూడా సమాజం యొక్క చలామణి పెట్టుబడిలో ఒక భాగంగా ఉంటుంది.

3. సమాజం యొక్క చలామణి పెట్టుబడి, వ్యష్టి చలామణి పెట్టుబడుల మొత్తానికి ప్రాతినిధ్యం వహిస్తున్నప్పటికీ, సమాజం యొక్క చలామణి పెట్టుబడి స్వభావానికీ, ప్రతి వ్యష్టి పెట్టుబడిదారుని చలామణి పెట్టుబడి స్వభావానికీ మధ్య తేడా ఉంటుంది. వ్యష్టి పెట్టుబడిదారుని చలామణి పెట్టుబడి అతని సొంత ఆదాయంలో భాగం ఎన్నటికీ కాజాలదు; అయితే సమాజం యొక్క చలామణి పెట్టుబడిలోని ఒక భాగం (వినియోగ సరుకుల రూపంలో ఉన్నట్టిది), అదే సమయంలో, సమాజం యొక్క ఆదాయంలో ఒక భాగంగా రూపొందించవచ్చు; లేదా ఆయన పైన తెలిపినట్లు, అది తప్పనిసరిగా వార్షిక ఉత్పత్తిలోని ఒక భాగం మేరకు సమాజం యొక్క నికరాదాయన్ని తగ్గించాలని ఏమీ లేదు. ఆడమ్ స్మిత్ ఇక్కడ చలామణి పెట్టుబడిగా పేర్కొంటున్నది, వాస్తవానికి ఏటా ఉత్పత్తి అయ్యే సరుకు–పెట్టుబడే; అంటే వినియోగ సరుకులను ఉత్పత్తి చేసే పెట్టుబడిదారులు ఏటా చలామణిలోకి తోసే సరుకు–పెట్టుబడి అన్నమాట. పెట్టుబడిదారుల యావత్ వార్షిక సరుకు–ఉత్పాదితం వినియోగ వస్తువుల రూపంలో ఉంటుంది; అందుచేత అది ఎలాంటి నిధిని ఏర్పరుస్తుందంటే, సమాజం యొక్క నికరాదాయాలు (వేతనాలతో సహా) అందులో నుంచే లభిస్తాయి; లేదా వ్యయమవుతుంది. ఆడమ్ స్మిత్ తన ఉదాహరణ కోసం, వ్యాపారి దుకాణంలోని సరుకులకు బదులు పారిశ్రామిక పెట్టుబడిదారుల గోదాములలో నిల్వ చేయబడిన సరుకుల సమూహాన్ని ఎంచుకొని ఉండవలసింది.

నిశ్చల పెట్టుబడి అని తాను పేర్కొన్న దాని పునరుత్పత్తిని ఆడం స్మిత్ పరిశీలిస్తున్న సందర్భంగా మునుపు ఆయన మనసులో తోసుకువచ్చిన చెదురుమదురు ఆలోచనలనూ, చలామణి పెట్టుబడి అని తాను పేర్కొన్న దాని పునరుత్పత్తిని పరిశీలిస్తున్న సందర్భంగా ఇప్పుడు అలాగే వచ్చిన ఆలోచనలనూ, ఆయన గనుక ఏకతాటిపైకి తెచ్చి మేళవించుంటే కింది నిర్ధారణకు వచ్చి ఉండేవారు:

I) సమాజం యొక్క వార్షిక ఉత్పాదితం రెండు విభాగాలుగా ఉంటుంది. ఒకటి, ఉత్పత్తి సాధనాలు, రెండవది, వినియోగ వస్తువులు. వీటిలో ప్రతిదాన్ని విడిగా పరిశీలించాల్సిందే.

II) ఉత్పత్తి సాధనాల రూపంలో ఉండే వార్షిక ఉత్పాదిత భాగం యొక్క మొత్తం విలువను ఈ క్రింది విధంగా విభజింపవచ్చు. ఆ విలువలోని ఒక భాగం ఆ ఉత్పత్తి సాధనాల నిర్మాణంలో వినియోగం అయిన ఉత్పత్తి సాధనాల విలువకు ప్రాతినిధ్యం వహిస్తుంది; ఇది పునరుద్ధరింపబడిన రూపంలో పునర్దర్శనమిచ్చే పెట్టుబడి–విలువ మాత్రమే. ఇందులోని మరొక భాగం శ్రమశక్తికై వెచ్చించబడిన పెట్టుబడి యొక్క విలువకు సమానంగా ఉంటుంది లేదా ఈ ఉత్పత్తి రంగంలో పెట్టుబడిదారులు చెల్లించిన వేతనాల మొత్తానికి సమానంగా ఉంటుంది. ఇక చివరగా, ఈ విలువలోని

మూడవ భాగం, ఈ తరహా పారిశ్రామిక పెట్టుబడిదార్ల లాభాలకు మూలాధారం. ఇందులో భూమి కౌలు కూడా చేరి ఉంటుంది.

ఆడమ్ స్మిత్ అభిప్రాయం ప్రకారం, మొదటి భాగం అంటే ఈ మొదటి విభాగంలో నియుక్తమైన సమస్త వ్యష్టి పెట్టుబడుల నుంచి పునరుత్పత్తి అయిన నిశ్చల పెట్టుబడి భాగం, వ్యష్టి పెట్టుబడిదారుల "నికర ఆదాయం"లో కానీ, సమాజం యొక్క "నికర ఆదాయంలో" కానీ "ఏ భాగంగానూ ఉండనే ఉండదు". అది ఎల్లప్పుడూ పెట్టుబడిగానే వ్యవహరిస్తుంది తప్ప ఎన్నడూ ఆదాయంగా ఉండదు. ఆ మేరకు ప్రతి వ్యష్టి పెట్టుబడిదారుని "నిశ్చల పెట్టుబడి"కీ, సమాజం యొక్క నిశ్చల పెట్టుబడికీ మధ్య తేడాయే లేదు. అయితే, సమాజం యొక్క వార్షిక ఉత్పాదితం విలువలో, ఉత్పత్తి సాధనాల రూపంలో ఉన్న ఇతర భాగాలు – ఉత్పత్తి సాధనాల మొత్తం పరిమాణంలోని సమభాగాలుగా ఉన్న వాటి విలువ భాగాలు – వాస్తవానికి, ఈ ఉత్పత్తిలో పాల్గొనే ప్రతినిధులందరికీ ఆదాయాలుగా ఏకకాలంలో ఉంటాయి. కార్మికులకు వేతనాలుగా, పెట్టుబడిదార్లకు లాభాలూ, కౌలుగా ఉంటాయి. సమాజం యొక్క వార్షిక ఉత్పాదితం, ఆ సమాజానికి చెందిన వ్యష్టి పెట్టుబడిదారుల ఉత్పాదితాల సమాహారంగా ఉన్నప్పటికీ పై భాగాలు సమాజానికి పెట్టుబడిగానే ఉంటాయి తప్ప ఆదాయంగా కాదు. ఇవి స్వభావరీత్యా మొత్తం మీద ఉత్పత్తి సాధనాలుగా మాత్రమే వ్యవహరించగలవు; అవసరమైతే వినియోగ వస్తువులుగా వ్యవహరించగలవి సైతం కొత్త ఉత్పత్తికి ముడిపదార్థాలుగా లేదా అనుబంధ పదార్థాలుగా ఉపకరించడానికి ఉద్దేశించబడినవే. అయితే అవి ఈ విధంగా, పెట్టుబడిగా ఉపయోగపడేది వాటిని ఉత్పత్తి చేసేవారికి కాదు, వాటిని వినియోగించుకునేవారికి మాత్రమే. వారెవరంటే;

III) రెండవ విభాగానికి చెందిన పెట్టుబడిదార్లు; వీరు వినియోగ సరుకుల ప్రత్యక్ష ఉత్పత్తి దారులు. అవి ఈ పెట్టుబడిదారుల కోసం వినియోగ సరుకుల ఉత్పత్తిలో వ్యయం కాబడిన పెట్టుబడిని భర్తీ చేస్తాయి. (ఈ పెట్టుబడి శ్రమశక్తిగా మారని మేరకు, అంటే, అది ఈ రెండవ విభాగపు కార్మికుల వేతనాల మొత్తం కాని మేరకు భర్తీ చేస్తాయి) కాగా వాటిని ఉత్పత్తి చేసే పెట్టుబడిదారుల చేతుల్లో ఇప్పుడు వినియోగ వస్తువుల రూపంలో ఉన్న ఈ వినియుక్త పెట్టుబడి – సామాజిక దృష్టితో చూస్తే – వినియోగ నిధి అవుతుంది; ఈ వినియోగ నిధి నుంచే మొదటి విభాగానికి చెందిన పెట్టుబడిదారులు, కార్మికులు తమ ఆదాయాలను గ్రహిస్తారు.

ఆడమ్ స్మిత్ గనక తన విశ్లేషణను ఈ అంశం దాకా కొనసాగించి ఉంటే, ఈ సమస్త సమస్య పరిష్కారానికి ఇక ఏదీ అవసరమై ఉండేదికాదు. ఆయన దాదాపు పరిష్కారం దగ్గరకు వచ్చాడు; ఎందుచేతనంటే సమాజం యొక్క సమస్త వార్షిక ఉత్పాదితంగా ఉన్న సరుకు–పెట్టుబడులలో, ఒక రకానికి చెందిన వాటి (ఉత్పత్తి సాధనాల) విలువ భాగాల్లో కొన్ని వాటి ఉత్పత్తిలో పాల్గొన్న వ్యష్టి కార్మికులకు, పెట్టుబడిదార్లకు ఆదాయాన్ని ఏర్పరుస్తాయే తప్ప, అవి సమాజం ఆదాయంలో ఒక భాగం కాబోవని ఆయన చెప్పాడు. కాగా, మరో రకం (వినియోగ వస్తువులు) యొక్క విలువ భాగాలు, ఈ మదుపు రంగంలో పాల్గొనే వాటి వ్యష్టి యజమానుల, అంటే పెట్టుబడిదారుల పెట్టుబడి–విలువకు ప్రాతినిధ్యం వహిస్తున్నప్పటికీ, అవి సమాజం ఆదాయంలో ఒక భాగంగా మాత్రమే ఉంటాయని ఆయన గమనించాడు.

అయితే పైన తెలిపిన అంశాలు ఈ క్రింది విషయాలను స్పష్టం చేస్తున్నాయి :

**ఒకటి** – సామాజిక పెట్టుబడి వ్యష్టి పెట్టుబడిదార్ల పెట్టుబడుల మొత్తానికి సమానంగా మాత్రమే ఉన్నప్పటికీ, ఆ కారణం వల్ల సమాజం యొక్క వార్షిక సరుకు–ఉత్పాదితం (లేక సరుకు–పెట్టుబడి) ఈ వ్యష్టి పెట్టుబడిదార్ల సరుకు–ఉత్పాదితాల మొత్తానికి సమానంగా ఉన్నప్పటికీ, అందుచేత సరుకుల విలువను దాని అంతర్భాగాలుగా విడమర్చడం ప్రతి వ్యష్టి సరుకు–పెట్టుబడికి చెల్లుబడి అయినట్లే సర్వ సమాజం యొక్క సరుకు–పెట్టుబడికి కూడా, తుదిదాకా చెల్లుబడి అయినప్పటికీ, ఈ అంతర్భాగాలు, పునరుత్పత్తికి సంబంధించిన మొత్తం సామాజిక ప్రక్రియలో ధరించే రూపం విభిన్నంగా ఉంటుంది.

**రెండు** – సాధారణ పునరుత్పత్తి ప్రాతిపదికపై సైతం, కేవలం వేతనాలూ (అస్థిర పెట్టుబడి), అదనపు విలువా ఉత్పత్తి కావడమే కాక, నూతన స్థిర పెట్టుబడి–విలువ యొక్క ప్రత్యక్ష ఉత్పత్తి కూడా జరుగుతుంది. పనిదినంలో రెండు భాగాలు ఉన్నప్పటికీ ఇది వాస్తవం, పనిదినంలోని ఒక భాగంలో కార్మికుడు తన శ్రమశక్తి కొనుగోలుకు సమంగా ఉన్నదానిని ఉత్పత్తిచేసి, తద్వారా అస్థిర పెట్టుబడి స్థానాన్ని భర్తీ చేస్తాడు. కాగా మరొక భాగంలో అతడు అదనపు–విలువను (లాభం, అద్దె వగైరా) ఉత్పత్తి చేస్తాడు.

ఉత్పత్తి సాధనాల పునరుత్పత్తిలో వ్యయమయ్యే రోజువారీ శ్రమ (దీని విలువలో వేతనాలు, అదనపు విలువ, రెండూ ఉన్నాయి) వాస్తవానికి నూతన ఉత్పత్తి సాధనాల రూపంలో దర్శనమిస్తుంది; వినియోగ వస్తువుల ఉత్పత్తిలో వ్యయమైన పెట్టుబడితోనే స్థిర భాగాన్ని నూతన ఉత్పత్తి సాధనాలు భర్తీ చేస్తాయి.

ప్రధానమైన చిక్కుల్లో ఎక్కువ భాగం వెనుకటి పేజీల్లోనే పరిష్కరింపబడినాయి. ఇవి పెట్టుబడి సంచయనంపై అధ్యయనంలో కాక సాధారణ పునరుత్పత్తి అధ్యయనంలో ఎదురవుతాయి; అందుచేతనే సమాజ వార్షిక ఉత్పాదితం యొక్క గమనానికీ, చలామణి ద్వారా దాని పునరుత్పత్తికీ సంబంధించిన సమస్య ఎదురైనప్పుడల్లా ఆడమ్ స్మిత్ (రెండవ సంపుటి), అంతకు మునుపు క్వెస్నే తన Tableau Economique (ఆర్థికాంశాల పట్టిక) లో సాధారణ పునరుత్పత్తితో ప్రారంభించారు.

## 2. ఆడమ్ స్మిత్ మార్పిడి విలువను అ.పె + అ.విగా విభజిస్తాడు

ఏ ఒక్క సరుకు ధరలో అందుచేత సమాజ వార్షిక ఉత్పాదితంగా ఉన్న మొత్తం సరుకుల ధరలో (అంతటా పెట్టుబడిదారీ ఉత్పత్తే ఉన్నట్లు, ఆడమ్ స్మిత్ ఊహించుకోవడం సరియైనదే), లేక 'మార్పిడి కాగల విలువలో' మూడు 'అంతర్భాగాలు' ఉంటాయని, లేదా అది వేతనాలుగా, లాభంగా భూమి కౌలుగా 'విభజితమవుతుందని' ఆయన చేసిన సూత్రీకరణను ఇలా క్లుప్తీకరించవచ్చు : సరుకు–విలువ అన్నది అ.పె + అ.వి కు సమానం; అంటే, అడ్వాన్సు చేయబడిన అస్థిర పెట్టుబడి విలువ + అదనపు విలువ అన్నమాట. ఆడమ్ స్మిత్ అనుమతితో లాభం, భూమి కౌలు, రెంటినీ, కింది ఉదాహరణల్లో చూపినట్లు, అ.వి అనే ఒక యూనిట్‌గా మనం పరిగణింపవచ్చు. సరుకు – విలువలో, మనం పేర్కొన్న అ.పె + అ.వి అనే అంశాలు మాత్రమే ఉంటాయన్న ఆయన సూత్రం నుంచి వైదొలగిన అల్ప విషయాలను – అ.వి నిజంగా వైదొలగినవైనా, లేక వైదొలగినట్లు కనిపించేవైనా – మనం ప్రారంభంలో వదిలేద్దాం.

కర్మాగారంలో : "పనివారు పదార్థాలకు అదనంగా చేకూర్చే విలువ – రెండు భాగాలుగా విభజితమవుతుంది. అందులో ఒక భాగం వారికి వేతనాలు చెల్లిస్తుంది. రెండవ భాగంలో ఆ పదార్థాల మొత్తం నిలవపై వచ్చే లాభాలు, అతడు అడ్వాన్స్ చేసిన వేతనాలు ఉన్నాయి." (సం. I, అధ్యాయం 6, పుట 41) "కార్ఖానాలోని వస్తూత్పాదకునికి అతని యజమాని వేతనాలు చెల్లిస్తాడు. కానీ వాస్తవంలో అతని వల్ల యజమానికి ఏమీ ఖర్చు కాదు; కార్మికుడు దేనిపై తన శ్రమను వెచ్చిస్తాడో ఆ వస్తువు యొక్క పెరిగిన విలువనుంచి లాభంతో సహా ఆ వేతనాల విలువ తిరిగి అందుతుంది." నిల్వ నిధిలో, "ఉత్పత్తి చేసే పనివారి పోషణకు" వ్యయమైన భాగం.... "అతనికి (యజమానికి) పెట్టుబడిగా పని చేసిన అనంతరం, వారికి (కార్మికులకు) రాబడిగా ఉంటుంది." (సం. II, అధ్యాయం 3, పుట 223)

ఇప్పుడు ఉల్లేఖించిన అధ్యాయంలో ఆడమ్ స్మిత్ ఇలా స్పష్టీకరిస్తాడు :

"ప్రతి దేశంలోని భూమి యొక్క, శ్రమ యొక్క సమస్త వార్షిక ఉత్పత్తి సహజంగానే రెండు భాగాలుగా విభజితమవుతుంది. అందులో ఒక భాగం, తరచుగా పెద్ద భాగం మొదట పెట్టుబడిని భర్తీ చేయడానికి ఉద్దేశించబడినది; లేదా అంతకు ముందు పెట్టుబడినుంచి ఉపసంహరించుకోబడిన ఆహార పదార్థాలను, సామాగ్రిని, తయారీ వస్తువులను పునరుద్ధరించడానికి ఉద్దేశించబడింది. రెండవ భాగమేమో ఈ పెట్టుబడి యజమానికి ఆదాయంగా ఉండటానికి, అతని నిల్వ నిధిపై లాభంగా ఉండటానికీ లేదా, మరెవరికైనా అతడి భూమికి కౌలుగా ఉండడానికి ఉద్దేశించబడినది." (పుట 222) పెట్టుబడిలోని ఒక భాగం మాత్రమే అదే సమయంలో మరొకరికి ఆదాయంగా ఉంటుందనీ, అది ఉత్పత్తి చేసే పనివారి కొనుగోలుకై మదుపు పెట్టిన భాగమనీ ఇంతకు ముందే ఆడమ్ స్మిత్ చెప్పాడు. ఈ భాగం – అంటే అస్థిర పెట్టుబడి – మొదట యజమాని చేతుల్లో అతనికి "పెట్టుబడిగా పని చేస్తుంది". ఆ తరువాత ఉత్పాదకుడైన కార్మికుడికి అది "ఆదాయంగా ఉంటుంది". పెట్టుబడిదారు తన పెట్టుబడి–విలువలోని ఒక భాగాన్ని శ్రమ–శక్తిగా మార్చుతాడు; అలా చేయడం ద్వారానే దానినతడు అస్థిర పెట్టుబడిగా మార్చుతాడన్నమాట. ఈ మార్పు మూలంగానే, పెట్టుబడిలోని ఈ భాగం మాత్రమే కాక, యావత్ పెట్టుబడి పారిశ్రామిక పెట్టుబడిగా పని చేస్తుంది. కార్మికుడు – అంటే శ్రమశక్తి అమ్మకందారు – శ్రమశక్తి విలువను వేతనాల రూపంలో స్వీకరిస్తాడు. అతని చేతుల్లో శ్రమశక్తి అన్నది, అమ్మటానికి వీలున్న సరుకు, దాని అమ్మకం ద్వారానే అతడు జీవిస్తాడు. కాబట్టి అతని ఆదాయానికి అది ఏకైక మూలాధారం; శ్రమశక్తి తన కొనుగోలుదారు చేతుల్లో మాత్రమే, అంటే పెట్టుబడిదారు చేతుల్లోనే అస్థిర పెట్టుబడిగా వ్యవహరిస్తుంది. పెట్టుబడిదారు దాని కొనుగోలు ధరను ఇస్తున్నట్లు కేవలం పైకి కనిపిస్తుంది అంతే. ఎందుచేతనంటే, అంతకు ముందే కార్మికుడు దాని విలువను అతనికి అందజేశాడు.

ఈ విధంగా, కర్మాగారంలో, ఒక ఉత్పాదితం విలువ అ.పె + అ.వికు (అ.వి పెట్టుబడిదారుని లాభానికి గుర్తు) సమానంగా ఉంటుందని నిరూపించాక ఆడమ్ స్మిత్ వ్యవసాయం గురించి ఇలా వివరిస్తాడు : వ్యవసాయంలో కార్మికులు "తమ వినియోగానికి సమానమైన విలువను లేక వారిని పనిలో నియోగించిన (అస్థిర) పెట్టుబడికి, దాని యజమాని లాభాలతో సహా సమానమైన విలువను పునరుత్పత్తి" చేయడంతో పాటు, వారు "వ్యవసాయదారుని పెట్టుబడికి, దాని లాభాన్నే కాక, అదనంగా

భూస్వామి యొక్క కౌలును కూడా క్రమం తప్పకుండా పునరుత్పత్తి చేస్తారు." (సం. II, అధ్యాయం 5, పుట 243) ప్రస్తుతం పరిశీలిస్తున్న సమస్యకు, భూమి కౌలు భూస్వామి చేతుల్లోకి పోతుందన్న వాస్తవంతో నిమిత్తం లేదు. అది భూస్వామి చేతుల్లోకి పోవడానికి ముందు, వ్యవసాయదారుని చేతుల్లో అంటే పారిశ్రామిక పెట్టుబడిదారు చేతుల్లో ఉండి తీరుతుంది. అది ఎవరికైనా ఆదాయంగా రూపొందడానికి ముందు, ఉత్పాదితం విలువలో ఒక అంతర్భాగంగా ఉండాలి. అందుచేత ఆడమ్ స్మిత్ అభిప్రాయం ప్రకారం, కౌలు, లాభం రెండూ కూడా, అదనపు విలువలో అంతర్భాగాలు; ఉత్పాదక కార్మికుడు నిరంతరాయంగా తన వేతనాలతో పాటు, అంటే అస్థిర పెట్టుబడి విలువతోపాటు ఈ భాగాలను కూడా పునరుత్పత్తి చేస్తాడు. కాబట్టి కౌలు, లాభం ఇవి అదనపు అ.వి లో విలువ భాగాలు. ఆ విధంగా ఆడమ్ స్మిత్ అభిప్రాయం ప్రకారం, అన్ని సరుకుల ధర కూడా అ.పె+అ.విగా విభజితమవుతుంది.

అన్ని సరుకుల ధర కూడా (అందుచేత వార్షిక సరుకు – ఉత్పాదితం ధర కూడా) వేతనాలు ప్లస్ లాభం ప్లస్ భూమి కౌలుగా విభజింపబడుతుందని చెప్పే సూత్రం స్మిత్ గ్రంథంలో, అక్కడక్కడ అరుదుగా ఉన్న భాగాల్లో ఏ రూపం ధరిస్తుందంటే, ప్రతి సరుకు యొక్క విలువ, కాబట్టి, సమాజం యొక్క వార్షిక సరుకు – ఉత్పాదితం విలువ కూడా, అ.పె + అ.వి కి సమానంగా ఉంటుందన్న రూపం ధరిస్తుంది; లేదా శ్రమశక్తికి వెచ్చింపబడినట్టి, కార్మికులు నిరంతరాయంగా పునరుత్పత్తి చేసినట్టి పెట్టుబడి విలువకూ, దానికి తోడు కార్మికులు తమ శ్రమ ద్వారా చేకూర్చిన అదనపు విలువకూ అది సమానంగా ఉంటుందన్న మాట.

సరుకు విలువ వివిధ అంతర్భాగాలుగా విభజితమవుతుందని తెలిపే ఆయన పాక్షిక విశ్లేషణకు మూలమేమిటో ఆడమ్ స్మిత్ సాధించిన అంతిమ ఫలితం మనకు స్పష్టంగా చూపిస్తుంది. (ఈ విషయంపై మరిన్ని వివరాలకు క్రింద చూడండి) ఉత్పత్తిలో పాల్గొంటున్న వివిధ వర్గాలకు ఈ అంతర్భాగాలు, అదే సమయంలో ఆదాయ మూలాలుగా ఉంటాయన్న వాస్తవానికీ ప్రతి అంతర్భాగ పరిణామం, వాటి విలువల మొత్తం ఎలా నిర్ధారణ అవుతుందనే దానితో ఎట్టి సంబంధం లేదు.

ఆడమ్ స్మిత్ చెప్పే కింది మాటల్లో, నానారకాల గందరగోళం ఉంది : "సమస్త ఆదాయానికీ, సమస్త మార్పిడి విలువకూ వేతనాలూ, లాభం, కౌలు అన్నవి మూడు మూలాధారాలు. ఏ ఆదాయమైనా అంతిమంగా వీటిలోని ఏదో ఒకదాని నుంచీ వచ్చిందే." (సం. I, అధ్యాయం 6, పుట 48)

1. కార్మికులుగా లేదా కార్మికేతరులుగా పునరుత్పత్తి ప్రక్రియలో ప్రత్యక్షంగా పాల్గొనని సమాజ సభ్యులందరూ, వార్షిక సరుకు ఉత్పాదితంలో తమ వాటాను, అంటే తమ వినియోగ వస్తువులను ప్రధానంగా, మొదట ఈ ఉత్పాదితం ఏ వర్గాలకు చెందుతుందో, ఆ వర్గాల చేతుల్లోంచే స్వీకరిస్తారు; అంటే ఉత్పాదక కార్మికుల నుంచీ, పారిశ్రామిక పెట్టుబడిదార్ల నుంచీ, భూస్వాముల నుంచీ లభిస్తుందన్న మాట. ఆ మేరకు వారి ఆదాయాలు వాస్తవ రూపంలో వేతనాల (ఉత్పాదక కార్మికుల వేతనాలు) నుంచి, లాభం నుంచి, కౌలు నుంచి నిష్పన్నమవుతాయి. అందుచేత ఇవి మౌలిక ఆదాయాలుగా కాక నిష్పన్నమైన (derivative) ఆదాయాలుగా కనిపిస్తాయి. కాగా ఈ అర్థంలో నిష్పన్నమైన ఆదాయాల గ్రహీతలు, తమ సామాజిక విధులను బట్టి, ఉదాహరణకు రాజుగా, పురోహితుడుగా, పండితుడిగా,

వేశ్యగా, సైనికుడిగా వగైరా వగైరాగా వాటిని గ్రహిస్తారు. కాబట్టి వీరు ఆ విధులను తమ ఆదాయాలకు మూలాధారమైనవిగా పరిగణించవచ్చు.

2. ఇక్కడ ఆడమ్ స్మిత్ యొక్క హాస్యాస్పదమైన దోషం పరాకాష్ట దశకు చేరుకుంది. సరుకుల విలువలోని అంతర్భాగాలను, వాటిలో నిక్షిప్తమై ఉన్న మొత్తం విలువ – ఉత్పాదితాన్ని ఆయన సరిగా నిర్వచించడంతో తన విశ్లేషణను ప్రారంభించాడు; ఆ తరువాత ఈ అంతర్భాగాలు ఏ విధంగా వివిధ ఆదాయ మూలాధారాలుగా[1] తయారవుతాయో కూడా నిరూపించాడు; విలువనుంచి ఆదాయాలను రాబట్టిన తరువాత ఆయన వ్యతిరేక మార్గంలో ముందుకెళ్ళి – అదే అతని ప్రధాన భావనగా ఉండిపోతుంది – "అంతర్భాగాల" నుంచి లభించిన ఆదాయాలను సమస్త మారకం విలువ యొక్క మూలాధారాలుగా మార్చివేస్తున్నాడు; అలా చేయడం ద్వారా ఆయన నాటు అర్థ శాస్త్రానికి తలుపులు బార్లా తెరిచాడు. (Roscherను చూడండి)[2]

## 3. పెట్టుబడి యొక్క స్థిర భాగం

ఇప్పుడిక ఆడమ్ స్మిత్ సరుకు–విలువ నుంచి పెట్టుబడి–విలువ యొక్క స్థిర భాగాన్ని ఎలా బయటకు నెట్టివేయడానికి ప్రయత్నిస్తాడో చూద్దాం.

"ఉదాహరణకు, ధాన్యం ధరలో ఒక భాగం భూస్వామి కౌలును చెల్లిస్తుంది." విలువలోని ఇతర భాగాలు లాభంగానూ, వేతనాలుగానూ ఆదాయ మూలాధారాలను ఏర్పరుస్తాయన్న వాస్తవంతో ఆ భాగాల పుట్టుకకు ఏ విధంగా సంబంధం లేదో, అదే విధంగా ఈ భాగం భూస్వామికి చెల్లింపబడి, అతనికి కౌలు రూపంలో ఆదాయాన్ని ఏర్పరుస్తుందన్న వాస్తవంతో ఈ భాగం పుట్టుకకు కూడా ఎలాంటి సంబంధం లేదు.

"దాన్ని ఉత్పత్తి చేయడానికి నియుక్తమైన శ్రామికుల" ("శ్రమించే పశువుల" అని కూడా చెబుతున్నాడు) వేతనాలను, పోషణ వ్యయాన్ని మరో భాగం చెల్లిస్తుంది. మూడవ భాగం వ్యవసాయదారుని లాభం చెల్లిస్తుంది. ఈ మూడు భాగాలు కూడా "తక్షణమే కానీ, అంతిమంగా కానీ ధాన్యం యొక్క మొత్తం ధరను రూపొందిస్తున్నట్లు కనిపిస్తుంది."[3] అవి నిజంగానే అలా కనిపిస్తాయి. ఈ మొత్తం ధర, అంటే దాని పరిమాణ నిర్ణయం, మూడు రకాల వారి మధ్య దాని పంపిణీతో

---

1. వెనుక భాగాన్ని ముందు భాగాన్ని పరిశీలిస్తే ప్రస్తుత సందర్భంలో ఈ వాక్యం వాటికి విరుద్ధమైనదిగా కనిపిస్తున్నప్పటికీ దీన్ని రాతప్రతి నుంచి యధాతథంగా వుంచాను. "ఆడమ్ స్మిత్ దృష్టిలో పెట్టుబడి, ఆదాయం" అనే నాల్గవ విభాగంలో ఈ వైరుధ్యం పరిష్కరింపబడింది. - **ఫ్రెడరిక్ ఎంగెల్స్**
2. W. Roscher రచించిన గ్రంథం system der volkswirts chaft. Band I : Dic Grundlagen der Nation alokonomic dritte, vermehrte und verbesserte Auflage stuttgart und Augsburg 1858, మార్క్స్ దృష్టిలో వుంది. సం.
3. ఆడమ్ స్మిత్ అలాంటి ఉదాహరణను ఎంపిక చేసుకోవడం దురదృష్టం అన్న వాస్తవాన్ని మనం విస్మరిద్దాం. శ్రమచేసే పశుగణానికి వినియోగమైన ఆహార పదార్థాలు శ్రామిక పశువుల వేతనాలుగా, శ్రమించే పశువులు వేతన శ్రామికులుగా చిత్రించబడ్డాయి. ఫలితంగా వేతన - శ్రామికుడు కూడా శ్రమించే పశువుగా చిత్రించబడ్డాడు. కాబట్టి ధాన్యం యొక్క విలువ వేతనాలుగానూ, లాభంగానూ, కౌలుగానూ విభజితమవుతుంది. (రాత ప్రతి 11 నుంచి - **ఫ్రెడరిక్ ఎంగెల్స్**)

బొత్తిగా నిమిత్తం లేదు. "వ్యవసాయదారుని సామాగ్రి విలువను భర్తీ చేయడానికి లేక అతని దుక్కి పశువుల శక్తి తగ్గుదల వల్ల, ఇతర వ్యవసాయ పరికరాల అరుగుదల వల్ల కలిగే నష్టాన్ని భర్తీచేయడానికి నాలుగవ భాగం అవసరమని బహుశా అనుకోవచ్చు. అయితే శ్రమించే గుర్రం లాంటి ఏ వ్యవసాయ పరికరం ధరలో అయినా అదే మూడు భాగాలు ఉంటాయి; అంటే తన గుర్రాన్ని మేపడానికి ఉపయోగించే భూమి యొక్క కౌలు, గుర్రాన్ని పెంచి పోషించడానికి పట్టే శ్రమ, ఈ భూమి, కౌలును, ఈ శ్రమకు వేతనాలను అడ్వాన్సు చేసే వ్యవసాయదారుని లాభాలు ఉంటాయి. కాబట్టి ధాన్యం ధర వాస్తవానికి గుర్రం ధరను, గుర్రం నిర్వహణ ఖర్చునూ చెల్లించినప్పటికీ, మొత్తం ధర అన్నది తక్షణమే కానీ, అంతిమంగా కానీ అదే మూడు భాగాలుగా, అంటే కౌలుగానూ, శ్రమగానూ [వేతనాలని ఆయన ఉద్దేశం], లాభంగానూ విభజింపబడుతుంది." (గ్రంథం I, అధ్యాయం 6, పుట 42)

తన విస్మయాత్మక సిద్ధాంతాన్ని సమర్థించుకోడానికి ఆడమ్ స్మిత్ చెప్పిన మాటలన్నీ ఇవే. ఆయన రుజువు ఒకటే : వాదనను కేవలం పునరుక్తం చేయడమే. ఉదాహరణకు, కింది విషయాన్ని అంగీకరిస్తాడు : ధాన్యం ధర కూడా అందులో ఉంది, అందుచేత వ్యవసాయదారుని శ్రమశక్తిలో మదుపు పెట్టని పెట్టుబడి – విలువ కూడా అందులో ఉన్నదన్న మాట. అయితే ఈ అన్ని ఉత్పత్తి సాధనాల ధరలు సైతం అ.పె + అ.వి గా, ధాన్యం ధరలాగే విభజితమవుతాయని ఆయన అంటారు. కానీ ఉత్పత్తి సాధనాల సృష్టికోసం వ్యయమైనట్టి ఉత్పత్తి సాధనాల ధరలను చేర్చడం మరచిపోయాడు. ఆయన ఒక ఉత్పత్తి శాఖ నుంచి మరో ఉత్పత్తి శాఖకు అక్కడ నుంచి మరో ఉత్పత్తి శాఖకు శాఖాచంక్రమణం చేస్తాడు. "వ్యయమైన ఉత్పత్తి సాధనాలను" సంపూర్ణంగా భర్తీ చేస్తున్నట్టి, కేవలం అస్థిర పెట్టుబడి మదుపు వల్లనే ఉత్పత్తి అయినట్టి సరుకులు, అంటే శ్రమశక్తిలో పెట్టుబడి మదుపు వల్ల మాత్రమే ఉత్పత్తి అయినట్టి సరుకులు తక్షణమే, స్థి.పె+అ.పె+అ.విగా [స్థి.పె అంటే వ్యయమైన ఉత్పత్తి సాధనాల ధర] విభజితమైన ధర గల సరుకులకు తుదకు తుల్యంగా ఉంటాయని ఆయన రుజువు చేయగలిగితే, సరుకుల యావత్తు ధర "వెనువెంటనే" లేదా "తుట్టతుదకు" అ.పె+అ.విగా విభజితమవుతుందనే ఆయన వాదన పసలేని కపటోపాయంగా ఉండేది కాదు; మొదట పేర్కొన్న సరుకు – ఉత్పాదితాల ధర తక్షణమే అ.పె+అ.వి అవుతుంది. ఆఖరున పేర్కొన్న సరుకుల ధర స్థి.పె+అ.పె+అ.వి అవుతుంది. [ఇక్కడ స్థి.పె పెట్టుబడిలోని స్థిర భాగాన్ని సూచిస్తుంది.] ఫలితంగా వీటి ధర కూడా చివరకు అ.పె+అ.వి గా విభజితమవుతుంది. స్కాచ్ గులకరాళ్ళను సేకరించే వారి ఉదాహరణ ద్వారా తాను ఇలాంటి నిర్ధారణను రుజువు చేశానని ఆడమ్ స్మిత్ నమ్మాడు కాదు. ఆయన అభిప్రాయం ప్రకారం 1) వాటిని సేకరించేవారు ఎలాంటి అదనపు విలువను సృష్టించరు; వారు తమ సొంత వేతనాలను మాత్రమే ఉత్పత్తి చేసుకుంటారు. 2) వారు ఎలాంటి ఉత్పత్తి సాధనాలను వినియోగించరు. (అయితే వారు నిజంగా వాటిని వినియోగిస్తారు. అవి గులకరాళ్ళను మోసుకు పోవడానికి అవసరమైన బుట్టలు, సంచులు మొదలైనవి.)

ఆడమ్ స్మిత్ స్వవచో వ్యాఘాతాలను గుర్తించకుండా, తరువాత తన సిద్ధాంతాన్ని తానే నిరాకరించాడని మనం పైన గమనించాం. ఆయన చెప్పే దానిలోని వైరుధ్యాలకు మూలం ఆయన శాస్త్రీయ ప్రాతిపదికల్లోనే ఉంది. శ్రమగా మార్చబడిన పెట్టుబడి తన విలువ కంటే ఎక్కువ విలువను

ఉత్పత్తి చేస్తుంది. ఎలా చేస్తుంది? ఆడమ్ స్మిత్ ఇలా అంటాడు; ఉత్పత్తి ప్రక్రియ సందర్భంగా కార్మికులు తాము పనిచేసే వస్తువులకు ఒక విలువను సంతరింపచేస్తారు. ఆ విలువలో వారి కొనుగోలు ధరకు సమానమైనదే కాక, అదనపు విలువ (లాభం, కౌలు) కూడా ఉంది; ఈ అదనపు విలువ శ్రమ జీవులకు కాక వారి యజమానులకు కేటాయించినది. కార్మికులు చేసేదీ, చేయగలిగేదీ యింతే. ఒక రోజుకు చెందిన పారిశ్రామిక శ్రమకు వర్తించేదే, సంవత్సర కాలంలో మొత్తం పెట్టుబడిదారీ వర్గం చలనంలో ఉంచినట్టి శ్రమకు కూడా వర్తిస్తుంది. అందుచేత సమాజం ఉత్పత్తి చేసే మొత్తం వార్షిక విలువ అ.పె+అ.వి గా మాత్రమే విభజితమవుతుంది. అంటే తమ శ్రమశక్తి కొనుగోలుకు వ్యయమైన పెట్టుబడి విలువను కార్మికులు భర్తీచేసే దానికి సమానమైనదిగానూ, తమ యజమానులకు కార్మికులు అందజేసి తీరవలసిన అదనపు విలువగాను విభజితమవుతుంది. అయితే సరుకు – విలువలోని ఈ రెండు భాగాలు, అదే సమయంలో పునరుత్పత్తిలో పాల్గొనే అనేక వర్గాలకు ఆదాయ మూలాధారాలుగా ఉన్నాయి. మొదటిది వేతనాల మూలాధారం, అంటే కార్మికుల ఆదాయం. రెండవది అదనపు విలువ మూలాధారం. అందులో ఒక భాగాన్ని పారిశ్రామిక పెట్టుబడిదారు లాభం రూపంలో ఉంచుకుంటాడు, మరో భాగాన్ని కౌలుగా వదిలేస్తాడు. ఇది భూస్వామి ఆదాయం. వార్షిక విలువ – ఉత్పాదితంలో అ.పె+అ.వి మినహా ఇంకేవీ లేనట్లయితే, విలువ యొక్క మరో భాగం ఎక్కడ నుంచి వస్తుంది? మనం ఇక్కడ సాధారణ పునరుత్పత్తి గురించి చర్చిస్తున్నాం. 1) శ్రమశక్తిలో నియుక్తమైన పెట్టుబడి విలువ పునరుత్పత్తికి అవసరమైన శ్రమగానూ, 2) అదనపు విలువ సృష్టికి అవసరమైన శ్రమగానూ సమస్త వార్షిక శ్రమ పరిమాణమూ విభజితమవుతుంది కాబట్టి శ్రమశక్తిలో నియుక్తంకాని పెట్టుబడి యొక్క ఉత్పత్తికి విలువ ఎక్కడ నుంచి వస్తుంది?

విషయం ఇలా ఉంటుంది :

1) వేతన కార్మికుడు తాను శ్రమ గ్రహీత వస్తువుకు చేర్చే శ్రమ పరిమాణాన్ని బట్టి ఆడమ్ స్మిత్ ఒక సరుకు విలువను నిర్ణయిస్తాడు. ఆయన దానిని అక్షరాలా "పదార్థాలు" అంటాడు. శ్రమ ఉత్పాదితాలను తయారు చేసే కర్మాగారం గురించి చర్చిస్తున్నాడు కాబట్టి అలా అంటాడు. కానీ, మనం చర్చిస్తున్న విషయాన్ని ఇది ఏవిధంగానూ మార్చదు. కార్మికుడు తన వస్తువుకు చేర్చే (ఈ చేర్చే అన్న పదం ఆడమ్ స్మిత్‌దే) విలువ, ఆ విలువ చేరడానికి ముందు ఆ వస్తువుకు ఏదైనా విలువ ఉండిందా లేదా అన్నదానితో బొత్తిగా నిమిత్తం లేనిది. అందుచేత కార్మికుడు సరుకు రూపంలో ఒక విలువను సృష్టిస్తాడు. ఆడమ్ స్మిత్ అభిప్రాయం ప్రకారం, అందులో ఒక భాగం అతని వేతనాలకు సమంగా ఉంటుంది. అతని వేతనాల విలువ పరిమాణం ఆ భాగాన్ని నిర్ణయిస్తుంది. అతడు ఆ పరిమాణాన్ని బట్టి, తన వేతనాలకు సమంగా ఉండే విలువను ఉత్పత్తి చేయడానికిగానీ, పునరుత్పత్తి చేయడానికిగానీ తన శ్రమను చేర్చవలసి ఉంటుంది. మరోవైపు కార్మికుడు అలా నిర్ణీతమైన పరిమితికి మించి అదనంగా తన శ్రమను చేర్చుతాడు. తనను పనిలో పెట్టుకున్న పెట్టుబడిదారుకు ఈ అదనపు శ్రమే అదనపు విలువను సృష్టిస్తున్నది. ఈ అదనపు విలువ సంపూర్ణంగా పెట్టుబడిదారు చేతుల్లో ఉంటుందా లేక అందులో కొంత భాగాన్ని ఇతర వ్యక్తులకు ఇస్తాడా అన్న విషయం, వేతన కార్మికుడు చేర్చిన అదనపు విలువను గుణాత్మకంగా కానీ (అది అదనపు విలువ అనే విషయాన్ని) పరిమాణాత్మ

కంగా కానీ (దాని రాశిని) ఏ విధంగానూ మార్చదు. ఉత్పాదితం విలువలోని ఇతర భాగాల లాగానే ఇది కూడా విలువే. అయితే ఒక విషయంలో మాత్రం తేడా ఉంది. అదేమిటంటే, కార్మికుడికి దాని విలువకు సమమైనది ముట్టలేదు. ఇకముందు కూడా ముట్టదు; అలా ముట్టలేదు సరికదా, ఆ విలువ పెట్టుబడిదారు, దానికి తుల్యమైనది ఇవ్వకుండానే సొంతం స్వాయత్తం చేసుకొంటాడు. ఒక సరుకును ఉత్పత్తి చేయడంలో కార్మికుడు వ్యయం చేసిన శ్రమ పరిమాణం ఆ సరుకు మొత్తం విలువను నిర్ణయిస్తుంది; ఈ మొత్తం విలువలో ఒక భాగాన్ని నిర్ణయించేది, వేతనాల విలువకు అది సమంగా ఉందన్న వాస్తవం; అంటే అది వేతనాలకు తుల్యమైనదన్న వాస్తవం. రెండో భాగం తప్పనిసరిగా, వేతనాలకు సమంగా ఉన్న విలువ మినహాయించబడగా మిగిలిన మొత్తం ఉత్పాదితం విలువకు సమంగా ఉంటుంది; అందుచేత, సరుకులో అతని వేతనాల విలువకు సమంగా ఉన్నదానికి మించి, సరుకు తయారీలో సృష్టించబడిన అధిక విలువకు ఈ రెండో భాగం సమంగా ఉంటుంది.

2) ఒక వ్యష్టి పారిశ్రామిక సంస్థలో ఏ వ్యష్టి కార్మికుడైనా ఉత్పత్తి చేసే సరుకుకు వర్తించే సత్యం మొత్తంగా అన్ని వ్యాపార శాఖల్లోని వార్షిక ఉత్పాదితానికి కూడా వర్తిస్తుంది. ఏదో ఒక వ్యష్టి ఉత్పాదక కార్మికుని ఒక దినం పనికి వర్తించే సత్యం, మొత్తం ఉత్పాదక కార్మికుల వర్గం చలనంలో పెట్టే సంవత్సరం పనికి కూడా వర్తిస్తుంది. ఈ వర్గం, సంవత్సర కాలంలో వ్యయమైన శ్రమ పరిమాణంచే నిర్ణయించబడిన మొత్తం విలువను వార్షిక ఉత్పాదితంలో "స్థాపిస్తుంది". (ఇది ఆడమ్ స్మిత్ వాడిన పదం) కాగా ఈ మొత్తం విలువ రెండు భాగాలుగా విభజింపబడుతుంది. మొదటి భాగం వార్షిక శ్రమలో, కార్మికవర్గం తమ వార్షిక వేతనాలకు తుల్యమైనదాన్ని, వాస్తవంలో ఈ వేతనాలనే సృష్టించే భాగంచే నిర్ణయింపబడేది. మరో భాగం – పెట్టుబడిదారీ వర్గం కోసం కార్మికుడు ఆ అదనపు విలువను సృష్టించే అతని అదనపు వార్షిక శ్రమచే నిర్ణయింపబడేది. మరో భాగం – పెట్టుబడిదారీ వర్గం కోసం కార్మికుడు ఆ అదనపు విలువను సృష్టించే అతని అదనపు వార్షిక శ్రమచే నిర్ణయింపబడేది. అందుచేత వార్షిక ఉత్పాదితంలోని వార్షిక విలువ – ఉత్పాదితంలో రెండు అంశాలుంటాయి. ఒకటి, కార్మిక వర్గానికి అంటే వార్షిక వేతనాలకు సమమైనది. రెండు, పెట్టుబడిదారీ వర్గం కోసం ఏటా అందే అదనపు విలువకు సమమైనది. వార్షిక వేతనాలేమో కార్మికవర్గం యొక్క ఆదాయం కాగా, వార్షిక అదనపు విలువ పరిమాణమేమో పెట్టుబడిదారీ వర్గం యొక్క ఆదాయం. కాబట్టి వినియోగం కోసం ఉద్దేశింపబడిన వార్షిక నిధిలో సంబంధిత వాటాలకు ఆ రెండూ ప్రాతినిధ్యం వహిస్తాయి; (సాధారణ పునరుత్పత్తిని వివరించే సందర్భంగా ఈ అభిప్రాయం సక్రమమైంది.) అంతేకాక, ఆ రెండు ఆదాయాలు కూడా ఆ నిధిలో నుంచే అందుతాయి. అందుచేత స్థిర పెట్టుబడి – విలువకు, ఉత్పత్తి సాధనాల రూపంలో పనిచేసే పెట్టుబడి యొక్క పునరుత్పత్తికి, ఎక్కడా స్థానమే లేకుండా పోయింది. ఆదాయంగా ఉపకరించే సరుకు విలువ భాగాలన్నీ, సామాజిక వినియోగ నిధికి ఉద్దేశించబడిన శ్రమ వార్షిక ఉత్పాదితంతో ఏకీభవిస్తాయని ఆడమ్ స్మిత్ తన గ్రంథానికి రాసుకున్న ఉపోద్ఘాతంలో స్పష్టంగా చెప్పాడు : "విస్తృత ప్రజానీకం ఆదాయం ఏమిటి లేక వివిధ యుగాలలో, వివిధ దేశాల్లో ప్రజల వార్షిక వినియోగానికి సరఫరా చేసినట్టి ఆ నిధుల స్వభావమేమిటి అనేది విశదీకరించడమే ఈ గ్రంథం మొదటి నాలుగు భాగాల లక్ష్యం." (పుట 12) ఉపోద్ఘాతంలోని మొట్ట

మొదటి వాక్యమే ఇలా ఉంది : "ప్రతి దేశపు వార్షిక శ్రమ, ఏటా ఆ దేశం వినియోగం చేసే జీవితావసరాలను, సౌకర్యాలనన్నింటినీ మౌలికంగా సరఫరా చేసే నిధి. ఈ నిధి ఎల్లప్పుడూ ఆ శ్రమ ప్రత్యక్ష ఉత్పాదితంగానో లేక ఆ ఉత్పాదితంతో ఇతర దేశాల నుంచి కొనుగోలు చేసినదిగానో ఉంటుంది." (పుట II)

వార్షిక ఉత్పాదితం విలువ కొత్తగా ఉత్పత్తి అయిన వార్షిక విలువకు సమానంగా ఉంటుందనడం ఆడమ్ స్మిత్ మొదటి పొరపాటు. కొత్తగా ఉత్పత్తి అయిన వార్షిక విలువ గత సంవత్సరపు శ్రమ ఉత్పాదితం మాత్రమే. కాగా వార్షిక ఉత్పాదితం విలువలో, వార్షిక ఉత్పాదితం తయారీలో వినియోగమైన విలువ తాలూకు అన్ని భాగాలతో పాటు, గత సంవత్సరమే కాక, కొంతవరకు అంతకు మునుపు సంవత్సరాలలో కూడా ఉత్పత్తి అయిన విలువలు కూడా ఉంటాయి. అవి ఉత్పత్తి సాధనాలు. వాటి విలువ కేవలం పునర్దర్శనం ఇస్తుంది. వాటి విలువకు సంబంధించినంత వరకు అది గత సంవత్సరం వ్యయమైన శ్రమ ఉత్పత్తి చేసినదీ కాదు, పునరుత్పత్తి చేసినదీ కాదు. ఈ గందరగోళం మూలంగా ఆడమ్ స్మిత్ వార్షిక ఉత్పాదితం విలువలోని స్థిర భాగాన్ని మాయం చేస్తున్నాడు. ఈ గందరగోళానికి మూలం అతని మౌలిక భావనలోని మరొక పొరపాటు. అదేమిటంటే, అసలు శ్రమ యొక్క ద్వివిధ స్వభావాన్ని ఆయన గుర్తించకపోవడం. అవి : శ్రమ శక్తి వ్యయం ద్వారా విలువను సృష్టించే శ్రమ స్వభావం – నిర్దిష్టమైన, ఉపయోగకరమైన పనిగా ఉపయోగపు సరుకులను (ఉపయోగ విలువలు) సృష్టించే శ్రమ స్వభావం. ఏటా తయారయ్యే సరుకుల మొత్తం పరిమాణం ఇంకో విధంగా చెప్పాలంటే, మొత్తం వార్షిక ఉత్పాదితం గత సంవత్సరం క్రియాశీలంగా పనిచేసిన ఉపయోగకర శ్రమ యొక్క ఉత్పాదితం అన్నమాట; శాఖోపశాఖలుగా ఉన్న ఉపయోగకర శ్రమ వ్యవస్థలో శ్రమ సామాజికంగా నియుక్తమైనందు వల్లనే ఈ సరుకులన్నీ అస్తిత్వంలోకి వచ్చాయి. సరుకుల ఉత్పత్తిలో వ్యయమైనట్టి, నూతన పాదార్థిక రూపంలో పునరుర్దర్శనమిస్తున్నట్టీ ఉత్పత్తి సాధనాల విలువ సంపూర్ణంగా పరిరక్షింపబడటానికి కూడా అదే ఏకైక కారణం. అందుచేత, మొత్తం వార్షిక ఉత్పాదితం గత సంవత్సరం వ్యయమైన ఉపయోగకర శ్రమ యొక్క ఫలితమే. అయితే వార్షిక ఉత్పాదితం విలువలో ఒక భాగం మాత్రమే ఆ సంవత్సర కాలంలో సృష్టించబడింది. ఈ భాగమే వార్షిక విలువ ఉత్పాదితం. సంవత్సర కాలంలో పనిచేసిన శ్రమ పరిమాణానికి ఇది ప్రాతినిధ్యం వహిస్తుంది.

మనం పైన ఉల్లేఖించిన వాక్యాల్లో ఆడమ్ స్మిత్ ఇలా అన్నాడు : "ప్రతి దేశపు వార్షిక శ్రమ అనేది ఏటా ఆ దేశం వినియోగం చేసే జీవితావసరాలు, సదుపాయాలన్నింటినీ సరఫరా చేసే ఒక నిధి..." ఆయన ఇలా అన్నందువల్ల, పూర్తిగా ఉపయోగకరమైన శ్రమ పట్ల ఆయన ఏకపక్ష వైఖరి అవలంబిస్తున్నాడని చెప్పవచ్చు. నిజానికి ఈ సమస్త జీవన భృతి సాధనాలకు వినియోగాత్మక రూపం ఇచ్చింది ఈ ఉపయోగకర శ్రమే. అయితే మునుపటి సంవత్సరాలు సరఫరా చేసిన శ్రమ పరికరాలు, శ్రమ గ్రహీత వస్తువులు లేకపోయినట్లయితే, ఇది సాధ్యమై ఉండేది కాదు; కాబట్టి "వార్షిక శ్రమ" విలువను సృష్టించినప్పటికీ, అది రూపొందించిన ఉత్పాదితాల యొక్క సమస్త విలువనూ అదే సృష్టించదు; కొత్తగా సృష్టించబడిన విలువ ఉత్పాదితం విలువకంటే తక్కువగా ఉంటుంది. ఈ అంశాలన్నిటినీ ఆయన విస్మరిస్తున్నాడు.

ఆడమ్ స్మిత్ ఈ విశ్లేషణా పథంలో తన తరువాత వచ్చిన వారికంటే ముందుకు వెళ్ళనందుకు (ఫిజియోక్రాట్లు సరైన దిశలో అడుగువేసిన మాట వాస్తవమే అయినప్పటికీ) ఆయనను మనం నిందించలేం. కానీ ఆ తరువాత ఆయన గందరగోళంలో పడిపోతాడు. ఇందుకు ప్రధాన కారణం, మొత్తం మీద సరుకుల విలువ గురించిన ఆయన "అంతర్భూత" భావనను ఆయన బహిర్గత భావనలు అడ్డుకోవడమే. మొత్తంపైన, ఈ బహిర్గత భావనలే ఆయనలో పైకొన్నాయి. అయినప్పటికీ, ఆయన శాస్త్రీయ, అంతఃప్రేరణ వల్ల, ఈ అంతర్భూత భావనా దృక్పథం పదే పదే ప్రత్యక్షమవుతోంది.

## 4. ఆడమ్ స్మిత్ రచనలో పెట్టుబడి, ఆదాయం

ప్రతి సరుకు విలువలో వేతనాలకు కేవలం తుల్యమైన భాగం (అందుచేత వార్షిక ఉత్పాదితంలో కూడా) పెట్టుబడిదారు శ్రమశక్తి కోసం అడ్వాన్సు చేసిన పెట్టుబడికి సమంగా ఉంటుంది; అంటే అడ్వాన్సు చేయబడిన మొత్తం పెట్టుబడిలో అస్థిర భాగానికి సమంగా ఉంటుంది. వేతన కార్మికులు సరఫరా చేసిన సరుకుల విలువ యొక్క నూతనోత్పాదిత విలువలోని ఒక భాగం ద్వారా, పెట్టుబడి – విలువలోని ఆ భాగాన్ని పెట్టుబడిదారు వసూలు చేసుకొంటాడు; అమ్మకానికి సిద్ధంగా లేనట్టి, ఒకవేళ సిద్ధంగా ఉన్నా పెట్టుబడిదారుచే ఇంకా అమ్మకంకాని ఉత్పాదితంలో కార్మికుని వాటా కింద అతనికి పెట్టుబడిదారు డబ్బు రూపంలో చెల్లించడం ద్వారా అస్థిర పెట్టుబడిని అడ్వాన్సు చేసినా లేక అంతకు ముందే కార్మికుడు సరఫరా చేసిన సరుకుల అమ్మకం ద్వారా లభించిన డబ్బుతో శ్రామికునికి చెల్లించినా లేక పెట్టుబడిదారుకు పరపతి ద్వారా ముందే ఈ డబ్బు లభించినా – ఈ అన్ని సందర్భాల్లోనూ, పెట్టుబడిదారు అస్థిర పెట్టుబడిని వ్యయం చేస్తున్నాడు; ఈ అస్థిర పెట్టుబడి డబ్బు రూపంలో కార్మికుల చేతుల్లోకి పోతుంది. మరోవైపు పెట్టుబడిదారు చేతిలో ఈ పెట్టుబడి విలువకు తుల్యమైనది ఉంది. పెట్టుబడిదారుని చేతిలోని సరుకుల మొత్తం విలువలో, కార్మికుడు తన వాటాగా కొత్తగా ఉత్పత్తి చేసిన భాగమిది. వేరు మాటల్లో చెబితే, అతని వేతనాల విలువ నిక్షిప్తమై ఉన్న భాగమిది. పెట్టుబడిదారు ఈ విలువ భాగాన్ని కార్మికుడు సృష్టించిన ఉత్పాదితం రూపంలోనే అతనికి ఇవ్వడానికి బదులుగా డబ్బు రూపంలో చెల్లిస్తాడు. అతను అడ్వాన్సు చేసిన పెట్టుబడి – విలువలోని అస్థిర భాగం అతని వద్ద సరుకుల రూపంలో ఉంటుంది. కాగా తాను అమ్ముకున్న శ్రమశక్తి సమంగా ఉన్న విలువను కార్మికుడు డబ్బు రూపంలో తీసుకొంటాడు.

పెట్టుబడిదారు అడ్వాన్సు చేసిన పెట్టుబడిలోని ఒక భాగం, అంటే శ్రమశక్తి కొనుగోలు ద్వారా అస్థిర పెట్టుబడిగా మారిన ఆ భాగం ఉత్పత్తి ప్రక్రియలో కార్యశీల శ్రమశక్తిగా పని చేస్తుంది; కాగా ఈ శ్రమశక్తి వ్యయం కావడం ద్వారా సరుకుల రూపంలో ఈ పెట్టుబడి భాగం కొత్తగా, ఒక కొత్త విలువగా ఉత్పత్తి అవుతుంది. అంటే పునరుత్పత్తి అవుతుంది. కనుక, ఇది అడ్వాన్సు చేయబడిన పెట్టుబడి విలువ యొక్క పునరుత్పత్తి లేక నూతన ఉత్పత్తి. కార్మికుడు తాను అమ్ముకున్న శ్రమశక్తి యొక్క విలువను లేక ధరను జీవనభృతి సాధనాలపైనా, తన శ్రమశక్తి పునరుత్పత్తికి అవసరమైన సాధనాలపైనా ఖర్చుపెడతాడు. అస్థిర పెట్టుబడిదారుకు తన శ్రమ-శక్తిని ఎంత కాలంపాటు అమ్ముకోగలడో అంతకాలంపాటు మాత్రమే ఆ ఆదాయం ఉంటుంది.

వేతన కార్మికుడి సరుకు, అంటే అతని శ్రమశక్తి పెట్టుబడిదారుని పెట్టుబడిలో అంతర్భాగమై

ఉన్నంతవరకే, అది సరుకుగా పని చేస్తుంది. పెట్టుబడిగా వ్యవహరిస్తుంది. కానీ శ్రమశక్తి కొనుగోలుకై పెట్టుబడిదారు డబ్బు – పెట్టుబడిగా ఖర్చు పెట్టిన పెట్టుబడి, శ్రమ–శక్తి అమ్మకందారుని చేతుల్లో అంటే వేతన శ్రామికుడి చేతుల్లో ఆదాయంలో వ్యవహరిస్తుంది.

ఇక్కడ చలామణికీ, ఉత్పత్తికీ సంబంధించి వివిధ ప్రక్రియలు పరస్పరం మిళితమై ఉంటాయి. అయితే ఆడమ్ స్మిత్ వీటిని వేరుచేసి చూడడు.

మొదటిది – చలామణి ప్రక్రియకు సంబంధించిన చర్యలు. కార్మికుడు తన సరుకును అంటే శ్రమశక్తిని పెట్టుబడిదారుకు అమ్ముతాడు; పెట్టుబడిదారు శ్రమశక్తి కొనుగోలుకై వెచ్చించే డబ్బు అతని దృష్టిలో అదనపు విలువ ఉత్పత్తికై మదుపు పెట్టబడిన డబ్బు. అందుచేత అది డబ్బు – పెట్టుబడి; అది అడ్వాన్సు చేయబడుతుందే తప్ప ఖర్చు పెట్టబడదు. ("అడ్వాన్స్" అన్న పదానికి నిజమైన అర్థం ఇదే. ఫిజియోక్రాట్లు avance అనేది ఇదే. పెట్టుబడిదారు దృష్టిలో, ఉత్పాదక ప్రక్రియ ప్రయోజనానికి తాను చెల్లించే ప్రతి విలువా తనచే అడ్వాన్సు చేయబడిందే; ఈ అడ్వాన్సు చేయడం ముందే జరిగిందా లేక వెనక జరిగిందా అనే విషయంతో నిమిత్తం లేదు. మొత్తానికి అది ఉత్పత్తి ప్రక్రియ కోసమే అడ్వాన్సు చేయబడింది) ఇతర సరుకుల ప్రతి అమ్మకంలో జరిగేదే ఇక్కడ కూడా జరుగుతుంది. అమ్మకందారు ఉపయోగపు విలువను (ఈ విషయంలో తన శ్రమశక్తిని) ఇచ్చి, దాని విలువను డబ్బు రూపంలో తీసుకొంటాడు. (అంటే దాని ధర అతని చేతికందుతుంది) కాగా కొనుగోలుదారు తన డబ్బును ఇచ్చి ప్రతిఫలంగా సరుకునే – ఈ సందర్భంలో శ్రమశక్తిని – తీసుకొంటాడు.

రెండవది – ఉత్పత్తి ప్రక్రియలో కొనుగోలైన శ్రమశక్తి ఇప్పుడిక క్రియాశీల పెట్టుబడిలో ఒక భాగంగా రూపొందుతుంది; ఇక్కడ కార్మికుడు కేవలం ఈ పెట్టుబడి యొక్క ప్రత్యేక భౌతికరూపంగా ఉపకరిస్తాడు. ఈ భౌతిక రూపానికీ, ఉత్పత్తి సాధనాల యొక్క భౌతిక రూపంలో ఉన్న పెట్టుబడి అంశాలకూ మధ్య తేడా ఉంది. కార్మికుడు ఈ ప్రక్రియలో తన శ్రమశక్తిని వ్యయం చేయడం ద్వారా తాను ఉత్పాదితాలుగా మార్చే ఉత్పత్తి సాధనాలకు విలువను చేకూర్చుతాడు; అలా చేర్చిన విలువ అతని శ్రమశక్తి విలువకు సమంగా ఉంటుంది. (ఇక్కడ అదనపు విలువ సంగతి పరిగణనకు తీసుకోవడం లేదు) అందుచేత కార్మికుడు ఈ విధంగా తన వేతనాలకై పెట్టుబడి అడ్వాన్సు చేసిన లేక అడ్వాన్సు చేయవలసిన పెట్టుబడి భాగానికి సమంగా ఉండే సరుకులను పెట్టుబడిదారు కోసం పునరుత్పత్తి చేస్తాడు. కాబట్టి పెట్టుబడిదారు శ్రమశక్తి కొనుగోలుకై మరోసారి "అడ్వాన్సు" చేయగల పెట్టుబడిని కార్మికుడు పునరుత్పత్తి చేస్తాడు.

మూడవది – ఒక సరుకు అమ్మకం జరిగినప్పుడు, పెట్టుబడిదారు అడ్వాన్సు చేసిన అస్థిర పెట్టుబడిని ఆ సరుకు యొక్క అమ్మకం ధరలో ఒక భాగం భర్తీచేస్తుంది; అందువల్ల పెట్టుబడిదారుకు శ్రమశక్తిని మళ్ళీ కొనుగోలు చేసే అవకాశమూ, కార్మికుడికి తన శ్రమ–శక్తిని మళ్ళీ అమ్ముకొనే అవకాశమూ లభిస్తాయి.

సరుకుల కొనుగోళ్ళు, అమ్మకాలకు మాత్రమే సంబంధించినంత వరకు ఈ కొనుగోళ్ళు, అమ్మకాల సందర్భంగా అమ్మకందారుకు తన సరుకులకు లభించిన డబ్బు ఏమవుతుంది,

కొనుగోలుదారుకు లభించిన ఉపయోగకర వస్తువులు ఏమవుతాయి అనేది ముఖ్యం కాదు. కాబట్టి కేవలం చలామణి ప్రక్రియకు సంబంధించినంత వరకు, పెట్టుబడిదారు కొనుగోలు చేసిన శ్రమశక్తి అతని కోసం పెట్టుబడి – విలువను పునరుత్పత్తి చేస్తుందన్న విషయమూ, మరోవైపు, కార్మికుడికి తన శ్రమశక్తి అమ్ముకున్నందుకుగాను లభించిన డబ్బు అతడికి ఆదాయంగా ఉంటుందన్న విషయమూ ముఖ్యం కాదు. కార్మికుడి యొక్క వ్యాపార సరుకుగా ఉన్న అతని శ్రమశక్తి విలువ పరిమాణంపైన, ఆ శ్రమశక్తి అతనికి "ఆదాయం"గా ఏర్పడుతుందనే వాస్తవానికి కానీ, కొనుగోలుదారు ఆ వ్యాపార సరుకును ఉపయోగించడం వల్ల అతడి పెట్టుబడి – విలువ పునరుత్పత్తి అవుతుందనే వాస్తవానికి కానీ ఎలాటి ప్రభావమూ ఉండదు.

శ్రమశక్తి విలువను, అంటే ఆ సరుకుకు తగిన అమ్మకం ధరను, దాని పునరుత్పత్తికి అవసరమైన శ్రమ పరిమాణం నిర్ణయిస్తుంది. కాబట్టి ఆ శ్రమ పరిమాణాన్ని అతడి జీవనభృతి సాధనాల ఉత్పత్తికి అవసరమైనది, అంటే అతని మనుగడకు అవసరమైనది నిర్ణయిస్తుంది. అందువల్ల అతడికి వేతనాలే ఆదాయంగా రూపొందుతాయి. వాటి ఆధారంగానే అతడు జీవించవలసి ఉంటుంది.

ఆడమ్ స్మిత్ ఈ క్రింది విధంగా చెప్పడం పూర్తిగా తప్పు. (పుట 233) "ఉత్పాదక వ్యక్తుల పోషణకు నియుక్తమైన పెట్టుబడిలోని ఒక భాగం అతని (పెట్టుబడిదారుకు) పెట్టుబడిగా సేవ చేసిన అనంతరం వారికి (శ్రామికులకు) ఆదాయమవుతుంది." పెట్టుబడిదారు, శ్రమ–శక్తికి చెల్లించే డబ్బు "అతనికి పెట్టుబడి క్రియలో ఉపకరిస్తుంది." ఎందువల్లనంటే, పెట్టుబడిదారు తద్వారా తన పెట్టుబడి తాలూకు పాదార్థిక భాగాల్లో శ్రమశక్తిని ఒక భాగంగా కలుపుకొంటాడు. ఆ విధంగా, అతని పెట్టుబడి ఉత్పాదక పెట్టుబడిగా వ్యవహరించడం సాధ్యపడుతుంది. కాబట్టి ఆ డబ్బు అతనికి అలా సేవ చేస్తుంది. మనం ఈ క్రింది తేడాను స్పష్టం చేయాలి; శ్రమశక్తి అన్నది శ్రామికుడి చేతిలో ఒక సరుకే తప్ప పెట్టుబడి కాదు; ఆ సరుకును అతడు మళ్ళీ మళ్ళీ నిరంతరాయంగా అమ్మగలిగినంత కాలమూ అది అతడికి ఆదాయంగా రూపొందుతుంది. కాగా అది అమ్మకం అయిన తరువాతనే పెట్టుబడిదారు చేతిలో అంటే ఉత్పత్తి ప్రక్రియలోనే పెట్టుబడిగా పని చేస్తుంది. ఇక్కడ శ్రమశక్తి రెండు ప్రయోజనాలను నెరవేర్చుతుంది; కార్మికుడి చేతిలో దాని విలువ మేరకు అమ్మబడిన సరుకుగానూ, దాన్ని కొనుగోలు చేసిన పెట్టుబడిదారు చేతుల్లో శక్తి ఉత్పాదక విలువగానూ, ఉపయోగ – విలువగానూ పని చేస్తుంది. కార్మికుడు తన శ్రమశక్తి ఉపయోగాన్ని పెట్టుబడిదారుకు సమర్పించిన తరవాత గానీ అది శ్రమ, శ్రమ ఉత్పాదిత తాలూకు విలువగా పెట్టుబడిదారు చేతికందిన తరువాత గానీ కార్మికునికి పెట్టుబడిదారు నుంచి డబ్బు రాదు. కాగా పెట్టుబడిదారు ఆ విలువకు డబ్బు చెల్లించక ముందే ఆ విలువను స్వాధీన పరచుకుంటాడు. అందుచేత మొదట ఆ స్థిర పెట్టుబడి యొక్క డబ్బు – రూపంగానూ, ఆ తరువాత వేతనాలుగానూ ఇలా రెండు కర్తవ్యాలు నిర్వర్తించేది శ్రమశక్తి మాత్రమే; మొదట అది శ్రమశక్తి అమ్మకంలో సరుకుగా వ్యవహరిస్తుంది. (చెల్లించాల్సిన వేతనాల మొత్తాన్ని నిర్ణయించడంలో డబ్బు కేవలం విలువకు ఆదర్శప్రాయమైన కొలబద్ధగా వ్యవహరిస్తుంది. అది పెట్టుబడిదారు చేతుల్లో ఉండాల్సిన అవసరం కూడా లేదు). ఆ తరువాత అది ఉత్పత్తి ప్రక్రియలో పెట్టుబడిగా వ్యవహరిస్తుంది. పెట్టుబడిదారు చేతుల్లో ఉపయోగ విలువనూ, విలువనూ సృష్టించే ఉపకరణగా వ్యవహరిస్తుంది.

పెట్టుబడిదారు డబ్బు రూపంలో కార్మికుడికి చెల్లించడానికి ముందే కార్మికుడికి చెల్లించాల్సిన మొత్తానికి సమానమైన దానిని శ్రమశక్తి సరుకుల రూపంలో అప్పటికే సరఫరా చేసి ఉంటుంది. కాబట్టి పెట్టుబడిదారు తనకు ఏ నిధి నుంచి చెల్లిస్తాడో ఆ నిధిని కార్మికుడే స్వయంగా సృష్టిస్తాడన్న మాట. అంతేకాదు అసలు విషయం ఇంకా ఉంది.

కార్మికుడు తాను తీసుకొనే డబ్బును తన శ్రమశక్తిని పరిరక్షించుకోడానికి ఖర్చు పెడతాడు; లేదా పెట్టుబడిదారీ వర్గాన్ని, కార్మిక వర్గాన్ని మొత్తంగా చూసినట్లయితే, పెట్టుబడిదారు పెట్టుబడిదారుగా కొనసాగడానికి అవసరమైన ఏకైక సాధనాన్ని పెట్టుబడిదారు కోసం పరిరక్షించడానికి కార్మికుడు ఆ డబ్బు పెడతాడు.

ఈ విధంగా శ్రమశక్తి యొక్క నిరంతర కొనుగోలు, అమ్మకం అన్నవి ఒకవైపు శ్రమశక్తిని పెట్టుబడిలోని ఒక భాగంగా శాశ్వతంగా ఉండేలా చేస్తాయి. అందువల్ల సరుకుల విలువగల ఉపయోగపు సరుకుల సృష్టికర్తగా పెట్టుబడి కనిపిస్తుంది. అందువల్ల శ్రమశక్తిని కొనుగోలు చేసే పెట్టుబడి భాగాన్ని శ్రమశక్తి సొంత ఉత్పాదితమే నిరంతరాయంగా పునరుద్ధరిస్తుంది. పర్యవసానంగా తనకు దేనినుంచీ చెల్లిస్తున్నారో ఆ పెట్టుబడి నిధిని కార్మికుడే నిరంతరం సృష్టిస్తున్నాడు. మరోవైపేమో, శ్రమ–శక్తి నిరంతర అమ్మకం, శ్రమశక్తిని ఎల్లప్పుడూ పునరుద్ధరిస్తూ, కార్మికుడి పోషణకు మూలాధారంగా తయారవుతుంది. అందుచేత శ్రామికుని శ్రమశక్తి అతనికి జీవనాధారంగా ఉన్న ఆదాయాన్ని తీసుకొచ్చే సాధనంగా కనిపిస్తుంది. ఇక్కడ ఆదాయం అంటే, ఒక సరుకును (శ్రమశక్తిని) నిరంతరం పదే పదే అమ్మడం ద్వారా లభించిన విలువలను స్వాయత్తం చేసుకోవడం తప్ప మరేమీ కాదు; అమ్మడానికి ఉన్న సరుకును నిరంతరం పునరుత్పత్తి చేయడానికి మాత్రమే ఉపకరించే విలువలవి. కార్మికుడు సృష్టించిన ఉత్పాదితం విలువలో, అతనికి పెట్టుబడిదారు వేతనాల రూపంలో చెల్లించిన మొత్తానికి సమంగా ఉండే భాగమే కార్మికుని ఆదాయానికి మూలాధారం అవుతుందని ఆడమ్ స్మిత్ అన్నాడు. అంతవరకూ సబబే. కానీ ఇందువల్ల సరుకు విలువలోని ఈ భాగం యొక్క స్వభావమూ లేదా పరిమాణమూ మారవు. ఉత్పత్తి సాధనాలు పెట్టుబడి విలువలుగా వ్యవహరించినప్పటికీ ఉత్పత్తి సాధనాల విలువలో మార్పు రానట్లే లేక ఒక సరళరేఖ త్రికోణానికి ఆధారరేఖగానో, దీర్ఘవృత్తం యొక్క వ్యాసంగానో వ్యవహరించినప్పటికీ ఆ సరళరేఖ యొక్క స్వభావంలో కానీ, పరిమాణంలో కానీ మార్పు ఉండనట్లే పైన పేర్కొన్న విలువ భాగం యొక్క స్వభావ పరిమాణాల్లో మార్పు ఉండదు. ఆ ఉత్పత్తి సాధనాల విలువ స్వతంత్రంగా నిర్దిష్టమై ఉన్నట్లే శ్రమశక్తి విలువ కూడా స్వతంత్రంగా నిర్దిష్టమై ఉంటుంది. సరుకు విలువలోని ఈ భాగం ఆ విలువలో స్వతంత్ర అంశంగా ఉన్న ఆదాయమూ కాదు. ఆ భాగం ఆదాయంగా విభజితమూ కాదు. కార్మికుడిచేత నిరంతరం పునరుత్పత్తి అయ్యే ఈ నూతన విలువ అతని ఆదాయానికి మూలాధారంగా ఉన్నప్పటికీ, ఈ ఆదాయం మాత్రం అతడు ఉత్పత్తి చేసిన ఈ నూతన విలువలో భాగం కాదు. అతడు సృష్టించిన నూతన విలువ నుంచి అతనికి చెల్లించిన వాటా పరిమాణమే అతని ఆదాయం యొక్క విలువ పరిమాణాన్ని నిర్ణయిస్తుందే తప్ప, అతని ఆదాయపు విలువ పరిమాణం ఆ వాటా పరిమాణాన్ని నిర్ణయించదు. నూతనంగా సృష్టించబడిన విలువలోని ఈ భాగం అతనికి ఒక ఆదాయంగా రూపొందుతున్నదంటే దీనివల్ల ఆ ఆదాయం

ఏమవుతున్నదో, ఆ ఆదాయం ఎలా ఉపయోగింపబడుతుందో మనకు తెలుస్తుంది; అంతే తప్ప ఏ ఇతర విలువ ఆవిర్భావంతోనూ సంబంధం లేనట్లే ఈ ఆదాయం ఆవిర్భావంతో కూడా దీనికి ఎలాటి సంబంధం లేదు. నా ఆదాయం వారానికి పది షిల్లింగులు అయితే అది ఆ పది షిల్లింగుల విలువ స్వభావాన్ని కానీ, వాటి విలువ పరిమాణాన్ని కానీ ఏ విధంగానూ మార్చదు. ప్రతి ఇతర సరుకు విషయంలోలాగే, శ్రమశక్తి విషయంలోనూ, దాని విలువను దాని పునరుత్పత్తికి అవసరమైన శ్రమ పరిమాణం నిర్ణయిస్తుంది; ఈ శ్రమ పరిమాణాన్ని కార్మికుడికి అవసరమైన జీవనభృతి సాధనాల విలువ నిర్ణయిస్తుంది. అందుచేత ఇది, అతని జీవన పరిస్థితుల పునరుత్పత్తికి అవసరమైన శ్రమకు సమంగా ఉంటుంది. ఇదీ ఈ సరుకు (శ్రమశక్తి) ప్రత్యేకత. దుక్కి పశువుల విలువను వాటి పోషణకు అవసరమైన జీవనభృతి సాధనాల విలువ, అంటే ఆ జీవనభృతి సాధనాల ఉత్పత్తికి అవసరమైన మానవ శ్రమ పరిమాణం నిర్ణయిస్తుందన్న వాస్తవంలోని ప్రత్యేకత వంటిదే. ఈ శ్రమశక్తి ప్రత్యేకత కూడా, అంతకు మించి మరేమీ కాదు.

అయితే ఆడమ్ స్మిత్‌లోని హానికరమైన సమస్త గందరగోళానికి "ఆదాయం" అనే ఈ అభివర్గమే మూలం. ఆయన అభిప్రాయం ప్రకారం, వివిధ రకాల ఆదాయమే ఏటా ఉత్పత్తి అయ్యే, నూతనంగా సృష్టింపబడే సరుకు విలువలోని "అంతర్భాగాలు" అవుతాయి. కాని వాస్తవం ఇందుకు విరుద్ధంగా ఉంది. పెట్టుబడిదారు విషయంలో ఈ సరుకు విలువ విభజితమయ్యే రెండు భాగాలు ఆదాయానికి మూలాధారంగా ఉన్నాయి. అవి, పెట్టుబడిదారు శ్రమను కొనుగోలు చేసే సందర్భంగా డబ్బు రూపంలో అడ్వాన్సు చేసే అస్థిర పెట్టుబడికి సమంగా ఉండే భాగం; రెండో భాగం అదనపు విలువ. ఇది పెట్టుబడిదారుకే చెందినప్పటికీ దానికోసం అతని కెలాంటి ఖర్చూ కాదు. అస్థిర పెట్టుబడికి సమంగా ఉండే భాగం మళ్ళీ శ్రమశక్తి కొనుగోలు కోసం అడ్వాన్సు చేయబడుతుంది; అది ఆ మేరకు కార్మికుడికి వేతనాల రూపంలో ఆదాయమవుతుంది. కాగా రెండో భాగం అంటే అదనపు విలువ పెట్టుబడిదారు అడ్వాన్సు చేసే ఏ పెట్టుబడినీ భర్తీ చేయడానికి ఉపయోగించవలసిన అవసరం లేదు. కాబట్టి దానిని అతడు వినియోగ వస్తువుల కోసం (అవసర వస్తువులు, విలాస వస్తువులు రెంటికోసమూ) ఖర్చు పెట్టవచ్చు. అంటే ఎలాంటి పెట్టుబడి – విలువగా ఏర్పడకుండా అది ఆదాయంగా వినియోగింప బడవచ్చు. సరుకు విలువ ఆదాయానికి ప్రాథమిక ఆవశ్యకత, పెట్టుబడిదారు దృష్టిలో, ఈ ఆదాయం యొక్క అంతర్భాగాల మధ్య ఒకే ఒక తేడా ఉంటుంది. పెట్టుబడిదారు అడ్వాన్సు చేసిన అస్థిర పెట్టుబడి – విలువకు అవి సమంగానైనా ఉంటాయి. లేదా దానికి మించి అదనంగానైనా ఉంటాయి. అయితే ఆ రెండింటిలోనూ ఉన్నది శ్రమశక్తి మాత్రమే – సరుకుల ఉత్పత్తి సందర్భంగా వ్యయమైన శ్రమశక్తి. వాటిలో ఉన్నది రాబడి వ్యయమూ కాదు, ఆదాయ వ్యయమూ కాదు, కేవలం శ్రమ వ్యయమే.

సరుకు విలువ ఆదాయ మూలాధారంగా ఉండడానికి బదులుగా ఆదాయమే సరుకు – విలువ మూలాధారంగా తయారవుతుందనే వాదన ప్రకారం సరుకుల విలువ వివిధ రకాల ఆదాయంతో "రూపొందించబడినట్లు" కనిపిస్తుంది; ఈ ఆదాయాలు దేనికదే స్వతంత్రంగా నిర్ణయింపబడతాయి. సరుకుల సంపూర్ణ విలువను ఆ ఆదాయాల విలువల మొత్తం నిర్ణయిస్తుంది. అయితే సరుకు –

విలువగా రూపొందుతాయని అంటున్న ఈ ఆదాయాలలోని ప్రతి ఒక దాని విలువనూ నిర్ణయించడం ఎలా అనే ప్రశ్న ఇప్పుడు మనముందుంది. వేతనాల విషయంలో ఇది సాధ్యమే. ఎందుచేతనంటే, వేతనాలు వాటి సరుకు విలువకు, అంటే శ్రమశక్తి విలువకు ప్రాతినిధ్యం వహిస్తాయి. ఇతర సరుకుల యొక్క విలువలాగే ఈ విలువను కూడా ఆ సరుకు పునరుత్పత్తికి అవసరమైన శ్రమను బట్టి నిర్ణయించవచ్చు. కానీ, అదనపు – విలువను లేదా ఆడమ్ స్మిత్ అంటున్న దాని రెండు రూపాలైన లాభాన్ని కౌలును నిర్ణయించడం ఎలా? ఆడమ్ స్మిత్ ఇక్కడ శుష్క శబ్దాడంబరం ప్రదర్శించాడు. ఆయన ఒకసారేమో వేతనాలు, అదనపు విలువ (లేక వేతనాలు, లాభం) సరుకుల విలువలోని లేక ధరలోని అంతర్భాగాలని అంటాడు; మరోసారేమో, అలా అన్న వెంటనే సరుకుల ధర ఆ రెండు భాగాలుగా "విభజితమవుతుంద"ని అంటాడు; కానీ, ఈ మాటల అర్థం సరుకు విలువ మొదట వస్తుందని, ఉత్పాదిత ప్రక్రియలో పాల్గొనే వివిధ వ్యక్తులకు ఈ విలువలోని వివిధ భాగాలు ఆదాయాల రూపంలో చెందుతాయని కదా. మరి, ఈ మూడు "అంతర్భాగాల"తో విలువ "రూపొందింపబడింది" అనే భావానికీ, పై భావానికీ మధ్య ఎలాంటి సారూప్యమూ లేదు. ఉదాహరణకు, నేను మూడు విభిన్న సరళరేఖల పొడుగులను విడివిడిగా నిర్ణయించి, ఆ తరువాత ఈ మూడు "అంతర్భాగాల" మొత్తం పొడుగులకు సమానంగా ఉండే నాలుగో సరళరేఖను వీటితోనే రూపొందించాను అనుకోండి. అయితే నా ముందు ఒక నిర్ణీత సరళరేఖ ఉంచుకొని, ఆ తరువాత ఏదో ఒక ఉద్దేశంతో, దాన్ని మూడు భాగాలుగా "విభజిస్తే", దీనికీ, పై పద్ధతికీ మధ్య సారూప్యం లేదు. మొదటి పద్ధతిలో, మూడు రేఖల పొడుగులను బట్టి, వాటితో ఏర్పడిన నాల్గవ రేఖ పొడుగు మారుతుంది. కాగా రెండవ పద్ధతిలో, ఒకే రేఖలోని మూడు భాగాల పొడుగులూ ప్రారంభం నుంచీ, ఒక నిర్ణీతమైన పొడవున్న రేఖలోని మూడు భాగాల పొడుగులూ ప్రారంభం నుంచీ, ఒక నిర్ణీతమైన పొడవున్న రేఖలోని మూడు భాగాలు అనే వాస్తవానికి పరిమితమైనవి. ఆడమ్ స్మిత్ ఇచ్చిన వివరణలో ఒక భాగం సక్రమమైనదే; సక్రమమైన భాగం ఇది : వార్షిక శ్రమచేత కొత్తగా సృష్టించబడినట్టి, వార్షిక సామాజిక సరుకు ఉత్పాదితంలో ఉన్నట్టి విలువ (ప్రతి వ్యష్టి సరుకులోనూ లేక దిన, వారాది ఉత్పాదితంలో ఉన్నట్లే) అడ్వాన్సు చేయబడిన అస్థిర పెట్టుబడి విలువనూ; (అంటే కొత్తగా శ్రమశక్తిని కొనడానికి ఉద్దేశించిన విలువ భాగం) పెట్టుబడిదారు తన వ్యక్తిగత వినియోగ సాధనాల రూపంలో తీసుకోగల అదనపు విలువనూ కూడితే వచ్చే మొత్తానికి సమానంగా ఉంటుంది. (సామాన్య పునరుత్పత్తి సాగుతున్నట్టూ, ఇతర పరిస్థితులు కూడా మారనట్లూ ఇక్కడ ఊహించుకొంటున్నాం.) ఈ సక్రమమైన వివరణ భాగాన్ని పరిగణనలోకి తీసుకుందాం; విలువను సృష్టిస్తున్నట్టే, శ్రమశక్తి వ్యయంగా ఉన్నట్టి శ్రమనూ ఉపయోగపు విలువను సృష్టిస్తున్నట్టే, అంటే ఉపయోగకరమైన, సముచితమైన పద్ధతిలో వ్యయమైనట్టి శ్రమనూ ఆడమ్ స్మిత్ కలగలుపుతున్నాడనే సంగతిని దృష్టిలో ఉంచుకొందాం. ఇప్పుడు మొత్తం భావన తాత్పర్యం ఇదీ : ప్రతి సరుకు విలువా శ్రమ ఉత్పాదితమే; అందుచేత వార్షిక శ్రమ ఉత్పాదితం యొక్క విలువకూ లేక సమాజ వార్షిక సరుకు – ఉత్పాదితం విలువకు కూడా ఈ సత్యం వర్తిస్తుంది. అయితే సకల శ్రమ రెండు భాగాలుగా విభజితమవుతుంది. 1) అవసరమైన శ్రమకాలం. ఈ శ్రమకాలంలో తన శ్రమశక్తి కొనుగోలుకు అడ్వాన్సు చేయబడిన పెట్టుబడికి సమమైన దానిని

మాత్రమే శ్రామికుడు ఉత్పత్తి చేస్తాడు. 2) అదనపు శ్రమ. ఇందులో కార్మికుడు పెట్టుబడిదారుకు సరఫరా చేసే విలువకు సమమైన దానిని పెట్టుబడిదారు తిరిగి కార్మికుడికి ఇవ్వడు. కాబట్టి ఇది అదనపు శ్రమ. సమస్త శ్రమ ఇలా విభజితమవుతున్నందు వల్ల సమస్త సరుకు – విలువ కూడా ఈ రెండు అంతర్భాగాలుగా విభజితం కాగలదు. ఫలితంగా, చివరకు అది కార్మిక వర్గానికి వేతనాల రూపంలోనూ, పెట్టుబడిదారీ వర్గానికి అదనపు విలువ రూపంలోనూ ఆదాయంగా ఉంటుంది. ఇక స్థిర పెట్టుబడి – విలువకు సంబంధించి, అంటే వార్షిక ఉత్పత్తి సృష్టిలో వ్యయమైన ఉత్పత్తి సాధనాల విలువకు సంబంధించి, ఈ విలువ ఎలా నూతన ఉత్పాదితం విలువలోకి చేరుతుందో వివరించలేము. (పెట్టుబడిదారు తన సరుకుల అమ్మకంలో కొనుగోలుదారు నుంచి దీన్ని వసూలు చేస్తాడు అని చెప్పడం మినహా ఆయన ఇంకేమీ చెప్పలేదు.) అయితే అంతిమంగా, ఉత్పత్తి సాధనాలు సైతం శ్రమ ఉత్పాదితాలు కాబట్టి విలువలోని ఈ భాగంలో అస్థిర పెట్టుబడికి సమమైనదీ, అదనపు విలువకు సమమైనదీ మాత్రమే ఉంటాయి; అంటే అవసరమైన శ్రమ ఉత్పాదితం, అదనపు శ్రమ ఉత్పాదితం మాత్రమే ఉంటాయి. అయితే ఈ ఉత్పత్తి సాధనాల విలువలు తమ యజమానుల చేతుల్లో పెట్టుబడి విలువలుగా వ్యవహరిస్తున్నాయన్న వాస్తవం, ఈ విషయాన్ని మూలముట్టుగా తరచి చూస్తే అవి "ఆదిలో", (గత కాలాననే కావచ్చు) ఇతరుల చేతుల్లో పైన చెప్పిన రెండు భాగాలుగా, కాబట్టి, రెండు విభిన్న ఆదాయ మూలాధారాలుగా విభజితం కావడానికి అడ్డురాదు.

ఇక్కడ ఒక అంశం సక్రమమైంది : ఈ విషయం సామాజిక పెట్టుబడి చలనంలో అంటే వ్యష్టి పెట్టుబడుల మొత్తం చలనంలో ఉన్న రీతికీ, ప్రతి వ్యష్టి పెట్టుబడినీ విడివిడిగా పరిశీలిస్తే, అంటే ప్రతి వ్యష్టి పెట్టుబడిదారు దృక్పథం నుంచి చూస్తే ఉన్న రీతికీ తేడా ఉంది. వ్యష్టి పెట్టుబడిదార్లకు సంబంధించి సరుకుల విలువ ఇలా విభజితమవుతుంది. (1) స్థిరమైన భాగం (ఆడమ్ స్మిత్ మాటల్లో ఇది నాల్గవది) (2) వేతనాల, అదనపు విలువ యొక్క మొత్తం లేక వేతనాలు, లాభం, కౌలు. అయితే సమాజం దృష్టి నుంచి చూస్తే ఆడమ్ స్మిత్ చెబుతున్న నాల్గవ అంశం, అంటే స్థిర పెట్టుబడి విలువ కనిపించదు.

## 5. సింహావలోకనం

వేతనాలు, లాభం, కౌలు అనే మూడు ఆదాయాలు, సరుకుల విలువలోని మూడు "అంతర్భాగాలుగా" రూపొందుతాయన్న ఆడమ్ స్మిత్ అసంబద్ధ సూత్రానికి మూలం ఏమిటంటే సరుకుల విలువ మూడు అంతర్భాగాలుగా "విభజిత"మవుతుంది అనే మరింత సంభావ్యమైన భావం. సరుకుల విలువను, వ్యయమైన శ్రమశక్తికి సమమైనదిగానూ, ఆ శ్రమశక్తి సృష్టించిన అదనపు విలువగానూ మాత్రమే విభజింపవచ్చునని అంగీకరించినప్పటికీ, ఈ భావం సైతం సరైంది కాదు. అయితే పొరపాటు ఇక్కడ కూడా అసలు పునాదిలోనే ఉన్నది. ఉత్పాదక శ్రామికుడు పెట్టుబడిదారుకు తన శ్రమశక్తిని సరుకుగా అమ్ముకొనడం, అలా అమ్మిన తరువాత ఆ శ్రమశక్తి పెట్టుబడిదారు చేతిలో అతని ఉత్పాదక పెట్టుబడిలోని ఒక భాగంగా పనిచేయడం – ఇదీ పెట్టుబడిదారీ ఉత్పత్తికి పునాది. చలామణికి సంబంధించిన ఈ లావాదేవీ, అంటే శ్రమశక్తి అమ్మకమూ, కొనుగోలూ ఉత్పత్తి ప్రక్రియను ప్రారంభించడమే కాక, ఉత్పత్తి యొక్క ప్రత్యేక స్వభావాన్ని ఖండితంగా నిర్ణయిస్తుంది కూడా. ఉపయోగపు విలువ ఉత్పత్తి, ఆ మాటకొస్తే సరుకు ఉత్పత్తి కూడా (స్వతంత్ర ఉత్పాదక కార్మికులు సైతం దీనిని

నిర్వహించడం సాధ్యం కాబట్టి) ఇక్కడ, పెట్టుబడిదారు కోసం నిరపేక్ష అదనపు విలువను, సాపేక్ష అదనపు విలువను ఉత్పత్తి చేసే ఒక సాధనం మాత్రమే. అందుచేత ఉత్పత్తి ప్రక్రియా విశ్లేషణలో నిరపేక్ష, సాపేక్ష అదనపు విలువల ఉత్పత్తి ఈ క్రింది రెండు అంశాలను నిర్ణయించడం మనం చూశాం : (1) దైనందిన శ్రమ ప్రక్రియ కాలం (2) పెట్టుబడిదారీ ఉత్పత్తి ప్రక్రియ తాలూకు సమస్త సామాజిక, సాంకేతిక స్వరూపం. ఈ ప్రక్రియలో ఈ క్రిందివాటి మధ్య తేడా అభివ్యక్తమవుతుంది : విలువ (స్థిర పెట్టుబడి విలువ) పరిరక్షణ; అడ్వాన్సు చేయబడిన విలువ (శ్రమశక్తికి తుల్యమైనది) వాస్తవిక పునరుత్పత్తి; అదనపు విలువ ఉత్పత్తి; పెట్టుబడిదారు ఈ అదనపు విలువకు తుల్యమైనదాన్ని ఉత్పత్తి ప్రక్రియకు మునుపుగానీ, తరువాతగానీ అడ్వాన్సు చేయడు.

అదనపు విలువను, పెట్టుబడిదారు అడ్వాన్సు చేసిన విలువకు సమానమైన దానికి మించి అదనంగా ఉన్న విలువను స్వాయత్తం చేసుకొనే చర్యకు, శ్రమశక్తి కొనుగోలూ, అమ్మకమూ నాందీ వాచకం పలికినప్పటికీ, అది ఉత్పత్తి ప్రక్రియ పరిధిలోనే జరిగే చర్య; అందుచేత అది ఉత్పత్తిలోని ఒక ముఖ్యాంశం.

చలామణి ప్రక్రియ అయిన ఈ ప్రారంభక చర్య, అంటే శ్రమశక్తి అమ్మకం, కొనుగోలు ఉత్పాదన అంశాల పంపిణీపై ఆధారపడి వుంది. అంటే "శ్రామికుని" సరుకుగా ఉన్న శ్రమశక్తి శ్రామికేతరుల ఆస్తిగా ఉన్న ఉత్పత్తి సాధనాల నుంచి ఉండటంపై ఆధారపడి ఉందన్న మాట. ఈ పంపిణీ సామాజిక ఉత్పాదితాల పంపిణీకి ముందే జరిగిపోయి ఉంటుంది. ఇందులో ఆ ఉత్పాదితాల పంపిణీ గర్భితం.

కానీ, ఈ అదనపు విలువ స్వాయత్తత లేక అడ్వాన్సు చేయబడిన విలువ పునరుత్పత్తిగానూ, మరే తుల్య విలువ స్థానాన్ని భర్తీచేయని నూతన విలువ (అదనపు విలువ) ఉత్పత్తిగానూ విలువ ఉత్పత్తి వేర్పడిపోవడమన్నది, విలువ మొత్తాన్ని కానీ, విలువ ఉత్పత్తి స్వభావాన్ని కానీ ఏ విధంగానూ మార్చదు; విలువ మొత్తం వ్యయమయిన శ్రమశక్తి తప్ప మరేమీ కాదు, కాబోదు. శ్రమ యొక్క నిర్దిష్ట, ఉపయోగకర లక్షణంతో నిమిత్తం లేని శ్రమ అది. కాగా విలువ ఉత్పత్తి, ఆ శ్రమ వ్యయ ప్రక్రియ తప్ప మరేది కాదు. ఉదాహరణకు ఒక ఫ్యూడల్ దాసుడు ఆరురోజుల పాటు తన శ్రమశక్తిని ఖర్చు పెడతాడు. అంటే ఆరు రోజులపాటు శ్రమిస్తాడు అనుకుందాం. అయితే అతడు మూడు రోజులపాటు తన సొంత భూమిలో పని చేయవచ్చు; మరో మూడు రోజుల పాటు తన యజమాని భూమిలో పని చేయవచ్చు, కానీ, ఇది శ్రమ వ్యయమయిందన్న వాస్తవాన్ని మార్చదు. అతడు తన కోసం చేసిన ఐచ్ఛిక శ్రమ, తన భూస్వామి కోసం చేసిన నిర్బంధ శ్రమ రెండూ సమానంగా శ్రమలే. ఆ శ్రమ విలువను లేక ఉపయోగకర వస్తువులను సృష్టించినంత వరకూ అతని ఆరు రోజుల శ్రమలో ఎలాంటి తేడా లేదు. ఆరు రోజుల శ్రమ కాలంలోని రెండు సమభాగాల్లో అతడు శ్రమ చేసిన పరిస్థితులకు సంబంధించి మాత్రమే తేడా ఉంటుంది తప్ప శ్రమకు సంబంధించి తేడా ఉండదు. వేతన కార్మికుని అవసర శ్రమకూ, అదనపు శ్రమకూ కూడా ఇదే వర్తిస్తుంది.

సరుకు తయారు కావడంతో ఉత్పత్తి ప్రక్రియ ముగుస్తుంది. సరుకు తయారీలో శ్రమశక్తి వ్యయమయిందనే వాస్తవం ఆ సరుకు పాదార్థిక ధర్మంలో ఇప్పుడు దర్శనమిస్తుంది; విలువ కలిగి ఉండటమనే ధర్మం అది. వ్యయమైన శ్రమ పరిమాణం ఈ విలువ పరిమాణానికి కొలమానం. ఒక

సరుకు విలువ ఇది తప్ప మరే అంశాలుగానూ విభజితం కాదు. విలువలో ఇతరమేదీ లేదు. నేను నిర్దిష్టమైన పొడవు గల సరళరేఖ గీశానంటే, నాతో ప్రమేయం లేని నిబంధనలను (నియమాలను) అనుసరించి అభ్యసించి రేఖా చిత్రకళ ప్రకారం సరళరేఖను "ఉత్పత్తి" చేశానన్న మాట. (నాకు ముందే తెలిసినట్లు సాంకేతికంగా మాత్రమే అనేది నిజమే.) నేనీ రేఖను మళ్ళీ మూడు భాగాలుగా (అవి ఏదైనా ఒక గణితశాస్త్ర సమస్యకు అనుగుణంగా ఉండవచ్చు) విభజించినట్లయితే అందులోని ప్రతి భాగమూ ఒక సరళరేఖగా ఉంటుంది; అదే సమయంలో మొత్తం రేఖ ఈ విభజన వల్ల సరళరేఖగానే ఉంటుంది తప్ప మరో రకంగా ఉండదు. ఉదాహరణకు అది వక్రరేఖగా ఏమీ మారదు. అంతేకాక నిర్ణీతమైన పొడవున్న రేఖను విభజిస్తే, విభజిత భాగాల మొత్తం పొడవు అవిభాజిత రేఖ పొడవుకన్నా ఎక్కువగా ఉండేలా విభజించలేను. అందుచేత అవిభాజ్య రేఖ పొడవును, చిత్తాయత్తంగా నిర్ణయించిన దాని భాగాల పొడవును నిర్ణయించజాలవు. అందుకు భిన్నంగా, ఈ భాగాల సాపేక్షమైన పొడవులు అంతకుముందే పరిమితమై ఉన్నాయి; అవి ఏ రేఖ భాగాలో ఆ రేఖ పరిమాణంచే ఆదిలోనే అవి పరిమితమై ఉన్నాయి.

ఈ విధంగా, పెట్టుబడిదారు ఉత్పత్తి చేసిన సరుకుకూ, స్వతంత్ర కార్మికుడు కానీ, శ్రామిక ప్రజా సమాజాలు కానీ, బానిసలు కానీ ఉత్పత్తి చేసిన సరుకులకూ మధ్య ఎలాంటి తేడా ఉండదు. అయితే ప్రస్తుత సందర్భంలో, మొత్తం శ్రమ ఉత్పాదితమూ, దాని సమస్త విలువా పెట్టుబడిదారుకే చెందుతుంది. ఇతర ఉత్పత్తిదారులాగే పెట్టుబడిదారు కూడా తన సరుకును తదుపరి ఉపయోగపెట్టుకో డానికి ముందు, దాన్ని అమ్మకం ద్వారా డబ్బుగా మార్చుకోవలసి ఉంటుంది; అంటే అతడు దానిని సార్వత్రిక తుల్య రూపంలోకి మార్చుకోవలసి ఉంటుంది.

డబ్బు రూపంలోకి మార్చబడడానికి ముందున్న సరుకు – ఉత్పాదితాన్ని పరిశీలిద్దాం. అది పూర్తిగా పెట్టుబడిదారుకే చెందుతుంది. మరోవైపేమో, శ్రమ యొక్క ఉపయోగకర ఉత్పాదితంగా, అంటే ఉపయోగపు విలువగా, ఇది పూర్తిగా గత శ్రమ ప్రక్రియ ఉత్పాదితం. అయితే దాని విలువ మాత్రం అలా కాదు. ఈ విలువలోని ఒక భాగం, సరుకు ఉత్పత్తిలో వ్యయమయి, తిరిగి నూతన రూపంలో దర్శనమిచ్చే ఉత్పత్తి సాధనాల విలువే. ఈ సరుకు ఉత్పాదన ప్రక్రియ సందర్భంగా ఈ విలువ ఉత్పత్తి అయినది కాదు. ఎందుచేతనంటే ఉత్పత్తి ప్రక్రియకు ముందే ఉత్పత్తి సాధనాల్లో ఆ ప్రక్రియతో ప్రమేయం లేకుండా ఆ విలువ ఉంది. ఉత్పత్తి సాధనాలు ఈ విలువ యొక్క వాహికలుగా ఈ ప్రక్రియలోకి ప్రవేశించాయి. పునర్దర్శనమిచ్చిందీ, మారిందీ, ఆ విలువ రూపం మాత్రమే. సరుకు విలువ యొక్క ఈ భాగం పెట్టుబడిదారు సరుకు ఉత్పత్తి సందర్భంగా అడ్వాన్స్ చేసినట్టీ, వినియోగ మయినట్టీ స్థిర పెట్టుబడి భాగానికి తుల్యంగా ఉంటుంది. అది అంతకుముందే ఉత్పత్తి సాధనాల రూపంలో ఉండింది; ఇప్పుడు కొత్తగా ఉత్పత్తి అయిన సరుకు విలువలో ఒక అంతర్భాగంగా ఉంది. ఈ సరుకు డబ్బుగా మార్పు చెందీ చెందగానే, ఇప్పుడు డబ్బు రూపంలో ఉన్న విలువ ఉత్పత్తి సాధనాలుగా తిరిగి మార్చబడాలి; అంటే ఉత్పత్తి ప్రక్రియచేత, అందులో దాని విధిచేత నిర్ణీతమైన దాని మొదటి రూపంలోకి మార్చబడాలి. ఈ విలువ పెట్టుబడిగా వ్యవహరించడం వల్ల సరుకు విలువ స్వభావంలో ఎలాంటి మార్పు రాదు.

ఇక సరుకు విలువలోని రెండవ భాగం, వేతన కార్మికుడు పెట్టుబడిదారుకు అమ్మే శ్రమశక్తి

యొక్క విలువే. ఉత్పత్తి సాధనాల విలువలాగే ఇది కూడా. తాను పాల్గొననున్న ఉత్పత్తి ప్రక్రియతో ప్రమేయం లేకుండా నిర్ణయమైనదీ, అలా ఉత్పత్తి ప్రక్రియలోకి ప్రవేశించక ముందే శ్రమశక్తి అమ్మకం, కొనుగోలు అనే చలామణి ప్రక్రియలో స్థిరపడినదీ. వేతన కార్మికుడు తన క్రియ ద్వారా, అంటే శ్రమ–శక్తి వ్యయం ద్వారా, తన శ్రమశక్తి వినియోగం కోసం తనకు పెట్టుబడిదారు చెల్లించవలసి ఉన్న విలువకు సమానంగా ఉండే సరుకు విలువను ఉత్పత్తి చేస్తాడు. అతడు ఈ విలువను పెట్టుబడిదారుకు సరుకు రూపంలో ఇస్తాడు; అందుకోసం అతనికి పెట్టుబడిదారు డబ్బు రూపంలో చెల్లిస్తాడు. పెట్టుబడిదారుని దృష్టిలో తాను వేతనాలుగా అడ్వాన్సు చేయవలసి ఉన్న అస్థిర పెట్టుబడికి సరుకు విలువలోని ఈ భాగం కేవలం తుల్యమైనది. అయితే అంతమాత్రాన, అది ఉత్పత్తి ప్రక్రియ సందర్భంగా కొత్తగా సృష్టించబడిన సరుకు విలువే తప్ప, అదనపు విలువలోలాగే అందులో కూడా గత శ్రమశక్తి వ్యయం తప్ప మరేమీ లేదన్న వాస్తవం మారదు. కార్మికుడికి పెట్టుబడిదారు వేతనాల రూపంలో శ్రమశక్తికి చెల్లించే విలువ కార్మికుడికి ఆదాయ రూపం ధరిస్తుందన్న వాస్తవానికి కానీ, తద్వారా శ్రమశక్తి మాత్రమే కాక సమస్త పెట్టుబడిదారీ ఉత్పత్తికి ప్రాతిపదిక అయినటువంటి వేతన కార్మికుల వర్గమే నిరంతరాయంగా పునరుత్పత్తి అవుతున్నదనే వాస్తవానికి కానీ పైన వివరించిన సత్యంపై ఎలాంటి ప్రభావం ఉండదు.

కాని, సరుకు విలువ అంతా విలువ యొక్క ఈ రెండు భాగాల మొత్తం మాత్రమే కాదు. ఈ రెండు భాగాలకు మించి అదనంగా మరొకటుంది – అదే అదనపు విలువ. వేతనాల రూపంలో అడ్వాన్సు చేయబడిన అస్థిర పెట్టుబడి స్థానాన్ని భర్తీ చేసే విలువ భాగంలాగే, ఇది ఉత్పత్తి ప్రక్రియ సందర్భంగా కార్మికుడు నూతనంగా సృష్టించిన విలువ. ఇది ఘనీభవించిన శ్రమ. అయితే యావత్తు ఉత్పాదితం యొక్క యజమానికి, అంటే పెట్టుబడిదారుకు దీనివల్ల ఖర్చేమీ కాదు. భూస్వామికి కౌలు ఇచ్చే విధంగా ఇతర భాగస్వాములకు కూడా ఇందులో కొంత భాగం సమర్పించవలసి ఉంటే తప్ప, ఈ అదనపు విలువను పెట్టుబడిదారే మొత్తంగా తన ఆదాయంగా వినియోగం చేసుకునేందుకు ఇందువల్ల అవకాశం ఉంటుంది; పెట్టుబడిదారు ఆ విధంగా అందులోని భాగాలను ఇతరులకు సమర్పించే పక్షంలో అవి ఇతరులకు ఆదాయాలవుతాయి. సరుకుల తయారీలో తాను అసలు పాల్గొన డానికి మన పెట్టుబడిదారుని ప్రేరేపించేది ఈ అదనపు విలువే. అయితే అదనపు విలువను గుంజుకోవా లన్న అతని అసలు "సదుద్దేశం" కానీ, అతనూ లేదా ఇతరులూ దానిని ఆ తరువాత ఆదాయంగా వ్యయం చేయడం కానీ ఏ విధంగానూ అదనపు విలువ స్వభావాన్ని మార్చదు. ఇది ఘనీభవించినట్టి, మూల్యం చెల్లింపబడినట్టి శ్రమ అన్న వాస్తవాన్ని కానీ, ఈ అదనపు విలువ పరిమాణాన్ని కానీ అవేవీ మార్చవు; అదనపు విలువను నిర్ణయించేది ఇందుకు పూర్తిగా భిన్నమైన పరిస్థితులు.

అయితే, ఆడమ్ స్మిత్ సరుకుల విలువను సమగ్రంగా పరిశీలించే సందర్భంగా, సమస్త పునరుత్పత్తి ప్రక్రియలో ఈ విలువ తాలూకు వివిధ భాగాలు నిర్వర్తించే పాత్రల విషయమే పట్టించుకో వాలనుకున్నట్లయితే, (వాస్తవానికి ఆయన ఆ పనే చేశాడు) ఒక విషయమై స్పష్టమై ఉండేది; కొన్ని ప్రత్యేక భాగాలు ఆదాయంగా వ్యవహరించగా, ఇతర భాగాలు పెట్టుబడిగా అంత నిరంతరాయంగానూ వ్యవహరిస్తాయి. కాబట్టి ఆయన తర్కం ప్రకారం, ఈ భాగాలను కూడా సరుకు విలువ అంతర్భాగాలుగా లేక ఈ విలువ విభజితమయ్యే భాగాలుగా పేర్కొని ఉండవలసింది.

ఆడమ్ స్మిత్ మొత్తం మీద సరుకుల ఉత్పత్తిని పెట్టుబడిదారీ సరుకు ఉత్పత్తిగానే పరిగణిస్తాడు. ఆయన ప్రారంభం నుంచీ ఉత్పత్తి సాధనాలను "పెట్టుబడి"గానే పరిగణిస్తాడు. ప్రారంభం నుంచీ ఆయన దృష్టిలో శ్రమ అంటే వేతన శ్రమే. అందుచేత "ఉపయోగకర, ఉత్పాదక కార్మికుల సంఖ్య ప్రతిచోటా, వారిని పనిలో పెట్టడానికి నియుక్తమైన పెట్టుబడి నిల్వ పరిమాణానికి అనుగుణమైన దామాషాలో ఉంటుంది." (ఉపోద్ఘాతం పుట 12.) సంక్షిప్తంగా చెప్పాలంటే, ప్రారంభం నుంచే శ్రమ ప్రక్రియ తాలూకు వివిధ అంశాలు – వస్తుగతమైనవీ, వ్యక్తిగతమైనవీ కూడా – పెట్టుబడిదారీ ఉత్పత్తి యుగానికి విశిష్టమైన ముసుగులతో కనిపిస్తాయి. ఈ విలువ ఒకవైపు నియుక్తమైన పెట్టుబడికి కేవలం సమతుల్యంగా ఏ మేరకు ఉంటుంది, మరోవైపు ఇది విలువగా, అంటే అడ్వాన్సు చేయబడిన పెట్టుబడి విలువను భర్తీచేయని, "ఉచితంగా" లభ్యమయ్యే విలువగా లేక అదనపు విలువగా ఏ మేరకు రూపొందుతుంది అనే పరిశీలనతో సరుకుల విలువ గురించిన ఈ విశ్లేషణ ఏకీభవిస్తుంది. ఈ దృక్కోణం నుంచి పరిశీలిస్తే, సరుకు విలువలోని భాగాలు, ఈ విధంగా మనకు తెలియకుండానే స్వతంత్రమైన దాని "అంతర్భాగాలుగా" పరివర్తన చెంది, చివరకు "సమస్త విలువకు మూలాధారాలుగా" మారతాయి. వివిధ రకాల ఆదాయాలు కలిసి సరుకు విలువగా ఏర్పడతాయి. లేదా అది వివిధ రకాల ఆదాయాలుగా "విభజిత"మవుతుంది అనేది మరో నిర్ధారణ. అంటే ఆదాయాలు సరుకు – విలువను రూపొందిస్తాయి తప్ప, సరుకు – విలువ ఆదాయాలను రూపొందించదన్న మాట. సరుకు విలువ, అనంతర దశలో ఏదో ఒక వ్యక్తికి ఆదాయంగా వ్యవహరించినప్పటికీ, సరుకు – విలువ స్వభావంలో మార్పు రానట్లే, సరుకు – విలువ, పెట్టుబడి – విలువగా వ్యవహరించినప్పటికీ, సరుకు విలువ స్వభావంలో ఏ విధమైన మార్పు రాదు. ఆడమ్ స్మిత్ పరిశీలిస్తున్న సరుకు ప్రారంభం నుంచీ కూడా సరుకు – పెట్టుబడే. (అందుచేత ఇందులో సరుకు ఉత్పత్తి సందర్భంగా వినియోగమయ్యే పెట్టుబడి – విలువతో పాటు అదనపు విలువ కూడా ఉంటుంది.) కాబట్టి ఇది పెట్టుబడిదారీ పద్ధతుల్లో ఉత్పత్తి అయిన సరుకు, పెట్టుబడిదారీ ఉత్పత్తి ప్రక్రియ ఫలితం. అందుచేత, ఈ పెట్టుబడిదారీ ఉత్పత్తి ప్రక్రియను, అందులో వున్న విలువ యొక్క స్వయం విస్తరణ ప్రక్రియను, విలువ ఆవిర్భవించే ప్రక్రియను విశ్లేషించవలసి ఉంటుంది. అయితే ఈ ప్రక్రియకు ప్రాతిపదికగా ఉన్నది సరుకుల చలామణి కాబట్టి సరుకును ప్రారంభంలోనే, స్వతంత్రంగా విశ్లేషించవలసి ఉంటుంది. కానీ ఆడమ్ స్మిత్ తన "నిగూఢ పద్ధతి"న, సరియైన పథం తొక్కినప్పటికీ, ఆయన విలువ ఆవిర్భావ ప్రక్రియను ఎల్లప్పుడూ సరుకుల విశ్లేషణకు, అంటే సరుకు పెట్టుబడి విశ్లేషణకు సంబంధించిన అంశంగా మాత్రమే పరిగణిస్తాడు.

## III. తదనంతర అర్థశాస్త్రవేత్తలు[1]

ఆడమ్ స్మిత్ సిద్ధాంతాన్ని దాదాపు మక్కికి మక్కీగా రికార్డో ఇలా పునరుద్ఘాటించాడు : "ఒక దేశం యొక్క ఉత్పత్తులన్నీ వినియోగమవుతాయన్న విషయం అర్థం చేసుకోవాలి; అయితే, ఈ విషయంలో, వాటిని వినియోగించుకునేది మరో విలువను పునరుత్పత్తి చేసేవారా? లేక అలా పునరుత్పత్తి చేయనివారా? అనే వాటి మధ్య బ్రహ్మాండమైన భేదముంది. ఆదాయాన్ని మిగిల్చి, పెట్టుబడికి అదనంగా

1. ఇక్కడ నుంచి అధ్యాయం ముగిసేదాకా వున్న భాగం రాతప్రతి II లోనిది - ఫ్రెడరిక్ ఎంగెల్స్.

చేర్చడం జరిగిందని మనమన్నామంటే, అలా పెట్టుబడికి చేర్చిన ఆదాయం భాగాన్ని అనుత్పాదక కార్మికులకు బదులుగా ఉత్పాదక కార్మికులు వినియోగించుకున్నారు అని దాని అర్థం." (ప్రిన్సిపుల్స్, పుట 163)

వాస్తవానికి, సరుకుల ధర వేతనాలుగానూ, అదనపు విలువగానూ (లేక అస్థిర పెట్టుబడిగానూ, అదనపు విలువగానూ) విభజితమవుతుందన్న ఆడమ్ స్మిత్ సిద్ధాంతాన్ని రికార్డో సంపూర్ణంగా ఆమోదించాడు. ఆయన దృష్టిలో వివాదాంశాలు ఇవి : 1) అదనపు – విలువ అంతర్భాగాల్లో ఆయన కౌలును ముఖ్యమైన భాగం కాదని తోసివేస్తాడు. 2) రికార్డో సరుకు ధరను ఈ అంతర్భాగాలుగా విడగొడతాడు. ఆ విధంగా విలువ పరిమాణానిదే ప్రథమ స్థానమవుతుంది. ఈ అంతర్భాగాల మొత్తం ఒక నిర్ణీత పరిమాణం గలదని ఆయన ఊహిస్తాడు. అదే ప్రారంభ స్థానం. కానీ ఆడమ్ స్మిత్ తత్భిన్నంగా ఊహిస్తాడు. ఇదే ప్రారంభ స్థానం. కానీ ఆడమ్ స్మిత్ సరియైన నిర్ణయాన్ని కాదని ఆ తరువాత, సరుకు విలువను దాని అంతర్భాగాల మొత్తం నుంచి రాబట్టడం ద్వారా తరచూ, పైన పేర్కొన్నదానికి విరుద్ధమైన పంథా తొక్కుతాడు.

రికార్డోకు వ్యతిరేకంగా రామ్సే ఈ క్రింది వ్యాఖ్య చేస్తాడు : "ఆయన సమస్త ఉత్పాదితాన్ని వేతనాలుగానూ, లాభాలుగానూ విభజితమైనదిగా ఎల్లప్పుడూ పరిగణిస్తూన్నట్లు కనిపిస్తుంది. నిశ్చల పెట్టుబడి స్థానం భర్తీ చేయడానికి అవసరమైన భాగాన్ని విస్మరిస్తున్నాడు." (యాన్ ఎస్సే ఆన్ ది డిస్ట్రిబ్యూషన్ ఆఫ్ వెల్త్, ఎడింబరో, 1836, పుట 174). నేను స్థిరపెట్టుబడిగా పరిగణించినదాన్నే రామ్సే నిశ్చల పెట్టుబడి అని అంటున్నాడు : "భవిష్యత్ సరుకును సృష్టించడానికి సహాయపడినప్పటికీ, కార్మికుల పోషణ ఖర్చును భరించనట్టి రూపంలో నిశ్చల పెట్టుబడి ఉంటుంది." (అదే గ్రంథం, పుట 59)

సరుకుల విలువ, అందువల్ల సమాజ వార్షిక ఉత్పాదితం విలువను కూడా వేతనాలుగానూ, అదనపు విలువగానూ, అంటే కేవలం నికరాదాయంగా మాత్రమే ఆడమ్ స్మిత్ చేసిన విభజన నుంచి ఆవశ్యంగా ఒక నిర్ధారణకు రావచ్చు. అది అలా విభజితమైనప్పుడు, మొత్తం వార్షిక ఉత్పాదితం వినియోగం కావచ్చుననేది ఆ నిర్ధారణ. కానీ ఆడమ్ స్మిత్ ఈ నిర్ధారణను వ్యతిరేకించాడు. అసంబద్ధమైన నిర్ధారణను చేసేది, ఉపజ్ఞాన్వితులైన చింతకులు కాదు. వారు ఇలాంటి వాటిని సే, మాక్కుల్లోచ్ వంటి వారికి వదలివేస్తారు.

వాస్తవానికి సే ఈ విషయాన్ని చాలా తేలిగ్గా పరిష్కరిస్తాడు. ఒకరికి పెట్టుబడి అడ్వాన్సుగా ఉన్నది, మరొకరికి ఆదాయంగా, నికర ఉత్పాదితంగా ఉంటుంది లేదా ఉండింది. మొత్తం ఉత్పాదితానికి, నిరకర ఉత్పాదితానికి మధ్య గల తేడా కేవలం ఆత్మాశ్రయమైనది. "ఈ విధంగా సమస్త ఉత్పాదితాల మొత్తం విలువ ఆదాయంగా సమాజంలో పంపిణీ అయింది." (Say, Traite d' Economic Politique, 1817, II, P. 64) "ప్రతి ఉత్పాదితం యొక్క మొత్తం విలువా భూస్వాముల, పెట్టుబడిదారుల, దాని ఉత్పత్తికి పాటుపడిన పారిశ్రామిక వృత్తుల వారి లాభాలతో కూడినది." (వేతనాలు పారిశ్రామిక వృత్తుల వారి లాభాలట!) ఇందువల్ల, సమాజ ఆదాయం, ఉత్పత్తి అయిన మొత్తం విలువకు సమానంగా ఉంటుందే తప్ప ఆ తరహా అర్థశాస్త్రవేత్తలు (ఫిజియోక్రాట్లు) నమ్మినట్లుగా, భూమి యొక్క నికర ఉత్పాదితాలకు సమానంగా ఉండదు." (పుట 63)

ఇతరులతో పాటు ప్రౌధాన్ కూడా సే కనిపెట్టిన ఈ కొత్త విషయాన్ని స్వాయత్తం చేసుకున్నాడు.

ఆడమ్ స్మిత్ సిద్ధాంతాన్ని సూత్రరీత్యా ఆమోదించిన స్టార్చ్ మాత్రం, ఆ సిద్ధాంతాన్ని సే ఆచరణకు అన్వయించిన తీరు సమర్థనీయమైనది కాదని అంటాడు. "ఒక జాతి యొక్క ఆదాయం దాని మొత్తం ఉత్పాదితానికి సమానంగా ఉంటుందని అంగీకరించినట్లయితే, అంటే, తీసివేయవలసిన పెట్టుబడి ఏదీ లేనట్లయితే (ఇక్కడ స్థిర పెట్టుబడి అని ఉండాలి), అప్పుడు ఈ దేశం తన భావి ఆదాయానికి ఎట్టి హాని కలగనీకుండా తన వార్షిక ఉత్పాదితం తాలూకు మొత్తం విలువనూ అనుత్పాదకంగా వినియోగించుకోవచ్చునని కూడా మనం అంగీకరించవలసి ఉంటుంది.... ఒక దేశం యొక్క (స్థిర) పెట్టుబడికి ప్రాతినిధ్యం వహించే ఉత్పాదితాలు వినియోగార్హమైనవి కావు." (Storch, Considerations sur la nature du revenu national, Paris, 1824, P.P. 147, 150)

అయితే, ధరల విషయంలో తాను ఆమోదించిన ఆడమ్ స్మిత్ విశ్లేషణకు పెట్టుబడిలోని ఈ స్థిర భాగ అస్తిత్వం ఎలా అనుగుణంగా ఉందో చెప్పడం స్టార్చ్ మరిచాడు; మరి, ఆడమ్ స్మిత్ విశ్లేషణ ప్రకారం, సరుకుల విలువలో వేతనాలు, అదనపు విలువ మాత్రమే ఉంటాయి తప్ప స్థిర పెట్టుబడిలోని భాగమేదీ ఉండదు కదా. ఈ ధరల విశ్లేషణ అసంబద్ధ ఫలితాలకు దారితీస్తుందని ఆయన సే ద్వారా మాత్రమే గ్రహిస్తాడు; ఆ అంశంపై ఈయన చివరి మాట ఇది : "అవసరమైన ధరను దాని అత్యంత సరళమైన అంశాలుగా విభజించడం అసాధ్యం." (Cours d' Economie Politique, Petersburg 1815, II, P. 141)

ముఖ్యంగా పెట్టుబడి, ఆదాయం మధ్య గల సంబంధం గురించి పరిశీలించినట్టి, వాస్తవానికి ఈ సంబంధం గురించిన విచిత్ర సూత్రీకరణను Nouveaux Principes అనే తన గ్రంథ విశిష్టతగా చెప్పుకొన్నట్టి సిస్మాండీ ఒక్క శాస్త్రీయ పదం కూడా ఉచ్చరించలేదు. ఈ సమస్యను వివరించడానికి అణువంత కూడా తోడ్పడలేదు.

బార్టన్, రామ్సే, చెర్బులియేజ్‌లు ఆడమ్ స్మిత్ సూత్రీకరణను దాటి వెళ్ళడానికి ప్రయత్నిస్తారు కానీ కుప్పకూలిపోతారు. ఎందువల్లనంటే వారు స్థిర పెట్టుబడి – విలువకూ, అస్థిర పెట్టుబడి – విలువకూ మధ్య గల వ్యత్యాసాన్ని, నిశ్చల పెట్టుబడికి, చలామణి పెట్టుబడికి మధ్య గల వ్యత్యాసాన్ని గుర్తించలేనందు వల్ల ప్రారంభం నుంచీ సమస్యను ఒకే పార్శ్వం నుంచి చూడడానికి ప్రయత్నించారు.

జాన్ స్టువర్ట్ మిల్ కూడా ఆడమ్ స్మిత్ తన అనుయాయులకు అందించిన సిద్ధాంతాన్ని తనకు సహజమైన ఆడంబరంతో పునశ్చరణ చేస్తాడు. ఫలితంగా స్మిత్ తాలూకు గందరగోళం ఈ నాటికీ కొనసాగుతున్నది; స్మిత్ పిడిసూత్రం, నేటికీ అర్థశాస్త్రం ప్రామాణికమైనదిగా నమ్ముతున్న వాటిలో ఒకటి.

★ ★ ★

# అధ్యాయం - 20

# సామాన్య పునరుత్పత్తి

## I. సమస్య గురించిన సూత్రీకరణ

సామాజిక పెట్టుబడి యొక్క వార్షిక క్రియను, దాని ఫలితాలను, అంటే ఒక సంవత్సరంలో సమాజం సృష్టించిన సరుకు – ఉత్పాదితాన్ని మనం అధ్యయనం[1] చేసినట్లయితే సామాజిక పెట్టుబడి యొక్క పునరుత్పత్తి ప్రక్రియ ఎలా జరుగుతుందో, ఈ పునరుత్పత్తి ప్రక్రియకూ వ్యష్టి పెట్టుబడి పునరుత్పత్తి ప్రక్రియకూ మధ్య గల వ్యత్యాసం ఏమిటో, ఈ రెండు ప్రక్రియలకూ గల ఉమ్మడి లక్షణాలేమిటో మనకు స్పష్టంగా బోధపడుతుంది. సామాజిక పెట్టుబడి అంటే, వ్యష్టి పెట్టుబడులు అంతర్భాగాలుగా గల మొత్తం పెట్టుబడి; ఈ అంతర్భాగాల వాటి వ్యక్తిగత చలనంగా వుంటుంది. అదే సమయంలో మొత్తం పెట్టుబడి చలనంలో వాటిని కలిపి కట్టే అనుసంధానంగా వుంటుంది. వార్షిక ఉత్పాదితంలో కింది సామాజిక ఉత్పాదిత భాగాలుంటాయి; పెట్టుబడిని భర్తీ చేసే, అంటే సామాజిక పునరుత్పత్తి చేసే భాగాలు, వినియోగ నిధిగా ఏర్పడే భాగాలు, అంటే కార్మికులు, పెట్టుబడిదారులు వినియోగించుకొనే భాగాలు, కాబట్టి, ఉత్పాదక వినియోగపు, వ్యక్తిగత వినియోగపు భాగాలు వుంటాయి. ఈ వినియోగంలో పెట్టుబడిదారీ వర్గ, కార్మిక వర్గ పునరుత్పత్తి (పోషణ) కూడా వున్నాయి. ఇందులో, సమస్త ఉత్పత్తి ప్రక్రియ యొక్క పెట్టుబడిదారీ స్వభావ పునరుత్పత్తి వుందన్న మాట. మనం క్రింది చలామణి సూత్రీకరణను విశ్లేషణ చేయవలసి వుందనేది స్పష్టమే :

స' – { డ–స....      ఉపె....స'
       { ధ–అస

కాగా వినియోగం తప్పనిసరిగా ఇందులో ఒక పాత్ర నిర్వర్తిస్తుంది. ఎందుచేతనంటే ప్రారంభ స్థానమైన స' = స+అస లో అనగా సరుకు – పెట్టుబడి విలువలో స్థిర పెట్టుబడి విలువ, అస్థిర పెట్టుబడి విలువతో పాటు అదనపు విలువ కూడా వుంటుంది; కాబట్టి దాని చలనంలో వ్యక్తిగత వినియోగమూ, ఉత్పాదక వినియోగమూ రెండూ వుంటాయి.

డ–స.... ఉపె....డ'–స' అనే ఆవృత్తిలోనూ, ఉపె....స'–డ'–స....ఉపె ఆవృత్తిలోనూ పెట్టుబడి యొక్క చలనం ప్రారంభ స్థానంగానూ వుంటుంది, పరిసమాప్త స్థానంగానూ వుంటుంది. ఇందులో వినియోగం కూడా కలిసే వుంటుందని వేరే చెప్పనవసరం లేదు. ఎందుచేతనంటే, సరుకును, ఉత్పాదితాన్ని అమ్మక తప్పదు. ఒకసారి ఇది జరిగింది అనుకుంటే, ఆ తరువాత సరుకులు ఏమవుతాయి

1. రాతప్రతి - II

అన్నదానితో వ్యష్టి పెట్టుబడి చలనానికి ఏ విధంగానూ సంబంధం వుండదు. కాగా మరోవైపున, స'...స' చలనంలో సామాజిక పునరుత్పత్తికి అవసరమైన పరిస్థితులు స్పష్టంగా వున్నట్లు తెలుస్తుంది. ఈ మొత్తం ఉత్పాదితం, స' యొక్క విలువలోని ప్రతి భాగమూ ఏమయిందో నిరూపించాల్సిన ఆవశ్యకతే పై విషయాన్ని తెలుపుతున్నది. ఇక్కడ పునరుత్పత్తి యొక్క సంపూర్ణ ప్రక్రియలో అసలు పెట్టుబడి పునరుత్పత్తి ఎలా చేరివుంటుందో అలాగే చలామణి ప్రక్రియ ద్వారా జరిగే వినియోగ ప్రక్రియ కూడా వుంటుంది.

మన ప్రస్తుత పరిశీలనకు, స' లోని వేరు వేరు అంతర్భాగాల విలువ, వాటి పదార్థాలు ఎలా భర్తీ అవుతాయన్న దృక్కోణం నుంచి ఈ పునరుత్పత్తి ప్రక్రియను అధ్యయనం చేయాలి. వ్యష్టి పెట్టుబడి ఉత్పాదితం తాలూకు విలువ విశ్లేషణలో, ఈ క్రింది ఊహతో సంతృప్తిపడ్డాము : వ్యష్టి పెట్టుబడిదారు మొదట తన సరుకుల అమ్మకం ద్వారా తన పెట్టుబడి అంతర్భాగాలను డబ్బుగా మార్చుకొని, ఆ తరువాత సరుకుల మార్కెట్‌లో ఉత్పాదక అంశాలను తిరిగి కొనుగోలు చేయడం ద్వారా ఆ డబ్బును మళ్ళీ ఉత్పాదక పెట్టుబడిగా మార్చుతాడు అని ఊహించుకొన్నాము. ఈ ఉత్పాదక అంశాలు వస్తువుల రూపంలో వుండటమే కాక ఇవి సామాజిక పెట్టుబడిలోని ఒక భాగానికి ప్రాతినిధ్యం వహిస్తాయి; వీటికి మార్పిడి అయి, వాటికి తన స్థానమిచ్చి వైదొలగిన తయారీ విడి ఉత్పాదితం సామాజిక పెట్టుబడిలోని ఒక భాగానికి ప్రాతినిధ్యం వహించినట్లే, ఈ ఉత్పాదక అంశాలు కూడా ఒక భాగానికి ప్రాతినిధ్యం వహిస్తాయి. కాగా మరోవైపేమో, వేతనాల వినియోగం ద్వారా కార్మికుడు, అదనపు విలువను వాడుకోవడం ద్వారా పెట్టుబడిదారు వినియోగించిన సామాజిక సరుకు – ఉత్పాదిత భాగం తాలూకు చలనం అన్నది, సమస్త ఉత్పాదితం యొక్క చలనంలో అంతర్భాగంగా వుండటమే కాక, వ్యష్టి పెట్టుబడుల చలనాలతో సమ్మిళితమై వుంటుంది. అందుచేత కేవలం ఊహించడం ద్వారా ఈ ప్రక్రియను విశదీకరించలేము.

మనకు నేరుగా ఎదురయ్యే ప్రశ్న ఇది : ఉత్పత్తిలో వినియోగమైన పెట్టుబడి విలువ ఏ విధంగా వార్షిక ఉత్పాదితం నుంచి భర్తీ అవుతుంది? ఇలా భర్తీ అయ్యే క్రమం ఏ విధంగా పెట్టుబడిదారుల అదనపు విలువ వినియోగంతోనూ, కార్మికుల వేతనాల వినియోగంతోనూ పెనవేసు కొంటుంది? అప్పుడది మొదట, సామాన్య స్థాయిలోని పునరుత్పత్తి సమస్య. ఉత్పాదితాలు వాటి విలువల ప్రకారం మార్పిడి అవుతాయని, ఉత్పాదక పెట్టుబడి అంతర్భాగాల విలువల్లో ఎలాంటి మార్పు వుండదని కూడా ఊహించుకున్నాము. విలువలకు, ధరలకు మధ్య వ్యత్యాసం వుంటుందన్న వాస్తవం సామాజిక పెట్టుబడి చలనాలను ఏ విధంగానూ ప్రభావితం చేయదు. తాము పెట్టిన అడ్వాన్సులకు, తాము విడిగా ఉత్పత్తి చేసిన అదనపు విలువల పరిమాణాలు ఇక ఏమాత్రమూ అనుగుణంగా లేని విలువ – సంబంధాలలో వ్యష్టి పెట్టుబడిదారులు నిమగ్నమైన మాట వాస్తవమే, అయినప్పటికీ మొత్తం మీద ఉత్పాదితాల పరిమాణాల మార్పిడిలో ఎలాంటి మార్పూ వుండదు. ఇక విలువలో పెనుమార్పుల సంగతికి వస్తే, ఆ విలువలు కనుక సార్వత్రికంగానూ, సమానంగానూ పంపిణీ అయ్యే పక్షంలో అవి ఏ విధంగానూ మొత్తం వార్షిక ఉత్పాదితంలోని విలువ భాగాల మధ్య సంబంధాలను మార్చవు. అయితే అవి కనుక పాక్షికంగానూ, అసమంగానూ పంపిణీ అయినట్లయితే

అవి ఎగుడుదిగుడులను సూచిస్తాయి. మొదటిది – మార్పు చెందని విలువ – సంబంధాల నుంచి కాస్త వైదొలగడంగా పరిగణించడం ద్వారా మాత్రమే వీటిని అర్థం చేసుకోగలం; రెండవది – వార్షిక ఉత్పాదితం విలువలోని ఒక భాగం స్థిర పెట్టుబడిని, మరో భాగం అస్థిర పెట్టుబడిని భర్తీ చేస్తుందన్న నియమం నిరూపితమయిందంటే, స్థిర పెట్టుబడి విలువలో కానీ, అస్థిర పెట్టుబడి విలువలో కానీ మార్పు ఏ విధంగానూ ఈ నియమాన్ని మార్చదు. ఈ రెంటిలో ఏదో ఒకటిగా పనిచేసే విలువ భాగాల సాపేక్ష పరిమాణాలను మాత్రమే అది మార్పు చేస్తుంది. ఎందుచేతనంటే, ఆదిలో వున్న విలువల స్థానంలో వేరే విలువలు వచ్చి వుంటాయి.

మనం పెట్టుబడి విలువ ఉత్పత్తిని, పెట్టుబడి ఉత్పాదితం విలువను విడివిడిగా పరిశీలించినప్పుడు, ఉత్పత్తి అయిన సరుకులు రూపం ఏదైనా మన విశ్లేషణకు ఒకటే, ఆ విషయం మనం పట్టించుకోలేదు. ఉదాహరణకు అది యంత్రం కావచ్చు, ధాన్యం కావచ్చు, కళ్ళద్దాలు కావచ్చు. ఇది ఎల్లప్పుడూ ఒక ఉదాహరణగా మాత్రమే వుండేది. ఏ ఉత్పత్తి శాఖ అయినా ఈ ఉదాహరణ ప్రయోజనాన్ని నెరవేర్చగలిగింది. అయితే అప్పుడు మనం పరిశీలించిన అంశం, ఉత్పత్తి ప్రత్యక్ష ప్రక్రియ; ప్రతి స్థానంలో ఏదో ఒక వ్యష్టి పెట్టుబడి యొక్క ప్రక్రియగా వ్యక్తమయ్యే ఉత్పత్తి ప్రక్రియ అది. ఇక పెట్టుబడి పునరుత్పత్తికి సంబంధించినంత వరకూ, ఉత్పాదితంలో పెట్టుబడి – విలువకు ప్రాతినిధ్యం వహించే భాగం చలామణి రంగంలో ఉత్పత్తి అంశాలుగా తిరిగి మారి, ఆ విధంగా తన ఉత్పాదక పెట్టుబడి రూపానికి మారే అవకాశం కలిగి వుంటుందని ఊహించాము. అది చాలింది తమ వేతనాలను, అదనపు విలువను ఖర్చు పెట్టేందుకు కార్మికులకు, పెట్టుబడిదార్లకు మార్కెట్‌లో సరుకులు ఉంటాయని ఊహించినట్లే ఇది కూడా ఊహించాము. కాని మొత్తం సామాజిక పెట్టుబడినీ, దాని ఉత్పాదితాల విలువనూ అధ్యయనం చేయడానికి ఇక్కడ తెలిపిన లాంఛనప్రాయమైన వివరణ మాత్రమే చాలదు. ఉత్పాదితం విలువలోని ఒక భాగం తిరిగి పెట్టుబడిగా మార్పు చెందడమూ, మరొక భాగం పెట్టుబడిదారీ వర్గానికి, కార్మికవర్గానికి వ్యక్తిగత వినియోగ నిధిగా మార్పు చెందడమూ – ఇవి ఉత్పాదితం విలువ పరిధిలో ఒక చలనంగా వుంది. ఈ చలనంలో మొత్తం పెట్టుబడి ఫలితం వ్యక్తమవుతుంది; ఈ చలనం విలువను మాత్రమే కాక పదార్థాన్ని కూడా భర్తీ చేస్తుంది. కాబట్టి దీనికి మొత్తం సామాజిక ఉత్పాదితం యొక్క విలువ భాగాల మధ్య గల నిష్పత్తులతో సంబంధం వున్నట్లే, వాటి ఉపయోగపు విలువతోనూ, పాదార్థిక రూపంతోనూ కూడా సంబంధం వుంది.

సామాన్య[1] పునరుత్పత్తి, అంటే అదే స్థాయిలోని పునరుత్పత్తి ఊహాకల్పనగా కనిపిస్తుంది; ఎందుచేతనంటే ఒకవైపేమో పెట్టుబడిదారీ పరిస్థితులలో సంచయన రాహిత్యం లేక విస్తృత స్థాయి పునరుత్పత్తి రాహిత్యం అన్నది విడ్డూరమైన ఊహే; మరోవైపేమో ఉత్పత్తి పరిస్థితులు విభిన్న సంవత్సరాలలో ఒకేరకంగా వుండవు. (ఉంటాయని ఊహించాము) ఈ ఊహ అర్థం ఏమిటంటే, నిర్దిష్ట పరిమాణంలోని సామాజిక పెట్టుబడి గత సంవత్సరంలో లాగే ఈ సంవత్సరంలో కూడా అదే పరిమాణంలో సరుకుల – విలువ సృష్టిస్తుంది; అదే పరిమాణంలో అవసరాలకై సరఫరా చేస్తుంది; కాకపోతే పునరుత్పత్తి ప్రక్రియలో సరుకుల రూపం మారవచ్చు. ఐతే, సంచయనం జరిగిన మేరకు,

1. రాతప్రతి VIII నుంచి - ఫ్రెడరిక్ ఎంగెల్స్.

సామాన్య పునరుత్పత్తి ఎల్లప్పుడూ అందులో భాగంగా వుంటుంది; అందుచేత దానిని ప్రత్యేకంగా అధ్యయనం చేయవచ్చు; సంచయనంలో అది ఆచరణాత్మక అంశంగా వుంటుంది. ఉపయోగపు విలువల పరిమాణంలో ఎలాంటి మార్పు లేనప్పటికీ, వార్షిక ఉత్పాదితం విలువ తరిగిపోవచ్చు; లేదా ఉపయోగపు విలువల పరిమాణం తరిగినప్పటికీ, వార్షిక ఉత్పాదితం విలువ యధాతథంగా ఉండవచ్చు; లేదా విలువ పరిమాణమూ, పునరుత్పత్తి అయిన ఉపయోగపు విలువల పరిమాణమూ ఒకే సమయంలో తరిగిపోవచ్చు. దీన్నిబట్టి బోధపడుతున్నదేమిటంటే, పునరుత్పత్తి, మునుపటి కంటే ఎక్కువ అనుకూల పరిస్థితులలోనయినా సంభవిస్తుంది లేదా మునుపటి కంటే కష్టతరమయిన పరిస్థితులలోనయినా సంభవిస్తుంది; కష్టతరమయిన పరిస్థితులున్నప్పుడు అసమగ్రమైన, లోపపూరితమైన పునరుత్పత్తి జరుగుతుంది. ఇదంతా పునరుత్పత్తికి సంబంధించిన వివిధ అంశాల పరిమాణాత్మక పార్శ్వాన్ని మాత్రమే ప్రభావితం చేస్తుంది తప్ప ఆ పదార్థాలు మొత్తం ప్రక్రియలో పునరుత్పాదక పెట్టుబడిగా కానీ, లేక పునరుత్పత్తి అయిన ఆదాయంగా కానీ నిర్వర్తించే పాత్రను ఏ విధంగానూ ప్రభావితం చేయదన్న మాట.

## II. సామాజిక ఉత్పత్తిలోని రెండు శాఖలు[1]

సమాజం యొక్క మొత్తం ఉత్పాదితాన్ని అంటే మొత్తం ఉత్పత్తిని రెండు ప్రధాన శాఖలుగా విభజించవచ్చు :

**I.** **ఉత్పత్తి సాధనాలు :** ఉత్పాదక వినియోగంలోకి ప్రవేశించి తీరవలసిన లేదా కనీసం ప్రవేశించ వీలున్న రూపం గల సరుకులు.

**II.** **వినియోగ వస్తువులు :** పెట్టుబడిదారీ వర్గ, కార్మిక వర్గ వ్యక్తిగత వినియోగంలోకి ప్రవేశించే రూపంలోని సరుకులు.

ఈ రెండు శాఖలలో ప్రతిదానికి సంబంధించిన వివిధ ఉత్పత్తి విభాగాలన్ని ఒకే ఒక పెద్ద ఉత్పత్తి శాఖగా రూపొందుతాయి. అందులో ఒక శాఖలోనివి ఉత్పత్తి సాధనాలు కాగా, మరో శాఖలోనివి వినియోగ వస్తువులు. ఉత్పత్తికి చెందిన ఈ రెండు శాఖల్లోని ప్రతిదానిలో నియుక్తమైన సగటు పెట్టుబడి, సామాజిక పెట్టుబడిలో ఒక ప్రత్యేక, పెద్ద పెట్టుబడి శాఖగా వుంటుంది.

ప్రతి శాఖలోనూ, పెట్టుబడి రెండు భాగాలుగా వుంటుంది.

**1)** **అస్థిర పెట్టుబడి :** ఈ పెట్టుబడి, దీని విలువకు సంబంధించినంతవరకూ ఈ ఉత్పత్తి శాఖలో నియుక్తమైన సామాజిక శ్రమశక్తి విలువకు సమానంగా వుంటుంది; అంటే ఈ శ్రమశక్తికి చెల్లించబడిన వేతనాల మొత్తానికి సమానంగా వుంటుంది. కాగా దీని పాదార్థిక రూపానికి సంబంధించినంత వరకూ, ఇది క్రియాశీలమైన శ్రమశక్తిగా వుంటుంది; అంటే, ఈ పెట్టుబడి విలువచే చలనంలో వుంచబడిన సజీవ శ్రమగా వుంటుంది.

**2)** **స్థిర పెట్టుబడి :** ఈ శాఖలో ఉత్పాదక ప్రయోజనాల కోసం నియుక్తమైన సమస్త ఉత్పత్తి సాధనాల విలువ ఇది. ఈ ఉత్పత్తి సాధనాలు తిరిగి నిశ్చల పెట్టుబడిగానూ (యంత్రాలు, శ్రమ

---

1. ప్రధానంగా రాతప్రతి II నుంచి, రాతప్రతి VIII లోని పథకాల నుంచి - **ఎంగెల్స్**.

పరికరాలు, భవనాలు, (శ్రమించే పశుగణం వగైరా) చలామణిలో వుండే స్థిర పెట్టుబడిగానూ (ముడిపదార్థాలు, అనుబంధ పదార్థాలు, సగం తయారీ ఉత్పాదితాలు వగైరా) విభజింపబడతాయి.

ఈ పెట్టుబడి సహాయంతో, రెండు శాఖల్లోనూ సృష్టింపబడిన సమస్త వార్షిక ఉత్పాదితం విలువలో రెండు భాగాలుంటాయి. 1) ఉత్పత్తి ప్రక్రియలో వినియోగింపబడిన స్థిర పెట్టుబడి, స్థి.పెకి ప్రాతినిధ్యం వహించే భాగం. దాని విలువ మేరకు ఉత్పాదితంలోకి మాత్రమే బదలాయించబడిన భాగం ఇది. 2) సంవత్సరంలోని యావత్ శ్రమచే అదనంగా చేర్చబడిన భాగం. ఈ రెండో భాగం తిరిగి రెండు భాగాలుగా విభజింపబడుతుంది. ఒకటి – అడ్వాన్సు చేయబడిన అస్థిర పెట్టుబడి, అ.పె ను భర్తీ చేసేది. రెండు – దానికి మించి వున్న అదనపు విలువ, అ.వి. ప్రతి విడివిడి సరుకు విలువలోలాగే, ప్రతి శాఖలోని సమస్త వార్షిక ఉత్పాదితంలోనూ స్థి.పె+అ.వి వుంటాయి.

ఉత్పత్తిలో వినియోగం అయిన స్థిర పెట్టుబడికి ప్రాతినిధ్యం వహించే విలువలోని స్థి.పె భాగం, ఉత్పత్తిలో నియుక్తమైన స్థిర పెట్టుబడి యొక్క విలువా, రెండూ ఒకటే కావు. ఉత్పత్తి పదార్థాలు పూర్తిగా వినియోగింపబడి, వాటి విలువలు సంపూర్ణంగా ఉత్పాదితంలోకి బదలాయించబడిన మాట వాస్తవమే. అయితే నియుక్తమైన నిశ్చల పెట్టుబడిలోని ఒక భాగం మాత్రమే పూర్తిగా వినియోగింపబడి, ఆ విధంగా దాని విలువ ఉత్పాదితంలోకి బదలాయించబడింది. యంత్రాలు, భవనాలు లాంటి నిశ్చల పెట్టుబడిలోని మరోభాగం మునుపటిలాగే అలాగే వుండి పని చేయడం కొనసాగిస్తున్నది; కాకపోతే సాలీనా సంభవించే అరుగుదల మేరకు దాని విలువ తగ్గుతుంది. ఉత్పాదితం విలువను పరిశీలించే సందర్భంగా, నిశ్చల పెట్టుబడిలో అంటిపెట్టుకొన్న ఈ భాగం లేనట్లే. నూతనంగా ఉత్పత్తి అయిన ఈ సరుకు – విలువతో నిమిత్తం లేకుండా దాని సరసనే వుండే పెట్టుబడి – విలువ భాగం ఇది. వ్యష్టి పెట్టుబడి ఉత్పాదితం విలువను విశ్లేషించిన సందర్భంగా ఈ విషయం ఇంతకు మునుపే నిరూపించాము. (పెట్టుబడి, సం. I, అధ్యాయం–VI) అయితే ఆ సందర్భంగా వినియోగించుకున్న విశ్లేషణా పద్ధతిని ప్రస్తుతానికి వదిలేయాలి. నిశ్చల పెట్టుబడి నుంచి అరుగుదల ద్వారా విడిపోయిన విలువ, ఆ సమయంలో సృష్టి అయిన ఉత్పాదితానికి బదలాయించబడిందని వ్యష్టి పెట్టుబడి ఉత్పాదితం తాలూకు విలువను అధ్యయనం చేసిన సందర్భంగా మనం గమనించాం; ఈ కాలంలో ఇలా బదలాయించబడిన విలువ నుంచి ఈ నిశ్చల పెట్టుబడికి చెందిన ఏ ఒక్క భాగమైనా వస్తురూపంలో భర్తీ అయిందా లేదా అనే విషయంతో దీనికి సంబంధమే లేదు. మొత్తం సామాజిక ఉత్పాదితాన్ని అధ్యయనం చేసే ప్రస్తుత సందర్భంగా, సంవత్సర కాలంలో నిశ్చల పెట్టుబడి స్థానం కొత్తదానితో భర్తీ కానట్లయితే, కనీసం ప్రస్తుతానికి నిశ్చల పెట్టుబడి నుంచి అరుగుదల ద్వారా వార్షిక ఉత్పాదితంలోకి బదలాయించబడిన విలువ భాగాన్ని లెక్కలోకి తీసుకోకుండా వదలివేయక తప్పదు. ఈ అధ్యాయంలోని తరువాతి ఒక భాగంలో ఈ అంశం గురించి ప్రత్యేకంగా చర్చిద్దాం.

★ ★ ★

మనం సామాన్య పునరుత్పత్తిని అధ్యయనం చేయడానికి ఈ క్రింది పథకాన్ని ప్రాతిపదికగా తీసుకొంటున్నాం. ఇందులో స్థి.పె అంటే స్థిర పెట్టుబడి, అ.పె అంటే అస్థిర పెట్టుబడి, అ.వి అంటే

అదనపు విలువ. అదనపు విలువ రేటు, $\frac{\text{అ.వి}}{\text{అ.పె}}$ ని నూరు శాతంగా తీసుకుందాం. అంకెలు మార్కుల మిలియన్లు కావచ్చు, ఫ్రాంక్‌ల మిలియన్లు కావచ్చు, లేదా పౌండ్ల స్టెర్లింగ్ మిలియన్లు కావచ్చు.

**I. ఉత్పత్తి సాధనాల ఉత్పత్తి :**

పెట్టుబడి........... 4,000 స్థి.పె + 1,000 అ.పె = 5,000

పెట్టుబడి–ఉత్పాదితం.... 4,000 స్థి.పె + 1,000 అ.పె+1,000 అ.వి = 6,000

ఉత్పత్తి సాధనాల రూపంలో వుంటుంది.

**II. వినియోగ వస్తువుల ఉత్పత్తి :**

పెట్టుబడి...... 2,000 స్థి.పె + 500 అ.పె = 2,500

సరుకు–ఉత్పాదితం...2,000 స్థి.పె + 500 అ.పె + 500 అ.వి = 3,000

వినియోగ వస్తువుల రూపంలో వుంటుంది.

సారాంశం : మొత్తం వార్షిక సరుకు – ఉత్పాదితం ఇలా వుంటుంది :

I. 4,000 స్థి.పె + 1,000 అ.పె + 1,000 అ.వి = 6,000 ఉత్పత్తి సాధనాలు

II. 2,000 స్థి.పె + 500 అ.పె + 500 అ.వి = 3,000 వినియోగ వస్తువులు.

మన ఊహ ప్రకారం తన సహజ రూపంలో వుండే నిశ్చల పెట్టుబడిని మినహాయిస్తే, మొత్తం విలువ 9,000.

మొత్తం అదనపు విలువ అనుత్పాదకంగా వినియోగింపబడినట్టి సామాన్య పునరుత్పత్తి ఆధారంగా అవసరమైన రూపాంతరీకరణలను మనమిప్పుడు పరిశీలించవలసి వున్నట్లయితే (ఆ రూపాంతరీకరణలకు దారితీసే డబ్బు – చలామణిని ప్రస్తుతానికి వదలివేస్తున్నాం), మనకు ప్రారంభంలో మూడు ముఖ్యమైన ఆధారాలు లభిస్తాయి.

1) రెండవ శాఖలో కార్మికుదు వేతనాలకు ప్రాతినిధ్యం వహించే 500 అ.పె, పెట్టుబడిదారుల తాలూకు 500 అ.వి – ఇవి రెండూ వినియోగ వస్తువుల కోసం ఖర్చు కావలసి వుంది. అయితే వాటి విలువ రెండవ శాఖలోని పెట్టుబడిదారుల స్వాధీనంలో గల, 1,000కి సమానమైన వినియోగ వస్తువుల రూపంలో వుంది. ఇది అడ్వాన్సు చేయబడిన 500 అ.పె ని భర్తీ చేస్తుంది, 500 అ.వి కి ప్రాతినిధ్యం వహిస్తుంది. అందువల్ల, అవి రెండవ శాఖకు చెందిన వేతనాలు, అదనపు విలువ రెండూ కూడా అదే శాఖకు చెందిన ఉత్పాదితాలకు మార్పిడి అవుతాయి. అందుచేత (500 అ.పె + 500 అ.వి) II = 1,000 మేరకు వినియోగ వస్తువులు, మొత్తం ఉత్పాదితం నుంచి విడిపోతాయి.

2) ఇదే విధంగా మొదటి శాఖకు చెందిన 1,000 అ.పె ని 1,000 అ.వి కూడా వినియోగ వస్తువుల కోసం ఖర్చు కావలసి వుంటుంది; ఇంకో విధంగా చెప్పాలంటే రెండవ శాఖలోని ఉత్పాదితాలకై అవి ఖర్చు కావలసి వుంటుంది. అందుచేత, స్థిర పెట్టుబడి భాగమైన 2,000 స్థి.పెకి సమంగా వుండే ఈ ఉత్పాదిత శేషభాగంతో అ.వి మార్పిడి కావలసి వుంది. ఇందుకు ప్రతిగా రెండవ శాఖకు, ఒకటో శాఖ నుంచి అంతే పరిమాణం గల ఉత్పత్తి సాధనాలు అందుతాయి. ఒకటవ శాఖలోని వీటిలో 1,000 అ.పె + 1,000 అ.వి యొక్క విలువ నిక్షిప్తమై వుంది. కాబట్టి 2,000 II స్థి.పె, (1,000 అ.పె + 1,000 అ.వి) I ఈ లెక్కాచారం నుంచి తప్పుకొంటాయి.

3) ఇప్పటికీ, 4,000 I స్థి.పె మిగిలే వుంది. ఇది ఉత్పత్తి సాధనాల రూపంలో వుంది; ఇది ఒకటవ శాఖలో వినియోగమయిన స్థిర పెట్టుబడిని భర్తీ చేయడానికి, ఆ శాఖలో మాత్రమే వినియోగించ వీలుంది. కాబట్టి ఒకటో శాఖలోని వ్యష్టి పెట్టుబడిదారుల మధ్య పరస్పర మార్పిడి ద్వారా ఇవి ఖర్చవుతాయి; రెండవ శాఖలో కార్మికులకు, పెట్టుబడిదారులకు మధ్య, లేక వ్యష్టి పెట్టుబడిదారుల మధ్య (500 అ.పె + 500 అ.వి) II మార్పిడి అయినట్లే అది కూడానూ.

రాబోయే విషయాలను అవగాహన చేసుకునేందుకు పై వివరణ ఉపయోగపడుతుంది.

## III. రెండు శాఖల మధ్య మార్పిడి

### I (అ.పె + అ.వి)కి బదులుగా II స్థి.పె[1]

రెండు వర్గాల మధ్య పెద్ద మార్పిడితో మన పరిశీలన ప్రారంభిద్దాం. తమ ఉత్పత్తిదారుల చేతుల్లో ఉత్పత్తి సాధనాల రూపంలో తమ సహజసిద్ధమైన రూపంలో వున్న (1,000 అ.పె+ 1,000 అ.వి) I విలువలు, 2,000 II స్థి.పెతో మార్పిడి అవుతాయి. రెండవ శాఖలోని 2,000 II స్థి.పె విలువలు వినియోగ వస్తువుల రూపంలో, అంటే పాదార్థిక రూపంలో వుంటాయి. రెండవ శాఖకు చెందిన పెట్టుబడిదారీ వర్గం తద్వారా వినియోగ వస్తువుల రూపంలో వున్న 2,000 స్థిర పెట్టుబడిని, వినియోగ వస్తువులను సృష్టించే ఉత్పత్తి సాధనాలుగా మార్చుకుంటుంది; అంటే మరోసారి శ్రమ ప్రక్రియ కారకంగానూ, విలువ స్వయం విస్తరణ కోసం స్థిర పెట్టుబడి విలువగానూ పనిచేయగలిగే రూపంలోకి మార్చుకుంటుందన్న మాట. కాగా మరోవైపు, ఒకటవ శాఖలోని (1,000 అ.పె) శ్రమశక్తికి తుల్యమైన భాగమూ, అదే శాఖలోని పెట్టుబడిదారుల అదనపు విలువ (1,000 అ.వి), ఈ రెండూ వినియోగ వస్తువుల రూపంలో చేతికందుతాయి; ఆ రెండూ తమ ఉత్పత్తి సాధనాల పాదార్థిక రూపం నుంచి ఆదాయంగా వినియోగం కాగల పాదార్థిక రూపంలోకి మారతాయి.

డబ్బు చలామణి ద్వారా ఈ పరస్పర మార్పిడి జరుగుతుంది. పరస్పర మార్పిడికి తోడ్పడేదీ ఇదే; ఆ ప్రక్రియను అవగాహన చేసుకోవడంలో అడ్డుపడేదీ ఇదే. కాని డబ్బు చలామణికి నిర్ణాయక ప్రాముఖ్యం వుంది. ఎందుచేతనంటే, డబ్బు రూపంలో నుంచి శ్రమశక్తి రూపంలోకి మారే డబ్బు పెట్టుబడిగా, పెట్టుబడిలోని అస్థిర భాగం ఎల్లప్పుడూ డబ్బు రూపాన్ని తిరిగి ధరించక తప్పదు. మొత్తం సమాజంలో ఒకే సమయంలో పక్కపక్కనే కొనసాగే సమస్త ఉత్పత్తి రంగాల్లోనూ, అవి ఒకటవ శాఖకు చెందినవా, లేక రెండవ శాఖకు చెందినవా అన్నదానితో నిమిత్తం లేకుండా, అస్థిర పెట్టుబడిని డబ్బు రూపంలోనే అడ్వాన్సు చేయవలసి వుంది; శ్రమశక్తి ఉత్పత్తి ప్రక్రియలోకి ప్రవేశించక మునుపే పెట్టుబడిదారు శ్రమశక్తిని కొనుగోలు చేస్తాడు. అయితే ఉపయోగపు విలువల ఉత్పత్తిలో అవి వ్యయమైన తర్వాతనే నిర్ణీత వ్యవధుల్లో ఆ శ్రమశక్తికి చెల్లిస్తాడు. ఉత్పాదితం విలువలోని శేషభాగంతో పాటు, శ్రమశక్తి చెల్లింపు కోసం ఖర్చైన డబ్బుకు సమమైన విలువ భాగం, అంటే అస్థిర పెట్టుబడికి ప్రాతినిధ్యం వహించే విలువ భాగం కూడా పెట్టుబడిదారుకే చెందుతుంది. విలువలోని ఈ భాగంలో, శ్రామికుడు తన వేతనాలకు తుల్యమైనదాన్ని ఇదివరకే పెట్టుబడిదారుకు సరఫరా చేసి

1. రాతప్రతి VIII నుంచి - ఎంగెల్స్.

వున్నాడు. అయితే పెట్టుబడిదారుకు అతని అస్థిర పెట్టుబడిని డబ్బు పెట్టుబడి రూపంలో పునరుద్ధరింప చేసేది, డబ్బుగా సరుకుల పునఃపరివర్తనే లేక సరుకుల అమ్మకమే. పెట్టుబడిదారు శ్రమశక్తి కొనుగోలు కోసం మరోసారి ఆ డబ్బు పెట్టుబడిని అడ్వాన్సు చేసుకోవచ్చు.

పోతే I వ శాఖలో సమష్టి పెట్టుబడిదారు 1,000 అ.పె కి సమంగా వున్న 1,000 పౌండ్లను కార్మికులకు చెల్లించాడు; ఒకటో శాఖ ఉత్పాదితం విలువలోని అ.వి భాగానికి, అంటే కార్మికులు సృష్టించిన ఉత్పత్తి సాధనాల విలువలోని అ.వి భాగానికి చెల్లించాడన్న మాట. (ఇది డబ్బు రూపంలో వున్న విలువ అని సూచించడానికి మాత్రమే నేను పౌండ్లు అన్న పదం వాడాను.) కార్మికులు ఈ 1000 పౌండ్లతో రెండవ శాఖకు చెందిన పెట్టుబడిదార్ల నుంచి అదే విలువ గల వినియోగ వస్తువులు కొనుగోలు చేస్తారు; ఆ విధంగా వారు రెండవ శాఖకు చెందిన స్థిర పెట్టుబడిలో సగభాగాన్ని డబ్బుగా మార్చుతారు. కాగా రెండవ శాఖకు చెందిన పెట్టుబడిదార్లు తిరిగి ఈ 1,000 పౌండ్లతో మొదటి శాఖకు చెందిన పెట్టుబడిదార్ల నుంచి 1,000 పౌండ్ల విలువ చేసే ఉత్పత్తి సాధనాలను కొనుగోలు చేస్తారు. పర్యవసానంగా 1,000 అ.పె కి సమంగా వుండే అస్థిర పెట్టుబడి విలువ, అంటే ఉత్పత్తి సాధనాల రూపంలో వుండే తమ ఉత్పాదిత భాగం ఈ విధంగా తిరిగి డబ్బుగా రూపాంతరం చెందుతుంది; ఈ డబ్బు ఇప్పుడు కొత్తగా I వ శాఖ పెట్టుబడిదారుల చేతుల్లో డబ్బు – పెట్టుబడిగా తన విధిని నిర్వహించగలదు. ఇది ఇప్పుడు శ్రమశక్తిగా, అంటే ఉత్పాదక పెట్టుబడిలోని అతి ముఖ్య భాగంగా రూపాంతరం చెందుతుందన్నమాట. ఈ విధంగా పెట్టుబడిదారుల సరుకు – పెట్టుబడిలోని కొంత భాగం తిరిగి డబ్బు రూపంలో చేతికందిన ఫలితంగా, వారి అస్థిర పెట్టుబడి డబ్బు రూపంలో తిరిగి వారివద్దకే వస్తుంది.

ఇక II వ శాఖకు చెందిన స్థిర పెట్టుబడిలోని రెండో అర్ధభాగంతో I వ శాఖ తాలూకు సరుకు – పెట్టుబడిలోని అ.వి భాగం మార్పిడి చేయడానికి అవసరమైన డబ్బు విషయానికి వస్తే, ఈ డబ్బును వివిధ రూపాల్లో అడ్వాన్సు చేయవచ్చు. వాస్తవానికి ఈ చలామణిలో రెండు శాఖలకు చెందిన వ్యష్టి పెట్టుబడిదారుల అసంఖ్యాకమైన విడివిడి కొనుగోళ్ళు, అమ్మకాలు వుంటాయి; ఎలాంటి పరిస్థితుల్లోనయినా డబ్బు ఈ పెట్టుబడిదారుల నుంచి రావలసిందే; ఎందుచేతనంటే కార్మికులు చలామణిలో పెట్టే డబ్బు గురించి ఇంతకు ముందే వివరించాం. II వ శాఖకు చెందిన ఒక పెట్టుబడిదారు ఉత్పాదక పెట్టుబడికి తోడుగా తనకు గల డబ్బు – పెట్టుబడితో I వ శాఖకు చెందిన పెట్టుబడిదార్ల నుంచి ఉత్పత్తి సాధనాలను కొనుగోలు చేయవచ్చు; ఇటువైపు I వ శాఖకు చెందిన ఒక పెట్టుబడిదారు పెట్టుబడి మదుపు కోసం కాక వ్యక్తిగత వ్యయం కోసం కేటాయించుకొన్న డబ్బు – నిధులతో రెండవ శాఖ పెట్టుబడిదార్ల నుంచి వినియోగ వస్తువులు కొనుగోలు చేయవచ్చు. ఈ గ్రంథం I వ, II వ భాగాలలో మనం నిరూపించినట్లుగా, పెట్టుబడిదారుల చేతుల్లో ఉత్పాదక పెట్టుబడితో పాటు పెట్టుబడిని అడ్వాన్సు చేయడానికి కానీ, లేక ఆదాయంగా ఖర్చుపెట్టడానికి కానీ ఉపయోగించేందుకు కొంత డబ్బు సరఫరా ఎల్లప్పుడూ వుండి తీరుతుందని ఊహించుకోవాలి. రెండవ శాఖ పెట్టుబడిదార్లు తమ స్థిర పెట్టుబడిని భర్తీ చేసుకొనేందుకు సగం డబ్బును ఉత్పత్తి సాధనాల కొనుగోలు నిమిత్తం అడ్వాన్సు చేస్తారని, మిగతా సగం భాగాన్ని I వ శాఖ పెట్టుబడిదార్లు వినియోగ వస్తువులకోసం

ఖర్చు పెడతారని అనుకుందాం. (ఇక్కడ నిష్పత్తులు చర్చనీయాంశానికి ముఖ్యం కాదు.) అప్పుడు, ఒకటవ శాఖ నుంచి ఉత్పత్తి సాధనాలను కొనుగోలు చేసేందుకు రెండవ శాఖ 500 పౌండ్లను అడ్వాన్సు చేస్తుంది; తద్వారా అది తన స్థిర పెట్టుబడిలోని నాలుగింట మూడు వంతులను వస్తు రూపంలో భర్తీ చేస్తుంది. (ఒకటవ శాఖ కార్మికుల నుంచి వచ్చిన 1,000 పౌండ్లతో సహా.) కాగా ఈ విధంగా లభించిన 500 పౌండ్లతో ఒకటవ శాఖ, రెండవ శాఖ నుంచి వినియోగ వస్తువులు కొనుగోలు చేస్తుంది. తద్వారా, దాని సరుకు – పెట్టుబడిలోని అ.వి భాగంలో సగం మొత్తం తాలూకు చలామణి, స–డ–స పూర్తి అవుతుంది. ఆ విధంగా దాని ఉత్పాదితం వినియోగ నిధి నుంచి డబ్బుగా చేతికందుతుంది. ఈ రెండవ ప్రక్రియ ద్వారా రెండవ శాఖ పెట్టుబడిదారుల చేతుల్లోకి 500 పౌండ్లు డబ్బు పెట్టుబడిగా తిరిగి వస్తుంది; ఇది ఉత్పాదక పెట్టుబడితో పాటు వారి వద్ద వుంటుంది. కాగా ఒకటవ శాఖ పెట్టుబడిదార్లు రెండవ శాఖ వినియోగ వస్తువులను కొనుగోలు చేసేందుకు 500 పౌండ్ల డబ్బును ఖర్చు పెడతారు; వారి వద్ద సరుకు – పెట్టుబడిలోని అ.వి భాగంలో సగం ఉత్పాదితంగా ఇంకా నిల్వలో వుంది. ఇది అమ్మకమవుతుందనే అంచనాతో, వారా డబ్బు ఖర్చు చేస్తారు. పోతే రెండవ శాఖ ఆ 500 పౌండ్లతోనే ఒకటవ శాఖ నుంచి ఉత్పత్తి సాధనాలు కొనుగోలు చేస్తుంది. తద్వారా తన సమస్త స్థిర పెట్టుబడిని (1,000+500+500 = 2000) వస్తు రూపంలో భర్తీ చేసుకొంటుంది. కాగా; ఒకటవ శాఖకు, దాని సమస్త అదనపు విలువ వినియోగ వస్తువులుగా అందుతుంది. మొత్తం మీద, 4,000 పౌండ్ల సరుకు అంతా 2,000 పౌండ్ల డబ్బు చలామణితో మార్పిడి జరుగుతుంది. పెద్ద మొత్తాలలో సమస్త వార్షిక ఉత్పాదితం మార్పిడి చేయబడినట్లుగా చెప్పాము కాబట్టి, డబ్బు చలామణి మొత్తం 2,000 పౌండ్ల వరకూ వుంది. ఇక్కడ గమనించాల్సిన ముఖ్యమైన విషయం ఇది : రెండవ శాఖ, వినియోగ వస్తువుల రూపంలో పునరుత్పత్తి చేసిన తన స్థిర పెట్టుబడిని ఉత్పత్తి సాధనాల రూపంలోకి తిరిగి మార్చుకోవటమే కాక, ఉత్పత్తి సాధనాల కొనుగోలు కోసం తాను చలామణిలోకి అడ్వాన్సు చేసిన 500 పౌండ్లను కూడా తిరిగి వస్తువులు చేసుకుంది; ఇదే విధంగా మొదటి శాఖ కూడా ఉత్పత్తి సాధనాల రూపంలో పునరుత్పత్తి చేసినట్టి అస్థిర పెట్టుబడి మళ్ళీ డబ్బు రూపంలో దాని చేతిలో వుంది. అది మళ్ళీ శ్రమశక్తిగా మారగల డబ్బు పెట్టుబడి. ఇదే కాకుండా అంటే తన పెట్టుబడిలోని అ.వి భాగం అమ్ముడవుతుందన్న అంచనాతో, వినియోగ వస్తువుల కొనుగోలు నిమిత్తం తాను వ్యయం చేసిన 500 పౌండ్లు కూడా, I వ శాఖ చేతిలోకి వచ్చిందన్నమాట. ఈ మొత్తం దానికి తిరిగి రావడానికి కారణం అది అంతకు ముందే ఆ 500 పౌండ్లు వ్యయం చేసి వుండటం కాదు; దాని అదనపు విలువలో సగం నిక్షిప్తమై వున్న సరుకు ఉత్పాదిత భాగం ఆ తరువాత అమ్ముడవుతుంది కాబట్టే 500 పౌండ్లు తిరిగి వస్తాయి.

ఈ రెండు సందర్భాల్లోనూ, రెండవ శాఖకు చెందిన స్థిర పెట్టుబడి, ఉత్పాదిత రూపం నుంచి ఉత్పత్తి సాధనాల పాదార్థిక రూపంలోకి తిరిగి మార్చబడుతుంది; ఆ రూపంలో మాత్రమే అది పెట్టుబడిగా తన విధిని నిర్వర్తించగలదు. అదే విధంగా, ఒకటవ శాఖ పెట్టుబడిలోని అస్థిర భాగం డబ్బు రూపంలోకి మారటంతో పాటు, ఒకటవ శాఖకు చెందిన ఉత్పత్తి సాధనాల్లోని అదనపు విలువ భాగం కూడా వినియోగార్హమైన రూపంలోకి మారుతుంది; ఆ రూపంలోనే దానిని ఆదాయంగా

ఉపయోగించుకొనడం సాధ్యం. ఇంతేకాక II వ శాఖ తన స్థిర పెట్టుబడిలో ఉత్పత్తి సాధనాల విలువకు సమంగా వుండే తన ఉత్పాదితం భాగాన్ని అమ్మడానికి ముందు, ఉత్పత్తి సాధనాల కొనుగోలు కోసం అడ్వాన్సు చేసిన 500 పౌండ్ల డబ్బు – పెట్టుబడి కూడా రెండవ శాఖకు తిరిగి వస్తుంది. (ఆ ఉత్పాదితం వినియోగ సాధనాల రూపంలో వుంటుంది) అంతేకాక, ఒకటవ శాఖ భవిష్యత్తులో తన సరుకును అమ్ముకోగలనన్న అంచనాతో ప్రస్తుతం వినియోగ వస్తువుల కొనుగోలుకై వ్యయం చేసిన 500 పౌండ్లు తిరిగి అదే శాఖకు చేరుకుంటుంది. రెండవ శాఖ తన సరుకు – ఉత్పాదితం తాలూకు స్థిర భాగం ఖాతామీదనూ, ఒకటో శాఖ తన సరుకు – ఉత్పాదితం తాలూకు అదనపు విలువ భాగం ఖాతామీదనూ అడ్వాన్సు చేసిన డబ్బు తిరిగి ఆ శాఖలకు చేరుకుంటున్నదంటే, అందుకు ఏకైక కారణం ఇది : రెండవ శాఖలో సరుకుల రూపంలో గల స్థిర పెట్టుబడికి అదనంగా ఒక వర్గం పెట్టుబడిదార్లు 500 పౌండ్లను చలామణికి పంపిస్తున్నారు. అదే విధంగా ఒకటవ శాఖలో సరుకుల రూపంలో గల అదనపు విలువకు మించి మరో వర్గం పెట్టుబడిదార్లు అంతే మొత్తాన్ని చలామణిలోకి పంపిస్తున్నారు. అంతిమ విశ్లేషణలో తేలేదేమంటే, రెండు శాఖలు కూడా తమ సరుకుల రూపంలో సమతుల్య విలువలను మార్పిడి చేసుకోవడం ద్వారా పరస్పరం పూర్తిగా చెల్లించుకున్నాయి. ఆ శాఖలు తమ సరుకులను మార్పిడి చేసుకునే సాధనంగా, తమ సరుకుల విలువలకు మించి అదనంగా చలామణిలోకి పంపిన డబ్బు ఆయా శాఖలకు చలామణి నుంచి తిరిగి చేరుకుంటుంది; ఆ శాఖలు చలామణిలోకి పంపిన వాటాలకు అనుగుణమైన దామాషాలో ఆ డబ్బు వాపస్ వస్తుంది. ఈ చర్యల వల్ల ఏ ఒక్క శాఖకూ అంతకు మించి ఒక పెన్నీ కూడా రాలేదు. II వ శాఖ వద్ద వినియోగ సరుకుల రూపంలో 2,000 స్థిర పెట్టుబడీ, 500 డబ్బు ఉంది. ఇప్పుడు ఉత్పత్తి సాధనాల రూపంలో 2,000 డబ్బు రూపంలో 500 ఉంది. అదే విధంగా ఒకటవ శాఖ వద్ద 1,000 అదనపు విలువతో పాటు (ఇప్పుడు దాని సరుకులైన ఉత్పత్తి సాధనాలు వినియోగ నిధిగా మారాయి.) మరో 500 డబ్బు కూడా వుంటుంది. దీన్నిబట్టి మొత్తంపై మన నిర్ధారణ ఇది : పారిశ్రామిక పెట్టుబడిదార్లు తమ సరుకు విలువలోని స్థిర భాగం ఖాతామీద గాని లేక సరుకుల రూపంలో, ఆదాయంగా వ్యయం కాగల అదనపు విలువ ఖాతామీద గానీ, తమ సరుకుల చలామణిని నిర్వహించడానికై చలామణిలోకి ఎంత డబ్బు పంపిస్తారో అంతే డబ్బు ఆయా పెట్టుబడిదారుల చేతుల్లోకి తిరిగి వస్తుంది.

ఇక ఒకటవ శాఖలోకి అస్థిర పెట్టుబడి డబ్బు రూపంలోకి తిరిగి మార్పు చెందే ప్రక్రియ సంగతి : ఈ శాఖ పెట్టుబడిదార్లు దాన్ని వేతనాల్లో మదుపు చేసిన తర్వాత ఆ పెట్టుబడి వారికి సరుకుల రూపంలో వుంటుంది; ఇవి కార్మికులు వారికి సృష్టించి ఇచ్చిన సరుకులు. పెట్టుబడిదారులు ఈ పెట్టుబడిని డబ్బు రూపంలో కార్మికులకు వారి శ్రమశక్తికి మూల్యంగా చెల్లించారు. డబ్బు రూపంలో ఖర్చు చేయబడిన అస్థిర పెట్టుబడికి సమంగా ఉన్నట్టి వారి సరుకు – ఉత్పాదితపు విలువ అంతర్భాగానికై పెట్టుబడిదార్లు ఆ మేరకు చెల్లించడం జరిగింది. ఆ కారణంగా సరుకు – ఉత్పాదితంలోని ఆ భాగానికి వారు సొంతదారులవుతారు. అయితే వారిచేత పనిలో నియమించబడిన కార్మికవర్గ భాగం, తాను సృష్టించిన ఉత్పత్తి సాధనాలను కొనుగోలు చేయదు. II వ శాఖ ఉత్పత్తి చేసిన వినియోగ సరుకులను కొంటుంది. అందుచేత ఒకటవ శాఖ పెట్టుబడిదారులు శ్రమశక్తి చెల్లింపు కోసం అడ్వాన్సు

చేసిన అస్థిర పెట్టుబడి నేరుగా వారి వద్దకు తిరిగి వెళ్ళదు. కార్మికులు చేసిన కొనుగోళ్ళ ద్వారా అది, కార్మికులకు అవసరమైనట్టి, వారు కొనగలిగినట్టి సరుకులను ఉత్పత్తి చేసే పెట్టుబడిదారుల చేతిలోకి పోతుంది. ఇంకో విధంగా చెప్పాలంటే, అది II వ శాఖ పెట్టుబడిదారుల చేతుల్లోకి పోతుంది. వీరు ఉత్పత్తి సాధనాల కోసం డబ్బు ఖర్చుపెడితే తప్ప, ఆ డబ్బు ఆవృత్తి మార్గంలో 1వ శాఖ పెట్టుబడిదారుల చేతుల్లోకి వెళ్ళదు.

దీన్నిబట్టి తేలుతున్నదేమిటంటే, సామాన్య పునరుత్పత్తి ప్రాతిపదికపై, I వ శాఖ సరుకు–పెట్టుబడి తాలూకు అ.పె + అ.వి విలువల మొత్తం (అందుచేత I వ శాఖ మొత్తం సరుకు – ఉత్పాదితంలోని తత్తుల్యమైన భాగం కూడా) స్థిర పెట్టుబడి II స్థి.పె కి సమానంగా వుంటుంది; ఇది కూడా రెండవ శాఖ మొత్తం సరుకు ఉత్పాదితంలో, తత్తుల్య భాగంగా తీసుకోబడిందే, లేక I (అ.పె+అ.వి) = II స్థి.పె.

## IV. IIవ శాఖలో అంతర్గత మార్పిడి

### జీవనావసర వస్తువులు, విలాస వస్తువులు

II వ శాఖ సరుకు – ఉత్పాదితం విలువకు సంబంధించి, అ.పె+అ.వి భాగాలను మనం ఇంకా అధ్యయనం చేయలేదు. అయితే ప్రస్తుతం మనం పరిశీలిస్తున్న అతి ముఖ్యమైన ప్రశ్నతో ఈ విశ్లేషణకు ఎలాంటి సంబంధమూ లేదు; ఆ ప్రశ్న ఏమిటంటే – ప్రతి వ్యష్టి పెట్టుబడిదారీ సరుకు ఉత్పాదితం విలువ స్థి.పె+అ.పె+అ.వి గా విభజన కావడం అన్నది (అది ఏ రూపాల్లో జరిగినా) ఏ మేరకు మొత్తం వార్షిక ఉత్పాదితం విలువకు కూడా వర్తిస్తుంది? ఒకవైపేమో II స్థి.పెకి I (అ.పె+అ.వి) మార్పిడి కావడంలోనూ; రెండోవైపేమో I వ శాఖ వార్షిక ఉత్పాదితంలోని I స్థి.పె పునరుత్పత్తిపై తర్వాత జరగబోయే పరిశీలనలోనూ ఈ ప్రశ్నకు సమాధానం లభిస్తుంది. II (అ.పె+అ.వి) అన్నది వినియోగ సరుకుల పాదార్థిక రూపంలో ఉన్నందువల్లనేమి, కార్మికుల శ్రమశక్తి చెల్లింపు కోసం అడ్వాన్సు చేయబడిన అస్థిర పెట్టుబడి సాధారణంగా వినియోగ సరుకుల కోసం వెచ్చించబడుతున్నందు వల్లనేమి, సరుకుల విలువలోని అ.వి భాగం, సామాన్య పునరుత్పత్తి సందర్భంగా, ఆచరణలో వినియోగ సరుకుల కోసం ఆదాయంగా వెచ్చించబడుతున్నందువల్లనేమి, చూచీ చూడగానే ఒక విషయం స్పష్టంగా కనిపిస్తుంది; II వ శాఖ పెట్టుబడిదార్ల నుంచి లభించిన వేతనాలలో ఆ శాఖ కార్మికులు తమ సొంత ఉత్పాదితంలోని ఒక భాగాన్ని తిరిగి తామే కొంటారు. ఇది, వేతనాలుగా పొందిన మొత్తం డబ్బు విలువకు తుల్యమైన భాగం. తద్వారా, రెండవ శాఖ పెట్టుబడిదారీ వర్గం శ్రమశక్తి చెల్లింపుకై తాను అడ్వాన్సు చేసిన డబ్బు – పెట్టుబడిని తిరిగి డబ్బు రూపంలోకి మార్చుకొంటుంది. ఇది పెట్టుబడిదారీ వర్గం కార్మికులకు కేవలం విలువ సంకేతాల్లో చెల్లించడమే. తాము ఉత్పత్తి చేసినట్టీ, అయితే పెట్టుబడిదారులకు చెందుతున్నట్టీ సరుకుల్లో ఒక భాగం కొనడం ద్వారా కార్మికులు ఈ విలువ సంకేతాలను వస్తురూపంలోకి మార్చగానే, ఆ సంకేతాలు పెట్టుబడిదారుల చేతుల్లోకి తిరిగి చేరుకుంటాయి. విశేషమేమిటంటే, ఈ సంకేతాలు విలువకు కేవలం ప్రాతినిధ్యం వహించడం కాదు. వాటిలో నిజంగా ఆ విలువ వుంది. అది బంగారం రూపంలో కావచ్చు, వెండి రూపంలో కావచ్చు. డబ్బు రూపంలో అడ్వాన్సు చేసిన అస్థిర పెట్టుబడి ఈ విధంగా వెనక్కు రావడం గురించి తరువాత మరింత వివరంగా విశ్లేషిద్దాం; కార్మికవర్గం కొనుగోలుదారుగానూ, పెట్టుబడిదారీ వర్గం

అమ్మకందారుగానూ కనిపించే ప్రక్రియ ద్వారా అది వెనక్కు వస్తుంది. అయితే ఇక్కడ పరిశీలించ వలసిన విషయం మరొకటి. అస్థిర పెట్టుబడి ఈ విధంగా బయల్దేరిన చోటికే తిరిగివచ్చే క్రమాన్ని విశ్లేషించే సందర్భంగా ఈ విషయాన్ని చర్చించాలి.

సరుకుల వార్షిక ఉత్పత్తికి సంబంధించిన II వ శాఖలో ఎన్నో రకాల ఉత్పత్తి విభాగాలున్నాయి. వీటి ఉత్పాదితాలను బట్టి వీటిని రెండు పెద్ద ఉప భాగాలుగా విభజింపవచ్చు.

**(అ) వినియోగ వస్తువులు :** ఇవి కార్మికవర్గ వినియోగ పరిధిలోకి ప్రవేశిస్తాయి. ఆ మేరకు అవి జీవితావసరాలు. అయితే కార్మికులు ఉపయోగించే వస్తువులు గుణంలోనూ, విలువలోనూ తరచూ భిన్నంగా ఉన్నప్పటికీ, పెట్టుబడిదారీ వర్గ వినియోగంలో కూడా అవి ఒక భాగంగా వుంటాయి. మన పరిశీలన కోసం, ఈ మొత్తం ఉప భాగాన్ని వినియోగదారీ అవసరాలు అని వర్గీకరించవచ్చు. అయితే పొగాకు లాంటి ఉత్పాదితం శరీర ధర్మం దృష్ట్యా నిజంగా వినియోగదారీ అవసర సరుకు అవునా, కాదా అన్న అంశంతో దీనికి సంబంధం లేదు. అలవాటు దృష్ట్యా వినియోగదారీ అవసరమే అంటే సరిపోతుంది.

**(ఆ) విలాస వస్తువులు :** ఇవి పెట్టుబడిదారీ వర్గ వినియోగంలోకి మాత్రమే ప్రవేశిస్తాయి. అందుచేత ఇవి, వెచ్చించే అదనపు విలువతో మాత్రమే మార్పిడి అవుతాయి. అదనపు విలువలో కార్మికులకు ఎన్నటికీ వాటా ఉండదు.

ఇక మొదటి ఉపభాగానికి సంబంధించినంత వరకూ, సరుకుల ఉత్పత్తి కోసం అడ్వాన్సు చేయబడిన అస్థిర పెట్టుబడి డబ్బు రూపంలో II వ పెట్టుబడిదారీ వర్గం యొక్క ఆ భాగానికి (అంటే II అ పెట్టుబడిదారులు) ఈ జీవనావసరాలను ఉత్పత్తి చేసిన వారికే తిరిగి తిన్నగా వస్తుందన్న విషయం స్పష్టమే. వీరు ఆ జీవనావసరాలను తమ కార్మికులకే, వేతనాలుగా వారికి చెల్లించబడిన అస్థిర పెట్టుబడి మొత్తానికి అమ్ముతారు. II శాఖ పెట్టుబడిదారీ వర్గంలోని ఈ ఉప భాగం (అ) అంతటికీ సంబంధించినంత వరకూ ఈ డబ్బు వెనక్కు వచ్చే క్రమం నేరుగా జరుగుతుంది. పరిశ్రమలోని నిర్దిష్ట శాఖల తాలూకు పెట్టుబడిదారుల మధ్య ఎన్ని లావాదేవీలు వున్నప్పటికీ, ఈ క్రమం నేరుగా జరిగిందే; ఈ లావాదేవీలు తిరిగి వచ్చే అస్థిర పెట్టుబడిని దామాషా రీత్యా పంపిణీ చేస్తాయి, అంతే. ఇవి చలామణి ప్రక్రియలు, కార్మికులు ఖర్చు పెట్టే డబ్బు మూలంగానే ఈ ప్రక్రియలు కొనసాగుతాయి; వీటికి ప్రత్యక్ష కారణం ఆ డబ్బే. అయితే II ఆ ఉప భాగం సంగతి వేరు. ఈ ఉప భాగంలో ఉత్పత్తి అయ్యే విలువ యావత్తూ, అంటే II ఆ (అ.పె+అ.వి) విలాస వస్తువుల రూపంలో వుంటుంది; కార్మిక వర్గం ఉత్పత్తి సాధనాల రూపంలో వుండే I వ శాఖ సరుకు విలువను కొనుగోలు చేయలేనట్లే, ఈ విలాస సరుకులను సైతం అది కొనలేదు. ఈ విలాస సరుకులు, ఉత్పత్తి సాధనాలు రెండూ కూడా తాము సృష్టించినవే అయినప్పటికీ, కార్మికులు వాటిని కొనలేరు. అందుచేత ఈ ఉప భాగంలో పెట్టుబడిదారీ ఉత్పత్తిదారులు అడ్వాన్సు చేసే అస్థిర పెట్టుబడి డబ్బు రూపంలో నేరుగా తిరిగి రాదు. I అ.వి విలువలోలాగే మరొక మాధ్యమం ద్వారా మాత్రమే అది తిరిగి వస్తుంది.

II వ శాఖ అంతటిలోలాగే ఇక్కడ కూడా అ.పె = 500, అ.వి = 500 అనుకొందాం; కాని అస్థిర పెట్టుబడి, దానికి అనుగుణంగా వుండే అదనపు విలువ ఈ క్రింది విధంగా పంపిణీ అవుతాయనుకొందాం.

ఉపభాగం (అ), జీవనావసరాలు : అ.పె = 400, అ.వి = 400; అందుచేత వినియోగదారీ అవసరాలకు సంబంధించిన సరుకుల మొత్తం విలువ = 400 అ.పె + 400 అ.వి = 800, లేక II (అ) (400 అ.పె + 400 అ.వి).

ఉప భాగం (ఆ), విలాస వస్తువులు : వీటి విలువ 100 అ.పె + 100 అ.వి = 200, లేక II (ఆ) (100 అ.పె + 100 అ.వి).

II (ఆ) కు చెందిన శ్రామికులకు వారి శ్రమశక్తికి చెల్లింపుగా డబ్బు రూపంలో 100 అందింది, లేక 100 పౌండ్లు అందిందనుకొందాం. వారు ఆ డబ్బుతో II (అ) పెట్టుబడిదార్లనుంచి వినియోగ సరుకులు కొనుగోలు చేస్తారు. కాగా, ఈ పెట్టుబడిదార్లు ఆ 100 పౌండ్లతో దాని విలువకు సమంగా II (ఆ) సరుకులను కొనుగోలు చేస్తారు. ఈ విధంగా II (ఆ) పెట్టుబడిదార్ల అస్థిర పెట్టుబడి, డబ్బు రూపంలో తిరిగి వారివద్దకే ప్రవహిస్తుంది.

II (ఆ) లో తిరిగి 400 అ.వి పెట్టుబడిదారుల చేతుల్లో వున్నాయి; ఆ మొత్తం తమ సొంత కార్మికుల నుంచి మార్పిడి ద్వారా లభించిందే. పైగా అదనపు విలువకు ప్రాతినిధ్యం వహించే ఉత్పాదితపు భాగంలోని నాల్గోవంతు II (ఆ) కార్మికులకు బదిలీ అయింది. మార్పిడి సందర్భంగా II (ఆ)కి (100 అ.పె) విలువ గల విలాస సరుకులు లభించాయి.

ఇప్పుడిక II (అ) పెట్టుబడిదారు II (ఆ) పెట్టుబడిదార్లు తమ ఆదాయ వ్యయాన్ని జీవితావసరాలకు, విలాస సరుకులకు ఒకే నిష్పత్తిలో విభజించుకొన్నారనుకొంటే, ఉదాహరణకు అయిదింట మూడు వంతులు జీవనావసరాల కోసం, అయిదింట రెండు వంతులు విలాస సరుకుల కోసం విభజించుకున్నారనుకొంటే, II (అ) ఉప భాగానికి చెందిన పెట్టుబడిదార్లు అదనపు విలువ నుంచి తమకు ఆదాయంగా లభించే 400 అ.విలో అయిదింట మూడు వంతులను లేక 240ని జీవనావసరాల కోసం, అయిదింట రెండు వంతులను లేక 160 ని విలాస వస్తువుల కోసం ఖర్చు పెడతారు. II (ఆ) ఉపభాగానికి చెందిన పెట్టుబడిదార్లు కూడా తమకు అదనపు విలువగా లభించే 100 అ.వి ని ఇదే పద్ధతిలో విభజించి ఖర్చుపెడతారు; అంటే అయిదింట మూడు వంతులను లేక 60ని జీవనావసరాల కోసం, అయిదింట రెండు వంతులను లేక 40ని విలాస వస్తువుల కోసం ఖర్చు పెడతారు. ఈ విలాస వస్తువులు తమ సొంత ఉప భాగంలోనే ఉత్పత్తి అయి, మార్పిడి అయినవి.

(II అ) అ.వి స్వీకరించిన విలాస వస్తువుల రూపంలోని 160 ఈ క్రింది పద్ధతిలో II (అ) పెట్టుబడిదారుల చేతుల్లోకి పోతుంది: మనం ఇంతకు ముందే గమనించినట్లు (II అ) (II ఆ) 400 అ.పె లోని 100 జీవనావసరాల రూపంలో (II ఆ) అ.వి లోని అంతే మొత్తానికి మార్పిడి కాబడింది. ఈ మొత్తం విలాస సరుకుల రూపంలో వుంటుంది. కాగా మిగతా 60, అంటే జీవనావసరాల రూపంలో వుండే 60, (II ఆ) తాలూకు విలాస సరుకుల రూపంలో వుండే 60 అ.వికి మార్పిడి అయింది. అప్పుడు మొత్తం లెక్క ఈ క్రింది విధంగా వుంటుంది :

II (అ) : 400 అ.పె + 400 అ.వి : (II ఆ) 100 అ.పె + 100 అ.వి.

1) II (అ) కు చెందిన కార్మికులు 400 అ.పె (అ) ని వినియోగిస్తారు. వీరి ఉత్పాదితం (జీవనావసరాలు) లోని ఒక భాగం అందులో వుంటుంది. కార్మికులు తమ సొంత ఉపభాగానికి చెందిన పెట్టుబడిదారీ ఉత్పాదకుల నుంచి వాటిని కొనుగోలు చేస్తారు. ఈ పెట్టుబడిదార్లు ఈ చర్య

ద్వారా 400 పౌండ్లను డబ్బు రూపంలో వసూలు చేసుకుంటారు; అదే కార్మికులకు వేతనాలుగా చెల్లించిన 400 అస్థిర పెట్టుబడి విలువ అది. ఈ పెట్టుబడిదార్లు ఈ మొత్తంతో మరొకసారి శ్రమశక్తిని కొనుగోలు చేయగలరు.

2) 100 అ.పె (ఆ) కు సమంగా వుండే 400 అ.వి భాగం, అంటే అదనపు విలువలో నాల్గో వంతు విలాస సరుకుల రూపంలో ఈ క్రింది విధంగా చేతికందుతుంది : (ఆ)కు చెందిన కార్మికులు తమ ఉప భాగం (ఆ)కు చెందిన పెట్టుబడిదార్ల నుంచి 100 పౌండ్లను వేతనాలుగా స్వీకరించారు. వారు ఈ మొత్తంతో, (అ) అదనపు విలువలో నాల్గోవంతును, అంటే జీవనావసరాల రూపంలోని సరుకులను కొనుగోలు చేస్తారు. (అ)కు చెందిన పెట్టుబడిదార్లు ఈ డబ్బుతో, ఈ డబ్బు విలువకు సమానమైన విలాస సరుకులు కొనుగోలు చేస్తారు. ఈ డబ్బు 100 అ.పె (ఆ)కు సమానం. లేక ఉత్పత్తి అయిన మొత్తం విలాస సరుకుల్లో సగానికి సమంగా వుంటుంది. ఈ విధంగా, (ఆ)కు చెందిన పెట్టుబడిదార్లు తమ అస్థిర పెట్టుబడిని డబ్బు రూపంలో తిరిగి పొందుతారు; ఆ డబ్బుతో తిరిగి శ్రమశక్తిని కొనుగోలు చేయడం ద్వారా వారు పునరుత్పత్తిని ప్రారంభించగలరు. ఎందుచేతనంటే, మొత్తం II వ శాఖకు చెందిన యావత్తు స్థిర పెట్టుబడీ, II స్థి.పెకి I (అ.పె+అ.వి) మార్పిడి వల్ల భర్తీ అయింది. విలాస సరుకుల కార్మికులు తమ శ్రమశక్తిని తిరిగి అమ్ముకొనే అవకాశం వుంది. అందుకు కారణం ఏమిటంటే, వీరు తమ వేతనాలకు సమంగా వుండే ఉత్పాదితంలోని భాగాన్ని II (అ) ఉప భాగానికి చెందిన పెట్టుబడిదార్లు తమ వినియోగ నిధిలోకి తీసుకొన్నాక అది డబ్బుగా మార్చబడింది. (I వ శాఖకు చెందిన శ్రమశక్తి అమ్మకానికి కూడా ఇదే వర్తిస్తుంది; ఎందువల్లనంటే, I (అ.పె+అ.వి)కి మార్పిడి చేయబడ్డ II స్థి.పె లో విలాస సరుకులు, జీవనావసర సరుకులు రెండూ వున్నాయి. కాగా I (అ.పె+అ.వి) చేత పునరుద్ధరింపబడిన దానిలో విలాస సరుకుల ఉత్పత్తి సాధనాలూ, జీవనావసర సరుకుల ఉత్పత్తి సాధనాలూ, రెండూ వున్నాయి).

3) ఇక (అ), (ఆ)ల మధ్య మార్పిడి విషయానికి వద్దాం; ఇది కేవలం రెండు ఉపభాగాలకు చెందిన పెట్టుబడిదార్ల మధ్య మార్పిడి మాత్రమే. మనమింత వరకూ (అ) లోని అస్థిర పెట్టుబడి (400 అ.పె) గురించీ, (100 అ.వి) అదనపు విలువలోని ఒక భాగం గురించీ, (ఆ) లోని అస్థిర పెట్టుబడి (100 అ.పె) గురించీ చెప్పాము. రెండు ఉపభాగాలకు సంబంధించి, పెట్టుబడిదార్ల ఆదాయ వ్యయం సగటు విలాస సరుకులకు అయిదింట రెండు వంతులనీ, జీవనావసర సరుకులకు అయిదింట మూడు వంతులనీ ఊహించుకొన్నాము. విలాస సరుకుల కోసం ఇప్పటికే వ్యయం అయిన 100 అటుంచి, మొత్తం (అ) ఉప విభాగానికి విలాస సరుకుల కోసం 60, (ఆ) ఉప విభాగానికి 40 ఇంకా కేటాయించవలసి వుంది.

(II అ) అ.వి అప్పుడు జీవనావసరాలకు 240 గా, విలాస సరుకులకు 160గా విభజింపబడు తుంది. లేక ఇలా వుంటుంది : 240+160=400 అ.వి (II అ) (II ఆ) అ.వి అప్పుడు జీవనావసరాలకు 60 గా, విలాస సరుకులకు 40 గా విభజింపబడుతుంది, లేక ఇలా వుంటుంది : 60+40=100 అవి (II ఆ) ఈ చివరి 40 ని ఈ వర్గం తన సొంత ఉత్పాదితం నుంచే వినియోగించుకుంటుంది. (తన అదనపు విలువలో ఇది అయిదింట రెండు వంతులు) కాగా, ఈ వర్గం జీవనావసరాల్లోని 60ని, తన 60 అదనపు విలువ 60 అ.వి (అ) తో మార్పిడి చేయడం ద్వారా పొందుతుంది.

అప్పుడు రెండవ శాఖకు చెందిన మొత్తం పెట్టుబడిదార్లకు సంబంధించి సమీకరణ ఇలా వుంటుంది. (ఇక్కడ (అ) ఉపభాగంలోని అ.పె+అ.విలో వున్నది జీవనావసరాలు; (ఆ) ఉపభాగంలోని అ.పె+అ.వి లో వున్నది విలాస సరుకులు.)

సమీకరణ : II అ (400 అ.పె+400 అ.వి) – II ఆ (100 అ.పె+100 అ.వి) = 1,000. పైన వివరించిన చలనం ద్వారా ఆయా విలువలు చేతికందే తీరు ఇదీ : 400 అ.పె (అ) 100 అ.వి (అ) రూపంలో 500 అ.పె (అ+ఆ); 300 అ.వి (అ) + 100 అ.పె (ఆ) + 100 అ.వి (ఆ) రూపంలో 500 అ.వి (అ+ఆ); మొత్తం 1,000.

అ, ఆ లను విడివిడిగా పరిశీలిస్తే సమీకరణలు ఇలా వుంటాయి:

$$\text{అ)}\ \frac{\text{అ.పె}}{400\ \text{అ.పె (అ)}} + \frac{\text{అ.వి}}{240\ \text{అ.వి(అ)} + 100\ \text{అ.పె(ఆ)} + 60\ \text{అ.వి (ఆ)}} = 800$$

$$\text{ఆ)}\ \frac{\text{అ.పె}}{100\ \text{అ.పె(అ)}} + \frac{\text{అవి}}{60\ \text{అ.వి(అ)} + 40\ \text{అ.పె(ఆ)}} \cdots\cdots = \frac{200}{1,000}$$

సౌలభ్యం కోసం మనం అస్థిర పెట్టుబడి, స్థిర పెట్టుబడి మధ్య నిష్పత్తి ఒకే విధంగా వుందని ఊహించుకొన్నట్లయితే (నిజానికి అలా వుండవలసిన అవసరం లేదు), 1600 స్థిర పెట్టుబడికి 400 అ.పె (అ) అస్థిర పెట్టుబడి, అలాగే 100 అ.పె (ఆ) అస్థిర పెట్టుబడికి 400 స్థిర పెట్టుబడి వుంటుంది. అప్పుడు II వ శాఖలోని, అ ఆ ఉపభాగాలలో ఇలా వుంటుంది.

II అ 1,600 స్థి.పె + 400 అ.పె + 400 అ.వి = 2,400

II ఆ 400 స్థి.పె + 100 అ.పె + 100 అ.వి = 600

మొత్తంగా చూస్తే

2,000 స్థి.పె + 500 అ.పె + 500 అ.వి = 3,000

దీని ప్రకారం 2,000 I కి (అ.పె+అ.వి) మార్పిడి అయ్యే వినియోగ సాధనాల రూపంలోని 2,000 II స్థి.పెలో, 1,600 జీవితావసరాల యొక్క ఉత్పత్తి సాధనాలకూ, మిగతా 400 విలాస వస్తువుల ఉత్పత్తి సాధనాలకూ మార్పిడి అవుతుంది.

2,000 I (అ.పె+అ.వి) ఇందువల్ల, (అ)కు సంబంధించి, (800 అ.పె + 800 అ.వి) I గా విభజింపబడుతుంది. ఇది జీవనావసరాల ఉత్పత్తి సాధనాలు తాలూకు 1,600 కు సమానంగా వుంటుంది. కాగా (ఆ)కు సంబంధించి, (200 అ.పె + 200 అ.వి) I గా విభజింపబడుతుంది. ఇది విలాస సరుకుల ఉత్పత్తి సాధనాల తాలూకు 400కు సమంగా వుంటుంది.

పోతే శ్రమ పరికరాలలోని గణనీయమైన భాగమూ, ముడి పదార్థాల అనుబంధ పదార్థాలలోని గణనీయమైన భాగమూ రెండు శాఖలకూ సమంగా వుంటుంది. అయితే మొత్తం ఉత్పాదితం I (అ.పె+అ.వి) యొక్క విలువలోని వివిధ భాగాల మార్పిడికి సంబంధించి, ఈ విభజనతో బొత్తిగా నిమిత్తం లేదు. 1,000 II స్థి.పె వినియోగ సరుకుల కోసం వేతనాలు వ్యయం అయినాయి కాబట్టి పై రెండూ కూడా, అంటే I వ శాఖ తాలూకు 800 అ.పె, I వ శాఖ తాలూకు 200 అ.పె ఈ రెండూ కూడా చేతికందినట్లే. కాబట్టి, ఇందుకై అడ్వాన్సు చేయబడిన డబ్బు – పెట్టుబడి తిరిగి రాగానే I కి చెందిన పెట్టుబడిదారీ ఉత్పత్తిదారుల మధ్య సమంగా పంపిణీ అవుతుంది. అంటే

పెట్టుబడిదారీ ఉత్పత్తిదారులు అడ్వాన్సు చేసిన అస్థిర పెట్టుబడి అదే నిష్పత్తిలో డబ్బు రూపంలో భర్తీ అవుతుంది. కాగా, మరోవైపు 1,000 I అ.వి చేతికందే సంగతికి సంబంధించి, పెట్టుబడిదార్లు ఇక్కడ కూడా ఏకరీతిలో (తమ అ.వి పరిమాణానికి అనుగుణమైన నిష్పత్తిలో) 1,000కు తుల్యమైన II స్థి.పె రెండవ సగం నుంచి వినియోగ సాధనాల రూపంలో 600 II అ, 400 II ఆ లను తిరిగి వసూలు చేసుకుంటారు. ఏతావాతా తేలేదేమంటే, II అ తాలూకు స్థిర పెట్టుబడిని భర్తీ చేసుకుని వారు ఈ క్రింది మొత్తాలను ఇలా వసూలు చేసుకుంటారు.

600 స్థి.పె (II అ) నుంచి 480 (అయిదింట మూడు వంతులు)

400 స్థి.పె (II ఆ) నుంచి 320 (అయిదింట రెండు వంతులు, మొత్తం 800)

II ఆ తాలూకు స్థిర పెట్టుబడిని భర్తీ చేసుకునేవారు ఇలా వసూలు చేసుకుంటారు.

600 స్థి.పె (II అ) నుంచి 120 (అయిదింట మూడు వంతులు)

400 స్థి.పె (II ఆ) నుంచి 80 (అయిదింట రెండు వంతులు)

మొత్తం 200; కాగా, అదీ ఇదీ కలిసి మొత్తం 1,000. ఇక్కడ చిత్తాయత్తంగా నిర్ణయించినదేమిటంటే, I వ, II వ శాఖలు రెంటిలోనూ, స్థిర పెట్టుబడికీ, అస్థిర పెట్టుబడికీ మధ్య గల నిష్పత్తి. వాటి ఉపభాగాలలో కూడా ఈ నిష్పత్తి ఇదే విధంగా వుంది. సౌలభ్యం కోసం ఈ సారూప్యం వుందని ఊహించుకొన్నాం. ఇందుకు భిన్నమైన నిష్పత్తులను ఊహించుకొన్నప్పటికీ సమస్య పరిస్థితులు, సమస్య పరిష్కృతి అందువల్ల మారవు. కాని, సామాన్య పునరుత్పత్తి జరుగుతున్నదని ఊహించుకొన్నప్పుడు; పై విశ్లేషణ కింది అనివార్య ఫలితాలకు దారితీస్తోంది:

1) సంవత్సరం పాటు శ్రమ ఉత్పత్తి సాధనాల రూపంలో సృష్టించిన నూతన విలువ (అ.పె+అ.విగా విభజింప వీలున్న ఈ విలువ) వార్షిక శ్రమలోని ఇతర భాగం సృష్టించినట్టి, వినియోగ సరుకుల రూపంలో పునరుత్పత్తి అయినట్టి ఉత్పాదితం విలువలోని (స్థి.పె) స్థిర పెట్టుబడికి సమానంగా వుంటుంది. ఆ విలువ గనుక II స్థి.పె కంటే తక్కువగా వుండే పక్షంలో, II వ శాఖ తన స్థిర పెట్టుబడిని సంపూర్ణంగా భర్తీ చేసుకోవడం అసాధ్యం; అది ఎక్కువగా వుండే పక్షంలో, అదనపు మొత్తం నిరుపయోగంగా మిగిలిపోతుంది. తక్కువగా వున్నా, ఎక్కువగా వున్నా, సామాన్య పునరుత్పత్తి అన్న ఊహకే భంగం కలుగుతుంది.

2) ఇక వినియోగ సరుకుల రూపంలో పునరుత్పత్తి అయిన వార్షిక ఉత్పాదితం విషయానికి సంబంధించి, డబ్బు రూపంలో అడ్వాన్సు చేయబడిన అస్థిర పెట్టుబడి అ.పెని విలాస వస్తు పరిశ్రమలోని దాని గ్రహీతలయిన కార్మికులు వస్తు రూపంలోకి మార్చుకోగలిగేది, జీవితావసరాల్లో, తమ పెట్టుబడిదారీ ఉత్పాదకుల అదనపు విలువకు మూర్తీభావంగా వున్న భాగంలో మాత్రమే. అందుచేత విలాస సరుకుల ఉత్పత్తిలో మదుపు పెట్టిన అ.పె, జీవనావసరాల రూపంలో ఉత్పత్తి అయిన అ.విలో, తదనుగుణ భాగం యొక్క విలువకు సమానంగా వుంటుంది. కాబట్టి ఇది మొత్తం అ.వి కంటే, అంటే (II) అ కంటే తప్పనిసరిగా తక్కువగా వుంటుంది; విలాస సరుకుల పెట్టుబడిదారీ ఉత్పత్తిదారులు అడ్వాన్సు చేసిన అస్థిర పెట్టుబడి వారికి డబ్బు రూపంలో వాపస్ వచ్చేది, ఈ అ.వి భాగం నుంచీ, ఈ అ.పె చేతికందడం ద్వారా మాత్రమే. ఈ క్రమానికీ, II స్థి.పెలో I (అ.పె+అ.వి) తిరిగి చేతికందే క్రమానికీ, ఒక తేడా తప్ప, సంపూర్ణ సారూప్యం వుంది. అదేమంటే, రెండవ ఉదాహరణలో (II ఆ) అ.పె,

(II అ) అ.వి.లోని సమాన విలువ గల ఒక భాగం ద్వారా వాపస్ వస్తుంది. మొత్తం వార్షిక ఉత్పాదితం యొక్క ప్రతి పంపిణీలోనూ ఈ నిష్పత్తులు గుణాత్మకంగా నిర్ణాయకాంశంగా వుంటాయి. ఎందుచేతనంటే ఈ మొత్తం వార్షిక ఉత్పాదితం వాస్తవానికి, చలామణి మూలంగా జరిగే వార్షిక పునరుత్పత్తి ప్రక్రియలోకి ప్రవేశిస్తుంది. II స్థి.పె రూపంలోనే I (అ.పె+అ.వి) తిరిగి చేతికందగలదు. అలాగే ఉత్పాదక పెట్టుబడిలోని ఒక అంతర్భాగంగా II స్థి.పె క్రియను ఆ పరిణామం ద్వారా మాత్రమే పునరుద్ధరించవచ్చు. అదేవిధంగా (II అ) అ.వి లోని ఒక భాగం నుంచి మాత్రమే (II ఆ) అ.పె ని వాపస్ పొందడం సాధ్యం; (II ఆ) అ.పెని ఈ విధంగా మాత్రమే డబ్బు–పెట్టుబడి రూపంలోకి తిరిగి మార్చుకో వీలవుతుంది. ఇదంతా కూడా పునరుత్పత్తి ప్రక్రియ ఫలితంగా ఉన్నంత మేరకే వర్తిస్తుందని చెప్పాల్సిన అవసరం లేదు; అంటే, ఉదాహరణకు II ఆ కు చెందిన పెట్టుబడిదారులు ఇతరుల నుంచి పరపతి రూపంలో అ.పె కోసం డబ్బు–పెట్టుబడి పొందనంత మేరకు మాత్రమే ఇది వర్తిస్తుంది. కాని, ఉత్పత్తి స్థాయి, దానిలో విలువ సంబంధాలు స్థిరంగా వున్నంత వరకే, విదేశీ వాణిజ్యం మూలంగా ఈ ఖచ్చితమైన సంబంధాలు మారనంత వరకు మాత్రమే, పరిమాణాత్మకంగా, వార్షిక ఉత్పాదితం తాలూకు వివిధ భాగాల మధ్య మార్పిడిలు పైన వివరించబడిన నిష్పత్తిలో జరుగుతాయి.

ఆడమ్ స్మిత్ చెప్పిన పద్ధతిలో, I (అ.పె+అ.వి) అన్నది II స్థి.పె గానూ, II స్థి.పె అన్నది I (అ.పె+అ.వి) గానూ విభజింపబడుతుందని మనం చెప్పే పక్షంలో లేక ఆయన మరింత తరచుగానూ, మరింత అసంబద్ధంగానూ చెబుతున్నట్లుగా, II స్థి.పె యొక్క ధర (లేక ఆయన అన్నట్లు "మార్పిడిలోని విలువ") తాలూకు అంతర్భాగాల రూపంలో I (అ.పె+అ.వి) వుంటుందనీ, I (అ.పె+అ.వి) యొక్క విలువ తాలూకు సమస్త అంతర్భాగం రూపంలో II స్థి.పె వుంటుందని మనం చెప్పవలసివస్తే, కింది విధంగా చెప్పవచ్చు, చెప్పక తప్పదు; (II ఆ) అ.పె అన్నది (II అ) అ.వి గానూ, లేక (II అ) అ.వి అన్నది (II ఆ) అ.పెగా విభజింపబడుతుంది; లేక (II ఆ) అ.పె అన్నది (II అ) యొక్క అదనపు విలువలో ఒక అంతర్భాగమవుతుంది; (II అ) అనేది, (II ఆ) యొక్క అదనపు విలువగా వుంటుంది. ఆ విధంగా అదనపు విలువ వేతనాలుగానూ లేక అస్థిర పెట్టుబడిగానూ విభజింపబడుతుంది. అస్థిర పెట్టుబడి అన్నది అదనపు విలువ యొక్క "అంతర్భాగంగా" వుంటుంది. ఈ అసంబద్ధత ఆడమ్ స్మిత్‌లో నిజంగా కనిపిస్తుంది. ఎందుచేతనంటే, ఆయన అభిప్రాయం ప్రకారం వేతనాలను జీవితావసర వస్తువుల విలువ నిర్ణయిస్తుంది. కాగా ఈ సరుకు – విలువలను వేతనాల విలువా (అస్థిర పెట్టుబడి), వాటిలోని అదనపు విలువా నిర్ణయిస్తాయి. పెట్టుబడిదారీ విధానం ప్రాతిపదికపై ఒక శ్రమదినం యొక్క విలువ – ఉత్పాదితం అ.పె+అ.విగా విభజింపబడుతుందంటూ ఆయన ఆ విభాగాల వ్యవహారాల్లో ఎంతగా మునిగిపోతాడంటే, సాధారణ సరుకు మార్పిడిలో, వివిధ పాదార్థిక రూపాల్లోని తుల్య విలువల్లో నిక్షిప్తమైన శ్రమకు మూల్యం చెల్లించారా, లేదా అన్నది అప్రస్తుతమనే సంగతిని ఆయన సంపూర్ణంగా విస్మరిస్తాడు; ఎందుకంటే, చెల్లించినా, చెల్లించకపోయినా, వాటి ఉత్పత్తి కోసం వ్యయమయ్యే శ్రమ పరిమాణం ఒకటే. అంతేగాక క యొక్క సరుకు ఉత్పత్తి సాధనమా? గ యొక్క సరుకు వినియోగ వస్తువా? ఒక సరుకు అమ్ముడయిపోయిన తరువాత అది పెట్టుబడి అంతర్భాగంగా ఉపకరించగా, మరో సరుకు వినియోగ నిధిలో ప్రవేశించి, ఆడమ్ స్మిత్ ప్రకారం, ఆదాయం వినియోగమవుతుందా? అనే విషయం కూడా ముఖ్యం కాదు. వ్యక్తిగత కొనుగోలుదారు తన సరుకును

ఎందుకోసం వినియోగించాడు అనే విషయం సరుకు – మార్పిడి పరిధిలోకి, చలామణి రంగంలోకి రాదు, సరుకు యొక్క విలువపై దీని ప్రభావం వుండదు అనే సంగతి కూడా ఆయన మరచాడు. మొత్తం సమాజ వార్షిక ఉత్పాదితం యొక్క చలామణి విశ్లేషణకు సంబంధించి అది ఏ ఉపయోగం కోసం ఉద్దేశించబడింది, ఆ ఉత్పాదితంలోని వివిధ అంతర్భాగాలు ఎలా వినియోగింపబడతాయి అనే అంశాలను తప్పనిసరిగా పరిగణలోకి తీసుకోవాలి అనే వాస్తవం కూడా సరుకు విలువను ఏవిధంగానూ మార్చదు.

పైన తెల్పిన (II అ) అ.విలో, తనకు సమానమైన విలువ గల భాగంతో (II ఆ) అ.పె మార్పిడి అవుతుందన్న విషయానికి సంబంధించి, (II అ) అ.వి కీ, (II ఆ) అ.వికీ మధ్య తదుపరి మార్పిడులకు సంబంధించి, II అ కూ, II ఆ కూ చెందిన వ్యష్టి పెట్టుబడిదార్లు కాని, లేక మొత్తం పెట్టుబడిదారులు కాని తమ అదనపు వినియోగ సరుకుల కోసం, విలాస సరుకుల కోసం ఒకే నిష్పత్తిలో విభజిస్తారని మనం ఊహించడం లేదు. ఒకరు వినియోగ సరుకులపై ఎక్కువ ఖర్చు పెడితే మరొకరు విలాస సరుకులపై ఎక్కువ ఖర్చు పెట్టవచ్చు. సామాన్య పునరుత్పత్తి ప్రాతిపదికపై, మొత్తం అదనపు విలువకు సమానంగా వుండే విలువలన్నీ వాస్తవానికి వినియోగ నిధి నుంచి గ్రహించబడతాయని మాత్రమే ఊహించుకొన్నాం. ఈ విధంగా దీని పరిమితులేమిటో వివరించబడ్డాయి. ప్రతి శాఖలోనూ ఒకరు 'అ'లో ఎక్కువ ఖర్చు చేస్తే, మరొకరు 'ఆ'లో ఎక్కువ ఖర్చు చేయవచ్చు. అయితే, ఈ ఎక్కువ తక్కువలు ఒకదానికొకటి చెల్లుకాబట్టి, 'అ' 'ఆ'లకు చెందిన పెట్టుబడిదార్లను మొత్తంగా తీసుకుంటే, వారు రెంటిలోనూ ఒకే నిష్పత్తిలో పాల్గొన్నట్టవుతుంది. కాని, విలువ – సంబంధాలు, అంటే II ఉత్పాదితం మొత్తం విలువలో 'అ' 'ఆ' అనే రెండు రకాల ఉత్పత్తిదార్ల వాటాలు ఏ నిష్పత్తిలో వుంటాయో ప్రతి నిర్దిష్ట సందర్భంలోనూ తప్పనిసరిగా నిర్ణీతమై వుంటాయి. కాబట్టి ఆ ఉత్పాదితాలను సరఫరా చేసే రెండు ఉత్పత్తి శాఖల మధ్య గల నిర్దిష్టమైన పరిమాణాత్మక సంబంధం నిర్ణీతమై వుంటుంది. కాకపోతే, ఉదాహరణగా ఇవ్వబడిన నిష్పత్తి మాత్రం ఊహాత్మకమైనది. మరో ఉదాహరణను ఎంపిక చేసుకున్నప్పటికీ గుణాత్మకమైన అంశాలలో మార్పు వుండదు; పరిమాణ సంబంధమైన నిర్ణాయకాంశాల్లో మాత్రమే మార్పు వుంటుంది. కాని ఏ పరిస్థితుల పర్యవసానంగానైనా 'అ' 'ఆ'ల తులనాత్మక పరిమాణంలో మార్పు వున్నట్లయితే, ఈ మార్పు ఫలితంగా సామాన్య పునరుత్పత్తి తాలూకు పరిస్థితులు కూడా తదనుగుణంగా మారిపోతాయి.

(II అ) అ.వి లోని సమతుల్య భాగం నుంచి (II ఆ) అ.పె పరిగ్రహింపబడుతుంది. కాబట్టి, వార్షిక ఉత్పాదితంలో విలాస సరుకుల నిష్పత్తి పెరిగేకొద్దీ, అనగా విలాస సరుకుల ఉత్పత్తికై వ్యయమయ్యే శ్రమశక్తి వాటా పెరిగేకొద్దీ, (II ఆ) అ.పె లో అడ్వాన్సు చేయబడిన అస్థిర పెట్టుబడి డబ్బు – పెట్టుబడిగా తిరిగి మారడం, అంటే డబ్బు రూపంలో అస్థిర పెట్టుబడిగా తిరిగి పనిచేయగల రూపంలోకి మారడం, తద్వారా II ఆ లో నియుక్తమైన కార్మికవర్గ భాగం యొక్క ఉనికీ, పునరుత్పత్తీ – వీరికి వినియోగ సరుకులు సరఫరా కావడం – ఇదంతా, పెట్టుబడిదారీ వర్గం దుర్వ్యయంపైనా, దాని అదనపు విలువలోని గణనీయమైన భాగం విలాస సరుకులకు మార్పిడి కావడంపైనా ఆధారపడి వుంటుంది.

ప్రతి సంక్షోభమూ తక్షణమే విలాస సరుకుల వినియోగాన్ని తగ్గిస్తుంది. (II ఆ) అ.పె తిరిగి

డబ్బు – పెట్టుబడిగా మారే క్రమాన్ని ఇది మందగింప చేస్తుంది; జాప్యం చేస్తుంది; ఈ పరివర్తనకు కొద్దిపాటి అవకాశం మాత్రమే వుంటుంది. అందువల్ల విలాస సరుకుల ఉత్పత్తిలో నియోగింపబడిన కార్మికులలో కొంతమంది పని కోల్పోతారు. ఇది మరోవైపేమో జీవనావసర సరుకుల అమ్మకాన్ని అడ్డుకొని, తగ్గింపచేస్తుంది. ఇంతేకాకుండా, అనుత్పాదక కార్మికులు, అంటే తమ సేవలకుగాను పెట్టుబడిదారుల విలాస సరుకుల ఖర్చు నిధిలో నుంచి ఒక భాగాన్ని స్వీకరించే కార్మికులు (ఈ మేరకు ఈ కార్మికులే విలాస సరుకుల వంటి వారు) పనినుంచి తొలగింపబడతారు. వీరూ జీవనావసర సరుకుల వినియోగంలో గణనీయమైన స్థాయిలో పాల్గొనేవారే మరి. సౌభాగ్య దశలో, ముఖ్యంగా కృతక సౌభాగ్య దశలలో పరిస్థితులు ఇందుకు సరిగ్గా భిన్నంగా వుంటాయి; కృతక సౌభాగ్య దశలలో సరుకుల రూపంలో వ్యక్తమయ్యే డబ్బు సాపేక్ష విలువ ఇతర కారణాల మూలంగా కూడా తగ్గిపోతుంది. (విలువలలో నిజమైన మార్పు జరక్కుండానే) అప్పుడు సరుకుల ధరలు తమ సొంత విలువలతో ప్రమేయం లేకుండా పెరిగిపోతాయి. జీవనావసర సరుకుల వినియోగం మాత్రమే కాదు పెరిగేది, సమస్త నిరుద్యోగ సేవకు పని దొరకడం వల్ల సంఖ్య పెరిగిన కార్మిక వర్గం కూడా తాత్కాలికంగా విలాస వస్తువులను వినియోగిస్తుంది. సాధారణ పరిస్థితుల్లో అయితే అవి దాని అందుబాటులో వుండవు. ఇతర సమయాలలో పెట్టుబడిదారీ వర్గానికి మాత్రమే అత్యధిక భాగం వినియోగదారీ "జీవనావసరాలు"గా వున్నట్టి వస్తువుల్లో కూడా కార్మిక వర్గానికి వాటా లభిస్తుంది. ఇందువల్ల కూడా ఆ మేరకు ధరలు పెరుగుతాయి.

సంక్షోభాలకు మూలం ఫలప్రదమైన వినియోగం కొరత, లేక ఫలప్రదమైన వినియోగదార్ల కొరత అనడం కేవలం పునరుక్తి అవుతుంది. గర్భదరిద్రులు, దగాకోరులు చేసే వినియోగాన్ని మినహాయిస్తే, పెట్టుబడిదారీ వ్యవస్థ ఫలప్రదమైన వినియోగాన్ని తప్ప మరే ఇతర వినియోగ నమూనాలను ఎరగదు; సరుకులు అమ్ముడు పోలేదంటే, అర్థం వాటి కోసం ఫలప్రదమైన కొనుగోలుదార్లు, అంటే వినియోగదార్లు లభించలేదన్న మాట. (ఎందుచేతనంటే, తుదకంటా విశ్లేషించి చూస్తే, సరుకులు ఉత్పాదక వినియోగం కోసం కాని లేక వ్యక్తిగత వినియోగం కోసం కాని కొనుగోలు చేయబడతాయి.) కార్మికవర్గం తన ఉత్పాదితంలో చాలా తక్కువ భాగాన్ని మాత్రమే పొందుతుందనీ, అలాకాక, ఆ భాగం బాగా పెరిగితే, అంటే దాని వేతనాలు పెరిగితే, ఈ చెడుగు తొలగిపోతుందనీ చెప్పడం ద్వారా ఈ పునరుక్తిని గట్టిగా సమర్థించడానికి ఎవరైనా ప్రయత్నం చేసే పక్షంలో, ఒక వాస్తవం స్పష్టం చేయవలసి వుంటుంది. ఏమిటంటే, సరిగ్గా వేతనాలు సర్వత్రా పెరిగి, వినియోగానికి ఉద్దేశించబడిన వార్షిక ఉత్పాదితంలో కార్మికవర్గం వాటా పెరిగిన దశే ఎల్లప్పుడూ సంక్షోభాలకు రంగం సిద్ధం చేస్తుంది. ఈ చక్కని "సామాన్య" (!) ఇంగితజ్ఞాన సమర్థకుల దృష్టినుంచి చూస్తే, ఇలాంటి దశ నిజానికి సంక్షోభాలను తొలగించాలి. కాబట్టి, పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానంలో సత్ సంకల్పాలతో, లేక దుష్ట సంకల్పాలతో నిమిత్తం లేని పరిస్థితులు వున్నట్లు కనిపిస్తుంది. ఆ సాపేక్ష సౌభాగ్యాన్ని, అందునా, రానున్న సంక్షోభానికి వేగుచుక్కలాంటి ఆ సౌభాగ్యాన్ని కార్మికవర్గం కేవలం తాత్కాలికంగా మాత్రమే అనుభవించనిచ్చే పరిస్థితులవి.[1]

1. సంక్షోభాలకు సంబంధించి రాడ్ బెర్టస్ సిద్ధాంతాన్ని బలపరచదలచిన వారు ఈ విషయం గమనించాలి - ఫ్రెడరిక్ ఎంగెల్స్.

II (అ.పె+అ.వి) అన్నది, వినియోగదారీ జీవనావసరాల ఉత్పత్తి, విలాస వస్తువుల ఉత్పత్తి మధ్య గల నిష్పత్తి మూలంగా, II అ, II ఆ మధ్య విభజితం కావలసి వుంటుంది. అలాగే II స్థి.పె కూడా (II అ) స్థి.పె, (II ఆ) స్థి.పె మధ్య విభజితం కావలసి వుంటుంది. ఈ విషయం ఇంతకు ముందు గమనించాం. కాబట్టి ఈ విభజన ఉత్పత్తి స్వభావాన్నీ, దాని పరిమాణాత్మక సంబంధాలనూ ఆమూలాగ్రంగా ప్రభావితం చేస్తుంది; ఉత్పత్తి మొత్తం నిర్మాణ స్వరూపాన్ని నిర్ణయించే ప్రధాన కారకంగా వుంటుంది.

అదనపు విలువను స్వాయత్తం చేసుకోవడమే వ్యష్టి పెట్టుబడిదార్ల అనివార్య ప్రేరణగా కనిపించినా, సామాన్య పునరుత్పత్తి ప్రధాన లక్ష్యం వినియోగమే. అయితే, అదనపు విలువ యొక్క సాపేక్షక పరిమాణం ఎలా ఉన్నప్పటికీ, ఇక్కడ అది పెట్టుబడిదారు వ్యక్తిగత వినియోగానికి మాత్రమే ఉపకరిస్తుందనే భావముంది.

విస్తృత స్థాయిలోని వార్షిక పునరుత్పత్తిలో సామాన్య పునరుత్పత్తి ఒక భాగం, అందునా, చాలా ముఖ్యమైన భాగం కాబట్టి, ఈ ప్రేరణ అటు తమ సంపద పెంచుకోవాలనే ఉద్దేశానికి సహచర మైనదిగానూ, ఇటు వ్యతిరిక్తమైనదిగానూ వుంటుంది. వాస్తవానికి ఈ విషయం చాలా జటిలమైనది; ఎందుచేతనంటే ఈ లూటీలోని, అంటే పెట్టుబడిదారు యొక్క అదనపు విలువ లూటీలోని భాగస్వాములు, అతనితో నిమిత్తం లేని వినియోగదారులుగా దర్శనమిస్తారు.

## V. మార్పిడికి మాధ్యస్థం వహిస్తున్న డబ్బు చలామణి

మనం ఇంతవరకూ చలామణిని విశ్లేషించిన ప్రకారం, వివిధ తరగతుల ఉత్పత్తిదారుల మధ్య చలామణి ఈ క్రింద తెలిపిన విధంగా సాగింది.

1) I వ తరగతి, II వ తరగతి మధ్య

I. 4,000 స్థి.పె + 1,000 అ.పె + 1,000 అ.వి

II. ..... 2,000 స్థి.పె .... 500 స్థి.పె + 500 అ.వి

2,000కు సమానంగా వున్నట్టి II స్థి.పె చలామణి ఇలా జరిగిపోతుంది. అది I (1,000 అ.పె + 1,000 అ.వి) తో మార్పిడి అవుతుంది.

ప్రస్తుతానికి 4,000 I స్థి.పెని వదిలివేద్దాం. IIవ తరగతిలో ఇంకా అ.పె+అ.వి అన్నది II అ, II ఆ మధ్య ఈ క్రింది విధంగా విభజింపబడుతుంది :

2) II 500 అ.పె + 500 అ.వి = అ (400 అ.పె + 400 అ.వి) + ఆ (100 అ.పె + 100 అ.వి)

400 అ.పె (అ) తన ఉప విభాగంలోనే చలామణి అవుతుంది; ఆ డబ్బు పొందిన కార్మికులు తాము ఉత్పత్తి చేసిన జీవితావసరాలను తమ యజమానుల నుంచి, అంటే II అ పెట్టుబడిదారుల నుంచి కొనుగోలు చేస్తారు.

రెండు ఉపవిభాగాలకు చెందిన పెట్టుబడిదారులు తమ అదనపు విలువలో అయిదింట మూడు వంతుల మొత్తాన్ని II అ తాలూకు ఉత్పాదితాల (జీవనావసరాలు) పైనా, అయిదింట రెండు వంతుల మొత్తాన్ని II ఆ తాలూకు ఉత్పాదితాల (విలాస వస్తువులు) పైనా ఖర్చు పెడతారు కాబట్టి, ఆ తాలూకు

అదనపు విలువలోని అయిదింట మూడు వంతుల మొత్తం, లేక 240, II అ ఉప విభాగం లోపలే వినియోగమవుతుంది; అదే విధంగా ఆ తాలూకు అదనపు విలువలోని మూడింట రెండు వంతుల మొత్తం (విలాస వస్తువుల రూపంలో ఉత్పత్తి అయి, అదే రూపంలో వుంటాయి) II ఆ ఉపవిభాగం లోపలే వినియోగమవుతుంది.

ఇక II అ, II ఆ మధ్య మార్పిడికావలసి వున్నవివీ :

II అ పక్షాన, 160 అ.వి;

II ఆ పక్షాన, 100 అ.పె + 60 అ.వి

ఇవి పరస్పరం రద్దు చేసుకుంటాయి. II ఆ కు చెందిన కార్మికులు డబ్బుగా వేతనాల రూపంలో తమకు లభించిన 100తో II అ నుంచి జీవనావసరాలను కొనుగోలు చేస్తారు. ఇదే విధంగా II ఆ కు చెందిన పెట్టుబడిదారులు II అ నుంచి తమ అదనపు విలువలోని అయిదింట మూడు వంతులు, లేక 60 వెచ్చించి జీవనావసరాలు కొనుగోలు చేస్తారు. II అ కు చెందిన పెట్టుబడిదారులకు పైన ఊహించిన విధంగా, తమ అదనపు విలువలోని అయిదింట రెండు వంతులను లేక 160 అవి ని II ఆ తాలూకు పెట్టుబడిదారులు ఉత్పత్తి చేసిన విలాస సరుకులలో మదుపు పెట్టేందుకు ఆ విధంగా డబ్బు లభిస్తుంది. (II ఆ పెట్టుబడిదారుల చేతిలో తాము చెల్లించిన వేతనాల స్థానాన్ని భర్తీ చేసే ఉత్పాదితంగా 100 అ.పె, దానితో పాటు 60 అ.వి వుంటుంది.) ఈ చలామణి చిత్రణ ఈ క్రింది విధంగా వుంటుంది.

3) II అ (400 అ.పె) + (240 అ.వి) + 160 అ.వి 100 అ.పె + 60 అ.వి + (40 అ.వి)

కుండలీకరణంలోని మొత్తాలు తమ ఉప తరగతుల్లోనే చలామణి అయి వినియోగింపబడతాయి.

అస్థిర పెట్టుబడిగా అడ్వాన్సు చేయబడిన డబ్బు పెట్టుబడి సరుకుల ఉత్పత్తిదార్లకు, సరుకుల చలామణి మామూలు క్రమంలోనే తిరిగి వస్తుందన్న సాధారణ నియమాన్ని ముందు పేర్కొన్నాము. జీవనావసరాలు ఉత్పత్తి చేసే II అ పెట్టుబడిదారీ విభాగంలో మాత్రమే ఈ పెట్టుబడి నేరుగా తిరిగి వస్తుంది. ఇది, ప్రత్యేక పరిస్థితుల వల్ల మారిన పై నియమం వ్యక్తీకరణే. దీని నుంచి మరో విషయం కూడా తెలుస్తుంది; సరుకుల ఉత్పత్తిదారు వెనుక ఎవరైనా డబ్బు – పెట్టుబడిదారు వుండి, ఆ పారిశ్రామిక పెట్టుబడిదారుకు డబ్బు పెట్టుబడిని అందజేసినట్లయితే (ఖచ్చితమైన అర్థంలో ఇది డబ్బు రూపంలో వున్న పెట్టుబడి – విలువ) ఈ డబ్బు తిరిగి వచ్చేది, డబ్బు – పెట్టుబడిదారు జేబులోకే. డబ్బు దాదాపు అన్ని చేతులు మారినప్పటికీ, నిజానికి బ్యాంకుల రూపంలో వ్యవస్థీకృతమూ, కేంద్రీకృతమూ అయిన డబ్బు – పెట్టుబడి విభాగానికే చలామణి అయ్యే డబ్బు మొత్తంగా చెందుతుంది. ఈ విభాగం తన పెట్టుబడిని అడ్వాన్సు చేసే పద్ధతి కారణంగా అది డబ్బు రూపంలో నిరంతరం తుదకు ఆ విభాగానికి తిరిగి వస్తూ వుంటుంది; పారిశ్రామిక పెట్టుబడి డబ్బు పెట్టుబడిగా తిరిగి మార్పు చెందడం ద్వారా తిరిగి రావటం జరిగినా అది చేరేది ఆ విభాగానికే.

సరుకుల చలామణికి ఎల్లప్పుడూ రెండు వస్తువులు అవసరం: ఒకటి, చలామణిలోకి తోయబడిన సరుకులు. రెండు, అదే విధంగా చలామణిలోకి తోయబడిన డబ్బు. "ఉపయోగ విలువలు స్థలాలు, చేతులు మారగానే, ఉత్పాదితాల ప్రత్యక్ష వస్తు మార్పిడిలాగా చలామణి ప్రక్రియ అంతరించదు. ఏదైనా ఒక సరుకు యొక్క రూపాంతరీకరణ తాలూకు ఆవృత్తి నుంచి బయటపడగానే డబ్బు

అదృశ్యమైపోదు; చలామణి రంగంలో ఇతర సరుకులు ఖాళీ చేసిన కొత్త స్థలాల్లోకి ఈ డబ్బు నిరంతరం వచ్చి పడుతూంటుంది.” (సం I, అధ్యాయం 3)

ఉదాహరణకు, II స్థి.పె, I (అ.పె+అ.వి)ల మధ్య చలామణిలో II వ శాఖ చలామణి కోసం డబ్బు రూపంలో 500 పౌండ్లను అడ్వాన్సు చేసిందని మనం ఊహించుకొన్నాము. ఉత్పత్తిదార్లకు సంబంధించిన పెద్ద పెద్ద సామాజిక బృందాల మధ్య చలామణిలో అంతర్భాగాలయిన అసంఖ్యాక చలామణి ప్రక్రియలలో వివిధ బృందాల ప్రతినిధులు వివిధ సమయాల్లో మొదట కొనుగోలుదార్లుగా రంగంపైకి వస్తారు; కాబట్టి వారు చలామణిలోకి డబ్బు ప్రవేశపెడతారు. ప్రత్యేక పరిస్థితుల విషయం అటుంచితే, మరేదానివల్ల కాకపోయినా ఉత్పత్తి దశలలోని తేడా వల్లనేమి, తత్కారణంగా, వివిధ సరుకు – విలువల టర్నోవర్‌ల వల్లనేమి ఇది అవసరమవుతుంది. కాబట్టి IIవ శాఖ ఈ 500 పౌండ్లతో ఒకటవ శాఖ నుంచి అంతే విలువ గల ఉత్పత్తి సాధనాలను కొనుగోలు చేస్తుంది; కాగా I వ శాఖ II వ శాఖ నుంచి 500 పౌండ్ల విలువ గల వినియోగ సరుకులు కొనుగోలు చేస్తుంది. అందుచేత II వ శాఖకు డబ్బు తిరిగి వస్తుంది. అయితే ఈ డబ్బు తిరిగి రావడం వల్ల II వ శాఖ సంపద పెరగదు. అది మొదట 500 పౌండ్లను డబ్బు రూపంలో చలామణిలోకి తోసి, చలామణిలో నుంచే అంతే విలువ గల సరుకులను తీసుకొంది. ఆ తరువాత అది 500 పౌండ్ల విలువ గల సరుకులను అమ్మి అంతే విలువ గల డబ్బును చలామణి నుంచి తీసేసుకుంటుంది; ఈ విధంగా 500 పౌండ్లు దానికి తిరిగి వస్తాయి. నిజానికి II వ శాఖ 500 పౌండ్లను డబ్బు రూపంలోనూ, 500 పౌండ్లను సరుకుల రూపంలోనూ చలామణిలోకి ప్రవేశపెట్టింది; ఇది 1,000 పౌండ్లకు సమానం. అది చలామణి నుంచి 500 పౌండ్లను సరుకుల రూపంలోనూ, 500 పౌండ్లను డబ్బు రూపంలోనూ తీసేసుకుంటుంది. I వ శాఖకు చెందిన 500 పౌండ్లను, II వ శాఖకు చెందిన 500 పౌండ్లను సరుకులుగా మార్చడానికై చలామణికి డబ్బు రూపంలో 500 పౌండ్లు మాత్రమే అవసరం; కాబట్టి ఇతర ఉత్పత్తిదార్ల నుంచి సరుకుల కొనుగోలు కోసం డబ్బు అడ్వాన్సు చేసిన ఏ వ్యక్తి అయినా, తన సరుకులను అమ్మే సందర్భంగా తన డబ్బును వసూలు చేసుకుంటాడు. పర్యవసానంగా తేలేదేమిటంటే, I వ శాఖ మొదట II వ శాఖ నుంచి 500 పౌండ్ల సరుకులను కొనుగోలు చేసి, తరువాత II వ శాఖకు 500 పౌండ్ల విలువ గల సరుకులను అమ్మితే, ఆ 500 పౌండ్లు II వ శాఖకు కాకుండా I వ శాఖకు మాత్రమే తిరిగి వస్తుంది.

I వ శాఖలో వేతనాలుగా మదుపు చేయబడిన డబ్బు, అంటే డబ్బు రూపంలో అడ్వాన్స్ చేయబడిన అస్థిర పెట్టుబడి ఈ రూపంలో ప్రత్యక్షంగా వాపస్ రాదు; పరోక్షంగా మాత్రమే అంటే డొంకతిరుగుడులో మాత్రమే తిరిగి వస్తుంది. అయితే II వ శాఖలో వేతనాల కోసం మదుపు చేయబడిన 500 పౌండ్లు కార్మికుల నుంచి పెట్టుబడిదార్లకు నేరుగా వస్తుంది. ఒకే వ్యక్తుల మధ్య కొనుగోలు, అమ్మకం పదే పదే జరిగే సందర్భంలో, అంటే వారు ఒకసారి కొనుగోలుదార్లుగానూ, మరొకసారి అమ్మకందార్లుగానూ వ్యవహరించే సందర్భంలో ఈ తిరిగిరావటం, ఎల్లప్పుడూ ప్రత్యక్షంగా జరుగుతుంది. II వ శాఖ పెట్టుబడిదారు శ్రమశక్తికి డబ్బు చెల్లిస్తాడు. ఆ విధంగా శ్రమశక్తిని తన పెట్టుబడిలోకి కలిపేసుకుని, వేతన సంపాదకులైన తన కార్మికుల విషయంలో పారిశ్రామిక పెట్టుబడిదారు పాత్ర ధరిస్తాడు. అయితే అతడు ఈ చలామణి చర్య ద్వారా మాత్రమే అలా

వ్యవహరిస్తాడు; అతని దృష్టిలో చలామణి అంటే డబ్బు – పెట్టుబడిని ఉత్పాదక పెట్టుబడిగా మార్చే క్రియ మాత్రమే. ఆ తరువాత కార్మికుడు, మొదట అమ్మకందారుగా, అంటే తన సొంత శ్రమశక్తి అమ్మకందారుగా వున్నట్టి ఈ కార్మికుడు రెండవసారి, చేతిలో డబ్బున్నవాడుగా, పెట్టుబడిదారుకు సంబంధించి, కొనుగోలుదారుగా రంగంపైకి వస్తాడు. ఇప్పుడు ఈ పెట్టుబడిదారు అమ్మకందారుగా వ్యవహరిస్తాడు. పెట్టుబడిదారు వేతనాలలో తాను మదుపు చేసిన డబ్బును ఈ విధంగా తిరిగి వసూలు చేసుకుంటాడు. అయితే సరుకుల అమ్మకంలో మోసం గట్రాలేదు. ఇది సమమైన విలువ గల సరుకుల డబ్బు మార్పిడి కాబట్టి పెట్టుబడిదారుని సంపద పెరగడానికి తోడ్పడే ప్రక్రియ కాదిది. అతడు కార్మికునికి రెండుసార్లు – మొదట డబ్బు రూపంలోనూ, ఆ తరువాత సరుకుల రూపంలోనూ చెల్లించడు. కార్మికుడు తన డబ్బును పెట్టుబడిదారుని సరుకులకు మార్పిడి చేసుకోగానే పెట్టుబడిదారుకు తన డబ్బు తిరిగి వస్తుంది.

కాని, అస్థిర పెట్టుబడిగా మార్చబడిన డబ్బు పెట్టుబడి, అంటే వేతనాల కోసం అడ్వాన్సు చేయబడిన డబ్బు అసలు డబ్బు చలామణిలో ముఖ్యమైన పాత్ర నిర్వర్తిస్తుంది; ఎందుచేతనంటే శ్రామికులు రెక్కాడితే గాని డొక్కాడని వారు కాబట్టి వారు పారిశ్రామిక పెట్టుబడిదార్లకు దీర్ఘకాలం పాటు పరపతి ఇవ్వజాలరు. ఈ కారణాన, అస్థిర పెట్టుబడిని డబ్బు రూపంలో సమాజంలోని అనేకానేక ప్రాంతాల్లో, ఏకకాలంలో వారం వగైరా వంటి స్వల్ప వ్యవధులలో అడ్వాన్సు చేయవలసి వుంటుంది; వివిధ పారిశ్రామిక శాఖల్లో పెట్టుబడుల టర్నోవర్ వ్యవధులు ఎలా వున్నప్పటికీ త్వరత్వరగా పునరావృతమయ్యే వ్యవధుల్లో డబ్బును అడ్వాన్సు చేయవలసి వుంటుంది. (ఈ వ్యవధులు ఎంత స్వల్ప కాలికమైనవైతే, ఈ మార్గం ద్వారా చలామణిలోకి ఒక్కొక్కసారి ప్రవేశపెట్టబడిన మొత్తం డబ్బు సాపేక్షంగా అంత తక్కువగా వుంటుంది) పెట్టుబడిదారీ ఉత్పత్తి గల ప్రతి దేశంలోనూ ఈ విధంగా అడ్వాన్సు చేయబడిన డబ్బు పెట్టుబడి మొత్తం చలామణిలో సాపేక్షంగా నిర్ణయాత్మకమైన వాటాగా వుంటుంది; ఆ డబ్బు బయలుదేరిన చోటికే వాపస్ రావడానికి ముందు, అనేక విభిన్న మార్గాల్లో పయనించి అసంఖ్యాక వ్యాపారాలకు చలామణి సాధనంగా వ్యవహరిస్తుంది కనుక దాని వాటా ముమ్మాటికీ నిర్ణయాత్మకమైనది.

★ ★ ★

మనమిప్పుడు I (అ.పె+అ.వి) II స్థి.పెల మధ్య చలామణిలో మరో దృక్కోణం నుంచి పరిశీలిద్దాం.

I వ శాఖ పెట్టుబడిదార్లు వేతనాల చెల్లింపుకు 1,000 పౌండ్లు అడ్వాన్సు చేస్తారు. కార్మికులు ఈ డబ్బుతో రెండవ శాఖ పెట్టుబడిదార్ల నుంచి 1,000 పౌండ్ల విలువ గల జీవనావసరాలను కొంటారు. ఈ పెట్టుబడిదార్లు తిరిగి ఈ డబ్బుతో ఒకటవ శాఖ పెట్టుబడిదార్ల నుంచి ఉత్పత్తి సాధనాలు కొంటారు. I వ శాఖ పెట్టుబడిదార్లు ఈ విధంగా తమ అస్థిర పెట్టుబడిని డబ్బు రూపంలో తిరిగి వసూలు చేసుకుంటారు; కాగా II వ శాఖ పెట్టుబడిదార్లు సరుకు పెట్టుబడి రూపంలోని స్థిర పెట్టుబడిలో సగభాగాన్ని ఉత్పాదక పెట్టుబడిగా మార్చేశారు. II వ శాఖ పెట్టుబడిదార్లు I వ శాఖ నుంచి ఉత్పత్తి సాధనాలు పొందడానికిగాను డబ్బు రూపంలో మరో 500 పౌండ్లను అడ్వాన్సు

చేస్తారు. I వ శాఖ పెట్టుబడిదార్లేమో ఈ డబ్బును II వ శాఖకు చెందిన వినియోగ సరుకులపై ఖర్చు పెడతారు. ఈ విధంగా II వ శాఖ పెట్టుబడిదార్లకు వారి 500 పౌండ్లు తిరిగి వస్తుంది. అప్పుడు వారు సరుకులుగా మార్చబడివున్న తమ స్థిర పెట్టుబడిలోని చివరి నాల్గో భాగాన్ని దాని ఉత్పాదక భౌతిక రూపంలో మార్చుకోడానికి ఆ డబ్బును మళ్లీ అడ్వాన్సు చేస్తారు. ఈ డబ్బు తిరిగి I వ శాఖ పెట్టుబడిదార్ల వద్దకు వెళ్తుంది. వారు తిరిగి ఇదే మొత్తం చెల్లించి II వ శాఖ నుంచి వినియోగ సరుకులు తీసుకొంటారు. ఈ విధంగా 500 పౌండ్లు II వ శాఖ పెట్టుబడిదార్ల వద్దకు చేరుకుంటుంది. ఇప్పుడు II వ శాఖ పెట్టుబడిదార్ల చేతిలో ఇంతకు ముందులాగే డబ్బు రూపంలో 500 పౌండ్లు, స్థిర పెట్టుబడి రూపంలో 2,000 పౌండ్లు వున్నాయి. ఈ 2,000 పౌండ్ల మొత్తం సరుకు పెట్టుబడి రూపం నుంచి కొత్తగా ఉత్పాదక పెట్టుబడిగా మార్చబడినది. అంటే 1,500 పౌండ్ల మొత్తంలో 5,000 పౌండ్ల విలువ గల సరుకులు చలామణి అయ్యాయి. అసలు వివరాలు ఇవి : 1) I వ శాఖ పెట్టుబడిదారు 1,000 పౌండ్లు తన కార్మికులకు అదే విలువ గల వారి శ్రమశక్తికిగాను చెల్లిస్తాడు. 2) కార్మికులు ఈ 1,000 పౌండ్లతో II వ శాఖ నుంచి జీవనావసరాలు కొనుగోలు చేస్తారు; 3) II వ శాఖ ఇదే డబ్బుతో I వ శాఖ నుంచి ఉత్పత్తి సాధనాలు కొనుగోలు చేస్తుంది. ఈ చర్య ద్వారా ఒకటవ శాఖకు 7,000 పౌండ్ల మేరకు అస్థిర పెట్టుబడి డబ్బు రూపంలో పునరుద్ధరించ బడుతుంది; 4) II వ శాఖ I వ శాఖ నుంచి 500 పౌండ్ల విలువ గల ఉత్పత్తి సాధనాలు కొనుగోలు చేస్తుంది; 5) I వ శాఖ ఈ 500 పౌండ్లతో II వ శాఖ నుంచి వినియోగ సరుకులు కొంటుంది; 6) II వ శాఖ ఈ 500 పౌండ్లతో I వ శాఖ ఉత్పత్తి సాధనాలు కొంటుంది; 7) I వ శాఖ ఈ 500 పౌండ్లతో II వ శాఖ నుంచి జీవనావసరాలు కొనుగోలు చేస్తుంది. సరుకుల రూపంలో 2,000 పౌండ్లతో పాటు చలామణిలోకి తోసినట్టి 500 పౌండ్లు ఈ విధంగా తిరిగి II వ శాఖకు చేరుకుంది; ఈ 500 కు తుల్యమైన సరుకులను ఈ శాఖ చలామణి నుంచి అంతకు ముందు తీసేసుకోలేదు.[1]

కాబట్టి మార్పిడి ఈ విధంగా వుంటుంది :

1. I వ శాఖ శ్రమశక్తి కోసం డబ్బు రూపంలో 1,000 పౌండ్లు చెల్లిస్తుంది; అంటే 1,000 పౌండ్లకు తుల్యమైన సరుకులకు అది చెల్లిస్తుంది.
2. కార్మికులు తమ 1,000 పౌండ్ల వేతనంతో II వ శాఖ నుంచి వినియోగ సరుకులు కొనుగోలు చేస్తారు; అంటే 1,000 పౌండ్ల విలువ గల సరుకులు కొనుగోలు చేస్తారు.
3. II వ శాఖ, కార్మికుల నుంచి లభించిన 1,000 పౌండ్లతో I వ శాఖ నుంచి అంతే విలువ గల ఉత్పత్తి సాధనాలు, అంటే 1,000 పౌండ్లకు సమమైన సరుకులు కొనుగోలు చేస్తుంది. ఈ విధంగా I వ శాఖకు తన అస్థిర పెట్టుబడి, 1,000 పౌండ్లు డబ్బు రూపంలో తిరిగి వచ్చింది.
4. II వ శాఖ I వ శాఖ నుంచి 500 పౌండ్ల విలువ గల ఉత్పత్తి సాధనాలను, అంటే 500 పౌండ్ల విలువ గల సరుకులను కొనుగోలు చేస్తుంది.

---

1. ఇంతకుముందు ఇచ్చిన వివరణకు ఈ వివరణకు మధ్య కొద్దిగా తేడా వుంది. అక్కడ I వ శాఖ కూడా సొంతంగా 500 పౌండ్లను చలామణిలోకి ప్రవేశపెడ్తుంది. ఇక్కడేమో II వ శాఖ మాత్రమే చలామణి కోసం అదనపు డబ్బు సరఫరా చేస్తుంది. కాని ఇది అంతిమ ఫలితాన్ని మార్చదు - ఫ్రెడరిక్ ఎంగెల్స్.

5. I వ శాఖ ఈ 500 పౌండ్లతో II వ శాఖ నుంచి వినియోగ సరుకులు, అంటే 500 పౌండ్ల విలువ గల సరుకులు కొనుగోలు చేస్తుంది.
6. II వ శాఖ ఈ 500 పౌండ్లతో I వ శాఖ నుంచి ఉత్పత్తి సాధనాలు, అంటే 500 పౌండ్ల విలువ గల సరుకులు కొనుగోలు చేస్తుంది.
7. I వ శాఖ ఈ 500 పౌండ్లతో II వ శాఖ నుంచి వినియోగ సరుకులు, అంటే 500 పౌండ్ల విలువ గల సరుకులు కొనుగోలు చేస్తుంది.

మార్పిడి అయిన యావత్తు సరుకు విలువల మొత్తం 5,000 పౌండ్లు, II వ శాఖ కొనుగోలుకు గాను అడ్వాన్సు చేసిన 500 పౌండ్లు ఆ విభాగానికి వాపస్ వచ్చింది.

ఫలితం ఈ క్రింది విధంగా వుంటుంది :

1) I వ శాఖ వద్ద డబ్బు రూపంలో 1,000 పౌండ్ల మేరకు అస్థిర పెట్టుబడి వుంది. ప్రారంభంలో చలామణిలోకి అడ్వాన్సు చేసిన మొత్తం అది. దీనికి తోడుగా ఈ శాఖ తన సొంత ఉత్పాదితాల రూపంలో తన వ్యక్తిగత వినియోగం కోసం మరో 1,000 పౌండ్లు ఖర్చుపెట్టింది; అంటే ఉత్పత్తి సాధనాలు అమ్మగా వచ్చిన 1,000 పౌండ్లు అది అలా ఖర్చు పెట్టిందన్న మాట.

కాగా మరోవైపు, డబ్బు రూపంలో వున్న అస్థిర పెట్టుబడి పరివర్తితం కావలసి వున్న భౌతిక రూపాన్ని, అంటే శ్రమశక్తి వస్తు వినియోగం ద్వారా పోషించడం, పునరుత్పత్తి చేయడం మళ్లీ లభ్యమయ్యేలా చేయడం జరిగింది. దాని సొంతదారులు బతకడం కోసం అమ్ముకోక తప్పని వారి ఏకైక వాణిజ్య సరుకు అది. వేతన కార్మికుల, పెట్టుబడిదారుల సంబంధం ఈ విధంగా పునరుత్పత్తి అవుతుంది.

2) II వ శాఖ స్థిర పెట్టుబడి వస్తు రూపంలో భర్తీ చేయబడింది. ఆ శాఖ చలామణిలోకి అడ్వాన్స్ చేసిన 500 పౌండ్లు దానికి తిరిగి వచ్చింది.

ఇక II వ శాఖ పెట్టుబడిదార్లకు సంబంధించి, ప్రక్రియ ఇలా వుంటుంది : స–డ, వారి సరుకు – ఉత్పాదితంలోని ఒక భాగం డబ్బు రూపంగా మార్చబడుతుంది. అది తిరిగి ఆ రూపం నుంచి ఉత్పాదక పెట్టుబడి యొక్క భాగాలుగా మార్చబడుతుంది; అంటే వారికి అవసరమైన ఉత్పత్తి సాధనాల్లో ఒక భాగంగా పరివర్తన చెందుతుంది.

II వ శాఖ పెట్టుబడిదార్లు ఉత్పత్తి సాధనాల తాలూకు భాగాల కొనుగోలు కోసం అడ్వాన్స్ చేసిన 500 పౌండ్ల విషయానికి వస్తే, ఇంకా వినియోగ సరుకుల రూపంలోనే వున్న II స్థి.పె తాలూకు భాగం డబ్బు రూపం ధరిస్తుందని వారికి ఎరుకే. డ–సలో, అంటే II వ శాఖ డ తో కొన్నట్టి, I వ శాఖ స ని అమ్మినట్టి చర్యలో, II వ శాఖ డబ్బు ఉత్పాదక పెట్టుబడిలోని ఒక భాగంగా మార్చబడుతుంది. కాగా I వ శాఖ స స – డ చర్యను గడచి డబ్బుగా మారుతుంది. అయితే ఇది I వ శాఖ పెట్టుబడి – విలువలోని ఏ అంతర్భాగానికీ ప్రాతినిధ్యం వహించదు; ఇది డబ్బుగా మార్చబడినట్టి, వినియోగ సరుకులపై ఖర్చు చేయబడినట్టి అదనపు విలువకు ప్రాతినిధ్యం వహిస్తుంది.

డ – స.... ఉపె.... స, – డ, ఆవృత్తంలో, డ – స అనే ప్రథమ చర్య ఒక పెట్టుబడిదారునిది

కాగా, ఆఖరున వున్న స, – డ, చర్య (లేక అందులో కొంత) మరో పెట్టుబడిదారునిది; డను ఉత్పాదక పెట్టుబడిగా మార్చినట్టి స అన్నది, దాని అమ్మకందారునికి, (ఈ స ను అతడు డబ్బుగా మార్చుకొన్నప్పుడు) స్థిర పెట్టుబడిలోని ఒక భాగానికి ప్రాతినిధ్యం వహిస్తుందా, లేక అస్థిర పెట్టుబడిలోని ఒక భాగానికి ప్రాతినిధ్యం వహిస్తుందా లేక అదనపు విలువకు ప్రాతినిధ్యం వహిస్తుందా అనే విషయం సరుకు చలామణికి బొత్తిగా సంబంధం లేని విషయం.

తన సరుకు ఉత్పాదితంలోని అ.పె+అ.వి భాగానికి సంబంధించినంత వరకూ, I వ శాఖ చలామణిలోకి ప్రవేశపెట్టిన దానికంటే ఎక్కువ డబ్బును చలామణి నుంచి తీసుకుంది. మొదటి దఫా, దాని 1,000 పౌండ్ల అస్థిర పెట్టుబడి వాపస్ వస్తుంది; రెండవ దఫా అది 500 పౌండ్ల విలువ గల ఉత్పత్తి సాధనాలను అమ్మింది; (పైన పేర్కొన్న నెం.4 మార్పిడిని గమనించండి.) ఈ విధంగా దాని అదనపు విలువలోని సగభాగం డబ్బుగా మార్చబడింది. ఆ తర్వాత అది (నెం.6 మార్పిడి చూడండి.) మళ్ళీ 500 పౌండ్ల విలువ గల ఉత్పత్తి సాధనాలు అమ్మింది. ఇది దాని అదనపు విలువ లోని రెండవ సగభాగం. ఈ విధంగా అది మొత్తం అదనపు విలువను డబ్బు రూపంలో చలామణి నుంచి వాపస్ తీసుకుంది. కాబట్టి వరుసగా :

1) 1,000 పౌండ్లకు సమంగా వుండే అస్థిర పెట్టుబడి డబ్బుగా మార్చబడింది.
2) 500 పౌండ్లకు సమంగా వుండే అదనపు విలువలోని సగభాగం డబ్బుగా మార్చబడింది.
3) 500 పౌండ్లకు సమంగా వుండే మరో సగభాగం అదనపు విలువ కూడా డబ్బుగా మార్చబడింది;

మొత్తం 1,000 అ.పె+1,000 అ.వి డబ్బుగా మార్చబడింది. ఇది 2,000 పౌండ్లకు సమానం. I వ శాఖ 1,000 పౌండ్లను మాత్రమే చలామణిలోకి ప్రవేశపెట్టినప్పటికీ (ఇది కాక I స్థి.పె పునరుత్పత్తికి దోహదం చేసే మార్పిడులు కూడా వున్నాయి, కాని వీటి గురించి మనం తరువాత విశ్లేషిద్దాం.) అది చలామణి నుంచి దానికి రెండు రెట్లు మొత్తాన్ని వాపస్ తీసుకుంది. వాస్తవానికి అవి డబ్బుగా మారగానే అంటే, వినియోగ సరుకులకు ఖర్చు పెట్టుబడగానే అది ఇతరుల చేతుల్లోకి, II వ శాఖ చేతుల్లోకి వెళ్ళిపోతుంది. I వ శాఖ పెట్టుబడిదార్లు సరుకుల రూపంలో ఎంత విలువను చలామణిలోకి ప్రవేశపెట్టారో అంతే విలువను డబ్బు రూపంలో వాపస్ తీసుకున్నారు. ఈ విలువ అదనపు విలువే అనే వాస్తవం అంటే దాని వల్ల పెట్టుబడిదార్లకు ఎలాంటి ఖర్చు అవదు అన్న వాస్తవం ఈ సరుకుల విలువను ఏ విధంగానూ మార్చదు; సరుకు చలామణిలో విలువల మార్పిడికి సంబంధించి, పై వాస్తవానికి ఏ విధమైన ప్రాముఖ్యమూ వుండదు. డబ్బులో అదనపు విలువ ఉనికి నిజానికి తాత్కాలిక మైనది; అడ్వాన్సు చేయబడిన పెట్టుబడి రూప పరివర్తనల సందర్భంగా ధరించే అన్ని రూపాలలాగే ఇది కూడా తాత్కాలికమైనది. I వ శాఖ సరుకుల డబ్బుగా మారడానికి, ఈ డబ్బు తిరిగి II వ శాఖ సరుకులుగా మారడానికి మధ్య గల వ్యవధికంటే ఎక్కువ కాలం దాని ఉనికి కొనసాగదు.

టర్నోవర్‌లకు పట్టే వ్యవధి తక్కువగా వుంటే – లేక సరుకుల సాధారణ చలామణి దృష్ట్యా డబ్బు చలామణి ఎక్కువ వేగంగా జరిగితే – మార్పిడి అయ్యే సరుకు – విలువల చలామణికై తక్కువ డబ్బైనా చాలు వరుసగా జరిగే మార్పిడులు సంఖ్య నిర్ణీతమైనప్పుడు, ఈ డబ్బు మొత్తాన్ని చలామణి అయ్యే సరుకుల తాలూకు ధరల మొత్తం లేక విలువల మొత్తం నిర్ణయిస్తుంది. అయితే ఈ విలువల మొత్తంలో అటు అదనపు విలువ, ఇటు పెట్టుబడి విలువ ఏ నిష్పత్తిలో వుంటాయనేది ముఖ్యం కాదు.

మనం ఇచ్చిన ఉదాహరణలో I వ శాఖ వేతనాలు సంవత్సరానికి నాలుగుసార్లు చెల్లించబడినట్లయితే, నాలుగు 250లు, అంటే 1,000 అవసరం. కనుక I అ.పె, II స్థి.పె చలామణికి, I అ.పె అస్థిర పెట్టుబడి I శ్రమశక్తి మధ్య చలామణికి 250 పౌండ్ల డబ్బు చాలునన్నమాట. అదే విధంగా I అ.పె, II స్థి.పె మధ్య చలామణి నాలుగు టర్నోవర్‌లలో జరిగినట్లయితే, 250 పౌండ్లు మాత్రం చాలు. లేక 5,000 పౌండ్ల సరుకుల చలామణికి మొత్తం 500 పౌండ్ల డబ్బు పెట్టుబడి మాత్రమే సరిపోతుంది. అప్పుడు అదనపు విలువ వరుసగా నాలుగుసార్లు డబ్బుగా మార్పు చెందుతుంది; అంటే ఒక్కో దఫా సగభాగం చొప్పున వరుసగా రెండుసార్లు కాకుండా, ఒక్కోసారి నాలుగింట ఒక వంతు చొప్పున వరుసగా నాలుగుసార్లు డబ్బుగా మార్పు చెందుతుంది.

నెం.4 మార్పిడిలో II వ శాఖకు బదులుగా I వ శాఖ కొనుగోలుదారుగా వ్యవహరించి, 500 పౌండ్లను దానికి సమానమైన వినియోగ సరుకుల కోసం వెచ్చించినట్లయితే, II వ శాఖ నెం. 5 మార్పిడిలో అదే 500 పౌండ్ల మొత్తంలో ఉత్పత్తి సాధనాలు కొనుగోలు చేస్తుంది. నెం. 6 మార్పిడిలో అదే 500 పౌండ్ల మొత్తంతో I వ శాఖ వినియోగ సరుకులు కొనుగోలు చేస్తుంది. నెం. 7 మార్పిడిలో II వ శాఖ అదే 500 పౌండ్ల మొత్తంలో ఉత్పత్తి సాధనాలు కొనుగోలు చేస్తుంది. ఫలితంగా చివరకు 500 పౌండ్లు I వ శాఖకు తిరిగి వస్తుంది; మనమిచ్చిన ఉదాహరణలో II వ శాఖకు 500 పౌండ్లు తిరిగి వచ్చినట్లుగా. ఇక్కడ పెట్టుబడిదారీ ఉత్పత్తిదారులు తమ వ్యక్తిగత వినియోగం కోసం డబ్బు ఖర్చు పెట్టడం ద్వారా అదనపు విలువ డబ్బుగా మార్చబడింది. ఈ డబ్బు రానున్న ఆదాయానికి ప్రాతినిధ్యం వహిస్తుంది. ఇంకా అమ్మకం కావలసిన సరుకుల్లో వున్న అదనపు విలువ నుంచి అందనున్న ఆదాయమిది. 500 పౌండ్లు తిరిగి రావడం వల్ల ఈ అదనపు విలువ డబ్బుగా మారలేదు. ఎందుచేతనంటే, I అ.పె సరుకుల రూపంలోని 1,000 పౌండ్లతో పాటు I వ శాఖ నెం.4 మార్పిడి ముగింపులో చలామణిలోకి 500 పౌండ్ల డబ్బును ప్రవేశపెట్టింది. మనకు తెలిసినంత వరకూ ఇది అదనపు డబ్బే తప్ప, సరుకుల అమ్మకం ద్వారా లభించింది కాదు. ఈ డబ్బు గనక I వ శాఖ అదనపు విలువ డబ్బుగా మారే క్రమం I అ.వి సరుకుల అమ్మకం ద్వారా మాత్రమే సంభవిస్తుంది; ఆ సరుకుల్లోనే అ.వి నిక్షిప్తమై వుంది. ప్రతిసారి, ఇలా సరుకుల అమ్మకం ద్వారా లభించిన డబ్బు వినియోగ సరుకుల కోసం మళ్ళీ ఖర్చు పెట్టబడేదాకా మాత్రమే ఆ అదనపు విలువ ఉనికిలో వుంటుంది.

I వ శాఖ అదనపు డబ్బులో II వ శాఖ నుంచి వినియోగ సరుకులు కొనుగోలు చేస్తుంది. I వ శాఖ ఈ డబ్బును ఖర్చు చేస్తుంది; ఇప్పుడు I వ శాఖ వద్ద II వ శాఖ సరుకులున్నాయి. ఇవి ఆ డబ్బుకు సమతుల్యం. I వ శాఖ నుంచి 500 పౌండ్ల విలువ గల సరుకులను II వ శాఖ కొనడం ద్వారా ఈ డబ్బు ప్రప్రథమంగా I వ శాఖకు వాపస్ వస్తుంది. ఇంకో విధంగా చెప్పాలంటే, I వ శాఖ అమ్మిన సరుకులకు సమతుల్యంగా అది వాపస్ వస్తుంది. అయితే ఈ సరుకుల కోసం I వ శాఖకు ఎలాంటి ఖర్చూ కాదు; అవి I వ శాఖకు అదనపు విలువ. ఈ విధంగా ఈ శాఖ చలామణిలోకి ప్రవేశపెట్టిన డబ్బే దాని అదనపు విలువను డబ్బుగా మార్చుతుంది. I వ శాఖ నుంచి రెండవసారి కొనుగోలు చేయడం ద్వారా (నెం. 6), II వ శాఖ నుంచి ఉత్పత్తి సాధనాలు కొనుగోలు చేయదని (నెం. 7) అనుకుందాం. అప్పుడు I వ శాఖ వినియోగ సరుకుల కోసం 1,000 పౌండ్లు చెల్లించి వుండేది; తద్వారా అది తన యావత్ అదనపు విలువను ఆదాయంగా ఖర్చు పెట్టి వుండేది. అంటే,

తన సొంత సరుకుల (ఉత్పత్తి సాధనాల) రూపంలో 500 పౌండ్లు, మరో 500 పౌండ్లు డబ్బు రూపంలోనూ ఖర్చు పెట్టి వుండేది. కాగా మరోవైపు నిలువలో వున్న తన సొంత సరుకుల (ఉత్పత్తి సాధనాలు) రూపంలో 500 పౌండ్లు మిగిలే వుండేవి. కాని డబ్బు రూపంలోని 500 పౌండ్లు మాత్రం ఖర్చయి వుండేవి.

దీనికి భిన్నంగా II వ శాఖ తన స్థిర పెట్టుబడిలో నాలుగింట మూడు వంతులను సరుకు – పెట్టుబడి రూపం నుంచి ఉత్పాదక పెట్టుబడిగా మార్చి వుండేది; కాని నాలుగింట ఒక వంతు (500 పౌండ్లు) మాత్రం డబ్బు – పెట్టుబడి రూపంలో – వాస్తవంలో, చేతిలో ఊరికే వుండిపోయిన డబ్బుగా, లేక ఎలాంటి క్రియా నిర్వర్తించకుండా అనామతులోని డబ్బుగా కానీ వుంచుకొందన్న మాట. ఈ పరిస్థితి కొంత కాలం పాటు కొనసాగినట్లయితే, II వ శాఖ తన పునరుత్పత్తి స్థాయిని నాల్గో వంతు మేరకు తగ్గించుకోక తప్పదు.

అయితే, I వ శాఖ చేతుల్లో ఉత్పత్తి సాధనాల రూపంలో వున్న 500 పౌండ్లు సరుకుల రూపంలో వున్న అదనపు విలువ కాదు; అవి డబ్బు రూపంలో అడ్వాన్సు చేయబడిన 500 పౌండ్ల స్థానంలో ఉన్నాయి. I వ శాఖ వద్ద సరుకుల రూపంలోని 1,000 పౌండ్ల అదనపు విలువతో పాటుగా వుండిన మొత్తమిది. డబ్బు రూపంలో అయితే, దాన్ని ఎప్పుడైనా మార్చుకోవచ్చు. అయితే సరుకులుగా మాత్రం అవి తక్షణమే అమ్ముకోడానికి వీల్లేనివి. దీనివల్ల ఈ క్రింది విషయం స్పష్టమవుతుంది. I, II శాఖలు రెంటిలోనూ ఉత్పాదక పెట్టుబడిలోని ప్రతి అంశమూ సామాన్య పునరుత్పత్తిలో భర్తీ కావలసి వుంటుంది కనుక, I వ శాఖ మొదట ఎగరేసిన 500 బంగారు పక్షులు ఆ శాఖకు తిరిగి చేరుకుంటేనే సామాన్య పునరుత్పత్తి ఈ సందర్భంలో సాధ్యపడుతుంది.

పెట్టుబడిదారు తన డబ్బును వినియోగ సరుకులపై ఖర్చు పెడితే ఆ డబ్బునిక అతడు పూర్తిగా కోల్పోయినట్లే. అది గోడకు కొట్టిన సున్నంతో సమానం. (ఇప్పటికీ మనం ఇక్కడ ప్రస్తావిస్తున్నది పారిశ్రామిక పెట్టుబడిదార్ల గురించే, అందరికీ వీరే ప్రాతినిధ్యం వహిస్తారు.) పెట్టుబడిదారు సరుకుల మార్పిడిలో, అంటే తన సరుకు – పెట్టుబడి మార్పిడిలో తన డబ్బును చలామణి నుంచి బయటకు లాగినప్పుడే అతడికి తిరిగి వస్తుంది. అతడి యావత్ వార్షిక సరుకు ఉత్పాదితం యొక్క (అతడి సరుకు – పెట్టుబడి యొక్క) విలువ ఏ విధంగా స్థిర పెట్టుబడి – విలువగానూ, అస్థిర పెట్టుబడి – విలువగానూ, అదనపు విలువగానూ విభజింపబడుతుందో అదే విధంగా ప్రతి వ్యష్టి సరుకు యొక్క విలువ కూడా, అతనికి సంబంధించినంత వరకు ఈ మూడు భాగాలుగా విభజింపబడుతుంది. ఫలితంగా ప్రతి వ్యష్టి సరుకూ (సరుకు ఉత్పాదితంలోని ఈ భాగాలు) డబ్బుగా పరివర్తన చెందడం, ఆ కారణాన, అదే యావత్ సరుకు – ఉత్పాదితంలో నిక్షిప్తమై వున్న అదనపు విలువలోని కొంత భాగం అదే సమయంలో డబ్బుగా పరివర్తన చెందడమే. కాబట్టి, ప్రస్తుత సందర్భంలో వాస్తవంగా జరిగింది ఏమిటంటే, పెట్టుబడిదారు స్వయంగా తన డబ్బును చలామణిలోకి ప్రవేశపెట్టడంతో – వినియోగ సరుకులపై వ్యయం చేయడం ద్వారా అలా చేసినప్పుడు – అతడి అదనపు విలువ డబ్బుగా మారింది, లేదా అతడికి వాపస్ వచ్చింది. అదే నాణాలు అతనికి తిరిగి వచ్చాయని కాదు; అతడు అంతకు మునుపు తన వ్యక్తిగత అవసరాల నిమిత్తం చలామణిలోకి ప్రవేశపెట్టిన దానికి (లేదా అందులో కొంత మొత్తానికి) సమంగా వున్న కొంత నగదు మొత్తం తిరిగి వచ్చిందన్నమాట.

ఇది ఆచరణలో రెండు పద్ధతుల్లో జరుగుతుంది. వ్యాపారం గనక ఇటీవలే ప్రారంభమై వుంటే, అంటే వర్తమాన సంవత్సరంలోనే ప్రారంభమై వుంటే, ఆ పెట్టుబడిదారు తన వ్యాపారం తాలూకు ఆదాయంలో కొంత భాగాన్ని తన వ్యక్తిగత వినియోగం కోసం ఖర్చు పెట్టగలిగేందుకు చాలా కాలం పడుతుంది. కనీసం కొన్ని మాసాలైనా పడుతుంది. అయితే అంతమాత్రాన అతడు క్షణంపాటు కూడా తన వ్యక్తిగత వినియోగాన్ని ఆపడు. భవిష్యత్తులో అదనపు విలువ వస్తుందన్న ఆశాభావంతో అతడు తనకు తానే డబ్బు – అడ్వాన్స్ చేసుకుంటాడు. (అతడు తన జేబు నుంచి అలా చేస్తాడా, లేక ఇతరుల నుంచి పరపతి తీసుకుని అలా చేస్తాడా అన్నది ఇక్కడ ముఖ్యం కాదు.) అయితే అలా చేయడంలో అతడు ఉత్తరోత్తరా అదనపు విలువను పొందేందుకు ఉపకరించే చలామణి సాధనాన్ని కూడా అడ్వాన్స్ చేస్తాడు. అలాకాక – దీర్ఘ కాలంగా వ్యాపారం క్రమబద్ధంగా జరుగుతూ ఉన్నట్లయితే, సంవత్సరం పొడుగునా వివిధ వ్యవధుల్లో చెల్లింపులూ, ఆదాయాలు పంపిణీ అవుతాయి. కాని ఒకటి మాత్రం నిరంతరాయంగా కొనసాగుతుంది. అది పెట్టుబడిదారు యొక్క వినియోగం; ఈ వినియోగం భవిష్యత్తులో ఆదాయం వస్తుందన్న ఎరుకతో జరుగుతుంది. దాని పరిమాణాన్ని సాంప్రదాయకమైన, లేదా అంచనా వేయబడిన ఆదాయంలోని ఒక నిర్దిష్ట భాగం నిర్ణయిస్తుంది. సరుకుల్లోని ప్రతి భాగమూ అమ్మబడినపుడల్లా, ఏటా ఉత్పత్తి కానున్న అదనపు విలువలో కొంత భాగం కూడా చేతికందుతుంది. అయితే సరుకులో ఉన్న స్థిర పెట్టుబడి విలువనూ, అస్థిర పెట్టుబడి విలువనూ మళ్ళీ భర్తీ చేయడానికి అవసరమైనన్ని సరుకులు మాత్రమే మొత్తం సంవత్సరంలో అమ్ముడు పోయినట్లయితే, లేక ధరలు బాగా పడిపోయి, యావత్ వార్షిక సరుకు ఉత్పాదితంలో గల పెట్టుబడి విలువ మాత్రమే ఆ అమ్మకాల ద్వారా లభించినట్లయితే, అప్పుడు, ఈ డబ్బు వ్యయం భవిష్యత్తులో అదనపు విలువనాశించి చేసినదనే సంగతి స్పష్టంగా బోధపడుతుంది. మన పెట్టుబడిదారు దివాలా తీసినట్లయితే, అతడు భవిష్యత్తులో ఆదాయాన్ని ఆశించి చేసిన వ్యక్తిగత వ్యయం, అతని మొత్తం వ్యాపార పరిమాణానికీ దానికి మామూలుగా తగినట్లు చేతికందే అదనపు విలువకూ అనుగణమైన నిష్పత్తిలో వుందా అన్న విషయంపై అతని రుణదాతలూ, న్యాయాధిపతీ దర్యాప్తు జరుపుతారు.

మొత్తం పెట్టుబడిదారీ వర్గానికి సంబంధించి, అది తన అదనపు విలువను రాబట్టుకోడానికి (తన స్థిర, అస్థిర పెట్టుబడుల చలామణి కోసం కూడా) అవసరమైన డబ్బును అదే స్వయంగా చలామణిలోకి ప్రవేశపెట్టాల్సి వుంటుందనే ప్రతిపాదన అసంబద్ధమైనదిగా కనిపించకపోవడమే కాక, ఈ యావత్ యంత్రాంగానికీ తప్పనిసరియైన షరతుగా ముందుకొస్తుంది. ఎందుచేతనంటే ఇక్కడ రెండే రెండు వర్గాలున్నాయి : తన శ్రమశక్తిని మాత్రమే అమ్ముకునే కార్మికవర్గమూ, ఉత్పత్తికి సంబంధించిన సామాజిక సాధనాలపైనా, డబ్బుపైనా గుత్తాధిపత్యం గల పెట్టుబడిదారీ వర్గమూ. కార్మికవర్గం గనుక సరుకులలోని అదనపు – విలువ చేతికందడానికి అవసరమైన డబ్బును తన సొంత వనరుల నుంచే తొలుత అడ్వాన్స్ చేసినట్లయితే అది అసంబద్ధత అవుతుంది. కానీ, వ్యష్టి పెట్టుబడిదారే ఆ విధంగా అడ్వాన్స్ చేస్తాడు; వినియోగ సరుకుల కొనుగోలుకు డబ్బు ఖర్చు పెట్టడం వల్లనూ, లేదా తన ఉత్పాదక పెట్టుబడి యొక్క అంగాలను (అవి శ్రమశక్తి కావచ్చు లేక ఉత్పత్తి సాధనాలు కావచ్చు) కొనుగోలు చేయడానికి డబ్బును అడ్వాన్స్ చేయడం వల్లనూ అతడు కొనుగోలుదారుగా వ్యవహరించడం ద్వారా అడ్వాన్సు చేస్తాడు. తన డబ్బుకు తుల్యమైనది వస్తే తప్ప

అతడు తన డబ్బును జారవిడుచుకోడు. అతడు చలామణిలోకి సరుకులను తోసినట్లే, డబ్బు కూడా చలామణిలోకి తోస్తాడు. అతడు రెండు సందర్భాల్లోనూ వాటి చలామణికి ప్రారంభ స్థానంగా వ్యవహరిస్తాడు.

రెండు పరిస్థితుల మూలంగా ఈ వాస్తవ ప్రక్రియ కనుమరుగవుతోంది :

1) పారిశ్రామిక పెట్టుబడి తాలూకు చలామణి ప్రక్రియలో వ్యాపారం పెట్టుబడి (వ్యాపారి పెట్టుబడి ప్రథమ రూపం ఎల్లప్పుడూ డబ్బు రూపంలోనే వుంటుంది. ఎందుచేతనంటే వ్యాపారి "ఉత్పాదితాన్ని" కాని "సరుకును" కాని సృష్టించడు.) ఒక ప్రత్యేక రకానికి చెందిన పెట్టుబడిదార్ల కార్యతంత్ర సాధనంగా డబ్బు పెట్టుబడి ఆవిర్భవించడం. 2) ఎల్లప్పుడూ మొదట పారిశ్రామిక పెట్టుబడిదారు చేతుల్లోనే ఉండే అదనపు విలువ వివిధ అభివర్గాలుగా విభజింపబడటం పారిశ్రామిక పెట్టుబడితో పాటు, భూస్వామి (భూమి కౌలుకు), వడ్డీ వ్యాపారి (వడ్డీకి), ప్రభుత్వమూ, ప్రభుత్వ ఉద్యోగులు, అద్దెకిచ్చేవారు మొదలైన వారు సైతం అదనపు విలువ యొక్క అభివర్గాల వాహకులుగా రంగంపైకి వస్తారు. ఈ పెద్దమనుషులంతా పారిశ్రామిక పెట్టుబడిదారు పట్ల కొనుగోలుదార్లుగా వ్యవహరిస్తారు. ఆ మేరకు వారు పారిశ్రామిక పెట్టుబడిదారు సరుకులను డబ్బుగా మార్చే పరివర్తన దార్లుగా వ్యవహరిస్తారు; వారు కూడా చలామణిలోకి తమ తమ భాగాల మేరకు డబ్బు ప్రవేశపెడ్తారు; పారిశ్రామిక పెట్టుబడిదారుకు వారినుంచే డబ్బు లభిస్తుంది. అయితే వారు మొట్టమొదట ఎక్కడ నుంచి ఈ డబ్బు పొందారు? ఎక్కడనుంచి వారికి మళ్ళీ మళ్ళీ ఆ డబ్బు వస్తూంది? అనే విషయం ఎల్లప్పుడూ విస్మరింపబడుతూనే వుంది.

## VI. Iవ శాఖ స్థిర పెట్టుబడి[1]

4,000 స్థి.పె మేరకు I వ శాఖ స్థిర పెట్టుబడిని విశ్లేషించే కర్తవ్యం మనకింకా మిగిలే వుంది. I వ శాఖ సరుకులను సృష్టించడంలో వ్యయమైన ఉత్పత్తి సాధనాల విలువకు ఈ విలువ సమంగా వుంటుంది. I వ శాఖ సరుకు – ఉత్పాదితంలో ఈ విలువ కొత్తగా దర్శనమిస్తుంది. ఈ విలువ I వ శాఖ ఉత్పత్తి ప్రక్రియలో ఉత్పత్తి అయినది కాదు. అంతకు మునుపటి సంవత్సరంలో అందులోకి స్థిర విలువగా, దాని ఉత్పాదక సాధనాల నిర్ణీత విలువగా ప్రవేశించింది; ఇప్పుడు I వ శాఖ సరుకుల్లో, II వ శాఖ గ్రహించని భాగమంతటిలో నిక్షిప్తమై వుంది. ఈ విధంగా I వ విభాగపు పెట్టుబడిదారుల చేతుల్లోనే మిగిలిపోయిన ఈ సరుకుల పరిమాణం విలువ, ఆ పెట్టుబడిదారుల సమస్త వార్షిక సరుకు – ఉత్పాదితం విలువలో మూడింట రెండు వంతుల విలువకు సమంగా వుంటుంది. ఏవో కొన్ని నిర్దిష్ట ఉత్పత్తి సాధనాలను ఉత్పత్తిచేసే వ్యష్టి పెట్టుబడిదారుల విషయంలో మనం ఇలా చెప్పవచ్చు. అతడు తన సరుకు ఉత్పాదితాన్ని అమ్ముతాడు; దానినతడు డబ్బుగా మార్చుకొంటాడు. ఆ డబ్బుగా మార్చడం ద్వారా తన ఉత్పాదితం విలువలోని స్థిర భాగాన్ని కూడా డబ్బుగా తిరిగి మార్చాడు. ఇలా డబ్బుగా మార్చబడిన ఆ విలువ భాగంతో అతడు సరుకులను అమ్మే ఇతరుల నుంచి ఉత్పత్తి సాధనాలను మళ్ళీ కొనుగోలు చేస్తాడు, లేదా తన ఉత్పాదితం విలువలోని

1. ఇక్కడ నుంచి II వ రాతప్రతి - ఫ్రెడరిక్ ఎంగెల్స్.

స్థిర భాగాన్ని పాదార్థిక రూపంలోకి అంటే అది ఉత్పాదక స్థిర పెట్టుబడిగా తన క్రియను తిరిగి కొనసాగించే స్థితిలో వుండే భౌతిక రూపంలోకి మార్చుతాడు. కాని, ఇప్పుడు ఈ ఊహకు ఆస్కారమే లేకుండాపోతుంది. I వ శాఖ పెట్టుబడిదారీ వర్గం కిందికి, ఉత్పత్తి సాధనాలను ఉత్పత్తి చేసే పెట్టుబడిదారులందరూ మొత్తంగా వస్తారు. పైగా, వారి చేతుల్లో మిగిలిపోయిన 4,000 సరుకు – ఉత్పాదితం సామాజిక ఉత్పాదితంలోని ఒక భాగం. అది సామాజిక ఉత్పాదితంలోని మరే భాగంతోనూ మార్పిడి కాజాలదు. ఎందుచేతనంటే, వార్షిక ఉత్పాదితంలో ఇలాంటి మరో భాగమేదీ లేదు. ఈ 4,000 మినహా తతిమ్మాదంతా ఖర్చయిపోయింది. ఒక భాగమేమో సామాజిక వినియోగ నిధిలోకి వెళ్ళిపోయింది. మరో భాగం II వ శాఖ స్థిర పెట్టుబడి స్థానాన్ని భర్తీ చేయవలసి వుంది. II వ శాఖ తాను అమ్ముకోగల ప్రతి ఒక్కదాన్ని I వ శాఖతో మార్పిడిలో ఇదివరకే మార్పిడి చేసుకొంది.

I వ శాఖ సమస్త సరుకు – ఉత్పాదితమూ భౌతిక రూపంలో వున్న ఉత్పత్తి సాధనాలే అనే సంగతిని మనం గుర్తుంచుకుంటే, ఈ చిక్కు తేలిగ్గా పరిష్కారమైపోతుంది. ఇంతకు మునుపు II వ శాఖలో మనకగుపించిన సంఘటనే ఇక్కడ కూడా కనిపిస్తున్నది; కాకపోతే అది ఇక్కడ మరో విధంగా కనిపిస్తున్నది. II వ శాఖలో సమస్త సరుకు – ఉత్పాదితమూ వినియోగ వస్తువులే. కాబట్టి అందులో వేతనాలూ, అదనపు విలువా ఈ రెంటి మొత్తానికి సమమైన ఒక భాగాన్ని దాని ఉత్పత్తిదారులే వినియోగించుకోగలరు. కాగా I వ శాఖ విషయంలో, సమస్త ఉత్పాదితము ఉత్పత్తి సాధనాల రూపంలో, అంటే భవనాలు, యంత్రాలు, పాత్రలు, ముడిపదార్థాలు, అనుబంధ పదార్థాలు వగైరా రూపంలో వుంటుంది. వీటిలో ఒక భాగం, అంటే ఈ శాఖలో నియుక్తమైన స్థిర పెట్టుబడిని భర్తీ చేసే భాగం, తన పాదార్థిక రూపంలో, ఉత్పాదక పెట్టుబడి అంతర్భాగంగా, నేరుగా తన విధిని కొత్తగా నిర్వర్తించ గలుగుతుంది. అది చలామణిలో ప్రవేశించిన మేరకు, I వ శాఖ పరిధిలోనే చలామణి అవుతుంది. II వ శాఖలో సరుకు – ఉత్పాదితంలోని ఒక భాగాన్ని పాదార్థిక రూపంలో దాని సొంత ఉత్పత్తిదారులే వ్యక్తిగతంగా వినియోగించుకుంటారు; కాగా I వ శాఖ ఉత్పాదితంలోని ఒక భాగాన్ని దాని పాదార్థిక రూపంలో ఆ శాఖ వినియోగమైన స్థిర పెట్టుబడి, ఆ శాఖ సరుకు పెట్టుబడిదారీ ఉత్పత్తిదార్లే ఉత్పాదాత్మకంగా వినియోగించుకుంటారు.

I వ శాఖ వినియోగమైన స్థిర పెట్టుబడి, ఆ శాఖ సరుకు పెట్టుబడిలో 4,000స్థి.పెకి సమమైన భాగంలో పునర్దర్శనమిస్తుంది. ఉత్పాదక స్థిర పెట్టుబడిగా తన విధిని నేరుగా తిరిగి ప్రారంభించగలిగే పాదార్థిక రూపంలో అది అలా పునర్దర్శనమిస్తుంది. ఇక II వ శాఖకు చెందిన 3,000 సరుకు – ఉత్పాదితంలో వేతనాలూ + అదనపు విలువకు (1000కు) సమానంగా వున్న భాగం ఆ శాఖ పెట్టుబడిదార్ల, కార్మికుల వ్యక్తిగత వినియోగంలోకి నేరుగా వెళ్ళిపోతుంది; ఈ సరుకు – ఉత్పాదితంలోని స్థిర పెట్టుబడి – విలువ (2,000కు సమానమైనది) మాత్రం II వ శాఖ పెట్టుబడిదార్ల ఉత్పాదక వినియోగంలోకి మళ్లీ ప్రవేశించలేదు. I వ శాఖతో మార్పిడి ద్వారా దీన్ని భర్తీ చేయవలసి వుంది.

ఇందుకు భిన్నంగా, I వ శాఖకు చెందిన 6,000 సరుకు – ఉత్పాదితంలో, వేతనాలూ + అదనపు విలువకు సమానంగా (2,000కు సమానంగా) వున్న భాగం దాని ఉత్పత్తిదార్ల వ్యక్తిగత వినియోగంలోకి ప్రవేశించదు; అందుకు కారణం ఆ భాగం దాని పాదార్థిక రూపంలో వుండటమే.

ఆ భాగం మొదట II వ శాఖతో మార్పిడి కావాలి. మరోవైపు ఈ ఉత్పాదితం విలువలో 4,000కు సమానంగా వున్నట్టి స్థిర భాగం తన పాదార్థిక రూపంలో వుంటుంది కాబట్టి, ఆ శాఖకు చెందిన పెట్టుబడిదారీ వర్గం యొక్క స్థిర పెట్టుబడిగా వెంటనే తన విధిని తిరిగి ప్రారంభించగలదు. (ఇక్కడ I వ శాఖ పెట్టుబడిదారీ వర్గాన్ని మొత్తంగా పరిగణనలోకి తీసుకుంటున్నాము.) ఇంకో విధంగా చెప్తే, I వ శాఖ సమస్త ఉత్పాదితమూ ఉపయోగ – విలువలే: ఇవి తమ పాదార్థిక రూపంలో వున్నాయి కనుక, పెట్టుబడిదారీ విధాన ఉత్పత్తిలో స్థిర పెట్టుబడి తాలూకు భాగాలుగా మాత్రమే ఉపకరించగలవు. అందుచేత ఈ 6,000 ఉత్పాదితంలోని మూడింట ఒక వంతు అంటే 2,000, IIవ శాఖ యొక్క స్థిర పెట్టుబడి స్థానాన్ని భర్తీ చేస్తుంది; కాగా మిగిలిన మూడింట రెండు వంతులేమో I వ శాఖ స్థిర పెట్టుబడి స్థానాన్ని భర్తీ చేస్తుంది.

స్థిర పెట్టుబడి I లో, ఉత్పత్తి సాధనాలను ఉత్పత్తి చేసే వివిధ ఉపశాఖల్లో మదుపు పెట్టిన అనేకానేక పెట్టుబడి సముదాయాలుంటాయి. కొంత ఇనుప కర్మాగారాల్లో, కొంత బొగ్గు గనుల్లో ఇలా వివిధ ఉపశాఖల్లో ఇది మదుపు పెట్టబడి వుంటుంది. మళ్ళీ ఈ ప్రతి పెట్టుబడి సముదాయాల్లోనూ, లేక ఈ ప్రతి సామాజిక పెట్టుబడి సముదాయంలోనూ తమ విధులను స్వతంత్రంగా నిర్వహించే అనేక చిన్న, పెద్ద వ్యష్టి పెట్టుబడులుంటాయి. మొదటి విషయం, సామాజిక పెట్టుబడిలో ఉదాహరణకు 7,500 లో (ఇది మిలియన్లలో వుండవచ్చు) వివిధ పెట్టుబడి సముదాయాలు వుంటాయి; 7,500ల సామాజిక పెట్టుబడి ప్రత్యేక భాగాలుగా విభజింపబడి వుంటుంది. ప్రతి భాగమూ ప్రత్యేక ఉత్పత్తి ఉపశాఖలో మదుపు పెట్టబడి వుంటుంది. ఒక నిర్దిష్ట ఉత్పత్తి ఉపశాఖలో మదుపు పెట్టబడిన సామాజిక పెట్టుబడి – విలువ తాలూకు ప్రతి భాగంలోనూ, దాని పాదార్థిక రూపానికి సంబంధించినంత వరకు, ఆ నిర్దిష్ట ఉత్పత్తి రంగానికి అవసరమైన ఉత్పత్తి సాధనాలు కొంతా, ఆ వ్యాపారంలో అవసరమైనట్టి అందుకు అనుగుణంగా శిక్షణ పొందినట్టి శ్రమశక్తి కొంతా వుంటాయి. ప్రతి వ్యష్టి ఉత్పత్తి ఉపశాఖలోనూ అవసరమైన ప్రత్యేక తరహా శ్రమను బట్టి శ్రమ విభజనచే మార్పు చెందిన శ్రమశక్తి అది. కాగా ఏ ఉత్పత్తి శాఖలోనైనా మదుపు పెట్టిన సామాజిక పెట్టుబడి తాలూకు ప్రతి భాగమూ ఆ శాఖలో స్వతంత్రంగా తమ విధులను నిర్వహించే వ్యష్టి పెట్టుబడుల సమాహారం. ఈ వాస్తవం I వ శాఖకూ, II వ శాఖకూ వర్తిస్తుందనేది స్పష్టమే.

ఇక I వ శాఖలో దాని సరుకు ఉత్పాదితం రూపంలో పునర్దర్శనమిచ్చే స్థిర పెట్టుబడి – విలువ విషయం : అందులో కొంత భాగం ఉత్పత్తి సాధనాలుగా తనకు సంబంధించిన ఉత్పత్తి రంగంలోకి (లేక వ్యష్టి వ్యాపారంలోకి కూడా) మళ్ళీ ప్రవేశిస్తుంది. ఉదాహరణకు ధాన్యం ఉత్పత్తిలో ధాన్యం, బొగ్గు ఉత్పత్తిలో బొగ్గు, ఇనుము ఉత్పత్తిలో యంత్రాల రూపంలోని ఇనుము, ఇలా, ప్రతి ఉత్పాదితం తన ఉత్పత్తి రంగంలోనికి ప్రవేశిస్తుంది.

అయితే, I వ శాఖ స్థిర పెట్టుబడి – విలువగా వున్న పాక్షిక ఉత్పాదితాలు మాత్రం తమ తమ నిర్దిష్ట ఉత్పత్తి రంగంలోకి కానీ, వ్యష్టి ఉత్పత్తి రంగంలోకి కానీ నేరుగా తిరిగి రావు. వాటి స్థానం మారుతుంది, అంతే. అవి తమ సహజ పాదార్థిక రూపంలో I వ శాఖలోని ఇతర ఉత్పత్తి రంగంలోకి ప్రవేశిస్తాయి. వీటి స్థానంలో I వ శాఖకు చెందిన ఇతర ఉత్పత్తి రంగాల ఉత్పాదితం తమ పాదార్థిక రూపంలో ప్రవేశిస్తుంది. ఇక్కడ ఈ ఉత్పాదితాల స్థానభ్రంశం మాత్రమే జరుగుతున్నది. అవన్నీ

కూడా I వ శాఖలోని స్థిర పెట్టుబడిని భర్తీ చేసే కారకాలుగా మళ్ళీ ప్రవేశిస్తాయి; అయితే అవి I వ శాఖకు చెందిన అదే సముదాయంలోకి కాక వేరే సముదాయంలోకి ప్రవేశిస్తాయి. ఇక్కడ I వ శాఖ వ్యష్టి పెట్టుబడిదారుల మధ్య మార్పిడి జరుగుతున్నది కాబట్టి స్థిర పెట్టుబడి తాలూకు ఒక పాదార్థిక రూపంతో మరో పాదార్థిక రూపం మార్పిడి అవుతుందన్న మాట; అంటే ఒక రకపు ఉత్పత్తి సాధనాలతో మరోరకపు ఉత్పత్తి సాధనాలు మార్పిడి అవుతున్నాయి. ఇది I వ శాఖ స్థిర పెట్టుబడిలోని వేరు వేరు భాగాల మధ్య జరుగుతున్న పరస్పర మార్పిడి మాత్రమే. తమ సొంత రంగంలో నేరుగా ఉత్పత్తి సాధనాలుగా ఉపకరించని ఉత్పాదితాలు తమ ఉత్పత్తి స్థానం నుంచి మరో ఉత్పత్తి స్థానానికి బదలాయించబడతాయి. ఆ విధంగా తమ స్థానాలను పరస్పరం మార్చుకొంటాయి. ఇంకో విధంగా చెప్తే (IIవ శాఖ అదనపు విలువ విషయంలోలాగే) I వ శాఖకు చెందిన ప్రతి పెట్టుబడిదారూ 4,000 స్థిర పెట్టుబడిలో తన వంతుకు అనుగుణమైన నిష్పత్తిలో ఈ సరుకుల మొత్తం నుంచి తనకు అవసరమైన ఉత్పత్తి సాధనాలను తీసేసుకుంటాడు. ఇది పెట్టుబడిదారీ ఉత్పత్తి కాక సామాజీకృత ఉత్పత్తి అయి వుంటే, I వ శాఖకు చెందిన ఈ ఉత్పాదితాలు కూడా ఉత్పత్తి సాధనాలుగా ఇదే శాఖలోని వివిధ ఉప శాఖలకు పునరుత్పత్తి కోసం నిరంతరాయంగా పునఃపంపిణీ అయి వుండేవి; ఈ ఉత్పాదితాల్లో ఒక భాగం, ఏ ఉత్పత్తి రంగం నుంచి తాను ఉత్పాదితంగా బయటకు వచ్చిందో అదే ఉత్పత్తి రంగంలోనే వుండిపోతుంది. మరో భాగం ఇతర ఉత్పత్తి స్థానాలకు వెళ్ళిపోతుంది. తద్వారా, ఈ శాఖలోనే వివిధ ఉత్పత్తి స్థానాల మధ్య ఉత్పాదితాల నిరంతరాయ ఆదాన ప్రదాన క్రమం తల ఎత్తుతుంది.

## VII. రెండు శాఖల్లోనూ అస్థిర పెట్టుబడి, అదనపు - విలువ

ఈ విధంగా, ఏటా ఉత్పత్తి అయ్యే వినియోగ వస్తువుల మొత్తం విలువ కింది విలువల సమాహారానికి సమానం : సంవత్సరంలో పునరుత్పత్తి అయ్యే II వ శాఖ అస్థిర పెట్టుబడి విలువ, కొత్తగా ఉత్పత్తి అయ్యే II వ శాఖ అదనపు విలువ (అంటే సంవత్సర కాలంలో II వ శాఖ ఉత్పత్తి చేసిన విలువ). సంవత్సరంలో పునరుత్పత్తి అయ్యే I వ శాఖ అస్థిర పెట్టుబడి విలువ, కొత్తగా ఉత్పత్తి అయ్యే I వ శాఖ అదనపు – విలువ (అంటే సంవత్సర కాలంలో I వ శాఖ సృష్టించిన విలువ).

కాబట్టి సామాన్య పునరుత్పత్తి విషయంలో, ఏటా ఉత్పత్తి అయ్యే వినియోగ వస్తువుల మొత్తం విలువ వార్షిక విలువ – ఉత్పాదితానికి సమానంగా వుంటుంది; అంటే సంవత్సర కాలంలో సామాజిక శ్రమ ఉత్పత్తి చేసిన మొత్తం విలువకు సమానంగా వుంటుంది. అది అలా వుండడానికి కారణం ఏమిటంటే, సామాన్య పునరుత్పత్తిలో, ఈ సమస్త విలువా వినియోగింపబడుతుంది.

మొత్తం సామాజిక పనిదినం రెండు భాగాలుగా విభజితమవుతుంది : 1) సంవత్సర కాలంలో 1,500 అ.పె విలువను సృష్టించే ఆవశ్యక శ్రమ; 2) మరికొంత విలువను లేక అదనపు విలువ 1,500 అ.వి ని సృష్టించే అదనపు శ్రమ. ఈ రెండింటి విలువల మొత్తం, అంటే 3,000 ఏటా సృష్టించబడే 3,000 వినియోగ వస్తువుల విలువకు సమానంగా వుంటుంది. అందుచేత, సంవత్సర కాలంలో ఉత్పత్తి అయిన వినియోగ వస్తువుల మొత్తం విలువ, సంవత్సర కాలంలో మొత్తం సామాజిక పనిదినం వల్ల ఉత్పత్తి అయిన మొత్తం విలువకు, అంటే సామాజిక అస్థిర పెట్టుబడి విలువకూ ప్లస్

సామాజిక అదనపు విలువకూ లేదా సంవత్సరంలో సృష్టించబడిన మొత్తం నూతన ఉత్పాదితానికీ సమానంగా వుంటుంది.

కాని, ఈ రెండు విలువ పరిమాణాలూ సమానంగా ఉన్నప్పటికీ, II వ శాఖ సరుకులైన వినియోగ వస్తువుల మొత్తం విలువ ఈ సామాజిక ఉత్పత్తి శాఖలో ఉత్పత్తి కాలేదని మనకు తెలుసు. ఆ రెండు విలువ పరిమాణాలూ ఎందుకు సమానంగా ఉంటాయంటే, II వ శాఖలో పునర్దర్శనమిచ్చే స్థిర పెట్టుబడి విలువ II వ శాఖ కొత్తగా ఉత్పత్తి చేసే విలువకు (అస్థిర పెట్టుబడి విలువ ప్లస్ అదనపు విలువ) సమానంగా వుంటుంది. అందుచేత II వ శాఖలో ఉత్పత్తిదారుల స్థిర పెట్టుబడి – విలువకు ప్రాతినిధ్యం వహించే II వ శాఖలో ఉత్పాదితంలో ఒక భాగాన్ని I (అ.పె+అ.వి) కొనుగోలు చేయగలుగుతుంది. II వ శాఖ పెట్టుబడిదారుల ఉత్పాదితం విలువ, వారి విషయంలో స్థి.పె+అ.పె+అ.విగా విభజింపబడినప్పటికీ సామాజిక దృక్పథంలో ఆ ఉత్పాదితం విలువ అ.పె+అ.వికు సమానంగా వుండటమూ, సామాజిక ఉత్పాదితానికి చెందిన ఈ రెండు అంతర్భాగాలూ తమ పాదార్థిక రూపాలను మార్పిడి ద్వారా పరస్పరం బదలాయించుకోవడమూ ఇందుకు కారణం. పర్యవసానంగా ఈ బదలాయింపు, లేక పరివర్తన ముగిశాక II స్థి.పె మళ్లీ ఉత్పత్తి సాధనాలుగానూ, I (అ.పె+అ.వి) మళ్ళీ వినియోగ వస్తువులుగానూ ఉనికిలో వుంటాయి.

వార్షిక ఉత్పాదితం విలువ అ.పె+అ.వి గా విభజింపబడుతుందని ఆడమ్ స్మిత్ భావించడానికి, ఇదిగో, ఈ పరిస్థితే ఆయనను ప్రేరేపించింది. 1) వార్షిక ఉత్పాదితంలో వినియోగ వస్తువుల రూపంలో వున్న భాగానికి సంబంధించి మాత్రమే ఇది వాస్తవం. 2) ఈ మొత్తం విలువ II వ శాఖలో ఉత్పత్తి అవుతుందనేదీ, II వ శాఖలో అడ్వాన్సు చేయబడిన అస్థిర పెట్టుబడి ప్లస్ అదే శాఖలో ఉత్పత్తి అయ్యే అదనపు విలువకు ఆ శాఖ ఉత్పాదితం విలువ సమానంగా ఉంటుందనేదీ వాస్తవం కాదు. II (స్థి.పె +అ.పె+అ.వి) అన్నది II (అ.పె+అ.వి) + (అ.పె+అ.వి) కు సమానంగా ఉంటుందనే అర్థంలో మాత్రమే ఇది వాస్తవం; లేక II స్థి.పె అన్నది I (అ.పె+అ.వి)కు సమానం కాబట్టి మాత్రమే ఇది వాస్తవం.

దీనినుంచీ ఈ క్రింది విషయం కూడా స్పష్టమవుతుంది :

ప్రతి వ్యక్తిగత పనిదినంలాగే సామాజిక పనిదినం కూడా (అంటే మొత్తం సంవత్సరంలో యావత్ కార్మిక వర్గమూ చేసిన శ్రమ) కూడా రెండు భాగాలుగా, అంటే ఆవశ్యక శ్రమగానూ, అదనపు శ్రమగానూ మాత్రమే విభజింపబడుతుంది. ఇదే విధంగా ఈ పనిదినం ఉత్పత్తి చేసిన విలువ కూడా రెండు భాగాలుగా మాత్రమే, అంటే అస్థిర పెట్టుబడి విలువగానూ, అదనపు విలువగానూ మాత్రమే విభజింపబడుతుంది. అంటే, కార్మికుడు తన సొంత పునరుత్పత్తి సాధనాల కొనుగోలుకు వినియోగపడే విలువ భాగంగానూ, పెట్టుబడిదారు తన వ్యక్తిగత వినియోగం కోసం ఖర్చు పెట్టుకునే భాగంగానూ విభజితమవుతుంది. అయినప్పటికీ, సామాజిక దృష్టితో చూస్తే, సామాజిక పనిదినంలోని ఒక భాగం నూతన స్థిర పెట్టుబడి ఉత్పత్తికోసమే సంపూర్ణంగా వ్యయమవుతుంది. శ్రమ ప్రక్రియలో పూర్తిగా ఉత్పత్తి సాధనాల విధిని నిర్వర్తించడానికి ఉద్దేశించిన ఉత్పాదితాలపైన, అంటే శ్రమ ప్రక్రియతో పాటు సాగే విలువ స్వయం విస్తరణ ప్రక్రియలో స్థిర పెట్టుబడిగా విధిని నిర్వర్తించటానికి ఉద్దేశించిన ఉత్పాదితాలపైన వ్యయమవుతుంది. మన ఊహ ప్రకారం, మొత్తం సామాజిక పనిదినం 3,000

డబ్బు విలువకు ప్రాతినిధ్యం వహిస్తుంది; అందులో మూడింట ఒక వంతు, అంటే 1,000 మాత్రం వినియోగ సరుకులను ఉత్పత్తిచేసే II వ శాఖలో ఉత్పత్తి అవుతుంది. సమాజం యొక్క సమస్త అస్థిర పెట్టుబడి విలువా, సమస్త అదనపు విలువా అంతిమంగా ఈ సరుకుల నుంచే గ్రహించబడతాయి. ఈ విధంగా ఈ ఊహ ప్రకారం, సామాజిక పనిదినంలోని మూడింట రెండు వంతులు నూతన స్థిర పెట్టుబడి ఉత్పత్తి కోసం నియుక్తమవుతాయి. I వ శాఖ వ్యష్టి పెట్టుబడిదారుల, కార్మికుల దృక్కోణం నుంచి చూస్తే, రెండవ శాఖ సామాజిక పనిదినంలోని చివరి మూడవ వంతులాగే, I వ శాఖ సామాజిక పనిదినంలోని ఈ మూడింట రెండు వంతులు కూడా అస్థిర పెట్టుబడి – విలువ ఉత్పత్తికీ, అదనపు – విలువ ఉత్పత్తికీ మాత్రమే ఉపకరించే విషయం వాస్తవమే అయినప్పటికీ, సామాజిక దృక్కోణం నుంచీ, అలాగే ఉత్పాదితం యొక్క ఉపయోగపు విలువ దృక్కోణం నుంచీ పరిశీలిస్తే, సామాజిక పనిదినంలోని ఈ మూడింట రెండు వంతులు, ఉత్పాదక వినియోగ ప్రక్రియలోని స్థిర పెట్టుబడిని, లేక అప్పటికే వినియోగం అయిన స్థిర పెట్టుబడిని భర్తీ చేసేందుకు అవసరమైన దాన్ని మాత్రమే ఉత్పత్తి చేస్తాయి. కాగా వ్యక్తిగతంగా పరిశీలించినట్లయితే, ఈ మూడింట రెండు వంతుల భాగం, ఉత్పత్తిదారునికి అస్థిర పెట్టుబడి విలువకూ ప్లస్ అదనపు విలువకూ సమానంగా వుండే మొత్తం విలువను ఉత్పత్తి చేసినప్పటికీ, వేతనాలను లేక అదనపు విలువను ఖర్చు పెట్టడానికి వీలున్న ఉపయోగ విలువలను ఉత్పత్తి చేయదు. అందుకు కారణం దాని ఉత్పాదితాలు, ఉత్పత్తి సాధనాలు కావటమే.

మొదట ఈ క్రింది విషయం గమనించాలి : రెండు శాఖల్లోనూ నియుక్తమై, ప్రస్తుతం తన విధిని నిర్వర్తిస్తున్న స్థిర పెట్టుబడి విలువను ఉత్పత్తి చేయడానికి సామాజిక పని దినంలోని ఏ భాగమూ ఉపకరించదు; ఈ వాస్తవం రెండు శాఖలకూ వర్తిస్తుంది. ఈ రెంటిలోనూ ఉత్పత్తి అయ్యేది అదనంగా చేరే విలువ మాత్రమే; అంటే 4,000 I స్థి.పె + 2,000 II స్థి.పెకి సమానంగా వున్న స్థిర పెట్టుబడి విలువకుతోడు దానికి అదనంగా వున్న 2,000 I (అ.పె+అ.వి) + 1,000 II (అ.పె+అ.వి) విలువ మాత్రమే. ఉత్పత్తి సాధనాల రూపంలో ఉత్పత్తి అయిన ఈ నూతన విలువ ఇంకా స్థిర పెట్టుబడి స్వభావాన్ని సంతరించుకొని లేదు; అది భవిష్యత్తులో స్థిర పెట్టుబడిగా పని చేయడానికి ఉద్దేశించినదంతే.

ఉపయోగ – విలువగా పరిశీలించినట్లయితే II వ శాఖ యొక్క సమస్త ఉత్పాదితమూ – అంటే వినియోగ సరుకులు – తన పాదార్థిక రూపంలో II వ శాఖ వ్యయం చేసిన సామాజిక పని దినంలోని మూడింట ఒక వంతు యొక్క ఉత్పాదితం. ఈ శాఖలోని నేతపని, బేకింగ్ (రొట్టె, కేకుల తయారీ – అను) వగైరా నిర్దిష్ట రూపంలోని శ్రమ ఉత్పాదితం అది. శ్రమ అన్నది శ్రమ ప్రక్రియ తాలూకు స్వీయాత్మకాంశంగా వ్యవహరిస్తుంది. కాబట్టి అది ఈ శ్రమ ఉత్పాదితం. ఇక ఈ II వ శాఖ ఉత్పాదితం విలువలోని స్థిర భాగం విషయానికి వచ్చినట్లయితే, అది ఒక నూతన ఉపయోగ – విలువగా నూతన పాదార్థిక రూపంలో, అంటే వినియోగ వస్తువుల రూపంలో పునర్దర్శనమిస్తుంది; కాగా అది అంతకు ముందు ఉత్పత్తి సాధనాల రూపంలో వుండేది. శ్రమ ప్రక్రియ దాని విలువను పాత పాదార్థిక రూపం నుంచి నూతన పాదార్థిక రూపానికి బదలాయించింది. అయితే 2,000కు సమానంగా వున్న సరుకు – ఉత్పాదితం యొక్క మూడింట రెండు వంతుల విలువ IIవ శాఖలోని

వర్తమాన సంవత్సర స్వయం విస్తరణ ప్రక్రియలో ఉత్పత్తి అయింది కాదు.

శ్రమ – ప్రక్రియ దృక్కోణం నుంచి పరిశీలిస్తే, II వ శాఖ ఏ విధంగా నూతనంగా తన విధిని నిర్వహిస్తున్న సజీవశ్రమ యొక్క, దీనికి కేటాయించబడినవని మనం ఊహిస్తున్న ఉత్పత్తి సాధనాల యొక్క ఫలితమే. (ఆ శ్రమ తన పాదార్థిక రూపాన్ని సంతరించుకొనేందుకు వస్తుగత పరిస్థితులు కల్పించే ఈ ఉత్పత్తి సాధనాల్లో మూర్తిమంతమవుతుంది.) అదే విధంగా, స్వయం విస్తరణ ప్రక్రియ దృక్కోణం నుంచి పరిశీలిస్తే, 3,000కు సమానంగా వున్న II వ శాఖ ఉత్పాదితం విలువలో, కొత్తగా చేర్చిన సామాజిక పని దినంలోని మూడింట ఒక వంతు ఉత్పత్తి చేసిన (500 అ.పె + 500 అ.వి = 1000) మేరకు కొత్త విలువా, II వ శాఖ ప్రస్తుత ఉత్పత్తి ప్రక్రియకు ముందే గతించిన సామాజిక పనిదినం తాలూకు మూడింట రెండు వంతులు మూర్తీభవించి వున్న స్థిర విలువా వున్నాయి. IIవ శాఖ ఉత్పాదితం విలువలోని ఈ భాగం, ఉత్పాదితంలోని ఒక భాగంలోనే అభివ్యక్తమవుతుంది. సామాజిక పనిదినంలోని మూడింట రెండు వంతులకు సమానమైన 2,000 విలువ గల వినియోగ సరుకుల మొత్తంలో అది నెలకొని వుంది. ఈ విలువ – భాగం పునర్దర్శనమిచ్చే నూతన ఉపయోగపు రూపం అది. వినియోగ వస్తువుల్లో 2,000 II స్థి.పెకి సమానంగా వున్న ఒక భాగం, I (1,000 అ.పె + 1,000)కి సమానమైన I వ శాఖ ఉత్పత్తి సాధనాలతో మార్పిడి అన్నది, వాస్తవానికి ప్రస్తుత సంవత్సరం ప్రారంభం కావడానికి ముందే ముగిసిన మొత్తం పనిదినంలోని మూడింట రెండు వంతులు ఈ సంవత్సరం కొత్తగా చేర్చిన పనిదినంలోని మూడింట రెండు వంతులతో మార్పిడికి ప్రాతినిధ్యం వహిస్తుంది. ప్రస్తుత ఉత్పత్తికి నియుక్తమై, అదే సమయంలో అవి తమ ఉత్పత్తిదార్లకు అస్థిర పెట్టుబడి విలువగానూ ప్లస్ అదనపు విలువగానూ వుండటం, ఒక పని జరక్కపోయివుంటే సాధ్యమయ్యేది కాదు. అదేమంటే, ఏటా వినియోగింపబడే వినియోగ సరుకుల విలువలో ఒక భాగంగానూ, ప్రస్తుత సంవత్సరానికి ముందే ముగిసి, వస్తురూపం ధరించిన పనిదినంలోని మూడింట రెండు వంతులకు మూర్తీభావంగానూ వున్న దానికి పైన పేర్కొన్న ప్రస్తుత సంవత్సరపు సామాజిక పనిదినంలో మూడింట రెండు వంతులు మార్పిడి కావడం, ఈ సంవత్సరపు పనిదినంలోని మూడింట రెండు వంతులతో గత సంవత్సరపు పనిదినంలోని మూడింట రెండు వంతులతో జరిగిన మార్పిడి ఇది. గత సంవత్సరపు శ్రమ కాలంలో ఈ సంవత్సరపు శ్రమ కాలం యొక్క మార్పిడి ఇది. అస్థిర పెట్టుబడిని, లేక అదనపు విలువను వేటినుంచి గ్రహించ వీలుందో, అట్టి సరుకుల ఉత్పత్తి కోసం మూడింట రెండు వంతుల పనిదినం వ్యయం కాకుండా, సంవత్సర కాలంలో వినియోగింపబడిన పెట్టుబడిని భర్తీ చేసే ఉత్పత్తి సాధనాల ఉత్పత్తి కోసమే అది వ్యయమైనప్పటికీ, మొత్తం సామాజిక పనిదినం యొక్క విలువ – ఉత్పాదితం ఏ విధంగా అస్థిర పెట్టుబడి విలువగానూ అదనపు విలువగానూ విభజింపబడగలదన్న చిక్కు ప్రశ్నకు ఈ విషయం సమాధానమిస్తుంది. ఈ సమాధానాన్ని ఈ క్రింది విధంగా వివరించవచ్చు : I వ శాఖ పెట్టుబడిదార్లు, కార్మికులు దేని నుంచి అస్థిర పెట్టుబడి విలువనూ, అదనపు విలువనూ గ్రహిస్తారో అట్టి II వ శాఖ ఉత్పాదితం విలువలోని మూడింట రెండు వంతులు, వాటి విలువ దృష్ట్యా, గత సంవత్సరపు సామాజిక పనిదినంలోని మూడింట రెండు వంతుల ఉత్పాదితమే. (వాటి అస్థిర పెట్టుబడి విలువా ప్లస్ అదనపు విలువా యావత్ వార్షిక ఉత్పాదితం విలువలో తొమ్మిదింట రెండు వంతుల మేరకు వుంటాయి).

తమ ఉపయోగ – విలువ దృష్ట్యా, I వ, II వ శాఖల మొత్తం సామాజిక ఉత్పాదితం, అంటే ఉత్పత్తి సాధనాలు, వినియోగ సరుకులు వాస్తవానికి వాటి నిర్దిష్ట, పాదార్థిక రూపంలో ఈ సంవత్సరపు శ్రమ యొక్క ఉత్పాదితమే. అయితే, ఈ శ్రమను ఉపయోగకరమైనదిగా, నిర్దిష్టమైనదిగా పరిగణించిన మేరకే తప్ప, శ్రమశక్తి వ్యయంగానూ విలువను సృష్టించే శ్రమగానూ కాదు. ఉత్పత్తి సాధనాలకు కేవలం సజీవ శ్రమను చేర్చడం ద్వారానే, వాటిని అది పనిలో పెట్టడం ద్వారానే ఆ ఉత్పత్తి సాధనాలు తమను తాము నూతన ఉత్పాదితాలుగా ఈ సంవత్సరపు ఉత్పాదితాలుగా మార్చుకున్నాయి అన్న అర్థంలోనే ఈ శ్రమ ఉపయోగకరమైనదీ, నిర్దిష్టమైనదీ. కాని, ఆ శ్రమతో ప్రమేయంలేని ఉత్పత్తి సాధనాలు లేకుండా, శ్రమ పరికరాలు, ఉత్పత్తి పదార్థాలు లేకుండా, ప్రస్తుత సంవత్సరపు శ్రమ తనను తాను ఉత్పాదితాలుగా మార్చుకోగలిగి వుండేది కాదు.

## VIII. రెండు శాఖల్లోనూ స్థిర పెట్టుబడి

ఉత్పాదితం యొక్క మొత్తం విలువ 9,000 గురించీ, అది విభజితమయ్యే అభివర్గాల గురించీ చేసే విశ్లేషణ వాస్తవానికి వ్యష్టి పెట్టుబడిదారు ఉత్పత్తి చేసిన విలువ గురించి చేసే విశ్లేషణ కంటే కష్టతరమైనదేమీ కాదు. పైపెచ్చు ఆ రెంటి మధ్య సారూప్యం వుంది.

ఇక్కడ సమస్త వార్షిక సామాజిక ఉత్పాదితంలో మూడు సామాజిక సంవత్సరపు పనిదినాలు వుంటాయి; ఇందులోని ప్రతి సాంవత్సరిక పనిదినమూ వ్యక్తం చేసే విలువ 3,000; కాగా మొత్తం ఉత్పాదితం వ్యక్తం చేసే విలువ 3×3,000కు లేక 9,000కు సమానంగా వుంటుంది.

మనమిప్పుడు ఒక సంవత్సరపు ఉత్పాదక ప్రక్రియ యొక్క ఉత్పాదితాన్ని విశ్లేషిస్తున్నాము. ఈ ప్రక్రియ కంటే ముందే పైన పేర్కొన్న పని కాలంలోని ఈ క్రింది భాగాలు గడచిపోయాయి : I వ శాఖలోని పనిదినంలో 4/3 వంతులు (దీని ఉత్పాదితం విలువ 4,000), II వ శాఖలోని పని దినంలో 2/3 వంతులు (దీని ఉత్పాదితం విలువ 2,000). ఈ రెండు సామాజిక పనిదినాల మొత్తం ఉత్పాదితం విలువ 6,000. అందుచేత 4,000 I స్థి.పె + 2,000 II స్థి.పె = 6,000 స్థి.పె అన్నది ఉత్పత్తి సాధనాల విలువగా లేక స్థిర పెట్టుబడి విలువగా వుంటుంది; సామాజిక ఉత్పాదితం మొత్తం విలువలో ఇది పునర్దర్శనమిస్తూ వుంటుంది.

పైగా I వ శాఖలోని సంవత్సరపు సామాజిక పనిదినంలో అదనంగా, కొత్తగా చేరిన 1/3 వంతు ఆవశ్యక శ్రమ లేక I వ శాఖ యొక్క 1,000 అస్థిర పెట్టుబడి విలువను భర్తీ చేసే శ్రమ, I వ శాఖచే నియుక్తమైన శ్రమ యొక్క ధరను చెల్లించే శ్రమ. అదే విధంగా II వ శాఖ సామాజిక పనిదినంలోని 1/6 వంతు ఆవశ్యక శ్రమ; దీని విలువ 500. కాబట్టి 1,000 II అ.పె + 500 II అ.పె = 1,500 అ.పె అన్నది సామాజిక పనిదినంలోని అర్ధభాగాన్ని వ్యక్తీకరిస్తున్నది; అంటే, అది మొత్తం పనిదినంలో మొదటి అర్ధభాగం యొక్క విలువ – వ్యక్తీకరణ, ఈ సంవత్సరం వచ్చి చేరినది. ఇది ఆవశ్యక శ్రమ.

ఇక చివరగా, I వ శాఖ మొత్తం పనిదినంలోని 1/3 వంతు అదనపు శ్రమ; దీని ఉత్పాదితం విలువ 1,000; కాగా II వ శాఖ పనిదినంలోని 1/6 వంతు అదనపు శ్రమ; దీని ఉత్పాదితం విలువ

500. ఈ రెండూ కలిసి, అదనంగా చేరిన పనిదినంలోని మిగతా అర్ధభాగం అవుతున్నాయి కాబట్టి ఉత్పత్తి అయిన మొత్తం అదనపు – విలువ 1,000 I అ.వి + 500 II అ.వి లేక 1,500 అ.వి.

ఈ ప్రకారంగా, సామాజిక ఉత్పాదితం విలువలోని స్థిర పెట్టుబడి భాగం (స్థి.పె) :

ఉత్పత్తి ప్రక్రియ కంటే ముందే వ్యయం అయిన రెండు దినాలు; వాటి విలువ = 6,000.

సంవత్సరంలో వ్యయం అయిన ఆవశ్యక శ్రమ (అ.పె) :

వార్షిక ఉత్పత్తిలో వ్యయం అయిన పని దినంలోని అర్ధభాగం, దీని విలువ = 1,500.

సంవత్సరంలో వ్యయం అయిన అదనపు శ్రమ (అ.వి) :

వార్షిక ఉత్పత్తిలో వ్యయం అయిన పనిదినంలోని అర్ధభాగం, దీని విలువ = 1,500.

వార్షిక శ్రమ ఉత్పత్తి చేసిన విలువ (అ.పె+అ.వి) = 3,000.

ఉత్పాదితం యొక్క మొత్తం విలువ (స్థి.పె+అ.పె+అ.వి) = 9,000.

కాబట్టి సామాజిక ఉత్పాదితం విలువను విశ్లేషించడంలో ఇబ్బందేమీ లేదు; మరి ఇబ్బంది ఎక్కడ ఎదురవుతుందంటే, సామాజిక ఉత్పాదితం విలువ అంతర్భాగాలను ఆ విలువ తాలూకు పాదార్థిక భాగాలతో పోల్చడంలోనే.

విలువలోని స్థిరమైనట్టి, కేవలం పునర్దర్శనమిస్తున్నట్టి భాగం, నిజానికి ఉత్పత్తి సాధనాల రూపంలో గల ఈ ఉత్పాదిత భాగం విలువకు సమానంగా వుంటుంది; అది ఈ భాగంలో నిక్షిప్తమై వుంటుంది.

అపె+అ.వికి సమానంగా వున్నట్టి సంవత్సరపు నూతన విలువ ఉత్పాదితం వినియోగ వస్తువుల రూపంలో గల ఈ ఉత్పాదిత భాగం విలువకు సమానంగా వుంటుంది; అది ఈ భాగంలోనే నిక్షిప్తమై వుంటుంది.

అయితే, ఇక్కడ బొత్తిగా ప్రాముఖ్యం లేని కొన్ని మినహాయింపులను వదిలేస్తే, ఉత్పత్తి సాధనాలు, వినియోగ వస్తువులు పూర్తిగా విభిన్నమైన రకాల సరుకులు; పూర్తిగా విభిన్నమైన పాదార్థిక రూపాలు లేక ఉపయోగపు రూపాలు కలవి; అందుచేత అవి పూర్తిగా పరస్పర భిన్నమైన నిర్దిష్ట శ్రమ ఉత్పాదితాలు. జీవనావసరాల ఉత్పత్తిలోని యంత్రాలను పని చేయించే శ్రమకూ, యంత్రాలను తయారు చేసే శ్రమకూ చాలా తేడా వుంది. 3,000 విలువకు అభివ్యక్తిగా వున్న సమస్త వార్షిక పని దినమూ 3,000కు సమానమైన వినియోగ వస్తువుల ఉత్పత్తి కోసం వ్యయం అవుతున్నట్లు కనిపిస్తుంది; ఇందులో విలువ తాలూకు స్థిర భాగం పునర్దర్శనమివ్వదు; ఎందుచేతనంటే 1,500 అ.పె + 1,500 అ.వికి సమానంగా గల ఈ 3,000, స్థిర పెట్టుబడి విలువగానూ, అదనపు విలువగానూ విభజితమవుతుంది. కాగా మరోవైపేమో 6,000 స్థిర పెట్టుబడి విలువ వినియోగ వస్తువులకు పూర్తి భిన్నమైన రకానికి చెందిన ఉత్పాదితాల్లో అంటే, ఉత్పత్తి సాధనాలలో పునర్దర్శనమిస్తుంది. వాస్తవానికి సామాజిక పనిదినంలో ఏ ఒక్క భాగమూ ఈ నూతన ఉత్పాదితాల ఉత్పత్తి కోసం వ్యయం అయినట్లు కనిపించదు. పైపెచ్చు ఉత్పత్తి సాధనాలను కాక వినియోగ వస్తువులను సృష్టించే రకపు శ్రమ మాత్రమే యావత్ పనిదినంలోనూ వున్నట్లు కనిపిస్తుంది. ఈ రహస్యం ఇప్పటికే తేటతెల్లమయింది. వార్షిక శ్రమ విలువ ఉత్పాదితం, II వ శాఖ ఉత్పాదితాల విలువకు సమానం. అంటే కొత్తగా ఉత్పత్తి అయిన

వినియోగ వస్తువుల మొత్తం విలువకు సమానం. అయితే ఈ ఉత్పాదితాల విలువ, (II వ శాఖ) వినియోగ వస్తువుల ఉత్పత్తి రంగంలో వ్యయం అయిన వార్షిక శ్రమలోని ఆ భాగం కంటే 2/3 వంతులు ఎక్కువగా వుంటుంది. వార్షిక శ్రమలోని 1/3 వంతు మాత్రమే వాటి ఉత్పత్తికోసం ఖర్చయింది. ఈ వార్షిక శ్రమలోని 2/3 వంతులు ఉత్పత్తి సాధనాల ఉత్పత్తి కోసం వ్యయమైంది. అంటే I వ శాఖలో వ్యయమైంది. I వ శాఖలో సృష్టి అయిన విలువ – ఉత్పాదితం ఆ శాఖలోని అస్థిర పెట్టుబడి విలువ + అదనపు విలువకు సమానంగా వున్నట్టి, ఇదే కాలంలో సృష్టించబడినట్టి విలువ – ఉత్పాదితం II వ శాఖ స్థిర పెట్టుబడి విలువకు సమానంగా వుంటుంది; ఈ స్థిర పెట్టుబడి విలువ II వ శాఖ వినియోగ వస్తువులలో పునర్దర్శనమిస్తూ వుంటుంది. అందుచేత అవి పరస్పరం మార్పిడి కావచ్చు, వాటి స్థానాలను వస్తురూపేణా భర్తీ చేయవచ్చు. కాబట్టి II వ శాఖ వినియోగ వస్తువుల మొత్తం విలువ, I వ, II వ శాఖలు నూతన విలువ ఉత్పాదితాల మొత్తానికి సమానంగా వుంటుంది; లేక II (స్థి.పె+అ.పె+అ.వి) = I (అ.పె+అ.వి) + II (అ.పె+అ.వి) అంటే అది వార్షిక శ్రమ అ.పె ప్లస్ అ.వి రూపంలో ఉత్పత్తి చేసిన నూతన విలువల మొత్తానికి సమానంగా వుంటుంది.

మరోవైపున I వ శాఖ ఉత్పత్తి సాధనాల మొత్తం విలువ, I వ శాఖ ఉత్పత్తి సాధనాల రూపంలోనూ, II వ శాఖ వినియోగ వస్తువుల రూపంలోనూ, పునర్దర్శనమిచ్చే స్థిర పెట్టుబడి విలువ మొత్తానికి సమానంగా వుంటుంది; మరో విధంగా చెప్పాలంటే, సమాజం యొక్క మొత్తం ఉత్పాదితంలో పునర్దర్శనమిచ్చే స్థిర పెట్టుబడి విలువ మొత్తానికి సమానంగా వుంటుంది. విలువ లెక్కన, ఈ మొత్తం విలువ నిజానికి I వ శాఖలో ఉత్పత్తి ప్రక్రియ ప్రారంభం కావడానికి ముందే ముగిసిన పనిదినంలో 4/3 వంతులకు, II వ శాఖలో ఉత్పత్తి ప్రక్రియ ప్రారంభం కావడానికి ముందే ముగిసిన పనిదినంలో 2/3 వంతులకు సమానంగా వుంటుంది. అంటే మొత్తంమీద, రెండు సంపూర్ణ పనిదినాలకు సమానంగా వుంటుందన్నమాట.

అందుచేత, వార్షిక సామాజిక ఉత్పాదితానికి సంబంధించిన ఇబ్బంది ఎక్కడ వస్తుందంటే, విలువలోని స్థిర భాగానికి సంపూర్ణంగా భిన్నమైన తరగతికి చెందిన ఉత్పాదితాలు, అంటే ఉత్పత్తి సాధనానికి ప్రాతినిధ్యం వహిస్తాయి; ఈ స్థిర విలువ భాగానికి నూతన విలువ అయిన అ.పె+అ.విని చేర్చే వినియోగ వస్తువులకు పైన తెలిపిన ఉత్పాదితాలు పూర్తిగా భిన్నమైనవి కదా. ఈ విధంగా విలువకు సంబంధించినంత వరకూ, వినియోగమైన ఉత్పాదితాల రాశిలోని మూడింట రెండు వంతుల ఉత్పత్తి కోసం సమాజం ఏ విధమైన శ్రమను వ్యయం చేయకుండానే అవి తిరిగి నూతన ఉత్పాదితం రూపంలో దర్శనమిస్తున్నట్లు కనిపిస్తుంది. కాని వ్యష్టి పెట్టుబడిదారు విషయంలో మాత్రం ఇలా వుండదు. ప్రతి వ్యష్టి పెట్టుబడిదారు ఏదో ఒక నిర్దిష్టమైన శ్రమను నియుక్తం చేస్తాడు; ఆ శ్రమ తన ప్రత్యేక ఉత్పత్తి సాధనాలను ఉత్పాదితంగా మారుస్తుంది. ఉదాహరణకు ఆ పెట్టుడిదారు ఒక యంత్ర నిర్మాత అనుకుందాం. సంవత్సరంలో వ్యయం అయిన స్థిర పెట్టుబడి 6,000 స్థి.పె, అస్థిర పెట్టుబడి 1,500 అ.పె అదనపు విలువ 1,500 అ.వి, ఉత్పాదితం విలువ 9,000 అనీ, ఉత్పాదితం ఒక్కొక్కటి 500 విలువ గల 18 యంత్రాలు అనీ అనుకుందాం. ఇక్కడ యావత్ ఉత్పాదితమూ ఒకే రూపంలో, అంటే యంత్రాల రూపంలో వుంది. (అతడు కనుక వివిధ రకాల ఉత్పాదితాలను ఉత్పత్తి చేస్తే

ప్రతిరకం ఉత్పాదితాన్నీ విడిగా లెక్కించడం జరుగుతుంది.) యావత్ సరుకు – ఉత్పాదితం యంత్ర నిర్మాణానికై సంవత్సరంలో వ్యయం అయిన శ్రమ యొక్క ఫలితమే. ఒకే తరహా నిర్దిష్ట శ్రమ, ఒకే తరహా ఉత్పత్తి సాధనాలు – ఈ రెంటి సంయోగం అది. కాబట్టి ఉత్పత్తి విలువలోని వివిధ భాగాలు ఒకే రకపు పాదార్థిక రూపంలో వున్నాయి; 12 యంత్రాలు 6,000 స్థి.పె విలువకు, 3 యంత్రాలు 1,500 అ.పె విలువకు, 3 యంత్రాలు 1,500 అ.వి విలువకు మూర్తీభావంగా వున్నాయి. ప్రస్తుత ఉదాహరణలో 12 యంత్రాలు 6,000 స్థి.పెకి సమానంగా వుందంటే, ఇందుకు కారణం ఈ యంత్రాల నిర్మాణానికి ముందే వ్యయం అయిన శ్రమ ఆ యంత్రాలలో నిక్షిప్తమై, వాటి నిర్మాణంపై శ్రమ వ్యయం కాకపోవడం కాదు. ఈ 18 యంత్రాల యొక్క ఉత్పత్తి సాధనాల విలువ దానిపాటికదే 12 యంత్రాలుగా పరివర్తన చెందడం జరగలేదు; అయితే ఈ 12 యంత్రాల విలువ (4,000 స్థి.పె + 1,000 అ.పె + 1,000 అ.వి) ఆ 18 యంత్రాల్లోని స్థిర పెట్టుబడి మొత్తం విలువకు సమానంగా వుంటుంది. కాబట్టి ఆ యంత్రాల కర్మాగార యజమాని వ్యయం అయిన స్థిర పెట్టుబడిని భర్తీ చేసుకోవడానికి 18 యంత్రాలలో 12 యంత్రాలను అమ్ముకోక తప్పదు. 18 కొత్త యంత్రాలను పునరుత్పత్తి చేయడానికి అతనికి ఆ స్థిర పెట్టుబడి అవసరం. అలాకాక, వ్యయమైన శ్రమ అంతా కేవలం యంత్రాల తయారీకే నియుక్తం అయినప్పటికీ ఈ కింది ఫలితం లభించినట్లయితే, అప్పుడు వివరించడానికి వీల్లేని పరిస్థితి తలెత్తుతుంది. ఫలితం : ఒకవైపేమో 1,500 అ.పె + 1500 అ.విలకు సమానమైన 6 యంత్రాలు, మరోవైపేమో 6,000 స్థి.పెకు సమానమైన ఇనుము, రాగి, స్క్రూలు, బెల్టులు వగైరా. అంటే పాదార్థిక రూపంలోని యంత్రోత్పత్తి సాధనాలు. యంత్రాలను తయారుచేసే వ్యక్తిగత పెట్టుబడిదారు ఈ ఉత్పత్తి సాధనాలను తానుగా ఉత్పత్తి చేయడనీ, చలామణి ప్రక్రియ ద్వారా మాత్రమే వాటిని భర్తీ చేసుకొంటాడనీ మనకు తెలుసు. అయినప్పటికీ సమాజం యొక్క వార్షిక ఉత్పాదిత పునరుత్పత్తి ఇలా అసంబద్ధమైన పద్ధతిలోనే జరుగుతున్నట్లు పైకి కనిపిస్తుంది!

వ్యష్టి పెట్టుబడి యొక్క ఉత్పాదితానికి, అంటే తన సొంత జీవితం కలిగి, సామాజిక పెట్టుబడి స్వతంత్రంగా తన విధిని నిర్వర్తించే దాని ప్రతి చిన్న భాగానికీ ఏదో ఒక రకమైన పాదార్థిక రూపం వుంటుంది. పోతే ఒకే ఒక షరతు, ఈ ఉత్పాదితానికి వాస్తవంగా ఉపయోగపు రూపం, అంటే ఉపయోగ విలువ వుండి తీరాలి; చలామణి కాగల సరుకుల ప్రపంచంలో దానికి సభ్యత్వముందన్న ముద్రవేసేది ఈ ఉపయోగ విలువే. అది ఏ ఉత్పత్తి ప్రక్రియ నుంచి ఉత్పాదితంగా బయటకు వచ్చిందో అదే ఉత్పత్తి ప్రక్రియలోకి ఉత్పత్తి సాధనంగా అది తిరిగి ప్రవేశించగలదా లేదా అన్నది ముఖ్యం కాదు; అది యాదృచ్ఛికమైనది. ఇంకో విధంగా చెప్తే, పెట్టుబడిలోని స్థిర భాగానికి ప్రాతినిధ్యం వహించే దాని విలువ భాగానికి, తిరిగి స్థిర పెట్టుబడిగా తన విధిని నిర్వర్తించగల పాదార్థిక రూపం వుందా అనేది ముఖ్యం కాదు. అలా లేకపోయినట్లయితే, ఉత్పాదితం యొక్క విలువలోని ఆ భాగం క్రయ విక్రయాల ద్వారా తిరిగి ఉత్పత్తి తాలూకు భౌతికాంశాల రూపంలోకి బదలాయించబడుతుంది; ఈ విధంగా స్థిర పెట్టుబడి క్రియాశీలమైన పాదార్థిక రూపంలో పునరుత్పత్తి అవుతుంది.

మొత్తం సామాజిక పెట్టుబడి యొక్క ఉత్పాదితం విషయంలో పరిస్థితి ఇందుకు భిన్నంగా వుంటుంది. పునరుత్పత్తి తాలూకు భౌతికాంశాలన్నీ తమ పాదార్థిక రూపంలో ఆ ఉత్పాదితం యొక్క

భాగాలుగా వుండి తీరతాయి. పెట్టుబడిలో వినియోగమైన స్థిరభాగాన్ని మొత్తం ఉత్పత్తి ఏ మేరకు భర్తీ చేయగలదంటే, ఉత్పాదితంలో పునర్దర్శనమిచ్చే పెట్టుబడి యొక్క సమస్త స్థిర భాగమూ నూతన ఉత్పత్తి సాధనాల పాదార్థిక రూపంలో, వాస్తవంగా స్థిర పెట్టుబడిగా తన విధిని నిర్వర్తించగల ఆ రూపంలో పునర్దర్శనమిచ్చేంత మేరకే అది అలా చేయగలదు; కాబట్టి సాధారణ పునరుత్పత్తి వుందని ఊహించుకొన్నప్పుడు, ఉత్పత్తి సాధనాల రూపంలో వున్న ఉత్పాదిత భాగం యొక్క విలువ సామాజిక పెట్టుబడి విలువలోని స్థిర భాగానికి సమానంగా వుండి తీరుతుంది.

పైగా, వ్యక్తిగతంగా పరిశీలించినట్లయితే, పెట్టుబడిదారు తన ఉత్పాదితం యొక్క విలువలో కొత్తగా చేరిన శ్రమ ద్వారా ఉత్పత్తి చేసేది కేవలం తన అస్థిర పెట్టుబడి ప్లస్ అదనపు విలువను మాత్రమే; కాగా కొత్తగా చేరిన శ్రమ యొక్క నిర్దిష్ట స్వభావం మూలంగా విలువలోని స్థిర భాగం ఉత్పాదితానికి బదిలీ అవుతుంది.

ఒక సామాజిక దృక్కోణం నుంచి పరిశీలించినట్లయితే, సామాజిక పనిదినంలో ఉత్పత్తి సాధనాలను ఉత్పత్తిచేసే భాగం, అంటే వాటికి నూతన విలువను చేర్చడమే కాక, ఉత్పత్తి సందర్భంగా వినియోగమైన ఉత్పత్తి సాధనాల విలువను వాటికి బదలాయించే సామాజిక పనిదినంలోని ఆ భాగం, I, II శాఖలలోనూ పాత ఉత్పత్తి సాధనాల రూపంలో వినియోగమైన దానిని భర్తీ చేయడానికి ఉద్దేశించిన నూతన స్థిర పెట్టుబడిని తప్ప, నిజంగా మరి దేనినీ సృష్టించదు. ఉత్పాదక వినియోగానికి ఉద్దేశించిన ఉత్పాదితాన్ని మాత్రమే అది సృష్టిస్తుంది. కాబట్టి, ఈ ఉత్పాదితం యొక్క సమస్త విలువా కొత్తగా స్థిర పెట్టుబడిగా తన విధిని నిర్వర్తించగలిగే విలువ మాత్రమే, స్థిర పెట్టుబడిని పాదార్థిక రూపంలో తిరిగి కొనుగోలు చేయగలిగే విలువ మాత్రమే, సామాజికంగా పరిశీలించినట్లయితే, ఈ కారణం చేత ఈ విలువ అస్థిర పెట్టుబడిగా కానీ, అదనపు విలువగా కానీ విభజింపబడదు.

మరోవైపు, వినియోగ వస్తువులను ఉత్పత్తి చేసే సామాజిక పనిదినంలోని ఆ భాగం నిజానికి సామాజిక పెట్టుబడిలో భర్తీ చేయవలసిన ఏ భాగాన్నీ సృష్టించదు. I వ, II వ శాఖలలో అస్థిర పెట్టుబడి విలువను, అదనపు విలువను వాటి పాదార్థిక రూపంలో గ్రహించడానికి ఉద్దేశించిన ఉత్పాదితాలను మాత్రమే సృష్టిస్తుంది.

సామాజిక దృక్కోణం నుంచి మాట్లాడుతున్నప్పుడు, అంటే సామాజిక పెట్టుబడి పునరుత్పత్తీ, వ్యక్తిగత వినియోగమూ రెండూ కలిసి వున్న సమాజం యొక్క మొత్తం ఉత్పాదితాన్ని పరిశీలిస్తున్నప్పుడు, మనం ప్రౌధాన్ అనుకరించిన బూర్జువా అర్థశాస్త్ర పద్ధతిలోకి జారుకోరాదు; అంటే పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం గల సమాజాన్ని మొత్తంగా, సమాహారంగా పరిశీలించినట్లయితే, ఆ సమాజం తన విశిష్ట చారిత్రక, ఆర్థిక స్వభావాన్ని కోల్పోతుందన్నట్లుగా ఈ విషయాన్ని పరిశీలించరాదు. అలా కానే కాదు. అలాంటి సందర్భంలో మనం పరిశీలించవలసింది సమష్టి పెట్టుబడిదారుణ్ణి. మొత్తం పెట్టుబడి యావన్మంది వ్యక్తిగత పెట్టుబడిదారుల పెట్టుబడి నిల్వగా కనిపిస్తుంది. ఈ జాయింట్ స్టాక్ కంపెనీకీ, అనేక ఇతర స్టాక్ కంపెనీలకూ మధ్య ఒక విషయంలో సారూప్యం వుంది. ఈ కంపెనీలో పెట్టుబడిదారు ఏమి మదుపు పెడుతున్నాడో ప్రతి ఒక్కరికీ తెలుసు. కానీ దాని నుంచి తాను ఏం పొందుతున్నాడో ఎవ్వరికీ తెలీదు.

## IX. ఆడమ్ స్మిత్, స్టార్చ్, రామ్సేలపై పునరావలోకన

సామాజిక ఉత్పాదితం యొక్క మొత్తం విలువ 9,000. ఇది 6,000 స్థి.పె + 1,500 అ.పె + 1,500 అ.వి కు సమానం; అంటే 6,000 ఉత్పత్తి సాధనాల విలువనూ 3,000 విలువ గల వినియోగ వస్తువులనూ పునరుత్పత్తి చేస్తుంది. కాబట్టి సామాజిక ఆదాయం (అ.పె+అ.వి) విలువ మొత్తం ఉత్పాదితం విలువలు 1/3 వంతు మాత్రమే వుంటుంది. పర్యవసానంగా వినియోగదార్లు, కార్మికులు, పెట్టుబడిదార్లు వీరంతా ఈ 1/3 వంతు ప్రకారమే మొత్తం సామాజిక ఉత్పాదితం నుంచి సరుకులను, ఉత్పాదితాలను తీసేసుకుని తమ వినియోగ నిధిలో – కలుపుకోగలరు. మరోవైపు 6,000 అన్నది లేక ఉత్పాదితం విలువలోని 2/3 వంతు పదార్థ రూపంలో భర్తీ చేయవలసిన స్థిర పెట్టుబడి విలువ. అందుచేత ఈ మొత్తానికి సమానంగా వుండే ఉత్పత్తి సాధనాలను తిరిగి ఉత్పత్తి నిధిలోకి చేర్చవలసి వున్నది. స్టార్చ్ ఇది ప్రధానమైన విషయంగా గుర్తించనప్పటికీ దీనిని రుజువు పరచలేకపోయాడు : "వార్షిక ఉత్పాదితం విలువ కొంత పెట్టుబడిగానూ, మరికొంత లాభాలుగానూ విభజింపబడుతుంది; వార్షిక ఉత్పాదితం విలువలోని ఈ భాగాల్లోని ప్రతిదీ జాతికి అవసరమైన ఉత్పాదితాలను కొనుగోలు చేయడానికి క్రమబద్ధంగా నియుక్తం అవుతుంది. తన పెట్టుబడిని అట్టిపెట్టుకోవడానికీ, తన వినియోగ – నిధిని భర్తీ చేయడానికీ జాతికి ఆ ఉత్పాదితాలు అవసరం. ఈ విషయాలు స్పష్టమే. జాతి యొక్క పెట్టుబడిగా వుండే ఉత్పాదితాలను వ్యయం చేయరాదు." (Storch, Considerations surla nature du revenue national, Paris, 1824, PP 134-135, 150.)

ఆడమ్ స్మిత్, ఈనాటికీ విశ్వసిస్తున్న ఆశ్చర్యకర సిద్ధాంతాన్ని మనం లోగడ తెలిపిన రూపంలో ప్రతిపాదించడమే కాక, మరింత సుబోధక రూపంలో కూడా ప్రతిపాదిస్తున్నాడు; మనం లోగడ ఉటంకించిన రూపం ప్రకారం, సామాజిక ఉత్పాదితం యొక్క మొత్తం విలువ వేతనాలుగానూ ప్లస్ అదనపు విలుగానూ, లేక ఆయన వ్యక్తీకరించినట్లుగా వేతనాలుగానూ ప్లస్ లాభం (వడ్డీ) గానూ, ప్లస్ కౌలుగానూ విభజింపబడుతుంది; సుబోధక రూపం ప్రకారం వినియోగదారులు "అంతిమంగా" ఉత్పాదితం యొక్క విలువను ఉత్పత్తిదార్లకు చెల్లించక తప్పదు. అర్థశాస్త్రం అనబడే దానిలో ఇది బాగా పాదుకొనిపోయిన సర్వసాధారణ విషయంగా లేక శాశ్వత సత్యంగా పరిగణింపబడుతున్నది. స్థూల దృష్టికి సమర్థనీయమైనదిగా కనిపించే ఈ క్రింది పద్ధతిలో దీనికి కింది ఉదాహరణ యిస్తున్నాడు: ఏదైనా ఒక వస్తువును, ఉదాహరణకు, లినన్ షర్టును తీసుకుందాం. మొదట లినన్ వడికేవాడు ఎల్లిగిసెనార మొత్తం విలువను దాని ఉత్పత్తిదారుడికి చెల్లించవలసి వుంటుంది; మొత్తం విలువ అంటే, అవిసెనార విత్తుల, ఎరువుల, శ్రమచేసే పశువుల విలువతో పాటు, ఉత్పాదితానికి ఉత్పత్తిదారు చేర్చే భవనాలు, వ్యవసాయ పరికరాలు వగైరా నిశ్చల పెట్టుబడి విలువ భాగమూ, ఎల్లిగిసెనార ఉత్పత్తికై అతను చెల్లించిన వేతనాలు, ఎల్లిగిసెనారలో కలిసి వున్న అదనపు విలువ (లాభం, భూమికౌలు), చివరకు, ఎల్లిగిసెనారను ఉత్పత్తి స్థానం నుంచి నేతమిల్లు దాకా తీసుకెళ్ళిన రవాణా ఖర్చు – వీటి మొత్తం అన్నమాట. ఆ తరువాత నేతగాడు ఎల్లిగిసెనార ధరనే కాక యంత్రాలు, భవనాలు వగైరా విలువలో, అంటే నిశ్చల పెట్టుబడి విలువలో, ఎల్లిగిసెనారకు బదలాయించబడ్డ విలువ భాగాన్ని కూడా నూలు వడకందారుకు చెల్లించవలసి వుంటుంది. అంతేకాదు. వడికే ప్రక్రియలో వ్యయం

అయిన అన్ని అనుబంధ పదార్థాల ధరనూ, వడికేవారి వేతనాలూ, అదనపు విలువ మొదలయిన వాటిని చెల్లిస్తాడు. బ్లీచర్ విషయంలోనూ ఇంతే. షర్టు తయారుదారు తయారైన లినన్ రవాణా ఖర్చును, తనకంటే ముందున్న ఉత్పత్తిదారులకయిన ఖర్చులన్నిటినీ చెల్లించవలసి వుంటుంది. షర్టు తయారుదారుకు కేవలం అతని ముడిసరుకునే వీరు సరఫరా చేశారు. దానికి ఇతని చేతుల్లో మరికొంత విలువ వచ్చి చేరుతుంది. శ్రమ పరికరాలు, అనుబంధ పదార్థాలు వగైరాల రూపంలో షర్టుల తయారీ కర్మాగారంలో వ్యయం అయిన స్థిర పెట్టుబడి విలువ ద్వారా కొంత, వ్యయం అయిన శ్రమ ద్వారా కొంత ఈ కొత్త విలువ సృష్టి అవుతుంది. వ్యయం అయిన శ్రమ కార్మికులు వేతనాల విలువనూ, షర్టుల కర్మాగార యజమాని అదనపు విలువను కూడా చేర్చుతుంది. మనమిప్పుడు షర్టుల రూపంలోని ఈ ఉత్పాదితానికయిన మొత్తం ఖర్చు 100 పౌండ్లు అనుకుందాం; అంటే, వార్షిక ఉత్పాదితం యొక్క మొత్తం విలువలో చొక్కాలపై సమాజం ఖర్చుపెట్టే వాటా ఇదన్నమాట. చొక్కాల వినియోగదారులు ఈ 100 పౌండ్లు చెల్లిస్తారు; అంటే ఈ చొక్కాల తయారీలోని ఉత్పత్తి సాధనాల విలువను, వేతనాల విలువను, ఎల్లిగిసె ఉత్పత్తిదారు, నూలు వడకందారు, బ్లీచింగ్ పౌడరుతో వస్త్రాన్ని శుభ్రం చేసిన వ్యక్తి, చొక్కాల కర్మాగార యజమాని, రవాణాదారు వీరందరి అదనపు విలువను కూడా చొక్కాల వినియోగదారులు చెల్లిస్తారు. ఇది పూర్తిగా సరియైనదే. పిల్లలకు కూడా ఈ విషయం తెలుసు. కాని ఇతర సరుకుల విలువకు సంబంధించి కూడా విషయం ఇలాగే వుంటుందని అంటున్నాడు. వాస్తవానికి ఈ విధంగా చెప్పాలి : అన్ని వినియోగ వస్తువుల విలువకు సంబంధించి, వినియోగ నిధిలోకి ప్రవేశించే సామాజిక ఉత్పాదితం యొక్క ఆ భాగం విలువకు సంబంధించి, అంటే ఆదాయంగా వ్యయమయ్యే సామాజిక ఉత్పాదితం యొక్క విలువలోని ఆ భాగానికి సంబంధించి విషయం ఇలాగే వుంటుంది. ఈ అన్ని సరుకుల యొక్క విలువల సమాహారం సరుకుల్లో వినియోగింపబడిన సమస్త ఉత్పత్తి సాధనాల (పెట్టుబడి యొక్క స్థిర భాగాలు) విలువ ప్లస్ శ్రమచేత సృష్టించబడి చివరగా చేర్చబడిన విలువకూ (వేతనాలు + అదనపు విలువకు) సమానమన్న మాట నిజమే. కనుక ఈ విలువల మొత్తమంతటికీ, వినియోగదారులందరూ మొత్తంగా డబ్బు చెల్లిస్తారు; ఎందుచేతనంటే, ప్రతి వ్యక్తిగత సరుకు విలువలోనూ స్థి.పె+అ.పె+అ.వి ఉన్నప్పటికీ, వినియోగ నిధిలోకి ప్రవేశించే అన్ని సరుకుల విలువల మొత్తమూ, వాటి గరిష్ట స్థాయిలో, అ.పె+అ.విగా విభజింపబడే సామాజిక ఉత్పాదితం యొక్క విలువలోని ఆ భాగానికి మాత్రమే సమానంగా వుండగలదు; అంటే, సంవత్సరంలో వ్యయమైన శ్రమ ప్రస్తుతం పనిచేస్తున్న ఉత్పత్తి సాధనాలకు లేక స్థిర పెట్టుబడి విలువకు చేర్చిన విలువకు సమానంగా వుంటుంది. ఇక స్థిరపెట్టుబడి విలువకు సంబంధించి, సామాజిక ఉత్పాదితాల రాశి నుంచి అది రెండు విధులుగా భర్తీ అవుతుందని మనం గమనించాం. మొదటిది, వినియోగ వస్తువులు ఉత్పత్తి చేసే II వ శాఖ పెట్టుబడిదారులు, వీరి కోసం ఉత్పత్తి సాధనాలను ఉత్పత్తి చేసే I వ శాఖ పెట్టుబడిదారులతో చేసుకునే మార్పిడి ద్వారా, ఒకరికి పెట్టుబడిగా వుండేది మరొకరికి ఆదాయంగా వుంటుంది అనే నానుడికి మూలం ఇక్కడే వుంది. అయితే వాస్తవ పరిస్థితి ఇది కాదు. వినియోగ వస్తువుల రూపంలో 2,000 విలువ గల 2,000 స్థి.పె నిజానికి II వ శాఖ పెట్టుబడిదార్లకు స్థిర పెట్టుబడి విలువగా వుంటుంది. పాదార్థిక రూపంలోని ఈ

ఉత్పాదితం వినియోగానికి ఉద్దేశించబడిందే అయినప్పటికీ, ఆ పెట్టుబడిదారులు ఆ స్థిర పెట్టుబడి విలువను వ్యయం చేసుకోజాలరు. మరోవైపు 2,000 I (అ.పె+అ.వి) అన్నది, I వ విభాగపు పెట్టుబడిదారు, కార్మికవర్గమూ ఉత్పత్తి చేసినట్టి వేతనాలు ప్లస్ అదనపు విలువ తప్ప మరొకటి కాదు. అవి ఉత్పత్తి సాధనాల పాదార్థిక రూపంలో వుంటాయి. కాబట్టి వాటి విలువను వినియోగించడం అసాధ్యం. మనకిక్కడ 4,000 మేరకు విలువల మొత్తం వుంది. అందులో సగ భాగం మార్పిడికి ముందు, మార్పిడి తర్వాత స్థిర పెట్టుబడిని మాత్రమే భర్తీ చేస్తుంది. పోతే మిగిలిన సగభాగం ఆదాయంగా మాత్రమే వుంటుంది.

రెండవది, I వ శాఖ స్థిర పెట్టుబడి పాదార్థిక రూపంలో భర్తీ అవుతుంది. కొంత I వ శాఖ పెట్టుబడిదార్ల మధ్య జరిగే మార్పిడి ద్వారానూ, మరికొంత ప్రతి వ్యక్తిగత వ్యాపారంలో పాదార్థిక రూపంలో భర్తీ కావడం ద్వారానూ అది జరుగుతుంది.

మొత్తం వినియోగదారులను వ్యక్తిగత వినియోగదారులు, ఉత్పాదక వినియోగదారులు అనే రెండు విభిన్నరకాలుగా పరిగణించినప్పుడే, సమస్త వార్షిక ఉత్పాదితం విలువను అంతిమంగా వినియోగదారే చెల్లించి తీరాలన్న మాట సరియైనది. కాని, ఉత్పాదితం తాలూకు ఒక భాగం ఉత్పాదకంగా వ్యయం కావాలంటే అర్థం, అది ఆదాయంగా వినియోగం కాకుండా, పెట్టుబడిగా పని చేయాలనే తప్ప మరొకటి కాదు.

మనం 9,000కు సమానంగా వున్న మొత్తం ఉత్పాదితం విలువను 6,000 స్థి.పె + 1,500 అ.పె + 1,500 అ.విగా విభజించి 3,000 (అ.పె+అ.వి) ని దాని ఆదాయ గుణ దృష్టితో మాత్రమే పరిగణించినట్లయితే, అస్థిర పెట్టుబడి అదృశ్యమైనట్లు కనిపిస్తుంది. సామాజిక దృక్పథం నుంచి పరిశీలిస్తే పెట్టుబడి కేవలం స్థిర పెట్టుబడిగానే వున్నట్లు కనిపిస్తుంది. కారణమేమిటంటే, ప్రప్రథమంలో 1,500 అ.పెగా తలెత్తిన మొత్తం సామాజిక ఆదాయంగా – వేతనాలుగా, అంటే కార్మికవర్గ ఆదాయంగా విభజితమవుతుంది. కాబట్టి దాని పెట్టుబడి స్వభావం అదృశ్యమైపోయింది. వాస్తవానికి, రామ్సే ఈ నిర్ధారణకే వచ్చాడు. ఆయన అభిప్రాయం ప్రకారం, సామాజికంగా పరిశీలిస్తే, పెట్టుబడి అంటే నిశ్చల పెట్టుబడి, అంటే స్థిర పెట్టుబడి; అంటే ఉత్పత్తి సాధనాల రూపంలోని విలువల మొత్తం. అవి శ్రమ పరికరాలు కావచ్చు, ముడి పదార్థాలు, సగం తయారైన ఉత్పాదితాలు, అనుబంధ పదార్థాల వంటి శ్రమ పదార్థాలు కావచ్చు. ఆయన అస్థిర పెట్టుబడిని చలామణిలోని పెట్టుబడి అని అంటాడు: "పనివారు తమ శ్రమ ఉత్పాదితాన్ని పూర్తి చేయడానికి ముందు వారికి అడ్వాన్సు చేసిన జీవనభృతి, తదితర జీవనావసరాలు మాత్రమే చలామణిలోని పెట్టుబడిలో వుంటాయి. ఖచ్చితంగా చెప్తే, జాతీయ సంపదకు మూలాధారం నిశ్చల పెట్టుబడే తప్ప చలామణిలోని పెట్టుబడి కాదు.... చలామణిలోని పెట్టుబడి ఉత్పత్తిలో ప్రత్యక్ష సాధనం కాదు. అసలు ఉత్పత్తికి ప్రధానమైనది కూడా కాదు. అది ప్రజాసమూహాల దుర్భర దారిద్ర్యం మూలంగా ఆవశ్యకమైన ఒక సౌకర్యం మాత్రమే.... జాతీయ దృష్టితో చూస్తే, నిశ్చల పెట్టుబడి మాత్రమే ఉత్పత్తి వ్యయంలో ఒక అంశంగా వుంటుంది." (రామ్సే అదే గ్రంథం, పుటలు 23 నుంచి 26, Passim) నిశ్చల పెట్టుబడి అంటే రామ్సే భావం స్థిర పెట్టుబడి అనే. నిశ్చల పెట్టుబడిని ఆయన మరింత సవివరంగా ఇలా నిర్వచిస్తున్నాడు: "శ్రమ

యొక్క (ఏదైనా సరుకుపై వ్యయం అయిన శ్రమ) ఉత్పాదితంలోని ఏ భాగమైనా నిశ్చల పెట్టుబడిగా వున్న, అంటే భవిష్యత్ సరుకును రూపొందించడానికి సహాయపడుతున్నప్పటికీ శ్రామికులను పోషించని రూపంలో వున్న కాలపరిమాణం గురించి.” (అదే గ్రంథం, పుట 59)

మనం ఇక్కడ ఆడమ్ స్మిత్ సృష్టిస్తున్న గందరగోళం మరోసారి గమనిస్తాం; ఆయన స్థిర పెట్టుబడికి అస్థిర పెట్టుబడికి మధ్య గల వ్యత్యాసాన్ని, నిశ్చల పెట్టుబడికి చలామణిలోని పెట్టుబడికి మధ్య గల వ్యత్యాసంలో ముంచేయడం ద్వారా సృష్టించిన గందరగోళం అది. రామ్సే పేర్కొనే స్థిర పెట్టుబడి శ్రమ పరికరాలు కాగా, ఆయన చెప్పే చలామణి పెట్టుబడిలో వున్నది జీవనాధారాలు. ఆ రెండూ కూడా నిర్దిష్ట విలువ గల సరుకులు, రెండూ కూడా అదనపు విలువను సృష్టించజాలవు.

## X. పెట్టుబడి, ఆదాయం : అస్థిర పెట్టుబడి, వేతనాలు[1]

యావత్ వార్షిక పునరుత్పత్తి, అంటే సంవత్సరంలోని యావత్ ఉత్పాదితం ఆ సంవత్సరంలోని ఉపయోగకర శ్రమ యొక్క ఉత్పాదితం. అయితే ఈ మొత్తం ఉత్పాదితం యొక్క విలువ నిజానికి వార్షిక శ్రమ నిక్షిప్తమై వున్న విలువ భాగం కన్నా, అంటే వర్తమాన సంవత్సరంలో వ్యయం అయిన శ్రమశక్తి నిక్షిప్తమై వున్న విలువ భాగం కంటే ఎక్కువగా వుంటుంది. ఆ సంవత్సరపు విలువ – ఉత్పాదితం, అంటే ఈ సంవత్సరంలో సరుకుల రూపంలో కొత్తగా సృష్టించబడిన విలువ, ఉత్పాదితం యొక్క విలువ కంటే తక్కువగా వుంటుంది; యావత్ సంవత్సరంలోనూ తయారైన సమస్త సరుకుల మొత్తం విలువకంటే తక్కువగా వుంటుంది. వార్షిక ఉత్పాదితం మొత్తం విలువలో నుంచి ఆ సంవత్సరంలో శ్రమ చేర్చిన విలువను తీసివేయగా మిగిలినది, వాస్తవానికి పునరుత్పత్తి చేయబడిన విలువ కాదు. అది నూతన అస్తిత్వ రూపంలో పునర్దర్శనమిచ్చే విలువ మాత్రమే. అది, ఆ సంవత్సరపు సామాజిక శ్రమ ప్రక్రియలో పాల్గొన్నట్టి స్థిర పెట్టుబడి అంతర్భాగాల మన్నికను బట్టి, అంతకు మునుపే అస్తిత్వంలో వున్న విలువ వార్షిక ఉత్పాదితంలోకి బదిలీ అయింది. అంతకు మునుపు సంవత్సరంగాని లేక కొన్ని ఏళ్ళు ముందుగాని ప్రపంచంలోకి వచ్చి వున్న ఉత్పత్తి సాధనాల విలువ నుంచి ఆవిర్భవించిన విలువ అది. మునుపటి సంవత్సరాల ఉత్పత్తి సాధనాల నుంచి వర్తమాన సంవత్సరపు ఉత్పాదితంలోకి బదిలీ అయిన విలువ అది.

మన ఉదాహరణను తీసుకుందాం. Iవ , IIవ శాఖల మధ్యా, IIవ శాఖలో అంతర్గతంగానూ మార్పిడి జరిగిన అనంతరం పరిస్థితి ఈ క్రింది విధంగా వుంది :

I) 4,000 స్థి.పె + 1,000 అ.పె + 1,000 అ.వి (చివర 2,000, II స్థి.పె వినియోగ వస్తువులుగా చేతికందింది) = 6,000

II) 2,000 స్థి.పె (1వ శాఖ (అ.పె+అ.వి)తో మార్పిడి చేత పునరుత్పత్తి అయినది) + 500 అ.పె + 500 అ.వి = 3,000.

విలువల మొత్తం – 9,000.

సంవత్సరంలో కొత్తగా ఉత్పత్తి అయిన విలువ అ.పె లోనూ, అ.వి లోనూ మాత్రమే వుంటుంది.

---

1. ఇక్కడ నుంచి రాతప్రతి VIII ప్రారంభం - **ఫ్రెడరిక్ ఎంగెల్స్.**

కాబట్టి ఈ సంవత్సరపు విలువ ఉత్పాదితపు మొత్తం అ.పె+అ.వి మొత్తానికి సమానంగా వుంటుంది. లేక 2,000 I (అ.పె+అ.వి) + 1,000 II (అ.పె+అ.వి) = 3,000.

ఈ సంవత్సరపు ఉత్పాదితం యొక్క మిగిలిన విలువ భాగాలన్నీ కూడా వార్షిక ఉత్పాదితంలో వినియోగం అయిన మునుపటి ఉత్పత్తి సాధనాల విలువ నుంచి బదలాయించబడిన విలువ మాత్రమే. వర్తమాన వార్షిక శ్రమ 3,000 విలువ మినహా మరో విలువనేది సృష్టించడం జరగలేదు. అది, దాని యావత్ వార్షిక విలువ ఉత్పాదితానికి ప్రాతినిధ్యం వహిస్తుంది.

మనం ఇంతకు ముందే గమనించినట్లు, 2,000 I (అ.పె+అ.వి) ఉత్పత్తి సాధనాల పాదార్థిక రూపంలో II వ శాఖకు దాని 2,000 II స్థి.పె ని భర్తీ చేస్తుంది. ఈ విధంగా I వ శాఖలో వ్యయమయిన వార్షిక శ్రమలోని 2/3 వంతులు II వ శాఖ కోసం స్థిర పెట్టుబడిని దాని సమస్త విలువనూ, పాదార్థిక రూపాన్నీ కొత్తగా ఉత్పత్తి చేసింది. సామాజిక దృక్కోణం నుంచి పరిశీలిస్తే, సంవత్సరంలో వ్యయమయిన 2/3 వంతుల శ్రమ నూతన స్థిర పెట్టుబడి విలువను సృష్టించింది. II వ శాఖకు తగిన పాదార్థిక రూపంలో అది చేతికందింది. ఈ విధంగా వినియోగ వస్తువుల ఉత్పత్తిలో వ్యయమయిన స్థిర పెట్టుబడి – విలువను భర్తీ చేసేందుకు, సామాజిక వార్షిక శ్రమలోని అధిక భాగం నూతన స్థిర పెట్టుబడి (ఉత్పత్తి సాధనాల రూపంలో వున్న పెట్టుబడి విలువ) ఉత్పత్తి కోసం వ్యయమయింది. ఈ విషయంలో సీనియర్[1] అనుకొంటున్నట్లు, పెట్టుబడిదారీ సమాజానికీ, ఆటవికునికీ మధ్య గల తేడా, ఆదాయంగా విభజితమయ్యే (మార్పిడి అయ్యే) ఉత్పాదితాలను, అంటే వినియోగ వస్తువులను తనకు చేకూర్చి పెట్టని విధంగా అప్పుడప్పుడు తన శ్రమను వెచ్చించగల ఆటవికుని ఆధిక్యత, ప్రత్యేకత కానేకాదు. ఆ తేడా ఈ క్రింది విధంగా వుంటుంది :

ఎ) పెట్టుబడిదారీ సమాజం తనకు లభిస్తున్న వార్షిక శ్రమలో ఎక్కువ భాగాన్ని ఉత్పత్తి సాధనాల (కాబట్టి స్థిర పెట్టుబడి) ఉత్పత్తికి నియుక్తం చేస్తుంది; ఈ ఉత్పత్తి సాధనాలు వేతనాల రూపంలో కాని, అదనపు విలువ రూపంలో కాని ఆదాయంగా విభజింపబడవు. అవి పెట్టుబడిగా మాత్రమే పని చేస్తాయి.

బి) ఆటవికుడు విల్లంబులు, బాణాలు, రాతిసుత్తెలు, రాతిగొడ్డళ్ళు, బుట్టలు తయారు చేస్తున్నప్పుడు అతనికి ఒక విషయం స్పష్టంగా తెలుసు; అలా నియుక్తమైన కాలాన్ని తాను వినియోగ వస్తువుల ఉత్పత్తి కోసం వెచ్చించడం లేదనీ, తనకు అవసరమైన ఉత్పత్తి సాధనాలను నిల్వ చేస్తున్నానే తప్ప మరేమీ చేయడం లేదనీ అతనికి స్పష్టంగా తెలుసు. పైగా, ఆటవికుడు వృధా కాలక్షేపాన్ని బొత్తిగా పట్టించుకోకపోవడం ద్వారా తీవ్రమైన ఆర్థిక పాపం చేస్తున్నాడు. టేలర్[2] అన్నట్లు, అతడు ఒక్కోసారి కేవలం ఒక బాణం తయారు చేయడానికే నెలరోజులు పడుతుంది.

---

1. ''అడవి మనిషి తన విల్లంబులు చేస్తున్నప్పుడు అతడు పరిశ్రమ చేస్తున్నాడు తప్ప భోగ త్యాగం చేయడం లేదు'' (సీనియర్, Principes fondamentaux de s' Economic Politique, trad, Arrivabene, Paris 1836, PP 342-43). ''సమాజం పురోగమించేకొద్దీ భోగ త్యాగం మరింత అవసరమవుతుంది.'' (అదే గ్రంథం, పుట 312)

2. ఇ.బి. టేలర్, Researches into the Early History of Mankind etc; లండన్, 1865, పుట 198-199.

నిజమైన అంతస్సంబంధాలను అర్థం చేసుకోవాలన్న సైద్ధాంతికపరమైన ఇబ్బంది నుండి బయటపడటానికి కొంతమంది అర్థశాస్త్రజ్ఞులు, ప్రచారంలో వున్న ఒక భావనపై ఆధారపడుతున్నారు. ఒకరికి పెట్టుబడిగా వున్నది మరొకరికి ఆదాయంగా వుంటుంది; అదేవిధంగా ఒకరికి ఆదాయంగా వున్నది మరొకరికి పెట్టుబడిగా వుంటుంది, అనేది ఆ భావన. కాని, ఈ భావన పాక్షికంగానే సరైంది; దీనికి సార్వత్రికతను ఆపాదించినప్పుడు ఇది పూర్తిగా పొరపాటు భావనైపోతుంది. (అందువల్ల, వార్షిక పునరుత్పత్తిలో జరిగే మార్పిడి ప్రక్రియకు సంబంధించి ఇందులో సంపూర్ణమైన పొరపాటు అవగాహన వుంది. కాబట్టి, పాక్షికంగా సరియైన భావనకు ఆధారంగా వున్న ప్రాతిపదికను గురించిన పొరపాటు అవగాహన కూడా  కూడా ఇందులో వుంది.)

మనమిప్పుడు ఈ భావనలోని పాక్షిక సత్యానికి ఆధారభూతమైన వాస్తవ సంబంధాలను సంక్షిప్తంగా పరిశీలిద్దాం; అలా చేస్తున్నప్పుడు ఈ సంబంధాల గురించిన పొరపాటు భావన కూడా బయటపడుతుంది.

1) అస్థిర పెట్టుబడి పెట్టుబడిదారు చేతుల్లో పెట్టుబడిగానూ – వేతన కార్మికుని చేతుల్లో ఆదాయంగానూ పని చేస్తుంది.

అస్థిర పెట్టుబడి మొదట పెట్టుబడిదారు చేతుల్లో డబ్బు–పెట్టుబడిగా వుంటుంది; అతడు దానితో శ్రమ–శక్తిని కొనుగోలు చేయడం వల్ల, అది డబ్బు–పెట్టుబడి విధిని నిర్వర్తిస్తుంది. అది అతని చేతుల్లో డబ్బు రూపంలో వున్నన్నాళ్ళూ అది డబ్బు రూపంలో వున్న నిర్దిష్ట విలువ తప్ప మరొకటి కాదు; అందుచేత అది స్థిర పరిమాణం గలదే తప్ప అస్థిర పరిమాణం గలది కాదు. అది అస్థిర పెట్టుబడి కాగలది మాత్రమే. ఎందువల్లనంటే, శ్రమశక్తిగా రూపాంతరం చెందగల శక్తి దానికున్నది. తనకు గల డబ్బు రూపాన్ని త్యజించిన తరువాత మాత్రమే, పెట్టుబడిదారీ ప్రక్రియలో ఉత్పాదక పెట్టుబడిలోని ఒక అంతర్భాగంగా తన విధిని నిర్వర్తించే శ్రమశక్తిగా రూపాంతరం చెందిన తరువాత మాత్రమే అది నిజమైన అస్థిర పెట్టుబడి అవుతుంది.

పెట్టుబడిదారు కోసం అస్థిర పెట్టుబడి యొక్క డబ్బు రూపంలో మొదట వ్యవహరించిన డబ్బు ఇప్పుడు కార్మికుడి చేతిలో అతడి వేతనాల యొక్క డబ్బు రూపంగా వ్యవహరిస్తుంది; దానిని తన శ్రమశక్తిని నిరంతరం పదే పదే అమ్ముకోవడం ద్వారా లభించిన ఆదాయం యొక్క డబ్బు రూపంగా అతడు జీవనావసరాల కోసం మార్పిడి చేసుకుంటాడు.

ఇక్కడున్న వాస్తవ విషయం సరళమైనదే : కొనుగోలుదారు యొక్క డబ్బు, ఈ సందర్భంలో పెట్టుబడిదారు డబ్బు అతని చేతుల్లో నుంచి అమ్మకందారు చేతుల్లోకి ఈ సందర్భంలో, శ్రమశక్తి అమ్మకందారు చేతుల్లోకి, అంటే కార్మికుడి చేతుల్లోకి వెళ్లిపోతుంది. ఇక్కడ అస్థిర పెట్టుబడి, పెట్టుబడిదారుకు పెట్టుబడిగానూ, కార్మికుడికి ఆదాయంగానూ అది ద్వివిధ పాత్రను నిర్వర్తించడం లేదు. ఇద్దరి చేతుల్లోనూ వున్నది ఒకే డబ్బు; అది మొదట పెట్టుబడిదారు చేతుల్లో అతడి అస్థిర పెట్టుబడి యొక్క డబ్బు రూపంగా, అంటే అస్థిర పెట్టుబడి కాగలిగిన రూపంలో వుంది; తరువాత, పెట్టుబడిదారు దానిని శ్రమశక్తిగా మార్చగానే అది కార్మికుడి చేతిలో, అమ్మబడిన శ్రమశక్తికి తుల్యమైనదిగా ఉపకరిస్తుంది. అయితే ఒకే డబ్బు కొనుగోలుదారు చేతుల్లో ఒక ఉపయోగకరమైన

ప్రయోజనాన్నీ, అమ్మకందారు చేతుల్లో మరో ఉపయోగకరమైన ప్రయోజనాన్నీ నిర్వహించడమనే వాస్తవం అన్ని సరుకుల క్రమ విక్రయాలకూ గల ప్రత్యేకతే.

పైన పేర్కొన్న పొరపాటు భావనను సమర్థించే అర్థశాస్త్రవేత్తలు ఈ విషయాన్ని తప్పుగా చిత్రిస్తారు. డ–శ్ర చలామణి క్రియ తర్వాత జరుగబోయేదాన్ని పరిశీలించకుండా కేవలం దానిపై మాత్రమే దృష్టి నిలిపితే ఆ విషయం స్పష్టంగా తెలుస్తుంది. డ – శ్రలో (డ–సకు సమానం) పెట్టుబడిదారు అయిన కొనుగోలుదారుకు సంబంధించి డబ్బు శ్రమశక్తిగా రూపాంతరం చెందుతుంది; ఇదే అమ్మకందారైన కార్మికునికి సంబంధించి శ్ర–డ (స–డకు సమానం) అవుతుంది; అంటే సరుకు అయిన శ్రమశక్తికి డబ్బుగా రూపాంతరం చెందుతుంది. ఈ అర్థశాస్త్రవేత్తలు క్రింది విధంగా అంటారు: ఇక్కడ ఒకే డబ్బు రెండు పెట్టుబడుల పని నిర్వహిస్తున్నది. కొనుగోలుదారు అనగా పెట్టుబడిదారు తన డబ్బు – పెట్టుబడిని సజీవ శ్రమశక్తిగా మార్చుతాడు; దాని నతడు తన ఉత్పాదక పెట్టుబడిలో విలీనం చేసుకుంటాడు. మరోవైపు అమ్మకందారు, అంటే కార్మికుడు శ్రమశక్తి అయిన తన సరుకును డబ్బుగా మార్చుకొంటాడు. దానిని అతడు ఆదాయంగా ఖర్చు పెట్టుకుంటాడు; అందువల్ల అతడు తన శ్రమశక్తిని నిరంతరం పదే పదే అమ్ముకోగలుగుతూ ఆ శ్రమశక్తిని సురక్షితంగా ఉంచుకో గలుగుతాడు. అందుచేత అతడి శ్రమశక్తి సరుకు రూపంలోని అతడి పెట్టుబడే. అది అతడికి నిరంతర ఆదాయాన్ని అందిస్తుంది. శ్రమశక్తి వాస్తవానికి అతని ఆస్తే (ఎప్పటికప్పుడు స్వయంగా పునరుజ్జీవనం పొందేదీ, పునరుత్పాదకశీలమైనదీ) తప్ప పెట్టుబడి కాదు. అతడు బ్రతకడం కోసం నిరంతరాయంగా అమ్ముకోగలిగిన, తప్పనిసరిగా అమ్ముకోవలసిన సరుకు అదొక్కటే. దాని కొనుగోలుదారు (పెట్టుబడిదారు) చేతుల్లో మాత్రమే అది  పెట్టుబడిగా (అస్థిర) పని చేస్తుంది. ఈ అర్థశాస్త్రవేత్తల అభిప్రాయం ప్రకారం, ఒక మనిషి నిరంతరం తప్పనిసరిగా తన శ్రమశక్తిని, అంటే ఏకంగా తననే మరొక మనిషికి అమ్ముకోవలసి వుండటమే అతడు పెట్టుబడిదారు అని నిరూపిస్తున్నది; ఎందుచేతనంటే అమ్ముకోడానికి అతడికి నిరంతరాయంగా "సరుకులు" (తనే) వున్నాయి. ఆ అర్థంలో బానిస కూడా పెట్టుబడిదారే; అతడు ఒక సరుకుగా శాశ్వతంగా అమ్మబడినప్పటికీ, అతడు కూడా ఒక పెట్టుబడిదారే. ఏమంటే, ఈ సరుకు స్వభావం, అంటే శ్రమించే బానిస స్వభావం ఏమిటంటే, దాని కొనుగోలుదారు ప్రతిరోజూ కొత్తగా దానితో పని చేయించడమే కాక, దానికి జీవనావసరాలు కూడా అందజేస్తాడు; వాటి మూలంగా అది మళ్ళీ కొత్తగా పని చేయగలుగుతుంది. (ఈ విషయం మాల్తస్‌కు రాసిన లేఖల ఆధారంగా సిస్మాండీని, సేని తులనాత్మకంగా పరిశీలించండి.[1])

2. అందుచేత, 1,000 I అ.పె + 1,000 I అ.వి ని 2,000 II స్థి.పెతో జరిగే మార్పిడిలో, కొందరికి స్థిర పెట్టుబడిగా (2,000 II స్థి.పె) వున్నటువంటిది ఇతరులకు అస్థిర పెట్టుబడిగానూ, అదనపు విలువగానూ, మొత్తం మీద ఆదాయంగానూ వుంటుంది; అలాగే కొందరికి అస్థిర పెట్టుబడిగానూ, అదనపు విలువగానూ (2,000 I అ.పె+అ.వి), మొత్తం మీద ఆదాయంగానూ వున్నటువంటిది మరికొందరికి స్థిరపెట్టుబడిగా వుంటుంది.

---

1. మార్క్స్ మనసులో వున్నది, మాల్తస్‌కు జె.బి. సే రాసిన లేఖలు Letters a M.Malthus sur differents Sujets d'Economie Politique, notamment, sur les couses de la stagnation general du commerce, Paris, 1820 - సంపాదకుడు.

మొదట, I అ.పెతో II స్థి.పె మార్పిడిని శ్రామికుని దృక్పథం నుంచి పరిశీలిద్దాం.

I వ శాఖ సమష్టి కార్మికుడు తన శ్రమశక్తిని I వ శాఖ సమష్టి పెట్టుబడిదారుకు 1,000కి అమ్మాడు; కార్మికునికి ఈ విలువ, వేతనాలుగా చెల్లింపబడిన డబ్బు రూపంలో ముడుతుంది. అతడు ఈ డబ్బులో ఇదే విలువకు II వ శాఖ నుంచి వినియోగ వస్తువులు కొనుగోలు చేస్తాడు. II వ శాఖ పెట్టుబడిదారు, అతడికి సరుకుల అమ్మకందారుగా మాత్రమే తారసపడతాడు; అంతకుమించి మరేమీ కాదు; అయితే మనం ఇంతకు మునుపు గమనించినట్లు 500 II అ.పె మార్పిడిలోలాగా, కార్మికుడు తన సొంత శాఖకు చెందిన పెట్టుబడిదారు నుంచి వాటిని కొనుగోలు చేసినా పరిస్థితి ఇదే. అతడి సరుకు, అంటే శ్రమశక్తి గడిచే చలామణి రూపం, కేవలం అవసరాలను తీర్చుకొనే నిమిత్తం, వినియోగం కోసం సరుకుల సరళ చలామణి రూపమే : స – (శ్రమశక్తి), డ–స (వినియోగ వస్తువులు, సరుకులు II). ఈ చలామణి చర్య ఫలితం ఏమిటంటే – కార్మికుడు, I వ శాఖ పెట్టుబడిదారు కోసం శ్రమశక్తిగా తన జీవిక కొనసాగిస్తాడు. అతడు ఆ విధంగా నిరంతరాయంగా తన జీవిక కొనసాగించాలంటే విధిగా ఈ శ్ర (స) – డ – స ప్రక్రియను నిరంతరం పునరుద్ధరిస్తూ పోవాలి. అతని వేతనాలు వినియోగ వస్తువుల రూపం ధరిస్తాయి. వేతనాలు ఆదాయంగా ఖర్చవుతాయి. కార్మిక వర్గాన్ని మొత్తంగా పరిగణనలోకి తీసుకున్నట్లయితే, వారి వేతనాలు ఆదాయంగా పదే పదే ఖర్చవుతాయి.

ఇప్పుడిక అదే II స్థి.పెతో II అ.పె మార్పిడిని పెట్టుబడిదారు దృక్కోణం నుంచి పరిశీలిద్దాం. II వ శాఖలోని సమస్త సరుకు – ఉత్పాదితమూ వినియోగ వస్తువుల రూపంలో వుంటుంది; కాబట్టి అవి వార్షిక వినియోగంలోకి ప్రవేశించడానికి ఉద్దేశించబడిన వస్తువులు. ఇతరులకు ఆదాయంగా అనుభోగమయేందుకు ఉపకరించే వస్తువులు. ఈ ఉదాహరణలో ఇతరులు అంటే I వ శాఖ సమష్టి కార్మికుడు. కాని II వ శాఖ సమష్టి పెట్టుబడిదారునికి 2,000లకు సమానంగా వున్న సరుకు – ఉత్పాదితంలోని ఒక భాగం, ఇప్పుడు, సరుకులుగా మారిన అతని ఉత్పాదక పెట్టుబడిలోని స్థిర పెట్టుబడి విలువ రూపం. ఈ ఉత్పాదక పెట్టుబడి ఈ సరుకు రూపం నుంచి దాని పాదార్థిక రూపంలోకి పరివర్తన చెందాలి; అంటే ఉత్పాదక పెట్టుబడిలోని స్థిర భాగంగా తిరిగి పని చేయగల రూపంలోకి పరివర్తన చెందాలి. II వ శాఖ పెట్టుబడిదారు ఇంతవరకూ సాధించిందేమిటంటే, అతడు, I వ శాఖ కార్మికులకు అమ్మకాల ద్వారా తన స్థిర పెట్టుబడి విలువలోని అర్ధభాగాన్ని (ఇది 1,000కి సమానం) డబ్బు రూపంలోకి తిరిగి మార్చాడు; (అతడి స్థిర పెట్టుబడి విలువ అప్పటికే సరుకుల రూపంలో పునరుత్పత్తి అయింది.) అందుచేత ఈ II వ శాఖ స్థిర పెట్టుబడి విలువలోని ఈ మొదటి అర్ధభాగంగా మార్పు చెందినది, I వ శాఖ అస్థిర పెట్టుబడి కాదు; శ్రమశక్తిగా మార్పిడి కోసం I వ శాఖకు డబ్బు – పెట్టుబడిగా తన విధిని నిర్వహించిన పెట్టుబడి కాదు; శ్రమశక్తిగా మార్పిడి కోసం I వ శాఖకు డబ్బు – పెట్టుబడిగా తన విధిని నిర్వహించిన డబ్బు మాత్రమే. అయితే శ్రమశక్తి అమ్మకందారు చేతుల్లోకి వచ్చిన ఈ డబ్బు, డబ్బు రూపంలోని ఆదాయానికి ప్రాతినిధ్యం వహిస్తుందే తప్ప, పెట్టుబడికి ప్రాతినిధ్యం వహించదు; అంటే ఇది వినియోగ వస్తువుల కొనుగోలు సాధనంగా ఖర్చు పెట్టబడుతుంది. కాగా, I వ శాఖ కార్మికుల నుంచి II వ శాఖ పెట్టుబడిదారుల చేతుల్లోకి వచ్చిన డబ్బు – 1,000కి సమానంగా వున్న ఈ డబ్బు II వ శాఖ ఉత్పాదక పెట్టుబడి తాలూకు స్థిర భాగంగా తన విధిని ఇప్పుడే నిర్వర్తించలేదు. అది ఇప్పటికీ తన సరుకు పెట్టుబడి యొక్క డబ్బు

రూపంలో మాత్రమే వుంది; అది స్థిర పెట్టుబడి తాలూకు నిశ్చల భాగంగా కాని, చలామణి భాగంగా కాని మార్పు చెందవలసి వుంది. కాబట్టి Iవ శాఖ కార్మికుల (వీరు IIవ శాఖ సరుకుల కొనుగోలుదార్లు) నుంచి అందిన డబ్బుతో IIవ శాఖ, Iవ శాఖ నుంచి 1,000 విలువ గల ఉత్పత్తి సాధనాలు కొనుగోలు చేస్తుంది. ఈ విధంగా IIవ శాఖ స్థిర పెట్టుబడి విలువలోని సగభాగం, ఆ శాఖ ఉత్పాదక పెట్టుబడిలో ఒక భాగంగా తన విధిని తిరిగి నిర్వర్తించగల పాదార్థిక రూపంలోకి పునరుద్ధరింపబడింది. ఈ ఉదాహరణలో, చలామణిలో క్రమం స–డ–స రూపం తీసుకుంది : 1,000 విలువ గల వినియోగ వస్తువులు – 1,000 విలువ గల డబ్బు – 1,000 విలువ గల ఉత్పత్తి సాధనాలు.

ఇక్కడ స–డ–స క్రమం పెట్టుబడి చలనానికి ప్రాతినిధ్యం వహిస్తుంది. కార్మికులకు 'స' అమ్మబడినపుడు అది 'డ'గా మార్చబడుతుంది; దరిమిలా ఈ 'డ' ఉత్పత్తి సాధనాలుగా మార్చబడుతుంది. సరుకులు, వేటితో తయారయ్యాయో, ఆ పాదార్థిక అంశాలుగా తిరిగి పరివర్తన చెందే క్రమమిది. మరోవైపు Iవ శాఖ పెట్టుబడిదారు పట్ల IIవ శాఖ పెట్టుబడిదారు కేవలం సరుకుల కొనుగోలుదారుగా వ్యవహరించినట్లే, IIవ శాఖ పెట్టుబడిదారు పట్ల Iవ శాఖ పెట్టుబడిదారు సరుకుల అమ్మకందారుగా మాత్రమే వ్యవహరిస్తాడు. మొట్టమొదట Iవ శాఖ అస్థిర పెట్టుబడిగా వ్యవహరించడానికి ఉద్దేశించి, 1,000 డబ్బుతో 1,000 విలువ గల శ్రమశక్తిని కొనుగోలు చేసింది. కాబట్టి అది డబ్బు రూపంలో ఖర్చు చేసిన 1,000 అ.పెకి సమతుల్యమైన దానిని పొందింది. ఇప్పుడీ డబ్బు కార్మికుడికి చెందుతుంది; అతడు ఆ డబ్బును IIవ శాఖ నుంచి చేసిన కొనుగోళ్ళకు ఖర్చు పెడతాడు. IIవ శాఖ ఖజానాలోకి ఈ విధంగా చేరిన డబ్బు Iవ శాఖకు తిరిగి రావాలంటే IIవ శాఖకు అంతే విలువగల సరుకులను అది మళ్ళీ అమ్మవలసి వుంటుంది. లేకుంటే ఆ డబ్బు దానికి తిరిగి రాదు.

Iవ శాఖ వద్ద అస్థిర పెట్టుబడిగా పని చేయడానికి ఉద్దేశించిన డబ్బు 1,000 మేరకు వుండింది. ఆ డబ్బు అంతే విలువ గల శ్రమశక్తిలోకి పరివర్తన చెందడం ద్వారా అస్థిర పెట్టుబడిగా తన విధిని నిర్వర్తిస్తుంది. అయితే ఉత్పత్తి ప్రక్రియ ఫలితంగా కార్మికుడు 6,000 విలువగల సరుకుల మొత్తాన్ని (ఉత్పత్తి సాధనాలను) Iవ శాఖకు అందజేస్తాడు; అందులో 1/6 వంతు లేక 1,000 డబ్బు రూపంలో అడ్వాన్స్ చేయబడిన పెట్టుబడిలోని అస్థిర భాగానికి సమానం. అస్థిర పెట్టుబడి విలువ ఇప్పుడు సరుకు రూపంలో వుంది. మునుపు డబ్బు రూపంలో వున్నప్పుడు అది ఎలా అస్థిర పెట్టుబడిగా పనిచేయలేదో, ఇప్పుడు సరుకు రూపంలో కూడా అది అస్థిర పెట్టుబడిగా పనిచేయదు. అది తిరిగి సజీవ శ్రమశక్తిగా మారిన తరువాత మాత్రమే, ఉత్పత్తి ప్రక్రియలో ఈ శ్రమశక్తి తన విధిని నిర్వర్తించినంతకాలం మాత్రమే అది అస్థిర పెట్టుబడిగా వ్యవహరించగలదు. డబ్బుగా వుండిన అస్థిర పెట్టుబడి విలువ, కేవలం సంభావ్య అస్థిర పెట్టుబడి మాత్రమే. అయితే అది నేరుగా శ్రమశక్తిగా మార్చబడడానికి వీలైన రూపంలో వుండింది. ఒక సరుకుగా ఆ అస్థిర పెట్టుబడి విలువ ఇప్పటికీ సంభావ్య డబ్బు విలువే; సరుకుల అమ్మకం ద్వారా మాత్రమే అది తిరిగి తన తొలి రూపమైన డబ్బు రూపంలోకి మారుతుంది; కనుక IIవ శాఖ Iవ శాఖ నుంచి 1,000 విలువ గల సరుకులను కొనుగోలు చేయడం ద్వారా అది తిరిగి డబ్బు రూపంలోకి పరివర్తన చెందుతుంది. ఇక్కడ చలామణి గమనం

క్రింది విధంగా వుంటుంది : 1,000 అ.పె (డబ్బు) – 1,000 విలువ గల శ్రమశక్తి – 1,000 అ.పె (డబ్బు), కాబట్టి అది డ–స....స–డ (=డ–శ్ర....స–డ). స....స మధ్య గల ఉత్పత్తి ప్రక్రియ చలామణి రంగానికి చెందింది కాదు. వార్షిక పునరుత్పత్తి తాలూకు వివిధ భాగాల మధ్య సాగే పరస్పర మార్పిడిలో దీనికి పాత్ర లేదు. ఈ మార్పిడి పరిధిలోకి ఉత్పాదక పెట్టుబడి యొక్క అన్ని భాగాలు, అంటే స్థిర, అస్థిర భాగాలు పునరుత్పత్తి ప్రక్రియ కూడా వచ్చినప్పటికీ, వీటి పరస్పర మార్పిడిలో దీనికి పాత్ర లేదు. ఈ మార్పిడిలో పాల్గొనే వారందరూ అటు కొనుగోలుదార్లుగా కాని, ఇటు అమ్మకందార్లుగా కాని లేక ఉభయులుగానూ రంగంపైకి వస్తారు. కార్మికులు సరుకుల కొనుగోలుదార్లుగా మాత్రమే కనిపిస్తారు; పెట్టుబడిదార్లు ఒకసారి కొనుగోలుదార్లుగానూ, మరొకసారి అమ్మకందార్లుగానూ కనిపిస్తారు; వారు కొన్ని పరిమితులలో కేవలం సరుకుల కొనుగోలుదార్లుగానూ లేక సరుకుల అమ్మకందార్లుగానూ మాత్రమే కనిపిస్తారు.

ఫలితం : I వ శాఖ వద్దకు దాని పెట్టుబడిలోని అస్థిర భాగపు విలువ డబ్బు రూపంలో మళ్ళీ వచ్చి చేరుతుంది; డబ్బు రూపం నుంచి మాత్రమే అది నేరుగా శ్రమశక్తిగా మారగలదు. అంటే తన ఉత్పాదక పెట్టుబడిలోని అస్థిర భాగంగా అడ్వాన్స్ చేయడానికి వీలున్న ఏకైక రూపంలో అస్థిర పెట్టుబడి విలువ మళ్ళీ I వ శాఖ వద్దకు చేరుతుందన్నమాట. కాగా కార్మికుడు మళ్ళీ సరుకుల కొనుగోలుదారుగా వ్యవహరించాలంటే, అంతకు ముందు అతడు తన సరుకుల (తన శ్రమశక్తి) అమ్మకందారుగా వ్యవహరించి తీరాలి.

ఇక II వ శాఖ అస్థిర పెట్టుబడికి (500 II అ.పె) సంబంధించి ఒకే తరగతి ఉత్పత్తికి చెందిన పెట్టుబడిదారులకు, కార్మికులకు మధ్య ఈ చలామణి ప్రక్రియ ప్రత్యక్షంగా సాగుతుంది. ఎందుచేతనంటే II వ శాఖ సమష్టి పెట్టుబడిదారునికి II వ శాఖ సమష్టి కార్మికునికి మధ్య అది సాగుతున్నట్లు మనం ఊహించుకొన్నాము.

II వ శాఖ సమష్టి పెట్టుబడిదారు 500 అ.పెని, దానికి సమాన విలువ గల శ్రమశక్తిని కొనుగోలు చేసేందుకు అడ్వాన్స్ చేస్తాడు. ఈ సందర్భంలో సమష్టి పెట్టుబడిదారు కొనుగోలుదారుగానూ, సమష్టి కార్మికుడు అమ్మకందారుగానూ వున్నారు. ఆ తరువాత కార్మికుడు తన శ్రమశక్తి అమ్మకం వల్ల లభించిన డబ్బుతో వచ్చి, తాను ఉత్పత్తి చేసిన సరుకులలో ఒక భాగానికి కొనుగోలుదారుగా వ్యవహరిస్తాడు. కనుక ఇక్కడ పెట్టుబడిదారు అమ్మకందారుగా వున్నాడు. తన శ్రమశక్తి కోసం పెట్టుబడిదారు చెల్లించిన డబ్బును కార్మికుడు తిరిగి పెట్టుబడిదారుకే అందజేస్తాడు : II వ శాఖ ఉత్పత్తి చేసిన సరుకు – పెట్టుబడిలోని ఒక భాగం ద్వారా, అంటే సరుకుల రూపంలోని 500 అ.పె ద్వారా కార్మికుడు ఆ విధంగా తిరిగి అందజేశాడు. పెట్టుబడిదారు వద్ద, శ్రమశక్తిగా పరివర్తన చెందడానికి మునుపు డబ్బు రూపంలో వున్న అదే అ.పె ఇప్పుడు అతని వద్ద సరుకుల రూపంలో వుంది. కాగా, కార్మికుడేమో తన శ్రమశక్తికి విలువను డబ్బు రూపంలో పొందాడు; తానే ఉత్పత్తి చేసిన వినియోగ వస్తువుల్లో కొన్నింటిని తన వినియోగానికై కొనుగోలు చేసేందుకు కార్మికుడు తిరిగి ఆ డబ్బును తన ఆదాయంగా ఖర్చు పెట్టడం ద్వారా దాన్ని వస్తు రూపంలో అనుభవిస్తాడు. తానే పునరుత్పత్తి చేసిన సరుకులలో ఒక భాగానికీ, అంటే పెట్టుబడిదారు యొక్క 500 అ.పె కీ, డబ్బు

రూపంలోని కార్మికుడి ఆదాయానికీ మధ్య జరిగిన మార్పిడి ఇది. ఈ విధంగా ఈ డబ్బు II వ శాఖ పెట్టుబడిదారుకు అతని అస్థిర పెట్టుబడి తాలూకు డబ్బు రూపంగా తిరిగి వస్తుంది. ఇక్కడ సరుకుల రూపంలోని అస్థిర పెట్టుబడి విలువను డబ్బు రూపంలోని సమాన విలువగల ఆదాయం భర్తీ చేస్తుంది.

కార్మికుని శ్రమశక్తిని కొనుగోలు చేసిన సందర్భంగా పెట్టుబడిదారు చెల్లించిన డబ్బును, అతడు సమతులమైన సరుకుల ద్వారా తిరిగి తీసేసుకోవడం వల్ల పెట్టుబడిదారు సంపద పెరగదు. అతడు శ్రమశక్తి కొనుగోలు సందర్భంగా మొదట కార్మికునికి 500 చెల్లించి, దానికి తోడు 500 విలువ గల సరుకులను – పెట్టుబడిదారు కోసం అతడు ఉత్పత్తి చేసిన ఆ సరుకులను ఉచితంగా ఇచ్చినట్లయితే పెట్టుబడిదారు కార్మికుడికి వాస్తవానికి రెండుసార్లు చెల్లించినవాడవుతాడు; ఇక కార్మికుని వైపు నుంచి పరిశీలిస్తే, అతడు గనుక తన 500 శ్రమశక్తికి సమానంగా మాత్రమే, 500 విలువ గల సరుకులు ఉత్పత్తి చేసినట్లయితే, ఈ లావాదేవీ ముగిశాక పెట్టుబడిదారుకు ఒరిగేదేమీ లేదు. కాని వాస్తవానికి కార్మికుడు 3,000 విలువ గల ఉత్పాదితాన్ని పునరుత్పత్తి చేశాడు. అతడు ఉత్పాదితం విలువలోని స్థిర భాగాన్ని యధాతథంగా భద్రపరిచాడు; అంటే అందులో ఉపయోగించిన 2,000కు సమానమైన ఉత్పత్తి సాధనాల విలువను నూతన ఉత్పాదితంగా మార్చడం ద్వారా అతడు అలా భద్రపరచాడు. అతడు ఈ నిర్ణీత విలువకు 1,000 (అ.పె+అ.వి) విలువను చేర్చాడు. (డబ్బు రూపంలో 500 తిరిగి రావడం ద్వారా పెట్టుబడిదారుకు అదనపు విలువ లభిస్తుందని, తద్వారా అతడు మరింత ధనవంతుడు అవుతాడు అనీ డిస్టట్ డీ ట్రేసీ చెప్పాడు. ఇదే అధ్యాయంలోని 8వ భాగంలో ఈ విషయం సవివరంగా చూపించాము.)

II వ శాఖ కార్మికుడు 500 విలువ గల వినియోగ వస్తువులు కొనుగోలు చేయడం ద్వారా II వ శాఖ పెట్టుబడిదారు 500 II అ.పె విలువను తాను మొదట అడ్వాన్సు చేసిన డబ్బు రూపంలో తిరిగి పొందుతాడు. ఆ విలువ అతని వద్ద సరుకుల రూపంలో వుండింది. ఇతర సరుకుల అమ్మకం ఫలితంలాగే, ఈ లావాదేవీ యొక్క తక్షణ ఫలితం కూడా, సరుకుల రూపంలోని ఒక నిర్దిష్ట విలువ డబ్బు రూపంలోకి మారడమే. డబ్బు ఈ విధంగా బయలుదేరిన చోటికే తిరిగి రావడంలో ప్రత్యేకత ఏమీ లేదు. II వ శాఖ పెట్టుబడిదారు 500 డబ్బు I వ శాఖ పెట్టుబడిదారు నుంచి సరుకులు కొనుగోలు చేసి అతడు తిరిగి 500 విలువ గల సరుకులను I వ శాఖ పెట్టుబడిదారుకు అమ్మి వున్నట్లయితే ఆ 500 డబ్బు రూపంలో అతడికే వాపస్ వచ్చి వుండేది. ఈ 500 డబ్బు 1,000 విలువ గల సరుకుల చలామణికి ఉపకరించి వుండేది. ఇంతకు ముందే వివరించిన సార్వత్రిక నియమం ప్రకారం ఈ సరుకుల మార్పిడి కోసం ఎవరయితే డబ్బును చలామణిలోకి తోస్తారో వారికే ఆ డబ్బు వాపస్ వచ్చి వుండేది.

అయితే, II వ శాఖ పెట్టుబడిదారుకు ఈ విధంగా తిరిగి వచ్చిన 500 డబ్బు, అదే సమయంలో డబ్బు రూపంలో పునరుద్ధరింపబడిన సంభావ్య అస్థిర పెట్టుబడి కూడా. ఇది ఇలా ఎందుకుంది? డబ్బును శ్రమశక్తిగా మార్చడానికి వీలుంది కాబట్టే, అలా మార్చ వీలున్నంత మేరకు డబ్బు, అంటే డబ్బు – పెట్టుబడి అన్నది సంభావ్య అస్థిర పెట్టుబడిగా వుంటుంది. II వ శాఖ పెట్టుబడిదారుకు డబ్బు రూపంలో 500 పౌండ్లు తిరిగి రావటంతో పాటు, II వ శాఖ శ్రమశక్తి కూడా మార్కెట్‌కు

తిరిగి వస్తుంది. ఈ రెండూ, విభిన్న ధ్రువాల వద్దకు తిరిగి రావడం అన్నది – అంటే, డబ్బుగానే కాక డబ్బు రూపంలో అస్థిర పెట్టుబడిగా కూడా ఈ 500 పునర్దర్శనమివ్వడం కూడా – ఒకే పరిణామ క్రమంపై ఆధారపడి వుంది. II వ శాఖ పెట్టుబడిదారుకు 500కు సమానమైన డబ్బు తిరిగి రావడానికి కారణం అతడు IIవ శాఖ కార్మికులకు 500 విలువగల వినియోగ వస్తువులు అమ్మడమే; అంటే తనను, తన కుటుంబాన్నీ, ఆ విధంగా తన శ్రమశక్తిని కాపాడుకోవడానికి కార్మికులు తమ వేతనాలను ఖర్చుపెట్టటమే. అతడు జీవించగలగాలన్నా, సరుకుల కొనుగోలుదారుగా తిరిగి వ్యవహరించగలగా లన్నా, అతడు మళ్ళీ తన శ్రమశక్తిని అమ్ముకోక తప్పదు. కాబట్టి II వ శాఖ పెట్టుబడిదారుకు డబ్బు రూపంలో 500 వాపస్ వస్తున్న క్రమం అన్నది అదే సమయంలో, డబ్బు రూపంలో 500తో కొనవీలున్న సరుకుగా శ్రమశక్తి సదా తిరిగి రావడమే; తద్వారా డబ్బు రూపంలో 500 సంభావ్య అస్థిర పెట్టుబడిగా తిరిగి రావడమే.

ఇక విలాస వస్తువులు ఉత్పత్తి చేసే II ఆ ఉపశాఖ సంగతి. (II) అ.పె విషయంలో జరిగేదానికీ, I అ.పె విషయంలో జరిగేదానికీ తేడా లేదు. II ఆ పెట్టుబడిదారుల కోసం అస్థిర పెట్టుబడిని డబ్బు రూపంలో పునరుత్పత్తి చేసేటటువంటి డబ్బు వారి వద్దకు పరోక్ష మార్గంలో వాపస్ వస్తుంది. అంటే II వ పెట్టుబడిదారుల ద్వారా అది తిరిగి వస్తుంది. అయితే కార్మికులు తమ జీవనావసరాలను, తమ శక్తిని కొనుగోలు చేసే పెట్టుబడిదారీ ఉత్పాదకుల నుంచి నేరుగా కొనేదానికీ, వేరే తరగతికి చెందిన పెట్టుబడిదారుల నుంచి కొనేదానికీ మధ్య తేడా వుంది. (పై శ్రమశక్తిని కొనుగోలు చేసే పెట్టుబడిదారు లకు చుట్టుమార్గంలో ఆ డబ్బు తిరిగి వచ్చేది వేరే పెట్టుబడిదారుల చేతిమీదుగానే.) కార్మిక వర్గానికి రెక్కాడితే గాని డొక్కాడదు కనుక, చేతిలో డబ్బున్నన్నాళ్ళే అది కొంటుంది. కాగా ఈ విషయంలో పెట్టుబడిదారుల పరిస్థితి వేరు. ఇందుకు, 1,000 I అ.పె కీ, 1,000 II స్థి.పె కీ మధ్య జరిగే మార్పిడే ఒక ఉదాహరణ. పెట్టుబడిదారు రెక్కాడితే గానీ డొక్కాడని మనిషికాదు. అతణ్ణి ప్రేరేపించే లక్ష్యం గరిష్ట స్థాయిలో తన పెట్టుబడి స్వయం విస్తరణే. II వ శాఖ పెట్టుబడిదార్లు గనక తమ స్థిర పెట్టుబడిని తక్షణమే పునరుద్ధరించుకోవడానికి బదులు తమ మొత్తం డబ్బును గాని, అందులో కొంత భాగాన్ని గాని కొంతకాలం పాటు అలాగే ఉంచుకొనే పక్షంలో అతడికి ఎక్కువ లాభం వచ్చే పరిస్థితులు ఏవైనా తలెత్తే పక్షంలో, అప్పుడు I వ శాఖకు డబ్బు రూపంలో 1,000 II స్థి.పె వాపస్ రావడంలో జాప్యం జరుగుతుంది; అదే విధంగా I వ శాఖ 1,000 అ.పె తిరిగి డబ్బుగా మారడంలో కూడా జాప్యం జరుగుతుంది; I వ శాఖ పెట్టుబడిదారు తన నిల్వ డబ్బును వాడుకొన్నట్లయితే అతడి వ్యాపారం అదే స్థాయిలో కొనసాగగలదు. మొత్తంపై చెప్పాలంటే, అస్థిర పెట్టుబడి విలువ డబ్బు రూపంలో త్వరగా కాని, లేక ఆలస్యంగా కాని తిరిగి రావడంతో నిమిత్తం లేకుండా, నిరంతరాయంగా వ్యాపారం సాగాలంటే, డబ్బు రూపంలో నిల్వ పెట్టుబడి అవసరం.

ప్రస్తుత వార్షిక పునరుత్పత్తిలోని వివిధ అంశాల మార్పిడిని అధ్యయనం చేయాలంటే, మునుపటి సంవత్సరపు, అంటే ముగిసిన సంవత్సరపు శ్రమ యొక్క ఫలితాలను కూడా అధ్యయనం చేయవలసి వుంటుంది. ఈ సంవత్సరపు ఉత్పాదితాన్ని ఇచ్చిన ఉత్పత్తి ప్రక్రియ అంతకు ముందే గడిచిపోయింది. అది తన ఉత్పాదితంలో నిక్షిప్తమై వుంది; చలామణి ప్రక్రియకు కూడా – ఉత్పత్తి ప్రక్రియ కంటే

ముందు కాని లేక దానితో పాటు కాని సాగిన ఆ ప్రక్రియకు ఇది యింకా ఎక్కువగా వర్తిస్తుంది; అది సంభావ్య అస్థిర పెట్టుబడి వాస్తవ అస్థిర పెట్టుబడిగా మారిన క్రమం. లేక శ్రమశక్తి యొక్క క్రయ విక్రయ క్రమం. మనం ఇక్కడ పరిశీలిస్తున్న సరుకు – మార్కెట్‌లో శ్రమ మార్కెట్ ఎంత మాత్రం ఒక భాగం కాదు. ఇక్కడ కార్మికుడు తన శ్రమశక్తిని అమ్మివేయడం మాత్రమే కాదు, అదనపు విలువతో పాటు తన శ్రమశక్తి ధర యొక్క సమతుల్యాన్ని సరుకుల రూపంలో సరఫరా చేశాడు. పైగా అతడు తన వేతనాలను జేబులో వేసుకొన్నాడు. మార్పిడి సందర్భంగా కేవలం సరుకుల (వినియోగ వస్తువులు) కొనుగోలుదారుగానే కనిపిస్తాడు. మరోవైపు వార్షిక ఉత్పాదితంలో పునరుత్పత్తి లోని అన్ని భాగాలూ తప్పనిసరిగా వుండాలి. ఉత్పాదక పెట్టుబడిలోని అన్ని భాగాలనూ, అందునా, అతి ముఖ్య భాగమైన అస్థిర పెట్టుబడిని అది తప్పనిసరిగా పునరుద్ధరించాలి. అస్థిర పెట్టుబడికి సంబంధించి, మార్పిడి ఫలితం ఈ క్రింది విధంగా వుండడం మనం ఇదివరకే గమనించాం. కార్మికుడు సరుకుల కొనుగోలుదారుగా తన వేతనాలను ఖర్చు పెట్టడం ద్వారా, కొన్న సరుకులను వినియోగించు కోవడం ద్వారా తన శ్రమశక్తిని కాపాడుకుంటూ దానిని పునరుత్పత్తి చేస్తాడు; అతడికి అమ్ముకోవడానికి వున్న సరుకు అదొక్కటే. పెట్టుబడిదారు కార్మికుడి శ్రమశక్తి కొనుగోలు కోసం అడ్వాన్సు చేసిన డబ్బు అతడికి తిరిగి వచ్చినట్లే, శ్రమశక్తి కూడా శ్రమ మార్కెట్‌కు, డబ్బు రూపంలో మార్పిడి చేసుకో వీలున్న సరుకుగా అది తిరిగి వస్తుంది. 1,000 I అ.పె.కి సంబంధించిన ప్రత్యేక విషయంలో జరిగేదిదీ : I వ శాఖకు చెందిన పెట్టుబడిదారుల చేతిలో డబ్బు రూపంలో 1,000 అ.పె వుంది. కాగా I వ శాఖకు చెందిన కార్మికులు శ్రమశక్తి రూపంలో పెట్టుబడిదారుకు 1,000 అందజేస్తారు. పర్యవసానంగా I వ శాఖలో యావత్ పునరుత్పత్తి ప్రక్రియ పునరుద్ధరింపబడుతుంది. మార్పిడి ప్రక్రియ తాలూకు ఒక ఫలితం ఇది.

మరోవైపు, I వ శాఖ కార్మికులు తమ వేతనాలను ఖర్చు పెట్టడం ద్వారా 1,000 స్థి.పె కి సమానంగా II వ శాఖ నుంచి వినియోగ వస్తువులు తీసుకొంటారు; ఈ విధంగా అవి సరుకు రూపం నుంచి డబ్బు రూపంలోకి పరివర్తన చెందుతాయి. II వ శాఖ 1,000 అ.పె కి సమానమైన సరుకులను I వ శాఖ నుంచి కొనుగోలు చేయడం ద్వారా వాటిని తన స్థిర పెట్టుబడి తాలూకు పాదార్థిక రూపంలోకి మార్చుకుంది; ఈ విధంగా I వ శాఖకు దాని అస్థిర పెట్టుబడి విలువను డబ్బు రూపంలో పునరుద్ధరింపజేసింది.

I వ శాఖ అస్థిర పెట్టుబడి మూడు రూపాంతరీకరణలను గడుస్తుంది. వార్షిక ఉత్పాదితం మార్పిడిలో ఈ రూపాంతరీకరణలు బొత్తిగా కనిపించవు, లేదా కేవలం సూచనమాత్రంగా కనిపిస్తాయి.

1. మొదటి రూపం డబ్బు రూపంలోని 1,000 I అ.పె. ఇది అదే విలువ గల శ్రమశక్తిగా మార్చబడుతుంది. I వ, II వ శాఖల మధ్య సాగే సరుకుల మార్పిడిలో ఈ రూపాంతరీకరణ కనిపించదు. కాని దాని ఫలితం మాత్రమే కనిపిస్తుంది. అంటే, II వ శాఖ కార్మిక వర్గం 500 డబ్బుతో 500 II అ.పె యొక్క సరుకు అమ్మకందారు ముందు తారసపడ్డట్లే, I వ శాఖ కార్మికవర్గం 1,000 డబ్బుతో II వ శాఖ సరుకుల అమ్మకందారు ముందు తారసపడుతుంది.
2. రెండవ రూపం – ఈ రూపంలో అస్థిర పెట్టుబడి వాస్తవంగా మార్పు చెందుతుంది. ఈ రూపం అస్థిర పెట్టుబడిగా తన విధిని నిర్వర్తిస్తుంది; ఇక్కడ నిర్దిష్ట విలువతో మార్పిడి అయి,

దాని స్థానంలో విలువను సృష్టించే శక్తి వస్తుంది. ఇది ముగిసిన ఉత్పత్తి ప్రక్రియకు మాత్రమే చెందిన రూపం.

3. మూడవ రూపం – ఈ రూపంలో అస్థిర పెట్టుబడి ఉత్పత్తి ప్రక్రియ ఫలితంలో తన సార్థకతను నిరూపించుకుంది; ఈ రూపం వార్షిక విలువ ఉత్పాదితం. ఇది I వ శాఖలో 1,000 అ.పె + 1000 అ.వి లేక 2,000 I (అ.పె+అ.వి) కు సమానం. 1000 డబ్బు రూపంలో వున్న తొలి విలువ స్థానే మనకిక్కడ దానికి రెట్టింపు విలువ, అంటే సరుకుల రూపంలో 2,000 వుంది. అందుచేత, సరుకుల రూపంలోని అస్థిర పెట్టుబడి విలువ అయిన 1000, ఉత్పాదక పెట్టుబడి యొక్క భాగంగా అస్థిర పెట్టుబడి ఉత్పత్తి చేసిన విలువలో సగం మాత్రమే. సరుకుల రూపంలోని 1000 I అ.పె. మొత్తం పెట్టుబడిలో అస్థిర భాగంగా వ్యవహరించేందుకై I వ శాఖ మొదట డబ్బు రూపంలో అడ్వాన్సు చేసిన 1000 అ.పె కి ఖచ్చింగా సమతుల్యమైనది. అయితే సరుకుల రూపంలో అవి సంభావ్య డబ్బుగా మాత్రమే (అవి అమ్ముడయ్యే వరకూ డబ్బుగా రూపొందవు.) వుంటాయి; అవి ప్రత్యేకమైన అస్థిర డబ్బు – పెట్టుబడి అసలే కావు. 1000 I అ.పె సరుకులు II స్థి.పెకి అమ్మబడినాక, శ్రమశక్తి కొనుగోలు చేయదగిన సరుకుగా, 1,000 అ.పె డబ్బుకు మార్పిడి చేసుకోదగిన పదార్థంగా పునర్దర్శనమిచ్చాకనే, ఆ సరుకులు అంతిమంగా అస్థిర డబ్బు పెట్టుబడిగా రూపొందుతాయి.

ఈ అన్ని పరివర్తన క్రమాల్లోనూ I వ శాఖ పెట్టుబడిదారు నిరంతరాయంగా అస్థిర పెట్టుబడిని తన చేతుల్లోనే వుంచుకుంటాడు; 1) మొట్టమొదట డబ్బు పెట్టుబడిగా 2) తరువాత, తన ఉత్పాదక పెట్టుబడిలోని ఒక భాగంగా 3) ఆ మీదట తన సరుకు – పెట్టుబడి విలువలోని ఒక భాగంగా అంటే సరుకు విలువ రూపంగా అన్నమాట 4) అంతిమంగా అది మళ్ళీ డబ్బుగా అతని చేతిలో వుంటుంది. ఈ రూపంలో, అది మరోసారి శ్రమశక్తి ముందుకెళ్తుంది. దానితో అది మార్పిడి కావచ్చు. శ్రమ – ప్రక్రియ సందర్భంగా పెట్టుబడిదారు అధీనంలో వున్న అస్థిర పెట్టుబడి, విలువను సృష్టించే క్రియాశీల శ్రమశక్తే తప్ప, నిర్దిష్ట పరిమాణం గల విలువ కాదు. అయితే కార్మికుడు నిర్ణీత కాలంపాటు శ్రమ చేసే వరకు అతడికి పెట్టుబడిదారు డబ్బు చెల్లించడు కాబట్టి, ఆ శ్రమశక్తి చేత సృష్టింపబడిన విలువ పెట్టుబడిదారు చేతుల్లో ముందే వుంటుంది. ఈ విలువ శ్రమశక్తి విలువను భర్తీ చేసే విలువ + అదనపు విలువకు సమానం.

అస్థిర పెట్టుబడి ఎల్లప్పుడూ ఏదో ఒక రూపంలో పెట్టుబడిదారు చేతుల్లోనే వుంటుంది కాబట్టి, అది ఎవరి కోసమైనా ఏవిధంగానైనా ఆదాయంగా తన్ను తాను మార్చుకుంటుందని చెప్పలేము. పైపెచ్చు, సరుకుల రూపంలోని 1,000 I అ.పె, II వ శాఖకు అమ్మకం కావడం ద్వారా డబ్బుగా మారుతుంది; ఇది II వ శాఖ స్థిర పెట్టుబడిలో సగ భాగాన్ని వస్తు రూపంలో భర్తీ చేస్తుంది.

ఆదాయంగా మారేది I వ శాఖ అస్థిర పెట్టుబడి కాదు, 1,000 అ.పె రూపంలోని డబ్బూ కాదు. ఈ డబ్బు శ్రమశక్తిగా మారీ మారగానే I వ శాఖ అస్థిర పెట్టుబడి యొక్క డబ్బు రూపంగా అది పనిచేయడం ఆగిపోతుంది. ఏ కొనుగోలుదారైనా ఇతర అమ్మకందార్ల సరుకులకు తన డబ్బును మార్పిడి చేసుకోగానే ఆ డబ్బు ఎంత మాత్రమూ ఎలా అతనికి చెందదో, అదే విధంగా ఇదీనూ. కార్మిక వర్గానికి వేతనాలుగా అదే డబ్బు చెందే పరివర్తనలు నిజానికి అస్థిర పెట్టుబడి యొక్క పరివర్తనలు కావు.

డబ్బుగా మారిన వారి శ్రమశక్తి విలువ చెందే పరివర్తనలవి. కార్మికులు సృష్టించిన 2,000 I (అ.పె+అ.వి) విలువ యొక్క పరివర్తన ఏ విధంగా కేవలం పెట్టుబడిదారుని సరుకు యొక్క పరివర్తనే తప్ప, కార్మికునికి దానితో ఎలాంటి సంబంధమూ వుండదో, ఇదీ అంతే. కాని, కార్మికుడికి చెల్లించబడిన డబ్బు ఇప్పటికీ పెట్టుబడిదారు డబ్బే అన్న భావం నుంచి బయటపడటం పెట్టుబడిదారుకూ, అంతకంటే ఎక్కువగా అతడి సైద్ధాంతిక భాష్యకారుడైన అర్థశాస్త్రవేత్తకూ మహా కష్టం. పెట్టుబడిదారు గనుక బంగారం ఉత్పత్తిదారు అయినట్లయితే, విలువలోని అస్థిర భాగం అంటే, శ్రమయొక్క కొనుగోలు ధరను భర్తీ చేసే సరుకులోని తత్తుల్య భాగం నేరుగా డబ్బు రూపంలో దర్శనమిస్తుంది. అందుచేత చుట్టూ తిరిగి రావలసిన అవసరం లేకుండానే అది మళ్ళీ అస్థిర డబ్బు – పెట్టుబడిగా తన విధిని నిర్వర్తించగలదు; ఇక II వ శాఖ కార్మికుడికి సంబంధించి (మనమిక్కడ విలాస వస్తువులు ఉత్పత్తి చేసే కార్మికుని విస్మరిద్దాం), 500 అ.పె కార్మికుడి వినియోగానికి ఉద్దేశించిన సరుకుల రూపంలో వుంటుంది. అతడు సమష్టి కార్మికుడిగా తన శ్రమశక్తిని అమ్ముకొన్న సమష్టి పెట్టుబడిదారు నుంచే నేరుగా ఈ సరుకులు కూడా కొంటాడు. II వ శాఖ పెట్టుబడి – విలువలోని అస్థిర భాగం, దాని పాదార్థిక రూపానికి సంబంధించినంత వరకూ, వినియోగ వస్తువుల రూపంలో వుంటుంది; ఈ వినియోగ వస్తువులు ప్రధానంగా కార్మికవర్గం వినియోగించుకోడానికి ఉద్దేశించబడినవి. అయితే కార్మికుడు ఈ రూపంలో ఖర్చు పెట్టినది అస్థిర పెట్టుబడిని కాదు, అతడు ఖర్చు పెట్టినది వేతనాలను. అంటే కార్మికుడి యొక్క డబ్బును మాత్రమే. ఇది ఈ వినియోగ వస్తువులుగా అతని అనుభోగానికి రావటం ద్వారా II వ శాఖ అస్థిర పెట్టుబడి కూడా వినియోగ వస్తువుల రూపంలో పునరుత్పత్తి అయింది. స్థిర పెట్టుబడి కానీ, అస్థిర పెట్టుబడి కానీ ఏదీ కూడా ఆదాయంగా మారదు. రెండింటి విషయాల్లోనూ ఆదాయంగా మారేది వేతనాలు మాత్రమే.

అయితే వేతనాలు ఆదాయంగా ఖర్చు కావటం ద్వారా 1,000 II స్థి.పె, అలాగే పరోక్ష మార్గాన 1,000 I అ.పె, 500 II అ.పె కూడా, అంటే స్థిర పెట్టుబడి, అస్థిర పెట్టుబడి రెండూ కూడా డబ్బు పెట్టుబడి రూపంలోకి పునరుద్ధరించడం వార్షిక ఉత్పాదితం మార్పిడిలో చాలా ముఖ్యమైన వాస్తవం. (అస్థిర పెట్టుబడి విషయంలో కొంత భాగం ప్రత్యక్షంగా తిరిగి రావటం ద్వారా, మరికొంత భాగం పరోక్షంగా తిరిగి రావటం ద్వారా ఇది జరుగుతుంది.)

## XI. నిశ్చల పెట్టుబడి భర్తీ అయ్యే క్రమం

వార్షిక పునరుత్పత్తి మార్పిడులను విశ్లేషించడంలో ఈ క్రింది చిక్కు సమస్య ఎదురవుతుంది. విషయాన్ని అతి సరళ రూపంలో చూపెట్టినప్పుడు అది ఇలా వుంటుంది :

I) 4,000 స్థి.పె + 1,000 అ.పె + 1,000 అ.వి +

II) 2,000 స్థి.పె + 500 అ.పె + 500 అ.వి = 9,000

ఇది అంతిమంగా ఇలా విభజితమవుతుంది :

4,000 I స్థి.పె + 2,000 II స్థి.పె + 1,000 I అ.పె + 500 II అ.పె + 1,000 I అ.వి + 500 II అ.వి = 6,000 స్థి.పె + 1,500 అ.పె + 1,500 అ.వి = 9,000.

స్థిర పెట్టుబడి విలువలోని ఒక భాగం, ఆ మాటకు గల ఖచ్చితమైన అర్థంలో, శ్రమ పరికరాలు.

(ఉత్పత్తి సాధనాలలో ఇవి ఒక ప్రత్యేక విభాగం.) ఇది శ్రమ పరికరాల నుంచి శ్రమ ఉత్పాదితానికి (సరుకుకు) బదలాయించబడుతుంది; ఈ శ్రమ పరికరాలు తమ పాత పాదార్థిక రూపంలో వుంటూ, ఉత్పాదక పెట్టుబడిలోని అంశాలుగా తమ విధిని కొనసాగిస్తాయి; శ్రమ పరికరాల నుంచి శ్రమ ఉత్పాదితానికి బదిలీ అయ్యేది, వాటిచే ఉత్పత్తి అయిన సరుకుల విలువలోని ఒక భాగంగా పునర్దర్శనమిచ్చేదీ శ్రమ పరికరాల అరుగుదలే; ఒక నిర్దిష్ట కాలంపాటు నిరంతరాయంగా పని చేసేటప్పుడు అవి క్రమేణా లోనయ్యే తరుగులే. అందుచేత వార్షిక పునరుత్పత్తికి సంబంధించి, సంవత్సరం కంటే ఎక్కువ కాలం పాటు మన్నిక గల నిశ్చల పెట్టుబడి తాలూకు భాగాలనే మొదట పరిగణనకు తీసుకొంటారు. అవి గనుక సంవత్సరంలోపలే సంపూర్ణంగా అరిగిపోయినట్లయితే వాటిని సంపూర్ణంగా వార్షిక పునరుత్పత్తి భర్తీ చేయవలసి వుంటుంది, పునరుద్ధరించవలసి వుంటుంది. అయితే ప్రస్తుత సమస్య వాటికి సంబంధించింది కాదు. యంత్రాలూ ఎక్కువ మన్నిక గల నిశ్చల పెట్టుబడి యొక్క ఇతర రూపాల విషయానికి వస్తే, భవనాలు, యంత్రాలు మొత్తంగా దీర్ఘకాలంపాటు మన్నినప్పటికీ, వాటిలోని కొన్ని భాగాలను సంవత్సరం లోపలే సంపూర్ణంగా భర్తీ చేయవలసి రావచ్చు. ఇలా తరచుగా జరుగుతూ వుంటుంది కూడా. ఇవి సంవత్సరంలోపలే భర్తీ చేయవలసిన నిశ్చల పెట్టుబడి భాగాల తరగతికి చెందిన భాగాలు.

సరుకుల విలువలోని ఈ భాగంతో మరమ్మతు ఖర్చులను గందరగోళపరచకూడదు. ఒక సరుకు అమ్మబడినట్లయితే, ఈ విలువ భాగం డబ్బుగా మార్పు చెందుతుంది, మిగతా వాటిలాగే; అయితే ఇది డబ్బుగా మార్పు చెందాక విలువలోని ఇతర భాగాలకు ఈ భాగానికి మధ్య గల భేదం స్పష్టంగా వ్యక్తమవుతుంది. సరుకుల ఉత్పత్తిలో వ్యయం అయిన ముడి సరుకులు, అనుబంధ పదార్థాలు పాదార్థిక రూపంలో భర్తీ చేయవలసి వుంది; సరుకుల పునరుత్పత్తి ప్రారంభం కావాలంటే (లేక సరుకుల ఉత్పత్తి ప్రక్రియ అవిచ్ఛిన్నంగా కొనసాగాలన్నా ఇది అవసరం.), వాటికోసం వ్యయమైన శ్రమశక్తిని కూడా కొత్త శ్రమశక్తితో భర్తీ చేయవలసి వుంటుంది. కాబట్టి, సరుకులు అమ్మగా వచ్చిన డబ్బును నిరంతరాయంగా ఉత్పాదక పెట్టుబడిలోని ఈ భాగాలుగా తిరిగి మార్చవలసి వుంది; అంటే డబ్బు రూపం నిరంతరాయంగా సరుకు రూపంగా మారవలసి వుంది. ముడిపదార్థాలను, అనుబంధ పదార్థాలను, ఉదాహరణకు, నిర్దిష్ట వ్యవధుల్లో పెద్ద పరిమాణాల్లో కొనుగోలు చేస్తే అవి ఉత్పాదక సరఫరాలుగా వుండి, నిర్దిష్ట వ్యవధుల్లో వాటిని తిరిగి కొనుగోలు చేయాల్సిన అవసరం వుండదు. అందుచేత ఆ సరఫరాలు వున్నంతకాలమూ, సరుకుల అమ్మకం ద్వారా వచ్చే డబ్బులో వీటి కోసం ఉద్దేశించిన భాగం పోగుపడవచ్చు. ఈ విధంగా, స్థిర పెట్టుబడిలోని ఈ భాగం క్రియాశీలంగా పని చేయించకుండా ఆపిన డబ్బు పెట్టుబడిగా తాత్కాలికంగా కనిపించవచ్చు. కాని ఇందువల్ల పై విషయం మారదు. ఇది ఆదాయపు పెట్టుబడి కాదు; డబ్బు రూపంలో, అనామతులో వుంచిన ఉత్పాదక పెట్టుబడి. ఏమైనా ఉత్పత్తి సాధనాల పునరుద్ధరణ అన్నివేళలా కొనసాగి తీరాల్సిందే. కాకపోతే చలామణికి సంబంధించి ఈ పునరుద్ధరణ రూపం మారితే మారవచ్చు. కొత్త కొనుగోళ్ళు, వాటి పునరుద్ధరణకు లేక వాటి భర్తీకి తోడ్పడే చలామణి కార్యకలాపం ఇంచుమించు దీర్ఘకాల వ్యవధుల్లో జరగవచ్చు; అప్పుడు ఒకేసారి పెద్ద మొత్తాన్ని మదుపు చేసి, తద్వారా ఈ మొత్తానికి అనుగుణమైన

స్థాయిలో ఉత్పాదక సరఫరా భర్తీ చేయబడుతుంది. లేదా కొనుగోళ్ళ మధ్య వ్యవధులు చిన్నవిగా వుండవచ్చు; అట్టి సందర్భాల్లో డబ్బు ఖర్చులు చిన్న చిన్న మోతాదుల్లో వెంట వెంటనే జరుగుతాయి. అందువల్ల ఉత్పాదక సరఫరాలు కూడా తక్కువ మోతాదుల్లోనే వుంటాయి. ఇది కూడా పరిస్థితిని మార్చదు. శ్రమశక్తికి కూడా ఇదే వర్తిస్తుంది. సంవత్సరం పొడుగునా ఒకే స్థాయిలో ఉత్పత్తిని కొనసాగించినప్పుడు, అంటే వ్యయమైన శ్రమశక్తి స్థానంలో నిరంతరాయంగా నూతన శ్రమశక్తి చోటు చేసుకుంటూన్నప్పుడూ ఇదే వర్తిస్తుంది. అయితే, సరుకుల అమ్మకం ద్వారా చేతికందిన డబ్బులో ఎంత మొత్తం నిశ్చల పెట్టుబడి తరుగుదలకు సమానమైన సరుకు విలువ భాగం యొక్క రూపాంతరీ కరణగా వుందో అంత మొత్తం, ఉత్పాదక పెట్టుబడి విలువలో తగ్గుదలను భర్తీ చేయగల తదంతర్భాగంగా మారదు. అది ఉత్పాదక పెట్టుబడి సరసనే స్థిరపడి, డబ్బు రూపంలోనే కొనసాగుతుంది. తక్కువ సంవత్సరాల పాటు లేదా ఎక్కువ సంవత్సరాలపాటు సాగే పునరుత్పత్తి దశ ముగిసే వరకూ, ఇలా డబ్బు వచ్చి చేరడం పదే పదే జరుగుతూనే వుంటుంది; ఈ పునరుత్పత్తి దశ సాగినంత కాలమూ స్థిర పెట్టుబడిలోని నిశ్చల భాగం తన మునుపటి పాదార్థిక రూపంలో అవిచ్ఛిన్నంగా తన విధిని నిర్వర్తిస్తూనే వుంటుంది. భవనాలు, యంత్రాలు లాంటి నిశ్చల భాగం అరిగి పూర్తిగా శిథిలమైపోయి, ఉత్పత్తి ప్రక్రియలో అది తన విధిని నిర్వర్తించలేని దశ రాగానే దాని విలువను, ఇలా వచ్చి పోగయిన డబ్బు పూర్తిగా భర్తీ చేస్తుంది. ఇది నిశ్చల పెట్టుబడి నుంచి క్రమేణా సరుకులకు బదిలీ అయిన విలువల మొత్తం. ఈ సరుకులు అమ్ముడు కావడం ద్వారా ఇది డబ్బు రూపం సంతరించుకుంది. అప్పుడు ఈ డబ్బు నిశ్చల పెట్టుబడిని లేక నిశ్చల పెట్టుబడి భాగాలను, (ఎందుచేతనంటే వివిధ భాగాల మన్నిక కాలం వేరువేరుగా వుంటుంది.) పాదార్థిక రూపంలో భర్తీ చేయడానికి, ఆ విధంగా, ఉత్పాదక పెట్టుబడిలోని ఆ భాగాన్ని పునరుద్ధరించడానికి ఉపకరిస్తుంది. అందుచేత ఈ డబ్బు వాస్తవానికి స్థిర పెట్టుబడి విలువలోని ఒక భాగం యొక్క, అంటే నిశ్చల భాగం యొక్క డబ్బు రూపం. ఈ విధంగా ఈ సంచిత నిధి ఏర్పడటం పెట్టుబడిదారీ పునరుత్పత్తి ప్రక్రియలో ఒక అంశంగా వుంటుంది; నిశ్చల పెట్టుబడి యొక్క జీవితం అంతమై, అది తన సంపూర్ణ విలువను ఉత్పత్తి అయిన సరుకులకు అందజేసేదాకా నిశ్చల పెట్టుబడి విలువను లేదా అందులోని భాగాల విలువను డబ్బు రూపంలో పునరుత్పత్తి చేసి నిల్వ చేసే క్రమం ఇది. ఈ నిశ్చల పెట్టుబడిని లేదా దాని భాగాలను వాటి పాదార్థిక రూపంలో ఇప్పుడు భర్తీ చేయవలసి వుంటుంది. అయితే, ఇలా భర్తీ చేయడానికై ఈ డబ్బును తిరిగి నిశ్చల పెట్టుబడి యొక్క కొత్త భాగాలుగా మార్చగానే, అలా మార్చినప్పుడు మాత్రమే, అది సంచిత నిధి రూపాన్ని కోల్పోయి, చలామణి ద్వారా ప్రారంభమైన పెట్టుబడి పునరుత్పత్తి ప్రక్రియలో తన పాత్రను తిరిగి చేపడుతుంది.

సాధారణ సరుకు చలామణి ఏ విధంగానూ కేవలం ఉత్పాదితాల మార్పిడి లాంటిది ఎలా కాదో, వార్షిక సరుకు – ఉత్పాదితం యొక్క రూపాంతరీకరణ కూడా మాధ్యమం లేని దాని వివిధ భాగాల పరస్పర మార్పిడిగా విభజితం కాజాలదు. డబ్బు అందులో నిర్దిష్ట పాత్ర నిర్వహిస్తుంది. ప్రత్యేకించి నిశ్చల పెట్టుబడి విలువ పునరుత్పత్తి అయ్యే పద్ధతిలో డబ్బు పాత్ర వ్యక్తం అవుతుంది. (ఉత్పత్తి సమష్టిగా జరిగినదైతే, అది సరుకు ఉత్పత్తి రూపంలో లేకపోతే, పరిస్థితి ఎంత భిన్నంగా వుంటుందనే విషయాన్ని తరువాత విశ్లేషిద్దాం.)

మనం మన ప్రాథమిక పథకానికి తిరిగి వద్దాం :

II వ శాఖలో ఉత్పత్తి ఇలా వుంటుంది : 2,000 స్థి.పె + 500 అ.పె + 500 అ.వి సంవత్సర కాలంలో ఉత్పత్తి అయిన అన్ని వినియోగ వస్తువుల విలువ 3,000కు సమానంగా వుంటుంది; కాగా సరుకుల మొత్తం సమాహారంలో వాటి విలువకు సంబంధించి, వివిధ భాగాలు ఇలా వుంటాయి. $\frac{2}{3}$ స్థి.పె + $\frac{1}{6}$ అ.పె + $\frac{1}{6}$ అ.వి లేదా శాతంలో అయితే ఇలా వుంటాయి – $66\frac{2}{3}$ స్థి.పె + $16\frac{2}{3}$ అ.పె + $16\frac{2}{3}$ అ.వి. II వ శాఖలోని వివిధ రకాల సరుకుల్లో స్థిర పెట్టుబడి వివిధ నిష్పత్తుల్లో వుంటుంది. అలాగే స్థిర పెట్టుబడిలోని నిశ్చల భాగం కూడా భిన్నంగా వుండవచ్చు. అందుచేత నిశ్చల పెట్టుబడి భాగాల మన్నిక కాలమూ, తత్కారణంగా వార్షిక తరుగుదల లేదా తాము పాల్గొనే ఉత్పత్తి సందర్భంగా అవి సరుకులకు తమ వంతుకు బదలాయించే విలువ భాగమూ కూడా భిన్నంగా వుండవచ్చు. అయితే అది ఇక్కడ ముఖ్యమైన విషయం కాదు. సామాజిక పునరుత్పత్తి ప్రక్రియకు సంబంధించినంత వరకూ, అది I వ, II వ శాఖల మధ్య గల మార్పిడి సమస్య మాత్రమే. ఈ రెండు శాఖలు తమ సామాజిక, సామూహిక సంబంధాల్లో మాత్రమే పరస్పరం ఎదురవుతాయి. కాబట్టి II వ శాఖ తాలూకు సకల ఉత్పత్తి విభాగాలనూ మొత్తంగా తీసుకొన్నట్లయితే II వ శాఖ సరుకు – ఉత్పాదితం విలువలోని స్థి.పె. నైష్పత్తిక పరిమాణం సగటు నిష్పత్తిని సూచిస్తుంది.

కాబట్టి 2,000 స్థి.పె + 500 అ.వి.గా వర్గీకరింపబడిన మొత్తం విలువ గల సరుకు ఉత్పాదితంలోని ప్రతి రకం సరుకు (అవి ఎక్కువ భాగం ఒకే రకాలుగా వుంటాయి), విలువలో $\frac{66\frac{2}{3}}{\text{స్థి.పె}} + \frac{16\ 2}{3\text{అ.పె}} + \frac{16\frac{2}{3}}{A3}$ కి సమానంగా వుంటుంది. ప్రతి 100 సరుకులకూ ఇది వర్తిస్తుంది. అ.వి. స్థి.పెకి చెందవచ్చు అ.పెకి చెందవచ్చు లేక అ.వి.కి చెందవచ్చు.

2,000 స్థి.పె నిక్షిప్తమై వున్న సరుకులను, విలువను బట్టి తిరిగి ఈ క్రింది విధంగా విభజించవచ్చు :

1) $1{,}333\frac{1}{3}$ స్థి.పె + $333\frac{1}{3}$ అ.పె + $333\frac{1}{3}$ అ.వి. = 2,000 స్థి.పె; అదే విధంగా 500 అ.పెని ఈ క్రింది విధంగా విభజించవచ్చు.

2) $333\frac{1}{3}$ స్థి.పె + $83\frac{1}{3}$ అ.పె + $83\frac{1}{3}$ అ.వి. = 500 అ.వి. ఇక చివరగా 500 అ.వి ఈ క్రింది విధంగా విభజించవచ్చు.

3) $333\frac{1}{3}$ స్థి.పె + $83\frac{1}{3}$ అ.పె + $83\frac{1}{3}$ అ.వి = 500 అ.వి.

ఇప్పుడిక 1), 2), 3) లలోని అన్ని స్థి.పె లను కూడితే $1{,}333\frac{1}{3}$ స్థి.పె + $333\frac{1}{3}$ స్థి.పె + $333\frac{1}{3}$ స్థి.పె = 2,000 వస్తుంది. అలాగే $1{,}333\frac{1}{3}$ అ.పె + $83\frac{1}{3}$ అ.పె + $83\frac{1}{3}$ అ.పె=500. అ.వి విషయంలోనూ ఇంతే. పైన తెలిపినట్లే, వీటి మొత్తం విలువ 3,000.

కాబట్టి, 3,000 విలువకు ప్రాతినిధ్యం వహించే II వ శాఖ మొత్తం సరుకుల్లో గల మొత్తం స్థిర పెట్టుబడి విలువ 2,000ల స్థి.పెలో నిక్షిప్తమై వుందే తప్ప, 500 అ.పె లోనూ అది అణువంత కూడా లేదు. అ.పెకీ, అ.వికీ ఇదే వర్తిస్తుంది.

మరో విధంగా చెప్పాలంటే, II వ శాఖ సరుకు రాశిలో స్థిర పెట్టుబడి విలువకు ప్రాతినిధ్యం వహించిన భాగం, అందువల్ల పాదార్థిక రూపంలోకి కాని, డబ్బు రూపంలోకి కాని తిరిగి మార్చదగిన సరుకుల భాగం 2,000 స్థి.పెలో వుంది. కాబట్టి II వ శాఖ సరుకుల స్థిర విలువ యొక్క మార్పిడికి సంబంధించిన ప్రతిదీ 2,000 స్థి.పె గమనానికి పరిమితమై వుంటుంది. ఈ మార్పిడి I (1,000 అ.పె + 1,000 అ.వి) తో మాత్రమే జరగ వీలుంది.

అదే విధంగా, ఇక I వ శాఖను తీసుకొంటే, దాని స్థిర పెట్టుబడి విలువ యొక్క మార్పిడికి సంబంధించి ప్రతిదీ 4,000 I స్థి.పె పరిశీలనకు పరిమితమైనదే.

## 1. విలువలోని తరుగుదల భాగం డబ్బు రూపంలో భర్తీ అయ్యే క్రమం

మొదట ఈ క్రింది విభజనతో ప్రారంభిద్దాం :

I) 4,000 స్థి.పె + 1,000 అ.పె + 1,000 అ.వి.

II) ........2,0000 స్థి.పె + 500 అ.పె + 500 అ.వి.

2,000 II స్థి.పె సరుకుల అంతే విలువ గల I (1000 అ.పె + 1000 అ.వి) సరుకులతో మార్పిడి చెందాయంటే, 2000 II స్థి.పె యావత్తూ, I వ శాఖ ఉత్పత్తి చేసే IIవ శాఖ స్థిర పెట్టుబడి యొక్క సహజ భాగాలుగా పునఃపరివర్తన చెందుతుందనేది అందులో గర్భితం. కాని II స్థి.పె వున్న 2000 సరుకు విలువలో నిశ్చల పెట్టుబడి విలువ తాలూకు తరుగుదలను భర్తీ చేసే భాగం నిక్షిప్తమై వుంది; అయితే ఇది వెంటనే వస్తు రూపంలో ఆ తరుగుదలను భర్తీ చేయదు. డబ్బు రూపంలోకి మార్చబడుతుంది. నిశ్చల పెట్టుబడి పాదార్థిక రూపంలో పునరుద్ధరింపబడే సమయం వచ్చేవరకూ క్రమేణా ఒక మొత్తంగా పోగవుతూ వుంటుంది. ప్రతి సంవత్సరమూ నిశ్చల పెట్టుబడి హరించుకు పోతూనే వుంటుంది. ఒక వ్యక్తిగత వ్యాపారంలోగాని, పారిశ్రామిక శాఖలోగాని అలా తరిగిపోయిన దానిని భర్తీ చేయవలసి వుంటుంది. ఒక వ్యష్టి పెట్టుబడికి సంబంధించి, దాని నిశ్చల పెట్టుబడిలోని ఏదో ఒక భాగాన్ని తప్పనిసరిగా భర్తీ చేయవలసి వస్తుంది. ఎందువల్లనంటే, దాని వివిధ భాగాల మన్నిక కాలం వేరువేరుగా వుంటుంది. సంచయనాన్ని పరిగణనలోకి తీసుకోకుండా కేవలం సాధారణ స్థాయిలో వార్షిక పునరుత్పత్తిని పరిశీలించినప్పటికీ మనం ఆసాంతం ప్రారంభించం. మనం పరిశీలిస్తున్న సంవత్సరం అనేక సంవత్సరాల గతిక్రమంలో ఒకటి మాత్రమే. పెట్టుబడిదారీ ఉత్పత్తి ప్రారంభమైన తరువాత అది మొదటి సంవత్సరమేమీ కాదు. కాబట్టి II వ శాఖలోని అనేకానేక ఉత్పత్తి రంగాలలో మదుపు చేయబడిన వివిధ పెట్టుబడుల కాలాల మధ్య తేడా వుంది. ఈ ఉత్పత్తి రంగాలలో పనిచేసే వారు ఏటా మరణిస్తున్నట్లే, నిశ్చల పెట్టుబడుల మొత్తాలు కూడా ఏటా హరించుకుపోతూ వుంటాయి; సంచయనం చేయబడిన డబ్బు – నిధి నుంచి ఆ మొత్తాలను వస్తు రూపంలో భర్తీచేయక తప్పదు. అందుచేత 2,000 I అ.పె + అ.వితో 2000 II స్థి.పె మార్పిడి కావటంతో, సరుకుల రూపం (వినియోగ వస్తువులు) లోని 2,000 II స్థి.పె తిరిగి ముడిపదార్థాలుగానూ అనుబంధ పదార్థాలుగా మాత్రమే కాక యంత్రాలు, పరికరాలు, భవనాలు వాటి నిశ్చల పెట్టుబడి పాదార్థిక భాగాలుగా కూడా పరివర్తన చెందటం ఇమిడి వుంది. కాబట్టి డబ్బు రూపంలో భర్తీ చేయవలసి వున్న 2000 స్థి.పె విలువలోని తరుగుదల ఎట్టి పరిస్థితులలోనూ, క్రియాశీల నిశ్చల

పెట్టుబడి మొత్తానికి సమతుల్యంగా వుండదు; ఎందుచేతనంటే, ఇందులో ఒక భాగం ఏటా వస్తురూపంలో భర్తీ కావలసి వుంది. అయితే ఇలా భర్తీ చేయడానికి అవసరమైన డబ్బును II వ శాఖ పెట్టుబడిదార్లు ఇంతకు మునుపు సంవత్సరాల్లో పోగుచేసుకుని వుంటారనేది ఇందులో గర్భితం. కాని మునుపటి సంవత్సరాలకు వర్తించినట్టే వర్తమాన సంవత్సరానికి కూడా ఈ వాస్తవం అదే స్థాయిలో వర్తిస్తుంది.

I (1,000 అ.పె + 1000 అ.వి)కీ, 2,000 II స్థి.పెకీ మధ్య జరిగే మార్పిడికి సంబంధించి, I (అ.పె+అ.వి) విలువల మొత్తంలో విలువ స్థిర భాగమేదీ లేదని మొదట మనం గమనించాలి; కాబట్టి తరుగుదలను భర్తీ చేసే విలువ భాగం కూడా అందులో లేదు; అంటే, స్థిర పెట్టుబడిలోని నిశ్చల భాగం నుంచి అ.పె+అ.వి వున్న సరుకుల రూపంలోకి బదిలీ అయిన విలువ అందులో లేదు. కాగా తరుగుదలను భర్తీ చేసే ఈ భాగం II స్థి.పెలో వుంటుంది; ఈ విలువలోని ఒక భాగం ఉనికికి కారణం, డబ్బు రూపం నుంచి తక్షణమే పాదార్థిక రూపంలోకి మారకుండా మొదట్లో డబ్బు రూపంలోనే కొనసాగవలసి వున్న నిశ్చల పెట్టుబడే. అందుచేత I (1,000 అ.పె+ 1,000 అ.వి)కీ 2,000 II స్థి.పెకీ మధ్య జరిగే మార్పిడి విషయంలో ఈ క్రింది ఇబ్బంది తలెత్తుతుంది: 2,000 (అ.పె+అ.వి)ల పాదార్థిక రూపంలోని I వ శాఖ ఉత్పత్తి సాధనాలు 2,000 సంపూర్ణ విలువకు సమతుల్యంగా వున్నట్టి II వ శాఖ వినియోగ వస్తువులతో మార్పిడి కావలసి వుంది; మరోవైపేమో 2,000 II స్థి.పె తాలూకు వినియోగ వస్తువులు తమ సంపూర్ణ విలువకు సమానంగా, I (1,000 అ.పె + 1,000 అ.వి) తాలూకు ఉత్పత్తి సాధనాలతో మార్పిడి కాజాలవు. అందుకు కారణమేమిటంటే వాటి విలువలోని ఒక భాగం, అంటే తరుగుదలకు సమంగా వున్న భాగం లేదా భర్తీ కావలసి వున్న నిశ్చల పెట్టుబడి తాలూకు తరుగుదల భాగం మొట్టమొదట డబ్బు రూపంలో చేతికి రావలసి వుంది. మనమిప్పుడు పరిశీలిస్తున్న వర్తమాన వార్షిక పునరుత్పత్తి ప్రక్రియ కాలంలో చలామణి సాధనంగా ఎంత మాత్రమూ పనిచేయని డబ్బు రూపంలో అది చేతికి రావలసి వుంది. అయితే ఈ తరుగుదల భాగానికి చెల్లించే డబ్బు I వ శాఖ నుంచి మాత్రమే వస్తుంది. ఎందుచేతనంటే, II వ శాఖ నేరుగా ఆ మొత్తాన్ని చెల్లించలేదు. తన సరుకులను అమ్మడం ద్వారా మాత్రమే ఆ చెల్లింపు జరగడానికి తోడ్పడుతుంది. 2,000 II స్థి.పె సరుకులను మొత్తంగా I (అ.పె+అ.వి) కొనుగోలు చేస్తుందని మనం ఊహిస్తున్నాము. కనుక I వ శాఖ ఈ కొనుగోలు ద్వారా II వ శాఖ కోసం ఆ తరుగుదల భాగాన్ని డబ్బుగా మార్చవలసి వుంది. అయితే ఇంతకు మునుపు రూపొందించిన నియమం ప్రకారం, పెట్టుబడిదారీ ఉత్పత్తిదారు చలామణిలోకి అడ్వాన్సు చేసిన డబ్బు అతనికి వాపస్ వస్తుంది. ఆ తరువాత అతను ఆ మొత్తానికి సమతుల్యమైన సరుకులను చలామణిలోకి ప్రవేశపెడ్తాడు. II స్థి.పె ని కొనుగోలు చేయడంలో I వ శాఖ II వ శాఖకు 2,000 విలువ గల సరుకులనూ, అదే సమయంలో దానికి అదనంగా శాశ్వతంగా డబ్బునూ (మార్పిడి కార్యకలాపం ద్వారా ఆ మొత్తాన్ని వాపస్ తీసుకోకుండా) ఇవ్వజాలదు. అలా కాకపోతే I వ శాఖ II స్థి.పె సరుకులను వాటి విలువకంటే ఎక్కువ ఇచ్చి కొనుగోలు చేసినట్లవుతుంది. II వ శాఖ గనుక వాస్తవంగా తన 2,000 స్థి.పెని (1,000 అ.పె + 1,000 అ.వి)కి మార్పిడి చేసుకున్నట్లయితే, I వ శాఖ నుండి అది అదనంగా రాబట్టుకోవలసిందేమీ వుండదు. ఈ మార్పిడిలో చలామణి అయ్యే డబ్బు అటు I వ శాఖకు కాని లేక ఇటు II వ శాఖకు

కాని తిరిగి వస్తుంది. అంటే ఆ డబ్బును ఎవరు చలామణిలోకి తోశారు, ఎవరు మొదట కొనుగోలు దారుగా వ్యవహరించారు అనేదాన్ని బట్టి అది వాపస్ వస్తుంది. అదే సమయంలో II వ శాఖ తన సరుకు – పెట్టుబడి తాలూకు సమస్త విలువనూ ఉత్పత్తి సాధనాల పాదార్థిక రూపంలోకి తిరిగి మార్చుకుని వుంటుంది. అయితే ఆ అమ్మకం తరువాత వర్తమాన వార్షిక పునరుత్పత్తి దశలో దానికి సమమైన భాగాన్ని డబ్బు రూపం నుంచి స్థిర పెట్టుబడి తాలూకు వర్తమాన వార్షిక పునరుత్పత్తి దశలో, దానికి సమమైన భాగాన్ని డబ్బు రూపం నుంచి స్థిర పెట్టుబడి తాలూకు నిశ్చల భాగాల రూపంలోకి తిరిగి మార్చుకోదు అన్నది మన ఊహ. II వ శాఖ కనుక I వ శాఖకు 2,000 విలువ గల సరుకులు అమ్మి, ఆ శాఖ నుంచి 2,000 కంటే తక్కువ, అంటే ఉదాహరణకు 1800ను కొనుగోలు చేసినట్లయితేనే II వ శాఖకు డబ్బు మిగులుతుంది. అప్పుడు I వ శాఖ 200 మేరకు డబ్బు లోటును భర్తీ చేసుకోవలసి వుంటుంది; ఈ 200 దానికిక తిరిగి రాదు. ఎందుచేతనంటే 200లకు సమానమైన సరుకులను అది చలామణిలోకి పంపడం ద్వారా అడ్వాన్సు చేసిన ఆ మొత్తాన్ని చలామణిలోంచి అది తీసుకోలేదు. ఇలా జరిగినట్లయితే II వ శాఖకు తన నిశ్చల పెట్టుబడిలోని తరుగుదలకు పరపతిగా డబ్బు నిధి చేకూరుతుంది. అయితే అప్పుడు II వ శాఖ పక్షంలో 200 మొత్తం మేరకు ఉత్పత్తి సాధనాల అదనపు ఉత్పత్తి వుంటుంది కాబట్టి మన పథకం ప్రాతిపదికే పూర్తిగా దెబ్బతింటుంది; ఎందుకంటే, వివిధ ఉత్పత్తి వ్యవస్థల మధ్య సంపూర్ణమైన పరస్పరానుగుణ్యత వుంటూ ఒకే స్థాయిలో జరిగే పునరుత్పత్తిని మనం ఊహించుకొన్నాం. అది విచ్ఛిన్నమవుతుంది. కాబట్టి ఒక చిక్కును తొలగించుకొనేందుకు అంతకంటే తీవ్రమైన చిక్కును కొనితెచ్చుకొన్నట్లవుతుంది.

ఈ సమస్య ప్రత్యేకమైన చిక్కులను సృష్టిస్తున్నందువల్లనూ, అర్థశాస్త్రవేత్తలు ఇంతవరకు ఈ సమస్యను పరిశీలించనందువల్లనూ మనం ఇప్పుడు వరుసగా సాధ్యమైన (కనీసం సాధ్యమైనవిగా కనిపించే) అన్ని పరిష్కారాలనూ లేక సూత్రీకరణలను పరిశీలిద్దాం.

మొదటి విషయం, II వ శాఖ I వ శాఖకు 2,000 విలువ గల సరుకులు అమ్మి ఆ శాఖ నుంచి 1800 విలువ గల సరుకులు కొన్నదని మనం పైన ఊహించుకొన్నాము. 2,000 II స్థి.పె సరుకు విలువలో తరుగుదల భర్తీకి అవసరమైన 200 వుంది; దీన్ని డబ్బు రూపంలో నిల్వ వుంచుకోవలసి వుంది. ఈ విధంగా 2,000 II స్థి.పె విలువ 1800 గానూ (ఇది I వ శాఖ ఉత్పత్తి సాధనాలతో మార్పిడి కావలసి వుంది), 200గానూ (ఇది తరుగుదల భర్తీకి ఉపయోగపడేది) విభజింపబడుతుంది. I వ శాఖకు 2,000 స్థి.పె అమ్మకం జరిగిన తరువాత ఈ 200 ను డబ్బు రూపంలో ఉంచుకోవలసి వుంది. విలువ పరిభాషలో చెప్పినట్లయితే, 2,000 II స్థి.పె అన్నది 1,800 స్థి.పె + 200 స్థి.పె (త) కి సమానంగా వుంటుంది. ఇక్కడ త అనేది తరుగుదలకు సంకేతాక్షరం.

అప్పుడు ఆ మార్పిడిని ఈ క్రింది విధంగా పరిశీలించవలసి వుంటుంది :

I. 1,000 అ.పె + 1,000 అ.వి

II. 1,800 స్థి.పె + 200 స్థి.పె (త)

I వ శాఖ II వ శాఖకు చెందిన 1,000 స్థి.పె వినియోగ వస్తువులను కొనుగోలు చేస్తుంది. ఈ డబ్బు కార్మికులకు, వారి శ్రమశక్తి కోసం ఇచ్చిన వేతనాలుగా వారికి చేరింది. కాగా II వ శాఖ

అదే 1,000 పౌండ్లతో I వ శాఖ నుంచి 1,000 అ.పె ఉత్పత్తి సాధనాలను కొనుగోలు చేస్తుంది. I వ శాఖ పెట్టుబడిదారులు ఈ విధంగా డబ్బు రూపంలో తమ అస్థిర పెట్టుబడిని తిరిగి పొంది, వచ్చే సంవత్సరం శ్రమశక్తి కొనుగోలుకు దానిని వినియోగించగలరు. అంటే తమ ఉత్పాదక పెట్టుబడిలోని అస్థిర భాగాన్ని వస్తురూపంలో భర్తీ చేయగలరు.

కాగా, II వ శాఖ తాను అడ్వాన్స్ చేసిన 400 పౌండ్లతో I అ.వి ఉత్పత్తి సాధనాలను కొనుగోలు చేస్తుంది; ఆ 400 పౌండ్లతో I అ.వి తిరిగి II స్థి.పె వినియోగ వస్తువులను కొనుగోలు చేస్తుంది. II వ శాఖ పెట్టుబడిదారులు చలామణికి అడ్వాన్సు చేసిన 400 పౌండ్లు ఈ విధంగా తిరిగి వారి వద్దకే వచ్చింది; ఈ మొత్తం, అమ్మబడిన సరుకులను తుల్యమైన భాగంగా వాపస్ వచ్చింది. ఇప్పుడిక I వ శాఖ అడ్వాన్సు చేసిన 400 పౌండ్లతో వినియోగ వస్తువులు కొనుగోలు చేస్తుంది; II వ శాఖ I వ శాఖ నుంచి 400 పౌండ్లతో వినియోగ వస్తువులు కొనుగోలు చేస్తుంది. II వ శాఖ I వ శాఖ నుంచి 400 పౌండ్ల విలువ గల ఉత్పత్తి సాధనాలు కొనుగోలు చేస్తుంది; ఈ విధంగా ఆ 400 పౌండ్లు Iవ విభాగానికి వాపస్ వస్తుంది. కాబట్టి ఇంతవరకూ ఖాతా వివరణ ఈ క్రింది విధంగా వుంటుంది.

I వ శాఖ చలామణిలోని సరుకుల రూపంలో 1,000 అ.పె + 800 అ.వి ని ప్రవేశపెట్టింది; ఆ శాఖ చలామణికి వేతనాల రూపంలో 1,000 పౌండ్లను, II వ శాఖతో మార్పిడి కోసం 400 పౌండ్లను ప్రవేశపెట్టింది. మార్పిడి పూర్తయ్యాక, I వ శాఖకు డబ్బు రూపంలో 1,000 అ.పె, II వ శాఖ యొక్క 800 స్థి.పె తో (వినియోగ వస్తువులతో) మార్పిడి చేసుకున్న 800 అ.వి, డబ్బు రూపంలో 400 పౌండ్లు వుంది.

II వ శాఖ చలామణిలోకి సరుకుల రూపంలో (వినియోగ వస్తువుల రూపంలో) 1800 స్థి.పెని, మరో 400 పౌండ్లను డబ్బు రూపంలో ప్రవేశపెట్టింది. మార్పిడి పూర్తయ్యాక, ఆ శాఖకు I సరుకుల రూపంలో 1800 (ఉత్పత్తి సాధనాలు), డబ్బు రూపంలో 400 పౌండ్లు వుంది.

ఇప్పటికీ I వ శాఖ వద్ద 200 (ఉత్పత్తి సాధనాల రూపంలో), II వ శాఖ వద్ద 200 (త) (వినియోగ వస్తువుల రూపంలో) మిగిలే వుంది.

మన ఊహ ప్రకారం, I వ శాఖ 200 పౌండ్లతో 200 విలువ గల వినియోగ వస్తువులు స్థి.పె (త)ను కొనుగోలు చేస్తుంది. అయితే II వ శాఖ వద్దనే 200 పౌండ్లు వుండిపోతాయి; ఎందుచేత నంటే, ఈ 200 స్థి.పె (త) తరుగుదలకు ప్రాతినిధ్యం వహిస్తుంది, కనుక ఇవి వెంటనే ఉత్పత్తి సాధనాలుగా మార్చబడవు. అందుచేత 200 I అవి అమ్మబడజాలదన్న మాట. I వ శాఖ అదనపు విలువలోని అయిదింట ఒక వంతు, అంటే, భర్తీ కావలసిన ఆ అయిదింట ఒక వంతు, అనుభోగానికి రాదు. లేదా ఉత్పత్తి సాధనాల పాదార్థిక రూపం నుంచి వినియోగ వస్తువులుగా మార్చబడజాలదు అన్నమాట.

సామాన్య స్థాయిలో పునరుత్పత్తి అనే మన ఊహకు ఇది వ్యతిరేకమైనదే కాక, 200 స్థి.పె (త) ఎలా డబ్బుగా పరివర్తన చెందుతుందో తెలిపే పరికల్పన కూడా కాదు. అంటే, దీనిని విశదీకరించడం సాధ్యం కాదన్నమాట. 200 స్థి.పె (త) ఏ విధంగా డబ్బుగా పరివర్తన చెందేదీ ఇది

నిరూపించదు కాబట్టి I వ శాఖ ఈ పరివర్తన క్రమాన్ని, దయతలచి నిర్వహిస్తుందని మనం భావించాలి; I వ శాఖ తన శేషభాగమైన 200 అ.విని డబ్బుగా మార్చుకోలేదు కాబట్టి ఇది ఆ పని నిర్వహిస్తుందని భావించాలి. ఇది మార్పిడి యంత్రాంగం యొక్క మామూలు కార్యకలాపమని భావించడమంటే, ఈ 200 స్థి.పె (త) ని డబ్బుగా క్రమం తప్పకుండా మార్చడానికై ఏటా ఆకాశం నుంచి 200 పౌండ్లు ఊడిపడతాయని ఊహించుకోవడమే.

అయితే, I అ.వి అన్నది, ఈ సందర్భంలోలాగా, తన ప్రాథమిక అస్తిత్వ రూపంలో వ్యక్తం కావడానికి బదులు, అంటే ఉత్పత్తి సాధనాల విలువలో అంతర్భాగంగా, అంటే పెట్టుబడిదారీ ఉత్పత్తిదార్లు అమ్మకం ద్వారా డబ్బుగా మార్చుకోగలిగే సరుకుల విలువలోని అంతర్భాగంగా వ్యక్తం కావడానికి బదులు అది పెట్టుబడిదారీ భాగస్వాముల చేతుల్లో దర్శనమిచ్చినట్లయితే, ఉదాహరణకు, భూస్వాముల చేతుల్లో కౌలుగానూ లేదా వడ్డీ వ్యాపారుల చేతుల్లో వడ్డీగానూ అది దర్శనమిచ్చినట్లయితే ఇలాంటి పరికల్పన (hypothesis) అసంబద్ధత కొట్టొచ్చినట్లు వెంటనే మనకు కనిపించదు. సరుకుల అదనపు విలువలో, దాని సహజ యజమానులకు కౌలుగా కానీ లేక వడ్డీగా కానీ పారిశ్రామిక పెట్టుబడిదారు ఇవ్వవలసి వున్న భాగాన్ని కనుక వారు సరుకుల అమ్మకం ద్వారా దీర్ఘకాలంపాటు తిరిగి పొందలేని పక్షంలో, కౌలు, వడ్డీలను ఖర్చు పెట్టడం ద్వారా వార్షిక పునరుత్పత్తిలోని కొన్ని భాగాలను డబ్బుగా మార్చడానికి భూస్వాములు కానీ లేక వడ్డీ గ్రహీతలు కానీ దైవదత్త సాధనంగా వ్యవహరించజాలరు. అనుత్పాదక శ్రామికులు అనబడే వారందరి వ్యయాలకూ, ఇది వర్తిస్తుంది; అంటే ప్రభుత్వ ఉద్యోగుల, వైద్యుల, న్యాయవాదుల వ్యయాలకు, ఇంకా, అర్థశాస్త్రవేత్తలు వివరించకుండా, వదలిన దానిని వివరించడం ద్వారా వారికి "ఉపకరించే" ఇతర "సాధారణ పౌర వ్యవస్థ" సభ్యులందరి వ్యయాలకు ఇది వర్తిస్తుంది.

I వ శాఖ II వ శాఖ మధ్య, పెట్టుబడిదారీ ఉత్పత్తిదారుల యొక్క రెండు ప్రధాన శాఖల మధ్య ప్రత్యక్ష మార్పిడికి బదులు – దళారీల వర్తకుడు వచ్చి తన "డబ్బు" ద్వారా ఇబ్బందులను అధిగమించ డానికి సహాయపడినప్పటికీ ఈ పరిస్థితిలో ఎలాంటి మార్పూ వుండదు. ప్రస్తుత ఉదాహరణలో, I వ శాఖ 200 అ.వి ని తప్పనిసరిగా II వ శాఖ పారిశ్రామిక పెట్టుబడిదార్లకు పంపించవలసిందే. అది అనేకమంది వర్తకుల చేతుల ద్వారా వారికి చేరవచ్చు. అయినప్పటికీ ఈ పరికల్పన ప్రకారం, మొదట, II వ శాఖ విషయంలో I వ శాఖ పెట్టుబడిదారీ ఉత్పత్తిదారులు ఎలాంటి ఇరుకు పరిస్థితుల్లో పడ్డారో అదే పరిస్థితుల్లో ఈ వర్తకుల్లో ఆఖరి వర్తకుడు కూడా పడతాడు. అంటే, 200 I అ.విని II వ శాఖకు అమ్ముకోడు. ఇలా స్తంభించిపోయిన అమ్మకపు మొత్తం I వ శాఖ ప్రక్రియను పునః ప్రారంభించజాలదు.

సామాజిక పునరుత్పత్తి ప్రక్రియను దాని సంక్లిష్ట, నిర్దిష్ట రూపంలో విశ్లేషించే సందర్భంగా, "శాస్త్రీయ" విశ్లేషణగా పైకి కనిపించే కపటోపాయాలను తొలగించివేయాలంటే, మన వాస్తవ లక్ష్యంతో పాటు, పునరుత్పత్తి ప్రక్రియను దాని మౌలిక రూపంలో – అసలు విషయాన్ని మరుగుపరచే చిల్లర మల్లర విషయాల బెడదలేని రూపంలో – పరిశీలించడం అత్యవసరం అని మనకిక్కడ కనిపిస్తుంది.

పునరుత్పత్తి ప్రక్రియ మామూలుగా సాగుతున్నప్పుడు (అది సామాన్య పునరుత్పత్తి కావచ్చు,

లేక విస్తృత స్థాయిలోని పునరుత్పత్తి కావచ్చు), పెట్టుబడిదారీ ఉత్పత్తిదారు చలామణికై అడ్వాన్సు చేసిన డబ్బు బయలుదేరిన చోటికే తిరిగి తప్పక వస్తుందన్న నియమం (ఆ డబ్బు అతని సొంతం కావచ్చు, లేక అరువు డబ్బు కావచ్చు), I వ శాఖ అడ్వాన్సు చేసిన డబ్బు ద్వారా 200 II స్థి.పె (త) డబ్బుగా మార్చబడిందన్న పరికల్పనకు ఏ మాత్రమూ అవకాశం లేకుండా చేస్తుంది.

## 2. వస్తు రూపంలో నిశ్చల పెట్టుబడి భర్తీ అయ్యే క్రమం

పైన పరిశీలించిన పరికల్పన సంగతి తేలిపోయిన తరువాత, ఇక డబ్బు రూపంలో తరుగుదల భాగాన్ని భర్తీ చేసే అంశం కాక, పూర్తిగా పనికిరాకుండాపోయిన నిశ్చల పెట్టుబడిని వస్తు రూపంలో భర్తీ చేసే అవకాశాలు మాత్రమే మిగిలి వున్నాయి. మనం ఇంతవరకూ ఇలా ఊహించుకొన్నాము :

అ) I వ శాఖ వేతనాల రూపంలో చెల్లించిన 1000 పౌండ్లను కార్మికులు II వ శాఖ సరుకుల కోసం వ్యయం చేస్తారు. అంటే వారు ఆ డబ్బుతో వినియోగ వస్తువులు కొనుగోలు చేస్తారు.

I వ శాఖ ఈ 1000 పౌండ్లను డబ్బు రూపంలో అడ్వాన్సు చేసిందనడం కేవలం వాస్తవం చెప్పడమే. ఆయా పెట్టుబడిదారీ ఉత్పత్తిదార్లు వేతనాలను డబ్బు రూపంలోనే చెల్లించక తప్పదు. అప్పుడు కార్మికులు ఆ డబ్బును వినియోగ వస్తువుల కోసం వ్యయం చేస్తారు; ఆ డబ్బు వినియోగ వస్తువుల అమ్మకందార్లకు, తమ స్థిర పెట్టుబడిని సరుకు పెట్టుబడి రూపం నుంచి ఉత్పాదక పెట్టుబడిగా మార్చడంలో చలామణి సాధనంగా ఉపకరిస్తుంది. అది అనేక మార్గాలను (దుకాణం యజమానులు, ఇంటి యజమానులు, పన్ను వసూలుదార్లు కార్మికునికి సైతం అవసరమైన వైద్యులులాంటి అనుత్పాదక కార్మికుల చేతుల మీదుగా) గడచి వెళ్ళడం నిజమే. అందుచేత I వ శాఖ కార్మికుల చేతుల నుంచి అది పాక్షికంగా మాత్రమే II వ శాఖ పెట్టుబడిదార్ల చేతుల్లోకి వెళ్తుంది. డబ్బు గమనం కొద్దో, గొప్పో కుంటుపడవచ్చు. అందువల్ల పెట్టుబడిదార్లకు నూతన డబ్బు నిల్వ అవసరమవుతుంది. మౌలిక రూపాన్ని పరిశీలించే సందర్భంగా ఇదంతా మన విశ్లేషణా పరిధిలోకి రాదు.

ఆ) I వ శాఖ ఒక సమయంలో డబ్బు రూపంలో 400 పౌండ్లు II వ శాఖ నుంచి కొనుగోళ్ళ కోసం అడ్వాన్సు చేస్తుందని, ఆ డబ్బు I వ శాఖకు తిరిగి వస్తుందనీ, మరో సమయంలో II వ శాఖ నుంచి కొనుగోళ్ళ కోసం 400 పౌండ్లు అడ్వాన్సు చేస్తుందనీ, అది కూడా అలాగే తన డబ్బును తిరిగి పొందుతుందని మనం ఊహించుకొన్నాము. ఇలా ఊహించుకోవలసిందే. ఎందుచేతనంటే, ఇలా కాకుండా I వ శాఖ పెట్టుబడిదారీ వర్గం కాని తమ సరుకుల మార్పిడికి అవసరమైన డబ్బును చలామణిలోకి ఏకపక్షంగా ప్రవేశపెట్టాలని ఊహించుకోవటం సహేతుకం కాదు. 200 II స్థి.పె (త) ని డబ్బుగా మార్చడానికిగానూ I వ శాఖ అదనపు డబ్బును చలామణిలోకి ప్రవేశపెడుతుందన్న పరికల్పన అసంబద్ధమైనదిగా తిరస్కరించాలని I వ ఉప శీర్షికలో మనం నిరూపించాము. కాబట్టి మనకిప్పుడు అంతకంటే ఎక్కువ అసంబద్ధమైన పరికల్పన మాత్రమే మిగిలినట్లు కనిపిస్తుంది; తన నిశ్చల పెట్టుబడి తాలూకు తరుగుదలను భర్తీ చేయవలసి వున్న డబ్బుగా, తన సరుకుల విలువలోని తత్సంబంధిత భాగాన్ని మార్చడానికై II వ శాఖే చలామణిలోకి ఆ డబ్బును ప్రవేశపెడుతుందన్నది ఆ పరికల్పన. ఉదాహరణకు మిష్టర్ ఎక్స్‌కు చెందిన నూలు వడుకు యంత్రం ఉత్పత్తి ప్రక్రియలో కోల్పోయినట్టి విలువలోని

ఆ భాగం నూలు దారం విలువలోని భాగంగా పునర్దర్శనమిస్తుంది. మిష్టర్ ఎక్స్ ఒకవైపు తన నూలు వడుకు యంత్రం తరుగుదల రూపంలో కోల్పోయిన విలువ, మరోవైపు డబ్బు రూపంలో అతని చేతిలో పోగుపడాలి. ఎక్స్ 200 పౌండ్ల విలువగల పత్తిని పైనుంచి కొనుగోలు చేసి, ఆ విధంగా 200 పౌండ్లను డబ్బు రూపంలో చలామణిలోకి అడ్వాన్సు చేస్తాడని అనుకుందాం. అప్పుడు పై 200 పౌండ్లు తన యంత్రం తరుగుదలను భర్తీ చేయడానికి అవసరమైన నిధిగా ఎక్స్‌కు ఉపకరిస్తుంది. ఏతావాతా మొత్తం విషయాన్ని ఈ క్రింది విధంగా చెప్పవచ్చు. ఎక్స్ తన ఉత్పత్తి, ఉత్పాదితం, ఉత్పాదితపు అమ్మకం వీటితో నిమిత్తం లేకుండా తన యంత్రం తరుగుదలను భర్తీ చేసుకొనేందుకు అదనంగా 200 పౌండ్లను నిల్వ వుంచుకుంటాడు; అంటే యంత్రం తరుగుదల రూపంలో నష్టపోయిన విలువతో పాటు, అతడు చివరకు కొత్త నూలు వడుకు యంత్రం కొనడానికి వీలుగా ప్రతి సంవత్సరం తన జేబులోంచి మరో 200 పౌండ్లు తీసి నిల్వ వుంచుకోవాలన్న మాట.

అయితే ఇక్కడ వున్న అసంబద్ధత కేవలం పైకి కనిపించేది మాత్రమే. II వ శాఖ పెట్టుబడిదార్ల నిశ్చల పెట్టుబడి వాస్తవానికి తన పునరుత్పత్తికి చెందిన వివిధ దశల్లో వుంది. కొంతమంది పెట్టుబడిదార్ల విషయంలో, అది వస్తురూపంలో పూర్తిగా భర్తీ చేయవలసిన దశకు చేరుకొని వుంటుంది. మరికొందరి విషయంలో అది ఆ దశకు కొద్దోగొప్పో దూరంలో వుంటుంది. ఈ రెండవ కోవకు చెందిన పెట్టుబడిదార్లకు ఉమ్మడిగా వున్న అంశమేమిటంటే, వీరి నిశ్చల పెట్టుబడి వాస్తవంగా పునరుత్పత్తి కాలేదు. అంటే, అదే తరహాకు చెందిన కొత్త వస్తువుచేత దాని పునరుద్ధరణ జరగలేదు. మరి జరిగిందేమిటంటే, కేవలం దాని విలువ డబ్బు రూపంలో వరుసగా పోగయింది. మొదటి కోవకు చెందిన పెట్టుబడిదార్లు తమ వ్యాపారాన్ని ప్రారంభించినప్పుడున్న పరిస్థితిలో (లేదా దాదాపు అదే పరిస్థితిలోనే కావచ్చు, అది అక్కడ ముఖ్యం కాదు) వున్నారు. అంటే, తన డబ్బు–పెట్టుబడిని ఒకవైపు స్థిర పెట్టుబడిగా (నిశ్చల పెట్టుబడి, చలామణిలోని పెట్టుబడి), మరోవైపు శ్రమశక్తిగా, అస్థిర పెట్టుబడిగా మార్చడానికై వారు తమ డబ్బు–పెట్టుబడితో మార్కెట్‌లోకి ప్రవేశించినప్పుడున్న పరిస్థితిలో వున్నారన్న మాట. వారు ఇప్పుడు మళ్ళీ ఆ డబ్బు పెట్టుబడిని, అంటే స్థిర, నిశ్చల పెట్టుబడి విలువనూ కూడా మరోసారి చలామణి రంగానికి అడ్వాన్సు చేయవలసి వుంటుంది.

అందుచేత, II వ శాఖ పెట్టుబడిదారీ వర్గం I వ శాఖలో మార్పిడి కోసం చలామణిలోకి ప్రవేశపెట్టిన 400 పౌండ్లలో సగభాగం, తమ సరుకుల ద్వారా చలామణి పెట్టుబడికి చెందిన ఉత్పత్తి సాధనాలను మాత్రమే కాక, డబ్బు ద్వారా తమ నిశ్చల పెట్టుబడిని కూడా వస్తురూపంలో పునరుద్ధరించుకోవలసి వున్న IIవ శాఖ పెట్టుబడిదార్ల నుంచి వస్తుందనీ, మిగతా సగభాగం స్థిర పెట్టుబడి తాలూకు చలామణి భాగాన్ని మాత్రమే తన డబ్బుతో భర్తీ చేస్తుందనీ, తమ నిశ్చల పెట్టుబడిని వస్తురూపంలో పునరుద్ధరించబోదనీ మనం ఊహించుకొన్నట్లయితే, కింద చెప్పిన మాటల్లో ఎలాంటి వైరుధ్యమూ లేదు – తిరిగి వచ్చే ఈ 400 పౌండ్లు (I వ శాఖ వినియోగ వస్తువులు కొనుగోలు చేయగానే తిరిగి వచ్చే ఈ మొత్తం) II వ శాఖలోని ఈ రెండు విభాగాలకు చెందిన వారికి వివిధ స్థాయిల్లో పంపిణీ అవుతుంది. ఆ 400 పౌండ్లు II వ శాఖ పెట్టుబడిదార్లకు తిరిగి వస్తాయి. కానీ,

అచ్చంగా అవే చేతుల్లోకి వాపస్ రావు; కాగా ఆ వర్గంలోని వివిధ పెట్టుబడిదార్ల మధ్యనే వివిధ స్థాయిల్లో పంపిణీ అవుతాయి. అంటే ఒక విభాగం నుంచి మరో విభాగానికి వెడుతుంటాయి.

II వ శాఖలోని ఒక విభాగానికి చెందిన పెట్టుబడిదార్లు సరుకుల ద్వారా దీర్ఘకాలంలో చివరకు తమ ఉత్పత్తి సాధనాల్లో ఒక భాగాన్ని భర్తీ చేసుకోవడంతో పాటు, డబ్బు రూపంలోని 200 పౌండ్లను వస్తు రూపంలోని నిశ్చల పెట్టుబడి యొక్క నూతన భాగాలుగా మార్చుకున్నారు. వ్యాపారం ప్రారంభంలో జరిగినట్లే, ఇప్పుడు కూడా, ఈ విధంగా ఖర్చు పెట్టబడిన డబ్బు ఆ విభాగానికి చెందిన పెట్టుబడిదార్లకు చలామణి నుంచి అనేక సంవత్సరాల కాలంలో, కొద్ది కొద్దిగా క్రమేణా మాత్రమే, అంటే ఈ నిశ్చల పెట్టుబడి ఉత్పత్తి చేసే సరుకుల విలువలోని తరుగుదల భాగంగా క్రమేణా పెట్టుబడి ఉత్పత్తి చేసే సరుకుల విలువలోని తరుగుదల భాగంగా క్రమేణా తిరిగి వస్తుంది.

IIవ శాఖలోని మరో విభాగానికి చెందిన పెట్టుబడిదార్లకు తమ 200 పౌండ్లకు గాను I వ శాఖ నుంచి ఎలాంటి సరుకులు లభించాయి కాదు. కాని I వ శాఖలోని మొదటి విభాగం పెట్టుబడిదార్లు తమ నిశ్చల పెట్టుబడి భాగాల కోసం ఖర్చు చేసిన డబ్బును I వ శాఖ వీరికి చెల్లిస్తుంది. II వ శాఖలోని మొదటి విభాగానికి చెందిన నిశ్చల పెట్టుబడి – విలువ మరోసారి పాదార్థిక రూపంలో పునరుద్ధరింపబడి వుంది; కాగా రెండవ విభాగం మాత్రం ఉత్తరోత్తరా తన నిశ్చల పెట్టుబడిని వస్తు రూపంలో భర్తీ చేసేందుకుగాను పెట్టుబడి విలువను డబ్బు రూపంలో పోగుచేసుకొంటూనే వుంది.

మునుపటి మార్పిడులు ముగిశాక ఇప్పుడిక మనం పరిశీలించవలసినది, ఉభయ పక్షాల్లోనూ ఇంకా మార్పిడి కావలసి వున్న సరుకుల శేషభాగాలను. అవి – I వ శాఖలోని 400 అ.వి, II వ శాఖలోని 400 స్థి.పె.[1] II వ శాఖ 800 విలువ గల సరుకులతో మార్పిడి కోసం డబ్బు రూపంలో 400 అడ్వాన్సు చేస్తుందని ఊహించుకొందాం. ఇందులో సగభాగాన్ని (200కు సమానం) II స్థి.పె ఎలాంటి డబ్బు రూపంలో తరుగుదల విలువగా 200 సంచయనం చేసిన పరిస్థితుల్లో అయినా సరే ఖర్చు పెట్టి తీరాల్సిందే; అది తిరిగి తన నిశ్చల పెట్టుబడి తాలూకు పాదార్థిక రూపంగా మార్చుకోవలసి వున్న డబ్బు ఇది.

II వ శాఖ, అలాగే I వ శాఖ సరుకు – పెట్టుబడి విలువ స్థిర పెట్టుబడి విలువగానూ, అస్థిర పెట్టుబడి విలువగానూ, అదనపు విలువగానూ విభజితమవుతున్నది. వీటిని, తదనుగుణమైన నిష్పత్తుల్లో వున్న ఆయా సరుకుల ప్రత్యేక వాటాల ద్వారా చూపవీలుంది. అదే విధంగా స్థిర పెట్టుబడి విలువలోపలే, నిశ్చల పెట్టుబడి పాదార్థిక రూపంగా మార్చకుండా, ప్రస్తుతానికి డబ్బు రూపంలో సంచయనం చేయవలసిన ఆ భాగాన్ని కూడా ఇలా చూపవచ్చు. IIవ శాఖ సరుకుల్లో కొంత పరిమాణం. (కాబట్టి ప్రస్తుత ఉదాహరణలో శేషభాగంలో సగం, లేదా 200) ఇక్కడ ఈ తరుగుదల విలువ యొక్క వాహికగా మాత్రమే వుంది. మార్పిడి ద్వారా ఇది డబ్బు రూపంలో చేతికి అందవలసి వుంది. (IIవ శాఖలోని మొదటి విభాగానికి చెందిన పెట్టుబడిదార్లు – అంటే నిశ్చల పెట్టుబడిని వస్తు రూపంలో పునరుద్ధరించేవారు, ఇప్పటికీ ఈ విధంగా తమ తరుగుదల విలువలో ఒక భాగాన్ని డబ్బు రూపంలో గ్రహించి వుంటారు; కానీ 200లను డబ్బు రూపంలో వారింకా గ్రహించవలసే వుంది.)

---

1. మునుపు మనం ఊహించిన సంఖ్యలతో ఈ సంఖ్యలు ఏకీభవించడం లేదు; అయితే ఇది కేవలం నిష్పత్తికి సంబంధించిన సమస్యే కాబట్టి సంఖ్యలకు ప్రాముఖ్యం లేదు - **ఫ్రెడరిక్ ఎంగెల్స్**.

ఇక II వ శాఖ ఈ ఆఖరు చర్యలో చలామణిలోకి ప్రవేశపెట్టిన 400 పౌండ్లలోని రెండవ సగభాగం (200కు సమానం) విషయానికి వచ్చినట్లయితే, ఆ శాఖ స్థిర పెట్టుబడి తాలూకు చలామణి భాగాలను I వ శాఖ నుంచి కొనుగోలు చేస్తుంది. IIవ శాఖకు చెందిన రెండు విభాగాలు కానీ, లేదా తన విలువలో నిశ్చల భాగాన్ని వస్తురూపంలో పునరుద్ధరించనటువంటి విభాగం కానీ ఈ 200 పౌండ్లతో ఒక భాగాన్ని చలామణిలోకి ప్రవేశపెట్టవచ్చు.

ఈ 400 పౌండ్లతో I వ శాఖ నుంచి ఈ క్రిందివి వసూలు చేయబడ్డాయి : 1) నిశ్చల పెట్టుబడి రూపంలో మాత్రమే ఉన్న 200 పౌండ్ల సరుకులు 2) II వ శాఖ స్థిర పెట్టుబడిలోని చలామణి భాగం తాలూకు వస్తువులను భర్తీ చేసే 200 పౌండ్ల సరుకులు. కాబట్టి I వ శాఖ, II వ శాఖకు అమ్మడానికి వీలున్న తన సమస్త వార్షిక ఉత్పాదితాన్ని అమ్మివేసింది; అయితే దానిలో అయిదింట ఒక వంతు విలువను అంటే 400 పౌండ్లను I వ శాఖ డబ్బు రూపంలో వుంచుకొంది. కాని ఇది వాస్తవానికి డబ్బుగా మార్చబడిన అదనపు విలువ; వినియోగ వస్తువుల కోసం ఈ డబ్బును ఆదాయంగా ఖర్చు పెట్టవలసి వుంది. I వ శాఖ ఈ విధంగా తన 400 పౌండ్లతో 400కు సమానమైన II వ శాఖ సరుకు విలువనంతటినీ కొనుగోలు చేస్తుంది; అందుచేత ఈ డబ్బు II వ శాఖ యొక్క సరుకులను చలనంలో ఉంచడం వల్ల II వ శాఖకు వాపస్ వస్తుంది.

మనమిప్పుడు మూడు సందర్భాలను ఊహించుకుందాం. ఈ సందర్భాల్లో తన నిశ్చల పెట్టుబడిని వస్తురూపంలో భర్తీ చేసుకొనే II వ శాఖ పెట్టుబడిదారుల విభాగాన్ని మనం "ఒకటవ విభాగం" అందాం; నిశ్చల పెట్టుబడి నుంచి డబ్బు రూపంలో తరుగుదల – విలువలను నిల్వ చేసే విభాగాన్ని "రెండవ విభాగం" అందాం. ఆ మూడు సందర్భాలు ఇవి. (అ) 400లో II వ శాఖ వద్ద ఇప్పటికీ సరుకుల రూపంలో మిగిలి వున్నట్టి ఒక భాగం, ఒకటవ, రెండవ విభాగాలకు స్థిర పెట్టుబడిలోని కొన్ని చలామణి భాగాలలోని కొన్ని వాటాలను భర్తీ చేయవలసి వుంది. (ఒక్కో విభాగానికి సగ భాగం అనుకుందాం) (ఆ) ఒకటవ విభాగం ఇప్పటికే తన సరుకులనన్నిటినీ అమ్మివేసింది. ఇప్పుడు రెండవ విభాగం 400 విలువ గల సరుకులను అమ్ముకోవలసి వుంది. (ఇ) రెండవ విభాగం తరుగుదల విలువకు ప్రాతినిధ్యం వహించే 200 మినహా అన్నింటినీ అమ్మివేసింది.

అప్పుడు పంపిణీ ఈ క్రింది విధంగా వుంటుంది :

అ) II వ శాఖ చేతుల్లో ఇప్పటికీ ఉన్న 400 స్థి.పె సరుకు – విలువలో ఒకటవ విభాగం వద్ద 100, రెండవ విభాగం వద్ద 300 వుంటాయి; ఈ 300లలోని 200 తరుగుదలకు ప్రాతినిధ్యం వహిస్తాయి. ఇలాంటి పరిస్థితిలో, II వ శాఖ నుంచి సరుకులు కొనుగోలు చేసేందుకు I వ శాఖ 400 పౌండ్లు వెనక్కు పంపించగా అందులో ఒకటవ విభాగం 300 పౌండ్లు వ్యయం చేసింది; అంటే 200 పౌండ్లు డబ్బు రూపంలో ఖర్చు పెట్టి నిశ్చల పెట్టుబడి భాగాలను వస్తు రూపంలో పొందింది. మరో 100 పౌండ్లేమో I వ శాఖతో సరుకుల మార్పిడికి ఉపకరించేందుకై వ్యయం చేసింది. కాగా రెండవ విభాగం 400వ నాలుగింట ఒక వంతు మొత్తం అంటే 100 పౌండ్లు I వ శాఖతో సరుకుల మార్పిడికి ఉపకరించేందుకు అడ్వాన్సు చేసింది.

కాబట్టి ఈ 400 లలో ఒకటవ విభాగం 300, రెండవ విభాగం 100 అడ్వాన్సు చేసింది.

అయితే ఈ 400 క్రింది విధంగా వాపస్ వస్తుంది :

ఒకటవ విభాగానికి 100, అంటే తాను అడ్వాన్సు చేసిన మొత్తంలో మూడింట ఒక వంతు మాత్రమే. అయితే దాని వద్ద 200 విలువ మేరకు పునరుద్ధరింపబడిన 2/3 వంతు నిశ్చల పెట్టుబడి వున్నది. ఒకటవ విభాగం ఈ నిశ్చల పెట్టుబడి భాగాల కోసం I వ శాఖకు డబ్బు రూపంలో ఇచ్చింది. అయితే ఆ తర్వాత సరుకులు మాత్రం అది ఇవ్వలేదు. ఇక 200 డబ్బుకు సంబంధించి, ఒకటవ విభాగం I వ శాఖకు కొనుగోలుదారుగా మాత్రమే ఎదురవుతుంది; కాని ఆ తర్వాత అమ్మకందారుగా మాత్రం తారసిల్లదు. అందుచేత ఈ డబ్బు ఒకటవ విభాగానికి వాపస్ రాదు; అలా రానప్పుడు, అది I వ శాఖ నుంచి నిశ్చల పెట్టుబడి భాగాలను బహుమతిగా పొందవలసి వుంటుంది.

ఇక ఒకటవ విభాగం అడ్వాన్సు చేసిన చివరి మూడవ వంతు డబ్బు విషయానికి వస్తే, ఒకటవ విభాగం మొదట తన స్థిర పెట్టుబడి తాలూకు చలామణి భాగాల కొనుగోలుదారుగా వ్యవహరించింది. I వ శాఖ అదే డబ్బుతో 100 విలువ గల మిగతా సరుకులను ఒకటవ విభాగం నుంచి కొనుగోలు చేస్తుంది. ఈ విధంగా ఈ డబ్బు II వ శాఖ ఒకటవ విభాగానికి తిరిగి చేరుతుంది. ఎందుకంటే, ఒకటవ విభాగం మొదట కొనుగోలుదారుగా వ్యవహరించిన తర్వాత, నేరుగా సరుకుల అమ్మకందారుగా వ్యవహరిస్తుంది కనుక, ఆ డబ్బు వాపస్ వస్తుంది. ఈ డబ్బు గనుక వాపస్ రాకపోయినట్లయితే, II వ శాఖ ఒకటవ విభాగం I వ శాఖకు 100కు సమమైన సరుకుల కోసం మొదట డబ్బు రూపంలో 100, తరువాత సరుకుల రూపంలో ఉచితంగా 100 ఇచ్చి వుండేది. అంటే II వ శాఖ తన సరుకులను I వ శాఖకు బహుమతిగా ఇచ్చి వుండేది.

మరోవైపు డబ్బు రూపంలో 100 వ్యయం చేసిన రెండవ విభాగానికి తిరిగి డబ్బు రూపంలో 300 వస్తుంది: అది మొదట కొనుగోలుదారుగా డబ్బు రూపంలో 100ను చలామణిలోకి ప్రవేశపెట్టింది కాబట్టి అమ్మకందారుగా తిరిగి ఆ 100ను పొందుతుంది; అది సరుకుల కొనుగోలుదారుగా కాక, అమ్మకందారుగానే వ్యవహరిస్తుంది. కాబట్టి 200 వెనక్కు వస్తుంది. అందుచేత I వ శాఖకు డబ్బు తిరిగి వెళ్ళజాలదు. నిశ్చల పెట్టుబడి భాగాలను కొనుగోలు చేసేందుకుగాను II వ శాఖ మొదటి విభాగం చలామణిలోకి త్రోసిన డబ్బుచేత ఈ విధంగా నిశ్చల పెట్టుబడి తరుగుదల భర్తీ అవుతుంది. అయితే అది I వ విభాగానికి చెందిన డబ్బుగా రెండవ విభాగం చేతుల్లోకి వెళ్ళదు. I వ శాఖకు చెందిన డబ్బుగా మాత్రమే అది ఆ విధంగా రెండవ విభాగానికి వెళ్తుంది.

ఆ) ఈ ఊహ ప్రాతిపదికగా II స్థి.పె శేషభాగం ఈ క్రింది విధంగా పంపిణీ అవుతుంది; ఒకటవ విభాగానికి డబ్బు రూపంలో 200, రెండవ విభాగానికి సరుకుల రూపంలో 400.

ఒకటవ విభాగం తన సరుకులనన్నిటినీ అమ్ముకుంది; అయితే డబ్బు రూపంలోని 200 మాత్రం దాని స్థిర పెట్టుబడిలోని నిశ్చల భాగం యొక్క పరివర్తిత రూపమే. ఆ డబ్బును అది వస్తు రూపంలో పునరుద్ధరించుకోవలసి వుంది. అందుచేత అది ఇక్కడ కొనుగోలుదారుగా మాత్రమే వ్యవహరించి I వ శాఖ నుంచి డబ్బుకు బదులుగా, వస్తురూపంలో, తన నిశ్చల పెట్టుబడి భాగం విలువకు సమానంగా వుండే సరుకులను స్వీకరిస్తుంది. ఇక రెండవ విభాగం గరిష్ట స్థాయిలో

(I వ, II వ శాఖల మధ్య సరుకు మార్పిడి కోసం I వ శాఖ కనుక డబ్బును అడ్వాన్సు చేయని పక్షంలో), 200 పౌండ్లు మాత్రమే చలామణిలోకి ప్రవేశపెట్టవలసి వుంది; ఎందుచేతనంటే, అది తన సరుకు విలువలో సగభాగాన్ని I వ శాఖకు అమ్ముతుందే తప్ప ఆ శాఖ నుంచి కొనుగోలు చేయదు.

ఇప్పుడిక రెండవ విభాగానికి చలామణి నుంచి 400 పౌండ్లు తిరిగి వస్తుంది. ఎందుకంటే, అది 200 పౌండ్లను కొనుగోలుదారుగా అడ్వాన్సు చేస్తుంది. తిరిగి 200 విలువ గల సరుకుల అమ్మకందారుగా దానికి ఆ 200 తిరిగి వస్తుంది; I వ శాఖకు 200 విలువ గల సరుకులు అమ్ముతుంది కాని దానినుంచి సమతుల్యమైన సరుకులను తీసుకోదు. కాబట్టి మరో 200 దానికి తిరిగి వస్తుంది.

ఇ) ఒకటవ విభాగంవద్ద డబ్బు రూపంలో 200, సరుకుల రూపంలో 200 స్థి.పె వుంది. రెండవ విభాగం వద్ద సరుకుల రూపంలో 200 స్థి.పె (త) వుంది.

ఈ ఊహను బట్టి, రెండవ విభాగం డబ్బు రూపంలో అడ్వాన్సు చేసేదేమీ వుండదు; ఎందుచేతనంటే I వ శాఖ విషయంలో అది ఇక కొనుగోలుదారుగా వ్యవహరించకుండా అమ్మకం దారుగా మాత్రమే వ్యవహరిస్తుంది. కాబట్టి ఇతరులెవరైనా కొనుగోలు చేసేదాకా అది ఆగవలసిందే.

ఒకటవ విభాగం డబ్బు రూపంలో 400 పౌండ్లు అడ్వాన్సు చేస్తుంది. I వ శాఖతో పరస్పర సరుకు – మార్పిడి కోసం 200 పౌండ్లూ, I వ శాఖ నుంచి కొనుగోలుదారుగా 200 పౌండ్లూ అది అడ్వాన్సు చేస్తుంది. ఈ చివరి 200 పౌండ్లతో అది నిశ్చల పెట్టుబడి భాగాలను కొనుగోలు చేస్తుంది.

I వ శాఖ డబ్బు రూపంలోని 200 పౌండ్లతో ఒకటవ విభాగం నుంచి 200 విలువకు సమానమైన సరుకులు కొనుగోలు చేస్తుంది. ఈ సరుకు మార్పిడి కోసం తాను అడ్వాన్సు చేసిన 200 పౌండ్లు డబ్బు రూపంలో ఒకటవ విభాగానికి ఈ విధంగా వాపస్ వస్తుంది. ఒకటవ విభాగం నుంచి ఇదేవిధంగా తనకందిన మిగతా 200 పౌండ్లతో I వ శాఖ 200 విలువ గల సరుకులను రెండవ భాగం నుంచి కొనుగోలు చేస్తుంది. ఇందువల్ల I వ విభాగం నిశ్చల పెట్టుబడి యొక్క తరుగుదల భాగం డబ్బు రూపంలో దాని చేతికందింది.

ఈ విషయంలో, సరుకుల మార్పిడి కోసం II వ శాఖలోని ఒకటవ పైన పేర్కొన్న విభాగానికి బదులుగా I వ శాఖే ఆ 200 అడ్వాన్సు చేసిందని మనం ఊహించినప్పటికీ ఈ పరిస్థితిలో బొత్తిగా మార్పు వుండదు. I వ శాఖ గనుక మొదట II వ శాఖ రెండవ విభాగం నుంచి 200 విలువ గల సరుకులు కొనుగోలు చేసినట్లయితే (ఈ విభాగానికి అమ్ముకోవడానికి మిగిలి వున్నది ఈ సరుకు మాత్రమే అని ఊహించాం కాబట్టి), అప్పుడు ఆ 200 పౌండ్లు I వ శాఖకు వాపస్ రాదు; ఎందుచేతనంటే II వ శాఖలోని రెండవ విభాగం తిరిగి కొనుగోలుదారుగా వ్యవహరించదు. అయితే అలాంటి సందర్భంలో II వ శాఖలోని ఒకటవ విభాగం వద్ద కొనుగోలు కోసం వ్యయం చేసేందుకు 200 పౌండ్లు, సరుకుల మార్పిడి కోసం 200 పౌండ్లు వుంటుంది. ఈ విధంగా I వ శాఖతో వ్యాపారం కోసం 400 అది వ్యయం చేయవలసి వుంటుంది. అప్పుడు II వ శాఖలో, ఒకటవ విభాగం నుంచి I వ శాఖకు డబ్బు రూపంలో 200 పౌండ్లు వాపస్ వస్తుంది. II వ శాఖలోని ఒకటవ విభాగం నుంచి 200 విలువ గల సరుకులు కొనుగోలు చేయడానికి I వ శాఖ ఆ డబ్బును తిరిగి వ్యయం

చేసినట్లయితే, II వ శాఖ యొక్క ఒకటవ విభాగం I వ శాఖ నుంచి 400 లోని రెండవ సగభాగాన్ని సరుకుల రూపంలో తీసుకోగానే I వ శాఖకు ఆ డబ్బులు తిరిగి వస్తాయి. II వ శాఖలోని ఒకటవ విభాగం నిశ్చల పెట్టుబడి భాగాల కొనుగోలుదారుగా మాత్రమే డబ్బు రూపంలో 200 పౌండ్లు వ్యయం చేసింది; అందుచేత ఆ డబ్బులు దానికిక తిరిగి రావు; IIవ శాఖలోని రెండవ విభాగానికి చెందిన సరుకుల శేషం, 200 స్థి.పెని డబ్బుగా మార్చడానికి అది ఉపకరిస్తుంది. కాగా I వ శాఖ సరుకుల మార్పిడి కోసం ఖర్చు చేసిన 200 పౌండ్లు II వ శాఖలోని రెండవ విభాగం ద్వారా కాక, II వ శాఖలోని ఒకటవ విభాగం ద్వారా మాత్రమే I వ శాఖకు తిరిగి వస్తాయి. 400 విలువ గల తన సరుకుల స్థానే అంతే విలువ గల సరుకులు దానికి తిరిగి వచ్చాయి. 800 విలువ గల సరుకులతో మార్పిడి కోసం అది డబ్బు రూపంలో వ్యయం చేసిన 200 పౌండ్లు కూడా అలాగే దానికి వాపస్ వచ్చాయి. కాబట్టి అంతా సవ్యంగానే వుంది.

★ ★ ★

ఈ మార్పిడిలో ఎదురైన –

I. 1,000 అ.పె + 1,000 అ.వి ఇబ్బంది కింది శేష భాగాల మార్పిడిలో ఇబ్బందిగా తయారైంది:

II. 2,000 స్థి.పె

I. ........ 400 అ.వి

II. (1) డబ్బు రూపంలో 200 + సరుకుల రూపంలో 200 స్థి.పె + (2) సరుకుల రూపంలో 200 స్థి.పె, లేదా విషయాన్ని మరింత స్పష్టీకరించాలంటే :

I. 200 అ.వి + 200 అ.వి

II. (1) డబ్బు రూపంలో 200 అ.వి + సరుకుల రూపంలో 200 స్థి.పె + (2) సరుకుల రూపంలో 200 స్థి.పె.

IIవ శాఖలోని ఒకటవ విభాగానికి చెందిన సరుకులు 200 స్థి.పె, 200 I అ.వి సరుకులతో మార్పిడి అయినందువల్లనూ, I వ, II వ శాఖల మధ్య సరుకుల రూపంలోని 400 మార్పిడిలో చలామణి అవుతున్న డబ్బు ఎవరు అడ్వాన్సు చేశారో (అది I వ శాఖ కావచ్చు, లేదా II వ శాఖ కావచ్చు) వారికి తిరిగి వచ్చినందువల్లనూ, I, II శాఖల మధ్య చలామణి అంశంగా వున్న ఈ మనకిక్కడ తికమకపెడుతున్న సమస్యలోని అంశం కాదు. లేదా ఇంకో విధంగా చెప్పాలంటే, 200 I అ.వి సరుకుల, II వ శాఖలోని ఒకటవ విభాగానికి చెందిన 200 II స్థి.పె సరుకుల మధ్య మార్పిడిలో ఆ డబ్బు కొనుగోలు సాధనంగానూ, కాబట్టి “చలామణి సాధనం”గానూ (ఆ మాటకు గల ఖచ్చితమైన అర్థంలో) కాకుండా, కేవలం చెల్లింపు సాధనంగానే వ్యవహరించిందని అనుకుందాం. అప్పుడు 200 I అ.వి సరుకులు, II వ శాఖలోని ఒకటవ విభాగానికి చెందిన 200 II స్థి.పె సరుకులు విలువ పరిమాణంలో సమానమైనవి కాబట్టి, 200 పౌండ్ల విలువ గల ఉత్పత్తి సాధనాలు 200 పౌండ్ల విలువ గల వినియోగ వస్తువులకు మార్పిడి అయ్యాయనీ, ఇక్కడ డబ్బు కేవలం

నామమాత్రంగానే వ్యవహరిస్తున్నదనీ, విలువ బాకీ చెల్లింపు కోసం ఏ పక్షం కూడా చలామణిలోకి డబ్బును నిజంగా ప్రవేశపెట్టాల్సిన అవసరం వుండదని కూడా స్పష్టంగా తెలుస్తున్నది. కాబట్టి I వ శాఖ 200 I అ.వి సరుకులు, II వ శాఖలోని ఒకటవ విభాగానికి చెందిన 200 II స్థి.పె సరుకులు, ఈ రెండింటినీ, సమానంగా వున్నాయని కొట్టివేసినప్పుడే, సమస్య స్పష్టమైన రూపంలో మునుముందు తలెత్తుతుంది.

I వ, II వ శాఖలకు చెందిన సమాన విలువ గల ఈ సరుకులను కొట్టివేశాక, మార్పిడి కావలసిన శేషభాగం అసలు సమస్యను సృష్టిస్తోంది. ఆ శేషం ఈ క్రింది రూపంలో వుంటుంది :

I. సరుకుల రూపంలో 200 అ.వి

II. (1) డబ్బు రూపంలో 200 స్థి.పె ప్లస్ (2) సరుకుల రూపంలో 200 స్థి.పె

II వ శాఖలోని ఒకటవ విభాగం 200 డబ్బుతో తన నిశ్చల పెట్టుబడి అంతర్భాగాలను, అంటే 200 I అ.వి ని కొనుగోలు చేస్తుందని మనకిక్కడ స్పష్టంగా బోధపడుతున్నది. ఈ క్రమంలో II వ శాఖలోని ఒకటవ విభాగం తాలూకు నిశ్చల పెట్టుబడి వస్తురూపంలో పునరుద్ధరింపబడుతుంది; I వ శాఖ అదనపు విలువ, 200 సరుకు – రూపం నుంచి (ఉత్పత్తి సాధనాలు లేదా మరింత ఖచ్చితంగా చెప్తే, నిశ్చల పెట్టుబడి అంశాల నుంచి) డబ్బు రూపంలోకి మార్చబడుతుంది. I వ శాఖ ఈ డబ్బుతో II వ శాఖలోని రెండవ విభాగం నుంచి వినియోగ వస్తువులు కొనుగోలు చేస్తుంది. II వ శాఖకు దీని ఫలితం ఏమిటంటే – మొదటి విభాగానికి చెందిన స్థిర పెట్టుబడి తాలూకు నిశ్చల భాగం వస్తువుల రూపంలో పునరుద్ధరింపబడింది; కాగా రెండవ విభాగానికేమో మరో భాగం (తన నిశ్చల పెట్టుబడి తరుగుదలను భర్తీ చేసే భాగం) డబ్బు రూపంలో చేతికందింది. ఈ తరుగుదల భాగం సైతం వస్తు రూపంలో పునరుద్ధరింపబడేదాకా ఈ క్రమం ఏటా కొనసాగుతూనే వుంటుంది.

ఇక్కడ ముందు షరతు ఏమిటంటే, తన విలువ మేరకు పూర్తిగా డబ్బు రూపంలోకి పరివర్తన చెందినట్టీ, ఆ కారణంగా ఒకటవ విభాగంలో ఏటా వస్తు రూపంలో పునరుద్ధరింపబడవలసి వున్నట్టీ II వ శాఖ స్థిర పెట్టుబడి తాలూకు ఈ నిశ్చల భాగం, II వ శాఖ స్థిర పెట్టుబడి తాలూకు మరో నిశ్చల భాగం యొక్క అంటే, మునుపటి పాదార్థిక రూపంలోనే పని చేస్తున్న నిశ్చల భాగం యొక్క తరుగుదలకు సమానంగా వుండాలి. ఈ తరుగుదల, విలువ తగ్గుదల, నిశ్చల పెట్టుబడి ఉత్పత్తి చేస్తున్న సరుకులకు బదిలీ అయ్యే ఈ విలువ మొదట డబ్బు రూపంలో భర్తీ కావలసి వుంటుంది. ఇలాంటి సమతులనం, ఒకే స్థాయిలో సాగే పునరుత్పత్తి యొక్క నియమంలాగా కనిపిస్తుంది. ఇంకో విధంగా చెప్తే, ఉత్పత్తి సాధనాలను తయారుచేసే I వ శాఖలో శ్రమ విభజన నిష్పత్తి మారకూడదు. ఎందుచేతనంటే, ఈ శాఖ II వ శాఖకు చెందిన స్థిర పెట్టుబడిలోని చలామణి భాగాలను ఒకవైపు, మరోవైపు ఆ పెట్టుబడిలోని నిశ్చల భాగాలను ఉత్పత్తి చేస్తుంది.

మనం ఈ అంశాన్ని మరింత లోతుగా విశ్లేషించడానికి ముందు II స్థి.పె (1) శేషభాగం II స్థి.పె (2) శేషభాగానికి సమానంగా వుండకుండా, ఎక్కువగా కానీ, తక్కువగా కానీ వున్నప్పుడు పరిస్థితి ఎలా వుంటుందో పరిశీలించవలసి వుంది. ఈ రెండు రకాల సందర్భాలను వరుసగా పరిశీలిద్దాం.

## మొదటి సందర్భం

I. 200 అ.వి

II (1) 220 స్థి.పె (డబ్బు రూపంలో) ప్లస్ 200 స్థి.పె (సరుకుల రూపంలో) ఇక్కడ II స్థి.పె (1) తన 200 పౌండ్ల డబ్బుతో 200 I అ.వి సరుకులను కొనుగోలు చేస్తుంది; కాగా I వ శాఖ అదే డబ్బుతో 200 II స్థి.పె (2) సరుకులను కొనుగోలు చేస్తుంది. స్థిర పెట్టుబడిలో, డబ్బుగా మారే భాగమిది. ఈ భాగం ఈ విధంగా డబ్బుగా పరివర్తన చెందుతుంది. అయితే డబ్బు రూపంలోని 20 II స్థి.పె (1) మాత్రం వస్తు రూపంలోని నిశ్చల పెట్టుబడిగా తిరిగి మారజాలదు.

I అ.వి శేషభాగాన్ని 200 గా కాకుండా 220గా ఉంచుకున్నట్లయితే ఈ దురదృష్ట పరిస్థితిని సరిదిద్దవచ్చునని కనిపిస్తుంది; అంటే మునుపటి మార్పిడి మూలంగా 2,000 Iలో 1,800 బదులుగా 1,780 మాత్రమే వ్యయమై వుండాలన్న మాట. అప్పుడు ఇలా వుంటుంది :

I. 200 అ.వి

II. (1) 200 స్థి.పె (డబ్బు రూపంలో) + (2) 20 స్థి.పె (సరుకుల రూపంలో)

ఒకటవ విభాగానికి చెందిన II స్థి.పె ఆ 220 పౌండ్ల డబ్బుతో 220 I అ.వి ని కొనుగోలు చేస్తుంది; అప్పుడు I వ శాఖ 200 పౌండ్లతో 200 II స్థి.పె (2) సరుకులను కొనుగోలు చేస్తుంది. ఫలితంగా I వ శాఖకు ఇప్పుడు 20 పౌండ్లు డబ్బు రూపంలో మిగిలిపోయింది. అదనపు విలువలోని ఈ భాగాన్ని అది డబ్బు రూపంలోనే వుంచుకోగలదు. వినియోగ వస్తువుల కోసం ఖర్చుపెట్టజాలదు. ఇబ్బంది, ఈ విధంగా II స్థి.పె ఒకటవ విభాగం నుంచి I అ.వికి బదలాయించబడింది, అంతే.

మరోవైపు ఒకటవ విభాగం యొక్క II స్థి.పె రెండవ విభాగం II స్థి.పె కంటే తక్కువ అనుకుందాం. అప్పుడు పరిస్థితి కింది విధంగా వుంటుంది.

## రెండవ సందర్భం

I. 200 అ.వి (సరుకుల రూపంలో)

II. (1) 180 స్థి.పె (డబ్బు రూపంలో) ప్లస్ (2) 200 స్థి.పె (సరుకుల రూపంలో)

II వ శాఖ I వ విభాగం 180 పౌండ్ల డబ్బుతో 180 I అ.వి సరుకులను కొనుగోలు చేస్తుంది. I వ శాఖ ఈ డబ్బుతో II వ శాఖ రెండవ విభాగం నుంచి అంతే విలువ గల సరుకులు కొనుగోలు చేస్తుంది; అంటే 180 II స్థి.పె (2) సరుకులను కొనుగోలు చేస్తుందన్నమాట. ఇప్పుడు ఒకవైపేమో అమ్మడానికి వీలులేని 20 I అ.పె మిగిలి వుంటుంది; మరోవైపేమో డబ్బు రూపంలోకి మార్చేందుకు వీలులేని 40 పౌండ్ల విలువ గల సరుకులు మిగిలి వుంటాయి.

I వ శాఖ శేష భాగాన్ని 180కి సమానంగా చేసినప్పటికీ ఉపయోగం వుండదు; అప్పుడు I వ శాఖకు అదనపు భాగం ఏదీ మిగలని మాట నిజం. కానీ, ఇంతకు ముందులాగే అమ్మడానికి వీలులేని, డబ్బుగా మార్చడానికి వీలులేని అదనపు సరుకు 20, II స్థి.పె (రెండవ విభాగం) వద్ద మిగులుతుంది.

II (2) కంటే II (1) ఎక్కువగా వున్న మొదటి పరిస్థితిలో, II స్థి.పె (1) పక్షాన నిశ్చల పెట్టుబడిగా మార్చడానికి వీలులేని డబ్బు రూపంలో అదనపు భాగం మిగిలి వుంటుంది. లేదా I అ.వి శేషభాగం

II స్థి.పె (1)కి సమానంగా వుందని ఊహించుకొన్నట్లయితే అప్పుడు I అ.పె పక్షాన వినియోగ వస్తువులుగా మార్చడానికి వీలులేని డబ్బు రూపంలో, అంతే మొత్తం మిగిలి వుంటుంది.

రెండవ సందర్భంలో, అంటే II స్థి.పె (2) కంటే II స్థి.పె (1) తక్కువగా వున్న పరిస్థితిలో 200 I అ.వి యొక్క శేషభాగం II స్థి.పె (1)కి సమానంగా వుంటుందని ఊహించినట్లయితే, అప్పుడు II స్థి.పె (2) పక్షాన డబ్బు లోటు ఏర్పడుతుంది. సరుకులు మిగిలిపోతాయి.

I అ.వి శేషభాగాలు ఎల్లప్పుడూ II స్థి.పె (1)కి సమానంగా వుంటాయని మనం ఊహించు కొందాం (ఎందుకంటే ఆర్డర్లు ఉత్పత్తిని నిర్ణయిస్తాయి కాబట్టి, ఒక సందర్భంలో II వ, I వ శాఖల స్థిర పెట్టుబడులలో నిశ్చల భాగాల ఉత్పత్తి ఎక్కువగా, మరుసటి సంవత్సరం వాటి స్థిర పెట్టుబడులలోని చలామణి భాగాల ఉత్పత్తి ఎక్కువగా వున్నప్పటికీ పునరుత్పత్తిలో ఎలాంటి మార్పూ వుండదు.) అప్పుడు, మొదటి పరిస్థితిలో, I వ శాఖ గనుక I అ.వితో II వ శాఖ అదనపు విలువలో కొంత భాగాన్ని కొనుగోలు చేస్తేనే, II వ శాఖ దానిని ఖర్చు పెట్టకుండా డబ్బు రూపంలో కూడబెట్టుకునే పక్షంలోనే, I అ.వి వినియోగ వస్తువులుగా తిరిగి మార్చడం సాధ్యపడుతుంది. ఇక రెండవ రకం సందర్భంలో, I వ శాఖ తనే స్వయంగా డబ్బు ఖర్చుపెట్టే పక్షంలోనే సమస్యకు పరిష్కారం కుదురుతుంది; అయితే అది అలా ఖర్చు పెడుతుందన్న ఊహను మనం ఇంతకు మునుపే తిరస్కరించాం.

II స్థి.పె (1) కనుక II స్థి.పె (2) కంటే ఎక్కువగా వుండే పక్షంలో, I అ.విలోని అదనపు డబ్బు అనుభోగంలోకి రావడానికి విదేశీ సరుకులను దిగుమతి చేసుకోవలసి వుంటుంది. ఇందుకు భిన్నంగా II స్థి.పె (1) కనుక II స్థి.పె (2) కంటే తక్కువగా వుండే పక్షంలో II స్థి.పె యొక్క ఉత్పత్తి సాధనాల్లో తరుగుదల భాగాన్ని భర్తీ చేసుకోడానికి II వ విభాగం సరుకులను (వినియోగ వస్తువులను) ఎగుమతి చేయవలసి వుంటుంది. ఏతావాతా తేలేదేమంటే, రెండు రకాల సందర్భాల్లోనూ విదేశీ వాణిజ్యం అవసరం.

స్థిరమైన స్థాయిలోని పునరుత్పత్తిని అధ్యయనం చేసే నిమిత్తం, పరిశ్రమ యొక్క అన్ని శాఖల ఉత్పాదకతా, ఆ కారణంగా, ఆ శాఖల తాలూకు సరుకుల మధ్యగల నైష్పత్తిక విలువ – సంబంధాలూ నిలకడగా వుంటాయని ఊహించవలసి వుంటుందనుకొన్నప్పటికీ, II స్థి.పె (2) కంటె II స్థి.పె (1) ఎక్కువగా కాని, లేదా తక్కువగా కాని వుంటుందని మనం అనుకున్న రెండు రకాల సందర్భాలూ, విస్తృత స్థాయిలోని ఉత్పత్తికి సంబంధించి, ఎల్లప్పుడూ ఆసక్తికరమైనవే; వాస్తవానికి విస్తృత స్థాయిలోని ఉత్పత్తి రంగంలో ఈ రెండు రకాల పరిస్థితులు అనివార్యంగా తలెత్తవచ్చు.

## 3. ఫలితాలు

నిశ్చల పెట్టుబడి స్థానం భర్తీ చేసేందుకు సంబంధించి ఈ క్రింది అంశాలను గమనించాలి.

అన్ని అంశాలు, అంటే ఉత్పత్తి స్థాయి మాత్రమే కాక, అన్నిటికన్నా ముఖ్యంగా శ్రామిక ఉత్పాదకత కూడా మార్పు లేకుండా యధాతథంగా వున్నప్పుడు, II స్థి.పె తాలూకు నిశ్చల పెట్టుబడిలో గత సంవత్సరం కంటే ఈ సంవత్సరం ఎక్కువ భాగం తరిగిపోతుందనుకుందాం. పర్యవసానంగా వస్తు రూపంలో ఎక్కువ భాగం భర్తీ చేయవలసి వుంటుంది. అప్పుడు, ప్రస్తుతం తరిగిపోతూన్న నిశ్చల పెట్టుబడి భాగం ఈలోగా పూర్తిగా నిరుపయోగమయ్యే వరకు డబ్బు రూపంలో భర్తీ చేయవలసి

వున్న ఆ భాగం కూడా అదే నిష్పత్తిలో తగ్గిపోతుంది. ఎందుచేతనంటే, మన ఊహ ప్రకారం II వ శాఖలో పనిచేసే నిశ్చల పెట్టుబడి భాగం యొక్క మొత్తం (విలువ మొత్తంతో సహా) మారకుండా యధాతథంగా వుంటుంది. కాని ఇది ఈ క్రింది పరిస్థితిని సృష్టిస్తుంది. మొదటి విషయం: I వ శాఖ సరుకు – పెట్టుబడిలోని ఎక్కువ భాగం, II స్థి.పె నిశ్చల పెట్టుబడి భాగాలుగా వున్నట్లయితే, తదనుగుణమైన తక్కువ భాగం II స్థి.పె చలామణి భాగాలుగా వుంటుంది. ఎందుచేతనంటే, II స్థి.పె కోసం I వ శాఖ సృష్టించే మొత్తం ఉత్పాదితం మారదు. ఇందులో ఏ భాగం పెరిగినా రెండవ భాగం తగ్గుతుంది. రెండవ భాగం పెరిగితే మొదటి భాగం తగ్గిపోతుంది. మరోవైపేమో II వ శాఖ మొత్తం ఉత్పత్తి పరిమాణం కూడా మారదు. మరి, ముడి పదార్థాలు, సగం తయారైన వస్తువులు, అనుబంధ పదార్థాలు (అంటే II వ శాఖ స్థిర పెట్టుబడి తాలూకు చలామణి భాగాలు) తగ్గిపోయినట్లయితే ఈ మొత్తం ఉత్పత్తి మారకుండా వుండడం ఎలా సాధ్యం?

రెండవది : డబ్బు రూపంలో పునరుద్ధరింపబడిన II స్థి.పె నిశ్చల పెట్టుబడిలోని ఎక్కువ భాగం తిరిగి I వ శాఖకు చేరుకుంటుంది; డబ్బు రూపంలో నుంచి పాదార్థిక రూపంలోకి తిరిగి మార్పు చేయవలసి వుంది. కాబట్టి, సరుకుల మార్పిడి కోసం I వ, II వ శాఖల మధ్య చలామణి అవుతున్న డబ్బుతోపాటు, I వ శాఖకు అధికంగా డబ్బు తిరిగి వస్తుందన్నమాట; ఇలా అధికంగా వచ్చే డబ్బు పరస్పర సరుకుల మార్పిడికి సాధనంగా ఉపకరించకుండా, పాక్షికంగా కొనుగోలు సాధనంగా మాత్రమే పనిచేస్తుంది. అప్పుడు తరుగుదల భాగపు సమతుల్యం వున్న II స్థి.పె సరుకుల మొత్తం కూడా, అంటే I వ శాఖ సరుకులతో కాక ఆ విభాగపు డబ్బుతో మార్పిడి చెందవలసి వున్న II వ శాఖ సరుకుతో కాక ఆ విభాగపు డబ్బుతో మార్పిడి చెందవలసి వున్న II వ శాఖ సరుకుల రాశి కూడా అదే నిష్పత్తిలో తగ్గిపోతుంది. ఆ విధంగా II వ శాఖ నుంచి I వ శాఖకు మరింత ఎక్కువ డబ్బు కేవలం కొనుగోలు సాధనంగా చేరుకోవలసి వుంది; II వ శాఖ పక్షాన తక్కువ సరుకులు వుంటాయి; ఈ సరుకులకు సంబంధించి Iవ శాఖ కేవలం కొనుగోలుదారుగానే వ్యవహరించవలసి వుంది. I అ.పె అప్పటికే II వ శాఖ సరుకులుగా మార్చబడి వుంది కాబట్టి, I అ.విలో ఎక్కువ భాగం II వ శాఖ సరుకులుగా మార్చబడదు; అది డబ్బు రూపంలోనే కొనసాగుతుంది.

దీనికి విరుద్ధమైన పరిస్థితి గురించి చర్చించాల్సిన అవసరం లేదు; అంటే ఒక నిర్దిష్ట సంవత్సరంలో II వ శాఖలో తరిగిపోయిన నిశ్చల పెట్టుబడి భాగాల పునరుత్పత్తి తక్కువగా వుండి, తరుగుదల భాగం ఎక్కువగా వున్న పరిస్థితి గురించి చర్చించాల్సిన అవసరం లేదు.

పునరుత్పత్తి ఒకే స్థాయిలో కొనసాగుతున్నప్పటికీ, సంక్షోభం అధికోత్పత్తి సంక్షోభం నెలకొంటుంది.

ఒక్కమాటలో చెప్పాలంటే, సామాన్య పునరుత్పత్తిలో, ఇతర పరిస్థితులు సైతం మారకుండా యధాతథంగా కొనసాగినప్పుడు ముఖ్యంగా ఉత్పాదక శక్తి, శ్రమ మొత్తం పరిమాణం, శ్రమ సాంద్రతలలో మార్పులేనప్పుడు, తరిగిపోతున్న నిశ్చల పెట్టుబడికీ (పునరుద్ధరింపబడవలసినది), తన మునుపటి పాదార్థిక రూపంలో ఇప్పటికీ పని చేస్తున్న నిశ్చల పెట్టుబడికీ మధ్య స్థిరమైన నిష్పత్తి వున్నట్లు ఊహించుకోకపోతే (తరుగుదలకు పరిహారంగా ఉత్పాదితాలకు విలువను కేవలం చేర్చేది),

అప్పుడు, మొదటిరకం సందర్భంలో, పునరుద్ధరించబడవలసి వున్నట్టి చలామణి భాగాల మొత్తం మార్పు లేకుండా యధావిధిగా వుంటుంది; కాగా, పునరుద్ధరించబడవలసి వున్న నిశ్చల భాగాల మొత్తం పెరుగుతుంది. అందుచేత I వ శాఖ యొక్క మొత్తం ఉత్పత్తి పెరగవలసి వుంది. లేకపోతే డబ్బు సంబంధాల వ్యవహారం అటుంచినా, పునరుత్పత్తిలో లోటు ఏర్పడుతుంది.

ఇక రెండవ రకం సందర్భంలో వస్తు రూపంలో పునరుద్ధరించబడవలసి వున్న II వ శాఖ యొక్క నిశ్చల పెట్టుబడి పరిమాణం తదనుగుణమైన మోతాదులో తగ్గిపోయి, ఇప్పుడు డబ్బు రూపంలో మాత్రమే పునరుద్ధరింపబడవలసి వున్న II వ శాఖ నిశ్చల పెట్టుబడి భాగం అదే నిష్పత్తిలో పెరిగినట్లయితే, Iవ శాఖ ఉత్పత్తి చేసేటువంటి II వ శాఖ స్థిర పెట్టుబడి తాలూకు చలామణి భాగాల పరిమాణం మార్పు లేకుండా యధాతథంగా వుంటుంది; పోతే పునరుద్ధరించవలసి వున్న నిశ్చల పెట్టుబడి భాగాలు తగ్గిపోతాయి. పర్యవసానంగా I వ శాఖ మొత్తం ఉత్పత్తి తగ్గిపోవడమో లేదా మిగులు తేలడమో (ఇంతకు మునుపు లోటుగా వున్నట్టిది) జరుగుతుంది; ఈ మిగులు భాగం డబ్బుగా మార్చడానికి వీలులేనట్టిది.

మొదటి రకం సందర్భంలో, అదే శ్రమ, పెరిగిన ఉత్పాదకత, విస్తరణ లేక తీవ్రత ద్వారా ఎక్కువ ఉత్పత్తి చేయగలదనేది నిజమే. ఆ సందర్భంలో ఈ విధంగా లోటును భర్తీ చేయడం సాధ్యపడుతుంది. అయితే I వ శాఖలోని ఒక ఉత్పత్తి రంగం నుంచి మరో ఉత్పత్తి రంగానికి పెట్టుబడిని, శ్రమను బదలాయించకపోతే పై మార్పు జరుగదు. కాగా అలాంటి ప్రతి బదలాయింపు మూలంగా తాత్కాలిక అంతరాయాలు కలుగుతాయి. పైగా (శ్రమ విస్తరణ, శ్రమ తీవ్రత పెరిగే కొద్దీ) I వ శాఖ వద్ద మార్పిడికోసం ఎక్కువ విలువ వుండగా, II వ శాఖ వద్ద తక్కువ విలువ వుంటుంది. కాబట్టి I వ శాఖ ఉత్పాదితం విలువ తగ్గుతుంది.

పోతే రెండవ రకం సందర్భంలో ఇందుకు విరుద్ధమైనది జరుగుతుంది. ఆ సందర్భంలో I వ శాఖ తన ఉత్పత్తిని తగ్గించుకోనైనా తగ్గించుకోవాలి, లేదా అదనంగానైనా ఉత్పత్తి చేయాలి. తగ్గించినట్లయితే కార్మికులకు, పెట్టుబడిదార్లకు సంక్షోభం ఏర్పడుతుంది; ఉత్పత్తిని పెంచినప్పటికీ సంక్షోభం తప్పదు. ఈ అదనపు ఉత్పత్తి స్వతహాగా చెడ్డది కాదు, మంచిదే. కానీ, పెట్టుబడిదారీ ఉత్పత్తి పరిస్థితుల్లో మాత్రం అది చెడ్డదే.

ఈ రెండు రకాల సందర్భాల్లోనూ విదేశీ వాణిజ్యం సహాయపడుతుంది; మొదటిరకం సందర్భంలో, I వ శాఖ వద్ద డబ్బు రూపంలో వున్న సరుకులను వినియోగ వస్తువులుగా మార్చడానికీ, రెండవ రకం సందర్భంలోనేమో అదనపు సరుకును వదిలించుకోడానికీ విదేశీ వాణిజ్యం సహాయ పడుతుంది. అయితే విదేశీ వాణిజ్యం కొన్ని అంశాలను కేవలం (విలువకు సంబంధించినవి కూడా) భర్తీ చేయడం మాత్రమే కాదు; అది వైరుధ్యాలను మరింత విస్తృత రంగానికి బదలాయించి, వాటికి మరింత అవకాశం కల్పిస్తుంది.

పునరుత్పత్తికి సంబంధించిన పెట్టుబడిదారీ స్వరూపం రద్దయ్యాక, సమస్య అల్లా, నిశ్చల పెట్టుబడి (మన ఉదాహరణలో వినియోగ వస్తువులు ఉత్పత్తిలో పనిచేసే పెట్టుబడి) తాలూకు తరుగుదల భాగం యొక్క పరిమాణం (అరిగిపోతున్న భాగం కాబట్టి వస్తురూపంలో పునరుత్పత్తి చేయవలసిన భాగం) ఏడాదికేడాదికీ మారుతూ వుంటూందనేదే. అది గనుక ఒక సంవత్సరంలో చాలా ఎక్కువగా

వుంటే (మనుషుల విషయంలో మరణాల సగటు రేటును మించి వున్నట్లుగా) తరువాత సంవత్సరంలో అది తప్పకుండా చాలా తక్కువగా వుంటుంది. అయితే ఇతర అంశాల్లో మార్పు లేనట్లయితే దీని పర్యవసానంగా వినియోగ వస్తువులు వార్షిక ఉత్పత్తికి అవసరమైనట్టి ముడిపదార్థాల, సగం తయారైన పదార్థాల, అనుబంధ పదార్థాల పరిమాణం మాత్రం తగ్గదు. అందుచేత ఉత్పత్తి సాధనాల మొత్తం ఉత్పత్తి ఒకరకం సందర్భంలో పెరగవలసి వుంటే, మరోరకం సందర్భంలో తరగవలసి వుంటుంది. నిరంతరాయమైన సాపేక్ష అధికోత్పత్తి ద్వారా మాత్రమే దీన్ని చక్కదిద్దవచ్చు. ఒకవైపేమో నేరుగా అవసరమైన దానికంటే అదనంగా నిర్దిష్ట పరిమాణంలో నిశ్చల పెట్టుబడి ఉత్పత్తి అవుతుండాలి. మరోవైపేమో – మరీ ముఖ్యంగా – ప్రత్యక్ష వార్షికావసరాలకంటే అదనంగా ముడిపదార్థాలు సరఫరా అవుతుండాలి. (ఇది ముఖ్యంగా జీవనావసరాలకు వర్తిస్తుంది.) ఈ తరహా అధికోత్పత్తి వున్నదంటే, సమాజానికి పునరుత్పత్తి తాలూకు పాదార్థిక వనరులపై నియంత్రణ వున్నట్లే. కానీ పెట్టుబడిదారీ సమాజంలో, ఇలాంటి అధికోత్పత్తి అరాచకాన్ని తెచ్చిపెట్టే అంశమవుతుంది.

పునరుత్పత్తి స్థాయి మారని స్థితిలో నిశ్చల పెట్టుబడికి సంబంధించిన ఈ ఉదాహరణ గమనార్హమైనది. అర్థశాస్త్రవేత్తలు సంక్షోభాలకు కారణాలు చెప్పే సందర్భంగా, ఇలా నిశ్చల పెట్టుబడి ఉత్పత్తికీ, చలామణి పెట్టుబడి ఉత్పత్తికీ మధ్య పరస్పరానుగుణ్యత లేకపోవడం ఒక కారణమని చెప్పడం వారికి అభిమానపాత్రమైన వాదనల్లో ఒకటి. నిశ్చల పెట్టుబడిని కేవలం భద్రపరిచినప్పటికీ, ఇలా పరస్పరానుగుణ్యత లేకపోవచ్చు, ఉండచ్చు కూడా అనే సంగతీ, అదివరకే పనిచేస్తూన్న సామాజిక పెట్టుబడి యొక్క సామాన్య పునరుత్పత్తి ప్రాతిపదికపై ఆదర్శప్రాయమైన మామూలు ఉత్పత్తి జరుగుతున్న దని ఊహించినప్పుడు ఇలా జరగగలదూ, జరిగి తీరుతుందన్న సంగతీ వారెరుగరు; ఇది వారికి కొత్త విషయమే.

## XII. డబ్బు మూలపదార్థాల పునరుత్పత్తి

మనం ఇంతవరకూ ఒక కారకాన్ని, అంటే బంగారం, వెండి వార్షిక పునరుత్పత్తిని పూర్తిగా విస్మరించాం. ఇవి విలాస వస్తువుల తయారీ, మలాము చేయటం, వగైరాలకు ఉపయోగపడే పదార్థాలుగా మాత్రమే ఉన్నట్లయితే, మిగతా ఉత్పాదితాలలాగే వీటి గురించి కూడా ప్రస్తావించాల్సిన అవసరం వుండేది కాదు. కానీ అది డబ్బు మూలపదార్థాలుగా, కనుక సంభావ్యధనంగా (Potential Money) ముఖ్యమైన పాత్ర నిర్వహిస్తాయి. సౌలభ్యం కోసం మనం ఇక్కడ బంగారాన్ని మాత్రమే డబ్బు మూలపదార్థంగా పరిగణిద్దాం.

పాత గణాంక వివరాల ప్రకారం, మొత్తం బంగారం వార్షిక ఉత్పత్తి 8,00,000 – 9,00,000 పౌండ్ల మేరకు వుంటుంది; దీని ఖరీదు స్థూలంగా 1,100–1,250 మిలియన్ మార్క్‌ల మధ్య వుంటుంది. కానీ సూట్ బీర్[1] అభిప్రాయం ప్రకారం, 1871–1875 సంవత్సరాల సగటు ప్రాతిపదికపై అది 1,70,675 కిలోగ్రాముల మేరకు వుంది. దాని ఖరీదు స్థూలంగా 476 మిలియన్ మార్కులు. ఇందులో ఆస్ట్రేలియా వంతు దాదాపు 167 మిలియన్ మార్కులు, అమెరికా సంయుక్త రాష్ట్రాల వంతు దాదాపు 166 మిలియన్ మార్కులు, రష్యా వంతు 93 మిలియన్ మార్కులు. మిగిలిన

1. ఎడ్. సూట్ బీర్, ఎల్‌మెటల్ ప్రొడక్షన్, గోతా, 1879.

బంగారాన్ని ఇతర దేశాలు ఒక్కొక్కటి 10 మిలియన్ మార్కుల కంటే తక్కువే ఉత్పత్తి చేస్తుంది. అదేకాలంలో వెండి వార్షిక ఉత్పత్తి 2 మిలియన్ కిలోగ్రాముల కంటే కొద్దిగా తక్కువ; దీని విలువ రమారమి 354 ½ మిలియన్ మార్కులు. ఇందులో ఆయా దేశాలు సరఫరా చేసిన వెండి విలువ ఇలా వుంది; మెక్సికో – 108 మిలియన్ మార్కులు, అమెరికా సంయుక్త రాష్ట్రాలు – 102 మిలియన్ మార్కులు, దక్షిణ అమెరికా – 67 మిలియన్ మార్కులు, జర్మనీ – 26 మిలియన్ మార్కులు, ఇలాగే మరికొన్ని దేశాలు కూడా వెండిని ఉత్పత్తి చేస్తున్నాయి.

పెట్టుబడిదారీ ఉత్పత్తి ప్రాబల్యంలో వున్న దేశాలలో అమెరికా మాత్రమే బంగారం, వెండిని ఉత్పత్తి చేస్తున్నది. యూరప్‌కు చెందిన పెట్టుబడిదారీ దేశాలు దాదాపు తమ మొత్తం బంగారాన్నీ, వెండిలో చాలా ఎక్కువ భాగాన్నీ ఆస్ట్రేలియా, అమెరికా సంయుక్త రాష్ట్రాలు, మెక్సికో, దక్షిణ అమెరికా, రష్యాల నుంచి తెప్పించుకొంటున్నాయి.

కానీ పెట్టుబడిదారీ ఉత్పత్తి వున్న దేశంలోని వార్షిక పునరుత్పత్తిని విశ్లేషిస్తున్న సందర్భంలో ఆ దేశంలోనే బంగారం గనులు వున్నట్లు మనం ఇక్కడ ఊహిస్తున్నాం. అందుకు కారణం ఇది :

విదేశీ వాణిజ్యం లేకుండా పెట్టుబడిదారీ ఉత్పత్తి అస్తిత్వంలో వుండదు. అయితే మామూలు వార్షిక ఉత్పత్తి ఒక నిర్దిష్ట స్థాయిలో వున్నదని మనం ఊహించినట్లయితే, ఇంకో విషయాన్ని కూడా ఊహించుకొంటున్నాము. అదేమిటంటే "ఉత్పత్తి సాధనాలు" "వినియోగ వస్తువులు" పరస్పర మార్పిడిలో వాటి విలువ సంబంధాలను గానీ లేదా వాటి ఉత్పాదితం విలువలోని భాగాలైన స్థిర పెట్టుబడి, అస్థిర పెట్టుబడి, అదనపు విలువల పరస్పర సంబంధాలను గానీ ఏ విధంగానూ ప్రభావితం చేయకుండానే, విదేశీ వాణిజ్యం, ఇతర ఉపయోగపు వస్తువులచేత, లేక ఇతర పాదార్థిక రూపంలోని వస్తువులచేత స్వదేశీ ఉత్పాదితాల స్థానాన్ని కేవలం భర్తీ చేస్తుందని ఊహించుకొంటున్నాము. అందుచేత పునరుత్పత్తి అయ్యే ఉత్పాదితాల విలువను విశ్లేషించే సందర్భంగా విదేశీ వాణిజ్యాన్ని ఆ విశ్లేషణా పరిధిలోకి తీసుకురావడం వల్ల కేవలం గందరగోళం ఏర్పడుతుందే తప్ప, సమస్యకు కానీ, దాని పరిష్కృతికి కానీ అది ఏ విధంగానూ తోడ్పడదు. ఈ కారణంచేత దీనిని పూర్తిగా వదలివేయాలి. పర్యవసానంగా, ఇక్కడ బంగారాన్ని సైతం వార్షిక పునరుత్పత్తిలోని ఒక ప్రత్యక్ష అంశంగా మాత్రమే పరిగణించాలి తప్ప, మార్పిడి ద్వారా విదేశాల నుంచి దిగుమతి చేసుకోబడిన సరుకుగా పరిగణించరాదు.

సాధారణంగా ఇతర లోహాల మాదిరే, బంగారం ఉత్పత్తి కూడా I వ శాఖకు, అంటే ఉత్పత్తి సాధనాలను ఉత్పత్తి చేసే అభివర్గానికి చెందుతుంది. బంగారం యొక్క వార్షిక ఉత్పత్తి 30కి సమానం అనుకుందాం. (కేవలం సౌకర్యం కోసమే ఇలా అనుకుందాం; వాస్తవంలో మనం తీసుకున్న ఉదాహరణలోని ఇతర సంఖ్యలతో పోల్చితే, ఇది చాలా ఎక్కువే.) అప్పుడీ విలువ 20 స్థి.పె + 5 అ.పె + 5 అ.విగా విభజింపబడుతుందని అనుకుందాం. స్థి.పె తాలూకు ఇతర అంశాలతో 20 స్థి.పె మార్పిడి కావలసి వుంది. దానిని మనం తర్వాత అధ్యయనం చేద్దాం.[1] పోతే 5 అ.పె + 5 అ.వి (1)లు II స్థి.పె అంశాలతో, అంటే వినియోగ వస్తువులతో మార్పిడి కావలసి వుంది.

5 అ.పె విషయానికి వస్తే, బంగారాన్ని ఉత్పత్తి చేసే ప్రతి సంస్థ కూడా శ్రమశక్తి కొనుగోలుతో

1. కొన్ని పుటల తరువాత గల ఎంగెల్స్ పాదపీఠిక చూడండి - సం.

ప్రారంభిస్తుంది. అయితే తాను ఉత్పత్తి చేసిన బంగారంతో కాక దేశంలోని డబ్బు సరఫరాలో కొంత భాగంతో అది ఆ పని చేస్తుంది. కార్మికులు ఈ 5 అ.పెతో II వ శాఖ నుంచి వినియోగ వస్తువులు కొనుగోలు చేస్తారు. ఆ II వ శాఖ ఈ డబ్బుతో I వ శాఖ నుంచి ఉత్పత్తి సాధనాలను కొనుగోలు చేస్తుంది. II వ శాఖ I వ శాఖ నుంచి 2కు సమానమైన బంగారాన్ని సరుకు పదార్థం, వగైరా కోసం (దాని స్థిర పెట్టుబడిలోని అంతర్భాగంగా) కొనుగోలు చేస్తుందని అనుకొందాం. అప్పుడు 2 అ.పె మళ్ళీ I వ శాఖకు చెందిన బంగారం ఉత్పత్తిదార్లకే డబ్బు రూపంలో చేరుకుంటుంది; అప్పటికే చలామణికి చెందిన డబ్బు ఇది. II వ శాఖ గనుక Iవ శాఖ నుంచి ఇక ఏ పదార్థాలు కొనుగోలు చేయకపోతే, I వ శాఖ తన బంగారాన్ని డబ్బుగా చలామణిలోకి తోసి II వ శాఖ నుంచి కొనుగోలు చేస్తుంది. ఎందుచేతనంటే, బంగారం ఏ సరుకునైనా కొనుగోలు చేయగలదు. ఇక్కడి వ్యత్యాసమల్లా I వ శాఖ అమ్మకందారుగా కాక కొనుగోలుదారుగా మాత్రమే వ్యవహరిస్తుంది. I వ శాఖ బంగారం గని యజమానులు తమ సరుకును ఎప్పుడైనా వదలించుకోగలరు; అది ఎల్లప్పుడూ నేరుగా మార్పిడి చేయడానికి వీలైన రూపంలో వుంటుంది.

ఒక నూలు ఉత్పత్తిదారుడు తన కార్మికులకు 5 అ.పె చెల్లించాడని అనుకుందాం; ఇందుకు బదులుగా ఆ కార్మికులు అతని కోసం అదనపు విలువతోపాటు, 5కు సమానమైన నూలు – ఉత్పాదితాన్ని సృష్టిస్తారు. కార్మికులు ఆ 5 II స్థి.పె నుంచి కొనుగోలు చేస్తారు; II వ శాఖయేమో ఆ 5 డబ్బు చెల్లించి I వ శాఖ నుంచి నూలు కొనుగోలు చేస్తుంది. ఈ విధంగా 5 అ.పె తిరిగి డబ్బు రూపంలో నూలు ఉత్పత్తిదారుకే చేరుకుంటుంది. మనం ఊహించిన ఉదాహరణలోని I బ (బంగారం ఉత్పత్తిదార్లను మనం ఇలా పిలుద్దాం.) తమ కార్మికులకు 5 అ.పెని డబ్బు రూపంలో అడ్వాన్స్ చేస్తాడు. ఇంతకు ముందు చలామణికి చెందిన డబ్బే అది. కార్మికులు దాన్ని వినియోగ వస్తువుల కోసం వెచ్చిస్తారు. అయితే 5లో 2 మాత్రమే I బ కు II వ శాఖ నుంచి తిరిగి వస్తుంది. ఏమైనా, నూలు ఉత్పత్తిదారునిలాగే I బ కూడా పునరుత్పత్తి ప్రక్రియను కొత్తగా ప్రారంభించగలడు. ఎందుచేత నంటే అతని కార్మికులు బంగారం రూపంలో 5ను అతనికి సరఫరా చేశారు. అతడు అందులో 2 అమ్మేశాడు, మరో 3 అతనివద్దనే వుంది. ఫలితంగా, IIవ శాఖ జోక్యం లేకుండా, తన యావత్ అస్థిర పెట్టుబడిని నేరుగా డబ్బు రూపంలో తన చేతుల్లో ఉంచుకోవాలంటే, అతడు అతని నాణేలుగా[1] ముద్రించుకోవడమో లేదా బ్యాంకి నోట్లుగా మార్చుకోవడమో చేయవలసి వుంటుంది, అంతే.

వార్షిక పునరుత్పత్తి యొక్క ఈ మొదటి ప్రక్రియ సైతం చలామణి రంగానికి చెందిన డబ్బు పరిమాణంలో యథార్థంగా, లేదా వస్తుతః మార్పు తీసుకొచ్చింది. II స్థి.పె మునుపు 2 అ.పె (I బ)ని పదార్థంగా కొనుగోలు చేసిందనీ, ఆ I బ తిరిగి తన అస్థిర పెట్టుబడి యొక్క డబ్బు రూపంగా II వ శాఖలో 3 వ్యయం చేసిందనీ మనం ఊహించుకొన్నాము. అందుచేత కొత్త బంగారం ఉత్పత్తి వల్ల సరఫరా అయిన డబ్బు పరిమాణం II వ శాఖలోనే వుండిపోయింది; అది I వ శాఖకు వాపస్

1. "శాన్‌ఫ్రాన్సిస్కోలో యజమానులు గణనీయమైన పరిమాణంలో బంగారం మూసను నేరుగా టంకశాలకు తీసుకెళ్ళారు." Reports of H.M. Secretaries of Embassy and Legation - 1879, భాగం 111, పుట 337.

రాలేదు. మన ఊహ ప్రకారం, II వ శాఖ బంగారంతో తనకు గల అవసరాలను తీర్చుకుంది. ఇక 3 దాని చేతుల్లో బంగారం నిల్వగా వుండిపోతుంది. ఎందుచేతనంటే, అ.వి దాని స్థిర పెట్టుబడిలో ఎలాంటి భాగంగానూ వుండజాలదు. శ్రమశక్తి కొనుగోలు కోసం II వ శాఖకు అంతకు ముందే కావలసినంత డబ్బు – పెట్టుబడి వుంది. అంతేకాక, ఈ అదనపు 3 బ, II స్థి.పెలోని ఒక భాగంతో మార్పిడి అయినందువల్ల, తరుగుదలను భర్తీ చేసే విలువగా తప్ప, 3 బకు నిర్వర్తించవలసిన మరే పనిలేదు. (II స్థి.పె గనుక II స్థి.పె (2) కంటే తక్కువగా వుండే పక్షంలో, తరుగుదల భాగాన్ని, దానికి సమానమైన విలువతో భర్తీ చేయడానికి 3 బ ఉపకరిస్తుంది. కాని అలా తక్కువగా వుండటం కేవలం యాదృచ్ఛికమే) కాగా, మరోవైపేమో తరుగుదల భాగం మినహా యావత్ II స్థి.పె సరుకు ఉత్పాదితమూ ఉత్పత్తి సాధనాలు I (అ.పె+అ.వి)కి బదలాయించవలసి వుంది. ఈ డబ్బు యావత్తూ II స్థి.పె నుంచి II అ.వికి బదలాయించవలసి వుంది; ఆ డబ్బు జీవనావసరాల రూపంలో వుందా లేక విలాస వస్తువుల రూపంలో వుందా అనేదానితో దీనికి నిమిత్తం లేదు. అలాగే, తదనుగుణమైన సరుకు విలువ II అ.వి నుంచి II స్థి.పెకి బదలాయించవలసి వుంది. దీని ఫలితం : అదనపు విలువలోని ఒక భాగం డబ్బు నిధిగా నిల్వ చేయడం జరుగుతుంది.

వార్షికంగా ఉత్పత్తి అయ్యే బంగారం అదే నిష్పత్తిలో డబ్బు పదార్థంగా వినియోగించుకోవడం కొనసాగించినట్లయితే, రెండవ పునరుత్పత్తి సంవత్సరంలో, 2 తిరిగి I బ కే ప్రవహిస్తుంది; 3 వస్తు రూపంలో భర్తీ చేయబడుతుంది. అంటే అది II వ శాఖలో నిల్వగా వుంచబడేందుకు మళ్ళీ విడుదల అవుతుంది.

ఇక మొత్తంపై, అస్థిర పెట్టుబడి విషయానికి వస్తే, ప్రతి పెట్టుబడిదారులాగే I బ పెట్టుబడిదారు కూడా శ్రమశక్తి కొనుగోలు కోసం ఈ పెట్టుబడిని నిరంతరాయంగా డబ్బు రూపంలో అడ్వాన్సు చేయవలసి వుంటుంది. కానీ ఈ అస్థిర పెట్టుబడి అ.పెకి సంబంధించినంత వరకూ, II వ శాఖ కొనుగోలు చేయవలసింది, అతడి కార్మికులే తప్ప అతడు కాదు. అందుచేత II వ శాఖ చొరవ లేకుండా ఆ శాఖలోకి బంగారాన్ని తోస్తూ అతడు కొనుగోలుదారుగా వ్యవహరించాల్సిన సందర్భమే రాదు. అయితే II వ శాఖ అతని నుంచి ఏ మేరకు పదార్థాన్ని కొనుగోలు చేసి, II స్థి.పె స్థిర పెట్టుబడిని తప్పనిసరిగా బంగారం పదార్థంగా మార్చుకోవలసి వుంటుందో, ఆ మేరకు I వ శాఖ తాలూకు ఇతర పెట్టుబడిదారుల విషయంలోలాగే ఇతడికి కూడా II వ శాఖ నుంచి (I 2) అ.పెలో ఒక భాగం వాపస్ వస్తుంది. ఇలా జరగని పక్షంలో, అతడు తన ఉత్పాదితం నుంచే తన అ.పెని బంగారం రూపంలో భర్తీ చేస్తాడు. అయితే డబ్బు రూపంలో అడ్వాన్స్ చేయబడిన అ.పె అతడికి గనుక II వ శాఖ నుంచి వాపస్ రానట్లయితే అప్పటికీ లభ్యమవుతున్న చలామణి సాధనాల్లో ఒక భాగం (I వ శాఖ నుంచి తీసుకొని మళ్ళీ దానికి పంపించబడనట్టిది) II వ శాఖలో డబ్బు నిధిగా మార్చబడుతుంది; ఆ కారణంచేత దాని అదనపు విలువలోని ఒక భాగం వినియోగ వస్తువుల కోసం వ్యయం కాదు. నిరంతరాయంగా కొత్త బంగారం గనులు తవ్వబడుతున్నాయి; లేదా పాత గనులను తిరిగి ప్రారంభిస్తున్నారు. అందువల్ల I బ అస్థిర పెట్టుబడిగా ఖర్చు పెట్టాల్సిన డబ్బులో ఒక భాగం ఎల్లప్పుడూ కొత్త బంగారం ఉత్పత్తికి ముందే వున్న డబ్బులో భాగమే, ఆ డబ్బును I బ తన కార్మికుల

ద్వారా II వ శాఖలోకి తోస్తుంది; అది గనక II వ శాఖనుంచి I బకు తిరిగి వస్తే తప్ప, అక్కడే నిల్వనిధి నిర్మాణానికి ఉపయోగపడుతుంటుంది.

అయితే (I బ) అ.వికి సంబంధించి మాత్రం, I బ ఎల్లప్పుడూ ఇక్కడ కొనుగోలుదారుగా వ్యవహరించగలడు. అతడు తన అ.విని బంగారం రూపంలో చలామణిలోకి తోసి అందుకు ప్రతిఫలంగా, చలామణి నుంచి II స్థి.పె వినియోగ వస్తువులను తీసేసుకుంటాడు. II వ శాఖలో, బంగారంలోని కొంత భాగం పదార్థంగా వినియోగించబడుతుంది. ఆ విధంగా అది ఉత్పాదక పెట్టుబడి లోని స్థిర పెట్టుబడి భాగం, స్థి.పె లో ఒక నిజమైన అంశంగా తన విధిని నిర్వహిస్తుంది. ఇలా జరగ నప్పుడు అది II అ.వి లో భాగంగా డబ్బు రూపంలోనే వుంటూ, నిల్వనిధి నిర్మాణానికి ఉపయోగపడు తూంటుంది. I స్థి.పెని మనం తర్వాత విశ్లేషిద్దాం.[1] కనుక దాని సంగతి వదలివేద్దాం. అప్పుడు ఒకటి స్పష్టమవుతుంది. అసలైన సంచయానికి, అంటే విస్తృత స్థాయిలో పునరుత్పత్తికి ఆస్కారం లేని సామాన్య పునరుత్పత్తిలో సైతం డబ్బు నిల్వ చేయడం, లేదా నిల్వ నిధి ఏర్పడటం జరుగుతుంది. ఇది ఏటా పునరావృత్తమవుతుంది కాబట్టి, పెట్టుబడిదారీ ఉత్పత్తి విశ్లేషణ సందర్భంగా మనం ఏ ఊహతో ప్రారంభించామో, ఆ ఊహ సహేతుకమైనదే అని నిరూపితమవుతూంది. పునరుత్పత్తి ప్రారంభంలో సరుకుల మార్పిడికి అనుగుణమైన స్థాయిలో డబ్బు సరఫరా I వ, II వ శాఖల పెట్టుబడిదారీ వర్గాల చేతుల్లో వుంటుందన్నదే ఆ ఊహ. చలామణిలో డబ్బు తరుగుదల రూపంలో స్పష్టమయ్యే బంగారం మొత్తాన్ని తీసివేసిన తర్వాత కూడా ఇలాంటి సంచయనం జరుగుతుంది.

కాబట్టి, పెట్టుబడిదారీ ఉత్పత్తి అభివృద్ధి చెందినకొద్దీ అందరి చేతుల్లోనూ అధికాధికంగా డబ్బు పోగవుతూ వుంటుంది; అందుచేత కొత్త బంగారం ఉత్పత్తి ద్వారా ఈ నిల్వనిధికి వచ్చి చేరే మొత్తం తక్కువగా వుంటుంది. (అయితే, ఆ విధంగా వచ్చి చేరిన డబ్బు నిరపేక్ష పరిమాణం గణనీయమైనదిగానే కావచ్చు.) టూకేకు వ్యతిరేకంగా లేవనెత్తబడిన అభ్యంతరాన్ని మరోసారి స్థూలంగా పేర్కొందాం: ప్రతి పెట్టుబడిదారూ వార్షిక ఉత్పాదితం నుంచి డబ్బు రూపంలో అదనపు విలువను తీసేసుకోవడం ఎలా సాధ్యం? అంటే తాను చలామణిలోకి తోసిన డబ్బు కంటే ఎక్కువ డబ్బును ఎలా తీసేసుకొంటాడు? చలామణిలోకి ప్రవేశపెట్టిన సమస్త డబ్బుకూ, తుట్టతుదకు పెట్టుబడిదారీ వర్గాన్నీ మూలాధారంగా పరిగణించవలసి వుంది కాబట్టి ఇదెలా సాధ్యం?

ఇంతకుముందు (XVIIవ అధ్యాయంలో) వివరించిన భావాలను సంక్షిప్తంగా పేర్కొనడం ద్వారా దీనికి సమాధానమిస్తున్నాము :

1) రాశిగా వున్న వార్షిక పునరుత్పత్తిలోని వివిధ అంశాల మార్పిడికి, మొత్తంపై చాలినంత డబ్బు వుంటుంది అన్న ఊహ ఒక్కటే ఇక్కడ ప్రధానమైనది. అయితే సరుకుల విలువలో ఒకభాగం అదనపు విలువ అనే వాస్తవం ఈ ఊహను ఏవిధంగానూ ప్రభావితం చేయదు. యావత్ ఉత్పాదితమూ కార్మికులకే చెందిందనీ కాబట్టి వారి అదనపు శ్రమ వారికోసమే ఉన్న అదనపు శ్రమ తప్ప పెట్టుబడిదారుల కోసం కాదనీ అనుకొందాం. అప్పుడు చలామణిలోని సరుకు విలువల పరిమాణం

---

1. కొత్తగా ఉత్పత్తి అయ్యే బంగారం I వ శాఖ స్థిర పెట్టుబడి పరిధిలో మార్పిడి అయ్యే విషయం గురించిన అధ్యయనం రాతప్రతుల్లో లేదు - ఫ్రెడరిక్ ఎంగెల్స్.

అంతే వుంటుంది. తక్కిన పరిస్థితులు మునుపటిలాగే వున్నట్లయితే, వాటి చలామణి కోసం అవసరమైన డబ్బు అంతే వుంటుంది. కాబట్టి, రెండు సందర్భాల్లోనూ ఉత్పన్నమయ్యే ప్రశ్న ఒకటే; ఈ సరుకు విలువల మొత్తం మార్పిడికి వీలుకలిగించే డబ్బు ఎక్కడనుంచి వస్తుంది? అంతే తప్ప, అదనపు విలువను డబ్బుగా మార్చడానికి ఎక్కడనుంచి డబ్బు వస్తుంది? అనే ప్రశ్న కాదు.

లోగడ సంగతినే తిరిగి చెబుతున్నాము. ప్రతి ఒక్క సరుకులోనూ స్థి.పె + అ.పె + అ.వి వుంటుంది. అందుచేత సరుకుల మొత్తం పరిమాణం చలామణిలోకి వెళ్ళాలంటే ఒకవైపు పెట్టుబడి, స్థి.పె + అ.పె చలామణికి ఒక నిర్దిష్ట మొత్తంలోనూ, మరోవైపు పెట్టుబడిదారుల ఆదాయం చలామణికి, అంటే అదనపు విలువ అ.వి చలామణికి మరో నిర్దిష్ట మొత్తంలోనూ డబ్బు అవసరమవుతుందనేది నిజమే. వ్యక్తిగత పెట్టుబడిదారుని తీసుకొన్నా, అలాగే మొత్తం పెట్టుబడిదారీవర్గాన్ని తీసుకొన్నా, వారు పెట్టుబడిగా అడ్వాన్స్ చేసే డబ్బుకూ, వారు తమ ఆదాయంగా ఖర్చుచేసే డబ్బుకూ మధ్య తేడా వుంది. ఆదాయంగా ఖర్చుచేసే డబ్బు ఎక్కడనుండి వస్తుంది? పెట్టుబడిదారీ వర్గం చేతుల్లోనే మొత్తం డబ్బునుంచే. అంటే సమాజంలో వున్న మొత్తం డబ్బునుంచే. దీనిలో ఒక భాగం పెట్టుబడిదారుల ఆదాయాన్ని చలామణిలో పెడుతుంది. కొత్తగా వ్యాపారం ప్రారంభించిన ప్రతి పెట్టుబడిదారు తన పోషణార్థం వినియోగ వస్తువులకై ఖర్చుపెట్టిన డబ్బును, తన వ్యాపారం నిలదొక్కుకున్న తరువాత, తన అదనపు విలువను డబ్బుగా మార్చడానికి ఉపకరించే డబ్బుగా తిరిగి రాబట్టుకొంటాడని, పైన చూచాము. అయితే మొత్తంమీద, ఈ ఇబ్బందికంతా రెండు మూల కారణాలున్నాయి :

మొదటిది : పెట్టుబడిదారుని పెట్టుబడి యొక్క మూర్తీభావంగా మాత్రమే పరిగణిస్తూ, పెట్టుబడిదారీ వినియోగదారునిగానూ, పౌరునిగానూ పరిగణించకుండా మనం గనక పెట్టుబడి చలామణిని, పెట్టుబడి టర్నోవర్‌ను మాత్రమే విశ్లేషించినట్లయితే, అతడు నిరంతరాయంగా తన సరుకు–పెట్టుబడిలోని అంతర్భాగంగా అదనపు విలువను చలామణిలోకి తోస్తున్నట్లు మనకు కనిపిస్తుందే తప్ప అతడి చేతుల్లో డబ్బు ఆదాయం యొక్క రూపంగా మనకెప్పుడూ కనిపించదు. తన అదనపు విలువను వినియోగించుకొనేందుకు అతడు డబ్బును చలామణిలోకి తోస్తున్నట్లు మనకెప్పుడూ కనిపించదు.

ఇక రెండవది – పెట్టుబడిదారీవర్గం కొంత మొత్తం డబ్బును ఆదాయ రూపంలో చలామణిలోకి తోసినట్లయితే, మొత్తం వార్షిక ఉత్పాదితంలోని ఈ భాగానికి సమతుల్యం అది చెల్లిస్తున్నదనీ, అందుచేత ఈ భాగం అదనపు విలువకు ప్రాతినిధ్యం వహించడంలేదనీ అనిపిస్తుంది. కాని, అదనపు విలువకు ప్రాతినిధ్యం వహించే అదనపు ఉత్పాదితం. పెట్టుబడిదారీ వర్గానికి ఎలాంటి ఖర్చు లేకుండానే లభిస్తుంది. ఒకవర్గంగా పెట్టుబడిదార్లు దానిని ఉచితంగానే స్వాధీనపరచుకుని అనుభవిస్తారు; డబ్బు చలామణి ఈ వాస్తవాన్ని మార్చజాలదు. ఈ చలామణి తెచ్చిన మార్పల్లా ఈ క్రింది వాస్తవం మాత్రమే: ప్రతి పెట్టుబడిదారూ తన అదనపు ఉత్పాదితాన్ని వస్తురూపంలో వినియోగించుకోడానికి బదులు (అది మొత్తంపై అసాధ్యమైన పని) సమాజ వార్షిక అదనపు ఉత్పాదిత రాశి నుండి నానారకాల సరుకులను, తాను స్వాయత్తం చేసుకొన్న అదనపు విలువ మేరకు తీసేసుకుని, స్వాయత్తం చేసుకుంటాడు. అయితే పెట్టుబడిదారీ వర్గం తన ఆదాయాన్ని ఖర్చుపెట్టేందుకు డబ్బును చలామణిలోకి ఒకవైపు తోస్తూ, మరోవైపు ఈ డబ్బును చలామణి నుంచి ఉపసంహరించుకుంటుందని, ఈ ప్రక్రియ

పదేపదే కొనసాగగలదని చలామణి యంత్రాంగం స్పష్టం చేసింది; కాబట్టి, పెట్టుబడిదారులను వర్గంగా పరిశీలించినట్లయితే, వారి చేతుల్లో ఇంతకు ముందులాగే, అదనపు విలువను డబ్బుగా మార్చడానికి అవసరమైనంత డబ్బు వుండనే వుంటుంది. అందుచేత, పెట్టుబడిదారు తన వినియోగ నిధి కోసం సరుకుల మార్కెట్ నుంచి సరుకుల రూపంలో తన అదనపు విలువను ఉపసంహరించుకోవటమే కాక, అదే సమయంలో ఆ సరుకుల కోసం చెల్లించిన డబ్బును కూడా తిరిగి పొందుతాడు; అంటే అతడు సమతుల్యమైన మొత్తం చెల్లించకుండానే చలామణి నుంచి సరుకులను ఉపసంహరించుకున్నాడన్నది స్పష్టం. అతడు వాటికోసం డబ్బు చెల్లించే మాట నిజమే. అయినప్పటికీ అవి అతడికి ఉచితంగా లభించినట్లే కాగలదు. నేను ఒక పౌండు స్టెర్లింగ్ పెట్టి సరుకులు కొన్నప్పుడు, ఆ అమ్మకందారుడు, నాకు ఉచితంగా లభించిన అదనపు ఉత్పాదితం కోసం ఆ పౌండు స్టెర్లింగ్‌ను తిరిగి అందజేస్తే, నాకు సరుకులు కేవలం ఉచితంగా లభించినట్లే అవుతుంది కదా. ఈ కార్యకలాపం నిరంతరం పునరావృత్తం కావడం వల్ల ఈ క్రింది వాస్తవం ఏవిధంగానూ మారదు: నేను సరుకులను కొనుగోలు చేయడానికి తాత్కాలికంగా ఆ పౌండు వదులుకున్నప్పటికీ, నేను నిరంతరాయంగా సరుకులను ఉపసంహరించుకుంటూనే వుంటాను; నిరంతరాయంగా ఆ పౌండు నా దగ్గరే వుంటుంది. పెట్టుబడిదారు తనకు ఉచితంగా లభించిన అదనపు విలువకు సమతుల్యమైన డబ్బుగా, ఈ డబ్బును నిరంతరాయంగా తిరిగి పొందుతూనే వుంటాడు.

సామాజిక ఉత్పాదితం మొత్తం విలువ ఆదాయంగా – స్థి.పె+అ.విగా విభజింపబడుతుందని ఆడమ్ స్మిత్ అభిప్రాయపడుతున్నట్లు చూచాము. ఫలితంగా స్థిర పెట్టుబడి విలువ లేనట్లే లెక్క. దీనివల్ల అవశ్యంగా తేలేదేమిటంటే, వార్షిక ఆదాయం చలామణికి అవసరమైన డబ్బే సమస్త వార్షిక ఉత్పాదితం చలామణికి కూడా సరిపోతుంది; కాబట్టి మన ఉదాహరణనే తీసుకొంటే, 3,000 విలువ గల వినియోగ వస్తువుల చలామణికి అవసరమైన డబ్బే 9,000 విలువ గల సమస్త వార్షిక ఉత్పాదితం చలామణికి కూడా సరిపోతుంది. వాస్తవానికి ఇదీ ఆడమ్ స్మిత్ అభిప్రాయం. దీన్నే థామస్ టూకే కూడా వల్లిస్తున్నాడు. ఆదాయం చేతికందడానికి అవసరమైన డబ్బు మొత్తానికీ, సమస్త సామాజిక ఉత్పాదితం చలామణికి అవసరమైన డబ్బు మొత్తానికి మధ్య గల నిష్పత్తికి సంబంధించిన ఈ తప్పు భావన, సమస్త వార్షిక ఉత్పాదితంలోని వివిధ పాదార్థిక భాగాలూ, విలువ భాగాలూ ఏ విధంగా పునరుత్పత్తి అవుతాయి, ఏటా అవి ఎలా భర్తీ అవుతాయి అన్న సంగతిని అర్థం చేసుకోనివారి అనాలోచిత అవగాహన అనివార్య ఫలితం. అందుచేత అది ఇదివరకే తిరస్కరింపబడింది.

స్మిత్, టూకేలు ఏమంటారో విందాం. స్మిత్ తన గ్రంథం రెండవ సంపుటి ద్వితీయ అధ్యాయంలో ఇలా అంటారు. "ప్రతి దేశంలోని చలామణి రెండు విభిన్న శాఖలుగా విభజింపబడినట్లు పరిగణించవచ్చు; వ్యాపారుల మధ్య పరస్పర చలామణి, వ్యాపారులకు, వినియోగదార్లకు మధ్య చలామణి. కొన్ని సమయాల్లో ఒక చలామణిలోనూ, మరికొన్ని సమయాల్లో మరో చలామణిలోనూ అదే డబ్బు నోట్లు రూపంలోగానీ, నాణేల రూపంలోగానీ నియుక్తమైనప్పటికీ, ఒకే సమయంలో ఈ రెండు చలామణిలు నిరంతరం సాగుతుంటాయి. కాబట్టి ప్రతిదానికీ ఏదో ఒక రకానికి చెందిన కొంత డబ్బు నిల్వ అంటూ అవసరమవుతుంది. వివిధ వ్యాపారుల మధ్య చలామణి అయిన సరుకుల విలువ ఎన్నటికీ వ్యాపారులకు, వినియోగదార్లకు మధ్య చలామణి అయిన సరుకుల విలువను

మించదు; వ్యాపారులు కొనుగోలు చేసిన ప్రతిదీ, చివరకు వినియోగదార్లకు అమ్మడానికి ఉద్దేశించినదీ, వ్యాపారుల మధ్య టోకు వ్యాపారం సాగుతుంది కాబట్టి మామూలుగా వారి మధ్య ప్రతి లావాదేవీకి పెద్ద మొత్తంలో డబ్బు అవసరం. కాగా ఇందుకు భిన్నంగా, వ్యాపారులకు, వినియోగదార్లకు మధ్య మామూలుగా చిల్లర వ్యాపారం సాగుతుంది కాబట్టి తరచుగా ఇందుకు చిల్లర డబ్బులు అవసరం. అంటే షిల్లింగు లేదా ఆఖరుకు అర్ధపెన్నీ కూడా సరిపోతుంది... అయితే, చిల్లర డబ్బులు పెద్ద మొత్తాల కంటే ఎక్కువ వేగంగా చలామణి అవుతాయి. కాబట్టి మొత్తం వినియోగదార్ల వార్షిక కొనుగోళ్ళు వ్యాపారస్తులందరి కొనుగోళ్ళకు కనీసం విలువలో సమానంగా ఉన్నప్పటికీ (ఈ "కనీసం" అనేది గొప్పగా వుంది) అవి మొత్తంపై, చాలా తక్కువ డబ్బుతోనే నిర్వహించబడవచ్చు;" వగైరా.

ఆడమ్ స్మిత్ గ్రంథంలోని ఈ ఉల్లేఖనపై థామస్ టూకే ఇలా వ్యాఖ్యానిస్తారు : (యాన్ ఎంక్వైయిరీ ఇంటు ది కరెన్సీ ప్రిన్సిపుల్, లండన్ 1844, 34 నుంచి 36 పుటల్లో అక్కడక్కడా) "ఇక్కడ తెలిపిన వ్యత్యాసం చాలావరకు సరియైనదే. ఇందుకు ఎట్టి సందేహమూ లేదు..... వ్యాపారులకు, వినియోగదార్లకు మధ్య మార్పిడిలో, వినియోగదార్ల ప్రధాన వనరైన వేతనాల చెల్లింపులు కూడా వున్నాయి... వ్యాపారులకు – వ్యాపారులకూ మధ్య జరిగే లావాదేవీలన్నీ అంటే అర్థం, కర్మాగార ఉత్పత్తి, తదితర మధ్యంతర ప్రక్రియల దశలగుండా ఉత్పాదకుని నుంచీ, లేదా దిగుమతిదారుని నుంచీ చిల్లర దుకాణందారు వరకు లేదా ఎగుమతిదారుని వరకు కొనసాగే అమ్మకాలు. ఇవి పెట్టుబడి గమనాలుగా లేదా బదలాయింపులుగా విభజితమవుతాయి. ఇక పెట్టుబడి బదలాయింపులకు, అత్యధిక సంఖ్యాక లావాదేవీలలో, ఈ బదలాయింపు సందర్భంగా డబ్బు – అంటే, బ్యాంకు నోట్లు లేక నాణేలు, ఊహలో కాకుండా, వాటి స్థూల రూపంలో చేతులు మారాలనేమీ లేదు. నిజానికి అలా మారదు కూడా. వ్యాపారులకు, వ్యాపారులకు మధ్య సాగే లావాదేవీల మొత్తాన్ని, తుదకు నిర్ణయించేదీ, పరిమితం చేసేదీ వ్యాపారులకు, వినియోగదారులకు మధ్య లావాదేవీల మొత్తమే."

ఈ ఆఖరు వాక్యాన్ని మాత్రమే తీసుకొంటే, వ్యాపారుల మధ్య మార్పిడులూ, వ్యాపారులకు, వినియోగదార్లకు మధ్య మార్పిడులూ ఈ రెండూ ఏదో ఒక నిష్పత్తిలో వుంటాయని టూకే చెబుతున్నట్లు ఎవరైనా అనుకోవచ్చు. ఇంకో విధంగా చెప్తే, వార్షిక ఆదాయం మొత్తం విలువకూ, ఆ విలువను ఉత్పత్తి చేసిన మొత్తం పెట్టుబడికీ మధ్య ఏదో నిష్పత్తి వున్నట్లు ఆయన చెబుతున్నాడని అనుకోవచ్చు. కాని ఆయన భావమది కాదు. ఆయన ఆడమ్ స్మిత్ అభిప్రాయాన్ని స్పష్టంగా ఆమోదిస్తున్నాడు. అందుచేత, ఆయనగారి చలామణి సిద్ధాంతంపై ప్రత్యేక విమర్శ అవసరం.

2) ప్రతి పారిశ్రామిక పెట్టుబడీ తన జీవిత ప్రారంభంలో, తన అంతర్భాగమైన నిశ్చల పెట్టుబడి కోసం, ఒకసారి డబ్బును చలామణిలోకి తోస్తుంది; అది తన వార్షిక ఉత్పాదితాలను అమ్మడం ద్వారా సంవత్సరాల తరబడి క్రమేణా ఆ డబ్బును తిరిగి రాబట్టుకొంటుంది. ఆ విధంగా అది మొదట, చలామణి నుంచి తీసేసుకున్న దానికన్నా ఎక్కువ మొత్తాన్ని చలామణిలోకి నెట్టుతుంది. మొత్తం పెట్టుబడిని వస్తురూపంలో పునరుద్ధరించే ప్రతి సందర్భంలోనూ ఇది పునరావృత్తం అవుతుంది. నిశ్చల పెట్టుబడి వస్తురూపంలో పునరుద్ధరింపబడవలసిన కొన్ని పరిశ్రమల విషయంలో ఇది ఏటా పునరావృత్తమవుతుంది. ప్రతి మరమ్మతు సందర్భంగానూ, నిశ్చల పెట్టుబడిని పాక్షికంగా పునరుద్ధరించే ప్రతి సందర్భంలోనూ ఇది పాక్షికంగా పునరావృత్తం అవుతుంది. కాగా, ఒకవైపు చలామణిలోకి

తోసిన డబ్బుకంటే అందులోనుంచి ఎక్కువ డబ్బును ఉపసంహరించుకోవడం, మరోవైపు చలామణిలోకి ప్రవేశపెట్టిన డబ్బుకంటే తక్కువ మొత్తాన్ని ఉపసంహరించడం జరుగుతుంది.

ఉత్పత్తి కాలం (పనికాలం కాదు) సుదీర్ఘమైనదిగా వున్న అన్ని పారిశ్రామిక శాఖల్లోనూ, ఆ కాలంలో పెట్టుబడిదారీ ఉత్పత్తిదార్లు నిరంతరాయంగా చలామణిలోకి డబ్బును, వినియోగించిన శ్రమశక్తి చెల్లింపునకు కొంత మొత్తం తోస్తుంటారు. ఈ విధంగా సరుకు మార్కెట్ నుంచి ఉత్పత్తి సాధనాలు ప్రత్యక్షంగా ఉపసంహరింపబడతాయి; వినియోగ వస్తువులు కొంత పరోక్షంగా (కార్మికులు తమ వేతనాలను వెచ్చించినప్పుడు), కొంత ప్రత్యక్షంగా (పెట్టుబడిదార్లు తమ వస్తు వినియోగాన్ని ఎప్పుడూ మానుకోరు కాబట్టి) ఉపసంహరింపబడతాయి. అయితే పెట్టుబడిదారులు, తత్తుల్యమైన సరుకులను మార్కెట్‌లోనికి ప్రవేశపెట్టరు. ఈ కాలంలో వారు చలామణిలోకి తోసిన డబ్బు, అదనపు విలువ కూడా కలిసివున్నట్టి సరుకు విలువను డబ్బుగా మార్చడానికి ఉపకరిస్తుంది. పెట్టుబడిదారీ ఉత్పత్తి అభివృద్ధి చెందిన దశలో నిర్మాణమయ్యే దీర్ఘకాలిక పరిశ్రమల్లో, ఉదాహరణకు స్టాక్ కంపెనీలు చేపట్టే రైల్వేల నిర్మాణం, కాలువల త్రవ్వకం, ఓడల మరమ్మతు, స్థావరాల, పెద్ద పెద్ద మున్సిపల్ భవనాల ఇనుప నౌకల నిర్మాణం, విస్తారమైన చిత్తడినేల ముంపు తోడకం వగైరా పరిశ్రమల్లో ఈ అంశం చాలా ప్రాముఖ్యం సంతరించుకుంటుంది.

3) ఇతర పెట్టుబడిదారులు – నిత్యం పెట్టుబడిపై పెట్టే మదుపు కాక, శ్రమశక్తి కొనుగోలుకు, చలామణి అంశాల కొనుగోలుకు చలామణిలోకి ప్రవేశపెట్టిన దానికంటే ఎక్కువ డబ్బును చలామణి నుంచి ఉపసంహరించుకుంటారు; పోతే బంగారం, వెండి ఉత్పత్తిచేసే పెట్టుబడిదార్లు ముడిపదార్థంగా ఉపకరించే విలువైన లోహాలనే కాక, డబ్బును మాత్రమే చలామణిలోకి తోసి చలామణి నుంచి సరుకులను మాత్రమే ఉపసంహరించుకుంటారు. తరుగుదల భాగం మినహా వారి మొత్తం స్థిర పెట్టుబడీ, వారి చేతుల్లో సంచయమవుతున్నట్టి నిల్వ నిధి మినహా – ఇదంతా డబ్బుగా చలామణిలోకి ప్రవేశిస్తుంది.

4) ఒకవైపు నిర్ణీత సంవత్సర కాలంలో, ఉత్పాదితాలుకాని భూఖండాలు, ఇళ్ళు లాంటి అన్ని రకాల పదార్థాలు, మరోవైపున తమ ఉత్పత్తికి సంవత్సరం కంటే ఎక్కువ వ్యవధిపట్టే పశువులు, కలప, ద్రాక్షసారా వగైరా వంటివి సరుకులుగా చలామణి అవుతాయి. ఇందుకోసమూ, ఇలాంటి ఇతర ఘటనల విషయంలోనూ తక్షణ చలామణికి అవసరమైన డబ్బు కాక, క్రియాశూన్య స్థితిలో వుంటూ, ప్రేరణ ఇవ్వగానే తన క్రియను ప్రారంభించగలిగే డబ్బు కొంత పరిమాణంలో ఎల్లప్పుడూ వున్నదని నిరూపించడం చాలా ముఖ్యం. పైపెచ్చు, అలాంటి ఉత్పాదితాల విలువ తరచుగా కొద్దికొద్దిగా, క్రమేణా చలామణి అవుతుంది – ఇళ్ళ విలువ అద్దె రూపంలో అనేక సంవత్సరాల పాటు చలామణి అవుతున్నట్లు.

మరోవైపు, పునరుత్పత్తి ప్రక్రియ తాలూకు గమనాలన్నీ చలామణి ద్వారా మాత్రమే జరుగవు. ఉత్పాదన అంశాలను సేకరించడం పూర్తికాగానే, మొత్తం ఉత్పత్తి ప్రక్రియ చలామణికి వెలిగా వుంటుంది. ఉత్పత్తిదారుడు వ్యక్తిగతంగా కానీ, ఉత్పత్తికోసం కానీ వినియోగించుకునే ఉత్పాదితాలన్నీ కూడా చలామణికి బాహ్యంగా వుంటాయి. వ్యవసాయ కార్మికులకు ఇచ్చే తిండి పదార్థాలు కూడా ఈ లెక్కలోకే వస్తాయి.

అందుచేత, వార్షిక ఉత్పాదితాన్ని చలామణి కావించే డబ్బు పరిమాణం సమాజంలోనే వుంటుంది; అంటే అది క్రమేణా సంచయనం అయి వుంటుంది. అది ఆ నిర్ణీత సంవత్సరంలో ఉత్పత్తి అయిన విలువ కాదు. బహుశా ఈ విషయంలో అరిగిపోయిన నాణేల వల్ల కలిగిన లోటును భర్తీ చేయడానికి ఉపయోగపడే బంగారాన్ని మినహాయించవలసి వుంటుంది.

సాదా లోహనాణేల ప్రాతిపదికపై సైతం డబ్బు అనేది చెల్లింపు సాధనంగా పనిచేయగలిగినప్పటికీ, చారిత్రక క్రమంలో అది ఆ పని వాస్తవంగా చేసినప్పటికీ, ఆ ప్రాతిపదికపై పరపతి వ్యవస్థ, దాని యంత్రాంగం తాలూకు అంశాలు కొన్ని అభివృద్ధిచెంది వున్నప్పటికీ, పైన తెలిపిన వివరణలో, డబ్బుగా కేవలం విలువైన లోహాల చలామణి, ఈ చలామణి నగదు కొనుగోళ్ళూ, అమ్మకాల సరళరూపం గర్భితం.

కేవలం పరిశీలనా పద్ధతికి సంబంధించిన విషయాల దృష్ట్యా మాత్రమే ఇలా ఊహించుకోవడం లేదు. అయితే అవి కూడా చాలా ముఖ్యమైనవే. బ్యాంకు నోట్ల చలామణికి సంబంధించిన వివరాల విషయంలో టూకే, ఆయన అనుయాయులూ, అలాగే ఆయన వ్యతిరేకులూ కూడా కేవలం నాణేలు మాత్రమే చలామణిలో వున్నవనే పరికల్పనను నిరంతరం తిరిగి ఆశ్రయించక తప్పకపోవడమే ఇందుకు నిదర్శనం. కాలం మించిపోయిన తరువాత వారా పని చేయవలసి వచ్చింది. కేవలం స్థూలంగా మాత్రమే, అలా చేశారు. అది అనివార్యం. ఎందుచేతనంటే వారి విశ్లేషణకు ప్రారంభ విషయంగా వున్నది, కేవలం ప్రసంగవశాత్తూ తడవిన విషయమైంది.

అయితే, ప్రాథమిక రూపంలోని డబ్బు చలామణి గురించిన అతి సామాన్య అధ్యయనం (డబ్బు చలామణి ఇక్కడ వార్షిక పునరుత్పత్తి ప్రక్రియలో స్వతస్సిద్ధమైనది) ఈ క్రింది వాస్తవాలను నిరూపిస్తుంది.

అ) పురోగామి పెట్టుబడిదారీ వ్యవస్థ వుందని ఊహిస్తే, కాబట్టి వేతన వ్యవస్థ ప్రాబల్యం వహిస్తూందని ఊహిస్తే, డబ్బు పెట్టుబడి ముఖ్యమైన పాత్ర నిర్వర్తిస్తుందనేది స్పష్టం; ఎందుచేతనంటే అస్థిర పెట్టుబడిని అడ్వాన్సు చేసేది ఆ రూపంలోనే. వేతన వ్యవస్థ అభివృద్ధి చెందడంతో, ఉత్పాదితాలన్నీ సరుకులుగా రూపాంతరం చెందుతాయి, కనుక – కొన్ని ముఖ్యమైన మినహాయింపులతో – ఉత్పాదితాన్నీ తమ గమనంలోని ఒక దశలో డబ్బుగా పరివర్తన చెందే స్థితిని గడిచితీరాలి. ఇలా సరుకులు డబ్బుగా మార్పు చెందడానికి చలామణిలోని డబ్బు పరిమాణం సరిపోవాలి. ఇందులో అత్యధిక భాగం వేతనాల రూపంలో సరఫరా అవుతుంది. అంటే పారిశ్రామిక పెట్టుబడిదార్లు తమ అస్థిర పెట్టుబడిని శ్రమశక్తి కొనుగోలు కోసం డబ్బు రూపంలో అడ్వాన్సు చేస్తారు. ఈ డబ్బు మామూలు కార్మికుల చేతుల్లో చలామణి సాధనంగా (కొనుగోలు సాధనంగా) మాత్రమే పని చేస్తుంది. ప్రతి దాస్య రూపం (భూస్వామ్య దాస్య రూపంతో సహా) లోని సమాజంలోని, అంతకన్నా కూడా, దాస్య పరిస్థితులు లేదా బానిసత్వ పరిస్థితులు వున్నా, లేకపోయినా దాదాపు ఆదిమ స్థితిలోని సమాజాల్లో ప్రబలంగా వుండే సహజ ఆర్థిక వ్యవస్థకు ఇది పూర్తిగా విరుద్ధమైనది.

బానిస వ్యవస్థలో శ్రమశక్తి కొనుగోలు కోసం మదుపు చేసిన డబ్బు పెట్టుబడి, నిశ్చల పెట్టుబడి యొక్క డబ్బు రూపం పాత్రను నిర్వర్తిస్తుంది; బానిస జీవితంలోని క్రియాశీల దశ సమాప్తమయ్యే కొద్దీ, దాని స్థానం క్రమక్రమంగా మాత్రమే భర్తీ అవుతుంది. అందుచేతనే ఏథెన్స్ వాసులు తమ

బానిసను ఒక పరిశ్రమలో పనిచేయడం ద్వారా ప్రత్యక్షంగా కానీ, లేక మరో పారిశ్రామిక యజమానికి (ఉదాహరణకు గనుల త్రవ్వకానికి) తమ బానిసలను అద్దెకివ్వడం ద్వారా పరోక్షంగా కానీ తమకు చేకూరే లాభాన్ని తాము అడ్వాన్సు చేసిన డబ్బు పెట్టుబడిపై లభించిన వడ్డీగా (ప్లస్ తరుగుదల భత్యం) మాత్రమే పరిగణించేవారు; అంటే పెట్టుబడిదారీ ఉత్పత్తి సాధనంలో పారిశ్రామిక పెట్టుబడిదారు తన అదనపు విలువలో ఒక భాగాన్నీ, నిశ్చల పెట్టుబడిలోని తరుగుదలనూ వడ్డీ ఖాతాలోనూ, నిశ్చల పెట్టుబడినీ భర్తీ చేసే ఖాతాలోనూ జమకట్టినట్లే ఇదీను. నిశ్చల పెట్టుబడిని (ఇళ్లు, యంత్రాలు వగైరా) అద్దెకిచ్చే పెట్టుబడిదారుకు కూడా ఇది వర్తిస్తుంది. అవసరమైన సేవలు చేస్తున్నట్టి లేక విలాస వస్తువులుగా ప్రదర్శన కోసం ఉంచుకున్నట్టి కేవలం గృహ బానిసలను మనం ఇక్కడ పరిగణనలోకి తీసుకోవడం లేదు. వారు ఆధునిక సేవకుల వర్గంతో సమానం. అయితే బానిస వ్యవస్థ కూడా, పురోగామి రాజ్యాలైన గ్రీస్, రోమ్‌లలో వున్నట్లు వ్యవసాయం, కార్ఖానా ఉత్పత్తి, నౌకాయానం వగైరాల్లో ప్రధానమైన ఉత్పాదక శ్రమ రూపంగా వున్నన్నాళ్ళూ, అది సహజ ఆర్థిక వ్యవస్థలోని ఒక అంశాన్ని నిలుపుకుంటుంది. యుద్ధం, బందిపోటు ఓడలు చేసే లూటీ వగైరాల ద్వారా బానిసల మార్కెట్ శ్రమశక్తి అనే తన సరుకు సరఫరాను కొనసాగిస్తుంది. ఈ నిలువుదోపిడీ చలామణి ప్రక్రియ ద్వారా వృద్ధి చెందదు; ప్రత్యక్ష బలాత్కారంతో ఇతరుల శ్రమశక్తిని స్వాయత్తం చేసుకోవడం ద్వారా అది వృద్ధి చెందుతుంది. అమెరికా సంయుక్త రాష్ట్రాల్లో ఉత్తరాన గల వేతన శ్రమ రాష్ట్రాలకూ, దక్షిణాన గల బానిస వ్యవస్థ రాష్ట్రాలకూ మధ్య వుండిన సరిహద్దు ప్రాంతాన్ని, దక్షిణ రాష్ట్రాలకోసం బానిసల ఉత్పత్తి కేంద్రంగా మార్చక, అక్కడ మార్కెట్‌లోకి పంపిన బానిస, అలా తానే వార్షిక పునరుత్పత్తిలోని ఒక అంశం అయ్యాడు. అయితే, చాలా కాలంపాటు ఈ పద్ధతి అవసరాలకు చాలలేదు. అందుచేత మార్కెట్ అవసరాలను తీర్చడానికి సాధ్యమైనంత కాలం, ఆఫ్రికన్ బానిస వ్యాపారాన్నే కొనసాగించడం జరిగింది.

ఆ) వార్షిక ఉత్పాదితాల మార్పిడిలో, పెట్టుబడిదారీ ఉత్పత్తి ప్రాతిపదికపై డబ్బు ధారాపాతంగా వస్తూంటుంది, పోతూంటుంది; నిశ్చల పెట్టుబడులను వాటి పూర్తి విలువ మేరకు ఒకేసారి అడ్వాన్సు చేస్తుంటారు. ఆ విలువను చలామణి నుంచి వరుసగా కొన్ని సంవత్సరాలలో రాబట్టుకొంటారు. వేరు మాటల్లో, ప్రతి ఏడాదీ నిల్వ నిధిని ఏర్పరచడం ద్వారా ఆ నిశ్చల పెట్టుబడులను డబ్బు రూపంలో క్రమేణా తిరిగి నెలకొల్పుతారు. (ఈ నిల్వ నిధి కొత్త బంగారం యొక్క వార్షిక ఉత్పత్తి ప్రాతిపదికపై సమానాంతరంగా పోగుపడే నిల్వ నిధులకు భిన్నమైనది.) సరుకుల ఉత్పత్తికి పట్టేకాలాన్ని బట్టి డబ్బును అడ్వాన్సు చేయాల్సిన కాల పరిమాణాలు భిన్నంగా వుంటాయి. ఫలితంగా, సరుకుల అమ్మకం ద్వారా చలామణి నుంచి దాన్ని తిరిగి రాబట్టుకొనే లోపల డబ్బును ఎల్లప్పుడూ నిల్వ చేసుకోవలసిన కాల పరిమాణాలు భిన్నంగా వుంటాయి; మరే కారణం లేకపోయినా, ఉత్పత్తి కేంద్రాలకూ, వాటి మార్కెట్లకూ మధ్య దూరాల్లో గల తేడా కారణంగా, డబ్బు అడ్వాన్సు చేయవలసిన కాల పరిమాణాల్లో తేడాలుంటాయి; వివిధ వ్యాపార శాఖల్లో, లేక ఒకే శాఖకు చెందిన వేరు వేరు వ్యాపారాల్లో ఉత్పాదక సరఫరాల పరిస్థితిని బట్టీ, ఆ సరఫరాల సాపేక్ష పరిమాణాలను బట్టీ, అంటే, పునరుత్పత్తి సంవత్సరంలోనే, స్థిర పెట్టుబడిలోని వివిధ భాగాలను ఎంత కాలానికి సరిపడా కొనాల్సి వుంటుందనేదాన్ని బట్టీ, డబ్బు తిరిగి వెళ్లిపోయే మోతాదుల్లో, వ్యవధుల్లో తేడాలుంటాయి. ఇవన్నీ

సద్యోజనిత గమనంలో విభిన్న అంశాలు. వీటిని అనుభవం ద్వారా గమనించి, వెలుగులోకి తీసుకు రావడం జరిగింది; దానితో పరపతి వ్యవస్థకు చెందిన యంత్రాంగ పరికరాలను క్రమపద్ధతిలో వినియోగించుకోవడం, రుణ రూపంలో లభ్యం కాగల పెట్టుబడులను వెదకి పట్టుకోవడం ప్రారంభమైంది.

దీనికి తోడు మరో విషయం కూడా పేర్కొనాలి. తక్కిన పరిస్థితులు మామూలుగా వున్నప్పుడు ఒకే స్థాయిలో నిరంతరాయంగా కొనసాగే వ్యాపార శాఖలకూ, వ్యవసాయంలో మాదిరి సంవత్సరం లోని వివిధ కాలాల్లో వివిధ పరిమాణాల్లో శ్రమశక్తిని వినియోగించే వ్యాపార శాఖలకూ మధ్య గల తేడా అది.

## XIII. పునరుత్పత్తి గురించిన డెస్టట్ డీ ట్రేసీ సిద్ధాంతం[1]

సామాజిక పునరుత్పత్తిని విశ్లేషించడంలో రాజకీయ అర్థశాస్త్రవేత్తల గందరగోళాన్ని, అదే సమయంలో ఆత్మాతిశయాన్ని వ్యక్తం చేసేవారు ఎంత తెలివిమాలినవారో గొప్ప తర్కశాస్త్రవేత్త అయిన డెస్టట్ డీ ట్రేసీని ఉదహరించడం ద్వారా నిరూపిద్దాం. డెస్టట్ డీ ట్రేసీ చెప్పింది నిజమే అనుకొని, (సం.I, నోట్ 30) రికార్డో కూడా ఈయనను గొప్ప విశిష్ట రచయిత అని అన్నాడు. (ప్రిన్సిపుల్స్ పుట 333.)

ఈ “విశిష్ట రచయిత” సమస్త సామాజిక పునరుత్పత్తి ప్రక్రియ గురించీ, చలామణి గురించీ ఈ క్రింది వివరణ యిస్తాడు :

“ఈ పారిశ్రామిక యజమానులు ఎలా ఇంత భారీ లాభాలను సంపాదిస్తారని, వారెవరి నుంచి ఆ లాభాలను రాబడతారని నన్ను ప్రశ్నిస్తారు. తాము ఉత్పత్తి చేసిన ప్రతిదానినీ దాని ఉత్పత్తి ఖర్చుకన్నా ఎక్కువ ధరకు అమ్మడం ద్వారా వారు లాభాలు సంపాదిస్తారనీ, వారు ఈ క్రింది వారికి అమ్ముతారనీ సమాధానమిస్తాను.”

1) “తమ వినియోగ వస్తువుల్లో తమ అవసరాలను తీర్చడానికి ఉద్దేశించిన భాగాన్ని మొత్తంగా ఒకరికొకరికి; వారు తమ లాభాల్లోని ఒక భాగంతో వాటికి డబ్బు చెల్లిస్తారు;”

2) “వేతన శ్రామికులకు, అంటే తాము వేతనాలు ఇచ్చే వారికీ, పనీపాటూ చేయని పెట్టుబడిదారులు వేతనాలు ఇచ్చే వారికీ ఈ ఉభయులకు వారు ఈ విధంగా ఈ వేతన కార్మికులనుంచీ, బహుశా వారు పొదుపుచేసే చిన్న మొత్తాలు మినహా సమస్త వేతనాలనూ గుంజుకొంటారు.”

3) “ఎటువంటి పనీపాటూ లేని పెట్టుబడిదార్లకు; వీరు తాము నేరుగా నియమించిన వేతన కార్మికులకు, తమ ఆదాయం నుంచి ఇంకా చెల్లించకుండా వున్న భాగంతో, ఈ వస్తువులకు డబ్బు చెల్లిస్తారు. కాబట్టి ఉత్పత్తిదారులు ఏటా ఈ పనీపాటూ లేని పెట్టుబడిదారులకు చెల్లించే మొత్తం అద్దె ఈ విధంగా కానీ, మరో విధంగా కానీ వారికే తిరిగి వస్తుంది.” (డెస్టట్ ట్రేసీ, Traite de la volon tect de ses effects, Paris, 1826 పుట 239.)

ఇంకో విధంగా చెప్తే, పెట్టుబడిదారులు తమ వ్యక్తిగత వినియోగం కోసం, లేదా ఆదాయంగా అనుభోగించడం కోసం తీసి వుంచుకొన్న తమ అదనపు విలువలోని ఆ భాగాన్ని మార్పిడి చేసుకోవడంలో, ఒకరిపై మరొకరు పైచేయి సాధించడం ద్వారా మరింత ధనవంతులవుతారు.

1. రాతప్రతి II నుంచి - ఫ్రెడరిక్ ఎంగెల్స్.

ఉదాహరణకు, వారి అదనపు విలువలోని లేదా వారి లాభాల్లోని ఈ భాగం 400 పౌండ్లకు సమానంగా వున్నట్లయితే, ఈ 400 పౌండ్ల సరుకు సొంతదారుల్లో ప్రతి ఒక్కడూ తన భాగాన్ని మరొకరికి 25 శాతం మేరకు అదనపు ధరకు అమ్మడం ద్వారా అదే 400 పౌండ్లు 500 పౌండ్లకు పెరుగుతుంది. అయితే అందరూ అదే పని చేస్తారు కాబట్టి, ఫలితం కూడా ఒకే విధంగా వుంటుంది. 400 పౌండ్ల విలువ గల సరుకుల చలామణికిగాను వారికి నిజంగా అవసరమయ్యేది 500 పౌండ్ల డబ్బే. ఇది మరింత ధనవంతులను చేసే పద్ధతి కాదు సరికదా వారిని కేవలం నష్టపెట్టే పద్ధతిగా మాత్రమే కనిపిస్తుంది. ఎందుచేతనంటే ఇది తమ మొత్తం సంపదలో ఎక్కువ భాగాన్ని నిరుపయోగమైన చలామణి సాధనంగా, అనుత్పాదకంగా వారు ఉంచుకోక తప్పని పరిస్థితిని కల్పిస్తుంది. మొత్తానికి తేలేదేమిటంటే – తమ సరుకుల ధరతో సర్వత్రా ఖాతాలో పెరుగుదల వున్నప్పటికీ, పెట్టుబడిదారీ వర్గం వద్ద వ్యక్తిగత వినియోగానికై తమ మధ్య పంపిణీ చేసుకోవడానికి 400 పౌండ్ల విలువ గల సరుకులు మాత్రమే వుంటాయి. అయితే వారు 400 పౌండ్ల విలువ గల సరుకులను, 500 పౌండ్ల విలువ గల సరుకుల చలామణికి అవసరమైన డబ్బు ద్వారా చలామణిలోకి నెట్టి అభిమానం ఒకరిపట్ల ఒకరు చూపుతారు.

ఇదిగాక ఇక్కడ ఆయన మరొక విషయం ఊహించాడు; "వారి లాభాల్లో ఒక భాగం," అంటే మొత్తం మీద లాభాలు నిక్షిప్తమై వున్న సరుకుల సరఫరా వున్నదని డెస్టట్ ఊహించుకొంటున్నాడు. అయితే లాభాలు ఎక్కడనుంచి లభిస్తాయో మనకు తెలియడానికే కదా డెస్టట్ పూనుకొన్నాడు. లాభాలను చలామణి చేయడానికి అవసరమైన డబ్బు పరిమాణం అన్నది చాలా అప్రధాన సమస్య. లాభానికి ప్రాతినిధ్యం వహించేటటువంటి సరుకుల పరిమాణానికి ఈ క్రింది పరిస్థితి మూలాధారం అనిపిస్తుంది; పెట్టుబడిదార్లు ఈ సరుకులను పరస్పరం అమ్ముకోవటమే కాదు చేసేది – ఇలా అమ్మడం కూడా చాలా గొప్ప విషయమే – వారు వాటిని చాలా ఎక్కువ ధరలకు పరస్పరం అమ్ముకుంటారు. కాబట్టి పెట్టుబడిదారులు ధనవంతులు కావడానికి ఒక మూలాధారం ఇప్పుడు మనకు తెలిసిపోయింది. గర్భదారిద్ర్యానికి కారణం "గర్భదారిద్ర్యమే" అని "ఇన్‌స్పెక్టర్ బ్రాసిగ్"[1] వెల్లడించిన రహస్యంలాగా వున్నదిది.

2) పైగా అదే పెట్టుబడిదారులు "వేతన కార్మికులకు అమ్ముతారు, తాము వేతనాలు చెల్లించే వారికీ, పనీపాటూ లేని పెట్టుబడిదారులు వేతనాలు చెల్లించే వారికీ ఉభయులకూ కూడా అమ్ముతారు. వారు ఈ విధంగా, బహుశా, వారు పొదుపు చేసిన చిన్న మొత్తాలు మినహా వారి మొత్తం వేతనాలను వేతన కార్మికుల నుంచి తిరిగి వసూలు చేసుకుంటారు."

డెస్టట్ అభిప్రాయం ప్రకారం, డబ్బు పెట్టుబడి తిరిగి చేతికందడం, అంటే పెట్టుబడిదారులు కార్మికులకు వేతనాలను అడ్వాన్సు చేసిన ఆ రూపం ఈ పెట్టుబడిదార్లు ధనవంతులు కావడానికి మరో మూలాధారం.

అందుచేత, ఉదాహరణకు పెట్టుబడిదార్లు గనక తమ కార్మికులకు వేతనాలుగా 100 పౌండ్లు చెల్లించినప్పుడు, ఆ కార్మికులు అదే పెట్టుబడిదారుల నుంచి 100 పౌండ్ల విలువ గల సరుకులను

1. జర్మన్ వ్యంగ్య రచయిత ఫ్రిట్జ్ రాయిటర్ (1810-74) రచనల్లోని ఒక పాత్ర - సం.

కొనుగోలు చేసినప్పుడు, అంటే శ్రమ – శక్తి కొనుగోలుదార్లుగా పెట్టుబడిదార్లు అడ్వాన్స్ చేసిన 100 పౌండ్లు కార్మికులకు 100 పౌండ్ల సరుకులు అమ్మిన సందర్భంగా వాపస్ వచ్చినపుడు ఆ చర్య ద్వారా పెట్టుబడిదార్లు మరింత ధనవంతులవుతారు. ఈ కార్యకలాపం జరగడానికి ముందు, తమ వద్ద వున్న 100 పౌండ్లు మళ్లీ వారి వద్దకు వచ్చినట్లు ఇంగితజ్ఞానం వున్న ఎవరికైనా కనిపిస్తుంది. ఈ కార్యకలాపం ప్రారంభంలో వారివద్ద డబ్బు రూపంలో 100 పౌండ్లు వుంది. ఈ 100 పౌండ్లతో వారు శ్రమశక్తిని కొనుగోలు చేస్తారు. ఇలా కొనుగోలు చేయబడిన శ్రమ ఆ 100 పౌండ్ల డబ్బుకుగాను, మనకు తెలిసినంత వరకూ, 100 పౌండ్ల విలువకు సమానమైన సరుకులను కొంటుంది. పెట్టుబడిదార్లు తమ కార్మికులకు 100 పౌండ్ల విలువ గల సరుకులను అమ్మడం ద్వారా 100 పౌండ్లను డబ్బు రూపంలో తిరిగి పొందుతారు. అప్పుడు పెట్టుబడిదార్ల వద్ద డబ్బు రూపంలో మళ్ళీ 100 పౌండ్లు వుంటుంది; కార్మికుల వద్దనేమో తాము ఉత్పత్తి చేసిన 100 పౌండ్లు విలువ గల సరుకులుంటాయి. అయితే ఈ చర్య పెట్టుబడిదార్లను ఎలా మరింత ధనవంతులుగా చేస్తుందో అర్థం కాదు. ఆ 100 పౌండ్ల డబ్బు పెట్టుబడిదార్లకు తిరిగి రాలేదంటే, వారు మొదటిది, కార్మికులకు వారికి 100 పౌండ్ల విలువ గల వస్తువులను అంటే వారి శ్రమ ఉత్పాదితాన్నే తిరిగి ఉచితంగా ఇచ్చేయవలసి వుంటుంది. కాబట్టి ఈ డబ్బు ఇలా తిరిగి రావడం అన్నది, మహా అయితే, పెట్టుబడిదార్లు ఈ లావాదేవీ మూలంగా ఎందుకు నష్టపోలేదో వివరిస్తుందే తప్ప వారు ఎలా మరింత ధనవంతులవుతున్నారో మాత్రం వివరించడం లేదు.

పెట్టుబడిదారుల చేతుల్లోకి 100 పౌండ్లు ఎలా వచ్చాయి, కార్మికులు తమ కోసమే సరుకులను ఉత్పత్తి చేయడానికి బదులు వారు ఆ 100 పౌండ్లకు తమ శ్రమశక్తిని మార్పిడి చేసుకోక తప్పని పరిస్థితి ఎందుకు ఏర్పడింది, అన్నది నిజంగా మరో సమస్య. కానీ డెస్టట్ స్థాయిలోని మేధావికి ఇది స్వయం విదితమే.

ఈ పరిష్కారం డెస్టట్‌కే పూర్తి సంతృప్తికరంగా లేదు. ఏది ఏమైనా కొంత డబ్బు, అంటే 100 పౌండ్లు ఖర్చుపెట్టి, అదే 100 పౌండ్లను తిరిగి తీసుకోవడం ద్వారా అంటే, డబ్బు రూపంలో 100 పౌండ్లు వాపస్ రావడం ద్వారా ఎవరైనా సరే మరింత ధనవంతులవుతారని ఆయన చెప్పారు కాదు; డబ్బు రూపంలోని ఆ వంద పౌండ్లు గల్లంతు కాలేదని మాత్రమే ఇది తెలియజేస్తుంది. పెట్టుబడిదార్లు "తాము ఉత్పత్తి చేసిన ప్రతిదాన్నీ దాని ఉత్పత్తి ఖర్చు కంటే ఎక్కువ ధరకు అమ్మడం ద్వారా" మరింత ధనవంతులవుతారని ఆయన చెప్తారు.

పర్యవసానంగా పెట్టుబడిదార్లు కార్మికులతో తాము జరిపే లావాదేవీల వల్ల కూడా, అంటే వారికి ఎక్కువ ధరలకు అమ్మడం ద్వారా కూడా మరింత ధనవంతులవుతారు. భేషుగ్గా వుంది! "వారు వేతనాలు చెల్లిస్తారు – వీరే వారికి (పెట్టుబడిదార్లకు) వేతనాల రూపంలో అయిన ఖర్చుకంటే ఎక్కువ ఉత్పాదితాల కోసం చెల్లిస్తారన్న మాట." (ఉదాహృత గ్రంథం, పుట 240) ఇంకో విధంగా చెప్తే, పెట్టుబడిదార్లు వేతనాల రూపంలో 100 పౌండ్లు కార్మికులకు చెల్లిస్తారు; తరువాత వారు ఈ కార్మికులకు తమ సొంత ఉత్పాదితాన్ని 120 పౌండ్లకు అమ్ముతారు; ఆ విధంగా వారు తమ 100 పౌండ్లను తిరిగి పొందడమే గాక, మరో 20 పౌండ్ల లాభం పొందుతారు. అంతేనా? అది అసాధ్యం. కార్మికులు తమకు వేతనాల రూపంలో లభించిన డబ్బు మాత్రమే చెల్లించగలరు. వారికి పెట్టుబడిదార్ల

నుంచి వేతనాల రూపంలో 100 పౌండ్లు లభించినట్లయితే ఆ 100 పౌండ్ల విలువకు సమానమైన దానిని మాత్రమే కొనుగోలు చేయగలరు తప్ప, 120 పౌండ్ల విలువకు సమానమైన దానిని కొనుగోలు చేయలేరు. కాబట్టి ఈ పద్ధతి పనికిరాదు. అయితే మరో పద్ధతి వుంది. కార్మికులు పెట్టుబడిదార్ల నుంచి 100 పౌండ్ల సరుకులు కొనుగోలు చేసినప్పటికీ వారికి వాస్తవంలో 80 పౌండ్ల విలువ గల సరుకులే అందుతాయి. అప్పుడు వారు 20 పౌండ్ల మేరకు మోసగింపబడ్డారనడం నిస్సందేహం. పెట్టుబడిదారుకు 20 పౌండ్లు లభించిన మాట నిస్సందేహం; ఎందుచేతనంటే అతడు శ్రమశక్తికి దాని విలువ కంటే 20 శాతం తక్కువ చెల్లించాడు, లేదా డొంకతిరుగుడు మార్గంలో వారి వాస్తవ వేతనాల్లో 20 శాతం కోత పెట్టాడు.

పెట్టుబడిదారీ వర్గం ప్రారంభంలో వేతనాల రూపంలో 80 పౌండ్లు చెల్లించి ఆ తర్వాత ఆ 80 పౌండ్ల డబ్బుకు 80 పౌండ్లు విలువ గల సరుకులను వారికి అందజేస్తే, అది ఈ లక్ష్యాన్నే సాధిస్తుంది. పెట్టుబడిదారీ వర్గాన్ని మొత్తంగా పరిశీలిస్తే, ఇదే మామూలు పద్ధతిగా కనిపిస్తుంది; ఎందుచేతనంటే డెస్టట్ అభిప్రాయం ప్రకారం, కార్మికవర్గం వేతనాలు కనీసం వారు తమ మనుగడకు, పనిచేయగల తమ శక్తిని నిలుపుకొనేందుకు చాలినంత, "కనీస పోషణాధారాలను" (పుట 180) సంపాదించుకోడానికి సరిపడే విధంగా వుండాలి. కాబట్టి వారికి "తగినంత వేతనం" లభించకపోతే "పరిశ్రమ మరణించినట్లే" అని (పుట 208) అదే డెస్టట్ అంటున్నాడు. కాబట్టి పెట్టుబడిదార్లు మరింత ధనవంతులయ్యే పద్ధతిగా ఇది కనిపించదు. అయితే, పెట్టుబడిదార్లు కార్మిక వర్గానికి చెల్లించే వేతనాల స్థాయి ఏదైనప్పటికీ, వాటికి నిర్దిష్ట విలువ వుంది. అంటే 80 పౌండ్ల విలువ వుంది. పెట్టుబడిదారీ వర్గం కార్మికులకు 80 పౌండ్లు చెల్లించినట్లయితే, ఆ 80 పౌండ్ల విలువకు సమానమైన సరుకులను అది వారికి సరఫరా చేయాల్సి వుంటుంది; అలా ఆ 80 పౌండ్లు వాపస్ రావడం వల్ల పెట్టుబడిదారీ వర్గం ధనం పెరగదు. అది కనుక 100 పౌండ్లు చెల్లించి, ఆ 100 పౌండ్లకుగాను వారికి 80 పౌండ్ల విలువ గల సరుకులే అమ్మినట్లయితే, అది వారికి వారి మామూలు వేతనాల కంటే 25 శాతం ఎక్కువ చెల్లించినట్లూ, ఆ వేతనాలకు ప్రతిగా సరుకుల రూపంలో 25 శాతం తక్కువ సరఫరా చేసినట్లు అవుతుంది.

ఇంకో విధంగా చెప్తే, మొత్తంపై పెట్టుబడిదారీ వర్గం పొందే లాభాలకు మూలంగా వున్న నిధి, మామూలు వేతనాల నుంచి మినహాయించిన సొమ్ముతో ఏర్పడిందని అనుకోవాలి. అంటే శ్రమశక్తికి దాని అసలు విలువకంటే తక్కువ చెల్లించడం ద్వారా, అంటే వేతన కార్మికులుగా వారి సామాన్య పునరుత్పత్తికి అవసరమైన జీవనాధారాల విలువకంటే తక్కువ చెల్లించడం ద్వారా ఏర్పడిందన్న మాట. కాబట్టి మామూలు వేతనాలు చెల్లించినట్లయితే (డెస్టట్ భావిస్తున్నది కూడా అదే) పారిశ్రామిక పెట్టుబడిదార్లకు కానీ, పనీపాటూ లేని పెట్టుబడిదార్లకు కానీ లాభనిధి వుండజాలదు.

అందుచేత పెట్టుబడిదారీ వర్గం ఎలా మరింత ధనికులవుతారనే రహస్యమంతటినీ డెస్టట్ "వేతనాల నుంచి మినహాయించడం ద్వారా" అని తేల్చి వుండాల్సింది. అప్పుడు, (1) కింద, (3) కింద ఆయన పేర్కొన్న ఇతర అదనపు విలువ నిధులు వుండవు.

కాబట్టి కార్మికుల డబ్బు – వేతనాలను, ఒక వర్గంగా, వారి జీవన భృతికి అవసరమైన వినియోగ వస్తువుల విలువకు కుదించాల్సివున్న అన్ని దేశాల్లోనూ, ఈ లెక్కన, పెట్టుబడిదార్లకు

వినియోగ నిధీ వుండదు. అందువల్ల పెట్టుబడిదారీ వర్గమే వుండదు. ఇక డెస్టట్ అభిప్రాయం ప్రకారం, ప్రాచీన నాగరికత గల అన్ని సంపన్న, ప్రవర్థిత దేశాల్లోనూ ఇలాగే వుండాలి. ఎందుకంటే ఆయన ఇలా అంటారు : "మన ప్రాచీన సమాజాలలో వేతన శ్రామికుల పోషణ నిధి..... దాదాపు స్థిరమైన పరిమాణంగా వుంది." (ఉదాహృత గ్రంథం, పుట 202)

వేతనాల నుంచి మినహాయించుకున్నంత మాత్రాన, పెట్టుబడిదారు మరింత ధనవంతుడు కాదు; అంటే మొదట కార్మికుడికి డబ్బు రూపంలో 100 పౌండ్లు చెల్లించి ఆ తర్వాత ఆ 100 పౌండ్లకుగాను 80 పౌండ్ల విలువ గల సరుకులనే సరఫరా చేయడం ద్వారా, ఆ విధంగా 80 పౌండ్ల విలువ గల సరుకులను 100 పౌండ్లతో, 25 శాతం ఎక్కువ డబ్బుతో చలామణి చేయడం ద్వారా పెట్టుబడిదారు మరింత ధనవంతుడు కాడు. పెట్టుబడిదారు ఉత్పాదితంలో అదనపు విలువకు ప్రాతినిధ్యం వహించే ఆ భాగాన్ని, అంటే అదనపు విలువను మాత్రమే గాక, ఉత్పాదితంలో కార్మికుడికి వేతనాల రూపంలో లభించాల్సిన భాగంలో 25 శాతం కూడా స్వాయత్తపరచుకోవడం ద్వారా మరింత ధనవంతుడవుతాడు. డెస్టట్ ఊహించిన ఈ తెలివితక్కువ పద్ధతివల్ల పెట్టుబడిదారీ వర్గానికి ఏమీ లాభించదు. పెట్టుబడిదారీ వర్గం 100 పౌండ్లు వేతనాలుగా చెల్లించి ఆ 100 పౌండ్లకుగాను కార్మికుడే సృష్టించిన 80 పౌండ్ల ఉత్పాదితాన్ని తిరిగి అందజేస్తుంది. అయితే ఆ తర్వాతి లావాదేవీలో, పెట్టుబడి దారీ వర్గం అదే కార్యవిధానం కోసం మళ్లీ 100 పౌండ్లు అడ్వాన్సు చేయవలసి వుంటుంది. ఈ విధంగా పెట్టుబడిదారీ వర్గం 80 పౌండ్లు అడ్వాన్సు చేసి దానికి మార్పిడిగా 80 పౌండ్ల సరుకులను సరఫరా చేయడానికి బదులు, 100 పౌండ్లు అడ్వాన్సు చేసి దానికి మార్పిడిగా 80 పౌండ్లు విలువ గల సరుకులు అందజేసే పనికిమాలిన ఆట ఆడుతుంది. అంటే, తన అస్థిర పెట్టుబడి చలామణికి అవసరమైన దానికంటే 25 శాతం ఎక్కువ డబ్బు పెట్టుబడిని అది నిరంతరాయంగా అడ్వాన్సు చేస్తూ వుంటుందన్న మాట. ధనవంతులు కావడానికి ఇది చాలా చిత్రమైన పద్ధతే.

3) చివరి విషయం, పెట్టుబడిదారీ వర్గం "పనీపాటూ చేయని పెట్టుబడిదారులకు" అమ్ముతుంది; "వీరు తాము ప్రత్యక్షంగా నియమించిన వేతన కార్మికులకు తమ ఆదాయంలోనుంచి ఇంకా చెల్లించకుండా వున్న భాగంతో ఈ పెట్టుబడిదారీ వర్గానికి చెల్లిస్తారు; ఈ విధంగా, పనీపాటూ చేయని పెట్టుబడిదార్లకు వారు ఏటా చెల్లించే మొత్తం కౌలు ఈ విధంగా కానీ, మరో విధంగా కానీ వారికే తిరిగి వస్తుంది."

పారిశ్రామిక పెట్టుబడిదార్లు "తమ అవసరాలను తీర్చుకోడానికి ఉద్దేశించిన వినియోగ భాగమంతటికీ తమ లాభాల్లో ఒక భాగాన్ని చెల్లిస్తారని" మనం పైన గమనించాము. కాగా, వారి లాభాలు 200 పౌండ్లకు సమానం అనుకుందాం. వారు ఇందులో 100 పౌండ్లను తమ వ్యక్తిగత వినియోగం కోసం ఉపయోగిస్తారనుకుందాం. మిగతా సగం లేక 100 పౌండ్లు వారికి చెందదు; ఇది పనీపాటూలేని పెట్టుబడిదార్లకు చెందుతుంది. అంటే కౌలు ఇచ్చే వారికీ, వడ్డీకి డబ్బు అప్పుగా ఇచ్చే పెట్టుబడిదార్లకూ అది చెందుతుంది. అందుచేత వారు ఈ పెద్దమనుషులకు100 పౌండ్లు చెల్లించాల్సి వుంటుంది. ఈ పెద్దమనుషుల వ్యక్తిగత వినియోగానికి ఈ డబ్బులో 80 పౌండ్లు అవసరం అనుకుందాం; మరో 20 పౌండ్లు తమ సేవకుల జీతాలు వగైరాలకు అవసరం అనుకుందాం. వారు ఆ 80 పౌండ్లతో పారిశ్రామిక పెట్టుబడిదార్ల నుంచి వినియోగ వస్తువులు కొనుగోలు చేస్తారు. ఈ

విధంగా ఈ పెట్టుబడిదార్లు 80 పౌండ్ల విలువ గల సరుకులను ఇచ్చి అందుకు ప్రతిగా 80 పౌండ్ల డబ్బు స్వీకరిస్తారు; అంటే తాము కౌలు, వడ్డీ వగైరా పేర్లతో పనిపాటూలేని పెట్టుబడిదార్లకు చెల్లించిన 100 పౌండ్లలో అయిదింట నాలుగు వంతులను తిరిగి పొందుతారు. ఇకపోతే, పనీపాటూలేని పెట్టుబడిదార్ల సేవక వర్గం అంటే ఆ పెట్టుబడిదార్ల ప్రత్యక్ష వేతన కార్మికులు తమ యజమానుల నుంచి 20 పౌండ్లు పొందారు. ఈ సేవకులు కూడా అలాగే 20 పౌండ్ల వినియోగ వస్తువులను పారిశ్రామిక పెట్టుబడిదార్ల నుంచి కొనుగోలు చేస్తారు. ఈ విధంగా ఈ పెట్టుబడిదార్ల 20 పౌండ్ల విలువ గల సరుకులను అమ్మడం ద్వారా, ఆ 20 పౌండ్ల డబ్బును తిరిగి పొందారు; అంటే, తాము పనీపాటూలేని పెట్టుబడిదార్లకు కౌలు, వడ్డీ వగైరాల కింద చెల్లించిన 100 పౌండ్లలో చివరి అయిదో వంతును ఈ విధంగా తిరిగి పొందారన్న మాట.

ఈ లావాదేవీ ముగిసేసరికి, పారిశ్రామిక పెట్టుబడిదార్లు పనీపాటూలేని పెట్టుబడిదార్లకు కౌలు, వడ్డీ మొదలయిన వాటి కింద చెల్లించిన 100 పౌండ్లను తిరిగి పొందారు. అయితే వారి అదనపు ఉత్పాదితంలోని 100 పౌండ్లకు సమానమైన సగభాగం ఈలోగా వారి చేతుల్లో నుంచి పనీపాటూ చేయని పెట్టుబడిదార్ల వినియోగ నిధిలోకి వెళ్ళిపోయింది.

ప్రస్తుతం, మనం చర్చిస్తున్న ప్రశ్నకు సంబంధించి, నిష్క్రియాపరులైన పెట్టుబడిదార్లకూ, వారి ప్రత్యక్ష వేతన కార్మికులకు మధ్య ఈ 100 పౌండ్లు ఎలా పంపిణీ అవుతాయో పరిశీలించడం అవసరం. అది సరళంగానే వుంది : 200 పౌండ్లకు సమానంగా వున్న అదనపు విలువలోని వారి భాగం అంటే, వారి కౌలు, వడ్డీ వగైరాలు 100 పౌండ్ల మేరకు పారిశ్రామిక పెట్టుబడిదార్లు వారికి డబ్బు రూపంలో చెల్లించారు. వారు ఈ 100 పౌండ్లతో పారిశ్రామిక పెట్టుబడిదార్ల నుంచి ప్రత్యక్షంగా కానీ, పరోక్షంగా కానీ వినియోగ వస్తువులు కొనుగోలు చేస్తారు. ఈ విధంగా పనీపాటూలేని పెట్టుబడిదార్లు ఆ 100 పౌండ్లు వారికి తిరిగి చెల్లించి, అందుకు ప్రతిగా వారి నుంచి 100 పౌండ్ల విలువ గల వినియోగ వస్తువులు స్వీకరిస్తారు.

పారిశ్రామిక పెట్టుబడిదార్లు డబ్బు రూపంలో నిష్క్రియాపరులైన పెట్టుబడిదార్లకు చెల్లించిన 100 పౌండ్లు ఈ విధంగా తిరిగి రావడం పూర్తవుతుంది. డెస్టట్ ఊహిస్తున్నట్లు, ఈ డబ్బు తిరిగి రావడం పారిశ్రామిక పెట్టుబడిదార్లను మరింత ధనవంతులను చేసే ఒక సాధనమా? ఈ లావాదేవీ జరగడానికి ముందు వారివద్ద 200 పౌండ్ల విలువల మొత్తం వుండింది – 100 పౌండ్లు డబ్బు రూపంలోనూ, 100 పౌండ్లు వినియోగ వస్తువుల రూపంలోనూ. లావాదేవీ జరిగిన తర్వాత వారి వద్ద తొలి విలువల మొత్తంలో సగమే వుంటుంది; వారివద్ద మళ్ళీ 100 పౌండ్లు డబ్బు రూపంలో వుంది. కాని 100 పౌండ్లను వినియోగ వస్తువుల రూపంలో కోల్పోయారు. అవి నిష్క్రియాపరులైన పెట్టుబడిదారుల చేతుల్లోకి వెళ్ళాయి. అందుచేత వారి సంపద 100 పౌండ్ల మేరకు పెరగడానికి బదులు, 100 పౌండ్ల మేరకు తగ్గింది. మొదట 100 పౌండ్లు డబ్బు రూపంలో చెల్లించి ఆ తర్వాత 100 పౌండ్ల విలువ గల వినియోగ సరుకులను సరఫరా చేయడం ద్వారా ఆ 100 పౌండ్లను తిరిగి పొందే డొంకతిరుగుడు పద్ధతి అవలంబించడానికి బదులుగా వారు కనుక కౌలు, వడ్డీ వగైరాలను నేరుగా తమ ఉత్పాదితాల రూపంలో చెల్లించి వుంటే, వారు ఆ మొత్తాన్ని చలామణిలోకి తోయలేరు కదా. పదార్థాల రూపంలో చెల్లించి వుంటే, ఈ క్రింది క్రమం జరిగి వుండేది; వారు 200 పౌండ్ల

అదనపు ఉత్పాదితంలో సగభాగాన్ని తమ దగ్గరే అట్టిపెట్టుకుని, మిగతా సగభాగాన్ని, అందుకు సమానమైన విలువను తిరిగి స్వీకరించకుండానే, నిష్క్రియాపరులైన పెట్టుబడిదార్లకు ఇచ్చి వుండేవారు. ఇది మరింత ధనవంతులయ్యే పద్ధతి అని ప్రకటించే ఆలోచన డెస్టట్‌కు కూడా వచ్చి వుండేది కాదు.

వాస్తవానికి తమ అదనపు విలువలోని ఒక భాగాన్ని కౌలు, వడ్డీ వగైరా రూపాల్లో చెల్లించే షరతుపై పనీపాటూలేని పెట్టుబడిదారుల నుంచి పారిశ్రామిక పెట్టుబడిదారులకు లాభదాయకమైనవే; ఎందుకంటే మొత్తంమీద సరుకుల ఉత్పత్తికి గాని, ఉత్పాదితంలో అదనపు విలువకు ప్రాతినిధ్యం వహించే అదనపు ఉత్పాదితంగా వున్న ఆ భాగం యొక్క ఉత్పాదనకు గాని తప్పనిసరిగా అవసరమైన వాటిలో అవీ ఒకటి. ఈ లాభం చేకూరేది అరువు తీసుకున్న భూమినీ, పెట్టుబడినీ ఉపయోగించుకోవడం ద్వారానే తప్ప, వాటికి చెల్లించే ధర నుంచి కాదు. ఈ ధర పైపెచ్చు, ఈ లాభం నుంచి తీసివేయబడుతుంది. అలాకాక పారిశ్రామిక పెట్టుబడిదార్లు తమ అదనపు విలువలోని మిగతా సగభాగాన్ని తమవద్దే వుంచుకోగలిగితే, దానిని ఇచ్చివేయకపోతే వారి సంపద పెరగకపోగా తరిగిపోతుందని వాదించవలసి వుంటుంది. డబ్బు వాపస్ రావటం చలామణిలోని ఒక ఘటన. దాన్ని ఉత్పాదితం పంపిణీతో కలగలపడం వల్ల ఇలాంటి గందరగోళం తలెత్తుతుంది; ఈ చలామణి ఘటన క్రమాలు ఉత్పాదితం పంపిణీకి కేవలం దోహదకారులు, అంతే.

అయినప్పటికీ అదే డెస్టట్ చాలా తెలివిగా ఇలా వ్యాఖ్యానించాడు : "పనీపాటూలేని ఈ పెద్ద మనుషుల ఆదాయాలు ఎక్కడనుంచి వస్తాయి? వారి పెట్టుబడులను పనిలో పెట్టి లాభాలు పొందే వారు, ఆ లాభాల నుంచి తమకు చెల్లించిన అద్దె నుంచీనే కదా ఈ ఆదాయాలు వచ్చేది? అంటే పనీపాటూలేని పెట్టుబడిదార్ల నిధులతో శ్రమకు – తనకయ్యే వ్యయంకన్నా ఎక్కువ ఉత్పత్తి చేసే ఆ శ్రమకు చెల్లించేవారు. ఒక్క ముక్కలో చెప్పాలంటే, పారిశ్రామిక పెట్టుబడిదార్లు చెల్లించే కౌలు నుంచే కదా ఈ ఆదాయాలు వచ్చేది? సర్వ సంపదలకు మూలాధారాన్ని కనుగొనడానికి తిరిగి వారివద్దకే వెళ్ళడం ఎల్లప్పుడూ అవసరం. పారిశ్రామిక పెట్టుబడిదార్లు నియోగించే వేతన కార్మికులకు నిజానికి తిండి పెట్టేది వారే." (పుట 246)

అందుచేత ఈ కౌలు వగైరాల చెల్లింపు పారిశ్రామిక పెట్టుబడిదారుల లాభంలో కోతే. మునుపేమో, ఈ చెల్లింపు వారు తమ సంపద పెంచుకొనేందుకు సాధనం.

అయితే మన డెస్టట్‌కు ఒక ఊరట మిగిలింది. పెద్దమనుషులైన ఈ పారిశ్రామికులు తాము ఒకరిపట్ల ఒకరు, అలాగే కార్మికుల పట్ల వ్యవహరించినట్లే, పనీపాటూలేని పెట్టుబడిదార్ల పట్ల కూడా వ్యవహరిస్తున్నారు. వీరందరికీ సరుకులన్నింటినీ చాలా ప్రియంగా, ఉదాహరణకు 20 శాతం ఎక్కువ ధరలకు అమ్ముతారు. ఇక్కడ రెండు ప్రత్యామ్నాయాలున్నాయి. పనీపాటూలేని పెట్టుబడిదార్లకు, తాము ఏటా పారిశ్రామిక పెట్టుబడిదార్ల నుంచి తీసుకొనే 100 పౌండ్లతో పాటు ఇతర డబ్బు వనరులు వుండనైనా వుంటాయి; లేదా వుండవు. అవి ఉన్న సందర్భంలో, పారిశ్రామిక పెట్టుబడిదార్లు వారికి 100 పౌండ్ల విలువ గల సరుకులను 120 పౌండ్లకు అమ్ముతారు. పర్యవసానంగా వారు తమ సరుకులను అమ్మడం ద్వారా ఈ నిష్క్రియాపరులకు చెల్లించిన 100 పౌండ్లను తిరిగి వసూలు చేసుకోవడమే కాక, అదనంగా మరో 20 పౌండ్లను కూడా వసూలు చేస్తారు; ఈ 20 పౌండ్లు నిజంగా వారికి లభించిన నూతన విలువే. ఇప్పుడు ఖాతా ఎలా కనిపిస్తుంది? వారు 100 పౌండ్లు

విలువ గల సరుకులను ఉచితంగా యిచ్చేశారు; ఎందుచేతనంటే, తమ సరుకులకుగాను తమకు చెల్లించబడిన 100 పౌండ్ల డబ్బు నిజంగా వారి సొంత డబ్బే. ఈ విధంగా వారి సొంత సరుకులకు వారి సొంత డబ్బే చెల్లించబడింది. కాబట్టి వారు 100 పౌండ్లు నష్టపోయారన్న మాట. అయితే ఆ సరుకుల విలువకంటే అదనంగా 20 పౌండ్లు ఎక్కువ వారికి ముట్టింది. ఈ 20 పౌండ్లను 100 పౌండ్ల నష్టం నుంచి మినహాయించండి. అప్పటికీ 80 పౌండ్ల నష్టం మిగిలే వుంటుంది. ఎప్పుడూ మైనసే కాని ప్లస్ కాదు. పనీపాటూలేని పెట్టుబడిదార్ల విషయంలో చేసిన మోసం, పారిశ్రామిక పెట్టుబడిదార్ల నష్టాన్ని తగ్గించింది. అయితే అది వారి సంపదలోని కోతను సంపద పెరుగుదల సాధనంగా మార్చడంలేదు. కానీ ఈ పద్ధతి నిరవధికంగా కొనసాగజాలదు; ఎందుచేతనంటే సోమరిపోతులైన పెట్టుబడిదార్లు ఏటా 100 పౌండ్లే తీసుకుంటూ, 120 పౌండ్ల డబ్బును ఏటా చెల్లిస్తూ పోవడం సాధ్యం కాదు.

ఇక రెండవ ప్రత్యామ్నాయం మిగిలి వుంది : సోమరులైన పెట్టుబడిదార్లకు తాము చెల్లించిన 100 పౌండ్లకు ప్రతిగా పారిశ్రామిక పెట్టుబడిదార్లు 80 పౌండ్ల విలువ గల తమ సరుకులను వారికి అమ్ముతారు. ఈ సందర్భంలో, మునుపటి సందర్భంలోలాగే, వారు 80 పౌండ్లు ఉచితంగానే కౌలు, వడ్డీ వగైరా రూపంలో ఇచ్చేస్తున్నారు. ఈ దగా పద్ధతి ద్వారా పారిశ్రామిక పెట్టుబడిదార్లు, సోమరులైన పెట్టుబడిదార్లకు చెల్లించే కప్పం తగ్గించేశారే కానీ, కప్పం అంటూ వుంది. కాబట్టి, అమ్మకందార్ల సంకల్పంపై ధరలు ఆధారపడి వుంటాయని ప్రకటించే సిద్ధాంతం ప్రకారం – ఈ సోమరులు భవిష్యత్తులో తమ భూమిపైనా, పెట్టుబడిపైనా కౌలు కోసం, వడ్డీ కోసం 100 పౌండ్లు కాక 120 పౌండ్లు డిమాండ్ చేయగల స్థితిలో వుంటారు.

"సర్వసంపదకూ మూలం శ్రమే" (పుట 242) అనీ, "లాభంతో సహా పెట్టుబడిని పునరుత్పత్తి చేసే శ్రమకు చెల్లించడానికై పారిశ్రామిక పెట్టుబడిదార్లు తమ పెట్టుబడిని నియుక్తం చేస్తారు" అని (పుట 246) ఆడమ్ స్మిత్ చెప్పిన మాటలను ఒకవైపు కాపీకొడుతూ, మరోవైపు ఈ పారిశ్రామిక పెట్టుబడిదార్లే "ఇతర ప్రజలందరకూ తిండి పెడతారు. పౌరసంపదను పెంచేది వీరు మాత్రమే" అనీ, మన అనుభోగాల సాధనాలన్నింటినీ కూడా సృష్టించేది వీరు మాత్రమే అనీ (పుట 242), శ్రామికులు పెట్టుబడిదార్లను పోషించడం కాక, పెట్టుబడిదార్లే శ్రామికులకు తిండి పెడతారనీ, ఎందుకంటే, శ్రామికులకు చెల్లించబడే డబ్బు వారివద్ద నిలవకుండా, వారు స్వయంగా ఉత్పత్తి చేసిన సరుకులకు చెల్లింపుగా ఆ డబ్బు నిరంతరం పెట్టుబడిదార్ల వద్దకు తిరిగి వెడుతుంది, అన్న అద్భుత కారణాన్ని చూపిన ఈ ప్రగాఢ చింతకుని మేధకు తగినట్లుగానే వున్నదీ అద్భుత విశ్లేషణ. "వారు (కార్మికులు) చేసే పనల్లా ఒక చేత్తో ఇలా తీసుకొని మరో చేత్తో దాన్ని తిరిగి యిచ్చేయడమే. కాబట్టి వారు వినియోగించేదాన్ని, కూలికి వారిని నియమించిన వారు సృష్టించినదిగా పరిగణించాలి." (పుట 235)

ఇలా సామాజిక పునరుత్పత్తి, వినియోగాలను డబ్బు చలామణి ఆచరణలోకి తెచ్చిందన్న ఈ సమగ్ర విశ్లేషణ చేశాక డెస్టట్ ఇంకా ఇలా అంటాడు : "సంపద నిరంతరం చలనాన్ని నిర్దుష్టం

చేసేది ఇదే; దీన్ని సరిగా అర్థం చేసుకోవడం జరుగలేదు కానీ" (సరిగ్గా అర్థం చేసుకోని మాట ముమ్మాటికీ నిజం!) "దీనికి చలామణి అని సరైన పేరే పెట్టారు. ఎందుచేతనంటే ఇది నిజంగా ఆవృత్తే. ఇది ఎల్లప్పుడూ బయలుదేరిన స్థానాన్నే తిరిగి చేరుకుంటుంది. ఉత్పత్తి పరాకాష్ఠనందుకొనేది ఈ స్థానంలోనే." (పుటలు 239, 240)

ఈ సామాజిక ప్రక్రియ గతిక్రమాన్ని తాను అద్భుతమైన స్పష్టతతో చిత్రించినందుకు, ఈ అంశంపై వెలుగును ప్రసరింపజేసినందుకు తనను పాఠకులు మెచ్చుకోవాలని, విశిష్ట రచయితా, ఫ్రాన్స్ ఇన్‌స్టిట్యూట్ సభ్యుడూ, ఫిలడెల్ఫియా ఫిలసాఫికల్ సొసైటీ సభ్యుడూ, కొంతమేరకు నాటు అర్థశాస్త్రవేత్తల్లో మణిలాంటి వ్యక్తి అయిన డెస్టట్ ఆఖరున తన పాఠకులను కోరతాడు. అంతేకాదు, ఈ సమస్యపై వెలుగు ప్రసరింపజేసిన తనను అభినందించాల్సిందిగా కూడా కోరతాడు. అంతేకాదు, ఈ వెలుగు ఎక్కడనుంచి వచ్చిందో తన పాఠకులపై దయవుంచి చెబుతున్నాడు. ఇది మూల భాషలో చదవాల్సిందే:

> *"On remarquera. J'espere, combien cette maniere de considerer la consommation de nos richeses est concordante avec tout ce quenous avons dit a propos de leur production et de leur distribution, et en meme temps quelle clarte elle repand sur toute la marche de la societe. D'ou viennent cet accord et cette lucidite? De ce que nous avons rencontrie la verite. Cela rappelle l'effet de ces miroirs ou les objets se peignent nettement et dans leurs justes proportions, quand on est place dans leur vrai point-de-vue, et ou tout parait confus et desuni, quand on en est trop pres ou trop loin." (Pp. 242 and 243)*

Voila le cretinisme bourgeois dans toute sa beatitude![1]

★ ★ ★

1. "సంపద ఉత్పత్తి, పంపిణీల గురించి మేము చెబుతూ వస్తున్నదానికి, మన సంపద పరాకాష్టనందుకోవడం గురించిన ఈ పరిశీలనా పద్ధతి ఎలా అనుగుణ్యంగా వుందో, అదే సమయంలో, మొత్తం సమాజ గతిక్రమంపై అది ఎంత వెలుగును ప్రసరిస్తుందో కూడా గమనిస్తారని నేను ఆశిస్తున్నాను. ఈ అనుగుణ్యత, ఈ స్పష్టత ఎక్కడ నుంచి వచ్చాయి? మేము సత్యాన్ని ప్రత్యక్షంగా చూశామన్న వాస్తవం నుంచి, కొన్ని అద్దాలను వస్తువులపై సరిగ్గా కేంద్రీకరించినపుడు ఆ వస్తువులను అవి సరిగ్గా, వాటి పరస్పరానురూపాల్లో ప్రతిబింబిస్తాయి. కాని మనం ఆ అద్దాలకు మరీ దగ్గరగానో లేదా మరీ దూరంగానో వుంటే ప్రతిదీ గందరగోళంగా అస్తవ్యస్తంగా కనిపిస్తుంది. అలాంటి అద్దాల ప్రభావాన్ని ఇది గుర్తుకు తెస్తున్నది."

మహదానందపరవశమైన బూర్జువా మూఢత్వం అంటే ఇదీ!

## అధ్యాయం - 21[1]

# విస్తృత స్థాయిలో సంచయనం మరియు పునరుత్పత్తి

**వ్య**ష్టి పెట్టుబడిదారీ ఉత్పత్తి విషయంలో సంచయనం ఎలా పనిచేస్తుందో ప్రథమ సంపుటిలో నిరూపించబడింది. సరుకు పెట్టుబడిని డబ్బుగా మార్చడం ద్వారా అదనపు విలువకు ప్రాతినిధ్యం వహించే అదనపు ఉత్పాదితం కూడా డబ్బుగా మారుతుంది. పెట్టుబడిదారు ఈ విధంగా రూపాంతరం చెందిన అదనపు విలువను తన ఉత్పాదక పెట్టుబడిలో అదనపు సహజ అంశాలుగా తిరిగి మార్చుకుంటాడు. అలా పెరిగిన పెట్టుబడి ఆ తరువాతి ఉత్పత్తి ఆవృత్తిలో, ఎక్కువ ఉత్పాదితాన్ని సమకూరుస్తుంది. వ్యష్టి పెట్టుబడిదారుని విషయంలో జరిగిందే మొత్తంగా వార్షిక పునరుత్పత్తి విషయంలో కూడా జరుగుతుంది; వ్యష్టి పెట్టుబడి విషయంలో, పూర్తిగా వినియోగమయిపోయిన దాని నిశ్చల భాగాలు వరుసగా డబ్బు రూపంలో ధరించడం, దాన్ని నిల్వ చేయడం జరిగినట్లే, సమాజ వార్షిక పునరుత్పత్తిలో కూడా జరుగుతుందని మనం, సామాన్య పునరుత్పత్తి విశ్లేషణలో చూచాము. దీనిలాగే అదీ.

ఒక వ్యష్టి పెట్టుబడి 400 స్థి.పె + 100 అ.పెకి సమానమైతే, వార్షిక అదనపు విలువ 100కు సమానమైతే, అప్పుడు సరుకు ఉత్పాదితం 400 స్థి.పె + 100 అ.పె +100 అ.వి గా ఉంటుంది. ఈ 600 డబ్బుగా పరివర్తన చెందుతుంది. ఈ మొత్తం డబ్బులో 400 స్థి.పె శ్రమశక్తిగా మార్పు చెందుతుంది. పోతే, సమస్త అదనపు విలువ సంచయనం అయ్యేపక్షంలో, మిగిలిన 100 అ.వి కూడా ఉత్పాదక పెట్టుబడి యొక్క అంశాలుగా సహజ పరివర్తన చెందడం ద్వారా, అదనపు స్థిర పెట్టుబడిగా మార్పు చెందుతుంది. ఈ విషయంలో ఇలా ఊహిస్తున్నాము. 1) పనిలో పెట్టిన స్థిర పెట్టుబడిని నిర్ణీత సాంకేతిక పరిస్థితుల్లో విస్తరింపచేయడానికి కానీ, లేక కొత్త పారిశ్రామిక వ్యాపారాన్ని ఏర్పాటు చేయడానికి కానీ ఈ మొత్తం చాలునని ఊహిస్తున్నాము. అయితే ఈ ప్రక్రియకు ముందు, అంటే నిజమైన సంచయనం, ఉత్పత్తి విస్తరణా జరగడానికి ముందు, అదనపు విలువ డబ్బుగా మారాల్సిన అవసరమూ, ఈ డబ్బును దీర్ఘకాలం పాటు నిల్వ ఉంచాల్సిన అవసరమూ ఏర్పడవచ్చు.

2) ఉత్పత్తి ఇంతకు ముందే విస్తృత స్థాయిలో నిజంగా సాగుతూందని కూడా ఊహించుకొంటు న్నాము. ఎందువల్లనంటే, డబ్బును (డబ్బు రూపంలో నిల్వ చేయబడిన అదనపు విలువను)

---

1. ఇక్కడ నుంచి తుదిదాకా రాతప్రతి VIII - **ఫ్రెడరిక్ ఎంగెల్స్.**

ఉత్పాదక పెట్టుబడి యొక్క అంశాలుగా మార్చాలంటే మనం వాటిని తయారైన ఉత్పాదక పెట్టుబడి యొక్క అంశాలుగా మార్చాలంటే మనం వాటిని మార్కెట్‌లో సరుకులుగా కొనుగోలు చేయగలిగిన స్థితిలో ఉండాలి. అవి తయారైన ఉత్పాదితాలుగానే కొనుగోలు చేసినవయినా, ఆర్డర్ మేరకు తయారు అయినవైనా, అందులో తేడా ఏమీ ఉండదు. అవి ఉనికిలో ఉంటే తప్ప వాటికోసం చెల్లించడం జరగదు; ఎలాంటి పరిస్థితిలోనూ, వాటికి సంబంధించి అంతవరకూ మామూలుగా ఉన్న ఉత్పత్తి విస్తరింపబడితే తప్ప అంటే విస్తృత స్థాయిలో పునరుత్పత్తి జరిగితే తప్ప, వాటికోసం చెల్లించడం జరగదు. అవి అస్తిత్వంలోకి రాగల స్థితిలో, అంటే వాటి అంశాల రూపంలో ఉండి ఉంటాయి. ఎందువల్లనంటే, అవి నిజంగా ఉత్పత్తి కావడానికి అవసరమైనదల్లా ఒక ఆర్డర్ కలిగించే ప్రేరణే – అంటే, నిజంగా అస్తిత్వంలోకి రావడానికి ముందే, తలపెట్టిన అమ్మకానికి ముందే సరుకుల కొనుగోలు కలిగించే ప్రేరణ. కనుక ఒకవైపున ఉన్న డబ్బు, మరోవైపున విస్తృత పునరుత్పత్తిని ప్రేరేపిస్తుంది. ఎందువల్లనంటే డబ్బు లేకున్నా విస్తృత పునరుత్పత్తికి అవకాశం ఉంటుంది. కారణం, డబ్బు స్వతహాగా నిజమైన పునరుత్పత్తిలో ఒక అంశం కాదు కాబట్టి.

ఉదాహరణకు, క అనే పెట్టుబడిదారు తాను వరుసగా కొన్ని పరిమాణాల్లో ఉత్పత్తి చేసిన సరుకులను ఒక సంవత్సరంలో కానీ, కొన్ని సంవత్సరాల్లో కానీ అమ్మడం వల్ల, సరుకుల్లో అదనపు విలువకు ప్రాతినిధ్యం వహించే ఆ భాగాన్ని కూడా, అంటే అదనపు ఉత్పాదితాన్ని కూడా డబ్బుగా మార్చుకుంటున్నాడు; లేక ఇంకో విధంగా చెప్తే, అతడు సరుకు రూపంలో ఉత్పత్తి చేసే అదనపు విలువను క్రమేణా కూడబెడతాడు. ఆ విధంగా తన కోసం నూతన సంభావ్య డబ్బు పెట్టుబడిని రూపొందించుకొంటాడు. సంభావ్యమని అనడం ఎందుకంటే, ఉత్పాదక పెట్టుబడి అంశాలుగా మార్పుచెందగల శక్తి దానికి ఉంది. దాని కర్తవ్యం కూడా అదే కాబట్టి. అయితే, వాస్తవంలో అతడు కేవలం కూడబెట్టడంలోనే నిమగ్నమవుతాడు; అలా కూడబెట్టే పని వాస్తవ పునరుత్పత్తిలో ఒక అంశం కాదు. అతడు మొదట చేసేదల్లా చలామణిలోని డబ్బును వరుసగా వెనక్కు తీసుకోవటమే. అయితే ఈ విధంగా చలామణిలో నుంచి ఉపసంహరించడానికి ముందు కూడబెట్టిన మరో నిల్వ నిధి, అంటే సంభావ్య నూతన డబ్బు పెట్టుబడి అయ్యే అవకాశమున్న ఈ నిధి అదనపు సామాజిక సంపదేమీ కాదు; అది కనుక వినియోగ వస్తువుల కోసం వ్యయమయి ఉంటే ఎలా సామాజిక సంపద కాదో, ఇదీ అంతే. అయితే, చలామణి నుంచి ఉపసంహరించుకోబడిన డబ్బు, అంటే అంతకుముందు చలామణిలో ఉన్నట్టి డబ్బు, అంతకు ముందు కాలంలో ఏదో ఒక నిల్వ నిధిలో ఒక భాగంగా కూడబెట్టబడి ఉండొచ్చు; వేతనాల యొక్క డబ్బు రూపమై ఉండి ఉండొచ్చు; ఉత్పత్తి సాధనాలను కానీ లేక ఇతర సరుకులను కానీ డబ్బుగా మార్చి ఉండొచ్చు; లేక, ఏదో ఒక పెట్టుబడిదారుని స్థిర పెట్టుబడిలోని భాగాలను లేదా అతడి ఆదాయాన్ని చలామణిలో పెట్టి ఉండొచ్చు. సరుకుల సాధారణ చలామణి దృష్టి నుంచి చూస్తే, అది నూతన సంపద కానే కాదు; డబ్బు రోజుకు పదిసార్లు చేతులు మారినప్పటికీ, పది విభిన్న సరుకు విలువను చేతికందించినప్పటికీ, దానికి తన నిజమైన విలువే తప్ప పది రెట్ల విలువ లేనట్లుగానే, ఇది కూడా నూతన సంపద కాజాలదు. డబ్బు లేకపోయినప్పటికీ సరుకులు ఉంటాయి; ఒకసారి చేతులు మారినప్పటికీ లేక పదిసార్లు చేతులు మారినప్పటికీ డబ్బు కేవలం డబ్బుగానే మిగిలిపోతుంది. (తరుగుదల మూలంగా కొంత తగ్గిపోవచ్చు కూడా.) బంగారం

ఉత్పత్తిలో మాత్రమే – బంగారపు ఉత్పాదితంలో అదనపు ఉత్పాదితం ఉన్నందువల్ల, అంటే అదనపు విలువ నిక్షిప్తమై ఉన్నందువల్ల – నూతన సంపద (సంభావ్య డబ్బు) సృష్టించబడుతుంది; డబ్బు – ఉత్పాదితం యావత్తూ చలామణిలోకి ప్రవేశించిన మేరకు మాత్రమే అది నూతన సంభావ్య డబ్బు – పెట్టుబడుల యొక్క డబ్బు పదార్థాన్ని పెంచుతుంది.

డబ్బు రూపంలో కూడబెట్టబడిన ఈ అదనపు విలువ, అదనపు నూతన సామాజిక సంపద కాకపోయినప్పటికీ, అది ఎందుకోసం కూడబెట్టబడిందో ఆ క్రియ మూలంగా నూతన సంభావ్య డబ్బు – పెట్టుబడికి ప్రాతినిధ్యం వహిస్తుంది. (అదనపు విలువ క్రమేణా డబ్బుగా పరివర్తన చెందే క్రమంలోనే కాక, ఇతరత్రా కూడా నూతన డబ్బు పెట్టుబడి ఆవిర్భవించవచ్చునని మనం ఉత్తరోత్తరా తెలుసుకొంటాం.)

సరుకులను అమ్మి, తరువాత కొనుగోలు చేయకపోవడం ద్వారా, డబ్బును చలామణి నుంచి ఉపసంహరించుకొని, నిధిగా నిల్వ చేయడం జరుగుతుంది. అందుచేత ఈ కార్యకలాపాన్ని సార్వత్రిక క్రమంగా భావిస్తే ఇక కొనుగోలుదార్లు ఎక్కడ నుంచి వస్తారో చెప్పడం సాధ్యం కానట్లు కనిపిస్తుంది; ఎందుచేతనంటే ఆ క్రమంలో కూడబెట్టుకోడానికిగాను ప్రతి ఒక్కరూ అమ్మాలనుకుంటారు. కొనుగోలు చేయాలని ఎవ్వరూ అనుకోరు. ప్రతి వ్యష్టి పెట్టుబడీ సంచయన ప్రక్రియలో ఉంటుంది కనుక దానిని సార్వత్రికంగానే భావించాలి.

వార్షిక పునరుత్పత్తిలోని వివిధ భాగాల మధ్య చలామణి ప్రక్రియ సరళరేఖలో జరుగుతుందని మనం భావించినట్లయితే – అలా భావించడం తప్పు. ఎందుచేతనంటే అది కొన్ని ప్రత్యేక సందర్భాల్లో తప్ప, మొత్తానికి ఎల్లప్పుడూ పరస్పర వ్యతిరేక గమనాల్లోనే సాగుతుంది. అప్పుడు మనం, అమ్మకుండా కొనుగోలు చేసే బంగారం (లేదా వెండి) ఉత్పాదకుని నుంచి ప్రారంభించవలసి ఉంటుంది. ఇతరులంతా అతడికే అమ్ముతారని కూడా ఊహించవలసి ఉంటుంది. అలా జరిగితే, సమాజం యొక్క సమస్త వార్షిక అదనపు ఉత్పాదితము (సమస్త అదనపు విలువకు ప్రాతినిధ్యం వహించేది.) అతని చేతుల్లోకి వెళుతుంది. ఇతర పెట్టుబడిదారులందరూ సహజంగా డబ్బు రూపంలో ఉండే అతని అదనపు ఉత్పాదితాన్ని, అంటే అతని అదనపు విలువ మూర్తీభవించి ఉన్న బంగారాన్ని తమలో తాము తమ అమ్మకాలకు అనుగుణంగా పంపిణీ చేసుకుంటారు. ఎందువల్లనంటే, బంగారం ఉత్పాదకుని క్రియాశీల పెట్టుబడిని భర్తీ చేయవలసిన అతని ఉత్పాదిత భాగం, అప్పటికే చిక్కడిపోయి, వినియోగమయింది. అప్పుడు బంగారం ఉత్పాదకుని అదనపు విలువ, బంగారం రూపంలో ఉత్పత్తి అయిన ఈ అదనపు విలువ ఇతర పెట్టుబడిదారులందరూ తమ వార్షిక ఉత్పాదితాన్ని డబ్బుగా మార్చడానికి ఉపకరించే ఏకైక నిధిగా ఉంటుంది; ఇతర పెట్టుబడిదారులందరూ తమ వార్షిక అదనపు ఉత్పాదితాన్ని డబ్బుగా మార్చే పదార్థాన్ని ఈ నిధినుంచే తీసుకుంటారు. కాబట్టి దీని విలువ పరిమాణం, సమాజం యొక్క సమస్త వార్షిక అదనపు విలువకూ సమంగా ఉండాలి. ఈ సమస్త వార్షిక అదనపు విలువా మొదట నిల్వ నిధి రూపం ధరించవలసి ఉంది. ఈ ఊహలు ఎంత అసంబద్ధంగా ఉన్నప్పటికీ, సర్వత్రా ఏకకాలంలో నిల్వ నిధి ఏర్పడే అవకాశముందని వివరించడానికి మించి ఏమీ చేయవు; బంగారం ఉత్పాదకుని విషయంలో తప్ప అసలు పునరుత్పత్తిని ఒక్క అడుగు కూడా ముందుకు తీసుకెళ్ళవు.

పైకి చిక్కుగా కనిపించే ఈ సమస్యను పరిష్కరించడానికి, ముందు మనం I వ శాఖలో

ఉత్పత్తి సాధనాలు ఉత్పత్తి సంచయనానికీ, II వ శాఖలో (వినియోగ వస్తువుల ఉత్పత్తి) సంచయనానికీ మధ్య గల వ్యత్యాసాన్ని గమనించాలి. ముందు I వ శాఖతో ప్రారంభిద్దాం.

## I. I వ శాఖలో సంచయనం

### 1. నిల్వ నిధి ఏర్పడే క్రమం

I వ శాఖలోని వివిధ పరిశ్రమల్లోని పెట్టుబడి మదుపులూ, ఒకే పరిశ్రమలోని వివిధ వ్యష్టి పెట్టుబడి మదుపులూ, ఈ రెండూ కూడా వయసును బట్టి అంటే, ఆదినుండి అప్పటివరకు పనిచేస్తున్న కాల పరిమాణాన్ని బట్టి (వాటి పరిమాణం, సాంకేతిక పరిస్థితులు, మార్కెట్ పరిస్థితులు వగైరాల సంగతి అటుంచి), అదనపు విలువ సంభావ్య డబ్బు పెట్టుబడిగా వరుసగా పరివర్తన చెందుతున్న క్రమంలోని విభిన్న దశలో ఉంటాయనేది స్పష్టమే; ఈ డబ్బు పెట్టుబడి, క్రియాశీల పెట్టుబడి విస్తరణకు ఉపకరించేది కావచ్చు, లేదా నూతన పరిశ్రమల స్థాపనకు ఉపకరించేది కావచ్చు – ఉత్పత్తి విస్తరణకు సంబంధించిన రెండు రూపాలివి. మొత్తం పెట్టుబడిదార్లలో కొంతమంది, తగినంత పరిమాణానికి పెరిగిన తమ సంభావ్య డబ్బు పెట్టుబడిని నిరంతరం ఉత్పాదక పెట్టుబడిగా మార్పు చెందిస్తూ ఉంటారు; అంటే, అదనపు విలువను డబ్బుగా మార్చడం ద్వారా నిల్వ చేసిన నిధితో వారు ఉత్పత్తి సాధనాలను – స్థిర పెట్టుబడి భాగాలను మరిన్ని కొనుగోలు చేస్తారు. పెట్టుబడిదార్లలో మరికొంత మంది ఈలోగా తమ సంభావ్య డబ్బు పెట్టుబడిని నిల్వ చేసే క్రమంలోనే నిమగ్నమై ఉంటారు. ఈ రెండు రకాల పెట్టుబడిదారులు పరస్పరం తారసపడతారు – కొంతమంది కొనుగోలుదార్లుగా, మిగతావారు అమ్మకందార్లుగా, ప్రతి ఒకరూ ఏదో ఒక పాత్ర మాత్రమే నిర్వహిస్తారు.

ఉదాహరణకు 'క' 600లను (400 స్థి.పె + 100 అ.పె + 100 అ.విలకు సమానం) 'చ'కు అమ్ముతాడనుకుందాం. (ఈయన ఒకరికంటే ఎక్కువమంది కొనుగోలుదార్లకు ప్రాతినిధ్యం వహించవచ్చు.) "క" 600లు విలువచేసే సరుకులను 600 డబ్బుకు అమ్ముతాడు; కాగా ఇందులో 100 అదనపు విలువ; దీనిని అతడు చలామణి నుంచి ఉపసంహరించుకుని డబ్బు రూపంలో నిల్వ ఉంచుకుంటాడు. అయితే డబ్బు రూపంలోని ఈ 100, నిజానికి 100 విలువకు వాహిక అయిన అదనపు ఉత్పాదితం యొక్క డబ్బు రూపం. నిల్వ నిధిని ఏర్పరచడం ఉత్పత్తి కానే కాదు. కాబట్టి ఉత్పత్తి యొక్క వడ్డీ కూడా కాదు. పెట్టుబడిదారు తన అదనపు ఉత్పాదితాన్ని అమ్మడం ద్వారా డబ్బు రూపంలోని 100ను చలామణి నుంచి కేవలం ఉపసంహరించుకుని, అలాగే దాన్ని తనవద్దే స్తంభింపజేస్తాడు. ఈ కార్యకలాపం కొనసాగించేది 'క' పెట్టుబడిదారుడొకడే కాదు, క, క', క'' .... అనే ఇతర పెట్టుబడిదారులు కూడా చలామణి పరిధిలోని వివిధ స్థానాల్లో ఇదే చేస్తారు; అందరూ కూడా నిల్వ నిధుల ఏర్పాటుకు సమానమైన ఉత్సాహంతో పూనుకొంటారు. చలామణిలో ఏ స్థానాల్లో డబ్బు ఉపసంహరించుకోబడి, వివిధ వ్యష్టి నిల్వలుగా లేక సంభావ్య డబ్బు పెట్టుబడులుగా పోగవుతాయో ఆ స్థానాలు చలామణికి ప్రతిబంధకాలుగా కనిపిస్తాయి; ఎందుచేతనంటే అవి డబ్బును ఒకచోట కట్టి పడేసి, నిర్దిష్ట కాలంపాటు చలామణి కాగల దాని శక్తిని హరించివేస్తాయి. అయితే సామాన్య సరుకుల చలామణికి పెట్టుబడిదారీ సరుకు ఉత్పత్తి ప్రాతిపదిక కావడానికి చాలాముందే సరుకుల సాధారణ చలామణిలో డబ్బు నిల్వ చేయడం జరుగుతుందని గమనించాం. సమాజంలో ఉన్న డబ్బు పరిమాణం,

నిజంగా చలామణిలో ఉన్న భాగంకంటే ఎల్లప్పుడూ ఎక్కువే. అయితే పరిస్థితులను బట్టి ఆ భాగం పెరగవచ్చు లేదా తరగవచ్చు. మనకు ఇక్కడ మళ్ళీ అవే నిల్వ నిధులు, నిల్వ నిధులుగా ఏర్పడే అదే క్రమం కనిపిస్తాయి. అయితే ఇప్పుడివి పెట్టుబడిదారీ ఉత్పత్తి ప్రక్రియలో అంతర్భాగంగా కనిపిస్తాయి.

పరపతి వ్యవస్థలోని ఈ సంభావ్య పెట్టుబడులన్నీ కూడా బ్యాంకులు, వగైరా సంస్థల చేతుల్లో కేంద్రీకరింపబడడం ద్వారా అవి వినియోగింప వీలున్న "అప్పుగా ఇవ్వ వీలున్న పెట్టుబడి"గా, డబ్బు పెట్టుబడిగా తయారైనప్పుడు, అవి ఎంతమాత్రం క్రియాశూన్యంగా, కలలో దొరికిన నిధిలాగా ఉండ కుండా క్రియాశీలంగానూ, పెరుగుతున్న పెట్టుబడిగానూ తయారైనప్పుడు కలిగిన ఆనందానుభూతిని అర్థం చేసుకోవచ్చు.

ఏది ఏమైనా, తన అదనపు ఉత్పాదితానికి సంబంధించినంతవరకూ క అమ్మకందారుగా వ్యవహరించిన మేరకే క నిల్వ నిధిని ఏర్పాటు చేస్తాడు. అంతే తప్ప ఆ తర్వాత కొనుగోలుదారుగా వ్యవహరించినప్పుడు కాదు. కాబట్టి అతడి నిల్వ నిధి నిర్మాణానికి మూలాధారం అతడి అదనపు ఉత్పాదితాల క్రమానుగత ఉత్పత్తే. డబ్బుగా మార్చవలసిన అతని అదనపు విలువ యొక్క ఆ వాహికలవే. Iవ శాఖలోని చలామణిని మాత్రమే మనం పరిశీలిస్తున్న ప్రస్తుత సందర్భంలో, మొత్తం ఉత్పాదితంలో ఒక భాగం అయిన అదనపు ఉత్పాదితం యొక్క పాదార్థిక రూపం, అది అంతర్భాగంగా ఉన్న మొత్తం ఉత్పాదితం యొక్క పాదార్థిక రూపంలాగానే, స్థిర పెట్టుబడి I యొక్క పాదార్థిక రూపమే; అంటే, ఉత్పత్తి సాధనాలను సృష్టించే ఉత్పత్తి సాధనాల అభివర్గానికి చెందుతుంది. చ, చ', చ" వగైరా కొనుగోలుదార్ల చేతుల్లో అది ఏమవుతుంది, అది నిర్వర్తించే విధులేమిటి అన్న విషయాన్ని మనం త్వరలో పరిశీలిద్దాం.

ఇక్కడ అన్నిటికన్నా ముందు ఒక విషయాన్ని పేర్కొనాలి. 'క' తన అదనపు విలువ మొత్తం మేరకు చలామణి నుంచి డబ్బును ఉపసంహరించుకుని నిల్వ చేసుకున్నప్పటికీ, అతడు కొన్ని సరుకులను చలామణిలోకి తోస్తూనే, దానికి ప్రతిగా ఇతర సరుకులను ఉపసంహరించాడు. అందువల్ల చ, చ', చ" వగైరా పెట్టుబడిదార్లు చలామణిలోకి డబ్బును తీసి చలామణి నుంచి సరుకులను మాత్రమే ఉపసంహ రించుకోగలుగుతున్నారు. ప్రస్తుత ఉదాహరణలోని, ఈ సరుకులు తమ పాదార్థిక రూపం, తమ గమ్యస్థానం కారణంగా చ, చ' ప్రభృతుల స్థిర పెట్టుబడిలోకి నిశ్చల భాగంగా కానీ, లేక చలామణి భాగంగా కానీ ప్రవేశిస్తాయి. అదనపు ఉత్పాదితం యొక్క కొనుగోలుదార్లయిన 'చ, చ'ల గురించి చర్చించేటప్పుడు ఈ అంశానికి సంబంధించి మరింత తెలుసుకుందాం.

★ ★ ★

ఇక్కడొక విషయం గమనించాలి; సామాన్య పునరుత్పత్తి విషయంలో కనిపించిందే ఇక్కడ కూడా మనకొకసారి కనిపిస్తుంది; వార్షిక ఉత్పాదితంలోని వివిధ అంతర్భాగాల మార్పిడి, అనగా వాటి చలామణి (అదే సమయంలో, పెట్టుబడి పునరుత్పత్తి, నిజానికి స్థిర, అస్థిర, నిశ్చల పెట్టుబడీ, చలామణి పెట్టుబడీ, డబ్బు పెట్టుబడీ, సరుకు – పెట్టుబడీ వంటి తన వివిధ రూపాల్లో పెట్టుబడి పునరుద్ధరణగా ఉన్న ఆ చలామణి) జరగాలంటే అంతకు ముందు, కేవలం సరుకుల కొనుగోలు ఆ తర్వాత అమ్మకమూ, లేక అమ్మకమూ ఆ తర్వాత కొనుగోలు జరిగి ఉండాలనేమీ లేదు. తత్ఫలితంగా

కేవలం చలామణిలో జరిగేదల్లా సరుకుల పరస్పర మార్పిడి మాత్రమే అని అనుకోరాదు. అర్థశాస్త్రజ్ఞులు, ముఖ్యంగా స్వేచ్ఛా వాణిజ్యవాదులు ఫిజియోక్రాట్ల ఆడమ్ స్మిత్‌ల కాలం నుంచి అనుకొంటున్నదిదే. ఒకసారి నిశ్చల పెట్టుబడి కోసం ఖర్చు జరిగాక, ఆ నిశ్చల పెట్టుబడి పని చేసినన్నాళ్ళూ అది భర్తీ కాదు; అది తన పాత రూపంలోనే కొనసాగుతుంది. కాగా దాని విలువ క్రమేణా డబ్బు రూపంలో చేతికందుతూంటుంది. కాగా, మనం కింది విషయం గమనించాం : నియమిత కాలాల్లో జరిగే నిశ్చల పెట్టుబడి II స్థి.పె పునరుద్ధరణకు (సమస్త పెట్టుబడి II స్థి.పె విలువా I (అ.పె+అ.వి)కి సమానమైన అంశాలుగా మార్పు) ఒకవైపున, II స్థి.పె తాలూకు నిశ్చల భాగం ఏకపక్షంగా కొనుగోలై ఉండాలి; డబ్బు రూపం నుంచి తన పాదార్థిక రూపంలోకి తిరిగి మారినదిది. ఇది I అ.వి అమ్మకానికి అనుగుణంగా ఉంటుంది; కాగా మరోవైపున II స్థి.పె ఏకపక్షంగా అమ్మకమై ఉండాలి. అంటే డబ్బుగా రూపొందిన దాని విలువలోని నిశ్చల భాగం (తరుగుదల) అమ్మకమై ఉండాలి; ఇది I అ.వి ఏకపక్షపు కొనుగోలుకు అనుగుణంగా ఉంటుంది. ఈ విషయంలో మార్పిడి మామూలుగా జరగాలంటే, II స్థి.పె విలువలో ఏకపక్షపు కొనుగోలు II స్థి.పె ఏకపక్షపు అమ్మకానికి సమంగా ఉంటుందని ఊహించవలసి ఉంటుంది; అదే విధంగా ఒకటవ విభాగంలోని II స్థి.పెకి జరిగే I అ.వి ఏకపక్షపు అమ్మకం రెండవ విభాగంలోని II స్థి.పె నుంచి చేసే దాని కొనుగోలుకు సమంగా ఉంటుందని ఊహించవలసి ఉంటుంది. ఇలా కాకపోతే సామాన్య పునరుత్పత్తి విచ్ఛిన్నమైపోతుంది. ఇక్కడ జరిగే ఏకపక్షపు కొనుగోలు అక్కడ జరిగే ఏకపక్షపు అమ్మకానికి చెల్లు. ఈ విషయంలో క, క', క'', ల నిల్వ నిధులుగా ఉండే + అ.వి భాగం యొక్క ఏకపక్షపు అమ్మకం, చ, చ', చ''ల నిల్వ నిధులను అదనపు ఉత్పాదక పెట్టుబడుల అంశాలుగా మార్చే I అ.వి భాగం యొక్క ఏకపక్షపు కొనుగోలుకు సమతుల్యంగా ఉంటుందని కూడా ఊహించుకోవాలి.

కొనుగోలుదార్లు ఆ తర్వాత అంతే విలువను అమ్మేవారుగా వ్యవహరిస్తారు. అలాగే అమ్మకందార్లు ఆ తర్వాత అంతే విలువను కొనుగోలు చేసేవారుగా వ్యవహరిస్తారు; కాబట్టి, సమతుల్యం తిరిగి ఏర్పడి, కొనుగోలు కోసం డబ్బు అడ్వాన్సు చేసిన వారికి, దాని అమ్మకం ద్వారా ఆ డబ్బు వాపస్ వస్తుంది. అయితే సరుకుల మార్పిడి విషయంలో, అంటే వార్షిక ఉత్పాదితంలోని వివిధ భాగాల మార్పిడికి సంబంధించినంత వరకు, నిజమైన సమతులనం ఉండాలంటే, పరస్పరం మార్పిడి అయ్యే సరుకుల విలువలు ఒకదానికొకటి సమానంగా ఉండి తీరాలి.

కాని, ఏకపక్ష మార్పిడులు జరుగుతాయి కనుక, అంటే ఒకవైపేమో ఏకపక్షంగా కొనుగోళ్ళు, మరోవైపేమో ఏకపక్షంగా అమ్మకాలు జరుగుతాయి కనుక – పెట్టుబడిదారీ విధానం ప్రాతిపదికపై సాగే వార్షిక ఉత్పాదితపు సాధారణ మార్పిడి వల్ల ఇలాంటి ఏకపక్ష రూపాంతరీకరణలు తప్పవు. ఏకపక్షపు అమ్మకాల విలువ ఏకపక్షపు కొనుగోళ్ళ విలువకు సమానంగా ఉంటుందని ఊహించుకొంటేనే సమతులనం నెలకొనగలదు. పెట్టుబడిదారీ ఉత్పత్తి సార్వత్రిక రూపం సరుకుల ఉత్పత్తిలో డబ్బు కేవలం చలామణి సాధనంగానే కాక, డబ్బు పెట్టుబడిగా కూడా పని చేస్తుంది; అంతేకాక అందులో మామూలు మార్పిడికి సంబంధించి, ఆ ఉత్పత్తి పద్ధతికి విలక్షణమైన కొన్ని పరిస్థితులను సృష్టిస్తుంది. కాబట్టి, మామూలు పునరుత్పత్తి గతిక్రమానికి సంబంధించి అది సామాన్య స్థాయిలోదైనా, విస్తృత స్థాయిలోదైనా కొన్ని ప్రత్యేక పరిస్థితులను సృష్టిస్తుంది. ఈ పరిస్థితులన్నీ అసాధారణ గమన

పరిస్థితులుగా, సంక్షోభాలు సంభవించేందుకు అవకాశాలుగా మారతాయి. ఎందువల్లనంటే, ఈ ఉత్పత్తి యొక్క అసంకల్పిత స్వభావం వల్ల ఇందులో సమతూకమే యాదృచ్ఛికమైనది.

మనం ఈ క్రింది విషయం కూడా గమనించాం : II స్థి.పె తాలూకు విలువకు సమానమైన I అ.పె మార్పిడి కావడంలో, II వ శాఖ మొత్తం పెట్టుబడిదారులకు సంబంధించి, వారి సొంత సరుకుల అమ్మకాన్ని ఆ తరువాత అంతే విలువగల I వ శాఖ సరుకుల కొనుగోలును పూర్తి చేస్తుంది. ఈ సరుకుల స్థానం భర్తీ కావడం జరుగుతుంది. అయితే జరగనిది ఏమిటంటే, I వ, II వ శాఖల పెట్టుబడిదార్ల మధ్య వారి వారి సరుకుల ప్రత్యక్ష మార్పిడి. II వ శాఖ పెట్టుబడిదార్లు తమ II స్థి.పె సరుకులను I వ శాఖ కార్మికవర్గానికి అమ్ముతారు. కార్మికవర్గం ఏకపక్షంగానే, అంటే సరుకులను I వ శాఖ కార్మికవర్గానికి అమ్ముతారు. కార్మికవర్గం ఏకపక్షంగానే, అంటే సరుకుల కొనుగోలు దారుగానే వారికి ఎదురవుతుంది. పెట్టుబడిదారులేమో సరుకుల ఏకపక్షపు అమ్మకందార్లుగా మాత్రమే కార్మికవర్గానికి ఎదురవుతారు. ఈ విధంగా లభించిన డబ్బుతో II స్థి.పె ఏకపక్షపు సరుకుల కొనుగోలుదారుగా I వ శాఖ డబ్బు రూపంలో తన అస్థిర పెట్టుబడిని తుదకు పునరుత్పత్తి చేసేది, ఈ సరుకుల అమ్మకం ద్వారానే. I వ శాఖ పెట్టుబడి II వ శాఖ పెట్టుబడిని ఏకపక్షంగా, I అ.పె మొత్తం మేరకు సరుకుల కొనుగోలుదారుగా, వారి శ్రమశక్తి యొక్క కొనుగోలుదారుగా ఎదుర్కొంటుంది. కాగా I వ శాఖ కార్మిక వర్గం II వ శాఖ పెట్టుబడిదార్లకు ఏకపక్షంగా, సరుకుల కొనుగోలుదారుగా (అంటే జీవనాధారాల కొనుగోలుదారుగా) ఎదురైతే, అదే కార్మికవర్గం I వ శాఖ పెట్టుబడిదార్లకు ఏకపక్షంగా సరుకుల అమ్మకందారుగా అంటే తన శ్రమశక్తి అమ్మకందారుగా ఎదురవుతుంది.

I వ శాఖ కార్మిక వర్గం యొక్క శ్రమశక్తి నిరంతరం సరఫరా కావటం, I వ శాఖ సరుకు పెట్టుబడిలోని కొంత భాగం అస్థిర పెట్టుబడి యొక్క డబ్బు రూపంగా తిరిగి పరివర్తన చెందడం, I వ శాఖ సరుకు పెట్టుబడిని II స్థి.పె తాలూకు స్థిర పెట్టుబడి యొక్క సహజ అంశాలు భర్తీ చేయడం – ఈ పూర్వావసరాలన్నీ పరస్పరావసరాలు. అయితే మూడు చలామణి క్రియలు గల చాలా సంక్లిష్టమైన ప్రక్రియ సహాయంతోనే ఇవి నిర్వహింపబడతాయి; ఈ చలామణి క్రియలు స్వతంత్రంగానే సాగుతున్నప్పటికీ, పరస్పరం సమ్మేళనం చెందుతాయి. ఈ ప్రక్రియ ఎంత సంక్లిష్టమైన దంటే, అది అసాధారణ మార్గం తొక్కే సందర్భాలను సృష్టిస్తుంది.

## 2. అదనంగా చేరే స్థిర పెట్టుబడి

అదనపు విలువకు వాహిక అయిన అదనపు ఉత్పాదితాన్ని స్వాయత్తం చేసుకొనే వారికి, అంటే I వ శాఖ పెట్టుబడిదార్లకు, దానివల్ల ఎలాంటి ఖర్చూ కాదు. దాన్ని పొందడానికి ఎలాంటి డబ్బును కానీ, సరుకులను కానీ అడ్వాన్సు చేయాల్సిన బాధ్యత వారిపై లేదు. ఫిజియోక్రాట్ల దృష్టిలో సైతం అడ్వాన్సు అనేది ఉత్పాదక పెట్టుబడి అంశాల్లో మూర్తీభవించి ఉన్న విలువ యొక్క సాధారణ రూపమే. అందుచేత I వ శాఖ పెట్టుబడిదార్లు తమ స్థిర, అస్థిర పెట్టుబడులను మినహా మరి దేన్నీ అడ్వాన్సు చేయరు. కార్మికుడు, వారి స్థిర పెట్టుబడిని తన శ్రమద్వారా అట్టిపెట్టడమే కాక, సరుకుల రూపంలో తాము కొత్తగా సృష్టించిన విలువలోని తదనుగుణ భాగంచేత పెట్టుబడిదార్ల అస్థిర పెట్టుబడిని భర్తీ చేయడమే కాక, తన అదనపు శ్రమచేత పెట్టుబడిదార్లకు అదనపు ఉత్పాదిత రూపంలో అదనపు

విలువను కూడా అందజేస్తాడు. పెట్టుబడిదార్లు ఈ అదనపు ఉత్పాదితాన్ని వరుసగా అమ్మడం ద్వారా నిల్వ నిధిని ఏర్పరచుకుంటారు. ఇది అదనపు డబ్బు – పెట్టుబడి కాగలిగినది. మనం పరిశీలిస్తున్న ఉదాహరణలో, ఈ అదనపు ఉత్పాదితం ప్రారంభం నుంచే, ఉత్పత్తి సాధనాలను ఉత్పత్తి చేసే సాధనాలుగా ఉండింది. I వ శాఖ చ, చ', చ" ప్రభృతుల చేతుల్లోకి వెళ్ళినప్పుడు మాత్రమే ఈ అదనపు ఉత్పాదితం అదనంగా చేరిన స్థిర పెట్టుబడిగా తన విధిని నిర్వహిస్తుంది. అయితే అది అమ్మబడడానికి ముందే కూడా, నిల్వ నిధిని పోగుచేసిన వారి చేతుల్లో, అంటే I వ శాఖ క, క', క" చేతుల్లో కూడా ఆచరణ రీత్యా అటువంటిదే. మనం కనుక I వ శాఖలో కేవలం పునరుత్పత్తి విలువ పరిమాణాన్నే పరిశీలించినట్లయితే, సామాన్య పునరుత్పత్తి పరిమితుల్లోనే ఉంటాయి. ఎందుచేతనంటే, ఆచరణ రీత్యా అదనపు స్థిర పెట్టుబడి (అదనపు ఉత్పాదితం) అయిన దీన్ని సృష్టించడానికి అదనపు పెట్టుబడి ఏదీ చలనంలో పెట్టబడలేదు. సామాన్య పునరుత్పత్తి ప్రాతిపదికగా జరిగే దానికంటే ఎక్కువ అదనపు శ్రమ ఏదీ వ్యయం కాలేదు. ఇక్కడ వ్యత్యాసమల్లా, చేసిన అదనపు శ్రమ రూపంలోనే, దాని ప్రత్యేకమైన ఉపయోగకర పాత్ర యొక్క నిర్దిష్ట స్వభావంలోనే ఉంది. ఆ శ్రమ II స్థి.పె కోసం కాక I స్థి.పె కోసం వ్యయమైంది. అంటే, వినియోగ వస్తువుల ఉత్పత్తి సాధనాల కోసం కాక, ఉత్పత్తి సాధనాలను ఉత్పత్తి చేసే సాధనాల కోసం వ్యయయింది. సామాన్య పునరుత్పత్తి విషయంలో, I వ శాఖ యొక్క సమస్త అదనపు విలువా ఆదాయంగా వ్యయం అయిందని ఊహించాము. అంటే II వ శాఖ సరుకుల కోసం వ్యయమయిందని ఊహించాము. అందుచేత, అదనపు విలువ, II స్థి.పె శాఖ స్థిర పెట్టుబడిని దాని పదార్థాల రూపంలో భర్తీ చేసే ఉత్పత్తి సాధనాలుగా మాత్రమే ఉండింది. కనుక, సామాన్య పునరుత్పత్తి నుంచి విస్తృత పునరుత్పత్తికి పరివర్తన జరగడానికి, I వ శాఖలో ఉత్పత్తి అన్నది II వ శాఖకు స్థిర పెట్టుబడి అంశాలను తక్కువ సంఖ్యలో, I వ శాఖకు స్థిర పెట్టుబడి అంశాలను ఎక్కువ సంఖ్యలోనూ సృష్టించగలిగే స్థితిలో ఉండాలి. ఎప్పుడూ ఏ చిక్కులు లేకుండా జరగనట్టి ఈ పరివర్తనకు, I వ శాఖ ఉత్పాదితాల్లో కొన్ని, రెండు శాఖల్లోనూ ఉత్పత్తి సాధనాలుగా ఉపకరించగలవన్న వాస్తవం సహాయపడుతుంది.

దీన్నిబట్టి, కేవలం విలువల పరిమాణం దృష్ట్యా విషయాన్ని పరిశీలిస్తే, విస్తృత పునరుత్పత్తికి పాదార్థిక పునాది సాధారణ పునరుత్పత్తి పరిధిలోనే సృష్టి అవుతుందని తేలుతూంది. ఉత్పత్తి సాధనాల ఉత్పత్తి కోసం, అంటే, I వ శాఖ యొక్క ఆచరణాత్మకమైన అదనపు పెట్టుబడి సృష్టిలో ప్రత్యక్షంగా వ్యయమైన I వ శాఖ కార్మికవర్గ అదనపు శ్రమశక్తి మాత్రమే అది. కాబట్టి I వ శాఖ క, క', క" పెట్టుబడిదార్లు ఎలాంటి డబ్బూ ఖర్చు చేయకుండా, అదనపు ఉత్పాదితాన్ని వరుసగా అమ్మడం ద్వారా ఏర్పరచుకొన్న ఆచరణాత్మకమైన అదనపు డబ్బు – పెట్టుబడి అన్నది, కేవలం, I వ శాఖలో అదనంగా ఉత్పత్తి అయిన ఉత్పత్తి సాధనాల డబ్బు రూపం తప్ప మరొకటి కాదు.

అందువల్ల ఆచరణాత్మకమైన అదనపు పెట్టుబడి ఉత్పత్తి మన ఉదాహరణలో (అది వేరే పద్ధతిలో ఏర్పడవచ్చునని మనకు ముమ్ముందు తెలుస్తుంది.) వ్యక్తం చేస్తున్నది, ఉత్పత్తి ప్రక్రియలోని ఒక పరిణామం తప్ప మరొకటి కాదు. ఒక ప్రత్యేక రూపంలో ఉత్పాదక పెట్టుబడి అంశాల ఉత్పత్తి అది.

కాబట్టి, భారీ స్థాయిలో ఆచరణాత్మకమైన డబ్బు – పెట్టుబడి ఉత్పత్తి అన్నది, ఆచరణాత్మకమైన అదనపు ఉత్పాదక పెట్టుబడి యొక్క బహుముఖ ఉత్పత్తి యొక్క ఫలితమూ, దాని వ్యక్తీకరణానూ. ఇది ఆవిర్భవించడానికి పారిశ్రామిక పెట్టుబడిదారు అధికంగా డబ్బును ఖర్చు పెట్టాల్సిన అవసరమేమీ ఉండదు.

I వ శాఖకు చెందిన క, క', క" పెట్టుబడిదార్ల ఈ ఆచరణాత్మకమైన అదనపు ఉత్పాదక పెట్టుబడి ఇలా ఆచరణాత్మకమైన డబ్బు పెట్టుబడిగా (నిల్వ నిధి) వరుసగా పరివర్తన చెందడానికి, వారు వరుసగా తమ అదనపు ఉత్పాదితాన్ని అమ్మడమే కారణం. అంటే తిరిగి ఎలాంటి కొనుగోళ్ళు జరపకుండా సరుకులను ఏకపక్షంగా పదే పదే అమ్మడమే కారణం. అంటే, చలామణి నుంచి పదే పదే డబ్బును ఉపసంహరించుకుని, తదనుగుణమైన నిల్వ నిధి ఏర్పరచుకోవడం వల్ల ఈ పరివర్తన జరుగుతుందన్న మాట. కొనుగోలుదారుడు బంగారం ఉత్పాదకుడుగా ఉన్న సందర్భంలో తప్ప ఈ నిల్వ నిధి నిర్మాణం, విలువైన లోహాల రూపంలో అదనపు సంపద కిందికి రాదు. అంతకు ముందు చలామణిలో ఉన్న డబ్బు చేసే పనిలో మార్పు వచ్చిందంతే. అంతకు ముందు ఈ డబ్బు చలామణి సాధనంగా పని చేసింది. ఇప్పుడది నిల్వ నిధిగా పని చేస్తూంది; ఇంకా రూపుగొంటున్న ఆచరణాత్మకమైన కొత్త డబ్బు పెట్టుబడిగా ఉంది. ఈ విధంగా అదనపు డబ్బు – పెట్టుబడి నిర్మాణానికీ, ఒక దేశంలో ఉన్న విలువైన లోహాల పరిమాణానికీ మధ్య కార్యకారణ సంబంధమేదీ ఉండదు.

కనుక నిర్ధారణ అవుతున్న మరో విషయమేమంటే : అదివరకే క్రియాశీలంగా ఉన్న ఉత్పాదక పెట్టుబడి (అదనపు ఉత్పాదితాన్ని ఉత్పత్తి చేసే శ్రమ శక్తి కూడా అందులోనిదే.) ఎంత ఎక్కువగా ఉంటే, శ్రమ యొక్క ఉత్పాదక శక్తి ఎంతగా అభివృద్ధిచెంది ఉంటే, పర్యవసానంగా ఉత్పత్తి సాధనాల సత్వర ఉత్పత్తి కోసం సాంకేతిక పద్ధతులు ఎంత ఎక్కువగా అభివృద్ధిచెంది ఉంటే – ఆ మేరకు విలువ రీత్యానూ, ఆ విలువకు ప్రాతినిధ్యం వహించే ఉపయోగపు విలువల పరిమాణం రీత్యానూ, అదనపు ఉత్పాదితపు రాశి ఎంత ఎక్కువగా ఉంటే ఈ క్రిందివి కూడా అంత ఎక్కువగా ఉంటాయి.

1) క, క', క" వగైరా చేతుల్లో గల ఆచరణాత్మకమైన అదనపు ఉత్పాదక పెట్టుబడి.

2) డబ్బుగా మారిన ఈ అదనపు ఉత్పాదితం యొక్క పరిమాణమూ, తత్ఫలితంగా క, క' క" చేతుల్లో గల ఆచరణాత్మకమైన అదనపు డబ్బు – పెట్టుబడి పరిమాణమూ. ఉదాహరణకు పులర్టన్ అమితోత్పత్తిని మామూలు అర్థంలో గుర్తించడానికి ఇష్టపడకుండా, పెట్టుబడి యొక్క అమితోత్పత్తినే, అంటే డబ్బు పెట్టుబడి యొక్క అమితోత్పత్తినే గుర్తిస్తున్నాడంటే, తమ సొంత వ్యవస్థ తాలూకు యంత్రాంగాన్ని బూర్జువా అర్థశాస్త్రవేత్తల్లోని అగ్రగణ్యులు సైతం ఎంత తక్కువగా అవగాహన చేసుకున్నారో మరోసారి రుజువవుతూంది.

I వ శాఖకు చెందిన క, క', క" పెట్టుబడిదార్లు నేరుగా ఉత్పత్తి చేసి, స్వాయత్తం చేసుకునే అదనపు ఉత్పాదితమే పెట్టుబడి సంచయనానికి నిజమైన ఆధారం అయినప్పటికీ, అంటే, విస్తృత పునరుత్పత్తికి అదే నిజమైన ఆధారం అయినప్పటికీ, అది I వ శాఖ చ, చ', చ" చేతుల్లోకి వచ్చేదాక ఆ హోదాలో నిజంగా ఆ విధిని నిర్వహించలేదు; పైపెచ్చు, డబ్బు పచ్చని బంగారంగా, అంటే క్రమేణా నిర్మాణమవుతున్న నిల్వ నిధిగా, ఆచరణాత్మకమైన డబ్బు పెట్టుబడిగా పూర్తిగా అనుత్పాదక

మైనది; ఈ నిల్వ నిధి రూపుగొనడం ఉత్పత్తి ప్రక్రియకు సమాంతరంగా జరిగినా, దానికి బాహ్యంగానే ఉంటుంది. అది పెట్టుబడిదారీ ఉత్పత్తికి గుదిబండ. ఆచరణాత్మకమైన డబ్బు పెట్టుబడిగా సంచయనం అయ్యే ఈ అదనపు విలువను లాభాలు లేదా ఆదాయం పొందడానికి ఉపయోగించుకోవాలన్న ఆతురత తుదకు పరపతి వ్యవస్థలో "కాగితాల్లో" లక్ష్యసిద్ధి పొందుతుంది. ఆ విధంగా పెట్టుబడిదారీ ఉత్పత్తి వ్యవస్థ గతిక్రమంపైనా, దాని బ్రహ్మాండమైన అభివృద్ధిపైనా డబ్బు పెట్టుబడి మరో రూపంలో గొప్ప పట్టు సంపాదిస్తుంది.

అదివరకే పని చేస్తున్న మొత్తం పెట్టుబడి ఎక్కువగా ఉన్నకొద్దీ, ఆ పెట్టుబడి విధి నిర్వహణలో ఉత్పన్నమైన అదనపు ఉత్పాదితం ఆచరణాత్మకమైన డబ్బు పెట్టుబడిగా రూపాంతరం చెందిన ఈ అదనపు ఉత్పాదితం పరిమాణంలో పెరుగుతూ పోతూంది. ఏటా పునరుత్పత్తి అయ్యే ఆచరణాత్మకమైన పెట్టుబడి నిరపేక్ష పరిమాణం పెరిగేకొద్దీ, దాన్ని విడి విడి భాగాలుగా విడగొట్టడం కూడా మరింత తేలికవుతుంది; ఫలితంగా అదే పెట్టుబడిదారు చేతుల్లో కానీ, లేక ఇతర పెట్టుబడిదార్ల (ఉదాహరణకు, వారసత్వంగా సంక్రమించిన ఆస్తి విభజన వగైరా సందర్భాల్లో ఆ కుటుంబ సభ్యుల) చేతుల్లో కానీ, ఏదైనా నిర్దిష్ట వ్యాపారంలో అది మరింత త్వరగా మదుపు పెట్టబడుతుంది. ఇక్కడ డబ్బు పెట్టుబడి ఖండాలుగా మదుపు పెట్టేందుకు కొంత భాగాన్ని మాతృక పెట్టుబడి నుంచి విడగొట్టడం అన్నమాట.

అదనపు ఉత్పాదితం అమ్మకందార్లు, అంటే I వ శాఖకు చెందిన క, క', క''లు దాన్ని ఉత్పత్తి ప్రక్రియ యొక్క ప్రత్యక్ష ఫలితంగా పొందారు; సామాన్య పునరుత్పత్తికి సైతం అవసరమైన స్థిర పెట్టుబడిని, అస్థిర పెట్టుబడిని అడ్వాన్స్ చేయడం మినహా అందుకోసం ఎలాంటి అదనపు చలామణి చర్యలూ అవసరం లేదు. అదనపు ఉత్పాదితం అమ్మకందార్లు ఆ విధంగా విస్తృత స్థాయిలో పునరుత్పత్తికి నిజమైన ఆధారాన్ని నిర్మిస్తారు. వాస్తవంలో, ఆచరణాత్మకమైన అదనపు పెట్టుబడిని సృష్టిస్తారు. కాగా I వ శాఖ చ, చ', చ''ల విషయం ఇందుకు భిన్నం. (1) I వ శాఖ చ, చ', చ'' వగైరాల చేతుల్లోకి అది వెళ్తే తప్ప, క, క', క'' ప్రభృతుల అదనపు ఉత్పాదితం అదనపు స్థిర పెట్టుబడిగా తన విధిని నిర్వర్తించదు. (ఉత్పాదక పెట్టుబడిలోని ఇతర అంశమైన అదనపు శ్రమశక్తిని, మరో విధంగా చెప్తే, అదనపు అస్థిర పెట్టుబడిని ప్రస్తుతానికి మన పరిశీలనా పరిధి నుంచి వదిలేద్దాం.) (2) అదనపు ఉత్పాదితం వారి చేతుల్లోకి వెళ్ళాలంటే, చలామణి క్రియ అవసరం, అంటే వారు దాన్ని కొనుగోలు చేసి తీరాలి.

ఒకటవ అంశానికి సంబంధించి ఇక్కడ కింది విషయం పేర్కొనాలి. I వ శాఖ క, క', క''లు ఒక నిర్ణీత సంవత్సరంలో ఉత్పత్తి చేసినట్టి అదనపు ఉత్పాదితంలో (ఇది ఆచరణాత్మకమైన అదనపు స్థిర పెట్టుబడిలో) ఒక పెద్ద భాగం. నిజానికి చ, చ', చ''ల చేతుల్లో, తరువాతి సంవత్సరం వరకు లేదా ఆపైన కొన్నాళ్ళ వరకు పారిశ్రామిక పెట్టుబడిగా పనిచేయకపోవచ్చు. ఇక రెండవ అంశానికి సంబంధించి, ఈ ప్రశ్న తలెత్తుతుంది : చలామణి ప్రక్రియకు అవసరమైన డబ్బు ఎక్కడ నుంచి వస్తుంది?

I వ శాఖకు చెందిన చ, చ', చ''లు సృష్టించిన ఉత్పాదితాలు తమ సొంత ఉత్పత్తి ప్రక్రియలోకే వస్తురూపేణా తిరిగి ప్రవేశిస్తాయి. కాబట్టి వారి అదనపు ఉత్పాదితంలోని తదనుగుణ భాగం నేరుగా

(చలామణి జోక్యం లేకుండానే) వారి ఉత్పాదక పెట్టుబడికి బదిలీ అయి, స్థిర పెట్టుబడిలోని అదనపు అంశమవుతుందని ప్రత్యేకించి చెప్పాల్సిన అవసరం లేదు. I వ శాఖకు చెందిన క, క', వగైరాల అదనపు ఉత్పాదితాన్ని అవి తదనుగుణమైన మొత్తంలో డబ్బుగా మార్చవు. మరి డబ్బు ఎక్కడ నుంచి వస్తుంది? క, క', వగైరాలలాగే I వ శాఖకు చెందిన చ, చ', చ''లు కూడా తమ అదనపు ఉత్పాదితాలను అమ్మడం ద్వారా తమ నిల్వ నిధిని నిర్మించుకున్నారని మనకు తెలుసు. ఇప్పుడు వారు నిల్వ చేసుకున్నట్టి, కేవల ఆచరణాత్మకమైన డబ్బు పెట్టుబడి ఫలప్రదంగా అదనపు డబ్బు పెట్టుబడిగా తన విధిని నిర్వహించాల్సిన దశకు చేరుకున్నారు. అయిదే ఇదంతా గానుగెద్దు తిరుగుడులా ఉంది. ఎందుకంటే, I వ శాఖకు చెందిన 'చ'లు చలామణి నుంచి ఉపసంహరించుకుని సంచయనం చేయడానికి ముందు వారికి డబ్బు ఎక్కడ నుంచి వస్తుంది, అనే ప్రశ్న మిగిలే ఉంది.

I వ, II వ శాఖల పెట్టుబడిదార్లు తమ అదనపు ఉత్పాదితాన్ని మార్పిడి చేసుకోగలగాలంటే, వారి వద్ద కొంత మొత్తంలో డబ్బు ఉండి తీరాలని సామాన్య పునరుత్పత్తిపై జరిపిన విశ్లేషణ నుంచి మనం గ్రహించాం. ఆ సందర్భంలో వినియోగ వస్తువుల కోసం వ్యయం చేయడానికి ఆదాయంగా మాత్రమే ఉపకరించిన డబ్బు తిరిగి పెట్టుబడిదార్లకు, వాపస్ వచ్చింది. వారు తమ సరుకుల మార్పిడి కోసం అడ్వాన్సు చేసిన మేరకు అలా వాపస్ వచ్చేసింది. ఇక్కడ కూడా అదే డబ్బు పునర్దర్శనమిస్తుంది. కానీ అది ఇక్కడ విభిన్న క్రియను నిర్వహిస్తుంది. I వ శాఖకు చెందిన 'క'లు 'చ'లు అదనపు ఉత్పాదితాన్ని ఆచరణాత్మకమైన అదనపు డబ్బు పెట్టుబడిగా మార్చుకోడానికి అవసరమైన డబ్బును ఒకరికొకరు మార్చి మార్చి సరఫరా చేసుకుంటారు; కొత్తగా ఏర్పడిన డబ్బు – పెట్టుబడిని కొనుగోలు సాధనంగా తిరిగి చలామణిలోకి ఒకసారి ఒకరు, మరొకసారి మరొకరూ తోస్తుంటారు.

ఈ విషయంలో ఊహించుకొంటున్నది ఒకే ఒక విషయం : దేశంలో గల డబ్బు పరిమాణం (చలామణి వేగం వగైరాల్లో మార్పు లేనట్లయితే) అటు క్రియాశీల చలామణికి, ఇటు నిల్వ నిధి ఏర్పాటుకూ రెంటికీ సరిపోతుందని; సరుకుల సామాన్య చలామణి విషయంలో కూడా మనం ఊహించుకొన్నదిదే అని మనకు తెలుసు. అయితే ప్రస్తుత సందర్భంలో నిల్వ నిధులు నిర్వహించే క్రియ మాత్రం భిన్నమైనది. పైగా, లభ్యమవుతున్న డబ్బు మొత్తం కూడా తప్పనిసరిగా ఎక్కువగా ఉండాలి. అందుకు కారణాలు : ఒకటి – పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానంలో ఉత్పాదితాలన్నీ సరుకులుగా సృష్టి అవుతాయి. (కొత్తగా ఉత్పత్తి అయ్యే విలువైన లోహాలు, ఉత్పాదకుడే స్వయంగా వినియోగించుకునే కొన్ని ఉత్పాదితాలు మినహా.) అందుచేత అవి డబ్బు పరివర్తన దశను గడవాలి; రెండు – పెట్టుబడిదారీ విధానంలో మొత్తం సరుకు పెట్టుబడీ, దాని విలువ పరిమాణమూ రెండూ కూడా నిరపేక్షంగా ఎక్కువగా ఉండడమే కాక, అతులిత వేగంతో పెరుగుతాయి కూడా; మూడు – నిరంతరం పెరుగుతున్న అస్థిర పెట్టుబడిని ఎల్లప్పుడూ డబ్బు పెట్టుబడిగా మార్చవలసి ఉంటుంది; నాలుగు – నూతన డబ్బు పెట్టుబడులు ఏర్పడటం ఉత్పత్తి విస్తరణ వేగానికి అనుగుణంగా ఉంటుంది కనుక, తదనుగుణ నిల్వ నిధి నిర్మాణానికి అవసరమైన పదార్థం అందుబాటులో ఉండాలి.

ఇది పెట్టుబడిదారీ ఉత్పత్తి ప్రథమ దశకు సర్వత్రా వర్తిస్తుంది; ఈ దశలో పరపతి వ్యవస్థకు సైతం లోహాల చలామణి చాలావరకు తోడుగా ఉండాలి. పరపతి వ్యవస్థకు లోహాల చలామణి

ప్రాతిపదికగా ఉన్న మేరకు, దాని అత్యంతాభివృద్ధి చెందిన దశకు కూడా ఇది వర్తిస్తుంది. విలువైన లోహాల అదనపు ఉత్పత్తి ఒకసారి పుష్కలంగానూ, మరోసారి కొరతగానూ ఉండటం కద్దు. ఒకవైపేమో ఇది సరుకుల ధరల నిలకడకు అంతరాయం కలిగిస్తుంది. ఈ దుష్ప్రభావం దీర్ఘకాలంపాటు కొనసాగవచ్చు, లేదా కొద్దికాలమే ఉండవచ్చు. మరోవైపేమో, యావత్తు పరపతి యంత్రాంగమూ నానారకాల చర్యల ద్వారా, పద్ధతుల ద్వారా, సాంకేతిక విధానాల ద్వారా నిరంతరం, లోహాల వాస్తవిక చలామణిని సాపేక్షంగా అంతవరకు కనీస స్థాయికి తగ్గించడంలో నిమగ్నమై ఉంటుంది. ఈ యావత్తు యంత్రాంగం యొక్క కృతక స్వభావమూ, దాని మామూలు గతిక్రమాన్ని భగ్నం చేసే అవకాశమూ రెండూ కూడా అదే మేరకు పెరుగుతాయి.

I వ శాఖకు చెందిన వివిధ చ, చ', చ"ల ఆచరణాత్మకమైన కొత్త డబ్బు పెట్టుబడి క్రియాశీల పెట్టుబడిగా తన పని ప్రారంభించినప్పుడు వారు తమ ఉత్పాదితాలను (తమ అదనపు ఉత్పాదితాల్లో భాగాలను) ఒకరి నుంచి మరొకరు కొనుగోలు చేయవలసి ఉంటుంది; లేదా ఒకరికొకరు అమ్ముకోవలసి రావచ్చు. ఆ మేరకు తమ అదనపు ఉత్పాదితం చలామణి కోసం వారు అడ్వాన్సు చేసిన డబ్బు, మామూలు పరిస్థితుల్లో, తమ సరుకుల చలామణి కోసం అడ్వాన్సు చేసిన నిష్పత్తిలోనే వారికి వాపస్ వస్తుంది. డబ్బు కనుక చెల్లింపు సాధనంగా చలామణి అయినట్లయితే, పరస్పర అమ్మకాలు, కొనుగోళ్ళు సమంగా లేనప్పుడు, బాకీ మొత్తాలను మాత్రమే చెల్లించవలసి ఉంటుంది. అయితే అన్ని చోట్లలాగే ఇక్కడ కూడా అతి సామాన్య, అతి ప్రాథమిక రూపంలోని లోహాల చలామణినే మనం ఊహించడం ముఖ్యం; ఎందుచేతనంటే, అప్పుడు డబ్బు అడ్వాన్సులు, డబ్బు తిరిగి రావడాలు, తేడాల సర్దుబాటు, ఒక్కమాటలో చెప్పాలంటే పరపతి వ్యవస్థలో ఉద్దేశపూర్వకంగా క్రమబద్ధం చేయబడిన ప్రక్రియలుగా ఉండే అన్ని అంశాలూ పరపతి వ్యవస్థకు సంబంధం లేనివిగా కనిపిస్తాయి. ఈ వ్యవహారం, ఉత్తరోత్తరా కనిపించే దాని ప్రతిబింబిత రూపంలో కాకుండా, దాని ఆదిమ రూపంలో కనిపిస్తుంది.

## 3. అదనపు అస్థిర పెట్టుబడి

ఇంతవరకూ మనం అదనపు స్థిర పెట్టుబడినే పరిశీలిస్తూ వస్తున్నాం. మనమిప్పుడు అదనపు అస్థిర పెట్టుబడి పరిశీలనపై దృష్టిని మళ్ళిద్దాం.

పెట్టుబడిదారీ ఉత్పత్తి వ్యవస్థలోని శ్రమశక్తి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందనీ, అవసరమయ్యే పక్షంలో శ్రామికుల సంఖ్యను పెంచకుండానే, లేక నియోగించిన శ్రమశక్తి పరిమాణాన్ని పెంచకుండానే ఎక్కువ శ్రమను లాగడం సాధ్యమనీ ప్రథమ సంపుటిలో మనం సవివరంగా విశదీకరించాం. అందుచేత ఆ అంశాన్ని అంతకంటే ఎక్కువ వివరించాల్సిన అవసరం లేదు. కానీ, కొత్తగా సృష్టి అయిన డబ్బు పెట్టుబడిలో, అస్థిర పెట్టుబడిగా మారగల భాగానికి ఎల్లప్పుడూ శ్రమశక్తి అందుబాటులో ఉంటుందని ఊహిద్దాం; స్వయంగా శ్రమశక్తిగా పరివర్తన చెందవలసిన భాగమిది. ఒక నిర్ణీత పెట్టుబడి ఎలాంటి సంచయనం లేకుండానే, కొన్ని పరిమితుల్లో తన ఉత్పత్తి పరిమాణాన్ని పెంచుకోవచ్చునని కూడా ప్రథమ సంపుటిలో వివరించాము. అయితే మనమిక్కడ పెట్టుబడి సంచయనాన్ని దానికి గల ప్రత్యేక అర్థంలో పరిశీలిస్తున్నాం కాబట్టి, ఉత్పత్తి విస్తరణలో, అదనపు

విలువ అదనపు పెట్టుబడిగా పరివర్తన చెందడం గర్భితం. ఆ విధంగా ఉత్పత్తికి పునాదిగా ఉన్న పెట్టుబడి విస్తరణ కూడా గర్భితం.

బంగారం ఉత్పాదకుడు తన బంగారపు అదనపు విలువలోని ఒక భాగాన్ని ఆచరణాత్మకమైన డబ్బు పెట్టుబడిగా కూడబెట్టుకోగలడు. అది తగినంత మొత్తం కాగానే, అతడు మొదట తన అదనపు ఉత్పాదితాన్ని అమ్మనవసరం లేకుండానే, ఆ మొత్తాన్ని నేరుగా కొత్త అస్థిర పెట్టుబడిగా మార్చగలడు. అదే విధంగా దాన్ని స్థిర పెట్టుబడి అంశాలుగా కూడా మార్చగలడు. అయితే స్థిర పెట్టుబడిగా మార్చడానికి, దాని పాదార్థిక అంశాలు అతడికి లభ్యం కావాలి. ఇంతవరకు, ఈ విషయ వివరణలో ఊహించినట్లుగా, ప్రతి ఉత్పాదకుడూ నిల్వ చేసి, పక్కా ఉత్పాదితాన్ని మార్కెట్‌కు తెస్తాడా, లేక వచ్చిన ఆర్డర్ల మేరకు ఉత్పత్తి చేస్తాడా అన్నది ఇక్కడ ముఖ్యం కాదు. ఉత్పత్తి యొక్క వాస్తవిక విస్తరణను, అంటే అదనపు ఉత్పాదితాన్ని రెండు సందర్భాల్లోనూ ఊహించుకొంటున్నాం. ఒక సందర్భంలో, అది వాస్తవంగా అందుబాటులో ఉన్నది అనీ, రెండవ సందర్భంలోనేమో ఆచరణ రీత్యా అందుబాటులో ఉంది, ఉత్తరోత్తరా సరఫరా చేయ వీలున్నదనీ ఊహించుకొంటున్నాము.

## II. II వ శాఖలో సంచయనం

I వ శాఖకు చెందిన క, క', క''లు తమ అదనపు ఉత్పాదితాన్ని అదే శాఖకు చెందిన చ, చ', చ'' లకు అమ్ముతారని మనం ఇంతవరకు ఊహించాం. అయితే I క తన అదనపు ఉత్పాదితాన్ని II వ శాఖకు చెందిన 'చ' అనే వ్యక్తికి అమ్మడం ద్వారా, అతడు తన అదనపు ఉత్పాదితాన్ని డబ్బుగా మార్చుకుంటాడు అనుకుందాం. I క II చ నుంచి వినియోగ వస్తువులేవీ కొనకుండా కేవలం అతనికి ఉత్పత్తి సాధనాలను అమ్మడం ద్వారా మాత్రమే, అంటే 'క' ఏకపక్ష అమ్మకం ద్వారా మాత్రమే ఇది సాధ్యపడుతుంది. I అ.పె మాత్రమే కాక, I అ.వి లో కనీసం ఒక భాగమైనా, ప్రస్తుతం వినియోగ వస్తువుల రూపంలో ఉన్నట్టి II స్థి.పె లోని ఒక భాగంతో మార్పిడి అయితే తప్ప, సరుకు పెట్టుబడి రూపంలోని II స్థి.పె ని ఉత్పాదక స్థిర పెట్టుబడి తాలూకు పాదార్థిక రూపంలోకి మార్చడం సాధ్యం కాదు; అయితే, ఇప్పుడు క తన I అ.వి ని డబ్బుగా మార్చుకొనేది ఈ మార్పిడి ద్వారా కాదు. ఈ మార్పిడి చేసుకోవడానికి బదులు, దాని అమ్మకం ద్వారా II వ శాఖ నుంచి లభించిన డబ్బును చలామణి నుంచి ఉపసంహరించుకోవడం ద్వారా అతడు తన I అ.వి ని డబ్బుగా మార్చుకొంటాడు. అప్పుడు I 'క' వద్ద అదనపు ఆచరణాత్మక డబ్బు పెట్టుబడి నిర్మాణమవుతుంది నిజమే. కాని II 'చ' వద్ద ఆ డబ్బు పెట్టుబడికి సమాన విలువ గల స్థిర పెట్టుబడి భాగం సరుకు పెట్టుబడి రూపంలో బంధింపబడి ఉంటుంది. ఉత్పాదక స్థిర పెట్టుబడి పాదార్థిక రూపంలోకి అది పరివర్తన చెందలేక పోయింది. ఇంకో విధంగా చెప్పాలంటే, II చ సరుకుల్లో ఒక భాగం, దేనినైతే అమ్మకుండా అతడు తన స్థిర పెట్టుబడిని మొత్తంగా దాని పాదార్థిక రూపంలోకి తిరిగి మార్చుకోలేడో ఆ భాగం, అమ్మకం కాజాలదన్నమాట. అందుచేత ఈ భాగానికి సంబంధించినంత వరకు అమితోత్పత్తి అయింది. ఈ అమితోత్పత్తి ఈ భాగానికి సంబంధించినంత వరకు అదే స్థాయిలో సైతం పునరుత్పత్తిని నిరోధిస్తుంది.

ఈ ఉదాహరణలో I వ శాఖ 'క'కు చెందిన అదనపు ఆచరణాత్మక డబ్బు పెట్టుబడి నిజానికి అదనపు ఉత్పాదితం (అదనపు విలువ) యొక్క డబ్బు రూపం; అయితే ఇక్కడ అదనపు ఉత్పాదితం

(అదనపు విలువ) సామాన్య పునరుత్పత్తి పరిణామమే తప్ప అది విస్తృత స్థాయిలోని పునరుత్పత్తి వల్ల సంభవించినది కాదు. II స్థి.పె అదే స్థాయిలో పునరుత్పత్తి జరగాలంటే I (అ.పె+అ.వి) చివరకు II స్థి.పెతో మార్పిడి చెందక తప్పదు; ఇక్కడ I (అ.పె+అ.వి)లో అ.వి కి సంబంధించి, కనీసం ఒక భాగమైనా చేరి ఉంటుంది. I 'క' తన అదనపు ఉత్పాదితాన్ని II 'చ'కు అమ్మడం ద్వారా తదనుగుణమైన స్థిర పెట్టుబడి విలువలోని భాగాన్ని పాదార్థిక రూపంలో 'చ'కు సరఫరా చేశాడు; అయితే అదే సమయంలో II 'చ' సరుకుల్లో తత్తుల్యమైన భాగం అమ్మకానికి వీలులేనిదయింది. ఎందువల్లనంటే, I క చలామణి నుంచి డబ్బును ఉపసంహరించుకోవడం వల్ల – తన అమ్మకం తదుపరి కొనుగోలు చేయకుండా ఉండడం వల్ల ఆ భాగం అమ్మకమయ్యే అవకాశం లేదు. కాబట్టి మనం సమస్త సామాజిక పునరుత్పత్తిని (I వ, II వ శాఖల పెట్టుబడిదార్లు ఇందులోకి వస్తారు.) పరిశీలిస్తే I క' యొక్క అదనపు ఉత్పాదితం, ఆచరణాత్మక డబ్బు పెట్టుబడిగా మారే క్రమం, అంతే విలువ గల II 'చ' యొక్క సరుకు పెట్టుబడి ఉత్పాదక (స్థిర) పెట్టుబడిగా మారడం సాధ్యం కాదన్న సంగతిని వ్యక్తం చేస్తుంది; అందుచేత విస్తృత స్థాయిలో ఆచరణాత్మక ఉత్పత్తిని కాకుండా, సామాన్య పునరుత్పత్తికి జరిగిన ఆటంకాన్ని, పర్యవసానంగా సామాన్య పునరుత్పత్తిలో ఏర్పడిన లోటును వ్యక్తం చేస్తుంది. I 'క' యొక్క అదనపు ఉత్పాదితం రూపుగొనడం, దాని అమ్మకం సామాన్య పునరుత్పత్తి యొక్క మామూలు ఘటనలు కనుక, సామాన్య పునరుత్పత్తి ప్రాతిపదికపై సైతం మనకిక్కడ ఈ క్రింది పరస్పరాధీన ఘటనలు కనిపిస్తాయి. I వ శాఖలో ఆచరణాత్మక అదనపు పెట్టుబడి రూపుగొనటం (కనుక II వ శాఖ దృక్కోణం నుంచి వినియోగం తగ్గుదల) పరిశీలిస్తే ఇది II వ శాఖ సరుకు సరఫరాలు పేరుకుపోయి, ఉత్పాదక పెట్టుబడిగా మార్పు చెందలేకపోవడం (కనుక II వ శాఖలో సాపేక్షమైన అమితోత్పత్తి), I వ శాఖలో డబ్బు పెట్టుబడి అదనం కావడం, II వ శాఖలోని పునరుత్పత్తిలో లోటు ఏర్పడడం.

ఇక్కడ వెంటనే ఒక మాట మాత్రం చెబుదాం : సామాన్య పునరుత్పత్తి విశ్లేషణ సందర్భంగా I వ, II వ శాఖల సమస్త అదనపు విలువా ఆదాయంగా వ్యయం అవుతుందని మనం ఊహించుకొన్నాం. అయితే వాస్తవానికి అదనపు విలువలోని ఒక భాగం ఆదాయంగా ఖర్చు కాగా, మరో భాగమేమో పెట్టుబడిగా మార్చబడుతుంది. ఈ ఊహ ప్రాతిపదికపై మాత్రమే నిజమైన సంచయనం సాధ్యం. వినియోగానికి నష్టకరంగా సంచయనం జరుగుతుందన్న భావం, ఆ మామూలు పదాల్లో దాక్కున్నట్టి ఒక భ్రమ, పెట్టుబడిదారీ ఉత్పత్తి స్వభావాన్నే కాదనే భ్రమ. ఎందుచేతనంటే పెట్టుబడిదారీ ఉత్పత్తి యొక్క లక్ష్యమూ, ప్రేరక శక్తీ వినియోగమే తప్ప, అదనపు విలువను హస్తగతం చేసుకొని, దాన్ని పెట్టుబడిగా మార్చడం కాదు. అంటే సంచయనం చేయడం కాదనేది ఆ భ్రమలో గర్భితం.

★ ★ ★

ఇప్పుడిక II వ శాఖలో సంచయనాన్ని నిశితంగా పరిశీలిద్దాం.

II స్థి.పెకి సంబంధించిన మొదటి చిక్కు, అంటే II వ శాఖకు చెందిన సరుకు పెట్టుబడిలోని ఒక అంతర్భాగం II వ శాఖలోని స్థిర పెట్టుబడి యొక్క పాదార్థిక రూపంగా తిరిగి పరివర్తన

చెందడమన్నది, నిజానికి సామాన్య పునరుత్పత్తికి సంబంధించినది. మునుపటి పథకాన్ని తీసుకుందాం:

(1000 అ.పె + 1000 అ.వి) I ఇవి 2,000 II స్థి.పెతో మార్పిడి అవుతాయి.

ఇప్పుడిక, ఉదాహరణకు I వ శాఖ అదనపు ఉత్పాదితంలోని ఒక సగభాగం అంటే $\frac{1000}{2}$ అ.వి, లేక 500 I అ.విని I వ శాఖ స్థిర పెట్టుబడిలో అంతర్భాగంగా తిరిగి కలిపితే, అప్పుడు I వ శాఖలోనే ఆగిపోయిన ఈ అదనపు ఉత్పాదిత భాగం, II స్థి.పెలోని ఏ భాగాన్నీ భర్తీ చేయజాలదు. దాన్ని వినియోగ వస్తువులుగా మార్చడానికి బదులు I వ శాఖలోనే అదనపు ఉత్పత్తి సాధనాలుగా వాడటం జరిగింది. (I, II శాఖల మధ్య చలామణిలోని ఈ విభాగంలో మార్పిడి నిజంగా పరస్పరమైనది. అంటే సరుకులు తమ స్థానాన్ని పరస్పరం మార్చుకొంటాయి. కాగా I వ శాఖ శ్రామికుల మూలంగా 1000 I అ.పె 1000 II స్థి.పెని భర్తీ చేసినదానికి ఇది భిన్నమైనది.) ఇది ఏకకాలంలో I వ శాఖలోనూ II వ శాఖలోనూ ఈ పనిని నిర్వర్తించజాలదు. పెట్టుబడిదారు తన అదనపు ఉత్పాదితం విలువను వినియోగ వస్తువుల కోసం వ్యయం చేస్తూనే, అదే సమయంలో ఆ అదనపు ఉత్పాదితాన్ని ఉత్పాదకంగా వ్యయం చేయలేడు. అంటే దానిని తన ఉత్పాదక పెట్టుబడిలో భాగంగా కలుపుకోలేడు. అందుచేత 2,000 I అ.పె + అ.వికి బదులు 1500 మాత్రమే, అంటే (100 అ.పె+500 అ.వి) I మాత్రమే 2,000 II స్థి.పెతో మార్పిడి చెందుతాయి; 500 II స్థి.పె సరుకు రూపం నుంచి ఉత్పాదక (స్థిర) పెట్టుబడి IIగా తిరిగి మార్చబడజాలదు. కనుక II వ శాఖలో అమితోత్పత్తి ఉంటుంది; ఇది పరిమాణంలో I వ శాఖలో ఉత్పత్తి విస్తరణకు కచ్చితంగా సమంగా ఉంటుంది. II వ శాఖలోని అమితోత్పత్తి ప్రభావం I వ శాఖపై ఎంత బలంగా ఉంటుందంటే, II వ శాఖ వినియోగ వస్తువుల కోసం I వ శాఖ కార్మికులు ఖర్చు చేసిన 1,000 తిరిగి రావటం కూడా పాక్షికంగా మాత్రమే జరగవచ్చు. ఫలితంగా ఈ 1,000 I వ శాఖ పెట్టుబడిదారుల చేతుల్లోకి అస్థిర డబ్బు పెట్టుబడి రూపంలో తిరిగి రాదు. అందుచేత ఈ పెట్టుబడిదారులు అదే స్థాయిలో సైతం పునరుత్పత్తి చేయగలిగే స్థితిలో ఉండరు. పునరుత్పత్తిని విస్తరించే వారి ప్రయత్నంలోనే ఈ అవరోధం ఎదురవుతుంది. I వ శాఖలో నిజంగా జరిగింది కేవలం సామాన్య పునరుత్పత్తేనని, మన పథకంలో చూపించినట్లుగా భవిష్యత్తులో, ఉదాహరణకు వచ్చే సంవత్సరం, విస్తరణను దృష్టిలో పెట్టుకుని సామాన్య పునరుత్పత్తి అంశాలను వేరు వేరు పద్దుల కింద కలపడం మరో రకంగా జరిగిందని మనం ఈ సందర్భంలో గుర్తుంచుకోవాలి.

ఈ చిక్కు నుంచి కింది విధంగా బయటపడడానికి ప్రయత్నించవచ్చు: పెట్టుబడిదారులు నిల్వలో ఉంచినట్టి, తక్షణమే ఉత్పాదక పెట్టుబడిగా మార్చబడజాలనట్టి 500 II స్థి.పె అమితోత్పత్తి కాదు సరికదా, అది పైపెచ్చు పునరుత్పత్తి యొక్క ఒక ఆవశ్యక అంశంగా ఉంటుంది. మనం ఇంతవరకూ విస్మరించిన అంశమిది. డబ్బు సరఫరా అనేక స్థానాల్లో సంచయనం కావలసి ఉన్నదనీ, కనుక I వ శాఖలో నూతన డబ్బు పెట్టుబడిగా రూపొందగలిగేందుకూ, క్రమేణా తరిగిపోతున్న నిశ్చల పెట్టుబడి విలువను డబ్బు రూపంలో తాత్కాలికంగా చేతిలో అట్టిపెట్టుకొనేందుకూ చలామణి నుంచి డబ్బును ఉపసంహరించుకోవలసి ఉన్నదని మనం గమనించాము. అయితే మనం ఈ పథకాన్ని రూపొందించినప్పుడు, మొట్టమొదటి నుంచే, I వ, II వ శాఖల పెట్టుబడిదారుల చేతుల్లోనే పూర్తిగా

మొత్తం డబ్బునూ, సరుకులనూ పోశాము. ఈ పథకంలో వ్యాపారులు కానీ, డబ్బు మార్పిడిదారులు కానీ, బ్యాంకర్లు కానీ, ప్రత్యక్షంగా ఉత్పత్తి చేయకుండా కేవలం వస్తువులు వినియోగించే వర్గాలు కానీ లేవు. కాబట్టి, పునరుత్పత్తి యంత్రాంగం నిరంతరాయంగా పని చేస్తుందా అంటే, తమ తమ ఉత్పాదకుల చేతుల్లో ఆయా సరుకుల నిల్వలు నిరంతరం ఉండడం తప్పనిసరి అని స్పష్టంగా తెలుతుంది. అందుచేత II పెట్టుబడిదారులు నిల్వ ఉంచుకొన్న 500 II స్థి.పె వినియోగ వస్తువుల రూపంలోని సరుకు సరఫరాకు ప్రాతినిధ్యం వహిస్తుంది; ఇది పునరుత్పత్తిలో అంతర్భూతంగా ఉన్న వినియోగ ప్రక్రియ నిరంతరాయతకు హామీ కల్పిస్తుంది. నిరంతరాయత అంటే, ఏటేటా అని అర్థం. వినియోగ నిధి దాని అమ్మకందారులూ అదే సమయంలో ఉత్పాదకులూ అయిన వారి చేతుల్లోనే ఇంకా ఉన్న దశలో అది ఈ సంవత్సరం పూర్తిగా సున్నాకు పడిపోయి, వచ్చే సంవత్సరం మళ్లీ సున్నాతో ప్రారంభం కాజాలదు. ఇవాళ సున్నాకు పడిపోయి రేపు మళ్ళీ సున్నాతో ప్రారంభం చేయడం సాధ్యం కానట్లే. అలాంటి సరుకుల సరఫరాలను – వాటి పరిమాణాల్లో తేడాలున్నా – నిరంతరాయంగా కొత్తగా నిర్మించవలసి ఉంది. కాబట్టి II వ శాఖకు చెందిన మన పెట్టుబడిదారీ ఉత్పత్తిదార్ల చేతిలో నిల్వ డబ్బు పెట్టుబడి ఉండి తీరాలి; వారి ఉత్పాదక పెట్టుబడిలోని ఒక భాగం తాత్కాలికంగా సరుకుల రూపంలో బంధింపబడి ఉన్నప్పటికీ, వారు తమ ఉత్పత్తి ప్రక్రియను కొనసాగించడానికి ఆ నిల్వ డబ్బు పెట్టుబడి వీలు కలిగిస్తుంది. వారు తమ మొత్తం వ్యాపారాన్ని ఉత్పత్తితో జోడిస్తారన్నది మన ఊహ. కనుక పునరుత్పత్తి ప్రక్రియలోని వేరు వేరు క్రియలు విడిపోయి వివిధ రకాల పెట్టుబడిదార్ల మధ్య పంపిణీ అయిన ఫలితంగా వ్యాపారుల చేతుల్లో ఉండే ఈ అదనపు డబ్బు – పెట్టుబడి, ఈ రెంటినీ జోడించిన పెట్టుబడిదార్ల వినియోగంలో ఉండాలి.

దీనికి ఎవరైనా ఇలా అభ్యంతరం వ్యక్తం చేయవచ్చు.

1) ఇలాంటి సరఫరాల నిర్మాణమూ, అలా నిర్మించాల్సిన అవసరమూ పెట్టుబడిదార్లందరకూ, అంటే I వ శాఖ, అలాగే II వ శాఖ పెట్టుబడిదారులందరకూ వర్తిస్తుంది. వారిని సరుకుల అమ్మకందార్లుగా మాత్రమే పరిగణించినట్లయితే, వారి మధ్య ఉన్న వ్యత్యాసమల్లా వారు భిన్న రకాల సరుకులు అమ్మడమే. II వ శాఖ వద్ద సరుకుల సరఫరా ఉందీ అంటే, అంతకు ముందే I వ శాఖ వద్ద కూడా సరుకుల సరఫరా ఉందన్న మాట. ఒక పక్షానికి సంబంధించి మనం ఈ సరఫరాను విస్మరిస్తే, రెండో పక్షానికి సంబంధించి కూడా దాన్ని విస్మరించాల్సిందే. అయితే ఇవి రెండు పక్షాల్లోనూ ఉన్నాయని అనుకొంటే, సమస్య ఏ విధంగానూ మారదు.

2) II వ శాఖకు సంబంధించి, ఒక సంవత్సరం రానున్న సంవత్సరానికి ఉద్దేశించిన సరుకుల సరఫరాలతో ముగిసినట్లే అది అంతకు మునుపు సంవత్సరం అందజేసిన సరుకుల సరఫరాతో ప్రారంభమయింది. కాబట్టి వార్షిక పునరుత్పత్తిని దాని అత్యంత అనిర్దిష్ట రూపంలో విశ్లేషించే సందర్భంగా, మనం ఈ రెండు నిల్వలను కొట్టివేయాల్సిందే. వచ్చే సంవత్సరం కోసం అట్టిపెట్టాల్సిన సరుకు సరఫరాతో సహా, యావత్ ఉత్పత్తినీ ఆ నిర్దిష్ట సంవత్సరానికే మనం వదిలివేసి అదే సమయంలో అంతకు మునుపు సంవత్సరం బదిలీ చేసిన సరుకుల సరఫరాను ఆ సంవత్సరం నుంచి తీసేసుకున్న ట్లయితే, మన ముందు మన విశ్లేషణాంశంగా ఒక సగటు సంవత్సరం యొక్క మొత్తం నిజమైన

మొత్తం ఉత్పాదితం ఉంటుంది.

3) ఇప్పుడు మనం అధిగమించవలసి ఉన్న చిక్కు సామాన్య పునరుత్పత్తిని విశ్లేషించే సందర్భంగా మనకు ఎదురుకాలేదంటే, పునరుత్పత్తికి సంబంధించి I వ శాఖ అంశాలను వేరు వేరు పద్దులకింద కలపడం మరొకరకంగా ఉన్నందువల్లనే ఒక ప్రత్యేక పరిణామం మనకు ఎదురవుతున్నట్లు అది నిరూపిస్తున్నది; ఇలాంటి మారిన కలయికలు లేకుండా విస్తృత స్థాయిలో పునరుత్పత్తి జరగనే జరగదు.

## III. సంచయనం : పథకంవారీ చిత్రణ

మనమిప్పుడు ఈ కింది పథకం ప్రకారం పునరుత్పత్తిని అధ్యయనం చేద్దాం :

**పథకం అ)**

I. 4,000 స్థి.పె + 1,000 అ.పె + 1,000 అ.వి = 6,000
II. 1,500 స్థి.పె + 376 అ.పె + 376 అ.వి = 2,252 } మొత్తం 8,252

మొదటి పథకంలోని మొత్తం వార్షికోత్పత్తి 9,000. కాగా దానికంటే ఈ వార్షిక సామాజిక ఉత్పత్తి మొత్తం అయిన 8,252, తక్కువగా ఉందని వెంటనే గమనించగలం. ఇంతకంటే ఎక్కువగా ఉన్న మొత్తాన్ని కూడా ఉదాహరణకు, పదిరెట్లు ఎక్కువగా ఉన్న మొత్తాన్ని ఊహించుకోవచ్చు. ఇక్కడ I వ పథకంలో కంటే తక్కువ మొత్తాన్ని తీసుకోవడం ఒక విషయాన్ని స్పష్టం చేయడానికే. అదేమంటే, విస్తృత స్థాయిలో పునరుత్పత్తికి (దాన్ని ఎక్కువ పెట్టుబడి మదుపుతో జరిగే ఉత్పత్తిగా మాత్రమే ఇక్కడ పరిగణిస్తున్నాము) ఉత్పాదితం యొక్క నిరపేక్ష పరిమాణంతో ఎలాంటి సంబంధమూ లేదు; ఒక నిర్ణీత పరిమాణంలోని సరుకులకు సంబంధించి, విస్తృత పునరుత్పత్తి జరిగిందంటే, ఒక నిర్దిష్ట ఉత్పాదితం యొక్క వివిధ అంశాలు మరో విధంగా పొందుపడి ఉన్నాయనీ, లేదా అవి నిర్వర్తించే విధులు మరో విధమైనవనీ అనుకోవాలి, అంతే. కాబట్టి, ఉత్పాదితం విలువకు సంబంధించి, అది సామాన్య పునరుత్పత్తి తప్ప మరేమీ కాదు. ఇదీ, స్పష్టం చేయదలచుకొన్న విషయం. ఇక్కడ మార్పు చెందింది సామాన్య పునరుత్పత్తి యొక్క నిర్ణీత అంశాల గుణాత్మక నిర్ధారణే తప్ప వాటి పరిమాణం కాదు; తరువాత పునరుత్పత్తి విస్తృత స్థాయిలో సాగడానికి పాదార్థిక పునాది ఈ మార్పే.[1]

అస్థిర పెట్టుబడికి, స్థిర పెట్టుబడికి మధ్య గల నిష్పత్తిని మార్చడం ద్వారా మనం ఈ పథకాన్ని మార్పు చేయవచ్చు. ఉదాహరణకు ఈ కింది విధంగా మార్చవచ్చు :

I. 4,000 స్థి.పె + 875 అ.పె + 875 అ.వి = 5,750
II. 1,750 స్థి.పె + 376 అ.పె + 376 అ.వి = 2,502 } మొత్తం 8,252

పునరుత్పత్తి సామాన్య స్థాయిలో ఉండే విధంగా ఈ పథకం రూపొందించబడినట్లుంది. మొత్తం అదనపు విలువ ఆదాయంగా వినియోగించబడిందే తప్ప సంచయనం కాబడలేదు. రెండు ఉదాహరణలలోనూ, అంటే (అ) ఉదాహరణలోనూ (ఆ) ఉదాహరణలోనూ వార్షిక ఉత్పాదితం

1. పెట్టుబడి సంచయనంపై జేమ్స్ మిల్‌కూ, ఎస్. బెయిల్‌కూ మధ్య తలెత్తిన వివాదానికి ఇది శాశ్వతంగా స్వస్తి చెబుతూంది. పెట్టుబడి ప్రథమ సంపుటిలో (అధ్యాయం XXIV, 5 నోట్ I) మరో కోణం నుంచి మనం ఆ వివాదాన్ని చర్చించాం; పారిశ్రామిక పెట్టుబడి యొక్క పరిమాణాన్ని మార్చకుండా దాని కార్యరంగాన్ని విస్తరించడానికి అవకాశం వుందా లేదా అన్నది ఆ వివాదం. దీనికి తరువాత తిరిగి వద్దాం.

యొక్క విలువ పరిమాణం ఒకటే. అయితే, (ఆ) లో దాని అంశాల విధులు ఎలా ఏర్పాటై ఉన్నాయంటే, పునరుత్పత్తి అదే స్థాయిలో తిరిగి ప్రారంభమవుతుంది ; (అ) లో దాని అంశాల విధుల ఏర్పాటు విస్తృత స్థాయిలో పునరుత్పత్తికి పాదార్థిక పునాదిగా ఉంది. (ఆ) లో (875 అ.పె+875 అ.వి) I, లేక 1,750 I (అ.పె+అ.వి) ఎలాంటి మిగులు లేకుండానే 1,750 II స్థి.పెతో మార్పిడి అవుతాయి; కాగా (అ)లో (1,000 అ.పె+1,000 అ.వి) I, అంటే 2,000 I (అ.పె+అ.వి) అటు 1,500 II స్థి.పెతో మార్పిడి అయినప్పుడు I వ శాఖలో సంచయనం కోసం 500 I అ.వి మిగులు ఏర్పడుతుంది.

ఇప్పుడు (అ) పథకాన్ని మరింత లోతుగా పరిశీలిద్దాం. I వ శాఖ, II వ శాఖ రెండూ తమ అదనపు విలువలో సగం సంచయనం చేస్తాయి అనుకుందాం. అంటే దానిని ఆదాయంగా ఖర్చు పెట్టకుండా అదనపు పెట్టుబడి అంశంగా మార్చుతాయి అనుకుందాం. 1,000 I అ.వి లో సగం లేక 500 ఏదో ఒక రూపంలో సంచయనం చేసి అదనపు డబ్బు పెట్టుబడిగా మదుపు చేయవలసి ఉంది; అంటే దాన్ని అదనపు ఉత్పాదక పెట్టుబడిగా మార్చవలసి ఉంది కాబట్టి (1,000 అ.పె + 500 అ.వి) I గా మాత్రమే ఆదాయంగా వ్యయం అవుతుంది. అందుచేత ఇక్కడ II స్థి.పె యొక్క మామూలు పరిమాణం 1,500 మాత్రమే. మనం 1,500 I (అ.పె+అ.వి)కీ, 1,500 II స్థి.పెకీ మధ్య మార్పిడి గురించి మరింత పరిశీలించాల్సిన అవసరం లేదు; ఎందుచేతనంటే సామాన్య పునరుత్పత్తి ప్రక్రియ శీర్షిక కింద ఈ పరిశీలన ఇదివరకే జరిగింది. అలాగే 4,000 I స్థి.పె పై కూడా దృష్టి మళ్ళించాల్సిన అవసరం లేదు; ఎందుచేతనంటే, కొత్తగా ప్రారంభం కాబోయే పునరుత్పత్తి కోసం (ఈ దఫా ఇది విస్తృత స్థాయిపై జరుగుతుంది) మార్చిన దాని పొందికను గురించి అలాగే చర్చించాము.

ఇక మనం పరిశీలించాల్సిన ఒకే ఒక విషయం 500 I అ.వి, (376 అ.పె + 376 అ.వి) II. ఎందుకంటే ఇది ఒకవైపు రెండు శాఖల అంతర్గత సంబంధాలకూ, మరోవైపు వాటి మధ్య జరిగే చలనాలకూ సంబంధించిన విషయం. IIలో కూడా అదనపు విలువలో సగం సంచయనం కావలసి ఉన్నదని మనం ఊహించాము కాబట్టి, 188 పెట్టుబడిగా మారవలసి ఉంది. అందులో నాలుగింట ఒకవంతు[1] లేక 47, లేక గుండు మొత్తంగా చెబితే, 48 అస్థిర పెట్టుబడిగా ఉండాలి; కాబట్టి 140 స్థిర పెట్టుబడిగా మారడానికి మిగిలి ఉంటుంది.

ఇక్కడ మనకు కొత్త సమస్య ఎదురవుతుంది; ఒకరకం సరుకులు మరోరకం సరుకులతో మార్పిడి అవుతాయనీ, లేక డబ్బుకు సరుకులు, అదే డబ్బు తిరిగి సరుకులకు మార్పిడి అవుతుందనీ వ్యాప్తిలో ఉన్న దృక్పథానికి ఈ సమస్య ఉనికే వింతగా కనిపించక మానదు. 140 II అ.వి ని సమానమైన విలువ గల I అ.వి సరుకులతో భర్తీ చేయడం ద్వారా మాత్రమే 140 II అ.వి ని ఉత్పాదక పెట్టుబడిగా మార్చడం సాధ్యం. II అ.వితో మార్పిడి జరగవలసి ఉన్న I అ.విలోని ఆ భాగం ఉత్పత్తి సాధనాల రూపంలో ఉండాలని వేరే చెప్పనవసరం లేదు. అప్పుడది I వ, II వ శాఖల ఉత్పత్తిలోకి కానీ, లేక పూర్తిగా II వ శాఖ ఉత్పత్తిలోకి కానీ ప్రవేశిస్తుంది. II వ శాఖ ఏకపక్షంగా

1. ఇది రాస్తున్నప్పుడు దొర్లిన పొరపాటు; అది అయిదింట ఒక వంతు అని వుండాలి. ఏదైనా ఇది అంతిమ నిర్ధారణలను ప్రభావితం చేయదు - సంపాదకుడు.

కొనుగోలు చేయడం ద్వారా మాత్రమే ఇది సాధ్యపడుతుంది; ఎందుకంటే, మనం పరిశీలించవలసి ఉన్నట్టి యావత్ అదనపు ఉత్పాదితం 500 I అ.వి తప్పనిసరిగా I వ శాఖలో సంచయనం కోసం ఉపకరించవలసి ఉంది; అందువల్ల II వ శాఖ సరుకులకు అది మార్పిడి కాజాలదు. ఇంకో విధంగా చెప్తే, I వ శాఖ దీన్ని ఒకే సమయంలో అటు సంచయనమూ ఇటు వినియోగమూ రెండూ చేయజాలదు కాబట్టి II వ శాఖ 140 I అ.విని నగదు పెట్టి కొనుగోలు చేయాలి. తన సరుకులను ఆ తర్వాత I వ శాఖకు అమ్మడం ద్వారా ఆ డబ్బును II వ శాఖ తిరిగి పొందకూడదు. విస్తృత స్థాయిలో పునరుత్పత్తి సాగినప్పుడు, ప్రతి నూతన వార్షిక ఉత్పత్తిలోనూ నిరంతరాయంగా పునరావృత్తమయ్యే ప్రక్రియ యిది. మరి, II వ శాఖలో ఈ డబ్బుకు మూలాధారం ఎక్కడుంది?

నూతన డబ్బు పెట్టుబడి నిర్మాణానికి II వ శాఖ బొత్తిగా లాభదాయకంగాకాని క్షేత్రంగా కనిపిస్తుంది; పెట్టుబడిదారీ ఉత్పత్తిలో అట్టి డబ్బు పెట్టుబడి నిర్మాణం వాస్తవిక సంచయనాన్ని వెన్నంటి ఉంటుంది, సంచయన అవసరాన్ని సృష్టిస్తుంది; అది మొదట సాధారణ నిల్వ నిధిగా కనిపిస్తుంది.

మొదటి 376 II అ.పె ఉంది. శ్రమశక్తి కోసం అడ్వాన్సు చేసిన 376 డబ్బు పెట్టుబడి II వ శాఖ సరుకుల కొనుగోలు ద్వారా ఆ శాఖ పెట్టుబడిదార్లకు అస్థిర పెట్టుబడిగా డబ్బు రూపంలో నిరంతరం తిరిగి వస్తూంటుంది. పెట్టుబడిదార్ల జేబుల్లో నుంచి డబ్బు ఇలా బయటికి వెడుతూ తిరిగి అక్కడికే తిరిగి రావడం నిరంతరం పదే పదే జరగడం వల్ల ఈ ఆవృత్తిలో అటూ ఇటూ తిరిగే డబ్బుకు అధికంగా ఏమీ చేకూరదు. కాబట్టి ఇది డబ్బు సంచయనానికి మూలాధారం కాదు. పైగా నిల్వ చేసిన, ఆచరణాత్మకమైన నూతన డబ్బు పెట్టుబడిని ఏర్పరచేందుకు ఈ డబ్బును చలామణి నుంచి ఉపసంహరించుకోవడం కూడా సాధ్యం కాదు.

ఆగండి! కాస్త లాభం గడించడానికి ఇక్కడ అవకాశం లేదా?

I వ శాఖకు లేని ఒక అనుకూలం II వ శాఖకు ఉందన్న విషయం మనం మరువరాదు! II వ శాఖ కార్మికులు తాము సృష్టించిన సరుకులనే ఆ శాఖ నుంచి కొనుగోలు చేయవలసి ఉంటుంది. II వ శాఖ, శ్రమశక్తి కొనుగోలుదారూ అదే సమయంలో తాను నియోగించిన శ్రమశక్తి సొంతదారులకు సరుకుల అమ్మకందారు కూడానూ. అందుచేత II వ శాఖ ఇలా చేయగలదు :

1) వేతనాలను వాటి సగటు స్థాయికంటే తగ్గించవచ్చు. ఇది I వ శాఖ పెట్టుబడిదారులూ చేయవచ్చు. ఇలా చేయడం ద్వారా, అస్థిర పెట్టుబడి యొక్క డబ్బు రూపంగా పని చేస్తున్న మొత్తంలో ఒక భాగం విడుదల అవుతుంది. ఇది కనుక నిరంతరాయంగా పునరావృత్తమైతే, II వ శాఖలో అది నిల్వ నిధి ఏర్పాటుకు, ఆ విధంగా ఆచరణాత్మకమైన అదనపు డబ్బు పెట్టుబడికి మూలాధారము కాగలదు. మనం ఇక్కడ చెబుతున్నది అడపా దడపా మోసంతో సంపాదించే లాభం గురించి కాదు. ఎందువల్లనంటే, మామూలు పెట్టుబడి ఏర్పడే క్రమం గురించి పరిశీలిస్తున్నాము. ఇక్కడొక విషయం మరువకూడదు; నిజంగా చెల్లించబడే మామూలు వేతనాలు (ఇతర అంశాలు సమంగా ఉన్నట్లయితే అస్థిర పెట్టుబడి పరిమాణాన్ని నిర్ణయించేది ఇవే.) పెట్టుబడిదార్లు తమ సహృదయత కారణంగా చెల్లించేవి కావు. నిర్ణీత సంబంధాల రీత్యా అవి చెల్లించక తప్పదు. కాబట్టి సంచయనానికి పైన చెప్పిన కారణానికి ఆస్కారం లేదు. 376 అ.పెను II వ శాఖ కేటాయించాల్సిన అస్థిర పెట్టుబడిగా మనం ఊహించినట్లయితే, కొత్తగా తలెత్తిన ఒక సమస్యను పరిష్కరించేందుకు II వ శాఖ 376

అ.పె బదులు 350 అ.పె మాత్రమే చెల్లించవచ్చుననే పరికల్పనను (Hypothesis) అకస్మాత్తుగా చొప్పించే హక్కు మనకు లేదు.

2) కాని, మొత్తంగా తీసుకుంటే, I వ శాఖకు లేని పై అనుకూలం II వ శాఖకు ఉంది; అంటే అది ఏకకాలంలో శ్రమశక్తి కొనుగోలుదారుగానూ, తన సొంత కార్మికులకు సరుకుల అమ్మకందారు గానూ వ్యవహరిస్తుంది. ఈ అనుకూలాన్ని తమ సొంత ప్రయోజనాల కోసం వాడుకునే పద్ధతికి అత్యంత స్పష్టమైన నిరూపణలు ప్రతి పారిశ్రామిక దేశంలోనూ (ఉదాహరణకు బ్రిటన్, అమెరికాలో) ఉన్నాయి. ఆ పద్ధతులివి : నామకః మామూలు వేతనాలను చెల్లిస్తూ, సమతుల్యమైన సరుకులు ఇవ్వకుండానే ఆ వేతనాల్లో కొంత భాగాన్ని తిరిగి లాక్కోవడం (ఇది దొంగిలించడమే); లేదా ట్రక్[1] పద్ధతి ద్వారా అదే పని చేయటం; లేదా చలామణి సాధనను తారుమారు చేయటం (బహుశా చట్టానికి చిక్కని పద్ధతిలో). (కొన్ని సముచిత ఉదాహరణలతో ఈ భావాన్ని మరింత విపులీకరించడానికి ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలి.) ఇది కూడా I వ శాఖలో జరిగే కార్యకాలాపం లాంటిదే; కాకపోతే ముసుగులో, డొంకతిరుగుడు పద్ధతిలో సాగుతుంది. అందుచేత దీనినీ దానిలాగే తిరస్కరించాల్సిందే. మనం ఇక్కడ పరిశీలిస్తున్నది వాస్తవంగా చెల్లించేదాన్ని గురించే తప్ప నామకః చెల్లించే వేతనాల గురించి కాదు.

పెట్టుబడిదారీ యంత్రాంగాన్ని వస్తుగతంగా విశ్లేషించే సందర్భంగా, ఆ యంత్రాంగానికి ఇప్పటికీ గట్టిగా అంటుకుని ఉన్న మరకలను కొన్ని సైద్ధాంతిక చిక్కులను అధిగమించడానికి మిషగా వినియోగించుకోజాలము. కాని చిత్రమేమిటంటే, పెట్టుబడిదారు శ్రమశక్తికి దాని నిజమైన విలువను చెల్లిస్తాడని (అతను చాలా వరకు అలా చెల్లించడు) నేను పెట్టుబడి, I వ సంపుటిలో ఊహించడం ద్వారా పెట్టుబడిదార్లకు అన్యాయం చేసినట్లుగా బూర్జువా విమర్శకుల్లో అత్యధిక సంఖ్యాకులు నన్ను దుయ్యబడుతున్నారు. (ఇక్కడ నాకు ఆపాదించిన ఔదార్యంలో కొంత కనపరుస్తూ స్కాపెల్‌ను ఉటంకించడం సముచితంగా ఉంటుంది.)

అందుచేత 376 II అ.పె తో, మనం పేర్కొన్న గమ్యాన్ని కాస్తయినా సమీపించలేదు.

అయితే 376 II అ.వి మరింత సంకటావస్థలో ఉన్నట్లు కనిపిస్తుంది. ఇక్కడ ఒకే తరగతికి చెందిన పెట్టుబడిదారులు మాత్రమే తాము ఉత్పత్తి చేసిన వినియోగ వస్తువులను పరస్పరం అమ్ముకుంటూ, కొనుగోలు చేస్తూ ఒకరికొకరు ఎదురవుతారు. ఈ లావాదేవీలకు అవసరమైన డబ్బు, చలామణి చేసిన నిష్పత్తిలోనే ఆ డబ్బు, మామూలు పరిస్థితిలో తిరిగి వారికి చేరాలి – అప్పుడది అదే మార్గాన్ని పదే పదే గడిచి రావడానికి వీలవుతుంది.

ఆచరణాత్మకమైన అదనపు డబ్బు పెట్టుబడి రూపొందేందుకు, ఈ డబ్బును చలామణి నుంచి ఉపసంహరించుకునే మార్గాలు రెండే రెండు ఉన్నట్లు కనిపిస్తుంది. II వ శాఖలోని కొంతమంది పెట్టుబడిదార్లు ఇతరులను మోసం చేసి వారి డబ్బును తస్కరించనైనా తస్కరిస్తారు. నూతన డబ్బు పెట్టుబడి నిర్మాణానికి చలామణి సాధనాన్ని ముందుగా విస్తరింపచేయవలసిన అవసరం లేదని మనకు తెలుసు. అవసరమైనదల్లా, కొంతమంది వ్యక్తులు చలామణి నుంచి డబ్బును ఉపసంహ

1. కార్మికులకు వేతనాలుగా డబ్బుకు బదులు వస్తువులు ఇవ్వడం లేదా డబ్బు చెల్లించినా, ఆ డబ్బుకు తమ వద్దనే సరుకులు కొనాలనడం - దీనిని ట్రక్ పద్ధతి అంటారు - తెలుగు సంపుటి సంపాదకుడు.

రించుకుని నిల్వ చేయడమే. ఈ డబ్బు దొంగిలింపబడినదైనప్పటికీ, అందులో తేడా ఏమీ ఉండదు; II వ శాఖలోని కొంతమంది పెట్టుబడిదారులు అలా దొంగిలించి, అదనపు డబ్బు పెట్టుబడిని నిర్మిస్తే మరికొంత మందికి ఆ మేరకు డబ్బు నష్టం అవుతుంది. అలా మోసగించబడిన II పెట్టుబడిదార్లు తమ విలాసాలు తగ్గించుకోవలసి ఉంటుంది, అంతే.

లేదా II అ.విలో జీవనావసరాలకు ప్రాతినిధ్యం వహించే ఒక భాగం II వ శాఖలోనే కొత్త అస్థిర పెట్టుబడిగా నేరుగా మారనైనా మారాలి. అది ఎలా జరుగుతుందో ఈ అధ్యాయం చివరన, (సం. VI కింద) పరిశీలిద్దాం.

## 1. మొదటి ఉదాహరణ

*అ. సామాన్య పునరుత్పత్తి పథకం*

| | | |
|---|---|---|
| I. | 4,000 స్థి.పె + 1,000 అ.పె + 1,000 అ.వి = 6,000 | మొత్తం 9,000 |
| II. | 2,000 స్థి.పె + 500 అ.పె + 500 అ.వి = 3,000 | |

*ఆ. విస్తృత స్థాయిలో పునరుత్పత్తి కోసం ప్రారంభ పథకం*

| | | |
|---|---|---|
| I. | 4,000 స్థి.పె + 1,000 అ.పె + 1,000 అ.వి = 6,000 | మొత్తం 9,000 |
| II. | 1,500 స్థి.పె + 750 అ.పె + 750 అ.వి = 3000 | |

పథకం (అ) లో అదనపు విలువలో అర్ధభాగం అంటే 500 సంచయనం అయింది అనుకుంటే, మనకు మొదట (1,000 అ.పె + 500 అ.వి) I, లేదా 1,500 I (అ.పె+అ.వి) లభిస్తుంది. దీన్ని 1,500 II స్థి.పె భర్తీ చేయవలసి ఉంది. అప్పుడు I వ శాఖలో 4,000 స్థి.పె, దానికి తోడు 500 అ.వి మిగిలి ఉంటుంది; 500 అ.వి సంచయనం కావలసి ఉంది. (1,000 అ.పె + 500 అ.వి) I ని 1,500 II స్థి.పె భర్తీ చేయడమన్నది, ఇంతకుముందే పరిశీలించబడిన సామాన్య పునరుత్పత్తి ప్రక్రియ.

ఇప్పుడిక 500 I అ.విలో 400ను స్థిర పెట్టుబడిగానూ, 100ను అస్థిర పెట్టుబడిగానూ మార్చవలసి ఉందని అనుకొందాం. I వ శాఖలో అంతర్గతంగా 400 అ.వి మార్పిడినీ, ఆ విధంగా అది పెట్టుబడిగా మారే క్రమాన్నీ గురించి ఇదివరకే చర్చించాము. అందుచేత ఎలాంటి వివరణ లేకుండానే ఆ మొత్తాన్ని I స్థి.పెలో కలపవచ్చు; అప్పుడు I వ శాఖ పరిస్థితి ఇలా ఉంటుంది :

4,400 స్థి.పె + 1,000 అ.పె + 100 అ.వి (చివరిది 100 అ.పెగా మార్చబడవలసి ఉంది)

తనవంతుగా, II వ శాఖ ఉత్పత్తి సాధనాల రూపంలో ఉన్నట్టి 100 అ.విని సంచయనం కోసం కొనుగోలు చేస్తుంది; ఇప్పుడది II వ శాఖ అదనపు స్థిర పెట్టుబడి అవుతుంది. కాగా, దాని కొనుగోలుపై డబ్బు రూపంలో ఆ శాఖ చెల్లించే 100, I వ శాఖ యొక్క అదనపు అస్థిర పెట్టుబడిగా మార్చబడుతుంది. అప్పుడు I వ శాఖ యొక్క పెట్టుబడి 4,400 స్థి.పె + 1,100 అ.పె గా ఉంటుంది. (రెండవది డబ్బు రూపంలో) మొత్తం పెట్టుబడి స్థి.పె 5,500కి సమానం.

ఇప్పుడు II వ శాఖలోని స్థిర పెట్టుబడి 1,600 స్థి.పె. దాన్ని పనిలో పెట్టేందుకుగాను కొత్త

శ్రమశక్తి కొనుగోలు చేయడానికి ఆ శాఖ మరో 50 అ.పె ని అడ్వాన్సు చేయవలసి ఉంటుంది; అప్పుడు దాని అస్థిర పెట్టుబడి 750 నుంచి 800కు పెరుగుతుంది. II వ శాఖలోని ఈ స్థిర, అస్థిర పెట్టుబడుల విస్తరణ మొత్తం 150, దాని అదనపు విలువ నుంచి సరఫరా అయింది. అందుచేత II వ శాఖ పెట్టుబడిదార్లకు, 750 II అ.విలో 600 అ.వి మాత్రమే వినియోగ నిధిగా మిగిలి ఉంటుంది; ఈ శాఖ వార్షిక ఉత్పాదితం ఈ కింది విధంగా పంపిణీ అవుతుంది :

II. 1,600 స్థి.పె + 800 అ.పె + 600 అ.పె (వినియోగ నిధి) = 3,000

ఇక్కడ II వ శాఖ (100 స్థి.పె + 50 అ.పె)గా మార్చబడినట్టి, వినియోగ వస్తువుల రూపంలో ఉత్పత్తి అయినట్టి 150 అవి మొత్తంగా తమ పాదార్థిక రూపంలో శ్రామికుల వినియోగంలోకి వెళ్తాయి; కాగా పైన వివరించినట్లుగా I వ శాఖ (100 I అ.పె) కార్మికులు 100ను వినియోగించుకోగా, II వ శాఖ (50 II అ.పె) కార్మికులు 50 ని వినియోగించుకుంటారు. వాస్తవానికి, సంచయనానికి తగిన రూపంలో తన మొత్తం ఉత్పాదితాన్ని సంసిద్ధం చేసిన II వ శాఖలో, ఆవశ్యకమైన వినియోగ వస్తువుల రూపంలో పునరుత్పత్తి కావలసిన అదనపు విలువ భాగం 100 ఎక్కువగా ఉండాలి. పునరుత్పత్తి కనుక నిజంగా విస్తృత స్థాయిలో ప్రారంభమైతే, I వ శాఖ యొక్క 100 అస్థిర పెట్టుబడి డబ్బు, దాని కార్మికవర్గం చేతులగుండా II వ శాఖకు తిరిగి చేరుకుంటుంది. కాగా II వ శాఖ 100 అ.విని సరుకు సరఫరా రూపంలో I వ శాఖకు, అదే సమయంలో సరుకు సరఫరా రూపంలో 50ని తన సొంత కార్మికవర్గానికి బదలాయిస్తుంది.

సంచయన ప్రయోజనం కోసం మారిన ఏర్పాటు ఈ క్రింది విధంగా ఉంటుంది :

| | | | |
|---|---|---|---|
| I. | 4,400 స్థి.పె + 1,100 అ.పె + 500 వినియోగనిధి | = | 6,000 |
| II. | 1,600 స్థి.పె + 800 అ.పె + 600 వినియోగనిధి | = | 3,000 |
| | మునుపటి లాగే మొత్తం | | 9,000 |

ఈ మొత్తాల్లో పెట్టుబడి ఇలా ఉంది :

| | | | |
|---|---|---|---|
| I. | 4,400 స్థి.పె + 1,100 అ.పె (డబ్బు) | = | 5,500 |
| II. | 1,600 స్థి.పె + 800 అ.పె (డబ్బు) | = | 2,400 |
| | మొత్తం | = | 7,900 |

కాగా ఉత్పత్తి ప్రారంభమైన పెట్టుబడి ఇలా ఉంది :

| | | | |
|---|---|---|---|
| I. | 4,000 స్థి.పె + 1,000 అ.పె | = | 5,000 |
| II. | 1,500 స్థి.పె + 750 అ.పె | = | 2,250 |
| | మొత్తం | = | 7,250 |

ఇప్పుడు ఈ ప్రాతిపదికపై నిజమైన సంచయనం జరిగితే, అంటే ఇలా పెరిగిన పెట్టుబడితో ఉత్పత్తి కొనసాగినట్లయితే, తరువాత సంవత్సరాంతం నాటికి పరిస్థితి ఈ క్రింది విధంగా ఉంటుంది:

| | | | |
|---|---|---|---|
| I. | 4,400 స్థి.పె + 1,100 అ.పె + 1,100 అ.వి | = | 6,600 |
| II. | 1,600 స్థి.పె + 800 అ.పె + 800 అ.వి | = | 3,200 |
| | మొత్తం | = | 9,800 |

I వ శాఖలో సంచయనం ఇదే నిష్పత్తిలో కొనసాగింది అనుకుందాం; అంటే 550 అ.వి ఆదాయంగా వ్యయమయిందనీ, 550 అ.వి సంచయనం అయిందనీ అనుకుందాం. అప్పుడు మొదట I, 100 II స్థి.పె చేత 1,100 I అ.పె భర్తీ అవుతుంది. 550 I అ.వి, II వ శాఖలోని అంతే విలువ గల సరుకుల రూపంలో అనుభోగానికి రావాలి. ఈ రెంటి మొత్తం 1,650 I (అ.పె+అ.వి). కానీ భర్తీ కావలసి ఉన్న II వ శాఖ స్థిర పెట్టుబడి 1,600 మాత్రమే. కాబట్టి మిగిలిన 50 ని 800 II అ.వి నుంచి పూరించుకోవాలి. ప్రస్తుతానికి డబ్బు విషయం వదిలేస్తే, ఈ లావాదేవీ ఫలితం ఇలా ఉంటుంది :

I. 4,400 + 550 అ.వి (పెట్టుబడిగా రూపొందవలసి ఉంది) ఇదికాక, II స్థి.పె సరుకు రూపంలో అనుభోగమైన పెట్టుబడిదారుల, కార్మికుల తాలూకు వినియోగ నిధి 1,650 అ.పె+అ.వి.

II. 1,650 స్థి.పె (ఇందులో 50 పైన తెలిపినట్లు II అ.వి నుంచి చేర్చినది) + 800 అ.పె + 750 అ.వి (పెట్టుబడిదారుల వినియోగ నిధి)

అయితే, II వ శాఖలో అ.పె, అ.విల మధ్య గల పాత నిష్పత్తే కొనసాగితే అప్పుడు 50 స్థి.పె కోసం అదనంగా 25 అ.పె వ్యయం కావలసి ఉంటుంది. దీన్ని 750 అ.వి నుంచి తీసుకోవలసి ఉంటుంది. అప్పుడు IIలో ఇలా ఉంటుంది :

II. 1,650 స్థి.పె + 825 అ.పె + 725 అ.వి

I వ శాఖలో 550 అ.విని పెట్టుబడిగా మార్చవలసి ఉంది. మునుపటి నిష్పత్తినే కొనసాగించి నట్లయితే ఈ మొత్తంలో 440 స్థిర పెట్టుబడిగానూ, 110 అస్థిర పెట్టుబడిగానూ ఉంటుంది. ఈ 110ని 725 II అ.వి నుంచి తీసుకోవచ్చు. అంటే 110 విలువ గల వినియోగ వస్తువులను II వ శాఖ పెట్టుబడిదార్లు కాక I వ శాఖ కార్మికులు వినియోగించుకుంటారు; అందువల్ల పెట్టుబడిదార్లు తాము వినియోగించుకోలేని ఈ 110 అ.విని విధిగా పెట్టుబడిగా మార్చుకోవలసి ఉంటుంది. అప్పుడు 725 II అ.విలో 615 II అ.వి మిగిలి ఉంటుంది. కాని, ఈ విధంగా II వ శాఖ ఈ 110ని అదనపు స్థిర పెట్టుబడిగా మార్చినట్లయితే, ఆ శాఖకు 55 అదనపు అస్థిర పెట్టుబడి అవసరమవుతుంది. దీన్ని కూడా దాని అదనపు విలువ సరఫరా చేయవలసిందే. 615 II అ.వి నుంచి ఈ మొత్తాన్ని తీసివేస్తే II వ శాఖ పెట్టుబడిదార్ల వినియోగం కోసం 560 మిగిలి ఉంటుంది. వాస్తవికమైన, సంభావ్యమైన బదలాయింపులన్నీ జరిగిన తర్వాత, ఈ క్రింది విధంగా పెట్టుబడి విలువ ఉంటుంది.

I. (4,400 స్థి.పె + 440 స్థి.పె) + (1,100 అ.పె + 110 అ.పె) = 4,840 స్థి.పె + 1,210 అ.పె = 6,050

II. (1,600 స్థి.పె + 50 స్థి.పె + 110 స్థి.పె) + (800 అ.పె + 25 అ.పె + 55 అ.పె) = 1,760 స్థి.పె + 880 అ.పె = 2,640

పై రెంటి మొత్తం = 8,690

అన్ని వ్యవహారాలు మామూలుగా కొనసాగినట్లయితే, I వ శాఖలో కంటే II వ శాఖలో ఎక్కువ వేగంగా సంచయనం అవుతుంది. ఎందుచేతనంటే అలాకాకపోతే, II స్థి.పెతో మాత్రమే మార్పిడి చెందవలసినట్టి I (అ.పె+అ.వి) భాగం II స్థి.పె కంటే ఎక్కువ వేగంగా పెరుగుతుంది. అది మరి II స్థి.పెతో మాత్రమే మార్పిడి కాగలదు.

ఈ ప్రాతిపదికపై పునరుత్పత్తి కొనసాగినట్లయితే, ఇతర పరిస్థితులలో ఎలాంటి మార్పు లేనప్పుడు, మరుసటి సంవత్సరాంతం నాటికి రెండు శాఖల్లో ఇలా ఉంటుంది.

| | | |
|---|---|---|
| I. | 4,840 స్థి.పె + 1,210 అ.పె + 1,210 అ.వి= 7,260 | } = 10,780 |
| II. | 1,760 స్థి.పె + 880 అ.పె + 880 అ.వి= 3,520 | |

అదనపు విలువ విభజన రేటులో మార్పు లేకపోతే, I వ శాఖచే ఆదాయంగా 1,210 అ.పె ప్లస్ అ.విలో సగం, అంటే 605, మొత్తం 1,815 వ్యయం కావలసి ఉంటుంది. ఈ వినియోగ నిధి II స్థి.పె కంటే 55 మేరకు పెద్దది. దీన్ని 880 అ.వి నుంచి తీసివేయాలి; అప్పుడు 825 మిగులుతుంది. పైగా 55 II అ.వి II స్థి.పెగా పరివర్తన చెందుతుందంటే, II అ.వి నుంచి దానికి అనుగుణమైన 27½ అస్థిర పెట్టుబడి కోసం, అంత మొత్తం తీసివేయవలసి ఉంటుంది. అప్పుడు వినియోగానికి మిగిలేది 797½ II అ.వి మాత్రమే. ఇప్పుడిక I వ శాఖ 605 అ.విని పెట్టుబడిగా మార్చవలసి ఉంది. ఇందులో స్థిర పెట్టుబడి 484, అస్థిర పెట్టుబడి 121. ఈ అస్థిర పెట్టుబడిని, ఇప్పటికీ 797½కు సమానంగా ఉన్న II అ.వి నుంచి తీసివేస్తే, మిగిలేది 676½ II అ.వి. అప్పుడు II వ శాఖ మరో 121ని స్థిర పెట్టుబడిగా మార్చుతుంది; కాబట్టి దానికి మరో 60½ అస్థిర పెట్టుబడి అవసరం. ఇది కూడా 676½ నుంచే వస్తుంది కాబట్టి ఇక వినియోగానికి మిగిలేది 616 మాత్రమే.

అప్పుడు పెట్టుబడులు ఈ క్రింది విధంగా ఉంటాయి :

| | | | |
|---|---|---|---|
| I. | స్థిర పెట్టుబడి : 4840 + 484 | = | 5,324 |
| | అస్థిర పెట్టుబడి : 1,210 + 121 | = | 1,331 |
| II. | స్థిర పెట్టుబడి : 1,760 + 55 + 121 | = | 1,936 |
| | అస్థిర పెట్టుబడి : 880 + 27½ + 60½ | = | 968 |
| మొత్తాలు : I. | 5,324 స్థి.పె + 1,331 అ.పె | = | 6,655 |
| II. | 1,936 స్థి.పె + 968 అ.పె | = | 2,904 |
| | మొత్తం | = | 9,559 |

సంవత్సరం చివర ఉత్పాదితం ఇలా ఉంటుంది :

| | | | |
|---|---|---|---|
| I. | 5,324 స్థి.పె + 1,331 అ.పె + 1,331 అ.వి | = | 7,986 |
| II. | 1,936 స్థి.పె + 968 అ.పె + 968 అ.వి | = | 3,872 |
| | మొత్తం | = | 11,858 |

ఇదే విధంగా తరువాతి సంవత్సరానికి కూడా లెక్కగట్టి, భిన్నాంకాన్ని పూర్ణాంకానికి సవరిస్తే, అదే సంవత్సరపు చివరన ఇలా ఉంటుంది :

| | | | |
|---|---|---|---|
| I. | 5,856 స్థి.పె + 1,464 అ.పె + 1,464 అ.వి | = | 8,784 |
| II. | 2,129 స్థి.పె + 1,065 అ.పె + 1,065 అ.వి | = | 4,259 |
| | మొత్తం | = | 13,043 |

దాని తర్వాతి సంవత్సరం ఆఖరున ఇలా ఉంటుంది :

| | | | |
|---|---|---|---|
| I. | 6,442 స్థి.పె + 1,610 అ.పె + 1610 అ.వి | = | 9,662 |

II. 2,342 స్థి.పె + 1,172 అ.పె + 1,172 అ.వి = 4,686

మొత్తం = 14,348

అయిదేళ్ళ పాటు విస్తృత స్థాయిలో పునరుత్పత్తి సాగాక I వ, II వ శాఖల మొత్తం పెట్టుబడి 5,500 స్థి.పె + 1,750 అ.పె = 7,250 నుంచి 8,784 స్థి.పె + 2,782 అ.పె = 11,566కి పెరిగింది. అంటే 100:160 నిష్పత్తిలో పెరిగిందన్నమాట. మొత్తం అదనపు విలువ ప్రారంభంలో 1,750 ఉండింది; అది ఇప్పుడు 2,782కు పెరిగింది. మొదట I వ శాఖ వినియోగించుకొన్న అదనపు విలువ 500, II వ శాఖ వినియోగించుకొన్న అదనపు విలువ 600; వీటి మొత్తం 1,100. కాగా, అంతకు మునుపు సంవత్సరంలో అది I వ శాఖకు 732గానూ, II వ శాఖకు 745గానూ ఉండింది; ఆ రెంటి మొత్తం 1,477. కాబట్టి అది 100:134 నిష్పత్తిలో పెరిగిందన్నమాట.

### 2. రెండవ ఉదాహరణ

మనమిప్పుడు పారిశ్రామిక పెట్టుబడిదార్ల వర్గం చేతుల్లో పూర్తి సరుకు పెట్టుబడిగా ఉన్న వార్షిక ఉత్పాదితం 9,000ను తీసుకుందాం; ఇందులో అస్థిర పెట్టుబడికీ, స్థిర పెట్టుబడికీ మధ్య గల సాధారణ సగటు నిష్పత్తి 1:5 అని అనుకొందాం. పెట్టుబడిదారీ ఉత్పత్తి అభివృద్ధి ఇదివరకే గణనీయంగా జరిగిందనీ, తదనుగుణంగా సామాజిక శ్రమ ఉత్పాదకత హెచ్చిందనీ, అంతకు ముందే ఉత్పత్తి స్థాయి గణనీయంగా పెరిగిందనీ, అంతిమంగా కార్మికవర్గంలో సాపేక్ష అదనపు జనాభా సృష్టికి కారణభూతమైన అన్ని పరిస్థితులు పెంపొందాయనీ ఇందులో గర్భితం. భిన్నాంకాలను పూర్ణాంకాలుగా సవరిస్తే, వార్షిక ఉత్పాదితం ఈ క్రింది విధంగా విభజింపబడుతుంది :

I. 5000 స్థి.పె + 1000 అ.పె + 1000 అ.వి = 7,000
II. 1430 స్థి.పె + 285 అ.పె + 285 అ.వి = 2,000
} మొత్తం 9,000

I వ శాఖ పెట్టుబడిదారీ వర్గం తమ అదనపు విలువలో సగభాగాన్ని, అనగా 500 వినియోగించుకుంటుందని మిగిలిన సగభాగాన్ని సంచయనం చేసుకుంటుందని భావిద్దాం. అప్పుడు (1,000 అ.పె+500 అ.వి) I లేక 1500ను 1500 II స్థి.పెగా మార్చవలసి ఉంటుంది. అయితే II స్థి.పె ఇక్కడ 1430 మాత్రమే కాబట్టి, అదనపు విలువ నుంచి 70 దీనికి చేర్చడం అవసరం. దీన్ని 285 II అ.వి నుంచి తీసివేస్తే 215 II అ.వి మిగులుతుంది. అప్పుడు ఈ క్రింది విధంగా ఉంటుంది :

I. 5,000 స్థి.పె + 500 అ.వి (పెట్టుబడిగా మార్చబడవలసినది) + 1500 (అ.పె+అ.వి) (ఇది పెట్టుబడిదార్ల, కార్మికుల వినియోగ–నిధి లోనిది)

II. 1,430 స్థి.పె + 70 అ.వి (పెట్టుబడిగా మార్చబడవలసినది) + 285 అ.పె+215 అ.వి

ఇక్కడ II స్థి.పెకి 70 II అ.విని నేరుగా కలిపాము కాబట్టి, ఈ అదనపు స్థిర పెట్టుబడిని చలనంలో ఉంచడానికి $\frac{70}{5}$ అస్థిర పెట్టుబడి లేక 14 అవసరం. ఈ 14 కూడా 215 II అ.వి నుంచే రావలసి ఉంది. కాబట్టి అది పోగా 201 II మిగులుతుంది. అప్పుడు II ఈ క్రింది విధంగా ఉంటుంది :

II. (1430 స్థి.పె + 70 స్థి.పె) + (285 అ.పె + 14 అ.పె) + 201 అ.వి.

1500 II స్థి.పెతో 1500 I (అ.పె+$\frac{1}{2}$ అ.వి) మార్పిడి సామాన్య పునరుత్పత్తి ప్రక్రియే కనుక దీని గురించి ఇంతకంటే ఎక్కువ చెప్పాల్సిన అవసరం లేదు. అయితే కొన్ని ప్రత్యేకతలను

ఇక్కడ గమనించాలి; ఇవి తలెత్తడానికి కారణం ఇది: సంచయనమవుతున్న పునరుత్పత్తిలో, I (అ.పె+$\frac{1}{2}$ అ.వి) ను భర్తీ చేసేది స్థి.పె మాత్రమే కాదు; II స్థి.పె + II అ.విలో కొంత భాగం భర్తీచేస్తుంది.

మనం సంచయనం అవుతున్నట్లు ఊహించగానే, I (అ.పె+అ.వి) అన్నది II స్థి.పె కంటే ఎక్కువగానే ఉంటుంది తప్ప, సామాన్య పునరుత్పత్తిలోలాగా తత్తుల్యంగా ఉండదని చెప్పాల్సిన అవసరం లేదు. ఎందుకంటే, మొదటి విషయం, I వ శాఖ తన అదనపు ఉత్పాదితంలో కొంత భాగాన్ని తన ఉత్పాదక పెట్టుబడిలో కలిపేసుకొంటుంది. దానిలో $\frac{5}{6}$ భాగాన్ని తన స్థిర పెట్టుబడిగా మార్చుకుంటుంది. కనుక ఈ $\frac{5}{6}$ భాగాన్ని అదే సమయంలో II వినియోగ వస్తువులతో భర్తీ చేయజాలదు. రెండవది, II వ శాఖలో సంచయనానికిగాను స్థిర పెట్టుబడికి అవసరమైన పదార్థాన్ని I వ శాఖ తన అదనపు ఉత్పాదితం నుంచే సరఫరా చేయవలసి ఉంటుంది. అలాగే I వ శాఖ తన అదనపు స్థిర పెట్టుబడిగా నియోగించిన అదనపు ఉత్పాదిత భాగాన్ని చలనంలో పెట్టే అస్థిర పెట్టుబడికి అవసరమైన పదార్థాన్ని II వ శాఖ సరఫరా చేయవలసి ఉంటుంది. వాస్తవ అస్థిర పెట్టుబడిగా ఉండేది, కాబట్టి అదనపు అస్థిర పెట్టుబడిగా కూడా ఉండేది శ్రమశక్తే అని మనకు తెలుసు. I వ శాఖ పెట్టుబడిదారు బానిస యజమాని చేసినట్లు, II వ శాఖ నుంచి జీవనావసరాలను కొనుగోలూ చేయడు, తాను నియోగించిన అదనపు శ్రమశక్తి కోసం వాటిని సంచయనమూ చేయడు. II వ శాఖతో వాటికై వ్యాపారం చేసేది కార్మికులే. అయితే అంతమాత్రాన, ఆ పెట్టుబడిదారు తన అదనపు శ్రమశక్తి యొక్క వినియోగ వస్తువులను, ఉత్పత్తి సాధనంగానూ, తన భావి అదనపు శ్రమశక్తి యొక్క జీవనావసరాలుగానూ పరిగణించకపోడు. అంటే, వాటిని తన అస్థిర పెట్టుబడి యొక్క పాదార్థిక రూపంగా పరిగణించకపోడు. కాబట్టి, పెట్టుబడిదారు తక్షణం చేసే పని – ప్రస్తుత సందర్భంలో I వ శాఖ పెట్టుబడిదారు తక్షణం చేసే పని – అదనపు శ్రమశక్తి కొనుగోలుకు అవసరమైన నూతన డబ్బుపెట్టుబడిని నిల్వ చేయడమే. అతడు దానిని తన పెట్టుబడిలో అంతర్భాగంగా చేసుకోగానే, అది ఆ శ్రమశక్తికి II వ శాఖ నుంచి సరుకులను కొనుగోలు చేసే సాధనంగా మారుతుంది. కనుక ఆ శ్రమశక్తికి వినియోగ వస్తువులు అందుబాటులో ఉండాలి.

సందర్భవశాత్తూ ఒక మాట. శ్రమశక్తి తన డబ్బును ఖర్చుచేసే పద్ధతి పట్లా, ఆ డబ్బును దాని అనుభోగానికి తెచ్చే II వ శాఖ సరుకుల పట్లా పెట్టుబడిదారూ, అతని పత్రికలూ తరచుగా అసంతృప్తిని వ్యక్తం చేయడం కద్దు. ఇలాంటి సందర్భాల్లో అతడు వేదాంత ధోరణి ప్రదర్శిస్తాడు. సంస్కృతి గురించి పేలుతాడు, జీవకారుణ్యవాదిలాగా మాట్లాడతాడు. ఉదాహరణకు వాషింగ్టన్‌లోని బ్రిటిష్ దౌత్య కార్యాలయంలో కార్యదర్శి డ్రుమండ్‌లాగా. ఆయన చెబుతున్న దాన్నిబట్టి, 1879 అక్టోబరులో "ది నేషన్" పత్రిక ప్రచురించిన ఒక ఆసక్తికరమైన వ్యాసంలో ఈ కింది వాక్యాలున్నాయి: "నూతన కల్పనల అభివృద్ధితో పాటు కార్మిక ప్రజలు తమ సంస్కృతిని పెంచుకోలేరు. తమ ముందు కుప్పతెప్పలుగా గుమ్మరించిన వస్తువులను ఎలా ఉపయోగించుకోవాలో వారికి తెలీదు. కాబట్టి వాటికి వారు మార్కెట్‌గా రూపొందలేరు." (ప్రతి పెట్టుబడిదారూ సహజంగానే తన సరుకులను కార్మికులు కొనుగోలు చేయాలని కోరుకుంటాడు.) "తాను ఎంత సంపాదిస్తున్నాడో అంతే సంపాదిస్తున్న మత గురువూ, న్యాయవాదీ, డాక్టరూ కోరుకున్నన్ని సౌకర్యాలను కార్మికుడు కూడా ఎందుకు కోరుకోరాదో కారణం కనిపించడం లేదు." (ఈ న్యాయవాదుల, మత గురువుల, డాక్టర్ల వర్గం అనేక సౌకర్యాలను

వాస్తవంలో కేవలం కోరుకోవడంతోనే సంతృప్తిపడవలసి ఉంటుంది.) "ఏమైనా అలాంటి కోరికలు అతనికి లేవు. ఎందుకంటే వివేకవంతమైన, ఆరోగ్యకరమైన ప్రక్రియల ద్వారా అతడు వినియోగదారుడుగా ఎదిగేలా చేయడం ఎలా అనే సమస్య తేలకుండా ఉంది; అది అంత తేలికైన సమస్య ఏమీ కాదు. ఎందుకంటే అతడి ఆకాంక్ష తన పనిగంటలను తగ్గించుకోవడం మించి వెళ్ళదు; వాగాడంబరులు కార్మికుణ్ణి ఆ పని చేయమని రెచ్చగొడతారే తప్ప అతడి మానసిక, నైతిక శక్తులను పెంచడం ద్వారా అతడి పరిస్థితిని మెరుగుపరచరు." (Reports of H.M's secretaries of Embassy and Legation on the Manufacturers, Commerce etc. of the countries in which they reside. London, 1879, p. 404)

కార్మికుని మానసిక, నైతిక శక్తులను పెంచడం ద్వారా అతడి పరిస్థితిని మెరుగుపరచి, అతణ్ణి సహేతుకమైన వినియోగదారునిగా చేసే ఆరోగ్యప్రదమైన, సత్యమైన ప్రక్రియల రహస్యం సుదీర్ఘమైన పనిగంటలే అనిపిస్తుంది. పెట్టుబడిదారుడి సరుకులకు సహేతుకమైన వినియోగదారుడిగా తయారుకావడానికి అతడు అన్నిటికంటే ముందు తన శ్రమశక్తిని అవివేకంగా, అనారోగ్యకరంగా తన పెట్టుబడిదారుని వినియోగించుకోనివ్వాలి. అయితే లెక్చర్లు దంచి జనాన్ని రెచ్చగొట్టే వారు దానిని అనుమతించరు! వివేకవంతమైన వినియోగానికి పెట్టుబడిదారుడు చెప్పే అర్థం, ట్రక్ పద్ధతిలో అతడు తన సొంత కార్మికులతో నేరుగా వ్యాపారం చేయడానికి దయతో దిగివచ్చిన ప్రతిచోటా స్పష్టమవుతోంది. ఈ వ్యాపారంలో కార్మికులకు ఇళ్ళు ఇవ్వడం కూడా చేరి ఉంది. అలా చేసే పెట్టుబడిదారు అదే సమయంలో కార్మికుల అద్దె ఇళ్ళకు యజమానిగా కూడా వ్యవహరిస్తాడు – అనేక వ్యాపార శాఖల్లో ఇదీ ఒకటి.

కార్మికవర్గాన్ని ఉద్ధరించేందుకు పెట్టుబడిదారు చేసే ప్రయత్నాలకు ముగ్ధుడైపోయిన అదే డ్రుమాండ్ అదే నివేదికలో, ఇతర విషయాలతో పాటు మరో విషయం గురించి కూడా చెప్తాడు. అది లోవెల్, లారెన్స్‌ల బట్టల మిల్లులకు సంబంధించిన విషయం. ఫ్యాక్టరీలలో పనిచేసే అమ్మాయిలకు ఉద్దేశించిన భోజన, విశ్రాంతి గృహాలు మిల్లు యజమానులకు చెందినవి. ఆ ఇళ్ళ వ్యవహారాలను చూచే స్త్రీలు కూడా, అదే కంపెనీచే నియుక్తులైనారు. వారికి ఆ కంపెనీ ప్రవర్తనా నిబంధనావళిని నిర్దేశిస్తుంది. రాత్రి 10 గంటల దాటిన తర్వాత ఏ అమ్మాయి బయట ఎక్కడా ఉండడానికి వీల్లేదు. ఇప్పుడు ఆణిముత్యం లాంటి నిబంధన వస్తుంది చూడండి : ఆ నిబంధనను ఉల్లంఘించకుండా చూసేందుకు ఆ మైదానంలో ప్రత్యేక పోలీసుదళం గస్తీ తిరుగుతూంటుంది. రాత్రి 10 గంటలు దాటితే ఏ అమ్మాయి బయటకు వెళ్లకూడదు, బయటినుంచి లోపలకు రాకూడదు. ఏ అమ్మాయీ కంపెనీ ఆవరణలో మినహా మరెక్కడా నివసించరాదు. అలాంటి ప్రతి గృహం నుంచి కంపెనీకి వారానికి దాదాపు 10 డాలర్లు అద్దె రూపంలో ముట్టుతుంది. వివేకవంతుడైన వినియోగదారుణ్ణి అతని మహోజ్వల స్థితిలో ఇదిగో చూడండి : "అత్యుత్తమ సౌకర్యాలున్న పని అమ్మాయిల బోర్డింగ్ వసతి గృహాలు చాలావాటిలో నిత్యం పియానో ఉంటుంది కాబట్టి ఆ అమ్మాయి శ్రద్ధాసక్తుల్లో గణనీయమైన భాగాన్ని వాద్య సంగీతం, గానం, నృత్యం పాలుపంచుకొంటాయి. 10 గంటల పాటు మగ్గాల దగ్గర స్థిరంగా పని చేసిన అమ్మాయిలకు నిజమైన విశ్రాంతికంటే విసుగుదల నుంచి ఉపశమనం ఎక్కువ అవసరం. కనీసం వారి విషయంలోనైనా జరుగుతున్నదిదే". (పుట 412)

అయితే కార్మికుణ్ణి వివేకవంతుడైన వినియోగదారుగా తయారుచేసే ప్రధాన రహస్యమేమిటో ఇంకా చెప్పనే లేదు. డ్రుమాండ్ ఓసారి టర్నర్స్ ఫాల్స్ (కానెక్టికట్ నది ప్రాంతం) తాలూకు కత్తులు వగైరా తయారీ ఫ్యాక్టరీలోకి వెళ్ళారు; అక్కడ ఆ కంపెనీ కోశాధికారి అయిన ఓక్మాన్, ముఖ్యంగా డైనింగ్ టేబుల్ మీద ఉపయోగించే చాకులు వగైరా తయారీలో వాటి నాణ్యతలో అమెరికన్‌లు ఇంగ్లీషు వారిని మించిపోయారని చెప్పిన తర్వాత ఇంకా ఇలా చెప్పాడు. "ధరల విషయంలో కూడా మేము ఇంగ్లాండును దెబ్బగొట్టే సమయం ఆసన్నమవుతున్నది; ఇప్పుడు మేము నాణ్యతలో వాళ్ళకంటే ముందున్నాం; అది అందరూ అంగీకరించిందే; అయితే మేము ధరలను తగ్గించాలి. తక్కువ ధరలకు ఉక్కు సంపాదించి శ్రమ ఖరీదు తగ్గించిన మరుక్షణమే మేము ఆ పని చేయగలం." (పుట 427) వేతనాల తగ్గింపు, పని గంటల పెంపుదల – ఇదీ, కార్మికుణ్ణి వివేకవంతుడైన వినియోగదారుని గౌరవనీయ స్థాయికి ఉద్ధరించడానికి ఉపయోగపడే వివేకవంతమైన, ఆరోగ్యప్రదమైన ప్రక్రియల సారం; పర్యవసానంగా, సంస్కృతీ, నూతన కల్పనల అభివృద్ధి "తమ ముందు కుప్పతెప్పలుగా పోసిన వస్తువులకు వారు మార్కెట్‌గా తయారవుతారు," అన్నమాట.

★ ★ ★

ఫలితంగా, I వ శాఖ తన అదనపు ఉత్పాదితం నుంచి II వ శాఖకు అదనపు స్థిర పెట్టుబడిని సరఫరా చేయవలసి ఉన్నట్లే, II వ శాఖ కూడా I వ శాఖకు అధిక అస్థిర పెట్టుబడిని సరఫరా చేస్తుంది. తన మొత్తం ఉత్పాదితంలో అధిక భాగాన్ని వినియోగానికి అవసరమైన వస్తువుల రూపంలో పునరుత్పత్తి చేయడం ద్వారా, కాబట్టి, ప్రత్యేకించి తన అదనపు ఉత్పాదితంలో అధిక భాగాన్ని ఆ విధంగా పునరుత్పత్తి చేయడం ద్వారా, II వ శాఖ, అస్థిర పెట్టుబడికి సంబంధించినంత వరకు తనకూ, I వ శాఖకు సంచయనం చేస్తుంది.

పెరుగుతున్న పెట్టుబడి ప్రాతిపదికగా గల ఉత్పత్తిలో, I (అ.పె+అ.వి) తప్పనిసరిగా, II స్థి.పె ప్లస్ పెట్టుబడిలో తిరిగి అంతర్భాగంగా చేరే అదనపు ఉత్పాదిత భాగం ప్లస్ II వ శాఖలో ఉత్పత్తి విస్తరణకు అవసరమైన స్థిర పెట్టుబడిలోని అదనపు భాగం – ఈ మూడింటి మొత్తానికి సమానంగా ఉండాలి. ఈ ఉత్పత్తి విస్తరణ ఏ స్థాయిలో లేకపోతే I వ శాఖలో నిజమైన సంచయనం, అంటే నిజమైన ఉత్పత్తి విస్తరణ సాధ్యం కాదో, అది ఆ విస్తరణ కనీస స్థాయి.

ఇప్పుడిక మనం ఆఖరున పరిశీలించిన విషయానికి వద్దాం; ఇందులోని విశేషం ఏమిటంటే, II స్థి.పె, I (అ.పె + $\frac{1}{2}$ అ.వి) కంటే తక్కువ, అంటే వినియోగ వస్తువుల కోసం ఆదాయంగా వ్యయం చేసిన I వ ఉత్పాదిత భాగం కంటే తక్కువ; కనుక 1500 I అ.పె+అ.వి ను మార్పిడి చేయాలంటే, II వ శాఖలో 70కి సమంగా ఉన్నట్టి అదనపు ఉత్పాదిత భాగం, వెంటనే అనుభోగానికి రావలసి ఉంటుంది. 1430కి సమంగా ఉన్న II స్థి.పె విషయానికి వస్తే, II వ శాఖలో సామాన్య పునరుత్పత్తి జరగడానికిగాను, మిగతా అన్ని పరిస్థితుల్లో మార్పు ఉండకపోతే, II స్థి.పెని I (అ.పె+అ.వి)లోని అంతే పరిమాణం గల విలువ భర్తీ చేయాలి. దీని విషయంలో ఇక్కడ ఇంతకంటే ఎక్కువ శ్రద్ధ వహించాల్సిన అవసరం లేదు. కాగా అదనపు 70 II అ.వి విషయం ఇందుకు భిన్నం.

I వ శాఖ విషయంలో, వినియోగ వస్తువుల చేత ఆదాయం కేవలం భర్తీ అయింది. అంటే, వినియోగానికి ఉద్దేశించిన కేవలం సరుకు మార్పిడి అది. కాని II వ శాఖ విషయంలోనేమో సామాన్య పునరుత్పత్తి విషయంలోలాగా కేవలం సరుకు పెట్టుబడి రూపంలోని స్థిర పెట్టుబడి తన పాదార్థిక రూపంలోకి పునఃపరివర్తన చెందడం మాత్రమే కాదు; ఇది ఇక్కడ సంచయనం యొక్క ప్రత్యక్ష ప్రక్రియ; వినియోగ వస్తువుల రూపంలోని దాని అదనపు ఉత్పాదితం స్థిర పెట్టుబడి రూపంలోకి చెందే పరివర్తన. I వ శాఖ కనుక డబ్బు రూపంలోని 70 పౌండ్లతో (అదనపు విలువ పరివర్తన కోసం నిల్వ చేసినది) 70 II అ.వి ని కొనుగోలు చేస్తే, II వ శాఖ 70 I అ.వి ని కొనుగోలు చేయడానికి ఆ 70 పౌండ్లను వినియోగించకుండా దాన్ని డబ్బు పెట్టుబడిగా సంచయనం చేస్తే, అప్పుడు ఈ డబ్బు పెట్టుబడి ఎల్లప్పుడూ అదనంగా వచ్చి చేరిన ఉత్పాదితం యొక్క వ్యక్తీకరణే. (ఇదీ అచ్చంగా II వ శాఖ అదనపు ఉత్పాదితం వ్యక్తీకరణ. ఇది దానిలోని ఒక సమభాగమే కనుక.) ఇది ఉత్పత్తిలోకి తిరిగి ప్రవేశించే ఉత్పాదితం కానప్పటికీ, అది అటువంటి వ్యక్తీకరణే. అయితే అలాంటప్పుడు II వ శాఖలోని ఈ డబ్బు సంచయనం, అదే సమయంలో, ఉత్పత్తి సాధనాల రూపంలో 70 I అ.వి అమ్మకం కాజాలదనే సంగతిని వ్యక్తం చేస్తోంది. II వ శాఖలో పునరుత్పత్తి విస్తరణ జరక్కపోవడంతో పాటుగా, I వ శాఖలో తదనుగుణమైన సాపేక్ష అమితోత్పత్తి ఉంటుంది.

ఇంతే కాదు, I వ శాఖ నుంచి డబ్బుగా వచ్చిన 70, 70 I అ.వి ని II వ శాఖ కొనడం ద్వారా సంపూర్ణంగా కానీ, పాక్షికంగా కానీ తిరిగి I వ శాఖకు వాపస్ వచ్చేదాకా, డబ్బు రూపంలోని ఈ 70 II వ శాఖ చేతుల్లో, అదనపు ఆచరణాత్మక డబ్బు పెట్టుబడిగా ఉండిపోతుంది. I, II వ శాఖల సరుకులు తమ స్థానాలను పరస్పరం భర్తీ చేయడం వల్ల డబ్బు దాని ప్రారంభ బిందువులకు చేరుకునే దాకా, ఆ శాఖల మధ్య ప్రతి మార్పిడికీ ఈ విషయం వర్తిస్తుంది. అయితే మామూలుగా ఇక్కడ డబ్బు తాత్కాలికంగా విడుదల అయిన అదనపు డబ్బు అంతా తక్షణమే అదనపు డబ్బు పెట్టుబడిగా పని చేసే పరపతి వ్యవస్థలో – ఇలా తాత్కాలికంగా మాత్రమే విడుదల అయిన డబ్బు పెట్టుబడి ఎక్కడైనా ఇరుక్కొనిపోవచ్చు. ఉదాహరణకు, ఇతర పరిశ్రమల్లో ఉండిపోయిన అదనపు ఉత్పాదితాలను అది అనుభోగానికి తీసుకురావలసి ఉండగా, I వ శాఖలో కొత్త పరిశ్రమలకు ఉపకరించవచ్చు. II వ శాఖ స్థిర పెట్టుబడితో 70 I అ.వి ని విలీనం చేయాలంటే అదే సమయంలో II వ శాఖ అస్థిర పెట్టుబడిని 14 మేరకు పెంచాల్సి ఉంటుందని కూడా ఇక్కడ గుర్తుంచుకోవాలి. అంటే, I స్థి.పె పెట్టుబడిలో అదనపు ఉత్పాదితం I అ.విని నేరుగా అంతర్భాగంగా చేసినట్లే, II వ శాఖలో పునరుత్పత్తి అప్పటికే జరుగుతూందని, అది అదనపు ఉత్పాదితాన్ని పెట్టుబడిగా మార్చే ధోరణి గలదనీ అర్థం. ఇంకో విధంగా చెప్తే, అదనపు ఉత్పాదితంలో జీవనావసరాల రూపంలోని భాగం విస్తరణ చెందుతుందని అర్థం.

★ ★ ★

రెండవ ఉదాహరణలో 500 I అ.వి ని పెట్టుబడిగా మార్చాలంటే, ఉత్పాదితం 9000 పునరుత్పత్తి కోసం ఈ క్రింది విధంగా పంపిణీ కావాలని మనం చూశాం; మనం ఇక్కడ సరుకులను మాత్రమే పరిశీలనలోకి తీసుకుని డబ్బు చలామణిని విస్మరిస్తున్నాము.

I. 5000 స్థి.పె + 500 అ.వి (పెట్టుబడిగా మార్చబడవలసినది) + 1500 (అ.పె + అ.వి) వినియోగ నిధి. ఇది సరుకుల రూపంలోని 7000కు సమానం.

II. 1500 స్థి.పె + 299 అ.పె + 201 అ.వి. ఇది సరుకుల రూపంలోని 2,000కు సమానం. మొత్తం, సరుకుల రూపంలో 9,000.

పెట్టుబడీకరణ ఈ క్రింది విధంగా జరుగుతుంది :

I వ శాఖలో పెట్టుబడిగా మార్చబడుతున్న 500 అ.వి ఇలా విభజితమవుతుంది : $\frac{5}{6}$ లేదా 417 స్థి.పె + $\frac{1}{6}$ లేదా 83 అ.పె. ఈ 83 అ.పె అంతే మొత్తాన్ని II అ.వి నుంచి ఉపసంహరించు కుంటుంది; II అ.వి స్థిర పెట్టుబడి అంశాలను కొనుగోలు చేసి వాటిని II స్థి.పెకి చేర్చుతుంది. II స్థి.పె 83 మేరకు పెరిగిందంటే II అ.పె 83లో అయిదింట ఒక వంతు, లేదా 17 పెరిగినట్లే. ఈ మార్పిడి జరిగాక ఇలా ఉంటుంది :

I. (5,000 స్థి.పె + 417 అ.వి) స్థి.పె + (1,000 అ.పె + 83 అ.వి) అ.పె = 5,417 స్థి.పె + 1,083 అ.పె = 6,500

II. (1,500 స్థి.పె + 83 అ.వి) స్థి.పె + (299 అ.పె + 17 అ.వి) అ.పె = 1,583 స్థి.పె + 316 అ.పె = 1,899

---

మొత్తం... 8,399

---

I వ శాఖ పెట్టుబడి 6,000 నుంచి 6,500కు, లేదా $\frac{1}{12}$ వంతు పెరిగింది. II వ శాఖ పెట్టుబడి 1,715 నుంచి 1,899కి, లేదా దాదాపు $\frac{1}{9}$ వంతు పెరిగింది.

ఈ ప్రాతిపదికపై పునరుత్పత్తి రెండవ సంవత్సరాంతం నాటికి పెట్టుబడిని ఈ క్రింది విధంగా పెంచుతుంది.

I. (5,417 స్థి.పె + 452 అ.వి) స్థి.పె + (1,083 అ.పె + 90 అ.వి) అ.పె = 5,869 స్థి.పె + 1,173 అ.పె = 7,042

II. (1,583 స్థి.పె + 42 అ.వి + 90 అ.వి) స్థి.పె + (316 అ.పె + 8 అ.వి) అ.పె = 1,715 స్థి.పె + 342 అ.పె = 2,057

మూడవ సంవత్సరాంతం నాటికి ఉత్పాదితం ఈ క్రింది విధంగా ఉంటుంది :

I. 5,869 స్థి.పె + 1,173 అ.పె + 1,173 అ.వి

II. 1,715 స్థి.పె + 342 అ.పె + 342 అ.వి

ఇంతకు ముందులాగే I వ శాఖ కనుక తన అదనపు విలువలో సగభాగాన్ని సంచయనం చేసినట్లయితే I (అ.పె + $\frac{1}{2}$ అ.వి) నుంచి 1,173 అ.పె + 587 ($\frac{1}{2}$ అ.వి) లభిస్తుందని తెలుస్తూనే ఉంది. ఇది 1,760 కి సమానం, లేక మొత్తం 1,715 II స్థి.పె కంటే 45 ఎక్కువ. ఇంతే పరిమాణంలో ఉత్పత్తి సాధనాలను II స్థి.పెకి బదలాయించడం ద్వారా తిరిగి రెంటి మధ్య సమతులనం ఉండేలా చూడాలి. అప్పుడు II స్థి.పె 45 మేరకు పెరుగుతుంది. అంటే II అ.పె, $\frac{1}{5} \times 45$ లేక 9 మేరకు

పెరగాలన్న మాట. ఆ తర్వాత పెట్టుబడిగా మార్చబడిన 587 I అ.వి, $\frac{5}{6}$ గానూ, $\frac{1}{6}$ గానూ అంటే 489 స్థి.పె గానూ, 98 అ.పె గానూ విభజితమవుతుంది. ఈ 98 మూలంగా, II వ శాఖలో స్థిర పెట్టుబడికి 98 అధికంగా చేరిందన్న మాట. ఇది తిరిగి II వ శాఖ అస్థిర పెట్టుబడిని $\frac{1}{5}$ మేరకు, లేదా 20 మేరకు పెంచుతుంది. అప్పుడు ఇలా ఉంటుంది.

I. (5,869 స్థి.పె + 489 అ.వి) + (1,173 అ.పె + 98 అ.వి)
అ.పె = 6,358 స్థి.పె + 1,271 అ.పె = 7,629

II. (1,715 స్థి.పె + 45 అ.వి + 98 అ.వి) స్థి.పె + (342 అ.పె +
9 అ.వి + 20 అ.వి) స్థి.పె = 1,858 స్థి.పె + 371 అ.పె = 2,229

మొత్తం పెట్టుబడి = 9,858

మూడేళ్ళుగా వృద్ధి చెందుతున్న పునరుత్పత్తిలో I వ శాఖ మొత్తం పెట్టుబడి 6,000 నుంచి 7,629కి, II వ శాఖ మొత్తం పెట్టుబడి 1,715 నుంచి 2,229కి పెరిగింది. కనుక మొత్తం సామాజిక పెట్టుబడి 7,715 నుంచి 9,858కి పెరిగింది.

## 3. సంచయనంలో II స్థి.పె భర్తీ అయ్యే క్రమం

II స్థి.పెతో I (అ.పె+అ.వి) మార్పిడి చెందడంలో ఈ విధంగా వేరు వేరు సందర్భాలు మనకు కనిపిస్తున్నాయి.

సామాన్య పునరుత్పత్తిలో అవి సమంగా ఉండి ఒకదాని స్థానాన్ని మరొకటి భర్తీ చేసుకుంటాయి. ఎందుచేతనంటే, అలా కాకపోతే మనం పైన గమనించినట్లుగా సామాన్య పునరుత్పత్తి నిరాటంకంగా ముందుకు సాగదు.

సంచయనం విషయంలో అన్నిటికంటే ప్రధానంగా పరిగణనకు తీసుకోవాల్సింది సంచయనం రేటును. మునుపటి ఉదాహరణలలో I వ శాఖలో సంచయనం రేటు $\frac{1}{2}$ అవి I కి సమానంగా ఉంటుందని, అది ఏటా మార్పు లేకుండా యధాతథంగా ఉంటుందని మనం ఊహించుకొన్నాం. ఇలా సంచయనం అయిన పెట్టుబడి అస్థిర పెట్టుబడిగానూ, స్థిర పెట్టుబడిగానూ విభజింపబడిన నిష్పత్తిని మాత్రమే మనం మార్చాము. అప్పుడు మూడు ఉదాహరణలను మనం తీసుకొన్నాము.

1) II స్థి.పెకి (అ.పె+$\frac{1}{2}$ అ.వి) సమానంగా ఉన్న ఉదాహరణ. ఇందులో I (అ.పె+ అ.వి) కంటే II స్థి.పె తక్కువ. ఇది ఎల్లప్పుడూ ఇలాగే ఉంటుంది. అలా ఉండకపోతే I వ శాఖ సంచయనం చేయలేదు.

2) II స్థి.పె కంటే I (అ.పె+$\frac{1}{2}$ అ.వి) ఎక్కువగా ఉన్న ఉదాహరణ. ఈ ఉదాహరణలో II అ.వి నుంచి తదనుగుణమైన భాగాన్ని II స్థి.పెకి చేర్చి, దాన్ని I (అ.పె+$\frac{1}{2}$ అ.వి)తో సమానంగా చేయడం ద్వారా, అవి ఒకదాని స్థానాన్ని మరొకటి భర్తీ చేయగలుగుతాయి. ఇక్కడ II వ శాఖ విషయంలో II స్థి.పె స్థానాన్ని భర్తీ చేసే క్రమం స్థిర పెట్టుబడి యొక్క సామాన్య పునరుత్పత్తి కాదు; ఇది సంచయనమే; అంటే I వ శాఖ ఉత్పత్తి సాధనాల కోసం తన అదనపు ఉత్పాదితంలో ఎంత భాగాన్ని మార్పిడి చేస్తుందో ఆ మేరకు దాని స్థిర పెట్టుబడి వృద్ధి చెందిందన్న మాట. అది ఇలా వృద్ధి

చెందిందంటే, అదే సమయంలో II వ శాఖ అదనపు ఉత్పాదితం నుంచే దాని అస్థిర పెట్టుబడికి కూడా తదనుగుణమైన మొత్తం చేర్చారన్నమాట.

3) II స్థి.పె కంటే I (అ.పె+$\frac{1}{2}$ అ.వి) తక్కువగా ఉన్న ఉదాహరణ. ఈ ఉదాహరణలో II వ శాఖ మార్పిడి ద్వారా తన స్థిర పెట్టుబడిని పూర్తిగా పునరుత్పత్తి చేసుకోదు. అందుచేత I వ శాఖ నుంచి కొనుగోలు చేయడం ద్వారా ఆ లోటును భర్తీ చేసుకోవలసి ఉంటుంది. అయితే దీని మూలంగా II వ శాఖ అస్థిర పెట్టుబడి మరింత సంచయనం కాదు. ఎందుచేతనంటే ఈ కార్యకలాపం ద్వారానే దాని స్థిర పెట్టుబడి పూర్తిగా పునరుత్పత్తి అవుతుంది. మరోవైపు, అదనపు డబ్బు పెట్టుబడిని మాత్రమే సంచయనం చేసే I వ శాఖ పెట్టుబడిదార్లు ఈ లావాదేవీ ద్వారా అప్పటికే ఈ సంచయనం కొంతవరకు సాధించారు.

II స్థి.పెకి I (అ.పె+అ.వి) సమానంగా ఉంటుంది అనే సామాన్య పునరుత్పత్తి యొక్క మూల సూత్రం, పెట్టుబడిదారీ ఉత్పత్తికి విరుద్ధమైనది. అయితే పది పదకొండేళ్ళ పారిశ్రామిక చక్రగమనంలో ఏదో ఒక సంవత్సరంలో అంతకు మునుపు సంవత్సరంలో కంటే మొత్తం ఉత్పత్తి తక్కువగా ఉండే అవకాశాన్ని మాత్రం ఇది త్రోసిపుచ్చదు; అంటే మునుపటి సంవత్సరంతో పోల్చితే సామాన్య పునరుత్పత్తి కూడా జరగదన్నమాట. అంతేకాక, జనాభాలో ఏటా సహజమైన పెరుగుదల ఉంటుందన్న వాస్తవాన్ని పరిగణనలోకి తీసుకుంటే, తదనుగుణమైన అధిక సంఖ్యలో అనుత్పాదకులైన సేవకులు, మొత్తం అదనపు విలువ అయిన 1,500లో పాలు పంచుకునే మేరకు సామాన్య పునరుత్పత్తికి వీలుంది. కాని ఇలాంటి పరిస్థితుల్లో, పెట్టుబడి సంచయనం, అంటే నిజమైన పెట్టుబడిదారీ ఉత్పత్తి అసాధ్య మవుతుంది. అందుచేత I (అ.పె+అ.వి)కి II స్థి.పె సమానం కావడమే కాక, దాన్నికన్నా ఎక్కువ కావచ్చు కూడా. దీని అర్థం II వ శాఖలో అమితోత్పత్తి జరగడమే. వ్యాపారం కుప్పకూలిపోవడం ద్వారా తప్ప ఇది సర్దుబాటు కాదు. దీని పర్యవసానంగా II వ శాఖకు చెందిన కొంత పెట్టుబడి I వ శాఖకు బదిలీ అవుతుంది.

వ్యవసాయంలో ఇంట్లో ఉత్పత్తి చేసిన విత్తనాలను వినియోగించుకొనే సందర్భాలలోలాగే, II వ శాఖ స్థిర పెట్టుబడిలోని ఒక భాగం తన్ను తాను పునరుత్పత్తి చేసుకున్నప్పటికీ, I (అ.పె+అ.వి)కీ II స్థి.పెకీ మధ్య గల సంబంధంలో ఎలాంటి మార్పు రాదు. I స్థి.పె లాగానే, II స్థి.పెలోని ఈ భాగాన్ని కూడా I, II వ శాఖల మధ్య మార్పిడికి సంబంధించి, పరిగణనలోకి తీసుకోవాల్సిన పనిలేదు. లేక II వ శాఖ ఉత్పాదితాల్లో ఒక భాగం I వ శాఖలో ఉత్పత్తి సాధనాలుగా ప్రవేశించ గలిగినప్పటికీ, అసలు పరిస్థితిలో మార్పు ఉండదు. I వ శాఖ సరఫరా చేసే ఉత్పత్తి సాధనాల్లో ఒక భాగం దానికి ప్రతిఫలమవుతుంది; సామాజిక ఉత్పత్తిలోని రెండు పెద్ద వర్గాల మధ్య, అంటే ఉత్పత్తి సాధనాల ఉత్పాదకుల, వినియోగ వస్తువుల ఉత్పాదకుల మధ్య మార్పిడి రూపాన్ని దాని పరిశుద్ధ రూపంలో, నగ్నరూపంలో మనం పరిశీలించాలనుకుంటే, ప్రారంభంలోనే ఆ భాగాన్ని రెండువైపులా వ్యవకలనం చేయాలి.

కనుక పెట్టుబడిదారీ ఉత్పత్తి పద్ధతిలో I (అ.పె+అ.వి) అన్నది II స్థి.పెకి సమంగా ఉండ జాలదు; ఇంకో విధంగా చెప్పాలంటే, పరస్పర మార్పిడిలో వాటి రెండింటి మధ్య సమతులనం

కుదరదు. మరోవైపు I వ శాఖ పెట్టుబడిదార్లు ఆదాయంగా ఖర్చు పెట్టిన II అ.విలోని భాగం I $\frac{\text{అవి}}{X}$ అని అనుకొంటే, I (అ.పె+$\frac{\text{అవి}}{X}$) ఎల్లప్పుడూ II స్థి.పెకి సమానంగా లేదా ఎక్కువగా లేదా తక్కువగా ఉండవచ్చు. అయితే II అ.విలో II వ పెట్టుబడిదారులు ఎట్టి పరిస్థితుల్లోనైనా సరే వ్యయం చేసి తీరవలసిన భాగం మేరకు I (అ.పె+$\frac{\text{అవి}}{X}$) ఎల్లప్పుడూ II (స్థి.పె+అ.వి) కంటే తక్కువగా ఉండాలి.

సంచయనం గురించిన ఈ వివరణలో ఒక విషయం గమనించాలి; తన తోడ్పాటుతో ఉత్పత్తి అయిన సరుకు పెట్టుబడి విలువలో స్థిర పెట్టుబడి ఒక భాగంగా ఉన్న మేరకు, స్థిర పెట్టుబడి విలువను ఇక్కడ కచ్చితంగా చూపలేదు. కొత్తగా సంచయనం అయిన స్థిర పెట్టుబడిలోని నిశ్చల భాగం, ఆయా నిశ్చల భాగాల భిన్న స్వభావాలనుబట్టి క్రమేపీ, దశలవారీగా మాత్రమే సరుకు పెట్టుబడిలోకి ప్రవేశిస్తుంది; కాబట్టి ముడి పదార్థాలు, సగం తయారీ సరుకులు వగైరా పెద్ద పరిమాణాల్లో సరుకుల ఉత్పత్తిలోకి ప్రవేశించిన సందర్భాలలో, చాలా వరకు సరుకు పెట్టుబడిగా ఉండేది, చలామణిలోని స్థిర భాగాలను అస్థిర పెట్టుబడిని భర్తీ చేసేవే. (అయితే, చలామణి అంతర్భాగాల ప్రత్యేకమైన టర్నోవర్‌ను బట్టి, ఈ వివరణ పద్ధతిని అనుసరించవచ్చు. అప్పుడు చలామణి అవుతున్న భాగమూ, దానికి నిశ్చల పెట్టుబడి నుంచి బదిలీ అయిన విలువ భాగమూ, ఈ రెండూ, ఒక సంవత్సరంలో ఎంత తరచుగా టర్నోవర్ అవుతాయంటే ఆ సంవత్సరం సరఫరా అయిన సరుకుల విలువ, వార్షిక ఉత్పత్తిలో ప్రవేశించిన మొత్తం పెట్టుబడి విలువకు సమానంగా ఉంటుందని ఊహించుకొంటున్నాము.) కాని యాంత్రిక పరిశ్రమకు ముడి పదార్థాలు లేకుండా కేవలం అనుబంధ పదార్థాలు మాత్రమే ఉపయోగించే ప్రతిచోటా, అ.పె కి సమానంగా ఉన్న శ్రమ భాగం తప్పనిసరిగా సరుకు పెట్టుబడిలో దాని పెద్ద భాగంగా పునర్దర్శనమివ్వాలి. నిశ్చల భాగాలు నియమిత వ్యవధుల్లో ఉత్పాదితానికి ఎక్కువ విలువ అందజేస్తాయా లేక తక్కువ విలువ అందజేస్తాయా అన్న విషయంతో నిమిత్తం లేకుండా లాభం రేటును లెక్కగట్టడంలో అదనపు విలువను మొత్తం పెట్టుబడినిబట్టి లెక్క గడతాము. కానీ, నియమిత వ్యవధుల్లో ఉత్పత్తి అయ్యే సరుకు పెట్టుబడి యొక్క విలువను లెక్కగట్టడంలో, స్థిర పెట్టుబడిలోని నిశ్చల భాగాన్ని, తరుగుదల ద్వారా ఉత్పాదితానికి సగటున అందజేసే విలువ మేరకు మాత్రమే ఆ నిశ్చల భాగాన్ని సరుకు పెట్టుబడి విలువలో చేర్చాలి.

## IV. అనుబంధ వ్యాఖ్యలు

II స్థి.పెలోని ఒక భాగంతో మార్పిడి అయిన I వ శాఖ బంగారం పరిశ్రమ యొక్క అ.పె+అ.వి.యే II వ శాఖ డబ్బుకు మూలాధారం. బంగారం ఉత్పాదకుడు అదనపు విలువను సంచయనం చేసిన మేరకు, లేక దానిని I వ శాఖ ఉత్పత్తి సాధనాలుగా మార్చిన మేరకు, అంటే అతడు తన ఉత్పత్తిని విస్తరింపచేసిన మేరకు అతని అ.పె+అ.వి II వ శాఖలోకి ప్రవేశించదు. మరోవైపు, బంగారం ఉత్పాదకునికి సంబంధించిన, డబ్బు సంచయనం అంతిమంగా విస్తృత స్థాయిలో పునరుత్పత్తికి దారి తీస్తుంది. బంగారం ఉత్పత్తి తాలూకు అదనపు విలువలో ఆదాయంగా ఖర్చు పెట్టబడని ఒక భాగం బంగారం ఉత్పాదకుని అదనపు అస్థిర పెట్టుబడిగా II వ శాఖలోకి వెళ్ళిపోతుంది; ఇక్కడ ఇది కొత్త నిల్వ నిధుల నిర్మాణానికి దోహదం చేస్తుంది; లేదా I వ శాఖకు నేరుగా అమ్మకుండానే దానినుండి

కొనుగోలు చేయడానికి అవసరమైన కొత్త సాధన సంపత్తిని సరఫరా చేస్తుంది. బంగారం ఉత్పత్తిలోని ఈ I (అ.పె+అ.వి) ద్వారా లభించిన డబ్బునుంచి, II లోని కొన్ని ఉత్పత్తి శాఖలకు ముడిపదార్థం వగైరాల కోసం, ఒక ముక్కలో చెప్పాలంటే, వాటి స్థిర పెట్టుబడి భర్తీ కోసం అవసరమైన బంగారాన్ని తీసివేయవలసి ఉంటుంది. I వ, II వ శాఖ మధ్య మార్పిడిలో, ప్రాథమిక నిల్వ నిధుల నిర్మాణం కోసం – భవిష్యత్తులో విస్తృత పునరుత్పత్తి కోసం – అవసరమైన అంశం ఉంది; I వ శాఖ I అ.విలోని ఒక భాగం ఏకపక్షంగా II కు అమ్మి, దానికి సమతూకమైన కొనుగోలు చేయకపోతే, II వ శాఖలో అది అదనపు స్థిర పెట్టుబడిగా పనిచేస్తుంది. అప్పుడు I వ శాఖలో నిల్వ నిధి ఏర్పడుతుంది. I వ శాఖ అదనపు అస్థిర పెట్టుబడి కోసం II వ శాఖలో నిల్వ నిధి ఏర్పడుతుంది. అంతేకాక, I వ శాఖ ఆదాయంగా ఖర్చు పెట్టిన అదనపు విలువలోని ఒక భాగం కనుక II స్థి.పెగా మారకపోతే, అంటే, దానితో II అ.విలోని ఒక భాగం కొనుగోలై అది డబ్బుగా మారితే II వ శాఖలో ఈ నిల్వ నిధి ఏర్పడుతుంది. II స్థి.పె కంటే I (అ.పె+$\frac{\text{అవి}}{x}$) ఎక్కువగా ఉండే పక్షంలో, II అ.వి నుంచి I వ శాఖ వ్యయం చేసి, దాన్ని II స్థి.పె తన సామాన్య పునరుత్పత్తి కోసం I సరుకులతో భర్తీ చేయాల్సిన అవసరం లేదు. ఇప్పుడిక II వ శాఖ పెట్టుబడిదార్ల మధ్య జరిగే మార్పిడి పరిధిలోనే ఏ మేరకు నిల్వ నిధి ఏర్పడుతుంది అన్న ప్రశ్న తలెత్తుతుంది. వీరి మధ్య జరిగే మార్పిడి II అ.వి యొక్క పరస్పర మార్పిడి మాత్రమే II అ.విలోని ఒక భాగం నేరుగా అస్థిర పెట్టుబడిగా పరివర్తన చెందడం వల్ల II వ శాఖ పరిధిలో నేరుగా సంచయనం జరుగుతుందన్న విషయం మనకు తెలుసు. (I వ శాఖలో I అ.విలోని ఒక భాగం నేరుగా స్థిర పెట్టుబడిగా పరివర్తన చెందినట్లే ఇదీను.) II వ శాఖ తాలూకు వివిధ పారిశ్రామిక విభాగాల్లోనూ, ఒకే పారిశ్రామిక విభాగంలోని వ్యష్టి పెట్టుబడిదారుల విషయంలోనూ వివిధ కాలాల నుంచి జరుగుతున్న సంచయనానికి, I వ శాఖలోలాగానే, తదవసరమైన మార్పులతో కారణాలను వివరించవచ్చు. కొందరు ఇంకా నిల్వ చేసే దశలోనే ఉంటారు. వారు కొనుగోలు చేయకుండా అమ్ముతుంటారు. మరి కొందరేమో వాస్తవంగా పునరుత్పత్తిని విస్తరింపజేసే దశలో ఉంటారు. వారు అమ్మకుండా కొనుగోలు చేస్తుంటారు. అదనపు అస్థిర డబ్బు పెట్టుబడిని మొదట అదనపు శ్రమశక్తికై మదుపు పెట్టే మాట నిజమే. అయితే, కార్మికుల వినియోగంలోకి ప్రవేశించే అదనపు వినియోగ వస్తువులను నిల్వ చేసే యజమానుల నుంచి జీవనావసరాలను కొనుగోలు చేయడానికి శ్రమశక్తి ఆ డబ్బును వాడుతుంది. ఈ యజమానుల నిల్వ నిర్మాణానికి అనుగుణమైన నిష్పత్తిలో, ఆ డబ్బు తాను బయలుదేరిన స్థానానికి తిరిగి రాదు. వారు దాన్ని నిల్వ చేస్తారు.

# రచయితల సూచిక


ఎ

ఆడమ్స్ విలియం (1797–1872)

అలెంబెర్త్ దీ జేన్‌లెరాన్డ్ (1717–1783)

అరివాబెన్ గియొవన్ని (1787–1881)

బి

బెయిలీ శామ్యూల్ (1791–1870)

బేక్‌వెల్ రాబర్ట్ (1725–1795)

బార్టన్ జాన్ (18వ శతాబ్దం ఆఖరు నుంచి 19వ శతాబ్దం ఆరంభం దాకా)

బెసెమెర్ హెన్రీ సర్ (1813–1898)

సి

కారీ హెన్రీ ఛార్లెస్ (1793–1879)

చాల్‌మర్స్ థామస్ (1780–1847)

చెర్బులీజ్ ఆంతోయినె ఎలిసీ (1797–1869)

చుప్రోవ్ ఎ.ఐ. (1842–1908)

కార్బెట్ థామస్ ....

కోర్సెల్లి – సెనెయుల్, జీన్‌గుస్తావ్ (1813 –1892)

డి

దెస్తుత్ ద త్రేసీ, ఆంతోయినె లూయీ క్లాడ్, కామ్టే (1754–1836)

డ్రమండ్ వి.ఎ.డబ్ల్యూ. (1833–1907)

ద్యుపాంత్ ద నెమూ, పీర్రె శామ్యూల్ (1739 – 1817)

ఇ

ఎడ్మండ్స్ థామస్ (1803–1889) –XXV

ఎఫ్

ఫిట్జ్ మారిస్...

ఫుల్లార్టన్ జాన్ (1780–1849)

జి

గూచ్ టి

గుడ్ డబ్ల్యూ. వాల్టర్

హెచ్

హాడ్గ్‌స్కిన్ థామస్ (1787–1869)

హోల్డ్స్‌వర్త్ డబ్ల్యు.ఎ.

కె

కిర్చాఫ్ ఫ్రెడరిక్

కోజక్ థియొఫిల్

ఎల్

లాలొర్ జాన్ (1814–1856)

లార్డ్‌నర్ డయొనీసియస్ (1793–1859)

లాసల్లే ఫెర్డినాండ్ (1825–1864)

లావ్‌లే ఎమిలిలూయీ విక్టర్ ద (1822– 1892)

లవర్‌గ్నె లియొనిస్ ద (1809–1880)

లవాషియర్ ఆంతోని లరాంత్ (1743–1794)

లెట్రోస్నె గిల్లోమ్ ఫ్రాంకోయ్ (1728–1780)

లింగెట్ సైమన్ నికలస్ హెన్రీ (1736–1794)

లిస్ట్ ఫ్రెడరిక్ (1789–1846)

ఎమ్

మేబ్లి గాబ్రియెల్ బోన్నాత్ ద (1709–1785)

మాకులోక్ జాన్ రామ్సె (1789–1864)

మెక్ లియోడ్ హెన్రీ డన్నింగ్ (1821–1902)
మాల్తస్ థామస్ రాబర్ట్ (1766–1834)
మార్క్స్ – ఎవెలింగ్ ఎలియనార్ (టుస్సీ) (1855–1898)
మార్క్స్ జెన్నీ (1814–1881)
మార్క్స్ కార్ల్ (1818–1883)
మెయెర్ రుడాల్ఫ్ హెర్మన్ (1839–1899)
మిల్ జేమ్స్ (1773–1836)
మిల్ జాన్‌స్టువార్ట్ (1806–1873)
ముల్లర్ ఆడమ్ హెన్రీక్ (1779–1829)

ఎన్

న్యూమన్ శామ్యూల్ ఫిలిప్స్ (1797–1842)

ఒ

ఒవెన్ రాబర్ట్ (1771–1858)

పి

పాటర్‌సన్ రాబర్ట్ (1821–1886)
పోటర్ ఎ
ప్రీస్ట్లీ జోసెఫ్ (1733–1804)
ప్రౌధాన్ పియరె జోసెఫ్ (1809–1865)

క్యూ

క్వెస్నే ఫ్రాంకోయిస్ (1694–1774)

ఆర్

రామ్సె జార్జి (1800–1871)
రోవ్ కార్ల్ హెన్రీక్ (1792–1870)
రావెన్‌స్టన్ పియర్సె (మ. 1830)
రికార్డో డేవిడ్ (1772–1823)
రాడ్‌బెర్టస్ జోహాన్ కారల్ (1805–1875)
రోశ్చర్ విల్‌హెల్మ్ (1817–1894)
రాస్కోయ్ హెన్రీ ఎన్‌ఫీల్డ్ సర్ (1833–1915)
రసెల్ జాన్ లార్డ్ (1792–1878)

ఎస్

సే జీన్ బాప్టిస్టె (1767–1832)
స్కాఫెల్ ఆల్బర్ట్ ఎబెర్‌హార్డ్ ఫ్రెడరిక్ (1831–1903)
ష్కిలె కార్ల్ విల్‌హెల్మ్ (1742–1786)
షోర్‌లెమర్ కార్ల్ (1834–1892)
స్క్రోప్ జార్జి జూలియస్ పోలెట్ (1797–1876)
సీనియర్ నాసావ్ విలియమ్ (1790–1884)
సిస్మండీ జీన్ ఛార్లెస్ లియోనార్డ్ సిమాండ్ ద (1773–1842–)
స్మిత్ ఆడమ్ (1723–1790)
సోబీర్ జార్జ్ ఆడాల్ఫ్ (1814–1892)
స్టీన్ లొరెంజ్ వాన్ (1815–1890)
స్టూవర్ట్ జేమ్స్ (1712–1780)
స్టార్చ్ హెన్రిక్ ఫ్రెడరిక్ (1766–1835)
స్ట్రాక్ ఆర్చిబాల్డ్

టి

థాంప్సన్ విలియమ్స్ (1785–1833)
టూకే థామస్ (1774–1858)
టర్గోట్ ఆన్నె రాబర్ట్ (1727–1781)
టేలర్ ఎడ్మండ్ బర్నెట్ (1832–1917)

డబ్ల్యూ

వేలాండ్ ఫ్రాన్సిస్ (1796–1865)
విలియమ్స్ ఆర్.పి.

జడ్

జెల్లర్ జె

# పెట్టుబడి రెండవ సంపుటంలో ఉల్లేఖించిన ప్రామాణిక రచయితల, పత్రాల సూచిక

## రచయితలు


ఎ

**ఆడమ్స్ డబ్ల్యు.బి :** రోడ్స్ అండ్ రెయిల్స్ అండ్ దైర్ సీక్వెన్స్ ఫిజికల్ అండ్ మోరల్, 1862.

బి

**బెయిల్ శామ్యూల్ :** ఎ క్రిటికల్ డిసర్టేషన్ ఆన్ ది నేచర్, మెజర్స్ అండ్ కాజెస్ ఆఫ్ వాల్యూ; చీఫ్లీ ఇన్ రిఫరెన్స్ టు ది రైటింగ్స్ ఆఫ్ మిస్టర్ రికార్డో అండ్ హిజ్ ఫాలోయర్స్, బై ది ఆథర్ ఆఫ్ ఎస్సేస్ ఆన్ ది ఫార్మేషన్ అండ్ పబ్లికేషన్ ఆఫ్ ఒపీనియన్స్, వగైరా, లండన్ 1825.

**బార్టన్ జాన్ :** అబ్జర్వేషన్స్ ఆన్ ది సర్కమస్టెన్సెస్ విచ్ ఇన్ఫ్లుయన్స్ ది కండిషన్ ఆఫ్ ది లేబరింగ్ క్లాసెస్ ఆఫ్ సొసైటీ,లండన్ 1817.

సి

**చామర్స్ థామస్ :** ఆన్ ది పొలిటికల్ ఎకానమీ ఇన్ కనెక్షన్ విత్ ది మోరల్ స్టేట్ అండ్ మోరల్ ప్రాస్పెక్ట్స్ ఆఫ్ సొసైటీ సెకండ్ ఎడిషన్, గ్లాస్గో, 1832.

**చుప్రోవ్ ఎ. :** రైల్‌రోడింగ్ పార్ట్ 1, మాస్కో, 1875.

**కార్బెట్ థామస్ :** ఎన్ ఇంక్వైరీ ఇన్ టు ది కాజెస్ అండ్ మోడ్స్ ఆఫ్ ది వెల్త్ ఆఫ్ ఇండివిద్యువల్స్; ఆర్ ది ప్రిన్సిపుల్స్, ఆఫ్ ట్రేడ్ అండ్ స్పెక్యులేషన్ ఎక్స్‌ప్లెయిన్డ్, లండన్, 1841.

**కొర్సెల్లె సినెయుల్, జె.జి. :** త్రెయిత్ థిమరికె ఎట్ ప్రాటిక్ దెస్ ఎన్టర్‌ప్రైజెస్ ఇండస్ట్రియల్, కమర్షియల్ ఎత్ అగ్రికోలెస్ జే మాన్యుయెల్ దె అఫైర్స్, సెకండ్ ఎడిషన్, పారిస్ 1857.

డి

**దెస్తూత్ ది త్రాసీ ఆంటోని :** ఎలిమెంట్స్ ద ఐడియాలజీ, iv-e at v-e పార్టీస్ త్రెయిత్ దలవొ లంతె ఎత్ దెసె ఎఫెత్స్ పారిస్, 1826.

**ద్యుపాంత్ దె నెమోర్, పీయర్రె, సామ్యూల్ :** మక్సిమ్స్ దు డాక్టర్ క్వెస్నే, జేరెస్తూమె దసె ప్రిన్సిసెస్ ద ఎకానమీ సోషియలె, కలెక్షన్ ది ప్రిన్సిపాల్ ఎకానమిస్తెస్ అనే గ్రంథంలో సంపుటం II ఫిజియోక్రాట్స్ పార్ట్ 1. దయిరె, పారిస్, 1846.

జి

**గుడ్, డబ్ల్యు. వాల్టర్ :** పొలిటికల్, అగ్రికల్చరల్ అండ్ కమర్షియల్ ఫాలసీస్, లండన్, 1866.

హెచ్

**హడ్గ్‌స్కిన్ థామస్ :** పాప్యులర్ పొలిటికల్ ఎకానమీ, లండన్, 1827.

**హాల్డ్స్ వర్త్ డబ్ల్యు. ఎ :** ది లా ఆఫ్ లాండ్‌లార్డ్ అండ్ టెనంట్, లండన్, 1857.

కె

**కిర్చాఫ్ ఫ్రెడరిక్ :** హేండ్‌బక్ డెర్ లేండ్ విర్ట్ స్చాఫ్ట్‌లిచెన్ బెట్రీబ్‌స్లెర్. ఎయిన్ లీయిట్ ఫడెన్ ఫూర్ ప్రాక్టిస్చె లేండ్ రిథె జుర్ జ్వెక్ మాసిగెన్

ఎయిన్ రిక్ టుంగ్ ఉండ్ వెర్వాల్టుంగ్ డెర్‌లేండ్ నటేర్ డ్రెస్టెన్, 1852.

ఎల్

**లార్డ్‌నర్ డయొనీసియస్ :** రైల్వే ఎకానమీ; ఎ ట్రీటైజ్ ఆన్ ది న్యూ ఆర్ట్ ఆఫ్ ట్రాన్స్‌పోర్ట్, ఇట్స్ మానేజ్‌మెంట్, ప్రాస్పెక్ట్స్ అండ్ రిలేషన్స్, కమర్షియల్, ఫైనాన్షియల్ అండ్ సోషల్, లండన్, 1850.

**లావిల్లేయీ ఎమిలీ, ది :** ఎస్సైనర్ లా ఎకానమీ రూరలెదె ల బెల్జికె, రెండవ ఎడిషన్, పారిస్, బ్రస్సెల్స్, లీప్జిగ్, 1863.

**లవెర్గ్నె లియోన్స్, డె :** ది రూరల్ ఎకానమీ ఆఫ్ ఇంగ్లండ్, స్కాట్లండ్ అండ్ ఐర్లండ్, లండన్, 1855.

**లెత్రాస్నె గెయిలమే ఫ్రాంకోయిస్ :** దెల ఇంత్రస్త్ సోషియల్ – కలెక్షన్ దె ప్రిన్సిపా ఎకానమిస్త్ అనే గ్రంథంలో నుంచి VII ఫిజియోక్రాట్స్ పార్ట్ II ఎడిషన్, సం.దాయిరె, పారిస్, 1846.

ఎమ్

**మార్క్స్ కార్ల్ :** దాస్ కాపిటల్, క్రిటిక్ డెర్ పొలిటిశ్చెన్ ఓకానమీ, సంపుటం 1.

– దాస్ కాపిటల్, క్రిటిక్ డెర్ పోలిటిశ్చెన్ ఓకానమీ, III.

– లాహ్నర్‌బిట్ ఉండ్ కాపిటల్, న్యూయె రైనిచ్ జేటుంగ్ – 264, 269 సంచికలలో నుంచి కోలొన్, 1849.

– మిసరె దె లా ఫిలాసఫీ, రెస్పొన్స్ అలా ఫిలాసాఫీ దెలా మిసరె పార్ ఎమ్. ప్రొధాన్, పారిస్ – బ్రస్సెల్స్, 1847.

– థియెరియెన్ ఉబెర్‌డెన్ మెహ్రా వర్ట్.

– జుర్ క్రిటిక్ డెర్ షొలిటిశ్చెన్ ఓకానమీ, బెర్లిన్, 1859.

**మెయెర్ రుడాల్ఫ్ :** డెర్ ఎమాన్సిపెటిన్ స్కాంఫ్ డెస్ వెయిర్‌టెన్ స్టాండెన్ I బిడి – బెర్లిన్ – 1874.

**ముల్లెర్, ఆడమ్ హెన్రీక్ :** డై ఎలెమెంటె డెర్ స్టాట్స్‌కుంట్స్ 2 థియొల్, బెర్లిన్, 1809.

ఎన్

**న్యూమన్ శామ్యూల్ ఫిలిప్స్ :** ఎలెమెంట్స్ ఆఫ్ పొలిటికల్ ఎకానమీ, ఆండోవర్ అండ్ న్యూయార్క్, 1835.

పి

**పాటర్, ఎ. :** పొలిటికల్ ఎకానమీ; ఇట్స్ ఆబ్జెక్ట్స్ యూజెస్ అండ్ ప్రిన్సిపుల్స్; కన్సిడర్డ్ విత్ రిఫరెన్స్ టు ది కండిషన్ ఆఫ్ ది అమెరికన్ పీపుల్ విత్ ఎ సమ్మరీ ఫర్ ది యూజ్ ఆఫ్ స్టూడెంట్స్, న్యూయార్క్, 1840.

క్యు

**క్వెస్నె ఫ్రాంకోయిస్ :** ఎనాలిసె ద టేబుల్ **ఎకనమిక్ :** ఇన్ కలెక్షన్ దె ప్రిన్సిపా ఎకానమిస్తెస్ రెండవ సంపుటంలో నుంచి ఫిజియొక్రాట్స్, పార్ట్ I, సం. దెయిరె, పారిస్, 1846.

– దయలోగస్ సర్ లె కామర్సె ఎత్ లెతావాఖ్ ది ప్రిన్సిపా ఎకానమిస్తెస్, V-II ఫిజియొక్రాట్స్ పార్ట్ I, సం. దెయిరె, పారిస్, 1846.

ఆర్

**రామ్సె జార్జ్ :** ఏన్ ఎస్సే ఆన్ ది డిస్ట్రిబ్యూషన్ ఆఫ్ వెల్త్, ఎడింబరో, 1836.

**రికార్డొ డేవిడ్ :** ఆన్ ది ప్రిన్సిపుల్స్ ఆఫ్ పొలిటికల్ ఎకానమి అండ్ టాక్సేషన్. 3వ ఎడిషన్, లండన్, 1821.

**రాడ్ బర్టస్ జగెడ్జొ కార్ల్ :** బ్రీఫ్ ఉండ్ సోషియా పొలిటిశ్చెస్క్, జేఫ్ సాట్జెహర్స్గ్ వాన్ డా. ఆర్. మెయెర్, బర్లిన్, 1881.

– దాస్ కాపిటల్, థియొఫిల్ కొజక్, బెర్లిన్, 1884.

- ఎయినిగె బ్రీఫె వాన్ డా॥ రాడ్‌బర్టస్ యాన్ జె. జడ్ జెయిట్ స్క్రిఫ్ట్ ఫర్ డైగెసామ్జె స్టాట్ స్విసెన్‌స్కాఫ్ట్ అనే గ్రంథంలో, ఫ్రిక్కర్ లీఫ్జిగ్ ష్కాఫెల్, స్టుట్‌గర్ట్, ఎ. వాగ్నర్, బెర్లిన్, బిడి 35, ట్యుబింగెన్, 1879.
- సోజియలె బ్రీఫె ఆన్ వాన్ కిర్చ్‌మాన్, డ్రిట్టర్‌బ్రీఫ్ విడెర్ లెనంగ్ డెర్ రికార్డోశ్చెన్ లెహ్రె వాన్‌డెర్ నంట్‌రెంట్ ఉండ్ బెర్ గ్రూడంగ్ ఎయినెర్ న్యూమెన్ రెంటెన్ థియొరీ, బెర్లిన్, 1851.
- జుర్ ఎర్కెన్‌టినిస్ అన్సెడర్ స్టాట్స్ విర్ట్‌ష్కాఫ్ట్ లిబెన్ జుస్టాండె. హెఫ్ట్. 1 న్యూబ్రాండ్‌బర్గ్ ఉండ్ ఫ్రీడ్‌లేండ్, 1842.
- రాస్కోయ్. హెచ్.ఎఫ్. అండ్ సి. స్కోర్ లెమ్మెర్. ఆస్‌ఫ్యూర్ లిచెస్ లెహెర్ బక్ డెర్ కెమ్మి. బిడి. వి. బ్రాన్ ష్వెగ్, 1887.

**ఎస్**

**సే జీన్ బాప్టిస్టె :** త్రెయితె ద ఎకానమి పొలితికె జె సింపుల్ ఎక్స్‌పోజిషన్ ది లా మానియర్ దోన్త్ సె షార్మెంత్‌సె దిస్త్రిబ్యుయంత్ ఎత్‌సె కన్సామ్మెంత్ లె రిచెస్. 3 ఎడిషన్, రెండవ వాల్యూం, పారిస్, 1817.

**సీనియర్ నసావ్ విలియమ్:** ప్రిన్సిపెస్ ఫండా మెంతేస్ డి ఎ ఎకానమి పొలిటికె. ట్రాడ్. జె. అరివాబెనె, పారిస్, 1836.

**సిస్మండి జె.సి.యల్. సిస్మండి డె. :** నోవో ప్రిన్సిపెస్ డి ఎకానమీ పొలిటికె జేడెల రిచెనె డాన్స్‌సెస్ రాపోర్ట్స్ అవెక్ లా పాపులేషన్ టి.ఐ పారిస్, 1819.

**స్మిత్ ఆడమ్ :** ఏన్ ఇంక్వైరీ ఇన్ టు ది నేచర్ అండ్ కాజెస్ ఆఫ్ ది వెల్త్ ఆఫ్ నేషన్స్. సం. ఆబర్డీన్, 1848.

**సోబీర్ అడాల్ఫ్ :** ఎడ్లెమెటల్ ప్రొడక్షన్ ఉండ్ వెర్ట్‌వార్ హోల్ట్‌నిస్ జ్వేస్కెన్ గోల్డ్ ఉండ్ సిల్వర్ సీట్ డెర్ ఎన్ట్‌డెకంగ్ అమెరికాస్ బిస్ జుర్ గెగెన్ వార్ట్ ఎర్గాంగ్ జుంగ్‌స్కాఫ్ట్, నెం. 75 జు. “పెటర్ మాన్స్ మిట్టెలుంగెన్”, గోథా, 1879.

**స్టార్చ్ హెన్రీ :** కోర్స్ డి ఎకానమీ పొలిటికె. జే ఎక్స్‌పోజిషన్ డెస్ ప్రిన్సిపెస్ క్విడెటర్మినంట్ లా ప్రాస్పరిటీ డెస్ నేషన్స్, సంపుటం 2. సెయింట్ పీటర్స్‌బర్గ్, 1815.
- కన్సిడరేషన్స్ సుర్‌లానేచర్ దు రెవెన్యు నేషనల్ పారిస్, 1824.

**టి**

**థాంప్సన్ విలియం :** ఎన్ ఇంక్వైరీ ఇన్ టు ది ప్రిన్సిపుల్స్ ఆఫ్ ది డిస్ట్రిబ్యూషన్ ఆఫ్ వెల్త్, మోస్ట్ కండ్యుసివ్ టు హ్యూమన్ హేపీనెస్, లండన్, 1850.

**టూకే, టిహెచ్:** ఎన్ ఇంక్వైరీ ఇన్ టు ది కరెన్సీ ప్రిన్సిపుల్; ది కనెక్షన్ ఆఫ్ ది కరెన్సీ విత్ ప్రైసెస్ అండ్ ది ఎక్స్‌పీడియన్సి ఆఫ్ ఎ సెపరేషన్ ఆఫ్ ఇష్యూ ఫ్రమ్ బేంకింగ్, లండన్, 1844.

**టర్గట్ ఎ.ఆర్.జె. :** రిఫ్లెక్షన్స్ సర్‌లా ఫార్మేషన్ ఎత్ లా డిస్ట్రిబ్యూషన్ డెస్ రిచెస్ (1766) “ఒయువ్రెస్ సంపా, డెయిరె” ఇడి, ప్యారిస్, 1844.

**టేలర్ ఇ.బి. :** రిసెర్చెస్ ఇంటుది ఎర్లీ హిస్టరీ ఆఫ్ మేన్‌కైండ్ ఎండ్ ది డెవలప్‌మెంట్ ఆఫ్ సివిలైజేషన్, లండన్, జాన్ ముర్రే 1865.

**డబ్ల్యూ**

**వేలాండ్ ఫ్రాన్సిస్ :** ది ఎలిమెంట్స్ ఆఫ్ పొలిటికల్ ఎకానమీ బోస్టన్, 1843.

**విలియమ్స్ ఆర్.పి. :** ఆన్ ది మెయిన్‌టెనెన్స్ అండ్ రెన్యువల్ ఆఫ్ పెర్మనంట్ వే. సివిల్ ఇంజనీర్స్ ఇన్‌స్టిట్యూషన్ ప్రొసీడింగ్ మినిట్స్ విత్ ఆబ్‌స్ట్రాక్ట్స్ ఆఫ్ ది డిస్కషన్స్ V-XXV. లండన్, 1866.

## II. అజ్ఞాత కర్తృత్వం

మానవ ధర్మశాస్త్రం లేదా 'ది ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ మను ఎకార్డింగ్ టు ది గ్లాస్ ఆఫ్ కుల్లూక, కంప్రైజింగ్ ది ఇండియన్ సిస్టమ్ ఆఫ్ డ్యూటీస్, రెలిజియస్ అండ్ సివిల్ మూలం నుంచి పదానువాదం, సర్ విలియం జోన్స్ ఉపోద్ఘాతం, సంస్కృత పాఠంతో గ్రేవ్స్ చామ్ని హటన్, ఎం.ఎ.ఎఫ్.ఆర్.ఎస్. మద్రాస్ ఈస్టిండియా కాలేజీలో హిందూ సాహిత్యం ప్రొఫెసర్ సరిచూసిన మూడవ సంపుటం, 1863.

ది సోర్స్ అండ్ రెమెడి ఆఫ్ ది నేషనల్ డిఫికల్టీస్ రెడ్యూస్డ్ ఫ్రమ్ ప్రిన్సిపుల్స్ ఆఫ్ పొలిటికల్ ఎకానమీ – 'ఎ లెటర్ టు జాన్ రసెల్' నుంచి. లండన్, 1821.

## III. వార్తాపత్రికలు, సమాచార పత్రికలు

ఎకానమిస్ట్, లండన్, మే 8, 1847.

– జూన్ 16, 1866.

– జూన్ 30, 1866.

– జూలై 7, 1866.

మనీ మార్కెట్ రివ్యూ, 1867.

న్యూ రీచె జీటుంగ్, ఆర్గన్ డెర్ డెమోక్రటిక్, కొలొన్, 1848–49.

జీయిట్ ష్రిఫ్ట్, ట్యూబింగెన్, 1879.

## IV. పార్లమెంటరీ నివేదికలు - ఇతర అధికార ప్రచురణలు

ఈస్టిండియా (మద్రాస్, ఒరిస్సా కరువులు) గౌరవ హమన్స్ సభ అడ్రస్‌కి జవాబు, జూలై 4, 1867.

ఈస్టిండియా (బెంగాల్, ఒరిస్సా కరువులు) బెంగాల్, ఒరిస్సాలకు సంబంధించిన పత్రాలు, ఉత్తర ప్రత్యుత్తరాలు, ఇందులో కరువు కమిటీ నివేదిక, బెంగాల్ లెఫ్టినెంట్ గవర్నర్, ఇండియా గవర్నర్ జనరల్ మినిట్స్, మే 31, 1807.

ఈస్టిండియా (బెంగాల్, ఒరిస్సా కరువు) బీహార్ కరువుకు సంబంధించిన సూత్రాలు, శ్రీ ఎఫ్.ఆర్. కాకెరిల్ నివేదికతో సహా, III భాగం, మే 31, 1867.

హెర్ మేజస్టస్ ఎంబసి, లెగేషన్ కార్యదర్శుల నివేదికలు, మాన్యుఫాక్చర్, కామర్స్ వగైరాల కార్యదర్శులు, వాళ్ళ నివాస స్థానం వున్న దేశాల నుంచి (1865) లండన్ నుండి – నెం.14 (1879).

బ్యాంక్ చట్టాల సెలెక్ట్ కమిటీ నివేదిక. కమిటీ కార్యనిర్వహణ సాక్ష్యం మినిట్స్, అనుబంధం, సూచిక భాగం I రిపోర్ట్ అండ్ ఎవిడెన్స్, జూలై 30, 1857.

రైల్వేల మీద రాయల్ కమిషన్. కమిషనర్ల ముందు సేకరించిన సాక్ష్యం, లండన్, 1867.

**PETTUBADI (CAPITAL)** KARL MARX
Volume 2 ( Telugu)

"పెట్టుబడి" గ్రంథం వెలువడి నూటయాభై సంవత్సరాలైనా, దాని ప్రాధాన్యత నానాటికీ పెరుగుతూనే ఉందిగాని, తరగడం లేదు. అందులో విశ్లేషించిన అంశాలు, ప్రతిపాదించిన సూత్రీకరణలు సజీవంగా నేటికీ మన సామాజిక జీవనంలో ప్రస్ఫుటంగా కనిపిస్తున్నందువల్లనే ఆ గ్రంథానికి అంత ప్రాధాన్యత ఉంది. 2008లో అమెరికాతో ప్రారంభమై ప్రపంచంలోని పెట్టుబడిదారీ దేశాలనూ, వాటితో వ్యాపార లావాదేవీలు కలిగిన అభివృద్ధి చెందుతున్న దేశాలను సహితం కుదిపివేసిన ఆర్థిక సంక్షోభం అనంతరం మార్క్సిస్టు మేధావులతోపాటుగా ఇతర మేధావులు, ఆర్థికవేత్తలు పెట్టుబడి గ్రంథాన్ని తిరిగి అధ్యయనం చేస్తున్నారన్న వార్తలు ఆ గ్రంథ ప్రాధాన్యతను నొక్కి వక్కాణిస్తున్నాయి. ప్రపంచ వ్యాపితంగా లక్షల సంఖ్యలో పెట్టుబడి గ్రంథ కాపీలు పునర్ముద్రించబడ్డాయి.

చరిత్రగతినీ, మన కాలపు మహద్విజయాలనూ, అపజయాలనూ అవగాహన చేసుకోడానికి సహాయపడగలిగిన భావాలకు "పెట్టుబడి" గ్రంథం ఒక అక్షయనిధి. చారిత్రక పరిణామ నూతన అనుభవాలనుపయోగించి, భావజాలాన్ని, ఘటనలను సృజనాత్మకంగా వివరించగలిగిన మార్క్సిస్టు-లెనినిస్టు మూల సూత్రాలకు "పెట్టుబడి" గ్రంథం పునాదిరాయి. అలాంటి గ్రంథాన్ని అధ్యయనం చేయడం ప్రతి సామాజిక శాస్త్రవేత్తకూ, ప్రత్యేకించి ప్రతి మార్క్సిస్టు-లెనినిస్టుకూ శ్రమభరితమైనా, సంతోషకరమైన ఉత్తమ కర్తవ్యం కావాలి.

వెల : ₹ 419/-
(మూడు సంపుటాల వెల ₹ 1699/-)

విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్
చంద్రం బిల్డింగ్స్, చుట్టుగుంట, విజయవాడ-520 004

మూడవ సంపుటం

# కార్ల్ మార్క్స్

# పెట్టుబడి





## కార్ల్ మార్క్స్

# పెట్టుబడి

## మూడవ సంపుటం


**అనువాదకులు**

బిట్రగుంట రామచంద్రరావు

ఎ. గాంధీ

సోదుం రామ్మోహన్



**మొదటి ముద్రణ**

**సంపాదకులు**

వై.వి. కృష్ణారావు

**రెండవ ముద్రణ**

(సవరించబడినది)

**సంపాదకులు**

రావు కృష్ణారావు

గద్దం కోటేశ్వరరావు

విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్

**విజయవాడ**

# PETTUBADI (CAPITAL) KARL MARX *Vol. III (Telugu)*


| | | |
|---|---|---|
| ప్రచురణ నెం. | : | 2350/3-1R |
| ప్రతులు | : | 1000 |
| మొదటి ముద్రణ | : | అక్టోబర్, 2000 |
| రెండవ ముద్రణ | : | ఫిబ్రవరి, 2017 |



**© విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్**



వెల : **₹ 680/-**

**(మూడు సంపుటాల వెల ₹ 1699/-)**

**ప్రతులకు**

**విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్**
33-22-2, చంద్రం బిల్డింగ్స్
చుట్టుగుంట, విజయవాడ-520 004
ఫోన్ : 0866-2430302
Email : vphpublish@gmail.com

**విశాలాంధ్ర బుక్‌హౌస్**
విజయవాడ, విశాఖపట్నం,
అనంతపురం, గుంటూరు
తిరుపతి, కాకినాడ, ఒంగోలు
శ్రీకాకుళం, కడప, విజయనగరం



**హెచ్చరిక :** ఈ పుస్తకంలో ఏ భాగాన్నైనా పూర్తిగా కానీ, పాక్షికంగా కానీ కాపీరైట్ హక్కు కలిగినవారి నుండి లేక ప్రచురణకర్తల నుండి ముందుగా రాతపూర్వక అనుమతి పొందకుండా ఏ రూపంగా వాడుకున్నా కాపీరైట్ చట్టరీత్యా నేరం.



**ముద్రణ : విశాలాంధ్ర విజ్ఞాన సమితి ముద్రణాలయం - విజయవాడ**

# Das Kapital.

## Kritik der politischen Oekonomie.

Von

**Karl Marx.**

Dritter Band, erster Theil.

**Buch III:**
**Der Gesammtprocess der kapitalistischen Produktion.**
**Kapitel I bis XXVIII.**

**Herausgegeben von Friedrich Engels.**

Das Recht der Uebersetzung ist vorbehalten.

**Hamburg**
**Verlag von Otto Meissner.**
**1894.**

1894లో వెలువడిన జర్మన్ ఎడిషన్ క్యాపిటల్ మూడవ సంపుటి I, ముఖపత్రం
(సైజు తగ్గించడమైనది)

# КАПИТАЛЪ

## КРИТИКА ПОЛИТИЧЕСКОЙ ЭКОНОМІИ

СОЧИНЕНІЕ

**КАРЛА МАРКСА**

изданное подъ редакціей Фридриха Энгельса

Переводъ съ нѣмецкаго

ТОМЪ ТРЕТІЙ

Книга III

**ПРОЦЕССЪ КАПИТАЛИСТИЧЕСКАГО ПРОИЗВОДСТВА ВЗЯТЫЙ ВЪ ЦѢЛОМЪ.**

С.-ПЕТЕРБУРГЪ
1896

1896లో వెలువడిన రష్యన్ ఎడిషన్ క్యాపిటల్ మూడవ సంపుటి I, ముఖపత్రం
(సైజు తగ్గించడమైనది)

# కృతజ్ఞతలు

ఆంధ్రప్రదేశ్ కమ్యూనిస్టు సమితి చొరవతో, దాతల సహకారంతో మార్క్స్ మహాశయుని "కాపిటల్" గ్రంథాన్ని తెలుగులో "పెట్టుబడి" గ్రంథంగా వెలువరించాలని విశాలాంధ్ర విజ్ఞాన సమితి 1984 సం॥రంలో బృహత్కార్యాన్ని చేపట్టింది. దాని ఫలితంగా 1996-2000 సం॥రాల మధ్య కాలంలో పెట్టుబడి గ్రంథం మూడు సంపుటాలు వెలువడినాయి. ఆ పుస్తకాలన్నీ చెల్లిపోవడంతో వాటిని విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ సహకారంతో పునర్ముద్రణ చేయాలనే సంకల్పంతో కామ్రేడ్స్ ఈడ్పుగంటి నాగేశ్వరరావు (ఛైర్మన్), గడ్డం కోటేశ్వరరావు (కన్వీనర్/సమన్వయ కర్త), రావు కృష్ణారావు, ఆచార్య నన్నపనేని అంజయ్య, ఆచార్య చేకూరి నరసింహారావులతో ఒక ఉపసంఘాన్ని ఆంధ్రప్రదేశ్ కమ్యూనిస్టు సమితి 26-2-2011న నియమించింది.

ఆ ఉపసంఘం 2011వ సం॥రం ఫిబ్రవరి 26, మార్చి 14, మార్చి 16 తేదీలలో సమావేశాలు జరిపి, పునర్ముద్రణకు అవసరమైన ప్రాతిపదికలను, విధి విధానాలను నిర్ణయించి, క్రింద పేర్కొన్న విధంగా పని విభజన చేసింది.

1. మొదటి ముద్రణ సమగ్రంగా రూపొందించబడినప్పటికీ, వాక్య నిర్మాణంలోనూ, భావ స్పష్టతలోనూ, వాక్యం నడకలోనూ అక్కడక్కడ యాదృచ్ఛికంగా దొర్లిన తప్పలను సరిచేసి అవసరమైనచోట్ల సవరణలు, మార్పులు చేర్పులు చేయాలి. అనువాదం వీలైనంత వరకూ ఒకే విధంగా (Uniform) ఉండేటట్లు చూడాలి.
2. సరఫరా చేయబడిన పారిభాషిక పదకోశంలోని పదజాలాన్ని వాడటం ద్వారా అనువాదం ఒకే విధంగా ఉండటానికి అందరూ ప్రయత్నించాలి. తప్పనిస్థితిలో, పదకోశంలో లేని, తాము వాడిన పదానికి పక్కనే ఇంగ్లీషు పదాన్ని బ్రాకెట్లో తప్పనిసరిగా రాయాలి.
3. మొదటి సంపుటానికి గడ్డం కోటేశ్వరరావు, రెండవ సంపుటానికి ఆచార్య సి. నరసింహారావు, ఆచార్య నన్నపనేని అంజయ్య, మూడవ సంపుటానికి రావు కృష్ణారావు, ఎ. గాంధీలు సంపాదక బాధ్యతలు నిర్వర్తించాలి.

2011వ సం॥రంలోనే పునర్ముద్రణ బాధ్యతలను విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ సంపాదకవర్గం స్వీకరించింది. అయితే పునర్ముద్రణకు సంపాదక బాధ్యతలు స్వీకరించిన ఆచార్య సి. నరసింహారావు, ఆచార్య ఎన్. అంజయ్య, మిత్రులు ఎ. గాంధీలు తమ వ్యక్తిగత కారణాల రీత్యా ఆ బాధ్యతలను నెరవేర్చలేమని తమ అశక్తతను వెల్లడిచేసినందున, మొదటి రెండు సంపుటాల సంపాదక బాధ్యతలను కామ్రేడ్ గడ్డం కోటేశ్వరరావు, మూడవ సంపుటం బాధ్యతలను కామ్రేడ్ రావు కృష్ణారావు, కామ్రేడ్ గడ్డం కోటేశ్వరరావులు స్వీకరించవలసి వచ్చింది.

మొదటిసారి అనువాదానికి మూలగ్రంథాలుగా స్వీకరించినవి :

1. 1887వ సం॥రపు శామ్యూల్ మూర్, ఎడ్వర్డ్ ఆవలింగ్‌ల ఇంగ్లీషు అనువాద గ్రంథాన్ని, 1954వ సం॥రంలో ఫారిన్ లాంగ్వేజస్ పబ్లిషింగ్ హౌస్, మాస్కో వారు పునర్ముద్రణ చేశారు. ఇది మొదటి సంపుటానికి మూలాధారం.
2. 1893వ సం॥రంలో జర్మన్ భాషలో ముద్రించబడిన "దాస్ కాపిటల్" (రెండవ సంపుటం) గ్రంథాన్ని ఫారిన్ లాంగ్వేజస్ పబ్లిషింగ్ హౌస్, మాస్కో వారు ఇంగ్లీషులోకి అనువదింపజేసి 1961వ సం॥రంలో ముద్రించారు. ఇది రెండవ సంపుటానికి మూలాధారం.
3. 1894వ సం॥రంలో జర్మన్ భాషలో ముద్రించబడిన "దాస్ కాపిటల్" (మూడవ సంపుటం) గ్రంథాన్ని ప్రోగ్రెస్ పబ్లిషర్స్, మాస్కో వారు ఇంగ్లీషులోకి అనువదింపజేసి 1966 సం॥రంలో ముద్రించారు. ఇది మూడవ సంపుటానికి మూలాధారం.

ఈ పుస్తకాలలోని ఇంగ్లీషేతర భాషల వాక్యాలు, పదాలు (జర్మన్, ఫ్రెంచి, ఇటాలిన్, స్పానిష్ వగైరాలు) ఆనాటి అనువాదానికి చాలా క్లిష్ట సమస్యలైనాయి. ప్రత్యేకించి పాదసూచికల్లోని అంశాలు మిక్కిలి క్లిష్టంగా మారాయి. అనువైనచోట్ల ఆనాడు అనువదించారు. తప్పని స్థితిలో కొన్నిచోట్ల ఆ భాషనే యథాతథంగా అక్కడ రాశారు. అయితే ప్రస్తుత రెండవ ముద్రణలో ఆ సమస్యలను పరిష్కరించడానికి మరికొన్ని ఇంగ్లీషు గ్రంథాలను ఆశ్రయించాము. అందుకు దోహదపడిన గ్రంథాలు : బెన్‌ఫోక్స్, డేవిడ్ ఫెరన్‌బాక్ లు ఇంగ్లీషులోకి అనువదించి, పెంగ్విన్, న్యూలెఫ్టు రెవ్యూ వారు ముద్రించిన "కాపిటల్" గ్రంథం మూడు సంపుటాలు; జి.డి.హెచ్. కోల్ ఉపోద్ఘాతంతో, ఈడెన్ అండ్ సిడార్‌పాల్‌లు ఇంగ్లీషులోకి అనువదించిన ఎవ్విరిమాన్ లైబ్రరీ వారు ముద్రించిన రెండు పుస్తకాలు; వీటితోపాటు, కాపిటల్ గ్రంథం మీద వివరణలు, వ్యాఖ్యానాలు, విశ్లేషణల రూపాల్లో రాసిన గ్రంథాలు; సి.జె. ఆర్థర్ రాసిన "మార్క్స్ కాపిటల్"; డేవిడ్ హార్వే రాసిన "ఎ కంపానియన్ టు మార్క్స్ కాపిటల్"; మైకేల్ హీన్‌రిక్ రాసిన "యన్ ఇన్‌ట్రడక్షన్ టు త్రి వాల్యూమ్స్ ఆఫ్ కారల్ మార్క్స్ కాపిటల్"; లూయీ ఆల్తూజర్, బలిబార్ రాసిన "రీడింగ్ కాపిటల్"; ఫ్రాన్సిస్ వీన్ రాసిన "మార్క్స్ దాస్ కాపిటల్" వగైరా గ్రంథాలు బాగా ఉపకరించాయి.

రెండవ ముద్రణ దాదాపుగా సమగ్రంగా అనువదించబడిందని వినయపూర్వకంగా మనవి చేస్తున్నాం. వాక్య నిర్మాణంలోనూ, భావ స్పష్టతలోనూ యాదృచ్ఛికంగా దొర్లిన పొరపాట్లను దాదాపుగా సరిచేశాం. మొదటి ముద్రణలో కనుగప్పి తప్పిపోయిన (Missing lines) వాక్యాలను తిరిగి చేర్చాము. ఇంగ్లీషేతర భాషల్లోని వాక్యాలనూ, పదాలనూ వీలైనంతవరకు అనువదించాము.

బహుభాషాకోవిదుడైన మార్క్స్ రచనలను అనువదించడం అంత సులభమైన పని కాదు. ఆయన రాసిన ప్రతి వాక్యంలోనూ దాదాపుగా సామెతలు, అలంకారాలు మెండుగా ఉంటాయి. అందులో పలురకాలైన భాషల్లో చెణుకులూ, వ్యంగ్యాలు ఉంటాయి. వాటి అనువాదం మాకు సంక్లిష్ట సమస్యగా మారింది. పలువురు భాషా కోవిదులను సంప్రదించవలసి వచ్చింది. మా శక్తి స్తోమతల మేరకు అనువదించాం. అయితే అందుకు సమయం పట్టింది.

మూడు సంపుటాల పునర్ముద్రణకు సంపాదక బాధ్యతలను గడ్డం కోటేశ్వరరావు, రావు కృష్ణారావులు మాత్రమే నెరవేర్చవలసివచ్చినందున, ఐదు సం॥రాలకు గానీ పునర్ముద్రణకు సిద్ధం చేయలేకపోయాము. మధ్యలో పునర్ముద్రణపై నీలినీడలు వ్యాపించడం కూడా ఆలస్యానికి మరో కారణం. వాటిని అధిగమించాం. ఆరోగ్యం సహకరించనప్పటికీ, పట్టుదలతో తన బాధ్యతను

నిర్విఘ్నంగా నెరవేర్చిన కామ్రేడ్ రావు కృష్ణారావు అభినందనీయులు. వారికి హృదయపూర్వక కృతజ్ఞతాభివందనాలు.

సక్రమంగా డి.టి.పి. చేయించడానికీ, ప్రూఫులు దిద్దడానికి కూడా సుదీర్ఘకాలం పట్టింది. సాంకేతిక పదాలు, శాస్త్ర సంబంధిత అంశాలు, గణాంకాలు, పట్టికలు వగైరాలను మూలగ్రంథ విధేయంగా తీసుకురావడానికి కూడా సమర్థులైన డి.టి.పి. ఆపరేటర్ల, ప్రూఫ్‌రీడర్ల ఆవశ్యకత ప్రత్యేకంగా పేర్కొనవలసిన అవసరంలేదు. విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్‌కున్న పరిమిత వనరులతోనే ఈ అంశాలన్నింటిలోనూ జాగ్రత్తపడ్డాం. ఎంతో ఓర్పుతో సంపాదకులు, సిబ్బంది శ్రమించి ఈ గ్రంథాన్ని ముద్రణకు సిద్ధం చేశారు.

యజ్ఞంలాగా సాగిన ఈ బృహత్తర కార్యక్రమానికి స్ఫూర్తినిచ్చిన భారత కమ్యూనిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ సురవరం సుధాకరరెడ్డిగార్కి, సి.పి.ఐ. ఆంధ్రప్రదేశ్ సమితి మాజీ కార్యదర్శి, నేటి కేంద్ర కార్యదర్శివర్గ సభ్యులు కామ్రేడ్ డా॥ కె. నారాయణగార్కి, సి.పి.ఐ. కేంద్ర కంట్రోల్ కమిషన్ ఛైర్మన్, పెట్టుబడి గ్రంథం పునర్ముద్రణ ఉపసంఘం ఛైర్మన్ కామ్రేడ్ ఈడ్పుగంటి నాగేశ్వరరావుగార్కి, సి.పి.ఐ. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమితి కార్యదర్శి కామ్రేడ్ కె. రామకృష్ణగారికి విప్లవాభివందనాలు.

విశాలాంధ్ర విజ్ఞాన సమితి రథసారథులు, రాష్ట్ర కమ్యూనిస్టు సమితి కార్యదర్శివర్గ సభ్యులు, కమ్యూనిస్టు పార్టీ నాయకులైన కామ్రేడ్స్ ముప్పాళ నాగేశ్వరరావు, జె.వి.వి. సత్యనారాయణమూర్తి, రావుల వెంకయ్య, పి. హరినాథరెడ్డి, జల్లి విల్సన్, జి. ఓబులేసు, పి.జె. చంద్రశేఖరరావు, మానం ఆంజనేయులు, నల్లూరి వెంకటేశ్వర్లు గార్లు వెన్నుతట్టి ప్రోత్సహించినందుకు కృతజ్ఞతాభివందనాలు.

అవిభక్త రాష్ట్రంలో విశాలాంధ్ర విజ్ఞాన సమితి అధ్యక్షులు కామ్రేడ్ చాడా వెంకటరెడ్డి, కార్యదర్శి కామ్రేడ్ బి.ఎస్.ఆర్. మోహన్‌రెడ్డి, కోశాధికారి కామ్రేడ్ డా॥ వి. రాంప్రసాద్, జనరల్ మేనేజర్ కామ్రేడ్ వై. చెంచయ్యగార్లకు కృతజ్ఞతలు.

ఈ ఐదు సం॥రాల కాలంలో ఈ ప్రాజెక్టు పూర్తిచేయడానికి సహాయపడిన విశ్రాంత అసోసియేట్ ఆచార్యులు గడ్డం సుశీలకు, డి.టి.పి., ప్రూఫ్‌రీడింగ్ బాధ్యతలు నిర్విఘ్నంగా నెరవేర్చిన శ్రీమతి జి.వి. పద్మావతి, శ్రీమతి ఎం. మాధవి, శ్రీమతి కె. శివకుమారి, శ్రీమతి యోగిత, శ్రీ ఎం. రామారావులకు, ఈ పుస్తకాల ముద్రణలో ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ సహకారాన్ని అందించిన విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ ఆఫీస్, గోడౌన్ ఉద్యోగులకు, ప్రింటింగ్ ప్రెస్ సిబ్బందికి హృదయపూర్వక ధన్యవాదాలు.

కృతజ్ఞతాభివందనాలతో

**టి. మనోహర్ నాయుడు**
**మేనేజర్**
**విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్**

**గడ్డం కోటేశ్వరరావు**
**సంపాదకుడు**
**విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ &**
**డిప్యూటీ జనరల్ మేనేజర్, విశాలాంధ్ర విజ్ఞాన సమితి**

## తెలుగులో రెండవ ముద్రణకు

# ముందుమాట

**మా**ర్క్స్ రచించిన పెట్టుబడి గ్రంథం మొదటి సంపుటం ప్రపంచ వ్యాపితంగా ప్రఖ్యాతిగాంచి, బహుళ ఆదరణ పొందిందనీ, మొదటి సంపుటంతో పోల్చితే రెండవ సంపుటం అంతగా ఆదరణ పొందలేదనీ, అయితే మూడవ సంపుటం వెలువడక ముందే బహుముఖమైన వివాదాలకు (Controversial) దారిచూపిందనీ ప్రముఖ మార్క్సిస్టు అర్థశాస్త్రవేత్త ఎర్నెస్ట్ మండెల్ (1923-1995) లాంటి వారు పేర్కొన్నారు. మూడవ సంపుటానికి రాసిన ముందుమాటలోనే వివాద విషయాన్ని ఎంగెల్స్ ప్రస్తావించాడు. 1894 తర్వాత కూడా ఆ వివాదాలు కొనసాగాయి. మార్క్స్ రాసిన ఆర్థిక సిద్ధాంతాలను విమర్శించినవారిలో ఆస్ట్రియా దేశానికి చెందిన అర్థశాస్త్రవేత్త బోహం బేవర్క్ (Bohm-Bawerk) ఆ రోజుల్లో ప్రముఖుడు. మూడవ సంపుటంలో మార్క్స్ ప్రస్తావించిన, ప్రతిపాదించిన ఆర్థిక సిద్ధాంతాల్లో పరస్పర విరుద్ధమైన, పొసగని (inconsistency) అంశాలున్నాయని ఆయన ఆరోపణలు చేశాడు. రెండవ ప్రపంచ యుద్ధం ముగిసిన తర్వాత ఐరోపాలోని అనేకమంది బూర్జువా అర్థశాస్త్రవేత్తలు మార్క్స్‌ను విమర్శించడంలో తమ తమ కలాలకు పదును పెట్టారు. ఇయాన్ స్టీడ్‌మాన్ నుండి కొలకోవస్కీ వరకూ, కీన్స్ నుండి ఫ్రైడ్‌మాన్ వరకూ ఆ దోవపట్టారు. అయితే ఈ శతాబ్దపు మొదటి దశకంలో సంభవించిన సంక్షోభాలకు పరిష్కార మార్గాలను అన్వేషిస్తున్న ఆర్థికవేత్తలలో ప్రముఖులైన గాల్‌బ్రెత్, స్టిగ్లర్ లాంటివారు తిరిగి మార్క్స్ ప్రస్తావన తెచ్చారు. మార్గాన్వేషణలో మార్క్స్ రచనలను పునఃపరిశీలన చేస్తున్నారు. తమదైన ధోరణిలో మార్క్స్ రచనల నుండి, ప్రత్యేకించి పెట్టుబడి గ్రంథం నుండి సమాచారాన్ని సేకరిస్తున్నారు; అవసర మైనచోట ఉటంకిస్తున్నారు.

అదనపు విలువ ఉత్పత్తి, నిరంతరాయంగా దాన్ని పెంచుకోడానికి పెట్టుబడిదారు కర్మాగారం (Factory) పరిధిలో చేసే ప్రయత్నం మొదటి సంపుటంలోని ప్రధానాంశాలు. ద్రవ్యం, మార్కెట్, సరుకుల చలామణి, పునరుత్పత్తి వగైరాలు రెండవ సంపుటంలోని ప్రధానాంశాలు. బూర్జువా సామాజిక వ్యవస్థను కూల్చడానికి అవసరమైన మేధోపరమైన మహాద్భుత నైతిక డైనమైట్లు (intellectual and moral dynamites) సిద్ధాంతాల రూపంలో, సూత్రీకరణల రూపంలో ఆ రెండు సంపుటాల్లో విశదీకరించబడ్డాయని మార్క్సిస్టు పండితులంటారు. వాటితో, ఆ వ్యవస్థ సైద్ధాంతిక పునాదులు తునాతునకలవుతాయని వారు పేర్కొన్నారు. ఆ డైనమైట్లను చేబూనగలిగిన శక్తి స్తోమతలనూ, జవసత్వాలనూ కార్మికవర్గానికి ఆ రెండు సంపుటాలు అందజేస్తాయనే భయంతోనే పెట్టుబడిదారీ వర్గం, దాని సైద్ధాంతిక పీఠాధిపతులు ఆందోళనతో మార్క్స్ రచనల్లోని

పొసగని అంశాలను పోగేయ ప్రయత్నిస్తున్నారని కూడా మార్క్సిస్టు అర్థశాస్త్రవేత్తలు అంటున్నారు. పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థ సమగ్ర స్వరూపాన్ని (Capitalist Economy in its totality) మూడవ సంపుటం విశదీకరిస్తుంది. ఈ సంపుటం ఉపశీర్షిక "సమగ్ర రూపంలో పెట్టుబడిదారీ ఉత్పత్తి ప్రక్రియ" (The Process of Capitalist Production as a Whole). అనగా ఉత్పత్తి (Production), చలామణి (Circulation). ప్రపంచ మార్కెట్, ప్రపంచ స్థాయిలో పెట్టుబడిదార్ల మధ్య పోటీ, స్టాక్ ఎక్స్ఛేంజీలు, ప్రపంచవ్యాపిత పారిశ్రామిక సంక్షోభం, సామాజిక వ్యవస్థలోని వివిధ వర్గాలు లాంటి అంశాలు మూడవ సంపుటంలోనో లేక అనుబంధంగానో మార్క్స్ పరిపూర్ణంగా విశ్లేషించాలని భావించాడు. పెట్టుబడి గ్రంథరచనా ప్రణాళికలో ఆ విషయాలు ఉన్నట్లుగా ఎంగెల్స్‌కు మార్క్స్ 1868 ఏప్రిల్ 30వ తేదీన రాసిన లేఖ ద్వారా తెలుస్తుంది. అయితే వ్యవధి లేనందువల్ల మార్క్స్ ఆ విషయాలను పూర్తిగానూ, సమగ్రంగానూ విశదీకరించలేకపోయాడు. అందువల్లనే కొన్ని వివాదాలకు అవకాశాలేర్పడినాయి.

పెట్టుబడిదారీ విధానం అదృశ్యమవుతుందా? మూడవ సంపుటంలో ఈ ప్రశ్నకు జవాబు ప్రస్తావించబడింది. పెట్టుబడిదారీ ఉత్పత్తి వ్యవస్థ స్వాభావికంగా (intrinsically) సంక్షోభిత సమాజమనీ, వ్యక్తిగతంగా ఏ ఒక్క పెట్టుబడిదారైనా, ప్రజారంజ పాలకుడైనా, అధికారైనా ఆ వ్యవస్థను సంక్షోభాల బారినుండి రక్షించలేరనీ, సంక్షోభాలను నివారించలేరనీ మూడవ సంపుటంలో సైద్ధాంతికంగా మార్క్స్ విశ్లేషించాడు. ప్రైవేటు ఆస్తినీ, పోటీనీ, లాభాలకై అవధుల్లేని సరుకుల అరాచక ఉత్పత్తి ప్రక్రియనూ నియంత్రించినా, వాటిని రద్దు చేయకుండా పెట్టుబడిదారీ సంక్షోభాలు నివారించబడవని మార్క్స్ వివరించాడు. పెట్టుబడిదారీ వ్యవస్థపై మార్క్స్ తీర్పు, ఆ వ్యవస్థకు గులాంగిరీ చేసే సైద్ధాంతిక పీఠాధిపతులకు ఏమాత్రం రుచించదూ (Unpalatable), ఆమోద యోగ్యమూ కాదు. అంతేకాదు, పెట్టుబడిదారీ విధానాన్ని నియంత్రించవచ్చునని (Regulate) వాదించే సంక్షేమ అర్థశాస్త్రవేత్తలకూ (Welfare Economists) ఈ విషయం మింగుడుపడదు. పెట్టుబడిదారీ వ్యవస్థలో సహజీవనం చేస్తున్న దానకర్ణులూ (Philanthropists), సామాజిక సంస్కరణవాదులూ (Social reformers) ఒకవైపున సమాజంలోని నికృష్ట పేదరికాన్నీ, అమానవీయతనూ ఆగ్రహంతో (Indignation) మార్క్స్‌లాగా నిరసిస్తూనే, సర్వమానవ సౌభ్రాతృత్వం కావాలని వాంఛిస్తూనే, పెట్టుబడిదారీ వ్యవస్థపై మార్క్స్ తీర్పును సమర్థించలేకపోవడంలోని వైఫల్యాన్ని, ఆంతర్యాన్ని గ్రహించాలి. తమ వాదనలను సమర్థించుకోడానికి ఆడమ్ అండ్ ఈవ్ దగ్గర నుండి శ్రీరాముడు, శ్రీకృష్ణుడూ, బైబిల్, భగవద్గీతల వరకూ, అదృష్ట, దురదృష్టాలనూ, మూఢనమ్మకాలనూ తమకు అనుకూలమైన పాళ్ళలో మేళవించి, రంగరించి సామాజిక వ్యవస్థలో వెదజల్లుతున్నారు; తినగలిగినవారికి దిట్టంగా తినిపిస్తూ, జనబాహుళ్యాన్ని పక్కదోవలు పట్టించే వేదాంత చర్చలకూ, పూజా పునస్కారాల కవసరమైన పీఠాలను వందల, వేల ఎకరాల్లో నిర్మిస్తున్నారు. అందువల్లనే మార్క్స్ సైద్ధాంతిక ఆయుధాలను నిర్వీర్యం చేయడానికి కంకణధారులైనవారికి పీఠాధిపతులు వత్తాసు ఇస్తున్నారు.

అభివృద్ధిచెంది, సాధారణంగా నిర్వహించబడుతున్న పెట్టుబడిదారీ ఉత్పత్తి వ్యవస్థలో (Normally functioning Capitalist mode of Production) ఏ ఒక్క పారిశ్రామిక విభాగమైనా తనచేత నియమితులైన వేతన కార్మికుల శ్రమ ఫలితంగా ఉత్పత్తి అయిన అదనపు విలువను

ప్రత్యక్షంగా పొందజాలదు. ఉత్పత్తి అయిన మొత్తం అదనపు విలువలో తన పెట్టుబడికి సరిపడే నిష్పత్తిలోనే అదనపు విలువను పొందగలుగుతుంది. ఒకానొక వ్యవస్థలోగానీ, దేశంలోగానీ, ఉత్పత్తి అయిన అదనపు విలువ మొత్తంగా పునఃపంపిణీ చేయబడుతుంది. అందువల్ల సగటు లాభం రేటు ఉత్పత్తి వ్యవస్థలోని అన్ని విభాగాలకూ కొద్దో గొప్పో వర్తిస్తుంది. ఉత్పత్తి వ్యవస్థలోని ఏ శాఖలోనైనా పెట్టుబడి అంగనిర్మాణం (Organic Composition of Capital) సామాజిక సగటుకన్నా తక్కువగా వుంటే, ఆ శాఖలో నియమితులైన శ్రామికులచే ఉత్పత్తి చేయబడిన అదనపు విలువలో, తాను వెచ్చించిన పెట్టుబడికి సమాన నిష్పత్తిలో అదనపు విలువను ఆ శాఖ రాబట్టుకోజాలదు. అనగా వ్యయం చేసిన మొత్తం పెట్టుబడితో పోల్చినపుడు ఎక్కువమంది శ్రామికులను నియోగించుకొని, చర పెట్టుబడిపై (Variable Capital) ఎక్కువగా వ్యయం చేస్తే, ఆ శాఖకు అదనపు విలువ వాటా తగ్గుతుంది. ఈ శాఖకు రావాల్సిన అదనపు విలువ వాటాలో మిగిలిన భాగం ఇతర శాఖలకు అనగా పెట్టుబడి అంగనిర్మాణం సామాజిక సగటుకన్నా అదనంగా ఉన్న శాఖలకు తరలించబడుతుంది. మరో విధంగా చెప్పాలంటే, మొత్తం పెట్టుబడిలో సామాజిక సగటుకన్నా అధిక భాగం యంత్రాలమీద, ముడి సరుకులమీద వెచ్చించి, వేతనాలమీద తక్కువగా వ్యయం చేసిన శాఖకు అదనపు విలువలో అధిక భాగం తరలించబడుతుంది. ఒక పరిశ్రమలో సామాజిక సగటుతో సమానంగా పెట్టుబడి అంగనిర్మాణం కలిగిన శాఖ, తాను నియమించుకున్న శ్రామికుల అదనపు ఉత్పత్తి మొత్తాన్ని ఇతర శాఖలకు బదలాయించబడకుండా, పొందగలుగుతుంది. శ్రామికుల శ్రమ దోపిడీలో పెట్టుబడిదారులందరికీ ఒకేరకమైన ఆలోచన ఉండటానికి గల కారణం అదే! ఒక వర్గంగా పెట్టుబడిదార్లు శ్రామికులను దోపిడీ చేయడానికి గల భౌతిక పునాది కూడా అదే!

లాభం రేటు సమానీకరణ (equalization) ప్రక్రియలో మూడు సమస్యలు ఎదురవుతాయి. ఈ అంశాలను మూడవ సంపుటంలో మార్క్స్ వివరించాడు. వేతన శ్రామికులు ఉత్పత్తి చేసిన మొత్తం అదనపు విలువ పంపకంలో వివిధ రకాలైన పెట్టుబడిదారీ వర్గాలు పాలుపంచుకుంటాయి. ఆయా పెట్టుబడిదారీ వర్గాల మధ్య ఆ పంపకం ఏ విధంగా నియంత్రించబడుతుందో కూడా మార్క్స్ విశదీకరించాడు. అందులో నాలుగు పాలనా వర్గాల ముఠాలను మార్క్స్ ప్రత్యేకంగా పేర్కొన్నాడు. పారిశ్రామిక పెట్టుబడిదార్లు, వాణిజ్య పెట్టుబడిదార్లు, బ్యాంకుల యజమానులు, పెట్టుబడిదారీ భూస్వాములే ఆ నాలుగు వర్గాలు. (Industrial Capitalists, Commercial Capitalists, Bankers, Capitalist Landowners.) మూడవ సంపుటంలో ఐదురకాలైన రాబడులు (Revenue) ప్రధానంగా ప్రస్తావించబడ్డాయి. పారిశ్రామిక లాభాలు, వాణిజ్య లాభాలు, వడ్డీలు, భూమి కౌలు, వేతనాలే (Industrial Profits, Commercial and Banking Profits, Interest, land rent, Wages) ఆ ఐదు రకాలైన రాబడులు. ఈ ఐదింటినీ తిరిగి వేతనాలు, లాభాలు, భూమి కౌలు అనే మూడు మౌలికమైన తరగతులుగా (Categories) మార్క్స్ పేర్కొన్నాడు. అదనపు విలువ రేటుకూ, లాభం రేటుకూ మధ్య వ్యత్యాసాన్నీ, వాటిమీద ప్రభావితం చేసే అంశాలనూ మార్క్స్ పేర్కొన్నాడు. ఆయా పెట్టుబడిదారీ వర్గాలు వెచ్చించిన చర పెట్టుబడితో నిమిత్తం లేకుండా (శ్రామికుల వేతనాలపై వెచ్చించిన పెట్టుబడి భాగం) మొత్తం అదనపు విలువ ఏ విధంగా వారి మధ్య పంపిణీ జరుగుతుందో మార్క్స్ వివరించాడు. లాభం రేటు సమానీకరణ చేసుకోవాలనే

ధోరణీ, సమానం చేసుకోవాలనే వారి ప్రయత్నాలను కూడా మార్క్స్ ఈ సంపుటంలో ప్రస్తావించాడు. అక్కడనుండే లాభం రేటు సాపేక్షంగా పడిపోయే ధోరణిని గురించి కూడా రాశాడు.

లాభం రేటు సమానీకరణ ప్రక్రియలోని సమస్యలు : 1) సమానీకరణకూ, శ్రామిక విలువ సిద్ధాంతానికి మధ్య సంబంధం ఏమిటి? 2) వాస్తవ జీవితంలో లాభం రేటు సమానీకరించబడటానికి అవసరమైన నిర్దిష్ట యంత్రాంగమేమిటి? 3) విలువ రూపాలు ఉత్పత్తి ధరలుగా మార్పు చెందడానికి (ఉత్పత్తి వ్యయాలు) అనుగుణ్యమైన సాంకేతిక పరిష్కారమేమిటి? మార్క్సిస్టు ఆర్థిక శాస్త్ర సిద్ధాంతానికి ఈ ప్రశ్నలన్నీ చాలా మౌలికమైనవి. మొదటి రెండూ అంతగా వివాదాన్ని సృష్టించకపోయినా, మూడవ ప్రశ్న గొప్ప వివాదాన్ని సృష్టించింది. గతితార్కిక విశ్లేషణ ప్రాతిపదికగా ఈ మూడు ప్రశ్నలకు మూడవ సంపుటంలో మార్క్స్ అద్వితీయంగా జవాబు చెప్పాడని మార్క్సిస్టు పండితులు రాశారు.

విలువ, దాని అంతిమ స్వరూపంలో సామాజికమైందే (Social) కానీ, వైయక్తిక (Individual) మైంది కాదని మార్క్స్ అంటాడు. సామాజిక సగటుకన్నా తక్కువ పెట్టుబడి అంగ నిర్మాణం కలిగిన ఒక పరిశ్రమ శాఖ (Branch of an Industry) సామాజిక శ్రమను వృధా (waste) చేస్తుందనే భావన పెట్టుబడిదారీ సమాజంలోని ఆ వర్గాలకు (సరుకుల యజమానులు) తప్పనిసరిగా స్ఫురిస్తుంది. అందులో వాస్తవం లేకపోలేదు. అందువల్ల ఆ శాఖలోని ఉత్పత్తి క్రియలో సృష్టించబడిన అదనపు విలువ అంతా ఆ శాఖకే మార్కెట్ బదలాయించదు (Market does not return to). సామాజిక సగటుకు మించిన పెట్టుబడి అంగనిర్మాణం కలిగిన శాఖ, అనగా శ్రామిక సామాజిక ఉత్పాదకత (Social productivity of labour) అదనంగా ఉన్న శాఖ, సామాజికంగా అవసరమైన శ్రమను సాపేక్షంగా పొదుపు (economize) చేస్తుంది. అందువల్ల ఆ శాఖ యజమానులు, అదనపు విలువలోని అదనపు భాగాన్ని అనగా తాను నియమించుకొన్న శ్రామికులు ఉత్పత్తి చేసిన అదనపు విలువకు మించిన భాగాన్ని మార్కెట్ ద్వారా స్వాయత్తం చేసుకుంటారు. దీనిమీద కూడా కొన్ని సందర్భాలలో వివాదాలొచ్చాయి. ఆధునిక కాలంలో ప్రత్యేకించి సాంకేతిక విజ్ఞానం విస్తరించిన తర్వాత (1970 దశకం తర్వాత) "కంప్యూటర్ల యుగంలో" కూడా మార్క్స్ చెప్పిన సత్యం కొట్టవచ్చినట్లు కనిపిస్తుంది. సామాజిక సగటుకు తక్కువ అంగనిర్మాణం కలిగిన శాఖలు క్రమేపీ దివాలాదారిలో నడుస్తాయనేది కూడా అంతే సత్యం.

ఒక పరిశ్రమలోని వివిధ శాఖల్లోని శ్రామిక ఉత్పాదకత స్థాయిని పోల్చడానికి అవకాశం ఉంటుందా? ఒకానొక కాలంలో ఒక పరిశ్రమలోని శాఖల్లోని శ్రామిక ఉత్పాదకత పెరుగుదలను పోల్చడానికి అవకాశం ఉంటుంది. ఉత్పాదక స్థాయిలో పెరుగుదల వచ్చినప్పుడల్లా పెట్టుబడి అంగనిర్మాణంలో కూడా మార్పులొస్తాయి. శ్రామిక సామాజిక ఉత్పాదకతను ఆ విధంగా కొలవడానికి అవకాశం ఉంటుంది. పెట్టుబడిదారీ మార్కెట్ ఆర్థిక వ్యవస్థలో నిరంతరాయంగా మార్పుచెందే ఉత్పత్తి పద్ధతులూ, సరుకుల గిరాకీ, ప్రత్యామ్నాయ సరుకుల పోటీ, వాటి గిరాకీ, వెచ్చించబడే (మదుపు) పెట్టుబడులు (Capital investment) ఒక శాఖ నుండి మరో శాఖకు పరుగుపెట్టే అస్థిరత్వం (flux) లాంటి అంశాలు సైద్ధాంతికంగానే కాక, ఆచరణలో కూడా నిరంతరం దర్శనమిస్తాయి. ఈ విషయాలన్నీ శతాబ్దంన్నర క్రితం మార్క్స్ చెప్పాడని గొప్పలు చెప్పకోడానికి కాదు, పెట్టుబడిదారీ వ్యవస్థ పనితీరునూ, దాని ప్రయాణాన్ని ఎంతో దూరదృష్టితో, శాస్త్రీయ

ప్రాతిపదికన మార్క్స్ విశ్లేషణ చేశాడని చెప్పడానికే పెట్టుబడి అంగనిర్మాణం, దానిలో మార్పులు, పర్యవసానాలను ఇక్కడ ప్రస్తావన చేయాల్సి వచ్చింది.

ఒక పరిశ్రమలోని వివిధ శాఖల్లోని ఉత్పత్తి ప్రక్రియలో వెచ్చించబడిన శ్రమ ద్వారా ఉత్పత్తి చేసిన విలువకూ, సామాజిక శ్రమ వృథా (waste) గావడం మూలంగానో, పొదుపు మూలంగానో వివిధ శాఖల మధ్య అదనపు విలువ బదలాయింపుకూ (Transfer) మధ్య వైరుధ్యం ఉన్నదని మార్క్సిస్టు అర్థశాస్త్రం మీద ఒక వ్యాసాన్ని రాసిన ప్రముఖ అర్థశాస్త్రవేత్త జోన్ రాబిన్‌సన్ పేర్కొంది. అందులో ఏవిధమైన వైరుధ్యం లేదని ఎర్నెస్ట్ మండెల్ లాంటి ప్రముఖ మార్క్సిస్టు అర్థశాస్త్రవేత్తలు పేర్కొన్నారు. పెట్టుబడిదారీ వ్యవస్థలో సామాజిక శ్రమ, ప్రైవేట్ శ్రమ ఒక ప్రత్యేక తరహాలో పెనవేసుకుపోయిన రీతిని మార్క్స్ విశ్లేషించాడనీ, దాన్ని వైరుధ్యంగా భావించడం తప్ప అనీ మండెల్ పేర్కొన్నాడు. ఇక్కడ సమస్య విలువ కొలమానం కాదు; విలువ సారాంశమే! ఏ సామాజిక వ్యవస్థలోనైనా మొత్తం శ్రమశక్తిని అంచనా కట్టడం (కొలవడం) కష్టం కాదు. ఉత్పత్తిదాయకమైన శ్రమలో పాల్గొనే శ్రామికుల సంఖ్యను తెలుసుకోవచ్చు; సామాజికంగా అంగీకృతమైన సగటు పనిదినాలను తెలుసుకోవచ్చు; ఒక రోజులో పనిగంటలను (work-hours) తెలుసుకోవచ్చు. వీటి ఆధారంగా ఉత్పత్తి అయిన విలువను తెలుసుకోవచ్చు (Total Value Produced). అదే విధంగా ఒకానొక కాలంలో సామాజికంగా అవసరమైన శ్రమకాలాన్ని కూడా తెలుసుకోవచ్చు. దాన్నుండి వృథా అయిన శ్రమను కూడా గణింపవచ్చు. అందులో వివిధ శాఖల ద్వారా పునఃపంపిణీ అయిన విలువనూ తెలుసుకోవచ్చు. అయితే గుత్తాధిపత్యం (Monopoly) పూర్తిగా రాజ్యమేలు తున్నప్పడు ఈ అంశాలను తెలుసుకోవడం కొద్దిగా కష్టంతో కూడుకున్న వ్యవహారమని ఐజాక్ రూబిన్ అనే అర్థశాస్త్రవేత్త పేర్కొన్నాడు. శ్రామికుల వేతనాలకయ్యే వ్యయం పంపిణీకి సంబంధించిన అంశంగానీ, ఉత్పత్తికి సంబంధించిన అంశం కాదు. అదేవిధంగా ఒక పరిశ్రమ శాఖలోని ప్రైవేటు శ్రమనూ తెలుసుకోవచ్చు. సగటు ఉత్పాదకత, సామాజికంగా అవసర శ్రమ, ఉత్పత్తి చేయబడిన మొత్తం విలువ, సరుకుల యజమానులు కాజేసే శ్రమ విలువ, శ్రామికులకు చెల్లించిన వేతనాలు, మార్కెట్‌లో రాబట్టుకోబడిన విలువలను తెలుసుకోవడం ద్వారా దోపిడీ స్థాయిని, రేటును తెలుసుకోవచ్చునని మార్క్స్ మూడవ సంపుటంలో వివరించాడు.

ఉత్పత్తి ప్రక్రియలో కట్టుదిట్టంగా నియోగించబడి, లాభసాటిగా విలువను ఉత్పత్తి చేసిన ప్రైవేట్ శ్రమకూ, ఉత్పత్తి అయిన సరుకుల ధరలకు సమానమైన సామాజిక విలువనే కార్మికులకు వేతనాల రూపంలో ఒప్పందం ప్రకారం చెల్లించినట్లుగా భావించే దానికీ మధ్య గతితార్కిక ఐక్యత-వైరుధ్యం ఉన్నట్లుగా మార్క్స్ పేర్కొంటాడు (Dialectical unity and Contradiction). ఒక పరిశ్రమలోని వివిధ శాఖల మధ్య సామాజిక శ్రమలోని వృథా (waste) అయిన భాగాన్నిగానీ లేక పొదుపు అయిన భాగాన్నిగానీ పోల్చినపుడు ఉత్పన్నమయ్యే సమస్య మార్కెట్‌కు సంబంధించినది. అనగా పంపిణీకి లేక పునఃపంపిణీకి సంబంధించిన సమస్యే గానీ ఉత్పత్తికి సంబంధించిన సమస్య కాదని మార్క్స్ మూడవ సంపుటంలో చెప్తాడు.

ఒక పరిశ్రమలోని వివిధ శాఖల మధ్య లాభం రేటు సమానీకరణలోని రెండవ సమస్య ఆచరణకు సంబంధించినది. దీన్ని అవగాహన చేసుకోవాలంటే ఒక ప్రమేయం (assumption)తో మన పరిశీలన ప్రారంభం కావాలి. సమానీకరణ (equalization) అనేది ఎల్లప్పడూ ఒక ధోరణిగానే

(tendency) ప్రారంభమవుతుంది గానీ, శాశ్వతమైంది కాదు అనేదే ఆ ప్రమేయం. ఒక పరిశ్రమలోని ప్రతి శాఖలో (Branch) పెట్టుబడిదారునికి వాస్తవంగా సంక్రమించిన (గుంజుకున్న) మొత్తం అదనపు విలువను తెలుసుకోవాలి. పెట్టుబడి అంగనిర్మాణం తక్కువగా ఉన్న శాఖలో వేతనాల మీద అధిక నిష్పత్తిలో పెట్టుబడులు వెచ్చించబడి (Capital outlays), లాభం రేటు ఆ శాఖలో ఎక్కువగానూ, పెట్టుబడి అంగనిర్మాణం ఎక్కువగా ఉండి, యంత్రాలూ, ముడిసరుకుల మీద అధిక నిష్పత్తిలో పెట్టుబడులు వెచ్చించబడితే, ఆ శాఖలో లాభం రేటు పై చెప్పిన శాఖతో పోల్చినపుడు తక్కువగానూ ఉంటుంది. మిగిలిన పరిస్థితుల్లో మార్పు లేనపుడు, సగటు లాభం రేటు అధికంగా ఉన్న శాఖల్లోకి అదనపు పెట్టుబడులు ఆకర్షించబడతాయి. ఆ మేరకు అక్కడ సామాజిక అవసరానికి మించిన ఉత్పత్తి పెరిగి సరఫరా పెరిగి ధరల తరుగుదలకు దారితీసి, లాభం రేటు పడిపోవచ్చు. సామాజిక సగటుకు మించిన పెట్టుబడి సగటు సజీవ అంగనిర్మాణం ఎక్కువగా ఉన్న శాఖలో (average organic composition of Capital) లాభం రేటు సాపేక్షికంగా తగ్గి, పెట్టుబడులు ఆ శాఖనుండి తరలించబడతాయి. అందువల్ల సామాజిక గిరాకీకన్నా ఉత్పత్తి తగ్గుతుంది. అప్పుడు ధరలు పెరుగుతాయి. పర్యవసానంగా లాభం రేటు సామాజిక సగటు లాభం రేటుకు తిరిగి సమానమయ్యే వరకూ పెరుగుతుంది. మరో విధంగా చెప్పాలంటే, అల్ప (Low) లాభం రేటు ఉన్న పరిశ్రమ శాఖల నుండి అధిక (Higher) లాభం రేటు ఉన్న శాఖలకు పెట్టుబడి ప్రవాహమే (Capital flux) లాభం రేటు సమానీకరణకు చోదకశక్తిగా (Driving force) పనిచేస్తుంది. అదే పెట్టుబడి సమీకరణ (Capital accumulation)కు దారి. అసొంతల్యానికీ, అసమాన (uneven) అభివృద్ధికీ (ప్రక్రియకు) పెట్టుబడి అడ్డదిడ్డపు పరుగులే కారణం. ఒక పరిశ్రమలోని శాఖలన్నీ ఒకే విధమైన లయబద్ధ (rhythm) ఉత్పత్తి ప్రక్రియను కలిగి ఉండవు. సమానీకరణ భావనలోనే అసమానత భావన అంతర్లీనంగా ఉంది. పెట్టుబడిదారీ ఉత్పత్తి వ్యవస్థ చరిత్రను పరిశీలిస్తే ఈ అంశాలన్నీ స్పష్టంగా గోచరమవుతాయి. సగటు లాభాలకన్నా, అదనపు లాభాలను (గుంజుకోవాలనే) పొందాలనే ప్రక్రియలోనే పెట్టుబడిదారీ వ్యవస్థ గుంజాటన, నిజస్వరూపం సాక్షాత్కరిస్తాయి.

ఒక పరిశ్రమలోని వివిధ శాఖల మధ్య లాభం రేటు సమానీకరణలోని మూడవ సమస్య సాంకేతికపరమైనది (technical). సరుకుల విలువలను ఉత్పత్తి ధరల్లోకి (prices of production) మార్పు చెయ్యడం అనే సాంకేతిక సమస్య క్లిష్టమైంది. పెట్టుబడిదార్ల మధ్య పోటీ ఉన్న స్థితిలో విలువ నిర్ణయసూత్రం ఏవిధంగా అమలు అవుతుంది? ఒకరకమైన సరుకును (గుణం రీత్యా) ఉత్పత్తి చేసినపుడు ఆ సరుకు ధరను ఏ విధంగా నిర్ణయిస్తాం? ఈ సమస్యలకు కూడా బూర్జువా అర్థశాస్త్రం, మార్క్సిస్టు అర్థశాస్త్రం భిన్న రూపాల్లో జవాబులిచ్చాయి. ఇందులో మరో సమస్య కూడా ప్రస్తావించబడింది. ప్రస్తుతం ఉత్పత్తి అయిన సరుకుల (Currently produced goods) విలువలను ధరల్లోకి మార్పు చెయ్యడంతోపాటు, ఆ సరుకుల ఉత్పత్తిలో నియోగించబడిన ఉత్పాదక సరుకుల (input commodities) విలువలను కూడా ధరల్లోకి మార్పు చేయడం కూడా సాంకేతిక సమస్యగా పరిగణించి విశ్లేషించాలని కొంతమంది మార్క్సిస్టు అర్థశాస్త్రవేత్తలు రాశారు. ఈ అంశాన్ని మార్క్స్ పూర్తిగా విశ్లేషించలేదని వారంటారు. సరుకు ఉత్పత్తి వ్యయధర (Commodity's cost price) కూడా ఒక ముఖ్య సమస్యే. సరుకు ఉత్పత్తి ప్రక్రియ కొనసాగుతున్న దశలో వినియోగమైన (Consumed) సరుకుల విలువలకు సరుకు ఉత్పత్తి వ్యయధర సమానమని కొంతమంది

ఆర్థికవేత్తలు చెప్పారు. (Cost price is equal to Value of Commodities Consumed in Production). ఉత్పాదకాల (input) విషయంలో విలువలనూ (Values), ఉత్పాదన (ఉత్పత్తి అయిన - output) విషయంలో ధరలనూ (prices) పరిగణలోకి తీసుకుంటే తప్పక తప్పటడుగులు వేస్తారనీ, అందువల్ల ఒకే ప్రయాణాన్ని రెండు అంశాల్లోను తీసుకోవాలని మార్క్స్ అంటాడు.

సరుకుల విలువలను ఉత్పత్తి ధరల్లోకి (Prices of Production) మార్పు (Transformation) చేయడంలోని సాంకేతిక అంశంలో మరో వివాదాస్పద అంశం కూడా ఉంది. ఉత్పత్తి ధరలకూ మార్కెట్ ధరలకూ మధ్య నెలకొన్న గందరగోళం మూలంగా వివాదం తలెత్తింది. అనగా విలువలను ద్రవ్య రూపంలో ధరలుగా వ్యక్తీకరించడంలో వివాదం (Expression of Values as prices i.e., money). స్వీజీ, స్టీడ్‌మాన్ లాంటి ఉద్దండపండితులు కూడా ఆ గందరగోళం నుండి బయటపడ లేదని కొంతమంది మార్క్సిస్టు అర్థశాస్త్రవేత్తలంటారు. ఉత్పత్తి ధరలకు మార్కెట్ ధరలతో నిమిత్తం లేదని మార్క్స్ సుస్పష్టంగా తేటతెల్లం చేశాడు. అనగా ఉత్పత్తి ధరలకు (ఉత్పత్తి విలువలు) ద్రవ్య రూపంలో వ్యక్తీకరించిన మార్కెట్ ధరలకు సంబంధం లేదు. పెట్టుబడి గ్రంథం మూడవ సంపుటంలోని తొమ్మిదవ అధ్యాయం "సరుకుల విలువలు ఉత్పత్తి ధరల్లోకి మార్పు" అనే శీర్షికతో మార్క్స్ ఈ విషయాన్ని విశదీకరించాడు. విలువలు శ్రమ పరిమాణాన్ని తెలియజేస్తాయి. అందువల్ల వాటికి ద్రవ్య రూపంలో వ్యక్తీకరించిన ధరలతో నిమిత్తం లేదు. పరిశ్రమలోని ఒక శాఖ నుండి మరో శాఖకు అదనపు విలువ పరిమాణాలు (quantities of surplus value) బదలాయించడం ద్వారా ఉత్పత్తి వ్యవస్థలోని వివిధ శాఖల మధ్య లాభం రేటు సమానీకరణ జరుగుతుంది. అదనపు విలువ పరిమాణాలంటే అదనపు శ్రమ పరిమాణాలే గానీ ద్రవ్య పరిమాణాలు కావు. పదో అధ్యాయంలో విలువలు ద్రవ్యంలోకి మార్పుచెందే అంశాన్ని పరిశీలిస్తూ మార్క్స్ మరో అంశాన్ని కూడా ప్రస్తావిస్తాడు. ఇక్కడ మార్కెట్ ధరలనూ, పెట్టుబడిదార్ల / వాణిజ్య పెట్టుబడిదార్ల మధ్య పోటీ మూలంగా ధరలమీద ప్రభావాన్ని కూడా ప్రస్తావించాడు. ఉత్పత్తి ధరల అస్థిరత్వాన్ని నిర్ణయించే సగటు లాభం రేటు అస్థిరత్వానికీ, ద్రవ్య రూపంలో వ్యక్తీకరించిన విలువలకూ (ఉత్పత్తి ధరలకు) మార్కెట్ ధరల అస్థిరత్వానికీ మధ్య స్పష్టమైన విచక్షణను / విభేదాన్ని (distinguish) మార్క్స్ ఇక్కడ తేటతెల్లం చేశాడు. మార్క్స్ ప్రతిపాదించిన ద్రవ్య సిద్ధాంతాన్ని (Marx's Theory of Money) సంపూర్ణంగా అవగాహన చేసుకోనందువల్లనే కొంతమంది ఆర్థికవేత్తలు గందరగోళంలో పడ్డారని మార్క్సిస్టు పండితులంటారు.

(మార్క్స్ చెప్పిన విలువ వివిధ భావనలు, మార్కెట్ విలువ, ఉత్పత్తి ధరలు మార్కెట్ ధరలు వగైరాల అవగాహనా రాహిత్యం మూలంగా గందరగోళానికి అవకాశం ఉంది. అందువల్ల ఆ భావనల సారాంశాన్ని మరోసారి ఇక్కడ పునశ్చరణ చేయడం ఉచితంగా ఉంటుంది. ఒక సరుకు యొక్క **వైయక్తిక విలువ** అనగా ఆ సరుకులో ఇమిడి వుండే శ్రమ పరిమాణం (Quantity of labour contained in a Commodity); ఒక సరుకు యొక్క **మార్కెట్ విలువ** అనగా ఆ సరుకులో ఇమిడివుండే సామాజికంగా అవసరమైన సగటు శ్రమ పరిమాణం (Socially average - necessary - quantity of labour); **ఉత్పత్తి ధర** అనగా పరిశ్రమలోని ప్రతి శాఖలోని, సగటు ఉత్పత్తి వ్యయాలను (+) అన్ని శాఖల్లోని సగటు లాభంతో కలపాలి. (Price of production = Average costs of production in each branch + average profit of all branches);

మరో విధంగా చెప్పాలంటే, వివిధ శాఖల మధ్య సమానీకరించబడిన లాభం రేటు మూలంగా మార్పు చెందిన (modified) సామాజికంగా అవసరమైన శ్రమ పరిమాణాన్ని **ఉత్పత్తి ధర** అంటాం. **ద్రవ్య రూపంలో** సరుకు **వైయక్తిక విలువ,** ఆ సరుకులో ఇమిడి వున్న శ్రమ పరిమాణపు ద్రవ్య విలువకు సమానం. (ద్రవ్యం విలువ మారుతూ ఉంటుంది.) ఉత్పాదకత అత్యల్ప స్థాయిలో వున్న పరిస్థితులలో శ్రమ పరిమాణపు ద్రవ్య విలువను **మార్కెట్ విలువ** అంటారు. ద్రవ్య రూపంలో మొత్తం ఉత్పత్తి వ్యయాలు + సగటు లాభాన్ని మొత్తం ఉత్పత్తితో విభాగించగా వచ్చినదే **ఉత్పత్తి ధర.)**

పెట్టుబడి గ్రంథం మూడవ సంపుటంలో పెట్టుబడిదారీ ఉత్పత్తి ప్రక్రియ సమగ్ర రూపాన్ని మార్క్స్ ఆవిష్కరించాడు. అందులో ఏడు భాగాలున్నాయి. అదనపు విలువ లాభంగా ఏ విధంగా పరివర్తన చెందుతుందీ, అదనపు విలువ రేటు లాభం రేటుగా ఏ విధంగా మారుతుందీ, లాభం సగటు లాభంగా ఎలా మారుతుందీ, లాభం రేటు పడిపోయే ధోరణికి మూలకారణాలేవీ; వ్యాపార పెట్టుబడీ, వడ్డీలు, అవి తెచ్చే పెట్టుబడులూ దాదాపు ఐదు భాగాల్లో మార్క్స్ వివరించాడు. ఆరవ భాగంలో భూమి కౌలును గూర్చి చర్చించాడు. ఏడవ భాగంలో ఆదాయాలను, స్టాక్ ఎక్స్ఛేంజీలు వగైరాలను విశ్లేషించాడు.

పెట్టుబడి "ఉత్పత్తి" చేసిన అదనపు విలువలో ఒక భాగం భూమి యజమాని వాటాగా మారటం గురించి మాత్రమే ఆరవ భాగంలో మార్క్స్ విశదీకరించాడు. భూ ఆస్తి చారిత్రక రూపాలను గురించిన అంశాలు మూడవ సంపుటి పరిధిలో లేవని కూడా మార్క్స్ పేర్కొన్నాడు. పెట్టుబడిదారీ విధానం వ్యవసాయంలో ఆవరించి ఉన్నదంటే అర్థం అన్ని ఉత్పత్తిరంగాలపైనా, బూర్జువా సమాజంపైనా అది ఆధిపత్యం వహిస్తుంది. అనగా పెట్టుబడుల మధ్య "స్వేచ్ఛాయుత పోటీ", పెట్టుబడులు ఒక రంగం నుండి మరో రంగానికి స్వేచ్ఛగా బదిలీ కావడం, సగటు లాభం సమానంగా ఉండటమూ లేక ఒకే స్థాయిలో ఉండటమూ వగైరా పూర్వావసరాలు (Preconditions) పూర్తిగా పరిణతి చెందాయనే ప్రమేయం (assumption) తోనే విశ్లేషణ జరుగుతుంది. భూ ఆస్తి రూపాలు చారిత్రకంగా మారుతూ వచ్చాయి. ఉత్పత్తి విధానాల మార్పు వల్ల ఆ ఆస్తి రూపాలు మార్పుచెందాయి.

పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం శ్రమ పరిస్థితులను కార్మికుల స్వాధీనం నుండి తొలగించడం ద్వారా, వ్యవసాయాన్ని లాభం కోసం సాగించే ఉత్పత్తి ప్రక్రియగా కొనసాగించడం ద్వారా భూమి నుండి గ్రామీణ కార్మికుల్ని తొలగించడం ద్వారా సాధారణంగా కొనసాగుతుంది. భూ సంబంధాల పరిశీలనలో భూ ఆస్తి ఆధునిక రూపాన్ని అధ్యయనం చేయాలి. అయితే వ్యవసాయంలో పెట్టుబడులు పెట్టడం వలన తలెత్తే ఉత్పత్తి, చలామణి పరిస్థితులను మార్క్స్ విశ్లేషించాడు. ఆ విషయానికి మాత్రమే మార్క్స్ ఇక్కడ పరిమితమైనాడు. ఈ గ్రంథ పరిధిలో భూమి కౌలు అనే సమస్య విశదీకరించబడింది. అదనపు లాభం భూమి కౌలుగా ఏ విధంగా రూపాంతరం చెందిందో మార్క్స్ వివరించాడు.

పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం తనకు అవసరమైన యాజమాన్య రూపాన్ని అది సృష్టించుకుంటుంది. ఆ రకంగా అది ఫ్యూడల్ ఆస్తినీ, గ్రామీణ సంఘాల అధీనంలోని సమిష్టి ఆస్తినీ, చిన్న రైతుల ఆస్తినీ, వాటి శాసన సంబంధమైన రూపాలు ఎంత వైవిధ్యంగా ఉన్నప్పటికీ, తన ఉత్పత్తి విధానం అవసరాలకు అనుగుణంగా ఆర్థిక రూపంలోకి మారుస్తుంది. ఆ విధంగా

పెట్టుబడిదారీ విధానం వ్యవసాయ రంగంలో రెండు విజయాలను సాధించింది. 1) ఒకవైపున హేతుబద్ధమైన వ్యవసాయం వలన వ్యవసాయాన్ని సామాజిక స్థాయిలో నిర్వహించడం; 2) మరో వైపున భూమిలో ఆస్తిని అసంబద్ధమైన స్థాయిలో కుదించడం. ప్రత్యక్ష ఉత్పత్తిదారులను పూర్తిగా దరిద్రులుగా మార్చడం ద్వారా ఈ విజయాలను సాధించింది.

భూమిని దున్నే వేతన కార్మికులను పెట్టుబడిదారు పనిలో పెట్టుకుంటాడు. తన పెట్టుబడిని లాభసాటి వ్యవసాయ ఉత్పత్తులకై తన పెట్టుబడిని మదుపుగా (investment) పెడతాడు. పెట్టుబడిదారీ రైతు భూమి యజమానికి ఒక నిర్ణీతమైన కాల పరిమితికి కొంత మొత్తాన్ని చెల్లిస్తాడు. దీన్నే భూమి కౌలు అని పిలుస్తారు. భూ యజమాని పెట్టుబడిదారీ రైతుతో తన భూమిని కౌలు కివ్వడానికి ఒప్పందం చేసుకున్న కాలానికంతటికీ కౌలు చెల్లించబడుతుంది. అనగా భూమి కౌలు భూ ఆస్తి ఆర్థిక రూపం. అది విలువను ఉత్పత్తి చేస్తుంది. ఇక్కడ మూడు వర్గాలు మనకు తారసపడతాయి. వేతన కార్మికులు, (పారిశ్రామిక) పెట్టుబడిదారులు, భూమి యజమానులు. ఈ వర్గాల మధ్య వైరుధ్యాల మూలంగా భిన్న రూపాల్లో పరస్పరం పోరు జరుగుతుంది. భూమిపైన పెట్టే పెట్టుబడిలో ఎరువులు, క్రిమిసంహారక మందుల కొనుగోలు వ్యయాలు, నీటిపారుదల వ్యయాలు, భూమి చదునుకయ్యే వ్యయాలు, పొలంలో ఇళ్ళ నిర్మాణం (కొష్టాల నిర్మాణం) వ్యయాలు, వడ్డీలు వగైరాలుంటాయి. ఇవన్నీ కూడా స్థిర పెట్టుబడి అభివర్గానికి చెందుతాయి. నిజానికి ఇవన్నీ కౌలులో భాగం కావాలి. అయితే భూమి ఉపయోగం కోసం చెల్లించే ద్రవ్యం, భూమి తన సహజ రూపంలో ఉన్నప్పటికీ, లేదా సంస్కరింపబడిన రూపంలో ఉన్నప్పటికీ అది భూమి కౌలు కాజాలదు. పెట్టుబడి మదుపులన్నీ పెట్టుబడిదారీ రైతే పెడతాడు. సాగు చెయ్యడం లాగానే, ఈ మదుపుల వలన భూ సారం మెరుగవుతుంది. దాని ఉత్పత్తి శక్తి పెరుగుతుంది. అనగా కేవలం పదార్థ స్థాయి నుండి భూమి పెట్టుబడి స్థాయికి పెరుగుతుంది. అయితే ఈ మెరుగుదలలన్నీ భూ యజమాని సొంతం అవుతాయి. భూ యజమాని తన కౌలు రేటును పెంచుకోడానికి ఈ మెరుగుదల ఉపకరిస్తుంది. భూమి అమ్మకం రేటూ (విలువ) పెరుగుతుంది. కొన్ని సందర్భాలలో కౌలులో హెచ్చుతగ్గులతో నిమిత్తం లేకుండా భూ యజమాని ఎక్కువ ధరకు భూమిని అమ్ముకొని లాభాన్ని గడించగలడు. భూమి యజమాని శ్రమతో ఏ సంబంధం లేకుండానే సృష్టించిన సామాజికాభివృద్ధి ఉత్పత్తిని భూమి యజమానులు తమ జేబుల్లో వేసుకుంటారు. వ్యవసాయంలో పెట్టుబడిదారీ సంబంధాలు అభివృద్ధి చెందడానికి భూమి కౌలు పెద్ద ఆటంకమనీ, వ్యవసాయం వెనుకబాటు తనానికి కూడా కారణమనీ కొంతమంది అర్థశాస్త్రవేత్తలంటున్నారు.

పెట్టుబడి గ్రంథం మొదటి రెండు సంపుటాలతో పోలిస్తే, మూడవ సంపుటంలో ఒక ప్రత్యేకత ఉంది. ఆర్థిక, సామాజిక అంశాల విశ్లేషణలను సమన్వయం చేయడం ద్వారా పెట్టుబడిదారీ వ్యవస్థను దాని సమగ్రతతో మార్క్స్ ఆవిష్కరించగలిగాడు. జాతీయాదాయం ఏ విధంగా పునరుత్పత్తి అయ్యేదీ, అది త్రిమూర్తుల (Trinity) మధ్య ఏ విధంగా పంపిణీ చేయబడేదీ మూడవ సంపుటంలో మార్క్స్ విశదీకరించాడు. ఒకవైపున వేతనాలు, అవి పొందే శ్రామికులూ, మరోవైపున లాభాలు, వడ్డీలు, భూమి కౌలు వాటిని స్వాయత్తం చేసుకునే పెట్టుబడిదార్లు, భూస్వాములూ విరుద్ధవర్గాలుగా విభజించబడి సామాజిక వైరుధ్యాలకూ, పోరాటాలకూ ఏ విధంగా అవి మూలకారణాలవుతాయో మార్క్స్ వివరించాడు. పెట్టుబడికి లాభం, (పరిశ్రమల లాభం + వడ్డీ) భూమికి కౌలు, శ్రమకు

వేతనాలు - ఇవీ సామాజిక ఉత్పత్తి ప్రక్రియలోని సమస్త రహస్యాలు ఇమిడి వున్న త్రిమూర్తి భావన (Trinity). పెట్టుబడిదార్లు, భూస్వాములు, శ్రామికులే ఆ త్రిమూర్తులు. ఈ సంబంధాలు పెట్టుబడిదారీ వ్యవస్థలో పునరుత్పత్తి జరుగుతూ వుంటాయి.

ఆధునిక బూర్జువా సిద్ధాంతకర్తలు ఉత్పత్తి కారకాలను (Factors of Production) నాలుగు రకాలుగా విభజించారు. అవి భూమి, శ్రమ, మూలధనం, వ్యవస్థాపనం (Land, Labour, Capital and Organisation) వీరి సిద్ధాంతం ప్రకారం భూమికి కౌలు, శ్రమకు వేతనం, మూలధనానికి వడ్డీ, వ్యవస్థాపనకు లాభం రూపంలో జాతీయాదాయం పంపిణీ చేయబడుతుంది. అర్థశాస్త్ర వక్రీకరణకు ఈ విధమైన విభజన పరాకాష్ట. విలువ ఉత్పత్తి, అదనపు విలువ, బూర్జువా అర్థశాస్త్రవేత్తల పరిశీలనలో లేదు. వారి పాఠ్యాంశాలలో వాటి ప్రస్తావన ఉండదు. కేవలం నిర్వహించే వాడికే (Organiser) లాభం సమకూరుతుంది. సమకాలీన ఆర్థిక వ్యవస్థలో పరిశ్రమల నిర్వాహకులంతా మేనేజర్లే! బూర్జువా సిద్ధాంతం ప్రకారం లాభం వారికి చెందాలి! కానీ మేనేజర్లు ఉన్నతస్థాయిలో వేతనం పొందే ఉద్యోగస్తులే గాని, పెట్టుబడిదార్లు కాదు. పెట్టుబడిదారీ ఉత్పత్తి ప్రక్రియ ద్వారా ఉత్పత్తి అయిన సరుకుల విలువను మార్కెట్‌లో రాబట్టుకున్న మేరకు, పెట్టుబడిదారీ వర్గాలలోని వివిధ శ్రేణులు కొల్లగొడతాయి. (శ్రామికుల వేతనాలు సరుకుల అమ్మకాలకు పూర్వమే దాదాపుగా చెల్లించబడతాయి.) పెట్టుబడిదారీ వ్యవస్థలో "అసమానత" అనేది దాదాపుగా సర్వవ్యాపితమైంది; అది ఆ వ్యవస్థ పునాదుల్లోనే ఉంది. కార్మికులకు/శ్రామికులకు, ఆస్తి కలిగిన సంపన్నవర్గాలకు మధ్య వ్యత్యాసం, ఆయా వర్గాల్లోని వివిధ శ్రేణుల మధ్య వ్యత్యాసాన్ని మనం ఆ వ్యవస్థలో చూడగలం. పెట్టుబడిదార్ల మధ్య పోటీ ఉంటుంది. ఆ పోటీ కొంతమంది పెరుగుదలకూ, మరికొంతమంది పెట్టుబడిదార్ల దివాళాకూ దారితీస్తుంది. సాంద్రీకరణ (Concentration), కేంద్రీకరణ (Centralisation) ప్రక్రియల మూలంగా కొద్దిమంది గుత్తాధిపతులుగా (Monopolies) పెరుగుతారు. ఆ ప్రవాహంలో మధ్యతరగతి, చిన్న పెట్టుబడిదార్లు వేతనజీవులుగా మారతారు. ఆ విధంగా పెట్టుబడిదారీ వ్యవస్థలోని సామాజిక జీవనం నిరంతరాయంగా రూపుదిద్దుకుంటుంది (Social evolution). ఒకటిన్నర శతాబ్దాల క్రితం మార్క్స్ చెప్పిన సామాజిక పరిణామ సిద్ధాంతాన్ని జోస్యం (Prediction)గా పరిగణిస్తూ ఆయన సమకాలీకులు కొంతమంది కొట్టిపారేశారు. శాస్త్రీయ ప్రాతిపదికపై సామాజిక మార్పును విశ్లేషించిన మార్క్స్ మౌలిక సిద్ధాంతం ఆచరణలో నూటికి నూరుపాళ్ళు యథార్థమని తేలిపోయింది. ఎంగెల్స్ చెప్పినట్లు మానవ పరిణామ సిద్ధాంతం ద్వారా డార్విన్ ప్రపంచానికి ఎంత వెలుగు చూపించాడో, సామాజిక పరిణామ సిద్ధాంతం ద్వారా మార్క్స్ అంతే ఘనమైన జ్ఞానాన్ని ప్రపంచానికి అందించాడు.

మార్క్స్ చెప్పినట్లుగా పెట్టుబడిదారీ విధానం పతనం కాలేదే? అనే అంశంమీద ఆయన తర్వాత కాలంలోనూ, ఇప్పటికీ చర్చ నడుస్తూనే ఉంది. పెట్టుబడిదారీ వ్యవస్థ పతనానికి ముహూర్తాలను పెట్టి, దాన్ని కూలగొట్టలేమని మార్క్సిజాన్ని ముందుకు తీసుకెళ్ళుతున్న సామాజిక శాస్త్రవేత్తలు చెప్తున్నారు. పెట్టుబడిదారీ వ్యవస్థ పుట్టుక, పెరుగుదల, పతనం ఏ విధంగా జరుగుతుందో విశదీకరిస్తూ మార్క్స్ మౌలిక సూత్రాలను ప్రతిపాదించాడు. ఆ సూత్రాలు ఆచరణలో రుజువైనాయి. ఆ వ్యవస్థ పెరుగుదలా, అందులోని వైరుధ్యాలూ, వర్గపోరాటాలుగా మన కళ్ళముందు కదులుతూనే ఉన్నాయి. వ్యవస్థ ఒక స్థాయి నుండి మరో స్థాయికి మార్పు చెందడానికి మౌలికాంశం ఆనాటి

నిర్దిష్ట వర్గ పోరాటం; లేక పోరాటాల పర్యవసానం లేక ఫలితం. వైరుధ్యాలు, వర్గపోరాటాలు, వర్గ శక్తుల పొందిక, పర్యవసానంగా పురోగామి శక్తులు విజయాన్ని సాధించవచ్చు లేదా తిరోగామి శక్తులు పైచేయి సాధించవచ్చు; లేదా ఆ సామాజిక వ్యవస్థ సుదీర్ఘకాలం క్షీణ దశలోనూ (Decadence) ఉండిపోవచ్చు.

పెట్టుబడిదారీ వ్యవస్థ అనివార్యంగా పతనమౌతుంది (Inevitable collapse of Capitalism) అనే అంశంమీద రెండవ ఇంటర్నేషనల్‌లో కూడా చర్చ జరిగింది. పెట్టుబడిదారీ వ్యవస్థ అంతర్గత వైరుధ్యాల పర్యవసానంగా తప్పక పతనమవుతుందని ఎంగెల్స్ కూడా ఆ అభిప్రాయాన్నే సమర్థించాడు. జర్మన్ సోషల్ డెమొక్రటిక్ పార్టీ ఎర్‌ఫర్ట్ కార్యక్రమంలోనూ, 1893 ఫిబ్రవరి 3వ తేదీన ఆగస్టు బెబెల్ రీచ్‌స్టాగ్ ఉపన్యాసంలోనూ (ఈ రెండింటినీ ఎంగెల్స్ సమర్థించాడు.) ఈ అంశం స్పష్టమైంది. మధ్యతరగతి వర్గాలు క్రమేపీ క్షీణిస్తాయనీ, పెట్టుబడి సాంద్రీకరణ, కేంద్రీకరణ అధిక స్థాయిలో జరుగుతుందనీ, పెట్టుబడికీ, వేతన శ్రమకూ (Wage-Labour) మధ్య వర్గ విభజన రాను రాను ధృవీకరించబడుతుందనీ (Polarization), వర్గ వైరుధ్యాలు పెరుగుతాయనీ, ఆర్థిక సంక్షోభాలు పెరుగుతాయనీ, యుద్ధాలు తరచుగా వస్తాయనీ, రాజకీయ ప్రజాస్వామ్య హక్కులు క్రమేపీ అణిచివేయబడతాయనీ, శ్రామికవర్గ చైతన్యం పెరుగుతుందనీ, ఆనాటి మార్క్సిస్టు పండితులు భావించారు. ఆ కారణాల రీత్యా పెట్టుబడిదారీ విధానం తప్పక పతనమవుతుందని వారు భావించారు. కార్మిక ఉద్యమాల పెరుగుదలనూ, శ్రామిక చైతన్యాన్ని, వర్గ పోరాటాలతో సమన్వయం చేయడం ఈ విశ్లేషణలోని గమనించదగిన అంశం.

అయితే ఇక్కడ ఒక అంశాన్ని తప్పక ప్రస్తావించాలి. పెట్టుబడిదారీ విధానం తప్పక పతనమవుతుందా లేక నిరవధికంగా కొనసాగుతుందా అనే అంశాన్ని ఆ వ్యవస్థ స్థానంలో మరో ఉన్నత వ్యవస్థ (inevitable replacement by a higher form) ఆవిర్భవిస్తుందనే అంశంతో గందరగోళపడరాదు. ఈ రెండు సైద్ధాంతికంగా రెండు విభిన్న అంశాలు. అందువల్ల గందరగోళానికి తావివ్వరాదు.

ఈ అంశంమీద గత వంద సంవత్సరాల కాలంలో మూడు ప్రధానమైన వాదనలు ముందుకొచ్చాయి. వాదన ప్రతిపాదితులంతా మార్క్సిస్టు పండితులే!

జర్మనీ దేశస్తుడైన బెర్నెస్టీన్ పెట్టుబడిదారీ విధానం తప్పక పతనమవుతుందనే భావనను సవాల్ చేశాడు (challanged). పెట్టుబడిదారీ ఉత్పత్తి వ్యవస్థలో అంతర్గత వైరుధ్యాలను పదును పెట్టగలిగే ధోరణి ఏదీ లేదని బెర్నెస్టీన్ వాదించాడు. వైరుధ్యాలు ఉంటే గింటే అవి క్రమేపీ బలహీనపడతాయని కూడా ఆయన చెప్పాడు. అందువల్ల ఆ వ్యవస్థ క్రమేపీ అదృశ్యమవుతుందని ఆయన నమ్మాడు. విప్లవం ద్వారా ఆ వ్యవస్థను కూల్చాల్సిన అగత్యం లేదని ఆయన భావించాడు. ఆ తర్వాత కాలంలోనూ, సోవియట్ యూనియన్ పతనానంతరం "యూరో కమ్యూనిస్టులు" (Euro-Communists) అనబడేవారూ ఇంచుమించుగా బెర్నెస్టీన్ వాదనలను సమర్థించే సంస్కరణవాదులుగా మారారు.

పెట్టుబడిదారీ విధానం దానికదే అదృశ్యం కాకపోగా, ప్రపంచానికి రెండు పెద్ద యుద్ధాలనూ (1914-19; 1939-45) ప్రపంచ ప్రజలను కరువు కాటకాలకు గురిచేసే సంక్షోభాలనూ (crises) (1920-21; 1929-32; 1938; 1960వ దశకం, 1970వ దశకం ప్రారంభంలోనూ, 2008

లోనూ వచ్చిన సంక్షోభాలు పేర్కొనదగినవి.) తెచ్చిపెట్టింది. స్వేచ్ఛా ప్రజాస్వామ్య విలువలను పెంచడానికి బదులుగా, అణిచివేత (repression) ధోరణులు పెరిగాయి. సోవియట్ యూనియన్ పతనం తర్వాత సామ్రాజ్యవాదం, దాని తొత్తు దేశాలు ప్రపంచ ప్రజలను శాసించే స్థితికి చేరాయి. ప్రత్యక్ష, పరోక్ష, ప్రచ్ఛన్న యుద్ధాలు ప్రపంచ పటంలో ఎక్కడో ఒకచోట ప్రతినిత్యం జరుగుతూనే ఉన్నాయి. ఇలాంటి విషయాలన్నీ మార్క్స్, ఎంగెల్స్ గానీ, ఆ తర్వాత పందొమ్మిదవ శతాబ్దంలోనూ, ఇరవయ్యవ శతాబ్దంలోనూ పేరెన్నికగన్న సోషలిస్టులు గానీ ఊహించలేదు. లెనిన్ లాంటి వారు సామ్రాజ్యవాద ఆవిర్భావం, ప్రపంచవ్యాపిత బహుళజాతి కంపెనీల పుట్టుక, ద్రవ్య పెట్టుబడి విన్యాసాల గురించి చెప్పారు. అయినా ఆ విషయాలను కూడా సంస్కరణవాదులు కొట్టిపారేశారు.

పెట్టుబడిదారీ విధానం పతనాన్ని గురించి రోజాలక్జెంబర్గ్ లాంటివారు కూడా విశేషంగా రాశారు. విస్తృత స్థాయిలో జరిగిన పునరుత్పత్తి, తద్వారా సంక్రమించవలసిన అదనపు విలువ రాబట్టుకోడానికి పరిశుద్ధమైన పెట్టుబడిదారీ విధానంలో (pure capitalism) అవకాశం లేదని ఆమె వాదించారు. పెట్టుబడిదారీ ఉత్పత్తిలో, పెట్టుబడిదారీయేతర మార్గాలలో పయనించే ధోరణులున్నాయని ఆమె అన్నారు. ఆ ఉత్పత్తి క్రియ అంతా సన్నకారు సరుకు ఉత్పత్తిదార్లవైపు పయనిస్తుందనీ, అదే విధంగా వలస, అర్ధవలస దేశాల్లోకి విస్తరిస్తుందనీ ఆమె వాదించారు. ఈ అవకాశాలన్నీ అదృశ్యం కాగానే అదనపు విలువను రాబట్టుకునే అవకాశాలు సన్నగిల్లి పెట్టుబడిదారీ వ్యవస్థ పతనమవుతుందని ఆమె విశ్వసించారు.

పెట్టుబడిదారీ వ్యవస్థ పతన వివాదంలో పాలుపంచుకున్న మరో పండితుడు నికోలాయ్ బుకారిన్. ఈయన రష్యన్ మార్క్సిస్టు. మరో పండితుడు హంగరీ దేశస్తుడైన వార్గా. పెట్టుబడిదారీ విధానం అదృశ్యం (పతనమయ్యే) అయ్యే చారిత్రక దశకు చేరుకుందని వారు వాదించారు. అందులో అంతర్గత వైరుధ్యాలు తీవ్రతరంగావడమే అందుకు కారణాలుగా వారు పేర్కొన్నారు. మార్కెట్లు పరిమితం కావడం, ప్రపంచస్థాయి వ్యాపారం తగ్గిపోవడం, అంతర్జాతీయ శ్రమ విభజన సన్నగిల్లడం, ద్రవ్య రూప ఆర్థిక వ్యవస్థ తరిగిపోవడం (decline of money economy), అంతవరకూ పెట్టుబడిదారీ వ్యవస్థలో కొనసాగుతున్న పెట్టుబడిదారీ పూర్వపు సంబంధాలు (Pre-Capitalist) కొనసాగడం, భౌతిక వస్తూత్పత్తి తగ్గడం (decline of material production), పరపతి వ్యవస్థ కుప్పకూలడం (collapse of credit system) శ్రామికుల జీవన ప్రమాణాలు నికృష్ట స్థాయికి దిగజారడం (absolute decline), యుద్ధాలు, ప్రచ్ఛన్న యుద్ధాలు (cold wars), అంతర్గత యుద్ధాలు (civil wars) పెరగడం, సోషలిస్టు విప్లవాలు ఊపు అందుకోవడం, విప్లవకర పోరాటాలు ప్రపంచ నలుమూలలకు వ్యాపించడం లాంటి అంశాల పర్యవసానంగా పెట్టుబడిదారీ విధానం తప్పక పతనమవుతుందని బుకారిన్, వార్గాలు వాదించారు. తదనంతర ప్రపంచ పరిమాణాలను (1920 తర్వాత) పరిశీలించినపుడు వీరు పేర్కొన్న కొన్ని కారణాల రీత్యా పెట్టుబడిదారీ వ్యవస్థలు కొన్నిచోట్ల పతనమైనాయని అనేవాళ్ళు లేకపోలేదు. రెండవ ప్రపంచ యుద్ధానంతరం, తూర్పు ఐరోపా దేశాల్లోనూ, ఆ తర్వాత కాలంలో చైనాలోనూ, 1960వ దశకం తర్వాత వియత్నాం, క్యూబాల్లోనూ వచ్చిన విప్లవాలను బుకారిన్, వార్గాలు చెప్పిన కారణాల రీత్యా వచ్చిన విప్లవాలుగా పూర్తిగా అంగీకరించలేమని కొంతమంది అంటారు.

పోలెండ్ దేశానికి చెందిన మరో మార్క్సిస్టు పండితుడు హెన్రిక్ గ్రాస్‌మాన్, అమెరికా

దేశానికి చెందిన బరాన్, స్వీజీ (Baran, Sweezy) కూడా ఈ వివాదంలో పాల్గొన్నారు. సగటు లాభం రేటు పడిపోవడం చుట్టూ వీరి వాదనలు సాగాయి. లాభం రేటు పడిపోకుండా పెట్టుబడిదారీ వర్గం ఎన్ని వ్యతిరేక ప్రయత్నాలు / ప్రతిచర్యలు (Countervailing) చేసినా, లాభం రేటు పడిపోకుండా ఆగదనీ, అందువల్ల సమీకరించబడిన పెట్టుబడి (Accumulated Capital) విలువ రూపాన్ని (Valorized) సంతరించుకోలేదనీ, అదనపు విలువ రాశి తిరిగి పెట్టుబడి సమీకరణకు దోహద పడదనీ, పర్యవసానంగా వ్యవస్థ పతనమవుతుందనీ వారు వాదించారు. పెట్టుబడిదారీ ఉత్పత్తి వ్యవస్థను చారిత్రకంగా పరిశీలించినపుడు వీరు చెప్పిన అభిప్రాయాల ప్రకారం వ్యవస్థ కూలిపోయి నట్లుగా ఎక్కడా రుజువులు లేవని ప్రస్తుత పండితులంటున్నారు. మూడవ సంపుటంలోని పదిహేనవ అధ్యాయంలో మార్క్స్ ఈ విధమైన వాదనలను ముందుగానే పరిశీలించినట్లుగా కనిపిస్తుంది. వ్యవస్థ పతనానికి అదొక్కటే కారణం కాజాలదని మార్క్స్ స్పష్టం చేశాడు. బరాన్, స్వీజీలు గుత్త పెట్టుబడిదారీ విధానాన్ని (Monopoly Capitalism) కూడా లోతుగా పరిశీలించారు. పోగుపడ్డ అదనపు విలువను మార్కెట్‌లో సంపూర్ణంగా రాబట్టుకోవడం గుత్తాధిపత్య దశలో ఇంకా కష్టమని వారు భావించారు. అదే సమయంలో వారు మరొక విషయాన్ని కూడా ఇక్కడ లేవనెత్తారు. కార్మికవర్గాన్ని పెట్టుబడిదారీ వ్యవస్థలో క్రమేపీ సామాజికంగా ఇముడ్చుకునే శక్తి ఆ వ్యవస్థకుందనీ, ఆ విధంగా నిరంతరాయంగా కార్మికవర్గ పరంపరాభివృద్ధికి పెట్టుబడిదారీ వ్యవస్థ ప్రయత్నిస్తుందనీ వారు వాదించారు. ఆ విధంగా పెట్టుబడిదారీ వ్యవస్థ పతనానికి బదులుగా శాశ్వతమైన అర్ధ-స్తబ్ధత (quasi-stagnation)లో పడిపోతుందనీ వారు వాదించారు. ప్రభుత్వ గుత్తాధిపత్య సిద్ధాంతాన్ని (State Monopoly Capitalism) ప్రతిపాదించిన వారిలాగానే వీరు కూడా పెట్టుబడిదారీ వ్యవస్థ పతనానికి ఆ వ్యవస్థకు బయట (outside) ఉండే శక్తులను ఆశ్రయించాలనే భావన వ్యక్తం చేశారు. అనగా మూడవ ప్రపంచ దేశాల్లోని పేద రైతాంగం, దోపిడీకి గురవుతూ సామాజిక పొరల్లో బయటకు నెట్టబడిన శ్రేణులు (Marginalised super - exploited layers) వగైరాలే ఆ శక్తులు. కార్మికవర్గంకన్నా ఈ శక్తులు బలమైన శక్తులు కాదు. పైగా వాటి సామాజిక వర్గ స్తోమత కూడా కార్మికవర్గమంత బలమైంది కాదు. పెట్టుబడిదారీ వ్యవస్థ స్తబ్దతవైపు ప్రయాణిస్తుందనే బరాన్, స్వీజీల అభిప్రాయానికీ, మైఖేల్ కాలక్కీ, స్టీండిల్, జోన్ రాబిన్స్ లాంటి నయా కీన్సువాదులు, అర్ధ-మార్క్సిస్టులు చెప్పే సిద్ధాంతాలకు వ్యత్యాసం ఉన్నదని ఇక్కడ ప్రస్తావించాలి. మారిన పరిస్థితులకు అనుగుణంగా పెట్టుబడిదారీ విధానం ఆర్థికంగా మారుతూ (Restructure) ఉంటుంది. అందువల్ల దాని పతనం అంత సులువు కాదు అని చెప్పినవారిలో వీరూ ఉన్నారు. అయితే వీరందరూ చెప్పిన ఒక అంశాన్ని ఇక్కడ తప్పక పేర్కొనాలి. అదనపు విలువ రేటు తగ్గిపోయే ధోరణితోపాటుగా, అదనపు విలువ రాశి (mass) పెరుగుదల కూడా తగ్గిపోయే ధోరణిని పెట్టుబడిదారీ వ్యవస్థలో మనం గమనించవచ్చునని వీరంటారు. పెట్టుబడి సమీకరణకు ఇది సమ్మెటపోటు లాంటిది. యాంత్రీకరణ (Mechanization), స్వయంచాలక యంత్రాల (Automation) అభివృద్ధి మూలంగా ఉత్పత్తిదాయక శ్రమ కాలం (Productive labour - hours) కొంత తగ్గవచ్చు. అదేవిధంగా రోబోట్లను (Robotism) నియోగించడం కూడా. వీటిమూలంగా అవసర శ్రమకాలం తగ్గుతుంది. ఇవేవీ కూడా పెట్టుబడిదారీ వ్యవస్థను సంక్షోభాన్నుంచి రక్షించలేవు. ఆ సంక్షోభాల నెదుర్కోడానికి పెట్టుబడిదారీ విధానపు శక్తి స్తోమతలు క్రమేపీ సన్నగిల్లుతాయి

(Capitalism's capacity to adapt). ఇక్కడ మరో అంశాన్ని కూడా చెప్పాలి. సేవల రంగాలను (Services sector) భారీస్థాయిలో సరుకు ఉత్పత్తి రంగాలుగా మార్పు చేయడం ద్వారా (Commodity producing branches) సంక్షోభాల నుండి తాత్కాలికంగా బయటపడవచ్చునా? అలాంటి ప్రయత్నం ఆరోగ్యం, విద్య, బ్యాంకులు, పౌర పరిపాలన వగైరా రంగాల్లో ప్రయత్నించారు. ఆ విధంగా పారిశ్రామికానంతర వ్యవస్థ (Post-Industrial Society) వైపు ప్రయాణించవచ్చుననే వాదనలూ వినిపించాయి. నిజానికి ప్రస్తుత ప్రపంచం పూర్తి పారిశ్రామికీకరణ (Full Industrialisation) వైపు పరుగెత్తుతున్నది. ఇక్కడ కూడా యాంత్రీకరణ, ఆటోమేషన్, రోబోట్ల వాడకం వగైరాలు ఉంటాయి. అయినప్పటికీ చరిత్రలో కనిపించే ఉదాహరణల రీత్యా పెట్టుబడిదారీ విధానం సంక్షోభాల్లో పడకుండా, పతనావస్థకు చేరకుండా రక్షించగలిగే మంత్రదండాలు లేవు. పెట్టుబడిదారీ వ్యవస్థ ముందుకు నడిచేకొలదీ మేథోపరమైన శ్రామికులు (Intellectual labour) పెరుగుతారు. శ్రమ సామాజికీకరణ అధిక స్థాయిలో జరిగినప్పడే ఆధునిక ఆర్థికరంగం కొద్దో గొప్పో ముందుకెళ్ళగలదు. వీటితోపాటు శ్రమజీవుల చైతన్య స్థాయి, సంఘటిత శక్తి పెరుగుతాయి. పెట్టుబడిదారీ ఉత్పత్తి సంబంధాలలోని వైరుధ్యాలనూ, అసంబద్ధతనూ, న్యాయబద్ధతనూ (legitimacy) వస్తుగతంగానూ, స్వీయాత్మకంగానూ శారీరక, మానసిక శ్రమజీవులు, ప్రజా బాహుళ్యం తెలుసుకోగలరు. ఆ విధంగా పెట్టుబడిదారీ వ్యవస్థలో అంతర్గత పోరాటాలు పదును తేలుతాయి. ఆ పోరాటాల సవాళ్ళను పతనంవైపు పయనించే పెట్టుబడిదారీ వర్గం ఎదుర్కొని నిలబడగలిగినన్నాళ్ళు ఆ వ్యవస్థ కొనసాగుతుంది; తదనంతరం ఆ వ్యవస్థ కూలిపోతుంది; ఆ స్థానంలో అంతకంటే ఉన్నతమైన నాగరికత, సామాజిక నిర్మాణం కలిగిన వ్యవస్థ ఆవిర్భవిస్తుంది. అప్పటివరకూ అభివృద్ధిచెందిన ఉత్పత్తి శక్తుల స్థాయిననుసరించి నిర్మాణ కౌశలాన్ననుసరించి ఆవిర్భవించనున్న వ్యవస్థ స్వరూపం ఉంటుంది.

**గడ్డం కోటేశ్వరరావు**

విజయవాడ, **సంపాదకుడు**

11-9-2016.

## తెలుగులో మొదటి ముద్రణకు

# ముందుమాట

**కా**ర్ల్‌మార్క్స్ "పెట్టుబడి" అంతగా ఈ సహస్రాబ్దిలో మానవ జీవితాన్ని ప్రభావితం చేసిన గ్రంథం మరొకటి లేదు. యావత్ ప్రపంచ మేధావి వర్గ ఆలోచనా విధానాన్నే మార్క్స్ ప్రతిపాదించిన దార్శనికత మార్చివేసింది. జీవిత సరళినే మలుపు తిప్పింది. జన్మం, చర్మం, వెనకటి సంప్రదాయమూ నెరపే అసమానతలకు చారిత్రక కారణాలను అన్వేషించి పరిష్కార మార్గాన్ని చూపెట్టింది. కల్పనల్లో, ఊహల్లో, జానపద గాథల్లో కమనీయంగా కలలుగన్న స్వర్గాన్ని యావత్ సమాజ సమానత్వాన్ని వాస్తవం చేసే సిద్ధాంతమైన - శాస్త్రీయ సోషలిజాన్ని ప్రతిపాదించింది. దీనికి ఆచరణ యోగ్యత కలిగిందీ ఇరవయ్యవ శతాబ్దంలోనే. లెనిన్ నాయకత్వం క్రింద రాజకీయ అధికారాన్ని అందుకోవడం ద్వారా రష్యాలో మార్క్స్ సిద్ధాంతం ఒట్టి సిద్ధాంతంగానే కాక, యధార్థం అయ్యే పరిస్థితి ఏర్పడింది. ఏడు దశాబ్దాలపాటు ప్రపంచ జనాభా ఈ ప్రయోగాన్ని చూసింది. చరిత్రగతిలో ఒడిదుడుకులు రావడం సహజం. సోవియట్ సోషలిస్ట్ రాజ్యం ఆచరణలో వెనకడుగు వేయాల్సి వచ్చింది. సామాజిక అభివృద్ధి గురించి "మార్క్స్ చేసిన స్థూల వివరణ పేర్లు పెట్టడానికి లేనివిధంగా సవ్యమైందే. అయితే ఈ దరిమిలా ఎన్నో మార్పులు వచ్చాయి" అని నెహ్రూ రాశారు. సోవియట్ ప్రయోగ విజయాలు, వైఫల్యాలు మాత్రమే మార్క్సిస్ట్ దార్శనికత సమంజసత్వాన్ని, ఉపయోగాన్ని నిర్ణయించ లేవని కూడా ఆయన రాశారు. అంచేత ఆచరణలో ఒకటి రెండు దెబ్బలు తినవలసి వచ్చినా మార్క్సిజం ఒక సిద్ధాంతంగా తన ప్రభావాన్ని కోల్పోలేదు. అంతేకాదు ప్రస్తుత సామాజిక వైరుధ్యాల నేపథ్యంలో ఈ ప్రపంచ పరిశీలనా దార్శనికతకు విలువ హెచ్చింది అని కూడా చెప్పాలి. మార్క్సిజం పతాకం క్రింద అధికారం దక్కించుకున్నా, ఆచరణలో అవరోధాలని అధిగమించలేక పోవడంతో బాటు సిద్ధాంతాన్ని నవనవోన్మేషంగా కాలానుగుణమైన రీతిలో వికసింపచేసే ప్రయత్నమూ జరుగలేదు. సిద్ధాంతం సృజనాత్మకంగా ఆచరణలో అమలు జరుగుతూ వుండాలి. లేనిపక్షంలో కొడిగట్టిపోతుంది. మార్క్సిస్టు సిద్ధాంతం పిడివాదం కాదు. గమనశీలమైన పరిస్థితుల్ని వాటి గతి క్రమంలో అధ్యయనం చెయ్యడం దీని పునాది. సమస్యలకు పరిష్కారాన్ని ఆ వెలుతుర్లో వెతకడం దీనికి ఆయువుపట్టు. మన కాలం నాటి సమస్యలకు పరిష్కారాన్ని అందించలేని దార్శనికత వట్టి ఊకలాంటిది. సూక్తుల్లా వల్లించుకోవడానికి మాత్రమే అది పరిమితం అయిపోతుంది. మార్క్సిజం అలాంటిది కాదు, మార్క్స్ చేసిన మౌలిక సూత్రీకరణలకు ప్రత్యాఖ్యాతం కలుగలేదు. అందుకే ఇవాళ కూడా మార్క్సిస్టు సిద్ధాంతం సామాజిక అవగాహనా కరదీపికగా వుంది.

అలాంటి మానవ పురోగమన మార్గాలు తెరిచిన ఈ సిద్ధాంతానికి మకుటాయమానమైన కృతి పెట్టుబడి. మార్క్స్ జీవితమంతా ధారపోసి ఈ రచనను అందించాడు.

ఇంతటి ఉద్గ్రంథానికి మార్క్స్ చేసిన రెండు ఆవిష్కరణలు భూమిక అని చెప్పాలి. చారిత్రక గతి తార్కిక భౌతిక వాదం, అదనపు విలువ ఉత్పత్తి అనేవి ఆ ఆవిష్కరణలు. సమాజం ఇలా

ఎందుకు ఉంది అన్న ప్రశ్నకు అనేకమంది మత బోధకులు, తత్త్వవేత్తలు తలా ఒక తీరులోనూ సమాధానాలు చెప్పారు. కానీ రోగ నిర్ధారణ సరిగా చెయ్యలేని వైద్యుడు చికిత్సలో విఫలమైనట్లే ఏ ఒక్క సమాధానమూ సర్వగ్రాసిగా సామాజిక పరిణామక్రమాన్ని, ఉనికిని వివరించలేకపోయింది. అందుకనే మార్క్స్, "తత్వవేత్తలు రకరకాలుగా ఈ సమాజాన్ని గురించి వివరించారు. కానీ అసలు చెయ్యవలసింది దీన్ని మార్చడం" అన్నాడు. ఆ మార్చడం ఎలా జరగాలో తెలియజేసే సైద్ధాంతిక దర్శనమే ఈ పెట్టుబడి.

పెట్టుబడి గ్రంథం మొదటి సంపుటి మార్క్స్ జీవితకాలంలోనే వెలువడింది. రెండు, మూడు సంపుటాలను ఎంగెల్స్ సంపాదకత్వం వహించి ప్రచురించాడు. పెట్టుబడి పందొమ్మిదవ శతాబ్దంలో యూరోపియన్ భాషల్లోకి, ఇరవయ్యవ శతాబ్దంలో ప్రపంచంలోని చాలా భాషల్లోకి అనువాదం అయింది. భారతదేశంలో హిందీ, మలయాళం, బెంగాలీ, తమిళ భాషలలోకి ఇంతకుముందే అనువాదమయింది. తెలుగులో ఇప్పటికే రెండు సంపుటాలు అనువాదం అయి వెలుగు చూశాయి. ఇప్పుడు ఈ మూడవ సంపుటం వెలువడుతోంది.

పెట్టుబడి తెలుగు అనువాదం వెలుగుచూడ్డం అనాయాసంగా జరుగలేదు. మొదటి సంపుటి ప్రచురణకు, రెండవ సంపుటి ప్రచురణకు మధ్య రెండేళ్ళు విరామం కలిగింది. తిరిగి రెండవ సంపుటి ప్రచురణకు ఈ మూడవ సంపుటి ప్రచురణకూ మధ్య కూడా రెండేళ్ల విరామం వచ్చింది.

అనువాద సరళి, పారిభాషిక పదావళి, ఆర్థిక పదబంధాలు మొదటి సంపుటంలో నిర్దేశితం అయ్యాయి. దానిమీద విజ్ఞుల ప్రతిస్పందనలు, విమర్శలూ, సూచనలూ వచ్చాయి. ఆ దారిలో రెండవ సంపుటి రూపుతీసుకుంది.

శ్రీయుతులు బిట్రగుంట రామచంద్రరావు, ఎ.గాంధి, సొదుం రామ్మోహన్ గార్లు మూడవ సంపుటిని అనువదించారు. వీరి అనువాదం సరళంగా వుంది, మూల విధేయంగా వుంది. రెండవ సంపుటి మీద వచ్చిన సూచనలను గమనంలో వుంచుకునే మూడవ సంపుటిని తీర్చిదిద్దటం జరిగింది.

విషయపరంగా మూడవ సంపుటిలో భూమి కౌలు ప్రముఖంగా పరిశీలనకు వచ్చింది. భూమి కౌలు సిద్ధాంతాన్ని ప్రతిపాదించినవాడు ఆడమ్ స్మిత్. ఆయన భూమి కౌలు ఆర్థిక విధానంలో పోషించే పాత్రని తత్సంబంధిత అంశాలనూ పరిశీలించాడు. పెట్టుబడి గ్రంథం రచనకు సన్నద్ధమయ్యే సందర్భంలోనే, 1862లో మార్క్స్ భూమి కౌలు సిద్ధాంతాన్ని అభివృద్ధి చేశాడు. బూర్జువా సమాజంలో భూస్వాములు అందుకునే ఆదాయం అది. డేవిడ్ రికార్డో ప్రతిపాదించిన భూమి, శిస్తు సిద్ధాంతాన్ని, ఆయన విమర్శించాడు. డేవిడ్ రికార్డో సిద్ధాంతం మాల్తస్ నియమం మీద ఆధారపడి వుంది. భూమి సారం తరుగుతూ వుంటుందన్నది ఈ ప్రతిపాదన. ఈ ధోరణిని విమర్శనాత్మకంగా పరిశీలించాలని మార్క్స్ 1851 నుంచి ఆలోచిస్తున్నాడు. చారిత్రకంగా వాస్తవాలను వివరించడానికి మాల్తస్ తరుగుదల సిద్ధాంతాన్ని తొలగించడానికి అదే మార్గం అని విశ్వసించాడు. ధాన్యం ధరలు స్థిరంగా పెరుగుతూ వుంటాయన్న రికార్డో సూత్రీకరణను పూర్వపక్షంగా చేసిన అంశం, 1641 నుంచి 1859 దాకా తీసిన సగటు ధరల పట్టిక. రికార్డో 1797, 1815 మధ్యకాలంలో పెరిగిన ధరలను పరిశీలన చేసి ప్రతిపాదించిన సూత్రీకరణలో ఏదీ ఈ పట్టిక వల్ల నిలవలేదు. మార్క్స్ రెండు వందల ఏళ్ల స్థితిని పరిశీలించి ధరలు ఒకసారి పెరగడం, ఒకసారి తరగడం జరిగిందని చూపించాడు. నాసిరకం భూములు సాగులోకి రావడం వల్లనే కాక, సారంలో



హెచ్చుతగ్గులు గల భూమి సాగులోకి రావడం వల్ల కూడా భూమి కౌలు యేర్పడ్డం గురించి వివరించాడు. వ్యవసాయ ఉత్పత్తుల ధరలు పెరిగినా, మారకుండా వున్నా, తరిగినా, ఆ అంశాలతో ప్రమేయం లేకుండానే భూమికౌలు రూపొందే అవకాశం వుందని నిరూపించాడు.

ఉత్పత్తి శక్తులు పెరగడానికీ, భూమిమీద వుండే యాజమాన్య సంబంధాలకీ, భూమి కౌలు ఎలాంటి ప్రభావం కలిగించేదీ మార్క్స్ వివరించాడు. దున్నేవానిదే భూమి అనే రైతు ఉద్యమ నినాదంలో భూమిని ఉత్పత్తి శక్తుల వికాసానికి దోహదకరంగా పరిణమింపచేసే తీరులో విముక్తి చెయ్యడం గర్భితమైవుంది. ఇంత శాస్త్రీయంగా భూమి కౌలును గురించి మార్క్స్ తనదైన స్పష్టతతో వివరించాడు. స్థిరమైన యధార్థాల విశ్లేషణనే నిర్ణాయిక ప్రాముఖ్యం వున్నదిగా పరిగణించాడు. ద్రవ్య చలామణీ గురించిన ఆయన పరిశీలన అలాంటిదే. మొత్తం మీద మార్క్స్ అధ్యయనం లక్ష్యం పెట్టుబడిదారీ వ్యవస్థలో అదనపు విలువ దోపిడీ అవుతుందని రుజువు చెయ్యడం. నిర్ద్వంద్వంగా మార్క్స్ ఆ అంశాన్ని రుజువు చేశాడు.

మార్క్స్ ఇలా సూత్రరీత్యా, సిద్ధాంత పరంగా ఈ ఆర్థిక అంశాన్ని రుజువు చేసిన ఆర్థికవేత్త మాత్రమే కాదు, ఇలాంటి పరిస్థితుల్ని మార్చవలసిన ఆవశ్యకతను నొక్కి చెప్పిన తత్వవేత్త, నూతన సమాజాన్ని శాస్త్రీయంగా సాకారం చెయ్య సంకల్పించిన దార్శనికుడు కూడానూ.

అందుకనే మార్క్స్ ప్రతిపాదించిన సామ్యవాద సిద్ధాంతం విప్లవ కాంతులతో ప్రపంచ పెట్టుబడిదారుల కళ్ళు బైర్లు కమ్మేటట్లు చేసింది. సోవియట్ ప్రయోగాన్ని విఫలం చెయ్యడానికి ఆ శక్తులు నడుం కట్టాయి. దీనికి అంతర్గత కారణాలు తోడయ్యాయి. రెండింటి కలయిక వల్ల సోవియట్ ప్రయోగం విఫలం అయింది. తాత్కాలికంగా పురోగామి శక్తులు వెనుకడుగు వెయ్యవలసి వచ్చింది.

సోవియట్ ప్రయోగం విఫలమైన నేపథ్యంలో చాలామంది మార్క్సిస్టు సిద్ధాంతం ఇంకా అనువర్తించే పరిస్థితులు వున్నాయా అన్న శంకలు వెల్లడించారు. కమ్యూనిస్టు సిద్ధాంతం ఇక సమాధి అయిపోయినట్టేనని వ్యతిరేకులు సంబరపడ్డారు. కానీ నూతన ఉదారవాద ఆర్థిక సిద్ధాంతాలను అనుసరించి తాత్కాలికంగా పుంజుకున్న పెట్టుబడి మళ్ళీ చతికిలబడుతోంది. ప్రపంచీకరణ వల్ల బహుళ జాతి సంస్థల జేబులు ఉబ్బినా పోటీలో నిలబడలేని పెట్టుబడిదారీ సంస్థలు, నానాటికీ తీసికట్టు నాగంబొట్లు అన్నట్లుగా తయారయ్యేయి. పెట్టుబడిదారీ విధానం ఇక మనలేదని చెప్పొచ్చు. జన సామాన్యం పేదరికం పాలబడుతోంది. ఆదాయంలో, సంపదలో అసమానతలు పెరుగుతున్నాయి. నిరుద్యోగం విస్తరిస్తోంది. సాంఘిక విచ్ఛిత్తి జరుగుతోంది. పర్యావరణ వినాశనం సంభవిస్తోంది. ఇవన్నీ ఈ విధాన దౌర్బల్యానికి ఇతర పార్శ్వాలు. కోట్లాది ప్రజానీకం పెట్టుబడిదారీ విధానం బలిగీస్తూ వున్న దోపిడీ పరిస్థితుల్లో మానవత్వహారక పరిస్థితుల్లో బతకాల్సి వస్తోంది. ధనిక, పేద దేశాల మధ్య అంతరం మరింత పెరుగుతోంది.

ఇప్పుడు ప్రపంచ వ్యాప్తంగా మరింత పటువైన ప్రజాస్వామిక వ్యవస్థకోసం ఉద్యమాలు తిరిగి ఊపిరి పోసుకొంటున్నాయి. ఇవి పెట్టుబడిదారీ వ్యతిరేక రూపం సంతరించుకొంటున్నాయి. 1999 జనవరి 22న కంభంపాటి సత్యనారాయణ స్మారకోపన్యాసంలో నేను ప్రస్తావించినట్లు ఈనాటి వ్యవస్థలో దోపిడీ మరింత నిశితం అయ్యింది. వ్యవస్థలో స్పర్థలు, వైరుధ్యాలు పెరుగుతున్నాయి. ఇవి నూతన సాంఘిక విభాగాల విస్తృతికీ, వైవిధ్యానికీ దారితీస్తున్నాయి. మిగిలిన వాటి స్వరూపాన్ని మారుస్తున్నాయి. విశాల సంఘటనలకు పరిస్థితుల్ని, అవకాశాలను సృష్టిస్తున్నాయి.

పర్యావరణవేత్తలు, రైతాంగం, భూమి లేనివాళ్ళు, వాసంలేని వాళ్ళు, ఉద్యోగంకోసం, ఆరోగ్యంకోసం, సాంఘిక భద్రతకోసం పోరాటం చేసేవాళ్ళు, స్త్రీ పురుషపరంగా, మతపరంగా, జాతిపరంగా, జాతీయత భావనపరంగా, వ్యవస్థీకృతమైన స్వతంత్ర బృందాలు ఇలాంటి సంఘటనల ఛత్రం ఏర్పాటు చేసుకుంటున్నాయి. ఈ ఘటనలన్నీ దోపిడీకి వ్యతిరేకంగా ఎక్కుపెట్టి సాగుతున్నవే. ఈనాటి ఉద్యమాలకు గత శతాబ్దం నాటి శ్రామిక ఉద్యమాలకంటే విశాల పరిధి వుంటోంది. సమాజంలో దోపిడీ ఏ రూపంలో వున్నా మార్క్సిస్ట్ సిద్ధాంత అవసరం వుండి తీరుతుంది. దోపిడీ రహిత సమాజమే మార్క్సిస్టు దార్శనికత లక్ష్యం. అంచేత తాత్కాలికంగా తలెత్తిన ఒడిదుడుకులు సిద్ధాంత రంగంలో ప్రకంపనలు కలిగించడంలో వింతేమీ లేదు. అంతమాత్రాన సిద్ధాంత పటుత్వం జావగారిపోనూ లేదు.

ప్రతి చీకటి వెనువెంటనే గతితప్పక వెలుగు వచ్చు అన్నట్లు ఈ చీకటి గడుస్తుంది. మార్క్స్ ప్రతిపాదించిన సిద్ధాంతానికి ఈ ప్రపంచీకరణ ఆర్థిక దోపిడీ నేపథ్యంలో సామయికత పెరిగింది. పూర్వం మాదిరి విప్లవాలు వస్తాయా లేదా అన్నది కాదు ఇక్కడి ప్రశ్న. ప్రపంచ జన చైతన్యం ఎంత పురోగమిస్తోంది, ఎలా ప్రతీప శక్తుల కుట్రలు భగ్నం అవబోయేదీ చూడ్డమే యీనాటి సమస్య.

ఈ దిశలో ఏ చిన్న అడుగులు పడినా అవి ప్రపంచ విముక్తికి పెట్టుబడే. ఈ పెట్టుబడి గ్రంథం ఆ పెట్టుబడిని సమకూరుస్తుందని ఆశిస్తున్నాను.

ఈ సంపుటి అనువాద పథకానికి, ప్రచురణ కార్యక్రమానికి నేను సమన్వయ కర్తగానూ, సంపాదకుడిగానూ కృషి చేశాను. మాస్కో రాదుగ ప్రచురణాలయంలో అనువాదకుడిగా పని చేసి, విశేష అనుభవం గడించిన మిత్రులు ఆర్వియార్ ఈ సంపుటంలో అనువాద సరళి, ఉపయోగించిన పదాల పొందిక ఒకే విధంగా వుండేటట్లు సరిజూచారు. వీరికి నా కృతజ్ఞతాభివందనాలు తెలియజేస్తున్నాను. విశాలాంధ్ర ప్రచురణాలయం మేనేజరు శ్రీ పి. రాజేశ్వర్రావు శుద్ధ ప్రతిని అచ్చుకు సిద్ధం చేయటంలో తోడ్పడ్డారు. వీరికి నా ధన్యవాదాలు. ఈ సంపుటం ప్రచురణకు రు. 25,000/-లు ఆర్థిక సహాయం చేసి తోడ్పడిన తమ్మారెడ్డి సత్యనారాయణ మెమోరియల్ సొసైటీ, హైదరాబాద్ వారికి నా కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. చివరిగా పెట్టుబడి గ్రంథం మూడు సంపుటాల ప్రచురణ కృషిలో అనేక రూపాల్లో సహకరించిన మిత్రులకు నా హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తున్నాను.

పెట్టుబడి అనువాద పథకానికి 1984లో శ్రీకారం చుట్టటం జరిగినా, అనేక కారణాల వల్ల ఆలస్యమయినా ఈ మహాయజ్ఞాన్ని ఇప్పటికి పూర్తి చేయగలిగినందుకు నాకు పూర్తి సంతృప్తి కలిగింది. ఆంధ్రప్రదేశ్ కమ్యూనిస్టు సమితి ఈ మహాయజ్ఞానికి సమన్వయం బాధ్యత నాకు అప్పగించింది. వారికి నా కృతజ్ఞతలు. వయస్సు మీరుతుండడంతో ఈ మహత్కార్యం పూర్తి అయ్యేంతవరకు జీవించగలుగుతానో లేదో ననే సంశయం నాకు అప్పుడప్పుడు కలుగుతూ వుండేది. ఏమయినా పెట్టుబడి తెలుగు అనువాద ప్రచురణ బాధ్యత నేటికి పూర్తి చేయగలిగినందుకు నాకు మహదానందంగా వుంది.

హైదరాబాద్, **వై.వి. కృష్ణారావు**

2-10-2000 **సంపాదకుడు, సమన్వయకర్త**

# విషయసూచిక

పీఠిక xxx

## మూడవ సంపుటి : పెట్టుబడిదారీ ఉత్పత్తి మొత్తం ప్రక్రియ-I

### ఒకటవ భాగం

### అదనపు విలువ లాభంగా పరివర్తన; అదనపు విలువ రేటు లాభం రేటుగా పరివర్తన

**అధ్యాయం-1. ఉత్పత్తి ఖర్చు - లాభం** **3**
**అధ్యాయం-2. లాభం రేటు** **18**
**అధ్యాయం-3. లాభం రేటుకు అదనపు విలువ రేటుకు మధ్య గల సంబంధం** **26**
**అధ్యాయం-4. లాభం రేటుపై టర్నోవరు ప్రభావం** **46**
**అధ్యాయం-5. స్థిర పెట్టుబడి వినియోగంలో పొదుపు** **53**
I. స్థూలంగా విషయ వివరణ 53
II. శ్రామికుల శ్రేయస్సుకు భంగకరంగా శ్రమ పరిస్థితుల్లో పొదుపులు 63
III. శక్తి ఉత్పాదన, ప్రసారాల్లోనూ, భవనాల్లోనూ పొదుపు 71
IV. ఉత్పత్తి క్రియ విసర్జితాల వాడకం 75
V. నూతన పరికల్పనల ద్వారా పొదుపు 78
**అధ్యాయం-6. ధరల హెచ్చుతగ్గుల ప్రభావం** **80**
I. ముడిపదార్థాల ధరల్లో హెచ్చుతగ్గులు, లాభం రేటుపై వాటి ప్రత్యక్ష ప్రభావం 80
II. పెట్టుబడి పెరుగుదల, తరుగుదల, విడుదల, బంధనం 84
III. సాధారణ ఉదాహరణ 1861-65 నాటి పత్తి సంక్షోభం ప్రారంభ చరిత్ర 97
**అధ్యాయం-7. అనుబంధ వ్యాఖ్యలు** **111**

### రెండవ భాగం

### సగటు లాభంగా లాభపరివర్తన

**అధ్యాయం-8. విభిన్న ఉత్పత్తి శాఖల్లో పెట్టుబడుల విభిన్న అంతర్నిర్మాణాలు; ఫలితంగా లాభం రేట్లలో తలెత్తిన తేడాలు** **115**
**అధ్యాయం-9. సార్వత్రిక లాభం రేటు (సగటు లాభం రేటు) రూపుగొనే క్రమం, సరుకుల విలువలు ఉత్పత్తి ధరలుగా పరివర్తన** **127**
**అధ్యాయం-10. పోటీ ద్వారా సార్వత్రిక లాభం రేటు సమానీకరణ** **144**
మార్కెట్ ధరలు, మార్కెట్ విలువలు, అదనపు లాభం 144

**అధ్యాయం-11. ఉత్పత్తి ధరలపై సార్వత్రిక వేతనం హెచ్చుతగ్గుల ప్రభావాలు** **169**
**అధ్యాయం-12. అనుబంధ వ్యాఖ్యలు** **174**
I. ఉత్పత్తి ధరలో మార్పుకు కారణాలు 174
II. సగటు అంతర్నిర్మాణం గల సరుకుల ఉత్పత్తి ధర 175
III. పెట్టుబడిదారుడి నష్టపరిహార ఆధారాలు 176

## మూడవ భాగం
## లాభం రేటు పడిపోయే ధోరణి నియమం

**అధ్యాయం-13. నియమ వాస్తవ స్వరూపం** **180**
**అధ్యాయం-14. ప్రతిక్రియాత్మక ప్రభావాలు** **200**
I. దోపిడీ పెరుగుదల తీవ్రత 200
II. శ్రమ శక్తి విలువకన్నా దిగువకు వేతనాల పతనం 203
III. స్థిర పెట్టుబడి అంశాలు చౌక కావటం 203
IV. సాపేక్షమైన అధిక జనాభా 204
V. విదేశీ వాణిజ్యం 204
VI. స్టాకు పెట్టుబడి పెరుగుదల 207
**అధ్యాయం-15. ఈ నియమం యొక్క అంతర్గత వైరుధ్యాల వివరణ** **208**
I. స్థూల పరిశీలన 208
II. ఉత్పత్తి విస్తరణకు, అదనపు విలువ ఉత్పత్తికి మధ్య ఘర్షణ 213
III. అధిక పెట్టుబడి - అధిక జనాభా 217
IV. అనుబంధ వ్యాఖ్యలు 225

## నాల్గవ భాగం
## సరుకు పెట్టుబడి మరియు డబ్బు పెట్టుబడి వాణిజ్య పెట్టుబడిగా, డబ్బు లావాదేవీల పెట్టుబడిగా (వ్యాపారి పెట్టుబడిగా) పరివర్తన

**అధ్యాయం-16. వ్యాపార పెట్టుబడి** **232**
**అధ్యాయం-17. వాణిజ్య లాభం** **244**
**అధ్యాయం-18. వర్తక పెట్టుబడి టర్నోవర్; ధరలు** **263**
**అధ్యాయం-19. డబ్బుతో వ్యవహరించే పెట్టుబడి** **275**
**అధ్యాయం-20. పెట్టుబడి గురించిన చారిత్రక వాస్తవాలు** **283**

## ఐదవ భాగం
## వడ్డీగా, పరిశ్రమ లాభంగా లాభవిభజన

**అధ్యాయం-21. వడ్డీ కలిసిన పెట్టుబడి** **297**
**అధ్యాయం-22. లాభ విభజన - వడ్డీ రేటు, సహజమైన వడ్డీ రేటు** **316**

**అధ్యాయం-23. వడ్డీ, పరిశ్రమ లాభం** **327**
**అధ్యాయం-24. వడ్డీ ఇచ్చే పెట్టుబడి రూపంలో పెట్టుబడి సంబంధాల బాహ్యీకరణ** **346**
**అధ్యాయం-25. పరపతి పెట్టుబడి, కల్పిత పెట్టుబడి** **355**
**అధ్యాయం-26. డబ్బు పెట్టుబడి సంచయనం, వడ్డీ రేటుపై దాని ప్రభావం** **371**
**అధ్యాయం-27. పెట్టుబడిదారీ ఉత్పత్తిలో పరపతి పాత్ర** **391**
**అధ్యాయం-28. చలామణి సాధనాలు, పెట్టుబడి** **398**
టూకే, పులార్టన్‌ల అభిప్రాయాలు 398

## మూడవ సంపుటి : పెట్టుబడిదారీ ఉత్పత్తి మొత్తం ప్రక్రియ-II

### ఐదవ భాగం

### వడ్డీగా, పరిశ్రమ లాభంగా లాభవిభజన (కొనసాగింపు)

**అధ్యాయం-29. బ్యాంకు పెట్టుబడి అంతర్భాగాలు** **417**
**అధ్యాయం-30. డబ్బు పెట్టుబడి, నిజ పెట్టుబడి-I** **429**
**అధ్యాయం-31. డబ్బు పెట్టుబడి, నిజ పెట్టుబడి-II (కొనసాగింపు)** **446**
1. డబ్బు రుణ పెట్టుబడిగా రూపాంతరం చెందటం 446
2. పెట్టుబడి లేదా ఆదాయం రుణ పెట్టుబడిగా రూపాంతరం చెందే డబ్బుగా రూపాంతరీకరణ 453
**అధ్యాయం-32. డబ్బు పెట్టుబడి, నిజ పెట్టుబడి-III (ముగింపు)** **456**
**అధ్యాయం-33. పరపతి వ్యవస్థలో చలామణి సాధనం** **470**
**అధ్యాయం-34. కరెన్సీ సూత్రం 1844 ఇంగ్లీష్ బ్యాంక్ చట్టం** **495**
**అధ్యాయం-35. విలువైన లోహమూ, మార్పిడి రేటు** **512**
I. బంగారం నిల్వ చలనం 512
II. మార్పిడి రేటు 521
- ఆసియాతో మార్పిడి రేటు 522
- ఇంగ్లాండు వాణిజ్య సమతూకం 535
**అధ్యాయం-36. పెట్టుబడిదారీ పూర్వ సంబంధాలు** **538**
- మధ్యయుగాలలో వడ్డీ 554
- వడ్డీ నిషేధం వల్ల చర్చికి చేకూరిన ప్రయోజనాలు 556

### ఆరవ భాగం

### అదనపు లాభం భూమి కౌలుగా రూపాంతరం చెందటం

**అధ్యాయం-37. పరిచయం** **557**
**అధ్యాయం-38. వ్యత్యాసపు కౌలు - సాధారణ వ్యాఖ్యలు** **581**
**అధ్యాయం-39. వ్యత్యాసపు కౌలు మొదటి రూపం (వ్యత్యాసపు కౌలు-I)** **589**
**అధ్యాయం-40. వ్యత్యాసపు కౌలు రెండవ రూపం (వ్యత్యాసపు కౌలు-II)** **612**
**అధ్యాయం-41. వ్యత్యాసపు కౌలు II - మొదటి అధ్యయనాంశం - స్థిరమైన ఉత్పత్తి ధర** **623**

**అధ్యాయం-42. వ్యత్యాసపు కౌలు II – రెండవ అధ్యయనాంశం** **631**
I. పడిపోతున్న ఉత్పత్తి ధర 631
II. అదనపు పెట్టుబడి యొక్క తగ్గిపోతున్న ఉత్పాదకత 638
III. అదనపు పెట్టుబడి యొక్క పెరిగే ఉత్పాదకత రేటు 640
**అధ్యాయం-43. వ్యత్యాసపు కౌలు II – మూడవ అధ్యయనాంశం – పెరిగే ఉత్పత్తి ధర** **646**
**అధ్యాయం-44. పరమ అధ్వాన్నపు సాగు భూములలో కూడా వ్యత్యాసపు కౌలు** **672**
**అధ్యాయం-45. నిరపేక్ష భూమి కౌలు** **681**
**అధ్యాయం-46. భవన స్థలం కౌలు, గని కౌలు – భూమి ధర** **703**
**అధ్యాయం-47. పెట్టుబడిదారీ భూమి – కౌలు ఉత్పాదన విధానం** **711**
I. పరిచయ వ్యాఖ్యలు 711
II. శ్రమ కౌలు 718
III. వస్తురూపంలో కౌలు 722
IV. డబ్బు కౌలు 724
V. పాలికాపు పద్ధతి, కమతాలపై రైతుల యాజమాన్యం 729

## ఏడవ భాగం
## ఆదాయాలు, వాటి మూలాధారాలు

**అధ్యాయం-48. త్రికసూత్రం** **739**
**అధ్యాయం-49. ఉత్పత్తి ప్రక్రియ విశ్లేషణ గురించి** **756**
**అధ్యాయం-50. పోటీ సృష్టించిన భ్రమలు** **775**
**అధ్యాయం-51. పంపిణీ సంబంధాలు, ఉత్పత్తి సంబంధాలు** **798**
**అధ్యాయం-52. వర్గాలు** **805**
**ఫ్రెడరిక్ ఎంగెల్స్ పెట్టుబడి మూడవ సంపుటికి చేర్చిన అనుబంధం** **807**
I. విలువ నియమం, లాభం రేటు 808
II. స్టాక్ ఎక్స్ఛేంజ్ 825
**రచయితల సూచిక** **828**
**పెట్టుబడి మూడవ సంపుటంలో ఉల్లేఖించిన ప్రామాణిక రచయితల, పత్రాల సూచిక** **832**
I. రచయితలు 832
II. అజ్ఞాత రచయితల సూచిక 840
III. వార్తాపత్రికలు, ఇతర పత్రికల సూచిక 841
IV. పార్లమెంటు నివేదికలు మరియు ఇతర అధికారిక ప్రచురణలు 842

★ ★ ★

# పీఠిక

**మార్క్స్** ప్రధాన గ్రంథంలోని ఈ తృతీయ సంపుటిని ప్రచురించే విశిష్టగౌరవం చివరకు నాకు లభించింది; దీంతో సైద్ధాంతిక భాగం సమాప్తమవుతుంది. నేను 1885లో రెండవ సంపుటిని ప్రచురించినప్పుడు, ఏవో కొన్ని విభాగాలలో తప్ప, నిస్సందేహంగా చాలా ముఖ్యమైన విభాగాలలో తప్ప, ఈ మూడవ భాగంలో బహుశా సాంకేతికపరమైన చిక్కులు మాత్రమే ఎదురవుతాయని భావించాను. వాస్తవం కూడా అంతే. మొత్తం రచనలో అత్యంత ముఖ్యమైన ఈ విభాగాలు నన్ను ఇంతగా శ్రమపెడతాయన్న భావం నాకు ఆనాడు లేదు; ఇతర అవరోధాలను ముందుగా ఊహించనట్లే, వీటిని కూడా నేను ఊహించలేదు. ఈ గ్రంథం పూర్తి కావడంలో ఇంత జాప్యం కావడానికి ఇవన్నీ కారణం.

తర్వాత అన్నిటికంటే ముఖ్యమైన విషయం, నా కంటి చూపు బలహీనత; ఇది కొన్నేళ్లపాటు నా రచనా కాలాన్ని కనీస స్థాయికి కుదించింది; ఇందువల్ల, ఇప్పుడు కూడా కేవలం అరుదుగా మాత్రమే కృత్రిమ వెలుగులో రాయగలుగుతున్నాను. పైగా తప్పించుకోలేని ఇతర ముఖ్యమైన ఒత్తిడి పనులు కూడా ఉండినాయి; ఉదాహరణకు మార్క్స్ రచనలవీ, నా తొలి రచనలవీ కొత్త మార్పులు, అనువాదాలు, వాటి సమీక్షలు, ఉపోద్ఘాతాలు, అనుబంధ రచనలు మొదలయినవి. నూతన అధ్యయనం లేకుండా ఇవన్నీ మరింతగా అసాధ్యం. అన్నిటికంటే ముఖ్యం, ఈ గ్రంథ ప్రథమ సంపుటి తాలూకు ఇంగ్లీషు కూర్పు దీని పాఠానికి చివరకు నాదే బాధ్యత. దాంతో నా సమయంలో చాలా భాగం హరించుకుపోయింది. నేను - అనువాదాలకు సహాయపడగల భాషల సంఖ్య - చాలా పరిమితం కావటం నా అదృష్టం. అలా కాకపోతే వారి రచనలను సమీక్షించ నిరాకరించేందుకు నా అంతరాత్మ అంగీకరించి ఉండేది కాదు కదా. గత పదేళ్లకాలంలో బ్రహ్మాండంగా అభివృద్ధి చెందిన అంతర్జాతీయ సోషలిస్టు సాహిత్యాన్ని, మరీ ముఖ్యంగా మార్క్స్ రచనల, నా తొలి రచనల అనేకానేక అనువాదాలను గమనించిన వారెవరైనా పైన నేను చెప్పిన వాస్తవాన్ని అంగీకరిస్తారు. అయితే ఈ సాహిత్య వృద్ధి, అంతర్జాతీయ కార్మికవర్గ ఉద్యమం యొక్క తదనుగుణవృద్ధికి సూచిక వంటిది మాత్రమే. కనుక ఇది నామీద మరిన్ని కొత్త బాధ్యతలను మోపింది. మా ప్రజా కార్యకలాపాలు ప్రారంభమైన తొలి రోజులనుంచీ వివిధ దేశాలలోని సోషలిస్టుల, కార్మికుల జాతీయ ఉద్యమాల మధ్య సంధానకర్తగా ప్రధాన పని భారాన్ని మోస్తూవచ్చింది, మార్క్స్, నేనూనే. మొత్తం ఉద్యమం విస్తరించినకొద్దీ ఈ పని కూడా అదే నిష్పత్తిలో విస్తరించింది. మార్క్స్ అంతిమ శ్వాస వదలేదాకా ఇందులో ప్రధాన భారాన్ని మోశాడు. కానీ, ఆయన మరణానంతరం నిత్యం పెరుగుతూ వచ్చినపనిలో ఎక్కువ భాగాన్ని నేనొక్కడ్నే నిర్వహించవలసి వచ్చింది. అప్పటినుంచీ వివిధ జాతీయ కార్మిక పార్టీలకు తమ మధ్య ప్రత్యక్ష సంబంధాలు ఏర్పరచుకోవటం ఒక నియమమయింది. అదృష్టవశాత్తూ

ఇది అధికారికంగా ఆచరణలోకి వస్తుంది. అయినప్పటికీ నా సైద్ధాంతిక కృషి దృష్ట్యా, నేను ఇష్టపడే దానికంటే ఎక్కువ తరచుగానే నా సహాయం కోసం విజ్ఞప్తులు వస్తున్నాయి. అయితే నాలాగా యాభై ఏళ్లకు పైగా ఈ ఉద్యమంలో క్రియాశీలంగా పాల్గొన్న ఏ వ్యక్తి అయినా, ఆ ఉద్యమానికి సంబంధించిన పనిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఆలస్యం చేయకూడని తక్షణ బాధ్యతగా పరిగణిస్తాడు. 16వ శతాబ్దంలో మాదిరి, మన ఘటనాభరితకాలంలో సైతం సామాజిక వ్యవహారాలకు సంబంధించిన శుద్ధ సిద్ధాంతవేత్తలు కేవలం ప్రగతి నిరోధక పక్షంలోనే కనిపిస్తున్నారు. ఆ కారణంచేత వారు - ఆ పదానికి గల సంపూర్ణ అర్థంలో - సిద్ధాంతవేత్తలు కూడా కారు; వారు కేవలం ప్రగతినిరోధక వాద సమర్థకులే.

నేను లండన్‌లో నివసిస్తున్న దృష్ట్యా, నా పార్టీ సంబంధాలు శీతాకాలంలో ఉత్తర ప్రత్యుత్తరాలకే పరిమితమైనాయి. కాగా వేసవిలో అవి చాలా వరకు వ్యక్తిగతమయినవి. ఈ కారణం వల్లనూ, అంతకంతకు ఎక్కువ దేశాలకు స్థిరంగా విస్తరిస్తున్న ఉద్యమాన్నీ, అంతకంటే వేగంగా పెరుగుతున్న దాని సంఖ్యానేక పత్రికలనూ గమనించాల్సిన ఆవశ్యకత వల్లనూ, పని పూర్తికావడానికి మధ్యలో ఎలాటి అంతరాయమూ ఉండకూడని వ్యవహారాలను నేను శీతాకాలానికి ప్రధానంగా సంవత్సరంలోని తొలి మూడు మాసాలకు అట్టిపెట్టుకోవలసి వచ్చింది. డెబ్బై ఏళ్ళు దాటిన వ్యక్తి మస్తిష్కంలోని మేనార్ట్ సమన్వయ నాడీతంత్రులు చికాకు కలిగించేటంత పరిమితంగా పని చేస్తాయి. అలాటి వ్యక్తి క్లిష్టమైన సైద్ధాంతిక సమస్యల్లో అంతరాయాలను మునుపటంత తేలిగ్గానూ, త్వరగానూ అధిగమించలేడు. అందుచేత ఒక శీతాకాలంలో పని అప్పడే పూర్తి కాకపోయినట్లయితే, దానిని తరువాతి శీతాకాలంలో కొత్తగా ప్రారంభించవలసి వచ్చేది. అన్నిటికంటే కష్టమైన అయిదవ భాగం విషయంలో జరిగిందిదే. మూడవ సంపుటికి సంపాదకత్వం వహించే పని రెండవ సంపుటి సంపాదకత్వం పనికంటే ముఖ్య విషయాలలో భిన్నమయినదని కింది విషయాలను బట్టి పాఠకుడు గ్రహించగలడు. మూడవ సంపుటికి సంబంధించి, చాలా అసమగ్రమయిన ముసాయిదా రచన మినహా వినియోగించుకోడానికి మరే ఇతర ఆధారమూ లేదు. వివిధ భాగాల ప్రారంభానికి తప్పనిసరిగా చాలా జాగ్రత్తగా తీర్చిదిద్దడం జరిగింది. దాని శైలికి సైతం మెరుగులు దిద్దడం జరిగింది. కానీ, ముందుకు వెళ్లేకొద్దీ రాత ప్రతి మరింత రేఖామాత్రంగా, అసమగ్రంగా ఉంది. ఉపసమస్యలను లేవనెత్తే అప్రస్తుత ప్రస్తావనలు కనిపిస్తాయి. ప్రధాన వాదనలో ఈ సమస్యలు సముచిత స్థానం విషయమై తరువాత తీసుకునే నిర్ణయానికి వదిలిపెట్టడం జరిగింది. వాక్యాలు మరింత సుదీర్ఘ మైనాయి, మరింత సంక్లిష్టమైనాయి. ఆ వాక్యాల్లో భావాలు తట్టినవి తట్టినట్లు వ్యక్తం అయేయి. కొన్నిచోట్ల చేతిరాత, చెప్పే తీరు, విపరీతమైన పనిభారం వల్ల అనారోగ్యం అప్పటికే ఆయనపై తన దాడి ప్రారంభించిందనడానికీ, అది క్రమేణా ఉధృతమైనదనడానికీ నిదర్శనం. అనారోగ్యం వల్ల ప్రారంభంలో ఆయనకు రచనలు సాగించడం కష్టమైపోయి, చివరకు అప్పుడప్పుడు పనిని పూర్తిగా ఆపుచేయక తప్పేదికాదు. అందులో ఆశ్చర్యమేమీ లేదు. మార్క్స్ 1863-1867 మధ్య పెట్టుబడి తాలూకు ఆఖరు రెండు సంపుటాల ప్రథమ ముసాయిదాలను పూర్తి చేయడమే కాక మొదటి సంపుటిని ప్రచురణకు సిద్ధం చేశారు. అంతేకాక ఇంటర్నేషనల్ వర్కింగ్ మెన్స్ అసోసియేషన్ వ్యవస్థాపనకు, విస్తరణకు సంబంధించిన బ్రహ్మాండమైన కృషి నిర్వహించారు. ఫలితంగా 1864,

1865 సంవత్సరాల్లోనే అనారోగ్య అశుభ సూచనలు కనిపించాయి; అందువల్ల మార్క్స్ రెండం సంపుటికీ మూడవ సంపుటికీ స్వయంగా తుది మెరుగులు దిద్దలేకపోయారు.

మొత్తం రాతప్రతిని బట్టి చదవడానికి యోగ్యమైన మరో ప్రతిని చెప్పి రాయించడం ద్వారా నా పని ప్రారంభించాను. ఆయన రాతను విడదీసి చదవడం తరచుగా నాకు కూడా కష్టంగా ఉండింది. దీనికే గణనీయమైన సమయం పట్టింది. అసలు కూర్పు పని నేను అప్పుడు మాత్రమే ప్రారంభించగలిగాను. ఈ పని అత్యవసరమైనదానికే పరిమితం చేశాను. మొదటి ముసాయిదా తగినంత స్పష్టంగా ఉన్నచోట ఆ ముసాయిదా స్వభావాన్ని యథాతథంగా ఉంచడానికి శాయశక్తులా ప్రయత్నించాను. పునరుక్తులు ఉన్నచోట వాటిని కూడా నేను తొలగించలేదు. విషయాన్ని మరో దృక్పథం నుండి పరిశీలిస్తున్నప్పుడు, లేదా వేరే మాటల్లో అదే భావాన్ని తిరిగి వ్యక్తం చేస్తున్నప్పుడు పునశ్చరణ మార్క్స్‌కు రివాజు. నా మార్పులు కానీ, అదనపు వ్యాఖ్యలు కానీ కూర్పు (ఎడిటింగ్) కృషి సరిహద్దులను మించినపుడు లేదా నా సొంత, స్వతంత్ర నిర్ధారణలకు మార్క్స్ ఇచ్చిన వివరాలతో కూడిన సమాచారాన్ని అన్వయించవలసి వచ్చినప్పుడు; ఆ మొత్తం వాక్యాలను బ్రాకెట్లలో ఉంచి అక్కడ నా సంతకం చేశాను. అయితే కొన్ని నా పాదపీఠికలను బ్రాకెట్లలో ఉంచలేదు; పోతే నా సంతకం ఉన్నచోటల్లా వాటికి బాధ్యత నాదే.

ఉత్తరోత్తరా విస్తరించి చెప్పవలసి ఉన్న అంశాలను గురించిన అనేక ప్రస్తావనలు రాతప్రతిలో ఎన్నో ఉన్నాయి. మొదటి ముసాయిదా దశలో ఇలాంటివి ఉండటం ఊహించనిదేమీ కాదు. కానీ ఆ వాగ్దానాలను ఎల్లప్పుడు నిలబెట్టుకోవటం జరగలేదు. వాటిని అలాగే వదిలేశాను; ఎందుచేతనంటే, భవిష్యత్ వివరణకు సంబంధించి అవి రచయిత సంకల్పాలను వెల్లడిస్తాయి.

ఇక వివరాలకు వద్దాం.

ప్రథమ భాగానికి సంబంధించినంతవరకు, ప్రధాన రాత ప్రతి గణనీయమైన పరిమితులతో మాత్రమే ఉపయోగపడింది. అదనపు విలువ రేటుకూ లాభం రేటుకూ మధ్యగల సంబంధానికి చెందిన గణిత శాస్త్రపు లెక్కాచారమంతా (ఇదే మన IIIవ అధ్యాయమయింది) ప్రారంభంలోనే ప్రవేశపెట్టబడింది; కాగా ఒకటవ అధ్యాయంలో వివేచించిన విషయం ఆ తర్వాత, సందర్భానుసారంగా పరిశీలింపబడింది. ఇక్కడ సవరించడానికి జరిగిన రెండు ప్రయత్నాలు ఉపయోగకరమైనది. ఒక్కొక్కటి ఫోలియో సైజులో ఎనిమిది పుటల దాకా ఉంది. అయితే వీటిలో కూడా ఉండవలసినంత ఏక క్రమం ఆద్యంత్యం లేదు. ఇప్పుడు ఒకటవ అధ్యాయంగా ఉన్నదానికి ఇవి మూలాన్ని సమకూర్చాయి. ఇక రెండవ అధ్యాయమేమో ప్రధాన రాత ప్రతినుంచి స్వీకరింపబడింది. ఇక మూడవ అధ్యాయానికి సంబంధించి అసంపూర్ణమైన గణితశాస్త్రపు లెక్కాచారాల పరంపరతో పాటు డెబ్బైనాటి మొత్తం, దాదాపు పూర్తి నోట్‌బుక్ కూడా ఉపయోగపడింది. ఇందులో లాభంరేటుకు అదనపు విలువరేటుకు మధ్యగల సంబంధం సమీకరణల రూపంలో ఉంది. ప్రథమ సంపుటిలో అత్యధిక భాగాన్ని ఇంగ్లీషులోకి అనువదించిన నా మిత్రుడు శామ్యూల్‌మూర్ నాకోసం ఈ నోట్‌బుక్‌ను ఎడిట్ చేసే బాధ్యతను స్వీకరించారు. ఆయన కేంబ్రిడ్జి విశ్వవిద్యాలయంలో లోగడ గణితశాస్త్రం చదువుకున్నారు. కాబట్టి ఈ పనికి నాకన్నా అర్హుడు. అప్పడప్పుడు ప్రధాన రాత ప్రతిని ఉపయోగించుకుంటూ, నేను మూడవ అధ్యాయాన్ని రూపొందించినది, ఆయన సంగ్రహ

రచన సహాయంతోనే. నాలుగవ అధ్యాయానికి శీర్షిక తప్ప మరేమీ అందుబాటులో లేదు. అయితే దానిలోని విషయం, అంటే లాభం రేటుపై టర్నోవర్ ప్రభావం, చాలా ప్రాముఖ్యమైంది. కాబట్టి, నేనే అదంతా రాశాను. ఆ కారణంచేత ఆ అధ్యాయం అంతా బ్రాకెట్లలో ఉంచాను. మూడవ అధ్యాయంలో ఇచ్చిన లాభంరేటు సూత్రీకరణ సర్వత్రా చెల్లుబాటు కావాలంటే, దానికి కొన్ని సవరణలు అవసరమని దీనిపై కృషి సాగుతున్నప్పుడు స్పష్టమైంది. ఇక అయిదవ అధ్యాయం లగాయతు, ఆ భాగంలోని మిగతా దానికి ప్రధాన రాత ప్రతే ఏకైక మూలాధారం. కాకపోతే అక్కడక్కడా, అక్కడిది ఇక్కడా ఇక్కడిది అక్కడా మార్చడమూ, కొన్నిచోట్ల చేర్పులూ కూడా అవసరమయ్యాయి.

ఆ తరువాతి మూడు భాగాలకు సంబంధించి, శైలీపరమైన మార్పులను మినహాయిస్తే, మూలరాత ప్రతినే దాదాపు ఆద్యంతం అనుసరించాను. టర్నోవర్ ప్రభావాన్ని వివరిస్తున్న కొన్ని పాఠ్యభాగాలను నేను మధ్యలో చేర్చిన నాలుగవ అధ్యాయానికి అనుగుణమైన విధంగా తిరిగి రాయవలసి వచ్చింది. వీటిని కూడా బ్రాకెట్లలో వుంచి అక్కడ సంతకం పెట్టాను.

అన్నిటికంటే అయిదవ భాగం ఎక్కువ చిక్కు తెచ్చిపెట్టింది. మొత్తం సంపుటిలోకెల్లా జటిలమైన విషయం ఈ భాగంలో చర్చించబడింది. సరిగ్గా ఈ సమయంలోనే, పైన తెలిపిన ఒకానొక తీవ్రమైన అస్వస్థతకు మార్క్స్ గురయ్యారు. కనుక ఇక్కడ సమగ్రమైన ముసాయిదా ఏదీ లేదు; తరువాత పూర్తి చేసుకోడానికి వీలున్న స్థూల రేఖాచిత్రం కూడా లేదు; ఒక విపులీకరణ తాలూకు ప్రారంభం మాత్రమే ఉంది. అది కూడా తరచుగా ఒక క్రమపద్ధతిలో లేని నోట్సుల సముదాయం, వ్యాఖ్యలు, ఉల్లేఖనల రూపంలో ఉంది. కొంతవరకు మొదటి భాగం విషయంలో చేసినట్లే, రాయకుండా వదలిన ఖాళీలను నింపడం ద్వారానూ, కేవలం సూచనప్రాయంగా రాసిన పాఠ్యభాగాలను మరింత విస్తరించడం ద్వారానూ ఈ భాగాన్ని పూర్తి చేయడానికి నేను మొదట ప్రయత్నించాను. అంటే రచయిత సంకల్పించిన ప్రతి విషయమూ కనీసం స్థూలంగా ఉండేలా ప్రయత్నించాను. నేను మూడుసార్లు ఇలా ప్రయత్నించినప్పటికీ మూడుసార్లు విఫలమయ్యాను. ఈ విషయంలో అయిన కాలహరణమే సంపుటి వెలువడటంలో జాప్యానికి ఒక ప్రధాన కారణం. నేను పొరపాటు మార్గంలో పడ్డట్లు చివరకు గుర్తించాను. నేను కనుక ఈ రంగంలోని విస్తార సాహిత్యం అధ్యయనం చేసి చివరకు ఒక గ్రంథాన్ని పూర్తి చేసి ఉండి ఉంటే అది మార్క్స్ గ్రంథం అయివుండేది కాదు. అందుచేత లభిస్తున్న సామాగ్రిని సాధ్యమైన మేరకు ఒక క్రమపద్ధతిలో పెట్టడానికీ, తప్పనిసరి అయిన చేర్పులను తీసుకురావడానికీ పరిమితం కావటం ద్వారానే ఈ చిక్కుముడిని విడదీయడం మినహా - నాకు మరోమార్గం లేకపోయింది. ఆ విధంగా 1893 వసంతం నాటికి, ఈ భాగానికి సంబంధించిన ప్రధాన కృషిని పూర్తి చేయడంలో నేను కృతకృత్యుణ్ణయ్యాను.

ఇక వివిధ అధ్యాయాల సంగతికివస్తే XXI నుంచి XXIVవ అధ్యాయం దాకా దాదాపు సమగ్ర రూపంలో లభ్యమయ్యాయి. XXV, XXVI అధ్యాయాల్లో విషయ ప్రస్తావనలను మార్చడమూ, మరొకచోట ఉన్న విషయాలను తగినచోట చేర్చడమూ అవసరమైంది. XXVII అధ్యాయం, XXIX అధ్యాయం మూల ముసాయిదా నుంచి దాదాపు పూర్తిగా స్వీకరించ వీలయింది. కాగా XXVIII అధ్యాయంలో మాత్రం అక్కడిది ఇక్కడా, ఇక్కడిది అక్కడా మార్చవలసివచ్చింది. ఏమైనా అసలైన

ఇబ్బంది XXX అధ్యాయంతో ప్రారంభమైంది. ఇక్కడ నుంచి విషయ ప్రస్తావనలను సముచిత స్థానాల్లో ఉంచడమే కాక, ఆలోచనా స్రవంతిని సరైన పద్ధతిలో ఉంచవలసి వచ్చింది; ఎందుకంటే వాక్యం మధ్యలో కొన్ని పదజాలాలు శాఖాసంక్రమణాలు చేసివచ్చి అవి ఆగిపోయి, మరెక్కడో తిరిగి ప్రారంభమయేవి. అది కూడా యధాలాపంగా మాత్రమే. ఆ విధంగా XXXవ అధ్యాయమంతా అక్కడిది ఇక్కడా, ఇక్కడిది అక్కడా మార్చడం ద్వారానూ కొంత సామాగ్రి తీసివేయడం ద్వారానూ సరి చేయబడింది. అయితే ఇలా తీసివేసినవి మరోచోట ఉపయోగించుకోబడ్డాయి. అయితే XXXI అధ్యాయంలో మరింత ఏకక్రమం ఉంది. కానీ ఆ తర్వాత రాతప్రతిలో "గందరగోళం" అనే శీర్షికతో ఒక సుదీర్ఘ విభాగం వస్తుంది. 1848, 1857 నాటి సంక్షోభాలపై పార్లమెంటరీ నివేదికల నుంచి ఉల్లేఖినలు తప్ప ఇతరమేమీ ఇందులో లేదు. ఇందులో ఇరవై ముగ్గురు వ్యాపారుల, అర్థశాస్త్రవేత్తల ప్రకటనలను సంకలనం చేశారు. ప్రధానంగా డబ్బు, పెట్టుబడి, బంగారం తరలింపు, మితిమీరిన సట్టా వ్యాపారం మొదలైన వాటిపై ప్రకటనలివి; అక్కడ కూడా మార్క్స్ ఎత్తిపొడుస్తూ క్లుప్తంగా చేసిన వ్యాఖ్యలున్నాయి. పెట్టుబడికీ డబ్బుకూగల సంబంధం గురించి ఆనాడు వ్యాప్తిలో ఉన్న భావాలు దాదాపు అన్నీ సమాధానాల రూపంలో కానీ, ప్రశ్నల రూపంలో కానీ చోటుచేసు కున్నాయి. మార్క్స్ సవిమర్శకంగానూ, అపహాస్యం చేస్తూనూ వివరించ దలచినది డబ్బు మార్కెట్‌లో; డబ్బును, పెట్టుబడిని గుర్తించడంలో వెల్లడయిన "గందరగోళాన్నే". అనేక ప్రయత్నాలు చేసిన తర్వాత, ఈ అధ్యాయాన్ని సరైన రూపంలో ఉంచడం సాధ్యంకాదన్న నిశ్చితాభిప్రాయం నాకు కలిగింది. ఆ అధ్యాయంలోని సామాగ్రిని ముఖ్యంగా మార్క్స్ వ్యాఖ్యలతో కూడిన సామాగ్రిని, ఎక్కడ సందర్భోచితంగా కనిపిస్తే అక్కడల్లా ఉపయోగించుకున్నాను.

తరువాత ఒకే ఒక మోస్తరు వరుస క్రమంలో వచ్చేది, నేను XXXII అధ్యాయంలో ఉంచిన విషయాలు. కానీ దీని వెనువెంటనే పార్లమెంటరీ నివేదికలనుంచి కొత్త ఉల్లేఖినల సముదాయం ఉంది. ఆ భాగానికి సంబంధించి, ఊహించవీలున్న ప్రతి ఒక్క అంశం గురించిన నివేదికలివి - మధ్య మధ్య రచయిత వ్యాఖ్యానాలతో సహా చివరలో, అంతకంతకు డబ్బుకు సంబంధించిన లోహాల గమన క్రమంపైనా, మార్పిడి రేటుపైనా ఈ ఉల్లేఖినలు, వ్యాఖ్య లున్నట్టు కేంద్రీకరించి నానార్థకాల వ్యాఖ్యానాలతో ముగుస్తాయి. అయితే, పెట్టుబడిదారీ విధాన పూర్వపు అధ్యాయం (అధ్యాయం XXXVI) సర్వసమగ్రంగా ఉంది.

అంతకుముందు మధ్యలో చేర్చిన విషయాలు మినహా "గందరగోళం"తో ప్రారంభమయ్యే ఈ మొత్తం సామాగ్రితో XXXIII అధ్యాయం నుంచి XXXV అధ్యాయం దాకా రూపొందించాను. అయితే నిరంతరాయత కోసం మధ్యలో గణనీయమైన చేర్పులు లేకుండా ఈ పని సాధ్యం కాలేదని వేరే చెప్పనవసరం లేదు. అలా చేర్చినవి స్వభావరీత్యా లాంఛనప్రాయమైనవైతే తప్ప, అవి నావే అని స్పష్టంగా వ్యక్తం చేశాను. రచయిత చెప్పిన సందర్భోచితమైనవన్నీ గ్రంథపాఠంలో పొందుపరచ డంలో చివరకు కృతకృత్యుడనయ్యాను. అంతకుముందే చెప్పిన వాటి పునశ్చరణలుగానో, లేక రాతప్రతి ఆ తరువాత పరిశీలించని అంశాల ప్రస్తావనలుగానో ఉన్న ఉల్లేఖినలు - ఇలాంటివి కొన్ని మినహా దేనినీ వదలిపెట్టలేదు.

నేల కౌలుకు సంబంధించిన భాగం మరింత సంపూర్ణంగా వివరించబడింది. కానీ XLIII

అధ్యాయంలో ఈ మొత్తం భాగానికి సంబంధించిన పథకాన్ని (రాతప్రతిలో కౌలును గురించి దానిలో ఆఖరు భాగం) తిరిగి సమీక్షించాల్సిన అవసరం ఉన్నట్లు మార్క్స్ భావించిన కారణంగా ఈ భాగం ఒక పద్ధతి ప్రకారం ఉంచబడలేదు. ఇది మంచిదే; ఎందుచేతనంటే రాతప్రతి XXXVII అధ్యాయంతో ఆరంభమైంది. ఆ తర్వాత XLV నుంచి XLVII అధ్యాయాలు వచ్చాయి. ఆ తర్వాత మాత్రమే XXXVIII నుంచి XLIV దాకా అధ్యాయాలు వస్తాయి. రెండవ తరహా తారతమ్యాల కౌలు పట్టికల విషయంలో అన్నిటికన్నా ఎక్కువ శ్రమపడవలసి వచ్చింది. ఈ తరగతి కౌలు తాలూకు మూడవ ఉదాహరణ XLIII అధ్యాయంలో విశ్లేషించబడలేదని కనుక్కోవడానికి కూడా అంతగానూ శ్రమపడవలసి వచ్చింది.

మార్క్స్ డెబ్బైలలో నేల కౌలులో ఈ భాగం విషయమై పూర్తిగా నూతనమైన ప్రత్యేక అధ్యయనాల్లో నిమగ్నమయ్యారు. రష్యాలో 1816లో "సంస్కరణ" జరిగిన అనంతరం అనివార్యంగా వెలువడిన గణాంక వివరాల నివేదికలను రష్యన్ మూలభాషలోనే అంతకుముందు కొన్నేళ్లపాటు మార్క్స్ అధ్యయనం చేశారు. అదేవిధంగా భూ యాజమాన్యంపై వచ్చిన ఇతర గ్రంథాలను కూడా అధ్యయనం చేశారు. తన మిత్రులు ఎంతో సమగ్రమైన రూపంలో తనకు అందజేసిన ఈ మూల ప్రచురణల నుంచి మార్క్స్ అవసరమైన భాగాలను ఎత్తి రాసుకొని, కౌలును గురించి ఈ గ్రంథ భాగాన్ని తిరిగి కొత్తగా రాయటానికి వాటిని వినియోగించుకుందామనుకొన్నారు. రష్యాలోని భూయాజమాన్య రూపాలు, వ్యవసాయ ఉత్పాదకులను దోచుకునే రూపాలు బహువిధమైనవి. అందువల్ల పారిశ్రామిక వేతన శ్రమకు సంబంధించి ప్రథమ సంపుటిలో, నేల కౌలుకు ఇంగ్లాండ్ ఎలాటి పాత్ర నిర్వహించిందో పరిశీలించే భాగంలో ఈ దేశం అలాటి పాత్రే నిర్వర్తించవలసి వుండింది. అయితే దురదృష్టవశాత్తూ ఆ పథకాన్ని అమలుపరచే అవకాశం ఆయనకు దక్కలేదు.

ఇక చివరగా ఏడవ భాగం సమగ్ర రూపంలో లేని ప్రథమ ముసాయిదాగానే లభించింది. దాన్ని ప్రచురణార్థంగా చేసేందుకు అందులోని అంతులేని దీర్ఘవాక్యాలను ఎక్కడిక్కక్కడే విరుచుకో వలసి వచ్చింది. చివరి అధ్యాయం తాలూకు ప్రారంభం మాత్రమే ఉంది. మూడు ప్రధాన ఆదాయ రూపాలయినకౌలు, లాభం, వేతనాలకు అనుగుణమైన ప్రవర్థిత పెట్టుబడిదారీ సమాజ ప్రధాన వర్గాలను - అంటే భూస్వాములు, పెట్టుబడిదారులు, వేతన కార్మికులను గురించీ, వారి ఉనికిని వెన్నంటి పెట్టుబడిదారీ దశ వాస్తవ పర్యవసానంగా ఉండే వర్గపోరాటాన్ని గురించి ఈ అధ్యాయం వివరించాల్సి ఉంటుంది. అంతిమ ఎడిటింగ్ దాకా మార్క్స్ ఇలాటి ముగింపు సమాహారాలను అలాగే వదిలేవారు; ప్రెస్‌కు వెళ్లేముందు తాజా చారిత్రక పరిణామాలు తన సైద్ధాంతిక ప్రతిపాదనలకు అత్యంత కాలానుగుణ్యమైన నిదర్శనలను తప్పనిసరిగా సమకూర్చేవారు.

తను చెప్పిన వాటిని సోదాహరణంగా వివరించే ఉల్లేఖనలూ, రుజువులు రెండవ సంపుటిలో లాగానే, ఇందులో కూడా ప్రథమ సంపుటిలో కంటే గణనీయంగా తక్కువ. మొదటి సంపుటిలోని ఉల్లేఖనలు దాని రెండవ, మూడవ కూర్పుల్లోని పుటలను పేర్కొంటున్నాయి. మునుపటి అర్థశాస్త్ర వేత్తల సైద్ధాంతిక ప్రకటనలను రాతప్రతి ప్రస్తావిస్తున్న ప్రతిచోటా తప్పనిసరిగా అతని పేరు మాత్రమే ఇవ్వబడింది; అంతిమ ఎడిటింగ్‌లో మాత్రమే ఉల్లేఖనలను చేర్చివుండేవారు. సహజంగానే నేను వాటిని యథాతథంగా వదిలేశాను. ఇందులో ఉన్నది నాలుగు పార్లమెంటరీ నివేదికలే. కానీ అవి

పుష్కలంగా వినియోగించుకోబడ్డాయి. ఆ నాలుగు నివేదికలు ఇవి:

1. (దిగువసభ తాలుకు) కమిటీల నివేదికలు, సంపుటి VIII, వాణిజ్య విపత్తు, సంపుటి 2 భాగం 1, 1847-48 సాక్ష్యాల మినిట్స్; 1847-48 వాణిజ్య విపత్తుగా ఉల్లేఖించబడినది.
2. 1847 వాణిజ్య విపత్తుపై లార్డ్స్ సభ రహస్య కమిటీ, 1848లో ప్రచురింపబడిన నివేదిక. 1857లో ప్రచురింపబడిన సాక్ష్యాలు. (1848లో దానిని మరీ అప్రతిష్ట తెచ్చేదిగా ఉన్నట్లు పరిగణించారు కాబట్టి) సి.డి. 1848/57 ఉల్లేఖింపబడింది.
3. నివేదిక : బ్యాంక్ చట్టాలు, 1857 - బ్యాంక్ చట్టాలు 1858. 1844, 1845 బ్యాంక్ చట్టాల ప్రభావంపై దిగువ సభ కమిటీ నివేదికలు. సాక్ష్యాధారాలతో -1857 లేక 1858 తాలూకు బి.ఏ.గా (బి.సి.గా కూడా) ఉల్లేఖింపబడ్డాయి.

అదనపు విలువ సిద్ధాంత చరిత్రకు సంబంధించిన నాలుగవ సంపుటిపై ఎలాగో సాధ్యమైనంత త్వరగా కృషి ప్రారంభించబోతున్నాము.

* * *

పెట్టుబడి రెండవ సంపుటికి రాసిన ఉపోద్ఘాతంలో, ఆనాడు గందరగోళం సృష్టించిన పెద్దమనుషులతో విషయం తేల్చుకోవలసి వచ్చింది; ఎందువల్లనంటే, మార్క్స్ ప్రతిపాదనలకు రహస్య మూలాధారమూ, మార్క్స్‌కంటే ఉన్నతుడయిన అతని పూర్వీకుడు "రోడ్‌బర్టస్" అన్న సంగతిని తాను కనుగొన్నట్లు ఆ పెద్దమనుషులు భ్రమపడ్డారు. "రోడ్‌బర్టస్ లాటి వారి అర్థశాస్త్రం సాధించగలిగేదేమిటో" నిరూపించడానికి వారికి నేనొక అవకాశం కల్పించాను. "విలువ నియమాన్ని ఉల్లంఘించకుండా మాత్రమే కాక ఆ నియమం ఆధారంగానే, ఏవిధంగా సమానమైన సగటు లాభం రేటు ఏర్పడగలదో, ఏర్పడి తీరుతుందో" నిరూపించాల్సిందిగా వారిని సవాలు చేశాను. అయితే రోడ్‌బర్టస్ ప్రథమ శ్రేణి అర్థశాస్త్ర కోవిదుడంటూ ప్రశంసావర్షం కురిపిస్తూ వుండిన ఆ పెద్దమనుషులు ఒక్కరు కూడా నాకు సమాధానం ఇవ్వలేకపోయారు; వారలా ప్రశంసావర్షం కురిపించడానికి కారణం స్వీయాత్మకం కావచ్చు, వస్తుగతం కావచ్చు, ఏది ఏమైనా అది శాస్త్రీయమైన కారణం మాత్రం కాదు. కానీ ఇతరులు మాత్రం ఈ సమస్యను చేపట్టగల సత్తా తమకున్నదని భావించారు.

ప్రొఫెసర్ లెక్సిస్ - రెండవ సంపుటిపై తాను రచించిన విమర్శనా పత్రంలో (Conrads Jahrbiicher, XI,1885, S. 452-65) ఆ సమస్యకు ప్రత్యక్ష పరిష్కారాన్ని చూపించాలనుకోకపోయిన ప్పటికీ, ఆ సమస్యను ఎత్తుకొన్నాడు. ఆయన ఇలా అంటారు. "వివిధ తరగతుల సరుకులను విడివిడిగా పరిశీలిస్తేనూ, వాటి విలువ వాటి మార్పిడి - విలువకు సమానంగా ఉండాలంటేనూ, వాటి మార్పిడి - విలువ వాటి ధరకు సమానంగా కానీ లేక సమాన నిష్పత్తిలో కానీ ఉండాలంటేనూ, ఈ వైరుధ్యం (విలువకు సంబంధించి రికార్డో-మార్క్సియన్ విలువ నియమానికీ, సమానమైన సగటు లాభం రేటుకూ మధ్యగల వైరుధ్యం) యొక్క పరిష్కారం అసాధ్యం. ఆయన అభిప్రాయం ప్రకారం, "విడివిడి సరుకుల విలువను శ్రమనుబట్టి కొలవడానికి స్వస్తిచెప్పి, మొత్తం సరుకుల ఉత్పత్తినీ, పెట్టుబడిదార్లు కార్మికులు అనే మొత్తం వర్గాల మధ్య వాటి పంపిణీని మాత్రమే పరిగణనకు

తీసుకుంటేనే" పరిష్కారం సాధ్యం. "మొత్తం ఉత్పాదితంలో కొంతభాగం మాత్రమే కార్మికవర్గానికి అందుతుంది. మిగతా భాగం, అంటే పెట్టుబడిదారీవర్గం వాటాగా వెళ్ళేభాగం మార్క్స్ అర్థంలో అదనపు ఉత్పాదితానికి, ఆ విధంగా అదనపు విలువకు ప్రాతినిధ్యం వహిస్తుంది. అప్పుడు పెట్టుబడిదారీ వర్గంలోని సభ్యులు తాము నియుక్తం చేసుకున్న కార్మికుల సంఖ్యను బట్టి గాక - తమలోని ప్రతి ఒక్కరు మదుపు పెట్టిన పెట్టుబడికి అనుగుణంగా, భూమిని కూడా పెట్టుబడి-విలువగా పరిగణిస్తూ, తమ మొత్తం అదనపు విలువను పంపిణీ చేసుకుంటారు" సరుకుల సాకార రూపం ధరించిన శ్రమ యూనిట్లచే నిర్ణయమైన మార్క్సియన్ భావాత్మక విలువలు ధరలకు అనుగుణమైన రీతిలో ఉండవు; ఆ విలువలను "నిజమైన ధరలకు దారితీసే మార్పు యొక్క ప్రారంభ బిందువులుగా పరిగణించవచ్చు. నిజమైన ధరలన్నవి, సమాన పెట్టుబడి మొత్తాలకు సమాన లాభాలు రావాలన్న వాస్తవంపై ఆధారపడతాయి." ఈ కారణంగా కొంతమంది పెట్టుబడిదార్లు తమ సరుకులకు భావాత్మక విలువలకంటే ఎక్కువ ధరలను పొందుతారు, మరికొంతమంది పెట్టుబడిదారులేమో తక్కువ ధరలను పొందుతారు. "అయితే పెట్టుబడిదారీ వర్గంలో, అదనపు విలువలో వచ్చిన నష్టాలు, లాభాలు ఒకదాన్ని మరొకటి తటస్థీకరిస్తాయి. కాబట్టి ధరలన్నీ కనుక భావాత్మక విలువలకు అనుగుణమైన నిష్పత్తిలో ఉన్నట్లయితే మొత్తం అదనపు విలువ ఎంత ఉండేదో ఇప్పుడూ అంతే ఉంటుంది."

అయితే ఇక్కడ సమస్య ఏవిధంగానూ పరిష్కరింపబడలేదనడం స్పష్టం; కాకపోతే కాస్త స్థూలంగానూ, లోతుకు పోకుండానూ, మొత్తంపై సమస్యను సరిగా సూత్రీకరించడం జరిగింది. పై రచయితలాగే "నాటు అర్థశాస్త్రవేత్త" అని పిలువబడుతున్నందుకు గర్వించే వ్యక్తి నుంచి మనం ఆశించిన దానికంటే ఇది ఎక్కువే. ఇతర మోటు అర్థశాస్త్రవేత్తల రాతలతో పోల్చితే ఇది నిజంగా ఆశ్చర్యకరంగానే ఉంది; వాటిని గురించి మనం తర్వాత చర్చిద్దాం. ఏది ఏమైనా లెక్సీస్‌గారి నాటు అర్థశాస్త్రం మాత్రం ఒక ప్రత్యేక బాణీకి చెందింది.

ఏది ఎలాగున్నా, పెట్టుబడి యొక్క లాభాలకు మూలకారణాన్ని మార్క్స్ సూచించిన విధంగా రాబట్టవచ్చుననీ, అయితే ఈ అభిప్రాయాన్ని మనం తప్పనిసరిగా అంగీకరించేలా చేసే వాదన ఏదీ లేదనీ ఆయన అంటారు. నాటు అర్థశాస్త్రం అలా కాకుండా కనీసం మరింత యుక్తంగా కనిపించే కారణాన్ని చూపుతోందని అంటున్నారు. అదేమిటంటే -

"ముడిపదార్థాలు, ఉత్పత్తిదార్లు, కార్ఖానాదార్లు, టోకు వ్యాపారి, చిల్లర వ్యాపారి వగైరా పెట్టుబడిదారీ అమ్మకందార్లంతా కొనుగోలు ధరకంటే ఎక్కువ ధరకు అమ్మడం ద్వారా తమ లావాదేవీలపై లాభాలు సంపాయిస్తారు; ఆ విధంగా వారు తాము సరుకుకు చెల్లించిన ధరకు కొంత శాతం అధికంగా జోడించుకుంటారు. కార్మికుడు మాత్రమే తన సరుకుకు ఈ విధంగా ఎక్కువ విలువను పొందే స్థితిలో లేడు; పెట్టుబడిదారుడితో పోలిస్తే తనకుగల అనుకూల పరిస్థితి దృష్ట్యా, అతడు తన శ్రమను తాను చెల్లించిన ధరకే అమ్ముకోక తప్పడం లేదు; అంటే తన జీవనావసరాలకే అమ్ముకుంటాడు..... ఈ విధంగా వస్తువులు కొనుగోలు చేసే కార్మికుని విషయాలలో ధరలకు ఈ జోడింపులు తమ సంపూర్ణ ప్రభావం చూపుతాయి. మొత్తం ఉత్పాదితంలో ఒక భాగాన్ని, పెట్టుబడిదారీ వర్గానికి బదిలీ అయ్యేలా చేస్తాయి."

పెట్టుబడి తాలుకు లాభాలకు "నాటు అర్థశాస్త్రం" చూపే ఈ కారణం - ఆచరణలో, అదనపు విలువ గుర్తించిన మార్క్స్ సిద్ధాంతం వంటిదేనని గ్రహించడానికి తలబద్దలు కొట్టుకోవాల్సిన అవసరమేమీ లేదు. కార్మికులు ఏవిధమైన "అననుకూల పరిస్థితి"లో ఉంటారని మార్క్స్ చెప్పారో లెక్సిస్ కూడా అదేవిధంగా చెప్పారు; ప్రతి కార్మికేతరుడూ తన సరుకులను ధరలకంటె ఎక్కువకు అమ్ముకోగా, కార్మికుడు మాత్రమే అలా చేయలేదు, కాబట్టి కార్మికుడు మోసానికి గురవుతున్నాడని ఉభయులూ భావిస్తున్నారు. జెవాన్స్, మెంగర్‌లు రూపొందించిన ఉపయోగపు విలువ, ఉపాంత ప్రయోజనం గురించిన సిద్ధాంతం పునాదిపై ఇంగ్లండులో నాటు సోషలిజం నిర్మించినంత సులభంగా, ఈ సిద్ధాంతం పునాదిపై కూడా కనీసం అంత యుక్తమైనదిగా కనిపించే నాటు సోషలిజం నిర్మించడం తేలికే. లాభం గురించిన ఈ సిద్ధాంతం సంగతి జార్జ్ బెర్నార్డ్‌షాకు తెలిసివుండి ఉంటే, ఆయన జెవాన్స్‌కూ, కార్ల్ మెంగర్‌కూ తిలోదకాలిచ్చి ఈ సిద్ధాంత శిలపైనే భవిష్యత్ ఫేబియన్ చర్చిని సరికొత్తగా నిర్మించడానికి నిస్సంకోచంగా ప్రయత్నించి ఉండేవాడన్న అనుమానం సైతం నాకుంది.

అయితే వాస్తవంలో ఈ సిద్ధాంతం, వేరు మాటల్లో మార్క్స్ సిద్ధాంతమే తప్ప మరొకటికాదు. మరి ఈ ధరల జోడింపులకు ఖర్చవుతున్నదేది? కార్మికుల "మొత్తం ఉత్పాదితమే". దీనికి కారణమేమిటంటే, "శ్రమ" అనే సరుకును లేక మార్క్స్ మాటల్లో శ్రమశక్తిని దాని ధరకంటే తక్కువకే అమ్ముకోవలసి వస్తుంది. ఎందుచేతనంటే, తమ ఉత్పత్తి వ్యయంకంటే ఎక్కువ ధరకు అమ్మబడడం అన్ని సరుకుల ఉమ్మడి ధర్మమై, శ్రమ ఎల్లప్పుడూ ఉత్పత్తి వ్యయం ధరకే అమ్మబడుతుంది. కనుక ఇందుకు శ్రమ ఒక్కటే మినహాయింపు అయినట్లయితే, ఈ నాటు అర్థశాస్త్ర ప్రపంచాన్ని శాసించే ధరకంటే తక్కువధరకే శ్రమ అమ్మబడుతున్నదన్నమాట. ఫలితంగా పెట్టుబడిదారుడికి లేదా పెట్టుబడిదారీ వర్గానికి లభించే అదనపు లాభం అంతిమ విశ్లేషణలో ఎక్కడనుంచి వస్తుందీ అంటే, ఎక్కడనుంచి రాగలదూ అంటే, కార్మికుడు తన శ్రమశక్తి ధరకు సమమైన విలువను పునరుత్పత్తి చేసిన అనంతరం, అతడు - తనకు ప్రతిఫలం చెల్లింపబడని ఉత్పాదితాన్ని మరికొంత ఉత్పత్తి చేయవలసి ఉంది. అనగా అదనపు- ఉత్పాదితాన్ని, ప్రతిఫలం చెల్లింపబడని శ్రమ ఉత్పాదితాన్ని లేక అదనపు విలువను - అతడు పునరుత్పత్తి చేయవలసివుంది; అన్న వాస్తవం నుంచే ఆ అదనపు లాభం వస్తుంది. లెక్సిస్ తన పదాలెంపికలో చాలా జాగ్రత్త వహిస్తున్నాడు. ఇది తన సొంత భావనే అని ఆయన ఎక్కడా స్పష్టంగా చెప్పడు. మనం ఇక్కడ ఒక మామూలు నాటు అర్థశాస్త్ర శాస్త్రవేత్తతో వ్యవహరించడం లేదన్న వాస్తవం పట్టపగలంత స్పష్టంగా ఉంది, వీరిలో ప్రతి ఒక్కరూ మార్క్స్ దృష్టిలో "మహా అయితే పనికిమాలిన వెర్రిమనిషి" అని లెక్సిస్ స్వయంగా అంటాడు. మనం ఇక్కడ వ్యవహరిస్తున్నది, నాటు అర్థశాస్త్రవేత్త ముసుగులోని మార్క్సిస్టుతో. అయితే ఈ ముసుగు బుద్ధిపూర్వకంగా వేసుకున్నదా, కాదా అన్నది మనస్తత్వ శాస్త్రపు ప్రశ్న; ప్రస్తుతం ఈ ప్రశ్నలో మనకు ఆసక్తిలేదు. దీన్నిగురించి దర్యాప్తు చేయదల్చుకున్నవారు, లెక్సిస్ అంతటి సూక్ష్మగ్రాహి లోగడ ఒకసారి ద్విలోహవాదం అనే అర్థంపర్థం లేని వాదాన్ని ఎలా సమర్థించాడు అనే విషయం గురించి కూడా పరిశీలన జరపవచ్చు.

ఈ ప్రశ్నకు సమాధానం ఇవ్వడానికి మొట్టమొదట నిజంగా ప్రయత్నించిన వ్యక్తి డాక్టర్

కాన్రాడ్‌ష్మిట్. Die Durchschnittsprofitrate auf Grundlage des Marx'schen Werthgesetzes, (Stuttgart Dietz, 1889) అనే శీర్షికతో రచించిన తన కరపత్రంలో ఆయన అలా ప్రయత్నించారు. డాక్టర్ ష్మిట్ అటు విలువ నియమంతోనూ ఇటు సగటు లాభం రేటుతోనూ మార్కెట్ ధరల నిర్మాణపు వివరాలకు పొత్తు కుదర్చడానికి ప్రయత్నిస్తాడు. పారిశ్రామిక పెట్టుబడిదారుడు తన ఉత్పాదిత రూపంలో, మొదట తాను అడ్వాన్సు చేసిన పెట్టుబడికి సమతౌల్యాన్నీ, ఆ తర్వాత తాను ప్రతిఫలం చెల్లించని అదనపు ఉత్పాదితాన్నీ అందుకొంటాడు. అయితే అదనపు ఉత్పాదితాన్ని సంపాదించాలంటే అతడు ఉత్పత్తికోసం పెట్టుబడిని అడ్వాన్సు చేయక తప్పదు. అంటే ఈ అదనపు ఉత్పాదితాన్ని స్వాయత్తం చేసుకోవాలంటే అతడు కొంత వస్తురూప శ్రమను వెచ్చించక తప్పదు. కనుక పెట్టుబడిదారుని దృష్టిలో ఈ అదనపు ఉత్పాదితాన్ని సంపాదించడానికి సామాజికంగా అవసరమైన శ్రమకు తాను అడ్వాన్సు చేసే పెట్టుబడి ప్రాతినిధ్యం వహిస్తుంది. ఇది ప్రతి పారిశ్రామిక పెట్టుబడిదారుడికీ వర్తిస్తుంది. విలువ నియమం ప్రకారం, సరుకులు ఉత్పత్తికి అవసరమైన సామాజిక శ్రమ యొక్క నిష్పత్తి మేరకు సరుకుల పరస్పర మార్పిడి జరుగుతుంది. కాబట్టీ, పెట్టుబడిదారుడికి సంబంధించినంత వరకు అదనపు ఉత్పాదితం ఉత్పత్తి కోసం అవసరమైన శ్రమ అతడి పెట్టుబడిలో సంచితమైన గత శ్రమే కాబట్టి, అదనపు సరుకులు తమలో వాస్తవంగా నిక్షిప్తమైన శ్రమ నిష్పత్తిలో కాక, తమ ఉత్పత్తికి అవసరమైన పెట్టుబడి మొత్తాల నిష్పత్తిలో మాత్రమే మార్పిడి అవుతాయని తేలుతోంది. కనుక ఉత్పత్తి అయిన అన్ని అదనపు విలువల మొత్తాన్ని ఉత్పత్తిలో వ్యయమైన పెట్టుబడుల మొత్తం చేత భాగించగా వచ్చునది, ప్రతి పెట్టుబడి యూనిట్ వాటాగా ఉంటుంది.

ఆ మేరకు, సమాన పెట్టుబడి మొత్తాల సమాన కాలాల్లో సమాన లాభాలు ఇస్తాయి. ఈ విధంగా లెక్కించిన అదనపు ఉత్పాదితం యొక్క ఉత్పత్తి వ్యయాన్ని అంటే సగటు లాభాన్ని ప్రతిఫలం చెల్లించిన ఉత్పాదితం యొక్క ఉత్పత్తి ధరకు చేర్చి ఈ పెరిగిన ధరకు, ప్రతిఫలం చెల్లించిన ఉత్పాదితాన్నీ చెల్లించబడని ఉత్పాదితాన్నీ అమ్మడం ద్వారా ఈ సమాన లాభాల సంపాదనాక్రియ నిర్వహింప బడుతుంది. ష్మిట్ అభిప్రాయం ప్రకారం, విలువ నియమమే సగటు సరుకు ధరలను నిర్ణయిస్తున్నప్పటికీ లాభాల సగటు రేటు రూపుగొంటోంది.

ఈ వాదన చాలా చమత్కారభరితమైనది. ఇది పూర్తిగా హెగెల్ సూత్రీకరణల నమూనాను పోలివుంది. అయితే హెగెల్ సూత్రీకరణల్లో అత్యధిక భాగంలాగే ఇది కూడా సరియైనదికాదు. అదనపు ఉత్పాదితానికీ, ప్రతిఫలం చెల్లించిన ఉత్పాదితానికీ మధ్య తేడా ఏమీ లేదు. విలువ నియమం అన్నది ప్రత్యక్షంగా సగటు ధరలకు చెల్లుబడి కావాలనే పక్షంలో, వాటి ఉత్పత్తికి కావలసినట్టి, వ్యయం అయినట్టి సామాజికంగా అవసరమైన శ్రమకు అనుగుణమైన నిష్పత్తిలో ఆ రెండూ విక్రయింపబడాలి. పెట్టుబడిలో నిక్షిప్తమైవున్న గతకాలపు సంచిత శ్రమ అన్నది సంపూర్ణ రూపంలోని విలువ మొత్తమే కాక, ఉత్పత్తిలోనూ, లాభం రూపుగొనడంలోనూ అదీ ఒక అంశం కనుక, అది విలువను కూడా సృష్టిస్తుందనీ, అందుచేత తనలోని విలువకంటే అది ఎక్కువ విలువకు మూలమనీ చెప్పే పెట్టుబడిదారీ ఆలోచనా సరళి భావాన్ని విలువ నియమం మొట్టమొదట నుంచీ ఖండిస్తూనే వస్తున్నది. ఒక్క సజీవ శ్రమకు మాత్రమే ఈ ధర్మం ఉందని ఇది నిరూపిస్తున్నది.

పెట్టుబడిదారులు తమ పెట్టుబడికి అనుగుణమైన నిష్పత్తిలో ఉండే సమాన లాభాలను ఆశిస్తారనీ, తాము అడ్వాన్సు చేసిన పెట్టుబడిని తమ లాభాల తాలూకు ఒకరకపు ఉత్పత్తి ఖర్చుగా పరిగణిస్తారనీ అందరకూ తెలిసిందే; అయితే ష్మిట్ సగటు లాభం రేటు ప్రాతిపదికగా గల ధరకూ విలువ నియమానికీ మధ్య పొత్తు కుదర్చడానికి ఈ భావనను వాడుకుంటున్నాడంటే, దాని అర్థం అతడు విలువ నియమాన్నే నిరాకరిస్తున్నాడన్నమాట. ఎందువల్లనంటే లాభం రేటును నిర్ణయించే అంశాల్లో విలువ నియమం కూడా ఒకటని అంటున్నాడు. ఇది అసలు ఆ నియమానికి పూర్తిగా విరుద్ధమైన భావన.

సజీవ శ్రమలాగే సంచిత శ్రమ కూడా విలువను సృష్టిస్తుందనే పక్షంలో విలువ నియమమే వర్తించదు.

లేదా అది విలువనే సృష్టించదనే పక్షంలో ష్మిట్ నిరూపణకూ విలువ నియమానికీ ఏమాత్రం పొత్తు కుదరదు.

ష్మిట్ పరిష్కారానికి బాగా దగ్గరకు వచ్చినపుడు ఇలా పక్కమార్గం పట్టడానికి కారణం ఏమిటంటే, ప్రతి సరుకు యొక్క సగటు ధరకూ, విలువ నియమానికీ మధ్య ఏకీభావాన్ని నిరూపించడానికి గణితశాస్త్రపు సూత్రీకరణ ఒకటి అవసరమని ఆయన విశ్వసించాడు. కానీ ఈ సందర్భంలో, లక్ష్యానికి దగ్గరగా వచ్చిన స్థితిలో ఆయన పెడమార్గం పట్టినప్పటికీ, పెట్టుబడి మొదటి రెండు సంపుటాల నుంచి నిర్ధారణలను సరియైన అవగాహనతో చేశాడనడానికి అతని మిగతా కరపత్రం సాక్షీభూతంగా ఉంది. లాభం రేటు తగ్గే ధోరణికి కారణాలను ఇంతవరకూ కచ్చితంగా వివరించిన వారు లేరు. మార్క్స్ మూడవ సంపుటి మూడవ భాగంలో వివరించిన సరియైన కారణాలను, స్వతంత్రంగా కనుగొన్న ఘనత, అలాగే పారిశ్రామిక అదనపు విలువ నుంచి వాణిజ్య లాభం నిష్పన్నం కావడానికి కారణాలను వివరించిన ఘతన, వడ్డీ, కౌలుకు సంబంధించిన అనేక వ్యాఖ్యలను చేసిన ఘనత కూడా ష్మిట్‌కే దక్కుతుంది. ఈ విషయంలో, మూడవ సంపుటిలోని నాలుగవ, అయిదవ భాగాల్లో మార్క్స్ అభివృద్ధిపరచిన భావాలను ష్మిట్ ముందే ఊహించాడు.

ష్మిట్ ఆ తర్వాత రచించిన వ్యాసంలో (New Zeit, 1892-93 Hî+. 3, 4) ఈ సమస్యను పరిష్కరించే ప్రయత్నంలో వేరే మార్గం చేపట్టాడు. సగటు లాభంకన్నా తక్కువ లాభంగల ఉత్పత్తి ఉపశాఖలనుంచి సగటుకు మించిన లాభాలు గల ఉత్పత్తి ఉపశాఖలకు పెట్టుబడి బదలాయించ బడేలా చేయడం ద్వారా సగటు లాభం రేటును సృష్టించేది పోటీయే అని ఆయన ఈ వ్యాసంలో వాదిస్తాడు. పోటీ చాలావరకు లాభాల సమకారిణి అన్నది ఈయన కొత్తగా కనిపెట్టిందేమీ కాదు. కానీ, మితిమీరి సరఫరా అయిన సరుకుల అమ్మకం ధర విలువ నియమం మేరకు సమాజం చెల్లించగల విలువ పరిమాణానికి తగ్గడానికీ, ఈ లాభాల సమకారిణి క్రమానికీ మధ్య సారూప్యం ఉందని నిరూపించేందుకు ఈయన ప్రయత్నిస్తాడు. ఈ మార్గం కూడా ఆయన్ను పరిష్కారదిశగా నడిపించలేకపోయిందనడానికి ఈ సంపుటిలో మార్క్స్ చేసిన విశ్లేషణలే సంపూర్ణ నిదర్శనం.

ష్మిట్ తర్వాత పి. ఫైర్మన్ ఈ సమస్య పరిష్కారానికి పూనుకొన్నాడు. (Conrads Jahrbiicher, Dritte Folge, III, S.793) మార్క్సియన్ విశ్లేషణలోని ఇతర అంశాల గురించి ఆయన చేసిన

వ్యాఖ్యల జోలికి నేను పోను. ఆ వ్యాఖ్యలకు కారణం ఒక పొరపాటు అభిప్రాయం. మార్క్స్ కేవలం పరిశీలన చేస్తున్న సందర్భంలో ఆయన నిర్వచించ కోరుతున్నాడనీ, మార్క్స్ రచనల్లో స్థిరమైన, మార్పులేని, శాశ్వతంగా వర్తించగల నిర్వచనాలను మొత్తంపై ఆశించవచ్చుననీ ఫైర్మన్ అభిప్రాయం. ఒక విషయం స్వయం విదితం; వస్తువులు, వాటి ఆంతరిక సంబంధాలు స్థిరమైనవి కావని, అవి మార్పు చెందుతున్నవని భావించే పక్షంలో, మనసులోని వాటి ప్రతిరూపాలు, అంటే భావాలు కూడా మార్పునకు, పరివర్తనకు గురవుతాయి. అవి కట్టుదిట్టమైన నిర్వచనాల నాళికల్లో బద్ధమై ఉండవు. అవి రూపొందే చారిత్రక, తార్కిక క్రమంలో వాటిని అభివృద్ధి చేయడం జరుగుతుంది. మార్క్స్ తన ప్రథమ సంపుటి ప్రారంభంలో సరుకుల సామాన్య ఉత్పత్తిని చారిత్రక ప్రాతిపదికగా తీసుకొని, ఆ ప్రాతిపదిక నుంచి తుదకు పెట్టుబడికి చేరుకోవాలని ఎందుకు భావించాడో, తార్కికంగానూ, చారిత్రకంగానూ రెండవ రూపంనుంచి, అంటే పెట్టుబడిదారీ విధానంవల్ల అదివరకే మార్పు చెందిన సరుకు నుంచి కాకుండా కేవలం సామాన్య సరుకు నుంచే ఎందుకు తన విశ్లేషణ ప్రారంభించాడో దీన్నిబట్టి స్పష్టమవుతుంది. ఈ అంశాన్ని ఫైర్మన్ గమనించలేకపోయా డనడం నిస్సందేహం. వీటిని, పలువిధమైన అభ్యంతరాలకు తావిచ్చే ఇతర అప్రాముఖ్య సమస్యలను ప్రస్తుతానికి వదిలేసి, అసలు విషయానికి వెళ్దాం. ఒక నిర్ణీత అదనపు విలువ రేటు ప్రకారం, అదనపు విలువ మొత్తం నియోగింపబడిన శ్రమశక్తికి అనుగుణమైన నిష్పత్తిలో ఉంటుందని, ఆయనకు సిద్ధాంతం బోధించగా, నిర్ణీత సగటు లాభం రేటు ప్రకారం, లాభం నియోగింపబడిన మొత్తం పెట్టుబడికి అనుగుణమైన నిష్పత్తిలో ఉంటుందని ఆయన స్వానుభవం ద్వారా గ్రహిస్తున్నాడు. లాభం అన్నది కేవలం సంప్రదాయసిద్ధమైన పరిణామం అనడం ద్వారా ఆయన దీనికి కారణం చెబుతున్నాడు. (అంటే ఇది నిర్దిష్ట సామాజిక వ్యవస్థకు చెందిందనీ, ఆ వ్యవస్థ ఉన్నప్పడే అది ఉంటుందనీ, అది పడిపోతే ఇది కూడా పడిపోతుందనీ ఆయన భాషలో దీని అర్థం) దీని అస్తిత్వం కేవలం పెట్టుబడితో ముడిపడి ఉంటుంది. పెట్టుబడికి లాభం సంపాదించడానికి తగిన శక్తి ఉన్నట్లయితే, అది పోటీ మూలంగా అన్ని పెట్టుబడుల మొత్తాలకు సమానంగా ఉండే లాభం రేటును సంపాదించక తప్పదు. వాస్తవానికి సమాన లాభం రేటు ఉన్నప్పడు, వ్యక్తిగత పెట్టుబడిదారుడి లాభ పరిమాణం అతని పెట్టుబడి మొత్తంపై మాత్రమే ఆధారపడి ఉంటుంది. కాగా లాభంలో అదనపు విలువ అనేది చెల్లించని శ్రమే. అదనపు విలువ పరిమాణం అన్నది శ్రమను దోపిడీ చేసే స్థాయిపై ఆధారపడి ఉంటుంది. లాభం పరిమాణమేమో నియోగింపబడిన పెట్టుబడి మొత్తంపై ఆధారపడి ఉంటుంది. మరైతే ఆ అదనపు విలువ, లాభంగా ఎలా పరివర్తన చెందుతుంది? "అస్థిర పెట్టుబడికి స్థిర పెట్టుబడికీ మధ్య నిష్పత్తి అత్యధికంగా ఉన్న అన్ని ఉత్పత్తి శాఖల్లోనూ సరుకులను.... వాటి విలువకంటే ఎక్కువకు అమ్మడం ద్వారా; అంటే స్థిర పెట్టుబడికీ, అస్థిర పెట్టుబడికీ మధ్య నిష్పత్తి (స్థిపె:అపె) అతి తక్కువగా ఉన్న అన్ని ఉత్పత్తి శాఖల్లోనూ సరుకులు తమ విలువకంటే తక్కువకు అమ్మకమవుతాయనేది ఇందులో గర్భితం. అంతేకాదు. స్థిరపెట్టుబడి, అస్థిర పెట్టుబడి నిష్పత్తి స్థిపె:అపె సరాసరిగా ఉన్న ఉత్పత్తి శాఖల్లో మాత్రమే సరుకులు తమ నిజమైన విలువలకు అమ్మకమవుతాయని కూడా ఇందులో గర్భితం.... మరి వ్యష్టి సరుకులు ధరలకూ, వాటి విలువలకూ మధ్యగల ఈ వ్యత్యాసం, విలువ సూత్రాన్ని నిరాకరించడం కాదా? కానే కాదు.

ఎందుచేతనంటే వాటి విలువకంటే తక్కువ స్థాయికి కొన్న సరుకుల ధరలు తమ విలువలకన్నా ఎంత తక్కువ స్థాయికి పడిపోతాయో మిగతా సరుకుల ధరలు తమ విలువలకన్నా అంత ఎక్కువ స్థాయికి పెరుగుతాయి; కాబట్టి ధరల మొత్తాలు విలువల మొత్తాలకు సమానంగా ఉంటాయి..... కనుక చివరకు ఈ అసంబద్ధత అదృశ్యమైపోతుంది." ఈ అసంబద్ధత కేవలం 'భగ్నం' లాటిది. "అయితే కచ్చితమైన విజ్ఞాన శాస్త్రాల్లో ఊహించవీలున్న భగ్నాన్ని నియమ ఉల్లంఘనగా పరిగణించడం సంప్రదాయం కాదు."

ఈ సంపుటి తొమ్మిదో అధ్యాయంలో ఇందుకు సంబంధించిన వాక్యాలతో పై వాక్యాలను పోల్చితే ఫైర్మన్ అసలైన అంశాన్నే పట్టుకున్నాడని స్పష్టంగా తెలుస్తుంది. అయితే ఫైర్మన్ సర్వసమగ్ర పరిష్కారాన్ని సాధించాలంటే, ఈ విషయాన్ని కనుగొన్న తరువాత సైతం, అనేక ఆంతరిక సంబంధాల లంకెలు అవసరమని, ప్రతిభా సమన్వితమైన ఆయన వ్యాసానికి తగిన స్పందన లభించకపోవడమే నిరూపిస్తున్నది. ఈ సమస్య పట్ల పలువురు ఆసక్తి వ్యక్తం చేసినప్పటికీ వారంతా వట్టిపుణ్యానికి చేతులు కాల్చుకుంటామేమో అని భయపడ్డారు. ఇలా భావించడానికి రెండు కారణాలున్నాయి. ఫైర్మన్ తాను కనుగొన్న విషయాన్ని అసమగ్ర రూపంలో వదలివేయడం, మార్క్సియన్ విశ్లేషణ గురించిన ఆయన భావన పూర్తి దోషభూయిష్టంగా ఉండటం; ఈ విశ్లేషణపై ఆయన చేసిన సాధారణ విమర్శ కూడా దోషభూయిష్టమైనదే; దీనికి మూలం ఆయన పొరపాటు భావనే.

ఏదైనా క్లిష్ట సమస్య ఎదురైన తన మూర్ఖత్వాన్ని బయట పెట్టుకునే అవకాశం లభించినప్పుడు జూరిచ్‌కు చెందిన ప్రొఫెసర్ జూలియస్ ఉల్ఫ్ ఆ అవకాశాన్ని ఎప్పడూ జారవిడుచుకోడు. సాపేక్ష అదనపు విలువలో మొత్తం సమస్యకు పరిష్కారం లభిస్తుందని ఆయన అంటున్నాడు. (Conrads Jahrbiicher 1891, dritte Folge, 11 S.352 ఇంకా తదుపరి వ్యాసాలు) సాపేక్ష అదనపు విలువ ఉత్పత్తి, అస్థిర పెట్టుబడి కంటె స్థిర పెట్టుబడి పెరగడంపై ఆధారపడి ఉంటుంది. "స్థిర పెట్టుబడిలో పెరుగుదల ఉందంటే, శ్రామికుల ఉత్పాదక శక్తిలో పెరుగుదల ఉండక తప్పదు. ఉత్పాదక శక్తిలోని పెరుగుదల (కార్మికుని జీవన వ్యయాన్ని తగ్గించడం ద్వారా) అదనపు విలువను పెంచుతుంది. కనుక పెరుగుతున్న అదనపు విలువ, మొత్తం పెట్టుబడిలో పెరుగుతున్న స్థిరపెట్టుబడి వాటా, ఈ రెండింటి మధ్య ప్రత్యక్ష సంబంధం నెలకొంటుంది. స్థిర పెట్టుబడిలోని పెరుగుదల, శ్రామిక ఉత్పాదక శక్తిలో పెరుగుదలను సూచిస్తుంది. మార్క్స్ అభిప్రాయం ప్రకారం, అస్థిర పెట్టుబడి యధాతథంగా ఉండి, స్థిర పెట్టుబడి పెరిగినట్లయితే అదనపు విలువ కూడా పెరిగి తీరాలి. మనముందుంచబడిన సమస్య ఇదే."

మార్క్స్ తన మొదటి సంపుటిలో చాలాసార్లు ఇందుకు పూర్తిగా వ్యతిరేకమైన భావాన్ని వ్యక్తం చేసిన మాట నిజం. మార్క్స్ అభిప్రాయం ప్రకారం, అస్థిర పెట్టుబడి తగ్గినప్పుడు స్థిర పెట్టుబడిలోని పెరుగుదలకు అనుగుణమైన నిష్పత్తిలో సాపేక్ష అదనపు విలువ పెరుగుతుంది అనే ఉద్ఘాటన ఎంత విస్మయకరమైందంటే, పార్లమెంట్‌లో చేసే ప్రకటనలన్నీ దీని ముందు ఛీ అనిపించు కోవలసిందే. సాపేక్ష అదనపు విలువ, నిరపేక్ష అదనపు విలువ అనే భావనలు సాపేక్షంగా కానీ నిరపేక్షంగా కానీ తనకు అర్థమే కాలేదని ప్రొఫెసర్ జూలియస్ ఉల్ఫ్ తన ప్రతి పంక్తిలోనూ నిరూపిస్తాడు. "అసంబద్ధతల గూట్లో చిక్కుకున్నట్లు మొదట్లో కనిపిస్తుంది" అని ఆయనే స్వయంగా

అంటాడు. నిజానికి ఆయన మొత్తం వ్యాసంలోని నిజమైన మాట ఇదే. ఏది ఏమైనా ఆయనకేమి? తాను కనుగొన్న అద్భుత విషయానికి ప్రొఫెసర్ జూలియస్ ఉల్ఫ్ ఎంతగా గర్విస్తున్నాడంటే, మరణించిన మార్క్స్‌ను ఇందుకు ప్రశంసావర్షంలో ముంచెత్తకుండా నిభాయించుకోలేక పోయాడు; అంతులేని తన అవివేకాన్ని, "పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థపై (మార్క్స్) రూపొందించిన విమర్శనా పద్ధతి నిశితమైన, దూరదృష్టి గలదనడానికి నూతన నిదర్శనమని" పొగడుకోకుండా ఉండలేకపోయాడు.

ఆయన సుభాషితాల్లోకెల్లా మణిపూస లాంటిది. ఇదుగో వినండి. ప్రొఫెసర్ ఉల్ఫ్ ఇలా అంటారు: "ఒకే శ్రమవ్యయం ఒకే అదనపు విలువను (పరిమాణానికి సంబంధించి) సృష్టించినట్లే, సమాన పెట్టుబడి మదుపు సమాన అదనపు విలువను (లాభం) సృష్టిస్తుందని, రికార్డో అదేవిధంగా వాదించాడు. ఇప్పుడిక సమస్యల్లా ఇవి ఒకదానితో మరొకటి ఎలా ఏకీభవిస్తున్నాయన్నదే. అయితే మార్క్స్, సమస్యను ఈ విధంగా చిత్రించడాన్ని ఆమోదించేందుకు నిరాకరించాడు. మొదటిమాట తప్పనిసరిగా విలువ నియమం యొక్క ఫలితం కాదనీ అది తన విలువ నియమానికి విరుద్ధంగా ఉంది కాబట్టి......దాన్ని నిరాకరించాలని ఆయన నిస్సందేహంగా నిరూపించాడు. (మూడవ సంపుటిలో)

ఆ తర్వాత, తప్పు చేసింది మార్క్సా లేక నేనా అనే విషయమై ఉల్ఫ్ పరిశీలిస్తాడు. చీకట్లో తడుములాడుతున్నది తానే అనే విషయం ఆయనకు సహజంగానే తట్టదు.

ఈ సుభాషితంపై ఇక ఒక మాట చెప్పినా, నా పాఠకులకు కోపం తెప్పించినట్లవుతుంది; పరిస్థితిలోని హాస్యాన్ని నేను గమనించనట్లే అవుతుంది. కానీ ఒకటి మాత్రంచెబుతాను. పైన ప్రస్తావించిన కొన్రాడ్ ష్మిట్ గ్రంథానికి "ఎంగెల్స్ ప్రత్యక్ష ప్రేరణ" అయినట్లు ప్రొఫెసర్లు పిచ్చాపాటిగా అనుకుంటున్న మాటలను పేర్కొనేందుకు ఈ అవకాశాన్ని వినియోగించుకొన్న ఈతని సిగ్గుమాలిన దుస్సాహసం, "మార్క్స్ తన మూడవ సంపుటిలో నిస్సందేహంగా నిరూపించిన" దాన్నే ఒకప్పుడు తాను కూడా చెప్పిన సిగ్గుమాలిన దుస్సాహసానికి సరితూగుతుంది. భలే! జూలియస్ ఉల్ఫ్‌గారు భలే! ఇతరులకు బహిరంగంగా ఒక సమస్యను వారి ముందుంచే వ్యక్తి తన దగ్గరి మిత్రులకు పరిష్కారాన్ని చాటుగా తెలియజెప్పడం మీరు మెలగే సమాజంలో మామూలు సంప్రదాయమే కావచ్చు. ఇలాటి పని మీరు చేయగలరని నమ్మడానికి నేను సంసిద్ధంగా ఉన్నాను. అయితే నేను సంచరించే సమాజంలోని వ్యక్తికి ఇంతటి కుయుక్తులకు దిగజారాల్సిన అవసరం లేదని ప్రస్తుత ఉపోద్ఘాతం నిరూపిస్తున్నది.

మార్క్స్ మరణించగానే ఆయన్ను గురించి ఆచిలీలోరియా నోవా యాంటలోజియాలో (Nuova Antologia) (ఏప్రిల్ 1883) హడావుడిగా ఒక వ్యాసం ప్రచురించాడు. అందులో తప్పుడు సమాచారంతో కూడుకున్న జీవిత చరిత్రతో ప్రారంభించి; ఆ తర్వాత ఆయన పౌర, రాజకీయ, సాహితీ రచనలను సవిమర్శకంగా సమీక్షించారు. చరిత్రపట్ల మార్క్స్‌కున్న భౌతికవాద భావనను తప్పుగా చిత్రిస్తాడు; వక్రీకరిస్తాడు; ఆ పని చేయడంలో అతడు చూపిన ఆత్మవిశ్వాసం, ఏదో ఉద్దేశంతోనే ఇలా చేస్తున్నాడని చాటుతోంది. తుదకు ఆ ఉద్దేశం నెరవేరింది. ఇదే లోరియా 1886లో Lateoria Economica della Constituzione Politica, అనే గ్రంథం రచించాడు. అందులో

అతడు లోగడ 1883లో తాను పూర్తిగా, ఉద్దేశ పూర్వకంగా వక్రీకరించిన చరిత్ర గురించిన మార్క్స్ భావన నిజానికి తనసొంత ఆవిష్కరణే అని ప్రకటించి సమకాలికులను ఆశ్చర్య సముద్రంలో ముంచాడు. ఆయన ఈ గ్రంథంలో మార్క్సిస్టు సిద్ధాంతాన్ని నిజానికి చాలా అల్పస్థాయికి దిగజార్చారు. నాలుగవ తరగతి కుర్రాడు కూడా సహించలేని తప్పడు తడకలతో కూడిన చారిత్రక ఉదాహరణలు, నిరూపణలు ఇందులో కోకొల్లలు. కానీ అతనికేమిపోయింది? సర్వత్రా రాజకీయ పరిస్థితులకు, ఘటనలకు తదనురూపంగా ఉండే ఆర్థిక పరిస్థితులే కారణం అనే కొత్త విషయాన్ని కనుగొనింది 1845లో మార్క్స్ కాదట. 1886లో లోరియాగారే నట. కనీసం తన దేశస్తులనైనా ఆయన ఈ విషయం నమ్మింప చేశాడు; ఆ గ్రంథం ఫ్రెంచ్ భాషలో వచ్చాక కొంతమంది ఫ్రెంచ్ పౌరులను సైతం నమ్మింపజేశాడు. ఈ కాకి దొంగిలించి ధరించిన నెమలి ఈకల్ని ఇటాలియన్ సోషలిస్టులు ఊడబెరికే దాకా ఈ పెద్దమనిషి ఇటలీలో చరిత్రకు సంబంధించిన నూతన శకాత్మక సిద్ధాంతకర్తగా రొమ్మువిరుచుకొని తిరగవచ్చు.

అయితే ఇది లోరియా తీరుతెన్నులకు నమూనా మాత్రమే. మార్క్స్ రూపొందించిన అన్ని సిద్ధాంతాలకు మూలం ఉద్దేశపూర్వక కుతర్కమే (Un Consaputo Sofisma) నని భరోసా ఇస్తున్నాడు; తనవి హేత్వాభాష (Sapendoli tali) లని తెలిసినప్పటికీ మార్క్స్ ఆ హేత్వాభాస చేపట్టక మానడట వగైరా. లోరియా లాగే మార్క్స్ కూడా నిజాయితీ లేకుండా పేరు ప్రఖ్యాతులు పొందినవాడని పాఠకులు భావించడానికి వీలు కలిగించే ఇలాటి అసహ్యకరమైన సంఖ్యానేక ఆరోపణలు మార్క్స్‌పై కుమ్మరించిన అనంతరం, అతడు తన పాఠకులకు ఒక ముఖ్యమైన రహస్యాన్ని వెల్లడిస్తాడు; తద్వారా మనలని లాభం రేటు దగ్గరకు తీసుకెళతాడు.

లోరియా ఇలా అంటాడు; మార్క్స్ అభిప్రాయం ప్రకారం, స్థిర పెట్టుబడి లాభాన్ని సృష్టించదు కాబట్టి, పెట్టుబడిదారీ పారిశ్రామిక సంస్థలో ఉత్పత్తి అయ్యే అదనపు విలువ మొత్తం (లోరియా దీన్ని లాభంగా పరిగణిస్తాడు) ఆ సంస్థలో నియోగించిన అస్థిర పెట్టుబడిపై ఆధారపడి వుంటుంది. అయితే ఇది వాస్తవానికి వ్యతిరేకమైంది. ఎందుచేతనంటే, ఆచరణలో లాభం, అస్థిర పెట్టుబడిపైకాక మొత్తం పెట్టుబడిపై ఆధారపడి ఉంటుంది. మార్క్స్ స్వయంగా దీన్ని గుర్తించి (Buch I Kap XI)[1] పైకి వాస్తవాలు ఈ సిద్ధాంతాన్ని వ్యతిరేకిస్తున్నట్టు కనిపిస్తాయని అంగీకరిస్తాడు. మరైతే ఆయన ఈ వైరుధ్యం నుంచి ఎలా బయటపడతాడు? అప్పటికింకా ప్రచురింపబడని తదుపరి సంపుటిని చూచుకోండని మార్క్స్ తన పాఠకులకు చెబుతాడు. మార్క్స్‌కు అసలు తరువాతి సంపుటి రచించే ఉద్దేశం ఉన్నట్లు తాను నమ్మడంలేదని లోరియా అదివరకే తన పాఠకులకు చెప్పేశాడు. ఇప్పుడు ఇలా విజయగర్వంతో చెప్తాడు "శాస్త్రబద్ధమైన వాదనలను ముందుకు తేవడంలో విఫలమైనప్పుడల్లా మార్క్స్ ఇదిగో రెండవ సంపుటిని వెలువరిస్తానన్న తెలివైన మాయోపాయాన్ని వినియోగించుకున్నాడని నేను వాదించడంలో పొరపడలేదు. రెండవ సంపుటి వెలువరిస్తానంటూ ఆయన ప్రత్యర్థులను నిరంతరం బెదిరించాడే తప్ప అది ప్రచురణే కాలేదు. (Un ingegnoso spediente ideato dal Marx a Sostituzione degli argomenti Scientifici)" లోరియా లాంటి దగాకోరు

1. ఇంగ్లీష్ కూర్పు: కార్ల్‌మార్క్స్, పెట్టుబడి సంపుటి-I, అధ్యాయం- XIII - మాస్కో 1983 - సంపాదకుడు.

శాస్త్రవేత్తల సరసనే మార్క్స్ స్థానం అని నమ్మేవారూ, ఇదంతా చెప్పాక కూడా ఇంకా నమ్మని వారెవరైనా ఉంటే వారినీ మూర్ఖత్వాన్నుండి విముక్తి చేయగలిగిన సాధనమేదీ లేదు.

దీన్నుంచి మనం నేర్చుకున్నది కనీసం ఇదే. లోరియా అభిప్రాయం ప్రకారం, మార్క్స్ ప్రతిపాదించిన అదనపు విలువ సిద్ధాంతం, సార్వత్రిక సమాన లాభం రేటుతో పొత్తు పొసగనిది. ఆ తర్వాత రెండవ సంపుటి రానే వచ్చింది. ఇదే అంశంపై నేను బహిరంగంగా సవాలు విసిరాను. లోరియా కూడా మాకుమల్లే బెరుకు ఉన్న జర్మనీయుడైతే అతను కాస్త ఇరకాటంలో పడివుండేవాడు. అయితే ఆయన ఉష్ణప్రాంతానికి చెందిన ధూర్త దాక్షిణాత్యుడు కనుక ఇలాటి సందర్భాల్లో నిమ్మకు నీరెత్తినట్లు ఉండడం అక్కడ సహజగుణమే అనేందుకు ఆయనే సాక్షి! లాభం రేటు ప్రశ్న బహిరంగంగా ప్రతిపాదితమయింది. లోరియా ఏమో దాన్ని పరిష్కరించడం సాధ్యంకాదని బాహాటంగానే ప్రకటించి ఉన్నాడు. అందుకనే ఇప్పుడాయన ఈ సమస్యను బహిరంగంగా పరిష్కరించడం ద్వారా తన్నుతాను మించిపోవడానికి ముందుకు వస్తున్నాడు.

ఇంతకు ముందే తెలిపిన కాన్రాడ్ ష్మిట్ కరపత్రాన్ని ప్రస్తావిస్తూ రాసిన Conrads Jahrbiicher, (Nevue Folga, Buch XX, S. 272) అనే వ్యాసంలో ఆయన ఆ అద్భుతాన్ని సాధించాడు. వాణిజ్య లాభం గడించేదెలాగో ష్మిట్ నుంచి లోరియా తెలుసుకున్నాక, ఆయనకీ విషయం అకస్మాత్తుగా తేటతెల్లమైంది. “విలువను శ్రమకాలం నిర్ధారించడమన్నది తమ పెట్టుబడుల్లో ఎక్కువ భాగాన్ని వేతనాల రూపంలో నియోగించే పెట్టుబడిదార్లకు అనుకూలం కనుక ఇలాటి సదుపాయాలున్న పెట్టుబడిదార్లనుంచి అనుత్పాదక” (వాణిజ్య అని చదువుకోవాలి) పెట్టుబడి ఎక్కువ వడ్డీని (లాభాన్ని అని చదువుకోవాలి) సంగ్రహించి ఆ విధంగా వ్యక్తిగత పారిశ్రామిక పెట్టుబడిదార్ల మధ్య సమానతను నెలకొల్పవచ్చు.... ఉదాహరణకు, అ, ఆ, ఇ అనే ముగ్గురు పారిశ్రామిక పెట్టుబడిదార్లు 100 పని దినాలను, వరుసగా 0, 100, 200 స్థిర పెట్టుబడిని ఉత్పత్తి కోసం వినియోగించుకున్నట్లయితే, 100 పనిదినాలకు వేతనం 50 పనిదినాలకే ప్రాతినిధ్యం వహించేట్లయితే ప్రతి పారిశ్రామిక పెట్టుబడిదారుడికీ 50 పనిదినాల అదనపు విలువ లభిస్తుంది; కాగా మొదటి వ్యక్తి లాభం రేటు 100%, రెండవ వ్యక్తి లాభంరేటు 33.3%, మూడవ వ్యక్తి లాభం రేటు 20% అవుతుంది. అయితే ‘ఈ’ అనే నాలుగవ పెట్టుబడిదారుడు 300 అనుత్పాదక పెట్టుబడిని పోగుచేస్తే, ‘అ’ పెట్టుబడిదారుడి నుంచి 40 పనిదినాల విలువకు సమానమైన వడ్డీ (లాభం)ని, ‘ఆ’ పెట్టుబడిదారుడి నుంచి 20 పనిదినాలకు విలువకు సమానమైన వడ్డీని గ్రహిస్తుంది కనుక ‘అ’, ‘ఆ’ పెట్టుబడిదార్ల లాభం రేటు పెట్టుబడిదారునికి లాగే 20 శాతానికి తగ్గిపోతుంది; ‘ఈ’ పెట్టుబడిదారుడు 300 పెట్టుబడితో 60 లాభం, లేదా 20 శాతం లాభం రేటు సంపాదిస్తాడు, ఇతర పెట్టుబడిదార్లలాగా!

పదేళ్ల క్రితం తనే పరిష్కార సాధ్యం కాదని ప్రకటించిన సమస్యను మహానుభావుడు లోరియా తన హస్తలాఘవంతో, ఆశ్చర్యం గొలిపే నైపుణ్యంతో ఇప్పుడు పరిష్కరించి పారేస్తున్నాడు. భూమి యజమాని, కౌల్దారుని అదనపు లాభాన్ని కౌలుకింద లాగేసుకున్నట్లే, పెట్టుబడిదార్ల నుంచి సగటు లాభం రేటును మించిన లాభాన్ని వడపిండి తన జేబులోనే ఉంచుకోగల శక్తి ఈ “అనుత్పాదక పెట్టుబడి”కి ఎక్కడనుంచి వచ్చిందన్న రహస్యం మాత్రం దురదృష్టవశాత్తూ ఆయన మనకు వెల్లడించడం లేదు. ఆయన అభిప్రాయం ప్రకారం, పారిశ్రామికుల నుంచి కౌలును పోలిన కప్పం

పొందేదీ, ఆ విధంగా సగటు లాభం రేటుకు దారితీసేదీ వ్యాపారులే. ఆయన సాధారణ లాభం రేటును సృష్టించడంలో వాణిజ్య పెట్టుబడి చాలా ముఖ్యమైన కారకం అన్న విషయం దాదాపు సర్వవిదితమే. అయితే సాధారణ లాభం రేటు అంటూ ఒకటి ఏర్పడక ముందే ఈ రేటుకు మించి ఉన్న యావత్తు అదనపు విలువను లాక్కోవడానికీ, భూస్థితిలో ఎలాటి సంబంధం లేకుండా ఆ అదనపు విలువను తన కోసం కౌలుగా మార్చడానికీ, వాణిజ్య పెట్టుబడికి మంత్రశక్తి ఉందని ధైర్యంగా ప్రకటించగలిగేదీ, రాజకీయ అర్థశాస్త్రం అంటేనే చీదరించుకొనే సాహితీలోక దుస్సాహసి మాత్రమే. కేవలం సగటు లాభం రేటుకు సమానంగా ఉండే అదనపు విలువను పొందే ప్రత్యేక పారిశ్రామికులెవరో వాణిజ్య పెట్టుబడి కనుగొని, వారి ఉత్పాదితాలను ఎలాంటి కమీషన్ పుచ్చుకోకుండా ఉచితంగా అమ్మడం ద్వారా ఈ మార్క్సియన్ విలువ సూత్ర బాధితుల కడగండ్లను కడతేర్చడం తన పుణ్యంగా అది పరిగణిస్తుందనడం అంతకన్నా తక్కువ ఆశ్చర్యకరమైనదేమీ కాదు. మార్క్స్‌కు ఇంతటి దారుణమైన కుయుక్తి అవసరమయిందని ఊహించే వ్యక్తి ఎంతటి దగాకోరైవుండాలి?

అయితే ఉత్తర ప్రాంతానికి చెందిన పోటీదార్లతో, ఉదాహరణకు శ్రీమాన్ జూలియస్ ఉల్ఫ్‌తో పోల్చి చూస్తే తప్ప సుప్రసిద్ధుడైన లోరియాగారి సంపూర్ణ యశఃకాంతులు మనకు స్పష్టంగా కనిపించవు. జూలియస్ ఉల్ఫ్ నిన్నా మొన్న పుట్టిన పసిబిడ్డేమీ కాదు మరి. బృహత్ గ్రంథం, (Sozialismus and Kapitalistische Gesellschaftsordnung) రచయితగా జూలియస్ ఉల్ఫ్ గారు ఈ ఇటాలియన్ సరసన మొరిగే కుక్కపిల్లలాగా కనిపిస్తాడు. మార్క్స్ కూడా తనలాగా కుతర్కవాదీ, తప్పుల తడక సిద్ధాంతవేత్త, దగాకోరూ అంతే, అంతకుమించి మరేమీ కాదు; అతను చిక్కుల్లో పడ్డప్పుడల్లా, తన సిద్ధాంతంలోని లోపాలను రానున్న సంపుటిలో భర్తీ చేస్తానని వాగ్దానం చేస్తూ ఆ సంపుటిని తాను ఎన్నటికీ రచించలేననీ, రచించబోననీ బాగా తెలిసి కూడా ఆయన ప్రపంచాన్ని అలా మోసగించడమనేది ప్రత్యేకించి పేర్కొననవసరం లేని విషయంగా భావించిన ఘనుడు లోరియా! అతని అపురూప ఆత్మవిశ్వాసం ముందు జూలియస్ ఉల్ఫ్‌లో ఎంతటి జంకు, తడబాటు కనిపిస్తుందని! ఎంతో వినయం కనిపిస్తుందని కూడా అనాలనిపిస్తుంది! అపారమైన గుండెధైర్యం, గడ్డు పరిస్థితుల్లో కొమ్మచేప లాగా పట్టుకు చిక్కకుండా జారుకునే గుణం, తిన్న తన్నులను లెక్క చేయకపోవడం, ఇతరులు సాధించిన వాటిని హడావిడిగా తస్కరించి తనవిగా చూపడం, సొంత డబ్బా కొట్టుకోవడం, మిత్రబృందం ద్వారా తన కీర్తిని దశదిశలా పాకేలా చేయడం - ఈ చర్యల్లో ఆయనకెవరు సాటిరాగలరు?

ఇటలీ ప్రామాణిక సాంప్రదాయకతకు పురిటిగడ్డ - ఆధునికకాల ఉషోదయం అయిన మహత్తరశకం ఆవిర్భవించిన నాటినుంచీ ఆ దేశం డాంటే మొదలుకొని గ్యారిబాల్డీ దాకా అసమాన ప్రామాణిక సాంప్రదాయకతకు మూర్తీభావమైన వ్యక్తులకు జన్మనిచ్చింది. అయితే దాని పతనావస్థ, విదేశీ పెత్తనం కూడా అలాంటి వ్యక్తుల వేషధారులను కూడా సృష్టించింది. అలాటి వారిలో ప్రత్యేకించి స్పష్టమైన రెండు మాదిరీలకు చెందిన వారు స్గవరెల్ల, డల్‌కామరా లు. ఈ రెండురకాల ప్రామాణిక ఐక్యతకు మూర్తీభావం సుప్రసిద్ధ లోరియా.

ఇక చివరగా నేను నా పాఠకులను అట్లాంటిక్ సముద్రం ఆవలకు తీసుకెళ్ళక తప్పదు.

న్యూయార్క్‌కు చెందిన డాక్టర్ జార్జ్ సి. స్టీబిలింగ్ కూడా ఈ సమస్యకొక పరిష్కారం కనుగొన్నాడు. అది చాలా సరళమైనది. అది ఎంత సరళమైనదంటే ఇక్కడ కానీ అక్కడ కానీ ఎవరూ ఆయన్ను పట్టించుకోలేదు. దాంతో ఆయనకు చిర్రెత్తుకొచ్చి, తనకు జరిగిన అన్యాయం గురించి శరపరం పరగా అట్లాంటిక్ మహాసముద్రం ఆవలా ఈవలా కరపత్రాల్లోనూ, వార్తాపత్రికల వ్యాసాల్లోనూ చాలా ఘాటుగా ఫిర్యాదు చేశాడు.అయితే ఆయన పరిష్కారం గణిత శాస్త్రపరమైన పొరపాటుపై ఆధారపడి ఉందని New Zeitలో ఆయనకు స్పష్టం చేయడం జరిగింది. కానీ దాన్ని ఆయన ఖాతరు చేయలేదు. మార్క్స్ కూడా గణితశాస్త్రపరమైన పొరపాట్లు చేశాడు. కానీ ఆయన నిర్ధారణలు అనేక విషయాల్లో సక్రమమైనవి. డాక్టర్ స్టీబిలింగ్ పరిష్కారాన్ని పరిశీలిద్దాం.

"సమాన పెట్టుబడితో సమాన కాలంపాటు పని చేసే రెండు ఫ్యాక్టరీలను తీసుకుందాం. అయితే వీటి స్థిర పెట్టుబడి, అస్థిర పెట్టుబడుల నిష్పత్తిలో మాత్రం తేడా ఉంది. ప్రతి దాని మొదటి పెట్టుబడి (స్థి.పె + అపె) = 'క', కాగా ఈ రెంటి స్థిరపెట్టుబడి, అస్థిర పెట్టుబడుల నిష్పత్తిలోని తేడా 'గ' అనుకుందాం. మొదటి ఫ్యాక్టరీకి సంబంధించి క= స్థి.పె + అ.పె, రెండవ ఫ్యాక్టరీకి సంబంధించి క = (సి.పె - గ) + అ.పె + గ. కనుక మొదటి ఫ్యాక్టరీ యొక్క అదనపు విలువ రేటు $\frac{\text{అ.వి}}{\text{అ.పె.}}$ రెండవ ఫ్యాక్టరీ యొక్క అదనపు విలువ రేటు $\frac{\text{అవి}}{\text{అ.పె+గ}}$ మొత్తం అదనపు విలువ (అ.వి) నేను లాభం (ల) అంటాను. నిర్ణీత కాలంలో ఈ అదనపు విలువ మొత్తం పెట్టుబడి 'క'ని లేక స్థి.పె+అ.పె.ని వృద్ధి చేస్తుంది. కనుక ల = అ.వి. అవుతుంది. మొదటి ఫ్యాక్టరీ లాభం రేటు = $\frac{\text{ల}}{\text{క}}$ లేక $\frac{\text{అవి}}{\text{స్థి.పె+అ.పె}}$ రెండవ ఫ్యాక్టరీ లాభం రేటు కూడా $\frac{\text{ల}}{\text{క}}$ లేక $\frac{\text{అవి}}{\text{(స్థి.పె-గ) + అపె+గ}}$ అంటే ఇది కూడా $\frac{\text{అ.వి.}}{\text{స్థి.పె+అ.పె}}$ - ఈ సమస్య ఎలా పరిష్కారమవుతుందంటే విలువ నియమం ప్రాతిపదికపై, సమాన పెట్టుబడి, సమాన పనికాలం ఉండి, సజీవశ్రమ పరిమాణాల్లో అసమానత ఉన్నట్లయితే అదనపు విలువ రేటులోని మార్పు, సగటులాభం రేటు సమానీకరణకు దారితీస్తుంది." (G.C. Stiebeling, Das werthgesetz and die Profitrate, Newyork, John Heinrich)

పై లెక్కాచారం ఎంత అందంగా విషయ బోధకంగా ఉన్నప్పటికీ మనం డాక్టర్ స్టీబిలింగ్‌ను ఒక ప్రశ్న అడక్కుండా ఉండలేము. మొదటి ఫ్యాక్టరీ ఉత్పత్తి చేసిన అదనపు విలువ మొత్తం రెండవ ఫ్యాక్టరీ ఉత్పత్తి చేసిన అదనపు విలువ మొత్తానికి కచ్చితంగా సమానంగా ఉంటుందని ఆయనకెలా తెలుసు? ఆయన స్థిపె, అపె, క అలాగే గ అంటే మిగతా అంశాలన్నీ రెండు ఫ్యాక్టరీలకు సమానమే అంటాడు తప్ప అ.వి. గురించి అసలు ప్రస్తావించడు. పైన పేర్కొన్న రెండు అదనపు విలువల పరిమాణాలను బీజగణితపు చిహ్నమైన అ.వి.తో సూచించినంత మాత్రాన ఆ రెండూ సమానం కావు. నిజానికి రుజువు కావలసింది కూడా అదే. ఎందుచేతనంటే డాక్టర్ స్టీబిలింగ్ గారు లాభం 'ల'ను అదనపు విలువగానే పరిగణిస్తున్నాడు. ఏ సందేహమూ లేకుండా, ఇప్పుడిక రెండే రెండు ప్రత్యామ్నాయాలు సాధ్యమని తోస్తుంది. ఒకటి - రెండు అ.వి.లు సమానంగా ఉంటాయి. అంటే రెండు ఫ్యాక్టరీలు సమాన మొత్తంలో అదనపు విలువను ఉత్పత్తి చేస్తాయి. ఇలా అనుకుంటే, తాను నిజంగా రుజువు చేయాల్సిన విషయాన్ని, రుజువైనట్లు ముందే భావించుకొన్నాడన్న మాట.

ఇక రెండు - ఒక ఫ్యాక్టరీ మరోదానికంటే ఎక్కువ అదనపు విలువను ఉత్పత్తి చేస్తుంది. ఇలా అనుకుంటే, ఆయన లెక్కాచారమంతా, ఆయన కళ్ళముందే పేకమేడలా కుప్పకూలుతుందన్నమాట.

స్టీబిలింగ్ ఈ గణిత శాస్త్రపు దోషం ఆధారంగా కుప్పతెప్పలుగా లెక్కాచారాలు తయారు చేయడానికీ వాటిని ప్రజలకు చూపడానికీ ఎంతో శ్రమ పడ్డాడు, ఎంతో డబ్బు ఖర్చుపెట్టాడు. ఆయన మనశ్శాంతికోసం ఆయనకు ఇలా గట్టిగా చెప్పదల్చుకున్నాను. ఆయన వేసిన లెక్కాచారాలన్నీ ఆయన రుజువు చేయదలచుకొన్నదానికి పూర్తిగా విరుద్ధమైన దాన్ని రుజువు చేస్తున్నాయి. ఉదాహరణకు ఆయన 1870, 1880 లలోని అమెరికా జనాభా లెక్కలను పోల్చడం ద్వారా లాభం రేటు వాస్తవంగా పడిపోయిందని నిరూపిస్తాడు; అయితే లాభంరేటుకు తప్పగా భాష్యంచెప్పి, అనుభవం ప్రాతిపదికపై, నిరంతరం స్థిరంగా ఉండే లాభంరేటు గురించి మార్క్స్ సిద్ధాంతాన్ని సరిదిద్దాలని ఊహించుకొంటాడు. అయితే 'స్థిరమైన లాభం రేటు' అనే ఈ మార్క్సియన్ సిద్ధాంతం కేవలం స్టీబిలింగ్ ఊహాకల్పనే అనీ, డాక్టర్ స్టీబిలింగ్ సూచించిన కారణాలకు సరిగ్గా వ్యతిరేకమైన కారణాలే లాభం రేటు తగ్గిపోయే ధోరణికి మూలమని ఈ మూడవ సంపుటిలోని తృతీయ భాగం వల్ల స్పష్టమవుతున్నది. డాక్టర్ స్టీబిలింగ్ సంకల్పాలు మంచివే. ఎలాటి సందేహం లేదు. కానీ శాస్త్రీయ సమస్యలను చర్చించదల్చుకున్న వ్యక్తి అన్నిటికంటే ముఖ్యంగా చేయవలసిందేమిటంటే, తాను ఉపయోగించ దల్చుకున్న గ్రంథాలను, కేవలం రచయిత రాసినట్లుగానే చదవడం నేర్చుకోవాలి; ఇంకా ముఖ్యమైం దేమిటంటే ఆ గ్రంథాల్లో లేని అంశాలు అందులో ఉన్నట్లు ఊహించుకోరాదు.

ఈ ప్రశ్నకు సంబంధించినంతవరకు కూడా మార్క్సియన్ పద్ధతి ఒక్కటే ఎంతో కొంత సాధించిందని, ఈ పరిశోధన ఫలితం మరోసారి నిరూపిస్తున్నది. ఫైర్మన్, కాన్రాడ్ ష్మిట్‌లు గనక ఈ మూడవ సంపుటి చదివితే వారుభయులూ ఎవరికి వారు తమ సొంత రచనల పట్ల సంతృప్తి చెందొచ్చు.

లండన్, **ఫ్రెడరిక్ ఎంగెల్స్**

అక్టోబర్ 4, 1894

మూడవ సంపుటం

# పెట్టుబడిదారీ ఉత్పత్తి మొత్తం ప్రక్రియ

# I

I

### ఒకటవ భాగం

# అదనపు విలువ లాభంగా పరివర్తన, అదనపు విలువ రేటు లాభం రేటుగా పరివర్తన

### అధ్యాయం - 1

## ఉత్పత్తి ఖర్చు - లాభం

మనం మొదటి సంపుటిలో పెట్టుబడిదారీ ఉత్పత్తి ప్రక్రియగా ఉన్న ఘటనను, బాహ్యా ప్రభావాల తాలూకు అప్రధాన ఫలితాలను దేన్నీ పరిగణనకు తీసుకోకుండా, కేవలం ప్రత్యక్ష ఉత్పాదక ప్రక్రియగా విశ్లేషించాం. అయితే ఈ ప్రత్యక్ష ఉత్పత్తి ప్రక్రియతోనే ఏ విధంగానూ పెట్టుబడి జీవితకాలం ముగియదు. వాస్తవ ప్రపంచంలో చలామణి ప్రక్రియ దీనికి అనుబంధమవుతోంది. రెండవ సంపుటిలో ఈ చలామణి ప్రక్రియ మన అధ్యయన అంశంగా ఉండింది. ఆ తరువాత భాగంలో, అనగా చలామణి ప్రక్రియను సామాజిక పునరుత్పత్తి ప్రక్రియకు మాధ్యమంగా పరిగణించినట్టి మూడవ భాగంలో, మొత్తం పెట్టుబడిదారీ ఉత్పత్తి ప్రక్రియ అన్నది ఉత్పత్తి ప్రక్రియ, చలామణి ప్రక్రియల సంయోగంగా తేలింది. ఈ మూడవ సంపుటిలోని అంశాలను బట్టి ఇది ఈ సంయోగానికి సంబంధించిన స్థూల భావాలకు మాత్రమే పరిమితం కాజాలదు. పైపెచ్చు, ఇది మొత్తంగా పెట్టుబడి గమనక్రమాల నుంచి ఆవిర్భవించిన నిర్దిష్ట రూపాలను తెలుసుకొని విశదీకరించాలి. పెట్టుబడులు తమ గమనక్రమాల్లో అటువంటి నిర్దిష్ట రూపంలో ఎదురుబొదురు అవుతుంటాయి. ప్రత్యక్ష ఉత్పత్తి ప్రక్రియలోని పెట్టుబడి రూపమూ చలామణి ప్రక్రియలోని పెట్టుబడి రూపమూ రెండూ అలాంటి నిర్దిష్ట రూపానికి ప్రత్యేక ఉదాహరణలుగానే దర్శనమిస్తాయి. సమాజ ఉపరితలాన, పెట్టుబడి ధరించే రూపాలను, అవి ఒకదానిపై ఒకటి చూపే ప్రభావంలో, పోటీలో అసలు ఉత్పత్తి ఏజెంట్ల మామూలు చైతన్యంలో అవి ధరించే రూపాన్ని, ఈ సంపుటిలో రూపాలను ఆవిష్కృతమైన పెట్టుబడి యొక్క వివిధ రూపాలు ఆ విధంగా క్రమేణా సమీపిస్తాయి.


పెట్టుబడిదారీ విధానంలో ఉత్పత్తి అయ్యే ప్రతి సరుకు విలువనూ స = స్థి.పె + ఉపె + అ.వి అనే సూత్రం వ్యక్తీకరిస్తుంది : ఈ ఉత్పాదన విలువ నుంచి అదనపు విలువలను తీసివేస్తే, ఉత్పత్తి సాధనాల్లో వ్యయం అయిన స్థి.పె + అ.పె అనే పెట్టుబడి విలువకు కేవలం సమతుల్య భాగం కానీ, లేక ప్రత్యామ్నాయ విలువ కానీ మిగులుతుంది.

ఉదాహరణకు – ఏదైనా ఒక సరుకు ఉత్పత్తికోసం 500 పౌండ్ల పెట్టుబడి అవసరమనుకుందాం, అందులో ఉత్పత్తి పరికరాల తరుగుదలకు20 పౌండ్లు, ఉత్పత్తి ముడి సరుకులకు 380 పౌండ్లు, శ్రమశక్తికి 100 పౌండ్లు వ్యయమవుతాయనుకుందాం. అదనపు విలువ రేటు 100% అయ్యే పక్షంలో, ఆ సరుకు విలువ ఇలా ఉంటుంది; 400 స్థి.పె+100 అ.పె+100 అ.వి = 600 పౌండ్లు.

ఇందులోనుంచి 100 పౌండ్లు అదనపు విలువను తీసివేస్తే, 500 పౌండ్ల సరుకు విలువ మిగులుతుంది; ఇది వ్యయం అయిన 500 పౌండ్లను భర్తీ చేస్తుంది. వినియోగింపబడిన ఉత్పత్తి సాధనాల, శ్రమశక్తి యొక్క ధరను భర్తీ చేసే ఈ సరుకు విలువ భాగం వాస్తవానికి పెట్టుబడిదారుడికి సరుకు ఉత్పత్తికి అయిన ఖర్చును భర్తీ చేస్తుంది. కనుక అతనికి అది సరుకు యొక్క ఉత్పత్తి ధర అయివుంటుంది.

పెట్టుబడిదారుడి దృష్టిలో సరుకు ధర వాస్తవ ఉత్పత్తి వ్యయమూ ఈ రెండూ పూర్తిగా విభిన్న పరిమాణాలు. సరుకు విలువలో అదనపు విలువకు ప్రాతినిధ్యం వహించే ఆ భాగం కోసం పెట్టుబడి దారుడికి ఎలాటి వ్యయమూకాదు; ఎందుచేతనంటే అది కార్మికునికి చెల్లించిన శ్రమ తాలూకు వ్యయమే. అయినప్పటికీ పెట్టుబడిదారీ ఉత్పత్తి ప్రాతిపదికపై శ్రామికుడు ఉత్పత్తి ప్రక్రియలో ప్రవేశించాక అతడే, స్వయంగా క్రియాత్మక ఉత్పాదక పెట్టుబడిలో ఒక ముఖ్యభాగమవుతాడు. ఆ క్రియాత్మక ఉత్పాదక పెట్టుబడి పెట్టుబడిదారుడికి చెందింది. కనుక సరుకు యొక్క వాస్తవ ఉత్పత్తి దారుడు పెట్టుబడిదారుడే. ఈ కారణం మూలంగా పెట్టుబడిదారుడికి సరుకు యొక్క ఉత్పత్తి ధర, సరుకు యొక్క వాస్తవ ధరగా కనిపిస్తుంది. మనం గనక ఉత్పత్తి ధరను ఉ గా భావిస్తే సవి = స్థి.పె+ అ.వె+అ.వి అనే సూత్రం (సవి=ఉ+అవి) సూత్రంగా మారుతుంది; అంటే సరుకువిలువ = ఉత్పత్తి ధర+అదనపు విలువ.

సరుకు ఉత్పత్తికోసం వ్యయం అయిన పెట్టుబడి విలువను భర్తీ చేసే ఆ సరుకు తాలూకు వివిధ విలువ భాగాలను ఉత్పత్తి ధర కింద లెక్కకట్టడం అన్నది ఒకవైపు పెట్టుబడిదారీ ఉత్పత్తి ప్రత్యేక స్వభావాన్ని వ్యక్తీకరిస్తుంది. సరుకుకోసం పెట్టుబడిదారుడికి అయిన వ్యయాన్ని, పెట్టుబడి వ్యయాన్ని బట్టి లెక్కగడతారు. కాగా సరుకుకోసం అయిన వాస్తవ వ్యయాన్ని శ్రమ వ్యయం బట్టి లెక్కగడతారు. కనుక సరుకు యొక్క పెట్టుబడిదారీ ఉత్పత్తి ధర, పరిమాణంలో ఆ సరుకు విలువకు లేక వాస్తవ ఉత్పత్తి ధరకు భిన్నమైనది. అది సరుకు విలువ కంటే తక్కువగా ఉంటుంది. ఎందుచేతనంటే స.వి = ఉ + అవి అయినప్పుడు ఉ = స.వి – అవి అన్నది విదితమే. మరోవైపు, సరుకు యొక్క ఉత్పత్తి ధర పెట్టుబడిదారీ జమాఖర్చు లెక్కల్లో మాత్రమే ఉండే అభివర్గమేజ్ఞీు కాదు. విలువలోని ఈ భాగం యొక్క ప్రత్యేక వ్యక్తిత్వం ఆచరణలో నిరంతరాయంగా సరుకు యొక్క వాస్తవ ఉత్పత్తిలో వ్యక్తమవుతూనే ఉంటుంది. ఎందుచేతనంటే అది నిరంతరం చలామణి ప్రక్రియ ద్వారా తన సరుకు



కార్ల్ మార్క్స్ – పెట్టుబడి మూడవ సంపుటి రాతప్రతిలోని మొదటి పేజి – ఫాసిమైల్ ప్రతి
(సైజు తగ్గించబడింది)

రూపం నుంచి ఉత్పాదక పెట్టుబడి రూపంలోకి బదిలీ కావలసి ఉంది. పర్యవసానంగా, సరుకు యొక్క ఉత్పత్తి ధర సరుకు ఉత్పత్తిలో వ్యయమైపోయిన ఉత్పాదక అంశాలను తిరిగి కొనుగోలు చేయవలసి ఉంటుంది.

ఇక మరోవైపు, సరుకు విలువ రూపుగొనడంలో కానీ, పెట్టుబడి యొక్క స్వయం విస్తరణ ప్రక్రియలో కానీ ఉత్పత్తి ధర అభివర్గానికి ఎలాంటి సంబంధమూ లేదు. 600 పౌండ్ల విలువచేసే సరుకులో ఆరింట అయిదు వంతులు లేక 500 పౌండ్లు, ఆ సరుకు ఉత్పత్తిలో వ్యయమైన 500 పౌండ్ల పెట్టుబడి సమతుల్యానికి ప్రాతినిధ్యం వహిస్తాయనీ, ఈ పెట్టుబడికి సంబంధించిన పాదార్థిక అంశాలను తిరిగి కొనుగోలు చేయడానికి మాత్రమే ఈ మొత్తం చాలునని నాకు తెలుసు. కానీ ఆ సరుకు ఉత్పత్తి ధరకు ప్రాతినిధ్యం వహించే ఆ సరుకు విలువలోని ఆరింట అయిదు వంతులు ఎలా ఉత్పత్తి అయ్యాయన్న విషయం కానీ, అదనపు విలువకు ప్రాతినిధ్యం వహించే ఆఖరు ఆరవ భాగం ఎలా ఉత్పత్తి అయిందన్న విషయం కానీ నాకు తెలీదు. అయితే పెట్టుబడిదారీ అర్థశాస్త్రంలో ఉత్పత్తి ధర అన్నది, విలువ ఉత్పాదక అభివర్గపు ముసుగు ధరిస్తుందని పరిశోధన నిరూపిస్తుంది.

మనం మళ్ళీ మన ఉదాహరణకు వద్దాం. ఉదాహరణకు ఒక శ్రామికుడు ఒక సగటు సామాజిక పనిదినంలో సృష్టించే విలువకు 6 షిల్లింగులు (6షి = 6డ) ప్రాతినిధ్యం వహిస్తుందనుకుందాం. అప్పుడు అడ్వాన్సు చేసిన పెట్టుబడి 500 పౌండ్లు (= 400 స్థి.పె + 100 అ.పె) $1666\frac{2}{3}$ పది గంటల పనిదినాలలో సృష్టించిన విలువకు ప్రాతినిధ్యం వహిస్తుంది. కాగా అందులో $1333\frac{1}{3}$ పని దినాలు 400 స్థి.పె ఉత్పత్తి సాధనాల విలువలోనూ $1333\frac{1}{3}$ పనిదినాలు 100 అ.పె శ్రమశక్తి విలువలోనూ మూర్తీభవించి ఉంటాయి. అదనపు విలువ రేటు 100 శాతం అనుకున్నాం కాబట్టి, కొత్తగా ఏర్పడే సరుకు ఉత్పత్తికి అవసరమైన శ్రమ వ్యయం 100 అ.పె+100 అ.వి = $666\frac{2}{3}$ పది గంటల పనిదినాలు.

కాగా, కొత్తగా సృష్టించబడిన 600 పౌండ్ల ఉత్పాదితం విలువలో ఈ క్రింది అంశాలున్నట్లు మనకు తెలుసు. (చూడండి సం.1) : 1. ఉత్పత్తి సాధనాలకు ఖర్చయి ఉత్పాదితంలో పునర్దర్శనమిస్తున్న 400 పౌండ్ల స్థిర పెట్టుబడి విలువ; 2. కొత్తగా ఉత్పత్తి అయిన 200 పౌండ్ల విలువ. సరుకు ఉత్పత్తి ధర = 500 పౌండ్లు. ఇందులో పునర్దర్శనమిస్తున్న 400 స్థి.పె, కొత్తగా ఉత్పత్తి అయిన విలువతో అంటే 200 పౌండ్లలో సగం (=100 అ.పె), ఈ రెండూ కూడా ఉన్నాయి. ఇవి పూర్తిగా భిన్నమైన పుట్టుకలు గల రెండు అంశాలు.

$666\frac{2}{3}$ పది గంటల పని దినాలలో వ్యయమైన శ్రమ, ప్రయోజనాత్మక స్వభావం గలది కాబట్టి, 400 పౌండ్ల మేరకు వినియోగం అయిన ఉత్పత్తి సాధనాల విలువ ఆ ఉత్పత్తి సాధనాల నుంచి ఉత్పాదితానికి బదిలీ అయింది. ఇంతకు ముందే అస్తిత్వంలో ఉన్న ఈ విలువ, ఈ విధంగా ఉత్పాదితం విలువలోని అంతర్భాగంగా పునర్దర్శనమిస్తుందే తప్ప, 'ఈ' సరుకు ఉత్పత్తి ప్రక్రియలో సృష్టింపబడింది కాదు. అది మదుపు పెట్టిన పెట్టుబడిలో భాగంగా అంతకు ముందే ఉండింది కాబట్టే ఇప్పుడు సరుకు విలువలో భాగంగా ఉంటున్నది. కనుక వ్యయమైన స్థిర పెట్టుబడిని, సరుకు విలువకు ఈ పెట్టుబడే అదనంగా చేర్చిన విలువ భాగం భర్తీ చేస్తుంది. కాబట్టి ఉత్పత్తి ధరలోని ఈ భాగానికి రెండు అర్థాలున్నాయి. ఒక వైపేమో – వ్యయమైన పెట్టుబడిని భర్తీ చేసే సరుకు విలువ భాగం కాబట్టి ఇది సరుకు యొక్క ఉత్పత్తి ధరలో ప్రవేశిస్తుంది. మరోవైపేమో – ఇది కేవలం వ్యయం అయిన పెట్టుబడి విలువ, లేదా ఉత్పత్తి సాధనాలకు ఇంత ఖర్చయింది కాబట్టే ఇది సరుకు విలువలో భాగంగా రూపొందుతున్నది.

ఉత్పత్తి ధరలోని ఇతర భాగానికి సంబంధించి, విషయం ఇందుకు పూర్తిగా భిన్నంగా ఉంటుంది. సరుకు ఉత్పత్తిలో వ్యయమైన $666\frac{2}{3}$ పనిదినాలు 200 పౌండ్ల కొత్త విలువను సృష్టిస్తాయి. ఈ కొత్త విలువలోని ఒక భాగం అడ్వాన్సు చేసిన 100 పౌండ్ల అస్థిర పెట్టుబడిని, లేదా నియుక్తం అయిన శ్రమశక్తి ధరను కేవలం భర్తీ చేస్తుంది. అయితే అడ్వాన్సు చేసిన పెట్టుబడి విలువ ఏవిధంగానూ నూతన విలువ సృష్టికి దోహదపడదు. పెట్టుబడి అడ్వాన్సుకు సంబంధించి, శ్రమశక్తి ఒక విలువగా పరిగణింపబడుతుంది. అయితే ఉత్పత్తి ప్రక్రియలో అది విలువ యొక్క సృష్టికర్తగా వ్యవహరిస్తున్నది. అడ్వాన్సు చేసిన పెట్టుబడిలో శ్రమశక్తి విలువకు గల స్థానాన్ని వాస్తవంగా క్రియాశీలమైన ఉత్పాదక పెట్టుబడిలో సజీవమైన, విలువ సృష్టి కారకమైన శ్రమశక్తి చేపడుతుంది. పెట్టుబడిలో ఖర్చయిన స్థిర పెట్టుబడి భాగం లేదా అస్థిర పెట్టుబడి భాగం వీటి విలువ పరిమాణంలో మార్పు జరిగినప్పుడల్లా,

సరుకు విలువలోని ఈ వివిధ భాగాల మధ్యగల వ్యత్యాసం ఉత్పత్తి ధరగా రూపొందే వీటి మధ్య గల వ్యత్యాసం, మనకు వెంటనే కనిపిస్తుంది. అవే ఉత్పత్తి సాధనాల ధర, అంటే పెట్టుబడిలోని స్థిర భాగం ధర 400 పౌండ్ల నుంచి 600 పౌండ్లకు పెరిగిందనుకుందాం, లేదా 200 పౌండ్లకు తగ్గిందనుకుందాం. పెరిగిన పక్షంలో సరుకు యొక్క ఉత్పత్తి ధర 500 పౌండ్ల నుంచి 600 స్థి.పె + 100 అ.పె = 700 పౌండ్లకు పెరగడమే కాక, సరుకు విలువ కూడా 600 పౌండ్ల నుంచి 600 స్థి.పె + 100 అ.పె + 100 అ.వి = 800 పౌండ్లకు పెరుగుతుంది. తగ్గిన పక్షంలో ఉత్పత్తి ధర 500 పౌండ్ల నుంచి 200 స్థి.పె +100 అ.పె =300 పౌండ్లకు తగ్గిపోవడమే కాక సరుకు విలువ సైతం 600 పౌండ్ల నుంచి 200 స్థి.పె+100 అ.పె + 100 అ.వి = 400 పౌండ్లకు పడిపోతుంది. ఖర్చయిన స్థిర పెట్టుబడి తన సొంత విలువను ఉత్పాదితానికి బదిలీ చేస్తుంది కనుక, ఇతర పరిస్థితుల్లో ఎలాటి మార్పు రాని పక్షంలో ఆ పెట్టుబడి విలువ యొక్క నిరపేక్ష పరిమాణానికి అనుగుణంగా ఉత్పాదితం విలువ పెరుగుతుంది లేదా తగ్గుతుంది. కాగా ఇతర పరిస్థితుల్లో ఎలాటి మార్పు లేనప్పుడు అదే పరిమాణం గల శ్రమశక్తి ధర 100 పౌండ్లనుంచి 150 పౌండ్లకు పెరిగిందనుకుందాం, లేదా అందుకు భిన్నంగా 100 పౌండ్లనుంచి 50 పౌండ్లకు తగ్గిందనుకుందాం. పెరిగిన పక్షంలో ఉత్పత్తి ధర 500 పౌండ్లనుంచి 400 స్థి.పె + 150 అ.పె = 550 పౌండ్లకు పెరుగుతుంది; తగ్గిన పక్షంలో 500 పౌండ్లనుంచి 400 స్థి.పె + 50 అ.పె = 450 పౌండ్లకు పడిపోతుంది. అయితే, పెరిగినా తరిగినా రెండు సందర్భాల్లోనూ సరుకు విలువ మాత్రం ఎలాటి మార్పు లేకుండా 600 పౌండ్లగానే ఉంటుంది. మొదటి సందర్భంలో అది 400 స్థి.పె + 150 అ.పె + 50 అ.వి గానూ, రెండో సందర్భంలో 400 స్థి.పె + 150 అ.పె + 150 అ.వి గానూ ఉంటుంది. అడ్వాన్సయిన అస్థిర పెట్టుబడి తన సొంత విలువను ఉత్పాదితానికి జోడించదు. ఉత్పాదితంలో దాని విలువ స్థానాన్ని శ్రమ సృష్టించిన నూతన విలువ స్వీకరిస్తుంది. కాబట్టి అస్థిర పెట్టుబడి యొక్క నిరపేక్ష పరిమాణంలోని మార్పు – అది కేవలం శ్రమశక్తి యొక్క ధరలోని మార్పునే వ్యక్తీకరిస్తుంటే – ఏ విధంగానూ సరుకు విలువ యొక్క నిరపేక్ష పరిమాణాన్ని మార్చదు. కారణమేమంటే, సజీవ శ్రమశక్తి సృష్టించిన నూతన విలువ యొక్క నిరపేక్ష పరిమాణాన్ని అది మార్చదు కనుక ఈ మార్పు వాస్తవంలో నూతన విలువ యొక్క రెండు అంతర్భాగాల సాపేక్ష నిష్పత్తిని మాత్రమే ప్రభావితం చేస్తుంది; ఇందులో ఒక భాగమేమో అదనపు విలువగా ఉంటుంది. రెండో భాగమేమో అస్థిర పెట్టుబడిని భర్తీ చేస్తుంది. కాబట్టి అది సరుకు యొక్క ఉత్పత్తి ధరలోకి ప్రవేశిస్తుంది.

ఉత్పత్తి ధరలోని రెండు భాగాలకు, ప్రస్తుత ఉదాహరణలో 400 స్థి.పె + 100 అ.పె మొత్తాలకు ఒక ఉమ్మడి గుణం ఉంది. అదేమంటే, అడ్వాన్సయిన పెట్టుబడిని భర్తీచేసే సరుకు విలువలో అవి రెండూ భాగాలుగా ఉంటాయి.

అయితే పెట్టుబడిదారీ ఉత్పత్తి దృక్కోణం నుంచి చూస్తే ఈ వాస్తవ పరిస్థితి తప్పని సరిగా తల్లకిందులుగా కనిపిస్తుంది.

పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానానికీ బానిస వ్యవస్థపై ఆధారపడిన ఉత్పత్తి విధానానికీ మధ్యగల ఒకానొక తేడా ఏమిటంటే, పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానంలో శ్రమశక్తి యొక్క విలువ, ఆ మేరకు శ్రమశక్తి యొక్క ధర, శ్రమ విలువగానే లేక శ్రమ ధరగా లేదా వేతనాలుగా కనిపిస్తుంది. (సం. I)


కాబట్టి అడ్వాన్సు చేసిన పెట్టుబడిలోని అస్థిర భాగం అన్నది వేతనాలకు వ్యయం అయిన పెట్టుబడిగా ఉత్పత్తిలో వ్యయమైన యావత్తు శ్రమ యొక్క విలువకై, అంటే ఆ శ్రమ ధరపై చెల్లించే పెట్టుబడి విలువగా కనిపిస్తుంది. ఉదాహరణకు 10 గంటల సగటు సామాజిక పనిదినం 6 షిల్లింగుల డబ్బులో మూర్తీభవించి ఉందనుకుందాం. అప్పుడు, అడ్వాన్సు చేసిన 100 పౌండ్ల అస్థిర పెట్టుబడి $333\frac{1}{3}$ పది గంటల పనిదినాలలో ఉత్పత్తి అయిన విలువ యొక్క డబ్బు వ్యక్తీకరణే అయితే అడ్వాన్సు అయిన పెట్టుబడిలో కొన్నట్టి శ్రమశక్తికి ప్రాతినిధ్యం వహించే ఈ విలువ ఏ విధంగానూ వాస్తవంగా క్రియాశీలమైన ఉత్పాదక పెట్టుబడిలో ఒక భాగంకాదు. ఉత్పత్తి ప్రక్రియలో దాని స్థానాన్ని సజీవశ్రమశక్తి స్వీకరిస్తుంది. మన ఉదాహరణలో లాగా శ్రమశక్తి దోపిడీ స్థాయి 100% అయినట్లయితే, ఆ శ్రమశక్తి $666\frac{2}{3}$ పదిగంటల పనిదినాలలో వ్యయమవుతుంది. ఆ విధంగా ఉత్పాదితానికి 200 పౌండ్ల నూతన విలువను జోడిస్తుంది. కాగా అడ్వాన్సు చేసిన పెట్టుబడిలో 100 పౌండ్ల అస్థిర పెట్టుబడి వేతనాల్లో మదుపు చేసిన పెట్టుబడిగా, లేక $666\frac{2}{3}$ పదిగంటల దినాలలో పనిచేసిన శ్రమశక్తి యొక్క ధరగా లెక్కకట్టబడుతుంది. 100 పౌండ్ల డబ్బును $666\frac{2}{3}$ పని దినాలచేత భాగిస్తే పదిగంటల పనిదినం యొక్క ధర మూడు షిల్లింగులుగా తేలుతుంది; అది విలువలో అయిదు గంటల శ్రమ తాలూకు ఉత్పాదితానికి సమానం.

మనం గనుక ఇటు అడ్వాన్సు చేసిన పెట్టుబడిని అటు సరుకు విలువతో పోల్చితే ఈ కింది ఫలితం లభిస్తుంది.

I. అడ్వాన్సు చేసిన పెట్టుబడి 500 పౌండ్లు = ఉత్పత్తి సాధనాలలో ఖర్చయిన పెట్టుబడి 400 పౌండ్లు (ఉత్పత్తి సాధనాల ధర) + శ్రమలో ఖర్చయిన పెట్టుబడి 100 పౌండ్లు ($666\frac{2}{3}$ పని దినాల ధర లేక ఆ పనిదినాలకు వెచ్చించిన వేతనం)

II. సరుకుల విలువ 600 పౌండ్లు = ఉత్పత్తి ధరకు ప్రాతినిధ్యం వహించే 500 పౌండ్లు (ఖర్చయిన ఉత్పత్తి సాధనాల ధర 400 పౌండ్లు + ఖర్చయిన $666\frac{2}{3}$ పని దినాల ధర 100 పౌండ్లు) + 100 పౌండ్ల అదనపు విలువ.

ఈ సూత్రంలో శ్రమశక్తికి మదుపు పెట్టిన పెట్టుబడి భాగానికీ, ప్రత్తి, బొగ్గులాంటి ఉత్పత్తి సాధనాలకు మదుపు పెట్టిన పెట్టుబడి భాగానికీ మధ్య తేడా ఒకటే. మొదటిది భౌతికంగా భిన్నమైన ఉత్పత్తి సాధనకు చెల్లింపుగా ఉపకరిస్తుంది. అంతేతప్ప సరుకు విలువను సృష్టించే ప్రక్రియలోనూ, తద్వారా పెట్టుబడి స్వయం విస్తరణ ప్రక్రియలోనూ క్రియాత్మకంగా భిన్నమైన ప్రయోజనానికి ఉపకరించడం వల్ల దీనికి, రెండవదానికీ మధ్య తేడా ఉందనలేము. ఉత్పత్తి సాధనాల ధర, అడ్వాన్సు చేసిన పెట్టుబడిలో లాగానే సరుకుల ఉత్పత్తి ధరలో పునర్దర్శనమిస్తుంది. ఈ ఉత్పత్తి సాధనాలు ఒక ప్రత్యేక ప్రయోజనం కోసం వినియోగ మయ్యాయి కాబట్టిఅది అలా తిరిగి దర్శనమిస్తుంది. అలాగే ఈ సరుకుల ఉత్పత్తి కోసం వినియోగించిన $666\frac{2}{3}$ పనిదినాల ధర, లేక వేతనాలు కూడా సరుకుల ఉత్పత్తి ధరలో పునరదర్శనమిస్తాయి; అడ్వాన్సు అయిన పెట్టుబడిలో లెక్కలోకి వచ్చినట్లే ఈ శ్రమ పరిమాణం ఒక ప్రత్యేక ప్రయోజనం కోసం ఖర్చు కావడం కూడా దీనికి కారణం. సంపూర్ణమైన అస్తిత్వంలో ఉన్న విలువలు మాత్రమే మనకు కనిపిస్తాయి; మదుపుపెట్టిన పెట్టుబడులు, ఉత్పాదితం విలువను సృష్టించేందుకు ఉపయోగపడే భాగాలే కనిపిస్తాయి తప్ప నూతన విలువలను సృష్టించే



కార్ల్‌మార్క్స్ – పెట్టుబడి మూడవ సంపుటిలో ఒకపేజి వారి కార్యదర్శి రాసినది, ఏంగెల్స్ చేసిన మార్పులతో వున్నది. పైన ఏంగెల్స్ చేర్చిన వాక్యాలూ వున్నాయి.
(సైజు తగ్గించబడింది)

అంశం కనిపించదు. స్థిర పెట్టుబడికీ అస్థిర పెట్టుబడికీ మధ్యగల వ్యత్యాసం అదృశ్యమైపోయింది. 500 పౌండ్ల మొత్తం ఉత్పత్తి ధరకు ఇప్పుడు రెండర్థాలున్నాయి.

మొదటిది – 600 పౌండ్ల సరుకు విలువలు సరుకు ఉత్పత్తి కోసం ఖర్చయిన 500 పౌండ్ల పెట్టుబడిని భర్తీ చేసే భాగం అది.రెండవది సరుకు విలువలోని ఈ భాగం, పనిలో నియోగింపబడిన ఉత్పాదక అంశాలైన ఉత్పత్తి సాధనాలూ, శ్రమయొక్క కొనుగోలు ధరగా, అంటే అడ్వాన్స్ చేసిన పెట్టుబడిగా ఇది వరకే అస్తిత్వంలో ఉంది కాబట్టే ఇపుడు అది అస్తిత్వంలో ఉంది. పెట్టుబడి విలువ

పెట్టుబడి విలువగా వ్యయం అయినందువల్ల, వ్యయం అయిన మేరకు అది సరుకు ఉత్పత్తి ధరగా తిరిగి రంగంపైకి వస్తోంది.

అడ్వాన్సయిన పెట్టుబడి విలువ యొక్క వివిధ భాగాలను శ్రమపరికరాలు, ముడి పదార్థాలు, అనుబంధ పదార్థాలు, శ్రమ మొదలైన భౌతికంగా విభిన్నమైన ఉత్పాదక అంశాలపై ఖర్చుచేయడం జరిగింది కాబట్టి భౌతికంగా విభిన్నమైన ఈ ఉత్పత్తి భాగాలను సరుకు యొక్క ఉత్పత్తి ధర తిరిగి కొనుగోలు చేయగలగాలి. కాగా ఉత్పత్తి ధర రూపొందడానికి సంబంధించి ఒకే ఒక తేడా గమనార్హమైనది – అది నిశ్చల పెట్టుబడికీ, చలామణి పెట్టుబడికీ మధ్య గల తేడా. మనం మన ఉదాహరణలో శ్రమ పరికరాల తరుగుదలకు 20 పౌండ్లు కేటాయించాం. (400 స్థి.పె = శ్రమ పరికరాల తరుగుదలకు 20 పౌండ్లు + ఉత్పత్తి పదార్థాలకు 380 పౌండ్లు) ఉత్పాదక ప్రక్రియకు ముందు ఈ శ్రమ పరికరాల విలువ 1200 పౌండ్లు అనుకుందాం. సరుకులు ఉత్పత్తి అయ్యాక ఆ విలువ రెండు రూపాల్లో ఉంటుంది. 20 పౌండ్లేమో సరుకు విలువలోని భాగంగానూ, 1200–20 లేక 1180 పౌండ్లేమో శ్రమ పరికరాల విలువగానూ. కాగా ఈ శ్రమ పరికరాల విలువ ఇంతకుముందు మాదిరే ఇప్పుడు కూడా పెట్టుబడిదారుని అధీనంలోనే ఉంది. అంటే, అతని సరుకు–పెట్టుబడిగా కాక, ఉత్పాదక పెట్టుబడి అంశంగా అది అతని ఆధీనంలోనే ఉంటుంది. శ్రమ సాధనాలకు విభిన్నంగా, ఉత్పత్తి పదార్థాలు, వేతనాలు పూర్తిగా సరుకు ఉత్పత్తికే వినియోగమవుతాయి. ఆ విధంగా వాటి సమస్త విలువా, ఉత్పత్తి అయిన సరుకు విలువలోకి ప్రవేశిస్తుంది. అడ్వాన్సు అయిన పెట్టుబడి యొక్క ఈ వివిధ భాగాలు టర్నోవర్‌కు సంబంధించి ఏవిధంగా నిశ్చల పెట్టుబడి రూపాన్ని, చలామణి పెట్టుబడి రూపాన్ని ధరిస్తాయో మనం గమనించాం.

కనుక అడ్వాన్సు పెట్టుబడి = 1680 పౌండ్లు = నిశ్చల పెట్టుబడి = 1200 పౌండ్లు+ చలామణి పెట్టుబడి=480 పౌండ్లు (=380 పౌండ్లు ఉత్పత్తి పదార్థాలు, 100 పౌండ్లు వేతనాలు)

కానీ సరుకు ఉత్పత్తి ధర మాత్రం = 500 పౌండ్లు (నిశ్చల పెట్టుబడి అరుగుదలకు సంబంధించి మొత్తం 20 పౌండ్లు, చలామణి పెట్టుబడి మొత్తం 480 పౌండ్లు) అయితే సరుకు ఉత్పత్తి ధరకూ అడ్వాన్సు చేసిన పెట్టుబడికీ మధ్యగల ఈ తేడా, ఉత్పత్తిలో వినియోగమైన పెట్టుబడి మాత్రమే సరుకు యొక్క ఉత్పత్తి ధరగా రూపొందుతున్న వాస్తవాన్ని నిరూపిస్తుంది.

సరుకు ఉత్పత్తికి 1200 పౌండ్ల విలువ గల ఉత్పత్తి సాధనాలు నియుక్తమయ్యాయి; అయితే ఇలా అడ్వాన్సు అయిన పెట్టుబడి విలువలోని 20 పౌండ్లు మాత్రమే ఉత్పత్తికి ఖర్చయ్యాయి. సరుకు ఉత్పత్తికి నియుక్తమైన నిశ్చల పెట్టుబడి పాక్షికంగా మాత్రమే వినియోగింపబడింది కాబట్టి అది సరుకు యొక్క ఉత్పత్తి ధరలోకి పాక్షికంగా మాత్రమే ప్రవేశిస్తుంది. నియుక్తమైన చలామణి పెట్టుబడి ఉత్పత్తికి మొత్తంగా వినియోగింపబడింది కనుక అది సరుకు యొక్క ఉత్పత్తి ధరలోకి మొత్తంగా ప్రవేశిస్తుంది. మరైతే నిశ్చల పెట్టుబడిలోని, చలామణి పెట్టుబడిలోని వ్యయమైన భాగాలు తమ విలువల పరిమాణానికి అనుగుణమైన నిష్పత్తిలో ఒకే రకంగా సరుకు యొక్క ఉత్పత్తి ధరలోకి ప్రవేశిస్తున్నాయని, ఉత్పత్తిలో ఖర్చయిన పెట్టుబడి నుంచీనే సరుకు విలువలోని ఆ భాగం ఆవిర్భవిస్తుందని, ఇది నిర్ద్వంద్వంగా రుజువు చేయడం లేదా? అలా కాకపోతే అడ్వాన్స్ అయిన

1200 పౌండ్ల నిశ్చల పెట్టుబడి ఉత్పాదక ప్రక్రియలో తాను కోల్పోయిన 20 పౌండ్లతో పాటు, అలా కోల్పోని 1,180 పౌండ్లను కూడా సరుకు విలువకు ఎందుకు జోడించడం లేదో కారణం కనిపించదు.

కనుక ఉత్పత్తి ధరను లెక్కకట్టే విషయంలో నిశ్చల పెట్టుబడికి చలామణి పెట్టుబడికీ మధ్యగల ఈ తేడా ఒక విషయాన్ని నిరూపిస్తుంది; ఖర్చయిన పెట్టుబడి విలువే, లేదా శ్రమతో సహా ఖర్చయిన ఉత్పాదక అంశాల కోసం పెట్టుబడిదారు చెల్లించిన ధరే ఉత్పత్తి ధరకు మూలమనే దృగ్గోచర విషయాన్ని అది నిరూపిస్తుంది. కాగా మరో వైపేమో, విలువ రూపుగొనడానికి సంబంధించినంత వరకు, అస్థిర పెట్టుబడిలో శ్రమశక్తికై మదుపు పెట్టిన భాగాన్నే చలామణి పెట్టుబడి పద్దుకింద స్థిర పెట్టుబడిగా (ఉత్పత్తి పదార్థాల రూపంలో ఉండే పెట్టుబడి భాగం) ఇక్కడ ఖచ్చితంగా పరిగణిస్తున్నారు. దీనితో పెట్టుబడి స్వయం విస్తరణ క్రమం పూర్తిగా అభేద్యమర్మంగా తయారవుతుంది.[1]

మనం ఇంతవరకు సరుకుల విలువలోని ఒక భాగాన్ని మాత్రమే, అంటే ఉత్పత్తి ధరను మాత్రమే పరిశీలించాం. మనమిప్పుడు సరుకుల విలువలోని ఇతర భాగంపై అంటే ఉత్పత్తి ధరకు మించి ఉన్న భాగంపై లేదా అదనపు విలువపై దృష్టి మళ్ళిద్దాం. మొట్టమొదటి విషయం అదనపు విలువ అనేది సరుకు యొక్క ఉత్పత్తి ధరకు పైబడిన దాని విలువ. అయితే ఉత్పత్తి ధర వ్యయమైన పెట్టుబడి విలువకు సమానంగా ఉంటుంది. ఆ పెట్టుబడికి సంబంధించిన భౌతిక అంశాలుగా అది నిరంతరాయంగా పరివర్తన చెందుతూంటుంది. కాబట్టి, ఉత్పత్తి ధరకు పైబడివున్న ఈ విలువ సరుకు ఉత్పత్తిలో వ్యయమై, చలామణి ద్వారా తిరిగి వచ్చే పెట్టుబడి విలువను పెంచుతుంది.

అదనపు విలువ అ.వి. అస్థిర పెట్టుబడి అ.పె. యొక్క విలువ మార్పునుంచి ఉత్పన్నమవుతుంది కాబట్టి అది అస్థిర పెట్టుబడి పెరుగుదలే అని కాగా ఉత్పత్తి ప్రక్రియ ముగిశాక అది స్థి.పె + అ.పె యొక్క పెరుగుదలగా, అంటే ఖర్చయిన మొత్తం పెట్టుబడి యొక్క పెరుగుదలగా రూపొందుతుందని మనం ఇదివరకే గమనించాం. శ్రమశక్తి కోసం అడ్వాన్సు చేసిన నిర్దిష్ట పెట్టుబడి విలువ అ.పెని చంచలపరిమాణంగా మార్చడం ద్వారా, అంటే స్థిర పరిమాణాన్ని అస్థిర పరిమాణంగా మార్చడం ద్వారా అ.వి. ఉత్పత్తి అవుతుందని సూచించే స్థి.పె + (అ.పె + అ.వి) సూత్రాన్ని (స్థి.పె + అ.పె)+ అ.విగా చూపించవచ్చు. ఉత్పత్తి జరగడానికి ముందు మనవద్ద 500 పౌండ్ల పెట్టుబడి ఉండింది. ఉత్పత్తి పూర్తయ్యాక మన వద్ద 500 పెట్టుబడితో పాటు 100 పౌండ్ల[2] విలువ పెరుగుదల కూడా ఉంది.

---

1. మొదటి సంపుటిలో (అధ్యాయం IX, 3 పుట 225 - సం) అర్థశాస్త్రవేత్త మనసులో యిది యేరకమైన గందరగోళాన్ని సృష్టిస్తుందో తెలపడానికి మనం ఎన్.డబ్ల్యు. సీనియర్ ఉదాహరణ యిచ్చాం.
2. "ఇంతకు ముందు చెప్పిన దాన్నిబట్టి, అదనపు విలువ అపె విలువలో" శ్రమశక్తిగా పరివర్తన చెందే పెట్టుబడి భాగం యొక్క విలువలో వచ్చిన మార్పు ఫలితమనీ, పర్యవసానంగా అ.పె + అ.వి = అ.పె + $\delta$అ.పె సూత్రం (లేక అ.పె + అ.పె పెరుగుదల) అని, తలెత్తుతున్నదని మనకు స్పష్టంగా తెలుసు. అయితే, పెట్టుబడిలోని అస్థిర భాగం పెరిగిన ఫలితంగా, అడ్వాన్స్ చేయబడ్డ మొత్తం పెట్టుబడి కూడా పెరుగుతుంది. ఇది, మారేది అ.పె మాత్రమే అన్న వాస్తవాన్నీ, ఆ మార్పుకు కారణభూతమైన పరిస్థితులనూ మరుగుపుచ్చుతుంది. అది మొదట 500 పౌండ్లుగా వుండి ఆ తర్వాత 500 పౌండ్లు అయింది" (సం. I, అధ్యాయం IX - సం)

అయితే అదనపు విలువ అన్నది అడ్వాన్సయిన పెట్టుబడిలో స్వయం విస్తరణ ప్రక్రియలోకి ప్రవేశించే భాగం పెరుగుదలగానే కాక అందులోని ప్రవేశించకి భాగం పెరుగుదలగా కూడా రూపొందుతుంది. వేరుమాటలో చెప్పాలంటే; వ్యయమయిన పెట్టుబడినేగాక ఉత్పత్తి ధర నుంచి భర్తీ అయ్యే ఈ పెట్టుబడిని మాత్రమే కాక, ఉత్పత్తికి మదుపు చేసిన మొత్తం పెట్టుబడినే అది వృద్ధి చేస్తుంది. ఉత్పత్తి ప్రక్రియకు ముందు మనవద్ద 1680 పౌండ్ల విలువగల పెట్టుబడి ఉండింది; ఉత్పత్తి సాధనాల్లో మదుపు పెట్టిన 1200 పౌండ్లు నిశ్చలపెట్టుబడి, (ఇందులో 20 పౌండ్లు మాత్రమే తరుగు రూపంలో సరుకు నిలువలోకి ప్రవేశిస్తుంది) ప్లస్ ఉత్పత్తి పదార్థాలకు, వేతనాలకు వ్యయం చేసిన 480 పౌండ్ల చలామణి పెట్టుబడి కాగా, ఉత్పత్తి ప్రక్రియ ముగిశాక మనవద్ద ఉత్పాదక పెట్టుబడి విలువ అంతర్భాగంగా 1180 పౌండ్లు, సరుకు పెట్టుబడిగా 600 పౌండ్లు ఉంది. ఈ రెండు మొత్తాలను కూడినందువల్ల, పెట్టుబడిదారు వద్ద ఇప్పుడు 1780 పౌండ్లు విలువ ఉంటుంది. అతడు అడ్వాన్సు చేసిన మొత్తం పెట్టుబడి 1680 పౌండ్లను అందులో నుంచి తీసివేస్తే వృద్ధి అయిన విలువ 100 పౌండ్లు మిగుల్తుంది. ఈ 100 పౌండ్ల అదనపు విలువ, మదుపు పెట్టిన 1680 పౌండ్లకే కాక ఉత్పత్తి ప్రక్రియలో ఖర్చయిన దాని భాగమైన 500 పౌండ్లకు కూడా ఒక పెరుగుదలే.

పెట్టుబడితో నిర్వహించబడే ఉత్పాదక ప్రక్రియలనుంచి ఈ విలువ పెరుగుదల ఉత్పన్న మవుతున్నది కాబట్టి, అది నేరుగా పెట్టుబడినుంచే ఉత్పన్నమవుతున్నదని, ఇప్పుడిక పెట్టుబడిదారుడికి స్పష్టంగా తెలుసు. ఎందుచేతనంటే ఉత్పాదక ప్రక్రియ తర్వాతే అది ఉంది తప్ప, ఉత్పాదక ప్రక్రియకు ముందు లేదు కదా. ఉత్పత్తిలో వినియోగమయిన పెట్టుబడిని తీసుకొంటే ఉత్పత్తి సాధనాలూ శ్రమతో కూడిన దాని విలువ యొక్క వివిధ భాగాల నుంచీ అదనపు విలువ సమానంగా ఆవిర్భవిస్తున్నట్టు కనిపిస్తుంది. ఎందుచేతనంటే, ఈ విభాగాలన్నీ కూడా ఉత్పత్తి ధర ఏర్పడటానికి సమంగా దోహదపడుతున్నాయి. అడ్వాన్సు చేసిన పెట్టుబడిగా అవన్నీ కూడా తమ విలువలను ఉత్పాదితం విలువకు జోడిస్తున్నాయి. వాటిని స్థిర విలువ అనీ అస్థిర విలువ అనీ వేరుచేసి చూపడం జరగదు. ఖర్చయిన పెట్టుబడి అంతా పూర్తిగా వేతనాలుగానో లేక పూర్తిగా ఉత్పత్తి సాధనాల విలువగానో ఉందని మనం క్షణంపాటు భావించినట్లయితే ఈ విషయం స్పష్టంగా బోధపడుతుంది. మొదటి సందర్భంలో మనవద్ద 400 స్థి.పె+ 100 అ.పె + 100 అవి సరుకు విలువకు బదులు 500 అ.పె + 100 అ.వి సరుకు విలువ ఉంటుంది. వేతనాలకు ఖర్చయిన 500 పౌండ్ల పెట్టుబడి 600 పౌండ్ల సరుకు విలువ ఉత్పత్తికి ఖర్చయిన సమస్త శ్రమ విలువకూ ప్రాతినిధ్యం వహిస్తుంది; కేవలం ఆ కారణం వల్లనే సమస్త ఉత్పాదితం యొక్క ఉత్పత్తి ధరగా రూపొందుతుంది. ఉత్పత్తి ధర ఏర్పడిన క్రమం వల్లనే, వ్యయమైన పెట్టుబడి ఉత్పాదితం విలువలో ఒక అంతర్భాగంగా పునరుత్పత్తి అవుతోంది. ఈ ఉత్పత్తి ధర రూపుగొనే క్రమమొక్కటే సరుకు విలువ రూపుగొనడంలో మన మెరిగిన క్రమం. దాని 100 పౌండ్లలోని అదనపు విలువ భాగం ఎలా అవతరించిందో మనకు తెలీదు. ఇక రెండవ సందర్భానికి కూడా ఇదే వర్తిస్తుంది. ఇక్కడ సరుకు విలువ 500 స్థి.పె + 100 అ.వి ఒక నిర్దిష్ట విలువ నుంచి అదనపు విలువ ఆవిర్భవించిందని ఈ రెండు సందర్భాలలోనూ మనకు తెలుసు. ఎందుచేతనంటే ఈ నిర్దిష్ట విలువ ఉత్పాదక పెట్టుబడి రూపంలో – అది శ్రమ రూపంలో కావచ్చు,

లేక ఉత్పత్తి సాధనాల రూపంలో కావచ్చు అడ్వాన్సు అయింది కదా. కాగా మరోవైపేమో, అడ్వాన్సయిన ఈ పెట్టుబడి విలువ ఖర్చయిపోయి సరుకు యొక్క ఉత్పత్తి ధర అయింది. కనుక ఇది అదనపు విలువగా రూపొందజాలదు. ఇది సరుకు యొక్క ఉత్పత్తి ధరగా ఉంది. కాబట్టి ఇది ఎలాటి అదనపు విలువగా రూపొందదు. ఖర్చయిన పెట్టుబడి స్థానాన్ని భర్తీ చేసే విలువగా అనగా సమతుల్య భాగంగా మాత్రమే ఇది రూపొందుతుంది. కాబట్టి అది అదనపు విలువను రూపొందించిన మేరకు ఖర్చయిన పెట్టుబడిగా కాక, అడ్వాన్సు అయిన పెట్టుబడిగా, అంటే ఉపయోగింపబడిన పెట్టుబడిగా మాత్రమే అది ఆ పని చేస్తుంది. ఈ కారణం చేత అడ్వాన్సయిన పెట్టుబడిలో సరుకు ఉత్పత్తి ధరలోకి ప్రవేశించే భాగం. అలా ప్రవేశించని భాగం, రెంటినుంచీ కూడా అదనపు విలువ ఉత్పన్న మవుతుంది. ఒక్క మాటలో చెప్పాలంటే, ఉపయోగింపబడిన పెట్టుబడిలోని నిశ్చల భాగం, చలామణి భాగం రెండింటి నుంచి సమానంగా ఇది ఉత్పన్నమవుతుంది. మొత్తం పెట్టుబడి భౌతికంగా ఉత్పాదితాల సృష్టికర్తగా, శ్రమ సాధనాలు, అలాగే ఉత్పత్తి పదార్థాలు, శ్రమలుగా ఉపకరిస్తున్నది. మొత్తం పెట్టుబడి భౌతికంగా వాస్తవ శ్రమ ప్రక్రియల్లోకి ప్రవేశిస్తుంది – దానిలోని ఒక భాగం మాత్రమే స్వయం విస్తరణ ప్రక్రియలోకి ప్రవేశించినప్పటికీ, ఉత్పత్తి ధర రూపుకొనడానికి పాక్షికంగానూ, అదనపు విలువ రూపొందడానికి సర్వ సంపూర్ణంగానూ ఇది దోహదపడుతుండడం బహుశా ఈ కారణం వల్లనే కావచ్చు. ఏది ఏమైనా, ఫలితం ఏమిటంటే మదుపు పెట్టిన పెట్టుబడి తాలూకు అన్ని భాగాలనుంచీ ఏకకాలంలో అదనపు విలువ ఆవిర్భవిస్తుంది. మాల్తస్ మాటల్లో సూటిగా క్లుప్తంగా ఇలా చెప్పడం ద్వారా ఈ నిర్ధారణను సంక్షిప్తపరచవచ్చు. “పెట్టుబడిదారుడు.... తాను అడ్వాన్సు చేసే పెట్టుబడి తాలూకు అన్ని భాగాలనుంచి సమంగా లాభాలను ఆశిస్తున్నాడు” [1]

అడ్వాన్సు చేసిన మొత్తం పెట్టుబడి నుంచి ఉద్భవించినదిగా ఊహించబడుతున్న అదనపు విలువ ఆ స్థితిలో లాభం రూపంలోకి పరివర్తన చెందుతుంది. కాబట్టి లాభం[2] సృష్టించే ఉద్దేశంతో మదుపు చేయబడే నిర్దిష్ట విలువ ఏదైనా పెట్టుబడి అవుతుంది, లేదా నిర్దిష్ట విలువ పెట్టుబడిగా నియుక్తం అయింది కనుక లాభం ఆవిర్భవిస్తుంది. లాభం ల అనుకుంటే, సవి = స్థి.పె + అ.పె + అ.వి = ఉ + అ.వి అనే సూత్రం స.వి = ఉ + ల గా మారుతుంది. లేదా సరుకు విలువ = ఉత్పత్తి ధర + లాభం.

ఇక్కడ వివరించిన విధంగా లాభం అన్నది నిగూఢ రూపంలో ఉన్న అదనపు విలువ తప్ప మరొకటి కాదు. ఈ రూపం పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానానికి తప్పనిసరి ఫలితం. ఉత్పత్తి ధర రూపుగొనడం గురించిన పై ఊహలో స్థిర పెట్టుబడికీ అస్థిర పెట్టుబడికీ మధ్య వ్యత్యాసం లేదు కాబట్టి ఉత్పత్తి ప్రక్రియలో సంభవించే విలువల రూప పరివర్తనలకు మూలం అస్థిర పెట్టుబడి నుంచి మొత్తం పెట్టుబడికి బదిలీ కాక తప్పదు. ఒక ధ్రువం వద్దనేమో శ్రమశక్తి ధర వేతనాల పరివర్తిత రూపం ధరిస్తుంది. కనుక మరో ధ్రువం వద్ద అదనపు విలువ లాభం మారురూపంలో దర్శనమిస్తుంది.

---

1. మాల్తస్ : Principles of Political Economy 2వ కూర్పు లండన్, 1886, పుట 268.
2. “లాభం దృష్టిలో ఖర్చు చేయబడిందేదైనా పెట్టుబడే” మాల్తస్, డెఫినిషన్స్ ఇన్ పొలిటికల్ ఎకానమీ, లండన్, 1827, పుట 86.



ఒక సరుకు ఉత్పత్తి ధర దాని విలువకంటే తక్కువగా ఉంటుందని మనం గమనించాం. స.వి = ఉ + అ.వి కాబట్టి ఉ = స.వి – అ.వి అవుతుంది. అవి = 0 అయితేనే, సవి = ఉ + అ.వి అనే సూత్రం స.వి = ఉ గా మారుతుంది. అంటే సరుకు విలువ సరుకు ఉత్పత్తి ధరకు సమానమవుతుంది. కానీ ప్రత్యేక మార్కెట్ పరిస్థితులు సరుకుల అమ్మకం ధరను వాటి ఉత్పత్తి ధరకు సమానంగా, లేక అంత కంటే తక్కువ స్థాయికి తగ్గించవచ్చు. కానీ పెట్టుబడిదారీ ఉత్పత్తి ప్రాతిపదికపై ఎన్నడూ అ.వి = 0గా ఉండదు.

కాబట్టి ఒక సరుకును దాని విలువ మేరకే అమ్మినట్లయితే కొంత లాభం చేతికందుతుంది. అది దాని ఉత్పత్తి ధరకు పైబడి ఉన్న విలువకు సమానంగా ఉంటుంది. కనుక సరుకు విలువలో మూర్తీభవించి ఉన్న సమస్త అదనపు విలువకూ అది సమానంగా ఉంటుంది. అయితే పెట్టుబడిదారు ఒక సరుకును దాని విలువకంటే తక్కువకు అమ్మినప్పటికీ అతనికి లాభమే రావచ్చు. సరుకు అమ్మకం ధర దాని విలువకంటే తక్కువగా ఉన్నప్పటికీ, అది గనుక దాని ఉత్పత్తి ధర కంటే ఎక్కువగా ఉన్నట్లయితే అందులో చేరివున్న అదనపు విలువలలోని ఒక భాగం ఎప్పుడూ అనుభవానికి వస్తుంది; ఆ విధంగా ఎప్పుడూ లాభం అందజేస్తుంటుంది. మనం పేర్కొన్న ఉదాహరణలో సరుకు విలువ 600 పౌండ్లు, ఉత్పత్తి ధర 500 పౌండ్లు. ఆ సరుకును 510 పౌండ్లకు, 520 పౌండ్లకు, 530 పౌండ్లకు, 560 పౌండ్లకు లేక 590 పౌండ్లకు అమ్మినట్లయితే ఆ సరుకు తన విలువ కంటే వరుసగా 90 పౌండ్లకు, 80 పౌండ్లకు, 70 పౌండ్లకు, 40 పౌండ్లకు లేక 10 పౌండ్లకు తక్కువగా అమ్ముడయినట్లు లెక్క. అలా అమ్మినప్పటికీ ఆ సరుకుపై వరుసగా 10 పౌండ్లు, 20 పౌండ్లు, 30 పౌండ్లు, 60 పౌండ్ల లేక 90 పౌండ్ల లాభం అనుభవానికి వస్తుంది. ఒక సరుకు యొక్క విలువకూ, దాని ఉత్పత్తి ధరకూ మధ్య ఎన్నో అమ్మకం ధరలు ఉండ వీలుంది. సరుకు విలువలో అదనపు విలువ భాగం ఎక్కువగా ఉన్న కొద్దీ ఈ మధ్యంతర ధరల ఆచరణాత్మక పరిధి కూడా ఎక్కువగానే ఉంటుంది.

కొన్ని సందర్భాలలో ఇతరులకంటే సరుకుల ధరలు తగ్గించి అమ్మడం వంటి రోజూ మనం చూస్తున్న పోటీయే కాక, కొన్ని పరిశ్రమ శాఖల్లో అసాధారణంగా తక్కువ ధరలకు సరుకులమ్మడం మొదలైనవి ఇందుకు ఉదాహరణ.[1] సార్వత్రిక లాభం రేటును దానిచే నిర్ణయమైన ఉత్పత్తి ధరలను క్రమబద్ధం చేసే పెట్టుబడిదారీ పోటీ యొక్క మౌలిక నియమం వాస్తవానికి సరుకుల విలువకూ, ఉత్పత్తి ధరకూ మధ్యగల ఈ భేదంపైనా, దాని ఫలితంగా ఒక సరుకు తన విలువకంటే తక్కువకే అయినా లాభంపై అమ్ముడయ్యే అవకాశంపైనా – ఆధారపడి ఉంటుందన్న విషయాన్ని మనం ఉత్తరోత్తరా గమనిస్తాం; ఈ మౌలిక నియమాన్ని రాజకీయ అర్థశాస్త్రం ఇప్పటిదాకా గ్రహించడం జరుగలేదు.

ఒక సరుకు యొక్క అమ్మకం ధరకు కనీస పరిమితి దాని ఉత్పత్తి ధరే. దాన్ని గనుక దాని ఉత్పత్తి ధరకంటే తక్కువకు అమ్మితే, ఉత్పాదక పెట్టుబడిలో వ్యయమైన భాగాలను ఆ అమ్మకం ధర నుంచి పూర్తిగా భర్తీ చేయడం అసాధ్యం. ఈ ప్రక్రియ ఇలాగే కొనసాగినట్లయితే అడ్వాన్సు చేసిన

1. చూడండి : సంపుటి I, అధ్యాయం XX - సం.

పెట్టుబడి విలువ అదృశ్యమైపోతుంది. కేవలం ఈ దృక్కోణం నుంచే, పెట్టుబడిదారుడు ఉత్పత్తి ధరను సరుకు యొక్క నిజమైన ఆంతరిక విలువగా పరిగణించేందుకు సిద్ధపడతాడు. ఎందుచేతనంటే, ఇక్కడ ఇంకో అంశం కూడా ఉంది. ఒక సరుకు యొక్క ఉత్పత్తి ధర దాని ఉత్పత్తి ప్రక్రియకు పెట్టుబడిదారు స్వయంగా చెల్లించిన కొనుగోలు ధర. కాబట్టి ఉత్పత్తి ప్రక్రియే నిర్ణయించిన కొనుగోలు ధర. ఈ కారణం మూలంగా, ఒక సరుకు అమ్మకం ద్వారా అనుభవానికి వచ్చిన విలువలలోని అదనపు భాగం లేదా అదనపు విలువ పెట్టుబడిదారుడికి దాని ఉత్పత్తి ధరకు పైబడి ఉన్న దాని విలువగా కాక దాని విలువకు పైబడి ఉన్నదాని అమ్మకం ధరగా కనిపిస్తుంది. కాబట్టి అందుకు అనుగుణంగా ఒక సరుకులో మూర్తీభవించి వున్న అదనపు విలువ చేతికందుతున్నట్లు కనిపించదు. అసలు దాని అమ్మకం ద్వారా అమ్మకంనుంచే నేరుగా అది ఆవిర్భవిస్తున్నట్లు కనిపిస్తుంది. ఈ భ్రమను మొదటి సంపుటిలో ("పెట్టుబడి గురించిన సాధారణ సూత్రంలో వైరుధ్యాలు") మరింత లోతుగా పరిశీలించాం. కానీ ఈ భ్రమను, రాజకీయ అర్థశాస్త్రం, రికార్డో తరువాత వేసిన ముందడుగుగా టారెన్స్, ఇతరులతో పాటు పునరుద్ఘాటించిన పద్ధతిని ఇక్కడ ఒక్కక్షణం పాటు తిరిగి ప్రస్తావిస్తాను.

"ఉత్పత్తి వ్యయంతో కూడుకున్న సహజసిద్ధమైన ధరలో, ఇంకో విధంగా చెప్పాలంటే, సరుకులను తయారు చేయడానికి ఖర్చయినట్టి పెట్టుబడిలో లాభం ఉండజాలదు.... రైతు తన భూములను సాగుచేయడానికి వంద బస్తాల ధాన్యం ఖర్చుచేసి, అందుకు ప్రతిఫలంగా నూట ఇరవై బస్తాల ధాన్యం పండిస్తాడనుకుందాం. ఈ సందర్భంలో ఖర్చు అయినదానికి మించి అదనంగా ఉన్న ఇరవై బస్తాలు రైతు యొక్క లాభం కిందికి వస్తాయి; అయితే ఈ అదనపు ధాన్యాన్ని లేక లాభాన్ని ఖర్చులో ఒక భాగం అనడం అసంబద్ధంగా ఉంటుంది... కార్ఖానా యజమాని నిర్దిష్ట మొత్తంలో ముడి పదార్థాలను వృత్తి పరికరాలను, సాధనాలను, శ్రమకోసం జీవనాధారాలను ఖర్చుచేసి అందుకు ప్రతిఫలంగా, నిర్దిష్ట పరిమాణంలో తయారైన ఉత్పాదితం పొందుతాడు. ముడిపదార్థాలు, పరికరాలు, జీవనాధారాలు ఖర్చుపెట్టి పొందిన ఈ తయారైన ఉత్పాదితం యొక్క మార్పిడి విలువ అలా ఖర్చు పెట్టినవాటికంటే ఎక్కువగానే ఉండితీరుతుంది." వినియోగదారులు "తక్షణ వస్తుమార్పిడి ద్వారా కానీ, పలు చేతులు మారిన వస్తు మార్పిడి ద్వారా కానీ, పెట్టుబడిలోని అన్ని అంశాల ఉత్పత్తి ధరలకన్నా ఏదో కొంత ఎక్కువగా వాటిని ఇస్తారనే" వాస్తవం ఉత్పత్తిధరకు పైబడివున్న అమ్మకంధరకు, లేదా లాభానికి మూలమని టారెన్స్, ఇతరులతో పాటు నిర్ధారణ చేస్తున్నాడు.[1]

ఒక నిర్దిష్ట పరిమాణం కంటే ఎక్కువగా ఉన్నది ఈ పరిమాణంలో భాగం కాజాలదు. కనుక లాభం, అంటే పెట్టుబడిదారుడు పెట్టిన ఖర్చులకంటే ఎక్కువగా ఉన్న సరుకు విలువ, ఆ ఖర్చుల్లో ఒక భాగం కాజాలదు. కాబట్టి పెట్టుబడిదారుడు అడ్వాన్సు చేసిన విలువ కాక మరేదీ సరుకు విలువ రూపొందే క్రమంలోకి ప్రవేశించకపోతే, ఆ ఉత్పత్తిలోకి వెళ్ళిన దానికంటే ఎక్కువ విలువ దాని నుంచి ఎలా వస్తుందో చెప్పలేము. ఎందుచేతనంటే, శూన్యం నుంచి ఏదీ రాజాలదు కదా. ఈ శూన్యం నుంచి జరిగిన ఈ సృష్టిని సరుకు ఉత్పత్తి క్షేత్రం నుంచి సరుకు చలామణి క్షేత్రానికి బదిలీ

1. ఆర్. టారెన్స్, 'యాన్ ఎస్సే ఆన్ ది ప్రొడక్షన్ ఆఫ్ వెల్త్, లండన్, 121, పుటలు 51-53, 349.

చేయడం ద్వారా టారెన్స్ దాటవేస్తాడు. ఉత్పత్తి నుంచి లాభం ఆవిర్భవించదని టారెన్స్[1] అంటాడు. కారణమేమంటే, ఉత్పత్తి నుంచే లాభం వచ్చేపక్షంలో ఉత్పత్తి వ్యయంలోనే అది ఇమిడి ఉంటుంది కనుక ఈ వ్యయంపై అదనం ఏదీ ఉండదు. సరుకుల మార్పిడి ద్వారా లాభం రాజాలదనీ, ఈ మార్పిడికి ముందే అది ఉంటే తప్ప అందులోనుంచి రాజాలదనీ రామ్సె సమాధానమిస్తాడు. మార్పిడి చెందిన ఉత్పాదితాల విలువ మొత్తం ఈ ఉత్పాదితాల మార్పిడి ద్వారా మారదనేది విదితమే. మార్పిడికి ముందు ఎంత ఉందో మార్పిడి తర్వాతనూ ఉన్న విలువ మొత్తం అదే. ఇక్కడ ఒక విషయం గమనించాలి. సరుకులు వాటి విలువకంటే ఎక్కువకు అమ్ముడవుతాయనే అంశంపై తనకొక విభిన్నమైన వివరణ ఉన్నప్పటికీ, లేదా అసలు వివరణ అనేది లేకపోయినప్పటికీ మాల్తస్ ఖచ్చితంగా టారెన్స్‌ను ప్రమాణంగా పేర్కొంటున్నాడు. ఆయనకు వివరణ అనేదే లేదు అనడం ఎందుకంటే ఇలాటి వాదనలన్నీ కూడా ఒకనాడు ప్రఖ్యాతి చెందిన ప్లాగిస్టన్[2] ప్రతికూల భారం లాంటివిగా తేలకుండా ఉండవు.

పెట్టుబడిదారీ ఉత్పత్తి ప్రాబల్యం వహిస్తున్న సామాజిక వ్యవస్థలో పెట్టుబడిదారుడు కానీ ఉత్పాదకుని సైతం పెట్టుబడిదారీ భావనలు గట్టిగా ఆకట్టుకుంటాయి. వాస్తవాలకు లోతుగా అవగాహన చేసుకోవడంలో పేరుపొందిన బాల్జాక్ తన చివరి నవల అయినా (Lespaysans) లెపెసెన్స్‌లో ఒక విషయం సముచితంగా వర్ణిస్తాడు. ఒక పేద రైతు తన రుణదాత మెప్పు నిలుపుకోవడం కోసం చిన్నచిన్న పనులన్నీ ఉచితంగానే చేసిపెడతాడు. చేసి పెట్టడమే కాక తన శ్రమవల్ల తనకు నగదు ఖర్చేబీ్బు కావడం లేదు కాబట్టి తను వట్టిపుణ్యానికి సేవలు చేయడం లేదనే ఊహిస్తాడు. కాగా ఇక ఆ వడ్డీ వ్యాపారేమో ఒకే దెబ్బకి రెండు పిట్టల్ని కొడతాడు; వేతనాలుగా ఇవ్వాల్సిన నగదు డబ్బును ఆదా చేసుకుంటాడు. మరోవైపేమో ఆ పేద రైతును అప్పుల సుడిగుండంలో కూరుకుపోయేలా చేస్తాడు. తన సొంత పొలంలో పని చేయనందువల్ల క్రమేణా నాశనమవుతాడు.

ఒక సరుకు యొక్క ఉత్పత్తి ధరలో దాని వాస్తవ విలువ ఉంటుందనీ, ఉత్పాదితాన్ని దాని విలువకంటే ఎక్కువకు అమ్మడం ద్వారా అదనపు విలువ ఆవిర్భవిస్తుందని, కనుక సరుకుల అమ్మకం ధర వాటి ఉత్పత్తి ధరకు సమానంగా ఉన్నట్లయితే, అంటే వినియోగింపబడిన ఉత్పత్తి సాధనాల ధరకు ప్లస్ వేతనాలకూ సమంగా ఉన్నట్లయితే, సరుకులు వాటి విలువకే అమ్మబడతాయనీ అనుకోవడం తెలివిమాలిన భావన. ఈ భావనను ప్రోథాన్ కొత్తగా కనిపెట్టిన సోషలిజంలోని రహస్యంగా తనకు అలవాటయిన కృతక శాస్త్రీయ వాగాడంబరంలో ప్రపంచానికి చాటాడు. నిజానికి ఆయన 'ప్రజల బ్యాంకి' సూత్రానికి కూడా పాఠకుల విలువను ఇలా వాటి ఉత్పత్తి ధరకు కుదించాలన్నదే ప్రాతిపదిక. ఒక ఉత్పాదితం విలువ యొక్క విభిన్న అంతర్భాగాలను తదనుగుణ నిష్పత్తిలో ఉన్న ఆ ఉత్పాదితం భాగాలుగా చూడవచ్చునని ఇంతకుముందు తెలిపాం. ఉదాహరణకు[3] 20 పౌన్ల దారం విలువ 30 షిల్లింగులయితే – అందులో ఉత్పత్తి సాధనాల విలువ 24 షిల్లింగులు. శ్రమశక్తి విలువ 3 షిల్లింగులు,

---

1. మాల్తస్: Definitions in Political Economy, 1853, లండన్ కూర్పు, పుటలు 70, 71.
2. బాహ్యపదార్థాలలో ఉంటుందని పూర్వం ఊహించిన దహనగుణ సిద్ధాంతం. (తె.సం)
3. ఇంగ్లీషు కూర్పు సంపుటి I, అధ్యాయం IX , 2 పు 212 - 213 సంపాదకుడు.

అదనపు విలువ 3 షిల్లింగులు అయితే – ఈ అదనపు విలువ ఆ ఉత్పాదితంలో $\frac{1}{10}$ వ వంతు అని చెప్పొచ్చు, లేదా 2 పౌన్ల దారం అని చెప్పొచ్చు. ఈ 20 పౌన్ల దారాన్ని ఉత్పత్తి ధరకే అమ్మినట్లయితే అంటే 27 షిల్లింగులకే అమ్మినట్లయితే, కొనుగోలుదారునికి 2 పౌన్ల దారం ఉచితంగా లభిస్తుంది; లేదా ఆ వస్తువు తన విలువ కంటే $\frac{1}{10}$ వంతు తక్కువకు అమ్ముడుపోయింది. అయితే శ్రామికుడు మునుపటిలాగే అదనపు శ్రమ చేశాడు. కానీ ఈ దఫా దారం ఉత్పాదకుడయిన పెట్టుబడిదారుడి కోసం కాకుండా దారం కొనుగోలుదారుని కోసం అతడు తన అదనపు శ్రమను చేశాడన్నమాట. అన్ని సరుకులను వాటి ఉత్పత్తి ధరకే అమ్మితే ఫలితం, అవన్నీ వాటి ఉత్పత్తి ధరకు మించిన మొత్తానికి, అయితేవాటి విలువకు అమ్మకమయినట్లుగా ఉంటుందని భావించడం పూర్తిగావచ్చు. ఎందుచేతనంటే, శ్రమశక్తి విలువ, పనిదిన పరిమాణం, శ్రమ దోపిడీ స్థాయి ఇవన్నీ అన్నిచోట్లా ఒకే స్థాయిలో ఉన్నప్పటికీ, వివిధ రకాల సరుకుల విలువల్లో గల అదనపు విలువ మొత్తాలు సమానంగా ఉండవు, సరుకుల ఉత్పత్తికి అడ్వాన్సు చేసిన పెట్టుబడుల తాలూకు విభిన్న ఆంగిక అంతర్నిర్మాణంపై ఆ అదనపు విలువ మొత్తాలు ఆధారపడివుంటాయి.[1]

★ ★ ★

1. శ్రమశక్తి విలువ నిర్ణీతమై దాని దోపిడీ స్థాయి సమంగా వున్నట్లయితే, విభిన్న పెట్టుబడులు ఉత్పత్తి చేసే విలువ రాశి, అదనపు విలువ రాశి రెండూ కూడా ఆ పెట్టుబడుల్లో అస్థిర భాగాల యొక్క మొత్తాలను బట్టి, అంటే సజీవ శ్రమశక్తిగా పరివర్తన చెందిన భాగాల మొత్తాలను బట్టి, తదనుగుణ నిష్పత్తిలో మారుతాయి.” సం. I, అధ్యాయం XI.

# అధ్యాయం - 2
# లాభం రేటు

పెట్టుబడి సాధారణ సూత్రం డ-స-డ, ఇంకోలా చేస్తే, చలామణిలో నుంచి ఎక్కువ మొత్తాన్ని లాగడానికై అందులోకి కొంత విలువ మొత్తం ప్రవేశపెట్టబడుతుంది. ఈ ఎక్కువ మొత్తాన్ని సృష్టించే ప్రక్రియే పెట్టుబడిదారీ ఉత్పత్తి. ఆ ఎక్కువ మొత్తాన్ని చేతికందజేసే క్రియే పెట్టుబడి చలామణి. పెట్టుబడిదారుడు కేవలం సరుకు కోసం లేక దాని ఉపయోగ విలువ కోసం తన వ్యక్తిగత వినియోగం కోసం సరుకును ఉత్పత్తి చేయడు. పెట్టుబడిదారుకు నిజంగా ఆసక్తి ఉన్నది ప్రత్యక్షంగా కనిపించే ఉత్పాదితం పట్ల కాదు, ఆ ఉత్పాదితం కోసం ఖర్చయిన పెట్టుబడి విలువకు పైబడిన అదనపు విలువ పట్ల అతని ఆసక్తి అంతా. పెట్టుబడిలోని వివిధ భాగాలు అదనపు విలువ ఉత్పత్తిలో నిర్వహించే విభిన్న పాత్రలతో ప్రమేయం లేకుండా, పెట్టుబడిదారు మొత్తం పెట్టుబడిని అడ్వాన్సు చేస్తాడు. అతడా పెట్టుబడిలోని అన్ని భాగాలను ఒకే విధంగా అడ్వాన్సు చేస్తాడు; అడ్వాన్సు చేసిన పెట్టుబడిని కేవలం పునరుత్పత్తి చేయడానికి కాకుండా, దానికి మించిన విలువను ఉత్పత్తి చేయడానికి అతడు ఆ పని చేస్తాడు. తాను అడ్వాన్సు చేసిన అస్థిర పెట్టుబడి విలువను ఎక్కువ విలువగా మార్చే ఏకైక మార్గం ఏమిటంటే, దానిని సజీవశ్రమకు మార్పిడి చేసి, ఆ సజీవ శ్రమను దోపిడీ చేయడం. అయితే ఈ శ్రమ పనిచేయడానికి అవసరమైన పరిస్థితులను ఏక సమయంలో అతడు ప్రవేశపెడితే తప్ప, అంటే శ్రమ సాధనాలను, శ్రమ వస్తువులను, యంత్రాలను, ముడిపదార్థాలను కూడా అడ్వాన్సు చేస్తే తప్ప అంటే తన ఆధీనంలోని విలువలో కొంత భాగాన్ని ఉత్పత్తి పరిస్థితుల రూపంలోకి మారిస్తే తప్ప అతడా శ్రమను దోపిడీ చేయలేడు; ఎందువల్లనంటే అతడు శ్రమ పరిస్థితులకు యజమానిగా ఉన్న స్థితిలో కేవలం శ్రమశక్తికి మాత్రమే సొంతదారైన శ్రామికునికి ఎదురవుతాడు. కాబట్టి అతడు పెట్టుబడిదారుడు అవుతున్నాడు. శ్రమను దోపిడీ చేసే ప్రక్రియను చేపట్టగలడు. ఇంతకుముందే మొదటి సంపుటిలో[1] నిరూపించినట్లు, శ్రామికేతరులు ఉత్పత్తి సాధనాల సొంతదార్లుగా ఉన్నారనే వాస్తవమే శ్రామికులను వేతన కార్మికులు గానూ, కార్మికేతరులను పెట్టుబడిదార్లుగానూ మార్చుతున్నది. తన అస్థిర పెట్టుబడి నుంచి లాభం తీయడానికిగాను స్థిర పెట్టుబడిని తాను అడ్వాన్సు చేస్తున్నానా లేక స్థిర పెట్టుబడి విలువను పెంచడానికి అస్థిర పెట్టుబడిని అడ్వాన్సు చేస్తున్నానా లేక తన యంత్రాల, ముడి పదార్థాల విలువను పెంచడానికి వేతనాల కోసం డబ్బును మదుపు చేస్తున్నానా లేక శ్రమదోపిడీ చేయగలిగేందుకు యంత్రాలకోసం, ముడిపదార్థాల కోసం డబ్బును మదుపు చేస్తున్నానా అన్న విషయాలను పెట్టుబడిదారు పట్టించుకోడు. పెట్టుబడిలోని అస్థిర భాగం మాత్రమే అదనపు విలువను

1. సంపుటి - I పుటలు.....

సృష్టించినప్పటికీ, ఇతర భాగాలు కూడా, అనగా ఉత్పత్తి పరిస్థితులు కూడా దానిలాగే అడ్వాన్సు అయినపుడు మాత్రమే అది అలా అదనపు విలువను సృష్టిస్తుంది. స్థిర పెట్టుబడిని అడ్వాన్సు చేయడం ద్వారా మాత్రమే తాను శ్రమను దోపిడీ చేయగలనని, అస్థిర పెట్టుబడిని అడ్వాన్సు చేయడం ద్వారానే స్థిర పెట్టుబడిని సద్వినియోగం చేసుకోగలనని పెట్టుబడిదారుడికి అనిపిస్తుంది. కాబట్టి అతడు అన్నిటినీ తన మనసులో ఒకే మొత్తంగా కలిపేస్తాడు. ముఖ్యంగా అతడు అలా ఎందుకు చేస్తాడంటే, అతడి ఆదాయం రేటును నిర్ణయించేది అస్థిర పెట్టుబడిలో లాభం ఉన్న నిష్పత్తి కాదు, మొత్తం పెట్టుబడిలో లాభం ఉన్న నిష్పత్తి మాత్రమే. అంటే, అదనపు విలువ రేటు కాక, లాభం రేటే దాన్ని నిర్ణయిస్తుంది. లాభం రేటు ఎలాంటి మార్పులేకుండా ఒకే రకంగా ఉంటూనే విభిన్న అదనపు విలువ రేట్లను అది వ్యక్తం చేయవచ్చుననే సంగతిని తరువాత తెలుసుకొంటాం.

ఉత్పాదితం యొక్క ఉత్పత్తి ధరల్లో పెట్టుబడిదారు చెల్లించిన దాని విలువ భాగాలన్నీ చేరి ఉంటాయి. లేదా అతను ఉత్పత్తిలోకి ప్రవేశపెట్టిన వాటి సమతుల్యాలు చేరివుంటాయి. పెట్టుబడిని భద్రంగా కాపాడాలన్నా లేక దాని తొలి పరిమాణంలో దాన్ని పునరుత్పత్తి చేయాలన్నా ఈ వ్యయాలన్నింటినీ భర్తీ చేయకతప్పదు.

ఒక సరుకులో ఉన్న విలువ దాని ఉత్పత్తి కోసం ఖర్చయిన శ్రమకాలానికి సమానంగా ఉంటుంది. ఈ శ్రమ మొత్తంలో చెల్లించిన భాగమూ, చెల్లించని భాగమూ రెండూ ఉన్నాయి. అయితే పెట్టుబడిదారుడి దృష్టిలో సరుకు యొక్క ఉత్పత్తి వ్యయాలు అంటే, తాను సరుకు తయారీలో చెల్లించిన శ్రమభాగం మాత్రమే. ఆ సరుకులో ఉన్న అదనపు శ్రమకోసం పెట్టుబడిదారుడు ఎలాటి వ్యయమూ చేయలేదు. అయితే చెల్లించిన శ్రమలాగే ఇది కూడా శ్రామికుడు వెచ్చించిన శ్రమే. ఈ చెల్లించని శ్రమ కూడా చెల్లించిన శ్రమ మాదిరే విలువను సృష్టించడమూ, సరుకులోని విలువను సృష్టించే అంశంగా ప్రవేశించడమూ కూడా వాస్తవమే. పెట్టుబడిదారుడికి లాభం ఎక్కడనుంచి వస్తుందంటే, తాను ప్రతిఫలం చెల్లించనిదేదో అమ్ముకోడానికి, అతనికి ఉంది. అదనపు విలువ, లేక లాభం అన్నది ఒక సరుకు యొక్క ఉత్పత్తి ధరకు పైబడి ఉన్న విలువే. అంటే, సరుకులు మూర్తీభవించిన శ్రమలోని చెల్లించని భాగం కన్నా అందులో మూర్తీభవించిన మొత్తం శ్రమ ఎంత ఎక్కువో అదే. దాని అదనపు విలువ పుట్టు పూర్వోత్తరాలేవైనా అది ఈ విధంగా అడ్వాన్సు చేసిన మొత్తం పెట్టుబడిని మించి అదనంగా ఉన్నదే. కాబట్టి మొత్తం పెట్టుబడిలో ఈ అదనపు మొత్తం నిష్పత్తిని $\frac{\text{అ.వి}}{\text{మొ.పె.}}$ వ్యక్తం చేస్తుంది. ఇందులో మొపె అంటే మొత్తం పెట్టుబడి. అప్పుడు లాభం రేటు $\frac{\text{అ.వి}}{\text{మొ.పె}} = \frac{\text{అ.వి}}{\text{స్థిపె+అపె}}$ కాగా, ఈ లాభం రేటుకూ $\frac{\text{అ.వి}}{\text{అ.పె}}$ అనే అదనపు విలువ రేటుకూ స్పష్టమైన తేడా ఉంది.

అస్థిర పెట్టుబడిని బట్టి లెక్కగట్టిన అదనపు విలువ రేటును, అదనపు విలువ రేటు అంటారు. మొత్తం పెట్టుబడిని బట్టి లెక్కగట్టిన అదనపు విలువ రేటును లాభం రేటు అంటారు. ఇవి రెండూ ఒకే వస్తువు యొక్క రెండు విభిన్న కొలతలు. అవి వ్యక్తం చేసే రెండు కొలమానాల్లో తేడా ఉంది. కనుక అవి ఆ వస్తువు యొక్క రెండు విభిన్న నిష్పత్తులను లేక సంబంధాలను వ్యక్తం చేస్తున్నవి. లాభంగా అదనపు విలువ పరివర్తనను, లాభం రేటుగా అదనపు విలువ రేటు, పరివర్తన నుంచి

రాబట్టాలి తప్పు, అదనపు విలువ రేటుగా లాభం రేటు పరివర్తన నుంచి కాదు. వాస్తవానికి లాభం రేటుతోనే పరిశీలన చారిత్రకంగా ప్రారంభమయింది. అదనపు విలువ, అదనపు విలువ రేటు – ఇవి సాపేక్షంగా అగోచరమైనవి, తెలియనివి. వీటిని పరిశీలించవలసి ఉంది. కానీ లాభం రేటూ, ఆ కారణాన లాభం రూపంలో అదనపు విలువ సాక్షాత్కారం స్పష్టంగా దృశ్యమాన ఘటనలు.

ఇక వ్యక్తిగత పెట్టుబడిదారునికి సంబంధించినంత వరకు, సరుకుల ఉత్పత్తికి అడ్వాన్సు చేసిన మొత్తం పెట్టుబడితో పోలిస్తే అదనపు విలువ లేదా సరుకుల అమ్మకం వల్ల అదనంగా లభించిన విలువ ఎంత అనేదానిపైనే అతనికి గల ఆసక్తి అంతా అనేది స్పష్టం. కాగా పెట్టుబడిలోని వివిధ భాగాలతో ఈ అదనపు విలువకు గల ఆంతరిక బాంధవ్యంపై కానీ, వాటితో గల ప్రత్యేక సంబంధంపై కానీ అతనికి ఎట్టి ఆసక్తి ఉండదు. పైపెచ్చు ఈ ప్రత్యేక సంబంధాన్ని, ఈ ఆంతరిక బాంధవ్యాన్ని కప్పిపుచ్చడం అతనికి ప్రయోజనకరం.

ఒక సరుకు ఉత్పత్తి ధరకు పైబడిన అదనపు విలువ ఉత్పత్తి ప్రత్యక్ష ప్రక్రియలో రూపొందినప్పటికీ అది చేతికందేది చలామణి ప్రక్రియలోనే; అది చలామణి ప్రక్రియనుంచే ఆవిర్భవించినట్లు త్వరలోనే కనిపిస్తుంది. ఎందుచేతనంటే, వాస్తవంలో పోటీవున్న మార్కెట్‌లో ఈ అదనపు విలువ చేతికి వస్తుందా? లేదా? వస్తే ఏ మేరకు వస్తుంది అనే విషయం మార్కెట్ పరిస్థితులపై ఆధారపడి ఉంటుంది. అయితే ఏదైనా ఒక సరుకును దాని విలువకంటే ఎక్కువకు గాని, తక్కువకు గాని అమ్మినట్లయితే అపుడు అదనపు విలువ మరో రకంగా విభజన అవుతుంది అంతే; ఈ భిన్న విభజన, అంటే అదనపు విలువను వివిధ వ్యక్తులు పంచుకొనే నిష్పత్తిలోని మార్పు ఏ విధంగానూ అదనపు విలువ పరిమాణాన్ని కానీ, స్వభావాన్ని కానీ మార్చదు. ఈ వాస్తవం వివరించడానికి ఇక్కడ మాటలు వృధా చేయాల్సిన అవసరం లేదు. చలామణి ప్రక్రియలో సంభవించేది మనం రెండవ సంపుటిలో చర్చించిన రూపాంతరీకరణలే కాదు, ఇవి నిజానికి పోటీలోనూ, సరుకుల విలువకంటే ఎక్కువకు లేక తక్కువకు అమ్మడంలోనూ, కొనడంలోనూ రూపుతీసుకుంటాయి. కాబట్టి వ్యక్తిగత పెట్టుబడిదారుని చేతికందే అదనపు విలువ ప్రత్యక్ష శ్రమ దోపిడీపైన ఎంత ఆధారపడి ఉంటుందో, అతడి వ్యాపారపరమైన దక్షతపైన కూడా అంతే ఆధారపడి ఉంటుంది.

చలామణి ప్రక్రియలో చలామణి కాలం, పనికాలంతో పాటు తన ప్రభావాన్ని ప్రసరించడం ద్వారా ఒక నిర్దిష్టకాలంలో చేతికందే అదనపు విలువ మొత్తాన్ని పరిమితం చేస్తుంది. చలామణినుంచి ఉత్పన్నమైన మరికొన్ని ఇతర అంశాలు సైతం వాస్తవ ఉత్పత్తి ప్రక్రియలోకి నిర్ణయాత్మకంగా చొరబడతాయి. ఉత్పత్తి ప్రక్రియా – చలామణి ప్రక్రియా రెండూ నిరంతరాయంగా ఒకదానితో మరొకటి పెనవేసుకొంటాయి, సమ్మిళితమవుతాయి. ఆ కారణంగా వాటి ప్రత్యేక లక్షణాలు అనివార్యంగా కల్తీ అవుతాయి. అదనపు విలువ, ఉత్పత్తి, వీటి విలువ ఉత్పత్తి ఈ విధంగా ఇంతకుముందే తెలిపినట్లు, చలామణి ప్రక్రియలో నూతన నిర్వచనాన్ని సంతరించుకుంటాయి. పెట్టుబడి తన రూపాంతరీకరణల ఆవృత్తిని గడుస్తుంది. చిట్టచివరకు తన ఆంతరిక అంగాంగిక జీవితం పరిధి నుంచి బయటపడి, ఒకవిధంగా చెప్పాలంటే, అది బాహ్య జీవితంతోటి సంబంధాలలోకి ప్రవేశిస్తుంది; ఆ సంబంధాల్లో ఎదురుబదురయ్యేది పెట్టుబడి, శ్రమ కాదు. ఒక సందర్భంలో పెట్టుబడి పెట్టుబడే; మరో సందర్భంలో కేవలం కొనుగోలుదార్లు, అమ్మకందార్లుగా వ్యక్తులు ఎదురుబదురవుతారు. చలామణి కాలం, పనికాలం

రెండూ ఒకదానిని మరొకటి దాటుకొని వెడతాయి; ఆ విధంగా రెండూ అదనపు విలువను నిర్ణయిస్తున్నట్లు కనిపిస్తాయి. పెట్టుబడి, వేతన శ్రమ పరస్పరం ఎదురు బదురయ్యే తొలిరూపం దానితో నిమిత్తం లేనట్లు కనిపించే సంబంధాల జోక్యం వల్ల మరుగున పడిపోతుంది. అదనపు విలువ అన్నది శ్రమ కాలాన్ని స్వాయత్తం చేసుకోగా కలిగిన ఫలితంగా కనిపించకుండా, సరుకులు వాటి ఉత్పత్తి ధరకు పైబడిన అమ్మకం ధరగా కనిపిస్తుంది. ఉత్పత్తి ధర ఈ విధంగా సరుకుల వాస్తవ విలువ (Valeur intrinseque) కు ప్రాతినిధ్యం వహిస్తుంది. మరోవైపేమో లాభం సరుకులో ఉన్న స్వతస్సిద్ధ విలువకు మించిన అమ్మకం ధర లాగా కనిపిస్తుంది.

ఉత్పత్తి ప్రక్రియ సాగే సందర్భంగా అదనపు విలువ స్వభావం నిరంతరాయంగా పెట్టుబడిదారుని చైతన్యానికి ప్రస్ఫుటమవుతూనే ఉంటుంది. ఇతరుల శ్రమకాలం మొదలైన వాటిపై అతనికి గల పేరాశను బట్టే ఇది వెల్లడవుతోంది. ఈ విషయం అదనపు విలువను గురించిన మన విశ్లేషణలో చూశాం. అయితే 1. వాస్తవ ఉత్పత్తి ప్రక్రియ అన్నది తాత్కాలిక దశ. ఇది నిరంతరం చలామణి ప్రక్రియలో సంలీనం చెందుతూ ఉంటుంది. అలాగే చలామణి ప్రక్రియ కూడా ఉత్పత్తి ప్రక్రియలో సంలీనమవుతూ ఉంటుంది. అందుచేత ఉత్పత్తి ప్రక్రియలో లాభం యొక్క మూలాధారం గురించి దాదాపు స్పష్టంగా తలెత్తుతున్న భావన, అంటే అదనపు విలువ గురించిన భావన, మహా అయితే ఉత్పత్తి ప్రక్రియతో నిమిత్తం లేని ఒక గమన క్రమంలో చేతికందిన అదనపు విలువ ఆవిర్భవించిందన్న భావంతో బాటు చెల్లుబాటు అవుతోంది. అంతే. అది చలామణిలో తలెత్తిందన్న భావానికి, శ్రమతో పెట్టుబడికి గల సంబంధంతో నిమిత్తం లేకుండా, అది పెట్టుబడికి చెందుతున్న భావానికి ఉన్న చెల్లుబాటే, పైన పేర్కొన్న భావానికి ఉంది. అంతే, పెట్టుబడి కేవలం తన భౌతిక అస్తిత్వం లోనే, శ్రమతో తన సామాజిక సంబంధంతో నిమిత్తం లేకుండా, ఒక విధంగా చెప్పాలంటే తన్ను పెట్టుబడిగా చేస్తున్న ఈ సంబంధంతో నిమిత్తం లేకుండానే శ్రమతో పాటుగా, శ్రమతో నిమిత్తం లేకుండా అదనపు విలువకు స్వతంత్ర మూలాధారమనేందుకు ఈ చలామణి ఘటనలు ప్రత్యక్ష నిదర్శనలు అని రామ్సే, మాల్తస్, సీనియర్, టారెన్స్ లాంటి ఆధునిక అర్థశాస్త్రవేత్తలు కూడా భావిస్తున్నారు. 2. వేతనాలతోపాటు ముడిపదార్థాల ధర, యంత్రాల తరుగుదల వగైరాలు ఈ పద్దు కిందికి వస్తాయి – మూల్యం చెల్లించకుండా చేయించిన శ్రమ ఒక వస్తువుకు మూల్యం చెల్లించడంలోని పొదుపుగా మాత్రమే ఒక నిర్దిష్ట పరిమాణంలోని శ్రమకు తక్కువ మొత్తం చెల్లింపుగా మాత్రమే నమోదయింది. ముడిపదార్థాలు చౌకగా కొన్నప్పుడు లేక యంత్రాల తరుగుదల తగ్గినప్పుడు జరిగిన పొదుపులాగా ఇది కనిపిస్తుంది. వడపిండుకున్న అదనపు శ్రమ ఈ విధంగా తన ప్రత్యేక స్వభావాన్ని కోల్పోయింది. అదనపు విలువతో దానికి గల ప్రత్యేక సంబంధం మరుగున పడిపోయింది. ప్రథమ సంపుటిలో[1] నిరూపించినట్లుగా శ్రమశక్తి విలువను వేతనాల రూపంలో చూపించడం దీనికి ఎంతో తోడ్పడింది.

పెట్టుబడి యొక్క అన్ని భాగాలూ సమానంగా, హెచ్చు విలువకు (లాభానికి) మూలాధారంగా కనిపిస్తున్నందుకు పెట్టుబడి యొక్క సంబంధాలు మరుగున పడిపోతాయి.

అయితే లాభం రేటు ద్వారా లాభం రూపంలోకి అదనపు విలువ పరివర్తన చెందించిన

1. సం. I, భాగం VI - సంపా.

పద్ధతి – ఉత్పత్తి ప్రక్రియలో అదివరకే సంభవించిన కర్త, వస్తువుల విపర్యాసాన్ని మరింత ముందుకు తీసుకుపోవడమే. ఉత్పత్తి ప్రక్రియలో కర్త అయిన శ్రమ తాలూకు ఉత్పాదక శక్తులు పెట్టుబడి తాలూకు ఉత్పాదక శక్తులు[1]గా కనిపించడం మనం గమనించాం. ఒకవైపేమో, విలువ లేక సజీవ శ్రమను శాసించే గత శ్రమ పెట్టుబడిదారుడిగా మానుషాకారం ధరించింది. మరోవైపేమో శ్రామికుడు కేవలం భౌతిక శ్రమశక్తిగా ఒక సరుకుగా కనిపిస్తాడు. ఉత్పత్తి తాలూకు సామాన్య సంబంధాల్లో కూడా ఈ విపర్యస్త సంబంధం తప్పనిసరిగా దాని కనుగుణమైన విపర్యస్త భావనలను సృష్టిస్తుంది. ఇదొక తల్లకిందుల చైతన్యం. వాస్తవ చలామణి ప్రక్రియ తాలూకు రూపాంతరీకరణాలు, మార్పులు వల్ల ఇది మరింత వృద్ధి చెందుతుంది.

రికార్డో అనుయాయుల విశ్లేషణా పద్ధతి నిరూపిస్తున్నట్లు, లాభం రేటు నియమాలను అదనపు విలువ రేటు నియమాలుగా చూపడం, లేక అదనపు విలువ రేటు నియమాలను లాభం రేటు నియమాలుగా చూపడం పూర్తిగా పొరపాటు. పెట్టుబడిదారు సహజంగానే వాటి మధ్య గల భేదాన్ని చూడడు. $\frac{\text{అ.వి}}{\text{మొ.పె}}$ సూత్రంలో అదనపువిలువ ఉత్పత్తికి అడ్వాన్స్ చేసిన మొత్తం పెట్టుబడి విలువను బట్టి ఆ అదనపు విలువను లెక్కగడతారు. ఈ మొత్తం పెట్టుబడిలో ఒక భాగం ఆ ఉత్పత్తిలో పూర్తిగా వినియోగం కాగా, ఒక భాగం కేవలం అందులో నియుక్తమయింది. నిజానికి $\frac{\text{అ.వి}}{\text{మొ.పె}}$ సూత్రం, అడ్వాన్సయిన మొత్తం పెట్టుబడి స్వయం విస్తరణ స్థాయిని వ్యక్తం చేస్తుంది; లేదా అంతర్గత భావనాత్మక సంబంధాలకు, అదనపు విలువ స్వభావానికి అనుగుణమైన దృష్టితో పరిశీలిస్తే, అడ్వాన్సయిన మొత్తం పెట్టుబడి పరిమాణానికి అస్థిర పెట్టుబడిలో వచ్చిన మార్పు పరిమాణంలోగల నిష్పత్తిని అది సూచిస్తుంది.

స్వభావతః, మొత్తం పెట్టుబడి విలువ పరిమాణానికి అదనపు విలువ పరిమాణంతో ఆంతరిక సంబంధం అనేది లేదు. కనీసం ప్రత్యక్షంగా లేదు. అయితే దాని పాదార్థిక భాగాలకు సంబంధించి నంతవరకు, అంతే మొత్తం పెట్టుబడిలో అస్థిర పెట్టుబడి మినహాయించగా మిగిలిన స్థిరపెట్టుబడికి సంబంధించినంత వరకు అందులో ఉన్నది, శ్రమకు ఒక భౌతిక రూపం లభించడానికి అవసరమైన శ్రమ సాధనాలు, శ్రమ పదార్థాలు. నిర్దిష్ట పరిమాణంలోని శ్రమ సరుకులుగా వస్తురూపం ధరించి తద్వారా విలువను సృష్టించాలంటే, నిర్దిష్ట పరిమాణంలో శ్రమ సాధనాలు, శ్రమ పదార్థాలు అవసరం. శ్రమ పరిమాణానికి ఈ శ్రమ ఉపయోగించే ఉత్పత్తి సాధనాల పరిమాణానికి మధ్య శ్రమ ప్రత్యేక స్వభావాన్ని బట్టి ఒక నిర్దిష్ట సాంకేతిక సంబంధం ఉంటుంది. కాబట్టి ఆ మేరకు అదనపు విలువ పరిమాణానికీ లేక అదనపు శ్రమ పరిమాణానికీ ఉత్పత్తి సాధనాల పరిమాణానికీ మధ్య కూడా ఒక నిర్దిష్ట సంబంధం ఉంటుంది. ఉదాహరణకు, వేతనాల ఉత్పత్తికి అవసరమైన శ్రమ గనుక రోజుకు ఆరు గంటలయితే; ఆరు గంటల అదనపు శ్రమ చేయడానికి, లేక 100% అదనపు విలువ సృష్టించడానికి రోజుకు 12 గంటలు పనిచేయవలసి ఉంటుంది. అతడు 6 గంటల్లో వినియోగించిన ఉత్పత్తి సాధనాలకు రెండు రెట్లు 12 గంటల్లో వినియోగిస్తాడు. అయితే అంతమాత్రాన, అతడు

1. సంపుటి I, అధ్యాయం XIII - సంపా.

ఆరు గంటల్లో ఆ ఉత్పత్తి చేసిన అదనపు విలువకూ – ఆరు గంటల్లో కానీ, లేక పన్నెండు గంటల్లో కానీ వినియోగించిన ఉత్పత్తి సాధనాల విలువకూ మధ్య ప్రత్యక్ష సంబంధం ఉండవలసిన కారణమేమీ లేదు. ఇక్కడ ఈ విలువకు ఏ మాత్రమూ ప్రాముఖ్యం లేదు. ఇది సాంకేతికంగా అవసరమైన పరిమాణానికి సంబంధించిన విషయం మాత్రమే. అవసరమైన ఉపయోగ విలువ ఉత్పత్తి సాధనాలకూ, ఉత్పత్తి ముడి పదార్థాలకూ ఉన్నన్నాళ్లు, శ్రమకు నియమిత సాంకేతిక నిష్పత్తిలో అవి లభించినన్నాళ్ళూ ఆ ముడిపదార్థాలు కానీ, శ్రమ సాధనాలు కానీ చౌకగా లభిస్తున్నాయా, ప్రియంగా లభిస్తున్నాయా అనేది ముఖ్యం కాదు. ఒక గంట నూలు వడకడంలో క పౌన్ల దూది ఖర్చయిందనీ, ఆ దూది ధర చ షిల్లింగులనీ నాకు తెలిస్తే అప్పుడు 12 గంటలు నూలు వడకడంలో 12 క పౌన్ల దూది ఖర్చవుతుందనీ, అది 12 చ షిల్లింగులకు సమానమని కూడా నాకు తెలుసు. అప్పుడు అదనపు విలువ నిష్పత్తిని 12 విలువకూ, 6 విలువకూ కూడా లెక్క కట్టగలను. అయితే చ షిల్లింగులు క పౌన్ల దూదికి సూచికగా ఉపయోగించేంత వరకే ఉత్పత్తి సాధనాల విలువతో సజీవ శ్రమ సంబంధం. ఎందుచేతనంటే, నిర్దిష్ట పరిమాణంలోని దూదికి నిర్దిష్ట ధర ఉంది; కనుక దూది ధర మారనంత వరకు అట్నుంచి నిర్దిష్ట పరిమాణంలోని దూదికి నిర్దిష్ట ధర కూడా ఒక సూచికగా ఉపయోగపడవచ్చు. 6 గంటల అదనపు శ్రమను స్వాయత్తం చేసుకోవాలంటే శ్రామికుడు నాకోసం 12 గంటలు పని చేయవలసి ఉంటుందని, కనుక 12 గంటల పాటు పనిచేసేందుకు అవసరమైన దూది సరఫరా నా దగ్గరుండాలని, నాకు తెలిస్తే, 12 గంటలకు అవసరమైన పరిమాణంలోని దూది ధర నాకు తెలిస్తే అప్పుడు దూది ధరకూ (అవసరమైన పరిమాణానికి సూచికగా) అదనపు విలువకూ మధ్య పరోక్ష సంబంధం ఉంటుంది. కానీ ఇలా కాకుండా ఆరుగంటల్లో కాక, ఉదాహరణకు ఒక గంటలో ఖర్చయ్యే ముడిపదార్థ పరిమాణం ఎంతో, ముడిపదార్థం ధర నుంచి నేను ఎన్నటికీ నిర్ధారించలేను. కనుక స్థిర పెట్టుబడి విలువకూ అదనపు విలువకూ మధ్య, కాబట్టి మొత్తం పెట్టుబడి విలువకూ (= స్థి.పె + అ.పె) అదనపు విలువకూ మధ్య, అవసరమైన ఆంతరిక సంబంధమేదీ లేదు.

అదనపు విలువ రేటు, అదనపు విలువ పరిమాణం తెలిసినట్లయితే, లాభం రేటు అదనపు విలువను లెక్కగట్టే మరో పద్ధతిని తప్ప మరేమీ వ్యక్తం చేయదు. అంటే శ్రమతో మార్పిడి కావడం ద్వారా అదనపు విలువను ఆవిర్భవింపచేసే పెట్టుబడి భాగం యొక్క విలువను బట్టి కాకుండా, మొత్తం పెట్టుబడి విలువను బట్టి అదనపు విలువ ఎంతో అది వ్యక్తం చేస్తుంది. అయితే వాస్తవంలో (అంటే దృశ్యమాన ప్రపంచంలో) విషయం ఇందుకు తల్లకిందులుగా ఉంటుంది. అదనపు విలువ ఎంతో ఇచ్చారు – కానీ అది సరుకు తాలూకు ఉత్పత్తి ధరకు పైబడి వున్న అమ్మకం ధరగా ఇవ్వబడింది. అయితే అదనపు మొత్తం ఎక్కడ నుంచి వచ్చింది, ఉత్పత్తి ప్రక్రియలో శ్రమను దోపిడీ చేయడం మూలంగా వచ్చిందా? లేక చలామణి ప్రక్రియలో కొనుగోలుదారుని దగాచేస్తే వచ్చిందా? లేక ఈ రెంటినుంచీ వచ్చిందా? అనేది నిగూఢంగా ఉండిపోతుంది. మొత్తం పెట్టుబడి విలువకి ఈ అదనపు మొత్తానికి గల నిష్పత్తిని కూడా ఇచ్చారు. అంటే లాభం రేటును కూడా ఇచ్చారు. అమ్మకం ధరలో ఉత్పత్తి ధరకు పైబడి ఉన్న హెచ్చు మొత్తాన్ని అడ్వాన్స్ చేసిన మొత్తం పెట్టుబడి విలువ దృష్ట్యా లెక్క చాలా ముఖ్యమూ, సహజమూ. ఎందుచేతనంటే, ఆచరణలో మొత్తం పెట్టుబడి విస్తరణ

నిష్పత్తిని, అంటే స్వయం విస్తరణ స్థాయిని తెలిపేది ఇదే. కనుక మనం ఈ లాభం రేటు నుంచి బయల్దేరితే అదనపు విలువకూ, వేతనాల్లో మదుపుపెట్టిన పెట్టుబడి భాగానికీ మధ్యగల ప్రత్యేక సంబంధాన్ని నిర్ధారించలేము. మాల్తస్ ఈ పద్ధతిలో అదనపు విలువ రహస్యాన్ని అస్థిర పెట్టుబడితో దానికి గల ప్రత్యేక సంబంధ రహస్యాన్ని తెలుసుకో ప్రయత్నించినపుడు ఆయన వేసిన పిల్లిమొగ్గ[1] లేమిటో తరువాతి అధ్యాయంలో మనం చూస్తాము. లాభం రేటు ఆచరణలో చూపేది, పెట్టుబడిలోని సమాన భాగాలకూ, అదనపు విలువకూ గల ఒకే విధమైన సంబంధాన్ని. ఈ దృక్కోణం నుంచి ఇది ఆంతరిక భేదాన్ని చూపించనే చూపించదు. చూపించిన భేదమల్లా నిశ్చల పెట్టుబడి, చలామణి పెట్టుబడి మధ్య భేదాన్ని మాత్రమే. ఈ భేదాన్ని సైతం అది చూపుతున్నదంటే అందుకు కారణం ఒకటే, అదనపు మొత్తాన్ని రెండు పద్ధతుల్లో లెక్కకట్టడం. మొదటి పద్ధతి – దాన్ని కేవలం ఒక పరిమాణంగా, ఉత్పత్తి ధరకు మించిన అదనపు మొత్తంగా లెక్కగట్టడం. ఈ పద్ధతిలో దాని తొలిరూపం, చలామణితో మొత్తం పెట్టుబడి ఉత్పత్తి ధరలోకి వెళ్తుంది. కాగా నిశ్చల పెట్టుబడిలోని తరుగుదల మాత్రమే అందులోకి వెళ్తుంది. రెండవ పద్ధతి – అడ్వాన్సయిన పెట్టుబడి తాలూకు మొత్తం విలువకు ఈ అదనపు విలువకు గల సంబంధాన్ని లెక్కగట్టిన ఈ పద్ధతిలో మొత్తం నిశ్చల పెట్టుబడి విలువ కూడా చలామణి పెట్టుబడిలాగే లెక్కలోకి వెళ్తుంది. కాబట్టి చలామణి పెట్టుబడేమో రెండు సందర్భాలల్లోనూ ఒకే విధంగా లెక్కలోకి రాగా నిశ్చల పెట్టుబడి మాత్రం మొదటి సందర్భంలో చలామణి పెట్టుబడికి భిన్నంగానూ, రెండో సందర్భంలో చలామణి పెట్టుబడిలాగానే లెక్కలోకి వెడుతోంది. ఈ పరిస్థితుల్లో మనకు కనిపించే భేదమల్లా నిశ్చల పెట్టుబడికీ చలామణి పెట్టుబడికీ మధ్య ఉన్న భేదం మాత్రమే.

కాబట్టి హెగెల్ పరిభాషలో అదనపు మొత్తం గనుక లాభం రేటు నుంచి తన్ను తాను పునః ప్రతిబింబించుకున్నట్లయితే, లేక ఇంకో విధంగా చెప్తే అదనపు మొత్తం అన్నది లాభం రేటు స్వభావానికి మరింత సన్నిహితంగా ఉన్నట్లయితే, అది ఒక సంవత్సరకాలంలో, లేక ఒక నిర్దిష్ట చలామణి కాలంలో పెట్టుబడి తన సొంత విలువకు మించి ఉత్పత్తి చేసిన అదనపు మొత్తంగా కనిపిస్తుంది. అదనపు విలువా, లాభమూ వాస్తవంలో ఒకటే, సంఖ్య రీత్యా సమానమైనదే. కానీ లాభం రేటుకు, అదనపు విలువ రేటు సంఖ్యలో తేడా ఉంటుంది. అయినప్పటికీ లాభం అదనపు విలువ యొక్క పరివర్తిత రూపం. ఆ రూపంలో దాని ఆవిర్భావం దాని అస్తిత్వ రహస్యం మరుగున పడి అంతర్ధానమవుతాయి. ఆచరణలో లాభం అనేది అదనపు విలువ మనకు దర్శనమిచ్చే రూపం. అదనపు విలువను కనుగొనాలంటే విశ్లేషణ ద్వారా మొదట లాభం కప్పుకొన్న ముసుగును తొలగించాలి. అదనపు విలువలో పెట్టుబడి, శ్రమ మధ్య గల సంబంధం స్పష్టంగా కనిపిస్తుంది. పెట్టుబడి లాభాల మధ్య గల సంబంధంలో అంటే పెట్టుబడికీ, ఒకవైపు చలామణి ప్రక్రియలో సరుకుల ఉత్పత్తి ధరకు మించి చేతికందిన హెచ్చు మొత్తంగానూ, మరోవైపు, మొత్తం పెట్టుబడితో తన సంబంధం ద్వారా సన్నిహితంగా నిర్ణయమైన అదనపు మొత్తంగానూ కనిపించే అదనపు విలువకు మధ్య సంబంధంలో పెట్టుబడి,

1. కె. మార్క్స్, థియరీస్ ఆఫ్ సర్ప్లస్ వాల్యూ. - సం.

తనతో తన సంబంధంగా కనిపిస్తుంది. దాన్ని నిర్ణయించిన ప్రారంభంలో ఒకానొక విలువగా ఉన్న పెట్టుబడిని, అది ఆవిర్భవింపచేసిన ఒక కొత్త విలువ నుంచి వేరుచేసి చూపే సంబంధమిది. ఉత్పత్తి, చలామణి ప్రక్రియల్లో తన గమన క్రియ ద్వారా పెట్టుబడి ఈ నూతన విలువను సృష్టించినట్లు మన చైతన్యానికి స్పష్టంగా కనిపిస్తుంది. అయితే ఇది ఎలా సంభవిస్తున్నదీ మాత్రం అంతుపట్టదు. పెట్టుబడిలో దాగివున్న సహజసిద్ధ గుణాల నుంచే అది ఆవిర్భవించినట్లు కనిపిస్తుంది.

పెట్టుబడి స్వయం విస్తరణను మనం పరిశీలించిన కొద్దీ పెట్టుబడి సంబంధాలు మరింత అగమ్యగోచరమైనవిగా తయారవుతాయి. దాని అంతర్నిర్మాణంలోని రహస్యం మరింత కనుమరుగవుతుంది.

ఈ భాగం, లాభం రేటుకు, అదనపు విలువ రేటుకూ సంఖ్య రీత్యా తేడా ఉండగా, లాభం, అదనపు విలువ వీటి పరిమాణం సంఖ్య రీత్యా ఒకటేనని, రూపంలో మాత్రం తేడా ఉందని భావించబడింది. తరువాతి భాగంలో, వైమనస్యం ఎలా వృద్ధి చెందుతుందో లాభం ఎలా అదనపు విలువతో పరిమాణంలో కూడా సంఖ్య రీత్యా విభేదిస్తుందో మనం గమనిస్తాం.

★ ★ ★

## అధ్యాయం - 3

# లాభం రేటుకు అదనపు విలువ రేటుకు మధ్య గల సంబంధం

**కొం**త మొత్తం పెట్టుబడిపై వచ్చే లాభం మొత్తం, ఆ పెట్టుబడి ద్వారా నిర్దిష్ట చలామణి కాలంలో ఉత్పత్తి అయ్యే అదనపు విలువ మొత్తానికి సమానమని గత అధ్యాయం చివర భాగంలోనూ, ఈ మొదటి భాగం అంతటా కూడా మనం భావిస్తాం. కనుక మనం ప్రస్తుతానికి ఒకవైపు ఈ అదనపు విలువను వివిధ ఉప రూపాలుగా, అంటే పెట్టుబడిపై వడ్డీ, నేల అద్దె, పన్నులు వగైరాలుగా విభజితం కావచ్చునన్న విషయాన్ని, మరోవైపు అదనపు విలువ అంటే సాధారణ లాభం రేటు ఫలితంగా స్వాయత్తమయ్యే లాభం కాదు అనే విషయాన్ని పక్కన పెడదాం. దీన్ని గురించి రెండవ భాగంలో చర్చిద్దాం.

లాభం పరిమాణం అన్నది అదనపు విలువ పరిమాణానికి సమానంగా ఉంటుందని ఊహించుకొంటున్న మేరకు, దీని పరిమాణాన్ని, లాభం రేటు పరిమాణాన్ని ప్రతి వ్యక్తిగత సందర్భంలో నిర్ణీతమైన లేదా తెలుసుకోవీలున్న సంఖ్యలు నిర్ణయిస్తాయి. కనుక ఈ విశ్లేషణ పూర్తిగా గణితశాస్త్ర పరిధిలోనే కొనసాగుతుంది.

మొదటి సంపుటిలోనూ, రెండవ సంపుటిలోనూ, ఉపయోగించిన సంకేతాలనే కొనసాగిద్దాం. మొ.పె. అనే మొత్తం పెట్టుబడిలో (స్థి.పె) స్థిర పెట్టుబడి, అస్థిర పెట్టుబడి (అ.పె) ఉన్నాయి. ఈ మొత్తం పెట్టుబడి అ.వి అదనపు విలువను ఉత్పత్తి చేస్తుంది. అడ్వాన్సు చేసిన అస్థిర పెట్టుబడితో ఈ అదనపు విలువకు గల నిష్పత్తిని లేక $\frac{\text{అ.వి}}{\text{అ.పె}}$ అదనపు విలువ రేటు అని అంటున్నాము. దీనికి అ.వి' అని పేరు పెడదాం. కనుక $\frac{\text{అ.వి}}{\text{అ.పె}} = \text{అ.వి'}$. పర్యవసానంగా అ.వి = అ.వి' అ.పె ఈ అదనపు విలువను అస్థిర పెట్టుబడితో కాకుండా మొత్తం పెట్టుబడితో లంకెపెడితే, దీన్ని లాభం అని అంటారు. దీన్ని 'ల' అని పేర్కొందాం. మొ.పె. అనే మొత్తం పెట్టుబడిలో అ.వి అనే అదనపు విలువకు గల నిష్పత్తిని లేక $\frac{\text{అవి}}{\text{మొ.పె}}$ ని లాభం రేటు ల' అంటారు. కనుక $\text{ల'} = \frac{\text{అ.వి}}{\text{మొ.పె}} = \frac{\text{అ.వి}}{\text{పె.అవి}}$ ఇప్పుడు మనం అ.వి స్థానంలో దాని సమతుల్యమైన అవి' అపె నీ వాడితే ఈ క్రింది సమీకరణ లభిస్తుంది :

$\text{ల'} = \text{అ.వి'}\ \frac{\text{అ.పె'}}{\text{మొ.పె}} = \text{అ.వి' మొ.పె} = \text{అవి'}\ \frac{\text{అ.పె}}{\text{స్థి.పె.అ.పె}}$ ఈ సమీకరణను ఈ క్రింది అనులోమానుపాతంగా కూడా వ్యక్తీకరించవచ్చు. ల' = అవి' = అ.పె:మొ.పె అస్థిర పెట్టుబడికి మొత్తం పెట్టుబడితో ఉన్న సంబంధం వంటిదే లాభం రేటుకు అదనపు విలువ రేటుతో గల సంబంధం.

ఈ అనుపాతం నుంచి నిర్ధారణ అవుతున్నదేమిటంటే, అపె అనే అస్థిర పెట్టుబడి ఎల్లప్పుడూ మొ.పె. అనే మొత్తం పెట్టుబడికంటే లేక అస్థిర పెట్టుబడి ప్లస్ స్థిర పెట్టుబడికంటే తక్కువగా ఉంటుంది. కాబట్టి ల' అనే లాభం రేటు ఎల్లప్పుడూ అవి' అనే అదనపు విలువ రేటుకంటే తక్కువగా ఉంటుంది. ఆచరణలో జరగని పనే అయినప్పటికీ ఇందుకొక మినహాయింపు మాత్రం ఉంది. అపె = మొ.పె అయినప్పుడు, పెట్టుబడిదారుడు స్థిర పెట్టుబడిని, ఉత్పత్తి సాధనాలను అడ్వాన్సు చేయకుండా వేతనాలను మాత్రమే అడ్వాన్సు చేసినపుడు దీనికి మినహాయింపు ఉంటుంది.

అయితే స్థి.పె, అ.పె, అ.వి వీటి పరిమాణాలపై నిర్ణయాత్మక ప్రభావం గల అనేక ఇతర అంశాలను కూడా మన విశ్లేషణ పరిశీలిస్తున్నది కాబట్టి వాటిని కూడా సంక్షిప్తంగా పరిశీలించక తప్పదు.

మొదటిది – డబ్బు విలువ. ఇది ఎల్లప్పుడూ స్థిరంగా ఉంటుందని భావించవచ్చు.

రెండవది – టర్నోవర్. ఈ అంశాన్ని ప్రస్తుతానికి పరిశీలించకుండా వదిలేద్దాం. ఎందుచేత నంటే, లాభం రేటుపై దీని ప్రభావాన్ని గురించి తరువాతి అధ్యాయంలో చర్చిద్దాం. అస్థిర పెట్టుబడి యొక్క ఒక టర్నోవర్ కాలానికి మాత్రమే ల' = అవి' $\frac{\text{అ.పె}}{\text{స్థి.పె}}$ అనే సూత్రం ఖచ్చితంగా చెల్లుతుందని మనమిక్కడ ముందే భావిస్తున్నాం. అయితే సాధారణ అదనపు విలువ రేటు అవి' స్థానంలో అదనపు విలువ వార్షిక రేటును అవి'ను చూపడం ద్వారా దీన్ని మనం సరిదిద్దవచ్చు. ఇక్కడ 'న' అంటే ఒక సంవత్సరంలో అస్థిర పెట్టుబడి మీక్క టర్నోవర్ల సంఖ్య (చూడు సం–III, అధ్యాయం–XVI, I – ఎంగెల్స్)

మూడవది – శ్రామిక ఉత్పాదకతకు సముచిత పరిగణన ఇవ్వాలి. అదనపు విలువ రేటుపై దీనికి గల ప్రభావం గురించి ఒకటవ సంపుటి (నాలుగవ భాగం) లో కూలంకషంగా చర్చించాం. ఒకటవ సంపుటిలో (అధ్యాయం X) నిరూపించినట్లు, వ్యక్తిగత పెట్టుబడి గనుక సగటు సామాజిక ఉత్పాదకత కంటే ఎక్కువ ఉత్పాదకతతో పనిచేస్తూ, సరుకులను వాటి సగటు సామాజిక విలువకంటే తక్కువ విలువకు ఉత్పత్తి చేసినందువల్ల అదనపు లాభాన్ని తెచ్చిపెట్టే పక్షంలో, కనీసం అలాటి వ్యక్తిగత పెట్టుబడి విషయంలో అయినా శ్రామిక ఉత్పాదకత లాభం రేటును ప్రత్యక్షంగా ప్రభావితం చేస్తుంది. అయితే ఈ విషయాన్ని మనం ప్రస్తుతానికి పరిశీలించడం లేదు. ఎందుచేతనంటే, సరుకులు మామూలు సామాజిక పరిస్థితులలో ఉత్పత్తి అవుతూ, వాటి విలువలకే అవి అమ్ముడవుతాయన్న ప్రాతిపదికతో మనమీ భాగంలో పరిశీలనను ప్రారంభిస్తున్నాము. కనుక ప్రతి సందర్భంలోనూ శ్రమ ఉత్పాదకత స్థిరంగా ఉందని ఊహించుకొంటున్నాము. ఆచరణలో, ఏదైనా ఒక పరిశ్రమ శాఖలో మదుపు పెట్టిన పెట్టుబడి యొక్క విలువ నిర్మాణ స్వరూపం, అంటే అస్థిర పెట్టుబడి, స్థిర పెట్టుబడి మధ్య గల నిర్దిష్ట నిష్పత్తి ఎల్లప్పుడూ శ్రామిక ఉత్పాదకత యొక్క నిర్దిష్టస్థాయిని వ్యక్తం చేస్తుంది. కాబట్టి, స్థిర పెట్టుబడిలోని పాదార్థిక భాగాల విలువలో మార్పు వల్ల కాకుండా లేక వేతనాల్లో మార్పు వల్ల కాకుండా, మరే కారణాలవల్లనైనా ఈ నిష్పత్తిలో గనుక మార్పు వచ్చినట్లయితే, దీనికి అనుగుణ్యంగా శ్రామిక ఉత్పాదకతలో కూడా మార్పు సంభవించవలసిందే. ఈ కారణం మూలంగానే సి.పె, అ.పె, అ.వి లలో మార్పులు వస్తే శ్రామిక ఉత్పాదకతలో కూడా మార్పులు సంభవించడం మనం తరుచుగా గమనిస్తుంటాం.

మిగతా మూడు అంశాలకు కూడా, అంటే పనిదిన పరిమాణం, శ్రమ తీవ్రత, వేతనాలు అనే మూడు అంశాలకు కూడా ఇది సమానంగా వర్తిస్తుంది. అదనపు విలువ రేటు పైనా, దాని పరిమాణంపైనా వీటి ప్రభావం గురించి ఒకటవ సంపుటిలో సవివరంగా చర్చించాం. కాబట్టి, సౌలభ్యం కోసం ఈ మూడు అంశాలు స్థిరంగా ఉంటాయనుకున్నప్పటికీ అ.పెలో అ.విలో వచ్చే మార్పులు ఈ అంశాల పరిమాణాల్లో మార్పులకు – అంటే వాటి నిర్ణాయక అంశాల్లో మార్పులకు దారితీస్తాయని మనకు ఎరుకే. ఇక్కడొక విషయాన్ని సంక్షిప్తంగా గుర్తుచేసుకోవాలి; అదనపు విలువ పరిమాణంపైనా, అదనపు విలువ రేటుపైనా వేతన ప్రభావం, వాటిపై పనిదిన పరిమాణం, శ్రమ తీవ్రత ప్రసరించే ప్రభావానికి విలోమానుపాతంలో ఉంటుంది. అంటే వేతనాల పెరుగుదల అదనపు విలువను తగ్గిస్తుంది. కాగా పనిదిన పరిమాణంలో, శ్రమ తీవ్రతలో పెరుగుదల అదనపు విలువను పెంచుతాయి.

ఉదాహరణకు, వారానికి 20 వేతనంతో రోజుకు పది గంటలు పని చేసే 20 మంది శ్రామికులను నియమించిన 100 పెట్టుబడి 20 అదనపు విలువను ఉత్పత్తి చేసినట్లయితే, ఇలా ఉంటుంది;

$80_{\text{స్థి.పె}}+20_{\text{అ.పె}}+20_{\text{అ.వి}}$; అ.వి' = 100%, ల' = 20% ఇప్పుడు వేతనాలు పెంచకుండా పనిదినాన్ని 15 గంటలకు పెంచారనుకుందాం. అప్పుడు 20 మంది శ్రామికులు ఉత్పత్తి చేసే మొత్తం విలువ 40 నుండి 60కి పెరుగుతుంది. (10:15=40:60) శ్రామికులకు చెల్లించిన వేతనాలు అ.పె.లో ఎలాటి మార్పులేదు కాబట్టి అదనపు విలువ 20 నుంచి 40కి పెరుగుతుంది; అప్పుడు ఇలా ఉంటుంది.

$80_{\text{స్థి.పె}}+20_{\text{అ.పె}}+40_{\text{అ.వి}}$ = 200% ల' = 40%

ఇలా కాకుండా పది గంటల పనిదినంలో మార్పు లేకుండా వేతనాలు గనుక 20 నుంచి 12కు తగ్గిపోతే ఇంతకు ముందు మాదిరే మొత్తం విలువ ఉత్పాదితం 40 మేరకే ఉంటుంది; కాకపోతే పంపిణీ మాత్రం భిన్నంగా ఉంటుంది. అపె అన్నది 12కు తగ్గిపోతుంది, మిగిలిన 28 మాత్రం అ.విగా ఉండిపోతుంది. అప్పుడు ఇలా ఉంటుంది;

$80_{\text{స్థి.పె}}+12_{\text{అ.పె}}+28_{\text{అ.వి}}$; = ల' = $233\frac{1}{3\%}$ , ల' = $\frac{28}{92=30\frac{10}{23}\%}$

కాబట్టి పనిదినం పొడిగింపు (లేక అందుకనుగుణంగా శ్రమ తీవ్రతలో పెరుగుదల) వేతనాల్లో తగ్గుదల ఇవి అదనపు విలువ మొత్తాన్ని, రేటును పెంచుతాయి. ఇందుకు భిన్నంగా, మిగతా విషయాలు సమంగా ఉండి, వేతనాల్లో పెరుగుదల ఉన్నట్లయితే అది అదనపు విలువ రేటును తగ్గిస్తుంది. కనుక వేతనాల పెరుగుదల మూలంగా అపె పెరిగినట్లయితే అది శ్రమ పరిమాణం పెరుగుదలను కాక శ్రమ పరిమాణం మునుపటికన్నా ప్రియంగా ఉందన్న సంగతిని మాత్రమే వ్యక్తీకరిస్తుంది; అప్పుడు అవి' అలాగే ల' తగ్గుతాయి తప్ప పెరగవు.

అ.పెలోనూ అ.విలోనూ, వాటి నిష్పత్తిలోనూ, మొత్తం పెట్టుబడి స్థి.పె + అ.పె తో అవి నిష్పత్తిని సూచించి ల'లోనూ మార్పు వస్తే తప్ప, పనిదినంలోనూ, శ్రమ తీవ్రతలోనూ, వేతనాల్లోనూ మార్పులు రావని ఇది సూచిస్తున్నది. అంతేకాక, అ.పెకి అ.వికి గల నిష్పత్తిలో మార్పు ఉన్నట్లయితే

ఈ మార్పుకు అనుగుణంగా పైన తెలిపిన శ్రమ యొక్క మూడు పరిస్థితుల్లో కనీసం ఒక దాంట్లోనైనా మార్పు వస్తోందనేది విస్పష్టం.

అస్థిర పెట్టుబడిని మొత్తం పెట్టుబడి గమన క్రమంతో, దాని స్వయం విస్తరణతో గల నిర్దిష్ట అంగాంగిక సంబంధాన్నీ, అలాగే స్థిర పెట్టుబడితో దానికి గల విభేదాన్ని ఇది కచ్చితంగా వెల్లడిస్తుంది. విలువ ఆవిర్భావానికి సంబంధించినంత వరకు, స్థిర పెట్టుబడికి గల ప్రాముఖ్యమల్లా దాని విలువను బట్టే. 1500 పౌండ్ల స్థిర పెట్టుబడి, 1 పౌండుకు 1 టన్ను ప్రకారం 1500 టన్నుల ఇనుముకు ప్రాతినిధ్యం వహిస్తుందా లేక 3 పౌండ్లకు 1 టన్ను ప్రకారం 500 టన్నుల ఇనుముకు ప్రాతినిధ్యం వహిస్తుందా అనేది విలువ ఆవిర్భావానికి సంబంధించి ముఖ్యం కాదు. స్థిర పెట్టుబడి విలువ మూర్తీభవించి ఉన్న భౌతిక పదార్థ పరిమాణానికి విలువ ఆవిర్భావంతోనూ లాభం రేటుతోనూ ఎలాటి ప్రమేయమూ లేదు; స్థిర పెట్టుబడి విలువ ప్రాతినిధ్యం వహించే భౌతిక ఉపయోగ విలువ పరిమాణంతో ఆ స్థిర పెట్టుబడి విలువ ఏ నిష్పత్తిలో హెచ్చింది, లేదా తగ్గింది అనే దానితో నిమిత్తం లేకుండా, లాభం రేటు ఆ విలువకు విలోమ నిష్పత్తిలో మారుతుంటుంది.

అస్థిర పెట్టుబడి విషయంలో ఇది భిన్నంగా ఉంటుంది; ఈ దశలో ముఖ్యమైనది దీని విలువ కానీ, దీనిలో మూర్తీభవించి ఉన్న శ్రమ కానీ కాదు. తాను చలనంలో పెట్టే మొత్తం శ్రమ యొక్క సూచికగా, తనలో వ్యక్తంకాని ఆ మొత్తం శ్రమ యొక్క సూచికగా మాత్రమే ఈ విలువకు ప్రాముఖ్యం ఉంది. ఆ విలువలో వ్యక్తమయిన శ్రమకు (అంటే) అందువల్ల మూల్యం చెల్లించబడిన శ్రమకు మొత్తం శ్రమకు గల భేదం, అంటే మొత్తం శ్రమతో, అదనపు విలువను ఉత్పత్తి చేసే భాగం ఎంత ఎక్కువగా ఉంటే ఆ విలువలో ఉన్న శ్రమ అంత తక్కువగా ఉంటుంది. పదిగంటల పనిదినం పది షిల్లింగులకు (పది మార్కులకు) సమానం అనుకుందాం. ఆవశ్యక శ్రమ, అంటే వేతనాలను లేక అస్థిర పెట్టుబడిని భర్తీ చేసే శ్రమ 5 గంటలు = 5 షిల్లింగులు అయితే, అదనపు శ్రమ = 5 గంటలు, అదనపు విలువ = 5 షిల్లింగులవుతుంది. ఆవశ్యక శ్రమ 4 గంటలైతే అదనపు శ్రమ = 6 గంటలు, అదనపు విలువ 6 షిల్లింగులు అవుతుంది. కనుక, అస్థిర పెట్టుబడి విలువ తాను చలనంలో ఉంచిన శ్రమ పరిమాణం యొక్క సూచికగా ఉండడం మానుకోగానే, పైపెచ్చు, ఈ సూచిక కొలత మారిపోగానే అదనపు విలువ రేటు కూడా వ్యతిరేక దిశలోనూ విలోమంగానూ మారుతుంది.

ఇప్పుడిక పైన తెలిపిన లాభం రేటు సమీకరణ అయిన ల' = అ.వి' $\frac{\text{అ.పె}}{\text{మొ.పె}}$ ని అవకాశమున్న వివిధ సందర్భాలకు అన్వయిద్దాం. అ.వి $\frac{\text{అ.పె}}{\text{మొ.పె}}$ లోని వేరు వేరు అంశాలు విలువను ఒకదాని తరువాత ఒకటి మార్చి, లాభం రేటుపై ఈ మార్పుల ఫలితాన్ని నిర్ణయిద్దాం. ఈ విధంగా మనకు భిన్న సందర్భాలు పరిశీలనకు లభిస్తాయి. వీటిని ఒకే పెట్టుబడి విషయంలో వరుసగా మారిన పని పరిస్థితులుగానూ, లేక తులనాత్మక పరిశీలనకై వివిధ పరిశ్రమ శాఖల లేదా వివిధ దేశాల నుంచి గ్రహించిన సమకాలీన విభిన్న పెట్టుబడులుగానూ మనం పరిగణించవచ్చు. కాబట్టి, మేము ఇచ్చిన కొన్ని ఉదాహరణల్లో ఒకే పెట్టుబడి విషయంలో వరుసగా సంభవించిన పరిస్థితుల గురించిన భావన అసహజమైనదిగా, లేక అసంభావ్యమైనదిగా కనిపించిన సందర్భాల్లో వాటిని వేరు వేరు పెట్టుబడుల మధ్య పోలికలుగా చూస్తే ఆ అభ్యంతరం తొలగిపోతుంది.

అవి' $\frac{\text{అ.పె}}{\text{మొ.పె}}$

కాబట్టి ఇప్పుడిక మనం ఉత్పాదితాన్ని దాని రెండు అంశాలైన అవి'గానూ $\frac{\text{అ.పె}}{\text{మొ.పె}}$ గానూ వేరుచేద్దాం. మొదట అ.వి' ను స్థిరమైనదిగా భావించి $\frac{\text{అ.పె}}{\text{మొ.పె}}$ లో వీలున్న మార్పుల ఫలితాన్ని విశ్లేషిద్దాం. ఆ తర్వాత $\frac{\text{అ.పె}}{\text{మొ.పె}}$ భిన్నంకాని స్థిరమైనదిగా పరిగణించి అవి'ని సాధ్యమైనన్ని మార్పులను గడవనిద్దాం. అంతిమంగా అన్ని అంశాలను అస్థిర పరిమాణాలుగా భావించి, తద్వారా లాభం రేటు నియమాలను ఏయే సందర్భాలనుంచి రాబట్టవచ్చునో ఆ సందర్భాలనన్నిటినీ నిశ్శేషంగా ఇద్దాం.

I. స్థి.పె' స్థిరం, $\frac{\text{అ.పె}}{\text{మొ.పె}}$ అస్థిరం

అనేక ఉప సందర్భాలకు ఆవరించిన ఈ సందర్భాన్ని ఒక సార్వత్రిక సూత్రం ద్వారా చూపవచ్చు. మొపె, మొపె$_1$ అనే రెండు పెట్టుబడులను వాటి అస్థిర భాగాలయిన అపె, అపె$_1$ లను తీసుకుందాం. వీటి ఉమ్మడి అదనపు విలువ రేటు అ.వి అనీ, వీటి లాభం రేట్లు ల', ల$_1$ అనీ భావిద్దాం.

అప్పుడు : ల' = అవి $\frac{\text{అ.పె}}{\text{మొ.పె}}$ ; ల'$_1$ = అ.వి' $\frac{\text{అ.పె}_1}{\text{మొ.పె}_1}$

ఇప్పుడిక మొ.పె, మొ.పె$_1$ల మధ్య అ.పె, అ.పె$_1$ల మధ్య నిష్పత్తిని లెక్కగడతాం. ఉదాహరణకు $\frac{\text{మొ.పె}_1}{\text{మొ.పె}}$ భిన్నాంక విలువ బి అనీ $\frac{\text{అ.పె}_1}{\text{అ.పె}}$ = భి అనీ అనుకొందాం (భి అంటే భిన్నాంక విలువ) అప్పుడు మొ.పె$_1$ = భి మొ.పె; అ.పె$_1$ = భి అ.పె అవుతుంది. పై సమీకరణలో ల$_1$, మొ.పె$_1$, అ.పె స్థానంలోనూ ఈ విలువలను ప్రవేశపెట్టడం ద్వారా కింది సమీకరణ వస్తుంది.

ల'$_1$ = అ.వి' $\frac{\text{బి అ.పె}}{\text{భి మొ.పె}}$

పై రెండు సమీకరణలను కింది నిష్పత్తిలోకి మార్చడం ద్వారా వాటినుంచి రెండవ సూత్రాన్ని మనం రాబట్టవచ్చు.

ల' = ల'$_1$ = అ.వి $\frac{\text{అ.పె}_1}{\text{మొ.పె}}$; అ.వి' $\frac{\text{అ.పె}_1}{\text{మొ.పె}_1}$ = $\frac{\text{అ.పె}}{\text{మొ.పె}}$ = $\frac{\text{అ.పె}_1}{\text{మొ.పె}}$ ఒకే సంఖ్యచేత భిన్నరాసి లవాన్నీ, హారాన్నీ గుణించినప్పటికీ, భాగించినప్పటికీ భిన్నరాసి విలువలో మార్పు ఉండదు కనుక మనం $\frac{\text{అ.పె}}{\text{మొ.పె}}$ ని, $\frac{\text{అ.పె}_1}{\text{మొ.పె}_1}$ ని శాతాలకింద మార్చవచ్చు. అంటే మొ.పె, మొ.పె$_1$ రెండూ 100కు సమానమనుకుంటే, అప్పుడు $\frac{\text{అ.పె}}{\text{మొ.పె}} = \frac{\text{అ.పె}}{100}$ $\frac{\text{అ.పె}_1}{\text{మొ.పె}_1} = \frac{\text{అ.పె}_1}{100}$ అవుతుంది. అప్పుడిక పై నిష్పత్తి లోని హారాన్ని వదిలేయవచ్చు. దాని ఫలితమిది;

ల' : ల'$_1$ = అ.పె : అ.పె$_1$ లేక;

ఒకే అదనపు విలువ రేటుతో పనిచేసే రెండు పెట్టుబడులను తీసుకున్నట్లయితే, లాభం రేట్లు ఆ మొత్తం పెట్టుబడుల్లో వాటి అస్థిర భాగాల శాతాలున్న నిష్పత్తిలో ఉంటాయి. $\frac{\text{అ.పె}}{\text{మొ.పె}}$ చెందగల మార్పులన్నీ ఈ రెండు సూత్రాల పరిధిలోకి వస్తాయి. ఈ వివిధ సందర్భాలను విడివిడిగా విశ్లేషించడానికి ముందు మరో సంగతి చెప్పాల్సివుంది. మొపె అన్నది స్థి.పె ప్లస్ అ.పెల మొత్తం కాబట్టి, అంటే స్థిర, అస్థిర పెట్టుబడుల మొత్తం కాబట్టి, అదనపు విలువ రేట్లను లాభం రేట్లను

మామూలుగా శాతాల్లో తెలుపుతారు కాబట్టి, స్థిపె + అపె కూడా 100కు సమానంగా ఉన్నట్లు, భావించడం సౌకర్యంగా ఉంటుంది; అంటే స్థిర పెట్టుబడిని అస్థిర పెట్టుబడిని కూడా శాతాల్లో వ్యక్తం చేయడం ఉంటుంది. లాభం మొత్తాన్ని కాకపోయినా, లాభం రేటును నిర్ణయించడానికి మాత్రం 12000 స్థిర పెట్టుబడి, 3000 అస్థిర పెట్టుబడి కలిసిన మొత్తం 15000 పెట్టుబడి 3000 అదనపు విలువను సృష్టిస్తుందని చెప్పినా ఒకటే, ఈ పెట్టుబడిని శాతాల కిందికి మార్చినా ఒకటే.

అందులో తేడా ఏమీ ఉండదు.

$15000_{\text{మొ.పె}} = 12000_{\text{స్థి.పె}} + 3000_{\text{అ.పె}}\ (+3000_{\text{అ.వి}})$

$100_{\text{మొ.పె}} = 80_{\text{స్థి.పె}} + 20_{\text{అ.పె}}\ (+20_{\text{అ.వి}})$

ఈ రెండు సందర్భాల్లోనూ అదనపు విలువ రేటు $\text{అ.వి}^1 = 100\%$ లాభం రేటు = 20%

రెండు పెట్టుబడులను, ఉదాహరణకు పై పెట్టుబడిని కింది ఉదహరించిన లాంటి పెట్టుబడితో పోల్చినప్పుడు ఇదే వర్తిస్తుంది.

$12000_{\text{మొ.పె}} = 10{,}800_{\text{స్థి.పె}} + 1200_{\text{అ.పె}}\ (+1200_{\text{అ.వి}})$

$100_{\text{మొ.పె}} = 90_{\text{స్థి.పె}} + 10_{\text{అ.పె}}\ (+10_{\text{అ.వి}})$

రెండు సందర్భాల్లోనూ అదనపు విలువ రేటు అవి=100%, లాభం రేటు = ల' 10% మొదటి పెట్టుబడితో పోలిక శాతం రూపంలో మరింత స్పష్టంగా ఉంది.

కానీ, ఒకటే పెట్టుబడిలో మార్పులు సంభవిస్తున్నట్లయితే, శాతాల రూపాన్ని అరుదుగా మాత్రమే ఉపయోగించాలి; ఎందుచేతనంటే ఈ రూపం ఆ మార్పులను దాదాపు ఎల్లప్పుడూ మరుగు పుచ్చుతుంది.

$80_{\text{స్థి.పె}}+20_{\text{అ.పె}}+20_{\text{అ.వి}}$ ఈ శాతాల రూపంలో వ్యక్తీకరించబడిన ఒక పెట్టుబడి, ఈ క్రింది శాతాల రూపం ధరిస్తే,

$90_{\text{స్థి.పె}} + 10_{\text{అ.పె}} + 10_{\text{అ.వి}}$

శాతాలలో మారిన అంతర్నిర్మాణం అంటే $90_{\text{స్థి.పె}}+10_{\text{అ.పె}}$, అపె యొక్క నిరపేక్ష తగ్గుదల ఫలితమా లేక స్థిపె యొక్క నిరపేక్ష పెరుగుదల ఫలితమా, లేక రెండింటి ఫలితమా అన్నది మనం తేల్చి చెప్పలేము. ఇది, తేల్చి చెప్పాలంటే సంఖ్యలో నిరపేక్ష పరిమాణాలు అవసరం. ఈ క్రింది మార్పులు వ్యక్తిగత ఉదాహరణల విశ్లేషణలో, ఎలా వచ్చాయన్న దానిపై ప్రతిదీ ఆధారపడి ఉంటుంది; అస్థిర పెట్టుబడిలో ఎటువంటి మార్పు లేకుండా స్థిర పెట్టుబడి పెరిగినందువల్ల ఉదాహరణకు, $12000_{\text{స్థి.పె}}+3000_{\text{అ.పె}}$ అన్నది $27000_{\text{స్థి.పె}}+3000_{\text{అ.పె}}$ గా మార్పుచెంది నందువల్ల ($90_{\text{స్థి.పె}}+10_{\text{అ.పె}}$ యొక్క శాతానికి అనుగుణంగా) $80_{\text{స్థి.పె}}+20_{\text{అ.పె}}$ అన్నది $90_{\text{స్థి.పె}}+10_{\text{అ.పె}}$గా మారిందా లేక స్థిర పెట్టుబడిలో మార్పు లేకుండా అస్థిర పెట్టుబడి తగ్గిపోయినందువల్ల ఈ మార్పు సంభవించిందా, అంటే $12000_{\text{స్థి.పె}}+1333\frac{1}{3}$అ.పె గా మార్పు చెందినందువల్ల (ఇది కూడా $90_{\text{స్థి.పె}}+10_{\text{అ.పె}}$ శాతానికి అనుగుణంగా) ఇది జరిగిందా, లేక అంతిమంగా రెండూ కూడా $13500_{\text{స్థి.పె}}+1500_{\text{అ.పె}}$ గా మార్పు చెందినందువల్లనా (ఇది కూడా $90_{\text{స్థి.పె}}+10_{\text{అ.పె}}$ శాతానికి అనుగుణంగానే) ఈ ఉదాహరణలనే వరుసగా మనం విశ్లేషించాల్సి

ఉంది. అలా విశ్లేషించడంలో, అనుకూలంగా వున్న శాతాల రూపాన్ని వదలివేయాలి, లేదా కనీసం ఈ రూపాన్ని ద్వితీయ శ్రేణి ప్రత్యామ్నాయంగా మాత్రమే వినియోగించుకోవాలి.

అస్థిర పెట్టుబడి పరిమాణం మారినట్లయితే, మొత్తం పెట్టుబడిలో మరో భాగమైన స్థిర పెట్టుబడి కూడా అదే పరిమాణంలో వ్యతిరేక దిశలో మారితేనే మొత్తం పెట్టుబడి మారకుండా యథాతథంగా ఉండగలుగుతుంది.

మొ.పె గనుక మొదట $80_{\text{స్థి.పె}}+20_{\text{అ.పె}}=100$ అయి, ఆ తర్వాత అ.పె గనుక 10కి తగ్గిపోతే, స్థి.పె 90కి పెరిగితేనే మొ.పె 100కు సమానంగా ఉంటుంది; $90_{\text{స్థి.పె}}+10_{\text{అ.పె}}=100$ మొత్తంపై చెప్పాలంటే, ప్రస్తుత ఉదాహరణ యొక్క షరతులు సంతృప్తికరంగా అమలుజరగాలంటే అ.పె గనుక అ.పె$\pm$డిగా మార్పు చెందితే, అంటే అ.పె అనేది డి మేరకు పెరిగితే లేక తరిగితే అప్పుడు స్థి.పె అనేది మొ.పె$\mp$గా మారాలి, అంటే అదే మొత్తం తద్వ్యతిరేకదిశలో మార్పు చెందాలి.

ఇదే విధంగా అస్థిర పెట్టుబడి అ.పె మార్పు చెంది అదనపు విలువ రేటు అ.వి' గనుక యథాతథంగా ఉన్నట్లయితే అదనపు విలువ మొత్తం అ.వి కూడా మార్పు చెందక తప్పదు. ఎందుచేతనంటే, అ.వి=అ.వి' అ.పె, అ.వి' అ.పెలో ఒక అంశమైన అ.పెకి మరో విలువ ఇవ్వబడింది.

ఈ ఉదాహరణలో ఊహించుకొన్న ప్రాతిపదికలవల్ల అయిన ల=అ.వి' $\frac{\text{అ.పె}}{\text{మొ.పె}}$ తో పాటు, అ.పెలో మార్పు ద్వారా మరో సమీకరణ ఏర్పడుతుంది. అదేమిటంటే, $\text{ల}'_1$ = అ.వి' $\frac{\text{అ.పె}_1}{\text{మొ.పె}}$

ఇందులో అ.పె అన్నది $\text{అ.పె}_1$గా మారింది. మారిన లాభం రేటు $\text{ల}'_1$ని కనుగొనాలి. దాన్ని కింది నిష్పత్తి నిర్ణయిస్తుంది. $\text{ల}':\text{ల}'_1$ = అ.వి' $\frac{\text{అ.పె}}{\text{మొ.పె}}$ : అవి' $\frac{\text{అ.పె}_1}{\text{మొ.పె}}$ = అ.పె : $\text{అ.పె}_1$ లేదా అదనపు విలువ రేటు, మొత్తం పెట్టుబడి రెండూ మార్పు లేకుండా యథాతథంగా ఉన్నట్లయితే, అస్థిర పెట్టుబడి మొదట్లో ఉన్న పరిమాణానికీ, మారిన అస్థిర పెట్టుబడి పరిమాణానికీ మధ్య ఉన్న నిష్పత్తులలోనే మొదట ఉన్న లాభం రేటూ, అస్థిర పెట్టుబడి మారిన ఫలితంగా లభించిన కొత్త లాభం రేటు ఉంటాయి. పైవిధంగానే, మొదట్లో పెట్టుబడి ఇలా ఉందనుకొందాం.

I. $15000_{\text{మొ.పె}} = 12000_{\text{స్థి.పె}} + 3000_{\text{అ.పె}}$ ($+3000_{\text{అ.వి}}$); కాగా ఇప్పుడది

II. $15000_{\text{మొ.పె}} = 13000_{\text{స్థి.పె}} + 2000_{\text{అ.పె}}$ ($+2000_{\text{అ.వి}}$); అయిందనుకొందాం. రెండింటిలోనూ మొపె = 15000 అ.వి' = 100%, మొదటి ఉదాహరణలో లాభం రేటు 20 శాతం. రెండవ ఉదాహరణలోని $13\frac{1}{3}$ – ఈ రెండూ, మొదటి ఉదాహరణలోని 3000 అస్థిర పెట్టుబడి రెండవ ఉదాహరణలోని అస్థిర పెట్టుబడి 2000 ఉన్న నిష్పత్తులలోనే ఉంటాయి. అంటే 20 శాతం : $13\frac{1}{3}$ శాతం = 3000:2000.

ఇప్పుడిక, అస్థిర పెట్టుబడి పెరగనూవచ్చు, తరగనూవచ్చు; అది పెరిగే ఉదాహరణను మొదట తీసుకుందాం. ఒకానొక పెట్టుబడి నిర్మాణ స్వరూపం ఇలా ఉందనీ, దాన్ని ఇలా నియుక్తం చేశామనీ అనుకుందాం.

I. $100_{\text{స్థి.పె}} + 20_{\text{అ.పె}}+10_{\text{అ.వి}}$; మొపె = 120, అ.వి'=50%, ల' = $8\frac{1}{3}$%

ఇప్పుడు అస్థిర పెట్టుబడి 30కి పెరుగుతుందనుకుంటే, మన ఊహ ప్రకారం మొత్తం పెట్టుబడి మార్పు లేకుండా 120 గానే ఉండాలంటే, స్థిర పెట్టుబడి 100 నుంచి 90కి దిగాలి. అదనపు

విలువ రేటు 50 శాతంగానే స్థిరంగా ఉన్నట్లయితే, ఉత్పత్తి అయిన అదనపు విలువ 10 నుంచి 15కు పెరుగుతుంది. అప్పుడు సమీకరణ ఇలా ఉంటుంది :

II. $90_{\text{స్థి.పె}}+30_{\text{అ.పె}}+15_{\text{అ.వి}}$; మొపె = 120, అవి' = 50%, ల' = 12½%

వేతనాలు యథాతథంగా ఉంటాయి. అన్న వూహతో మొదట పరిశీలిద్దాం. అప్పుడు అదనపు విలువ రేటుకు సంబంధించిన ఇతర అంశాలు కూడా, అంటే పనిదినం, శ్రమతీవ్రత కూడా యథాతథంగా ఉండితీరాలి. అప్పుడు అపెలో పెరుగుదల (20 నుంచి 30కి పెరుగుదల) వాస్తవానికి మరో సగంమంది శ్రామికులను నియుక్తం చేసుకున్నట్లు సూచిస్తుంది. అప్పుడు ఉత్పత్తి అయిన మొత్తం విలువ కూడా సగం, అంటే 30 నుండి 45కు పెరుగుతుంది; ఇంతకు ముందులాగే అది ఇలా పంపిణీ అవుతుంది. $\frac{2}{3}$ వంతు వేతనాలు, $\frac{1}{3}$ వంతు అదనపు విలువ. అయితే అదే సమయంలో శ్రామికుల సంఖ్య పెరగడంతో స్థిర పెట్టుబడి, ఉత్పత్తి సాధనాల విలువ 100 నుంచి 90కి పడిపోయింది. అప్పుడు శ్రామిక ఉత్పాదకత తగ్గడంతో పాటు, స్థిర పెట్టుబడి కూడా తగ్గిపోతుంది. ఆర్థికంగా ఇలాటి సందర్భం సంభవమా?

శ్రామిక ఉత్పాదకత తగ్గుదల, ఫలితంగా నియమించుకునే కార్మికుల సంఖ్య పెరుగుదల ఉండే వ్యవసాయం, గనుల పరిశ్రమలని తేలిగ్గా అర్థం చేసుకోవచ్చు. కనుక వీటిలో పెట్టుబడిదారీ ఉత్పత్తి ప్రాతిపదికపైనా, దాని పరిధిలోనూ ఈ ప్రక్రియ స్థిర పెట్టుబడిలోని తగ్గుదలతో కాక పెరుగుదలతో ముడిపడి ఉంటుంది. పైన తెలిపిన స్థిర పెట్టుబడి స్థి.పెలోని తగ్గుదలకు కేవలం ధర తగ్గుదల కారణమైనప్పటికీ, ఒక వ్యక్తిగత పెట్టుబడి అసాధారణ పరిస్థితుల్లో మాత్రమే I నుంచి IIవ దానికి పరివర్తన చెందగలదు. అయితే రెండు విభిన్న దేశాల్లో కానీ, లేక వ్యవసాయంలో కానీ, గని పరిశ్రమలో కానీ మదుపు పెట్టిన రెండు ప్రత్యేక పెట్టుబడుల విషయంలో, ఒకదానిలోకంటే మరొక దానిలో ఎక్కువమంది కార్మికులను (ఆ కారణంగా ఎక్కువ అస్థిర పెట్టుబడిని) నియమించడం, లేక తక్కువ విలువగల, లేదా తక్కువ ఉత్పత్తి సాధనాలతో వారితో పని చేయించడం అసాధారణమేమీ కాదు. అయితే వేతనం, యథాతథంగా ఉంటుందన్న ఊహకు స్వస్తి చెప్పి, వేతనాలు సగం పెరిగినందు వల్లనే అస్థిర పెట్టుబడి 20 నుంచి 30కి పెరిగిందని వివరిద్దాం. అప్పుడు పూర్తిగా భిన్నమైన సందర్భం ఏర్పడుతుంది. అదే సంఖ్యలోని కార్మికులు – మాట వరుసకు ఇరవైమంది – అదే ఉత్పత్తి సాధనాలతో, లేక కాస్త తక్కువ విలువగల ఉత్పత్తి సాధనాలతో పని చేయడం కొనసాగిస్తారు. పనిదినంలో గనుక మార్పు లేనట్లయితే అది పదిగంటలు అనుకుందాం – ఉత్పత్తి అయిన మొత్తం విలువలో కూడా మార్పు ఉండదు. అది ఇంతకు ముందూ, ఇప్పుడూ రెండు సందర్భాల్లోనూ ముప్పయే. అయితే అడ్వాన్సయిన 30 అస్థిర పెట్టుబడిని భర్తీ చేయడానికి ఇప్పుడీ 30ని వినియోగించుకోవలసి ఉంది. అదనపు విలువ అదృశ్యమైపోతుంది. కానీ మనమేమో అదనపు విలువ రేటు యథాతథంగా ఉంటుందని, అంటే Iవ ఉదాహరణలో లాగే 50% ఉంటుందని భావించాం. అయితే పనిదినాన్ని సగం పొడిగిస్తేనే, అంటే 10 గంటల నుంచి 15 గంటలకు పొడిగిస్తేనే ఇది సాధ్యపడుతుంది. అప్పుడు 20 మంది శ్రామికులు 15 గంటల్లో 45 మొత్తం విలువను ఉత్పత్తి చేస్తారు; దాంతో అన్ని షరతులూ పూర్తిగా అమలు జరుగుతాయి.

II. $90_{\text{స్థి.పె}}+30_{\text{అ.పె}}+15_{\text{అ.వి}}$; మొపె = 120, అ.వి = 50%, ల' = $12\frac{1}{2}$%

ఇప్పుడు 20 మంది శ్రామికులకు మొదటి ఉదాహరణలో ఉపయోగించినన్ని శ్రమ పరికరాలూ, పనిముట్లూ, యంత్రాలకు మించి అవసరం లేదు. కాగా ముడిపదార్థాలను లేక అనుబంధ పదార్థాలను మాత్రమే సగం పెంచాల్సిన అవసరం ఉంటుంది. ఈ పదార్థాల ధరలు గనుక తగ్గినట్లయితే Iవ పరిస్థితి నుంచి II వ పరిస్థితికి పరివర్తన చెందడానికి వ్యక్తిగత పెట్టుబడికి సైతం, మన ఊహ ననుసరించి ఆర్థికరీత్యా ఎక్కువ అవకాశం ఉంటుంది. పెట్టుబడిదారుడికి స్థిర పెట్టుబడి తరుగుదల ద్వారా వచ్చిన నష్టాన్ని పెరిగిన లాభం ద్వారా భర్తీ చేసుకునే అవకాశం ఉంటుంది.

ఇప్పుడిక అస్థిర పెట్టుబడి పెరగడానికి బదులు తగ్గుతుందని భావిద్దాం. అప్పుడు మనం మన ఉదాహరణను తిరగతిప్పాల్సి ఉంటుంది; అంటే IIలోని మొదట్లో ఉన్నదాన్ని పెట్టుబడిగా భావించి, II నుంచి Iకి మళ్ళాలి. అప్పుడు, II. $90_{\text{స్థి.పె}}+30_{\text{అ.పె}}+15_{\text{అ.వి}}$ అనేది ఇలా మారుతుంది; I $100_{\text{స్థి.పె}}+20_{\text{అ.పె}}+10_{\text{అ.వి}}$ అయితే ఈ స్థాన వ్యత్యయం వల్ల వాటి లాభం రేట్లను, వాటి పరస్పర సంబంధాన్నీ క్రమబద్ధంచేసే పరిస్థితుల్లో మాత్రం ఎలాటి మార్పులూ రావన్నది సుస్పష్టం.

స్థిర పెట్టుబడి పెరగడంతో పాటు, $\frac{1}{3}$ వంతు మంది తక్కువ శ్రామికులు నియుక్తం చేసుకోవడం వల్ల 30 నుంచి 20కి అపె తగ్గిపోతే అప్పుడు మామూలు ఆధునిక పరిశ్రమ పరిస్థితి కిందికి వస్తుంది. అంటే శ్రామిక ఉత్పాదక పెరగడం తక్కువ మంది కార్మికులతో ఎక్కువ సంఖ్యలోని ఉత్పత్తి సాధనాలను పనిచేయించడం అన్నమాట. ఈ ఉద్యమానికీ, అదే సమయంలో లాభం రేటు తగ్గుదలకూ గల అనివార్య సంబంధం గురించి ఇదే సంపుటిలోని మూడవ అధ్యాయంలో వివరిస్తాం.

అయితే తక్కువ వేతన రేటుతో అదే సంఖ్యలో శ్రామికులను నియోగించిన కారణంగా అపె 30 నుంచి 20కి తగ్గినట్లయితే, పనిదినంలో మునుపులాగే మార్పు రానప్పుడు ఉత్పత్తి అయిన మొత్తం విలువ మునుపటిలాగే = $30_{\text{అ.పె}}+15_{\text{అ.వి}}=45$. అపె 20కి పడిపోయింది. కాబట్టి అదనపు విలువ 25కు పెరుగుతుంది; అదనపు విలువ రేటు 50% నుంచి 125%కి పెరుగుతుంది; అయితే ఇది మనం ఊహించిన దానికి వ్యతిరేకమైంది. మన ఉదాహరణలోని షరతులకు అనుగుణంగా ఉండాలంటే 50% మేరకు ఉన్న అదనపు విలువ రేటు 10 శాతానికి పడిపోవాలి; కనుక ఉత్పత్తి అయిన మొత్తం విలువ 45 నుంచి 30కి పడిపోవాలి. అయితే పనికాలం $\frac{1}{3}$ వంతు మేరకు తగ్గితేనే ఇది సాధ్యం. అప్పుడు మునుపటిలాగే ఇలా ఉంటుంది.

$100_{\text{స్థి.పె}}+20_{\text{అ.పె}}+10_{\text{అ.వి}}$; అ.వి' = 50%, ల' = $8\frac{1}{3}$%

అయితే వేతనాలు తగ్గినప్పుడు పనికాలం తగ్గడమన్నది ఆచరణలో జరగదని చెప్పాల్సిన అవసరం లేదు. ఏమైనా అది ముఖ్యమైన విషయం కాదు. లాభం రేటు అన్నది అనేక అస్థిర పరిమాణాల ప్రక్రియ. ఈ అస్థిర పరిమాణాలు ఎలా లాభం రేటును ప్రభావితం చేస్తాయో తెలుసుకోవాలనుకుంటే, ఒకే పెట్టుబడిపై అస్థిర పరిమాణ ప్రభావం విడివిడిగా దేనికదిగా ప్రసరించడం ఆర్థికంగా ఆచరణలో సాధ్యమా అన్న విషయంతో ప్రమేయం లేకుండా మనం ప్రతి అస్థిర పరిమాణ ప్రభావాన్ని విశ్లేషించాలి.

2. అ.వి స్థిరం, అ.పె అస్థిరం, అపె మార్పువల్ల స్థిపె మారుతుంటుంది.

ఈ ఉదాహరణకూ ఇంతకు ముందు తెలిపిన ఉదాహరణకూ స్థాయిలో మాత్రమే తేడా ఉంది. అ.పె పెరిగినంతగా, లేక తరిగినంతగా తరగడానికి తేడా పెరగడానికి మారు స్థి.పె స్థిరంగా ఉంటుంది. ప్రధాన పరిశ్రమల్లోనూ వ్యవసాయంలోనూ ఈనాటి పరిస్థితులలో మొత్తం పెట్టుబడిలో అస్థిర పెట్టుబడి సాపేక్షంగా తక్కువగా మాత్రమే ఉంటుంది. ఈ కారణంగా అస్థిర పెట్టుబడిలోని మార్పు ఫలితంగా మొత్తం పెట్టుబడిలో జరిగే తరుగుదల కానీ పెరుగుదల కానీ సాపేక్షంగా స్వల్పమే. మనం మళ్ళీ ఈ పెట్టుబడితో ప్రారంభిద్దాం.

I. $100_{\text{స్థి.పె}}+20_{\text{అ.పె}}+10_{\text{అ.వి}}$; మొ.పె=120, అ.వి'=50%, అ.వి'=$8\frac{1}{3}$% అప్పుడిది ఇలా మార్పు చెందుతుందనుకుందాం.

II. $100_{\text{స్థి.పె}}+30_{\text{అ.పె}}+15_{\text{అ.వి}}$; మొ.పె=130, అ.వి'=50%, అ.వి'=$11\frac{7}{13}$%

అస్థిర పెట్టుబడి తగ్గేటటువంటి వ్యతిరేక సందర్భానికి II నుంచి Iకి మారడం ఉదాహరణ. ఆర్థిక పరిస్థితులు ముందు తెలిపిన ఉదాహరణలో మాదిరే ఉంటాయి. కనుక వాటిని మళ్ళీ చర్చించాల్సిన అవసరం లేదు. I నుంచి IIకు మారడమంటే శ్రామిక ఉత్పాదకత సగం తగ్గడమన్నమాట. IIకు $100_{\text{స్థి.}}$పెని వినియోగించుకోవాలంటే I కంటే సగం మంది శ్రామికులు ఎక్కువ అవసరం. ఈ పరిస్థితి వ్యవసాయరంగంలో[1] సంభవించవచ్చు.

స్థిర పెట్టుబడి అస్థిర పెట్టుబడిగా, అస్థిర పెట్టుబడి స్థిర పెట్టుబడిగా మారిన కారణంగా మునుపటి ఉదాహరణలో మొత్తంపెట్టుబడి మాత్రం యథాతథంగా ఉంటుంది. కానీ, ఈ ఉదాహరణలో మాత్రం అస్థిర పెట్టుబడి పెరిగితే అదనపు పెట్టుబడి అవసరమవుతుంది; అలా కాక అస్థిర పెట్టుబడి తగ్గితే ముందు నియుక్తం చేసిన పెట్టుబడి విడుదల అవుతుంది.

3. అ.వి', అ.పె స్థిరం కాగా, స్థి.పె, అస్థిరం. అందువల్ల మొ.పె అస్థిరం. ఈ ఉదాహరణలో ల'=అ.వి' $\frac{\text{అ.పె}}{\text{మొ.పె}}$ అన్న సమీకరణ $ల_1$'= అ.వి' $\frac{\text{అ.పె}}{\text{మొ.పె}_1}$ గా మార్పు చెందుతుంది. రెండువైపులా గల ఒకే కారకాలను కొట్టివేసినట్లయితే ఈ క్రిందిది లభ్యమవుతుంది.

$ల'_1$:ల' = మొ.పె:$\text{మొ.పె}_1$;

అదనపు విలువ రేటులో మార్పులేకుంటే, అస్థిర పెట్టుబడులు సమంగా ఉంటే, లాభం రేట్లు మొత్తం పెట్టుబడులకు విలోమానుపాతంలో ఉంటాయి.

ఉదాహరణకు మనకు మూడు విభిన్న పెట్టుబడులుంటే, లేక ఒకే పెట్టుబడికి సంబంధించి, మూడు విభిన్న పరిస్థితులుంటే:

I. $80_{\text{స్థి.పె}}+20_{\text{అ.పె}}+20_{\text{అ.వి}}$ : మొ.పె=100, అ.వి'=100%, ల'=20%

II. $100_{\text{స్థి.పె}}+20_{\text{అ.పె}}+20_{\text{అ.వి}}$; మొ.పె=120, అ.వి'=100%, ల'=$16\frac{2}{3}$%

III. $60_{\text{స్థి.పె}}+20_{\text{అ.పె}}+20_{\text{అ.వి}}$; మొ.పె=80, అ.వి'=100%, ల'=25%

అప్పుడు ఈ క్రింది నిష్పత్తులు లభిస్తాయి.

20%:$16\frac{2}{3}$% =120:100.

20%:25% = 80:100

1. ఇక్కడ రాత ప్రతిలో ఈ క్రింది వ్యాఖ్య వుంది: "ఈ పరిస్థితి కౌలుతో ఎలా ముడిపడి వుందో, తర్వాత దర్యాప్తు చేయాలి." - **ఫ్రెడరిక్ ఎంగెల్స్.**

అవి' స్థిరంగా ఉన్నప్పుడు $\frac{అ.పె}{స్థి.పె}$ లో మార్పులకు పైన ఇచ్చిన సాధారణ సూత్రం ఇదీ :

ల'$_1$ = అ.వి' $\frac{భి.అ.పె}{బి.మొ.పె}$ కాగా ఇప్పుడిది ఇలా మారుతుంది. ల'$_1$ = అ.వి' $\frac{అ.పె}{బి.మొ.పె}$

అ.పె లో ఎలాంటి మార్పు రాదు కాబట్టి భి = $\frac{అ.పె_1}{అ.పె}$ అన్నది ఒకటికి సమానం.

అ.వి' అ.పె= అ.వి, అదనపు విలువ పరిమాణం కాబట్టి, అ.వి' అలాగే అ.పె రెండూ కూడా స్థిరంగా ఉంటాయి. కాబట్టి మొ.పెలో మార్పు వచ్చినప్పటికీ అ.విలో ఎలాంటి మార్పు రాదు. మార్పుకు ముందులాగే తరువాత కూడా అదనపు విలువ పరిమాణం కూడా యథాతథంగా ఉంటుంది.

స్థి.పె గనుక సున్నాకు పడిపోతే, ల' అన్నది అ.వి'కి సమానంగా ఉంటుంది; అంటే లాభం రేటు అదనపు విలువ రేటుకు సమానంగా ఉంటుంది.

స్థిర పెట్టుబడి యొక్క భౌతిక పదార్థాల విలువలో వచ్చిన మార్పు మూలంగా కానీ, మొత్తం పెట్టుబడి తాలూకు సాంకేతిక అంతర్నిర్మాణ స్వరూపంలో వచ్చిన మార్పు మూలంగా కానీ, అంటే ఒక నిర్ణీత పరిశ్రమ శాఖలో శ్రమ ఉత్పాదకతలో వచ్చిన మార్పు మూలంగా కానీ స్థిపెలో మార్పు రావచ్చు. పై ఆఖరు ఉదాహరణలో ఆధునిక పరిశ్రమల అభివృద్ధి, భారీస్థాయి వ్యవసాయ అభివృద్ధి కారణంగా సామాజిక శ్రమ ఉత్పాదకత పెరుగుదల వల్ల III నుంచి I కి Iనుంచి IIకి పరివర్తన జరుగుతుంది. 20 చెల్లించబడగా, 40 విలువను ఉత్పత్తి చేసే శ్రమ పరిమాణం మొదట 60 విలువ మేరకు శ్రమ స్థానాలను వినియోగిస్తుంది; ఉత్పాదకత పెరిగి, విలువలో మార్పు లేనట్లయితే, వినియోగించిన శ్రమ సాధనాలు మొదట 80కి, ఆ తర్వాత 100కి పెరుగుతాయి. ఈ పరిణామక్రమం తలక్రిందులు అయిందంటే ఉత్పాదకత తగ్గినట్లే లెక్క. అదే శ్రమ పరిమాణం తక్కువ పరిమాణం గల ఉత్పత్తి సాధనాలను చలనంలో ఉంచుతుంది. పని మోతాదు తగ్గిపోతుంది. వ్యవసాయం, గని పరిశ్రమ మొదలయిన వాటిలో ఇలా జరగవచ్చు.

స్థిర పెట్టుబడిలో పొదుపు ఒకవైపేమో లాభం రేటును పెంచుతుంది. మరోవైపేమో పెట్టుబడిని విడుదల చేస్తుంది. అందుకే అది పెట్టుబడిదారుడికి ముఖ్యమైన విషయం. మనం ఈ అంశాన్ని, దీనితోపాటు, స్థిర పెట్టుబడిలోని భాగాల, ముఖ్యంగా ముడిపదార్థాల ధరల్లో వచ్చే మార్పు మీక్క ప్రభావాన్ని ఆ తర్వాత[1] మరింత లోతుగా పరిశోధిస్తాం.

స్థిర పెట్టుబడిలో ఆ మార్పు దాని భౌతిక పదార్థాల తగ్గుదల వల్ల లేదా పెరుగుదల వల్ల వచ్చిందా, లేక కేవలం వాటి విలువలో మార్పు వల్ల వచ్చిందా అనేదానితో నిమిత్తం లేకుండా, స్థిర పెట్టుబడిలోని మార్పు కూడా లాభం రేటును ప్రభావితం చేస్తుంది.

4. అ.వి' స్థిరం, అ.పె, స్థి.పె, మొ.పె అన్నీ అస్థిరాలు ఈ ఉదాహరణలో, మారిన లాభం రేటును ప్రారంభంలో అమలు జరుగుతుంది. ఇచ్చిన సార్వత్రిక కింది సూత్రం.

$$ల'_1 = అవి' \frac{భి.అ.పె}{బి.మొ.పె}$$

1. ఇదే కూర్పు: అధ్యాయం V, VI - సంపాదకుడు

అదనపు విలువ మారకుండా యథాతథంగా ఉన్నట్లయితే ఈ క్రింది పరిణామాలు సంభవిస్తాయని దీని నుంచి నిర్ధారణ అవుతుంది.

అ) భి కంటే బి ఎక్కువ ఉన్నట్లయితే, అంటే అస్థిర పెట్టుబడికంటే మొత్తం పెట్టుబడి వేగంగా పెరిగే స్థాయికి స్థిర పెట్టుబడిని పెంచినట్లయితే, లాభం రేటు తగ్గిపోతుంది. 80స్థి.పె+20అ.పె+20అ.వి, పెట్టుబడి 170స్థి.పె+30అ.పె+30అ.విగా మారినట్లయితే అ.వి' 100% శాతంగానే ఉంటుంది.

కానీ $\frac{\text{అపె}}{\text{మొపె}}$ $\frac{20}{100}$ నుంచి $\frac{30}{200}$ కు పడిపోతుంది; అపె అలాగే మొపె, రెండూ కూడా పెరిగి నప్పటికీ దానికి అనుగుణంగా లాభం రేటు 20% నుంచి 15%కి పడిపోయినప్పటికీ ఇది ఇలా తగ్గిపోతుంది.

ఆ) భి=బి అయినప్పుడు మాత్రమే, అంటే, $\frac{\text{అ.పె}}{\text{మొ.పె}}$ భిన్నాంకం విలువ మారినట్లు పైకి కనిపించి నప్పటికీ, అంటే దాని లవమూ, హారమూ ఒకే సంఖ్యచే హెచ్చించబడినా, భాగింప బడినా లాభం రేటు మారదు. పెట్టుబడి 80స్థి.పె+20అ.పె+20అ.వి' పెట్టుబడి 160స్థి.పె+40అ.పె+40అ.వి' ఈ రెంటికీ ఉన్న లాభం రేటు సమానమే. (20%) ఎందుకంటే, అ.వి' రెంటిలోనూ 100 శాతమే. రెండు ఉదాహరణల్లోనూ $\frac{\text{అ.పె}}{\text{భి}}$

$\frac{\text{అ.పె}}{\text{భి}} = \frac{20}{100} = \frac{40}{200}$ ఒకే విలువ గలది.

ఇ) బి కంటే భి ఎక్కువగా ఉన్నప్పుడు అంటే మొత్తం పెట్టుబడి కంటే అస్థిర పెట్టుబడి ఎక్కువ వేగంగా పెరిగినప్పుడు లాభం రేటు పెరుగుతుంది. 80స్థి.పె+20అ.పె+20అ.వి అన్నది 120స్థి.పె+ 40అ.పె+40అ.విగా మారితే లాభం రేటు 20% నుంచి 25%కి పెరుగుతుంది. అందుకు కారణమేమిటంటే, అవి' అదనపు విలువ రేటులో మార్పులేకుండానే $\frac{\frac{\text{అ.పె}}{\text{మొ.పె.}}}{100} = 20$ అన్నది $\frac{40}{160}$ కి, లేదా $\frac{1}{5}$ నుంచి $\frac{1}{4}$ కి పెరిగింది.

అ.పె అలాగే మొ.పె యొక్క మార్పులు ఒకే దిశలో ఉన్నట్లయితే వాటి పరిమాణాల్లోని మార్పులకు సంబంధించి కొంతమేరకు అవి రెండూ ఒకే నిష్పత్తిలో మారినట్లు, అంతవరకు $\frac{\text{అపె}}{\text{మొపె}}$ మార్పు లేకుండా ఉన్నట్లు మనం భావించవచ్చు. ఈ దశ తర్వాత అందులో ఏదో ఒకటి మాత్రమే మార్పు చెందుతుంది; తద్వారా ఈ సంక్లిష్టమైన ఉదాహరణను మునుపు పేర్కొన్న సరళమైన ఉదాహరణల్లో ఒకటిగా మార్చినట్లవుతుంది.

ఉదాహరణకు, 80స్థి.పె+20అ.పె+20అ.వి అన్నది 100స్థి.పె+30అ.పె+30అ.విగా మార్పు చెందినట్లయితే ఈ మార్పులలో అ.పె, స్థి.పెల మధ్య అలాగే అ.పె, మొ.పెల మధ్య కూడా నిష్పత్తి 100స్థి.పె+25అ.పె+25అ.వి వరకూ యథాతథంగా ఉంటుంది. కనుక ఆ దశ వరకు లాభం రేటు కూడా యథాతథంగానే ఉంటుంది. అప్పుడు 100స్థి.పె+25అ.పె+25అ.వితో మన పరిశీలన ప్రారంభించవచ్చు. అపె 5 మేరకు పెరిగి 30 అపెకి చేరుకున్నట్లు, ఫలితంగా మొపె 125 నుంచి 130కి పెరిగినట్లు తెలుస్తుంది; ఈ విధంగా ఇది రెండవ ఉదాహరణ అవుతుంది. అంటే అ.పె

మామూలుగా మార్పుచెందుతుండగా, మొ.పె తత్ఫలితంగా మార్పు చెందుతుంది. మొదట 20 శాతం మేరకే ఉన్న లాభం రేటు, అస్థిర పెట్టుబడి 5 పెరిగిన కారణంగా $23\frac{1}{13}$ శాతానికి పెరుగుతుంది; అదనపు విలువ రేటు మారకుండా ఉంటేనే ఇలా జరుగుతుంది.

అ.పె, మొ.పెల పరిమాణాలకు వ్యతిరేక దిశలో పెరిగితే కూడా, దాన్ని సరళమైన ఉదాహరణగా మార్చవచ్చు. ఉదాహరణకు, మనం మళ్ళీ $80_{స్థి.పె}+20_{అ.పె}+20_{అ.వి}$తో ప్రారంభించి, ఇది $110_{స్థి.పె}+10_{అ.పె}+10_{అ.వి}$గా మారిందనుకుందాం. అప్పుడు మార్పు $40_{స్థి.పె}+10_{అ.పె}+10_{అ.వి}$ మేరకు ఉన్నప్పుడు లాభం రేటు 20% గానే ఉంటుంది. ఈ మధ్యంతర దశకు $70_{స్థి.పె}$ జోడించడం ద్వారా లాభం రేటు $8\frac{1}{3}\%$ కి పడిపోతుంది. ఈ విధంగా మనం మళ్ళీ ఈ ఉదాహరణను ఒక అస్థిరాంశం మాత్రమే, స్థి.పె మాత్రమే మార్పు చెందిన ఉదాహరణగా మార్చాము.

కాబట్టి అ.పె, స్థి.పె, మొపెలు ఏక సమయంలో మారినప్పటికీ అందులో కొత్త విషయాలేమీ ఉండవు. అది అంతిమ విశ్లేషణలో ఒక్క అంశం మాత్రమే మారిన ఉదాహరణకు దారితీస్తుంది.

మిగిలిన ఒకే ఒక ఉదాహరణ కూడా పరిశీలింపబడినట్లే. అంటే అపె, మొపెల భౌతిక పదార్థాల విలువ మార్పుకు గురైనప్పటికీ, అపె, స్థిపెలు మాత్రం సంఖ్యరీత్యా యథాతథంగా ఉండే ఉదాహరణ ఉంది. ఇకపై మార్పువల్ల అపె అన్నది చలనంలో ఉంచబడిన శ్రమ యొక్క మారిన పరిమాణాన్ని సూచిస్తుంది; స్థి.పె అన్నది చలనంలో ఉంచబడిన ఉత్పత్తి సాధనాల యొక్క మారిన పరిమాణాన్ని సూచిస్తుంది.

$80_{స్థి.పె}+20_{అ.పె}+20_{అ.వి}$ పెట్టుబడిలో 20 అ.పె అన్నది రోజుకు 10 గంటలు పనిచేసే 20 మంది కార్మికుల వేతనానికి ప్రాతినిధ్యం వహిస్తుందనుకొందాం. కాగా ఒక్కొక్కరి వేతనం 1 నుంచి $1\frac{1}{4}$ కు పెరిగింది అనుకుందాం. అలా అయితే $20_{అ.పె}$ అన్నది 20 మందికి కాక 16 మంది శ్రామికులు 200 పనిగంటలలో 40 విలువను ఉత్పత్తి చేస్తే రోజుకు 10 గంటల చొప్పున 16 మంది శ్రామికులు 32 విలువను మాత్రమే ఉత్పత్తి చేస్తారు. వేతనాలకు అందులోనుంచి $20_{అ.పె}$ మినహాయించాక 32లో 12 మాత్రమే అదనపు విలువగా మిగులుతుంది. కనుక అదనపు విలువ రేటు స్థిరంగా ఉంటుందని భావించాం. కనుక పని దినాన్ని $\frac{1}{4}$ మేరకు, అంటే 10 నుంచి $12\frac{1}{2}$ గంటలకు పొడిగించాలి. 20 మంది శ్రామికులు రోజుకు 10 గంటల చొప్పున 200 గంటలు పనిచేస్తే 40 విలువ ఉత్పత్తి కాగా, 16 మంది శ్రామికులు రోజుకు $12\frac{1}{2}$ గంటల చొప్పున 200 గంటలు పనిచేస్తే అంతే విలువ ఉత్పత్తి అవుతుంది. $80_{స్థి.పె}+20_{అ.పె}$ పెట్టుబడి ఇంతకు ముందులాగే 20 అదనపు విలువనే సృష్టిస్తుంది.

ఇందుకు భిన్నంగా వేతనాలు పడిపోతే, అంటే $20_{అ.పె}$ గనుక 30 మంది శ్రామికుల వేతనాన్ని ప్రాతినిధ్యం వహించే స్థాయికి అవి పడిపోతే అప్పుడు పనిదినాన్ని 10 గంటల నుంచి $6\frac{2}{3}$ గంటలకు తగ్గిస్తేనే స్థిరంగా వుంటుంది. ఎందువల్లనంటే, $20\times10=30\times6\frac{2}{3}$ = 200 పనిగంటలు

ఈ విభిన్న ఉదాహరణల్లో, డబ్బు రూపంలో వ్యక్తం చేసిన మొ.పె విలువ ఏయే మేరకు మారకుండా ఉంటుందో, అలా ఉన్నప్పటికీ, మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ఉత్పత్తి సాధనాలు విభిన్న పరిణామాలకు అది ఎలా ప్రాతినిధ్యం వహిస్తుందో మనం చాలావరకు ఇదివరకే చర్చించాము. తన

స్వచ్ఛరూపంలో ఈ ఉదాహరణ ఒక మినహాయింపుగా మాత్రమే ఆచరణలోకి వచ్చే అవకాశం వుంది.

ఇక స్థి.పె యొక్క భాగాల విలువ మార్పు సంగతి కొన్ని భాగాలను తగ్గించి, లేదా పెంచి స్థి.పె విలువ మొత్తాన్ని మాత్రం యథాతథంగా ఉంచే మార్పు వల్ల వాస్తవానికి అపె పరిమాణంలో మార్పు రానంత వరకూ, లాభం రేటూ మార్పు చెందదు, అదనపు విలువ రేటూ మార్పు చెందదు.

ఈ విధంగా మనం సమీకరణలోని అ.పె, స్థి.పె అలాగే మొపెలలో సంభవించగల మార్పుల ఉదాహరణలన్నింటినీ పూర్తి చేశాం. స్థి.పెతోనూ, మొ.పెతోనూ అ.పెకి గల నిష్పత్తి ఏ కాస్త మారినప్పటికీ అది లాభం రేటును మార్చగలిగే స్థితిలో ఉండగా, అదనపు విలువ రేటు యథాతథంగా ఉన్నప్పటికీ లాభం రేటు పడిపోనూవచ్చు, మారకుండానూ ఉండవచ్చు. లేదా పెరగనూవచ్చు అన్న విషయమూ గమనించాం.

మనం మరో విషయం కూడా గమనించాం. అపె మీక్క మార్పులలో, ప్రతిచోటా నిర్దిష్టమైన పరిమితి అంటూ ఉంది. ఆ పరిమితి దాటితే, అదనపు విలువ స్థిరంగా ఉండటం ఆర్థిక రీత్యా అసాధ్యం. అ.పె మారకుండా ఉండలేని నిర్దిష్ట పరిస్థితిలో ప్రతి స్థి.పె యొక్క ప్రతి ఏకపక్ష మార్పు కూడా పరిమితిని చేరుకోవలసి ఉంటుంది. కనుక, $\frac{\text{అ.పె}}{\text{మొ.పె}}$ లో రాగల మార్పుకు ఒక పరిమితి అంటూ ఉంటుంది. ఆ పరిమితి దాటితే అ.వి' కూడా మార్పు చెందుతుంది. మనమిప్పుడు అ.వి' మార్పుల గురించి చర్చిద్దాం. అవి[1] మార్పులలో మన సమీకరణలోని విభిన్న అస్థిర అంశాల పరస్పర ప్రభావం మరింత స్పష్టంగా కనిపిస్తుంది.

II. అ.వి' అస్థిరాంశం

ల' = అ.వి' $\frac{\text{అ.పె}}{\text{మొ.పె}}$ సమీకరణను మనం $\text{ల}'_1$ = $\text{అ.వి}'_1$, $\frac{\text{అ.పె}}{\text{మొ.పె}_1}$ సమీకరణగా మార్చడం ద్వారా $\frac{\text{అ.పె}}{\text{మొ.పె}}$ స్థిరంగా ఉంటుందా, ఉండదా అన్నదానితో నిమిత్తం లేకుండా విభిన్న అదనపు విలువ రేట్లు గల లాభం రేట్లను ఒక సార్వత్రిక సూత్రాన్ని మనం పొందగలం. కాగా ఈ రెండవ సమీకరణలో $\text{ల}_1'$, $\text{అ.వి}'_1$, $\text{అ.పె}'_1$ అలాగే $\text{మొ.పె}_1$ ఇవన్నీ $\text{ల}'_1$, $\text{అ.వి}'_1$, అ.పె అలాగే మొ.పెల యొక్క మారిన విలువలను సూచిస్తాయి. అప్పుడు ఈ క్రింది సూత్రం లభిస్తుంది.

$$\text{ల}' : \text{ల}'_1 = \text{అ.వి}'_1 \frac{\text{అ.పె}}{\text{మొ.పె}} : \text{అవి}'_1 \frac{\text{అ.పె}_1}{\text{మొ.పె}}$$

కనుక

$$\text{ల}'_1 = \frac{\text{అ.వి}'_1}{\text{అ.వి}} \times \frac{\text{అ.పె}_1}{\text{అ.పె}} \times \frac{\text{మొ.పె}}{\text{మొ.పె}} \times \text{ల}'$$

1. అ.వి' మార్పు చెందేదీ, $\frac{\text{అ.పె}}{\text{మొ.పె}}$ స్థిరమైనది.

ఈ ఉదాహరణలో ఈ క్రింది సమీకరణలు లభిస్తాయి.

$$\text{ల}' = \text{అ.వి}' \frac{\text{అ.పె}}{\text{మొ.పె}}; \quad \text{ల}'_1 = \text{అవి}'_1 \frac{\text{అ.పె}}{\text{మొ.పె}}$$

ఈ రెండింటిలో $\frac{\text{అ.పె}}{\text{మొ.పె}}$ సమానంగా ఉంటుంది;

కాబట్టి $\text{ల}' : \text{ల}'_1 = \text{అవి}' : \text{అవి}'_1$

ఒకే అంతర్నిర్మాణం గల రెండు పెట్టుబడుల యొక్క లాభం రేట్లు, ఆ పెట్టుబడుల తాలూకు అదనపు విలువ రేట్లున్న నిష్పత్తిలో ఉంటాయి. $\frac{\text{అ.పె}}{\text{మొ.పె}}$ భిన్నరాశికి అ.పె, మొ.పెల నిరపేక్ష పరిమాణాలతో ప్రమేయం లేదు. అది వాటి నిష్పత్తి మాత్రమే. కాబట్టి వాటి నిరపేక్ష పరిమాణాలు ఎలా వున్నా సమాన అంతర్నిర్మాణం గల అన్ని పెట్టుబడులకూ ఇది వర్తిస్తుంది.

$80_{\text{స్థి.పె}} + 20_{\text{అ.పె}}+20_{\text{అ.వి}}$; మొ.పె = 100, అ.వి' = 100% ల' = 20%

$160_{\text{స్థి.పె}}+40_{\text{అ.పె}}+20_{\text{అ.వి}}$; మొ.పె = 200, అ.వి' = 50% ల' = 10%

100% : 50% = 20% : 10%

రెండు ఉదాహరణల్లోనూ అ.పె, మొ.పెల నిరపేక్ష పరిమాణాలు ఒకే విధంగా ఉన్నప్పుడు లాభం రేట్లు కూడా పరస్పరం అదనపు విలువ మొత్తాలున్న నిష్పత్తిలోనే ఉంటాయి.

ల':$\text{ల}_1$' = అ.వి' అ.పె:అవి' అ$\text{పె}_1$=అవి':అవి'$_1$

ఉదాహరణకు :

$80_{\text{స్థి.పె}}+20_{\text{అ.పె}}+20_{\text{అ.వి}}$; అ.వి' = 100% ల' = 20%

80స్థి.పె+20అ.పె+10అ.వి; అ.వి' = 50% ల' = 10%

20%:10% = 100×20:50×20 = $20_{\text{అ.వి}}$:$10_{\text{అ.వి}}$

పెట్టుబడుల అంతర్నిర్మాణం నిరపేక్షంగా కానీ, శాతాల రీత్యా కాని సమానంగా ఉన్నప్పుడు వేతనాలు మారితేనూ లేదా పనిదిన పరిమాణం మారితేనూ లేదా శ్రమ తీవ్రత మారితేనూ మాత్రమే వాటి అదనపు విలువ రేట్ల మధ్య తేడా ఉంటుందన్న విషయం ఇప్పుడు స్పష్టం అయింది.

I. $80_{\text{స్థి.పె}}+20_{\text{అ.పె}}+10_{\text{అ.వి}}$; అ.వి' = 50%, ల' = 10%

II. $80_{\text{స్థి.పె}}+20_{\text{అ.పె}}+20_{\text{అ.వి}}$; అ.వి' = 100%, ల' = 20%

III. $80_{\text{స్థి.పె}}+20_{\text{అ.పె}}+40_{\text{అ.వి}}$; అ.వి' = 200%, ల' = 40%

ఈ మూడు ఉదాహరణల్లో :

I లో ఉత్పత్తి అయిన మొత్తం విలువ 30 ($20_{\text{అ.పె}}+10_{\text{అ.వి}}$); II లో 40; III లో 60. ఇది మూడు విభిన్న పద్ధతుల్లో సంభవించవచ్చు.

మొదటిది – వేతనాలు విభిన్నంగా ఉండి, $20_{\text{అ.పె}}$ అన్నది ప్రతి వ్యక్తిగత ఉదాహరణలోనూ విభిన్న సంఖ్య కార్మికులకు ప్రాతినిధ్యం వహిస్తే I వ పెట్టుబడి ఒక్కో శ్రామికుడికి $1\frac{1}{3}$ పౌండు వేతనంతో రోజుకు 10 గంటల చొప్పున 15 మంది శ్రామికులను నియుక్తం చేసుకుందనుకుంటే వారు 30 పౌండ్ల విలువను ఉత్పత్తి చేస్తారు; అందులో 20 పౌండ్లు వేతనాలను భర్తీ చేస్తుంది; 10 పౌండ్లేమో అదనపు విలువ. వేతనాలు ఒక పౌండుకు తగ్గిపోతే 10 గంటల చొప్పున 20 మంది శ్రామికులను నియుక్తం చేసుకోవచ్చు; అప్పుడు వారు 40 పౌండ్ల విలువను ఉత్పత్తి చేస్తారు; అందులో 20 పౌండ్లు వేతనాలను భర్తీ చేస్తే 20 పౌండ్లు అదనపు విలువగా ఉంటుంది. వేతనాలు మరింతగా, అంటే $\frac{2}{3}$ పౌండుకు పడిపోతే 10 గంటల చొప్పున 30 మంది శ్రామికులను నియుక్తం చేసుకోవచ్చు. వారు 60 పౌండ్ల విలువ ఉత్పత్తి చేస్తారు; అందులో 20 పౌండ్లు వేతనాలకు మినహాయించగా మిగతా 40 పౌండ్లు అదనపు విలువకు ప్రాతినిధ్యం వహిస్తాయి.

పెట్టుబడి శాతాల్లో స్థిరమైన అంతర్నిర్మాణ స్వరూపం, స్థిరమైన పనిదినం, స్థిరమైన శ్రమ తీవ్రత వేతనాల్లో మార్పు మూలంగా అదనపు విలువ రేటులో మార్పు ఉన్నా ఈ ఉదాహరణలో మాత్రమే రికార్డో ఊహ సరైంది. ఆయన ఊహ ఇదీ : "వేతనాలు తగ్గిన లేక పెరిగిన నిష్పత్తిలోనే సరిగా లాభం పెరుగుతుంది లేక తగ్గుతుంది" (Principles ch.I Sect. IIIp.18 of the works of D. Ricardo, ed. by Mec Culloch, 1852)

లేక రెండవది – శ్రమ తీవ్రత మార్పుచెందే పక్షంలో ఈ ఉదాహరణలో రోజుకు 10 గంటల చొప్పున పనిచేసే 20మంది శ్రామికులు అదే ఉత్పత్తి సాధనాలతో I లో 30 సరుకులు, IIలో 40 సరుకులు IIIలో 60 సరుకులు ఉత్పత్తి చేస్తారు. వాటిలోని ప్రతి సరుకులోనూ పొందుపడివున్న ఉత్పత్తి సాధనాల విలువ కాక, అది I పౌండు నూతన విలువకు కూడా ప్రాతినిధ్యం వహిస్తుంది. కాబట్టి I లో 20 సరుకులు 20 పౌండ్ల వేతనాలకు ప్రాతినిధ్యం వహించగా, మిగిలిన 10 పౌండ్లకు సమానంగా వున్న 10 సరుకులు అదనపు విలువకు ప్రాతినిధ్యం వహిస్తాయి. IIలో 20 పౌండ్లకు సమానంగా ఉన్న 20 సరుకులు, IIIలో 40 పౌండ్లకు సమానంగా వున్న 40 సరుకులు అదనపు విలువకు ప్రాతినిధ్యం వహిస్తాయి.

లేక మూడవది – పని దినం పరిమాణంలో తేడా. I లో 20 మంది శ్రామికులు ఒకే శ్రమ తీవ్రతతో 9 గంటలూ, II లో 12 గంటలూ, IIIలో 18 గంటలూ పనిచేస్తే వారి మొత్తం ఉత్పాదితాలు, 30:40:60, 9:12:18 ఉన్న నిష్పత్తులలోనే మారుతాయి. ప్రతి ఉదాహరణలోనూ వేతనాలు 20 పౌండ్లకు సమానం కనుక 10,20,40 అదనపు విలువగా మిగుల్తాయి :

కాబట్టి వేతనాల పెరుగుదల కానీ, తరుగుదల కానీ అదనపు విలువ రేటును వ్యతిరేక దిశలో ప్రభావితం చేస్తాయి. కాగా శ్రమ తీవ్రతలోని పెరుగుదల లేక తరుగుదల పనిదినం పొడిగింపు లేక తగ్గింపు అదనపు విలువ రేటును సానుకూల దిశలో ప్రభావితం చేస్తాయి. $\frac{\text{అ.పె}}{\text{మొ.పె}}$ స్థిరంగా ఉన్నట్లయితే, ఇవి లాభం రేటును కూడా ఇదే విధంగా సానుకూల దశలో ప్రభావితం చేస్తాయి.

2. అ.వి', అ.పె అస్థిరమైనవి, మొ.పె స్థిరమైనది. ఈ ఉదాహరణకు ఈ క్రింది నిష్పత్తి వర్తిస్తుంది.

$$\text{ల}':\text{ల}'_1 = \text{అ.వి}^1 \frac{\text{అ.పె}}{\text{మొ.పె}} : \text{అ.వి}'_1 \frac{\text{అ.పె}}{\text{మొ.పె}} = \text{అ.వి}'\ \text{అ.పె} = \text{అ.వి}'_1\ \text{అ.పె}_1 = \text{అ.వి}:\text{అ.వి}_1.$$

లాభం రేట్ల మధ్య సంబంధం వాటి అదనపు విలువ మొత్తాల మధ్య సంబంధంగా ఉంటుంది.

అస్థిర పెట్టుబడి స్థిరంగా ఉండి, అదనపు విలువ రేటులో మార్పులు ఉన్నప్పుడు ఉత్పత్తి అయిన విలువ పరిమాణంలోనూ పంపిణీలోనూ మార్పుకు దారితీసింది. అపెలోనూ, అవి'లోనూ ఏక సమయంలో మార్పు జరిగినట్లయితే, పంపిణీలో మార్పు ఉంటుంది. కానీ ఉత్పత్తి అయిన విలువ పరిమాణంలో ఎల్లప్పుడూ మార్పు ఉండదు. మూడు ఉదాహరణలకు వీలుంది.

అ) అ.పె, అ.వి'ల మార్పులు పరిమాణంలో ఒకే రకంగా ఉండి వ్యతిరేక దిశలో సాగుతాయి. ఉదాహరణకు

$80_{\text{స్థి.పె}}+20_{\text{అ.పె}}+10_{\text{అ.వి}}$; అ.వి'=50%, ల'=10%

$90_{\text{స్థి.పె}}+10_{\text{అ.పె}}+20_{\text{అ.వి}}$; అ.వి'=200%, ల'=20%

ఉత్పత్తి అయిన విలువ రెండింటిలోనూ సమానమే కనుక చేసిన శ్రమ పరిమాణం కూడా సమానమే; అంటే $20_{\text{అ.పె}}+10_{\text{అ.వి}}=10_{\text{అ.పె}}+20_{\text{అ.వి}} = 30$. ఇక్కడ ఉన్న తేడా ఏమిటంటే, మొదటి ఉదాహరణలో వేతనాలకు 20 చెల్లించగా అదనపు విలువగా 10 మిగిలితే, రెండవ ఉదాహరణలో వేతనాలు 10 కాగా అదనపు విలువేమో 20. శ్రామికుల సంఖ్య శ్రమతీవ్రత, పనిదినం పరిమాణం మారకుండా, అ.పె, అ.వి'లు ఏక సమయంలో మార్పుచెందే ఏకైక ఉదాహరణ ఇది.

ఆ) అ.వి', అ.పెల మార్పు వ్యతిరేక దిశల్లో ఉంటుంది కానీ అది ఒకే పరిమాణంలో కాదు. అప్పుడు అ.పె యొక్క మార్పు కానీ అ.వి' యొక్క మార్పు కానీ ఒకదాన్ని మరొకటి అధిగమిస్తుంది.

I. $80_{\text{స్థి.పె}}+20_{\text{అ.పె}}+10_{\text{అ.వి}}$; అ.వి'=100%, ల'=20%

$72_{\text{స్థి.పె}}+28_{\text{అ.పె}}+20_{\text{అ.వి}}$; అ.వి'=$71\frac{3}{7}$%, ల'=20%

$84_{\text{స్థి.పె}}+16_{\text{అ.పె}}+20_{\text{అ.వి}}$; అవి'=125%, ల'=20%

I వ పెట్టుబడి ఉత్పత్తి అయిన 40 విలువకు $20_{\text{అ.పె}}$ చెల్లింపుకు ఖర్చు చేస్తుంది; IIవ పెట్టుబడి ఉత్పత్తి అయిన 48 విలువకు $28_{\text{అ.పె}}$ చెల్లింపుకు ఖర్చు చేస్తుంది; III వ పెట్టుబడేమో ఉత్పత్తి అయిన 36 విలువకు $16_{\text{అ.పె}}$ చెల్లింపుకు ఖర్చు చేస్తుంది. అయితే ఉత్పత్తి అయ్యే విలువలో మార్పు ఉంటే చేసిన శ్రమ పరిమాణంలో సైతం మార్పు ఉండక తప్పదు కనుక శ్రామికుల సంఖ్యలో పనిగంటల్లో, శ్రమ తీవ్రతలో మార్పుగా, లేక ఈ మూడింటికిగాను రెండింటిలో గానీ మార్పుగా ఉంటుంది.

ఇ) అ.వి'లోనూ, అ.పెలోనూ ఒకే దిశలో మార్పు జరుగుతుంది. అప్పుడు ఇందులో ఒకటి మరొక దాని ప్రభావాన్ని తీవ్రతరం చేస్తుంది.

$90_{\text{స్థి.పె}}+10_{\text{అ.పె}}+ 10_{\text{అ.వి}}$; అ.వి' = 100%, ల' = 10%

$80_{\text{స్థి.పె}}+ 20_{\text{అ.పె}}+ 30_{\text{అ.వి}}$; అ.వి' = 150%, ల' = 30%

$92_{\text{స్థి.పె}}+ 8_{\text{అ.పె}}+ 6_{\text{అ.వి}}$; అ.వి' = 75%, ల' = 6%

ఇక్కడ కూడా ఉత్పత్తి అయిన విలువలు భిన్నమైనవే, అవి 20,50,14 ఆయా శ్రమ పరిమాణాల్లోని ఈ తేడాను శ్రామికుల సంఖ్యలో, శ్రమ గంటల్లో, శ్రమ తీవ్రతలో తేడాగా లేదా ఇందులో కొన్నింటి తేడాగా లేక అన్నింటి తేడాగా తేలుతుంది.

3) అ.వి', అ.పె, మొ.పె అస్థిరాలు

ఈ ఉదాహరణలో కూడా కొత్త అంశాలేమీలేవు. అ.వి' అస్థిరంగా ఉండే IIలోని సార్వత్రిక సూత్రం దీనిని పరిష్కరిస్తుంది.

★ ★ ★

కనుక, లాభం రేటుపై అదనపు విలువ రేటు పరిమాణంలోని మార్పు ప్రభావం ఈ క్రింది ఉదాహరణలకు దారితీస్తోంది :

1. $\frac{\text{అ.పె}}{\text{మొ.పె}}$ గనుక స్థిరంగా ఉంటే అ.వి' ఏ నిష్పత్తిలో తగ్గుతుందో లేక పెరుగుతుందో ల' కూడా అదే నిష్పత్తిలో తగ్గుతుంది లేక పెరుగుతుంది.

$80_{\text{స్థి.పె}}+20_{\text{అ.పె}}+20_{\text{అ.వి}}$; అ.వి'=100%, ల'=20%

$80_{\text{స్థి.పె}}+20_{\text{అ.పె}}+10_{\text{అ.వి}}$; అ.వి'=50%, ల'=10%

100% : 50% = 20% : 10%

2. అవి' కదిలిన దిశలోనే $\frac{\text{అ.పె}}{\text{మొ.పె}}$ కూడా కదిలే పక్షంలో అవి' కంటే ల' ఎక్కువ వేగంగా పెరుగుతుంది లేక తగ్గుతుంది; అంటే అ.వి' పెరిగితే అది పెరుగుతుంది. అ.వి' తగ్గితే అది తగ్గుతుంది.

$80_{\text{స్థి.పె}}+20_{\text{అ.పె}}+10_{\text{అ.వి}}$; అ.వి'=50%, ల'=10%

$70_{\text{స్థి.పె}}+30_{\text{అ.పె}}+20_{\text{అ.వి}}$; అ.వి'=$66\frac{2}{3}$ %, ల'=20%

50% : $66\frac{2}{3}$% < 10%:20%

3) $\frac{\text{అ.పె}}{\text{మొ.పె}}$ గనుక అ.వి'కు వ్యతిరేకదిశలో, కానీ దానికన్నా తక్కువ వేగంగా మారినప్పుడు, అ.వి' కన్నా తక్కువ వేగంగా ల' పెరుగుతుంది లేదా తగ్గుతుంది.

$80_{\text{స్థి.పె}}+20_{\text{అ.పె}}+10_{\text{అ.వి}}$; అ.వి' = 50%, ల' = 10%

$90_{\text{స్థి.పె}}+10_{\text{అ.పె}}+15_{\text{అ.వి}}$; అ.వి' = 150%, ల' = 15%

50%:150% > 10%:15%

4) అ.వి' కంటే వేగంగానూ దీనికి వ్యతిరేకదిశలోనూ $\frac{\text{అ.పె}}{\text{మొ.పె}}$ గనుక మార్పు చెందినప్పుడు, అ.వి' తగ్గితే ల' పెరుగుతుంది. అవి' పెరిగితే ల' తగ్గుతుంది.

$80_{\text{స్థి.పె}}+20_{\text{అ.పె}}+20_{\text{అ.వి}}$; అవి' = 100%, ల' = 20%

$90_{\text{స్థి.పె}}+10_{\text{అ.పె}}+15_{\text{అ.వి}}$; అవి' = 150%, ల' = 15%

అ.వి' 100% నుంచి 150% కి పెరిగింది. ల' ఏమో 20% నుంచి 15% కి తగ్గింది.

5 $\frac{\text{అ.పె}}{\text{మొ.పె}}$ గనుక అ.వి'కి వ్యతిరేక దిశలోనూ అయితే అదే నిష్పత్తిలోనూ మార్పు చెందినప్పుడు, అ.వి' పెరుగుదలతోనూ తరుగుదలతోనూ నిమిత్తం లేకుండా ల' స్థిరంగా ఉంటుంది.

ఈ ఆఖరి ఉదాహరణను మాత్రం కొద్దిగా వివరించాలి. అదనపు విలువ యొక్క ఒకే రేటును విభిన్న లాభం రేట్లలో వ్యక్తీకరించవచ్చునని $\frac{\text{అ.పె}}{\text{మొ.పె}}$ మార్పుల్లో మనం గమనించాం. ఇప్పుడు మనం ఒకే లాభం రేటు విభిన్న అదనపు విలువ రేట్ల ప్రాతిపదికపై ఉండవచ్చునన్న విషయం చూస్తున్నాం. అయితే అ.వి' స్థిరంగా ఉండే పక్షంలో, మొ.పెతో అ.పెకి గల నిష్పత్తిలో ఏ మాత్రం మార్పువచ్చినా లాభం రేటులో మార్పుకు అది దారితీస్తుంది; కానీ లాభం రేటు స్థిరంగా ఉండాలంటే అ.వి' పరిమాణంలోని మార్పు, దానికి వ్యతిరేకదిశలో $\frac{\text{అ.పె}}{\text{మొ.పె}}$ మార్పుకు దారితీయకతప్పదు. ఒకే పెట్టుబడి విషయంలో, లేక ఒకే దేశంలోని రెండు పెట్టుబడుల విషయంలో ఇది అరుదుగా మాత్రమే సాధ్యం; ఉదాహరణకు ఈ క్రింది పెట్టుబడి ఉందనుకుందాం:

$80_{\text{స్థి.పె}}+20_{\text{అ.పె}}+20_{\text{అ.వి}}$; మొ.పె = 100. అ.వి' = 100% ల' = 20%

$20_{\text{అ.పె}}$ కి బదులు 16అపె ఖర్చుతోనే అదే సంఖ్యలలో శ్రామికులను నియమించుకోగలిగే

స్థాయికి వేతనాలు పడిపోయాయనుకుందాం. అప్పుడు మిగతా అంశాలు యథాతథంగా ఉండి, 4 అపె గనుక విడుదల అయితే ఇలా ఉంటుంది.

$80_{\text{స్థి.పె}}+16_{\text{అ.పె}}+24_{\text{అ.వి}}$; మొ.పె=96, అ.వి' = 150%, ల' = 25%. ముందులాగే ఇప్పుడు కూడా ల' అన్నది 20%గా ఉండాలంటే, మొత్తం పెట్టుబడి 120కి పెరగక తప్పదు; కనుక ఆ మేరకు స్థిర పెట్టుబడి 104 కు పెరగక తప్పదు.

$104_{\text{స్థి.పె}}+16_{\text{అ.పె}}+24_{\text{అ.వి}}$; మొ.పె = 120, అ.వి' = 150%, ల' = 20%

వేతనాలు పడిపోవడంతోపాటు శ్రమ ఉత్పాదకతలో మార్పువచ్చి, తత్కారణంగా పెట్టుబడి అంతర్నిర్మాణ స్వరూపంలో స్థిర పెట్టుబడి విలువ 80 నుంచి 104కు పెరిగినప్పుడు ఇది సాధ్యమవుతుంది. ఒక్కమాటలో చెప్పాలంటే అసాధారణ సందర్భాల్లో సంభవించే పరిస్థితులన్నీ యాదృచ్ఛికంగా ఒకేసారి సంభవించాలన్నమాట. వాస్తవంలో అ.పె మారవలసిన అవసరం లేకుంటే, ఆవిధంగా $\frac{\text{అ.పె}}{\text{మొ.పె}}$ మారవలసిన అవసరం లేకుండా అ.వి' మారడమనేది, చాలా నిర్దిష్ట పరిస్థితుల్లోనే సాధ్యం. శ్రమ పదార్థాలను ప్రకృతే సరఫరా చేస్తుండగా కేవలం నిశ్చల పెట్టుబడి, శ్రమ పెట్టుబడి నియుక్తమైన పరిశ్రమల్లోనే సాధ్యం.

అయితే రెండు భిన్నదేశాల లాభం రేట్లను పోల్చి చూసినపుడు పరిస్థితి ఇలా ఉండదు. ఎందుచేతనంటే అలాంటి సందర్భంలో చాలావరకు విభిన్న అదనపు విలువ రేట్లపై ఒకే లాభం రేటు ఆధారపడి ఉంటుంది.

ఈ అయిదు ఉదాహరణలను బట్టి మనకొక విషయం స్పష్టమవుతున్నది; లాభం రేటు పెరిగితే దానికి అనుగుణంగా అదనపు విలువ రేటు తగ్గవచ్చు లేదా పెరగవచ్చు; లాభం రేటు తగ్గితే అదనపు విలువ రేటు పెరగవచ్చు, లేదా తగ్గవచ్చు; లాభం రేటు స్థిరంగా ఉన్నప్పటికీ అదనపు విలువ రేటు పెరగనూవచ్చు, తరగనూవచ్చు. లాభం రేటు పెరిగినా, తగ్గినా లేక స్థిరంగా ఉన్నా అదనపు విలువ రేటు యథాతథంగా ఉండొచ్చునని I లో మనం గమనించాం.

★ ★ ★

కనుక లాభం రేటు రెండు ప్రధాన అంశాలపై ఆధారపడి ఉంటుంది – అదనపు విలువ రేటు, పెట్టుబడి యొక్క విలువ అంతర్నిర్మాణం. పెట్టుబడి తాలూకు రెండు భాగాల్లో ఏ భాగం వల్ల మార్పు వచ్చిందన్నది ముఖ్యమైన విషయం కాదు కాబట్టి ఈ అంతర్నిర్మాణాన్ని శాతంలో ఇవ్వడం ద్వారా ఈ రెండు ప్రధాన అంశాల ప్రభావాన్ని ఈ క్రింది విధంగా సంక్షిప్తీకరించవచ్చు;

రెండు విభిన్న పెట్టుబడుల లాభం రేట్లు, లేక రెండు విభిన్న పరిస్థితుల్లో ఒకే పెట్టుబడి తాలూకు లాభం రేట్లు ఏ పరిస్థితుల్లో సమానంగా ఉంటాయంటే

1. పెట్టుబడుల అంతర్నిర్మాణ రూపం శాతాల్లో ఒకటే అయినప్పుడు, అదనపు విలువరేట్లు సమానంగా ఉన్నప్పుడు;
2. వాటి అంతర్నిర్మాణ రూపం శాతాల్లో ఒకటే కానప్పుడు, అదనపు విలువరేట్లు అసమంగా ఉన్నప్పుడు, అదనపు విలువ రేట్లను పెట్టుబడిలోని అస్థిర భాగాల శాతంతో భాగించగా

వచ్చిన ఫలితం అంటే $\frac{\text{అ.వి'}}{\text{అ.పె}}$ రెంటిలోనూ ఒకటే అయినప్పుడు, మొత్తం పెట్టుబడిలో శాతంగా లెక్కగట్టిన అదనపు విలువ మొత్తాలు (అ.వి=అ.వి'అ.పె) సమానంగా ఉన్నప్పుడు, ఇంకో విధంగా చెప్పాలంటే, రెండు సందర్భాల్లోనూ అ.వి', అపెలు పరస్పరం విలోమ నిష్పత్తిలో ఉన్నప్పుడు.

కాగా అవి ఏ పరిస్థితుల్లో అసమంగా ఉంటాయంటే...

1. శాతాల్లో అంతర్నిర్మాణ రూపం ఈ సందర్భంలో లాభం రేట్లు అసమంగా ఉన్నప్పుడు, ఈ సందర్భంలో లాభం రేట్లు అదనపు విలువరేట్లున్న నిష్పత్తిలోనే ఉంటాయి.
2. అదనపు విలువ రేట్లు ఒకే విధంగా ఉండి, శాతాల్లో అంతర్నిర్మాణ రూపం అసమంగా ఉన్నప్పుడు, పెట్టుబడుల తాలూకు అస్థిర భాగాలున్న సందర్భంలో ఈ నిష్పత్తిలోనే లాభం రేట్లుంటాయి.
3. అదనపు విలువ రేట్లు అసమంగా ఉన్నప్పుడు, అంతర్నిర్మాణ రూపం శాతాల్లో ఒకే విధంగా లేనప్పుడు, ఈ సందర్భంలో లాభం రేట్లు, అ.వి' అ.పె గుణాకార లబ్దాలున్న నిష్పత్తిలోనే ఉంటాయి. అంటే, మొత్తం పెట్టుబడిలో శాతంగా లెక్కగట్టబడిన అదనపు విలువ మొత్తాలున్న నిష్పత్తులలో ఉంటాయి.[1]

★ ★ ★

1. అదనపు విలువ రేటుకు లాభం రేటుకు మధ్య గల తేడాకు (అ.వి'-ల') సంబంధించిన వివరమైన లెక్కలు ప్రతిలో వున్నాయి. ఈ తేడాకు ఆసక్తికరమైన ప్రత్యేకతలున్నాయి; ఈ రెండు రేట్లు, ఒకదానికొకటి ఎక్కడ ఎడమవుతూ వస్తాయో, ఎక్కడ పరస్పరం సమీపిస్తాయో ఈ తేడా గమనం సూచిస్తుంది. ఈ గమన క్రమాలను రేఖల ద్వారా కూడా సూచించొచ్చు. ఈ వివరాలను ఇక్కడ ఇవ్వడం లేదు. ఎందువల్లనంటే, ఈ గ్రంథ తక్షణ లక్ష్యాల దృష్ట్యా వాటికి అట్టే ప్రాముఖ్యం లేదు; ఈ అంశాన్ని ఇంతకు మించి పరిశీలించగోరే వారి దృష్టికి పై విషయం తీసుకురావడం ఇక్కడ చాలు. **ఫ్రెడరిక్ ఎంగెల్స్.**

## అధ్యాయం - 4

# లాభం రేటుపై టర్నోవర్ ప్రభావం

**అ**దనపు విలువ ఉత్పత్తిపైనా, పర్యవసానంగా లాభంపైనా టర్నోవర్ ప్రభావం గురించి రెండవ సంపుటిలో చర్చించాం. దాన్ని సంక్షిప్తంగా సమాహరించి చెబితే, దాని తాత్పర్యం ఇది: టర్నోవర్‌కు కొంత కాలవ్యవధి అవసరం కాబట్టి, మొత్తం పెట్టుబడినంతా ఒకేసారి ఉత్పత్తిలో నియుక్తం చేయడం సాధ్యంకాదు; డబ్బు పెట్టుబడి రూపంలో కానీ, ముడిపదార్థాల రూపంలో కానీ తయారైనప్పటికీ ఇంకా అమ్మకంకాని సరుకు పెట్టుబడి రూపంలో కానీ, వసూలు చేసుకోవాల్సిన అప్పుల రూపంలో కానీ పెట్టుబడిలో కొంత ఎల్లప్పుడూ క్రియాశూన్యంగా ఉంటుంది; కనుక క్రియాశీల ఉత్పత్తిలోని పెట్టుబడి, అంటే అదనపు విలువను ఉత్పత్తి చేసి స్వాయత్తం చేసుకునే క్రమాల్లోని పెట్టుబడి ఎల్లప్పుడూ ఈ మేరకు తగ్గుతుంది. ఉత్పత్తి అయి, స్వాయత్తం అయిన అదనపు విలువ కూడా ఆ మేరకు తగ్గుతుంది. ఇతర పరిస్థితులు యధాతథంగా ఉన్నప్పుడు టర్నోవర్ వ్యవధి తక్కువగా ఉన్నకొద్దీ, మొత్తం పెట్టుబడితో పోలిస్తే ఇలా క్రియాశూన్యంగా పడివుండే పెట్టుబడి భాగం తక్కువ ఉంటుంది. కాబట్టి స్వాయత్తం అయిన అదనపు విలువ ఎక్కువవుతూ ఉంటుంది.

టర్నోవర్ కాలం తగ్గితే, లేక దాని రెండు విభాగాలైన ఉత్పత్తి కాలం, చలామణి కాలం, ఈ రెంటిలో ఏదో ఒకటి తగ్గితే అదనపు విలువ పరిమాణం ఎలా పెరుగుతుందో రెండవ సంపుటిలో సవివరంగా నిరూపించాం. అయితే లాభం రేటు అన్నది ఉత్పత్తి అయిన అదనపు విలువ పరిమాణానికీ, దాని ఉత్పత్తి కోసం నియుక్తమైన మొత్తం పెట్టుబడికీ మధ్యగల నిష్పత్తిని వ్యక్తం చేస్తుంది; కాబట్టి టర్నోవర్ కాలం తగ్గితే లాభం రేటు పెరుగుతుందనేది స్వయం విదితమే. రెండవ సంపుటి, రెండవ భాగంలో అదనపు విలువ గురించి చెప్పిన ప్రతిదీ లాభానికీ, లాభం రేటుకు కూడా సమానంగా వర్తిస్తుంది. కనుక వాటిని ఇక్కడ మళ్ళీ చెప్పవలసిన అవసరం లేదు. కొన్ని ప్రధానమైన అంశాలను మాత్రమే నొక్కి చెప్పాలనుకుంటున్నాం.

ఉత్పత్తి కాలాన్ని తగ్గించే ప్రధాన సాధనం అధిక శ్రమ ఉత్పాదకత. దీన్నే మామూలుగా పారిశ్రామిక ప్రగతి అంటుంటారు. ఖర్చుతో కూడిన యంత్రాల స్థాపన వగైరాల వల్ల మొత్తం పెట్టుబడి వ్యయం గనుక అదే సమయంలో గణనీయంగా పెరగడానికి, మొత్తం పెట్టుబడిని బట్టి లెక్కగట్టబడే లాభం రేటు దాని మూలంగా తగ్గడానికి ఈ ప్రగతి దారితీయకుంటే, ఈ రేటు పెరగక తప్పదు. లోహకార పరిశ్రమలు, రసాయనిక పరిశ్రమలలోని ఆధునిక మెరుగుదలలు చాలావాటిలో ఇది నిస్సందేహంగా వాస్తవం. ఇనుము, ఉక్కు ఉత్పాదనలో ఇటీవల కనుగొన్న పద్ధతులు – బెసెమర్, సీమెన్స్, గిల్‌క్రిస్ట్ – థామస్ వగైరాల పద్ధతులు; వ్యయ ప్రయాసలతో కూడుకొన్న మునుపటి

ఉత్పాదన క్రమాలను సాపేక్షంగా తక్కువ ఖర్చుతో కనీస స్థాయికి తగ్గించాయి. బొగ్గు – తారునుంచి ఉత్పత్తి అయ్యే ఒక ఎర్రని అద్దకపు రంగు పదార్థమైన అలిజారిన్ తయారు కావడానికి నేడు కేవలం కొన్ని వారాలు చాలు. లోగడైతే దీన్ని ఉత్పత్తి చేయడానికి కొన్ని సంవత్సరాలు పట్టేది. బొగ్గు – తారు అద్దకపు రంగును ఉత్పత్తి చేసే ఇప్పటి యంత్రాలతోనే ఇది సాధ్యమవుతున్నది. పూర్వం రంగుటద్దకం తయారీలో ఉపయోగపడే మంజిష్టతీగె బాగా పెరగాలంటే సంవత్సరం పట్టేది; మరికొన్ని ఏళ్ళపాటు వాటి వేళ్ళను పెరగనివ్వడం పరిపాటి. అప్పుడు కానీ వాటిని రంగు తయారీకి వాడేవారు కాదు.

చలామణి కాలాన్ని తగ్గించే ప్రధాన సాధనం అభివృద్ధి చెందిన కమ్యూనికేషన్లు (వార్తా, రవాణా సౌకర్యాలు). గత యాభై ఏళ్ళ కాలం ఈ రంగంలో విప్లవం తెచ్చింది; 18వ శతాబ్దపు ఉత్తరార్థంలోని పారిశ్రామిక విప్లవంతో పోల్చతగిన విప్లవం ఇది. భూ ఉపరితలంపై కంకర రోడ్ల స్థానంలో రైలు మార్గాలు వచ్చాయి; సముద్రంలో నిదానంగానూ, ఒక క్రమపద్ధతి లేకుండా ప్రయాణించే ఓడలను వెనక్కు నెట్టేసి వాటి స్థానంలోకి వేగంగానూ, నమ్మకంగానూ ప్రయాణించే స్టీం బోట్లు వచ్చాయి, భూగోళమంతటా టెలిగ్రాఫ్ తీగల వలయం పరచుకుంటున్నది. తూర్పు ఆసియా, ఆస్ట్రేలియాలకు స్టీంబోట్ల రాకపోకలకు సూయజ్ కాలువ ద్వారాలు పూర్తిగా తెరుచుకున్నాయి. తూర్పు ఆసియాకు వెళ్ళే ఒక ఓడ సరుకుల చలామణికి 1847లో (cf.Buch II. S.235) కనీసం పన్నెండు మాసాలు పట్టేది; ఇప్పుడది దాదాపు పన్నెండు వారాలకు తగ్గిపోయింది. 1825–1857 సంక్షోభాల తాలూకు రెండు అతి పెద్ద కేంద్రాలైన అమెరికా, ఇండియాలు రవాణా రంగంలో జరిగిన ఈ విప్లవం వల్ల యీనాడు యూరప్ పారిశ్రామిక దేశాలకు 70 నుంచి 90 శాతం మేరకు మరింత దగ్గరగా వచ్చాయి. తద్వారా వాటి ప్రజ్వలన స్వభావం బాగా తగ్గిపోయింది. ఈ మేరకు మొత్తం ప్రపంచ వాణిజ్యం తాలూకు టర్నోవర్ కాలం తగ్గిపోయింది. దీనిలో నియుక్తం అయిన పెట్టుబడి యొక్క ఫలదాయకత రెండు లేక మూడు రెట్లు పెరిగింది. దీని ప్రభావం లాభం రేటుపై లేకపోలేదని చెప్పాల్సిన అవసరంలేదు.

లాభం రేటుపై మొత్తం పెట్టుబడి టర్నోవర్ ప్రభావాన్ని విడిగా అంచనా కట్టాలంటే పోల్చి చూడవలసిన పెట్టుబడుల తాలూకు ఇతర పరిస్థితులన్నీ సమంగా ఉంటాయని మనం ఊహించాలి. అదనపు విలువ రేటు, పనిదిన పరిమాణంతో పాటు, ముఖ్యంగా శాతాల్లో పెట్టుబడుల అంతర్నిర్మాణం రూపం కూడా ఒకే విధంగా వుంటుందని మనం ఊహించాలి. ఇప్పుడిక 'అ' పెట్టుబడి స్వరూపం ఇలా ఉందనుకుందాం: $80_{\text{స్థి.పె}}+20_{\text{అ.పె}}=100$ మొపె; ఇది 100% అదనపు విలువ రేటుతో ఏడాదికి రెండుసార్లు టర్నోవర్ అవుతుందనుకుందాం. అప్పుడు వార్షిక ఉత్పాదితం ఇలా ఉంటుంది.

$160_{\text{స్థి.పె}}+40_{\text{అ.పె}}+40_{\text{అ.వి}}$. అయితే లాభం రేటును నిర్ధారించడానికి $40_{\text{అ.వి}}$ ను టర్నోవర్ అయిన 200 పెట్టుబడి విలువపై లెక్కపెట్టం; అడ్వాన్సు చేసిన 100 పెట్టుబడిపైనే దాన్ని లెక్కపెడతాం. కాబట్టి లాభం రేటు (ల') = 40%

ఇప్పుడిక దీన్ని 'ఆ' పెట్టుబడి $160_{\text{స్థి.పె}}+40_{\text{అ.పె}}=200$ మొ.పెతో పోల్చి చూద్దాం. దీనికి కూడా 100% అదనపు విలువ రేటే ఉందనీ, అయితే దీని టర్నోవర్ సంవత్సరానికి ఒకటే అనీ

అనుకొందాం. కనుక పెట్టుబడి వార్షిక ఉత్పాదితం కూడా 'అ' పెట్టుబడి తాలూకు వార్షిక ఉత్పాదితం అంతే.

$160_{\text{స్థి.పె}}+40_{\text{అ.పె}}+40_{\text{అ.వి}}$ అయితే ఈ దఫా $40_{\text{అ.వి}}$ను అడ్వాన్సు చేసిన 200 పెట్టుబడిపై లెక్కకట్టాల్సి ఉంటుంది. అప్పుడది 20% లాభం రేటు మాత్రమే అవుతుంది. అంటే 'అ' పెట్టుబడి తాలూకు లాభం రేటులో సగమే అన్నమాట.

కాబట్టి తేలే విషయమేమిటంటే, సమాన అదనపు విలువ రేట్లు, సమాన పనిదినాలు, అంతర్నిర్మాణంలో సమాన శాత స్వరూపం గల రెండు పెట్టుబడుల లాభం రేట్లు ఆ పెట్టుబడుల టర్నోవర్ కాలాలకు విలోమ నిష్పత్తిలో ఉంటాయి. పైన తెలిపిన ఉదాహరణల్లో పెట్టుబడి అంతర్నిర్మాణ స్వరూపం కానీ, అదనపు విలువ రేట్లు కానీ, పనిదినం కానీ లేక వేతనాలు కానీ అసమంగా ఉన్నట్లయితే వీటివల్ల లాభం రేట్లలో తేడాలు మరింత ఎక్కువగా ఉంటాయి. అయితే ఇవి టర్నోవర్‌తో ప్రమేయం లేనివి కనుక వాటితో మనకిప్పుడు పని లేదు. వీటిని గురించి మూడవ అధ్యాయంలోనే చర్చించాం.

రెండవ సంపుటి XVIవ అధ్యాయం "అస్థిర పెట్టుబడి యొక్క టర్నోవర్" లో వివరించినట్లు, అదనపు విలువ ఉత్పత్తిపైనా, పర్యవసానంగా లాభంపైనా తగ్గిన టర్నోవర్ కాలం యొక్క ప్రత్యక్ష ప్రభావం ఏమిటంటే, పెట్టుబడిలోని అస్థిర భాగం యొక్క సామర్థ్యం పెరుగుతుంది. సంవత్సరానికి ఒకసారి మాత్రమే టర్నోవర్ అయ్యే 5000 అస్థిర పెట్టుబడి అదే సమయంలో అదే అదనపు విలువ రేటుతో అదే వేతనాలతో ఎంత అదనపు విలువను ఉత్పత్తి చేస్తుందో, సంవత్సరానికి 10 సార్లు టర్నోవర్ అయ్యే 500 అస్థిర పెట్టుబడి కూడా అంతే అదనపు విలువను ఉత్పత్తి చేస్తుందని ఆ అధ్యాయం నిరూపించింది.

నిశ్చల పెట్టుబడి 10,000 చలామణి అయ్యే స్థిర పెట్టుబడి 500, అస్థిర పెట్టుబడి 500 గల పెట్టుబడి Iను తీసుకొందాం. నిశ్చల పెట్టుబడి వార్షిక తరుగుదల 10%=1000 అని అనుకొందాం. కాగా 100% అదనపు విలువరేటు చొప్పున అస్థిర పెట్టుబడి సంవత్సరానికి పది టర్నోవర్‌లు చేస్తుందనుకుందాం. సరళత కోసం, ఈ క్రింది అన్ని ఉదాహరణల్లోనూ అస్థిర పెట్టుబడి టర్నోవర్ అయిన వ్యవధిలోనే స్థిరపెట్టుబడి కూడా టర్నోవర్ అయిందనుకుందాం. ఆచరణలో మామూలుగా జరిగేదిదే. అప్పుడు ఒక్కో టర్నోవర్ తాలూకు ఉత్పాదితం ఇలా ఉంటుంది.

$100_{\text{స్థి.పె}}$ తరుగుదల$+500_{\text{స్థి.పె}}+500_{\text{అ.పె}}+500_{\text{అ.వి}} = 1600.$

కాగా ఇలాటి పది టర్నోవర్‌ల ఉత్పాదితం ఇలా ఉంటుంది.

$1000_{\text{స్థి.పె}}$ తరుగుదల$+5000_{\text{స్థి.పె}}+5000_{\text{అ.పె}}+5000_{\text{అ.వి}} = 16000$

మొ.పె = 11,000, అ.వి=5000, ల' = $\frac{5000}{11,000} = 45\frac{5}{11}$

ఇప్పుడిక IIవ పెట్టుబడిని తీసుకుందాం : 9,000 నిశ్చల పెట్టుబడి, వార్షిక తరుగుదల 1000:1000 చలామణి స్థిరపెట్టుబడి, 1000 అస్థిర పెట్టుబడి, అదనపు విలువ రేటు 100%, సంవత్సరంలో అస్థిర పెట్టుబడి టర్నోవర్‌లు 5; అప్పుడు అస్థిర పెట్టుబడి యొక్క ప్రతి టర్నోవర్ తాలూకు ఉత్పాదితం ఇలా ఉంటుంది.

200స్థి.పె తరుగుదల+1000స్థి.పె+1000అ.పె+1000అ.వి=3,200

కనుక అయిదు టర్నోవర్‌ల తర్వాత మొత్తం వార్షిక ఉత్పాదితం ఇలా ఉంటుంది.

1000స్థి.పె తరుగుదల+5000స్థి.పె+5000అ.పె+5000అ.వి = 16000

మొ.పె = 11,000, అ.వి=5000, ల' = $\frac{5,000}{11,000} = 45\frac{5}{11}\%$

ఇప్పుడిక IIIవ పెట్టుబడిని తీసుకుందాం, ఇందులో నిశ్చల పెట్టుబడి లేదు. 6,000 చలామణి స్థిర పెట్టుబడి, 5000 అస్థిర పెట్టుబడి, 100% అదనపు విలువ రేటు చొప్పున సంవత్సరాని కొక టర్నోవర్ ఉందనుకుందాం. అప్పుడు మొత్తం వార్షిక ఉత్పాదితం ఇలా ఉంటుంది:

6000స్థి.పె+5000అ.పె+5000అ.వి = 16000

మొపె=11,000, అవి = 5000, ల' = $\frac{5000}{11,000} = 45\frac{5}{11}\%$

కనుక ఈ మూడు ఉదాహరణల్లోనూ వార్షిక అదనపు విలువ పరిమాణం ఒకటే. అది 5,000 కాగా అన్ని ఉదాహరణల్లోనూ మొత్తం పెట్టుబడి ఒకటే కాబట్టి, అనగా 11,000 కాబట్టి లాభం రేటు కూడా ఒకటే. అనగా $45\frac{5}{11}\%$

అయితే Iవ పెట్టుబడిలోని అస్థిర భాగానికి 10 వార్షిక టర్నోవర్‌లు బదులు 5 వార్షిక టర్నోవర్‌లే ఉన్నట్లయితే ఫలితం భిన్నంగా ఉంటుంది. అప్పుడు ఒక్కో టర్నోవర్ తాలూకు ఉత్పాదితం ఇలా ఉంటుంది.

200స్థి.పె తరుగుదల+500స్థి.పె+500అ.పె+500అ.వి = 1700 కాగా వార్షిక ఉత్పాదితం ఇలా ఉంటుంది.

1000స్థి.పె తరుగుదల+2500స్థి.పె+2500అ.పె+2500అ.వి = 8500

మొ.పె. = 11,000, అ.వి = $\frac{2500}{11,000}$; ల' = 2500 = $22\frac{8}{11}\%$

టర్నోవర్ కాలం రెట్టింపు పెరిగింది కాబట్టి లాభంరేటు సగం పడిపోయింది.

కనుక ఒక సంవత్సరంలో స్వాయత్తం చేసుకున్న అదనపు విలువ పరిమాణం, అస్థిర పెట్టుబడి యొక్క ఒక టర్నోవర్‌లో స్వాయత్తం చేసుకున్న అదనపు విలువ పరిమాణాన్ని ఒక సంవత్సరంలోని అలాటి టర్నోవర్‌ల సంఖ్యచే గుణించగా వచ్చే పరిమాణానికి సమానంగా ఉంటుంది. ఉదాహరణకు ఒక సంవత్సరంలో స్వాయత్తం చేసుకున్న అదనపు విలువను లేక లాభాన్ని వా.వి అందాము; ఒక టర్నోవర్‌లో స్వాయత్తం చేసుకున్న అదనపు విలువ అవి, ఒక సంవత్సరంలో అస్థిర పెట్టుబడి యొక్క టర్నోవర్‌ల సంఖ్య న అప్పుడు వావి=అవి×న కాగా అదనపు విలువ వార్షిక రేటు వావి[1] = అ.వి×న, రెండవ సంపుటి XVI, 1 అధ్యాయంలో దీన్ని నిరూపించాం.

లవంలో ఉన్నంత అ.పె హారంలో కూడా ఉన్నంత వరకే ల' = అ.వి' $\frac{\text{అ.పె}}{\text{మొపె}}$ = అ.వి' $\frac{\text{అపె}}{\text{స్థిపె+అపె}}$ అన్న సూత్రం సరిగా ఉంటుందని చెప్పాల్సిన అవసరం లేదు. హారంలోని అపె వేతనాల చెల్లింపుకోసం మొత్తం పెట్టుబడిలో సగటున అస్థిర పెట్టుబడిగా ఉపయోగింపబడిన యావత్ భాగాన్నీ సూచిస్తుంది. అపె అనేది ఒకానొక పరిమాణంలో వా.విని ఉత్పత్తి చేసి స్వాయత్తం చేసుకొంటుందన్న వాస్తవం మాత్రమే లవంలోని అపెని ప్రధానంగా నిర్ణయిస్తుంది. ఈ అపెతో వావి నిష్పత్తే, అంటే $\frac{\text{వా.వి}}{\text{అపె}}$ (m')

అదనపు విలువరేటు. ల' = $\frac{\text{వా.వి}}{\text{స్థి.పె+అ.పె}}$ అనే సూత్రం ల'= వా.వి' = $\frac{\text{అ.పె}}{\text{స్థి.పె+అ.పె}}$ అనే మరో సూత్రంగా మార్పు చెందింది. ఈ విధంగానే హారంలోని అ.పెకి సమానంగా ఉండాలన్న వాస్తవం ఇప్పుడు లవంలోని అ.పెని మరింత కచ్చితంగా నిర్ణయిస్తుంది. అంటే మొత్తం పెట్టుబడి మొ.పెలోని యావత్ అస్థిర భాగానికి అది సమానంగా ఉండాలన్న వాస్తవం లవంలోని అ.పెని నిర్ణయిస్తుంది. ఇంకో విధంగా చెప్పాలంటే, అస్థిర పెట్టుబడి యొక్క ఒక్క టర్నోవర్‌లో ఉత్పత్తి అయిన అదనపు విలువను వావి సూచిస్తేనే, ల'= $\frac{\text{వా.వి}}{\text{మొ.పె}}$ అనే సూత్రాన్ని ల' = అ.వి' $\frac{\text{అ.పె}}{\text{స్థి.పె+అ.పె}}$ సూత్రంగా కచ్చితంగా మార్చవచ్చు. వా.వి అన్నది ఈ అదనపు విలువలో ఒక భాగం మాత్రమే అయినప్పుడు కూడా అవి=అవి' అపె అన్న సూత్రం ఒప్పవుతుంది. అయితే మొ.పె=స్థి.పె+అ.పె లోని అ.పె కంటే ఈ అ.పె చిన్నదిగా ఉంటుంది. కారణమేమిటంటే వేతనాల కోసం ఖర్చయిన మొత్తం అస్థిర పెట్టుబడి కంటే ఇది తక్కువ అయితే అ.పెలోని ఒక టర్నోవర్ యొక్క అదనపు విలువ కంటే వా.వి ఎక్కువగా ఉన్నట్లయితే ఈ అ.పెలోని ఒక భాగం కానీ, మొత్తం అ.పె కానీ రెండుసార్లు ఉపయోగపడుతుంది. ఒకటవ, రెండవ టర్నోవర్‌లోనూ, ఆ తర్వాత మిగిలిన టర్నోవర్‌లలోనూ అది ఉపయోగపడుతుంది. అదనపు విలువను ఉత్పత్తి చేసేటటువంటి, చెల్లించిన అన్ని వేతనాల మొత్తానికి ప్రాతినిధ్యం వహించే టటువంటి అ.పె అప్పుడు స్థి.పె+అ.పెలోని అ.పె కంటే ఎక్కువగా ఉంటుంది కాబట్టి ఈ లెక్కంతా తప్పయిపోతుంది.

ఈ సూత్రాన్ని వార్షిక లాభం రేటుకు కచ్చితమైందిగా చేయాలంటే సాధారణ అదనపు విలువకు మారు వార్షిక అదనపు విలువ రేటును చూపాలి. అంటే అ.వి బదులు వా.వి ను లేక అ.వి'న ను తీసుకోవాలి; ఇంకో విధంగా చెప్పాలంటే అ.వి ని అంటే అదనపు విలువ రేటును, లేదా మొ.పెలోని అస్థిర పెట్టుబడి అయిన అ.పె ని న చేత, అంటే ఒక సంవత్సరంలో ఈ అస్థిర పెట్టుబడి చేసే టర్నోవర్ సంఖ్యలచేత గుణించాలి. అప్పుడు మనకు వార్షిక లాభం రేటును సూచించే ల' =అ.వి' న $\frac{\text{అ.పె}}{\text{మొ.పె}}$ అనే సూత్రం లభిస్తుంది.

తన వ్యాపారంలో మదుపు పెట్టిన అస్థిర పెట్టుబడి మొత్తం ఎంతో ఎక్కువ సందర్భాలలో పెట్టుబడిదారునికే తెలియదు. తన పెట్టుబడిలో నిశ్చల పెట్టుబడి, చలామణి పెట్టుబడి అనేవి ఉన్నాయన్నదే పెట్టుబడిదారుని మనసులో నాటుకొని ఉండే పెట్టుబడిలోని ప్రధాన అంతర్గత భేదమల్లా అదే అని రెండవ సంపుటిలోని VIIIవ అధ్యాయంలో గమనించాం; ఉత్తరోత్తరా కూడా ఆ విషయం మనం గమనించబోతున్నాం. అతడు వేతనాలు చెల్లించడానికి డబ్బు రూపంలో గల్లాపెట్టెలో ఉన్న చలామణి పెట్టుబడిలోని ఒక భాగంలో నుంచి డబ్బు తీసుకుంటాడు – బ్యాంకిలో డిపాజిట్ చేసి ఉండకపోతే, అతడు ముడిపదార్థాలకోసం, అనుబంధ పదార్థాల కోసం అదే గల్లాపెట్టెలో నుంచి డబ్బు తీస్తాడు. ఆ రెండు మొత్తాలను ఒకే ఖాతాకింద జమకట్టుకొంటాడు. ఒకవేళ వేతనాల కోసం విడిగా అకౌంటు పెట్టినప్పటికీ సంవత్సరాంతానికి అది అతడు వేతనాలకు చెల్లించిన మొత్తమే అవుతుంది తప్ప, అంటే అ.పె.న అవుతుంది తప్ప, అది అ.పె అనే అస్థిర పెట్టుబడి కాజాలదు. అస్థిర పెట్టుబడి మొత్తమెంతో తెలుసుకోవాలంటే అతడు అందుకోసం ప్రత్యేకంగా లెక్కచేయాల్సి ఉంటుంది. అందుకు సంబంధించిన ఉదాహరణ ఒకటి ఇక్కడ ఇవ్వాలనుకుంటున్నాం.

ఇందుకోసం మొదటి సంపుటిలో వర్ణించిన 1000 కదుళ్లున్న నూలు మిల్లును తీసుకుందాం. 1871 ఏప్రిల్ మాసంలోని ఒక వారానికి సంబంధించి తెలిపిన వివరాలు యధాతథంగా మొత్తం సంవత్సరమంతటా అమలులో ఉన్నట్లు భావిద్దాం. యంత్రాల సాకార రూపంలోని నిశ్చల పెట్టుబడి విలువ 10,000 పౌండ్లు, చలామణి పెట్టుబడి ఎంతో ఇవ్వలేదు. అది 2500 పౌండ్లు ఉంటుందని భావిద్దాం. ఇది కాస్త ఎక్కువ అంచనాయే అయినప్పటికీ ఖాతాపై పనులు జరగలేదనీ, పర్యవసానంగా ఇతరుల పెట్టుబడిని శాశ్వతంగా కానీ, తాత్కాలికంగా కానీ వినియోంచే అవకాశమేదీ లేదు అనీ, మనం ఇక్కడ భావించవలసి ఉంటుంది. కాబట్టి ఈ అంచనా సమర్ధనీయమైందే. కాగా దాని వారం వారీ ఉత్పాదితం విలువగా రూపుగొన్నవివీ: యంత్రాల తరుగుదల 20 పౌండ్లు, అడ్వాన్సు చేసిన చలామణి, స్థిర పెట్టుబడి 358 పౌండ్లు (అద్దె 6 పౌండ్లు, దూది 342 పౌండ్లు, బొగ్గు, గ్యాస్, నూనె 10 పౌండ్లు) వేతనాలకు చెల్లించిన అస్థిర పెట్టుబడి 52 పౌండ్లు అదనపు విలువ 80 పౌండ్లు కాబట్టి, $20_{\text{స్థి.పె}}$(తరుగుదల)+ $358_{\text{స్థి.పె}}+52_{\text{అ.పె}}+80_{\text{అ.వి}}=510$.

కాబట్టి వారం వారం అడ్వాన్సు చేసిన చలామణి పెట్టుబడి $358_{\text{స్థి.పె}}+52_{\text{అ.పె}} = 410$. ఈ మొత్తం శాతంలో ఇలా ఉంది. $87.3_{\text{స్థి.పె}}+12.7_{\text{అ.పె}}$ మొత్తం చలామణి పెట్టుబడి 2500 పౌండ్లలో స్థిరపెట్టుడి 2,182 పౌండ్లు అస్థిర పెట్టుబడి 318 పౌండ్లు సంవత్సరంలో వేతనాలకయ్యే మొత్తం ఖర్చు 52×52 పౌండ్లు లేక 2704 పౌండ్లు కాబట్టి 318 అస్థిర పెట్టుబడి ఒక సంవత్సరంలో దాదాపు $8\frac{1}{2}$ సార్లు టర్నోవర్ అయినట్లు దీన్ని బట్టి తెలుస్తున్నది. కాగా అదనపు విలువ రేటు $\frac{80}{52} = 153\frac{11}{13}\%$ విలువలను ఈ క్రింది సూత్రంలో చేర్చడం ద్వారా, ఈ భాగాల ప్రాతిపదికపై మనం లాభం రేటును లెక్క కడదాం: ల'=అ.వి' న $\frac{\text{అ.పె}}{\text{మొ.పె}}$ : అ.వి' =$153\frac{11}{13}$, న=$8\frac{1}{2}$, అ.పె= 318, మొపె = 12,500 కాబట్టి

$$ల' = 153\frac{11}{13} \times 8\frac{1}{2} \times \frac{318}{12{,}500} = 33.27\%$$

$ల' = \frac{\text{అ.వి}}{\text{మొ.పె}}$ అనే సాధారణ సూత్రం సాధనంతో మనం దీన్ని పరీక్షిద్దాం. మొత్తం వార్షిక అదనపు విలువ లేక లాభం 52×80 లేదా 4160 పౌండ్లు. దీన్ని మొత్తం పెట్టుబడిచేత భాగిస్తే 33.28% వస్తుంది. ఇది దాదాపు అదే ఫలితం. ఈ లాభం రేటు అసాధారణంగా ఎక్కువగా ఉన్న మాట నిజమే. ఆనాడు ఉన్న అసాధారణ అనుకూల పరిస్థితుల (దూది ధరలు చాలా తక్కువగా ఉండటం, నూలు ధరలేమో చాలా ఎక్కువగా ఉండటం) మూలంగా అది సాధ్యమై ఉండొచ్చు కానీ ఆ పరిస్థితులు సంవత్సరం పొడుగునా కొనసాగి ఉండజాలవు.

ల' = అ.వి' న $\frac{\text{అ.పె}}{\text{మొ.పె}}$ సూత్రంలోని అవి'న అన్నది లోగడ చెప్పినట్లు, రెండవ సంపుటిలో పేర్కొన్న అదనపు విలువ వార్షిక రేటు అన్నది. పై ఉదాహరణలో అది $153\frac{11}{13}\%$ ని $8\frac{1}{2}$ చేత గుణిస్తే వచ్చే $1307\frac{9}{13}\%$ రెండవ సంపుటి ఉదాహరణలో వాడిన అసాధారణ అదనపు విలువ వార్షిక రేటు అన్నది. 1000% ను చూసి ఒకానొక బీడర్‌మన్[1] దిగ్భ్రాంతి చెందాడు. అయితే

1. బీడర్‌మన్ పదంలో శ్లేష వుంది. ఇది కుసంస్కారుడు అన్న అర్థమూ యిస్తుంది; ఆ పేరుతో Deutsche Allgemeine Zeitung పత్రిక సంపాదకుడూ వున్నాడు - సంపాదకుడు.

మాంచెస్టర్‌లోని వాస్తవ అనుభవం నుంచి గ్రహించిన 1300% కు పైబడ్డ ఈ వార్షిక అదనపు విలువ రేటును చూచి ఆయన బహుశా శాంతిస్తాడు. మహత్తర సౌభాగ్య కాలాల్లో ఈ రేటు అరుదేమీ కాదు. కానీ చాలా కాలంగా ఇలాంటి కాలాన్ని మనం చూడలేదు అంతే.

ఆ మాటకొస్తే ఆధునిక భారీ స్థాయి పరిశ్రమలోని పెట్టుబడి వాస్తవ అంతర్నిర్మాణ రూపానికి ఇక్కడ ఒక ఉదాహరణ ఉంది; మొత్తం పెట్టుబడి 12500 పౌండ్లు కాగా అందులో స్థిరపెట్టుబడి 12182 పౌండ్లు, అస్థిర పెట్టుబడి 318 పౌండ్లు. దీన్నే శాతంలో సూచిస్తే $97\frac{1}{2} + 2\frac{1}{2} = 100$మొ.పె మొత్తంలో నలభయ్యవ వంతు మాత్రమే. అయితే సంవత్సరంలో 8 సార్లకు పైగా టర్నోవర్ అయి వేతనాల చెల్లింపుకోసం ఉపయోగపడుతోంది.

తమ వ్యాపారానికి సంబంధించి, ఈ తరహాలో లెక్క గట్టాలనుకొనే వారు చాలా తక్కువ మంది మాత్రమే ఉంటారు. కాబట్టి మొత్తం సామాజిక పెట్టుబడిలోని స్థిర భాగానికి అందులోని అస్థిర భాగంతో గల నిష్పత్తి విషయమై గణాంక వివరాలేవీ లేవు. అమెరికా దేశపు లెక్కలు మాత్రమే ఆధునిక పరిస్థితుల్లో ఏమి సాధ్యమో తెలుపుతున్నాయి; అంటే ఏయే వ్యాపారశాఖ వేతనాలకెంత చెల్లించిందో, ఎంత లాభాలు సంపాదించిందో తెలుపుతున్నాయి. అవి పెట్టుబడిదారులు ఇష్టా రాజ్యంగా చేసిన ప్రకటనలపై ఆధారపడినవి కాబట్టి, సందేహింపతగినవే అయినప్పటికీ అవి చాలా విలువైనవీ ఈ సమస్యపై మనకు లభ్యమవుతున్న ఏకైక సాధికార పత్రాలూనూ. (యూరప్‌లోని పెద్దపెద్ద పెట్టుబడిదారుల నుంచి మనకు కనువిప్పు కలిగించే ఇలాటి వివరాలను ఆశించేసాహసం లేదు.)

**ఫ్రెడరిక్ ఎంగెల్స్**

★ ★ ★

## అధ్యాయం - 5

# స్థిర పెట్టుబడి వినియోగంలో పొదుపు

### I. స్థూలంగా విషయ వివరణ

**అ**స్థిర పెట్టుబడి మారకుంటే, అంటే నియుక్త శ్రామికుల సంఖ్య, డబ్బు రూపంలో వారికి చెల్లించే వేతనాలు మారకుంటే ఓవర్‌టైమ్ చెల్లించబడిందా, లేదా అనేదానితో నిమిత్తం లేకుండా నిరపేక్ష అదనపు విలువ పెరిగితే, లేక అదనపు శ్రమ పొడిగించబడితే, తద్వారా పనిదినం పొడిగించబడితే, స్థిర పెట్టుబడి సాపేక్ష విలువ తగ్గిపోతుంది; అంటే మొత్తం పెట్టుబడితోనూ, అస్థిర పెట్టుబడితోనూ పోల్చితే అది తగ్గిపోతుంది, అందువల్ల లాభం రేటు పెరుగుతుంది. అదనపు విలువ పరిమాణం పెరుగుదలతో, బహుశా అదనపు విలువ రేటు పెరుగుదలతో ప్రమేయం లేకుండా లాభం రేటు పెరుగుతుంది. శ్రమ ప్రక్రియకు 16 గంటలు ఉపకరిస్తాయో లేక 12 గంటలు ఉపకరిస్తాయో అన్న విషయంతో ప్రమేయం లేకుండా, స్థిర పెట్టుబడిలోని నిశ్చలభాగ పరిమాణం అంటే ఫ్యాక్టరీ భవనాలు, యంత్రాలు వగైరా యధాతథంగా ఉంటాయి. పనిదినాన్ని పొడిగించినప్పటికీ, స్థిర పెట్టుబడిలోని అత్యంత వ్యయభరిత భాగమైన వీటిపై కొత్త ఖర్చులు తలెత్తవు. పైపెచ్చు, నిశ్చల పెట్టుబడి విలువ తక్కువ సంఖ్యలోని టర్నోవర్ వ్యవధుల్లో పునరుత్పత్తి అవుతుంది. ఫలితంగా సదరు నిశ్చల పెట్టుబడి విలువను ఒక నిర్దిష్ట లాభార్జనకై ఎంత కాలానికి అడ్వాన్స్ చేయవలసి ఉంటుందో ఆ కాలం తగ్గుతుంది. కనుక ఓవర్ టైం చెల్లించినా – మామూలు పని గంటలకు వచ్చేదానికన్నా ఎక్కువ రేటులో ఈ ఓవర్ టైం చెల్లించినా, పనిదినం పొడిగింపు వల్ల లాభం పెరుగుతుంది. కనుక ఆధునిక పరిశ్రమలో నిశ్చల పెట్టుబడిని పెంచవలసిన ఆవశ్యకత అంతకంతకు పెరగడం, లాభపిపాసోన్మత్తులయిన పెట్టుబడిదారులు – పనిదినాన్ని పొడిగించడానికి[1] ఒకానొక ప్రధాన కారణం. పనిదినం మార్పులేకుండా యథాతథంగా ఉన్నట్లయితే పరిస్థితులు ఇలా ఉండవు. అప్పుడు శ్రామికుల సంఖ్యను పెంచడమూ, వారితోపాటు భవనాలు, యంత్రాలు లాంటి నిశ్చల పెట్టుబడిని కొంతవరకు పెంచాల్సిన అవసరం ఉంటుంది. పెరిగిన శ్రమ పరిమాణాన్ని (మనమిక్కడ వేతనాల్లో కోతలు లేక మామూలు స్థాయికంటే తక్కువ స్థాయికి వేతనాలు పడిపోవడం లాంటివాటిని వదిలేద్దాం.) దోపిడీ చేయాలంటే ఇలా చేయడం అవసరం; లేదా శ్రమ తీవ్రత తద్వారా శ్రమ ఉత్పాదకత పెరిగితే,

1. "అన్ని ఫ్యాక్టరీలలోనూ భవనాలు, యంత్రాల రూపంలో పెద్ద మొత్తంలో నిశ్చల పెట్టుబడి వుంది కాబట్టి, ఆ యంత్రాలతో ఎన్ని ఎక్కువ గంటలు పనిచేయిస్తే, ప్రతిఫలం అంత ఎక్కువ వుంటుంది." (రిపోర్ట్స్ ఆఫ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్, 31 అక్టోబర్ 1858, పుట 8)

మొత్తంపై ఎక్కువ సాపేక్ష అదనపు విలువ ఉత్పత్తి అయితే, ముడిపదార్థాలను వినియోగించుకునే పరిశ్రమల్లో స్థిర పెట్టుబడిలోని చలామణి పెట్టుబడి భాగం యొక్క పరిమాణం పెరుగుతుంది. ఎందుకంటే, నిర్దిష్ట కాలంలో ఎక్కువ ముడిపదార్థాలు వగైరా తయారైన సరుకులుగా మారతాయి. ఇక రెండవది అదే కార్మికులు చలనంలో పెట్టే యంత్రాల పరిమాణం పెరుగుతుంది. ఆ కారణం వల్ల, స్థిర పెట్టుబడిలోని ఈ భాగం కూడా పెరుగుతుంది. కాబట్టి అదనపు విలువ పెరగడంతో పాటు స్థిర పెట్టుబడి కూడా పెరుగుతుంది. శ్రమను దోచుకునేందుకు వినియోగించే శ్రమ సాధనాలకు మరింత ఎక్కువ మొత్తాలను కేటాయించడం ద్వారా అంటే, మరింత ఎక్కువ పెట్టుబడిని నియోగించడం ద్వారా శ్రమను దోచుకోవడం కూడా పెరుగుతుంది కాబట్టి ఈ విధంగా లాభం రేటు ఒకవైపు తగ్గగా మరోవైపు పెరుగుతుంది.

పనిదిన పరిమాణం పెరిగినా, తరిగినా దీంతో నిమిత్తం లేకుండా అనేక రోజువారీ ఖర్చులు దాదాపుగా లేదా పూర్తిగా ఒకే విధంగా ఉంటాయి. 12 గంటల పనిదినాలలో 750 మంది శ్రామికులపై కంటే 18 గంటల పనిదినాలలో 500 మంది శ్రామికులపై పర్యవేక్షణ ఖర్చు తక్కువగా ఉంటుంది. "ఒక ఫ్యాక్టరీని 10 గంటలు పనిచేయించినప్పటికీ 12 గంటలు పని చేయించినప్పటికీ ఖర్చులు దాదాపు సమానంగానే ఉంటాయి". (రిపోర్ట్స్ ఆఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్, అక్టోబర్ 1848, పుట 37) పనికాలం ఎక్కువైనప్పటికీ, తక్కువైనప్పటికీ ప్రభుత్వ పన్నులు మునిసిపల్ పన్నులు, అగ్ని ప్రమాదబీమా ఖాయం అయిన వివిధ తరహా ఉద్యోగుల వేతనాలు, యంత్రాల తరుగుదల, ఇంకా అనేక ఇతర ఖర్చులు మార్పుచెందకుండా యథాతథంగా ఉంటాయి. ఉత్పత్తి ఏ మేరకు తగ్గుతుందో, ఆ మేరకు ఈ ఖర్చులు లాభంతో పోలిస్తే పెరుగుతాయి. (రిపోర్ట్స్ ఆఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ అక్టోబర్ 1862, పుట 19)

యంత్రాల, తదితర నిశ్చల పెట్టుబడి భాగాల విలువ ఎంత కాలంలో పునరుత్పత్తి అవుతుందన్నది ఆచరణలో – కేవలం ఆ యంత్రాల, ఆ భాగాల జీవిత కాలాన్ని బట్టి నిర్ణయం కాదు. అవి ఏ శ్రమ ప్రక్రియకై వినియోగమై జరిగిపోతాయో ఆ శ్రమ ప్రక్రియ సాగిన మొత్తం కాలాన్ని బట్టి నిర్ణయమవుతుంది. శ్రామికులు రోజుకు 12 గంటలకు బదులు 18 గంటలు పనిచేసినట్లయితే, వారానికి మూడు రోజులు తేడా వస్తుంది; అంటే ఒక వారాన్ని ఒకటిన్నర వారంగానూ, రెండేళ్ళను, మూడేళ్ళుగానూ సాగదీయడం జరిగింది. ఈ ఓవర్ టైం చెల్లించబడని పక్షంలో శ్రామికులు ప్రతి మూడు వారాలకు ఒక వారం, ప్రతి మూడేళ్ళకు ఒక సంవత్సరం మామూలు అదనపు శ్రమ కాలాన్నిమించి ఉచితంగా శ్రమచేసిన వారవుతారు. ఈ విధంగా యంత్రాల విలువ పునరుత్పత్తి వేగం 50 శాతం మేరకు పెరిగి, మామూలుగా అవసరమైన కాలంలో మూడింట రెండు వంతులలోనే పునరుత్పత్తి అవుతుంది.

అవసరమైన సంక్షిప్తతలను నివారించేందుకుగాను, ఈ విశ్లేషణలోనూ, ముడిపదార్థాల ధరల ఎగుడుదిగుళ్ళ (అధ్యాయం VI) విశ్లేషణలో కూడా అదనపు విలువ పరిమాణమూ, రేటూ రెండూ కూడా నిర్ణీతమైనవన్న ఊహతో ప్రారంభిస్తున్నాము.

సహకారం శ్రమ విభజన, యంత్రాల చిత్రణలో ఇంతకుముందే నిరూపించినట్లు, భారీస్థాయి ఉత్పత్తిలో కనిపించే ఉత్పత్తి పరిస్థితుల పొదుపునకు ప్రధాన కారణం. ఈ పరిస్థితులన్నీ సామాజిక

శ్రమ పరిస్థితులుగా లేక సామాజికంగా సమ్మేళనం చెందిన శ్రమ పరిస్థితులుగా, అంటే శ్రమ యొక్క సామాజిక పరిస్థితులుగా ఆచరణలో ఉండడమే. అవన్నీ ఉత్పత్తి ప్రక్రియలో సామూహిక శ్రామికునిచే వినియోగమవుతాయి; ఒకరితో మరొకరికి సంబంధం లేని శ్రామికుల సముదాయించే ముక్కలు ముక్కలుగా కాకుండా, సామూహిక శ్రామికునిచే అవి వినియోగమవుతాయి. ఒకటి లేక రెండు కేంద్ర మోటార్లున్న పెద్ద ఫ్యాక్టరీలో వాటి ఆశ్వికశక్తి పెరిగిన నిష్పత్తిలోనే, ఆ కారణంగా అది పనిచేయగల రంగం విస్తరించే నిష్పత్తిలోనే ఆ మోటార్ల ఖర్చు పెరగదు. చలన ప్రసార పరికరాల ఖర్చు, అవి చలనంలో పెట్టే పని యంత్రాల సంఖ్య పెరిగిన నిష్పత్తిలో పెరగదు. ఒక యంత్రం యొక్క చట్రం ఖరీదు, అది తన ఉపాంగాలుగా, వాడే పరికరాల సంఖ్య పెరిగిన నిష్పత్తిలోనే పెరగదు. ఇలా ఎన్నో ఉదాహరణలివ్వవచ్చు.

పైపెచ్చు, ఉత్పత్తి సాధనాల కేంద్రీకరణ మూలంగా వివిధ రకాల భవనాలపై ఖర్చు ఆదా అవుతుంది. అసలు వర్క్‌షాపులకు సంబంధించే కాక సరుకు నిల్వ చేసేందుకు ఇతర పనులకు సంబంధించిన భవనాలివి. ఇంధనం, దీపాలు వగైరా ఖర్చులకు కూడా ఇదే వర్తిస్తుంది. ఎక్కువ మంది ఉపయోగించుకున్నారా లేక తక్కువమంది ఉపయోగించుకున్నారా అన్న విషయంతో నిమిత్తం లేకుండా ఉత్పత్తి తాలూకు ఇతర పరిస్థితులు యథాతథంగా ఉంటాయి.

అయితే, ఉత్పత్తి సాధనాల కేంద్రీకరణ వల్లనూ, వాటి సామూహిక ఉపయోగం వల్లనూ తలెత్తిన ఈ పొదుపు అంతటికీ – తప్పనిసరిగా శ్రామికులను పోగుచేయడమూ, వారిమధ్య సహకారమూ అవసరం; అంటే శ్రమ సామాజిక సమ్మేళనం అవసరం. కాబట్టి వ్యష్టి శ్రామికుని అదనపు శ్రమ నుంచి అదనపు విలువ ఆవిర్భవించినట్లే; ఈ పొదుపు కూడా శ్రమ సామాజిక స్వభావం నుంచి ఆవిర్భవిస్తుంది. ఇక్కడ సాధ్యమూ, అవసరమూ అయిన నిరంతర మెరుగుదలకు ప్రధాన కారణం సామాజిక అనుభవమూ, సామాజిక పరిశీలనా. భారీస్థాయిలో, సమ్మిళితమైన రాశీభూత శ్రమ, ఉత్పత్తి ప్రక్రియను నిర్వహిస్తున్నందువల్ల ఇవి సాధ్యమవుతున్నాయి.

ఉత్పత్తి పరిస్థితుల్లో పొదుపునకు గల రెండవ పెద్ద మూలాధారానికి కూడా ఇదే వర్తిస్తుంది. ఉత్పత్తి విసర్జితాలను ఉత్పత్తి క్రమంలో వెలువడే వ్యర్థ పదార్థాలనే వాటిని, తిరిగి ఉత్పత్తి తాలూకు నూతన పదార్థాలుగా, అదే పరిశ్రమలో కానీ లేక మరో పరిశ్రమలో కానీ ఉత్పత్తి పదార్థాలుగా తిరిగి మార్చే ప్రక్రియ గురించి ఇక్కడ ప్రస్తావిస్తున్నాం. విసర్జిత పదార్థమనే దీనిని ఉత్పత్తి ఆవృత్తిలోనే, ఫలితంగా వినియోగం యొక్క ఆవృత్తిలోకి తిరిగి ప్రవేశపెట్టే ప్రక్రియ ఇది. ఈ రకం ఆదా కూడా భారీస్థాయి సామాజిక శ్రమ తాలూకు ఫలితమే. దీన్ని గురించి మనం తర్వాత మరింత లోతుగా చర్చిద్దాం. వ్యర్థ పదార్థాలు పుష్కలంగా ఉండటం వల్ల అవి వర్తకానికి తిరిగి లభ్యం అవుతున్నాయి. ఆ విధంగా అవి తిరిగి నూతన ఉత్పత్తి పదార్థాలుగా మారుతున్నాయి. సమ్మిళిత ఉత్పత్తి యొక్క వ్యర్థ పదార్థంగా ఉండటం వల్లనే అంటే భారీ స్థాయి ఉత్పత్తి యొక్క వ్యర్థ పదార్థంగా ఉండటం వల్లనే అది ఉత్పత్తి ప్రక్రియకు ముఖ్యమైనదిగా రూపొందుతుంది; మార్పిడి విలువకు వాహికగా ఉంటోంది. ఈ వ్యర్థ పదార్థం, ఉత్పత్తి తాలూకు నూతన పదార్థంగా ఉపయోగపడటమేకాక, అది ఏ మేరకు తిరిగి అమ్మకానికి యోగ్యంగా ఉంటుందో ఆ మేరకు ముడిపదార్థం ఖర్చును కూడా తగ్గిస్తుంది. ఎందువల్లనంటే, ఈ ఖర్చులో ఎల్లప్పుడూ మామూలు వ్యర్థ పదార్థలు అంటే ఉత్పత్తి ప్రక్రియలో

సాధారణంగా నష్టమయ్యే పరిమాణం కలిసేవుంటుంది. స్థిర పెట్టుబడిలోని ఈ భాగం ఖర్చు తగ్గిన మేరకు లాభం రేటు పెరుగుతుంది. ఇక్కడ అస్థిర పెట్టుబడి పరిమాణమూ, అదనపు విలువ రేటూ నిర్ణీతమైనవని ఊహించుకొంటున్నాము.

అదనపు విలువ నిర్ణీతమైనదైతే, సరుకు ఉత్పత్తికి అవసరమైన స్థిర పెట్టుబడి విలువను తగ్గించడం ద్వారా మాత్రమే లాభం రేటును పెంచడం సాధ్యం. సరుకుల ఉత్పత్తిలోకి స్థిర పెట్టుబడి ప్రవేశించే విషయానికి వస్తే, ఆ సరుకు మార్పిడి విలువకు కాక, ఉపయోగ విలువకు మాత్రమే ప్రాముఖ్యం ఉంటుంది. శ్రమ ఉత్పాదకత, అంటే సాంకేతిక అభివృద్ధి స్థాయి నిర్ణీతమై ఉన్నట్లయితే నూలుమిల్లులో ఎల్లగిసె నార తనంలో లీనం చేసుకోగల శ్రమ పరిమాణం దాని విలువపై కాక దాని పరిమాణంపైనే ఆధారపడి ఉంటుంది. అలాగే మాట వరుసకు ముగ్గురు కార్మికులకు ఒక యంత్రం అందజేసే సహాయం దాని విలువపై కాక యంత్రంగా దాని ఉపయోగ విలువపై మాత్రమే ఆధారపడి ఉంటుంది. ఒకానొక సాంకేతిక అభివృద్ధి స్థాయిలో ఒక పనికిమాలిన యంత్రం ప్రియంగా ఉండవచ్చు. మరో అభివృద్ధి స్థాయిలో ఒక మంచి యంత్రం చౌకగా ఉండవచ్చు.

పత్తి, నూలు వడికే యంత్రం చౌక కావడం ద్వారా పెట్టుబడిదారుడికి అందే లాభం పెరుగుదల వాస్తవానికి శ్రమ ఉత్పాదకత పెరిగిన ఫలితమే. ఈ శ్రమ అధికోత్పాదకత నూలు మిల్లులోనిది కాదు, పత్తి సేద్యంలోనిదీ, యంత్రాల నిర్మాణంలోనిదీ. ఒక నిర్ణీత పరిమాణంలోని శ్రమకు సాకారరూపం ఇవ్వడానికి కాబట్టి, ఒక నిర్ణీత పరిమాణంలో అదనపు శ్రమను పెంచుకోడానికి శ్రమ పరిస్థితులకు సంబంధించిన కేటాయింపులు తగ్గుతాయి. అప్పుడు ఒక నిర్దిష్ట పరిమాణంలోని అదనపు శ్రమను స్వాయత్తం చేసుకోడానికి అవసరమైన ఖర్చులు తగ్గిపోతాయి.

మొత్తం శ్రమ లేక సామాజికంగా సంయోగం చెందిన శ్రమ ఉత్పత్తి సాధనాలను సహకార పద్ధతులు వినియోగించడం ద్వారా ఉత్పత్తి ప్రక్రియలో సమకూరే ఆదా గురించి ఇంతకు ముందే ప్రస్తావించాం. చలామణి కాలాన్ని తగ్గించడం ద్వారా స్థిర పెట్టుబడిలో అయ్యే ఆదా గురించి తర్వాత చర్చిద్దాం; చలామణి వ్యవధిని తగ్గించడంలో రవాణా, వార్తాప్రసార సాధనాల అభివృద్ధి పాత్ర ప్రధానమైనది కాగా – ప్రస్తుతం, యంత్రాలలో వచ్చే నిరంతరాయమైన మెరుగుదల ద్వారా అయ్యే ఆదా గురించి చర్చిద్దాం; ఆ మెరుగుదల అవి : (1) చెక్కకు బదులు ఇనుమును వాడడం (2) యంత్ర నిర్మాణంలో వచ్చిన అభివృద్ధి ఫలితంగా యంత్రాలు చౌక కావడం అందువల్ల స్థిర పెట్టుబడిలోని నిశ్చల భాగం విలువ, పెద్ద ఎత్తున శ్రమ పెంపొందడంతో నిరంతరాయంగా పెరిగినప్పటికీ, శ్రమ పెంపొందిన రేటుతో సమానంగా పెరగదు[1] (3) ప్రస్తుతం పనిచేస్తున్న యంత్రాలలో మరింత చౌకగా మరింత ఫలప్రదంగా పనిచేయించగలిగే ప్రత్యేక మెరుగుదలలు; ఉదాహరణకు స్టీమ్ బాయిలర్లలో వచ్చిన మెరుగుదలలు. వీటి గురించి తర్వాత సవివరంగా చర్చిద్దాం. (4) మంచి యంత్రాల ద్వారా దుబారాను తగ్గించడం.

ప్రతి వృష్టి సరుకూ తన ధరలో యంత్రాల తరుగుదలలోని పూర్ణాంకపు భాగాన్ని పునరుత్పత్తి చేస్తుంది. కాబట్టి ఒక నిర్ణీత ఉత్పత్తి కాలానికి సాధారణంగా యంత్రాల తరుగుదలను, మొత్తంపై

1. చూడండి : ఫ్యాక్టరీ నిర్మాణంలో పురోగతిపై ఉరే.

నిశ్చల పెట్టుబడి తరుగుదలను తగ్గించేదేదైనా సరే సరుకును చౌకపరుస్తుంది. అంతేకాక మదుపు చేసిన పెట్టుబడిలో కాలానికి సంబంధించిన భాగాన్ని కూడా అది తగ్గిస్తుంది. అవసరమైన మరమ్మతు కార్యకలాపాలు వగైరాలు, యంత్రాలు తొలి ఖర్చుకు అదనంగా తోడవుతాయి. యంత్రాల మన్నిక కాలం పెరగడం వల్ల మరమ్మతు ఖర్చులు తగ్గుతాయి. కాబట్టి ఆ తగ్గుదల ఆ యంత్రాల ధరను అదే నిష్పత్తిలో తగ్గిస్తుంది.

ఇక్కడ మళ్ళీ ఒక విషయం చెప్పాలి. ఈ పొదుపులన్నీ కూడా సంయుక్త శ్రమ విషయంలోనే చాలావరకు ఉన్నాయి. మరింత భారీస్థాయిలో ఉత్పత్తి ప్రక్రియ కొనసాగిస్తే తప్ప – ఈ పొదుపులు తరచు సాధ్యం కాదు. ఫలితంగా వాటికి తక్షణ ఉత్పత్తి ప్రక్రియలో మరింత భారీస్థాయిలో శ్రమ సంయోగం అవసరం. కానీ, మరోవైపు, ఉత్పత్తికి సంబంధించిన ఏ ఒక శాఖలోనైనా సరే శ్రమ ఉత్పాదక శక్తి పెరుగుదల ఇతర పారిశ్రామిక శాఖల్లో ఉత్పత్తి సాధకాల విలువ తగ్గుదలకు ఫలితంగా వాటి ఉత్పత్తి ధర తగ్గుదలకు పూర్వావసరంగా కనిపిస్తోంది. ఉదాహరణకు, ఇనుము, బొగ్గు, యంత్రాల ఉత్పత్తి, వాస్తు శిల్పం మొదలయిన వాటిలో శ్రమ ఉత్పాదకత పెరుగుదల. ఇది మళ్ళీ బౌద్ధిక ఉత్పత్తి రంగంలో, ముఖ్యంగా ప్రకృతిశాస్త్రంలో, దాన్ని ఆచరణకు అన్వయించడంలో సాధించిన ప్రగతితో పాక్షికంగా ముడివడి వుంది.

జౌళి పరిశ్రమలో లేదా వ్యవసాయంలో ఉత్పత్తి సాధకాల విలువ, తగ్గుదలకు ఫలితంగా వాడే ధర తగ్గుదలకు పూర్వావసరం అవుతోంది. ఇది స్వయం విదితమే; ఎందుచేతనంటే ఒక పరిశ్రమ శాఖ తాలూకు ఉత్పాదితమైన సరుకు మరో పారిశ్రామిక శాఖ ఉత్పత్తి సాధనంగా ప్రవేశిస్తుంది. ఆ సరుకు ధర ఎక్కువా లేక తక్కువా అన్నది అది ఏ ఉత్పత్తి శాఖ సరుకుగా వెలువడిందో దానిలోని శ్రమ ఉత్పాదకతపై ఆధారపడి ఉంటుంది. అంతేకాకుండా తాను ఏ సరుకుల ఉత్పత్తిలోకి ప్రవేశిస్తుందో ఆ సరుకుల ధరను అది తగ్గించడమే కాక; ఇక్కడ ఏ స్థిర పెట్టుబడిలో తాను ఒక భాగమవుతూ ఉందో ఆ స్థిర పెట్టుబడి విలువను కూడా అది తగ్గిస్తుంది. తద్వారా లాభం రేటును పెంచుతుంది.

పరిశ్రమ క్రమానుగతంగా అభివృద్ధి చెందిన మూలంగా స్థిర పెట్టుబడిలో అయ్యే ఈ రకమైన ఆదా యొక్క విశిష్ట లక్షణమేమిటంటే, ఒక పరిశ్రమ శాఖలోని లాభం రేటు పెరుగుదల మరో పరిశ్రమ శాఖలోని శ్రమ ఉత్పాదక శక్తి అభివృద్ధిపై ఆధారపడి వుంటుంది. ఈ విషయంలో పెట్టుబడిదారుడికి అనుకూలమైన దేదైనా సరే, సామాజిక శ్రమ వల్ల పొందిన లబ్ధి. తాను దోపిడీ చేసే కార్మికుల ఉత్పాదితం కానిపక్షంలో అది అంతే. అంతిమ విశ్లేషణలో తేలేదేమంటే, ఇలాంటి ఉత్పాదక శక్తి అభివృద్ధికి మూలం – ఉత్పత్తిలో నియోగింపబడుతున్న శ్రమ తాలూకు సామాజిక స్వభావమూ, సమాజంలోని శ్రమ విభజనా, బౌద్ధిక శ్రమ అభివృద్ధే. ముఖ్యంగా భౌతిక శాస్త్రాల్లో దాని అభివృద్ధి పెట్టుబడిదారుడు ఈ విధంగా వినియోగించుకునే దేమిటంటే సామాజిక శ్రమ విభజన తాలూకు యావత్ వ్యవస్థలోని అనుకూలాలనే. ఇక్కడ పెట్టుబడిదారుడికి ఉత్పత్తి సాధనాలను సమకూర్చే బాహ్యశాఖలోని శ్రమ ఉత్పాదకత అభివృద్ధి అతడు నియోగించే స్థిర పెట్టుబడి విలువను సాపేక్షంగా తగ్గిస్తుంది; తద్వారా లాభం రేటును పెంచుతుంది.

లాభం రేటులో మరో తరహా పెరుగుదల కూడా ఉంది. దీనికి మూలం స్థిర పెట్టుబడిని సృష్టించే శ్రమలో పొదుపు కాదు. ఆ పెట్టుబడి వాడకంలోని పొదుపు. ఒకవైపేమో, శ్రామికుల –

కేంద్రీకరణ, వారి భారీస్థాయి సహకార శ్రమ – ఇవి స్థిర పెట్టుబడిని పొదుపు చేస్తాయి. అవే భవనాలు, అవే ఉష్ణ ఉత్పాదకాల ప్రసార యంత్రాలు, – లఘుస్థాయి ఉత్పత్తులలో కంటే భారీస్థాయి ఉత్పత్తిలో వీటి వ్యయం సాపేక్షంగా తక్కువగా ఉంటుంది. విద్యుదుత్పాదక యంత్రాలు, పనియంత్రాల విషయంలోనూ ఇది వర్తిస్తుంది. వీటి నిరపేక్ష విలువ పెరిగినప్పటికీ ఉత్పత్తి విస్తరణతోనూ, లేక అస్థిర పెట్టుబడి పరిమాణంతోనూ, లేక చలనంలో ఉంచిన శ్రమశక్తి పరిణామంతోనూ పోల్చినపుడు వాటి విలువ తగ్గుతుంది. తన సొంత ఉత్పత్తి శాఖలోనే ఒక నిర్దిష్ట పెట్టుబడి సాధించే పొదుపు ప్రప్రథమంగా శ్రమలో పొదుపే. అంటే దాని సొంత కార్మికుల తాలూకు చెల్లించబడిన శ్రమలో తగ్గుదలే కాక ఇంతకు మునుపు ప్రస్తావించిన స్పష్టమైన తేడా ఉంది. ఇంతకు మునుపు ప్రస్తావించిన పొదుపు ఇతరుల చెల్లించబడని శ్రమను, అతి పొదుపైన పద్ధతిలో అంటే నిర్ణీత ఉత్పత్తి స్థాయి వల్ల – వీలయినంత తక్కువ వ్యయంతో సాధ్యమయినంత ఎక్కువగా స్వాయత్తం చేసుకోవడం ద్వారా సాధింపబడింది; ఇంతకు ముందు ప్రస్తావించిన స్థిర పెట్టుబడి ఉత్పత్తిలో నియోగించిన సామాజిక శ్రమ ఉత్పాదకత దోపిడీపై ఈ తరహా పొదుపు ఆధారపడదు, ఇది స్థిర పెట్టుబడి వినియోగంలోనే జరిగే పొదుపు కాబట్టి అది ఒకానొక ఉత్పత్తి శాఖలోనే శ్రమ పరస్పర సహకారం నుంచి, లేదా ఆ శ్రమ సామాజికత నుంచి ప్రత్యక్షంగా ఉత్పన్నమవుతుంది. లేక, యంత్రాలు మొదలయినవాటి ఉపయోగపు విలువ పెరిగే వేగంతో వాటి విలువ పెరగకుండా ఉండే స్థాయిలో జరిగే ఆ యంత్రాదుల ఉత్పత్తి నుంచి తలెత్తుతుంది.

ఇక్కడ రెండు విషయాలు గుర్తుంచుకోవాలి. భి విలువ సున్నాకు సమానమైనట్లయితే, ల'=అ.వి'; అప్పుడు లాభం రేటు గరిష్ట స్థాయిలో ఉంటుంది కానీ శ్రమను ప్రత్యక్షంగా దోపిడీ చేయడంలో అతి ముఖ్యమైన విషయం, నియుక్తమైన దోపిడీ సాధనాల విలువ కాదు; అంటే నిశ్చల పెట్టుబడి; ముడిపదార్థాలు, అనుబంధ పదార్థాలు వగైరాల విలువకాదు. శ్రమను గ్రహించే సాధనాలుగా శ్రమ, తద్వారా అదనపు శ్రమ వస్తురూపం ధరించడానికి సాధనాలుగా ఉపకరించే మేరకు యంత్రాల, భవనాల ముడి పదార్థాల వగైరాల మార్పిడి విలువకు బొత్తిగా ప్రాధాన్యం లేదు. తుదకంటూ చూస్తే, ఏది ముఖ్యమంటే ఒకవైపేమో ఒక నిర్దిష్ట పరిమాణంలోని సజీవశ్రమతో సమ్మేళనకు సాంకేతికంగా అవసరమైన ఈ సాధనాల పరిమాణమూ, మరోవైపేమో వాటి అనుకూల్యత, అంటే మంచి యంత్రాలే కాక నాణ్యత గల ముడిపదార్థాలు, అనుబంధ పదార్థాలు కూడా ముఖ్యం. లాభం రేటు పాక్షికంగా ముడిపదార్థాల ఉత్తమ నాణ్యతపై ఆధారపడి ఉంటుంది. మంచి పదార్థాలలో వ్యర్థమై పోయే భాగం తక్కువగా ఉంటుంది. కనుక, అదే శ్రమ పరిమాణాన్ని గ్రహించడానికి తక్కువ ముడిపదార్థాలైనా చాలు. పైగా, పనిచేసే యంత్రానికి ఎదురయ్యే రాపిడి కూడా తక్కువగా ఉంటుంది. ఇది పాక్షికంగా అదనపు విలువనూ, అదనపు విలువ రేటునూ ప్రభావితపరుస్తుంది. నాణ్యతలేని ముడిపదార్థాలైతే, అదే పరిమాణంలోని వాటి శుద్ధికి కార్మికునికి ఎక్కువ సమయం అవసరమవుతుంది. వేతనాలు యథాతథంగా ఉంటాయని భావిస్తే, ఇందువల్ల అదనపు శ్రమ తగ్గుతుంది. ఇది పెట్టుబడి పునరుత్పత్తినీ, సంచయనాన్నీ కూడా గణనీయంగా ప్రభావితం చేస్తుంది; ఇవి, ప్రథమ సంపుటం (S.627/619 ff)లో నిరూపించినట్లు; నియోగించిన శ్రమ పరిమాణంపైకన్నా, శ్రమ ఉత్పాదకతపై ఎక్కువ ఆధారపడి ఉంటుంది.

కాబట్టి ఉత్పత్తి సాధనాల్లో పొదుపు విషయమై పెట్టుబడిదారుడు ఎందుకంత పిడి పట్టుపడతాడో మనం తేలిగ్గానే అర్థం చేసుకోవచ్చు. ఏదీ నష్టం జరగరాదన్నా, దుబారా కాకూడదన్నా, ఉత్పత్తికి అవసరమైనంత మేరకే ఉత్పత్తి సాధనాలు వినియోగం కావాలన్నా అది కొంతవరకు శ్రామికుల నైపుణ్యంపైనా, తెలివిపైనా ఆధారపడి ఉంటుంది; కొంతవరకు సంయుక్త శ్రమ విషయంలో పెట్టుబడిదారు అమలు జరిపే క్రమశిక్షణపైనా ఆధారపడి ఉంటుంది. కాగా శ్రామికులు తమకోసమే ఇచ్ఛాపూర్వకంగా పనిచేసే సామాజిక వ్యవస్థలో, ఈ క్రమశిక్షణ అవసరం ఉండదు. ఒప్పందం పనిలో (piece-work) ఇలాటి క్రమశిక్షణతో ఇప్పటికే దాదాపు అవసరం లేకుండా పోయింది. ఉత్పత్తి భాగాలను కల్తీ చేయడంలో కూడా ఈ తరహా భల్లూకపు పట్టుదల తద్వ్యతిరేక రూపంలో వ్యక్తమవుతుంది. అస్థిర పెట్టుబడితో స్థిర పెట్టుబడి విలువ నిష్పత్తిని తగ్గించి తద్వారా లాభం రేటును పెంచే ఒకానొక ప్రధాన పద్ధతి ఈ కల్తీయే. ఈ ఉత్పత్తి భాగాల విలువ, ఉత్పాదితంలో పునర్దర్శన మిచ్చిన మేరకు, ఈ ఉత్పత్తి భాగాలను వాటి విలువ కంటే ఎక్కువకు అమ్మడం మోసమే అవుతుంది. జర్మన్ పరిశ్రమలో ఈ వంచనాత్మక ఆచరణ ముఖ్యమైన పాత్ర నిర్వహిస్తుంది. మొదట నుంచి నమూనా సరుకులు పంపి, ఆ తర్వాత నాసిరకం సరుకులు పంపినప్పటికీ ప్రజలు వాటిని నిజంగా మెచ్చుకొంటారనేది దీని సూత్రం. ఏది ఏమైనా ఈ విషయాలు పోటీ రంగానికి చెందినవి కాబట్టి ఇక్కడ వాటితో మనకు ప్రమేయం లేదు.

ఇక్కడ ఒక విషయం గమనించాలి. స్థిర పెట్టుబడి విలువను తగ్గించడం ద్వారా అంటే దాని ఖర్చును తగ్గించడం ద్వారా లాభం రేటును పెంచడం, ఏ విధంగానూ, ఆ పారిశ్రామిక శాఖ విలాస వస్తువులు ఉత్పత్తి చేస్తున్నదా లేక శ్రామికుల వినియోగం కోసం ఉత్పత్తి చేస్తున్నదా లేక మొత్తంపై ఉత్పత్తి సాధనాలను సృష్టిస్తున్నదా అన్న దానిపై బొత్తిగా ఆధారపడదు. ఇక్కడ సమస్య అదనపు విలువ రేటుకు సంబంధించినదై ఉంటే, పైన ఆఖరులో పేర్కొన్న విషయానికి ప్రాముఖ్యం ఉంది. ఎందుకంటే అదనపు విలువ రేటు ప్రధానంగా శ్రమశక్తి విలువపై ఆధారపడి ఉంటుంది. అంటే శ్రామికుని మామూలు జీవితావసరాల విలువపై ఆధారపడి ఉంటుంది. అయితే ఇక్కడి ఉదాహరణలో అదనపు విలువ, అదనపు విలువ రేటు రెండూ నిర్ణీతమైనవిగా ఊహించుకొన్నాం. ఈ పరిస్థితుల్లో మొత్తం పెట్టుబడితో అదనపు విలువకు గల నిష్పత్తి – లాభం రేటును నిర్ధారించేదే –పూర్తిగా స్థిర పెట్టుబడి విలువపైనే ఆధారపడి ఉంటుంది తప్ప ఏ విధంగానూ ఆ స్థిర పెట్టుబడిలోని భాగాల ఉపయోగ విలువపై ఆధారపడదు.

ఉత్పత్తి సాధనాలు సాపేక్షంగా చౌక అయే వాటి నిరపేక్ష మొత్తం విలువ పెరిగే అవకాశం లేదనికాదు. ఎందుచేతనంటే శ్రమ ఉత్పాదకత పెరగడంతోనూ దానితోపాటు ఉత్పత్తి స్థాయి పెరగడంతోనూ, నియుక్తమైన ఉత్పత్తి సాధనాల పరిమాణం బ్రహ్మాండంగా పెరుగుతుంది. స్థిర పెట్టుబడిని ఉపయోగించడంలో పొదుపు అన్నది, ఏ దృష్టిలో చూసినప్పటికీ కొంతవరకు, ఒక వాస్తవం నుంచి ఉత్పన్నమైన ఫలితంగా పరిగణించవచ్చు. అదేమంటే, ఉత్పత్తి సాధనాలు సమ్మేళనమైన శ్రామికుని సంయుక్త ఉత్పత్తి సాధనాలుగా పనిచేస్తాయి, వినియోగమవుతాయి. ఆ విధంగా అయిన ఆదా, ప్రత్యక్ష ఉత్పాదక శ్రమ యొక్క సామాజిక స్వభావ ఫలితంగా కనిపిస్తుంది. అయితే ఈ పొదుపు పెట్టుబడికి దాని సరఫరాకి అయ్యే రంగాల్లో శ్రమ ఉత్పాదకత అభివృద్ధి చెందుతున్న

ఫలితం కూడా. కాబట్టి, మనం, పెట్టుబడిదారు క నియమించిన శ్రామికులను పెట్టుబడిదారుడు గ దృష్ట్యా పరిశీలించకుండా, మొత్తం శ్రమను మొత్తం పెట్టుబడి దృష్టితో పరిశీలించినట్లయితే, ఈ పొదుపు సామాజిక శ్రమ తాలూకు ఉత్పాదకశక్తుల అభివృద్ధి ఫలితంగా మరోసారి దర్శనమిస్తుంది. అయితే ఇందులోని ఒకే ఒక తేడా ఏమిటంటే, పెట్టుబడిదారు క తన సొంత సంస్థలోని శ్రమ ఉత్పాదకత ప్రయోజనాన్నే కాక ఇతర సంస్థల్లోని శ్రమ ఉత్పాదకత ప్రయోజనాన్ని కూడా పొందుతున్నాడు. కానీ పెట్టుబడిదారు తన స్థిర పెట్టుబడిలో పొదుపును శ్రామికులతో సంబంధం లేనిదిగానూ, వారికి అన్యమైనదిగానూ పరిగణిస్తాడు. అయితే తాను ఒకే మొత్తం డబ్బుతో ఎక్కువమంది శ్రామికులను లేక తక్కువమంది శ్రామికులను కొనుగోలు చేయడంలో కార్మికులకేదో సంబంధం ఉందన్న విషయం యజమానికి సదా స్పష్టంగా తెలుసు. ఎందుకంటే పెట్టుబడిదారుడికీ శ్రామికుడికీ మధ్య గల లావాదేవీ అతనికి ఈ విధంగానే కనిపిస్తుంది. ఉత్పత్తి సాధనాల వాడుకల్లో ఈ పొదుపు, కనీస మదుపుతో ఒకానొక నిర్దిష్ట ఫలితాన్ని సాధించే ఈ పద్ధతి – శ్రమయొక్క అంతర్గత శక్తిగా కాకుండా, పెట్టుబడి సహజశక్తిగానే పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానానికీ ప్రత్యేకమైన, దానికి లక్షణంగా ఉన్న పద్ధతిగా కనిపిస్తుంది.

ఇది వాస్తవానికి అనుగుణంగా ఉన్నట్లు కనిపిస్తున్నందువల్లనేమి, శ్రామికుని శ్రమకు ఆకారమిచ్చే సాధనాల పట్ల శ్రామికుల నిరాసక్తత, వేర్పాటుతనం పరాంగ్ముఖతల వెనుక గల ఆంతరిక సంబంధంపై పెట్టుబడి సంబంధం ముసుగు కప్పుతున్నందువల్ల నేమి, ఈ భావన ఆట్టే ఆశ్చర్యకరమైంది కాదు.

మొదటిది – స్థిర పెట్టుబడిగా వున్న ఉత్పత్తి సాధనాలు పెట్టుబడిదారుడికి చెందిన డబ్బుకు మాత్రమే ప్రాతినిధ్యం వహిస్తాయి. రోమన్ రుణగ్రహీత శరీరం అతని రుణదాత డబ్బుకు ప్రాతినిధ్యం వహిస్తుందని లింగెట్ అభిప్రాయ పడినట్లుగా[1] అవి అతనికి మాత్రమే సంబంధించినవి; కాగా ప్రత్యక్ష ఉత్పత్తి ప్రక్రియలో మాత్రమే ఉత్పత్తి సాధనాలతో శ్రామిక సంపర్కం. అతడు వాటితో ఉత్పత్తి తాలూకు ఉపయోగ విలువలుగానే, శ్రమ సాధనాలుగానే ఉత్పత్తి పరికరాలుగా మాత్రమే వ్యవహరిస్తాడు. ఈ కారణంగా, శ్రామికుడు రాగితో పనిచేసినా, ఇనుముతో పనిచేసినా ఉత్పత్తి సాధనాల విలువ పెరిగినా, తరిగినా ఆ సంబంధంపై దానికి ఎంతో ప్రభావము ఉండదు. పెట్టుబడిదారుడితో అతడి సంబంధంపై దానికి ఎలాంటి ప్రభావమూ లేనట్టే. ఆ విషయానికి వస్తే, ఉత్పత్తి సాధనాల విలువ పెరిగి, తత్ఫలితంగా అతడి లాభం రేటు గనక తగ్గిపోయినట్లయితే పెట్టుబడిదారు ఈ విషయాన్ని మరోరకంగా చూడాలనుకుంటాడు; దీన్ని తర్వాత వివరిస్తాము.

రెండవది – పెట్టుబడిదారీ ఉత్పత్తి ప్రక్రియలో ఈ ఉత్పత్తి సాధనాలు శ్రమను దోపిడీ చేసే సాధనాలు కూడా! అందువల్ల ఆ ఉత్పత్తి సాధనాలు ఎంత ప్రియమైనవి లేక ఎంత చౌకగా ఉన్నవీ శ్రామికుడికి ఏవిధంగానూ పట్టదు. కళ్ళెం ధర ప్రియమా, లేక చౌకా అన్న విషయంపై గుర్రానికి ఏవిధంగా సంబంధం లేనట్లే ఇదీనూ.

చివరిది – తన శ్రమ యొక్క సామాజిక స్వభావాన్ని, ఒక ఉమ్మడి ప్రయోజనం కోసం ఇతరుల శ్రమతో తన శ్రమ సమ్మేళనను శ్రామికుడు పరాయివిగా పరిగణిస్తాడని ఇంతకు ముందే

1. [ (Linguet) Theorie des loix civiles, ou principes fondamentaux de la Societe, tome II, Londres, 1767, livre V, chapitre XX - సంపాదకుడు.]

గమనించాం. ఈ సమ్మేళనాన్ని సఫలీకృతం చేసేది అతనికి పరాయి ఆస్తి; దాన్ని పొదుపు చేయాలన్నా నిర్బంధానికి గురైతే తప్ప ఆ ఆస్తి దుర్వ్యయం గురించి అతడు బొత్తిగా పట్టించుకోడు. రాచ్‌డేల్[1] విషయంలోలాగా శ్రామికులే ఫ్యాక్టరీల సొంతదార్లయితే ఈ పరిస్థితి భిన్నంగా ఉంటుంది.

ఈ క్రింది విషయాన్ని ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు; ఒక పరిశ్రమ శాఖలోని శ్రమ ఉత్పాదకత, మరో పరిశ్రమ శాఖలోని ఉత్పత్తి సాధనాలను చౌకపరచడానికీ, మెరుగుపరచడానికీ, తద్వారా లాభం రేటును పెంచడానికి ఒక సాధనమవుతోంది. పెట్టుబడిదారుడు మాత్రమే ఆ ఉత్పత్తి సాధనాలను కొనుగోలు చేస్తాడు, స్వాయత్తం చేసుకుంటాడు కాబట్టి; ఈ సామాజిక శ్రమ తాలూకు సాధారణ అంతస్సంబంధం తమకు పూర్తిగా పరాయిదిగా శ్రామికులకు కనిపిస్తుంది; తన సొంత పరిశ్రమ శాఖలోని శ్రామికుల ఉత్పాదితంతో వేరే పరిశ్రమ శాఖలోని శ్రామికుల ఉత్పాదితాన్ని పెట్టుబడిదారు కొనుగోలు చేస్తున్నాడు కనుక తన సొంత ఉత్పాదితాన్ని ఎలాటి చెల్లింపు లేకుండానే స్వాయత్తం చేసుకోవడం ద్వారా మాత్రమే వేరే పెట్టుబడిదారుని ఉత్పాదితాన్ని అమ్మగలుగుతున్నాడు ఇదే – చలామణి ప్రక్రియ మొదలైనవి, అదృష్టవశాత్తు మరుగుపుచ్చుతున్న పరిణామం.

పైపెచ్చు భారీస్థాయి ఉత్పత్తి తన పెట్టుబడిదారీ రూపంలో ప్రప్రథమంగా అభివృద్ధి చెందుతుంది. కాబట్టి అటు లాభపిపాస, ఇటు పోటీ సరుకులను సాధ్యమైనంత చౌకగా ఉత్పత్తి అయ్యేలా చేసే ఈ రెంటి మూలంగా స్థిర పెట్టుబడి నియామకంలో పొదుపు, పెట్టుబడిదారీ విధాన ఉత్పత్తియొక్క విశిష్ట లక్షణంగా కనిపిస్తున్నది. కనుక ఇది పెట్టుబడిదారుని క్రియగా కనిపిస్తుంది. పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం ఒకవైపు సామాజిక శ్రమ యొక్క ఉత్పాదక శక్తుల అభివృద్ధికి దోహదం చేసినట్లే మరొకవైపు స్థిర పెట్టుబడి నియామకంలో పొదుపును పెంచుతుంది.

ఏదియేమైనా, శ్రామికునికీ, అంటే సజీవశ్రమ వాహకునికీ, అతని శ్రమ తాలూకు భౌతిక పరిస్థితులను పొదుపుగా అంటే సహేతుకంగా, దుబారా చేయకుండా వాడటానికీ మధ్య తలెత్తేది ఈ వేర్పాటు భావమూ, ఉపేక్షా భావమూ మాత్రమే కాదు.

పెట్టుబడిదారీ విధాన ఉత్పత్తికి గల పరస్పర విరుద్ధ, శత్రుపూరిత స్వభావానికి అనుగుణంగా అది శ్రామికుని జీవితాన్ని, ఆరోగ్యాన్ని తీవ్రంగా నాశనం చేయడాన్ని, అతని జీవన పరిస్థితులను కుంగదీయడాన్ని కూడా స్థిర పెట్టుబడి వినియోగంలో పొదుపుగా, ఆ మేరకు లాభం రేటును పెంచే సాధనంగా పరిగణిస్తుంది.

శ్రామికుడు తన జీవితంలో ఎక్కువ భాగాన్ని ఉత్పత్తి ప్రక్రియలో గడుపుతాడు కాబట్టి, ఈ ప్రక్రియ తాలూకు పరిస్థితులు చాలా వరకు అతని క్రియాశీల జీవనక్రమ పరిస్థితులుగా, అంటే అతని జీవన పరిస్థితులుగా ఉంటాయి. కాబట్టి ఈ జీవన పరిస్థితులలో పొదుపు చేయడం అన్నది లాభం రేటును పెంచే సాధనంగా ఉంటుంది. మనం ఇంతకు ముందే గమనించినట్లు ఈ మితి మించిన పని, శ్రామికుని గానుగెద్దుగా మార్చే క్రమం; పెట్టుబడిని పెంచే సాధనమయినట్లు లేక అదనపు విలువ ఉత్పత్తిని త్వరితం చేసే సాధనమయినట్లు. ఇలాంటి పొదుపు పారిశుద్ధ్య సౌకర్యాలు

1. 1844లో ఏర్పాటైన 'సొసైటీ ఆఫ్ ఈక్విటబుల్ పయనీర్స్' ఈ ఫ్యాక్టరీలను స్థాపించింది. ఈనాడు వీటిని వినియోగ సహకార సంఘాల ప్రారంభ బిందువుగా భావిస్తున్నారు - తెలుగు కూర్పు సంపాదకుడు.

బొత్తిగా లేని ఇరుకు ఇళ్ళలో కార్మికులు క్రిక్కిరిసివుండటం, (దీన్ని పెట్టుబడిదారుడి భాషలలో స్థలాన్ని ఆదా చేయడం అని అంటారు) ఎలాటి భద్రతా సౌకర్యాలు లేని ఇరుకు గదుల్లో ప్రమాదకరమైన యంత్రాలతో శ్రామికులను పని చేయించడం, ఆరోగ్యానికి హానికరమైన గని తవ్వకంలో లాగా ప్రమాదకరమైన ఉత్పత్తి ప్రక్రియలో భద్రతా నిబంధనలను నిర్లక్ష్యం చేయడం ఇవన్నీ – ఈ పొదుపు కిందికే వస్తాయి. ఇక, ఉత్పత్తి క్రమాన్ని మనుషులు పాల్గొన తగినదిగా, ఆమోద యోగ్యమైనదిగా, కనీసం సహించదగినదిగా చేసే సౌకర్యాలు బొత్తిగా ఉండవని చెప్పాల్సిన అవసరమే లేదు. పెట్టుబడిదారుడి దృక్పథంలో ఆ సౌకర్యాలు కల్పించడం వట్టి పనికిమాలిన పని, తెలివి తక్కువ వృధా వ్యయం. ఎంత లోభితనం ఉన్నప్పటికీ, మొత్తం మీద పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం మానవ వనరుల విషయంలో ఎంతైనా దుర్వ్యయం చేస్తుంది. వర్తకం ద్వారా సరుకులను పంపిణీ చేసే తన పద్ధతి మూలంగానూ, పోటీ పద్ధతి మూలంగానూ తన పాదార్థిక సాధనాలను ఎంతైనా దుర్వ్యయం చేసినట్లుగానే వ్యక్తిగత పెట్టుబడిదారుడికి అది సంపాదించి పెట్టే లాభం సమాజానికి నష్టమవుతుంది.

సజీవ శ్రమ ప్రత్యక్ష నియోగాన్ని అవసరమైన శ్రమ మేరకే కుదించే పోకడతో పాటు శ్రమ యొక్క సామాజిక ఉత్పాదకతను ఉపయోగించుకోవడం ద్వారా సరుకు ఉత్పత్తికి అవసరమైన శ్రమను తగ్గించే, తద్వారా నేరుగా నియుక్తం చేసే సజీవశ్రమను గరిష్ట స్థాయిలో పొదుపుచేసే పోకడతో పాటు పెట్టుబడికి మరో పోకడ కూడా ఉంది; కనీస స్థాయికి తగ్గించిన ఈ శ్రమను పూర్తిగా పొదుపుచేసిన పరిస్థితుల్లో నియమించే పోకడయిది. అంటే, నియుక్తం విలువ స్థిర పెట్టుబడి విలువను కనీస స్థాయికి కుదించే ధోరణి కూడా పెట్టుబడికి ఉంది. సరుకుల్లో నిక్షిప్తమై వున్న మొత్తం శ్రమ కాలంకాక, అవసరమైన శ్రమ మాత్రమే సరుకుల విలువను నిర్ధారించే పక్షంలో ఆ నిర్ధారణను వాస్తవీకరించేదీ, అదే సమయంలో నిర్దిష్ట సరుకును ఉత్పత్తి చేయడానికి సామాజికంగా అవసరమైన శ్రమ కాలాన్ని నిరంతరాయంగా తగ్గించేదీ పెట్టుబడే. ఆ సరుకు ఉత్పత్తికి అవసరమైన శ్రమలోని ప్రతి భాగమూ, కనీస స్థాయికి కుదించబడినందువల్ల సరుకు ధర దాని కనీస స్థాయికి తగ్గుతుంది.

స్థిర పెట్టుబడి వినియోగానికి సంబంధించి పొదుపులోని ఒక తేడాను మనం గమనించాలి. నియుక్తమైన పెట్టుబడి పరిమాణం పెరిగితే పర్యవసానంగా ఆ పెట్టుబడి విలువ మొత్తం పెరిగినట్లయితే అది ఒకే చేతిలో ఎక్కువ పెట్టుబడి కేంద్రీకరణ మాత్రమే. ఐనప్పటికీ ఈ విధంగా ఎక్కువ పరిమాణంలో ఒకే సంస్థచే స్థిర పెట్టుబడి నియామకమయినందువల్లనే, అస్థిర పెట్టుబడిని పొదుపు చేయడానికి అవసరం కలుగుతోంది. ఈ విధమైన నియామకంలో, శ్రమ సాపేక్షంగా ఎక్కువ పరిమాణంలో ఉండి తీరుతుంది. కానీ ఆ పరిమాణం సాపేక్షంగా తక్కువే. వ్యష్టి పెట్టుబడిదారుని పరిశీలనకు తీసుకున్నట్లయితే, మదుపు పెట్టిన అవసరమైన పెట్టుబడి మొత్తం ముఖ్యంగా దానిలోని నిశ్చల భాగం పెరుగుతుంది. అయితే సరుకు తయారీకి ఉపయోగించిన సామాగ్రి మొత్తంలోనూ, దోచుకున్న శ్రమతోనూ పోల్చితే దీని విలువ తగ్గుతుంది.

కొన్ని ఉదాహరణల ద్వారా దీన్ని ఇప్పుడు సంక్షిప్తంగా నిరూపించాలి. చివరి విషయంతో, అంటే ఉత్పత్తి పరిస్థితుల్లో పొదుపుతో ప్రారంభిద్దాం; ఇది శ్రామికుని జీవన పరిస్థితులవుతున్నాయి కూడా. ఆ మేరకు వాటితో ప్రారంభిద్దాం.

## II. శ్రామికుల శ్రేయస్సుకు భంగకరంగా శ్రమ పరిస్థితుల్లో పొదుపులు

**బొగ్గుగనులు : తప్పనిసరి అయిన ఖర్చులపట్ల అలక్ష్యం :**

"బొగ్గుగనుల యజమానులు, సొంతదారుల మధ్యగల పోటీ ఫలితంగా.... వారు అతి స్పష్టంగా కనిపించే భౌతికమైన చిక్కులను అధిగమించడానికి అవసరమైన దానికంటే ఎక్కువ ఖర్చులు పెట్టడమే లేదు; చేయాల్సిన పనికి అవసరమైన దానికంటే ఎక్కువ సంఖ్యలో ఉన్న బొగ్గు కార్మికుల మధ్య పోటీ ఉంది. ఈ పరిస్థితిలో తమ చుట్టూ ఉన్న వ్యవసాయ జనాభాకంటే కాస్త ఎక్కువగా లభించే వేతనాల కోసం వారు పెద్ద పెద్ద ప్రమాదాలను, విషపూరిత కాలుష్యాలను ఎదుర్కోడానికి సంతోషంగా సిద్ధమవుతారు; పైగా గనుల్లో తమ పిల్లలను కూడా లాభకరంగా ఉపయోగపెట్టుకోగలుగుతారు. అత్యంత దోషభూయిష్టమైన మురుగు నివారణ సౌకర్యాలూ, వాతాయనాలతో (Ventilator), తరచూ అరకొరగా నిర్మించిన సొరంగ మార్గాలూ, పనికిమాలిన పనిముట్లూ, అసమర్థ ఇంజనీర్లతో అరకొరగా నిర్మించిన నడవాలతో, రోడ్లతో అనేకానేక గనులను పనిచేయించడానికి ఈ జంట పోటీ చాలు. ఇవి ప్రాణహానికీ, అంగవైకల్యానికీ, అనారోగ్యానికి కారణభూతమవుతున్నాయి. వీటి గణాంక వివరాలు భయంకరమైన చిత్రాన్ని మన ముందుంచుతాయి". (బొగ్గు గనుల్లో పిల్లల నియామకంపై ప్రథమ నివేదిక, ఏప్రిల్ 21, 1829 పుట102) 1860 ప్రాంతాల్లో ఇంగ్లీషు బొగ్గు కార్మికులు సగటున వారానికి 15 మంది చొప్పున ప్రాణాలు కోల్పోయారు. బొగ్గుగని ప్రమాదాల నివేదిక (ఫిబ్రవరి 6, 1862) ప్రకారం 1852-61 మధ్యకాలంలోని పదేళ్ళలో మొత్తం 8466 మంది దుర్మరణం పాలయ్యారు. అయితే అసలు సంఖ్య ఇంతకంటే ఎక్కువే ఉండొచ్చునని ఆ నివేదిక అంగీకరించింది. ఎందుచేతనంటే, ఇన్‌స్పెక్టర్లను నియమించిన తొలి కొద్ది సంవత్సరాల్లో వారి అజమాయిషీలోని జిల్లాలు కూడా మరీ పెద్దవిగా ఉన్న ఆ రోజుల్లో ఎన్నో ప్రమాదాలు, చావులు నమోదు కాలేదు. తనిఖీ వ్యవస్థ ఏర్పాటయ్యాక, ఇన్‌స్పెక్టర్లు తక్కువమందే ఉన్నప్పటికీ, వారికి ఇచ్చిన అధికారాలు పరిమితమైనవే అయినప్పటికీ ప్రమాదాలు ఇంకా ఎక్కువగానే ఉన్నా, వాటి సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది. పెట్టుబడిదారీ దోపిడీ స్వభావం ఎలాటిందో మనకి వాస్తవం స్పష్టంగా నిరూపిస్తున్నది. మనుషులు ఇలా బలి కావడానికి ప్రధాన కారణం బొగ్గుగని యజమానుల విపరీతమైన అత్యాశే. గనికి తరచుగా ఒకే ఒక గొయ్యిమార్గం ఉండేది. అందువల్ల సరిగా గాలి ఆడే సౌకర్యం లేకపోవడమే కాక ఆ గని గొయ్యికి ఏదైనా అవరోధం ఏర్పడితే, కార్మికులు తప్పించుకునే మార్గమే ఉండేదికాదు.

చలామణి ప్రక్రియ నుంచి, పోటీ అత్యాచారాల నుంచి వేరుచేసి – పెట్టుబడిదారీ ఉత్పత్తిని పరిశీలించినట్లయితే, సరుకుల్లో మూర్తీభవించివున్న వస్తురూప శ్రమ విషయంలో అది చాలా పొదుపైనదే. కానీ, ఏ ఇతర ఉత్పత్తి విధానం కంటే, ఈ ఉత్పత్తి విధానమే మానవ ప్రాణాలను లేక సజీవశ్రమను భారీగా దుర్వ్యయం చేస్తుంది; అది రక్తమాంసాలనే కాదు, నరాల సత్తువనూ, మెదడునూ కూడా దుర్వ్యయం చేస్తుంది. వాస్తవానికి, సమాజాన్ని చైతన్యయుతంగా పునర్ వ్యవస్థీకరించడం జరగబోయే ముందటి చారిత్రక శకంలో మానవజాతి అభివృద్ధికి ఈ మాత్రమైనా రక్షణ ఏర్పడి, అది కొనసాగుతున్నదంటే, అది జరుగుతున్నది, వ్యక్తి అభివృద్ధిని హద్దుపద్దూ లేకుండా వృధా చేయడం ద్వారానే. మనం ఇక్కడ చర్చిస్తున్న పొదుపంతా కూడా శ్రమ తాలూకు సామాజిక స్వభావం నుంచే

ఉత్పన్నమవుతున్నది కాబట్టి, ఈ ప్రత్యక్ష శ్రమ సామాజిక స్వభావమే మనుషుల ప్రాణాలూ, ఆరోగ్యం దుర్వ్యయం కావడానికి కారణమవుతోంది. ఫ్యాక్టరీల ఇన్‌స్పెక్టర్ ఆర్. బేకర్ సూచించిన ప్రశ్న ఈ విషయంలో విలక్షణమైనది. "మొత్తం సమస్యను త్రికరణశుద్ధితో పరిశీలించాలి; సామూహిక శ్రమ ద్వారా సంభవించే ఈ బాల్యజీవితాల బలిదానాన్ని ఎలా ఉత్తమ పద్ధతిలో నివారించగలం?" (ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ రిపోర్ట్స్; అక్టోబరు, 1863 పుట 157)

**ఫ్యాక్టరీలు :**

ఈ శీర్షిక కిందికి అసలు ఫ్యాక్టరీలలో శ్రామికుల భద్రత, సౌకర్యం, ఆరోగ్యాలకు హామీ కల్పించే భద్రతా చర్యల పట్ల ఉపేక్ష కూడా వస్తుంది. గాయపడిన, మరణించిన పారిశ్రామిక కార్మికుల జాబితాలో ఎక్కువ భాగానికి భద్రతా చర్యల పట్ల అలక్ష్యమే కారణం. (వార్షిక ఫ్యాక్టరీ నివేదికలు చూడండి) అలాగే ఇరుకు గదులు, గాలి ఆడే సౌకర్యం లేకపోవడం వగైరాలు కూడా దీనికిందికే వస్తాయి.

సమతల సొరంగ మార్గాల్లో భద్రతా ఏర్పాట్లు లేకపోవడం ఎంత ప్రమాదకరమో నిరంతరం సంభవించే ప్రమాదాలు చెప్పక చెబుతున్నప్పటికీ (అందులో అనేకం ప్రాణాంతకమైనవి), భద్రతా చర్యలకు ఎక్కువ ఖర్చు కానప్పటికీ, అవి ఉత్పత్తికి భంగకరం కానప్పటికీ వాటి అమలుకు సంబంధించిన చట్టపరమైన నిబంధనలను అనేకమంది యజమానులు ప్రతిఘటిస్తున్నారని 1855లోనే లియొనార్డ్ హోర్నర్ వాపోయాడు. (ఫ్యాక్టరీ ఇన్‌స్పెక్టర్ల రిపోర్ట్‌లు, 1835, పుట 6) వీరి ప్రతిఘటనకు జీతాలు లేని ఆనాటి జడ్జీలు (Justices of Peace) బాహాటంగానే సమర్థించారు; ఈ జడ్జీలలో ఎక్కువమంది స్వయంగా కార్ఖానా యజమానులు లేక వారి మిత్రులు కనుక ఆ విధంగానే వారికి అనుకూలంగా తీర్పులు చెప్పేవారు. ఈ పెద్దమనుషులు ఏ తరహా తీర్పులిచ్చేవారో సుపీరియర్ జడ్జి కాంప్‌బెల్ వెల్లడి చేశారు. అలాంటి ఒక తీర్పుపై తనకు అప్పీలు చేసుకొన్న ఒక కేసులో ఆ తీర్పును గురించి ప్రస్తావిస్తూ ఆయన ఇలా అన్నారు. "అది పార్లమెంటు చట్టానికి భాష్యం కాదు, అది పార్లమెంటు చట్టాన్ని రద్దు చేయటమే." (అదే నివేదిక పుట 11) యంత్రాలతో పని ప్రారంభించే ముందు కార్మికులు ముందుగా ఆ విషయం హెచ్చరించేవారు కాదని హోర్నర్ అదే నివేదికలో చెబుతున్నారు. యంత్రాలు పనిచేయని సమయంలో సైతం ఏదో ఒక పని నిరంతరం చేయవలసి ఉన్నందువల్ల వేళ్ళు, చేతులు ఎల్లప్పుడూ యంత్రాలపైనే ఉండేవి. కాబట్టి, కేవలం హెచ్చరించే సిగ్నల్ లేని కారణంగానే నిరంతరాయంగా ప్రమాదాలు జరుగుతున్నాయి. (అదే నివేదిక పుట 44) ఫ్యాక్టరీ చట్టాలను వ్యతిరేకించడానికి ఆ కాలంలో ఫ్యాక్టరీ యజమానుల కొక ట్రేడ్ యూనియన్ ఉండేది; మాంచెస్టర్‌లోని ఆ ట్రేడ్ యూనియన్ పేరు నేషనల్ అసోసియేషన్ ఫర్ ది అమెండ్‌మెంట్ ఆఫ్ ది ఫ్యాక్టరీ లాస్. ఫ్యాక్టరీ ఇన్‌స్పెక్టరు తమ సభ్యులపై పెట్టిన కేసుల విచారణలో కోర్టు ఖర్చులు చెల్లించడానికీ, యూనియన్ పేరుతో కేసులు నడపడానికీ 1855 మార్చిలో ఒక్కో ఆశ్విక శక్తికి రెండు షిల్లింగుల చొప్పున, మొత్తం 50 వేల పౌండ్లకు పైగా వసూలు చేసింది. చంపడం లాభంకోసం జరిగినప్పుడు, అది[1]

1. 1657లో ఇంగ్లండులో ప్రచురించిన "చంపడం హత్యకాదు" అన్న కరపత్రం గురించిన ప్రస్తావన యిది. ఈ కరపత్రాన్ని రచించిన వ్యక్తి నాటి పార్లమెంటరీ సేనలోని ఉగ్ర రిపబ్లికన్ పార్టీ సభ్యుడయిన ఎడ్వర్డ్ సెగ్జ్బీ - **సంపాదకుడు**

హత్యకాదని రుజువు చేయడం వారి లక్ష్యం. స్కాట్లాండ్‌కు చెందిన ఫ్యాక్టరీ ఇన్‌స్పెక్టర్ సర్‌జాన్ కిన్కెయిడ్ గ్లాస్కోలోని ఒక సంస్థ గురించి ఇలా చెబుతున్నాడు. గ్లాస్కోలోని ఆ సంస్థ తన యంత్రాలను కప్పే రక్షణ కవచాలను చేయడానికి తన ఫ్యాక్టరీలోనే లభించిన ఇనుము రద్దును ఉపయోగించిందనీ, అందుకైన మొత్తం ఖర్చు 9 పౌండ్లు 1 షిల్లింగు మాత్రమే అని, ఆయన చెప్పాడు. కాగా అది గనుక ఆ ట్రేడ్ యూనియన్‌లో చేరి ఉండివుంటే దాని 110 ఆశ్విక శక్తికిగాను మొత్తం 11 పౌండ్లు ఖర్చయివుండేది. అంటే యంత్రాల రక్షణ పరికరాల తయారీ ఖర్చుకంటే ఈ ఖర్చే ఎక్కువన్నమాట. అయితే 1854లో ఈ యూనియన్ ఏర్పాటయింది, అలాటి భద్రతాచట్టాన్ని స్పష్టంగా వ్యతిరేకించడానికే. 1844 నుంచి 1854 వరకూ ఫ్యాక్టరీ యజమానులు ఏనాడూ ఆ చట్టాన్ని లక్ష్యపెట్టిన పాపానపోలేదు. పామర్‌స్టర్ ఆదేశాల మేరకు చట్టాన్ని చిత్తశుద్ధితో అమలు పరుస్తామని ఫ్యాక్టరీ ఇన్స్పెక్టర్లు; యజమానులకు తెలపగానే వారు హుటాహుటిన తమ అసోసియేషన్‌ను ఏర్పాటు చేసుకున్నారు. అందులోని అతి ప్రముఖ సభ్యుల్లోని చాలామంది గౌరవ జడ్జీలే (Justices of Peace) కనుక వారు ఆ హోదాలో చట్టాన్ని అమలు పరచవలసి ఉండింది. 1855 ఏప్రిల్‌లో దేశీయ వ్యవహారాల నూతన మంత్రి సర్‌జార్జ్ గ్రే ఒక రాజీ ప్రతిపాదన చేస్తే ఆ అసోసియేషన్ ఆగ్రహంతో దానిని సైతం తిరస్కరించింది; ఆ రాజీ ప్రతిపాదనలో కేవలం నామమాత్ర భద్రతా పరికరాలను అమర్చినప్పటికీ ప్రభుత్వం సంతృప్తిపడుతుందని మంత్రి తెలిపారు. అనేక కోర్టు కేసుల్లో సుప్రసిద్ధ ఇంజనీర్ విలియం ఫేర్‌బేర్న్ తన పేరు ప్రఖ్యాతులను పొదుపు సూత్రాన్ని సమర్థించడానికీ, ఉల్లంఘించబడిన పెట్టుబడి స్వేచ్ఛను సమర్థించడానికీ వినియోగించాడు. ఫ్యాక్టరీ తనిఖీ అధినేత లియొనార్డ్ హార్నర్‌ను ఫ్యాక్టరీ యజమానులు ఊహించడానికి వీలున్న అన్ని పరిస్థితుల్లోనూ వెన్నాడి వేధించారు, ఆయనపై నీలాపనిందలు వేశారు.

కానీ ఫ్యాక్టరీ యజమానులు ఆనాటి రాణి బెంచి కోర్టునుంచి తమకు అనుకూలమైన తీర్పు పొందే వరకూ నిద్రపోలేదు. భూ ఉపరితలానికి ఏడడుగుల కంటే ఎక్కువ ఎత్తులోని సమతల షాఫ్టులకు భద్రతా పరికరాలు అమర్చాలని 1844 చట్టం నిర్దేశించడం లేదని ఆ తీర్పు స్పష్టం చేసింది. ఎట్టకేలకు మూఢ మతావేశం గల విల్సన్ పాటన్ అనే వ్యక్తి సేవల ద్వారా వారు తమకు పూర్తిగా సంతృప్తికరమైన పార్లమెంటు చట్టాన్ని సాధించుకోవడంలో కృతకృత్యులయ్యారు. లక్ష్మీపుత్రుల పాపిష్టి పనులను చేసి పెట్టడానికి తన మతభక్తిని రంగంపైకి తేవడానికి సదా సిద్ధంగా ఉంచుకొనే దైవభక్తిపరాయణుల్లో విల్సన్ పాటన్ ఒకరు. ఈ చట్టం కార్మికులకు గల ప్రత్యేక పొదుపు రక్షణ లేకుండా చేసింది. పారిశ్రామిక ప్రమాదాలు జరిగినప్పుడు నష్టపరిహారం కోసం మామూలు కోర్టులకు వెళ్ళండని వారికి ఆ చట్టం సూచించింది. (అలా సూచించడం, ఇంగ్లీషు దావాలకవుతున్న విపరీతమైన ఖర్చుల దృష్ట్యా వారిని కేవలం అపహాస్యం చేయడమే అవుతుంది.) ఆ చట్టం, నిపుణుల సాక్ష్యం అవసరమని చక్కని మాటలో చెప్పే క్లాజును పొందుపరచడం ద్వారా యజమానులు దావాల్లో ఓడిపోయే వీలులేకుండా చేసింది. ఫలితంగా ప్రమాదాలు శరవేగంగా పెరిగాయి. 1858 మే నుంచి అక్టోబర్ వరకు ఆరునెలల్లో అంతకుముందు సంవత్సరం ఆరునెలలతో పోల్చితే, ప్రమాదాలు 21 శాతం పెరిగినట్లు ఇన్‌స్పెక్టర్ బేకర్ తన నివేదికలో తెలిపాడు. ఆయన అభిప్రాయంలో వీటిని 36.7 శాతం ప్రమాదాలు నివారింపవీలున్నవి. 1845, 1846లలో కంటే 1858, 1859ల్లో ప్రమాదాల సంఖ్య

నిరంతరం గణనీయంగా తగ్గిన మాట నిజమే. ఇన్‌స్పెక్షన్ పరిధిలోకి వచ్చిన పరిశ్రమల్లోని కార్మికుల సంఖ్య 20 శాతం పెరిగినప్పటికీ ప్రమాదాల సంఖ్య వాస్తవంలో 29 శాతం తగ్గింది. అయితే ఇందుకు కారణమేమిటి? ఇప్పటికే (1865) ఈ సమస్య పరిష్కారమైంది. ఇందుకు ప్రధాన కారణం భద్రతా పరికరాలు అమర్చివున్న నూతన యంత్రాలను ప్రవేశపెట్టడమే; వీటివల్ల ఫ్యాక్టరీ యజమానికి అదనపు ఖర్చు అయ్యే అవకాశం లేదు. కాబట్టి ఈ భద్రతా పరికరాలకు వారు అభ్యంతరం తెలుపలేదు. పైపెచ్చు, కొంతమంది కార్మికులు తాము కోల్పోయిన చేతులకుగానూ భారీ నష్టపరిహారం పొందడంలో కృతకృత్యులయ్యారు కూడా; ఆ తీర్పులను ఉన్నత స్థాయి కోర్టులు సైతం ధృవీకరించాయి. (రిపోర్ట్స్ ఆఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్; ఏప్రిల్ 30 1861 పుట 31, అదే నివేదిక ఏప్రిల్ 1862, పుట 17)

యంత్రాల నిర్వహణలో వాటిని నడపడంలో ప్రమాదాలు జరక్కుంటే కార్మికుల (అందులో చాలామంది పిల్లలు) ప్రాణాలను, తనువులను రక్షించే పరికరాల్లో పొదుపుకు సంబంధించిన వివరాలిక చాలు.

## నాలుగు గోడల మధ్య పని:

స్థలం విషయంలోనూ, భవనాల విషయంలోనూ పొదుపు పాటించడం వల్ల ఇరుకు గదుల్లో కార్మికులు ఎంత క్రిక్కిరిసి ఉంటారో మనకు తెలుసు! వీటికి తోడు గాలి ప్రసార సదుపాయాల విషయంలో కూడా పొదుపు ఉండనే ఉంది. సుదీర్ఘమైన పనిగంటలు కూడా తోడైనప్పుడు ఇవి రెండూ శ్వాసకోశ రోగాలను, తద్వారా చావురేటును పెంచుతాయి. 1863 ప్రజారోగ్య నివేదికల నుంచి (ఆరవ నివేదిక) ఈ క్రింది ఉదాహరణలను సంగ్రహించాం. ఒకటవ సంపుటిలో మనకు బాగా పరిచయమైన డాక్టర్ జాన్ సైమన్ ఆ నివేదికను తయారు చేశాడు.

సమ్మిశ్రిత శ్రమ సహకార శ్రమ భారీస్థాయిలో యంత్రాల నియామకానికి, ఉత్పత్తి సాధనాల కేంద్రీకరణకు, వాటి వినియోగంలో పొదుపునకు వీలుకల్పించినట్లే; ఆరోగ్య అవసరాలచేత కాక, ఉత్పత్తి సౌలభ్యం చేత నిర్ణయింపబడిన పరిస్థితుల్లో నాల్గుగోడల మధ్య కార్మికులు ఇలా సామూహికంగా కలిసి పనిచేయటమే; ఒకే వర్క్‌షాపులో ఈ సామూహిక కేంద్రీకరణే, ఒకవైపు పెట్టుబడిదారుకు మరిన్ని లాభాలకు మూలాధారమవుతోంది. మరోవైపు, పనిగంటల తగ్గింపు, ఇతర జాగ్రత్తల ద్వారా అడ్డుకొంటే తప్ప కార్మికుల ప్రాణాలు, ఆరోగ్యం యధేచ్ఛగా బలికావడానికి కారణభూతమవుతోంది.

డాక్టర్ సైమన్ ఈ క్రింది నిబంధనను రూపొందించి బోలెడు గణాంక వివరాలతో ఆ నిబంధనను సమర్థిస్తాడు; "ఒక్క జిల్లాలోని ప్రజలు నాలుగు గోడల మధ్యసాగే వృత్తిలో ఏ నిష్పత్తిలో ఆకర్షితులవుతారో, అదే నిష్పత్తిలో ఊపిరితిత్తుల వ్యాధితో ఆ జిల్లాలో చావురేటు కూడా పెరుగుతుంది." (పుట 23) ఇందుకు కారణం అధ్వాన్నమైన గాలి ప్రసార సౌకర్యమే. "గదుల్లోపల సాగే పరిశ్రమలు ఎక్కువగా ఉన్న ప్రతి జిల్లాలోనూ కార్మిక ప్రజల మరణాల పెరుగుదల ఏ స్థాయిలో ఉందంటే, శ్వాసకోశ వ్యాధులు విపరీతంగా పెరిగినట్లు మొత్తం జిల్లా మరణాల లెక్కలు ప్రస్ఫుటం చేస్తున్నాయి." (పుట 23)

1860లోనూ 1861లోనూ హెల్త్ బోర్డు అధికారులు సేకరించిన మరణ వివరాలు ఇలా

ఉన్నాయి. ఇంగ్లీషు వ్యవసాయ జిల్లాలలో ఒకే సంఖ్యలోని 15-55 మధ్య వయస్సు గల పురుషుల్లో క్షయ తదితర శ్వాసకోశ వ్యాధులతో మరణినంచిన వారి సంఖ్య 100 కాగా, ఇతర జిల్లాల్లో మరణ రేట్లు ఇలా ఉన్నాయి; కావెంట్రీ జిల్లాలో 163, బ్లాక్ బర్న్, స్కిప్టన్‌లలో 167, కాంగ్లెటన్, బ్రెడ్‌ఫోర్డ్‌లలో 168, లీసెస్టర్‌లో 171, లీక్‌లో 182, మాకిల్స్‌ఫీల్డ్‌లో 184, బోల్డన్‌లో 190, నాటింగామ్‌లో 192, రాచ్‌డేల్‌లో 193, డెర్బీలో 198, సెల్ఫోర్డ్, ఆస్టన్-అండర్-లైన్‌లో 203, లీడ్స్‌లో 218, ప్రెస్టన్‌లో 220, మాంచెస్టర్‌లో 263 (పుట 24) ఈ క్రింది పట్టిక మరింత స్పష్టమైన ఉదాహరణలను ఇస్తోంది:

**15-55 మధ్య వయస్సు గలవారు ప్రతి లక్షమందికి**
**ఊపిరితిత్తుల జబ్బులతో మరణించిన పట్టిక**

| జిల్లా | ప్రధాన పరిశ్రమ | పురుషులు | స్త్రీలు |
|---|---|---|---|
| బెర్కాంప్‌స్టెడ్ | గడ్డిపరకల నేత (స్త్రీలు) | 219 | 578 |
| లీటన్ బజార్డ్ | గడ్డిపరకల నేత (స్త్రీలు) | 309 | 554 |
| న్యూపోర్ట్‌పాగ్నెల్ | లేసు ఫ్యాక్టరీ ఉత్పత్తి (స్త్రీలు) | 301 | 617 |
| టోసెస్టర్ | లేసు ఫ్యాక్టరీ ఉత్పత్తి (స్త్రీలు) | 239 | 577 |
| యెవిల్ | చేతి తొడుగుల ఫ్యాక్టరీ ఉత్పత్తి (ప్రధానంగా స్త్రీలు) | 280 | 409 |
| లీక్ | పట్టుపరిశ్రమ (ముఖ్యంగా స్త్రీలు) | 437 | 856 |
| కాంగ్లెటన్ | పట్టుపరిశ్రమ (ముఖ్యంగా స్త్రీలు) | 566 | 790 |
| మాకిల్స్‌ఫీల్డ్ | పట్టుపరిశ్రమ (ముఖ్యంగా స్త్రీలు) | 593 | 890 |
| ఆరోగ్యకరమైన గ్రామీణ జిల్లా | వ్యవసాయం | 331 | 333 |

ప్రతి లక్షమందికీ శ్వాసకోశ వ్యాధుల వల్ల 15-55 మధ్య వయసువారు ఏ సంఖ్యలో స్త్రీలు, ఏ సంఖ్యలో పురుషులు మరణించిందీ ఈ పట్టిక సూచిస్తున్నది. ఇక్కడ ఎంచుకొన్న జిల్లాల్లో, నాలుగు గోడల మధ్య నిర్వహింపబడే పరిశ్రమల్లో స్త్రీలను మాత్రమే నియమిస్తున్నారు. కాగా, పురుషులు సాధ్యమైన ఇతర పారిశ్రామిక శాఖలన్నిటిలోనూ పని చేస్తున్నారు.

పురుషులు ఎక్కువ సంఖ్యలో నియామకమైన సిల్కు పరిశ్రమ జిల్లాలో వారి మరణ రేటు కూడా ఎక్కువ స్థాయిలోనే ఉంది. క్షయ మొదలయిన వ్యాధులమూలంగా స్త్రీ, పురుషులు ఉభయుల విషయంలోనూ ఉన్న మరణాల రేటు, నివేదిక చెబుతున్నట్లు "మన పట్టు పరిశ్రమల్లో ఎక్కువ భాగం ఎలాంటి దారుణమైన పారిశుద్ధ్య పరిస్థితుల్లో పనిచేస్తున్నాయో" బయటపెడుతోంది. కాగా ఈ సిల్కు పరిశ్రమల్లో చాలా అనుకూలమైన, పరిశుద్ధమైన పరిస్థితులున్నాయని వాదిస్తూ యజమానులు నిబంధనల నుంచి తమ సంస్థలను మినహాయించాలనీ, 13 ఏళ్ళలోపు పిల్లలకు సుదీర్ఘమైన పనిగంటలుండాలని డిమాండ్ చేశారు. పాక్షికంగా ఆ డిమాండు సాధించారు కూడా (సం. I, అధ్యాయం V, VIII)

"ఇంతవరకు దర్యాప్తు జరిపిన ఏ పరిశ్రమ కూడా డాక్టర్ స్మిత్ చిత్రించిన దర్జీ పరిశ్రమ అంత అధ్వాన్నంగా లేదు : పారిశుద్ధ్య పరిస్థితులకు సంబంధించి ఒక వర్క్‌షాపుకూ మరొక షాపుకూ మధ్య తేడా ఉన్నప్పటికీ, దాదాపు అన్ని షాపులూ క్రిక్కిరిసి ఉన్నాయి. గాలి ప్రసార సౌకర్యాలు సరిగా లేవు. ఆరోగ్యానికి చాలా అననుకూలమైనవి... ఇలాంటి గదులు తప్పనిసరిగా ఉక్కపోతగా ఉంటాయి. కానీ పొగమంచు అలముకొన్న రోజుల్లో పగటిపూట, శీతాకాలంలో రాత్రిపూట గ్యాస్ వెలిగించినప్పుడు ఉష్ణం 80 డిగ్రీల వరకు, ఒక్కోసారి 90 డిగ్రీల వరకు కూడా పెరుగుతుంది; అందువల్ల విపరీతంగా చెమట పోస్తుంది; గాజు పలకలపై ఆవిరి ద్రవీభవిస్తుంది. కనుక అది పైకప్పు నుంచి కిందకి ధారగానో, లేక బొట్లు బొట్లుగానో కారుతుంది. పర్యవసానంగా పనివారు తమకు జలుబు చేసే ప్రమాదం ఉన్నప్పటికీ తప్పనిసరిగా కొన్ని కిటికీ తలుపులు తెరచి ఉంచుతారు. పదహారు ముఖ్యమైన వెస్టెండ్ షాపుల్లో తాను చూసిన విషయాలను ఆయన ఇలా చెబుతున్నారు. 'గాలిప్రసారం సరిగాలేని ఈ గదుల్లో ప్రతి పనివానికి అనుమతించిన గరిష్ట ఘన పరిమాణ స్థలం 270 అడుగులు; కనీస ఘన పరిమాణ స్థలం 105 అడుగులు; మొత్తం మీద సగటు ఘనపరిమాణ స్థలం 156 అడుగులు మాత్రమే. చుట్టూ గ్యాలరీ కప్పునుంచి మాత్రమే వెలుతురు వచ్చే అవకాశం ఉన్న ఒక్కో గదిలో 92 నుంచి 100 మంది దాకా కార్మికులు పని చేస్తున్నారు. అక్కడే పెద్ద సంఖ్యలో గ్యాస్ లైట్లు వెలుగుతుంటాయి. ఈ గదులకు అతి దగ్గరలోనే మూత్రశాలలున్నాయి. ఒక్కో మనిషికి 150 చదరపుటడుగుల కంటే ఎక్కువ స్థలం లేదు. మరో గది ఉంది. అది కుక్కల దొడ్డిగా పిలవతగినది. దానికి పైకప్పు నుంచి వెలుతురు పడుతుంది. పైకప్పులోని ఒకే ఒక రంధ్రం ద్వారా గాలి ప్రసరిస్తుంది. ఒక్కో మనిషికి 112 చదరపుటడుగుల చొప్పున స్థలం ఉన్న ఈ గదిలో అయిదారుగురు పనిచేస్తారు'..... డాక్టర్ స్మిత్ వర్ణించిన ఆ దారుణమైన వర్క్‌షాపుల్లో దర్జీలు మామూలుగా రోజుకు 12 లేక 13 గంటలు పనిచేస్తారు; ఒక్కోసారి పని 15 లేక 16 గంటల దాకా కూడా కొనసాగుతుంది". (పుటలు 25, 26, 28)

| నియమింపబడిన వారి సంఖ్య | పరిశ్రమ శాఖ, ప్రాంతము | వివిధ వయసు గ్రూపు వారిలో ప్రతి లక్షమందికీ మరణాల రేటు | | |
|---|---|---|---|---|
| | | 25–35 | 35–45 | 45–55 |
| 958,265 | వ్యవసాయం, ఇంగ్లండు, వేల్స్ | 743 | 805 | 1,145 |
| 22,301 పురుషులు<br>12,377 స్త్రీలు | దర్జీపని, లండన్..... | 958 | 1,262 | 2,093 |
| 13,803 | కంపోజిటర్లు, అచ్చుకొట్టే వారు, లండన్ | 894 | 1,747 | 2,367 |

ఇక్కడ ఒక విషయం గమనించాలి. దీన్ని గురించి వైద్యశాఖ ప్రధాన అధికారీ, నివేదిక రచయితా అయిన జాన్ సైమన్ వ్యాఖ్యానించాడు కూడా; 25–35 వయసువారిలో లండన్‌లోని దర్జీల, కంపోజిటర్ల, ముద్రాపకుల మరణరేటు వాస్తవ సంఖ్య కంటే తక్కువగా నమోదైంది; ఎందుచేత

నంటే లండన్‌లో ఈ రెండు వ్యాపార శాఖల్లోని యజమానులు గ్రామాలకు చెందిన యువకులను (బహుశా 30 ఏళ్ళ వారి వరకు) పెద్ద సంఖ్యలో (అప్రెంటీసులుగా) "మెరుగు పరచుకొంటున్న వారుగా" అంటే, అదనపు శిక్షణ పొందుతున్న వారుగా నియమించబోతున్నారు. లండన్‌లో పరిశ్రమల్లోని మరణాల రేట్ల లెక్కల్లో వారిని కూడా జోడిస్తే ఆ సంఖ్య పెరుగుతుంది. కానీ లండన్‌లో వారి నివాసం తాత్కాలికమే కాబట్టి వారి మరణాలు లండన్‌లోని మరణాల రేటును తదనుగుణంగా పెంచవు. ఎందువల్లనంటే శిక్షణ పొందే సమయంలో తాము గనుక జబ్బుపడితే వారు గ్రామాల్లోని తమ ఇళ్ళకు వెళ్తారు. అక్కడ మరణిస్తే వారి మరణం అక్కడే నమోదవుతుంది. ఇంతకన్నా తక్కువ వయస్సువారి విషయంలో ఇది మరింత వర్తిస్తుంది. ఇందువల్ల లండన్‌లో ఈ వయసువారి మరణాల రేట్లు, ఆరోగ్యంపై పరిశ్రమల దుష్ప్రభావ సూచికలుగా బొత్తిగా పనికిరావు (పుట. 30)

ప్రెస్సుల్లోని కంపోజిటర్ల పరిస్థితి కూడా అచ్చంగా దర్జీల పరిస్థితిలాగే ఉంది. గాలి ప్రసార సౌకర్యం లేకపోవడం, కలుషితమైన గాలి, మొదలయిన వాటితో పాటు రాత్రి పని విషయం కూడా పేర్కొనాలి. వారి మామూలు పనికాలం 12 నుంచి 13 గంటలు, ఒక్కోసారి 15 నుంచి 16 గంటలు కూడా. "గ్యాస్ లైట్లు వెలిగించగానే విపరీతమైన వేడీ, దుర్వాసన బయల్దేరుతుంది... ఫౌండ్రీ నుంచి వెలువడే పొగలు, యంత్రాల నుంచి లేక మురికి గుంటల నుంచి వెలువడే దుర్వాసనలు పైగదికీ వ్యాపించి అక్కడ పరిస్థితి మరింత దుర్భరం చేయడం అరుదు కాదు. కింది గదుల్లోని వేడి గాలి పైగదుల నేల వేడెక్కేలా చేయడం వల్ల అక్కడి గాలి కూడా వేడెక్కుతుంది. గదుల ఎత్తు తక్కువగా ఉంటేనూ, గ్యాస్ వినియోగం భారీగా ఉంటేనూ, ఇది చాలా తీవ్రమైన చెడుగవుతుంది. కాగా కింది గదుల్లో ఆవిరి బాయిలర్లను ఉంచి, అవాంఛనీయమైన వేడిని మొత్తం భవనానికి సరఫరా చేసినప్పుడు మాత్రమే పరిస్థితి ఇంతకన్నా విషమంగా ఉంటుంది". అన్నిటికీ వర్తించేలా ఇలా చెప్పవచ్చు: సర్వే సర్వత్రా గాలి ప్రసార సౌకర్యం లోపభూయిష్టంగా ఉంది; సాయంకాలాలు, రాత్రిళ్ళు వెలువడే వేడిని, గ్యాసు ప్రజ్వలన ఉత్పాదితాలను తొలగించడానికి అది బొత్తిగా చాలదు. అనేక కార్యాలయాల్లో ముఖ్యంగా నివాస గృహాలనే కార్యాలయాలుగా మార్చినచోట పరిస్థితి మరింత శోచనీయంగా ఉంది..... కొన్ని కార్యాలయాల్లో పని (ముఖ్యంగా వార్తాపత్రికల కార్యాలయాల్లో) 12-16 మధ్య వయసు బాలురు కూడా పెద్దవారితో సమానంగా పాల్గొనే పని ఏకధాటిగా రెండు పగళ్ళు, ఒకరాత్రి కొనసాగుతుంది. 'అత్యవసర' మైన పని చేయడానికి సన్నద్ధమైన ఇతర అచ్చు ఆఫీసుల్లో కార్మికునికి ఆదివారం కూడా విరామం ఉండదు; ప్రతి వారమూ అతని పనిదినాలు ఆరు కాక ఏడుగానే ఉంటాయి" (పుటలు 26, 28)

అధిక పనికి సంబంధించి, ఆడవారి టోపీలు తయారుచేసేవారు, దుస్తులు కుట్టేవారు, ఇదివరకే ప్రథమ సంపుటిలో (అధ్యాయం VIII, 3, S 249/241) మన దృష్టిని ఆకర్షించారు. మనం పేర్కొన్న డాక్టర్ ఆర్డ్ నివేదికలో వారి వర్క్‌షాప్‌ల వర్ణన ఉంది. పగటిపూట అవి కాస్త బాగున్నప్పటికీ గ్యాస్ వెలిగించినప్పుడు మాత్రం అవి భరింపరాని వేడితో దుర్వాసనతో అనారోగ్యకరమైనవిగా తయారవు తున్నాయి. తక్కిన వాటికన్నా బాగున్న వర్క్‌షాపుల్లో ఒక్కో శ్రామిక మహిళకు ఉన్నది, సగటున ఈ క్రింది ఘనపుటడుగుల స్థలమని డాక్టర్ ఆర్డ్‌కు తెలిసింది;

"...... నాలుగు సందర్భాల్లో 500 కంటే ఎక్కువ, మరో నాలుగు సందర్భాల్లో 400 నుంచి 500 వరకు..... మరో ఏడు సందర్భాల్లో 200 నుంచి 250 వరకు మరో నాలుగు సందర్భాల్లో 150 నుంచి 200 వరకు, కాగా మరో తొమ్మిదింటిలో 100 నుంచి 150 వరకు. ఆ స్థలమంతటా పరిశుద్ధమైన గాలి ప్రసార సౌకర్యం కల్పిస్తే తప్ప, వీటిల్లోకెల్లా విశాలమైన స్థలం సైతం నిరంతరాయమైన పనికి బొత్తిగా చాలదు. అసాధారణమైన వాతావరణ సౌకర్యం ఉంటే తప్ప, గ్యాస్‌లైట్ వెలిగే సమయాల్లో వాతావరణం అంత ఆరోగ్యకరమైనది కాదు." తాను సందర్శించిన ఒకానొక చిన్న వర్క్‌షాపు గురించి డాక్టర్ ఆర్డ్ ఈ క్రింది విధంగా వ్యాఖ్యానించాడు : అది ఒక దళారీ ద్వారా నిర్వహింపబడేది; "ఆ గది విస్తీర్ణం ఘనపుటడుగుల్లో 1280; పనికి హాజరవుతున్న వ్యక్తులు 14; ఒక్కొక్కరికి ఉన్న స్థలం ఘనపుటడుగుల్లో విస్తీర్ణం 91.5. అక్కడ పనిచేసే స్త్రీలు చాలా నిస్త్రాణగా, మురికి మురికిగా కనిపించారు; వారి వారం ఆదాయం 7 షిల్లింగులనుంచి 15 షిల్లింగులూ, వారికిచ్చే టీ......పని గంటలు ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 గంటల దాకా. ఈ 14 మందిని కుక్కిన ఈ గదిలో సరైన గాలి ప్రసార సౌకర్యం లేదు. రెండు కదిలే కిటికీలు, ఒక నెగడు ఉన్నాయి. అయితే నెగడు పొగ బయటకు వెళ్ళే మార్గం లేదు. ఏ రకమైన ప్రత్యేక గాలి ప్రసార సౌకర్యమూ లేదు." (పుట 27)

ఆడవారి టోపీలు చేసేవారి, దుస్తులు కుట్టేవారి పని భారం గురించి అదే నివేదికలో ఇలా ఉంది; "మోజయిన దుస్తులు తయారు చేసే సంస్థలో పనిచేసే యువతుల అమితమైన పని నాలుగు నెలలకు మించి మరీ దారుణంగా అనేక సందర్భాల్లో జనంలో తాత్కాలికంగా ఆశ్చర్యమూ, ఆగ్రహమూ రేకెత్తించినంత దారుణంగా ఉండదు. అయితే ఈ నాలుగు నెలల్లో మాత్రం గదుల్లోపల పనిచేసేవారు తప్పనిసరిగా రోజుకు 14 గంటలు పనిచేయాల్సి ఉంది. మరీ పని ఒత్తిడి ఉన్న రోజుల్లోనేమో, రోజుకు 17 గంటలు, ఒక్కోసారి 18 గంటలు పనిచేయాల్సి ఉంది. సంవత్సరంలోని మిగతా మాసాల్లో గదుల్లో చేసేవారు బహుశా రోజుకు 10 నుంచి 14 గంటలు పనిచేయాల్సి ఉంది. కాగా బయట పనిచేసేవారి పనిగంటలు 12 లేక 13. శాలువలు, కాలర్లు, షర్టులు తయారుచేసేవారు, ఇంకా ఇతరేతర తరహా కుట్టుపనివారు (కుట్టుమిషన్ వద్ద పనిచేసే వ్యక్తులతో సహా) ఇలా ఉమ్మడి గదుల్లో పనిచేసేవారి పనిగంటలు తక్కువ; మామూలుగా 10 నుంచి 12 గంటలకు మించవు. అయితే కొన్ని సంస్థల్లో, కొన్ని సమయాల్లో పనిగంటలను గణనీయంగా పెంచడం రివాజు అని డాక్టర్ ఆర్డ్ అంటారు. అదనపు వేతనానికి అదనపు పని చేయించే పద్ధతి ఉంది. కాగా మరికొన్ని సంస్థల్లో, ఆ పనిని పని గంటలు తర్వాత మహిళా కార్మికులు తమ ఇళ్ళల్లో చేయడానికి అప్పగించే పద్ధతి ఉంది. ఈ రెండు పద్ధతుల్లోనూ తరచుగా ఈ పని తప్పకుండా చేయాల్సిందే." (పుట 28) ఈ పుటలో జాన్ సైమన్ పాదపీఠికలో ఇలా అంటారు : "ప్రథమశ్రేణి వ్యాపార సంస్థల్లో పనిచేసే యువతులను ప్రశ్నించే అసాధారణ అవకాశం లభించిన అంటువ్యాధుల శాస్త్ర సంస్థ గౌరవ కార్యదర్శి రాడ్లి 20 మంది అమ్మాయిల్ని పరీక్షించాడు. తాము 'బాగా' ఉన్నట్లు చెప్పినా, వాళ్ళల్లో ఒక్కరి ఆరోగ్య పరిస్థితి మాత్రమే 'బాగుంది' అని చెప్పగలిగిన రీతిలో ఉందని చూశాడు. మిగతా వారిలో వివిధ స్థాయిల్లో తగ్గిన శారీరక పటుత్వం, నరాల నిస్సత్తువ లక్షణాలు వీటితోపాటు ఉండే అనేక శారీరక అస్వస్థతా లక్షణాలు కనిపించాయి. ఈ స్థితికి మొట్టమొదటి కారణం సుదీర్ఘమైన పనిగంటలే

అని ఆయన అభిప్రాయం. సీజన్ కానప్పుడు రోజుకు కనీసం 12 గంటలు పనిచేసేవారని ఆయన అంచనా; ఇక రెండవ కారణం. గదుల్లో పనివారు క్రిక్కిరిసి ఉండటం, ఆ గదుల్లోని అధ్వాన్నపు గాలి ప్రసార సౌకర్యం, గ్యాస్ పొగ, చాలీచాలని లేదా అధ్వాన్నమయిన తిండి, ఇంటి సౌకర్యాల పట్ల అశ్రద్ధ."

ఇంగ్లీషు ఆరోగ్య బోర్డు అధిపతి ఈ క్రింది నిర్ధారణకు వచ్చారు. "సిద్ధాంతరీత్యా తమ ప్రప్రథమ పారిశుద్ధ్య హక్కును అమలుపరచాలని గట్టిగా అడగడం పనిచేసేవారికి ఆచరణలో అసాధ్యంగా ఉంది; యజమానికి ఏ పని చేయించడానికి తమని ఒకచోట చేర్చినా, ఆ పనికి సంబంధించిన, అనవసరంగా ఉన్న అనారోగ్య పరిస్థితులు, తన సొంత ఖర్చుతో లేకుండా చేయాలని పట్టుపట్టే హక్కుంది.... పనిచేసేవారికి ఆ పారిశుద్ధ్య న్యాయాన్ని అమలు జరిపించే శక్తి లేకపోవడంతో పాటు, వారు (చట్టంలో ఉన్నట్లు అందరూ ఊహించుకొంటున్న దాని ఉద్దేశాలేమైనప్పటికి) న్యూసెన్స్ రిమూవల్ యాక్టులను అమలు జరపడానికి నియమింపబడిన అధికార్ల నుంచి ఫలప్రదమైన సహాయాన్ని ఆశించలేకపోతున్నారు. (పుట 29) "యజమానులు ఏ రేఖ వద్ద నిబంధనలకు బద్ధులవుతున్నారో ఆ రేఖను ఖచ్చితంగా" నిర్వచించడంలో కొన్ని చిన్న చిన్న సాంకేతిక ఇబ్బందులున్నాయనడం నిస్సందేహం. అయితే.... సూత్రరీత్యా పారిశుద్ధ్య హక్కు సార్వత్రికమే. కేవలం ఉద్యోగం చేసిన పాపానికి అనవసరంగా శారీరక బాధలకు గురై అకాలంగా చనిపోతున్న లక్షలాది మంది శ్రామిక స్త్రీ పురుషుల కోసం, సర్వత్రా గదుల్లోనూ సరైన గాలి ప్రసార సౌకర్యాలకు హామీ కల్పించబడుతుందనీ, అన్ని రోగకారక వృత్తుల్లోనూ ఆరోగ్యానికి భంగం కలిగించే నిర్దిష్టమైన ప్రభావాలు సాధ్యమైనంత మేరకు తగ్గించ బడతాయని నేను ఆశిస్తున్నట్లు చెప్ప సాహసిస్తున్నాను." (పుట 31)

## III. శక్తి ఉత్పాదన, ప్రసారాల్లోనూ, భవనాల్లోనూ పొదుపు

ఎల్.హార్నల్ తన 1852 అక్టోబర్ నివేదికలో, పాట్రీక్రాఫ్ట్‌కు చెందిన సుప్రసిద్ధ ఇంజనీరు జేమ్స్ నాస్మిత్ లేఖనొక దాన్ని ఉటంకిస్తున్నాడు. ఆవిరి సమ్మెటను (స్టీల్ హామర్) కనిపెట్టిన ఈ ఇంజనీరు లేఖలో ఇలా ఉంది :

"నేను పేర్కొన్న యంత్ర వ్యవస్థాగత మార్పుల వల్లనూ, మెరుగుదల వల్లనూ ఆవిరి ఇంజన్లలోనికి చోదక శక్తిలో వచ్చిన గొప్ప పెరుగుదల గురించి ప్రజలకు పెద్దగా తెలీదు. ఈ జిల్లా (లాంకషైర్) కు చెందిన ఇంజన్ శక్తి నలభై ఏళ్ళ పాటు పిరికితనమూ, దురభిప్రాయాలతో కూడిన సంప్రదాయాల నిద్రావస్థలో ఉంటూ వచ్చింది. అయితే ఇప్పుడు మనం దానినుంచి సుఖప్రదంగా విముక్తి చెందాం. గత పదిహేనేళ్ళ కాలంలో, ముఖ్యంగా గత నాలుగేళ్ళ కాలంలో (1848 నుంచి) కండెన్సింగ్ ఆవిరి ఇంజన్లతో పని చేయించే పద్ధతిలో చాలా ముఖ్యమైన మార్పులు చోటుచేసుకున్నాయి..... ఫలితమేమి టంటే.... అలాటి ఇంజన్లు చేసే విధి లేక పని పరిమాణం చాలా పెరిగింది; అంతేకాక ఇంధన వ్యయం కూడా గణనీయంగా తగ్గింది..... పైన తెలిపిన జిల్లాల్లోని మిల్లుల్లోనూ, కార్ఖానాల్లోనూ ఆవిరి శక్తిని ప్రవేశపెట్టినాక చాలా ఏళ్ళపాటు కండెన్సింగ్ ఆవిరి ఇంజన్లతో పని చేయించతగిన వేగం, పిస్టన్‌తో నిముషానికి 220 అడుగులని భావించారు; అంటే అయిదడుగుల స్ట్రోకు గల

ఇంజన్, 'నిబంధన' ప్రకారం నిముషానికి తన క్రంక్ షాఫ్టులను 22 పరిభ్రమణలకు మాత్రమే పరిమితం చేశారు. ఇంజన్‌తో అంతకు మించిన వేగంతో పనిచేయించడం వివేకమైన పని కాదని లేదా వాంఛనీయం కాదని భావించారు. కనుక అన్ని మిల్లు గేరింగ్‌లను ఈ విధంగా పిస్టన్ నిముషానికి 220 అడుగుల వేగంతో ఆడాలన్న నిబంధనకు అనుగుణంగా రూపొందించారు. ఈ మందగమనం, అసంబద్ధమైన ఈ పరిమిత వేగం చాలా ఏళ్ళపాటు ఇంజన్ల పని తీరును శాసించింది. ఏది ఏమైనా చివరకు అదృష్టవశాత్తూ ఆ 'నిబంధన' విషయం తెలియనందువల్లనో లేదా కొత్త పుంతలు తొక్కే ఎవరో సాహసవంతులు ప్రదర్శించిన వివేకం వల్లనో, 'ఇంజన్‌ను స్వేచ్ఛగా వదిలిపెట్టడం' ద్వారా వేగాన్ని పెంచ చూచారు. ఫలితం చాలా సానుకూలంగా ఉన్నందువల్ల ఈ జాడను ఇతరులు కూడా అనుసరించారు. వారు చేసిందేమిటంటే ఇంజను నిముషానికి 300 అడుగులు అంతకు మించిన వేగంతో ఆడేందుకు వీలు కలిగిస్తూ మిల్లు గేరింగ్‌తో మొదట తిరిగే చక్రాల పరిమాణాన్ని మార్చారు. కానీ మిల్లు గేరింగ్ వేగం మార్చలేదు. ఇలా 'ఇంజన్'ను స్వేచ్ఛగా వదిలిపెట్టే' పద్ధతి దాదాపు సర్వే సర్వత్రా ఇంజన్ల వేగం పెరుగుదలకు దారి తీసింది. ఎందుచేతనంటే, అదే రకమైన ఇంజన్ల ద్వారా ఎక్కువ శక్తి లభిస్తుందని రుజువు కావడమే కాక, ఇంజను తాలూకు అధిక వేగం వల్ల ఫ్లైవీల్‌లో ఒరిపిడి పెరగడంతో పాటు దాని గమనం మరింత క్రమబద్ధంగా ఉన్నట్లు స్పష్టంగా తేలింది. స్టీం ఇంజన్ యొక్క పిస్టన్‌ను మరింత వేగంతో కదలడానికి అనుమతించడం ద్వారా ఆవిరి ఇంజన్ నుంచి మనకు మరింత శక్తి లభిస్తుంది. (కండెన్సర్‌లో ఆవిరి పీడనం, శూన్యంలలో మార్పు లేకుండా).... ఈ విధంగా, ఉదాహరణకు ఏదైనా ఒక ఇంజన్ తాలూకు పిస్టన్ నిముషానికి 200 అడుగుల వేగంతో కదిలితే ఆ ఇంజన్ మనకు 40 ఆశ్విక శక్తిని ఇస్తుందనుకుందాం; తగిన ఏర్పాట్ల ద్వారా కానీ లేదా మార్పులను ప్రవేశపెట్టడం వల్లకానీ ఆ ఇంజన్ పిస్టన్‌కు నిముషానికి 400 అడుగుల వేగంతో ఆడడానికి అనుమతించినట్లయితే ఆ ఇంజన్ మనకు అంతకు రెండు రెట్లు శక్తినిస్తుంది. రెండు సందర్భాల్లోనూ ఆవిరి పీడన, శూన్యం మార్పు చెందని పక్షంలో, 200 అడుగుల వేగంలో కంటే 400 అడుగుల వేగంలో ఆ ఇంజన్ భాగాలపై ఒత్తిడి ఎక్కువగా ఏమీ ఉండదు కాబట్టి వేగం పెరగడం వల్ల 'చెడిపోయే' ప్రమాదం కూడా భౌతికంగా ఏమీ పెరగదు. తేడా అల్లా, ఈ సందర్భంలో పిస్టన్ వేగం నిష్పత్తికి అనుగుణమైన రేటులో లేదా దానికి దగ్గరగా ఉండే రేటులో ఆవిరి ఖర్చవుతుంది; రాగి మిశ్రమంతో చేసిన భాగాల్లో కానీ లేక ఒరిపిడికి గురయ్యే భాగాల్లో కానీ అరుగుదల కొద్దిగా, అది ఎంత తక్కువగా ఉంటుందంటే దాన్ని పరిగణనకు తీసుకోవలసిన అవసరం ఉండదు. అయితే పిస్టన్ ఎక్కువ వేగంతో పని చేయనివ్వడం ద్వారా అదే ఇంజన్ నుంచి ఎక్కువ శక్తిని పొందాలంటే అదే బాయిలర్‌లో ప్రతి గంటకు ఎక్కువ బొగ్గును దగ్ధం చేయాల్సి ఉంటుంది. లేదా ఎక్కువ బాష్పీభవన శక్తి, అంటే ఎక్కువ ఆవిరిని ఉత్పత్తి చేసే శక్తి ఉన్న బాయిలర్‌ను వాడాలి. ఆ పనే చేశారు. ఎక్కువ ఆవిరిని ఉత్పత్తి చేసే బాయిలర్లను లేదా ఎక్కువ నీటిని బాష్పీభవనం చెందించే బాయిలర్లను పాత వేగంతో పనిచేసే ఇంజన్లకు సరఫరా చేశారు. ఇలా పైన తెలిపిన మార్పులను ప్రవేశపెట్టడం ద్వారా అనేక సందర్భాల్లో అవే ఇంజన్ల నుంచి నూరు శాతం ఎక్కువ పని రాబట్టగలిగారు. దాదాపు పదేళ్ళ క్రితం, కార్న్‌వాల్ బొగ్గు గనుల కార్యకలాపాల్లో వాడుతున్న

ఇంజన్ల నుంచి అసాధారణమైన మిత వ్యయంతో శక్తి ఉత్పత్తి కావడం అందరి దృష్టి ఆకర్షించసాగింది; పోటీ వత్తిడి మూలంగా నూలు నేత వ్యాపారంలోని ఉత్పత్తిదారులు 'పొదుపులనే' లాభానికి ప్రధానమైన మూలాధారాలుగా చూడడం ప్రారంభించేసరికి, కార్నిష్ ఇంజన్ల పనితీరు సూచించినట్లు, గంటకు ఒక ఆశ్విక శక్తికి బొగ్గు వినియోగంలో ఉన్న గణనీయమైన భేదం, ఉల్ఫ్ జంట సిలెండర్ ఇంజన్ల పని తీరులో పొదుపు. ఇవి, ఈ జిల్లాల్లో ఇంధనాన్ని పొదుపు చేసే విషయం అందరి దృష్టిని అధికాధికంగా ఆకర్షించసాగాయి. మొత్తం పత్తిమిల్లు ఇంజన్లు ప్రతి ఆశ్విక శక్తి గంటకూ 8 లేక 12 పౌన్ల బొగ్గును ఖర్చు చేస్తూ ఉండగా కార్నిష్ జంట సిలిండర్ ఇంజన్లు $3\frac{1}{2}$ నుంచి 4 పౌన్ల బొగ్గే ఖర్చు చేశాయి. ఇంత గణనీయమైన తేడా కనిపించేసరికి, ఈ జిల్లాలోని మిల్లు యజమానులు, ఇంజన్ తయారీదార్లు అలాటి పద్ధతులను అవలంబించడం ద్వారా, కార్న్‌వాల్‌లోనూ ఫ్రాన్స్‌లోనూ సర్వసాధారణమైన అలాంటి మితవ్యయ ఫలితాలు సాధించడానికి పూనుకొన్నారు. ఆ ప్రాంతాల్లో బొగ్గు ధర చాలా ఎక్కువగా ఉండడంతో తమ సంస్థల్లోని ఇలాంటి వ్యయభరితమైన శాఖలను యజమానులు నిశితంగా పరిశీలించక తప్పలేదు. ఇలా ఇంధన మిత వ్యయంపట్ల, పెరిగిన శ్రద్ధ వల్ల కలిగిన ఫలితం చాలా విధాలుగా ముఖ్యమైనది. మొదటిది – ఇంతకు ముందు బాగా లాభాలు వచ్చేకాలంలో అనేక బాయిలర్ల ఉపరితలంలో సగభాగం చలిగాలుల తాకిడికి నగ్నంగా అలాగే వదలి వేయబడేది. అలాటి బాయిలర్లను ఇప్పుడు మందమైన కంబళ్ళతో ఇటుకలూ సున్నపు గచ్చుతో కప్పిపుచ్చుతున్నారు. బాయిలర్ల నగ్న ఉపరితలం నుంచి వేడి బయటికి పోకుండా అరికట్టే ఇతర పద్ధతులను అవలంబిస్తున్నారు. మునుపు అంత ఇంధనం ఖర్చవుతూ వచ్చింది ఆ వేడిని అలాగే ఉంచడానికే కదా! ఇదే పద్ధతిలో ఆవిరి పైపులను కూడా 'కాపాడటం' ప్రారంభించారు. ఇలాగే ఇంజన్ సిలిండర్లపై కంబళ్ళు కప్పేవారు, వాటికి చెక్క పెట్టెలను చేయించారు. ఆ తర్వాత 'ఎక్కువ ఆవిరి'ని ఉపయోగించే పద్ధతి అమలులోకి వచ్చింది. అంటే ఒక్కో చదరపు అంగుళానికి 4, 6 లేక 8 పౌన్ల ఒత్తిడికే తెరచుకొనే భద్రతా కవాటం వాడకానికి బదులుగా, ఆ వత్తిడిని 14 లేక 20 పౌన్లకు పెంచడం ద్వారా నిస్సంశయంగా ఇంధనం ఆదా అయింది. వేరుమాటల్లో చెప్తే, గణనీయంగా తక్కువ బొగ్గు వినియోగంతో మిల్లులను పని చేయించారు.... తగిన సాధన సంపత్తీ, సాహసమూ ఉన్న వారేమో ఒక్కో చదరపు అంగుళానికి 30, 40, 60, 70 పౌన్ల ఆవిరిని సరఫరా చేయగలిగే విధంగా నిర్మాణమయిన బాయిలర్ల వినియోగం ద్వారా అధికతర పాత పద్ధతిలో ఆలోచించే ఇంజనీరుకు మతిపోగొట్టేంత పీడనలవి. అయితే ఆవిరి పీడనను పెంచడం వల్ల కలిగే ఆర్థిక ఫలితాలు స్పష్టంగా పౌండ్లు, షిల్లింగులు, పెన్నీల రూపాల్లో దర్శనమివ్వడంతో కండెన్సింగ్ ఇంజన్లు ఉన్నత స్థాయి పీడనగల ఆవిరి బాయిలర్లకు వాడకం దాదాపు సర్వసాధారణమైపోయింది. కాగా ఈ విషయంలో సంపూర్ణ స్థాయికి వెళ్ళదల్చుకున్నవారు, త్వరలో సమగ్రమైన ఉల్ఫ్ ఇంజన్ వాడకానికి పూనుకొన్నారు. ఇలాంటి ఇటీవల నిర్మాణమైన మన మిల్లుల్లో ఎక్కువ భాగం ఉల్ఫ్ ఇంజన్లతో నడుస్తున్నాయి. ఈ ఇంజన్లలో ఒక్కొక్క దానికి రెండు సిలిండర్లుంటాయి. ఇందులోని ఒక దానిలోకి బాయిలర్‌లో నుంచి అధిక పీడనతో ప్రవేశించే ఆవిరి, వాతావరణ పీడనకన్నా ఎక్కువగా వున్న తన పీడన ద్వారా ఒత్తిడి చేస్తుంది, అంటే శక్తిని ఇస్తుంది. ప్రతి పిస్టన్ స్ట్రోక్ చివర అధిక పీడన గల ఆవిరి వాతావరణంలోకి

వెళ్ళకుండా, ఈ సిలిండర్ కన్నా నాలుగుసార్లు ఎక్కువ విశాలంగా మండే తక్కువ పీడన గల రెండవ సిలిండర్‌లోకి వెడుతుంది. అది తగినంత విస్తరించిన తరువాత, కండెన్సర్‌లోకి ప్రవేశిస్తుంది. ఈ రకం ఇంజన్ల నుంచి లభించే ఆర్థిక ఫలితం ఏమిటంటే ఒక్కో ఆశ్విక శక్తికీ, గంటకు అయ్యే ఇంధన వినియోగం $3\frac{1}{2}$ 4 పౌన్లు మాత్రమే; కాగా పాత పద్ధతి ఇంజన్లకేమో ఒక్కో ఆశ్విక శక్తికి గంటకు సగటున 12 నుంచి 14 పౌన్ల బొగ్గు వినియోగమయ్యేది. ఎంతో చాతుర్యం గల ఏర్పాటు ద్వారా జంట సిలిండర్ల ఉల్ఫ్ ఇంజన్ వ్యవస్థను, లేక తక్కువ పీడనం, ఎక్కువ పీడనం, సమ్మిశ్రణ గల ఇంజన్ వ్యవస్థను ప్రస్తుతం అమలులో ఉన్న ఇంజన్లకు విస్తృతస్థాయిలో జోడించారు. అందువల్ల పాత పద్ధతి ఇంజన్ల పనితీరు రెండు విధాలా పెరిగింది, అంటే వాటి శక్తీ పెరిగింది, ఇంధనంలో పొదుపు పెరిగింది. ఈ పద్ధతిలో అనేక సందర్భాల్లో చాలా సౌకర్యంగా ఉంది.”

ఒకే తరహా ఇంజన్లను ఈ పెరుగుదల్లో కొన్ని, లేదా అన్ని ప్రవేశపెట్టిన తరువాత అయ్యే ఆ ఇంజన్ల పనితీరు సరిగ్గా ఏ మేరకు అభివృద్ధి చెందిందీ నిర్ధారించడం అంత తేలికేమీ కాదు; ఏదియేమైనా అంతే బరువుగల ఆవిరియింజన్ యంత్రం నుంచి ఇప్పుడు మనకు కనీసం సగటున 50 శాతం ఎక్కువ ఫలితం లేక పని లభిస్తున్నదని నా నమ్మకం; నిముషానికి 220 అడుగుల వేగానికే పరిమితమైన రోజుల్లో అవే ఆవిరి ఇంజన్లు 50 ఆశ్విక శక్తిని అందించగా, ఇప్పుడివి అనేక సందర్భాల్లో 100కు పైగా ఆశ్విక శక్తిని అందిస్తున్నాయి. కండెన్సింగ్ ఆవిరి ఇంజన్ల పనిలో అధిక పీడన ఆవిరిని వినియోగించడం ద్వారా, పొదుపుకు సంబంధించి లభించిన ఫలితాల కారణంగానూ, మిల్లు విస్తరణ వల్ల అవే ఇంజన్ నుంచి దానికి ఎక్కువ శక్తి అవసరమైన కారణంగానూ, గత మూడు సంవత్సరాల్లో గొట్టపు ఆకారంలోని బాయిలర్లు వాడుకలోకి వచ్చాయి. మిల్లు ఇంజన్లకు ఆవిరిని ఉత్పత్తి చేసే మునుపటి బాయిలర్లకన్నా వీటివల్ల మరింత ఆదా అవుతోంది.

(రిపోర్ట్స్ ఆఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ అక్టోబర్ 1852 పుటలు 23–27)

శక్తి ఉత్పత్తికి వర్తించేది – శక్తి ప్రసారానికీ, పనిచేసే యంత్రాలకూ కూడా వర్తిస్తుంది.

“ఈ కొద్ది సంవత్సరాల్లో యంత్రాల పెరుగుదలలో సాధించబడిన సత్వర ప్రగతి, ఫ్యాక్టరీ యజమానులు అదనపు చోదక శక్తిని వినియోగించకుండానే మరింత పొదుపుగా వినియోగించే అవసరం ఏర్పడింది. చాలా క్రమబద్ధంగా నడిచే మిల్లులో తెలివిగల వ్యక్తి తక్కువ వ్యయంతో ఉత్పత్తిని పెంచే పద్ధతి ఏమిటా అని నిరంతరం ఆలోచిస్తున్నాడు; నా జిల్లాలోని ఒక తెలివైన పెద్దమనిషి దయతో తయారు చేసిన పట్టిక ఒకటి నా ముందు ఉంది; 1840 నుంచి ఇప్పటివరకు నియుక్తులయిన కార్మికుల సంఖ్య, వారి వయసులు, పనిచేస్తున్న యంత్రాలు, చెల్లించబడిన వేతనాలు వగైరా వివరాలు అందులో ఉన్నాయి. 1840 అక్టోబరులో ఆయన సంస్థ 600 మందిని పనిలో పెట్టింది; వారిలో 200 మంది 13 ఏళ్ళలోపు వారు; కాగా గత అక్టోబర్‌లో 300 మందిని పనిలో పెట్టారు; అందులో 60 మంది మాత్రమే 13 ఏళ్ళలోపు కానివారు; అదే సంఖ్యలోని యంత్రాలు కొద్ది తేడాతో పనిచేశాయి; రెండు కాలాల్లోనూ చెల్లించిన వేతనాల మొత్తం ఒకటే” (రెడ్ గ్రేన్స్ రిపోర్ట్ ఇన్ రిపోర్ట్స్ ఆఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్; అక్టోబర్ 1852 పుటలు 58–59)

తగు విధంగా అమర్చిన ఫ్యాక్టరీలలో వినియోగిస్తే తప్ప యంత్రాలలోని ఈ మెరుగుదలలు తమ సంపూర్ణ ఫలితాన్ని ఇవ్వవు.

"యంత్రాలలో వచ్చిన మెరుగుదలల విషయానికి సంబంధించి, మొదట్లో నేనొక విషయం చెప్పవచ్చు. మెరుగుపరిచిన యంత్రాలను అమర్చేందుకు అనుగుణమైన మిల్లుల నిర్మాణంలో గొప్ప పురోగతి సాధింపబడిందని కింది అంతస్తు గదిలో నా నూలును రెట్టింపు చేస్తాను. ఆ ఒకేగదిలో 29 వేల జంట పోగుల కదుళ్ళను ఉంచుతాను. ఆ గదిలో కనీసం 10 శాతం శ్రమను పొదుపు చేస్తాను. ఈ పొదుపునకు కారణం జంటపోగులకు సంబంధించిన సూత్రంలో మెరుగుదల కాదు; ఒకే ఒక మేనేజ్‌మెంట్ ఆధ్వర్యంలో యంత్రాలను కేంద్రీకరించడమే కారణం. ఫలితంగా ఒకే షాఫ్టు ద్వారా ఈ అన్ని కదుళ్ళను నేను ఆడించగలుగుతున్నాను. ఇతర సంస్థల్లో ఇదే సంఖ్యలోని కదుళ్ళను ఆడించే షాప్టింగుతో పోలిస్తే 60 శాతం ఆదా అవుతోంది. కొన్ని సందర్భాల్లో 80 శాతం కూడా ఆదా అవుతోంది. నూనెలోనూ షాప్టింగు కందెనల్లో పెద్ద ఎత్తున ఆదా అవుతూ ఉంది... మేలయిన మిల్లు ఏర్పాట్లుతో, మెరుగైన యంత్రాలతో, అతి తక్కువ అంచనాబట్టి చూచినా, శ్రమలలో 10 శాతం పొదుపును, శక్తి, బొగ్గు, నూనె, కొవ్వు, షాప్టింగు, నాడాలలో పెద్ద పొదుపు సాధించాను" (నూలు మిల్లు యజమాని సాక్ష్యం రిపోర్ట్స్ ఆఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్, అక్టోబర్ 1863, పుటలు 109, 110)

## IV. ఉత్పత్తి క్రియ విసర్జితాల వాడకం

ఉత్పత్తి, వినియోగాల యొక్క విసర్జితాల వాడకాన్ని పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం విస్తరింపజేస్తుంది. ఉత్పత్తి విసర్జితాలు అంటే, పరిశ్రమ, వ్యవసాయాల వ్యర్థ పదార్థాలనీ, వినియోగం తాలూకు విసర్జితాలంటే మానవ శరీరంలో పదార్థాల సహజ మార్పిడివల్ల ఉత్పన్నమయ్యే విసర్జితాలూ, ఇంకా మనుషులు ఉపయోగించిన అనంతరం మిగిలి ఉండే రూపంలోని, వస్తువులూ అని మా అర్థం. ఉదాహరణకు రసాయనిక పరిశ్రమలో ఉత్పత్తి విసర్జితాలంటే తక్కువస్థాయి ఉత్పత్తిలో వృధా అయ్యే ఉప ఉత్పాదితాలు; యంత్రాల నిర్మాణ క్రమంలో ఇనుప ముక్కలు పోగవుతాయి; ఇనుము ఉత్పత్తికి ఇది తిరిగి ముడి పదార్థంగా ఉపయోగపడుతుంది. ఇలాంటి ఉదాహరణలు ఎన్నైనా ఇవ్వవచ్చు. మానవ శరీరం విసర్జించే సహజ వ్యర్థ పదార్థం, దుస్తుల తాలూకు పాత పీలికలు వగైరా ఇవి వినియోగం తాలూకు విసర్జితాలు. వినియోగ క్రియ విసర్జితాలకు వ్యవసాయంలో గొప్ప ప్రాముఖ్యత ఉంది. వాటి వాడకం విషయానికి వస్తే పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థలో అవి అపారంగా వృధా అయిపోతున్నాయి. ఉదాహరణకు లండన్ నగరంలోని 45 లక్షల పౌరుల విసర్జితాలతో, థేమ్స్ నదిని పెద్ద ఖర్చుతో కలుషితం చేయడం తప్ప వాటిని అంతకంటే మంచిగా ఉపయోగపెట్టుకోలేక పోతున్నారు.

ముడిపదార్థాల ధరలు పెరగడం సహజంగానే వ్యర్థపదార్థాల వాడకాన్ని ప్రోత్సహిస్తుంది.

ఈ విసర్జితాల పునర్వినియోగానికి ఈ క్రింది సాధారణ పరిస్థితులు అవసరం; ఇలా వ్యర్థ పదార్థాలు పెద్ద పరిమాణంలో ఉండాలి; భారీస్థాయి ఉత్పత్తిలోనే ఇవి పెద్ద ఎత్తున లభ్యమవుతాయి; ఇంతకు మునుపున్న రూపంలో నిరుపయోగమైన పదార్థాలను నూతన ఉత్పత్తికి ఉపయోగించుకోగలిగే మెరుగైన యంత్రాలు; శాస్త్రీయ ప్రగతి, ముఖ్యంగా రసాయనిక శాస్త్ర ప్రగతి; ఇలాటి వ్యర్థ పదార్థాలు

ఉపయోగకర ధర్మాలను రసాయనిక శాస్త్రం వెల్లడిచేస్తుంది, సన్నకారు వ్యవసాయంలో కూడా ఈ తరహా భారీ పొదుపులను పాటించడం నిజమే. లంబార్డీ దక్షిణ చైనా, జపాన్‌లలో ఇలా పొదుపులు సాధిస్తున్నారు. అయితే మొత్తం మీద, ఈ వ్యవస్థలో వ్యవసాయ రంగ ఉత్పాదకతకు మూలం మానవ శ్రమ అపార దుర్వ్యయమే – ఆ మేరకు శ్రమ ఇతర ఉత్పత్తి రంగాలకు అందకుండా పోతోంది.

వ్యర్థ పదార్థం అనబడేది దాదాపు ప్రతి పరిశ్రమలోనూ ముఖ్యమైన పాత్ర నిర్వర్తిస్తుంది. ఇంగ్లీషు రైతులు, పలువురు ఐరిష్ రైతులు, ఎల్లిగిసెనార పండించకపోవడానికి లేక అరుదుగా మాత్రమే పండించడానికి ఇది ఒకానొక ప్రధాన కారణమని 1863 డిసెంబర్ నాటి ఫ్యాక్టరీ నివేదిక స్పష్టం చేసింది; "నారను శుద్ధి చేసే మిల్లుల వద్ద భారీగా వ్యర్థ పదార్థం పేరుకుపోతోంది.... పత్తిలో ఈ వ్యర్థ పదార్థం తక్కువ. కానీ ఎల్లిగిసెనారలో చాలా ఎక్కువ. నీటిలో సమర్థంగా నానబెట్టడం వల్లనూ, నారను మంచి యంత్రాలతో శుద్ధి చేయడం వల్లనూ ఈ నష్టాన్ని గణనీయంగా తగ్గించవచ్చు... ఐర్లాండులో ఎల్లిగిసెనారను సిగ్గుచేటైన విధంగా శుద్ధి చేస్తున్నందువల్ల చాలా శాతం, 28 నుంచి 30 శాతం దాకా వ్యర్థమైపోతున్నది; (1863 డిసెంబర్ రిపోర్ట్స్ ఆఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ పుటలు139, 142) కాగా మంచి యంత్రాల వాడకం ద్వారా ఈ వృధానంతా నివారించి ఉండొచ్చు. దారిపక్కన తెగిన నారపోగులు ఎంత పెద్ద ఎత్తున పడివుండేవంటే ఫ్యాక్టరీ ఇన్‌స్పెక్టర్ ఇలా అంటాడు. "నారను శుద్ధి చేసే మిల్లుల వద్ద పేరుకుపోయిన వ్యర్థ పదార్థాలను ఆ మిల్లు యజమానులు ఇంటి వద్ద తమ నెగళ్ళలో ఉపయోగించేవారని, వాస్తవానికి ఆ వ్యర్థ పదార్థం చాలా విలువైందని ఐర్లాండులోని కొన్ని నార శుద్ధి మిల్లులు గురించి నాకు తెలిపారు." (పై నివేదికలోని 140 పుట) ముడిపదార్థాల ధరల ఎగుడుదిగుడులను చర్చించే సందర్భంగా పత్తి వ్యర్థ పదార్థాల గురించి చెప్పుకొందాం.

ఎల్లిగిసెనార ఫ్యాక్టరీ యజమానుల కంటే ఉన్ని పరిశ్రమల యజమానులు తెలివితో వ్యవహరించారు. "ఉన్ని వ్యర్థ పదార్థాలను, ఉన్ని పీలికలను, ఉన్ని వనరుత్పత్తికి ఉపయోగించే పద్ధతిని ఒకప్పుడు నిరసించేవారు; అయితే పాత పీలికలతో ఉన్ని తయారు చేసే వ్యాపారంపై ఇప్పుడా అపోహలు పూర్తిగా తొలగిపోయాయి; ఇప్పుడది యార్క్‌షైర్ ఉన్ని వ్యాపారంలో ఒక ముఖ్యమైన శాఖగా తయారైంది; పత్తి వ్యర్థ పదార్థాలు కూడా అంగీకృత లోపాన్ని భర్తీ చేసేవిగా గుర్తింపబడటం నిస్సందేహం. ముప్పై ఏళ్ళ కిందట ఉన్ని పాతపీలిక, పాతగుడ్డల సగటు ధర టన్ను ఒకటికి 4 పౌండ్లు 4 షిల్లింగులుండేది; ఇటీవలి కాలంలో వాటి ధర టన్ను ఒకటికి 44 పౌండ్లకు పెరిగింది. వీటికి డిమాండు ఎంతగా పెరిగిందంటే, నూలు ఉన్ని కలిసి వస్త్రాల పీలికల్లోని నూలును నిర్మూలించి ఉన్నిని అలాగే ఉంచడం ద్వారా అలాంటి వస్త్రాల పీలికలలో ఉపయోగించే పద్ధతిని కనుగొన్నారు. ఈనాడు పాతపీలికలతో కొత్త వస్త్రాలు తయారుచేసే పరిశ్రమలో వేలాదిమంది పనివారు నియమితులై ఉన్నారు. దీనివల్ల వినియోగదారుడు సరసమైన ధరకు సగటు నాణ్యత గల వస్త్రాలను కొనుగోలు చేయగలిగి ఆ విధంగా చాలా లాభపడుతున్నాడు." (రిపోర్ట్స్ ఆఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ అక్టోబర్ 1863 పుట 107) 1862 సంవత్సరం నాటికి ఇలా పునరుజ్జీవం పొందినట్టి పాత పీలికల ఉన్ని ఇంగ్లీషు పరిశ్రమలో వినియోగమవుతున్న మొత్తం ఉన్నిలో మూడో వంతుకు చేరుకుంది (రిపోర్ట్స్

ఆఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్, అక్టోబర్ 1862 పుట 81) 'వినియోగదారు' పొందుతున్న 'పెద్ద లాభం' ఏమిటంటే ఇలా తయారైన వస్త్రాలు, మునుపటి కాలంలోని మూడో వంతు కాలంలోనే చిరిగిపోతాయి; ఆరోవంతు కాలంలో ఎక్కడి దారాలక్కడ విడిపోతాయి.

ఇంగ్లీషు పట్టుపరిశ్రమ కూడా అదే దిగజారుడు పంథాలో పయనించింది. 1839–1862 మధ్యకాలంలో అచ్చమైన ముడి పట్టు వినియోగం తగ్గగా, పట్టుపీలికల వినియోగం రెండు రెట్లు పెరిగింది. మెరుగైన యంత్రాలతో, పట్టు పీలికల నుంచి బహుళ ప్రయోజనకరమైన పట్టును తయారు చేయడం సాధ్యపడింది; లేకపోతే అవి ఎందుకూ పనికిరావు.

వ్యర్థ పదార్థాల వాడకానికి అతి చక్కటి ఉదాహరణ రసాయనిక పరిశ్రమలో లభిస్తుంది. ఈ పరిశ్రమ తన వ్యర్థ పదార్థాలకు గల కొత్త ఉపయోగాలను కనుగొని వాటిని వాడటమే కాక అనేక ఇతర పరిశ్రమల వ్యర్థ పదార్థాలను కూడా వాడుతోంది. ఉదాహరణకు ఈ పరిశ్రమ ఇంతకు ముందు దాదాపు నిరుపయోగంగా ఉన్నట్టి గ్యాస్ తారును నీలి అద్దకం రంగులుగానూ, మాంజిష్ట వర్ణంగానూ, ఇటీవలి కాలంలో ఔషధాలుగా కూడాను మార్చుతున్నది.

ఉత్పత్తి విసర్జితాలను మళ్ళీ వినియోగించడం ద్వారా జరిగే పొదుపునకు, పదార్థం వ్యర్థం కాకుండా నివారించడం ద్వారా జరిగే పొదుపునకు మధ్య స్పష్టమైన తేడా ఉంది; ఈ పొదుపు అంటే, ఉత్పత్తి తాలూకు విసర్జితాలను కనీస స్థాయికి తగ్గించడం, ఉత్పత్తికి అవసరమైన అన్ని ముడి పదార్థాలను, అనుబంధ పదార్థాలను గరిష్ట స్థాయిలో తక్షణమే వినియోగించుకోవడం అన్నమాట.

వ్యర్థ పదార్థాల తగ్గింపు కొంతవరకు ఉపయోగంలోని యంత్రాల నాణ్యతపై ఆధారపడి ఉంటుంది. నూనె, సబ్బు మొదలైన వాటి పొదుపు యంత్రభాగాలను సరైన స్థితిలో ఉంచడంపైన, వాటిని మెరుగుపెట్టడంపైన ఆధారపడి ఉంటుంది. ఇది అనుబంధ పదార్థాలకు సంబంధించిన విషయం. కానీ, ఈ ఉత్పత్తి ప్రక్రియలో, ముడి పదార్థాల్లో ఎక్కువ భాగం వృధా అయిపోయిందా లేక తక్కువ భాగం వృధా అయిపోయిందా అనేది ఉపయోగించిన యంత్రాల పనిముట్ల నాణ్యతపైన కొంత వరకు ఆధారపడి ఉంటుంది. ఇది చాలా ముఖ్య విషయం. చివరగా, ఇది ముడిపదార్థాల నాణ్యతపైనే ఆధారపడి ఉంటుంది. కాగా ఇది తిరిగి గని తవ్వకం పరిశ్రమపైనా, వ్యవసాయంపైనా కొంతవరకు ఆధారపడి వుంటుంది; (కచ్చితంగా చెప్తే నాగరికతా పురోగతిపై) అలాగే ముడిపదార్థాలు ఫ్యాక్టరీలలో ప్రవేశించే ముందు ఏ ప్రక్రియగుండా పయనిస్తాయో ఆ ప్రక్రియల అభివృద్ధిపై కూడా కొంతవరకు ఆధారపడి ఉంటుంది.

"ఇటీవలి కాలంలో, ఉదాహరణకు 14వ లూయీ కాలం నుంచి ఫ్రాన్స్‌లో ధాన్యాలను పిండిచేసే కళలో ఎంత అభివృద్ధి జరిగిందంటే పాత మిల్లులతో పోలిస్తే కొత్త మిల్లులు అదే మొత్తం పిండితో మునుపటికన్నా సగం ఎక్కువ రొట్టెలు చేయగలవని నిరూపించబడింది. మొదట పారిస్ నివాసి వార్షిక ధాన్య వినియోగం 4 సెటియర్లుగా (ఫ్రెంచి ధాన్యం కొలమానం – అనువాదకుడు) ఆ తర్వాత 3 సెటియర్లుగా, చివరకు 2 సెటియర్లుగా, ఈనాడు $1\frac{1}{3}$ సెటియర్లుగా అంచనా వేశారు; అంటే తలసరి వినియోగం దాదాపు 342 పౌండ్లు... నేను చాలాకాలం పాటు నివసించిన పెర్ష్‌లో నల్లరాయితో చేసిన తిరగలి గల మర మిల్లులను యంత్రశాస్త్ర నిబంధనల మేరకు దాదాపు తిరిగి

నిర్మించారు; గత ముప్పై సంవత్సరాలలో ఈ శాస్త్రం సత్వర ప్రగతి సాధించింది. లాఫెర్ట్ నుంచి శ్రేష్టమైన తిరగలి రాళ్ళను తెచ్చి అమర్చారు; అవి ధాన్యాన్ని రెండుసార్లు పిండి చేస్తున్నాయి; మిల్లు సంచి వృత్తాకారంగా తిరిగేలా చేశారు. ఫలితంగా అదే ధాన్యం నుంచి పిండి ఉత్పత్తి ఇప్పుడు ఆరింట ఒక భాగం పెరిగింది. కాబట్టి రోమన్లకూ, మనకూ రోజువారీ ధాన్యం వినియోగంలో విపరీతమైన తేడాకు గల కారణమేమో సులభంగా చెప్పవచ్చు. ఇందుకు కారణం ధాన్యాన్ని పిండి చేయటంలో, రొట్టె తయారీలో వారి దోషభూయిష్టమైన పద్ధతులే. ప్లినీ (XVIII, అధ్యాయం 20, 2) లో చేసిన అద్భుతమైన వ్యాఖ్యను[1] కూడా ఇదేవిధంగా వివరించాలనుకుంటున్నా. "రోమ్‌లో పిండిధర దాని నాణ్యతను బట్టి మోడియస్ ఒక్కంటికి 40, 48, లేక 96 అస్[2] లు పలికింది. నాటి ధాన్యం ధరలతో పోల్చి ఈ ధరలు చాలా ఎక్కువగా ఉండడానికి కారణం ఇంకా శైశవ దశలో ఉన్న ఆనాటి మిల్లుల దోష భూయిష్టమైన పరిస్థితే, తత్ఫలితంగా మిల్లు లాడించేందుకు పట్టే భారీ ఖర్చులున్నూ." (Dureau de la Melle, Economie Politique des Romains, Paris, 1840, 1 పుటలు 280–81)

## V. నూతన పరికల్పనల ద్వారా పొదుపు

నిశ్చల పెట్టుబడి నియోగంలోని ఈ పొదుపులకు కారణం భారీస్థాయిలో శ్రమ పరిస్థితుల నియోగమే అని పునరుద్ఘాటిస్తున్నాం; క్లుప్తంగా చెప్పాలంటే ఉత్పత్తి ప్రక్రియలో ఇవి ప్రత్యక్షంగా సామాజికమైన శ్రమ పరిస్థితులుగా లేక సామాజికీకృత శ్రమ పరిస్థితులుగా లేక ప్రత్యక్ష సహకార పరిస్థితులుగా ఉపకరించడమే ఈ పొదుపులకు కారణం. ఒకవైపేమో, సరుకు ధర పెంచకుండా యాంత్రిక, రసాయనిక నూతన పరికల్పనల వినియోగానికి ఇది తప్పనిసరి అవసరం; ఇది ఎల్లప్పుడూ అనివార్య షరతు. మరోవైపేమో సహకార ఉత్పాదక వినియోగం నుంచి లభ్యమయ్యే పొదుపులకు భారీ స్థాయిలో ఉత్పత్తి మాత్రమే వీలు కలిగిస్తుంది. చివరి విషయం – ఎక్కడ, ఎలా పొదుపు చేయాలి అన్న సంగతినీ, నూతన ఆవిష్కరణలు అమలు జరిపే అతిసులువైన పద్ధతులనూ, సిద్ధాంతాన్ని అమలు జరపడంలో, అంటే సిద్ధాంతాన్ని ఉత్పత్తి ప్రక్రియకు వర్తింప చేయడంలో ఉత్పన్నమయ్యే ఆచరణాత్మక ఘర్షణలను కనుగొని, వెల్లడించేది సంయుక్త శ్రామికుని అనుభవం మాత్రమే.

సందర్భవశాత్తూ ఒక మాట. సార్వత్రిక శ్రమకు, సహకార శ్రమకూ మధ్య గల వ్యత్యాసాన్ని చూడాలి. శ్రమకూ సహకార శ్రమకూ ఈ రెండు రకాల శ్రమలూ ఉత్పత్తి ప్రక్రియలో తమ వంతు పాత్ర నిర్వర్తిస్తాయి; రెండూ ఒకదానిలోకి మరొకటి ప్రవేశిస్తాయి; అయినప్పటికీ రెంటి మధ్య తేడా ఉంది. సార్వత్రిక శ్రమ అంటే యావత్తు శాస్త్రీయ శ్రమ, అన్ని ఆవిష్కరణలు నూతన పరికల్పనలు. ఈ శ్రమ కొంతవరకు సజీవ కార్మికుల సహకారం పైనా, కొంతవరకూ ఇంతకు ముందు వెళ్ళిపోయిన వారి శ్రమ వినియోగం పైనా ఆధారపడి ఉంటుంది. కాగా సహకార శ్రమ ఏమో వ్యక్తుల ప్రత్యక్ష సహకారం.

పైన చెప్పిన దాన్ని పలు పరిశీలనలు ధ్రువీకరిస్తున్నాయి.

---

1. ప్రాచీన రోమ్‌లో మోడియస్ (modius) అనేది ఒక కొలత ప్రమాణం.
2. అస్ (as) అనేవి ప్రాచీన రోమ్‌లో డబ్బు ప్రమాణ నాణెం.

1. నూతన యంత్రం తాలూకు మొదటి నమూనా కయ్యే ఖర్చుకు, దాని పునరుత్పత్తికయ్యే ఖర్చుకు మధ్య పెద్ద తేడా. (ఇందుకు సంబంధించి ఉరే[1] బాబేజ్[2] లను చూడండి.)
2. ఒక నూతన పరికల్పనపై ఆధారపడి ఒక సంస్థ నిర్వహణ వ్యయం, సాపేక్షంగా దాని శిథిలాలనుంచి ఉత్పన్నమైన సంస్థల నిర్వహణ వ్యయంకంటే చాలా ఎక్కువ. ఇది ఎంత వాస్తవమంటే, ప్రప్రథమంగా కొత్త పుంత తొక్కినవారు సాధారణంగా దివాలా తీస్తారు. ఆ తర్వాత ఆ భవనాలను, యంత్రాలను చౌకగా కొనేవారు. వాటినుంచి డబ్బు చేసుకుంటారు. కాబట్టి, మానవ శక్తి తాలూకు సార్వత్రిక శ్రమ సాధించిన నూతన అభివృద్ధుల నుంచి, సమ్మిళిత శ్రమ ద్వారా వాటి ఆచరణనుంచి అత్యధిక లాభాలు పొందేది సాధారణంగా పూర్తిగా పనికిమాలినవారూ, పరమ నీచులూ అయిన డబ్బు పెట్టుబడిదారులే.

★ ★ ★

---

1. ఎ. ఉరే, ది ఫిలాసఫీ ఆఫ్ మాన్యుఫాక్చర్స్, రెండవ ముద్రణ, లండన్, 1855 - సంపాదకుడు.
2. సి.హెచ్. బాబేజ్, ఆన్ ది ఎకానమీ ఆఫ్ మెషినరీ అండ్ మాన్యుఫ్యాక్చర్స్, లండన్ , 1832, పుటలు 280-81 - సంపాదకుడు.

## అధ్యాయం - 6

# ధరల హెచ్చుతగ్గుల ప్రభావం

### I. ముడిపదార్థాల ధరల్లో హెచ్చుతగ్గులు; లాభం రేటుపై వాటి ప్రత్యక్ష ప్రభావం

**ము**నుపటి ఉదాహరణల్లోలాగే ఈ ఉదాహరణలో కూడా అదనపు విలువ రేటు మార్పు చెందదని ఊహించుకొందాం. ఈ ఉదాహరణను దీని స్వచ్ఛమైన రూపంలో విశ్లేషించడం అవసరం. అయితే, ఇక్కడ మనం విశ్లేషించనున్న ముడి పదార్థాల ధరల హెచ్చుతగ్గుల వల్ల కలిగే సంకోచ, వ్యాకోచాల మూలంగా అంతకంతకు ఎక్కువమంది కార్మికులను లేక అంతకంతకు తక్కువమంది కార్మికులను, తన అదనపు విలువ రేటులో మార్పులేని ఒక నిర్దిష్ట పెట్టుబడి నియోగించుకొనే అవకాశం ఉంది. అటువంటి సందర్భంలో అదనపు విలువ రేటు యథాతథంగా ఉంటూనే అదనపు విలువ పరిమాణం మారవచ్చు. అయినా దీనిని అప్రధాన అంశంగా పరిగణించి విస్మరించాలి. యంత్రాలలో వచ్చిన అభివృద్ధి, ముడిపదార్థాల ధరల్లో వచ్చిన మార్పులు ఏకసమయంలో ఒక నిర్దిష్ట పెట్టుబడి నియమించే కార్మికుల సంఖ్యను లేక వేతనాల స్థాయిని ప్రభావితం చేసినట్లయితే, ఈ క్రింది ప్రభావాలను కలపవలసి ఉంటుంది. 1. లాభం రేటుపై స్థిర పెట్టుబడి మార్పులు కలిగించే ప్రభావం. 2. లాభం రేటుపై వేతనాల్లోని మార్పులు కలిగించే ప్రభావం. అప్పుడు దాని ఫలితమేమో తేలుతుంది.

అయితే మునుపటి ఉదాహరణల్లోలాగే ఈ ఉదాహరణలో కూడా మొత్తం మీద ఒక విషయం గమనించాలి; స్థిర పెట్టుబడి తాలూకు పొదుపుల కారణంగా కానీ, ముడి పదార్థాల ధరల హెచ్చుతగ్గుల కారణంగా కానీ మార్పులు జరిగితే; ఆ మార్పులు వేతనాలను కదపకపోయినా, అంటే అదనపు విలువ రేటులోనూ అదనపు విలువ మొత్తంలోనూ ఎలాటి మార్పు తీసుకురాకపోయినా, లాభం రేటును ఎల్లప్పుడు ప్రభావితం చేస్తాయి. అ.వి అ.వి' $\frac{\text{అ.పె}}{\text{మొ.పె}}$ లోని మొ.పె యొక్క పరిమాణాన్ని మార్చుతాయి. ఆ విధంగా అవి మొత్తంగా ఆ భిన్నరాశి విలువనే మారుస్తాయి. కాబట్టి అదనపు విలువ విశ్లేషణలో మనం గమనించిన దానికి భిన్నంగా, ఈ ఉదాహరణలో, ఏ ఉత్పత్తి శాఖలో ఈ మార్పులు సంభవిస్తాయన్నది ముఖ్యం కాదు; వాటిచేత ప్రభావితమయ్యే ఉత్పత్తి శాఖలు కార్మికుల కోసం జీవనావసరాలను ఉత్పత్తి చేస్తాయా లేక అలాటి వాటి ఉత్పత్తి కోసం స్థిర పెట్టుబడిని ఉత్పత్తి చేస్తాయా అన్నది ఈ సందర్భంలో కూడా ముఖ్యం కాదు. ఇక్కడ మనం చేసిన నిర్ధారణలు, విలాస వస్తువుల ఉత్పత్తిలో జరిగే మార్పులకు కూడా సమానంగా వర్తిస్తాయి. విలాస వస్తువులంటే ఇక్కడ మన అర్థం శ్రమశక్తి పునరుత్పత్తికి ఉపకరించని ఉత్పత్తి.

ఇక్కడ ముడిపదార్థాల్లో నీలిమందు, బొగ్గు, గ్యాస్ లాటి అనుబంధ పదార్థాలు కూడా చేరతాయి. అంతేకాక, ఈ పద్దుకింద యంత్రాలకు సంబంధించినంత వరకు, వాటి ముడి పదార్థాలు ఇనుము, కలప, తోలు వగైరాలతో కూడినవి. కాబట్టి యంత్రాల నిర్మాణంలో ఉపయోగించే ముడిపదార్థాల ధరల హెచ్చుతగ్గులు యంత్రాల ధరనే ప్రభావితం చేస్తాయి. కాగా ముడిపదార్థాల ధరలోని హెచ్చుతగ్గుల మూలంగా కానీ లేక యంత్రాల పనిలో ఖర్చయ్యే అనుబంధ పదార్థాల ధరల హెచ్చుతగ్గుల మూలంగా కానీ యంత్రాల ధర పెరిగినట్లయితే, లాభం రేటు దానికి అనుగుణమైన నిష్పత్తిలో పడిపోతుంది; యంత్రాల ధర తగ్గితే లాభం రేటు దానికి అనుగుణమైన నిష్పత్తిలో పెరుగుతుంది.

సరుకు ఉత్పత్తి ప్రక్రియలోకి ప్రవేశించే ముడిపదార్థాల ధరల హెచ్చుతగ్గుల విశ్లేషణకే మనం ఇక్కడ పరిమితమవుదాం; శ్రమసాధనాలుగా పనిచేసే లేక యంత్రాలను పనిచేయించడంలో అవసరమైన ముడిపదార్థాలతో మనకు ప్రమేయం లేదు. ఇక్కడ ఒక్క అంశాన్ని మాత్రం గుర్తుంచుకోవాలి. ఇనుము, బొగ్గు, కలప వగైరా రూపాల్లోని ప్రకృతి సంపద, అంటే యంత్రాల నిర్మాణానికీ, ఉపయోగానికీ ఉపకరించే ప్రధాన పదార్థాలు పెట్టుబడి యొక్క సహజసిద్ధమైన ఫలితంగా కనిపిస్తుంది; వేతనాల తక్కువ స్థాయితోనూ, ఎక్కువ స్థాయితోనూ నిమిత్తం లేకుండా లాభం రేటును నిర్ధారించే అంశం ఇది.

$\frac{\text{వా.వి}}{\text{మొ.పె}}$ లేక $\frac{\text{అవి}}{\text{స్థి.పె+అ.పె}}$ అన్నది లాభం రేటు కాబట్టి స్థి.పె పరిమాణంలోనూ తద్వారా మొ.పె పరిమాణంలోనూ మార్పు తెచ్చే ప్రతిదీ లాభం రేటులో కూడా మార్పు తెస్తుంది. అ.వి, అ.పెలు, అలాగే వాటి మధ్య సంబంధం యధాతథంగా ఉన్నప్పటికీ ఇలా జరుగుతుంది. ఇప్పుడిక ముడి పదార్థాల స్థిరపెట్టుబడిలోని ఒకానొక ప్రధాన భాగం. ముడిపదార్థాలు వినియోగం కాని పరిశ్రమల్లో కూడా ఇవి అనుబంధ పదార్థాలుగా, లేక యంత్రాల భాగంగా కానీ లెక్కలోకి వస్తాయి. కనుక వీటి ధరల హెచ్చుతగ్గులు ఆ మేరకు లాభం రేటును ప్రభావితం చేస్తాయి. ముడిపదార్థాల ధర ధ మేరకు మొత్తం కనుక పడిపోతే $\frac{\text{వా.వి}}{\text{మొ.పె}}$ లేక $\frac{\text{అ.వి}}{\text{స్థి.పె+అ.పె}}$ అన్నది $\frac{\text{వా.వి}}{\text{మొ.పె}-\text{ధ}}$ అవుతుంది, లేక $\frac{\text{అ.వి}}{(\text{స్థి.పె}-\text{ధ})+\text{అ.పె}}$ అవుతుంది; అప్పుడు లాభం రేటు పెరుగుతుంది. అలా కాకుండా, ముడి పదార్థాల ధర పెరిగితే అప్పుడు $\frac{\text{వా.వి}}{\text{మొ.పె}}$ లేక $\frac{\text{అ.వి}}{\text{స్థి.పె+అ.పె}}$ అనేది $\frac{\text{అ.వి}}{\text{స్థి.పె+ధ}}$ లేక $\frac{\text{అ.వి}}{\text{స్థి.పె+ధ})+\text{అ.పె}}$ అవుతుంది; లాభం రేటు పడిపోతుంది. ఇతర పరిస్థితులన్నీ యధాతథంగా ఉన్న పక్షంలో, ముడి పదార్థాల ధరకు విలోమ నిష్పత్తిలో లాభం రేటు తగ్గుతుంది లేదా పెరుగుతుంది. కాబట్టి ముడి పదార్థాల ధరల హెచ్చుతగ్గులతో పాటు ఉత్పాదితం యొక్క అమ్మకం రంగంలో మార్పులు లేనప్పటికీ అంటే గిరాకీ సరఫరాల సంబంధంతో నిమిత్తం లేకుండా ముడిపదార్థాల తక్కువ ధర అన్నది పారిశ్రామిక దేశాలకు ఎంత ముఖ్యమో ఇది సూచిస్తున్నది. దీన్నిబట్టి విదేశీ వాణిజ్యం లాభం రేటును ప్రభావితం చేస్తుందన్నది కూడా స్పష్టం; జీవనావసరాలను చౌక చేయడం ద్వారా వేతనాలపై అది కలుగజేసే ప్రభావంతో ఇక్కడ నిమిత్తం లేదు. అసలు విషయ మేమిటంటే, పరిశ్రమలోనూ, వ్యవసాయంలోనూ ఖర్చయ్యే ముడిపదార్థాల లేక అనుబంధ పదార్థాల ధరలను అది ప్రభావితం చేస్తుందన్నమాట. ఒకవైపు (టోరెన్స్‌లాంటి[1]) అర్థశాస్త్రవేత్తలు లాభం రేటుపై ముడిపదార్థాల ధరల

1. ఆర్. టొరెన్స్, యాన్ యెస్సే ఆన్ ది ప్రొడక్షన్ ఆఫ్ వెల్త్, లండన్, 1821, పుట 28 - సంపాదకుడు.

హెచ్చుతగ్గులకు గల గణనీయమైన ప్రభావానికి కారణాలను పొరపాటుగా వివరించడానికీ, మరోవైపు రికార్డో[1] లాటి అర్థశాస్త్రవేత్తలు అనగా సార్వత్రిక సూత్రాలకు కట్టుబడి ఉండే అర్థశాస్త్రవేత్తలు లాభం రేటుపై ప్రపంచ వాణిజ్యానికి గల ప్రభావాన్ని గుర్తించకపోవడానికీ కారణం, లాభం రేటు స్వభావాన్నీ, అదనపు విలువ రేటుకు దానికి గల ప్రత్యేక తేడాను అసమగ్రంగా అవగాహన చేసుకోవడమే.

ముడి పదార్థాలపై ఎగుమతి, దిగుమతి సుంకాల రద్దు, లేక తగ్గింపు – పరిశ్రమలకు ఎంత ముఖ్యమో ఇది స్పష్టం చేస్తుంది. ముడిపదార్థాలపై దిగుమతి సుంకాలను గరిష్ట స్థాయిలో తగ్గించడం సహేతుక అభివృద్ధికి ఒక ముఖ్య సూత్ర మయింది. ప్రధానంగా పత్తిపై సుంకాన్ని రద్దు చేయించడానికి కృషి చేసిన ఇంగ్లీషు స్వేచ్ఛా వ్యాపార వాదులు ముడి పదార్థాల పైనా ధాన్యంపైనా దిగుమతి సుంకం రద్దును తమ ప్రధాన లక్ష్యంగా పెట్టుకొన్నారు.

అచ్చమైన ముడిపదార్థంగా కాక, అనుబంధ పదార్థంగానూ, అదే సమయంలో ఒక ప్రధానమైన ఆహార పదార్థంగానూ ఉన్న వస్తువు విషయంలో ధర తగ్గుదల ఎంత ముఖ్యమైనదో తెలపడానికి జౌళి పరిశ్రమలో మైదాపిండి వాడకం ఒక ఉదాహరణగా ఉపకరిస్తుంది. 1837లో గ్రేట్ బ్రిటన్‌లోని జౌళి మిల్లుల్లో పని చేస్తుండిన ఒక లక్ష మరమగ్గాలు, 2 లక్షల 50వేల చేతి మగ్గాలు ఏటా 41 మిలియన్ల పౌన్ల పిండిని పడుగును సాఫీ చేయడానికి వాడుకుంటున్నాయని ఆనాడే ఆర్.హెచ్. గ్రెగ్[2] అంచనా వేశాడు. దీనికి తోడు, దీనిలో మూడోవంతు పిండిని బ్లీచింగ్ తదితర ప్రక్రియలకు వాడేవారని ఆ లెక్కన అంతకుముందు పదేళ్ళ కాలంలో ఏటా 342,000 పౌండ్ల విలువగల పిండిని వినియోగించే వారని గ్రెగ్ అంచనా వేశారు. యూరప్ ఖండంలోని పిండి ధరతో పోల్చితే కేవలం ధాన్యంపై దిగుమతి సుంకం కారణంగా బ్రిటన్‌లో పిండిధర ఎక్కువ. జౌళి పరిశ్రమదారులపై అలా ఏటా రుద్దిన అదనపు ధర 170,000 పౌండ్లు. 1837కు ఈ మొత్తం కనీసం 200,000 పౌండ్లని గ్రెగ్ అంచనా వేశారు. పిండి ధర పెరిగిన కారణంగా ఏటా 1000 పౌండ్లు అదనంగా భరించవలసి వచ్చిన ఒక కంపెనీని ఆయన ఉదహరించాడు. ఫలితంగా "ధాన్యం చట్టాలను రద్దు చేసినట్లయితే పదిగంటల పని మస్తుగా సరిపోతుందని యోచనాశీలురూ, వ్యాపారం ఆనుపానులు తెలిసినవారూ అయిన గొప్ప పరిశ్రమదారులు అన్నారు" (రిపోర్ట్స్ ఆఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్, అక్టోబర్ 1848, పుట 98) ధాన్యం చట్టాలు రద్దయ్యాయి. పత్తి తదితర ముడి పదార్థాలపై దిగుమతి సుంకాలు కూడా రద్దయ్యాయి. అయితే ఇవి రద్దు అయీ అవగానే పదిగంటల బిల్లుపట్ల ఫ్యాక్టరీ యజమానుల వ్యతిరేకత ఎప్పటికంటే మరింత ఉధృత రూపం దాల్చింది. అయితే పదిగంటల ఫ్యాక్టరీ దినం చట్టరూపం దాల్చగానే ప్రథమ ఫలితం ఏమిటంటే వేతనాలను తగ్గించడానికి సార్వత్రిక ప్రయత్నం ప్రారంభమైంది.

ఒక ఉత్పాదితం తయారీలో వినియోగమయ్యే ముడిపదార్థాల, అనుబంధ పదార్థాల విలువ పూర్తిగా ఒకేసారి ఆ ఉత్పాదితం విలువలో ప్రవేశిస్తుంది; కాగా నిశ్చల పెట్టుబడి భాగాలు మాత్రం తమ విలువను ఉత్పాదితానికి క్రమేణా మాత్రమే తమ అరుగుదలకు అనుగుణమైన నిష్పత్తిలో బదలాయిస్తాయి. ఒక ఉత్పాదితం తయారీ పెట్టుబడిలో ఎంత ఖర్చయింది – అన్న విషయంతో

1. డి. రికార్డో ఆన్ ది ప్రిన్స్‌పుల్స్ ఆఫ్ పొలిటికల్ ఎకానమీ అండ్ టాక్సేషన్, తృతీయ ముద్రణ లండన్ 1821, పుటలు 131-38 - సంపాదకుడు.
2. ది ఫ్యాక్టరీ క్వెశ్చన్ అండ్ ది టెన్ అవర్స్ బిల్ - ఆర్.హెచ్. గ్రెగ్, లండన్ 1837 పుట 115.

ప్రమేయం లేకుండా, నియోగించిన పెట్టుబడి మొత్తం విలువ, లాభం రేటును నిర్ధారించే మాట నిజమే. అయినప్పటికీ, నిశ్చల పెట్టుబడి ధర కంటే ముడి పదార్థాల ధరే ఎక్కువగా లాభం రేటును ప్రభావితం చేస్తుందని దీన్నిబట్టి నిర్ధారణ అవుతోంది. సరుకులు వాటి విలువలకే అమ్ముడుపోతాయనీ, ఫలితంగా పోటీవల్ల తలెత్తే ధరల హెచ్చుతగ్గులతో ఇక్కడ ప్రమేయం లేదని మనం ఊహిస్తున్నాం కానీ, (ఇది ప్రాసంగికంగా చెబుతున్న మాటే) మార్కెట్ సంకోచ, వ్యాకోచాలు వ్యష్టి సరుకు ధరపై ఆధారపడి ఉంటుందనీ, ఈ సంకోచ వ్యాకోచాలు ఆ ధర పెరుగుదలకు లేక తగ్గుదలకు విలోమ అనుపాతంలో ఉంటాయనీ విదితమవుతోంది. కనుక ఆచరణలో ఉత్పాదితం ధర, ముడి పదార్థం ధరకు అనుగుణమైన నిష్పత్తిలో పెరగదు. ముడిపదార్థం ధరకు అనుగుణమైన నిష్పత్తిలో తగ్గదు. కనుక ఉత్పాదితాలు తమ విలువకు అమ్మకమయిన పక్షంలో ఉండే దానికంటే లాభం రేటు ఒక సందర్భంలో పడిపోతుంది. మరో సందర్భంలో పెరుగుతుంది.

అంతేకాక, నియుక్తమైన యంత్రాల పరిమాణమూ, విలువా రెండూ కూడా శ్రమ ఉత్పాదకత అభివృద్ధితో పాటు పెరుగుతాయి కానీ కచ్చితంగా ఆ ఉత్పాదకత పెరిగిన నిష్పత్తిలోనే పెరగవు; అంటే ఆ యంత్రాలు తమ మొత్తం ఉత్పత్తిని పెంచిన నిష్పత్తిలోనే ఇవి పెరగవు. కాబట్టి ముడి పదార్థాలను ఖర్చు పెట్టే పరిశ్రమల శాఖల్లో అంటే శ్రమకర్తే గత శ్రమ యొక్క ఉత్పాదితంగా ఉండే పరిశ్రమల శాఖల్లో, ఒక నిర్దిష్ట పరిమాణంలోని శ్రమను మరింత పెద్ద పరిమాణాల్లోని ముడి పదార్థాలు లీనంచేసుకొనే నిష్పత్తిలో, శ్రమ యొక్క పెరుగుతున్న ఉత్పాదకత కచ్చితంగా వ్యక్తమవుతుంది; ఇంకొంచెం వివరంగా చెప్తే, ఉదాహరణకు ఒక గంటలో ఉత్పాదితాలుగా మారిన అంటే సరుకులుగా శుద్ధి చేయబడిన ముడిపదార్థాల అధికారిక పరిమాణంలో అది వ్యక్తమవుతుంది. కాబట్టి శ్రమ ఉత్పాదకత అభివృద్ధికి అనుగుణమైన నిష్పత్తిలో ముడిపదార్థం విలువ సరుకు – ఉత్పాదితం విలువలో అంతకంతకు పెరుగుతున్న భాగమవు తుంది. అందుకు కారణం, అది అంతలోకి మొత్తంగా ప్రవేశించడమే కాదు, మొత్తం ఉత్పాదితం తాలూకు ప్రతి సమభాగంలోనూ యంత్రాల తరుగుదల భాగమూ, కొత్తగా చేరిన శ్రమ భాగమూ రెండూ నిరంతరాయంగా తగ్గిపోతాయి. ఇలా తగ్గే పోకడ వల్ల, సరుకు విలువలో ముడిపదార్థాలకు ప్రాతినిధ్యం వహించే ఇతర భాగం తదనుగుణంగా పెరుగుతుంది. ముడి పదార్థాల ఉత్పత్తి నియుక్తమైన శ్రమ ఉత్పాదకత పెరిగిన ఫలితంగా పడిపోయిన ముడిపదార్థపు విలువ తగ్గుదల, ఆ ఇతర భాగం పెరుగుదలకు సరియెత్తుగా ఉంటేనే అలా పెరుగుతుంది.

అంతేకాక, వేతనాలలాగే ముడిపదార్థాలు, అనుబంధ పదార్థాలు కూడా చలామణి పెట్టుబడిలో భాగాలుగా రూపొందుతున్నాయి కాబట్టి ఉత్పాదితం అమ్మకం ద్వారా నిరంతరాయంగా వాటిని మొత్తంగా భర్తీ చేయక తప్పదు; కాగా యంత్రాల విషయంలో తరుగుదలను మాత్రమే మొదట నిల్వ నిధి రూపంలో పునరుద్ధరించాల్సి ఉంటుంది. అంతేకాక, మొత్తం వార్షిక అమ్మకాలు ఈ నిల్వనిధికి తమ వంతు వార్షిక భాగాన్ని సమకూర్చినన్నాళ్ళూ, ప్రతి వ్యష్టి అమ్మకం ఈ నిల్వనిధికి తమవంతు భాగాన్ని సమకూర్చాల్సిన అవసరమేమీ లేదు. సరుకుల అమ్మకం ద్వారా లభించిన ధర గనుక ఆ సరుకుల అంతర్భాగాలన్నిటికీ భర్తీ చేయడానికి సరిపోని పక్షంలో, ముడిపదార్థం ధరలోని పెరుగుదల మొత్తం ఉత్పత్తి ప్రక్రియను తగ్గించగలదు లేక మొత్తంగా ఆపివేయగలదు అని ఇది స్పష్టం చేస్తున్నది. లేదా దాని సాంకేతిక ప్రాతిపదిక స్థాయికి అవసరమైనంతగా ఉత్పత్తి ప్రక్రియ కొనసాగడం సాధ్యం

కాకుండా చేస్తుంది; పర్యవసానంగా యంత్రాలలోని ఒక భాగం మాత్రం పనిలో కొనసాగుతుంది లేదా మొత్తం యంత్రాలు మామూలు కాలంలో కొంత భాగం మాత్రమే పనిచేస్తాయి.

చివరగా – వ్యర్థ పదార్థం వల్ల అయ్యే ఖర్చు, ముడిపదార్థాల ధరల హెచ్చుతగ్గులకు అనుగుణమైన ప్రత్యక్ష నిష్పత్తిలో ఉంటుంది. అంటే వాటి ధరలు పెరిగితే ఈ ఖర్చు పెరుగుతుంది, అవి తగ్గితే ఇది తగ్గుతుంది. అయితే దీనికీ ఒక పరిమితి అంటూ ఉంటుంది. 1850 ఏప్రిల్ ఫ్యాక్టరీ నివేదికలో ఇలా ఉంది; "ముడిపదార్థాల ధరల పెరుగుదల వల్ల జరిగే గణనీయ నష్టానికి గల ఒక మూల కారణం నూలుమిల్లు యజమానికి తప్ప మరెవ్వరికీ తట్టదు. అదేమిటంటే వ్యర్థ పదార్థం వల్ల జరిగే నష్టం. పత్తి ధర పెరిగినప్పుడు, ముఖ్యంగా తక్కిన నాణ్యత గల రకాల నూలు మిల్లు యజమానికి అయ్యే ఖర్చు అతను వాస్తవంలో చెల్లించిన అడ్వాన్స్‌కు మించిన నిష్పత్తిలో పెరుగుతుందనీ, ఎందువల్లనంటే, ముతక రకం నూలు దారాలు వడకటంలో, వ్యర్థమయ్యే ముడిపత్తి పూర్తిగా 15 శాతం ఉంటుందనీ నాకు చెప్పారు. ఈ రేటున, పౌను $3\frac{1}{2}$ పెన్నీలు అమ్మే పత్తిపై పౌనుకు ½ పెన్నీ నష్టం తెస్తే, పత్తి ధర పౌను 7 పెన్నీలకు పెరిగినప్పుడు ఒక పెన్నీ నష్టం సంభవిస్తుంది" (రిపోర్ట్స్ ఆఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్, ఏప్రిల్, 1850 పుట 17) అయితే అమెరికా అంతర్యుద్ధం ఫలితంగా, దాదాపు 100 ఏళ్ళల్లో ఎప్పుడూ లేని స్థాయికి పత్తి ధర పెరిగినప్పుడు ఫలితం భిన్నంగా ఉండిందని ఆ నివేదిక తెలిపింది : "ఇప్పుడు వ్యర్థ పదార్థానికి లభిస్తున్న ధర, వ్యర్థమైన పత్తిని ఫ్యాక్టరీలలో తిరిగి వాడటం ఇవి, వ్యర్థ పదార్థాల వల్ల కలిగే నష్టం విషయంలో సూరత్ పత్తికీ, అమెరికన్ పత్తికీ మధ్య గల తేడాను (ఇది దాదాపు $12\frac{1}{2}$ శాతం) కొంతవరకు తొలగిస్తున్నాయి."

"సూరత్ పత్తిలో వ్యర్థమయ్యేది 25 శాతం ఉండేది; అందువల్ల ఫ్యాక్టరీ యజమాని నూలు ఉత్పత్తి చేయక ముందే అతనికి పత్తి కయిన ఖర్చు నాల్గోవంతు పెరిగేది. అమెరికన్ పత్తి పౌనుకు 5 పెన్నీలు లేక ఆరు పెన్నీలు ఉన్నప్పుడు వ్యర్థపదార్థాల వల్ల జరిగే నష్టాన్ని పట్టించుకొనే వారు కాదు. ఎందువల్లనంటే అది పౌనుకు $\frac{3}{4}$ పెన్నీల కంటే ఎక్కువ ఉండేది కాదు. కాగా ఇప్పుడా నష్టానికి ఎక్కువ ప్రాముఖ్యం ఉంది. ఎందుచేతనంటే 2 షిల్లింగులు ధర పలికే ప్రతి పౌను పత్తిమీద ఆరు పెన్నీల నష్టం సంభవిస్తుంది"[1] (రిపోర్ట్స్ ఆఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్, అక్టోబర్ 1863 పుట 106).

## II. పెట్టుబడి పెరుగుదల, తరుగుదల, విడుదల, బంధనం

ఈ అధ్యాయంలో విశ్లేషించిన దృశ్యమాన పరిణామాలు సమగ్రరూపం అందుకోవాలంటే పరపతి వ్యవస్థ, ప్రపంచ మార్కెట్‌లో పోటీ అన్నవి అవసరం. ఇందులో రెండవది పెట్టుబడిదారీ ఉత్పత్తికి పునాది, చాలా ముఖ్యమైన భాగం. పెట్టుబడి యొక్క సాధారణ స్వభావాన్ని అవగాహన చేసుకుంటేనే మరింత నిర్దిష్టమైన ఈ పెట్టుబడిదారీ ఉత్పత్తి రూపాలను సమగ్రంగా చిత్రించడం

1. ఈ నివేదిక ఆఖరు వాక్యంలో ఒక తప్పుంది. వ్యర్థపదార్థం వల్ల జరిగే నష్టం 6 పెన్నీలని కాక 3 పెన్నీలని వుండాలి. సూరత్ పత్తి విషయంలో ఈ నష్టం 25 శాతంకాగా అమెరికన్ పత్తి విషయంలో ఇది $12\frac{1}{2}$ -15 శాతం మాత్రమే. అమెకన్ పత్తి విషయంలో, ఆ శాతం ప్రకారం సరిగా వేసినది, 5-6 పెన్నీల ధరకే. కానీ, అంతర్యుద్ధం ఆఖరు సంవత్సరాల్లో యూరప్‌కు తెచ్చిన అమెరికన్ పత్తి విషయంలో కూడా వ్యర్థపదార్థం వల్ల జరిగిన నష్టం తరచు మునుపటి కన్నా బాగా పెరిగిందనేది నిజం - ఎంగెల్స్.

సాధ్యం. పైగా ఇవి ఈ రచన పరిధిలోకి రావు; ఇవి ఈ రచన భావి కొనసాగింపునకు చెందినవి. అయినా పై శీర్షిక కింద అంశాలను ఈ దశలో స్థూలంగా చర్చించవచ్చు. మొదటి విషయం అవి పరస్పర సంబంధం గలవి, రెండవది – వీటికి లాభం రేటుతోనూ, లాభం మొత్తంతోనూ సంబంధం ఉంది. అదనపు విలువ పరిమాణం లేదా రేటు కదలికతో ప్రమేయం లేకుండా లాభం రేటు మాత్రమే కాక లాభం మొత్తం కూడా – అదనపు విలువ మొత్తమే తప్ప మరొకటిగాని లాభం మొత్తం కూడా – స్వతంత్రంగా పెరగగలవు. లేక తగ్గగలవు అన్న అభిప్రాయాన్ని ఇవి కలుగజేస్తాయి. కాబట్టి వీటిపైన సంక్షిప్తంగానైనా చర్చించాల్సిందే.

ఒకవైపు పెట్టుబడి విడుదలనూ, బంధనను, మరొకవైపు పెట్టుబడి విలువ వృద్ధినీ, క్షీణతనూ విభిన్న పరిమాణంగా పరిగణించాలా?

పెట్టుబడి విడుదల, బంధనం అంటే మన అర్థమేమిటనేది ప్రశ్న. పెట్టుబడి వృద్ధి, క్షీణతలు స్వయం విదితమే. వీటి అర్థమల్లా ఏమిటంటే కొన్ని కొన్ని సాధారణ ఆర్థిక పరిస్థితుల ఫలితంగా ఒక నిర్ణీత పెట్టుబడి విలువ పెరుగుతుంది లేదా తరుగుతుంది. మనమిక్కడ ప్రత్యేకంగా ఒకానొక వైయక్తిక పెట్టుబడి ప్రారబ్ధం గురించి చర్చించడం లేదు. కనుక వీటి అర్థమల్లా ఏమిటంటే – ఉత్పత్తిలో మదుపుపెట్టిన ఒక పెట్టుబడి విలువ తాను నియోగించిన అదనపు శ్రమ ఫలితంగా తాను చెందే స్వయం విస్తరణతో ప్రమేయం లేకుండా పెరుగుతుంది లేదా తరుగుతుంది.

పెట్టుబడి బంధనం అంటే అర్థం, ఉత్పత్తి అదే స్థాయిలో కొనసాగాలంటే ఉత్పాదితం యొక్క మొత్తం విలువలోని కొన్ని భాగాలు స్థిర పెట్టుబడి అంశాలుగానూ, అస్థిర పెట్టుబడి అంశాలుగాను తిరిగి పరివర్తన చెందవలసి ఉంటుంది. పెట్టుబడి విడుదల అంటే అర్థం, మునుపటి స్థాయిలోనే ఉత్పత్తి కొనసాగితే, స్థిర పెట్టుబడిగా లేక అస్థిర పెట్టుబడిగా కొంత కాలం పాటు తిరిగి మార్పు చెందవలసి ఉన్న ఉత్పాదితం తాలూకు మొత్తం విలువలోని ఒక భాగం అనావశ్యకమైనదిగా, యధేచ్ఛగా వినియోగించుకోవీలయినదిగా తయారవుతుంది. ఈ పెట్టుబడి విడుదలకూ లేక బంధనానికీ రాబడి తాలూకు విడుదలకూ, బంధనానికీ మధ్య తేడా ఉంది. ఒక వ్యక్తిగత పెట్టుబడి మొ.పె తాలూకు వార్షిక అదనపు విలువ 'క' కు సమానంగా ఉన్నట్లయితే, పెట్టుబడిదారుడు వినియోగించుకున్న సరుకుల ధర తగ్గుదల వల్ల, క–అ మునుపటంత సంతృప్తి నివ్వడానికి సరిపోతుంది. రాబడిలోని ఒక భాగం, 'ఆ' విడుదలై, 'ది' వినియోగాన్ని పెంచడానికి కానీ, లేక పెట్టుబడిగా తిరిగి పరివర్తన చెందడానికి కాని, (పెట్టుబడి సంచయనం కోసం) ఉపకరించవచ్చు. ఇందుకు భిన్నంగా ముందులాగే జీవించడానికి క+అ అవసరమైనట్లయితే, అప్పుడు ఈ జీవన ప్రమాణాన్ని తగ్గించనైనా తగ్గించాలి లేదా ఇంతకు ముందు కూడబెట్టిన ఆదాయం 'అ' ను రాబడిగా ఖర్చయినా చేయాలి.

పెట్టుబడి పెరుగుదల, తరుగుదలలు స్థిరపెట్టుబడిని కానీ అస్థిర పెట్టుబడిని కానీ లేక రెండింటినీ కానీ ప్రభావితం చేయచ్చు – స్థిర పెట్టుబడిని ప్రభావితం చేస్తే అది తిరిగి నిశ్చల పెట్టుబడిని కానీ లేక చలామణి భాగాన్ని కానీ, లేక రెండింటినీ కానీ ప్రభావితం చేయొచ్చు.

స్థిర పెట్టుబడి కింద మనం సగం తయారైన సరుకులతో సహా ముడి పదార్థాలను, అనుబంధ పదార్థాలను, (వీటన్నిటిని ముడి పదార్థాలున్న దానికిందే చేరుస్తున్నాము) యంత్రాలను, ఇతర స్థిర పెట్టుబడిని పరిశీలించాల్సి ఉంది.

ఇంతకు ముందు జరిపిన విశ్లేషణలో మనం ముడి పదార్థాల ధరలో లేక విలువలో కలిగే మార్పులకు లాభం రేటుపై గల ప్రభావాన్ని ప్రత్యేకించి ప్రస్తావించి, ఇతర పరిస్థితులు సమానంగా ఉన్నట్లయితే, లాభం రేటు ముడి పదార్థాల విలువకు విలోమానుపాతంలో ఉంటుందన్న సార్వత్రిక నియమాన్ని నిర్ధారించాం. వ్యాపార సంస్థలో కొత్తగా మదుపు పెట్టిన పెట్టుబడికీ ఇది సర్వ సంపూర్ణంగా వర్తిస్తుంది. మదుపు అంటే ఉత్పాదక పెట్టుబడిగా డబ్బు మార్పు అప్పుడప్పుడే జరుగుతున్న వ్యాపార సంస్థలోనికి పెట్టుబడికి పూర్తిగా వర్తిస్తుంది.

కొత్తగా మదుపు పెట్టబడుతున్న ఈ పెట్టుబడులే కాక, ఇప్పటికే క్రియాత్మక పెట్టుబడిలోని ఒక పెద్ద భాగం, చలామణి రంగంలో మరో భాగం ఉత్పత్తి రంగంలో ఉంది. ఒక భాగం మార్కెట్‌లో డబ్బుగా మారడానికి ఎదురు చూస్తున్న సరుకుల రూపంలో ఉంది; మరో భాగం ఏదో ఒక రూపంలో చేతిలో డబ్బుగా ఉంది; ఇది ఉత్పాదక అంశాలుగా తిరిగి మార్పు చెందడానికి సిద్ధంగా ఉంది. చివరగా, మూడవ భాగం ఉత్పత్తి రంగంలో ఉంది; ఇందులో కొంతభాగం మార్కెట్‌లో కొనుగోలు చేసిన ముడి పదార్థాలు, అనుబంధ పదార్థాలు, సగం తయారైన సరుకులు, యంత్రాలు, ఇతర నిశ్చల పెట్టుబడి వంటి ఉత్పత్తి సాధనాల అసలు రూపంలోనూ, మరికొంత భాగం ఉత్పత్తి ప్రక్రియలో ఉన్న ఉత్పాదితాల రూపంలోనూ ఉంది. పెట్టుబడి పెరుగుదల లేక తరుగుదల ఇక్కడ చాలా వరకు ఈ పెట్టుబడి భాగాల సాపేక్ష నిష్పత్తిపై ఆధారపడి ఉంటుంది. విషయ సరళత కోసం నిశ్చల పెట్టుబడిని వదిలేసి, ముడిపదార్థాల, అనుబంధ పదార్థాల, సగం తయారీ ఉత్పాదితాల రూపంలోనూ, సంపూర్ణంగా తయారైన మార్కెట్‌లో ఉన్న ఉత్పాదితాల రూపంలోనూ ఇంకా ఉత్పత్తి ప్రక్రియలోనూ ఉన్నట్టి స్థిర పెట్టుబడి భాగాన్ని మాత్రమే పరిశీలిద్దాం.

ముడి పదార్థాల ధర, ఉదాహరణకు పత్తి ధర పెరిగితే, పత్తి చౌకగా ఉన్నప్పుడు పత్తితో తయారైన సరుకుల ధర నూలు లాటి సగం తయారీ సరుకుల ధర, పూర్తిగా తయారైన నూలు వస్త్రాల ధర కూడా పెరుగుతుంది; అలాగే నిల్వలో ఉన్న శుద్ధి చేయని పత్తి విలువ, ఉత్పత్తి ప్రక్రియలో ఉన్న పత్తి విలువ కూడా పెరుగుతుంది. నిల్వలోని, ఉత్పత్తి ప్రక్రియలోని పత్తి గతావలోకనంలో అధిక శ్రమకాలానికి ప్రాతినిధ్యం వహిస్తుంది. కాబట్టి ఇది ప్రవేశించిన ఉత్పాదితం తొలి విలువకు అదనంగా విలువను జోడిస్తుంది. అంటే ఆ ఉత్పాదితం కోసం పెట్టుబడిదారుడు చెల్లించిన దానికంటే ఎక్కువ విలువను ఇది దానికి చేరుస్తుంది.

కాబట్టి ముడిపదార్థాల ధర పెరిగి, మార్కెట్‌లో తయారైన సరుకులు గణనీయమైన పరిమాణంలో లభిస్తున్నట్లయితే, వాటి తయారీ దశతో నిమిత్తం లేకుండా, ఈ సరుకుల విలువ కూడా పెరుగుతుంది; ఫలితంగా ప్రస్తుతం ఉనికిలోని పెట్టుబడి విలువ కూడా పెరుగుతుంది. ఉత్పాదకుని చేతిలోని ముడి పదార్థాల వగైరాల సరఫరాకు కూడా ఇదే వర్తిస్తుంది. ఈ విలువ పెరుగుదల వ్యష్టి పెట్టుబడిదారుడికి లేదా మొత్తంగా పెట్టుబడిదారీ ఉత్పత్తి రంగంలోని ఒక శాఖకు శాఖకూ ముడి పదార్థం ధర పెరుగుదలతో పాటు సంభవించే లాభం రేటు తగ్గుదలవల్ల కలిగే నష్టాన్ని భర్తీచేయొచ్చు లేదా అంతకంటే ఎక్కువే ఇవ్వొచ్చు. పోటీకి సంబంధించి సవివరమైన ప్రభావాల జోలికి పోకుండా, విషయ సమగ్రత కోసం మనం క్రింది విధంగా చెప్పవచ్చు : 1. గోదాములో గనుక ముడిపదార్థాల

నిల్వలు దండిగా ఉన్నట్లయితే వాటి ఉత్పత్తి స్థానంలో ధరల పెరుగుదలను అవి, అడ్డుకోవచ్చు. 2. మార్కెట్‌పై సగం తయారైన సరుకులు, పూర్తిగా తయారైన సరుకుల ఒత్తిడి ఎక్కువగా ఉంటే, వాటి ముడి పదార్థాల పెరుగుదలకు అనుగుణమైన నిష్పత్తిలో ఆ సరుకుల ధరలు పెరక్కుండా నిరోధింపబడతాయి.

కాగా ముడిపదార్థాల ధర తగ్గితే, ఇందుకు భిన్నమైన పరిస్థితి తలెత్తుతుంది. ఇతర పరిస్థితుల్లో మార్పు లేనట్లయితే, ఇది లాభం రేటును పెంచుతుంది. మార్కెట్‌లోని సరుకులు విలువ, ఉత్పత్తి క్రమంలోని వస్తువుల విలువ, లభిస్తున్న ముడి పదార్థాల విలువ తగ్గిపోతుంది. ఇది లాభం రేటు పెరుగుదలను అడ్డుకొంటుంది.

ఉత్పత్తి రంగంలోనూ, వాణిజ్య సంవత్సరం ముగిశాక మార్కెట్‌లలోనూ అంటే వ్యవసాయ రంగంలో మాసూలు తర్వాత ముడి పదార్థాలు మళ్లీ కొత్తగా పెద్ద మొత్తాలల్లో సరఫరా అయ్యే దశ ముగిశాక మార్కెట్‌లోనూ సరఫరాలు తక్కువ స్థాయిలో ఉన్నప్పుడు ముడి పదార్థాల ధరల్లో హెచ్చుతగ్గుల ప్రభావం మరింత ప్రస్ఫుటంగా ఉంటుంది.

ఈ మొత్తం విశ్లేషణలో మనం ధరల పెరుగుదల, తరుగుదలలు వాస్తవానికి విలువలో హెచ్చుతగ్గులనే వ్యక్తం చేస్తాయన్న ఊహతో వ్యవహరిస్తున్నాము. అయితే లాభం రేటుపై ఇలాంటి ధరల మార్పుకు గల ప్రభావమే ఇక్కడ చర్చిస్తున్న విషయం కనుక వీటి అట్టడుగున ఏమున్నదీ మనకవసరం లేదు. విలువలో హెచ్చుతగ్గుల మూలంగా కాకుండా, పరపతి వ్యవస్థ, పోటీ, వగైరాల ప్రభావం మూలంగా ధరలు పెరిగే లేక తరిగే ఉదాహరణలకు ప్రస్తుతం చెబుతున్నవన్నీ సమానంగా వర్తిస్తాయి. లాభం రేటు ఉత్పాదితం విలువకు పైబడిన అదనపు విలువకూ, అడ్వాన్స్ చేసిన మొత్తం పెట్టుబడికీ గల నిష్పత్తికీ సమానం, కాబట్టి అడ్వాన్స్ చేసిన పెట్టుబడి విలువ తగ్గిన ఫలితంగా లాభం రేటు పెరగడంతోపాటు, పెట్టుబడి విలువకు నష్టం సంభవిస్తుంది. అదే విధంగా అడ్వాన్స్ చేసిన పెట్టుబడి విలువ పెరిగిన ఫలితంగా లాభం రేటు తగ్గడంతో పాటు లబ్ధి వుండవచ్చు.

పోతే స్థిర పెట్టుబడిలోని ఇతర భాగానికి సంబంధించి, అంటే యంత్రాలు, మొత్తంపై నిశ్చల పెట్టుబడికి సంబంధించి, ముఖ్యంగా భవనాలు, భూస్థితి విలువ పెరిగే అంశంపై భూమి కౌలు గురించిన సిద్ధాంతం లేకుండా మనం చర్చించలేము, కనుక ఇది ఈ అధ్యాయానికి చెందదు కానీ పెట్టుబడి విలువ తరుగుదల సమస్య విషయంలో కింది అంశాలు మొత్తం మీద ముఖ్యమైనవి.

ప్రస్తుతం పని చేస్తున్న యంత్రాలు, ఫ్యాక్టరీ భవనాలు వగైరాలు ఉపయోగ విలువను తగ్గించేటట్టు, అందువల్ల వాటి విలువను తగ్గించేటట్టు నిరంతరాయమైన మెరుగుదలలు ప్రవేశపెట్టడం, కొత్తగా ప్రవేశపెట్టబడిన యంత్రాలు మొదటి దశలో అవి ఒకానొక పరిణతి దశ నందుకోకముందు, పై ప్రక్రియకు ప్రత్యేకించి దుష్ప్రభావం ఉంది. ఈ దశలో ఈ యంత్రాలు తమ విలువను పునరుత్పత్తి చేయడానికి పట్టే కాలం గడవక ముందే వాటికి కాలం చెల్లుతుంది. ఇలాంటి దశలో పని కాలాన్ని అడ్డూ ఆపూ లేకుండా పెంచడానికి షిఫ్టులను, రాత్రి షిఫ్టులను మార్చి మార్చి కొనసాగించడానికీ ఇది ఒక ప్రధాన కారణం. తరుగుదల పద్దు కొంత పెద్ద ఖర్చులు వేయకుండా అతి తక్కువ కాలంలోనే యంత్రాల విలువను పునరుత్పత్తి చేసుకోవాలన్నది ఇక్కడ వారి లక్ష్యం. యంత్రాలు ఫలప్రకారం

పనిచేసే ఈ స్వల్పకాలంలో జరగనున్న పెరుగుదల దృష్ట్యా కుదించుకుపోయిన యంత్రాల జీవిత కాలంలో ఈ విధంగా నష్టపరిహారం గనుక జరక్కపోతే ఆ యంత్రాలు నైతిక క్షీణత ద్వారా ఉత్పాదితానికి ఎంత ఎక్కువ విలువను అందచేస్తాయంటే, అవి చేతి పరిశ్రమతో కూడా పోటీ పడజాలవు.[1]

యంత్రాలు, భవన సముదాయం, మొత్తం నిశ్చల పెట్టుబడి ఒక నిర్దిష్ట పరిపక్వ దశనందుకున్న అనంతరం, అంటే కనీసం కొంతకాలంపాటు తమ మౌలిక నిర్మాణంలో అవి మార్పు లేకుండా కొనసాగిన అనంతరం, ఈ నిశ్చల పెట్టుబడిని పునరుత్పత్తి చేసే పద్ధతులు అభివృద్ధి చెందిన ఫలితంగా, ఇదే విధమైన విలువ తరుగుదల తలెత్తుతుంది. ఈ సందర్భంలో యంత్రాలు మొదలయిన వాటి విలువ తగ్గడానికి కారణం ఆ యంత్రాలనే త్వరత్వరగా పని చేయించడమూ, మరింత ఉత్పాదక శక్తిగల కొత్త యంత్రాలు వగైరాల మూలంగా పాత వాటి విలువ కొంతవరకు తగ్గడమూ కద్దు. అందుకు కారణం వాటిని మరింత చౌకగా పునరుత్పత్తి చేయడానికి వీలుండటమే. పెద్ద పెద్ద సంస్థలు ఇతరుల చేతుల్లోకి వెళ్లేదాకా, అంటే, మొదటి యజమానులు దివాలా తీసిన తరువాత వాటిని చౌకగా కొన్నవారు తక్కువ పెట్టుబడితో మళ్ళీ మొదటి నుంచి ప్రారంభించేదాకా తరచుగా అభివృద్ధి చెందకపోవడానికి ఇది ఒక కారణం.

ముఖ్యంగా వ్యవసాయం విషయంలో ఉత్పాదితం ధర పెరగడానికీ లేక తరగడానికీ కారణ భూతమైనదే పెట్టుబడి విలువ పెరుగుదలకూ లేక తరుగుదలకూ కూడా కారణభూతమవుతుందని ఇక్కడ మనకు వెంటనే స్ఫురిస్తుంది. అందుకు కారణం పెట్టుబడి విలువ అన్నది వ్యవసాయంలో ధాన్యం, పశుగణం వగైరాల రూపంలో ఉండటమే. (రికార్డో[2])

★ ★ ★

మనమింకా అస్థిర పెట్టుబడిని పరిశీలించాల్సి ఉంది.

శ్రమశక్తి పునరుత్పత్తికి అవసరమైన జీవనావసరాల విలువ పెరిగితే శ్రమశక్తి విలువ కూడా పెరుగుతుంది; ఆ జీవనావసరాల విలువ తగ్గితే శ్రమశక్తి విలువ కూడా తగ్గుతుంది. (వాస్తవానికి అస్థిర పెట్టుబడి పెరుగుదల, తరుగుదల అన్నవి ఈ రెండూ సందర్భాల కేవలం వ్యక్తీకరణలే తప్ప మరొకటి కాదు) పనిదిన పరిమాణంలో మార్పులేకపోతే, పై కారణం వల్ల, అదనపు విలువ తగ్గుదలతో పాటు అస్థిర పెట్టుబడి విలువ పెరుగుతుంది. అదనపు విలువ పెరుగుదలతో అస్థిర పెట్టుబడి విలువ తగ్గుతుంది. ఇతర పరిస్థితులు కూడా, అంటే – పెట్టుబడి విడుదల, పెటుటబడి బంధనం –

---

1. ఉదాహరణ కోసం ఇతరులతోపాటు బాబేజ్ (ఆన్ ది ఎకానమీ ఆఫ్ మెషినరీ అండ్ మాన్యుఫాక్చర్స్ లండన్, 1832, పుటలు 280-281 - సంపాదకుడు)ను కూడా చూడండి. ఈ సందర్భంలో వినియోగించే మామూలు పద్ధతి ఒకటి వుంది. అది వేతనాలను తగ్గించడం. అది కూడా ఉపయోగించబడింది. అందుచేత ఈ నిరంతరాయ తరుగుదల శ్రీ కారీ (Mr. Carey) గారి 'సామరస్య మేధ' స్వప్నాలకు పూర్తి విరుద్ధంగా పనిచేస్తుంది.
2. డి. రికార్డో, ఆన్ ది ప్రిన్సిపుల్స్ ఆఫ్ పొలిటికల్ ఎకానమి అండ్ టాక్సేషన్ మూడవ కూర్పు, లండన్ 1821, అధ్యాయం II - సంపాదకుడు.

సంభవించవచ్చు. వాటిని ఇంతవరకు మనం విశ్లేషించలేదు కనుక వాటిని సంక్షిప్తంగా పేర్కొందాం.

శ్రమశక్తి విలువ తగ్గిన ఫలితంగా వేతనాలు పడిపోతే (శ్రమ యొక్క వాస్తవ ధర పెరిగినా ఇలా జరగొచ్చు) ఇంతకు ముందు వేతనాల్లో మదుపు పెట్టిన పెట్టుబడిలో కొంత భాగం విడుదల అవుతుంది. అస్థిర పెట్టుబడి ఖాళీగా ఉంటుంది. పెట్టుబడిని కొత్తగా మదుపు పెడుతున్న సందర్భంలో ఇది మరింత ఎక్కువ అదనపు విలువ రేటుతో పనిచేస్తున్న ఫలితమిస్తుంది. అదే శ్రమ పరిమాణాన్ని చలనంలో ఉంచడానికి ఇంతకు ముందుకంటే ఇప్పుడు తక్కువ డబ్బు అవసరం. ఈ విధంగా చెల్లించిన శ్రమ భాగం తగ్గిపోయి, చెల్లించని శ్రమ భాగం పెరుగుతుంది. అయితే ఇంతకుముందే మదుపు పెట్టిన పెట్టుబడికి సంబంధించి, అదనపు విలువ రేటు పెరగడమే కాక ఇంతకు ముందు వేతనాల్లో మదుపు పెట్టిన పెట్టుబడిలోని ఒక భాగం విడుదల అవుతుంది కూడా – అది ఇప్పటిదాకా బంధింపబడి ఉండింది. ఉత్పాదితం అమ్మకం ద్వారా వచ్చిన డబ్బు నుంచి మినహాయించి వేతనం కోసం అడ్వాన్సు చేయవలసి ఉన్న క్రమబద్ధమైన భాగంగా ఉండింది. వ్యాపారం మునుపటి స్థాయిలో కొనసాగాలంటే ఇలా ఆ భాగం అస్థిర పెట్టుబడిగా వ్యవహరించవలసి ఉండేది. ఇప్పుడా భాగం విడుదల అయి కొత్త మదుపుగా ఉపయోగించుకోడానికి అనువుగా ఉంటుంది; దీన్ని అదే వ్యాపారం విస్తరణకైనా ఉపయోగించుకోవచ్చు లేదా ఇతర ఉత్పత్తి రంగంలోనైనా ఉపయోగించుకోవచ్చు.

ఉదాహరణకు 500 మంది కార్మికులను పనిలో పెట్టుకోడానికి మొదట వారానికి 500 పౌండ్లు అవసరమయిందనీ, ఇప్పుడదే ప్రయోజనానికి 400 పౌండ్లే సరిపోతాయనీ అనుకుందాం. రెండు ఉదాహరణల్లోనూ ఉత్పత్తి అయిన విలువ పరిమాణం 1000 పౌండ్లు అయితే, మొదటి ఉదాహరణలో వారంవారీ అదనపు విలువ మొత్తం 500 పౌండ్లు; కాగా అదనపు విలువ రేటు $\frac{500}{500}$ =100% అయితే వేతనాలు తగ్గింపు తరువాత, అదనపు విలువ మొత్తం 1000 పౌండ్లు మైనస్ 400 పౌండ్లు = 600 పౌండ్లు కాగా అదనపు విలువ రేటేమో $\frac{600}{400}$ = 150%. అదనపు విలువ రేటులో ఈ పెరుగుదల 400 పౌండ్ల అస్థిర పెట్టుబడితోనూ, తదనుగుణమైన స్థిర పెట్టుబడితోనూ ఇదే ఉత్పత్తి రంగంలో కొత్త వ్యాపారం ప్రారంభించిన వ్యక్తికి మాత్రమే కద్దు. కాగా ఇప్పటికీ కొనసాగుతున్న వ్యాపారంలో ఇలా జరగనట్లయితే, అస్థిర పెట్టుబడి తగ్గుదల అదనపు విలువ మొత్తాన్ని 500 పౌండ్ల నుంచి 600 పౌండ్లకు, అదనపు విలువ రేటును 100% నుంచి 150%కి పెంచడమే కాక, శ్రమను మరింతగా దోపిడీ చేయడానికి 100 పౌండ్ల అస్థిర పెట్టుబడిని విడుదల చేస్తుంది. కాబట్టి అదే శ్రమ పరిమాణం మరింత లాభదాయకంగా వినియోగించుకోబడుతుంది. ఇంతేకాక, అదే 500 పౌండ్ల అస్థిర పెట్టుబడిలో మునుపటికన్నా ఎక్కువమంది కార్మికులను ఎక్కువ స్థాయిలో దోచుకోవడం సాధ్యమవుతుంది.

ఇప్పుడిక దీనికి సరిగ్గా భిన్నమైన పరిస్థితిని తీసుకుందాం. 500 మంది కార్మికులను పనిలో పెట్టుకున్నప్పుడు ఉత్పాదితం విభజన ఇలా ఉందనుకుందాం : 400 స్థి.పె + 600 అ.వి = 1000 అప్పుడు అదనపు విలువ రేటు = 150%. ఈ సందర్భంలో కార్మికునికి వారానికి $\frac{4}{5}$ పౌండు లేక 16 షిల్లింగులు లభిస్తుంది. అస్థిర పెట్టుబడి విలువ పెరిగిన ఫలితంగా 500 మంది కార్మికుల వల్ల

వారానికి 500 పౌండ్లు వ్యయమైతే ఒక్కొక్కరికి వారానికి ఒక పౌండు లభిస్తుంది; అప్పుడు 400 పౌండ్లతో 400 మంది కార్మికులను మాత్రమే పనిలో పెట్టుకోవచ్చు. ఇలాకాక ఇంతకు మునుపులాగే పాత సంఖ్యలోనే కార్మికులను నియుక్తం చేస్తే, $500_{\text{స్థి.పె}}+500_{\text{అ.వి}}=1000$గా ఉంటుంది. అప్పుడు అదనపు విలువ రేటు 150% నుంచి 100%కి పడిపోతుంది. అంటే మూడింట ఒకవంతు తగ్గుతుంది. ఇక్కడ కొత్త పెట్టుబడి విషయంలో ఫలితం ఏమిటంటే, ఇలా అదనపు విలువ రేటు మూడోవంతు తగ్గడమే. ఇతర పరిస్థితులు యథాతథంగా ఉన్నట్లయితే, అదే నిష్పత్తిలో కాకపోయినా మొత్తం మీద లాభం రేటు కూడా పడిపోయి ఉండేది. ఉదాహరణకు స్థి.పె = 2000 అయితే ఒక సందర్భంలో ఇలా ఉంటుంది : $2000_{\text{స్థి.పె}}+400_{\text{అ.పె}}+600_{\text{అ.వి}} = 3000$; అదనపు విలువ రేటు = 150%, లాభం రేటు $=\frac{600}{2,400} = 25\%$. రెండవ సందర్భంలో $2000_{\text{స్థి.పె}}+500_{\text{అ.పె}}+500_{\text{అ.వి}}=3000$ అదనపు విలువ రేటు 100%. లాభం రేటు $\frac{500}{2500} = 20\%$. కాగా ఇంతకు ముందే మదుపుపెట్టిన పెట్టుబడి విషయానికి వస్తే, ఇక్కడ ద్వంద్వ ప్రభావం ఉంటుంది. 100% అదనపు విలువ రేటుతో 400 పౌండ్లు అస్థిర పెట్టుబడిలో 400 మంది కార్మికులను మాత్రమే నియమించడం సాధ్యపడింది. కనుక వారు 400 పౌండ్ల అదనపు విలువ మొత్తాన్ని మాత్రమే ఉత్పత్తి చేస్తారు. పైగా, 2000 పౌండ్ల స్థిర పెట్టుబడిని చలనంలో పెట్టాలంటే 500 మంది కార్మికులు అవసరం కాబట్టి 400 మంది కార్మికులు 1600 పౌండ్లు స్థిర పెట్టుబడిని మాత్రమే చలనంలో పెట్టగలరు. యంత్రాలలో అయిదింట ఒకవంతు ఖాళీగా ఉండకుండా అదే స్థాయిలో ఉత్పత్తి కొనసాగాలంటే ఇంతకు ముందులాగే 500 మంది కార్మికులను నియమించడానికిగాను అస్థిర పెట్టుబడికి 100 పౌండ్లు అదనంగా జోడించక తప్పదు. ఇంతకుముందు దేనికైనా వినియోగించడానికి వీలుగా ఉన్న పెట్టుబడికి జోడించడం (Tying) ద్వారా మాత్రమే ఈ పని చేయడం సాధ్యం. అంటే ఉత్పత్తి విస్తరణకై ఉద్దేశించిన సంచయనం లోని ఒక భాగం లోటును భర్తీ చేయడానికి ఉపకరిస్తుంది. లేదా రాబడికోసం కేటాయించిన భాగం తిరిగి పాత పెట్టుబడికి జోడించబడుతుందన్న మాట. అప్పుడు 100 పౌండ్లు మేరకు పెరిగిన అస్థిర పెట్టుబడి 100 పౌండ్లు తక్కువ అదనపు విలువను ఉత్పత్తి చేస్తుంది. అంటే సంఖ్యలో కార్మికులను నియోగించడానికి ఎక్కువ పెట్టుబడి అవసరమవుతోంది. అదే సమయంలో, ప్రతి కార్మికుడూ ఉత్పత్తి చేసే అదనపు విలువ తగ్గిపోతుంది.

అస్థిర పెట్టుబడి విడుదలవల్ల గల అనుకూలతలు, బంధించడంవల్ల గల ప్రతికూలతలు వున్నది, కొన్ని పరిస్థితులకు లోబడి పనిచేస్తూ తన్ను తాను పునరుత్పత్తి చేసుకుంటున్న పెట్టుబడికి మాత్రమే. కొత్తగా మదుపు పెట్టిన పెట్టుబడి, విషయంలో అటు అనుకూలతలు కానీ, ఇటు ప్రతికూలతలు కానీ అదనపు విలువ రేటు పెరుగుదలకు లేక తరుగుదలకు మాత్రమే పరిమితమై ఉంటాయి; అదే నిష్పత్తిలో కాదు కానీ, లాభం రేటులో తదనుగుణమైన మార్పునకు పరిమితమై ఉంటాయి.

★ ★ ★

ఇప్పుడిక్కడ విశ్లేషించిన అస్థిర పెట్టుబడి విడుదల, జోడించడం రెండూ కూడా అస్థిర పెట్టుబడి అంశాల, అంటే శ్రమశక్తి పునరుత్పత్తి ఖర్చుల తరుగుదల లేదా పెరుగుదల ఫలితాలు.

అయితే వేతనం రేటులో మార్పులేని పక్షంలో, శ్రమ ఉత్పాదకత అభివృద్ధి ఫలితంగా అదే పరిమాణంలోని స్థిర పెట్టుబడిని చలనంలో ఉంచేందుకు తక్కువమంది కార్మికులను నియమించడం వీలైతే అప్పుడు కూడా అస్థిర పెట్టుబడిని విడుదల చేయడం సాధ్యమే. అదే విధంగా, శ్రమ ఉత్పాదకత తగ్గిన పర్యవసానంగా అదే స్థిర పెట్టుబడిని చలనంలో ఉంచడానికి ఎక్కువమంది కార్మికులను నియమించడం అవసరమైతే, పైదానికి భిన్నంగా, అదనపు అస్థిర పెట్టుబడి జోడించబడుతుంది. మరోవైపు, ఇంతకు ముందు అస్థిర పెట్టుబడిగా నియుక్తమైన పెట్టుబడిలోని ఒక భాగం స్థిర పెట్టుబడి రూపంలో నియుక్తమయితే ఫలితంగా అదే పెట్టుబడి తన అంతర్భాగాల మధ్య పంపిణీ అయిన తీరు భిన్నంగా ఉంటేనూ ఇది అటు అదనపు విలువ రేట్లు, ఇటు లాభం రేటునూ రెండింటినీ ప్రభావితం చేస్తుంది. అయితే ఇది ఇక్కడ మనం చర్చిస్తున్న పెట్టుబడి జోడింపు, విడుదల శీర్షిక కిందికి రాదు.

స్థిర పెట్టుబడి భాగాల పెరుగుదల లేక తరుగుదల ద్వారా కూడా స్థిర పెట్టుబడి జోడింపబడటం లేక విడుదల కావటం జరగవచ్చునని మనం ఇదివరకే గమనించాం. ఇది కాక, శ్రమ ఉత్పాదక శక్తి పెరిగినప్పుడు మాత్రమే అస్థిర పెట్టుబడిలోని ఒక భాగం స్థిర పెట్టుబడిగా మార్పుచెందని పక్షంలో స్థిర పెట్టుబడిని జోడించడం సాధ్యం; శ్రమ ఉత్పాదక శక్తి పెరిగితే అదే సంఖ్యలోని కార్మికులు ఎక్కువ ఉత్పాదితాన్ని సృష్టిస్తారు, కనుక ఎక్కువ పరిమాణంలోని స్థిర పెట్టుబడిని చలనంలో ఉంచుతారు. కొన్ని పరిస్థితుల్లో ఉదాహరణకు వ్యవసాయంలో ఉత్పాదకత తగ్గితే కూడా ఇలాగే జరగొచ్చు – అదే పరిమాణంలో ఉత్పత్తి జరగాలంటే. అదే సంఖ్యలో కార్మికులకు విత్తనాలు, ఎరువులు, మురుగు నీటి పారుదల సదుపాయాలు వగైరాలాంటి ఉత్పత్తి సాధనాలు ఎక్కువ అవసరమవుతాయి. ఇంతకు ముందు ఎక్కువ విలువ గల స్థిర పెట్టుబడి చేస్తూ ఉండిన అదే సేవలను – ఇప్పుడు తక్కువ విలువ గల స్థిర పెట్టుబడితో చేయడానికి గనుక మెరుగుదలలు, ప్రకృతి శక్తుల వినియోగం తోడ్పడినట్లయితే తరుగుదల లేకుండానే స్థిర పెట్టుబడి విడుదల కావచ్చు.

ఒకసారి సరుకులు డబ్బుగా పరివర్తన చెందాక లేక అవి అమ్ముడుపోయాక ఈ డబ్బులోని కొంత భాగం స్థిర పెట్టుబడి తాలూకు పాదార్థిక భాగాలుగా పునఃపరివర్తన చెందవలసి ఉంటుందనీ, ఆయా ఉత్పత్తి రంగ సాంకేతిక స్వభావానికి అనుగుణమైన నిష్పత్తిలో ఇది జరగవలసి ఉంటుందనీ మనం రెండవ సంపుటిలో గమనించాం. ఈ విషయంలో, వేతనాలు కాక అంటే అస్థిర పెట్టుబడి కాక, ఈ పాదార్థిక భాగాల్లో అత్యంత ముఖ్యమైనది, అన్ని పారిశ్రామిక శాఖల్లో అనుబంధ పదార్థంతో సహా ముడి పదార్థం గనులు, తవ్వకం పరిశ్రమలలాంటి ముడిపదార్థాలు లేని ఉత్పత్తి శాఖల్లో ఈ అనుబంధ పదార్థం చాలా ముఖ్యమైనది. యంత్రాలు గనుక పనిచేసే స్థితిలో ఉన్నన్నాళ్ళు ఆ యంత్రాలు ధరలో తరుగుదలను భర్తీ చేయాల్సిన భాగం పద్దుల్లోకి ప్రధానంగా నామమాత్రంగా ఎక్కుతుంది. అది చెల్లించబడిందా? ఇవాళ కానీ, రేపు కానీ లేక పెట్టుబడి టర్నోవర్ కాలంలో ఏ దశలో కానీ అది డబ్బుచేత భర్తీ అయిందా? అన్నదానికి అట్టే ప్రాముఖ్యత లేదు. కాగా ముడిపదార్థం విషయంలో పరిస్థితి దీనికి భిన్నంగా ఉంటుంది. ముడిపదార్థాల ధర పెరిగితే, వేతనాలు మినహాయించాక సరుకుల

ధర నుంచి వాటిని పూర్తిగా భర్తీచేయడం అసాధ్యం కావచ్చు. కాబట్టి ధరల తీవ్రమైన హెచ్చుతగ్గులు ఉత్పత్తి ప్రక్రియలో ఆటంకాలకు, అవాంతరాలకు, విపత్తులకు సైతం దారితీస్తాయి. మరీ ముఖ్యంగా అసలైన వ్యవసాయ ఉత్పాదితాలు, అంటే సేంద్రియ ప్రకృతి నుంచి పొందే ముడి పదార్థాలే ముఖ్యంగా, అటువంటి విలువ మార్పులకు గురి అవుతుంటాయి. అందుకు కారణం పంట దిగుబడుల్లోని మార్పులు మొదలయినవి. ప్రస్తుతానికి పరపతి వ్యవస్థను వదలి వేస్తున్నాము. అదుపులో లేని ప్రకృతి పరిస్థితుల కారణంగా అవి సానుకూలమైనవి కావచ్చు, ప్రతికూలమైనవి కావచ్చు – ఒకే పరిమాణంలోని శ్రమ విభిన్న ఉపయోగ విలువలకు ప్రాతినిధ్యం వహించవచ్చు. కనుక ఒక నిర్దిష్ట పరిమాణంలోని ఈ ఉపయోగ విలువలకు విభిన్న ధరలు పలకొచ్చు. ఆ అనే సరుకు యొక్క 100 పౌండ్ల విలువ క అయితే, ఆ అ సరుకు యొక్క ఒక పౌండు ధర $\frac{\text{క}}{100}$; క అనేది 1000 పౌండ్ల విలువ అయితే అప్పుడు అ సరుకు యొక్క ఒక పౌండు ధర $\frac{\text{క}}{1000}$ వగైరా వగైరా కాబట్టి ముడిపదార్థాల ధర హెచ్చుతగ్గుల్లో ఇదొక అంశం. పోటీ, పరపతి వ్యవస్థ ప్రస్తుత విశ్లేషణ పరిధిలోకి రావు కనుక విశ్లేషణ సమగ్రత కోసం ఇక్కడ పేర్కొంటున్న రెండవ అంశమిది. మొక్కలకు, జంతువులకు సంబంధించిన పదార్థాల పెరుగుదల, ఉత్పత్తి కొన్ని ప్రకృతి నియమాలకు లోబడి, ప్రకృతి రుతువులతో ముడిపడి ఉండటం సహజం. అలాంటివాటి పరిమాణాన్ని యంత్రాలు, తదితర నిశ్చల పెట్టుబడి లేక బొగ్గు లేక ఖనిజాల పరిమాణాన్ని పెంచినట్లు అకస్మాత్తుగా పెంచడం అసాధ్యం. పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన దేశాల్లో, ప్రకృతి పరిస్థితులు మారని పక్షంలో, యంత్రాది నిశ్చల పెట్టుబడుల, బొగ్గు, ఖనిజాల పునరుత్పత్తిని త్వరగా సాధించవచ్చు. కాబట్టి స్థిర పెట్టుబడిలో సేంద్రియ ముడిపదార్థాల భాగాన్ని యంత్రాది నిశ్చల పెట్టుబడి భాగం అధిగమించడం – అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ ఉత్పత్తి వ్యవస్థలో సాధ్యమూ, అనివార్యమూ కూడా. ఆ ఫలితంగా సేంద్రియ ముడిపదార్థాల సరఫరా కంటే గిరాకీ త్వరగా పెరగడం వల్ల వాటి ధర పెరుగుతుంది. ముడిపదార్థాల యొక్క పెరిగే ధరల మూలంగా కింది పరిస్థితులు ఏర్పడతాయి. 1) ధరలు పెరుగుతున్నాయి కాబట్టి రవాణా ఛార్జీలను వాటి నుంచి భర్తీ చేయవచ్చు. ఆ కారణంగా చాలా దూరం నుంచి ముడి పదార్థాలను ఓడల్లో తీసుకువస్తారు. 2) వీటి ఉత్పత్తి పెరుగుతుంది. కానీ ఇది ప్రకృతి కారణాల దృష్ట్యా వచ్చే సంవత్సరం దాకా ఉత్పాదితాల పరిమాణం పెరగదు. 3) ఇంతకు ముందు వినియోగించుకోని అనేక ప్రత్యామ్నాయాలు ఉపయోగింపబడతాయి; వ్యర్థ పదార్థాల వినియోగం పెరుగుతుంది. ఉత్పత్తినీ, సరఫరాను ఈ ధరల పెరుగుదల గణనీయంగా ప్రభావితం చేయడం ప్రారంభమయినప్పుడు అత్యధిక సందర్భాల్లో అదొక మలుపు చేరుకున్నట్టు సూచిస్తుంది; అంటే ముడి పదార్థాల ధర, ఆ పదార్థాలు అంతర్భాగంగా ఉన్న అన్ని సరుకుల ధర దీర్ఘకాలం పాటు పెరిగిన ఫలితంగా డిమాండు పడిపోతుంది. అందువల్ల వాటికి, ముడి పదార్థాల ధరలో కూడా ప్రతిస్పందన ఉంటుంది. పెట్టుబడి విలువ తగ్గడం ద్వారా, దానివల్ల వివిధ రూపాల్లో వచ్చే కుదుపులతో పాటు మరికొన్ని పరిస్థితులకు కూడా ఇది దారితీస్తుంది. ఆ పరిస్థితులను మనం ప్రస్తావించాలి.

పైన వివరించిన దాన్నిబట్టి ఈ విషయం స్పష్టం : పెట్టుబడిదారీ ఉత్పత్తి పెరిగేకొద్దీ, తత్ఫలితంగా యంత్రాలు వగైరా రూపాల్లోని స్థిర పెట్టుబడి భాగం అకస్మాత్తుగానూ, శాశ్వతంగానూ హెచ్చించే

సాధ్య సంపత్తి పెరిగేకొద్దీ, సంచయన వేగం పెరిగే కొద్దీ (ముఖ్యంగా సౌభాగ్య కాలంలో) యంత్రాలు, తదితర నిశ్చల పెట్టుబడి సాపేక్ష అమితోత్పత్తి కూడా పెరుగుతుంది; అంతే తరచుగా పంటల, జంతువుల రూపంలోని ముడిపదార్థాల ఉత్పత్తి స్థాయి మామూలుకన్నా సాపేక్షంగా తగ్గుతుంది. పైన వర్ణించిన వీటి ధరల పెరుగుదల, దానితోపాటు వ్యక్తమయ్యే ప్రతిస్పందన మరింత ప్రస్ఫుట మవుతాయి. ఉత్పత్తి ప్రక్రియలోని ఒకానొక ముఖ్య భాగం, ధరల్లోని విపరీతమైన హెచ్చుతగ్గుల ఫలితంగా వచ్చే కుదుపులు కూడా అంతే తరుచుగా సంభవిస్తాయి.

అయితే డిమాండు తగ్గినందువల్ల కానీ, ఒక స్థలంలో ఉత్పత్తి పెరిగినందువల్ల కానీ మరోచోట ఇంతకు మునుపు పూర్తిగా ఉపేక్షించిన లేదా తక్కువగా మాత్రమే ఉపయోగించుకున్న సుదూర ఉత్పత్తి ప్రాంతాల నుంచి ఇప్పుడు దిగుమతి ఎక్కువ చేసుకున్నందువల్ల కానీ, ఈ అధిక ధరలు పడిపోయినట్లయితే, ఈ రెండు సందర్భాలలో మునుపటి హెచ్చు ధరలకు ముడిపదార్థాల సరఫరా వాటి గిరాకీ కంటే పెరిగినప్పుడు, తలెత్తే ఫలితాన్ని విభిన్న దృక్కోణాల నుంచి పరిశీలించవచ్చు. ముడి పదార్థాల ధరలు అకస్మాత్తుగా పడిపోవడం పునరుత్పత్తిని నిరోధిస్తుంది; వాటిని అత్యంత అనుకూల పరిస్థితుల్లో ఉత్పత్తి చేస్తున్న మునుపటి దేశాల గుత్తాధిపత్యం, బహుశా కొన్ని పరిమితులతో మొత్తానికి పునరుద్ధరింపబడుతోంది. దానికి లభించిన ప్రోత్సాహం కారణంగా ముడి పదార్థాల పునరుత్పత్తి విస్తృత స్థాయిలో, ముఖ్యంగా ఈ ఉత్పత్తిపై దాదాపు గుత్తాధిపత్యం గల దేశాల్లో పునరుత్పత్తి కొనసాగేమాట నిజమే. అయితే యంత్రాదుల విస్తరణ అనంతరం ఉత్పత్తి సాగడానికి మూలమైన ప్రాతిపదికను కొన్ని ఎగుడుదిగుళ్ళ తర్వాత నూతన సాధారణ ప్రాతిపదికగా ప్రారంభ స్థానంగా ఉపకరించనున్న ఈ ప్రాతిపదికను అంతకు మునుపటి టర్నోవర్ చక్రంలోని పరిణామాలు మరింత విస్తరింపచేస్తాయి. ఇది ఇలా ఉండగా, అంతంతమాత్రమే హెచ్చిన పునరుత్పత్తి, సరఫరాకు సంబంధించిన ద్వితీయ మూలాధారాల విషయంలో కొన్ని గణనీయమైన అవరోధాలకు గురవుతుంది; ఉదాహరణకు, అమెరికాలో పత్తి ఉత్పత్తి తగ్గినప్పుడల్లా ఇండియాలో పత్తి ఉత్పత్తి పెరిగినట్లూ, ఆ తర్వాత అది దాదాపు శాశ్వతంగా తగ్గిపోయినట్లు గత ముప్ఫై సంవత్సరాల (1865 వరకు) ఎగుమతి వివరాల పట్టికను బట్టి రుజువవుతోంది. ముడిపదార్థాలు ప్రియమైన కాలంలో పారిశ్రామిక పెట్టుబడిదారులు ఏకమై ఉత్పత్తిని క్రమబద్ధం చేసేందుకు అసోసియేషన్‌ను ఏర్పాటు చేసుకుంటారు. ఉదాహరణకు 1848లో మాంచెస్టర్‌లో పత్తి ధరలు పెరిగాక, ఐర్లాండులో ఎల్లిగిసెనార ధర పెరిగాక వారా విధంగా చేశారు. అయితే ఆ తాత్కాలిక ప్రేరణ అంతంకాగానే, 'అతి చౌక మార్కెట్‌లో కొనుగోలు చేయాలి' అనే సాధారణ పోటీ సూత్రం (తాత్కాలిక ధరతో నిమిత్తం లేకుండా) ఈ అసోసియేషన్లు ప్రయత్నించిన విధంగా, ముడిపదార్థాలను సరఫరా చేసే దేశాల్లో ఉత్పత్తికి ప్రేరణ ఇచ్చే బదులు మళ్ళీ పైచేయి సాధించగానే సరఫరాను క్రమబద్ధం చేసే పని తిరిగి 'ధరలకే' వదలి వేయబడుతుంది. ముడిపదార్థాల ఉత్పత్తిపై దూరపు చూపుతో సర్వావృతమైన ఉమ్మడి నియంత్రణను నెలకొల్పాలన్న ఆలోచన స్థానంలో గిరాకీ, సరఫరాలు పరస్పరం క్రమబద్ధం చేసుకుంటాయన్న విశ్వాసం మళ్ళీ చోటుచేసుకుంటుంది. ఇలాంటి నియంత్రణ వాస్తవానికి పెట్టుబడిదారీ ఉత్పత్తి నియమాలతో పొసగనిదని అంగీకరించాలి. అది ఎప్పుడూ ఒక పవిత్రమైన కోరికగానే మిగిలిపోతుంది;

తీవ్రమైన ఒత్తిడి, గందరగోళం[1] తలెత్తిన సమయాల్లో అరుదైన సహకారానికి మాత్రమే అది పరిమితమై ఉంటుంది. ఈ విషయంలో పెట్టుబడిదారుల మూఢనమ్మకం ఎంత మూర్ఖంగా ఉంటుందంటే ఫ్యాక్టరీ ఇన్‌స్పెక్టర్లు కూడా తమ నివేదికలలో పదే పదే ఆశ్చర్యంతో చేతులెత్తేస్తున్నారు. మంచీ, చెడూ సంవత్సరాలు మార్చి మార్చి రావడం వల్ల కూడా సహజంగానే ముడిపదార్థాలు చౌకగా లభ్యమవుతాయి. పెరుగుతున్న డిమాండ్‌పై దీనికి గల ప్రత్యక్ష ప్రభావంతో పాటు ఇంతకు ముందే ప్రస్తావించిన లాభం రేటుపై గల ప్రభావం కూడా మరో ప్రేరణగా ఉంది. పైన తెలిపిన ముడిపదార్థాల ఉత్పత్తి ప్రక్రియను క్రమేణా యంత్రాల ఉత్పత్తి అధిగమించడం భారీ స్థాయిలో పునరావృత్తమవుతుంది. పరిమాణంలోనే కాకుండా నాణ్యతలో కూడా కోర్కెలను తీర్చగలిగే ముడిసరుకుల మెరుగుదలకు, ఉదాహరణకు అమెరికన్ నాణ్యత గల పత్తి భారతదేశం నుంచి రావటానికి, యూరప్ దేశాల నుంచి దీర్ఘకాలంపాటు, క్రమం తప్పకుండా పెరిగే స్థిరమైన గిరాకీ అవసరం (భారతదేశంలో ఉత్పాదకుడు ఏ ఆర్థిక పరిస్థితుల్లో శ్రమిస్తున్నాడు అనే విషయంతో నిమిత్తం లేకుండా) కానీ ప్రస్తుతం ముడి పదార్థాల ఉత్పత్తి రంగం మొదట అకస్మాత్తుగా వేగంగా విస్తరించి ఆ తర్వాత మళ్లీ తీవ్రంగా కుదించుకుపోయింది. దీన్ని, పెట్టుబడిదారీ ఉత్పత్తి స్ఫూర్తిని 1861–65 నాటి పత్తి కొరత దశలో అధ్యయనం చేయవచ్చు. పునరుత్పత్తులలో ఒకానొక ప్రధాన భాగమైన ఒక ముడిపదార్థం కొంతకాలం బొత్తిగా లభ్యంకాని దశ అది. వస్తు సమృద్ధి వున్న పరిస్థితులు ఇబ్బందులతో కూడుకున్నవైతే, సరఫరా సమృద్ధిగా ఉన్నప్పుడు కూడా ధరలు పెరగవచ్చు. లేదా ముడిపదార్థాలకు నిజమైన కొరత ఉండవచ్చు. పత్తి సంక్షోభ సమయంలో ఆదిలో తలెత్తింది ఈ ఆఖరు పరిస్థితే.

ఉత్పత్తి చరిత్రలోని మన కాలాన్ని ఎంత సన్నిహితంగా పరిశీలిస్తే మనకు అంత క్రమబద్ధంగా ఒక విషయం స్పష్టంగా కనిపిస్తుంది; ముఖ్యంగా అత్యవసర పరిశ్రమ శాఖల్లో సజీవ ప్రకృతి నుంచి లభించే ముడిపదార్థాలు సాపేక్షంగా పెరగడం, తత్ఫలితంగా తరువాత సాపేక్షంగా తరగడం, నిరంతరం

---

1. పై విషయం రాసిన (1865) అనంతరం అన్ని నాగరిక దేశాల్లో ముఖ్యంగా అమెరికా, జర్మనీలలో పరిశ్రమలు త్వరితంగా అభివృద్ధి చెందిన ఫలితంగా ప్రపంచ మార్కెట్ స్థాయిలో పోటీ గణనీయంగా తీవ్రరూపం దాల్చింది. శీఘ్రంగానూ, బ్రహ్మాండంగానూ ఈనాడు విస్తరిస్తున్న ఉత్పాదక శక్తులు, సరుకుల మార్పిడికి చెందిన పెట్టుబడిదారీ పద్ధతి నియమాలు నియంత్రణను అధిగమిస్తున్నాయన్న వాస్తవం అధికాధికంగా పెట్టుబడిదారుల చైతన్యాన్ని ప్రభావితం చేస్తున్నది. ముఖ్యంగా దీన్ని రెండు లక్షణాలు వెల్లడిస్తున్నాయి. (ఆ పద్ధతి పరిధిలో ఆ నియమాలు పనిచేస్తాయని వారి ఊహ) మొదటిది, రక్షణ సుంకాల విషయంలో సర్వత్రా వ్యాపించిన ఒక కొత్త వ్యామోహం. దీనికీ, పాతరక్షణ సుంకం విధానానికీ తేడా వుంది. ఇప్పుడు ఎగుమతికి అర్హత గల సరుకులకే అత్యుత్తమ రక్షణ లభిస్తుంది. రెండవది - పరిశ్రమదారులు, మొత్తం ఉత్పత్తి రంగాలకై ఏర్పాటు చేసుకున్న ట్రస్టులు, ఇవి ఉత్పత్తినీ తద్వారా ధరలనూ, లాభాలనూ క్రమబద్ధం చేస్తున్నాయి. ఆర్థిక వాతావరణం తరతమ భేదంతో సానుకూలంగా వున్నన్నినాళ్ళు మాత్రమే ఈ ప్రయోగాలు ఆచరణయోగ్యంగా వుంటాయని చెప్పాల్సిన అవసరం లేదు. వీటిని మొట్టమొదటి తుఫానే తల్లకిందులు చేయక తప్పదు. ఉత్పత్తిని క్రమబద్ధం చేయాల్సిన అవసరం వున్న విషయం వాస్తవమే అయినప్పటికీ, ఆ కర్తవ్య నిర్వహణకు యోగ్యమైనది పెట్టుబడిదారీ వర్గం కాదన్న విషయం అది నిరూపిస్తుంది. ఈలోగా ఈ ట్రస్టులకు, మునుపటికంటే వేగంగా చిన్నచేపలను పెద్దచేప మింగేలా చూడటం తప్ప మరో కర్తవ్యం లేదు - **ఫ్రెడరిక్ ఎంగెల్స్**.

మార్చి మార్చి జరుగుతుంటుంది. మనమిప్పుడు విశ్లేషించిన విషయాన్ని ఫ్యాక్టరీ ఇన్‌స్పెక్టర్ల నివేదికల్లో నుంచి గ్రహించిన కింది ఉదాహరణలు స్పష్టంగా నిరూపిస్తాయి.

వ్యవసాయరంగ పరిశీలన నుంచి నిర్ధారించాల్సిన చరిత్ర నీతి ఏమిటంటే, పెట్టుబడిదారీ వ్యవస్థ సహేతుకమైన వ్యవసాయ రంగానికి వ్యతిరేకంగా పనిచేస్తుంది. (పెట్టుబడిదారీ వ్యవస్థ, వ్యవసాయరంగంలో సాంకేతిక అభివృద్ధులను పెంపొందించే విషయం వాస్తవమే అయినప్పటికీ.) పెట్టుబడిదారీ వ్యవస్థతో సహేతుకమైన వ్యవసాయానికి పొత్తు పొసగదు. వ్యవసాయానికి సొంత శ్రమతో జీవించే సన్నకారు రైతు లేదా సంఘాల్లో సంఘటితులైన ఉత్పాదకుల నియంత్రణ అవసరం.

ఇంగ్లీషు ఫ్యాక్టరీ నివేదికల నుంచి తీసుకున్నవని పైన పేర్కొన్న ఉదాహరణలు కింద యిస్తున్నాం.

"వాణిజ్య పరిస్థితి చక్కగా ఉంది; అయితే యంత్రాలు పెరిగేకొద్దీ సమృద్ధి, అధ్వాన్నపు కాలాల చక్రం కుచించుకుపోతుంది; ముడి పదార్థాల కోసం గిరాకీ పెరిగేకొద్దీ ఒక స్థితి నుంచి మరొక స్థితికి మార్పులు మరింత తరుచుగా జరుగుతాయి... ప్రస్తుతం 1857 భయానక పరిస్థితి తర్వాత గుండె ధైర్యం తిరిగి పాదుకొనడమే కాక ఆ భయానక పరిస్థితే దాదాపు విస్మృతమైనట్లు కనిపిస్తోంది. ఈ మెరుగుదల కొనసాగుతుందా లేదా అన్నది ప్రధానంగా ముడిపదార్థాల ధరపై ఆధారపడి ఉంటుంది. కొన్ని సందర్భాల్లో ఇది గరిష్ట స్థాయి అందుకొన్నట్లు నాకు దాఖలాలు కనిపిస్తున్నాయి; ఆ గరిష్ట స్థాయిని దాటితే వాటి ఉత్పత్తి క్రమేణా అంతకంతకు తక్కువ లాభసాటిగా తయారై చివరకు లాభమే లేకుండాపోతుంది. ఉదాహరణకు ఉన్ని నూలు వ్యాపారం సమృద్ధిగా సాగిన 1849, 1850 సంవత్సరాలను తీసుకుంటే, ఇంగ్లీషు ఉన్ని దారం ధర ఒక పౌనుకు 1 షిల్లింగు 1 పెన్నీ, ఆస్ట్రేలియా ఉన్ని దారం 1 షిల్లింగు 2 పెన్నీలు – 1 షిల్లింగు 5 పెన్నీల మధ్య ఉండింది. కాగా 1841 నుంచి 1850 దాకా సగటున పదేళ్ళలో (ఆ రెండు సంవత్సరాలను కూడా కలుపుకొంటే) ఇంగ్లీషు ఉన్ని దారం సగటున ఎప్పుడూ పౌనుకు ఒక షిల్లింగు 2 పెన్నీలకు, ఆస్ట్రేలియా ఉన్ని దారం ఒక షిల్లింగు 5 పెన్నీలకు మించలేదు. అయితే 1857 వినాశకర సంవత్సరం ప్రారంభంలో ఆస్ట్రేలియా ఉన్ని దారం పౌను ధర ఒక షిల్లింగు 11 పెన్నీలతో ప్రారంభమై భయోత్పాతం పతాక స్థాయి చేరుకున్న డిసెంబర్ మాసానికి 1 షిల్లింగు 6 పెన్నీలకు పడిపోయింది; అయితే 1858 నాటికి మళ్ళీ క్రమేణా అది 1 షిల్లింగు 9 పెన్నీలకు పెరిగింది; ఇప్పుడు కూడా అదే ధర కొనసాగుతోంది. కాగా ఇంగ్లీషు ఉన్ని దారం 1 షిల్లింగు 8 పెన్నీలతో ప్రారంభమై 1857 ఏప్రిల్, సెప్టెంబర్ నాటికి ఒక షిల్లింగు 9 పెన్నీలకు పెరిగి, మళ్ళీ 1858 జనవరికల్లా ఒక షిల్లింగు 2 పెన్నీలకు పడిపోయింది. దరిమిలా ఒక షిల్లింగు 5 పెన్నీలకు పెరిగింది. ఇది నేను ప్రస్తావించిన పదేళ్ళ సగటు కంటే 3 పెన్నీలు ఎక్కువ..... ఇది ఈ మూడింటిలో ఏదో ఒక విషయాన్ని నిరూపిస్తున్నదనుకుంటున్నా. 1857లో ఇలాంటి ధరల మూలంగా జరిగిన దివాళాలను మరచిపోయారు. లేదా ప్రస్తుతం ఉన్న కదుళ్ళు వినియోగించుకోగలిగినంత ఉన్ని సిద్ధంగా లేదు. లేదా తయారైన సరుకుల ధరలు శాశ్వతంగా ఎక్కువ స్థాయి నందుకోనున్నాయి. గత అనుభవం నేను గమనించినట్లు కదుళ్ళు, మగ్గాలు రెండూ కూడా నమ్మశక్యం కానంత స్వల్ప వ్యవధిలో ఇబ్బడిముబ్బడిగా పెరుగుతున్నాయి. వాటి వేగమూ పెరుగుతుంది. ఫ్రాన్స్‌కు మన ఉన్ని ఎగుమతులు దాదాపు సమాన నిష్పత్తిలో పెరుగుతాయి. మన దేశంలోనూ, విదేశాల్లోనూ

గొర్రెల ఆయుః ప్రమాణం తగ్గిపోతున్నట్లు కనిపిస్తున్నది; ఇందుకు కారణం పెరుగుతున్న జనాభా, వ్యవసాయదారులు "పశువుల నుంచి త్వరితంగా లాభాలు" కోరుకోవడమూను. ఈ విషయం తెలియకుండా ప్రకృతి నియమాల ఆధారంగా మాత్రమే అభివృద్ధి చెందే ఉత్పాదితంపై తమ విజయం కోసం ఆధారపడుతూ దానిపై నైపుణ్యాన్ని, పెట్టుబడిని వెచ్చించేవారిని తరచూ చూచి వారిని గురించి ఆందోళనపడ్డాను.... ఇంతకుముందు కాలాల్లో పత్తి వ్యాపారంలోని అనేక ఎగుడుదిగుళ్ళకు, 1857 ఆకురాలు కాలంనాటి ఇంగ్లీషు ఉన్ని మార్కెట్‌లోని పరిస్థితులకూ, దాని ఘోర దుష్ఫలితాలకు; పదార్థాలకు సంబంధించిన సరఫరా, గిరాకీ పరిస్థితి కారణంగా కనిపిస్తుంది"[1] (1858, అక్టోబర్, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ నివేదికల్లో ఆర్. బేకర్, పుటలు 56-61)

యార్క్‌షైర్‌లోని వెస్ట్ రైడింగ్ ఉన్ని పరిశ్రమకు ఉచ్ఛదశ (halcyon days) 1849-1850 సంవత్సరాలు. 1838లో ఈ పరిశ్రమలో 29,246 మంది, 1843లో 37,000 మంది, 1845లో 48,097 మంది, 1850లో 74,891 మంది పని చేశారు. ఇదే జిల్లాలో 1838లో 2,768 మరమగ్గాలున్నాయి; 1841లో 11,458, 1843లో 16,870, 1845లో 19,121, 1850లో 29,539 మరమగ్గాలున్నాయి. (ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ రిపోర్ట్స్, 1850, పుట 60) ఈ ఉన్ని పరిశ్రమ అభివృద్ధి దశ 1850 అక్టోబర్ నాటికే విపత్ సూచనలను ఉత్పన్నం చేసింది. సబ్ ఇన్‌స్పెక్టర్ బేకర్ లీడ్స్‌కు, బ్రెడ్‌ఫోర్డ్‌కు సంబంధించి తన 1851 ఏప్రిల్ నివేదికలో ఇలా అన్నారు : "వ్యాపార పరిస్థితి ఇప్పుడూ, గత కొద్దికాలంగానూ, చాలా అసంతృప్తికరంగా ఉంటున్నది. ఉన్ని వాడకందార్లు 1850 నాటి లాభాలను వేగంగా కోల్పోతున్నారు; కాగా ఎక్కువ సందర్భాల్లో ఫ్యాక్టరీ యజమానుల పరిస్థితి ఏమంత బాగాలేదు. నాకు తెలిసినంత వరకు గతంలో ఎన్నడూ లేనంతగా ఈనాడు ఉన్ని యంత్రాలు ఖాళీగా ఉంటున్నాయనీ, ఎల్లిగిసెనార వడికేవాళ్ళు కూడా కార్మికులను తొలగిస్తూ నార చట్రాలను ఆపివేస్తున్నారనీ నేను విశ్వసిస్తున్నాను. ఈనాడు జౌళి పరిశ్రమలో వ్యాపార చక్రాలు చాలా అనిశ్చిత స్థితిలో ఉన్నాయి. కదుర్ల ఉత్పాదక శక్తికీ, ముడి పదార్థాల పరిమాణానికీ, జనాభా పెరుగుదలకూ  మధ్య పోలికే లేదన్న వాస్తవాన్ని మనం త్వరలోనే గుర్తించబోతున్నామని నా అభిప్రాయం." (పుట 52)

నూలు బట్టల పరిశ్రమకు కూడా ఇదే వర్తిస్తుంది. పైన ఉదహరించిన 1858 అక్టోబర్ నివేదికలో ఇలా ఉంది :  ఫ్యాక్టరీల్లో పనిగంటలను నిర్ణయిస్తున్నారు కాబట్టి అన్ని జౌళి మిల్లుల్లోనూ వినియోగం, ఉత్పాదన, వేతనాల మొత్తాలు త్రిక నియమానికి (rule of three) కుదించబడుతున్నాయి.... నేను ప్రస్తుత బ్లాక్‌బర్న్ మేయర్ శ్రీ బేన్స్..... పత్తి వాణిజ్యంపై చేసిన ఉపన్యాసాన్ని ఉటంకిస్తాను. ఆయన తన ప్రాంత పత్తి గణాంకాలను అటువంటి సాధనాల ద్వారా ఉజ్జాయింపుగా కుదించగలిగాడు.

"వాస్తవమైన, యాంత్రికమైన ప్రతి అశ్వశక్తి 450 స్వయంచాలక యంత్ర కదుళ్ళను, లేదా దారం వడికి, పురిపెట్టే 200 కదుళ్ళను లేక 40 అంగుళాల వస్త్రం నేసే 15 మగ్గాలను ఆడిస్తుంది;

1. 1867 ఉన్ని సంక్షోభానికి కారణం ముడిపదార్థాల ధరలకూ, ఉత్పాదిత ధరలకూ మధ్య గల వ్యత్యాసమే అని బేకర్‌లాగా మేము పేర్కొనమని వేరే చెప్పాల్సిన పనిలేదు. ఈ వ్యత్యాసం కేవలం ఒక లక్షణమే; నాటి సంక్షోభమేమో సార్వత్రికమైనది - **ఫ్రెడరిక్ ఎంగెల్స్.**

పడుగును చక్కబరచడం, బట్టను చుట్టడం, పిండి రాయడం వంటి పనులు కూడా చేసే మగ్గాలివి. ప్రతి అశ్వశక్తి వడకడంలో $2\frac{1}{2}$ పనివారికి, కానీ, నేతలో 10 మందికి ఉపాధి కల్పిస్తుంది; వీరి వారంవారీ సగటు వేతనం 10 షిల్లింగుల 6 పెన్నీలు. ఇలా వడికిన, నేసిన నూలు సగటు కౌంట్లు 30 నుంచి 32 జంటపోగు నేత, 34 నుంచి 36 కౌంట్ల ఒంటిపోగు నేత. వారానికి ఒక్కో కదురు 13 ఔన్సుల పత్తి వడుకుతుందనుకొంటే, వారానికి 824,700 పౌండ్ల నూలు ఉత్పత్తి అవుతుంది. ఇందుకు 970,000 పౌండ్ల పత్తి లేదా 2,300 బేళ్ళ పత్తి అవసరం. దీని ఖరీదు 28,300 పౌండ్లు, ఈ జిల్లాలో (బ్లాక్‌బర్న్ చుట్టూ 5 మైళ్ళలోపు) ప్రాంతంలో ఒక వారంలో వినియోగింపబడే మొత్తం పత్తి 1,530,000 పౌండ్లు లేక 3,650 బేళ్ళు. దీని ఖరీదు 44,625 పౌండ్లు.... ఇది యునైటెడ్ కింగ్‌డమ్‌లోని మొత్తం నూలు ఉత్పత్తిలో ఎనిమిదో వంతు లేదా మొత్తం మరమగ్గాల నేతలో ఆరో వంతు.”

“కాబట్టి, బేన్స్ అభిప్రాయం ప్రకారం యునైటెడ్ కింగ్‌డమ్‌లోని మొత్తం పత్తి కదుళ్ళ సంఖ్య 28,800,000. ఇవి కనుక పూర్తికాలం పనిచేస్తాయనుకుంటే, పత్తి వార్షిక వినియోగం 1,432,080,000 పౌన్ల మేరకు ఉండాలి. అయితే పత్తి దిగుమతి (1850, 1857లోని ఎగుమతిని తీసివేస్తే) కేవలం 1,022,576,832 పౌన్లే కాబట్టి సరఫరాలో కొరత తప్పనిసరిగా 409,503,168 పౌన్ల మేరకు ఉండివుంటుంది. ఈ సమస్యపై నాకు, ఆయనకూ ఉత్తర ప్రత్యుత్తరాలు జరిగాయి; నేత కౌంట్లలోని తేడా మూలంగానే కాక యంత్రాల నాణ్యత కారణంగా కూడా బ్లాక్‌బర్న్ జిల్లాలో ఉపయోగించుకున్న పత్తి వార్షిక వినియోగం ఎక్కువే ఉంటుందని ఆయన భావిస్తున్నారు. యునైటెడ్ కింగ్‌డమ్‌లో పత్తి మొత్తం వార్షిక వినియోగం 1,000,000,000 పౌన్లని ఆయన అంచనా. ఆయన అంచనా సక్రమమైందే అయితే నిజంగా 22,576,832 పౌన్ల మేరకు సరఫరా ఎక్కువగా ఉన్నట్లు తోస్తుంది. తన జిల్లాలో పనికి సంసిద్ధమవుతున్నట్లు బేన్స్ చెప్పిన అదనపు కదుళ్ళను, మగ్గాలను, అదే హేతుసామ్యం ప్రకారం బహుశా ఇతర జిల్లాల్లోని అలాంటి కదుళ్ళను, మగ్గాలను పరిగణనలోకి తీసుకోకుండానే ఈ సరఫరా గిరాకీ దాదాపు సమతుల్యంగా ఉన్నట్లు కనిపిస్తుంది.” (పుటలు 59, 60)

## III. సాధారణ ఉదాహరణ 1861-65 నాటి పత్తి సంక్షోభం ప్రారంభ చరిత్ర

1845 జౌళి పరిశ్రమకు స్వర్ణయుగం. పత్తి ధర చాలా తక్కువ. ఈ విషయమై ఎల్.హార్నర్ ఇలా అంటారు : “ముఖ్యంగా పత్తి వడికే పరిశ్రమల్లో వ్యాపారం గత వేసవిలోనూ, ఆకురాలు కాలంలోనూ ఉన్నంత చురుగ్గా గత ఎనిమిది సంవత్సరాల్లో ఎన్నడూ ఉన్నట్లు నేను చూడలేదు. ఆ అర్ధ సంవత్సరం అంతటా ఫ్యాక్టరీలలో కొత్తగా పెట్టుబడులు మదుపు పెడుతున్నట్లు ప్రతి వారం నోటీసులు నాకు వస్తూనే ఉన్నాయి; కొత్త మిల్లులు నిర్మించే రూపంలో కానీ, ఖాళీగా ఉన్న కొన్ని మిల్లులను తిరిగి నడిపేందుకు కొత్తవారు పూనుకొన్న రూపంలో కానీ, ప్రస్తుతం ఉన్న మిల్లులను విస్తరించే రూపంలో కానీ, ఎక్కువ శక్తి గల కొత్త ఇంజన్లను ప్రవేశపెట్టే రూపంలో కానీ, కొత్త ఉత్పాదక యంత్రాల స్థాపన రూపంలో కానీ కొత్త పెట్టుబడులు మదుపు పెట్టారు.” (రిపోర్ట్స్ ఆఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్, అక్టోబర్ 1845, పుట 13)

1846 ఫిర్యాదులు ప్రారంభం; "తమ వ్యాపారం మందగించినట్లు పత్తి మిల్లుల నిర్వాహకుల నుంచి సాధారణ ఫిర్యాదులు చాలా కాలంగా వింటున్నాను.... గత ఆరు వారాలుగా అనేక మిల్లులు తక్కువ కాలం పనిచేయసాగాయి; రోజుకు పన్నెండు గంటలు బదులు మామూలుగా ఎనిమిది గంటలే అవి పని చేస్తున్నాయి; ఈ ధోరణి అధికమవుతున్నట్లు కనిపిస్తున్నది.... ముడి పదార్థం ధర చాలా పెరిగింది..... తయారైన సరుకుల ధర పెరక్కపోవడం అటుంచి..... పత్తి ధర పెరగడానికి ముందున్న ధరల కంటే తగ్గిపోయాయి. గత నాలుగేళ్ళలో పత్తి మిల్లుల సంఖ్య బాగా పెరిగిన కారణంగా ఒకవైపు ముడి పదార్థాలకు గిరాకీ పెద్దగా పెరిగి ఉండాలి. మరోవైపేమో తయారైన సరుకుల మార్కెట్‌లో, సరఫరా బాగా పెరిగి ఉండాలి; ముడిపదార్థాల సరఫరా, తయారైన సరుకుల వినిమయం ఈ రెండూ మార్పు లేకుండా ఉన్నాయనుకొంటే ఇవి లాభాలకు వ్యతిరేకంగా ఏక కాలంలో పనిచేసి ఉంటాయి. అయితే, ఇటీవలి కాలంలో పత్తి సరఫరా తగ్గినందువల్లనూ, తయారైన సరుకులకు అనేక దేశీయ, విదేశీ మార్కెట్లలో గిరాకీ తగ్గుతున్నందువల్లనూ అవి మరింత ఎక్కువ నిష్పత్తిలో పనిచేసి ఉంటాయి." (రిపోర్ట్స్ ఆఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్, అక్టోబరు 1846, పుట 10)

ముడిపదార్థాలకు గిరాకీ పెరగడంతో పాటు సహజంగానే మార్కెట్‌లో సరుకులు కూడా కుప్పతెప్పలుగా వచ్చిపడ్డాయి. సందర్భవశాత్తూ ఒక మాట. ఆ సమయంలో పరిశ్రమ విస్తరణను, ఆ తర్వాత తలెత్తిన స్తబ్ధత జౌళి పరిశ్రమ జిల్లాలకే పరిమితం కాలేదు. ఏకిన ఉన్ని పరిశ్రమ జిల్లా అయిన బ్రెడ్‌ఫోర్డ్‌లో 1836లో 318 ఫ్యాక్టరీలు ఉండగా, 1846లో అవి 490కి పెరిగాయి. పనిచేస్తున్న ఫ్యాక్టరీలు కూడా గణనీయంగా విస్తరించాయి. కాబట్టి ఉత్పత్తి వాస్తవ పెరుగుదలను పై సంఖ్యలు వ్యక్తీకరించవు. ముఖ్యంగా ఎల్లిగిసెనార మిల్లులకు ఇది ప్రత్యేకించి వర్తిస్తుంది. "గత పదేళ్ళలో దాదాపు అన్నీ మార్కెట్‌లో మితిమీరిన నిల్వలకు దోహదపడ్డాయి. వ్యాపారంలో ప్రస్తుత స్తబ్ధతకు చాలా వరకు ఈ నిల్వలే కారణం.... మిల్లులు, యంత్రాలు ఇంత త్వరత్వరగా పెరిగిన సహజ ఫలితమే.... ఈ మాంద్యం." (రిపోర్ట్స్ ఆఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్, అక్టోబర్ 1846, పుట 30)

1847 అక్టోబర్ విత్త భయాందోళన. ముదరా 8 శాతం. దానికి మునుపే రైల్వేలో జరిగిన మోసం అకామొడేషన్ బిల్లుల్లో ఈస్టిండియా సట్టా వ్యాపారం, అయినప్పటికీ :

"ఆ వ్యాపారాలు బాగా విస్తరించిన కారణంగా పత్తి, ఉన్ని, ఎల్లిగిసెనారలకు గత కొద్ది సంవత్సరాలుగా పెరిగిన గిరాకీకి సంబంధించిన చాలా ఆసక్తికరమైన వివరాల్లోకి బేకర్ వెడుతున్నారు. సగటు సరఫరా కంటే తక్కువ స్థాయికి ఉత్పత్తి పడిపోయిన స్థితిలో ఈ ముడి పదార్థాలకు గిరాకీ పెరగడం ఆ పరిశ్రమ శాఖల వర్తమాన పరిస్థితికి తగినంత కారణంగా ఆయన భావిస్తున్నారు. తారుమారైన డబ్బు పరిస్థితిని సైతం ఆయన ఈ సందర్భంలో ప్రస్తావించడం లేదు. నా సొంత పరిశీలనలు, వ్యాపారంతో బాగా పరిచయమున్న వారితో నేను జరిపిన సంభాషణలు ఆ అభిప్రాయాన్ని పూర్తిగా ధ్రువపరిచాయి. అనేక శాఖలు చాలా మాంద్య పరిస్థితిలో ఉండేవి; కాగా డిస్కౌంట్లు 5 శాతం చొప్పున, అంతకంటే తక్కువ రేటుకు సులభంగా లభించేవి. ఇందుకు భిన్నంగా ముడి పట్టు సరఫరా సమృద్ధిగా ఉండేది; ధరలు మధ్యరకంగా ఉండేవి. ఫలితంగా వ్యాపారం గత రెండు మూడు వారాల క్రితం వరకు కూడా చాలా చురుగ్గా సాగుతూ వచ్చింది. ఆ దశలో ఉత్పత్తి రంగంలో

వాస్తవంగా పాల్గొన్న వ్యక్తులనే కాక, అంతకన్నా కూడా పట్టుదారం నేసే వారికి పెద్ద ఖాతాదార్లుగా ఉన్న ఫ్యాన్సీ, సరుకుల ఉత్పత్తిదార్లను డబ్బు సంక్షోభం దెబ్బతీసింది. గత మూడేళ్ళలో పత్తి వ్యాపారం దాదాపు 27 శాతం పెరిగినట్లు, ప్రచురించిన సమాచార పత్రాలను బట్టి తెలుస్తున్నది. ఫలితంగా పత్తి ధర పౌనుకు పూర్ణసంఖ్యలో 4 షిల్లింగుల నుంచి 6 షిల్లింగులకు పెరిగింది. కాగా, సరఫరా పెరిగిన ఫలితంగా నూలు ధర పెరిగినా అది మునుపటి ధరకంటే బహుకొద్దిగా మాత్రమే ఎక్కువగా ఉంది. ఉన్ని పరిశ్రమ 1836లో పెరగనారంభించింది. దరిమిలా యార్క్‌షైర్ జిల్లా ఉన్ని ఉత్పత్తిని 40 శాతం పెంచింది. కాగా స్కాట్లండ్‌లో ఇది ఇంతకంటే ఎక్కువ పెరిగింది. నయం (Worsted) ఉన్ని బట్టల పరిశ్రమ[1] ఇంకా ఎక్కువ పెరిగింది. అదే కాలంలో ఈ పరిశ్రమ 74 శాతం పెరిగినట్లు గణాంక వివరాలు తెలుపుతున్నాయి. కాబట్టి ముడి ఉన్ని వినియోగం బ్రహ్మాండంగా పెరిగింది. ఎల్లిగిసెనార పరిశ్రమ 1839 దరిమిలా ఇంగ్లాండులో 25 శాతం పెరగ్గా స్కాట్లండ్‌లో 22 శాతం పెరిగింది; ఐర్లాండ్‌లో దాదాపు 90 శాతం పెరిగింది.[2] దీని పర్యవసానంగా, ముడిపదార్థం ధర, పంటలు దెబ్బతిన్నప్పుడు టన్నుకు 10 పౌండ్లు పెరగ్గా, నూలు ధర మాత్రం కండెకు 6 షిల్లింగుల మేరకు తగ్గింది. (రిపోర్ట్స్ ఆఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్, అక్టోబర్ 1847, పుటలు 30–31)

1849 వ్యాపారం 1848 ఉత్తరార్థం నుంచి మళ్ళీ పుంజుకొంది. "ఏ పరిస్థితుల్లో అయినా సరే దాదాపు సహేతుకమైన లాభం వస్తుందని హామీ కల్పించేటంత తక్కువగా ఉన్న ఎల్లిగిసెనార ధర, తమ కార్యకలాపాలను స్థిరంగా కొనసాగించేలా ఫ్యాక్టరీ యజమానులను ప్రోత్సహించింది... సంవత్సరం ప్రథమ భాగంలో కొంతకాలంపాటు ఉన్ని పరిశ్రమదారులు తమ పనిలో తలమునకలై ఉన్నారు. ఉన్ని వస్తువుల ఎగుమతులు తరచుగా వాస్తవ గిరాకీ స్థానాన్నాక్రమిస్తున్నాయని, అలాగే పైకి సౌభాగ్య దశలుగా అంటే పూర్తి పని ఉండే దశలుగా కనిపించేవి సక్రమ గిరాకీ దశలు కావని నా భయం! కొన్ని మాసాల్లో నయం ఉన్ని వ్యాపారం చాలా బాగుండింది; నిజానికి అది మూడు పూలు ఆరు కాయలుగా అభివృద్ధిచెందుతూ ఉండింది....పైన ప్రస్తావించిన దశ ప్రారంభంలో ఉన్ని ధర బాగా తక్కువగా ఉండింది; ఉన్ని దారం మిల్లులు కొన్నదేదో చౌకగానే కొన్నారు; నిస్సందేహంగా దండిగానే కొన్నారు. వసంత రుతువు అమ్మకాలలో ఉన్ని ధర పెరగడంతో ఉన్ని దారం మిల్లు యజమానికి పరిస్థితి అనుకూలంగా తయారైంది. తయారైన సరుకుల కోసం గిరాకీ గణనీయమూ, అనివార్యమూ కావడంతో వారు తమ ఆ అనుకూల పరిస్థితిని ఉపయోగించుకున్నారు." (రిపోర్ట్స్ ఆఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్, ఏప్రిల్ 1849, పుట 42)

"ఇంగ్లాండ్‌లో గత మూడు నాలుగేళ్ళ మధ్య దేశంలోని ఉన్ని పరిశ్రమ జిల్లాల్లో ఆ వ్యాపార పరిస్థితిలో వచ్చిన మార్పులను గనుక పరిశీలిస్తే ఎక్కడో సంక్షోభ కారణం ఉన్నట్లు మనం అంగీకరించక

---

1. పొట్టి ఉన్ని నుంచి నేసిన ఉన్ని వస్త్రాల పరిశ్రమకూ (ప్రధాన కేంద్రం లీడ్స్) చిక్కు తీసిన ఉన్ని నుంచి నేసిన ఉన్ని వస్త్రాల పరిశ్రమకూ (ప్రధాన కేంద్రం బ్రెడ్‌ఫోర్డ్) మధ్య ఇంగ్లాండ్‌లో స్పష్టమైన తేడా చూపుతున్నారు - ఫ్రెడరిక్ ఎంగెల్స్.
2. ఐర్లాండ్‌లో యంత్రాలతో నేసే లినన్ ఉత్పత్తి యొక్క ఈ సత్వర విస్తరణ జర్మనీలో (సైలేసియా, లుసాటియా, వెస్ట్ ఫేలియాలలో) చేనేత లినన్ వస్త్రాల ఎగుమతిని చావుదెబ్బ కొట్టింది - ఫ్రెడరిక్ ఎంగెల్స్.

తప్పదు... అయితే పెరిగిన యంత్రాల తాలూకు బ్రహ్మాండమైన ఉత్పాదక శక్తి ఈ కారణానికి మరో అంశాన్ని చేర్చి ఉండదా?" (రిపోర్ట్స్ ఆఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్, ఏప్రిల్ 1849, పుటలు 42, 43)

1848 నవంబర్‌లోనూ, 1849 మే మాసంలోనూ, అక్టోబర్ మాసం దాకా వేసవిలోనూ వ్యాపారం బాగా వృద్ధి చెందింది. "మేలైన రకం ఉన్ని పరిశ్రమకు పెద్ద కేంద్రాలయిన బ్రెడ్‌ఫోర్డ్, హాలిఫాక్స్ జిల్లాల్లో ఆ పరిశ్రమ అతి చురుగ్గా పెంపొందింది; ఈ వ్యాపారం లోగడ ఎన్నడూ, ఇప్పుడున్న స్థితికి చేరుకుని ఎరుగదు.... ముడి ఉన్ని సరఫరాల విషయంలో సట్టా వ్యాపారమూ, అనిశ్చిత స్థితీ మరే పారిశ్రామిక శాఖలో కన్నా ఈ శాఖలో ఎల్లప్పుడూ ఎక్కువ ఉద్వేగానికి, తరచుగా ఎక్కువ మార్పులకు కారణభూతమవుతున్నాయి. ప్రస్తుతం.... ముతక రకాల నూలు వస్త్రాల నిల్వలు పేరుకొనిపోవడం చిన్నతరహా నూలు మిల్లు యజమానులకు ఆందోళనకరంగా ఉంది. ఆ నిల్వలు వారికి హాని కలిగిస్తున్నాయి. వారిలో చాలామంది తమ మిల్లులను తక్కువ కాలంపాటు ఆడించ వలసివస్తోంది" (రిపోర్ట్స్ ఆఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్, అక్టోబర్ 1849, పుటలు 64-65).

1850 ఏప్రిల్‌లో వ్యాపారం ముమ్మరంగా కొనసాగింది. ఇందుకు మినహాయింపు : "పత్తి వ్యాపారంలోని ఒక భాగంలో మహా మాంద్యం.... ముఖ్యంగా తక్కువ నంబర్ల నూలును వాడే శాఖల్లోనూ లేక ఎక్కువ మందంగా ఉండే వస్త్రాలను ఉత్పత్తి చేసే శాఖల్లోనూ వాడకానికి అనుగుణమైన ముడిసరుకు కొరత ఇందుకు కారణం. ఉన్ని వ్యాపారం కోసం ఇటీవల మరింత ఎక్కువ సంఖ్యలో నిర్మించిన యంత్రాల విషయంలో కూడా ఇదే విధమైన ప్రతిస్పందన రేకెత్తవచ్చునన్న భయాందోళనలు ఉన్నాయి. ఒక్క 1849లోనే ఉన్ని మగ్గాలు తమ ఉత్పత్తిని 40 శాతం పెంచినట్లు, కదుళ్ళు 25 నుంచి 30 శాతం తమ ఉత్పత్తిని పెంచినట్లు అవి ఇప్పటికీ అదే రేటున ఉత్పత్తిని పెంచుతున్నట్లు బేకర్ అంచనా వేస్తున్నారు." (రిపోర్ట్స్ ఆఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్, ఏప్రిల్ 1850, పుట 54)

1850 అక్టోబర్. "ముడిపత్తి అధిక ధర వల్ల ఈ పారిశ్రామిక శాఖలో, ముఖ్యంగా ఉత్పత్తి వ్యయంలో ముడిపదార్థం గణనీయమైన భాగంగా ఉన్న సరుకుల శాఖల్లో గణనీయమైన మాంద్యం కొనసాగుతూనే ఉంది.... ముడిపట్టు ధర బాగా పెరిగినందువల్ల కూడా పలు పట్టు వస్త్రాల్లోనూ మాంద్యం తలెత్తింది." (రిపోర్ట్స్ ఆఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్, అక్టోబర్ 1850, పుట 14)

ఎల్లిగిసెనార ధర బాగా ఎక్కువగా, ఇతర వ్యవసాయ ఉత్పాదితాల ధరలు బాగా తక్కువగా ఉండడం మరుసటి సంవత్సరం ఎల్లిగిసెనార ఉత్పత్తి పెరుగుదలకు హామీ అయినట్లు ఐర్లాండ్‌లో ఎల్లిగిసెనార అభివృద్ధికి ఉద్దేశించిన రాయల్ సొసైటీ కమిటీ జోస్యం చెప్పిందని అదే నివేదికలోని 31, 33 పేజీల్లో మనకు తెలుస్తుంది.

1853 ఏప్రిల్ మహత్తర వృద్ధి. ఎల్. హార్నర్ తన నివేదికలో ఇలా అంటారు. "లాంక్‌షైర్‌లోని పారిశ్రామిక జిల్లాలతో నాకున్న పదిహేడేళ్ళ పరిచయ కాలంలో ఏ దశలోనూ సర్వత్రా ఇంత సౌభాగ్య వంతంగా ఉన్నట్లు నేనెరుగను; ప్రతి శాఖలోనూ కార్యకలాపాలు అసాధారణంగా కొనసాగుతున్నాయి." (రిపోర్ట్స్ ఆఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్, ఏప్రిల్ 1853, పుట 19)

1853 అక్టోబర్ పత్తి పరిశ్రమలో మాంద్యం. 'అమితోత్పత్తి' (రిపోర్ట్స్ ఆఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్, అక్టోబర్ 1853, పుట 15)

1854 ఏప్రిల్ "ఉన్ని పరిశ్రమతో పనులు ఆట్టే ముమ్మరంగా జరక్కపోయినప్పటికీ ఉన్ని

వస్త్రాలను తయారు చేస్తున్న అన్ని ఫ్యాక్టరీలకు అది సంపూర్ణమైన ఉపాధి కల్పించింది; పత్తి ఫ్యాక్టరీలకు కూడా ఇదే వర్తిస్తుంది. గత సంవత్సరం తుది ఆరు నెలల కాలమంతటా మేలైన రకపు ఉన్ని పరిశ్రమ అనిశ్చిత, అసంతృప్తికర పరిస్థితిలో ఉండింది. ఎల్లిగిసెనార, జనపనార పరిశ్రమలు కూడా తీవ్రంగా దెబ్బతినే అవకాశం ఉంది; ఇందుకు కారణం, క్రిమియా యుద్ధం మూలంగా రష్యా నుంచి ముడిపదార్థాల సరఫరాలు తగ్గిపోవడమే." (రిపోర్ట్స్ ఆఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్, ఏప్రిల్ 1854, పుట 37)

1859 "స్కాట్లండ్‌లోని ఎల్లిగిసెనార జిల్లాల్లోని పరిశ్రమలో ఇప్పటికీ మాంద్యం కొనసాగు తున్నది; ఇందుకు కారణం ముడిపదార్థం కొరత, దాని అధిక ధర కూడా. గత సంవత్సరం బాల్టిక్ ప్రాంతంలోని తక్కువ నాణ్యత గల పంట (ఇక్కడనుంచే మనకు ప్రధానంగా సరఫరాలు వచ్చేది.) ఈ జిల్లాలోని వ్యాపారంపై హానికరమైన ప్రభావాన్ని కలిగిస్తుంది. అయితే ముతక వస్త్రాలకు సంబంధించి ఎల్లిగిసెనార స్థానాన్ని క్రమేణా ఆక్రమిస్తున్న జనుము ధర మాత్రం అంత ఎక్కువగానూ లేదు, పరిమాణంలో కొరతా లేదు.... డుండీలోని యంత్రాల్లో సగభాగం ఇప్పుడు జనుము నేతలో నిమగ్నమై ఉన్నాయి." (రిపోర్ట్స్ ఆఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్, ఏప్రిల్ 1859, పుట 19)

"ముడి పదార్థం ధర ఎక్కువగా ఉన్నందున ఎల్లిగిసెనార, నూలుకు ఇంకా గిట్టుబాటు ధర లభించడం లేదు; ఇతర మిల్లులన్నీ పూర్తి కాలం పనిచేస్తోంటే ఎల్లిగిసెనార యంత్రాల్లో పని ఆపివేసిన అనేక ఉదాహరణలున్నాయి...జనుపనార దారం పరిశ్రమ.... ఒక విధంగా సంతృప్తికరమైన స్థితిలో ఉంది; ఇందుకు కారణం ఇటీవల ముడిపదార్థం ధర తగ్గడమే. అది ఇప్పుడు ఒక మోస్తరు స్థాయికి తగ్గిపోయింది." (రిపోర్ట్స్ ఆఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్, అక్టోబర్ 1859, పుట 20).

## 1861-64 అమెరికా అంతర్యుద్ధం. పత్తికి విపరీతమైన కొరత, ముడిపదార్థం కొరత వల్లనూ, దాని అధిక ధర వల్లనూ ఉత్పత్తి ప్రక్రియలో అంతరాయానికి అతి పెద్ద ఉదాహరణ

1860 ఏప్రిల్. "వ్యాపార పరిస్థితికి సంబంధించి, ముడిపదార్థాల ధర ఎక్కువగా ఉన్నప్పటికీ పట్టు ఉత్పత్తిదారులు మినహా మిగతా జౌళి మిల్లు యజమానులంతా గత అర్ధ సంవత్సరంలో వ్యాపారపనుల్లో తలమునకలై ఉన్నారని మీకు తెలుపగలుగుతున్నందుకు సంతోషిస్తున్నాను... కొన్ని పత్తి జిల్లాల్లో కార్మికుల కోసం అడ్వర్‌టైజ్‌మెంట్లు కూడా చేశారు; నార్‌ఫోక్ తదితర గ్రామీణ ప్రాంతాల నుంచి అటు వలస వెళ్ళారు కూడా... ప్రతి వ్యాపార శాఖలోనూ ముడి పదార్థాల కొరత తీవ్రంగా ఉన్నట్లు కనిపిస్తున్నది. దాని కొరతే.... మనల్ని పరిమితుల్లో ఉంచుతున్నది. జౌళి పరిశ్రమలో కొత్త మిల్లుల నిర్మాణం, విస్తరణకు సంబంధించిన నూతన వ్యవస్థల ఏర్పాటు, కార్మికుల కోసం గిరాకీ – ఇవి ఏనాడూ ఇప్పటికంటే ఎక్కువగా ఉన్నట్లు నేననుకోను. ముడిపదార్థాల అన్వేషణ కోసం ప్రతిచోటా ప్రయత్నాలు సాగుతున్నాయి." (రిపోర్ట్స్ ఆఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్, ఏప్రిల్ 1860, పుట 57)

1860 అక్టోబర్. "పత్తి, ఉన్ని, ఎల్లిగిసెనార పారిశ్రామిక జిల్లాల్లో పరిశ్రమ పరిస్థితి చక్కగా ఉంది. వాస్తవానికి సంవత్సరానికి పైగా ఐర్లాండులో పరిశ్రమ పరిస్థితి 'చాలా బాగుంది'; ముడి పదార్థాల కొరత లేనట్లయితే అది అంతకంటే ఇంకా బాగుండేది. తమ అవసరాలకు సరిపోయే ఎల్లిగిసెనార సరఫరాల కొరకై ఇండియాలో రైలు మార్గాల ప్రారంభం కోసం ఇక్కడ వ్యవసాయాభివృద్ధి

కోసం ఎల్లిగిసెనార నూలు మిల్లుల యజమానులు నేడు ఎప్పటికంటే ఆత్రంగా ఎదురుచూస్తున్నట్లు కనిపిస్తున్నది." (రిపోర్ట్స్ ఆఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్, అక్టోబర్ 1860, పుట 37).

1861 ఏప్రిల్. "ప్రస్తుతం పరిశ్రమ పరిస్థితి మాంద్యంగా ఉంది..... కొన్ని పత్తి మిల్లులు తక్కువ కాలంపాటు నడుస్తున్నాయి; అనేక పట్టు మిల్లులను పాక్షికంగా మాత్రమే వినియోగించు కుంటున్నారు. ముడి పదార్థం ధర ఎక్కువగా ఉంది. ప్రతి జౌళి పరిశ్రమ శాఖలోనూ బహుళ సంఖ్యాక వినియోగదార్లకోసం ఉత్పత్తి చేయవీలున్న దానికంటే ముడిపదార్థం ధర ఎక్కువగా ఉంది." (రిపోర్ట్స్ ఆఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్, ఏప్రిల్ 1861, పుట 33)

1860లో పత్తి పరిశ్రమలో అమితోత్పత్తి జరిగినట్లు విదితమయింది. తదుపరి కొన్ని సంవత్స రాల్లో దాని ఫలితం అనుభూతమయింది. "1860 నాటి అమితోత్పత్తి ప్రపంచ మార్కెట్లలో ఖర్చు కావడానికి రెండు మూడేళ్ళు పట్టింది." (రిపోర్ట్స్ ఆఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్, డిసెంబర్ 1863, పుట 127).

"ప్రాచ్య ఖండంలో 1860 ప్రారంభంలో పత్తి ఉత్పాదితాల విషయంలో మందగించిన మార్కెట్ల పరిస్థితి, బ్లాక్‌బర్న్ పరిశ్రమపై తదనుగుణ ప్రభావాన్ని చూపింది. కేవలం ప్రాచ్య ఖండంలో వినియోగం కోసమే వస్త్రాలను ఉత్పత్తి చేసేందుకు బ్లాక్‌బర్న్‌లో మామూలుగా 30 వేల మరమగ్గాలను నియోగిస్తున్నారు. పత్తి దిగ్బంధన ప్రభావం అనుభూతం కావడానికి ముందు, పై కారణం వల్ల అనేక మాసాలపాటు, శ్రమ కోసం పరిమితమైన గిరాకీ మాత్రమే ఉండింది.... అదృష్టవశాత్తూ ఇది పలువురు నూలు మిల్లుల, నేత మిల్లుల యజమానులను నాశనం కాకుండా కాపాడింది. నిల్వలను తమవద్ద ఉంచుకొన్నంత కాలం వాటి విలువ పెరిగింది; ఫలితంగా ఆస్తుల విలువ ఆందోళన కరంగా తరగడం వంటిది తలెత్తలేదు; అలాంటి సంక్షోభంలో ఆ విధమైన తరుగుదల ఉంటుందను కోవడం అసమంజసమేమీ కాదు." (రిపోర్ట్స్ ఆఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్, అక్టోబర్ 1862, పుటలు 29, 31)

1861 అక్టోబర్. గత కొద్దికాలంగా వ్యాపారం చాలా మందంగా ఉంది. శీతాకాలంలో అనేక సంస్థలు చాలా తక్కువ కాలంపాటు పని చేయనుండటం అసంభవమేమీ కాదు. అయితే ఈ పరిస్థితిని ముందే ఊహించి ఉండొచ్చు.... అమెరికా నుంచి పత్తి సరఫరాలకు, మన ఎగుమతులకు అంతరాయం కలిగించిన కారణాలు ఏమైనప్పటికీ, గత మూడు సంవత్సరాలుగా ఉత్పత్తి బాగా పెరిగినందువల్ల, ఇండియా మార్కెట్లు, చైనా మార్కెట్లు అనిశ్చిత పరిస్థితిలో ఉన్నందున రానున్న శీతాకాలంలో తక్కువ కాలంపాటు మిల్లులతో పనిచేయించి ఉండవలసింది." (రిపోర్ట్స్ ఆఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్, అక్టోబర్ 1861, పుట 19)

**పత్తి రద్దు పదార్థాలు. ఈస్టిండియన్ పత్తి (సూరత్) కార్మికుల వేతనాలపై ప్రభావం. యంత్రాల పెరుగుదల పత్తికి మైదాపిండి, ఖనిజ ప్రత్యామ్నాయాలు జోడించడం. కార్మికులపై మైదాపిండి ప్రభావం. నాణ్యమైన నూలు ఫ్యాక్టరీల యజమానులు. ఫ్యాక్టరీ యజమానుల మోసాలు**

"ఒక ఫ్యాక్టరీ యజమాని నాకిలా రాశాడు : "ఒక్కో కదురుకు వినియోగాన్ని అంచనా వేస్తున్నప్పుడు మరొక వాస్తవాన్ని లెక్కలోకి తీసుకోవడం లేదేమో అని నా అనుమానం. అదేమిటంటే

– పత్తి ధర ఎక్కువగా ఉన్నప్పుడు మామూలు నూలును (ఉదాహరణకు 40 కౌంట్ల వరకు ముఖ్యంగా 12 కౌంట్ల నుంచి 32 కౌంట్ల దాకా) వడికే పత్తి మిల్లు యజమాని సాధ్యమైనంత మేరకు వ్యక్తి తన కౌంట్లను పెంచుతాడు. అంటే 12 కౌంట్ల రకం వడికే వ్యక్తి 16 కౌంట్లు, 16 కౌంట్లు వడికే వ్యక్తి 20 కౌంట్లు ఇలా కౌంట్లు పెంచి వడుకుతాడు. ఈ మేలైన నూలును ఉపయోగించే జౌళిమిల్లు యజమాని ఆ మేరకు పిండిని ఎక్కువగా చేరుస్తూ తన బట్ట బరువు తగ్గకుండా చూస్తాడు. పరిశ్రమ ఈనాడు ఈ వనరును ఎంత వరకు ఉపయోగించుకొంటున్నదంటే, అది ప్రతిష్ఠాత్మకమైనదని కూడా చెప్పాలి. సాధికారికంగా చెప్పగలిగిన వారి నుంచి నేను విన్నదేమంటే ఎగుమతి చేసే 8 పౌన్ల మామూలు షర్టింగులో $5\frac{1}{4}$ పౌన్ల పత్తి, $2\frac{3}{4}$ పౌన్ల పిండి ఉంటోంది. ఇతర రకాల వస్త్రాలలో ఒక్కోసారి 50 శాతం పిండి చేర్చుతున్నారు. ఒక పౌను బట్టను, దానిలో గల నూలుకు తాను చెల్లించిన దానికంటే తక్కువ ధరకు అమ్మడం ద్వారా ధనవంతుడనవుతున్నాని వస్త్ర పరిశ్రమదారుడు నేడు గొప్పలు చెప్పుకోవచ్చు; అలా చెప్పుకొంటున్నాడు కూడా." (రిపోర్ట్స్ ఆఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్, ఏప్రిల్ 1864, పుట 27)

"సూరత్ పత్తితో వడికిన నూలు పడుగులకు పూయడానికి ఉపయోగించే పిండివల్లనే తాము అంతకంతకు ఎక్కువగా జబ్బుపడటానికి కారణమని బట్టల మిల్లులోని నేత కార్మికులు చెబుతున్నారనీ, ఈ పిండి మునుపు ఉపయోగించే పిండి కాదనీ నాకు ప్రకటనలు కూడా అందాయి. కాని ఈ ప్రత్యామ్నాయ పిండి వల్ల ఒక అతి ముఖ్యమైన అనుకూలముంది. తయారైన వస్త్రం బరువును అది బాగా పెంచుతుంది. 15 పౌన్ల ముడి పదార్థాన్ని వస్త్రంగా నేసినపుడు, ఆ వస్త్రం 20 పౌన్లు తూగుతుంది." (రిపోర్ట్స్ ఆఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్, అక్టోబర్ 1863. ఈ ప్రత్యామ్నాయం చైనా బంకమట్టి అని పిలవబడుతున్న టాల్కం పొడి, లేదా ఫ్రెంచ్ చాక్ అని పిలువబడుతున్న జిప్సం.)

"పడుగులకు పూసే పిండికి మారు ఈ ప్రత్యామ్నాయాలను ఉపయోగించడం ద్వారా నేతగాండ్ర (అంటే నేత కార్మికుల) ఆదాయాలు చాలా తగ్గిపోతాయి. దారం బరువును పెంచే ఈ పూత వల్ల పోగు గట్టిగా పెళుసుగా తయారవుతుంది. మగ్గం పడుగులోని ప్రతి పోగూ 'హీల్డ్' అనే మగ్గపు భాగంగుండా వెడుతుంది. పడుగును దాని సరియైన స్థానంలో ఉంచే బలమైన దారాలు ఈ 'హీల్డ్'లో ఉంటాయి. పడుగు బిరుసుగా ఉండటం వల్ల హీల్డ్ దారాలు తరచూ తెగిపోతుంటాయి. అలా దారం తెగినప్పుడల్లా నేత కార్మికునికి దాన్ని సరిగ్గా తిరిగి అతకడానికి అయిదు నిమిషాలు పడుతుందంటారు. నేత కార్మికుడు ఇంతకు ముందుకన్నా పదిరెట్లు ఎక్కువసార్లు ఇలా పోగుల్ని అతికించవలసి వస్తుంది. అందువల్ల పని గంటల్లో మగ్గం ఉత్పాదక శక్తి తగ్గుతుంది." (అదే నివేదిక, పుటలు 42, 43)

"అష్టాన్, స్టేలీబ్రిడ్జ్, మోస్లీ, ఓల్డామ్ వగైరాచోట్ల ఇలా తగ్గిపోయిన కాలం పూర్తిగా మూడో వంతు ఉంటున్నది; ప్రతివారం గంటలు తగ్గిపోతున్నాయి. ఈ కాలం తగ్గుదలతోపాటు, అనేక శాఖల్లో వేతనాలు కూడా తగ్గాయి." (రిపోర్ట్స్ ఆఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్, అక్టోబర్ 1861, పుటలు 12–13)

1861 ప్రారంభంలో లాంక్‌షైర్‌లోని కొన్ని ప్రాంతాల్లో మర మగ్గాల కార్మికులు సమ్మె చేశారు. అంతకు ముందు పలువురు ఫ్యాక్టరీ యజమానులు 5 శాతం నుంచి $7\frac{1}{2}$ శాతం దాకా వేతనాలు

తగ్గిస్తున్నట్లు ప్రకటించారు. పనిగంటలు తగ్గించి వేతనాలను యథాతథంగా ఉంచాలని కార్మికులు పట్టుపట్టారు. దీన్ని ఆమోదించకపోవడంతో సమ్మెకు పిలుపిచ్చారు. నెల తర్వాత మర మగ్గాల కార్మికులు తలవంచక తప్పలేదు. వారికి రెండూ లభించాయి. "వేతనాల తగ్గింపుతో పాటు (చివరకు కార్మికులు దీనికి అంగీకరించారు), మిల్లులు ఇప్పుడు తక్కువ కాలం నడుస్తున్నాయి." (రిపోర్ట్స్ ఆఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్, అక్టోబర్ 1861, పుట 23)

1862 ఏప్రిల్. "నా గత నివేదిక అనంతరం మర మగ్గాల కార్మికుల అవస్థలు చాలా పెరిగాయి; అయితే బట్టల మిల్లుల చరిత్రలో ఎన్నడూ కూడా ఇంత ఆకస్మికంగా ఎదురైన ఇంత తీవ్రమైన అవస్థలను వారు ఇంత ఓర్పుతో, ఆత్మగౌరవంతో అనుభవించలేదు." (రిపోర్ట్స్ ఆఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్, అక్టోబర్ 1862, పుట 10)

"ఈ తేదీనాటికి పూర్తిగా ఉపాధి కోల్పోయిన మరమగ్గ, కార్మికుల నిష్పత్తి 1848 నాటికంటే చాలా ఎక్కువగా ఉన్నట్లు కనిపించదు. 1848 నాడు కార్ఖానాదారులలో ఆందోళన పుట్టించేంతగా పర్యవసానాలను గురించిన భయం వ్యాపించింది. అది ఎంతగా నెలకొందంటే, ఇప్పుడు వారం వారం పత్తి వ్యాపారం పరిస్థితిపై వెలువడుతున్న గణాంక వివరాల వంటివి ఆనాడు సేకరించడం అవసరమైంది. మాంచెస్టర్‌లో మామూలుగా పనిలో నియమితులైన వారిలో 15 శాతానికి పనిలేదు.... తక్కువ కాలం పనివున్నవారు 12 శాతం. పూర్తికాలం పనివున్నవారు 70 శాతం. ఈ సంవత్సరం మే 28న మామూలుగా పనిలో నియుక్తమైన వారిలో 15 శాతం మంది పని కోల్పోయారు; 35 శాతం తక్కువ కాలం పనిచేశారు; 49 శాతం పూర్తికాలం పనిచేశారు. ఇతరచోట్ల, ఉదాహరణకు స్టాక్‌పోర్ట్‌లో తక్కువ కాలం పనిచేసే వారి సగటు, పూర్తిగా నిరుద్యోగుల సగటు ఇంతకన్నా ఎక్కువ; కాగా పూర్తికాలం పనివున్నవారి సగటు తక్కువ." అందుకు కారణం మాంచెస్టర్‌లో కంటే అక్కడ ఎక్కువగా ముతక కౌంట్ల నూలు బట్టలు నేస్తూండడమే. (పుట 16)

1862 అక్టోబర్. "పార్లమెంటుకు సమర్పించిన గత నివేదికను బట్టి నాకు ఈ కింది వివరాలు తెలుస్తున్నాయి. 1861లో యునైటెడ్ కింగ్‌డమ్‌లో 2,887 జౌళి ఫ్యాక్టరీలుండేవి; అందులో 2,109 నా జిల్లా (లాంక్‌షైర్, చెషైర్) లోనివే. నా జిల్లాలో ఉన్న 2,109 ఫ్యాక్టరీల్లో చాలా పెద్ద భాగం కొద్దిమందికి మాత్రమే ఉపాధి కల్పించే చిన్న సంస్థలని నాకు తెలుసు. అయితే, అది ఎంత పెద్ద భాగమో తెలిసినప్పుడు నాకు ఆశ్చర్యమేసింది. 392 ఫ్యాక్టరీలలో, అంటే 19 శాతం ఫ్యాక్టరీలలో ఆవిరి ఇంజన్ లేదా నీటి చక్రం శక్తి 10 ఆశ్వికశక్తి కంటే తక్కువే; 345 ఫ్యాక్టరీల్లో లేక 16 శాతం ఫ్యాక్టరీలలో ఆశ్వికశక్తి 10కీ 20కీ మధ్య ఉండేది; 1,372 ఫ్యాక్టరీలలో ఆశ్వికశక్తి 20, అంతకు పైబడి ఉండేది. ఈ చిన్న పారిశ్రామికదారుల్లో చాలామంది – మొత్తంలో మూడో వంతుకంటే ఎక్కువమంది – మొన్నటి వరకూ స్వయంగా యంత్రాలు నడిపేవారు. వారి వద్ద పెట్టుబడి లేదు... కనుక మిగిలిన మూడింట రెండు వంతుల మందే భారంలో అత్యధిక భాగం మోయాల్సి ఉంది." (రిపోర్ట్స్ ఆఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్, అక్టోబర్ 1862, పుటలు 18, 19)

అదే నివేదిక ప్రకారం, లాంక్‌షైర్, చెషైర్ జిల్లాల్లోని 40,146 మంది లేక 11.3% మంది జౌళి మిల్లు కార్మికులు ఆనాడు పూర్తికాలం పని చేసేవారు. 134,767 మంది, లేక 38 శాతం

మంది తక్కువ కాలం పనిచేసే కార్మికులు; 179,721 మంది లేక 50.7 శాతం మంది నిరుద్యోగులు. ప్రధానంగా నాణ్యమైన నూలు పరిశ్రమపై పత్తి కరువు ప్రభావం సాపేక్షంగా తక్కువ. అటువంటి మాంచెష్టర్, బోల్టన్ జిల్లాల లెక్కలను ఇందులో నుంచి తీసివేస్తే పరిస్థితి మరింత ప్రతికూలంగా కనిపిస్తుంది; అంటే పూర్తికాలం ఉద్యోగులు 8.5 శాతం, పాక్షిక ఉపాధి కలవారు 38 శాతం, పూర్తి నిరుద్యోగులు 53.5 శాతం. (పుటలు 19, 20)

"మంచి పత్తితో పనిచేయడానికి, నాసిరకం పత్తితో పనిచేయడానికి, కార్మికుని ప్రతిఫలం దృష్ట్యా తేడా ఉంది. తాము సేకరించగలిగిన తక్కువ ధర పత్తితో మిల్లులను పనిచేయించడానికి ఫ్యాక్టరీ యజమానులు సంవత్సరం ప్రారంభంలో ప్రయత్నిస్తూ వచ్చారు. ఆ రోజుల్లో, మామూలుగా మంచి పత్తి వాడే మిల్లులకు నాసిరకం పత్తిని తెచ్చారు. ఫలితంగా పనివారి వేతనాల్లో ఎంత పెద్ద తేడా ఉండేదంటే పాత రేట్లతో ఒక మంచి దినవేతనం సంపాదించలేకున్నామనే కారణంతో వారు చాలాసార్లు సమ్మెలు చేశారు... కొన్ని సందర్భాలలో పూర్తికాలం పనిచేస్తున్నప్పటికీ, నాసిరకం పత్తితో పనిచేయడంవల్ల వేతనాల్లో తేడా దాదాపు సగం ఉండేది." (పుట 27)

1863 ఏప్రిల్. "ప్రస్తుత సంవత్సరంలో దేశంలోని జౌళి మిల్లు కార్మికుల్లో సగంకంటే ఎక్కువ మందికి ఉపాధి ఉండదు." (రిపోర్ట్స్ ఆఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్, ఏప్రిల్ 1863, పుట 14)

"ఫ్యాక్టరీ యజమానులు ఇప్పుడు సూరత్ పత్తిని ఉపయోగించక తప్పడం లేదు. సూరత్ పత్తి వాడకం పట్ల యజమానుల తీవ్రమైన అభ్యంతరమేమిటంటే, ఉత్పత్తి ప్రక్రియ సాగుతున్నప్పుడు యంత్రాల వేగాన్ని చాలా తగ్గించుకోవలసి ఉంటుంది; అదే యంత్రాలతో ఎక్కువ పని చేయించేందుకు గాను గత కొద్ది సంవత్సరాలుగా యంత్రాల వేగాన్ని పెంచడానికి శతధా ప్రయత్నించారు. కనుక వేగం తగ్గింపు అటు కార్మికులను, ఇటు కార్ఖానా యజమానినీ దెబ్బకొడుతుంది; ఎందుకంటే కార్మికుల్లో ఎక్కువమందికి చేసిన పనినిబట్టి వేతనం చెల్లించేవారు; ఉదాహరణకు నూలు వడికే వారికి నేసిన నూలు బరువునుబట్టి పౌనుకింత చొప్పున చెల్లిస్తారు. నేత కార్మికులకేమో నేసిన వస్త్రాలను వస్త్రానికింత చొప్పున చెల్లిస్తారు; వారంవారీ వేతనాలు పొందే ఇతర తరగతుల కార్మికులకు కూడా ఉత్పత్తి అయిన సరుకు తగ్గుదల మూలంగా వేతనాలు తగ్గడం కద్దు. కార్మికుల వేతనాలు మునుపటి వాటిలో సగటున 20 శాతం తగ్గినట్లు కొన్ని సందర్భాలలో, 1861లో ఉన్న అదే రేట్ల వేతనాల లెక్కన ఈ తగ్గుదల 50 శాతం వరకు ఉన్నట్లు, నా దర్యాప్తులను బట్టి, ప్రకటనలను బట్టి నాకు తెలుస్తున్నది." (పుట 13)

".... సంపాదించిన మొత్తం, కార్మికుడు పనిచేసిన పదార్థ స్వభావంపైన ఆధారపడి ఉంటుంది.... ఈనాడు (1863 అక్టోబర్) కార్మికుల ఆదాయ పరిస్థితి గత సంవత్సరం ఇదే కాలంలో ఉండిన ఆదాయాల పరిస్థితి కంటే చాలా బాగుంది. యంత్రాలు మెరుగుపడ్డాయి; పదార్థాల స్వభావాన్ని బాగా అర్థం చేసుకుంటున్నారు; మొదట ఎదురవుతూండిన ఇబ్బందులను కార్మికులు ఇప్పుడు అధిగమించగలుగుతున్నారు. నేను గత వసంత రుతువులో ప్రెస్టన్‌లోని ఒక కుట్టుమిషన్ పాఠశాల (నిరుద్యోగుల కోసం నడిపే ధర్మ సంస్థ)లో ఉన్నప్పుడు జరిగిన ఘటన ఒకటి నాకు జ్ఞాపకం వస్తున్నది. వారానికి 4 షిల్లింగులు సంపాదించుకోవచ్చునని ఫ్యాక్టరీ యజమానులు చెప్పడంతో ఇద్దరు

యువతులను నేతమిల్లులో పనికి పంపిన మరుసటి రోజే వారు, పాఠశాలలో తిరిగి చేరడానికి వచ్చారు. వారానికి ఒక షిల్లింగు కూడా సంపాదించగలిగే వారు కాదని వారి ఫిర్యాదు. నేను 'స్వయంచాలక నిర్వాహకుల' గురించి విన్నాను. రెండు స్వయంచాలక కదుర్లను నిర్వహించే ఈ పురుష కార్మికులు రెండు వారాల పూర్తి పనికి 8 షిల్లింగుల 11 పెన్నీలు సంపాదించేవారు. ఫ్యాక్టరీ యజమాని ఇంటి అద్దె మొత్తాన్ని ఇందులోంచి మినహాయించుకుని ఇంటి అద్దెలో సగం మొత్తాన్ని తిరిగి బహుమతిగా వాపస్ ఇచ్చేవాడు. (అబ్బో ఏమి దాతృత్వమండీ) స్వయంచాలక నిర్వాహకులు 6 షిల్లింగుల 11 పెన్నీలు ఇంటికి తీసుకువెళ్ళేవారు. అనేక ప్రాంతాల్లో 1862 ఆఖరు మాసాల్లో వారి వారంవారీ వేతనాలు 5 షిల్లింగుల నుంచి 9 షిల్లింగుల దాకా, నేత కార్మికుల వేతనాలు 2 షిల్లింగుల నుంచి 6 షిల్లింగుల దాకా ఉండేవి... అనేక జిల్లాల్లో వారి సంపాదనలు బాగా తగ్గిపోయినప్పటికీ, ప్రస్తుత పరిస్థితి మునుపటికంటే చాలా మెరుగ్గా ఉంది. కార్మికుల ఆదాయాలు తగ్గడానికి సూరత్ పత్తి పొట్టి పింజ కావడం, దాని నాణ్యత అధ్వాన్నంగా ఉండడంతో పాటు ఇంకా అనేక ఇతర కారణాలున్నాయి; ఉదాహరణకు ఇప్పుడు సూరత్ పత్తితో 'వ్యర్థ పదార్థాన్ని' కలపడం వాడుక అయింది. పర్యవసానంగా వడికే కార్మికుల లేదా కదురు నిర్వాహకుల ఇబ్బందులు ఎక్కువయ్యాయి. పింజ పొట్టిది కావడం వల్ల, దారాన్ని కదురు నుంచి లాగేప్పుడూ, మెలిపెట్టేప్పుడు దారాలు తెగిపోయే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది; కనుక కదురును నిరంతరాయంగా చలనంలో ఉంచడం సాధ్యం కాదు. నేతలో పోగులను ఏకాగ్రతతో గమనించాల్సి ఉంటుంది కాబట్టి చాలామంది నేత కార్మికులు ఒక మగ్గాన్ని మాత్రమే చూసుకోగలరు; రెండుకంటే ఎక్కువ మగ్గాలను పర్యవేక్షించ గలిగిన వారు బహు తక్కువ. పనివారి వేతనాల్లో తగ్గుదల 5 శాతం, $7\frac{1}{2}$ శాతం, 10 శాతం దాకా వుంటున్నది... ఎక్కువ సందర్భాల్లో పని వారు తమ సామాగ్రిని అత్యుత్తమంగా ఉపయోగించుకోవాలి... మామూలు రేట్లతో సాధ్యమయినంత మంచి వేతనాలు సంపాదించాలి. నేత కార్మికులకు అప్పుడప్పుడు ఎదురయ్యే మరో ఇబ్బంది ఏమిటంటే వారు నాసిరకం సామాగ్రి నుంచి భేషైన వస్త్రాన్ని ఉత్పత్తి చేయాలి; పనిలో పొరపాట్లేవైనా జరిగితే వారికి జరిమానాలు విధించేవారు." (రిపోర్ట్స్ ఆఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్, అక్టోబర్ 1863, పుటలు 41-43).

పూర్తి పని దొరికిన సందర్భాల్లో సైతం వేతనాలు అధ్వాన్నంగా ఉండేవి. జౌళి మిల్లు కార్మికులు ప్రభుత్వం నుంచి కుటుంబ పోషణకు సహాయం పొందేందుకు డ్రైనేజి, రోడ్ల నిర్మాణం, రాళ్ళు పగలకొట్టడం, వీధులకు నాపరాళ్ళు పరచడం లాంటి పనులకు నిస్సంకోచంగా వెళ్లేవారు. (అయితే ఇది ఆచరణలో ఫ్యాక్టరీ యజమానులకు సహాయపడేది. ప్రథమ సంపుటి చూడండి.) బూర్జువా వర్గం యావత్తు కార్మికులపై కన్నువేసి ఉంచింది. బొత్తిగా చాలని వేతనాలు ఇచ్చినప్పుడు వాటిని ఏ కార్మికుడయినా తిరస్కరిస్తే నిరుద్యోగ సహాయక కమిటీ అతని పేరును తన జాబితా నుంచి తొలగించేది. అది ఫ్యాక్టరీ యజమానులకు ఒకరకంగా స్వర్ణ యుగం. ఎందువల్లనంటే, కార్మికులు పస్తులైనా పడాలి లేదా బూర్జువా వర్గానికి లాభదాయకంగా ఉండే వేతనాలకైనా పనిచేయాలి. సహాయక కమిటీలు కావలి కుక్కలుగా పనిచేసేవి. అదే సమయంలో కార్మికుల వలసలను నిరోధించడానికి యజమానులు ప్రభుత్వంతో రహస్య ఒప్పందాలు కుదుర్చుకునేవారు. ఇందులోని ఉద్దేశం కార్మికుల

రక్తమాంసాలపై మదుపు పెట్టిన పెట్టుబడిని అందుబాటులో సిద్ధంగా ఉంచుకోవడం. వారి నుంచి చెవులు పిండి వసూలు చేసే ఇంటి అద్దెకు ఢోకా లేకుండా చూడటం.

"ఈ విషయంలో సహాయక కమిటీలు చాలా ఖచ్చితంగా వ్యవహరించేవి. ఒకవేళ పని ఇవ్వచూపితే, పని పొందాల్సిన కార్మికుల పేర్లు జాబితాల నుంచి తొలగించడం ద్వారా ఆ పనిని వారు స్వీకరించక తప్పని పరిస్థితిని సృష్టించేవారు. పని ఆమోదించడానికి నిరాకరించారంటే కారణం ఒకటే, ఆదాయాలు కేవలం నామమాత్రంగా ఉండడం, పనియేమో అతికష్టమైనది కావడం." (రిపోర్ట్స్ ఆఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్, అక్టోబర్ 1863, పుట 97)

పబ్లిక్ వర్క్స్ చట్టం మేరకు ఇచ్చిన ఏ పని చేయడానికైనా కార్మికులు సిద్ధంగా ఉండేవారు. "పారిశ్రామిక ఉద్యోగుల ఏర్పాటుకు ఆధారభూతమైన సూత్రం విభిన్న పట్టణాల్లో విభిన్న రీతుల్లో ఉండేది; అయితే బయటి పని పూర్తిగా శ్రమ పరీక్ష కానిచోట్ల ఖచ్చితంగా సహాయక కమిటీ రేటు తోనో లేదా దాదాపు ఆ రేటుతోనో శ్రమకు ప్రతిఫలం చెల్లించే తీరు, నిజానికి శ్రమ పరీక్ష అయింది." (పుట 69)

"1963 నాటి పబ్లిక్ వర్క్స్ చట్టం యొక్క ఉద్దేశం ఈ అసౌకర్యాన్ని తొలగించడమూ, స్వతంత్ర శ్రామికుడుగా తన రోజువారీ వేతనాలను సంపాయించే అవకాశాన్ని మిల్లు కార్మికునికి కల్పించడ మూను. ఈ చట్టానికి మూడు ప్రయోజనాలున్నాయి; మొదటిది – ఖజానా రుణాల కమీషనర్ల నుంచి స్థానిక అధికారులు రుణాలు పొందే అవకాశం కల్పించడం (కేంద్ర సహాయక కమిటీ అధ్యక్షుని ఆమోద ముద్రతో); రెండవది – పరిశ్రమ, జౌళి పారిశ్రామిక జిల్లాలలోని పట్టణాల్లో సౌకర్యాలను మెరుగుపరచడమూ; మూడవది – నిరుద్యోగ మిల్లు కార్మికులకు పనీ, గిట్టుబాటైన వేతనాలూ ఇవ్వడం". "1863 అక్టోబర్ ఆఖరు నాటికి ఈ చట్టం క్రింద 883,700 పౌండ్ల మేరకు రుణాలు మంజూరయ్యాయి. (పుట 70) ఈ చట్టం కింద ప్రధానంగా చేపట్టిన పనులు – కాలువల తవ్వకం, రోడ్ల నిర్మాణం, రోడ్లపై పేవ్‌మెంట్ల నిర్మాణం, మంచినీటి సరఫరాకై రిజర్వాయర్ల నిర్మాణం వగైరా."

బ్లాక్‌బర్న్‌లోని ఈ కమిటీ అధ్యక్షుడు హెండర్సన్ ఇందుకు సంబంధించి, ఫ్యాక్టరీ ఇన్‌స్పెక్టర్ రెడ్ గ్రేవ్‌కు ఇలా రాశారు; "పబ్లిక్ వర్క్స్ చట్టం అమలు ద్వారా బ్లాక్‌బర్న్ కార్పొరేషన్ ఇచ్చిన పనులను ఈ జిల్లాలోని నిరుద్యోగులైన మిల్లు కార్మికులు అత్యుత్సాహంతో అంగీకరించారు. అష్ట కష్టాలతో కూడుకున్న ప్రస్తుత దశలో దీనికన్నా బలంగా మరేదీ నా మనసుపై హత్తుకోలేదు; దీనంతటి సంతృప్తి ఇవ్వలేదు. ఫ్యాక్టరీలో నైపుణ్యం గల కార్మికుడిగా నూలు వడకందారుడికీ, 14 నుంచి 18 అడుగుల లోతు మురుగు కాల్వలో పనిచేసే కార్మికుడికీ మధ్య గల దానికి మించిన తేడాను ఊహించజాలం." (అతని కుటుంబ పరిమాణాన్ని బట్టి అతడు వారానికి 4 నుంచి 12 షిల్లింగులు సంపాదించేవాడు. ఒక్కోసారి ఎనిమిది మంది సభ్యులు గల కుటుంబాన్ని బ్రహ్మాండమైన ఈ మొత్తం పోషించేది. పట్టణవాసులు దీని నుంచి రెండు విధాలా లాభం పొందారు. మొదటిది – పొగచూరిన, నిరాదరణకు గురైన తమ నగరాలను బాగుపరచుకోడానికి వారికి చాలా తక్కువ వడ్డీరేట్లకు డబ్బు లభించింది. రెండవది – వారు కార్మికులకు చెల్లించేది మామూలు వేతనం కంటే చాలా తక్కువ.) "దాదాపు ఉష్ణ మండల శీతోష్ణ స్థితిలో, కండబలం కంటే చురుకుదనం, సున్నితమైన పని మెళకువలు

ఎన్నో రెట్లు ఉపయోగపడిన ఆ శీతోష్ణ స్థితిలో పని చేయడానికి ఇప్పుడు తాను సంపాదించగలిగిన ప్రతిఫలానికి రెండు రెట్లు, ఒక్కోసారి మూడు రెట్లు అలవాటుపడిన ఈతను ఇప్పుడు ఇవ్వజూపిన పనిని నిస్సంకోచంగా అంగీకరించడంలో కొంత ఆత్మత్యాగమూ, సద్భావమూ ఇమిడి ఉన్నాయి. బ్లాక్‌బర్న్‌లో దాదాపు ప్రతిరకం బయటి పనిలోనూ కార్మికులను పరీక్షించి చూచారు – బిగుసుకు పోయిన బరువైన బంకమట్టి నేలను చాలా లోతు వరకూ తవ్వడం; రాళ్ళు పగలకొట్టే రోడ్ల నిర్మాణం, మురుగు కాలువల కోసం 14 అడుగులు, 16 అడుగులు ఒక్కోసారి 20 అడుగులు లోతు వరకు వీధుల్లో తవ్వకం, ఇలా అన్ని పనులకూ మిల్లు కార్మికుల శ్రమను పరీక్షించారు. ఇలా నియమింప బడినవారు చాలా సందర్భాల్లో పది పన్నెండు అంగుళాల లోతు గల బురదనీటిలో నిల్చునేవారు. అప్పుడు వారున్న లాంటి తేమ వాతావరణంతో సమంగా ఉండేదాన్ని మించినది ఇంగ్లండ్‌లోని మరే జిల్లాలోనూ లేదు." (పుటలు 91–92) "మిల్లు కార్మికుల ప్రవర్తన బయటి పనిని ఆమోదించి ఆ పనిని సాధ్యమయినంత బాగా చేయడానికి వారి సంసిద్ధత – ఏ మాత్రమూ తప్పుపట్టడానికి వీలులేనిది." (పుట 69)

1864 ఏప్రిల్ "వివిధ జిల్లాల్లో కార్మికుల కొరత గురించి అప్పుడప్పుడు ఫిర్యాదులు వచ్చాయి. అయితే కొన్ని శాఖల్లో, ఉదాహరణకు నేత కార్మికుల రంగంలో ఈ కొరత ప్రధానంగా కనిపించింది... ఈ ప్రత్యేక రంగంలో సైతం ఫిర్యాదులు రావడానికి శ్రామిక ప్రజల కొరత ఎంత కారణమో, నాసి రకం నూలు వినియోగం వల్ల పనివారు సంపాదించ గల వేతనాల రేట్లు తక్కువగా ఉండటం కూడా అంతగానూ కారణమే. గత నెలలో మిల్లుల యజమానులకూ, అందులో పనిచేసే కార్మికులకూ మధ్య వేతనాలకు సంబంధించిన అనేక భేదాభిప్రాయాలు తలెత్తాయి. చాలా తరచుగా సమ్మెలకు దిగారని చెప్పడానికి నాకు బాధగా ఉంది... పబ్లిక్ వర్క్ చట్టం ఫలితాన్ని మిల్లు యజమానులు తమకు పోటీగా భావిస్తున్నారు. బాకప్‌లోని స్థానిక కమిటీ పనులను ఆపివేసింది; ఎందువల్లనంటే అన్ని మిల్లులు పని చేయనప్పటికీ కార్మికుల కొరత ఎదురవుతున్నది." (రిపోర్ట్స్ ఆఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్, ఏప్రిల్ 1864, పుటలు 9, 10)

వాస్తవానికి అది పరిశ్రమదారులకు ఆనందప్రదమైన సమయం. పబ్లిక్ వర్కర్స్ చట్టం మూలంగా కార్మికుల కోసం గిరాకీ ఎంత బలంగా పెరిగిందంటే, పలువురు ఫ్యాక్టరీ కార్మికులు బాకప్ రాళ్ళ గనుల్లో రోజుకు 4 నుంచి 5 షిల్లింగులు సంపాదించేవారు. కాబట్టి ప్రభుత్వ రంగం పనులు క్రమేణా ఆగిపోయాయి; ఈ పనులు 1848 నాటి Ateliers Nation auxకి (జాతీయ వర్క్‌షాపులు) ఒక కొత్త రూపం, కానీ వీటిని ఈ దఫా బూర్జువా వర్గ ప్రయోజనాల కోసం ఏర్పరచారు.

## పనికిమాలిన ప్రయోగాలు

"నేను అనేక మిల్లుల్లో (పూర్తికాలంపాటు నియమించబడిన) పనివారి వాస్తవాదాయాల వివరాలు ఇచ్చినప్పటికీ, వారు ప్రతి వారమూ అవే మొత్తాలు సంపాదిస్తారని దాన్నిబట్టి అనుకోరాదు. ఒకే మిల్లులో వివిధ రకాల పత్తితోనూ, పత్తీ, పత్తి రద్దుల యొక్క వేరు వేరు నిష్పత్తులతోనూ నిరంతరం మిల్లు యజమానులు ప్రయోగాలు చేస్తున్నారు. 'మిశ్రమాలు' అనే వీటిని తరచు మారుస్తున్నారు. ఇందువల్ల మిల్లు పనివారు పెద్ద ఎత్తున మార్పులకు లోనవుతున్నారు. పత్తి 'మిశ్రమం' నాణ్యతను

బట్టి మిల్లు పనివారి ఆదాయాలు పెరుగుతుంటాయి, తరుగుతుంటాయి. ఒక్కోసారి అవి మునుపటి ఆదాయాల్లో 15 శాతంలోపు ఉండేవి; ఆ తర్వాత ఒకటి రెండు వారాలకు 50 నుంచి 60 శాతానికి పడిపోయేవి." ఈ నివేదిక రూపొందించిన ఇన్‌స్పెక్టర్ రెడ్‌గ్రేవ్ ఆ తర్వాత వాస్తవాచరణ నుంచి గ్రహించిన వేతనాలను ఉదహరిస్తున్నారు. అందులోని కింది ఉదాహరణలు ప్రస్తుతానికి చాలు :

'క' అనే నేత కార్మికుడు, ఆరుగురున్న కుటుంబం. వారంలో నాలుగు రోజులే పని దొరికింది. ఆదాయం 6 షిల్లింగులు $8\frac{1}{2}$ పెన్నీలు; 'గ' అనే ట్విస్టర్‌కు, వారంలో $4\frac{1}{2}$ రోజులే పని దొరికింది; 6 షిల్లింగులు; 'చ' అనే నేత కార్మికుడు, నలుగురు సభ్యుల కుటుంబం. వారంలో అయిదు రోజులు పని దొరికింది, ఆదాయం 5 షిల్లింగులు 1 పెన్నీ; దారాలను సరిగా ఉంచే 'జ' అనే కార్మికుడు, ఆరుగురు సభ్యుల కుటుంబం. వారంలో నాలుగు రోజులే పని దొరికింది, ఆదాయం 7 షిల్లింగులు 10 పెన్నీలు; 'ఝ' అనే నేత కార్మికుడు, ఏడుగురు సభ్యుల కుటుంబం. వారంలో మూడు రోజులే పని దొరికింది; ఆదాయం 5 షిల్లింగులు వగైరా వగైరా... రెడ్‌గ్రేవ్ ఇంకా ఇలా రాశారు : "పై వివరాలు పరిశీలించదగినవి. ఎందుచేతనంటే, అనేక కుటుంబాల్లో పని అన్నది దౌర్భాగ్యంగా తయారై ఉండేదేనని ఈ లెక్కలు సూచిస్తున్నాయి; ఆ పని ఆదాయాలను కేవలం తగ్గించడమే కాదు, తప్పని సరియైన అవసరాల్లో బహుకొద్ది భాగాన్ని సమకూర్చడానికి సైతం అవి బొత్తిగా చాలవు. అయితే, కుటుంబ సభ్యులందరూ నిరుద్యోగులైతే, వారికి ప్రభుత్వం నిరుద్యోగ సహాయంగా ఇచ్చే మొత్తానికి, కుటుంబ వేతనాలు సమానంగా లేనట్లయితే, మిల్లు కార్మికులకు ప్రభుత్వం ఆ లోటును భర్తీ చేయడానికి తగిన సహాయం అందజేస్తున్నది కనుక ఆ దౌర్భాగ్య స్థితి తప్పింది." (రిపోర్ట్స్ ఆఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్, అక్టోబర్ 1863, పుటలు 50–53).

"గత జూన్ 5వ తేదీ దరిమిలా ఏ వారంలోనూ కార్మికులందరకూ రెండు రోజులు ఏడు గంటలా కొన్ని నిముషాలకంటే ఎక్కువ పని దొరకలేదు." (అదే నివేదిక, పుట 121)

సంక్షోభ సమయం నుంచి 1863 మార్చి 25 వరకు రక్షక సంస్థలైన కేంద్ర సహాయ కమిటీ, మాన్షన్ హౌస్ కమిటీలు దాదాపు మూడు మిలియన్ పౌండ్ల స్టెర్లింగులు ఖర్చు పెట్టాయి. (అదే నివేదిక, పుట 13)

"అతి నాణ్యమైన నూలు తయారవుతున్న ఒక మిల్లు సౌత్ సీ ఐలాండ్ పత్తి నుంచి ఈజిప్టు పత్తికి మారిన పర్యవసానంగా వడకందారుల ఆదాయం పరోక్షంగా 15 శాతం తగ్గుతుంది.... మరో పెద్ద జిల్లాలోని అనేక ప్రాంతాల్లో సూరత్ పత్తితో కలపడానికి పత్తి రద్దును వాడుతున్నారు. ఇక్కడ వడికేవారి ఆదాయాలు అదివరకే 5 శాతం తగ్గాయి; సూరత్ పత్తినీ, వ్యర్థ పదార్థాన్నీ మిశ్రమం చేయడం వల్ల అదనంగా 20 నుంచి 30 శాతం వారు నష్టపోయారు. నేత కార్మికుల మగ్గాలు 4 నుంచి 2 కు తగ్గాయి. 1860లో వారికి సగటున ఒక మగ్గం నుంచి 5 షిల్లింగులు 7 పెన్నీల ఆదాయం రాగా, 1863 నాటికి అది 3 షిల్లింగుల 4 పెన్నీలకు తగ్గింది. ఇంతకుముందు అమెరికా పత్తి వాడేటప్పుడు జరిమానాలు (కార్మికులు ఒక్కొక్కరికి) 3 పెన్నీల నుంచి 6 పెన్నీల దాకా ఉండగా, ఇప్పుడవి 1 షిల్లింగు నుంచి 3 షిల్లింగుల 6 పెన్నీల దాకా పెరిగాయి." ఈజిప్టు పత్తిని తూర్పు ఇండియా పత్తితో మిశ్రమం చేసి వాడే ఒకే జిల్లాలో "యంత్ర కదుళ్ళతో వడికేవారి సగటు ఆదాయం

1860లో 18 షిల్లింగుల నుంచి 25 షిల్లింగుల దాకా వుండగా, అది ఇప్పుడు సగటున 10 నుంచి 18 షిల్లింగుల దాకా ఉంది. ఇందుకు కారణం నాసిరకం పత్తితోపాటు, దారంలో పురిని పెంచేందుకు కదురు వేగం తగ్గించడం కూడా." (పుటలు 43, 44) "ఫ్యాక్టరీ యజమానులు ఇండియా పత్తిని లాభం వచ్చే విధంగా వాడి ఉండవచ్చు. అయితే 1861 నాటితో పోల్చితే కార్మికులు నష్టపోయారని విదితమవుతూంది. (అదే నివేదిక, పుట 53) సూరత్ పత్తి వినియోగం ధ్రువపడితే, కార్మికులు 1861 నాటి వేతనాలు సంపాదించాలని కోరుకుంటారు. అలా అయితే, ముడిపత్తి ధరలో కానీ లేక తన ఉత్పాదితాల ధరలో కానీ ఫ్యాక్టరీ యజమానికి నష్టపరిహారం లభించని పక్షంలో అతని లాభాలు తీవ్రంగా దెబ్బతింటాయి." (పుట 105)

**ఇంటి అద్దె :** "తాము కట్టించిన ఇళ్ళలో నివసిస్తున్న కార్మికులు తక్కువ కాలం పని చేస్తున్నప్పటికీ వారి వేతనాల నుంచి ఫ్యాక్టరీ యజమానులు తరచుగా అద్దెలను మినహాయించుకొంటారు. ఏది ఏమైనా ఈ తరహా ఆస్తుల విలువ తగ్గిపోయింది; మామూలు కాలంలో ఉండే అద్దెలకంటే 25 నుంచి 50 శాతం తక్కువ అద్దెలకు ఇళ్ళు దొరకడం సాధ్యం; ఉదాహరణకు ఇంతకు ముందు వారానికి 3 షిల్లింగుల 6 పెన్నీల అద్దెకు లభించే ఇల్లు ఇప్పుడు 2 షిల్లింగుల 4 పెన్నీలకు, ఒక్కోసారి అంతకంటే తక్కువ అద్దెకు కూడా లభిస్తుంది." (పుట 57)

**వలస :** "యజమానులు సహజంగానే కార్మికుల వలసను వ్యతిరేకిస్తారు. అందుకు కారణ మేమిటంటే, ఒకవైపేమో వారు ప్రస్తుత మాంద్యం నుంచి జౌళి వ్యాపారం బయటపడే రోజులకు ఎదురుచూస్తూ, అత్యంత లాభదాయకంగా మిల్లులను నడిపేందుకు కావలసిన సాధనాలను తమకు అందుబాటులో ఉంచుకుంటారు." మరోవైపేమో, "ఫ్యాక్టరీ యజమానుల్లో అనేకులు పనిచేసే కార్మికులు నివసించే ఇళ్ళ సొంతదారులు. వారిలో కొందరు తమకు బాకీ ఉన్న అద్దెలో కొంత రాబట్టుకోవచ్చునని నిస్సందేహంగా ఆశిస్తున్నారు." (పుట 96)

1864 అక్టోబర్ 22వ తేదీన బెర్నాల్ ఓస్బోర్న్ తన పార్లమెంటరీ నియోజకవర్గ ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తూ లాంక్‌షైర్ కార్మికులు ప్రాచీన వేదాంతుల్లాగా (స్టోయిక్స్) వ్యవహరించారని పేర్కొన్నాడు. గొర్రెల మందలాగా కాదూ?

★ ★ ★

## అధ్యాయం - 7

# అనుబంధ వ్యాఖ్యలు

ఈ భాగంలో ఊహించుకొన్నట్లుగా, ఏ నిర్దిష్ట ఉత్పత్తి శాఖలోనైనా లాభం మొత్తం ఆ శాఖలో మదుపు పెట్టిన మొత్తం పెట్టుబడి సృష్టించిన అదనపు విలువ మొత్తానికి సమానంగా ఉంటుందని అనుకుందాం. అప్పుడు కూడా బూర్జువా వర్గీయుడు తన లాభం అదనపు విలువే, అంటే మూల్యం చెల్లించని అదనపు శ్రమే, అని భావించడు; అందుకు కారణాలు ఇవి :

1. అతడు చలామణి ప్రక్రియలో ఉత్పత్తి ప్రక్రియను విస్మరిస్తాడు. సరుకుల విలువను డబ్బు రూపంలో తన చేతికందినప్పుడు అదనపు విలువ రూపొందిందని అతడు భావిస్తాడు; సరుకుల విలువ డబ్బుగా చేతికందడంలోనే అదనపు విలువ కూడా డబ్బుగా చేతికందడం ఇమిడి ఉంది. (రాతప్రతిలో దీని తరువాత ఖాళీ స్థలం ఉంది. ఈ అంశాన్ని మరింత వివరంగా చర్చించాలని మార్క్స్ ఉద్దేశించినట్లు ఇది సూచిస్తున్నది. **- (ఫ్రెడరిక్ ఎంగెల్స్)**
2. దోపిడీ స్థాయి ఒకేరకంగా ఉంటుందని ఊహించినప్పుడు మనం ఒక విషయం గమనించాం. పరపతి వ్యవస్థలోని మార్పులతో నిమిత్తం లేకుండా, ఒకరినొకరు అధిగమించడానికీ, దగా చేయడానికీ పెట్టుబడిదారులు చేసే ప్రయత్నాలతో నిమిత్తం లేకుండా, చివరగా అనుకూలమైన మార్కెట్ ఎంపికతో కూడా నిమిత్తం లేకుండా ఈ క్రింది అంశాలను బట్టి లాభం రేటులో గణనీయమైన తేడా ఉండవచ్చు; ఆ అంశాలివి; ముడిపదార్థాల ధరల్లో ఎక్కువ తక్కువలు, కొనుగోలుదారుడి అనుభవం, యంత్రాల తాలూకు సాపేక్ష ఉత్పాదకత, సామర్థ్యం, చౌకదనం, ఉత్పాదక ప్రక్రియలోని వివిధ దశలలోని మొత్తం ఏర్పాట్లు సామర్థ్యం ఎక్కువ తక్కువలు, పదార్థం వ్యర్థం కాకుండా చూడటం, మేనేజ్‌మెంట్, పర్యవేక్షణల సౌలభ్యం సామర్థ్యం వగైరా వగైరా. ఒక్కమాటలో చెప్పాలంటే ఒక నిర్దిష్ట అస్థిర పెట్టుబడికి లభించే అదనపు విలువ నిర్ణీతమైనప్పుడు సైతం, ఆ అదనపు విలువ ఏ మేరకు ఉన్న లాభం రేటులో వ్యక్తమవుతుంది, అంటే ఏ మేరకు లాభాన్ని అందజేస్తుంది అనేది, పెట్టుబడిదారునికి లేదా అతని మేనేజర్లకు, లేక గుమాస్తాలకు ఆయా వ్యాపారంలో గల నైపుణ్యంపై ఆధారపడి ఉంటుంది. 'క' అనే వ్యాపార సంస్థ 9000 పౌండ్ల స్థిర పెట్టుబడితో 1000 పౌండ్ల అదనపు విలువను పొందిందనీ, అది 1000 పౌండ్ల వేతనాల ఉత్పాదితమనీ, 'గ' అనే వ్యాపార సంస్థ 11,000 పౌండ్ల స్థిర పెట్టుబడితో 1000 పౌండ్ల అదనపు విలువనే పొందిందనీ, అదక్కడ 1000 పౌండ్లు వేతనాల ఉత్పాదితమనీ అనుకొందాం. అప్పుడు 'క' విషయంలో ల' (లాభం రేటు) $= \frac{1000}{10,000}$ లేక 10 శాతం. 'గ' విషయంలో ల' (లాభం రేటు) $= \frac{1000}{12,000}$ లేక $8\frac{1}{3}$ శాతం. 'క తాలూకు

మొత్తం పెట్టుబడి, 'గ' తాలూకు మొత్తం పెట్టుబడి కంటే సాపేక్షంగా ఎక్కువ లాభాన్ని ఉత్పత్తి చేస్తుంది. రెండు సందర్భాల్లోనూ ఒకే అస్థిర పెట్టుబడిని (1,000 పౌండ్లు) అడ్వాన్సు చేసినా, ఒకే అదనపు విలువ 100 పౌండ్లు ఉత్పత్తి అయినప్పటికీ, ఒకే సంఖ్యలోని కార్మికులను ఒకే స్థాయిలో దోపిడీ చేయడం జరిగినా 'క' విషయంలో లాభం రేటు ఎక్కువ కాబట్టి సహజంగానే లాభం ఎక్కువ దక్కింది. శ్రమ దోపిడీలో తేడా లేనప్పటికీ ఒకే అదనపు విలువ మొత్తం వ్యక్తమయిన తీరులో లేక లాభం రేట్లలో, కనుక లాభంలో ఈ భేదం ఉండడానికి ఇతర కారణాలు కూడా ఉండవచ్చు. ఐనప్పటికీ, రెండు సంస్థలను నిర్వహించే వ్యాపార దక్షతలో గల తేడాయే ఇందుకు పూర్తిగా కారణం కావచ్చు కూడా. ఈ పరిస్థితి పెట్టుబడిదారుణ్ణి తప్పుదారి పట్టిస్తుంది; తన లాభాలకు కారణం శ్రమ దోపిడీ చేయడం కాదనీ, ఇతర స్వతంత్ర పరిస్థితులే, ముఖ్యంగా తన వ్యక్తిగత కార్యకలాపాలే అందుకు కనీసం కొంతైనా కారణమనీ అతనికి గట్టి నమ్మకం ఏర్పడుతుంది.

★ ★ ★

ఈ భాగంలోని విశ్లేషణలు రోడ్ బెర్టస్[1] అభిప్రాయం సక్రమమైంది కాదని నిరూపిస్తున్నాయి. వ్యక్తిగత పెట్టుబడి మొత్తంలోని మార్పు పెట్టుబడికీ లాభానికీ మధ్య నిష్పత్తిని, అంటే లాభం రేటును ప్రభావితం చేయదనీ, అందుకు కారణమేమంటే లాభం మొత్తం గనుక పెరిగితే లాభాన్ని లెక్కగట్టడానికి ప్రాతిపదిక అయిన పెట్టుబడి మొత్తం కూడా పెరగవలసి ఉంటుందనీ, అలాగే పెట్టుబడి మొత్తం పెరిగితే లాభం పెరగవలసి ఉంటుందనీ రోడ్ బెర్టస్ అభిప్రాయం (కౌలు దీనికి భిన్నమైనది; ఉదాహరణకు, భూమి విస్తీర్ణం మారదు కానీ, దాని కౌలు పెరగడం కద్దు – అంటాడాయన.)

రెండు సందర్భాల్లో మాత్రమే ఇది వాస్తవం.

మొదటిది : ఇక్కడ అన్ని పరిస్థితులూ ముఖ్యంగా అదనపు విలువ రేటు యథాతథంగా ఉన్నాయని ఊహించుకొంటున్నాం – డబ్బు సరుకు అయినట్టి సరుకు విలువలో మార్పు ఉన్న సందర్భం. (ఇతర పరిస్థితులు యథాతథంగా ఉండి, విలువలో కేవలం నామమాత్రపు మార్పు ఉన్నప్పుడు కూడా, అంటే కేవలం విలువ సంకేతాలు పెరిగినా, తరిగినా ఇదే జరుగుతుంది.) మొత్తం పెట్టుబడి = 100 పౌండ్లు, లాభం = 20 పౌండ్లు, లాభం రేటు 20% అనుకొందాం. బంగారం ధర సగం తగ్గితే లేక రెండు రెట్లు తగ్గితే తగ్గినప్పుడు, మునుపు 100 పౌండ్ల విలువ గల పెట్టుబడి విలువ, ఇప్పుడు 200 పౌండ్లకు పెరుగుతుంది; ఆ మేరకు లాభం 40 పౌండ్లవుతుంది. అంటే లాభం మునుపటి 20 పౌండ్లలో కాక 40 పౌండ్లలో వ్యక్తమవుతుంది. కాక బంగారం ధర పెరిగితే 100 పౌండ్ల పెట్టుబడి విలువ 50 పౌండ్లకు తగ్గుతుంది; లాభానికి ప్రాతినిధ్యం వహించే ఉత్పాదితం విలువ 10 పౌండ్లే అవుతుంది. అయితే రెండు సందర్భాల్లోనూ 200:40 = 50:10 = 100:20 = 20%గానే ఉంటుంది. కాగా ఈ అన్ని ఉదాహరణల్లోనూ పెట్టుబడి విలువ పరిమాణంలో

1. జాన్ కార్ల్ రాడ్ బెర్టస్ (1805-1875) ఈయన ప్రష్యన్ భూయజమాని. ఆయన 'స్టేట్ సోషలిస్టు' అనే తన గ్రంథంలో ఆర్థిక వ్యవహారాల నిర్వహణలో బిస్మార్క్ క్రియాశీల జోక్యాన్ని సమర్థించాడు. చూడండి, పెట్టుబడి ప్రథమ సంపుటి (ఇంగ్లీషు పుట 669), ద్వితీయ సంపుటి (ఇంగ్లీషు పుటలు 88-102).

వాస్తవమైన మార్పు ఏదీ ఉండదు; కాకపోతే అదే విలువకు, అదే అదనపు విలువకు డబ్బు వ్యక్తీకరణలో మాత్రమే మార్పు ఉంటుంది. ఈ కారణంగా $\frac{\text{అ.వి.}}{\text{మొ.పె.}}$ లేక లాభం రేటు మార్పుకు గురికాదు.

ఇక రెండవ సందర్భంలో విలువ మొత్తంలో వాస్తవమైన మార్పు ఉంది, కానీ దాంతోపాటు అ.పె. కీ స్థి.పె.కీ గల నిష్పత్తిలో మాత్రం మార్పు లేదు; ఇంకో విధంగా చెప్పాలంటే, అదనపు విలువ రేటు యథాతథంగా ఉన్నట్లయితే, ఉత్పత్తి సాధనాల్లో మదుపు పెట్టిన పెట్టుబడికీ శ్రమశక్తిలో మదుపు పెట్టిన పెట్టుబడికీ (చలనంలో ఉంచిన శ్రమశక్తి పరిమాణానికి సూచికగా పరిగణింపబడే అస్థిర పెట్టుబడికీ మధ్య నిష్పత్తి యథాతథంగా ఉంటుంది.) ఈ పరిస్థితుల్లో మన దగ్గర మొ.పె. ఉన్నా లేక లా. మొ.పె. ఉన్నా లేక, $\frac{\text{మొ.పె}}{\$}$ ఉన్నా, అంటే 1000 లేక 2000 లేక 500 పౌండ్లు వున్నా లాభం రేటు 20% కాబట్టి మొత్తం లాభం మొదటి ఉదాహరణలో 200, రెండవ ఉదాహరణలో 400, మూడవ ఉదాహరణలో 100 ఉంటుంది. కానీ $\frac{200}{1000} = \frac{400}{2000} = \frac{100}{500} = 20$ శాతంగానే వుంటుంది; అంటే పెట్టుబడి అంతర్నిర్మాణ స్వరూపంలో మార్పు లేనందువల్లా, పరిమాణంలో మార్పు ఆ స్వరూపాన్ని మార్చనందువల్లా లాభం రేటు మారదు. కాబట్టి మొత్తం లాభంలో పెరుగుదల లేక తరుగుదల మదుపు పెట్టిన పెట్టుబడి పరిమాణంలో పెరుగుదలను లేక తరుగుదలను మాత్రమే సూచిస్తుంది.

కనుక మొదటి సందర్భంలో నియుక్తమయిన పెట్టుబడి మొత్తంలో మార్పు ఉన్నట్లు కేవలం కనిపిస్తున్నది. కాగా; రెండవ సందర్భంలో పెట్టుబడి మొత్తంలో నిజమైన మార్పు ఉంది; కానీ పెట్టుబడి అంతర్నిర్మాణ స్వరూపంలో, అంటే పెట్టుబడిలోని అస్థిర, స్థిర భాగాల మధ్య నిష్పత్తిలో మార్పు లేదు. ఈ రెండు సందర్భాలను పక్కన ఉంచితే, ఉపయోగించిన పెట్టుబడి మొత్తంలో మార్పు దానిలోని ఒకానొక భాగం తాలూకు విలువలో అంతకు మునుపు వచ్చిన మార్పు ఫలితమైనా అవుతుంది; ఆ మేరకు వాటి భాగాల సాపేక్ష పరిమాణంలో వచ్చిన మార్పు ఫలితమైనా అవుతుంది; (అస్థిర పెట్టుబడితో పాటు అదనపు విలువ మారనంత కాలమూ ఇది వర్తిస్తుంది.) లేదా, పరిమాణంలోని ఈ మార్పు, (భారీ స్థాయి శ్రమ ప్రక్రియలోనూ, నూతన యంత్రాల ప్రవేశంలోనూ జరిగినట్లు) పెట్టుబడిలోని రెండు భాగాల సాపేక్ష పరిమాణంలో మార్పుకు కారణభూతమైనా అవుతుంది; కాబట్టి, ఈ అన్ని సందర్భాల్లోనూ, మిగతా పరిస్థితులు యథాతథంగా ఉన్నట్లయితే, ఉపయోగించిన పెట్టుబడి పరిమాణంలో మార్పుతో పాటు లాభం రేటులో కూడా మార్పు వుండి తీరుతుంది.

★ ★ ★

లాభం రేటు పెరగడానికి ఎప్పుడైనా సరే కారణమిది; అదనపు విలువ ఉత్పత్తి వ్యయంతో పోలిస్తే, అంటే అడ్వాన్సు చేసిన మొత్తం పెట్టుబడితో పోలిస్తే, అదనపు విలువ సాపేక్షంగా, లేక నిరపేక్షంగా పెరగడం లేదా లాభం రేటుకూ అదనపు విలువ రేటుకూ మధ్య తేడా తగ్గడం.

పెట్టుబడి తాలూకు ఆంతరిక భాగాల్లోని మార్పులతో కానీ, పెట్టుబడి యొక్క నిరపేక్ష పరిమాణంలో కానీ ప్రమేయం లేకుండా లాభం రేటులో మార్పులు రావచ్చు. పెట్టుబడి పునరుత్పత్తికి అవసరమైన పనికాలం పెరుగుదల మూలంగా కానీ తగ్గుదల మూలంగా కానీ, అడ్వాన్స్ చేసిన

నిశ్చల, లేక చలామణి పెట్టుబడి విలువ పెరిగితేనో, లేక తరిగితేనో లాభం రేటులో హెచ్చుతగ్గులు సంభవించవచ్చు. ప్రతి సరుకు విలువనూ – అదే విధంగా పెట్టుబడిగా ఉన్న సరుకుల విలువనూ – అందులోని ఆవశ్యక శ్రమ కాలం కాక దాని పునరుత్పత్తికి అవసరమైన సామాజిక శ్రమ కాలమే నిర్ణయిస్తుంది. మొదటి ఉత్పత్తి పరిస్థితులకు భిన్నంగా ఉండే క్లిష్టతర పరిస్థితుల్లోనో, సానుకూల పరిస్థితుల్లోనో ఈ పునరుత్పత్తి ప్రక్రియ జరగవచ్చు. మారిన పరిస్థితుల్లో అదే భౌతిక పెట్టుబడి పునరుత్పత్తికి రెట్టింపు కాలం పడుతుంది. లేక అందుకు భిన్నంగా సగం కాలమే పడుతుంది. అప్పుడు, డబ్బు విలువ యథాతథంగా ఉన్నట్లయితే ఇంతకు ముందు 100 పౌండ్ల విలువ గల పెట్టుబడిపై పరిస్థితిని బట్టి ఇప్పుడు 200 పౌండ్లవుతుంది. లేదా, 50 పౌండ్లవుతుంది. విలువలోని ఈ పెరుగుదల లేక తరుగుదల పెట్టుబడిలోని అన్ని భాగాలనూ సమానంగా ప్రభావితం చేస్తే, అందుకనుగుణంగా లాభం కూడా రెండు రెట్లున్న లేక సగమే ఉన్న డబ్బు మొత్తంగా వ్యక్తమవుతుంది. ఇతర పరిమితులు యథాతథంగా ఉంటూ, పెట్టుబడి ఆంతరిక నిర్మాణ స్వరూపంలో మార్పు ఉన్నట్లయితే, స్థిర పెట్టుబడి భాగంతో అస్థిర పెట్టుబడి భాగం యొక్క నిష్పత్తి మార్పు చెందినట్లయితే, అస్థిర పెట్టుబడి సాపేక్ష పెరుగుదలతో పాటు లాభం రేటు పెరుగుతుంది. లేదా అస్థిర పెట్టుబడి సాపేక్ష తగ్గుదలతోపాటు అదీ తగ్గుతుంది. డబ్బు విలువలో మార్పు ఫలితంగా అడ్వాన్సు చేసిన పెట్టుబడి తాలూకు డబ్బు విలువ పెరిగితే లేక తరిగితే అదనపు విలువను వ్యక్తం చేసే డబ్బు అదే నిష్పత్తిలో పెరుగుతుంది లేదా తరుగుతుంది. కాగా లాభం రేటు మాత్రం యథాతథంగా ఉండిపోతుంది.

★ ★ ★

# రెండవ భాగం

# సగటు లాభంగా లాభపరివర్తన

## అధ్యాయం - 8

### విభిన్న ఉత్పత్తి శాఖల్లో పెట్టుబడుల విభిన్న అంతర్నిర్మాణాలు; ఫలితంగా లాభం రేట్లలో తలెత్తిన తేడాలు

ఇంతకు ముందు భాగంలో మనం అదనపు విలువ రేటు యథాతథంగా వుంటూనే లాభం రేటు మారవచ్చునని, అంటే పెరగవచ్చునని లేక తగ్గవచ్చునని ఇతర విషయాలతో పాటు నిరూపించాం. ఒక దేశ సామాజిక శ్రమ విభజింపబడిన అన్ని ఉత్పత్తి శాఖల్లోనూ శ్రమ దోపిడీ తీవ్రత, పర్యవసానంగా అదనపు విలువ రేటు, పనిదిన పరిమాణం ఇవన్నీ మార్పు చెందకుండా వుంటాయని ప్రస్తుత అధ్యాయంలో ఊహిద్దాం. వివిధ ఉత్పత్తి శాఖల్లోని శ్రమ దోపిడీలో తేడాలు, వాస్తవంగా వున్న నష్ట పరిహారాల ద్వారా లేక వ్యాప్తిలో వున్న అపోహల ప్రాతిపదికపై నష్టపరిహారాలుగా అందరూ అంగీకరించిన వాటి ద్వారా, ఒకదానిని మరొకటి సమతులనం చేస్తాయని ఆడమ్ స్మిత్[1] సమగ్రంగా నిరూపించారు. అందువల్ల ఈ తేడాలు కేవలం తాత్కాలికమైనవనీ, సార్వత్రిక సంబంధాల అధ్యయనంలో వాటికి అట్టే ప్రాముఖ్యం లేదనీ ఆయన చెప్పారు. ఇతర తేడాలు లేక వ్యత్యాసాలు, ఉదాహరణకు వేతన స్థాయిలో తేడాలు, ప్రధానంగా ప్రథమ సంపుటి ప్రారంభంలో ప్రస్తావించిన సరళ శ్రమకు, సంక్లిష్ట శ్రమకు మధ్యగల తేడాపై ఆధారపడి వుంటాయి; వివిధ ఉత్పత్తి శాఖల్లోని శ్రమదోపిడీ తీవ్రతతో వీటికి ఏ విధంగానూ ప్రమేయం వుండదు; కాకపోతే ఆ శాఖల్లోని శ్రామికుని స్థితిగతులను అసమమైనవిగా మార్చుతాయి. ఉదాహరణకు, ఒకరోజువారీ కార్మికుని శ్రమ కంటే ఒక స్వర్ణకారుని శ్రమకు ఎక్కువ పారితోషికం చెల్లిస్తున్నారంటే, అందుకు కారణం ఆ స్వర్ణకారుని అదనపు శ్రమ ఆ రోజువారీ కార్మికుని అదనపు శ్రమకంటే నిష్పత్తి రీత్యా ఎక్కువ అదనపు విలువను సృష్టించడమే. విభిన్న ఉత్పత్తి శాఖల మధ్య, ఒకే ఉత్పత్తి శాఖలోని విభిన్న పెట్టుబడి మదుపుల మధ్య సైతం వేతనాల సమానీకరణను పనిదినాల సమానీకరణను, తద్వారా అదనపు విలువ రేట్ల సమానీకరణను నానావిధ స్థానిక అవరోధాలు అదుపులో పెట్టే విషయం వాస్తవమే. అయినప్పటికీ పెట్టుబడిదారీ విధాన ఉత్పత్తి పురోగమించేకొద్దీ, మిగతా అన్ని ఆర్థిక పరిస్థితులు ఈ ఉత్పత్తి విధానానికి లోనైనకొద్దీ ఈ సమానీకరణ క్రమం అధికాధికంగా చోటు చేసుకుంటూనే వుంది. వేతనాలపై ప్రత్యేక పరిశీలనకు సంబంధించి ఈ ఘర్షణల అధ్యయనం ముఖ్యమైందే అయినప్పటికీ, పెట్టుబడిదారీ

1. ఆడమ్ స్మిత్, యాన్ ఎంక్వయిరీ యింటు ది నేచర్ అండ్ కాజెస్ ఆఫ్ ది వెల్త్ ఆఫ్ నేషన్స్, సంపుటి 1, అధ్యాయం - X - సంపాదకుడు.

ఉత్పత్తి గురించిన సాధారణ విశ్లేషణలో దీన్ని యాదృచ్ఛికమైనదిగా, అప్రస్తుత మైనదిగా తోసి వేయవచ్చు. ఈ తరహా సాధారణ విశ్లేషణలో, వాస్తవ పరిస్థితులు వాటి గురించిన భావనకు అనుగుణంగా వుంటాయని ఊహించుకోవడం మామూలు. వేరు మాట్లో చెప్పాంటే, వాస్తవ పరిస్థితులను, అవి తమ సాధారణ లక్షణాలకు మచ్చుతునకగా వున్న మేరకే అభివర్ణించడం జరుగుతుంది.

మన ప్రస్తుత విశ్లేషణకు సంబంధించి, వివిధ దేశాల్లోని అదనపు విలువ రేట్ల తేడాలకు, పర్యవసానంగా శ్రమదోపిడీ తీవ్రత విషయంలో వివిధ దేశాల మధ్యగల తేడాలకు బొత్తిగా ప్రాధాన్యం లేదు. మనం ఈ భాగంలో కచ్చితంగా స్పష్టం చేయదల్చుకున్నది; ఏ దేశంలో అయినా సాధారణ లాభం రేటు రూపుగొనే తీరును గురించే. అయితే వివిధ దేశాల్లోని లాభం రేట్లను పోల్చి చూడాలంటే, మనం ఇంతకు ముందు అధ్యయనం చేసిన అంశాలతో, ఇక్కడ అధ్యయనం చేయబోతున్న అంశాలను – సవిమర్శక దృష్టితో పోల్చి చూడాలి, అంతే, ఇది స్పష్టమే. మొదట వివిధ దేశాల్లోని అదనపు విలువ రేట్లలో గల తేడాలను పరిశీలించాలి, ఆ తర్వాత ఈ రేట్ల ప్రాతిపదికపై వివిధ దేశాల్లోని లాభం రేట్ల మధ్యగల తేడాలను పోల్చిచూడాలి. ఈ తేడాలకు మూల కారణం వివిధ దేశాల్లోని అదనపు విలువ రేట్లలోని తేడాలు కానట్లయితే, ఈ అధ్యాయంలోని విశ్లేషణలో అదనపు విలువ ఏ పరిస్థితుల్లో సర్వత్రా ఒకే విధంగా, అంటే స్థిరంగా వుంటుందని భావించామో ఆ పరిస్థితులే దానికి కారణమవ్వాలి.

అదనపు విలువరేటు యధాతథంగా వుందనుకొన్నప్పుడు, స్థిర పెట్టుబడిలోని ఏదో ఒక భాగం విలువను పెంచి లేక తగ్గించి, తద్వారా పెట్టుబడి తాలూకు అస్థిర భాగం, స్థిరభాగం మధ్యగల నిష్పత్తిని ప్రభావితం చేసే పరిస్థితులను బట్టి ఒక నిర్దిష్ట పెట్టుబడి యొక్క లాభంరేటు పెరగవచ్చు లేదా తరగవచ్చునని మనం మునుపటి అధ్యాయంలో నిరూపించాం. ఒక వ్యక్తిగత పెట్టుబడి యొక్క టర్నోవర్ కాలాన్ని పొడిగించే, లేక కుదించే పరిస్థితులు – నిజానికి అదే విధంగా లాభంరేటును కూడా ప్రభావితం చేస్తాయని కూడా మనం గమనించాం. లాభ పరిమాణం అదనపు విలువ పరిమాణానికి, అసలు అదనపు విలువకు సమానంగా వుంటుంది. కనుక లాభం రేటుకు స్పష్టంగా భిన్నమైన లాభ పరిమాణాన్ని పైన పేర్కొన్న విలువ హెచ్చుతగ్గులు ప్రభావితం చేయవని కూడా మనం గమనించాం. ఒక నిర్ణీత అదనపు విలువ కాబట్టి ఒక నిర్ణీత పరిమాణంలోని లాభం – ఇవి అభివ్యక్తమయ్యే రేటును ఆ హెచ్చుతగ్గులు మార్చుతాయి; ఇంకో విధంగా చెప్పాలంటే, లాభం యొక్క సాపేక్ష పరిమాణాన్ని మాత్రమే – అంటే అడ్వాన్సయిన పెట్టుబడి పరిమాణంతో పోల్చితే వున్న లాభం యొక్క సాపేక్ష పరిమాణాన్ని మాత్రమే – అవి మార్చుతాయి. ఇలాటి విలువల మార్పు మూలంగా పెట్టుబడి బంధింపబడినప్పుడు కానీ, విడుదల అయినప్పుడు కానీ లాభం రేటు కాక లాభం కూడా పరోక్షంగా ప్రభావితమవుతుందని చూశాము. అయితే ఇదివరకే మదుపు చేసిన పెట్టుబడులకు మాత్రమే యిది వర్తించింది తప్ప కొత్త మదుపులకు కాదు. పైగా లాభం పెరగడం లేక తరగడం అన్నది ఎల్లప్పుడూ, అలాటి విలువల హెచ్చుతగ్గుల ఫలితంగా అదే పెట్టుబడి ఏ మేరకు ఎక్కువ శ్రమను లేక తక్కువ శ్రమను చలనంలో వుంచగలిగింది అనే అంశంపై ఆధారపడింది. ఇంకో విధంగా చెప్పాలంటే, అదనపు విలువ రేటులో మార్పు లేకుండా అదే పెట్టుబడి ఎక్కువ

అదనపు విలువను సృష్టించగలిగిందా, లేక తక్కువ అదనపు విలువను సృష్టించగలిగిందా అనే అంశంపై ఆధారపడి వుంటుందన్న సాధారణ నియమానికి మినహాయింపుగా కనిపించే యిది, సాధారణ నియమ అన్వయంలో ప్రత్యేక సందర్భమే తప్ప సాధారణ నియమ వ్యతిరేకమూ కాదు, దానికి మినహాయింపూ కాదు.

దోపిడీ స్థాయిలో మార్పులేని పక్షంలో, స్థిరపెట్టుబడి తాలూకు అంతర్భాగాల విలువల్లో, పెట్టుబడి తాలూకు టర్నోవర్ కాలంలో మార్పులు వస్తే, వీటితోపాటు లాభంరేటులో కూడా మార్పులు వస్తాయనీ యిదివరకు భాగంలో మనం గమనించాం. దీని నుంచి స్పష్టమవుతున్న నిర్ధారణ యిది. ఇతర పరిస్థితులు యథాతథంగా వుండి, వివిధ ఉత్పత్తి శాఖల్లో నియుక్తమయిన పెట్టుబడుల టర్నోవర్ కాలాల్లో తేడా వున్నట్లయితే, లేక వివిధ ఉత్పత్తి శాఖల్లో ఈ పెట్టుబడుల అంతర్భాగాల విలువ సంబంధంలో తేడా వున్నట్లయితే, పక్కపక్కనే వున్న వివిధ ఉత్పత్తి శాఖల్లోని లాభంరేట్లలో తేడాలుండక తప్పదు. అదే పెట్టుబడికి సంబంధించి వరుసగా మార్పులు సంభవిస్తున్నట్లు మనం ఇదివరకు పరిగణించిన దానిని ఇప్పుడు విభిన్న ఉత్పత్తి శాఖల్లో, పక్కపక్కనే వున్న పెట్టుబడి మదుపుల్లో ఏకకాలంలో తలెత్తిన మార్పులుగా పరిగణించాలి.

ఈ పరిస్థితుల్లో మనం ఈ క్రింది అంశాలను విశ్లేషించాల్సి వుంది : 1. పెట్టుబడుల అంతర్నిర్మాణంలోని తేడా 2. వాటి టర్నోవర్ కాలాల్లోని తేడాలు.

ఈ యావత్ విశ్లేషణలోని పూర్వావసర ప్రాతిపదిక యేదంటే, ఒక నిర్దిష్ట ఉత్పత్తి శాఖలోని పెట్టుబడి అంతర్ నిర్మాణ స్వరూపం గురించి కానీ పెట్టుబడి టర్నోవర్ గురించి కానీ మనం ప్రస్తావిస్తున్నప్పుడు, ఆ శాఖలో సగటున మదుపు చేయబడిన మామూలు పరిమాణాల్లోని పెట్టుబడే తప్ప, ఆ ప్రత్యేక రంగంలో నియుక్తమయిన మొత్తం పెట్టుబడిలోని సగటే తప్ప, వ్యష్టి పెట్టుబడుల యాదృచ్ఛిక భేదాలు కాదు అన్నది మన అభిప్రాయం.

అదనపు విలువరేటు, పని దినమూ స్థిరంగా వుంటాయని ఊహించుకొంటున్నాం. ఈ కారణంగా వేతనాలు కూడా స్థిరంగా వుంటాయి; కనుక ఒకానొక పరిమాణంలోని అస్థిర పెట్టుబడి – చలనంలో వుంచిన ఒక నిర్దిష్ట పరిమాణంలోని శ్రమశక్తికి ప్రాతినిధ్యం వహిస్తుంది; కనుక ఒక నిర్దిష్ట పరిమాణంలోని వాస్తవీకృత శ్రమను అది సూచిస్తుంది. కాబట్టి 100 పౌండ్లు గనుక 100 మంది కార్మికుల వారంరోజుల వేతనాలకు ప్రాతినిధ్యం వహిస్తే, అంటే 100 వాస్తవ శ్రమశక్తులకు అవి ప్రాతినిధ్యం వహిస్తే, ర రెట్లు 100 పౌండ్లు అన్నవి ర రెట్లు 100 కార్మికుల శ్రమశక్తిని సూచిస్తాయి. $\frac{100}{ర}$ పౌండ్లు 100 కార్మికుల శ్రమశక్తిని సూచిస్తాయి. ఈవిధంగా ఇక్కడ అస్థిర పెట్టుబడి (వేతనం నిర్ణీతమై వున్నప్పుడు ఎప్పటిలాగే) నిర్దిష్టమైన ఒక మొత్తం పెట్టుబడిచేత చలనంలో వుంచబడిన శ్రమ పరిమాణానికి ఇక్కడ సూచికగా ఉపకరిస్తుంది. కాబట్టి నియుక్తం అయిన అస్థిర పెట్టుబడుల పరిమాణాల్లోని తేడాలు, నియుక్తం అయిన శ్రమశక్తి పరిమాణంలోని తేడాలకు సూచికలుగా ఉపకరిస్తాయి. 100 పౌండ్లు గనుక వారానికి 100 కార్మికులను సూచిస్తే, వారానికి 60 పనిగంటల చొప్పున 6000 పనిగంటలకు ప్రాతినిధ్యం వహిస్తే, 200 పౌండ్లు 12000 పనిగంటలకు ప్రాతినిధ్యం వహిస్తాయి; 50 పౌండ్లు 3000 పనిగంటలకు మాత్రమే ప్రాతినిధ్యం వహిస్తాయి.

ప్రథమ సంపుటిలో చెప్పినట్లు, పెట్టుబడి అంతర్నిర్మాణం అంటే, ఆ పెట్టుబడిలోని క్రియాత్మక,

నిష్క్రియా భాగాల మధ్య, అంటే అస్థిర పెట్టుబడి, స్థిర పెట్టుబడుల మధ్య నిష్పత్తులన్న మాట. ఈ శీర్షిక క్రింద రెండు నిష్పత్తులు పరిశీలనకు వస్తున్నాయి. కొన్ని నిర్దిష్ట పరిస్థితుల్లో అవి ఒకే రకమైన ఫలితాలను సృష్టించే వీలున్నప్పటికీ అవి రెండూ సమాన ప్రాముఖ్యం కలవి కావు.

మొదటి నిష్పత్తి సాంకేతిక ప్రాతిపదికపై ఆధారపడి వుంటుంది; ఉత్పాదక శక్తులయొక్క ఒక నిర్దిష్ట అభివృద్ధి దశలో ఇది నిర్ణీతమైనదిగా పరిగణించాలి. ఒక రోజులో ఒక నిర్దిష్ట పరిమాణంలోని ఉత్పాదితాలను ఉత్పత్తి చేయటానికి ఒక నిర్దిష్ట సంఖ్యలోని కార్మికులకు ప్రాతినిధ్యం వహించే ఒక నిర్దిష్ట పరిమాణంలో శ్రమశక్తి అవసరమవుతుంది; తద్వారా – ఇది స్వయం విదితమే – ఒక నిర్దిష్ట పరిమాణంలోని ఉత్పత్తి సాధనాలు, యంత్రాలు, ముడిపదార్థాలు వగైరాలను ఉత్పాదకంగా వినియోగించడానికి ఆ శ్రమ అవసరమవుతుంది. ఒక నిర్దిష్ట పరిమాణంలోని ఉత్పత్తి సాధనాలకు అనుగుణంగా కార్మికులు ఒక నిర్దిష్ట సంఖ్యలో వుంటారు. కనుక ఉత్పత్తి సాధనాల్లో వాస్తవ రూపం దాల్చిన ఒక నిర్దిష్ట పరిమాణంలోని శ్రమకు అనుగుణంగా ఒక నిర్దిష్ట పరిమాణంలోని సరుకే శ్రమవుతుంది. ఈ నిష్పత్తి వివిధ ఉత్పత్తి రంగాల్లో విభిన్న రీతుల్లో వుంటుంది; తరచూ ఒకే పరిశ్రమలోని విభిన్న శాఖల్లో కూడా అది విభిన్న రీతుల్లోనే వుంటుంది. కాకపోతే యాదృచ్ఛికంగా విభిన్న పరిశ్రమల్లో అది పూర్తిగా, లేక, దాదాపు ఒకే విధగా వుండొచ్చు.

పెట్టుబడి తాలూకు సాంకేతిక అంతర్నిర్మాణంగా వున్నది ఈ నిష్పత్తే; దాని ఆంగిక అంతర్నిర్మాణానికి నిజమైన ప్రాతిపదిక ఇదే.

అయితే అస్థిర పెట్టుబడి కేవలం శ్రమ శక్తికి సూచికగానూ, స్థిర పెట్టుబడి కేవలం ఆ శ్రమశక్తి చలనంలో పెట్టిన మొత్తం ఉత్పత్తి సాధనాలకు సూచికగానూ వున్నట్లయితే ఈ మొదటి నిష్పత్తి అన్ని పరిశ్రమ శాఖల్లోనూ ఒకేరకంగా వుండే అవకాశం కూడా వుంది. ఉదాహరణకు, రాగి పరిశ్రమలోనూ, ఇనుము పరిశ్రమలోనూ మొత్తం ఉత్పత్తి సాధనాలతో పని చేయించడానికి ఒకే నిష్పత్తిలోని శ్రమశక్తి అవసరం కావచ్చు; అయితే రాగి, ఇనుము కన్నా ఖరీదయినది కనుక ఈ రెండు శాఖల్లోనూ అస్థిర పెట్టుబడి, స్థిర పెట్టుబడి మధ్య గల విలువ సంబంధంలో తేడా వుంటుంది. ప్రతి పరిశ్రమలోనూ సాంకేతిక నిర్మాణ స్వరూపానికీ, విలువ నిర్మాణ స్వరూపానికీ మధ్య గల తేడా ఈ క్రింది విధంగా వ్యక్తమవుతుంది. పెట్టుబడి సాంకేతిక స్వరూపం మాత్రం యథాతథంగా వుండగా దాని రెండు భాగాల విలువ సంబంధం మారవచ్చు. సాంకేతిక నిర్మాణ స్వరూపం మారినప్పటికీ విలువ సంబంధం యథాతథంగా వుండొచ్చు. ఈ రెండవ సందర్భం ఎప్పుడు సాధ్యపడుతుందంటే, నియుక్తం అయిన ఉత్పత్తి సాధనాల మొత్తానికీ, శ్రమశక్తికీ మధ్యగల నిష్పత్తిలో మార్పు వాటి విలువల్లో తద్వ్యతిరిక్తమైన మార్పు పరిహరించాలి.

పెట్టుబడి యొక్క విలువ నిర్మాణ స్వరూపాన్ని దాని సాంకేతిక నిర్మాణ స్వరూపం నిర్ణయిస్తుంది. ప్రతిబింబిస్తుంది. అందువల్ల దాన్ని పెట్టుబడి యొక్క ఆంగిక నిర్మాణ స్వరూపం అని పిలుస్తారు.[1]

1. ప్రధమ సంపుటం మూడవ కూర్పు ప్రారంభంలో Kap XXIII.S 628లో పై భావాన్ని సంక్షిప్తంగా వివరిం చడం జరిగింది. (ఇంగ్లీషు కూరు. అధ్యాయం XXV పుట 574 సంపాదకుడు) మొదటి రెంటు కూర్పుల్లో ఈ వాక్య సముదాయం లేదు కాబట్టి దీని పునశ్చరణ యిక్కడ మరింత వాంఛనీయం
**– ఫెడరిక్ ఎంగెల్స్**

కాబట్టి అస్థిర పెట్టుబడికి సంబంధించి, అది ఒక నిర్దిష్ట శ్రమశక్తి లేదా అనిర్దిష్ట కార్మికుల సంఖ్యకి, లేదా చలనంలో వుంచిన సజీవ శ్రమ నిర్దిష్ట పరిమాణానికి సూచిక అని ఊహించుకొన్నాం. అస్థిర పెట్టుబడి విలువ పరిమాణంలో మార్పు, అంతిమంగా, అదే శ్రమశక్తి యొక్క ఎక్కువ లేక తక్కువ ధరను మాత్రమే సూచిస్తుందని మనం వెనుకటి భాగంలో గమనించాం. అయితే అదనపు విలువ రేటూ, పనిదినమూ స్థిరంగా వున్నాయని ఒక నిర్దిష్ట పని కాలానికి వేతనాలు నిర్ణీతమై వున్నాయని ఇక్కడ ఊహించుకొంటున్నాము. కాబట్టి ఇక్కడ ఆ సమస్యే ఉత్పన్నం కాదు. మరోవైపు, స్థిర పెట్టుబడి పరిమాణంలోని మార్పు ఒక నిర్దిష్ట శ్రమశక్తి చేత చలనంలో వుంచబడిన ఉత్పత్తి సాధనాల పరిమాణంలో మార్పులకు సూచికగా వుండొచ్చు. కానీ ఒక శాఖలోనూ మరొక శాఖలోనూ చలనంలో వుంచబడిన ఉత్పత్తి సాధనాల విలువ మధ్యగల తేడానుంచి కూడా ఇది తలెత్తవచ్చు. కనుక రెండు అభిప్రాయాలనూ ఇక్కడ పరిశీలించాల్సి వుంది.

చివరగా ఈ క్రింది ముఖ్యమైన వాస్తవాలను గమనిద్దాం :

100 పౌండ్లు 100 మంది కార్మికుల వారం రోజుల వేతనం అనుకుందాం. వారం రోజుల పనిగంటలు 60 అనుకుందాం. అంతేకాక, అదనపు విలువ రేటు 100% అనుకుందాం. ఈ ఉదాహరణలో కార్మికులు మొత్తం 60 గంటల్లో 30 గంటలు తమకోసం పనిచేస్తే, మిగతా 30 గంటలు పెట్టుబడిదారుడి కోసం ఉచితంగా పనిచేస్తారు. వాస్తవంలో 100 పౌండ్ల వేతనం 100 మంది కార్మికుల యొక్క 30 పనిగంటలకు మాత్రమే ప్రాతినిధ్యం వహిస్తుంది. లేదా మొత్తంగా 3000 పని గంటలకే ప్రాతినిధ్యం వహిస్తుంది; కాగా కార్మికులు పనిచేసిన మిగతా 3,000 గంటలు 100 పౌండ్ల అదనపు విలువలో లేక పెట్టుబడిదారు జేబులో వేసుకున్న లాభంలో నిక్షిప్తమై వుంది. కాబట్టి, 100 పౌండ్ల వేతనం 100 మంది కార్మికుల వారం వారీ శ్రమ దాల్చిన వస్తు రూప విలువను వ్యక్తం చేయని విషయం వాస్తవమే. అయినప్పటికీ (పనిదిన పరిమాణం, అదనపు విలువ రేటు నిర్ణీతమయినవి కనుక) ఆ పెట్టుబడి 100 మంది కార్మికులను 6,000 పనిగంటలు చలనంలో వుంచుతుందన్న వాస్తవాన్ని అది సూచిస్తుంది. మొదటిది ఈ 100 పౌండ్ల పెట్టుబడి దీన్ని యిలా ఎందుకు సూచిస్తుందంటే, ఒక పౌండు = ఒక వారానికి ఒక కార్మికుని చొప్పున చలనంలో వుంచిన ఆ కార్మికుల సంఖ్యను అది సూచిస్తుంది. కాబట్టి 100 పౌండ్లు = 100 మంది కార్మికులు; రెండవది – అదనపు విలువ రేటు 100% కనుక ప్రతి కార్మికుడూ తన వేతనంలో వున్న దానికి రెట్టింపు పని చేస్తాడు; ఆ కారణంగా 1 పౌండు, అంటే వారం శ్రమలో సగాన్నే వ్యక్తం చేసే అతని వేతనం మొత్తం ఒక వారం శ్రమను పనిలో పెడుతుంది – అలాగే 100 పౌండ్ల వేతనంలో 50 వారాల శ్రమ మాత్రమే వున్నప్పటికీ, 100 పౌండ్లు 100 వారాల శ్రమను చలనంలో వుంచుతుంది. ఈ విధంగా వేతనాలుగా మదుపు చేసిన అస్థిర పెట్టుబడి విషయంలో చాలా ముఖ్యమైన ఒక తేడాను స్పష్టం చేయాలి. వేతనాల మొత్తంగా, ఒక నిర్దిష్ట పరిమాణంలోని వస్తురూప శ్రమగా వుండే దాని విలువకూ, అది చలనంలో వుంచిన సజీవ శ్రమ పరిమాణం యొక్క సూచికగా మాత్రమే వుండే విలువకూ మధ్య గల తేడాను గమనించాలి. చలనంలోని సజీవ శ్రమ పరిమాణానికి సూచికగా వుండే విలువ ఎల్లప్పుడూ అందులో మూర్తీభవించి వున్న విలువ కంటే ఎక్కువగానే వుంటుంది; కాబట్టి అస్థిర పెట్టుబడి విలువకంటే ఎక్కువ విలువే దానికి ప్రాతినిధ్యం వహిస్తుంది. ఈ ఎక్కువ విలువను ఒకవైపు

అస్థిర పెట్టుబడిచేత చలనంలో వుంచబడిన కార్మికుల సంఖ్య, మరోవైపు వారు చేసిన అదనపు శ్రమ పరిమాణమూ నిర్ధారిస్తాయి.

అస్థిర పెట్టుబడిని ఈ విధంగా పరిశీలిస్తే ఈ క్రింది నిర్ధారణలు లభిస్తాయి :

'క' అనే ఉత్పత్తి శాఖలో మదుపు పెట్టిన మొత్తం పెట్టుబడిలోని ప్రతి 700 కు 100 మాత్రమే అస్థిర పెట్టుబడిగానూ, మిగతా 600 స్థిర పెట్టుబడిగానూ ఖర్చు పెట్టారని, 'గ' అనే ఉత్పత్తి శాఖలో 600 అస్థిర పెట్టుబడిగానూ, మిగతా 100 స్థిర పెట్టుబడిగానూ ఖర్చు పెట్టారని అనుకుందాం. అప్పుడు 'క' తాలూకు 700 పెట్టుబడి, 100 శ్రమశక్తిని లేక 100 వారాల శ్రమను లేక 6000 గంటల సజీవ శ్రమను చలనంలో వుంచుతుంది. అప్పుడు 'క' తాలూకు పెట్టుబడి 50 వారాల శ్రమను మాత్రమే స్వాయత్తం చేసుకుంటుంది. కాగా 'గ' తాలూకు అదే పెట్టుబడి మొత్తం 600 వారాల శ్రమను లేక 36000 గంటల సజీవ శ్రమను చలనంలో వుంచుతుంది. కాగా 'గ' తాలూకు అదే మొత్తం పెట్టుబడి 300 వారాల శ్రమను లేక 18000 గంటల శ్రమను స్వాయత్తం చేసుకుంటుంది. అస్థిర పెట్టుబడి అన్నది అందులో మూర్తీభవించి వున్న శ్రమకు సూచిక మాత్రమే కాదు. అదనపు విలువ రేటు నిర్ణీతమై వున్న సందర్భంలో అందులో మూర్తీభవించి వున్న శ్రమయే కాక దానికి అదనంగా చలనంలో వుంచిన శ్రమ పరిమాణానికి కూడా అంటే – అదనపు విలువకు కూడా అది సూచిక. దోపిడీ తీవ్రత ఒకే విధంగా వుందనుకొంటే, మొదటి ఉదాహరణలో లాభం ఇలా వుంటుంది. $\frac{100}{700} = \frac{1}{7} = 14\frac{2}{7}\%$, కాగా రెండవ ఉదాహరణలో $\frac{600}{700} = \frac{6}{7} = 85\frac{5}{7}\%$ లేదా ఆరు రెట్లు లాభం రేటు. ఈ ఉదాహరణలో లాభం ఆరు రెట్లు అధికంగా వుంటుంది; అంటే 'గ' ఉత్పత్తి శాఖలో అది 600 కాగా 'క' ఉత్పత్తి శాఖలో అది 100 మాత్రమే. కారణమేమంటే, అదే మొత్తంలోని పెట్టుబడి సజీవ శ్రమ అంటే ఆరు రెట్లు ఎక్కువ శ్రమను చలనంలో వుంచుతుంది. అంటే అదే దోపిడీ స్థాయిలో ఆరు రెట్లు అదనపు విలువను, ఆ విధంగా ఆరు రెట్లు ఎక్కువ లాభాన్ని సంపాదిస్తుంది.

అలా కాకుండా 'క' ఉత్పత్తి శాఖలో మదుపు చేసిన పెట్టుబడి 700 పౌండ్లు కాకుండా 7000 పౌండ్లు అనీ, 'గ' ఉత్పత్తి శాఖలో మదుపు చేసిన పెట్టుబడి 700 పౌండ్లు అనీ అనుకుంటే, ఈ రెండింటి అంతర్నిర్మాణ స్వరూపం ఒకటే అనుకుంటే, అప్పుడు 'క' ఉత్పత్తి శాఖ తన 7000 పౌండ్లలో, 1000 పౌండ్లను అస్థిర పెట్టుబడిగా వాడుకుంటుంది. అంటే వారానికి 1000 మంది కార్మికులను నియోగిస్తుంది. ఇది 60 వేల గంటల సజీవ శ్రమ, అందులో 30,000 గంటలు అదనపు శ్రమగా వుంటుంది. అయినప్పటికీ, 'క' పెట్టుబడిలోని ప్రతి 700 పౌండ్లు గ లోని పెట్టుబడి చలనంలో వుంచిన దానిలో ఆరింట ఒక వంతు సజీవ శ్రమను మాత్రమే చలనంలో వుంచుతుంది; కనుక అది చలనం లోటును అదనపు శ్రమ కూడా ఆరోవంతు మాత్రమే వుంటుంది. కాబట్టి అది ఉత్పత్తి చేసే లాభమూ, గ దానిలో ఆరోవంతు మాత్రమే వుంటుంది. ఇప్పుడిక లాభం రేటును పరిశీలిస్తే అది 'క' ఉత్పత్తి శాఖలో $\frac{1000}{7000} = \frac{100}{700} = 14\frac{2}{7}\%$ ఇక 'గ' ఉత్పత్తి శాఖలో $\frac{600}{700}$ లేక $85\frac{5}{7}\%$. ఒకే పెట్టుబడి మొత్తాలను తీసుకున్నప్పటికీ, లాభం రేట్లలో తేడా వుంటుంది; అందుకు కారణమేమంటే, అదనపు విలువ రేట్లలో మార్పులేనప్పటికీ చలనంలో వుంచిన సజీవ శ్రమ పరిమాణంలోనూ అదనపు విలువ పరిమాణంలోనూ తేడాలున్నాయి.

ఒకదానిలో మదుపు చేసిన దానికంటే మరో దానిలో మదుపు చేసిన స్థిర పెట్టుబడి తాలూకు భాగాల విలువలో మార్పు వున్నప్పటికీ, అంటే తక్కువగా వున్నా, ఎక్కువగా వున్నా రెండింటిలోనూ సాంకేతిక పరిస్థితులు ఒకేరకంగా వున్నట్లయితే, దాదాపు మనకు ఇదే రకమైన ఫలితం లభిస్తుంది. రెండు ఉత్పత్తి శాఖల్లోనూ 100 పౌండ్లను అస్థిర పెట్టుబడిగా పెట్టారనుకుందాం; కాబట్టి ఒకే పరిమాణంలోని యంత్రాలను ముడి పదార్థాలను చలనంలో వుంచడానికి వారానికి 100 మంది కార్మికులను నియమించారనుకుందాం. అయితే 'క' లో కంటె 'గ'లో యంత్రాల, ముడిపదార్థాల ఖర్చు ఎక్కువ అనుకుందాం. ఉదాహరణకు 'క'లో 100 పౌండ్ల అస్థిర పెట్టుబడి 200 పౌండ్ల స్థిర పెట్టుబడిని, 'గ'లో 400 పౌండ్లు స్థిర పెట్టుబడిని చలనంలో ఉంచిందనుకుందాం. అదనపు విలువరేటు 100%లో మార్పులేదు. కనుక రెండింటిలోనూ ఉత్పత్తి అయిన అదనపు విలువ 100 పౌండ్లకు సమానంగా వుంటుంది; అందువలన రెండింటిలోనూ లాభం కూడా 100 పౌండ్ల మేరకే వుంటుంది. అయితే 'క'లో లాభం రేటు మాత్రం $\frac{100}{200\text{స్థిపె}+100\text{అపె}} = \frac{1}{3} = 33\frac{1}{3}\%$ కాగా 'గ'లో అది $\frac{100}{400\text{స్థిపె}+100\text{అపె}} = \frac{1}{5} = 20\%$ కాగా ఇందులోని మొత్తం పెట్టుబడిలోని పూర్ణాంక భాగాన్ని (aliquot part) తీసుకున్నప్పటికీ 'గ'లోని ప్రతి 100 పౌండ్లలోనూ 20 పౌండ్లు మాత్రమే అంటే అయిదింట ఒక వంతు మాత్రమే అస్థిర పెట్టుబడిగా వున్నట్లు 'క' లోని ప్రతి 100 పౌండ్లలోనూ $33\frac{1}{3}$ పౌండ్లు అంటే మూడింట ఒక వంతు అస్థిర పెట్టుబడిగా వున్నట్లు మనకు తెలుస్తుంది. 'గ' ఉత్పత్తి శాఖ ప్రతి 100 పౌండ్లకూ 'క' కన్నా తక్కువ లాభాన్ని ఉత్పత్తి చేస్తుంది; అందుకు కారణం 'క' కంటే యిది తక్కువ సజీవ శ్రమను చలనంలో వుంచడమే. ఈ ఉదాహరణలో లాభం రేటులోని తేడా లాభ పరిమాణంలోని తేడాగా తేలుతుంది. మదుపు పెట్టిన పెట్టుబడిలోని ప్రతి 100 పౌండ్లు ఉత్పత్తి చేసిన అదనపు విలువ పరిమాణాలే యిందుకు కారణం.

రెండవ ఉదాహరణకూ, మొదటి ఉదాహరణకూ మధ్య గల తేడా ఇది. రెండో ఉదాహరణలో 'క', 'గ' ల మధ్య సమానీకరణ కోసం, సాంకేతిక ప్రాతిపదికలో మార్పు లేనట్లయితే, 'క' లేక 'గ' తాలూకు స్థిర పెట్టుబడి విలువలో మార్పు మాత్రమే అవసరం. అయితే మొదటి ఉదాహరణలో రెండు ఉత్పత్తి శాఖల్లోని సాంకేతిక నిర్మాణ స్వరూపాల మధ్య తేడా వుంది; సమానీకరణ సాధించడానికి దీనిని పూర్తిగా మార్చాల్సి వుంది.

వివిధ పెట్టుబడుల వేరువేరు అంతర్నిర్మాణ స్వరూపం ఈ విధంగా వాటి నిరపేక్ష పరిమాణాలతో నిమిత్తం లేనిది. ప్రతి 100 పౌండ్లలోనూ అస్థిర పెట్టుబడి ఎంత, స్థిర పెట్టుబడి ఎంత అన్నదే నిరంతరం ఎదురయ్యే ప్రశ్న.

శాతాల్లో లెక్కించిన విభిన్న పరిమాణాల్లోని పెట్టుబడులు లేక, (ప్రస్తుత సందర్భంలో అటువంటిదే అయిన) ఒకే పనికాలం, ఒకే దోపిడీ స్థాయితో పనిచేసే ఒకే పరిమాణం గల పెట్టుబడులు అదనపు విలువ కారణంగా విభిన్న మొత్తాల లాభాన్ని ఉత్పత్తి చేయవచ్చు. ఇందుకు కారణమేమిటంటే; వివిధ ఉత్పత్తి శాఖల్లోని పెట్టుబడి తాలూకు అంతర్నిర్మాణంలో తేడా వుందంటే, వాటి అస్థిర భాగాల్లో కూడా తేడా వున్నట్లే. ఆ మేరకు చలనంలో వుంచిన సజీవ శ్రమ పరిమాణాల్లోనూ తేడా వుంటుంది. కాబట్టి వారు స్వాయత్తం చేసుకునే అదనపు శ్రమ మొత్తాల్లో కూడా వ్యత్యాసం వుంటుంది. అదనపు

విలువ సారం ఆ విధంగా లాభం యొక్క అసలు సారం – ఈ అదనపు శ్రమే. విభిన్న ఉత్పత్తి శాఖల్లోని మొత్తం పెట్టుబడి తాలూకు సమాన భాగాల్లో అదనపు విలువ యొక్క మూలాధారాలు అసమంగా వుంటాయి. కాగా అదనపు విలువ యొక్క ఏకైక మూలాధారం సజీవ శ్రమ. శ్రమ దోపిడీ ఒకే స్థాయిలో వుండి, 100 పెట్టుబడి చలనంలో వుంచే శ్రమ పరిమాణం పర్యవసానంగా ఆ పెట్టుబడి స్వాయత్తం చేసుకునే అదనపు విలువ పరిమాణం నిజానికి దానిలోని అస్థిర భాగంపై ఆధారపడి వుంటుంది. 90 స్థి.పె. +10అ.పె. శాతంలోని పెట్టుబడీ, 10 స్థి.పె. +90 అ.పె. శాతంలోని పెట్టుబడీ రెండూ ఒకే దోపిడీ స్థాయితో ఒకే పరిమాణంలో అదనపు విలువను, లేక లాభాన్ని కనుక ఉత్పత్తి చేసినట్లయితే; అదనపు విలువకూ, మొత్తం మీద విలువకూ మూలాధారం శ్రమ కాకుండా మరొకటేదో వుండి వుండాలన్న విషయం కరతలామలకం. అంతేకాదు, అప్పుడు రాజకీయ అర్థశాస్త్రానికి ఏ సహేతుక ప్రాతిపదికా లేకుండా పోతుందనేదీ అంతగానూ సుస్పష్టం. 60 గంటలు పనిచేసే కార్మికుని వారంవారీ వేతనానికి 1 పౌండు ప్రాతినిధ్యం వహిస్తుందని, అదనపు విలువ రేటు 100% అనీ మనం భావిస్తే, వారంలో ఒక కార్మికుడు సృష్టించే మొత్తం విలువ – ఉత్పాదితం 2 పౌండ్లు అనేది స్పష్టమే. ఆ లెక్కన 10 మంది కార్మికులు 20 పౌండ్లకంటె యెక్కువ విలువ – ఉత్పాదితాన్ని సృష్టించలేరు. అయితే ఈ 20 పౌండ్లలోనూ 10 పౌండ్లు వేతనాలను భర్తీచేస్తాయి కాబట్టీ ఆ పదిమంది కార్మికులు 10 పౌండ్లకంటే ఎక్కువ అదనపు విలువ సృష్టించలేరు. కాగా, 90 పౌండ్లు వేతనాలతో 180 పౌండ్ల మొత్తం ఉత్పాదితాన్ని సృష్టించే 90 మంది కార్మికులు 90 పౌండ్ల అదనపు విలువను ఉత్పత్తి చేస్తారు. మొదటి ఉదాహరణలో లాభం రేటు 10% కాగా రెండో ఉదాహరణలో లాభం రేటు 90%. ఇలా కాకపోతే, విలువ, అదనపు విలువ రెండూ కూడా వస్తు రూపం దాల్చిన శ్రమ కాక మరొకటేదో అయి వుండాలి. విభిన్న ఉత్పత్తి శాఖల్లోని పెట్టుబడులు శాతాల్లో పరిగణింపబడితే లేక సమాన మొత్తాలు గల పెట్టుబడులుగా పరిగణింపబడితే అవి అస్థిర, స్థిర పెట్టుబడులుగా భిన్నరీతిలో విభాజితమై వుంటాయి. అవి చలనంలో వుండే సజీవ శ్రమ పరిమాణాలకు భిన్నంగా వుంటాయి. కాబట్టి అవి విభిన్న అదనపు విలువలను సృష్టిస్తాయి. కాబట్టి విభిన్న లాభాలను సృష్టిస్తాయి. లాభం రేటు అంటే మొత్తం పెట్టుబడికి అదనపు విలువకు మధ్యన శాతంలో వ్యక్తమయిన నిష్పత్తి. కాబట్టి లాభం రేటు మార్పు చెందక తప్పదని దీన్నిబట్టి తేలుతుంది.

శాతంలో లెక్కించబడిన విభిన్న ఉత్పత్తి శాఖల్లోని పెట్టుబడులు కనుక, అంటే సమాన పరిమాణాలు కనుక తమ అంతర్నిర్మాణంలోని తేడాల మూలంగా అసమలాభాలను ఉత్పత్తి చేసినట్లయితే, విభిన్న ఉత్పత్తి శాఖల్లోని అసమ పెట్టుబడుల తాలూకు లాభాలు వాటి పెట్టుబడుల పరిమాణాలకు అనుగుణమైన నిష్పత్తిలో వుండజాలవని నిర్ధారణ అవుతోంది; లేదా విభిన్న ఉత్పిత్తి శాఖల్లోని లాభాలు, ఆ శాఖల్లో మదుపుపెట్టిన పెట్టుబడుల పరిమాణాలకు అనుగుణమైన నిష్పత్తిలో వుండవన్నది స్పష్టమే; ఎందుచేతనంటే, లాభాలు గనుక మదుపు పెట్టిన పెట్టుబడుల మొత్తాల పెరుగుదలకు అనుగుణమైన నిష్పత్తిలో పెరిగినట్లయితే లాభాల శాతం కూడా అదే నిష్పత్తిలో వుంటుంది, ఫలితంగా విభిన్న ఉత్పత్తి శాఖల్లో సమాన మొత్తాల్లోని పెట్టుబడులకు వాటి అంతర్నిర్మాణ స్వరూపంలో తేడా వున్నప్పటికీ, సమాన లాభం రేట్లు వుంటాయి. పెట్టుబడి అంతర్నిర్మాణం నిర్ణీతమైన ఒకే

ఉత్పత్తి శాఖలోనూ లేదా పెట్టుబడుల ఆంతరిక స్వరూపం ఒకే విధంగా వుండే విభిన్న ఉత్పత్తి శాఖల్లోనూ మాత్రమే లాభం మొత్తాలు, మదుపు చేసిన పెట్టుబడుల మొత్తాలకు నేరుగా అనుగుణమైన నిష్పత్తిలో వుంటాయి. అసమాన మొత్తాల్లోని పెట్టుబడుల తాలూకు లాభాలు ఆ పెట్టుబడుల పరిమాణాలకు అనుగుణమైన నిష్పత్తిలో వుంటాయనడం, సమాన మొత్తాల్లోని పెట్టుబడులు సమాన లాభాలను సృష్టిస్తాయని చెప్పడమే అవుతుంది; లేదా పరిమాణంతోనూ అంతర్నిర్మాణ స్వరూపంతోనూ నిమిత్తం లేకుండా అన్ని పెట్టుబడులకూ ఒకే లాభం రేటు వుంటుందని చెప్పడమే అవుతుంది.

సరుకులు వాటి విలువలకే అమ్ముడవుతాయని భావిస్తేనే, పైన చెప్పిన విషయాలు సరియైనవి అనాలి. ఒక సరుకు యొక్క విలువ; నిజానికి అందులో వున్న స్థిర పెట్టుబడి విలువ + అందులో పునరుత్పత్తి అయిన అస్థిర పెట్టుబడి విలువ + దాని వృద్ధికి అంటే – ఈ అస్థిర పెట్టుబడి సృష్టించిన అదనపు విలువకు సమానంగా వుంటుంది. అదనపు విలువ రేటు మార్పు చెందనట్లయితే, అదనపు విలువ పరిమాణం అన్నది నిస్సంశయంగా అస్థిర పెట్టుబడి పరిమాణంపై ఆధారపడి వుంటుంది. 100 పౌండ్ల వ్యక్తిగత పెట్టుబడి యొక్క ఉత్పాదితం విలువ ఒక ఉదాహరణలో $90_{\text{స్థి.పె.}} + 10_{\text{అ.పె.}} + 10_{\text{అ.వి}} = 110$గానూ; మరో ఉదాహరణలో $10_{\text{స్థి.పె.}} + 90_{\text{అ.పె.}} + 90_{\text{అ.వి.}} = 190$ గానూ వుంటుంది. సరుకులు తమ విలువలకే అమ్మకమయితే, మొదటి వుత్పాదితం 110 పౌండ్లకు అమ్ముడవుతుంది; అందులో 10 పౌండ్లు అదనపు విలువకు లేక చెల్లించబడని శ్రమకు ప్రాతినిధ్యం వహిస్తుంది; కాగా రెండవ ఉత్పాదితం 190 పౌండ్లకు అమ్ముడవుతుంది. అందులో 90 పౌండ్లు అదనపు విలువకు లేక చెల్లించబడని శ్రమకు ప్రాతినిధ్యం వహిస్తుంది.

వివిధ దేశాల్లోని లాభం రేట్లను తులనాత్మకంగా పరిశీలిస్తున్నప్పుడు దీనికి ప్రత్యేక ప్రాముఖ్యం వుంది. ఉదాహరణకు, ఒక యూరప్ దేశంలోని అదనపు విలువ రేటు 100% అనుకుందాం; అప్పుడు కార్మికులు – పనిదినంలో అర్ధ భాగం తమకోసం, మిగతా అర్ధ భాగం తమ యజమాని కోసం పనిచేస్తారు. ఇకపోతే ఒక ఆసియా దేశంలో అదనపు విలువ రేటు 25% అనుకుందాం. అప్పుడు కార్మికులు పనిదినంలో అయిదింట నాలుగు వంతులు తమకోసమూ, అయిదింట ఒక వంతు తమ యజమాని కోసమూ పనిచేస్తారు. యూరప్ దేశంలో జాతీయ పెట్టుబడి అంతర్నిర్మాణ స్వరూపం $84_{\text{స్థి.పె.}} + 16_{\text{అ.పె.}}$గా వుందనుకుందాం; అలాగే తక్కువ యంత్రాలు వాడకంలో వుండే ఆసియా దేశంలో జాతీయ పెట్టుబడి స్వరూపం $16_{\text{స్థి.పె.}} + 84_{\text{అ.పె.}}$గా వుందనుకుందాం; ఆసియా దేశంలో ఒక నిర్దిష్ట పరిమాణంలోని శ్రమశక్తి ఉత్పాదక రీత్యా సాపేక్షంగా తక్కువ ముడి పదార్థాలను వ్యయం చేస్తుంది. అప్పుడు లెక్క ఇలా వుంటుంది:

యూరప్ దేశంలో ఉత్పాదితం విలువ = $84_{\text{స్థి.పె.}} + 16_{\text{అ.పె.}} + 16_{\text{అ.వి.}} = 116$;

లాభం రేటు = $\frac{16}{100}$ = 16%

ఆసియా దేశంలో ఉత్పాదితం విలువ = $16_{\text{స్థి.పె.}} + 84_{\text{అ.పె.}} + 21_{\text{అ.వి}} = 121$.

లాభం రేటు = $\frac{21}{100}$ = 21%

ఈ విధంగా యూరప్ దేశంలో కంటే ఆసియా దేశంలో లాభంరేటు 25% ఎక్కువ; యూరప్ దేశంలోని అదనపు విలువ రేటులో ఆసియా దేశంలోని అదనపు విలువ రేటు నాలుగింట ఒకవంతు మాత్రమే వున్నప్పటికీ లాభం రేటు ఇలా ఎక్కువగా వుంది. కారీ, బాస్టియట్ ఇంకా అలాటి

అర్థశాస్త్రవేత్తలు దీనికి పూర్తిగా వ్యతిరేకమైన నిర్ధారణకు వస్తారు. ఈ సందర్భంలో ఒక మాట, విభిన్న జాతీయ లాభం రేట్లు ప్రధానంగా విభిన్న జాతీయ అదనపు విలువ రేట్లపై ఆధారపడి వుంటాయి. అయితే మనం ఈ అధ్యాయంలో ఒకే అదనపు విలువ రేటు నుంచి నిష్పన్నమైన అసమ లాభం రేట్లను తులనాత్మకంగా పరిశీలిస్తున్నాం.

పెట్టుబడుల తాలూకు అంతర్నిర్మాణాల్లోని తేడాలే కాక, శ్రమ పరిమాణాల్లోని తేడాలే కాక, ఇతర పరిస్థితులు యథాతథంగా వున్నప్పుడు, విభిన్న ఉత్పత్తి శాఖల్లో ఒకే మొత్తంలోని పెట్టుబడులు చలనంలో వుంచిన అదనపు శ్రమ పరిమాణాల్లోని తేడాలే కాక, లాభం రేట్లలోని అసమానతకు మరో మూలకారణం కూడా వుంది. ఇది విభిన్న ఉత్పత్తి శాఖల్లోని పెట్టుబడి తాలూకు టర్నోవర్ కాలంలోని తేడా. ఇతర పరిస్థితులు యథాతథంగా వున్నట్లయితే, ఒకే అంతర్నిర్మాణం గల పెట్టుబడుల యొక్క లాభం రేట్లు, ఆ పెట్టుబడుల టర్నోవర్ కాలాలకు విలోమ నిష్పత్తిలో వుంటాయని మనం నాలుగో అధ్యాయంలో గమనించాం. వివిధ కాలవ్యవధుల్లో టర్నోవర్ అయిన ఒకే అస్థిర పెట్టుబడి విభిన్న పరిమాణాలు గల వార్షిక అదనపు విలువలను ఉత్పత్తి చేస్తుందని కూడా మనం గమనించాం. కాబట్టి విభిన్న ఉత్పత్తి శాఖల్లో సమాన మొత్తాల్లోని పెట్టుబడులు సమాన కాలాల్లో సమాన లాభాలను ఉత్పత్తి చేయకపోవడానికీ, పర్యవసానంగా విభిన్న ఉత్పత్తి శాఖల్లో లాభం రేట్లలో తేడా వుండడానికీ టర్నోవర్ వ్యవధుల్లో తేడా కూడా ఒక కారణమే.

కానీ, పెట్టుబడి అంతర్నిర్మాణంలో నిశ్చల పెట్టుబడి, చలామణి పెట్టుబడుల నిష్పత్తి విషయానికి వస్తే, ఇది సొంతంగా లాభం రేటును ప్రభావితం చేయదు. అది లాభం రేటును ఒక సందర్భంలో మాత్రం (ప్రభావితం చేయగలదు) పెట్టుబడిలోని అస్థిర, స్థిర భాగాల మధ్య నిష్పత్తిలో తేడాతో దాని అంతర్నిర్మాణంలోని ఈ తేడా ఏకీభవించిన సందర్భంలో – అలా ప్రభావితం చేయగలదు. అప్పుడు లాభం రేటులోని తేడాకు కారణం అస్థిర, స్థిర భాగం మధ్య నిష్పత్తి తేడాయే తప్ప, చలామణి పెట్టుబడికీ, నిశ్చల పెట్టుబడికీ మధ్య గల నిష్పత్తి తేడా కాదు; మరో సందర్భంలో కూడా ఇలా జరగొచ్చు. నిశ్చల పెట్టుబడి, చలామణి పెట్టుబడి మధ్య గల నిష్పత్తిలోని తేడా, ఒక నిర్దిష్ట మొత్తంలోని లాభం చేతికందే టర్నోవర్ కాలంలోని తేడాకు కారణమైనప్పుడు కూడా ఇలా జరగొచ్చు. భిన్న నిష్పత్తుల్లో నిశ్చల పెట్టుబడిగా, చలామణి పెట్టుబడిగా, పెట్టుబడుల విభజన సహజంగానే ఎల్లప్పుడూ టర్నోవర్ కాలాన్ని ప్రభావితం చేసి, అందులోని తేడాలకు కారణభూతవుతుంది. అయితే ఒకే విధమైన పెట్టుబడులు నిర్దిష్ట లాభాలు ఆర్జించడానికి పట్టే టర్నోవర్ వ్యవధి వేరువేరుగా వుంటుందని దీని అర్థం కాదు. ఉదాహరణకు, 'క' అనే పెట్టుబడి తన ఉత్పాదితంలోని ఎక్కువ భాగాన్ని నిరంతరాయంగా ముడిపదార్థాలు వగైరాలుగా మార్చుకోవలసిన పరిస్థితి వుండొచ్చు; కాగా 'గ' అనే పెట్టుబడి అదే యంత్రాలు వగైరాలను మరింత ఎక్కువ కాలంపాటు వాడుకోవచ్చు; ఆ మేరకు దానికి తక్కువ ముడిపదార్థాలు అవసరం కావచ్చు. అయితే నిరంతరం ఉత్పత్తి క్రమంలో పాల్గొంటున్న 'క', 'గ'లు రెండూ ఉత్పత్తిలో నిమగ్నమై వున్నందువల్ల తమ పెట్టుబడిలో ఒక భాగాన్ని ఎల్లప్పుడూ ఆ పనికి నియోగిస్తూనే వుంటాయి. ఒకటి ముడిపదార్థాలకు, అంటే, చలామణి పెట్టుబడిగా, మరొకటి యంత్రాలకు, అంటే నిశ్చల పెట్టుబడిగా నియోగిస్తూ వుంటుంది. 'క' పెట్టుబడి నిరంతరాయంగా

తన పెట్టుబడిలోని ఒక భాగాన్ని సరుకుల రూపం నుంచి డబ్బు రూపంలోకి, ఆ డబ్బును తిరిగి ముడిపదార్థాల రూపంలోకి మార్పు చేసుకుంటూ వుంటుంది. కాగా 'గ' పెట్టుబడి మాత్రం యిలాటి పరివర్తనలతో పనిలేకుండానే తన పెట్టుబడిలోని ఒక భాగాన్ని మరింత ఎక్కువ కాలంపాటు శ్రమ పరికరంగా వాడుకుంటుంది. ఆ రెండూ కనుక ఒకే పరిమాణంలోని శ్రమను నియుక్తం చేసుకున్నట్లయితే ఒక సంవత్సరంలో అవి అసమ విలువ గల ఉత్పాదితాల మొత్తాలను అమ్మకం చేస్తాయి; కానీ ఆ రెండు ఉత్పాదితాల మొత్తాల్లోనూ సమానమైన అదనపు విలువ మొత్తాలుంటాయి; మదుపు చేసిన మొత్తం పెట్టుబడిపై లెక్కిస్తే లాభం రేట్లు కూడా సమంగానే వుంటాయి. వాటి నిశ్చల పెట్టుబడి, చలామణి పెట్టుబడి స్వరూపంలోనూ, టర్నోవర్ కాలాల్లోనూ తేడాలున్నప్పటికీ ఆ అదనపు విలువ మొత్తాలు వుంటాయి. వాటి టర్నోవర్ కాలాల్లో తేడాలున్నప్పటికీ ఆ రెండు పెట్టుబడులూ సమాన కాలాల్లో సమాన లాభాలను గ్రహిస్తాయి.[1] ఒక నిర్ణీత కాలంలో అదే పెట్టుబడి స్వాయత్తం చేసుకుని, డబ్బుగా మార్చుకొనే అదనపు విలువ మొత్తాన్ని టర్నోవర్ కాలంలోని తేడా ప్రభావితం చేస్తుంది. అంతే తప్ప, దానికి స్వయంగా ప్రాముఖ్యం లేదు. కనుక నిశ్చల పెట్టుబడిగా చలామణి పెట్టుబడిగా భిన్నమైన విభజన తప్పనిసరిగా భిన్నమైన టర్నోవర్ కాలానికి కారణం కానప్పుడు, అందువల్ల భిన్నమైన లాభం రేటుకు కారణం కానప్పుడు, స్పష్టంగా బోధపడే విషయం యేమిటంటే, లాభం రేట్లలో అలాటి తేడా అంటూ వుంటే, అందుకు కారణం చలామణి పెట్టుబడికి నిశ్చల పెట్టుబడికి మధ్య నిష్పత్తిలో తేడా కాదు; దానికి కారణం లాభం రేటును ప్రభావితం చేసే టర్నోవర్ కాలాల అసమత్వాన్ని ఆ భిన్న నిష్పత్తి సూచిస్తుండడమే.

కనుక వేరు వేరు ఉత్పత్తి శాఖల్లో స్థిర పెట్టుబడి అంతర్నిర్మాణం దాని పట్ల నిశ్చల, చలామణి భాగాలకు సంబంధించి ఇలా వేరువేరుగా వుండటం అన్నది లాభం రేటును ప్రత్యక్షంగా ప్రభావితం చేయదు. ఎందుకంటే లాభం రేటును నిర్ధారించేది స్థిర పెట్టుబడికి అస్థిర పెట్టుబడికీ మధ్య నిష్పత్తి మాత్రమే. కాగా స్థిర పెట్టుబడి విలువ కనుక అస్థిర పెట్టుబడితో ముడిపడి వున్న దాని పరిమాణం – ఈ రెంటికీ, దాని అంతర్భాగాల నిశ్చల, చలామణి స్వభావానికీ ఎలాంటి సంబంధం లేదు. అయినా ఎక్కడెక్కడ నిశ్చల పెట్టుబడి గణనీయంగా అభివృద్ధి చెంది వుందో అక్కడల్లా అది భారీస్థాయిలో

---

1. తమ విలువలకు సంబంధించి 'క' 'గ' పెట్టుబడుల అంతర్నిర్మాణంలో తేడా వున్నప్పటికీ వాటి అస్థిర భాగాల శాతాలు వాటి టర్నోవర్ కాలాలకు అనుగుణమైన నిష్పత్తిలో వున్నప్పుడు మాత్రమే, అంటే వాటి టర్నోవర్ సంఖ్యలకు అవి విలోమ నిష్పత్తిలో వున్నప్పుడు మాత్రమే పై ప్రకటన కచ్చితంగా వర్తిస్తుందని IVవ అధ్యాయం స్పష్టం చేస్తున్నది. 'క' పెట్టుబడి అంతర్నిర్మాణ నిష్పత్తి ఇలా వుందనుకుందాం: 20స్థి.పె. నిశ్చల భాగం + 70స్థి.పె. చలామణి భాగం. ఆ మేరకు 90స్థి.పె.+10అ.పె.=100 కాగా ఆ 100% అదనపు విలువ రేటుతో 10అ.పె. ఒక టర్నోవర్‌లో 10అ.వి. ని ఉత్పత్తి చేస్తుంది; అంటే ఒక టర్నోవర్‌కు లాభం రేటు 10%. ఇక 'గ' పెట్టుబడి అంతర్నిర్మాణం ఇలా వుందనుకుందాం : 60స్థి.పె. నిశ్చల భాగం+20స్థి.పె. చలామణి భాగం, ఆ మేరకు 80స్థి.పె.+20అ.పె.=100 అదనపు విలువ రేటుతోనే 20అ.పె. లాభం రేటు 20 శాతం అవి. ఇది 'క' తాలూకు లాభం రేటు కంటే రెండు రెట్లు ఎక్కువ. అయితే 'క' పెట్టుబడి సంవత్సరంలో రెండుసార్లు టర్నోవర్ అయి, 'గ' కనుక ఒకసారి మాత్రమే అయితే, 2×10 కూడా సంవత్సరానికి 20అ.వి. ని సృష్టిస్తుంది.... అప్పుడు రెండింటి వార్షిక లాభం రేటు ఒకే రకంగా అంటే 20 శాతం మేరకే వుంటుంది - **ఫ్రెడరిక్ ఎంగెల్స్**

ఉత్పత్తి జరుగుతూందనే వాస్తవాన్ని వ్యక్తం చేస్తుంది, అంతే. అలాటి పరిస్థితిలో స్థిర పెట్టుబడి, అస్థిర పెట్టుబడి కంటే చాలా ఎక్కువ మోతాదులో వుంటుంది. లేదా అది ఉపయోగించుకుంటున్న ఉత్పత్తి సాధనాల పరిమాణంతో పోల్చి చూస్తే అది నియుక్తం చేసుకునే సజీవ శ్రమశక్తి సాపేక్షంగా తక్కువగా వుంటుంది – ఇది తరచూ తప్పుడు నిర్ధారణకు దారితీస్తుంది.

ఈ విధంగా మనం ఈ క్రింది విషయం నిరూపించాం; విభిన్న పారిశ్రామిక శాఖల్లో విభిన్న లాభం రేట్లు వుంటాయి; అవి వాటి పెట్టుబడుల అంగనిర్మాణంలోని తేడాలకు అనుగుణంగా వుంటాయి. సూచించిన పరిమితుల్లో విభిన్న టర్నోవర్ కాలాలకు కూడా అవి అనుగుణంగా వుంటాయి; టర్నోవర్ కాలంలో మార్పులేకపోతే, పెట్టుబడుల పరిమాణాలను బట్టి లాభాలు వుంటాయని, సమాన పరిమాణాల్లోని పెట్టుబడుల సమాన కాలాల్లో సమాన లాభాలను యిస్తాయనీ చెప్పే నియమం (ఒక సార్వత్రిక ధోరణిగా) అదనపు విలువ రేటులో మార్పులేని ఒకే అంతర్నిర్మాణం గల పెట్టుబడులకు మాత్రమే వర్తిస్తుంది. మన అన్ని విశ్లేషణలకూ, సరుకులు తమ విలువలకే అమ్ముడుపోతాయి అన్నదే ప్రాతిపదికగా వుంది. మరో ప్రక్క పరస్పరం పరిహరించుకునే అప్రధాన, అనుబంధ భేదాలతో పాటు వివిధ పారిశ్రామిక శాఖల్లో సగటు లాభం రేటులో తేడాలు వాస్తవంలో వుండవనేది నిస్సందేహం. యావత్ పెట్టుబడిదారీ వ్యవస్థను రద్దు చేయకుండా అవి వుండే వీలేలేదు. కాబట్టి విలువ సిద్ధాంతానికి వాస్తవ ప్రక్రియతో, నిజమైన ఉత్పత్తి పరిమాణంతో ఇక్కడ పొత్తు పొసగదనీ, అందువల్ల ఈ పరిమాణాలను అవగాహన చేసుకోడానికి జరిపే ప్రయత్నాలకు స్వస్తి చెప్పాలనీ అనిపిస్తుంది.

భిన్న ఉత్పత్తి శాఖల్లో, పెట్టుబడుల అంతర్నిర్మాణంలో ఎంత తేడాలున్నప్పటికీ, ఉత్పాదితాల ఉత్పత్తికి అడ్వాన్సు చేసిన పెట్టుబడి భాగాలు సమంగా వున్నట్లయితే, వుత్పాదితాల ఉత్పత్తి ధరలు సమంగానే వుంటాయని ఈ సంపుటి ప్రథమ భాగంలో నిరూపించాం. ఉత్పత్తి ధరలో అస్థిర పెట్టుబడికీ స్థిర పెట్టుబడికీ మధ్యగల తేడా పెట్టుబడిదారుని దృష్టికి రాదు. ఒక సరుకు ఉత్పత్తి కోసం అతడు అడ్వాన్సు చేయాల్సిన 100 పౌండ్లలో అతడికి ఖర్చయ్యేది సరిగ్గా వంద పౌండ్లే. అతడు దాన్ని 90స్థి.పె.+10అ.పె.గా మదుపు పెట్టినా ఒకటే, లేక 10స్థిపె+90అపెగా మదుపు పెట్టినా ఒకటే. ఏ పద్ధతిలో మదుపు చేసినా అతడికి అయ్యే ఖర్చులో పిసరంత కూడా తేడా రాదు. ఉత్పత్తి అయిన విలువల్లోనూ, అదనపు విలువల్లోనూ ఎంత తేడా ఉన్నప్పటికీ విభిన్న శాఖల్లోని సమాన పెట్టుబడులకు ఉత్పత్తి ధరలు సమానంగానే వుంటాయి. ఉత్పత్తి ధరల సమానత మదుపు పెట్టిన పెట్టుబడుల మధ్య పోటీకి ప్రాతిపదిక. ఈ పోటీ వల్లనే సగటు లాభం రూపుగొంటుంది.

★ ★ ★

## అధ్యాయం - 9

# సార్వత్రిక లాభం రేటు (సగటు లాభం రేటు) రూపుగొనే క్రమం, సరుకుల విలువలు ఉత్పత్తి ధరలుగా పరివర్తన

ఏ నిర్దిష్ట సమయంలోనైనా పెట్టుబడి అంతర్నిర్మాణం రెండు పరిస్థితులపై ఆధారపడి వుంటుంది; మొదటిది – నియుక్తమైన ఉత్పత్తి సాధనాల మొత్తంతో నియుక్త శ్రమ శక్తికి గల సాంకేతిక సంబంధం; రెండవది – ఈ ఉత్పత్తి సాధనాల ధర. మనం ఇంతకు ముందే గమనించినట్లు ఈ అంగనిర్మాణాన్ని శాతపు నిష్పత్తుల ప్రాతిపదికపై పరిశీలించాలి. $\frac{4}{5}$ భాగం స్థిర పెట్టుబడి $\frac{1}{5}$ భాగం అస్థిర పెట్టుబడి గల అంగనిర్మాణాన్ని మనం $80_{స్థి.పె.}+20_{అ.పె.}$గా సూత్రంలో వ్యక్తం చేశాం. అదనపు విలువరేటు మారనిదని కూడా మనం ఈ తులనాత్మక పరిశీలనలో ఊహించాం. ఉదాహరణకు ఆ రేటు 100% అనుకుందాం. అప్పుడు $80_{స్థి.పె.}+20_{అ.పె.}$ పెట్టుబడి $20_{అ.వి.}$ అదనపు విలువ ఉత్పత్తి చేస్తుంది. మొత్తం పెట్టుబడిపై లాభం రేటు 20% అవుతుంది. దాని ఉత్పాదితం యొక్క నిజమైన విలువ పరిమాణం స్థిర పెట్టుబడిలోని నిశ్చల భాగం పరిమాణంపైనా, తరుగుదల రూపంలో ఉత్పాదితంలోకి చేరే భాగంపైనా ఆధారపడి వుంటుంది. అయితే దీనికీ, లాభం రేటుకూ బొత్తిగా సంబంధం లేదు. కనుక ప్రస్తుత విశ్లేషణలో, సరళత కోసం అన్నిచోట్ల అన్ని సందర్భాల్లో స్థిర పెట్టుబడి మొత్తంగానూ, ఒకే రకంగానూ పెట్టుబడుల తాలూకు వార్షిక ఉత్పాదితాల్లోకి బదలాయింప బడుతుందని మనం ఊహిద్దాం; వివిధ ఉత్పత్తి శాఖల్లోని పెట్టుబడులు ఏటా తమ అస్థిర భాగాల మొత్తాల నిష్పత్తికి అనుగుణంగా ఒకే పరిమాణాలలోని అదనపు విలువ సంగ్రహిస్తాయని ఊహిద్దాం. కాబట్టి ప్రస్తుతానికి టర్నోవర్ కాలాల తేడాల ద్వారా తలెత్తే వ్యత్యాసాలను విస్మరిస్తున్నాము. ఈ అంశాన్ని తర్వాత చర్చిద్దాం.

అయిదు విభిన్న ఉత్పత్తి శాఖలను తీసుకుని వాటిలోని ప్రతిదానిలో పెట్టుబడి అంతర్నిర్మాణం ఇలా భిన్నంగా వుందనుకుందాం.

| పెట్టుబడులు | అదనపు విలువ రేటు | అదనపు విలువ | ఉత్పాదితం విలువ | లాభం రేటు |
|---|---|---|---|---|
| 1. $80_{స్థి.పె.}+20_{అ.పె.}$ | 100% | 20 | 120 | 20% |
| 2. $70_{స్థి.పె.}+30_{అ.పె.}$ | 100% | 30 | 130 | 30% |
| 3. $60_{స్థి.పె.}+40_{అ.పె.}$ | 100% | 40 | 140 | 40% |
| 4. $85_{స్థి.పె.}+15_{అ.పె.}$ | 100% | 15 | 115 | 15% |
| 5. $95_{స్థి.పె.}+5_{అ.పె.}$ | 100% | 5 | 105 | 5% |

దోపిడీ ఒకే స్థాయిలో వున్న విభిన్న ఉత్పత్తి శాఖలలో, ఆయా పెట్టుబడుల విభిన్న అంతర్నిర్మాణానికి అనుగుణంగా చాలా భిన్నమైన లాభం రేట్లున్నాయని కనిపిస్తూనే వుంది.

ఈ అయిదు ఉత్పత్తి శాఖల్లోనూ మదుపు చేసిన పెట్టుబడుల మొత్తం = 500; అ.వి. ఉత్పత్తి చేసిన అదనపు విలువ మొత్తం = 110; అ.వి. ఉత్పత్తి చేసిన సరుకుల మొత్తం విలువ = 610. మనం ఈ 500 పెట్టుబడిని ఒకే ఒక పెట్టుబడిగానూ, 1 నుంచి 5 దాకా ఉన్న పెట్టుబడులను కేవలం వాటి అంతర్భాగాలుగానూ పరిగణిస్తే (ఉదాహరణకు ఒక పత్తిమిల్లులోని వేరు వేరు భాగాల్లో లాగా; అందులో ఏకడం, వడకడానికి నూలును సిద్ధం చేయడం, వడకడం, నేయడం మొదలయిన పనులకు వేరు వేరు విభాగాలుంటాయి. వాటిలో స్థిర, అస్థిర పెట్టుబడులు వేరు వేరు నిష్పత్తుల్లో వుంటాయి. కాని ఫ్యాక్టరీ మొత్తానికి వీటి సగటు నిష్పత్తి ఎంతో ఇంతవరకు లెక్కవేయడం జరగలేదు) ఈ 500 పెట్టుబడి తాలూకు సగటు అంతర్నిర్మాణం = 390$_{\text{స్థి.పె.}}$+110. లేక శాతంలో తెలిపితే 78$_{\text{స్థి.పె.}}$+22. ప్రతి 100 పెట్టుబడినీ మొత్తం పెట్టుబడిలో అయిదింట ఒక వంతు పెట్టుబడిగా పరిగణిస్తే దీని అంతర్నిర్మాణం 78$_{\text{స్థి.పె.}}$+22$_{\text{అ.పె.}}$ సగటు సమంగా వుంటుంది. ప్రతి 100కూ సగటు అదనపు విలువ 22. ఆమేరకు సగటు లాభం రేటు 22 శాతం. ఈ 500 ఉత్పత్తి చేసిన మొత్తం ఉత్పాదితంలోని ప్రతి అయిదో దాని వంతు ధర 122కు సమానం. అప్పుడు అడ్వాన్సయిన మొత్తం పెట్టుబడిలోని ప్రతి అయిదో ఉత్పాదితాన్ని 122కు అమ్మవలసి వుంటుంది.

అయితే పొరపాటు నిర్ధారణలను నివారించడానికి గాను అన్ని ఉత్పత్తి ధరలు100కు సమానమని ఊహించరాదు.

80$_{\text{స్థి.పె.}}$+20$_{\text{అ.పె.}}$ తోనూ, 100% అదనపు విలువ రేటుతోనూ 1వ పెట్టుబడి ఉత్పత్తి చేసిన సరుకుల మొత్తం విలువ 80స్థిపె+20అ.పె=120 మొత్తం స్థిర పెట్టుబడి వార్షిక ఉత్పాదితంలోకి ప్రవేశిస్తే ఫలితం అలా వుంటుంది. కొన్ని పరిస్థితుల్లో కొన్ని ఉత్పత్తి శాఖల్లో ఇలా జరగవచ్చు. కానీ స్థిర పెట్టుబడి, అస్థిర పెట్టుబడి 4:1 నిష్పత్తిలో వున్న సందర్భాల్లో ఫలితం ఇలా వుండదు. కాబట్టి ఈ భిన్న పెట్టుబడులలోని ప్రతి 100 ఉత్పత్తి చేసిన విలువలను తులనాత్మకంగా పరిశీలించే సందర్భంలో నిశ్చల పెట్టుబడి, చలామణి పెట్టుబడి భాగాలకు సంబంధించి, స్థిర పెట్టుబడి యొక్క భిన్న అంతర్నిర్మాణాన్ని అనుసరించి, ఆ విలువలు మారుతుంటాయని మనం మరచిపోరాదు; అంతేకాక, పర్యవసానంగా ప్రతి భిన్న పెట్టుబడుల్లోని నిశ్చల భాగాలూ ఆయా సందర్భాన్ని బట్టి నిదానంగానో, వేగంగానో తరిగిపోతాయి. తద్వారా సమాన వ్యవధుల్లో తమ విలువకు అసమ పరిమాణాల్లో ఉత్పాదితానికి బదిలీ చేస్తాయి. అయితే దీనితో లాభం రేటుకు ప్రమేయమే లేదు. 80$_{\text{స్థి.పె.}}$ అన్నది వార్షిక ఉత్పాదితానికి తన 80 విలువను ఇచ్చినా, లేక 50 ఇచ్చినా లేక 5 ఇచ్చినా ఆ మేరకు వార్షిక ఉత్పత్తి 80$_{\text{స్థి.పె.}}$+20$_{\text{అ.పె.}}$+20$_{\text{అ.వి.}}$ = 120గా వున్నా, 50$_{\text{స్థి.పె.}}$+20$_{\text{అ.పె.}}$+20$_{\text{అ.వి.}}$ =90గా వున్నా, 5$_{\text{స్థి.పె.}}$+20$_{\text{అ.పె.}}$+20$_{\text{అ.వి.}}$ = 45గా వున్నా ఈ అన్ని సందర్భాల్లోనూ ఉత్పాదితం విలువ, దాని ఉత్పత్తి ఖర్చుల కంటే 20 మేరకు ఎక్కువగా వుంటుంది. ఈ అన్ని ఉదాహరణల్లోనూ లాభం రేటును లెక్క పెట్టడంలో ఈ 20ని, వాటన్నిటిలోనూ 100 పెట్టుబడిని – ప్రాతిపదికగా చేస్తాము. కాబట్టి 1వ పెట్టుబడి యొక్క లాభం రేటు ప్రతి సందర్భంలోనూ 20%. ఈ అంశాన్ని మరింత

స్పష్టం చేసేందుకు, విభిన్న స్థిర పెట్టుబడి భాగాలు ఈ అయిదు పెట్టుబడుల ఉత్పాదితం విలువలోకి కింది పట్టికలోలాగే ప్రవేశించేలా చేద్దాం :

| పెట్టుబడులు | | అదనపు విలువ రేటు | అదనపు విలువ | లాభం రేటు | వాడకమైన స్థి.పె. | సరుకుల విలువ | ఉత్పత్తి ధర |
|---|---|---|---|---|---|---|---|
| 1. | 80స్థి.పె. +20అ.పె. | 100% | 20 | 20% | 50 | 90 | 70 |
| 2. | 70స్థి.పె. +30అ.పె. | 100% | 30 | 30% | 51 | 111 | 81 |
| 3. | 60స్థి.పె. +40అ.పె. | 100% | 40 | 40% | 51 | 131 | 91 |
| 4. | 85స్థి.పె. +15అ.పె. | 100% | 15 | 15% | 40 | 70 | 55 |
| 5. | 95స్థి.పె. +5అ.పె. | 100% | 5 | 5% | 10 | 20 | 15 |
| మొత్తం | 390స్థి.పె. +110అ.పె. | – | 110 | 110% | – | – | – |
| సగటు | 78స్థి.పె. +22అ.పె. | – | 22 | 22% | – | – | – |

ఇప్పుడు మళ్లీ మనం 1 నుంచి 5 దాకా గల పెట్టుబడులను ఒకే ఒక మొత్తం పెట్టుబడిగా పరిగణిస్తే ఈ ఉదాహరణలో కూడా ఈ అయిదు పెట్టుబడుల యొక్క మొత్తం అంతర్నిర్మాణం ఇలా వుంటుంది; 500=390స్థి.పె. +110అ.పె. కనుక ఇప్పుడు కూడా అదే సగటు అంతర్నిర్మాణం అంటే 78స్థి.పె. +22అ.పె. లభిస్తుంది; అదేవిధంగా అదనపు విలువ సగటు 22గా వుంటుంది. మనం గనుక ఈ అదనపు విలువను – ఈ అయిదు పెట్టుబడులకు ఒకే విధంగా పంచినట్లయితే, మనకు ఈ క్రింది సరుకు ధరలు లభిస్తాయి :

| పెట్టుబడులు | | అదనపు విలువ | సరుకుల విలువ | సరుకుల ఉత్పత్తి ధర | సరుకుల ధర | లాభం రేటు | విలువకూ ధరకూ వ్యత్యాసం |
|---|---|---|---|---|---|---|---|
| 1. | 80స్థి.పె. +20అ.పె. | 20 | 90 | 70 | 92 | 22% | +2 |
| 2. | 70స్థి.పె. +30అ.పె. | 30 | 111 | 81 | 103 | 22% | –8 |
| 3. | 60స్థి.పె. +40అ.పె. | 40 | 131 | 91 | 113 | 22% | –18 |
| 4. | 85స్థి.పె. +15అ.పె. | 15 | 70 | 55 | 77 | 22% | +7 |
| 5. | 95స్థి.పె. +5అ.పె. | 5 | 20 | 15 | 37 | 22% | +17 |

మొత్తంగా చూస్తే, సరుకులు వాటి విలువకంటే 2+7+17=26 ఎక్కువకు, వాటి విలువ కంటే 8+18=26 తక్కువకు అమ్ముడు పోయాయి; ఫలితంగా అదనపు విలువను ఒకే విధంగా పంపిణీ చేయడం ద్వారా, లేక 1 నుంచి 5 దాకా వున్న సరుకుల ఉత్పత్తి ధరలకు అడ్వాన్సు చేసిన ప్రతి 100 యూనిట్లకు 22 సగటు లాభాన్ని చేర్చడం ద్వారా ధర, విలువల మధ్య గల పరస్పర వ్యత్యాసం రద్దయిపోతుంది. సరుకుల్లో ఒక భాగం వాటి విలువకంటే ఎక్కువకు అమ్ముడుపోగా, మరో భాగం వాటి విలువ కంటే అదే మోతాదులో తక్కువకు అమ్ముడుపోతుంది. విభిన్న

అంతర్నిర్మాణాలు వున్నప్పటికీ, 1 నుంచి 5 దాకా అన్ని పెట్టుబడులకూ ఒకే రకంగా 22 శాతం లాభం రావడానికి వీలు కలిగిస్తున్నది. ఇలాంటి ధరలకు సరుకులు అమ్ముడుపోతే విభిన్న ఉత్పత్తి శాఖల్లోని ఉత్పత్తి ఖర్చులకు విభిన్న ఉత్పత్తి శాఖల్లోని సగటు లాభం రేట్లను చేర్చగా వచ్చిన ధరలే ఉత్పత్తి ధరలు అవుతున్నాయి. ఒక సార్వత్రిక లాభం ఉండటమనేది వాటికి పూర్వావసరం. సార్వత్రిక లాభం రేటు ఉండాలంటే ప్రతి ఉత్పత్తి శాఖలో లాభం రేట్లు ముందే సగటు రేటుగా రూపొంది వుండాలి. ప్రతి ఉత్పత్తి శాఖలోనూ ఈ నిర్దిష్ట లాభం రేటు = $\frac{\text{అ.వి.}}{\text{మొ.పె}}$ కనుక ఈ సంపుటం మొదటి భాగంలో వెల్లడి అయినట్లు వాటిని నిగమన (deduction) పద్ధతిలో రాబట్టాలి. ఇలా రాబట్టకపోతే సార్వత్రిక లాభం రేటు (పర్యవసానంగా సరుకుల యొక్క ఉత్పత్తి ధర కూడా) అస్పష్టమైన, అర్థరహితమైన భావనగానే మిగిలిపోతుంది. కనుక ఒక సరుకు ఉత్పత్తి ఖర్చు+సార్వత్రిక లాభం రేటు ప్రకారం దానికి శాతంలో కేటాయించబడిన లాభం = ఆ సరుకు ఉత్పత్తి ధర, లేక వేరుమాటల్లో, ఒక సరుకు ఉత్పత్తిధర = ఉత్పత్తి ఖర్చు + సగటు లాభం.

విభిన్న ఉత్పత్తి శాఖల్లో మదుపు చేసిన విభిన్న అంతర్నిర్మాణాలు గల పెట్టుబడుల కారణంగానూ, ఫలితంగానూ ఒక నిర్దిష్ట మొత్తం పెట్టుబడిలో అస్థిర పెట్టుబడి భాగం ఎంత శాతం – అనేదాన్ని బట్టి సమాన పరిమాణాల్లోని పెట్టుబడులు విభిన్న శ్రమ పరిమాణాలను చలనంలో వుంచుతున్న కారణంగానూ, అదనపు శ్రమను విభిన్న పరిమాణాల్లో స్వాయత్తం చేసుకుంటాయి, లేదా విభిన్న పరిమాణాల్లో అదనపు విలువను సృష్టిస్తాయి. ఆ మేరకు, విభిన్న ఉత్పత్తి శాఖల్లోని లాభం రేట్లు సహజంగానే ప్రారంభంలో చాలా భిన్నమైనవి. ఈ విభిన్న లాభం రేట్లు పోటీ మూలంగా సమానమైన ఒక సార్వత్రిక లాభంరేటునందుకొంటాయి. ఈ విభిన్న లాభం రేట్లన్నింటి సగటు అదే. అంతర్నిర్మాణంతో నిమిత్తం లేకుండా ఏ నిర్దిష్ట మొత్తంలోని పై పెట్టుబడికయినా ఈ సాధారణ లాభం రేటు మేరకు చేకూరే లాభాన్నే సగటు లాభం అంటారు. ఉత్పత్తి ఖర్చులు ప్లస్, సరుకు ఉత్పత్తికై మదుపు చేసిన మొత్తం పెట్టుబడి (ఖర్చయింది మాత్రమే కాదు) పై వచ్చే వార్షిక సగటు లాభంలో దాని టర్నోవర్ పరిస్థితులను బట్టి దాని వాటాకు వచ్చేలాభం. దీనికి సమానంగా వున్నట్టి ఒక సరుకు యొక్క ధరనే ఉత్పత్తి ధర అంటారు. ఉదాహరణకు 500 పెట్టుబడిని తీసుకుందాం; అందులో 100 శాశ్వత పెట్టుబడి అనుకుందాం; కాగా ఒక టర్నోవర్ కాలంలో ఈ 400 చలామణి పెట్టుబడికి 10 శాతం తరుగుదల వుందనుకుందాం. ఒక టర్నోవర్ కాలంలో సగటు లాభం రేటు 10 శాతం అనుకుందాం. అప్పుడు ఒక టర్నోవర్‌లో ఉత్పత్తి అయిన ఉత్పాదితం యొక్క ఉత్పత్తి ఖర్చు 10 స్థి.పె. తరుగుదల ప్లస్ 400 (స్థి.పె.+అ.పె.) చలామణి పెట్టుబడి = 410; దాని ఉత్పత్తి ధర 410 ఉత్పత్తి ఖర్చు ప్లస్ (500పై 10 శాతం చొప్పున) 50=460.

కనుక, విభిన్న ఉత్పత్తి శాఖలకు చెందిన పెట్టుబడిదారులు తమ సరుకులను అమ్మడం ద్వారా ఉత్పత్తికి వినియోగమైన పెట్టుబడి విలువను తిరిగి పొందినప్పటికీ, ఆ శాఖల్లో ఆ సరుకులు ఉత్పత్తి వల్ల సృష్టి అయ్యే అదనపు విలువను, పర్యవసానంగా లాభాన్ని వారు పొందరు. ఒక నిర్దిష్ట కాలంలో అన్ని ఉత్పత్తి శాఖల్లోని మొత్తం సామాజిక పెట్టుబడి సృష్టించే మొత్తం సామాజిక అదనపు విలువను, లేక లాభం సమంగా విభజించగా, ఆ సామాజిక పెట్టుబడిలోని ప్రతి భాగానికి వాటాగా లభించే అదనపు విలువ, పర్యవసానంగా లాభం మాత్రమే పెట్టుబడిదారులకు లభిస్తుంది. అడ్వాన్సు

చేసిన పెట్టుబడిలో ప్రతి 100 దాని అంతర్నిర్మాణం ఎలా వున్నప్పటికీ సంవత్సరంలో లేక నిర్ణీత కాలంలో ప్రతి 100 వాటాకు మొత్తం పెట్టుబడిలోని "వ" భాగానికి రావాల్సిన లాభాన్నే పొందుతాయి. లాభాలకు సంబంధించి, వివిధ పెట్టుబడిదారులంతా, ఒక స్టాక్ కంపెనీలో స్టాక్ హోల్డర్ల లాగా వుంటారు. స్టాక్ కంపెనీలలో లాభం వాటాలు ప్రతి 100కూ సమంగా పంపిణీ చేసుకుంటారు. ఫలితంగా ఆయా పెట్టుబడిదారుల విషయంలో లాభాల మధ్య తేడా మొత్తం పరిశ్రమలో ప్రతి ఒక్కరూ మదుపు పెట్టిన పెట్టుబడి మొత్తాలను బట్టి వుంటుంది; అంటే మొత్తం సామాజిక ఉత్పత్తిలో అతడు పెట్టిన పెట్టుబడి ప్రకారమే, అంటే అతని వాటాల సంఖ్యకు అనుగుణంగానే లాభాలు వస్తాయి. కాబట్టి ఈ సరుకుల ఉత్పత్తి కోసం ఖర్చయిన పెట్టుబడి భాగాలను భర్తీ చేసే సరుకుల ధర భాగం కనుక వినియోగమయిన పెట్టుబడి విలువలను తిరిగి కొనడానికి ఉపయోగించవలసిన సరుకుల ధర విభాగం అంటే వాటి ఉత్పత్తి ఖర్చు ఆయా ఉత్పత్తి శాఖల్లో పెట్టిన పెట్టుబడులపై పూర్తిగా ఆధారపడి వుంటుంది. అయితే సరుకుల ధరలోని ఇతర భాగం, ఉత్పత్తి ఖర్చులకు వచ్చి చేరిన లాభం, నిర్దిష్ట కాలంలో నిర్దిష్ట శాఖలో నిర్దిష్ట పెట్టుబడి ఉత్పత్తి చేసిన లాభం మొత్తంపై ఆధారపడి వుండదు. సామాజిక ఉత్పత్తికై మదుపు చేసిన మొత్తం సామాజిక పెట్టుబడిలోని ఒక సమ విభజిత భాగంగా ప్రతి వ్యష్టి పెట్టుబడికీ సగటున లభించే లాభం పరిమాణంపై అది ఆధారపడి వుంటుంది.[1] కాబట్టి ఒక పెట్టుబడిదారుడు తన సరుకులను ఉత్పత్తి ధరకు అమ్మినప్పుడు, వాటి ఉత్పత్తి కోసం ఖర్చయిన పెట్టుబడి విలువకు అనుగుణంగా డబ్బునూ, మొత్తం సామాజిక పెట్టుబడిలో ఒక సమ విభజిత భాగంగా, అతడు అడ్వాన్సు చేసిన పెట్టుబడికి అనుగుణమైన నిష్పత్తిలో అతడికి లాభం దక్కుతుంది. అతడి ఉత్పత్తి ఖర్చులు ప్రత్యేకమైనవి. అయితే వాటికి లభించిన లాభానికి మాత్రం అతడు మదుపు పెట్టిన ప్రత్యేక ఉత్పత్తి శాఖతో నిమిత్తం లేదు. మదుపు చేసిన పెట్టుబడిలోని 100 యూనిట్లకు సాధారణ సగటుగా వుంటుంది. మునుపటి ఉదాహరణలోని 1 నుంచి 5 వరకు వున్న విభిన్న పెట్టుబడులు ఒకే వ్యక్తికి చెందినవని భావిద్దాం. 1 నుండి 5 వరకు గల ప్రతి శాఖలోనూ ప్రతి 100కూ సరుకుల ఉత్పత్తికై ఖర్చయిన అస్థిర పెట్టుబడి ఎంతో, స్థిర పెట్టుబడి యెంతో తెలుస్తుంది. 1 నుంచి 5 వరకు గల సరుకుల విలువలోని ఈ వాటా, వాటి ధరలోని ఒక భాగమవుతుందని వేరే చెప్పనవసరం లేదు. ఎందుకంటే అడ్వాన్సు అయి, ఖర్చయినట్టి పెట్టుబడి భాగాన్ని భర్తీ చేయడానికి అవసరమైన కనీస ధర ఇది. అందువల్ల ఉత్పత్తి ఖర్చులు 1 నుంచి 5 వరకు అన్ని శాఖల్లోని సరుకులకు భిన్నంగా వుంటాయి. వాటిని యజమానే వేర్వేరుగా నిర్ధారిస్తాడు. ఇక 1 నుంచి 5 వరకు గల ఉత్పత్తి శాఖల్లో ఉత్పత్తి అయిన విభిన్న అదనపు విలువ మొత్తాలకు లేక లాభానికి సంబంధించి, తాము అడ్వాన్సు చేసిన మొత్తం పెట్టుబడికి లభించిన లాభంగా దీన్ని పెట్టుబడిదారు పరిగణించవచ్చు; అంటే ప్రతి 100 యూనిట్ల పెట్టుబడికీ నిర్దిష్ట సమవిభజిత భాగం లభిస్తుంది. కనుక 1 నుంచి 5 వరకు గల ఉత్పత్తి శాఖల్లో ఉత్పత్తి అయిన సరుకుల ఉత్పత్తి ఖర్చులు వేరు వేరుగా వుంటాయి, అయితే వాటి అమ్మకం ధరలో, ప్రతి 100 యూనిట్ల పెట్టుబడికి చేరిన లాభం వల్ల రూపుగొన్న భాగం, లేక వాటా ఈ అన్ని సరుకులకూ ఒకటిగానే వుంటుంది.

---

1. Cherbuliez (Richesse on Pauvrete, Paris), 1841, పుటలు 71-72 - సంపాదకుడు.

ఈ విధంగా 1 నుంచి 5 వరకు గల ఉత్పత్తి శాఖల తాలూకు సరుకుల యొక్క మొత్తం ధర వాటి మొత్తం విలువ అంతే వుంటుంది, అంటే వాటి మొత్తం ఉత్పత్తి ఖర్చులు ప్లస్ ఉత్పత్తి అయిన అదనపు విలువలకు లేక లాభాలకు సమంగా వుంటుంది. కాబట్టి 1 నుంచి 5 వరకు గల ఉత్పత్తి శాఖల్లోని సరుకుల్లో మూర్తీభవించి వున్న గతకాలపు శ్రమ, వర్తమాన శ్రమ ఈ రెంటి మొత్తం పరిమాణం యొక్క డబ్బు వ్యక్తీకరణగా వుంటుంది. ఇదే విధంగా సమాజంలో ఉత్పత్తి అయిన అన్ని సరుకుల ఉత్పత్తి ధరల మొత్తం – అన్ని ఉత్పత్తి శాఖల్లోని మొత్తం – వాటి విలువల మొత్తానికి సమంగా వుంటుంది.

పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానంలో ఉత్పాదక పెట్టుబడి భాగాలను సాధారణంగా మార్కెట్‌లో కొంటారు. కాబట్టి ఇప్పటికే చేతికందిన లాభాలు కూడా వాటి ధరల్లో చేరి వుంటాయనీ, ఫలితంగా ఆయా పరిశ్రమ శాఖల్లోని ఉత్పత్తి ధర కూడా అందులో కలిసి వుందని, ఆ మేరకు ఒక పరిశ్రమ శాఖలోని లాభం మరో పరిశ్రమ శాఖలోని ఉత్పత్తి ఖర్చుల్లో చేరి వుంటుందని, తెలిపే వాస్తవంతో పై ప్రకటన విభేదిస్తున్నట్లు కనిపిస్తుంది. అయితే దేశంలోని యావత్తు సరుకుల ఉత్పత్తి ఖర్చుల మొత్తాన్ని ఒకవైపు, మరోవైపు లాభాల మొత్తాన్ని లేక అదనపు విలువల మొత్తాన్ని – ఉంచితే లెక్క సరిగా వుంటుందనేది స్పష్టమే. ఉదాహరణకు 'ఎ' అనే ఒక సరుకును తీసుకుందాం. బి, సి, డి మొదలయిన సరుకు ఉత్పత్తి ఖర్చుల్లో 'ఎ' లాభం వుండే వీలున్నట్లే, 'ఎ' ఉత్పత్తి ధరలో బి, సి, డి మొదలయిన వాటి లాభాలుండవచ్చు. అలాగే మనం లెక్క వేస్తున్న సరుకు 'ఎ' ఉత్పత్తి ఖర్చుల్లో దాని లాభం చేర్చబడదు. అలాగే 'బి' 'సి' 'డి' సరుకుల లాభాలు కూడా వాటి ఉత్పత్తి ఖర్చుల్లో చేర్చబడవు. ఏ పెట్టుబడిదారూ తన సొంత లాభాన్ని తన ఉత్పత్తి ఖర్చుల్లో చేర్చుకోడు. కాబట్టి క ఉత్పత్తి రంగాలు వున్నాయనుకుంటే, ప్రతి ఉత్పత్తి రంగమూ 'ల' మొత్తంలో లాభాన్ని సృష్టిస్తే, అప్పుడు వాటి మొత్తం ఉత్పత్తి ఖర్చు ఖ మైనస్ క×ల. ఈ లెక్కని మొత్తంగా పరిశీలిస్తే ఒక ఉత్పత్తి శాఖలోని లాభాలు మరో ఉత్పత్తి శాఖలోని ఉత్పత్తి ఖర్చుల్లోకి ప్రవేశిస్తున్నాయి కనుక అంతిమ ఉత్పాదితం యొక్క మొత్తం ధరలో అవి అంతర్భాగాలుగా వున్నాయనీ, ఆ కారణంగా రెండవ దఫా లాభంగా లెక్కాచారంలో చోటు చేసుకోజాలవనీ మనకు బోధపడుతుంది. ఒకవేళ అవి అలా లెక్కల్లో ప్రవేశించినట్లయితే, అందుకు గల ఏకైక కారణం, అంతిమ ఉత్పాదితమైన ఆ సరుకు యొక్క ఉత్పత్తి ఖర్చు మరో సరుకు యొక్క ఉత్పత్తి ఖర్చులోకి ప్రవేశించకపోవడమే.

ఉత్పత్తి సాధనాల ఉత్పాదకుల లాభాలకు ప్రాతినిధ్యం వహించే 'ల' మొత్తం ఒక సరుకు యొక్క ఉత్పత్తి ఖర్చులో కలిసి వున్నట్లయితే 'ల'కు సమానంగా వున్న లాభం ఈ ఉత్పత్తి ఖర్చుకు చేర్చబడితే అప్పుడు మొత్తం లాభం అంటే లా=ల+ల$_1$. లాభం భాగాలను పరిగణనలోకి తీసుకోకుండా, సరుకు యొక్క మొత్తం ఉత్పత్తి ఖర్చు అన్నది, దాని ఉత్పత్తి ఖర్చు – లా. ఈ ఉత్పత్తి ధర ప అని అనుకొందాం. అప్పుడు ప+ల=ప+ల+ల$_1$ అని కనిపిస్తూనే వుంది. ప్రథమ సంపుటి (Kap.VII, 2s 211/203) లో అదనపు విలువను గురించి చర్చించే సందర్భంగా ఏ పెట్టుబడి తాలూకు ఉత్పాదితమైనా, అందులోని ఒక భాగం పెట్టుబడిని భర్తీ చేయగా మిగతా భాగం అదనపు విలువకు మాత్రమే ప్రాతినిధ్యం వహిస్తుందని మనం గమనించాం. సమాజం తాలూకు మొత్తం ఉత్పాదితానికి ఈ దృక్పథాన్ని వర్తింపచేయటంలో మనం కొన్ని దిద్దుబాట్లు చేయవలసి వుంటుంది. సమాజాన్ని మొత్తంగా

చూచినప్పుడు, ఒక సరుకు ధరలో, ఉదాహరణకు ఎల్లిగిసెనార ధరలో కలిసి వున్న లాభం రెండుసార్లు – లినన్ ధరలో ఒక భాగంగానూ, ఎల్లిగిసెనార లాభంగానూ రంగంపైకి రాజాలదు.

'ఏ' తాలూకు అదనపు విలువ 'బి' తాలూకు స్థిర పెట్టుబడిలోకి ప్రవేశిస్తున్నంత వరకూ అదనపు విలువకూ, లాభానికీ మధ్య తేడా లేదు. సరుకుల్లోని శ్రమకు చెల్లించారా లేక చెల్లించలేదా అన్న అంశంతో సరుకుల విలువకు సంబంధం లేదు. కనుక 'ఏ' యొక్క అదనపు విలువకు 'బి' చెల్లిస్తున్నట్లు ఇది నిరూపిస్తున్నది అంతే. 'ఏ' యొక్క అదనపు విలువ మొత్తం లెక్కల్లో రెండుసార్లు నమోదు కాజాలదు.

అయితే తేడా ఇదీ : ఒక నిర్దిష్ట ఉత్పాదితం ధరకు, ఉదాహరణకు 'బి' పెట్టుబడి యొక్క ఉత్పాదితం ధరకు దాని విలువకు మధ్య తేడా వుండవచ్చు. ఎందువల్లనంటే, "బి" పెట్టుబడిలో చేతికందని అదనపు విలువ 'బి' తాలూకు ఉత్పాదితాల ధరకు చేర్చిన లాభం కంటే ఎక్కువగానో తక్కువగానో వుండొచ్చు. అంతేకాదు, 'బి' పెట్టుబడి తాలూకు స్థిర భాగంగా వున్న సరుకులకు పరోక్షంగా దాని అస్థిర భాగంగా వున్న సరుకులకు, అంటే శ్రామికుల జీవితావసరాలకు సైతం ఈ వాస్తవం వర్తిస్తుంది. స్థిర భాగానికి సంబంధించి, అది ఉత్పత్తి ఖర్చులూ ప్లస్ అదనపు విలువకూ సమానంగా వుంటుంది; కాబట్టి ఇక్కడ ఉత్పత్తి ఖర్చుకు ప్లస్ లాభానికీ సమానంగా వుంటుంది; అయితే ఈ లాభం అన్నది అది ప్రాతినిధ్యం వహించే అదనపు విలువకంటే ఎక్కువగానూ వుండవచ్చు, తక్కువగానూ వుండవచ్చు. ఇక అస్థిర పెట్టుబడి సంగతికి వస్తే, సగటు రోజువారీ వేతనం ఎల్లప్పుడూ కార్మికులు జీవనావసరాలను ఉత్పత్తి చేయడానికి అవసరమైనన్ని గంటల్లో సృష్టింపబడిన విలువకు సమానంగా వుంటుంది. అయితే జీవనావసరాల ఉత్పత్తి ధరలకూ వాటి విలువలకూ మధ్య గల తేడా ఈ గంటల సంఖ్యను మరుగుపరుస్తుంది. ఈ సమస్యలో ఇమిడి వున్నదేమిటంటే, ఒక సరుకునకు అదనపు విలువ కన్నా తక్కువ అందుతుండగా, మరో సరుకుకు అదనపు విలువ కన్నా ఎక్కువ అందుతూంది. ఫలితంగా ఉత్పత్తి ధరల్లో నిక్షిప్తమై వున్న విలువ వ్యత్యాసాలు పరస్పరం రద్దవుతాయి.

పెట్టుబడిదారీ విధానంలో ఈ సార్వత్రిక నియమం దాదాపుగానూ చాలా సంక్లిష్టమైన పద్ధతిలోనూ మాత్రమే ప్రబల ధోరణిగా, నిరంతరమైన హెచ్చుతగ్గుల సగటుగా, ఇదమిత్థంగా నిర్ధారించ వీలులేని సగటుగా పనిచేస్తుంది.

ఒక నిర్దిష్ట కాలంలో, ఉదాహరణకు ఒక సంవత్సరంలో పెట్టుబడిలోని ప్రతి 100 యూనిట్లకు లభించే విభిన్న లాభం రేట్ల సగటు తీసుకోవడం ద్వారా సార్వత్రిక లాభం రేటు ఏర్పడుతుంది. కాబట్టే వేరు వేరు పెట్టుబడుల వేరు వేరు టర్నోవరు కాలాల మూలంగా తలెత్తే తేడా కూడా ఇందులో అదృశ్యమవుతుంది. అయితే విభిన్న ఉత్పత్తి శాఖల్లోని వివిధ లాభం రేట్లపై ఈ తేడాలకు నిర్ణయాత్మకమైన ప్రభావం వుంటుంది; ఈ రేట్ల సగటే సార్వత్రిక లాభం రేటు అవుతుంది.

సగటు లాభం రేటు నిర్ధారణకు సంబంధించి మనం ఇంతకు ముందు వివరించిన ఉదాహరణలో ప్రతి ఉత్పత్తి శాఖలో ప్రతి పెట్టుబడినీ 100గా ఊహించుకొన్నాము. లాభం రేట్లలో తేడాలను శాతాల్లో స్పష్టం చేయడానికీ, ఆ విధంగా ఒకే మొత్తంలోని పెట్టుబడులు ఉత్పత్తి చేసే సరుకుల విలువల్లోని తేడాలను విశదం చేయడానికీ, మనం అలా ఊహించుకున్నాం. అయితే ప్రతి ఉత్పత్తి శాఖల్లోనూ, పెట్టుబడి అంతర్నిర్మాణం నిర్ణీతమై వుంటుంది కనుక, అందులో ఉత్పత్తి అయ్యే

అదనపు విలువ పరిమాణాలు, మదుపు పెట్టిన పెట్టుబడుల మొత్తంపై ఆధారపడి వుంటాయని వేరే చెప్పే పనిలేదు. కానీ, ఏదైనా ఒక ఉత్పత్తి శాఖలో, వాస్తవ లాభం రేటును పెట్టుబడి పరిమాణం ప్రభావితం చేయదు. పెట్టుబడి 100 లేక క × 100 లేక క×చ×100 అన్నది దానిని ప్రభావితం చేయదు. మొత్తం లాభం 100 అయినా, 1000 అయినా, 10,000 అయినా, ఎంతయినా లాభం రేటు 10 శాతంగానే వుంటుంది తప్ప అందులో మార్పు వుండదు.

ఐనప్పటికీ, విభిన్న ఉత్పత్తి శాఖల్లో మొత్తం పెట్టుబడిలో అస్థిర పెట్టుబడి నిష్పత్తిని బట్టి అదనపు విలువల మొత్తాల్లో, లేక లాభంలో తేడాలుంటాయి. సామాజిక పెట్టుబడిలోని ప్రతి 100కి సగటు లాభం, సగటు లేక, సార్వత్రిక లాభం రేటు వివిధ ఉత్పత్తి శాఖల్లో పెట్టిన పెట్టుబడుల మొత్తాలనుబట్టి గణనీయంగా మార్పు చెందుతుందనడం స్పష్టమే. ఎ, బి, సి, డి అనే నాలుగు పెట్టుబడులను తీసుకుందాం. అన్ని పెట్టుబడులకూ ఒకే అదనపు విలువ రేటు 100% వుంటుందనుకుందాం. 'ఏ' పెట్టుబడిలో ప్రతి 100 మొత్తం పెట్టుబడిలోనూ అస్థిర పెట్టుబడి 25 అనీ, 'బి'లో 40 అనీ, 'సి'లో 15 అనీ, 'డి'లో 10 అనీ భావిద్దాం. అప్పుడు మొత్తం పెట్టుబడిలోని ప్రతి 100 'ఏ' 25 అదనపు విలువను లేక లాభాన్ని, 'బి'లో 40 లాభాన్ని, 'సి'లో 15 లాభాన్ని, 'డి'లో 10 లాభాన్ని సృష్టిస్తాయి. ఈ లాభాల మొత్తం 90 అవుతుంది. ఈ నాలుగు పెట్టుబడులు ఒకే పరిమాణం గలవనుకొంటే, సగటు లాభం రేటు $\frac{90}{4}$ లేక, $22\frac{1}{2}\%$ అవుతుంది.

అయితే, ఆ మొత్తం పెట్టుబడులు ఈ కింది విధంగా వున్నాయనుకుందాం : 'ఏ' = 200, 'బి' = 300, 'సి' = 1000, 'డి' = 4000. అప్పుడు అవి ఉత్పత్తి చేసే లాభాలు వరుసగా ఇలా వుంటాయి: 50, 120, 150, 400. అప్పుడు మొత్తం నాలుగు పెట్టుబడులకూ అంటే 5,500కూ మొత్తం లాభం 720, సగటు లాభం రేటు $13\frac{1}{11}\%$ అవుతుంది.

ఎ, బి, సి, డిలలో మదుపు చేసిన మొత్తం పెట్టుబడుల పరిమాణాన్ని బట్టి ఉత్పత్తి అయిన మొత్తం విలువ పరిమాణాలు భిన్నంగా వుంటాయి. కాబట్టి సగటు లాభం రేటు రూపొందేది విభిన్న ఉత్పత్తి శాఖల్లోని విభిన్న లాభం రేట్ల సామాన్య సగటును బట్టి కాదు; ఈ సగటును రూపొందించడంలో ఈ విభిన్న లాభం రేట్ల సాపేక్ష ప్రభావానికి సంబంధించిన విషయమిది. కాని, ప్రతి ఉత్పత్తి శాఖలోనూ మదుపు చేసిన పెట్టుబడి యొక్క సాపేక్ష పరిమాణంపైన లేక, ప్రతి శాఖలోని పెట్టుబడి మొత్తం సామాజిక పెట్టుబడిలో ఎంత భాగం అనేదానిపైన ఆధారపడి వుంది. మొత్తం పెట్టుబడిలోని పెద్ద భాగం లేక చిన్న భాగం ఎక్కువ లాభం రేటును ఉత్పత్తి చేస్తుందా లేక తక్కువ లాభం రేటును ఉత్పత్తి చేస్తుందా అనే అంశం ఆధారంగా సహజంగానే పెద్ద తేడా వుంటుంది. ఇది మొత్తం పెట్టుబడితో పోల్చినప్పుడు అస్థిర పెట్టుబడి సాపేక్షంగా ఎక్కువగా లేక తక్కువగా వున్న వివిధ శాఖలు దీనిలో ఎంత పెట్టుబడి మదుపు పెట్టారు అనేదానిపై ఆధారపడి వుంటుంది. ఒక వడ్డీ వ్యాపారి విభిన్న వడ్డీ రేట్లకు – 4% లేక 5% లేక 6% లేక 7% రేట్లకు వివిధ మొత్తాల పెట్టుబడిని అప్పుగా ఇవ్వగా అతనికి వచ్చే సగటు వడ్డీ లాగానే యిదీను. ఆ వడ్డీ వ్యాపారి ఎంత పెట్టుబడి ఏఏ వడ్డీ రేట్లతో అప్పు ఇచ్చాడు అన్నదానిపై అతని సగటు వడ్డీ రేటు ఆధారపడి వుంటుంది.

కాబట్టి సార్వత్రిక లాభం రేటును రెండు అంశాలు నిర్ధారిస్తాయి;

1. విభిన్న ఉత్పత్తి శాఖల్లోని పెట్టుబడుల అంతర్నిర్మాణం, ఆ మేరకు ఆయా శాఖల్లోని విభిన్న లాభం రేట్లు;
2. ఈ విభిన్న శాఖల మధ్య మొత్తం సామాజిక పెట్టుబడి పంపిణీ, ఆ మేరకు ఒక్కో శాఖలో వున్న నిర్దిష్ట లాభం రేటును మదుపు చేసిన పెట్టుబడి సాపేక్ష పరిమాణం; అంటే ప్రతి ఉత్పత్తి శాఖ మొత్తం సామాజిక పెట్టుబడిలో వాడుకున్న సాపేక్ష వాటా.

మొదటి సంపుటంలోనూ, రెండవ సంపుటంలోనూ మనం సరుకుల విలువ గురించే చర్చించాం. ఇప్పుడేమో ఒకవైపు ఈ విలువలో ఉత్పత్తి వ్యయాన్ని ఒక భాగంగా వేరుచేసి చూపాం. మరోవైపు సరుకుల ఉత్పత్తి ధరను ఈ విలువ యొక్క పరివర్తిత రూపంగా నిర్ధారించాం.

సగటు సామాజిక పెట్టుబడి నిర్మాణ స్వరూపం 80స్థి.పె. 20అ.పె. అనీ అదనపు విలువ వార్షిక రేటు వా.వి.' 100 అనుకుందాం. అప్పుడు 100 పెట్టుబడికి వార్షిక సగటు లాభం 20 అవుతుంది; కాగా సార్వత్రిక వార్షిక లాభం రేటేమో 20 శాతం అవుతుంది. 100 పెట్టుబడి సంవత్సర కాలంలో ఉత్పత్తి చేసే సరుకుల తాలూకు ఉత్పత్తి వ్యయం వ్య. ఎంత అయినప్పటికీ, వాటి ఉత్పత్తి ధర వ్య.+20గా వుంటుంది. పెట్టుబడి నిర్మాణ స్వరూపం (80–క) స్థి.పె.+ (20+క) అ.పె. గా వున్నట్టి ఉత్పత్తి శాఖల్లో, వాస్తవంగా ఉత్పత్తి అయ్యే అదనపు విలువ లేక వార్షిక లాభం 20+క గా వుంటుంది. అంటే 20 కంటే ఎక్కువ వుంటుంది. కాగా ఉత్పత్తి అయిన సరకుల విలువ వ్య.+20+క, అంటే వ్య.+20 కంటే ఎక్కువగా వుంటుంది. లేదా వాటి ఉత్పత్తి ధరకంటే ఎక్కువగా వుంటుంది. పోతే, పెట్టుబడి నిర్మాణ స్వరూపం (80+క) స్థి.పె.+(20–క) అ.పె.గా వున్నట్టి ఉత్పత్తి శాఖల్లో, ఏటా ఉత్పత్తి అయ్యే అదనపు విలువ, లేక లాభం 20–క, లేక 20 కంటే తక్కువగా వుంటుంది. పర్యవసానంగా సరుకుల విలువ వ్య.+20–క, వాటి ఉత్పత్తి ధర అయిన వ్య.+20 కంటే తక్కువగా వుంటుంది. టర్నోవర్ కాలాల్లో తేడాలను వదిలేస్తే, పెట్టుబడి నిర్మాణ స్వరూపం 80 స్థి.పె. 20అ.పె.గా ఉన్నట్టి ఉత్పత్తి శాఖల్లో మాత్రమే సరుకుల ఉత్పత్తి ధర వాటి విలువకు సమానంగా వుంటుంది.

ప్రతి ఉత్పత్తి శాఖలోని శ్రమ సామాజిక ఉత్పాదకత యొక్క ప్రత్యేక అభివృద్ధి స్థాయిలో తేడాలుంటాయి; ఒక నిర్దిష్ట శ్రమ పరిమాణం అంటే ఒక నిర్ణీత పనిదినంలో, ఒక నిర్దిష్ట సంఖ్యలోని శ్రామికులు ఎంత భారీ స్థాయిలో ఉత్పత్తి సాధనాల మొత్తాన్ని చలనంలో పెట్టారు అన్నదాన్నిబట్టి ఆ ఉత్పాదకత స్థాయి ఎక్కువగానో లేక తక్కువగానో వుంటుంది. అంటే నిర్దిష్ట ఉత్పత్తి సాధనాలను చలనంలో పెట్టడానికి ఎంత తక్కువ శ్రమ పరిమాణం అవసరం అన్నదానిపై అది ఆధారపడి వుంటుంది. కనుక సగటు సామాజిక పెట్టుబడి కంటే స్థిర పెట్టుబడి శాతం ఎక్కువగా, అస్థిర పెట్టుబడి శాతం తక్కువగా వుండే పెట్టుబడులను మనం ఉన్నత అంతర్నిర్మాణం గల పెట్టుబడులని అంటాం; అందుకు భిన్నంగా, స్థిర పెట్టుబడి సాపేక్షంగా తక్కువగా, అస్థిర పెట్టుబడి సాపేక్షంగా ఎక్కువగా ఉన్నట్టి పెట్టుబడులనేమో అల్ప అంతర్నిర్మాణం గల పెట్టుబడులని అంటాం. చివరగా, పెట్టుబడుల అంతర్నిర్మాణ సగటు స్థాయిలో వుండే పెట్టుబడులను సగటు అంతర్నిర్మాణం గల పెట్టుబడులని అంటాం. సగటు సామాజిక పెట్టుబడి నిర్మాణం 80స్థి.పె.+20అ.పె. శాతంలో వున్నట్లయితే 90స్థి.పె.+10అ.పె. పెట్టుబడి సగటు సామాజిక పెట్టుబడి కంటె ఉన్నతమైన

అంతర్నిర్మాణం గల పెట్టుబడి; 70$_{\text{స్థి.పె.}}$+30$_{\text{అ.పె.}}$ పెట్టుబడి ఏమో అల్ప అంతర్నిర్మాణం గల పెట్టుబడి అవుతుంది. మామూలుగా చెప్తే, సగటు సామాజిక పెట్టుబడి అంతర్నిర్మాణం వ $_{\text{స్థి.పె.}}$+ బ $_{\text{అ.పె.}}$ గానూ, ఇందులో వ, బ లు స్థిర పరిమాణాలు గానూ వ+బ=100 గానూ వున్నట్లయితే అప్పుడు (వ+క) $_{\text{స్థి.పె.}}$ + (బ−క) $_{\text{అ.పె.}}$ అనేది, ఉన్నత అంతర్నిర్మాణం గల పెట్టుబడికి ప్రాతినిధ్యం వహించగా (వ−క)$_{\text{స్థి.పె.}}$+(బ+క)$_{\text{అ.పె.}}$ అన్నది అల్ప అంతర్నిర్మాణం గల పెట్టుబడికి లేక పెట్టుబడుల బృందానికి ప్రాతినిధ్యం వహిస్తుంది. సంవత్సరానికి ఒక టర్నోవర్ అనుకుంటే, సగటు లాభం రేటు, స్థాపితమైన తరువాత, ఈ పెట్టుబడులు ఏ విధంగా పని చేస్తాయో ఈ కింది పట్టికలో తెలిపాం. ఇందులో 1వ పెట్టుబడి 20% సగటు లాభం రేటుగల సగటు అంతర్నిర్మాణం గల పెట్టుబడికి ప్రాతినిధ్యం వహిస్తుంది.

1. 80$_{\text{స్థి.పె.}}$+20$_{\text{అ.పె.}}$+20$_{\text{అ.వి.}}$ లాభం రేటు = 20%
   ఉత్పాదితం ధర = 120, విలువ = 120
2. 90$_{\text{స్థి.పె.}}$+10$_{\text{అ.పె.}}$+10$_{\text{అ.వి.}}$ లాభం రేటు = 20%
   ఉత్పాదితం ధర = 120, విలువ=110
3. 70$_{\text{స్థి.పె.}}$+30$_{\text{అ.పె.}}$+30$_{\text{అ.వి.}}$ లాభం రేటు = 20%
   ఉత్పాదితం ధర = 120, విలువ = 130

కాబట్టి IIవ పెట్టుబడి ఉత్పత్తి చేసే సరుకుల విలువ వాటి ఉత్పత్తి ధర కంటే తక్కువగా వుంటుంది; కాగా IIIవ పెట్టుబడిలో సరుకుల ఉత్పత్తి ధర వాటి విలువ కంటే తక్కువగా వుంటుంది; పోతే పెట్టుబడి అంతర్నిర్మాణం సామాజిక సగటుకు సమానంగా వుండే I వ పెట్టుబడిలో మాత్రమే విలువా, ఉత్పత్తి ధర సరిసమానంగా వుంటాయి. అయితే ఏ నిర్దిష్ట ఉదాహరణలకైనా ఈ పదాలను అన్వయించేప్పుడు ఒక విషయం దృష్టిలో వుంచుకోవాలి. స్థి.పె, అ.వి.ల నిష్పత్తిలోని తేడాకు కారణం కేవలం స్థిర పెట్టుబడి భాగాల విలువలో మార్పేనా లేక సాంకేతిక నిర్మాణ స్వరూపంలోని మార్పే దానికి కారణమా అన్న విషయాన్ని గమనించాలి.

అయితే సరుకుల ఉత్పత్తి ధర నిర్ధారణకు సంబంధించి ఇంతకు ముందు చేసిన ఊహను పై ప్రకటనలు ఏ విధంగానైనా సరే మార్చాయి. ఒక సరుకు యొక్క ఉత్పత్తి ధర ఆ సరుకు ఉత్పత్తిలో వ్యయమైన సరుకుల విలువలకు సమంగా వుంటుందని మనం మొదట ఊహించుకొన్నాం. అయితే కొనుగోలుదారుడికి ఒక నిర్దిష్ట సరుకు యొక్క ఉత్పత్తి ధర దాని ఉత్పత్తి వ్యయమే కనుక అది ఇతర సరుకుల ధరల్లోకి ఉత్పత్తి వ్యయంగానే ప్రవేశించవచ్చు. ఒక సరుకు ఉత్పత్తి ధరకూ, దాని విలువకూ మధ్య తేడా వుండొచ్చు కాబట్టి, ఇతర సరుకుల ఉత్పత్తి ధర కలిసి వున్నట్టి ఒక సరుకు ఉత్పత్తి వ్యయం ఆ సరుకు మొత్తం విలువలో ఏ భాగమైతే అది వినియోగించుకొన్న ఉత్పత్తి సాధనాల విలువగా వుందో, ఆ భాగం కన్నా ఎక్కువగానూ వుండొచ్చు, తక్కువగానూ వుండొచ్చు. ఉత్పత్తి వ్యయానికి గల ప్రాముఖ్యంలోని ఈ మార్పును గుర్తుంచుకోవాలి; ఒక శాఖలోని సరుకు తాలూకు ఉత్పత్తి ఖర్చును అది వినియోగించుకొన్న ఉత్పత్తి సాధనాల విలువగా భావించే పక్షంలో పొరపాటు రావచ్చునన్న సంగతిని దృష్టిలో వుంచుకోవాలి. ప్రస్తుత విశ్లేషణ కోసం ఈ అంశాన్ని ఇంతకన్నా లోతుగా పరిశీలించాల్సిన అవసరం లేదు. కాని ఒక సరుకు యొక్క ఉత్పత్తి ఖర్చు ఎల్లప్పుడూ దాని

విలువకంటే తక్కువగానే వుంటుందనేది నిజం. ఒక సరుకు యొక్క ఉత్పత్తి వ్యయానికీ అది వినియోగించుకొన్న ఉత్పత్తి సాధనాల విలువకూ మధ్య ఎంత తేడా వున్నప్పటికీ పెట్టుబడిదారు ఈ పాత పొరపాటును పట్టించుకోనే పట్టించుకోడు. ఒక నిర్దిష్ట సరుకు యొక్క ఉత్పత్తి ఖర్చు ఇదమిత్థంగా నిర్ణీతమై వున్న విషయం మన పెట్టుబడిదారుడి ఉత్పత్తితో నిమిత్తం లేదు. కాగా అతడి ఉత్పత్తి యొక్క ఫలితం మాత్రం అదనపు విలువ కలిసి వున్న సరుకు కాబట్టి అందులో దాని ఉత్పత్తి వ్యయానికి మించిన అధిక విలువ వుంది. ఏ విధంగా చూసినా సరుకు యొక్క విలువకంటె ఉత్పత్తి వ్యయం తక్కువ అనే మాట ఇప్పుడు ఆచరణలో ఉత్పత్తి వ్యయం, ఉత్పత్తి ధర కంటే తక్కువ అనే మాటగా మారింది. కాగా ఉత్పత్తి ధర, విలువకు సమానంగా వుండే మొత్తం సామాజిక పెట్టుబడి విషయంలోంచి, ఈ మాట మునుపటి మాటలాగే వుంటుంది. అంటే ఉత్పత్తి వ్యయం విలువకంటే తక్కువే అన్న మాటలాగే వుంటుంది. వ్యష్టి ఉత్పత్తి రంగాల్లో ఈ మాట కొంత మారినప్పటికీ, మొత్తం సామాజిక పెట్టుబడి విషయంలో మాత్రం ఉత్పత్తి వ్యయం వాటి విలువ కంటే తక్కువగా వుంటుందన్నది ఎప్పుడూ మౌలిక వాస్తవంగానే వుంటుంది. లేక, మొత్తం సామాజిక సరుకుల రాశి విషయంలో, వాటి విలువకు విభిన్నమైన వాటి ఉత్పత్తి ధర కన్నా తక్కువగా వుంటుంది. ఉత్పత్తి ధరలో చెల్లించిన శ్రమ పరిమాణం, ప్లస్ చెల్లించని శ్రమ పరిమాణంలో ఒక నిర్దిష్ట భాగం – వీటిని గురించిన ప్రస్తావన వుంది. ఏ ప్రత్యేక ఉత్పత్తి రంగం విషయంలోనైనా చెల్లించకుండా వున్న ఈ శ్రమ పరిమాణాన్ని కొన్ని పరిస్థితులు నిర్ణయిస్తాయి. వీటిపై ఆ రంగానికి అదుపు ఉండదు.

ఒక సరుకు యొక్క ఉత్పత్తి ధర = వ్య+ల అనే సూత్రీకరణను అంటే ఒక సరుకు యొక్క ఉత్పత్తి ధర, దాని ఉత్పత్తి వ్యయం ప్లస్ లాభానికి సమానంగా వుంటుందనే సూత్రీకరణను ఇప్పుడు ల=వ్య.ల' (ల'అంటే సార్వత్రిక లాభం రేటు) అనే దానితో మరింత కచ్చితంగా నిర్వచిస్తున్నాము. కాబట్టి ఉత్పత్తి ధర = వ్య+వ్య.ల' వ్య=300, లా'=15% అయితే, అప్పుడు ఉత్పత్తి ధర వ్య+వ్య.ల' $= 300+300\times\frac{15}{100}$ లేక 345.

ఏదైనా ఒక ఉత్పత్తి శాఖలోని సరుకుల ఉత్పత్తి ధర తాలూకు పరిమాణంలో ఈ క్రింది సందర్భాల్లో మార్పులుండవచ్చు.

1. దీని సరుకుల విలువ యథాతథంగా వుంటూ (సరుకుల ఉత్పత్తిలో మునుపటి పరిమాణాల్లోనే మృత, సజీవ శ్రమ వినియోగమవుతూండగా) సార్వత్రిక లాభం రేటు గనుక ఈ ప్రత్యేక శాఖతో నిమిత్తం లేకుండా మారినట్లయితే;
2. సార్వత్రిక లాభం రేటు యథాతథంగా ఈ ప్రత్యేక రంగంలో సాంకేతిక మార్పుల ఫలితంగానో లేదా ఈ రంగ స్థిర పెట్టుబడిలో అంతర్భాగాలవుతున్న సరుకుల విలువ మారిన ఫలితంగానో విలువలో మార్పు వున్నట్లయితే కానీ...
3. చివరగా పైన తెలిపిన ఈ రెండు పరిస్థితులు యేకమైతే కానీ...

వ్యక్తిగత ఉత్పత్తి రంగాల్లోని వాస్తవ లాభం రేట్లలో నిరంతరాయంగా పెద్ద మార్పులు చోటు చేసుకుంటున్నప్పటికీ, (ఈ విషయం ముమ్మందు అవగతమవుతుంది) అసాధారణ ఆర్థిక సంఘటనల కారణంగా తప్ప సార్వత్రిక లాభం రేటులో ఏదైనా నిజమైన మార్పు వుందంటే, అది సుదీర్ఘ కాల

వ్యవధుల్లో జరిగిన హెచ్చుతగ్గుల పరంపర ఫలితం. ఇలాంటి హెచ్చుతగ్గులు స్థిరత్వం పొంది ఒకదాన్ని మరొకటి సమానీకరించి సార్వత్రిక లాభం రేటులో మార్పు తీసుకు రావడానికి దీర్ఘకాలం పడుతుంది. అన్ని స్వల్ప వ్యవధుల్లోనూ (మార్కెట్ ధరల్లోని హెచ్చుతగ్గుల్ని మినహాయిస్తే) ఉత్పత్తి ధరల్లోని మార్పుకు అసలు మూలం, ఎల్లప్పుడూ సరుకుల విలువలోని మార్పుల్లో అంటే వాటి ఉత్పత్తికి అవసరమైన శ్రమకాల పరిమాణంలోని మార్పుల్లో వుందని మనం గమనించవచ్చు. ఆ విలువల యొక్క కేవల డబ్బు వ్యక్తీకరణలో మార్పులను సహజంగానే ఇక్కడ మనం పరిగణనకు తీసుకోవడం లేదు.[1]

మరోవైపు మొత్తం సామాజిక పెట్టుబడి దృక్పథం నుంచి చూస్తే, అది ఉత్పత్తి చేసే సరుకుల విలువ (లేదా డబ్బు రూపంలో వ్యక్తం చేస్తే వాటి ధర) = స్థిర పెట్టుబడి విలువ + అస్థిర పెట్టుబడి విలువ + అదనపు విలువ. శ్రమదోపిడీ స్థాయిలో మార్పు లేదని భావిస్తే, అదనపు విలువ పరిమాణంలో మార్పు వుంటే తప్ప లాభం రేటు కూడా మార్పు చెందదు; స్థిర పెట్టుబడి విలువలో కానీ అస్థిర పెట్టుబడి విలువలో కానీ లేదా ఈ రెండు విలువలలో కానీ మార్పువుంటే తప్ప లాభం రేటు మారదు. మొ.పెలో మార్పు వస్తే సార్వత్రిక లాభం రేటును $\frac{\text{అ.వి.}}{\text{మొ.పె}}$ సూచిస్తుంది. ఈ రెంటిలోని ప్రతి సందర్భంలోనూ సార్వత్రిక లాభం రేటులో మార్పు వచ్చిందంటే స్థిర పెట్టుబడిని లేక అస్థిర పెట్టుబడిని లేదా రెండింటి అంతర్భాగాలుగా వుండే సరుకుల విలువలో కూడా మార్పు వచ్చినట్లే.

లేదా, సరుకుల విలువ యథాతథంగా వుండగా, శ్రమ దోపిడీ స్థాయిలో మార్పు వున్నట్లయితే సార్వత్రిక లాభం రేటు మార్పు చెందవచ్చు.

లేదా, శ్రమదోపిడీ స్థాయి యథాతథంగా వుంటే, శ్రమ ప్రక్రియలో సాంకేతిక మార్పుల ఫలితంగా స్థిర పెట్టుబడికి నియుక్తమైన సాపేక్ష శ్రమ పరిమాణంలో మార్పు రావడం ద్వారా సార్వత్రిక లాభం రేటు మార్పు చెందవచ్చు. అయితే ఇలాటి సాంకేతిక మార్పులు ఎల్లప్పుడూ సరుకుల విలువ మార్పులోనే వ్యక్తంకావాలి. అలా సాంకేతిక మార్పులు వచ్చినప్పుడు ఆ సరుకుల ఉత్పత్తికి అవసరమైన శ్రమ అంతకు ముందుకంటే ఎక్కువగానైనా వుంటుంది, లేదా తక్కువగానైనా వుంటుంది.

అదనపు విలువ, లాభం రెండూ వాటి మొత్తం పరిమాణం దృష్ట్యా ఒకటేనని మనం ప్రథమ భాగంలో గమనించాం. కానీ మొట్టమొదటి నుంచే లాభం రేటుకూ, అదనపు విలువ రేటుకూ మధ్య స్పష్టమైన తేడా వుంది; ఇది పైకి లెక్కించే పద్ధతిలో వున్న తేడాగా మాత్రమే కనిపించే మాట నిజం. కాగా అదనపు విలువ రేటు యథాతథంగా వుంటూనే, లాభం రేటు పెరగవచ్చు లేదా తగ్గవచ్చు. ఆచరణలో పెట్టుబడిదారుడు పట్టించుకునేది కేవలం తన లాభం రేటు గురించే. ఈ రెండు కారణాల వల్ల, ఇలా లెక్కించడం అదనపు విలువ యొక్క నిజమైన పుట్టు పూర్వోత్తరాలను పూర్తిగా కనిపించకుండా చేస్తుంది; అర్థంకానివాటిగా, నిగూఢమైనవిగా చేస్తుంది. ఏమైనా అదనపు విలువ రేటు, లాభం రేటుల మధ్య పరిమాణంలో తేడా వుందే తప్ప, అదనపు విలువకూ, లాభానికీ మధ్య మాత్రం తేడా లేదు. లాభం రేటు విషయంలో, అదనపు విలువను మొత్తం పెట్టుబడిపై లెక్కిస్తున్నారు. మొత్తం పెట్టుబడినీ దానికి కొలమానంగా పరిగణిస్తున్నారు. అందువల్ల అదనపు విలువ మొత్తం పెట్టుబడి

1. కోర్బెట్ (యాన్ ఎంక్వయిరీ ఇంటు ది కాజెస్ అండ్ మోడ్స్ ఆఫ్ వెల్త్ ఆఫ్ ఇండివిడ్యువల్స్, లండన్ 1841 - సంపాదకుడు) పుట 174.

నుంచి దాని అన్ని భాగాల నుంచి సమానంగా లభ్యమవుతున్నట్లు కనిపిస్తుంది. ఫలితంగా, లాభం గురించిన భావనలో స్థిర, అస్థిర పెట్టుబడుల మధ్య గల ఆంగికభాగం తుడిచిపెట్టుకుపోతుంది. లాభం అనే మారువేషంలో, అదనపు విలువ వాస్తవానికి తన పుట్టుకనే కాదంటుంది; తన స్వభావాన్ని కోల్పోతోంది. తనను గుర్తుపట్టడానికి వీలులేకుండా చేసుకుంటున్నది. లాభం, అదనపు విలువ మధ్య భేదం, ఇంతవరకు కేవలం ఒక గుణాత్మక మార్పుకు లేదా రూపం మార్పుకు మాత్రమే వర్తిస్తుండగా, ఈ మార్పు యొక్క మొదటిదశలో అదనపు విలువ, లాభాల మధ్య పరిమాణంలో నిజమైన తేడా లేదు. కానీ లాభం రేటు, అదనపు విలువ రేటు మధ్య తేడా వుంది.

అయితే సార్వత్రిక లాభం రేటు, తద్వారా వివిధ ఉత్పత్తి శాఖల్లో, మదుపు చేసిన పెట్టుబడి మొత్తానికి అనుగుణంగా సగటు లాభం స్థాపితం కాగానే పరిస్థితి ఇందుకు భిన్నంగా వుంటుంది.

అప్పుడు, ఏదైనా ఒక ఉత్పత్తి శాఖలో వాస్తవంగా ఉత్పత్తి అయిన అదనపు విలువా, ఆ విధంగా లాభమూ ఒక సరుకు యొక్క అమ్మకం ధరలోని లాభంతో ఏకీభవించినట్లయితే అది యాదృచ్ఛికమే కాగలదు. అదనపు విలువ, లాభం రేట్లు మాత్రమే కాక అదనపు విలువా, లాభమూ కూడా తప్పనిసరిగా విభిన్న పరిమాణాల్లో వుంటాయి. ఒక నిర్ణీత దోపిడీ స్థాయిలో, ఏదైనా ఒక ఉత్పత్తి రంగంలో ఉత్పత్తి అయిన అదనపు విలువ పరిమాణం ఆ శాఖలోని వ్యష్టి పెట్టుబడిదారుకంటే సామాజిక పెట్టుబడి తాలూకు మొత్తం సగటు లాభానికి సంబంధించి మొత్తంగా పెట్టుబడిదారీ వర్గానికి సంబంధించి ఎక్కువ ముఖ్యమైనది. తన శాఖలో ఉత్పత్తి అయిన అదనపు విలువ మొత్తం సగటు లాభాన్ని క్రమబద్ధం చేసేందుకు సహాయపడిన మేరకే వ్యష్టి పెట్టుబడిదారుకు అది ముఖ్యమైనది.[1] అయితే ఈ పరిణామం అంతా అతనితో ప్రమేయం లేకుండా జరుగుతుంది. కాబట్టి దాన్ని అతడు చూడడు, అర్థం చేసుకోడు. దానిపట్ల అతనికి ఆసక్తే వుండదు. లాభం రేటుకూ, అదనపు విలువ రేటుకూ మధ్య గల పరిమాణపు భేదమే కాక – లాభానికీ, అదనపు విలువకూ మధ్య వాస్తవంగా వుండే పరిమాణపు భేదం, లాభం యొక్క పుట్టుపూర్వోత్తరాలను వాస్తవ స్వభావాన్ని సంపూర్ణంగా మూసిపెడుతుంది. ఈ విషయంలో ఆత్మవంచన పట్ల ప్రత్యేక ఆసక్తి చూపే పెట్టుబడిదారుని దృష్టి నుంచే కాకుండా కార్మికుని దృష్టి నుంచి కూడా ఇది మరుగుపుచ్చుతుంది. విలువలు, ఉత్పత్తి ధరలుగా మారడం, అసలు విలువనే నిర్ధారించే ప్రాతిపదికను కనిపించకుండా చేసేందుకు ఉపకరిస్తుంది. చివరగా, అదనపు విలువ కేవలం లాభంగా మారడం వల్ల సరుకు తాలూకు విలువలో లాభంగా మారే భాగం దాని ఉత్పత్తి వ్యయంగా వున్న భాగం నుంచి వేర్పడిపోతుంది. కాబట్టి, ఈ దశలో పెట్టుబడిదారుడికి విలువ గురించిన భావన కనిపించకపోవడం సహజమే. ఎందుచేతనంటే, అతడు సరుకులోకి వెళ్ళిన మొత్తం శ్రమను చూడడు. ఉత్పత్తి సాధనాల రూపంలో, అది సజీవమైనదైనా లేక వస్తు రూపమైనదైనా తాను చెల్లించిన శ్రమ భాగాన్ని మాత్రమే చూస్తాడు. కనుక అతడికి తన లాభం తన సరుకు తాలూకు అంతర్గత విలువకు బాహ్యమైనదిగా కనిపిస్తుంది. దీన్ని పూర్తిగా ధ్రువపరిచి, పదిలపరచి, చెక్కుచెదరకుండా చేస్తున్న అంశం ఒకటి వుంది. అదేమంటే ఉత్పత్తి వ్యయానికి

1. వేతనాల తగ్గింపు ద్వారా, గుత్త ధరలు వగైరాల ద్వారా తాత్కాలికంగా అధిక లాభాలను సంపాదించే అవకాశాన్ని మనం సహజంగానే ప్రస్తుతానికి వదలివేస్తున్నాం - **ఫ్రెడరిక్ ఎంగెల్స్.**

చేర్చబడిన లాభాన్ని తన శాఖలోని విలువ ఏర్పడే క్రమం తాలూకు పరిమితులు కాక తన ప్రత్యేక ఉత్పత్తి శాఖ దృక్కోణం నుంచి చూస్తే పూర్తిగా బాహ్య ప్రభావాలే నిర్ణయిస్తాయి.

ఈ ఆంతరిక సంబంధాన్ని ఇక్కడే ప్రప్రథమంగా బహిర్గతం చేయడం జరిగింది. రానున్న అధ్యాయాల్లోనూ, నాల్గవ సంపుటిలోనూ మనం ఈ క్రింది వాస్తవాన్ని చూడబోతున్నాము. అదనపు విలువకూ, లాభానికీ, వాటి రేట్లకూ మధ్య గల తేడాల నుంచీ ఇప్పటిదాకా రాజకీయ అర్థశాస్త్రం బలవంతంగా దూరంగా వుంది. కనుక విలువ నిర్ధారణను ప్రాతిపదికగా అది నిలుపుకోగలిగింది. లేదా ఈ పరిణామంలో కనిపించే తేడాలను అంటిపెట్టుకోడానికి గాను, ఈ విలువ నిర్ధారణకు దానితోపాటు శాస్త్రీయ దృక్పథం అవశేషాలన్నిటికీ తిలోదకాలివ్వడం జరిగింది. సిద్ధాంతవేత్తల్లో తలెత్తిన ఈ గందరగోళ పోటీ వల్ల కళ్ళు కనపించని పెట్టుబడిదారు ఈ పరిణామాన్ని ఛేదించి, దీని అంతస్సారాంశాన్నీ, దీని ఆకారం వెనుక గల ఆంతరంగిక నిర్మాణాన్నీ గుర్తించగల శక్తి ఆచరణాత్మక పెట్టుబడిదారునికి లేదనడానికి అతి చక్కని ఉదాహరణ.

నిజానికి లాభం రేటు పెరుగుదల, తరుగుదలకు సంబంధించి ప్రథమ భాగంలో రూపొందిన నియమాలన్నింటికీ ఈ క్రింది రెండు అర్థాలున్నాయి.

1. ఒకవైపేమో, అవి సార్వత్రిక లాభం రేటుకు సంబంధించిన నియమాలు. లాభం రేటు పెరగడానికీ లేక తరగడానికీ అనేక విభిన్న కారణాలున్నాయి. కాబట్టి సార్వత్రిక లాభం రేటు ప్రతిరోజూ మార్పు చెందుతుందని ఎవరైనా భావించవచ్చు. అయితే ఒక ఉత్పత్తి శాఖలోని ఒక ధోరణి మరో ఉత్పత్తి శాఖలోని ధోరణిని పరిహరిస్తుంది. వాటి ప్రభావాలు ఒకదానినొకటి అడ్డుకొని ఒక దానిని మరొకటి స్తంభింపచేస్తాయి. ఈ హెచ్చుతగ్గులు అంతిమంగా ఏ దిశగా మొగ్గుతాయి అన్న విషయాన్ని మనం తర్వాత పరిశీలిద్దాం. ఏమైనా వాటి నడక నిదానం. వ్యక్తిగత ఉత్పత్తి శాఖల్లో ఈ హెచ్చుతగ్గుల ఆకస్మికత, బహుళత వాటి వేరు కాల వ్యవధులు వీటివల్ల అవి సంభవించే వరుస క్రమంలో ఒకదానికొకటి పరిహారమవుతాయి. ఫలితంగా ఒకసారి ధర తగ్గాక మళ్ళీ ధర పెరుగుతుంది, ధర పెరిగాక మళ్ళీ తగ్గుతుంది. ఈ విధంగా అవి స్థానిక ఉత్పత్తి శాఖలకే అంటే ఆయా వ్యష్టి శాఖలకు పరిమితమై ఉంటాయి. విభిన్న స్థానిక హెచ్చుతగ్గులు అంతిమంగా ఒకదానిని మరొకటి స్తంభింపచేస్తాయి. ప్రతి వ్యక్తిగత ఉత్పత్తి శాఖలోనూ మార్పులు, అంటే సాధారణ లాభం రేటు నుంచి వైదొలగిన అతిక్రమణలు తలెత్తుతాయి. ఇవి ఒకవైపేమో ఒక నిర్దిష్ట కాలంలో ఒకదానికొకటి విరుగుడుగా పనిచేస్తాయి. ఆ విధంగా సార్వత్రిక లాభం రేటుపై వీటి ప్రభావం ఉండదు. మరోవైపేమో స్థానిక హెచ్చుతగ్గులు వాటిని సమతూకంలో ఉంచుతాయి. కనుక వాటికి దానిపై ప్రతిచర్య ఉండదు; సార్వత్రిక లాభం రేటును నిర్ధారించేది ప్రతి ఉత్పత్తి రంగంలోని సగటు లాభం రేటు మాత్రమే కాదు. విభిన్న ఉత్పత్తి శాఖల మధ్య, మొత్తం సామాజిక పెట్టుబడి పంపిణీ అయిన విధం కూడా సార్వత్రిక లాభం రేటును నిర్ధారిస్తుంది. ఆ పంపిణీ నిరంతరం మార్పు చెందుతూ ఉంటుంది. కనుక సార్వత్రిక లాభం రేటు మార్పుకు ఇది కూడా ఒక నిరంతర

కారణం అవుతుంది. అయితే ఈ చలనం తాలూకు అవిచ్ఛిన్నమైన[1] బహుముఖ స్వభావం దృష్ట్యా ఇది తన్ను తాను స్తంభింపచేసుకునే కారణం మాత్రమే.

2. ప్రతి శాఖలోనూ, ఆ శాఖ లాభం రేటు ఎక్కువ కాలంపాటో, తక్కువ కాలంపాటో హెచ్చు తగ్గులకు గురయ్యేందుకు కొంత అవకాశముంది. సార్వత్రిక లాభం రేటును ప్రభావితం చేయడానికీ, అందువల్ల స్థానికమైన దానికన్నా ఎక్కువ ప్రాముఖ్యం సంతరించుకోవడానికీ, ఈ హెచ్చుతగ్గుల తరువాత తగినంత వ్యవధి పొందేందుకై ఇవి స్థిరపడతాయి. ఈ సంపుటి మొదటి భాగంలో వివరించిన లాభం రేటు నియమాలు – అదేవిధంగా ఈ స్థలకాల పరిమితుల్లో వర్తిస్తాయి. అదనపు విలువ లాభంగా మారే ప్రథమ పరివర్తనకు సంబంధించిన సిద్ధాంత భావన, అంటే పెట్టుబడిలోని ప్రతి భాగమూ ఒకే మోతాదులో లాభాన్ని అందచేస్తుందన్న సిద్ధాంత భావన నిజానికి ఒక ఆచరణాత్మక వాస్తవాన్ని వ్యక్తీకరిస్తుంది.[2] పారిశ్రామిక పెట్టుబడి అంతర్నిర్మాణం ఎలా ఉన్నా, అది నాలుగింట ఒక వంతు మృత శ్రమనూ, నాలుగింట మూడు వంతుల సజీవ శ్రమనూ, లేదా నాలుగింట ఒక వంతు సజీవ శ్రమనూ, నాలుగింట మూడు వంతుల మృత శ్రమనూ చలనంలో ఉంచినప్పటికీ, ఒక సందర్భంలోకన్నా మరో సందర్భంలో మూడు రెట్లు ఎక్కువ అదనపు శ్రమను పిండుకొన్నా, లేక మూడు రెట్లు అదనపు విలువను ఉత్పత్తి చేసినా – శ్రమ దోపిడీ స్థాయి యధాతథంగా ఉన్నప్పుడు వ్యక్తిగత విభేదాలను పక్కకు పెడితే, ఈ రెండు సందర్భాల్లోనూ ఆ పెట్టుబడి ఒకే మొత్తంలో లాభాన్ని సృష్టిస్తుంది. మనం ఇక్కడ ఈ రెండు సందర్భాల్లోనూ, మొత్తం ఉత్పత్తి రంగం సగటు నిర్మాణ స్వరూపాన్ని పరిశీలిస్తున్నాం కనుక, పైన పేర్కొన్న వ్యక్తిగత విభేదాలు అదృశ్యమై పోతాయి. పరిమిత దృక్పథం గల వ్యక్తిగత పెట్టుబడిదారు (లేక ప్రతి ఉత్పత్తి రంగంలోని పెట్టుబడిదారులందరూ) తాను నియుక్తం చేసిన శ్రమే లేక తన ఉత్పత్తి శాఖలో నియుక్తమైన శ్రమే లాభానికి ఏకైక మూలాధారమని భావించకపోవడం న్యాయమే. అతని సగటు లాభానికి సంబంధించినంతవరకు ఇది అక్షరాలా సత్యం. మొత్తం సామాజిక పెట్టుబడి అంటే, తన తోటి పెట్టుబడిదారులంతా శ్రమను మొత్తంగా దోచుకోవడం ఈ లాభానికి ఏ మేరకు మూలకారణమనేది – ఈ అంతస్సంబంధం – వ్యష్టి పెట్టుబడిదారునికి బొత్తిగా అంతుబట్టని రహస్యం. ఇంతవరకు ఏ బూర్జువా సిద్ధాంతవేత్త, ఏ రాజకీయ అర్థశాస్త్రవేత్త ఈ రహస్యాన్ని వెల్లడించకపోవడం, ఇది అలాగే ఉండిపోవడానికి దోహదం చేసింది. శ్రమలో పొదుపు – ఒకానొక ఉత్పాదితాన్ని ఉత్పత్తి చేయడానికి అవసరమైన శ్రమలో మాత్రమే కాదు, నియుక్తం చేయబడిన కార్మికుల సంఖ్యలో కూడా పొదుపు – మృత శ్రమను (స్థిర పెట్టుబడిని) ఎక్కువగా నియమించడం – ఇవి ఆర్థిక దృక్పథం నుంచి చూస్తే, సరైన చర్యలుగా కనిపిస్తాయి. సార్వత్రిక లాభం రేటుపైనా, సగటు లాభంపైనా వీటికి ఏ మాత్రమూ ప్రభావం ఉన్నట్టు కనిపించదు.

---

1. మూలప్రతిలో "విచ్ఛిన్నమైన" (unterbrocheenheit) అని వుంది. మార్క్స్ రాతప్రతి చూశాక సవరించ బడింది - సంపాదకుడు

2. మాల్తస్ (ప్రిన్సిపుల్స్ ఆఫ్ పొలిటికల్ ఎకానమీ, రెండవ ముద్రణ, లండన్ 1836, పుట 268 - సంపాదకుడు)

ఉత్పత్తికి అవసరమైన శ్రమ పరిమాణం తగ్గినప్పటికీ లాభంపై దాని ప్రభావం లేనప్పుడు లాభానికి సజీవ శ్రమ ఏకైక మూలంగా ఎలా ఉండగలదు? పైగా కనీసం వ్యష్టి పెట్టుబడిదారుడికి, కొన్ని పరిస్థితుల్లో అది లాభాల పెరుగుదలకు ప్రత్యక్ష మూలాధారంగా కనిపిస్తుంది.

ఏదైనా ఒక ఉత్పత్తి శాఖలో, స్థిర పెట్టుబడి విలువకు ప్రాతినిధ్యం వహించే ఉత్పత్తి వ్యయ భాగం పెరిగితే కానీ, తరిగితే కానీ ఆ భాగం చలామణీ నుంచి వస్తుంది; పెరిగిన రూపంలో, లేదా తరిగిన రూపంలో అది మొదటి నుంచే సరుకు ఉత్పత్తి ప్రక్రియలోకి ప్రవేశిస్తుంది. మరోవైపున ఒకే సంఖ్యలోని కార్మికులు ఒకే వ్యవధిలో ఉత్పత్తి చేసిన ఫలితంగా, కార్మికుల సంఖ్యలో మార్పు లేకుండానే, ఒక నిర్దిష్ట పరిమాణంలో సరుకులను ఉత్పత్తి చేయడానికి అవసరమైన శ్రమ పరిమాణం మార్పు చెందినట్లయితే, కార్మికుల అస్థిర పెట్టుబడి విలువకు ప్రాతినిధ్యం వహించే ఉత్పత్తి వ్యయభాగం యధాతథంగా ఉంటుంది; అంటే మొత్తం ఉత్పాదితం తాలూకు ఉత్పత్తి వ్యయానికి అదే మొత్తాన్ని చేకూర్చుతుంది. కాని మొత్తం ఉత్పాదితానికి ప్రాతినిధ్యం వహించే మొత్తం సరుకుల్లోని ప్రతి వ్యక్తిగత సరుకులోనూ తక్కువ లేక ఎక్కువ శ్రమను (చెల్లించిన శ్రమను, చెల్లించని శ్రమను) పంచుకొంటుంది. ఫలితంగా ఆ శ్రమ కోసం పెట్టిన ఎక్కువ మదుపును కానీ, తక్కువ మదుపును కానీ ప్రతి సరుకూ పంచుకుంటుంది; అంటే వేతనంలోని ఎక్కువ భాగాన్ని లేక తక్కువ భాగాన్ని పంచుకుంటుంది. పెట్టుబడిదారు చెల్లించిన మొత్తం వేతనాల్లో మార్పు ఉండదు కానీ వ్యక్తిగత సరుకుపై లెక్కకడితే మాత్రం వేతనాల్లో తేడా ఉంటుంది. ఆ విధంగా సరుకు ఉత్పత్తి వ్యయంలోని ఈ భాగంలో మార్పు ఉంటుంది. వ్యక్తిగత సరుకు యొక్క ఉత్పత్తి వ్యయం పెరిగినా లేక తరిగినా (లేదా బహుశా ఒక నిర్దిష్ట పరిమాణం గల పెట్టుబడి ఉత్పత్తి చేసినా, మొత్తం సరుకుల ఉత్పత్తి వ్యయం పెరిగినా, లేక తగ్గినా) సరుకు సొంత విలువలో మార్పు వల్ల కానీ, లేక దాని భాగాల్లోని విలువల్లో మార్పు వల్ల కానీ – ఉత్పత్తి వ్యయం పెరిగినా లేక తరిగినా, సగటు లాభం ఉదాహరణకు 10 శాతం యొక్క సగటు లాభం 10 శాతంగానే ఉండిపోతుంది. అయినప్పటికీ మనం ఊహించుకొన్న విలువ మార్పుల వల్ల వ్యక్తిగత సరుకు తాలూకు ఉత్పత్తి వ్యయంలో వచ్చిన మార్పు ఎంత పరిమాణంలో ఉందనే దాన్నిబట్టి, వ్యక్తిగత సరుకు యొక్క[1] ఈ 10 శాతం విభిన్న మొత్తాలకు ప్రాతినిధ్యం వహించవచ్చు.

అస్థిర పెట్టుబడికి సంబంధించినంత వరకు ఇది చాలా ముఖ్యమైన విషయం. ఎందుచేతనంటే, అదనపు విలువకు మూలాధారం ఇదే; పైగా పెట్టుబడిదారుని సంపద సంచయనానికి అదనపు విలువ సంబంధాన్ని దాచి ఉంచేది ఏదైనా యావత్ వ్యవస్థను నిగూఢంగా ఉంచేందుకే తోడ్పడుతుంది కనుక అస్థిర పెట్టుబడికి సంబంధించినంత వరకు విషయాలు మరింత మొరటుగా తయారవుతాయి; లేదా పెట్టుబడిదారుడికి ఈ కింది విధంగా కనిపిస్తాయి; 100 పౌండ్ల అస్థిర పెట్టుబడి 100 మంది కార్మికుల వారం వారీ వేతనానికి ప్రాతినిధ్యం వహిస్తుందనుకుందాం. ఈ 100 మంది కార్మికులు ఒక నిర్ణీత వ్యవధిలో 200 సరుకులను = 200 స ని ఉత్పత్తి చేశారనుకుందాం. అప్పుడు స్థిర

1. కార్బెట్ (యాన్ ఎంక్వయిరీ ఇంటు ది కాజెస్ అండ్ మోడ్స్, ఆఫ్ ది వెల్త్ ఆఫ్ ఇండివిడ్యువల్స్, లండన్, 1841, పుట 20 - సంపాదకుడు)

పెట్టుబడి చేర్చిన ఉత్పత్తి వ్యయభాగం నుంచి వేరుచేయబడిన 1 స ధర $\frac{100}{200}$ లేదా 10 షిల్లింగులు. ఎందుచేతనంటే 100 పౌండ్లు = 200 స కాబట్టి. ఇప్పుడిక కార్మికుల ఉత్పాదకతలో మార్పు వచ్చిందనుకుందాం. ఉత్పాదకత రెండు రెట్లు పెరిగిందనుకుందాం; అంటే అదే సంఖ్యలోని కార్మికులు ఇంతకు ముందు 200 స ని ఉత్పత్తి చేసిన కాలంలోనే, ఇప్పుడు 200 స కి రెండు రెట్లు ఎక్కువ ఉత్పత్తి చేస్తారు. ఈ ఉదాహరణలో (ఉత్పత్తి వ్యయంలో వేతనాలుగా ఉన్న భాగాన్ని మాత్రమే పరిగణనలోకి తీసుకుంటే) 1స. $\frac{\text{100 పౌండ్లు}}{400}$ = 5 షిల్లింగులు; ఎందుచేతనంటే ఇప్పుడు 100 పౌండ్లు = 400 స ఉత్పాదకత కనుక సగం మేరకు తగ్గిపోతే అదే శ్రమ $\frac{200\text{స}}{2}$ ను మాత్రమే ఉత్పత్తి చేస్తుంది; ఎందుకంటే 100 పౌండ్లు = $\frac{200\text{స}}{2}$ 1స. $\frac{\text{200 పౌండ్లు}}{200}$ = 1 పౌండు. సరుకుల ఉత్పత్తికి అవసరమైన శ్రమ కాలంలోని మార్పులు, అంటే వాటి విలువలోని మార్పులు ఆ విధంగా ఉత్పత్తి వ్యయం విషయంలో, ఉత్పత్తి ధర విషయంలో అదే వేతనం ఎక్కువ సరుకులకు, లేక తక్కువ సరుకులకు వేరువేరుగా పంపిణీ అయినట్లు కనిపిస్తుంది. అంటే అదే వేతనాలకు, అదే కాలంలో ఉత్పత్తి అయిన ఎక్కువ, లేక తక్కువ సరుకుల పరిమాణాన్ని బట్టి జరిగిన పంపిణీ ఇది. కాగా ఒక్కో సరుకులోని చెల్లించిన శ్రమభాగం, శ్రమ ఉత్పాదకతతో పాటు మారుతున్న సంగతినీ, తదనుగుణంగా ప్రతి సరుకు విలువ కూడా మారుతున్న సంగతినీ పెట్టుబడిదారుతో పాటు రాజకీయ అర్థశాస్త్రవేత్త కూడా చూస్తున్నాడు. అయితే ప్రతి సరుకులోనూ ఉన్న చెల్లించని శ్రమకు సైతం ఇది వర్తిస్తుందన్న విషయం వారికి కనిపించదు; వాస్తవంలో, వ్యష్టి పెట్టుబడిదారుని శాఖ గ్రహించిన చెల్లించబడని శ్రమ యాదృచ్ఛికంగా మాత్రమే సగటు లాభాన్ని నిర్ణయించడం వల్ల ఇది వారి దృష్టిలో పడదు. సరుకు విలువను నిర్ధారిస్తున్నది వాటిలో నిక్షిప్తమైన శ్రమే అనే సంగతిని మనం చూడగలిగేది ఇలాంటి అర్థంపర్థం లేని మొదటి రూపంలోనే.

★ ★ ★

# అధ్యాయం - 10

# పోటీ ద్వారా సార్వత్రిక లాభం రేటు సమానీకరణ

## మార్కెట్ ధరలు, మార్కెట్ విలువలు, అదనపు లాభం

కొన్ని ఉత్పత్తి శాఖల్లో మదుపు చేసిన పెట్టుబడికి సగటు అంతర్నిర్మాణ రూపం ఉంటుంది. అంటే దాని అంతర్నిర్మాణం అచ్చంగా లేక దాదాపు సామాజిక పెట్టుబడికి ఉన్న అంతర్నిర్మాణం లాంటిది.

ఈ ఉత్పత్తి శాఖల్లో ఉత్పత్తి ధర డబ్బు రూపంలో వ్యక్తమయిన ఉత్పాదిత సరుకు విలువ సరిగ్గా లేక దాదాపు ఒకటే. గణిత శాస్త్ర పద్ధతిలో దీన్ని చెప్పడం కుదరకపోతే అది ఈ విధంగా ఉంటుంది; పోటీ అన్నది సామాజిక పెట్టుబడిని వివిధ ఉత్పత్తి శాఖల్లో ఎలా పంపిణీ చేస్తుందంటే, ప్రతి శాఖలోనూ ఉత్పత్తి ధరలు, ఈ సగటు అంతర్నిర్మాణం తాలూకు శాఖల్లోని ఉత్పత్తి ధరల నమూనా ప్రకారం రూపొందుతాయి. అంటే ఉత్పత్తి ధరలు = వ్య+వ్య ల' (ఉత్పత్తి ధర, ఉత్పత్తి ధరచే గుణించబడిన సగటు లాభం రేటు) అయితే ఈ సగటు లాభం రేటు సగటు అంతర్నిర్మాణం గల శాఖలోని లాభం శాతం తప్ప మరొకటి కాదు; కాబట్టి లాభం అదనపు విలువతో ఏకీభవించే శాఖలోని లాభం రేటే. ఈ విధంగా లాభం రేటు అన్ని ఉత్పత్తి శాఖల్లోనూ ఒకే విధంగా ఉంటుంది. ఎందువల్లనంటే, సగటు అంతర్నిర్మాణం గల పెట్టుబడి వున్న సగటు శాఖల ప్రాతిపదికపై అది సమానమవుతుంది. ఫలితంగా అన్ని ఉత్పత్తి శాఖల్లోని లాభాల మొత్తమూ తప్పనిసరిగా అదనపు విలువల మొత్తానికి సమంగా ఉండి తీరుతుంది. అలాగే మొత్తం సామాజిక ఉత్పాదితం యొక్క ఉత్పత్తి ధరల మొత్తం ఆ ఉత్పాదితం యొక్క విలువ మొత్తానికి సమంగా ఉండి తీరుతుంది. కానీ, అంతర్నిర్మాణం గల ఉత్పత్తి శాఖల మధ్య సమతూకం వాటిని సగటు అంతర్నిర్మాణం గల శాఖలతో సమానం చేయచూస్తుంది. ఆ సగటు అంతర్నిర్మాణం అచ్చంగా సామాజిక సగటులాగే ఉండొచ్చు. లేదా దాదాపు అలాగే ఉండొచ్చు. సామాజిక సగటుకు దాదాపు సమంగా ఉండే శాఖల మధ్యనే మళ్ళీ సమానీకరణ ధోరణి ఉంది. ఇవి ఆదర్శప్రాయమైన సగటుకు, అంటే, వాస్తవంలో ఉనికిలో లేని సగటును సాధించ చూస్తాయి. ఆదర్శాన్ని ప్రమాణంగా పరిగణించే ధోరణి ఇది. ఉత్పత్తి ధరలను కేవలం విలువ యొక్క పరివర్తిత రూపాలుగా చేసే, లేక లాభాలను కేవలం అదనపు విలువలోని భాగాలుగా మార్చే ధోరణి ఆవశ్యంగా పాదుకొని ఉంటుంది. అయితే ప్రతి ప్రత్యేక ఉత్పత్తి శాఖలో ఉత్పత్తి అయిన అదనపు విలువ నిష్పత్తికి అనుగుణంగా ఈ లాభాలు పంపిణీ కాబడవు. ప్రతి శాఖలోనూ నియుక్తమయిన పెట్టుబడి మొత్తాల నిష్పత్తికి అనుగుణంగా అవి పంపిణీ అవుతాయి.

ఫలితంగా సమాన మొత్తాల్లో పెట్టుబడులకు, వాటి అంతర్నిర్మాణం ఏమైనా మొత్తం సామాజిక పెట్టుబడి ఉత్పత్తి చేసే మొత్తం అదనపు విలువలో సమాన వాటాలందుతాయి.

అచ్చంగా లేక దాదాపు సగటు అంతర్నిర్మాణం పెట్టుబడుల విషయం ఈ విధంగా ఉత్పత్తి ధర, విలువా ఒకటే లేక దాదాపు ఒకటే. లాభమూ, అది ఉత్పత్తి చేసిన అదనపు విలువా ఒకటే.

తమ అంతర్నిర్మాణం ఎలా ఉన్నప్పటికీ అన్ని పెట్టుబడుల పోటీ ఒత్తిడి మూలంగా ఈ సగటువైపు మొగ్గుతాయి. అయితే సగటు అంతర్నిర్మాణం గల పెట్టుబడులు సగటు సామాజిక పెట్టుబడిలాంటి నిర్మాణ స్వరూపమో, లేక దాదాపు అలాంటి స్వరూపమో కలిగినవి. అందువల్ల అన్ని పెట్టుబడులూ తాము ఉత్పత్తి చేసిన అదనపు విలువతో నిమిత్తం లేకుండా తమ సరుకు ధరలోని తమ సొంత అదనపు విలువను కాక, సగటు లాభాన్ని అందజేసే ధోరణి కలిగి ఉంటాయి. అంటే ఉత్పత్తి ధరలను అందజేసే ధోరణి కలిగి ఉంటాయి.

ఇంకోవైపు చూస్తే, ఏ పద్ధతుల ద్వారా ఉత్పత్తి అయినప్పటికీ సగటు లాభం కనుక సార్వత్రిక లాభం రేటు ఉత్పత్తి అయిన ప్రతి సందర్భంలోనూ, అలాంటి సగటు లాభం అన్నది సగటు సామాజిక పెట్టుబడిపై వచ్చిన లాభంగా తప్ప మరొకటి కాజాలదు. ఈ లాభం మొత్తం అదనపు విలువ మొత్తానికి సమంగా ఉంటుంది. అంతేకాదు, ఈ సగటు లాభాన్ని ఉత్పత్తి వ్యయానికి కలపడం ద్వారా లభించిన ధరలు వాస్తవానికి ఉత్పత్తి ధరలుగా పరివర్తన చెందిన విలువలు తప్ప మరొకటి కావు. కొన్ని ఉత్పత్తి శాఖల్లోని పెట్టుబడులు, ఏ కారణం చేతనైనా, సమానీకరణ ప్రక్రియకు గురికాని పక్షంలో దేనిలోనూ మార్పు ఉండదు. అప్పుడు సమానీకరణ ప్రక్రియలోకి ప్రవేశించే సామాజిక పెట్టుబడి భాగం ఆధారంగానే లాభాన్ని లెక్కించడం జరుగుతుంది. సగటు లాభం వివిధ ఉత్పత్తి శాఖల్లోని పెట్టుబడులకు వాటి పరిమాణాలకు అనుగుణంగా పంపిణీ చేయబడిన అదనపు విలువల మొత్తమే తప్ప అందుకు భిన్నంగా ఉండదు అన్నది స్పష్టం. ఇది డబ్బు రూపంలో చేతికందిన చెల్లించని మొత్తం శ్రమ. ఈ మొత్తం శ్రమ చెల్లించిన సజీవ వస్తు రూప శ్రమలాగే, పెట్టుబడిదారుల వాటాగా వచ్చి చేరే సరుకుల మొత్తం రాశిలోనూ, డబ్బులోనూ నిక్షిప్తమై ఉంటుంది.

నిజంగా క్లిష్టమైన ప్రశ్నే ఇది : ఈ లాభాల సమానీకరణ సార్వత్రిక లాభం రేటుగా ఎలా ఏర్పడుతుంది? ఇది ఫలితమే తప్ప ప్రారంభస్థానం కాదనేది స్పష్టమే, కాబట్టి ఈ ప్రశ్న తలెత్తుతుంది.

మొదటి విషయం, సరుకు విలువల అంచనా, ఉదాహరణకు డబ్బు రూపంలో వాటి అంచనా ఆ సరుకుల మార్పిడి ఫలితం తప్ప మరొకటిగా ఉండజాలదు. కనుక, ఇలాంటి అంచనాను మనం ఊహించుకొంటున్నప్పుడు, దీనిని మనం ఒక సరుకు విలువకు మరొక సరుకు విలువ పొందిన మార్పిడి ఫలితంగానే పరిగణించాల్సి ఉంటుంది. మరైతే వాటి నిజమైన విలువలను బట్టి సరుకుల యొక్క ఈ మార్పిడి ఎలా జరుగుతోంది?

వివిధ ఉత్పత్తి శాఖల్లోని అన్ని సరుకులు తమ నిజ విలువలకే అమ్ముడుపోయాయని, మొదట అనుకుందాం. దాని పర్యవసానం ఏమిటి? పైన చెప్పినదాని ప్రకారం, విభిన్న ఉత్పత్తి శాఖల్లో విభిన్న లాభం రేట్లు ఉంటాయి. సరుకులు తమ నిజ విలువలకు అమ్ముడుపోవడం (అంటే తమలో నిక్షిప్తమై ఉన్న విలువకు అనుగుణంగా తమ విలువకు అనుగుణమైన ధరలకు మార్పిడి కావడం),

లేక ఆయా సరుకుల ఉత్పత్తికి మదుపు పెట్టిన పెట్టుబడుల సమాన మొత్తాలకు సమానమైన లాభాలు తీసుకువచ్చే ధరలకు అవి అమ్ముడుపోవడం – ఇవి రెండూ వేరువేరు విషయాలని స్పష్టంగా ఆదిలోనే తెలిసిపోతోంది.

అసమాన పరిమాణాల్లోని సజీవ శ్రమను నియోగిస్తున్న పెట్టుబడులు అసమాన పరిమాణాల్లో అదనపు విలువను ఉత్పత్తి చేస్తాయనే వాస్తవంలో శ్రమ దోపిడీ స్థాయి, లేక అదనపు విలువ రేటు కనీసం కొంతవరకైనా ఒకే విధంగా ఉన్నాయనేది గర్భితం; లేదా వాటిలో ఏవైనా తేడాలున్నట్లయితే వాటిని నిజమైన లేదా ఊహాత్మకమైన (సాంప్రదాయ) పరిహార ప్రాతిపదిక సమానీకరిస్తుందనేది కూడా గర్భితం. కార్మికుల మధ్య పోటీ, వారు నిరంతరం ఒక ఉత్పత్తి శాఖనుంచి మరో ఉత్పత్తి శాఖలోకి వెళ్ళిపోతూండటం ద్వారా సమానత నెలకొనడం ఇందులో గర్భితం. సైద్ధాంతిక సరళత కోసం, అన్ని ఆర్థిక నియమాలలాగే ఇలాంటి అదనపు విలువ సార్వత్రిక రేటును మనం ఊహించుకొన్నాం. అయితే వాస్తవంలో ఇది పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానానికి ప్రాతిపదికగా ఉన్న ఊహ. ఆచరణలోని సంఘర్షణలు ఈ వాస్తవాన్ని కొద్దో గొప్పో నిరోధిస్తూ, బ్రిటన్‌లోని వ్యవసాయ కార్మికుల స్థిర నివాస చట్టాలలాగా గణనీయంగా స్థానిక భేదాలను సృష్టించిన ప్రాతిపదిక మాత్రం అదే. కానీ సిద్ధాంతరీత్యా మాత్రం పెట్టుబడిదారీ ఉత్పత్తి నియమాలు పరిశుద్ధమైన రూపంలో పని చేస్తాయని ఊహించుకొంటున్నాం. కాగా వాస్తవాచరణలో ఉండేది దరిదాపు వ్యవహారమే అయితే పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం అభివృద్ధి చెందిన కొద్దీ, మునుపటి దశకు చెందిన ఆర్థిక పరిస్థితుల అవశేషాలతో అది మిశ్రితమై, కలుషితం కావడం తగ్గిపోయిన కొద్దీ పరిశుద్ధ రూపానికి మరింత దరిదాపుగా ఉంటాయి.

అయితే చిక్కంతా ఎక్కడ వస్తుందంటే, సరుకులు కేవలం సరుకులుగా కాక, పెట్టుబడుల తాలూకు ఉత్పాదితాలుగా మార్పిడి అవుతాయి. పెట్టుబడులు తమ పరిమాణాన్ని బట్టి అదనపు విలువ మొత్తంలో తమ వాటా తమకు కావాలంటాయి. సమాన పరిమాణంలో ఉంటే సమాన వాటా కోరుతాయి. నిర్దిష్ట పెట్టుబడి నిర్దిష్ట కాలంలో ఉత్పత్తి చేసే సరుకుల తాలూకు మొత్తం ధర ఈ కోర్కెను తీర్చవలసి వుంది. అయితే ఈ సరుకుల మొత్తం ధర అన్నది ఈ పెట్టుబడి ఉత్పత్తి చేసిన వ్యక్తిగత సరుకుల తాలూకు ధరల సమాహారం తప్ప మరొకటి కాదు.

మనం ఈ క్రింది విధంగా పరిశీలిస్తే ముఖ్యమైన విషయం స్పష్టంగా ముందుకు వస్తుంది. తమ ఉత్పత్తి సాధనాలు కార్మికుల చేతుల్లోనే ఉన్నాయనీ, వారు తమ సరుకులను పరస్పరం మార్పిడి చేసుకుంటారని భావిద్దాం. ఇలా అయితే ఈ సరుకులు పెట్టుబడి తాలూకు ఉత్పాదితాలుగా ఉండవు. వివిధ ఉత్పత్తి శాఖల్లో జరిగే పని సాంకేతిక స్వభావాన్ని బట్టి వివిధ శ్రమ సాధనాల విలువ, ముడి సరుకుల విలువ వేరువేరుగా ఉంటాయి. పైపెచ్చు, వారు నియుక్తం చేసే ఉత్పత్తి సాధనాల విలువ అసమంగా ఉండడమే కాక, నిర్ణీత పరిమాణాల శ్రమకు విభిన్న పరిమాణాల ఉత్పత్తి సాధనాలు అవసరమవుతాయి. ఎందుకంటే ఒకానొక సరుకును ఉత్పత్తి చేయడానికి ఒక గంట అవసరమైతే మరో సరుకును ఉత్పత్తి చేసేందుకు ఒక రోజు అవసరం కావచ్చు. పైగా విభిన్న శ్రమ తీవ్రత మొదలయిన వాటి తేడాలకు పరిహారాలను దృష్టిలో ఉంచుకొంటూనే కార్మికులు సగటున

సమాన పనికాలం పనిచేస్తారని భావిద్దాం. ఈ సందర్భంలో ఇద్దరు కార్మికులు మొదట తమ మదుపులను, అంటే, ఖర్చయిన ఉత్పత్తి సాధనాల ఉత్పత్తి వ్యయాన్ని తమ రోజు పని ఉత్పాదితమైన సరుకుల్లో భర్తీ చేసివుంటారు. అయితే వారి శ్రమ తాలూకు సాంకేతిక స్వభావాన్ని బట్టి ఈ మదుపుల్లో తేడా ఉంటుంది. ఇక రెండవది – ఇరువురూ కూడా సమాన మొత్తాల్లో నూతన విలువను సృష్టించి ఉంటారు; ఉత్పత్తి సాధనాలకు వారు జోడించిన పని దినమిది. పని దినంగా ఉన్నది, వారి వేతనాలు ప్లస్ అదనపు విలువ. ఈ అదనపు విలువ వారి ఆవశ్యక అవసరాలకు మించి ఉన్న అదనపు శ్రమకు ప్రాతినిధ్యం వహిస్తుంది. అయితే ఈ అదనపు శ్రమ తాలూకు ఉత్పాదితం మాత్రం ఆ కార్మికులకే చెందుతుంది. పెట్టుబడిదారీ భాషలో చెప్తే, ఇరువురికీ ఒకే వేతనాలు ప్లస్ ఒకే లాభం అందుతుంది. లేదా పది గంటల పనిదినం తాలూకు ఉత్పాదితం వ్యక్తీకరించే ఒకే విలువ వారికి లభిస్తుంది. కాగా, మొదటిది, వారి సరుకుల విలువల్లో తేడా ఉండక తప్పదు. ఉదాహరణకు Iవ సరుకులో ఖర్చయిన ఉత్పత్తి సాధనాలకు సంబంధించిన విలువ భాగం IIవ సరుకులో అదే భాగం కంటే ఎక్కువగా ఉండవచ్చు. కాగా, రేకెత్తగల, అన్ని తేడాలను ప్రవేశపెట్టడానికి మనం IIవ సరుకు కంటే Iవ సరుకు ఎక్కువ శ్రమను హరిస్తుందనీ, ఫలితంగా అది ఉత్పత్తి కావడానికి ఎక్కువ శ్రమకాలం పడుతుందనీ ఇప్పుడు భావించవచ్చు. కాబట్టి Iవ, II వ సరుకుల విలువల్లో తేడా ఉంటుంది. అదే విధంగా Iవ, IIవ సరుకు తాలూకు కార్మికులు నిర్దిష్ట కాలంలో సృష్టించిన ఉత్పాదితానికి ప్రాతినిధ్యం వహించే సరుకుల విలువల మొత్తాల్లో తేడా ఉంటుంది. మదుపు పెట్టిన ఉత్పత్తి సాధనాల మొత్తం విలువకు అదనపు విలువకు గల నిష్పత్తే లాభం రేటు అని మనం భావించే పక్షంలో, I, II సరుకుల లాభం రేట్లలో కూడా తేడా ఉంటుంది. ఉత్పత్తి సాగే సమయంలో Iవ, IIవ సరుకు తాలూకు కార్మికులకు రోజువారీగా ఖర్చయ్యే జీవనావసరాలు ఇక్కడ మదుపు చేసిన ఉత్పత్తి సాధనాల భాగంగా ఉన్నాయి. దీనిని మామూలుగా అస్థిర పెట్టుబడి అంటారు. అయితే సమాన పని కాలాలకు Iవ, IIవ సరుకుల విషయంలో, అదనపు విలువలు కూడా సమానంగా ఉంటాయి. ఇంకొంచెం కచ్చితంగా చెప్పాలంటే I, IIలు ప్రతి ఒక్కటీ ఒక పని దినంలోని ఉత్పాదితం విలువను స్వీకరిస్తాయి కాబట్టి, అడ్వాన్సు చేసిన 'స్థిర' భాగం విలువను మినహాయించిన అనంతరం రెంటికీ సమాన విలువలే అందుతాయి. కాగా ఇందులో ఒక భాగాన్ని ఉత్పత్తి సందర్భంగా ఖర్చయిన జీవనావసరాలను భర్తీ చేసినదిగానూ, మరో భాగాన్ని దానికి మించి ఉన్న అదనపు విలువగానూ పరిగణించవచ్చు. Iవ శాఖ తాలూకు కార్మికునికి ఎక్కువ ఖర్చులు తగిల్తే ఈ స్థిర భాగాన్ని భర్తీ చేసే అతని సరుకు తాలూకు విలువలోని ఎక్కువ భాగంతో దాన్ని పూడ్చుకోవచ్చు. కాబట్టి అతడు తన ఉత్పాదితం తాలూకు మొత్తం విలువలో మరింత ఎక్కువ భాగాన్ని ఆ స్థిర భాగపు పాదార్థిక అంశాలుగా పునః పరివర్తన చేసుకోవాల్సి ఉంటుంది. కాగా IIవ సరుకు తాలూకు కార్మికునికి తక్కువే అందినప్పటికీ అలా పునఃపరివర్తన చేసుకోవాల్సింది తక్కువగానే ఉంటుంది. కాబట్టి ఇలాంటి పరిస్థితుల్లో లాభం రేట్లలోని తేడాకు అట్టే ప్రాముఖ్యం ఉండదు. తననుంచి పిండిన అదనపు విలువ మొత్తాన్ని ఏ లాభం రేటు వ్యక్తీకరిస్తుందన్న విషయం నేటి వేతన కార్మికునికి ప్రాముఖ్యం లేనట్లే, అంతర్జాతీయ వాణిజ్యంలో వివిధ జాతీయ లాభం రేట్లలోని తేడాల ప్రాముఖ్యం సరుకు మార్పిడికి లేనట్లే ఇదీను.

ఈ విధంగా తమ విలువలకు లేక రమారమి విలువలకు సరుకుల మార్పిడి అన్నది, వాటి ఉత్పత్తి ధరల ప్రకారం మార్పిడికంటే తక్కువ స్థాయికి చెందిన దశ అవసరం. సరుకులు ఉత్పత్తి ధరలకు మార్పిడి కావడానికి ఒక నిర్దిష్టమైన పెట్టుబడిదారీ అభివృద్ధి స్థాయి అవసరం.

మొదట వివిధ సరుకుల ధరలు ఎలా పరస్పరం నిర్ధారించబడినా, ఎలా క్రమబద్ధీకరించ బడినా ధరల కదలికలను విలువ నియమమే ఎల్లప్పుడూ శాసిస్తుంది. వాటి ఉత్పత్తికి అవసరమైన శ్రమకాలం తగ్గిపోతే, ధరలు పడిపోతాయి. శ్రమ కాలం పెరిగితే ధరలు కూడా పెరుగుతాయి. అయితే ఇతర పరిస్థితులు మార్పు లేకుండా యథాతథంగా ఉన్నప్పుడు ఇలా జరుగుతుంది.

ధరనూ, ధరల కదలికనూ విలువ నియమం శాసించడం అటుంచి, సిద్ధాంతరీత్యానే కాక చారిత్రకంగా కూడా సరుకుల విలువలు, ఉత్పత్తి ధరల కంటే మునుపటివిగా పరిగణించడం చాలా సముచితంగా ఉంటుంది. కార్మికుడే తన ఉత్పత్తి సాధనాలకు సొంతదారుడుగా ఉన్న పరిస్థితులకు ఇది వర్తిస్తుంది. ప్రాచీన ప్రపంచంలోనూ ఆధునిక ప్రపంచంలోని, తన రెక్కల కష్టంపై ఆధారపడి జీవించే సొంత భూమి గల వ్యవసాయదారుని, చేతివృత్తిదారుని పరిస్థితి ఇదే. ఒకే సమాజంలోని సభ్యుల మధ్య కాక విభిన్న సమాజాల మధ్య జరిగే మార్పిడి ద్వారా ఉత్పాదితాలు సరుకులుగా మార్పు చెందుతాయని మేము ఇంతకు ముందు వ్యక్తం చేసిన భావంతో[1] సైతం ఇది ఏకీభవిస్తుంది. ప్రతి ఉత్పత్తి శాఖలోని ఉత్పత్తి సాధనాలను కష్టంపై మాత్రమే ఒక రంగం నుంచి మరోరంగంలోకి బదిలీ చేయడానికి వీలున్నన్నాళ్లు ఇది, ఆదిమ సమాజ పరిస్థితులకై కాక, తదుపరి బానిస దశ పరిస్థితులకూ, భూస్వామ్య బానిస దశ పరిస్థితులకు కూడా వర్తిస్తుంది. ఈ బదిలీ కష్టభూయిష్టమైనది కనుక విభిన్న ఉత్పత్తి శాఖల మధ్య సంబంధాలు, కొన్ని పరిమితుల్లో, విదేశాల మధ్య లేక కమ్యూనిస్టు సమాజాల మధ్య సంబంధాల లాంటివే.

సరుకులు పరస్పరం మార్పిడి చెందే ధరలు కనుక వాటి విలువలకు రమారమి అనుగుణంగా ఉండాలంటే ఈ క్రింది అంశాలకంటే ఎక్కువేమీ అవసరం లేదు. 1. వివిధ సరుకుల మార్పిడి కేవలం యాదృచ్ఛికంగా, లేక అప్పుడప్పుడు మాత్రమే జరగడం ఆగిపోవాలి. 2. సరుకుల ప్రత్యక్ష మార్పిడికి సంబంధించినంతవరకు ఈ సరుకులు ఉభయ పక్షాల అవసరాలకు దాదాపు సరిపోయేటంత పరిమాణాల్లో ఉత్పత్తి కావాలి. ఇది వర్తకంలో పరస్పరానుభవంలో తెలియవచ్చే విషయం. కాబట్టి నిరంతరాయ వ్యాపార సహజ పరిణామం. 3. ఇక అమ్మకానికి సంబంధించినంతవరకు, ఉభయ పక్షాలు తమ సరుకులను వాటి విలువలకంటే ఎక్కువకు అమ్మేందుకు వీలు కల్పించే లేదా తక్కువకు అమ్మక తప్పని పరిస్థితి కల్పించే సహజమైన లేదా కృత్రిమమైన గుత్తాధిపత్యం ఉండరాదు. యాదృచ్ఛికమైన గుత్తాధిపత్యం అంటే మనం చెప్పుకునే అర్థం కొనుగోలుదారుకు లేక అమ్మకందారుకు సరఫరా, గిరాకీల యాదృచ్ఛిక స్థితి ద్వారా లభించే గుత్తాధిపత్యం.

వివిధ ఉత్పత్తి శాఖల్లోని సరుకులు తమ విలువలకే అమ్ముడుపోతాయని ఊహిస్తున్నామంటే,

---

1. 1865లో ఇది కేవలం మార్క్స్ భావంగానే వుండింది. మారర్ నుంచి మోర్గన్ దాకా ఆదిమ సమాజాల స్వభావంపై విస్తృత పరిశోధన జరిగిన తరువాత ఈనాడు ఇది అంగీకృత వాస్తవం. దీన్ని ఎవరూ నిరాకరించడం లేదు. - **ఫ్రెడరిక్ ఎంగెల్స్**.

ఆ సరుకుల విలువ అనేది గురుత్వ కేంద్రం అని, వాటి ధరలు ఆ కేంద్రానికి అటూ ఇటూ హెచ్చుతగ్గులకు గురవుతుంటాయని, వాటి నిరంతరాయమైన పెరుగుదల తరుగుదలలు ఆ ధరలను సమానీకరించే వైపుగా మొగ్గుతాయని దాని అర్థం. ఇక మార్కెట్ విలువ అనేది (దీన్ని గురించి ఉత్తరోత్తరా వివరిస్తాము) ఒకటి ఉంది. సరుకుల యొక్క వ్యక్తిగత విలువ వాటి మార్కెట్ విలువ కంటే తక్కువగా ఉంటుంది. (అంటే వాటి ఉత్పత్తికి మార్కెట్ విలువలో వ్యక్తమైన దానికంటే తక్కువ శ్రమకాలం అవసరం.) కాగా మరికొన్నింటి వ్యక్తిగత విలువ మార్కెట్ విలువకంటే ఎక్కువగా ఉంటుంది. ఒకవైపేమో, వివిధ శాఖల్లోని సగటు పరిస్థితుల్లో ఉత్పత్తి అయి, ఆయా రేఖ సరుకుల్లో అత్యధిక భాగంగా ఉన్నవాటి వ్యక్తిగత విలువగా పరిగణించాలి. మరీ అధ్వాన్నమైన లేదా అత్యనుకూలమైన పరిస్థితుల్లో ఉత్పత్తి అయిన సరుకులు మార్కెట్ విలువను శాసించేదీ, ఈ విలువ మళ్ళీ మార్కెట్ ధరల హెచ్చుతగ్గులకు కేంద్రంగా ఉండేదీ, అసాధారణమైన సంఘటనల సమ్మేళనలలో మాత్రమే. కానీ ఒకే రకమైన అన్ని సరుకుల మార్కెట్ ధరలు ఒకే విధంగా ఉంటాయి. సగటు విలువ గల సరుకుల, అంటే రెండు కొసలకు మధ్యలోని విలువ గల సరుకుల సరఫరా సాధారణ గిరాకీని తీరిస్తే, అప్పుడు మార్కెట్ విలువకంటే తమ వ్యక్తిగత విలువ తక్కువగా ఉన్నట్టి సరుకులు అధిక అదనపు విలువను లేక అదనపు లాభాన్ని సంపాదిస్తాయి; కాగా మార్కెట్ విలువ కంటే ఎక్కువ వ్యక్తిగత విలువ ఉన్నట్టి సరుకు తమలో ఉన్నా, అదనపు విలువలలోని కొంత భాగాన్ని చేతి కందించలేవు.

గడ్డు పరిస్థితుల్లో ఉత్పత్తి అయిన సరుకుల అమ్మకం అన్నది, అవి గిరాకీని తీర్చడానికి అవసరమైనవనే సంగతిని నిరూపిస్తాయని చెప్పడంవల్ల ప్రయోజనమేమీ లేదు. మనం ఊహించుకొన్న ఉదాహరణలో, ధర కనుక సగటు మార్కెట్ విలువకంటే ఎక్కువగా ఉన్నట్లయితే గిరాకీ తక్కువగా[1] ఉంటుంది. ఒక సరుకు ఒకానొక ధర ఉన్నప్పుడు ఆ సరుకు మార్కెట్‌లో ఒక నిర్దిష్ట స్థానాన్ని ఆక్రమిస్తుంది. ధరలో మార్పు జరిగిన సందర్భంలో – ధర పెరుగుదలతో పాటు సరఫరా తగ్గితే, ధర తగ్గుదలతో పాటు సరఫరా పెరిగే – అప్పుడు మాత్రమే మార్కెట్‌లో దాని స్థానం యథాతథంగా ఉంటుంది.

అత్యంత ప్రతికూల పరిస్థితుల్లో ఉత్పత్తి అయిన సరుకుల విలువ ధరను క్రమబద్ధం చేసినపుడు ఏమాత్రం కుంచించుకుపోనంత ఎక్కువగా గిరాకీ ఉన్నట్లయితే, అప్పుడివి మార్కెట్ విలువను నిర్ధారిస్తాయి. మామూలు స్థాయికంటే గిరాకీ ఎక్కువగా ఉంటే తప్ప లేదా మామూలు స్థాయికంటే తక్కువ స్థాయికి సరఫరా పడిపోతే తప్ప, ఇది సాధ్యం కాదు. ఇక చివరగా ఉత్పత్తి అయిన సరుకుల పరిమాణం కనుక సగటు మార్కెట్ విలువలకు అమ్ముడుపోయిన వాటికంటే ఎక్కువగా ఉన్నట్లయితే అప్పుడు అత్యంత సానుకూల పరిస్థితుల్లో ఉత్పత్తి అయిన సరుకులు మార్కెట్ విలువను శాసిస్తాయి. ఉదాహరణకు, అవి తమ వ్యక్తిగత విలువకు ఖచ్చితంగా లేక రమారమిగా అమ్ముడుపోవచ్చు; అలా జరిగితే ఏ మాత్రమూ అనుకూలంగా లేని పరిస్థితుల్లో ఉత్పత్తి అయిన సరుకులకు వాటి ఉత్పత్తి

1. మూల ప్రతిలో ఎక్కువ (grosser) అని వుంది. మార్క్స్ రాత ప్రతి చూశాక సవరించడం జరిగింది - సంపాదకుడు.

ఖర్చులు కూడా లభించకపోవచ్చు; కాగా సగటు పరిస్థితుల్లో ఉత్పత్తి అయిన సరుకులకు వాటిలో గల అదనపు విలువలోని ఒక భాగం మాత్రమే లభిస్తుంది. మార్కెట్ విలువ గురించి మనమిక్కడ చెప్పింది, ఉత్పత్తి ధర మార్కెట్ విలువ స్థానం వహించగానే దానికీ వర్తిస్తుంది. ప్రతి శాఖలోనూ ఉత్పత్తి ధర క్రమబద్ధం అవుతుంది; అలాగే ప్రత్యేక పరిస్థితులు దానిని క్రమబద్ధం చేస్తాయి. ఈ ఉత్పత్తి ధర తిరిగి రోజువారీ మార్కెట్ ధరల హెచ్చుతగ్గులకు కేంద్రంగా ఉంటుంది. నిర్దిష్ట కాలాల్లో అవి ఒకదాన్ని మరొకటి సమానీకరించ చూస్తాయి. ఏ మాత్రమూ అనుకూలంగా లేని పరిస్థితుల్లో పని చేసేవారి వల్ల ఉత్పత్తి ధర నిర్ధారణ పై రికార్డో గ్రంథం చూడండి.[1]

ధరలు ఎలా క్రమబద్ధం అయినప్పటికీ మనం ఈ క్రింది నిర్ధారణలకు వస్తాము.

1. అవసరమైన శ్రమ కాలం తగ్గితే ఉత్పత్తి ధరలు తగ్గుతాయి, అవి పెరిగితే ఇవీ పెరుగుతాయి. ఈ మేరకు విలువ నియమం ధరల కదలికను శాసిస్తుంది. ఈ అర్థంలోనే రికార్డో (తన ఉత్పత్తి ధరలు, సరుకుల విలువ నుంచి వైదొలగుతున్న విషయం ఆయన నిస్సందేహంగా గ్రహించారు.) ఇలా అంటారు. "సరుకుల నిరపేక్ష విలువకు సంబంధించి కాక వాటి సాపేక్ష విలువలోని మార్పుల ప్రభావం గురించే నేను పాఠకుల దృష్టికి తేవాలనుకుంటున్నాను."[2]

2. ఉత్పత్తి ధరలను నిర్ధారించే సగటు లాభం ఎల్లప్పుడూ అదనపు విలువలోని ఒకే నిర్దిష్ట పరిమాణానికి రమారమిగా సమంగా ఉండాలి. అది మొత్తం సామాజిక పెట్టుబడిలో దాని ఒక సమ విభజిత భాగంగా వ్యష్టి పెట్టుబడి వాటాకు లభించే అదనపు విలువ పరిమాణం ఉదాహరణకు డబ్బు విలువలో వ్యక్తమైన సార్వత్రిక లాభం రేటు, కాబట్టి సగటు లాభం వాస్తవమైన సగటు అదనపు విలువ తాలూకు డబ్బు విలువకంటే ఎక్కువ అనుకుందాం. పెట్టుబడిదారులకు సంబంధించినంత వరకు వారు పరస్పరం 10 శాతం లాభం వసూలు చేశారా లేక 15 శాతం లాభం వసూలు చేశారా అన్న విషయానికి ప్రాముఖ్యమే లేదు. ఇందులో ఏ శాతం కూడా మిగతా శాతంకన్నా ఎక్కువ వాస్తవ సరుకు విలువ మొత్తాన్ని వసూలు చేయడం లేదు. ఎందుచేతనంటే డబ్బు రూపంలో అదనపు మొత్తాల వసూలు అనేది పరస్పరమైనది. ఇక కార్మికునికి సంబంధించి నంతవరకు (అతడికి మామూలు వేతనం లభిస్తుందనీ, కాబట్టి సగటు లాభం పెరుగుదల అతని వేతనాల నుంచి తీసివేత కాదనీ ఊహించుకొంటున్నారు. అంటే పెట్టుబడిదారుని మామూలు అదనపు విలువకు పూర్తిగా భిన్నమైన దానిని అది వ్యక్తం చేస్తుంది.) సగటు లాభం పెరిగినందువల్ల సరుకు ధరల్లో సంభవించే పెరుగుదల తప్పనిసరిగా అస్థిర పెట్టుబడి యొక్క డబ్బు వ్యక్తీకరణ పెరుగుదలకు అనుగుణంగా ఉండాలి. వేతనాలను పెంచకుండా స్థిర పెట్టుబడిగా ఉన్న సరుకుల ధరలను

---

1. డి. రికార్డో, ఆన్ ది ప్రిన్సిపుల్స్ ఆఫ్ పొలిటికల్ ఎకానమీ అండ్ టాక్సేషన్, మూడవ కూర్పు, లండన్ 1821, పుటలు 60-61 - సంపాదకుడు.

2. డి. రికార్డో ప్రిన్సిపుల్స్ ఆఫ్ పొలిటికల్ ఎకానమీ వర్క్స్, సంపాదకుడు మెకులాబ్, 1852, పుట 15 - సంపాదకుడు.

పెంచకుండానూ, మదుపు పెట్టిన మొత్తం పెట్టుబడికీ అదనపు విలువకూ మధ్య గల నిష్పత్తి నిర్దేశించిన పరిమితికి మించి సార్వత్రిక లాభం రేటూ, సగటు లాభం పెరగడం ఆచరణలో సాధ్యం కాదు. తగ్గుదల సందర్భానికి పై సూత్ర వ్యత్యయం వర్తిస్తుంది. సరుకుల మొత్తం విలువ మొత్తం అదనపు విలువను క్రమబద్ధం చేస్తుంది. ఈ మొత్తం అదనపు విలువ తిరిగి సగటు లాభం స్థాయిని, తద్వారా సార్వత్రిక లాభం రేటునూ క్రమబద్ధం చేస్తుంది – సార్వత్రిక నియమంగా లేక హెచ్చుతగ్గులను శాసించే నియమంగా. కాబట్టి విలువ నియమం ఉత్పత్తి ధరలను క్రమబద్ధం చేస్తుందని తేలుతుంది.

పోటీ మొదట ఒకే శాఖలో ఒకే మార్కెట్ విలువను, మార్కెట్ ధరను సాధిస్తుంది. ఇది సరుకుల వివిధ వ్యక్తిగత విలువల నుంచి నిష్పన్నమైనది. విభిన్న శాఖల్లోని పెట్టుబడుల పోటీవల్లనే మొట్టమొదట, విభిన్న శాఖల్లోని లాభం రేట్లను సమానం చేసే ఉత్పత్తి ధర రూపుగొంటుంది. లాభం రేట్లు సమానీకరణ జరగడానికి పెట్టుబడిదారీ ఉత్పత్తి ఇంతకు ముందుకంటే ఎక్కువ అభివృద్ధి చెందాల్సి ఉంటుంది.

ఒకే ఉత్పత్తి శాఖకు, ఒకే రకానికి చెందిన, రమారమి ఒకే నాణ్యత గల సరుకులు తమ విలువకు అమ్ముడుపోవాలంటే ఈ క్రింది రెండు విషయాలు అవసరమవుతాయి.

మొదటిది – ఏకైక సామాజిక విలువ. అంటే పైన ప్రస్తావించిన మార్కెట్ విలువ రూపుగొనేలా విభిన్న వ్యక్తిగత విలువను సమానీకరించాల్సి ఉంది. అంటే ఒకే రకం సరుకులు ఉత్పత్తి చేసే వారి మధ్య పోటీ ఉండాలన్నమాట. అదే విధంగా వారు తమ వస్తువులు అమ్మకానికి పెట్టడానికి ఉమ్మడి మార్కెట్ అంటూ ఒకటి ఉండాలి. వేరు వేరు పరిస్థితుల్లో ఉత్పత్తి అయిన ఒకే రకం సరుకుల మార్కెట్ ధర అన్నది మార్కెట్ విలువకు అనుగుణంగా ఉండాలంటే, అది మార్కెట్ విలువకు మించకుండా లేదా తగ్గకుండా ఉండాలంటే అమ్మకందారులు ఒకరిపై ఒకరు తెచ్చే ఒత్తిడి, సామాజిక అవసరాలను తీర్చడానికి తగినన్ని సరుకులను వారు మార్కెట్‌కు తెచ్చే విధంగా ఉండాలి. అంటే సమాజం మార్కెట్ విలువను చెల్లించగల పరిమాణంలో ఆ సరుకులు ఉండాలి. ఈ గిరాకీని ఉత్పాదితాల మొత్తం మించిపోతే ఆ సరుకులు తమ మార్కెట్ విలువకంటే తక్కువకు అమ్ముకోవాల్సి ఉంటుంది. అందుకు భిన్నంగా గిరాకీని తీర్చే పరిమాణంలో ఆ సరుకులు లేనట్లయితే, మరో విధంగా చెప్పాలంటే అమ్మకందార్ల మధ్య పోటీ ఈ సరుకును మార్కెట్‌కు తెచ్చేటంత బలంగా లేనట్లయితే అవి మార్కెట్ విలువకంటే ఎక్కువకు అమ్ముకోవాల్సి ఉంటుంది. మార్కెట్ విలువలో మార్పు వచ్చినట్లయితే మొత్తం సరుకులు అమ్ముడుపోయే పరిస్థితుల్లో కూడా మార్పు వస్తుంది. మార్కెట్ విలువ పడిపోతే, దాని ఫలితంగా సగటు సామాజిక గిరాకీ పెరుగుతుంది. (సామాజిక గిరాకీ అంటే అర్థం సార్థక గిరాకీ.) అప్పుడు నిర్ణీత పరిమితుల్లో సరుకులు మునుపటికన్నా ఎక్కువ పరిమాణంలో అమ్ముడుపోతాయి. మార్కెట్ విలువ పెరిగినట్లయితే, సామాజిక గారాకీ తగ్గుతుంది. అప్పుడు మునుపటికన్నా తక్కువ పరిమాణంలో సరుకులు అమ్ముడుపోతాయి. కాబట్టి సరఫరా, గిరాకీలు మార్కెట్ ధరను క్రమబద్ధం చేస్తే లేక మార్కెట్ విలువ నుంచి మార్కెట్ ధర వైదొలగడాలను క్రమబద్ధం చేస్తే, అప్పుడు ఇటువైపునుంచి మార్కెట్ విలువ సరఫరా గిరాకీల నిష్పత్తిని క్రమబద్ధం

చేస్తుంది. లేదా సరఫరా గిరాకీల హెచ్చుతగ్గులు మార్కెట్ ధరలను ఏ కేంద్రానికి అటూ ఇటూ మారేలా చేస్తాయో ఆ కేంద్రాన్ని మార్కెట్ విలువ క్రమబద్ధం చేస్తుంది.

నిశితంగా పరిశీలిస్తే, వ్యక్తిగత సరుకు విలువకు వర్తించే పరిస్థితులు ఇక్కడ ఒక నిర్దిష్ట సరుకు యొక్క విలువను శాసించే పరిస్థితులుగా పునరుత్పత్తి అయినట్లు మనకు కనిపిస్తుంది. పెట్టుబడిదారీ ఉత్పత్తి ప్రారంభం నుంచీ కూడా భారీ స్థాయి ఉత్పత్తి తక్కువ అభివృద్ధి చెందిన ఇతర ఉత్పత్తి విధానాల్లో బహుళ సంఖ్యాకులైనప్పటికీ సన్నకారు ఉత్పాదకులైన వారు సాపేక్షంగా తక్కువ పరిమాణాల్లో ఉత్పత్తి చేసిన ఒకేరకం సరుకు పెద్ద పరిమాణాల్లో – కనీసం అతి ముఖ్యమైన సరుకుల విశేషంలో సాపేక్షంగా కొద్దిమంది వ్యాపారుల చేతిలో కేంద్రీకృతమవుతుంది. వీరు వాటిని పోగు చేసుకుని ఒక ఉత్పత్తి శాఖకే చెందిన ఉత్పాదితంగా అమ్ముతారు. ఈ సందర్భంలో కింది విషయం గుర్తుంచుకోవాలి; గిరాకీ సూత్రాన్ని శాసించే సామాజిక గిరాకీ ప్రధానంగా వివిధ వర్గాల పరస్పర సంబంధానికీ, వాటి ఆర్థిక పరిస్థితికీ లోబడి ఉంటుంది. ముఖ్యంగా మొదటిది – వేతనాలకు మొత్తం అదనపు విలువకు మధ్య నిష్పత్తికీ, రెండవది – అదనపు విలువ విడిపోయే వివిధ భాగాల (లాభం, వడ్డీ, కౌలు, పన్నులు వగైరా) సంబంధానికీ లోబడి ఉంటుంది. ఈ గిరాకీ సరఫరా సంబంధానికి ప్రాతిపదిక ఏమిటో తెలుసుకోకపోతే గిరాకీ సరఫరాల సంబంధం ఏమీ తెలియజేయలేదని ఈ విషయం మరోసారి నిరూపిస్తున్నది.

సరుకు, డబ్బు, ఈ రెండూ మార్పిడి విలువ, ఉపయోగ విలువల ఐక్యతకు ప్రాతినిధ్యం వహిస్తున్నప్పటికీ కొనుగోలులోనూ, అమ్మకంలోనూ ఈ రెండు విధులు రెండు విభిన్న ధృవాలకు చెందుతాయని మనం ఇదివరకే గమనించాం. (1వ సం, 1వ విభాగం[1]) అంటే సరుకేమో (అమ్మకందారుడు) ఉపయోగ విలువకు ప్రాతినిధ్యం వహిస్తే, డబ్బేమో (కొలుగోరుదారుడు) మార్పిడి విలువకు ప్రాతినిధ్యం వహిస్తుంది. అమ్మకం యొక్క మొట్టమొదటి పూర్వావసరాల్లో ఒకటి ఏమిటంటే సరుకుకు ఉపయోగ విలువ ఉండాలి; కనుక అది ఒక సామాజిక అవసరాన్ని తీర్చాలి. రెండో పూర్వావసరం ఏమిటంటే సరుకులో నిక్షిప్తమైవున్న శ్రమ సామాజిక ఆవశ్యకత శ్రమకు ప్రాతినిధ్యం వహించాలి అంటే దాని వ్యక్తిగత విలువ (మన ఊహ ప్రకారం అమ్మకం ధర) ఆ సరుకు యొక్క సామాజిక విలువతో ఏకీభవించాలి.[2] ఒక శాఖ యావత్తు ఉత్పాదితానికి ప్రాతినిధ్యం వహించే మార్కెట్ లభిస్తున్న సరుకుల పరిణామానికి దీనిని వర్తింపచేద్దాం.

ఒక శాఖ ఉత్పత్తి చేసిన మొత్తం సరుకుల రాశిని ఒకే సరుకుగాను, ఒకే రకానికి చెందిన అనేక సరుకుల ధరల మొత్తాన్ని ఒకే ధరగాను పరిగణిస్తే, ఈ వ్యవహార సమగ్ర చిత్రం మనముందు నిలుస్తుంది. అప్పుడు ఒకే ఒక సరుకు గురించి చెప్పినదంతా మార్కెట్‌లో లభించే ఒక ఉత్పత్తి శాఖకే చెందిన సరుకు రాశికి వర్తిస్తుంది. సరుకు యొక్క వ్యక్తిగత విలువ ఆ సరుకు యొక్క సామాజిక విలువకు అనుగుణంగా ఉండవలసిన అవసరం కింది విధంగా తీరింది. ఆ సరుకు రాశి ఉత్పత్తికి అవసరమైన సామాజిక శ్రమ అందులో నిక్షిప్తమైంది. దీని విలువ మార్కెట్ విలువకు సమంగా ఉంటుంది.

---

1. ప్రథమ సంపుటి; అధ్యాయం 1, 3 - సంపాదకుడు.
2. కార్ల్‌మార్క్స్, Zur kritik der politschen Oekonomie, Berlin, 1859.

ఇప్పుడిక ఈ సరుకుల్లో అత్యధిక భాగం దాదాపు ఒకేరకం మామూలు సామాజిక పరిస్థితుల్లో ఉత్పత్తి అయ్యాయనుకుందాం. అప్పుడు ఈ విలువ, అదే సమయంలో ఈ రాశిగా ఉన్న వ్యక్తిగత సరుకుల వ్యక్తిగత విలువగా ఉంటుంది. కాగా, ఈ సరుకుల్లో సాపేక్షంగా కొద్ది సరుకులు వీటికన్నా ప్రతికూలమైన పరిస్థితుల్లోనూ, కొద్ది సరుకులు వీటికన్నా మరింత అనుకూలమైన పరిస్థితుల్లోనూ ఉత్పత్తి అయ్యాయనుకుంటే, ఒక భాగపు వ్యక్తిగత సరుకులలోని అత్యధిక భాగం సగటు విలువకన్నా ఎక్కువగానూ, మరోభాగపు వ్యక్తిగత విలువ తక్కువగానూ ఉంటుంది. కానీ ఈ భిన్న ధృవాలు ఒకదానికి మరొకటి సమతూకంగా ఉండే నిష్పత్తుల్లోనే ఈ ఎక్కువ, తక్కువలుంటాయనుకొంటే, భిన్న ధృవాల్లోని సగటు విలువ, మధ్యలో ఉన్న సరుకుల సగటు విలువకు సమానంగా ఉంటుంది. పర్యవసానంగా సగటు పరిస్థితుల్లో ఉత్పత్తి అయిన సరుకుల తాలూకు విలువే మార్కెట్ విలువను నిర్ధారిస్తుంది.[1] మొత్తం సరుకుల విలువ అన్నది, సమస్త వ్యక్తిగత సరుకులను అంటే సగటు పరిస్థితుల్లోనే కాక వాటికన్నా ప్రతికూలమైన పరిస్థితుల్లోనూ, మరింత అనుకూలమైన పరిస్థితుల్లోనూ ఉత్పత్తి అయిన సరుకులన్నిటినీ కలిపితే వాటి విలువల మొత్తానికి సమానంగా ఉంటుంది. అప్పుడు సరుకుల రాశి మార్కెట్ విలువను లేక సామాజిక విలువను – వాటిలో నిక్షిప్తమైన అవసర శ్రమకాలాన్ని – సరుకుల రాశిలో అత్యధికంగా ఉన్న సగటు భాగం విలువ నిర్ధారిస్తుంది.

దీనికి భిన్నంగా, మార్కెట్‌కు తెచ్చిన సరుకుల మొత్తం యథాతథంగా ఉందని, ప్రతికూల పరిస్థితుల్లో ఉత్పత్తి అయిన సరుకుల విలువ – మరింత అనుకూల పరిస్థితుల్లో ఉత్పత్తి అయిన సరుకుల విలువ – సమతూకంగా లేదనీ సగటు పరిస్థితుల్లో ఉత్పత్తి అయిన సరుకుల మొత్తం కంటే, అనుకూల పరిస్థితుల్లో ఉత్పత్తి అయిన సరుకుల మొత్తం కంటే ప్రతికూల పరిస్థితుల్లో ఉత్పత్తి అయిన సరుకుల భాగ పరిమాణం సాపేక్షంగా ఎక్కువగా ఉందనీ అనుకొందాం. అలాంటి సందర్భంలో ప్రతికూల పరిస్థితుల్లో ఉత్పత్తి అయిన సరుకుల రాశి మార్కెట్ విలువను లేక సామాజిక విలువను క్రమబద్ధం చేస్తాయి.

ఇక చివరగా సగటు పరిస్థితుల కంటే మరింత బాగా ఉన్న పరిస్థితుల్లో ఉత్పత్తి అయిన సరుకుల మొత్తం ప్రతికూల పరిస్థితుల్లో ఉత్పత్తి అయిన సరుకుల మొత్తం కంటే గణనీయంగా ఎక్కువ ఉందనుకుందాం. సగటు పరిస్థితుల్లో ఉత్పత్తి అయిన సరుకుల కంటే కూడా అవి ఎక్కువ పరిమాణంలో ఉన్నాయనుకుందాం. అప్పుడు ఈ ఉదాహరణలో అత్యంత అనుకూల పరిస్థితుల్లో ఉత్పత్తి అయిన సరుకుల భాగం మార్కెట్ విలువను నిర్ధారిస్తుంది. అయితే సరుకులు పేరుకొని ఉన్న మార్కెట్‌ను ఇక్కడ విస్మరిస్తున్నాం. అటువంటి మార్కెట్‌లో అత్యనుకూల పరిస్థితుల్లో ఉత్పత్తి అయిన భాగమే మార్కెట్ ధరను నిర్ధారణ చేస్తుంది. మనమిక్కడ మార్కెట్ విలువతో విభేదించే మేరకు మార్కెట్ ధరను కాక, మార్కెట్ విలువను నిర్ధారించే వివిధ అంశాలను గురించి చర్చిస్తున్నాము.[2]

---

1. పూర్వోదాహృత గ్రంథం.
2. కౌలుకు సంబంధించిన విధానం (విషయానికి సంబంధించిన వివాదం మాత్రమే; వాస్తవానికి ప్రత్యర్థులిరువురు ఒకరి మాటపట్ల మరొకరు శ్రద్ధ వహించలేదు.) అంటే, మార్కెట్ విలువను (లేదా స్టార్చ్ పేర్కొనే మార్కెట్ ధరను రికార్డో పేర్కొనే ఉత్పత్తి ధరను) ప్రతికూల పరిస్థితుల్లో ఉత్పత్తి అయిన

వాస్తవానికి, ఖచ్చితంగా చెప్తే (వాస్తవాచరణలో సంఖ్యానేక మార్పులతో, రమారమిగా మాత్రమే అలా జరుగుతుంది.) Iవ ఉదాహరణలో, సగటు విలువలచే క్రమబద్ధం అయ్యే మొత్తం సరుకుల మార్కెట్ విలువ అన్నది వాటి వ్యక్తిగత విలువల మొత్తానికి సమంగా ఉంటుంది; అయితే అటు ప్రతికూల పరిస్థితుల్లోనూ, ఇటు అనుకూల పరిస్థితుల్లోనూ ఉత్పత్తి అయిన విషయంలో ఈ విలువను సగటు విలువగా చూపించడం, ఈ విలువను వాటిపై రుద్దడం జరుగుతుంది. అప్పుడు ప్రతికూల పరిస్థితుల్లో ఉత్పత్తిచేసే వారు తమ సరుకులను వ్యక్తిగత విలువకంటే తక్కువకు అమ్ముకోవాలి. అత్యనుకూల పరిస్థితుల్లో ఉత్పత్తిచేసే వారు తమ సరుకులను వ్యక్తిగత విలువకంటే ఎక్కువకు అమ్ముకొంటారు.

II వ ఉదాహరణలో ప్రతికూల పరిస్థితుల్లోనూ, అనుకూల పరిస్థితుల్లోనూ ఉత్పత్తి అయిన సరుకు విలువల తాలూకు వ్యక్తిగత విలువల మొత్తాలు ఒకదానికి మరొకటి సమతూకంగా లేవు. పైపెచ్చు ప్రతికూల పరిస్థితుల్లో ఉత్పత్తి అయినవే అసలు విషయాన్ని నిర్ధారిస్తాయి. కచ్చితంగా చెప్తే ఇప్పుడు ప్రతి వ్యక్తిగత సరుకు యొక్క సగటు ధరను లేక మార్కెట్ విలువను లేదా మొత్తం పరిమాణంలోని ప్రతి తమ విభాజిత భాగం విలువను విభిన్న పరిస్థితుల్లో ఉత్పత్తి అయిన యావత్తు సరుకుల విలువలను కూడగా వచ్చే మొత్తం విలువ, ఈ మొత్తం విలువలో ప్రతి విడివిడి సరుకు వాటాకు వచ్చే విలువననుసరించి నిర్ధారిస్తుంది. ఈ విధంగా వచ్చిన మార్కెట్ విలువ నిజానికి అనుకూల పరిస్థితుల్లోని సరుకుల వ్యక్తిగత విలువ కంటేనూ, సగటు పరిస్థితులకు చెందిన సరుకుల విలువ కంటేనూ కూడా ఎక్కువగా ఉంటుంది. అయినప్పటికీ, ఇది ప్రతికూల పరిస్థితుల్లో ఉత్పత్తి అయిన సరుకుల వ్యక్తిగత విలువకంటే ఎల్లప్పుడు తక్కువగానే ఉంటుంది. కాగా మార్కెట్ విలువ దానికి ఎంత దగ్గరగా ఉంటుందన్నదీ లేక అది అంతిమంగా దానితో ఏకీభవించేదీ ప్రతికూల

---

సరుకులు నిర్ధారిస్తాయో (రికార్డో) ఆన్ ది ప్రిన్సిపుల్స్ ఆఫ్ పొలిటికల్ ఎకానమీ అండ్ టాక్సేషన్, మూడవ కూర్పు, లండన్, 1821, పుటలు 60-61 (సంపాదకుడు) లేక అనుకూల పరిస్థితుల్లో ఉత్పత్తి అయిన సరుకులు నిర్ధారిస్తాయా (స్టార్చ్) (Cowrs d'economie Politique, ouex Position des Principles, quidetermines la Prosperite des nations, టోమ్ II సెంట్‌పీటర్స్‌బర్గ్, 1815, పుటలు 78-79 - సంపాదకుడు) అనే సమస్యపై స్టార్చ్‌కూ రికార్డోకు మధ్య ఉత్పన్నమైన వివాదం. దాన్ని తుదకంటా విశ్లేషిస్తే తేలుతున్నదేమిటంటే నిజానికి ఇద్దరిదీ ఒప్పే, ఇద్దరిదీ తప్పే; ఇరువురూ సగటు సందర్భాన్ని పరిగణనకు తీసుకోలేదు. అత్యంత అనుకూల పరిస్థితుల్లో ఉత్పత్తి అయిన సరుకుల ధరను నిర్ధారించే సందర్భాలపై కార్బెట్ (యాన్ యెంక్వయిరీ యింటు ది కాజెస్ అండ్ మోడ్స్ ఆఫ్ ది వెల్త్ ఆఫ్ ఇండివిడ్యువల్స్, లండన్, 1841, పుటలు 42-44 - సంపాదకుడు) ఏమంటారో పోల్చి చూద్దాం; రెండు వేరువేరు సరుకుల రాశి, ఉదాహరణకు ఒక టోపీ, ఒక జత పాదరక్షల రాశి సమాన శ్రమ పరిమాణాల చేత ఉత్పత్తి అయినప్పుడు అవి మార్పిడి చెందుతాయని నొక్కిచెప్పడం ఆయన (రికార్డో) ఉద్దేశం కాదు. ఇక్కడ సరుకు అంటే ఫలానా టోపీ అని కానీ, ఫలానా జత పాదరక్షలు అని కానీ కాకుండా, కేవలం 'సరుకుల వర్గన' అని మాత్రమే అర్థం చేసుకోవాలి. ఇందుకోసం ఇంగ్లాండ్‌లోని అన్ని పాదరక్షలను ఉత్పత్తి చేసే మొత్తం శ్రమ అన్ని టోపీలకు పంపిణీ అయినట్లు ఈ సందర్భంలో భావించాల్సి వుంటుంది. ప్రారంభంలోనూ, ఈ సిద్ధాంతం గురించీ సాధారణ ప్రకటనల్లోనూ ఈ భావం వ్యక్తమైనట్లు నాకు కనిపించలేదు.'' (అబ్జర్వేషన్స్ ఆన్ సర్టన్ వర్బల్ డిస్ప్యూట్స్ ఇన్ పొలిటికల్ ఎకానమీ ఎట్‌సెట్రా, లండన్, 1821, పుటలు 53-54)

పరిస్థితుల్లో ఉత్పత్తి అయిన సరుకుపై తన శాఖలో ఆక్రమించే పరిమాణంపై ఆధారపడి ఉంటుంది. గిరాకీ గనుక సరఫరా కంటే కొద్దిగా మాత్రమే ఎక్కువగా ఉంటే ప్రతికూల పరిస్థితుల్లో ఉత్పత్తి అయిన సరుకుల తాలూకు వ్యక్తిగత విలువ మార్కెట్ ధరను నిర్ధారిస్తుంది.

ఇక చివరగా, IIIవ ఉదాహరణలోలాగా అనుకూల పరిస్థితుల్లో ఉత్పత్తి అయిన సరుకుల పరిమాణం, ప్రతికూల పరిస్థితుల్లో ఉత్పత్తి అయిన వాటికంటే, సగటు పరిస్థితుల్లో ఉత్పత్తి అయిన వాటికంటే ఈ సరుకుల పరిమాణం ఎక్కువగా ఉన్నట్లయితే – మార్కెట్ విలువ సగటు విలువ కంటే తక్కువ స్థాయికి పడిపోతుంది. రెండు విభిన్న పరిస్థితుల్లోని, సగటు పరిస్థితుల్లోని విలువ మొత్తాలను కూడటం ద్వారా లెక్కించిన సగటు విలువ ఇక్కడ మధ్యస్థ విలువకంటే తక్కువగా ఉంటుంది. అనుకూల పరిస్థితుల్లోని సరుకులు ఆక్రమించే సాపేక్ష స్థానాన్నిబట్టి సగటు విలువ, మధ్యస్థ విలువకు దగ్గరగానో లేక దూరంగానో ఉంటుంది. సరఫరా కంటే గిరాకీ తక్కువగా ఉన్నట్లయితే అనుకూల పరిస్థితుల్లో ఉత్పత్తి అయిన సరుకుల మొత్తం తన పరిమాణంతో నిమిత్తం లేకుండా తమ ధరలను తమ వ్యక్తిగత విలువ స్థాయికి తగ్గించడం ద్వారా మార్కెట్‌లో జొరబడి చోటుచేసుకొంటుంది. గారికీ సరఫరాను ఎంతో అధిగమిస్తే తప్ప ఈ మార్కెట్ విలువ అత్యనుకూల పరిస్థితుల్లో ఉత్పత్తి అయిన సరుకుల వ్యక్తిగత విలువతో ఎన్నడూ ఏకీభవించలేవు.

ఇక్కడ అనిర్దిష్టంగా వర్ణించిన ఈ మార్కెట్ విలువల నిర్ధారణ పద్ధతి వాస్తవ మార్కెట్‌లో కొనుగోలుదార్ల మధ్యగల పోటీవల్ల పెంపొందుతుంది. అయితే ఆ విధంగా నిర్ణయించిన విలువలకు భారీ పరిమాణంలోని సరుకులను కొనుగోలు చేయగలిగే విధంగా గిరాకీ కూడా భారీగా ఉండాలి. దీనివల్ల మరో అంశం మన దృష్టికి వస్తుంది.

రెండు – ఒక సరుకుకు ఉపయోగ విలువ ఉందంటే అది ఏదో ఒక సామాజిక అవసరాన్ని తీర్చుతుందని చెప్పడం తప్ప మరొకటి కాదు. మనం ఇంతవరకు విడివిడిగా సరుకుల గురించే చర్చించాం కాబట్టి, ఫలానా సరుకు యొక్క అవసరం ఉందని మనం ఊహించుకోగలిగాము. దాని ధరే దాని పరిమాణాన్ని సూచించింది. ఈ అవసరాన్ని తీర్చడానికి కావలసిన సరుకుల పరిమాణం విషయమై మనం, తదుపరి పరిశీలించలేదు. కాని ఒక శాఖకు చెందిన మొత్తం ఉత్పాదితాన్ని ఒక వైపున, దానికి గల సామాజిక అవసరాన్ని మరోవైపున ఉంచి చూసినప్పుడు ఆ సరుకు పరిమాణానికి తప్పనిసరిగా ప్రాముఖ్యం ఉంటుంది. అప్పుడు ఈ సామాజిక అవసరం తాలూకు విస్తృతిని అంటే పరిమాణాన్ని పరిశీలించాల్సిన అవసరం ఏర్పడుతుంది.

పై విధంగా మార్కెట్ విలువలను నిర్ధారించిన సందర్భంగా ఉత్పాదిత సరుకుల రాశి నిర్ణీతమైనదని, అంటే యథాతథంగా ఉంటుందని, ఈ రాశిలోని వివిధ భాగాల మధ్య నిష్పత్తిలో మాత్రమే మార్పు ఉంటుందనీ, ఇవి విభిన్న పరిస్థితుల్లో ఉత్పత్తి అయినవనీ, కాబట్టి ఒకే సరుకుల రాశి మార్కెట్ విలువ విభిన్నంగా క్రమబద్ధం అవుతుందనీ మనం భావించాం. ఈ సరుకుల మొత్తం పరిమాణం మామూలు సరఫరాకు అనుగుణమైన స్థాయిలో ఉందని భావిద్దాం. ఉత్పాదిత సరుకుల్లో ఒక భాగాన్ని మార్కెట్ నుంచి తాత్కాలికంగా ఉపసంహరించుకోబడే అవకాశాన్ని ఈ మొత్తానికి గల గిరాకీ ఇప్పుడు కూడా యథాతథంగా ఉన్నట్లయితే, మార్కెట్ విలువను పై మూడు సందర్భాల్లో ఏది

క్రమబద్ధం చేస్తుందన్నదానితో నిమిత్తం లేకుండా, ఈ సరుకు మార్కెట్ విలువకు అమ్ముడుపోతుంది. ఈ సరుకుల మొత్తం కేవలం ఒక అవసరాన్ని తీర్చడమేకాక దాని సామాజిక అవసరాన్ని పూర్తిగా తీర్చుతుంది. వాటికి గల గిరాకీ కంటే ఈ సరుకుల సరఫరా తక్కువగా కానీ లేక ఎక్కువగా కానీ ఉన్నట్లయితే, మార్కెట్ విలువకూ మార్కెట్ ధరకూ మధ్య తేడాలు వస్తాయి. మొదటి తేడా ఏమిటంటే – సరఫరా కనుక చాలా తక్కువగా ఉన్నట్లయితే ప్రతికూల పరిస్థితుల్లో ఉత్పత్తి అయిన సరుకులే ఎల్లప్పుడూ మార్కెట్ విలువను క్రమబద్ధం చేస్తాయి. అలాకాక సరఫరా కనుక చాలా ఎక్కువగా ఉన్నట్లయితే అనుకూల పరిస్థితుల్లో ఉత్పత్తి అయిన సరుకులే మార్కెట్ విలువను క్రమబద్ధం చేస్తాయి. విభిన్న పరిస్థితుల్లో ఉత్పత్తి అయిన సరుకు రాశుల కేవల నిష్పత్తి ననుసరించిన ఫలితం, భిన్నంగా ఉండాల్సిన మాట నిజమే అయినా మొత్తం మీద మార్కెట్ విలువను నిర్ధారించేది అత్యనుకూల పరిస్థితుల్లో ఏదో ఒక పరిస్థితిలో ఉత్పత్తి అయిన సరుకుల పరిమాణమే. ఉత్పాదితానికి గల గిరాకీకి ఆ ఉత్పాదితం లభ్యమయిన పరిమాణానికీ మధ్య వ్యత్యాసం గణనీయంగా ఉన్నట్లయితే – మార్కెట్ విలువ కంటే మార్కెట్ ధర గణనీయంగా ఎక్కువగా కానీ తక్కువగా కానీ ఉంటుంది. ఉత్పత్తి అయిన సరుకుల పరిమాణానికీ, మార్కెట్ విలువకు అవి అమ్ముడుపోయే పరిమాణానికీ మధ్య తేడా ఉండడానికి రెండు అంశాలు కారణం కావచ్చు. ఒకటి – సరుకుల పరిమాణం మారినప్పుడు; అంటే పరిమాణం తగ్గవచ్చు లేదా పెరగవచ్చు. ఫలితంగా నిర్ణీత మార్కెట్ విలువను క్రమబద్ధం చేసిన స్థాయికి భిన్నమైన స్థాయిల్లో పునరుత్పత్తి జరిగి ఉండవచ్చు. అటువంటి సందర్భాల్లో గిరాకీ యథాతథంగా ఉన్నప్పటికీ సరఫరా మారింది; కాబట్టి సాపేక్షమైన అధిక ఉత్పత్తి కానీ లేక తక్కువ ఉత్పత్తి కానీ జరిగింది. లేక, అనేక కారణాలవల్ల డిమాండు తరిగినా, పెరిగినా పునరుత్పత్తి, అలాగే సరఫరా యథాతథంగా ఉండిపోయింది. సరఫరా తాలూకు నిరపేక్ష పరిమాణం యథాతథంగా ఉండినప్పటికీ దాని సాపేక్ష పరిమాణం మారింది. గిరాకీ దృష్ట్యా అంటే గిరాకినీబట్టి అంచనా కట్టినపుడు సరఫరా పరిమాణం మారిందన్నమాట. ఫలితం కూడా మొదటి సందర్భంలో మాదిరే వుంటుంది. కానీ వ్యతిరేక దిశలో ఉంటుంది. ఇక చివరగా, రెండువైపులా మార్పులు సంభవిస్తే, అవి వ్యతిరేక దిశలో కానీ లేక అదే దిశలోనైనా ఒక మోతాదులో కాకుండా వేరు వేరు మోతాదులు సంభవిస్తే, అంటే, ఈ మార్పులు రెండువైపుల మధ్యగల నిష్పత్తిని ప్రభావితం చేస్తే అంతిమ ఫలితం తప్పనిసరిగా పైన తెలిపిన రెండు సందర్భాల్లో ఏదో ఒకదానికి దారితీస్తుంది.

సరఫరా డిమాండ్‌ల సాధారణ నిర్వచనాన్ని రూపొందించడంలో ఎదురయ్యే అసలు ఇబ్బంది ఏమిటంటే, అది పునరుక్తి రూపం ధరిస్తున్నట్టు కనిపిస్తుంది. ముందు సరఫరాను పరిశీలిద్దాం. సరఫరా అంటే మార్కెట్‌లో లభ్యమవుతున్న ఉత్పాదితం లేదా మార్కెట్‌కు తరలించగలిగిన ఉత్పాదితం. పనికిమాలిన వివరాల జోలికి పోకుండా, ప్రతి నిర్ణీత ఉత్పత్తి శాఖలో ఏటా పునరుత్పత్తి అయ్యే సరుకుల మొత్తాన్ని మాత్రమే మనమిక్కడ పరిగణలోకి తీసుకుని, మార్కెట్ నుంచి ఉపసంహరించబడి వచ్చే సంవత్సరందాకా నిల్వ ఉంచడానికి వివిధ సరుకులకు తరతమ స్థాయిల్లో గల శక్తిని విస్మరిద్దాం. ఈ వార్షిక పునరుత్పత్తి ఒక నిర్దిష్ట పరిమాణంలో వ్యక్తీకరించబడుతుంది. ఇంత తూకం గలవనో, లేక ఇన్ని అనో వ్యక్తీకరించబడుతుంది. ఈ సరుకులు నిరంతరాయంగా కొలవబడేవా లేక విడివిడిగా

కొలవబడేవా అన్నదానిపై అది ఆధారపడుతుంది. ఇవి కేవలం మనుషుల అవసరాలు తీర్చే ఉపయోగపు విలువలే కాదు, ఈ ఉపయోగ విలువలు నిర్దిష్ట పరిమాణంలో మార్కెట్‌లో కూడా లభ్యమవుతాయి. రెండవది – ఈ సరుకుల పరిమాణానికి ఒక నిర్దిష్టమైన మార్కెట్ విలువ ఉంది. విలువను సరుకు విలువ యొక్క లేక దాని యూనిట్ కొలత యొక్క గుణిజంగా వ్యక్తీకరించవచ్చు. ఈ విధంగా మార్కెట్‌లోని సరుకుల తాలూకు రాశికీ, వాటి మార్కెట్ విలువకూ మధ్య తప్పనిసరియైన సంబంధమేదీ లేదు. ఎందుచేతనంటే, అనేక సరుకులకు ప్రత్యేకంగా అధిక విలువ, మరి కొన్నిటికి ప్రత్యేకంగా తక్కువ విలువ ఉంటాయి. ఫలితంగా కొన్ని నిర్ణీత విలువల మొత్తానికి చాలా పెద్ద పరిమాణంలోని ఒక సరుకు కొద్దిపాటి పరిమాణంలోని మరో సరుకు ప్రాతినిధ్యం వహించవచ్చు. మార్కెట్‌లో లభ్యమవుతున్న వస్తువుల పరిమాణానికీ, ఈ వస్తువుల మార్కెట్ విలువకూ మధ్య ఈ క్రింది సంబంధం మాత్రమే ఉంది; ఒక నిర్ణీత శ్రమ ఉత్పాదకత ప్రాతిపదికపై ప్రతి ఉత్పత్తి శాఖలోనూ నిర్దిష్ట పరిమాణంలో వస్తువుల ఉత్పత్తికిగాను నిర్దిష్ట పరిమాణంలోని సామాజిక శ్రమకాలం అవసరమవుతుంది; అయితే ఈ నిష్పత్తి వేరు వేరు ఉత్పత్తి శాఖల్లో వేరు వేరుగా ఉండవచ్చు; ఈ వస్తువుల ఉపయుక్తత కానీ, వాటి ఉపయోగ విలువల ప్రత్యేక స్వభావంతో కానీ ఈ నిష్పత్తికి ఆంతరిక సంబంధమేదీ ఉండదు. ఇతర పరిస్థితులన్నీ సమంగా ఉన్నాయనీ, ఒక సరుకు యొక్క క పరిమాణానికి గ శ్రమకాలం అవసరమని అనుకొంటే, అదే సరుకు యొక్క ఏక పరిమాణానికి క గ శ్రమకాలం అవసరమవుతుంది. సమాజం ఏదైనా ఒక అవసరాన్ని తీర్చుకోవాలనుకొని ఇందుకోసం ఒక వస్తువును ఉత్పత్తి చేసినపుడు అందుకోసం అది చెల్లించవలసి ఉంటుంది. సరుకు ఉత్పత్తికి శ్రమ విభజన అవసరం కాబట్టి, తనకు ఉన్న శ్రమ కాలంలో ఒక భాగాన్ని ఆ వస్తువు ఉత్పత్తికి కేటాయించడం ద్వారా సమాజం ఆ వస్తువు కోసం మూల్యం చెల్లిస్తుంది. కాబట్టి సమాజం తాను వినియోగించ వీలున్న శ్రమ కాలంలో కొంత భాగంతో ఆ సరుకును కొనుగోలు చేస్తుంది. ఆ ప్రత్యేక సరుకు ఉత్పత్తి కోసం శ్రమ విభజన ద్వారా తన శ్రమను వెచ్చించే సమాజంలోని ఆ భాగం నిజానికి ఆ సరుకుల్లో నిక్షిప్తమై ఉన్న సామాజిక శ్రమకు తుల్యమైనదాన్ని; తన సొంత అవసరాలను తీర్చుకొనేందుకు పొందాలి. అయితే ఒక సామాజిక సరుకుకు వెచ్చించిన సామాజిక శ్రమ పరిమాణానికీ, అంటే, సమాజంలోని మొత్తం శ్రమశక్తులు ఈ వస్తువు ఉత్పత్తికి కేటాయించిన భాగానికీ లేక మొత్తం ఉత్పత్తి ఈ వస్తువు ఉత్పత్తి ఆక్రమించే పరిమాణానికీ, మరోవైపు ఆ సరుకు ద్వారా సమాజం తన అవసరాన్ని, ఆ వస్తువు ద్వారా తీరే అవసరాన్ని సమాజం ఎంత పరిమాణంతో తీర్చుకో చూస్తుందో ఆ పరిమాణానికీ మధ్య ఆవశ్యకమైన సంబంధం కాక యాదృచ్ఛిక సంబంధం ఉంటుంది. ప్రతి వ్యకిగత సరుకులో లేదా ప్రతి సరుకు తాలూకు నిర్దిష్ట పరిమాణంలో దాని ఉత్పత్తికి అవసరమైన దానికంటే ఎక్కువ సామాజిక శ్రమ ఉండకపోవచ్చు. ఈ దృష్టితో చూస్తే, ఈ సమస్త సరుకు యొక్క మార్కెట్ విలువా కేవలం ఆవశ్యక శ్రమకే ప్రాతినిధ్యం వహిస్తుంది. కానీ అప్పటి సామాజిక అవసరాలకు మించి ఈ సరుకును ఉత్పత్తి చేసినట్లయితే, ఆ మేరకు సామాజిక శ్రమ వృధా అయిపోతుంది. ఆ సరుకుల రాశి నిజంగా దానిలో నిక్షిప్తమైన సామాజిక శ్రమకంటే తక్కువ సామాజిక శ్రమకే ప్రాతినిధ్యం వహిస్తుంది. (ఉత్పత్తి అన్నది సమాజం వాస్తవ, నిర్ణయాత్మక

నియంత్రణలో ఉన్నప్పుడు మాత్రమే సమాజం నిర్దిష్ట వస్తువుల ఉత్పత్తికై నియోగించిన సామాజిక శ్రమకాల పరిమాణానికీ, ఈ వస్తువులు తీర్చవలసిన సామాజిక శ్రమ పరిమాణానికీ మధ్య సంబంధాన్ని స్థాపిస్తుంది.) ఈ కారణంగా, ఈ సరుకులను వాటి మార్కెట్ విలువకంటే తక్కువకు అమ్మవలసి ఉంటుంది. ఆ సరుకుల్లో కొంత భాగం అసలే అమ్మటానికి వీలులేకపోవచ్చు. ఒక నిర్దిష్ట సరుకు ఉత్పత్తి కోసం నియోగించిన సామాజిక శ్రమ పరిమాణం కనుక, ఆ సరకుకు గల సామాజిక గిరాకీని తీర్చేదానికి అవసరమైన సామాజిక శ్రమకన్నా తక్కువ ఉన్నట్లయితే ఇందుకు వ్యతిరేకమైనది వర్తిస్తుంది. అలాకాక ఆ సరుకుకు గల సామాజిక గిరాకీకి అనుగుణమైన విధంగానే ఆ సరుకు ఉత్పత్తి కోసం సామాజిక పరిమాణం వ్యయమైన పక్షంలో, అంటే ఫలితంగా ఉత్పాదిత పరిమాణం పునరుత్పత్తి మామూలు స్థాయికి అనుగుణంగా ఉంటూ, గిరాకీ మారకుండా ఉన్నట్లయితే, సరుకు మార్కెట్ విలువకే అమ్ముడుపోతుంది. సరుకులు తమ తమ విలువలకు మార్పిడి కావడం లేదా అమ్ముడుపోవడం అన్నది సవ్యమైన పరిస్థితి. అంటే వాటి సమతులనపు సహజ నియమం. తేడాలకు కారణమేమిటో తెలిపేది ఈ నియమమే తప్ప ఈ నియమానికి కారణమేమిటో ఈ తేడాలు తెలపవు.

ఇప్పుడిక రెండో పార్శ్వాన్ని అంటే గిరాకీని పరిశీలిద్దాం.

ఉత్పాదక వినియోగం కోసం లేదా వ్యక్తిగత వినియోగం కోసం సరుకులను ఉత్పత్తి సాధనాలుగా కానీ లేక జీవన అవసరాలుగా కానీ  కొనుగోలు చేస్తారు. కొన్ని సరుకులు రెండు ప్రయోజనాలనూ నెరవేర్చినంత మాత్రాన అసలు పరిస్థితిలో మార్పేమీ ఉండదు. కనుక సరుకుల కోసం అటు ఉత్పాదకుల నుంచి (ఇక్కడ పెట్టుబడిదారులు; ఎందుచేతనంటే ఉత్పత్తి సాధనాలు పెట్టుబడిగా మార్చబడినాయని భావించాం.) ఇటు వినియోగదారుల నుంచి గిరాకీ ఉంటుంది. వీరిద్దరి గిరాకీలకు సంబంధించి ఒక నిర్ణీత పరిమాణంలోని సామాజిక అవసరం ప్రాతిపదికగా ఉన్నట్లు పైకి కనిపిస్తుంది. వివిధ ఉత్పత్తి శాఖల్లో ఒక నిర్ణీత పరిమాణం గల సామాజిక ఉత్పత్తికి ఇది అనుగుణంగా ఉన్నట్లు కూడా కనిపిస్తుంది. పత్తి పరిశ్రమ నిర్దిష్ట స్థాయిలో తన వార్షిక పునరుత్పత్తిని సాధించాలంటే, ఆ పరిశ్రమకు మామూలు పత్తి సరఫరా అవసరం. ఇతర పరిస్థితులు యథాతథంగా ఉన్నవనుకొంటే, పెట్టుబడి సంచయనం ఫలితమైన పునరుత్పత్తి వార్షిక విస్తరణకు అనుగుణంగా అదనపు పరిమాణంలో పత్తి లభ్యం కావాలి. జీవనావసరాలకు కూడా ఇది సమంగా వర్తిస్తుంది. కార్మిక వర్గం గనుక తను అలవాటుపడిన సగటు జీవన పద్ధతిని కొనసాగించాలంటే, వారికి జీవనావసరాలు కనీసం అదే పరిమాణంలో లభించాలి. అయితే ఆ జీవనావసరాలు వివిధ రకాల సరుకులుగా పంపిణీ అయిన తీరు తరతమ స్థాయిలో భిన్నంగా ఉండవచ్చు. ఇంతేకాక ఏటా పెరిగే జనాభా అవసరాలకు అనుగుణంగా కూడా ఇది అధిక పరిమాణంలో లభ్యం కావాలి. ఇతర వర్గాల ప్రజలకు కూడా కొద్దిపాటి మార్పులతో ఇదే వర్తిస్తుంది.

కనుక, డిమాండ్‌కు సంబంధించి, నిర్దిష్ట సామాజిక అవసరాలు ఒక నిర్ణీత పరిమాణంలో ఉన్నాయనీ, వాటిని తీర్చడానికి మార్కెట్‌లో ఒక నిర్దిష్ట పరిమాణం గల నిర్దిష్ట సరుకులు అవసరమనీ అనిపిస్తుంది. అయితే రాశి రీత్యా, నిర్దిష్ట సామాజిక అవసరాలు హెచ్చుతగ్గులకు లోనయ్యే స్వభావం కలవి, నిరంతరం మార్పు చెందేవి. వాటికి స్థిరత్వం ఉన్నట్లు పైకి మాత్రమే కనిపిస్తుంది. జీవనా వసరాలు చౌకగా ఉన్నట్లయితే లేదా డబ్బు రూపంలోని వేతనాలు ఎక్కువగా ఉన్నట్లయితే, కార్మికులు

వాటిని ఎక్కువ పరిమాణంలో కొంటారు. వాటికి ఎక్కువ 'సామాజిక అవసరం' తలెత్తుతుంది. అయితే కటిక దరిద్రులు మొదలయిన వారి నుంచి వచ్చే గిరాకీ వారి భౌతిక అవసరాల స్వల్పాతిస్వల్ప స్థాయి కంటే తక్కువగా ఉంటుంది కాబట్టి వారిని వదిలివేస్తున్నాం. మరోవైపు కొన్ని వస్తువులు, ఉదాహరణకు పత్తి కనుక చౌకగా ఉన్నట్లయితే పత్తికోసం పెట్టుబడిదారుల నుంచి గిరాకీ పెరుగుతుంది. ఫలితంగా పత్తి పరిశ్రమలోకి మరింత ఎక్కువ పెట్టుబడిని పెడతారు. ఇలాగే తక్కిన పరిశ్రమల్లో కూడా. మన ఊహ ప్రకారం ఉత్పాదక వినియోగం కోసం వస్తువులకు గిరాకీ అన్నది పెట్టుబడిదారుల నుంచి వచ్చే గిరాకీ అన్న విషయం మనమెప్పుడూ విస్మరించరాదు. ఈ పెట్టుబడిదారుల ప్రధాన లక్ష్యం అదనపు విలువను ఉత్పత్తి చేయడమే. కేవలం ఇందుకోసమే అతడు తన ప్రత్యేక సరుకును ఉత్పత్తి చేస్తాడు. అయినా పెట్టుబడిదారు మార్కెట్‌లో కొనుగోలుదారుడిగా ఉన్నన్నాళ్ళూ అతడు ఈ పత్తికి గల అవసరానికి ప్రాతినిధ్యం వహించడానికి ఇదేమీ అడ్డురాదు. పత్తి కొనుగోలుదారుడు ఈ పత్తిని బట్టలుగా మార్చుకుంటాడా లేక గన్‌కాటన్‌గా మార్చుకుంటాడా లేక తన చెవుల్లోనూ ప్రపంచ జనాభా చెవుల్లోనూ పెట్టుకోడానికి వాడే దూది, ఒత్తులుగా మార్చుకుంటాడా అన్నదానితో దూది అమ్మకందారుకు ఎలా సంబంధం లేదో, ఇదీ అంతే. పెట్టుబడిదారుని లక్ష్యం అతడు ఏ తరహా కొనుగోలుదారుడు అన్న విషయాన్ని గణనీయంగా ప్రభావితం చేస్తుంది. అతని నిజమైన అవసరం లాభార్జన. పత్తికై అతని నుంచి వచ్చే గిరాకీ దాన్ని కప్పిపుచ్చుతూంది. ఈ గిరాకీని ఈ వాస్తవం గణనీయంగా మార్చివేస్తుంది. కనుక మార్కెట్‌లో సరుకులకు గల ఆవశ్యకతకు అంటే గిరాకీకి వాస్తవ సామాజిక ఆవశ్యకతకూ మధ్య పరిమాణంలో తేడా ఉంటుంది. ఈ తేడాకు గల పరిమితులు సహజంగానే వివిధ సరుకులకు గణనీయంగా మారుతుంటుంది. అంటే నేను చెప్పదల్చుకున్న దేమిటంటే గిరాకీ ఉన్న సరుకుల పరిమాణానికీ, ఇతర డబ్బు ధరలను లేక కొనుగోలుదార్ల ఇతర ధర, జీవన పరిస్థితులను బట్టి ఎంత పరిమాణం గల పత్తికి గిరాకీ ఉండి ఉండేదో, ఆ పరిమాణానికీ మధ్య తేడా గురించే నేనిక్కడ చెబుతున్నది.

గిరాకీ, సరఫరాల మధ్యగల వ్యత్యాసాలను, పర్యవసానంగా మార్కెట్‌ల విలువకూ మార్కెట్ ధరలకూ మధ్య ఏర్పడే తేడాలనూ అర్థం చేసుకోవడం అంత సులభమైనది మరొకటి లేదు. కాగా సరఫరా, గిరాకీల సమీకరణ అంటే ఏమిటనేది నిర్ణయించడమే నిజంగా కష్టమైన పని.

ఒక నిర్దిష్ట ఉత్పత్తి శాఖలోని మొత్తం సరుకులు సరిగ్గా వాటి మార్కెట్ విలువకన్నా ఎక్కువకు గానీ, తక్కువకు గానీ కాకుండా సరిగ్గా ఆ విలువకే అమ్ముడుపోయేందుకు అనువైన విధంగా సరఫరా, గిరాకీల పరస్పర నిష్పత్తి ఉన్నప్పుడు సరఫరా, గిరాకీలు ఏకీభవిస్తాయి. ఇది మనం వింటున్న మొదటి అంశం.

ఇక రెండవ అంశం ఇదీ : సరుకులు కనుక మార్కెట్ విలువలకు అమ్ముడుపోతే సరఫరా, గిరాకీలు ఏకీభవిస్తాయి.

సరఫరా, గిరాకీకి సమానంగా ఉన్నట్లయితే అవి పనిచేయడం ఆగిపోతుంది. ఈ కారణం చేతనే సరుకులు వాటి మార్కెట్ విలువలకు అమ్ముడుపోతున్నాయి. రెండు శక్తులు వ్యతిరేక దిశలలో సమానంగా పనిచేసినపుడు అవి ఒక దానిని మరొకటి సమతూకంలో ఉంచుతాయి. బయటి దేనిపైనా వాటి ప్రభావం ఉండదు. ఈ పరిస్థితిలో సంభవించే ఏ ఘటనకైనా ఈ రెండు శక్తుల ప్రభావం కాక

మరేవో కారణమని చెప్పవలసి ఉంటుంది. సరఫరా, గిరాకీలు ఒకదానిని మరొకటి సమతులనంలో ఉంచినట్లయితే ఇక అవి వేటికీ కారణభూతంగా ఉండవు. అవి మార్కెట్ విలువలను ప్రభావితం చేయవు. కాబట్టి మార్కెట్ విలువ ఫలానా మొత్తం డబ్బుగానే ఎందుకు వ్యక్తం అవుతున్నది? అందుకు భిన్నమైన మొత్తంగా ఎందుకు వ్యక్తం కావడం లేదు? – అన్న విషయానికి గల కారణాలు మనకు అయోమయంగా ఉంటాయి. పెట్టుబడిదారీ ఉత్పత్తి యొక్క నిజమైన ఆంతరిక నియమాలకు – సరఫరా, గిరాకీల పరస్పర ప్రతిచర్యను కారణంగా చెప్పలేమనేది స్పష్టమే; (ప్రస్తుతం సందర్భోచితం కాని ఈ రెండు సామాజిక చోదక శక్తుల తాలూకు ప్రగాఢ విశ్లేషణను అటుంచుదాం.) ఎందుచేతనంటే సరఫరా, గిరాకీలు పనిచేయడం మానుకుంటే తప్ప, అంటే అవి సమానంగా ఉన్నప్పుడు తప్ప ఈ నియమాలను వాటి పరిశుద్ధ స్థితిలో చూడలేము. వాస్తవంలో సరఫరా గిరాకీలు ఎన్నడూ ఏకీభవించవు. లేక అవి ఏకీభవించినట్లయితే అది కేలం యాదృచ్ఛికమే. యాదృచ్ఛికమైన దానికి ఎలాంటి శాస్త్రీయ ప్రాముఖ్యం లేదు. కాబట్టి అవి ఏకీభవించలేదని అనాలి. అయితే సరఫరా, గిరాకీలు ఒకదానితో మరొకటి ఏకీభవిస్తుందని రాజకీయ అర్థశాస్త్రం ఊహిస్తుంది. ఎందుకు? ఘటనలను వాటి మౌలిక సంబంధాలలో, వాటిని గురించిన భావనకు అనుగుణమైన రూపంలో అధ్యయనం చేయగల స్థితిలో ఉండడానికి, అంటే సరఫరా గిరాకీల చలనం వల్ల ఉత్పన్నమైన దృశ్యమాన విషయాలతో నిమిత్తం లేకుండా ఆ ఘటనలను అధ్యయనం చేయగలగడానికై శాస్త్రం అలా ఊహిస్తుంది. మరో కారణం, వాటి చలనాల వాస్తవ ధోరణులను కనుగొని, వాటిని కొంతమేరకు నమోదు చేయడం. ఈ వ్యత్యాసాలు విరుద్ధ స్వభావం కలవి కనుకనూ, అవి వరుసగా ఒకదాని వెంట మరొకటి సంభవిస్తాయి కనుకనూ – అవి తమ వ్యతిరేక చలనాల ద్వారా, తమ వైరుధ్యాల ద్వారా ఒకదానినొకటి సమతూకంలో ఉంచుతాయి. కాబట్టి ఏ నిర్దిష్ట పరిస్థితిలోనూ సరఫరా, గిరాకీలు ఎన్నడూ సమంగా ఉండనందువల్ల వాటి వ్యత్యాసాలు ఒకదాని తరువాత మరొకటి ఎలా వస్తుంటాయంటే – ఒక దిశలో సంభవించే ఒక వ్యత్యాసం వ్యతిరేక దిశలో మరొక వ్యత్యాసాన్ని సృష్టిస్తుంది. దీర్ఘకాలాన్ని పరిగణనలోకి తీసుకుని మొత్తంగా చూసినప్పుడు సరఫరా, గిరాకీలు ఎల్లప్పుడూ సమంగా ఉంటాయి. అయితే గతకాలపు చలనాల తాలూకు సగటుగా మాత్రమే, వాటి వైరుధ్యం తాలూకు నిరంతరాయ చలనంగా మాత్రమే అవి అలా సమస్థితిలో ఉంటాయి. ఈ విధంగా మార్కెట్ విలువలకు భిన్నంగా ఉండే మార్కెట్ ధరలు – పరస్పరం సర్దుబాటు చేసుకుని, వాటి సగటు సంఖ్యనుబట్టి చూసినప్పుడు మార్కెట్ విలువలకు సమానంగా తయారవుతాయి. అంటే మార్కెట్ విలువలకు భిన్నంగా ఉండే మార్కెట్ ధరలు ఒకదానిని మరొకటి ప్లస్, మైనస్‌లుగా రద్దు చేసుకోవడం ద్వారా మార్కెట్ విలువలకు సమానంగా తయారవుతాయి. పెట్టుబడి దృష్టిలో కేవలం సిద్ధాంత రీత్యానే కాక ఆచరణ రీత్యా కూడా ఈ సగటుకు ప్రాముఖ్యం ఉంది. ఎందువల్లనంటే, ఒక నిర్ణీత కాలంలోని హెచ్చుతగ్గుల, నష్టపరిహారాల ప్రాతిపదికపైన పెట్టుబడి మదుపును లెక్కగడతారు.

కాబట్టి, పరస్పర గిరాకీల పరస్పర సంబంధం, ఒకవైపు మార్కెట్ విలువలకూ మార్కెట్ ధరలకూ మధ్యన గల వ్యత్యాసాలకు కారణమవుతూంది. మరోవైపేమో ఈ వ్యత్యాసాలను నిర్మూలించే ధోరణికి, అంటే సరఫరా గిరాకీల సంబంధ ప్రభావాన్ని నిర్మూలించే ధోరణికి కూడా అదే కారణ భూతమవుతోంది. (ధర మాత్రమే కలిగి విలువ కలిగి ఉండని సరుకులు కొన్ని ఉన్నాయి. అలాంటి

మినహాయింపులను ఇక్కడ పరిశీలించడం లేదు.) సరఫరా, గిరాకీలు తమ మధ్య వ్యత్యాసం వల్ల కలిగే ఫలితాన్ని అవి అనేక పద్ధతుల్లో నిర్మూలించవచ్చు. ఉదాహరణకు, గిరాకీ, తత్ఫలితంగా మార్కెట్ ధర రెండూ పడిపోతే, పెట్టుబడిని పెట్టుబడిదారులు ఉపసంహరించుకోవచ్చు; పర్యవసానంగా సరఫరా తగ్గిపోతుంది. ఆవశ్యక శ్రమకాలాన్ని తగ్గించే శాస్త్రీయ పరికల్పనల ఫలితంగా మార్కెట్ విలువ పడిపోయి మార్కెట్ ధరకు సమానం కావచ్చు. ఇందుకు భిన్నంగా, గిరాకీ పెరిగి, దాని ఫలితంగా మార్కెట్ విలువను మించి మార్కెట్ ధర పెరిగితే, దీని పర్యవసానంగా ఆ ఉత్పత్తి శాఖలోకి పెట్టుబడి మరింత ఎక్కువ ప్రవహించవచ్చు. అప్పుడు మార్కెట్ విలువ కంటే కూడా తక్కువ స్థాయికి మార్కెట్ ధర పడిపోయేటంతగా ఉత్పత్తి అధికం కావచ్చు. లేదా దాని మూలంగా ధర పెరిగి గిరాకీ తగ్గడానికి అది దారితీయవచ్చు. లేదా, అది ధర పెరుగుదలకు దారితీసి, ఇది గిరాకీని తగ్గించవచ్చు. కొన్ని ఉత్పత్తి శాఖల్లో వాంఛిత ఉత్పాదితాల్లో కొంత భాగం ఈ దశలో ప్రతికూల పరిస్థితుల్లో ఉత్పత్తి చేయవలసి రావడంలో, కొద్దికాలం పాటు లేక దీర్ఘకాలం పాటు, ఇది మార్కెట్ విలువే పెరగడానికి దారితీయవచ్చు.

సరఫరా గిరాకీలు మార్కెట్ ధరను నిర్ధారిస్తాయి; అలాగే మార్కెట్ ధర, అంతిమ విశ్లేషణలో మార్కెట్ విలువ సరఫరా, గిరాకీలను నిర్ధారిస్తాయి. గిరాకీ విషయంలో ఇది స్పష్టమే. ఎందుచేతనంటే గిరాకీ, ధరలకు వ్యతిరేక దిశలో పయనిస్తుంది. ధరలు పడిపోయినప్పుడు అది పెరుగుతుంది, ధరలు పెరిగినప్పుడు అది పడిపోతుంది. అయితే సరఫరాకు కూడా ఇదే వర్తిస్తుంది. ఎందుచేతనంటే అమ్మజూపే సరుకుల్లోని ఉత్పత్తి సాధనాల ధరలు ఆ ఉత్పత్తి సాధనాలకు గిరాకీని నిర్ధారిస్తాయి. సరుకుల సరఫరాలో ఈ ఉత్పత్తి సాధనాలకు గిరాకీ ఇమిడి ఉన్నందువల్ల ఆ సరుకుల సరఫరాను కూడా ఈ ఉత్పత్తి సాధనాల ధరలు నిర్ధారిస్తాయి. పత్తి ధరలు నూలు వస్త్రాల ధరలను నిర్ణయిస్తాయి.

గిరాకీ సరఫరాల – ద్వారా ధరలు నిర్ధారింపబడతాయి; అదే సమయంలో ధరల ద్వారా సరఫరా గిరాకీలు నిర్ధారింపబడతాయి అనే ఈ గందరగోళానికి తోడుగా మరో గందరగోళాన్ని కూడా చేర్చాలి; అదేమిటంటే – సరఫరా, గిరాకీని నిర్ధారించినట్లే గిరాకీ, సరఫరాను నిర్ధారిస్తుంది. అలాగే ఉత్పత్తి, మార్పెట్‌ను నిర్ధారిస్తుంది; అదే విధంగా మార్కెట్టేమో ఉత్పత్తిని[1] నిర్ధారిస్తుంది.

బాహ్య పరిస్థితుల ద్వారా గిరాకీలో లేదా సరఫరాలో మార్పు రానప్పుడు సరుకుల తాలూకు మార్కెట్ విలువలో మార్పు వచ్చిన ఫలితంగా సరఫరా గిరాకీల మధ్య నిష్పత్తిలో మార్పు రావచ్చునని

1. కింది వివరణలోని చమత్కారానికి అర్థం పర్థం లేదు. "ఒక వస్తువును ఉత్పత్తి చేయడానికి అవసరమైన వేతనాల పెట్టుబడి, భూమి పరిమాణాలు, మునుపున్న వాటికి భిన్నంగా వున్న సందర్భంలో, ఆ వస్తువు సహజ ధరగా ఆడమ్ స్మిత్ పేర్కొనేది కూడా భిన్నంగా వుంటుంది. మునుపు ఆ వస్తువు సహజ ధరగా వుండిన ఆ ధర, ఈ మార్పుకు సంబంధించి దాని మార్కెట్ ధర అవుతుంది. ఎందువల్లనంటే, సరఫరా కానీ, అవసరమైన పరిమాణం కానీ మారకుండా వుండే వీలున్నప్పటికీ" (ఇక్కడ రెండూ మారతాయి. ఎందువల్లనంటే, మార్కెట్ విలువ లేక ఆడమ్ స్మిత్ మార్కెట్లో ఉత్పత్తి ధర విలువ మార్పు ఫలితంగా మారుతుంది.) "ఇప్పుడు ఆ సరఫరా, ఇప్పటిదాని ఉత్పత్తి ధరను చెల్లించగలిగిన, చెల్లించడానికి సిద్ధంగా వున్న వారికి సరిగ్గా సరిపోదు. అంతకన్నా ఎక్కువగానైనా వుంటుంది లేదా తక్కువగానైనా వుంటుంది. ఫలితంగా సరఫరాకూ, కొత్త ఉత్పత్తి ధరననుసరించి వుండే సార్థక గిరాకీకీ మధ్య నిష్పత్తి మునుపున్న నిష్పత్తికి భిన్నంగా వుంటుంది. అప్పుడు, సరఫరా రేటు మారడానికి ఎటువంటి ఆటంకమూ లేనట్లయితే,

మామూలు అర్థశాస్త్రవేత్త కూడా (పాదపీఠిక చూడండి) అంగీకరిస్తాడు. మార్కెట్ విలువ ఏదైనప్పటికీ అది నిర్ధారింపబడాలంటే సరఫరా, గిరాకీలు ఏకీభవించాలని అతడు సైతం అంగీకరించి తీరుతాడు. ఇంకో విధంగా చెప్పాలంటే గిరాకీకి, సరఫరాకు మధ్య నిష్పత్తి మార్కెట్ విలువకు కారణం కాదు సరికదా మార్కెట్ విలువే సరఫరా, గిరాకీల హెచ్చుతగ్గులకు కారణభూతమవుతుంది. 'అబ్జర్వేషన్స్' రచయిత పాదపీఠికలో ఉటంకించిన వాక్యాల తర్వాత ఇలా అంటారు : "అయితే, ఆడమ్ స్మిత్‌ను ప్రస్తావిస్తున్న సందర్భంగా 'గిరాకీ' 'సహజ ధర' అనే పదాలకు మనం అనుకొన్న అర్థాలే వాటికి ఉన్నట్లు ఇప్పటికీ అనుకొన్న పక్షంలో ఈ నిష్పత్తి (గిరాకీ, సరఫరాల మధ్య నిష్పత్తి) ఎల్లప్పుడూ సమాన నిష్పత్తిగానే ఉంటుంది. ఎందుచేతనంటే, సార్థక గిరాకీ, సరఫరా సమానంగా ఉన్నప్పుడే అంటే, సహజ ధరకు ఎక్కువగా కానీ, తక్కువగా కానీ చెల్లించినట్టి గిరాకీకి, సరఫరా సమానంగా ఉన్నప్పుడే వాస్తవానికి సహజ ధర చెల్లించినట్లవుతుంది. ఫలితంగా ఒకే సరుకుకు విభిన్న సమయాల్లో విభిన్న సహజ ధరలు ఉన్నప్పటికీ గిరాకీకి, సరఫరాకు మధ్య నిష్పత్తి రెండు సందర్భాల్లోనూ ఒకే విధంగా ఉండవచ్చు. అంటే సమాన నిష్పత్తి ఉంటుంది." కాబట్టి విభిన్న సమయాల్లో ఒకే సరుకుకు రెండు విభిన్న సహజ ధరలున్నప్పుడు, రెండు సందర్భాల్లోనూ సరుకు దాని సహజ ధరకు అమ్ముడు పోవాలంటే గిరాకీ, సరఫరాలు ఎల్లప్పుడూ విధిగా ఒకదాని కొకటి సమతులనంగా ఉండక తప్పదని అంగీకరిస్తున్నారన్నమాట. రెండు సందర్భాల్లోనూ గిరాకీకి, సరఫరాకు మధ్య నిష్పత్తిలో తేడా లేదు, కానీ సహజ ధర పరిమాణంలో తేడా ఉంది. కనుక ఈ ధర గిరాకీ, సరఫరాలతో నిమిత్తం లేకుండా నిర్ణయమవుతూందనీ, ఆ విధంగా వాటివల్ల అది నిర్ధారణ కాదనీ తేలుతూంది.

ఏదైనా ఒక సరుకు దాని మార్కెట్ విలువకు అమ్ముడుపోవాలంటే, అంటే ఆ సరుకులో మూర్తీభవించి ఉన్న ఆవశ్యక సామాజిక శ్రమకు అనుగుణమైన నిష్పత్తిలో అమ్ముడుపోవాలంటే, ఆ సరుకును మొత్తంగా ఉత్పత్తి చేయడానికి వినియుక్తమయిన సామాజిక శ్రమ మొత్తం తప్పనిసరిగా ఆ సరుకుకు గల సామాజిక అవసరం యొక్క పరిమాణానికి, అంటే సార్థక సామాజిక అవసర పరిమాణానికి అది అనుగుణంగా ఉండాలి. పోటీ, గిరాకీ, సరఫరాల హెచ్చుతగ్గులకు అనుగుణంగా ఉండే మార్కెట్ ధరల హెచ్చుతగ్గులు, ఇవి నిరంతరం ప్రతిరకం సరుకుకూ కేటాయించిన సామాజిక

ఆ రేటులో మార్పు వచ్చి, తుదకు ఆ సరుకును దాని సహజ ధరకు తీసుకొస్తుంది. సరుకు సరఫరా మార్పు వల్ల అది తన సహజ ధరనందుకొంటుంది. కనుక, సరుకు మార్కెట్ ధరకు గిరాకీ, సరఫరాల మధ్య ఒక నిష్పత్తి కారణమైనట్లే సరుకు సహజ ధరకు గిరాకీ, సరఫరాల మధ్య మరో నిష్పత్తి కారణమనీ, ఫలితంగా, మార్కెట్ ధరలలానే సహజధర కూడా గిరాకీ, సరఫరాల మధ్య నిష్పత్తిపై ఆధారపడి వుంటుందనీ కొందరు చెప్పడం బాగున్నట్లే కనిపిస్తుంది." ("ఎ. స్మిత్ సహజ ధరలనూ, మార్కెట్ ధరలనూ పేర్కొనే వాటిని నిర్ణయించడానికి గిరాకీ, సరఫరాల గురించిన మహానియమాన్ని రంగంలోకి తీసుకొస్తున్నారు" - మాల్తస్) (ప్రిన్సిపుల్స్ ఆఫ్ పొలిటికల్ ఎకానమీ, లండన్, 1820, పుట 75 - సం) (అబ్జర్వేషన్స్ ఆన్ సర్టన్ వర్బల్ డిస్ప్యూట్స్ ఎట్‌సెట్రా, లండన్, 1821, పుటలు 60-61) ఈ అమాయకుడు ఒక వాస్తవం గ్రహించడం లేదు. ఉత్పత్తి ధరలో మార్పే, అంటే విలువలో మార్పే గిరాకీలో మార్పుకు కారణమయింది. ప్రస్తుత సందర్భంలో, ఆ విధంగా గిరాకీ, సరఫరాల మధ్య నిష్పత్తికి కారణమయింది; గిరాకీలో ఈ మార్పు సరఫరాలో మార్పును తేవచ్చు. దీనివల్ల, మన మనిషి రుజువు చేయదలచుకొన్న దానికి సరిగ్గా వ్యతిరేకమైనది రుజువవుతూంది. దీన్నిబట్టి ఉత్పత్తి ధరలో మార్పుకు గిరాకీ, సరఫరాల నిష్పత్తిలో మార్పు కారణం కాదనీ, పైపెచ్చు ఉత్పత్తి ధరలో మార్పే ఈ నిష్పత్తిని క్రమబద్ధం చేస్తుందనీ రుజువవుతుంది.

శ్రమ పరిమాణాన్ని ఈ స్థాయికి తీసుకురావడానికి చూస్తుంటాయి.

మొదటి విషయం, సరఫరా, గిరాకీల మధ్య నిష్పత్తి మార్పిడి విలువకూ ఉపయోగ విలువకూ మధ్య సంబంధాన్ని, డబ్బుకూ సరుకుకూ మధ్య సంబంధాన్ని, కొనుగోలుదారుకు అమ్మకందారుకు మధ్య సంబంధాన్ని పునరావృత్తం చేస్తుంది. ఆ తర్వాత వినియోగదారునికీ ఉత్పాదకునికీ మధ్య సంబంధాన్ని పునరావృత్తం చేస్తుంది. వీరిద్దరికీ మూడవ పక్షం అంటే వ్యాపారులు ప్రాతినిధ్యం వహించినప్పటికీ జరిగేది ఇదే. కొనుగోలుదారునూ, అమ్మకందారునూ పరిశీలించే సందర్భంగా వారి మధ్య గల సంబంధాన్ని చిత్రించడానికి వారిని వ్యక్తిగతంగా ఎదురుబొదురుగా నిలిపితే చాలు. ఒక సరుకు యొక్క సంపూర్ణ రూపాంతరీకరణకు ముగ్గురు వ్యక్తులు సరిపోతారు. అంటే మొత్తం అమ్మకం, కొనుగోలు ప్రక్రియ పూర్తికావడానికి ముగ్గురు వ్యక్తులు చాలు. 'క' అనే వ్యక్తి తన సరుకును అమ్మినపుడు 'ఖ' అనే వ్యక్తి సంబంధిత డబ్బుగా మార్చుకొంటాడు. 'గ' నుంచి సరుకులు కొనడానికి అతడు ఆ డబ్బును వినియోగించినప్పుడు ఆ డబ్బును తిరిగి సరుకులుగా మార్చుకొంటాడు. ఈ మొత్తం ప్రక్రియ అంతా ముగ్గురు వ్యక్తుల మధ్యే సాగుతుంది. అంతేకాదు, సరుకులు వాటి విలువలకే అమ్మకమవుతాయని డబ్బు గురించిన అధ్యాయంలో ఊహించాం. ఎందువల్లనంటే సరుకులు డబ్బుగా పరివర్తన చెంది డబ్బు నుంచి సరుకులుగా తిరిగి పరివర్తన చెందినపుడు ఇదంతా కేవలం రూపపరివర్తనే కనుక; ధరలకూ, విలువకూ మధ్య తేడా ఉంటుందని అనుకోవడానికి బొత్తిగా ఎటువంటి కారణమూ లేదు. ఒక సరుకును అమ్మి, అమ్మగా వచ్చిన డబ్బుతో కొత్త సరుకును కొనగానే మనకు మొత్తం రూపాంతరీకరణ ప్రత్యక్షమవుతుంది. సరుకు ధర తన విలువ కంటే ఎక్కువగా ఉందా తక్కువగా ఉందా అన్న విషయంతో ఈ ప్రక్రియకు ఎలాంటి సంబంధమూ లేదు. సరుకు యొక్క విలువ ఒక పునాదిగా ప్రాముఖ్యం వహిస్తూనే ఉంటుంది. ఎందుచేతనంటే, డబ్బు భావనను మరే ఇతర పునాది పైనా రూపొందించలేము. ధర అంటే దాని సాధారణ అర్థంలో డబ్బు రూపంలోని విలువ మాత్రమే. ఏది ఏమైనా, చలామణి మాధ్యమంగా డబ్బును అధ్యయనం చేసిన సందర్భంగా ఏ సరుకుకైనా ఒకే రూపాంతరీకరణ ఉండదని భావించాం. ఏమైనా మనం అధ్యయనం చేసింది, ఈ రూపాంతరీకరణల యొక్క సామాజిక పరస్పర సంబంధాలనే. ఈ విధంగా మాత్రమే డబ్బు చలామణిని, చలామణి మాధ్యమంగా దాని కర్తవ్య క్రమాభివృద్ధినీ అర్థం చేసుకోగలం. డబ్బు – చలామణి సాధనంగా పరివర్తన చెందడంలోనూ, ఫలితంగా రూపంలో కలిగే మార్పులోనూ ఈ పరస్పర సంబంధానికి ప్రాముఖ్యం ఉన్నప్పటికీ, వ్యక్తిగత కొనుగోలుదార్ల, అమ్మకందార్ల మధ్య జరిగే లావాదేవీల విషయంలో దీనికి ప్రాముఖ్యం లేదు.

అయితే, సరఫరా, గిరాకీల విషయంలో, సరఫరా అన్నది ఒక రకం సరుకు తాలూకు అమ్మకందార్ల మొత్తానికి లేక ఉత్పాదకుల మొత్తానికి సమంగా ఉంటుంది. కాగా గిరాకీ అన్నది అదే సరుకు తాలూకు కొనుగోలుదార్ల లేక వినియోగదార్ల మొత్తానికి (ఉత్పాదక వినియోగదార్లు, వ్యక్తిగత వినియోగదార్లు కూడా) సమానంగా ఉంటుంది. ఈ మొత్తాలు యూనిట్లుగా, రాశీభూత శక్తులుగా పరస్పరం ప్రతిస్పందిస్తాయి. ఇక్కడ వ్యక్తులు కేవలం సామాజిక శక్తిలో ఒక భాగంగా మాత్రమే, మొత్తం ద్రవ్యరాశిలోని అణువుగా మాత్రమే పరిగణింపబడతారు. ఉత్పత్తి, వినియోగాల తాలూకు సామాజిక స్వభావాన్ని పోటీ అన్నది బయటకు తెచ్చేది ఈ రూపంలోనే.

పోటీలో తాత్కాలికంగా బలహీనంగా ఉండే పక్షం ఏదంటే స్వతంత్రంగా తన పోటీదార్లతో నిమిత్తం లేకుండా తరచుగా తన పోటీదార్లకు వ్యతిరేకంగా వ్యవహరించే వ్యక్తి ఉన్న పక్షమే. (తాము ఒకరిపై ఒకరం ఆధారపడి ఉన్నామనే విషయం వారి మనసుపై హత్తుకొనేది ఈ విధంగానే.) ఈ క్రమంలో ఎక్కువ బలంగా ఉండే పక్షం తన ప్రత్యర్థికి వ్యతిరేకంగా దాదాపు, ఐక్యశక్తిగా వ్యవహరిస్తుంది. ఈ నిర్దిష్ట సరుకుకు గిరాకీ, సరఫరా కంటే ఎక్కువ ఉన్నట్లయితే, కొన్ని పరిమితుల్లో ఒక కొనుగోలుదారుడు, మరో కొనుగోలుదారుని కంటే ఎక్కువ ధరపెట్టిన సరుకు కొంటాడు. ఆ విధంగా ఆ సరుకు ధర కొనుగోలుదార్లందరికీ మార్కెట్ విలువకంటే ఎక్కువ స్థాయికి పెరుగుతుంది. మరోవైపేమో అమ్మకందార్లు ఎక్కువ మార్కెట్ ధరకు అమ్మడానికి చేసే ప్రయత్నంలో అంతా ఐక్యమవుతారు. అలా కాకుండా సరఫరా డిమాండ్‌ను మించినట్లయితే, ఒకడు తన సరుకులను ఇతరులకన్నా చౌకగా అమ్మడం ప్రారంభిస్తాడు. ఇతరులంతా అతన్ని అనుసరించక తప్పదు. అప్పుడు కొనుగోలుదార్లు, మార్కెట్ ధరను మార్కెట్ విలువకంటే సాధ్యమయినంత తక్కువ స్థాయికి దిగజార్చడానికి సమైక్యంగా ప్రయత్నిస్తారు. ప్రతి వ్యక్తీ ఉమ్మడి ప్రయోజనంలోని మేలును గుర్తించేది, దానివల్ల అది లేనప్పటికన్నా ఎక్కువ లాభం పొందుతున్నంత కాలమే. ఒక పక్షం ఇతర పక్షంకన్నా బలహీనమయిన మరుక్షణంలో ఈ ఐక్య కార్యాచరణ ఆగిపోతుంది. ప్రతి ఒక్కడూ సాధ్యమయినంత లాభదాయకంగా ఈ స్థితినుంచి బయటపడేందుకు తనకు తాను ప్రయత్నిస్తాడు. కాగా ఎవరైనా ఒకరు చౌకగా ఎక్కువ ఉత్పత్తి చేసి ఎక్కువ సరుకులను అమ్ముకోగలిగితే, ఆ విధంగా అప్పుడున్న మార్కెట్ ధరకంటే లేదా మార్కెట్ విలువకంటే తక్కువకు అమ్మడం ద్వారా అతడు మార్కెట్‌లో మరింత బలీయమైన స్థానాన్ని ఆక్రమించ గలిగితే అతను అలా చేస్తాడు. తద్వారా అతడు మిగతా వ్యక్తులను కూడా క్రమేణా, మరింత చౌకగా జరిగే ఉత్పత్తి విధానాన్ని సామాజికంగా అవసరమైన శ్రమ, ఒక కొత్త – మరింత తక్కువ స్థాయికి తగ్గించే ఉత్పత్తి విధానాన్ని అమలుపరచాల్సిన ఒత్తిడికి గురిచేసిన వాడవుతాడు. ఒక పక్షానికి ప్రయోజనం చేకూరేటట్లయితే ఆ పక్షానికి చెందిన వ్యక్తులందరూ లాభపడతారు. అది వారు తమ ఉమ్మడి గుత్తాధిపత్యాన్ని చలాయించినట్లవుతుంది. కాగా ఒక పక్షం బలహీనంగా ఉన్నట్లయితే ఆ పక్షానికి చెందిన ప్రతి వ్యక్తీ ఏదో విధంగా స్వశక్తితోనే బలపడడానికి ప్రయత్నిస్తాడు, (ఉదాహరణకు తక్కువ ఉత్పత్తి వ్యయంతో పనిచేసే వ్యక్తి) లేదా కనీసం సాధ్యమైనంత తక్కువ నష్టంతో బయటపడడానికి ప్రయత్నిస్తాడు. తన చర్య ద్వారా తనకే కాక తన సహచరులకందరికీ కూడా నష్టం కలిగించినప్పటికీ ఇటువంటి సందర్భాల్లో ప్రతి ఒక్కడూ ఎవరికి వారే యమునా తీరే అన్న చందంగా వ్యవహరిస్తాడు.[1]

గిరాకీ, సరఫరాల్లో 'విలువ' మార్కెట్ విలువగా పరివర్తన (ప్రక్రియ) అంతర్లీనంగా ఉంది.

1. "ఒక వర్గానికి చెందిన ప్రతి వ్యక్తికీ మొత్తం లాభాల్లో తన వాటాకంటే కానీ, అందులోని సమ విభజిత భాగంకంటే కానీ ఎక్కువ దక్కే అవకాశమే లేనట్లయితే, లాభం పెంచడానికి, తక్కిన వారితో చేతులు కలపడానికి అతడు వెంటనే సిద్ధపడతాడు." (సరఫరాకూ డిమాండ్‌కూ మధ్య నిష్పత్తి ఇందుకు వీలు కల్పించగానే అతడు అలా చేస్తాడు.) "ఇది గుత్తాధిపత్యం. అయితే మొత్తం లాభాన్ని తగ్గించే ప్రక్రియ ద్వారా అయినా సరే అందులోని తన సొంత వాటా నిరపేక్ష మొత్తాన్ని పెంచుకోగలనని ప్రతి వ్యక్తీ భావించినట్లయితే, అతడా పని తరచుగా చేస్తాడు; ఇది పోటీ" (యాన్ ఎంక్వయిరీ ఇంటు దోస్ ప్రిన్సిపుల్స్ రెస్పెక్టింగ్ ది నేచర్ ఆఫ్ డిమాండ్, లండన్, 1821, పుట 105)

అవి పెట్టుబడిదారీ ప్రాతిపదికపై సాగినంతవరకూ, సరుకులన్నవి పెట్టుబడి తాలూకు ఉత్పాదితాలుగా ఉన్నంతవరకూ పెట్టుబడిదారీ ఉత్పత్తి ప్రక్రియలు వాటికి ప్రాతిపదికగా ఉంటాయి. అంటే కేవలం వస్తువుల కొనుగోలు, అమ్మకం కాక ఇతరేతర సంబంధాలు వాటికి ప్రాతిపదికగా ఉంటాయి. ఇక్కడ ఇది సరుకుల విలువ ధరలుగా లాంఛనప్రాయంగా మార్పుచెందే సమస్య కాదు. అంటే కేవలం రూపంలోని మార్పే కాదు. మార్కెట్ ధరలు మార్కెట్ విలువల నుంచి, అంతేకాక ఉత్పత్తి ధరల నుంచి ఖచ్చితమైన పరిమాణాల్లో వైదొలగడానికి సంబంధించిన సమస్య ఇది. వట్టి కొనుగోలు, అమ్మకం ప్రక్రియకైతే సరుకుల ఉత్పాదకులు ఎదురుబదురుగా ఉంటే చాలు. మరింత విశ్లేషిస్తే తేలేదేమంటే, సమాజం యొక్క మొత్తం ఆదాయాన్ని పంచుకుని, తమలో తాము వినియోగించుకొనే వివిధ వర్గాలు, వర్గ విభాగాలున్నాయనీ, కాబట్టి ఆదాయం సృష్టించిన గిరాకీ ఈ వర్గాల నుంచే వస్తున్నదనీ, గిరాకీ సరఫరాల్లో గర్భితం. మరోవైపేమో, ఉత్పాదకులు తమ మధ్య సృష్టించుకున్న సరఫరా, గిరాకీలను అవగాహన చేసుకోవాలంటే పెట్టుబడిదారీ ఉత్పత్తి తాలూకు సమగ్ర నిర్మాణాన్ని సూక్ష్మంగా పరిశీలించాల్సిన అవసరం ఉంది. పెట్టుబడిదారు ఉత్పత్తి విధానంలో అసలు సమస్య, చలామణిలోకి సరుకు రూపంలో ప్రవేశపెట్టిన విలువల పరిమాణానికి ప్రతిగా డబ్బు రూపంలో కానీ లేదా మరో సరుకు రూపంలో కానీ అదే పరిమాణంలో గల విలువను రాబట్టడం గురించినది మాత్రమే కాదు. ఏ శాఖలోనైనా సరే ఉత్పత్తి కోసం అడ్వాన్సు చేసిన పెట్టుబడిపై, అదే పరిమాణం గల ఏ ఇతర పెట్టుబడిపైనైనా సరే అందినంత అదనపు విలువను, అదనపు లాభాన్ని లేదా దాని పరిమాణానికి అనుగుణంగా అందినంత అదనపు విలువను లేదా లాభాన్ని చేతికందేలా చూడటమే సమస్య. కాబట్టి అసలు విషయం ఏమిటంటే, కనీసం సగటు లాభాన్ని తెచ్చే ధరలకు అంటే ఉత్పత్తి ధరలకు సరుకులను అమ్మడమన్నమాట. ఈ రూపంలో పెట్టుబడికి తాను ఒక సామాజిక శక్తి అనే చైతన్యం కలుగుతుంది. ఈ సామాజిక శక్తిలో ప్రతి పెట్టుబడిదారూ మొత్తం సామాజిక పెట్టుబడిలో తన భాగానికి అనుగుణమైన నిష్పత్తిలో పాల్గొంటాడు.

మొదటిది : తాను ఉత్పత్తి చేసే సరుకు యొక్క ఉపయోగ విలువ ఏమిటి? దాని విశిష్ట లక్షణాలేమిటి? అనే విషయమై పెట్టుబడిదారీ ఉత్పత్తి పట్టించుకోదు. ప్రతి ఉత్పత్తి శాఖలోనూ అదనపు విలువ సృష్టించడంలోనే, శ్రమ ఉత్పాదితంలో మూర్తీభవించి ఉన్న చెల్లించబడని శ్రమలోని కొంత మొత్తాన్ని స్వాయత్తం చేసుకోవడంలోనే దాని ఆసక్తి అంతా. అదేవిధంగా పెట్టుబడికి లోనైన వేతన శ్రమ స్వభావమేమిటంటే, అది తన శ్రమ ప్రత్యేక లక్షణం గురించి పట్టించుకోదు. పెట్టుబడి అవసరాలకు అనుగుణమైన మార్పు చెందడానికీ, ఒక ఉత్పత్తి శాఖ నుంచి మరో ఉత్పత్తి శాఖకు బదలాయించబడడానికి సిద్ధంగా ఉండక తప్పదు.

ఇక రెండో విషయం ఏమంటే అన్ని ఉత్పత్తి శాఖలు బాగోగుల విషయంలో ఒకటే. ప్రతి శాఖ ఇచ్చే లాభం ఒకటే. ఉత్పత్తి చేసే సరుకులు గనుక ఏదో ఒక సామాజిక ఆవశ్యకతను తీర్చని పక్షంలో ప్రతి ఉత్పత్తి శాఖ నిరుపయోగమవుతుంది.

సరుకులు గనుక తమ విలువలకు అమ్మకమయితే, మనం ఇంతకు ముందే నిరూపించినట్లు, మదుపు చేసిన విభిన్న పెట్టుబడుల మొత్తాల అంతర్నిర్మాణాన్ని బట్టి వివిధ ఉత్పత్తి శాఖల్లో విభిన్న

లాభం రేట్లు తలెత్తుతాయి. అయితే పెట్టుబడి తక్కువ లాభం రేటు లభించే శాఖను వదలుకొని ఎక్కువ లాభం రేటు లభించే ఇతర శాఖల్లోకి జొరబడుతుంది. లాభం రేట్లు ఒకచోట పెరగడం, మరోచోట తరగడం ఎలా జరుగుతూందనే దాన్నిబట్టి కొనసాగే నిరంతరాయమైన ఈ ఉపసంహరణ జొరబాట్ల మూలంగా ఒక్కమాటలో ఇలా పంపిణీ కావడం మూలంగా, అది సరఫరా, గిరాకీల మధ్య ఎలాంటి నిష్పత్తిని సృష్టిస్తుందంటే, వివిధ ఉత్పత్తి శాఖల్లోని సగటు లాభం ఒకే విధంగా ఉంటుంది. కాబట్టి ఆ మేరకు విలువలు ఉత్పత్తి ధరలుగా పరివర్తన చెందుతాయి. ఆయా దేశాలలో పెట్టుబడిదారీ విధానం ఏ మేరకు అభివృద్ధి చెందిందనే దాన్నిబట్టి, అంటే ఆ దేశంలోని పరిస్థితులను పెట్టుబడిదారీ విధానానికి అనువుగా ఏమేరకు మలచారనే దాన్నిబట్టి పెట్టుబడి ఈ సమానీకరణను తరతమ స్థాయిల్లో సాధించగలుగుతుంది. పెట్టుబడిదారీ ఉత్పత్తి పురోగమనంతో, పెట్టుబడి కూడా తన సొంత పరిస్థితులను అభివృద్ధిపరచుకొంటుంది. ఉత్పత్తి ప్రక్రియకు ఆధారభూతమైన అన్ని సామాజిక ఆవశ్యకతలను తన ప్రత్యేక స్వభావానికీ, తన సహజ నియమాలకూ లోనై ఉండేలా చేస్తుంది.

1. పెట్టుబడి ఎంత చలనశీలమైనదైతే, అంటే దాన్ని ఒక శాఖ నుంచి మరో శాఖకు, ఒక స్థలం నుంచి మరో స్థలానికి ఎంత తేలిగ్గా తరలించ వీలైతే; 2) శ్రమ శక్తిని, ఒక ఉత్పత్తి రంగం నుంచి మరో ఉత్పత్తి రంగానికి, ఒక ఉత్పత్తి స్థలం నుంచి మరో ఉత్పత్తి స్థలానికి ఎంత త్వరగా బదలాయించ వీలైతే, నిరంతర వ్యత్యాసాల సమానీకరణ అంత త్వరగా జరుగుతుంది. సమాజంలో పూర్తిగా స్వేచ్ఛా వ్యాపారం, సహజసిద్ధమైనవి తప్ప మిగతా అన్ని గుత్తాధిపత్యాల తొలగింపు మొదటి షరతులో సూచితం. సహజసిద్ధమైనవి అంటే పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం నుంచి ఉత్పన్నమైనవని అర్థం. అభివృద్ధి చెందిన పరపతి వ్యవస్థ కూడా మొదటి షరతులో సూచితం. వ్యష్టి పెట్టుబడిదారునికి ముఖాముఖిగా వినియోగార్హమైన పాదార్థిక పెట్టుబడిని ఇలాంటి పరపతి వ్యవస్థ కేంద్రీకరిస్తుంది. చివరి విషయం, వివిధ ఉత్పత్తి శాఖలు పెట్టుబడిదారుల నియంత్రణకు లోబడి ఉంటాయని కూడా ఈ షరతులో సూచితం. ఈ విషయం మనం ఊహించుకొన్న ఆధారాల్లో చేరినదే. ఎందువల్లనంటే, ఇది పెట్టుబడిదారీ పద్ధతికి లోనైన అన్ని ఉత్పత్తి శాఖల్లోనూ, విలువలు ఉత్పత్తి ధరలుగా మారేందుకు సంబంధించిన వ్యవహారమని మనం ఊహించుకొన్నాం. పెట్టుబడిదారీ ప్రాతిపదికపై నిర్వహించబడని అనేక భారీ ఉత్పత్తి శాఖలు (చిన్న రైతుల వ్యవసాయం లాంటివి) గనుక పెట్టుబడిదారీ సంస్థల మధ్య చోటుచేసుకొని వాటితో లంకె ఏర్పరచుకుంటే ఈ సమానీకరణకే పెద్ద అవరోధాలు ఎదురవుతాయి. మరో ఆవశ్యకత ఏమిటంటే, జన సాంద్రత ఎక్కువగా ఉండాలి. ఇక రెండవ షరతులో సూచితమైన దేమిటంటే – ఒక ఉత్పత్తి శాఖ నుంచి మరో ఉత్పత్తి శాఖకు, ఒక ఉత్పత్తి స్థలం నుంచి మరో ఉత్పత్తి స్థలానికి, కార్మికులు మారకుండా నిరోధించే అన్ని చట్టాలు రద్దు. తన శ్రమ స్వభావం పట్ల కార్మికుల ఉపేక్ష. అన్ని ఉత్పత్తి శాఖల్లోనూ శ్రమ సామాన్యమైన శ్రమగా రూపొందడం. వృత్తులకు సంబంధించి కార్మికుల్లో ఉన్న అపోహలన్నీ తొలగిపోయి ఉండటం. ఆఖరుదైనా, పైవాటంతటి ముఖ్యమైనది, కార్మికుడు పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానానికి లోనై ఉండటం. దీన్ని గురించిన ఇతర విషయాలు పోటీకి సంబంధించిన ప్రత్యేక విశ్లేషణ కిందికి చేరతాయి.

పైన చెప్పిన దాన్నిబట్టి తేలుతున్నదేమిటంటే – ప్రతి ఉత్పత్తి శాఖలోనూ వ్యష్టి పెట్టుబడిదారుడూ, అలాగే మొత్తంగా పెట్టుబడిదారులూ, మొత్తం కార్మికవర్గాన్ని మొత్తం పెట్టుబడి చేసే దోపిడీలో, ఆ

దోపిడీ స్థాయిలో ప్రత్యక్షంగా పాల్గొంటారు. దీనికి కారణం వారి వర్గ పరస్పరానుబంధమే కాదు, ప్రత్యక్ష ఆర్థిక కారణాలు కూడా ఉన్నాయి. ఎందుచేతనంటే, అడ్వాన్సు చేసిన మొత్తం స్థిర పెట్టుబడితో సహా ఇతర పరిస్థితులన్నీ నిర్ణీతమై ఉన్నట్లయితే, మొత్తం పెట్టుబడి – మొత్తం శ్రమను దోపిడీ చేసే తీవ్రతపై సగటు లాభం రేటు ఆధారపడి ఉంటుంది.

ప్రతి 100 పెట్టుబడికీ ఉత్పత్తి అయ్యే సగటు అదనపు విలువతో సగటు లాభం ఏకీభవిస్తుంది; ఇక అదనపు విలువకు సంబంధించి, పైన చేసినవన్నీ సహజంగానే వర్తిస్తాయి. సగటు లాభం విషయంలో లాభం రేటును నిర్ధారించే మరో అదనపు అంశం అడ్వాన్సు చేసిన పెట్టుబడి యొక్క విలువ. ఏ వ్యష్టి ఉత్పత్తి శాఖకు చెందిన పెట్టుబడిదారుడైనా లేక పెట్టుబడి అయినా ప్రత్యక్షంగా నియుక్తమైన కార్మికుల దోపిడీలో వ్యక్తం చేసే ఆసక్తి కేవలం అదనపు లాభానికి అంటే సగటుకు మించిన లాభానికి పరిమితమై ఉంటుంది. మామూలుకన్నా ఎక్కువ పని చేయించడం ద్వారా కానీ లేక వేతనాలను సగటు కంటే తగ్గించడం ద్వారా కానీ లేక నియుక్తమైన కార్మికుల ఉత్పాదకతను పెంచడం ద్వారా కానీ ఈ అదనపు లాభం పొంద జూస్తాడు. ఇంతేకాదు తన ఉత్పత్తి శాఖలో ఏ మాత్రమూ అస్థిర పెట్టుబడిని పెట్టని పెట్టుబడిదారు కూడా అంటే ఒక కార్మికుని కూడా నియమించని (వాస్తవంలో ఇది అతిశయోక్తితో కూడిన ఊహ) పెట్టుబడిదారునికి సైతం అస్థిర పెట్టుబడిని మాత్రమే పెట్టే (మరో అతిశయోక్తి) పెట్టుబడిదారునికి – అంటే తన మొత్తం పెట్టుబడిని వేతనాల రూపంలోనే పెట్టే పెట్టుబడిదారునికి, పెట్టుబడిచే కార్మికవర్గ దోపిడీపై ఉన్నంత ఆసక్తే ఉంటుంది. చెల్లించని అదనపు శ్రమ నుంచి అతనంత లాభం పొందుతాడు! కానీ శ్రమ దోపిడీ స్థాయి అన్నది శ్రమ దినం నిర్ణీతమైనప్పుడు శ్రమ సగటు తీవ్రతపై ఆధారపడి ఉంటుంది. దోపిడీ తీవ్రత నిర్ణీతమైనప్పుడు శ్రమదిన పరిమాణంపై ఆధారపడి ఉంటుంది. అదనపు విలువ రేటును శ్రమ దోపిడీ స్థాయి నిర్ధారిస్తుంది. కనుక నిర్ణీత పరిమాణంలోని అస్థిర పెట్టుబడికి అదనపు విలువ పరిమాణాన్ని, పర్యవసానంగా లాభ పరిమాణాన్ని శ్రమ దోపిడీ స్థాయే నిర్ధారిస్తుంది. మొత్తం సామాజిక పెట్టుబడికి భిన్నమైన ఒక ప్రత్యేక శాఖ పెట్టుబడికి అందులో ప్రత్యక్షంగా నియుక్తమైన కార్మికులను దోపిడీ చేయడంలో ఉన్నంత ప్రత్యేక ఆసక్తి, ఆ మొత్తం శాఖకు భిన్నమైన దాని వ్యష్టి పెట్టుబడిదారునికి తాను వ్యక్తిగతంగా నియమించుకొన్న కార్మికులను దోపిడీ చేయటంలో ఉంటుంది.

మరోవైపేమో, ప్రతి శాఖకు చెందిన పెట్టుబడికీ, ప్రతి వ్యష్టి పెట్టుబడిదారుడికీ, మొత్తం పెట్టుబడిచేత నియమితమైన సామాజిక శ్రమ యొక్క ఉత్పాదకతలో ఒకే విధమైన ఆసక్తి ఉంటుంది. ఎందుకంటే ఈ ఉత్పాదకతపై రెండు అంశాలు ఆధారపడి ఉంటాయి. ఒకటి – సగటు లాభాన్ని వ్యక్తం చేసే ఉపయోగ విలువల రాశి; కొత్త పెట్టుబడి సంచయనానికి నిధిగానూ, వినియోగంకోసం ఖర్చుపెట్టే ఆదాయానికి ఒక నిధిగానూ ఈ సగటు లాభం ఉపకరిస్తుంది. కాబట్టి దీనికి రెట్టింపు ప్రాముఖ్యం ఉంది. రెండు, మొత్తం పెట్టుబడి వర్గం తాలూకు మొత్తం అదనపు విలువ లేక మొత్తం లాభం నిర్ణీతమైనప్పుడు మదుపు చేసిన మొత్తం పెట్టుబడి విలువ (స్థిర, అస్థిర పెట్టుబడులు) లాభం రేట్లను లేక నిర్దిష్ట మొత్తంలోని పెట్టుబడిపై లాభాన్ని నిర్ధారిస్తుంది. ఏదైనా ఒక నిర్దిష్ట లేక అందులోని ఒక పరిశ్రమలో శ్రమ ప్రత్యేక ఉత్పాదకత పట్ల అందులో ప్రత్యక్షంగా పాల్గొన్న పెట్టుబడిదారులకు

మాత్రమే ఆసక్తి ఉంటుంది. ఎందుచేతనంటే, దానివల్ల ఆ నిర్దిష్ట శాఖకే లేక ఆ వ్యష్టి పెట్టుబడిదారుడికే అదనపు లాభం గడించ వీలవుతుంది.

పెట్టుబడిదారుల మధ్య పోటీ మూలంగా పరస్పరాభిమానాలు లేకపోయినప్పటికీ, మొత్తం వర్గానికి వ్యతిరేకంగా అచ్చం ఒక ఫ్రీమేసన్ సంఘంగా (ప్రాచీన సౌహృద, సౌభ్రాతృత్వాన్ని పాటించే వారి సంఘం – అను) ఎందుకు ఏర్పడ్డాయో ఇక్కడ మనకు కచ్చితమైన, గణిత శాస్త్రపూర్వక నిదర్శన ఉంది.

ఉత్పత్తి ధరలో సగటు లాభం కూడా కలిసి ఉంది. మనం ఉత్పత్తి ధర అని అంటున్నాం. దానిని ఆడమ్ స్మిత్ సహజ ధర అన్నాడు; రికార్డో దానిని ఉత్పత్తి ధర లేక ఉత్పత్తి వ్యయం అన్నాడు; ఫిజియోక్రాట్లేమో (Prix nēcessaire) ఆవశ్యక ధరలు అన్నాడు. ఎందుచేతనంటే ప్రతి వ్యక్తిగత శాఖలోనూ[1] సరఫరాకు సరుకుల పునరుత్పత్తికి ఇదొక పూర్వావసరం. అయితే వీరిలో ఏ ఒక్కరు కూడా ఉత్పత్తి ధరకూ, విలువకూ మధ్య ఉన్న తేడాను వెల్లడించలేదు. సరుకుల శ్రమ కాలాన్ని బట్టి సరుకుల విలువ నిర్ధారణను, అంటే సరుకులలోని శ్రమ పరిమాణాన్ని బట్టి వాటి విలువ నిర్ధారణను వ్యతిరేకించే ఈ అర్థశాస్త్రవేత్తలు ఉత్పత్తి ధరలనే కేంద్రాల చుట్టూ మార్కెట్ ధరలు హెచ్చుతగ్గులకు గురవుతుంటాయని ఎందుకు వాదిస్తారో మనం స్పష్టంగానే అర్థం చేసుకోవచ్చు. వారలా వాదించ గలగడానికి కారణముంది. ఉత్పత్తి ధర అన్నది సరుకుల విలువ తాలూకు బాహ్య రూపం; అర్థం పర్థం లేనిదని చూడగానే తెలిసిపోయే రూపం. పోటీలో కనిపించే రూపం. కనుక నాటు పెట్టుబడిదారుని మనోవీధిలో, పర్యవసానంగా నాటు అర్థశాస్త్రవేత్తల మనోవీధిలో కనిపించే రూపం.

ఏ నిర్దిష్ట ఉత్పత్తి శాఖలో అయినా అత్యంత సానుకూల పరిస్థితుల్లో ఉత్పత్తి నిర్వహించే వారికి సంబంధించి, మార్కెట్ విలువలో (దీని గురించి చెప్పిన ప్రతిదీ తగిన మార్పులతో ఉత్పత్తి ధరకు కూడా వర్తిస్తుంది.) అదనపు లాభం కూడా ఎలా చేరి ఉందో మన విశ్లేషణ వెల్లడిచేసింది. మార్కెట్ విలువల నుంచి లేక ఉత్పత్తి తాలూకు మార్కెట్ ధరల నుంచి మార్కెట్ ధరలు ఎంత వైదొలగినప్పటికీ, సంక్షోభాలనూ, అధికోత్పత్తి పరిస్థితినీ మినహాయిస్తే, ఇది అన్ని మార్కెట్ ధరలకూ వర్తిస్తుంది. ఎందుచేతనంటే మార్కెట్ ధరకు అర్థం ఏమిటంటే, విభిన్న పరిస్థితుల్లో ఉత్పత్తి అయి, అందువల్ల ఉత్పత్తి వ్యయం చాలా భిన్నంగా ఉన్నప్పటికీ, ఒకే తరహాకు చెందిన సరుకులకు ఒకే ధర లభిస్తుంది. (గుత్త సంస్థలకు అవి కృత్రిమమైనవైనా లేక సహజమైనవైనా – లభించే అదనపు లాభాల గురించి ఈ దశలో మనం పేర్కొనడటం లేదు.)

నిర్దిష్ట ఉత్పత్తి శాఖలోనైనా తమ సరుకుల విలువల ఉత్పత్తి ధరలుగా మారకుండా నివారించ గలిగే స్థితిలో ఉంటే, ఆ విధంగా తమ లాభాలు, సగటు లాభాలుగా కుదించబడకుండా నివారించ గలిగితే, అప్పుడు కూడా అదనపు లాభం తలెత్తే అవకాశం ఉంది. కౌలుకు సంబంధించిన భాగంలో అదనపు లాభానికి చెందిన ఈ రెండు రూపాల మార్పుల గురించి మరింత శ్రద్ధగా పరిశీలిద్దాం.

★ ★ ★

1. మాల్తస్ (ప్రిన్సిపుల్స్ ఆఫ్ పొలిటికల్ ఎకానమీ, లండన్, 1836, పుటలు 77-78 - సంపాదకుడు)

## అధ్యాయం - 11

# ఉత్పత్తి ధరలపై సార్వత్రిక వేతనం హెచ్చుతగ్గుల ప్రభావాలు

సామాజిక పెట్టుబడి సగటు అంతర్నిర్మాణం 80$_{\text{స్థి.పె.}}$ +20$_{\text{అ.పె}}$ అనీ, లాభం (లా) 20% అనీ అనుకుందాం. మిగతా అంశాలు యథాతథంగా ఉండి, వేతనాలు సార్వత్రికంగా పెరిగితే, అది అదనపు విలువ రేటు తగ్గడంతో సమానం. సగటు పెట్టుబడి విషయంలో లాభం, అదనపు విలువ రెండూ ఒకటే. వేతనాలు 25% పెరిగాయనుకుందాం. ఇంతకు ముందు 20తో చలనంలో ఉంచిన శ్రమ ధర ఇప్పుడు 25కు పెరుగుతుంది. అప్పుడు టర్నోవర్ విలువ 80స్థి.పె.+20అ.పె.+20 లా. బదులు 80$_{\text{స్థి.పె.}}$ +25$_{\text{అ.పె.}}$ +15$_{\text{లా.}}$గా ఉంటుంది. ఇంతకు ముందుగానే, అస్థిర పెట్టుబడిచేత చలనంలో ఉంచబడిన శ్రమ 40 విలువను ఉత్పత్తి చేస్తుంది. అ.పె. కనుక 20 నుంచి 25కు పెరిగితే అదనపు విలువ అ.వి. లేక లా. 15గా మాత్రమే ఉంటుంది. 105 పెట్టుబడిపై 15 లాభం అంటే $14\frac{2}{7}\%$. ఇది కొత్త సగటు లాభం రేటుగా ఉంటుంది. సగటు పెట్టుబడి ఉత్పత్తి చేసిన సరుకుల ఉత్పత్తి ధర వాటి విలువకు సమానంగా ఉంటుంది. కాబట్టి, ఈ సరుకుల ఉత్పత్తి ధర మార్పు లేకుండా ఉంటుంది. కాబట్టి వేతనాలు పెరిగితే లాభం తగ్గుతుంది తప్ప, సరుకుల విలువలో కానీ, ధరలో కానీ మార్పు ఉండదు.

ఇంతకు ముందు సగటు లాభం 20%గా ఉన్నప్పుడు ఒక టర్నోవర్ కాలంలో ఉత్పత్తి అయిన సరుకుల ఉత్పత్తి ధర ఆ సరుకుల ఉత్పత్తి వ్యయం ప్లస్ ఆ ఉత్పత్తి వ్యయంపై 20% లాభానికి సమానంగా ఉంది; అంటే ఉ.వ్య.+ఉ.వ్య.లా' = ఉ.వ్య.+$\frac{20\text{ఉ.వ్య}}{100}$ ఈ సూత్రంలో ఉ.వ్య. అన్నది, అస్థిర పరిమాణం. సరుకుల్లోకి వెళ్ళే ఉత్పత్తి సాధనాల విలువను బట్టి, ఉత్పాదితానికి నిశ్చల పెట్టుబడి అందజేసే విలువ మేరకు లోనైన అరుగుదల పరిమాణాన్ని బట్టి అది మారుతూ ఉంటుంది. అప్పుడు ఉత్పత్తి ధర ఇలా ఉంటుంది : ఉ.వ్య.+$\frac{14\frac{2}{7}\text{ఉ.వ్య.}}{100}$

ముందు తీసుకున్న 80$_{\text{స్థి.పె.}}$ +20$_{\text{అ.పె.}}$ సగటు సామాజిక పెట్టుబడి అంతర్నిర్మాణం (అది ఇప్పుడు $76\frac{4}{21}$ స్థి.పె.+$23\frac{17}{21}$ అ.పె.గా మారింది.) కంటే తక్కువ అంతర్నిర్మాణం గల పెట్టుబడిని ఉదాహరణకు 50$_{\text{స్థి.పె.}}$ +50$_{\text{అ.పె.}}$ని తీసుకుందాం. అవగాహనా సౌలభ్యం కోసం, నిశ్చల పెట్టుబడి యావత్తు తరుగుదలగా వార్షిక ఉత్పాదితంలోకి వెళ్తుందనీ, టర్నోవర్ కాలం మొదటి ఉదాహరణలో ఉందనీ మనం భావించినట్లయితే, వేతనాలు పెరగడానికి ముందు, ఆ వార్షిక ఉత్పాదితం యొక్క

ఉత్పత్తి ధర ఇలా ఉండేది. 50స్థి.పె.+50అ.పె+20లా=120. చలనంలో ఉంచిన అదే శ్రమ పరిమాణానికి వేతనాలు కనుక 25 శాతం పెరిగినట్లయితే అస్థిర పెట్టుబడి 50 నుంచి $62\frac{1}{2}$కు పెరుగుతుంది. ఈ వార్షిక ఉత్పాదితాన్ని మునుపటి ఉత్పత్తి ధర అయిన 120కి అమ్మినట్లయితే, దాని ఫలితం 50+$62\frac{1}{2}$ అ.పె.+$7\frac{1}{2}$లా; లేదా చేతికందేది $6\frac{2}{3}$% లాభం రేటు. అయితే కొత్త సగటు లాభం రేటు $14\frac{2}{7}$%, మిగతా అన్ని పరిస్థితులు యథాతథంగా ఉంటాయని భావిస్తున్నాము కాబట్టి 50స్థి.పె.+ $62\frac{1}{2}$ అ.పె. పెట్టుబడి కూడా ఇదే లాభాన్ని సృష్టిస్తుంది. $14\frac{2}{7}$% లాభం రేటు చొప్పున ఇప్పుడు $112\frac{1}{2}$ పెట్టుబడి $16\frac{1}{14}$ లాభాన్ని సృష్టిస్తుంది. కాబట్టి ఈ పెట్టుబడి ఉత్పత్తిచేసే సరుకుల తాలూకు ఉత్పత్తి ధర 50స్థి.పె.+ $62\frac{1}{2}$అ.పె.+ $16\frac{1}{14}$లా = $128\frac{8}{14}$గా ఉంటుంది. వేతనాలు 25% పెరిగినందువల్ల, అదే మొత్తం సరుకుల తాలూకు ఉత్పత్తి ధర 120 నుంచి $128\frac{8}{14}$కు లేదా 7% పెరిగింది.

ఇందుకు భిన్నంగా, సగటుపెట్టుబడి కంటే ఉన్నతమైన అంతర్నిర్మాణం ఉన్న ఉత్పత్తి శాఖను తీసుకున్నాం అనుకుందాం. 92స్థి.పె.+8అ.పె.ని ఈ సందర్భంలో ఈ పెట్టుబడి నిర్మాణం కూడా సగటు అని అనుకొందాం. ఈ లాభం 20గానే ఉంటుంది. మనం మళ్ళీ మునుపటిలాగే యావత్తు నిశ్చల పెట్టుబడి వార్షిక ఉత్పాదితంలోకి వెళ్తుందనీ, మొదటి, రెండవ ఉదాహరణల్లోలాగే టర్నోవర్ కాలంలో మార్పులేదనీ భావిస్తే సరుకు తాలూకు ఉత్పత్తి ధర ఇక్కడ కూడా 120గానే ఉంటుంది. వేతనాలు 25% పెరిగినందువల్ల అదే శ్రమ పరిమాణానికి అస్థిర పెట్టుబడి 8 నుంచి 10కి, సరుకుల ఉత్పత్తి వ్యయం 100 నుంచి 102కు పెరుగుతుంది. కాగా సగటు లాభం రేటు 20%నుంచి $14\frac{2}{7}$% తగ్గుతుంది. కాని 100:$14\frac{2}{7}$ = 102:$14\frac{4}{7}$ కనుక ఇప్పుడు 102 వాటాకు వచ్చే లాభం $14\frac{4}{7}$. ఈ కారణం వల్ల మొత్తం ఉత్పాదితం ఇలా అమ్ముడుపోతుంది. ఉ.వ్య+ఉ.వ్య.లా' = 102+$14\frac{4}{7}$ = $116\frac{4}{7}$ కాబట్టి ఉత్పత్తి ధర 120 నుంచి $116\frac{4}{7}$కు పడిపోయింది లేదా $3\frac{3}{7}$ తగ్గింది.

పర్యవసానంగా వేతనాలు గనుక 25% పెరిగినట్లయితే –

1. సగటు సామాజిక అంతర్నిర్మాణం గల పెట్టుబడి యొక్క సరుకుల ఉత్పత్తి ధర పెరగదు;
2. తక్కువ అంతర్నిర్మాణం గల పెట్టుబడి యొక్క సరుకుల ఉత్పత్తి ధర పెరుగుతుంది, కానీ లాభం తగ్గిన నిష్పత్తిలో కాదు;
3. ఉన్నత అంతర్నిర్మాణం గల పెట్టుబడి యొక్క సరుకుల ఉత్పత్తి ధర పడిపోతుంది, కానీ లాభం తగ్గిన నిష్పత్తిలో కాదు.

సగటు పెట్టుబడి యొక్క సరుకుల ఉత్పత్తి ధర యథాతథంగా, ఉత్పత్తి విలువకు సమానంగా ఉంది. కనుక అన్ని పెట్టుబడుల యొక్క సరుకుల ఉత్పత్తి ధరల మొత్తం కూడా మార్పు లేకుండా యథాతథంగా ఉంది; అంటే మొత్తం పెట్టుబడి ఉత్పత్తి చేసిన సరుకుల మొత్తం విలువలకు సమానంగా ఉంటుంది. ఒకవైపు పెరుగుదల, మరోవైపు తగ్గుదల – ఇవి మొత్తం పెట్టుబడినంతా తీసుకొన్నప్పుడు, సగటు సామాజిక పెట్టుబడి స్థాయిలో ఒకదానికొకటి సమతూకంలో ఉంచుతాయి.

ఉత్పత్తి ధర IIవ ఉదాహరణలో పెరుగుతుందంటేనూ, IIIవ ఉదాహరణలో తగ్గుతుందంటేనూ,

అదనపు విలువ రేటు తగ్గుదల వల్ల లేక సార్వత్రిక వేతనం పెరుగుదల వల్ల తలెత్తిన ఈ పరస్పర వ్యతిరేక ఫలితాలు నిరూపిస్తున్నది : వేతనాల పెరుగుదలకు ధరలో తదనుగుణమైన పరిహారం లభించదు. ఎందుచేతనంటే, IIIవ ఉదాహరణలో ఉత్పత్తి ధర తగ్గుదల పెట్టుబడిదారుడికి లాభంలో తగ్గుదలను భర్తీ చేయజాలదు; IIవ ఉదాహరణలోని ధరలో పెరుగుదల లాభం తరుగుదలను నివారించలేదు. రెండు ఉదాహరణల్లోనూ ధర పెరిగినా, తరిగినా లాభం మాత్రం ధర యథాతథంగా ఉన్న సగటు పెట్టుబడి లాభమంతే మార్పు లేకుండా ఉంటుంది. రెండవ ఉదాహరణలోనూ, మూడవ ఉదాహరణలోనూ సగటు లాభం ఒకే విధంగా $5\frac{5}{7}$ మేరకు తగ్గింది; లేదా దాదాపు 25 శాతానికి కొంచెం ఎక్కువగా రెండు ఉదాహరణల్లోనూ తగ్గింది. IIవ ఉదాహరణలో ధర పెరగలే దంటేనూ, IIIవ ఉదాహరణలో తగ్గలేదంటేనూ, అది సూచిస్తున్నదేమంటే IIవ ఉదాహరణలో తన సరుకును కొత్తగా తగ్గిన సగటు లాభంకంటే తక్కువకు, IIIవ ఉదాహరణలో ఎక్కువకు అమ్ముకోవలసి ఉంటుందని స్పష్టమవుతోంది. పెట్టుబడిలోని 100 యూనిట్లలో వేతనాలకుగాను 50 లేక 25 లేక 10 కేటాయించారా అన్న దాన్నిబట్టి పెట్టుబడిదారుడిపై వేతనాల పెరుగుదల ప్రభావం ఆధారపడి వుంటుంది. అంటే తన పెట్టుబడిలో $\frac{1}{10}$ వంత భాగాన్ని వేతనాలకు కేటాయించిన పెట్టుబడిదారుడికీ, $\frac{1}{4}$ వంతు లేక $\frac{1}{2}$ వంతు కేటాయించిన పెట్టుబడిదారులకూ మధ్య వేతనాల ప్రభావం తేడా ఉంటుంది. సగటు సామాజిక పెట్టుబడి దానికంటే పెట్టుబడి అంతర్నిర్మాణం తక్కువగా ఉందా లేక ఎక్కువగా ఉందా అన్న అంశంపై ఆధారపడి ఒకవైపు ఉత్పత్తి ధర పెరగడం, మరోవైపు తరగడం జరిగేది. కొత్తగా తగ్గిన సగటు స్థాయికి లాభాన్ని సర్దుబాటు చేసే ప్రక్రియ మూలంగానే.

ఇప్పుడిక సగటు సామాజిక పెట్టుబడి అంతర్నిర్మాణానికి వ్యతిరేక దిశల్లో భిన్నంగా ఉన్న పెట్టుబడులు ఉత్పత్తి చేస్తే సరుకుల తాలూకు ఉత్పత్తి ధరలను వేతనాల్లో సార్వత్రిక తగ్గుదల, తదనుగుణమైన లాభం రేటు పెరుగుదల ఎలా ప్రభావితం చేస్తుంది? అలాగే సగటు లాభం పెరుగుదల ఎలా ప్రభావితం చేస్తుంది? మనం ఫలితాన్ని సాధించాలంటే పైన తెలిపిన ఉదాహరణను తిరగేయాల్సి ఉంటుంది. (రికార్డో ఇది విశ్లేషించలేకపోయారు.)

1. సగటు పెట్టుబడి = $80_{\text{స్థి.పె.}}+20_{\text{అ.పె.}}=100$; అదనపు విలువ రేటు = 100%; ఉత్పత్తి ధర= సరుకుల విలువ = $80_{\text{స్థి.పె.}}+20_{\text{అ.పె.}}+20_{\text{లా}}=120$; లాభం రేటు=20% వేతనాలు నాలుగింట ఒక వంతు తగ్గాయనుకుందాం. అప్పుడు అదే స్థిర పెట్టుబడిని $20_{\text{అ.పె.}}$ బదులు $15_{\text{అ.పె.}}$ చలనంలో ఉంచుతుంది. కనుక సరుకుల విలువ $80_{\text{స్థి.పె.}}+15_{\text{అ.పె.}}+25_{\text{లా}}$ = 120; అ.పె. సృష్టించిన శ్రమ పరిమాణంలో ఎలాంటి మార్పు ఉండదు; కాకపోతే అది కొత్తగా సృష్టించిన విలువ పెట్టుబడిదారుడికీ, కార్మికుడికీ భిన్నంగా పంపిణీ అవుతుంది. అదనపు విలువ 20 నుంచి 25కు అదనపు విలువ రేటు $\frac{20}{20}$ నుంచి $\frac{25}{15}$ లేక 100% నుంచి $166\frac{2}{3}$%కి పెరుగుతుంది. ఇప్పుడు 95పై వచ్చే లాభం 25. కనుక 100కు లాభం రేటు $26\frac{6}{19}$ అవుతుంది. ఇప్పుడు కొత్త పెట్టుబడి అంతర్నిర్మాణం శాతంలో ఇలా ఉంటుంది. $84\frac{4}{19}$స్థి.పె. $+15\frac{15}{19}$అ.పె. = 100.

2. తక్కువ అంతర్నిర్మాణంలో మునుపటిలాగే $50_{\text{స్థి.పె.}}+50_{\text{అ.పె.}}$ వేతనాలు నాలుగింట ఒక వంతు తగ్గిపోయినందువల్ల అ.పె. $37\frac{1}{2}$ కు తగ్గిపోయింది. పర్యవసానంగా అడ్వాన్సు చేసిన మొత్తం పెట్టుబడి $50_{\text{స్థి.పె.}}+37\frac{1}{2}_{\text{అ.పె}}=87\frac{1}{2}$కి తగ్గిపోయింది. మనం గనుక కొత్త లాభం రేటు $26\frac{6}{19}$%ను దీనికి వర్తింపచేస్తే ఇలా ఉంటుంది $100:26\frac{6}{17}=87\frac{1}{2}:23\frac{1}{38}$ ఇంతకు ముందు 120 వ్యయమయిన అదే సరుకుల మొత్తానికి ఇప్పుడు $87\frac{1}{2}+23\frac{1}{38}=110\frac{10}{19}$ వ్యయమవుతుంది; అంటే దాదాపు 10 శాతం మేరకు ధర తగ్గిపోతుంది.

3. ఉన్నత అంతర్నిర్మాణం మునుపున్నది. $92_{\text{స్థి.పె.}}+8_{\text{అ.పె.}}=100$. వేతనాలు నాలుగింట ఒకవంతు తగ్గిపోయినందువల్ల అ.పె. 8 నుంచి 6కు తగ్గిపోతుంది; కాగా మొత్తం పెట్టుబడి 98కి తగ్గిపోతుంది. పర్యవసానం ఇది : $100:26\frac{6}{19}=98:25\frac{15}{19}$. 100+20 = 120గా ఇంతకు ముందు ఉన్న ఉత్పత్తి ధర ఇప్పుడు అంటే వేతనాలు తగ్గాక, $98+25\frac{15}{19}=123\frac{15}{19}$గా ఉంటుంది. అంటే ఇది దాదాపు 4 పెరిగింది.

కాబట్టి తగిన మార్పులతో వ్యతిరేక దిశలో మనకు ముందే పరిణామం కనిపిస్తుంది. వేతనాల సార్వత్రిక తగ్గుదలతో అదనపు విలువ, అదనపు విలువ రేటు పెరుగుతాయి. ఇతర పరిస్థితులు యథాతథంగా ఉన్నప్పుడు, భిన్న నిష్పత్తులు వ్యక్తమయినప్పటికీ లాభం రేటు పెరుగుతుందనేది స్పష్టమే. తక్కువ స్థాయి అంతర్నిర్మాణం గల పెట్టుబడి ఉత్పత్తి చేసిన సరుకుల ఉత్పత్తి ధర తగ్గిపోతుంది. ఉన్నత అంతర్నిర్మాణం, పెట్టుబడి ఉత్పత్తి చేసిన సరుకుల ఉత్పత్తి ధర పెరుగుతుంది. వేతనాలు సార్వత్రికంగా పెరిగినప్పుడు తలెత్తిన ఫలితానికి భిన్నమైన ఫలితమిది.[1] రెండు సందర్భాల్లోనూ – వేతనాలు పెరిగినప్పుడు తరిగినప్పుడు పనిదినం, జీవనావసరాల ధరలు యథాతథంగా ఉంటాయని ఊహించాము. ఈ పరిస్థితుల్లో వేతనాలు మామూలు శ్రమ ధరకంటే గతంలో ఎక్కువగా ఉంటేనే లేదా ఈ ధరకంటే తక్కువగా ఉండవలసి వుంటేనే వేతనాలు పడిపోవడం సాధ్యం. విలువలో మార్పు ఫలితంగా వేతనాలు పెరగడం లేదా తగ్గడం జరిగితే, పర్యవసానంగా కార్మికులు వినియోగించుకునే సరుకుల తాలూకు ఉత్పత్తి ధరలో మార్పువస్తే దాని ప్రభావం ఎలా ఉంటుంది అన్న విషయాన్ని కౌలును గురించి చర్చించే భాగంలో పరిశీలిద్దాం. అయితే ఇక్కడ ఆఖరుమాటగా ఈ క్రింది వ్యాఖ్యలు చేయవలసివుంది.

జీవనావసరాల విలువలో మార్పు ఫలితంగా వేతనం పెరగడం కానీ, తరగడం కానీ జరిగితే పై నిర్ధారణల్లో ఎప్పుడు మార్పు జరుగుతుందంటే, ఏ సరుకుల ధరలో మార్పు అస్థిర పెట్టుబడిని

1. తనకు సహజమైన రీతిలో రికార్డో [ఆన్ ది ప్రిన్సిపుల్స్ ఆఫ్ పొలిటికల్ ఎకానమీ అండ్ టాక్సేషన్, మూడవ కూర్పు, లండన్, 1821, పుటలు 36-41 - సం.] (విలువలు ఉత్పత్తి ధరలుగా సర్దుబాటు అయ్యే విషయాన్ని అర్థం చేసుకోలేదు కాబట్టి ఆయన సహజంగా మన దారికి భిన్నమైన దారిలో వెళతాడు.) ఈ పరిణామాన్ని పరిశీలించనేలేదు; ఆయన వేతనాల పెరుగుదల ప్రభావం అనే మొదటి సందర్భాన్ని మాత్రమే పరిశీలించడం పూర్తిగా స్వయంవిదితమైన, యథార్థంగా పునరుక్తి అయిన ఈ ఆచరణాత్మక అనువర్తనకు కనీసం ప్రయత్నించనైనా ప్రయత్నించలేదు. [Horace, Epistles, Book I, Epistle 19 - Editor]

పెంచుతాయో లేక తగ్గిస్తాయో ఆ సరుకులు అంతర్భాగాలుగా స్థిర పెట్టుబడిలోకి ప్రవేశించి వేతనాలనే కాక ఇతర అంశాలను సైతం ప్రభావితం చేసినప్పుడే మార్పు సంభవిస్తుంది.

మనం ఈ అధ్యాయమంతా సార్వత్రిక లాభం రేటు స్థాపన, సగటు లాభం స్థాపన, పర్యవసానంగా విలువలు ఉత్పత్తి ధరలుగా పరివర్తన – ఇవన్నీ నిర్వివాదమైనవిగా భావించాం. ఇక ప్రశ్నల్లా వేతనాల్లో పెరుగుదల కానీ తరుగుదల కానీ, ఊహించిన సరుకుల ఉత్పత్తి ధరలను ఎలా ప్రభావితం చేశాయన్నదే. ఈ భాగంలో విశ్లేషించిన ఇతర ముఖ్యమైన అంశాలతో పోల్చితే దీని ప్రాముఖ్యం తక్కువే. అయితే రికార్డో చర్చించిన సందర్భోచిత అంశం ఇదొక్కటే. కానీ ఆయన ఈ అంశాన్ని పాక్షికంగానూ, అసంతృప్తికరంగానూ పరిశీలించినట్లు మనం ముందు ముందు చూడగలం.[1]

★ ★ ★

1. K. Marx, Theoriem iiberden Mehrwert, k.Marx/F - సం.
Theories of surplus - value, Part II, pp 189-203.

## అధ్యాయం - 12

# అనుబంధ వ్యాఖ్యలు

### I. ఉత్పత్తి ధరలో మార్పుకు కారణాలు

ఒక సరుకు యొక్క ఉత్పత్తి ధరను మార్చగలిగే కారణాలు రెండే రెండున్నాయి.

**మొదటిది :** సార్వత్రిక లాభం రేటులో మార్పు. దీనికి కారణం అదనపు విలువ సగటు రేటులో మార్పు ఒక్కటే కావచ్చు లేదా అదనపు విలువ సగటు రేటు యథాతథంగా ఉన్నట్లయితే, అడ్వాన్సయిన మొత్తం సామాజిక పెట్టుబడి పరిమాణానికీ, స్వాయత్తం అయిన అదనపు విలువల మొత్తానికీ మధ్య నిష్పత్తిలో మార్పు కావచ్చు.

అదనపు విలువ రేటులో మార్పుకు కారణం వేతనాలు మామూలు స్థాయికంటే తగ్గిపోవడం కానీ, మామూలు స్థాయికంటే పెరగడం కానీ కానట్లయితే – ఇలాంటి చలనాలను కేవలం ఎగుడు దిగుళ్ళుగానే పరిగణించాలి. అప్పుడు అందుకు కారణం శ్రమ శక్తి విలువ పెరగడం లేక తరగడం ఒక్కటే కారణం కాగలదు. జీవనావసరాలను ఉత్పత్తి చేసే శ్రమ తాలూకు ఉత్పాదకతలో అంటే శ్రామికుడు వినియోగించే సరుకుల విలువలో మార్పు వుంటే తప్ప ఈ రెండింటిలో ఏదీ సాధ్యంకాదు.

లేదా, అడ్వాన్స్ కాబడిన మొత్తం సామాజిక పెట్టుబడికీ, స్వాయత్తం కాబడిన అదనపు విలువల మొత్తానికీ మధ్య నిష్పత్తిలో మార్పు వల్ల కూడా ఇది జరగవచ్చు. ఈ సందర్భంలో మార్పుకు కారణం అదనపు విలువ రేటు కాదు కాబట్టి దీనికి కారణం మొత్తం పెట్టుబడి కావాలి లేక ఖచ్చితంగా చెప్పాలంటే దాని స్థిర భాగం కావాలి. సాంకేతికంగా పరిశీలిస్తే, అస్థిర పెట్టుబడి కొనుగోలు చేసే శ్రమ శక్తి పరిమాణానికి అనుగుణమైన నిష్పత్తిలో స్థిర పెట్టుబడి పరిమాణం పెరుగుతుంది లేదా తరుగుతుంది. ఆ విధంగా దాని సొంత పరిమాణం పెరగడాన్ని లేదా తరగడాన్ని బట్టి దాని విలువ పరిమాణం పెరుగుతుంది లేదా తరుగుతుంది. కాబట్టి అస్థిర పెట్టుబడి విలువ పరిమాణానికి అనుగుణమైన నిష్పత్తులలో కూడా అది పెరుగుతుంది లేదా తరుగుతుంది. అదే శ్రమ గనుక ఎక్కువ స్థిర పెట్టుబడిని చలనంలో ఉంచితే, దాని ఉత్పాదకత పెరిగినట్లు లెక్క. ఇందుకు వ్యతిరేకంగా జరిగితే, దాని ఉత్పాదకత తగ్గినట్లు లేక ఈ విధంగా శ్రమ ఉత్పాదకతలో మార్పు వచ్చిందన్నమాట. కాబట్టి కొన్ని సరుకుల విలువలో కూడా తప్పనిసరిగా మార్పు ఉంటుంది.

ఈ క్రింది నియమం రెండు సందర్భాలకూ వర్తిస్తుంది; సార్వత్రిక లాభం రేటులో వచ్చిన మార్పు ఫలితంగా ఏదైనా ఒక సరుకు ఉత్పత్తి ధరలో మార్పు వచ్చినట్లయితే, ఆ సరుకు విలువ మాత్రం యథాతథంగా ఉండవచ్చు. అయితే దీనివల్ల ఇతర సరుకుల విలువలో మాత్రం మార్పు వచ్చి ఉండాలి.

**రెండు :** సార్వత్రిక లాభం రేటు యథాతథంగా ఉంటుంది. ఈ సందర్భంలో సరుకు యొక్క సొంత విలువలో మార్పు వచ్చినపుడు మాత్రమే దాని ఉత్పత్తి ధర మార్పు చెందుతుంది. ఇందుకు కారణం ఆ సరుకు పునరుత్పత్తికి అవసరమైన శ్రమ ఎక్కువగానైనా ఉండవచ్చు, తక్కువగానైనా ఉండవచ్చు. ఇది ఆ సరుకును అంతిమ రూపంలో ఉత్పత్తి చేసే శ్రమ తాలూకు ఉత్పాదకతలో మార్పువల్ల కావచ్చు. లేదా ఆ సరుకు ఉత్పత్తిలోకి ప్రవేశించే సరుకులను ఉత్పత్తి చేసే శ్రమ ఉత్పాదకత వల్లనైనా కావచ్చు. నూలు దారం ఉత్పత్తి ధర తగ్గిపోడానికి కారణం ముడి పత్తి మునుపటి కంటే చౌకగా ఉత్పత్తి అవడం కావచ్చు లేదా మెరుగైన యంత్రాల కారణంగా నూలు వడకడంలో పాల్గొనే శ్రమ యొక్క ఉత్పాదకత మరింత పెరగడం కావచ్చు.

మనం ఇంతకు ముందే గమనించినట్లు ఉత్పత్తి ధర = ఉ.వ్య+లా, అంటే ఉత్పత్తి వ్యయం ప్లస్ లాభానికి సమానం. అయితే ఈ=ఉ.వ్య+ఉ.వ్య'లో ఉత్పత్తి వ్యయం, ఉ.వ్య, అస్థిర పరిమాణం. ఇది విభిన్న ఉత్పత్తి శాఖలకు మారుతూ ఉంటుంది. ఆయా శాఖల్లో సరుకు ఉత్పత్తికి ఖర్చయిన స్థిర, అస్థిర పెట్టుబడుల విలువకు, ఇది సమానంగా ఉంటుంది; కాగా ఇందులో లా' అన్నది శాతం, రూపంలోని సగటు లాభం రేటు. ఉ.వ్య.=200, లా'=20% అయినట్లయితే ఉత్పత్తి ధర ఉ.వ్య. + ఉ.వ్య.లా' = 200+200. $\frac{20}{100}$ = 200+40 = 240. సరుకుల విలువలో మార్పు వచ్చినప్పటికీ ఈ ఉత్పత్తి ధర స్పష్టంగా మార్పు లేకుండా యథాతథంగా ఉండవచ్చు.

సరుకుల ఉత్పత్తి ధరలోని మార్పులన్నిటికీ అంతిమంగా విలువలో మార్పులు కారణమని తేలుతూంది. అయితే సరుకుల విలువలోని మార్పులన్నీ ఉత్పత్తి ధర మార్పుల్లో వ్యక్తం కావాల్సిన అవసరమేమీ లేదు. ఉత్పత్తి ధరను నిర్ధారించేది ఒక సరుకు యొక్క విలువ మాత్రమే కాదు, అన్ని సరుకుల మొత్తం విలువ దాన్ని నిర్ధారిస్తుంది. అంటే 'క' అనే సరుకులోని మార్పును 'ఖ' అనే సరుకులోని వ్యతిరేక మార్పు సమతులనంలో ఉంచడం ద్వారా మొత్తంమీద సాధారణ సంబంధం మార్పు లేకుండా ఉండవచ్చు.

## II. సగటు అంతర్నిర్మాణం గల సరుకుల ఉత్పత్తి ధర

విలువలకు – ఉత్పత్తి ధరలకు మధ్య తేడా ఉండడానికి కారణం ఈ క్రింది అంశాలని మనం గమనించాం :

1. సరుకులోని అదనపు విలువ బదులు సగటు లాభం దాని ఉత్పత్తి వ్యయానికి చేరడం.
2. తన విలువకు ఆ విధంగా భిన్నంగా ఉంటే ఒక సరుకు ధర ఇతర సరుకుల ఉత్పత్తి వ్యయంగా ఉన్న అంశాల్లో ఒకటిగా ప్రవేశించడం. ఇందువల్ల ఒక సరుకులోని అదనపు విలువకు, సగటు లాభానికీ మధ్య తేడావల్ల ఉత్పన్నమైన భేదానికి తోడు, ఆ సరుకు వినియోగించుకొన్న ఉత్పత్తి. సాధనాల్లోనే ఉత్పత్తి ధరకు, వాటి విలువకు మధ్య తేడాలుండవచ్చు.

కాబట్టి సగటు అంతర్నిర్మాణం గల పెట్టుబడిచేత ఉత్పత్తి అయిన సరుకుల తాలూకు ఉత్పత్తి వ్యయానికీ, వీటి ఉత్పత్తి ధరలో ఈ భాగంగా ఉన్న వాటి విలువల మొత్తానికీ మధ్య తేడా ఉండే అవకాశం ఉంది. ఉదాహరణకు సగటు అంతర్నిర్మాణం 80$_{\text{స్థి.పె.}}$+20$_{\text{అ.పె.}}$ అనుకుందాం. ఈ అంతర్నిర్మాణం గల పెట్టుబడుల్లో 80స్థి.పె స్థిర పెట్టుబడి మొ.పె. విలువకంటే ఎక్కువగా కానీ

తక్కువగా కానీ ఉండే అవకాశం ఉంది. ఎందుచేతనంటే ఏ సరుకుల ధర ఉత్పత్తి అయితే వాటి విలువకు భిన్నంగా ఉందో, ఆ సరుకుల సముదాయంలోనే ఈ మొ.పె. రూపొంది ఉండవచ్చు. ఇదే విధంగా, వేతనాల వినియోగంలో ఉత్పత్తి ధరకూ, విలువకూ తేడా ఉన్న సరుకులు చేరి ఉన్నట్లయితే 20అ.పె. కూడా తన విలువకు భిన్నంగా ఉండవచ్చు. అలాంటి సందర్భంలో కార్మికుడు ఆ సరుకులను తిరిగి కొనడానికి (వాటిని భర్తీచేయడానికి) ఎక్కువ కాలం కానీ, తక్కువ కాలం కానీ పనిచేస్తాడు. ఈ విధంగా జీవనావసరాల ఉత్పత్తి ధరకూ, వాటి విలువలకూ తేడా లేనిపక్షంలో అవసరమైన దానికంటే ఎక్కువగానో, తక్కువగానో శ్రమ చేస్తాడు.

అయితే సగటు అంతర్నిర్మాణం గల పెట్టుబడులు ఉత్పత్తిచేసే సరుకులకు సంబంధించి ప్రతిపాదించిన సిద్ధాంతాలు సరియైనవనే వాస్తవాన్ని ఇది ఏమాత్రమూ సవాలు చేయదు. ఈ సరుకులకు వచ్చే లాభ పరిమాణం వాటిలో ఉన్న అదనపు విలువ పరిమాణానికి సమానంగా ఉంటుంది. ఉదాహరణకు పెట్టుబడి అంతర్నిర్మాణం 80స్థి.పె.+20అ.పె. అనుకొంటే అందులో అదనపు విలువను నిర్ధారించడంలో ముఖ్యమైన అంశం ఈ సంఖ్యలు నిజమైన విలువలను వ్యక్తీకరిస్తున్నాయా లేదా అన్నది కాదు; వాటి పరస్పర సంబంధమే ముఖ్యమైన విషయం. అంటే మొత్తం పెట్టుబడిలో అయిదింట ఒకవంతు అ.పె., మొత్తం పెట్టుబడిలో అయిదింట నాలుగు వంతులు స్థి.పె. అన్నదే ముఖ్యమైన విషయం. పరిస్థితి ఇలా ఉన్నప్పుడల్లా, మనం ఊహించినట్లుగానే, అ.పె. ఉత్పత్తి చేసిన అదనపు విలువ, సగటు లాభానికి సమానంగా ఉంటుంది. కాగా మరోవైపేమో, అది సగటు లాభానికి సమానంగా ఉంటుంది కనుక, ఉత్పత్తి ధర = వ్యయం ధర ప్లస్ లాభం = ఉ.వ్య+లా.=ఉ.వ్య+అ.వి.; అంటే ఆచరణలో ఇది సరుకు విలువకు సమానంగా ఉంటుంది. అంటే దీని అర్థం వేతనాలు పెరిగినా తరిగినా దాని ప్రభావం సరుకు విలువపై ఉండనట్లే ఉత్పత్తి ధర ఉ.వ్య+లా.పై కూడా ఉండదు. ఇది కేవలం లాభం రేటును వ్యతిరేక దిశలో ప్రభావితం చేస్తుంది. అంతే. ఎందుచేతనంటే, వేతనాల పెరుగుదల లేక తరుగుదల సరుకుల ధరలో మార్పు తెచ్చే పక్షంలో ఈ సగటు అంతర్నిర్మాణం గల శాఖల్లోని లాభం రేటుకు మించవచ్చు లేక తగ్గవచ్చు. ధర నిలకడగా ఉన్నప్పుడు మాత్రమే సగటు అంతర్నిర్మాణ శాఖలోని లాభం స్థాయి ఇతర శాఖల్లోని లాభాల స్థాయికి సమంగా ఉంటుంది. కనుక ఆచరణలో ఇది ఉత్పాదితాలు వాటి నిజమైన విలువకు అమ్మితే లభించే ఫలితమే. సరుకులు గనుక తమ వాస్తవ విలువలకు అమ్ముడుపోతే, ఇతర పరిస్థితులు యథాతథంగా ఉన్నప్పుడు వేతనాలు పెరిగితే లేదా తరిగితే లాభం రేటు తరుగుతుంది లేదా పెరుగుతుంది. తప్ప, సరుకుల విలువలో మాత్రం మార్పు రాదు. అంతేకాదు, ఏ పరిస్థితుల్లో అయినా వేతనాల్లో పెరుగుదల కానీ, తరుగుదల కానీ అదనపు విలువ పరిమాణాన్ని మాత్రమే మార్చగలుగుతుంది తప్ప సరుకుల విలువను ఎన్నడూ మార్చలేదు.

## III. పెట్టుబడిదారుడి నష్టపరిహార ఆధారాలు

పోటీ వివిధ ఉత్పత్తి శాఖల్లోని లాభం రేట్లను సమానీకరించి సగటు లాభం రేటును సృష్టిస్తుందని, ఆ విధంగా ఈ విభిన్న శాఖల తాలూకు ఉత్పాదితాల విలువలను ఉత్పత్తి ధరలుగా మార్చుతుందనీ చెప్పుకున్నాం. ఒక శాఖనుంచి మరోశాఖకు, తాత్కాలికంగా లాభం సగటు స్థాయికంటే ఎక్కువగా

ఉన్న శాఖకు నిరంతరం పెట్టుబడిని బదలాయించడం ద్వారా ఇది జరుగుతుంది. అయితే, ఏదైనా ఒక పరిశ్రమ వృద్ధి, హీన సంవత్సరాల చక్రం ద్వారా తలెత్తే లాభం తాలూకు హెచ్చుతగ్గులను కూడా తగిన విధంగా పరిగణనలోకి తీసుకోవాలి. విభిన్న ఉత్పత్తి శాఖల మధ్య ఇలా నిరంతరంగా ప్రవేశించే నిష్క్రమించే పెట్టుబడులు నిజానికి లాభం రేటులో హెచ్చుతగ్గుల ధోరణిని సృష్టిస్తాయి. ఈ హెచ్చుతగ్గుల ధోరణి లాభాలను దాదాపు సమానీకరిస్తుంది. ప్రతి శాఖలోని లాభం రేటునూ ఉమ్మడి సార్వత్రిక స్థాయికి ఇలా తీసుకొచ్చే ధోరణి ఒకటి ఉత్పన్నమవుతుంది.

ఈ పెట్టుబడుల చలనాన్ని ప్రధానంగా సృష్టించేది మార్కెట్ ధరల స్థాయి. అది ఒక శాఖలో లాభాలను సార్వత్రిక సగటు స్థాయికి పైబడేలా పెంచుతుంది. మరొక శాఖలో సార్వత్రిక సగటు స్థాయి కంటే తక్కువ స్థాయికి దిగజార్చుతుంది.

ఈ దశలో అప్రస్తుతం కాబట్టి వాణిజ్య పెట్టుబడిని మనం పరిశీలించడంలేదు. ఎందుచేతనంటే కొన్ని సరుకులకు సంబంధించి సట్టా వ్యాపారం సాగుతున్న విషయం మనకు తెలుసు. అందువల్ల ఒక వాణిజ్య శాఖ నుంచి పెట్టుబడుల మొత్తాలను ఆఘమేఘాల మీద ఉపసంహరించుకుని, అంతే త్వరితగతితో మరో వాణిజ్య శాఖలో ఆ పెట్టుబడులను ప్రవేశపెట్టడం మనమెరిగిందే. పరిశ్రమలు, వ్యవసాయం, గనులు వగైరా వంటి ప్రతి ఉత్పత్తి శాఖ నుంచి మరో శాఖలోకి పెట్టుబడిని బదిలీ చేయాలంటే గణనీయమైన ఇబ్బందులే ముఖ్యంగా నిశ్చల పెట్టుబడి మూలంగా ఎదురవుతాయి. అంతేకాదు ఉదాహరణకు పత్తి పరిశ్రమల లాంటి ఒక పారిశ్రామిక శాఖ ఒక దశలో అసాధారణమైన అధిక లాభాలను అందజేస్తే, మరొక దశలో చాలా తక్కువ లాభాలను, తుదకు నష్టాలను సైతం తెచ్చిపెట్టడం అనుభవంలో మనకు తెలిసిందే. ఇలా జరగడం వల్ల కొన్ని సంవత్సరాల చక్రభ్రమణంలో ఇక్కడ వచ్చే సగటు లాభం ఇతర శాఖల్లో మాదిరే ఉంటుంది. పెట్టుబడి త్వరలోనే ఈ అనుభవాన్ని పరిగణనలోకి తీసుకుంటుంది.

అయితే పోటీ తెలియచేయనిది ఒకటుంది. ఉత్పత్తి గమనాన్ని శాసించేది విలువ నిర్ధారణే అనీ, ఉత్పత్తి ధరల వెనుక ఉన్నది విలువలే అనీ, తుదకు ఆ ధరలను నిర్ణయించేదీ విలువలే అనీ పోటీ తెలపదు. అయితే పోటీ మనకు ఈ క్రింది అంశాలను తెలుపుతుంది. 1. విభిన్న ఉత్పత్తి శాఖల్లో పెట్టుబడి అంతర్నిర్మాణంతోనూ, ప్రతి దోపిడీ రంగంలోనూ పెట్టుబడి స్వాయత్తం చేసుకొనే సజీవ శ్రమతోనూ నిమిత్తం లేకుండా స్వతంత్రంగా ఉండే సగటు లాభాలు; 2. వేతనాల స్థాయిలో వచ్చే మార్పుల మూలంగా ఉత్పత్తి ధరల్లో జరిగే పెరుగుదల, తరుగుదలలు. ఈ దృగ్విషయం మొదటి చూపునకు సరుకుల విలువ సంబంధానికి విరుద్ధంగా ఉన్నట్టు కనిపిస్తుంది; 3. మార్కెట్ ధరల హెచ్చుతగ్గులు – ఇవి నిర్దిష్ట కాలంలో సరుకుల తాలూకు సగటు మార్కెట్ ధరను మార్కెట్ విలువగా కాక ఈ మార్కెట్ విలువకు ఎంతో భిన్నమైన ఉత్పత్తి తాలూకు మార్కెట్ ధరగా కుదిస్తాయి. శ్రమ కాలాన్ని బట్టి విలువ నిర్ధారణకూ చెల్లించని అదనపు శ్రమ రూపమైన అదనపు విలువ స్వభావానికీ పైకి కనిపించే ఈ విషయాలు విరుద్ధంగా ఉన్నట్లు తోస్తుంది. ఆర్థిక సంబంధాల వాస్తవ ఉనికిలోనూ, ఆ కారణం వల్ల ఈ సంబంధాలను వాటి వాహకంలో, ప్రతినిధులు అర్థం చేసుకునే ప్రయత్నంలో ఏర్పరచుకున్న భావనల్లోనూ పైకి కనిపించే వాటి అంతర్గతమైన, అయితే సారభూతమైన రూపానికీ, తదనుగుణమైన భావనకూ చాలా భిన్నమైనది. నిజంగా వ్యతిరిక్తమైనది కూడా. అంతేకాదు

– పెట్టుబడిదారీ ఉత్పత్తి ఒకానొక అభివృద్ధి స్థాయికి చేరుకోగానే వ్యక్తిగత శాఖల్లోని విభిన్న లాభం రేట్లు సార్వత్రిక లాభం రేటుగా సమానీకరణ చెందే క్రమం, వాస్తవానికి కేవలం ఆకర్షణ వికర్షణ ప్రక్రియ ద్వారా మాత్రమే సాగదు; మార్కెట్ ధరలు పెట్టుబడిని ఆకర్షించే, తిరగ్గొట్టే ఈ ప్రక్రియ ద్వారా మాత్రమే సాగదు. సగటు ధరలు, వాటికి అనుగుణమైన మార్కెట్ ధరలు కొంతకాలంపాటు స్థిరత్వం పొందిన తరువాత ఈ సమానీకరణ అన్నది ఖచ్చితమైన తేడాలను సమతులనంలో ఉంచుతున్న విషయం వ్యష్టి పెట్టుబడిదారుల చైతన్యంలోకి ఎక్కుతుంది. ఆ మేరకు వారు తమ లెక్కాచారాల్లో వీటికి స్థానం ఇస్తారు. పెట్టుబడిదారుడి మనసులో ఈ తేడాలుంటాయి. కనుక అతడు వీటిని నష్టపరిహారానికి ఆధారాలుగా పరిగణిస్తాడు.

సగటు లాభం అన్నది ఒక మౌలిక భావన. అంటే సమాన పరిమాణంలోని పెట్టుబడులు సమాన వ్యవధుల్లో సమాన లాభాలను తప్పనిసరిగా ఇస్తాయన్న భావన అది. దీనికి క్రింది భావన ప్రాతిపదిక. మొత్తం సామాజిక పెట్టుబడి కార్మికుల నుంచి పిండిన మొత్తం అదనపు విలువలో, ప్రతి ఉత్పత్తి శాఖలోని పెట్టుబడి తన పరిమాణానికి అనుగుణంగా పాలుపంచుకొంటుంది. లేదా ప్రతి వ్యక్తిగత పెట్టుబడిని మొత్తం సామాజిక పెట్టుబడిలో కేవలం ఒక భాగంగానూ, ప్రతి పెట్టుబడిదారుణ్ణి మొత్తం సామాజిక పరిశ్రమలో వాస్తవానికి ఒక వాటాదారుడిగా ఉంటూ, తన పెట్టుబడి వాటా యొక్క పరిమాణానికి అనుగుణంగా మొత్తం లాభంతోపాటు పంచుకొంటున్నట్లుగానూ పరిగణించాలి.

పెట్టుబడిదారు లెక్కాచారానికి ఈ భావన ఒక ప్రాతిపదికగా ఉపయోగపడుతుంది. ఉదాహరణకు తన సరుకులు ఉత్పత్తి కావడానికి ఎక్కువ కాలం పట్టడం వల్ల కానీ లేక అవి దూరంగా ఉన్న మార్కెట్లలో అమ్ముడుపోతున్నందు వల్ల కానీ ఒక పెట్టుబడిదారుని పెట్టుబడి టర్నోవర్ ఇతరుల పెట్టుబడులకంటే ఆలస్యంగా జరిగినట్లయితే, ఆ విధంగా కోల్పోయే లాభాన్ని పూడ్చే విధంగా ధర నిర్ధారిస్తాడు. అంటే ధర పెంచడం ద్వారా అతడు నష్టపరిహారం పొందుతాడు. లేదా ఎక్కువ ప్రమాదాలున్న శాఖల్లో ఉదాహరణకు నౌకా వ్యాపారం లాంటి శాఖల్లో అధిక ధరల ద్వారా పెట్టుబడి మదుపులకు నష్టపరిహారం లభిస్తుంది. పెట్టుబడిదారీ ఉత్పత్తి, దానితోపాటు భీమా వ్యాపారమూ అభివృద్ధి చెందగానే అన్ని ఉత్పత్తి శాఖల్లోని (కార్బెట్ రచనను చూడండి[1]) ప్రమాదాలను ఆచరణలో సమానీకరించడం జరుగుతుంది. అయితే ఎక్కువ ప్రమాదాలున్న ఉత్పత్తి శాఖలు ఎక్కువ భీమా రెట్లు చెల్లించి తమ సరుకుల ధరల్లో వాటిని వసూలు చేసుకుంటాయి. ఆచరణలో దీని అర్థం ఏమిటంటే, అన్ని ఉత్పత్తి శాఖలనూ నిర్దిష్ట పరిమితుల్లో సమానమైనవిగానే పరిగణించినప్పటికీ, ఒక శాఖను తక్కువ లాభం వచ్చేదిగానూ, మరొక శాఖను ఎక్కువ లాభం వచ్చేదిగానూ చేసే ప్రతి పరిస్థితినీ నష్టపరిహారానికి చెల్లుబడి అయ్యే ఆధారంగా పరిగణించడం జరుగుతుంది. ఈ నష్ట పరిహారాన్ని లెక్కగట్టడంలోని ఉద్దేశాలను, అంశాలను సమర్థించడానికి, పదే పదే పోటీ చర్యలతో అవసరం ఉండదు. విభిన్న ఉత్పత్తి శాఖల్లో సరుకుల ధరలను నిర్ధారించడంలో పెట్టుబడిదారులు పరస్పరం చూపే ఈ నష్టపరిహార ఆధారాలన్నీ వాటా కోరడానికి వారికి సమానమైన హక్కున్నదన్న

1. టిహెచ్. కార్బెట్, యాన్ ఎంక్వయిరీ ఇంటు ది కాజెస్ అఫ్ అండ్ మోడ్స్ ఆఫ్ ది వెల్త్ ఆఫ్ ఇండివిడ్యువల్స్, లండన్, 1841, పుటలు 100-102 - సంపాదకుడు.

వాస్తవాన్ని సూచిస్తున్నాయే తప్ప మరేమీ కాదనే సంగతిని పెట్టుబడిదారులు కేవలం మరచిపోతున్నారు. లేక మరింత సరిగా చెప్పాలంటే వారు ఆ సంగతిని తెలుసుకోవడం లేదు. ఎందువల్లనంటే దాన్ని పోటీ ఎత్తిచూపడం లేదు. తాము జేబులో వేసుకున్న లాభానికీ, తాము స్వాయత్తం చేసుకున్న అదనపు విలువకూ తేడా వుంది. కాబట్టి, మొత్తం అదనపు విలువలో తమ భాగస్వామ్యాలను ఈ నష్టపరిహార ఆధారాలు సమానీకరిస్తున్నట్లు కాక, ఈ నష్టపరిహార ఆధారాలే లాభాన్ని సృష్టిస్తున్నట్లు వారికి కనిపిస్తుంది. ఏదో ఒక ఆధారంపై తమ సరుకుల ఉత్పత్తి ఖర్చులకు చేర్చిన మొత్తాలనుంచే లాభం నిష్పన్నమైనట్లు వారికి కనిపిస్తుంది.

అదనపు విలువ మూలాధారానికి సంబంధించి పెట్టుబడిదారుడి ఊహల విషయమై VIIవ అధ్యాయంలో చెప్పినవి, సగటు లాభానికి కూడా వర్తిస్తాయి. సరుకుల మార్కెట్ ధర, శ్రమ దోపిడీ నిర్ణీతమై ఉన్నాయనుకొంటే, ఉత్పత్తి వ్యయంలో పొదుపు ఆయా పెట్టుబడిదారుల వ్యాపార దక్షత, అప్రమత్తత వగైరా అంశాలపై ఆధారపడి ఉన్న మేరకు మాత్రమే ప్రస్తుత సందర్భం భిన్నమైనదిగా కనిపిస్తుంది.

★ ★ ★

## మూడవ భాగం

# లాభం రేటు పడిపోయే ధోరణి నియమం

## అధ్యాయం - 13

# నియమ వాస్తవ స్వరూపం

**ఒ**క నిర్ణీత వేతనాన్ని, పని దినాన్ని ఊహించినప్పుడు, ఒక అస్థిర పెట్టుబడి, ఉదాహరణకు 100 అయితే, ఒక నిర్దిష్ట సంఖ్యలో నియామకమైన, కార్మికులకు ప్రాతినిధ్యం వహిస్తుంది. ఆ సంఖ్యకు అది సూచిక. వారానికి 100 మంది కార్మికుల వేతనం 100 పౌండ్లు అనుకుందాం. ఈ కార్మికులు సమాన పరిమాణంలో అవసర శ్రమనూ, అదనపు శ్రమనూ నిర్వహిస్తున్నారనుకుందాం. అంటే తమ కోసం, తమ వేతనాల పునరుత్పత్తి కోసం ఎన్ని గంటలు వెచ్చిస్తున్నారో, పెట్టుబడిదారుని కోసం, అదనపు విలువ ఉత్పత్తి కోసం కూడా అన్ని గంటల్నే వెచ్చిస్తున్నారనుకుందాం. అప్పుడు వారి మొత్తం ఉత్పాదితం 200 పౌండ్లు అవుతుంది. వారు ఉత్పత్తి చేసే అదనపు విలువ 200 పౌండ్లు. అదనపు విలువ రేటు $= \frac{\text{అ.వి.}}{\text{అ.పె.}} = 100\%$. అయితే, మనం ఇంతకు ముందే గమనించినట్లు ఈ అదనపు విలువ రేటు చాలా భిన్నమైన లాభం రేటుగా వ్యక్తమవుతుంది. అది స్థిర పెట్టుబడి స్థి.పె.పైనా, అందువల్ల మొత్తం పెట్టుబడి మొ.పె.పైనా ఆధారపడి ఉంటుంది. ఎందుకంటే లాభం రేటు $\frac{\text{అ.వి.}}{\text{మొ.పె.}}$ అదనపు విలువ రేటు = 100%.

స్థి.పె. = 50, అ.పె. = 100 అయితే, లా $= \frac{100}{150} = 66\frac{2}{3}\%$

స్థి.పె. = 100, అ.పె. = 100 అయితే, లా $= \frac{100}{200} = 50\%$

స్థి.పె. = 200, అ.పె. = 100 అయితే, లా $= \frac{100}{300} = 33\frac{1}{3}\%$

స్థి.పె. = 300, అ.పె. = 100 అయితే, లా $= \frac{100}{400} = 25\%$

స్థి.పె. = 400, అ.పె. = 100 అయితే, లా $= \frac{100}{500} = 20\%$

ఒకే స్థాయిలో శ్రమ దోపిడీ కొనసాగుతుండగా, ఒకే అదనపు విలువ రేటు ఈ రకంగా పడిపోతున్న లాభం రేటుగా వ్యక్తమవుతుంది. ఎందుకంటే స్థిర పెట్టుబడి భౌతిక పెరుగుదలతో పాటు దాని విలువ పెరుగుదల కూడా ఉంటుంది. అదే స్థాయిలో అది ఉండకపోవచ్చు. ఫలితంగా మొత్తం పెట్టుబడి విలువా పెరుగుతుంది.

పెట్టుబడి అంతర్నిర్మాణంలో క్రమక్రమంగా వచ్చిన ఈ మార్పు వ్యష్టి ఉత్పత్తి రంగాలకు మాత్రమే పరిమితం గాక, దాదాపు అన్ని రంగాల్లోనూ లేదా కనీసం కీలక రంగాలన్నిటిలోనూ వచ్చిందనుకుందాం. అపుడు నిర్దిష్ట సమాజపు మొత్తం పెట్టుబడి సగటు అంతర్నిర్మాణంలో మార్పులు వస్తాయి. అప్పుడు అదనపు విలువ రేటు అంటే శ్రమ దోపిడీ తీవ్రత యథాతథంగా ఉన్నంత కాలం, స్థిర, అస్థిర పెట్టుబడుల మధ్య నిష్పత్తిని బట్టి చూచినపుడు స్థిర పెట్టుబడిలో వచ్చిన క్రమక్రమ పెరుగుదల లాభం సార్వత్రిక రేటు క్రమక్రమ వేతనానికి ఆవశ్యంగా దారితీయాలి. పెట్టుబడిదారీ అభివృద్ధితోపాటు, అస్థిర పెట్టుబడి, స్థిర పెట్టుబడితో పోల్చి చూసినపుడు, సాపేక్షంగా తగ్గుతుంది కనుక చలనంలోని మొత్తం పెట్టుబడితో చూసినపుడు అలా తగ్గుతుంది. ఇది పెట్టుబడిదారీ ఉత్పత్తి నియమం అని మనం గమనించాం. పెట్టుబడిదారీ వ్యవస్థలో పెంపొందే ప్రత్యేకమైన ఉత్పత్తి పద్ధతుల వల్ల అదే సంఖ్యలోని కార్మికులు, అనగా ఒక నిర్దిష్ట విలువ కలిగిన అస్థిర పెట్టుబడి చలనంలో ఉంచిన అదే పరిమాణం గల శ్రమశక్తి, అదే కాలవ్యవధిలో రానురాను మరింత పెరుగుతున్న పరిమాణంలో శ్రమ సాధనాలను, యంత్రాలను అన్ని రకాల నిశ్చల పెట్టుబడిని, ముడి, సహాయ పదార్థాలను పనిలో పెడుతుంది. వాటితో పని చేయిస్తుంది. వాటిని ఉత్పాదకంగా వినియోగిస్తుంది. ఆ రకంగా రానురాను అధికాధిక విలువ గల పెట్టుబడిని ఉత్పాదకంగా అలా వినియోగిస్తుంది.

ఈ విధంగా స్థిర పెట్టుబడికీ మొత్తం పెట్టుబడికీ సంబంధించి, సాపేక్షంగా అస్థిర పెట్టుబడి నిరంతరాయంగా పడిపోవటమంటే, సగటు సామాజిక పెట్టుబడి యొక్క అంతర్నిర్మాణం అంతకంతకు ఉన్నత స్థాయినందుకోవటమే. సామాజిక శ్రమ ఉత్పాదకత క్రమానుగతంగా అభివృద్ధి చెందడానికి ఇది మరో వ్యక్తీకరణ మాత్రమే. అదే సంఖ్యలోని కార్మికులు అదే కాల వ్యవధిలో అంటే తక్కువ, రాను రాను మరింత ఎక్కువ పరిమాణంలో ముడి పదార్థాలను, సహాయక పదార్థాలను ఉత్పాదితాలుగా మార్చుతున్నారన్న వాస్తవమే ఇందుకు నిరూపణ. ఇది యంత్రాలను, మొత్తంపై నిశ్చల పెట్టుబడిని రాను రాను మరింత ఎక్కువగా వాడటం వలన సాధ్యపడుతుంది. ఇలా స్థిర పెట్టుబడి విలువ పరిమాణం అంతకంతకు పెరగడంతోపాటు (పాదార్థికంగా స్థిర పెట్టుబడిగా ఉన్నది ఉపయోగపు విలువలే కాబట్టి, ఉపయోగ విలువల వాస్తవ మొత్తం పెరుగుదలను ఇది రమారమిగా మాత్రమే సూచించినప్పటికీ) ఉత్పాదితాలు రానురాను మరింత చౌక అవుతాయి. దానికిగా దాన్ని చూస్తే ప్రతి విడి ఉత్పాదితంలోనూ కింది స్థాయి ఉత్పత్తిలో కంటే తక్కువ శ్రమ పరిమాణం ఉంటుంది. కింది స్థాయి ఉత్పత్తిలో వేతనాలపై వెచ్చించిన పెట్టుబడి ఉత్పత్తి సాధనాలలో మదుపు పెట్టిన పెట్టుబడితో పోలిస్తే చాలా ఎక్కువ ఉంటుంది. కనుక ఈ అధ్యాయం ప్రారంభంలో ఊహించి వరుసగా వేసిన లెక్కలు పెట్టుబడిదారీ ఉత్పత్తి యొక్క వాస్తవ ధోరణిని తెలియజేస్తాయి. ఈ ఉత్పత్తి విధానంలో స్థిర పెట్టుబడితో పోలిస్తే అస్థిర పెట్టుబడి సాపేక్షంగా క్రమేపీ తగ్గిపోతుంది. కనుక మొత్తం పెట్టుబడి అంతర్నిర్మాణ స్థాయి నిరంతరాయంగా పెరుగుతుంది. దీని తక్షణ ఫలితం ఏమంటే, అదే శ్రమ దోపిడీ స్థాయిలో లేక శ్రమ దోపిడీ స్థాయి పెరిగినపుడు సైతం – అదనపు విలువ రేటు, నిరంతరాయంగా పడిపోతున్న లాభం రేటు సార్వత్రిక రూపంలో వ్యక్తమవుతుంది. (ఈ పతనం నిరపేక్ష రూపంలో

వ్యక్తం కాకుండా క్రమక్రమ పతన ధోరణిగా ఎందుకు వ్యక్తమవుతుందో తర్వాత పరిశీలిద్దాం.[1]) కనుక సార్వత్రిక లాభం రేటు క్రమక్రమంగా పడిపోయే ధోరణి పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానానికి ప్రత్యేకమైన రీతిలో శ్రమ సామాజిక ఉత్పాదక క్రమక్రమాభివృద్ధి వ్యక్తం చేస్తున్నది అంతే. అంటే లాభం రేటు తాత్కాలికంగా ఇతర కారణాల వల్ల పడిపోదని కాదు. కానీ పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానపు స్వభావం రీత్యా చూస్తే దాని అభివృద్ధిలో సార్వత్రిక సగటు అదనపు విలువ రేటు, పడిపోతున్న సార్వత్రిక లాభం రేటుగా, కార్యకారణ సంబంధాన్నిబట్టి వ్యక్తమయి తీరాలని రుజువయింది.

నియుక్తమయిన సజీవ శ్రమ మొత్తం అది చలనంలో ఉంచే వస్తు రూపంలోని శ్రమ మొత్తంతో పోలిస్తే, అనగా ఉత్పాదకంగా వినియోగమయ్యే ఉత్పత్తి సాధనాలతో పోలిస్తే నిరంతరాయంగా పడిపోతుంది. దానినిబట్టి సజీవ శ్రమలో ఏ భాగమైతే వేతనం చెల్లించబడకుండా అదనపు విలువ రూపం ధరించిందో ఆ భాగం మదుపు పెట్టబడిన మొత్తం పెట్టుబడి విలువ పరిమాణంతో పోల్చినపుడు క్రమక్రమంగా తగ్గిపోతూ ఉండాలి. మదుపు పెట్టిన మొత్తం పెట్టుబడి విలువకు, అదనపు విలువ మొత్తానికి మధ్య ఉన్న నిష్పత్తే లాభం రేటు అవుతుంది కనుక రేటు నిరంతరాయంగా తప్పనిసరిగా పడిపోతుంది.

పైన చెప్పిన వివరణను బట్టి ఈ నియమం సరళమైనదిగా కనిపిస్తుంది. అయితే ఇంతవరకు రాజకీయ అర్థశాస్త్రం ఈ నియమాన్ని కనుగొనడంలో విఫలమయింది. ఈ విషయాన్నే వివరంగా తర్వాత భాగంలో చూస్తాం.[2] ఇలా కనిపించే ధోరణిని ఆర్థికవేత్తలు గమనించారు. దాన్ని వివరించి చెప్పటానికి వారు నానా యాతనలూ పడ్డారు. బుర్రలు బద్దలుకొట్టుకొన్నారు. పెట్టుబడి ఉత్పత్తి దృష్ట్యా ఈ నియమానికి గొప్ప ప్రాధాన్యం ఉంది. కనుక ఆడమ్ స్మిత్ మొదలుకొని ఈ మాయని ఛేదించడమే రాజకీయ అర్థశాస్త్రం యొక్క లక్ష్యం అయింది. ఈ సమస్యకు పరిష్కారం కనిపెట్టటానికి ఆడమ్ స్మిత్ నాటి నుంచీ అనుసరించిన వివిధ దృక్పథాలను బట్టి వివిధ కోవలకు చెందిన శాస్త్ర బృందాలు ఒకదానితో ఒకటి విభేదించాయి. ఒకవైపున ప్రస్తుత రాజకీయ అర్థశాస్త్రం స్థిర, అస్థిర పెట్టుబడుల మధ్య ఉన్న తేడా చుట్టూ గిరికీలు కొడుతోంది. అయితే దానిని ఖచ్చితంగా ఎలా నిర్వచించాలో మాత్రం దానికి తెలియలేదు. అది అదనపు విలువను లాభం నుంచి ఎపుడూ వేరుచేసి చూడలేదు. లాభాన్ని సైతం దాని శుద్ధరూపంలో, దాని భిన్నమైన, స్వతంత్రమైన అంశాలతో అంటే, పారిశ్రామిక లాభం, వాణిజ్య లాభం, వడ్డీ, కౌలు లాంటి వాటితో ప్రమేయం లేకుండా పరిశీలించలేదు. అది ఎపుడూ ఇంతవరకూ పెట్టుబడి అంతర్నిర్మాణంలో ఉన్న తేడాలను క్షుణ్ణంగా విశ్లేషించలేదు. ఈ కారణంచేతనే సార్వత్రిక లాభం రేటు రూపొందటాన్ని విశ్లేషించాలని అది ఎప్పుడూ ఆలోచించలేదు. దీనినంతటిని మనం దృష్టిలో పెట్టుకుంటే, ఈ చిక్కుముడిని విప్పటంలో వాళ్ళు ఎందుకు నెగ్గుకు రాలేకపోయారోనన్న విషయం ఆశ్చర్యం కలిగించదు.

విభిన్న స్వతంత్ర అభివర్గాలుగా లాభం విభజన గురించి పరిశీలించే ముందే ఈ నియమాన్ని గురించి కావాలనే ఇక్కడ తెలియజేస్తున్నాము. లాభం విభిన్న భాగాలుగా విభజితమై వేరు వేరు

1. ఇదే గ్రంథం, అధ్యాయం XIV - సంపాదకుడు.
2. కార్ల్ మార్క్స్ అదనపు విలువ సిద్ధాంతాలు.

తరహాల వ్యక్తులకు చెందిన వాటాలుగా మారటంలో ప్రమేయం లేకుండా ఈ విశ్లేషణ జరుగుతుంది. ఈ వాస్తవాన్ని బట్టి, ఈ విభజనతో ప్రమేయం లేకుండానే ఈ మొత్తం నియమం స్వతంత్రమైనదనీ, అలా విభజితమైన లాభం యొక్క అభివర్గాల పరస్పర సంబంధాలలో కూడా దీనికి ప్రమేయం లేదనీ ప్రారంభంలోనే వెల్లడి అవుతుంది. ఇక్కడ మనం ప్రస్తావిస్తున్న లాభం అన్నది అదనపు విలువకు మరో పేరు మాత్రమే. దీన్ని ఆవిర్భవింపచేసిన అస్థిర పెట్టుబడితో కాక, మొత్తం పెట్టుబడితో దీనికి గల సంబంధం దృష్ట్యా దీన్ని వివరించి చూపుతున్నాం.

కనుక లాభం రేటులో పతనం అన్నది అడ్వాన్సు చేసిన మొత్తం పెట్టుబడికీ, అదనపు విలువకు మధ్యగల నిష్పత్తి, పతనాన్ని వ్యక్తం చేస్తుంది. ఈ కారణంగా లాభం రేటు తగ్గుదలకు వివిధ అభివర్గాలుగా అదనపు విలువ విభజనతో ప్రమేయం లేదు.

పెట్టుబడి అంతర్నిర్మాణం స్థి.పె.:అ.పె = 50:100గా ఉన్న పెట్టుబడిదారీ అభివృద్ధి యొక్క ఒకానొక దశలో అదనపు విలువ రేటు 100% అన్నది $66\frac{2}{3}\%$ లాభం రేటుగా వ్యక్తమయిందనీ, ఇంతకంటే ఉన్నత దశలో స్థి.పె.:అ.పె = 400:100గా ఉన్నప్పుడు అదే అదనపు విలువ రేటు కేవలం 20% లాభం రేటుగా వ్యక్తమైందనీ మనం ఒక దేశంలో వరుసగా వచ్చిన విభిన్న అభివృద్ధి దశలకు వర్తింపచేసిన ఈ అంశమే ఏకకాలంలో విభిన్న దేశాలలో ఉండే వేర్వేరు అభివృద్ధి దశలకు కూడా వర్తిస్తుంది. అభివృద్ధి చెందని ఒక దేశంలో ఇంతకు మొదట చెప్పిన పెట్టుబడి అంతర్నిర్మాణం సగటుగా ఉన్న దేశంలో సార్వత్రిక లాభం రేటు $66\frac{2}{3}\%$గా ఉంటుంది. రెండవ అంతర్నిర్మాణం కలిగిన దేశంలో, అనగా హెచ్చు అభివృద్ధి ఉన్న దేశంలో అది 20%.

ఒక దేశంకన్నా తక్కువ అభివృద్ధి చెందిన దేశంలో శ్రమ తక్కువ ఉత్పాదకంగా ఉంటే, ఆ రెండు దేశాల లాభం రేట్ల మధ్య ఉన్న తేడా అదృశ్యం కావచ్చు లేదా తారుమారు కావచ్చు. ఎందుకంటే, అవే సరుకులు తక్కువ పరిమాణంలో అధిక పరిమాణం గల శ్రమకు ప్రాతినిధ్యం వహిస్తాయి. తక్కువ ఉపయోగపు విలువ ఎక్కువ మార్పిడి విలువకు ప్రాతినిధ్యం వహిస్తుంది. అప్పుడు కార్మికుడు తన సొంత జీవన అవసరాలను లేదా వాటి విలువను పునరుత్పత్తి చేయటానికి ఎక్కువ సమయం వెచ్చిస్తాడు. అదనపు విలువను ఉత్పత్తి చేయటానికి తక్కువ సమయం వెచ్చిస్తాడు. పర్యవసానంగా అతడు తక్కువ అదనపు శ్రమ చేయటం వలన, అదనపు విలువ రేటు తక్కువ ఉంటుంది. తక్కువ అభివృద్ధి చెందిన దేశపు కార్మికుడు పనిదినంలో $\frac{2}{3}$ వంతు తనకోసం; $\frac{1}{3}$ వంతు పెట్టుబడిదారుని కోసం వెచ్చిస్తున్నాడనుకొందాం. పైన ఇచ్చిన ఉదాహరణ ప్రకారం అదే శ్రమ శక్తికి $133\frac{1}{3}$ చెల్లించ బడుతుంది. ఆ శ్రమశక్తి, $66\frac{2}{3}$ మాత్రమే అదనం సరఫరా చేస్తుంది. స్థిర పెట్టుబడి 50 ఉంటే అస్థిర పెట్టుబడి $133\frac{1}{3}$ ఉంటుంది. అదనపు విలువ రేటు = $66\frac{2}{3} : 133\frac{1}{3}$ = 50%. లాభం రేటు $66\frac{2}{3} : 183\frac{1}{3} = 36\frac{1}{2}\%$.

లాభం యొక్క విభిన్న అంతర్భాగాలను మనం ఇంతవరకు విశ్లేషించలేదు. అంటే ప్రస్తుతానికి మన దృష్టి పథంలో అవి లేవు. పొరపాటు అవగాహనకు కేవలం తావులేకుండా ఉండేందుకు ఈ కింది అంశాలను ముందుగానే పేర్కొనాలి. విభిన్న అభివృద్ధి దశలలో ఉన్న దేశాలను పోల్చేటప్పుడు జాతీయ లాభం రేటు స్థాయిని, జాతీయ వడ్డీరేటు స్థాయిని బట్టి కొలవటం పెద్ద పొరపాటు అవుతుంది.

అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ ఉత్పత్తి గల దేశాలను, శ్రమ ఇంకా సలాంఛనంగా పెట్టుబడికి లోనుకాని దేశాలతో పోల్చటం పొరపాటవుతుంది. ఈ దేశాలలో శ్రామికుణ్ణి పెట్టుబడిదారు వాస్తవంగా దోచుకొంటున్నప్పటికి, ఇలా పోల్చటం పొరపాటు. (ఉదాహరణకు భారతదేశంలో రైతు ఒక స్వతంత్ర ఉత్పత్తిదారుడుగా తన పొలం పనులను నిర్వహిస్తాడు. అతని ఉత్పత్తి ఇంకా పెట్టుబడికి లోను కాలేదు. అయితే వడ్డీ వ్యాపారి రైతు నుంచి అతని అదనపు శ్రమ ఫలితమంతటినీ దోచుకోవడం మాత్రమే కాక పెట్టుబడిదారీ పదబంధంలో వ్యక్తం చేయాలంటే అతని వేతనంలో కొంత భాగాన్ని సైతం దోచేసుకుంటాడు.) మొత్తం లాభం, దానికన్నా ఎక్కువే ఇక్కడ వడ్డీగా ఉంది. అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ ఉత్పత్తి గల దేశాలలోలాగా ఈ వడ్డీ కేవలం అదనపు విలువలో లేదా లాభంలో సమ విభజిత భాగం కాదు. మరోవైపున ఈ వడ్డీ, ఈ సందర్భంలో లాభంతో ప్రమేయం లేని సంబంధాల వల్ల నిర్ణయమవుతుంది. (కౌలు వసూలు చేసే పెద్ద ఎస్టేటుల యజమానులకు వడ్డీ వ్యాపారులు ఇచ్చిన రుణాలపైన ఇది ఆధారపడి ఉంటుంది.) కౌలులో వడ్డీ వ్యాపారం ఏ మేరకు స్వాహా చేస్తుందో ఇది తెలియజేస్తుంది.

విభిన్న పెట్టుబడిదారీ అభివృద్ధి దశలలో ఉన్న దేశాలు తత్ఫలితంగా విభిన్న అంతర్నిర్మాణం గల పెట్టుబడులున్న దేశాల విషయం చూద్దాం. ఒక దేశంలోకంటే సాధారణ పనిదినం తక్కువ ఉన్న మరో దేశంలో అదనపు విలువ రేటు ఎక్కువ ఉండవచ్చు. (ఇది అదనపు విలువ లాభం రేటును నిర్ణయించే అంశాలలో ఒకటి.) మొదటిది. ఇంగ్లండ్‌లో శ్రమ తీవ్రత వలన దాని పది గంటల పనిదినం ఆస్ట్రియాలో పధ్నాలుగు గంటల పనిదినంతో సమానం అనుకుందాం. రెండు దేశాల పనిదినాన్ని సమానంగా విభజిస్తే, ఇంగ్లండు యొక్క ఐదు గంటల అదనపు శ్రమ ఆస్ట్రియా యొక్క ఏడు గంటల అదనపు శ్రమకంటే ప్రపంచ మార్కెట్‌లో ఎక్కువ విలువకు ప్రాతినిధ్యం వహించవచ్చు. రెండవ విషయం ఆస్ట్రియా పనిదినంలోకన్నా ఇంగ్లండు పనిదినంలో ఎక్కువ భాగం అదనపు శ్రమకు ప్రాతినిధ్యం వహించవచ్చు.

సమానమైన లేదా అంతకంటే ఎక్కువ అదనపు విలువ రేటును వ్యక్తం చేసే లాభం రేటు క్రమక్రమ పతన నియమం వేరుమాటల్లో చెబుతున్నది. సగటు సామాజిక పెట్టుబడి యొక్క ఏ పరిమాణం అయినా, ఉదాహరణకు 100 అనుకుందాం. రాను రాను మరింత ఎక్కువ శ్రమ సాధనాలను మరింత తక్కువ సజీవ శ్రమ భాగాన్ని కలిగి ఉంటుంది. కనుక ఉత్పత్తి సాధనాలతో పనిచేస్తున్న సజీవ శ్రమ పరిమాణం మొత్తం ఈ ఉత్పత్తి సాధనాల విలువతో పోలిస్తే తగ్గిపోతూ ఉంటుంది. దీనినిబట్టి ప్రతిఫలం చెల్లించబడని శ్రమ, అది వ్యక్తమయ్యే విలువ భాగం మొత్తం అడ్వాన్స్ చేసిన పెట్టుబడి విలువతో పోలిస్తే తగ్గితీరాలి. లేదా క్రమేణా అడ్వాన్సు చేసిన మొత్తం పెట్టుబడిలో మరింత చిన్న సమ విభజిత భాగం సజీవ శ్రమగా మార్చబడుతుంది. కనుక దాని పరిమాణానికి అనుగుణంగా ఈ మొత్తం పెట్టుబడి క్రమక్రమంగా మరింత తక్కువ అదనపు శ్రమను ఇముడ్చుకొంటుంది. ఇక్కడ ప్రతిఫలం చెల్లించని శ్రమ భాగం ప్రతిఫలం దక్కిన శ్రమ భాగంతో పోలిస్తే పెరిగినప్పటికీ ఇది వర్తిస్తుంది. స్థిర, అస్థిర పెట్టుబడులు రెండూ నిరపేక్షంగా పెరగనప్పటికీ, అస్థిర భాగం స్థిర భాగంతో పోల్చినపుడు సాపేక్షంగా తగ్గిపోవటం అన్నది శ్రమ ఉత్పాదకత పెరుగుదలకు మరొక వ్యక్తీకరణ.

100 పెట్టుబడిలో 80స్థి.పె.+20అ.పె. ఉందనుకొందాం. 20అ.పె.=20 మంది కార్మికులనుకుందాం. అదనపు విలువ రేటు 100% అనుకుందాం. అనగా కార్మికుడు సగం రోజులు తన కోసం, మిగిలిన సగమూ పెట్టుబడిదారుని కోసం పనిచేస్తాడు. ఇక దానికన్నా తక్కువ అభివృద్ధిచెందిన దేశంలోని పెట్టుబడి 100. 20స్థి.పె.+80అ.పె. అనుకుందాం. 80స్థి.పె.=80 మంది కార్మికులనుకుందాం. కాని ఈ కార్మికుల పనిదినంలో $\frac{2}{3}$ వంతు తనకోసం పనిచేయాలి. $\frac{1}{3}$ వంతు పెట్టుబడిదారుని కోసం పనిచేస్తారు. మిగిలిన అంశాలన్నీ యథాతథంగా ఉంటే మొదటి దేశంలో కార్మికులు 40 విలువను ఉత్పత్తి చేస్తారు. రెండవ దేశంలో అది 120. మొదటి పెట్టుబడి ఉత్పత్తి చేసేది 80స్థి.పె.+20అ.పె.+20అ.వి.=120; లాభం రేటు 20%. రెండవ పెట్టుబడి 20స్థి.పె.+80అ.పె.+40అ.వి. లాభం రేటు 40%. మొదటిదానిలో అదనపు విలువ రేటు 100% కాగా రెండవ దానిలో కేవలం 50% మాత్రమే. అయినప్పటికీ రెండవ దేశంలో మొదటిదానికంటే లాభం రేటు రెట్టింపు ఉంది. ఒకే పరిమాణం గల పెట్టుబడి మొదటి దేశంలో కేవలం 20 మంది శ్రామికుల అదనపు శ్రమను మాత్రమే స్వాయత్తం చేసుకోగా, రెండవ దేశంలో ఇదే పెట్టుబడి 80 మంది కార్మికుల శ్రమను సంగ్రహిస్తుంది.

క్రమానుగతంగా పడిపోయే లాభం రేటు నియమం లేదా సజీవ శ్రమ చలనంలో ఉంచే వస్తు రూప శ్రమ పరిమాణంతో పోల్చినపుడు, స్వాయత్తమయ్యే అదనపు శ్రమ సాపేక్షంగా తగ్గిపోవడం అన్నది, సామాజిక పెట్టుబడి చలనంలో ఉంచే దోపిడీకి గురయ్యే శ్రమ పరిమాణం యొక్క నిరపేక్ష పెరుగుదలకు, అందువల్ల సామాజిక పెట్టుబడి స్వాయత్తం చేసుకొనే అదనపు శ్రమ పరిమాణం యొక్క నిరపేక్ష పెరుగుదలకు ఆస్కారం లేకుండా చేయదు. అలాగే వ్యష్టి పెట్టుబడిదార్ల అధీనంలో ఉన్న పెట్టుబడులు క్రమక్రమంగా పెరుగుతున్న శ్రమ పరిమాణాన్ని, కాబట్టి అధికాధికమైన అదనపు శ్రమ పరిమాణాన్ని వాడుకోవచ్చునన్న దాన్ని కూడా ఈ నియమం తిరస్కరించదు. వ్యష్టి పెట్టుబడులు పనిలో పెట్టే కార్మికుల సంఖ్య పెరగనప్పటికీ 'అవి వాడుకొనే అదనపు శ్రమ పరిమాణం పెరుగుతూనే ఉండవచ్చు.'

పనిచేసే 20 లక్షల జనాభాను తీసుకొందాం. సగటు పని దినం పరిమాణం, దాని తీవ్రత వేతనాల స్థాయీ, అవసర శ్రమ, అదనపు శ్రమల నిష్పత్తి, నిర్ణీతంగా ఉన్నాయనుకుందాం. అలాంటప్పుడు 20 లక్షలమంది మొత్తం శ్రమ, అదనపు విలువగా వ్యక్తమైన వారి అదనపు శ్రమ ఎల్లప్పుడూ అదే పరిమాణం కలిగిన విలువను సృష్టిస్తుంది. అయితే ఈ శ్రమ చలనంలో ఉంచిన స్థిర పెట్టుబడి (నిశ్చల, చలామణి పెట్టుబడులు) పరిమాణం పెరగటంతో, ఇలా ఉత్పత్తి అయిన విలువ పరిమాణం పెట్టుబడి విలువతో పోల్చినపుడు తగ్గిపోతుంది. పెట్టుబడి విలువ, దాని పరిమాణంతో పాటు తదనుగుణ నిష్పత్తిలో కాకపోయినప్పటికీ పెరుగుతుంది. పనిలో ఉన్న సజీవ శ్రమ మొత్తం యథాతథంగా ఉన్నప్పటికీ, పెట్టుబడి అంతే పరిమాణం గల అదనపు శ్రమను పిండుకొంటున్నప్పటికీ ఇలా ఉత్పత్తి అయిన విలువ పరిమాణానికి, చలనంలోని స్థిర పెట్టుబడి విలువ పరిమాణానికి మధ్య గల ఈ నిష్పత్తి పడిపోతుంది; పర్యవసానంగా లాభం రేటు పడిపోతుంది. సజీవ శ్రమ చలనంలో ఉంచే వస్తురూప శ్రమ మొత్తం పెరిగింది కనుక అది మారుతుంది. అంతేకానీ

సజీవ శ్రమ తగ్గిపోవటం వల్ల కాదు. ఈ తగ్గుదల అన్నది సాపేక్షమైనదే తప్ప నిరపేక్షమైనది కాదు. నిజానికి చలనంలో ఉంచబడిన శ్రమ, అదనపు శ్రమల నిరపేక్ష పరిమాణంలో దీనికి ప్రమేయం లేదు. లాభం రేటులో తగ్గుదల, మొత్తం పెట్టుబడిలో అస్థిర పెట్టుబడి భాగం సాపేక్షంగా తగ్గిపోవటం వల్ల, స్థిర పెట్టుబడితో పోల్చినప్పుడు అది తగ్గిపోవడం వల్ల మాత్రమే జరుగుతుంది. అంతేగాని అస్థిర పెట్టుబడి నిరపేక్షంగా తగ్గిపోవడం వల్ల కాదు.

ఏ నిర్ణీత శ్రమ పరిమాణానికైనా, అదనపు శ్రమ పరిమాణానికైనా వర్తించేది, పెరుగుతున్న కార్మికుల సంఖ్యకు కూడా వర్తిస్తుంది. పైన తెలిపిన అభ్యూహ ప్రకారం, పెరుగుతున్న పని యుక్త శ్రమ పరిమాణానికైనా ప్రత్యేకించి అందులో ప్రతిఫలం చెల్లించబడని భాగానికి అంటే అదనపు శ్రమకు ఇది వర్తిస్తుంది. పనిచేసే జనాభా 20 లక్షల నుంచి 30 లక్షలకు పెరిగి, వేతనాల్లో మదుపు పెట్టిన అస్థిర పెట్టుబడి కూడా అలాగే 20 లక్షల నుంచి 30 లక్షలకు పెరిగిందనుకుందాం. స్థిర పెట్టుబడి 40 లక్షల నుంచి 50 లక్షలకు పెరిగిందనుకుందాం. స్థిరమైన పనిదినం, స్థిరమైన అదనపు విలువ ఉన్నాయని భావిస్తే అదనపు శ్రమ పరిమాణం, అదనపు విలువ పరిమాణం 50% పెరుగుతుంది. అంటే 20 లక్షల నుంచి 30 లక్షలకు పెరుగుతుంది. అదనపు శ్రమ దానితోపాటు అదనపు విలువ మొత్తం పరిమాణం 50% పెరిగినప్పటికీ, అస్థిర పెట్టుబడికి స్థిర పెట్టుబడికి మధ్య వున్న నిష్పత్తి 2:4 నుండి 3:15కు పడిపోతుంది. అపుడు అదనపు విలువకు మొత్తం పెట్టుబడికి (లక్షలలో) మధ్య ఉన్న నిష్పత్తి ఇలా ఉంటుంది.

I. 4స్థి.పె. +2అ.పె. +2అ.వి.; మొ.పె = 6, లా' = $33\frac{1}{3}$%

II. 15స్థి.పె. +3అ.పె. +3అ.వి.; మొ.పె. = 18, లా' = $16\frac{2}{3}$%

అదనపు విలువ పరిమాణం సగం పెరిగింది. కాగా లాభం రేటు సగం పడిపోయింది. అయితే మొత్తం సామాజిక పెట్టుబడిపైన లెక్కించబడిన అదనపు విలువే లాభం. లాభం మొత్తం సామాజికంగా అదనపు విలువ మొత్తానికి సమానం. కనుక లాభ పరిమాణం మొత్తం 50% పెరిగింది. అప్పుడు మొత్తం అడ్వాన్సయిన పెట్టుబడితో పోల్చినపుడు అది సాపేక్షంగా ఎంతో పడిపోయినప్పటికీ సార్వత్రిక లాభం రేటు రీత్యా పడిపోయినప్పటికీ, లాభ నిరపేక్ష పరిమాణం మాత్రం పెరిగింది. పెట్టుబడి పనిలో పెట్టే కార్మికుల సంఖ్య, అది చలనంలో ఉంచే శ్రమ పరిమాణం, అది పిండుకొనే అదనపు శ్రమ మొత్తం పరిమాణం, అది సృష్టించే అదనపు విలువ మొత్తం పరిమాణం. కనుక అది సృష్టించే లాభం మొత్తం పరిమాణం పెరగగలవు. లాభం రేటు అంతకంతకు పడిపోతున్నప్పటికీ ఇవన్నీ అంతకంతకు పెరుగుతాయి. ఇలా జరగటం మాత్రమే కాదు. తాత్కాలికమైన ఆటుపోట్లను మినహాయిస్తే, పెట్టుబడిదారీ ఉత్పత్తి ప్రాతిపదికపైన అది అలా జరిగితీరాలి.

పెట్టుబడిదారీ ఉత్పత్తి ప్రక్రియ సారభూతాత్మికంగా ఏకకాలంలో ఒక సంచయన ప్రక్రియ కూడా. పెట్టుబడిదారీ ఉత్పత్తి అభివృద్ధితో పాటు శ్రమ ఉత్పాదకత పెరుగుతున్నకొద్దీ, పనిలో పెట్టబడిన శ్రమశక్తి స్థిరంగా ఉన్నప్పటికీ, కేవలం పునరుత్పత్తి చేయాల్సిన లేదా కాపాడవలసిన విలువ మొత్తం పెరుగుతూనే ఉంటుందని మనం ఇంతకు ముందు గమనించాం. అయితే సామాజిక శ్రమ ఉత్పాదకత అభివృద్ధితో పాటు, ఉత్పాదిత ఉపయోగ విలువల మొత్తం మరింతగా పెరుగుతాయి.

ఉత్పత్తి సాధనాలు ఈ ఉపయోగ విలువల్లో ఒక భాగం. అలాగే దేన్ని స్వాయత్తం చేసుకోవడం ద్వారా ఈ అదనపు శ్రమ పెట్టుబడిగా తిరిగి మార్చబడుతుందో ఆ అదనపు శ్రమ ఈ ఉత్పత్తి సాధనాల విలువపై గాక (జీవితావసరాలతో సహా) వాటి పరిమాణంపై ఆధారపడుతుంది. ఎందుకంటే ఉత్పత్తి ప్రక్రియలో కార్మికులకు ఉత్పత్తి సాధనాల విలువతో ప్రమేయం లేదు. వాటి ఉపయోగ విలువతో మాత్రమే వారికి సంబంధం ఉంది. అయితే సంచయనం దానితోపాటు జరిగే పెట్టుబడి కేంద్రీకరణ ఉత్పాదకతను పెంచే వస్తురూప సాధనం. కాగా ఉత్పత్తి సాధనాల పెరుగుదలలో శ్రామిక జనాభా పెరుగుదల, కొత్త శ్రామిక జనాభా సృష్టి చేరివున్నాయి. ఇది అదనమే. పెట్టుబడికి అనుగుణంగా ఉండే క్రమం దాని మొత్తం అవసరాలను సైతం మించిపోయి అధిక శ్రామిక జనాభాకు దారితీసే క్రమం. తాను పనికి పురమాయించిన శ్రామిక జనాభాకు మించి అదనపు పెట్టుబడి ఉన్నప్పుడు అది రెండు రకాల ప్రభావాన్ని కలిగిస్తుంది. ఒకవైపున అది వేతనాలను పెంచటం ద్వారా కార్మికుల సంతానాన్ని అకాలమరణానికి గురిచేసే ప్రతికూల పరిస్థితుల తీవ్రతను తగ్గిస్తుంది. వారి మధ్య వివాహాలను మరింత సుకరం చేస్తుంది. ఆ రకంగా క్రమంగా జనాభాను వృద్ధిచేస్తుంది. మరోవైపున సాపేక్ష అదనపు విలువను ఇచ్చే (యంత్రాలను ప్రవేశపెట్టడం, మెరుగుపరచడం లాంటి) పద్ధతులను అమలుపరచడం ద్వారా శీఘ్రంగా, కృత్రిమంగా సాపేక్ష అదనపు జనాభాను సృష్టిస్తుంది. ఆ పరిస్థితి కూడా అధిక జనాభా వృద్ధికి వీలుకల్పిస్తుంది. ఎందుకంటే పెట్టుబడిదారీ ఉత్పత్తిలో దారిద్ర్యం మరింత జనాభాను పెంచుతుంది. కాబట్టి పెట్టుబడిదారీ ఉత్పత్తి ప్రక్రియలో కేవలం ఒక భాగమైన పెట్టుబడిదారీ సంచయన ప్రక్రియ స్వభావం నుంచి తెలిసేది ఏమంటే పెట్టుబడిగా మార్చాల్సిన ఉత్పత్తి సాధనాల పరిమాణం పెరుగుదలతో అదేస్థాయిలో, ఒకేసారి అంతకంటే ఎక్కువగా శ్రామిక జనాభా, దోచుకోబడే ఈ జనాభా కూడా పెరుగుతుంది. కనుక ఉత్పత్తి ప్రక్రియ సంచయన ప్రక్రియను పురోగమించేకొద్దీ అందుబాటులో ఉండే స్వాయత్తమయ్యే అదనపు శ్రమ పెరుగుతుంది. కనుక సామాజిక పెట్టుబడి స్వాయత్తం చేసుకొనే లాభం యొక్క నిరపేక్ష పరిమాణం పెరిగితీరాలి. కాని దాని పరిమాణం పెరుగుదలతోపాటు, ఉత్పత్తి సంచయనాలకు సంబంధించిన అవే నియమాలు పెట్టుబడిలోని అస్థిర భాగం విలువకంటే సజీవశ్రమలో మదుపు పెట్టిన ఈ భాగం విలువకంటే స్థిర భాగం విలువను అంతకంతకు మరింత శీఘ్రంగా పెంచుతూంది. కనుక అవే నియమాలు సామాజిక పెట్టుబడికి అంతకంతకు పెరిగే లాభం నిరపేక్ష పరిమాణాన్ని, అంతకంతకు పడిపోతున్న లాభం రేటును సృష్టిస్తాయి.

పెట్టుబడిదారీ ఉత్పత్తి పురోగమించటంతోపాటు, దానివల్ల సామాజిక శ్రమ ఉత్పాదకత అభివృద్ధి చెందటంతోపాటు, ఉత్పత్తి శాఖలు, ఉత్పాదితాలు అనేక రెట్లు పెరగడంతోపాటు ఒకే పరిమాణంలోని విలువ రానురాను మరిన్ని ఉపయోగ విలువలకు, సుఖాలకు ప్రాతినిధ్యం వహిస్తుందన్న అంశాన్ని మనం ఇక్కడ పూర్తిగా ఉపేక్షిద్దాం.

పెట్టుబడిదారీ ఉత్పత్తి, సంచయనాల అభివృద్ధి శ్రమ ప్రక్రియలను రానురాను మరింత విస్తృత స్థాయిలోకి పెంచుతుంది. ఆ విధంగా వారి ప్రమాణాలను హెచ్చిస్తుంది. అందుకనుగుణంగా ప్రతి విడి సంస్థకు మరింత పెద్ద పెట్టుబడులు అవసరమయ్యేలా చేస్తుంది. పెట్టుబడుల అధికాధిక

కేంద్రీకరణ (దానితోపాటుగా దానికన్నా తక్కువ స్థాయిలో అయినప్పటికీ పెట్టుబడిదారుల సంఖ్య పెరుగుదల) పెట్టుబడిదారీ ఉత్పత్తి, సంచయనాల పాదార్థిక అవసరాలలో ఒకటి. దాని ఫలితాలలో కూడా ఒకటి. దానితోపాటు దాన్ని ప్రభావితం చేస్తూ, దానితో ప్రభావితమవుతూ సంభవించే పరిణామ మేమిటంటే దాదాపు ప్రత్యక్ష ఉత్పత్తిదారులుగా ఉన్న వారి ఆస్తిపాస్తులను గుంజుకోవడం అంతకంతకు ఎక్కువవుతుంది. వ్యష్టి పెట్టుబడిదార్లు రానురాను భారీ సంఖ్యలో కార్మికుల్ని తమ పట్టులోకి తెచ్చుకోగలగడం సహజం. (స్థిర పెట్టుబడితో పోల్చినపుడు అస్థిర పెట్టుబడి ఎంతగా పడిపోయినప్పటికీ ఇది జరుగుతుంది.) లాభం రేటు పడిపోయినప్పటికీ, దాంతోబాటు వారు స్వాయత్తం చేసుకొనే అదనపు విలువ పరిమాణం, లాభం పరిమాణం పెరగడం కూడా సహజం. వ్యష్టి పెట్టుబడిదార్ల ఆధిపత్యంలో కార్మికులను కేంద్రీకరించే కారణాలు, మదుపు పెట్టబడిన నిశ్చల పెట్టుబడి, సహాయక ముడి పదార్థాల పరిమాణాన్ని పనిలో పెట్టబడిన సజీవ శ్రమతో పోలిస్తే, అపారంగా పెంచే కారణాలే.

ఒక నిర్దిష్ట శ్రామిక జనాభా ఉందనుకొంటే పనిదినాన్ని పొడిగించటం ద్వారాగానీ లేదా తీవ్రతరం చేయటం ద్వారాగాని లేదా శ్రమ ఉత్పాదకత పెరుగుదల వల్ల వేతనాల విలువ తగ్గడం ద్వారాగానీ అదనపు విలువ రేటు పెరిగితే, అదనపు విలువ పరిమాణం, లాభం పరిమాణం పెరుగుతాయి అనీ, స్థిర పెట్టుబడితో పోల్చినపుడు అస్థిర పెట్టుబడి సాపేక్షంగా పడిపోయినప్పటికీ ఇది ఇలాగే జరుగుతుందనీ సూచించడానికి ఇక్కడ ప్రాసంగికంగా వాటిని ప్రస్తావిస్తే చాలు.

సామాజిక శ్రమ ఉత్పాదకత యొక్క అదే అభివృద్ధి, మొత్తం పెట్టుబడితో పోల్చినపుడు అస్థిర పెట్టుబడి సాపేక్ష క్షీణతగా వ్యక్తమయ్యే అవే నియమాలు ఈ సంచయనం మళ్ళీ ఉత్పాదకత మరింత పెంపొందడానికి అస్థిర పెట్టుబడి సాపేక్షంగా మరింత తగ్గడానికి తొలి మెట్టు అవుతుంది. ఈ విధమైన అదే అభివృద్ధి తద్వారా వీలుకల్పించబడిన సంచయనంగా మొత్తం తాత్కాలికమైన ఆటుపోట్లను మినహాయిస్తే, పనిలో పెట్టబడిన మొత్తం శ్రమ శక్తి రానురాను మరింతగా పెరగటంగాను, అదనపు విలువ యొక్క పరిమాణం పెరుగుదలగానూ, అందువల్ల లాభం యొక్క పరిమాణం పెరుగుదలగానూ వ్యక్తమవుతుంది.

ఒకే రకం కారణాల మూలంగా లాభం రేటు తగ్గడం, లాభం నిరపేక్ష పరిమాణం పెరగడం జరుగుతుందన్న ద్విపార్శ్వ నియమం యొక్క రూపం ఏమైవుండాలి? నిర్ణీత పరిస్థితులలో స్వాయత్తమైన అదనపు శ్రమ మొత్తం అందువల్ల అదనపు విలువ మొత్తం పెరుగుతుంది. మొత్తం పెట్టుబడికి సంబంధించిన మేరకు లేదా దానిలో ఒక సమభాగమైన విడి పెట్టుబడికి సంబంధించిన మేరకు, లాభం అదనపు విలువ సర్వసమాన పరిమాణాలు అన్న వాస్తవంపై ఆధారపడిన నియమం అని చెప్పాలా?

మనం ఒక పెట్టుబడిలోని ఒక సమభాగాన్ని ఉదాహరణకు 100ను తీసుకొని దానిపై లాభం రేటును లెక్కిద్దాం. ఈ 100 మొత్తం పెట్టుబడి సగటు అంతర్నిర్మాణాన్ని ఉదాహరణకు $80_{\text{స్థి. పె.}}+20_{\text{అ. పె.}}$ ని సూచిస్తోంది అనుకుందాం. వివిధ ఉత్పత్తి శాఖల్లో సగటు లాభం రేటు ప్రతి విడి పెట్టుబడి అంతర్నిర్మాణాన్ని బట్టి కాక సగటు సామాజిక అంతర్నిర్మాణాన్ని బట్టి నిర్ణయించబడు తుందని మనం ఇంతకు ముందు ఈ గ్రంథం రెండవ భాగంలో గమనించాం. స్థిర పెట్టుబడితో

పోలిస్తే, మొత్తం పెట్టుబడి 100తో పోలిస్తే అస్థిర పెట్టుబడి తగ్గిపోతుంది కనుక లాభం రేటు, అదనపు విలువ సాపేక్ష పరిమాణం, అనగా ముందస్తు పెట్టుబడి 100కు లాభానికి మధ్య ఉన్న నిష్పత్తి, శ్రమ తీవ్రత యథాతథంగా ఉన్నప్పటికీ లేదా పెరిగినప్పటికీ కూడా పడిపోతుంది. అయితే పడిపోయేది సాపేక్ష పరిమాణం మాత్రమే కాదు లేదా మొత్తం పెట్టుబడి 100 పిండుకొన్న అదనపు విలువ పరిమాణం లేదా లాభ పరిమాణం నిరపేక్షంగా పడిపోతుంది. అదనపు విలువ రేటు 100% ఉంటే, 60$_{\text{స్థి.పె.}}$+40$_{\text{అ.పె.}}$ అంతర్నిర్మాణం గల పెట్టుబడి 40 అదనపు విలువను, కనుక లాభాన్ని ఉత్పత్తి చేస్తుంది. 70$_{\text{స్థి.పె.}}$+30$_{\text{అ.పె.}}$ అంతర్నిర్మాణం గల పెట్టుబడి 30 లాభాన్ని ఉత్పత్తి చేస్తుంది. 80$_{\text{స్థి.పె.}}$+20$_{\text{అ.పె.}}$ పెట్టుబడి విషయంలో లాభం 20కి పడిపోతుంది. ఈ పడిపోవడం అన్నది అదనపు విలువ పరిమాణానికి లేక లాభం పరిమాణానికి వర్తిస్తుంది. మొత్తం పెట్టుబడి అయిన 100 తక్కువ సజీవ శ్రమను పనిలో పెట్టడం వల్ల శ్రమదోపిడీ తీవ్రత యథాతథంగా ఉన్న స్థితిలో ఈ పెట్టుబడి 100 తక్కువ అదనపు శ్రమను చలనంలో ఉంచుతుంది. కనుక తక్కువ అదనపు విలువను ఉత్పత్తి చేస్తుంది. సామాజిక పెట్టుబడి నుంచి ఏ సమవిభాగాన్ని తీసుకొన్నప్పటికీ, అనగా అదనపు విలువను కొలవటానికి ఉపయోగించే ప్రమాణంగా సగటు అంతర్నిర్మాణం గల ఏ పెట్టుబడిని తీసుకొన్నప్పటికీ, (లాభాన్ని గణించే అన్ని సందర్భాల్లోనూ అమల్లో ఉన్నది ఈ పద్ధతే.) అదనపు విలువ సాపేక్ష పతనం, సాధారణంగా దాని నిరపేక్ష పతనంతో సమానంగా ఉంటుంది. పైన ఇచ్చిన ఉదాహరణలో లాభం రేటు 40% నుంచి 30% దాని నుంచీ 20% పడిపోయింది. ఎందుకంటే నిజానికి అదే పెట్టుబడి ఉత్పత్తి చేసిన అదనపు విలువ మొత్తం, లాభం మొత్తం 40 నుంచి 30కి దాని నుంచి 20కి పడిపోయింది. అదనపు విలువను కొలవటానికి ఉపయోగిస్తున్న పెట్టుబడి విలువ పరిమాణం 100 అని ఇవ్వబడింది. కనుక ఈ నిర్ణీత పరిమాణానికి అదనపు విలువకూ మధ్య గల నిష్పత్తి పతనం అన్నది, అదనపు విలువ, లాభాల నిరపేక్ష పరిమాణం పతనం కావడానికి మరో వ్యక్తీకరణ మాత్రమే. ఇది నిజానికి చర్వితచరణమే. అయితే ఇలా తగ్గిపోవడం అన్న వాస్తవాన్ని ముందు నిరూపించినట్లు, పెట్టుబడిదారీ ఉత్పత్తి ప్రక్రియ అభివృద్ధి స్వభావం నుంచి తలెత్తుతుంది.

మరోవైపున ఒక నిర్ణీత పెట్టుబడి విషయంలో అదనపు విలువను, లాభాన్ని తగ్గిపోయేలా చేసే కారణాలే, శాతం లెక్కతోకట్టే లాభం రేటును తగ్గించే కారణాలే అదనపు విలువ మొత్తం పరిమాణాన్ని, సామాజిక పెట్టుబడి స్వాయత్తం చేసుకొనే లాభం పరిమాణాన్ని (పెట్టుబడిదారులందరూ కలిసి స్వాయత్తం చేసుకొనే లాభం పరిమాణాన్ని) పెంచుతాయి. ఇది ఎలా జరుగుతుంది? ఇది జరగగల ఏకైక మార్గం ఏమిటి? వైరుధ్యంలా కనిపిస్తున్న దీని వెనుక ఉన్న పరిస్థితులేమిటి?

సామాజిక పెట్టుబడిలో, ఏ సమ విభాగమైనా, ఉదాహరణకు 100, ఒక నిర్ణీత పరిమాణం కనుక సగటు సామాజిక అంతర్నిర్మాణం గల ఏ 100 అయినా ఒక నిర్ణీత పరిమాణం, దీని విషయంలో లాభం రేటు తగ్గుదల, లాభం మొత్తం పరిమాణం తగ్గుదలతో ఏకీభవిస్తుంది; ఎందుకంటే ఇక్కడ కొలమానంగా ఉన్న పెట్టుబడి ఒక స్థిర పరిమాణం, సామాజిక పెట్టుబడి పరిమాణం, విడిపెట్టుబడిదార్ల చేతులలో ఉంటే పెట్టుబడి పరిమాణంలాగానే అస్థిరం, అది మారుతుంది. మన ఊహ ప్రకారం అస్థిర పెట్టుబడి తగ్గుదలకు విలోమంగా అది మారుతుంది.

ఇంతకు ముందు ఉదాహరణలో పెట్టుబడి అంతర్నిర్మాణ శాతం 60స్థి.పె.+40అ.పె. ఉన్నప్పుడు దాని అదనపు విలువ లేదా లాభం 40 కనుక లాభం రేటు 40%. మొత్తం పెట్టుబడి ఈ దశలో పది లక్షలు అనుకుందాం. అపుడు మొత్తం అదనపు విలువ, మొత్తం లాభం నాలుగు లక్షలు అవుతుంది. తర్వాత అంతర్నిర్మాణం 80స్థి.పె.+20అ.పె. అయిందనుకుందాం. శ్రమదోపిడీ స్థాయి యథాతథంగా ఉంటే అదనపు విలువ లేదా లాభం ప్రతి 100పైన 20 ఉంటుంది. అయితే అదనపు విలువ మొత్తం పరిమాణం లేదా లాభం ఇంతకు ముందే వివరించినట్లుగా పెరుగుతుంది. లాభం రేటు అదనపు విలువ ఉత్పత్తి రేటు ప్రతి 100 పెట్టుబడి మీదా తగ్గిపోయినప్పటికీ నాలుగు లక్షల నుంచి (4,40,000) నాలుగు లక్షల నలభైవేలకు మొత్తం లాభం పెరిగిందనుకుందాం. అంటే ఈ కొత్త అంతర్నిర్మాణం సమయంలో మొత్తం పెట్టుబడి 22,00,000కు పెరిగి ఉంటుంది. చలనంలో ఉన్న మొత్తం పెట్టుబడి 220% పెరిగింది కాగా లాభం రేటు మొత్తం 50% పడిపోయింది. మొత్తం పెట్టుబడి కేవలం రెట్టింపు మాత్రమే అయివుంటే అది 20% లాభం రేటును పొందాలంటే పది లక్షల తొలి పెట్టుబడి 40% చొప్పున ఉత్పత్తి చేసిన అదనపు విలువను ఉత్పత్తి చేయాల్సి ఉంటుంది. అది రెట్టింపుకంటే తక్కువ పెరిగితే 10,00,000ల తొలి పెట్టుబడి ఉత్పత్తి చేసిన దానికంటే తక్కువ అదనపు విలువను లేక లాభాన్ని ఉత్పత్తి చేసి ఉంటుంది. పాత అంతర్నిర్మాణంలో పాత పెట్టుబడి 10,00,000లు తన అదనపు విలువను 4,00,000 నుంచి, 4,40,000కు పెంచాలంటే అది 10,00,000 నుంచి 11,00,000కు పెరగాలి.

అస్థిర పెట్టుబడి సాపేక్షంగా తగ్గటమూ, సామాజిక శ్రమ ఉత్పాదకత అభివృద్ధి చెందటం కారణంగా రానురాను మరింత పెద్ద పరిమాణంలో మొత్తం పెట్టుబడి అదే పరిమాణం గల శ్రమశక్తిని చలనంలో ఉంచుతుందని, అదే పరిమాణం గల అదనపు శ్రమను బయటకు పిండుతుందని ఇంతకు ముందు[1] నిర్వచించిన నియమమే మనకు ఇపుడు మరోసారి తటస్థపడుతోంది. దాని ఫలితంగా పెట్టుబడిదారీ ఉత్పత్తి పురోగమనానికి అనుగుణంగా శ్రామిక ప్రజలు సాపేక్షంగా మిగిలిపోవటం సాధ్యమవుతుంది. ఇది సామాజిక శ్రమ ఉత్పాదకత తగ్గటం వల్ల కాక పెరగటం వల్లనే జరిగింది. కనుక ఇది శ్రమకు, జీవనభృతి సాధనాలకు మధ్య బొత్తిగా సమతూకం లేకపోవడం వల్లనో లేదా శ్రమకు ఈ జీవన భృతి సాధనాలను ఉత్పత్తి చేసే సాధనాలకు మధ్య పొంతన లేకపోవడం వల్లనో తలెత్తదు. ఇది పెట్టుబడిదారీ పద్ధతిలో శ్రమను దోచుకోవటం వల్ల తలెత్తిన వైషమ్యం. ఇది పెట్టుబడి అంతకంతకు పెరుగుతూపోవడానికీ, పెరిగిపోతున్న జనాభా యొక్క ఆవశ్యకత ఆ పెట్టుబడికి సాపేక్షంగా తగ్గిపోవడానికి మధ్య గల వైషమ్యం.

లాభం రేటు 50% పడిపోతే అది సగం తగ్గుతుంది. లాభం మొత్తం యథాతథంగా ఉండాలంటే, పెట్టుబడి రెట్టింపు కావాలి. తగ్గిపోతున్న లాభం రేటులో లాభం మొత్తం యథాతథంగా ఉండాలంటే, మొత్తం పెట్టుబడి పెరుగుదలను సూచించే గుణకం, లాభం రేటు పతనాన్ని సూచించే భాజకంతో సమానం కావాలి. లాభం రేటు 40 నుంచి 20కి పడిపోతే, అదే ఫలితాన్ని సాధించటానికి మొత్తం పెట్టుబడి విలోమంగా 20:40 రేటున పెరగాలి. లాభం రేటు 40 నుంచి 8కి పడిపోతే

1. పెట్టుబడి సంపుటం I.

పెట్టుబడి 8:40 రేటున, అనగా 5 రెట్లు పెరగాలి. 10,00,000 పెట్టుబడి 40% చొప్పున 4,00,000 లను ఉత్పత్తి చేస్తే, 50,00,000ల పెట్టుబడి అదేరకంగా 8% చొప్పున 4,00,000లు ఉత్పత్తి చేస్తుంది. ఫలితం యథాతథంగా మరింత అధికంగా ఉండాలంటే అపుడు లాభం రేటు పడిపోయే రేటుకంటే ఎక్కువ రేటుతో పెట్టుబడి పెరగాలి. మరోలా చెప్పాలంటే, మొత్తం పెట్టుబడిలో అస్థిర భాగం శాతం పడిపోతున్నప్పటికీ, మొత్తం పెట్టుబడిలో దాని అస్థిర నిరపేక్ష పరిమాణం యథాతథంగా ఉండకుండా పెరగాలంటే అస్థిర పెట్టుబడి శాతం పడిపోతున్న దానికంటే ఎక్కువ వేగంగా మొత్తం పెట్టుబడి పెరగాల్సి ఉంటుంది. దాని కొత్త అంతర్నిర్మాణంలో శ్రమశక్తిని కొనుగోలు చేయటానికి పాత అస్థిర పెట్టుబడి కంటే ఎక్కువ పరిమాణం అవసరం అయేంత గణనీయంగా మొత్తం పెరగాలి. 100 పెట్టుబడితో అస్థిర పెట్టుబడి భాగం 40 నుంచి 20కి పడిపోతే, 40 కంటే ఎక్కువ అస్థిర పెట్టుబడిని పనిలో పెట్టగలగటానికి 200కు మించిన మొత్తం పెట్టుబడి అవసరం అవుతుంది.

దోపిడీకి గురయ్యే కార్మిక జనాభా సంఖ్య యథాతథంగా ఉండి, కేవలం పనిదిన పరిమాణం, తీవ్రత మాత్రమే పెరిగినప్పటికీ మదుపు పెట్టిన పెట్టుబడి మొత్తం పెరగాల్సి ఉంటుంది. ఎందుకంటే పెట్టుబడి అంతర్నిర్మాణం మారిన తర్వాత పాత దోపిడీ పరిస్థితులలో అదే మొత్తం శ్రమను పనిలో పెట్టాలంటే అధిక మొత్తం పెట్టుబడి అవసరమవుతుంది.

పెట్టుడిదారీ ఉత్పత్తి ప్రగతితో కొనసాగే సామాజిక శ్రమ ఉత్పాదకత అభివృద్ధి ఒకవైపున అంతకంతకు పడిపోయే లాభం రేటు ధోరణిలోనూ, మరోవైపున స్వాహా చేయబడే అదనపు విలువ లేదా లాభం మొత్తం పరిమాణం అంతకంతకు పెరగటంలోనూ వ్యక్తమవుతుంది. మొత్తం మీద అస్థిర పెట్టుబడీ, లాభమూ సాపేక్షంగా తగ్గటంతోపాటు అవి రెండూ (అదనపు విలువ, లాభం) నిరపేక్షంగా పెరుగుతూ ఉంటాయి. మొత్తం పెట్టుబడి పెరుగుదల లాభం రేటు పడిపోవడం కంటే వేగంగా వ్యక్తమవుతుందని మనం గమనించాం. ఉన్నత స్థాయి అంతర్నిర్మాణం గల పెట్టుబడిలో నిరపేక్షంగా పెరిగిన అస్థిర పెట్టుబడి నియుక్తం కావాలంటే, మొత్తం పెట్టుబడి ఉన్నత స్థాయి అంతర్నిర్మాణానికి కేవలం అనుగుణంగా మాత్రమే గాక, మరింత వేగంగా పెరగాల్సి ఉంటుంది. అంటే పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం అభివృద్ధి చెందుతున్నకొద్దీ, పెరిగిన శ్రమశక్తిని వినియోగించటం మాట అటుంచి, అదే శ్రమశక్తిని పనిలో పెట్టాలన్నా మరింత పెద్ద పరిమాణంలో పెట్టుబడి అవసరమవుతుంది. ఆ రకంగా పెట్టుబడిదారీ పునాదిపైన నిరంతరాయంగా పెరిగే శ్రమ ఉత్పాదకత తప్పనిసరిగానూ, శాశ్వతంగానూ, శ్రామిక ప్రజలు అధికంగా (మిగులు) ఉన్నట్లు కనిపించే స్థితిని సృష్టిస్తుంది. అస్థిర పెట్టుబడి స్థిర పెట్టుబడిలో ఇంతకు ముందులా $\frac{1}{2}$ కాక $\frac{1}{6}$ మాత్రమే ఉంటే అదే మొత్తం శ్రమ శక్తిని పనిలో పెట్టడానికి మొత్తం పెట్టుబడి మూడింతలు కావాల్సి ఉంటుంది. దానికి రెండింతలు శ్రమశక్తిని పనిలో పెట్టాలంటే మొత్తం పెట్టుబడి ఆరు రెట్లు పెరగాలి.

లాభంరేటు పడిపోయే ధోరణికి సంబంధించిన నియమాన్ని రాజకీయ అర్థశాస్త్రం, ఇంత వరకు వివరించలేకపోయింది. వ్యష్టి పెట్టుబడిదారునికీ, సామాజిక పెట్టుబడికీ పెరుగుతున్న లాభం మొత్తాన్ని అంటే లాభం మొత్తం పరిమాణం పెరగటాన్ని చూపించడం ద్వారా ఊరట చెందింది. అయితే ఇది కూడా కేవలం, స్వయం విదితవాస్తవంపైన, ఊహాగానంపైన ఆధారపడినదే.

లాభం పరిమాణం రెండంశాలపైన – మొదటిది లాభం రేటుపైన, రెండోది ఈ రేటులో మదుపు పెట్టబడిన పెట్టుబడి మొత్తంపైన ఆధారపడి ఉంటుందనటం కేవలం పునరుక్తి మాత్రమే. అలాగే లాభం రేటు పడిపోయినప్పటికీ అదే సమయంలో లాభం పరిమాణం పెరగడం సాధ్యమే అని అనటం ఈ పునరుక్తి నుంచి ఉత్పన్నమైన ఉప సిద్ధాంతం మాత్రమే. మనం ఒక్క అడుగు ముందుకు వేయటానికి కూడా ఇది సాయం చేయదు. లాభం పరిమాణం పెరగకుండానే పెట్టుబడి పెరగవచ్చు. అంతేకాదు లాభం పరిమాణం పడిపోతున్నప్పుడు కూడా పెట్టుబడి పెరగవచ్చు. ఎందుకంటే 25% చొప్పున 100 పెట్టుబడి 25 ఇస్తుంది, 5% చొప్పున 400 పెట్టుబడి 20 లాభాన్ని మాత్రమే ఇస్తుంది.[1] లాభం రేటును పడిపోయేలా చేసే కారణాలే పెట్టుబడి సంచయనానికి అంటే, అదనపు పెట్టుబడి రూపొందటానికి దారితీస్తే, ప్రతి అదనపు పెట్టుబడి అదనపు శ్రమను వినియోగించి, అదనంగా అదనపు విలువను ఉత్పత్తి చేస్తే, మరోవైపున కేవలం లాభం రేటు పడిపోవడంలో స్థిర పెట్టుబడి దానితోపాటు మొత్తం తొలి పెట్టుబడి పెరుగుదల అంతర్గతంగా ఉంటే అపుడు ఈ పరిణామంలోని నిగూఢత్వం ఎగిరిపోతుంది. లాభం రేటు తగ్గుదలతోపాటు, లాభం మొత్తం పెరగటం సాధ్యమన్న అంశాన్ని మటుమాయం చేయడానికి తమ అంచనాలతో కొంతమంది కావాలని ఎలా తప్పుడు లెక్కలు ఇవ్వటానికి పాల్పడ్డారో మనం తర్వాత చూద్దాం.[2]

---

1. "భూమిపైన పెట్టుబడి సంచయనం వల్ల, వేతనాల పెరుగుదల వల్ల పెట్టుబడి లాభాల రేట్లు తగ్గిపోవచ్చు. అయినప్పటికీ లాభాల మొత్తం పరిమాణం పెరుగుతుంది. ఉదాహరణకు 1,00,000 పౌన్లు పెట్టుబడి పదే పదే పోగుబడటం వలన లాభం రేటు 20 నుంచి, 19కి, 18కి, 17%కి పడిపోయిందనుకుందాం. ఇది నిరంతరం పడిపోతున్న రేటు. అయితే పెట్టుబడి యజమానులకు అందిన లాభాల మొత్తం మాత్రం పెరుగుతూనే వుంటుందని మనం భావించవలసి వుంటుంది. పెట్టుబడి 1,00,000 పౌనులు ఉన్నప్పటి కన్నా 2,00,000లు వున్నప్పుడు లాభ పరిమాణం ఎక్కువగా వుంటుంది. అది 3,00,000లు వున్నప్పుడు లాభం మొత్తం ఇంకా ఎక్కువగా వుంటుంది. ఈ విధంగా అంతకంతకు పెరుగుతూంటుంది. ఇలా పెట్టుబడిలో వచ్చే ప్రతి పెరుగుదలతో లాభం రేటు తగ్గుతూపోయిన లాభ పరిమాణం పెరుగుతుంది. అయితే ఈ పెరుగుదల కొంతకాలానికి మాత్రమే వర్తిస్తుంది. ఆ రకంగా ఒక 1,00,000 పైన 20% కన్నా 2,00,000 పైన 19% చొప్పున వచ్చే లాభం ఎక్కువగానే వుంటుంది. అలాగే 2,00,000ల పైన 19% కంటే 3,00,000ల పైన 18% చొప్పున వచ్చే లాభం ఎక్కువే. అయితే పెట్టుబడి బాగా పెద్ద స్థాయిలో సంచితం అయిన తర్వాత లాభం రేటు మరింతగా పడిపోయినపుడు, తదుపరి సంచయనం వల్ల లాభాల మొత్తం పరిమాణం తగ్గిపోతుంది. ఉదాహరణకు 10,00,000ల పెట్టుబడిపైన లాభం రేటు 7% ఉంటే, మొత్తం లాభం 70,000లు అవుతుంది. ఇపుడు 10,00,000లకు మరో 1,00,000 కలిపితే లాభం రేటు 6%కు పడిపోయిందనుకుందాం. అపుడు పెట్టుబడి యజమానులకు అంతకు ముందు లాభం కంటే 4000 పౌండ్లు తక్కువ లభిస్తుంది. పెట్టుబడి 10,00,000 నుంచి 11,000,000కు పెరిగినప్పటికి లాభం అలా పడిపోయింది." రికార్డో. **పొలిటికల్ ఎకానమీ** అధ్యాయం VI (వర్క్స్, సంపాదకుడు మేక్‌కుల్లక్, 1852, పుటలు 68, 69) అయితే వాస్తవ మేమిటంటే, ఇక్కడ పెట్టుబడి 10,00,000 నుంచి 11,00,000కు అనగా 10% పెరిగినట్లు లాభం రేటు 7నుంచి 6కు అనగా $14\frac{2}{7}$ % పడిపోయినట్లు ఊహించుకుంటున్నారు. **హింక్ ఇల్లే లేక్రియే** (పబ్లియస్, టెరెన్స్, ఆండ్రియా ఏక్ట్ I, 1వ రంగం - సం)
2. కారల్ మార్క్స్, అదనపు విలువ సిద్ధాంతాలు.

లాభం సార్వత్రిక రేటు పడిపోయే ధోరణికి కారణభూతమైన అంశాలే ఎలా పెట్టుబడి సంచయనం త్వరితగతిని జరిగేలా చేస్తాయో, పర్యవసానంగా ఆ పెట్టుబడి స్వాయత్తం చేసుకొనే అదనపు శ్రమ (అదనపు విలువ, లాభం) నిరపేక్ష పరిమాణం లేదా దాని మొత్తం రాశి ఎలా పెరిగేలా చేస్తాయో లోగడ నిరూపించాము. పోటీలోనూ, పోటీ ప్రతినిధుల చైతన్యంలోనూ ప్రతీది తలకిందులుగా కనిపించినట్లే ఈ నియమం కూడా పరస్పర వైరుధ్యాల్లా కనిపిస్తున్న ఈ రెండు అంశాల మధ్య ఈ అవసర, అంతర్గత సంబంధం కూడా కనిపిస్తుంది కనుక, పైన పేర్కొన్న నిష్పత్తుల పరిధిలో ఎక్కువ లాభాలను సంపాదిస్తున్నట్లు కనిపిస్తున్న చిన్నపెట్టుబడిదారుని కంటే పెద్దపెట్టుబడితో వ్యవహరిస్తున్న పెట్టుబడిదారు పెద్దమొత్తంలో లాభాన్ని పొందుతాడనేది స్పష్టమే. అంతేకాక కొన్ని పరిస్థితుల్లో చిన్న పెట్టుబడిదారులను ప్రక్కకు నెట్టి తాను మార్కెట్లో ప్రవేశించాలనుకున్నప్పుడు పెద్ద పెట్టుబడిదారు ఆచరణలో అలా ప్రవర్తిస్తాడని పరిస్థితిని స్థూలంగా పరిశీలించినా అర్థం అవుతుంది. సంక్షోభ సమయాల్లో ఇలా జరుగుతుంది. చిన్నవాళ్ళను ఊపిరి ఆడకుండా చెయ్యటానికి అతడు ఆ సందర్భంలో తన లాభం రేటును కావాలని తగ్గిస్తాడు. లాభం పడిపోవటానికి కారణాన్ని వ్యాపార విస్తరణకు, ఆ విధంగా పెట్టుబడి విస్తరణకు అంటగడుతున్నట్లు కనిపించే పరిణామాలను వ్యాపార పెట్టుబడి (దీన్ని ముందు మరింత సవివరంగా వర్ణిస్తాము.) ప్రత్యేకించి ప్రదర్శిస్తుంది. ఈ పొరపాటు భావనకు సంబంధించిన శాస్త్రీయమైన వివరణను తరువాత ఇస్తాం. స్వేచ్ఛాయుత పోటీలో ఉన్న, లేదా గుత్తాధిపత్యం కింద ఉన్న ఆయా వాణిజ్య విభాగాల్లోని లాభం రేట్లను పోల్చటం ద్వారా ఇటువంటి నిశిత దృష్టిలేని నిర్ధారణలు వస్తాయి. పోటీ ప్రతినిధుల బుర్రల్లో ఇటువంటి ఇంగితం లేని భావన ఎలా ఉంటుందో రోషర్‌ను చూస్తే అర్థం అవుతుంది. లాభం రేటు తగ్గటం "మరింత విజ్ఞాన యుతమైన, మానవతాయుతమైన విషయం" అంటాడు ఆయన.[1] ఈ సందర్భంలో లాభం రేటు పడిపోవటం, పెట్టుబడి పెరుగుదల ఫలితంగా, దానితో పాటు లాభం రేటు తక్కువుంటే జేబులో పడే లాభాల మొత్తం పెరుగుతుందనే పెట్టుబడిదారుని అంచనా ఫలితంగా కనిపిస్తుంది. ఈ మొత్తం భావన (ఆడమ్ స్మిత్ భావనను ఇక్కడ మినహాయించాలి. దాన్ని గురించి తరువాత ప్రస్తావిద్దాం.)[2] లాభం సార్వత్రిక రేటు అంటే ఉన్న పొరపాటు అవగాహనపైన ఆధారపడి ఉంది. సరుకుల నిజమైన విలువకు ఏకపక్షంగా ఎంతోకొంత లాభాన్ని జతచేయడం ద్వారా వాటి ధరలను నిర్ణయించటం జరుగుతుందనే అపోహపైన ఇది ఆధారపడి ఉంది. ఈ భావాలు ఎంత మొరటుగా ఉన్నప్పటికీ, పెట్టుబడిదారీ ఉత్పత్తి సహజ నియమాలు పోటీలో తలక్రిందులుగా కనిపించడం వల్ల అవి తప్పనిసరిగా తలెత్తుతాయి.

★ ★ ★

1. రోశ్చర్, డై గ్రుండ్లెజ్ డెర్ నేషనల్ ఎకానమీ 1858 - సం॥
2. మార్క్స్, అదనపు విలువ సిద్ధాంతాలు - సం.

ఉత్పాదకత అభివృద్ధి చెందటం వల్ల లాభం రేటు పడిపోవడంతోపాటు లాభ పరిమాణం పెరుగుతుందన్న నియమం మరో వాస్తవంలో వ్యక్తం అవుతుంది. ఒక పెట్టుబడి ఉత్పత్తి చేసిన సరుకుల ధరలు పడిపోవడంతోపాటు, వాటిలో నిక్షిప్తమై, వాటి అమ్మకం వల్ల చేతికందే లాభ పరిమాణం సాపేక్షంగా పెరుగుతుందనే వాస్తవంలో వ్యక్తమయ్యేది ఈ నియమమే.

ఉన్నత స్థాయి పెట్టుబడి అంతర్నిర్మాణం ద్వారా, నిరంతరాయంగా ఉత్పాదకత అభివృద్ధి, దానికి అనుగుణమైన ఉన్నత స్థాయి పెట్టుబడి అంతర్నిర్మాణం ద్వారా నిరంతరాయంగా తగ్గిపోయే శ్రమ పరిమాణంతో నిరంతరంగా పెరిగే ఉత్పత్తి సాధనాల పరిమాణాన్ని చలనంలో ఉంచుతాయి. కనుక మొత్తం ఉత్పాదితంతో ప్రతి ఒక సమభాగమూ, ప్రతి ఒక సరుకు లేదా మొత్తం ఉత్పాదితాల పరిమాణంలో ప్రతి ప్రత్యేక సరుకుల విభాగమూ మరింత తక్కువ సజీవ శ్రమను గ్రహిస్తుంది. వినియుక్త నిశ్చల పెట్టుబడి అరుగుదల రూపంలోనూ, ముడిపదార్థాలు, అనుబంధ పదార్థాల రూపంలోనూ దానిలో చేరిన పదార్థీకృత శ్రమ కూడా మరింత తక్కువగా ఉంటుంది. కనుక ఉత్పత్తి జరుగుతున్నప్పుడు ఉత్పత్తి సాధనాల్లో భౌతిక రూపం ధరించిన శ్రమను, క్రొత్తగా కలపబడిన శ్రమను తక్కువ పరిమాణంలో మాత్రమే ప్రతి ఒక్క సరుకు కలిగి ఉంటుంది. దీనివల్ల విడి సరుకు ధర పడిపోతుంది. అయితే నిరపేక్ష, సాపేక్ష అదనపు విలువ రేటు పెరిగితే విడి సరుకులలో ఉన్న లాభాల మొత్తం పెరగవచ్చు. సరుకులో ఇప్పుడు కొత్తగా కలిసిన శ్రమ తగ్గుతుంది. అయితే దానిలోని వేతనం చెల్లించబడిన విభాగంతో పోల్చితే, వేతనం చెల్లించని విభాగం పెరుగుతుంది. కానీ ఇది కొన్ని పరిమితులలో మాత్రమే జరుగుతుంది. ఉత్పత్తి అభివృద్ధి అవుతున్నకొద్దీ సజీవ శ్రమ నిరపేక్ష పరిమాణం విడిసరుకులలో రానురానూ మరింత తక్కువగా పొందుపరచబడుతుంది. కనుక వాటిలో ఉన్న ప్రతిఫలం ముట్టని శ్రమ మొత్తం కూడా అదే విధంగా తగ్గుతుంది. ఈ భాగం ప్రతిఫలం ముట్టిన భాగంతో పోల్చితే ఎంతగా పెరిగినప్పటికీ ఇది వర్తిస్తుంది. శ్రమ ఉత్పాదకత అభివృద్ధితో పాటు లాభం పరిమాణం ప్రతి విడి సరుకులోనూ గణనీయంగా తగ్గుతుంది. అదనపు విలువ రేటులో పెరుగుదల ఉన్నప్పటికీ ఇది వర్తిస్తుంది. లాభం రేటు పడిపోవడం లాగానే విడి సరుకులతో లాభం పరిమాణం తగ్గిపోవడం కూడా, స్థిర పెట్టుబడిగా ఉన్న అంశాలు చౌకకావడం వల్లనేమి, అదనపు విలువ రేటు నిర్ణీతమైనప్పుడూ లేక అది పడిపోతున్నప్పుడు సైతం లాభం రేటును పెంచే ఇతర పరిస్థితులవల్లనేమి ఆలస్యమవుతుంది, అంతే. వాటి గురించి ఈ గ్రంథం మొదటి భాగంలో వివరించటం జరిగింది.

పెట్టుబడి యొక్క మొత్తం ఉత్పాదితంగా ఉన్న మొత్తం విడి సరుకుల ధర పడిపోవడం అంటే, ఒక నిర్దిష్ట పరిమాణం గల శ్రమ మరింత ఎక్కువ పరిమాణం గల సరుకులలో వాస్తవ రూపం ధరించిందని అర్థం. కనుక ప్రతీ విడి సరకు ఇంతకు ముందుకంటే తక్కువ శ్రమను కలిగి ఉంటుంది. స్థిర పెట్టుబడిలో ఒక భాగం ధర, ఉదాహరణకు ముడి పదార్థం మొదలయిన వాటి ధర పెరిగినప్పటికీ ఇది వర్తిస్తుంది. కొన్ని సందర్భాలను మినహాయించే (ఉదాహరణకు శ్రమ ఉత్పాదకత వల్ల స్థిర, అస్థిర పెట్టుబడుల అంశాలు అన్నీ ఒకే విధంగా చౌక అయితే) అదనపు విలువ రేటు అధికంగా ఉన్నప్పటికీ లాభం రేటు పడిపోతుంది. ఎందుకంటే 1. కొత్తగా కలపబడిన తక్కువ శ్రమ పరిమాణం మొత్తంలో ప్రతిఫలం ముట్టని ఎక్కువ పరిమాణం గల భాగం సైతం ఇంతకు ముందు

ఎక్కువ పరిమాణంలో ఉన్న శ్రమలో ప్రతిఫలం ముట్టని తక్కువ పరిమాణం గల భాగం కంటే మరింత తక్కువగా ఉంటుంది. 2. ముడి సహాయక పదార్థాన్ని, నిశ్చల పెట్టుబడి అరుగుదలను సూచించే విలువ భాగంతో పోల్చినపుడు, కొత్తగా కలపబడిన శ్రమ విలువ భాగం తగ్గిపోతుంది అన్న వాస్తవం విడి సరుకులో పెట్టుబడి యొక్క ఉన్నతమైన అంతర్నిర్మాణం వ్యక్తం చేస్తుంది. విడి సరుకుల ధరలో వివిధ అంతర్ భాగాల నిష్పత్తిలో ఈ మార్పు, అనగా కొత్తగా కలపబడిన శ్రమ వాస్తవ రూపం ధరించిన భాగపు ధర – తగ్గటమూ, పెరగటమూ అన్నది, స్థిర పెట్టుబడితో పోల్చినపుడు అస్థిర పెట్టుబడి తగ్గుదలను విడి సరుకుల ధర ద్వారా వ్యక్తం చేసే రూపం. ఒక నిర్దిష్ట పరిమాణం గల పెట్టుబడికి, ఉదాహరణకు 100కు ఈ తగ్గుదల నిరపేక్షమైనట్లే పునరుత్పత్తి చెయ్యబడిన పెట్టుబడిలో ఒక సమ విభాగంగా ఉన్న ప్రతి విడి సరుకు విషయంలో కూడా అది నిరపేక్షమే. అయితే విడి సరుకు ధర యొక్క అంశాలను బట్టి మాత్రమే లెక్కిస్తే, అప్పుడు లాభం రేటు, అది వాస్తవంగా ఉన్న దానికి భిన్నంగా ఉంటుంది. దానికి గల కారణం ఇది :

(ఒక నిర్దిష్ట కాలానికి, వాస్తవంగా ఒక సంవత్సరానికిగానూ మొత్తం మదుపు పెట్టిన పెట్టుబడి పైన లాభం రేటు లెక్కింపబడుతుంది. ఒక ఏడాదిలో ఉత్పత్తి అయి, చేతికందిన అదనపు విలువ లేదా లాభం రేటు అన్నది మొత్తం పెట్టుబడికీ, అదనపు విలువకూ లేదా లాభానికీ మధ్య శాతంలో లెక్కగట్టబడిన నిష్పత్తి. కనుక ఒక సంవత్సరానికి కాకుండా, మదుపు పెట్టబడిన పెట్టుబడి యొక్క టర్నోవర్ పెట్టుబడి కాలానికి లెక్కించబడిన లాభం రేటుకు ఇది సమానం కానక్కరలేదు. పెట్టుబడి టర్నోవర్ కాలం సరిగ్గా ఒక సంవత్సరం అయితే అప్పుడు ఆ రెండూ ఏకీభవిస్తాయి.

మరోవైపున ఒక ఏడాది కాలంలో సంపాదించిన లాభం ఆ సంవత్సర కాలంలో ఉత్పత్తి అయి అమ్మబడిన సరుకులపైన లాభాల మొత్తం మాత్రమే! మనం లాభాన్ని సరుకుల ఉత్పత్తి వ్యయం పైన లెక్కిస్తే, లాభం రేటు = $\frac{\text{లా}}{\text{ఉ. వ్య.}}$ అవుతుంది. ఇక్కడ లా ఒక ఏడాదిలో వచ్చిన లాభం. ఉ.వ్య. అదే కాలంలో ఉత్పత్తి అయి అమ్మబడిన సరుకుల ఉత్పత్తి వ్యయం. $\frac{\text{లా}}{\text{ఉ. వ్య.}}$ లాభం రేటు వాస్తవ లాభం రేటు అయిన $\frac{\text{లా}}{\text{మొ. పె}}$ లో ఏకీభవించదు అన్నది స్పష్టం. $\frac{\text{లా}}{\text{మొ. పె.}}$ = మొత్తం లాభం/మొత్తం పెట్టుబడి. ఉ.వ్య = మొ.పె. అయితే తప్ప, అనగా ఈ పెట్టుబడి సరిగ్గా ఒక ఏడాదిలో టర్నోవర్ అయితే తప్ప అది సాధ్యం కాదు.

పారిశ్రామిక పెట్టుబడికి చెందిన మూడు భిన్న సందర్భాలను తీసుకుందాం.

I. 8 వేల పౌండ్ల పెట్టుబడి ఏటా 5 వేల సరుకులను ఒక్కొక్కదాన్ని 30 షిల్లింగులు చొప్పున అమ్ముతుంది. ఆ రకంగా అది ఏటా 7,500 పౌన్ల టర్నోవర్ చేస్తుంది. ప్రతీ సరుకు మీద అది 10 షిల్లింగుల లాభం సంపాదిస్తుంది. అంటే ఏడాదికి 2,500 పౌండ్ల లాభం వస్తుంది. ప్రతి సరుకులోనూ అడ్వాన్సు చేసిన పెట్టుబడి 20 షిల్లింగులు, లాభం 10 షిల్లింగులు. కనుక ఒక సరుకులో లాభం రేటు 10/20=50% 7,500 పౌండ్ల టర్నోవర్ మొత్తంలోను, 500 పౌండ్ల అడ్వాన్స్ పెట్టుబడి ఉంది. 2,500 పౌండ్ల లాభం ఉంది. టర్నోవర్ ఒక్కింటికి లాభం రేటు $\frac{\text{లా}}{\text{ఉ.వ్య.}}$, ఆ ప్రకారం = 50% అయితే మొత్తం పెట్టుబడి మీద లెక్కగడితే $\frac{\text{లా}}{\text{ఉ. వ్య.}}$ = 2,500/8,000 = $31\frac{1}{4}$ %.

II. పెట్టుబడి 10 వేల పౌండ్లకు పెరిగింది. శ్రమ ఉత్పాదకత పెరగటం కారణంగా అది ఏటా 10 వేల సరుకుల్ని ఉత్పత్తి చేస్తుంది. ఒక సరుకు ఉత్పత్తి ఖర్చు 20 షిల్లింగులు. ఆ సరుకును ఒక్కొక్కదాన్ని 24 షిల్లింగుల చొప్పున అమ్మితే 4 షిల్లింగుల లాభం వస్తుంది. అటువంటప్పుడు వార్షిక ఉత్పాదితం ధర = 12 వేల పౌండ్లు. దానిలో అడ్వాన్సు చేసిన పెట్టుబడి 10 వేల పౌండ్లు. లాభం 2 వేల పౌండ్లు. ప్రతి సరుకు పైన లాభం రేటు $\frac{\text{లా}}{\text{ఉ.వ్య.}}$ = 4/20 వార్షిక టర్నోవర్ ప్రకారం అది 2,000/ 10,000. ఈ రెండు సందర్భాల్లోనూ అది 20%. మొత్తం పెట్టుబడి ఉత్పత్తి ఖర్చుల మొత్తంతో అనగా ఇక్కడ 10 వేల పౌండ్లతో సమానం అయింది. కనుక వాస్తవ లాభం రేటు $\frac{\text{లా}}{\text{మొ.పె}}$ కూడా 20%.

III. శ్రమ ఉత్పాదకత నిలకడగా పెరగటం వల్ల ఈసారి పెట్టుబడి 15 వేల పౌండ్లకు పెరిగిందనుకుందాం. అది ఏటా 30 వేల సరుకులను ఉత్పత్తి చేస్తుందనీ, ఒక సరుకు ఉత్పత్తి ఖర్చు 13 షిల్లింగులనీ అనుకుందాం. ప్రతి సరుకుపైన లాభం 2 షిల్లింగులు అనగా ఒక సరుకు 15 షిల్లింగులకు అమ్మబడుతుందనీ అనుకుందాం. వార్షిక టర్నోవర్ = 30,000×15 షిల్లింగులు = 22,500 పౌండ్లు. దీనిలో అడ్వాన్సు చేసిన పెట్టుబడి 19,500 పౌండ్లు, లాభం 3,000 పౌండ్లు. ఒక సరుకుపైన లాభం రేటు $\frac{\text{లా}}{\text{ఉ.వ్య}}$ = 2/13 = 3,000/19,500 = $15\frac{5}{13}$% అయితే $\frac{\text{లా}}{\text{మొ.పె}}$ = 3,000/15,000 = 20%.

రెండో సందర్భంలో మాత్రమే టర్నోవర్ అయిన పెట్టుబడి విలువ, మొత్తం పెట్టుబడికి సమానంగా ఉన్న సందర్భంలో మాత్రమే, సరుకు ఒకటింటికి లాభం రేటు లేదా టర్నోవర్ మొత్తంపై లాభం రేటు మొత్తం పెట్టుబడిపై లెక్కగట్టిన లాభం రేటు ఒకటేనని చూశాం. Iవ సందర్భంలో మొత్తం పెట్టుబడికంటే టర్నోవర్ మొత్తం తక్కువ. కనుక సరుకు ఉత్పత్తి ఖర్చుపైన లెక్కించబడిన లాభం రేటు అధికంగా ఉంది. IIవ సందర్భంలో మొత్తం పెట్టుబడి టర్నోవర్ మొత్తం కంటే తక్కువ. కనుక ఈ లాభం రేటు మొత్తం పెట్టుబడిపై లెక్కకట్టిన వాస్తవ రేటుకంటే తక్కువ ఉంటుంది. ఇది ఒక సార్వత్రిక సూత్రం.

వాణిజ్య సంప్రదాయంలో సాధారణంగా టర్నోవర్‌ను తప్పుగా లెక్కకడతారు. సరుకుల అమ్మకం వలన వచ్చిన మొత్తం అడ్వాన్సు చేసిన పెట్టుబడితో సమానం కాగానే పెట్టుబడి టర్నోవర్ అయిపోయిందనుకుంటారు. అయితే పెట్టుబడి పూర్తిగా ఒక టర్నోవర్‌ను పూర్తిచేయగలగాలంటే, అమ్మకమైన సరుకుల ఉత్పత్తి ఖర్చుల మొత్తం పెట్టుబడి మొత్తంతో సమానం కావాలి – ఎంగెల్స్)

విడి సరుకులను లేక ఒక నిర్దిష్ట కాలంలోని సరుకు ఉత్పాదితాన్ని అడ్వాన్సు చేసిన పెట్టుబడి ఉత్పాదితాలుగా పరిగణించడం, వాటిని వేటికవిగా, కేవలం సరుకులుగా కాకుండా వాటికి ఉత్పత్తి చేసిన మొత్తం పెట్టుబడికి సంబంధించినవిగా పరిగణించడం పెట్టుబడిదారీ ఉత్పత్తిలో ఎంత ముఖ్యమో ఇది మరోసారి నిరూపిస్తుంది.

ఉత్పత్తి అయిన, చేతికందిన అదనపు విలువ పరిమాణాన్ని సరుకులలో తిరిగి ప్రత్యక్షమయ్యే వినియోగమైన పెట్టుబడి భాగాన్నిబట్టి మాత్రమే కాక, దానితోపాటు వినియోగం కాకపోయినా,

ఉత్పత్తిలో భాగాన్నిబట్టి కొలవడం ద్వారా లాభం రేటును లెక్కగట్టాలి. అయితే లాభం, మొత్తం సరుకులలో ఉన్నట్టి వాటి అమ్మకం ద్వారా చేతికందినట్టు అదనపు విలువల లేదా లాభానికి మాత్రమే సమానమవుతుంది. ఇక మరిదేనితోనూ సమానం కాదు.

పరిశ్రమ ఉత్పాదకత పెరిగితే విడి సరుకుల ధర పడిపోతుంది. వాటిలో తక్కువ శ్రమ ప్రతిఫలం ముట్టిన, ముట్టని – శ్రమ తక్కువ ఉంటుంది. ఒకే శ్రమ ఇంతకు ముందు ఉత్పత్తి చేసిన దానికి మూడింతలు చేస్తుందని అనుకుందాం. అప్పుడు ఆ ఉత్పాదితానికి 2/3 వంతు శ్రమ తక్కువ సరిపోతుంది. ఒక విడి సరుకులో ఉన్న శ్రమ మొత్తంలో ఒక భాగం మాత్రమే లాభం అవుతుంది. కనుక విడి సరుకుతో లాభం మొత్తం తగ్గక తప్పదు. అదనపు విలువ రేటు పెరిగినప్పటికీ ఈ తగ్గుదల కొన్ని పరిమితుల లోపలే జరుగుతుంది. ఏమైనప్పటికీ మొత్తం ఉత్పాదితం మీద లాభం పరిమాణం అన్నది, పెట్టుబడి ఒకే స్థాయిలో దోపిడీ చేస్తున్న మేరకు, ఒకే సంఖ్యలో కార్మికులను పనిలో పెట్టిన మేరకు తొలి లాభ పరిమాణం కంటే తక్కువగా ఉండదు. (దోపిడీ హెచ్చు స్థాయిలో ఉంటూ తక్కువమంది కార్మికులు ఉన్నా ఇది సంభవించవచ్చు.) ఎందుకంటే ఉత్పాదితాల సంఖ్య పెరగడానికి అనుగుణంగా విడి ఉత్పాదితంపై లాభం మొత్తం తగ్గుతుంది. మొత్తంగా లాభం పరిమాణం యథాతథంగా ఉంటుంది. అయితే అది సరుకుల మొత్తం పరిమాణంపైన విభిన్నంగా పంపిణీ అవుతుంది. దీనివల్ల కార్మికులకు, పెట్టుబడిదారులకు మధ్య కొత్తగా కలిసిన శ్రమ వల్ల విలువ పరిమాణం పంపిణీలో మార్పు రాదు. ఒకే పరిమాణం గల శ్రమ పనిలో ఉన్నప్పుడు ప్రతిఫలం ముట్టని అదనపు శ్రమ పెరిగితే తప్ప, లేదా శ్రమ దోపిడీ తీవ్రత సమానంగా ఉన్నప్పుడు, కార్మికుల సంఖ్య పెరిగితే తప్ప లాభం పరిమాణం పెరగజాలదు. లేదా ఈ రెండు కారణాలు ఈ ఫలితాన్ని సాధించవచ్చు. ఈ సందర్భాలన్నింటిలోనూ (మన ఊహ ప్రకారం అస్థిర పెట్టుబడితో పోలిస్తే స్థిర పెట్టుబడి పెరుగుతుంది. మొత్తంగా పెట్టుబడి పరిమాణం పెరుగుతుంది.) విడి సరుకు ఇంతకు ముందుకంటే తక్కువ పరిమాణంలో లాభాన్ని కలిగి ఉంటుంది. విడి సరుకుపైన లెక్కగట్టినప్పటికి లాభం రేటు పడిపోతుంది. కొత్తగా కలిసిన నిర్ణీత పరిమాణం గల శ్రమ ఇంతకు ముందుకంటే ఎక్కువ పరిమాణం గల సరుకులలో భౌతిక రూపం ధరిస్తుంది. విడి సరుకు ధర పడిపోతుంది. నిరపేక్షంగా పరిశీలించినపుడు, శ్రమ ఉత్పాదకత హెచ్చి, అదే సమయంలో మునుపటికన్నా చౌకగా వున్న ఈ సరుకుల సంఖ్య పెరిగిన ఉదాహరణకు ఈ శ్రమ ఉత్పాదకత పెరుగుదల సరుకులో ఉన్న అన్ని అంశాలపైన ఒకే విధంగా ఏకకాలంలో పనిచేసినపుడు శ్రమ ఉత్పాదకత పెరిగిన నిష్పత్తిలోనే సరుకు మొత్తం ధర తగ్గుతుంది. మరోవైపున సరుకు ధరలో ఉన్న భిన్న అంశాల మధ్య పరస్పర సంబంధం యథాతథంగా ఉంటుంది. ఆ పరిస్థితులు పైన చెప్పినట్లు లాభం రేటు యథాతథంగా ఉండవచ్చు. స్థిర పెట్టుబడిలో అంశాల విలువ, ముఖ్యంగా నిశ్చల పెట్టుబడి విలువ గణనీయంగా తగ్గిపోయినపుడు అదనపు విలువ రేటు పెరిగితే, లాభం రేటు పెరుగుతుంది. అయితే వాస్తవంలో దీర్ఘకాల గతిక్రమంలో, ఇదివరకే మనం గమనించినట్టు, లాభం రేటు పడిపోతుంది. ఏ సందర్భం లోనూ విడి సరుకు ధర పడిపోవడమే, లాభం రేటు గురించిన ఏ ఆచూకీని తెలపదు. ప్రతిదీ ఉత్పత్తిలో మదుపు పెట్టిన మొత్తం పెట్టుబడి పరిమాణంపైన ఆధారపడి ఉంటుంది. ఉదాహరణకు

ఒక గజం వస్త్రం ధర మూడు షిల్లింగుల నుంచి $1\frac{2}{3}$ షిల్లింగులకు పడిపోయిందనుకొందాము. ధర పడిపోవడానికి ముందు దానిలో $1\frac{2}{3}$ షిల్లింగుల స్థిరపెట్టుబడి, నూలు వగైరా, $\frac{2}{3}$ షిల్లింగుల వేతనాలు, $\frac{2}{3}$ షిల్లింగుల లాభం ఉన్నాయనుకొందాము. ధర పడిపోయాక దానితో 1 షిల్లింగు స్థిర పెట్టుబడి, $\frac{1}{3}$ షిల్లింగు వేతనాలు, $\frac{1}{3}$ షిల్లింగు లాభం ఉందనుకొందాము. దీనినిబట్టి లాభం రేటు యథాతథంగా ఉందో, లేదో చెప్పలేము. అడ్వాన్సు చేసిన మొత్తం పెట్టుబడి పెరిగిందా, పెరిగితే ఎంత పెరిగింది, ఒక నిర్ణీత కాలంలో అది ఎన్ని గజాల వస్త్రాన్ని ఎక్కువ ఉత్పత్తి చేస్తుంది అన్నదానిపైన ఇది ఆధారపడి ఉంటుంది.

శ్రమ ఉత్పాదకత పెరిగిందంటే, విడి సరుకు ధర లేదా, నిర్దిష్టమైన కొన్ని సరుకుల మొత్తం ధర పడిపోతుంది. సరుకుల సంఖ్య పెరుగుతుంది. విడి సరుకు లాభం మొత్తం తగ్గుతుంది, మొత్తం సరుకులపై లాభం రేటు తగ్గుతుంది. సరుకుల మొత్తం పరిమాణంపైన వచ్చే లాభం పరిమాణం పెరుగుతుంది. ఇది పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం నుంచి తలెత్తే పరిణామం. ఇది పైకి, విడి సరుకుపై వచ్చే లాభం మొత్తం తగ్గటంగానూ, వాని ధర పడిపోవడంగాను, మొత్తం సామాజిక పెట్టుబడి లేదా ఒక వ్యష్టి పెట్టుబడిదారు ఇతోధిక సంఖ్యలో ఉత్పత్తి చేసిన సరుకులపై లాభం మొత్తం పెరగడంగానూ మాత్రమే కనిపిస్తుంది. అప్పుడది పెట్టుబడిదారు తన ఇష్టప్రకారమే విడి సరుకు ధరకు తక్కువ లాభాన్ని కలుపుతున్నట్టుగాను, తక్కువ పడిన మొత్తాన్ని అతడు ఎక్కువ సరుకుల ఉత్పత్తి ద్వారా పూడ్చుకొంటున్నట్టుగాను కనిపిస్తుంది. సరుకు వేరయిపోయిన తరువాత లాభం ఏర్పడుతుందన్న భావనపైన ఇది ఆధారపడి ఉంది. ఇది మళ్ళీ వ్యాపార పెట్టుబడి గురించిన భావన నుంచి నిష్పన్నమైనది.

శ్రమ ఉత్పాదకతతో పాటుగా పెరుగుతున్న సరుకుల పరిమాణం, అలాగే విడి సరుకు మరింత చౌకగా మారటం అన్నవి (ఈ సరుకులు శ్రమశక్తి ధరలో నిర్ణాయకాంశాలుగా ప్రవేశించనంతవరకు) ధర పడిపోతున్నప్పటికీ విడి సరుకులో, ప్రతిఫలం ముట్టిన, ముట్టని శ్రమల మధ్య నిష్పత్తిని మార్చవు అని మనం మొదటి సంపుటిలో ఇంతకు ముందు గ్రహించాం.[1]

పోటీలో ప్రతి అంశమూ వక్రంగా, అంటే తారుమారై కనిపిస్తుంది. కనుక విడి (Individual) పెట్టుబడిదారు ఈ రకంగా ఊహించవచ్చు: 1. తాను విడి సరుకు ధరని తగ్గించడం ద్వారా ఆ సరుకుపై తన లాభాన్ని తగ్గించుకొంటున్నాను. అయితే ఎక్కువ పరిమాణం సరుకులు అమ్మటం ద్వారా దానిని పూడ్చుకొనని ఎక్కువ లాభాన్ని సంపాదిస్తున్నాను. 2. విడి సరుకుల ధరను తానే నిర్ణయిస్తాడు. ఆ తరువాత గుణించడం ద్వారా మొత్తం ఉత్పాదితం ధరను నిర్ణయిస్తాడు. కాగా అసలు ఈ ప్రక్రియ భాగహారానికి సంబంధించినది (పెట్టుబడి సంపుటం I, అధ్యాయం XII). ఈ గుణకారం ఈ భాగహారంపైన ఆధారపడి ఉన్నది కనుక ద్వితీయార్థంలో మాత్రమే సరయినది. నాటు ఆర్థిక వేత్త – పోటీ దాస్య బంధంలోని పెట్టుబడిదారుల విడ్డూర భావనలను మరింత సైద్ధాంతికమైనవి, సర్వసామాన్యమైనవిగా కనిపించే భాషలోకి అనువదించడం తప్ప, ఇవి ఎలా

1. మొదటి సంపుటి, IV, VII, భాగాలు - సం.

న్యాయసమ్మతమో ఆధారాలతో రుజువు చేయటానికి ప్రయత్నించడం తప్ప – ఆచరణలో మరేమీ చేయటం లేదు.

సరుకుల ధర పడిపోవడం ఇలా చౌకగా మారిన, ఇతోధిక సరుకులపైన లాభం మొత్తం పెరగడం అన్నది నిజానికి లాభం రేటు పడిపోవటంతోపాటు అదే సమయంలో లాభం మొత్తం పెరుగుతుందన్న నియమానికి మరో రూపం మాత్రమే.

లాభం రేటు పడిపోవడం ధరల పెరుగుదలతో, ఏ మేరకు ఏకీభవిస్తున్నది అన్నది విశ్లేషణ, సాపేక్ష అదనపు విలువకు సంబంధించి సంపుటి Iలో మునుపు చర్చించిన అంశంలాగే ఇక్కడ అప్రస్తుతం.[1] మెరుగైన ఉత్పత్తి పద్ధతులు ఇంకా పూర్తిగా సామాన్య వాడకంలోకి రాకముందే వాటిని ఉపయోగిస్తున్న పెట్టుబడిదారు మార్కెట్ ధరకంటే తక్కువకు అమ్మగలుగుతాడు. అయితే ఆ ధర అతని ఉత్పత్తి ధరకంటే ఎక్కువే. పోటీ అతని లాభం రేటును అందరితోపాటు సమానంగా మార్చేటంత వరకు అది పెరుగుతుంది. ఇలా సమానం అవుతున్న కాలంలో అతడు మదుపు పెట్టిన పెట్టుబడి విస్తరిస్తుంది. ఇది ఆ ప్రక్రియ రెండవ అవసరం. ఈ విస్తరణ స్థాయినిబట్టి పెట్టుబడిదారుడు తన పాత కార్మికులలో ఒక భాగాన్ని, కొత్త పరిస్థితుల్లో బహుశా వారందరినీ, లేదా అంతకంటే ఎక్కువ మందినీ పనిలో పెట్టగలుగుతాడు. కనుక అంతే పరిమాణంలో లేదా అంతకంటే ఎక్కువ పరిమాణంలో లాభం మొత్తాన్ని సంపాదించగలుగుతాడు.

★ ★ ★

1. సంపుటి I - సం.

## అధ్యాయం - 14

# ప్రతిక్రియాత్మక ప్రభావాలు

ఇంతకు ముందు కాలంతో పోల్చుకుంటే గత 30 ఏళ్ళలో సామాజిక శ్రమ ఉత్పాదక శక్తులు అపారంగా అభివృద్ధి చెందాయి. ప్రత్యేకించి, మొత్తంగా సామాజిక ఉత్పత్తి ప్రక్రియలో వాస్తవ యంత్రాలతోపాటు నిశ్చల పెట్టుబడి అపారమైన పరిమాణంలో ప్రవేశించింది. ఇంతవరకు అర్థశాస్త్రవేత్తలను ఇబ్బందిపెట్టిన సమస్య, అంటే లాభం రేటు పడిపోవడానికి కారణమేమిటి అన్న సమస్య మాయమై, దాని స్థానంలో తద్వ్యతిరేక సమస్య అంటే, ఈ లాభం రేటు మరింత ఎక్కువగానూ, శీఘ్రంగానూ ఎందుకు తగ్గడంలేదన్న ప్రశ్న తలెత్తుతోంది. ఈ సార్వత్రిక నియమం యొక్క ప్రభావాన్ని అడ్డుకొనడాన్ని రద్దు చేసే ప్రతిక్రియాత్మక ప్రభావాలు కొన్ని ఉండి ఉండాలి. అవి ఈ నియమానికి కేవలం ఒక ధోరణి లక్షణాన్ని ఇస్తూ ఉండాలి. అందుకే సార్వత్రిక లాభం రేటు పడిపోవటాన్ని పడిపోయే ధోరణిగా పేర్కొన్నాము.

ఈ క్రింద పేర్కొన్నవి అతి సర్వసాధారణమైన ప్రతిక్రియాత్మక శక్తులు.

### I. దోపిడీ పెరుగుదల తీవ్రత

పనిదినాన్ని పొడిగించడం ద్వారా, శ్రమను తీవ్రతరం చేయడం ద్వారా శ్రమను దోపిడీ చేసే స్థాయిని అదనపు శ్రమను, అదనపు విలువను స్వాయత్తం చేసుకొనే స్థాయిని గణనీయంగా పెంచడం జరుగుతుంది. సాపేక్ష, నిరపేక్ష అదనపు విలువ ఉత్పత్తిని చర్చించే సందర్భంలో ఈ రెండు అంశాల గురించి ఒకటవ సంపుటిలో సమగ్రంగా వివరించబడింది. శ్రమను తీవ్రం చేసేందుకు అనేక మార్గాలున్నాయి. అస్థిర పెట్టుబడితో పోల్చితే స్థిర పెట్టుబడి పెరుగుదల, కనుక లాభం రేటు తగ్గుదల వీటిలో గర్భితం. కార్మికుడు ఇంతకు ముందుకంటే ఎక్కువ యంత్రాలను నడిపించవలసిన స్థితిని కల్పించడం అటువంటి మార్గమే. అటువంటి సందర్భాల్లో సాపేక్ష అదనపు విలువ ఉత్పత్తికి తోడ్పడే అత్యధిక పద్ధతులలో అదనపు విలువ రేటును పెంచే కారణాలే, మదుపు పెట్టిన మొత్తం పెట్టుబడి నిర్ణీత పరిమాణాల దృష్టి నుంచి చూస్తే, అదనపు విలువ మొత్తం పరిమాణం పడిపోవడానికి కూడా దారితీయవచ్చు. కానీ శ్రమను తీవ్రతరం చేసే ఇతర అంశాలు ఉన్నాయి. యంత్రాల వేగం హెచ్చుటం, అవి, అదే కాలంలో మరింత ఎక్కువ ముడిపదార్థాలను వినియోగించటం అలాంటిదే అయితే నిశ్చల పెట్టుబడికి సంబంధించినంత మేరకు అది యంత్రాన్ని అంతకు ముందుకంటే మరింత వేగంగా అరిగిపోయేలా చేస్తుందే తప్ప దానిని చలనంలో ఉంచే శ్రమ ధరకు, తన విలువకు మధ్య ఉన్న సంబంధాన్ని ప్రభావితం చెయ్యదు. అయితే పనిలో వున్న శ్రమశక్తికీ, అది చలనంలో వుంచిన స్థిర

పెట్టుబడికీ మధ్య నిష్పత్తిని మార్చకుండా, స్వాయత్తమయ్యే అదనపు శ్రమ మొత్తం పరిమాణాన్ని పెంచేది, ముఖ్యంగా పనిదినం పొడిగింపే – ఆధునిక పరిశ్రమలు కనుగొన్న ఈ పద్ధతే. ఇది పైపెచ్చు ఈ పెట్టుబడిని సాపేక్షంగా తగ్గించచూస్తుంది కూడ.

అంతేకాక ఇదివరకే నిరూపించినట్లు, సాపేక్ష అదనపు విలువను ఉత్పత్తి చేసే ప్రయత్నాల తాత్పర్యమిది. ఒక నిర్ణీత పరిమాణం గల శ్రమను సాధ్యమయినంత మేరకు అదనపు విలువగా మార్చజూస్తాయి. మరోవైపున మదుపు పెట్టిన పెట్టుబడికి అనుగుణంగా సాధ్యమైనంత తక్కువ శ్రమను పనిలో పెట్టజూస్తాయి – లాభం రేటు పడిపోయే ధోరణిలోని రహస్యమిదే. పర్యవసానంగా, శ్రమ దోపిడీ తీవ్రతను పెంచటానికి వీలుకల్పించే కారణాలే, అదే పెట్టుబడి అదే పరిమాణం గల శ్రమను మునుపటిలాగే దోచుకొనే ఆస్కారం లేకుండా చేస్తాయి. ఇవి ప్రతిక్రియాత్మక ధోరణులు. ఇది అదనపు విలువ యొక్క రేటును పెంచుతూనే, అదనపు విలువ పరిమాణాన్ని తగ్గిస్తాయి. కనుక ఒక నిర్దిష్ట పెట్టుబడి ఉత్పత్తిచేసే లాభం రేటును తగ్గిస్తాయన్నమాట. స్త్రీల, బాలల శ్రమను విస్తారంగా ప్రవేశపెడుతున్న సంగతిని ఇక్కడ పేర్కోవాలి. ఇప్పుడు మొత్తం కుటుంబం పెట్టుబడికోసం ఇంతకు ముందుకంటే మరింత ఎక్కువ అదనపు శ్రమను నిర్వహిస్తుంది. వారి వేతనాల మొత్తం ఒకోసారి పెరగకపోవచ్చు. పెరిగినప్పటికీ, యిది వర్తిస్తుంది. వ్యవసాయంలోలాగా మదుపు పెట్టిన పెట్టుబడి పరిమాణాన్ని మార్చకుండానే కేవలం మెరుగైన పద్ధతులను ఉపయోగించడం ద్వారా సాపేక్ష అదనపు విలువ ఉత్పత్తిని పెంపొందించే ప్రతిదీ ఇలాంటి ప్రభావాన్నే కలిగిస్తుంది. అటువంటి సందర్భాల్లో అస్థిర పెట్టుబడితో పోల్చినపుడు స్థిర పెట్టుబడి పెరగదన్నది నిజమే. అస్థిర పెట్టుబడిని, పనిలో పెట్టబడిన శ్రమశక్తికి సూచికగా పరిగణించిన మేరకు ఇది జరగదు. అయితే పనిలో పెట్టబడిన శ్రమశక్తితో పోల్చితే ఉత్పాదితం పరిమాణం పెరుగుతుంది. శ్రమ ఉత్పాదకతను (దాని ఫలితం కార్మికులు వినియోగం చేసినా, లేదా అది స్థిర పెట్టుబడి అంశాల్లో ప్రవేశించినా ఇది వర్తిస్తుంది.) వార్తా, రవాణా సాధనాల్లో ఉన్న ఆటంకాల నుంచి, నిర్హేతుకమైన ఆంక్షల నుంచి, కాలగతిలో ఆటంకాలుగా తయారైన తదితర ఆంక్షల నుంచి స్థిర, అస్థిర పెట్టుబడుల మధ్య నిష్పత్తిని మార్చకుండా బంధనాల నుంచి విముక్తం చేస్తే ఇదే జరుగుతుంది.

లాభం రేటు పడిపోవటాన్ని నిరోధించినప్పటికీ, తుదకంటా చూస్తే, ఆ పడిపోవటాన్ని త్వరితం చేసే అంశాల్లో సార్వత్రిక స్థాయికి మించిన అదనపు విలువ పెరుగుదలలో – తాత్కాలికమైనదైన, పదేపదే సంభవించే ఈ పెరుగుదలలో – చేరుతాయా అనే ప్రశ్న ఇక్కడ ఉత్పన్నం కావచ్చు. ఈ ప్రశ్నకు ఔననే సమాధానం చెప్పవలసి వుంది.

కొత్త ఆవిష్కరణలను మిగతాచోట్ల ప్రవేశపెట్టక ముందే ఉపయోగించుకునే ఆయా పెట్టుబడి దారులకు ప్రయోజనకరంగా ఇవి ఒకసారి ఒక ఉత్పత్తి రంగంలో, మరోసారి మరో ఉత్పత్తి రంగంలో తలెత్తుతాయి.

ఒక నిర్ణీత పరిమాణం గల పెట్టుబడి ఉత్పత్తి చేసే అదనపు విలువ మొత్తం రెండు అంశాల ఫలితం. అది అదనపు విలువ రేటును ఈ రేటున పనిలో పెట్టబడిన కార్మికుల సంఖ్యతో గుణిస్తే వచ్చినది. అదనపు విలువ రేటు నిర్ణీతమైనప్పుడు, అది కార్మికుల సంఖ్యపై ఆధారపడి వుంటుంది.

కార్మికుల సంఖ్య నిర్ణీతమైనప్పుడు అదనపు విలువ రేటుపై ఆధారపడుతుంది. కనుక, మొత్తంపై చెప్పాలంటే అస్థిర పెట్టుబడి నిరపేక్ష పరిమాణాలకు, అదనపు విలువ రేటుకు మధ్య వున్న సంక్లిష్ట నిష్పత్తిపైన ఆధారపడుతుంది. నిరపేక్ష అదనపు విలువ రేటును పెంచే అంశాలు సగటున, పనిలో పెట్టబడే శ్రమశక్తి మొత్తాన్ని తగ్గిస్తాయని చూశాం. కానీ, ఈ పరస్పర విరుద్ధమైన చలనం ఏ నిర్దిష్ట నిష్పత్తిపైన ఉంటుంది అన్నదానిపైన ఆధారపడి ఏదో ఒక మేరకు ఇది జరుగుతుందనీ, లాభం రేటు పడిపోయే ధోరణీ, పనిదినాన్ని పొడిగించటం ద్వారా నిరపేక్ష అదనపు విలువ రేటు పెరగడంవల్ల గణనీయంగా బలహీనపడుతుందనీ స్పష్టంగా కనిపిస్తూంది.

మొత్తం పెట్టుబడి పరిమాణం పెరగటంవల్ల లాభం రేటు పడిపోవడంతోపాటు లాభం మొత్తం సాధారణంగా పెరుగుతుందని లాభం రేటు సందర్భంగా మనం గమనించాలి. సమాజంలో ఉన్న అస్థిర పెట్టుబడి మొత్తం దృష్టి నుంచి చూస్తే అది ఉత్పత్తి చేసిన అదనపు విలువ అది ఉత్పత్తి చేసిన లాభంతో సమానం. ఇక్కడ అదనపు విలువ రేటుతోపాటు దాని మొత్తం కూడా పెరిగింది. సమాజంలో పనిలో పెట్టబడిన శ్రమశక్తి పరిమాణం పెరగటం వల్ల ఒకటీ, ఈ శ్రమశక్తి దోపిడీ తీవ్రత పెరగటం వల్ల మరొకటీ పెరిగాయి. కానీ ఒక నిర్ణీత పరిమాణం గల పెట్టుబడి విషయంలో ఉదాహరణకు 100 విషయంలో, అదనపు విలువ రేటు పెరగవచ్చు. కాగా సగటున అదనపు విలువ మొత్తం తగ్గవచ్చు. ఎందుకంటే రేటు అన్నది అస్థిర పెట్టుబడి విలువను ఉత్పత్తి చేసే నిష్పత్తిపై ఆధారపడి వుంటుంది, కాగా అదనపు విలువ మొత్తమేమో మొత్తం పెట్టుబడికి, అస్థిర పెట్టుబడికి మధ్య ఉన్న నిష్పత్తిపైన ఆధారపడి వుంటుంది.

అదనపు విలువ మొత్తాన్ని, ఆ కారణంగా లాభం రేటును నిర్ణయించటంలో అదనపు విలువ రేటు పెరుగుదల ఒక అంశం. ఎందుకంటే మనం ఇంతకుముందు గమనించినట్టుగా, అస్థిర పెట్టుబడికి సంబంధించి స్థిర పెట్టుబడి పెరగకుండానో లేదా తదనుగుణమైన నిష్పత్తిలో పెరగకుండానో వున్న పరిస్థితుల్లో ప్రత్యేకించి, అదనపు విలువ రేటు పెరుగుతుంది. పై అంశం సంబంధిత సార్వత్రిక నియమాన్ని రద్దుచేయదు. అయితే ఆ నియమాన్ని ఒక ధోరణిగా వ్యవహరించేలా చేస్తుంది. అంటే, ప్రతికూల పరిస్థితులవల్ల ఆ నియమం యొక్క అప్రతిహత చర్య నిరోధించబడుతుంది, మందగిస్తుంది, బలహీనపడుతుంది. అయితే అదనపు విలువ రేటును పెంచే ప్రభావాలే (శ్రమకాలం పొడిగించటం సైతం భారీ పరిశ్రమ ఫలితం) ఒక నిర్దిష్ట పెట్టుబడి పనిలో పెట్టిన శ్రమశక్తిని తగ్గించాలని చూస్తాయి. దీనినిబట్టి అవి లాభం రేటును తగ్గించటంతోపాటు ఈ తగ్గుదలను కూడా కుదిస్తాయి. ఒక కార్మికుడు కనీసం ఇద్దరి పనిని సహేతుకంగా నిర్వహించేలా ఒత్తిడి చెయ్యబడినపుడు, ఒక కార్మికుడు ముగ్గురి పనిని చెయ్యటానికి అవకాశం ఉండిన పరిస్థితుల్లో ఇది జరిగితే, అప్పుడు ఈ ఒక కార్మికుడు ఇంతకు ముందు ఇద్దరు నిర్వహించిన అదనపు శ్రమను నిర్వహిస్తాడు. అదనపు విలువ రేటు ఆ మేరకు పెరిగి వుంటుంది. అయితే అతడు ముగ్గురు చెయ్యాల్సిన పనిని చేయడు. ఆ మేరకు అదనపు విలువ రాశి తగ్గిపోతుంది. అయితే ఈ తగ్గుదలను అదనపు విలువ రేటు పెరుగుదల కొంత భర్తీ చేస్తుంది లేదా పరిమితమవుతుంది. అధిక అదనపు విలువ రేటుపై మొత్తం జనాభా పనిలో పెట్టబడితే ఆ జనాభా యథాతథంగా ఉన్నప్పటికీ అదనపు విలువ రాశి పెరుగుతుంది. జనాభా పెరిగితే అది మరింత పెరుగుతుంది. మొత్తం పెట్టుబడి పరిమాణానికి అనుగుణంగా పనిలో

పెట్టుబడిన కార్మికుల సంఖ్య సాపేక్ష తగ్గుదలతో ఇది ముడిపడి ఉన్నప్పటికీ ఈ తగ్గుదల అదనపు విలువ రేటు పెరగటం వల్ల పరిమితమవుతుంది, నిరోధించబడుతుంది.

ఈ అంశాన్ని వదిలేసే ముందు ఒక విషయం నొక్కిచెప్పాలి. ఒక నిర్ణీత పరిమాణం గల పెట్టుబడితో, దాని అదనపు విలువ రాశి తగ్గుతుండగా దాని అదనపు విలువ రేటు పెరగవచ్చు. అలాగే రాశి పెరుగుతుండగా రేట్లు తగ్గవచ్చు. అదనపు విలువ రాశి అదనపు విలువ రేటును కార్మికుల సంఖ్యతో గుణిస్తే వస్తుంది. అయితే రేటును లెక్కగట్టేది మొత్తం పెట్టుబడిని బట్టికాదు; కేవలం అస్థిర పెట్టుబడిని బట్టే. వాస్తవంలో ప్రతి పనిదినానికి లెక్కగడతారు. కానీ, ఒక నిర్ణీత పరిమాణం గల పెట్టుబడి విలువ విషయంలో అదనపు విలువ మొత్తం పెరిగితేనే లాభం రేటు పెరుగుతుంది; అదనపు విలువ మొత్తం పడిపోతేనే లాభం రేటు పడిపోతుంది.

## II. శ్రమ శక్తి విలువకన్నా దిగువకు వేతనాల పతనం

ఇది కేవలం అనుభవాన్ని చూసి మాత్రమే పేర్కొనబడినది. వరుసబెట్టి పేర్కొనవీలున్న అనేక ఇతర విషయాలకు లాగానే దీనికి కూడా పెట్టుబడి సాధారణ విశ్లేషణతో సంబంధం లేదు. ఇది పోటీ విశ్లేషణకు సంబంధించిన విషయం. అయితే పోటీ గురించి ఈ గ్రంథంలో వివరించలేదు. ఏమైనప్పటికీ లాభం రేటు పడిపోకుండా నిరోధిస్తున్న అత్యంత ప్రధానమైన అంశాల్లో ఇది ఒకటి.

## III. స్థిర పెట్టుబడి అంశాలు చౌక కావటం

అదనపు విలువ రేటు యథాతథంగా వున్నప్పుడు, లేదా అదనపు విలువ రేటుతో ప్రమేయం లేకుండా లాభం రేటును పెంచే అంశాలను గురించి ఈ గ్రంథం ఒకటవ భాగంలో చెప్పిన ప్రతీది ఇక్కడ కూడా వర్తిస్తుంది. మొత్తం పెట్టుబడికి సంబంధించిన మేరకు, స్థిర పెట్టుబడి విలువ దాని పాదార్థిక పరిమాణానికి అనుగుణమైన నిష్పత్తిలో పెరగదు. ఉదాహరణకు ఆధునిక పరిశ్రమలో యూరప్‌లో నూలు వడికే వ్యక్తి ఒక రాట్నంతో వడకగల్గిన పత్తి గతానికీ ఇప్పటికీ అపారంగా పెరిగింది. అయితే పత్తి పరిమాణం పెరిగినంతగా దాని విలువ పెరగలేదు. యంత్రాలకు, నిశ్చల పెట్టుబడికి ఇదే వర్తిస్తుంది. క్లుప్తంగా చెప్పాలంటే, అస్థిర పెట్టుబడితో పోల్చితే స్థిర పెట్టుబడి పరిమాణాన్ని పెంచే అభివృద్ధి దాని అంతర్భాగాల విలువను శ్రమ ఉత్పాదకత పెరుగుదల కారణంగా తగ్గిస్తుంది. ఆ రకంగా స్థిర పెట్టుబడి నిరంతరాయంగా పెరిగినప్పటికీ దాని పాదార్థిక పరిమాణం పెరిగిన స్థాయిలో దాని విలువ పెరగకుండా అడ్డుపడుతుంది. అనగా అదే పరిమాణం గల శ్రమశక్తి, చలనంలో పెట్టే ఉత్పత్తి సాధనాల పాదార్థిక పరిమాణం పెరిగిన స్థాయిలో వాటి విలువ పెరగదు. కొన్ని ప్రత్యేక సందర్భాల్లో స్థిర పెట్టుబడి విలువ యథాతథంగా ఉన్నప్పుడు లేదా పడిపోయినప్పుడు స్థిర పెట్టుబడి అంశాల పరిమాణం పెరగవచ్చు కూడా.

పైన చెప్పినది ఇప్పుడున్న పెట్టుబడి (దాని పాదార్థిక అంశాలు) విలువ తగ్గుదలతో ముడిపడినది. ఇది పరిశ్రమ అభివృద్ధి చెందడంతో జరుగుతుంది. కొన్ని పరిస్థితులలో లాభాన్నిచ్చే పెట్టుబడి పరిమాణాన్ని తగ్గించడం ద్వారా లాభం పరిమాణంపైన ప్రభావం కలిగించినప్పటికీ లాభం రేటు పడిపోకుండా నిరోధిస్తూ నిరంతరాయంగా పనిచేసే మరొక అంశం ఇది; లాభం రేటు పడిపోయేలా చేసే ప్రభావాలే ఈ ధోరణి ఫలితాలను అదుపులో ఉంచుతాయని ఇది మరొకసారి రుజువు చేస్తుంది.

## IV. సాపేక్షమైన అధిక జనాభా

సాపేక్షమైన అధిక జనాభా ఆవిర్భావం లాభం రేటు పడిపోవడం ద్వారా వ్యక్తమైన శ్రమ ఉత్పాదకత అభివృద్ధి నుంచి వేరుచేయ వీలులేనిది. పైగా ఈ అభివృద్ధి దానిని త్వరితం చేస్తుంది. ఒక దేశంలో పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం ఎంతగా అభివృద్ధి అయితే అక్కడే సాపేక్షమైన అధిక జనాభా అన్నది అంత ఎక్కువగా కనిపిస్తుంది. ఒకవైపున, అనేక ఉత్పత్తి శాఖలలో శ్రమపై పెట్టుబడి ఇంకా అసంపూర్ణంగానే ఆధిపత్యం వహించడానికీ, సాధారణ అభివృద్ధి దశకు తగినట్లు కనిపించే దానికన్నా ఎక్కువ కాలం ఈ పరిస్థితి కొనసాగటానికీ కారణం ఇదే. నిరుద్యోగ వేతన కార్మికులు విస్తారంగా, పని చెయ్యటానికి సిద్ధంగా, చౌకగా అందుబాటులో ఉండటం వల్లనేమి, కొన్ని ఉత్పత్తి శాఖలు వాటి స్వభావం రీత్యానే శారీరక శ్రమను యాంత్రిక ఉత్పత్తిగా మార్చటాన్ని మరింత గట్టిగా ప్రతిఘటించడం వల్లనేమి ఈ పరిస్థితి ఏర్పడింది. మరోవైపు కొత్త ఉత్పత్తి శాఖలు ప్రారంభమవుతాయి. ముఖ్యంగా విలాస వస్తువుల ఉత్పత్తికి ఇది వర్తిస్తుంది. ఇతర ఉత్పత్తి రంగాలు తమ స్థిర పెట్టుబడిని పెంచుకోవటం ద్వారా తరచుగా విడుదల చేసే ఈ సాపేక్ష అధిక జనాభాను ఈ శాఖలే తమ పునాదిగా తీసుకుంటాయి. ఈ కొత్త శాఖలు ఎక్కువగా సజీవ శ్రమను ఉపయోగించటంతో ప్రారంభిస్తాయి. క్రమంగా ఇతర ఉత్పత్తి రంగాలు గడచిన పరిణామ క్రమాన్నే ఇవీ గడుస్తాయి. ఈ రెండు సందర్భాల్లోనూ పెట్టుబడిలో అస్థిర పెట్టుబడి గణనీయమైన స్థాయిలో ఉంటుంది. వేతనాలు సగటు కంటే తక్కువగా వుంటాయి. కనుక ఈ ఉత్పత్తి రంగాల్లో అదనపు విలువ రేటూ, పరిమాణమూ రెండూ కూడా అసాధారణంగా ఎక్కువగా వుంటాయి. సాధారణ లాభం రేటు వేరు వేరు ఉత్పత్తి శాఖల్లో లాభం రేట్లను సమం చెయ్యటం ద్వారా రూపొందుతుంది. కాబట్టి లాభం రేటు పడిపోయే ధోరణిని సృష్టించే ఈ అంశమే దీనికి ప్రతికూలమైన అంశాన్ని కూడా సృష్టించి ఈ ధోరణి ప్రభావాలను ఎంతో కొంత మేరకు స్తంభింపచేస్తుంది.

## V. విదేశీ వాణిజ్యం

విదేశీ వాణిజ్యం కొంత వరకు స్థిర పెట్టుబడి అంశాలను, మరికొంత వరకు అస్థిర పెట్టుబడితో మార్పిడి అయిన జీవితావసరాలను చౌకపరుస్తుంది. అందువల్ల, అదనపు విలువ రేటును పెంచటం ద్వారా, స్థిర పెట్టుబడి విలువను తగ్గించటం ద్వారా లాభం రేటు పెంచపూనుకుంటుంది. ఉత్పత్తి స్థాయి విస్తరించటానికి వీలు కల్పించడం ద్వారా అది సాధారణంగా ఈ దిశలో వ్యవహరిస్తుంది. ఆ రకంగా అది సంచయన క్రమాన్ని త్వరితం చేస్తుంది. మరోవైపున స్థిర పెట్టుబడితో పోలిస్తే అస్థిర పెట్టుబడిని కుదింపచేస్తుంది. ఆ రకంగా లాభం రేటు పడిపోవటాన్ని త్వరితం చేస్తుంది. అదే విధంగా పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం శైశవ దశలో ఉన్నప్పుడు దానికి విదేశీ వాణిజ్య విస్తరణ ప్రాతిపదికగా ఉన్నప్పటికీ, పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం మరింత పురోగమించటంతో దాని ఫలితంగా మారింది. దీనికి కారణం ఉత్పత్తి విధాన స్వతఃసిద్ధ ఆవశ్యకత నిరంతరాయంగా విస్తరించే మార్కెట్ దానికి అవసరం కావటం మరోసారి మనం ఇక్కడ ఈ ప్రభావానికి ఉన్న ద్వంద్వ స్వభావాన్ని చూడొచ్చు. (విదేశీ వాణిజ్యం యొక్క ఈ పార్శ్వాన్ని రికార్డో పూర్తిగా విస్మరించాడు.[1])

---

1. డి. రికార్డో; ఆన్ ది ప్రిన్సిపుల్స్ ఆఫ్ పొలిటికల్ ఎకానమీ అండ్ టాక్సేషన్, మూడవ ముద్రణ, లండన్, 1821, 7వ అధ్యాయం - సం.

మరో ప్రశ్న (ఈ ప్రశ్న తన ప్రత్యేక స్వభావం రీత్యా మన విశ్లేషణ పరిధిలో లేదు.) ఇదీ : విదేశీ వాణిజ్యంలో, ముఖ్యంగా వలస దేశాలతో వాణిజ్యంలో పెట్టిన పెట్టుబడి తెచ్చిపెట్టే అధిక లాభం రేటువల్ల సాధారణ లాభం రేటు పెరుగుతోందా?

విదేశీ వాణిజ్యంలో పెట్టిన పట్టుబడులు అధిక లాభం రేట్లను ఇవ్వగలవు. ఎందుకంటే మొదటిది, నాసిరకపు ఉత్పత్తి సదుపాయాలు ఉన్న ఇతర దేశాలలో ఉత్పత్తి అయిన సరుకులతో పోటీ అది. ఫలితంగా, ఎక్కువ పురోగమించిన దేశం తనతో పోటీపడుతున్న దేశాలకంటే చౌకగా తన సరుకులను అమ్ముకొన్నప్పటికీ వాటి విలువను మించి ఫలితం లభిస్తుంది. ఎక్కువ పురోగమించిన దేశపు శ్రమ ఇక్కడ ఎక్కువ విశిష్ట భారం గల శ్రమగా చేతికందుతుంది. కాబట్టి లాభం రేటు పెరుగుతుంది. ఎందుకంటే ఇక్కడ ఎక్కువ నైపుణ్యం గల శ్రమగా చెల్లించబడని శ్రమ నాణ్యత గల శ్రమగా అమ్మబడుతుంది. సరుకులు ఏ దేశానికి ఎగుమతి అయ్యాయో ఆ దేశానికీ, ఏ దేశం నుంచి దిగుమతి అయ్యాయో ఆ దేశానికీ ఇది వర్తిస్తుంది. అంటే ఆ దేశం వస్తు రూపంలో పొందే శ్రమకన్నా ఎక్కువ వస్తురూప శ్రమను అందజేయవచ్చు. అయినప్పటికీ అది స్వయంగా ఉత్పత్తి చేసుకోగలిగిన దానికంటే చౌకగా విదేశీ సరుకులను పొందగలుగుతుంది. ఇది కింది పరిస్థితి లాంటిదే; కొత్త ఆవిష్కరణను ఉపయోగించుకునే కార్ఖానాదారుడు అది సార్వత్రికంగా అందరూ ఉపయోగించక ముందే తన పోటీదారుల అందరికంటే తన సరుకులను తక్కువ ధరలకు అమ్ముతాడు. అయినా దాని విడి విలువకంటే ఎక్కువకే అమ్మగలుగుతాడు. అంటే తాను నియమించిన శ్రామికుల అధిక ఉత్పాదకతను అదనపు శ్రమగా ఎంచుతాడు. ఆ రకంగా అతను అదనపు లాభాన్ని సంపాదిస్తాడు. కానీ వలస దేశాలలో పెట్టుబడులు సంబంధించిన మేరకు, అక్కడ వున్న వెనుకబడిన అభివృద్ధి స్థాయి కారణంగానూ, బానిసలు, కూలీలు మొదలైన వారిని నియమించుకోవడం ద్వారా శ్రమను దోచుకొంటున్న కారణంగానూ లాభం రేటు ఎక్కువగా వుంటుంది కాబట్టి, ఆ పెట్టుబడులపై వచ్చే లాభం రేట్లు అధికంగానే వుండవచ్చు. ఈ అధిక లాభం రేట్లు కొన్ని రంగాలలో పెట్టిన పెట్టుబడులపై లభిస్తున్నాయి. ఆ లాభాలు వలస దేశాల నుంచి స్వదేశాలకు వస్తున్నాయి కూడా. అయితే అవి దేశంలో సార్వత్రిక లాభం రేటు సమానీకరణలో ప్రవేశించి తద్వారా లాభం రేటును ఎందుకు పెంచవు? గుత్త సంస్థలు అందుకు ఆటంకంగా వుంటే తప్ప ఇలా ఎందుకు జరగదు? ఈ పెట్టుబడి[1] మదుపు రంగాలు స్వేచ్ఛాయుత పోటీ నియమాలకు లోబడి ఉంటాయి కనుక అలా జరగకపోవడానికి కారణం లేదు. రికార్డో ఊహించింది ప్రధానంగా ఇది : విదేశాల్లో ఎక్కువ ధరలవల్ల వచ్చిన డబ్బుతో సరుకులు కొని ఈ దేశానికి పంపబడతాయి. ఈ సరుకులు ఆ విధంగా స్వదేశీ మార్కెట్టులో అమ్మబడతాయి. మహా అయితే, ఈ వాస్తవం అనుకూల పరిస్థితులున్న ఉత్పత్తి రంగాలకు తాత్కాలికమైన అదనపు ఇబ్బంది సృష్టిస్తుంది అని ఆయన నమ్మకం. దాని డబ్బు రూపాన్ని తొలగించగానే ఈ భ్రమ మాయమైపోతుంది. అనుకూల పరిస్థితుల్లో వున్న దేశం తక్కువ శ్రమకు బదులు ఎక్కువ శ్రమ

1. రికార్డో చెప్పినదానికి వ్యతిరేకంగా ఆడమ్ స్మిత్ ఈ విషయంలో సరిగ్గా చెప్పాడు. ''లాభాల సార్వత్రిక పెరుగుదలవల్ల లాభాల్లో సమానత్వం వస్తుందని వారు అంటున్నారు. అత్యంత సానుకూలమైన వాణిజ్యంలో లాభాలు సాధారణ స్థాయికి వేగంగా లొంగుతాయని నేను భావిస్తున్నాను''. (వర్క్స్, సంపాదకుడు మాకులోక్)

పొందుతుంది – ఈ తేడాను, ఈ అదనపు మొత్తాన్ని, శ్రమకు పెట్టుబడికి మధ్య జరిగే మార్పిడులు అన్నింటిలో లాగానే ఒక వర్గం జేబులో వేసుకున్నా కూడా. కనుక వలస దేశంలో సాధారణంగా ఎక్కువగా వున్న కారణాన, ఆ విధంగా లాభం రేటు ఎక్కువగా వుండటం వల్ల, సహజ పరిస్థితులు అనుకూలిస్తే ఈ అధిక లాభం రేటు సరుకుల తక్కువ ధరలతోపాటు కొనసాగుతుంది. లాభాలు ఒకే స్థాయికి వస్తాయి. కాని రికార్డో భావించినట్టుగా అది పాత స్థాయికి సమానం కాదు.

ఇదే విదేశీ వాణిజ్యం స్వదేశంలో పెట్టుబడిదారీ ఉత్పత్తి, విధానాన్ని అభివృద్ధి చేస్తుంది. అది స్థిర పెట్టుబడితో పోలిస్తే అస్థిర పెట్టుబడి తగ్గుదలను సూచిస్తుంది. మరోవైపున విదేశీ మార్కెట్ల విషయంలో అధికోత్పత్తికి కారణమవుతుంది. ఫలితంగా, కాలక్రమేణా, మళ్ళీ ఇందుకు విరుద్ధమైన ప్రభావాన్ని కలిగిస్తుంది.

సార్వత్రిక లాభం రేటు పడిపోయే ధోరణిని సృష్టించే ప్రభావాలే సరిగ్గా అందుకు విరుద్ధమైన ప్రభావాలను సృష్టిస్తాయనీ, అవి లాభం రేటు పడిపోవడాన్ని అడ్డుకొని, మందగింపచేసి కొంత వరకు స్తంభింపచేస్తాయని మనం గమనించాం. ఇవి నియమాన్ని రద్దు చేయవు. కానీ దాని ప్రభావాన్ని దెబ్బతీస్తాయి. అగమ్యగోచరంగా వుండేది సార్వత్రిక లాభం రేటు కాదు; దాని సాపేక్ష మందగమనం. కనుక ఈ నియమం కేవలం ఒక ధోరణిగా మాత్రమే వ్యవహరిస్తుంది. అది కొన్ని పరిస్థితులలో మాత్రమే, దీర్ఘకాలం తరువాత మాత్రమే దాని ప్రభావాలు కొట్టొచ్చినట్టు కనిపిస్తాయి.

మనం చెప్పుకోడానికి ముందు, పొరపాటు అవగాహనలను దూరం చేసేందుకుగాను పదే పదే వివరించిన రెండు అంశాలను జ్ఞాపకం చేసుకోవాలి.

**మొదటిది :** పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం అభివృద్ధి క్రమంలో సరుకులను చౌకపరచే ప్రక్రియే ఆ సరుకుల, ఉత్పత్తిలో పెట్టిన సామాజిక పెట్టుబడి నిర్మాణ రూపంలో మార్పు తెస్తుంది. పర్యవసానంగా లాభం రేటును తగ్గిస్తుంది. కనుక విడి సరుకు సాపేక్ష ఉత్పత్తి ఖర్చు తగ్గుదలా, ఆ సరుకులో యంత్రాల తరుగుదలకు ప్రాతినిధ్యం వహించే భాగం యొక్క ఉత్పత్తి ఖర్చుతో సహా అస్థిర పెట్టుబడితో పోలిస్తే, స్థిర పెట్టుబడి విలువ పెరుగుదలా ఒకటేనని భావించరాదు. అయితే ఇందుకు విరుద్ధంగా, స్థిర పెట్టుబడి సాపేక్ష ఉత్పత్తి ఖర్చులో ప్రతి తగ్గుదల (దాని పాదార్థిక ఆంశాల పరిమాణం యథాతథంగా ఉంటుంది లేదా పెరుగుతుంది అని ఊహించుకొంటున్నాం.) లాభం రేటును పెంచ చూస్తుంది; అంటే, నిష్పత్తి రీత్యా తగ్గిపోతున్న నియుక్త అస్థిర పెట్టుబడితో పోలిస్తే, స్థిర పెట్టుబడి విలువను తగ్గిస్తుంది.

**రెండవది :** మొత్తంగా పెట్టుబడి యొక్క ఉత్పాదితమైన ఆయా విడి సరుకులలో కొత్తగా కలుపబడిన సజీవ శ్రమ వుంది. ఆ సరుకుల్లోని పదార్థాలతోను, వాటిచే వినియోగమైన శ్రమ సాధనాలతోను పోలిస్తే ఈ సజీవ శ్రమ తగ్గిపోతుంది. ఈ వాస్తవం, వాటిలో రాను రాను మరింత తక్కువ పరిమాణంలో సజీవ శ్రమ కలుస్తుంది అన్న వాస్తవం (ఎందుకంటే సామాజిక శ్రమ ఉత్పాదకత అభివృద్ధితో ఈ సరుకుల ఉత్పత్తికి తక్కువ శ్రమ అవసరం అవుతుంది.) వాటిలోని సజీవ శ్రమ ప్రతిఫలం ముట్టిన శ్రమగా, ముట్టని శ్రమగా విడిపోయే నిష్పత్తిని మార్చదు. అందుకు విరుద్ధంగా జరుగుతుంది. సరుకులలో ఉన్న అదనపు సజీవ శ్రమ మొత్తం పరిమాణం తగ్గిపోయినప్పటికీ ప్రతిఫలం ముట్టిన శ్రమతో పోల్చితే ప్రతిఫలం ముట్టని శ్రమ పెరుగుతుంది. ప్రతిఫలం ముట్టిన

శ్రమ సాపేక్షంగా, లేదా నిరపేక్షంగా తగ్గవచ్చు. ఎందుకంటే సరుకులో అదనపు సజీవ శ్రమ మొత్తం పరిమాణాన్ని తగ్గించే ఉత్పత్తి విధానంతోనే అదనపు విలువ సాపేక్ష, నిరపేక్ష విలువ పెరుగుతుంది. లాభం రేటు పడిపోయే ధోరణి అదనపు విలువ రేటు పెరిగే ధోరణితో ముడిపడి వుంది. కనుక శ్రమ దోపిడీ రేటు పెరిగే ధోరణితో ముడిపడి వుంది. కనుక లాభం రేటు పడిపోవడానికి వేతనాల రేటు పెరగడం కారణమని చెప్పటంకంటే అసంబద్ధం అయినదేదీ లేదు. అయితే అరుదుగా అలా జరిగినా, అది మినహాయింపే! వివిధ యుగాల్లోను, దేశాల్లోను వేతనాల రేటును వాస్తవంగా లాభం రేటును రూపొందించే పరిస్థితులను సమగ్రంగా అర్థం చేసుకొంటే తప్ప గణాంక సమాచారం విశ్లేషించ లేదు. లాభం రేటు పడిపోవడం శ్రమ ఉత్పాదకత తక్కువ కావడం వల్ల కాదు; శ్రమ ఉత్పాదకత ఎక్కువ కావడం వల్ల. అదనపు విలువ రేటు పెరగడం, లాభం రేటు పడిపోవడం అన్నవి పెట్టుబడిదారీ విధానంలో పెరుగుతున్న శ్రమ ఉత్పాదకతను వ్యక్తం చేసే రెండు ప్రత్యేక రూపాలు.

## VI. స్టాకు పెట్టుబడి పెరుగుదల

పైన పేర్కొన్న ఐదు అంశాలకు అనుబంధంగా ఈ క్రింది అంశాలను చేర్చవచ్చు. అయితే ప్రస్తుతానికి వీటి గురించి సమగ్రంగా చర్చించ వీలులేదు. పెట్టుబడిదారీ ఉత్పత్తి ప్రగతితోపాటు వేగంగా పెట్టుబడి సంచయనం జరుగుతుంది. దానితో పెట్టుబడిలో ఒక భాగం వడ్డీ ఇచ్చే పెట్టుబడిగా మాత్రమే లెక్కించబడుతుంది. నియోగించబడుతుంది. పారిశ్రామిక పెట్టుబడిదారుడు మదుపుపెట్టిన వ్యక్తిగా లాభాన్ని జేబులో వేసుకోగా, పెట్టుబడిని అప్పుపెట్టిన ప్రతి పెట్టుబడిదారుడు వడ్డీతో సంతృప్తి పడతాడన్న అర్థంలో కాదు. సార్వత్రిక లాభం రేటు స్థాయిపైన దీని ప్రభావం ఏమి ఉండదు. ఎందుకంటే, లాభం = వడ్డీ + అన్ని రకాల లాభం + కౌలు; ఇలా ప్రత్యేక తరహాలుగా విభజితం కావటంతో దానికి ప్రమేయం లేదు. భారీ ఉత్పాదక పరిశ్రమల్లో మదుపు పెట్టబడినప్పటికీ, ఈ పెట్టుబడులు అన్ని ఖర్చులు మినహాయించిన తరువాత డివిడెండ్లు అనబడే కేవలం వడ్డీ మొత్తాలను మాత్రమే ఇస్తాయన్న అర్థంలో ఇది వర్తిస్తుంది. ఇందుకు (పెద్దవో, కొద్దిపాటివో) రైల్వేలు ఉదాహరణ. సార్వత్రిక లాభం రేటును సమం చేయటంలో వీటికి పాత్ర లేదు. ఎందుకంటే అవి సగటు లాభం రేటుకంటే తక్కువ ప్రతిఫలాన్ని ఇస్తాయి. అవి కూడా లాభం రేటులో ప్రవేశిస్తే సార్వత్రిక లాభం రేటు మరింత తక్కువ స్థాయికి పడిపోతుంది. సైద్ధాంతికంగా వాటిని కూడా పరిగణనలోకి తీసుకొన వచ్చును. అలా చేస్తే, ఫలితం ఇప్పుడున్నట్లు కనిపిస్తున్న లాభం రేటుకంటే తక్కువ స్థాయికి పడిపోతుంది. (ఈ కనిపిస్తున్న రేటు పెట్టుబడిదారులకు నిర్ణయాత్మకమైన అంశం) ప్రత్యేకించి ఈ పరిశ్రమల్లో, అస్థిర పెట్టుబడితో పోల్చితే స్థిర పెట్టుబడి అత్యధికంగా వుండటమే ఈ రేటు పైవిధంగా పడిపోవడానికి కారణం.

★ ★ ★

## అధ్యాయం - 15

# ఈ నియమం యొక్క అంతర్గత వైరుధ్యాల వివరణ

### I. స్థూల పరిశీలన

**లా**భం రేటు అదనపు విలువ రేటును అది వాస్తవంగా ఉన్న దానికంటే తక్కువగా ఉన్నట్లు ఎల్లప్పుడూ వ్యక్తం చేస్తుందని మనం ఈ గ్రంథం మొదటి భాగంలో చూశాం. పెరిగే అదనపు విలువ రేటుకు సహితం పడిపోతున్న లాభం రేటులో వ్యక్తం అయ్యే ధోరణి వుందని ఇక్కడ చూస్తున్నాం. లాభం రేటు అదనపు విలువ రేటుతో సమానం కావాలంటే స్థి.పె = 0 కావాలి. అంటే, మొత్తం పెట్టుబడి వేతనాలుగా చెల్లించబడాలి. స్థిర పెట్టుబడిని చలనంలో పెట్టే శ్రమశక్తి పరిమాణానికి, స్థిర పెట్టుబడి విలువకు మధ్య నిష్పత్తి మారకుండా యథాతథంగా వున్నప్పుడు, లేదా స్థిర పెట్టుబడి విలువతో పోల్చితే శ్రమశక్తి పరిమాణం పెరిగినపుడు మాత్రమే పడిపోయే లాభం రేటు పడిపోయే అదనపు విలువగా వ్యక్తం అవుతుంది.

లాభం రేటు విశ్లేషణ పేరుతో రికార్డో వాస్తవంగా విశ్లేషించింది అదనపు విలువ రేటును మాత్రమే. పైగా సాంద్రత రీత్యా, విస్తృతి రీత్యా పనిదినం పరిమాణం స్థిరమైనదనే ఊహపై ఆధారపడిన విశ్లేషణ ఇది.

లాభం రేటు పడిపోవటమూ, సత్వర సంచయనమూ – ఈ రెండూ ఉత్పాదకత అభివృద్ధిని ప్రతిబింబించిన మేరకు ఒకే క్రమానికి చెందిన రెండు భిన్న వ్యక్తీకరణలు మాత్రమే. సంచయనంలో భారీ స్థాయిలో శ్రమ కేంద్రీకరణ ఆ విధంగా పెట్టుబడి యొక్క ఉన్నత నిర్మాణ స్వరూపమూ గర్భితం. అందువల్ల అది లాభం రేటు పతనాన్ని త్వరితం చేస్తుంది. మరోవైపున లాభం రేటు పడిపోవటం అన్నది పెట్టుబడి కేంద్రీకరణను, సాంద్రీకరణను త్వరితం చేస్తుంది. చిన్న పెట్టుబడిదారుల ఆస్తిపాస్తులను కొద్దిమంది ప్రత్యక్ష ఉత్పత్తిదారుల వద్ద లాక్కోవడానికి ఏదైనా మిగిలివుంటే దాన్ని లాక్కోవడం ద్వారా ఇది జరుగుతుంది. ఇది పరిమాణానికి సంబంధించి సంచయనాన్ని త్వరితం చేస్తుంది. అయితే లాభం రేటుతోపాటు సంచయనం రేటు కూడా పడిపోతుంది.

మరోవైపు, మొత్తం పెట్టుబడి స్వయం విస్తరణ రేటు లేదా లాభం రేటు అన్నది, పెట్టుబడిదారీ ఉత్పత్తికి ముల్లుకర్ర కావడం వల్ల (పెట్టుబడి స్వయం విస్తరణ దాని ఏకైక లక్ష్యం అయినట్లుగా) లాభం రేటు పడిపోవటం కొత్త, స్వతంత్ర పెట్టుబడులు రూపొందటాన్ని నిరోధిస్తుంది. ఆ రకంగా పెట్టుబడిదారీ ఉత్పత్తి ప్రక్రియ అభివృద్ధికి ప్రమాదంగా కనిపిస్తుంది. అది అమితోత్పత్తిని, సట్టా వ్యాపారాన్ని, సంక్షోభాలను, అదనపు జనాభాతో పాటు అదనపు పెట్టుబడిని సృష్టిస్తుంది. పెట్టుబడిదారీ

ఉత్పత్తి విధానాన్ని రికార్డో లాగానే పరిపూర్ణమైనదని భావించే శాస్త్రవేత్తలు ఈ విషయంలో అది తనకు తాను ఆటంకం సృష్టించుకుంటుందని భావిస్తారు. ఈ కారణంగా ఈ ఆటంకాన్ని ఉత్పత్తికి కాక ప్రకృతికి ఆపాదిస్తారు (కౌలు సిద్ధాంతంలో). కానీ, లాభం రేటు పడిపోవడం వారిని భయపెట్టడంలో ప్రధాన అంశం ఏమంటే పెట్టుబడిదారీ ఉత్పత్తి తన ఉత్పాదక శక్తుల అభివృద్ధిలో సంపద సృష్టికి ఏ మాత్రం సంబంధం లేని ఆటంకాన్ని ఎదుర్కొంటూందనే భావన. ఈ ప్రత్యేక ఆటంకం పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం యొక్క పరిమితులకూ, దాని కేవల చారిత్రక, తాత్కాలిక స్వభావానికీ రుజువు. సంపద సృష్టికి అది పరిపూర్ణ విధానం కాదని అంతేకాక, ఒకానొక దశలో సంపద తదుపరి అభివృద్ధికి అది ఎదురొడ్డుతుందనీ రుజువు చేస్తుంది.

రికార్డో, ఆయన తరహాలో ఆలోచించిన వారు వడ్డీ చేరివున్న పారిశ్రామిక పెట్టుబడిని మాత్రమే పరిశీలించారు. నిజమే. భూమి కౌలుకు నిరపేక్ష పరిమాణం పెరిగినా నైష్పత్తికంగా పారిశ్రామిక లాభం కంటే ఎక్కువగా కూడా పెరిగినా దానికి కూడా లాభం రేటులాగానే పడిపోయే ధోరణి వుంది. (రికార్డోకన్నా ముందు భూమి కౌలు నియమాన్ని రూపొందించిన ఎడ్‌వెస్ట్[1] గ్రంథాన్ని చూడండి.) మనం మొత్తం సామాజిక పెట్టుబడిని మొ.పె. అనుకుందాం. దానిలో వడ్డీ, భూమి కౌలు తీసివెయ్యగా మిగిలిన పారిశ్రామిక లాభాన్ని $\text{లా}_1$ అనుకుందాం. వడ్డీని వ. గాను, భూమి కౌలును కౌ గాను భావిద్దాం. అప్పుడు $\frac{\text{అ.వి.}}{\text{మొ.పె.}} = \frac{\text{లా}}{\text{మొ.పె.}} = \frac{\text{లా}_1+\text{వ}+\text{కౌ}}{\text{మొ.పె.}} = \frac{\text{లా}}{\text{మొ.పె.}} + \frac{\text{వ}}{\text{మొ.పె.}} + \frac{\text{కౌ.}}{\text{మొ.పె.}}$ అదనపు విలువ మొత్తం అ.వి. పెట్టుబడిదారీ అభివృద్ధి క్రమంలో రానురాను పెరుగుతోందనీ, అ.వి. కంటే మొ.పె. వేగంగా పెరగడం వల్ల $\frac{\text{అ.వి.}}{\text{మొ.పె}}$ క్రమంగా తగ్గుతోందనీ మనం చూస్తాం. కనుక $\frac{\text{అ.వి.}}{\text{మొ.పె.}} = \frac{\text{లా}}{\text{మొ.పె.}}$ లతో పాటు $\frac{\text{లా}_1}{\text{మొ.పె.}}$, $\frac{\text{వ.}}{\text{మొ.పె.}}$, $\frac{\text{కౌ.}}{\text{మొ.పె.}}$ లు ప్రతీది క్రమంగా తగ్గుతున్నప్పటికీ $\text{లా}_1$, వ, కౌ లు ప్రతీది క్రమంగా పెరగటంలో వైరుధ్యం ఏదీ లేదు. అలాగే వ.తో పోల్చితే $\text{లా}_1$ లేదా లా తో పోల్చితే కౌ, లేదా $\text{లా}_1$వ లతో పోల్చితే కౌలు పెరగటంలో కూడా వైరుధ్యం లేదు. పెరిగే మొత్తం అదనపు విలువ లేదా లాభంతో పాటు (అ.వి. = లా.తో పాటు) అదే సమయంలో పడిపోతున్న లాభం రేటు$\frac{\text{అ.వి.}}{\text{మొ.పె.}} = \frac{\text{లా}}{\text{మొ.పె.}}$ తో పాటు $\text{లా}_1$, వ, కౌ $\text{ల}_1$ అంశీభూత భాగాల నిష్పత్తులు మొత్తం అ.వి. పరిధిలో అ.వి. పరిమాణాన్ని గాని లేదా $\frac{\text{అ.వి.}}{\text{మొ.పె.}}$ పరిమాణాన్ని గాని మార్చకుండా ఎంతైనా మారవచ్చు.

$\text{లా}_1$, వ, కౌ ల నిష్పత్తిలో తేడాలు కేవలం విభిన్న వర్గాల మధ్య అ.వి. పంపిణీ వేరువేరుగా వుందని మాత్రమే తెలియజేస్తాయి. పర్యవసానంగా, పారిశ్రామిక లాభం రేటు, వడ్డీ రేటు, మొత్తం పెట్టుబడితో భూమి కౌలు ఉన్న నిష్పత్తి, అనగా $\frac{\text{లా}_1}{\text{మొ.పె.}}$, $\frac{\text{కౌ}}{\text{మొ.పె.}}$ వ లేదా$\frac{\text{వ}}{\text{మొ.పె.}}$లు ప్రతిది ఒకదానితో పోల్చితే ఒకటి పెరగవచ్చు. $\frac{\text{అ.వి.}}{\text{మొ.పె.}}$ అనగా సార్వత్రిక లాభం రేటు పడిపోతున్నప్పుడు కూడా ఇలా పెరగవచ్చు. ఒకే ఒక షరతు. ఏమంటే ఈ మూడు అంశాల మొత్తం = $\frac{\text{అ.వి.}}{\text{మొ.పె.}}$ కావాలి. ఒకానొక

1. ఈ.వెస్ట్. ఎస్సే ఆన్ ది ఎప్లికేషన్ ఆఫ్ కేపిటల్ టు లాండ్, లండన్, 1815 - సం.

పెట్టుబడి (దాని అదనపు విలువ రేటు=100% అనుకుందాం) నిర్మాణ స్వరూపం $50_{\text{స్థి.పె.}}+50_{\text{అ.పె.}}$ నుంచి $75_{\text{స్థి.పె.}}+25_{\text{అ.పె.}}$ గా మారినపుడు స్థి.పె. మారటం కారణంగా, దాని లాభం రేటు 50% నుంచి 25%కు పడిపోయిందనుకుందాం. ఇప్పుడు మొదటి ఉదాహరణలో పెట్టుబడి 100 అయితే లాభం 500 అవుతుంది. రెండవ దానిలో పెట్టుబడి 4000 అయితే లాభం 1000 అవుతుంది. అ.వి. లేదా లా రెట్టింపు అయ్యిందని, $\text{లా}_1$ సగానికి పడిపోయిందని గమనించవచ్చు. ఇదివరకటి 50% లాభాన్ని 20% లాభంగానూ, 10 వడ్డీగానూ, 20 భూమి కౌలుగానూ భావిద్దాం. అపుడు $\frac{\text{లా}_1}{\text{మొ.పె.}} = 20\%$ $\frac{\text{వ}}{\text{మొ.పె.}} = 10\%$ $\frac{\text{కౌ}}{\text{మొ.పె.}} = 20\%$. 50% నుంచి 25%కి మారిన తరువాత నిష్పత్తులు యథాతథంగా ఉంటే అప్పుడు $\frac{\text{లా}_1}{\text{మొ.పె.}}=10\%$ $\frac{\text{వ}}{\text{మొ.పె.}}=5\%$ $\frac{\text{కౌ}}{\text{మొ.పె.}}=10\%$గా వుంటాయి. $\frac{\text{లా}_1}{\text{మొ.పె.}} = 8\%$ $\frac{\text{వ}}{\text{మొ.పె.}} = 4\%$కి పడిపోతే, $\frac{\text{కౌ}}{\text{మొ.పె.}} = 13\%$ పెరుగుతుంది. లా, వ లతో పోల్చితే కౌ సాపేక్ష పరిమాణం పెరిగింది. కాగా లా యథాతథంగా వుంది. ఈ రెండు సందర్భాలలోనూ లా, వ, కౌ మొత్తం నాల్గింతలు పెట్టుబడి వల్ల ఉత్పత్తి అయింది కనుక పెరిగి వుండాలి. అంతేకాక ప్రారంభంలో పారిశ్రామిక లాభంలో (వడ్డీతో కలిసి) మొత్తం అదనపు విలువ ఉంటుందన్న రికార్డో ఊహ చారిత్రకంగానూ, తార్కికంగానూ తప్పు. 1) మొత్తం లాభాన్ని నేరుగా పారిశ్రామిక, వ్యాపార పెట్టుబడిదార్లకు తదుపరి పంపిణీ కోసం ఇచ్చినదీ, 2) భూమి కౌలును లాభానికిపైన ఉన్న మిగులుగానూ, మార్చింది పెట్టుబడిదారీ ఉత్పత్తి ప్రగతే. ఈ పెట్టుబడిదారీ ప్రాతిపదికపైన లాభంలో ఒక భాగంగా భూమి కౌలు పెరుగుతుంది. (అంటే, మొత్తం పెట్టుబడి ఉత్పాదితంగా పరిగణింప బడుతున్న అదనపు విలువలలో భాగంగా పెరుగుతుంది.) అంతేగాని పెట్టుబడిదారుడు జేబులో వేసుకునే ఉత్పాదితం యొక్క ప్రత్యేక భాగంగా కాదు.

అవసరమైన ఉత్పత్తి సాధనాలు, తగిన స్థాయిలో పెట్టుబడి సంచయనమూ ఉన్నప్పుడు అదనపు విలువ రేటు అంటే దోపిడీ తీవ్రత నిర్ణీతమైనప్పుడు, అదనపు విలువ సృష్టి అన్నది కార్మిక ప్రజల సంఖ్యచేత మాత్రమే పరిమితమవుతుంది. కార్మిక ప్రజల సంఖ్య నిర్ణీతమైనప్పుడు దోపిడీ తీవ్రత దాన్ని పరిమితం చేయదు. పెట్టుబడిదారీ ఉత్పత్తి ప్రక్రియ తప్పనిసరిగా అదనపు విలువ ఉత్పత్తిగానే ఉంటుంది. అదనపు ఉత్పాదితం లేక ఉత్పత్తి అయిన సరుకుల్లో ప్రతిఫలం ముట్టని శ్రమకు వస్తురూపంగా వున్న భాగం ఈ అదనపు విలువకూ ప్రాతినిధ్యం వహిస్తుంది. ఈ అదనపు విలువ ఉత్పత్తీ, దానిలో ఒక భాగం పెట్టుబడిగా మారటమూ లేదా సంచయనంగా తిరిగి మారటమూ, పెట్టుబడిదారీ ఉత్పత్తి యొక్క తక్షణ లక్ష్యం, మీరరాని ప్రోద్బలకారి. కనుక పెట్టుబడిదారీ ఉత్పత్తిని, అది ఏదికాదో దానిని చిత్రించడం అంటే తక్షణ అనుభోగానికి ఉద్దేశించిన వస్తూత్పత్తిగా లేక పెట్టుబడిదారుని కోసం ఉద్దేశించిన సుఖానుభోగ సాధనాల ఉత్పత్తిగా చిత్రించడం నిష్ఫలం. అలా చేయడమంటే, దాని ప్రత్యేక స్వభావాన్ని, దాని అంతర్గత సారభూతాంశంగా వెల్లడి అవుతున్న ఈ స్వభావాన్ని ఉపేక్షించడమే.

అదనపు విలువ సృష్టియే ప్రత్యక్ష ఉత్పత్తి ప్రక్రియ. మనం ఇంతకు ముందు చెప్పినట్లుగా దానికి పైన పేర్కొన్నవి తప్ప మరే పరిమితులు లేవు. నడపిందుకోడానికి వీలైన అదనపు శ్రమ అంతా సరుకులలో మూర్తీభవించగానే అదనపు విలువ ఉత్పత్తి అయినట్లే. అయితే ఈ అదనపు

విలువ ఉత్పత్తితో పెట్టుబడిదారీ ఉత్పత్తి ప్రక్రియ యొక్క మొదటి చర్య మాత్రమే పూర్తి అవుతుంది. అంటే ప్రత్యక్ష ఉత్పత్తి ప్రక్రియ పూర్తి అవుతుంది. పెట్టుబడి ఒక నిర్దిష్టమైన పరిమాణం గల ప్రతిఫలం ముట్టని శ్రమను తనలో ఇముడ్చుకొంది. లాభం రేటు పతనంగా వ్యక్తమయ్యే ఈ ప్రక్రియ అభివృద్ధితో, ఆ రకంగా ఉత్పత్తి అయిన అదనపు విలువ పరిమాణం అపారమైన స్థాయితో పెరుగుతుంది. ఇప్పుడు ప్రక్రియ రెండో చర్య మొదలవుతుంది. మొత్తం సరుకుల పరిమాణం, అనగా స్థిర, అస్థిర పెట్టుబడులను భర్తీ చేసే భాగం, అదనపు విలువకు ప్రాతినిధ్యం వహించే భాగం అమ్మబడాలి. అలా జరక్కపోతే లేదా పాక్షికంగా మాత్రమే జరిగితే లేదా ఉత్పత్తి వ్యయంకంటే తక్కువ ధరలకు అమ్మబడితే, కార్మికుడు దోపిడీ చేయబడ్డాడే కాని ఆ దోపిడీ ఫలితం పెట్టుబడిదారునికి దక్కలేదన్నమాట. అతన్నించి వడపిండిన అదనపు విలువను డబ్బు రూపంలో రాబట్టడంలో పూర్తి లేదా పాక్షిక వైఫల్యంతో ఇది ముడిపడి వుంటుంది. పెట్టుబడిని ఒకోసారి పూర్తిగాను లేదా పాక్షికంగానూ కోల్పోవడం కూడా జరగవచ్చు. ప్రత్యక్ష దోపిడీ పరిస్థితులు, ఆ దోపిడీ ఫలితాన్ని డబ్బు రూపంలో రాబట్టుకొనే పరిస్థితులు ఒకటి కావు. అవి స్థల, కాలాల రీత్యా మాత్రమే కాక తార్కికంగా కూడా వేరు వేరు అంశాలు. మొదటి అంశంపై సమాజం యొక్క ఉత్పాదక శక్తి పరిమితి విధిస్తుంది. రెండవ రకం పరిస్థితులపై సమాజం యొక్క వివిధ ఉత్పత్తి శాఖల మధ్య నైష్పత్తిక సంబంధం సమాజం యొక్క వినియోగ శక్తీ పరిమితి విధిస్తాయి. అయితే ఈ వినియోగ శక్తి సంపూర్ణ ఉత్పాదక శక్తిచేతగాని, సంపూర్ణ వినియోగ శక్తిచేతగాని నిర్ణయించబడదు. అలా కాకపోగా, సమాజంలోని అత్యధికులు వినియోగాన్ని కనిష్ట పరిమితికి కాస్త అటూ ఇటూగా వుండే స్థాయికి కుదించే శత్రుపూరిత పంపిణీ పరిస్థితులపై ఆధారపడిన వినియోగ శక్తిచే నిర్ణయింపబడుతుంది. అంతేగాక పెట్టుబడి సంచయన ధోరణీ, పెట్టుబడిని విస్తరింపచేయటానికి, అదనపు విలువను విస్తృత స్థాయిలో ఉత్పత్తి చేయటానికి జరిగే తీవ్ర కృషీ దీనికి పరిమితులు విధిస్తాయి. ఇది పెట్టుబడిదారీ ఉత్పత్తికి నియమం. ఉత్పత్తి పద్ధతులలో నిరంతర విప్లవాలు, ఆ విప్లవాలవల్ల అదివరకున్న పెట్టుబడి విలువ తగ్గడం, సార్వత్రిక పోటీతత్వ పోరాటం కేవలం ఆత్మరక్షణ ఉండటానికి సాధనంగా, నాశనమైపోయే ముప్పుకు గురికాకుండా ఉండటానికి ఉత్పత్తిని మెరుగుపరచాల్సిన అవసరం – ఇది పెట్టుబడిదారీ ఉత్పత్తిపైన ఈ నియమాన్ని రుద్దుతున్నాయి. కనుక మార్కెట్‌ను నిరంతరాయం విస్తరించాల్సి వుంటుంది. అందువల్ల దాని ఆంతరిక సంబంధాలు, వాటిని క్రమబద్ధం చేసే పరిస్థితులు రానురాను ఒక ప్రకృతి నియమ రూపాన్ని ధరించి ఉత్పత్తిదారునితో ప్రమేయం లేకుండా స్వతంత్రంగా పనిచేస్తాయి. రానురాను వాటిని అదుపు చేయటం అసాధ్యం అవుతుంది. ఈ అంతర్గత వైరుధ్యం ఉత్పత్తి యొక్క బాహ్య పరిధి విస్తరణ ద్వారా పరిష్కారం కాజూస్తుంది. అయితే ఉత్పాదకత అభివృద్ధి చెందినకొద్దీ – దానికీ, వినియోగ పరిస్థితుల సంకుచిత ప్రాతిపదికకూ మధ్య తేడా పెరుగుతూనే వుంటుంది. ఈ స్వయం విరుద్ధమైన ప్రాతిపదికపైన ఏకకాలంలో పెరుగుతున్న అదనపు జనాభాతోపాటు అదనపు పెట్టుబడి వుండటంలో వైరుధ్యమేమీ లేదు. ఎందువల్లనంటే, ఈ రెండు అంశాల కలయిక ఉత్పత్తి అయ్యే అదనపు విలువ పరిమాణాన్ని పెంచుతూ, అదే సమయంలో అదనపు ఉత్పత్తి అయ్యే పరిస్థితులకూ, అదనపు విలువ డబ్బుగా చేతికందే పరిస్థితులకూ మధ్య వున్న వైరుధ్యాన్ని తీవ్రతరం చేస్తుంది.

ఒకానొక లాభం రేటు నిర్ణీతమైతే, లాభం పరిమాణం ఎల్లప్పుడూ అడ్వాన్సు చేసిన పెట్టుబడి

పరిమాణంపైన ఆధారపడుతుంది. అయితే సంచయనం, పెట్టుబడిగా పునఃపరివర్తన చెందిన లాభ పరిమాణ భాగంపైన ఆధారపడుతుంది. ఈ భాగం, లాభంలోంచి పెట్టుబడిదారు వినియోగం చేసిన ఆదాయం పోగా మిగిలినది. అది కేవలం ఈ పరిమాణం విలువపై మాత్రమే కాక దానితో పెట్టుబడిదారు కొనే సరుకుల చౌకదనంపైన ఆధారపడి వుంటుంది. అతని వినియోగంలోకి, అంటే అతని ఆదాయంలోకి కొంత, అతని స్థిర పెట్టుబడిలోకి కొంత వెళ్ళే సరుకులవి (ఇక్కడ వేతనాలు నిర్ణీతమైనవిగా ఊహించుకొన్నాం).

కార్మికుడు తాను చలనంలో ఉంచే పెట్టుబడి రాశి యొక్క విలువను తన శ్రమచేత భద్రపరచి, తన ఉత్పాదితంలో పునరుత్పత్తి చేస్తాడు. ఆ పరిమాణం అతడు జతచేసే విలువకు భిన్నమైంది. పెట్టుబడి పరిమాణం రూ. 1,000 అని, చేర్చిన శ్రమ రూ. 100 అని అనుకొందాము. పునరుత్పత్తి అయిన పెట్టుబడి = రూ. 1,100. పరిమాణం = 100 అయితే, చేర్చిన శ్రమ = 20 అయితే పునరుత్పత్తి అయిన పెట్టుబడి = రూ. 120. మొదటి ఉదాహరణలో లాభం రేటు = 10%, రెండవ దానిలో అది 20%. అయినప్పటికీ 20 నుంచి కంటే 100 నుంచి ఎక్కువ సంచయనం సాధ్యం. కనుక పెట్టుబడి అనేది (ఉత్పాదకత పెరగడంవల్ల అదివరకున్న పెట్టుబడి విలువ తగ్గడం మాట అటుంచి) ప్రవహిస్తూనే వుంటుంది. పెట్టుబడి సంచయనం జరుగుతూనే వుంటుంది. అయితే లాభం రేటుకు అనుగుణంగా గాక, దానికి అప్పటికే ఉన్న ఊపునకు అనుగుణంగా అది జరుగుతుంది. అధిక అదనపు విలువ రేటుపై ఆధారపడినంత వరకు, శ్రమ ఉత్పాదకత అధికం కానప్పటికీ, పని దినం చాలా సుదీర్ఘంగా వున్నపుడు అధిక లాభం రేటు సాధ్యమే! ఎందుకంటే ఆ కార్మికుల అవసరాలు చాలా పరిమితి, కనుక సగటు వేతనాలు చాలా తక్కువగా వుంటాయి. శ్రమ అనుత్పాదకంగా ఉన్నప్పటికి పరిస్థితులు అలా వుంటాయి. శ్రామికుని శక్తిహీనతకు అనుగుణంగానే వేతనాల స్థాయి తక్కువగా వుంటుంది. లాభం రేటు అధికంగా ఉన్నప్పటికీ పెట్టుబడి సంచయనం నెమ్మదిగా సాగుతుంది. జనాభా స్తంభిస్తుంది. ఉత్పాదితంలో ఖర్చు అయ్యే పనికాలం ఎక్కువగా వుంటుంది. కార్మికులకు చెల్లించే వేతనాలు మాత్రం తక్కువగా ఉంటాయి.

లాభం రేటు పడిపోకపోవడానికి కారణం కార్మికుడు తక్కువ దోపిడీ చేయబడటం కాదు. పనిలో పెట్టిన పెట్టుబడితో పోలిస్తే నియమించిన శ్రమ సాధారణంగా తక్కువ ఉండటమే దీనికి కారణం.

పైన నిరూపించినట్లు, లాభం రేటు పడిపోవటం అన్నది లాభం మొత్తం పెరుగుదలతో ముడిపడి వుంటే, వార్షిక శ్రమ ఉత్పాదితంలో ఎక్కువ భాగాన్ని పెట్టుబడిదారు పెట్టుబడి కింద, (వినియోగమైన పెట్టుబడి భర్తీ చెయ్యటంతో) సాపేక్షంగా తక్కువ భాగాన్ని లాభం కింద ఉపయోగించుకొంటాడు. అందుచేతనే మతగురువు చామర్స్‌కు వింత ఆలోచన వచ్చింది.[1] అది ఏమంటే పెట్టుబడిదారులు వార్షిక ఉత్పాదితంతో పెట్టుబడిగా ఎంత తక్కువ వ్యయం చేస్తే వారు జేబులో వేసుకునే లాభాలు అంత ఎక్కువగా వుంటాయి. అటువంటి సందర్భంలో అదనపు ఉత్పాదితాన్ని

1. టి. చామర్స్, ఆన్ పొలిటికల్ ఎకానమీ ఇన్ కనక్షన్ విత్ ది మోరల్ స్టేట్ అండ్ మోరల్ ప్రాస్పెక్ట్స్ ఆఫ్ సొసైటీ, రెండవ ముద్రణ గ్లాస్‌గో, 1832, పుట 88 - సం.

పెట్టుబడిగా ఉపయోగించటానికి బదులు దానిలో అత్యధిక భాగాన్ని వినియోగం చెయ్యటం ద్వారా ప్రభుత్వ చర్చి పెట్టుబడిదారులకు తోడ్పడుతుందన్నమాట. ఈ మతగురువు కార్యకారణాలను గందరగోళ పరుస్తున్నాడు. అంతేకాదు, మదుపు పెడుతున్న పెట్టుబడి పెరుగుతున్నకొద్దీ, లాభం రేటు తక్కువగా ఉన్నప్పటికీ లాభం మొత్తం పెరుగుతుంది. అయితే దీనికి అదే సమయంలో పెట్టుబడి సాంద్రీకరణ అవసరం అవుతుంది. ఎందుకంటే ఉత్పత్తి పరిస్థితుల వల్ల అక్కడ మరింత పెద్ద స్థాయిలో పెట్టుబడిని పనిలో పెట్టవలసి వుంటుంది. ఇక్కడ సాంద్రీకరణ కూడా అవసరం అవుతుంది. అంటే చిన్న పెట్టుబడిదారులను పెద్ద పెట్టుబడిదారులు మింగేసి వారి చేతిలో పెట్టుబడి లేకుండా చెయ్యటం. ఇది కూడా ఉత్పత్తి పరిస్థితులను ఉత్పత్తిదారుల నుంచి వేరుచెయ్యటమే అవుతుంది. ఇది ఇబ్బడి ముబ్బడిగా జరుగుతుంది. చిన్న పెట్టుబడిదారులు ఇంకా ఉత్పత్తిదారుల కింద లెక్క. ఎందుకంటే వారి శ్రమ ఇంకా తగిన స్థాయిలో పాత్ర వహిస్తూనే వుంటుంది. పెట్టుబడిదారుని శ్రమ అతని పెట్టుబడి పరిమాణానికి అంటే అతడు పెట్టుబడిదారుడుగా వున్న స్థాయికి విలోమానుపాతంలో ఉంటుంది. ఉత్పత్తిదారుల నుంచి ఉత్పత్తి పరిస్థితులు ఇలా విడిపోవడం అన్నదే పెట్టుబడి – అన్న భావనను రూపొందిస్తుంది. అది ఆదిమ సంచయనంతో ప్రారంభమవుతుంది.[1] పెట్టుబడి సంచయన, సాంద్రీకరణతో ఇదొక శాశ్వత ప్రక్రియలా రంగంపైకి వస్తుంది. చివరికి అప్పుడున్న పెట్టుబడులు కొద్దిమంది చేతుల్లో కేంద్రీకరించబడటంగానూ, అనేకమంది తమ పెట్టుబడిని కోల్పోవటంగానూ వ్యక్తమవుతుంది. పరస్పర విరుద్ధంగా వ్యవహరించే ధోరణులే లేకుంటే ఈ ప్రక్రియ పెట్టుబడిదారీ ఉత్పత్తి పతనానికి దారితీసి వుండేదే; పై కేంద్రీకరణ ధోరణితోపాటు ఈ ధోరణులు నిరంతరాయంగా వికేంద్రీకరణ ప్రభావాన్ని చూపుతుంటాయి.

## II. ఉత్పత్తి విస్తరణకు, అదనపు విలువ ఉత్పత్తికి మధ్య ఘర్షణ

శ్రమ సామాజిక ఉత్పాదకత అభివృద్ధి రెండు విధాలుగా వ్యక్తం అవుతుంది. మొదటిది – అప్పటికే ఉత్పత్తి అయిన ఉత్పాదక శక్తుల పరిమాణ రూపంలో, కొత్త ఉత్పత్తి కొనసాగే ఉత్పత్తి పరిస్థితుల పరిమాణమూ, విలువా రూపంలో, అప్పటికే సంచితమైన ఉత్పాదక పెట్టుబడి సంపూర్ణ పరిమాణ రూపంలోనూ వ్యక్తం అవుతుంది. రెండవది – వేతనాలకై కేటాయించబడిన మొత్తం పెట్టుబడి భాగం సాపేక్షంగా తక్కువగా ఉంటుందన్న రూపంలో, అంటే ఒక నిర్ణీత పెట్టుబడి పునరుత్పత్తికి, స్వయం విస్తరణకు, భారీస్థాయి ఉత్పత్తికి అవసరం అయిన సజీవ శ్రమ పరిమాణం సాపేక్షంగా చిన్నదిగా ఉండటం అన్న రూపంలో వ్యక్తమవుతుంది. ఇది కూడా పెట్టుబడి సాంద్రీకరణను సూచిస్తుంది.

పనిలో ఉన్న శ్రమశక్తికి సంబంధించి ఉత్పాదకత అభివృద్ధి రెండు రకాలుగా వ్యక్తమవుతుంది. మొదటిది – అదనపు విలువ పెరుగుదలతో, అంటే శ్రమశక్తి పునరుత్పత్తి కావలసిన అవసర శ్రమ కాలం తగ్గుదల రూపంలో వ్యక్తమవుతుంది. రెండవది ఒక నిర్ణీత పెట్టుబడిని చలనంలో పెట్టటానికి పనిలో పెట్టబడిన శ్రమశక్తి పరిమాణం (కార్మికుల సంఖ్య) తగ్గుదల రూపంలో వ్యక్తమవుతుంది.

1. మొదటి సంపుటం, 8వ భాగం.

ఈ రెండు చలనాలు కలిసే పయనిస్తాయి. అంతేకాక అవి ఒకదానినొకటి ప్రభావితం చేస్తాయి. ఒకే నియమం ఈ రెండు ధోరణులలోనూ వ్యక్తమవుతుంది. అయితే లాభం రేటును అవి పరస్పర విరుద్ధ మార్గాలలో ప్రభావితం చేస్తాయి. మొత్తం లాభం పరిమాణం, మొత్తం అదనపు విలువ పరిమాణంతో సమానం. లాభం రేటు $= \frac{\text{అ.వి.}}{\text{మో.పె.}} = \frac{\text{అదనపు విలువ}}{\text{మొత్తం ముందస్తు పెట్టుబడి}}$ ఒకే మొత్తంగా అదనపు మొత్తం ముందస్తు పెట్టుబడి విలువను మొదటిదాని రేటు నిర్ణయిస్తుంది. రెండవది, ఏకకాలంలో ఈ రేటున పనిలో పెట్టుకున్న శ్రమ పరిమాణం నిర్ణయిస్తుంది. అంటే అస్థిర పెట్టుబడి పరిమాణం నిర్ణయిస్తుందన్నమాట. వీటిలో ఒక అంశం, అదనపు విలువ రేటు పెరుగుతుంది. మరో అంశం, కార్మికుల సంఖ్య పడిపోతుంది (సాపేక్షంగా లేదా నిరపేక్షంగా). ఉత్పాదక శక్తుల అభివృద్ధి పనిలో పెట్టిన శ్రమలో వేతనం చెల్లించబడిన భాగాన్ని తగ్గించిన మేరకు అది అదనపు విలువను పెంచుతుంది. ఎందుకంటే అది అదనపు విలువ రేటును పెంచుతుంది కనుక. ఒక నిర్ణీత పెట్టుబడిచే నియుక్తమైన మొత్తం శ్రమ పరిమాణాన్ని అది తగ్గించిన మేరకు అదనపు విలువ మొత్తం పరిమాణాన్ని తెలుసుకొనేందుకు అదనపు విలువ రేటును గుణించాల్సిన సంఖ్యను తగ్గిస్తుంది. రోజూ పన్నెండు గంటలపాటు పనిచేసే ఇద్దరు కార్మికులు, రోజూ రెండు గంటలు మాత్రమే పనిచేసే 24 మంది కార్మికులతో సమంగా అదనపు విలువ మొత్తాన్ని ఉత్పత్తి చెయ్యలేరు. కేవలం రోజూ 2 గంటలు మాత్రమే పని చేసే కార్మికులు గాలి భోంచేస్తూ, తమకోసం పనిచెయ్యాల్సిన అవసరం లేనివారయినా కూడా. కనుక ఈ విషయంలో కార్మికుల సంఖ్య తగ్గుదలకు పరిహారంగా దోపిడీ స్థాయిని తీవ్రం చేయడానికి కొన్ని అధిగమించ వీలులేని పరిమితులు ఉన్నాయి. ఈ కారణంచేత అది లాభం రేటు పడిపోకుండా కొంతవరకు మాత్రమే నిరోధించవచ్చు. అయితే మొత్తంగా నిరోధించ జాలదు.

కాబట్టి పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం అభివృద్ధితో, పనిలో పెట్టబడిన పెట్టుబడి పరిమాణం పెరగటంతోపాటు లాభం పరిమాణం పెరుగుతుంది. కాగా లాభం రేటు పడిపోతుంది. రేటు నిర్ణీతమైతే, పెట్టుబడి పరిమాణం యొక్క నిరపేక్ష పెరుగుదల దాని ప్రస్తుత పరిమాణంపైన ఆధారపడి వుంటుంది. అయితే ఈ పరిమాణం నిర్ణీతమైతే దాని పెరుగుదల నిష్పత్తి, అంటే పెరుగుదల రేటు లాభం రేటుపైన ఆధారపడుతుంది. ఉత్పాదకతలో పెరుగుదల (ఇది అందుబాటులో ఉన్న పెట్టుబడి యొక్క విలువ తగ్గుదలకు దారితీస్తూనే వుంటుందని మళ్ళీ చెబుతున్నాం.) అప్పటికి ఉన్న పెట్టుబడి విలువను ప్రత్యక్షంగా పెంచాలంటే – లాభం రేటును పెంచటం ద్వారా వార్షిక ఉత్పాదితం విలువలో పెట్టుబడిగా తిరిగి మార్చబడే భాగాన్ని పెంచగలిగితేనే అది సాధ్యం. శ్రమ ఉత్పాదకతకు సంబంధించిన మేరకు, సాపేక్ష అదనపు విలువను పెంచటం ద్వారా లేదా స్థిర పెట్టుబడి విలువను తగ్గించటం ద్వారా శ్రమశక్తి పునరుత్పత్తిలోగాని లేదా స్థిర పెట్టుబడి అంశాలలోగాని ప్రవేశించే సరుకుల్ని – చౌకగా మార్చటం ద్వారా మాత్రమే ఇది సాధ్యమవుతుంది. (ఎందుకంటే ఈ ఉత్పాదకతకు అప్పుడున్న పెట్టుబడి విలువతో ఎటువంటి ప్రత్యక్ష సంబంధమూ లేదు.) ఈ రెంటిలోనూ అప్పుడున్న పెట్టుబడి విలువ తగ్గుదల గర్భితం. రెంటి విషయంలోనూ స్థిర పెట్టుబడితో పోల్చినపుడు అస్థిర పెట్టుబడి తగ్గుతుంది. ఇవి రెండూ లాభం రేటును పడగొడతాయి. ఆ పడిపోవడాన్ని మందగింపచేస్తాయి. అంతేకాక లాభం రేటు పెరుగుదల – శ్రమకు గల గిరాకీని పెంచిన మేరకు, అది కార్మిక జనాభా

పెరుగుదలకు దారితీస్తుంది. ఆ విధంగా పెట్టుబడి నుంచి వాస్తవమైన పెట్టుబడిని తయారుచేసే దోపిడీకి అనువైన సామాగ్రిని అది పెంచుతుంది.

అయితే పరోక్షంగా శ్రమ ఉత్పాదకత అభివృద్ధి అప్పుడు పెట్టుబడి విలువను పెంచటానికి తోడ్పడుతుంది. అదే మార్పిడి విలువకు ప్రాతినిధ్యం వహించే ఉపయోగ విలువల పరిమాణాన్ని, వైవిధ్యాన్ని పెంచటం ద్వారా అది అలా తోడ్పడుతుంది. ఈ ఉపయోగపు విలువలు పెట్టుబడి యొక్క పాదార్థిక అంశాలు. స్థిర పెట్టుబడికి ప్రత్యక్షంగా, అస్థిర పెట్టుబడికి కనీసం పరోక్షంగానూ – ఇవి పాదార్థిక అంశాలు అవుతున్నాయి. పెట్టుబడిగా మార్చవీలున్న మరిన్ని ఎక్కువ ఉత్పాదితాలు – వాటి మార్పిడి విలువ ఏమైనప్పటికీ – అదే పెట్టుబడితో, అదే శ్రమతో సృష్టి అవుతాయి. ఈ ఉత్పాదితాలు అదనపు శ్రమను, అదనపు మిగులు శ్రమను సైతం ఇముడ్చుకోవటానికి తోడ్పడవచ్చు. ఆ రకంగా అది అదనపు పెట్టుబడిని సృష్టించడానికి తోడ్పడవచ్చు. ఒక పెట్టుబడి వినియోగించగల శ్రమ పరిమాణం దాని విలువపైన కాక ఆ పెట్టుబడిగా వున్న ముడి, సహాయక పదార్థాల, యంత్రాల, నిశ్చల పెట్టుబడి అంశాల రాశిపైన, జీవితావసరాల రాశిపైన – వాటి విలువ ఏమైనప్పటికీ – ఆధారపడి వుంటుంది. నియుక్త శ్రమ మొత్తం పెరుగుదలతో తత్కారణంగా, అదనపు శ్రమ పెరుగుదలతో, పునరుత్పత్తి అయిన పెట్టుబడి విలువ పెరుగుతుంది. దానికి కొత్తగా కలిసిన అదనపు విలువ కూడా పెరుగుతుంది. సంచయన ప్రక్రియలో ఉన్న ఈ రెండు అంశాలు రికార్డో ఊహించినట్లుగా ఒకదాని ప్రక్కన ఒకటి ప్రశాంతంగా ఉంటాయని భావించరాదు. వాటిలో ఒక వైరుధ్యముంది. పరస్పర విరుద్ధ ధోరణుల పరిణామాల ద్వారా అది వ్యక్తమవుతుంది. ఈ పరస్పర విరుద్ధ అంశాలు ఏకకాలంలో ఒకదానినొకటి ఎదుర్కొంటూ పనిచేస్తాయి.

కార్మిక ప్రజ వాస్తవ పెరుగుదలకు ప్రేరణలతోపాటు, సామాజిక ఉత్పాదితంలో పెట్టుబడిగా పనిచేసే భాగం పెరుగుదల నుంచి ఉత్పన్నమైన ఈ ప్రేరణలతోపాటు కేవలం సాపేక్ష అధిక జనాభాను సృష్టించే అంశాలు కూడా ఉంటాయి.

లాభం రేటు పడిపోవడంతోపాటు పెట్టుబడుల మొత్తం పెరుగుతుంది. దీనితోపాటు అప్పుడున్న పెట్టుబడుల విలువ పడిపోతుంది. అది లాభం రేటు పతనాన్ని అడ్డుకొంటుంది. పెట్టుబడి విలువల సంచయనానికి అధికాధికంగా ఊపునిస్తుంది.

ఉత్పాదకత అభివృద్ధితోపాటు పెట్టుబడి మరింత ఉన్నతమైన నిర్మాణ స్వరూపాన్ని సంతరించు కుంటుంది. అంటే స్థిర పెట్టుబడితో పోలిస్తే అస్థిర పెట్టుబడి నిష్పత్తి సాపేక్షంగా తగ్గుతుంది.

ఈ విభిన్న ప్రభావాలు ఒక సందర్భంలో పక్క పక్కనే వుండి పనిచేయవచ్చు. మరో సందర్భంలో ఒకదాని తరువాత మరొకటి రావచ్చు. విరుద్ధ అంశాల ఘర్షణ కొంతకాలాని కొకసారి సంక్షోభాలలో వ్యక్తమవుతుంది. సంక్షోభాలన్నవి ఎప్పుడూ అప్పుడున్న వైరుధ్యాలకు తాత్కాలికమైన, బలాత్కారంతో రుద్దబడిన పరిష్కారాలు మాత్రమే. అవి దెబ్బతిన్న సమతాస్థితిని కొంత కాలంపాటు పునరుద్ధరించే ఉద్ధృతమైన విస్ఫోటనలు.

స్థూలంగా చెప్పాలంటే, ఈ వైరుధ్యం ఇదీ : పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం ఉత్పాదక శక్తుల నిరపేక్ష అభివృద్ధివైపు సాగే ధోరణి కలది; దానిలో ఎంత విలువ, ఎంత అదనపు విలువ ఉందనే దానితో ప్రమేయం లేకుండా, పెట్టుబడిదారీ ఉత్పత్తి ఏ సామాజిక పరిస్థితుల్లో జరుగుతుంది అన్న

దానితో ప్రమేయం లేకుండా ఇది కొనసాగుతుంది. కాగా మరోవైపున అప్పుడున్న పెట్టుబడి విలువను భద్రపరచటమూ, దాని స్వయం విస్తరణను అత్యున్నత స్థాయికి (ఈ విలువ అంతకంతకు మరింత వేగంగా పెరగటాన్ని) పెంపొందింపచెయ్యటమూ దాని లక్ష్యం. దానికున్న ప్రత్యేక లక్షణం ఏమంటే అది అప్పటికున్న పెట్టుబడి విలువను అత్యధిక స్థాయిలో పెంచటానికి ఒక సాధనంగా దానికి ఉపయోగపడుతుంది. దీనిని అది సాధించే పద్ధతులివి : లాభం రేటు పడిపోవటమూ, అప్పుడున్న పెట్టుబడి విలువ తగ్గిపోవటమూ, అప్పటికే ఉత్పత్తి అయిన ఉత్పత్తి శక్తులన్నీ నష్టపరిచి శ్రమల యొక్క ఉత్పాదక శక్తులను అభివృద్ధిచెయ్యటమూ.

నియమిత కాలానికి ఒకసారి, ఉనికిలో ఉన్న విలువ పడిపోవడం అన్నది (లాభం రేటు పడిపోవటాన్ని నిరోధించటానికి కొత్త పెట్టుబడిని రూపొందించటం ద్వారా పెట్టుబడి విలువ సంచయనాన్ని త్వరితం చెయ్యటానికి పెట్టుబడిదారీ ఉత్పత్తిలో ఉన్న సాధనాల్లో ఇది ఒకటి.) పెట్టుబడి చలామణి ప్రక్రియ, పునరుత్పత్తి జరిగే పరిస్థితుల్ని దెబ్బతీస్తుంది. దానివల్ల ఉత్పత్తి ప్రక్రియ హఠాత్తుగా తగ్గిపోవటమూ, సంక్షోభాలకు గురికావటం జరుగుతుంది.

స్థిర పెట్టుబడితో పోలిస్తే అస్థిర పెట్టుబడి తగ్గటం ఉత్పాదక శక్తుల అభివృద్ధితోపాటు కొనసాగుతుంది. అది నిరంతరాయంగా కృత్రిమ అధిక జనాభాను సృష్టించటంతోపాటు కార్మిక జనాభా పెరుగుదలకు ప్రోద్బలమిస్తుంది. విలువగా పెట్టుబడి సంచయనం లాభం రేటు పడిపోవటం వల్ల మందగిస్తుంది. ఇది ఉపయోగపు విలువల సంచయనాన్ని మరింత త్వరితం చేస్తుంది. దీనివల్ల తిరిగి విలువ సంచయనానికి కొత్త ఊపు వస్తుంది.

పెట్టుబడిదారీ ఉత్పత్తి పద్ధతిలో స్వతహాగా ఉన్న ఈ ఆటంకాలను అధిగమించటానికి అది నిరంతరాయంగా ప్రయత్నిస్తుంది. అయితే ఈ ఆటంకాలను అది ఏ సాధనాలతో అధిగమిస్తుందో అవి మరింత బలవత్తరమైన స్థాయిలో ఈ ఆటంకాలను సృష్టిస్తాయి.

పెట్టుబడిదారీ ఉత్పత్తికి అసలైన ఆటంకం పెట్టుబడే. పెట్టుబడి, దాని స్వయం విస్తరణ అన్నవి ఏకకాలంలో ఉత్పత్తి యొక్క ప్రారంభ స్థానం, అంతిమ స్థానం కూడా. అదే దాని ప్రోద్బలకారీ, లక్ష్యమూనూ. ఉత్పత్తి కేవలం పెట్టుబడి ఉత్పత్తి కోసమే తప్ప, ఉత్పత్తి కోసం పెట్టుబడి కాదు. ఉత్పత్తి సాధనాలు ఉత్పత్తిదారుల సమాజం యొక్క జీవిత ప్రక్రియ నిరంతర విస్తరణకు కేవల సాధనాలు కాదు. బహుళ సంఖ్యాక ఉత్పత్తిదారులను దోచుకొని వారిని కటిక దరిద్రులుగా మార్చడం అనే పునాదిపై ఆధారపడిన పెట్టుబడి, విలువ భద్రత దాని స్వయం విస్తరణ కొన్ని పరిమితులకు లోనై మాత్రమే కొనసాగుతున్నాయి. ఈ పరిమితులే తన లక్ష్యాల కోసం పెట్టుబడి ఉపయోగించే ఉత్పత్తి పద్ధతులతో ఘర్షిస్తాయి. ఈ పద్ధతులు అమితోత్పత్తి విస్తరణవైపుగా ఉత్పత్తే పరమ లక్ష్యంగా వున్న ఉత్పత్తి వైపుగా, సామాజిక శ్రమ ఉత్పాదకత యొక్క నిర్నిబద్ధ అభివృద్ధివైపుగా పెట్టుబడిని తరుముతాయి. సాధనాలు (సామాజిక ఉత్పత్తి శక్తుల నిర్నిబద్ధ అభివృద్ధి) అస్తిత్వంలో ఉన్న పెట్టుబడి స్వయం విస్తరణ అన్న పరిమితి లక్ష్యంతో నిరంతరాయంగా ఘర్షిస్తాయి. ఈ కారణంచేత పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం ఉత్పత్తి పాదార్థిక శక్తుల అభివృద్ధికి, ఒక సరైన ప్రపంచ మార్కెట్టును సృష్టించటానికి అనువైన చారిత్రక సాధనం. అదే సమయంలో దాని ఈ చారిత్రక కర్తవ్యానికి దాని సొంత సామాజిక ఉత్పత్తి సంబంధాలకు మధ్య జరిగే నిరంతరాయ ఘర్షణ.

## III. అధిక పెట్టుబడి - అధిక జనాభా

లాభం రేటు తగ్గుదలను అనుసరించి శ్రమను ఉత్పాదకంగా వినియోగించటానికి వ్యక్తిగత పెట్టుబడిదారునికి అవసరమైన కనీస పెట్టుబడి పెరుగుతుంది. మామూలుగా శ్రమను దోచుకోవటానికి, వెచ్చించిన శ్రమకాలం సరుకుల ఉత్పత్తిలో అవసరమైన శ్రమకాలంగా సరిపోయేటట్టు చెయ్యటానికి, ఆ విధంగా సరుకుల ఉత్పత్తికై అవసరమైన సగటు సామాజిక శ్రమకాలాన్ని మించకుండా చూడటానికి పెట్టుబడిదారునికి అవసరమైన కనీస పెట్టుబడి పెరుగుతుంది. అదే సమయంలో పెట్టుబడి సాంద్రీకరణ పెరుగుతుంది. ఎందువల్లనంటే, ఒక నిర్ణీత పరిమితులకు మించినప్పుడు ఒక పెద్ద పెట్టుబడి మొత్తం తక్కువ వడ్డీ రేటులోనే ఎక్కువ వడ్డీ రేటుతో ఉన్న చిన్న పెట్టుబడికంటే వేగంగా పోగుపడుతుంది. నిరంతరాయంగా పెరిగే ఈ కేంద్రీకరణ ఒకానొక దశలో లాభం రేటును మరోసారి పడగొడుతుంది. దానివల్ల, చెల్లాచెదురుగా ఉన్న చిన్న పెట్టుబడి మొత్తాలు, సట్టా వ్యాపారమూ, పరపతి దగాలు, స్టాక్ మోసాలు సంక్షోభాల దుస్సాహసిక మార్గాన్ని తొక్కుతాయి. పెట్టుబడుల అతి బహుళత అన్నది, లాభం రేటు పడిపోవడంవల్ల వచ్చిన నష్టాన్ని లాభం మొత్తం పెరగటం ద్వారా భర్తీ చేసుకోలేని పెట్టుబడుల బహుళతకు ప్రధానంగా వర్తిస్తుంది. (కొత్తగా అభివృద్ధిచెందే పెట్టుబడి నూతనాంకురాలకు ఇది ఎప్పుడూ వర్తిస్తుంది.) లేక, తమంత తామే కార్యరంగంలోకి దిగలేక పరపతి రూపంలో పెద్ద పరిశ్రమల మేనేజర్ల స్వాధీనంలో ఉంచే పెట్టుబడుల బహుళతకు వర్తిస్తుంది. సాపేక్ష అధిక జనాభాను సృష్టించే కారణాలే పెట్టుబడుల బహుళతను కూడా సృష్టిస్తాయి. అందుచేత సాపేక్ష అధిక జనాభాకు పెట్టుబడి బహుళత అనుబంధంగా వుండే పరిణామం. అయితే అవి పరస్పర వ్యతిరేక ధృవాల వద్ద ఉంటాయి. పనిలేని పెట్టుబడి ఒక ధృవం, పనిలేని కార్మిక ప్రజానీకం మరో ధృవం.

విడి సరుకులు గాక పెట్టుబడి అధికోత్పత్తి. (పెట్టుబడి అధికోత్పత్తిలో సరుకుల అధికోత్పత్తి కూడా ఎప్పుడూ ఇమిడి ఉంటుంది.) అందువల్ల పెట్టుబడి అమిత సంచయనం తప్ప మరొకటి కాదు. ఈ అమిత సంచయనం అన్నది అర్థంకావాలంటే (అది మరింత క్షుణ్ణంగా తరువాత విశ్లేషించ బడుతుంది.) దాన్ని సంపూర్ణమైనదిగా (absolute) ఊహించుకోవాలి. పెట్టుబడి అమితోత్పత్తి సంపూర్ణమైనదిగా ఎప్పుడు ఉంటుంది? ఒకటో, రెండో ప్రధాన ఉత్పత్తి రంగాలకు మాత్రమే కాక దాని పూర్తి శక్తితో సంపూర్ణ మొత్తంగా, అంటే మొత్తం ఉత్పత్తి రంగాలకన్నింటికీ విస్తరించినదిగా ఎప్పుడుంటుంది?

పెట్టుబడిదారీ ఉత్పత్తి లక్ష్యాలకు అవసరమైన అదనపు పెట్టుబడి 0 అయినప్పుడు పెట్టుబడి అమితోత్పత్తి సంపూర్ణమైనదిగా ఉంటుంది. కానీ లక్ష్యం పెట్టుబడి స్వయం విస్తరణే, అంటే అదనపు శ్రమను స్వాయత్తం చేసుకోవటమే. అదనపు విలువను, అంటే లాభాన్ని ఉత్పత్తి చెయ్యటం దాని లక్ష్యం. కనుక కార్మిక జనాభా సరఫరా చేసే నిరపేక్ష శ్రమకాలంగాని లేదా సాపేక్ష అదనపు శ్రమకాలంగాని శ్రామిక జనాభాకు సంబంధించి, ఇక ఏ మాత్రమూ విస్తరింపచెయ్యటానికి వీలులేని నిష్పత్తిలో పెట్టుబడి పెరిగినప్పుడు, పెరిగిన పెట్టుబడి తాను పెరగటానికి ముందు ఉత్పత్తి చేసినంత లేదా దానికంటే తక్కువ అదనపు విలువను ఉత్పత్తి చేసినప్పుడు, పెట్టుబడి అధికోత్పత్తి సంపూర్ణమైనదని చెప్పవచ్చు. (శ్రమ గిరాకీ బలంగా ఉన్నప్పుడు ఫలితంగా వేతనాలు పెరిగే ధోరణి ఉన్నప్పుడు

సాపేక్ష అదనపు శ్రమకాలాన్ని పెంచడం సాధ్యం కాదు.) అంటే పెరిగిన పెట్టుబడి మొ.పె.+△ మొ.పె. ఇంతకు ముందు మొ.పెకి △మొ.పె జతకానప్పుడు ఉత్పత్తి చేసిన లాభం కంటే ఎక్కువ లాభం ఉత్పత్తి చేయకపోగా మరింత తక్కువ కూడా ఉత్పత్తి చేయవచ్చు. ఈ రెండు సందర్భాల్లోనూ సార్వత్రిక లాభం రేటు తీవ్రంగా హఠాత్తుగా పడిపోతుంది. అయితే ఈసారి ఉత్పాదక శక్తుల అభివృద్ధి కారణంగా కాక అస్థిర పెట్టుబడి యొక్క డబ్బు విలువ పెరిగిన కారణాన (వేతనాల పెరుగుదల వల్ల) పెట్టుబడి నిర్మాణ స్వరూపంలో వచ్చిన మార్పువల్ల, అలాగే అందుకనుగుణంగా అవసర శ్రమలో అదనపు శ్రమ నిష్పత్తి తగ్గిపోవటంవల్ల అలా జరుగుతుంది.

నిజానికి పెట్టుబడిలో ఒక భాగం పూర్తిగా లేదా పాక్షికంగా పనిలేకుండా ఉన్నట్టు కనిపిస్తుంది. (ఎందుకంటే తన విలువను అది విస్తరించుకోవాలంటే ముందు క్రియాశీలమైన కొంత పెట్టుబడిని బయటికి నెట్టవలసి ఉంటుంది.) పనిలేని లేదా పాక్షికంగా మాత్రమే పనిలో వున్న పెట్టుబడి ఒత్తిడివల్ల మరోభాగం మరింత తక్కువ లాభం రేటులో విలువలను ఉత్పత్తి చేస్తుంది. ఈ విషయంలో అదనపు పెట్టుబడిలో ఒక భాగం పాత పెట్టుబడి స్థానాన్ని తీసుకొంటే, అలాగే పాత పెట్టుబడిలో కొంత భాగం అదనపు పెట్టుబడి స్థానాన్ని తీసుకొంటే, అది ప్రస్తుత సందర్భంలో ముఖ్యమైనది కాదు. అలా జరిగినప్పటికి ఒకవైపున పాత పెట్టుబడి మొత్తం, రెండోవైపున అదనపు పెట్టుబడి మొత్తం ఉంటాయి. లాభం రేటులో పతనంతోపాటు లాభం మొత్తంలో తగ్గుదల కూడా ఉంటుంది. ఎందుకంటే పనిలో ఉన్న శ్రమశక్తి మొత్తం పెరగలేదు. మనం ఊహించిన పరిస్థితులలో అదనపు విలువ రేటు పెరగలేదు. కనుక అదనపు విలువ మొత్తం కూడా పెరగదు. తగ్గిన లాభం మొత్తాన్ని పెరిగిన మొత్తం పెట్టుబడి పాతలాభం రేటుతోనే, స్వయంగా విస్తరిస్తున్నప్పటికీ అందువల్ల లాభం మొత్తం యథాతథంగా ఉన్నప్పటికీ, ఈ మొత్తాన్ని పెరిగిన మొత్తం పెట్టుబడిపైనే అంచనా కట్టడం జరుగుతుంది. కనుక లాభం రేటు పడిపోవటాన్నే ఇది సూచిస్తుంది. మొత్తం పెట్టుబడి 1000, అది ఇచ్చే లాభం 100 అనుకొందాం. పెట్టుబడి 1500కి పెరిగిన తర్వాత కూడా లాభం 100యే అయితే రెండవ సందర్భంలో 1000 ఇస్తున్న లాభం $66\frac{2}{3}$ మాత్రమే. నిరపేక్ష అర్థంలో పాత పెట్టుబడి స్వయం విస్తరణ తగ్గింది. 1000 పెట్టుబడి కొత్త పరిస్థితులలో ఇంతకు ముందు $666\frac{2}{3}$ పెట్టుబడి ఇచ్చినంత లాభమే ఇస్తుంది.

అయితే ఈ పాత పెట్టుబడి విలువ యొక్క వాస్తవ తగ్గుదల పోరాటం లేకుండా జరగదు. అదనపు పెట్టుబడి (△ మొ.పె) పోరాటం లేకుండా పెట్టుబడి విధులను స్వీకరించదు. పెట్టుబడి అధికోత్పత్తి వల్ల ఏర్పడే పోటీ ప్రభావం క్రింద లాభం రేటు పడిపోదు. అది నిజానికి అందుకు విరుద్ధంగా జరుగుతుంది. లాభం రేటు పడిపోవటం, పెట్టుబడి అధికోత్పత్తీ ఒకే పరిస్థితుల నుంచి తలెత్తుతాయి. కనుక, పోటీ పోరాటమే ముందు మొదలవుతుంది. పాత పెట్టుబడిదార్ల చేతులలో △ మొ.పె.లో ఒక భాగం పనిలేకుండా ఉంటుంది. వారు తమ తొలిపెట్టుబడి విలువ పడిపోకుండా నిరోధించటానికి ఉత్పత్తి రంగంలో దాని స్థానాన్ని కుదించకుండా ఉండటానికి అలా చేస్తారు. లేదా ఆ పెట్టుబడిని వారు ఉపయోగించి తాత్కాలిక నష్టాన్ని భరించవచ్చు. అదనపు పెట్టుబడిని పనిలో పెట్టకుండా ఉంచే అవసరాన్ని కొత్తగా రంగంలో ప్రవేశించిన వారి మీద, వారి పోటీదార్ల మీద నెట్టడానికై వారు అలా చేయవచ్చు.

కొత్తవారి చేతుల్లో ఉన్న భాగం △ మొ.పె. పాత పెట్టుబడిని నష్టపెట్టి తనకో స్థానాన్ని కల్పించుకోవాలని ప్రయత్నిస్తుంది. పాత పెట్టుబడిలో కొంత భాగానికి పనిలేకుండా చేయటం ద్వారా అది ఈ కార్యాన్ని సాధిస్తుంది. పాత పెట్టుబడిని తన పాత స్థానాన్ని వదిలి పూర్తిగా లేదా పాక్షికంగా పనిలేని అదనపు పెట్టుబడిలో చేరేలా చేస్తుంది.

అన్ని రకాల పరిస్థితులలోనూ పాత పెట్టుబడిలో ఒక భాగం వాడబడకుండా నిరుపయోగంగా ఉండక తప్పదు. పెట్టుబడిగా తనకున్న లక్షణాన్ని – విలువను ఉత్పత్తి చేయటానికి సంబంధించినంత వరకు – వదిలేసుకోవాల్సి వుంటుంది. పోటీ పోరాటం దానిలో ఏ భాగం దెబ్బతింటుంది అన్న దానిని నిర్ణయిస్తుంది. పరిస్థితులు సజావుగా ఉండినన్నాళ్ళు, లాభం రేటు సమం అయ్యే సందర్భంలో మనం గమనించినట్టుగా పోటీ అన్నది పెట్టుబడిదారీ వర్గాన్ని ఒక సోదర కుటుంబంగా వ్యవహరించేలా చేస్తుంది. అప్పుడు ప్రతి ఒక్కరూ తన మదుపుకు తగినట్టుగా ఉమ్మడి దోపిడీలో ఒక వాటాను పంచుకొంటారు. లాభాలు పంచుకోవటం కాక, నష్టాలను పంచుకోవటం అన్న సమస్య తలెత్తినప్పుడు ప్రతి ఒక్కరూ తన వాటాను సాధ్యమైనంత తక్కువకు కుదించి నష్టాన్ని మరొకరిపై నెట్టటానికి ప్రయత్నిస్తారు. ఒక వర్గంగా అది అనివార్యంగా నష్టపోతుంది. ఒక వ్యష్టి పెట్టుబడిదారు ఎంత నష్టాన్ని భరించాలి అన్నది అతని బలంపైన, వంచనా శక్తిపైన ఆధారపడి వుంటుంది. అప్పుడు పోటీ పరస్పర శత్రువులైన అన్నదమ్ముల పోరాటంగా మారుతుంది. వ్యష్టి పెట్టుబడిదార్ల ప్రయోజనాలకు మొత్తం పెట్టుబడిదారీ వర్గపు ప్రయోజనాలకు మధ్య ఉన్న శత్రుత్వం అపుడు బహిర్గతమవుతుంది – ఇంతకు ముందు వీరి ప్రయోజనాలు ఒకటేననే సంగతి పోటీ ద్వారా ఆచరణలో వ్యక్తమయినట్లుగా.

ఈ ఘర్షణ ఎలా పరిష్కారమవుతుంది. పెట్టుబడిదారీ ఉత్పత్తి "సజావుగా" సాగడానికి అనుగుణమైన పరిస్థితులు ఎలా పునరుద్ధరించబడతాయి? ఈ పరిష్కార పద్ధతి ఘర్షణ ప్రాదుర్భావంలోనే సూచితమవుతుంది. అదనపు పెట్టుబడి (△ మొ.పె.) యొక్క పూర్తి విలువతో సమానమైన లేదా దానిలో ఒక భాగంతో సమానమైన మొత్తం ఉపసంహరించుకోవడం లేదా పాక్షికంగా ధ్వంసం చేయడం సైతం అందులో గర్భితం. ఆ ఘర్షణ యొక్క వర్ణన రుజువుచేస్తున్నట్లుగా వ్యక్తిగత పెట్టుబడిదార్ల మధ్య నష్టం సమానంగా పంపిణీ కాదు. ఈ పంపిణీ పోటీ పోరాటం ద్వారా నిర్ణయించబడుతుంది. ఇంతకు ముందు ఆయా పెట్టుబడులకు గల ప్రత్యేక సౌకర్యాలనుబట్టి లేదా ఇంతకు ముందు అది స్వాధీనం చేసుకున్న స్థానాలనుబట్టి చాలా భిన్నమైన నిష్పత్తుల్లో, రూపాలలో ఈ నష్టం పంపిణీ అవుతుంది. ఒక పెట్టుబడి వాడబడకుండా వదిలి వేయబడవచ్చు, మరో పెట్టుబడి నాశనం కావచ్చు, మూడవ పెట్టుబడి సాపేక్షంగా నష్టపోవచ్చు లేదా తాత్కాలికంగా మాత్రమే కొంత విలువను కోల్పోవచ్చు.

అయితే అన్ని రకాల పరిస్థితులలోనూ ఎంతో కొంత పెట్టుబడిని ఉపసంహరించుకోవడం ద్వారా లేదా నాశనం చేయడం ద్వారా సమతౌల్యతా స్థితి పునరుద్ధరింపబడుతుంది. పెట్టుబడి పాదార్థిక అంశానికి ఇది పాక్షికంగా వర్తిస్తుంది. అంటే ఉత్పత్తి సాధనాలలో, నిశ్చల, చలామణి, పెట్టుబడులలో ఒక భాగం పనిచేయవు. అవి పెట్టుబడిగా వ్యవహరించవు. దానితో కొన్ని కార్యనిర్వాహక వ్యవస్థలు స్తంభించిపోతాయి. ఈ విషయంలో అన్నిరకాల ఉత్పత్తి సాధనాలపైన (భూమి మినహా) కాలం దాడి చేస్తుంది. వాటిని పాడుచేస్తుంది. నిజానికి నిలుపుదల (stopage) అన్నింటికంటే ఉత్పత్తి సాధనాలకే అత్యధిక నష్టాన్ని కలుగచేస్తాయి. అయితే ఈ విషయంలో ప్రధాన ఫలితమేమిటంటే,

ఉత్పత్తి సాధనాలు ఉత్పత్తి సాధనాలుగా పనిచేయకపోవడం, ఎంతో కొంత కాలంపాటు వాటి కార్యకలాపాలు భగ్నం కావటం.

ప్రధానమైన నష్టం, అతి తీవ్రమైన నష్టం పెట్టుబడికి జరుగుతుంది. అది విలువగా ఉన్న మేరకు ఆ నష్టం పెట్టుబడి విలువలకు జరుగుతుంది. అదనపు విలువ యొక్క భావి వాటాలపైన, అంటే లాభంపై హక్కుల రూపంలో మాత్రమే వుండే పెట్టుబడి విలువ భాగానికి, వివిధ రూపాల్లోని ఉత్పత్తిపై ప్రామిసరీ నోట్ల రూపంలో ఉన్న పెట్టుబడి విలువ భాగానికి ఆ నష్టం జరుగుతుంది. తగ్గిపోయిన జమలనుబట్టి లెక్కగట్టడం జరుగుతుంది. కాబట్టి ఆ పెట్టుబడి విలువ తక్షణమే తగ్గిపోతుంది. వెండి, బంగారాలలో ఒక భాగం నిరుపయోగంగా పడివుంటుంది. అంటే అది పెట్టుబడిగా వ్యవహరించదు. మార్కెట్‌లో ఉన్న సరుకులలో ఒక భాగం తమ ధరలను బాగా తగ్గించుకోవడం ద్వారా మాత్రమే తమ చలామణి పునరుత్పత్తి ప్రక్రియలను పూర్తి చేయగలుగుతాయి. కాబట్టి అవి ప్రాతినిధ్యం వహించే పెట్టుబడి విలువను తగ్గించడం ద్వారా మాత్రమే ఇది సాధ్యమవుతుంది. ఇదే విధంగా నిశ్చల పెట్టుబడి అంశాల విలువ కూడా ఏదో ఒక మేరకు తగ్గిపోతుంది. పునరుత్పత్తి ప్రక్రియను నిర్దిష్టమైన, ముందే ఊహించబడిన ధర సంబంధాలు శాసిస్తుంటాయి. కనుక సర్వత్రా ధరలు పడిపోవడంవల్ల పునరుత్పత్తి ఆగిపోతుంది. గందరగోళంలో చిక్కుకొంటుంది. ఈ గందరగోళమూ, స్తంభన, ఒక చెల్లింపు సాధనంగా డబ్బు చేసే పనిని కుంటుపరుస్తాయి. ఈ చెల్లింపు సాధనం అభివృద్ధి పెట్టుబడి అభివృద్ధి కోసం ఉద్దేశించబడినదీ, ముందే ఊహించబడిన ధర సంబంధాలపై ఆధారపడినదీను. నిర్ణీత తేదీలలో చెల్లింపు బాధ్యతల గొలుసు, వందచోట్ల విచ్ఛిన్నమవుతుంది. పెట్టుబడి అభివృద్ధితో పాటు పెంపొందిన పరపతి వ్యవస్థ కూడా పతనమై ఈ గందరగోళాన్ని మరింత ఉధృతం చేస్తుంది. ఇది తీవ్రమైన, ఉధృతమైన సంక్షోభాలకు, హఠాత్తుగా బలవంతంగా విలువలు పడిపోవటానికి, పునరుత్పత్తి ప్రక్రియ వాస్తవ స్తంభనకు, విచ్ఛిన్నతకు దారితీస్తుంది. ఆ విధంగా పునరుత్పత్తి వాస్తవ పతనానికి దారితీస్తుంది.

అయితే అదే సమయంలో ఇతర అంశాలు కూడా పనిచేస్తుంటాయి. ఉత్పత్తి స్తంభనవల్ల కార్మిక వర్గంలో ఒక భాగం తొలగింపునకు గురవుతారు. ఉద్యోగంలో ఉన్న భాగం సగటు స్థాయికంటే తగ్గిన వేతనాలను సైతం ఆమోదించాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. సగటు వేతనాలలో సాపేక్ష లేదా నిరపేక్ష అదనపు విలువ పెరిగినప్పుడు ఉండే ప్రభావాన్నే పెట్టుబడిపైన ఇది కలిగిస్తుంది. సుభిక్ష వాతావరణం వల్ల కార్మికులలో పెళ్ళిళ్ళు ఎక్కువ జరగవచ్చు. శిశు మరణాల సంఖ్య తగ్గిపోవచ్చు. అప్పుడు వాస్తవ జనాభా పెరిగినప్పటికి, వాస్తవంగా పనిచేసే జనాభా పెరగటాన్ని ఇది సూచించదు. అయితే పెట్టుబడితో కార్మికులకున్న సంబంధాలను ఇది ప్రభావితం చేస్తుంది. వాస్తవంగా పనిచేసే కార్మికుల సంఖ్య పెరిగితే ఉండే ప్రభావమే దీనివల్ల కూడా వుంటుంది. మరోవైపున ధరలు పడిపోవటమూ, పోటీ పోరాటమూ ప్రతి పెట్టుబడిదారుణ్ణి కొత్త యంత్రాల ద్వారా, కొత్త మెరుగైన పని పద్ధతుల ద్వారా, కొత్త కలయికల ద్వారా తన మొత్తం ఉత్పాదితం విలువను దాని సాధారణ విలువకంటే తగ్గించేలా చేస్తాయి. అంటే, ఒక నిర్ణీత శ్రమ పరిమాణపు ఉత్పాదకతను పెంచటానికి, స్థిర పెట్టుబడితో అస్థిర పెట్టుబడికి ఉన్న నిష్పత్తిని తగ్గించటానికి, ఆ రకంగా కొంతమంది కార్మికులను విడుదల చేయటానికి, క్లుప్తంగా చెప్పాలంటే కృత్రిమమైన అధికాధిక జనాభాను సృష్టించటానికి

పూనుకొనేలా చేస్తాయి. అంతిమంగా స్థిర పెట్టుబడి అంశాల విలువ తగ్గుదలే లాభం రేటును పెంచటానికి దోహదం చేస్తుంది. పనిలో ఉన్న స్థిర పెట్టుబడి మొత్తం అస్థిర పెట్టుబడితో పోలిస్తే పెరిగి ఉండవచ్చు. అయితే దాని విలువ మాత్రం పడిపోతుంది. ఆపై సంభవించే ఉత్పత్తి మాంద్యం తదుపరి ఉత్పత్తి విస్తరణకు – పెట్టుబడిదారీ పరిమితుల లోపలే మార్గాన్ని సుగమం చేస్తుంది.

ఆ రకంగా ఈ చక్రభ్రమణం మళ్ళీ కొత్తగా ప్రారంభమవుతుంది. పని స్తంభించటంవల్ల విలువ కోల్పోయిన పెట్టుబడిలోని ఒక భాగం తన పాత విలువను తిరిగి పొందుతుంది. మిగతా భాగం విషయంలో మరింత విస్తరించిన ఉత్పత్తి పరిస్థితులలో ఇదే విషచక్రం విస్తరించిన మార్కెట్ పరిస్థితులలో, ఉత్పాదక శక్తులు పెరిగిన పరిస్థితితో సాగిపోతుంది.

కానీ, మనం ఊహించిన అత్యంత తీవ్ర పరిస్థితుల్లో సైతం ఈ పెట్టుబడి సంపూర్ణ అధికోత్పత్తి – నిజంగా సంపూర్ణ అధికోత్పత్తి కాదు; అది ఉత్పత్తి సాధనాల సంపూర్ణ అధికోత్పత్తి కాదు. ఉత్పత్తి సాధనాలు పెట్టుబడిగా వ్యవహరించిన మేరకు మాత్రమే ఉత్పత్తి సాధనాల అధికోత్పత్తి, కాబట్టి విలువ స్వీయ విస్తరణతో కూడి వుంటుంది. అలాగే పెరిగిన మొత్తానికి అనుగుణమైన నిష్పత్తిలో అదనపు విలువ (Additional Value) ఉత్పత్తి చేసి తీరాలి.

అయినప్పటికీ అది అధికోత్పత్తే అవుతుంది. ఎందుకంటే పెట్టుబడిదారీ ఉత్పత్తి ప్రక్రియ "సజావయిన" "మామూలు" అభివృద్ధికి అవసరమైన స్థాయిలో, పనిలో ఉన్న పెట్టుబడి మొత్తం పెరుగుదలతోపాటు లాభం మొత్తాన్ని కనీసం పెంచగలిగే స్థాయిలో, పెట్టుబడి పెరిగినంతగా, లాభం రేటు పడిపోకుండా, అంతకంటే కూడా వేగంగా పడిపోకుండా నిరోధించే స్థాయిలో పెట్టుబడి శ్రమను దోపిడీ చేయజాలదు.

పెట్టుబడి అధికోత్పత్తి అన్నది పెట్టుబడిగా వ్యవహరించే ఉత్పత్తి సాధనాల (శ్రమ సాధనాలు, జీవనభృతి సాధనాలు) అధికోత్పత్తి తప్ప మరొకటి కాదు. పెట్టుబడిగా వ్యవహరించటం అంటే ఒక నిర్ణీత దోపిడీ స్థాయిలో శ్రమను దోపిడీ చేయడం అని అర్థం. ఒకానొక స్థాయికన్నా శ్రమ దోపిడీ తీవ్రత తగ్గితే అది పెట్టుబడిదారీ ఉత్పత్తిలో ఒడిదుడుకులను సంస్తంభనలను కలిగిస్తుంది. సంక్షోభాలకు, పెట్టుబడి విధ్వంసనకు దారితీస్తుంది. ఈ పెట్టుబడి అధికోత్పత్తికి ఏదో ఒక స్థాయిలో గణనీయమైన సాపేక్ష అధిక జనాభా వెన్నంటి ఉండటంలో వైరుధ్యమేమీ లేదు. శ్రమ ఉత్పాదకతను పెంచిన పరిస్థితులే, ఉత్పత్తి అయిన సరుకుల మొత్తాన్ని పెంచిన, మార్కెట్‌లను విస్తరింపచేసినట్టి పెట్టుబడి సంచయనాన్ని, రాశి రీత్యా విలువ రీత్యా త్వరితం చేసినట్టి లాభం రేటును తగ్గించినట్టి పరిస్థితులే సాపేక్ష అధిక జనాభాను కూడా సృష్టించాయి. నిరంతరాయంగా సృష్టిస్తాయి. తక్కువ స్థాయిలో దోపిడీ జరగటం వల్ల, ఆ స్థాయిలో మాత్రమే కార్మికుల్ని పనిలో పెట్టడం సాధ్యం కావటం వల్ల, ఆ నిర్ణీత దోపిడీ స్థాయిలో వచ్చే తక్కువ లాభం రేటు వల్ల అదనపు పెట్టుబడి పనిలో పెట్టుకోకుండా వున్న అదనపు కార్మిక జనాభా అది.

పెట్టుబడిని విదేశాలకు పంపించటం జరిగితే, దాన్ని స్వదేశంలో నియోగించటం బొత్తిగా సాధ్యం కానందువల్ల కాక, విదేశాలలో ఎక్కువ లాభం రేటుకు నియోగించ వీలున్నందువల్ల అలా జరుగుతుంది. అయితే అటువంటి పెట్టుబడి పనిలో ఉన్న కార్మిక ప్రజానీకానికి, మొత్తంపై స్వదేశానికి సంపూర్ణంగా అదనపు పెట్టుబడే. అది సాపేక్ష అధిక జనాభాతోపాటు ఆ రకంగా మనుగడ సాగిస్తుంది.

అది రెండూ ఒకదాని పక్కన మరొకటి ఎలా ఉంటాయో, ఒకదాన్ని మరొకటి ఎలా ప్రభావితం చేస్తాయో తెలియటానికి ఇదొక ఉదాహరణ.

మరోవైపున సంచయనంతో ముడిపడి వున్న లాభం రేటు పతనం పోటీ పోరాటలను తప్పనిసరి చేస్తుంది. లాభం రేటు పడిపోవటానికి లాభం మొత్తం పెరుగుదల నష్టపరిహారంగా వుండటం అన్నది, మొత్తం సామాజిక పెట్టుబడికి, స్థిరంగా పాతుకుపోయిన పెద్ద పెట్టుబడిదార్లకు మాత్రమే వర్తిస్తుంది. స్వతంత్రంగా వ్యవహరిస్తున్న కొత్త అదనపు పెట్టుబడికి అటువంటి నష్టపరిహార పరిస్థితులుండవు. వాటిని అది సాధించుకోవాల్సి వుంటుంది. కనుకనే లాభం రేటు పడిపోవటం అన్నది, పెట్టుబడిదార్ల మధ్య పోటీని తీవ్రతరం చేస్తుంది. అంతే తప్ప ఈ పోటీవల్ల లాభం పడిపోవడం కాదు. పోటీవల్ల తాత్కాలికంగా వేతనాలు పెరుగుతాయి. తాత్కాలికంగా లాభం రేటు మరింత పడిపోతుందన్నది నిజమే. అయితే సరుకుల అధికోత్పత్తి జరిగినపుడు, మార్కెట్లు వాటితో పూర్తిగా నిండిపోయినపుడు కూడా అదే జరుగుతుంది. పెట్టుబడి లక్ష్యం కొన్ని అవసరాలను తీర్చటం కాక లాభాన్ని ఉత్పత్తి చేయటమే. అది ఉత్పత్తి మొత్తాన్ని (mass) ఉత్పత్తి స్థాయికి (scale) అనుగుణంగా మారుస్తుంది. అంతేకానీ ఉత్పత్తి ప్రమాణాన్ని (scale) ఉత్పత్తి మొత్తానికి అనుగుణంగా మార్చదు. ఉత్పత్తి మొత్తాన్ని, ఉత్పత్తి ప్రమాణానికి అనుగుణంగా మార్చే పద్ధతుల ద్వారా తన లక్ష్యాన్ని నెరవేర్చుకొంటుంది కనుక పెట్టుబడిదారీ విధానంలో పరిమితమైన వినియోగ పరిధికీ, ఈ స్వతస్సిద్ధ అవరోధాన్ని సదా అధిగమించ చూచే ఉత్పత్తికీ మధ్య ఒక అగాధం, తన్యత నిరంతరాయంగా పెరుగుతూ వుంటుంది. అంతేకాక పెట్టుబడిలో సరుకులు ఉంటాయి. కనుక పెట్టుబడి అధికోత్పత్తిలో సరుకుల అధికోత్పత్తి అన్నది గర్భితం. అందుచేతనే పెట్టుబడి అధికోత్పత్తిని అంగీకరిస్తూనే సరుకుల అధికోత్పత్తి లేదనే ఆర్థికవేత్తల ప్రత్యేక ధోరణి తలెత్తింది. వివిధ ఉత్పత్తి శాఖలలో పరస్పరానురూపత (Proportionality) లోపించిందే తప్ప సార్వత్రిక అధికోత్పత్తి అన్నది లేదు అనటం, పెట్టుబడిదారీ ఉత్పత్తిలో పరస్పరానురూపతా రాహిత్యం (Disproportion) నుంచి ఆయా విడి ఉత్పత్తి శాఖలలో ఈ అనురూపత ఒక నిరంతర క్రమంగా తలెత్తుతుందని చెప్పటమే. ఎందుకంటే, మొత్తం ఉత్పత్తి యొక్క సంలగ్నత (cohesion) చేత ఉత్పత్తి ప్రతినిధులపైన ఇది ఒక గుడ్డి నియమంగా రుద్దబడుతుంది. అంతేతప్ప, ఉత్పత్తి ప్రతినిధులు తమ సమష్టి బుద్ధిచేత అర్థం చేసుకొన్నందువల్ల ఉత్పాదక ప్రక్రియను వారి ఉమ్మడి అజమాయిషీ కిందికి తెచ్చిన నియమం కాదిది. అంతేకాదు, పెట్టుబడిదారీ ఉత్పత్తి ఇంకా అభివృద్ధిగాని దేశాలు పెట్టుబడిదారీ ఉత్పత్తి గల దేశాలకు అనువైన రేటులో వినియోగం చెయ్యాలని కోరటంతో సమానమవుతుంది. అధికోత్పత్తి అన్నది కేవలం సాపేక్షమే అంటే అది సరియైనదే. అయితే, మొత్తంగా పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం కూడా సాపేక్షమే. దాని అవరోధాలు నిరపేక్షంగా కాదు. ఈ ఉత్పత్తి విధానానికి మాత్రమే అవి నిరపేక్షం అంటే ఆ విధాన ప్రాతిపదికపైన. లేకుంటే విశాల ప్రజానీకానికి లేని సరుకులకు గిరాకీ లేకపోవటం ఎలా సాధ్యం? స్వదేశంలో శ్రామికులకు సగటు జీవితావసరాల రాశిని చెల్లించడం కోసం విదేశాల్లో, విదేశీ మార్కెట్లలో గిరాకీకై వెతకడం ఎలా సాధ్యం? ఈ ప్రత్యేక మైన పెట్టుబడిదారీ అంతఃసంబంధంలో అదనపు ఉత్పాదితం ఎటువంటి రూపం సంతరించుకుంటుం దంటే, అది ముందు తన యజమానికి పెట్టుబడిగా మారకుంటే అతడు దానిని వినియోగానికై

అమ్మజూపలేదు. అందుచేతనే ఇది సాధ్యం. పెట్టుబడిదారులు తమ సరుకుల్ని తమలో తామే మార్పిడి చేసుకుని వినియోగం చేస్తే సరిపోతుంది అన్నామనుకోండి. అలా అనడం మొత్తం పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం యొక్క స్వభావాన్ని విస్మరించడమే. అంతేకాదు ఇది పెట్టుబడిని వినియోగం చెయ్యటం కాక, దాని విలువను విస్తరింప చేసేందుకు సంబంధించిన సమస్య అన్న సంగతిని కూడా మరిచిపోయి నట్లవుతుంది. క్లుప్తంగా చెప్పాలంటే స్పష్టంగా కనిపించే అధికోత్పత్తి పరిణామానికి (Phenomena) ఎదురవుతున్న ఈ అభ్యంతరాలన్నింటి సారాశం ఏమంటే పెట్టుబడిదారీ ఉత్పత్తి అవరోధాలన్నీ మొత్తంపై ఉత్పత్తి అవరోధాలు కాదు, కనుక అవి ఈ ప్రత్యేక పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానపు అవరోధాలు కూడా కావు. (ఈ అభ్యంతరాలను, ఈ పరిణామం పెడచెవిని పెడుతోంది.) పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానంలో ఉన్న వైరుధ్యం ఏమంటే, నిరపేక్షంగా అభివృద్ధి చెందే ఉత్పాదక శక్తులు పెట్టుబడి గమనం యొక్క ప్రత్యేక ఉత్పత్తి పరిస్థితులతో నిరంతరాయంగా ఘర్షణపడతాయి. పెట్టుబడి ఆ పరిస్థితులలో మాత్రమే చరించగలదు.

ఇప్పుడున్న ప్రజానీకానికి అనుగుణంగా జీవితావసరాలు ఎన్నో ఉత్పత్తి కావడం లేదు. నిజానికి అందుకు విరుద్ధంగా జరుగుతూంది. అత్యధిక ప్రజానీకపు అవసరాలను యధోచితంగా, మానవతాయుతంగా తీర్చటానికి ఉత్పత్తి అవుతున్నది బహు స్వల్పం.

పనిచెయ్యగల్గిన జనాభాను పనిలోపెట్టగల ఉత్పత్తి సాధనాలు చాలినన్ని ఉత్పత్తి కావటం లేదు. అందుకు సరిగ్గా విరుద్ధంగా జరుగుతూంది. మొదటి విషయం జనాభాలో ఒక పెద్ద భాగం పని చెయ్యగలగడం లేదు. పరిస్థితుల ప్రాబల్యం వలన ఇతరుల శ్రమను దోచుకోవడంపైన ఆధారపడి ఉన్నారు. లేదా ఒక దౌర్భాగ్యపు ఉత్పత్తి విధానంలో మాత్రమే శ్రమ అని పిలవబడే దానిపై ఆధారపడి ఉన్నారు. రెండవ విషయం, అత్యంత ఉత్పాదక పరిస్థితులలో, మొత్తం పనిచెయ్యగలిగిన జనాభా పని చేయడానికి చాలినన్ని ఉత్పత్తి సాధనాలు తయారుకావడం లేదు. అలా జరిగితే, పని గంటల్లో నియుక్తమైన స్థిర పెట్టుబడి పరిమాణం వల్లనేమి, దాని సార్థకత వల్లనేమి వారి నిరపేక్ష పనికాలం తగ్గగలదు.

మరోవైపు, ఒక నిర్దిష్ట లాభం రేటుపై శ్రామికులను దోపిడీ చేసే సాధనాలుగా ఉపయోగించ వీలులేనంతటి ఎక్కువ సంఖ్యలో శ్రమ సాధనాలు, జీవితావసరాలు కొన్ని సందర్భాలలో ఉత్పత్తి అవుతున్నాయి. పెట్టుబడిదారీ ఉత్పత్తికి ప్రత్యేకమైన పంపిణీ, వినియోగ పరిస్థితులలో సరుకుల విలువను, వాటిలోని అదనపు విలువను కొత్త పెట్టుబడిగా మార్చటానికి వీలులేనంత ఎక్కువగా సరుకులు ఉత్పత్తి అవుతున్నాయి. అంటే నిరంతరాయంగా పునరావృత్తం అయ్యే విస్ఫోటనలు లేకుండా ఈ పంపిణీ వినియోగ ప్రక్రియ పూర్తికావటానికి వీలులేనంత ఎక్కువగా ఉత్పత్తి అవుతున్నా యన్నమాట.

సంపద చాలినంత ఉత్పత్తి కావటం లేదు. అయితే కొన్నిసార్లు పెట్టుబడిదారీ, స్వయం-విరుద్ధ రూపాలలో సంపద అతిగా ఉత్పత్తి అవుతోంది.

పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం యొక్క పరిమితులు ఈ అంశాల్లో బయటపడుతున్నాయి.

1. శ్రమ ఉత్పాదకత యొక్క అభివృద్ధి లాభం రేటు పడిపోవటం నుంచి ఒక నియమాన్ని సృష్టిస్తుంది. ఆ నియమం ఒకానొక దశలో ఈ అభివృద్ధితో ఘర్షణపడుతుంది. నిరంతరాయంగా సంక్షోభాల ద్వారా మాత్రమే అది అధిగమించబడుతుంది.

2. ఉత్పత్తి వ్యాకోచం లేదా సంకోచాలు వేతనం చెల్లించబడని శ్రమ స్వాయత్తతపైన, మొత్తం మీద పదార్థ రూపం ధరించిన శ్రమకు, వేతనం చెల్లించబడని శ్రమకు మధ్య ఉన్న నిష్పత్తిపైన ఆధారపడుతుంది. లేక పెట్టుబడిదారుల భాషలో చెప్పాలంటే లాభంచేత, పనిలో పెట్టబడిన పెట్టుబడికి, ఈ లాభానికి ఉన్న నిష్పత్తిచేత నిర్ణయించబడుతుంది. అంటే సామాజిక అవసరాలు అనగా సామాజికంగా అభివృద్ధిచెందిన మానవ అవసరాలకు ఉత్పత్తికి మధ్య ఉన్న సంబంధం వల్ల కాక ఒక నిర్దిష్ట, లాభం రేటుచేత అది నిర్ణయించబడుతుంది. ఈ కారణంచేతనే పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం ఉత్పత్తి విస్తరించిన ఒకానొక దశలో అవరోధాలను ఎదుర్కొంటుంది. అవసరాల దృష్టి నుంచి చూస్తే ఈ విస్తరించిన ఉత్పత్తి బొత్తిగా చాలదని తేలివుండేది. అవసరాలను తీర్చడం కాక లాభాన్ని ఉత్పత్తి చెయ్యటమూ, రాబట్టడమూ అన్న అంశాలు నిర్ణయించిన స్థితిలో ఉత్పత్తి స్తంభించిపోతుంది.

లాభం రేటు పడిపోతే, ఒకవైపున వ్యష్టి పెట్టుబడిదారులు మెరుగైన పద్ధతుల ద్వారా తమ విడిసరుకు విలువను సామాజిక సగటు విలువకంటే తక్కువకు పడగొట్టి ఆ రకంగా అప్పటి మార్కెట్టు ధరతో అదనపు లాభాన్ని పొందవచ్చు. మరోవైపున కొత్త ఉత్పత్తి పద్ధతులతో, కొత్త పెట్టుబడి మదుపుతో, కొత్త సాహసాలతో కూడిన కార్యకలాపాల ద్వారా వంచనకు పాల్పడటం, వంచనను ప్రోత్సహించడం జరుగుతుంది. ఇదంతా సగటు లాభంతో నిమిత్తంలేనట్టి, దానికి పైబడినట్టి అదనపు లాభంతో కాస్త ఒడుపుకోవడం కోసం.

లాభం రేటు, అంటే పెట్టుబడి సాపేక్షపు పెరుగుదల, ఒక స్వతంత్ర స్థానం కోసం వెతుకుతున్న కొత్త పెట్టుబడులన్నింటికి చాలా ప్రధానం. అయితే పెట్టుబడి రూపొందటం సువ్యవస్థితమైన బడా పెట్టుబడుల చేతులలో పడగానే ఉత్పత్తికుండే జీవశక్తి మొత్తంగా ఆరిపోతుంది. ఎందుకంటే ఆ పెట్టుబడుల లాభం మొత్తం, లాభం రేటు పడిపోవడంవల్ల తలెత్తిన లోటును భర్తీ చేస్తుంది. కనుక ఉత్పత్తి చచ్చిపోతుంది. లాభం రేటే పెట్టుబడిదారీ ఉత్పత్తికి చోదక శక్తి. లాభంతో ఉత్పత్తి చేయగలిగిన మేరకు మాత్రమే వస్తువులు ఉత్పత్తి చెయ్యబడతాయి. అందుకే లాభం రేటు పడిపోవడంపట్ల ఇంగ్లీషు ఆర్థికవేత్తలు అంతగా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కేవలం ఇలా జరిగే అవకాశమే రికార్డోకు బాధ కలిగిస్తోంది. ఇది ఆయన పెట్టుబడిదారీ ఉత్పత్తి పరిస్థితులను సంపూర్ణంగా అవగాహన చేసుకున్నా డనటానికి నిదర్శనం. “మానవుల్ని” ఆయన ఏమాత్రం పట్టించుకోకపోవటమూ – మానవులు త్యాగాలు, అవి తెచ్చిన పెట్టుబడి ‘విలువల’ను పట్టించుకోకుండా – ఉత్పత్తి శక్తుల అభివృద్ధిపైన ఆయన తన దృష్టినంతా నిలపడాన్ని కొంతమంది తప్పుపడుతున్నారు. అయితే ఆయన ప్రముఖ దోహదం ఇదే! సామాజిక శ్రమ యొక్క ఉత్పాదక శక్తుల అభివృద్ధే పెట్టుబడి యొక్క చారిత్రక కర్తవ్యం, పెట్టుబడికి సమర్ధన కూడా. ఈ రకంగా మాత్రమే అది అనుకోకుండా ఇంతకంటే ఉన్నతమైన ఉత్పత్తి విధానానికి పాదార్థిక అవసరాను సృష్టిస్తుంది. పెట్టుబడిదారీ ఉత్పత్తికి ప్రేరణనిచ్చిన సూత్రం, సంచయనానికి ప్రాథమిక ఆధారం, చోదక శక్తి అయిన లాభం రేటు, అసలు ఉత్పత్తి అభివృద్ధి కారణంగానే ప్రమాదంలో పడటం రికార్డోని వ్యాకులపరుస్తోంది. ఇక్కడ పరిమాణాత్మక నిష్పత్తి అనేదే సర్వస్వం. అయితే దీని వెనుక ఇంతకంటే గాఢమైనదేదో వుంది. దానిని గురించి ఆయనకు అస్పష్టంగా మాత్రమే తెలుసు.

ఇది కేవలం ఆర్థిక రూపంలో మాత్రమే ఇక్కడ బయటపడుతుంది. అంటే, బూర్జువా దృక్కోణం నుంచి పెట్టుబడిదారీ అవగాహన పరిమితుల్లో, అసలు పెట్టుబడిదారీ ఉత్పత్తి దృక్కోణం నుంచి వెల్లడవుతున్నది : పెట్టుబడిదారీ విధానానికి అవరోధాలు వున్నాయి. ఈ విధానం సాపేక్షమైనది తప్ప, నిరపేక్షమైనది కాదు. అది ఉత్పత్తి పాదార్థిక అవసరాల అభివృద్ధిలో ఒక నిర్దిష్ట పరిమిత యుగానికి మాత్రమే వర్తించే చారిత్రక ఉత్పత్తి విధానం తప్ప మరొకటి కాదని స్పష్టమవుతోంది.

## IV. అనుబంధ వ్యాఖ్యలు

వివిధ పారిశ్రామిక శాఖలలో శ్రమ ఉత్పాదకత అభివృద్ధి చాలా అసమంగా సాగుతుంది. అది స్థాయి రీత్యా అసమంగా ఉండటమే కాక విరుద్ధ దిశలలో కొనసాగుతుంది. దీనినిబట్టి అత్యంత పురోగామి పారిశ్రామిక శాఖలలో ఉత్పాదకత అభివృద్ధి అయిన తరువాత సగటు లాభంలో (అదనపు విలువ) అత్యధిక భాగం సగటు స్థాయికంటే గణనీయంగా తక్కువగా ఉండటం సహజం. వివిధ పారిశ్రామిక శాఖల్లో ఉత్పాదకత అభివృద్ధి గణనీయంగా భిన్నమైన రేట్లతోనూ, తరచుగా విరుద్ధ దిశలలోనూ సాగటం కేవలం పోటీవల్ల తలెత్తిన అరాచకం వల్లనే కాదు. బూర్జువా ఉత్పత్తి విధానం ప్రత్యేక స్వభావంవల్ల కూడా కాదు. శ్రమ ఉత్పాదకత అన్నది ప్రాకృతిక పరిస్థితులతో కూడా ముడిపడి వుంటుంది. ఉత్పాదకత పెరుగుతున్నకొద్దీ ఈ పరిస్థితులు తక్కువ ఉత్పాదకంగా మారతాయి. (ఉత్పాదకత సామాజిక పరిస్థితులపైన ఆధారపడినందువల్ల ఇలా జరుగుతుంది. అందుకే విభిన్న రంగాల్లో గమన క్రమాలు విరుద్ధ దిశలలో ఉంటాయి.) ఒకచోట ప్రగతి, మరోచోట తిరోగమనం కనిపిస్తాయి. ఉదాహరణకు, అత్యధిక ముడి పదార్థాల పరిమాణంపై రుతువుల ప్రభావాన్ని, అడవుల్ని, బొగ్గు, ఇనుప గనుల తరుగుదలను పరిశీలించండి.

స్థిర పెట్టుబడిలోని చలామణి అయ్యే భాగం అంటే ముడిపదార్థాలు మొదలయిన వాటి పరిమాణం శ్రమ ఉత్పాదకతకు అనుగుణంగా పెరుగుతుంది. కాని స్థిర పెట్టుబడిలోని నిశ్చల భాగం భవనాలు, యంత్రాలు, దీపాలు, ఉష్ణ ప్రసార సదుపాయాల వంటి వాటికి ఇది వర్తించదు. ఒక యంత్రం భౌతిక పరిమాణం పెరగటంతో నిరపేక్ష అర్థంలో ప్రియమైనప్పటికీ సాపేక్షంగా చూస్తే చౌకగా మారుతుంది. అయిదుగురు కార్మికులు ఇంతకు ముందు ఉత్పత్తి చేసిన సరుకుకు పదింతలు ఉత్పత్తి చేస్తే దానివల్ల నిశ్చల పెట్టుబడికి కేటాయించాల్సిన సొమ్ము పదింతలు పెరగదు. ఉత్పాదకత అభివృద్ధితోపాటు స్థిర పెట్టుబడిలోని ఈ భాగం యొక్క విలువ పెరిగినప్పటికి, అది అదే నిష్పత్తిలో పెరగదు. శ్రమ ఉత్పాదకత పెరుగుదలతో స్థిర, అస్థిర పెట్టుబడుల మధ్య నిష్పత్తిలో వచ్చే భేదాన్నీ – లాభం రేటు పడిపోవటంలో వ్యక్తమయ్యే ఈ భేదాన్నీ వ్యష్టి సరుకుతోనూ, దాని ధరతోనూ గల సంబంధంలో వ్యక్తమయ్యే అదే నిష్పత్తిలోని భేదాన్ని మేము తరచు ఎత్తిచూపాము.

[సరుకు విలువను దానిలో నిక్షిప్తమై ఉన్న గత శ్రమ నేటి సజీవ శ్రమల మొత్తం నిర్ణయిస్తుంది. ఉత్పాదకతలో పెరుగుదల వుందంటే, అందులోని సజీవ శ్రమ భాగం తగ్గగా, గత శ్రమ భాగం పెరిగిందన్నమాట. అయితే సరుకులో ఇమిడి వున్న మొత్తం శ్రమ పరిమాణం తగ్గే విధంగా ఇది జరుగుతుంది. కనుక గత శ్రమ పెరిగినదానికంటే ఎక్కువ సజీవ శ్రమ తగ్గే విధంగా ఇది జరుగుతుంది.

ఒక సరుకు విలువలో ఉన్న గత శ్రమ (పెట్టుబడి స్థిరభాగం)లో పాక్షికంగా నిశ్చల పెట్టుబడి అరుగుదలా, పాక్షికంగా చలామణి అయ్యే స్థిర పెట్టుబడి భాగమూ ఉంటాయి. ఈ భాగం సరుకు వినియోగంలో కొన్న ముడిపదార్థాలు, సహాయక పదార్థాలు లాంటి అంశాలు. పెరుగుతున్న శ్రమ ఉత్పాదకతతోపాటు ముడి సహాయక పదార్థాల నుంచి వచ్చే విలువ భాగం తగ్గుతుంది. ఎందుకంటే ఈ పదార్థాలకు సంబంధించి వాటి విలువను తగ్గించడం ద్వారా ఉత్పాదకత వ్యక్తమవుతుంది. మరోవైపున, పెరిగే శ్రమ ఉత్పాదకతకు స్వభావసిద్ధమైన అంశం ఏమంటే, స్థిర పెట్టుబడిలోని నిశ్చల భాగం బాగా పెరుగుతుంది. దానితోపాటు సరుకులకు బదిలీ అయిన అరుగుదల విలువ భాగం కూడా పెరుగుతుంది. ఒక కొత్త ఉత్పత్తి పద్ధతి ఉత్పాదకతలో నిజమైన పెరుగుదలకు ప్రాతినిధ్యం వహించాలంటే, అది ప్రతి యూనిట్ సరుకుకు అరుగుదల రూపంలో బదలాయించే విలువ అదనపు భాగం సజీవ శ్రమను పొదుపు చేయడం ద్వారా దీనినుంచి మినహాయించే విలువ భాగంకన్నా తక్కువగా ఉండాలి. ఒక్క ముక్కలో చెప్పాలంటే అది సరుకు విలువను తగ్గించాలి. ఎక్కువ లేదా ప్రియమైన ముడి లేదా సహాయక పదార్థాలు, నిశ్చల పెట్టుబడికి సంబంధించిన, అరుగుదల అదనపు భాగాన్ని మించి ప్రవేశించిన కారణాన కొన్ని సందర్భాలలో విలువ అదనంగా సరుకు విలువలో ప్రవేశిస్తుంది. అలాంటప్పుడు కూడా కొత్త ఉత్పత్తి పద్ధతే సరుకు విలువను తగ్గించాలనేది స్పష్టమే; అయితే విలువకు జమ అయిన అదనపు మొత్తాలన్నీ సజీవ శ్రమ తగ్గటంవల్ల విలువలో వచ్చిన తగ్గుదలతో పరిహారం కావాలి.

కనుక, సరుకులోకి ప్రవేశించే శ్రమ మొత్తం తగ్గుదల శ్రమ ఉత్పాదకత పెరుగుదలకు తప్పనిసరియైన గీటురాయి అవుతుంది. ఏ సామాజిక పరిస్థితులలో ఉత్పత్తి జరిగినప్పటికీ ఇది వర్తిస్తుంది. ఉత్పత్తిదారులు ముందే వేసుకొన్న పథకం ప్రకారం ఉత్పత్తి విక్రయబద్ధం చేసే సమాజంలో, లేదా సాధారణ సరుకు ఉత్పత్తి వ్యవస్థలో సైతం ఈ రాశి ప్రమాణంలోనే శ్రమ ఉత్పాదకత కొలవబడుతుంది. అయితే పెట్టుబడిదారీ ఉత్పత్తిలో పరిస్థితి ఏమిటి?

ఉదాహరణకు ఒక పెట్టుబడిదారీ పారిశ్రామిక శాఖ ఈ క్రింది పరిస్థితులలో తన ప్రామాణిక సరుకును తయారుచేస్తుందనుకొందాం. నిశ్చల పెట్టుబడి అరుగుదల ఒక సరుకుకు $\frac{1}{2}$ షిల్లింగ్ అందులో ప్రవేశించే ముడి పదార్థాలు, సహాయక పదార్థాలు $17\frac{1}{2}$ షిల్లింగ్‌లు అనుకొందాం. వేతనాలు రెండు షిల్లింగ్‌లు, అదనపు విలువ రెండు షిల్లింగ్‌లు అనుకొందాం. అంటే, అదనపు విలువ రేటు $100\%$ సరుకు మొత్తం విలువ = 22 షిల్లింగులు. ఈ ఉత్పత్తి రంగంలో పెట్టుబడికి సగటు సామాజిక పెట్టుబడి నిర్మాణ స్వరూపం ఉందనుకొందాం. కనుక ఒక సరుకు ఉత్పత్తి ధర దాని విలువతో సమానం అవుతుంది. పెట్టుబడిదారుని లాభం సృష్టించబడిన అదనపు విలువతో సమానం అవుతుంది. అప్పుడు సరుకు ఉత్పత్తి ఖర్చు = $\frac{1}{2} + 17\frac{1}{2} + 2 = 20$ షిల్లింగ్‌లు,. సగటు లాభం రేటు $\frac{2}{20} = 10\%$. ఒక సరుకు ఉత్పత్తి ధర దాని విలువలాగే 22 షిల్లింగ్‌లు.

ఒక సరుకు ఉత్పత్తి చేయటానికి అవసరమైన సజీవ శ్రమను సగానికి తగ్గిస్తూ, నిశ్చల పెట్టుబడి అరుగుదలకు సంబంధించిన విలువ భాగాన్ని మూడు రెట్లు పెంచే యంత్రాన్ని కనుగొన్నారనుకొందాం. ఈ సందర్భంలో లెక్కాచారం ఇలా వుంటుంది. అరుగుదల = $1\frac{1}{2}$ షిల్లింగ్‌లు.

ముడి, సహాయక పదార్థాలు ఇంతకు ముందులాగే $17\frac{1}{2}$ షిల్లింగులు. వేతనాలు ఒక షిల్లింగ్, అదనపు విలువ ఒక షిల్లింగ్, మొత్తం 21 షిల్లింగ్‌లు; అపుడు సరుకు విలువ ఒక షిల్లింగ్ పడిపోతుంది. అంటే కొత్త యంత్రం ఖచ్చితంగా శ్రమ ఉత్పాదకతను పెంచింది. అయితే పెట్టుబడిదారు రాశి విషయాన్ని ఇలా చూస్తాడు. అతని ఉత్పత్తి ఖర్చు అరుగుదల కింద $1\frac{1}{2}$ షిల్లింగులు, ముడి, సహాయక పదార్థాలకు $17\frac{1}{2}$ షిల్లింగులు, వేతనాలకు ఒక షిల్లింగ్ అవుతుంది. లాభం రేటు కొత్త యంత్రంవల్ల తక్షణమే మారనందువల్ల అతడు తన ఉత్పత్తి ఖర్చుపైన 10% అనగా రెండు షిల్లింగ్‌ల లాభాన్ని పొందుతాడు. కాబట్టి ఉత్పత్తి ధర మారదు. అది 22 షిల్లింగ్‌లు. అయితే విలువకంటే ఒక షిల్లింగ్ ఎక్కువ. పెట్టుబడిదారీ పరిస్థితుల్లో ఉత్పత్తి చేస్తున్న సరుకు సమాజానికి చౌక కాలేదు. కనుక కొత్త యంత్రం దాని దృష్టిలో మెరుగైన యంత్రం కాదు. కనుక పెట్టుబడిదారుడు దానిని ప్రవేశపెట్టడంలో ఆసక్తి చూపడు. దానిని ప్రవేశపెట్టడంవల్ల, ఇంకా పూర్తిగా అరిగిపోని తన పాత యంత్రం వృధా అయిపోతుంది. కేవలం అది పాత ఇనుప సామానుగా మారుతుంది. లాభం లేకపోగా నష్టం వస్తుంది. కనుక అతడు ఆ పనిచేయకుండా జాగ్రత్త తీసుకొంటాడు. అతని దృష్టిలో అది ఆచరణ యోగ్యం కాని తప్పు.

కనుక పెట్టుబడి దృష్టి నుంచి శ్రమ ఉత్పాదకత పెరుగుదల నియమం సంపూర్ణంగా వర్తించదు. పెట్టుబడికి సంబంధించినంత వరకు కేవలం సజీవ శ్రమ పొదుపైనంత మాత్రంచేత ఉత్పాదకత పెరిగినట్లు కాదు. గతంలో వెచ్చించిన శ్రమతో పోలిస్తే ప్రతిఫలం చెల్లించబడే సజీవ శ్రమ పొదుపు ద్వారా మాత్రమే ఉత్పాదకత పెరుగుతుంది. ఒకటో సంపుటం 15వ అధ్యాయంలో రాశి అంశాల్ని పేర్కొన్నాం. ఇక్కడ పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానంలో మరో వైరుధ్యముంది. దాని చారిత్రక కర్తవ్యం ఏమంటే, మానవ శ్రమ ఉత్పాదకతను అమితమైన వేగంతో పరిమితిలేని అభివృద్ధిని సాధించడం. ఉత్పాదకత అభివృద్ధిని అది ఇక్కడలాగా నిరోధించినప్పుడల్లా అది తన కర్తవ్యం నుంచి వైదొలుగుతుంది. ఆ రకంగా అది వార్ధక్యంలో పడుతున్నదని, అది అవసరమైన దానికంటే ఎక్కువ కాలం బతుకుతోందని అది మరోసారి రుజువు చేస్తుంది.][1]

★ ★ ★

పోటీ వ్యవస్థలో ఒక స్వతంత్ర పారిశ్రామిక సంస్థను ఫలప్రదంగా నిర్వహించాలంటే, ఉత్పాదకత పెరుగుదలలో, అవసరమైన కనీస పెట్టుబడి పెరుగుదల కింది లక్షణాన్ని సంతరించు కొంటుంది. కొత్త, మరింత ఖరీదైన పరికరాలు సార్వత్రికంగా స్థాపించబడగానే చిన్న పెట్టుబడిదారులు ఈ పరిశ్రమ నుంచి నెట్టివేయబడతారు. వివిధ పారిశ్రామిక రంగాలలో కొత్త యంత్రాలను కనిపెట్టిన తొలి దశలో మాత్రమే చిన్న పెట్టుబడులు స్వతంత్రంగా కొనసాగగలుగుతాయి. మరోవైపున స్థిర పెట్టుబడి అసాధారణమైన నిష్పత్తిలో ఉండే రైల్వేలలాంటి భారీ సంస్థలు సగటు లాభం రేటును ఇవ్వవు. దానిలో ఒక భాగాన్ని మాత్రమే, వడ్డీ మాత్రమే ఇస్తాయి. అలా కాకుంటే సాధారణ లాభం

1. దీనికి ముందున్న విషయాన్ని కుండలీకరణలలో పెట్టడానికి కారణం మూల రాతప్రతి నోట్స్ ఇక్కడ తిరిగి రాయబడినప్పటికీ, కొన్ని అంశాలలో ఆ రాతప్రతి పరిధిని దాటటం జరిగింది. - ఎంగెల్స్

రేటు ఇంకా పడిపోయి వుండేది. అయితే పెద్ద ఎత్తున కేంద్రీకృతమైన పెట్టుబడులకు స్టాకుల రూపంలాగా నియోగింపబడటానికి ఇది అవకాశమిస్తోంది.

పెట్టుబడి పెరుగుదలే, పెట్టుబడి సంచయనమే లాభం రేటు పడిపోవటాన్ని సూచించదు. దానితోపాటు పెట్టుబడి నిర్మాణ స్వరూపంలో ఇంతకు ముందు పేర్కొన్న మార్పులు జరిగితే లాభం రేటు పడిపోతుంది. ఉత్పత్తి విధానంలో నిరంతరాయంగా రోజు రోజూ విప్లవాలు జరుగుతున్నప్పటికీ, మొత్తం పెట్టుబడిలో చిన్నదో పెద్దదో భాగం ఇప్పుడు కొంత, అప్పుడు కొంత ఈ నిర్మాణ స్వరూపం అంతర్భాగాల మధ్య ఒక నిర్దిష్ట సగటు నిష్పత్తి ప్రాతిపదికపై పెట్టుబడి పోగుపడుతూనే వుంటుంది. ఫలితంగా దాని పెరుగుదలతో పాటు, దాని నిర్మాణ స్వరూపంలో కొంతకాలంపాటు మార్పులుండవు. కనుక లాభం రేటు పడిపోవటానికి కారణం ఉండదు. ఈ నిరంతరాయమైన పెట్టుబడి విస్తరణా, పాత ఉత్పత్తి విధానం ప్రాతిపదికపై ఈ ఉత్పత్తి విస్తరణా, తమ పక్కనే కొత్త పద్ధతులు ప్రవేశిస్తున్నప్పటికీ, కొంతకాలంపాటు కొనసాగుతాయి. మొత్తం సామాజిక పెట్టుబడి పెరిగినంతగా లాభం రేటు పడిపోక పోవడానికి ఇది మరొక కారణం.

వేతనాలపై వెచ్చించబడే అస్థిర పెట్టుబడి సాపేక్షంగా తగ్గినప్పటికీ అన్ని ఉత్పత్తి శాఖల్లోనూ కార్మికుల సంఖ్య నిరపేక్షంగా గానీ, ఏకరీతిగా గానీ పెరగదు. వ్యవసాయంలో సజీవ శ్రమ అంశం తగ్గుదల నిరపేక్షంగా ఉండొచ్చు.

వేతన కార్మికుల సంఖ్య సాపేక్షంగా తగ్గినప్పటికీ నిరపేక్షంగా పెరగడం పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం యొక్క అవసరం. రోజూ 12–15 గంటలపాటు శ్రమశక్తిని పెట్టడం అనవసరమయిన వెనువెంటనే, పెట్టుబడిదారీ విధానం దృష్టిలో శ్రామిక సంఖ్యాబలం అక్కరకు మించినదవుతుంది. కార్మికుల సంఖ్యనిక నిరపేక్షంగా తగ్గించే ఉత్పాదకశక్తుల అభివృద్ధి విప్లవాన్ని తెస్తుంది. మొత్తం జాతి తన మొత్తం ఉత్పత్తిని ఇంతకు ముందుకంటే తక్కువ కాలంలో నిర్వహించడం విప్లవానికి దారితీస్తుంది. ఎందుకంటే ప్రజల్లో అత్యధిక భాగాన్ని అది నిరుద్యోగులుగా మారుస్తుంది. పెట్టుబడిదారీ ఉత్పత్తికి ఉన్న ప్రత్యేక అవరోధాల మరో వ్యక్తీకరణ ఇది. పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం ఉత్పాదక శక్తుల అభివృద్ధికి, సంపద సృష్టికి పరమ రూపం కాదని, పైపెచ్చు ఒక దశలో ఈ అభివృద్ధితో అది ఘర్షణపడుతుందనీ అది రుజువు చేస్తుంది. ఈ ఘర్షణ అప్పుడప్పుడూ వచ్చే సంక్షోభాలలో సాక్షికంగా కనిపిస్తుంది. దాని పాత పని విధానంలో ఒకప్పుడు జనంలోని ఒక విభాగం, మరో సందర్భంలో మరో విభాగం నిరుద్యోగం అయినందువల్ల ఈ సంక్షోభాలు ఉద్భవిస్తుంటాయి. పెట్టుబడిదారీ ఉత్పత్తి పరిమితి ఏమంటే కార్మికుల అదనపు కాలమే. సమాజం సాధించిన నిరపేక్ష విరామ కాలాన్ని అది పట్టించుకోదు. ఉత్పాదకత అభివృద్ధి కార్మికవర్గపు అదనపు శ్రమకాలాన్ని పెంచిన మేరకు మాత్రమే దాన్ని గురించి పెట్టుబడిదారీ ఉత్పత్తి శ్రద్ధ వహిస్తుంది. అంతే తప్ప మొత్తంపై పాదార్థిక ఉత్పత్తికి పట్టే శ్రమకాలం తగ్గినందుకు కాదు. ఆ రకంగా అది ఒక వైరుధ్యంలో పయనిస్తుంది.

పెరిగే పెట్టుబడి సంచయనంలో పెరుగుతున్న పెట్టుబడి సాంద్రీకరణ గర్భితమని గమనించాం. ఆ రకంగా పెట్టుబడి శక్తి పెరుగుతుంది. పెట్టుబడిదారుని రూపంలో మూర్తీభవించిన సామాజిక ఉత్పత్తి పరిస్థితులు వాస్తవ ఉత్పత్తిదారుల నుంచి పరాయీకరింపబడటం (alienation) పెరుగుతుంది.

పెట్టుబడి రానురానూ ఒక సామాజిక శక్తిగా ముందుకొస్తుంది. దాని ప్రతినిధి పెట్టుబడిదారుడు ఇప్పుడు దీనికి విడి వ్యక్తి, శ్రమ సృష్టించగలిగిన దానితో ఏమాత్రం సంబంధం ఉండదు. అది పూర్తిగా పరాయీకృత, స్వతంత్ర సామాజిక శక్తిగా తయారవుతుంది. అది సమాజాన్ని ఒక వస్తువుగానూ, పెట్టుబడిదారుని శక్తికి ఆధారభూతమైన వస్తువుగానూ ఎదుర్కొంటుంది. ఒకవైపున పెట్టుబడి అది సంతరించుకొన్న సాధారణ సామాజిక శక్తికీ, మరోవైపున ఈ సామాజిక ఉత్పత్తి పరిస్థితులపై వ్యష్టి పెట్టుబడిదారుల ప్రైవేటు శక్తికీ మధ్య వైరుధ్యం రానురానూ రాజీలేని విధంగా తయారవుతుంది. అయితే అదే సమయంలో ఉత్పత్తి పరిస్థితులను సాధారణ, ఉమ్మడి, సామాజిక పరిస్థితులుగా రూపాంతరీకరించటం దానిలో గర్భితం కనుక ఆ వైరుధ్యంలోనే సమస్యకు పరిష్కారం కూడా ఉంది. పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానంలో ఉత్పత్తి శక్తుల అభివృద్ధీ, ఈ అభివృద్ధి జరిగే పద్ధతులూ, సాధనాలూ ఈ రూపాంతరీకరణకు మూలకందాలు.

★ ★ ★

ఒక కొత్త ఉత్పత్తి పద్ధతి – ఎంత ఎక్కువ ఉత్పాదకమైనదిగా ఉన్నప్పటికీ, అదనపు విలువ రేటును అది ఎంతగా పెంచినప్పటికీ, లాభం రేటును గనుక అది తగ్గించినంత కాలం ఏ పెట్టుబడిదారూ ఎన్నడూ స్వచ్ఛందంగా దానిని ప్రవేశపెట్టడు. అయినా అటువంటి కొత్త ఉత్పత్తి పద్ధతి ప్రతీదీ సరుకులను చౌక చేస్తుంది. కనుక పెట్టుబడిదారు తొలిదశలో వాటిని ఉత్పత్తి వ్యయానికి మించి, లేదా బహుశా వాటి విలువకు మించి అమ్ముతాడు. వాటి ఉత్పత్తి ఖర్చుకు అంతకంటే ఎక్కువ ఉత్పత్తి ఖర్చులో తయారైన అవే రకం సరుకుల మార్కెట్ ధరలకు మధ్య తేడాను జేబులో వేసుకొంటాడు. ఎక్కువ ఉత్పత్తి ఖర్చుతో తయారైన సరుకుల ఉత్పత్తికి సామాజికంగా అవసరమైన సగటు శ్రమ కాలం కొత్త ఉత్పత్తి పద్ధతులవల్ల పట్టే దానికంటే ఎక్కువ కనుక అతడు అలా చేయగలుగుతాడు. అతని ఉత్పత్తి పద్ధతి సామాజిక సగటును మించి ఉంటుంది. అయితే పోటీవల్ల అది సార్వత్రిక మవుతుంది. సార్వత్రిక నియమానికి లోనవుతుంది. ఫలితంగా లాభం రేటు పడిపోతుంది. (బహుశా మొదట ఒక ఉత్పత్తి రంగంలో జరుగుతుంది. క్రమంగా అది మిగిలిన రంగాలలో సమతూకాన్ని సాధిస్తుంది.) కనుక లాభం రేటు పడిపోవడం అన్నది పెట్టుబడిదారుని ఇష్టానిష్టాలతో ఏ మాత్రమూ ప్రమేయం లేనిది.

ఈ సందర్భంలో మరో విషయం కూడా పేర్కొనాలి. కార్మికుల వినియోగంలోకి గానీ, వారి జీవితావసరాలు ఉత్పత్తి అయ్యే పరిస్థితుల్లోకి గానీ ప్రవేశించని ఉత్పాదితాలకు సంబంధించిన ఉత్పత్తి రంగాలను సైతం ఈ నియమం శాసిస్తుంది. అంటే, సరుకుల ధరలు తగ్గించటం అనేది సాపేక్ష అదనపు విలువను పెంచలేని, శ్రమశక్తి ధరను తగ్గించలేని రంగాలకు కూడా ఇది వర్తిస్తుంది. (ఏమైనప్పటికీ, ఈ రంగాలన్నింటిలోనూ, శ్రమ దోపిడీ యథాతథంగా వున్న స్థితిలో స్థిర పెట్టుబడి చౌక కావటంవల్ల లాభం రేటు పెరగవచ్చు. కొత్త ఉత్పత్తి పద్ధతి వ్యాపించటం ప్రారంభం కాగానే, ఈ సరుకులను వాస్తవంగా ఇంతకంటే చౌకగా తయారు చేయొచ్చు అన్న స్పష్టమైన రుజువును సమకూరడం ప్రారంభం కాగానే పాత ఉత్పత్తి పద్ధతులతో పనిచేస్తున్న పెట్టుబడిదార్లు వారి ఉత్పాదితాలను వాటి

పూర్తి ఉత్పత్తి ఖర్చుకంటే తక్కువకు అమ్మాల్సి వుంటుంది. ఎందుకంటే ఈ సరుకు విలువ పడిపోయింది. దానిని ఉత్పత్తి చేయడానికి అవసరమైన శ్రమకాలం సామాజిక సగటుకంటే ఎక్కువగా వుంది. ఒక్క మాటలో చెప్పాలంటే స్థిర పెట్టుబడితో అస్థిర పెట్టుబడికున్న నిష్పత్తిని తగ్గించే కొత్త ఉత్పత్తి పద్ధతిని ఈ పెట్టుబడిదార్లు సైతం ప్రవేశపెట్టవలసిందే – ఇది పోటీ ఫలితంగా కనిపిస్తుంది.

సరుకు ధరను తగ్గించే యంత్రాలను ఉపయోగించటానికి దారితీసే పరిస్థితులన్నీ, అంతిమ విశ్లేషణలో, ఒక విడి సరుకు లోగొనే శ్రమ పరిమాణం తగ్గటం, రెండవది యంత్రంలోని అరుగుదల భాగం తగ్గటం తప్ప వేరే కాదని తేలుతోంది. ఈ అరుగుదల భాగం యొక్క విలువ సరుకులో ప్రవేశిస్తుంది. యంత్రాల అరుగుదల వేగం ఎంత తక్కువగా ఉంటే దాని విలువ ప్రవేశించే సరుకులు అంత ఎక్కువగా వుంటాయి. అది పునరుత్పత్తి అయ్యేలోగా అది అంత ఎక్కువ సజీవ శ్రమను భర్తీ చేస్తుంది. ఈ రెండు సందర్భాలలోనూ నిశ్చల, స్థిర పెట్టుబడి పరిమాణమూ, విలువా అస్థిర పెట్టుబడితో పోలిస్తే పెరుగుతాయి.

"మిగతా అన్ని పరిస్థితులు యథాతథంగా ఉన్నప్పుడు, ప్రతి దేశం తన లాభాల నుంచి పొదుపు చేయగల శక్తి, లాభాల రేటునుబట్టి మారుతూ ఉంటుంది. లాభాలు ఎక్కువ ఉంటే ఎక్కువగానూ, తక్కువ ఉంటే తక్కువగానూ వుంటుంది. అయితే లాభాల రేటు పడిపోవడంతో మిగిలిన పరిస్థితులన్నీ యథాతథంగా ఉండవు... ఇంగ్లండులోలాగా తక్కువ లాభం రేటుతోపాటు ప్రజల సంఖ్యనుబట్టి సాధారణంగా సత్వరగతితో కూడిన సంచయనం రేటు వుంటుంది... లాభం రేటు ఎక్కువగా వున్నప్పుడు, సంచయనం రేటు, ప్రజల సంఖ్యను బట్టి మందకొడిగా వుంటుంది. ఉదాహరణలు... పోలెండ్, రష్యా, ఇండియా వగైరా.." (రిచర్డ్ జోన్స్, ఏన్ ఇంట్రడక్టరీ లెక్చర్ ఆన్ పొలిటికల్ ఎకానమీ, లండన్, 1833, పుట 50.) లాభం రేటు పడిపోయినప్పటికీ సంచయనానికి ప్రేరణలు, శక్తులు పెరుగుతాయని జోన్స్ సరిగానే నొక్కిచెప్పాడు. మొదటిది, పెరుగుతున్న సాపేక్ష అధిక జనాభావల్ల. రెండవది, పెరిగే శ్రమ ఉత్పాదకతతోపాటు అదే మార్పిడి విలువ వ్యక్తం చేసే ఉపయోగ విలువల పరిమాణం పెరగటంవల్ల, అనగా పెట్టుబడి పాదార్థిక అంశాలు పెరగటంవల్ల. మూడవది, ఉత్పత్తి శాఖలు మరింత వైవిధ్యాన్ని సంతరించుకోవటం వల్ల. నాలుగవది, పరపతి వ్యవస్థ స్టాక్ కంపెనీలు వగైరాలు అభివృద్ధి చెందడంవల్ల పారిశ్రామిక పెట్టుబడిదారు కానక్కర్లేకుండానే డబ్బును పెట్టుబడిగా మార్చే పరిస్థితులవల్ల. అయిదవది, అవసరాలు, సంపద కోసం ఆబ పెరగటం వల్ల. ఆరవది నిశ్చల పెట్టుబడిలో మదుపు పరిమాణం పెరగటం వగైరాల వల్ల అది సాధ్యమవుతుంది.

★ ★ ★

పెట్టుబడిదారీ ఉత్పత్తిలో మూడు ఆధారభూత వాస్తవాలు.

1. కొద్దిమంది చేతుల్లో ఉత్పత్తి సాధనాల సాంద్రీకరణ. ఇందువల్ల సాధనాలు తత్సంబంధిత కార్మికుల ఆస్తిగా ఉండటంపోయి సామాజిక ఉత్పత్తి సదుపాయాలుగా మారతాయి. అవి తొలిదశలో పెట్టుబడిదార్ల ప్రైవేటు ఆస్తిగా ఉన్నప్పటికీ ఇది వర్తిస్తుంది. వీరు బూర్జువా సమాజానికి ధర్మకర్తలు. ఈ ధర్మకర్తృత్వంవల్ల వచ్చే ఆదాయాన్నంతటినీ వారు జేబులో వేసుకొంటారు.

2. సహకారం ద్వారా, శ్రమ విభజన ద్వారా, శ్రమను భౌతిక శాస్త్రాలలో కలపడం ద్వారా సామాజిక శ్రమగా శ్రమ వ్యవస్థీకరణ.

ఈ రెండు అర్థాల్లో పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం విరుద్ధ రూపాలలోనే అయినప్పటికీ ప్రైవేటు ఆస్తిని, ప్రైవేటు శ్రమను రద్దుచేస్తుంది.

3. ప్రపంచ మార్కెట్ సృష్టి.

పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానంలో, జనాభా పెరుగుదలకు అనుగుణంగా ఉత్పాదకత బ్రహ్మాండంగా పెరుగుతుంది. దాంతోబాటు అదే స్థాయిలో కాకపోయినప్పటికీ పెట్టుబడి విలువలు (కేవలం వాటి పాదార్థిక అంశంలో మాత్రమే కాదు) వృద్ధి చెందుతాయి. ఇవి జనాభాకంటే చాలా వేగంగా వృద్ధి చెందుతాయి. ఈ పెరుగుదలలు ఈ అపార ఉత్పాదక శక్తి దేని తరఫున పని చేస్తున్నదో ఆ పునాదిలో ఘర్షిస్తాయి. ఎందుకంటే సంపద వృద్ధితో పోల్చినపుడు ఈ పునాది మరింత సంకుచితమవుతుంది. అంతేగాక ఈ పెరుగుదలలు వృద్ధి చెందుతున్న పెట్టుబడి తన విలువను పెంపొందించుకొనే పరిస్థితులతో కూడా ఘర్షిస్తాయి. అందుకే ఈ సంక్షోభాలు.

★ ★ ★

## నాల్గవ భాగం

# సరుకు పెట్టుబడి మరియు డబ్బు పెట్టుబడి వాణిజ్య పెట్టుబడిగా, డబ్బు లావాదేవీల పెట్టుబడిగా (వ్యాపారి పెట్టుబడిగా) పరివర్తన

## అధ్యాయం - 16

## వ్యాపార పెట్టుబడి

**వ్యా**పారి పెట్టుబడి - లేదా వ్యాపార పెట్టుబడి రెండు రూపాలుగా లేదా రెండు ఉప విభాగాలుగా విడిపోతుంది. అవి వాణిజ్య పెట్టుబడి, డబ్బు లావాదేవీల పెట్టుబడి. ప్రాథమిక నిర్మాణంలో ఉన్న పెట్టుబడిని గురించిన మన విశ్లేషణకు అవసరమైన మేరకు వీటిని ఇప్పుడు మరింత క్షుణ్ణంగా నిర్వచిస్తాం. ఎందుకంటే ఆధునిక రాజకీయ అర్థశాస్త్రం దాని అత్యుత్తమ ప్రతినిధులను సైతం తీసుకొని చూచినా వ్యాపార పెట్టుబడిని, పారిశ్రామిక పెట్టుబడిని విచక్షణా రహితంగా కలిపి గందరగోళ పరుస్తోంది. వ్యాపార పెట్టుబడి ప్రత్యేక లక్షణాలను ఉపేక్షిస్తోంది.

★ ★ ★

సరుకు పెట్టుబడి గమనాలు రెండో సంపుటంలో విశ్లేషించడం జరిగింది. మొత్తం సామాజిక పెట్టుబడిని తీసుకొని చూస్తే, దానిలో ఒక భాగం (విభిన్న అంశాలతో ఉంటుంది. దాని పరిమాణం కూడా మారుతూ ఉంటుంది.) మార్కెట్‌లో ఎప్పుడూ డబ్బుగా మారటానికై సరుకుల రూపంలో ఉంటుంది. మరోభాగం సరుకులుగా మారటానికై, డబ్బు రూపంలో ఉంటుంది. సరుకు పెట్టుబడి ఎప్పుడూ ఈ పరివర్తనా ప్రక్రియలోనే, ఈ రూప పరివర్తన క్రమంలోనే ఉంటుంది. చలామణి క్రమంలో పెట్టుబడి యొక్క ఈ క్రియ ఒక ప్రత్యేక పెట్టుబడి యొక్క ప్రత్యేక క్రియగా కేటాయించబడి నందువల్ల, శ్రమ విభజన కారణంగా పెట్టుబడిదారుల ఒక ప్రత్యేక బృందానికి నిర్ణయించబడిన క్రియగా ఉన్నందువల్ల సరుకు పెట్టుబడి వ్యాపార పెట్టుబడిగా మారుతుంది.

రవాణా పరిశ్రమ, స్టోరేజీ వ్యవస్థ, పంపిణీకి అర్హమైన రూపంలో సరుకుల పంపిణీ మొదలైనవి, ఏ మేరకు చలామణి ప్రక్రియ పరిధిలో ఉంటూనే ఉత్పత్తి ప్రక్రియలుగా పరిగణించబడవచ్చో ఇంతకు

ముందు వివరించాను. (IIవ సంపుటం, అధ్యాయం VI "చలామణి ఖర్చులు" 2, 3) సరుకు పెట్టుబడి చలామణికి అనుబంధంగా ఉండే అంశాలు కొన్ని సందర్భాలలో వ్యాపారి పెట్టుబడిగా, వ్యాపార పెట్టుబడిగా గందరగోళపర్చబడుతున్నాయి. కొన్ని సందర్భాలలో అవి నిజంగానే ఆచరణలో ఈ ప్రత్యేక క్రియలతో ముడిపడి ఉంటాయి. అయితే సామాజిక శ్రమ విభజన అభివృద్ధితోపాటు వ్యాపారి పెట్టుబడి క్రియ దాని శుద్ధ రూపంలో ఆవిష్కృతమవుతుంది. అయ్యే ఈ క్రియల నుంచి వేరుపడి వాటితో నిమిత్తం లేకుండా రూపొందుతుంది. కనుక ఆ క్రియలు ఇక్కడ మనకు అప్రస్తుతం. మన లక్ష్యం పెట్టుబడి యొక్క ప్రత్యేక రూపంలోని నిర్దిష్ట భేదాన్ని నిర్వచించటం మాత్రమే. చలామణి ప్రక్రియలో మాత్రమే నియుక్తమైన పెట్టుబడి, అంటే ప్రత్యేక వ్యాపార పెట్టుబడి ఈ క్రియలను తన క్రియలతో పాక్షికంగా జోడించిన మేరకు శుద్ధ రూపంలో కన్పించదు. ఆయా సందర్భాలలో తలెత్తే ఈ క్రియలన్నింటి నుంచీ దానిని వేరుచేసిన తర్వాత దాని శుద్ధ రూపం లభిస్తుంది.

సరుకు పెట్టుబడిగా పెట్టుబడి అస్తిత్వమూ, మార్కెట్‌లో సరుకు పెట్టుబడిగా చలామణి రంగంలో అది లోనయ్యే రూప పరివర్తనను (సరుకు పెట్టుబడిగా డబ్బు పెట్టుబడిగానూ, డబ్బు పెట్టుబడిని సరుకు పెట్టుబడిగానూ మార్చే క్రయ విక్రయాలుగా విభజితమయ్యే ఒక రూపపరివర్తన) మనం చూస్తాం. ఇది పారిశ్రామిక పెట్టుబడి పునరుత్పత్తి ప్రక్రియలో, కనుక మొత్తంగా దాని ఉత్పత్తి ప్రక్రియలో ఒక దశగా ఉందని మనం గమనించాం. అయితే ఉత్పాదక పెట్టుబడిగా అది నిర్వహించే క్రియకంటే చలామణి పెట్టుబడిగా అది నిర్వహించే క్రియ భిన్నమైనదని కూడా మనం గమనించాం. ఈ రెండూ ఒకే పెట్టుబడి అస్తిత్వం యొక్క రెండు భిన్నమైన, వేర్వేరు రూపాలు. మొత్తం సామాజిక పెట్టుబడిలో ఒక భాగం చలామణి పెట్టుబడి రూపంలో నిరంతరాయంగా మార్కెట్లో ఉంటూ, ఈ రూప పరివర్తనా ప్రక్రియ ద్వారా పయనిస్తూంటుంది. అయితే ప్రతి విడి పెట్టుబడి విషయంలోనూ, సరుకు పెట్టుబడిగా దాని అస్తిత్వమూ, దాని రూప పరివర్తనా దాని ఉత్పత్తి ప్రక్రియ కొనసాగింపులో నిరంతరం మాయమవుతూ, ప్రత్యక్షమవుతూండే కీలక స్థానాలకు అంటే పరివర్తనా దశలకు కేవలం ప్రాతినిధ్యం వహిస్తాయి. మార్కెట్‌లో సరుకు పెట్టుబడి అంశాలు ఈ కారణంగా నిరంతరాయంగా మారుతూ ఉంటాయి. సరుకు మార్కెట్ నుంచి నిరంతరాయంగా అవి ఉపసంహరించబడి, మళ్ళీ అంతే నియమిత కాలాల్లో ఉత్పత్తి ప్రక్రియ యొక్క కొత్త ఉత్పాదితాలుగా మార్కెట్‌లోకి ప్రవేశిస్తుంటాయి.

వ్యాపార పెట్టుబడి అన్నది నిరంతరం రూప పరివర్తనా ప్రక్రియలో ఉంటూ, చలామణి రంగంచేత ఆవరించబడి, మార్కెట్‌లో నిరంతరాయంగా కన్పించే ఈ చలామణి పెట్టుబడిలోని ఒక భాగపు మారిన రూపం తప్ప మరొకటి కాదు. మనం ఒక భాగం అనటానికి కారణం, సరుకుల క్రయ విక్రయాలలో ఒక భాగం ఎప్పుడూ పారిశ్రామిక పెట్టుబడిదారుల మధ్య నేరుగా జరగడమే. ఈ విశ్లేషణలో ఈ భాగాన్ని మనం మొత్తంగా పరిశీలన నుంచి తొలగిద్దాం. ఎందుకంటే వ్యాపారి పెట్టుబడి ప్రత్యేక స్వభావాన్ని అర్థం చేసుకోవటానికి గానీ, ఆ భావనను నిర్వచించటానికి గానీ ఇది ఎంతమాత్రమూ తోడ్పడదు. అంతేకాక ఈ అంశాన్ని రెండో సంపుటంలో క్షుణ్ణంగా పరిశీలించటం జరిగింది.

సరుకుల వ్యాపారి సాధారణంగా ఒక పెట్టుబడిదారుగా మార్కెట్‌లో ప్రధానంగా నిర్దిష్టమైన డబ్బు మొత్తానికి ప్రతినిధిగా ప్రత్యక్షమవుతాడు. అతడు ఆ డబ్బును పెట్టుబడిదారుగా అడ్వాన్సు

చేస్తాడు. అంటే, దానినతడు 'క' నుంచి (దాని తొలి విలువ) క+△క గా (తొలి విలువ+లాభం) మార్చాలనుకొంటాడు. అతడు ఏదో ఒక పెట్టుబడిదారుడు కాడు. సరుకులను కొనే ఒక ప్రత్యేక వ్యాపారి కనుక, సరుకులను ఉత్పత్తి చేయడు కనుక, తన పెట్టుబడి మార్కెట్లో మొదట డబ్బు పెట్టుబడి రూపంలో ప్రవేశించాలన్న సంగతి అతనికి తెలుసు. అతను కేవలం వాటితో వ్యాపారం చేస్తాడు. వాటి గమనాలను త్వరితం చేస్తాడు. వాటితో వ్యాపారం చేయాలంటే ముందు వాటిని కొనాలి. కనుక తన చేతిలో డబ్బు పెట్టుబడి ఉండాలి.

ఒక సరుకుల వ్యాపారి దగ్గర 3 వేల పౌండ్లు ఉన్నాయనుకొందాం. దానినతడు వ్యాపార పెట్టుబడిగా మదుపు పెట్టాడు. గజం రెండు షిల్లింగ్‌ల చొప్పున వస్త్రాల ఉత్పత్తిదారు నుంచి 30 వేల గజాల వస్త్రాన్ని అతడు కొన్నాడు. అతడు ఆ 30 వేల గజాల్ని అమ్మాడనుకొందాం. వార్షిక సగటు లాభం రేటు 10% అనుకొంటే, ఖర్చులన్నీ పోగా ఏడాది చివర అతడు తన 3 వేల పౌండ్లను 3,300 పౌండ్లుగా మార్చగల్గుతాడు. అతడు ఈ లాభాన్ని ఎలా పొందుతాడు అన్న అంశాన్ని తర్వాత చర్చిద్దాం. ప్రస్తుతానికి, అతని పెట్టుబడి గమన క్రమాల రూపాన్ని మాత్రమే మనం పరిశీలిద్దాం. అతని 3000 పౌండ్లతో వస్త్రాల్ని కొంటూ అమ్ముతూ ఉంటాడు. అతను నిరంతరాయంగా పునరావృత్తం చేసే, అమ్మడం కోసం కొనే ఈ క్రియ, అంటే డ–స–డ ప్రక్రియ, చలామణి ప్రక్రియకే పూర్తిగా పరిమితమైనటువంటిది. అలాగే దాని సొంత గమనానికి, విధికి బయట ఉండే ఉత్పత్తి ప్రక్రియలోని విరామాలచే భగ్నం కానటువంటి పెట్టుబడి సరళరూపమిది.

పారిశ్రామిక పెట్టుబడి అస్థిర రూపంగా సరుకు పెట్టుబడితో ఈ వాణిజ్య పెట్టుబడికి ఉన్న సంబంధం ఏమిటి? వస్త్రాల ఉత్పత్తిదారునికి సంబంధించినంత వరకు తన వస్త్రం యొక్క విలువను వ్యాపారి డబ్బుతో తిరిగి రాబట్టాడు. తన సరుకు పెట్టుబడి రూప పరివర్తనలో మొదటి దశను అతను పూర్తి చేశాడు. అంటే దాన్ని డబ్బుగా మార్చగలిగాడు. మిగిలిన అంశాలన్నీ యథాతథంగా ఉంటే, అతను ఈ డబ్బును తిరిగి నూలు, బొగ్గు, వేతనాలు మొదలయినవాటిగానూ, తన ఆదాయాన్ని వినిమయం చేయటం కోసం జీవనాధారాలుగా మార్చటానికి అతడు సిద్ధం కావచ్చు. ఆదాయపు వ్యయాన్ని మినహాయిద్దాం. పోతే అతడు తన పునరుత్పత్తి ప్రక్రియను కొనసాగించవచ్చునన్నమాట.

కాని, ఒక ఉత్పత్తిదారునిగా తన వస్త్ర విక్రయం ద్వారా అది డబ్బుగా మారటం జరిగింది. అయితే వస్త్రం ఇంకా డబ్బుగా రూప పరివర్తన చెందలేదు. అది మార్కెట్‌లో తన మొదటి రూప పరివర్తన కోసం, సరుకు పెట్టుబడిగా అమ్మబడటం కోసం ఎదురుచూస్తుంది. యజమాని మారటం తప్ప ఈ వస్త్రానికి ఏ మార్పు జరగలేదు. దాని లక్ష్యాన్ని బట్టి చూసినా, ప్రక్రియలో దాని స్థానాన్ని బట్టి చూసినా అది ఇంకా సరుకు పెట్టుబడే, అమ్మదగిన సరుకే. తేడా ఒక్కటే, అది ఇప్పుడు ఉత్పత్తిదారుని చేతుల్లోగాక, వ్యాపారి చేతుల్లో ఉంది. దాని అమ్మే క్రియ, దాని రూప పరివర్తన మొదటి దశను సాధించే పని ఉత్పత్తిదారుని నుంచి వ్యాపారికి మారింది. అది వ్యాపారి యొక్క ఒక ప్రత్యేకమైన వ్యవహారంగా మారింది. కాగా ఇంతకు ముందు, ఉత్పత్తిదారుడే ఉత్పత్తి పూర్తయిన తరువాత ఈ విధిని కూడా తానే స్వయంగా నిర్వహించేవాడు.

3 వేల పౌండ్ల విలువ గల మరో 30,000 గజాల వస్త్రాన్ని, వస్త్ర ఉత్పత్తిదారు మార్కెట్‌కు తేవడానికి పట్టే కాలంలోగా ముప్పై వేల గజాల వస్త్రాన్ని అమ్మలేకపోయాడనుకొందాం. మార్కెట్‌లోకి

వచ్చిన వస్త్రాన్ని వ్యాపారి కొత్తగా కొనలేడు. ఎందుకంటే అతని దగ్గర ఇంకా డబ్బు పెట్టుబడిగా మారని 30 వేల గజాల వస్త్రం నిల్వ ఉంది. ఇలా ఆగిపోవడం వల్ల పునరుత్పత్తికి అంతరాయం కలుగుతుంది. అయితే వస్త్ర ఉత్పత్తిదారుని దగ్గర అదనంగా డబ్బు పెట్టుబడి ఉండి ఉండవచ్చు. 30 వేల గజాల వస్త్రం అమ్మకంతో ప్రమేయం లేకుండా, ఉత్పత్తి ప్రక్రియను కొనసాగించడం కోసం, ఉత్పాదక పెట్టుబడిగా దాని నతడు మార్చగలడు. కాని దీనివల్ల పరిస్థితిలో మార్పు రాదు. మార్కెట్‌లో నిలబడిపోయిన 30 వేల గజాల వస్త్రానికి సంబంధించిన మేరకు దాని పునరుత్పత్తి ప్రక్రియకు అంతరాయం కలిగింది. వ్యాపారం చర్యలు ఉత్పత్తిదారుని సరుకు పెట్టుబడిని ఎలాగైనా డబ్బుగా మార్చడానికి నిర్వహించి తీరవలసిన చర్యలు తప్ప మరొకటి కాదని ఇక్కడ స్పష్టమవుతోంది. చెలామణి, పునరుత్పత్తి ప్రక్రియలలో సరుకు పెట్టుబడి విధులు నిర్వహింపబడేలా చేసే చర్యలివి. ఒక స్వతంత్ర వ్యాపారికి బదులు ఈ క్రయ విక్రయాలను నిర్వహించే పని – ప్రత్యేకంగా ఉత్పత్తిదారుని గుమాస్తాపై పడినప్పటికీ, ఈ సంబంధం ఒక్క క్షణం కూడా కనుమరుగు కాదు.

కనుక వ్యాపార పెట్టుబడి అన్నది డబ్బుగా పరివర్తన చెందే ప్రక్రియకి లోనుకావలసిన ఉత్పత్తిదారుని సరుకుకు పెట్టుబడి తప్ప మరొకటి కాదు. (మార్కెట్‌లో అది సరుకు పెట్టుబడి విధిని నిర్వహించటానికి ఇది అవసరం.) తేడా ఒకటే, ఉత్పత్తిదారుని యొక్క ఒక సందర్భోచితమైన విధికి ప్రాతినిధ్యం వహించటానికి బదులు ఒక ప్రత్యేక తరహా పెట్టుబడిదారుని, ఒక వర్తకుని ప్రత్యేకమైన విధిగా అది ఇప్పుడు తారసపడుతుంది. పెట్టుబడి యొక్క ప్రత్యేక మదుపుకు సంబంధించిన వ్యవహారంగా అది వేరుచేయబడుతుంది.

వ్యాపార పెట్టుబడి చలామణి యొక్క ప్రత్యేక రూపంలో ఇది మరింత స్పష్టమవుతుంది. వ్యాపారి సరుకుని కొని, అమ్ముతాడు. అది డ–స–డ' సరుకుల సాదా చలామణిలో, పారిశ్రామిక పెట్టుబడి చలామణి ప్రక్రియలో కనిపించే సరుకుల చలామణిలో సైతం, అంటే స'–డ–సలో సైతం చలామణి అన్నది, ప్రతి డబ్బు మొత్తమూ రెండుసార్లు చేతులు మారటం ద్వారా జరుగుతుంది. వస్త్రాల ఉత్పత్తిదారు తన సరుకును అంటే వస్త్రాన్ని అమ్మి దానిని డబ్బుగా మారుస్తాడు. కొనుగోలు దారుని డబ్బు అతని చేతుల్లోకి వస్తుంది. అదే డబ్బుతోనే అతడు నూలు, బొగ్గు, శ్రమ, వగైరాలను కొంటాడు. ఆ వస్త్రపు విలువను తిరిగి సరుకులుగా మార్చడం కోసం, వస్తువు ఉత్పాదనలు అంశాలుగా మార్చటం కోసం ఆ డబ్బును వెచ్చిస్తాడు. అతడు కొనే సరుకు అతడు అమ్మే సరుకు లాంటిది కాదు. అతడు ఉత్పాదితాలను అమ్మి, ఉత్పత్తి సాధనాలను కొన్నాడు. అయితే వ్యాపారి పెట్టుబడి గమన క్రమాల విషయంలో ఇది భిన్నంగా ఉంటుంది. వ్యాపారి తన 3000 పౌండ్లతో 30,000 గజాల వస్త్రాన్ని కొంటాడు. తన డబ్బు పెట్టుబడిని (3,000 పౌండ్లు + లాభం) చలామణి నుంచి తిరిగి రాబట్టడం కోసం అదే 30,000 గజాల్ని అమ్ముతాడు. ఇక్కడ రెండుసార్లు స్థానం మారేది ఒకే సరుకు. అంతే తప్ప డబ్బు నాణేలు కాదు. ఈ సరుకు అమ్మకందారుని చేతుల్నించి కొనుగోలుదారుల చేతుల్లోకి వస్తుంది. ఇపుడు అమ్మకందారునిగా మారిన కొనుగోలుదారుని నుంచి మరో కొనుగోలుదారు నికి పోతుంది. అది రెండుసార్లు అమ్మబడింది. వర్తకుల పరంపర ద్వారా అది పదేపదే అమ్మబడవచ్చు. పదే పదే జరిగే ఈ అమ్మకం ద్వారానే ఒకే సరుకు రెండుసార్లు స్థాన మార్పిడి ద్వారానే మొదటి కొనుగోలుదారుడు అడ్వాన్సు చేసిన డబ్బు తిరిగి రాబట్టడం జరిగింది. అతని డబ్బు అతనికి తిరిగి

వచ్చింది. ఒక సందర్భంలో స–డ–స ఒకే డబ్బును రెండుసార్లు స్థానం మారేలా చేస్తుంది. ఒక రూపంలో సరుకు అమ్మకం, మరో రూపంలో సరుకు కొనుగోలు నిర్వహింపబడేలా చేస్తుంది. మరో సందర్భంలో స–డ–స' ఒకే సరుకు రెండుసార్లు స్థానం మారేలా చేస్తుంది. అడ్వాన్సు చేసిన డబ్బును చలామణి నుంచి ఉపసంహరిస్తుంది. ఉత్పత్తిదారుని నుంచి వ్యాపారి చేతుల్లోకి మారినపుడు సరుకు తుదిసారిగా అమ్మబడలేదన్నది స్పష్టం. ఎందుకంటే వ్యాపారి కేవలం అమ్మే క్రియను నిర్వహిస్తాడు. లేదా సరుకు పెట్టుబడి విధి నిర్వహిస్తాడు. అయితే అదే సమయంలో ఒక విషయం స్పష్టంగా కనిపిస్తోంది. ఉత్పాదక పెట్టుబడిదారునికి స–డ అనేది సరుకు పెట్టుబడి యొక్క పరివర్తనా రూపంలో తన పెట్టుబడి నిర్వహించే విధి మాత్రమే. అయితే ఇది వ్యాపారికి డ–స–డ' అవుతోంది; అనగా అతను ముందస్తుగా పెట్టిన డబ్బు పెట్టుబడి విలువలో ప్రత్యేకమైన పెరుగుదల అవుతోంది. సరుకుల పరివర్తన యొక్క ఒక దశ ఇక్కడ వ్యాపారి విషయంలో డ–స–డ' రూపంలో కనిపిస్తుంది. అనగా ఒక ప్రత్యేక తరహా పెట్టుబడి పరిణామ క్రమంగా కన్పిస్తుంది.

తుదకు వ్యాపారి తన సరుకును అమ్ముతాడు. అంటే ఒక వినియోగదారునికి వస్త్రాన్ని అమ్ముతాడు. అతడు ఒక ఉత్పాదక వినియోగదారుడు కావచ్చు (ఉదాహరణకు బ్లీచర్) లేదా తన సొంత వినియోగానికి వస్త్రం కొనుక్కునే వ్యక్తి కావచ్చు. ఆ రకంగా వ్యాపారి తాను ముందుగా పెట్టిన పెట్టుబడిని (లాభంతో) తిరిగి పొందుతాడు. అతడు ఈ చర్యని పునరావృత్తం చేయవచ్చు. వస్త్రాన్ని కొనటంలో డబ్బు కేవలం చెల్లింపు సాధనంగా ఉపయోగపడి ఉంటే, పర్యవసానంగా వ్యాపారి ఆరు వారాల తర్వాతనే చెల్లించాల్సి ఉంటే, ఈ వ్యవధిలోగా అతడు అమ్మగల్గినపుడు వస్త్రాల ఉత్పత్తిదారునికి తన సొంత డబ్బు పెట్టుబడిని ముందుగా పెట్టాల్సిన అవసరం లేకుండానే చెల్లించగల్గుతాడు. దానినతడు అమ్మలేకపోయి ఉంటే, వస్త్రం తనకు అందినప్పుడు కాక గడువు అయిపోయిన రోజున 3 వేల పౌండ్లను అడ్వాన్సు చేయాల్సి ఉంటుంది. మార్కెట్ ధరలు పడిపోవటం వల్ల అతడు కొనుగోలు ధర కంటే తక్కువకు అమ్మాల్సివస్తే ఆ లోటును అతడు తన సొంత పెట్టుబడితో పూడ్చాల్సి ఉంటుంది.

తన సరుకును తానే అమ్ముకునే ఉత్పత్తిదారుని చేతిలో వ్యాపార పెట్టుబడి చలామణి రంగంలో ఉండగా పునరుత్పత్తి ప్రక్రియలోని ఒక ప్రత్యేక దశలో అతని పెట్టుబడి యొక్క ప్రత్యేక రూపం మాత్రమే అన్నది స్పష్టం. కాగా ఈ వ్యాపార పెట్టుబడి స్వతంత్రంగా వ్యవహరించే పెట్టుబడి స్వభావాన్ని సంతరిస్తున్న అంశమేమిటి?

**మొదటిది :** ఉత్పత్తిదారుడు కాక వేరే ఏజెంట్ చేతుల్లో సరుకు పెట్టుబడి అంతిమంగా డబ్బు రూపంలోకి మారటం, అది తన తొలి రూపాంతరాన్ని నిర్వహించడం, అంటే, సరుకు పెట్టుబడిగా మార్కెట్‌లో తనకు తగిన పాత్రను నిర్వహించడం. సరుకు పెట్టుబడి యొక్క ఈ విధి వ్యాపారిచేత అతని కార్యకలాపాల్లో, అంటే అమ్మకం కొనుగోళ్ళలో నిర్వహించబడటం, పర్యవసానంగా ఈ కార్యకలాపాలు పారిశ్రామిక పెట్టుబడి యొక్క ఇతర క్రియల కంటే భిన్నమైన ప్రత్యేకమైన ప్రక్రియలుగా, కనుక ఒక స్వతంత్ర సంస్థ కార్యకలాపాలుగా కనిపించడం అన్న వాస్తవం. సామాజిక శ్రమ విభజనలో ఇది ఒక ప్రత్యేకమైన రూపం. పెట్టుబడి పునరుత్పత్తి ప్రక్రియలోని ఒక ప్రత్యేక దశలో – ఈ సందర్భంలో చలామణి రంగంలో నిర్వహించబడే సాధారణ విధిలో ఒక భాగం; ఉత్పత్తిదారుని కంటే భిన్నమైన ప్రత్యేక చలామణి ఏజెంట్‌కు చెందిన ప్రత్యేక విధిగా కనిపిస్తుంది. అయితే ఇది

మాత్రమే పునరుత్పత్తి ప్రక్రియలో నిమగ్నమైన పారిశ్రామిక పెట్టుబడిని భిన్నమైన, స్వతంత్రమైన ఒక ప్రత్యేక పెట్టుబడి నిర్వహించే ప్రత్యేక విధి లక్షణాన్ని ఈ ప్రత్యేక వ్యవహారానికి ఇవ్వదు. వ్యాపారం సేల్స్‌మేన్‌చేత లేదా పారిశ్రామిక పెట్టుబడిదారుని ఇతర ప్రత్యక్ష ఏజెంట్లచేత – నిర్వహించబడినపుడు అలా కనిపించనే కనిపించదు. కనుక రెండో అంశం ఇందులో ఇమిడి ఉండాలి.

**రెండవది :** ఒక స్వతంత్ర చలామణి ఏజెంట్‌గా వర్తకుడు డబ్బు పెట్టుబడిని (తన సొంత లేదా అప్పుకి తీసుకొన్న పెట్టుబడి) అడ్వాన్స్ చేస్తాడు – అన్న వాస్తవం నుంచి ఇది తలయెత్తుతుంది. పునరుత్పత్తి ప్రక్రియలో పారిశ్రామిక పెట్టుబడి లావాదేవీ, కేవలం స–డగా ఉంది; అంటే సరుకు పెట్టుబడి డబ్బు పెట్టుబడిగా మారటంగా లేదా కేవలం అమ్మకంగా ఉంది. ఇది వర్తకుని విషయంలో డ–స–డ' రూపం, అంటే ఒకే సరుకు క్రయ విక్రయాల రూపాన్ని ధరిస్తుంది. ఆ విధంగా, కొనుగోలులో అతని నుంచి వెళ్ళిపోయిన డబ్బు, పెట్టుబడి అమ్మకంలో అతనికి తిరిగి వస్తుంది.

సరుకు పెట్టుబడి డబ్బు పెట్టుబడిగా మారటం, స–డ అన్నది, వర్తకుని విషయంలో సరుకులను వాటి ఉత్పత్తిదారుల నుంచి కొనుగోలు చేయటానికి పెట్టుబడిని అడ్వాన్సు చేసిన మేరకు డ–స–డ' రూపం తీసుకొంటుంది. అది సరుకు పెట్టుబడి మొదటి రూపాంతరం అయినప్పటికీ ఉత్పత్తిదారునికి, లేదా పునరుత్పత్తి ప్రక్రియలోని పారిశ్రామిక పెట్టుబడికీ, లావాదేవీ డ–సగా, డబ్బు సరుకులుగా, (ఉత్పత్తి సాధనాలుగా) తిరిగి మారడం కావచ్చు. అనగా రూప పరివర్తనలోని రెండో దశ కావచ్చు. వస్త్రాల ఉత్పత్తిదారునికి మొదటి రూపాంతరం స–డ, అతని సరుకు పెట్టుబడి, డబ్బు పెట్టుబడిగా మారటం. అదే చర్య వర్తకునికి డ–సగా, అతని డబ్బు పెట్టుబడి సరుకు పెట్టుబడిగా మారటంగా కన్పిస్తుంది. దీనిని అతడు ఒక బ్లీచర్‌కి అమ్మితే బ్లీచర్ దృష్టి నుంచి అది డ–సగా, డబ్బు పెట్టుబడి నుంచి ఉత్పాదక పెట్టుబడిగా మారటంగా కన్పిస్తుంది. కాగా వ్యాపారికి అది స–డగా అనగా అతను కొన్న వస్త్రం అమ్ముడైందని అర్థం. అయితే నిజానికి వస్త్ర ఉత్పత్తిదారు యొక్క సరుకు పెట్టుబడి అంతిమంగా అమ్మబడింది ఈ దశలోనే. మరోలా చెప్పాలంటే వర్తకుని యొక్క ఈ డ–స–డ ఇద్దరు ఉత్పత్తిదారుల మధ్య స–డకై ఒక వర్తకుడు నిర్వహించిన మధ్యవర్తి పాత్ర తప్ప వేరుకాదు. వస్త్రాల ఉత్పత్తిదారు అమ్మిన వస్త్రాల విలువలో ఒక భాగంలో నూలు వ్యాపారి దగ్గర నూలు కొన్నాడనుకొందాం. అది అతని దృష్టిలో డ–స అయితే, నూలు అమ్ముతున్న వర్తకునికి అది స–డ, నూలును మళ్ళీ అమ్మడమే. ఒక సరుకు పెట్టుబడిగా, నూలు విషయంలో ఇది అంతిమంగా విక్రయించబడినట్టే. తద్వారా అది చలామణి రంగం నుంచి వినిమయ రంగంలోకి వెళ్ళిపోయింది. అంటే దాని మొదటి రూపాంతరీకరణ యొక్క అంతిమ దశ అయిన స–డ మాత్రమే పారిశ్రామిక పెట్టుబడిదారునికి వ్యాపారి అమ్మినా, అతని నుంచి కొన్నా అతని స–డ మాత్రం, అతని వ్యాపార పెట్టుబడి ఆవృత్తి మాత్రం వ్యక్తం చేసేది, కేవలం స–డనే లేదా సరుకు పెట్టుబడి విషయంలో దాని రూపాంతరీకరణ పూర్తిగావటాన్ని మాత్రమే. పునరుత్పత్తి ప్రక్రియలో పారిశ్రామిక పెట్టుబడి యొక్క తాత్కాలిక రూపం ఇది. వ్యాపారి పెట్టుబడి యొక్క డ–స పారిశ్రామిక పెట్టుబడిదారునికి మాత్రమే డ–స అవుతుంది. అంతేగాని అతడు ఉత్పత్తి చేసిన సరుకు పెట్టుబడికి అలా కాదు. పారిశ్రామిక పెట్టుబడిదారుని నుంచి చలామణి ఏజంట్‌కి సరుకు పెట్టుబడి బదిలీ మాత్రమే ఇది. వ్యాపార పెట్టుబడి స–డని పూర్తిచేసేదాకా రంగంలో సరుకు పెట్టుబడి తన చివరి స–డ పాత్ర నిర్వహించదు. డ–స–డ అన్నది

కేవలం ఒకే సరుకు పెట్టుబడి యొక్క రెండు స-డలను సూచిస్తుంది. వరుసగా జరిగే దాని రెండు విక్రయాలను సూచిస్తుంది. తద్వారా దాని చిట్టచివరి అమ్మకం జరుగుతుంది.

ఆ రకంగా వ్యాపార పెట్టుబడిలో సరుకు పెట్టుబడి ఒక స్వతంత్ర తరహా రూపాన్ని సంతరించుకొంటుంది. ఎందుకంటే వర్తకుడు డబ్బు పెట్టుబడిని ముందు పెడతాడు. సరుకు పెట్టుబడి రూపాంతీకరణకు, సరుకు పెట్టుబడిగా దాని విధి నిర్వహణకూ, అంటే డబ్బుగా దాని పరివర్తనకు కేవలం మాధ్యమంగా పనిచేయటం ద్వారా మాత్రమే అది తిరిగి చేతికందుతుంది, పనిచేస్తుంది. నిరంతరాయమైన సరుకుల క్రయ విక్రయాల ద్వారా అది ఈ కార్యం నెరవేరుస్తుంది. ఇది దాని ప్రత్యేకమైన కార్యకలాపం. పారిశ్రామిక పెట్టుబడి చలామణి ప్రక్రియను నిర్వహించే ఈ కార్యకలాపం వ్యాపారి వ్యవహరించే డబ్బు పెట్టుబడి యొక్క ప్రత్యేక కార్యం. ఈ కార్యం ద్వారా అతడు తన డబ్బును డబ్బు పెట్టుబడిగా మారుస్తాడు, తన డ ని డ-స-డ' గా మారుస్తాడు. అదే ప్రక్రియ ద్వారా సరుకు పెట్టుబడిని వ్యాపార పెట్టుబడిగా మారుస్తాడు.

మొత్తం సామాజిక పెట్టుబడి యొక్క పునరుత్పత్తి ప్రక్రియ దృష్టితో చూస్తే; సరుకు పెట్టుబడి రూపంతో ఉన్నంత కాలం వాణిజ్య పెట్టుబడి రూపాంతరం చెందుతున్న దశలో మార్కెట్‌లో సరుకు పెట్టుబడిగా ఉంటూ అలా వ్యవహరించే పారిశ్రామిక పెట్టుబడి యొక్క ఒక భాగం తప్ప మరొకటి కాదు. కనుక వర్తకుడు అడ్వాన్స్ చేసే డబ్బు పెట్టుబడి మాత్రమే క్రయ విక్రయాలకు నిర్దేశించ బడింది. ఈ కారణంగా అది ఎప్పుడూ సరుకు పెట్టుబడి రూపాన్ని లేదా డబ్బు పెట్టుబడి రూపాన్ని మాత్రమే ధరిస్తుంది. ఉత్పాదక పెట్టుబడి రూపాన్ని ఎప్పుడూ ధరించదు. పెట్టుబడి యొక్క చలామణి రంగానికి అది పరిమితమై ఉంటుంది. ఇపుడు పెట్టుబడి యొక్క మొత్తం పునరుత్పత్తి ప్రక్రియ సందర్భంగా పరిశీలించవలసింది ఈ డబ్బు పెట్టుబడినే.

వస్త్రాల ఉత్పత్తిదారుడు తన 30 వేల గజాలను వర్తకునికి 3 వేల పౌండ్లకు అమ్మగానే ఆ సొమ్ముతో అతడు అవసరమైన ఉత్పత్తి సాధనాలను కొంటాడు. ఫలితంగా అతని పెట్టుబడి ఆ రకంగా ఉత్పత్తి ప్రక్రియకు తిరిగి వస్తుంది. అతని ఉత్పత్తి ప్రక్రియ నిరంతరాయంగా కొనసాగుతుంది. అతనికి సంబంధించిన మేరకు అతని సరుకు డబ్బుగా మారటం అన్నది పూర్తయింది. అయితే వస్త్రానికి సంబంధించినంత వరకు దాని రూపాంతరం ఇంకా జరగలేదు. అది ఇంకా అంతిమంగా డబ్బు రూపంలోకి తిరిగి మార్చబడలేదు. ఉత్పాదక లేదా వ్యక్తిగత వినియోగంలోకి ఒక ఉపయోగ విలువగా అది ప్రవేశించలేదు. ఇంతకు ముందు వస్త్రాల ఉత్పత్తిదారు ప్రాతినిధ్యం వహించిన సరుకు పెట్టుబడికి ఇపుడు మార్కెట్‌లో వస్త్రాల వ్యాపారి ప్రాతినిధ్యం వహిస్తాడు. ఉత్పత్తిదారుని రూపాంతర ప్రక్రియ ఆగిపోయింది. అది వ్యాపారి చేతుల్లో కొనసాగుతుంది.

ఉత్పత్తిదారు తన వస్త్రం సరుకుగా ఉండటం అంతం అయ్యే వరకూ, చివరి కొనుగోలు దారుని ఉత్పాదక, లేదా వ్యక్తిగత వినియోగదారునికి అది చేరేవరకూ వేచి ఉండాల్సి వస్తే, అతని పునరుత్పత్తి ప్రక్రియకు అంతరాయం ఏర్పడి ఉండేది. లేదా దానిని నిరోధించటానికి తన కార్యకలాపాలను పరిమితం చేసుకోవాల్సి వచ్చేది. వస్త్రంలో ఇంతకు ముందుకంటే చిన్న భాగాన్ని నూలుగా, బొగ్గుగా, శ్రమ వగైరాలుగా మార్చటానికి – ఒక్క ముక్కలో చెప్పాలంటే – ఉత్పాదక పెట్టుబడి అంశాలుగా మార్చటానికి, అందులో ఎక్కువ భాగాన్ని డబ్బు నిల్వగా ఉంచాల్సి వచ్చేది. ఆ

రకంగా అతని పెట్టుబడిలో ఒక భాగం మార్కెట్లో సరుకుల రూపంలోనూ, మరో భాగం ఉత్పత్తి ప్రక్రియలోనూ ఉండేది. మార్కెట్లో సరుకుల రూపంలో ఒక భాగం ఉండగా మరో భాగం డబ్బుగా తిరిగి వచ్చేది. అయితే అతని పెట్టుబడి ఇలా విభజించబడటం అన్నది వ్యాపారి జోక్యం వల్ల రద్దు కాదు. అయితే ఆ జోక్యం లేకపోతే చలామణి పెట్టుబడిలోని డబ్బు నిల్వ భాగం – ఉత్పాదక పెట్టుబడి రూపంలో నియుక్తమైన భాగంతో పోలిస్తే ఎల్లప్పుడూ ఎక్కువగా ఉండాల్సివచ్చేది. పునరుత్పత్తి స్థాయిని కూడా దానినిబట్టి పరిమితం చేయాల్సి వచ్చేది. దానికి బదులుగా వాస్తవ ఉత్పత్తి ప్రక్రియలో, తన పెట్టుబడితో ఎక్కువ భాగాన్ని, డబ్బు నిల్వ రూపంతో తక్కువ భాగాన్ని కేటాయించడానికి, ఉత్పత్తిదారునికి వీలు చిక్కింది.

మరోవైపున సామాజిక పెట్టుబడిలో మరో భాగం వ్యాపారి పెట్టుబడి రూపంలో నిరంతరాయంగా చలామణి రంగంలో ఉంది. ఇది ఎల్లప్పుడూ కేవలం క్రయ విక్రయాల కోసమే వినియోగమైంది. కనుక తమ చేతుల్లో ఈ పెట్టుబడి ఉన్న వ్యక్తుల సంబంధమైన మార్పు తప్ప మరేమీ జరగలేదని కనిపిస్తుంది.

3 వేల పౌండ్ల విలువైన వస్త్రాలను కొనటానికి బదులు వర్తకుడు ఈ సొమ్మును ఉత్పాదకంగా వినియోగించి ఉంటే సమాజం యొక్క ఉత్పాదక పెట్టుబడి పెరిగి ఉండేది. నిజమే. వస్త్రాల ఉత్పత్తిదారు తన పెట్టుబడిలో మరింత పెద్ద భాగాన్ని డబ్బు నిల్వగా తన దగ్గర పెట్టుకోవాల్సి వచ్చేది. పారిశ్రామిక పెట్టుబడిదారునిగా ఇపుడు మారిన వర్తకునికీ ఇదే వర్తిస్తుంది. కాని వర్తకుడు వర్తకుడుగానే ఉంటే ఉత్పత్తిదారుడు అమ్మకం కోసం వెచ్చించవలసి వచ్చే తన సమయాన్ని పొదుపు చేసుకొంటాడు. దాన్ని అతడు తన ఉత్పత్తి ప్రక్రియను అజమాయిషీ చేయటానికి ఉపయోగించుకోవచ్చు. వర్తకుడేమో తన కాలమంతటినీ అమ్మకానికే వెచ్చించాలి.

వ్యాపారి పెట్టుబడి అవసరమైన తన నిష్పత్తులను అధిగమించకపోతే దాని ఫలితార్థం ఈ క్రింది విధంగా ఉంటుంది.

1. శ్రమ విభజన కారణంగా క్రయ విక్రయాలకే పరిమితమైన పెట్టుబడి (కేవలం సరుకులను కొనడానికి అవసరమైన డబ్బు మాత్రమే కాక, వ్యాపారి తన సంస్థను నిర్వహించటానికి శ్రమపై మదుపు పెట్టడానికి అవసరమైన డబ్బు, గిడ్డంగులు, రవాణా మొదలైన స్థిర పెట్టుబడులు కూడా ఇందులో చేరి ఉంటాయి.) పారిశ్రామిక పెట్టుబడిదారు తప్పనిసరిగా వాణిజ్య వ్యవహారాలను కూడా తానే నిర్వహించుకోవలసినపుడు పెట్టే పెట్టుబడికంటే తక్కువగా ఉంది;
2. వ్యాపారి తన సమయాన్నంతటినీ ఈ వాణిజ్యానికి కేటాయిస్తాడు. కనుక ఉత్పత్తిదారు తన సరుకుల్ని మరింత శీఘ్రంగా డబ్బు రూపంలోకి మార్చుకోగలడు. అంతేకాక, ఉత్పత్తిదారుని చేతుల్లో కంటే సరుకు పెట్టుబడి తన రూపాంతరీకరణను మరింత శీఘ్రంగా గడిచిపోతుంది;
3. పారిశ్రామిక పెట్టుబడితో గల సంబంధం దృష్ట్యా మొత్తం వ్యాపార పెట్టుబడిని చూస్తే, వ్యాపారి పెట్టుబడి యొక్క ఒక టర్నోవర్ ఒక ఉత్పత్తి రంగంలోని అనేక పెట్టుబడుల టర్నోవర్లకు మాత్రమే కాక విభిన్న ఉత్పత్తి రంగాలలోని అనేక పెట్టుబడుల టర్నోవర్లకు ప్రాతినిధ్యం వహించవచ్చు. ఉదాహరణకు, ఒక వస్త్రాల వ్యాపారి తన మూడు వేల పౌండ్లతో ఒక

వస్త్రాల ఉత్పత్తిదారుని నుంచి కొని, ఆ ఉత్పత్తిదారుడు మరోసారి అంతే పరిమాణం గల వస్త్రాన్ని మార్కెట్‌కు తెచ్చేలోగా అమ్మేయగల్గితే, ఆ వ్యాపారి అపుడు మరో ఉత్పత్తిదారుని లేదా అనేకమంది ఉత్పత్తిదారుల సరుకుని ఈలోగా కొని, అమ్మగల్గుతాడు. ఆ రకంగా ఒకే ఉత్పత్తి రంగంలో విభిన్న పెట్టుబడుల టర్నోవర్‌ను అతడు నిర్వహిస్తాడు. వ్యాపారి తన వస్త్రాన్ని అమ్మిన తర్వాత ఆ డబ్బుతో పట్టును కొన్నాడనుకొందాం. అపుడతడు మరో ఉత్పత్తి రంగంలో పెట్టుబడి టర్నోవర్‌ని సాధిస్తాడు.

సాధారణంగా, పారిశ్రామిక పెట్టుబడి టర్నోవర్ చలామణి అనేది కాలంచేత మాత్రమే కాక ఉత్పత్తి కాలంచేత కూడా నిర్ణయించబడుతుందని గమనించాలి. ఒక తరహా సరుకుతో వ్యవహరిస్తున్న వర్తకుని పెట్టుబడి టర్నోవర్, కేవలం ఒక పారిశ్రామిక పెట్టుబడి టర్నోవర్‌చేత కాక – అదే ఉత్పత్తి శాఖలో ఉన్న పారిశ్రామిక పెట్టుబడులన్నింటి టర్నోవర్లచేత నిర్ణయించబడుతుంది. వర్తకుడు ఒక ఉత్పత్తిదారుని వస్త్రాన్ని అమ్మిన తర్వాత ఆ ఉత్పత్తిదారు మరో విడత తన సరుకును మార్కెట్లోకి తేవటానికి ముందే మరొకరి దగ్గర కూడా కొని, అమ్మగలడు. అది వర్తకుని పెట్టుబడి ఒక ఉత్పత్తి శాఖలో మదుపుపెట్టిన విభిన్న పెట్టుబడుల టర్నోవర్‌లను పెంపొందించవచ్చు. కనుక దాని టర్నోవర్ ఒకే పారిశ్రామిక పెట్టుబడి టర్నోవర్లతో సమానం కాదు. కనుక ఆ పారిశ్రామిక పెట్టుబడిదారు తన వద్ద ఉంచుకోవలసి వచ్చే ఒకే ఒక డబ్బు నిల్వను మాత్రమే అది భర్తీ చేయదు. ఒక ఉత్పత్తి రంగంలో వర్తకుని పెట్టుబడి యొక్క టర్నోవర్ ఆ రంగంలో మొత్తం ఉత్పత్తిచేత సహజంగానే పరిమితమవుతుంది. అదే రంగానికి చెందిన ఏదో ఒక పెట్టుబడి ఉత్పత్తి స్థాయినిబట్టి కానీ, దాని టర్నోవర్ కాలాన్నిబట్టి కానీ నిర్ణయించబడదు. దాని టర్నోవర్ కాలం, దాని ఉత్పత్తి కాలంచేత నిర్ణీతమైన మేరకు ఇది వర్తిస్తుంది. ఉదాహరణకు క ఒక సరుకును సరఫరా చేస్తాడు. దాని ఉత్పత్తికి పట్టేది మూడు నెలలు. వర్తకుడు దానిని కొని, అమ్మటానికి ఒక నెలరోజులు పడుతుంది అనుకొందాం. అపుడు మరో ఉత్పత్తిదారుని దగ్గర అదే ఉత్పాదితాన్ని అతడు కొని, అమ్మగల్గుతాడు. లేదా ఒక రైతు దగ్గర ధాన్యం కొని, అమ్మిన తర్వాత అదే డబ్బుతో మరో రైతు దగ్గర కూడా ధాన్యం కొని, అమ్మ గల్గుతాడు. అతని పెట్టుబడి టర్నోవర్ ఒక నిర్ణీత కాలంలో, ఉదాహరణకు ఒక ఏడాదిలో అతడు వరుసగా కొని, అమ్మగల్గిన ధాన్యం పరిమాణంపైన ఆధారపడి ఉంటుంది. కానీ టర్నోవర్ కాలంతో ప్రమేయం లేకుండా రైతు పెట్టుబడి టర్నోవర్ మాత్రం ఉత్పత్తి కాలంచేత నిర్ణయించబడుతుంది. ఈ ఉత్పత్తి కాలం సహజంగానే ఒక సంవత్సరం.

ఐతే అదే వర్తకుని పెట్టుబడి టర్నోవర్ వివిధ ఉత్పత్తి శాఖల్లో ఉన్న పెట్టుబడుల టర్నోవర్‌లను పై విధంగా ప్రభావితం చెయ్యొచ్చు.

విభిన్న సరుకు పెట్టుబడులను వరుసగా డబ్బుగా మార్చటానికి విభిన్న టర్నోవర్‌లతో అదే వర్తకుని పెట్టుబడి తోడ్పడిన మేరకు, వాటిని ఒకదాని తర్వాత ఒకటి కొని, అమ్మటానికి తోడ్పడిన మేరకు, సాధారణంగా డబ్బు తన అనేక టర్నోవర్‌ల ద్వారా ఒక నిర్ణీత కాలంలో సరుకుల విషయంలో వ్యవహరించినట్టుగానే వర్తకుని పెట్టుబడి కూడా సరుకు పెట్టుబడి విషయంలో డబ్బు పెట్టుబడిగా వ్యవహరిస్తుంది.

వర్తకుని పెట్టుబడి టర్నోవర్ అదే పరిమాణంలో ఉన్న పారిశ్రామిక పెట్టుబడి టర్నోవర్‌తో

గానీ, పునరుత్పత్తితో గానీ సర్వసమానం కాదు. అటువంటి కొన్ని పారిశ్రామిక పెట్టుబడుల టర్నోవర్‌ల మొత్తంతో అది సమానం. ఆ పెట్టుబడులు ఒకే శాఖలో ఉండవచ్చు లేదా విభిన్న ఉత్పత్తి శాఖలలో ఉండి ఉండవచ్చు. వర్తకుని పెట్టుబడి టర్నోవర్ ఎంత శీఘ్రంగా జరిగితే మొత్తం డబ్బు పెట్టుబడిలో – వర్తకుని పెట్టుబడిగా వ్యవహరించే భాగం, అంత చిన్నదిగా ఉంటుంది. అలా కాక టర్నోవర్ ఎంత నెమ్మదిగా జరిగితే ఈ పెట్టుబడి భాగం అంత పెద్దదిగా ఉంటుంది. ఉత్పత్తి ఎంత తక్కువ అభివృద్ధి చెందితే వర్తకుని పెట్టుబడి చలామణిలోకి నెట్టే సరుకుల మొత్తంతో పోలిస్తే అంత పెద్దదిగా ఉంటుంది. కానీ నిరపేక్షంగా లేక మరింత అభివృద్ధి చెందిన పరిస్థితితో పోల్చినపుడు వర్తకుని పెట్టుబడి ఆ మేరకు చిన్నదవుతుంది. దీన్ని తిరగేసి చెప్తే ఉత్పత్తి ఎంత ఎక్కువ అభివృద్ధి చెందితే వర్తకుని పెట్టుబడి, చలామణిలోకి వచ్చి సరుకుల మొత్తంతో పోలిస్తే అంత చిన్నదిగా ఉంటుంది. కానీ, నిరపేక్షంగా లేక తక్కువ అభివృద్ధి చెందిన పరిస్థితులతో పోల్చినపుడు ఆ మేరకు అది పెద్దదిగా ఉంటుంది. కనుక అటువంటి బడుగు పరిస్థితులలో వాస్తవ డబ్బు పెట్టుబడితో అధిక భాగం వర్తకుల చేతుల్లో ఉంటుంది. వారి సంపద మిగిలినవారి స్థితికి విరుద్ధంగా డబ్బు సంపదగానే ఉంటుంది.

వర్తకుడు ముందుగా పెట్టిన డబ్బు పెట్టుబడి వేగం రెండు అంశాల మీద ఆధారపడి ఉంటుంది. 1) ఉత్పత్తి ప్రక్రియ పునరుద్ధరింపబడే వేగంపైన, విభిన్న ఉత్పత్తి ప్రకియలు, ఒకదానితో ఒకటి జోడింపబడే వేగంపైన ఆధారపడి ఉంటుంది. 2) వినియోగ వేగంపైన ఆధారపడి ఉంటుంది.

మనం పైన పరిశీలించిన టర్నోవర్ పూర్తి చేయటానికి వర్తకుని పెట్టుబడి మొదట సరుకులను తన మొత్తం విలువతో కొని తరువాత అమ్మాల్సిన అవసరం లేదు. దానికి బదులు వర్తకుడు రెండు గమన క్రమాలను ఏకకాలంలో నిర్వహిస్తాడు. అతని పెట్టుబడి రెండు భాగాలుగా విడిపోతుంది. ఒకటి సరుకు పెట్టుబడి, రెండోది డబ్బు పెట్టుబడి. ఒకచోట అతడు కొనటం ద్వారా తన డబ్బును సరుకులుగా మారుస్తాడు. మరోచోట అమ్మటం ద్వారా తన సరుకు పెట్టుబడిలోని మరో భాగాన్ని డబ్బుగా మారుస్తాడు. ఒకవైపున అతని పెట్టుబడి అతనికి డబ్బు పెట్టుబడి రూపంలో తిరిగి వస్తుంది. మరోవైపున అతడు సరుకు పెట్టుబడిని పొందుతాడు. ఒక రూపంలో అది ఎంత పెద్దదిగా ఉంటే మరో రూపంలో అంత చిన్నదిగా ఉంటుంది. ఈ మొత్తాల పరిమాణం తారుమారవుతూ ఒకదానితో ఒకటి సర్దుకొంటాయి. చలామణి సాధనంగా డబ్బు ఉపయోగం చెల్లింపు సాధనంగా దాని ఉపయోగంలోనూ, దానితోపాటు పరపతి వ్యవస్థ అభివృద్ధితోనూ సమ్మిళితమైతే, ఈ వర్తకుని పెట్టుబడి నిర్వహించే లావాదేవీల మొత్తంతో పోల్చినపుడు – వర్తకుని పెట్టుబడిలోని డబ్బు పెట్టుబడి భాగం మరింత తగ్గుతుంది. నేను 3 వేల పౌండ్ల ద్రాక్ష సారాయిని మూడు నెలల పరపతిపైన అరువుగా కొని, ఈ గడువుకు ముందే దానినంతటినీ నగదుకు అమ్మగల్గితే ఈ లావాదేవీల కోసం ఒక్క పెన్నీ సైతం నేను ముందుగా పెట్టాల్సిన అవసరం లేదు. ఈ సందర్భంలో వర్తకుని పెట్టుబడిగా వ్యవహరిస్తున్న డబ్బు పెట్టుబడి – డబ్బుగా తిరిగి వస్తున్న క్రమంలో దాని డబ్బు పెట్టుబడి రూపంలో ఉన్న పారిశ్రామిక పెట్టుబడి తప్ప మరేమీ కాదన్నది సుస్పష్టం. (మూడు నెలల పరపతిపైన 3 వేల పౌండ్ల ద్రాక్ష సారాయిని అమ్మిన ఉత్పత్తిదారు తన ప్రామిసరీ నోటుకు బ్యాంకరు దగ్గర డిస్కౌంట్ చేయించుకోవచ్చు అయితే ఇది విషయాన్ని ఏ మాత్రం మార్చదు. దీనితో వర్తకుని పెట్టుబడికి ఏ మాత్రం సంబంధం లేదు.) ఈలోగా మార్కెట్ ధరలు $\frac{1}{10}$ వ వంతు పడిపోతే వర్తకుడు లాభం సంపాదించటానికి

బదులు 3 వేల పౌండ్లను గాను కేవలం 2,700 పౌండ్లు మాత్రమే తిరిగి పొందుతాడు. అతడు 300 పౌండ్లన్నా తన జేబులోంచి పెట్టాల్సి ఉంటుంది. ధరలో ఉన్న తేడాను సర్దటానికి ఈ 300 పౌండ్లు కేవలం ఒక నిల్వగా పనిచేస్తాయి. కానీ ఇదే ఉత్పత్తిదారునికి కూడా వర్తిస్తుంది. అతడు స్వయంగా ఈ పడిపోతున్న ధరలకే అమ్మితే అదే విధంగా అతనికి 300 పౌండ్లు నష్టమొచ్చేది. నిల్వ పెట్టుబడి లేకుండా అదే స్థాయిలో ఉత్పత్తిని కొనసాగించటం సాధ్యమయ్యేది కాదు.

వస్త్రాల వ్యాపారి ఉత్పత్తిదారుని నుంచి 3000 పౌండ్ల వస్త్రాన్ని కొంటాడు. దానిలో ఉత్పత్తి దారు నూలు కోసం 2000 పౌండ్లు చెల్లించాడనుకొందాం. అతడు ఈ నూలును నూలు వ్యాపారి దగ్గర కొంటాడు. ఉత్పత్తిదారు నూలు వ్యాపారికి చెల్లించే డబ్బు వస్త్రాల వ్యాపారి డబ్బు కాదు. ఎందుకంటే ఈ మొత్తానికి సరిపడా వస్త్రాల వ్యాపారి సరుకులు పొందాడు. అది ఉత్పత్తిదారుని సొంత పెట్టుబడి డబ్బు రూపం మాత్రమే. నూలు వ్యాపారి చేతుల్లో ఇప్పుడున్న రెండువేల పౌండ్లు, తిరిగి వచ్చిన డబ్బు పెట్టుబడిలా కన్పిస్తాయి. అయితే వస్త్రాలు వదిలేసిన డబ్బు రూపానికి లేదా నూలు స్వీకరించిన డబ్బు రూపానికి ప్రాతినిధ్యం వహించే 2000 పౌండ్లకు భిన్నంగా ఇది ఏమేరకు వర్తకుని డబ్బు పెట్టుబడిగా ఉంది? నూలు వ్యాపారి పరపతిపై కొన్ని చెల్లింపు గడువులోగానే నగదుకు అమ్మివుంటే, అపుడు ఈ రెండు వేల (2000) పౌండ్లలో ఒక్క పెన్నీ కూడా వర్తకుని పెట్టుబడి ఉండదు. పారిశ్రామిక పెట్టుబడి తన ఆవృత్త కాలంలో ధరించే డబ్బు రూపంకంటే ఇది భిన్నం. కనుక వ్యాపార పెట్టుబడి వర్తకుని చేతుల్లో కేవలం సరుకు పెట్టుబడి లేదా డబ్బు పెట్టుబడిగా, పారిశ్రామిక పెట్టుబడి రూపం మాత్రమే కాకుంటే అది ప్రత్యక్షంగా వ్యాపారికి చెందిన సమతుల క్రయ విక్రయాలలో చలామణి అయ్యే అతని డబ్బు పెట్టుబడిలో భాగం తప్ప మరోటి కాదు. కుదించిన స్థాయిలో ఇది ఉత్పత్తి కోసం అడ్వాన్సు చేయబడిన పెట్టుబడిలో పారిశ్రామికవేత్త చేతుల్లో ఎప్పుడూ డబ్బు నిల్వగా, కొనుగోలు సాధనంగా ఉండాల్సినట్టి, అతని డబ్బు పెట్టుబడిగా ఎల్లప్పుడూ చలామణి కావలసినట్టి భాగం. ఈ భాగం కుదించబడిన స్థాయిలో ఇపుడు వర్తక పెట్టుబడిదార్ల చేతుల్లో ఉంది. చలామణి ప్రక్రియలో ఆ పాత్రల్ని నిర్వహిస్తుంది. ఆదాయంగా వెచ్చించబడిన మొత్తం కాక, పునరుత్పత్తి ప్రక్రియను కొనసాగించటానికి ఒక కొనుగోలు సాధనంగా మార్కెట్‌లో నిరంత రాయంగా చలామణిలో ఉండాల్సిన మొత్తం పెట్టుబడి భాగం ఇది. పునరుత్పత్తి ప్రక్రియ ఎంత వేగంగా ఉంటే, చెల్లింపు సాధనంగా డబ్బు పాత్ర ఎంత అభివృద్ధి చెందిన, పరపతి వ్యవస్థ ఎంత అభివృద్ధి చెందితే,[1] మొత్తం పెట్టుబడితో పోల్చినపుడు, ఈ వర్తకుని పెట్టుబడి భాగం అంత తక్కువగా ఉంటుంది.

వ్యాపారి పెట్టుబడి చలామణి రంగంలో పనిచేసే పెట్టుబడి మాత్రమే. చలామణి ప్రక్రియ

---

1. వర్తకుని పెట్టుబడిని ఉత్పాదక పెట్టుబడిగా వర్గీకరించటం కోసం రామ్సే దానిని రవాణా పరిశ్రమతో గందరగోళపరుస్తాడు. అతడు వ్యాపారాన్ని ఒకచోటు నుండి మరోచోటుకు "సరుకుల రవాణా" అంటాడు. (ఏన్ ఎస్సే ఆన్ ది డిస్ట్రిబ్యూషన్ ఆఫ్ వెల్త్, పుట 19) వెర్రీ కూడా ఇదే గందరగోళాన్ని వ్యక్తం చేశాడు. (మెడిటా జియోనీ సుల్లా ఎకానమియా పొలిటికా, 4వ అధ్యాయం) సే కూడా అంతే (ట్రెయిటీ డి ఎకానమీ పొలిటిక్). ఎస్.పి. న్యూమేన్ ఇలా అంటాడు. (ఎలిమెంట్స్ ఆఫ్ పొలిటికల్ ఎకానమీ, అన్‌డోవర్, న్యూయార్క్, 1835); "సమాజం యొక్క ప్రస్తుత ఆర్థిక పరిస్థితులలో వర్తకుడు ఉత్పత్తిదారునికి వినియోగదారునికి మధ్య నిలబడి ఉత్పత్తిదారునికి పెట్టుబడి ఇచ్చి సరుకులు పుచ్చుకొంటాడు. ఈ సరుకుల్ని వినియోగదారునికిచ్చి దానికి బదులుగా తిరిగి పెట్టుబడి పుచ్చుకొంటాడు. అతడు చేసే ఈ

మొత్తం పునరుత్పత్తి ప్రక్రియలోని ఒక దశ. కానీ చలామణి ప్రక్రియలో విలువ ఏదీ ఉత్పత్తి కాదు కనుక, అదనపు విలువ కూడా ఉత్పత్తి కాదు. ఒకే విలువ – రాశి రూపంలో మాత్రమే మార్పులు జరుగుతాయి. నిజానికి సరుకుల రూపాంతరానికి ఆవల ఏమీ జరుగదు. విలువల సృష్టితో కానీ లేదా విలువ మార్పుతో కానీ దీనికి ఏమాత్రం సంబంధం లేదు. ఉత్పత్తి అయిన సరుకుల విక్రయంలో అదనపు విలువ లభించింది. అంటే అర్థం అది అప్పటికే వాటిలో ఉంది. రెండో చర్యను, సరుకులలో బదులు డబ్బు పెట్టుబడిని మళ్ళీ మార్పిడి చేసినపుడు (ఉత్పత్తి అంశాల కోసం) కొనుగోలుదారుడు, ఇక్కడ ఏ అదనపు విలువనూ పొందడు. అతడు కేవలం ఉత్పత్తి సాధనాల కోసం శ్రమ శక్తి కోసం తన డబ్బును మార్పిడి చేయటం ద్వారా అదనపు విలువ ఉత్పత్తిని ప్రారంభిస్తాడు. అయితే ఈ పరివర్తనలకు చలామణి కాలం (ఈ కాలంలో పెట్టుబడి దేన్నీ ఉత్పత్తి చేయదు. అదనపు విలువను అంతకంటే ఉత్పత్తి చేయదు.) అవసరమైన మేరకు అది విలువల సృష్టిని పరిమితం చేస్తుంది. చలామణి కాల వ్యవధికి విలోమ నిష్పత్తిలో అదనపు విలువ లాభం రేటు ద్వారా వ్యక్తమవుతుంది. కనుక వ్యాపారి పెట్టుబడి విలువను గానీ, అదనపు విలువను గానీ సృష్టించదు. కనీసం నేరుగా సృష్టించదు. అది చలామణి కాలాన్ని తగ్గించటానికి తోడ్పడిన మేరకు, పారిశ్రామిక పెట్టుబడిదార్లు ఉత్పత్తిచేసే అదనపు విలువను పెంచటానికి పరోక్షంగా తోడ్పడవచ్చు. మార్కెట్‌ని విస్తరించటానికి సాయపడిన మేరకు, పెట్టుబడుల మధ్య శ్రమ విభజనను సాధించడం ద్వారా, ఆ విధంగా పెట్టుబడి మరింత పెద్ద స్థాయిలో పనిచేసేలా తోడ్పడటం ద్వారా, దాని చర్య పారిశ్రామిక పెట్టుబడి ఉత్పాదకతను దాని సంచయనాన్ని పెంపొందిస్తుంది. అది చలామణి కాలాన్ని తగ్గించిన మేరకు ముందస్తు పెట్టుబడితో అదనపు విలువ నిష్పత్తిని పెంచుతుంది కనుక లాభం రేటును కూడా పెంచుతుంది. చలామణి రంగానికి డబ్బు పెట్టుబడి రూపంలో, పెట్టుబడిలోని చిన్న భాగాల్ని పరిమితం చేసిన మేరకు ఉత్పత్తిలో ప్రత్యక్షంగా నిమగ్నమైన పెట్టుబడి భాగాన్ని అది పెంచుతుంది.

★ ★ ★

---

పని సమాజం యొక్క ఆర్థిక ప్రక్రియలకు వీలు కల్పిస్తుంది. పైగా ఆ సరుకులకు విలువ జత చేస్తుంది.'' (పుట 174) వర్తకుని జోక్యం వల్ల ఆ రకంగా ఉత్పత్తిదారునికీ, వినియోగదారునికీ కాలం, డబ్బు ఆదా అవుతోంది. ఈ సేవకు పెట్టుబడి, శ్రమ అవసరం ''అది ఉత్పాదితాలకే విలువను జోడిస్తుంది. కనుక, ఉత్పత్తిదారుల చేతుల్లో కంటే అవే వస్తువులకు వినియోగదారుల చేతుల్లో మరింత విలువ వుంటుంది కనుక.'' ఈ సేవకు ప్రతిఫలం లభించాలి. రామ్సేకి కనిపించినట్టే ఇతనికి కూడా వ్యాపారం ''ఒక ఉత్పత్తి చర్యగానే'' కనిపిస్తుంది. న్యూమేన్ అభిప్రాయం మౌలికంగా తప్పు. ఒక సరుకు ఉపయోగ విలువ ఉత్పత్తిదారుని దగ్గరకంటే వినియోగదారుని దగ్గర ఎక్కువ ఉంటుంది. ఎందుకంటే దానిని గ్రహించేది వినియోగదారుడే. సరుకు వినియోగ రంగంలో ప్రవేశించేదాకా ఉపయోగ విలువ తన లక్ష్యాన్ని సాధించదు. పనిచేయటం మొదలుపెట్టదు. అది ఉత్పత్తిదారుని చేతిలో ఉన్నంతకాలం అది కేవలం గుప్త రూపంలో మాత్రమే ఉంటుంది. కానీ, ఒక సరుకుకు దాని మార్పిడి విలువ ఒకసారి, దాని ఉపయోగ విలువకు మరోసారి ఎవరూ రెండుసార్లు చెల్లించరు. దాని మార్పిడి విలువకు చెల్లించటం ద్వారా నేను దాని ఉపయోగపు విలువను స్వాయత్తం చేసుకొంటాను. ఉత్పత్తిదారుని నుంచి లేదా మధ్యవర్తి నుంచి, వినియోగదారునికి సరుకును బదిలీ చేసినంత మాత్రంచేత దాని మార్పిడి విలువ ఎంతమాత్రం పెరగదు.

# అధ్యాయం - 17

# వాణిజ్య లాభం

చలామణి రంగంలో పెట్టుబడి యొక్క శుద్ధ కార్యకలాపాలు (పారిశ్రామిక పెట్టుబడిదారుడు మొదటిది తన సరుకుల విలువను రాబట్టటం కోసం, రెండవది ఈ విలువను ఉత్పత్తి అంశాలుగా తిరిగి మార్చడం కోసం నిర్వహించే కార్యకలాపాలు, సరుకు పెట్టుబడి రూప పరివర్తనను సాధించే కార్యకలాపాలను స'-డ-స, అంటే క్రయ విక్రయాలు) విలువను గాని, అదనపు విలువను గాని ఉత్పత్తి చేయవు. ఈ అంశాన్ని మనం రెండవ సంపుటంలో చూశాం. దీనికి అవసరమయ్యే కాలం - సరుకులకు సంబంధించి వస్తుగతంగా, పెట్టుబడిదారునికి సంబంధించి ఆత్మాశ్రయంగా అవసరమయ్యే కాలం - విలువ, అదనపు విలువల ఉత్పత్తికి అవధిని నిర్దేశిస్తోంది. సరుకు పెట్టుబడి రూప పరివర్తనకు సాధారణంగా వర్తించే అంశాలు దానిలో ఒక భాగం వ్యాపార పెట్టుబడి రూపాన్ని ధరించవచ్చుననే వాస్తవం వల్ల మారిపోవు. సరుకు పెట్టుబడి రూప పరివర్తనను కలుగచేసే కార్యకలాపాలు ప్రత్యేక పెట్టుబడిదారుల బృందం యొక్క, ప్రత్యేక వ్యవహారంగా కన్పించడం వల్ల లేదా డబ్బు పెట్టుబడి యొక్క ఒక భాగపు ప్రత్యేకమైన పనిగా కన్పించటం వల్ల కూడా ఇవి మారిపోవు. పారిశ్రామిక పెట్టుబడిదారులే సరుకుల క్రయ విక్రయాలను కొనసాగించే కార్యకలాపాలు (స'-డ-స సరుకు పెట్టుబడి రూప పరివర్తన అర్థం ఇదే.) విలువను లేదా అదనపు విలువను సృష్టించలేనప్పుడు పారిశ్రామిక పెట్టుబడిదారులు కాక, ఇతర వ్యక్తులచేత ఈ కార్యకలాపాలు నిర్వహించబడినపుడు అవి విలువను గానీ, అదనపు విలువను గానీ సృష్టించలేవు. అంతేకాక చలామణి ప్రక్రియచేత పునరుత్పత్తి ప్రక్రియ అంతరాయానికి గురికాకుండా, నిరంతరాయంగా కొనసాగటానికి డబ్బు పెట్టుబడిగా ఎపుడూ చేతిలో వుండాల్సిన మొత్తం సామాజిక పెట్టుబడి యొక్క భాగం విలువను, అదనపు విలువను సృష్టించలేనపుడు అదే విధిని నిర్వహించటానికి పారిశ్రామిక పెట్టుబడిదారులు కాక వేరే పెట్టుబడిదారుల విభాగం ఈ డబ్బు పెట్టుబడిని చలామణిలోకి యెడతెగకుండా నెట్టినంత మాత్రంచేత దానికి విలువను, అదనపు విలువను సృష్టించే లక్షణాలు కొత్తగా రావు. ఏ మేరకు వర్తకుని పెట్టుబడి పరోక్షంగా ఉత్పాదకంగా ఉండగలదో ఇంతకు ముందే సూచించాం. ఈ అంశాన్ని మరింత వివరంగా తర్వాత చర్చిద్దాం.

నిల్వ చేయడం, బట్వాడా చేయడం, రవాణా, పంపిణీ, చిల్లరగా అమ్మడమూ వగైరా సంబంధం ఉన్న నానా రకాల కార్యకలాపాల నుంచి వ్యాపార పెట్టుబడిని తప్పించి అమ్మడం కోసం కొనడమనే దాని నిజమైన కార్యకలాపానికే పరిమితం చేస్తే, అది విలువను గానీ, అదనపు విలువను గానీ సృష్టించదు. అయితే వాటిని రాబట్టడానికి, తద్వారా అదే సమయంలో సరుకుల వాస్తవ మార్పిడిలో

అంటే, ఒక చేతినుంచి మరొక చేతికి జరిగే వాటి బదిలీలో, సామాజిక చయాపచయ క్రియలో (Social metabolism) మధ్యవర్తిగా వ్యవహరిస్తుంది. అయినప్పటికీ పునరుత్పత్తి ప్రక్రియలో పారిశ్రామిక పెట్టుబడి చలామణి దశ కూడా ఉత్పత్తి లాగానే ఒక దశ కనుక, చలామణి రంగంలో స్వతంత్రంగా పనిచేస్తున్న పెట్టుబడి వివిధ ఉత్పత్తి శాఖల్లో పనిచేస్తున్న పెట్టుబడిలాగే సగటు వార్షిక లాభాన్ని ఇవ్వాల్సి వుంటుంది. పారిశ్రామిక పెట్టుబడి కంటే వర్తక పెట్టుబడి ఎక్కువ సగటు లాభం శాతం యిస్తే, అపుడు పారిశ్రామిక పెట్టుబడిలో ఒక భాగం వర్తక పెట్టుబడిగా మారుతుంది. అది యిచ్చే సగటు లాభం తక్కువగా వుంటే అపుడు అందుకు విరుద్ధంగా జరుగుతుంది. అపుడు వర్తక పెట్టుబడిలో ఒక భాగం పారిశ్రామిక పెట్టుబడిగా మారుతుంది. ఏ రకం పెట్టుబడీ, వర్తక పెట్టుబడి అంత సులభంగా తన లక్ష్యాన్ని, కార్యకలాపాన్ని మార్చుకోజాలదు.

వర్తక పెట్టుబడి స్వయంగా అదనపు విలువను ఉత్పత్తి చేయదు గనుక సగటు లాభం రూపంలో అది జేబులో వేసుకొనే అదనపు విలువ మొత్తం ఉత్పాదక పెట్టుబడి ఉత్పత్తి చేసిన అదనపు విలువలో ఒక భాగం అయి వుంటుంది. అయితే ఇపుడు ఒక ప్రశ్న తలెత్తుతుంది. ఉత్పాదక పెట్టుబడి ఉత్పత్తిచేసిన అదనపు విలువను లేదా లాభంలో తన వాటాను వర్తక పెట్టుబడి ఎలా ఆకర్షిస్తుంది?

వ్యాపార లాభం అంటే సరుకుల విలువను అదనంగా పోటీ ధరలకు జోడించడం లేదా వాటిని పెంచటం అన్నది ఒక భ్రమ మాత్రమే.

వర్తకుడు తన లాభాన్ని తానమ్మిన సరుకుల ధర నుంచి రాబడతాడన్నది స్పష్టం. తన సరుకుల అమ్మకంలో సంపాదించే లాభం అతని కొనుగోలు ధరకు అమ్మకం మధ్య ఉన్న తేడాకు సమానం అన్నది, కొనుగోలు ధరకంటే అమ్మకం ధర ఎంత ఎక్కువగా ఉందో ఆ మొత్తానికి సమానమన్నది మరింత స్పష్టం.

సరుకుల కొనుగోలు తర్వాత వాటి అమ్మకానికి ముందు సరుకులలో అదనపు ఖర్చులు (చలామణి ఖర్చులు) చేరవచ్చు అన్నది సాధ్యమే. అలా జరగకపోవడం కూడా సాధ్యమే. అటువంటి ఖర్చులు తగిలితే కొనుగోలు ధరకంటే అమ్మకం ధర ఎంత ఎక్కువ అయితే ఆ మొత్తం అంతా లాభంగా ఉండదు. ఈ విశ్లేషణను మరింత సరళం చేయటానికి ఇక్కడ అటువంటి ఖర్చులు ఉండవని భావిద్దాం.

పారిశ్రామిక పెట్టుబడిదారునికి సరుకుల కొనుగోలు ధరకు, అమ్మకం ధరకు మధ్య వున్న తేడా వాటి ఉత్పత్తి ధరకు, వాటి ఉత్పత్తి ఖర్చుకు మధ్య ఉన్న తేడాతో సమానం; లేదా మొత్తం సామాజిక పెట్టుబడి దృష్టి నుంచి సరుకుల విలువకు పెట్టుబడిదారులకైన ఉత్పత్తి ఖర్చుకు మధ్య ఉన్న తేడాతో సమానం. ఇది సరుకులలో ఉన్న మొత్తం శ్రమ పరిమాణానికి, ప్రతిఫలం చెల్లించబడిన శ్రమ పరిమాణానికి మధ్య నున్న తేడాకు సమానం అవుతుంది. పారిశ్రామిక పెట్టుబడిదారు కొన్న సరుకులు మార్కెట్లో అమ్మదగిన సరుకులుగా నెట్టబడటానికి ముందు అవి ఉత్పత్తి ప్రక్రియను గడుస్తాయి. ఆ ప్రక్రియలో మాత్రమే లాభంగా గ్రహించటానికి వీలైన వాటి ధరలో ఒక భాగం సృష్టించబడుతుంది. అయితే వర్తకుని విషయంలో ఇలా కాదు. సరుకులు చలామణి రంగంలో ఉన్న మేరకే అతని చేతిలో ఉంటాయి. అతడు కేవలం వాటి అమ్మకాన్ని కొనసాగిస్తాడు. ఉత్పాదక పెట్టుబడిదారుడు ప్రారంభించిన వాటి ధర రాబట్టడం అన్న పనిని కొనసాగిస్తాడు. కనుక అవి మళ్ళీ అదనపు విలువను గ్రహించడానికి

వీలయిన మధ్యంతర ప్రక్రియ ద్వారా ఆ సరుకులు పయనించేలా అతడు చేయడు. పారిశ్రామిక పెట్టుబడిదారు చలామణి ప్రక్రియలో అంతకుముందే ఉత్పత్తి అయిన అదనపు విలువను లేదా లాభాన్ని కేవలం రాబడతాడు. వర్తకుడు చలామణి ప్రక్రియలోనూ, దాని ద్వారా నూతన లాభాన్ని రాబట్టడము మాత్రమే కాదు, మొదట ఆ లాభాన్ని సృష్టించాలి కూడా. పారిశ్రామిక పెట్టుబడిదారుని దగ్గర ఉత్పత్తి ధరకు కొన్న సరుకుల అమ్మకానికి వెలుపల అతడు ఈ పని నిర్వహించే మరోమార్గం ఏదీ లేదనిపిస్తుంది. లేదా మొత్తం సరుకు పెట్టుబడి దృష్టినుంచి చూస్తే వాటి ఉత్పత్తి ధరలకంటే హెచ్చు విలువలకు వాటిని అమ్ముతాడు. వాటి ధరలకంటే హెచ్చుగా అతడు వసూలు చేస్తాడు. మొత్తం సరుకు పెట్టుబడి దృష్టినుంచి చూస్తే వాటి విలువని పెంచి అమ్ముతాడు. వాటి వాస్తవ విలువకంటే నామక విలువ (nominal valid) హెచ్చుగా వుంటుంది. అంటే అసలు విలువకంటే ఎక్కువ ధరకు అమ్ముతాడు. ఈ మిగులును అతడు జేబులో వేసుకొంటాడు.

ఈ రకంగా అదనంగా వసూలు చేసే పద్ధతి సులభగ్రాహ్యం. ఉదాహరణకు ఒక గజం వస్త్రం రెండు షిల్లింగ్‌లవుతుంది. దాన్ని తిరిగి అమ్మడం ద్వారా 10% లాభం సంపాదించాలని నేను అనుకొంటే దాని ధరకు నేను $\frac{1}{10}$ను చేర్చి ఒక గజం వస్త్రాన్ని రెండు షిల్లింగ్‌ల $2\frac{2}{5}$ పెన్నీలకు అమ్మాల్సి వుంటుంది. కనుక దాని వాస్తవ ఉత్పత్తి ధరకు దాని అమ్మకం ధరకు మధ్య తేడా $2\frac{2}{5}$ పెన్నీలు. ఇది రెండు షిల్లింగులపైన 10% లాభాన్ని సూచిస్తోంది. ఒక గజం వస్త్రాన్ని వాస్తవంలో $1\frac{1}{10}$ గజం ధరకు అమ్మటంలో ఇది సమానం అవుతుంది లేదా నేను కొనుగోలుదారునికి రెండు షిల్లింగ్‌లకు అమ్మినది $\frac{10}{11}$ గజం మాత్రమే అన్నదానితో సమానం అవుతుంది. అంటే $\frac{1}{11}$ గజాన్ని నా దగ్గరే వుంచుకొన్నానన్నమాట. నిజానికి ఈ $\frac{1}{11}$ గజాన్ని నేను $2\frac{2}{5}$ పెన్నీలిచ్చి రెండు షిల్లింగుల $2\frac{2}{5}$ పెన్నీల గజం ధర చొప్పున నేను తిరిగి కొనగలను. సరుకుల నామక ధరలను పెంచడం ద్వారా అదనపు విలువలో లేదా అదనపు ఉత్పాదితంలో ఈ రకంగా వాటా పంచుకోవటం అన్నది కేవలం ఒక డొంకతిరుగుడు పద్ధతి.

సరుకుల ధరలు పెంచడం ద్వారా వాణిజ్య లాభాన్ని రాబట్టడం లాగా ఇది పైకి కన్పిస్తుంది. సరుకుల ధరలను పెంచడం ద్వారానూ, వాటి విలువ కంటే హెచ్చుగా అమ్మడం ద్వారాను లాభం సృష్టించబడుతున్నట్లు కన్పించే ఈ అభిప్రాయం వ్యాపార పెట్టుబడిని పరిశీలించటం వల్ల తలెత్తుతుంది.

అయితే దీన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తే ఇది భ్రమ అన్నది వెంటనే స్పష్టమవుతుంది. పెట్టుబడిదారీ ఉత్పత్తి ప్రథమంగా ఉందనుకొంటే వాణిజ్య లాభం ఈ రకంగా చేతికందదు. (ఇక్కడ అది ఎప్పుడూ సగటులకు సంబంధించిన సమస్యేతర ప్రత్యేక సందర్భాల గురించినది కాదు.) సరుకులను వాటి ఉత్పత్తి ధరకంటే 10% ఎక్కువగా అమ్మటం ద్వారా వర్తకుడు 10% లాభాన్నే పొందుతాడని మనం ఎందుకనుకోవాలి? ఎందుకంటే ఈ సరుకుల ఉత్పత్తిదారుడు, పారిశ్రామిక పెట్టుబడిదారుడు (పారిశ్రామిక పెట్టుబడికి వ్యక్తి రూపంగా ఉంటాడు కనుక ఉత్పత్తిదారునిలా బయటి ప్రపంచానికి కన్పించే పారిశ్రామిక పెట్టుబడిదారు.) వ్యాపారికి వాటి ఉత్పత్తి ధరలకే వీటిని అమ్మాడని మనం భావిస్తాం కనుక. వ్యాపారి చెల్లించిన సరుకుల కొనుగోలు ధర వాటి ఉత్పత్తి ధరకు సమానం లేదా కనీసం వాటి విలువకు సమానం కనుక వాటి ఉత్పత్తి ఖర్చు లేదా కనీసం వాటి విలువ వర్తకుని ఉత్పత్తి ఖర్చుకు ప్రాతినిధ్యం వహిస్తుంది. అటువంటప్పుడు అతని కొనుగోలు ధరకంటే అతని

అమ్మకం ధర హెచ్చు (అతని లాభానికి మూలం ఈ తేడా మాత్రమే). ఈ హెచ్చు, వాటి ఉత్పత్తి ధరపైన వాటి వాణిజ్య ధర ఉండే హెచ్చు కనుక అంతిమ విశ్లేషణలో వర్తకుడు సరుకులన్నింటిని వాటి విలువలకు మించి అమ్ముతాడని అర్థం. అయితే పారిశ్రామిక పెట్టుబడిదారు తన సరుకుల్ని వర్తకునికి వాటి ఉత్పత్తి ధరలకే అమ్ముతాడని ఎందుకనుకోవాలి? లేక, అలా అనుకోవటంలో నిర్వివాదమైనదిగా అంగీకరింపబడినదేది? వర్తకుని పెట్టుబడి సార్వత్రిక లాభం రేటును రూపొందించటంలో పాల్గొనదు అని అంగీకరించబడింది. (వాణిజ్య పెట్టుబడిగానే దానిని మనం ఇంకా పరిశీలిస్తున్నాం.) సార్వత్రిక లాభం రేటును చర్చించడంలో మనం ఈ ప్రాతిపదికతోనే ప్రారంభించాం. ఎందుకంటే అప్పటికి మన దృష్టిలో వాణిజ్య పెట్టుబడి అన్నది ఇంకా ప్రవేశించలేదు. రెండవది, సగటు లాభం సార్వత్రిక లాభం రేటును మొదట వివిధ ఉత్పత్తి శాఖలలో పారిశ్రామిక వాస్తవంగా ఉత్పత్తి చేసిన లాభాలను లేదా అదనపు విలువలను సమం చేసేదిగా వివరించాల్సి వచ్చింది. అయితే వర్తకుని పెట్టుబడి విషయంలో, ఉత్పత్తిలో పాల్గొనకుండా లాభాన్ని పంచుకొనే పెట్టుబడితో మనం వ్యవహరిస్తున్నాం. కనుక ఇంతకు ముందు వివరణకు అనుబంధ అంశాన్ని చేర్చడం అవసరం.

ఒక ఏడాది కాలంలో అడ్వాన్సు చేయబడిన మొత్తం పారిశ్రామిక పెట్టుబడి = $720_{\text{స్థి.పె}}+180_{\text{అ.పె}}=900$ అనీ, (10 లక్షల పౌండ్లు అనుకొందాం) అ.వి.' = 100% అనీ భావిద్దాం. కనుక ఉత్పాదితం = $720_{\text{స్థి.పె}}+180_{\text{అ.పె}}+180_{\text{అ.వి}}$. ఈ ఉత్పాదితాన్నే లేదా ఉత్పత్తి అయిన సరుకు పెట్టుబడిని స.పె. అందాం. దాని విలువ లేదా ఉత్పత్తి ధర (మొత్తం సరుకుల దృష్టి నుంచి చూస్తే ఈ రెండూ ఒకటే) = 1,080. మొత్తం 900 సామాజిక పెట్టుబడి యొక్క లాభం రేటు = 20%. ఇంతకు ముందు మన విశ్లేషణ ప్రకారం ఈ 20% సగటు లాభం రేటు. ఎందుకంటే ఇక్కడ అదనపు విలువను ఏదో ఒక ప్రత్యేక నిర్మాణ రూపం కల్గిన పెట్టుబడిపై అంచనా కట్టలేదు. అది సగటు నిర్మాణ రూపం కల్గిన మొత్తం పారిశ్రామిక పెట్టుబడిపైన అంచనా కట్టబడింది. ఆ రకంగా స.పె = 1,080, లాభం రేటు = 20% అయితే ఈ 900 పౌండ్ల పారిశ్రామిక పెట్టుబడితో పాటు 100 పౌండ్ల వర్తకుని పెట్టుబడి కూడా ఉందనుకుందాం. అది కూడా తన పరిమాణానికి అనుగుణంగా లాభం రేటును పంచుకొంటుందనుకొందాం. మన భావన ప్రకారం మొత్తం పెట్టుబడి 1000లో ఇది $\frac{1}{10}$ వ వంతు. కనుక, మొత్తం అదనపు విలువ 180లో అది $\frac{1}{10}$ వ వంతు ఉంటుంది. కనుక 18% లాభాన్ని పొందుతుంది. అప్పుడు వాస్తవంలో మిగిలిన $\frac{9}{10}$ మొత్తం పెట్టుబడి పొందే లాభం 162 మాత్రమే. అంటే 900 పెట్టుబడిపైన పొందే లాభం 18%. 900 పౌండ్లు గల్గిన పారిశ్రామిక పెట్టుబడి, యజమానులు వర్తకులకు స.పె.ని అమ్మిన ధర = $720_{\text{స్థి.పె}}+180_{\text{అ.పె}}+162_{\text{అ.వి}}$ = 1,062. అప్పుడు వ్యాపారి తన పెట్టుబడి 100పైన 18% సగటు లాభాన్ని జోడిస్తే అతడు ఆ సరుకుల్ని 1,062+18=1,080 కి అమ్ముతాడు. అంటే వాటి ఉత్పత్తి ధరకు అమ్ముతాడు. మొత్తం సరుకు పెట్టుబడి దృష్టి నుంచి చూస్తే వాటి విలువకే అమ్ముతాడు. అతడు చలామణి ప్రక్రియలోనే తన లాభాన్ని పొందినప్పటికీ, తన కొనుగోలు ధరకంటే అమ్మకం ధర హెచ్చుగా ఉండటం వల్లనే లాభాన్ని పొందినప్పటికీ ఇది వర్తిస్తుంది. అయినప్పటికీ అతడు సరుకుల్ని వాటి విలువకంటే హెచ్చుగా గానీ, ఉత్పత్తి ధరకంటే హెచ్చుగా గానీ అమ్మడు. ఎందుకంటే

అతడు పారిశ్రామిక పెట్టుబడిదారుని దగ్గర నుంచి ఆ సరుకుల్ని వాటి విలువ కంటే, వాటి ఉత్పత్తి వ్యయం కంటే తక్కువకి కొన్నాడు.

ఆ రకంగా వర్తకుని పెట్టుబడి మొత్తం పెట్టుబడిలో తన వాటాను బట్టి అదే రేటున సార్వత్రిక లాభం రేటును నిర్ణయించడంలో పాల్గొంటుంది. కనుక ఈ సందర్భంలో మన సగటు లాభం 18% అనుకొందాం. మొత్తం పెట్టుబడిలో వర్తకుని పెట్టుబడి $\frac{1}{10}$ వంతు ఉండకపోతే అది సార్వత్రిక లాభం రేటులో $\frac{1}{10}$ తగ్గి ఉండకపోతే అది 20% ఉండి ఉండేది. ఇది మరింత సున్నితమైన, మరింత సమగ్రమైన ఉత్పత్తి ధర నిర్వచనానికి దారితీస్తుంది. ఉత్పత్తి ధర అంటే మన ఉద్దేశం ఇంతకు ముందులాగే సరుకు ధర మాత్రమే. సరుకు ధర = దాని ఖర్చులు, (దానిలో ఉన్న స్థిర అస్థిర పెట్టుబడి విలువ) + సగటు లాభం. అయితే ఈ సగటు లాభం ఇపుడు విభిన్నంగా నిర్ణయించబడుతుంది. మొత్తం ఉత్పాదక పెట్టుబడి ఉత్పత్తి చేసే మొత్తం లాభంచేత ఇది నిర్ణయించబడుతుంది. అంతేకాని మొత్తం పారిశ్రామిక పెట్టుబడి చేత నిర్ణయించబడదు. మొత్తం పారిశ్రామిక పెట్టుబడి = 900, మొత్తం లాభం = 180, దానినిబట్టి సగటు లాభం రేటు $\frac{180}{900}$ = 20% అయి వుండాలి. అయితే మొత్తం ఉత్పాదక పెట్టుబడి + వర్తకుని పెట్టుబడి పైన అనగా 900 ఉత్పాదక పెట్టుబడి + 100 వర్తకుని పెట్టుబడి పైన సగటు లాభం రేటు = $\frac{180}{100}$ = 18% కనుక ఉత్పత్తి ధర క+20 అవటానికి బదులు క (ఖర్చులు) + 18. ఆ రకంగా సగటు లాభం రేటులో వర్తకుని పెట్టుబడికి వచ్చిపడే మొత్తం లాభంలో వాటా కూడా చేర్చబడింది. మొత్తం సరుకు పెట్టుబడి వాస్తవ విలువ లేదా ఉత్పత్తి ధర = క+లా+వా (వా అనగా వాణిజ్య లాభం) ఉత్పత్తి ధర లేదా పారిశ్రామిక పెట్టుబడిదారుడు తన సరుకులను అమ్మే ధర. ఆ రకంగా సరుకు వాస్తవ ఉత్పత్తి ధరకంటే తక్కువగా ఉంటుంది. మొత్తం సరుకులను కలిపి చూస్తే పారిశ్రామిక పెట్టుబడిదారుల వర్గం తమ సరుకులను అమ్మే ధరలు, వాటి విలువకంటే తక్కువ. కనుక పై ఉదాహరణలో 900 పైన 900 (ఖర్చులు) + 18% లేదా 900+162=1,062. వర్తకుడు తాను 100కు కొన్న సరుకును 118కి అమ్మటం ద్వారా ధరకు 18% కలుపుతున్నాడన్నమాట. అయితే అతడు 100 చెల్లించిన ఈ సరుకు నిజమైన విలువ 118. అతడు దాని విలువకు మించి అమ్మలేదు. ఇకనుంచి మనం ఉత్పత్తి ధర అన్న పదాన్ని కచ్చితమైన ఈ అర్థంలో వాడతాం. పారిశ్రామిక పెట్టుబడిదారుని లాభం సరుకు ఉత్పత్తి ఖర్చుపైన సరుకు ఉత్పత్తి ధర ఎక్కువగా ఉన్న మొత్తంతో సమానం అవుతుంది అన్నది స్పష్టం. ఈ పారిశ్రామిక పెట్టుబడికి భిన్నంగా సరుకును పెట్టుబడి సరుకు ఉత్పత్తి ధరపైన అనగా వర్తకుని కొనుగోలు ధరపైన అతని అమ్మకం ధర హెచ్చుగా ఉన్న మొత్తంతో సమానమవుతూ ఉన్నది కూడా స్పష్టమే. సరుకుల విలువలో అదనపు విలువగా అప్పటికే ఉన్న లాభాలను మాత్రమే పారిశ్రామిక పెట్టుబడి రాబడినట్టే. మొత్తం అదనపు విలువను లేదా లాభాన్ని పారిశ్రామిక పెట్టుబడిదారుడు సరుకుల్నించి పూర్తిగా వసూలు చేయలేదు కనుకనే వర్తకుని పెట్టుబడి లాభాలను రాబడుతోంది.[1] వర్తకుని అమ్మకం ధర అతని కొనుగోలు ధర కంటే మించటానికి కారణం మొత్తం

1. జాన్ బెల్లర్ [ఎస్సేస్ ఎబౌట్ ది పూర్ మేన్యుఫేక్చరర్స్ ట్రేడ్, ప్లానిటేషన్స్ అండ్ ఇమ్మోర్టాలిటీ, లండన్ 1699 - సం]

విలువ కంటే అమ్మకం ధర ఎక్కువగా ఉండటం కాదు. కొనుగోలు ధర ఈ విలువకంటే తక్కువగా ఉండటమే కారణం.

కనుక వర్తకుని పెట్టుబడి – సరుకు ఉత్పత్తిలో పాల్గొనకపోయినప్పటికీ, అది అదనపు విలువను సగటు లాభానికి సమంగా వుండేలా చేయటంలో పాల్గొంటుంది. ఆ విధంగా చెందవలసిన అదనపు విలువ భాగం, అంటే పారిశ్రామిక పెట్టుబడి యొక్క లాభంతో – అతనికి చెందవలసిన భాగం సార్వత్రిక లాభం రేటుతో చేరివుంది.

పై విషయాన్ని బట్టి ఈ క్రింది అంశాలు స్పష్టం :

1. పారిశ్రామిక పెట్టుబడితో పోలిస్తే వర్తకుని పెట్టుబడి ఎంత ఎక్కువ ఉంటే పారిశ్రామిక లాభం రేటు అంత తక్కువగా వుంటుంది. వర్తకుని పెట్టుబడి తక్కువ ఉంటే పారిశ్రామిక లాభం రేటు ఎక్కువ వుంటుంది.
2. వాస్తవ అదనపు విలువ రేటుకంటే ఎపుడూ లాభం రేటు తక్కువ వుంటుందని మొదటి భాగంలో రుజువు అయింది. పైన పేర్కొన్న ఉదాహరణ = $720_{\text{స్థి.పె}}+180_{\text{అ.పె}}+180_{\text{అ.వి}}$లో లాగా అదనపు విలువ రేటు 100% ఉన్నప్పటికీ లాభం రేటు 20% మాత్రమే. వర్తకుని పెట్టుబడికి చెందే వాటాను కూడా పరిగణనకు తీసుకొనే సార్వత్రిక లాభం రేటు 20% నుంచి 18%కు పడిపోయి అది మరింత తక్కువగా వున్నందువల్ల ఈ తేడా మరింత ఎక్కువయింది. కనుక అది శ్రమ తీవ్రతను తక్కువగా చూపిస్తుంది. కనుక ప్రత్యక్ష పెట్టుబడిదారీ దోపిడీదారుని సగటు లాభం రేటు వాస్తవంగా ఉన్నదానికంటే తక్కువ రేటు వ్యక్తం చేస్తుంది.

మిగిలిన పరిస్థితులన్నీ యథాతథంగా వున్నాయనుకొందాం. వర్తకుని పెట్టుబడి యొక్క సాపేక్ష పరిమాణం (ఇక్కడ చిన్న వర్తకుని మినహాయించాలి. అతడు ఓ సంకర రూపానికి ప్రాతినిధ్యం వహిస్తాడు.) ఎల్లప్పుడూ టర్నోవర్ వేగానికి విలోమానుపాతంలో ఉంటుంది. కనుక సాధారణంగా పునరుత్పత్తి ప్రక్రియ శక్తికి విలోమానుపాతంలో ఉంటుంది. శాస్త్రీయ విశ్లేషణా క్రమంలో సార్వత్రిక లాభం రేటు రూపొందటం అన్నది పారిశ్రామిక పెట్టుబడుల వల్ల, వాటి పోటీ వల్ల తలెత్తుతుందనీ, ఆ తర్వాత మాత్రమే వర్తకుని పెట్టుబడి జోక్యంచేత అది సరిదిద్దబడి అనుబంధించబడి మార్చబడు తుందని అన్నట్టుగా కనిపిస్తుంది. అయితే దాని చారిత్రక పరిణామ క్రమంలో ఈ ప్రక్రియ నిజానికి తలక్రిందులుగా వుంటుంది. సరుకుల ధరలను దాదాపు వాటి విలువల కనుగుణంగా ఉండేలా మొదట నిర్ణయించేది వాణిజ్య పెట్టుబడే. పునరుత్పత్తి ప్రక్రియను పెంపొందించే చలామణి రంగంలోనే మొదట సార్వత్రిక లాభం రేటు రూపొందుతుంది. మొదట వాణిజ్య లాభమే పారిశ్రామిక లాభాన్ని నిర్ణయిస్తుంది. పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం నిలదొక్కుకోనంత వరకూ – ఉత్పత్తిదారుడే వర్తకునిగా మారనంత వరకూ – సామాజిక పునరుత్పత్తి ప్రక్రియలో నిమగ్నమైన మొత్తం పెట్టుబడిలో ఒక సమ భాగంగా వర్తకుని పెట్టుబడికి చెందే మొత్తం అదనపు విలువలో ఒక సమభాగంగా వాణిజ్య లాభం కుదించబడదు.

ఆ తరువాత అనుబంధంగా వర్తకుని పెట్టుబడి జోక్యం వల్ల లాభం సమం కావటంలో వర్తకుని ముందస్తు డబ్బు పెట్టుబడితో సరుకుల విలువలో అదనపు అంశమేదీ చేరలేదని, వర్తకుడు లాభం చేసుకోవటానికి వీలుగా ధరపైన అదనంగా వసూలు చేసిన మొత్తం ఉత్పాదక పెట్టుబడి

ఉత్పత్తి ధరలో అంచనా వేయకుండా, వదిలేసిన సరుకుల విలువ భాగంతో సమానం మాత్రమేనని మనం గమనించాం. ఈ డబ్బు పెట్టుబడి వ్యవహారం పారిశ్రామిక పెట్టుబడిదారుని నిశ్చల పెట్టుబడి లాంటిదే. ఎందుకంటే అది వినియోగం కాదు. దాని విలువ సరుకు విలువలో ఒక అంశంగా మారదు. అది సరుకు పెట్టుబడి కొనుగోలు ధరలో వర్తకుడు దాని ఉత్పత్తి ధరను డ = డబ్బు రూపంలో భర్తీ చేస్తాడు. ఇంతకు ముందే చూపించినట్టుగా అతని అమ్మకం ధర = డ+△డ. ఇక్కడ △డ సరుకుల ధరకు జోడించవలసిన మొత్తం, ఇది సార్వత్రిక లాభం రేటుచేత నిర్ణయించబడింది. ఒకసారి అతడు సరుకుల్ని అమ్మితే అతడు కొనుగోలులో అడ్వాన్సు చేసిన అతని తొలి డబ్బు పెట్టుబడి △డలో కలిసి తిరిగి వస్తుంది. అతని డబ్బు పెట్టుబడి, డబ్బు పెట్టుబడిగా మార్చబడిన పారిశ్రామిక పెట్టుబడిదారుని సరుకు పెట్టుబడి తప్ప మరేమీ కాదని మనం మరోసారి గమనిస్తాం. సరుకు పెట్టుబడి వర్తకునికి బదులు నేరుగా అంతిమ వినియోగదారునికి అమ్మినపుడులాగే సరుకు పెట్టుబడి విలువ పరిమాణాన్ని ఈ డబ్బు పెట్టుబడి మార్చదు. వాస్తవానికి అది వినియోగదారుని చెల్లింపును ముందే ఊహిస్తుంది. అయితే ఇంతవరకూ మనం ఊహించని పరిస్థితులలో మాత్రమే ఇది వర్తిస్తుంది. అంటే వర్తకునికి అదనపు ఖర్చులు లేవనుకోవాలి. ఉత్పత్తిదారుని నుంచి సరుకులు కొనటానికి అతడు మరే పెట్టుబడినీ అడ్వాన్సు చేయనక్కర్లేదని, సరుకు రూపాంతరం ప్రక్రియలో అనగా క్రయ విక్రయాల ప్రక్రియలో అతడేరకమైన చలామణిని లేదా నిశ్చల పెట్టుబడిని అడ్వాన్సు చేయనక్కర్లేదని భావించాలి. అయితే వాస్తవంలో ఇలా వుండదు. చలామణి ఖర్చుల విశ్లేషణలో (రెండవ సంపుటం, 6వ అధ్యాయం) ఈ అంశాన్ని మనం గమనించాం. ఈ చలామణి ఖర్చుల్ని పాక్షికంగా వర్తకుడు ఇతర చలామణి ఏజెంట్ల నుంచి తిరిగి రాబడతాడు. కొన్ని ఖర్చులు నేరుగా అతని ప్రత్యేక వాణిజ్యం నుంచే తలెత్తుతాయి.

ఈ చలామణి ఖర్చుల స్వభావం ఏమైనప్పటికీ (అవి వర్తక సంస్థ వాణిజ్య స్వభావం నుంచి మాత్రమే తలెత్తే వర్తకుని యొక్క ప్రత్యేక చలామణి ఖర్చులై ఉండవచ్చు. చలామణి రంగంలో తరువాత జోడింపబడే ఉత్పత్తి ప్రక్రియకు సంబంధించిన ఖర్చులు కూడా కావచ్చు. ఉదాహరణకు రవాణా, నిల్వ చేయటం, వగైరా.) సరుకులు కొనటానికి వర్తకుడు పెట్టే ముందస్తు డబ్బు పెట్టుబడి కాక అటువంటి చలామణి సాధనాలను కొనటానికి, వాటికి చెల్లించటానికి కొంత అదనపు పెట్టుబడి కూడా కావాలి. ఖర్చులో ఈ అంశం చలామణి పెట్టుబడిగా వున్న మేరకు ఇది మొత్తంగా సరుకుల అమ్మకం ధరలో ఒక అదనపు అంశంగా ప్రకాశిస్తుంది. అది నిశ్చల పెట్టుబడిగా ఉన్న మేరకు అరుగుదలగా మాత్రమే ప్రవేశిస్తుంది. అయితే అది సరుకుల వాస్తవ విలువకు అదనంగా ఏమాత్రం జోడించదు. కేవలం చలామణి వాణిజ్య ఖర్చులుగా ఒక నామక విలువను రూపొందించే అంశంగా మాత్రమే ఇది పనిచేస్తుంది. ఈ అదనపు పెట్టుబడి మొత్తం నిశ్చల పెట్టుబడి అయినా లేదా చలామణి పెట్టుబడి అయినా సార్వత్రిక లాభం రేటును రూపొందించటంలో పాల్గొంటుంది.

కేవలం చలామణి తాలూకు వాణిజ్య ఖర్చులు (కనుక ఇక్కడా రవాణా, నిల్వ చేయటం వగైరాలను మినహాయించాలి.) సరుకుల విలువను రాబట్టడానికి, సరుకులను డబ్బుగానూ, డబ్బును సరుకులుగానూ రూపొందించటానికి, వాటి మార్పిడిని సాధించటానికి అవసరమైన ఖర్చులుగా తేలుతాయి. ఇక్కడ చలామణి ప్రక్రియలో కొనసాగటానికి వీలున్న ఉత్పత్తి ప్రక్రియలన్నింటినీ మనం

పరిగణనలోనించి తొలగిద్దాం. దాని నుంచి వర్తకుని వ్యవహారాలను మొత్తంగా వేరుచేయవచ్చు. వాస్తవానికి రవాణా పరిశ్రమ, వాణిజ్యానికి పూర్తిగా భిన్నమైన ఉత్పత్తి శాఖలు వగైరాల నుంచి వేరు చేయవచ్చు. క్రయ విక్రయాలకు అనువైన సరుకులను నౌకాశ్రయాలలో లేదా ఇతర గిడ్డంగులలో నిల్వ చేయవచ్చు. ఈ ఖర్చులన్నీ ఆయా సంస్థలు వర్తకుని నుంచి వసూలు చేస్తాయి. ఎందుకంటే వీటిని వర్తకుడు భరించవలసి వుంటుంది. ఇదంతా, టోకు వాణిజ్యంలో వాస్తవంగా జరిగేదే. అక్కడ వర్తకుని పెట్టుబడి ఇతర కార్యకలాపాలతో మిళితం కాకుండా దాని విశుద్ధ రూపంలో వుంటుంది. సరుకులు రవాణా చేసే వాహనాల కంపెనీ యజమాని, రైల్వే డైరెక్టరు, ఓడ యజమాని, "వర్తకులు" కాదు. ఇక్కడా మనం పరిగణించేది క్రయ విక్రయాల ఖర్చులు. ఇవి జమా ఖర్చుల నిర్వహణ, మార్కెటింగ్, ఉత్తర ప్రత్యుత్తరాలు వగైరాలుగా విశదమవుతాయని ఇంతకుముందే పేర్కొన్నాం. దీని కోసం అవసరమైన స్థిర పెట్టుబడిలో కార్యాలయాలు, కాగితం, పోస్టేజి వగైరాలుంటాయి. వాణిజ్య వేతన కార్మికులను పనిలో పెట్టడానికి అడ్వాన్సు చేసే అస్థిర పెట్టుబడిగా ఇతర ఖర్చులుంటాయి. (రవాణా ఖర్చులు, కస్టమ్స్ సుంకాల కోసం ముందు చెల్లింపులు వగైరాలు సరుకుల కొనుగోలులో వర్తకుడు కొంత భాగాన్ని అడ్వాన్సు చేస్తున్నట్లుగా భావించవచ్చు. ఆ రకంగా అవి అతనికి సంబంధించినంత వరకూ కొనుగోలు ధరలో చేరతాయి.)

సరుకుల ఉపయోగ విలువను ఉత్పత్తి చేయటంలో కాక వాటి విలువను రాబట్టడంలోనే ఈ ఖర్చులు తగులుగాయి. అవి తక్షణ ఉత్పత్తి ప్రక్రియలో ప్రవేశించవు. అయితే అది చలామణి ప్రక్రియలో భాగం కనుక మొత్తం పునరుత్పత్తి ప్రక్రియలో కూడా భాగమే.

ఈ ఖర్చులలో అన్నిటికంటే ఆసక్తిదాయకమైన అంశం ఇక్కడే అస్థిర పెట్టుబడిగా అడ్వాన్సు చేయబడిన ఖర్చు. (ఈ క్రింది ప్రశ్నలను కూడా విశ్లేషించాలి. మొదటిది సరుకుల విలువలో కేవలం అవసర శ్రమ మాత్రమే ప్రవేశిస్తుందన్న నియమం చలామణి ప్రక్రియలో ఎలా పనిచేస్తుంది? రెండవది, వ్యాపార పెట్టుబడిలో సంచయనం ఎలా జరుగుతుంది? మూడవది, వాస్తవ సామాజిక పునరుత్పత్తి ప్రక్రియ మొత్తంలో వర్తకుని పెట్టుబడి ఎలా వ్యవహరిస్తుంది?)

ఉత్పాదితం సరుకు యొక్క ఆర్థిక రూపాన్ని కలిగి ఉండటం వల్ల ఈ ఖర్చులు తలెత్తుతాయి.

పారిశ్రామిక పెట్టుబడిదారులు పరస్పరం నేరుగా సరుకులను అమ్మటంలో కోల్పోయే శ్రమకాలం (వస్తుగతంగా చూస్తే, సరుకుల చలామణి కాలం) ఈ సరుకులకు విలువను జోడించకపోతే, ఈ శ్రమ కాలం పారిశ్రామిక పెట్టుబడిదారునికి బదులు, వర్తకునికి వర్తించినంత మాత్రాన అది దాని స్వభావాన్ని మార్చదు – అన్నది స్పష్టం. సరుకులను (ఉత్పాదితాలను) డబ్బుగాను, డబ్బును సరుకులుగానూ (ఉత్పత్తి సాధనాలుగానూ) మార్చడం అన్నది పారిశ్రామిక పెట్టుబడి యొక్క అత్యవసర కార్యకలాపం, కనుక తన సొంత చైతన్యాన్ని, అభీష్టాన్ని కలిగిన పెట్టుబడికి వాస్తవంగా మూర్తిమంతమైన పెట్టుబడిదారుని అత్యవసర వ్యవహారం కూడా ఇదే. అయితే ఈ కార్యకలాపాలు విలువను సృష్టించవు. అదనపు విలువను ఉత్పత్తి చేయవు. ఉత్పాదక పెట్టుబడిదారుడు ఈ కార్యకలాపాలను నిర్వహించడం ఆగిపోయిన తరువాత, వీటిని నిర్వహించడం ద్వారానూ, చలామణి రంగంలో పెట్టుబడి పనులను కొనసాగించడం ద్వారానూ వర్తకుడు కేవలం పారిశ్రామిక పెట్టుబడిదారుని స్థానాన్ని తీసుకొంటాడు. ఈ పనులలో అవసరమైన శ్రమ కాలం పెట్టుబడి యొక్క పునరుత్పత్తి ప్రక్రియకు అవసరమైన

కార్యకలాపాలకు వినియోగించబడుతుంది. అయితే అది అదనపు విలువను ఇవ్వదు. వర్తకుడు ఈ కార్యకలాపాలు నిర్వహించకపోతే (ఆ శ్రమ కాలాన్ని వెచ్చించకపోతే) అతడు పారిశ్రామిక పెట్టుబడి యొక్క చలామణి సాధనంగా తన పెట్టుబడిని నియుక్తం చేయడు. అపుడతడు అంతరాయమేర్పడిన పారిశ్రామిక పెట్టుబడిదారుని పనిని కొనసాగించడు. కనుక పారిశ్రామిక పెట్టుబడిదారులు ఉత్పత్తి చేసిన లాభరాశిలో ఒక పెట్టుబడిదారునిగా తన ముందస్తు పెట్టుబడికి అనుగుణమైన రేటులో వాటా పంచుకోలేడు. అదనపు విలువ మొత్తంలో వాటా పంచుకోటానికి, పెట్టుబడిగా తాను అడ్వాన్సు చేసిన విలువను పెంచుకోటానికి, వాణిజ్య పెట్టుబడిదారు వేతన కార్మికులను నియమించనక్కరలేదు. అతని వ్యాపారమూ, పెట్టుబడీ చిన్నదైతే దానిలో అతడొక్కడే పనివాడు కావచ్చు. అతడు సరుకులకు చెల్లించిన కొనుగోలు ధరకు, వాటి వాస్తవ ఉత్పత్తి ధరకు మధ్య వున్న తేడా వల్ల లభించిన లాభం నుంచి అతనికి చెల్లించడం జరుగుతుంది.

అయితే, చిన్న మొత్తమైన తన ముందస్తు పెట్టుబడిపైన వర్తకుడు పొందే లాభం బాగా జీతం వచ్చే నిపుణుడైన వేతన కార్మికుని వేతనాలకంటే ఎక్కువగా ఉండకపోవచ్చు. అంతకంటే తక్కువగా కూడా ఉండవచ్చు. నిజానికి అతడు ఉత్పాదక పెట్టుబడిదారుని అనేక ప్రత్యక్ష వాణిజ్య ఏంజెట్లతో అతడు భుజాలు రాసుకొంటాడు. వీరిలో కొనుగోలుదారులు, అమ్మకందారులు, సంచార ప్రతినిధులు ఉంటారు. వారు వేతనాల రూపంలోనో లేదా ప్రతి విక్రయంలోనో, లాభంలో వాటా రూపంలోనో (శాతాలు, బోనస్‌లు) వారు అతని అంతే ఆదాయాన్ని లేదా అంతకంటే ఎక్కువ ఆదాయాన్ని పొందుతుంటారు. మొదటి సందర్భంలో వర్తకుడు స్వతంత్ర పెట్టుబడిదారునిగా వర్తక లాభాన్ని జేబులో వేసుకొంటాడు. రెండవ సందర్భంలో పారిశ్రామిక పెట్టుబడిదారుని వేతన కార్మికుడైన సేల్స్‌మేన్ లాభంలో ఒక భాగాన్ని వేతనాల రూపంలో గానీ లేదా తాను ఏజెంటుగా ఉన్న పారిశ్రామిక పెట్టుబడిదారుని లాభంలో తదనుగుణమైన నిష్పత్తిలో వాటాను పొందుతాడు. కాగా అతని యజమాని పారిశ్రామిక, వ్యాపార లాభాలు రెంటినీ జేబులో వేసుకొంటాడు. ఈ సందర్భాలన్నింటిలోనూ చలామణి ఏజెంటు దృష్టిలో తన ఆదాయం ఒక మామూలు వేతనంగా తాను నిర్వహించిన పనికి ప్రతిఫలంగా కనిపించవచ్చు లేదా అలా కనిపించకపోయినప్పటికీ మంచి వేతనం పొందుతున్న కార్మికుల జీతం కంటే ఈ లాభం ఎక్కువ కాకపోవచ్చు. అయితే ఈ సందర్భాలన్నింటిలోనూ అతని ఆదాయం వాణిజ్య లాభం నుంచే వస్తుంది. ఎందుకంటే అతని శ్రమ, విలువను ఉత్పత్తి చేసే శ్రమ కాదు.

పారిశ్రామిక పెట్టుబడిదారుని విషయంలో చలామణి క్రియ పొడిగింపబడటం అంటే, 1) వ్యక్తిగతంగా సమయం వృధా కావటమే! ఎందుకంటే అతను ఉత్పత్తి ప్రక్రియకు మేనేజర్‌గా తన పనిని వ్యక్తిగతంగా చేయకుండా ఇది నిరోధిస్తుంది. 2) చలామణి ప్రక్రియలో అంటే విలువ విస్తరించని ప్రక్రియలో, ప్రత్యక్ష ఉత్పత్తి ప్రక్రియకు అంతరాయం కలిగించే ప్రక్రియలో అతని ఉత్పాదితం డబ్బు రూపంలో లేదా సరుకుల రూపంలో ఎక్కువ కాలం వుండిపోతుంది. ఈ ప్రక్రియకు అంతరాయం కలగకుండా ఉండాలంటే ఉత్పత్తిని కుదించాలి లేదా అదే స్థాయిలో ఉత్పత్తి ప్రక్రియ కొనసాగించడానికి మరింత డబ్బు పెట్టుబడి అడ్వాన్సు చేయాలి. అంటే ప్రతీసారి ఇంతకు ముందు పెట్టిన పెట్టుబడిపైన తక్కువ లాభం వస్తుంది. లేదా అంతకు ముందు వచ్చిన లాభాన్ని సంపాదించాలంటే అదనపు డబ్బు

పెట్టుబడిని అడ్వాన్సు చేయాలి. వర్తకుడు పారిశ్రామిక పెట్టుబడిదారుని స్థానం తీసుకొంటే ఇదంతా యథాతథంగా వుంటుంది. పారిశ్రామిక పెట్టుబడిదారుడే చలామణి ప్రక్రియకు మరింత సమయాన్ని వెచ్చించటానికి బదులు వర్తకుడు ఆ పనిలో నిమగ్నమవుతాడు. పారిశ్రామిక పెట్టుబడిదారునికి బదులు వర్తకుడే చలామణిలోకి అదనపు పెట్టుబడిని అడ్వాన్సు చేస్తాడు. పారిశ్రామిక పెట్టుబడిలో పెద్ద భాగాన్ని చలామణి ప్రక్రియలోకి నిరంతరాయంగా మళ్ళించడానికి బదులు, వర్తకుని పెట్టుబడే ఆ ప్రక్రియతో పూర్తిగా ముడివేసుకొని ఉంటుంది. తక్కువ లాభం సంపాదించడానికి బదులు పారిశ్రామిక పెట్టుబడిదారుడు తన లాభంలో కొంత భాగాన్ని పూర్తిగా వర్తకునికి ఇవ్వాల్సి వుంటుంది. అవసరమైన సరిహద్దుల పరిధిలోనే వర్తకుని పెట్టుబడి ఉన్న మేరకు కేవలం చలామణి ప్రక్రియకే ఖర్చయ్యే సమయాన్ని ఈ పెట్టుబడి కార్యకలాపాల విభజన తగ్గిస్తుంది. దీనికోసం తక్కువ అదనపు పెట్టుబడి అవసరం అవుతుంది. మొత్తం లాభానికి వాణిజ్య లాభ రూపంలో కలిగించే నష్టం తగ్గుతుంది. ఇదీ తేడా.

పై ఉదాహరణలో $720_{\text{స్థి.పె}}+180_{\text{అ.పె}}+180_{\text{అ.వి.}}$ వర్తకుని పెట్టుబడి 100 సాయంలో 162 లాభాన్ని అనగా 18% పారిశ్రామిక పెట్టుబడిదారునికి ఇస్తుంది. అంటే లాభంలో కోత 18 అన్నమాట. అయితే ఈ స్వతంత్ర వర్తకుని పెట్టుబడి లేకుండా పారిశ్రామిక పెట్టుబడిదారునికి అవసరమైన అదనపు పెట్టుబడి 200 అయి వుండవచ్చు. కనుక అతను అడ్వాన్సు చేసిన మొత్తం 900కి బదులు 1100 అవుతుంది. అదనపు విలువ 180 కనుక లాభం రేటు $16\frac{4}{11}\%$ మాత్రమే.

తన సొంత వర్తకునిగా వ్యవహరించే పారిశ్రామిక పెట్టుబడిదారు చలామణి ప్రక్రియలో అతని ఉత్పాదితం డబ్బుగా చేతికందడానికి ముందే కొత్త సరుకులను కొనటానికి అదనపు పెట్టుబడినే కాక, తన సరుకు పెట్టుబడి విలువను రాబట్టడానికి అవసరమైన పెట్టుబడిని కూడా (ఆఫీసు ఖర్చులు, వాణిజ్య రంగ ఉద్యోగుల వేతనాలు) అడ్వాన్సు చేస్తే, అంటే చలామణి ప్రక్రియకు సైతం అవసరమైన పెట్టుబడిని అడ్వాన్సు చేస్తే ఇది అదనపు పెట్టుబడి అవుతుందే తప్ప అదనపు విలువను సృష్టించదు. సరుకుల విలువకంటే ఈ ఖర్చులను భర్తీ చేయాల్సి వుంటుంది. ఎందుకంటే ఈ సరుకుల విలువలో ఒక భాగాన్ని ఈ చలామణి ఖర్చులుగా తిరిగి మార్చాల్సి వుంటుంది. దానివల్ల అదనంగా లభించే అదనపు విలువ ఏదీ ఉండదు. మొత్తం సామాజిక పెట్టుబడికి సంబంధించిన మేరకు దానిలో ఒక భాగాన్ని స్వయం విస్తరణ ప్రక్రియలో సంబంధంలేని ద్వితీయ కార్యకలాపాలకోసం అట్టేపెట్టాలి. సామాజిక పెట్టుబడిలో ఈ భాగాన్ని ఈ లక్ష్యంలో నిరంతరాయంగా పునరుత్పత్తి చేయాల్సి వుంటుంది. వ్యక్తిగత పెట్టుబడిదారునికీ, మొత్తంగా పారిశ్రామిక పెట్టుబడిదారుల వర్గానికీ దీనివల్ల లాభం రేటు తగ్గుతుంది. ఒకే అస్థిర పెట్టుబడి మొత్తాన్ని చలనంలో ఉంచటానికి అటువంటి అదనపు పెట్టుబడి మదుపు అవసరమైనందువల్ల కలిగే ఫలితమిది.

చలామణి వాణిజ్యానికి సంబంధించిన ఈ అదనపు ఖర్చు పారిశ్రామిక పెట్టుబడిదారుని నుంచి వ్యాపార పెట్టుబడిదారునికి బదిలీ అయిన మేరకు లాభం రేటులో అటువంటి తగ్గుదలే జరుగుతుంది. అయితే విభిన్నంగానూ అంతకంటే తక్కువ స్థాయిలోనూ జరుగుతుంది. ఈ ఖర్చులు లేకుంటే వర్తకుడు అవసరమైన దానికంటే ఎక్కువ పెట్టుబడిని అడ్వాన్సు చేసి ఉండేవాడనేది స్పష్టం.

ఈ అదనపు పెట్టుబడి మీద లాభం, వాణిజ్య లాభం మొత్తాన్ని పెంచుతుంది. అపుడు సగటు లాభం రేటును సమం చేయటంలో వర్తకుని పెట్టుబడిలో మరింత భాగం పారిశ్రామిక పెట్టుబడితో చేరుతుంది. తద్వారా సగటు లాభం పడిపోతుంది. మన – పై ఉదాహరణలో వర్తకుని పెట్టుబడి 100తోపాటు మరో 50 అదనపు పెట్టుబడిని ఈ ఖర్చుల నిమిత్తం అడ్వాన్సు చేసినట్లయితే అపుడు మొత్తం అదనపు విలువ 180ని ఉత్పాదక పెట్టుబడి 900+150తో కలిపి 1050 పైన పంచబడుతుంది. కనుక సగటు లాభం రేటు $17\frac{1}{7}$కు పడిపోతుంది. పారిశ్రామిక పెట్టుబడిదారు తన సరుకులను వర్తకునికి $900 + 154\frac{2}{7} = 1054\frac{2}{7}$కు అమ్ముతాడు. వర్తకుడు వాటిని 1130 కి (1080 + తాను తిరిగి రాబట్టుకోవలసిన ఖర్చులకుగాను మరో 50) అమ్ముతాడు. అంతేగాక వర్తకుని పెట్టుబడికి పారిశ్రామిక పెట్టుబడికి మధ్య విభజనతోపాటు వాణిజ్య ఖర్చుల కేంద్రీకరణ జరిగి ఆ ఖర్చులు తగ్గుతాయి.

ఇపుడు తలెత్తే ప్రశ్న ఏమంటే వాణిజ్య పెట్టుబడిదారుడు అనగా ఇక్కడ వర్తకుడు పనిలో పెట్టిన వాణిజ్య వేతన కార్మికుల సంగతేమిటి?

ఒక విధంగా అటువంటి వాణిజ్య ఉద్యోగి ఇతరులందరిలాగే వేతన కార్మికుడే. మొదటిది, అతని శ్రమ శక్తి వర్తకుని అస్థిర పెట్టుబడిచేత కొనబడింది. అది అతని ఆదాయంగా ఖర్చు అయ్యే డబ్బుతో కొనబడలేదు. అందువల్ల అది వ్యక్తిగత సేవకోసం గాక పెట్టుబడి విలువను విస్తరించే లక్ష్యంతో కొనబడింది. రెండవది, అతని శ్రమశక్తి విలువ అంటే అతని వేతనాలు, ఇతర వేతన కార్మికుల వేతనాల లాగానే నిర్ణయించబడతాయి. అవి అతని ప్రత్యేక శ్రమశక్తి ఉత్పత్తి పునరుత్పత్తుల ఖర్చుచేత నిర్ణయించబడతాయి, అతని శ్రమ ఉత్పాదితంచేత కాదు.

ఐతే, అతనికి పారిశ్రామిక పెట్టుబడి నేరుగా పనిలో పెట్టిన వేతన కార్మికులకు మధ్య గల భేదాన్ని చూడాలి. అది పారిశ్రామిక పెట్టుబడికీ, వర్తకుని పెట్టుబడికీ మధ్య అనగా పారిశ్రామిక పెట్టుబడిదారునికీ, వర్తకునికీ మధ్య వున్న భేదం వంటిదే. కేవలం ఒక చలామణి ఏజెంట్‌గా వర్తకుడు విలువను గానీ, అదనపు విలువను గానీ ఉత్పత్తి చేయడు. (సరుకులకు అతడు తన ఖర్చుల ద్వారా జోడించే అదనపు విలువ ఇంతకు ముందే ఉన్న విలువల జోడింపుగా మారుతుంది. అయితే అతడు తన స్థిర పెట్టుబడి విలువను ఎలా భద్రపరుస్తాడు అన్న ప్రశ్న ఉండనే వుంది.) దానినిబట్టి ఇవే కార్యకలాపాలలో అతడు పనిలో పెట్టిన వాణిజ్య కార్మికులు అతని కోసం అదనపు విలువను నేరుగా సృష్టించలేదు. ఉత్పాదక కార్మికుల విషయంలో లాగానే ఇక్కడ కూడా వేతనాలు, శ్రమ శక్తి విలువను బట్టి నిర్ణయించబడతాయి – అని మనం భావించాం. వేతనాలను అణచి ఉంచడం ద్వారా వర్తకుడు తన జేబులు నింపుకొంటున్నది, వేతనాలను అణచటం ద్వారా కాదనీ – అనగా తన ఖర్చుల ఖాతాలో పాక్షికంగా మాత్రమే చెల్లించిన శ్రమ కోసం అడ్వాన్సు మొత్తాన్ని చూపడనీ – మరోలా చెప్పాలంటే అతడు డబ్బు నార్జించేది తన గుమాస్తాలను వంచించటం వగైరాల ద్వారా కాదనీ భావిస్తున్నాము.

ప్రత్యక్షంగా ఎటువంటి అదనపు విలువనూ (లాభం అన్నది అదనపు విలువ మారిన రూపం మాత్రమే) తమ యజమానులకు సృష్టించకుండా వాణిజ్య వేతన కార్మికులు ప్రత్యక్ష లాభాలను ఎలా

ఉత్పత్తి చేస్తారన్నది వివరించడం కష్టం కాదు. నిజానికి ఈ ప్రశ్న వాణిజ్య పెట్టుబడుల సాధారణ విశ్లేషణలోనే పరిష్కరించబడింది. పారిశ్రామిక పెట్టుబడి సరుకులలో మూర్తీభవించి ఉన్న శ్రమను అమ్మటం ద్వారా – ఎటువంటి సమతుల్యం చెల్లించబడని శ్రమను అమ్మటం ద్వారా లాభం గడిస్తుంది. అలాగే వర్తకుని పెట్టుబడి కూడా సరుకులలో (సరుకుల ఉత్పత్తిలో మదుపు పెట్టిన పెట్టుబడి, మొత్తం పారిశ్రామిక పెట్టుబడిలో ఒక సమభాగంగా వ్యవహరించిన మేరకు) ఉన్న ప్రతిఫలం ముట్టని శ్రమ అంతటి కోసం ఉత్పాదక పెట్టుబడికి పూర్తిగా చెల్లించక పోవటం ద్వారా, అమ్మకం సమయంలో సరుకులలో అలాగే ఉన్న ఈ ప్రతిఫలం చెల్లించని భాగానికి చెల్లింపుని డిమాండ్ చేయడం ద్వారా వర్తకుని పెట్టుబడి లాభం రాబడుతుంది. అదనపు విలువతో వర్తకుని పెట్టుబడికి ఉన్న సంబంధం పారిశ్రామిక పెట్టుబడికి గల సంబంధం కంటే భిన్నమైనది. పారిశ్రామిక పెట్టుబడి ప్రతిఫలం చెల్లించని ఇతరుల శ్రమను నేరుగా స్వాయత్తం చేసుకోవడం ద్వారా అదనపు విలువను ఉత్పత్తి చేస్తుంది. ఈ అదనపు విలువలో ఒక భాగాన్ని పారిశ్రామిక పెట్టుబడి నుంచి తనకు బదిలీ చేసుకోవటం ద్వారా దానిని వర్తకుని పెట్టుబడి స్వాయత్తం చేసుకొంటుంది.

విలువలను రాబట్టే కార్యకలాపం ద్వారా మాత్రమే వర్తకుని పెట్టుబడి పునరుత్పత్తి ప్రక్రియలో పెట్టుబడిగా వ్యవహరిస్తుంది. కనుక మొత్తం పెట్టుబడి ఉత్పత్తి చేసిన అదనపు విలువలో కొంత భాగాన్ని గ్రహిస్తుంది. వ్యక్తిగత వర్తకుని లాభం ఈ ప్రక్రియలో అతడు పెట్టగల్గిన పెట్టుబడి పరిమాణం పైన ఆధారపడి వుంటుంది. అతడు క్రయ విక్రయాల్లో ఎంత ఎక్కువ పెట్టుబడిని పెట్టగలిగితే అతని గుమాస్తాల చెల్లించబడని శ్రమ అంతరం అంత ఎక్కువగా వుంటుంది. వర్తకుని డబ్బు, పెట్టుబడిగా రూపొందించే కార్యకలాపాన్ని ప్రధానంగా అతని ఉద్యోగులే నిర్వహిస్తారు. ఈ గుమాస్తాల ప్రతిఫలం చెల్లించని శ్రమ అదనపు విలువను సృష్టించదు. కొన్ని అదనపు విలువలను అతడు స్వాయత్తం చేసుకొనేందుకు వీలు కల్గిస్తుంది. ఇది అతని పెట్టుబడికి కూడా వర్తిస్తుంది. కనుక ఇది అతని లాభానికి ఉన్న ఆధారాలల్లో ఒకటి. అలా కాకుంటే వ్యాపార పెట్టుబడిదారీ స్థాయిలో, భారీ స్థాయిలో నిర్వహించబడేదే కాదు.

కార్మికుని ప్రతిఫలం చెల్లించని శ్రమ ఉత్పాదక పెట్టుబడి కోసం నేరుగా అదనపు విలువను సృష్టించినట్లే, వాణిజ్య వేతన కార్మికుని యొక్క ప్రతిఫలం చెల్లించని శ్రమ వర్తకుని పెట్టుబడికోసం ఈ అదనపు విలువలో ఒక వాటాను సంపాదించి పెడుతుంది.

చిక్కు ఇక్కడే వుంది. వర్తకుని శ్రమ కాలమూ, శ్రమా, అప్పటికే ఉత్పత్తి అయిన అదనపు విలువలో ఒక వాటాను సంపాదించినప్పటికీ విలువను సృష్టించవు కాబట్టి వాణిజ్య శ్రమశక్తిని కొనటానికి కేటాయించే అతని అస్థిర పెట్టుబడి సంగతి ఏమిటి? అడ్వాన్సు చేయబడిన వర్తకుని పెట్టుబడి – పెట్టుబడి యొక్క ఖర్చులలో ఈ అస్థిర పెట్టుబడిని చేర్చవచ్చా? అలా కాకుంటే లాభం రేటు సమమయ్యే నియమానికి ఇది విరుద్ధంగా వున్నట్లు కనిపిస్తుంది. అడ్వాన్సు చేస్తున్న పెట్టుబడి 100గా మాత్రమే లెక్కించగల్గినపుడు ఏ పెట్టుబడిదారుడైనా 150 అడ్వాన్సు చేస్తాడా? అలా అయితే అది వర్తకుని పెట్టుబడి స్వభావానికి విరుద్ధంగా వున్నట్లు తోస్తుంది. ఎందుకనంటే పారిశ్రామిక పెట్టుబడిలాగా ఇతర్ల శ్రమను చలనంలో ఉంచటం ద్వారా ఈ రకం పెట్టుబడి పెట్టుబడిగా

వ్యవహరించదు. అది తన సొంత పని అయిన క్రయ విక్రయాలను నిర్వహించడం ద్వారా పెట్టుబడిగా వ్యవహరిస్తుంది. పారిశ్రామిక పెట్టుబడి ఉత్పత్తి చేసిన అదనపు విలువలో ఒక భాగాన్నీ అది పొందడానికి సాధనమూ, కారణమూ ఇదే.

(కనుక మనం ఈ కింది అంశాలను విశ్లేషించాలి. వర్తకులు అస్థిర పెట్టుబడి, చలామణి రంగంలో అవసర శ్రమ నియమం, వర్తకుని శ్రమ తన స్థిర పెట్టుబడి విలువను ఎలా నిలబెట్టు కొంటుంది – అన్న అంశమూ; మొత్తంగా పునరుత్పత్తి ప్రక్రియలో వర్తకుని పెట్టుబడి నిర్వహించే పాత్ర, అంతిమంగా ఒకవైపున సరుకు పెట్టుబడి, డబ్బు పెట్టుబడి చేసే పనే మరోవైపున వాణిజ్య పెట్టుబడి డబ్బుతో వ్యవహరించే పెట్టుబడి చేయడం వగైరా అంశాలను విశ్లేషించాలి.)

ప్రతి వర్తకునికి తన శ్రమ ద్వారా టర్నోవర్ చేయగల్గినంత పెట్టుబడి మాత్రమే వుంటే వర్తక పెట్టుబడి ముక్కచెక్కలవుతుంది. ఉత్పాదక పెట్టుబడి ఉత్పత్తిని పెంచినకొద్దీ, పెట్టుబడిదారీ ఉత్పత్తి పురోగమన క్రమంలో అది అంతకంతకు పెద్ద పరిమాణాలతో పనిచేసినకొద్దీ వర్తక పెట్టుబడి ముక్కచెక్కలుగా చీలిపోయే క్రమం కూడా అదే నిష్పత్తిలో పెరుగుతుంది. కనుక ఈ రెంటిమధ్య వ్యత్యాసం కూడా పెరుగుతుంది. ఉత్పత్తి రంగంలో పెట్టుబడి ఏమేరకు కేంద్రీకరించబడితే ఆమేరకు చలామణి రంగంలో పెట్టుబడి వికేంద్రీకరించబడుతుంది. పారిశ్రామిక పెట్టుబడిదారుని కేవల వాణిజ్య కార్యకలాపాలూ, వాటితోపాటుగా అతని వాణిజ్య ఖర్చులు అనంతంగా పెరిగిపోతాయి. ఎందుకంటే అతను 100 మంది వర్తకులతో వ్యవహరించటానికి బదులు 1000మందితో వ్యవహరించాల్సి ఉంటుంది. కనుక స్వతంత్రంగా వ్యవహరిస్తున్న వర్తకుని పెట్టుబడి వల్ల వచ్చే సౌకర్యాలు మాయమై పోతాయి. కేవలం వాణిజ్య ఖర్చులు మాత్రమే కాక సార్టింగ్, సరుకుల రవాణా వగైరా ఇతర చలామణి ఖర్చులు కూడా పెరుగుతాయి. పారిశ్రామిక పెట్టుబడికి సంబంధించినంత వరకు ఇదీ పరిస్థితి. ఇపుడు మనం వర్తకుని పెట్టుబడిని పరిశీలిద్దాం. మొదట కేవలం వాణిజ్య కార్యకలాపాలను చూద్దాం. చిన్న అంకెలకు పట్టే కాలం కంటే పెద్ద అంకెలతో వ్యవహరించటానికి పట్టే కాలం ఎక్కువగా ఉండదు. 100 పౌండ్ల చొప్పున 10 కొనుగోళ్ళు చేసేందుకు 1000 పౌండ్లు చొప్పున ఒకే కొనుగోలు చేసిన దానికంటే పదింతలు ఎక్కువ సమయం పడుతుంది. వందమంది చిన్న వర్తకులతో వ్యవహరించడానికి జరిపే ఉత్తర ప్రత్యుత్తరాలు, అందుకు పట్టే కాగితం, తపాలా ఖర్చులు ఒక పెద్ద వర్తకునితో వ్యవహరించడానికి పట్టే వాటికన్నా పదిరెట్లు ఎక్కువగా వుంటాయి. ఒక వ్యాపార కార్యాలయంలో స్పష్టంగా నిర్వచించబడిన శ్రమ విభజన ఉంటుంది. ఇందులో ఒకరు ఖాతా పుస్తకాలతో వ్యవహరిస్తారు. మరొకరు డబ్బు వ్యవహారాలు చూస్తారు. మూడవ వ్యక్తి ఉత్తర ప్రత్యుత్తరాలు నిర్వహిస్తాడు. ఒకరు కొంటూ, మరొకరు అమ్ముతారు. మూడో వ్యక్తి ప్రయాణిస్తుంటాడు. ఈ రకంగా శ్రమ కాలం అపారంగా పొదుపు అవుతుంది. కనుక టోకు వ్యాపారంతో పనిచేసే కార్మికుల సంఖ్య ఆ సంస్థ పరిమాణాన్ని బట్టి ఉండదు. ఎందుకంటే పరిశ్రమలో కంటే వాణిజ్యంతో చిన్న స్థాయిలో చేసినా పెద్ద స్థాయిలో చేసినా అదే పనికి అంతే శ్రమ కాలం పడుతుంది. ఈ కారణంచేతనే చారిత్రకంగా కేంద్రీకరణ అన్నది పారిశ్రామికుని వర్క్‌షాప్‌లో కంటే వర్తకుని వాణిజ్యంలో మొదట ప్రారంభమైంది. స్థిర పెట్టుబడుల కేటాయింపులకు సంబంధించి చూద్దాం. ఒక పెద్ద కార్యాలయంకంటే 100 చిన్న గిడ్డంగులకు ఎక్కువ ఖర్చు అవుతుంది. వాణిజ్య సంస్థ ఖాతాలో కనీసం అడ్వాన్సు

చేయాల్సిన ఖర్చులో ప్రవేశించే రవాణా ఖర్చులు వాణిజ్య పెట్టుబడి విభజన పెరుగుతున్న కొద్దీ పెరుగుతాయి.

పారిశ్రామిక పెట్టుబడిదారుడు తన కార్యకలాపాలలో వాణిజ్య విభాగంలో శ్రమకోసమూ చలామణి ఖర్చులకోసమూ ఎక్కువ కేటాయించాల్సి వుంటుంది. ఒక వర్తకుని పెట్టుబడి అనేక మంది చిన్న పెట్టుబడిదారుల మధ్య విభజించబడితే, ఆ విభజన వల్ల దాని కార్యకలాపాల నిర్వహణకు ఎక్కువమంది కార్మికులు అవసరమవుతారు. అదే సరుకు పెట్టుబడి టర్నోవర్‌కు వర్తకుని పెట్టుబడి మరింత ఎక్కువ అవసరమవుతుంది.

సరుకుల క్రయ విక్రయాలలో ప్రత్యక్షంగా పాల్గొంటున్న మొత్తం వర్తకుని పెట్టుబడి క అనుకొందాం. వాణిజ్య ఉద్యోగులకు వేతనాలుగా చెల్లించిన అస్థిర పెట్టుబడిని గ అనుకొందాం. ప్రతి వర్తకుడు సహాయకులు లేకుండా స్వయంగానే నిర్వహించుకొంటున్నపుడు గ లో ఏమాత్రమూ మదుపు పెట్టనపుడు – మొత్తం వర్తకుని పెట్టుబడి క కంటే అప్పుడు క+గ చిన్నదిగా ఉంటుంది. అయినా మనం ఇంకా ప్రధాన ఇబ్బందిని అధిగమించలేదు.

సరుకుల అమ్మకం ధర ఈ క్రింది అంశాలకు చాలాలి. 1) క+గ పైన సగటు లాభాన్ని చెల్లించటానికి సరిపోవాలి. మరేదీ లేకపోయినా ఒక వాస్తవాన్నిబట్టి ఇది సరిపోతుందని రుజువవుతుంది. అదేమంటే, క+గ అనేది గ లేకపోతే అవసరమయ్యే ఒక చిన్న వర్తకుని పెట్టుబడి అయిన మునుపటి క కన్నా క+గ మామూలుగా చిన్నది. అయితే ఈ అమ్మకం ధర, ఈ క్రింది అంశానికి సరిపోవాలి. 2) గ పైన అదనపు లాభానికి సరిపడా మాత్రమే గాక చెల్లించిన వేతనాలయిన వర్తకుని అస్థిర పెట్టుబడి గ ని కూడా భర్తీ చేస్తుంది. ఈ ఆఖరి అంశం వల్ల ఒక చిక్కు సమస్య తల ఎత్తుతోంది. ధరలో గ ఒక కొత్త అంతర్భాగమా? లేక క+గ ద్వారా సంపాదించిన లాభంలో అది ఒక భాగం మాత్రమేనా, వాణిజ్య వేతన కార్మికునికి సంబంధించినంత వరకు వేతనాలుగానూ, వర్తకునికి సంబంధించినంత వరకూ అస్థిర పెట్టుబడిని భర్తీ చేసేదిగానూ వుందా? ఈ చివరి దాని విషయంలో వర్తకుడు అడ్వాన్సు చేసిన క+గ పెట్టుబడిపై అతని లాభం సార్వత్రిక రేటు కారణంగా క కి చెందాల్సిన లాభంతో సరిగ్గా సమానం అవుతుంది. దానితో పాటు లాభం ఇవ్వని వేతనాల రూపంలో అతను చెల్లించేది కూడా ఉంటుంది.

అసలు విషయమేమంటే (అంక గణితం రీత్యా) గ పరిమితుల్ని కనుగొనాలి. సమస్యను ముందు మనం ఖచ్చితంగా నిర్వచిద్దాం. సరుకుల క్రయ విక్రయంలో నేరుగా పెట్టిన పెట్టుబడికి క సంకేతం. ఈ పనిలో వినిమయమైన (సరుకులను ఎత్తిదించటం వగైరా ఖర్చులు) స్థిర పెట్టుబడి వ సంకేతం వర్తకుడు మదుపు పెట్టిన అస్థిర పెట్టుబడికి గ సంకేతం, అని అనుకొందాం.

క తిరిగి పొందటం విషయంలో ఇబ్బందులేవీ తలెత్తవు. ఇది వర్తకునికి డబ్బు రూపంలో కొనుగోలు ధర, ఉత్పత్తిదారునికి ఉత్పత్తి ధర చేతికందడం మాత్రమే. అది వర్తకుడు చెల్లించే ధర. అతడు తిరిగి దానిని అమ్మేటప్పుడు విక్రయ ధరలో భాగంగా దీనిని తిరిగి పొందుతాడు. ఈ క తో పాటు క పైన ఇదివరలో వివరించినట్టు లాభం కూడా పొందుతాడు. ఉదాహరణకు సరుకు ధర 100 పౌండ్లు లాభం 10% అనుకొందాం. అటువంటప్పుడు ఆ సరుకును అతడు 110కి అమ్ముతాడు.

ఇంతకు ముందు సరుకుకైన ఖర్చు 100. వర్తకుని పెట్టుబడి 100. కేవలం దానికి మరో 10ని జోడిస్తుంది.

మనం ఇపుడు వ ని పరిశీలిస్తే మహా అయితే క్రయ విక్రయాలలో ఉత్పత్తిదారుడు వెచ్చించే స్థిర పెట్టుబడి భాగం అంత వుంటుంది. (వ చలామణి ఖర్చు) నిజానికి దానికంటే తక్కువ వుంటుంది. అతనికి ఉత్పత్తిలో ప్రత్యక్షంగా అవసరమైన స్థిర పెట్టుబడికి అది ఒక అదనపు మొత్తం అవుతుంది. అయితే ఈ భాగం ఉత్పత్తి ధరలో నిరంతరాయంగా తిరిగి పొందాల్సి వుంటుంది. లేక ఈ రూపంలో అంతే సరుకు భాగం నిరంతరాయంగా ఖర్చు చేయాల్సి వుంటుంది. లేక మొత్తం సామాజిక పెట్టుబడి దృష్టి నుంచి చూస్తే, ఈ రూపంలో ఇది నిరంతరాయంగా పునరుత్పత్తి కావాల్సి వుంటుంది. ఉత్పత్తిలో నేరుగా మదుపు పెట్టబడిన మొత్తం పెట్టుబడికి లాగే, అడ్వాన్సు చేయబడిన స్థిర పెట్టుబడి యొక్క ఈ భాగానికి కూడా లాభం రేటును పరిమితం చేసే ప్రభావం ఉంటుంది. పారిశ్రామిక పెట్టుబడిదారు తన పరిశ్రమలోని వాణిజ్య విభాగాన్ని వర్తకునికి వదిలివేసిన మేరకు ఈ భాగం పెట్టుబడిని అతడు అడ్వాన్సు చేయనక్కర్లేదు. అతనికి బదులు వర్తకుడు అడ్వాన్సు చేస్తాడు. ఒకరకంగా అతడు దీనిని నామమాత్రంగా చేస్తాడు. ఎందుకంటే అతడు వినియోగం చేసే స్థిర పెట్టుబడిని (సరుకు తరలించడం వగైరాలకయ్యే ఖర్చులు) వర్తకుడు ఉత్పత్తి చేయడు. పునరుత్పత్తి చేయలేడు. దాని ఉత్పత్తి ఒక ప్రత్యేక వ్యాపారమవుతుంది. జీవితావసరాల ఉత్పత్తిదారునికి స్థిర పెట్టుబడిని సరఫరా చేసే వారిలాగే ఈ సరుకు ఉత్పత్తి – కొంతమంది పారిశ్రామిక పెట్టుబడిదారుల పరిశ్రమగా, లేక అందులో భాగంగా వుంటుంది. కనుక మొదటిది, వర్తకుడు ఈ స్థిర పెట్టుబడిని తనకోసం తిరిగి పొందేలా చూస్తాడు. దానిపైన లాభాన్ని పొందుతాడు. కనుక ఈ రెంటి ద్వారా పారిశ్రామిక పెట్టుబడిదారుని లాభం కుదించబడుతుంది. అయితే శ్రమ విభజనతో ముడిపడివున్న పొదుపరితనం, సాంద్రీకరణ వల్ల ఉత్పత్తిదారుడే ఈ పెట్టుబడిని స్వయంగా అడ్వాన్సు చేసి వుండేటప్పటికంటే అది తక్కువగా వుంటుంది. ఆ రకంగా అడ్వాన్సు చేసిన పెట్టుబడి తక్కువగా వుంటుంది. కనుక లాభం రేటులో తగ్గుదల కూడా తక్కువగా వుంటుంది.

కనుక ఇంతవరకు విక్రయ ధరగా వున్నది, క+వ+(క+వ పైన లాభం) ఈ భాగం మన అవగాహనకు ఇబ్బంది కల్గించదు. అయితే ఇక్కడ వర్తకుడు అడ్వాన్సు చేసిన అస్థిర పెట్టుబడి గ ప్రవేశిస్తుంది.

దానివల్ల ఇపుడు అమ్మకం ధర క+వ+గ+(క+వ) పైన లాభం+గ పైన లాభం.

క కేవలం కొనుగోలు ధరను రాబడుతుంది. క పైన లాభాన్ని తప్ప మరిదేన్నీ దానికి జోడించదు. వ కూడా స్వయంగా వ ని వపైన లాభాన్ని జోడిస్తుంది. అయితే పారిశ్రామిక పెట్టుబడిదారుని చేతుల్లో వ+వ పైన లాభం అనగా స్థిర పెట్టుబడి రూపంలో అడ్వాన్సు చేయబడిన చలామణి ఖర్చులో ఒక భాగం + దానికి అనుగుణమైన సగటు లాభం వర్తకుని చేతుల్లో కంటే ఎక్కువగా వుంటుంది. అడ్వాన్సు చేయబడిన పారిశ్రామిక పెట్టుబడి నుంచి క+వని తీసేసిన తర్వాత లెక్కగట్టిన పూర్తి సగటు లాభంగా సగటు లాభం తగ్గుదల కన్పిస్తుంది. క+వ పైన సగటు లాభం నుంచి, తీసివేయటంతో ఈ వ్యవకలనం ఒక ప్రత్యేక పెట్టుబడికి చెల్లించిన వర్తకుని పెట్టుబడిపై లాభంగా కనిపిస్తుంది.

అయితే గ + దానిపైన లాభం విషయంలో పరిస్థితి భిన్నంగా వుంటుంది. ప్రస్తుత

ఉదాహరణలో లాభం రేటు 10% అని అనుకొందాం. కనుక అది గ+$\frac{1}{10}$ అవుతుంది. అసలు చిక్కు వున్నది ఇక్కడే.

మన ఊహ ప్రకారం గ తో వర్తకుడు కొనేది, వాణిజ్య శ్రమ తప్ప మరేమీ కాదు. అది చలామణి పెట్టుబడి కార్యకలాపాలను నిర్వహించే శ్రమ. ఆ కార్యకలాపాలు స్థి. పె.–వా., వా–స్థి. పె. అయితే వాణిజ్య శ్రమ అన్నది సాధారణంగా వర్తకుని పెట్టుబడిగా వ్యవహరించటానికి, సరుకులను డబ్బుగానూ డబ్బును సరుకులుగానూ మార్చటానికి తోడ్పడే శ్రమ అది. విలువలను సృష్టించే శ్రమ కాదు, వాటిని చేతికందజేసే శ్రమ మాత్రమే. ఈ కార్యకలాపాలను పెట్టుబడి నిర్వర్తించిన మేరకు (కనుక ఈ కార్యకలాపాలను పెట్టుబడిదారు నిర్వహిస్తాడు లేదా ఈ పనిని అతని పెట్టుబడితో చేయిస్తాడు.) అది వర్తకుని పెట్టుబడిగా వ్యవహరిస్తుంది. సార్వత్రిక లాభం రేటును క్రమబద్ధం చేయటంలో అంటే మొత్తం లాభం నుంచి తన డివిడెండ్లను పొందటంలో పాల్గొంటుంది. అయితే మొదటిది, గ+దానిపైన లాభంలో శ్రమకు చెల్లింపు. (ఎందుకంటే పారిశ్రామిక పెట్టుబడిదారుడు వర్తకుని అతని సొంత శ్రమకోసం చెల్లించినా, లేక వర్తకుడు చెల్లించే గుమాస్తాల శ్రమకోసం చెల్లించినా – ఈ రెంటికీ తేడా లేదు.) రెండవది వర్తకుడు స్వయంగా చేసే ఈ శ్రమకోసం చెల్లింపుపై లాభం చేరి వున్నట్లు కనిపిస్తుంది. మొదట వర్తకుని పెట్టుబడి దాని గ తిరిగి వచ్చేలా చూసుకొంటాడు. రెండవది దానిపైన అతడు లాభం తీసుకొంటాడు. ఇది ఎలా సాధ్యమవుతుందంటే మొదట అది వర్తకుని పెట్టుబడిగా వ్యవహరించటం వల్ల ఆ పనికి చెల్లించాల్సిన అవసరం ఉంటుంది. రెండవది అది పెట్టుబడిగా వ్యవహరించటం వల్ల లాభాన్ని కోరుతుంది. ఎందుకంటే పనిచేసే పెట్టుబడిగా దాని పనికి లాభం చెల్లించబడుతుంది. అందుకే ఈ సమస్యను పరిష్కరించాలి.

క=100 అని, గ=10 లాభం రేటు 10% అనుకుందాం. వ=0 అనుకొందాం. ఇది ఇక్కడ అప్రస్తుతం. ఇంతకుముందే లెక్కించబడింది కనుక కొనుగోలు ధరలో ఈ అంశాన్ని పరిశీలన నుంచి వదిలేద్దాం. కనుక అమ్మకం ధర = క+లా+గ+లా=క+కలా+గ+గలా (ఇక్కడ లా అనగా లాభం రేటు). మొత్తం 100+10+10+1=121.

గ ని వర్తకుడు వేతనాలలో మదుపు పెట్టకపోతే (గ వాణిజ్య శ్రమ కోసం మాత్రమే చెల్లించ బడుతుంది. కనుక పారిశ్రామిక పెట్టుబడి మార్కెట్లోకి తరలించిన సరుకు పెట్టుబడి విలువను రాబట్టటానికి అవసరమైన శ్రమ ఇది.) విషయం ఇలా వుంటుంది: క కోసం అమ్మటం లేదా కొనటం అన్నది = 100. వర్తకుడు తన కాలాన్ని, తనకున్న కాలాన్నంతటినీ దీనికే వెచ్చిస్తా డనుకొందాం. గ ప్రాతినిధ్యం వహించే వాణిజ్య శ్రమ 10, వేతనాలకు బదులు లాభంచేత చెల్లించబడితే దానికి మరొక వర్తకుని పెట్టుబడి 100 కావాలి. ఎందుకంటే 10% చొప్పున గ=10 అవుతుంది. ఈ రెండో క=100 సరుకుల ధరలోకి అదనంగా ప్రవేశించదు. అయితే 10% మాత్రం ప్రవేశిస్తుంది. కనుక 100 చొప్పున ఇక్కడ కార్యకలాపాలు రెండు జరుగుతాయి = 200. అది 200+20=200కు సరుకులను కొంటుంది.

వర్తకుని పెట్టుబడి చలామణి ప్రక్రియలో నిమగ్నమైన పారిశ్రామిక పెట్టుబడి ఒక భాగపు విడిరూపం తప్ప మరేమీ గాదు. కనుక వర్తకుని పెట్టుబడికి మాత్రమే చెందిన ఈ ప్రత్యేక ధోరణి ఇంకా స్వతంత్రంగా కనిపించకుండా ఇంకా పారిశ్రామిక పెట్టుబడి శాఖలాగా దానిలో నేరుగా

సంబంధాన్ని కలిగి వుండే రూపంలో సమస్యను ప్రాథమికంగా పరిశీలించడం ద్వారా దానికి సంబంధించిన సమస్యలనన్నింటినీ పరిష్కరించాల్సి వుంటుంది. కర్మాగారానికి భిన్నంగా ఒక కార్యాలయంగా వాణిజ్య పెట్టుబడి చలామణి ప్రక్రియలో నిరంతరాయంగా వ్యవహరిస్తుంది. ఇక్కడే, పారిశ్రామిక పెట్టుబడిదారుని కార్యాలయంలోనే మనం ఇపుడు పరిశీలిస్తున్న గ ని మొదట విశ్లేషించాలి.

పారిశ్రామిక వర్క్‌షాపుతో పోలిస్తే ముందు నుంచీ కూడా, ఈ కార్యాలయం అతి చిన్నదిగా వుంటుంది. ఇక మిగిలిన విషయాల సంగతి : ఉత్పత్తి స్థాయి విస్తరించిన కొద్దీ పారిశ్రామిక పెట్టుబడి చలామణి కోసం నిరంతరాయంగా అవసరమైన వాణిజ్య కార్యకలాపాలు, సరుకు పెట్టుబడిగా వున్న ఉత్పాదితాన్ని అమ్మటం కోసం, ఆ రకంగా పొందిన డబ్బును ఉత్పత్తి సాధనాలుగా తిరిగి మార్చటానికి, ఈ మొత్తం ప్రక్రియ ఖాతా నిర్వహించటానికి బహుళీకృతమవుతాయి. ధరలను లెక్కకట్టడం, ఖాతా పుస్తకాలను నిర్వహించడం, నిధుల నిర్వహణ, ఉత్తర ప్రత్యుత్తరాలు జరపడం – ఇవన్నీ ఈ శీర్షిక క్రింద వస్తాయి. ఉత్పత్తి స్థాయి అభివృద్ధి చెందినకొద్దీ అదే నిష్పత్తిలో లేకపోయినప్పటికీ పారిశ్రామిక పెట్టుబడి వాణిజ్య కార్యకలాపాలు కూడా అభివృద్ధి చెందుతాయి. విలువను అదనపు విలువను రాబట్టటంలో నిమగ్నమైన శ్రమ తదితర చలామణి ఖర్చులు కూడా పెరుగుతాయి. ఇందువల్ల వాణిజ్య వేతన కార్మికుల నియామకం తప్పనిసరి అవుతుంది. వీరే కార్యాలయ సిబ్బంది. వీరికోసం కేటాయింపు వేతనాల రూపంలోనే వున్నప్పటికీ ఉత్పాదక శ్రమ కొనుగోలులో కేటాయించిన అస్థిర పెట్టుబడికంటే ఇది భిన్నంగా వుంటుంది. పారిశ్రామిక పెట్టుబడిదారుని డబ్బు కేటాయింపు, అతడు అడ్వాన్సు చేయాల్సిన అతని పెట్టుబడి మొత్తం పెరుగుతుంది. అయితే ఇది ప్రత్యక్షంగా అదనపు విలువను పెంచదు. ఎందుకంటే అప్పటికే సృష్టించిన విలువను రాబట్టటానికి మాత్రమే నియమితమైన శ్రమకోసం కేటాయించే సొమ్ము ఇది. ఈ బాపతు కేటాయింపులన్నింటి లాగానే ఇది కూడా లాభం రేటును తగ్గిస్తుంది. ఎందుకనంటే ఇది ముందస్తు పెట్టుబడిని పెంచుతుందే తప్ప అదనపు విలువను పెంచదు. అదనపు విలువ అ.వి స్థిరంగా వుండి, ముందస్తు పెట్టుబడి మొ.పె అన్నది మొ.పె+ $\triangle$మొ.పెకి పెరిగితే, లాభం రేటు $\frac{\text{అ.వి}}{\text{మొ.పె}}$ కి బదులు, దానికన్నా తక్కువ లాభం రేటు అయిన $\frac{\text{అ.వి}}{\text{మొ.పె} + \triangle \text{ మొ.పె}}$ అవుతుంది. కనుక పారిశ్రామిక పెట్టుబడిదారు స్థిర పెట్టుబడి ఖర్చుల విషయంలో లాగానే ఈ చలామణి ఖర్చులను కనీస స్థాయికి కుదించటానికి ప్రయత్నిస్తాడు. కనుక పారిశ్రామిక పెట్టుబడికి తన వాణిజ్య వేతన కార్మికుల విషయంలో, ఉత్పాదక వేతన కార్మికుల పట్ల ఉండే దృష్టి ఉండదు. మిగిలిన పరిస్థితులన్నీ యథాతథంగా ఉంటే అది ఎంత ఎక్కువమంది వేతన కార్మికుల్ని పనిలో పెడితే అంత ఎక్కువగా ఉత్పత్తి అవుతుంది. అంత ఎక్కువగా అదనపు విలువ లేదా లాభం లభిస్తుంది. అందుకు విరుద్ధంగా ఉత్పత్తి స్థాయి పెరిగినకొద్దీ రాబట్టాల్సిన విలువ, అదనపు విలువల పరిమాణమూ, ఉత్పత్తి అయిన సరుకు పెట్టుబడీ, ఆఫీసు ఖర్చులూ సాపేక్షంగా కాకపోయినా నిరపేక్షంగా అంత ఎక్కువగా ఉంటాయి. ఇదొక తరహా శ్రమ విభజనను సృష్టిస్తుంది. ఏ మేరకు లాభం అన్నది ఈ కేటాయింపులకు ప్రథమ షరతు అవుతుంది. ఇతర విషయాల మాట ఎట్లా వున్నా వాణిజ్య వేతనాల పెరుగుదలతోపాటు వాటిలో కొంత భాగం తరచుగా లాభంలో వాటా చేత చెల్లించబడతాయి. కొంతవరకూ విలువను లెక్కగట్టడంతోనూ, కొంత వరకూ వాటిని రాబట్టడం

తోనూ మరికొంత వరకూ అలా రాబట్టిన డబ్బును ఉత్పత్తి సాధనాలుగా మార్చడంతోనూ సంబంధం ఉన్న మధ్యంతర కార్యకలాపాలలో ఉండే శ్రమ పరిమాణం విలువ రాబట్టాల్సిన విలువ ఉత్పత్తి పరిమాణంపైన ఆధారపడి వుంటుందన్నది సహజమే. ప్రత్యక్ష ఉత్పాదక శ్రమలాగా ఇవి కారణంగా (Cause) పని చేయవు. అయితే ఈ విలువల ఆయా మొత్తాల పరిమాణాల ఫలితంగా మాత్రమే వ్యవహరిస్తాయి. ఇదే తరహా చలామణి ఖర్చులకు వర్తిస్తుంది. ఎక్కువగా కొలవటమూ, తుయ్యటమూ, ఎక్కువ పేకింగు చెయ్యటమూ, రవాణా చెయ్యటమూ జరగాలంటే చేతిలో ఎక్కువ పని ఉండి ఉండాలి. పేకింగ్, రవాణా వగైరాల పరిమాణం ఈ కార్యకలాపాలకు వస్తువులైన సరుకుల పరిమాణంపైన ఆధారపడి వుంటుంది. అంతేకానీ ఈ పనులపైన సరుకుల పరిమాణం ఆధారపడి వుండదు.

వాణిజ్య (Commercial) కార్మికుడు అదనపు విలువను దేనినీ ప్రత్యక్షంగా ఉత్పత్తి చేయడు. అయితే అతని శ్రమ ధర అతని శ్రమ శక్తి విలువపైన, కనుక దాని ఉత్పత్తి ఖర్చులపైన – ఆధారపడి వుంటుంది. కాగా ఈ శ్రమ శక్తి వినియోగమూ, దాని అరుగుదల ఇతర వేతన కార్మికుల విషయంలో లాగానే దాని విలువచేత పరిమితం కావు. కనుక అతని వేతనం, పెట్టుబడిదారునికి లాభం రాబట్టడానికి సాయం చేసిన నిష్పత్తిలోనే ఉండకపోవచ్చు. అతడు పెట్టుబడిదారుడికి ఏం తీసుకొస్తాడు, అతని వల్ల పెట్టుబడిదారునికి ఎంత ఖర్చవుతుంది అన్నవి రెండు వేరు వేరు విషయాలు. అతడు అదనపు విలువను ప్రత్యక్షంగా సృష్టించడు. కానీ అదనపు విలువను రాబట్టడంలో ఖర్చును తగ్గించటం ద్వారా పెట్టుబడిదారుని ఆదాయం పెరగటానికి అతడు తోడ్పడతాడు. ఆ మేరకు అతడు పాక్షికంగా ప్రతిఫలం చెల్లించని శ్రమను నిర్వహిస్తాడు. వాణిజ్య కార్మికుడు ఆ పదానికున్న ఖచ్చితమైన అర్థంలో చూస్తే ప్రతిఫలం కొంత మెరుగ్గా లభించే వేతన కార్మికులకు చెందుతాడు. సగటు శ్రమకు మించిన నిపుణ శ్రమగా అతని శ్రమ వర్గీకరించబడుతుంది. అయినప్పటికీ పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం పురోగమిస్తున్నకొద్దీ ఈ వేతనం సగటు శ్రమతో పోల్చిచూసినపుడు సైతం పడిపోతుంది. ఇది పాక్షికంగా, కార్యాలయంలో పని విభజన వల్ల జరుగుతుంది. కార్మికుని శక్తి ఏకపార్శ్వంగా అభివృద్ధి చెందటం ఇందులో గర్భితం. దాని ఖర్చు మొత్తంగా పెట్టుబడిదారునిపై పడదు. ఎందుకంటే కార్మికుని నైపుణ్యం ఒకే పనిని అదేపనిగా చేయటం ద్వారా దానంతటదే అభివృద్ధి చెందుతుంది. శ్రమ విభజన దానిని ఏక పార్శ్వంగా చేసినకొద్దీ శీఘ్రంగా పెరుగుతుంది. రెండవది అవసరమైన శిక్షణ, వాణిజ్య కార్యకలాపాల జ్ఞానం, భాషాజ్ఞానం వగైరాలు రానురాను మరింత శీఘ్రంగా, తేలికగా, సార్వత్రికంగా, చౌకగా, శాస్త్ర విద్యా రంగాల ప్రగతితోపాటు, పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం బోధనా పద్ధతులను తన ఆచరణ లక్ష్యాలవైపు మళ్ళించినకొద్దీ అధికాధికంగా పునరుత్పత్తి అవుతాయి. సామాజిక విద్య సార్వత్రికం కావటంలో ఇంతకు ముందు తక్కువ జీవన ప్రమాణానికి అలవాటుపడిన వర్గాల నుంచి ఇంతకు ముందు ప్రవేశం లేని, వృత్తుల్లో సైతం వారిని పెట్టుబడిదారులు నియమించగల్గుతారు. అంతేగాక ఇది కార్మికుల సరఫరాను పెంచుతుంది. కనుక పోటీ పెరుగుతుంది. పెట్టుబడిదారీ ఉత్పత్తి ప్రగతితో బాటు, కొన్ని మినహాయింపులతో, వీరి శ్రమశక్తి విలువ తగ్గించబడుతూ వుంటుంది. వారి వేతనం పడిపోతూ వుంటుంది. కాగా వారి శ్రమ స్థోమత పెరుగుతుంది. ఎక్కువ విలువను, లాభాలను,

రాబట్టాల్సినపుడల్లా ఈ కార్మికుల సంఖ్యను పెట్టుబడిదారు పెంచుతాడు. ఈ శ్రమ పెరుగుదల అన్నది ఎపుడూ అధిక అదనపు విలువ ఫలితమే గానీ ఎన్నడూ దానికి కారణం కాదు.[1]

★ ★ ★

కనుక ఒకే పని రెండుసార్లు జరుగుతోంది. ఒకవైపున సరుకు పెట్టుబడి, డబ్బు పెట్టుబడి, (వర్తకుని పెట్టుబడి అన్న నామం ఇవ్వబడింది అందుకే) కార్యకలాపాలు పారిశ్రామిక పెట్టుబడి సంతరించుకొన్న సాధారణ నిర్దిష్ట రూపాలు. మరోవైపున ఈ కార్యకలాపాలకు ప్రత్యేకంగా పరిమితమైన ప్రత్యేక పెట్టుబడులు, ప్రత్యేక పెట్టుబడిదారుల బృందాలు ఉన్నాయి. కనుక ఈ కార్యకలాపాలు పెట్టుబడి స్వయం విస్తరణ ప్రత్యేక రంగాలుగా అభివృద్ధి చెందుతాయి.

వాణిజ్య పెట్టుబడి విషయంలో వాణిజ్య కార్యకలాపాలు చలామణి ఖర్చులు కేవలం వ్యక్తిగత రూపంలో మాత్రమే కనిపిస్తాయి. చలామణికే అంకితమైన పారిశ్రామిక పెట్టుబడి పార్శ్వం సరుకు పెట్టుబడి, డబ్బు పెట్టుబడి రూపంలో మాత్రమే గాక కర్మాగారం పక్కనే, కార్యాలయంగా వుంటుంది. అయితే వాణిజ్య పెట్టుబడి విషయంలో ఇదీ స్వతంత్రమవుతుంది. ఈ సందర్భంలో, కార్యాలయమే దాని కర్మాగారం. చలామణి ఖర్చుల రూపంలో వినియోగించే పెట్టుబడి వాటా పారిశ్రామికుని విషయంలోకంటే పెద్ద వ్యాపారి విషయంలో ఎక్కువగా ఉన్నట్లు కనిపిస్తుంది. ఎందుకంటే, ప్రతి పారిశ్రామిక వర్క్‌షాప్‌లోనూ సంబంధం ఉన్న తమ సొంత కార్యాలయాలతో పాటు, ఆ రకంగా పారిశ్రామిక పెట్టుబడిదారుల వర్గం మొత్తం అందుకు వినియోగించాల్సిన పెట్టుబడి అంతా కొద్దిమంది వర్తకుల చేతుల్లో కేంద్రీకరించబడుతుంది. ఈ చలామణి కార్యకలాపాల నిర్వహణతో పాటు వాటి కొనసాగింపుకు అవసరమయ్యే ఖర్చులను కూడా వారే భరిస్తారు.

పారిశ్రామిక పెట్టుబడిదారుని దృష్టిలో చలామణి ఖర్చులు అనుత్పాదకమైన ఖర్చులుగా కనిపిస్తాయి. అవి నిజంగా అలాంటివే. వర్తకుని దృష్టిలో అవి అతని లాభానికి ఆధారంగా కనిపిస్తాయి. సార్వత్రిక లాభం రేటు నిర్ణీతంగా ఉంటే వాటి పరిమాణాన్ని బట్టి లాభం ఉంటుందని అతడు భావిస్తాడు. ఈ చలామణి ఖర్చులకు కేటాయించాల్సిన డబ్బు వాణిజ్య పెట్టుబడి దృష్టిలో ఒక ఉత్పాదకమైన మదుపు అవుతుంది. ఈ కారణంచేతనే అది కొనే వాణిజ్య శ్రమ కూడా దాని దృష్టిలో వెంటనే ఉత్పాదకమవుతుంది.

★ ★ ★

1. వాణిజ్య కార్మికవర్గాన్ని గురించి 1865లో చెప్పిన ఈ జోస్యం కాల పరీక్షకు ఎలా నిలిచిందో వందలాది జర్మన్ గుమాస్తాలను చూస్తే అర్థమవుతుంది. వీరంతా వాణిజ్య కార్యకలాపాలలో శిక్షణ పొందినవారు. మూడు, నాలుగు భాషల్లో పరిచయముంటుంది. వారానికి 25 షిల్లింగుల చొప్పున లండన్ నగరంలో పని చేయటానికి వీరు సిద్ధంగా వుంటారు. అయినా ఫలితం ఉండదు. ఈ వేతనం ఒక మంచి యంత్రకారుని వేతనం కంటే తక్కువ. ఇక్కడ రాతప్రతిలో రెండు పేజీలు ఖాళీగా వుంది. ఈ అంశాన్ని మరింత వివరంగా పరిశీలించే ఉద్దేశం ఉందని ఇది సూచిస్తుంది. మిగిలిన అంశాల కొస్తే చూ. పెట్టుబడి రెండో సంపుటి (చలామణి ఖర్చులు) ఈ శీర్షిక కింద ప్రస్తావించదగిన వివిధ అంశాలు అక్కడ చర్చించబడ్డాయి - **ఎంగెల్స్.**

## అధ్యాయం - 18

# వర్తక పెట్టుబడి టర్నోవర్; ధరలు

పారిశ్రామిక పెట్టుబడి టర్నోవర్, దాని ఉత్పత్తి కాలాన్ని చలామణి కాలాన్ని కలిపితే వస్తుంది. కనుక అది మొత్తం ఉత్పత్తి ప్రక్రియకు ఆవరించినది. కానీ వర్తకుని పెట్టుబడి వాస్తవంలో సరుకు పెట్టుబడి యొక్క పరాయత (alienated) చలనం తప్ప మరొకటి కాదు. అందువల్ల అది ఒక సరుకు రూప పరివర్తనలో మొదటి దశకు, సరుకు–డబ్బుగా పరివర్తనకు మాత్రమే, ఒక ప్రత్యేక పెట్టుబడి తిరుగు ప్రవాహంగా మాత్రమే ప్రాతినిధ్యం వహిస్తుంది. వాణిజ్య దృష్టి నుంచి డబ్బు – సరుకు, సరుకు–డబ్బు అన్నది వర్తకుని పెట్టుబడి టర్నోవర్. వర్తకుడు తన డబ్బును సరుకులుగా మారుస్తూ కొంటాడు. తన సరుకుల్ని తిరిగి డబ్బుగా మారుస్తూ అమ్ముతాడు. ఆ విధంగా పదేపదే చేస్తూనే ఉంటాడు. చలామణి లోపల పారిశ్రామిక పెట్టుబడి రూప పరివర్తన ఎపుడూ $స_1$–డ–$స_2$ రూపంలో కనిపిస్తుంది. $స_1$, ఉత్పాదిత సరుకు అమ్మకం వల్ల వచ్చిన డబ్బు, కొత్త ఉత్పత్తి సాధనాలైన $స_2$ కొనుగోలుకు ఉపయోగించబడుతుంది. ఆచరణలో ఇది $స_1$ని $స_2$లో మార్పిడి చేయటంలో సమానం అవుతుంది. ఆ రకంగా అదే డబ్బు రెండుసార్లు చేతులు మారుతుంది. రెండు భిన్నమైన సరుకులు $స_1$, $స_2$ మార్పిడికి దాని చలనం మధ్యవర్తిగా ఉంటుంది. అయితే వర్తకుని విషయంలో ఇందుకు విరుద్ధంగా డ–స–$డ^1$ సరుకే రెండుసార్లు చేతులు మారుతుంది. ఇది కేవలం డబ్బు తిరిగి రావటానికి దోహదం చేస్తుంది.

ఉదాహరణకు ఒక వర్తకుని పెట్టుబడి 100 పౌండ్లు, ఆ వర్తకుడు దానితో సరుకులు కొని, వాటిని 110 పౌండ్లకు అమ్మేడనుకొందాం. అపుడతని పెట్టుబడి 100 పౌండ్లు, ఒక టర్నోవర్ పూర్తిచేసింది. ఈ చలనం డ–స–$డ^1$ ఏడాదిలో పునరావృత్తమయ్యే సంఖ్యపైన ఈ టర్నోవర్‌ల సంఖ్య ఆధారపడి ఉంటుంది.

కొనుగోలు ధరకు అమ్మకం ధరకు మధ్య తేడాలో దాగి ఉన్న ఖర్చులను మనం పరిశీలన నుంచి పూర్తిగా వదిలేద్దాం. ఎందుకంటే, మనం విశ్లేషిస్తున్న అంశాన్ని ఏ రకంగానూ ఈ ఖర్చులు మార్చవు.

కనుక, ఒక నిర్ణీత వర్తకుని పెట్టుబడి టర్నోవర్‌ల సంఖ్య ఈ సందర్భంలో కేవలం ఒక చలామణి సాధనంగా డబ్బు పదే పదే చేసే ఆవృత్తాలతో సమానం అవుతుంది. ఒకే నాణెం 10 ఆవృత్తాలు చేయటం ద్వారా, తనకు 10 రెట్లు విలువైన సరుకుల్ని కొంటుంది. అదే విధంగా వర్తకుని యొక్క ఒకే పెట్టుబడి 10 సార్లు టర్నోవర్ అయితే సరుకులలో దాని విలువకు 10 రెట్లు విలువను కొంటుంది. లేదా దానికంటే పదిరెట్లు విలువైన సరుకు పెట్టుబడిని రాబడుతుంది. కనుక

వర్తకుని పెట్టుబడి 100 అంటే, 10 రెట్ల విలువలో 1000కి సమానం అవుతుంది. అయితే ఇక్కడొక తేడా ఉంది. అదేమంటే, చలామణి సాధనంగా డబ్బు చేసే ఆవృత్తిలో విభిన్న హస్తాలగుండా పయనించేది అదే నాణెం. ఆ విధంగా అది అదే పనిని పదే పదే నిర్వహిస్తుంది. చలామణిలో ఉన్న డబ్బు నాణేల పరిమాణపు లోటును తన వేగంతో పూరిస్తుంది. అయితే వర్తకుని విషయంలో అదే డబ్బు పెట్టుబడి, అదే డబ్బు విలువ దాని డబ్బు రూపం ఏమైనప్పటికీ, దాని విలువకు సమానంగా పదే పదే సరుకు పెట్టుబడిని కొంటుంది, అమ్ముతుంది. అదే చేతుల్లోకి తిరిగి వస్తూంటుంది. విలువ + అదనపు విలువగా డ+△డగా తిరిగి ప్రారంభ స్థానానికి వస్తూ ఉంటుంది. దాని టర్నోవర్‌కి ఒక పెట్టుబడి టర్నోవర్ లక్షణాన్ని సంతరించేది ఇదే. అది ఎప్పుడూ చలామణి రంగంలోకి తాను నెట్టిన డబ్బుకంటే ఎక్కువ డబ్బును తీసుకొంటూ ఉంటుంది. ఏమైనప్పటికీ, వర్తకుని పెట్టుబడి టర్నోవర్ వేగం పెరిగితే (పరపతి వ్యవస్థ అభివృద్ధి చెందినపుడు ఒక చెల్లింపు సాధనంగా డబ్బు కార్యకలాపం ప్రబలంగా ఉంటుంది), అదే డబ్బు పరిమాణం మరింత వేగంగా చలామణి అవుతూందన్నమాట.

వాణిజ్య పెట్టుబడి పదేపదే టర్నోవర్ కావటం పదే పదే జరిగే క్రయ విక్రయాలను తప్ప దేన్నీ సూచించదు. కాగా పారిశ్రామిక పెట్టుబడి పదేపదే టర్నోవర్ కావడం మొత్తం పునరుత్పత్తి ప్రక్రియ కాలావధిని, పునరుద్ధరణను సూచిస్తుంది. వినియోగ ప్రక్రియ కూడా ఇందులోనిదే. వర్తకుని పెట్టుబడి దృష్టిలో ఇదంతా బాహ్య పరిస్థితిగా కనిపిస్తుంది. పారిశ్రామిక పెట్టుబడి, మార్కెట్‌లోకి నిరంతరాయంగా సరుకుల్ని తెచ్చి, మళ్ళీ దానినుంచి ఉపసంహరించుకొంటూన్నప్పుడే వర్తకుని పెట్టుబడి, త్వరితంగా టర్నోవర్ కావటం సాధ్యమవుతుంది. పునరుత్పత్తి ప్రక్రియ నెమ్మదిగా జరిగితే వర్తకుని పెట్టుబడి టర్నోవర్ కూడా నెమ్మదిగానే జరుగుతుంది. వర్తకుని పెట్టుబడి ఉత్పాదక పెట్టుబడి టర్నోవర్‌ను పెంపొందించే మాట నిజమే. అయితే అది చలామణి కాలాన్ని తగ్గించిన మేరకే అలా చేయగల్గుతుంది. ఉత్పత్తి కాలంపైన దానికి ప్రత్యక్ష ప్రభావం లేదు. పారిశ్రామిక పెట్టుబడి టర్నోవర్ కాలానికి ఉత్పత్తి కాలం కూడా ఒక అవరోధమే. వర్తకుని పెట్టుబడి టర్నోవర్‌కు ఇది మొదటి అవరోధం. రెండోది పునరుత్పాదక వినియోగం కల్గించే అవరోధంతోపాటు మొత్తం వ్యక్తిగత వినియోగం యొక్క వేగమూ, దాని పరిమాణమూ కూడా అంతిమంగా వర్తకుని పెట్టుబడి టర్నోవర్‌కు పరిమితులు విధిస్తాయి. ఎందుకంటే వినియోగ నిధిలో భాగమైన సరుకు పెట్టుబడి అంతా దీనిపైనే ఆధారపడుతుంది.

అయితే (వాణిజ్య ప్రపంచపు టర్నోవర్‌లలో ఒక వర్తకుడెప్పుడు, మరో వర్తకునికి ఒకే సరుకు అమ్ముతుంటాడు. ఈ రకం చలామణి, సట్టా వ్యాపారం సాగుతున్న కాలంలో ప్రవర్ధమానంగా కనిపిస్తుంది. ఈ టర్నోవర్‌లను మినహాయిస్తే) వర్తకుని పెట్టుబడి ఉత్పాదక పెట్టుబడి విషయంలో స–డ దశను కుదిస్తుంది. రెండవది ఆధునిక పరపతి వ్యవస్థలో మొత్తం సామాజిక డబ్బు పెట్టుబడిలో ఒక పెద్ద భాగాన్ని, ఇంతకు ముందు కొన్న వస్తువులను ఖచ్చితంగా అమ్మటానికి ముందే కొత్త కొనుగోళ్ళు చేయటానికి వీలుగా విడుదల చేస్తుంది. మన వర్తకుడు అంతిమ వినియోగదారునికి నేరుగా అమ్ముతాడా లేక అతనికీ అంతిమ వినియోగదారునికీ మధ్య మరో డజనుమంది మధ్యంతర వర్తకులు ఉన్నారా అన్న దానితో ఇక్కడ ప్రమేయం లేదు. పునరుత్పత్తి ప్రక్రియను నిర్ణీత హద్దులు దాటిపోయేలా ఎపుడైనా వత్తిడి చేయవచ్చు. దాని సంకోచ వ్యాకోచ పరిధి విస్తృతంగా ఉంటుంది.

కనుక ఉత్పత్తిలోనే అది ఏ రకమైన అవరోధాన్నీ ఎన్నుకోదు. సరుకుల స్వభావం మూలంగా స-డ, డ-స వేరైపోవడమే కాక, ఒక నకిలీ డిమాండ్ సృష్టించబడుతుంది. వర్తకుని పెట్టుబడికి స్వతంత్ర ప్రతిపత్తి ఉన్నప్పటికీ దాని చలనం చలామణిరంగంలో పారిశ్రామిక పెట్టుబడి చలనం మాత్రమే. అయితే దాని స్వతంత్ర ప్రతిపత్తి కారణంగా కొన్ని పరిమితుల లోపల పునరుత్పత్తి ప్రక్రియ గమనంతో ప్రమేయం లేకుండా పయనిస్తుంది. తద్వారా ఈ ప్రక్రియని దానిసొంత హద్దుల్ని కూడా దాటిపోయేలా చేయగలదు. ఈ అంతర్గత పరాధీనత, బాహ్య స్వాతంత్ర్యం వర్తకుని పెట్టుబడిని ఏ దశకు నెడుతుందంటే, ఈ అంతర్గత సంబంధం తిరిగి ఒక సంక్షోభం ద్వారా బలవంతంగా పునరుద్ధరించ బడేలా చేస్తుంది.

ప్రత్యక్ష వినియోగ రంగ లావాదేవీలను నిర్వహించే చిల్లర వ్యాపారంలో కాకుండా, టోకు వ్యాపార రంగంలోనూ సమాజం యొక్క డబ్బు పెట్టుబడిని టోకు వ్యాపారానికి అందుబాటులో ఉంచే బ్యాంకింగ్ రంగంలోనూ సంక్షోభం మొదట ప్రారంభమయేది అందువల్లనే.

ఉత్పత్తిదారుడు వాస్తవంగా ఎగుమతిదారునికీ, ఎగుమతిదారుడు తన విదేశీ ఖాతాదారునికీ అమ్మవచ్చు. దిగుమతిదారుడు తన ముడి పదార్థాలను ఉత్పత్తిదారునికి, ఉత్పత్తిదారుడు తన ఉత్పాదితాలను టోకు వ్యాపారికి అమ్మవచ్చు. ఇలా క్రయ విక్రయాలు సాగుతూపోవచ్చు. అయితే ఎక్కడో ఓ అదృశ్య స్థానంలో సరుకులు అమ్మబడకుండా ఉండవచ్చు లేదా, ఉత్పత్తిదారుల దగ్గర, మధ్యవర్తులందరి దగ్గర క్రమంగా సరుకుల విలువ పెరిగిపోయి ఉండవచ్చు. ఈ సమయంలో వినిమయం సాధారణంగా అత్యున్నత స్థాయిలో ఉంటుంది. ఎందుకంటే ఒక పారిశ్రామిక పెట్టుబడి దారుడు వరుసబెట్టి, ఇతర పారిశ్రామిక పెట్టుబడిదారులను అనేకమందిని చలనంలో పెడతాడు, లేదా వారు పనిలో పెట్టిన కార్మికులు పూర్తిగా పనిలో ఉంటారు. కనుక మామూలుకన్నా ఎక్కువ ఖర్చు చేయడానికి వారివద్ద డబ్బు ఉంటుంది. పెట్టుబడిదారుల ఆదాయం పెరుగుదలతో పాటు వారి ఖర్చులు కూడా పెరిగిపోతాయి. మనం రెండో సంపుటంలో గమనించినట్టుగా స్థిర పెట్టుబడికీ, స్థిర పెట్టుబడికీ మధ్య నిరంతరాయమైన చలామణి జరుగుతుంది. (వేగం పుంజుకొన్న సంచయనంలో ప్రమేయం లేకుండా కూడా) మొదట దీనికి వ్యక్తిగత వినియోగంతో ప్రమేయం ఉండదు. అయితే ఈ వినిమయం అన్నది దీనికి నిర్దిష్టమైన పరిమితుల్ని విధిస్తుంది. ఎందుకంటే స్థిర పెట్టుబడి దానికోసమే అది ఉత్పత్తికాదు. వ్యక్తిగత వినియోగానికి అవసరమైన ఉత్పాదితాల యొక్క ఉత్పాదన రంగాలకు స్థిర పెట్టుబడి అధికాధికంగా అవసరమవుతుంది. డిమాండుకు గల అవకాశం వల్ల ప్రేరేపితమైంది. ఈ క్రయ విక్రయాలు నిర్విఘ్నంగా కొంత కాలంపాటు కొనసాగవచ్చు. కనుక అలాంటి శాఖలలో వర్తకుల, పారిశ్రామిక వాణిజ్యం వడిగా నడుస్తుంది. దూరప్రాంతాల మార్కెట్‌లలో అమ్మే వర్తకుల నుంచి (లేదా స్వదేశంలో కూడా తమ సరఫరాలు పేరుకొనిపోయిన వర్తకుల నుంచి) డబ్బు నెమ్మదిగా మరీ తక్కువ మొత్తాల్లో తిరిగి రావడంతో బ్యాంకులు చెల్లింపుల కోసం ఒత్తిడి చేస్తాయి. కొన్ని సరుకులు తిరిగి అమ్మకముందే ప్రామిసరీ నోట్ల గడువు పూర్తయిపోతుంది. దానితో సంక్షోభం సంభవిస్తుంది. బలవంతపు అమ్మకాలు, కేవలం చెల్లింపుల కోసం జరిగే అమ్మకాలు మొదలౌతాయి. భ్రమాత్మకమైన సుభిక్షతను హఠాత్తుగా అంతం చేసే సంక్షోభం ప్రజ్వలించేది అప్పుడే.

అయితే వర్తక పెట్టుబడి టర్నోవర్ యొక్క అర్థరాహిత్యం దాని పైపై స్వభావం మరింత

ఎక్కువ. ఎందుకంటే ఒకే వర్తకుని పెట్టుబడి టర్నోవర్ ఏకకాలంలో లేదా ఒకదాని తర్వాత ఒకటిగా అనేక ఉత్పాదక పెట్టుబడుల టర్నోవర్‌లను పెంపొందించవచ్చు.

వర్తకుని పెట్టుబడి టర్నోవర్ అనేక పారిశ్రామిక పెట్టుబడుల టర్నోవర్‌కు ప్రోద్బలమివ్వటం మాత్రమే కాదు. సరుకు పెట్టుబడి రూప పరివర్తనలో వ్యతిరేక దశలను త్వరితం చేస్తుంది. ఉదాహరణకు వర్తకుడు ఉత్పత్తిదారుడు నుంచి వస్త్రాల్ని కొని బ్లీచర్‌కి అమ్ముతాడు. కనుక ఈ సందర్భంలో వర్తకుని ఒకే పెట్టుబడి టర్నోవర్ అదే స–డ వస్త్రం విలువను రాబట్టడం అన్నది ఇద్దరు పారిశ్రామిక పెట్టుబడిదారుల దృష్టిలో రెండు వ్యతిరేక దశలకు ప్రాతినిధ్యం వహిస్తుంది. వర్తకుడు ఉత్పాదక వినియోగం కోసం అమ్మిన మేరకు అతని స–డ అన్నది ఎప్పుడూ ఒక పారిశ్రామిక పెట్టుబడిదారునికి డ–సగా ఉంటుంది. అలాగే అతని డ–స ఎపుడూ మరో పారిశ్రామిక పెట్టుబడిదారునికి స–డగా ఉంటుంది.

మనం చలామణి ఖర్చులు వ ని ఈ అధ్యాయంలో వదిలేసినట్లుగా వదిలేద్దాం. మరోలా చెప్పాలంటే సరుకుల కొనుగోలుకు అవసరమైన డబ్బుతోపాటు వర్తకుడు అడ్వాన్సు చేసే పెట్టుబడి భాగాన్ని వదిలేద్దాం. అంటే మనం △వ ని, ఈ అదనపు పెట్టుబడిపైన సంపాదించిన అదనపు లాభాన్ని కూడా పరిశీలన నుంచి తొలగిస్తున్నామన్నమాట. లాభమూ, వర్తకుని పెట్టుబడి టర్నోవర్ ధరలను ఎలా ప్రభావితం చేస్తాయో చూడాలంటే తార్కికంగానూ, గణిత శాస్త్రం రీత్యానూ, ఇదే ఖచ్చితమైన, సరైన విశ్లేషణా పద్ధతి.

ఒక పౌను పంచదార ఉత్పత్తి ధర ఒక పౌండు అయితే, 100 పౌండ్లతో వర్తకుడు వంద పౌనుల పంచదార కొనగలుగుతాడు. ఒక ఏడాదిలో అతడు ఈ మొత్తాన్ని అమ్ముతాడు అనుకుందాం. అతని సగటు లాభం వార్షిక రేటు 15% అనుకుందాం. అప్పుడతడు 100 పౌండ్లకు మరో 15 పౌండ్లు జోడిస్తాడు. ఒక పౌండుకు మూడు షిల్లింగులు జోడిస్తాడు. అంటే అతడు ప్రతి పౌను పంచదారను ఒక పౌండు మూడు షిల్లింగులకు అమ్ముతాడు. అయితే ఒక పౌను పంచదార ఉత్పత్తి ధర ఒక షిల్లింగుకు పడిపోతే వర్తకుడు 100 పౌండ్లతో 2000 పౌనుల పంచదారను కొనగలుగుతాడు. ఆ పంచదారను ప్రతి పౌను $1\frac{4}{5}$ పెన్నీలకు అమ్ముతాడు. అయినా ఈ పంచదార వ్యాపారంలో మదుపుపెట్టిన పెట్టుబడిపైన వార్షిక లాభం ప్రతి వంద పౌండ్లపై 15 పౌండ్లే ఉంటుంది. అయితే వర్తకుడు మొదటి సందర్భంలో 100 పౌండ్లు, రెండవ సందర్భంలో 2000 పౌండ్లు అమ్మవలసి ఉంటుంది. ఉత్పత్తి ధర ఎక్కువ తక్కువలకు లాభం రేటుతో ప్రమేయం లేదు. అయితే ప్రతి పౌను పంచదార అమ్మకం ధరను నిర్ణయాత్మకంగా అది ప్రభావితం చేస్తుంది. ఒక నిర్దిష్ట పరిమాణం గల సరుకులు లేదా ఉత్పాదితాలపైన వర్తకుడుగా నిర్ణయించే ధరపైన వర్తకుని లాభంగా అది మారుతూ ఉంటుంది. ఒక సరుకు ఉత్పత్తి ధర తక్కువగా ఉంటే, దాని కొనుగోలు ధర కోసం వర్తకుడు ముందు పెట్టే మొత్తం కూడా తక్కువగా ఉంటుంది. కనుక ఒక నిర్ణీత లాభం రేటులో ఈ చౌక సరుకుల పరిమాణంపైన అతను సంపాదించే లాభం మొత్తం కూడా తక్కువే ఉంటుంది. లేదా ఇలా కూడా చెప్పవచ్చు. అతడప్పుడు ఒక 100 పౌండ్లతో ఈ సరుకులను పెద్ద పరిమాణంలో కొనగలుగుతాడు. మొత్తం లాభం, 15 పెద్ద పరిమాణంలో ఉన్న ఈ సరుకులలో ప్రతి విడి సరుకు

ధరలోను చిన్న అంతర్భాగంగా మారుతుంది. దీనికి విరుద్ధంగా జరిగితే ఫలితం కూడా విరుద్ధంగా ఉంటుంది. ఇదంతా అతడు వ్యాపారం చేస్తున్న రంగంలో పారిశ్రామిక పెట్టుబడి ఉత్పాదకత ఎక్కువ ఉందా, తక్కువ ఉందా అన్న దానిపై ఆధారపడి ఉంటుంది. వర్తకుడు గుత్త వ్యాపారిగా ఉన్నప్పుడు అదే సమయంలో ఉత్పత్తిని కూడా గుత్తగా స్వాయత్తం చేసుకొన్నప్పుడు తప్ప (ఒకప్పుడు డచ్ ఈస్ట్ ఇండియా కంపెనీ పరిస్థితి ఇలాగే ఉండేది.) వర్తకుడు తక్కువ లాభంతో ఎక్కువ సరుకులు అమ్ముతాడా లేక ప్రతి సరుకును ఎక్కువ లాభంతో తక్కువ సరుకుల్ని అమ్ముతాడా అన్నది ఆ వర్తకునిపై ఆధారపడి ఉంటుందనీ ప్రస్తుతం ప్రచారంలో ఉన్న భావనకన్నా హాస్యాస్పదమైనదేదీ లేదు. అతని అమ్మకం ధరపై ఉండే రెండు పరిమితులు ఇవి. ఒకవైపున సరుకుల ఉత్పత్తి ధర. దానిపైన అతనికి ఏ మాత్రం అదుపు ఉండదు. మరోవైపున సగటు లాభం రేటు. దీనిపైన కూడా అతనికి బొత్తిగా అదుపు ఉండదు. అతడు చౌక సరుకులతో వ్యాపారం చేయదలచుకున్నాడా లేక ప్రియమైన సరుకులతో వ్యాపారం చేయదలచుకున్నాడా అన్న అంశాన్ని మాత్రమే అతడు నిర్ణయించుకోగలడు. ఇక్కడ సైతం అతని దగ్గర ఉన్న పెట్టుబడి తదితర పరిస్థితులు తమ ప్రభావాన్ని నెరపుతాయి. కనుక అది మొత్తంగా పెట్టుబడిదారీ ఉత్పత్తి విధాన అభివృద్ధి స్థాయిపైన ఆధారపడి ఉంటుంది. అంతేగానీ వర్తకుడు ఎలా ప్రవర్తిస్తాడు అన్నది అతని ఇష్టాయిష్టాలపై ఆధారపడి ఉండదు. పాత డచ్ ఈస్టిండియా కంపెనీ లాగా ఉత్పత్తిపై గుత్తాధిపత్యం కలిగిన ఒక అచ్చమైన వాణిజ్య సంస్థ, పెట్టుబడిదారీ ఉత్పత్తి తొలి దినాలలో అనుసరించిన పద్ధతిని పూర్తిగా మారిన పరిస్థితుల్లో సైతం కొనసాగించగలనని అనుకుందాము.[1]

ఇతర అంశాలతో పాటు ఈ కింది పరిస్థితులు పరిశీలిస్తే లాభాన్ని గురించిన అన్ని తప్పుడు భావనల్లాగానే, ప్రచారంలో ఉన్న ఈ దురభిప్రాయం కూడా శుద్ధ వాణిజ్యాన్ని, వర్తకుని అపోహలను పరిశీలించడం ద్వారా పుడుతుందని చెప్పడానికి ఉపయోగపడతాయి.

**మొదటిది :** పోటీ. అయితే ఇది వాణిజ్య లాభం విడి వర్తకులు మధ్య, మొత్తం వాణిజ్య పెట్టుబడి వాటాదార్ల మధ్య పంపిణీ విషయంలో మాత్రమే వర్తిస్తుంది. ఉదాహరణకు తన పోటీదార్లను రంగం నుంచి తొలగించడానికి ఒకరు చౌకగా అమ్మితే ఈ సూత్రం వర్తిస్తుంది.

**రెండవది :** ప్రొఫెసర్ రోశ్చర్ లాంటి గొప్పస్థాయి ఆర్థికవేత్త, అమ్మకం ధరలలో మార్పు రావడానికి కారణం ఉత్పత్తి విధానంలో విప్లవాత్మకమైన మార్పులు రావడం వల్ల కాక కేవలం వర్తకుని యొక్క "వ్యవహార జ్ఞానం, మానవతా ధోరణి" కారణమని భావించాడు.[2]

---

1. "ధర ఏమైనప్పటికీ సాధారణ సూత్రం ప్రకారం లాభం ఒకే విధంగా వుంటుంది. పైకి ఎగసి కిందపడే వరద అలలపైన తేలియాడే వస్తువులాంటిదది. కనుక ధరలు పెరిగితే వర్తకుడు కూడా తన ధర పెంచుతాడు. ధరలు తగ్గితే అతడు తన ధరను తగ్గిస్తాడు" (కర్బెట్ యాన్ ఇంక్వయిరీ ఇంటూ ది కాసెస్ ఆఫ్ ది వెల్త్ ఆఫ్ ఇండివిడ్యువల్స్, లండన్ 41, పుట 20) ఇక్కడ ప్రస్తావిస్తున్నది సాధారణ వాణిజ్యం గురించి మాత్రమే. సట్టా వ్యాపారం గురించి కాదు. సట్టా వ్యాపారపు విశ్లేషణ అలాగే వర్తకుని పెట్టుబడి విభజనకు సంబంధించిన అంశాలన్నీ మన పరిశీలన పరిధికి రావు. "వాణిజ్య లాభం అన్నది ధరతో నిమిత్తం లేని పెట్టుబడికి జోడించబడిన ఒక విలువ. రెండవది (సట్టా వ్యాపారం పెట్టుబడి విలువతో లేదా అచ్చంగా ధరలో ఉన్న తేడాపైన ఆధారపడి వుంటుంది. అదే గ్రంథం, పుట 128)"

2. రోశ్చర్ డై గ్రుండ్లాగెన్ డెర్ నేషనల్ ఎకనామి, 1858 - సం.

**మూడవది :** శ్రమ ఉత్పాదకత పెరగడం వల్ల ఉత్పత్తి ధరలు పడిపోతే, అదే కారణంగా అమ్మకం ధరలు కూడా పడిపోతాయి. అప్పుడు తరచూ గిరాకీ సరఫరా కంటే వేగంగా పెరుగుతుంది. దాంతోపాటు మార్కెట్ ధరలు కూడా పెరుగుతాయి. ఫలితంగా అమ్మకం ధరలు సగటు లాభం కంటే ఎక్కువ లాభాన్ని ఇస్తాయి.

**నాలుగవది :** ఒక వర్తకుడు తన అమ్మకం ధరను తగ్గించవచ్చు. (అయితే అది అతడు ధరకు జోడించే మామూలు లాభం కంటే ఎక్కువ ఉండదు.) ఇది అతడు పెద్ద పరిమాణంలో పెట్టుబడిని మరింత వేగంగా టర్నోవర్ చేయడానికి చేస్తాడు. ఇది వర్తకుల మధ్య పోటీకి సంబంధించిన అంశం మాత్రమే.

మొదటి సంపుటంలో మనం ఒక విషయాన్ని విచారించాం. అది ఏమంటే సరుకు ధరలు ఎక్కువ ఉన్నా తక్కువ ఉన్నా ఒక నిర్ణీత పెట్టుబడి ఉత్పత్తి చేసే అదనపు విలువ పరిమాణాన్ని అవి నిర్ణయించవు. అదనపు విలువ రేటును కూడా అవి నిర్ణయించవు. ఒక నిర్దిష్ట పరిమాణం గల శ్రమ ఉత్పత్తి చేసే సరుకుల సాపేక్ష పరిమాణంపై ఆధారపడి సరుకు ధర, దాంతో పాటు ఆ ధరలో ఉన్న అదనపు విలువ ఆధారపడి ఉన్నప్పటికీ ఇది వర్తిస్తుంది. ఒక సరుకు యొక్క నిర్దిష్ట పరిమాణం యొక్క ధరలు విలువకు అనుగుణంగా ఉన్న మేరకు, ధరలు ఈ సరుకులో మూర్తీభవించి ఉన్న మొత్తం శ్రమ పరిమాణంచేత నిర్ణయించబడతాయి. పెద్ద పరిమాణం గల సరుకులో కొద్ది శ్రమ మాత్రమే మూర్తీభవించి ఉంటే ఒక విడిసరుకు ధర తక్కువగా ఉంటుంది. దానితో అదనపు విలువ కూడా తక్కువగానే ఉంటుంది. ఈ సరుకులో ఇమిడి ఉన్న శ్రమలో ప్రతిఫలం ముట్టిన శ్రమ, ముట్టని శ్రమ ఏ రకంగా విడిపోతాయి? దాని ధరలో ఏ భాగం అదనపు విలువకు ప్రాతినిధ్యం వహిస్తుంది? అన్న అంశాలకు ఈ మొత్తం శ్రమ పరిమాణంతో ఎటువంటి ప్రమేయం ఉండదు. దానికి సరుకు ధరతో కూడా ప్రమేయం ఉండదు. ఒక సరుకు విడి ధరలో ఉన్న అదనపు విలువ నిరపేక్ష పరిమాణం పైన అదనపు విలువ రేటు ఆధారపడి ఉండదు. అది దాని సాపేక్ష పరిమాణంపైన ఆధారపడి ఉంటుంది. ఆ సరుకులో ఉన్న వేతనాలతో అది ఏ నిష్పత్తిలో ఉన్నదో దానిపైన ఆధారపడి ఉంటుంది. ప్రతి విడి సరుకులోను అదనపు విలువ నిరపేక్ష పరిమాణం తక్కువగా ఉన్నప్పటికీ అదనపు విలువ రేటు మాత్రం ఎక్కువగా ఉండవచ్చును. ప్రతి సరుకులో ఉన్న అదనపు విలువ నిరపేక్ష పరిమాణం ప్రధానంగా శ్రమ ఉత్పాదకతపైన ఆధారపడి ఉంటుంది. ప్రతిఫలం ముట్టిన, ముట్టని శ్రమగా దాని విభజనపైన అది ఆధారపడడం అన్నది ద్వితీయ ప్రాధాన్యం గల అంశం మాత్రమే.

వాణిజ్య అమ్మకం ధర విషయంలో ఉత్పత్తి ధర ఒక నిర్ణీత బాహ్య పరిస్థితి.

గతంలో వాణిజ్య సరుకు ధరలు అధికంగా ఉండడానికి రెండు ప్రధాన కారణాలున్నాయి: ఒకటి – ఉత్పత్తి ధరలు అధికంగా ఉండడం వల్ల; అనగా శ్రమ ఉత్పాదకత తక్కువగా ఉండడం వల్ల. రెండు – సార్వత్రిక లాభం రేటు అన్నది లేకపోవడం. పారిశ్రామిక పెట్టుబడుల సాధారణ చలనశక్తి ఎక్కువగా ఉంటే వాణిజ్య పెట్టుబడి వాటాకు లభించే అదనపు విలువకంటే ఎక్కువ పరిమాణంలో లభించడం వల్ల ఇలా జరుగుతుంది. కనుక ఈ రెండు అంశాలలోను ఈ పరిస్థితి అంతం కావడం పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం అభివృద్ధి ఫలితమే.

వర్తక పెట్టుబడి టర్నోవర్‌ల వ్యవధి మారుతూ ఉంటుంది. దానినిబట్టి వార్షికంగా ఆ టర్నోవర్‌ల సంఖ్య వివిధ వాణిజ్య శాఖలలో ఎక్కువ తక్కువలుగా ఉండవచ్చు. ఒకే శాఖలో ఆర్థిక చక్రం యొక్క వివిధ దశలలో టర్నోవర్ అన్నది ఎక్కువ వేగంగా లేక తక్కువ వేగంగా ఉండవచ్చు. అయితే అనుభవం ఆధారంగా నిర్ణయించిన సగటు టర్నోవర్‌ల సంఖ్య ఒకటి ఉంటుంది.

వాణిజ్య పెట్టుబడి టర్నోవర్ పారిశ్రామిక పెట్టుబడి టర్నోవర్ కంటే భిన్నంగా ఉంటుందని మనం ఇంతకుముందే గమనించాం. ఇది దాని స్వభావంలోనే ఉంది. పారిశ్రామిక పెట్టుబడి టర్నోవర్‌లోని ఒక దశ స్వతంత్రంగా ఉన్న వాణిజ్య పెట్టుబడి యొక్క లేదా దానిలోని ఒక భాగం యొక్క సంపూర్ణమైన టర్నోవర్‌గా కనిపిస్తుంది. లాభ నిర్ణయంలో, ధర నిర్ణయంలో దానికి గల సంబంధం కూడా భిన్నమైనది.

పారిశ్రామిక పెట్టుబడి విషయంలో దాని టర్నోవర్ ఒకవైపున పునరుత్పత్తి కాలపరిమితిని వ్యక్తం చేస్తుంది. కనుక ఒక నిర్దిష్ట కాల వ్యవధిలో మార్కెట్‌లోకి పంపే సరుకుల మొత్తం దానిపైన ఆధారపడి ఉంటుంది. మరోవైపున దాని చలామణి కాలం ఒక ఆటంకాన్ని సృష్టిస్తుంది. ఈ ఆటంకం విస్తరించవచ్చు. అది ఉత్పత్తి ప్రక్రియ పరిమాణాన్ని ప్రభావితం చేస్తుంది కనుక విలువ, అదనపు విలువల ఉత్పత్తిని చలామణి కాలం అదుపు చేస్తుంది. కనుక వార్షికంగా ఉత్పత్తయ్యే అదనపు విలువ మొత్తంపైన టర్నోవర్ అన్నది నిర్ణాయక అంశంగా వ్యవహరిస్తుంది. దానితోపాటు సార్వత్రిక లాభం రేటు రూపొందటంలో కూడా అదే పాత్ర నిర్వహిస్తుంది. అయితే అది ఒక సానుకూల అంశంగా కాక పరిమితిని విధించే అంశంగా వ్యవహరిస్తుంది. వర్తకుని పెట్టుబడి విషయంలో అలాకాక సగటు లాభం రేటు అన్న ఒక నిర్ణీత పరిమాణం అవుతుంది. వర్తకుని పెట్టుబడి లాభాన్ని లేదా అదనపు విలువను సృష్టించడంలో ప్రత్యక్షంగా పాల్గొనదు. మొత్తం పెట్టుబడిలో దాని వాటాను బట్టి, పారిశ్రామిక పెట్టుబడి ఉత్పత్తి చేసిన మొత్తం లాభం నుంచి అది తన డివిడెండ్‌ను గ్రహించిన మేరకు మాత్రమే సార్వత్రిక లాభం రేటును రూపొందించడంలో అది పాల్గొంటుంది.

రెండో సంపుటంలోని రెండో భాగంలో వర్ణించిన పరిస్థితులలో పారిశ్రామిక పెట్టుబడుల ఆ టర్నోవర్‌ల సంఖ్య ఎంత ఎక్కువగా ఉంటే అది సృష్టించే మొత్తం లాభం కూడా అంతే ఎక్కువగా ఉంటుంది. సార్వత్రిక లాభం రేటు రూపొందడం ద్వారా మొత్తం లాభం వేర్వేరు పెట్టుబడుల మధ్య పంపిణీ అయ్యేది ఉత్పత్తిలో వాటి వాస్తవ పాత్రను బట్టి కాక, మొత్తం పెట్టుబడి పరిమాణంలో వాటి నిష్పత్తిని బట్టి మాత్రమే అన్నది నిజమే. కానీ ఇది అసలు విషయంలోని సారభూతాంశాన్ని మార్చదు. మొత్తం పారిశ్రామిక పెట్టుబడి టర్నోవర్‌ల సంఖ్య ఎంత ఎక్కువగా ఉంటే లాభాల మొత్తం కూడా అంత ఎక్కువగా ఉంటుంది. వార్షికంగా ఉత్పత్తయ్యే అదనపు విలువల మొత్తం కూడా అంత ఎక్కువగా ఉంటుంది. కనుక మిగిలిన పరిస్థితులన్నీ యథాతథంగా ఉంటే లాభం రేటు కూడా అంత ఎక్కువగా ఉంటుంది. కానీ వర్తకుని పెట్టుబడి విషయంలో ఇది భిన్నంగా ఉంటుంది. లాభం రేటు అన్నది దాని విషయంలో ముందే నిర్ణయించబడినటువంటి అంశం. ఈ రేటు ఒకవైపున పారిశ్రామిక పెట్టుబడి ఉత్పత్తి చేసిన లాభం మొత్తంపైన ఆధారపడి ఉంటుంది. మరోవైపున అది మొత్తం వర్తక పెట్టుబడి సాపేక్ష పరిమాణంపైన ఆధారపడి ఉంటుంది. అంటే ఉత్పత్తి చలామణి ప్రక్రియలలో అడ్వాన్స్ చేయబడిన పెట్టుబడి మొత్తంలో దాని పరిమాణం ఏ నిష్పత్తిలో ఉన్నదో దానిని బట్టి కూడా

నిర్ణయించబడుతుంది. దాని టర్నోవర్‌ల సంఖ్య మొత్తం పెట్టుబడితో దానికున్న సంబంధాన్ని, లేదా చలామణి కోసం అవసరం అయిన వర్తకుని పెట్టుబడి సాపేక్ష పరిమాణాన్ని అది నిర్ణయాత్మకంగా ప్రభావితం చేస్తుంది. ఎందుకంటే అవసరమైన వర్తక పెట్టుబడి మొత్తం పరిమాణం, దాని టర్నోవర్‌ల వేగం విలోమానుపాతంలో ఉంటాయన్నది స్పష్టం. అయితే మిగిలిన పరిస్థితులన్నీ యథాతథంగా ఉంటే వర్తక పెట్టుబడి సాపేక్ష పరిమాణం లేదా మొత్తం పెట్టుబడిలో దాని భాగం వర్తక పెట్టుబడి మొత్తం పరిమాణాన్ని బట్టి ఉంటుంది. మొత్తం పెట్టుబడి 10 వేలు, దానిలో వర్తకుని పెట్టుబడి $\frac{1}{10}$ అయితే అది వెయ్యి అవుతుంది. మొత్తం పెట్టుబడి వెయ్యి అయితే వర్తక పెట్టుబడి 100 అవుతుంది. వర్తక పెట్టుబడి మొత్తం పరిమాణం మొత్తం పెట్టుబడి పరిమాణాన్ని బట్టి మారుతుంటుంది. అయితే దాని సాపేక్ష పరిమాణం యథాతథంగానే ఉన్నప్పటికీ ఇది వర్తిస్తుంది. ఇక్కడ మనం సాపేక్ష పరిమాణాన్ని నిర్ణీతమని భావిస్తున్నాం. ఈ ఉదాహరణలో అది మొత్తం పెట్టుబడిలో $\frac{1}{10}$. ఈ సాపేక్ష పరిమాణం టర్నోవర్ చేత నిర్ణయించబడుతుంది. దాని టర్నోవర్ వేగంగా జరిగితే దాని మొత్తం పరిమాణం మొదటి ఉదాహరణలో లాగా వెయ్యి పౌండ్లు కావచ్చు. రెండో ఉదాహరణలో లాగా అది వంద కూడా కావచ్చు. కనుక దాని సాపేక్ష పరిమాణం మాత్రం $\frac{1}{10}$. టర్నోవర్ వేగం తక్కువగా ఉంటే అప్పుడది మొదటి ఉదాహరణలో 2000 గాను, రెండవ ఉదాహరణలో 200 గాను ఉంటుందని భావిద్దాం. అపుడు దాని సాపేక్ష పరిమాణం $\frac{1}{10}$ నుంచి $\frac{1}{5}$కి పెరుగుతుంది. వర్తకుని పెట్టుబడి సగటు టర్నోవర్ తగ్గించే పరిస్థితులు, ఉదాహరణకు రవాణా సాధనాల అభివృద్ధి లాంటివి, వర్తకుని పెట్టుబడి మొత్తం పరిమాణాన్ని తగ్గిస్తాయి. ఆ రకంగా అవి సార్వత్రిక లాభం రేటును పెంచుతాయి. దానికి వ్యతిరేకంగా జరిగితే అందుకు విరుద్ధమైన ఫలితం వస్తుంది. మునుపటి పరిస్థితులతో పోలిస్తే అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ విధానం వర్తకుని పెట్టుబడిపైన రెండు రకాలుగా తన ప్రభావాన్ని నెరపుతుంది. ఒకవైపున వాస్తవంగా రంగంలో ఉన్న వర్తకుని పెట్టుబడి తక్కువగా ఉంటూనే అంతే పరిమాణం గల సరుకులను టర్నోవర్ చేస్తుంది. ఇది వర్తకుని పెట్టుబడి మరింత వేగంగా టర్నోవర్ కావడం వల్ల, ఈ టర్నోవర్ వేగం ఆధారపడే పునరుత్పత్తి ప్రక్రియ వేగంగా జరగడం వల్ల – పారిశ్రామిక పెట్టుబడితో వర్తక పెట్టుబడి నిష్పత్తి తగ్గుతుంది. మరోవైపున పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం అభివృద్ధితోపాటు ఉత్పత్తి అంతా సరుకుల ఉత్పత్తిగా మారుతుంది. దానివల్ల మొత్తం ఉత్పాదితాలన్నీ చలామణి ఏజంట్ల చేతుల్లోకి వస్తాయి. ఇంతకు ముందు ఉత్పత్తి విధానం చిన్న స్థాయిలో ఉత్పత్తి చేసింది. దానిలో ఉత్పత్తిదారుల్లో అత్యధికులు తమ సరుకులను వినియోగదారులకు నేరుగా అమ్మేవారు, లేదా వినియోగదారులు అడిగిన మీదట పని మొదలుపెట్టేవారు. వీటినుంచి ఉత్పత్తిదారులు స్వయంగా ప్రత్యక్షంగా వినియోగం చేసిన ఉత్పాదితాలనూ, వస్తురూపంగా నిర్వహించిన సేవలను ఇక్కడ మినహాయించాలి. కనుక ఇంతకు ముందు ఉత్పత్తి విధానాలలో సరుకు పెట్టుబడితో పోలిస్తే దానిని టర్నోవర్ చేసిన వాణిజ్య పెట్టుబడి ఎక్కువగా ఉన్నప్పటికీ, దాని నిరపేక్ష పరిమాణం తక్కువగా ఉండేది.

1. ఎందుకంటే మొత్తం ఉత్పాదితంలో చాలా చిన్న భాగం మాత్రమే సరుకులుగా ఉత్పత్తయ్యింది. సరుకు పెట్టుబడిగా అది చలామణి రంగంలో ప్రవేశించి వర్తకుల చేతుల్లో పడింది. సరుకు

పెట్టుబడి తక్కువగా ఉండేది కనుక వాణిజ్య పెట్టుబడి కూడా తక్కువగా ఉండేది. అయితే అదే సమయంలో నిష్పత్తి రీత్యా అది పెద్దదిగా ఉండేది. దాని టర్నోవర్ నెమ్మదిగా ఉండడం వల్ల మాత్రమే కాదు, సరుకుల మొత్తంతో పోల్చి చూసినపుడు మాత్రమే కాదు, ఈ సరుకుల మొత్తం ధర ఎక్కువగా ఉండడం వల్ల కూడా, వర్తకుడు అడ్వాన్స్ చేయాల్సిన పెట్టుబడి పెద్దదిగా ఉండాల్సి వచ్చింది. పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానంలో కంటే శ్రమ ఉత్పాదకత తక్కువగా ఉండే పరిస్థితులలో; వాణిజ్య పెట్టుబడి ఎక్కువగా ఉండాల్సి వచ్చింది. అనగా అదే విలువ తక్కువ పరిమాణం గల సరుకులలో ఇమిడి ఉండాలి.

2. పెట్టుబడిదారీ ఉత్పత్తి ప్రాతిపదికపైన పెద్ద పరిమాణంలో సరుకులు ఉత్పత్తి కావడమే కాదు. (ఈ సరుకుల పరిమాణం విలువ తగ్గుతున్న అంశాన్ని పరిగణనలోకి తీసుకోవాలి.) అదే ఉత్పాదితాల పరిమాణమే ఉదాహరణకు ధాన్యం మరింత పెద్ద పరిమాణం గల సరుకుల మొత్తంగా రూపొందుతుంది. రానురాను దానిలో అత్యధిక భాగం వాణిజ్య రంగంలోకి వస్తుంది. పర్యవసానంగా కేవలం వర్తక పెట్టుబడి పరిమాణం మాత్రమే కాక నౌకా రవాణా, రైల్వేలు, టెలిగ్రాఫ్ వగైరా చలామణిలో ఉండే పెట్టుబడి అంతా కూడా పెరుగుతుంది.

3. అయితే ఇది "పెట్టుబడుల మధ్య పోటీ" గురించిన చర్చలో ఒక అంశం. పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానపు ప్రగతితో చిల్లర వ్యాపారంలో ప్రవేశించడం సులభం కావడంతో, సట్టా వ్యాపారం పెరగడంతో విడుదలయిన పెట్టుబడి పెరగడంతో ఖాళీగా పడివుండే లేదా సగమే పనిచేస్తున్న వర్తక పెట్టుబడి పెరుగుతుంది.

అయితే మొత్తం పెట్టుబడిలో వర్తక పెట్టుబడి ఒక నిర్ణీత నిష్పత్తిలో ఉందని అనుకొన్నప్పుడు వివిధ వాణిజ్య శాఖల టర్నోవర్‌లలో ఉన్న తేడా వర్తకుని పెట్టుబడి వాటాకు లభించే మొత్తం పెట్టుబడి పరిమాణాన్ని కానీ లేదా సార్వత్రిక లాభం రేటును కానీ ప్రభావితం చేయదు. వర్తకుడు టర్నోవర్ చేసే సరుకు పెట్టుబడి మొత్తం వర్తకుని లాభాన్ని నిర్ణయించదు. ఈ టర్నోవర్ కోసం అతడు అడ్వాన్స్ చేసిన డబ్బు పెట్టుబడి పరిమాణమే దాన్ని నిర్ణయిస్తుంది. వార్షిక సార్వత్రిక లాభం రేటు 15% అయితే, వర్తకుడు 100 పౌండ్లు అడ్వాన్స్ చేసినపుడు – అతడు ఒక ఏడాదిలో ఒకసారి టర్నోవర్ చేస్తే ఆ సరుకులను అతడు 115కు అమ్ముతాడు. ఈ పెట్టుబడి ఏడాదికి అయిదుసార్లు టర్నోవర్ అయితే తాను కొన్న సరుకు పెట్టుబడిని 103 చొప్పున ఏడాదిలో అయిదుసార్లు అమ్ముతాడు. కనుక ఒక ఏడాదిలో 500కు కొన్న సరుకు పెట్టుబడిని 515 చొప్పున అమ్ముతాడు. అతడు అడ్వాన్సు చేసిన వందపైన అతనికి అదే లాభం రేటు 15 లభిస్తుంది. అలా కాకుంటే వర్తకుని పెట్టుబడి అంతకంటే ఎక్కువ లాభాన్ని సంపాదించి ఉండేది. అది టర్నోవర్‌ల సంఖ్యకు అనుగుణంగా, పారిశ్రామిక పెట్టుబడికన్నా చాలా ఎక్కువగా ఉండేది. అయితే అది సార్వత్రిక లాభం రేటు నియమానికి విరుద్ధం.

కనుక వివిధ శాఖలలో వర్తకుని పెట్టుబడి టర్నోవర్‌ల సంఖ్య సరుకుల వాణిజ్య ధరలను ప్రత్యక్షంగా ప్రభావితం చేస్తుంది. వాణిజ్య ధరకు జోడించిన మొత్తం, ఒక నిర్ణీత పెట్టుబడిపైన వచ్చే వాణిజ్య లాభం – సరుకు ఉత్పత్తి ధరకు వచ్చి చేరిన ఈ మొత్తం – టర్నోవర్‌ల సంఖ్యకు లేదా వివిధ

వాణిజ్య శాఖలలో ఉన్న వర్తక పెట్టుబడుల టర్నోవర్ వేగానికి విలోమ నిష్పత్తిలో ఉంటుంది. ఒక వర్తకుని పెట్టుబడి ఏడాదికి అయిదుసార్లు టర్నోవర్ అయితే; అది సరుకు పెట్టుబడికి సమానమైన విలువకు జోడించే మొత్తం ఒకేసారి టర్నోవర్ అయ్యే మరో వర్తకుని పెట్టుబడి అదే సరుకు పెట్టుబడికి జోడించే విలువలో అయిదవ వంతు ఉంటుంది.

వివిధ వాణిజ్య శాఖలలో పెట్టుబడుల టర్నోవర్ సగటు కాలం అమ్మకం ధరలను మారుస్తుంది. అది ఇలా ఉంటుంది : సార్వత్రిక వార్షిక లాభం రేటుచేత నిర్ణయించబడిన వర్తక పెట్టుబడి నిర్ణీత పరిమాణాన్ని బట్టి లాభం మొత్తం ఉంటుంది. కనుక దానికి ఈ పెట్టుబడి వాణిజ్య కార్యకలాపాల ప్రత్యేక స్వభావంతో నిమిత్తం లేదు. టర్నోవర్ రేటుకు అనులోమంగా సమాన విలువ కలిగిన సరుకులలో అది భిన్నంగా పంపిణీ అవుతుంది. ఉదా : ఒక వర్తకుని పెట్టుబడి ఏడాదికి అయిదుసార్లు టర్నోవర్ అయితే అది $\frac{15\%}{5} = 3\%$ ఉంటుంది. ఒకసారే టర్నోవర్ అయితే సరుకుల ధరకు $15\%$ జోడించబడుతుంది.

కనుక వివిధ వాణిజ్య శాఖలలో ఒకే వాణిజ్య లాభ శాతం సరుకుల అమ్మకం ధరను వాటి విలువలపైన భిన్నమైన శాతాలలో పెరుగుదలను సాధిస్తుంది. ఇదంతా వాటి టర్నోవర్ కాలాలపైన ఆధారపడి ఉంటుంది.

కానీ, పారిశ్రామిక పెట్టుబడి విషయంలో టర్నోవర్ కాలం అన్నది ఉత్పత్తయిన విడి సరుకుల విలువ పరిమాణాన్ని ఏ రకంగానూ ప్రభావితం చేయదు. అయితే ఒక నిర్ణీత కాలంలో ఒక నిర్దిష్ట పెట్టుబడిచేత ఉత్పత్తయిన మొత్తం విలువల్ని, అదనపు విలువల్ని అది ప్రభావితం చేస్తుంది. ఎందుకంటే అది దోపిడీ చేయబడే శ్రమ పరిమాణాన్ని ప్రభావితం చేస్తుంది. ఉత్పత్తి ధరలను గమనించినపుడు ఈ వాస్తవం మరుగుపడటమే కాక దానికి విరుద్ధంగా కూడా కనిపిస్తుంది. ఇంతకు ముందు విశ్లేషించిన నియమాల ప్రకారం వివిధ సరుకుల ఉత్పత్తి ధర తమ విలువల నుంచి వైదొలగుతాయన్నదొక్కటే ఇందుకు కారణం. మొత్తంగా ఉత్పత్తి ప్రక్రియను, యావత్తు పారిశ్రామిక పెట్టుబడి ఉత్పత్తిచేసే సరుకుల రాశిని పరిశీలిస్తే సార్వత్రిక నియమం రుజువైందని వెంటనే తెలుస్తుంది.

కనుక పారిశ్రామిక పెట్టుబడి రూపొందించే విలువలపైన టర్నోవర్ కాలానికున్న ప్రభావాన్ని పరిశీలించడం ద్వారా మనం, సార్వత్రిక నియమాన్ని అంటే, సరుకుల్లో నిక్షిప్తంగా ఉన్న శ్రమకాలం వాటి విలువలను నిర్ణయిస్తాయన్న రాజకీయ అర్థశాస్త్ర ప్రాతిపదికను చేరుకొంటాము. కానీ ధరలపైన వర్తక పెట్టుబడి టర్నోవర్‌ల ప్రభావాన్ని క్షుణ్ణమైన పరిశీలన లేకుండానే గమనిస్తే ధరలను వర్తకుడే యధేచ్ఛగా నిర్ణయిస్తున్నట్టు, ఒక ఏడాదికి ఒక నిర్దిష్ట పరిమాణం గల లాభాన్ని జేబులో వేసుకోవడమే లక్ష్యంగా ఆ పెట్టుబడి వ్యవహరిస్తున్నట్టు అనిపిస్తుంది. ప్రత్యేకించి ఈ టర్నోవర్‌ల ప్రభావం కారణంగా, కొన్ని పరిమితుల లోపల, ఉత్పత్తి ప్రక్రియతో ప్రమేయం లేకుండా సరుకుల ధరలను చలామణి ప్రక్రియే నిర్ణయిస్తున్నట్లు కనిపిస్తుంది. మొత్తంగా పునరుత్పత్తి ప్రక్రియను గురించిన పొరపాటుపై వున్న భావనలన్నీ వర్తక పెట్టుబడిని పరిశీలించడం వల్ల తలెత్తినవే; వర్తక పెట్టుబడి ప్రత్యేక చలనాలవల్ల చలామణి ఏజెంట్ల మనసులో ఉద్భవించే భావనలనుంచి తలెత్తినవే.

ఇక్కడ పాఠకుడు గమనించినట్టుగా పెట్టుబడిదారీ ఉత్పత్తి ప్రక్రియ వాస్తవ అంతర్నిహిత సంబంధాల విశ్లేషణ చాలా సంక్లిష్టమైనదీ, విస్తృతమైనది. పైపైన కనిపించే కేవలం బాహ్య చలనాన్ని నిజమైన అంతర్గత చలనంగా విడమరచి చూపటమే శాస్త్రం యొక్క కర్తవ్యమైతే, పెట్టుబడిదారీ ఉత్పత్తి చలామణి ఏజెంట్ల బుర్రల్లో ఉత్పత్తి నియమాల గురించి తలెత్తే భావనలు ఈ నిజమైన నియమాల నుంచి మౌలికంగా వైదొలగుతాయనేది స్పష్టమే. పైపైన కనిపించే చలనాల చైతన్య పూరితమైన వ్యక్తీకరణలుగా మాత్రమే ఇవి ఉంటాయి. వర్తకుడు, స్టాక్ బ్రోకర్, బ్యాంకర్ – వీరి భావనలు తప్పనిసరిగా వక్రభావనలు అయి ఉంటాయి. ఉత్పత్తిదారుల భావనలు చలామణి చర్యల వల్ల, సార్వత్రిక లాభం రేటు సమం కావడమనే భావంచేత ప్రభావితమవుతాయి.[1] పోటీ అన్నది కూడా వారి బుర్రల్లో ఒక వక్రీకృత పాత్రను ధరిస్తుంది. విలువ, అదనపు విలువల పరిమితులు నిర్ణీతంగా ఉంటే, పోటీ అన్నది విలువల్ని ఉత్పత్తి ధరలుగానూ, వాణిజ్య ధరలుగానూ, అదనపు విలువను సగటు లాభంగా ఎలా మారుస్తుందో గ్రహించడం సులభమవుతుంది. అయితే ఈ పరిమితులు లేనప్పుడు ఈ పోటీ అన్నది సార్వత్రిక లాభం రేటును ఒక స్థాయికి కాక మరొక స్థాయికి మాత్రమే ఎందుకు కుదిస్తుందో, 1500% బదులు 15% కే ఎందుకు కుదిస్తుందో బొత్తిగా అర్థంకాదు. సార్వత్రిక లాభం రేటును పోటీ అన్నది మహా అయితే ఒక స్థాయికి కుదించగలదు. అయితే ఈ స్థాయిని నిర్ణయించే అంశం ఏదీ దానిలో లేదు.

కనుక వర్తకుని పెట్టుబడి దృష్టి నుంచి చూస్తే ధరలను నిర్ణయించేది టర్నోవర్ అనిపిస్తుంది. మరోవైపున పారిశ్రామిక పెట్టుబడి టర్నోవర్ రేటు ఎంతో కొంత శ్రమను దోపిడీ చేయడానికి ఒక నిర్దిష్ట పెట్టుబడికి వీలు కల్పించిన మేరకు అది లాభం పరిమాణంపైన సార్వత్రిక లాభం రేటుపైన నిర్ణయాత్మకమైన, పరిమితి విధించే ప్రభావాన్ని కలిగిస్తుంది. ఈ లాభం రేటు అన్నది వర్తకుని పెట్టుబడికి ఒక బాహ్య వాస్తవంగా ఉంటుంది. అదనపు విలువ ఉత్పత్తిలో దాని అంతర్గత సంబంధం పూర్తిగా తుడిచిపెట్టుకుపోతుంది. ఒకే పరిస్థితులు, ఒకే అంతర్నిర్మాణం కొనసాగుతున్నప్పుడు అదే పారిశ్రామిక పెట్టుబడి రెండుసార్లు బదులు నాలుగుసార్లు టర్నోవర్ అయితే; అప్పుడు అది రెండు రెట్ల అదనపు విలువను, కనుక లాభాన్ని ఉత్పత్తి చేస్తుంది. ఒక మెరుగైన ఉత్పత్తి పద్ధతిపైన ఈ పెట్టుబడికి గుత్తాధిపత్యం ఉన్న మేరకు అది స్పష్టంగా కనిపిస్తుంది. మెరుగైన ఉత్పత్తి పద్ధతి వల్లనే టర్నోవర్ వేగం సాధ్యమైంది. అలాకాక విభిన్న వాణిజ్య శాఖలలో టర్నోవర్ కాలాలలో తేడాలు ఒక వాస్తవంతో ప్రతిబింబితమవుతాయి. అదేమంటే ఒక నిర్ణీత సరుకు పెట్టుబడి టర్నోవర్‌పైన సంపాదించిన లాభం – ఈ సరుకు పెట్టుబడిని డబ్బు పెట్టుబడి టర్నోవర్ చేసే సంఖ్యకు విలోమంగా ఉంటుంది. చిన్న చిన్న లాభాలు వేగంగా తిరిగివచ్చే ప్రతిఫలాలు అన్నది షాపు యజమానికి ఒక సూత్రంగా కనిపిస్తుంది. అది అతడు ఒక సూత్రంగా భావించి అనుసరిస్తాడు.

---

1. ఇది అమాయకంగా ఉన్నప్పటికీ సరైన వ్యాఖ్యే. ఒకే సరుకును విభిన్న విక్రయదార్ల నుంచి విభిన్న ధరలకు కొనడం అన్నది తరచుగా అంచనాలలో తప్పులు కారణంగా జరుగుతుంది. (ఫెల్లర్, ఓడర్ మాన్, అడాస్ గాంజ్..... 1859) కేవలం సైద్ధాంతికమైన, అంటే ఊహాత్మకమైన ఈ అంశం ధరల నిర్ణాయక అంశంగా ఎలా పనిచేస్తుందో ఇది తెలియచేస్తుంది.



మిగతా విషయాలకు సంబంధించి, ఒక విషయం స్పష్టం. ఒకప్పుడు వేగంగాను, మరొకప్పుడు నెమ్మదిగాను ఉంటూ పరస్పరం పరిహరించుకుంటూ మార్పిడి చేసుకుంటూ టర్నోవర్‌లతో నిమిత్తం లేకుండా వర్తకుని పెట్టుబడి యొక్క ఈ టర్నోవర్ నియమం ప్రతి ప్రత్యేక శాఖలోను మొత్తం వర్తక పెట్టుబడి చేసే టర్నోవర్‌ల సగటుకు మాత్రమే వర్తిస్తుంది. గ వ్యవహరిస్తున్న శాఖలోనే వ్యవహరించే క పెట్టుబడి, సగటు టర్నోవర్‌ల సంఖ్యకంటే ఎక్కువ టర్నోవర్‌లు చేయవచ్చు లేదా తక్కువ టర్నోవర్‌లు చేయవచ్చు. ఈ సందర్భంలో ఇతర్లు కూడా ఎక్కువ లేదా తక్కువ టర్నోవరు చేస్తారు. ఈ శాఖలో మదుపు పెట్టబడిన మొత్తం వర్తకుల పెట్టుబడి టర్నోవర్‌ను ఇది మార్చదు. అయితే ఇది ఆయా వర్తకునికి లేదా షాపు యజమానికి చాలా నిర్ణయాత్మకమైన అంశం. ఈ విషయంలో అతడు, పారిశ్రామిక పెట్టుబడిదార్ల లాగానే సగటు పరిస్థితుల కంటే మెరుగైన పరిస్థితుల్లో వ్యవహరిస్తున్నప్పుడు అదనపు లాభం సంపాదిస్తాడు. పోటీ అతన్ని ఒత్తిడి చేస్తే సగటు లాభం కంటే తగ్గించకుండానే అతడు తన వస్తువులను మిగిలిన వారికంటే చౌకగా అమ్మగలుగుతాడు. తన పెట్టుబడిని మరింత వేగంగా టర్నోవర్ చేయడానికి తోడ్పడే పరిస్థితులు అమ్మకానికి వస్తే అనగా షాపు పెట్టడానికి అనుకూలమైన స్థలం వగైరాలు అమ్మకానికి వస్తే అతడు దానికోసం అదనపు కౌలు చెల్లించగలుగుతాడు. ఆ రకంగా అతడు తన అదనపు లాభంలో ఒక భాగాన్ని భూమి కౌలుగా మారుస్తాడు.

★ ★ ★

# అధ్యాయం - 19

# డబ్బుతో వ్యవహరించే పెట్టుబడి

**పా**రిశ్రామిక, వాణిజ్య పెట్టుబడి యొక్క చలామణి ప్రక్రియలో డబ్బు నిర్వహించే కేవల సాంకేతికమైన చలనాలు (పారిశ్రామిక పెట్టుబడి యొక్క చలామణి గమనంలో కొంత భాగాన్ని వాణిజ్య పెట్టుబడి తనదిగా చేసుకొంటుంది. కాబట్టి వాణిజ్య పెట్టుబడిని కూడా ఇప్పుడు చేర్చవచ్చు.) కేవలం ఈ కార్యకలాపాలు తన ప్రత్యేక కార్యకలాపాలుగా నిర్వహించే ఒక ప్రత్యేక పెట్టుబడి యొక్క విధిగా వైశిష్ట్యాన్ని సంతరించుకొన్నప్పుడు, అవి ఈ పెట్టుబడిని డబ్బుతో వ్యవహరించే పెట్టుబడిగా మారుస్తాయి. పారిశ్రామిక పెట్టుబడి యొక్క, మరింత ఖచ్చితంగా చెప్పాలంటే వాణిజ్య పెట్టుబడి యొక్క ఒక భాగం ఎల్లప్పుడూ స్థూలంగా డబ్బు రూపంలో లభిస్తుంది. దరహం మీద (Ingeneral) డబ్బు పెట్టుబడిగా కనిపిస్తుంది. అంతేకాదు. ఈ సాంకేతిక కార్యకలాపాలలో నిమగ్నమై ఉన్న డబ్బు పెట్టుబడిగా కూడా కనిపిస్తుంది. మొత్తం పెట్టుబడిలో ఒక నిర్దిష్ట భాగం మిగిలిన పెట్టుబడి నుంచి విడిపోయి, డబ్బు పెట్టుబడి రూపంలో వేరుపడి ఉంటుంది. మొత్తం పారిశ్రామిక, వాణిజ్య పెట్టుబడిదారుల వర్గానికి ప్రత్యేకంగా ఈ కార్యకలాపాలు నిర్వహించడమే దాని పెట్టుబడిదారీ విధి అవుతుంది. వాణిజ్య పెట్టుబడి విషయంలో లాగానే డబ్బు పెట్టుబడి రూపంలో చలామణి ప్రక్రియలో నిమగ్నమైన పారిశ్రామిక పెట్టుబడిలోని ఒక భాగం మిగిలిన పెట్టుబడి నుండి వేరైపోయి, ఆ పెట్టుబడి కోసం ఈ పునరుత్పత్తి ప్రక్రియ కార్యకలాపాలను నిర్వహిస్తుంది. కనుక డబ్బు పెట్టుబడి యొక్క ఈ చలనాలు పునరుత్పత్తి ప్రక్రియలో నిమగ్నమై ఉన్న పారిశ్రామిక పెట్టుబడిలోని ఒక ప్రత్యేక భాగం యొక్క చలనాలు మాత్రమే.

పెట్టుబడి కొత్తగా మదుపు పెట్టబడినప్పుడు మాత్రమే, ఆ మేరకు మాత్రమే (ఇది సంచయనానికి కూడా వర్తిస్తుంది) డబ్బు రూపంలో ఉన్న పెట్టుబడి ఈ చలనం యొక్క ప్రారంభ బిందువుగాను, అంతిమ ఫలితంగాను కనిపిస్తాయి. అయితే ఈ ప్రక్రియలో అప్పటికే నిమగ్నమై ఉన్న మిగిలిన పెట్టుబడులకు ఈ ప్రథమ, అంతిమ బిందువులు కేవలం మజిలీ బిందువులుగా కనిపిస్తాయి. సాధారణ సరుకు చలామణి విషయంలో ఇంతకు ముందే గమనించినట్లుగా పారిశ్రామిక పెట్టుబడి ఉత్పత్తి రంగాన్ని వదలిన క్షణం నుంచి అది తిరిగి ప్రవేశించే క్షణం వరకు స'-డ-స అనే రూపాంతరానికి గురి అవుతుంది. నిజానికి ఇది రూపాంతరంలో ఒక దశ యొక్క అంతిమ ఫలితానికి ప్రాతినిధ్యం వహిస్తుంది. దానికి అనుబంధంగా ఉన్న దీని తిరుగు దశకు తొలి బిందువుగా మారుతుంది. పారిశ్రామిక పెట్టుబడి యొక్క స-డ వర్తకుని పెట్టుబడి దృష్టిలో ఎప్పుడూ డ-స-డ అయినప్పటికీ, ఆ ప్రక్రియ ప్రారంభం అయిన తరువాత వర్తకుని పెట్టుబడికి ఈ ప్రక్రియ స-డ-స అవుతుంది. అయితే అది

ఏకకాలంలో స–డ, డ–స చర్యలను నిర్వహిస్తుంది. అంటే స–డ దశలో ఒక పెట్టుబడి, డ–సలో మరో పెట్టుబడి ఉందని చెప్పడం కాదు. ఒకే పెట్టుబడి నిరంతరాయంగా ఏకకాలంలో, ఉత్పత్తి ప్రక్రియ నిరంతరాయత కారణంగా కొంటూ అమ్ముతూ ఉంటుందని అర్థం. ఏకకాలంలో రెండు దశల్ని గమనించవచ్చు. దానిలో ఒక భాగం తరువాత సరుకులుగా, తిరిగి మార్చబడడానికి వీలుగా డబ్బుగా మారుతుంది. అదే సమయంలో మరో భాగం తరువాత డబ్బుగా మార్చబడడానికి వీలుగా సరుకులుగా మారుతుంది.

ఇదంతా సరుకు మార్పిడి రూపంపైన ఆధారపడి ఉంటుంది. డబ్బు ఇక్కడ చలామణి సాధనంగా వ్యవహరిస్తోందా, చెల్లింపు సాధనంగా వ్యవహరిస్తోందా అన్నదానిపై ఆధారపడి ఉంటుంది. ఈ రెండు సందర్భాలలోను పెట్టుబడిదారు చాలామంది వ్యక్తులకు డబ్బు చెల్లించాలి. చాలామంది వ్యక్తుల దగ్గర్నుంచి డబ్బు గ్రహించాలి. ఇలా చెల్లించే, గ్రహించే ఈ సాంకేతిక కార్యకలాపం డబ్బు చెల్లింపు సాధనంగా వ్యవహరించిన మేరకు, ఇవ్వాల్సిన, రావాల్సిన మొత్తాలను సరి చూడవలసిన అవసరం ఉన్న మేరకు, ఖాతాలను సర్దాల్సిన అవసరం ఉన్న మేరకు, ఇది కూడా శ్రమే. ఈ శ్రమ చలామణి ఖర్చు. అంటే ఇది విలువను సృష్టించే శ్రమ కాదు. ప్రత్యేక ఏజంట్లచే లేదా పెట్టుబడిదారుల బృందంచే మిగిలిన పెట్టుబడిదారీ వర్గం కోసం ఈ కార్యకలాపం నిర్వహించబడుతుంది. ఆ విధంగా ఇది కుదించబడుతుంది.

పెట్టుబడిలో ఒక నిర్దిష్ట భాగం పెట్టుబడి నిల్వ ధనంగా, డబ్బు పెట్టుబడికాగల సొమ్ముగా, కొనుగోలు సాధనాల నిల్వగా, చెల్లింపు సాధనాల నిల్వగా పనిలో పెట్టడానికి సిద్ధంగా ఉన్న డబ్బు రూపంలోని పని లేని పెట్టుబడిగా చేతుల్లో నిరంతరాయంగానే సిద్ధంగా ఉండాలి. మరో భాగం నిరంతరాయంగా వెనక్కు ధారాప్రవాహంగా వస్తూంటుంది. వసూలు చేయడం, చెల్లించడం, ఖాతా నిర్వహించడంతోపాటు ఈ నిల్వధనాన్ని సురక్షితంగా ఉంచాల్సిన అవసరం ఉంది. ఇదే ఒక కార్యకలాపం. ఇది నిజానికి నిల్వధనాన్ని నిరంతరాయంగా చలామణి సాధనంగానూ, చెల్లింపు సాధనంగానూ మారుస్తూ అమ్మకాల ద్వారా, బాకీలు తిరిగి రావడం ద్వారా దాని నిరంతరాయంగా పునరుద్ధరించే పని డబ్బు రూపంలో ఉన్న పెట్టుబడిలోని ఈ భాగం పెట్టుబడి నిధినుండి వేరుపడి ఇలా నిరంతరాయంగా, చలనంలో ఉంచటానికి ఈ కేవల సాంకేతికమైన ఈ విధికి ప్రత్యేకమైన శ్రమ, ఖర్చు అవసరమవుతున్నాయి. ఈ ఖర్చులు చలామణి ఖర్చులుగా వర్గీకరించబడుతున్నాయి.

పెట్టుబడి కార్యకలాపాలపై ఆధారపడిన ఈ సాంకేతిక కార్యకలాపాలను మొత్తం పెట్టుబడిదారీ వర్గం కోసం సాధ్యమైనంత వరకు ఒక ప్రత్యేక ఏజెంట్ల వర్గం లేదా పెట్టుబడిదారుల్లో ఒక ప్రత్యేక వర్గం తమ ప్రత్యేకమైన విధిలా నిర్వహించాల్సి వస్తుంది; ఈ కార్యకలాపాలు వారి చేతిలో కేంద్రీకృతం కావలసి వస్తుంది. శ్రమ విభజన దీనిని అవసరం చేస్తుంది. వర్తకుని పెట్టుబడి విషయంలో లాగానే ఇక్కడ శ్రమ విభజన రెండర్థాలలో ఉంటుంది. ఇది ఒక ప్రత్యేకమైన వ్యవహారం అవుతుంది. మొత్తం వర్గం కోసం డబ్బు పనులను నిర్వహించే ప్రత్యేక వ్యవహారం కావడం వల్ల కేంద్రీకరించబడి భారీ స్థాయిలలో నిర్వహించబడుతుంది. దానిలోనే అంతర్గతంగా మరింత శ్రమ విభజన కొనసాగుతుంది. అది వివిధ స్వతంత్ర శాఖలుగా విభజింపబడటం ద్వారానూ, ఈ శాఖల లోపలే వేరు వేరు భాగాలుగా పరివిభజితం (Segmentation) కావడం ద్వారానూ (పెద్ద కార్యాలయాలు అసంఖ్యాకమైన గుమాస్తాలు,

క్యాషియర్లు, ఇతర రకాల (శ్రమ విభజన) కొనసాగుతుంది. డబ్బు వసూలు చేయడం, చెల్లించడమూ, ఖాతాలను సర్దడమూ, తక్షణ ఖాతాలను (Current accounts) నిర్వహించడమూ, డబ్బును భద్రపరచడమూ వగైరా కార్యకలాపాలన్నీ, ఈ సాంకేతిక కార్యకలాపాలను అవసరం చేసిన చర్యల నుంచి దూరమవుతాయి. పెట్టుబడి యొక్క డబ్బుగా వ్యవహరించే పెట్టుబడి భాగం ఈ కార్యకలాపాల కోసం అడ్వాన్స్ చేసేలా చేస్తాయి.

వివిధ కార్యకలాపాలను ప్రత్యేక వ్యవహారాలుగా వేరుచేయడమన్నది డబ్బు వ్యాపారానికి దారితీస్తుంది. అసలు డబ్బు యొక్క విభిన్న లక్ష్యాల నుంచి, దాని కార్యకలాపాల నుంచి అది తలెత్తుతుంది. కనుక పెట్టుబడి తన డబ్బు రూపంలో నిర్వహించాల్సిన కార్యకలాపాల నుంచి తల ఎత్తుతుంది.

ఇంతకు ముందు వివిధ గణాల మధ్య ఉత్పాదితాల మార్పిడి ద్వారా ద్రవ్య వ్యవస్థ అభివృద్ధి చెందిందని నేను పేర్కొన్నాను.[1]

కనుక డబ్బుతో వ్యాపారం చేయడం, డబ్బు సరుకుతో వాణిజ్యం ఆదిలో ఆ రకంగా అంతర్జాతీయ వాణిజ్యం నుంచి అభివృద్ధి చెందింది. విభిన్న జాతీయ నాణేలు ఉన్నప్పటి నుంచి విదేశాలలో కొనుగోలు చేసే వ్యాపారులు తమ జాతీయ నాణేలను ఆ విదేశీ స్థానిక నాణేలతో మార్పిడి చేయాల్సి ఉండేది. లేదా ప్రపంచ డబ్బైన వెండి, బంగారాలతో విభిన్న నాణేలను మార్పిడి చేయాల్సి ఉండేది. అందుచేతనే ఆధునిక ద్రవ్య వ్యవస్థకు మార్పిడి వ్యాపారమన్నది ఒక సహజ పునాదిగా పరిగణించబడుతుంది.[2] దానిలో నుంచి మార్పిడి బ్యాంకులు అభివృద్ధి చెందాయి. దానిలో

1. ఎ కాంట్రిబ్యూషన్ టు ద క్రిటిక్ ఆఫ్ పొలిటికల్ ఎకానమి.
2. "నాణేలలో వాటి బరువు రీత్యా వాటిని నాణేలుగా మార్చిన తీరు రీత్యా అనేక భేదాలు ఉండటం కారణంగా ఆయా రాజకుమారులూ, పట్టణాలు నాణేలను వేర్వేరు రకాలుగా తయారు చేయడం వలన విభిన్న నాణేలకు స్థానిక ద్రవ్యంతో మార్పిడి అవసరమైనచోట్ల అక్కడ వర్తకులకు వీలుగా ఉండేలా వాణిజ్య సంస్థలు వెలిశాయి. నగదు చెల్లింపులు చేయడంకోసం విదేశీ మార్కెట్‌లో ప్రవేశించిన వర్తకులు నాణేలుగా మార్చని శుద్ధ వెండి, బంగారాలను ఉపయోగించారు. అదే విధంగా స్థానిక మార్కెట్లలో లభించిన నాణేలను స్వదేశానికి తిరిగి వెళుతున్నప్పుడు శుద్ధ వెండి, బంగారాలుగా మార్చుకునే స్థానిక ద్రవ్యాన్ని వెండి, బంగారాలుగాను, వెండి, బంగారాలను స్థానిక నాణేలుగాను మార్చే వాణిజ్యం బాగా వ్యాపించింది. లాభదాయకంగా తయారయింది." (హ్యూల్‌మాన్, బాన్, 1826-29) "మార్పిడి బ్యాంకులకు ఆ పేరు అవి నాణేలను మార్పిడి చేయడం వల్ల వచ్చిందే తప్ప మార్పిడి బిల్లులను విడుదల చేయడం వల్ల రాలేదు.... 1609లో ఆమ్‌స్టర్‌డామ్ మార్పిడి బ్యాంకును స్థాపించడానికి చాలా ముందే డచ్చి వాణిజ్య నగరాలలో డబ్బును మార్పిడి చేసే వ్యక్తులు, మార్పిడి సంస్థలు, మార్పిడి బ్యాంకులు సైతం ఉన్నాయి.... ఈ డబ్బును మార్చే వ్యక్తుల ప్రధానమైన పని విదేశీ వర్తకులు దేశంలోకి తెచ్చే నాణేలకు బదులు తమ స్థానిక నాణేలతో మార్పిడి చేయడమే. క్రమంగా వారి కార్యకలాపాల పరిధి విస్తరించింది... తమ కాలంలో వారే బ్యాంకర్లు, క్యాషియర్లూ అయ్యారు. అయితే ఆమ్‌స్టర్‌డామ్ ప్రభుత్వం ఈ రకంగా క్యాషియర్ పని, మార్పిడి వ్యాపారం కలిసిపోవడం ప్రమాదకరమని భావించింది. ఈ ప్రమాదాన్ని ఎదుర్కోవడానికి క్యాషియర్ పనిని, మార్పిడి కార్యకలాపాలను నిర్వహించగలిగిన ఒక పెద్ద సంస్థను నిర్మించాలని నిర్ణయించింది. ఈ సంస్థే ప్రఖ్యాతిచెందిన, 1609లో ఏర్పాటయిన ఆమ్‌స్టర్‌డామ్ మార్పిడి బ్యాంకు. అదే విధంగా డబ్బును మార్చాల్సిన నిరంతరాయమైన అవసరం రీత్యా వెనీస్, జెనోవా, స్టాక్‌హోం, హాంబర్గ్ బ్యాంకులు కూడా వెలిశాయి. వీటన్నింటిలోను ఇంకా వాణిజ్యం చేస్తున్నది హాంబర్గ్ మార్పిడి సంస్థ మాత్రమే. ఎందుకంటే ఇంకా డబ్బు ముద్రణాలయం లేని ఈ వర్తకుల పట్టణంలో అటువంటి సంస్థ అవసరం ఇంకా ఉంటూనే వుంది." (ఎస్. - విషరింగ్, ఆమ్‌స్టర్‌డామ్, 1860-61)

వెండి, బంగారాలు ప్రపంచ డబ్బుగా వినియోగమవుతున్నాయి. కరెన్సీ కంటే భిన్నంగా దానినిపుడు బ్యాంకు డబ్బునీ, వాణిజ్య డబ్బునీ వ్యవహరిస్తున్నారు. ఒక దేశంలో డబ్బును మార్పిడి చేసే వ్యక్తి నుంచి మరో దేశంలో మార్పిడి చేసే వ్యక్తికి ప్రయాణీకులకు చెల్లింపు నోట్లు అనే అర్థంలో మార్పిడి లావాదేవీలు వాస్తవ డబ్బు మార్పిడి ద్వారా మునుపు రోమ్, గ్రీసులతో అభివృద్ధి చెందాయి.

వెండి, బంగారాలతో సరుకులుగానే (విలాస వస్తువులు తయారుచేసే ముడి పదార్థాలుగానే) వ్యాపారం చేయడం వెండి, బంగారాల వ్యాపారానికి లేదా సార్వత్రిక డబ్బుగా డబ్బు కార్యకలాపాల సాధనంగా వ్యవహరించే వాణిజ్యానికి సహజ ప్రాతిపదిక. ఇంతకు ముందే వివరించినట్లు (మొదటి సంపుటం, మూడవ అధ్యాయం) ఈ కార్యకలాపాలు రెండు రకాలు : వివిధ జాతీయ చలామణి రంగాల మధ్య కరెన్సీ ముందుకూ వెనక్కూ జరిగే చలనం. వడ్డీ కోసం వలస పోయే పెట్టుబడులకు సంబంధించి అంతర్జాతీయ చెల్లింపులను సరిచేయడం కోసం ఈ చలనం జరుగుతుంది. అదే సమయంలో వెండి, బంగారాలు తమ ఉత్పత్తి స్థానం నుంచి ప్రపంచ మార్కెట్‌గుండా పయనించి వివిధ జాతీయ చలామణి రంగాలలో పంపిణీ అవుతాయి. ఇంగ్లండ్‌లో పదిహేడో శతాబ్దిలో చాలా భాగం వరకు కంసాలులు బ్యాంకర్లుగా వ్యవహరించారు. బిల్లుల సట్టా వ్యాపారం వగైరాలలో అంతర్జాతీయ ఖాతాలను సరిచేయడం గురించి మనం ఇక్కడ ప్రస్తావించడం లేదు. విలువైన కాగితాల లావాదేవీలకు సంబంధించి కూడా మనం ప్రస్తావించడం లేదు. క్లుప్తంగా చెప్పాలంటే పరపతి వ్యవస్థకు సంబంధించిన ప్రత్యేక రూపాలను మనం పక్కన ఉంచుదాం. వాటితో మనకు ఇక్కడింకా సంబంధం లేదు.

జాతీయ ద్రవ్యం అంతర్జాతీయ ద్రవ్యపు హోదాలో తన స్థానిక స్వభావాన్ని వదిలివేస్తుంది. ఒక జాతీయ కరెన్సీ మరో కరెన్సీగా – మరో కరెన్సీ లెక్కల్లో వ్యక్తమవుతుంది. ఆ రకంగా అవన్నీ అంతిమంగా వాటిలో గల వెండి, బంగారాలుగా కుదించబడతాయి. ప్రపంచ డబ్బుగా చలామణి అవుతున్న ఈ రెండు సరుకులు అదే సమయంలో తమ పరస్పర విలువ నిష్పత్తిని ఏర్పరచుకుంటాయి. ఈ నిష్పత్తి నిరంతరాయంగా మారుతూ ఉంటుంది. సరిగా ఈ మధ్యంతర కార్యకలాపాన్నే డబ్బు వ్యాపారి తన ప్రత్యేక వృత్తిగా స్వీకరిస్తాడు. ఆ రకంగా డబ్బు మార్పిడి, వెండి, బంగారాల వాణిజ్యం డబ్బు వ్యాపారానికి తొలిరూపాలు. అవి జాతీయ ద్రవ్యంగా, అంతర్జాతీయ ద్రవ్యంగా రెండు రకాల డబ్బు విధుల్నుంచి తలెత్తుతాయి.

మొత్తం వాణిజ్యం లాగానే పెట్టుబడిదారీ ఉత్పత్తి ప్రక్రియ కూడా పెట్టుబడిదారీ పూర్వ పద్ధతులలో సైతం ఈ కింది అంశాలను సూచిస్తుంది.

**మొదటిది :** ఒక నిల్వగా డబ్బు సంచయనం ఇక్కడ చెల్లింపు సాధనాల, కొనుగోలు సాధనాల నిల్వ ధనంగా చేతిలో ఎల్లప్పుడూ ఉండే పెట్టుబడి భాగం; ఒక నిల్వ ధనం యొక్క మొదటి రూపం ఇది. అది పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానంలో తిరిగి కనిపిస్తుంది. వర్తకుని పెట్టుబడి అభివృద్ధితో పాటు కనీసం ఈ పెట్టుబడి ప్రయోజనాల కోసం సాధారణంగా అది పునఃప్రత్యక్షమవుతుంది. ఈ రెండు వ్యాఖ్యలు జాతీయ చలామణికి, అంతర్జాతీయ చలామణికి కూడా వర్తిస్తాయి. ఈ నిల్వ ధనం నిరంతరాయంగా మారుతూ ఉంటుంది. అది నిర్విరామంగా చలామణిలోకి ప్రవహిస్తుంది. అంతే

నిరంతరాయంగా దానినుంచి తిరిగి వెనక్కు వస్తుంది. నిల్వ ధనం రెండో రూపం పనిలేని, తాత్కాలికంగా పనిలో పెట్టబడని డబ్బు రూపంలో ఉన్న పెట్టుబడి; దీనిలో కొత్తగా పోగుబడిన, ఇంకా మదుపు పెట్టని డబ్బు పెట్టుబడి కూడా ఉంటుంది. నిల్వ ఈ రూపంలో ఏర్పడటం వల్ల ప్రాథమికంగా తలెత్తే కార్యకలాపాల్లో డబ్బును భద్రపరచడం, ఖాతాలను నిర్వహించడం వగైరాలుంటాయి.

**రెండవది :** అయితే ఇదంతా కొనుగోళ్ళ కోసం డబ్బు కేటాయించడం, అమ్మకాల నుంచి డబ్బులు వసూలు చేయడం, చెల్లింపులను చేయటం, చెల్లింపులను సర్దటం వగైరాలను అవసరం చేస్తుంది. డబ్బుతో వ్యవహరించే వ్యక్తి మొదట ఈ పనులన్నిటినీ కేవలం వర్తకుల, పారిశ్రామికుల, పెట్టుబడిదారుల క్యాషియర్‌గా నిర్వహిస్తాడు.[1]

డబ్బు వ్యాపారపు మామూలు విధులకు అప్పు ఇవ్వడం, తీసుకోవడం, పరపతి అన్నది తోడు కాగానే డబ్బు వ్యాపారం మొదటి దశల్లో సైతం అది పూర్తిగా అభివృద్ధి చెందుతుంది.

వెండి, బంగారాల వ్యాపారం ఒక దేశం నుంచి మరొక దేశానికి వెండి, బంగారాల బదిలీ రూపంలో జరిగే వాణిజ్యం కేవలం సరుకుల వ్యాపారం ఫలితం మాత్రమే. అది మార్పిడి రేటుచేత నిర్ణయించబడుతుంది. ఈ మార్పిడి రేటు అన్నది అంతర్జాతీయ చెల్లింపుల పరిస్థితిపైన విభిన్న

---

1. "డచ్ వాణిజ్య నగరాలలో లాగా అంత విశుద్ధమైన స్వతంత్ర రూపంలో క్యాషియర్ పని మరెక్కడా బహుశా నిలబడలేదు" (చూ : ఆన్ ది ఆరిజిన్ ఆఫ్ ది క్యాషియర్ బిజినెస్ ఇన్ ఆమ్‌స్టర్‌డామ్, ఇ. లుజాక్, హాలండ్స్ రిజ్కడమ్, III భాగం). ఆమ్‌స్టర్‌డామ్ పాత మార్పిడి బ్యాంక్ కార్యకలాపాలలో ఇంతవరకు దీని కార్యకలాపాలు ఏకీభవిస్తాయి. వర్తకులు క్యాషియర్ సేవల్ని వినియోగించుకున్నందుకుగాను అతనికి కొంత డబ్బు ముట్టచెబుతారు. అతడు వారి పేరున తన ఖాతా పుస్తకాలలో 'పరపతి'ని ('Credit') ప్రారంభిస్తాడు. తరువాత వారు అతనికి తమ హక్కు (claims) పత్రాలను పంపుతారు. వాటితో అతడు డబ్బులు వసూలు చేసి వారి ఖాతాలో దానిని జమ చేస్తాడు. అదే సమయంలో వారి డ్రాఫ్టులపైన చెల్లిస్తాడు. వారి ఖాతా నుంచి ఆ మేరకు అతడు ఆ సొమ్మును తగ్గిస్తాడు. ఈ వసూళ్ళకు, చెల్లింపులకుగాను అతడు కొద్దిగా పైకం వసూలు చేస్తాడు. అది అతని శ్రమకు ప్రతిఫలాన్ని ఇస్తుంది. ఇరుపక్షాల మధ్య టర్నోవర్‌ల పరిమాణంపై ఈ ప్రతిఫలం ఆధారపడి వుంటుంది. ఇద్దరు వర్తకుల మధ్య ఈ చెల్లింపుల్ని సర్దాల్సివస్తే, వారిరువురు అతని ఖాతాదారులు అయితే, అటువంటి చెల్లింపులను వారి ఖాతా పుస్తకాలలో సులభంగానే సర్దవచ్చు. ఇది క్యాషియర్ల రోజువారీ చర్యే కనుక క్యాషియర్ వాస్తవంగా చేసే పని ప్రాథమికంగా చెల్లింపులలో మధ్యవర్తిత్వం నెరపటమే. కనుక పారిశ్రామిక సంస్థలను, సట్టా వ్యాపారాన్ని, అపరిమితమైన పరపతి సౌకర్యాలనూ అది ఆ రకంగా మినహాయిస్తుంది. ఎందుకంటే ఈ వ్యాపారంలో క్యాషియర్ ఖాతాదారుల్లో ఎవరికి కూడా వారి ఖాతాను మించి చెల్లించడం అన్నది జరుగదు." (విషరింగ్) వెనిస్‌లో ఉన్న బ్యాంకింగ్ అసోసియేషన్ల గురించి వెనిస్‌లో వెండి, బంగారాలు తీసుకువెళ్ళడం అన్నది ఇతరచోట్ల కంటే అసౌకర్యంతో కూడిన పని, కనుక ఆ ప్రదేశపు అవసరాల వల్ల ఆ నగరంలో ఉన్న పెద్ద వర్తకులు బ్యాంకు అసోసియేషన్ ఏర్పాటు చేసుకున్నారు. వాటికి తగిన భద్రతను, అజమాయిషీని, నిర్వహణను ఏర్పర్చుకున్నారు. ఆ అసోసియేషన్ల సభ్యులు కొంత సొమ్మును ఆ బ్యాంకుల్లో డిపాజిట్ చేసేవారు. తమ పరపతిదార్లకు ఆ సొమ్ముపైన డ్రాఫ్టులు పంపేవారు. దానిపై అంతకుముందు వారు చెల్లించిన ఖాతాలో నుంచి ఆ సొమ్మును తీసివేసి పరపతిదారుని పుస్తకంలో జమచేయబడేది. గైరో బ్యాంకులనబడే వాటి ప్రారంభమిదే. ఇవి చాలా పాత అసోసియేషన్లు. అయితే అవి 12వ శతాబ్దంలో ఉన్నాయని భావిస్తే 1171లో స్థాపించబడిన ప్రభుత్వ రుణ సంస్థతో గందరగోళపరచడం జరుగుతుంది." (హ్యూల్‌మాన్)

మార్కెట్లలో ఉన్న వడ్డీ రేట్లపైన ఆధారపడి ఉంటుంది. ఈ వెండి, బంగారాల వ్యాపారి కేవలం ఈ ఫలితాల మధ్యవర్తిగా మాత్రమే వ్యవహరిస్తాడు.

డబ్బును దాని చలనాలు, రూపాలు సాధారణ సరుకు చలామణిలో నుంచి అభివృద్ధి చెందే రూపాన్నీ చర్చించిన సందర్భంలో మనం ఒక విషయాన్ని గమనించాం. (మొదటి సంపుటం, మూడవ అధ్యాయం) కొనుగోలు చెల్లింపు సాధనాలుగా చలామణిలో ఉండే ఆ డబ్బు మొత్తం చలనాలు సరుకుల రూపాంతరంపైన ఈ రూపాంతరపు వేగం పరిమాణంపైన ఆధారపడి ఉంటాయని చూశాం. మొత్తం పునరుత్పత్తి ప్రక్రియలో ఇది ఒక దశ మాత్రమేనని మనకు ఇపుడు తెలుసు. డబ్బు పదార్థాలైన వెండి, బంగారాలను వాటి ఉత్పత్తి స్థానాల నుంచి గ్రహించడం అనేది సరుకుల ప్రత్యక్ష మార్పిడిగా రూపొందుతుంది. అనగా వెండి, బంగారాలు సరుకులుగా ఇతర సరుకులతో మార్పిడి అవుతాయి. కనుక అది సరుకుల మార్పిడిలో ఇనుము తదితర లోహాలను గ్రహించడం లాగే ఒక దశ అవుతుంది. అయితే ప్రపంచ మార్కెట్లో ఈ విలువైన లోహాల చలనానికి సంబంధించినంత వరకు (పెట్టుబడి బదిలీ రుణాల ద్వారా వ్యక్తమయ్యే చలనాలను మనం ఇక్కడ పరిగణనలోకి తీసుకోవడం లేదు. ఈ రకం బదిలీ సరుకు పెట్టుబడి రూపంలో కూడా కనిపిస్తుంది.) జాతీయ కొనుగోలు చెల్లింపు సాధనాలు స్వదేశంలో సరుకుల మార్పిడి చేత నిర్ణయించబడినట్లే, అది అంతర్జాతీయ సరుకుల మార్పిడి చేత నిర్ణయించబడుతుంది. ఒక జాతీయ చలామణి రంగం నుంచి మరో రంగానికి ఈ విలువైన లోహాల రాకపోకలు కేవలం జాతీయ కరెన్సీ విలువ పడిపోవడం వల్ల లేదా ద్వంద్వ లోహాల చలామణి వల్ల మాత్రమే జరిగిన మేరకు ఇవి డబ్బు చలామణికి భిన్నంగా, తదన్యమైనదిగా ఉంటాయి. ప్రభుత్వాలు ఏకపక్షంగా చేసే ఆదేశాల వల్ల ఏర్పడిన మార్పులు, దిద్దుబాట్లకు ప్రతినిధులుగా మాత్రమే కనిపిస్తాయి. కొనుగోలు చెల్లింపు సాధనాల కోసం అవసరమైన నిల్వ నిధులు స్వదేశ వాణిజ్యం కోసం ఉన్నా, విదేశీ వాణిజ్యం కోసం ఉన్నా అవి కేవలం తాత్కాలికంగా పనిలేని పెట్టుబడి రూపాన్ని సూచిస్తాయి. ఈ నిధుల కోసం రూపొందే నిల్వలు రెండు సందర్భాలలోను చలామణి ప్రక్రియను తప్పనిసరిగా త్వరితం చేస్తాయి.

మొత్తం డబ్బు చలామణి తన పరిమాణం రీత్యా, రూప చలనాల రీత్యా కేవలం సరుకు చలామణి ఫలితమే అనుకుందాం. పెట్టుబడిదారీ దృష్టి నుంచి ఈ సరుకు చలనం అన్నది కేవలం పెట్టుబడి చలామణి ప్రక్రియ మాత్రమే. (ఆదాయంగా పెట్టుబడి మార్పిడి, అలాగే చిల్లర వ్యాపారం ద్వారా, ఆదాయపు కేటాయింపులు ప్రభావితం అయిన మేరకు ఆదాయాల పరస్పర మార్పిడి ఇందులోనివే.) అపుడు కేవలం డబ్బుతో వ్యవహరించడం అన్నది కేవలం డబ్బు చలామణిని పెంపొందించదని, అది కేవలం సరుకు చలామణి ఫలితమూ, రూపమూ మాత్రమేనని స్పష్టమవుతుంది. సరుకు చలామణిలో ఒక దశ అయిన ఈ డబ్బు చలామణి సహజంగానే అప్పటికే ఉన్నట్టుగా డబ్బు వ్యవహారంలో పరిగణించబడుతుంది. ఈ డబ్బు వ్యవహారమన్నది కేవలం డబ్బు చలామణికి సంబంధించిన సాంకేతిక కార్యకలాపాలను అభివృద్ధి చేస్తుంది. వాటిని కేంద్రీకరిస్తుంది. కుదిస్తుంది. సరళం చేస్తుంది. డబ్బుతో వ్యవహరించడం అన్నది నిల్వలను రూపొందించలేదు. నిల్వలు రూపొందడం అన్నది ఐచ్ఛికంగా జరిగిన మేరకు (ఇది పనిలో పెట్టబడని పెట్టుబడి రూపం కాదు. లేదా పునరుత్పత్తి

ప్రక్రియలో అంతరాయాల రూపమూ కాదు.) దాని సాంకేతిక సాధనాలను కనీస ఆర్థిక స్థాయికి కుదించడానికి తోడ్పడుతుంది. ఎందుకంటే మొత్తం పెట్టుబడిదారీ వర్గం కోసం నిర్వహించాల్సివస్తే చెల్లింపు కొనుగోలు సాధనాల నిల్వ నిధులు ప్రతి పెట్టుబడిదారుడూ స్వయంగా నిర్వహించుకుంటే ఉండాల్సినంత ఎక్కువ మొత్తంలో ఉండనక్కరలేదు. డబ్బు వ్యాపారులు వెండి, బంగారాలను కొనరు. సరుకు వాణిజ్యం వాటిని కొన్న వెంటనే వాటి పంపిణీని మాత్రమే వారు నిర్వహిస్తారు. వారు చెల్లింపు సాధనంగా డబ్బు వ్యవహరించిన మేరకు ఖాతాలను సర్దడానికి తోడ్పడతారు. ఈ సర్దే వ్యవహారంలో అవసరమైన డబ్బు మొత్తాన్ని కుదించగలుగుతారు. అయితే ఈ సంబంధాలను కానీ, పరస్పర చెల్లింపుల పరిమాణాన్ని కానీ వారు నిర్ణయించలేరు. మార్పిడి బిల్లులు, చెక్కులు బ్యాంకులలోను, క్లియరింగ్ హౌస్‌లలోను మార్పిడి చేయబడతాయి. అవి కేవలం స్వతంత్ర లావాదేవీల ప్రతిరూపాలు మాత్రమే. ఆయా స్వతంత్ర కార్యకలాపాల ఫలితాలు మాత్రమే. ఈ ఫలితాలను మరింత మెరుగైన సాంకేతిక పద్ధతిలో పరిష్కరించడమే డబ్బు వ్యవహారానికి సంబంధించిన ప్రధాన సమస్య. కొనుగోలు సాధనంగా డబ్బు చలామణిలో ఉన్న మేరకు క్రయవిక్రయాల పరిమాణం గాని, సంఖ్యకుగాని డబ్బు వ్యవహారంతో ఎటువంటి సంబంధం ఉండదు. క్రయవిక్రయాలతో పాటు జరిగే సాంకేతిక కార్యకలాపాలను కుదించటం, సరుకుల టర్నోవర్‌కు అవసరమైన నగదు డబ్బు మొత్తాన్ని ఆ విధంగా తగ్గించడం తప్ప ఇది మరేమీ చేయలేదు.

డబ్బుతో వ్యవహరించడం అన్నది దాని విశుద్ధ రూపంలో అనగా మనం ఇక్కడ పరిశీలిస్తున్నట్లుగా పరపతి వ్యవస్థతో ప్రమేయం లేకుండా అలా సరుకు చలామణి యొక్క ఒకానొక దశలో సాంకేతిక పద్ధతికి సంబంధించిన అంశం మాత్రమే. అది డబ్బు చలామణికి దాని చలామణిలో తలెత్తే విభిన్న కార్యకలాపాలకు సంబంధించిన సాంకేతిక వ్యవహారం మాత్రమే.

డబ్బుతో వ్యవహరించడాన్ని ఇది సరుకులతో వ్యవహరించడం నుంచి గణనీయంగా వేరు చేస్తుంది. డబ్బుతో వ్యవహరించడం సరుకుల రూపాంతరాన్ని వాటి మార్పిడిని పెంపొందిస్తుంది. సరుకు పెట్టుబడి యొక్క ఈ ప్రక్రియకు పెట్టుబడి ప్రక్రియ రూపాన్ని సైతం ఇస్తుంది. ఇది పారిశ్రామిక పెట్టుబడి కంటే భిన్నమైన పెట్టుబడి ప్రక్రియలా కనిపించేలా చేస్తుంది. వాణిజ్య పెట్టుబడికి తన సొంత చలామణి రూపం ఉంది; అది డ-స-డ. దానిలో సరుకు రెండుసార్లు చేతులు మారుతుంది. ఆ రకంగా అది డబ్బు తిరిగి రావడానికి వీలు కల్పిస్తుంది. స-డ-స దీనికంటే భిన్నమైనది. దీనిలో డబ్బు రెండుసార్లు చేతులు మారుతుంది. ఆ రకంగా సరుకు మార్పిడిని పెంపొందిస్తుంది. కానీ డబ్బుతో వ్యవహరించే పెట్టుబడి విషయంలో అటువంటి ప్రత్యేక రూపమే లేదు.

ఈ డబ్బు చలామణిని సాంకేతికంగా పెంపొందించడంలో ఒక ప్రత్యేక పెట్టుబడిదారీ వర్గం డబ్బు పెట్టుబడిని అడ్వాన్స్ చేసిన మేరకు పెట్టుబడి యొక్క సాధారణ రూపమైన డ-డ' ఇక్కడ కూడా కనిపిస్తుంది. (ఈ పెట్టుబడి మరింత కుదించబడిన స్థాయిలో వర్తకుల పారిశ్రామిక పెట్టుబడిదారుల అదనపు పెట్టుబడిని సూచిస్తుంది. ఇది లేకుంటే వారు స్వయంగా దానిని అడ్వాన్స్ చేయాల్సి వచ్చేది.) డ ని ఎడ్వాన్స్ చేయడం ద్వారా ఆ పెట్టుబడిదారుడు డ+△డ' పెంపొందించడం అన్నది ఈ రూపాంతర ప్రక్రియ యొక్క పాదార్థిక అంశం కాదు. సాంకేతిక అంశం మాత్రమే.

డబ్బుతో వ్యవహరించేవారు ఉపయోగించే డబ్బు పెట్టుబడి మొత్తం చలామణి రంగంలో పారిశ్రామిక పెట్టుబడిదారుల, వర్తకుల డబ్బు పెట్టుబడి మాత్రమే. డబ్బు వ్యవహర్త కార్యకలాపాలు వాస్తవంగా వర్తకుల, పారిశ్రామిక పెట్టుబడిదారుల కార్యకలాపాలు మాత్రమే అన్నది స్పష్టం. ఆ కార్యకలాపాలలో వారు మధ్యవర్తులుగా వ్యవహరిస్తారు.

డబ్బు వ్యవహర్త లాభం అదనపు విలువ నుంచి గ్రహించబడింది మాత్రమే అన్నది కూడా స్పష్టం. ఎందుకంటే అప్పటికే చేతికందిన విలువలతో వారు వ్యవహరిస్తారు. (అవి పరపతిదారుల హక్కుల రూపంలో చేతికందినప్పటికీ ఇది వర్తిస్తుంది.)

సరుకుల వాణిజ్యంలో లాగానే ఒకే పని రెండుచోట్ల జరుగుతుంది. ఎందుకంటే డబ్బు చలామణికి సంబంధించిన సాంకేతిక కార్యకలాపాలలో ఒక భాగం డబ్బుతో వ్యవహరించేవారు నిర్వహిస్తారు. కాగా సరుకుల ఉత్పత్తిదారులు మరో భాగంతో వ్యవహరిస్తారు.

★ ★ ★

## అధ్యాయం - 20

# పెట్టుబడి గురించిన చారిత్రక వాస్తవాలు

**వా**ణిజ్య పెట్టుబడి, డబ్బుతో వ్యవహరించే పెట్టుబడి ఏ ప్రత్యేక రూపంలో డబ్బును పోగుచేస్తాయో తర్వాత భాగంలో చర్చిద్దాం.

ఇంతకు ముందు చర్చించిన దాన్నిబట్టి ఒక విషయం స్పష్టం. వర్తక పెట్టుబడి, వాణిజ్య పెట్టుబడి రూపంలో ఉన్నా, డబ్బుతో వ్యవహరించే పెట్టుబడి రూపంలో ఉన్నా దానిని పారిశ్రామిక పెట్టుబడి యొక్క ఒక ప్రత్యేక రూపంగా పరిగణించడం కంటే అసంబద్ధమయినది మరొకటి ఉండజాలదు. గనులు, వ్యవసాయం, పశుపోషణ, కార్ఖానాలు, రవాణా వగైరాలు సామాజిక శ్రమ విభజన కారణంగా ఏర్పడిన పారిశ్రామిక పెట్టుబడి పక్కనే (side lines) ఉండే వేరు వేరు శాఖలు. అందుకే ఇవి విభిన్న మదుపు రంగాలు. వీటితోపాటు వర్తకుని పెట్టుబడి మరో రూపం కాదు. పునరుత్పత్తి ప్రక్రియలో చలామణి దశలో ప్రతి పారిశ్రామిక పెట్టుబడి సరుకు పెట్టుబడిగానూ, డబ్బు పెట్టుబడిగానూ వ్యవహరిస్తాయి. ఈ విధులను వర్తకుని పెట్టుబడి ప్రత్యేకంగా నిర్వహిస్తుంది. దీనినిబట్టి పైన పేర్కొన్న మొరటు అభిప్రాయాన్ని కొట్టివేయవచ్చు. మరోవైపున వాణిజ్య పెట్టుబడితోనూ, డబ్బుతో వ్యవహరించే పెట్టుబడితోను ఉత్పాదక పెట్టుబడిగా పారిశ్రామిక పెట్టుబడికీ, చలామణి రంగంలో ఉన్న అదే పెట్టుబడికీ ఉన్న తేడాలను విడివిడి రూపాలుగా భావించటం జరుగుతుంది. పెట్టుబడి ఆయా సందర్భాలలో ధరించే నిర్దిష్ట రూపాలు నిర్వహించే నిర్దిష్ట కార్యకలాపాల్ని బట్టి వీటిని ప్రత్యేక పెట్టుబడుల ప్రత్యేక రూపాలుగానూ, కార్యకలాపాలుగానూ పొరపాటుగా అర్థం చేసుకోవటం జరుగుతుంది. పారిశ్రామిక పెట్టుబడి యొక్క మారిన రూపం వేరు. విభిన్న పారిశ్రామిక శాఖలలో ఉపయోగించే ఉత్పాదక పెట్టుబడుల మధ్య ఉన్న పాదార్థిక భేదాలు వేరు. ఈ భేదాలు ఆయా వివిధ శాఖల స్వభావాన్ని బట్టి తలెత్తుతాయి. ఈ రెండూ వేరు వేరు ప్రపంచాలు.

రూపభేదాల్ని ఆర్థికవేత్త సాధారణంగా చాలా మొరటుగా పరిగణిస్తున్నాడు. వాటి పాదార్థిక పార్శ్వం మాత్రమే అతడు పట్టించుకుంటాడు. అదలా ఉంచితే ఈ మొరటు ఆర్థికవేత్త పొరపాటు అభిప్రాయానికి కారణాన్ని రెండు రకాలుగా వివరించవచ్చు. మొదటిది వాణిజ్య లాభం యొక్క ప్రత్యేక స్వభావాన్ని వివరించలేకపోవడం. రెండోది సరుకు పెట్టుబడి, డబ్బు పెట్టుబడి, డబ్బుతో వ్యవహరించే పెట్టుబడులను ఉత్పత్తి ప్రక్రియనుంచే తప్పనిసరిగా తలెత్తే రూపాలుగా చూపించాలనే అతని ఆతురత. నిజానికి సరుకుల చలామణిని అలాగే డబ్బు చలామణిని తన పునాదిగా పరిగణించే పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం యొక్క ప్రత్యేక రూపమే వాటి ఆవిర్భావానికి కారణం.

వాణిజ్య పెట్టుబడి, డబ్బుతో వ్యవహరించే పెట్టుబడి అనేవి ధాన్యం ఉత్పత్తి కంటే భిన్నమయినవి.

కాకుంటే ధాన్యం ఉత్పత్తి, పశుపోషణ కార్ఖానాల లాగానే మరో శాఖ అయినట్టుగానే ఈ పెట్టుబడులు కూడా మరో శాఖ మాత్రమే అయివుంటే ఉత్పత్తి, పెట్టుబడిదారీ ఉత్పత్తీ ఒకటే అవుతాయన్నది పట్టపగల్లా సుస్పష్టమవుతుంది. దానితోపాటు సామాజిక ఉత్పాదితాలను సామాజిక సభ్యుల మధ్య పంపిణీ చేయటంలో, అది ఉత్పాదక లక్ష్యంతో కానీ లేదా వ్యక్తిగత వినియోగం కోసం కానీ పంపిణీ చేయటాన్ని తప్పనిసరిగా వర్తకులు, బ్యాంకర్లే నిర్వహించాల్సి ఉంటుంది. మాంస వినిమయాన్ని పశుపోషణ ద్వారానూ, వస్తు వినిమయాన్ని వాటి తయారీ ద్వారానూ నిర్వహించినట్టే వాటి నిర్వహణ కూడా అనివార్యమవుతుంది.[1]

వాణిజ్య పెట్టుబడి ఒక ప్రత్యేక తరహా పెట్టుబడి కావడం వల్ల స్మిత్, రికార్డో తదితర గొప్ప ఆర్థికవేత్తలు గందరగోళపడ్డారు. ఇది పెట్టుబడి ప్రాథమిక రూపాన్ని మాత్రమే పరిగణించడం వల్ల జరిగింది. పెట్టుబడిని పారిశ్రామిక పెట్టుబడిగానూ, చలామణి పెట్టుబడిగానూ (సరుకు పెట్టుబడి, డబ్బు పెట్టుబడి) భావించడం వల్ల మాత్రమే జరిగింది. చలామణి పెట్టుబడి ప్రతి పెట్టుబడి పునరుత్పత్తి ప్రక్రియలో ఒక దశ కావడం వల్ల ఇలా జరిగింది. విలువ, లాభం వగైరాలు రూపొందడానికి సంబంధించిన సూత్రాలను పారిశ్రామిక పెట్టుబడి అధ్యయనం ద్వారా మాత్రమే గ్రహించటానికి ప్రయత్నించడం వల్ల వారు వర్తకుని పెట్టుబడికి కూడా నేరుగా దాన్ని వర్తింపచేయలేదు. ఈ కారణం చేత వర్తక పెట్టుబడిని వారు పూర్తిగా వదిలేశారు. అందుకే దానిని వారు ఒక తరహా పారిశ్రామిక పెట్టుబడిగా పేర్కొన్నారు. విదేశీ వాణిజ్యాన్ని చర్చించినపుడు రికార్డో ప్రత్యేక విశ్లేషణ చేసినట్లుగానే వారు విశ్లేషించినపుడు మాత్రం ఆ పెట్టుబడి విలువను సృష్టించదని రుజువు చేయడానికి ప్రయత్నించారు. (ఆ రకంగా అదనపు విలువను కూడా సృష్టించదని గ్రహించారు.) అయితే విదేశీ వాణిజ్యానికి వర్తించే ఈ వాస్తవం స్వదేశీ వాణిజ్యానికి కూడా వర్తిస్తుంది.

★ ★ ★

---

1. రోశ్చర్ మహర్షి [డైగ్రుండ్ లాగెన్ డెరెనేషనల్ ఎకనామీ, 3 జౌప్లేజ్, 1858 - సం॥] ఇలా చెప్పారు : కొంతమంది వ్యాపారాన్ని ఉత్పత్తిదారులు, వినియోగదారుల మధ్య మధ్యవర్తిత్వం నెరపటం అని అంటారు. కనుక ఉత్పత్తినే వినియోగంలో మధ్యవర్తిత్వంగా [ఎవరి మధ్య?] భావించవచ్చు. అంటే దాని అర్థం వ్యవసాయ పెట్టుబడి, పారిశ్రామిక పెట్టుబడి, ఉత్పాదక పెట్టుబడిలో భాగమైనట్టుగానే వర్తకుని పెట్టుబడి కూడా ఒక భాగం అని చెప్పటం అన్నమాట. మరోలా చెప్పాలంటే ఉత్పత్తి సాధనాల ద్వారా మాత్రమే, మనిషి తన వినియోగానికి మధ్యవర్తిత్వం నెరపుతాడనీ, [అతడు ఈ పనిచేయడానికి లీబ్జిక్‌లో చదువుకో నక్కరలేదు.] ప్రకృతి ఉత్పాదితాలను అనుభవించటానికి శ్రమ అవసరమని [దీనిని కూడా మధ్యవర్తిత్వం అనవచ్చు] చెప్పవీలుంది. కాబట్టి ప్రత్యేక ఉత్పత్తి సామాజిక రూపం నుంచి తలెత్తే సామాజిక మధ్యవర్తిత్వానికి [ఎందుకంటే మధ్యవర్తిత్వం] తప్పనిసరియైన ఆవశ్యకంగా మారే సంపూర్ణ స్వభావ ముందన్నమాట. మధ్యవర్తిత్వం అన్న మాట అన్నిటినీ పరిష్కరించేస్తుంది. అన్నట్టు, వ్యాపారులు - ఉత్పత్తిదారులకు, వినియోగదారులకు [వినియోగదారులంటే ఉత్పత్తిదారుల కంటే భిన్నమైన ఉత్పత్తి చేయని వినియోగదారులు అన్న అర్థంలో వారిని ఇక్కడ మనం వదిలేద్దాం.] మధ్యవర్తులు కాదు. ఉత్పత్తిదారుల మధ్యనే ఆయా ఉత్పాదితాల మార్పిడిలో వీరు మధ్యవర్తిత్వం నెరపుతారు. వారు మార్పిడిలో మధ్యవర్తులు. ఈ మార్పిడి వేలాది సందర్భాలలో వారు లేకుండానే కొనసాగుతుంది.

ఇంతవరకు మనం వర్తక పెట్టుబడిని కేవలం పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం పరిధిలో, ఆ దృష్టి నుంచి మాత్రమే పరిగణించి పరిశీలించాం. అయితే వాణిజ్యం మాత్రమే కాక వర్తకుని పెట్టుబడి సైతం పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం కంటే ప్రాచీనమైనది. నిజానికి అది చారిత్రకంగా పెట్టుబడి స్వతంత్రంగా ఉనికిలో ఉండే అత్యంత ప్రాచీన రూపం.

డబ్బుతో వ్యవహరించడం, దానికై పెట్టుబడిని అడ్వాన్సు చేయడం అన్న అంశాల అభివృద్ధికి టోకు వాణిజ్యం, వాణిజ్య పెట్టుబడి ఉనికిలో ఉండడం తప్ప మరేమీ అక్కర్లేదన్న సంగతి మనం గ్రహించాం కనుక ఇక్కడ మనం పరిశీలించాల్సింది వాణిజ్య పెట్టుబడిని మాత్రమే.

వర్తకుని పెట్టుబడి చలామణి రంగంలో మాత్రమే ఉండడం వల్ల, సరుకుల మార్పిడిని పెంపొందించడమే దాని పరమావధి కనుక సరుకులు, డబ్బు యొక్క సాధారణ చలామణికి అవసరమైన పరిస్థితులకు మించి మరే అంశాలు దాని ఉనికికి అవసరం లేదు. (ప్రత్యక్ష వస్తు మార్పిడి నుంచి తలెత్తే ఇంకా అభివృద్ధి చెందని రూపాలు తప్ప) నిజానికి సరుకులు, డబ్బు సాధారణ చలామణి దాని ఉనికికి అవసరం. చలామణిలోకి సరుకులుగా నెట్టబడే ఉత్పాదితాలు ఉత్పత్తి కావడానికి ప్రాతిపదిక ఏమైనప్పటికీ – ఆ ప్రాతిపదిక ఆదిమ సమాజమైనా, బానిస ఉత్పత్తి సమాజమైనా చిన్న రైతు, పెట్టీ బూర్జువా వ్యవస్థ అయినా, పెట్టుబడిదారీ వ్యవస్థ అయినా సరుకులుగా ఆ ఉత్పాదితాల స్వభావం మారదు. సరుకులుగా అది మార్పిడి ప్రక్రియగుండా పయనించాల్సిందే. దానితోపాటు రూపంతో ఆయా మార్పులకు గురికావాల్సిందే. ఏ రెండు చివరల మధ్యవర్తిగా వర్తకుని పెట్టుబడి వ్యవహరిస్తుందో ఆ చివరలు అంతకు ముందే దాని విషయంలో నిర్ణయమై ఉంటాయి. డబ్బు విషయంలోనూ, దాని చలనాల విషయంలోనూ ఈ చివరలు నిర్ణీతంగా ఉన్నట్లుగానే. ఇక్కడ అవసరమైన ఏకైక అంశం ఏమిటంటే ఈ చివరలు సరుకులుగా అందుబాటులో ఉండడం. ఉత్పత్తి మొత్తంగా సరుకుల ఉత్పత్తి, లేక స్వతంత్ర ఉత్పత్తిదారుల తక్షణ అవసరాలు తమ సొంత ఉత్పత్తితో సంతృప్తమైనాక అదనపు ఉత్పాదితాలు మార్కెట్లోకి నెట్టబడుతున్నాయా? అన్నదానితో ఇక్కడ ప్రమేయం లేదు. ఈ చివరల, ఈ సరుకుల చలనాలను మాత్రమే వర్తకుని – పెట్టుబడి పెంపొందిస్తుంది. దాని అస్తిత్వానికి అవి ప్రాథమిక అవసరాలు.

ఉత్పాదితాలు వాణిజ్య రంగంలో ఏ మేరకు ప్రవేశించి వర్తకుల చేతులగుండా పయనిస్తాయి అన్న విషయం ఉత్పత్తి విధానంపైన ఆధారపడి ఉంటుంది. అది పెట్టుబడిదారీ ఉత్పత్తి అంతిమ అభివృద్ధిలో శిఖరాగ్ర దశకు చేరుకుంటుంది. అక్కడ ఉత్పత్తి ఒక జీవితావసరంగా కాక, కేవలం ఒక సరుకుగా మాత్రమే ఉత్పత్తి చేయబడుతుంది. మరోవైపున ప్రతి ఉత్పత్తి విధానం ప్రాతిపదికపైనా, వాణిజ్య మార్పిడికోసం నిర్దేశించిన అదనపు ఉత్పాదితాల ఉత్పత్తిని సుకరం చేస్తుంది. ఉత్పత్తిదారుల (ఇక్కడ ఉత్పాదితాల యజమానులు) విలాసాలను లేదా సంపదను పెంచడానికి తోడ్పడుతుంది. ఆ రకంగా వాణిజ్యం ఉత్పత్తికి రాను రాను మార్పిడి విలువ దిశగా ఉండే స్వభావాన్ని ఇస్తుంది.

సరుకుల రూపాంతరీకరణలో, వాటి చలనంలో రెండు అంశాలుంటాయి. ఒకటి పాదార్థిక అంశం. విభిన్న సరుకులు ఒకదానితో ఒకటి మార్పిడి కావడం. రెండు, రూపానికి సంబంధించిన అంశం. విక్రయం ద్వారా సరుకులను డబ్బుగా మార్చడం, కొనుగోలు ద్వారా డబ్బును సరుకులుగా మార్చడం. వర్తకుని పెట్టుబడి పని ఈ సరుకుల క్రయ విక్రయాలే కనుక అది సరుకుల మార్పిడిని

పెంపొందించడం మాత్రమే చేస్తుంది. అయితే ఈ మార్పిడి ప్రత్యక్ష ఉత్పత్తిదారుల మధ్య సరుకుల మార్పిడిగా అర్థం చేసుకోరాదు. బానిస వ్యవస్థ, ఫ్యూడల్ వ్యవస్థ సామంత రాజ్యాలలో (ఈ ఆదిమ సమాజాలకు సంబంధించినంత వరకు) బానిస, యజమాని, ఫ్యూడల్ ప్రభువు, కప్పం కట్టించుకునే రాజ్యమూ ఉత్పాదితాల సొంతదారులు కనుక వారే ఉత్పాదితాల విక్రయదార్లు కూడా. వర్తకుడు ఎంతోమంది కోసం క్రయ విక్రయాలు చేస్తాడు. క్రయ విక్రయాలు అతని చేతిలో కేంద్రీకరించ బడతాయి. కనుక అవి కొనుగోలుదారు (వర్తకుని) ప్రత్యక్ష అవసరాలకు మాత్రమే పరిమితం కానవసరం లేదు.

వర్తకుడు పెంపొందించే సరుకుల మార్పిడి ఉత్పత్తి రంగాలకు చెందిన ఏ సామాజిక వ్యవస్థలో అయినా వర్తకుని సంపద ఎప్పుడూ డబ్బు రూపంలోనే ఉంటుంది. అతని డబ్బు ఎప్పుడూ పెట్టుబడిగా వ్యవహరిస్తుంది. దాని రూపం ఎప్పుడూ డ–స–డ'. మార్పిడి విలువకు స్వతంత్ర రూపమైన డబ్బు ప్రారంభ స్థానం. మార్పిడి విలువను పెంచడమే దాని పరమావధి. సరుకు మార్పిడిగా దానిని ప్రభావితం చేసే చర్యల్ని (ఉత్పత్తి నుంచి వేర్పడి ఉత్పత్తిదారులు కానివారిచేత నిర్వహించబడే చర్యలు) కేవలం సంపదను సంపదగా మాత్రమే కాక దాని అత్యంత సార్వత్రిక రూపమైన సంపదగా, మార్పిడి విలువగా పెంపొందించే సాధనాలు మాత్రమే. ఇక్కడ బలమైన లక్ష్యం, నిర్ణయాత్మకమైన అంశం ఏమంటే డ ని డ+△డగా మార్చడమే. డ–స, స–డ' లావాదేవీలు డ–డ'ని పెంపొందిస్తాయి. ఇవి డ ని డ+△డగా మార్చడంలో పరివర్తనా దశగా మాత్రమే కనిపిస్తాయి. ఈ డ–స–డ' అన్నది వర్తకుని పెట్టుబడి యొక్క స్వభావోచితమైన చలనం. ఇది స–డ–స కంటే భిన్నమైనది. అనగా ఉత్పత్తిదారుల మధ్య నేరుగా జరిగే సరుకుల వాణిజ్యం కంటే భిన్నమైనది. ఈ సరుకుల వాణిజ్యానికి అంతిమ లక్ష్యం ఉపయోగ విలువల మార్పిడి.

ఉత్పత్తి ఎంత తక్కువగా అభివృద్ధి చెందితే డబ్బు రూపంలో ఉన్న సంపద అంత ఎక్కువగా వర్తకుల చేతుల్లో కేంద్రీకరించబడుతుంది, లేక వర్తకుల సంపద ప్రత్యేక రూపంలో కనిపిస్తుంది.

పెట్టుబడి ఉత్పత్తిపైన తన ఆధిపత్యాన్ని స్థాపించగానే, దానికి మొత్తంగా మారిన ప్రత్యేక రూపాన్ని ఇవ్వగానే, పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానంలో వర్తకుని పెట్టుబడి ప్రత్యేకమైన విధిని నిర్వహించే పెట్టుబడిగా కనిపిస్తుంది. ఇంతకు మునుపటి ఉత్పత్తి విధానాలన్నిటిలోను ముఖ్యంగా ఉత్పత్తిదారుని తక్షణ అవసరాల కోసమే ఉత్పత్తి జరిగిన వ్యవస్థలన్నిటిలోను వర్తకుని పెట్టుబడి అత్యుత్తమ పెట్టుబడి విధి నిర్వహిస్తున్నట్టు కనిపిస్తుంది.

అందుచేత ఉత్పత్తిపైన పెట్టుబడి తన ఆధిపత్యం స్థాపించుకోవడానికి చాలా ముందుగానే వర్తకుని పెట్టుబడి – పెట్టుబడి యొక్క చారిత్రక రూపంగా ఎందుకు కనిపిస్తుందో అర్థం చేసుకోవడం కష్టం కాదు. కొంతవరకు దాని ఉనికీ, అభివృద్ధీ పెట్టుబడిదారీ ఉత్పత్తి అభివృద్ధికి చారిత్రక పూర్వావసరాలు. 1. డబ్బు సంపద కేంద్రీకరించబడటానికి అవి పూర్వావసరం. 2. ఎందుకంటే పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానానికి పూర్వావసరంగా ముందు వాణిజ్యం కోసం ఉత్పత్తి జరగాలి, పెద్ద స్థాయిలో అమ్మకం జరగాలి. అమ్మకం కేవలం విడి వినియోగదారుని కోసం కాదు. అది తన సొంత అవసరాలను తీర్చుకోవడం కోసం కాక అమ్మకానికై తానే వర్తకుడై అనేకమంది కొనుగోలుదారుల కొనుగోళ్ళను తన ఒక్క కొనుగోలులో కేంద్రీకరిస్తాడు. మరోవైపున వర్తకుని పెట్టుబడి అభివృద్ధి

అంతా ఉత్పత్తిని రాను రాను మార్పిడి విలువకై జరిగే ఉత్పత్తి స్వభావాన్ని ఇస్తుంది. రాను రాను ఉత్పాదితాలను సరుకులుగా మార్చే స్వభావాన్ని ఇస్తుంది. అయినప్పటికీ దాని అభివృద్ధి తనంత తానుగా ఒక ఉత్పత్తి విధానం నుంచి మరో ఉత్పత్తి విధానానికి జరిగే పరివర్తనను పెంపొందించలేదు. దానిని వివరించలేదు కూడా. ఆ విషయాన్ని మనం ఇప్పుడు చూడవచ్చు.

పెట్టుబడిదారీ ఉత్పత్తిలో వర్తకుని పెట్టుబడి తన పూర్వపు స్వతంత్ర ఉనికి నుంచి పెట్టుబడి మదుపులో ఒక ప్రత్యేక దశకు కుదించబడుతుంది. లాభాల సమత్వం దాని లాభం రేటును సార్వత్రిక సగటుకు కుదిస్తుంది. ఉత్పాదక పెట్టుబడికి ప్రతినిధిగా మాత్రమే అది వ్యవహరిస్తుంది. వర్తకుని పెట్టుబడి అభివృద్ధితో పాటు రూపొందే ప్రత్యేక సామాజిక పరిస్థితులు ఇక్కడ ఎంతమాత్రం ప్రబలంగా ఉండవు. పైపెచ్చు వర్తకుని పెట్టుబడి ఇంకా ప్రాబల్యం వహిస్తున్న ప్రతిచోట వెనుకబడిన పరిస్థితుల్ని మనం చూస్తాం. ఒకే దేశంలో సహితం మనం దీనిని గమనించవచ్చు. ఉదాహరణకు ప్రత్యేకంగా వర్తక నగరాలు ఉన్నచోట పారిశ్రామిక నగరాల కంటే ప్రాచీన పరిస్థితులకే ఎక్కువ సామ్యం కనిపిస్తుంది.[1]

స్వతంత్రమైన, ప్రబలమైన రీతిలో వర్తకుని పెట్టుబడిగా పెట్టుబడి అభివృద్ధి చెందడం అంటే ఉత్పత్తి పెట్టుబడికి లొంగకపోవడమే అవుతుంది. ఆ రకంగా ఒక పరాయి సామాజిక ఉత్పత్తి విధానం ప్రాతిపదికపై అభివృద్ధి చెందే పెట్టుబడికి లొంగకపోవడం అవుతుంది. ఈ ఉత్పత్తి విధానం కూడా ఆ పెట్టుబడితో ప్రమేయం లేకుండా ఉంటుంది. కనుక వర్తకుని పెట్టుబడి స్వతంత్ర అభివృద్ధి సాధారణ, సామాజిక, ఆర్థిక అభివృద్ధికి విలోమ నిష్పత్తిలో ఉంటుంది.

పెట్టుబడి యొక్క ప్రబలమైన రూపంగా స్వతంత్ర వాణిజ్య సంపద చలామణి ప్రక్రియను దాని చివరల నుండి వేరుపడటానికి ప్రాతినిధ్యం వహిస్తుంది. ఈ చివరలు మార్పిడి చేసుకునే ఉత్పత్తిదారులే. వారు చలామణి ప్రక్రియతో నిమిత్తం లేకుండా స్వతంత్రంగా ఉంటారు. చలామణి ప్రక్రియ వారితో నిమిత్తం లేకుండా స్వతంత్రంగా ఉంటుంది. ఉత్పాదితం వాణిజ్యం ద్వారా సరుకుగా మారుతుంది. ఇక్కడ సరుకులను ఉత్పాదితాలుగా మార్చేది వాణిజ్యమే. అంతేకాని ఉత్పత్తి చేయబడిన సరుకు తన చలనాల ద్వారా వాణిజ్యాన్ని సృష్టించదు. ఆ రకంగా ఇక్కడ పెట్టుబడి మొదట చలామణి ప్రక్రియలో పెట్టుబడిగా కనిపిస్తుంది. పెట్టుబడిగా డబ్బు పెంపొందించేది చలామణి ప్రక్రియలోనే. ఉత్పాదితాలు మొదట మార్పిడి విలువలుగా, సరుకుగా, డబ్బుగా అభివృద్ధి చెందేది చలామణిలోనే. పెట్టుబడి తన చివరలను అదుపు చేయడం ఎలాగో నేర్చుకోవడానికి ముందు చలామణి ప్రక్రియలో

1. శ్రీమాన్ డబ్ల్యు. కీసెల్‌బాక్ 1860 నాటి తన గ్రంథంలో వర్తకుని పెట్టుబడి సాధారణ పెట్టుబడి రూపంగా ఉండే ప్రపంచానికి సంబంధించిన భావాలలో ఇంకా మునిగితేల్తున్నాడు. పెట్టుబడి యొక్క ఆధునిక అర్థం గురించి అతనికి బొత్తిగా తెలియదు. రోమ్ చరిత్రలో 'పెట్టుబడి' గురించి, పెట్టుబడి పాలన గురించి మాట్లాడుతున్నప్పుడు మోమ్‌సెన్ వ్యవహరించినట్లుగా ఇతడు వ్యవహరిస్తాడు. ఆధునిక ఇంగ్లీష్ చరిత్రలో వాణిజ్యవర్గం, వాణిజ్య నగరాలు రాజకీయంగా కూడా అభివృద్ధి నిరోధకంగా ఉన్నాయి. పారిశ్రామిక పెట్టుబడికి వ్యతిరేకంగా భూస్వాముల, వడ్డీ వ్యాపారుల ప్రయోజనాలతో కుమ్మక్కైనాయి. ఉదాహరణకు మాంచెస్టర్, బర్మింగ్‌హామ్‌లతో లివర్‌పూల్ రాజకీయ పాత్రను పోల్చి చూడండి. దాస్యపు సుంకం రద్దు వగైరా చర్యల వరకు పారిశ్రామిక పెట్టుబడి సంపూర్ణాధిపత్యాన్ని ఇంగ్లీషు వర్తకుని పెట్టుబడి, డబ్బు పెట్టుబడి వాణిజ్యం గుర్తించలేదు.

అది ఏర్పడాలి. చలామణి వివిధ ఉత్పత్తి రంగాల మధ్యవర్తిగా ఉంటుంది. డబ్బు, సరుకుల చలామణి అత్యంత విభిన్నమైన సామాజిక వ్యవస్థల ఉత్పత్తి రంగాల మధ్య మధ్యవర్తిత్వం నెరపగలదు. ఆ వ్యవస్థల అంతర్గత నిర్మాణం ఇంకా ఉపయోగ విలువల ఉత్పత్తికే అనువుగా ఉండి ఉండవచ్చు. మరో మూడో అంశంచేత కలపబడే ఉత్పత్తి రంగాలలో చలామణి ప్రక్రియ వేరుకావడం అన్నదానికి రెండు రకాల ప్రాధాన్యం ఉంది. ఒకవైపున చలామణి ఇంకా ఉత్పత్తిపైన తన పట్టును స్థాపించుకోలేదు. దానితో ఒక నిర్ణీత ప్రాతిపదికపై ముడిపడి ఉంటుంది. మరోవైపున ఉత్పత్తి ప్రక్రియ ఇంకా చలామణిని, కేవలం ఒక ఉత్పత్తి దశగా ఇముడ్చుకోలేదు. అయితే ఈ రెండూ పెట్టుబడిదారీ ఉత్పత్తికి వర్తిస్తాయి. ఉత్పత్తి ప్రక్రియ మొత్తంగా చలామణిపై ఆధారపడుతుంది. చలామణి కేవలం ఉత్పత్తి యొక్క ఒక తాత్కాలిక దశ మాత్రమే. ఈ చలామణిలో సరుకుగా సృష్టించబడిన ఉత్పాదితం వాస్తవ రూపం ధరిస్తుంది. అదే విధంగా సరుకులుగానే సృష్టించబడిన దాని ఉత్పత్తి అంశాలు స్థానభ్రంశం చెందుతాయి. చలామణిలో నుంచి నేరుగా అభివృద్ధి చెందిన ఆ రూపపు పెట్టుబడి, అనగా వర్తకుని పెట్టుబడి ఇక్కడ కేవలం పునరుత్పత్తి ప్రక్రియలో పెట్టుబడిగా కనిపిస్తుంది.

వర్తకుని పెట్టుబడి స్వతంత్ర అభివృద్ధి పెట్టుబడిదారీ ఉత్పత్తి అభివృద్ధి స్థాయికి విలోమ నిష్పత్తిలో ఉంటుందనే నియమం ప్రత్యేకించి, వెనిస్, జెనోవా, డచ్ తదితర దేశాలలోలాగా వాణిజ్య నిర్వహణ చరిత్రలో మరింత స్పష్టంగా కనిపిస్తుంది. ఇక్కడ ప్రధానమైన లాభాలు స్వదేశ వస్తువులను ఎగుమతి చేయడం వల్ల కాక, వాణిజ్యపరంగా ఆర్థికంగా అభివృద్ధి చెందని సమాజాల ఉత్పాదితాల మార్పిడిని పెంపొందించడం ద్వారా రెండు ఉత్పాదక దేశాలను దోచుకోవడం ద్వారా ప్రధాన లాభాలు లభించాయి.[1] ఇక్కడ వర్తకుని పెట్టుబడి దాని విశుద్ధ రూపంలో ఉంటుంది. ఉత్పత్తి రంగాల మధ్యవర్తిగా అది వ్యవహరిస్తుంది. అయితే ఆ రంగాల నుంచి అది వేరుచేయబడుతుంది. దాని అభివృద్ధికి ఇదే ప్రధాన కారణం. అయితే ఈ వాణిజ్య నిర్వహణపై గుత్తాధిపత్యం విచ్ఛిన్నమవుతుంది. దానితో పాటు ఆ వాణిజ్యం కూడా విచ్ఛిన్నమవుతుంది. ఇది ఆయా ప్రజల ఆర్థికాభివృద్ధికి అనులోమంగా జరుగుతుంది. వర్తకుని పెట్టుబడి ఈ ప్రజలను రెండు చివరలలోను దోచుకుంటూ వచ్చింది. వారి అభివృద్ధి రాహిత్యమే దాని ఉనికికి ప్రాతిపదిక. వాణిజ్య నిర్వహణ విషయంలో ఒక ప్రత్యేక వాణిజ్య శాఖ క్షీణతలా మాత్రమే కాక కేవలం వాణిజ్యంపైన ఆధారపడిన జాతుల, సార్వత్రిక రూపంలో వాణిజ్య నిర్వహణపైన ఆధారపడిన వారి వాణిజ్య సంపద యొక్క ప్రాబల్యంగా కూడా కనిపిస్తుంది. పెట్టుబడిదారీ ఉత్పత్తి పురోగమించడంతో, పారిశ్రామిక పెట్టుబడికి వర్తకులు లోబడి ఉండడంతో

1. "వాణిజ్య నగరాలలో ఉన్న ప్రజలు ధనిక నగరాల మెరుగైన ఉత్పత్తుల్ని, ఖరీదైన విలాస వస్తువులను దిగుమతి చేసుకోవడం ద్వారా బహు సంఖ్యాక యజమానుల ఆత్మాతిశయానికి అనుగుణమైన వస్తువులను ఇవ్వగలిగారు. ఈ యజమానులు తమ సొంత భూముల ముడి ఉత్పాదితాలను విస్తారమైన పరిమాణాలలో సమర్పించుకుని ఆ విలాస వస్తువులను ఆత్రంగా కొనుక్కున్నారు. ఆ కాలంలో యూరప్‌లో అత్యధిక భాగపు వాణిజ్యం ఆ రకంగా తమ సొంత ముడి ఉత్పాదితాలకు బదులు మరింత నాగరికమైన దేశాల ఉత్పాదితాలను తెచ్చుకోవడంగా ఉండేది... ఈ అభిరుచి సర్వసాధారణమైనప్పుడు, గిరాకీ గణనీయంగా పెరిగినపుడు, వర్తకులు రవాణా ఖర్చులను తగ్గించడం కోసం తమ సొంత దేశాలలోనే కొన్ని వస్తువుల తయారీకి ఏర్పాట్లు చేశారు." (ఆడమ్ స్మిత్, వెల్త్ ఆఫ్ నేషన్స్, బుక్ III, లండన్ 1776)

వ్యక్తమయ్యే ప్రత్యేక రూపం మాత్రమే ఇది. కేవలం సార్వత్రిక రూపంలో వలస ఆర్థిక వ్యవస్థలో మాత్రమే కాక (వలస వ్యవస్థ అనబడే దానిలో మాత్రమే కాక) ప్రత్యేకించి పాత డచ్ ఈస్ట్ ఇండియా కంపెనీ పద్ధతుల ద్వారా కూడా ఉత్పత్తిపైన అది పెత్తనం చేసినచోటల్లా వర్తకుని పెట్టుబడి స్వభావం స్పష్టంగా కనిపిస్తుంది.

వర్తకుని పెట్టుబడి చలనం డ–స–డ కనుక వర్తకుని లాభం మొదట చలామణి ప్రక్రియలో మాత్రమే కనిపించే చర్యల ద్వారా, అనగా క్రయ విక్రయాల ద్వారా సిద్ధిస్తుంది. రెండవది అది విక్రయం ద్వారా వాస్తవ రూపం ధరిస్తుంది. కనుక అది వేర్పడటం ద్వారా వచ్చిన లాభం. ఉత్పాదితాలు వాటి విలువకే అమ్మబడిన మేరకు వాణిజ్య లాభం అన్నది అసాధ్యమని స్పష్టంగా రుజువవుతుంది. చౌకగా కొని, ప్రియంగా అమ్మడమన్నది వాణిజ్య సూత్రం. అది సమ విలువల మార్పిడి కాదు. వివిధ సరుకులు విలువలుగా ఉన్న మేరకు దానిలో విలువ భావన ఇమిడి ఉంది. కనుక అది డబ్బుగా వ్యక్తం కాగలదు. గుణానికి సంబంధించి అవన్నీ సామాజిక క్రమ వ్యక్తీకరణలే. అయితే అవి సమ పరిమాణం గల విలువలు కాదు. ఉత్పాదితాలు మార్పిడి అయిన పరిమాణాత్మక నిష్పత్తి మొదట ఇష్టానుసారంగా జరుగుతుంది. మార్పిడి చేయడానికి వీలైన మేరకు – అనగా అదే మూడో అంశానికి వ్యక్తీకరణలుగా ఉన్న మేరకు – అవి సరుకుల రూపం సంతరించుకుంటాయి. నిరంతరాయమైన మార్పిడి, మరింత క్రమబద్ధమైన మార్పిడి కోసం జరిగే పునరుత్పత్తి రాను రాను ఇలా ఇష్టానుసారంగా విలువను నిర్ణయించే పద్ధతిని కుదిస్తుంది. అయితే ఇది మొదట ఉత్పత్తిదారులు, వినియోగదారుల కోసం జరగదు. డబ్బు, ధరలను పోల్చి చూసుకుని వాటి మధ్య తేడాలను జేబులో వేసుకునే వారి మధ్యవర్తి వర్తకుని కోసం ఇది జరుగుతుంది. అతడు సమత్వాన్ని స్థాపించేది తన సొంత చలనాల ద్వారా మాత్రమే.

ఆదిలో, వర్తకుని పెట్టుబడి తాను అదుపు చేయలేని అంచుల మధ్య, తాను సృష్టించని ప్రాతిపదికల మధ్య కేవలం జోక్యం చేసుకునే చలనం మాత్రమే.

సరుకు చలామణి, స–డ–స యొక్క శుద్ధ రూపం నుండి డబ్బు పుట్టినట్లే కేవలం విడివడటం వల్ల తనని తాను భద్రపరచుకుని పెంచుకునే ఒక అంశంగా డబ్బు, డబ్బు నిల్వ కూడా, వర్తకుని పెట్టుబడి చలామణి యొక్క విశుద్ధ రూపం నుంచి డ–స–డ నుంచి తలెత్తుతుంది. సరుకు చలామణి నుంచి డబ్బు కేవలం విలువ కాలమానంగాను, చలామణి సాధనంగాను మాత్రమే కాక సరుకు యొక్క సంపూర్ణ రూపంగాను అనగా నిల్వ ధనం రూపంగా కూడా కనిపిస్తుంది. ఆ రకంగా డబ్బు రూపంలో దానిని భద్రపర్చడం, పోగుచేయడం అన్నది ఒక పరమావధిగా మారుతుంది.

ఎపిక్యురస్ దేవతల లాగానే ప్రాచీన కాలంలో వాణిజ్య దేశాలన్నీ విశ్వంలో మధ్యంతర ప్రపంచాలలో ఉండేవి. లేదా అవి పోలిష్ సమాజ బెజ్జాలలో ఉన్న యూదుల లాగా ఉండేవి. మొట్టమొదట స్వతంత్ర సుభిక్ష వర్తక నగరాల, వాణిజ్య దేశాల వాణిజ్యం ప్రధానంగా ఉత్పత్తి చేసే దేశాల బర్బరతపైన ఆధారపడి ఉండేది. ఆ దేశాల మధ్య అవి దళారీలుగా వ్యవహరించాయి.

పెట్టుబడిదారీ పూర్వ సామాజిక దశలలో వాణిజ్యం పరిశ్రమను శాసించింది. ఆధునిక సమాజంలో అందుకు విరుద్ధంగా ఉంది. అయితే అది ఏ సమాజాల మధ్య వాణిజ్యం చేస్తోందో వాటిపైన వాణిజ్యం, ప్రతికూల ప్రభావాన్ని నెరపుతుంది. విలాస వస్తువులను, జీవితావసరాలను

తక్షణ ఉపయోగంపైన కాక వాటి విక్రయంపైన ఎక్కువగా ఆధారపడేలా చేయడం ద్వారా మరింతగా వాణిజ్యం ఉత్పత్తి మార్పిడి విలువలకు లోబడి ఉండేలా చేస్తుంది. ఆ రకంగా అది పాత సంబంధాలను రద్దు చేస్తుంది. డబ్బు చలమణిని అనేక రెట్లు పెంచుతుంది. అది ఉత్పత్తిలో మిగులును ఆవరించడం మాత్రమే కాక రాను రాను మరింత లోతుగా ఉత్పత్తిని దిగమింగుతుంది. మొత్తం ఉత్పత్తి శాఖలను తనపైన ఆధారపడేలా చేస్తుంది. అయినప్పటికీ ఈ విచ్ఛిన్నకర ప్రభావం, ఉత్పత్తి చేసే సమాజం యొక్క స్వభావంపైన చాలా వరకు ఆధారపడి ఉంటుంది.

అభివృద్ధి చెందని సమాజాల మధ్య ఉత్పాదితాల మార్పిడిని వర్తకుని పెట్టుబడి పెంపొందించిన మేరకు వాణిజ్య లాభం అన్నది తెలివిమీరిన బేరాలుగాను, వంచనగాను కనిపించడమే కాదు చాలావరకు వాటిలో నుంచే అది పుడుతుంది. వివిధ దేశాల ఉత్పత్తి ధరల మధ్య తేడాను అది స్వప్రయోజనాలకు వాడుకుంటుంది. (ఈ విషయంలో అది సరుకుల విలువను సమం చేసి నిర్ధారించే ధోరణి కలిగి ఉంటుంది.) అంతేకాదు ఆ ఉత్పత్తి విధానాల వల్ల వచ్చిన వర్తకుని పెట్టుబడి, అదనపు ఉత్పాదితంలో అత్యధిక భాగాన్ని స్వాయత్తం చేసుకొంటుంది. ఇంకా ఉపయోగ విలువల కోసమే గణనీయంగా ఉత్పత్తి చేసే సమాజాల మధ్య మధ్యవర్తిగా వ్యవహరించడం ద్వారా కొంత ఇలా స్వాయత్తం చేసుకోగలుగుతుంది. ఈ సమాజాల ఆర్థిక వ్యవస్థ దృష్టిలో తమ ఉత్పాదితంలో ఒక భాగం చలామణిలోకి ప్రవేశించి విక్రయించబడడం అన్నది, ఆ మాటకొస్తే ఆ ఉత్పాదితాలు వాటి విలువకు అమ్మబడటం అన్నది ద్వితీయ ప్రాధాన్యం గల అంశం మాత్రమే. ఆ తొలినాటి ఉత్పత్తి విధానాలలో వర్తకుడు వ్యవహరించే అదనపు ఉత్పాదితం యొక్క సొంతదారులు బానిస యజమాని, భూస్వామి లేదా రాజ్యం. (ఉదాహరణకు ప్రాచ్య నియంత) వీరు సంపద విలాసాల వినియోగానికి ప్రతినిధులు. దానిని వర్తకుడు పట్టుకోవడానికి చూస్తాడు. ఇంతకుముందు ఉల్లేఖించిన అంశంలో ఆడమ్ స్మిత్ ఫ్యూడల్ యుగాలలో ఉన్న ఈ పరిస్థితిని సరిగ్గా పసిగట్టగలిగాడు. వర్తకుని పెట్టుబడి ప్రబలమైన స్థితి సాధించగలిగినపుడు అది దారిదోపిడీ వ్యవస్థకు ప్రతిచోట ప్రతినిధిగా నిలబడుతుంది.[1] ఆ రకంగా ప్రాచీన కాలంలోను, ఆధునిక కాలంలో కూడా వాణిజ్య దేశాలలో దాని అభివృద్ధి దారిదోపిడీతో,

1. "ఇప్పుడు వర్తకులు ప్రభువుల గురించి దోపిడీ దొంగల గురించి అధికంగా ఫిర్యాదు చేస్తున్నారు. ఎందుకంటే వారు అనేక ప్రమాదాలను ఎదుర్కొంటున్నారు. వర్తకులను అపహరించుకుపోవడం, చితకబాదడం, బెదిరించడం, దోచుకోవడం సర్వసాధారణమైంది. ఈ దారుణాలను వారు న్యాయంకోసం భరించి ఉంటే వర్తకులు రుషిపుంగవులతో సమానమై ఉండేవారు... అయితే వర్తకులు ప్రపంచంలోనూ, తమ మధ్య కూడా చేస్తున్న నేరాలు క్రైస్తవ విరుద్ధమైన దొంగతనం, దోపిడీ గమనిస్తే అపసవ్య మార్గాలలో గ్రహించిన ఆ సంపదను భగవంతుడు తిరిగి స్వాధీనం చేసుకోవడంలో ఆశ్యర్యం ఉందా? వారి సంపద కోల్పోవడం, దోచుకోవడం, వారిని తలమీద కొట్టి జైళ్ళలోకి నెట్టడం అన్నవి ఆశ్చర్యకరమేమీ కాదు.... ప్రభువులు అటువంటి అన్యాయమైన బేరసారాలను కఠినంగా శిక్షించాలి. వారి పౌరులను వర్తకులు దారుణంగా దోచుకోకుండా అడ్డుకోవాలి. అలా చెయ్యడంలో ప్రభువులు విఫలం కావడం వల్ల దోపిడీ దొంగల్ని, వీరుల్ని భగవంతుడే వినియోగిస్తున్నాడు. వర్తకులు చేసిన పొరపాట్లకుగాను వారి ద్వారా భగవంతుడు శిక్షిస్తున్నాడు. వారిని భగవంతుడు తన సైతాన్లుగా ఉపయోగిస్తున్నాడు. ఈజిప్ట్‌నీ, ప్రపంచాన్నంతటినీ తన సైతాన్లతో నింపినట్లుగానే, శత్రువులతో నాశనం చేసినట్లుగానే భగవంతుడు వర్తకులను కూడా శిక్షిస్తున్నాడు. ఆ రకంగా ఆయన ఒకరికి వ్యతిరేకంగా, మరొకరిని ఉసిగొల్పుతున్నాడు.

సముద్ర దొంగతనాలతో, బానిసల అపహరణతో, వలసల ఆక్రమణతో ముడిపడి ఉంది. కార్టేజ్, రోమ్‌లు, అటు పిమ్మట వెనిస్, పోర్చుగీస్, డచ్ అందుకు ఉదాహరణలు.

ప్రతిచోటా వాణిజ్యం, వర్తకుని పెట్టుబడి అభివృద్ధి చెందడం అన్నది మార్పిడి విలువల ఉత్పత్తి దిశగా పయనించే ధోరణిని సృష్టిస్తుంది. దాని పరిమాణాన్ని ద్విగుణీకృతం చేస్తుంది. సకల జాతుల సమాహారంగా మారుస్తుంది. డబ్బును అది ప్రపంచ డబ్బుగా అభివృద్ధి చేస్తుంది. అందుచేత వాణిజ్యం ప్రతిచోటా ఉపయోగపు విలువల ఉత్పత్తికి అలవాటుపడి దానినే సాగించే భిన్న రూపాల ఉత్పత్తి వ్యవస్థలను బలహీనపరచే చెడు ప్రభావాన్ని ఎంతో కొంత చూపుతుంది. అయితే ఏ మేరకు ఈ పాత ఉత్పత్తి విధానాన్ని అది రద్దుచేయగలుగుతుంది అన్న అంశం ఆ వ్యవస్థ యొక్క స్థిరత్వంపైన, అంతర్గత నిర్మాణంపైన ఆధారపడి ఉంటుంది. ఈ రద్దు అయ్యే ప్రక్రియ ఎటు దారితీస్తుంది, పాత ఉత్పత్తి విధానం స్థానంలో ఏ కొత్త ఉత్పత్తి విధానం ఆవిర్భవిస్తుంది అన్నది వాణిజ్యంపైనే ఆధారపడి ఉండదు. అది పాత ఉత్పత్తి విధానపు స్వభావంపైనే ఆధారపడి ఉంటుంది. ప్రాచీన ప్రపంచంలో వాణిజ్య ప్రభావం వర్తక పెట్టుబడి అభివృద్ధి బానిస ఆర్థిక వ్యవస్థ ఏర్పడ్డానికే దారితీసింది. అది ఎప్పుడూ ప్రారంభ స్థానంపైనే ఆధారపడుతుంది. పితృస్వామిక బానిస వ్యవస్థలో తక్షణ జీవితావసరాల ఉత్పత్తి జరుగుతుంది. దానిని అదనపు విలువ ఉత్పత్తికి అంకితమైన సమాజంగా మార్చడానికి అది ఉపయోగపడుతుంది. ఐతే ఆధునిక ప్రపంచంలో ఇది పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానానికి దారి తీసింది. దాని నుంచి అర్థమయ్యేదేమిటంటే, వర్తకుని పెట్టుబడి అభివృద్ధి పరిస్థితులకు భిన్నమైన పరిస్థితుల నుంచి ఈ ఫలితాలు లభిస్తాయి.

వ్యవసాయ పరిశ్రమ నుంచి పట్టణ పరిశ్రమ విడిపోగానే పట్టణ పరిశ్రమ ఉత్పాదితాలు ప్రారంభం నుంచే సరుకులుగా ఉండటం, ఆ రకంగా వాటి విక్రయం కోసం వాణిజ్యం మధ్యవర్తిత్వం అవసరం కావడం సహజం. వాణిజ్యం పట్టణాల అభివృద్ధివైపు మొగ్గుచూపడం మరోవైపున వాణిజ్యం పైన నగరాలు ఆధారపడటం సహజమే. అయితే పారిశ్రామిక ప్రగతి వాణిజ్య అభివృద్ధితో పాటు ఏ మేరకు జరుగుతుంది అన్నది పూర్తిగా భిన్న పరిస్థితులపైన ఆధారపడి ఉంటుంది. ప్రాచీన రోమ్ తదుపరి రిపబ్లికన్ కాలంలో వర్తక పెట్టుబడిని ప్రాచీన ప్రపంచంలో ఇంతకుముందు ఎప్పుడూ కానంత ఎక్కువ స్థాయిలో అభివృద్ధి చేసింది. అయితే చేతివృత్తులలో ఏమాత్రం ప్రగతి చూపించలేదు.

---

ప్రభువులు, వీరులు వర్తకులకంటే ఏమాత్రం తక్కువ దారిదోపిడీ చేయడం లేదు. తేడా ఏమంటే వర్తకులు రోజువారీ దోచుకుంటారు. కాగా ఏడాదికి ఒకసారో రెండుసార్లో దోచుకుంటాడు గజదొంగ.'' ''ఐజయ్యా మాటను పాటించడం : ప్రభువులు దోపిడీ దొంగలకు సహచరులయ్యారు. వారు దొంగల్ని ఒకటో రెండో రూకలు దొంగిలించినందుకు ఉరితీస్తారు. అయితే వారు మొత్తం ప్రపంచాన్ని దోచుకునే వారితోను, మిగిలిన వారికంటే ధీమాగా దొంగతనం చేసేవారితోను సహచర్యం చేస్తారు. కనుక 'పెద్ద దొంగలు చిన్న దొంగల్ని ఉరితీస్తారు' అన్న సామెత రుజువవుతున్నది. రోమన్ సెనేటర్ కాటో ఇలా అన్నాడు. చిన్న దొంగలు జైళ్ళలో ఉంటారు. కానీ పగటి దొంగలు చీనీ చీనాంబరాలతో కులుకుతుంటారు. అయితే అంతిమంగా దేవుడేమంటాడు? ఆయన ఐజికిల్‌కి చెప్పినట్లుగానే చేస్తాడు. నగరాలు తగలబడే సందర్భంలో ప్రభువుల్ని, వర్తకుల్ని ఆయన సీసమూ, ఇనుముల్లాగానే మిళితం చేస్తాడు. ఆ మంటల్లో రాకుమారులు, వర్తకులు ఎవరూ మిగలరు.'' (మార్టిన్ లూథర్, పోన్ కౌస్ శాన్‌డ్లంగ్ అండ్ వూచార్, 1524. పుటలు 296-97)

కాగా కొరింత్‌లోను, యూరప్‌లో ఉన్న ఇతర గ్రీస్ నగరాలలోనూ, ఆసియా మైనర్‌లోనూ వాణిజ్యాభివృద్ధి చేతివృత్తుల అభివృద్ధితో పాటు కొనసాగింది. మరోవైపున నగరాలు వాటికి అనువైన పరిస్థితుల పెరుగుదలకు విరుద్ధంగా వాణిజ్య స్ఫూర్తి, వర్తక పెట్టుబడి అభివృద్ధి తరచుగా ఇంకా స్థిరపడని సంచార జాతుల ప్రజలలో కనిపిస్తుంది.

పదహారు, పదిహేడు శతాబ్దాలలో భౌగోళిక ఆవిష్కరణలు జరిగాయి. వాటివల్ల వాణిజ్యంలో మహా విప్లవాలు తలెత్తాయి. అవి వర్తకుని పెట్టుబడి అభివృద్ధిని మరింత త్వరితం చేశాయి. ఫ్యూడల్ ఉత్పత్తి విధానం పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానంగా పరివర్తన చెందడానికి తోడ్పడిన ప్రధాన అంశాలలో ఇవి ఒకటనడంలో సందేహం లేదు. సరిగ్గా ఈ వాస్తవమే పూర్తిగా పొరపాటు భావనకు దారితీసింది. హఠాత్తుగా ప్రపంచ మార్కెట్ విస్తరించడం, చలామణి సరుకులు గుణీకృతం కావడం, ఆసియా ఉత్పాదితాలను, అమెరికా సంపదలను స్వాధీనం చేసుకోవడంలో యూరప్ జాతుల మధ్య పోటీతో కూడిన పట్టుదల, వలస వ్యవస్థ – ఇవన్నీ ఉత్పత్తిపైన ఉన్న ఫ్యూడల్ సంకెళ్ళను విచ్ఛిన్నం చేసే దిశగా భౌతికంగా దోహదపడ్డాయి. అయితే మొదటి దశలో, కార్ఖానాల కాలంలో ఆధునిక ఉత్పత్తి విధానం మధ్యయుగాలలో దాని కనువైన పరిస్థితులు రూపొందినచోట మాత్రమే అభివృద్ధి చెందింది. ఉదా : పోర్చుగీస్‌తో హాలెండ్‌ని పోల్చి చూడండి.[1] పదహారో శతాబ్దంలోను, పాక్షికంగా పదిహేడో శతాబ్దంలోను హఠాత్తుగా జరిగిన వాణిజ్య విస్తరణ, కొత్త ప్రపంచ మార్కెట్ విస్తరణ పాత ఉత్పత్తి విధాన పతనానికి, పెట్టుబడిదారీ ఉత్పత్తి ఆవిర్భవించడానికి అత్యధికంగా తోడ్పడింది. అయితే అది అప్పటికే ఉనికిలో ఉన్న పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం ప్రాతిపదికపైన సాధించబడింది. ప్రపంచ మార్కెట్టే ఈ ఉత్పత్తి విధానానికి ప్రాతిపదిక ఏర్పరుస్తుంది. మరోవైపున ఈ ఉత్పత్తి విధానానికి రాను రాను మరింత పెద్ద స్థాయిలో ఉత్పత్తి చేయాల్సిన అవసరం సహజంగా ఉంటుంది. ఈ అవసరమే నిరంతరాయంగా ప్రపంచ మార్కెట్‌ని విస్తరించేలా చేస్తుంది. ఈ విషయంలో పరిశ్రమను విప్లవాత్మకంగా మార్చేది వాణిజ్యం కాదు. వాణిజ్యాన్ని నిరంతరాయంగా విప్లవాత్మకంగా మార్చేది పరిశ్రమ మాత్రమే. వాణిజ్య ఆధిపత్యమే ఇప్పుడు పెద్ద పరిశ్రమకు అనువైన పరిస్థితులు ఏ స్థాయిలో ఉన్నాయి అన్నదానితో ముడిపడి ఉంది. ఉదా : హాలెండ్‌ని ఇంగ్లండ్‌తో పోల్చండి. ప్రధాన వాణిజ్య దేశంగా ఉండే హాలెండ్ పతనపు చరిత్ర పారిశ్రామిక పెట్టుబడికి వర్తకుని పెట్టుబడి లోబడిన చరిత్రే. ఇండియా, చైనాలతో ఇంగ్లండ్‌కున్న సంబంధాలతో ఇంగ్లండ్ వాణిజ్య ప్రభావానికి అవరోధాలుగా నిలిచిన పెట్టుబడిదారీ

1. ఇతర పరిస్థితులతోపాటు హాలెండ్ అభివృద్ధికి ప్రాతిపదికగా చేపల పరిశ్రమ, కార్ఖానాలు, వ్యవసాయం ఎంత ప్రబలంగా వున్నాయో మాసీ లాంటి (పుట అరవై) పద్దెనిమిదో శతాబ్దపు రచయితలు వివరించారు. ఇంతకు ముందు ఆసియాలో ప్రాచీన కాలంలోను, మధ్యయుగాలలోను సాగిన వాణిజ్యం పరిమాణాన్ని, ప్రాధాన్యాన్ని తగ్గించి చూపడం జరిగింది. అందుకు విరుద్ధంగా ఇప్పుడు దానిని అతిశయించి చెప్పడం ఆనవాయితీగా మారింది. ఈ భావనకు అత్యుత్తమమైన విరుగుడేమిటంటే పద్దెనిమిదో శతాబ్దపు తొలిరోజుల్లో ఇంగ్లండ్ దిగుమతులు ఎగుమతుల అధ్యయనం, వాటిని ఆధునిక ఎగుమతులు దిగుమతులతో పోల్చి చూడటమే. అయినప్పటికీ ఇంతకు ముందు వాణిజ్యం చేసే ఏ దేశం కంటే కూడా పోల్చడానికి వీలులేనంత ఎక్కువగా ఉంటాయి. (చూ. ఆండర్సన్ ఏన్ హిస్టారికల్ అండ్ క్రోనలాజికల్ డిడక్షన్ ఆఫ్ ది ఆరిజిన్ ఆఫ్ కామర్స్) (సం. II, లండన్, 1761, పుట 261 - ఎంగెల్స్)

పూర్వ జాతీయ ఉత్పత్తి విధానాల స్థిరత్వం, అంగ నిర్మాణం ఉదాహరణలుగా నిలుస్తాయి. ఉత్పత్తి విధానపు విస్తృతి ప్రాతిపదిక ఇక్కడ సన్నకారు వ్యవసాయం, గృహ పరిశ్రమల ఐక్యతచేత ఏర్పడింది. భారతదేశంలో వీటికి తోడు ఉమ్మడి భూయాజమాన్యంపైన నిర్మించబడిన గ్రామీణ సమాజాల రూపాన్ని మనం జతపర్చాలి. సందర్భవశాత్తు, ఇదే రూపం చైనాలో కూడా తొలిదినాల్లో ఉంది. ఈ చిన్న ఆర్థిక సమాజాలను విచ్ఛిన్నం చేయడానికి భారతదేశంలో ఇంగ్లీషువారు పాలకులుగా, భూస్వాములుగా తమ ప్రత్యక్ష రాజకీయ, ఆర్థిక బలాన్ని వినియోగించడంలో కాలయాపన చేయలేదు.[1] ఈ సమాజాలపైన ఇంగ్లండ్ వాణిజ్యం విప్లవాత్మకమైన ప్రభావాన్ని కలిగించింది. దాని సరుకుల చౌకధరలు నేత పరిశ్రమలను, నూలు వడికే పరిశ్రమలను విచ్ఛిన్నం చేసిన మేరకు ఈ సమాజాలను అది ఛిన్నాభిన్నం చేసింది. పారిశ్రామిక వ్యవసాయిక ఉత్పత్తుల ఈ ఐక్యతను కట్టుబాటు చేసే ప్రాచీన అంశాలుగా నేత వడికే పరిశ్రమలు ఉండేవి. అయినప్పటికీ ఈ రద్దు కార్యక్రమం చాలా నెమ్మదిగానే కొనసాగుతోంది. తన ప్రత్యక్ష రాజకీయ అధికారం లేని చైనాలో ఇది మరింత నెమ్మదిగా సాగుతోంది. అక్కడి విస్తృతమైన ఆర్థిక వ్యవస్థ, వ్యవసాయం, కార్ఖానా తయారీతో మిళితం కావడం వల్ల సమయం పొదుపు కావడం – ఇవి పెద్ద పరిశ్రమల ఉత్పాదితాలను మొండిగా ప్రతిఘటించాయి. ఈ ఉత్పాదితాల ధరలలో చలామణి ప్రక్రియ ఖర్చులు కూడా కలిసే ఉంటాయి. ఇంగ్లీషు వాణిజ్యంలా కాక రష్యన్ వాణిజ్యం మరోవైపున ఆసియా ప్రాంతాల ఉత్పత్తి యొక్క ఆర్థిక పునాదిని ముట్టుకోకుండా వదిలేసింది.[2]

ఫ్యూడల్ ఉత్పత్తి విధానం నుంచి పరివర్తన రెండు రకాలుగా జరుగుతుంది. ప్రాకృతిక వ్యవసాయ ఆర్థిక వ్యవస్థకు, మధ్యయుగాల లోగిళ్ళ పరిధుల్లో సాగిన చేతివృత్తుల నగర పరిశ్రమలకు విరుద్ధంగా ఇక్కడ ఉత్పత్తిదారుడే వర్తకుడు, పెట్టుబడిదారుడు అవుతాడు. ఇది నిజంగా విప్లవాత్మకమైన మార్పు. లేదా వర్తకుడు ఉత్పత్తిపైన ప్రత్యక్షంగా పెత్తనం చేస్తాడు. ఇది చారిత్రకంగా తొలిమెట్టుగా ఎంతగా తోడ్పడినప్పటికీ తనంతటదే అది పాత ఉత్పత్తి విధానాన్ని కూలదోయడానికి తోడ్పడజాలదు. పైగా తన ప్రాథమిక అవసరంగా దానిని భద్రపరచి కొనసాగించాలనుకుంటుంది. ఉదాహరణకు 17వ శతాబ్దపు ఇంగ్లీషు వస్త్ర వ్యాపారిని చూడండి. స్వతంత్రులైన నేతగాళ్ళకు ఉన్ని అమ్మి, వారి దగ్గర వస్త్రాలను కొనుగోలు చేయడం ద్వారా వారిని తన అదుపులోకి తెచ్చుకుంటాడు. ఫ్రెంచి పట్టు పరిశ్రమలోను, ఇంగ్లీష్ రెడీమేడ్ దుస్తుల పరిశ్రమ, అల్లిక పరిశ్రమలలోను చాలావరకు ఈ కార్ఖానాదారుడు పందొమ్మిదో శతాబ్దపు మధ్యభాగం వరకు పేరుకు మాత్రమే కార్ఖానాదారుడు. నిజానికి అతడు కేవలం ఒక వర్తకుడు మాత్రమే. నేతగాళ్ళను మునుపటి అసంఘటిత పని చేయనిచ్చాడు.

---

1. వ్యర్థమైన, నిజంగా అసంబద్ధమైన (ఆచరణలో రోసిపోయిన) ఆర్థిక ప్రయోగాలకు ఏ దేశ చరిత్రనయినా ఉదాహరణగా చూపాలంటే అది భారతదేశంలో ఇంగ్లండ్ చరిత్ర మాత్రమే. బెంగాల్‌లో వారు ఇంగ్లండ్‌లో ఉండే భారీ ఎస్టేట్ల వక్రచిత్రాన్ని సృష్టించారు. ఆగ్నేయ భారతంలో చిన్న కమతాల వ్యంగ్య చిత్రాన్ని సృష్టించారు. వాయువ్య భారతంలో భూమిపై ఉమ్మడి స్వామ్యం కలిగి ఉండే భారత ఆర్థిక సమాజపు వ్యంగ్య చిత్రం సృష్టించడానికి వారు చేయగలిగిందంతా చేశారు.
2. రష్యా తన సొంత పెట్టుబడిదారీ ఉత్పత్తిని అభివృద్ధి చేయడానికి తీవ్రమైన కృషి చేస్తోంది. అది కేవలం తన సొంత మార్కెట్‌పైన, పొరుగునున్న ఆసియా ప్రాంతాల మార్కెట్‌పైన మాత్రమే ఆధారపడింది. ఈ కృషి వల్ల ఇది కూడా మారడం ప్రారంభమైంది - ఎంగెల్స్.

వారిపైన అతనికున్నది వర్తకుని అదుపే. వారు పనిచేసింది నిజానికి వర్తకుని కోసం మాత్రమే.[1] ప్రతిచోటా ఈ పద్ధతి నిజమైన పెట్టుబడిదారీ విధానానికి అవరోధంగా ఉంటుంది. పెట్టుబడిదారీ ఉత్పత్తి అభివృద్ధితో అది అడుగంటింది. ఉత్పత్తి విధానాన్ని అది విప్లవకరంగా మార్చకుండానే ప్రత్యక్ష ఉత్పత్తిదారుల పరిస్థితిని మరింత హీనంగా మారుస్తుంది. నేరుగా పెట్టుబడి ఆధిపత్యంలో ఉండే పరిస్థితుల కంటే హీనమైన పరిస్థితులలో వారిని వేతన కార్మికులుగాను, కేవలం కూలీవాళ్ళు గాను మారుస్తుంది. పాత ఉత్పత్తి విధానం ప్రాతిపదికపై వారి అదనపు శ్రమను స్వాహా చేస్తుంది. లండన్ చేతివృత్తులకు చెందిన ఫర్నిచర్ పరిశ్రమలో ఒక భాగంలో కొద్ది మార్పుతో ఇవే పరిస్థితులు ఉన్నాయి. టవర్ హామ్లెట్స్‌లో చాలా పెద్ద స్థాయిలో ఇదే పద్ధతి ఆచరించబడుతోంది. మొత్తం ఉత్పత్తి అంతా అసంఖ్యాకమైన విడివిడి వాణిజ్య శాఖలుగా ఒకదానితో మరొకటి సంబంధం లేకుండా విభజించబడింది. ఒక సంస్థ కుర్చీలు మాత్రమే చేస్తుంది. మరొకటి బల్లలు మాత్రమే, మూడోది రాతబల్లల్ని వగైరాలు మాత్రమే చేస్తుంది. ఈ సంస్థల్ని ఒక చిన్న యజమాని కొద్దిమంది కార్మికులతో చేతివృత్తుల లాగానే నడుపుతుంటాడు. అయితే ప్రైవేటు వ్యక్తులకోసం నేరుగా పని చేయడానికి వీలు లేనంత పెద్ద స్థాయిలో ఈ ఉత్పత్తి ఉంటుంది. వీటి కొనుగోలుదారులు ఫర్నిచర్ స్టోర్స్ యజమానులై ఉంటారు. శనివారాలలో ఈ చిన్న యజమాని ఫర్నిచర్ దుకాణాలకు పోయి తన ఉత్పాదితాన్ని అమ్ముతాడు. ఒక తాకట్టు దుకాణంలో అప్పుకోసం ప్రయత్నించినట్లుగానే, ఈ లావాదేవీ కూడా రహస్యంగా ఎంతకీ తెగని బేరంలా జరుగుతుంది. ఈ చిన్న యజమానులు వారానికోసారి జరిగే ఈ అమ్మకంపైన పూర్తిగా ఆధారపడి ఉంటారు. మరుసటి వారం ముడిపదార్థాలు కొనడానికి, జీతాలు చెల్లించడానికి అది వారికి తప్పనిసరి అవుతుంది. ఈ పరిస్థితులలో వారు కేవలం వర్తకునికి, తమ సొంత కార్మికులకు మధ్య దళారులు మాత్రమే. అదనపు విలువలో అత్యధిక భాగం కాజేసేది వర్తకుడే. ఇక్కడ అతను ఆచరణలో పెట్టుబడిదారుడు.[2] ఇంతకుముందు చేతివృత్తులుగానో లేదా గ్రామీణ పరిశ్రమలకు అనుబంధ శాఖలుగానో కొనసాగిన శాఖలు కార్ఖానా ఉత్పత్తికి పరివర్తన చెందే విషయంలో ఇదే సూత్రం వర్తిస్తుంది. భారీ పరిశ్రమకి జరిగే పరివర్తన చిన్న యజమాని నడిపే సంస్థల సాంకేతిక అభివృద్ధిపైన ఆధారపడుతుంది. చేతివృత్తి లాంటి చర్యను ఆమోదించే యంత్రాలను వారు వినియోగించినచోటల్లా ఇదే జరుగుతుంది. యంత్రం, చేతికి బదులు ఆవిరితో నడపబడుతుంది. ఇంగ్లీష్ అల్లిక వస్త్రాల పరిశ్రమలో, ఇది ఇటీవలి ఉదాహరణగా కనిపిస్తుంది.

పర్యవసానంగా మూడు రకాల పరివర్తన జరుగుతుంది.

**మొదటి విషయం :** వర్తకుడు నేరుగా ఒక పారిశ్రామిక పెట్టుబడి దారుడవుతాడు. వాణిజ్యంపైన

---

1. "రిబ్బన్ తయారీదారుకు సరైన ప్రాంతానికి చెందిన పట్టు నేతగాళ్ళకు ఇది వర్తిస్తుంది. ఈ గ్రామీణ చేనేతవారికి ఆ పట్టణ "కార్ఖానాదారుని"కి మధ్య సంబంధం సక్రమంగా ఉండడం కోసం క్రెఫెల్డ్ దగ్గరలో ఒక రైలు మార్గాన్ని సైతం నిర్మించడం జరిగింది. అయితే తరువాత దీనికి పనిలేకుండా పోయింది. ఎందుకంటే యాంత్రిక నేత పరిశ్రమ వచ్చి చేనేతవారిని నిరుద్యోగులుగా మార్చింది" - **ఎంగిల్స్.**

2. ఈ వ్యవస్థ 1865 నుంచి మరింత పెద్ద స్థాయిలో మరింత అభివృద్ధి చెందింది. వివరాలకోసం బండచాకిరీ పద్ధతిపైన ప్రభువుల సభకు చెందిన సెలెక్ట్ కమిటీ మొదటి నివేదిక చూడండి. లండన్, 1888 - **ఎంగెల్స్.**

ఆధారపడిన వృత్తుల విషయంలో ఇది వాస్తవం. ముఖ్యంగా పదిహేనో శతాబ్దంలో కాన్‌స్టాంటినోపుల్ నుంచి ఇటలీకి దిగుబడి అయినట్లుగానే విదేశాల నుండి ముడిపదార్థాల కార్మికుల దిగుమతిలోను, విలాస వస్తువును ఉత్పత్తి చేసే విషయంలోను ఇదే జరిగింది.

**రెండవది :** చిన్న యజమానులను వర్తకుడు తన దళారులుగా మారుస్తాడు. లేదా స్వతంత్ర ఉత్పత్తిదారుని దగ్గర నేరుగా కొంటాడు. ఆ ఉత్పత్తిదారుని నామమాత్రంగా స్వతంత్రంగా ఉంచుతాడు. అతని ఉత్పత్తి విధానాన్ని మార్చకుండా వదిలేస్తాడు.

**మూడవది :** పారిశ్రామికవేత్తే వర్తకుడవుతాడు. టోకు మార్కెట్ కోసం నేరుగా ఉత్పత్తి చేస్తాడు.

మధ్యయుగాల్లో గిల్డులు లేదా రైతులు ఉత్పత్తి చేసిన సరుకులను వర్తకుడు, పోపి[1] చెప్పినట్లుగా, కేవలం బదిలీ చేస్తాడు. వర్తకుడు పారిశ్రామికుడవుతాడు. లేదా చేతివృత్తుల వారిని, ముఖ్యంగా చిన్న గ్రామీణ ఉత్పత్తిదారుని తన కోసం పనిచేసేలా చేస్తాడు. అందుకు విరుద్ధంగా ఉత్పత్తిదారుడే వర్తకుడవుతాడు. ఉదా : మాస్టర్ వీవర్ తన ఉన్నిని లేదా నూలును తనే స్వయంగా కొంటాడు. తన వస్త్రాన్ని వర్తకునికి అమ్ముతాడు. తన ఉన్నికోసం వర్తకునిపై ఆధారపడడు. తన కార్మికులతో సహా వర్తకుని కోసం పనిచేయడు. ఉత్పత్తి అంశాలు అతడే స్వయంగా కొన్న సరుకులుగా ఉత్పత్తి ప్రక్రియలోకి ప్రవేశిస్తాయి. ఒక విడి వర్తకుని కోసం ఉత్పత్తి చేయడానికి బదులు, లేదా ప్రత్యేక ఖాతాదారుల కోసం ఉత్పత్తి చేయడానికి బదులు వాణిజ్య ప్రపంచం కోసం అతడు ఉత్పత్తి చేస్తాడు. ఇక్కడ ఉత్పత్తిదారుడే స్వయంగా వర్తకుడు. వర్తకుని పెట్టుబడి – చలామణి ప్రక్రియను కొనసాగించడం తప్ప మరేమీ చేయదు. మొదట చేతివృత్తులు, గ్రామీణ గృహ పరిశ్రమలు, ఫ్యూడల్ వ్యవసాయం పెట్టుబడిదారీ పరిశ్రమకు వాణిజ్యం అన్నది అవసరమయింది. అది ఉత్పాదితం కోసం కొంతవరకు మార్కెట్‌ని సృష్టించడం ద్వారాను, కొంతవరకు సమానమైన కొత్త సరుకుల్ని ప్రవేశపెట్టడం ద్వారాను, ఉత్పత్తికి కొత్త ముడిపదార్థాలు సహాయపదార్థాలు సరఫరా చేయడం ద్వారాను, ఆ రకంగా మొదటి నుంచి వాణిజ్యంపైన ఆధారపడి కొత్త ఉత్పత్తి శాఖల్ని ప్రారంభించడం ద్వారాను – అది ఉత్పాదితాన్ని సరుకుగా మారుస్తుంది. స్వదేశ ప్రపంచ మార్కెట్ల కోసం జరిగే ఉత్పత్తి విషయంలోను, ప్రపంచంలో తలెత్తే ఉత్పత్తి పరిస్థితుల విషయంలోను ఈ కొత్త ఉత్పత్తి శాఖలు మొదట వాణిజ్యంపైన ఆధారపడతాయి. కార్ఖానా విధానం తగినంత బలాన్ని పుంజుకోగానే ముఖ్యంగా భారీ పరిశ్రమ పుంజుకోగానే స్వయంగా తనకోసం ఒక మార్కెట్‌ను సృష్టించుకుంటుంది. తన సరుకుల ద్వారా దానిని స్వాధీనపరచుకోవడం ద్వారా ఆ మార్కెట్‌ను సృష్టిస్తుంది. ఈ స్థానం దగ్గర వాణిజ్యం పారిశ్రామిక పెట్టుబడి సేవకుడిగా మారిపోతుంది. పారిశ్రామిక పెట్టుబడికి మార్కెట్ నిరంతరాయంగా విస్తరించడం అన్నది ప్రాణావసరం అవుతుంది. రాను రాను మరింతగా విస్తరించే భారీ ఉత్పత్తి అప్పటికే ఉన్న మార్కెట్‌ని ముంచెత్తుతుంది. ఆ రకంగా మార్కెట్‌ని మరింతగా విస్తరింపచేయడం కోసం నిరంతరాయంగా కృషి చేస్తుంది. ఆ మార్కెట్ పరిధుల్ని అధిగమించడానికి అది ప్రయత్నిస్తుంది. ఈ భారీ ఉత్పత్తిని పరిమితం చేసేది వాణిజ్యం కాదు. (అది అప్పటికి ఉన్న గిరాకీని వ్యక్తం చేసిన మేరకు) దానిని పరిమితం చేసేది వినియోగంలో పెట్టబడిన పెట్టుబడి పరిమాణం, శ్రమ ఉత్పాదకత

1. పోపి గెషెటేడెర్ టెక్నాలజీ సం. I, గ్యాటింగెన్, 1807 - సం.

అభివృద్ధి స్థాయి మాత్రమే. పారిశ్రామిక పెట్టుబడిదారుని దృష్టిలో ఎప్పుడూ ప్రపంచ మార్కెట్ ఉంటుంది. అతడు నిరంతరాయంగా తన సొంత ఉత్పత్తి ధరలను దేశంలోను, ప్రపంచమంతటా ఉన్న మార్కెట్ ధరలతో నిరంతరాయంగా పోల్చి చూసుకుంటాడు. తొలిదశలో అటువంటి పోలిక దాదాపు మొత్తంగా వర్తకులే చేసేవారు. ఆ రకంగానే వారు పారిశ్రామిక పెట్టుబడిపైన వర్తక పెట్టుబడి ప్రాబల్యాన్ని సాధించారు.

ఆధునిక ఉత్పత్తి విధానాన్ని – అనగా వాణిజ్య వ్యవస్థను; సైద్ధాంతికంగా వివరించడం అన్నది వర్తక పెట్టుబడి చలనాలలో వేరుచేయబడిన చలామణి ప్రక్రియ యొక్క బాహ్యరూపాల అధ్యయనంతో ప్రారంభమైంది. కనుక ఆయా విషయాల బాహ్య రూపాన్ని మాత్రమే గ్రహించడం జరిగింది. వర్తక పెట్టుబడి సాధారణంగా పెట్టుబడి ఉనికికి మొదటి స్వతంత్ర రూపం కావడం దీనికి కొంతవరకు కారణం. ఫ్యూడల్ ఉత్పత్తిలో మొదటి విప్లవాత్మక దశలో, ఆధునిక ఉత్పత్తి పుట్టుకలో అది కలిగించిన అనంతమైన ప్రభావం మరికొంత కారణం. సైద్ధాంతిక విశ్లేషణ చలామణి ప్రక్రియ నుంచి ఉత్పత్తి ప్రక్రియకు మారినప్పుడు మాత్రమే ఆధునిక ఆర్థిక విధానం యొక్క వాస్తవ శాస్త్రం ప్రారంభమవుతుంది. నిజానికి దీనిలాగా వడ్డీ ఇచ్చే పెట్టుబడి కూడా పెట్టుబడి యొక్క అత్యంత ప్రాచీన రూపం. దానిని వాణిజ్య శాస్త్రం తన ప్రారంభ స్థానంగా తీసుకోకుండా దానికి వ్యతిరేకంగా వాద వివాదాలను ఎందుకు నిర్వహిస్తుందో మనం తరువాత చూస్తాం.

★ ★ ★

## ఐదవ భాగం

# వడ్డీగా, పరిశ్రమ లాభంగా లాభవిభజన

## అధ్యాయం - 21

# వడ్డీ కలిసిన పెట్టుబడి

**సా**ర్వత్రిక లేదా సగటు లాభం రేటు గురించిన మన మొదటి చర్చలో (ఈ పుస్తకంలో రెండో భాగం) ఈ రేటు దీని సంపూర్ణ రూపంలో మనముందు లేదు. అప్పుడు లాభం సమానంగా మారటం అన్నది వివిధ రంగాలలో పెట్టబడిన పారిశ్రామిక పెట్టుబడుల మధ్య సమానంగా మారటంగా మాత్రమే మనకు కనిపించింది. దానికి అనుబంధంగా తరువాత భాగంలో వాణిజ్య పెట్టుబడి కూడా సమానంగా ఎలా మారుతుందో వివరించబడింది. ఈ ప్రక్రియలో వాణిజ్య లాభం కూడా పాల్గొంటుందని తెలియజేయబడింది. సార్వత్రిక లాభం రేటు, సగటు లాభం అంతకు ముందుకంటే ఇప్పుడు మరింత తక్కువ పరిమితుల్లో కనిపించాయి. మన విశ్లేషణ క్రమంలో సార్వత్రిక లాభం రేటు గురించి కానీ, సగటు లాభం గురించి కానీ భవిష్యత్తులో ప్రస్తావన వస్తే ఈ రెండో అర్థంలో మాత్రమే మాట్లాడుతున్నట్టు గుర్తుంచుకోవాలి. కనుక సగటు రేటు యొక్క అంతిమ రూపాన్ని గురించి మాత్రమేనని అర్థం చేసుకోవాలి. ఈ రేటు వాణిజ్య పెట్టుబడికి పారిశ్రామిక పెట్టుబడికి సమానమే కనుక సగటు లాభానికి సంబంధించినంత వరకు వాణిజ్య పారిశ్రామిక పెట్టుబడుల మధ్య తేడా చూపించాల్సిన అవసరం ఏ మాత్రం లేదు. ఉత్పత్తి రంగంలో పారిశ్రామికంగా పెట్టబడినా, చలామణి రంగంలో వాణిజ్యపరంగా పెట్టబడినా, పెట్టుబడి దాని పరిమాణాన్ని బట్టి ఒకే సగటు వార్షిక లాభాన్ని ఇస్తుంది.

డబ్బు అన్నది ఇక్కడ వాస్తవంగా డబ్బు రూపంలో ఉన్నా లేదా సరుకుల రూపంలో ఉన్నా విలువల మొత్తానికి స్వతంత్ర వ్యక్తీకరణగా తీసుకోబడింది. అది పెట్టుబడిదారీ ఉత్పత్తి ప్రాతిపదికపైన పెట్టుబడిగా మార్చబడవచ్చు. ఆ రకంగా ఒక నిర్దిష్ట విలువ నుండి స్వయంగా విస్తరించే లేదా వృద్ధి చెందే విలువగా మార్చబడవచ్చు. అది లాభాన్ని ఉత్పత్తి చేస్తుంది. అనగా, అది వేతనం చెల్లించబడని కొంత శ్రమ పరిమాణాన్ని గుంజటానికి పెట్టుబడిదారుడికి వీలుకల్పిస్తుంది. కార్మికుల నుండి అదనపు ఉత్పాదితాన్ని, అదనపు విలువను స్వాయత్తం చేసుకొనేందుకు వీలుకల్పిస్తుంది. ఈ రకంగా డబ్బు ఒక ఉపయోగ విలువగా ఉండటంతోపాటు అది ఒక అదనపు ఉపయోగ విలువను కూడా సంతరించుకుంటుంది. అనగా పెట్టుబడిగా కూడా వ్యవహరించగలుగుతుంది. పెట్టుబడిగా

మార్చబడినప్పుడు అది ఉత్పత్తి చేసే లాభమే సరిగ్గా దాని ఉపయోగ విలువ. పెట్టుబడి కాగలిగిన దాని ఈ శక్తి వల్లనే, అనగా లాభాన్ని ఉత్పత్తి చేసే సాధనంగా మారగల శక్తి వల్లనే – అది ఒక సరుకుగా మారుతుంది. పెట్టుబడి పెట్టుబడిగానే ఒక సరుకుగా మారుతుందన్న మాట.[1]

సగటు వార్షిక లాభం రేటు 20 శాతమనుకుందాం. 100 పౌండ్ల విలువైన యంత్రాన్ని సగటు పరిస్థితులలో, కార్యసాధకమైన కృషితో, సగటు తెలివితేటలతో పెట్టుబడిగా ఉపయోగంలో పెడితే 20 పౌండ్ల లాభం ఇస్తుందన్నమాట. కనుక 100 పౌండ్లు చేతిలో ఉన్న మనిషి 100 పౌండ్లను 120 పౌండ్లుగా మార్చగలిగిన శక్తి కలిగి ఉన్నాడన్నమాట. అనగా 20 పౌండ్ల లాభాన్ని ఉత్పత్తి చేయగలడన్నమాట. అతని దగ్గర 100 పౌండ్ల పెట్టుబడిగా మారగలిగిన డబ్బు ఉంది. అతడు మరో వ్యక్తికి ఏడాదిపాటు నిజమైన పెట్టుబడిగా వాడుకోటానికి వీలుగా ఇస్తే అతడు ఆ రెండో వ్యక్తికి 20 పౌండ్ల లాభాన్ని సంపాదించే శక్తి ఇస్తున్నాడన్నమాట. ఈ 20 పౌండ్ల అదనపు విలువను ఉత్పత్తి చేయడానికి రెండవ వ్యక్తి ఖర్చు పెడుతున్నదేమీ లేదు. దానికి సమానమైన దేన్నీ అతడు ఇవ్వటం లేదు. ఈ రెండవ వ్యక్తి ఏడాది చివర వచ్చిన లాభంలో 100 పౌండ్లు తనకిచ్చిన ఆసామికి 5 పౌండ్లు ఇచ్చాడనుకొందాం. అంటే, 100 పౌండ్ల ఉపయోగ విలువకుగాను, అనగా పెట్టుబడిగా వ్యవహరించే దాని ఉపయోగ విలువకుగాను, అనగా 20 పౌండ్ల లాభాన్ని ఉత్పత్తి చేయగలిగిన దాని చర్యకుగాను ఈ 5 పౌండ్లు చెల్లిస్తున్నాడన్నమాట. ఆ యజమానికి లాభంలో ఒక వాటా ఇవ్వబడుతుంది. దాని పేరే వడ్డీ. పెట్టుబడి పనిచేసే ప్రక్రియలో ఉత్పత్తి అయ్యే లాభంలో తన సొంత ఖాతాలో కాక పెట్టుబడి యజమానికి ఇచ్చే వాటానే వడ్డీ అని అంటున్నది – ఇది దానికి మరొక పేరు లేదా ప్రత్యేక పదం.

తన వద్ద 100 పౌండ్లు ఉన్న యజమానికి అది వడ్డీని, అంటే అది ఉత్పత్తి చేసిన లాభంలో ఒక వాటాను ఇస్తుందనేది స్పష్టం. ఆ మరోవ్యక్తికి తన 100 పౌండ్లు ఇవ్వకుండా ఉంటే అది ఎటువంటి లాభమూ దాని యజమానికి సంపాదించి ఉండేది కాదు. ఈ 100 పౌండ్ల విషయంలో అతడు పెట్టుబడిదారునిగా వ్యవహరించడం కూడా సాధ్యపడేది కాదు.[2]

'ఇక్కడ గిల్బర్ట్ మాట్లాడినట్లుగా (పాద సూచికను చూడండి) సహజ న్యాయం గురించి మాట్లాడటం అర్థరహితం. ఉత్పత్తి ప్రతినిధుల మధ్య లావాదేవీల న్యాయం అన్నది ఉత్పత్తి సంబంధాల సహజ పర్యవసానాలుగా ఈ లావాదేవీలు తలెత్తుతాయి – అన్న వాస్తవంపైన ఆధారపడి ఉంటుంది. కనుక ఆర్థిక లావాదేవీలు కనిపించే న్యాయ సంబంధమైన రూపాలు ఆయా పక్షాల ఇష్టాపూర్వకమైన చర్యలుగాను – వారి ఉమ్మడి అభీష్టంలాగాను, చట్టబద్ధంగా ఒక వ్యక్తిగత పక్షానికి వ్యతిరేకంగా

1. ఇక్కడ ఈ అంశాన్ని అర్థశాస్త్రవేత్తలు ఎలా గ్రహించారో తెలియజెప్పడానికి కొన్ని ఉల్లేఖనలు అవసరం - "మీరు (బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్) పెట్టుబడి సరుకుతో పెద్ద స్థాయిలో వ్యవహరిస్తారా?" ఈ ప్రశ్న బ్యాంకు చట్టాల నివేదికను తయారుచేసే సందర్భంలో సాక్ష్యమిస్తున్న ఒక బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్ డైరెక్టర్‌ను అడగడం జరిగింది. (H.of C. 185, పుట 104)

2. "డబ్బును లాభం సంపాదించే ఉద్దేశంతో అప్పు తీసుకున్న వ్యక్తి అప్పు ఇచ్చినవాడికి తన లాభంలో కొంత భాగం ఇవ్వడమన్నది స్పష్టమైన సహజ న్యాయ సూత్రం." ది హిస్టరీ అండ్ ప్రిన్సిపల్స్ ఆఫ్ బ్యాంకింగ్. (గిల్బర్ట్ The History and Principles of Banking, లండన్, 1834, పుట 163)

అమలుచేయటానికి వీలైన ఒప్పందాలుగాను కనిపించినంత మాత్రాన – అవి కేవలం రూపాలు మాత్రమే గనుక – వస్తువును నిర్ణయించలేవు. కేవలం దాన్ని వ్యక్తం చేస్తాయి. ఉత్పత్తి విధానానికి ఈ సారాంశం అనుగుణంగా ఉన్నప్పుడు అది న్యాయమైనదే. ఆ విధానానికి అది విరుద్ధంగా ఉన్నప్పుడు అది అన్యాయంగా కనిపిస్తుంది. పెట్టుబడిదారీ ఉత్పత్తి ప్రాతిపదికపైన బానిసత్వం అన్యాయం అవుతుంది. అలాగే సరుకుల నాణ్యతలో కల్తీ కూడా అటువంటిదే.

100 పౌండ్లు పెట్టుబడిగా వ్యవహరిస్తుంది కనుక 20 పౌండ్లు లాభాన్ని ఉత్పత్తి చేస్తుంది. అది పారిశ్రామిక పెట్టుబడి కావచ్చు లేదా వాణిజ్య పెట్టుబడి కావచ్చు. ఈ 100 పౌండ్లు పెట్టుబడిగా వ్యయమైంది గనుక, అనగా ఉత్పత్తి సాధనాల కొనుగోలులో (పారిశ్రామిక పెట్టుబడి అయితే) లేదా సరుకుల కొనుగోలులో (వాణిజ్య పెట్టుబడి అయితే) వ్యయమైంది గనుక ఆ మొత్తం పెట్టుబడిగా వ్యవహరిస్తోందన్నమాట. అయితే ఇలా వ్యయం కావాలంటే ఆ మొత్తం అందుబాటులో ఉండాలి. ఈ 100 పౌండ్ల యజమాని క తన వ్యక్తిగత వినియోగానికి వినియోగించిన లేదా దానిని విధిగా తన వద్ద ఉంచుకొన్న, పని చేసే పెట్టుబడిదారు గ ద్వారా ఆ మొత్తం పెట్టుబడిగా మదుపు పెట్టుబడి ఉండేది కాదు. గ తన సొంత పెట్టుబడిని ఖర్చు పెట్టలేదు, క పెట్టుబడిని ఖర్చు పెట్టాడు. అయితే క పెట్టుబడిని అతడు క అంగీకారం లేకుండా వ్యయం చేయలేడు. కనుక మౌలికంగా 100 పౌండ్లనే పెట్టుబడిగా ఖర్చు పెడుతున్నవాడు క మాత్రమే. అయితే ఒక పెట్టుబడిదారునిగా అతని చర్య 100 పౌండ్లను ఇవ్వడానికే పరిమితమవుతుంది. ఈ 100 పౌండ్లకు సంబంధించి క అప్పు ఇచ్చాడు కనుకనే గ పెట్టుబడిదారుడిగా వ్యవహరించగలుగుతాడు. ఆ రకంగా ఆ మొత్తాన్ని పెట్టుబడిగా ఖర్చు చేయగలుగుతాడు.

మొదట మనం వడ్డీకి తెచ్చిన పెట్టుబడి యొక్క ఒక చలామణి క్రియను విడిగా పరిశీలిద్దాం. తరువాత అది సరుకుగా ఏ ప్రత్యేక పద్ధతిలో అమ్మబడిందో రెండవదిగా చూద్దాం. అనగా ఏకంగా దాన్ని ఇచ్చివేయటానికి బదులు అప్పుగా ఎలా ఇవ్వబడిందో విశ్లేషిద్దాం.

ఇక్కడ ప్రారంభ స్థానం గ కి క డబ్బు ఇవ్వడంతో హామీ మొదలవుతుంది. ఇది హామీ పూర్వకంగాను లేదా లేకుండాను ఇచ్చి ఉండవచ్చు. సరుకులపైన అడ్వాన్సులు ఇవ్వడం లేదా బిల్స్ ఆఫ్ ఎక్స్ఛేంజ్, షేర్లు వగైరాలపైన అడ్వాన్సులు ఇవ్వడం లాంటి రూపాలు తప్పితే మొదట పేర్కొన్న రూపం మరింత ప్రాచీనమైనది. ఈ ప్రత్యేక రూపాల విషయంతో మనకు ఈ దశలో సంబంధం లేదు. ఇక్కడ మనం వడ్డీ ఇచ్చే పెట్టుబడిని దాని సాధారణ రూపంలో మాత్రమే పరిశీలిస్తున్నాం.

గ స్వాధీనంలో డబ్బు వాస్తవంగా పెట్టుబడిగా మారింది. అది డ–స–డను గడచి చివర క చేతికి డ గా తిరిగి వస్తుంది. అనగా డ+△డగా తిరిగి వస్తుంది. △డ ఇక్కడ వడ్డీకి ప్రాతినిధ్యం వహిస్తుంది. ఇక్కడ పెట్టుబడి గ స్వాధీనంలో దీర్ఘకాలంపాటు ఉన్నప్పుడు తరచుగా నిర్ణీత కాల అవధుల్లో వడ్డీ చెల్లించబడటాన్ని మనం ఇక్కడ పరిశీలించడం లేదు.

కనుక గమనం ఈ క్రింది విధంగా ఉంటుంది :

ఇక్కడ ఒకే ప్రక్రియ డ–డ–స–డ'–డ రెండుసార్లు జరుగుతున్నట్లు కనిపిస్తుంది. అదేమిటంటే 1. పెట్టుబడిగా డబ్బును కేటాయించడం 2. వాస్తవ రూపం ధరించిన పెట్టుబడిగా అనగా డ గా లేదా డ+ △డ గా తిరిగి రావడం.

వాణిజ్య పెట్టుబడి గమనంలో ద–స–ద'లో ఒక వ్యాపారి మరో వ్యాపారికి అమ్మితే ఒకే సరుకు రెండు అంతకంటే ఎక్కువసార్లు చేతులు మారుతుంది. అయితే ఆ సరుకు ఆ రకంగా స్థాన భ్రంశం చెందినప్పుడల్లా రూపపరివర్తనకు గురి అవుతుంది. అది వినియోగ రంగంలో ప్రవేశించే దాకా ఆ ప్రక్రియ ఎన్నిసార్లు పునరావృత్తమయినప్పటికీ సరుకు క్రయ విక్రయాల్లో సరుకు రూపం మారుతుంది.

అలాకాక స–ద–సలో అదే డబ్బు చేతులు మారుతుంది. అయితే ఇది సరుకు యొక్క సంపూర్ణ రూప పరివర్తనను సూచిస్తుంది. మొదట అది డబ్బుగా మారుతుంది. తరువాత ఆ డబ్బు మరో సరుకుగా మారుతుంది.

అయితే వడ్డీ నిచ్చే పెట్టుబడి విషయంలో మొదటిసారి ద చేతులు మారినపుడు అది సరుకు రూప పరివర్తనగాని లేదా పెట్టుబడి పునరుత్పత్తిగాని కాదు. అది క్రియాశీల పెట్టుబడిదారుని చేతుల్లో అనగా దానితో వ్యాపారం చేసే పెట్టుబడిదారుని చేతుల్లో మాత్రమే పెట్టుబడిగా మారుతుంది. లేదా ఉత్పాదక పెట్టుబడిగా మారుతుంది. అనగా అది మొదటిసారి గాక రెండవసారి వ్యయమైనపుడే పెట్టుబడిగా మారుతుంది. మొదటిసారి చేతులు మారినపుడు క చేతిలో నుండి గ చేతిలోకి మారటం తప్ప మరి దేనినీ అది వ్యక్తం చేయదు. ఈ చేతులు మారడం అన్నది చట్టబద్ధమైన రూపాలలో నియమాల కనుగుణంగా జరుగుతుంది.

పెట్టుబడిగా ఒకే మొత్తం డబ్బు రెండుసార్లు కేటాయించబడటంలో మొదటి దశ క చేతుల నుండి గ చేతులలోకి బదిలీ కావటం మాత్రమే. అలాగే పెట్టుబడి తిరిగి రావడం కూడా రెండుసార్లు జరుగుతుంది. ద' గా లేదా ద+△దగా పెట్టుబడిదారునిగా వ్యవహరిస్తున్న గ చేతికి అది తిరిగి వస్తుంది. అతడు దానిని తిరిగి క కి ఇస్తాడు. అయితే దానితోపాటు లాభంలో కొంత భాగాన్ని కూడా కలిపి ఇస్తాడు. అనగా ద+△దని ఇస్తాడు. అయితే ఇక్కడ △ద మొత్తం లాభం కాదు. లాభంలో ఒక భాగం మాత్రమే, వడ్డీ మాత్రమే. అది పని నిర్వహిస్తున్న పెట్టుబడిగా గ చేతికి తిరిగి వస్తుంది. అయితే క ఆస్తిగా మాత్రమే అది తిరిగి వస్తుంది. ఆ పెట్టుబడికి అదనంగా కొంత లాభంలో భాగాన్ని వడ్డీ అనబడేదాన్ని అతడు క కి ఇవ్వాల్సి ఉంటుంది. ఎందుకంటే అతడు ఏ పెట్టుబడితో ఈ లాభాన్ని సంపాదించాడో అది స్వతహాగా క కి చెందిన పెట్టుబడి. ఈ చలనంలో తనను తాను భద్రపరచుకోవడం మాత్రమే కాక, తన యజమానికి అదనపు విలువను సృష్టించే విలువగా క దానిని గ కి ఇచ్చాడు. అది పనిచేసే పెట్టుబడిగా ఉన్నంత మేరకే గ చేతిలో ఉంటుంది. నిర్ణీత తేదీన అది తిరిగి వచ్చినప్పుడు పెట్టుబడిగా వ్యవహరించటం మానేస్తుంది. పెట్టుబడిగా వ్యవహరించని ఆ మొత్తాన్ని క కి తిరిగి ఇవ్వాల్సి ఉంటుంది. అతడు ఆ మొత్తానికి చట్టబద్ధంగా ఎప్పుడూ యజమానే.

సరుకుగా పెట్టుబడికి ప్రత్యేకమైన అప్పు ఇవ్వడమనే ఈ రూపం ఇక్కడ పెట్టుబడి అన్నది సరుకుగా లభించడం లేదా పెట్టుబడిగా ఉన్న డబ్బు సరుకుగా మారడం అన్న సాదా నిర్వచనం నుంచి తలెత్తుతుంది. ఈ రూపం అమ్మకానికి బదులు ఇతర లావాదేవీల్లో కూడా కనిపిస్తుంది. అయితే ఈ రెంటికీ తేడా ఉంది.

చలామణి రంగంలో పెట్టుబడి సరుకు పెట్టుబడిగాను, డబ్బు పెట్టుబడిగాను వ్యవహరిస్తుందన్న

సంగతిని మనం ఇంతకు ముందే పరిశీలించాం. (సంపుటం 2, అధ్యాయం 1) అయితే ఈ రెంటిలో దేనిలోనూ పెట్టుబడి పెట్టుబడిగా సరుకు రూపం ధరించదు.

ఉత్పాదక పెట్టుబడి, సరుకు పెట్టుబడిగా మారగానే దానిని సరుకుగా అమ్మడం కోసం మార్కెట్లో పెట్టాలి. అక్కడ అది సరుకుగా వ్యవహరిస్తుంది. అప్పుడు పెట్టుబడిదారు కేవలం సరుకు విక్రయదారుగా కనిపిస్తాడు. కొనుగోలు చేసే వ్యక్తి కేవలం సరుకు కొనుగోలుదారుగా కనిపించినట్లుగానే ఒక సరుకుగా ఉత్పాదితం దాని విక్రయం ద్వారా చలామణి ప్రక్రియలో తన విలువను పొందాలి. అనగా మారిన డబ్బు రూపాన్ని ధరించాలి. ఈ కారణంచేతనే ఈ సరుకు ఒక జీవితావసర వస్తువుగా లేక ఒక ఉత్పత్తి సాధనంగా అనగా పెట్టుబడిలో భాగంగా పెట్టుబడిదారునిచేత కొనబడిందా అన్న దానితో ప్రమేయం లేదు. చలామణి అనే చర్యలో సరుకు పెట్టుబడి సరుకుగా వ్యవహరిస్తుంది తప్ప పెట్టుబడిగా కాదు. అది సాధారణ సరుకుకు భిన్నమైన సరుకు పెట్టుబడి. 1. ఎందుకంటే అది అదనపు విలువ చేరి బరువెక్కుతుంది. అందువల్ల దాని విలువ చేతికందడమంటే, అదనపు విలువ చేతికందినట్లే. అయితే ఇది సరుకుగా కొంత ధర కల్గిన ఉత్పాదితంగా దాని మామూలు అస్తిత్వాన్ని ఏమాత్రం మార్చదు. 2. పెట్టుబడిగా పునరుత్పత్తి ప్రక్రియలో అది ఒక సరుకుగా వ్యవహరించడం అన్నది ఒక దశ. కనుక ఒక సరుకుగా దాని చలనం మొత్తం ప్రక్రియలో పాక్షికంగా మాత్రమే. అదే సమయంలో దానితోపాటు పెట్టుబడిగా అది చలనంలో ఉంటుంది. అది అమ్మకం ద్వారా కాక మొత్తం చలనంతో ఈ అమ్మకానికి ఉన్న సంబంధం ద్వారా మాత్రమే అది పెట్టుబడిగా ఉంటుంది.

అలాగే డబ్బు పెట్టుబడిగా అది కేవలం డబ్బుగా అనగా సరుకుల కొనుగోలు సాధనంగా (ఉత్పత్తి అంశాలు) వ్యవహరిస్తుంది. ఈ డబ్బు ఏకకాలంలో డబ్బు పెట్టుబడి కూడా. అనగా పెట్టుబడికి ఒక రూపం. ఇది నిర్వహించే ప్రధాన పాత్ర కొనుగోలు అనే చర్య వల్ల తలెత్తదు. మొత్తం పెట్టుబడి చలనంతో దీనికున్న సంబంధంతో ఇది తలెత్తుతుంది. ఎందుకంటే పెట్టుబడి డబ్బుగా వ్యవహరించడం అన్న ఈ చర్య పెట్టుబడిగా అది పెట్టుబడిదారీ ఉత్పత్తి ప్రక్రియను ప్రారంభిస్తుంది కనుక.

సరుకు పెట్టుబడీ, డబ్బు పెట్టుబడీ వాస్తవంగా పనిలో ఉన్న మేరకు, ఈ ప్రక్రియలో తమ వాస్తవ పాత్రలు నిర్వహించిన మేరకు అవి కేవలం సరుకుగాను, డబ్బుగాను మాత్రమే వ్యవహరిస్తాయి. ఈ రూప పరివర్తనలో పెట్టుబడిదారు తన సరుకులను కొనుగోలుదారునికి పెట్టుబడిగా అమ్మడు – అవి అతనికి పెట్టుబడే అయినప్పటికీ. అలాగే అతడు విక్రయదారునికి తన డబ్బును పెట్టుబడిగా ఇవ్వడు. ఈ రెండు సందర్భాలలోను అతడు తన సరుకుల్ని సరుకులుగాను, తన డబ్బును డబ్బుగాను అనగా సరుకుల కొనుగోలు సాధనంగా మాత్రమే ఇస్తాడు.

మొత్తం ప్రక్రియలో భాగంగానే, అనగా ప్రారంభ స్థానం, పునరాగమన స్థానం ఏకకాలంలో ఒకటిగా కనిపించే ఈ సందర్భంలో మాత్రమే, అనగా డ–డ' లేదా స–స' లో మాత్రమే చలామణి ప్రక్రియలో మాత్రమే పెట్టుబడి పెట్టుబడిగా కనిపిస్తుంది. (కాగా ఉత్పత్తి ప్రక్రియలో కార్మికుణ్ణి పెట్టుబడిదారునికి లొంగదీయడం ద్వారా, అదనపు విలువను ఉత్పత్తి చేయటం ద్వారా పెట్టుబడిగా వ్యవహరిస్తుంది.) దీని పునరాగమన స్థానంలో ఈ సంబంధం అంతర్థానం అవుతుంది. కనుక మన ముందున్నది డ–డ' లేదా డ+△డ. అనగా తొలిదశలో అడ్వాన్స్ చేయబడిన మొత్తం + దాని పెరుగుదల, అనగా చేతికందిన అదనపు విలువ (△డ విలువ మొత్తం డబ్బు రూపంలో ఉంటుందా,

సరుకుల రూపంలోనా, ఉత్పత్తి అంశాల రూపంలోనా అన్న దాంతో ప్రమేయం లేదు.) సరిగ్గా ఈ పునరాగమన స్థానంలో పెట్టుబడి పెట్టుబడిగా, విస్తృత విలువగా ఈ రూపంలో చలామణిలోకి ఎన్నడూ ప్రవేశించదు సరికదా (ఈ స్థానం విరామ స్థానంగా నిర్ణయమై ఉండటం వాస్తవమూ కావచ్చు, ఊహాజనితమూ కావచ్చు అలా ఉన్న మేరకు.) మొత్తం ప్రక్రియ ఫలితంగా చలామణి నుండి ఉపసంహరించబడినట్లు కనిపిస్తుంది. అది తిరిగి వ్యయం చేయబడినపుడల్లా మరొకరికి పెట్టుబడిగా ఇవ్వబడదు. కేవలం అది ఒక సాధారణ సరుకుగా మాత్రమే అమ్మబడుతుంది లేదా సరుకుల మార్పిడికిగాను సాధారణమైన డబ్బుగా ఇవ్వబడుతుంది. చలామణి ప్రక్రియలో అది ఎన్నడూ పెట్టుబడిగా కనిపించదు. కేవలం సరుకుగాను లేదా డబ్బుగాను కనిపిస్తుంది. ఈ సందర్భంలో అది ఇతరులకు ఈ రూపాల్లో మాత్రమే కనిపిస్తుంది. సరుకులు, డబ్బు ఇక్కడ పెట్టుబడేకాని సరుకులు డబ్బుగా మారటం వల్లనూ, డబ్బు సరుకులుగా మారటం వల్లనూ కాక క్రయ, విక్రయదారుల విషయంలో తమ వాస్తవ సంబంధాల ద్వారా గాక, కేవలం పెట్టుబడిదారునితో (వ్యక్తిపరంగా చూస్తే) భావ రూపేణా ఉన్న సంబంధాల ద్వారా లేదా పునరుత్పత్తి ప్రక్రియలో (వస్తుగతంగా చూస్తే) దశలుగా మాత్రమే అవి – పెట్టుబడిగా వ్యవహరిస్తాయి. పెట్టుబడి వాస్తవ చలనంలో మాత్రమే పెట్టుబడిగా ఉంటుంది. అది చలామణి ప్రక్రియలో కాదు. శ్రమశక్తి దోపిడీకి గురయ్యే ప్రక్రియలో మాత్రమే, అనగా ఉత్పత్తి ప్రక్రియలో మాత్రమే అది పెట్టుబడిగా వ్యవహరిస్తుంది.

వడ్డీ ఇచ్చే పెట్టుబడి విషయంలో ఇది భిన్నంగా ఉంటుంది. ఈ భిన్నత్వం వల్లనే దానికి ఒక ప్రత్యేక స్వభావం వస్తుంది. వడ్డీ ఇచ్చే పెట్టుబడిగా తన డబ్బును పెంచుకోదలచుకున్న డబ్బు ఆసామి దానిని ఒక మూడోవ్యక్తికి యిస్తాడు. చలామణి రంగంలోకి దానిని విసురుతాడు. దానిని పెట్టుబడి అనే సరుకుగా మారుస్తాడు. తనవరకే కాక ఇతరులకు కూడా పెట్టుబడిగా వ్యవహరించేలా మారుస్తాడు. దానిని ఇచ్చేవానికి మాత్రమే అది పెట్టుబడి కాదు. మొదటి నుంచి అది మూడవ వ్యక్తికి కూడా పెట్టుబడిగా వ్యవహరిస్తుంది. అది అదనపు విలువను సృష్టించే లాభాన్ని సృష్టించే ఉపయోగ విలువగా వ్యవహరిస్తుంది. ఆ విలువ తన చలనంలో తనను తాను భద్రపరచుకుని తొలి యజమానికి అనగా డబ్బు యజమానికి తన విధి నిర్వహణ తర్వాత తిరిగి వస్తుంది. కనుక అది అతనిని కొంతకాలం మాత్రమే విడిచి ఉంటుంది. అతని స్వాధీనం నుంచి తప్పుకొని పని నిర్వహిస్తున్న పెట్టుబడిదారుని స్వాధీనంలోకి పోతుంది. కనుక దానిని మొదటి వ్యక్తి రెండవ వ్యక్తికి చెల్లించలేదు, అమ్మలేదు. కేవలం అప్పుగా మాత్రమే ఇచ్చాడు. కొంత కాల వ్యవధి తర్వాత అది తొలి స్థానానికే తిరిగి రావాలన్న షరతుతో దానిని తాత్కాలికంగా వదులుకున్నాడు. అంతేకాక అది ఒక వాస్తవ రూపం ధరించిన పెట్టుబడిగా అంటే తన ఉపయోగ విలువను సార్థకం చేసిన పెట్టుబడిగా అనగా అదనపు విలువను సృష్టించే దాని శక్తికి వినియోగించిన పెట్టుబడిగా తిరిగి వస్తుంది.

పెట్టుబడిగా రుణం ఇవ్వబడిన సరుకులు స్థిర పెట్టుబడిగా గాని, చలామణి పెట్టుబడిగా గాని వాటి లక్షణాలను బట్టి అప్పు ఇవ్వబడతాయి. డబ్బును ఈ రెంటిలో ఏ రూపంలోనైనా అప్పు పెట్టవచ్చు. ఉదాహరణకు దాన్ని స్థిర పెట్టుబడిగా అప్పిచ్చినట్లయితే, సాలుసరి వాయిదా రూపంలో దాన్ని తిరిగి చెల్లిస్తే, అక్కడ పెట్టుబడిలో కొంత భాగం వడ్డీతోపాటు వెనుక్కు వస్తుంది. ఇల్లు, నౌకలు, యంత్రాలు వగైరా సరుకులు కొన్ని స్వతహాగా వాటి ఉపయోగ విలువల స్వభావం వల్ల స్థిర

పెట్టుబడిగా మాత్రమే అప్పు ఇవ్వబడతాయి. అప్పు ఇవ్వబడిన పెట్టుబడి రూపం ఏదయినప్పటికీ, దాని ఉపయోగ విలువ యొక్క స్వభావం అది తిరిగి వచ్చే పద్ధతిని ఎలా మార్చినప్పటికీ అది డబ్బు పెట్టుబడి యొక్క ఒక ప్రత్యేక రూపం మాత్రమే. ఎందుకంటే అప్పు ఇవ్వబడినది ఒక నిర్దిష్ట మొత్తం డబ్బు. వడ్డీ ఈ మొత్తంపైనే లెక్కకట్టబడుతుంది. అప్పు ఇవ్వబడినది డబ్బు లేదా చలామణి పెట్టుబడి కాకపోయినట్లయితే అది కూడా స్థిర పెట్టుబడి విషయంలో లాగానే ప్రతిఫలం తిరిగి వస్తుంది. రుణదాత నిర్ణీత కాలానికి ఓసారి చొప్పున స్థిర పెట్టుబడిలో ఖర్చయిన భాగంతోపాటు వడ్డీని కూడా పొందుతాడు. ఈ ఖర్చయిన భాగం నిర్ణీత కాలంలో అరుగుదలకు సమానమవుతుంది. నిర్ణీత కాలం చివర అప్పు ఇవ్వబడిన స్థిర పెట్టుబడిలో వినియోగంగాని భాగం వస్తు రూపేణా తిరిగి వస్తుంది. అప్పు ఇవ్వబడిన పెట్టుబడి చలామణి పెట్టుబడి అయితే అది కూడా అదే విధంగా చలామణి పెట్టుబడి తరహాలోనే తిరిగి వస్తుంది.

ఈ పునరాగమన ఫక్కీ పునరుత్పత్తి చర్యలో పెట్టుబడి చేసే ఆవృత్తిని బట్టి, దాని ప్రత్యేక తరహాలను బట్టి నిర్ణయమవుతుంది. కానీ అప్పు ఇవ్వబడిన పెట్టుబడి విషయంలో తిరిగి ఇవ్వాల్సిన చెల్లింపుల రూపంలోనే తిరిగి వస్తుంది. ఎందుకంటే అది అప్పు రూపంలో అడ్వాన్సు చేయబడి బదిలీ అయింది కనుక.

ఈ అధ్యాయంలో మనం కేవలం వాస్తవమైన డబ్బు పెట్టుబడిని పరిశీలిద్దాం. దానినుంచే అప్పు ఇవ్వబడిన పెట్టుబడి యొక్క ఇతర రూపాలు తలెత్తుతాయి.

అప్పు ఇవ్వబడిన పెట్టుబడి రెండు రకాలుగా తిరిగి వెనక్కు వస్తుంది. పునరుత్పత్తి ప్రక్రియలో అది పనిచేసే పెట్టుబడిదారునికి అది తిరిగి వస్తుంది. తర్వాత ఆ తిరిగి రావడం అన్నది మరోసారి అప్పు ఇచ్చిన వ్యక్తికి అనగా డబ్బు పెట్టుబడిదారునికి బదిలీ అవటం ద్వారా పునరావృత్తమవుతుంది. దాని సొంత యజమానికి తిరిగి చెల్లించబడుతుంది. అది దాని చట్టబద్ధమైన ప్రారంభ స్థానానికి తిరిగి వస్తుంది.

వాస్తవ చలామణి ప్రక్రియలో పెట్టుబడి ఎప్పుడూ సరుకుగా గాని లేదా డబ్బుగా గాని కనిపిస్తుంది. దాని చలనం ఎప్పుడూ క్రయ, విక్రయాల పరంపరలుగా విభజితమవుతుంది. క్లుప్తంగా చెప్పాలంటే, చలామణి ప్రక్రియ సరుకుల రూపపరివర్తనగా మారుతుంది. అయితే ఉత్పత్తి ప్రక్రియను మొత్తంగా పరిగణిస్తేనే, అది భిన్నంగా ఉంటుంది. మనం డబ్బుతో ప్రారంభిస్తే (మనం సరుకులతో ప్రారంభించినప్పటికీ వాటి విలువనే పరిగణిస్తాం కనుక అవి కూడా డబ్బుగానే వ్యవహరిస్తాయి.) కొంత కాలానికి కొంత డబ్బు ఖర్చయి తిరిగి కొంత వృద్ధితో పాటు తిరిగి రావడాన్ని గమనిస్తాం. అడ్వాన్స్ చేయబడిన డబ్బు మొత్తం అదనపు విలువతో కలిసి తిరిగి వస్తుంది. ఒక ఆవృత్తం పూర్తి చేయటం ద్వారా అది యథాతథంగా ఉండటమే కాక వృద్ధి చెందింది. అయితే పెట్టుబడిగా అప్పు ఇవ్వబడటం వల్ల డబ్బు తనను తాను భద్రపరచుకొని వృద్ధిచెందే డబ్బు మొత్తంగా అప్పు ఇవ్వబడింది. అది నిర్ణీత కాలం తర్వాత పెరుగుదలతోపాటు తిరిగి వస్తుంది. అదే ప్రక్రియను మళ్ళీ నిర్వహించటానికి సిద్ధంగా ఉంటుంది. అది డబ్బుగా గాని లేదా సరుకుగా గాని వ్యయం కాలేదు. ఒక సరుకు కొనుగోలులో డబ్బుగా వ్యయం కాలేదు. లేదా డబ్బు కోసం సరుకుగా అమ్మబడలేదు. అది పెట్టుబడిగా మాత్రమే వ్యయమైంది. తనతో దానికి ఉన్న ఈ సంబంధం పెట్టుబడిదారీ ఉత్పత్తి ప్రక్రియ మొత్తంగా ఒకే

అంశంగా పరిశీలించబడినప్పుడు, పెట్టుబడి డబ్బును సృష్టించే డబ్బుగా కన్పించినపుడు పెట్టుబడి ప్రత్యక్షమవుతుంది. ఈ సంబంధం దానికి తన స్వభావంలాగా, దాని నామధేయంలాగా మధ్యంతర చలనం ఏదీ లేకుండా అబ్బుతుంది. ఈ నామధేయంతోనే ఇది డబ్బు పెట్టుబడిగా అప్పు ఇవ్వబడినపుడు త్యజించబడుతుంది.

డబ్బు పెట్టుబడి పాత్ర గురించి ప్రౌధాన్‌కి ఓ వింత అవగాహన ఉంది. అప్పు ఇవ్వడమన్నది అమ్మకం కాదు గనుక అది ఒక పాపంలా ప్రౌధాన్‌కి కనిపిస్తుంది. వడ్డీ అప్పు ఇవ్వడమంటే "ఒకే వస్తువును దాని యాజమాన్యాన్ని వదిలిపెట్టకుండానే పదే పదే అమ్మడం, పదే పదే దాని ధరను రాబట్టడమూ అవుతుంది.[1] ఈ వస్తువు డబ్బు – ఇల్లు వగైరా ఏదైనా కావచ్చు – అది క్రయ విక్రయాలలోలాగా యజమానులను మార్చదు. వడ్డీ ఇచ్చే పెట్టుబడి రూపంలో ఇచ్చిన డబ్బుకు ప్రతిగా సమవిలువ ఏదీ అప్పు ఇచ్చిన వ్యక్తి పొందలేదని ప్రౌధాన్ గమనించలేదు. మార్పిడి ప్రక్రియలున్న మేరకు ప్రతి క్రయ విక్రయ చర్యలోను వస్తువు ఇచ్చివేయబడుతుందన్న మాట నిజమే. అమ్మబడిన వస్తువు, యాజమాన్యం వదిలివేయబడుతుంది. కానీ దాని విలువను వదులుకోవడం జరగదు. ఒక అమ్మకంలో సరుకు ఇవ్వబడుతుంది. కానీ దాని విలువ ఇవ్వబడదు. అది డబ్బు రూపంలో తిరిగి వస్తుంది. లేదా అది మరో రూపంలో ఉంటుంది. ప్రామిసరీ నోట్లు లేదా దస్తావేజుల రూపంలో ఉంటుంది. కొనుగోలు చేసేటప్పుడు డబ్బు ఇచ్చివేయబడుతుంది. కాని దాని విలువ కాదు. ఆ విలువ సరుకుల రూపంలో తిరిగి వస్తుంది. పారిశ్రామిక పెట్టుబడిదారు అదే విలువను తన చేతుల్లో పునరుత్పత్తి ప్రక్రియ జరుగుతున్నంత కాలమూ (అదనపు విలువ మినహా) భిన్నమైన రూపాల్లో ఉంచుకుంటాడు.

మార్పిడి ఉన్న మేరకు అనగా వస్తువుల మధ్య మార్పిడి జరిగిన మేరకు విలువలో మార్పేమీ ఉండదు. అదే పెట్టుబడిదారు ఎల్లప్పుడూ అదే విలువను ఉంచుకుంటాడు. కాని పెట్టుబడిదారు అదనపు విలువను ఉత్పత్తి చేసిన మేరకు మార్పిడి అనేది ఉండదు. ఒక మార్పిడి జరగగానే అదనపు విలువ అన్నది సరుకులలో అప్పటికే పొందుపరచబడి వుంది. డ–స–డ' అనే పెట్టుబడి చేసిన ఆవృత్తాన్ని మనం గమనిస్తే ఒక నిర్దిష్ట విలువ మొత్తం నిరంతరాయంగా అడ్వాన్స్ చేయబడుతుందనీ, చలామణి నుంచి ఈ మొత్తమూ, దానితోపాటు అదనపు విలువ లేదా లాభం ఉపసంహరింప బడుతోందని అర్థం అవుతుంది. వాస్తవ మార్పిడి చర్య, ఈ ప్రక్రియకు ఎలా ప్రోద్బలమిస్తోందో ఏరకంగానూ వెల్లడించదు. అది సరిగ్గా పెట్టుబడిగా డ యొక్క ప్రక్రియ. దానిపై డబ్బు అప్పిచ్చే పెట్టుబడిదారుని వడ్డీ ఆధారపడి ఉంటుంది. దానినుంచే అది తలెత్తుతుంది.

"టోపీలు తయారు చేసే వ్యక్తి వాటి అమ్మకంతో నిజానికి వాటి విలువను మాత్రమే పొందుతాడు. ఎక్కువ కాదు తక్కువ కాదు. కాని డబ్బు అప్పిచ్చే పెట్టుబడిదారుడు తన పెట్టుబడిని మాత్రమే గాక తన పెట్టుబడికి మించి పొందుతాడు. అతడు మార్పిడిలోకి ప్రవేశపెట్టే మొత్తంకంటే ఎక్కువ తన

1. ఇక్కడ ఉదహరించిన మాటలు చెవ్ వి. ఆయన లా వోయిక్స్ డ్యు పాప్లే అనే పత్రిక సంపాదకుల్లో ఒకరు. పైన పేర్కొన్న పుస్తకంలో తొట్టతొలి లేఖను రచించిన వ్యక్తి (Gratute du credit, Discussion entre, యం.యఫ్. బాస్టియట్ ఎట్ యం. ప్రౌథాన్, పారిస్, 1850)

పెట్టుబడిపైన వడ్డీని గ్రహిస్తాడు" (పుట 60) అంటాడు ప్రౌఢాన్. ఇక్కడ టోపీ తయారీదారు ఉత్పాదక పెట్టుబడిదారు. అప్పు ఇచ్చే పెట్టుబడిదారుడికి భిన్నమైనవాడు. ఉత్పాదక పెట్టుబడిదారుడు సరుకుల్ని వాటి విలువకే అమ్మి (ఉత్పత్తి ధరల ద్వారా సమానం కావడం అన్నదానితో అతని అవగాహనకు ప్రమేయం లేదు.) మార్పిడిలోకి తాను విసిరే పెట్టుబడి మీద లాభం ఎలా గ్రహించగలడు అన్న రహస్యాన్ని అర్థం చేసుకోవడంలో ప్రౌఢాన్ స్పష్టంగా విఫలమయ్యాడు. ఉదాహరణకు 100 టోపీల ధర 115 పౌండ్లు అనుకుందాం. ఈ ఉత్పత్తి ధర టోపీల విలువకు సమానం. టోపీలను ఉత్పత్తి చేసే పెట్టుబడి సామాజిక పెట్టుబడి యొక్క పొందికనే కలిగి ఉందనుకుందాం. లాభం 15 శాతం అయితే టోపీల వ్యక్తి 115 పౌండ్లు విలువకు తన సరుకులను అమ్మడం ద్వారా 15 పౌండ్ల లాభాన్ని సంపాదిస్తున్నాడు. అనగా అవి తయారు చేయటానికి అతనికి 700 పౌండ్లు మాత్రమే ఖర్చయింది. అతడు తన సొంత పెట్టుబడితో ఉత్పత్తి చేసి ఉంటే మొత్తం అదనపు విలువ 15 పౌండ్లు జేబులో వేసుకొనేవాడు. కాని అతడు అప్పు తెచ్చిన పెట్టుబడితో ఉత్పత్తి చేసి ఉంటే 5 పౌండ్లు వడ్డీగా ఇవ్వాల్సి ఉంటుంది. అది టోపీల విలువను ఎంతమాత్రం మార్చదు. ఈ విలువలో అప్పటికే ఉన్న అదనపు విలువను విభిన్న వ్యక్తుల మధ్య విభజనకు సంబంధించిన విషయాన్ని మాత్రమే అది మారుస్తుంది. వడ్డీ చెల్లించటం ద్వారా టోపీల విలువ మారదు. కనుక "వాణిజ్యంలో లాగానే, సరుకుల ధరల నిర్ణయంలో పెట్టుబడిపైన చెల్లించే వడ్డీ కూడా శ్రామికుల జీతాలకు కలపటం వలన కార్మికుడు తన శ్రమ ఉత్పాదితాన్ని తిరిగి కొనటం అసాధ్యం. వడ్డీ సూత్రం కింద Vivre en travaillant (పనిచేసి బతకడం) అనే సూత్రంలో వైరుధ్యం తలెత్తుతుంది" (పుట 105) అని ప్రౌఢాన్ అనటం అర్థరహితం.[1]

ఈ క్రింది ప్రకటన చూస్తే పెట్టుబడి స్వభావాన్ని ప్రౌఢాన్ ఎంత తక్కువ అర్థం చేసుకున్నాడో తెలుస్తుంది. దానిలో అతడు పెట్టుబడి యొక్క చలనాన్ని వడ్డీ ఇచ్చే పెట్టుబడి చలనాన్ని ప్రత్యేక చలనంగా వర్ణిస్తాడు. "డబ్బు పెట్టుబడి తన తొలి స్థానానికి మార్పిడి నుండి వడ్డీని పోగుచేయడం ద్వారా తిరిగి వస్తుంది. కనుక తిరిగి మదుపు పెట్టడం అనేది ఎప్పుడూ ఒకే వ్యక్తిచేత పెట్టబడుతుంది. అదే వ్యక్తికి నిరంతరాయంగా లాభాన్ని తెస్తుంది." (పుట 154, ప్రౌఢాన్)

వడ్డీ పెట్టుబడి ప్రత్యేక చలనంలో అతన్ని ఇంకా గందరగోళపరుస్తున్న అంశం ఏమిటి? అమ్మకం, ధర, వస్తువులను ఇచ్చివేయటం, అదనపు విలువ, ఇక్కడ దర్శనమిచ్చే తక్షణ రూపం వగైరా అభివర్గాలు. క్లుప్తంగా చెప్పాలంటే పెట్టుబడి యథాతథంగా సరుకుగా మారటం అన్న అంశం పర్యవసానంగా అమ్మకం అన్నది అప్పు ఇవ్వడంగాను, ధర అన్నది లాభంలో వాటాగాను మారాయి.

---

1. ఇల్లు, డబ్బు వగైరాలు ప్రౌఢాన్ అవగాహన ప్రకారం - పెట్టుబడిగా ఇవ్వడానికి కుదరదు. వాటి ఉత్పత్తి ధరకు సరుకుల్ని అమ్మాలి అంతే. ప్రౌఢాన్ కంటే లూథర్ అవగాహన కొంత మెరుగు. లాభార్జన అనేది అప్పిచ్చే లేదా అమ్మే విధానంపైన ఆధారపడి వుండదు - అని అతనికి తెలుసు. "వారు అమ్మటాన్ని కూడా వడ్డీ వ్యాపారంగా మారుస్తారు. అయితే అన్నిటి గురించి ఒకేసారి మాట్లాడటం సాధ్యం కాదు. అప్పు ఇవ్వటంలో ఉన్న వడ్డీ వ్యాపారానికి పరిమితమై దాన్ని ఆపిన తరువాత (ప్రళయ దినం తర్వాత) కొనుగోలులో వడ్డీ వ్యాపారానికి వ్యతిరేకంగా బోధించకుండా ఉండబోము." (మార్టిన్ లూథర్, An die Pfarherrn wider den Wucher zu Predigen, witteenberg, 1540.)

పెట్టుబడి తన ప్రారంభ స్థానానికే తిరిగి రావడం అన్నది మొత్తం వలయంలో పెట్టుబడి చలనానికి సాధారణంగా ఉన్న లక్షణమే. ఇది కేవలం వడ్డీ ఇచ్చే పెట్టుబడి లక్షణం మాత్రమే కాదు. దీనిలో ప్రత్యేక అంశం ఏమిటంటే దాని బాకీ రూపం మాత్రమే. అనగా ఆవృత్తంలో ప్రమేయం లేకుండా అది తిరిగి రావడం మాత్రమే. అప్పిచ్చే పెట్టుబడిదారు దాన్ని పారిశ్రామిక పెట్టుబడిదారునికి సమ విలువనేది పొందకుండానే ఇచ్చివేస్తాడు. బదిలీ చేస్తాడు. అతని ఈ బదిలీ పెట్టుబడి యొక్క వాస్తవ చలామణి ప్రక్రియకు సంబంధించిన చర్య ఎంతమాత్రం కాదు. ఆవృత్తాన్ని ప్రవేశపెట్టడానికి మాత్రమే అది దోహదపడుతుంది. పారిశ్రామిక పెట్టుబడిదారుడు ఆవృత్తాన్ని ఫలప్రదంగా నిర్వహిస్తాడు. డబ్బు యొక్క మొదటి స్థానం మార్పిడి ఈ రూప పరివర్తనలో ఎటువంటి చర్యను – క్రయ విక్రయాల్లో దేనినీ వ్యక్తం చేయదు. యాజమాన్యం ఇక్కడ వదులుకోబడలేదు. ఎందుకంటే మార్పిడి జరగలేదు. సమ విలువ ఏదీ గ్రహించబడలేదు. పారిశ్రామిక పెట్టుబడిదారు నుంచి అప్పిచ్చిన పెట్టుబడిదారునికి డబ్బు తిరిగి రావడమన్నది మొదట జరిగిన డబ్బు ఇవ్వడం అన్న చర్యకు అనుబంధం మాత్రమే. డబ్బుగా అడ్వాన్స్ చేయబడిన పెట్టుబడి పారిశ్రామిక పెట్టుబడిదారునికి డబ్బు రూపంలో చక్రభ్రమణ ప్రక్రియలో తిరిగి వస్తుంది. అతడు పెట్టుబడి పెట్టినప్పుడు అది అతని సొంతం కాదు కనుక తిరిగి వచ్చినప్పుడు కూడా అతని సొంతం కాదు. పునరుత్పత్తి ప్రక్రియగుండా ప్రయాణించినంత మాత్రం చేత ఆ పెట్టుబడి అతని ఆస్తి కాజాలదు. కనుక అతనికి అప్పిచ్చినవానికి తిరిగి ఇవ్వాల్సి ఉంటుంది. రుణదాత నుంచి రుణ గ్రహీతకు పెట్టుబడిని బదిలీ చేసిన మొదటి వ్యయం వాస్తవ పునరుత్పత్తి ప్రక్రియకు ఏమాత్రం సంబంధం లేని ఒక చట్టబద్ధమైన లావాదేవి. అది ఈ ప్రక్రియకు ఉపోద్ఘాతం మాత్రమే. తిరిగి ఆ మొత్తాన్ని చెల్లించటం అనేది పెట్టుబడిని రుణగ్రహీత నుంచి రుణదాతకు వెనక్కు తెస్తుంది. ఇది కూడా ఒక చట్టబద్ధమైన లావాదేవీయే. ఇది మొదటిదానికి అనుబంధం మాత్రమే. మొదటిది వాస్తవ ప్రక్రియకు ప్రవేశిక. రెండవది ఈ ప్రక్రియకు అనుబంధ చర్య. ప్రారంభ స్థానం, అంతిమ స్థానం, అప్పు ఇవ్వబడే పెట్టుబడిని ఇవ్వడమూ, తిరిగి పొందడమూ లాంటివి అన్నీ పెట్టుబడి యొక్క వాస్తవ చలనానికి ముందూ తర్వాతా జరుగుతాయి. ఈ చలనంతో ఏమాత్రం సంబంధం కలిగి ఉండవు. ఇవన్నీ చట్టబద్ధమైన లావాదేవీలతో కూడిన ఏకపక్ష చలనాలుగా కనిపిస్తాయి.

మొదటి ప్రవేశిక చర్యలో రుణదాత అతని పెట్టుబడిని రుణగ్రహీతకు ఇస్తాడు. అనుబంధ, అంతిమ చర్యలో రుణగ్రహీత ఆ పెట్టుబడిని రుణదాతకు తిరిగి ఇస్తాడు. వారిద్దరి మధ్య జరిగిన లావాదేవీ సంబంధించినంత వరకు (వడ్డీ సంగతి ప్రస్తుతానికి పక్కన ఉంచుదాం.) రుణదాతకు, గ్రహీతకు మధ్య అప్పివ్వబడిన పెట్టుబడి చలనానికి సంబంధించినంత వరకు ఈ రెండు చర్యలు (తక్కువ కాల పరిమితి లేదా ఎక్కువ కాలపరిమితితోను విభజించబడతాయి. ఈ మధ్యకాలంలో వాస్తవ పునరుత్పత్తి ప్రక్రియ జరుగుతుంది.) మొత్తం చలనంలో భాగం అవుతాయి. ఈ చలనం తిరిగి వచ్చినప్పుడు ఇచ్చివేసే షరతుపైన అప్పు ఇవ్వడం, తీసుకోవడం అన్న చలనం ఆధారపడి ఉంటుంది. డబ్బు లేదా సరుకులను ఆ షరతుపైన అన్యధాకరించే ప్రత్యేక రూపం అది.

సాధారణంగా పెట్టుబడి యొక్క స్వాభావిక చలనం పెట్టుబడిదారుడికి డబ్బు తిరిగి రావడం అన్నది, అనగా ప్రారంభ స్థానానికి పెట్టుబడి తిరిగి రావడం అన్నది, వడ్డీ యిచ్చే పెట్టుబడి విషయంలో మొత్తంగా ఒక బాహ్యరూపాన్ని ధరిస్తుంది. ఈ రూపం వాస్తవ చలనం నుంచి విభజించబడుతుంది.

క తన డబ్బును డబ్బుగా ఇవ్వడు, పెట్టుబడిగా ఇస్తాడు. పెట్టుబడిలో ఎటువంటి మార్పు ఉండదు. అది కేవలం చేతులు మారుతుంది. అది గ చేతిలోకి వచ్చేదాకా అది వాస్తవంగా పెట్టుబడిగా మారటం అన్నది జరగదు. కాని క దృష్టిలో దాన్ని గ కి ఇచ్చిన వెంటనే అది పెట్టుబడిగా మారుతుంది. ఉత్పత్తి ప్రక్రియ నుంచి, చలామణి నుంచి పెట్టుబడి వాస్తవంగా తిరిగి రావడమన్నది గ విషయంలో మాత్రమే జరుగుతుంది. క దృష్టిలో డబ్బు తిరిగి రావడమన్నది ఇచ్చిన రూపంలోనే జరుగుతుంది. గ నుంచి క కి పెట్టుబడి తిరిగి వస్తుంది. కొంత కాలంపాటు డబ్బును అప్పివ్వడమూ, వడ్డీతో (అదనపు విలువతో) పాటు తిరిగి పొందడమూ – వడ్డీ ఇచ్చే పెట్టుబడి ప్రత్యేక చలనం యొక్క పూర్తి రూపం. అప్పివ్వబడిన డబ్బు యొక్క వాస్తవ చలనం పెట్టుబడిగా రుణదాతకు, గ్రహీతకు జరిగిన లావాదేవీలకు బాహ్యంగా జరిగే చర్య అది. ఈ లావాదేవీల్లో మధ్యంతర చర్య రద్దు చేయబడుతుంది. అది కనిపించదు. అది ప్రత్యక్షంగా ఉండదు. పెట్టుబడి ఓ ప్రత్యేక తరహా సరుకు. అది తన సొంత తరహాలో అన్యధాకరణ (alienation) పొందుతుంది. కనుక పెట్టుబడి తిరిగి రావడం అన్నది కూడా కొన్ని ఆర్థిక ప్రక్రియల నిర్దిష్ట పరంపరల పర్యవసానమూ, ఫలితమూ అన్నట్లుగా వ్యక్తం కాదు. అమ్మకందారునికి, కొనుగోలుదారునికి మధ్య ఒక ప్రత్యేక చట్టబద్ధమైన ఒప్పందం ఫలితంగా అది కనిపిస్తుంది. వడ్డీ ఇచ్చే పెట్టుబడి విషయంలో రుణదాతకు, రుణగ్రహీతకు మధ్య జరిగిన ఒక ఒప్పందంపైన మాత్రమే ఆధారపడి ఉన్నట్లు కనిపిస్తుంది. ఈ లావాదేవీకి సంబంధించి పెట్టుబడి తిరిగి రావడం అన్నది పునరుత్పత్తి ప్రక్రియ నుంచి తలెత్తిన ఫలితంగా కనిపించదు. అది అప్పిచ్చిన పెట్టుబడి డబ్బు రూపాన్ని ఏనాడూ కోల్పోలేదన్నట్లుగా కనిపిస్తుంది. నిజానికి ఈ లావాదేవీలు వాస్తవ పునరుత్పాదక ఫలితాలచేత నిర్ణయించబడతాయి. అయితే లావాదేవీలో ఈ విషయం ఎక్కడా కనిపించదు. పైగా ఆచరణలో కూడా ప్రతిసారి ఇలాగే జరగదు. వాస్తవంగా ఉత్పత్తి ప్రక్రియ నుంచి డబ్బు సరైన సమయంలో తిరిగి రాకపోతే రుణదాత ఎడల తన బాధ్యతను నిర్వహించడానికి రుణగ్రహీత ఇతర వనరులను ఆశ్రయించాల్సి ఉంటుంది. పెట్టుబడి యొక్క సాధారణ రూపంగా ఒక మొత్తంగా ఖర్చుపెట్టబడిన డబ్బు అ అనుకుందాం. అది కొంత కాలపరిమితి తర్వాత అ + $\frac{1}{\text{ఎక్స్}}$ అ గా తిరిగి వస్తుంది. ఈ కాలపరిమితి తప్ప మధ్యంతర చర్య ఏదీ ఉన్నట్లు కనిపించదు. ఇది పెట్టుబడి యొక్క వాస్తవ చలనం యొక్క ఒక అర్థరహిత రూపం మాత్రమే.

పెట్టుబడి యొక్క వాస్తవ చలనంలో దాని తిరిగి రాక అన్నది చలామణి ప్రక్రియలో ఒక దశ. డబ్బు మొదట ఉత్పత్తి సాధనాలుగా మారుతుంది. ఉత్పత్తి, వాటిని సరుకులుగా మారుస్తుంది. అమ్మకం ద్వారా అవి మళ్ళీ డబ్బుగా మారతాయి. ఈ రూపంలో పెట్టుబడిదారునికి అవి తిరిగి వస్తాయి. అతడు ఈ డబ్బు రూపంలోనే మొదట తన పెట్టుబడిని అడ్వాన్స్ చేశాడు. అదే రూపంలో తిరిగి పొందుతాడు. కాని వడ్డీ ఇచ్చే పెట్టుబడి విషయంలో మొదట ఇవ్వడమూ, తిరిగి పుచ్చుకోవడమూ అన్నవి అన్యధాకరణలాగానే, పెట్టుబడి ఇచ్చిన వానికి రెండవ పక్షం వానికి మధ్య జరిగిన చట్టబద్ధమైన లావాదేవీల ఫలితం. కేవలం అన్యధాకరణ, తిరిగి ఇచ్చుకోవటం మాత్రమే మనకు తెలుసు. ఈ మధ్యలో జరిగింది మరుగునపడింది.

పెట్టుబడిగా అడ్వాన్స్ చేయబడిన డబ్బుకూ, అదే వ్యక్తికి తిరిగి వచ్చే స్వభావం ఉంది. కనుక పెట్టుబడి చలనం యొక్క రూపం డ–స–డ' కనుక డబ్బు యజమాని ఈ కారణంచేతనే దానిని

పెట్టుబడిగా అప్పిస్తాడు. తన ప్రారంభ స్థానానికి తిరిగి వచ్చే స్వభావం గల వస్తువుగా తనని తాను నిలబెట్టుకుంటూ ఆ చలన క్రమంలో తన విలువను వృద్ధిచేసుకునే అంశంగా దానిని అడ్వాన్స్ చేస్తాడు. అది పెట్టుబడిగా ఉపయోగించబడటం వల్ల తన ప్రారంభ స్థానానికి తిరిగి వస్తుంది. అందుకే ఆ పెట్టుబడి నతడు తొలుత ఇచ్చివేస్తాడు. రుణగ్రహీతకు కూడా అది తిరిగి వెనక్కు వచ్చినట్లే, రుణదాతకు కూడా అది వెనక్కు తిరిగి వస్తుంది.

కనుక పెట్టుబడిగా డబ్బును అప్పు ఇవ్వటంలో (అది కొంతకాలం తర్వాత తిరిగి వచ్చే షరతుపైన దాని అన్యధాకరణ) ఆ డబ్బు పెట్టుబడిగానే వాస్తవంగా వినియోగించబడుతుందని, అలాగే తన తొలి స్థానానికి తిరిగి వస్తుందనే ఊహ కూడా ఉంది. పెట్టుబడిగా డబ్బు చేసే వాస్తవ ఆవృత్తం అన్నది రుణగ్రహీత రుణదాతకు ఆ డబ్బు తిరిగి ఇవ్వాలన్న చట్టబద్ధమైన లావాదేవీకి తొలి ఆధారం. రుణగ్రహీత ఆ డబ్బును పెట్టుబడిగా ఉపయోగించకపోతే అది అతని సొంత వ్యవహారం. రుణదాత దానిని పెట్టుబడిగానే అప్పు ఇస్తాడు. కనుక అది పెట్టుబడిగానే తన విధి నిర్వహిస్తుందని భావించబడుతుంది. డబ్బు రూపంలో తొలి స్థానానికి తిరిగి వచ్చే వరకు డబ్బు పెట్టుబడి చేసే ఆవృత్తం కూడా అందులో ఇమిడి ఉంది.

డ–స, స–డ' అనే చలామణి చర్యలలో కొంత విలువ మొత్తం డబ్బుగా లేదా సరుకులుగా వ్యవహరిస్తుంది. ఈ చర్యలు మధ్యంతర ప్రక్రియలు. మొత్తం చలనంలో ఇవి దశలు మాత్రమే. పెట్టుబడిగా అది మొత్తం డ–డ' చలనాన్ని నిర్వహిస్తుంది. అది డబ్బుగాను లేక ఒక విలువల మొత్తంగాను ఏదో ఒక రూపంలో అడ్వాన్స్ చేయబడింది. అది ఒక విలువల మొత్తంగా తిరిగి వస్తుంది. అతడు దానిని పెట్టుబడిగా అడ్వాన్స్ చేశాడు. అది డ–డ' గా, ఒక విలువగా తన తొలి స్థానానికి కొంత కాలం తర్వాత తిరిగి వస్తుంది. అతడు క్రయ విక్రయాలకు బదులు అప్పు ఇస్తాడు. కనుక ఈ అప్పు ఇవ్వడమనేది ఒక విలువను డబ్బుగా లేదా సరుకులుగా అన్యధాకరించడానికి బదులు పెట్టుబడిగా అన్యధాకరించే దానికి తగిన రూపం. అయితే పెట్టుబడిదారీ పునరుత్పత్తి ప్రక్రియతో ఎటువంటి సంబంధంలేని లావాదేవీల రూపం ఈ అప్పు ఇవ్వడమనేది తీసుకోదనే అర్థం కాదు.

★ ★ ★

మనం ఇంతవరకు అప్పు ఇవ్వబడిన పెట్టుబడి యొక్క చలనాలను పెట్టుబడి యజమానికి, పారిశ్రామిక పెట్టుబడిదారునికి మధ్య జరిగే చలనాలను మాత్రం పరిశీలించాం. ఇప్పుడు మనం వడ్డీని పరిశీలిద్దాం.

అప్పిచ్చే వ్యక్తి తన డబ్బును పెట్టుబడిగా ఖర్చు పెడతాడు. అతడు రెండవ వ్యక్తికి ఇచ్చే విలువ మొత్తం పెట్టుబడి కనుక అది అతనికి తిరిగి వస్తుంది. అయితే అది కేవలం తిరిగి రావడమనేది పెట్టుబడిగా అప్పు ఇవ్వబడిన విలువ మొత్తం తిరిగి రావటం కాదు. కేవలం అప్పు ఇవ్వబడిన మొత్తం తిరిగి రావడం మాత్రమే. పెట్టుబడిగా తిరిగి రావడం అంటే అడ్వాన్స్ చేయబడిన విలువ మొత్తం చలనంలో భద్రపరచబడటం మాత్రమే కాక అది విస్తరించాలి. దాని విలువను వృద్ధి చేసుకోవాలి. డ+△డ గా ఒక అదనపు విలువతో తిరిగి రావాలి. △డ అనగా వడ్డీ లేదా సగటు లాభంలో ఒక

భాగం. అది పనిచేసే పెట్టుబడిదారు చేతుల్లో నిలిచి ఉండదు. 'డబ్బు – పెట్టుబడిదారు'డి వాటాగా పోతుంది.

డబ్బు పెట్టుబడిదారు దానిని పెట్టుబడిగా వదులుకున్నాడు. అంటే అర్థం, అది డ+△డగా తిరిగి రావాలన్నమాట. నిర్ణీత కాల పరిమితుల్లో మధ్య మధ్య పెట్టుబడిని అలా ఉంచి, వడ్డీని చెల్లించే రూపాన్ని కూడా మనం పరిశీలించాలి. పెట్టుబడి సుదీర్ఘ కాలం తర్వాత చివరలో మాత్రమే తిరిగి వస్తుంది.

డబ్బు పెట్టుబడిదారుడు రుణగ్రహీత అయిన పారిశ్రామిక పెట్టుబడిదారునికి ఏమిస్తాడు? నిజంగా ఏమి దఖలుపరుస్తాడు? అతడు డబ్బును రెండో వ్యక్తి చేతిలో పెట్టటం మాత్రమే చేస్తాడు. ఈ చర్య డబ్బును అప్పివ్వటం అనేదాన్ని పెట్టుబడిగా డబ్బును అన్యధాకరిస్తుంది. అనగా సరుకుగా పెట్టుబడిని అన్యధాకరించడం జరుగుతుంది.

ఈ అన్యధాకరించడం అన్న చర్య ద్వారానే అప్పిచ్చే వ్యక్తి ద్వారా పెట్టుబడి ఒక సరుకుగా అప్పివ్వబడుతుంది. అంటే తన దగ్గరున్న ఒక సరుకును మరొకనికి పెట్టుబడిగా ఇవ్వటం జరుగుతుంది.

సాధారణమైన అమ్మకంలో అన్యధాకరించ బడినదేమిటి? అమ్మబడిన సరుకు యొక్క విలువ మాత్రం కాదు. ఎందుకంటే ఆ విలువ రూపం మాత్రమే మారుతుంది. భావ రూపేణా విలువ అనేది ఒక సరుకు వాస్తవంగా అమ్మే వ్యక్తికి డబ్బుగా మారడానికి ముందే ధర రూపంలో ఉంటుంది. అదే విలువ, అదే మొత్తం విలువ కేవలం వాటి రూపం మార్చుకుంటాయి. ఒక సందర్భంలో అవి సరుకు రూపంలోను, మరొకసారి అవి డబ్బు రూపంలోను ఉంటాయి. విక్రయదారుడు నిజంగా దేన్ని అన్యధాకరించాడు. అది వ్యక్తిగత లేదా ఉత్పాదక కొనుగోలుదారుని వినిమయంలోకి విక్రేత నిజంగా అన్యధాకరించిన అంశం ఏం వచ్చింది – అంటే సరుకు యొక్క ఉపయోగ విలువ – ఉపయోగ విలువగా సరుకు అన్నమాట.

డబ్బు పెట్టుబడిదారుడు అప్పిచ్చిన కాలం అంతటిలోను ఉత్పాదక పెట్టుబడిదారునికి అనగా రుణగ్రహీతకు ఇచ్చే ఉపయోగ విలువ ఏమిటి? పెట్టుబడిగా మారగల్గిన శక్తిని సంపాదించే డబ్బు యొక్క ఉపయోగ విలువ అది. పెట్టుబడిగా వ్యవహరించ కల్గిన ఉపయోగ విలువ, అది తన విలువ పరిమాణాన్ని కాపాడుకుంటూ ఒక నిర్దిష్టమైన అదనపు విలువను సగటు లాభాన్ని (అంతకంటే ఎక్కువ, తక్కువలు ఉండటం అన్నది ఇక్కడ యాదృచ్ఛికం) దాని ప్రక్రియ కాలంలో సృష్టించే ఉపయోగ విలువ అది. ఇతర సరుకుల విషయంలో ఉపయోగ విలువ అనేది అంతిమంగా వినియోగమవుతుంది. వాటి పదార్థాంశం మాయమవుతుంది. దానితోపాటు వాటి విలువ కూడా మాయమవుతుంది. ఇందుకు విరుద్ధంగా సరుకు పెట్టుబడి తన విలువను – ఉపయోగ విలువను నిలబెట్టుకోవడం మాత్రమే కాక దాని ఉపయోగ విలువ వినిమయం ద్వారా వాటిని పెంచుకుంటుంది కూడా.

పెట్టుబడిగా డబ్బుకుండే ఈ ఉపయోగ విలువ (సగటు లాభాన్ని ఉత్పత్తి చేసే ఈ శక్తి)ని డబ్బు పెట్టుబడిదారు కొంతకాలంపాటు అతడు తన డబ్బును అప్పుగా ఇచ్చిన కాలమంతటిలోను పారిశ్రామిక పెట్టుబడిదారునికి వదులుకుంటాడు.

ఈ విషయంలో ఈ రకంగా అప్పు ఇవ్వబడిన డబ్బుకు, పారిశ్రామిక పెట్టుబడిదారునికి సంబంధం విషయంలో శ్రమ శక్తిని కొంత మేరకు పోలి ఉంటుంది. అయితే తేడా ఏమంటే పారిశ్రామిక పెట్టుబడిదారు శ్రమశక్తి విలువకై చెల్లిస్తాడు. కాగా అప్పు ఇవ్వబడిన పెట్టుబడి విలువను వెనక్కి తిరిగి ఇస్తాడు. పారిశ్రామిక పెట్టుబడిదారునికి శ్రమశక్తి యొక్క ఉపయోగ విలువ ఏమంటే, అది తన వినియోగంలో తను స్వయంగా కలిగి ఉన్న విలువకంటే – అనగా దాని ఖరీదుకంటే ఎక్కువ విలువను (లాభాన్ని) ఉత్పత్తి చేస్తుంది. ఈ అదనపు విలువే పారిశ్రామిక పెట్టుబడిదారునికి ఉపయోగ విలువ. అదే విధంగా అప్పివ్వబడే పెట్టుబడి యొక్క ఉపయోగ విలువ, విలువను సృష్టించి వృద్ధి చేసే శక్తిలా కనిపిస్తుంది.

నిజానికి డబ్బు పెట్టుబడిదారు ఒక ఉపయోగ విలువను అన్యధాకరిస్తాడు. కనుక అతడు ఇచ్చివేసేదేదైనా ఒక సరుకుగా ఇచ్చినట్లే. ఈ మేరకు మాత్రమే సరుకుతో దానికున్న పోలిక పూర్తవుతుంది. మొదటిది, ఒక చేతినుండి మరోచేతికి పోయే విలువ అది. సాధారణ సరుకు విషయంలో ఒకే విలువ విభిన్న రూపాలలో క్రయ, విక్రయదారులిద్దరి చేతుల్లో ఉంటుంది. లావాదేవీకి ముందు ఇద్దరి దగ్గర ఒకే విలువ ఉంటుంది. ఒకరిదగ్గర సరుకు రూపంలోను, మరొకరి దగ్గర డబ్బు రూపంలోను ఉంటుంది. వాటిని వారిరువురు ఒకరికొకరు వదులుకుంటారు. ఇక్కడ భేదమేమిటంటే అప్పివ్వడంలో డబ్బు పెట్టుబడిదారుడొక్కడే ఆ లావాదేవీలో విలువను ఇచ్చేస్తాడు. తర్వాత దానిని తిరిగి పొందడం ద్వారానే అతడు దాన్ని భద్రపరుస్తాడు. అప్పివ్వడమనే లావాదేవీలో ఒక పక్షం మాత్రమే విలువను గ్రహిస్తుంది. కనుక ఒక పక్షం మాత్రమే విలువను వదులుకుంటుంది. రెండోది ఒక నిజమైన ఉపయోగ విలువ ఒకవైపున వదులుకోబడుతుంది. రెండోవైపున గ్రహించబడి వినియోగమవుతుంది. సాధారణ సరుకులకు భిన్నంగా ఈ ఉపయోగ విలువ స్వయంగా విలువే. అనగా పెట్టుబడిగా డబ్బును ఉపయోగించడం ద్వారా వాస్తవ రూపం ధరించిన తొలి విలువపైన అధికంగా వచ్చే మొత్తం అన్నమాట. లాభం అనేది ఈ ఉపయోగ విలువే.

అప్పివ్వబడిన డబ్బు యొక్క ఉపయోగ విలువ అది పెట్టుబడిగా వ్యవహరించడంలో ఉంది. అనగా సగటు పరిస్థితులలో, సగటు లాభాన్ని ఉత్పత్తి చేయడంలో ఉంది.[1]

ఇప్పుడు పారిశ్రామిక పెట్టుబడిదారుడు ఏమి చెల్లిస్తాడు? అప్పివ్వబడిన పెట్టుబడి ధర ఎంత? “వ్యక్తులు తాము అప్పు తీసుకున్న దానిపైన మాసీ చెప్పేదాని ప్రకారం అది ఉత్పత్తి చేయగలిగిన లాభంలో ఒక భాగం.” అదే గ్రంథం పుట 49.[2]

---

1. “వడ్డీ సమానమైన స్థాయిలో రావడం అన్నది ఒక మనిషి లాభాన్ని సృష్టించడం, సృష్టించకపోవడంపైన కాక అది సక్రమంగా వినియోగించబడితే” (అప్పు) “లాభాన్ని ఉత్పత్తి చేయగలిగిన దాని శక్తిపైన ఆధారపడి వుంటుంది.” (ఏన్ ఎస్సే ఆన్ ది గవర్నింగ్ కాజెస్ ఆఫ్ ది నాచురల్ రేట్ ఆఫ్ ఇంటరెస్ట్ వేర్ ఇన్ ది సెంటిమెంట్స్ ఆఫ్ సర్ విలియం పెట్టీ అండ్ మిస్టర్ లాకి ఆన్ దట్ హెడ్ ఆర్ కన్సిడెర్డ్, లండన్, 1750, పుట 49. ఈ అజ్ఞాత గ్రంథ రచయిత పేరు **జె. మాసీ**)

2. “ధనవంతులు తమ డబ్బును తమంతట తామే ఉపయోగించకుండా ఇతరులకు దానిపైన లాభం తెచ్చుకునేందుకుగాను బదులిస్తారు. అలా వచ్చిన లాభంలో కొంత వాటాను ఆ డబ్బు యజమానులుగా తాము పొందుతారు.” (అదే గ్రంథం, పుటలు 23, 24)

ఒక సరుకు కొనుగోలు చేసే వ్యక్తి కొనేది దాని ఉపయోగ విలువ అతడు చెల్లించేది దాని విలువకే. అలాగే డబ్బు అప్పు తీసుకున్నవాడు కొనేది పెట్టుబడిగా దాని ఉపయోగ విలువ. అయితే దానికి అతడు ఏమి చెల్లిస్తాడు? మామూలు సరుకుల విషయంలోలాగా దాని ధరను లేదా విలువను మాత్రం కాదు. అప్పు తీసుకునేవానికి ఇచ్చేవానికి మధ్య విలువ రూపంలో మార్పేమీ జరగదు. సాధారణ క్రయ విక్రయదారుల మధ్య ఒకచోట డబ్బు రూపంలోను, మరొకచోట సరుకు రూపంలోను మార్పు జరుగుతుంది. ఇక్కడ అన్యధాకరించిన తిరిగి వచ్చిన విలువ ఒకేలా ఉండటం అన్నది పూర్తిగా భిన్నమైన పద్ధతిలో వ్యక్తమౌతుంది. విలువ మొత్తం అనగా డబ్బు సమ విలువ లేకుండానే ఇవ్వబడుతుంది. కొంత కాలం తర్వాత తిరిగి వస్తుంది. అప్పిచ్చినవాడు ఆ విలువపైన ఎప్పుడూ యజమానిగానే ఉంటాడు. అతని చేతుల నుండి అప్పు తీసుకున్నవాడి చేతుల్లోకి ఆ మొత్తం వెళ్ళినప్పుడు కూడా దాని విలువపైన యజమాని అతడే. సరుకుల సాధారణ మార్పిడిలో డబ్బు ఎప్పుడూ కొనుగోలు దారునివైపు నుండి వస్తుంది. కానీ అప్పు విషయంలో అది నమ్మకందారుని నుంచి వస్తుంది. కొంత కాలంపాటు డబ్బును ఇచ్చివేసేది అతడే. పెట్టుబడి కొనుగోలుదారు దానిని సరుకుగా గ్రహిస్తాడు. డబ్బు పెట్టుబడిగా వ్యవహరించినంత వరకు మాత్రమే ఇది సాధ్యం. అందుకే అది అడ్వాన్స్ చేయబడుతుంది. రుణగ్రహీత డబ్బును పెట్టుబడిగా అనగా మరింత విలువను ఉత్పత్తి చేసే విలువగా గ్రహిస్తాడు. అయితే అది అడ్వాన్స్ చేయబడిన క్షణంలో అది కేవలం పెట్టుబడి కాగల మొత్తం మాత్రమే. అడ్వాన్స్ చేయబడిన క్షణంలో ప్రారంభ స్థానంలో ఇతర పెట్టుబడుల్లాగానే ఇది కూడా వ్యవహరిస్తుంది. అది వినియోగించబడటం ద్వారానే తన విలువను వృద్ధి చేసుకుంటుంది. పెట్టుబడిగా వాస్తవ రూపం ధరిస్తుంది. రుణగ్రహీత దానిని వాస్తవ రూపం ధరించిన పెట్టుబడిగా గ్రహించాలి. అనగా విలువతోపాటు అదనపు విలువను (వడ్డీని) గ్రహించాలి. వడ్డీ అన్నది వాస్తవ రూపం ధరించిన లాభంలో ఒక భాగం మాత్రమే కాగలదు. అది మొత్తం కాదు, ఒక భాగం మాత్రమే. ఎందుకంటే రుణగ్రహీతకు అప్పు తీసుకున్న పెట్టుబడి యొక్క ఉపయోగ విలువ లాభం ఉత్పత్తి చేయడంలోనే ఉంది గనుక. అలా కాకుండా రుణదాతవైపు నుంచి ఎటువంటి ఉపయోగ విలువ ఇవ్వబడి ఉండేది కాదు. మరోవైపున మొత్తం లాభమంతా రుణగ్రహీతకు చెందదు. అలా కాకుంటే అన్యధాకరించిన ఉపయోగ విలువకు అతడు ఏమీ చెల్లించడు. అడ్వాన్సు చేయబడిన డబ్బును రుణదాతకు మామూలు డబ్బుగా చెల్లిస్తాడు. పెట్టుబడిగా – వాస్తవ రూపం ధరించిన పెట్టుబడిగా – అనగా ద+$\triangle$దగా చెల్లించడు.

రుణదాత, రుణగ్రహీతలిద్దరూ ఒకే మొత్తం డబ్బును పెట్టుబడిగా గ్రహించారు. అయితే రుణగ్రహీత చేతుల్లో మాత్రమే అది పెట్టుబడిగా వ్యవహరిస్తుంది. ఒకే డబ్బు మొత్తం పెట్టుబడిగా ఇద్దరు వ్యక్తుల చేతుల్లో రెండుసార్లు ఉన్నంత మాత్రంచేత లాభం రెట్టింపు కాదు. వారిరువురికీ లాభాన్ని విభజించడం ద్వారా మాత్రమే అది పెట్టుబడిగా వ్యవహరిస్తుంది. రుణదాతకు చెందే వాటానే వడ్డీ అంటారు.

ఈ మొత్తం లావాదేవీ రెండు రకాల పెట్టుబడిదారుల మధ్య జరుగుతుంది. డబ్బు పెట్టుబడిదారు, పారిశ్రామిక పెట్టుబడిదారు లేదా వాణిజ్య పెట్టుబడిదారు.

పెట్టుబడి, ఇక్కడ పెట్టుబడిగా ఒక సరుకు అన్న విషయాన్ని లేదా ఇక్కడ చర్చించబడిన సరుకు పెట్టుబడి అన్న విషయాన్ని ఎప్పుడూ గుర్తుంచుకోవాలి. ఒక మామూలు సరుకు అన్న దృష్టి నుంచి చూస్తే ఇక్కడ మనకు కనిపించే సంబంధాలన్నీ హేతువిరుద్ధంగా కనిపిస్తాయి. పునరుత్పత్తి ప్రక్రియలో సరుకు పెట్టుబడిలా – పెట్టుబడి వ్యవహరించిన మేరకు పెట్టుబడి దృష్ట్యా కూడా అది అసంగతంగా కనిపిస్తుంది. క్రయ విక్రయాలకు బదులు అప్పు ఇవ్వడం, అప్పు తీసుకోవడం అనే తేడా ఇక్కడ పెట్టుబడి అనే సరుకు యొక్క ప్రత్యేక స్వభావం నుంచి తలెత్తుతుంది. అదే విధంగా ఇక్కడ చెల్లించబడేది సరుకు ధర కాదు, వడ్డీయే. వడ్డీని మనం డబ్బు పెట్టుబడి యొక్క ధర అని పిలువదలచుకుంటే అప్పుడు సరుకుల ధర అన్న భావనకు పూర్తిగా భిన్నమైన హేతువిరుద్ధమైన ధర రూపమది.[1] ఇక్కడ ధర అన్నది కేవలం దాని అనిర్దిష్ట అర్థరహిత రూపానికి కుదించబడింది. అది ఒక నిర్దిష్ట మొత్తం డబ్బును, ఏదో ఒక రూపంలో ఉపయోగ విలువగా వ్యవహరిస్తోందని సూచిస్తోంది. కాగా ధర అన్న భావన కొంత ఉపయోగ విలువ యొక్క విలువను డబ్బు రూపంలో వ్యక్తం చేస్తుంది.

పెట్టుబడి ధరను సూచించే వడ్డీ మొదటినుంచీ ఒక హేతువిరుద్ధమైన వ్యక్తీకరణ. ఈ సరుకుకు ద్వంద్వ విలువ ఉంది. మొదటిది విలువ. రెండోది ఈ విలువకు భిన్నమైన ధర. కాగా ధర డబ్బు రూపంలో ఉన్న విలువ వ్యక్తీకరణకు ప్రాతినిధ్యం వహిస్తుంది. డబ్బు పెట్టుబడి అన్నది కేవలం 'ఒక మొత్తం డబ్బు' మాత్రమే. లేదా ఒక డబ్బు మొత్తంలో నిర్ణీతమైన నిర్దిష్ట పరిమాణం గల సరుకుల విలువ మాత్రమే. ఒక సరుకు పెట్టుబడిగా అప్పివ్వబడితే అది ఒక డబ్బు మొత్తం యొక్క మారురూపం మాత్రమే. ఎందుకంటే పెట్టుబడిగా ఇక్కడ అప్పివ్వబడింది ఫలానా ఇన్ని పౌండ్ల పత్తి అని గాక ఫలానా ఇంత డబ్బు పత్తి రూపంలో దాని విలువగా ఉంది మాత్రమే అని అర్థం. కనుక పెట్టుబడి ధర ఒక డబ్బు మొత్తంగా ప్రస్తావించబడుతుంది. టోరెన్స్ ఊహించినట్టు (ఫుట్‌నోట్ 1 చూడండి) అది కరెన్సీ కాకపోయినప్పటికీ కూడా అలాగే వ్యవహరిస్తుంది. ఒక విలువ మొత్తం దాని సొంత ధరతోపాటు మరో ధర ఎలా కలిగి ఉంటుంది? తన సొంత డబ్బు రూపంలో వ్యక్తమైన ధర కాక మరో ధర ఎలా కలిగి ఉంటుంది? ఒక సరుకు ఉపయోగ విలువకు భిన్నంగా దాని విలువే దాని ధర. (మార్కెట్టు ధర విషయంలో కూడా అంతే. మార్కెట్ ధరకూ విలువకూ ఉన్న తేడా గుణాత్మకమైంది కాదు. కేవలం పరిమాణానికి సంబంధించింది మాత్రమే.) ఒక ధర విలువతో పరిమాణాత్మకంగా భేదించడమన్నది ఒక అసంబద్ధమైన వైరుధ్యం.[2]

---

1. "విలువ అన్న పదం కరెన్సీకి ప్రయోగించినపుడు మూడు అర్థాలిస్తుంది. చేతిలో వాస్తవంగా ఉన్న కరెన్సీ భవిష్యత్తులో ఒక రోజున తిరిగి పొందే అదే మొత్తం కరెన్సీతో పోల్చబడుతుంది. ఈ సందర్భంలో కరెన్సీ విలువ వడ్డీ రేటుతో కొలువబడుతుంది. వడ్డీ రేటన్నది అప్పివ్వబడిన పెట్టుబడికి దాని డిమాండుకు మధ్య వున్న నిష్పత్తిని బట్టి నిర్ణయమౌతుంది." (కల్నల్ ఆర్. టోరెన్స్, ఆన్ ది ఆపరేషన్ ఆఫ్ ది బ్యాంక్ చార్టర్ యాక్ట్ ఆఫ్ 1844..... రెండవ ముద్రణ 1847, పుటలు 5, 6)
2. "డబ్బు విలువ లేదా కరెన్సీ విలువ అన్న పదాన్ని సరుకుల విషయంలో మార్పిడిలో ఉన్న విలువను సూచించడానికి, పెట్టుబడి ఉపయోగంలో విలువను సూచించడానికి రెండు సందర్భాల్లోనూ ద్వంద్వార్థ సూచకంగా ప్రయోగించడం వల్ల నిరంతరం గందరగోళం తలెత్తుతుంది." (టూకే, ఇంక్వైరీ ఇన్ టు ది కరెన్సీ ప్రిన్సిపుల్, పుట 77) ప్రధానమైన గందరగోళం (ఆ విషయంలోనే అంతర్గతంగా ఉంది) యథాతథంగా విలువ (వడ్డీ) పెట్టుబడి యొక్క ఉపయోగ విలువవుతుంది - అన్నదాన్ని టూకే గ్రహించలేదు.

పెట్టుబడి పెట్టుబడిగా స్వయం విస్తరణ ద్వారానే వ్యక్తమౌతుంది. దాని స్వయం విస్తరణ స్థాయి అనేది అది తనను తాను పెట్టుబడిగా వాస్తవ రూపం ఏ పరిమాణాత్మక స్థాయిలో ధరిస్తుందో వ్యక్తం చేస్తుంది. అది ఉత్పత్తి చేసిన అదనపు విలువ లేక లాభం (దాని పరిమాణం) అడ్వాన్సు చేయబడిన పెట్టుబడి విలువతో మాత్రమే కొలవబడుతుంది. కనుక వడ్డీ ఇచ్చే పెట్టుబడి యొక్క స్వయం విస్తరణ ఎక్కువగా ఉన్నా, తక్కువగా ఉన్నా అది వడ్డీ మొత్తాన్ని అంటే మొత్తం లాభాల్లో దాని వాటాను అడ్వాన్సుచేయబడిన పెట్టుబడి యొక్క విలువతో పోల్చడం ద్వారానే కొలవబడుతుంది. కనుక సరుకు విలువను ధర వ్యక్తం చేస్తుంది. అలాగే డబ్బు పెట్టుబడి యొక్క స్వయం విస్తరణను వడ్డీ వ్యక్తం చేస్తుంది. అందుచేతనే అది రుణదాతకు చెల్లించబడిన ధరలా కనిపిస్తుంది. కనుక ప్రౌఢాన్ చేసినట్టుగా ఇక్కడ క్రయ విక్రయాలలో డబ్బు అనే సాధనం ద్వారా సాధారణ మార్పిడి సంబంధాలకు దీనిని వర్తింపజేయడమన్నది ఎంత అసంబద్ధమో తెలుస్తుంది. డబ్బు పెట్టుబడిగా వ్యవహరిస్తుంది. దాన్ని అదే విధంగా పెట్టుబడి కాగల మొత్తంగా మూడో వ్యక్తికి బదిలీ చేయవచ్చు – అన్నదే ఇక్కడ ప్రాథమిక ఆధార సూత్రం.

ఇక్కడ పెట్టుబడి మార్కెట్‌లో ఇవ్వజూపిన మేరకు, డబ్బు యొక్క ఉపయోగ విలువ పెట్టుబడిగా వేరుపడని మేరకు – పెట్టుబడి ఒక సరుకుగా కనిపిస్తుంది. దాని ఉపయోగ విలువ అనేది లాభాన్ని ఉత్పత్తి చేయడంలోనే ఉంది. పెట్టుబడిగా ఉపయోగించబడిన డబ్బు లేదా సరుకుల విలువ డబ్బు లేదా సరుకులుగా వాటికున్న విలువపైన ఆధారపడి ఉండదు. వాటి యజమానికి అవి ఎంత అదనపు విలువ ఉత్పత్తి చేస్తాయన్నదానిపైన వాటి విలువ ఆధారపడి ఉంటుంది. పెట్టుబడిదారీ ఉత్పత్తి ప్రాతిపదికపైన అది డబ్బుగా ఖర్చు పెట్టబడిందా (డబ్బుగా ఖర్చు పెట్టబడినప్పటికీ) లేక పెట్టుబడిగా అడ్వాన్సు చేయబడినప్పటికీ అది డబ్బు యొక్క భిన్నమైన ఉపయోగం మాత్రమే. డబ్బు లేదా సరుకులు స్వయంగా శ్రమశక్తి లాగానే పెట్టుబడి కాగల శక్తి కలిగి ఉంటాయి. 1) ఎందుకంటే డబ్బు – ఉత్పత్తి సాధనాలుగా మార్చబడవచ్చు. అది విలువగా వాటి అస్తిత్వానికి, వాటి అనిర్దిష్ట వ్యక్తీకరణ మాత్రమే. 2) సంపద యొక్క పాదార్థిక అంశాలకు పెట్టుబడి కాగల స్వభావముంది. వాటిని పెట్టుబడిగా మార్చే వాటి విరుద్ధ అనుబంధమైన వేతన శ్రమ పెట్టుబడిదారీ ఉత్పత్తి ప్రాతిపదికపైన లభ్యమౌతుంది కనుక ఇది సాధ్యం.

పాదార్థిక సంపదకున్న విరుద్ధమైన సామాజిక లక్షణాలు (వేతన శ్రమగా శ్రమకు వ్యతిరేకంగా దాని కర్తృత్వం) ఉత్పత్తి ప్రక్రియతో సంబంధం లేకుండానే పెట్టుబడిదారీ ఆస్తిలో వ్యక్తమౌతాయి. పెట్టుబడిదారీ ఉత్పత్తి ప్రక్రియ నుండి ఇది నిరంతరాయంగా తలెత్తుతుంది. ఈ నిరంతరాయమైన ఫలితం నిరంతరాయమైన పూర్వావసరంగా వ్యవహరిస్తుంది. దీనంతటితోనూ సంబంధం లేకుండానే డబ్బు, సరుకులు పెట్టుబడికాగల శక్తి కలిగి ఉంటాయి కనుక అవి పెట్టుబడిగా అమ్మబడతాయి. ఈ రూపంలో అవి ఇతరుల శ్రమపై అజమాయిషీ వహిస్తాయి. ఇతరుల శ్రమను స్వాయత్తం చేసుకునే హక్కునిస్తాయి. కనుక స్వయం విస్తరిత విలువలకు ప్రాతినిధ్యమిస్తాయి. ఈ వైరుధ్యం దానంతటిలోనూ ఉంది. పెట్టుబడిదారుడివైపు నుంచి ఒక సమ విలువగా ఇవ్వజూపిన శ్రమ కాక ఈ పైన పేర్కొన్న

సంబంధమే ఇతరుల శ్రమను స్వాయత్తం చేసుకోడానికి సాధనాలనూ, హక్కులనూ సరఫరా చేస్తుందన్నది స్పష్టం.

అంతేకాక లాభం వడ్డీగానూ, లాభంగానూ విభజించబడటమన్నది సరఫరా గిరాకీలచేత అనగా పోటీచేత సరుకుల మార్కెట్ ధరల్లాగానే క్రమబద్ధం చేయబడిన మేరకు పెట్టుబడి సరుకుగా కనిపిస్తుంది. అయితే ఇక్కడ తేడాపై సామ్యం అంతగానూ స్పష్టమే! సరఫరా, గిరాకీలు సమానమైతే సరుకుల మార్కెట్ ధరలు ఉత్పత్తి ధరలతో సమానమౌతాయి. అప్పుడు వాటి ధర పోటీతో ప్రమేయం లేకుండా పెట్టుబడిదారీ ఉత్పత్తి యొక్క సహజ నియమాలతో క్రమబద్ధం చేయబడినట్టు కనిపిస్తుంది. ఎందుకంటే సరఫరా, గిరాకీల ఆటుపోట్లు ఉత్పత్తి ధరల నుండి మార్కెట్ ధరలు వైదొలగటం తప్ప మరిదేన్నీ వివరించవు. ఇలా వైదొలగటం అన్నవి ఒకదానితో ఒకటి సమతూకంలో ఉంటాయి. కాస్త సుదీర్ఘ కాలక్రమంలో సగటు మార్కెట్ ధరలు ఉత్పత్తి ధరలతో సమానంగా ఉంటాయి. సరఫరా, గిరాకీలు సమానం కాగానే ఈ శక్తులు పనిచేయడం మానేస్తాయి. ఇవి ఒకదానిని మరొకటి భర్తీ చేసుకుంటాయి. ధరలో నిర్ణయించే సార్వత్రిక నియమం విడి సందర్భాలకు కూడా వర్తిస్తుంది. మార్కెట్ ధర అప్పుడు కేవలం దాని మార్కెట్ ధర చలనాల సగటుగా మాత్రమేగాక తన తక్షణ రూపంలో సైతం ఉత్పత్తి ధరకు సమానమౌతుంది. ఇక్కడ ఉత్పత్తి విధానం యొక్క నైసర్గిక నియమాలతో క్రమబద్ధం చేయబడుతుంది. వేతనాలకూ ఇదే వర్తిస్తుంది. సరఫరా, గిరాకీలు సమానమైతే అవి ఒకదాని ప్రభావాన్ని మరొకటి రద్దు చేసుకుంటాయి. వేతనాలు శ్రమశక్తి విలువతో సమానమౌతాయి. అయితే డబ్బు పెట్టుబడి యొక్క వడ్డీ విషయంలోను ఇది భిన్నంగా ఉంటుంది. ఈ సందర్భంలో పోటీ అన్నది సూత్రం నుంచి వైదొలగటాన్ని నిర్ణయించదు. పోటీ విధించే విభజన నియమం తప్ప మరోటి ఉండదు. సహజసిద్ధమైన వడ్డీ రేటు అన్నది ఉండబోదు. ఆ విషయాన్ని మనం వివరంగా చూద్దాం. సహజసిద్ధమైన వడ్డీ రేటు అనటంలో ప్రజల ఉద్దేశం స్వేచ్ఛా పోటీచేత నిర్ణయించబడిన రేటు అని మాత్రమే. సహజసిద్ధమైన పరిమితులేవీ వడ్డీ రేటుకు లేవు. పోటీ ఆటుపోట్లనూ, వైదొలగడాన్నీ నిర్ధారించని సందర్భాల్లో మాత్రమే కాక, పరస్పర విరుద్ధ శక్తుల సమతూకం అటువంటి నిర్ధారణలను నిలిపివేసినపుడు నిర్ధారించాల్సిన విషయం ఏకపక్షమూ, చట్టవిరుద్ధమూ అవుతుంది. తర్వాతి అధ్యాయంలో దీని గురించి చర్చిద్దాం.

వడ్డీ ఇచ్చే పెట్టుబడి విషయంలో ప్రతిదీ పై మినుకులా కనిపిస్తుంది. రుణదాత నుండి రుణగ్రహీతకు కేవలం ఒక బదిలీగా పెట్టుబడిని అడ్వాన్సు చేయడమూ, ఒక బదిలీగా ఆ పెట్టుబడి వాస్తవ రూపం ధరించి తిరిగి రావడమూ, రుణదాత నుండి రుణ గ్రహీతకు వడ్డీతో కలిసి తిరిగి రావడమూ ఇదంతా కృత్రిమంగా కనిపిస్తుంది. పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానంలో ఉన్న మరో సత్యం కూడా ఇలాగే ఉంటుంది. లాభం రేటు అడ్వాన్సు చేయబడిన పెట్టుబడి విలువకు ఒక టర్నోవర్‌లో చేయబడిన లాభంతో ఉన్న సంబంధాన్ని బట్టి నిర్ణయించబడుతుంది. అంతేగాక ఈ టర్నోవరు కాల పరిమితి నిడివిని బట్టి కూడా ఆధారపడి ఉంటుంది. కనుక పారిశ్రామిక పెట్టుబడి ఒక నిర్దిష్ట కాలావధిలో ఎంత లాభం ఇచ్చిందీ అన్నది నిర్ణయించబడుతుంది. వడ్డీ ఇచ్చే పెట్టుబడి విషయంలో పైపైన చూస్తే ఇలాగే కొంత నిర్దిష్ట కాలావధికి రుణదాతకు చెల్లించబడిన నిర్దిష్టమైన వడ్డీగా కనిపిస్తుంది.

వస్తువుల అంతర్గత సంబంధాల విషయంలో తన సహజసిద్ధమైన మహత్తర అవగాహనతో కాల్పనికవాది అయిన ఆడం మ్యుల్లర్ ఇలా అంటాడు (ఎలిమెంటీర్ స్టాట్స్కన్స్ట్, బెర్లిన్, 1809, డ్రిట్టర్ థెయిల్, ఎస్. 138) "వస్తువుల ధరలు నిర్ణయించడంలో కాలం లెక్కించబడదు. కాగా వడ్డీ నిర్ణయించడానికి కాలమే ప్రధాన అంశం." ఉత్పత్తి కాలమూ– చలామణి కాలమూ సరుకుల ధరలు నిర్ణయించడంలో ఎలా ప్రవేశిస్తాయో అతడు గమనించలేదు. ఒక నిర్దిష్ట కాలానికి పెట్టుబడి టర్నోవర్‌కు ఎంత లాభం రేటు అన్నదాన్ని ఏ అంశాలు నిర్ణయిస్తాయో అతడర్థం చేసుకోలేదు. కాగా సరిగ్గా ఒక నిర్ణీత కాలావధిలో లాభం ఎంత వచ్చిందీ అన్న నిర్ణయమే వడ్డీని కూడా నిర్ణయిస్తుంది. ప్రతీ సందర్భంలో లాగానే ఇక్కడ కూడా అతని విజ్ఞత ఎక్కడ ఉందంటే అతడు పైపైన ఎగసే దుమ్ము మేఘాల్ని మాత్రమే చూసి ఆ దుమ్మును చాలా నిగూఢమైందిగానూ, ప్రధానమైందిగానూ ఆడంబరంగా ప్రకటిస్తాడు.

★ ★ ★

## అధ్యాయం - 22

# లాభ విభజన - వడ్డీ రేటు సహజమైన వడ్డీ రేటు

ఈ అధ్యాయంలో ప్రసక్తమయ్యే విషయం గురించి, పరపతికి సంబంధించి మనం తరువాత చర్చించబోయే ఇతర అంశాలన్నింటి లాగానే, ఇక్కడ వివరంగా విశ్లేషించడం కుదరదు. రుణదాతలకు, రుణ గ్రహీతలకు మధ్య పోటీ, దానివల్ల డబ్బు మార్కెట్‌లో ఎదురయ్యే చిన్న చిన్న ఆటుపోట్లు కూడా ఇక్కడ చర్చించడం లేదు. వడ్డీ రేటు పారిశ్రామిక ఆర్థిక చక్రభ్రమణంలో చేసే ఆవృత్తాన్ని వివరించాలంటే పారిశ్రామిక చక్రభ్రమణాన్ని విశ్లేషించాలి. అయితే దాన్ని గురించి కూడా ఇక్కడ మనం చర్చించబోవటం లేదు. ప్రపంచ మార్కెట్లో ఎక్కువగానో, తక్కువగానో వడ్డీ రేటు అన్నది సుమారుగా సమానం గావటాన్ని గురించి కూడా ఇక్కడ చర్చించడం లేదు. ఇక్కడ మనం చర్చించే అంశం కేవలం వడ్డీ ఇచ్చే పెట్టుబడి యొక్క స్వతంత్ర రూపం గురించి. అలాగే లాభానికి భిన్నంగా వడ్డీకి గల విడి అస్తిత్వాన్ని గురించి మాత్రమే.

వడ్డీ అనేది కేవలం లాభంలో ఒక భాగం మాత్రమే కనుక, మన తొలి ఊహ ప్రకారం, పారిశ్రామిక పెట్టుబడిదారుడు డబ్బు పెట్టుబడిదారునికి మొత్తం లాభంలో ఒక వాటా ఇస్తాడు. ఇక్కడ వడ్డీకున్న అత్యధిక పరిమితి స్వయంగా లాభం మాత్రమే. అటువంటప్పుడు ఉత్పాదక పెట్టుబడిదారుడు జేబులో వేసుకున్న భాగం=0. లాభంకంటే ఎక్కువ వడ్డీ చెల్లించిన అసాధారణమైన సందర్భాలను పక్కన పెడదాం. అటువంటప్పుడు సాధారణంగా ఉత్పాదక పెట్టుబడిదారుడు ఇచ్చే అత్యధిక వడ్డీ "లాభం నుంచి పనిని అజమాయిషీ చేసినందుకు ఇచ్చిన వేతనాలను తీసివేయగా వచ్చే మొత్తం" అవుతుంది. (ఈ అంశాన్ని తర్వాత వివరిద్దాం) వడ్డీ కనీస పరిమితిని ఎంత మాత్రమూ నిర్ధారించలేం. అది ఎంత తక్కువకైనా పడిపోవచ్చు. అయితే అటువంటి సందర్భంలో దాన్ని సాపేక్ష కనీస స్థాయినుంచి మళ్ళీ పెంచటానికి ఎప్పుడూ కొన్ని ప్రతిచర్యాత్మక (Counteracting) ప్రభావాలు ఉండనే ఉంటాయి.

"పెట్టుబడి ఉపయోగించడానికై చెల్లించిన మొత్తానికీ, పెట్టుబడికీ మధ్య ఉన్న సంబంధం డబ్బుగా కొలవబడిన వడ్డీ రేటును వ్యక్తం చేస్తుంది." "వడ్డీ రేటు (1) లాభం రేటుపైన (2) రుణదాత, గ్రహీతల మధ్య మొత్తం లాభం ఏ నిష్పత్తిలో విభజించబడింది అన్నదానిపైన ఆధారపడివుంటుంది." (ఎకనామిస్ట్, జనవరి 22, 1853) "మనుషులు తాము తీసుకున్న మొత్తాన్ని ఉపయోగించుకున్నందుకు చెల్లించేదే వడ్డీ అయితే, ఆ మొత్తం అది ఉత్పత్తి చేయగలిగిన లాభాలలో ఒక భాగంగా వుండి ఉంటే

అప్పుడు ఈ వడ్డీ అనేది ఆ లాభాలచేత శాసించబడుతుంది." (మాసీ, అదే గ్రంథం, పుట 49)

మొత్తం లాభానికీ వడ్డీ పేరుతో డబ్బు పెట్టుబడిదారునికి చెల్లించే భాగానికీ నిశ్చిత సంబంధం ఉంది అనుకుందాం. అంటే మొత్తం లాభంతో పాటు వడ్డీ పెరుగుతుంది, తరుగుతుంది – అనేది స్పష్టం. మొత్తం లాభం సార్వత్రిక లాభం రేటునుబట్టి, దాని ఆటుపోటులనుబట్టి నిర్ణయించబడుతుంది. ఉదాహరణకు సగటు లాభం రేటు = 20% వడ్డీ లాభంలో నాలుగవ వంతు అనుకుందాం. అప్పుడు వడ్డీ రేటు = 5%. సగటు లాభం రేటు = 16% అయితే, వడ్డీ రేటు = 4% అవుతుంది. లాభం రేటు 16%, వడ్డీ రేటు 4% వున్నప్పుడు పారిశ్రామిక పెట్టుబడిదారునికి నికర లాభం 12% ఉంటుంది. లాభం రేటు 20% అయితే అప్పుడు వడ్డీ రేటు 8% వరకూ పెరిగినా అతనికి ఇంతకు ముందులాగే 12% నికర లాభం మిగులుతుంది. వడ్డీ రేటు 6% లేదా 7% మాత్రమే వున్నా అతనికి ఇంతకు ముందుకంటే ఎక్కువ వాటా లాభం లభిస్తుంది. దీనిని బట్టి సార్వత్రిక లాభం రేటు ఎంత ఎక్కువ వుంటే అంతగా మొత్తం లాభానికీ, వడ్డీకీ మధ్య నున్న తేడా కూడా పెరుగుతుంది. ఉత్పాదక పెట్టుబడిదారుడు జేబులో వేసుకోగలిగిన మొత్తం లాభం యొక్క వాటా కూడా పెరుగుతుంది. దీన్నే తిరగేసి కూడా చెప్పవచ్చు. వడ్డీ సగటు లాభంలో '5'వ వంతు వుంది అనుకుందాం. 10 లో 5వ వంతు అంటే 2. మొత్తం లాభానికి వడ్డీకి ఉన్న తేడా ఇక్కడ 8. 20లో 5వ వంతు 4. తేడా 20–4=16. 25లో 5వ వంతు 5. 25–5=20. 30లో 5వ వంతు 6. తేడా 30–6=24. 35లో 5వ వంతు 7. తేడా 35–7=28. భిన్నమైన వడ్డీ రేట్లు 4, 5, 6, 7% లుగా తీసుకుందాం. వీటిలో ఏదీ 20% మొత్తం లాభంలో 5వ వంతు కంటే ఎక్కువ కాదు. లాభం రేట్లు గనుక భిన్నంగా వుంటే మొత్తం లాభంలో ఒకే శాతాన్ని విభిన్న వడ్డీ రేట్లు వ్యక్తం చేస్తాయి. వడ్డీ స్థిరమైన నిష్పత్తుల్లో వుంటే పారిశ్రామిక లాభం అనేది (మొత్తం లాభానికి, వడ్డీకి ఉన్న తేడా) సార్వత్రిక లాభం రేటుకు అనుగుణంగా పెరుగుతుంది లేదా తగ్గుతుంది.

మిగిలిన అన్ని పరిస్థితులు యథాతథంగా వున్నాయి అనుకుంటే, అనగా వడ్డీకి లాభానికి మధ్యనున్న నిష్పత్తి దాదాపు స్థిరంగా ఉందనుకుంటే, పనిచేసే పెట్టుబడిదారుడు తన లాభం రేటు స్థాయికి అనుగుణంగా ఎక్కువ లేదా తక్కువ వడ్డీని చెల్లించగలుగుతాడు.[1] లాభం రేటు అనేది పెట్టుబడిదారీ ఉత్పత్తి అభివృద్ధికి విలోమానుపాతంలో వుంటుందని మనం ఇంతకు ముందు గ్రహించాం. దానినిబట్టి ఒక దేశంలో ఎక్కువ లేదా తక్కువ వడ్డీ రేటు అనేది అదేరకంగా పారిశ్రామికాభివృద్ధి స్థాయినిబట్టి విలోమానుపాతంలో ఉంటుంది. కనీసం వడ్డీ రేటులో ఉన్న తేడా వాస్తవంగా లాభం రేటులో వున్న తేడాను వ్యక్తం చేసిన మేరకు అలా జరుగుతుంది. అయితే ఇది ప్రతిసారీ ఇలాగే ఉండవకపోవచ్చునని తరువాత తెలుస్తుంది. ఈ అర్థంలో వడ్డీ అనేది లాభం ద్వారా లేదా ఇంకా ఖచ్చితంగా చెప్పాలంటే సార్వత్రిక లాభం రేటు ద్వారా క్రమబద్ధం అవుతుంది అని చెప్పవచ్చు. వడ్డీ ఈ రకంగా క్రమబద్ధం అవటం అనేది దాని సగటుకు కూడా వర్తిస్తుంది.

సగటు లాభం రేటు అన్నది వడ్డీ గరిష్ట పరిమితిని అంతిమంగా నిర్ణయిస్తుందని గమనించాలి.

---

1. "సహజమైన వడ్డీ రేటు అనేదాన్ని ప్రత్యేక అంశాల్లో వాణిజ్య లాభాలు నిర్ణయిస్తాయి." (మాసీ - అదే గ్రంథం, పుట 51)

వడ్డీని సగటు లాభానికి సంబంధంలో వుంచాలి అనే అంశాన్ని మరింత వివరంగా పరిశీలిద్దాం. లాభం లాంటి ఒక ప్రత్యేక అంశాన్ని రెండు పక్షాల మధ్య విభజించాల్సి వచ్చినప్పుడల్లా, ఆ విభజింపబడే అంశం యొక్క పరిమాణాన్ని ప్రధానంగా పరిశీలించాలి. అనగా లాభం పరిమాణాన్ని దాని సగటు రేటు నిర్ణయిస్తుంది. సార్వత్రిక లాభం రేటు లేదా ఒక నిర్దిష్ట పరిమాణం గల పెట్టుబడిపై వచ్చే లాభం యొక్క పరిమాణం = 100 అనుకుందాం. అప్పుడు వడ్డీలో తలెత్తే వైవిధ్యం ఉత్పాదక పెట్టుబడిదారుని అనగా రుణగ్రహీత చేతుల్లో మిగిలి వున్న లాభంలో భాగానికి విలోమానుపాతంలో వుంటుంది. లాభాన్ని పంపిణీ చేయడాన్ని నిర్ణయించే పరిస్థితులు అంటే వేతనం చెల్లించబడని శ్రమ ఉత్పత్తి చేసిన విలువను పంపిణీ చేసే పరిస్థితులు ఈ ఇద్దరు పెట్టుబడిదారుల మధ్య ఆ లాభాన్ని విభజించే పరిస్థితుల కంటే చాలా భిన్నంగా వుంటాయి. అవి తరచుగా పూర్తిగా వ్యతిరేక ప్రభావాన్ని కలిగిస్తూ వుంటాయి.[1]

ఆధునిక పరిశ్రమ ఏ చక్రభ్రమణాల గుండా పయనిస్తుందో పరిశీలిస్తే (పనిలేని పరిస్థితి, క్రమంగా కోలుకోవటం, సుభిక్షం, అధికోత్పత్తి, సంక్షోభం, మాంద్యం, తిరిగి పనిలేని పరిస్థితి వగైరాలు ఇక్కడ మన విశ్లేషణ పరిధిలోకి రావు.) తక్కువ వడ్డీ రేటు అన్నది సాధారణంగా సుభిక్ష దశలోనూ, అదనపు లాభాలు వస్తున్న తరుణంలోనూ కనిపిస్తుంది. వడ్డీలో పెరుగుదల అన్నది, సుభిక్షానికి దానికి వ్యతిరేకమైన పరిస్థితికి మధ్యలో ఉంటుంది. అత్యధిక వడ్డీ రేట్లు వడ్డీ వ్యాపారం సంక్షోభ కాలంలో కనిపిస్తాయి.[2] 1843 వేసవి గొప్ప సుభిక్ష దశతో ప్రారంభమైనది. 1842 వసంతకాలంలో ఇంకా $4\frac{1}{2}\%$ వున్న వడ్డీ రేటు 1843 వసంతానికి, వేసవి నాటికి 2%కి పడిపోయింది.[3] సెప్టెంబర్‌లో అది $1\frac{1}{2}\%$కు పడిపోయింది. (గిల్బర్ట్, అదే గ్రంథం, పుట 166) 1847 సంక్షోభం నాటికి అది 8%, అంతకంటే ఎక్కువకు పెరిగింది.

అయితే మాంద్యంతోపాటు తక్కువ వడ్డీ రేటు ఉండటం మళ్ళీ కోలుకున్న కార్యకలాపాలతో బాటు కొద్దిగా వడ్డీ రేటు పెరగటం సాధ్యమే.

సంక్షోభ కాలంలో వడ్డీ రేటు దాని అత్యున్నత స్థాయికి చేరుకుంటుంది. చెల్లింపుల కోసం ఏ

---

1. ఇక్కడ రాతప్రతిలో ఈ క్రింది ప్రస్తావన వుంది. "ఈ అధ్యాయం సూచిస్తున్నదేమంటే లాభాలను పంపిణీ చేసే నియమాలను విశ్లేషించడానికి ముందు పరిమాణ విభజన ఏ రకంగా గుణానికి సంబంధించిన విభజనగా మారుతుందో వివరించటం మంచిది. మునుపటి అధ్యాయం నుంచి మారడానికి ముందు వడ్డీ అన్నది లాభంలో ఒక అనిర్దిష్ట భాగం అని భావించటం అవసరం."

2. "మొదటి దశలో ఒత్తిడి గడిచిపోయిన వెంటనే డబ్బు విస్తారంగా లభిస్తుంది. సట్టా వ్యాపారం ఉండదు. రెండవ దశలో డబ్బు విస్తారంగా దొరుకుతుంది. సట్టా వ్యాపారం కూడా బాగా నడుస్తుంది. మూడవ దశలో సట్టా వ్యాపారం క్షీణిస్తుంది. డబ్బు గిరాకీ పెరుగుతుంది. నాలుగవ దశలో డబ్బు కొరత ఏర్పడుతుంది. మళ్ళీ ఒత్తిడి తలెత్తుతుంది." (గిల్బర్ట్, ఎ ప్రాక్టికల్ ట్రెటైస్ ఆన్ బ్యాంకింగ్, 5వ ముద్రణ, సంపుటి 1, లండన్ 1849, పుట 149)

3. టూకే ఈ రకంగా వివరిస్తాడు. "గత సంవత్సరాలలో లాభదాయకంగా వినియోగించబడవలసిన అదనపు పెట్టుబడి కొరత తరువాత దానితోపాటు ఆ అదనపు పెట్టుబడి అత్యవసరంగా పోగుపడుతుంది. నిల్వలను బయటకు విడుదల చేయటం ద్వారానూ, వాణిజ్య అవకాశాలపై విశ్వాసం పునరుద్ధరించబడటం వల్లనూ ఇది జరుగుతుంది." (హిస్టరీ ఆఫ్ ప్రైసెస్ ఫ్రమ్ 1839, టిల్ 1847, లండన్ 1848, పుట 54)

రేటుకైనా డబ్బు అప్పు తీసుకొనబడుతుంది. వడ్డీ రేటు పెరగటం అన్నది సెక్యూరిటీల ధరలు పడిపోవటాన్ని సూచిస్తుంది. కనుక డబ్బు పెట్టుబడి దండిగా వున్నవారికి వడ్డీ తెచ్చే సెక్యూరిటీలను అత్యంత తక్కువ ధరలకు కొనివేసే అవకాశం దొరుకుతుంది. కాలక్రమంలో వడ్డీ రేటు మళ్ళీ పడిపోగానే సెక్యూరిటీలు సగటు ధరను తిరిగి పొందుతాయి.[1]

అయితే లాభం రేటులో ఆటుపోట్లతో ప్రమేయం లేకుండానే వడ్డీ రేటు పడిపోయే ధోరణి కూడా వుంది. నిజానికి దీనికి రెండు ప్రధాన కారణాలు వున్నాయి.

I. "ఉత్పాదకంగా ఉపయోగించడానికి తప్ప పెట్టుబడి ఎప్పుడూ అప్పు తీసుకోబడదని మనం భావించవచ్చా? మొత్తం నికర లాభాల రేటులో ఏ మార్పు లేకుండానే వడ్డీ మారవచ్చని నేను అనుకుంటున్నాను. ఒక జాతి సంపదనార్జించడంలో పురోగమించినపుడు ఒక వర్గం తలెత్తుతారు, వృద్ధి చెందుతారు. కొంతమంది తమ తాత ముత్తాతల శ్రమ ఫలితంగా కేవలం వారికున్న వడ్డీతో బాగా బతకగలగడానికి తగినంత ఆస్తులుంటాయి. యవ్వనంలోను, మధ్య వయస్సులోను చాలామంది క్రియాశీలంగా వాణిజ్యంలో నిమగ్నమయినవారు, వారి చివరి రోజుల్లో తాము కూడబెట్టిన మొత్తాలపై వచ్చిన వడ్డీలతో ప్రశాంతంగా బతకగలుగుతారు. వీరు, ఇంతకు ముందు పేర్కొన్నవారు ఒక దేశపు ధనరాశులు పెరుగుతున్న కొద్దీ పెరుగు తుంటారు. చేతిలో చిల్లిగవ్వ లేకుండా ప్రారంభించిన వారికంటే తగినంత సొమ్ముతో ప్రారంభించిన వారు త్వరగా స్వతంత్రులు అవుతారు. ఆ రకంగా ప్రాచీన ధనిక దేశాలలో ప్రజలు కొత్తగా స్థిరపడిన, పేద జిల్లాల్లో కంటే పెట్టుబడిని తమంతట తామే పెట్టి ఉపయో గించడానికి ఇష్టపడని వారికి సంబంధించిన జాతీయ పెట్టుబడి మొత్తం సమాజంలో ఉన్న మొత్తం ఉత్పాదక నిల్వల కంటే ఎక్కువ నిష్పత్తిలో వుంటుంది. అద్దెకు లేక కౌలుకు ఇచ్చే వారి వర్గం సంఖ్య ఇంగ్లండ్‌లో జనాభా సంఖ్యతో పోలిస్తే ఎంత ఎక్కువో! ఈ అద్దె లేక కౌలుకిచ్చే వారి వర్గం పెరిగేకొద్దీ పెట్టుబడిని అప్పిచ్చేవారి సంఖ్య కూడా పెరుగుతుంది. నిజానికి వారిద్దరి వర్గం ఒకటే." (రాంసే, ఏన్ ఎస్సే ఆన్ ది డిస్ట్రిబ్యూషన్ ఆఫ్ వెల్త్, పుటలు 201, 202)

II. పరపతి వ్యవస్థ అభివృద్ధి దానితో పాటు సమాజంలో ఉన్న అన్ని వర్గాలు పొదుపు చేసే డబ్బు మొత్తాలపై బ్యాంకర్ల సాయంతో నిరంతరాయంగా పెరుగుతున్న పారిశ్రామికవేత్తల పట్టు, డబ్బు పెట్టుబడిగా వ్యవహరించగలిగే ఈ పొదుపు మొత్తాలను రానురానూ అత్యధికంగా కేంద్రీకరించటమూ – ఇవన్నీ వడ్డీ రేటును పడగొట్టాలి. దీని గురించి తర్వాత మరికొంత చర్చిద్దాం.

వడ్డీ రేటు నిర్ణయించడానికి సంబంధించి ప్రస్తావిస్తూ రాంసేనే ఇలా అంటాడు :

1. ఓ పాత కస్టమర్‌కు 200,000 పౌండ్ల బాండ్‌పై అప్పు ఇవ్వటానికి బ్యాంక్ యజమాని తిరస్కరించాడు. ఆ కస్టమర్ తాను చెల్లింపులన్నింటినీ నిలిపివేయడానికి సిద్ధపడినాడు. అటువంటి చర్య అవసరం లేదని, ఆ పరిస్థితులలో 150,000 పౌండ్లకు తాను కొనుగోలు చేస్తానని బ్యాంక్ యజమాని చెప్పాడు. (హెచ్. రాయ్) (ది థియరీ ఆఫ్ ది ఎక్స్ఛేంజెస్, ద బ్యాంక్ చార్టర్ యాక్ట్ ఆఫ్ 1844, లండన్, 1869, పుట 80)

"ఇది పాక్షికంగా మొత్తం లాభాల రేటుపై ఆధారపడుతుంది. పాక్షికంగా పెట్టుబడి లాభాలుగాను, పరిశ్రమ లాభాలుగాను విభజించబడే నిష్పత్తిపైన ఆధారపడి వుంటుంది. ఈ నిష్పత్తి తిరిగి రుణదాతల, రుణగ్రహీతల మధ్య పోటీపైన ఆధారపడి వుంటుంది. పూర్తిగా ఏరకంగాను క్రమబద్ధం కానప్పటికీ వాస్తవ రూపం ధరించాల్సిన మొత్తం లాభం రేటుచేత ఈ పోటీ ప్రభావితం అవుతుంది.[1] పోటీ అన్నది మొత్తంగా ఏ కారణంచేత – ఎందుకు క్రమబద్ధం కాదంటే ఒకవైపున చాలామంది ఉత్పాదక వినియోగం అనే దృష్టి లేకుండానే అప్పు తీసుకుంటారు. మరోవైపున మొత్తం అప్పు ఇవ్వడానికి వీలైన పెట్టుబడి యొక్క నిష్పత్తి మొత్తం లాభాలలో వచ్చే మార్పులతో ప్రమేయం లేకుండానే ఒక దేశపు ధనరాశులను బట్టి మారుతూ వుంటుంది." (రాంసే అదే గ్రంథం, పుటలు 206–207)

సగటు వడ్డీ రేటును నిర్ణయించడానికి 1. ప్రధాన పారిశ్రామిక చక్రభ్రమణాలలో సగటు వడ్డీ రేటులో వచ్చిన తేడాలను మనం అంచనా వేయాలి. 2. పెట్టుబడి యొక్క దీర్ఘకాలిక రుణాలు అవసరమైన మదుపుల కోసం అవసరమైన వడ్డీ రేట్లను తెలుసుకోవాలి.

ఒకానొక దేశంలో అమలులో వున్న సగటు వడ్డీ రేటు (నిరంతరాయంగా ఆటుపోట్లకు గురయ్యే మార్కెట్ రేట్లకు భిన్నంగా) ఏ చట్టంచేతా నిర్ణయించబడజాలదు. ఈ రంగంలో ఆర్థిక వేత్తలు సహజమైన లాభం రేటు గురించి, సహజమైన వేతనాల రేటు గురించి మాట్లాడే తీరులో, సహజమైన వడ్డీ రేటు అనేది ఎక్కడా వుండదు. ఈ విషయంలో మాసీ సరిగ్గా చెప్పాడు (పుట 49). "ఈ సందర్భంలో ఏ వ్యక్తికైనా సందేహం రావాల్సిన అంశమేమంటే, ఈ లాభాలు ఏ నిష్పత్తిలో రుణదాతకీ, రుణగ్రహీతకూ హక్కుగా లభిస్తాయి. సాధారణంగా రుణదాత, రుణగ్రహీతల అభిప్రాయాలను బట్టి తప్ప దీనిని నిర్ణయించే వేరే పద్ధతి ఏదీ లేదు. ఇక్కడ తప్పు ఒప్పు అన్నది సామాన్య ఆమోదమే నిర్ణయిస్తుంది." సరఫరా, గిరాకీలను సమం చేయడం (సగటు లాభం రేటు ముందే ఇవ్వబడినట్లుగా ఊహించడమూ) అన్నదానికి ఇక్కడ ప్రత్యేక అర్థం లేదు. ఈ సూత్రాన్ని ఆశ్రయించినప్పుడల్లా (ఇది ఆచరణలో సరైనదే) ప్రాథమిక సూత్రాన్ని కనుక్కోవడానికి ఈ సూత్రం ఉపకరిస్తుంది. (పరిమితులను క్రమబద్ధం చేయడం లేదా పరిమాణాలను పరిమితం చేయడం) ఈ సూత్రానికి పోటీతో ప్రమేయం లేదు. పైగా అది పోటీని నిర్ణయిస్తుంది. పోటీ అనే ఆచరణకు బందీలయిన వారి విషయంలో మరింత ఎక్కువగా వర్తిస్తుంది. పోటీ దాని దృశ్య రూపాలు, వాటి నుంచి తలెత్తే భావనలు అవన్నీ కలిసి వారిని పోటీలో అంతర్గతంగా ఉన్న ఆర్థిక సంబంధాల మధ్య వున్న అంతస్సంబంధాన్ని గురించి ఒక అసహజమైన భావాన్ని వారికిస్తుంది. పోటీతో పాటు ఉండే తేడాపాడాలను ఈ తేడాల పరిమితులకు ఈ పద్ధతి పయనిస్తుంది. సగటు వడ్డీ రేటు విషయంలో ఇలా ఉండదు. సగటు పోటీ పరిస్థితులు అంటే రుణదాత, రుణగ్రహీతల మధ్య సమతూకం. రుణదాతకు 3, 4, 5 శాతం వగైరా వడ్డీ ఎందుకు ఇవ్వాలి; అలాగే అతని పెట్టుబడిపైన కొంత నికర లాభాల శాతం ఉదాహరణకు 20 శాతం లేదా 50 శాతం ఎందుకుండాలి? అన్నదానికి సరైన కారణమేమీ

1. వడ్డీ రేటు మొత్తం మీద సగటు లాభం రేటుచేత నిర్ణయించబడుతుంది గనుక, తక్కువ వడ్డీ రేటుతో పాటు తరచుగా దారుణమైన వంచన కూడా ఉంటూ ఉంటుంది. ఉదాహరణకు 1844 వేసవిలో జరిగిన రైల్వే కుంభకోణం. బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్ వడ్డీ రేటు 1844 అక్టోబర్ 16 వరకు 3 శాతానికి పెంచబడలేదు.

కనిపించదు. పోటీ అన్న దేనినైనా నిర్ధారించిన ప్రతీచోటా ఆ నిర్ధారణ యాదృచ్ఛికం. కేవలం పైపై పరిశీలన శుష్కపాండిత్యం, కాల్పనిక ధోరణి ఈ యాదృచ్ఛిక అంశాన్ని ఒక ఆవశ్యకంగా చూపించటానికి ప్రయత్నిస్తుంది.[1] 1857, 1858లో బ్యాంక్ శాసనాలు, వాణిజ్య సంక్షోభాలపై పార్లమెంట్ నివేదికల్లో బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్ డైరెక్టర్లు లండన్ బ్యాంకర్లు కంట్రీ బ్యాంకర్లు వృత్తిరీత్యా సిద్ధాంతకారులు "ఉత్పత్తయిన వాస్తవ రేటు" గురించి మాట్లాడినదాన్ని వినడం కంటే వినోదాత్మకమైనది ఏదీ ఉండదు. వీరంతా ఊకదంపుడుగా చర్చించినప్పటికీ "అప్పు ఇవ్వడానికి వీలైన వడ్డీకి చెల్లించే ధర అటువంటి పెట్టుబడి సరఫరాపైన ఆధారపడి ఉంటుంది." "అధిక రేటు, తక్కువ లాభం శాశ్వతంగా ఉండజాలవు" లాంటి సాదాసీదా డొల్ల మాటలను వీరంతా దాటిపోలేదు.[2] శాసన సాంప్రదాయాలు, ఆచారాలకు సగటు వడ్డీ రేటును నిర్ణయించడంలో పోటీకి ఎంత పాత్ర వుందో వీటికీ అంతే వుంది. ఈ వడ్డీ రేటు అన్నది ఒక సగటుగా కాక వాస్తవ పరిమాణంగా ఉన్న మేరకు ఇది వర్తిస్తుంది. వడ్డీని లెక్కకట్టాల్సిన న్యాయ వివాదాలలో ఒక సగటు వడ్డీ రేటును చట్టబద్ధమైన రేటుగా అంగీకరించాల్సి వుంటుంది. ఒక సగటు వడ్డీ రేటు పరిమితుల్ని సాధారణ నియమాల నుంచి మనం ఎందుకు గ్రహించలేమో పరిశీలిస్తే దానికి సమాధానం వడ్డీ స్వభావంలోనే దొరుకుతుంది. అది కేవలం సగటు లాభంలో ఒక భాగం మాత్రమే. ఒకే పెట్టుబడి రెండు పాత్రలలో కనిపిస్తుంది. రుణదాత చేతుల్లో అప్పివ్వబడే పెట్టుబడిగాను, పనిచేసే పెట్టుబడిదారుని చేతుల్లో పారిశ్రామిక, వాణిజ్య పెట్టుబడిగాను దర్శనమిస్తుంది. అయితే అది ఒకసారే పనిచేస్తుంది. ఒకసారే లాభాన్ని ఉత్పత్తి చేస్తుంది. స్వయంగా

---

1. జెజి అప్‌డికే, ఉదాహరణకు తన ట్రెటయిజ్ ఆన్ పొలిటికల్ ఎకానమి (న్యూయార్క్ 1851)లో 5% వడ్డీ రేటును శాశ్వత న్యాయాల ద్వారా ఎంత సార్వత్రికమో వివరించడానికి ఒక విఫల యత్నం చేస్తాడు. అయితే పోల్చి చూస్తే ఇంతకంటే, అమాయకంగా కార్ల్ అరల్డ్ తన 'నేచురల్ ఎకనమిక్స్ అపోజ్డ్ టు ది స్పిరిట్ ఆఫ్ మోనోపలీ అండ్ కమ్యూనిజం' (హనో 1845)లో ఇలా చర్చించాడు. "సరుకుల ఉత్పత్తి యొక్క సహజ క్రమంలో ఒక దృశ్య రూపం పూర్తిగా స్థిరపడిన దేశాలలో కొంతమేరకు వడ్డీ రేటును క్రమబద్ధం చేస్తున్నట్లు కనిపిస్తుంది. యూరప్ అడవులలో పెరిగే కలపకు వాటి సహజమైన వార్షిక పెరుగుదల తోడవడంలో ఈ నిష్పత్తి ఉంది. ఈ కొత్త పెరుగుదల వాటి మార్పిడి విలువతో ప్రమేయం లేకుండా 3 లేదా 4 నుంచి 100 వరకు జరుగుతుంది." (చెట్లు తమ మార్పిడి విలువతో ప్రమేయం లేకుండా తమ కొత్త పెరుగుదలను చూస్తాయనడం ఎంత వింత!) "దీని ప్రకారం అత్యంత ధనిక దేశాలలో ప్రస్తుతం ఉన్న స్థాయి కంటే వడ్డీ రేటు పడిపోవడాన్ని ఊహించలేము." (పుట 124) (అంటే చెట్ల మార్పిడి విలువ వాటి కొత్త పెరుగుదలపైన ఎంతగా ఆధారపడినప్పటికీ వాటి పెరుగుదలకు మార్పిడి విలువతో ప్రమేయం లేదు, అని ఆయన ఉద్దేశం.) దీన్ని మనం "ఆదిమ ఆటవిక వడ్డీ రేటు" అని పిలవచ్చు. "మన శాస్త్రానికి" ఈ ఆవిష్కర్త "కుక్క పన్ను తత్వవేత్త" తన రచనలో మరింత ప్రశంసనీయమైన దోహదం చేశాడు. (కె. అరండ్‌ని హేళనగా కుక్క పన్ను తత్వవేత్త అన్నాడు మార్క్స్. దానికి కారణం ఈ రచయిత తన గ్రంథంలో (88, S 420, 421) ఒక ప్రత్యేక పేరాగ్రాఫ్‌లో కుక్కలపై పన్ను విధించాలని ఉద్బోధించాడు. సం॥)
2. బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్ తన డిస్కౌంట్ రేటును పెంచుతుంది, తగ్గిస్తుంది. అయితే ఇది మార్కెట్లో అమలులో వున్న రేటును పరిగణించి బంగారపు ఎగుమతులు, దిగుమతులను బట్టి అలా చేస్తుంది. "డిస్కౌంట్లలో ఈ జూదమూ, బ్యాంక్ రేట్లలో మార్పులను ఊహించడమూ వగైరాలు డబ్బు కేంద్రాల పెద్దతలకాయల వాణిజ్యంలో సగభాగాన్ని ఆక్రమిస్తుంది." (హెచ్. రాయ్, ది థియరీ ఆఫ్ ది ఎక్స్ఛేంజెస్, పుట 113).

ఉత్పత్తి ప్రక్రియలో అప్పివ్వబడిన పెట్టుబడిగా దానికి వేరే పాత్ర లేదు. ఆ లాభాన్ని విభజించడంలో ఆ ఇరుపక్షాలు ఎవరెంత విభజించుకోవాలి అన్నదే కేవలం ఆచరణ రంగానికి సంబంధించినది. ఒక వాణిజ్య భాగస్వామ్యంలో ఉమ్మడి లాభాన్ని ఏ శాతాలలో విభజించాలి అన్న ప్రశ్న ఎటువంటిదో, ఇది కూడా అటువంటి యాదృచ్ఛికమైనదే. శ్రమశక్తి, పెట్టుబడి అనే రెండు పూర్తిగా భిన్నమైన అంశాలు అదనపు విలువ వేతనాల మధ్య విభజనను నిర్ణయిస్తాయి. ఈ విభజన లాభం రేటును నిర్ణయిస్తుంది. ఇది రెండు స్వతంత్రమైన మార్పిడికి గురయ్యే అంశాల విధులు. ఇవి ఒక దానిని ఒకటి పరిమితం చేసుకుంటాయి. వాటి గుణాత్మకమైన తేడాయే ఉత్పత్తయిన విలువను పరిమాణాత్మకంగా విభజించడానికి మూలం. అదనపు విలువను వడ్డీగాను, లాభంగాను విభజించడంలో కూడా ఇదే జరుగుతుందని తర్వాత మనం గమనిస్తాం. వడ్డీ విషయంలో ఇటువంటిదేమీ జరగదు. ఇక్కడ మనం ప్రస్తుతం చూస్తున్న గుణాత్మకమైన, వ్యత్యాసం అదనపు విలువ యొక్క అదే మొత్తం యొక్క పరిమాణాత్మక విభజన నుండే ప్రారంభమవుతుంది.

పైన చెప్పినదాన్ని బట్టి సహజసిద్ధమైన వడ్డీ రేటు ఏదీ లేదని అర్థం అవుతుంది. అయితే సాధారణ వడ్డీ రేటులాగా కాక ఒకవైపున సగటు వడ్డీ పరిమితుల్ని నిర్ణయించడానికి సాధారణ నియమం లేదు. నిరంతరాయంగా ఆటుపోట్లకు గురయ్యే మార్కెట్ వడ్డీ రేట్లకు భిన్నంగా సగటు వడ్డీ రేటును చెప్పే సూత్రం లేదు. ఎందుకంటే ఇది కేవలం వేరు వేరు పేర్లతో వున్న ఇరువురు పెట్టుబడి యజమానుల మధ్య మొత్తం లాభాన్ని విభజించాలన్నదే ఇక్కడ ప్రశ్న; కనుక, మరోవైపున వడ్డీ రేటు (అది సందర్భాన్ని బట్టి సగటు రేటు కావచ్చు లేదా మార్కెట్ రేటు కావచ్చు) లాభం సాధారణ రేటుకు పూర్తిగా భిన్నంగా నిలిచి వుండే ఒక నిర్దిష్ట ఏకరూప పరిమాణంగా కనిపిస్తుంది.[1]

ఒక సరుకు మార్కెట్ ధర, దాని విలువతో ఎలా సంబంధం కలిగి వుంటుందో వడ్డీ రేటు కూడా లాభం రేటుతో సంబంధం కలిగి వుంటుంది. వడ్డీ రేటు లాభం రేటుచేత నిర్ణయించబడిన మేరకు ఇది ఎప్పుడూ సార్వత్రిక లాభం రేటుగా మాత్రమే వుంటుంది. అంతేగాని ఒక ప్రత్యేక పారిశ్రామిక శాఖలో వున్న ప్రత్యేక లాభం రేటు కాదు. ఒక వ్యష్టి పెట్టుబడిదారు ఒక ప్రత్యేక వాణిజ్య రంగంలో సంపాదించగల్గిన అదనపు లాభం అంతకంటే కాదు.[2] కనుక సార్వత్రిక లాభం రేటు

---

1. ''సరుకుల ధరలు నిరంతరాయంగా ఆటుపోట్లకు గురవుతాయి. అవన్నీ విభిన్న ఉపయోగాల కోసం తయారుచేయబడ్డవి. డబ్బు మాత్రం అన్ని పనులను నిర్వహిస్తుంది. ఒకేలాంటి సరుకులు కూడా నాణ్యతను బట్టి భిన్నంగా ఉంటాయి. నగదు డబ్బు ఎప్పుడూ ఒకే విలువ కలిగి వుంటుంది. కనీసం అలా భావించబడుతుంది. ఆ రకంగా డబ్బు యొక్క ధర అనగా వడ్డీ - మిగిలిన ఏ వస్తువుకంటే కూడా ఎక్కువ స్థిరత్వాన్ని, ఏకరూపతను కలిగి వుంటుంది.'' (జె. స్టువార్ట్, ప్రిన్సిపల్స్ ఆఫ్ పొలిటికల్ ఎకానమీ, ఫ్రెంచి అనువాదం, 1789, IV పుట 27)

2. ''లాభాలను విభజించే ఈ సూత్రాన్ని ప్రతీ రుణదాతకు, రుణగ్రహీతకు వర్తింపచేయరాదు. కాని ఇది సాధారణంగా రుణదాతలు, రుణగ్రహీతలందరికీ వర్తిస్తుంది. పెద్ద లాభాలకు నైపుణ్యమూ, తక్కువ లాభాలకు అవగాహనా లోపమూ కారణాలు. ఈ లక్షణాలతో రుణదాతలకు సంబంధం లేదు. అటువంటి లక్షణాల వల్ల వారు నష్టపోయేది లేదు. కనుక ప్రత్యేకంగా లాభం పొందాల్సిన అవసరం లేదు. ఒకే వాణిజ్యంలో కొంతమంది నిర్దిష్టమైన వ్యక్తుల గురించి చెప్పింది, ఆ ప్రత్యేక వాణిజ్యానికి మాత్రమే వర్తిస్తుంది. వాణిజ్యవేత్తలు, వ్యాపారులు ఒక శాఖలో, వేరే వాణిజ్య వేత్తలు, వ్యాపారులు వేరే శాఖల్లో

సగటు వడ్డీ రేటులో ఒక ఆచరణాత్మకమైన, నిర్ణీతమైన వాస్తవంగా కన్పిస్తుందనేది నిజం. అయితే సగటు వడ్డీ రేటు లాభం రేటు యొక్క పరిశుద్ధమైన, నమ్మతగిన వ్యక్తీకరణ కాదు.

వడ్డీ రేటన్నది రుణగ్రహీతలకు చెందిన వివిధ రకాల సెక్యూరిటీలను బట్టి మారుతుంటుంది అన్నది నిజం. ఆ డబ్బు ఎంత కాలానికై అప్పు తీసుకోబడిందో ఆ నిడివిని బట్టి కూడా మారుతుంటుంది. అయితే ప్రతి ప్రత్యేక సందర్భంలో అది ఏకరూపంగా ఉంటుంది. నిర్ణీతమైన, ఏకరూపకమైన వడ్డీ రేటు యొక్క రూపాన్ని ఈ తేడా రద్దు చేయదు.[1]

ప్రత్యేక లాభం రేట్లలో నిరంతరం మార్పులంటూ వుంటాయి. అయితే ఒక రంగంలో వచ్చిన మార్పులను మరో రంగంలో దానికి వ్యతిరేకమైన మార్పులు భర్తీ చేస్తుంటాయి. సార్వత్రిక లాభం రేటు దీర్ఘ విరామాల కొకసారి మాత్రమే మారుతూ వుంటుంది. కనుక సగటు లేక సామాన్య వడ్డీ రేటు కూడా చాలా కాలంపాటు ఒక స్థిర పరిమాణంలా కనిపిస్తుంది.

నిరంతరాయంగా ఆటుపోట్లకు గురయ్యే వడ్డీ రేటుకు సంబంధించి ఏ నిర్ణీత క్షణంలోనైనా ఒక నిర్ణీత పరిమాణంతో ఉంటుంది. సరుకుల మార్కెట్ ధరలాగానే ఒకవైపు అప్పివ్వడానికి వీలయిన పెట్టుబడి సరఫరా, మరోవైపున దాని డిమాండ్‌కు మధ్య వున్న సంబంధాలు – ఏ నిర్ణీత సమయంలో నైనా వడ్డీ యొక్క మార్కెట్ స్థాయిని నిర్ణయిస్తాయి. డబ్బు మార్కెట్‌లో అప్పివ్వడానికి వీలైన పెట్టుబడి మొత్తం నిరంతరాయంగా పనిచేసే పెట్టుబడిని ఒక మొత్తంగా ఎదుర్కొంటుంది. అభివృద్ధి అధికమైన కొద్దీ ఇది మరింత వర్తిస్తుంది. పరపతి వ్యవస్థ దానితోపాటు కేంద్రీకృతమవుతుంది. అప్పివ్వడానికి

---

సంపాదించిన ఉమ్మడి లాభాలకంటే, అప్పు తీసుకున్న పెట్టుబడితో ఎక్కువ సంపాదిస్తే ఆ అసాధారణ లాభం వారి సొంతం అవుతుంది. దానికి సామాన్యమైన నైపుణ్యం అవగాహన సరిపోయినప్పటికీ ఆ లాభం వారికి డబ్బు ఇచ్చిన రుణదాతలకు కాక వారికే చెందుతుంది. ఎందుకంటే ఆ రుణదాతలు ఏ శాఖలో లేదా వ్యాపారంలో అంతకంటే తక్కువ వడ్డీ రేటుకు అప్పిచ్చి ఉండేవారు కాదు. కనుక ఆ డబ్బుతో సాధించిన అదనపు సదుపాయాలలో సామాన్య రేటుకంటే ఎక్కువగా వారికి దఖలుపడాల్సిన అవసరం లేదు.'' (మాసీ అదే గ్రంథం, పుటలు 50, 51)

1.

| | | |
|---|---|---|
| బ్యాంక్ రేటు ..... | ... | 5% |
| మార్కెట్ డిస్కౌంట్ రేటు, 60 రోజుల డ్రాఫ్టులు | ... | $3\frac{5}{8}$% |
| మార్కెట్ డిస్కౌంట్ రేటు, 3 నెలల డ్రాఫ్టులు | ... | $3\frac{1}{2}$% |
| మార్కెట్ డిస్కౌంట్ రేటు, 6 నెలల డ్రాఫ్టులు | ... | $3\frac{5}{16}$% |
| రోజువారీ బిల్ బ్రోకర్లకు రుణాలు.... | ... | 1 నుంచి 2% వరకు |
| రోజువారీ బిల్ బ్రోకర్లకు రుణాలు వారం రోజుల కొరకు | ... | 3% |
| పక్షం రోజుల కోసం స్టాక్ బ్రోకర్లకు ఇచ్చిన అప్పులపై ఆ రేటు | ... | $4\frac{3}{4}$ నుంచి 5% |
| డిపాజిట్ అలవెన్స్ (బ్యాంకులు) | ... | $3\frac{1}{2}$% |
| డిపాజిట్ అలవెన్స్ (డిస్కౌంట్ హౌసెస్) | .... | 3 నుంచి $3\frac{1}{4}$% వరకు |

లండన్ డబ్బు మార్కెట్‌లో 1889 డిసెంబర్ 9వ తేదీన ఉన్న వడ్డీ రేట్లకు సంబంధించిన ఈ అంకెలలో ఎంత తేడా వుందో గమనించవచ్చు. డిసెంబర్ 10వ తేదీన డైలీ న్యూస్ పత్రికలో వ్యాసం నుంచి సేకరించబడింది. ఇక్కడ కనిష్టం 1 శాతం, గరిష్టం 5 శాతం **(ఎంగెల్స్)**

వీలైన పెట్టుబడికి ఇది ఒక సాధారణ సామాజిక స్వభావాన్ని కల్పిస్తుంది. పైగా దాన్నంతటినీ డబ్బు మార్కెట్‌లోకే నెడుతుంది. మరోవైపున సార్వత్రిక లాభం రేటు అన్నది ఒక ధోరణికి మించి మరేమీ కాదు. ప్రత్యేక లాభం రేట్లను సమం చేసే చలనం అది. పెట్టుబడిదారుల మధ్య పోటీ (స్వయంగా ఈ చలనం సమతుల్యంవైపు ఉంటుంది)లో ఏయే రంగాలలో చాలా కాలంపాటు లాభం రేటు సగటు కంటే తక్కువగా ఉందో ఆ రంగాల నుండి పెట్టుబడిని ఉపసంహరించి లాభం సగటు కంటే ఎక్కువగా ఉన్న రంగాలలో మదుపు పెట్టడం జరుగుతుంది. అదనపు పెట్టుబడి క్రమంగా ఈ రంగాలలో ఆయా లాభం రేట్లను బట్టి పంపిణీ అవుతుంది. ఈ రంగాలకు సంబంధించి పెట్టుబడి సరఫరాలోను, ఉపసంహరించడంలోను నిరంతరాయంగా మార్పులు జరుగుతుంటాయి. ఇవన్నీ ఒకేసారి ఒకే విధమైన ప్రభావాన్ని వడ్డీ రేటు నిర్ణయించడంలో కలిగించవు.

వడ్డీ ఇచ్చే పెట్టుబడి ఒక సరుకుతో పూర్తిగా విభేదించే అభివర్గం అయినప్పటికీ, ఒకలాంటి సరుకుగా మారుతుందని మనం చూశాం. వడ్డీయే దాని ధర అవుతుంది. ఈ ధర సాధారణ సరుకు యొక్క మార్కెట్ ధర లాగానే సరఫరా, గిరాకీని బట్టి అన్నివేళల్లోనూ నిర్ణీతమవుతుంది. వడ్డీ మార్కెట్ రేటు నిరంతరాయంగా ఆటుపోట్లకు గురవుతూనే ఏ నిర్దిష్ట క్షణంలోనైనా ప్రతీ విడి సందర్భంలోను ఒక సరుకు యొక్క మార్కెట్ ధర విషయంలోలాగే స్థిరంగా ఏకరూపంగా నిర్ణీతమవుతుంది. డబ్బు పెట్టుబడిదారులు ఈ సరుకును సరఫరా చేస్తారు. పనిచేసే పెట్టుబడిదారులు దీనిని కొంటారు. ఆ రకంగా వారు దానికి గిరాకీ సృష్టిస్తారు. ఈ సమం చేయడం అనే క్రమం సార్వత్రిక లాభం రేటును సృష్టిస్తున్నప్పుడు ఇది జరగదు. ఒక రంగంలో ఉన్న సరుకుల ధరలు ఉత్పత్తి ధరకంటే ఎక్కువ లేదా తక్కువ కంటే (పారిశ్రామిక చక్రభ్రమణంలో ప్రతీ పరిశ్రమలోను దానితోపాటు వచ్చే ఆటుపోట్లు గురించి మనం ఇక్కడ కావాలనే వదిలేస్తున్నాం.) ఉత్పత్తి పెంచడం ద్వారా లేదా కుదించడం ద్వారా సమతూకం సాధించబడుతుంది. పారిశ్రామిక పెట్టుబడిదారులు మార్కెట్‌లోకి తరలించే సరుకుల మొత్తాన్ని పెంచడం, తగ్గించడం ద్వారా – విడి ఉత్పత్తి రంగాలకు పెట్టుబడిని ఉపసంహరించ బడుతుంది. ఈ రకంగా సరుకుల సగటు మార్కెట్ ధరలను ఉత్పత్తి ధరలతో సమం చేయడం ద్వారా సగటు లేక సార్వత్రిక లాభం రేట్లకూ, ప్రత్యేక లాభం రేట్లకూ మధ్య గల తేడాలు సరిదిద్ద బడతాయి. పారిశ్రామిక పెట్టుబడి లేదా వాణిజ్య పెట్టుబడి అనేది వడ్డీ ఇచ్చే పెట్టుబడి విషయంలోలాగా కొనుగోలుదారుని ఎడల ఎప్పుడూ ఈ క్రమంలో సరుకుల రూపం ధరించదు. ఈ క్రమాన్ని గ్రహించ గలిగితే అది ప్రత్యక్షంగా సగటు లాభాన్ని నిర్ణయించడం కాక మార్కెట్ ధరలను ఉత్పత్తి ధరలకు సమం చేయటం అన్నది ఆటుపోట్లలో మాత్రమే చేస్తుందని అర్థం అవుతుంది. సార్వత్రిక లాభం రేటు నిజానికి 1. మొత్తం పెట్టుబడిచేత ఉత్పత్తి చేయబడే అదనపు విలువచేతనూ 2. మొత్తం పెట్టుబడి విలువకు ఈ అదనపు విలువ యొక్క నిష్పత్తిచేతనూ 3. పోటీచేతనూ నిర్ణయించబడుతుంది. అయితే ఈ పోటీ అన్నది వివిధ ఉత్పత్తి రంగాలలో పెట్టబడిన పెట్టుబడులు – ఈ అదనపు విలువ నుండి వాటి సాపేక్ష పరిమాణాలకు అనుగుణంగా సమానమైన డివిడెండ్లను గ్రహించటానికి జరిగే చలనం. కనుక సార్వత్రిక లాభం రేటు మార్కెట్ వడ్డీ రేటు కంటే చాలా భిన్నమైన, సంక్లిష్టమైన కారణాల నుంచి తలెత్తుతుంది. ఈ మార్కెట్ వడ్డీ రేటును సరఫరా, గిరాకీల మధ్య ఉండే ప్రత్యక్షమైన

తక్షణ నిష్పత్తి నిర్ణయిస్తుంది. కనుక వడ్డీ రేటులాగా స్పష్టమైన, నిర్దిష్టమైన అంశం కాదిది. వివిధ ఉత్పత్తి రంగాలలో విడి లాభం రేట్లు అస్థిరంగా వుంటాయి. అవి కనిపించిన మేరకు వాటి ఏకరూపత గాక వాటి తేడాలే మనకు స్పష్టంగా అర్థమవుతాయి. సార్వత్రిక లాభం రేటు అత్యంత తక్కువ లాభ పరిమితిగా కనిపిస్తుంది. అంతేగాని వాస్తవ లాభం రేటు అనుభవంలో ప్రత్యక్షంగా కనిపించే అంశంగా అనిపించదు.

వడ్డీ రేటుకు – లాభం రేటుకు మధ్య వున్న తేడాను నొక్కిచెప్పడంలో మనం వడ్డీ రేటును స్థిరం చేసే రెండు అంశాలు వదిలేస్తున్నాం. అవి 1. వడ్డీ ఇచ్చే పెట్టుబడి చారిత్రకంగా ముందు నుంచీ ఉంది, దానితోపాటు సాంప్రదాయక సార్వత్రిక వడ్డీ రేటు ఉంది. 2. వడ్డీ రేటు నిర్ణయించడంలో ప్రపంచ మార్కెట్ యొక్క ప్రత్యక్ష ప్రభావం వుంది. ఒక ప్రత్యేక దేశం దాని లాభం రేటు యొక్క ప్రభావంతో పోల్చి చూస్తే దాని ఆర్థిక పరిస్థితులు ఏమైనప్పటికీ ఇది వర్తిస్తుంది.

సగటు లాభం అన్నది ప్రత్యక్షంగా నిరూపించబడిన వాస్తవంలా వుండదు. పరస్పర విరుద్ధమైన ఆటుపోట్లు సమం గావడం ఫలితంగా అది నిర్ణయించబడుతుంది. వడ్డీ రేటు విషయంలో అలా కాదు. అది దాని సాధారణ, కనీసంగా స్థానిక చెల్లుబాటు (Validity) రోజువారీగా నిర్ణీతమవుతుంది. పారిశ్రామిక, వాణిజ్య పెట్టుబడులకు అది ప్రథమ అవసరంగాను, వాటి పనిలో అంచనా వేయటంలో తోడ్పడే అంశంగాను అది పనిచేస్తుంది. ప్రతీ వంద పౌండ్ల డబ్బు మొత్తం యొక్క సాధారణ స్వభావం 2, 3, 4, 5 పౌండ్లు ఇవ్వడంగా వుంటుంది. స్టాక్ ఎక్స్ఛేంజి నివేదికలు వడ్డీ రేటును తెలిపినంత కచ్చితంగా వాతావరణ నివేదికలు బెరామీటరు, థర్మామీటర్ల కొలతలను తెలపలేవు. ఏదో ఒక పెట్టుబడి విషయంలో కాదు – మొత్తం డబ్బు మార్కెట్‌లో వున్న పెట్టుబడి విషయంలో, అనగా సాధారణంగా అప్పివ్వదగిన పెట్టుబడి విషయంలో, కచ్చితంగా తెలియజేస్తాయి.

డబ్బు మార్కెట్‌లో కేవలం రుణదాతలు, రుణగ్రహీతలు మాత్రమే ఒకరినొకరు ఎదుర్కొంటారు. సరుకుకు ఒకే రూపం ఉంటుంది. అది డబ్బు రూపం. ఆయా ఉత్పత్తి, చలామణి రంగాలలో పెట్టబడిన పెట్టుబడి రూపాలన్నీ ఇక్కడ మరుగునబడతాయి. అది ఇక్కడ కేవలం భేదంలేని ఒకేలాంటి ఒక స్వతంత్ర విలువ రూపాన్ని కలిగి వుంటుంది. అది డబ్బు రూపాన్ని కలిగి వుంటుంది. విడిరంగాల పోటీ దానిని ప్రభావితం చేయదు. ఆ విడిరంగాలన్నీ రుణ గ్రహీతలుగా మార్కెట్లోకి వస్తాయి. వాటి నన్నిటినీ పెట్టుబడి ఒకే రూపంలో ఎదుర్కొంటుంది. దానికి ఏ పద్ధతిలో అది మదుపు పెట్టబడుతుంది – అన్నదానితో ఇక్కడ ప్రమేయం లేదు. అది పెట్టుబడి యొక్క సరఫరా, గిరాకీలలో బాగా కనిపిస్తుంది. వివిధ విడి రంగాల మధ్య పారిశ్రామిక పెట్టుబడి, పెట్టుబడి యొక్క చలనంలోను, పోటీలోను ప్రవర్తించినట్లే ఇది కూడా ఒక వర్గం యొక్క ఉమ్మడి పెట్టుబడిగా కనిపిస్తుంది. మరోవైపున డబ్బు మార్కెట్లో ఉన్న డబ్బు పెట్టుబడి అది ఏ ప్రత్యేక ఉపయోగానికి గురవుతుందన్న దానితో ప్రమేయం లేకుండా వివిధ రంగాల మధ్య పెట్టుబడిదారీ వర్గం మధ్య ఒక ఉమ్మడి అంశంగా విభజించబడుతుంది. ప్రతీ విడిరంగంలోను ఉత్పత్తి అవసరాల కనుగుణంగా ఈ విభజన జరుగుతుంది. అంతేకాక భారీ పరిశ్రమ అభివృద్ధితోపాటు డబ్బు పెట్టుబడి మార్కెట్లో కనిపించిన మేరకు అది ఒక విడి పెట్టుబడిదారుని చేత అంటే మార్కెట్లో పెట్టుబడిలో వున్న ఏదో ఒక భాగానికి యజమానిచేత ప్రాతినిధ్యం వహించబడదు.

అది ఒక కేంద్రీకృత, సంఘటిత మొత్తం యొక్క స్వభావాన్ని సంతరించుకుంటుంది. అది వాస్తవ ఉత్పత్తి కంటే భిన్నమైనది. బ్యాంకర్స్ కంట్రోళ్ళకు గురవుతుంది. అనగా సామాజిక పెట్టుబడి ప్రతినిధుల అజమాయిషీకి లోబడి వుంటుంది. దాని గిరాకీ రూపానికి సంబంధించినంత వరకు అప్పు ఇవ్వబడే పెట్టుబడి ఒక వర్గాన్ని మొత్తంగా ఎదుర్కొంటుంది. సరఫరా విషయంలో కూడా అది మొత్తంగానే కనిపిస్తుంది.

లాభం రేటు అస్పష్టంగాను, వడ్డీ రేటు నిర్దిష్టంగాను కనిపించడానికి ఉన్న కారణాలలో ఇవి కొన్ని : వడ్డీ రేటు పరిమాణంలో ఆటుపోట్లు ఉండవచ్చు. అయితే రుణ గ్రహీతను అది ఒక నిర్ణీత రేటుగానే ఎదుర్కొంటుంది. ఎందుకంటే అది మారినప్పటికీ అందరికీ ఒకే తీరున మారుతుంది. డబ్బు విలువలో మార్పులు వచ్చినప్పటికీ సరుకులన్నిటి విషయంలో దాని విలువ ఒకటిగానే ఉండటం మనం చూస్తాం. సరుకుల మార్కెట్ ధరలలో రోజువారీ కనిపించే తేడాలు వాటి ధరలను పేపర్లలో రోజూ ప్రచురించడాన్ని నిరోధించనట్టే ఇది కూడా. వడ్డీ రేటు క్రమబద్ధంగా "డబ్బు యొక్క ధర"గా నివేదించబడుతుంది. అది అంతే. ఎందుచేతంటే పెట్టుబడి స్వయంగా డబ్బు రూపంలో ఒక సరుకుగా ఇక్కడ లభ్యం అవుతుంది గనుక. దాని ధరను నిర్ణయించడమంటే ఇతర సరుకులన్నింటిలో లాగానే దాని మార్కెట్ ధరను నిర్ణయించడమే. కనుక వడ్డీ రేటు ఇక్కడ సార్వత్రిక వడ్డీ రేటుగా కనిపిస్తుంది. ఇంత డబ్బుకు ఫలానా ఇంత డబ్బు అన్నట్టుగా ఒక నిర్దిష్ట మొత్తంగా కనిపిస్తుంది. లాభం రేటు మరోవైపున సరుకుల విషయంలో అదే రంగంలో, అదే ధరతో మారవచ్చు. ఇది ఒకే సరుకును విభిన్న పెట్టుబడులు, విభిన్న పరిస్థితులలో ఉత్పత్తి చేయడంపై ఆధారపడి వుంటుంది. ఎందుకంటే ఒక విడి పెట్టుబడి యొక్క లాభం రేటు సరుకు యొక్క మార్కెట్ ధరపైన ఆధారపడి వుండదు. మార్కెట్ ధరకు ఉత్పత్తి ఖర్చుకు ఉన్న తేడాపై అది ఆధారపడి వుంటుంది. ఈ విభిన్న లాభం రేట్లు మొదట ఒక రంగంలోను తరువాత వివిధ రంగాల మధ్య కేవలం నిరంతరాయమైన ఆటుపోట్ల ద్వారా సమతూకాన్ని సాధించగలవు.

* * *

(తరువాత వివరించడం కోసం ఒక నోట్) పరపతి యొక్క ఒక ప్రత్యేక రూపం ఇది : డబ్బు కొనుగోలు సాధనంగా గాక చెల్లింపు సాధనంగా పని చేసినప్పుడు సరుకు వేరైపోతుంది – అన్నది తెలిసిన విషయమే. అయితే దాని విలువ, తరువాత మాత్రమే గ్రహించబడుతుంది. ఆ సరుకును తిరిగి అమ్మిన తరువాత వరకు చెల్లింపు జరక్కపోతే, ఈ అమ్మకం – కొనుగోలు యొక్క ఫలితంగా కనిపించదు. అమ్మకం ద్వారానే కొనుగోలు వాస్తవ రూపం ధరించినట్లు కనిపిస్తుంది. మరోలా చెప్పాలంటే అమ్మకం అన్నది కొనుగోలు సాధనంగా మారుతుంది. రెండోది : రుణపత్రాలు, మార్పిడి బిల్లులు వగైరాలు రుణదాత చెల్లింపు సాధనాలుగా మారతాయి. మూడోది : రుణాలపై వున్న హక్కు భుక్తాలు డబ్బు స్థానాన్ని స్వీకరిస్తాయి.

★ ★ ★

## అధ్యాయం - 23

# వడ్డీ , పరిశ్రమ లాభం

ఇంతకు ముందు రెండు అధ్యాయాలలో గమనించినట్లుగా వడ్డీ మౌలికంగా కనిపిస్తుంది. అది మౌలికంగా లాభంలో, అంటే అదనపు విలువలో ఒక భాగం మాత్రమే. ఒక పారిశ్రామిక, వాణిజ్య పెట్టుబడిదారు, ఒక పనిచేసే పెట్టుబడిదారు తాను తన పెట్టుబడిగాక అప్పు తెచ్చుకున్న పెట్టుబడిని ఉపయోగించినప్పుడల్లా డబ్బు పెట్టుబడిని ఇచ్చినవానికి అనగా దాని యజమానికి ఆ వడ్డీని చెల్లించాల్సి వుంటుంది. అతడు తన సొంత పెట్టుబడిని ఉపయోగిస్తే లాభాన్ని విభజించడం అనేది జరగదు. మొత్తం అతనికే చెందుతుంది. పునరుత్పత్తి ప్రక్రియలో తమంతట తామే పెట్టుబడి యజమానులు దానిని ఉపయోగిస్తే వడ్డీ రేటు నిర్ణయించడంలో వారు పోటీపడరు. వడ్డీ అనే అభివర్గం (వడ్డీ రేటును నిర్ణయించకుండా అసాధ్యం) పారిశ్రామిక పెట్టుబడి చలనానికి బాహ్యంగా వుంటుంది అనేది దీన్నిబట్టి తెలుస్తుంది.

“వడ్డీ రేటు అన్నదాన్ని ఇలా నిర్వచించవచ్చు. అది రుణదాత గ్రహించడానికి అంగీకరించిన మొత్తం, అలాగే రుణగ్రహీత చెల్లించడానికి ఆమోదించిన మొత్తం వార్షికంగానో లేదా ఏదో ఒక కాలావధికో ఓసారి గావచ్చు. కొంత డబ్బు పెట్టుబడి మొత్తాన్ని ఉపయోగించుకున్నందుకు చెల్లించాల్సిన మొత్తం ఇది... పెట్టుబడి యజమాని క్రియాశీలంగా పునరుత్పత్తిలో దానిని ఉపయోగించినప్పుడు అతడు రుణగ్రహీతలతో ఏ పెట్టుబడిదారుల నిష్పత్తి వడ్డీ రేటును నిర్ణయిస్తుందో ఆ పెట్టుబడిదారుల జాబితాలోకి రాడు.” (టూకే, హిస్టరీ ఆఫ్ ప్రైసెస్, లండన్ 1838, II పుటలు 355, 356) పెట్టుబడిదారులు డబ్బు పెట్టుబడిదారులుగా, పారిశ్రామిక పెట్టుబడిదారులుగా వేరుపడటం వల్లనే లాభంలో ఒక భాగం వడ్డీగా మారుతుంది. అదే వడ్డీ అనే అభివర్గాన్ని సృష్టిస్తుంది. ఈ రెండు రకాల పెట్టుబడిదారుల మధ్య పోటియే వడ్డీ రేటును పుట్టిస్తుంది.

పునరుత్పత్తి ప్రక్రియలో పెట్టుబడి పనిచేసినంత కాలం (అది పారిశ్రామిక పెట్టుబడిదారుకు చెందిందనీ, అతడు దానిని రుణదాతకు అనగా పెట్టుబడిదారుకి తిరిగి చెల్లించనక్కర్లేదని భావించ బడినప్పటికీ) పెట్టుబడిదారుడు ఒక ప్రైవేటు వ్యక్తిగా ఈ పెట్టుబడిని తన స్వాధీనంలో ఉంచుకోడు. దాని లాభాన్ని మాత్రమే ఉంచుకుంటాడు. దానిని మాత్రమే (ఆదాయంగా ఖర్చు చేయవచ్చు) అతని పెట్టుబడి పెట్టుబడిగా పనిచేసినంత కాలం అది పునరుత్పత్తి ప్రక్రియకే చెందుతుంది. ఆ ప్రక్రియతో ముడిపడి వుంటుంది. అతడు దానికి యజమాని అన్నది నిజమే. అయితే ఆ పెట్టుబడి శ్రమను దోపిడీ చేయడానికి ఉపయోగించినంత వరకూ అతడు దానిని మరో విధంగా ఖర్చుపెట్టలేడు. డబ్బు పెట్టుబడిదారుని విషయంలో కూడా అంతే. అతని పెట్టుబడి అప్పు ఇవ్వబడి డబ్బు పెట్టుబడిగా

పనిచేస్తున్నంత వరకు అది అతనికి వడ్డీని అనగా లాభంలో ఒక భాగాన్ని తెచ్చిపెడుతుంది. అంతేకాని అసలును అతడు ఖర్చు చేయలేడు. ఒక సంవత్సరానికో లేదా ఇంకా ఎక్కువ కాలానికో తన పెట్టుబడిని అప్పు ఇచ్చినపుడు ఇది స్పష్టంగా కనిపిస్తుంది. అసలును తిరిగి తీసుకోకుండా నిర్దిష్ట కాలానికోసారి వడ్డీని మాత్రమే గ్రహిస్తాడు. ఒకవేళ అసలు తిరిగి వచ్చినప్పటికీ ఈ సూత్రంతో తేడా వుండదు. తిరిగి వచ్చిన అసలును ఎప్పుడూ మరోచోట అప్పు ఇవ్వాల్సిందే. అది పెట్టుబడిగా వ్యవహరించాల్సినప్పుడల్లా – ఈ సందర్భంలో డబ్బు పెట్టుబడిగా వ్యవహరిస్తున్నప్పుడు – అతడు దానిని అప్పుగా ఇవ్వక తప్పదు. అతడు తన చేతుల్లో ఉంచుకున్న మేరకు అది వడ్డీని వసూలు చేయదు. పెట్టుబడిగా వ్యవహరించదు. అది వడ్డీని పోగుచేసిన మేరకు పెట్టుబడిగా వ్యవహరించిన మేరకు అతని చేతుల్లో కాక బయటే వుంటుంది. కనుకనే నిరంతరాయంగా పెట్టుబడిని బయట అప్పు ఇవ్వడమనేది సాధ్యమయ్యింది. కనుక బాసాంక్వెట్‌కి వ్యతిరేకంగా టూకే చేసిన ఈ క్రింది వ్యాఖ్య పూర్తిగా తప్పు. అతడు బాసాంక్వెట్‌ని ఇలా ఉల్లేఖించాడు. (మెటాలిక్ పేపర్ అండ్ క్రెడిట్ కరెన్సీ, లండన్ 1842, పుట 73) "1% కంటే తక్కువగా వడ్డీ రేటు ఉన్నప్పుడు అప్పు తీసుకున్న పెట్టుబడి సొంత పెట్టుబడితో దాదాపు సమానమవుతుంది." దీనికి టూకే మార్జిన్‌లో ఈ విధంగా నోట్ రాశాడు. ఆ రేటుకు లేదా అంతకంటే తక్కువ రేటుకు అప్పు తీసుకోబడిన పెట్టుబడి దాదాపు సొంత పెట్టుబడితో సమానంగా పరిగణించబడాలి అన్నది ఓ వింత ప్రతిపాదన. ఈ ప్రతిపాదన చేసిన వ్యక్తి చాలా తెలివైనవాడు, కొన్ని అంశాలపైన బాగా విషయ పరిజ్ఞానం ఉన్నవాడు కాకుండా ఉన్నట్లయితే ఈ అంశాన్ని సీరియస్‌గా పట్టించుకోవాల్సిన అవసరం ఉండేది కాదు. ఆయన ఈ ప్రతిపాదన ద్వారా తిరిగి చెల్లించాలన్న షరతును ఈ పరిస్థితిని దాటవేశాడా, దీనికి ఏ ప్రాధాన్యం లేదని భావించాడా?" (టూకే, ఏన్ ఇంక్వైరీ ఇన్ టు ది కరెన్సీ ప్రిన్సిపుల్, రెండవ ముద్రణ, లండన్ 1844, పుట 80) వడ్డీ = 0 అయితే అప్పు తీసుకున్న పెట్టుబడితో వ్యవహరిస్తున్న పారిశ్రామిక పెట్టుబడిదారుడు తన సొంత పెట్టుబడితో వ్యవహరిస్తున్న పెట్టుబడిదారునితో సమానమవుతాడు. వారిద్దరూ ఒకే సగటు లాభాన్ని జేబులో వేసుకుంటారు. అది అప్పు తీసుకోబడినదైనా, సొంతదైనా లాభం సంపాదిస్తేనే పెట్టుబడి పెట్టుబడిగా ఉపకరిస్తుంది. తిరిగి చెల్లించాలన్న షరతు విషయాన్ని ఏమీ మార్చదు. "సున్నాకి" వడ్డీ రేటు ఎంత దగ్గరగా వుంటే ఉదాహరణకు ఒక శాతానికి పడిపోతే అది అప్పు తీసుకున్న పెట్టుబడి యజమాని యొక్క సొంత పెట్టుబడితో ఆ మేరకు దగ్గరైనట్టే డబ్బు పెట్టుబడి డబ్బు పెట్టుబడిగా వుండాల్సిన మేరకు అది ఎప్పుడూ అప్పు ఇవ్వబడుతూనే వుంటుంది. అప్పుడు అమలులో వున్న వడ్డీ రేటుకు ఉదాహరణకు ఒక శాతానికి అదే పారిశ్రామిక, వాణిజ్య పెట్టుబడిదారునికి ఇవ్వబడాల్సి వుంటుంది. వీరు పెట్టుబడిదారులుగా పనిచేసినంత వరకు అప్పు తీసుకున్న పెట్టుబడితో పనిచేసేవానికి సొంత పెట్టుబడితో పనిచేసేవానికి మధ్య వున్న తేడా ఒకటే. మొదటి వ్యక్తి వడ్డీ చెల్లిస్తాడు. రెండో వ్యక్తి చెల్లించడు. రెండో వ్యక్తి మొత్తం లా లాభాన్ని జేబులో వేసుకుంటాడు. మొదటివాడు లా–వ అనగా వడ్డీపోగా మిగిలిన లాభాన్ని తీసుకుంటాడు. వడ్డీ సున్నాకి ఎంత దగ్గరగా వుంటే లా–వ అనేది లా కి అంతే పెట్టుబడిని తిరిగి చెల్లించాలి. మళ్ళీ కొత్తగా అప్పు తీసుకోవాలి. రెండో వ్యక్తి అలాగే దానిని ఉత్పత్తి ప్రక్రియకు మళ్ళీ మళ్ళీ అడ్వాన్స్ చేయాలి. అతని

పెట్టుబడి పనిచేసినంత కాలం ఈ ప్రక్రియతో ప్రమేయం లేకుండా అతడు దానిని స్వేచ్ఛగా వాడుకోలేడు. ఈ రెంటికి మధ్య మిగిలి వున్న ఏకైక భేదం వారిలో ఒకరు తన పెట్టుబడికి యజమాని, రెండవ వాడు కాదు అన్న స్పష్టమైన భేదం మాత్రమే.

ఇప్పుడు తలెత్తే ప్రశ్న ఇది. లాభాన్ని నికర లాభంగాను, వడ్డీగాను పరిమాణాత్మకంగా విభజించటమనేది గుణాత్మక విభజనగా ఎలా మారుతుంది? మరో రకంగా చెప్పాలంటే తన పెట్టుబడి మాత్రమే ఉపయోగించే పెట్టుబడిదారు తన మొత్తం లాభాన్ని వడ్డీగాను, నికర లాభంగాను వేరువేరుగా ఎందుకు లెక్కలు గడతాడు. అంతేగాక అప్పు తెచ్చిన పెట్టుబడి అయినా, సొంత పెట్టుబడి అయినా పెట్టుబడి అంతటినీ నికర లాభాన్ని ఉత్పత్తి చేసే పెట్టుబడి నుంచి వడ్డీనిచ్చే పెట్టుబడి అన్నదాన్ని వేరుచేయడం ఎలా జరుగుతుంది?

లాభం యొక్క ప్రతి యాదృచ్ఛిక పరిమాణాత్మక విభజన ఈ రకంగా గుణాత్మక విభజనగా మారదని అర్థం చేసుకోవచ్చు. ఉదాహరణకు కొంతమంది పారిశ్రామిక పెట్టుబడిదారులు వ్యాపారాన్ని నడపటం కోసం చేతులు కలుపుతారు. తరువాత ఒక చట్టబద్ధమైన ఒప్పందం ప్రకారం లాభాన్ని పంచుకుంటారు. కొంతమంది భాగస్వాములు ఎవరూ లేకుండానే సొంతంగా వ్యాపారం చేసుకుంటారు. వీరు లాభాన్ని రెండు రకాలుగా, అనగా విడి లాభంగానూ, భాగస్వాములు లేని కంపెనీ యొక్క లాభంగానూ విభజించి లెక్కలు రాసుకోరు. ఈ విషయంలో పరిమాణాత్మక విభజన గుణాత్మక విభజనగా మారదు. చట్టబద్ధమైన హక్కుదారులు అనేకమంది ఉన్నప్పుడు మాత్రమే ఇది జరుగుతుంది. అలా కానప్పుడు జరగదు.

ఈ ప్రశ్నకు సమాధానం చెప్పాలంటే వడ్డీ రూపొందటంలో వాస్తవ ప్రారంభ స్థానాన్ని గురించి కొంత వివరంగానే చర్చించాల్సి వుంటుంది. అంటే డబ్బు పెట్టుబడిదారు, పారిశ్రామిక పెట్టుబడిదారు కేవలం చట్టం దృష్టిలో విభిన్న వ్యక్తులు మాత్రమే గాక వారు పునరుత్పత్తి ప్రక్రియలో విభిన్నమైన పాత్రలు పోషిస్తున్న వ్యక్తులుగాను, వారి చేతుల్లో పెట్టుబడి పూర్తిగా భిన్నమైన ద్వంద్వ రూప చలనాన్ని చేస్తున్నట్లుగాను వారు ఒకరినొకరు ఎదుర్కొంటున్నారని మనం భావించాల్సి వుంటుంది. ఒకరు కేవలం అప్పు ఇస్తారు. రెండవవారు దానిని కేవలం ఉత్పాదకంగా ఉపయోగిస్తారు.

అప్పు తెచ్చిన పెట్టుబడితో వ్యవహరించే ఉత్పాదక పెట్టుబడిదారునికి మొత్తం పెట్టుబడి రెండు భాగాలుగా ఉంటుంది. మొదటిది వడ్డీ. దీనిని అప్పిచ్చినవానికి తిరిగి చెల్లించాలి. రెండోది ఈ వడ్డీ పోగా మిగిలినది. లాభంలో అది తన సొంత వాటా. లాభం సార్వత్రిక రేటు నిర్దిష్టంగా వున్నప్పుడు ఈ వాటా వడ్డీ రేటుచేత నిర్ణయించబడుతుంది. వడ్డీ రేటు నిర్దిష్టమైతే సార్వత్రిక లాభం రేటుచేత ఈ వాటా నిర్ణయించబడుతుంది. అంతేకాదు ప్రతి విడి సందర్భంలోను మొత్తం లాభం, ఈ మొత్తం లాభం యొక్క వాస్తవ విలువ సగటు లాభం కంటే ఎంత భిన్నంగా ఉన్నప్పటికీ పనిచేసే పెట్టుబడిదారు నికి లభించాల్సిన భాగం మాత్రం వడ్డీని బట్టి నిర్ణయించబడుతుంది. ఎందుకంటే ఇది సాధారణ వడ్డీ రేటుచేత నిర్ణీతమైంది. (ప్రత్యేకమైన, చట్టబద్ధమైన ఆదేశాలను పరిగణనలోకి తీసుకోకుండానే) ఈ వడ్డీ ముందుగానే, ఉత్పత్తికి ముందుగానే ఉత్పత్తి ప్రక్రియ ప్రారంభమవడానికి ముందే, అనగా దాని ఫలితమైన మొత్తం లాభం అనే దానిని సాధించడానికి ముందే అది నిర్ణయింపబడుతుంది.

పెట్టుబడి యొక్క వాస్తవ ప్రత్యేక ఉత్పాదితం అదనపు విలువ లేదా మరింత ఖచ్చితంగా చెప్పాలంటే లాభం అని మనం గ్రహించాం. అప్పు తెచ్చిన పెట్టుబడితో పనిచేసే పెట్టుబడిదారు పొందేది లాభం కాదు. వడ్డీ పోగా మిగిలిన లాభం మాత్రమే. కనుక ఇలా లాభంలో మిగిలిన భాగం పెట్టుబడి పనిలో ఉన్నంత కాలం అది ఉత్పత్తి చేసిన అంశంలా అది అతనికి కనిపిస్తుంది. పనిచేసే పెట్టుబడిగా మాత్రమే పెట్టుబడికి అతను ప్రాతినిధ్యం వహిస్తాడు. కనుక తనకు సంబంధించినంత వరకు అతను అలా భావిస్తాడు. అది పని చేసినంతకాలమూ దానికి అతడు వ్యక్తిరూపం. పరిశ్రమలోనూ వ్యాపారం లోనూ అది లాభదాయకంగా మదుపు పెట్టబడినంత కాలమూ, అలాగే దానికి సంబంధించిన పారిశ్రామిక శాఖ అవసరాల మేరకు అది తన యజమానిచేత పనిచేయించినంత మేరకు అతడు దానికి వ్యక్తి రూపంగా ఉంటాడు. అతడు రుణదాతకు మొత్తం లాభం నుంచి చెల్లించాల్సిన వడ్డీ కంటే భిన్నంగా లాభంలో మిగిలిన భాగం పారిశ్రామిక లాభంగా లేక వాణిజ్య లాభంగా మారుతుంది. ఈ రెంటినీ సూచించే జర్మన్ పదం Unternehmergewinn (profit of enterprise) మొత్తం లాభం సగటు లాభానికి సమానమైతే పరిశ్రమ లాభం యొక్క పరిమాణం వడ్డీ రేటుచేత మాత్రమే నిర్ణయించ బడుతుంది. సగటు లాభానికి మొత్తం లాభానికీ మధ్య వ్యత్యాసం వున్నట్లయితే సగటు లాభం నుంచి దాని భేదం, (ఆ రెంటినుంచీ వడ్డీ తీసేసాక) ఈ తాత్కాలిక భేదానికి కారణమైన పరిస్థితులన్నిటి చేతా నిర్ణయించబడుతుంది. ఆ కారణాలు ఒక ప్రత్యేక రంగంలో లాభం రేటు నుంచి సార్వత్రిక లాభం రేటు వరకు, ఒక విడి పెట్టుబడిదారునికి ఒక రంగంలో వచ్చిన లాభం మొదలుకొని ఆ రంగంలో వున్న సగటు లాభం వరకూ ఏమైనా కావచ్చు. అయితే ఉత్పత్తి ప్రక్రియలో లాభం రేటు అదనపు విలువ మాత్రమే గాక ఇంకా అనేక ఇతర పరిస్థితులపైన కూడా ఆధారపడి వుంటుంది. ఉత్పత్తి సాధనాల కొనుగోలు ధరలు, సగటు పద్ధతుల కంటే మరింత ఉత్పాదకమైన పద్ధతులు, స్థిర పెట్టుబడిపైన పొదుపు వగైరాలు ఈ పరిస్థితులలో కొన్ని. ఉత్పత్తి ధర మాత్రమే కాక అది ప్రత్యేక పరిస్థితులపైన కూడా ఆధారపడి వుంటుంది. ప్రతీ వాణిజ్య లావాదేవీలోనూ పారిశ్రామిక పెట్టుబడిదా రుని తెలివితేటలపైన, అతడు ఉత్పత్తి ధరపైన ఎంత ఎక్కువ లేదా తక్కువకు కొన్నాడు లేదా అమ్మాడు అన్నదానిపైన, చలామణి ప్రక్రియలోని మొత్తం అదనపు విలువలో ఎంత భాగం స్వాధీనం చేసుకున్నాడు అన్నదానిపైన కూడా అది ఆధారపడి వుంటుంది. ఏరకంగా అయినప్పటికీ మొత్తం లాభం యొక్క పరిమాణాత్మక విభజన గుణాత్మక విభజనగా మారుతుంది. పరిమాణాత్మక విభజన అన్నది ఏది విభజించబడాలి? క్రియాశీల పెట్టుబడిదారుడు తన పెట్టుబడితో ఏ పద్ధతిలో పనిచేస్తాడు? పనిచేసే పెట్టుబడిగా అది అతనికి ఒక క్రియాశీల పెట్టుబడిదారునిగా అతని కార్యకలాపాలకుగాను ఎంత మొత్తం లాభాన్ని ఇస్తుంది? అన్న అంశాలపైన ఈ విభజన ఆధారపడి వుంటుంది. పనిచేసే పెట్టుబడిదారు ఇక్కడ పెట్టుబడి యొక్క యజమాని కాదు అని భావించబడతాడు. అతనికి సంబంధించి ఇక్కడ పెట్టుబడి యాజమాన్యం అన్నది డబ్బు పెట్టుబడిదారుడు, అనగా రుణదాత నిర్వహిస్తాడు. రుణదాతకు అతను చెల్లించే వడ్డీ రుణదాత పెట్టుబడికి యజమాని కావడం వల్ల లభించిన మొత్తం లాభంలో భాగంగా కనిపిస్తుంది. ఇందుకు భిన్నంగా క్రియాశీల పెట్టుబడిదారునికి లభించిన లాభం యొక్క భాగం పరిశ్రమ లాభంగా కనిపిస్తుంది. పునరుత్పత్తి ప్రక్రియలో పెట్టుబడితో వ్యవహరించి

నందుకుగాను, ఆ కార్యకలాపాలకుగాను ప్రత్యేకంగా పరిశ్రమలో లేదా వాణిజ్యంలో అతడు నిర్వహించిన కార్యకలాపాలకుగాను ఈ భాగం అతనికి లభించినట్లుగా కనిపిస్తుంది. అతనికి సంబంధించినంత వరకూ వడ్డీ అన్నది కేవలం పెట్టుబడి యాజమాన్యం వహించటం వల్ల లభించే అంశంగా కనిపిస్తుంది. పునరుత్పత్తి ప్రక్రియకు దూరంగా ఉన్నట్టి, క్రియారహితమైనట్టి, ఏ విధంగానూ పనిచేయని పెట్టుబడికి వడ్డీగా దాని యజమానికి చెందుతుందని అనిపిస్తుంది. కాగా పరిశ్రమ లాభం అన్నది పెట్టుబడితో అతడు అతని కార్యకలాపాల ఫలితంగా అది పెట్టుబడి యొక్క చలనం పతనం యొక్క ఫలితంగా తన సొంత కార్యకలాపంలాగే కనిపించే పనితనం ఫలితంగా, ఉత్పత్తి ప్రక్రియలో పాల్గొనని డబ్బు పెట్టుబడిదారుని క్రియారాహిత్యంలాగా కాకుండా తన పనితనానికిగాను లభించిన ఫలితంగా అతనికి కనిపిస్తుంది. మొత్తం లాభం ఇలా రెండు భాగాలుగా గుణాత్మక విభజనకు గురవుతుంది. వడ్డీ ఉత్పత్తి ప్రక్రియతో సంబంధం లేని యాజమాన్యానికిగాను పెట్టుబడికి లభించిన ఫలితంగా కనిపిస్తుంది. కాగా పరిశ్రమ లాభం అన్నది పనిచేసే పెట్టుబడి యొక్క, ఉత్పత్తి ప్రక్రియలో పనిచేసే పెట్టుబడి యొక్క ఫలితంగా కనిపిస్తుంది. కనుక పునరుత్పత్తి ప్రక్రియలో పెట్టుబడిని ఉపయోగించే వ్యక్తి నిర్వహించిన క్రియాశీల పాత్రకుగాను లభించిన ఫలితంగా కనిపిస్తుంది. ఈ గుణాత్మక విభజన ఒకవైపు డబ్బు పెట్టుబడిదారుని, మరోవైపు పారిశ్రామిక పెట్టుబడిదారుని స్వీయాత్మక భావన మాత్రమే కాదు. అది ఒక భౌతిక వాస్తవంపైన ఆధారపడి వుంది. డబ్బు పెట్టుబడిదారుడు కేవలం పెట్టుబడి యజమాని మాత్రమే. ఉత్పత్తి ప్రక్రియకు ముందు దానికి ఆవల మాత్రమే అతడు పెట్టుబడికి యాజమాన్యం వహిస్తాడు. వడ్డీ ఈ డబ్బు పెట్టుబడిదారునికి తిరిగి వస్తోంది. కాగా పెట్టుబడికి యజమానిగా కాకుండా పనిచేసే పెట్టుబడిదారుకు మాత్రమే పరిశ్రమ లాభం లభిస్తుంది.

పెట్టుబడి ఉత్పత్తి చేసిన లాభం మీద అదే పెట్టుబడి మీద భిన్నమైన చట్టబద్ధమైన హక్కులు కలిగిన ఇద్దరు వ్యక్తుల మధ్య మొత్తం లాభం యొక్క పరిమాణాత్మక విభజన ఆ రకంగా అప్పు తెచ్చుకున్న పెట్టుబడితో వ్యవహరిస్తున్న మేరకు పారిశ్రామిక పెట్టుబడిదారునికి తన సొంత పెట్టుబడిని తాను ఉపయోగించనంత మేరకు డబ్బు పెట్టుబడిదారునికి మధ్య గుణాత్మక విభజనగా మారుతుంది. లాభంలో ఒక భాగం ఇప్పుడు ఒక రూపంలో ఉన్న పెట్టుబడికి చెందాల్సిన వడ్డీగా కనిపిస్తుంది. మరో భాగం దానికి వ్యతిరేక రూపంలో వున్న పెట్టుబడి యొక్క ప్రత్యేక ఫలితంగా అనగా పరిశ్రమ లాభంగా కనిపిస్తుంది. ఇందులో ఒకటి పెట్టుబడితో వ్యవహరించటంవల్ల మాత్రమే వచ్చిన ఫలితంగా, పనిచేసే పెట్టుబడి ఫలితంగా లేదా క్రియాశీల పెట్టుబడిదారుడు నిర్వహించిన కార్యకలాపాల కారణంగా వచ్చినట్లు కనిపిస్తుంది. మొత్తం లాభంలో రెండు భాగాలు ఇలా వేరయి ఒకదానికి ఒకటి దూరంగా విడివిడిగా విభిన్న మూలాల నుంచి పుట్టినట్టుగా తయారుకావడం అన్నది, ఇప్పుడు మొత్తం పెట్టుబడిదారీ వర్గ విషయంలోనూ, మొత్తం పెట్టుబడి విషయంలోనూ ఒక స్థిరమైన రూపం తీసుకుంటుంది. క్రియాశీల పెట్టుబడిదారు ఉపయోగించిన పెట్టుబడి అప్పు తెచ్చినదా లేదా అన్న దానితో ప్రమేయం లేదు. డబ్బు పెట్టుబడిదారు తన పెట్టుబడిని అతడే ఉపయోగించాడా లేదా అన్నదానితో ప్రమేయం లేదు. ప్రతి పెట్టుబడి యొక్క లాభమూ, పెట్టుబడులూ సమానం కావటంవల్ల వచ్చే సగటు లాభం రెండు గుణాత్మకంగా భిన్నమైన పరస్పర ఆధారితమైన వేరైన విడి భాగాలుగా

చీలుతుంది లేదా విభజించబడుతుంది. (అంటే వడ్డీగాను, పరిశ్రమ యొక్క లాభంగాను విభజింప బడుతుంది. ఈ రెండు ప్రత్యేక నియమాలచేత నిర్ణయించబడతాయి.) తన సొంత పెట్టుబడితో వ్యవహరించే పెట్టుబడిదారు అప్పు తెచ్చుకున్న పెట్టుబడిదారునిలాగానే మొత్తం లాభాన్ని యజమానిగా తనకు తానే రుణదాతగా తనకు రావాల్సిన వడ్డీగాను, ఒక క్రియాశీల పెట్టుబడిదారునిగా తనకు రావాల్సిన పరిశ్రమ లాభంగాను విభజిస్తాడు. కనుక ఒక గుణాత్మకమైన విభజనగా చూసినప్పుడు పెట్టుబడిదారుడు మరొకనితో భాగం పంచుకుంటాడా లేదా అన్నది ఇక్కడ అసంగతం. పెట్టుబడిని ఉపయోగించే వ్యక్తి తన సొంత పెట్టుబడితో పనిచేస్తున్నప్పుడు సైతం ఇద్దరు వ్యక్తులుగా విభజిత మవుతాడు. పెట్టుబడి యజమాని, పెట్టుబడిని ఉపయోగించేవాడు. లాభం యొక్క అభివర్గాలకు సంబంధించిన మేరకు అతని పెట్టుబడి కూడా పెట్టుబడి ఆస్తిగా, అనగా ఉత్పత్తి ప్రక్రియకు ఆవల వున్న పెట్టుబడిగాను, స్వయంగా వడ్డీ ఇచ్చే అంశంగాను, ఉత్పత్తి ప్రక్రియలో ఉంటూ తన కార్యకలాపాల ద్వారా పరిశ్రమ లాభాన్నిచ్చే పెట్టుబడిగాను విభజింపబడుతుంది.

వడ్డీ అన్నది ఒకరకంగా సువ్యవస్థితమైంది. అది ఉత్పత్తితో సంబంధం లేని మొత్తం లాభంలో ఒక భాగంగా వుండదు. పారిశ్రామిక పెట్టుబడిదారు ఇతరుల పెట్టుబడితో వ్యవహరించిన సందర్భాలలో ఇలా ఉత్పత్తితో సంబంధం లేకపోవడం అన్నది జరుగుతుంది. అతని లాభం అన్నది అతడు తన సొంత పెట్టుబడితో వ్యవహరించినపుడు కూడా అతడి లాభం వడ్డీగానూ, పరిశ్రమ లాభంగానూ విభజితమవుతుంది. ఆ రకంగా కేవలం ఒక పరిమాణాత్మక విభజన ఒక గుణాత్మక విభజనగా మారుతుంది. పారిశ్రామిక పెట్టుబడిదారు తన సొంత పెట్టుబడికి యజమాని అయినా, కాకపోయినా ఇది జరుగుతుంది. లాభం విభిన్న వ్యక్తులకు విభిన్న మొత్తాలలో లభించడం మాత్రమే కాదు. లాభం యొక్క రెండు విభిన్నమైన తరగతులు (categories) విభిన్నంగా పెట్టుబడితో సంబంధం కలిగి వున్న అంశాలు గనుక పెట్టుబడి యొక్క విభిన్నమైన అంశాలకు సంబంధించిన వ్యవహారమిది.

ఇప్పుడు మొత్తం లాభం వడ్డీగాను, పరిశ్రమ లాభంగాను విభజితమవడం అన్నది ఒక గుణాత్మక విభజనగా మారింది. మొత్తం పెట్టుబడి విషయంలోనూ, మొత్తం పెట్టుబడిదారీ వర్గం విషయంలోనూ గుణాత్మక విభజన స్వభావాన్ని అది ఎందుకు సంతరించుకుందో కారణాలను కనుక్కోవడం సులభమే.

మొదటిది – ఇది రోజువారీ అనుభవం నుంచీ, పరిస్థితుల నుంచీ తలెత్తుతుంది. పారిశ్రామిక పెట్టుబడిదారులలో అత్యధికులు విభిన్న నిష్పత్తులలో తమ సొంత పెట్టుబడితోనూ, అప్పు తెచ్చిన పెట్టుబడితోనూ వ్యవహరిస్తుంటారు. కనుక వేరు వేరు సందర్భాలలో సొంత పెట్టుబడికి, అప్పు తెచ్చిన పెట్టుబడికి మధ్య వున్న నిష్పత్తి మారుతుంటుంది.

రెండోది – మొత్తం లాభంలో ఒక భాగం వడ్డీ రూపం తీసుకోవడం వల్ల మరోభాగం పరిశ్రమ లాభంగా మారుతుంది. పరిశ్రమ లాభం అన్నది నిజానికి మొత్తం లాభంలో వడ్డీ పోగా మిగిలిన అంశం. ఒక స్వతంత్ర అభివర్గంగా అస్తిత్వంలోకి రాగానే వడ్డీకి వ్యతిరేక రూపాన్ని సంతరించు కుంటుంది. మొత్తం లాభం అన్నది వడ్డీగాను పరిశ్రమ లాభంగాను ఎలా వేరు అవుతుంది అన్న విశ్లేషణ మొత్తం లాభంలో ఒక భాగం సర్వత్రా వేరుపడి విడి వడ్డీగా ఎలా మారుతుందన్న పరిశీలనగా

పరిణమిస్తుంది. అయినప్పటికీ చారిత్రకంగా వడ్డీ ఇచ్చే పెట్టుబడి సంపూర్ణ సాంప్రదాయక రూపంలో పెట్టుబడి ఉత్పత్తి చేసిన అదనపు విలువ యొక్క సంపూర్ణ ఉపవిభాగం రూపంలో పెట్టుబడిదారీ ఉత్పత్తి విధం, పెట్టుబడి, లాభం అన్న భావనలు తలెత్తడానికి చాలా ముందే అస్తిత్వంలో ఉంది. ఆ రకంగా మామూలు అవగాహనకు డబ్బు పెట్టుబడి లేదా వడ్డీ ఇచ్చే పెట్టుబడి అన్నది ఒక పెట్టుబడి మాత్రమే. అది ఒక సర్వోత్కృష్టమైన పెట్టుబడి. ఆ రకంగా అది మరోవైపున మాసీ అనే ఆయన స్పష్టం చేయటానికి ముందు వరకు వడ్డీగా చెల్లించబడే డబ్బు మాత్రమే అని అభిప్రాయం ఉండేది. అప్పిచ్చిన పెట్టుబడి వాస్తవంగా పెట్టుబడిగా ఉపయోగించినా, ఉపయోగించకపోయినా (కేవలం వినియోగం కోసం మాత్రమే అప్పు తీసుకొన్నప్పటికీ) వడ్డీ ఇస్తూ ఉండటం అన్న వాస్తవం పెట్టుబడి యొక్క ఈ రూపం స్వతంత్రంగా అస్తిత్వంలో ఉంటుందన్న భావనకు బలాన్నిస్తుంది. పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం తొలిదశలో లాభంతో ప్రమేయంలేని వడ్డీ యొక్క స్వతంత్ర అస్తిత్వం లాభం విషయంలో వడ్డీకి, పారిశ్రామిక పెట్టుబడి విషయంలో వడ్డీ ఇచ్చే పెట్టుబడికి ఉన్న స్వాతంత్ర్యానికి నిదర్శనాన్ని మాసీ, అతని తర్వాత హ్యూమ్ 18వ శతాబ్దం మధ్యలో కనుగొన్నారు. అదేమంటే వడ్డీ అన్నది మొత్తం లాభంలో ఒక భాగం మాత్రమే అన్న వారి ఆవిష్కరణ అవసరమైందంటే అర్థం వడ్డీకి, వడ్డీ ఇచ్చే పెట్టుబడికి సంబంధించి ప్రజల మనస్సులో తొలిదశలో ఉండిన స్వతంత్ర అస్తిత్వం అర్థం అవుతుంది.

మూడోది – పారిశ్రామిక పెట్టుబడిదారు తన సొంత పెట్టుబడితో వ్యవహరిస్తున్నాడా లేక అప్పు తెచ్చిన పెట్టుబడితో వ్యవహరిస్తున్నాడా అన్న విషయం డబ్బు పెట్టుబడిదారుల వర్గం ఒక ప్రత్యేక తరహా పెట్టుబడిదారులుగాను, డబ్బు పెట్టుబడి ఒక స్వతంత్ర పెట్టుబడిగాను, అలాగే వడ్డీ అన్నది ఈ ప్రత్యేక పెట్టుబడికి సంబంధించిన అదనపు విలువ యొక్క స్వతంత్ర రూపంగాను, తనను ఎదుర్కొంటున్నారు అన్న వాస్తవాన్ని ఏరకంగాను మార్చలేదు.

గుణాత్మకంగా చెప్పాలంటే వడ్డీ అన్నది పెట్టుబడిపై కేవల యాజమాన్యం ఇచ్చిన అదనపు విలువ. పెట్టుబడి యొక్క యజమాని పునరుత్పత్తి ప్రక్రియకు బాహ్యంగా వున్నప్పటికీ అది పెట్టుబడి చేత ఇవ్వబడుతుంది. కనుక అది దాని ప్రక్రియకు బాహ్యంగా పెట్టుబడి అందజేసిన అదనపు విలువ అన్నమాట.

పరిమాణాత్మకంగా చెప్పాలంటే వడ్డీగా ఏర్పడే లాభం యొక్క భాగం పారిశ్రామిక పెట్టుబడిగా లేదా వాణిజ్య పెట్టుబడిగా కాక డబ్బు పెట్టుబడికి జోడించబడుతుంది. ఈ అదనపు విలువ భాగం యొక్క రేటు అనగా వడ్డీ రేటు ఈ సంబంధాన్ని నిరూపిస్తుంది. ఎందుకంటే ప్రధమంగా వడ్డీ రేటు సార్వత్రిక లాభం రేటుపై ఆధారపడి వున్నప్పటికీ అది స్వతంత్రంగా నిర్ణయించబడుతుంది. రెండోది సరుకుల మార్కెట్ ధరలాగే అస్థిరమైన లాభం రేటుకు విరుద్ధంగా దాని వైవిధ్యాలన్నిటితో పోలిస్తే అది ఒక నిశ్చిత, ఏకరూప, స్థిరమైన, నిర్ణీత అంశంగా కనిపిస్తుంది. మొత్తం పెట్టుబడి అంతా పారిశ్రామిక పెట్టుబడిదారుని చేతుల్లోనే వుంటే వడ్డీ అనేది, వడ్డీ రేటు అనేదీ ఉండవు. మొత్తం లాభం యొక్క పరిమాణాత్మక విభజన సంతరించుకున్న స్వతంత్ర రూపం గుణాత్మక విభజనను సృష్టిస్తుంది. పారిశ్రామిక పెట్టుబడిదారుడు డబ్బు పెట్టుబడితో పోల్చుకోవాలంటే అతనికి సగటు

వడ్డీ పోగా లాభంలో మిగిలిన మొత్తం అనగా పరిశ్రమ లాభం (సగటు వడ్డీ అన్నది వడ్డీ రేటునుబట్టి చిరకాల అనుభవంలో ఇవ్వబడినట్లు కనిపిస్తుంది.) మాత్రమే ఇతర వ్యక్తి నుంచి అతడ్ని వేరుచేస్తుంది. మరోవైపున అతడు అప్పు తెచ్చిన పెట్టుబడితో కాక తన సొంత పెట్టుబడితో వ్యవహరిస్తున్న పారిశ్రామిక పెట్టుబడిదారునితో తనను తాను పోల్చుకుంటే ఆ పారిశ్రామిక పెట్టుబడిదారు వడ్డీని ఇతరులకు చెల్లించకుండా తన జేబులోనే వేసుకునే డబ్బు పెట్టుబడిదారునిగా తనకంటే వేరుగా కనిపిస్తాడు. వడ్డీ గాక మొత్తం లాభంలో భాగం రెండు సందర్భాలలోను అతనికి పరిశ్రమ లాభంగా కనిపిస్తుంది. వడ్డీ యథాతథంగా పెట్టుబడిచేత ఇవ్వబడే అదనపు విలువగా కనిపిస్తుంది. పెట్టుబడి ఉత్పాదకంగా ఉపయోగించనప్పుడు కూడా అది వడ్డీని ఇస్తుంది.

ఆచరణాత్మక అర్థంలో విడి పెట్టుబడిదారుని దృష్ట్యా అది సరైనదే. అతడు తన పెట్టుబడిని వడ్డీకి పెట్టుబడిగా అప్పు ఇవ్వడం ద్వారా ఉపయోగించడానికి లేదా ఉత్పాదక పెట్టుబడిగా ఉపయోగించటం ద్వారా దాని విలువను పెంచడానికి అతనికి అవకాశం వుంది. అతని పెట్టుబడి మొదటి నుంచీ డబ్బు పెట్టుబడి రూపంలో వుందా? లేక డబ్బు పెట్టుబడిగా ఇంకా మార్చబడాల్సి వుందా? అన్నదానితో ప్రమేయం లేదు. అయితే కొంతమంది భ్రష్ట (Vulgar) ఆర్థికవేత్తలు వాదిస్తున్నట్లు మొత్తం సామాజిక పెట్టుబడికి వర్తింపచేయడం అన్నది దాని లాభానికి మూలకారణం అన్నట్లుగా నిర్వచించడం వరకూ పోవడమన్నది అసంబద్ధం. పెట్టుబడిని కొన్ని ఉత్పత్తి సాధనాలలో ఉపయోగించే వారు లేకుండా మొత్తం పెట్టుబడిని డబ్బు పెట్టుబడిగా మార్చాలన్న భావం పరమ అర్థరహితమైనది. ఎటువంటి ఉత్పాదక విధిని నిర్వహించకుండా వడ్డీ అన్నది కేవలం ఒక భాగంగా మాత్రమే వుండే అదనపు విలువను సృష్టించకుండా పెట్టుబడిదారీ ఉత్పత్తి ప్రాతిపదికపైన పెట్టుబడి వడ్డీని ఇస్తుందని ఊహించడం మరింత అసంబద్ధం. అనగా పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం పెట్టుబడిదారీ ఉత్పత్తిక్రమం లేకుండానే నడుస్తుంది అన్నంత అసంబద్ధం. ఊహించనంతమంది పెట్టుబడిదారులు తమ పెట్టుబడిని డబ్బుగా మార్చితే ఫలితం ఏమంటే డబ్బు పెట్టుబడి భయంకరంగా విలువను కోల్పోతుంది. వడ్డీ రేటు భయంకరంగా పడిపోతుంది. ఒక్కసారిగా చాలామందికి తమ వడ్డీమీద బతకడం అసాధ్యం అవుతుంది. కనుక మరోసారి పారిశ్రామిక పెట్టుబడిదారులుగా మారటం తప్పనిసరి అవుతుంది. అయితే ఇక్కడ ఈ అంశం ఒక విడి పెట్టుబడిదారుని దృష్ట్యా ఇది వాస్తవమే అన్న సంగతిని మరోసారి చెప్పాల్సి వుంది. ఈ కారణంచేతనే తన సొంత పెట్టుబడితో వ్యవహరిస్తున్నప్పుడు కూడా సగటు లాభంలో సగటు వడ్డీతో సమానమైన భాగాన్ని అతని పెట్టుబడికి యథాతథంగా అంటే ఉత్పత్తి ప్రక్రియతో సంబంధం లేకుండానే లభించిన ఫలితంగా అతడు భావిస్తాడు. దీనిని వడ్డీగా వేరుచేసిన తర్వాత మొత్తం లాభంలో మిగిలిన అదనపు మొత్తాన్ని అతడు కేవలం పరిశ్రమ లాభంగా భావిస్తాడు.

నాలుగోది (రాత ప్రతిలో ఖాళీ వుంది)

కనుక అప్పు తీసుకున్న పెట్టుబడి యజమానికి పనిచేసే పెట్టుబడిదారు లాభంలో చెల్లించాల్సిన భాగం లాభం యొక్క ఒక భాగానికి స్వతంత్ర రూపంగా మార్చబడింది అన్న అంశాన్ని మనం గమనించాం. అది అప్పు తీసుకున్నదైనా, కాకున్నా మొత్తం పెట్టుబడి అంతా వడ్డీ పేరుతో ఇస్తున్నట్టు కనిపిస్తుందని మనం చూశాం. ఈ వాటా ఎంత భారీగా వుంటుంది అన్నది సగటు వడ్డీ రేటుపైన

ఆధారపడి వుంటుంది. పనిచేసే పెట్టుబడిదారు తనతో పెట్టుబడి యజమాని పోటీపడనప్పుడు (కనీసం క్రియాశీలంగా పోటీపడనప్పుడు) వడ్డీ రేటును నిర్ణయించడం ద్వారా దాని పుట్టుక వ్యక్తమవుతుంది. దానిపైన విభిన్న, చట్టబద్ధమైన హక్కులు కలిగిన ఇద్దరు వ్యక్తుల మధ్య లాభం కేవలం పరిమాణాత్మకంగా విభజించబడటం అన్నది ఒక గుణాత్మక విభజనగా మారింది. అది పెట్టుబడి, లాభం యొక్క స్వభావంలో నుంచే పుట్టినట్లు కనిపిస్తుంది. లాభం యొక్క ఒక భాగం వడ్డీ రూపాన్ని సార్వత్రికంగా సంతరించుకోగానే సగటు లాభం, వడ్డీల మధ్య ఉన్న తేడా వడ్డీకి విరుద్ధమైన రూపాన్ని అనగా పరిశ్రమ లాభం అన్న రూపాన్ని సంతరించుకుంటుంది. వడ్డీ, పరిశ్రమ లాభం అన్న ఈ రెండు రూపాలు విరుద్ధాంశాలుగానే అస్తిత్వంలో వుంటాయి. కనుక అదనపు విలువతో వాటికి సంబంధం లేదు. నిజానికి విభిన్న అభివర్గాలుగా అవి విభిన్న నామధేయాలతో ఉన్న అదనపు విలువ యొక్క భాగాలే అయినప్పటికీ అవి పరస్పర విరుద్ధంగా కనిపిస్తాయి. ఎందుకంటే లాభంలో ఒక భాగం వడ్డీగాను, మరోభాగం పరిశ్రమ లాభంగాను మారతాయి.

లాభం అంటున్నప్పుడు ఇక్కడ మన ఉద్దేశం ఎప్పుడూ సగటు లాభం మాత్రమే. ఎందుకంటే ఈ విశ్లేషణలో అవి విడి లాభాలైనా లేదా విభిన్న రంగాలలో లాభాలైనా వాటి వైవిధ్యంతో మనకు సంబంధం ఉండదు. పోటీ పోరాటం వల్ల, ఇతర పరిస్థితుల వల్ల ఏర్పడే వైవిధ్యాలు సగటు లాభాన్ని లేదా అదనపు విలువను ప్రభావితం చేస్తాయి. ఇది సాధారణంగా ఈ మొత్తం పరిశీలనకు వర్తిస్తుంది.

రాంసే చెప్పినట్లు వడ్డీ అన్నది పెట్టుబడి యాజమాన్యం వల్ల వచ్చే నికర లాభం. ఈ నికర లాభం పునరుత్పత్తి ప్రక్రియకు బాహ్యంగా ఉన్న రుణదాతకు చెందవచ్చు. లేదా తన పెట్టుబడిని ఉత్పాదకంగా ఉపయోగించే యజమానికీ చెందవచ్చు. ఇక్కడ అతనికి ఒక ఉత్పాదక పెట్టుబడిదారునిగా కాక ఒక డబ్బు పెట్టుబడిదారునిగా తన సొంత పెట్టుబడిని ఒక వడ్డీ ఇచ్చే పెట్టుబడిగా ఒక పనిచేసే పెట్టుబడిదారునికిచ్చినట్లు తనకే ఇవ్వటం వల్ల ఈ నికర లాభాన్ని అతడి పెట్టుబడి అతడికి అందజేస్తుంది. డబ్బు, మొత్తం మీద విలువ అనేవి పెట్టుబడిగా మారటం అన్నది పెట్టుబడిదారీ ఉత్పత్తి యొక్క నిరంతరాయమైన ఫలితమైనట్టే పెట్టుబడిగా దాని అస్తిత్వం కూడా దాని నిరంతరాయమైన ముందు షరతు అవుతుంది. ఉత్పత్తి సాధనాలుగా మార్చబడగల దాని శక్తి వల్ల అది వేతనం లభించని శ్రమను ఆదేశించగలుగుతుంది. ఆ రకంగా ఉత్పత్తి ప్రక్రియను, సరుకుల చలామణిని దాని యజమానికి అదనపు విలువ ఉత్పత్తిగా మార్చగలుగుతుంది. కనుక వడ్డీ అన్నది దరహం మీద విలువ (దాని సాధారణ సామాజిక రూపంలో వాస్తవ రూపం ధరించిన శ్రమ) వాస్తవ ఉత్పత్తి ప్రక్రియల్లో ఉత్పత్తి సాధనాల రూపాన్ని సంతరించుకునే విలువ. సజీవ శ్రమ శక్తిని ఒక స్వతంత్ర శక్తిగా ఎదుర్కొంటుంది. అది వేతనం చెల్లించబడని శ్రమను స్వాహా చేయటానికి ఉపయోగించే ఒక సాధనం. అది కార్మికుణ్ణి మరొకని ఆస్తిగా ఎదుర్కొంటుంది. కనుక అది ఒక శక్తిగా కనిపిస్తుంది. అయితే మరోవైపున వేతన శ్రమతో ఉన్న ఈ వైరుధ్యం వడ్డీ రూపంలో రద్దయిపోతుంది. ఎందుకంటే వడ్డీ ఇచ్చే పెట్టుబడిదారునికది వేతన శ్రమను గాక ఉత్పాదక పెట్టుబడిని తన విరుద్ధాంశంగా కలిగి వుంటుంది. ఉత్పత్తి ప్రక్రియలో పనిచేస్తున్న పెట్టుబడిదారుడు ఇక్కడ అప్పిచ్చే పెట్టుబడిదారునికి విరుద్ధాంశంగా కనిపిస్తాడు. అంతేగాని ఇక్కడ పెట్టుబడిదారీ ఉత్పత్తిలో ఉత్పత్తి సాధనాల నుండి

వేరుచేయబడిన వేతన కార్మికుడు అతనికి విరుద్ధాంశంగా కనిపించదు. వడ్డీ ఇచ్చే పెట్టుబడి అన్నది ఒక 'విధి నిర్వాహక' పెట్టుబడి (Capital as Function) కి భిన్నమైన 'ఆస్తి' పెట్టుబడి. అయితే పెట్టుబడి తన విధి నిర్వహించనంత వరకూ అది కార్మికుల్ని దోపిడీ చేయదు. ఆ రకంగా కార్మికుడికి విరుద్ధంగా రంగంలోకి రాదు.

మరోవైపున పరిశ్రమ లాభం అన్నది వేతన శ్రమకు గాక వడ్డీకి మాత్రమే విరుద్ధాంశంలా కనిపిస్తుంది.

మొదటిది – సగటు లాభం నిర్ణయింపబడింది అనుకుంటే లాభం రేటు వేతనాల చేతగాక, వడ్డీ రేటు చేత నిర్ణయించబడుతుంది. అది ఎక్కువున్నా, తక్కువున్నా వడ్డీ రేటుకు మాత్రం విలోమానుపాతంలో వుంటుంది.[1]

రెండోది – పనిచేసే పెట్టుబడిదారు పరిశ్రమ లాభాలపైన హక్కును పొందేది పెట్టుబడిపై అతనికున్న యాజమాన్యం వల్ల కాక జడ ఆస్తిగా నిర్దిష్ట రూపంలో వుండే పెట్టుబడి అందుకు భిన్నంగా (క్రియాశీలంగా) పనిచేసినందుకుగాను అతడు దాన్ని పొందుతాడు. అప్పు తెచ్చిన పెట్టుబడితో అతడు పనిచేసినప్పుడల్లా అది ప్రత్యక్ష వైరుధ్యంలా కనిపిస్తుంది. కనుక వడ్డీ, పరిశ్రమ లాభమూ వేరు వేరు వ్యక్తులకు చెందుతాయి. పునరుత్పత్తి క్రమంలో పెట్టుబడి పనిచేయడం వల్ల పనిచేసే పెట్టుబడిదారుడు పారిశ్రామిక వాణిజ్య పెట్టుబడిని వృద్ధి చేసే కార్యకలాపాల ఫలితంగా పరిశ్రమ లాభం తలెత్తుతుంది. అయితే వడ్డీ ఇచ్చే పెట్టుబడికి ప్రాతినిధ్యం వహించటంలా కాక పెట్టుబడి కార్యకలాపాలకు ప్రాతినిధ్యం వహించటం అనేది ఇక్కడ గౌరవభత్యం కాదు. పెట్టుబడిదారీ ఉత్పత్తి ప్రాతిపదికమైన పెట్టుబడిదారు ఉత్పత్తి ప్రక్రియను, చలామణిని నిర్వహిస్తాడు. ఉత్పాదక శ్రమను దోపిడీ చేయడానికి కొంత ప్రయాస (Exertion) అవసరం. అతడు స్వయంగా దోపిడీ చేసినా, లేదా అతని తరపున వేరొకరు చేసినా ఇది అవసరం. కనుక అతని పరిశ్రమ లాభం అతనికి వడ్డీలా కాక పెట్టుబడి యాజమాన్యంతో సంబంధం లేని ప్రతిఫలం కాక యజమాని కానివ్యక్తిగా, ఒక కార్మికునిగా అతని కార్యకలాపాలకు గాను వచ్చిన ఫలితంగా అతనికి కనిపిస్తుంది.

ఈ కారణంచేతనే అతడు తన పరిశ్రమ లాభాన్ని వేతన శ్రమకు భిన్నమైనదని, వేతనం చెల్లించని ఇతరుల శ్రమ అని భావించడు. పైగా అది కేవలం శ్రమను అజమాయిషీ చేసినందుకు సామాన్య కార్మికునికంటే అధికంగా లభించిన వేతనంగా లేక వేతనాలుగా భావిస్తాడు. ఒకటి – ఎందుకంటే ఆ పని మరింత సంక్లిష్టమైంది కనుక. రెండు – అతను స్వయంగా వాటిని చెల్లించు కుంటాడు కనుక. పెట్టుబడిదారునిగా అతని కార్యకలాపంలో అదనపు విలువను, వేతనం చెల్లించని శ్రమను సృష్టించడం, దానిని అత్యంత పొదుపైన పరిస్థితుల్లో సృష్టించడం అన్న వాస్తవం దృష్టిపథం నుంచి తప్పుకుంటుంది. ఎందుకంటే పెట్టుబడిదారుని విధిని నిర్వహించనపుడు కూడా కేవలం పెట్టుబడి యజమాని అయినందుకే అతనికి వడ్డీ అతని వాటాగా లభిస్తుంది. మరోవైపున పరిశ్రమ

1. "పరిశ్రమ లాభాలు పెట్టుబడి యొక్క నికర లాభాలపైన ఆధారపడి వుంటాయి. కానీ నికర లాభాలు పరిశ్రమ లాభంపైన ఆధారపడి ఉండవు." (రాంసే, ఎస్సే ఆన్ ది డిస్ట్రిబ్యూషన్ ఆఫ్ వెల్త్, పుట 214) రాంసే దృష్టిలో నికర లాభం అంటే వడ్డీ అని అర్థం.

లాభం పనిచేసే పెట్టుబడిదారునికి అతడు తాను వ్యవహరిస్తున్న పెట్టుబడికి తాను యజమాని కానప్పటికీ లభిస్తుంది. లాభం అనగా అదనపు విలువ. ఇలా రెండు విరుద్ధమైన అంశాలుగా విభజించబడటం వల్ల అవి రెండు ఒకే అదనపు విలువలో రెండు భాగాలన్న వాస్తవాన్నీ, ఈ విభజన అన్నది అదనపు విలువ యొక్క స్వభావాన్ని, పుట్టుకను, అస్తిత్వ విధానాన్ని ఏమీ మార్చదన్న వాస్తవాన్నీ అతడు విస్మరిస్తాడు.

పునరుత్పత్తి ప్రక్రియలో కార్యనిర్వాహక (పనిచేసే) పెటుబడిదారు వేతన శ్రామికులకు అభిముఖంగా ఇతరుల ఆస్తి అయిన పెట్టుబడికి ప్రాతినిధ్యం వహిస్తాడు. పనిచేసే పెట్టుబడిదారుచే ప్రాతినిధ్యం వహించబడే డబ్బు పెట్టుబడిదారు శ్రమదోపిడీలో పాలుపంచుకుంటాడు. శ్రామికుల పరంగా కేవలం ఉత్పత్తి సాధనాల ప్రతినిధిగా మాత్రమే క్రియాశీల పెట్టుబడిదారు తన విధులు నిర్వర్తించగలడు. శ్రామికులను తనకోసం పని చేయించుకోగలడు, లేదా ఉత్పత్తి సాధనాలను పెట్టుబడిగా పనిచేయించగలడు. అయితే ఈ విషయం పునరుత్పత్తి ప్రక్రియలో పెట్టుబడి విధికి, ఈ పునరుత్పత్తి ప్రక్రియకు బయటవుండే పెట్టుబడిపై యాజమాన్యానికి మధ్య ప్రతియోగం (Opposition) సమక్షంలో విస్మరింపబడుతుంది.

వాస్తవానికి లాభం లేదా అదనపు విలువ యొక్క రెండు భాగాలు తీసుకున్న రూపానికి అనగా వడ్డీకి, పరిశ్రమ లాభానికి శ్రమతో ఎటువంటి సంబంధం ఉన్నట్లు కనిపించదు. ఎందుకంటే ఈ సంబంధం కేవలం శ్రమకు, లాభానికి మధ్య మాత్రమే వుంటుంది. అనగా శ్రమ ద్వివిధ భాగాల సమగ్ర మొత్తం అయిన అదనపు విలువకు సంబంధం ఉంటుంది. లాభం విభజితమయ్యే నిష్పత్తి, ఈ విభజనను అనుమతించే విభిన్న చట్టబద్ధమైన హక్కులు, ఇవన్నీ లాభం అప్పటికే అస్తిత్వంలో ఉన్నది అనే ఊహపైన ఆధారపడి వున్నాయి. కనుక తను వ్యవహరించే పెట్టుబడికి తానే యజమాని అయిన పెట్టుబడిదారు మొత్తం లాభాన్ని లేదా అదనపు విలువను జేబులో వేసుకుంటాడు. మొత్తం లాభాన్ని పెట్టుబడిదారు తన జేబులో వేసుకుంటాడా? లేక ఒక చట్టబద్ధమైన యజమాని అయిన మరో మూడవ వ్యక్తికి ఈ లాభంలో కొంత చెల్లిస్తాడా అన్నది కార్మికులకు పూర్తిగా అనవసరం. రెండు రకాల పెట్టుబడిదారుల మధ్య లాభం విభజించబడటానికి గల కారణాలు ఆ రకంగా విభజించబడాల్సిన లాభం, అదనపు విలువల అస్తిత్వానికి కారణాలుగా గమనించటానికి వీల్లేని పరిధిలో మారతాయి. ఈ విభజనతో ప్రమేయం లేకుండానే అదనపు విలువను నిజానికి పునరుత్పత్తి ప్రక్రియ నుండే పెట్టుబడి రాబడుతుంది. వడ్డీ పరిశ్రమ లాభానికి, పరిశ్రమ లాభం వడ్డీకి పరస్పరం వ్యతిరేకంగా కన్పిస్తాయి కనుక అవి రెండూ కలిసి శ్రమకు వ్యతిరేకంగా ఉన్నట్లు కనిపించవు. అయితే పరిశ్రమ లాభమూ మరియు వడ్డీ అనగా లాభమూ, అదనపు విలువ దేని నుంచి తలెత్తుతాయి? వాటి పరస్పర విరుద్ధ రూపాల నుంచి తలెత్తుతాయి! అయితే ఈ విభజన జరగటానికి ముందే ఈ విభజనకు సంబంధించిన ఆలోచనకు ముందే లాభం ఉత్పత్తయి ఉంటుంది.

అప్పు తీసుకున్న డబ్బు వాస్తవంగా పెట్టుబడిగా మార్చబడిన మేరకే దానితో అదనపు విలువ ఉత్పత్తి అయిన మేరకే వడ్డీ ఇచ్చే పెట్టుబడి తన స్వరూపాన్ని నిలుపుకొంటుంది. వడ్డీ అన్నది అదనపు విలువలో ఒక భాగం. అయితే వడ్డీని రాబట్టడం అన్నది ఉత్పత్తి ప్రక్రియతో సంబంధం లేకుండానే

దాని స్వతస్సిద్ధ ధర్మం అన్న అంశాన్ని ఈ అంశం రద్దు చేయదు. శ్రమశక్తి వినియోగించబడిన మేరకే అనగా శ్రమ ప్రక్రియలో వాస్తవ రూపం ధరించిన మేరకే విలువను ఉత్పత్తి చేసే తన ధర్మాన్ని నిర్వహిస్తుంది. అయితే అది ఒక శక్తిగా విలువను సృష్టించగలుగుతుందని, అది కేవలం ఉత్పత్తి ప్రక్రియ నుంచే ఆవిర్భవించనక్కరలేదని, ఉత్పత్తి ప్రక్రియకు ముందే ఉంటుందన్న వాస్తవాన్ని ఇది కాదనదు. విలువను ఉత్పత్తిచేసే శక్తిగానే ఇది కొనబడుతుంది. దానిని ఉత్పాదకంగా వినియోగించ కుండా ఉండటానికి కూడా అనగా కేవలం వ్యక్తిగత ప్రయోజనాల కోసం ఉదాహరణకు వ్యక్తిగత సేవల కోసం దానిని కొనవచ్చు. అదే పెట్టుబడికి కూడా వర్తిస్తుంది. దానిని పెట్టుబడిగానే ఉపయోగిస్తాడా? అదనపు విలువను ఉత్పత్తిచేసే దాని సహజ ధర్మాన్ని వాస్తవంగా చలనంలో ఉంచుతాడా? అన్నది అప్పు తీసుకున్నవాడికి సంబంధించిన వ్యవహారం. ఈ రెండు సందర్భాలలోను కూడా ఒక సరుకులో పెట్టుబడి సహజంగా సంభావమైన అదనపు విలువకై మాత్రమే అతడు చెల్లిస్తాడు.

పరిశ్రమ లాభాన్ని గురించి మరికొంత వివరంగా చర్చిద్దాం.

పెట్టుబడిదారీ ఉత్పత్తిలో పెట్టుబడి యొక్క ప్రత్యేక సామాజిక లక్షణం (మరో వ్యక్తి శ్రమశక్తిని ఆదేశించే ఆస్తి) అన్నది నిశ్చితం అవుతుంది. కనుక ఈ అంతస్సంబంధంలో పెట్టుబడి ఉత్పత్తి చేసిన అదనపు విలువలో భాగంగా వడ్డీ కనిపిస్తుంది. అదనపు విలువ యొక్క మరో భాగమైన పరిశ్రమ లాభం పెట్టుబడి నుంచి వచ్చినట్లుకాక ఉత్పత్తి ప్రక్రియ నుంచి వచ్చినట్లు కనిపిస్తుంది. ఇక్కడ దాని ప్రత్యేక సామాజిక లక్షణం అన్నది పెట్టుబడిమీద వడ్డీ అన్న పదంలో ఇంతకు ముందే వ్యక్తమయింది. ఈ ప్రత్యేక లక్షణం నుంచి అది వేరుచేయబడుతుంది. అయితే పెట్టుబడి నుంచి వేరుచేయబడిన ఉత్పత్తి ప్రక్రియ అనేది కేవలం శ్రమ పెట్టుబడి మాత్రమే. కనుక పెట్టుబడి యజమానికి భిన్నంగా పారిశ్రామిక పెట్టుబడిదారు పెట్టుబడితో పనిచేస్తున్నట్లు కాక పెట్టుబడితో ప్రమేయం లేని కార్యకర్తగా లేదా సాధారణంగా శ్రమ ప్రక్రియ యొక్క సాదా ప్రతినిధిగా అనగా కార్మికునిగా నిజానికి వేతన కార్మికునిగా కనిపిస్తాడు.

వడ్డీ అనేది పెట్టుబడిలాంటి శ్రమ పరిస్థితుల అస్తిత్వాన్ని మాత్రమే వ్యక్తం చేస్తుంది. అది ఈ పరిస్థితుల్ని శ్రమకు విరుద్ధంగా వుండే సామాజిక అంశాలనూ, శ్రమపైన శ్రమకు వ్యతిరేకంగా ఒక వ్యక్తిగత శక్తిగా అవి మారడాన్ని వడ్డీ వ్యక్తం చేస్తుంది. ఇతరుల శ్రమ ఉత్పాదితాన్ని స్వాహా చేసే సాధనాలుగా ఉండే పెట్టుబడి యాజమాన్యానికి అది ప్రాతినిధ్యం వహిస్తుంది. అయితే పెట్టుబడి యొక్క ఈ లక్షణాన్ని అది ఉత్పత్తి ప్రక్రియకు వెలుపల వున్న మరేదో అంశంలాగా ప్రదర్శిస్తుంది. ఈ ఉత్పత్తి ప్రక్రియలోనే ఉండే పెట్టుబడి యొక్క ప్రత్యేక లక్షణంగా అది చూపించదు. ఈ లక్షణాన్ని ప్రత్యక్షంగా శ్రమకు వ్యతిరేకంగా వున్నట్లు కాక శ్రమతో సంబంధం లేనట్లుగా కేవలం ఒక పెట్టుబడిదారునికి మరో పెట్టుబడిదారునితో వున్న సంబంధంలాగా వడ్డీ చూపిస్తుంది. కనుక, అది శ్రమకు పెట్టుబడికి వున్న సంబంధంతో ప్రమేయం లేనిదానికి బాహ్యంగా వుండే ఒక లక్షణం అన్నమాట. కనుక వడ్డీలో పెట్టుబడి యొక్క పరస్పర విరుద్ధ స్వభావం ఒక స్వతంత్ర రూపాన్ని సంతరించుకునే లాభం యొక్క ఆ ప్రత్యేక రూపంలో ఈ వైరుధ్యం పూర్తిగా రద్దయిపోయే విధంగా

ఇది జరుగుతుంది. వడ్డీ అన్నది ఇద్దరు పెట్టుబడిదారులకు సంబంధించిన సంబంధం తప్ప పెట్టుబడిదారునికి కార్మికునికి మధ్య సంబంధం కాదన్నట్లుగా ఇది వ్యక్తం అవుతుంది.

మరోవైపున వడ్డీ యొక్క ఈ రూపం లాభం యొక్క మరో భాగానికి పరిశ్రమ లాభం అనే రూపాన్ని, అజమాయిషీ చేసినందుకుగాను వేతనం అనే రూపాన్ని ఇస్తుంది. పెట్టుబడిదారు ఒక పెట్టుబడిదారునికి నిర్వహించాల్సిన ప్రత్యేక విధులు శ్రామికునికి భిన్నమైన, వ్యతిరేకమైన అతని విధులను కేవలం కార్మికుని విధులుగానే ప్రదర్శిస్తారు. అతడు పెట్టుబడిదారుడిగా పనిచేయటం వల్ల కాక అతడు కూడా పనిచేసినందుకే పెట్టుబడిదారునిగా అతనికి హోదాతో ప్రమేయం లేకుండా అతడు అదనపు విలువను సృష్టిస్తాడు. అదనపు విలువ యొక్క ఈ భాగం ఆరకంగా అదనపు విలువగా కాక దాని విరుద్ధాంశమైన చేసిన శ్రమకు సమవిలువగా కనిపిస్తుంది. పెట్టుబడి అన్యధాకరణ స్వభావం వల్ల శ్రమతో దానికున్న విరుద్ధాంశం వాస్తవ దోపిడీ ప్రక్రియ ఆవలికి నెట్టివేయబడుతుంది. అనగా వడ్డీ ఇచ్చే పెట్టుబడికి నెట్టివేయబడుతుంది. ఈ దోపిడీ ప్రక్రియ అన్నది ఒక సాధారణ ప్రక్రియగా కనిపిస్తుంది. దానిలో పనిచేసే పెట్టుబడిదారు కార్మికుని కంటే భిన్నమైన మరో శ్రమను నిర్వహిస్తున్నట్లు కనిపిస్తుంది. దోపిడీకి గురయ్యే, దోపిడీ చేసే శ్రమలు రెండూ ఒకేలాంటి శ్రమగా కనిపిస్తాయి. దోపిడీ చేసే శ్రమ, దోపిడీ చేయబడే శ్రమ లాంటిదే అన్నట్లుగా అనిపిస్తుంది. పెట్టుబడి యొక్క సామాజిక రూపం వడ్డీకి దఖలుపడుతుంది. అయితే అది ఒక తటస్థమైన, ఎటూ మొగ్గు చూపని రూపంగా వ్యక్తమవుతుంది. పెట్టుబడి యొక్క ఆర్థిక విధి పరిశ్రమ లాభానికి దఖలుపడుతుంది. కానీ ఆ విధికున్న ప్రత్యేక పెట్టుబడిదారీ స్వభావాన్నుండి వేరయిపోతుంది. (Abstracted)

ఇదే అంశం పెట్టుబడిదారుని మదిలో రెండవ భాగంలో ప్రస్తావించినట్లుగా సగటు లాభం సమంగావడం విషయంలో లాగానే ఈ సందర్భంలో కూడా అతనికి అర్థం అవుతుంది. అదనపు విలువ పంపిణీలో నిర్ణాయకాంశాలుగా ప్రవేశించే ఈ కారణాలు పెట్టుబడిదారుని మనస్సులో వక్రీకరించబడతాయి. లాభం పుట్టుకకు దాని (స్వీయాత్మక) సమర్థనకు పునాదులుగా కనిపింప చేసేందుకు అవి అలా వక్రీకరింపబడతాయి.

పరిశ్రమ లాభం అన్న భావన, శ్రమను అజమాయిషీ చేసినందుకు లభించే వేతనం అన్న భావన పరిశ్రమ లాభం వడ్డీల మధ్య ఉండే వైరుధ్యం నుంచి తలెత్తుతుంది. లాభంలో ఒక భాగం నిజానికి వేరుచేయబడి, వేతనాలుగా నిజంగానే వేరుచేయబడి,లేదా తద్విరుద్ధంగా వేతనాల్లో ఒక భాగం పెట్టుబడిదారీ ఉత్పత్తి లాభంలో సమగ్ర భాగంగా కనిపించటం వల్ల ఈ భావం మరింతగా బలపడుతుంది. ఆడమ్ స్మిత్ సరిగ్గా చెప్పినట్లు ఒకవైపున ఈ భాగం స్వచ్ఛంద రూపంలో లాభం నుంచి పూర్తిగా వేరుపడి స్వతంత్ర రూపంలో దర్శనమిస్తుంది. (వడ్డీగాను, పరిశ్రమ లాభంగాను వేరుపడుతుంది.) మరోవైపున వడ్డీ పోగా లాభంలో మిగిలిన భాగం నుండి అనగా పరిశ్రమ లాభం నుండి మేనేజరుకు ఒక ప్రత్యేక వేతనాన్ని అవసరం చేసేంత స్థాయిలో శ్రమ విభజన అనుమతించే వ్యాపార శాఖలలో మేనేజ్‌మెంట్ వేతన రూపంలో అది దర్శనమిస్తుంది.

ప్రత్యక్ష ఉత్పత్తి ప్రక్రియ ఒక సమన్విత సామాజిక ప్రక్రియ రూపం తీసుకున్న ప్రతి సందర్భంలోను అజమాయిషీ చేయడమూ, మేనేజ్‌మెంట్ అన్నవి సహజంగానే అవసరమవుతాయి.

స్వతంత్ర ఉత్పత్తిదారుల విడి శ్రమ విషయంలో అవసరం కాదు.[1] అయితే ఈ అజమాయిషీకి ద్వంద్వ స్వభావమున్నది.

ఒకవైపున అనేకమంది వ్యక్తులు సహకరించుకునే శ్రమలో వాటన్నిటినీ సమన్వయం చేయటానికి ఆ క్రమాన్ని ఐక్యం చేయటానికి ప్రత్యేక పనులకు కాక మొత్తం వర్క్‌షాపు యొక్క మొత్తం కార్యాచరణకు సంబంధించిన పనులను సమన్వయం చేయటానికి, ఆర్కెస్ట్రా కండక్టర్ లాగా, అజమాయిషీ చేసే శక్తి ఒకటి అవసరమే. ఇది ప్రతీ సమన్విత ఉత్పత్తి విధానంలో నిర్వహించాల్సిన ఉత్పాదక కర్తవ్యం.

మరోవైపున ప్రత్యేక వాణిజ్య విభాగాలతో సంబంధం లేకుండానే ఈ అజమాయిషీ అన్నది ప్రత్యక్ష ఉత్పత్తిదారుడైన కార్మికునికి, ఉత్పత్తి సాధనాల యజమానికి మధ్య వైరుధ్యంపై ఆధారపడిన ఉత్పత్తి విధానాలన్నింటిలోనూ సహజంగానే తలెత్తుతుంది. ఈ వైరుధ్యం ఎంత ఎక్కువగా వుంటే అజమాయిషీ పాత్ర అంతగా పెరుగుతుంది. కనుకనే అది బానిస వ్యవస్థలో శిఖరాగ్రదశకు చేరుకుంది.[2] అది పెట్టుబడిదారీ ఆర్థిక విధానంలో కూడా తప్పనిసరి అవసరం. ఎందుకంటే దానిలో వున్న ఉత్పత్తి ప్రక్రియ ఏకకాలంలో పెట్టుబడిదారు, శ్రమశక్తిని వినియోగం చేసే ప్రక్రియ కూడా. నియంతృత్వ రాజ్యాలలో లాగానే ప్రభుత్వం యొక్క అజమాయిషీ, అన్ని రంగాలలో జోక్యం అనే అంశాల్లో అన్ని సామాజిక సమూహాల స్వభావాన్నుంచి తలెత్తే ఉమ్మడి కార్యక్రమం ఉంటుంది. అలాగే ప్రభుత్వానికి ప్రజాసామాన్యానికి మధ్య వుండే వైరుధ్యం నుండి తలెత్తే కార్యకలాపాలు వుంటాయి.

ప్రాచీన రచయితల గ్రంథాలలో ఈ రెండు రకాల పని అజమాయిషీ సిద్ధాంతంలోను, ఆచరణలో కూడా అవిభాజ్యంగా సమ్మేళనం కావించబడింది. వారి ముందు వున్న వ్యవస్థ బానిస వ్యవస్థ. అలాగే పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానమే నిరంతరమనుకునే ఆధునిక ఆర్థికవేత్తల రచనలలో కూడా ఇదే కనిపిస్తుంది. ఇతర ఆర్థికవేత్తలు వేతన వ్యవస్థను సమర్థించడానికి పని అజమాయిషీని ఎంతగా ఉపయోగిస్తారో, ఆధునిక బానిస వ్యవస్థ వకాల్తాదారులు బానిసత్వాన్ని సమర్థించడానికి అజమాయిషీ అన్నదానిని అంతగా ఉపయోగిస్తారు.

కాటో కాలంలో 'విల్లికస్' (విల్లికస్, ఈ పదం విల్లా అనే పదం నుండి గ్రహించబడింది.) "బానిస ఆర్థిక వ్యవస్థ ఫమీలియారస్టికాలో ఎస్టేట్ అధికారి స్థానంలో మేనేజర్ ఉంటాడు. అతడు డబ్బులు తన యజమాని నుంచి తీసుకుంటాడు, ఖర్చు పెడతాడు, కొంటాడు అమ్ముతాడు, ఆదేశాలు గ్రహిస్తాడు. యజమాని లేనప్పుడు ఆదేశాలిస్తాడు, శిక్షలు విధిస్తాడు. సహజంగానే మిగిలిన బానిసలకంటే మేనేజర్‌కు ఎక్కువ స్వేచ్ఛ ఉంటుంది. మాగో గ్రంథాలు సూచించిన దాని ప్రకారం అతడు పెళ్ళి చేసుకోవడానికి, పిల్లల్ని కని పెంచడానికి తన సొంత నిధుల్ని ఉంచుకోవడానికి వుంది. అతడు ఒక ఆడ మేనేజర్‌ను పెళ్ళి చేసుకోవడం మంచిదని కాటో సిఫార్స్ చేశాడు. బహుశా బాగా ప్రవర్తిస్తే తన యజమాని నుంచి స్వేచ్ఛను పొందడానికి అవకాశం అతనికి మాత్రమే వుండేది.

1. "ఇక్కడ (పొలం యజమాని విషయంలో) అజమాయిషీ అన్నది అసలు అవసరం లేదు." (జె.ఇ. కెయిర్‌నెస్, ది స్లేవ్ పవర్, లండన్ 1862, పుట 48)

2. "ఒక విస్తారమైన ప్రదేశంలో చెల్లాచెదురుగా దూరంగా శ్రామికులను (బానిసలను) నియమించాల్సిన అవసరాన్ని ఆ పని కల్పిస్తే అజమాయిషీదారుల సంఖ్య, అలాగే ఈ అజమాయిషీకి అవసరమైన శ్రమకు అయ్యే ఖర్చు అనులోమంగా అదే స్థాయిలో పెరుగుతుంది." (కెయిర్‌నెస్, అదే గ్రంథం, పుట 44)

ఇక మిగిలిన వాటికి సంబంధించి అందరూ ఉమ్మడిగా ఒకే ఇంటిలో ఉండేవారు... మేనేజర్‌తో సహా ప్రతి బానిసకు యజమాని నిర్దిష్ట విరామాలలో నిశ్చితమైన రేట్ల ప్రకారం జీవితావసర వస్తువుల్ని సరఫరా చేసేవాడు. వారు వాటితో గడుపుకోవాలి. ఇక్కడ ఆ వస్తువుల పరిమాణం, శ్రమను బట్టి వుంటుంది. ఉదాహరణకు మేనేజర్ చేసే పని మిగిలిన బానిసల పనికంటే తేలిక కనుక అతనికి వారికంటే తక్కువ రేషన్ లభించేది."

(మోమ్‌సెన్, ర్యోమిశ్చేగెస్కిత్, రెండవ ముద్రణ 1856, పుటలు 80, 9, 10)

**అరిస్టాటిల్ :**

"యజమాని (పెట్టుబడిదారుడు) యజమానికావడం అన్నది బానిసల్ని పొందటం వల్ల కాక, (శ్రమశక్తిని కొనుగోలు చేసే శక్తిని అతనికిచ్చే పెట్టుబడిపైన యాజమాన్యం) బానిసల్ని ఉపయోగించుట ద్వారా (ఉత్పత్తి ప్రక్రియలో కార్మికుల్ని ప్రస్తుత పరిస్థితుల్లో వేతన కార్మికుల్ని) జరుగుతుంది". ("అయితే ఈ శాస్త్రంలో మహత్తరమైన అంశం ఏమీ లేదు.") ("బానిస ఏయే పనులు చేయగలడో ఆ పనులన్నింటినీ యజమాని ఆదేశించగలగాలి.") ("యజమానుల అజమాయిషీ తలనొప్పి భరించలేనప్పుడల్లా మేనేజర్ ఈ గౌరవాన్ని అందుకుంటాడు. ఆ వేళల్లో యజమానులు రాజ్య వ్యవహారాలకు తత్వశాస్త్ర అధ్యయనానికి తను సమయాన్ని వెచ్చిస్తాడు.") (అరిస్టాటిల్, డి రిపబ్లికా, బెకర్ ఎడిషన్, బుక్ I, 7)

ఇక్కడ అరిస్టాటిల్ వివరంగా చెప్తున్న అంశం ఏమిటంటే రాజకీయ, ఆర్థిక రంగాలలో ఆధిక్యత అన్నది పాలక శక్తులపైన ప్రభుత్వ విధులను కూడా పెడుతుంది. కనుక వారు ఆర్థిక రంగంలో శ్రమ శక్తిని వినియోగం చేసే కళను తెలుసుకోవాలి. దానితోపాటు ఈ అజమాయిషీ చేయటం అన్న పని గొప్ప వ్యవహారం కాదనే కారణంచేతనే ఆ బండచాకిరీ చేసే 'గౌరవాన్ని' యజమాని తనకు వీలుపడినప్పుడల్లా తన మేనేజర్‌కు అప్పగిస్తాడు.

మేనేజ్‌మెంట్, అజమాయిషీల పని (అది మొత్తం సమన్విత సామాజిక శ్రమచేత నిర్ణయించబడిన ప్రత్యేక విధి కాక ఉత్పత్తి సాధనాల యజమానికి, కేవలం శ్రమశక్తి యజమానికి మధ్య వున్న వైరుధ్యంచేత నిర్ణయించబడిన మేరకు, బానిస వ్యవస్థలోలాగా ఈ శ్రమశక్తిని కొనడం అనేది బానిసను కొనటం ద్వారా జరిగిందా? లేక స్వయంగా కార్మికుడే తన శ్రమశక్తిని అమ్ముతాడా? అన్నదానితో ప్రమేయం లేదు. తద్వారా ఉత్పత్తి ప్రక్రియ కూడా అతని శ్రమను పెట్టుబడి వినిమయించే ప్రక్రియగా కనిపిస్తుంది.) ప్రత్యక్ష ఉత్పత్తిదారుల దాస్యం నుంచి తలెత్తే ఈ పని చాలా తరచుగా ఈ సంబంధాన్ని సమర్థించడానికి ఉల్లేఖించబడింది. వేతనం చెల్లించని ఇతరుల శ్రమను స్వాహా చేయడం అనే దోపిడీ తరచుగా పెట్టుబడి యొక్క యజమాని పనికి న్యాయమైన బహుమానంగా చూపించబడింది. అయితే అమెరికాలో బానిస వ్యవస్థను సమర్థించే ఓకానర్ అనే న్యాయవాది 1859 డిసెంబర్ 19వ తేదీన న్యూయార్క్‌లో జరిగిన ఒక సభలో "దక్షిణాదికి న్యాయం" అన్న నినాదంతో వాదించినంత బాగా మరెవరూ వాదించలేరు. బ్రహ్మాండమైన హర్షధ్వానాల మధ్య అతనిలా ప్రసంగించాడు. "పెద్దలారా, నీగ్రో దాస్యమన్నది ప్రకృతిసిద్ధమైనది... అతనికి బలం వుంది. పనిచేసే శక్తి వుంది. అయితే ఆ శక్తినిచ్చిన ప్రకృతి అతనికి పాలించే తెలివితేటలను కానీ, పనిచేయాలన్న సంకల్పాన్ని కానీ ఇవ్వలేదు." (హర్షధ్వానాలు) "ఈ రెండు శక్తులు అతనికి నిరాకరించబడ్డాయి. పనిచేసే సంకల్పాన్ని ఇవ్వని ప్రకృతి అతనికి ఆ సంకల్పాన్ని బలవంతంగా రప్పించడం కోసం అతన్ని ఒక ఉపయోగకరమైన...

సేవకునిగా అతనికి, అతని యజమానికి ఉపయోగపడే విధంగా చేయడానికి ఒక యజమాని నిచ్చింది... ప్రకృతి నీగ్రోను ఉంచిన పరిస్థితులలో అతన్ని వదలివేయటమూ, అతన్ని పాలించటానికి ఒక యజమానిని ఇవ్వడమూ అన్యాయం కాదు. అతన్ని శ్రమ చేసేందుకు బలవంతం చేయడం అన్నది అతని హక్కుల్ని కాలరాయడం ఏమాత్రం కాదు. అతన్ని పాలించినందుకు, అతన్ని సమాజానికి ఉపయోగపడే విధంగా మలిచినందుకు ఒక న్యాయమైన పరిహారం యజమానికివ్వడం అన్యాయం కాదు."[1]

ఇప్పుడు బానిసలాగా వేతన కార్మికునికి కూడా అతన్ని పనిలో వుండి పరిపాలించే ఒక పెత్తందారు వుండాలి. ఈ దొరగారు బానిస సంబంధం ఉందనుకొంటే అప్పుడు తన సొంత వేతనాన్ని దానితోపాటు అజమాయిషీ చేసినందుకు వేతనాల్ని ఉత్పత్తి చేయాలని వేతన కార్మికుడ్ని బలవంతం చేయడం సక్రమమే అవుతుంది. "అతన్ని పాలించటానికి అతన్ని సమాజానికీ, తనకీ ఉపయోగకరంగా మలచటానికి ఉపయోగించిన శ్రమ, నైపుణ్యాలకు తగిన న్యాయమైన పరిహారం" అనగా తనపై పెత్తనం చెలాయించడానికీ, అజమాయిషీ చేయడానికీ పరిహార మన్నమాట.

అజమాయిషీ, మేనేజ్‌మెంట్ చేయడం అన్న శ్రమ ఒక వైరుధ్యం నుంచి, శ్రమపైన పెట్టుబడి ఆధిక్యత నుంచి తలెత్తుతుంది. పెట్టుబడిదారీ విధానం లాగానే వర్గ వైరుధ్యాలపైన ఆధారపడిన ఉత్పత్తి విధానాలన్నిటికీ ఇది ఉమ్మడి అంశం. ఇది పెట్టుబడిదారీ వ్యవస్థలో కూడా మొత్తం సమన్విత సామాజిక శ్రమ వ్యక్తులకు తమ ప్రత్యేక కర్తవ్యాలుగా అందించే అన్ని ఉత్పాదక కార్యకలాపాలతోను అది ప్రత్యక్షంగా అవిభాజ్యంగా జోడించబడుతుంది. ఫ్యూడల్ ఫ్రాన్స్‌లో ఒక ఎపిట్రోపోస్ లేదా రెగిసియర్ అని పిలిచే వాని వేతనాలు ఆ వ్యాపారాన్ని తగినంత భారీ స్థాయిలో నిర్వహించినపుడు ఒక మేనేజర్‌కు వేతనం చెల్లించాల్సిన పరిస్థితులున్నప్పుడు లాభం నుండి పూర్తిగా విడిపోతాయి. ఒక నైపుణ్యమైన శ్రమకిచ్చే వేతనాల రూపం కూడా తీసుకుంటాయి. అయితే ఇక్కడ మన పారిశ్రామిక పెట్టుబడిదారులు "ప్రభుత్వ వ్యవహారాలను నిర్వహించడానికి తత్వశాస్త్ర అధ్యయనానికి" ఇంకా చాలా దూరంలోనే ఉన్నారు.

మన పారిశ్రామిక వ్యవస్థకు పారిశ్రామిక పెట్టుబడిదారులుగాక పారిశ్రామిక మేనేజర్‌లే "ఆత్మ" అని ఉరే ఇంతకు ముందే పేర్కొన్నాడు.[2] ఒక సంస్థ యొక్క వ్యాపార భాగానికి సంబంధించినంత వరకు ఇంతకు ముందు భాగంలోనే అవసరమైనదంతా మనం వివరించాం.[3]

పెట్టుబడి యాజమాన్యంతో ఏ మాత్రం సంబంధం లేకుండా పనిపైన అజమాయిషీ చేసేవారు ఎంతమందైనా, ఎప్పుడైనా దొరికే దశకు పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం పరిస్థితుల్ని తీసుకొచ్చింది. కనుక పెట్టుబడిదారు తానే స్వయంగా నిర్వహించడం అన్నదాన్ని వ్యర్థంగా మార్చింది. వాద్యగోష్టి నిర్వాహకుడికి (సంగీత దర్శకుడికి) తన సొంత వాయిద్య పరికరాలు ఉండాల్సిన అవసరం లేదు. ఇతర సంగీతకారుల "వేతనాలకు" సంబంధించి కూడా అతను పట్టించుకోనక్కరలేదు.

---

1. న్యూయార్క్ డైలీ ట్రిబ్యూన్, డిసెంబర్ 20, 1859 పుటలు 7, 8 - సం॥
2. ఎ. ఉరే, ఫిలాసఫీ ఆఫ్ మాన్యుఫాక్చర్స్, ఫ్రెంచి అనువాదం, 1836, I, పుట 67. ఈ 'పిండార్ ఆఫ్ ది మాన్యుఫాక్చరర్స్' అదే సమయంలో చెపుతున్న మరో అంశం, చాలా కార్ఖానాదారులకు తాము చలనంలో ఉంచిన యంత్రాంగం గురించి బొత్తిగా అవగాహన లేదు.
3. ప్రస్తుత ముద్రణ, పుటలు 289, 92 - సం॥

తన ఉన్నత, సురక్షిత స్థానం నుండి చూసిన పెట్టుబడిదారునికి పెద్ద భూస్వామి అనవసరమైన వానిగా కనిపించినట్లే, సహకార ఫ్యాక్టరీలు కార్యనిర్వాహకునిగా పెట్టుబడిదారుని అవసరం కూడా తీరిందని నిరూపిస్తున్నాయి. పెట్టుబడిదారు చేసే పని కేవలం పెట్టుబడిదారీ ఉత్పత్తి ప్రక్రియలో మాత్రమే జనించదు కాబట్టి, అది పెట్టుబడితో పాటు అంతం కాదు. అది ఇతరుల శ్రమను దోచుకోవడానికే పరిమితం కాదు కాబట్టి, అందుచేత అది సామాజిక శ్రమగా శ్రమ రూపం నుండి జనిస్తుంది కాబట్టి, ఒకే ఫలితం కోసం అనేకమంది సమ్మేళనం, సహకారాల నుండి జనిస్తుంది కాబట్టి, అది ఒకసారి తన పెట్టుబడిదారీ పెంకును బ్రద్దలుచేసుకొని వస్తే ఈ రూపంలాగానే పెట్టుబడి నుండి పూర్తి స్వతంత్రమైనదిగా వుంటుంది. పెట్టుబడిదారీ శ్రమలాగానే లేదా పెట్టుబడిదారుని విధి లాగానే ఈ శ్రమ కూడా అవసరమే అని చెప్పడం అంటే భ్రష్ట సిద్ధాంతవేత్తకు పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానంలో అభివృద్ధి అయిన రూపాల గురించి తెలియదని అర్థం. పెట్టుబడిదారీ విరుద్ధ స్వభావం నుంచి ఆ రూపాలను వేరుచేయవచ్చునని, విముక్తి చేయవచ్చునని అతడు అవగాహన చేసుకోలేదు. డబ్బు పెట్టుబడిదారునితో పోల్చినప్పుడు పారిశ్రామిక పెట్టుబడిదారుడు కార్మికుడు. కానీ ఇతరుల శ్రమ దోచుకొనే 'పెట్టుబడిదారీ కార్మికుడు' అనే అర్థంలో కార్మికుడు. అతడు తన హక్కుగా ప్రకటించి జేబులో వేసుకునే జీతం మొత్తం స్వాహా చేయబడిన మరొకరి శ్రమ పరిమాణానికి సరిగ్గా సమానం అవుతుంది. ఈ శ్రమ దోపిడీ రేటు మీద అతడి జీతం ప్రత్యక్షంగా ఆధారపడి వుంటుంది. అయితే అటువంటి దోపిడీకి అవసరమైన శ్రమాయానం స్థాయిపైన ఆధారపడి వుండదు. ఎందుకంటే ఆ పనిని తక్కువ జీతంతోనే మరో మేనేజర్‌కతడు అప్పచెప్పగలుగుతాడు. ప్రతీ సంక్షోభం తర్వాత మాజీ కార్ఖానాదారుల్లో చాలామంది, ఇంగ్లీషు ఫ్యాక్టరీలున్న జిల్లాలలో తక్కువ జీతాలకు అజమాయిషీ చేసే ఉద్యోగాన్ని నిర్వహించడం జరుగుతుంది. ఇంతకు ముందు తన సొంత ఫ్యాక్టరీలుగా వున్న వాటిలోనే ఇప్పుడు తమ కొత్త యజమానుల దగ్గర, తరచుగా వారి మాజీ రుణదాతల దగ్గర మేనేజర్ స్థాయిలో చేరటం మామూలే.[1]

వాణిజ్య, పారిశ్రామిక మేనేజర్లు ఎవరయినా నిర్వహణ కోసం ఇచ్చే జీతాలకు కార్మికులు నడిపే సహకార ఫ్యాక్టరీలలోను, పెట్టుబడిదారీ స్టాకు కంపెనీలలోను కూడా పరిశ్రమ లాభాలతో పూర్తిగా సంబంధం లేకుండా వేరుగా ఉంటాయి. ఇలా మేనేజ్‌మెంట్ వేతనాలు పరిశ్రమ లాభాల నుండి వేరుపడటం అన్నది ఇతర సందర్భాలలో కేవలం యాధృచ్ఛికం. కానీ ఇక్కడ స్థిరంగా వుంటాయి. సహకార ఫ్యాక్టరీలో అజమాయిషీ చేసే శ్రమ యొక్క శత్రు స్వభావం అదృశ్యమవుతుంది. ఎందుకంటే శ్రామికులే మేనేజర్‌కు జీతం ఇస్తారు. అంతే తప్ప వారికి వ్యతిరేకమైన పెట్టుబడికి ప్రాతినిధ్యం వహించరు. పరపతి వ్యవస్థతో పాటు అభివృద్ధి చెందిన స్టాక్ కంపెనీలు సాధారణంగా ఈ మేనేజ్‌మెంట్ అన్న పనిని పెట్టుబడి యొక్క యాజమాన్యం అన్న పనినుంచి సొంత యాజమాన్యం ఉన్న సందర్భాల లోనూ, ఇతర సందర్భాలలోనూ కూడా వేరుచేసే ధోరణి పెరుగుతుంది. బూర్జువా సమాజ అభివృద్ధి వల్ల భూమిపైన యాజమాన్యం నుంచి న్యాయవాదుల, పరిపాలకుల విధులు వేరయినట్లే ఇది కూడా.

1. నాకు తెలిసిన సందర్భంలో 1868 సంక్షోభం తర్వాత ఒక దివాళా తీసిన కార్ఖానాదారుడు తన మాజీ కార్మికుల చేతుల్లో వేతన కార్మికుడయ్యాడు. దివాళా తర్వాత ఆ ఫ్యాక్టరీని కార్మికుల సహకార రంగం నడిపింది. దాని మాజీ యజమాని మేనేజర్‌గా నియమితుడయ్యాడు. **- ఎంగెల్స్**

ఫ్యూడల్ దశలో అలా వేరుగా లేవు. అయితే ఒకవైపున కేవలం పెట్టుబడి యజమాని అయిన డబ్బు పెట్టుబడిదారుడు పనిచేసే పెట్టుబడిదారుని ఎదుర్కోవలసి వుంటుంది. కాగా డబ్బు పెట్టుబడే పరపతి సౌకర్యం ద్వారా సామాజిక స్వభావం సంతరించుకుంటుంది. అనగా అది బ్యాంకులలో కేంద్రీకృతమై దాని తొలి యజమానులకు బదులు బ్యాంకులే అప్పులిస్తాయి. మరోవైపున పెట్టుబడికి సంబంధించి ఎటువంటి హక్కులేని మేనేజర్ దానిని అప్పు తీసుకుని గాని లేదా తీసుకోకుండా గాని పనిచేసే పెట్టుబడిదారుని విధులన్నీ నిర్వహిస్తాడు. కేవలం పనిచేసే వ్యక్తి మాత్రమే మిగిలిపోయి ఉత్పత్తి ప్రక్రియలో పెట్టుబడిదారుడు అనవసరం గనుక అదృశ్యమవుతాడు.

ఇంగ్లండ్‌లోని సహకార ఫ్యాక్టరీల జమాఖర్చులను బట్టి[1] తెలిసే అంశం ఏమంటే – మేనేజర్ వేతనాల్ని తీసివేసిన తర్వాత సగటు లాభం కంటే వాటి లాభం ఎక్కువగా ఉంది. ఇక్కడ మేనేజర్ వేతనం అన్నది ఇతర కార్మికుల వేతనం లాగానే మదుపు పెట్టబడిన అస్థిర పెట్టుబడిలో భాగం మాత్రమే. ఒక్కొక్క సందర్భంలో ప్రైవేట్ కార్ఖానాదారుల కంటే ఎక్కువ వడ్డీ రేటును చెల్లించినపుడు సైతం ఇదే జరిగింది. ఈ సందర్భాలన్నిటిలోనూ ఎక్కువ లాభాలు రావడానికి కారణం స్థిర పెట్టుబడిని పొదుపుగా వాడటమే. ఇక్కడ ఆసక్తి కలిగించేది ఏమంటే సగటు లాభం (వడ్డీ+పరిశ్రమ లాభం) అన్నది మొత్తంగా మేనేజ్‌మెంట్ వేతనాలతో సంబంధం లేని ఒక పరిమాణంగా అతి స్పష్టంగా, వాస్తవంగా కనిపిస్తుంది. సగటు లాభం కంటే ఇక్కడ లాభం ఎక్కువ గనుక పరిశ్రమ లాభం కూడా మామూలు కంటే ఎక్కువగా వుంటుంది.

ఇదే పరిస్థితి కొన్ని పెట్టుబడిదారీ స్టాక్ కంపెనీలలో కూడా కనిపించింది. ఉదాహరణకు జాయింట్ స్టాక్ బ్యాంకులు, 1863లో ది లండన్ అండ్ వెస్ట్ మినిస్టర్ బ్యాంక్ 30% డివిడెండ్‌ను చెల్లించింది. కాగా యూనియన్ బ్యాంక్ ఆఫ్ లండన్‌తోపాటు మరికొన్ని బ్యాంకులు 15% మాత్రమే చెల్లించాయి. డైరెక్టర్ల వేతనాలే కాక, డిపాజిట్లపై చెల్లించిన వడ్డీలు కూడా మొత్తం లాభం నుంచి తీసివేయగానన్నమాట. ఇక్కడ అధిక లాభం అన్నది డిపాజిట్లతో పోలిస్తే తక్కువ పెట్టుబడి ఉండటం వల్ల వచ్చింది. ఉదాహరణకు లండన్ అండ్ వెస్ట్ మినిస్టర్ బ్యాంక్ విషయంలో 1863లో పెట్టుబడి 10,00,000 పౌండ్లు, డిపాజిట్లు 1,45,40,275 పౌండ్లు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ లండన్ విషయంలో 1863లో పెట్టుబడి 6,00,000 పౌండ్లు, డిపాజిట్లు 1,23,84,173 పౌండ్లు.

పరిశ్రమ లాభం అజమాయిషీ లేదా నిర్వహణ వేతనాల మధ్య గందరగోళం వడ్డీ విషయంలో అదనపు లాభం వడ్డీకి వ్యతిరేకంగా శత్రురూపం తీసుకోవడం నుండే మొదట్లో పుట్టింది. లాభాన్ని వేతనం చెల్లించని శ్రమ నుంచి రాబట్టిన అదనపు విలువ కాక పెట్టుబడిదారుడు చేసే పనికి వేతనాలుగా చూపించే వకాల్తాదారీ లక్ష్యం వల్ల ఈ గందరగోళం మరింత పెరిగింది. ఇక దీనిని సోషలిస్టులు లాభాన్ని తగ్గించాలనే డిమాండ్‌తో ఎదుర్కొన్నారు. ఇక్కడ లాభం అంటే కేవలం సైద్ధాంతికంగా చూస్తే వారి వేతనాలు మాత్రమే. కనుక ఈ డిమాండ్ సైద్ధాంతికంగా మరింత గందరగోళంతో కూడింది. అజమాయిషీ వేతనాలు ఇతర వేతనం లాగానే ఒకవైపున నిర్దిష్ట స్థాయిని, నిర్దిష్ట మార్కెట్ ధరను కలిగి వుంటాయి. పారిశ్రామిక, వ్యాపార మేనేజర్ల వర్గం సంఖ్యాపరంగా

1. ఇక్కడ ఉల్లేఖించబడిన జమాఖర్చులు 1864 వరకే పరిమితమవుతాయి. ఎందుకంటే ఇది 1865లో లిఖించబడింది. - ఎంగెల్స్

పెరగడంతో పాటు[1] జీతాలు ఎలాగూ పడిపోతాయి. మరోవైపున సాధారణ అభివృద్ధితో పాటు ప్రత్యేకమైన శిక్షిత శ్రమ శక్తిని ఉత్పత్తి చేసే ఖర్చు తగ్గడం వల్ల నిపుణ శ్రమ వేతనాలన్నీ తగ్గినట్లే అజమాయిషీ వేతనాలు కూడా తగ్గుతాయి.[2] కార్మికుల్లో సహకారం అభివృద్ధి చెందడం వల్ల, బూర్జువా వర్గంలో స్టాక్ పరిశ్రమలు పెరగడం వల్ల పరిశ్రమ లాభం గురించి, మేనేజ్‌మెంట్ వేతనాల గురించి ఇప్పటివరకూ గందరగోళానికున్న చివరి సాకు తెర తొలగించబడింది. లాభం సిద్ధాంత రంగంలో ఎలా స్థిరమైనదిగా కనిపించిందో ఆచరణలో కూడా అలాగే కనిపించింది. అనగా అదనపు విలువగా, సమాన విలువ చెల్లించబడని విలువగా, వాస్తవ రూపం ధరించిన వేతనం చెల్లించని శ్రమగా కనిపించింది. పనిచేసే పెట్టుబడిదారు శ్రమను నిజంగానే దోపిడీ చేస్తాడని, ఈ దోపిడీ ఫలితం అప్పు తీసుకొచ్చిన పెట్టుబడి సందర్భంలో వడ్డీగాను, పరిశ్రమ లాభంగాను విభజించబడిందని అప్పుడు స్పష్టమైంది. పరిశ్రమ లాభం అన్నది లాభంలో వడ్డీపోగా మిగిలిన మొత్తం అని గ్రహించబడింది.

స్టాక్ పరిశ్రమల్లో మేనేజ్‌మెంట్ వేతనాలకు సంబంధించి పెట్టుబడిదారీ విధానం ప్రాతిపదికపై ఒక కొత్త వంచన ప్రారంభమవుతుంది. వాస్తవంగా పనిచేసే డైరెక్టర్లపైన అనేకమంది మేనేజర్లను, డైరెక్టర్లను నియమిస్తారు. స్టాక్ హోల్డర్లను నిలువుదోపిడీ చేసి మస్తుగా సంపాదించడానికి మాత్రమే అజమాయిషీ, నిర్వహణ అన్నవి వారికి ఉపకరిస్తాయి. ది సిటీ ఆర్ ది ఫిజియాలజీ ఆఫ్ లండన్ బిజినెస్; విత్ స్కెచెస్ ఆన్ చేంజ్ అండ్ ది కాఫీ హౌసెస్ (లండన్, 1845) అనే గ్రంథంలో దీనికి సంబంధించి చాలా కుతూహలం రేకెత్తించే వివరాలున్నాయి. "బ్యాంకర్లు, వ్యాపారులు 8, 9 భిన్నమైన కంపెనీలను నడపటం ద్వారా ఎటువంటి ప్రయోజనాన్ని సాధిస్తారో ఈ ఉదాహరణ తెలియజేస్తుంది. తిమోతి అబ్రహాం కర్టిస్ తన వ్యక్తిగతమైన బేలన్స్‌షీట్‌లో తాను దివాళా తీసినప్పుడు దివాళా కోర్టు ముందు డైరెక్టర్ పదవి వల్ల వచ్చిన వేతనాన్ని ఏడాదికి 800 నుండి 900 పౌండ్లు వరకూ చూపించాడు. కర్టిస్ బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్ కోర్టులతోనూ, ఈస్ట్ ఇండియా హౌస్‌తోనూ అతనికున్న సంబంధాల రీత్యా బోర్డులో అతని సేవల్ని వినియోగించుకోవడం అన్నది ఒక పబ్లిక్ కంపెనీకి వాటంగానే ఉంటుందని భావించవచ్చు." (పుటలు 81, 82) అటువంటి కంపెనీల డైరెక్టర్లకు ప్రతీవారం సమావేశానికి గాను లభించే భత్యం కనీసం ఒక గినియా (21 షిల్లింగులు) లభిస్తుంది. ఈ దివాళా కోర్టులో నడిచే కార్యకలాపాలు చూస్తే సాధారణంగా ఈ నామమాత్ర డైరెక్టర్లు నిర్వహించే వాస్తవ అజమాయిషీకి వారి జీతాలు విలోమానుపాతంలో వుంటాయి.

★ ★ ★

1. "యజమానులు కూడా కార్మికులుగాను, వారి మేస్త్రీలుగానూ వ్యవహరిస్తారు. ఈ సందర్భంలో వారి కార్మికుల ప్రయోజనాలు వారి ప్రయోజనాలు ఒకటే. అయితే వారు స్వయంగా పెట్టుబడిదారులై వుంటారు. లేదా వారి ప్రతినిధులైనా అయి వుంటారు. ఈ విషయంలో వారి ప్రయోజనాలు ఖచ్చితంగా కార్మికుల ప్రయోజనాలకు వ్యతిరేకంగా వుంటాయి." (పుట 27) "ఈ దేశంలో వున్న మేస్త్రీ మెకానిక్‌లలో విద్యావ్యాప్తి వల్ల యజమానుల శ్రమకు, నైపుణ్యానికి విలువ రోజురోజుకీ పడిపోతోంది. ఆ ప్రత్యేక జ్ఞానం కలిగిన వారి సంఖ్య పెరుగుతుంది." (పుట 30, హాడ్జ్ స్కిన్, లేబర్ డిపెండెంట్ ఎగెనెస్ట్ ది క్లెయిమ్స్ ఆఫ్ కేపిటల్, లండన్ 1825)

2. "సాంప్రదాయికమైన సాధారణ ఆటంకాలు తగ్గడంచేతనూ, విద్యావకాశాలు పెరగటంవల్లనూ నైపుణ్యం లేని శ్రమ వేతనాలను పెంచటానికి బదులు, నిపుణ శ్రమ వేతనాలు తగ్గుతున్నాయి." (జె. స్టూవర్ట్ మిల్, ప్రిన్సిపుల్స్ ఆఫ్ పొలిటికల్ ఎకానమీ, రెండవ ముద్రణ, లండన్ 1849, I, పుట 479)

## అధ్యాయం - 24

# వడ్డీ ఇచ్చే పెట్టుబడి రూపంలో పెట్టుబడి సంబంధాల బాహ్యీకరణ

**పె**ట్టుబడి సంబంధాలు వడ్డీ ఇచ్చే పెట్టుబడి విషయంలో అత్యంత బాహ్యీకృత, అత్యంత ఆరాధనాపూర్వక రూపాన్ని సంతరించుకుంటాయి. ఇక్కడ డ–డ', డబ్బుకు మరికొంత డబ్బును సృష్టించే, స్వయంగా విస్తరించే విలువ వుంది. ఈ రెండు చివరలనూ కలిపే ప్రక్రియ మాత్రం కనిపించదు. వ్యాపార పెట్టుబడిలో కనీసం డ–స–డ' అనే కనీసమైన పెట్టుబడిదారీ చలనం వుంటుంది. అది కేవలం చలామణి రంగానికే పరిమితం అయినప్పటికీ ఆ ప్రక్రియ ఉంటుంది. అక్కడ లాభం అన్నది పరాయీకరణ వల్ల లాభంగా లభించినట్టు కనిపిస్తుంది. అయితే కనీసం అది ఒక సామాజిక సంబంధం నుంచి పుట్టినట్టు కనిపిస్తుంది. కేవలం ఒక వస్తువులోంచి పుట్టినట్టు కనిపించదు. వ్యాపార పెట్టుబడి రూపం కనీసం ఒక ప్రక్రియను రెండు విరుద్ధ దశల ఐక్యతను, రెండు వ్యతిరేక చర్యలుగా చీలిపోయే చలనాన్ని, అనగా సరుకుల క్రయ విక్రయాలను చూపిస్తుంది. డ–డ' అనగా వడ్డీ ఇచ్చే పెట్టుబడి రూపంలో ఇది రద్దయిపోతుంది. ఉదాహరణకు ఒక పెట్టుబడిదారుడు 5% వడ్డీ రేటుతో 1000 పౌండ్లను అప్పిస్తే, 1000 పౌండ్ల పెట్టుబడి విలువ ఒక ఏడాదికి స.పె.+స.పె.వ.గా మారుతుంది. స.పె. అనగా పెట్టుబడి, వ అనగా వడ్డీ రేటు కనుక $5\% = \frac{5}{100} = \frac{1}{20}$ మరియు $1000+1000 \times \frac{1}{20} =$ 1050 పౌండ్లు. పెట్టుబడిగా 1000 పౌండ్ల విలువ = 1050 పౌండ్లు కాబట్టి ఇక్కడ పెట్టుబడి అనేది ఒక సరళమైన పరిమాణం కాదు. అది పరిమాణాల సంబంధం. అది ఒక నిర్దిష్ట (given) విలువగా ఒక అసలు మొత్తానికి, దాని స్వయంగా విస్తరించే విలువకు అనగా అదనపు విలువను ఉత్పత్తి చేసే అసలు మొత్తానికి వున్న సంబంధం. పెట్టుబడి పెట్టుబడిగా క్రియాశీల పెట్టుబడిదారులందరి విషయంలోనూ వారు తమ సొంత పెట్టుబడితో వ్యవహరించినా, అప్పు తెచ్చిన పెట్టుబడితో వ్యవహరించినా ప్రత్యక్షంగా స్వీయ విస్తరణాత్మక విలువ రూపాన్ని సంతరించుకుంటుందన్న వాస్తవాన్ని మనం గమనించాం.

డ–డ' పెట్టుబడి యొక్క తొలి ప్రారంభ స్థానం డ–స–డ' అన్న డబ్బు సూత్రం దాని రెండు చివరలను డ–డ'గా కుదించింది. డ'=డ△డ మరింత డబ్బును సృష్టించే డబ్బు. ఇది అర్థరహితంగా కుదించబడిన పెట్టుబడి యొక్క ప్రాథమిక సాధారణ సూత్రం. అది సిద్ధంగా వున్న పెట్టుబడి. ఉత్పత్తి చలామణి ప్రక్రియల ఐక్యత కాబట్టి ఒక ప్రత్యేకమైన కాలపరిమితిలో నిర్దిష్టమైన అదనపు విలువను

ఇచ్చే పెట్టుబడి అది. వడ్డీ ఇచ్చే పెట్టుబడి రూపంలో ఇది మరింత ప్రత్యక్షంగా కనిపిస్తుంది. ఇక్కడ ఉత్పత్తి, చలామణి ప్రక్రియలు కనిపించవు. పెట్టుబడి ఒక నిగూఢమైన వడ్డీకి ఒక స్వయం ఉత్పాదక మూలాధారంగా, అనగా తన సొంత వృద్ధికి తానే మూలాధారంగా కనిపిస్తుంది. వస్తువు (డబ్బు, సరుకు విలువ) ఇపుడు కేవలం వస్తువుగానే పెట్టుబడి అవుతుంది. పెట్టుబడి కేవలం వస్తువుగా కనిపిస్తుంది. మొత్తం పునరుత్పత్తి ప్రక్రియ ఫలితం వస్తువులోని అంతర్గతంగా వున్న సహజ ధర్మంలా కనిపిస్తుంది. అతడు దానిని డబ్బుగా ఖర్చు పెడతాడా? లేక పెట్టుబడిగా అప్పు ఇస్తాడా? అన్నది డబ్బు యజమానిపై ఆధారపడి వుంది. ఎందుకంటే డబ్బు అన్నది నిరంతరాయంగా పరివర్తన కనువయ్యే రూపంలో వుండే సరుకు కనుక వడ్డీ ఇచ్చే పెట్టుబడిలో దానంతటదే ఆరాధనాత్మకంగా మారే పరిస్థితి, స్వయంగా విస్తరించే విలువ. డబ్బును డబ్బు పుట్టించడం అన్నది వాటి శుద్ధ రూపంలోకి తీసుకురాబడతాయి. ఈ రూపంలో దానికి జనన చిహ్నాలు కల్పించకుండాపోతాయి. ఇక్కడ సామాజిక సంబంధం ఒక వస్తువుకు సంబంధించిన, డబ్బుకు సంబంధించిన సంబంధంగా మారుతుంది. డబ్బు వాస్తవంగా పెట్టుబడిగా మారటానికి బదులు ఇక్కడ మనం వస్తువు (content) లేని రూపాన్ని మాత్రమే చూస్తాం. శ్రమశక్తి విషయంలో లాగానే ఇక్కడ డబ్బు ఉపయోగపు విలువ, విలువను సృష్టించే దాని శక్తి. అది తాను కలిగి వున్న విలువకంటే ఎక్కువ విలువను ఉత్పత్తి చేస్తుంది. డబ్బు డబ్బుగా స్వయంగా విస్తరించే విలువను గుప్తంగా కలిగి ఉంటుందన్నమాట. అది డబ్బుగానే అప్పివ్వబడుతుంది. ఈ ప్రత్యేకమైన సరుకు విక్రయ రూపం విలువను సృష్టించి వడ్డీ నివ్వడమన్నది బేరి చెట్లు బేరి పండ్లను కాయడం అన్నంత సహజమైన ధర్మంగా మారుతుంది. రుణదాత తన డబ్బును, డబ్బును పుట్టించే వస్తువుగానే అమ్ముతాడు. అంతేకాదు వాస్తవంలో పనిచేస్తున్న పెట్టుబడి మనం ఇంతకు ముందు చూసినట్లుగా ఒక పని చేస్తున్న పెట్టుబడిగా కాక, స్వయంగా తాను పెట్టుబడికావడం వల్ల అది డబ్బు పెట్టుబడిగా వడ్డీని ఇస్తుంది.

ఇది కూడా వక్రీకరణకు గురి అవుతుంది. వడ్డీ అన్నది లాభం యొక్క అనగా అదనపు విలువ యొక్క ఒక భాగం మాత్రమే. దానిని పనిచేసే పెట్టుబడిదారుడు కార్మికుడ్నించి పిండుతాడు. అయితే ఇప్పుడు అందుకు విరుద్ధంగా వడ్డీ అన్నది పెట్టుబడి యొక్క అసలైన ఉత్పాదితంగానూ, అదే ప్రాథమికమైనదిగానూ, లాభం అన్నది పరిశ్రమ లాభం రూపంలో పునరుత్పత్తి ప్రక్రియలో వచ్చిన అనుబంధ లేదా ఉప ఉత్పాదితమన్నట్లు కనిపిస్తుంది. అందుకే మనకు పెట్టుబడి యొక్క ఆరాధనాత్మక రూపం దర్శనమిస్తుంది. పెట్టుబడికి దైవత్వ భావన సిద్ధిస్తుంది. డ-డ'లో మనకు పెట్టుబడి యొక్క అర్థరహిత రూపం కనిపిస్తుంది. ఇది ఉత్పత్తి సంబంధాలను వాటి అత్యున్నత స్థాయిలో వక్రీకరించిన, వాస్తవీకరించిన రూపం. వడ్డీ ఇవ్వడమనే రూపంలో పెట్టుబడి యొక్క సాదా రూపం. తన సొంత పునరుత్పత్తి ప్రక్రియకు ముందే అది వుంటుంది. పునరుత్పత్తితో సంబంధం లేకుండానే తన సొంత విలువను పెంచుకొనే డబ్బు లేదా సరుకు యొక్క సామర్థ్యం అది. పెట్టుబడిని దాని అత్యంత దుర్మార్గమైన రూపంలో మార్మీకరించడమది.

భ్రష్ట రాజకీయార్థశాస్త్రం పెట్టుబడిని విలువకు, విలువ సృష్టికి స్వతంత్ర మూలాధారంగా చూపించడానికి ప్రయత్నిస్తుంది. ఈ రూపంతో లాభం యొక్క మూలాధారం కనిపించదు. దానిలో పెట్టుబడిదారీ ఉత్పత్తి ప్రక్రియ యొక్క ఫలితం ఆ ప్రక్రియకు దూరమై ఒక స్వతంత్ర అస్తిత్వాన్ని

సంతరించుకుంటుంది. ఇది సహజంగానే భ్రష్ట అర్ధశాస్త్రవేత్తకు ఒక కొత్త తరహా ఆవిష్కరణగా దొరుకుతుంది.

పెట్టుబడి, డబ్బు పెట్టుబడిగా మారనంతవరకూ సరుకుగా మారదు. స్వయంగా విస్తరించే దాని శక్తికి ఒక నిర్దిష్టమైన ధర వుంటుంది. అది ప్రతిసారీ ఆచరణలో వున్న ప్రతీ వడ్డీ రేటులోను ఉల్లేఖించబడుతుంది.

వడ్డీ ఇచ్చే పెట్టుబడిగా ముఖ్యంగా వడ్డీ ఇచ్చే డబ్బు పెట్టుబడిగా దాని ప్రత్యక్ష రూపంలో (వడ్డీ ఇచ్చే పెట్టుబడి యొక్క ఇతర రూపాలు ఈ రూపం నుంచే పుడతాయి. ఆ రూపాలకు ముందే ఇది వుంటుంది. వాటితో మనకు ప్రస్తుతం ప్రమేయం లేదు.) పెట్టుబడి దాని శుద్ధ ఆరాధ్య రూపాన్ని సంతరించుకుంటుంది. డ–డ' అనేది ఒక కర్తగా, ఒక అమ్మదగిన వస్తువుగా తయారవుతుంది. మొదటిది – అది దాని ప్రత్యేక లక్షణాలన్నీ రద్దయి, దాని వాస్తవ అంశాలు ఏ మాత్రం కనిపించని డబ్బు రూపంలో నిరంతరాయంగా వుంటాయి. ఎందుకంటే డబ్బు అన్నది ఎలాంటి రూపం అంటే దానిలో ఉన్న ఉపయోగ విలువలు లాంటి సరుకులకుండే ప్రత్యేక లక్షణాలన్నీ కనుమరుగు అవుతాయి. కనుక ఈ సరుకుల్ని వాటి ఉత్పత్తి పరిస్థితుల్ని కలిగి వుండే పారిశ్రామిక పెట్టుబడుల ప్రత్యేక లక్షణాలు కూడా కనుమరుగు అవుతాయి. విలువ ఒక స్వతంత్ర మార్పిడి విలువగా వుండే రూపం అస్తిత్వంలో వుంటుంది. ఈ సందర్భంలో అది పెట్టుబడి. పెట్టుబడి యొక్క పునరుత్పత్తి ప్రక్రియలో డబ్బు రూపం అన్నది కేవలం తాత్కాలికం. ఒక మధ్యస్థ దశ మాత్రమే. అయితే డబ్బు మార్కెట్లో పెట్టుబడి ఎప్పుడూ ఇదే రూపంలో వుంటుంది. రెండవది – అది ఉత్పత్తి చేసే అదనపు విలువ ఇక్కడ కూడా డబ్బు రూపంలోనే వుంటుంది. అది దాని యొక్క అంతర్గత భాగంగా కనిపిస్తుంది. చెట్లకు పెరుగుదల అనే ప్రక్రియ ఎట్లాంటిదో, పెట్టుబడి తన డబ్బు పెట్టుబడి రూపంలో డబ్బును సృష్టించే డబ్బుగా అది దాని సహజ లక్షణంగా కనిపిస్తుంది.

వడ్డీ ఇచ్చే పెట్టుబడిలో పెట్టుబడి యొక్క చలనం కుదించబడుతుంది. దాని మధ్యస్థ ప్రక్రియ తొలగించబడుతుంది. ఈ రకంగా ఒక పెట్టుబడి = 1000 అన్నది ఒక వస్తువుగానే నిశ్చితమవుతుంది. అది తనలో తాను 1100గా కనిపిస్తుంది. అది నిలువ వుంచిన ద్రాక్ష సారాయి లాగానే తన ఉపయోగ విలువను కొంత కాలానికి తానే పెంచుకున్నట్లుగా కనిపిస్తుంది. పెట్టుబడి అన్నది ఇపుడు ఒక వస్తువు. అయితే అది ఒక వస్తువుగా పెట్టుబడి. డబ్బు ఇప్పుడు గర్భవతి.[1] దాన్ని బయటకు అప్పివ్వగానే లేదా పునరుత్పత్తి ప్రక్రియలో మదుపు పెట్టగానే (దాని యజమానిగా పనిచేసే పెట్టుబడిదారునికి పెట్టుబడి లాభం కాక ఎంత వడ్డీ ఇస్తుందో అంత మొత్తంలో) దానిపైన వడ్డీ పెరుగుతుంది. అది మేలుకుని వున్నా, నిద్రపోయినా స్వదేశంలో వున్నా, విదేశంలో వున్నా, రాత్రయినా పగలైనా పెరుగుతూనే వుంటుంది. ఆ రకంగా వడ్డీ ఇచ్చే డబ్బు పెట్టుబడి (దాని విలువ దృష్ట్యా పెట్టుబడి అంతా డబ్బు పెట్టుబడే లేదా డబ్బు పెట్టుబడి యొక్క వ్యక్తీకరణగా భావించబడుతుంది.) నిల్వదారుని అత్యంత తీవ్రమైన ఆకాంక్షను తీరుస్తుంది.

ఒక వస్తువులో లాగా ఈ రకంగా డబ్బు పెట్టుబడిలో అంతర్గతంగా పెరిగే వడ్డీ వుండటం

1. గోతే, ఫౌస్ట్ భాగం 1, రంగం 5 - సం॥

అన్నది (పెట్టుబడి ద్వారా అదనపు విలువ ఉత్పత్తి అన్నది ఇక్కడ ఇలాగే కనిపిస్తుంది.) లూథర్ దృష్టిని తీవ్రంగా ఆకట్టుకుంది. అందుకే వడ్డీ వ్యాపారానికి వ్యతిరేకంగా అతడు అమాయకమైన దాడులు చేశాడు. ఒక నిర్దిష్ట తేదీ నాటికి అప్పులు చెల్లించటంలో విఫలమైతే రుణదాత మరోచోట దానిని చెల్లించాల్సిన అవసరం వుంది కనుక అతనికి నష్టం కలిగించనట్లు అవుతుంది. లేదా అతను ఒక లావాదేవీలో లాభం సంపాదించే అవకాశాన్ని ఉదాహరణకు ఒక తోటను కొనుగోలు చేసే అవకాశాన్ని పోగొట్టుకోవడం అవుతుంది. దానిపైన లూథర్ ఇలా అంటాడు. "నేను నీకు వాటిని అప్పిచ్చాను. (100 గల్డెన్) నీవు చెల్లించకపోవడం వల్ల నేను మరోచోట చెల్లించలేకపోతున్నాను లేదా కొనలేకపోతున్నాను. కనుక రెండు విధాలా నేను నష్టపోతున్నాను. దీన్ని రెండిందాలా నష్టం అంటారు. duplex intereste, damuni emeagentis at lucri cessanties... ఒకటి జరిగిన నష్టమూ, రెండోది పోగొట్టుకున్న లాభం సంపాదించే అవకాశం... 100 గల్డెన్ మీద జాన్‌కి నష్టం వచ్చిందని తెలియగానే రుణదాత తన నష్టాన్ని భర్తీ చేయమంటాడు. హుటాహుటిన పోయి ప్రతి 100 గల్డెన్ మీద రెట్టింపు వసూలు చేస్తాడు. రుణదాత తాను తిరిగి మరొకనికి చెల్లించలేకపోవటానికి, దానిపైన లాభం సంపాదించలేకపోవటానికి గాను దానికి రెండు రెట్ల డబ్బును పిండుతాడు. ఈ 100 గల్డెన్ పైన ఈ రెట్టింపు నష్టం అన్నది పెరుగుతుందన్నట్టుగా అతడు వ్యవహరిస్తాడు. వారి దగ్గర 100 గల్డెన్ ఉన్నప్పుడల్లా వాటిని అప్పిచ్చి రెండు నష్టాలకు అన్నట్టుగా వసూలు చేస్తారు. నిజానికి ఆ నష్టాలేవీ వారు భరించలేదు... కనుక నీవు పొందని ఊహాజనితమైన నష్టానికిగాను నష్టపరిహారంగా నీ పొరుగువాని నుంచి డబ్బును వడికే వడ్డీ వ్యాపారిని ఈ నష్టాన్ని నీవు నిరూపించనూ లేవు. అంచనా వేయనూ లేవు. ఇటువంటి నష్టాలను న్యాయవాదులు non verum, sed phantasticum interesse అంటారు. వాస్తవ నష్టాలు కాదు, ఊహాజనిత నష్టాలు. వీటిని ప్రతి ఒక్కరూ తమకు తాము ఊహించుకుంటారు. కనుక నేను చెల్లించలేకపోవడం వల్ల, కొనలేకపోవటం వల్ల నష్టాలు జరిగి వుండేవి అనటం కుదరదు. ex contingente necessarium అంటే ఒక కానివిషయాన్ని అయిన విషయంగానూ, ఒక నికరంగాని విషయాన్ని నిశ్చయంగా జరుగుతుందన్నట్లు చెప్పడం అవుతుంది. అటువంటి దారుణమైన వడ్డీ వ్యాపారం కొన్ని సంవత్సరాలలో మొత్తం ప్రపంచాన్ని మింగివేయదా? అతని సంకల్పంతో సంబంధం లేకుండా ఒక దురదృష్టకరమైన ప్రమాదం జరిగితే అతను దాన్నుంచి కోలుకోవాలి. దానికి అతడు నష్టపరిహారం కోరవచ్చు. వ్యాపారంలో ఇది వేరుగా వుంటుంది. దానికి సరిగ్గా వ్యతిరేకంగా వుంటుంది. అవసరంలో ఉన్న తమ పొరుగువారిని బలిపెట్టి వారు లాభం సంపాదించడానికి పథకాలు పన్నుతారు. సంపదను కూడబెట్టడానికి, మరింత ధనికులు కావడానికి, సోమరిగా ఇరుతల శ్రమపైన భోగాలను అనుభవించడానికి, బాధ్యతగాని ప్రమాదంగాని నష్టంగాని లేకుండా వుండటానికి వారు పథకం పన్నుతారు. నేను నా గూటిలో వెచ్చగా వుంటూనే నా 100 గల్డెన్ దేశంలో సంపద పోగేస్తూ వుండగా వాటిని ఒకరకంగా నా జేబులోనే వుంచుకుంటాను. ఎందుకంటే అవి కేవలం అప్పివ్వబడినాయి. దానిలో ప్రమాదం గాని, బాధ్యతగాని ఏమీ లేదు. మిత్రమా, ఇలా చేయటానికి ఎవరు ఇష్టపడరు." (మార్టిన్ లూథర్, విటెన్‌బర్గ్, 1540)

ఒక్క స్వయం పునరుత్పాదక స్వయం విస్తరిత విలువగా తన సహజ ధర్మాల ద్వారా చిరకాలం నిలిచి వుండి శాశ్వతంగా పెరిగే పెట్టుబడి అన్న భావన (పండితవాదులలో దాగిన సహజ సుగుణాల

వల్ల కూడా ఈ భావన తలెత్తింది.) డాక్టర్ ప్రైస్ బ్రహ్మాండమైన వింత ఊహలకు దారితీసింది. ఇది రసవాదుల వింత ఊహల్ని కూడా దాటిపోయింది. పిట్ ఈ వింత ఊహల్ని చాలా గట్టిగా నమ్మాడు. నిధుల్ని సమకూర్చటం విషయంలో అతను పేర్కొన్న నియమాలలో ఈ ఊహల్ని తన ఆర్థిక పరిపాలనా స్తంభాలుగా ఉపయోగించాడు. "డబ్బు ఇచ్చే చక్రవడ్డీ మొదట నెమ్మదిగా వృద్ధి చెందుతుంది. అయితే పెరుగుదల రేటు వేగం నిరంతరాయంగా వృద్ధి చెందటం వల్ల కొన్నిసార్లది మనం ఊహించలేనంత శీఘ్రంగా వుంటుంది. మన ముక్తిదాత జన్మదినం నాడు ఒక పెన్నీ 5 శాతం చక్రవడ్డీకి ఇచ్చి వుంటే ఈ సమయానికి ఎంత పెద్ద మొత్తం అయ్యేదంటే 15 కోట్ల భూగోళాలను పూర్తిగా బంగారంతో నింపేయొచ్చు. అయితే మామూలు వడ్డీ కనుక ఇచ్చి వుంటే అది కేవలం 7 షిల్లింగుల నాలుగున్నర పెన్నీలు అవుతుంది." మన ప్రభుత్వం ఇంతవరకు డబ్బు వృద్ధిని చేయటానికి ఇందులో మొదటి పద్ధతిని కాక చివరి పద్ధతిని ఎంచుకుంది.[1]

అతను రాసిన అబ్జర్వేషన్స్ ఆన్ రివర్షనరీ పేమెంట్స్ (లండన్ 1772) అనే గ్రంథంలో అతని ఊహలు మరింత ఎత్తుకు ఎగురుతాయి. "మన ముక్తిదాత పుట్టినరోజున 6% చక్రవడ్డీ రేటుకు ఒక షిల్లింగును ఉంచితే" (జరూసలేం దేవాలయంలోనేమో) "మొత్తం సౌరవ్యవస్థను మించి పెరిగి వుండేవి. శనిగ్రహం యొక్క కక్ష్య ఉన్న వ్యాసాన్ని తీసుకుంటే, ఆ వ్యాసంతో గీయదగిన వృత్తం దానితో నిండిపోతుంది." కనుక ప్రభుత్వం ఏ ఇబ్బందుల్ని ఎదుర్కోనవసరం లేదు. ఎందుకంటే, కొద్దిపాటి పొదుపుతో వడ్డీ పెరగటానికి అవసరమయ్యే తక్కువ కాల వ్యవధిలో అత్యంత పెద్ద మొత్తాలలో వున్న రుణాలను తీర్చివేయవచ్చు. (పుటలు XIII, XIV)

1. రిచర్డ్ ప్రైస్, ఏన్ అప్పీల్ టు ది పబ్లిక్ ఆన్ ది సబ్జక్ట్ ఆఫ్ ది నేషనల్ డెట్ రెండవ ముద్రణ, లండన్, 1774, పుట 19. అతను ఇట్లా అమాయకంగా జోక్ చేస్తుంటాడు. "డబ్బును సాధారణ వడ్డీకి అప్పు తీసుకుని చక్రవడ్డీ లెక్కల్లో వృద్ధి చేయాలి." (ఆర్. హేమిల్టన్, ఏన్ ఇంక్వైరీ ఇంటు ది రైజ్ అండ్ ప్రొగ్రెస్ ఆఫ్ ది నేషనల్ డెట్ ఆఫ్ గ్రేట్ బ్రిటన్, రెండవ ముద్రణ, ఎడిన్‌బర్గ్, 1814, పుట 133.) దీని ప్రకారం ప్రైవేటు వ్యక్తులకు కూడా సంపద పెంచుకోవాలంటే అప్పు చేయడమే అత్యంత సురక్షితమైన సాధనం. అయితే నేను 5% వడ్డీ రేటు చొప్పున 100 పౌండ్లు అప్పు తీసుకుంటే ఏడాది చివర 5 పౌండ్లు చెల్లించాల్సి వుంటుంది. ఈ అప్పు అనేది పది కోట్ల సంవత్సరాలున్నా, ఈలోగా నేను 100 పౌండ్ల మీద 5 పౌండ్లు మాత్రమే ప్రతి ఏటా చెల్లించాల్సి వుంటుంది. నేను 100 పౌండ్లు అప్పు చేస్తున్నప్పుడు ఈ ప్రక్రియలో 105 పౌండ్లను అప్పివ్వలేను. అటువంటప్పుడు 5% వడ్డీని ఎలా తిరిగి చెల్లించగలుగుతాను? కొత్త అప్పుల ద్వారా మాత్రమే లేదా ప్రభుత్వం అయితే కొత్త పన్నుల ద్వారా మాత్రమే. పారిశ్రామిక పెట్టుబడిదారుడు అప్పు తీసుకుంటే అతని లాభం 15% అనుకుంటే, వడ్డీగా 5% చెల్లించవచ్చు. తన వ్యక్తిగత ఖర్చులకు 5% ఖర్చుపెట్టవచ్చు. (అతని ఆదాయం పెరుగుతున్న కొద్దీ ధనదాహం కూడా పెరుగుతుంది.) 5% తిరిగి పెట్టుబడిగా మార్చవచ్చు. ఈ సందర్భంలో 15% అన్నది నిరంతరాయంగా 5% వడ్డీ చెల్లించడానికి అవసరమైన ముందు షరతు ఈ ప్రక్రియ ఇలాగే కొనసాగితే ముందు అధ్యాయాలలో పేర్కొనబడిన కారణాల వల్ల ఒక లాభం రేటు తగ్గుతుంది. ఉదాహరణకు 15% నుంచి 10%కు తగ్గుతుంది. అయితే 5% వడ్డీ అన్నదానికంటే ముందు 15% లాభం రేటు ఉండాలన్న సంగతిని ప్రైస్ మర్చిపోతాడు. పైగా పెట్టుబడిని పోగుచేస్తే చాలు వడ్డీ పెరగటం అలాగే కొనసాగుతుందని భావిస్తాడు. పెట్టుబడి సంచయనం అనే వాస్తవ ప్రక్రియకు సంబంధించి అసలతడు పట్టించుకోడు. డబ్బు అప్పివ్వడమూ, తిరిగి చక్రవడ్డీతో రాబట్టడమూ మాత్రమే అతనికి అర్థమైన విషయం. అది ఎలా జరుగుతుందనేది అతనికి అనవసరం. ఎందుకంటే అది వడ్డీ నిచ్చే పెట్టుబడి యొక్క సహజధర్మం కదా మరి.

ఆహా ఇంగ్లండ్ జాతీయ రుణానికి ఎంత చక్కటి సైద్ధాంతిక ఉపోద్ఘాతం!

గుణాభివృద్ధి క్రమం (జామెట్రికల్ ప్రోగ్రెషన్)లో కనిపిస్తున్న పరిమాణాలను చూసి ప్రైస్ కళ్ళు చెదిరిపోయాయి. పునరుత్పత్తి శ్రమ పరిస్థితుల్ని పరిగణలోకి తీసుకోకుండా పెట్టుబడిని స్వయంగా క్రమబద్ధం చేసుకునే యంత్రంలాగా దానంతటదే పెరిగిపోయే సంఖ్యలాగా (మాల్తస్ తన జనాభా సిద్ధాంతం విషయంలో చేసినట్టుగానే)[1] దాని పెరుగుదల రేటుని అ.వి = $(స.పె+వ)^n$ అనే సూత్రం ద్వారా కనుక్కున్నాననే ఆలోచనతో అతడు ఉక్కిరిబిక్కిరి అయ్యాడు. అ.పె=పెట్టుబడి మొత్తము+చక్రవడ్డీ, స.పె = అడ్వాన్స్ చేసిన పెట్టుబడి, వ = వడ్డీ రేటు, (100లో సమవిభజక భాగము) n = ఈ ప్రక్రియ జరిగే సంవత్సరాల సంఖ్య.

డాక్టర్ ప్రైస్ గందరగోళాన్ని పిట్ నిజమనే పరిగణించాడు. 1786లో ప్రజా సంక్షేమం కోసం హౌస్ ఆఫ్ కామన్స్ 10 లక్షల పౌండ్లను సేకరించాలని నిర్ణయించింది. ప్రైస్ అభిప్రాయం ప్రకారం జనంపైన పన్నులు వేయటం కంటే ఉత్తమ పద్ధతి లేదు. దాన్ని పోగుచేయటానికి ఆ తర్వాత చక్రవడ్డీ మహత్యంతో జాతీయ రుణ భూతాన్ని పారదోలటానికి ఇది మంచి మార్గం. ఈ పద్ధతినే పిట్ నమ్మాడు. పైన పేర్కొన్న హౌస్ ఆఫ్ కామన్స్ తీర్మానంతో పాటు పిట్ ఒక శాసనం చేశాడు. దాని ప్రకారం 2 లక్షల 50 వేల పౌండ్ల డబ్బును పోగు చేయాలి. వార్షిక చెల్లింపులు పోగా ఆ నిధి 40,00,000 పౌండ్లకు పెరిగేదాకా ఈ డబ్బు సంచయనం కొనసాగాలి అనేది దాని సారాంశం. (యాక్ట్ 26, జార్జి III, అధ్యాయం 31)[2] 1792లో మాట్లాడుతూ పిట్ ఈ సమకూర్చాల్సిన నిధుల్ని పెంచాల్సిందిగా కోరాడు. ఇంగ్లాండ్ వాణిజ్య ఆధిక్యతకు కారణం యంత్రాలు పరపతి సౌకర్యంతోపాటు "అత్యంత వ్యాపితమూ, దీర్ఘకాలంపాటు నిలిచి వుండే కారణమూ సంచయనం" అని పేర్కొన్నాడు. స్మిత్ రచనలలో ఈ సూత్రం సంపూర్ణంగా అభివృద్ధి చెందిందని, ఈ సంచయనం వార్షిక లాభంలో ఒక భాగాన్ని అసలును పెంచటం కోసం ఉపయోగించటం వల్ల సాధ్యమయిందని, ఆ మొత్తాన్ని ఇదే పద్ధతిలో రెండో సంవత్సరం కూడా ఉపయోగిస్తే ఒక నిరంతరాయమైన లాభాన్ని ఇస్తుందని పేర్కొన్నాడు. ఆ రకంగా డాక్టర్ ప్రైస్ సహాయంతో స్మిత్ సంచయన సిద్ధాంతాన్ని పిట్ రుణ సంచయనం ద్వారా జాతిని సంపన్నం చేయడంగా మారుస్తాడు. ఆ రకంగా అప్పులు చెల్లించడానికి అప్పులు అనే నిరంతరాయ రుణ స్వీకరణ నిర్ధారణకు వస్తాడు.

ఆధునిక బ్యాంకింగ్ పితామహుడైన జోషయా చైల్డ్ దీనికి సంబంధించి అంతకుముందే పేర్కొని వున్నాడు. 10% చొప్పున 100 పౌండ్లను చక్రవడ్డీకి ఇస్తే 70 ఏళ్ళకు అది 1,02,400 పౌండ్లు అవుతుందని అతను తెలియజేశాడు. (ట్రైట్ సర్ లే కామర్స్ జె. చైల్డ్, ఆమ్‌స్టర్‌డాం, బెర్లిన్, 1754, పుట 115, రాయబడిన సంవత్సరం 1669.)

ఎకనామిస్ట్‌లో వచ్చిన ఈ క్రింది పేరా.

ఆధునిక ఆర్థికవేత్తలు డాక్టర్ ప్రైస్ భావనను ఎంత గుడ్డిగా వర్తింపచేస్తున్నారో తెలియజేస్తుంది.

---

1. మాల్తస్, ఏన్ ఎస్సే ఆన్ ది ప్రిన్సిపుల్ ఆఫ్ పాపులేషన్, లండన్, 1798, పుటలు 25-26. - సం॥
2. ప్రతి మూడు మాసాల చివరన కమీషనర్స్ చేతిలో కొంత సొమ్ము పెట్టాలని నిర్దేశించే చట్టం ఇది. జాతీయ రుణం తగ్గించడానికి కమీషనర్లు దానిని ఉపయోగిస్తారు. (అనో, 26, జార్జి III, రెగిస్ కేపిటల్ 31. - సం॥)

"పొదుపు చేయబడిన పెట్టుబడి యొక్క ప్రతీ భాగంపైన చక్రవడ్డీతో వున్న పెట్టుబడి సర్వ వ్యాపితంగా వుంది. ప్రపంచంలో ఆదాయం వచ్చే సంపదంతా కూడా ఏనాడో పెట్టుబడి యొక్క వడ్డీగా మారింది... ఇప్పుడు కౌలు అంతా భూమిపైన ఇంతకు ముందు మదుపు పెట్టబడిన పెట్టుబడికి వడ్డీ మాత్రమే." (ఎకనామిస్ట్, జూలై 19, 1851) వడ్డీ ఇచ్చే పెట్టుబడి హోదాలో పెట్టుబడి ఉత్పత్తి కాగల సంపద అంతటిపైన యాజమాన్య హక్కుల్ని కోరుతుంది. సర్వాన్ని కబళించే దాని ఆకలికి ఇంతవరకు అది పొందినదంతా అంతవరకు చెల్లింపబడిన వాయిదాలుగా మాత్రమే పరిగణింపబడుతుంది. కాని సహజ నియమాల ద్వారా మానవజాతి భవిష్యత్తులో నిర్వహించే అదనపు శ్రమ అంతా దానికే చెందుతుంది. సంక్షిప్తంగా చెప్పాలంటే మోలాక్.[1]

ఇక ముగింపుగా కాల్పనికవాది మ్యూలర్ కలగాపులగపు గందరగోళాన్ని చూడండి. "డాక్టర్ ప్రైస్ చక్రవడ్డీ యొక్క అమితమైన అభివృద్ధి లేదా మనిషి యొక్క స్వయంగా వేగవృద్ధి చెందే శక్తులకు ముందు ఒక అవిభాజ్యమైన, అవిచ్ఛిన్నమైన ఒకేలాంటి వినియోగం కొన్ని శతాబ్దాల పాటు జరగాలి. అలాంటి మానవశక్తులు, బ్రహ్మాండమైన ఫలితాలు రావాలంటే ఇది అవసరం. పెట్టుబడి విభజించ బడగానే స్వతంత్రంగా పెరిగే అనేక అంశాలుగా చీలిపోయినపుడు మొత్తం సంచయన శక్తులు మళ్ళీ కొత్తగా ప్రారంభమవుతాయి. ప్రతీ కార్మికుని సగటు భాగంగా 20, 25 ఏళ్ళ కాలంపాటు శక్తిని ప్రకృతి సమానంగా పంచుతుంది. (!) ఈ కాలం అయిపోగానే కార్మికుడు అతని వృత్తిని వదిలివేస్తాడు. శ్రమ యొక్క చక్రవడ్డీచేత సంచితమైన పెట్టుబడిని కొత్త కార్మికుడికి బదిలీ చేయాలి. దానిని చాలా వరకూ అనేకమంది కార్మికులకు లేదా పిల్లలకు అప్పగించాలి. వీరు తమ వాటా పెట్టుబడిని క్రియాశీలంగా మార్చడమూ, వినియోగించడమూ నేర్చుకోవాలి. దీనిపైన చక్రవడ్డీని వాస్తవంగా వాళ్ళు గ్రహించడానికి ముందే ఈ పని జరగాలి. అంతేగాక ఒక పెద్ద పరిమాణంలో వున్న పెట్టుబడి అత్యంత అశాంతంగా వున్న దేశాలలో సైతం సభ్యసమాజం సంపాదించిన భారీ పెట్టుబడి చాలా ఏళ్ళలో క్రమంగా పోగుచేయబడిన పెట్టుబడి. అంతేగాని దానిని తక్షణ శ్రమ విస్తరణ కోసం ఉపయోగించలేదు. దానికి బదులుగా కొద్దిపాటి మొత్తం పోగుపడినప్పుడు అది మరో వ్యక్తికి, మరో కార్మికునికి బ్యాంకరు లేదా ప్రభుత్వానికి బదిలీ చేయబడింది. అది అప్పు అన్న పద్దు క్రింద జరుగుతుంది. అలా అప్పు తీసుకున్న వ్యక్తి లేదా సంస్థ ఆ పెట్టుబడిని వాస్తవ చలనంలో వుంచి చక్రవడ్డీని సంపాదిస్తుంది. మొదటి రుణదాతకు మామూలు వడ్డీ చెల్లిస్తుంది. అంతిమంగా వినియోగం, దురాశ, దుర్వ్యయం ఈ వేగ వృద్ధి క్రమాన్ని అడ్డగిస్తాయి. అలా కాకుండా ఉత్పత్తి నియమం లేక పొదుపు నియమం మాత్రమే ప్రభావం కలిగిస్తే అప్పుడు మనిషి యొక్క శక్తులు, వారి ఉత్పాదితాలు వేగంగా వృద్ధి చెందుతాయి." (ఎ.ముల్లర్, ఎలిమెంట్ డెర్ స్టాట్‌ఫ్కన్స్ట్ III, పుటలు 147, 49)

ఇన్ని తక్కువ పంక్తులలో ఇంతటి రోమాంచిత అసంబద్ధమైన అంశాలను అల్లడం అసాధ్యం. కార్మికుల్ని, పెట్టుబడిదారుల్ని శ్రమశక్తి విలువను పెట్టుబడిపై వడ్డీకి కలగాపులగం చేసి గందరగోళ పరచి వినోదాన్ని విడిచి ప్రక్కన పెడితే, చక్రవడ్డీని వసూలు చేయడాన్ని చక్రవడ్డీ తేవడం కోసం అప్పు ఇవ్వబడిన పెట్టుబడి సహాయంతో వివరించవచ్చు అనుకోవడం మొత్తం జీవిత రంగాలన్నింటి

1. దుష్టదేవుడు, పుట్టబోయే పిల్లల్ని బలికోరతాడు. (తెలుగు - సం.)

లోనూ వున్న నిఖార్సయిన కాల్పనికతకు నిదర్శనం మన ముల్లర్ గారి పద్ధతి. ఆ పద్ధతిలో సమకాలీన అభిమాన దురభిమానాలన్నీ ఉన్నాయి. పైకి కనిపించే అంశాలను చిలికి సారాంశం రాబట్టబడింది. ఈ దోషభూయిష్టమైన, అల్ప సారాంశం ఆకాశానికెత్తబడి మరింత గందరగోళపరచే వ్యక్తీకరణ పద్ధతి ద్వారా మార్మిక ధోరణిలో గానం చేయడమే మిగిలిందిక.

పెట్టుబడి సంచయన క్రమాన్ని చక్రవడ్డీ సంచయనంగా ఊహించవచ్చు. ఎలాగంటే పెట్టుబడిగా తిరిగి మార్చబడిన లాభం (అదనపు విలువ)లో ఒక భాగం మరింత అదనపు విలువను అనగా వడ్డీని గ్రహించడానికి పనికివస్తుంది. అయితే.....

1. ఆయా సందర్భాలలో జరిగే జోక్యాన్ని అలా వుంచితే మార్కెట్‌లో లభించే పెట్టుబడిలో అధిక భాగం పునరుత్పత్తి ప్రక్రియలో నిరంతరాయంగా దాని విలువను కోల్పోతుంది. ఎందుకంటే సరుకుల విలువ వాటి ఉత్పత్తి ప్రక్రియలో ఖర్చుపెట్టబడిన శ్రమకాలాన్ని బట్టి కాక, వాటి పునరుత్పత్తిలో ఖర్చు పెట్టబడిన శ్రమకాలంచేత నిర్ణయించబడుతుంది. పైగా సామాజిక శ్రమ ఉత్పాదకత అభివృద్ధి చెందటం వల్ల ఇది మరింత తగ్గుతుంది. మరింత ఉన్నత స్థాయిలో వున్న సామాజిక ఉత్పాదకత ఉన్నప్పుడు ఆ కారణంచేత మార్కెట్లో లభించే పెట్టుబడి మొత్తం సాపేక్షంగా పునరుత్పత్తి కాలావధి తక్కువగా వుండటం అన్న కారణంగా దాని ఫలితంగా కనిపిస్తుంది. అంతేకాని పెట్టుబడి సంచయనం యొక్క సుదీర్ఘ ఫలితం కాదు అనిపిస్తుంది.[1]
2. ఈ పుస్తకంలో మూడవ భాగంలో నిరూపించినట్టు లాభం రేటు అన్నది పెట్టుబడి సంచయనం పెరుగుతున్న కొద్దీ, దానితోపాటు సామాజిక శ్రమ ఉత్పాదకత పెరుగుతున్న కొద్దీ అదే నిష్పత్తిలో తగ్గుతుంది. స్థిర పెట్టుబడి భాగంతో పోల్చినపుడు రానురానూ అస్థిర పెట్టుబడి సాపేక్షంగా తగ్గిపోవడంలో ఇది వ్యక్తమవుతుంది. ఒక కార్మికుడు చలనంలో ఉంచగలిగిన పెట్టుబడి పది రెట్లు పెరిగినప్పుడు అదే రేటులో లాభం ఉత్పత్తి చేయాలంటే అదనపు శ్రమకాలం పది రెట్లు పెరగాలి. అప్పుడు మొత్తం శ్రమకాలం మొత్తం రోజులో 24 గంటల్ని పెట్టుబడే స్వాహా చేసినప్పటికీ అవి కూడా చాలవు. లాభం రేటు తగ్గదు అన్న భావన ప్రైస్ యొక్క వేగ వృద్ధి క్రమం సిద్ధాంతానికి ఆధారం. "చక్రవడ్డీతో, పెట్టుబడి సర్వాన్నీ ఆవహిస్తుంది"[2] అన్న ఆలోచనకు కూడా ఆధారం ఇదే.

అదనపు విలువ, అదనపు శ్రమల ఏకరూపత అన్నది పెట్టుబడి సంచయనంపైన గుణాత్మకమైన

---

1. ఈ అంశంపైన మిల్, కారీ, రోశ్చర్‌ల పొరపాటు వ్యాఖ్యానాలు చూడండి. (మార్క్స్ ఈ క్రింది గ్రంథాలను ప్రస్తావిస్తున్నాడు. జె. స్టూవర్ట్ మిల్, ప్రిన్సిపుల్స్ ఆఫ్ పొలిటికల్ ఎకానమీ, రెండవ ముద్రణ, సంపుటి I, లండన్, 1849, పుటలు 91, 92; హెచ్.సి.హెచ్. కారీ, ప్రిన్సిపుల్ ఆఫ్ సోషల్ సైన్స్, సంపుటి III, ఫిలడెల్ఫియా, 1859, పుటలు 71, 73; డబ్ల్యు. రోశ్చర్, డై గ్రండ్లాగెన్ డెర్ నేషనల్యోకనామీ, 3 ఆఫ్ లేస్ స్టుట్ గార్ట్, ఆగ్స్ బర్గ్, 1858, 45వ అధ్యాయం - సం॥)
2. "చక్రవడ్డీ యొక్క ఉగ్రమైన డిమాండ్లకు ఏ శ్రమ, ఏ ఉత్పాదక శక్తి, ఏ తెలివితేటలు, ఏ కళా జవాబు చెప్పలేవన్నది స్పష్టం. అయితే మొత్తం పొదుపంతా పెట్టుబడిదారుని ఆదాయం నుంచే లభిస్తుంది. కాబట్టి ఈ డిమాండ్లు వాస్తవంగా నిరంతరాయంగా చేరబడతాయి. అంతే నిరంతరాయంగా కార్మికుని ఉత్పాదక శక్తి వాటిని తీర్చడానికి నిరాకరిస్తుంది. కనుక ఒకరకమైన సమతూకం ఎప్పుడూ ఏర్పడుతుం టుంది." (లేబర్ డిఫెండెడ్ ఎగెనెస్ట్ ది క్లెయిమ్స్ ఆఫ్ కేపిటల్, పుట 23; హాడ్జిస్కిన్)

పరిమితిని విధిస్తుంది. దీనిలో మొత్తం పనిదినం ఉంటుంది. ఉత్పత్తి శక్తులు, జనాభాల ఆనాటి అభివృద్ధి అన్నది వినియోగించుకోదగిన పనిదినాల సంఖ్యను అదే సమయంలో పరిమితం చేస్తుంది. అయితే అదనపు విలువను వడ్డీ అన్న అర్థరహిత రూపంతో ఊహించినప్పుడు ఆ పరిమితి అన్నది కేవలం పరిమాణాత్మకం. అది యావత్ కల్పనాశక్తిని అధిగమిస్తుంది.

వడ్డీ ఇచ్చే పెట్టుబడి విషయంలో పెట్టుబడి యొక్క ఆరాధనాత్మక భావన అత్యున్నత స్థాయికి చేరుకుంటుంది. సంచిత శ్రమ ఉత్పాదితంగా, దాని స్థిరరూపమైన డబ్బుకు ఒక అంతర్నిహిత రహస్య శక్తిని, ఒక స్వయంచలనాన్ని, గుణవృద్ధి వేగంతో అదనపు విలువను సృష్టించగలిగిన శక్తిని ఆపాదించే భావన వల్ల ఇది జరుగుతుంటుంది. అందుచేతనే సంచిత శ్రమ ఉత్పాదితం ప్రపంచంలో వున్న సంపదనంతటినీ భవిష్యత్తులో ఉండబోయే సంపదతో సహా మొత్తం తనకే చెందుతుందని, న్యాయంగానే తనవద్దకు చేరుతోందనీ భావిస్తుందని 'ఎకనామిస్ట్' కథనం. గత శ్రమ ఉత్పాదితంతో పాటు పాత శ్రమ కూడా ఇక్కడ వర్తమాన లేదా భవిష్యత్ సజీవ అదనపు శ్రమను కడుపులో ఉంచుకుందన్నమాట. అయితే వాస్తవంలో గత శ్రమ ఉత్పాదితాల విలువ భద్రపరచడమూ, కొంత మేరకు పునరుత్పత్తి కావడమూ అన్నది అది సజీవ శ్రమతో సంబంధం ఫలితం మాత్రమే అని మనకు తెలుసు. గత శ్రమ ఉత్పాదితాలు సజీవ అదనపు శ్రమపై పెత్తనం చేయటమన్నది పెట్టుబడిదారీ సంబంధాలున్నంత వరకూ ఉంటుందని కూడా మనకు తెలుసు. పాత శ్రమ కొత్త శ్రమపై స్వతంత్రంగాను, అపరిమితంగానూ ఆధిపత్యం వహించే ప్రత్యేక సామాజిక సంబంధాల ప్రాతిపదికపై పెట్టుబడిదారీ సంబంధాలు ఉంటాయి.

★ ★ ★

## అధ్యాయం - 25

# పరపతి పెట్టుబడి, కల్పిత పెట్టుబడి

పరపతి వ్యవస్థ గురించి, అది తన ఉపయోగం కోసం సృష్టించే పరికరాల (పరపతి సౌకర్యం మొదలైనవి) గురించి వివరించడం మన పరిధిలో లేదు. సాధారణంగా పెట్టుబడిదారీ ఉత్పత్తి విధాన లక్షణాలను తెలియజేసే కొన్ని ప్రత్యేకాంశాలను మాత్రమే తీసుకుందాం. వాణిజ్య పరపతి గురించి, బ్యాంక్ పరపతి గురించీ మాత్రమే చర్చిద్దాం. ఈ రూపంలో ఉన్న పరపతితో పాటు ప్రభుత్వ పరపతి యొక్క అభివృద్ధుల మధ్య సంబంధాన్ని గురించి కూడా ఇక్కడ పరిశీలించబోవడం లేదు.

ఒక చెల్లింపు సాధనంగా డబ్బు యొక్క విధులేమిటో, పరపతి సౌకర్యం పొందే వ్యక్తికి పరపతి ఇచ్చే వ్యక్తికి ఉన్న సంబంధం ఏమిటో, అలాగే సాధారణ సరుకుల చలామణి నుంచి సరుకుల ఉత్పత్తిదారునికి సరుకుల వ్యాపారికి మధ్య తలెత్తే సంబంధాల గురించి నేను ఇంతకు ముందే తెలియచేశాను.[1] వ్యాపారమూ, చలామణి కోసమే ఉత్పత్తి చేసే పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానమూ అభివృద్ధి చెందడంతో పరపతి వ్యవస్థ యొక్క సహజ ప్రాతిపదిక విస్తరిస్తుంది, సార్వత్రికమౌతుంది, వ్యవస్థీకృతమవుతుంది. డబ్బు ఇక్కడ మొత్తం మీద కేవలం చెల్లింపు సాధనంగానే ఉపయోగపడుతుంది. అనగా సరుకులు డబ్బుకు కాక ఒక నిర్ణీత తేదీనాడు చెల్లించే రాతపూర్వక వాగ్దాన పత్రంపై అమ్మబడతాయి. సంక్షిప్తత కోసం, ఈ ప్రామిసరీ నోట్లన్నిటినీ బిల్స్ ఆఫ్ ఎక్స్ఛేంజి అనే సాధారణ శీర్షిక కింద ఉంచుదాం. వాస్తవంగా చెల్లించాల్సిన నిర్ణీత తేదీ వరకు అటువంటి బిల్స్ ఆఫ్ ఎక్స్ఛేంజి చెల్లింపు సాధనాలుగా చలామణి అవుతాయి. అవే వాస్తవమైన వాణిజ్య ధనంగా ఉంటాయి. రావాల్సిన బాకీలు, ఇవ్వాల్సిన బాకీల సమతౌల్యం ద్వారా అంతిమంగా పరస్పరం రద్దు చేసుకునేదాకా అవి పూర్తిగా డబ్బుగా వ్యవహరిస్తాయి. అవి వాస్తవంగా డబ్బుగా మారినప్పటికీ ఇదే జరుగుతుంది. ఉత్పత్తిదారులు, వ్యాపారులు పరస్పరం చేసుకునే అడ్వాన్స్‌లు పరపతి యొక్క వాస్తవమైన పునాది అయినట్లే, అలాగే వారి చలామణి సాధనమైన బిల్స్ ఆఫ్ ఎక్స్ఛేంజి పరపతి ధనం యొక్క, బ్యాంక్ నోట్లు యొక్క ప్రాతిపదిక అవుతుంది. నాణేల రూపంలోని లేదా పేపర్ కరెన్సీ రూపంలోని డబ్బు చలామణిపై ఇవి ఆధారపడవు. మార్పిడి బిల్లుల (బిల్స్ ఆఫ్ ఎక్స్ఛేంజి) చలామణిపైనే ఆధారపడి ఉంటాయి.

డబ్ల్యు. లియాథాన్ (యార్క్‌షైర్‌కి చెందిన బ్యాంకర్) తన 'లెటర్స్ ఆన్ ది కరెన్సీ' అనే గ్రంథంలో ఇలా రాస్తాడు. 2వ ముద్రణ, లండన్ 1840... "మొత్తం 1839 సంవత్సరంలో ఈ

1. కాపిటల్ వాల్యూం III, అధ్యాయం 3.

మొత్తం..... 528,493,842 పౌండ్లు." (ఇందులో విదేశీ బిల్స్ ఆఫ్ ఎక్స్ఛేంజి 5వ వంతు ఉంటుం దని అతను భావించాడు.) "అదే సంవత్సరం దీనిలో విదేశాల బిల్లులు 132,123,460 పౌండ్లు." (పుట 56) ఈ బిల్స్ ఆఫ్ ఎక్స్ఛేంజి "మిగిలినవన్నీ కలపగా వచ్చే మొత్తం కంటే ఒక భాగం ఎక్కువగా ఉంది." (పుట 3) "ఇంత పెద్ద ఉపరి నిర్మాణమూ బ్యాంక్ నోట్లతోను బంగారంతోనూ ఏర్పడిన ప్రాతిపదికపైన ఆధారపడి ఉంటుంది." (!) "కొన్ని సంఘటనల తర్వాత ఈ ప్రాతిపదిక మరీ సంకుచితమైపోతే దాని యొక్క స్థిరత్వమూ, మొత్తానికి అస్తిత్వమే ప్రమాదంలో పడిపోతుంది." (పుట 8) "నేను మొత్తం కరెన్సీని" (అంటే ఆయన ఉద్దేశం బ్యాంక్ నోట్లు అని అర్థం.) "అంటే మొత్తం కరెన్సీని డిమాండ్‌పైన బ్యాంకులు, దేశవాళీ బ్యాంకర్లు చెల్లించాల్సిన బాకీలు మొత్తాన్ని నేను అంచనా వేస్తే నాకు 1530 లక్షలు తేలుతుంది. అనగా చట్టబద్ధంగా బంగారంలోకి మార్చాల్సిన డబ్బు ఇది. అయితే... డిమాండ్‌ను తీర్చడం కోసం అవసరమైన బంగారం మొత్తం 140 లక్షల బంగారం మాత్రమే ఉంది." (పుట 11) ఈ బిల్స్ ఆఫ్ ఎక్స్ఛేంజిని అదుపులో ఉంచడానికి డబ్బు విస్తారాన్ని, అతి ఎక్కువగా అతి తక్కువగా ఉండే వడ్డీ లేదా డిస్కౌంట్ రేట్లను నిరోధించడం మినహా మరో మార్గం లేదు. ఇవి బిల్స్ ఆఫ్ ఎక్స్ఛేంజిలో ఒక భాగంగా ఉంటాయి. వీటిని నిరోధించకపోతే అవి పెద్ద ప్రమాదకరమైన విస్తరణను ప్రోత్సహిస్తాయి. ప్రామాణిక లావాదేవీల నుంచి అనగా వాస్తవ బేరాలు విక్రయాల నుండి ఏ భాగం తలెత్తుతుంది? అలాగే ఏ భాగం కేవలం నకిలీ భాగంగా వీలుకల్పించే కాగితంగా మాత్రమే ఉంటుంది? అన్నది నిర్ణయించడం అసాధ్యం. అనగా ఒక బిల్ ఆఫ్ ఎక్స్ఛేంజిని నడపటానికి మరొకదాన్ని సృష్టించడం ద్వారా కరెన్సీని సృష్టించడం ద్వారా ఒక నకిలీ పెట్టుబడిని రూపొందించడం అన్నది ఎంతగా జరుగుతుందో నిర్ణయించలేం. సమృద్ధి కాలంలో చౌకడబ్బు దొరికే కాలంలో ఇవి పెద్ద మొత్తాలకు చేరుకుంటుందని నాకు తెలుసు." (పుటలు 43, 44) జె.డబ్ల్యు. బొసాంక్విట్ మోటాలిక్ పేపర్ అండ్ క్రెడిట్ కరెన్సీ, లండన్, 1842.... "క్లియరింగ్ హౌస్ ద్వారా (లండన్ బ్యాంకర్లు బిల్లులను, చెక్కులను మార్పిడి చేసుకునే చోటు) జరిగే చెల్లింపుల మొత్తం సగటున ఏడాది రోజుకు మొత్తం 30 లక్షల పౌండ్లు. దీనికి అవసరమైన డబ్బు మొత్తం రోజుకు 2 లక్షల పౌండ్లు. (పుట 86) (1889లో క్లియరింగ్ హౌస్ మొత్తం టర్నోవరు సగటున 300 వ్యాపార దినాల్లో $7618\frac{3}{4}$ మిలియన్ పౌండ్లు ఉంది. అనగా రోజుకు సగటున $25\frac{1}{2}$ మిలియన్ పౌండ్లు ఉంటుంది – ఎంగెల్స్) "బిల్స్ ఆఫ్ ఎక్స్ఛేంజి నిస్సందేహంగా డబ్బుతో ప్రమేయం లేకుండానే కరెన్సీగా వ్యవహరిస్తాయి." అవి ఒక చేతినుంచి మరో చేతికి ఆస్తిని కేవలం దఖలు పరచడం ద్వారా బదిలీ చేస్తున్నాయి. కనుక ఇది జరుగుతుంది. (పుట 92) "చలామణిలో నున్న ప్రతి బిల్లుకు సగటున బాధ్యత దఖలుపరచడమనేది రెండుసార్లు జరుగుతుంది. ప్రతి బిల్లు చెల్లించబడే తేదీ ముందు రెండుసార్లు చెల్లించబడుతుంది. ఈ ఊహ ఆధారంగానే కేవలం బాధ్యత దఖలు పరచడం ద్వారానే బిల్స్ ఆఫ్ ఎక్స్ఛేంజి ద్వారా ఆస్తి చేతులు మారుతున్నట్లు కనిపిస్తుంది. ఈ రకంగా అది 5,280 లక్షలకు రెండింతలు లేదా 10,560 లక్షల పౌండ్ల విలువ గల్గిన మొత్తం అన్నమాట. 1839లో రోజుకు 30 లక్షల పౌండ్ల చొప్పున ఈ మొత్తం అయింది. కనుక డిపాజిట్లు, బిల్స్ ఆఫ్ ఎక్స్ఛేంజి కలిసి డబ్బు సాయం లేకుండానే రోజువారీ 180 లక్షల పౌండ్లకు తగ్గకుండా ఆస్తి చేతులు మారటం ద్వారా అవి డబ్బు విధులను నిర్వహిస్తున్నాయనే నిర్ధారణకు మనం రావచ్చు." (పుట 93)

సాధారణమైన పరపతి గురించి టూకే ఇలా అంటాడు. "మామూలు మాటల్లో చెబితే పరపతి అన్నది ఒక నమ్మకం. అది ఆధార సహితమూ కావచ్చు, ఆధార రహితమూ కావచ్చు. డబ్బు రూపంలో లేదా సరుకుల రూపంలో అంగీకరించబడిన డబ్బు మొత్తంలో దాని విలువ లెక్కించబడి ప్రతి సందర్భంలోనూ ఒక నిర్ణీత గడువులోగా చెల్లించే ఒప్పందంపై కొంత పెట్టుబడి మొత్తాన్ని మరో వ్యక్తికి దఖలుపరచడమనేది జరుగుతుంది. పెట్టుబడి డబ్బు రూపంలో అనగా బ్యాంక్ నోట్లలో గాని, నగదు పరపతిగా గాని డబ్బు రూపంలో పెట్టుబడి అప్పిచ్చిన సందర్భాలలో ప్రతీ 100 పౌండ్లకు పైన ఫలానా ఇంత మొత్తం పెట్టుబడిని అదనంగా చెల్లించాల్సి ఉంటుంది. సరుకుల విషయంలో అయితే వాటి విలువను డబ్బు రూపం మార్చి అంగీకారం కుదుర్చుకోబడుతుంది. దీనిలో విక్రయం కూడా ఉంటుంది. పెట్టుబడి ఉపయోగించుకోనిచ్చినందుకుగాను, చెల్లించాల్సిన గడువు వరకూ రిస్కు తీసుకున్నందుకుగాను ఈ అంశాలు చెల్లించాల్సిన మొత్తం అంచనా వేయడంలో పరిగణనలోకి తీసుకోబడతాయి. నిర్ణీత తేదీలలో చెల్లిస్తామనే రాతపూర్వక హామీలు ఈ పరపతి సౌకర్యంతో పాటు సాధారణంగా ఉంటూ ఉంటాయి. ఈ పత్రాలు లేదా ప్రామిసరీ నోట్లు బదిలీ చేయబడగలవు. రుణదాతలు డబ్బు రూపంలో గాని, సరుకుల రూపంలో గాని తమ పెట్టుబడిని తమ చేతుల్లో ఉన్న బిల్లుల గడువు పూర్తికాక ముందు ఉపయోగించుకోదలచుకుంటే ఈ పత్రాలు వారికి సాధనంగా ఉపయోగపడతాయి. అతి తక్కువ ధరలకు అప్పు తీసుకోడానికి లేదా కొనడానికి వారికి వీలుకల్పిస్తాయి. బిల్లులపైన తమ పేర్లతోపాటు ఇతరుల పేర్లు కూడా జమ అవటం వల్ల తమ పరపతి వ్యవస్థను వారు బలోపేతం చేసుకోగలుగుతారు." (ఇంక్వైరీ ఇన్ టు ది కరెన్సీ ప్రిన్సిపుల్, పుట 87.)

చార్లెస్ కోకెలిన్, డూక్రెడిట్ ఎట్ డిస్ బాంక్వెస్ డాన్స్ లా ఇండస్ట్రీ, రెవ్యూ డిస్ డ్యూ మోండిస్, 1842, తోం 31 : "ప్రతి దేశంలోను పరపతి లావాదేవీలలో అత్యధికం పారిశ్రామిక సంబంధాల వలయంలోనే జరుగుతాయి. ముడి పదార్థాలను ఉత్పత్తిదారుడు వాటిని ప్రాసెసింగ్ చేసే కార్ఖానాదారునికి అందజేస్తాడు. ఒక నిర్ణీత తేదీన చెల్లిస్తాననే హామీ పత్రాన్ని అతనినుంచి తీసుకుంటాడు. కార్ఖానాదారుడు తన పని పూర్తయిన తర్వాత అతడు కూడా అటువంటి షరతులపైనే మరో కార్ఖానాదారునికి తన ఉత్పాదితాన్ని అందజేస్తాడు. ఈ రెండో కార్ఖానాదారుడు ఆ ఉత్పాదితాన్ని మరింత మార్చాల్సి ఉంటుంది. ఈ రకంగా పరపతి అన్నది ఒకరి నుంచి మరొకరికి వినియోగదారునికి వస్తువు చేరే వరకు అది విస్తరిస్తూనే ఉంటుంది. టోకు వ్యాపారి చిల్లర వ్యాపారికి సరుకుల్ని పరపతి పైనే ఇస్తాడు. అతడు కార్ఖానాదారుని నుంచి లేదా కమీషన్ ఏజెంట్ నుంచి వాటిని పరపతిపైనే పొంది ఉంటాడు. వీరిలో ప్రతి ఒక్కరూ కొన్నిసార్లు డబ్బును, తరచుగా ఉత్పాదితాన్ని ఒకచేత్తో అప్పు తీసుకుని మరోచేత్తో అప్పిస్తుంటారు. ఆ రకంగా అడ్వాన్స్‌ల యొక్క నిరంతరాయమైన మార్పిడి జరుగుతూ ఉంటుంది. పారిశ్రామిక సంబంధాలలో ఇదెక్కువగా జరుగుతూంటుంది. అన్ని దిశలలోనూ ఇవి కలుస్తాయి, విడిపోతాయి. పరపతి అభివృద్ధి అన్నదానిలో ఇలా పరస్పరం అడ్వాన్స్ చేసుకోవడం అన్నది అనేక రెట్లుగా పెరగడం ఉంటుంది. పరపతికి ఉన్న శక్తికి నిజమైన మూలం అదే."

పరపతి వ్యవస్థకు మరో పార్శ్వం డబ్బు వ్యవహారాల అభివృద్ధికి సంబంధించింది. సరుకుతో వ్యవహరించటం, అభివృద్ధి చెందడంతోపాటు ఇది కూడా అభివృద్ధిచెందుతుంది. దీనికి ముందు

భాగంలో (అధ్యాయం 19లో) వ్యాపారుల నిల్వ నిధుల బాధ్యత అనగా అంతర్జాతీయ చెల్లింపులకు, వాణిజ్యానికి చెందిన డబ్బును స్వీకరించడమూ, విడుదల చేయడమూ అన్న సాంకేతిక కార్యకలాపాల బాధ్యత అన్నది డబ్బుతో వాణిజ్యం చేసే వారి చేతుల్లో ఎలా కేంద్రీకృతమయిందో చూశారు. పరపతి వ్యవస్థకున్న మరో పార్శ్వం అంటే వడ్డీ ఇచ్చే పెట్టుబడి లేదా డబ్బు పెట్టుబడి నిర్వహణ, డబ్బుతో వ్యాపారం చేసే వారి ప్రత్యేక కార్యకలాపంగా, ఈ డబ్బు వ్యాపారంతో పాటు అభివృద్ధి చెందుతుంది. డబ్బు అప్పు తీసుకోవటమూ, అప్పు ఇవ్వటమూ అన్నది వీరి ప్రత్యేక వ్యాపారంగా మారుతుంది. డబ్బు పెట్టుబడి యొక్క రుణదాతలకు, రుణగ్రహీతలకు మధ్య దళారులుగా వీరు పనిచేస్తారు. సాధారణంగా బ్యాంక్ వాణిజ్యం యొక్క ఈ అంశంలో అప్పు ఇవ్వడానికి వీలయిన డబ్బు పెట్టుబడిని పెద్ద మొత్తాల్లో బ్యాంకర్ల చేతిలో కేంద్రీకృతమవ్వడం అన్న అంశం ఇమిడి ఉంటుంది. కనుక వ్యక్తిగతమైన రుణదాత స్థానంలో బ్యాంకర్లు పారిశ్రామిక పెట్టుబడిదారుల్ని, వాణిజ్య పెట్టుబడిదారుల్ని మొత్తం రుణదాతలందరి ప్రతినిధులుగా ఎదుర్కొంటారు. బ్యాంకర్లు డబ్బు పెట్టుబడికి జనరల్ మేనేజర్లుగా మారతారు. మరోవైపున మొత్తం వాణిజ్య ప్రపంచం కోసం అప్పు తీసుకోవడం ద్వారా రుణదాతలందరికీ అభిముఖంగా రుణగ్రహీతలందరినీ కేంద్రీకరిస్తారు. ఒకవైపున రుణదాతల డబ్బు పెట్టుబడిని, మరోవైపున రుణగ్రహీతల్ని బ్యాంక్ అన్నది కేంద్రీకరిస్తుంది. అది అప్పిచ్చే మొత్తంపై కంటే తీసుకునే మొత్తంపైన తక్కువ వడ్డీ చెల్లించటంలోనే దాని లాభం ఉంటుంది.

బ్యాంకుల దగ్గరున్న అప్పివ్వడానికి వీలయిన పెట్టుబడి అనేక మార్గాలలో బ్యాంకులకు లభిస్తుంది. వారు పారిశ్రామిక పెట్టుబడిదారులకు క్యాషియర్‌లు గనుక ప్రతి ఉత్పత్తిదారుడు వ్యాపారి నిల్వ నిధిగా (reserve fund) ఉంచుకోవాల్సిన డబ్బు పెట్టుబడిని లేదా ఇతరులు వారికి చెల్లించిన మొత్తాన్ని వారు తమ చేతుల్లో కేంద్రీకరించుకుంటారు. ఈ నిధులు ఆ రకంగా అప్పివ్వదగిన డబ్బు పెట్టుబడిగా మారతాయి. ఈ రకంగా వ్యాపార ప్రపంచం యొక్క నిల్వ నిధి ఒక ఉమ్మడి ఖజానాలో కేంద్రీకృతం అవడం వల్ల అత్యవసరమైన కనిష్ఠ మొత్తానికి కుదించబడింది. నిల్వ నిధిగా గురకపెట్టి నిద్రపోవాల్సిన డబ్బు పెట్టుబడిలో కొంత భాగం, ఆ రకంగా అప్పు ఇవ్వడం ద్వారా అది వడ్డీ యిచ్చే పెట్టుబడిగా వ్యవహరిస్తుంది. రెండోది – డబ్బు పెట్టుబడిదారులు తమ డబ్బును అప్పు వ్యాపారంలో సాయం చేయడానికిగాను బ్యాంకులో డిపాజిట్ చేస్తారు. ఆ రకంగా అప్పివ్వదగిన పెట్టుబడి తయారవుతుంది. అంతేగాక బ్యాంకింగ్ వ్యవస్థ అభివృద్ధి చెందడంతోపాటు ముఖ్యంగా డిపాజిట్లపైన వడ్డీ చెల్లించడానికి బ్యాంకులు ముందుకు రాగానే అన్ని వర్గాల పొదుపు మొత్తాలు, తాత్కాలికంగా ఖాళీగా ఉన్న డబ్బు బ్యాంకులో డిపాజిట్ అవుతుంది. తమంత తామే డబ్బు పెట్టుబడి వ్యవహరించ గల్గిన శక్తిలేని చిన్న మొత్తాలు కలిసి పెద్ద మొత్తాలై డబ్బు శక్తిగా మారతాయి. ఇలా చిన్న మొత్తాల్ని పోగుచేయడం అన్నది డబ్బు పెట్టుబడిదారులకు, రుణగ్రహీతలకు మధ్య అది నిర్వహించే కార్యకలాపాల్లో బ్యాంకింగ్ వ్యవస్థ యొక్క ఒక ప్రత్యేక విధిగా భావించాలి. అంతిమ విశ్లేషణలో సాధారణంగా క్రమేణ వినియోగమయ్యే ఆదాయాలు కూడా బ్యాంకులలో డిపాజిట్ అవుతాయి.

బిల్స్ ఆఫ్ ఎక్స్ఛేంజిని డిస్కౌంట్ చేయడం ద్వారా వాటి నిర్ణీత గడువుకు ముందు బిల్స్ ఆఫ్ ఎక్స్ఛేంజిని డబ్బుగా మార్చడం ద్వారా – అప్పు తీసుకుంటారు. (ఇక్కడ మనం వాణిజ్య పరపతిని గురించి ప్రస్తావిస్తున్నాం.) దానితోపాటు వివిధ రకాలయిన అడ్వాన్స్‌ల ద్వారా కూడా అప్పు తీసుకోవడం

సాధ్యమవుతుంది. వ్యక్తిగత పరపతిపైన ప్రత్యక్షంగా చేసే అడ్వాన్సులు, ప్రభుత్వ పత్రాలు, అన్ని రకాల సరుకుల నిల్వలు, బిల్స్ ఆఫ్ లేడింగ్ (Lading) పైన ఓవర్ డ్రాఫ్టులు, వడ్డీ ఇచ్చే పత్రాల లాంటి హామీ పత్రాలు, డాక్ వారెంటులు, సరుకుల యాజమాన్యానికి సంబంధించిన ఇతర అధికారిక పత్రాలు, అలాగే డిపాజిట్లపైన ఓవర్ డ్రాఫ్టులు మొదలైనవి.

బ్యాంకర్ ఇచ్చే పరపతి అనేక రూపాల్ని సంతరించుకుంటుంది. ఇతర బ్యాంకులపైన బిల్స్ ఆఫ్ ఎక్స్ఛేంజి, వాటిపైన చెక్కులు, అదే తరహాకు చెందిన పరపతి ఖాతాలు వగైరా. నోట్లను విడుదల చేసే హక్కున్న బ్యాంక్ తనే స్వయంగా బ్యాంకు నోట్లు రూపంలో ఇవ్వవచ్చు. బ్యాంకు నోటు అంటే అది తీసుకున్న వ్యక్తికి ప్రయివేటు డ్రాఫ్టులకు బదులు ఏ సమయంలోనైనా చెల్లే బ్యాంకు డ్రాఫ్టు తప్ప మరొకటి కాదు. సామాన్యునికి ఈ చివరి రూపంలో ఉన్న పరపతి చాలా ప్రధానంగా, కొట్టొచ్చినట్లు కనిపిస్తుంది. ఎందుకంటే మొదటిది ఈ రూపంలో వున్న పరపతి సొమ్ము వ్యాపార చలామణి పరిధిని ఛేదించుకుని సాధారణ చలామణిలోకి వస్తుంది. అక్కడది డబ్బుగా వ్యవహరిస్తుంది. చాలా దేశాలలో నోట్లను విడుదల చేసే బ్యాంకులు జాతీయ, ప్రైవేటు బ్యాంకుల యొక్క ఒక ప్రత్యేక మిశ్రమంగా ఉంటాయి. వాటికి దన్నుగా వాస్తవంలో జాతీయ పరపతి ఉంటుంది. అవి విడుదల చేసే నోట్లు చట్టబద్ధమైన కరెన్సీ పత్రాలుగా ఉంటాయి. బ్యాంకరు తనే స్వయంగా పరపతి వ్యవహారం చూసుకుంటాడు. కనుక బ్యాంకు నోటన్నది కేవలం చలామణిలో ఉన్న పరపతి చిహ్నం మాత్రమే. అయితే పరపతి యొక్క ఇతర రూపాలన్నింటిలోనూ అతడు వ్యవహరిస్తాడు. తన దగ్గర డిపాజిట్టయిన నగదు ధనాన్ని అడ్వాన్స్ చేస్తున్నప్పుడు కూడా అతడిలా వ్యవహరిస్తాడు. నిజానికి ఒక బ్యాంకు నోటు కేవలం టోకు వాణిజ్యం యొక్క నాణానికి ప్రాతినిధ్యం వహిస్తుంది. బ్యాంకులు డిపాజిట్లకు ఎప్పుడూ అత్యంత ప్రాధాన్యం యిస్తాయి. దీనికి అత్యుత్తమ నిదర్శనం స్కాట్లండు బ్యాంకులే.

ప్రత్యేక బ్యాంకుల రూపాల విషయంలో లాగానే ప్రత్యేక పరపతి సంస్థల గురించి కూడా ఇక్కడ మరింత పరిశీలన చేయాల్సిన అవసరం లేదు.

"బ్యాంకర్ల వాణిజ్యాన్ని... రెండు శాఖలుగా విభజించవచ్చు.... బ్యాంకర్ల వాణిజ్యంలో ఒక శాఖ తమ సొంత పెట్టుబడితో తక్షణ ఉపయోగం లేని వారినుండి ఆ పెట్టుబడిని పోగుచేసిన తక్షణ అవసరం ఉన్న వారికి పంచడం, బదిలీ చేయడం. రెండో శాఖ పని వారి ఖాతాదారుల ఆదాయాల డిపాజిట్లను స్వీకరించి ఆ మొత్తాన్ని ఖాతాదారుల ఖర్చు వినిమయ అవసరాలకై తిరిగి చెల్లించడం... మొదటిది పెట్టుబడి, చలామణి. రెండోది పెట్టుబడి చలనం (కరెన్సీ)... "మొదటిది" ఒకవైపున పెట్టుబడి కేంద్రీకరించి మరోవైపున దానిని పంపిణీ చేయడం... "రెండోది" జిల్లాలోని స్థానిక లక్ష్యాల కోసం చలామణిని నిర్వహించడంలో ఉపయోగించబడుతుంది." టూకే, ఇంక్వైరీ ఇన్ టు ది కరెన్సీ ప్రిన్సిపుల్, పుటలు 36, 37. ఈ పేరా గురించి మనం తిరిగి 28వ అధ్యాయంలో ప్రస్తావిద్దాం.

కమిటీ నివేదికలు సంపుటి VIII కమర్షియల్ డిస్ట్రెస్ సంపుటి II, భాగం I, 1847, 48; మినిట్స్ ఆఫ్ ఎవిడెన్స్ (ఇక ముందు కమర్షియల్ డిస్ట్రెస్ 1847, 48 అని ఉల్లేఖించబడుతుంది) 40లలో లండన్‌లో బిల్స్ ఆఫ్ ఎక్స్ఛేంజిని డిస్కౌంట్ చేసేటప్పుడు మరో బ్యాంకుపైన ఒక బ్యాంకు యొక్క 21 రోజుల డ్రాఫ్టులను బ్యాంకు నోట్లకు బదులు తరచుగా ఆమోదించటం జరిగింది. (దేశవాళీ బ్యాంకర్, జె. పిఫీస్ సాక్ష్యం, నెం. 4636, 4645) అదే నివేదిక ప్రకారం బ్యాంకర్ డబ్బు కొరత

ఉన్నప్పుడల్లా తమ ఖాతాదారులకు అటువంటి బిల్స్ ఆఫ్ ఎక్స్ఛేంజినే తరచుగా ఇవ్వటం ఆనవాయితీగా ఉంది. ఖాతాదారుడు బ్యాంకు నోటులు కావాలనుకుంటే ఈ బిల్లును మరోసారి డిస్కౌంట్ చేయాలి. బ్యాంకులకు ఇది డబ్బును ముద్రించే హక్కును ఇచ్చినట్లయింది. మెసర్స్ జోన్, లాయిడ్ అండ్ కంపెనీ డబ్బు కొరత ఏర్పడి వడ్డీ 5 శాతం కంటే పెరిగిన సందర్భాలలో 'అనాదిగా' ఈ రకంగానే చెల్లిస్తుంది. ఖాతాదారుడు అటువంటి బ్యాంకర్ల బిల్లులను సంతోషంగా స్వీకరించేవాడు. ఎందుకంటే జోన్స్, లాయిడ్ అండ్ కంపెనీ బిల్స్ తన సొంత బిల్లులకంటే తేలికగా డిస్కౌంట్ అయ్యేవి. అంతేకాక అవి 20 నుంచి 30 వరకూ చేతులు మారేవి. (అదే గ్రంథం, నెం.901 నుంచి 904 వరకూ, 905, 992)

ఈ రూపాలన్నీ చెల్లింపు హక్కులను బదిలీ చేయడానికి వీలు కల్పిస్తున్నాయి. "పరపతి అన్నది డబ్బు నిధులను నిర్వహించడానికి ఉద్దేశించబడిన ప్రతి సందర్భంలోనూ అది ధరించలేని రూపం అంటూ ఏదీ లేదు. ఆ రూపం బ్యాంకు నోటు, లేదా బిల్ ఆఫ్ ఎక్స్ఛేంజి లేదా బ్యాంకర్ చెక్ ఏదైనా కావచ్చు. ఇది ప్రతి ప్రత్యేక ఆవశ్యక అంశంలోను ఈ క్రమం ఒకటే, ఫలితం కూడా ఒకటే. "ఫుల్లర్టన్, ఆన్ ది రెగ్యులేషన్ ఆఫ్ ది కరెన్సీస్, రెండవ ముద్రణ, లండన్, 1845, పుట 38" "బ్యాంకు నోట్లనేవి పరపతి యొక్క చిల్లర మొత్తాలు." (పుట 51)

డి.డబ్ల్యు. గిల్బర్ట్ రాసిన ది హిస్టరీ అండ్ ప్రిన్సిపుల్స్ ఆఫ్ బ్యాంకింగ్ (లండన్, 1834) గ్రంథంలో ఇలా ఉంది. "ఒక బ్యాంకు యొక్క వ్యాపార పెట్టుబడులను రెండు భాగాలుగా విభజించవచ్చు. మదుపు చేసిన పెట్టుబడి, అప్పు తీసుకోబడిన బ్యాంకింగ్ పెట్టుబడి." (పుట 117) "బ్యాంకింగ్ లేదా అప్పు తీసుకోబడిన పెట్టుబడిని సాధించాలంటే మూడు మార్గాలున్నాయి. మొదటిది డిపాజిట్లను స్వీకరించడం, రెండోది నోట్లను విడుదల చేయడం, మూడోది – బిల్స్‌ను తీసుకోవడం. ఒక వ్యక్తి నాకు ఊరికే 100 పౌండ్లు అప్పిచ్చాడనుకుందాం. ఆ 100 పౌండ్లను నేను మరో వ్యక్తికి 4 శాతం వడ్డీకి ఒక ఏడాది పాటు అప్పిస్తే ఈ లావాదేవీ వల్ల నాకు నాలుగు పౌండ్లు మిగులుతుంది. ఒక వ్యక్తి నా "ప్రామిస్ టు పే" (ఐ ప్రామిస్ టు పే అనేది ఇంగ్లీషు బ్యాంకు నోట్ల మీద ఉండే సూత్రం) ని తీసుకుని నాకు అది ఏడాది చివర మళ్ళీ తెచ్చి ఇచ్చి దానికోసం నాలుగు శాతం చెల్లించా డనుకుందాం. 100 సావరీన్లను నేను అతనికి అప్పు ఇచ్చి ఉంటే వచ్చినట్టే, ఇక్కడ కూడా 4 శాతం లాభం పొందుతున్నాయి. అలాగే ఒక చిన్న పట్నంలో ఉన్న ఓ వ్యక్తి ఒక వంద పౌండ్లు తెచ్చి దానిని 21 రోజులు తర్వాత లండన్‌లో ఉన్న మరో వ్యక్తికి చెల్లించాలనే షరతుపై నాకు ఇచ్చాడనుకుందాం. ఆ ఇరవయ్యొక్క రోజులలో దానిమీద నేను సంపాదించగల వడ్డీ కూడా నా లాభమే అవుతుంది. బ్యాంకింగ్ కార్యకలాపాల గురించి అలాగే డిపాజిట్ల ద్వారా నోట్లు, బిల్లుల ద్వారా బ్యాంకింగ్ పెట్టుబడి ఎలా సృష్టించబడుతుందో అన్న విషయం గురించి ఇది చక్కగా తెలియజేస్తుంది." (పుట 117) "బ్యాంకర్ లాభాలు సాధారణంగా అతని బ్యాంకింగ్ లేదా అప్పు తెచ్చిన పెట్టుబడి మొత్తానికి అనులోమానుపాతంలో ఉంటాయి.... ఒక బ్యాంకు యొక్క నిజమైన లాభాన్ని లెక్కించాలంటే మొత్తం లాభం నుంచి మదుపు పెట్టుబడిపైన వడ్డీని తీసివేయగా మిగిలేదే బ్యాంకింగ్ లాభం." (పుట 118) "బ్యాంకర్లు తమ ఖాతాదారులకు చేసే అడ్వాన్సులు ఇతర ప్రజల డబ్బుతో చేస్తారు." (పుట 146) "బ్యాంక్ నోట్లను విడుదల చేయని బ్యాంకర్లు మాత్రమే బిల్స్‌ను డిస్కౌంట్ చేయడం ద్వారా బ్యాంకింగ్

పెట్టుబడిని సృష్టిస్తారు. వారు తమ డిపాజిట్ల పెరుగుదలకు తమ డిస్కౌంట్లు లోబడి ఉండేలా చేస్తారు. లండన్ బ్యాంకర్లు తమ దగ్గర ఖాతాలకు డిపాజిట్ చేస్తే తప్ప డిస్కౌంట్ అనుమతించరు." (పుట 119) తన బిల్లులను డిస్కౌంట్ చేయించుకొని మొత్తం సొమ్ముపైన వడ్డీ చెల్లించే వ్యక్తి ఆ మొత్తంలో కొంత భాగాన్ని వడ్డీ లేకుండా బ్యాంకర్ల చేతుల్లో వదలాల్సి ఉంటుంది. ఈ రకంగా బ్యాంకర్‌కు వాస్తవంగా అడ్వాన్స్ చేసిన డబ్బుపైన అప్పటికి ఉన్న వడ్డీ రేటుకంటే ఎక్కువే లభిస్తుంది. తన చేతుల్లో మిగిలి ఉన్న మొత్తంతో అతను బ్యాంకింగ్ పెట్టుబడిని రూపొందిస్తాడు." (పుటలు 119, 120) నిల్వ నిధులపైన, డిపాజిట్లపైన, చెక్కులపైన పొదుపు "చలామణి సాధనం యొక్క ఉపయోగాన్ని డిపాజిట్ బ్యాంక్‌లో పొదుపు చేయడానికి తోడ్పడతాయి. ఇది హక్కుభుక్తాల బదిలీ సూత్రంపై జరుగుతుంది. ఆ రకంగా ఆ డిపాజిట్ బ్యాంకులు... ఒక చిన్న డబ్బు మొత్తంతో పెద్ద లావాదేవీల మొత్తాన్ని సాధించగలుగుతాయి. అలా విడుదలయిన డబ్బు బ్యాంకర్లు డిస్కౌంట్‌తో లేదా మరోరకంగా ఖాతాదారులకు అడ్వాన్స్‌లు చేయడానికి ఉపయోగిస్తారు. కనుక ఈ బదిలీ సూత్రం అన్నది డిపాజిట్ వ్యవస్థకు మరింత అదనపు సామర్థ్యాన్ని ఇస్తుంది." (పుట 123) "ఒకరితో ఒకరికి సంబంధం ఉన్న రెండు పక్షాలు తమ ఖాతాలను ఒకే బ్యాంకర్ దగ్గర ఉంచారా లేక వేరు వేరు బ్యాంకర్ల దగ్గర ఉంచారా అన్నదానితో ప్రమేయం లేదు. ఎందుకంటే బ్యాంకర్లు తమ చెక్కులను క్లియరింగ్ హౌస్‌లో పరస్పరం మార్చుకుంటారు. ఆ రకంగా బదిలీల ద్వారా డిపాజిట్ వ్యవస్థ నాణాలలో ఉన్న డబ్బు కరెన్సీ ఉపయోగాన్ని మొత్తంగానే తొలగించేదాకా సాగవచ్చు. ప్రతి మనిషీ తన బ్యాంకులో తన డిపాజిట్ ఖాతాను కలిగివుండి తన చెల్లింపులన్నింటినీ చెక్కుల ద్వారా నిర్వహిస్తే డబ్బు స్థానంలో చెక్కులు అపుడు ఏకైక చలామణి సాధనం అవుతాయి. ఈ సందర్భంలో బ్యాంకర్ తన చేతుల్లో డబ్బు ఉంచుకున్నాడని భావించడం అవసరం, లేదంటే చెక్కులకు ఏ విలువా ఉండదు." (పుట 124) 1. బ్యాంకు శాఖల ద్వారా దేశవాళీ బ్యాంకులకు తమ జిల్లాలోని చిన్న పట్టణాల్లో బ్యాంకు శాఖలున్నాయి. లండన్ బ్యాంకులకు నగరంలోని వివిధ జిల్లాలలో శాఖలున్నాయి. 2. ఏజెన్సీల ద్వారా, "ప్రతీ దేశవాళీ బ్యాంకర్ తన నోట్లను, బిల్లులను చెల్లించటం కోసం.... లండన్‌లో నివసిస్తున్న వారు జిల్లాలలో నివసిస్తున్న వారి ఉపయోగార్థం ఉంచిన మొత్తాలను స్వీకరించం కోసం ఒక లండన్ ఏజెంట్‌ను నియమిస్తారు." (పుట 127) ప్రతీ బ్యాంకర్ ఇతరుల నోట్లను ఆమోదిస్తాడు. కానీ వాటిని తిరిగి విడుదల చేయడు. అన్ని పెద్ద నగరాలలోను వారానికి వారంతా ఒకసారో రెండుసార్లో ఒకచోట చేరి తమ నోట్లను మార్పిడి చేసుకుంటారు. మిగిలిన మొత్తం లండన్ డ్రాఫ్ట్ ద్వారా చెల్లించబడుతుంది. (పుట 134) "బ్యాంకింగ్ లక్ష్యం వాణిజ్యానికి సదుపాయం కల్పించటం. వాణిజ్యానికి ఇచ్చే ప్రతి సౌకర్యం సట్టా వ్యాపారానికి సౌకర్యంగా మారుతుంది. వాణిజ్యమూ, సట్టా వ్యాపారమూ కొన్ని సందర్భాలలో ఎంత సన్నిహితంగా ముడిపడి ఉంటాయంటే సరిగ్గా ఎక్కడ వాణిజ్యం అంతం అవుతుందో, ఎక్కడ సట్టా వ్యాపారం ప్రారంభమవుతుందో చెప్పడం అసాధ్యం." బ్యాంకులున్న ప్రతిచోటా పెట్టుబడి మరింత సులభంగా చౌకరేటుతో దొరుకుతుంది. పెట్టుబడి యొక్క చౌకతనం సట్టా వ్యాపారానికి మరింత సౌకర్యాన్ని ఇస్తుంది. మాంసమూ, బీరు చౌకగా దొరికితే తిండిపోతుతనానికీ, తాగుబోతుతనానికీ సౌకర్యం పెరిగినట్టే ఇది కూడా." (పుటలు 137, 138) చలామణి బ్యాంకులు తమ నోట్లను ఎప్పుడూ తామే విడుదల చేసుకుంటాయి. కనుక తమ డిస్కౌంటింగ్

వాణిజ్యం కేవలం ఈ పద్ధతిలోనే సాగుతుందని భావించడానికి అవకాశం ఉంది. కానీ అది అలా జరగదు. తాను డిస్కౌంట్ చేసే బిల్లులన్నిటి కోసమూ, తన సొంత నోట్లను విడుదల చేయడం అన్నది ఒక బ్యాంకర్‌కు సాధ్యమే అయినప్పటికీ తన దగ్గరున్న బిల్లులతో పదింట తొమ్మిది వంతులు వాస్తవమైన పెట్టుబడికి ప్రాతినిధ్యం వహించాలి. ఎందుకంటే మొదటగా బిల్లు కోసం బ్యాంకర్ యొక్క నోట్లు ఇవ్వబడినప్పటికీ ఈ నోట్లు బిల్లు గడువు మరో మూడు నెలలు ఉండవచ్చు. నోట్లు మూడు రోజులలోనే తిరిగి రావచ్చు." (పుట 172) "నగదు పరపతి ఖాతా యొక్క ఓవర్ డ్రాఫ్టులు వాణిజ్యంలో రోజూ జరిగే విషయం. నిజానికి నగదు పరపతి ఇచ్చిన లక్ష్యమే అది... కేవలం వ్యక్తిగత హామీపైనే కాక ప్రజానిధుల హామీపైన కూడా నగదు పరపతి ఇవ్వబడుతుంది." (పుటలు 174, 175) "వాణిజ్య హామీలపై అప్పుగా అడ్వాన్స్ చేయబడిన పెట్టుబడి బిల్స్ డిస్కౌంటింగ్‌లో అడ్వాన్స్ చేయబడినప్పుడు కలిగే ప్రభావమే కలిగిస్తుంది. తన వాణిజ్య హామీపై ఒక సంస్థ 100 పౌండ్లు అప్పు తీసుకుంటే తన వాణిజ్యాన్ని అతడు 100 పౌండ్లు బిల్లుకు అమ్మి బ్యాంకర్ దగ్గర డిస్కౌంట్ చేసినట్లే అవుతుంది. ఈ అడ్వాన్స్‌ను పొందడం ద్వారా తన వాణిజ్యంపైన మరింత మంచి మార్కెట్ లభించేంత వరకూ హక్కు కలిగి ఉంటాడు. అలా కాకుంటే తక్షణ అవసరాల కోసం డబ్బులు సంపాదించడానికి తప్పనిసరై అతడు వాణిజ్యాన్ని వదిలిపెట్టుకోవాల్సిన పరిస్థితిని నిరోధిస్తాడు." (పుటలు 180, 181)

కరెన్సీ థియరీ రెవ్యూడ్, పుటలు 62, 63. నువ్వు ఈ రోజున 'అ' దగ్గర డిపాజిట్‌గా మారవచ్చు అన్నది నిస్సందేహంగా వాస్తవం. ఎల్లుండి దానిని 'ఆ' విడుదల చేయగా అది 'ఇ' దగ్గర డిపాజిట్‌గా మారవచ్చు. ఇది ఇలాగే అనంతంగా సాగుతుంది. ఒకే 1000 పౌండ్ల డబ్బు మొత్తం ఆ రకంగా బదిలీల పరంపర కారణంగా పూర్తిగా అనంతమైన డిపాజిట్ల పెద్ద మొత్తంగా అనేక రెట్లు పెరగవచ్చు. కనుక యునైటెడ్ కింగ్‌డమ్‌లో ఉన్న పదింట తొమ్మిది వంతుల డిపాజిట్‌లకు బ్యాంక్ రికార్డు పుస్తకాలతో తప్ప వాస్తవ అస్తిత్వం ఉండకపోవచ్చు. వాటికి జవాబుదారులు బ్యాంకర్లే... ఆ రకంగా స్కాట్లండ్‌లో ఉదాహరణకు కరెన్సీ (ఇందులో చాలావరకు కాగితం డబ్బు) 30 లక్షల పౌండ్లకు మించి ఎప్పుడూ లేదు. కానీ బ్యాంకులలో ఉన్న డిపాజిట్లు 270 లక్షల పౌండ్లని అంచనా వేయబడుతుంది... అలాగే అదే 1000 పౌండ్లు తన ప్రయాణాల నుంచి వెనక్కు పంపిస్తే అంత సులభంగా అంతే అనంతమైన మొత్తాన్ని రద్దు చేయగలిగి ఉంటుంది. ఎందుకంటే ఒక వ్యాపారికి నీవు ఇవ్వాల్సిన 1000 పౌండ్ల బాకీని తీర్చివేస్తే అవే 1000 పౌండ్లు అతడు రేపు ఒక వాణిజ్యవేత్తకు తను ఇవ్వాల్సిన బాకీని రద్దు చేసుకోవచ్చు. వాణిజ్యవేత్త ఆ తరువాత రోజున అదే సొమ్ముతో తన బ్యాంకు రుణాన్ని రద్దు చేసుకోవచ్చు. ఇది ఇలా అనంతంగా సాగవచ్చు. కనుక ఒకే 1000 పౌండ్లు ఒక చేతినుండి మరో చేతికి ఒక బ్యాంకునుండి మరో బ్యాంక్‌కు మారుతూ ఊహించటానికి వీలున్న ఎంత డిపాజిట్ల మొత్తాన్నైనా రద్దు చేయగలదు."

[1834 లోనే గిల్బర్ట్‌కి "వ్యాపారానికి వీలు కల్పించే ప్రతీది సట్టా వ్యాపారానికి వీలు కల్పిస్తుంది. వ్యాపారమూ, సట్టా వ్యాపారమూ కొన్ని సందర్భాలలో ఎంతగా ముడిపడి ఉంటాయంటే ఎక్కడ వ్యాపారం అంతమౌతుందో, ఎక్కడ సట్టా వ్యాపారం ప్రారంభమవుతుందో చెప్పడం అసాధ్యం" అని

తెలుసు అన్న సంగతి మనం చూశాం. అమ్మబడిన సరుకులపైన ఎడ్వాన్స్‌లను ఎంత తేలికగా పొందగలిగితే అంత ఎక్కువగా ఆ ఎడ్వాన్స్‌ను తీసుకోవటం జరుగుతుంది. సరుకుల్ని ఉత్పత్తి చేసి, సుదూర మార్కెట్లను అప్పటికే తయారైన సరుకులతో ముంచెత్తటానికి వాటిపైన డబ్బు ఎడ్వాన్సులను పొందటానికి పడే ప్రలోభం మరింతగా పెరుగుతుంది. అటువంటి మోసానికీ ఒక దేశం యొక్క మొత్తం వ్యాపార ప్రపంచం, ఏ మేరకు గురవుతుందో చివరికి ఏం జరుగుతుందో 1845, 47 సంవత్సరాలలో జరిగిన ఇంగ్లీషు వాణిజ్య చరిత్ర స్పష్టంగా నిరూపిస్తుంది. పరపతి అన్నది ఏయే పనులు నిర్వహించగలదో అది తెలియజేస్తుంది. కింది ఉదాహరణలకు వెళ్ళే ముందు కొన్ని ప్రాథమిక అంశాలను చూద్దాం.

1842 చివరలో ఇంగ్లీషు పరిశ్రమపై 1837 నుండి దాదాపు అవిచ్ఛిన్నంగా ఉంటూవచ్చిన ఒత్తిడి తొలగిపోవడం ప్రారంభయింది. తర్వాత రెండు సంవత్సరాలలోను ఇంగ్లీషు కార్ఖానాలలో తయారైన సరుకులకై విదేశాలలో ఉన్న డిమాండ్ పెరిగింది. 1845, 1846 సంవత్సరాలు అత్యంత సుభిక్ష దశల్ని సూచించాయి. 1843లో నల్లమందు యుద్ధం ఇంగ్లీషు వాణిజ్యానికి చైనా ద్వారాలను తెరిచింది. ఈ కొత్త మార్కెట్ అప్పటికే విస్తరిస్తున్న పరిశ్రమ మరింత విస్తరించడానికి ముఖ్యంగా పత్తి పరిశ్రమకు ఒక కొత్త ఊపునిచ్చింది. "మనం 30 కోట్ల ప్రజలకు బట్టనందివ్వాలి. అత్యధికంగా మనం ఎప్పుడూ ఎలా ఉత్పత్తి చేయగలుగుతాం?" అని ఈ రచయితతో ఒక మాంచెస్టర్ కార్ఖానాదారుడు అన్నాడు. అయితే కొత్తగా కట్టిన ఫ్యాక్టరీ భవనాలు, ఆవిరి యంత్రాలు, వడికే, నేత యంత్రాలు అన్నీ కలిపినా లాంక్‌షైర్ నుంచి ధారాళంగా వస్తున్న అదనపు విలువను ఇముడ్చుకోవడానికి సరిపోలేదు. ఉత్పత్తి పెంచడంలో చూపించినటువంటి పట్టుదలతోనే రైల్వే నిర్మాణంలో కూడా ప్రజలు నిమగ్న మయ్యారు. మొదట 1844 వేసవిలోనే కార్ఖానాదారుల, వాణిజ్యవేత్తల సట్టా వ్యాపార దాహం ఈ రంగంలో కొంత తీరింది. తొలి చెల్లింపుల కోసం అవసరమైన డబ్బు ఉన్న మేరకు నిల్వలకు పూర్తిగా తక్కువ వెలకట్టబడింది. మిగతా విషయాన్ని కాలమే సర్దుబాటు చేస్తుంది! అయితే తర్వాత చెల్లింపులు అవసరమైనప్పుడు (1059 సి.డి. 1848/57 తెలియజేసేదేమంటే 1846, 47లలో రైల్వేలలో పెట్టిన పెట్టుబడి 750 లక్షల పౌండ్లు) పరపతిని ఆశ్రయించాల్సి వచ్చింది. చాలా సందర్భాలలో ఆ సంస్థకున్న మూల పరిశ్రమను కూడా పిండాల్సి వచ్చింది.

చాలా సందర్భాలలో ఈ మూల పరిశ్రమలపై అత్యధిక భారం పడింది. నోరూరించే అధిక లాభాలు తన చేతుల్లో ఉన్న వనరుల శక్తిని మించిన స్థాయిలో విస్తారమైన కార్యకలాపాలకు పురికొల్పాయి. అయినా తేలికగా లభించే చౌక పరపతి సౌకర్యం బ్యాంకు డిస్కౌంట్ రేటు 1844లో చాలా తక్కువగా $1\frac{3}{4}$ నుంచి $2\frac{3}{4}\%$ వరకూ మాత్రమే ఉంది. 1845 అక్టోబర్ వరకు 3% కంటే తక్కువ ఉంది. అది కొద్దికాలంపాటు (1846 ఫిబ్రవరి) 5%కు పెరిగింది. 1846 డిసెంబర్‌లో $3\frac{1}{4}\%$కు పడిపోయింది. బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్‌కు దాని ఖజానాలో కనీవినీ ఎరుగనంత బంగారపు సరఫరా అప్పట్లో ఉండింది. దేశంలో ఉన్న కొటేషన్‌లు అన్నీ ఇంతకు ముందుకంటే ఎక్కువ స్థాయిలో ఉన్నాయి. కనుక ఈ సువర్ణావకాశాన్ని ఎందుకు వదులుకోవాలి? సాధ్యమయినంత మేరకు ఎందుకు ముందుకు పోకూడదు? ఇంగ్లీషు సరుకుల కోసం తహతహలాడుతున్న విదేశీ మార్కెట్లకు మనం

తయారుచేస్తున్న సరుకులన్నింటినీ ఎందుకు పంపరాదు? దూర ప్రాచ్యంలో నూలును, వస్త్రాలను అమ్మి తిరుగు ప్రయాణంలో ఇంగ్లండ్‌కు సరుకులు తీసుకురావడం ద్వారా ఇబ్బడిగా లాభాన్ని కార్ఖానాదారునిగా తాను ఎందుకు పొందరాదు?

ఆ రకంగా అడ్వాన్స్ చెల్లింపుల ఆధారంగా ఇండియాకు, చైనాకు భారీస్థాయిలో సరుకుల రవాణా వ్యవస్థ పెరిగింది. అలా త్వరలోనే కేవలం అడ్వాన్స్‌లు పొందటం కోసం దూరదేశాలకు రవాణా చేయడమన్న వ్యవస్థ పెరిగింది. దానివల్ల మార్కెట్లు అనివార్యంగా సరుకులతో ముంచి వేయబడ్డాయి. ఆర్థిక వ్యవస్థ పతనమైపోయింది. దీని వివరాలు తర్వాతి సూచికల్లో ఇవ్వబడ్డాయి.

ఈ పతనాన్ని 1846 పంటల వైఫల్యం మరింత తీవ్రం చేసింది. ఇంగ్లాండ్‌కు ముఖ్యంగా ఐర్లాండ్‌కు పెద్ద స్థాయిలో ఆహార పదార్థాలు ముఖ్యంగా ధాన్యం, బంగాళదుంపల దిగుమతి అవసరం అయింది. అయితే ఆ సరుకుల్ని సరఫరా చేసే దేశాలకు ఇంగ్లండ్ ఇవ్వగలిగిన ఉత్పాదితాలు పరిమితమే. వెండి, బంగారాల్ని ఇచ్చేయాల్సి వచ్చింది. కనీసం 90 లక్షల విలువ చేసే బంగారాన్ని విదేశాలకు పంపించాల్సి వచ్చింది. దీనిలో 75 లక్షలు బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్ ఖజానా నుంచే వచ్చింది. దానితో డబ్బు మార్కెట్లో దాని కార్యాచరణ స్వేచ్ఛ కొట్టవచ్చినట్లు దెబ్బతింది. బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్‌లో తమ నిల్వలను డిపాజిట్ చేసిన బ్యాంక్‌లు, ఆచరణలో దానిలాంటి కార్యకలాపాలే కలిగిన బ్యాంకులు కూడా డబ్బు సదుపాయాన్ని అందివ్వడాన్ని దాదాపు కుదించక తప్పలేదు. ఇంతకు ముందు వేగంగాను, అనాయాసంగాను సాగిన చెల్లింపుల ప్రవాహం నిరోధించబడింది. మొదట అక్కడక్కడ, తర్వాత సార్వత్రికంగాను ఇది జరిగింది. 1847 జనవరిలో కూడా 3 నుంచి $3\frac{1}{2}\%$ వరకు మాత్రమే ఉన్న బ్యాంకింగ్ డిస్కౌంట్ రేటు ఏప్రిల్ నాటికి 7% అయింది. ఏప్రిల్‌లోనే మొదటి భయోత్పాతం బద్దలయింది. వేసవిలో కొంతమేరకు పరిస్థితి మెరుగుపడింది. ($6\frac{1}{2}\%$, 6%) అయితే మళ్ళీ కొత్త పంట కూడా విఫలం కాగానే మళ్ళీ కొత్తగా మరింత ఉగ్రంగా భయోత్పాతం అలుముకుంది. అక్టోబర్‌లో 7కు, నవంబర్ నాటికి 10%కి అధికారికంగా కనీస బ్యాంక్ డిస్కౌంట్ పెరిగింది. బిల్స్ ఆఫ్ ఎక్స్ఛేంజిలో అత్యధికం బిల్లులపైన దారుణమైన వడ్డీ రేట్లు వసూలు చేయబడ్డాయి. కొన్ని బిల్లులపైన డిస్కౌంట్ పూర్తిగా నిరాకరించబడింది. చెల్లింపులను సార్వత్రికంగా ఆపు చేయటంతో కొన్ని పెద్ద సంస్థలు అనేక మధ్యతరహా చిన్న సంస్థలు దెబ్బతిన్నాయి. దగాకోరు బ్యాంకు చట్టం (బ్యాంకు యాక్ట్ ఆఫ్ 1844) విధించిన పరిమితులవల్ల బ్యాంకే ప్రమాదంలో పడిపోయింది. సర్వత్రా గగ్గోలు చెలరేగింది. దానికి లొంగి ప్రభుత్వం ఈ బ్యాంక్ చట్టాన్ని అక్టోబర్ 25న నిలిపివేసింది. ఆ రకంగా బ్యాంక్‌పైన రుద్దిన అసంబద్ధమైన, చట్టపరమైన సంకెళ్ళను అది తొలగించింది. అది ఇప్పుడు బ్యాంకు నోట్ల సరఫరాను నిరాఘాటంగా చలామణి చెయ్యగలిగింది. ఈ బ్యాంక్ నోట్ల పరపతికి ఆచరణలో జాతీయ పరపతి హామీ ఉండటం వల్ల అవి నిరాటంకం కావడం వల్ల డబ్బు విడుదలపై ఉన్న అదుపు తక్షణమే నిర్ణయాత్మకంగా సడలించబడింది. అయినప్పటికీ సహజంగానే మరీ అతిగా గందరగోళపు నిర్వహణ కలిగిన పెద్ద, చిన్న సంస్థలెన్నో విఫలమయ్యాయి. సంక్షోభం యొక్క ఉగ్రస్థితిని మాత్రం అధిగమించడం జరిగింది. బ్యాంకింగ్ డిస్కౌంట్ డిసెంబర్‌లో 5%కు పడిపోయింది. 1848లో వ్యాపార కార్యకలాపాల నూతన కెరటం పైకి ఎగిసింది. అది యూరప్ ఖండంలో 1849లో వచ్చిన

విప్లవోద్యమాల అంచును తాకింది. ఈ ఉద్యమాలు 50లో ఒక అపూర్వమైన పారిశ్రామిక సుభిక్షతకు శ్రీకారం చుట్టాయి. అది మళ్ళీ 1857 సంక్షోభంతో అంతమయింది. – **ఎంగెల్స్**]

I. 1848లో హౌస్ ఆఫ్ లార్డ్స్ విడుదల చేసిన ఒక పత్రం 1847 సంక్షోభ కాలంలో ప్రభుత్వ కాగితం బాండ్ల విలువ ఎంత దారుణంగా పడిపోయిందో తెలియజేస్తుంది. 1847 అక్టోబరు 23 నాటి తరుగుదల అదే ఏడాది ఫిబ్రవరి స్థాయితో పోల్చి చూస్తే ఇలా ఉంది :

| | | |
|---|---|---|
| ఇంగ్లీషు ప్రభుత్వ బాండ్లపైన ..... | 93,824,217 | పౌండ్లు |
| రేవులలోను, కాలువల్లోను ఉన్న నిల్వలపై.... | 1,358,288 | పౌండ్లు |
| రైల్వే నిల్వలపైన...... | 19,579,820 | పౌండ్లు |
| మొత్తం | 114,762,325 | పౌండ్లు |

II. ఈస్టిండియా వ్యాపారంలో వంచనకు సంబంధించి చూస్తే, అక్కడ సరుకులు కొనటం కారణంగా డ్రాఫ్టులు తీసుకోబడటం కాక డబ్బుగా మార్చడానికి వీలైన డిస్కౌంటు అయ్యే డ్రాఫ్టులను పొందటం కోసం మాత్రమే సరుకులు కొనటం జరిగింది. 1847 నవంబర్ 24 నాటి 'మాంచెస్టర్ గార్డియన్' దానిపై ఇలా వ్యాఖ్యానించింది.

"లండన్‌లో ఉన్న 'అ' అనే వ్యక్తి మాంచెస్టర్‌లో ఉన్న 'ఇ' అనే వ్యక్తి దగ్గర్నుంచి ఈస్టిండియాలో ఉన్న 'ఈ' అనే వ్యక్తికి ఓడ రవాణాలో సరుకులు పంపించడం కోసం కొనాల్సిందిగా 'ఆ' అనే వ్యక్తిని ఆదేశిస్తాడు. 'ఆ' 'ఇ'కి ఆరునెలల గడువు గల డ్రాఫ్టులను చెల్లిస్తాడు. 'అ' దగ్గర నుంచి ఆరునెలలు గడువు గల డ్రాఫ్టులను 'ఆ' పొందుతాడు. సరుకులు ఓడ కెక్కించగానే పోస్టుచేసిన బిల్ ఆఫ్ లేడింగ్‌కి ప్రతిగా 'ఈ' దగ్గర నుంచి ఆరునెలల గడువు గల డ్రాఫ్టులను తీసుకుంటాడు. ఇక్కడ సరుకుల కోసం చెల్లించడానికి కొన్ని నెలలకు ముందే వాటిని ఓడకెక్కించినవాడు, అతనితో పాటు సంతకం చేసినవాడు కొన్ని కొత్త నిధులు స్వాధీనం చేసుకోగలుగుతాడు. చాలా సాధారణంగా జరిగేదేమంటే దీర్ఘకాలిక వ్యాపారంలో వేచి ఉండాల్సిన సమయం ఎక్కువ అనే సాకుతో బిల్స్‌ను డబ్బుగా మార్చడమనేది గడువుకు ముందే జరుగుతుంది. దురదృష్టవశాత్తూ అటువంటి వ్యాపారంలో వచ్చే నష్టాలు ఆ వ్యాపారం కుంచించుకుపోడానికి దారితీసేందుకు బదులు మరింత విస్తరించేందుకు దారితీస్తాయి. మనుషులు ఇక్కడ దరిద్రులైన కొద్దీ తమ పాత వ్యాపార దుస్సాహసాల్లో కోల్పోయిన పెట్టుబడిని కొత్త అడ్వాన్సుల సాయంతో రాబట్టడం కోసం మరింత ఎక్కువ మొత్తాల్లో కొనుగోలు చేయడం అవసరమైంది. ఆ రకంగా ఈ కొనుగోళ్ళు అనేవి సరఫరా, గిరాకీలకు సంబంధించిన అంశంగా కాక ఇబ్బందుల నెదుర్కొంటున్న ఒక సంస్థ యొక్క ఆర్థిక కార్యకలాపాల్లో అత్యంత ప్రధానమైన భాగంగా మారాయి. అయితే మొత్తం చిత్రానికి ఇది ఒక పార్శ్వం మాత్రమే. దేశంలో సరుకుల ఎగుమతి విషయంలో జరిగినదే దేశం బయట కొనుగోళ్ళు, ఓడ రవాణాల విషయంలో కూడా జరగసాగింది. ఇండియాలో ఉన్న వాణిజ్య గృహాలకు తమ బిల్లుల్ని పంపించే పరపతి ఉంది. వారు పంచదార, నీలిమందు, పట్టు, పత్తి వగైరాల కొనుగోలుదారులు. లండన్ నుంచి సూచించబడిన ధరల ప్రకారం ఆనాటి ఇండియాలోని ధరలను బట్టి చూస్తే లాభదాయకం కానప్పటికీ అంతకుముందే ఈ సరుకులపై లండన్ హౌస్‌లో తీసుకున్న డ్రాఫ్టుల గడువు దగ్గరపడుతుంది గనుక ఈ కొనుగోళ్ళు చేయడం

జరుగుతుంది. ఒక పంచదార ఓడను కొనుగోలు చేసి దానికి లండన్ హౌస్‌లో పది నెలల గడువుపై బిల్లులతో చెల్లించడం జరుగుతుంది. ఈ నౌకా రవాణా పత్రాలను అంతకంటే త్వరితంగా రెండు నెలల్లోనే, ఇంకా ఓడలకెత్తిన సరుకు హుగ్లీ ముఖద్వారాన్ని కూడా చేరుకోకముందే లంబార్డ్ స్ట్రీట్‌లో తాకట్టు పెట్టడం జరుగుతుంది. ఇంకా ఆ సరుకుల కోసం చెల్లించాల్సిన గడువు ఎనిమిది నెలలు ఉండగానే లండన్ హౌస్‌కు ఇది సమర్పించడం జరుగుతుంది. ఇదంతా నిరంతరాయంగానూ, ఎటువంటి కష్టం లేకుండానూ సాగిపోయింది. బిల్లు బ్రోకర్ల దగ్గర బిల్స్ ఆఫ్ లేడింగ్‌లపైన టేకు వారంట్లపైన ఎడ్వాన్సు చేయడానికి ఇండియా హౌసెస్ మిన్సింగ్ లేన్‌లో ఉన్న పెద్ద సంస్థల నుండి పొందే బిల్సుపైన పరిమితి లేకుండా డిస్కౌంట్ తీసుకోవడానికి అవసరమైనంత విస్తారమైన డబ్బు మొత్తాలు ఉన్నంత వరకు ఇది సాగిపోయింది.”

[ఇండియా నుంచి పంపే సరుకులు, ఇండియాకు దిగుమతి అయ్యే సరుకుల్ని రవాణా చేసే ఓడలు గుడ్‌హోప్ అగ్రాన్ని చుట్టి వచ్చి, ప్రయాణం ఉన్నంతకాలం ఈ దగా పద్ధతి సాగింది. అయితే ఈ సరుకులు సూయజ్ కాలువ ద్వారా ఆవిరి ఇంజన్ల నౌకలపై రవాణా చేయడం ప్రారంభం కాగానే ఈ విధంగా అభాస పెట్టుబడిని సృష్టించడానికి ఉండిన పునాది (సుదీర్ఘ నౌకా ప్రయాణం) అంతమై పోయింది. టెలిగ్రాఫ్ ఎప్పటికప్పుడు ఇంగ్లీషు వ్యాపారికి ఇండియన్ మార్కెట్ గురించి, ఇండియన్ వ్యాపారికి ఇంగ్లండు మార్కెట్ గురించి అదేరోజున తెలియజేయగలిగినప్పటి నుంచి ఈ పద్ధతి పూర్తిగా ఆచరణలో అసాధ్యమైంది – ఎంగెల్స్]

III. కమర్షియల్ డిస్ట్రెస్, 1847–48 పై ఉన్న నివేదిక నుంచి ఉల్లేఖించబడిన అంశం ఇలా ఉంది : “1847” ఏప్రిల్ ఆఖరి వారంలో బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్ రాయల్ బ్యాంక్ ఆఫ్ లివర్‌పూల్‌కి ఒక లేఖ ద్వారా తాను ఆ బ్యాంకులో ఉన్న డిస్కౌంటు వాణిజ్యాన్ని సగానికి తగ్గించుకోబోతున్నట్లు తెలియజేసింది. ఈ ప్రకటన లివర్‌పూల్ బ్యాంక్‌కు చాలా చిత్రమైన కష్టాలను తెచ్చిపెట్టింది. ఎందుకంటే దానికి ఆ మధ్యకాలంలో జరిగిన చెల్లింపులు నగదు రూపంలో కంటే బిల్లుల రూపంలో చాలా ఎక్కువగా జరిగాయి. ఇంతకు ముందు పెద్ద మోతాదులో చెల్లించడం కోసం నగదు మొత్తాలను తీసుకువచ్చే వ్యాపారులు ఇప్పుడు తమ పత్తికి ఇతర వస్తువులకు తాము పొందిన బిల్లులు మాత్రమే ఈ మధ్య ఆ బ్యాంకుకు సమర్పిస్తున్నారు. కష్టాలు పెరిగిన కొద్దీ ఈ ధోరణి మరింతగా పెరిగింది. ఈ వ్యాపారులకు బ్యాంకు చెల్లించాల్సి వస్తున్న మొత్తాలన్నీ విదేశాలలో వ్యాపారులు కట్టాల్సిన మొత్తాలు. ఈ మొత్తాలను వారు తమ వస్తువులను అమ్మటం ద్వారా ఏ రూపంలో పొందితే అదే రూపంలో సమర్పిస్తున్నారు. వ్యాపారులు ఇంతకు ముందు మామూలుగా బ్యాంకుకు నగదు రూపంలో కట్టేవారు. ఐతే ఇప్పుడు దానికి బదులు తెచ్చిన బిల్లులు రకరకాల గడువులతో వివిధ తరహాలకు చెందినవి. వాటిలో చాలావరకు మూడు నెలల గడువు గల బ్యాంకుల బిల్లులు. వాటిలో అత్యధికం పత్తి బిల్లులు. ఈ బిల్స్ ఆఫ్ ఎక్స్ఛేంజ్, బ్యాంకర్ల బిల్లులు, లండన్ బ్యాంకర్ చేత బ్రెజిల్, కెనడా, వెస్టిండీస్ వ్యాపారులచేత పేర్కొనగలిగిన ప్రతి వ్యాపారంలోనూ ఆమోదించబడినప్పుడు వ్యాపారులు ఒకరికొకరు బిల్లులు పంపించుకోవడం కాక, దేశంలో వివిధ ప్రాంతాలలో ఉన్న వివిధ పక్షాలు వ్యాపారుల దగ్గర నుంచి వస్తువులు కొనుగోలు చేసి

లండన్ బ్యాంకర్లకు, లండన్‌లో ఉన్న వివిధ లక్ష్యాలుగాని మరెవరికిగాని చెందిన బిల్లులను వ్యాపారులకు పంపారు. అయితే బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్ ప్రకటన వల్ల విదేశీ వస్తువుల అమ్మకాలపై ఇంతకు ముందు తరచుగా మూడు నెలల గడువు కలిగిన బిల్లులకా వ్యవధి తగ్గిపోయింది." (పుటలు 26, 27)

1844 నుంచి 1847 వరకు ఇంగ్లండులో ఉండిన పైన వర్ణించబడిన సుభిక్ష కాలం మొదటి పెద్ద రైల్వే కుంభకోణంతో ముడిపడి ఉంది. పైన పేర్కొన్న నివేదిక వ్యాపారంపైన ఈ కుంభకోణం యొక్క సాధారణమైన ప్రభావం ఎలా ఉందో ఈ ప్రస్తావన తెలియజేస్తుంది : "1847 ఏప్రిల్‌లో దాదాపు వాణిజ్య గృహాలన్నీ తమ వాణిజ్య పెట్టుబడిలో కొంత భాగాన్ని రైల్వేలకు తరలించడం ద్వారా ఎంతో కొంత మేరకు తమ తొలి వ్యాపారాల కడుపు మాడ్చడం ప్రారంభించాయి." (పుట 42) "రైల్వే షేర్లపైన చాలా ఎక్కువ వడ్డీ రేటుకు ఉదాహరణకు 8%కు ప్రైవేటు వ్యక్తులు, బ్యాంకర్లు, ఫైర్ ఆఫీసులు అప్పులిచ్చాయి." (పుట 66) "వాణిజ్య గృహాలు రైల్వేలకు ఇంత పెద్ద ఎత్తున రుణాలు ఇవ్వడం వల్ల తమ సొంత వాణిజ్య కార్యకలాపాలు కొనసాగించడం కోసం డిస్కౌంటుపై, బ్యాంకులు ఇచ్చే రుణాలపైన అత్యధికంగా ఆధారపడాల్సి వచ్చింది." (పుట 67) (ప్రశ్న) "ఈ రైల్వే అవసరాలు ఆనాడు వాణిజ్యంపై ఉండిన వత్తిడికి పెద్ద ప్రభావాన్ని (డబ్బు మార్కెటుపైన) ఏప్రిల్, అక్టోబర్‌లలో (1847) కలిగించాయా?" (జవాబు) "ఏప్రిల్‌లో వత్తిడి కలిగించడం విషయంలో అవి ఏమాత్రం ప్రభావశీలంగా లేవని చెప్పగలం. ఏప్రిల్ వరకు, బహుశా వేసవి వరకు ఇవి కొన్ని విధాలుగా బ్యాంకర్ల శక్తిని తగ్గించటం కంటే పెంచాయని చెప్పవచ్చు. ఎందుకంటే అప్పుడు రైల్వే అవసరాలు ఉన్నంత శీఘ్రంగా బ్యాంకులు వ్యయం చేయలేదు. పర్యవసానంగా చాలా బ్యాంకుల చేతుల్లో ఏడాది ప్రారంభంలో పెద్ద మొత్తాల్లో రైల్వే డబ్బు పోగుపడింది." (CD 1848–57లో బ్యాంకర్లు ఇచ్చిన అనేక స్టేట్‌మెంట్లు ఈ అంశాన్ని బలపరుస్తాయి.) "వేసవిలో అవి క్రమంగా కరిగిపోయాయి. డిసెంబర్ 31వ తేదీకి అవి బాగా తగ్గిపోయాయి. అక్టోబరులో తలెత్తిన ఒత్తిడికి ఒక కారణం ఏమంటే బ్యాంకర్ల చేతుల్లో ఉన్న రైల్వే డబ్బు క్రమంగా తగ్గిపోవడమే. ఏప్రిల్ 22 నుండి డిసెంబర్ 31లోగా మా చేతులలో ఉన్న రైల్వే నిల్వలు మూడో వంతు తగ్గిపోయాయి. దేశమంతటా దీని ప్రభావం రైల్వే అవసరాలపైన కూడా పడింది. అవి క్రమంగా బ్యాంకర్ల డిపాజిట్లను తోడివేస్తున్నాయి." (పుటలు 43, 44) శామ్యూల్ గుర్నీ (అపఖ్యాతిపాలైన ఓవరెండ్ గుర్నీ అండ్ కంపెనీ అధినేత) ఇదే విధంగా అంటాడు : 1846లో పెట్టుబడికై రైల్వే నిర్మాణం సందర్భంగా గణనీయమైన గిరాకీ ఉంది. చిన్న చిన్న మొత్తాలు పెద్ద మొత్తాలుగా దగ్గరికి చేర్చబడ్డాయి. ఆ పెద్ద మొత్తాలు మా మార్కెట్‌లో ఉపయోగించబడ్డాయి. దాని ఫలితమేమంటే మొత్తంమీద మా నగరంలో ఉన్న డబ్బు మార్కెట్ నుంచి వెనక్కుతీసే మొత్తాలకంటే దానిలోకి పంపే మొత్తాలు బాగా పెరిగాయి." (పుట 159)

ఎ. హాడ్జ్‌సన్, లివర్‌పూల్ జాయింట్ స్టాక్ బ్యాంక్ డైరెక్టరు, బ్యాంకర్ల దగ్గర బిల్స్ ఆఫ్ ఎక్స్ఛేంజ్ ఏ స్థాయిలో నిల్వలో ఉండొచ్చో తెలియజేస్తున్నాడు : "మన డిపాజిట్లలో కనీసం పదింట తొమ్మిది వంతులు ఉంచడం అన్నది మన అలవాటుగా ఉన్నది. మన దగ్గర ఉన్న ఇతర వ్యక్తుల డబ్బు, మన దగ్గర ఉన్న బిల్లులు, ఏ రోజుకారోజు గడువు దగ్గరకు వస్తున్న బిల్లులు అన్నీ దాదాపు ప్రతిరోజూ మనం చెల్లించాల్సిన మొత్తంతో సమానంగా ఉంటున్నాయి." (పుట 53)

సట్టా వ్యాపారపు బిల్లులు – “5092. ఈ బిల్లులను (పత్తి అమ్మకంపైన) ఎవరు ఆమోదిస్తున్నారు? – (ఈ గ్రంథంలో మనం అనేకసార్లు పేర్కొన్న కార్ఖానాదారుడు ఆర్. గార్డెనర్) “వస్తువుల బ్రోకర్లు : ఒక వ్యక్తి పత్తిని కొని బ్రోకర్ చేతుల్లో పెడతాడు. బ్రోకర్ దగ్గరి నుంచి తీసుకున్న బిల్లులు బ్యాంకుల్లో డిస్కౌంటు చేయబడతాయి.” “5094. లివర్‌పూల్ బ్యాంకులలో ఇవి డిస్కౌంట్ ఔతాయా? – ఔను. ఇతర బ్యాంకులతోపాటు.... ఇటువంటి సదుపాయం గనుక బ్యాంకులు ముఖ్యంగా లివర్‌పూల్ బ్యాంకులు కలిగించకపోతే పత్తి ధర గత ఏడాది అంత ఎక్కువ ఉండేది కాదు. అది ప్రతి పౌండుకు $1\frac{1}{2}$ లేదా 2 పెన్నీలు పెరిగింది.” – “600. మీరు పెద్ద మొత్తంలో బిల్లులను చలామణిలో ఉంచినట్టు చెప్పారు. ఇది లివర్‌పూల్‌లో ఉన్న కాటన్ బ్రోకర్‌ల దగ్గర నుంచి సట్టా వ్యాపారులు తీసుకున్న బిల్లులు. ఈ పద్ధతి పత్తితో పాటు వలస దేశాల, విదేశీ వస్తువులపైన అనుమతి పత్రాలపై మీరిచ్చే అడ్వాన్సుకు కూడా వర్తిస్తుందా?” (ఎ. హాడ్జ్‌సన్, లివర్‌పూల్ బ్యాంకర్) “ఇది వలస దేశాల వస్తువులన్నిటికీ వర్తిస్తుంది. ముఖ్యంగా పత్తికి.” – “601. ఒక బ్యాంకరుగా అటువంటి బిల్లులను మీరు నిరుత్సాహపరుస్తారా? – నిరుత్సాహపరచం. అది మితంగా ఉన్న మేరకు చట్టబద్ధమైన కాగితం రూపంగానే భావిస్తాం. ఈ రూపం తరచుగా పునరుద్ధరించబడుతుంది.

ఈస్టిండియా, చైనా మార్కెట్లలో 1847 నాటి దగా. – చార్లెస్ టర్నర్ (లివర్‌పూల్‌లో ఉన్న ఈస్టిండియా ప్రముఖ వాణిజ్య గృహాలలో ఒక సంస్థకు అధిపతి) “మారిషస్ వ్యాపారానికి ఇంకా అటువంటి ఇతర వ్యాపారాలకు సంబంధించి జరిగిన సంఘటనలు మనందరికీ తెలుసు. బ్రోకర్లు సరుకులు వచ్చిన తర్వాత ఆ సరుకులపై తీసుకున్న బిల్లులకు అలాగే లేడింగ్ బిల్లులకుగాను అడ్వాన్సు చేయడం పూర్తిగా చట్టబద్ధమే. కానీ వారలా చేయడం మాత్రమే కాక అసలు సరుకు ఓడలకెత్తక ముందే, కొన్ని సందర్భాల్లో ఇంకా తయారవకముందే అడ్వాన్సు చేయడమన్నది వారి అలవాటుగా మారింది. ఇప్పుడు మా సొంత అనుభవాన్ని ప్రస్తావిస్తాను. ఒక సందర్భంలో నేను కలకత్తాలో 6, 7 వేల పౌండ్ల బిల్లులను కొన్నాను. వాటికి సంబంధించిన మొత్తాలు మారిషస్‌లో చక్కెర ఉత్పత్తికి సాయంచేయటం కోసం పంపబడ్డాయి. ఆ బిల్లులు తిరిగి ఇంగ్లండు వచ్చాయి. వాటిలో సగం తిరస్కరించబడ్డాయి. ఎందుకంటే పంచదార ఓడలు వచ్చినప్పుడు చూస్తే ఈ బిల్లులను చెల్లించడానికి బదులు మరో మూడో పక్షానికి వాటిని తాకట్టు పెట్టడం జరిగింది. ఇదంతా సరుకు ఓడలకెత్తడానికి ముందే, నిజానికి చక్కెర తయారు కావడానికి ముందే జరిగింది.” (పుట 78) “ఇప్పుడు కార్ఖానాదారులు నగదు కావాలని పట్టుపడుతున్నారు. ఐతే అది ఎంతో మొత్తంలో ఉండదు. ఎందుకంటే లండన్‌లో కొనుగోలుదారుకు ఏమాత్రం పరపతి ఉన్నా వాణిజ్య గృహాలనుంచి తీసుకున్న బిల్లులను బ్యాంకులచేత డిస్కౌంటు చేయించుకుంటాడు. డిస్కౌంట్లు బాగా చవకగా ఉన్న లండన్‌కు వెళతాడు. బిల్లు డిస్కౌంటు అయ్యాక కార్ఖానాదారునికి నగదు చెల్లిస్తాడు... ఓడల్లో ఇండియాకు సరుకు పంపించే వ్యాపారికి ఫలితం తిరిగి రావటానికి కనీసం పన్నెండు నెలలు పడుతుంది... 10, 15 వేల పౌండ్లున్న మనిషి ఇండియన్ వ్యాపారంలో అడుగు పెడతాడు. లండన్‌లో ఉన్న ఒక వాణిజ్య గృహంలో అతడు ఓ పరపతిదారుడవుతాడు. ఇది చాలా వరకు ఆ గృహానికి ఒక శాతం ఇచ్చే విధంగా చేరతాడు. ఈ లండన్ గృహం నుంచి ఈ సరుకుల మొత్తాలు మళ్ళీ అక్కడికే తిరిగి వచ్చే షరతుపైన అతడు అక్కడ బిల్లులను పొందుతాడు. అయితే ఇరువురి మధ్యా ముందే ఉండే అవగాహన ప్రకారం లండన్‌లో

ఉన్న వ్యక్తికి నగదు అడ్వాన్సు లేకుండా చూడబడుతుంది. అనగా మరోరకంగా చెప్పాలంటే సరుకుల మొత్తాలు తిరిగి లండన్‌కు వచ్చేలోగా బిల్లులు పునరుద్ధరించబడాలి. ఇవి లివర్‌పూల్, మాంచెస్టర్.... లేదా లండన్ బ్యాంకులలో ఈ బిల్లులు డిస్కౌంటు అవుతాయి... వాటిలో అనేక బిల్లులు స్కాచ్ బ్యాంకులలో ఉంటాయి." (పుట 79) – "786. ఇంతకు ముందు రోజున లండన్‌లో ఒక వాణిజ్య గృహం దెబ్బతింది. వారి వ్యవహారాలు పరిశీలించగా ఒక లావాదేవీ ఈ విధంగా జరిగినట్టు రుజువైంది. మాంచెస్టర్‌లో ఒక వాణిజ్య గృహముంది. మరోటి కలకత్తాలో ఉంది. వారు లండన్‌లో ఉన్న ఒక వాణిజ్య గృహంలో 2 లక్షల పౌండ్ల మేరకు పరపతి ఖాతాను తెరిచారు. అనగా ఈ మాంచెస్టర్‌లో ఉన్న పరపతిదారులు, గ్లాస్గో నుండి, మాంచెస్టర్ నుండి ఈస్టిండియా హౌస్‌కి సరుకును పంపి ఆ గృహం నుంచి 2 లక్షల పౌండ్ల మేరకు తీసుకోగలిగిన శక్తి కలిగి ఉంటారన్నమాట. అదే సమయంలో కలకత్తాలో ఉన్న వాణిజ్య గృహం లండన్ గృహం నుంచి మరో 2 లక్షల పౌండ్ల మేరకు తీసుకోవాలన్నది వారి పరస్పర అవగాహనలో భాగం. కలకత్తాలో అమ్మబడిన బిల్లులపై వచ్చిన మొత్తాలతో ఇతర బిల్లులను కొని లండన్ హౌస్‌కు సమర్పించి గ్లాస్గో నుంచి మొదటి బిల్లుల్ని వెనక్కు తీసుకోవడానికి ఉపయోగించాలి... ఆ లావాదేవీపైన సృష్టించిన బిల్లు విలువ 6 లక్షల పౌండ్ల విలువుంటుంది." – "971. ప్రస్తుతానికి కలకత్తాలో ఉన్న ఒక గృహం (ఇంగ్లండుకు వెళ్తున్న) ఓ ఓడ సరుకులను కొని అందుకుగాను లండన్‌లో ఉన్న తమ కరెస్పాండెంట్‌కు తమ సొంత బిల్లులు ఇస్తే వారు ఆ బిల్లులను ఈ దేశంలో ఉన్న లేడింగ్ హోంకు పంపుతారు. ఈ లేడింగ్ బిల్లులు... తక్షణమే లంబార్డ్ స్ట్రీట్‌లో అడ్వాన్సులు చేయడం కోసం వీలైన మొత్తాలుగా ఉంటాయి. వారి కరస్పాండెంట్లు చెల్లించాల్సిన గడువు తేదీకి ముందు ఎనిమిది నెలల పాటు ఆ డబ్బు వారి చేతిలో ఉంటుంది."

IV. 1848లో హౌస్ ఆఫ్ లార్డ్స్ యొక్క రహస్య కమిటీ 1847 సంక్షోభ కారణాలపై దర్యాప్తు జరిపింది. అయితే ఆ కమిటీ ముందుకు వచ్చిన సాక్ష్యాలను 1857 వరకు ప్రచురించలేదు. (మినిట్స్ ఆఫ్ ఎవిడెన్స్, టేకెన్ బిఫోర్ ది సీక్రెట్ కమిటీ ఆఫ్ ది హౌస్ ఆఫ్ లార్డ్స్ ఎపాయింటెడ్ టు ఇంక్వైర్ ఇంటూది కాజెస్ ఆఫ్ డిస్ట్రెస్, 1857 కోటెడ్ యాజ్ సి.డి. 1848/57) ఇక్కడ లివర్‌పూల్ యూనియన్ బ్యాంకు డైరెక్టర్ లిస్టర్ మిగిలిన అంశాలతోపాటు ఈ రకమైన సాక్ష్యం చెప్పాడు :

"2444. 1844 వసంతకాలంలో పరపతి అతిగా విస్తరించింది. ఎందుకంటే తన ఆస్తిని రైల్వేల్లోకి బదిలీ చేసిన మనిషి పాత వ్యాపారాన్ని ఇంకా అదే స్థాయిలో కొనసాగించాలని ఆత్రుత ప్రదర్శించడమే. అతడు బహుశా మొదట తన రైల్వే షేర్లను లాభానికమ్మి తన వ్యాపారంలో ఏర్పడిన డబ్బు కొరతను పూడ్చుకోవచ్చునని అనుకుని ఉంటాడు. బహుశా అతడు అలా చేయలేకపోయుంటాడు. అంతకు ముందు అతడు నగదు రూపంలో చెల్లించే వాణిజ్యంలో పరపతి ధనం పొందాడు. దానివల్ల పరపతి తీసుకోవడం తీవ్రస్థాయిలో విస్తరించింది."

"2500. బ్యాంకు నష్టాలు పొందిన బిల్లులు ముఖ్యంగా ధాన్యపు బిల్లులా లేక పత్తి బిల్లులా? అవి అన్ని రకాల వస్తువులకు సంబంధించిన బిల్లులు. ధాన్యం, పత్తి, పంచదార, అన్ని రకాల విదేశీ వస్తువులు. బహుశా నూనె తప్ప అన్ని వస్తువులకు ఇదే వర్తిస్తుంది." – "2506. బిల్లులను ఆమోదించే బ్రోకరు దాని విలువపైన పెద్ద మిగులు లేకుండా ఆమోదించడు."

"2512. సరుకుపైన రెండు రకాల బిల్లులు తీసుకోబడ్డాయి. మొదటిది సరుకు దిగుమతి చేసుకునే విదేశంలో ఉన్న వ్యాపారి దగ్గర నుంచి తీసుకునే బిల్లు... సరుకు చేరటానికి ముందు తీసుకోబడిన ఈ బిల్లులు తరచుగా గడువు తేదీ దూరంలో ఉంటుంది. కనుక సరుకు వచ్చినప్పుడు ఆ వ్యాపారి తన దగ్గర తగిన మొత్తంలో పెట్టుబడి లేకుండా ఆ సరుకును బ్రోకరు దగ్గర తాకట్టు పెడతాడు. ఇది ఆ సరుకును అమ్మేంత వరకు తాకట్టులో ఉంటుంది. అప్పుడు వెంటనే లివర్‌పూల్‌లో ఉన్న వ్యాపారి బ్రోకరు దగ్గర నుంచి ఓ కొత్తరకం బిల్లును ఆ సరుకు భద్రతపైన తీసుకుంటాడు... ఆ బ్రోకరు దగ్గర సరుకు ఉన్నదా, దానిపైన అతడు ఎంత మొత్తం అడ్వాన్సు చేశాడు అన్నదాన్ని నిర్ధారించుకోవలసింది బ్యాంకరు. బ్రోకరు గనక నష్టపోతే తనను తాను రక్షించుకోగలిగిన ఆస్తులు అతనికి ఉన్నాయా అనే అంశాన్ని నిర్ధారించుకోవాల్సిన బాధ్యత కూడా బ్యాంకర్‌దే."

"2516. మనం విదేశాల నుంచి కూడా బిల్స్‌ను సేకరిస్తాం.... ఇంగ్లండులో చెల్లించాల్సిన బిల్లును ఒక వ్యక్తి విదేశాల్లో కొంటాడు. దాన్ని ఇంగ్లండులో ఉన్న వాణిజ్య గృహానికి పంపుతాడు. ఆ బిల్లు వివేకవంతంగా తీసుకోబడిందా లేక అవివేకంగానా అన్న విషయంగాని, సరుకుపై తీసుకోబడిందా లేదా ఉత్తుత్తి వ్యవహారమా అన్నది చెప్పలేము."

"2533. అన్ని రకాల విదేశీ వస్తువులు పెద్ద నష్టంపైన అమ్మబడ్డాయని మీరు చెప్పారు. ఆ సరుకుపైన జరగకూడనంత సట్టా వ్యాపారం జరగటం వల్ల ఏర్పడిన పర్యవసానమే అనంటారా? – అది పెద్ద ఎత్తున జరిగిన దిగుమతుల నుండి తలెత్తింది. దానికి సమమైన వినియోగం ఇక్కడ లేదు. దిగుమతుల్తో పోలిస్తే వినియోగం బాగా పడిపోయినట్టు కనిపిస్తుంది." – "2534. అక్టోబరులో సరుకులు కొనటం దాదాపు ఆగిపోయింది."

తీవ్రమైన సంక్షోభ కాలంలో ఎవరిపాటికి వారు బయటపడాలన్న పరిస్థితి ఎలా తలెత్తుతుందో అదే నివేదికలో అందెవేసిన చెయ్యి, పేరుమోసిన వంచనాశిల్పి, ఓవరెండ్ గుర్నీ అండ్ కంపెనీ అధిపతి శామ్యూల్ గుర్నీ ఇలా అన్నాడు : "1262. భయోత్పాత వాతావరణం ఉన్నప్పుడు మనిషి తన బ్యాంకు నోట్లకు ఎంత వస్తుంది అని ఆలోచించడు. తన ఖజానా బిల్లుల్ని అమ్మడం ద్వారా ఒకటా రెండా లేక మూడు శాతమా నష్టపోవడం అన్న విషయం పట్టించుకోడు. తనను తాను సురక్షితంగా ఉంచుకుంటాడు. మిగిలిన ప్రపంచాన్ని దాని ఇష్టానికి వదిలేస్తాడు."

V. రెండు మార్కెట్లు ఒకదానినొకటి పూర్తిగా సరుకులతో నింపుకోడానికి సంబంధించి ఈస్టిండియా వాణిజ్యంలో ఓ వ్యాపారి అయిన అలెగ్జాండర్ 1857 బ్యాంకు యాక్టుపైన దిగువ సభలో కమిటీ ముందు ఇలా అన్నాడు : (ఇది బి.సి. 1857గా ఉల్లేఖించబడింది) "4330. ప్రస్తుతం మాంచెస్టర్‌లో నేను 6 షిల్లింగులు పెడితే ఇండియాలో నాకు 5 షిల్లింగులు వస్తాయి. ఇండియాలో 6 షిల్లింగులు పెడితే తిరిగి లండన్‌లో నాకు 5 షిల్లింగులు వస్తాయి." అందుచేత ఇండియన్ మార్కెట్‌ను ఇంగ్లండు, ఇంగ్లండు మార్కెట్‌ను ఇండియా సరుకులతో ముంచెత్తాయి. 1847 చేదు అనుభవం గడచి పదేళ్లయినా అయిందో లేదో 1857 వేసవిలో కూడా నిజానికి ఇదే పరిస్థితి తలెత్తింది.

★ ★ ★

## అధ్యాయం - 26

# డబ్బు పెట్టుబడి సంచయనం, వడ్డీ రేటుపై దాని ప్రభావం

"ఇంగ్లాండులో క్రమంగా అదనపు సంపద పోగుపడుతోంది. అంతిమంగా డబ్బు రూపం తీసుకునే ధోరణి దానికి ఉంది. ఇప్పుడు డబ్బు సంపాదించాలనే కోరిక తర్వాత తలెత్తే తక్షణ అవసరమేమంటే బహుశా వడ్డీగాని, లాభంగానీ తెచ్చిపెట్టే తీరులో ఏదో ఒక రకపు మదుపు కోసం ఆ డబ్బును నియోగించాలనే కోరిక తలెత్తుతుంది. డబ్బు డబ్బుగానే వుంటే ఈ రెంటిలో ఏదీ దక్కదు. కనుక నిరంతరాయంగా వచ్చే అదనపు పెట్టుబడిని అదే సమయంలో ఉపయోగించుకో గలిగిన రంగం తగినంత స్థాయిలో క్రమంగా విస్తరించకపోతే మదుపును కోరే డబ్బు అప్పుడప్పుడూ పోగుపడడం జరుగుతుంది. సంఘటనల చలనంపై ఈ డబ్బు పరిమాణం ఆధారపడి ఉంటుంది. చాలా ఏళ్ళుగా ఇంగ్లండు యొక్క అదనపు సంపదను మన ప్రజారుణం ఇముడ్చుకుంది. ఈ రుణం 1816లో దాని అత్యధిక స్థాయికి చేరగానే అది ఈ సంపదను ఇముడ్చుకోలేని పరిస్థితి రాగానే కనీసం ఏడాదికి 720 మిలియన్ల మొత్తాన్ని ఇతర మదుపు పెట్టే మార్గాలకు మళ్ళించడం జరిగింది. అంతేగాక పెట్టుబడి యొక్క వివిధ రకాల చెల్లింపులు తిరిగి వచ్చాయి. పెద్ద పెట్టుబడి అవసరమైన పరిశ్రమలు నిరుపయోగ అదనపు పెట్టుబడికి ఎప్పటికప్పుడు అవకాశాలు సృష్టిస్తాయి. కనీసం మన దేశంలో అదనపు సామాజిక సంపద అప్పుడప్పుడూ పోగుపడినప్పుడు అది మామూలుగా ఇంతకు ముందు రంగాలలో ఉపయోగించడానికి వీలుగానప్పుడు దానిని ఉపయోగంలో పెట్టడానికి ఈ పరిశ్రమలు చాలా అవసరం." (ది కరెన్సీ థియరీ రెవ్యూడ్, లండన్, 1845, పుటలు 32–34) అదే గ్రంథం 1845 గురించి ఇలా అంటుంది. "ఈ మధ్యకాలంలోనే ధరలు పరమ కనీస స్థాయి నుంచి ఒక్క ఉదుటున పెరిగాయి. కాన్సల్స్ (గడువు తీరిన సాంవత్సరిక బాండ్ల అంకిత దశ నందుకున్నాయి.) బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్ ఖజానాలో ఉన్న వెండి, బంగారం ఆ సంస్థ పుట్టిన దగ్గర నుంచీ దానికున్న సంపదను మించిపోయాయి. అన్ని రకాల షేర్ల సగటు ధరలు ఇంతకు ముందు ఎన్నడూ లేనంతగా ఉన్నాయి. వడ్డీ రేట్లు నామమాత్రమైన స్థాయికి పడిపోయాయి. ఇప్పుడు ఇంగ్లండులో ఉపయోగించని సంపద పెద్ద ఎత్తున పోగుపడి ఉందనటానికి మళ్ళీ సట్టా వ్యాపారపు ఉద్వేగకాలం మరొకటి రానున్నదని చెప్పడానికి ఇవి సాక్ష్యాలు కాదా." (అదే గ్రంథం, పుట 36)

"వెండి, బంగారాల దిగుమతి విదేశీ వాణిజ్యంపైన ఖచ్చితమైన లాభానికి చిహ్నం కానప్పటికీ, మరోరకంగా వివరించే కారణం లేదు కనుక ఆ లాభంలో అది ఒక భాగానికి స్పష్టంగానే ప్రాతినిధ్యం

వహిస్తుంది." (జె.జి. హబ్బార్డ్, ది కరెన్సీ అండ్ ది కంట్రీ, లండన్, 1843, పుటలు 40, 41) "స్థిరమైన వ్యాపారం, సరసమైన ధరలు. పూర్తి, వృధాగాని చలామణి ఉన్నప్పుడు పంట దిగుబడి తక్కువ ఉన్నప్పుడు ధాన్యం దిగుమతి చేసుకోవలసి వచ్చిందని, 50 లక్షల విలువైన బంగారం ఎగుమతి జరిగిందని భావిద్దాం. చలామణి (అంటే చలామణి సాధనాలు కాక ఖాళీగా వున్న డబ్బు పెట్టుబడి అనే ఆయన ఉద్దేశమని ఇప్పుడు గ్రహిస్తాం – ఎంగెల్స్) అదే మొత్తంలో కుదించబడుతుంది. అంతే పరిమాణం గల చలామణి వ్యక్తుల మధ్య జరగొచ్చు. అయితే బ్యాంకర్ల దగ్గర వ్యాపారుల డిపాజిట్లు, డబ్బు బ్రోకర్ల దగ్గర బ్యాంకర్ల మిగుళ్ళు, వారి సొంత ఖజానాలో నిల్వలు అన్నీ తగ్గుతాయి. పనిలో పెట్టని పెట్టుబడి మొత్తంలో ఈ తగ్గుదల యొక్క తక్షణ ఫలితంగా వడ్డీ రేటు పెరుగుతుంది. అది నాలుగు నుంచి ఆరు శాతానికి పెరుగుతుందని నేను భావిస్తాను. వ్యాపారం సవ్యంగా ఉండటం వల్ల నమ్మకం సడలిపోదు. పరపతి మరింతగా విలువ కట్టబడుతుంది." (అదే గ్రంథం, పుట 42) అన్నిటి ధరలు పడిపోతున్నాయని ఊహిద్దాం... అవసరానికి మించి వున్న ద్రవ్యం పెరిగిన డిపాజిట్లుగా బ్యాంకర్లకు తిరిగి వస్తుంది. పనిలో పెట్టిన పెట్టుబడి వడ్డీ రేటును అతి తక్కువ స్థాయికి తగ్గిస్తుంది. ధరలు అధికమయ్యేదాకా కానీ, లేక మరింత క్రియాశీలమైన వ్యాపారం వచ్చి నిద్రపోతున్న ఈ కరెన్సీ తిరిగి పనిచేపట్టేదాకా కానీ లేక విదేశీ సరుకుల్లో, విదేశీ నిల్వల్లో ఈ కరెన్సీ మదుపు జరిగే వరకు కానీ ఈ పరిస్థితి ఇలాగే కొనసాగుతుంది." (పుట 68)

ఈ క్రింది అంశాలు కూడా 1847–48 "కమర్షియల్ డిస్ట్రెస్‌పై" పార్లమెంటరీ నివేదిక నుండి తీసుకోబడ్డాయి. 1846–47లో పంటలు దెబ్బతినడం వల్ల, కాటకం వల్ల పెద్ద స్థాయిలో ఆహార ధాన్యాల దిగుమతి అవసరమైంది. "ఈ పరిస్థితులు దేశంలోకి దిగుమతులు, ఎగుమతుల కంటే చాలా అత్యధికం అయ్యేలా చేశాయి. దానివల్ల బ్యాంకుల్లో ఉన్న ధనం గణనీయంగా ఊడ్చుకొని పోయింది." డిస్కౌంట్ బ్రోకర్‌లు బిల్లు పెరిగి డిస్కౌంట్ కోసం పెట్టే దరఖాస్తుల సంఖ్య పెరిగింది. వారు బిల్లులను ఒకటికి రెండుసార్లు పరిశీలించడం మొదలుపెట్టారు. వ్యాపార సంస్థల్లో సదుపాయాలు తీవ్రంగా పరిమితమయ్యాయి. బలహీనమైన సంస్థలు విఫలం కాసాగాయి. కేవలం పరపతి మీదే ఆధారపడిన సంస్థల వాణిజ్యం మందగించింది. ఇంతకు ముందే కనిపించిన భయాందోళన మరింత పెరిగింది. బ్యాంకర్లు, ఇతరులు ఇంతకు ముందున్నంత ధైర్యంగా తమ బిల్లుల్ని, ఇతర హామీలను బ్యాంకు నోట్లుగా మార్చలేకపోతున్నామని గ్రహించి తామిచ్చే సదుపాయాలను మరింతగా పరిమితం చేశారు. చాలా సందర్భాలలో పూర్తిగా తిరస్కరించారు కూడా! తమ సొంత పనుల అవసరార్థం తమ బ్యాంక్ నోట్లను భద్రంగా దాచిపెట్టుకున్నారు. వాటిని వదిలిపెట్టాలంటే వారు భయపడ్డారు. ప్రతిరోజూ ఈ భయాందోళనా, గందరగోళము పెరిగాయి. లార్డ్ జాన్ రస్సెల్ ... బ్యాంక్‌కు లేఖ రాయకుండా ఉండి ఉంటే.... సార్వత్రిక దివాళా అన్నది ప్రధాన సమస్య అయివుండేది." (పుటలు 74–75) లార్డ్ జాన్ రస్సెల్ లేఖ బ్యాంకు చట్టాన్ని నిలిపివేసింది. ఇంతకు ముందు పేర్కొనబడిన చార్లెస్ టర్నర్ ఈ రకంగా సాక్ష్యం చెప్పాడు : "కొన్ని వాణిజ్య గృహాలకు పెద్ద ఎత్తున సాధన సంపత్తి ఉంది. కానీ అవి అందుబాటులో లేవు. వారి పెట్టుబడి అంతా మారిషస్‌లోని ఎస్టేట్‌లలో లేదా నీలిమందు ఫ్యాక్టరీలలో లేదా పంచదార ఫ్యాక్టరీలలో ఇరుక్కుపోయి వుంది. 5 లక్షలు లేదా 6 లక్షల పౌండ్ల మేరకు వారు బాకీలు కట్టాల్సిరాగా బిల్లులను చెల్లించడానికి వారి దగ్గర తగిన మొత్తంలో ఆస్తులు లేవు. వారు

బిల్లులను చెల్లించడంకోసం మొత్తంగా తమ పరపతిపైనే ఆధారపడి ఉన్నారని ఇందుమూలంగా రుజువైంది." (పుట 81) ఇంతకు ముందే ప్రస్తావించుకున్న ఎస్. గుర్నీ ఇలా అన్నాడు (1664) : "ప్రస్తుతం (1848) లావాదేవీలపైన పరపతి వుంది. డబ్బు అతిగా విస్తారంగా లభిస్తోంది" – "1763. అది పెట్టుబడి లోపం వల్ల అని నేను భావించాను. వడ్డీ రేటు అతి ఎక్కువగా ఉండటం వల్ల ఏర్పడిన భయం దానికి కారణం."

1847లో ఇంగ్లండు తాను దిగుమతి చేసుకున్న ఆహారధాన్యాల కోసం విదేశాలకు కనీసం 90 లక్షల పౌండ్ల బంగారం చెల్లించింది. ఈ మొత్తంలో 75 లక్షల పౌండ్లు బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండు నుంచి, 15 లక్షలు ఇతర మార్గాల ద్వారానూ వచ్చింది. (పుట 245) – బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్ గవర్నరు, మారిస్ : "దేశంలో ఉన్న పబ్లిక్ నిల్వలు కాల్వల షేర్లు, రైల్వే షేర్లు 1847 అక్టోబర్ 23 నాటికే మొత్తం 114,752,225 పౌండ్లు తరిగిపోయాయి." (పుట 312) లార్డ్ జి. బెంటింక్ ప్రశ్నించగా మళ్ళీ మారిస్ : "నిల్వలలోనూ అన్ని రకాల ఉత్పాదితాలలోనూ పెట్టబడిన మదుపు ఒకే రకంగా తిరిగిపోయినప్పుడు ముడి పత్తి, ముడి పట్టు, ముడి ఉన్ని అదే తరిగిపోయిన ధరల చొప్పున యూరప్ ఖండంలో ఇతర దేశాలకు పంపించారని పంచదార, కాఫీ, టీ బలవంతపు అమ్మకాలలో వదులు కున్నారని మీకు తెలియదా? – అది అనివార్యం. దేశం పెద్ద ఎత్తున ఆహార ధాన్యాలు దిగుమతి చేసుకోవడం వల్ల వెండి. బంగారాలు బయటికి పోకుండా నిలపడం కోసం గణనీయమైన స్థాయిలో త్యాగం తప్పదు." – "బ్యాంకు ఖజానాల్లో ఉన్న 80 లక్షల పౌండ్లను బయటికి తీయడం అన్నది అటువంటి త్యాగంతో బంగారాన్ని వెనక్కు తీసుకొచ్చే ప్రయత్నం కంటే మెరుగని మీరు భావించరా? – లేదు, నేను భావించను." – అటువంటి వీరత్వం మీద వ్యాఖ్యానాల గురించి, బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్ మాజీ గవర్నరు, ఒక డైరెక్టరు అయిన డబ్ల్యు. కాటన్‌ని డిజ్రేలి ప్రశ్నించాడు : "1844లో బ్యాంకు యజమానులకు చెల్లించబడిన డివిడెండు రేటెంత?– ఏడాదికి ఏడు శాతం." "1847లో డివిడెండ్ ఎంత? – 9 శాతం." "బ్యాంక్ తన యజమానులకు ఈ ఏడాది వారి ఆదాయం పన్ను చెల్లించిందా? – చెల్లించింది." – "1844లో కూడా చెల్లించిందా? – చెల్లించలేదు"[1] – "అంటే ఈ (1844) బ్యాంకు చట్టం యజమానులకు బాగా లాభించిందన్నమాట?... ఈ చట్టం చేసిన దగ్గరి నుంచి యజమానులకు లభించే డివిడెండు 7 శాతం నుంచి 9 శాతం పెరిగింది. ఈ చట్టానికి ముందు ఆదాయం పన్నును యజమానులే చెల్లించుకోగా ఇప్పుడు బ్యాంకే చెల్లిస్తోంది గదా?– ఔను." (నంబర్లు 4356–61)

1847 సంక్షోభ కాలంలో బ్యాంకుల్లో కూడబెట్టడం గురించి ఒక దేశవాళీ బ్యాంకరు, పీజ్ ఇలా అన్నాడు : "4605. బ్యాంకు తన వడ్డీ రేటును పెంచక తప్పని పరిస్థితి ఎదురవటంతో ప్రతి ఒక్కరికీ భయం పట్టుకుంది. దేశవాళీ బ్యాంకర్లు తమ చేతుల్లో ఉన్న వెండి, బంగారాలను మరింత

---

1. మరోలా చెప్పాలంటే ఇంతకు ముందు వారు మొదట డివిడెండును నిర్ణయించారు. విడిగా ప్రతి స్టాక్‌హోల్డరుకు డివిడెండు చెల్లించిన తర్వాత ఆదాయపు పన్నును దాన్నించి తీసివేశారు. అయితే 1844 తర్వాత బ్యాంకు తన మొత్తం లాభంపైన మొదట ఆదాయం పన్నును చెల్లించి, తర్వాత ఆదాయపు పన్నులేని డివిడెండును చెల్లించింది. కనుక అవే నామమాత్రపు శాతాలు ఆదాయపు పన్నుతో చూస్తే రెండో సందర్భంలో ఎక్కువగా ఉన్నాయి - **ఎంగెల్స్.**

పెంచుకున్నారు. నోట్ల నిల్వను కూడా పెంచుకున్నారు. మాలో చాలామంది ఇంతకు ముందు బంగారాన్నీ, బ్యాంకు నోట్లనూ వందల పౌండ్లలో మాత్రమే ఉంచుకునేవాళ్ళం. ఇప్పుడు తక్షణమే మా సొరుగుల్లోనూ, డెస్కుల్లోనూ వేలాది పౌండ్లు దాచుకున్నాం. డిస్కౌంట్ల గురించి, మార్కెట్లో చలనంలో ఉన్న బిల్లుల గురించి అనిశ్చిత పరిస్థితి ఏర్పడటం వల్ల కూడబెట్టడం సాధారణమైపోయింది." ఒక కమిటీ సభ్యుడు ఇలా అన్నాడు : "4691. పన్నెండేళ్ళుగా కారణమేమైనప్పటికీ ఫలితం మాత్రం సాధారణంగా ఉత్పాదక వర్గాలకంటే యూదుకీ, డబ్బు వ్యాపారికీ అనుకూలంగా ఉంటోంది."

సంక్షోభ సమయాల్ని డబ్బు వ్యాపారి తన కనుకూలంగా ఎలా ఉపయోగించుకుంటాడో టూకే ఇలా వివరించాడు : "పరిశ్రమలుండే జిల్లాలైన వార్విక్‌షైర్, స్టఫోర్డ్‌షైర్‌లలో 1847లో సరుకులకై వచ్చిన చాలా ఆర్డర్లను నిరాకరించడం జరిగింది. ఎందుకంటే కార్ఖానాదారుడు తన బిల్లులపై చెల్లించాల్సిన డిస్కౌంటువల్ల అతను చెల్లించే వడ్డీ రేటు అతని లాభాలకంటే ఎక్కువే దిగమింగింది." (5451)

ఇంతకు ముందే పేర్కొన్న మరో పార్లమెంటరీ నివేదికను చూద్దాం. "రిపోర్ట్ ఆఫ్ సెలెక్ట్ కమిటీ ఆన్ బ్యాంక్ యాక్ట్స్ కమ్యూనికేటెడ్ ఫ్రం ది కామన్స్ టుది లార్డ్స్. 1857" అనే నివేదిక ఇది. (ఇక నుంచి బి.సి. 1857 అని ఉల్లేఖించబడుతుంది.) దానిలో బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండు డైరెక్టరు, కరెన్సీ సూత్రం మొనగాళ్లలో ఒక ప్రముఖుడు అయిన నార్మన్‌ను ఇలా ప్రశ్నించడం జరిగింది :

"3635. వడ్డీ రేటన్నది నోట్ల మొత్తంపైన గాక పెట్టుబడి యొక్క సరఫరా, గిరాకీలపైన ఆధారపడి ఉంటుందని మీరు భావిస్తున్నట్లు చెప్పారు. నోట్లు, నాణాలు కాక 'పెట్టుబడి' అన్నదానిలో మీరింకా దేనిని చేరుస్తారు? – పెట్టుబడి యొక్క సాధారణ నిర్వచనం ఉత్పత్తిలో ఉపయోగించబడిన సరుకులు లేదా సేవలు అని నేను నమ్ముతున్నా."

"3636. మీరు వడ్డీ రేటు గురించి మాట్లాడుతున్నప్పుడు పెట్టుబడి అన్న పదంలో అన్ని సరుకుల్నీ చేరుస్తారని చెప్పటం మీ ఉద్దేశమా? – ఉత్పత్తిలో ఉపయోగించిన అన్ని సరుకులు." '3637. వడ్డీ రేటును క్రమబద్ధం చేసే అంశాల గురించి మీరు మాట్లాడుతున్నప్పుడు 'పెట్టుబడి' అన్న పదంలో దాన్నంతటినీ మీరు చేరుస్తారా? – ఔను. ఒక జౌళి ఉత్పత్తిదారుడు తన ఫ్యాక్టరీకి అవసరమైన పత్తికోసం దాన్ని పొందడానికి ఎలా ప్రారంభిస్తాడంటే బహుశా అతడు తన బ్యాంకరు దగ్గర అడ్వాన్సు తీసుకొని అలా లభించిన నోట్లతో లివర్‌పూల్ వెళ్ళి అక్కడ కొనుగోలు చేస్తాడు. అతనికి నిజంగా కావల్సింది పత్తి. పత్తిని పొందటానికి తోడ్పడే సాధనాలుగా తప్ప అతనికి నోట్లూ, బంగారమూ అక్కరలేదు. తన పనివాళ్ళకు అతను చెల్లించాలనుకోవచ్చు. అప్పుడు మళ్ళీ నోట్లను అప్పు తీసుకుంటాడు. ఆ నోట్లతో పనివాళ్ళ వేతనాలు చెల్లిస్తాడు. పనివాళ్లకు ఆహారమూ, వసతి కావాలి. డబ్బు అన్నది వాటికి చెల్లించే సాధనం." "3638. ఆ డబ్బుమీద వడ్డీ చెల్లిస్తారా? – చెల్లించడం జరుగుతుంది. అది పైకి అలా కనిపిస్తుంది అంతే. అయితే మరొక ఉదాహరణ చూడండి. అతను అడ్వాన్సు కోసం బ్యాంకుకు పోకుండా పరపతిపైన పత్తిని కొన్నాడనుకుందాం. నగదు డబ్బు ధరకు పరపతి ధరకు అప్పుడు ఉండే భేదమే అప్పటి వడ్డీ కొలమానం. అసలు డబ్బనేదే లేకపోయినప్పటికీ వడ్డీ మాత్రం ఉంటుంది."

ఇంతకు మించి ఇంకేముంటుందన్న భరోసా ధోరణి చెత్త కరెన్సీ సూత్రపు మూలస్థంభానికి

అనుగుణంగానే ఉంటుంది. మొదట బ్యాంక్ నోట్లు, బంగారం ఏదో ఒక వస్తువును కొనే సాధనాలు మాత్రమే. వాటిని వాటికోసమే అప్పు తీసుకోలేదన్న మహోజ్వల ఆవిష్కరణ. వడ్డీ రేటు క్రమబద్ధ మవటాన్ని వివరించడానికై ఈ ఆవిష్కరణ ముందుకు తేబడింది – కానీ అది దేనితో క్రమబద్ధమౌతుంది? ఇంత వరకు సరుకుల మార్కెటు ధరలను మాత్రమే క్రమబద్ధం చేస్తాయనుకుంటున్న సరుకుల గిరాకీ, సరఫరాల చేతనట. అయితే సరుకులకు ఒకే మార్కెట్టు ధరలున్నప్పుడు విభిన్నమైన వడ్డీ రేట్లు ఉంటుంటాయి. ఇక ఇప్పుడు ఈ ఎత్తుగడ... అతన్ని అప్పుడు సరైన ప్రశ్నే ఎదుర్కొంది : "అయితే వడ్డీ అన్నది డబ్బుపైనే చెల్లించబడుతుంది గదా?" అంటే దానర్థం ఇది : "సరుకులతో ఏ మాత్రం వ్యవహరించని బ్యాంకరు గ్రహించే వడ్డీకి ఈ సరుకులకు సంబంధమేమిటి? కార్ఖానాదారులు వేరువేరు మార్కెట్‌లలో మదుపు పెట్టినప్పటికీ, అనగా ఉత్పత్తిలో ఉపయోగించే సరుకుల సరఫరా, గిరాకీల పరిస్థితులు చాలా వేరువేరుగా ఉన్నప్పటికీ వారు ఒకే వడ్డీ రేటుపైన డబ్బు పొందటం లేదా?" ఈ ప్రశ్నలన్నిటికీ ఈ మహామేధావి చెప్పేదంతా ఏమంటే కార్ఖానాదారుడు పత్తిని పరపతిపై కొంటే "నగదు డబ్బు ధరకు అప్పటి పరపతి ధరకు మధ్య ఉన్న తేడా అన్నది వడ్డీకి కొలమానం" అని. నిజానికి ఇందుకు విరుద్ధంగా జరుగుతుంది. అమల్లో ఉన్న వడ్డీ రేటును క్రమబద్ధం చేసే అంశమేమిటి అన్న దాన్ని వివరించమని ఈ మేధావి నార్మన్‌ను అడగటం జరిగింది. ఈ వడ్డీ రేటు నగదు ధరకు చెల్లింపు గడువు వరకు పరపతి ధరకు మధ్య వున్న భేదానికి కొలమానం. మొదటిది పత్తి దాని నగదు ధరపై అమ్మబడాలి. దీన్ని మార్కెటు ధర నిర్ణయిస్తుంది. మార్కెట్ ధర సరఫరా గిరాకీలచేత క్రమబద్ధం అవుతుంది. ధర = 1000 పౌండ్లనుకుందాం. క్రయ విక్రయాలకు సంబంధించిన మేరకు ఉత్పత్తిదారునికి పత్తి బ్రోకరునికి మధ్య లావాదేవీ ఇంతటితో ముగుస్తుంది. ఇప్పుడు రెండో లావాదేవీ మొదలవుతుంది. అది రుణదాతకూ, రుణగ్రహీతకూ మధ్య. జౌళి ఉత్పత్తి దారునికి 1000 పౌండ్ల విలువ పత్తి రూపంలో అడ్వాన్సు చేయబడింది. అతను దాన్ని మూడు నెలల కాలంలో డబ్బు రూపంలో చెల్లించాలి. మార్కెట్ వడ్డీ రేటు చేత నిర్ణయించబడి 1000 పౌండ్లపైన మూడు నెలల వడ్డీ అన్నది నగదు ధరపైన అధికంగా వసూలు చేయబడిన మొత్తమవుతుంది. పత్తి యొక్క ధర సరఫరా, గిరాకీల చేత నిర్ణయించబడుతుంది. అయితే అడ్వాన్సు చేయబడిన పత్తి విలువ ధర అనగా మూడు నెలలకై అడ్వాన్సు చేయబడిన 1000 పౌండ్ల వడ్డీని మార్కెట్ వడ్డీ రేటు నిర్ణయిస్తుంది. పత్తి అన్నది డబ్బు పెట్టుబడిగా రూపాంతరం చెందింది అన్న ఈ వాస్తవం డబ్బు లేకున్నా వడ్డీ వుంటుంది అని రుజువైనట్టుగా నార్మన్‌కి కనిపిస్తుంది. అసలు డబ్బే లేకుంటే సార్వత్రిక వడ్డీ రేటన్నది కూడా నిస్సంశయంగా ఉండదు.

పెట్టుబడి అంటే 'ఉత్పత్తిలో ఉపయోగించిన సరుకులు' అనే భ్రష్ట భావన ఒకటి ఉంది. ఈ సరుకులు పెట్టుబడిగా వ్యవహరించిన మేరకు పెట్టుబడిగా వాటి విలువ, సరుకులుగా వాటి విలువకంటే భిన్నమైన ఆ విలువ, వాటి ఉత్పాదక వాణిజ్య ఉపయోగం నుండి తలెత్తే లాభంగా వ్యక్తమవుతుంది. అన్ని పరిస్థితుల్లోనూ లాభం రేటు అన్నది కొనుగోలు చేసిన సరుకుల మార్కెట్ ధరతోనూ వాటి సరఫరా, గిరాకీలతోనూ ఏదో ఒక సంబంధం కలిగి ఉంటుంది. కానీ అది పూర్తిగా భిన్నమైన పరిస్థితుల చేత నిర్ణయించబడుతుంది. సాధారణంగా వడ్డీ రేటన్నది లాభం రేటుచేత పరిమితం చేయబడుతుంది అనటంలో సందేహం లేదు. అయితే ఈ పరిమితి ఎలా నిర్ణయించబడుతుందో

నార్మన్ చెప్పాల్సి వుంది. పెట్టుబడి యొక్క ఇతర రూపాలకంటే భిన్నంగా డబ్బు పెట్టుబడి యొక్క సరఫరా, గిరాకీలను బట్టి అది నిర్ణయించబడుతుంది. మరో ప్రశ్న వేయవచ్చు : డబ్బు పెట్టుబడి గిరాకీ, సరఫరాలు ఎలా నిర్ణయించబడతాయి? పాదార్థిక పెట్టుబడి సరఫరాకు డబ్బు పెట్టుబడి సరఫరాకు మధ్య అనుకోకుండానే ఒక సంబంధం వుంటుందన్నది నిస్సందేహమైన వాస్తవం. అలాగే డబ్బు పెట్టుబడికోసం పారిశ్రామిక పెట్టుబడిదారుల గిరాకీ వాస్తవ ఉత్పత్తి పరిస్థితులచేత నిర్ణయించ బడుతుంది. ఈ విషయంలో మనకు జ్ఞానోదయం కలిగించడానికి బదులు డబ్బు పెట్టుబడికోసం ఉండే గిరాకీ, డబ్బుగా డబ్బు కోసం ఉండే గిరాకీ ఒకటి కాదు అన్న రుషిపుంగవుల అభిప్రాయాన్ని నార్మన్ ప్రసాదిస్తున్నాడు. అతడు, ఓవర్‌స్టన్ తదితర కరెన్సీ ప్రవక్తలు చలామణి సాధనం నుండి కృత్రిమంగా శాసనపరమైన జోక్యం ద్వారా పెట్టుబడి చేసుకోడానికి, వడ్డీ రేటును పెంచడానికి ప్రయత్నిస్తున్నారు. కనుక వారి ఈ వివేకం అప్పుడప్పుడూ వారి ఆత్మను గుచ్చుతూ ఉంటుంది.

ఇక ఓవర్‌స్టన్ అని నామాంతరం వున్న శామ్యూల్ జోన్స్ లాయడ్‌ను అతని 'డబ్బు' పైన పది శాతం ఎందుకు తీసుకుంటున్నాడో వివరించమంటే తన దేశంలో 'పెట్టుబడి' చాలా కొరతగా వుంది అన్న సమాధానం వచ్చింది.

"3653. వడ్డీ రేటులో ఆటుపోటులు రెండు కారణాల్లో ఒక దానివల్ల తలెత్తుతాయి. పెట్టుబడి విలువలో మార్పువల్ల." (అద్భుతం! సాధారణంగా చెప్పాలంటే పెట్టుబడి విలువ అన్నది సరిగ్గా వడ్డీ రేటునే సూచిస్తుంది. కనుక ఆ రకంగా వడ్డీ రేటులో మార్పు, వడ్డీ రేటులో మార్పు నుంచే తలెత్తుతున్నట్టు చెప్తున్నాడు. 'పెట్టుబడి విలువ' అన్నది మనం వేరే సందర్భంలో పేర్కొన్నట్టుగా సిద్ధాంతంలో మరోరకంగా ఊహించబడదు. లేదంటే లార్డ్ ఓవర్‌స్టన్ ఉద్దేశంలో 'పెట్టుబడి విలువ' అంటే వడ్డీ రేటు అయితే ఈ గంభీర ఆలోచనాశీలి లాభం రేటు వడ్డీ రేటును క్రమబద్ధం చేస్తుందన్న ఆలోచనకు తిరిగి వస్తున్నాడన్న మాట!) లేదా దేశంలో వున్న డబ్బు మొత్తంలో మార్పు వల్ల. వడ్డీలో ఉన్న పెద్ద ఆటుపోట్లన్నీ పెట్టుబడి విలువలో మార్పులవల్లే తలెత్తాయని స్పష్టంగా గమనించవచ్చు. ఈ ఆటుపోట్లు వాటి కాల వ్యవధిని బట్టి లేదా వాటి విస్తృతిని బట్టి అవి పెద్దవి కావచ్చు. 1847లోనూ, గత రెండేళ్ళుగానూ (1855–56) వడ్డీ రేటులో పెరుగుదల కంటే మించిన ఆచరణాత్మక ఉదాహరణను ఇవ్వలేము. వడ్డీ రేటులో డబ్బు పరిమాణంలో వచ్చే మార్పువల్ల తలెత్తే కొద్దిపాటి ఆటుపోట్లు వాటి విస్తృతి రీత్యా – కాల వ్యవధి రీత్యా అవి చిన్నవి. అవి తరచుగా వస్తుంటాయి. అవి ఎంత తరచుగా శీఘ్రంగా వస్తే వాటి నిర్దేశిత లక్ష్యాన్నవి అంత బాగా నిర్వహిస్తాయి." అనగా ఓవర్‌స్టన్ లాంటి బ్యాంకర్లను సుసంపన్నం చేయటమే వాటి లక్ష్యం. మిత్రుడు శామ్యూల్ గుర్నె లార్డ్స్ కమిటీ ముందు దానిని అమాయకంగా చెప్పేశాడు. సి.డి. 1848 (1857) : "1324. వడ్డీ రేట్లలో గత ఏడాది వచ్చిన పెద్ద ఆటుపోట్లు బ్యాంకర్లకు, డబ్బు వ్యాపారులకు సానుకూలంగా ఉన్నాయా, లేవా – డబ్బు వ్యాపారులకు అవి సానుకూలంగా ఉన్నాయని నేను భావిస్తున్నాను. వ్యాపారంలో ఆటుపోట్లు తెలిసిన మనిషికి సానుకూలంగానే ఉంటాయి." – "1325. అధిక వడ్డీ రేట్ల వల్ల తన ఖాతాదారుణ్ణి దరిద్రునిగా మార్చటం వల్ల బ్యాంకరు ఇబ్బందికి గురికాడా? – లేదు. దానికి అటువంటి ప్రభావముందని నేననుకోను." – *Voila ce que parler veut dire.*[1]

1. అదన్నమాట సంగతి.

వడ్డీ రేటుపై అందుబాటులో డబ్బు పరిమాణం ప్రభావం ఎలా ఉంటుందనేది తర్వాత చర్చిద్దాం. అయితే ఇక్కడ ఓవర్‌స్టన్ ఓ అప్రస్తుత వ్యాఖ్య చేశాడు. 1847లో డబ్బు పెట్టుబడి కోసం గిరాకీ (అక్టోబరుకి ముందు డబ్బు కొరత గురించి ఆత్రుత ఏమీ లేదు. అలాగే 'డబ్బు పరిమాణం' గురించీ లేదు.) అనేక కారణాలుగా పెరిగింది. ధాన్యం, పత్తి వగైరాల ధరలు పెరగటం వల్ల, అధికోత్పత్తి వల్ల పంచదారను కొనేవారు లేకపోవడం వల్ల, రైల్వే సట్టా వ్యాపారం వల్ల, సంక్షోభం వల్ల పత్తి సరుకులతో విదేశీ మార్కెట్లను ముంచెత్తడం వల్ల ఇంతకు ముందు వివరించిన రీతిగా బిల్స్ ఆఫ్ ఎక్స్చేంజిలో సట్టా వ్యాపారం చేసే లక్ష్యంతో ఇండియా నుంచి దిగుమతులు, ఇండియాకు ఎగుమతులు బలవంతంగా నిర్వహించడం వల్ల గిరాకీ పెరిగింది. పరిశ్రమలో అధికోత్పత్తి, వ్యవసాయంలో అల్పోత్పత్తి – మరోలా చెప్పాలంటే పూర్తిగా భిన్నమైన వేరు వేరు కారణాల వల్ల డబ్బు పెట్టుబడికి అనగా పరపతి కోసం, డబ్బు కోసం గిరాకీ బాగా పెరిగింది. డబ్బు పెట్టుబడికై పెరిగిన గిరాకీకి మూలం ఉత్పాదక క్రమంలోనే ఉంది. డబ్బు పెట్టుబడి యొక్క ఈ గిరాకీ వడ్డీ రేటును అనగా డబ్బు పెట్టుబడి విలువను పైకెగబాకేలా చేసింది. డబ్బు పెట్టుబడి విలువ పెరిగింది. కనుక అది పెరిగిందని ఓవర్‌స్టన్ చెప్పదలచుకుంటే అది పునరుక్తి మాత్రమే. అయితే 'పెట్టుబడి విలువ' అనటంలో వడ్డీ రేటును పెంచడానికి కారణమైన లాభం రేటులో పెరుగుదల అనేది అతని ఉద్దేశమైతే అది పూర్తిగా తప్పు అని మనం వెంటనే గమనిస్తాం. డబ్బు పెట్టుబడికి పర్యవసానంగా 'పెట్టుబడి విలువ'కు ఉన్న గిరాకీ, లాభం తగ్గినప్పటికీ పెరుగుతుంది; డబ్బు పెటుబడి యొక్క సాపేక్ష సరఫరా కుంచించుకుపోగానే దాని 'విలువ' పెరుగుతుంది. ఓవర్‌స్టన్ రుజువు చేయదలచుకున్నదేమంటే 1847 సంక్షోభానికి, దాని పర్యవసానంగా తలెత్తిన అధిక వడ్డీ రేటుకు, 'డబ్బు పరిమాణం'లో అనగా తాను సమర్థించిన 1844 బ్యాంక్ యాక్టు శాసనాలతో ఎటువంటి సంబంధం లేదు అని. నిజానికి వాటితో దానికి పూర్తి సంబంధముంది. బ్యాంకు నిల్వలకు ఖర్చు చేయాలంటే ఉన్న భయం – ఇది ఓవర్‌స్టన్ నిర్వాకమే – 1847–48 సంక్షోభానికి దారితీసిన డబ్బు భయానికి దోహదపడింది. అయితే, ఇక్కడ విషయం అది కాదు. అందుబాటులో ఉన్న సాధన సంపత్తితో పోలిస్తే మితిమీరిన కార్యకలాపాల పరిమాణం వల్ల అలాగే పంటలు దెబ్బ తినటం కారణంగా, రైల్వేల్లో అతిగా మదుపు పెట్టడం వల్ల, అధికోత్పత్తి వల్ల (ముఖ్యంగా పత్తి సరుకులు) ఇండియా, చైనాలతో వ్యాపారంలో దగా కార్యకలాపాల వల్ల, సట్టా వ్యాపారం అనవసరమైన పంచదార దిగుమతుల వల్ల, పునరుత్పత్తి ప్రక్రియలో తలెత్తిన ఇబ్బందులు త్వరితం జేయటం వల్ల డబ్బు పెట్టుబడి కొరత తీవ్రమైంది. ఒక బస్తా ధాన్యానికి 120 షిల్లింగులు చెల్లించిన వారు దాని ధర 60 షిల్లింగులకు పడిపోయినప్పుడు వారు ఎక్కువగా చెల్లించిన 60 షిల్లింగులు లాంబార్ట్ స్ట్రీట్‌లో ఆ మొత్తంపైన ధాన్యానికిగాను తీసుకున్న పరపతి అడ్వాన్సులు వారు కోల్పోయారు. ధాన్యాన్ని దాని పాత ధరకు, 120 షిల్లింగులకు అమ్మలేకపోవడానికి కారణం బ్యాంకు నోట్ల కొరత కాదు. అమితంగా పంచదారను దిగుమతి చేసుకున్న వారికి కూడా ఇది వర్తిస్తుంది. ఆ పంచదారను అమ్మటం దాదాపు అసాధ్యమైంది. తమ చేతిలో ఉన్న పెట్టుబడి రైల్వేల్లో ఇరుక్కుపోగా తమ 'న్యాయమైన' వ్యాపారంలో పూర్తిగా పరపతిపైన ఆధారపడిన పెద్దమనుషులకు ఇది వర్తిస్తుంది. ఓవర్‌స్టన్‌కి ఇదంతా "తన డబ్బు యొక్క, పెరిగిన విలువ యొక్క నైతిక భావంగా" కనబడుతుంది. అయితే డబ్బు పెట్టుబడి యొక్క ఈ పెరిగిన విలువ మరోవైపున వాస్తవ పెట్టుబడి (సరుకు పెట్టుబడి, ఉత్పాదక

పెట్టుబడి) యొక్క తగిన డబ్బు విలువకు ప్రత్యక్షంగా అనులోమానుపాతంలో వుంటుంది. ఒక రూపంలో పెట్టుబడి విలువ తగ్గింది కనుకనే మరో రూపంలో పెరిగింది. అయితే ఈ రెండు రకాల పెట్టుబడుల విలువలనే ఒకే పెట్టుబడి విలువగా చూపించడానికి ఓవర్‌స్టన్ ప్రయత్నిస్తున్నాడు. ఈ రెంటినీ కలిపి చలామణి సాధనం యొక్క కొరతకు అనగా అందుబాటులో ఉన్న డబ్బు కొరతకు వ్యతిరేకంగా చూపిస్తున్నాడు. అయితే ఒక మొత్తం డబ్బు పెట్టుబడిని చలామణి సాధనం యొక్క విభిన్న పరిమాణాలతో అప్పివ్వవచ్చు.

ఆయన 1847 ఉదాహరణ చూద్దాం. జనవరిలో అధికారిక బ్యాంకు రేటు 3 నుంచి $3\frac{1}{2}$ శాతం ఉంది. ఫిబ్రవరిలో 4 నుంచి $4\frac{1}{2}$ శాతం వుంది. మార్చిలో అది సాధారణంగా 4 శాతం వుంది. ఏప్రిల్‌లో (భయోత్పాతం) 4 నుంచి $7\frac{1}{2}$ శాతం. మే 5 నుంచి $5\frac{1}{2}$ శాతం. జూన్ మొత్తం మీద 5 శాతం. జూలై 5 శాతం. ఆగస్టు 5 నుంచి $5\frac{1}{2}$. సెప్టెంబర్ $5\frac{1}{4}$, $5\frac{1}{2}$, 6 శాతాల కొద్దిపాటి తేడాలతో ఎక్కువగా 5 శాతం వుంది. అక్టోబర్ 5, $5\frac{1}{2}$, 7 శాతం. నవంబర్ 7–10 శాతం. డిసెంబర్ 7 నుంచి 5 శాతం. ఈ సందర్భంలో లాభాలు తగ్గాయి గనుక సరుకుల డబ్బు విలువలు విపరీతంగా పడిపోయాయి. కనుక వడ్డీ రేటు పెరిగింది. కనుక 1847లో పెట్టుబడి విలువ పెరిగింది. కనుక వడ్డీ రేటు పెరిగిందని ఓవర్‌స్టన్ చెబుతున్నాడు. అంటే అతని ఉద్దేశం పెట్టుబడి విలువ అని కాదు. కేవలం డబ్బు పెట్టుబడి విలువ అని మాత్రమే. డబ్బు పెట్టుబడి విలువ అంటే వడ్డీ రేటు తప్ప మరొకటి కాదు. అయితే అతడు తర్వాత తన అసలు రంగు బయటపెట్టాడు. పెట్టుబడి విలువను లాభం రేటుతో సమానం చేశాడు.

1856లో చెల్లించిన అధిక వడ్డీ రేటుకు సంబంధించి పరపతి మీద వ్యాపారం చేసేవారు ముందుకొస్తున్నారని, వారు తమ లాభాల్నించి కాక ఇతరుల పెట్టుబడి నుంచి వడ్డీని చెల్లిస్తున్నారు అన్న విషయం ఓవర్‌స్టన్ లక్ష్యపెట్టలేదు. 1857 సంక్షోభానికి కొద్ది నెలల ముందు 'వ్యాపారం సవ్యంగానే ఉంది' అని అతను సెలవిచ్చాడు.

అతనింకా ఇలా సాక్ష్యం చెప్పాడు (బి.సి. 1857) : "3722. వడ్డీ రేట్లు పెరగటం వల్ల వాణిజ్యంలో ఉన్న లాభాలు నాశనమవుతాయన్న భావన చాలా పొరపాటు. మొదటిది – వడ్డీ రేటులో పెరుగుదల దీర్ఘకాలంపాటు ఉండటమన్నది చాలా అరుదుగా జరుగుతుంది. రెండోది దీర్ఘకాలం పాటు పెద్ద విస్తృతిలో అది ఉంటే అది పెట్టుబడి విలువలో పెరుగుదల మాత్రమే. పెట్టుబడి విలువ ఎందుకు పెరుగుతుంది? ఎందుకంటే లాభం రేటు పెరిగింది గనుకనే." – ఇక్కడ మళ్ళీ 'పెట్టుబడి విలువ' అంటే అతని ఉద్దేశమేమిటో తెలుస్తుంది. అంతేగాక దీర్ఘకాలంపాటు లాభం రేటు ఎక్కువగా ఉండొచ్చు. అయినా పరిశ్రమ లాభం పడిపోనూవచ్చు. ఎందుకంటే వడ్డీ రేటు బాగా పెరిగి లాభంలో బాగా పెద్ద భాగాన్ని అది దిగమింగవచ్చు.

"3724. దేశంలో వ్యాపారం పెద్ద ఎత్తున పెరగటం వల్ల, లాభాల రేటు పెద్దగా పెరగటం వల్ల వడ్డీ రేటులో పెరుగుదల తలెత్తింది. వడ్డీ రేటు ఈ రెంటినీ ధ్వంసం చేస్తుందనడం అంటే వడ్డీ రేటు వాటి ప్రభావం వల్లే తలెత్తటం వల్ల అదొక తార్కిక అసంబద్ధత అవుతుంది. దానితో ఎలా వ్యవహరించాలో తెలియటం కష్టం." – అతడు ఇలా చెప్పి ఉంటే ఎంత తర్కబద్ధంగా ఉంటుందో ఇదీ అంతే : లాభం రేటులో పెరుగుదల సట్టా వ్యాపారం వల్ల సరుకుల ధరల పెరుగుదల కారణంగా

తలెత్తింది. ధరల పెరుగుదల తన సొంత కారణాన్ని అనగా సట్టా వ్యాపారాన్ని నాశనం చేస్తుంది అనటం తార్కిక అసంబద్ధత. అయితే తన సొంత కారణాన్నే అంతిమంగా నాశనం చేసుకోవడమన్నది అధిక వడ్డీ రేటుతో అమితంగా ఆకర్షితుడైన వడ్డీ వ్యాపారికి మాత్రమే అది తార్కిక అసంబద్ధతగా కనిపిస్తుంది. రోమన్‌ల గొప్పతనానికి కారణమైన వారి విజయాలే వారి గొప్పతనాన్ని నాశనం చేశాయి. సంపద భోగలాలసతకు కారణం. భోగలాలసత సంపదను నాశనం చేయగలదు. ఆహా! ఏం తెలివి! ప్రస్తుత బూర్జువా ప్రపంచపు మౌఢ్యానికి ఈ కోటీశ్వరుని (పేడకుప్పల ప్రభువు) తర్కం మొత్తం ఇంగ్లండు అంతటిలోనూ సృష్టించిన గౌరవమే మంచి తార్కాణం. అంతేగాక అధిక లాభం రేటు, వ్యాపార విస్తృతి అధిక వడ్డీ రేటుకు కారణాలైతే కావచ్చు. కానీ అధిక వడ్డీ రేటు ఏ రకంగానూ అధిక లాభానికి కారణంగాదు. ఇక్కడ అసలు ప్రశ్న ఏమంటే అధిక లాభం రేటు చాలాకాలం క్రితమే నిష్క్రమించిన తర్వాత అటువంటి అధిక వడ్డీ (సంక్షోభ కాలంలో వాస్తవంగా కనుగొనబడినట్టుగా) కొనసాగటమే కాక దాని అత్యున్నత స్థాయికి చేరుకుందా అన్నది ప్రశ్న.

"3718. డిస్కౌంటు రేటులో పెద్ద ఎత్తున పెరుగుదలకు సంబంధించి అది పూర్తిగా పెరిగి పెట్టుబడి విలువ నుంచి తలెత్తే పరిస్థితి. పెట్టుబడి యొక్క ఆ పెరిగిన విలువకు కారణం ఏ వ్యక్తయినా స్పష్టంగా కనుక్కోవచ్చు. ఈ చట్టం అమలులో ఉన్న పదమూడేళ్ళ కాలంలోనూ ఈ దేశపు వాణిజ్యం 450 లక్షల పౌండ్ల నుండి 1200 లక్షల పౌండ్లకు పెరిగిందన్న వాస్తవాన్ని నేనింతకు ముందే తెలియజేశాను. ఈ చిన్న ప్రకటనలో ఇమిడివున్న సంఘటనలన్నిటినీ ఏ వ్యక్తినయినా గుర్తు చేసుకోమనండి. అంత పెద్ద స్థాయిలో పెరిగిన వాణిజ్యాన్ని కొనసాగించడానికి పెట్టుబడిపైన పెరిగిన అపారమైన గిరాకీని పరిశీలించమనండి. అదే సమయంలో ఈ పెద్ద గిరాకీకి అవసరమైన సరఫరా నందించే సహజ ఆధారాన్ని అనగా ఈ దేశంలో వార్షిక పొదుపు మొత్తాలను పరిశీలించమనండి. అవన్నీ లాభంలేని యుద్ధ వ్యయంలో వినియోగమైపోయాయి. వడ్డీ రేటు ఇప్పుడున్న దానికంటే ఎక్కువ లేనందుకు ఆశ్చర్యపోతున్నాను. మరోరకంగా చెప్పాలంటే ఈ పెద్ద కార్యకలాపాలు కొనసాగించడానికి అవసరమైన పెట్టుబడి మీద ఒత్తిడి నీకు కనిపించిన దానికంటే చాలా ఎక్కువ స్థాయిలో లేదు:"

ఈ వడ్డీ వ్యాపారపు తర్కవేత్త ఎంత ఆశ్చర్యకరమైన మాటల గారడీ ఇది! ఇక్కడ మళ్ళీ ఇతడు తన పెరిగిన పెట్టుబడి విలువతో ముందుకొచ్చాడు. పునరుత్పత్తి ప్రక్రియ ఒకవైపున అపారంగా విస్తరిస్తుండగా అనగా వాస్తవ పెట్టుబడి సంచయనం జరుగుతుండగా మరోవైపున వాణిజ్య రంగంలో ఈ మహావిస్తరణను నిర్వహించడానికి అవసరమైన పెట్టుబడి అస్తిత్వంలో ఉందని అతడు అనుకొంటున్నట్టు అనిపిస్తుంది. ఉత్పత్తి అపారంగా పెరగడమంటే పెట్టుబడి పెరగటం కాదా? ఒకవేళ అది గిరాకీని సృష్టించిందనుకుంటే సరఫరాను, అదే సమయంలో డబ్బు పెట్టుబడి సరఫరాను సృష్టించలేదా? డబ్బు పెట్టుబడి సరఫరా కంటే దాని గిరాకీ పెరగటం వల్ల వడ్డీ రేటు పెరిగిందీ అంటే మరోరకంగా చెప్పాలంటే దానర్థం పారిశ్రామిక ఉత్పత్తి విస్తరించడంతో పరపతి ప్రాతిపదికపై దాని కార్యకలాపాలు కూడా విస్తరించినాయని చెప్పడమవుతుంది. అంటే వాస్తవంగా జరిగిన పారిశ్రామిక విస్తృతి దానికి 'వసతి' కోసం గిరాకీని కూడా పెంచింది. ఈ వసతి కోసం గిరాకీని పెట్టుబడి కోసమున్న గిరాకీగా మన బ్యాంకరు అర్థం చేసుకుంటున్నాడు. పెట్టుబడికై ఈ గిరాకీ

పెరగటం వల్ల మాత్రం ఎగుమతి వాణిజ్యం 450 లక్షల పౌండ్ల నుంచి 1200 లక్షల పౌండ్లకు పెరగలేదు. అంతేగాదు. క్రిమియా యుద్ధం దిగమింగిన వార్షిక పొదుపు మొత్తాలు ఈ సహజమైన సరఫరా ఆధారాన్ని సృష్టిస్తాయని, ఈ ఆధారం నుంచి ఈ అతిపెద్ద గిరాకీకి సరఫరా చేసి ఉండొచ్చునని చెప్పటంలో ఓవర్‌స్టన్ ఉద్దేశమేమిటి? మొదటిది. 1792-1815లో ఇంగ్లండు డబ్బు సంచయనాన్ని ఎలా సాధించింది. ఇది చిన్న క్రిమియా యుద్ధం కంటే చాలా భిన్నమైన యుద్ధం. రెండోది, సహజమైన ఆధారం ఎండిపోతే మరే ఆధారం నుంచి పెట్టుబడి ప్రవహించింది? ఇంగ్లండు విదేశాల నుంచి రుణాలు పుచ్చుకోలేదన్నది తెలిసిన విషయమే. సహజమైన ఆధారంతో పాటు అసహజమైన ఆధారం కూడా ఉంటే సహజమైన ఆధారాన్ని యుద్ధంలోనూ, అసహజమైన దాన్ని వాణిజ్యంలోనూ ఉపయోగిస్తే బావుండేది. అయితే కేవలం పాత డబ్బు పెట్టుబడి మాత్రమే అందుబాటులో ఉంటే అధిక వడ్డీ రేటు ద్వారా దాని ప్రభావాన్నది రెట్టింపు చేసుకోగలదా? దీనిని బట్టి ఓవర్‌స్టన్ ఆలోచిస్తున్నదేమంటే దేశంలో ఉన్న వార్షిక పొదుపు మొత్తాలు (అయితే ఈ విషయంలో వినియోగమైపోయామని భావించబడింది) డబ్బు పెట్టుబడిగా మాత్రమే మార్చబడ్డాయి. అయితే నిజమైన సంచయనం అనగా ఉత్పత్తి విస్తరణ, ఉత్పత్తి సాధనాల వృద్ధి జరగకపోయుంటే ఈ ఉత్పత్తి పైన రుణదాతల హక్కుభుక్తాలు పోగుబడటం వల్ల ప్రయోజనమేమిటి?

అధిక లాభం రేటు నుంచి తలెత్తే 'పెట్టుబడి విలువ'లో పెరుగుదలను డబ్బు పెట్టుబడి కోసం పెద్ద గిరాకీ వల్ల ఏర్పడిన పెరుగుదలగా ఓవర్‌స్టన్ చూపుతున్నాడు. లాభం రేటుతో ప్రమేయం లేకుండానే వేరే కారణాల వల్ల ఈ గిరాకీ పెరగవచ్చు. వాస్తవ పెట్టుబడి విలువ తగ్గటం ఫలితంగా 1847లో తలెత్తిన ఉదాహరణను అతనే స్వయంగా పేర్కొన్నాడు. తన ఉద్దేశానికి ఏది వాటంగా ఉంటే దాన్ని ఉపయోగించుకుంటూ పెట్టుబడి విలువను ఒకసారి వాస్తవ పెట్టుబడిగాను, మరోసారి డబ్బు పెట్టుబడిగాను చూపిస్తున్నాడు.

మన బ్యాంకు ప్రభువుగారి నిజాయితీ రాహిత్యం ఆయన సంకుచిత బ్యాంకరు దృక్పథం దాని ఉపదేశాత్మక సుగంధంతో సహా ఈ కింది అంశంలో వ్యక్తమవుతుంది : (3728. ప్రశ్న:) "వ్యాపారికి డిస్కౌంటు రేటుతో ఎటువంటి పాదార్థికమైన ప్రాధాన్యత లేదని మీరు భావిస్తున్నట్టు మీరే చెప్పారు. సాధారణ లాభం రేటనగా మీ ఉద్దేశమేమిటో దయచేసి సెలవిస్తారా?" – ఈ ప్రశ్నకు సమాధానం చెప్పటం 'అసాధ్యం' అని ఓవర్‌స్టన్ ప్రకటించాడు. "3729. సగటు లాభం రేటు 7 నుంచి 10% ఉందనుకుంటే, డిస్కౌంటు రేటులో 2 నుంచి 7 లేదా 8% మార్పు ఉంటే అది లాభం రేటును పాదార్థికంగా ప్రభావితం చేస్తుందా లేదా" (ఈ ప్రశ్నే పరిశ్రమ లాభాన్ని లాభం రేటుతో కలగాపులగం చేసింది. అంతేగాక లాభం రేటన్నది వడ్డీ, పరిశ్రమ లాభాల ఉమ్మడి ఆధారం అన్న అంశాన్ని దాటవేసింది. వడ్డీ రేటు లాభం రేటును ముట్టుకోకపోవచ్చు. కానీ పరిశ్రమ లాభాన్ని ప్రభావితం చేయకుండా ఉండదు. ఓవర్‌స్టన్ ఇలా సమాధానం చెప్పాడు :) "మొదటిది తమ లాభాలకు తీవ్రంగా అంతరాయం కల్పించే డిస్కౌంటు రేటును ఖాతాదారులు చెల్లించరు. వారు అలా చేయటం కంటే తమ వ్యాపారాన్ని నిలిపివేస్తారు" (ఔను. తమను తాము నాశనం చేసుకోకుండా అలా చేయగలిగితే వారు చేస్తారు. వారి లాభం అధికంగా ఉన్న మేరకు వారి డిస్కౌంట్ చెల్లించాలనుకుంటారు కనుక చెల్లిస్తారు. అది బాగా తక్కువగా వున్నప్పుడు, వారు చెల్లించక తప్పదు గనుక చెల్లిస్తారు.) "డిస్కౌంటు

అర్థమేమిటి? ఒక వ్యక్తి తన బిల్లునెందుకు డిస్కౌంటు చేస్తాడు?... ఎందుకంటే మరింత పెద్ద మొత్తంలో పెట్టుబడి మీద అదుపు సంపాదించాలని అతడనుకుంటాడు గనుక." (Halte-la! – ఆగండి! కొంచెం. ఎందుకంటే వేరేచోట ఇరుక్కుపోయిన తన పెట్టుబడి నుంచి డబ్బు తిరిగి వస్తుందని ఆశిస్తాడు గనుక, తన వ్యాపారం ఆగిపోకుండా కొనసాగించాలనుకుంటాడు గనుక, గడువులోపల అతడు చెల్లించాల్సిన మొత్తాలున్నాయి గనుక. వ్యాపారం బాగా ఉన్నప్పుడు లేదా వ్యాపారం బాగా లేకపోయినా మరొకని పెట్టుబడితో సట్టా వ్యాపారం చేస్తున్నప్పుడు గాని అతడు మరింత పెట్టుబడిని కోరతాడు. డిస్కౌంటు అన్నది కేవలం వ్యాపారాన్ని విస్తరించడానికి మాత్రమే కానక్కరలేదు.) "మరింత మొత్తం పెట్టుబడిపై అతడు అదుపు సంపాదించాలని ఎందుకనుకుంటాడు? ఎందుకంటే అతడా పెట్టుబడిని ఉపయోగించాలనుకుంటాడు కనుక. అతడా పెట్టుబడిని ఎందు కుపయోగించాలనుకుంటాడు? అలా చేయటం అతనికి లాభదాయకం కనుక. డిస్కౌంట్ అతని లాభాన్ని నాశనం చేస్తే అలా చేయటం అతనికి లాభదాయకంగా ఉండబోదు."

మార్పిడి బిల్లులను కేవలం వ్యాపారాన్ని విస్తరింపచేయటానికి మాత్రమే డిస్కౌంటు చేస్తారని, అలాగే వ్యాపారం లాభదాయకం గనుకనే దాన్ని విస్తరింపజేస్తారని భరోసా ధోరణి తర్కపండితుడు భావిస్తున్నాడు. మొదటి భావన తప్పు. సాధారణ వ్యాపారి తన పెట్టుబడి యొక్క డబ్బు రూపాన్ని పొందటం కోసం డిస్కౌంటు చేస్తాడు. ఆ రకంగా తన పునరుత్పత్తి ప్రక్రియను కొనసాగిస్తాడు. అంతేగాని తన వ్యాపారాన్ని విస్తరించడానిగ్గాను అదనపు పెట్టుబడిని పొందటానిక్కాని కాదు. తాను ఇవ్వాల్సిన పరపతికి తాను పెట్టుకునే పరపతికి మధ్య సమతూకం ఉండేలా చూసుకుంటాడు. పరపతిపైన తన వ్యాపారాన్ని విస్తరింపజేయాలని కోరుకుంటే బిల్లులను డిస్కౌంటు చేయడం వల్ల అతనికి ప్రయోజనమేమీలేదు. ఎందుకంటే అప్పటికే తన చేతుల్లో ఉన్న తన డబ్బు పెట్టుబడిని ఒక రూపం నించి మరొక రూపానికి మార్చడం మాత్రమే అవుతుంది. దానికి బదులు అతడు ప్రత్యక్షంగా దీర్ఘకాలిక రుణాన్ని తీసుకుంటాడు. పరపతి దగాకోరు తన పరపతి పత్రం తన వ్యాపార కార్యకలాపాలను విస్తరింపజేయడానికే తన అప్పు పత్రాన్ని డిస్కౌంటు చేయిస్తాడు. తను నడిపే ఒక రోత వ్యాపారాన్ని మరోదానితో కప్పిపెట్టడానికి, లాభం సంపాదించడానిక్కాక మరొకడి పెట్టుబడిపై 'ఆధిపత్యాన్ని సంపాదించడానికి అతడలా చేస్తాడు.'

ఆ రకంగా డిస్కౌంటింగును ఓవర్‌స్టన్ అదనపు పెట్టుబడిని అప్పు తీసుకోవటంగా చూపించిన తర్వాత (ఇది నిజానికి పెట్టుబడికి ప్రాతినిధ్యం వహించే బిల్లులను నగదు డబ్బుగా మార్చడం మాత్రమే.) ఒత్తిడి పెంచగానే టక్కున వెనక్కు తగ్గుతాడు. (3730. ప్రశ్న:) "వ్యాపారంలో నిమగ్నమైన వారు డిస్కౌంటు రేటులో తాత్కాలిక పెరుగుదల ఉన్నప్పటికీ తమ వ్యాపారాల్ని కొంత కాలంపాటు కొనసాగించొద్దా?" (ఓవర్‌స్టన్:) "ఏ ప్రత్యేకమైన లావాదేవీలోనైనా ఒక వ్యక్తి ఎక్కువ వడ్డీ రేటుతో కంటే తక్కువ వడ్డీ రేటుతో పెట్టుబడిపైన అదుపు సంపాదించగలిగితే ఆ పరిమిత దృక్పథంతో చూస్తే అదతనికి వీలుగా ఉంటుందనటంలో సందేహం లేదు." – అయితే అది పరిమిత దృక్పథం మాత్రమే. మరోవైపున ఈ దృక్పథం అతనికి తన సొంత బ్యాంకరు పెట్టుబడి మాత్రమే పెట్టుబడిగా అర్థమయ్యేలా చేస్తుంది. తన దగ్గర మార్పిడి బిల్లులను డిస్కౌంటు చేసుకునే మనిషి పెట్టుబడి లేని మనిషని ఓవర్‌స్టన్ భావిస్తాడు. ఎందుకంటే ఆ మనిషి పెట్టుబడి సరుకుల రూపంలో ఉంది గనుక. లేదా అతని

పెట్టుబడి యొక్క రూపం మార్పిడి బిల్లు గనుక. ఆ మార్పిడి బిల్లును ఓవర్‌స్టన్ మరో డబ్బు రూపానికి మారుస్తాడు.

3732. "1844 చట్టానికి సంబంధించి బ్యాంకులో ఉన్న వెండి, బంగారాల మొత్తంతో సగటు వడ్డీ రేటు ఏ నిష్పత్తిలో ఉందో చెప్పగలరా? వెండి, బంగారాల మొత్తం 90 లక్షలు లేదా 100 లక్షల పౌండ్లు ఉన్నప్పుడు వడ్డీ రేటు 6% లేదా 7% ఉందని, ఆ మొత్తం 160 లక్షల పౌండ్లున్నప్పుడు వడ్డీ రేటు 3% నుంచి 4% ఉంది అన్న విషయం నిజమేనా?" (పెట్టుబడి విలువ చేత ప్రభావితం అయిన మేరకు, వడ్డీ ప్రాతిపదికపైన బ్యాంకులో ఉన్న వెండి, బంగారాల మొత్తం చేత ప్రభావితమయిన మేరకు వడ్డీ రేటును వివరించాల్సిందిగా ప్రశ్నించే వ్యక్తి అతన్ని వత్తిడి చేస్తున్నాడు.) "నేను అది అలా ఉంటుందని అనుకోను... అది ఒకవేళ అలాగే ఉంటే 1844 చట్టంలో తీసుకున్న వాటికంటే మరింత కఠినమైన చర్యలు తీసుకోవాల్సి వుంటుంది. ఎందుకంటే వెండి, బంగారాల నిల్వలు పెరిగిన కొద్దీ వడ్డీ రేటు తగ్గిపోతుందనేది నిజమే. అయితే ఆ దృక్పథం ప్రకారం ఒక అతి భారీ స్థాయిలో వెండి, బంగారాల నిల్వలను పెంచడానికి కృషి చేయడం ప్రారంభించాలి. ఇక అప్పుడు వడ్డీని సున్నా స్థాయికి తగ్గించాలి." – ఈ చౌకబారు ఛలోక్తికి ప్రశ్నిస్తున్న కేలీ చలించలేదు. అతడిలా కొనసాగించాడు : "3733. అట్లా అయితే 50 లక్షల పౌండ్ల వెండి, బంగారాలను ఆరు నెలల్లోగా బ్యాంకుకు తిరిగి చేర్చగలిగితే అది 160 లక్షల పౌండ్లు అవుతుంది. అప్పుడు వడ్డీ రేటు 3, 4 శాతానికి పడిపోతుంది. అటువంటప్పుడు దేశంలో వున్న వ్యాపారం బాగా తగ్గిపోవడం వల్లనే వడ్డీ రేటు పడిపోయిందని ఎలా చెప్పగలరు? – నేనన్నది వడ్డీ రేటు పడిపోవడం కాదు. ఇటీవల వడ్డీ రేటు పెరగటం అన్నది దేశంలో ఉన్న వ్యాపారంలో పెరుగుదలతో సన్నిహితంగా ముడిపడి వుంది అని అన్నాను." అయితే కేలీ అన్నది ఇది : బంగారపు నిల్వలు తగ్గటంతో వడ్డీ రేటు పెరగటం అన్నది వ్యాపార విస్తరణను సూచిస్తే బంగారు నిల్వలు విస్తరించడంతో వడ్డీ రేటు పడిపోవడం అన్నది వ్యాపారం మందగించడాన్ని సూచించాలి గదా అని. దీనికి ఓవర్‌స్టన్ దగ్గిర సమాధానం లేదు – (3736. ప్రశ్న:) పెట్టుబడిని సంపాదించడానికి డబ్బు ఒక పరికరం అని మీరనటం (నివేదికలో ప్రతిచోటా యువర్ లార్డ్‌షిప్ అనే సంబోధన ఉంటుంది.) నేను గమనించాను. (డబ్బును ఒక పరికరంగా ఊహించడమే సరిగ్గా ఇక్కడ పొరపాటు. అది పెట్టుబడి యొక్క ఒక రూపం.) "వెండి, బంగారాలు (బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్ నుంచి) అపారంగా బయటికి పోవడం వల్ల పెట్టుబడిదారులకు డబ్బు దొరకటం కష్టం కాలేదా?" (ఓవర్‌స్టన్:) "డబ్బు కావాలని కోరేవారు పెట్టుబడిదారులు కానివారే. వారు ఎందుకు కావాలనుకుంటారు?... ఎందుకంటే డబ్బు ద్వారా వారు పెట్టుబడిదారుల పెట్టుబడిపై అదుపు సంపాదించి పెట్టుబడిదారులు కానివారి వ్యాపారం కొనసాగించడానికి ఉపయోగిస్తారు." – ఇక్కడ అతడు సూటిగా కార్ఖానాదారులు, వ్యాపారులు పెట్టుబడిదారులు కాదని, పెట్టుబడిదారుని పెట్టుబడి అంటే డబ్బు పెట్టుబడి మాత్రమేనని ప్రకటిస్తున్నాడు. – "3737. మార్పిడి బిల్లుల్ని తీసుకునేవారు పెట్టుబడిదారులు కాదా – మార్పిడి బిల్లులు తీసుకునేవారు పెట్టుబడిదారులు కావచ్చు, కాకపోవచ్చు." – ఇక్కడ అతడాగిపోయాడు.

వ్యాపారుల మార్పిడి బిల్లులు అమ్మినా లేదా ఓడకెక్కిన సరుకులకు ప్రాతినిధ్యం వహిస్తాయా

అని అతన్నడిగారు. ఒక బ్యాంకు నోటు బంగారానికి ప్రాతినిధ్యం వహించినట్టు ఈ బిల్లులు సరుకుల విలువకు ప్రాతినిధ్యం వహిస్తాయన్న విషయాన్ని అతను తిరస్కరించాడు. (3740, 3741) ఇది ఒక రకంగా తలబిరుసుతనం.

“3742. వ్యాపారి లక్ష్యం డబ్బును పొందటం కాదా? – కాదు. ఒక బిల్లును తీసుకోవటంలో లక్ష్యం డబ్బును పొందటం కాదు. ఒక బిల్లును డిస్కౌంటు చేయటంలో లక్ష్యం డబ్బును పొందటం” – మార్పిడి బిల్లులను తీసుకోవడం అంటే సరుకులను పరపతి డబ్బు రూపంలోకి మార్చడం. మార్పిడి బిల్లులను డిస్కౌంటు చేయడం అంటే ఈ పరపతి డబ్బును మరో రూపంలోకి అనగా బ్యాంకు నోట్లలోకి మార్చడం లాంటిదే ఇది కూడా. ఏమైతేనేమి డిస్కౌంటు చేయడం యొక్క లక్ష్యం డబ్బును పొందటమేనని ఇక్కడ ఓవర్‌స్టన్ అంగీకరిస్తున్నాడు. ఇంతకు ముందు అతడు డిస్కౌంటింగ్ అన్నది పెట్టుబడిని ఒక రూపంలోంచి మరొక రూపంలోకి మార్చే పద్ధతి కాక అదనపు పెట్టుబడిని సంపాదించే పద్ధతిగా పేర్కొన్నాడు.

“3743. 1825, 1837, 1839లలో మీరు పేర్కొన్నట్టు భయోత్పాతపు ఒత్తిడిలో వాణిజ్య ప్రపంచానికి వుండే గొప్ప కోర్కె ఏమిటి? వారి లక్ష్యం పెట్టుబడిని స్వాధీనం చేసుకోవడమా? చెల్లుబాటయ్యే రూపం గల డబ్బును సంపాదించడమా? – వారి లక్ష్యం తమ వ్యాపారానికి అండగా పెట్టుబడిపై అదుపు సంపాదించడమే.” – వారి లక్ష్యం గడువు తేదీకి చెల్లించాల్సిన మార్పిడి బిల్లుల కోసం అవసరమైన చెల్లింపు సాధనాలను సంపాదించడం. పరపతి కొరత కారణంగా వారి సరుకుల ధర పడిపోకుండా ఉండాలంటే ఇది అవసరం. వారి వద్ద అసలు పెట్టుబడే లేకపోతే వారు చెల్లింపు సాధనంతో పాటు దాన్ని కూడా పొందుతారు. ఎందుకంటే వారు ఒక సమవిలువ లేకుండానే పొందుతారు. విలువను సరుకుల రూపంనుంచి లేదా పరపతిదారుని హక్కుల రూపంనుంచి డబ్బు రూపానికి మార్చాలనే కోర్కెలోనే డబ్బును పొందాలనే తపన ఎప్పుడూ వుంటుంది. కనుక సంక్షోభాలతో ప్రమేయం లేకుండానే అప్పు తీసుకునే పెట్టుబడికి, డిస్కౌంటుకి మధ్య ఈ భారీ తేడా ఉంటూనే వుంటుంది. డిస్కౌంట్ అనగా డబ్బుపై ఉన్న హక్కును ఒక రూపం నుంచి మరో రూపానికి లేదా పక్కా డబ్బు రూపంలోకి మార్చడం మాత్రమే.

[సంపాదకుడి హోదాలో కొన్ని అంశాలను ఇక్కడ చేర్చడం ధర్మం అనుకుంటున్నాను.

నార్మన్, లాయడ్ ఓవర్‌స్టన్‌ల దృష్టిలో బ్యాంకర్ అనగా ఎప్పుడూ ఇతరులకు ‘పెట్టుబడిని అడ్వాన్సు’ చేసేవాడు అనే. అతని ఖాతాదారులు ఎప్పుడూ అతన్నుంచి ‘పెట్టుబడి’ని కోరేవారే. ఆ రకంగా జనం తన ద్వారా ఎందుకు తమ మార్పిడి బిల్లులను డిస్కౌంటు చేయించుకుంటారంటే ‘వారు పెట్టుబడిపైన అదుపు సంపాదించాలనుకుంటారు గనుక’ అని ఓవర్‌స్టన్ అంటాడు (3729). వారికి తక్కువ వడ్డీ రేటుపై పెట్టుబడిపై అదుపు సంపాదించడమంటే చాలా ఇష్టం (3730). ‘డబ్బు అనేది పెట్టుబడిని పొందటానికి ఒక పరికరం’ (3736). భయోత్పాత పరిస్థితులలో వాణిజ్య ప్రపంచపు ప్రధానమైన కోరిక ‘పెట్టుబడిపైన అదుపు సంపాదించడమే’ (3743). పెట్టుబడి అంటే ఏమిటి అన్న విషయంలో లాయడ్ ఓవర్‌స్టన్‌ల గందరగోళం అంతటిలోనూ ఒక్క అంశం స్పష్టం. బ్యాంకరు అతని ఖాతాదారునికి ఇచ్చేది పెట్టుబడి అని, అతని ఖాతాదారునికి అంతకుముందు ఆ పెట్టుబడి

లేదని, అయితే అతని దగ్గిర ఉన్నదానికి అదనంగా ఈ మొత్తం అడ్వాన్సు చేయబడుతోందని ఓవర్‌స్టన్ భావిస్తాడు.

డబ్బు రూపంలో అందుబాటులో ఉన్న సామాజిక పెట్టుబడిని (అప్పుల ద్వారా) పంపిణీ చేయడానికి ఈ బ్యాంకరు ఎంతగా అలవాటుపడ్డాడంటే తాను డబ్బును ఇచ్చే ప్రతి కార్యకలాపాన్నీ అప్పిస్తున్నట్టుగా పరిగణిస్తాడు. అతను చెల్లించే డబ్బంతా అతనికి రుణం లాగానే కనిపిస్తుంది. డబ్బు సూటిగా అప్పివ్వబడితే అది అక్షరాలా నిజమే అవుతుంది. బిల్లును డిస్కౌంటు చేసే వ్యవహారంలో మదుపు పెట్టబడితే అది నిజానికి బిల్లు గడువు తేదీ వరకు మాత్రమే అడ్వాన్సు చేయబడినట్లు లెక్క. ఆ రకంగా అతనికి తాను చేసే చెల్లింపులన్నీ అడ్వాన్సుల్లాగానే కనిపిస్తాయి. అడ్వాన్సులు కానిచెల్లింపులు అతడు చేయడం లేదన్న భావన అతని మనసులో స్థిరపడుతుంది. అంతేగాక డబ్బు యజమాని ప్రైవేటు వ్యక్తి హోదాలో తనకే ఒక పారిశ్రామికునిగా చేసుకుని అడ్వాన్సును వడ్డీ లేదా లాభం సంపాదించే లక్ష్యంతో పెట్టే ప్రతి డబ్బు మదుపును ఆర్థిక శాస్త్రంలో అడ్వాన్సుగా పరిగణించడం జరగదు. బ్యాంకరు తన ఖాతాదారునికి బదిలీ చేసే అడ్వాన్సులను ఆ ప్రత్యేకార్థంలో అప్పు అంటారు. ఆ అప్పు ఖాతాదారుని దగ్గర అప్పటికే ఉన్న పెట్టుబడికి అనుబంధంగా వ్యవహరిస్తుంది.

బ్యాంకరు కార్యాలయం నుంచి రాజకీయ అర్థశాస్త్రానికి బదిలీ అయిన ఈ భావన ఒక గందరగోళపు వివాదాన్ని సృష్టించింది. బ్యాంకరు తన ఖాతాదారునికి నగదు డబ్బు (hard cash) రూపంలో ఇచ్చే మొత్తం పెట్టుబడా లేక డబ్బు మాత్రమేనా? అది చలామణి సాధనమా లేక కరెన్సీయేనా అన్న వివాదమది. మౌలికంగా సరళమైన ఈ వివాదాన్ని పరిష్కరించాలంటే మనం ఖాతాదారుని స్థానంలో వుండి ఆలోచించాలి. ఈ ఖాతాదారుడు ఏమి అడుగుతున్నాడు. ఏమి పొందుతున్నాడు అన్న దానిపైన ఆధారపడి వుంటుంది.

వ్యక్తిగతమైన పరపతిపైన ఎటువంటి హామీలు లేకుండా ఖాతాదారునికి బ్యాంకు అప్పు ఇస్తుందంటే ఇక్కడ విషయం స్పష్టమే. అప్పుడు అతడు అంతకు ముందే మదుపు పెట్టబడిన పెట్టుబడికి అదనంగా ఒక నిర్దిష్ట విలువ యొక్క అడ్వాన్సును ఖాయంగా పొందుతాడు. అతడు దాన్ని డబ్బు రూపంలో పొందుతాడు. కనుక అది డబ్బు మాత్రమే గాదు, డబ్బు పెట్టుబడి కూడా.

అలాకాక, అతడు హామీలపైన అడ్వాన్సును పొంది ఉంటే అతడు దాన్ని తిరిగి చెల్లించాలన్న షరతుపైన చెల్లించబడిన డబ్బు అర్థంలో అడ్వాన్సది. అయితే అది పెట్టుబడి అడ్వాన్సు కాదు. ఎందుకంటే హామీలు కూడా పెట్టుబడికి ప్రాతినిధ్యం వహిస్తాయి. పైగా అవి అడ్వాన్సు కంటే పెద్ద మొత్తంలో ఉంటాయి. కనుక ఈ డబ్బు గ్రహీత హామీగా ఉంచిన డిపాజిట్ల కంటే తక్కువ పెట్టుబడి విలువను పొందుతాడు. అది అతనికి అదనపు పెట్టుబడి పొందటం లాంటిది కాదు. అతను ఈ లావాదేవీలోకి ప్రవేశించింది పెట్టుబడి అవసరం వల్ల కాదు. అది హామీల రూపంలో అతని దగ్గర ఉంది. అతనికి కావలసింది డబ్బు మాత్రమే. కనుక ఇక్కడ మనం ప్రస్తావిస్తున్నది పెట్టుబడి గాదు, కేవలం డబ్బు అడ్వాన్సు మాత్రమే.

ఆ అప్పు బిల్లులను డిస్కౌంటు చేయడం ద్వారా ఇవ్వబడి ఉంటే అప్పుడు దాని అడ్వాన్సు రూపం కూడా మాయమవుతుంది. అప్పుడది కేవలం క్రయ విక్రయాలకే సంబంధించిన వ్యవహారం. ఆ బిల్లు అధికారిక ఆమోదం ద్వారా బ్యాంకు స్వాధీనంలోకి పోతుంది. కాగా డబ్బు ఖాతాదారుని

స్వాధీనంలోకి వస్తుంది. ఇక్కడ తిరిగి చెల్లించటమనే ప్రశ్న తలెత్తదు. ఖాతాదారుడు మార్పిడి బిల్లుతో గాని లేదా మరో పరపతి సాధనంతో గాని నగదు డబ్బును కొంటే అతడు తన పత్తితోనూ, ఇనుముతోనూ లేదా ధాన్యం వగైరా సరుకులతోనూ నగదు డబ్బును కొన్నట్టే అవుతుంది. కనుక అది అడ్వాన్సు చేయబడిన డబ్బు కాజాలదు. దీనిని అడ్వాన్సు చేసిన పెట్టుబడి అని అనలేము. ఒక వ్యాపారికి మరో వ్యాపారికి మధ్య జరిగే క్రయ విక్రయాలు పెట్టుబడి బదిలీ మాత్రమే. పెట్టుబడి బదిలీ పరస్పరం జరగనప్పుడు కొంతకాలం పాటు ఏకపక్షంగానే జరిగినప్పుడు అది పెట్టుబడి అడ్వాన్సు అవుతుంది. కనుక డిస్కౌంటు ద్వారా పెట్టుబడిని అడ్వాన్సు చేయటమన్నది ఆ బిల్లు సట్టా వ్యాపారానికి సంబంధించినది అయినప్పుడు అది అమ్మిన సరుకులకు ప్రాతినిధ్యం వహించనప్పుడు మాత్రమే జరుగుతుంది. దాని స్వభావం తెలిసిన బ్యాంకరు ఎవరూ దానిని స్వీకరించరు. రోజువారీ డిస్కౌంటింగ్ వ్యాపారంలో బ్యాంకు ఖాతాదారుడు పెట్టుబడి అడ్వాన్సు గానీ డబ్బు అడ్వాన్సు గానీ పొందడు. కనుక అతడు పొందేది అమ్మిన సరుకులకై డబ్బును మాత్రమే.

ఆ రకంగా ఖాతాదారుడు ఒక బ్యాంకు నుంచి డిమాండ్ చేసి పెట్టుబడిని పొందే సందర్భాలకు అతడు డబ్బును అడ్వాన్సుగా పొందే, లేదా బ్యాంకు నుంచి డబ్బును కొనుగోలు చేసే సందర్భాలకు మధ్య స్పష్టమైన వ్యత్యాసం వుంది. మిగిలిన వారి సంగతి ఎలా ఉన్నా లాయడ్ ఓవర్‌స్టన్ ఎన్నడూ హామీ లేకుండా చాలా అరుదుగా తప్ప నిధులు అడ్వాన్సు చేయడు గనుక (మాంచెస్టర్‌లో ఉన్న నా సంస్థకు బ్యాంకరు ఆయనే) కార్ఖానాదారుల పెట్టుబడి అవసరాలకు ఉదారమైన బ్యాంకర్లు పెద్ద మొత్తాలలో పెట్టుబడిని అప్పు ఇవ్వడమన్న కవితాత్మకమైన వర్ణనలు పూర్తిగా కల్పితాలు.

32వ అధ్యాయంలో మార్క్స్ సరిగ్గా అదే అంశాన్ని తెలియజేశాడు: "వ్యాపారులు, ఉత్పత్తిదారులు పెట్టడానికి మంచి హామీలున్నంత వరకు చెల్లింపు సాధనం కోసం ఉండే గిరాకీ కేవలం డబ్బు రూపంలోకి మార్చడానికి ఉండే గిరాకీ మాత్రమే. హామీ లేనప్పుడు అది డబ్బు పెట్టుబడి కోసం గిరాకీ అవుతుంది. ఎందుకంటే చెల్లింపు సాధనం యొక్క ఈ అడ్వాన్సు వారికి డబ్బు రూపాన్ని మాత్రమే గాక వారు వెంటనే తిరిగి చెల్లించలేని సమవిలువను కూడా ఇస్తుంది." – మళ్ళీ 33వ అధ్యాయంలో ఇలా అంటాడు : "ఒక అభివృద్ధిచెందిన పరపతి వ్యవస్థలో బ్యాంకర్ల చేతుల్లో డబ్బు కేంద్రీకరించబడటంతో కనీసం నామమాత్రంగానైనప్పటికీ, అడ్వాన్సు చేసేది వారే. ఈ అడ్వాన్స్ చలామణిలో వున్న డబ్బుకు మాత్రమే వర్తిస్తుంది. అది చలామణి అడ్వాన్సు మాత్రమే. అంతేగాని అది చలామణిలో ఉంచే పెట్టుబడుల అడ్వాన్సు గాదు." చాప్‌మాన్ కూడా ఇలాగే డిస్కౌంటింగ్ వ్యాపారపు భావనను కలిగి వున్నాడు; బి.సి. 1857. "బ్యాంకరు దగ్గర బిల్లు ఉంది. బ్యాంకరు ఆ బిల్లును కొన్నాడు" సాక్ష్యం, ప్రశ్న. 5139.

అయితే మనం ఈ విషయాన్ని మళ్ళీ 28వ అధ్యాయంలో పరిశీలిద్దాం – ఎంగెల్స్.]

"3744. పెట్టుబడి అంటే మీరిచ్చే అర్థం ఏమిటో దయచేసి వివరిస్తారా?" – (ఓవర్‌స్టన్:) "పెట్టుబడిలో అనేక సరుకులుంటాయి. వాటితో వాణిజ్యం కొనసాగించబడుతుంది. స్థిర పెట్టుబడి, అస్థిర పెట్టుబడి ఉంటాయి. మీ నౌకలు, మీ నౌకాశ్రయాలు, ఓడరేవులు...స్థిర పెట్టుబడి. మీ ఆహార పదార్థాలు, మీ వస్త్రాలు వగైరాలు అస్థిర పెట్టుబడి."

"3745. వెండి, బంగారాలు అపారంగా బయటికి పోవడం వల్ల దేశం తీవ్రమైన ఒత్తిడికి

గురవుతుందా? – హేతుబద్ధమైన అర్థంలో కాదు.” (ఆ తర్వాత పాత రికార్డో డబ్బు సిద్ధాంతం బయటపడుతుంది) “సహజమైన పరిస్థితుల్లో ప్రపంచపు డబ్బు విభిన్న దేశాలలో నిర్దిష్ట నిష్పత్తులలో పంపిణీ అవుతుంది. ఆ నిష్పత్తులు ఎటువంటివంటే ఆ డబ్బు పంపిణీ కింద ఏ ఒక్క దేశాన్ని తీసుకున్నా మిగిలిన దేశాలన్నింటితో దాని సంబంధాలు వస్తు మార్పిడిగా ఉంటుంది. అయితే ఈ పంపిణీని భగ్నం చేసే పరిస్థితులు తలెత్తుతాయి. అవి తలెత్తినప్పుడు ఒక దేశం యొక్క డబ్బులో కొంత భాగం ఇతర దేశాలకు పోతుంది.” – “3746. తమరు ఇప్పుడు డబ్బు అన్న పదాన్ని ఉపయోగించారు. మీరు ఇంతకు ముందు పెట్టుబడి నష్టం గురించి మాట్లాడారని అర్థం చేసుకున్నాను. పెట్టుబడి నష్టం అంటే ఏమిటి?” – “3747. వెండి, బంగారాల ఎగుమతా? – లేదు నేనలా అనలేదు. వెండి, బంగారాల్ని మీరు పెట్టుబడిగా భావిస్తే అది నిస్సందేహంగా పెట్టుబడి నష్టమే అవుతుంది. ప్రపంచ ద్రవ్యాన్ని కలిగి వున్న ఆ విలువైన లోహాలలో ఒక నిర్దిష్ట భాగాన్ని వదులుకోవటమే అవుతుంది.” – “3448. డిస్కౌంటు రేటులో మార్పు అన్నది పెట్టుబడి విలువలో మార్పుకు కేవలం చిహ్నం మాత్రమే అని తమరు అన్నట్టుగా నేనర్థం చేసుకున్నాను?” – “నేనన్నాను” – “3749. బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండులో వెండి, బంగారాల నిల్వను బట్టి డిస్కౌంట్ రేటు మారుతుందని తమరన్నారా? – అవును. అయితే డబ్బు పరిమాణంలో వచ్చే మార్పులను బట్టి వడ్డీ రేటులో అటుపోట్లుంటాయని నేనింతకు ముందే చెప్పాను.” (కనుక అతడు ఇక్కడ ప్రస్తావిస్తున్నది వాస్తవంగా అస్తిత్వంలో ఉన్న బంగారం పరిమాణం.) “ఒక దేశంలో చాలా తక్కువ.”

“3750. మామూలు కంటే మరింత డిస్కౌంటు రేటులో పెరుగుదల తాత్కాలికంగానే అయినప్పటికీ అవిచ్ఛిన్నంగా కొనసాగినప్పుడు తక్కువ పెట్టుబడి ఉంటుందని తమరు భావిస్తున్నారా? – ఆ పదానికి ఉన్న ఒక అర్థంలో తక్కువే వుంటుంది. పెట్టుబడికి, దాని గిరాకీకి మధ్య ఉన్న నిష్పత్తి మారుతుంది. అది పెట్టుబడి పరిమాణం తగ్గటం వల్ల కాక దాని గిరాకీ పెరగటం వల్ల కావచ్చు.” (అయితే ఒక క్షణం క్రితం పెట్టుబడి = డబ్బు లేదా బంగారం. అంతకంటే ముందు వడ్డీ రేటులో పెరుగుదలను ఆయన లాభం రేటులో పెరుగుదలను బట్టి వివరించాడు. అనగా ఒక వ్యాపారం లేదా పెట్టుబడి యొక్క తగ్గుదల వల్ల కాక విస్తరణ వల్ల వడ్డీ రేటు పెరిగినట్టుగా వివరించాడు.)

“3751. మీరు ప్రత్యేకంగా చెప్తున్న పెట్టుబడి ఏమిటి? ప్రతి వ్యక్తి ఏమి కోరుకున్నాడన్న దాన్నిబట్టి పెట్టుబడి అంటే ఏమిటి అన్నది ఆధారపడి వుంటుంది. ఒక దేశం తన వ్యాపారాన్ని నిర్వహించడానికి తన అదుపులో వుంచుకున్నదే పెట్టుబడి. ఆ వ్యాపారం రెట్టింపైనప్పుడు దానిని నడపడానికి అవసరమైన పెట్టుబడి కోసం గిరాకీ కూడా పెద్ద ఎత్తున పెరుగుతుంది.” (ఈ తెలివైన బ్యాంకరు మొదట వ్యాపార కార్యకలాపాన్ని రెట్టింపు చేశాడు. తర్వాత దానికవసరమైన పెట్టుబడి గిరాకీని కూడా రెట్టింపు చేశాడు. తన వ్యాపారాన్ని రెండింతలు పెంచడం కోసం మరింత పెట్టుబడిని ఇమ్మని లాయడ్‌ను అడిగే ఖాతాదారుని మాత్రమే అతడు చూస్తాడు.) – “పెట్టుబడి ఇతర సరుకులన్నిటి లాంటిదే” (అయితే లాయడ్ ప్రకారం పెట్టుబడి అంటే సరుకుల మొత్తం తప్ప మరొకటి కాదు.) “అది వేరు వేరు ధరలను కలిగి వుంటుంది.” (సరుకులు తమ ధరను రెండుసార్లు మార్చుకుంటాయన్న మాట. ఒకసారి సరుకులుగాను, రెండోసారి పెట్టుబడిగాను.) “సరఫరా గిరాకీని బట్టి ఈ ధర మారుతుంది.”

"3752. డిస్కౌంటు రేట్లో మార్పులు సాధారణంగా బ్యాంకు ఖజానాలో ఉన్న బంగారపు మొత్తంలో మార్పులతో ముడిపడి వుంటాయి. తమరు పేర్కొంటున్న పెట్టుబడి అదేనా? – కాదు" – "3753. బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండులో అధికంగా నిలవున్నప్పుడు డిస్కౌంటు రేటు కూడా అధికంగా ఉన్న సందర్భాన్ని తమరు పేర్కొనగలరా? – బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్ పెట్టుబడి డిపాజిట్ చేసే చోటు కాదు. అది డబ్బు డిపాజిట్ చేసే చోటు మాత్రమే." – "3754. వడ్డీ రేటు పెట్టుబడి మొత్తంపైన ఆధారపడి వుంటుందని తమరు ప్రకటించారు. దయచేసి మీరు ప్రస్తావిస్తున్నది ఏ పెట్టుబడో తెలియజేస్తారా? బ్యాంకులో వెండి, బంగారాలు పెద్ద ఎత్తున నిల్వ ఉన్నప్పుడు అధిక వడ్డీ రేటున్న ఒక సందర్భాన్ని తమరు చెప్పగలరా? – బ్యాంకులో వెండి, బంగారాల సంచయనం తక్కువ వడ్డీ రేటుతోపాటు కలిసి ఉండటం సాధ్యమే (ఆహా!). ఎందుకంటే పెట్టుబడి కోసం గిరాకీ తగ్గిన కాలంలో అది జరగొచ్చు." (అనగా డబ్బు పెట్టుబడి ఇక్కడ ప్రస్తావించిన కాలం 1844-1845. అది సుభిక్షాకాలం) "ఆ కాలంలో మీరు పెట్టుబడిని అదుపు చేయడానికి తోడ్పడే సాధనాలు లేదా పరికరాలు పోగుబడవచ్చు." – "3755. అంటే డిస్కౌంట్ రేటుకూ బ్యాంక్ ఖజానాలో వున్న వెండి, బంగారాల మొత్తానికీ ఎలాంటి సంబంధం లేదని మీరు భావిస్తారా? – సంబంధం ఉండి ఉండవచ్చు. కానీ అది సూత్రరీత్యా సంబంధం కాదు." (1844 బ్యాంకు చట్టం తమ స్వాధీనంలో ఉన్న వెండి, బంగారాల పరిమాణాన్ని బట్టి వడ్డీ రేటును క్రమబద్ధం చేయటం అన్నదాన్ని బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండు యొక్క సూత్రంగా మార్చింది.) "అవి ఒకేసారి ఒకే సమయంలో జరిగితే జరగవచ్చును." – "3758. డిస్కౌంటు రేటు ఎక్కువగా ఉండటం వల్ల, బాగా ఒత్తిడి ఉండటం వల్ల ఈ దేశంలో ఉన్న వ్యాపారులకు డబ్బు పొందటం కంటే పెట్టుబడి పొందటం మరింత కష్టమని మీరన్నారని నేను సరిగానే అర్థం చేసుకున్నానా? మీరు రెండు విషయాల్ని కలిపి అడుగుతున్నారు. నేను ఆ రెంటినీ ఆ రూపంలో కలపలేదు. ఒకటి పెట్టుబడి పొందటంలో వారి ఇబ్బందులు.... డబ్బు పొందటంలో ఇబ్బందులు పెట్టుబడి పొందటంలో ఇబ్బందులు అన్నవి ప్రగతి క్రమంలో రెండు వరుస దశలలో వచ్చే ఒకే ఇబ్బందులవి." – ఇక్కడ మళ్ళీ పప్పులో కాలేశాడు. "మొదటి ఇబ్బంది మార్పిడి బిల్లును డిస్కౌంటు చేయడం లేదా సరుకుల హామీపై రుణాన్ని పొందటం. పెట్టుబడిని మరో రూపంలోకి మార్చే ఇబ్బంది లేదా పెట్టుబడి యొక్క వాణిజ్య చిహ్నాన్ని డబ్బుగా మార్చటంలో ఉన్న ఇబ్బంది ఇతర అంశాలతో పాటు ఈ ఇబ్బంది అధిక వడ్డీ రేటులో వ్యక్తమవుతుంది. అయితే డబ్బు పొందగానే తలెత్తే రెండో ఇబ్బందేమిటి? అది కేవలం చెల్లించాల్సిన అంశం మాత్రమే అయితే తన డబ్బును వదిలించుకోవడంలో ఎవరికైనా ఎటువంటి ఇబ్బందైనా తలెత్తుతుందా? అది కొనే అంశం అయితే సంక్షోభ సమయాలలో కొనుగోలు చేయడంలో ఎవరికైనా ఏమైనా ఇబ్బందులు తలెత్తాయా? కేవలం వాదన కోసం ధాన్యం, పత్తి వగైరాల కొరత ఉంది అనుకుంటే ఈ ఇబ్బంది ఆ సరుకుల ధరల్లో మాత్రమే కనిపిస్తుంది. అంతేగాని డబ్బు పెట్టుబడి విలువలో కాదు. అనగా వడ్డీ రేటులో కాదు. అంతిమ విశ్లేషణలో ఈ ఇబ్బంది అధిగమించబడుతుంది. ఎందుకంటే మన మనిషి దగ్గర వాటిని కొనడానికి కావలసిన డబ్బుంది గనుక."

"3760. అధిక డిస్కౌంటు రేటు అన్నది డబ్బును పొందటంలో మరింత ఇబ్బందిని

కలిగించదా? – డబ్బును పొందటంలో ఇబ్బందిని పెంచుతుంది. అయితే అది నువ్వు డబ్బును కలిగి వుండాలనుకోవడం వల్ల గాదు. అది కేవలం ఒక రూపం మాత్రమే. (ఈ రూపం బ్యాంకరు జేబును లాభాలతో నింపుతుంది.) ఈ రూపంలో ఒక నాగరిక రాజ్యంలో ఉన్న సంక్లిష్ట సంబంధాల ప్రకారం పెట్టుబడిని పొందటంలో పెరిగిన ఇబ్బంది ప్రత్యక్షమవుతుంది."

"3763. (ఓవర్‌స్టన్ జవాబు :) బ్యాంకరు ఒకవైపున డిపాజిట్లను స్వీకరిస్తాడు. మరోవైపున పెట్టుబడి రూపంలో వ్యక్తులకు అప్పుజెప్పడం ద్వారా వాటిని వినియోగిస్తాడు. ఇలా బ్యాంకరు ఈ రెంటికీ మధ్య స్థానంలో ఉంటాడు."

ఆఖరికు పెట్టుబడి అంటే అతని ఉద్దేశమేమిటో తెలిసింది. అతడు డబ్బును ఇతరులకు 'అప్పుజెప్పటం' ద్వారా పెట్టుబడిగా మారుస్తాడు. కాస్త సరళంగా చెప్పాలంటే దానిని వడ్డీకి అప్పివ్వటం ద్వారా పెట్టుబడిగా మారుస్తాడు.

డిస్కౌంటు రేటులో మార్పు అన్నది బ్యాంకులో ఉన్న బంగారపు లేదా డబ్బు నిల్వ పరిమాణపు మార్పుతో సంబంధాన్ని కలిగి ఉండాల్సిన అవసరం లేదని, అయితే యాదృచ్ఛికంగా జరిగితే జరగవచ్చునని ఓవర్‌స్టన్ ప్రకటించిన తర్వాత అతడిలా పునరుద్ఘాటిస్తున్నాడు :

"3805. ఒక దేశంలో డబ్బు బయటికి పోవడం వల్ల దాని పరిమాణం తగ్గిపోయినప్పుడు దాని విలువ పెరుగుతుంది. బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండు ఆ డబ్బు విలువలో వచ్చిన మార్పును ధ్రువీకరించాలి." (అనగా పెట్టుబడిగా డబ్బు యొక్క విలువ. మరోలా చెప్పాలంటే వడ్డీ రేటు. ఎందుకంటే సరుకులతో పోల్చినపుడు డబ్బు యొక్క విలువ యథాతథంగా ఉంటుంది.) "అంటే దానర్థం వడ్డీ రేటును పెంచటమనే సాంకేతిక పదంలో ఉంది."

"3819. ఆ రెంటినీ నేనెప్పుడూ గందరగోళపర్చలేదు." (ఎందుకంటే డబ్బునీ పెట్టుబడినీ – రెంటినీ అతడెప్పుడూ వేరుచేసి చూడలేదు.)

"3834. చాలా పెద్ద మొత్తం, నిజానికి పెట్టుబడినీ, దేశానికి అవసరమైన ఆహార పదార్థాల సరఫరా కోసం చెల్లించాల్సి వచ్చింది." (1847లో ధాన్యం కోసం)

"3841. డిస్కౌంటు రేటులో వచ్చే మార్పులు" (బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండు) "నిల్వ పరిస్థితితో సన్నిహిత సంబంధం కలిగి ఉంటాయనటంలో సందేహం లేదు. ఎందుకంటే నిల్వ పరిస్థితి అన్నది దేశంలో ఉన్న డబ్బు పరిమాణం పెరుగుదల లేదా తరుగుదలకు సూచిక. దేశంలో ఉన్న డబ్బు పెరుగుదల లేదా తరుగుదల ఏ నిష్పత్తిలో ఉంటే ఆ డబ్బు విలువ కూడా అదే నిష్పత్తిలో పెరుగుతుంది లేదా తరుగుతుంది. బ్యాంక్ డిస్కౌంటు రేటు కూడా ఆ మార్పుకు అనుగుణంగా ఉంటుంది." ఆ రకంగా ఓవర్‌స్టన్ 3755లో చాలా గట్టిగా తిరస్కరించిన అంశాన్ని ఇక్కడ అంగీకరిస్తున్నాడు. – "3842. వాటి మధ్య చాలా సన్నిహితమైన సంబంధముంది." అంటే ఒకవైపున విడుదల చేసే విభాగంలో వెండి, బంగారాల పరిమాణానికి మరోవైపున బ్యాంకింగు విభాగంలో నోట్ల నిల్వకు మధ్య అన్నమాట. ఇక్కడ ఈయన వడ్డీ రేటులో మార్పును డబ్బు పరిమాణంలో మార్పుతో వివరిస్తున్నాడు. కానీ ఈ ప్రకటన తప్పు. దేశంలో చలామణిలో ఉన్న డబ్బు పెరగటం వల్ల ఆ నిల్వ తగ్గవచ్చు. ఈ సందర్భంలోనే ప్రజలు ఎక్కువ నోట్లను తీసుకుంటారు. లోహాన్ని కూడబెట్టడమనేది

తగ్గదు. అటువంటి సందర్భాల్లో వడ్డీ రేటు పెరుగుతుంది. ఎందుకంటే 1844 చట్టం వల్ల బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్ యొక్క బ్యాంకింగ్ పెట్టుబడి పరిమితమైంది గనుక. అయితే ఈ అంశాన్ని పేర్కొనే ధైర్యం ఆయనకు లేదు. ఎందుకంటే ఈ చట్టం వల్ల ఈ రెండు విభాగాలకూ మధ్య ఒకదానికి మరోదాంతో సంబంధం లేకుండాపోయింది.

"3859. అధిక వడ్డీ రేటు ఎప్పుడూ పెట్టుబడికి గిరాకీని పెద్దగా పెంచుతుంది. పెట్టుబడి కోసం పెద్ద గిరాకీ ఉంటే అది పెట్టుబడి విలువను పెంచుతుంది." – చివరికి ఇక్కడ అధిక లాభం రేటుకు, పెట్టుబడి కోసం ఉండే గిరాకీకి మధ్య సంబంధాన్ని ఓవర్‌స్టన్ ఊహిస్తున్నాడన్న సంగతి మనకు స్పష్టంగా తెలుస్తుంది. ఉదాహరణకు 1844–45లో పత్తి పరిశ్రమలో అధిక లాభం రేటు ఉంది. ఎందుకంటే ముడి పత్తి చవకగా ఉంది. పత్తి ఉత్పాదితాల కోసం గిరాకీ చాలా బలంగా ఉన్నప్పటికీ పరిస్థితి అలాగే వుంది. పెట్టుబడి విలువ అనగా (ప్రతి ఒక్కరూ తమ వాణిజ్యంలో కోరుకునేదాన్నే పెట్టుబడి అని ఓవర్‌స్టన్ ఇంతకుముందు తన ప్రకటనలో పేర్కొన్నాడు.) ఈ సందర్భంలో ముడి పత్తి అవుతుంది. అది కార్ఖానాదారునికి పెరగలేదు. అధిక లాభం రేటు కొంతమంది పత్తి మిల్లు యజమానులు తమ వ్యాపారాన్ని విస్తరింపజేసేందుకు డబ్బు లేదా పరపతిని పొందటానికి ప్రయత్నించేలా చేసి వుండవచ్చు. దానితో డబ్బు పెట్టుబడి కోసం అతని డిమాండ్ పెరిగింది. మరి దేనికోసమూ కాదు.

"3889. వెండి, బంగారాలు డబ్బు కావచ్చు, కాకపోవచ్చు. ఒక కాగితం బ్యాంకు నోటు కావచ్చు, కాకపోవచ్చు అన్నట్టుగానే ఇది కూడా."

"3896. బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండులో ఉన్న నోట్లలో ఆటుపోట్లు వెండి, బంగారాల మొత్తంలో వచ్చే ఆటుపోట్లకు అనుగుణంగా ఉండాలని 1840లో మీరు చేసిన వాదనను మీరు వదిలేసుకున్నారని నేను సరిగానే అర్థం చేసుకున్నానా? – నేను ఈ మేరకు దాన్ని వదులుకున్నాను. ఇప్పుడు మనకు ఉన్న సమాచారం సహాయంతో బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్ బయట వున్న నోట్లు బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్‌లో నిల్వ వున్న నోట్లకు జమ అయి ఉండాలని భావిస్తున్నాను." – ఇది మరీ అతిశయోక్తి. బ్యాంక్ తన ఖజానాలో బంగారం ఎంత ఉంటే అన్ని కాగితం నోట్లను అంతకు మించి 140 లక్షల నోట్లను ముద్రించుకోవచ్చు అన్న ఏకపక్ష సదుపాయం సూచించేదేమంటే నోట్ల విడుదలలో ఆటుపోట్లు బంగారపు నిల్వల ఆటుపోట్లకు అనుగుణంగా ఉండాలి అన్నదే. అయితే 'ప్రస్తుతం మన దగ్గర ఉన్న సమాచార సాధనాలు' స్పష్టంగా తెలియజేసేదేమంటే బ్యాంక్ తయారుచేయగలిగిన నోట్ల మొత్తం (విడుదలచేసే విభాగం బ్యాంకింగ్ విభాగానికి ఈ మొత్తాన్ని బదిలీ చేస్తుంది.) – బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్ యొక్క రెండు విభాగాల మధ్య ఉండే ఈ చలామణి బంగారం నిల్వ ఆటుపోట్లతో పాటు, ఆటుపోట్లకు గురౌతుంది. అది బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండుకు ఆవల బ్యాంకు నోట్ల చలామణిలో ఆటుపోట్లను నిర్ణయించదు. అప్పుడు – నిజమైన చలామణి – బ్యాంక్ నిర్వహణ దృష్టిలో అనవసరమైన విషయంగా మారుతుంది. బ్యాంకు యొక్క రెండు విభాగాల మధ్య చలామణికి, దీనికి ఉన్న తేడా నిల్వలో ప్రతిబింబిస్తుంది. బయటి ప్రపంచం దృష్టిలో ఈ చలామణికున్న ప్రాధాన్యం కేవలం బ్యాంకు యొక్క నోట్లు విడుదల చేయగలిగిన చట్టబద్ధమైన అత్యధిక పరిమితికి బ్యాంకు ఎంత దగ్గరగా ఉంది

అన్నదాన్ని ఆ నిల్వ తెలియజేస్తుంది కనుక. అంతేగాక అది బ్యాంకింగ్ విభాగం నుంచి దాని ఖాతాదారులు ఇంకా ఎంత మొత్తం పొందగలరో తెలియజేస్తుంది.

ఈ క్రింద పేర్కొన్న అంశాలు ఓవర్‌స్టన్ యొక్క దురుద్దేశాలకు దివ్యమైన ఉదాహరణలు.

"4243. ఇటీవల సంవత్సరాలలో డిస్కౌంటు రేటులో ప్రదర్శితమైన మార్పుల స్థాయిలోనే పెట్టుబడి పరిమాణంలో ప్రతినెలా దాని విలువ మార్చేంతగా మార్పులు ఉన్నాయని మీరనుకుంటున్నారా? – పెట్టుబడి గిరాకీ, సరఫరాల సంబంధం కొద్ది కాల పరిమితిలోనే నిస్సందేహంగా ఆటుపోట్లకు గురికావచ్చు... రేపు ఫ్రాన్సు ఒక పెద్ద మొత్తం అప్పు కావాలని నోటీసు పెడితే అది డబ్బు విలువలో అనగా ఈ దేశంలో ఉన్న పెట్టుబడి విలువలో వెంటనే పెద్ద మార్పు సృష్టిస్తుందనటంలో సందేహం లేదు."

"4245. ఏదో ఒక లక్ష్యంతో తనకు 300 లక్షల విలువైన సరుకులు కావాలని ఫ్రాన్సు ప్రకటిస్తే మరింత శాస్త్రీయమైన, సరళమైన పదంలో చెప్పాలంటే పెట్టుబడి కోసం పెద్ద గిరాకీ ఏర్పడుతుంది."

"4246. తన రుణం ద్వారా ఫ్రాన్సు కొనాలనుకుంటున్న పెట్టుబడి అన్నది ఒకటి. అది దానిని ఏ డబ్బుతో కొంటుంది అన్నది మరొక అంశం. మారేది ఆ డబ్బు విలువే. అవునా కాదా? – మనం మళ్ళీ పాత ప్రశ్ననే పునరుద్ధరిస్తున్నట్టున్నాము. ఈ ప్రశ్న ఈ కమిటీ రూములో కంటే స్టూడెంటు ఛాంబరుకి తగినట్టుంటుంది." – ఇలా అన్నాక అతను నిష్క్రమించాడు. అయితే స్టూడెంటు ఛాంబరులోకి మాత్రం కాదు.[1]

★ ★ ★

1. 32వ అధ్యాయం చివరలో పెట్టుబడికి సంబంధించిన విషయాల్లో పదాలలో ఓవర్‌స్టన్ గందరగోళం గురించి మరికొంత చర్చించబడింది - **ఎంగెల్స్.**

# అధ్యాయం - 27

# పెట్టుబడిదారీ ఉత్పత్తిలో పరపతి పాత్ర

పరపతి వ్యవస్థకు సంబంధించి ఇంతవరకూ వచ్చిన సాధారణ వ్యాఖ్యలు ఈ క్రింది విధంగా ఉన్నాయి.

I. లాభం రేటు సమంగావటాన్ని లేదా ఈ సమం అయ్యే చలనాలను అభివృద్ధి ప్రభావితం చేయడం అవసరం. దీనిపైనే మొత్తం పెట్టుబడిదారీ ఉత్పత్తి ఆధారపడి వుంది.

II. చలామణి ఖర్చుల తగ్గుదల

1. చలామణికి ఉన్న ప్రధాన ఖర్చుల్లో ఒకటి తనంతతానే విలువయిన డబ్బే. పరపతి ద్వారా అది మూడు రకాలుగా పొదుపు చేయబడుతుంది.

   అ. చాలా లావాదేవీల్లో పూర్తిగా వదిలేయటం ద్వారా.

   ఆ. చలామణి సాధనం మరింత వేగోద్ధృతితో చలామణి కావటం ద్వారా[1] 2వ అంశం కింద మనం చెప్పదలచుకున్న ఒక భాగానికి ఇది అనుగుణంగా ఉంటుంది. ఒకవైపున ఈ వేగోద్ధృతి సాంకేతికం. అనగా వినియోగ సరుకుల వాస్తవ టర్నోవర్‌ల సంఖ్య పరిమాణం మారకుండానే తక్కువ మొత్తం డబ్బు లేదా డబ్బు టోకెన్లు అదే సేవను చేస్తాయి. ఇది బ్యాంకింగు కౌశలంతో ముడిపడి వుంటుంది. మరోవైపున పరపతి సరుకుల రూపాంతరీ కరణ వేగాన్ని, దానితోపాటు డబ్బు చలామణి వేగాన్ని మరింత పెంచుతుంది.

   ఇ) బంగారపు డబ్బు స్థానాన్ని కాగితం స్వీకరించడం.

---

1. "1812లోనూ, 1818లోనూ సగటు నోట్ల చలామణి ఇలా వుంది. మొదటి సంవత్సరం 106,538,000 ఫ్రాంకులు, రెండో సంవత్సరం 101,205,000 ఫ్రాంకులు ఉంది. కాగా కరెన్సీ చలనం లేదా మొదటి ఖాతాలపై మొత్తం ఇవ్వడాలూ, పుచ్చుకోవడాలూ 1812లో 2,837,712,000 ఫ్రాంకులు ఉంది. కాగా 1818లో 9,665,030,000 ఫ్రాంకులు ఉంది. కనుక ఫ్రాన్స్‌లో 1812 కార్యకలాపంతో పోల్చి చూస్తే 1818లో కరెన్సీ కార్యకలాపాలు మూడింతలుంది. చలామణి వేగాన్ని క్రమబద్ధం చేసే గొప్ప అంశం పరపతి... డబ్బు మార్కెట్‌పైన తీవ్రమైన ఒత్తిడి సాధారణంగా పూర్తి చలామణితో ఎందుకు కలిసి వుంటుందో ఇది వివరిస్తుంది." (ది కరెన్సీ థియరీ రెవ్యూడ్... పుట 65) - "1833 సెప్టెంబర్, 1843 సెప్టెంబర్‌కి మధ్య యునైటెడ్ కింగ్‌డమ్ అంతటిలోనూ నోట్లు విడుదల చేసే సంస్థలకు దాదాపు మరో మూడు వందల బ్యాంకులు జోడించబడ్డాయి. దాని ఫలితమేమంటే 25 లక్షల మేరకు చలామణి కుదించబడింది. 1833 సెప్టెంబర్ చివరిలో అది 36,035,244 పౌండ్లు కాగా 1843 సెప్టెంబర్ చివరిలో 33,518,554 పౌండ్లు ఉంది." (ఎల్.సి. పుట 53) - "స్కాటిష్ చలామణి వంద పౌండ్లతో, ఇంగ్లండులో 420 పౌండ్లతో సాధ్యమైన ఆర్థిక లావాదేవీల మొత్తాన్ని ప్రభావితం చేయడం జరుగుతోంది." (ఎల్.సి. పుట 55. ఈ చివరి అంశం దీని సాంకేతిక పార్శ్వానికి మాత్రమే వర్తిస్తుంది.)

2. చలామణి యొక్క విడి దశలు, లేదా సరుకుల రూపాంతరీకరణ అటుపిమ్మట పెట్టుబడి రూపాంతరీకరణ దాంతో పాటు సాధారణ పునరుత్పత్తి, పరపతి ద్వారా వేగోద్ధృతిని పొందుతాయి. (మరోవైపున పరపతి కొనుగోళ్ళను, అమ్మకాలను ఒకదానికొకటి దూరంగా ఉంచటం ద్వారా అది సట్టా వ్యాపారానికి ప్రాతిపదికగా వ్యవహరిస్తుంది.) రిజర్వు నిధులు తగ్గిపోవడాన్ని రెండు రకాలుగా చూడొచ్చు. ఒకవైపున చలామణి సాధనం తగ్గిపోవడం గాను, మరోవైపున ఎప్పుడూ డబ్బు రూపంలో ఉండాల్సిన పెట్టుబడి యొక్క ఆ విభాగం తగ్గిపోవడంగాను.[1]

III. స్టాక్ కంపెనీలు రూపొందటం. ఆ తర్వాత :

1. ఉత్పత్తి స్థాయి, పరిశ్రమల స్థాయి, విడి పెట్టుబడులకు అసాధ్యమైన రీతిలో అపారంగా విస్తరించాయి. అదే సమయంలో అంతకు ముందు ప్రభుత్వ పరిశ్రమలుగా ఉన్నవి పబ్లిక్ పరిశ్రమలుగా మారాయి.

2. సామాజిక ఉత్పత్తి విధానంపై ఆధారపడిన పెట్టుబడి, అలాగే ఉత్పత్తి సాధనాలు శ్రమశక్తి సామాజికంగా కేంద్రీకరింపబడటం అన్నది ముందు అవసరం అయిన పెట్టుబడి, ఇక్కడ ప్రత్యక్షంగా సామాజిక పెట్టుబడి (సమిష్టి వ్యక్తుల ప్రత్యక్ష పెట్టుబడి) రూపాన్ని సంతరించు కుంటుంది. ఇది ప్రైవేటు పెట్టుబడి కంటే భిన్నమైన రూపం. దీని కార్యకలాపాలు కూడా ప్రైవేటు కార్యకలాపాల కంటే భిన్నమైన రూపాన్ని తీసుకుంటాయి. పెట్టుబడిదారీ ఉత్పత్తి చట్రంలోనే సొంత ఆస్తిగా పెట్టుబడిని రద్దు చేయడమే ఇది.

3. వాస్తవంగా పనిజేసే పెట్టుబడిదారుని కేవలం మేనేజరుగా, ఇతరుల పెట్టుబడి యొక్క నిర్వాహకునిగా మార్చటం. అలాగే పెట్టుబడి యజమానిని కేవలం యజమానిగా కేవలం డబ్బు పెట్టుబడిదారునిగా మార్చడం. వారు పొందే డివిడెండ్లలో వడ్డీ, దానితోపాటు పరిశ్రమ లాభం, అనగా మొత్తం లాభం (ఎందుకంటే మేనేజరు వేతనం కేవలం ఒక ప్రత్యేక తరహా నిపుణ శ్రమకు లభించే వేతనంగా మాత్రమే ఉండాలి. దాని ధర ఇతర శ్రమలన్నిటి లాగానే శ్రమ మార్కెట్‌లో క్రమబద్ధమవుతుంది) ఉన్నప్పటికీ ఈ మొత్తం లాభం వడ్డీ రూపంలో మాత్రమే లభిస్తుంది. అనగా పెట్టుబడికి యజమానిగా ఉన్నందుకు మాత్రమే లభిస్తుంది. ఇక్కడ మేనేజరు యొక్క కార్యకలాపం పెట్టుబడి యాజమాన్యం నుంచి పూర్తిగా విడిపోయినట్లే ఈ పెట్టుబడిపై యాజమాన్యం కూడా వాస్తవ పునరుత్పత్తి ప్రక్రియ నుంచి మొత్తంగా విడిపోతుంది. ఆ రకంగా లాభం అన్నది (అప్పు తీసుకునేవాని లాభం నుంచి సమర్థింపుని పొందే లాభం యొక్క ఆ భాగం మాత్రమే కాదు. అనగా వడ్డీ మాత్రమే కాదు.) కేవలం ఇతరుల అదనపు శ్రమను స్వాహా చేయటంలా కనిపిస్తుంది. అంటే ఉత్పత్తి సాధనాలు పెట్టుబడిగా మారటం నుంచి అనగా వాటి వాస్తవ ఉత్పత్తిదారుని నుంచి వాటిని వేరు

1. "బ్యాంకుల ఏర్పాటుకు ముందు... కరెన్సీ లక్ష్యాల కోసం వెనక్కు తీసుకున్న పెట్టుబడి మొత్తం అన్ని వేళలా వాస్తవ సరుకుల చలామణికి అవసరమైన దానికంటే ఎక్కువగా ఉంది." (ఎకనమిస్ట్, 1845, పుట 238)

చేయడం నుండి, వేరే వ్యక్తి యొక్క ఆస్తిగా ఉత్పత్తిలో వాస్తవంగా పనిలో వున్న ప్రతి వ్యక్తికీ అవి విరుద్ధాంశంగా ఉండటం నుంచి తలెత్తుతున్నట్టు కనిపిస్తుంది. మేనేజరు నుంచి చివరి రోజువారీ కార్మికుని వరకు అందరి యొక్క అదనపు శ్రమ స్వాహా అవుతున్నట్టు కనిపిస్తుంది. స్టాక్ కంపెనీల్లో పెట్టుబడి యాజమాన్యం నుంచి కార్యనిర్వహణ వేరుపడిపోతుంది. అలాగే ఉత్పత్తి సాధనాల యాజమాన్యం నుంచి, అదనపు శ్రమ నుంచి శ్రమ మొత్తంగా విడిపోతుంది. పెట్టుబడిదారీ ఉత్పత్తి అంతిమ అభివృద్ధి యొక్క ఈ ఫలితం పెట్టుబడి ఉత్పత్తిదారుల ఆస్తిగా తిరిగి మారే దిశగా ఆవశ్యకత పరివర్తనా దశ. అయితే విడి ఉత్పత్తిదారుల సొంత ఆస్తిగాగాక సమిష్టి ఉత్పత్తిదారుల ఆస్తిగా, సామాజిక ఆస్తిగా ఉంటుంది. మరోవైపున స్టాక్ కంపెనీ అన్నది ఇంకా పెట్టుబడిదారీ ఆస్తితో ముడివడి ఉన్న పునరుత్పత్తి కార్యకలాపాలుగా అనగా సామాజిక కార్యకలాపాలుగా మారే దిశగా సాగే సంధి దశ.

మనం మరింత సాగిపోవటానికి ముందు ఆర్థికంగా ప్రాధాన్యమున్న ఈ క్రింది వాస్తవాన్ని గమనించాల్సి ఉంటుంది. ఇక్కడ లాభం అన్నది కేవలం శుద్ధ వడ్డీ రూపం ధరించడం వల్ల ఈ రకమైన సంస్థలు కేవలం వడ్డీ ఇస్తున్నంత కాలం ఇంకా సాధ్యంగానే ఉంటాయి. సార్వత్రిక లాభం రేటును పడిపోకుండా నిలబడెతున్న కారణాల్లో ఇదొకటి. ఎందుకంటే ఇటువంటి సంస్థలలో అస్థిర పెట్టుబడితో స్థిర పెట్టుబడి ఎంత అపారంగా ఉంటుందంటే అవి సార్వత్రిక లాభం రేటు సమం గావటమన్న దానిలోకి ప్రవేశించాల్సిన అవసరమే లేదు.

[మార్క్స్ ఈ అంశాన్ని రాసిన నాటి నుంచి కొత్త రూపాల్లో పారిశ్రామిక సంస్థలు అభివృద్ధి జెందాయి. రెండో దశ, మూడో దశ స్టాక్ కంపెనీలుగా అవి మనకు తెలుసు. భారీ పరిశ్రమల యొక్క అన్ని రంగాల్లోనూ ఉత్పత్తి విస్తరింపజేయగలిగిన వేగం రోజూ పెరుగుతోంది. ఈ పెరుగుతున్న వేగాన్ని, ఈ పెరిగిన వస్తువులకు మార్కెట్ చాలా నిదానంగా పెరుగుతున్న క్రమం తటస్థీకరిస్తుంది. నెలలలో సాధించగలిగిన ఉత్పత్తిని మార్కెట్ ఇముడ్చుకోవడానికి సంవత్సరాలు పడుతున్నాయి. దీనికి తోడు రక్షిత పన్నుల విధానం వల్ల ప్రతి పారిశ్రామిక దేశం ఇతర దేశాల నుంచి ముఖ్యంగా ఇంగ్లండు నుంచి సరుకులు రాకుండా తన తలుపులు మూసుకుంటుంది. పైగా స్వదేశ ఉత్పత్తి శక్తిని కృత్రిమంగా పెంచుకుంటోంది. ఫలితం సాధారణ దీర్ఘకాలిక అమితోత్పత్తి, పడిపోయిన ధరలు, తగ్గిపోయిన లేదా మొత్తంగా మాయమైన లాభాలు. క్లుప్తంగా చెప్పాలంటే నిర్నిబంధ పోటీ గురించి పలికిన పాత బీరాలు వాటి అంత్యదశకు చేరుకున్నాయి. వాటి స్పష్టమైన అపఖ్యాతికరమైన దివాళాకోరుతనాన్ని అవే ప్రకటించుకోవాల్సి ఉంది. ప్రతి దేశంలోనూ ఏదో ఒక శాఖకు చెందిన పెద్ద పారిశ్రామికవేత్తలందరూ ఉత్పత్తిని క్రమబద్ధం చేయటం కోసం ఒక కార్టెల్‌లో చేరటం ద్వారా ఇది జరుగుతోంది. ప్రతీ సంస్థ ఎంత పరిమాణంలో ఉత్పత్తి చేయాలో ఒక కమిటీ నిర్ణయిస్తుంది. మొత్తం సరుకులకై వచ్చే ఆర్డర్లను పంపిణీ చేసే అంతిమ అధికారం ఆ కార్టెల్‌కే ఉంటుంది. అప్పుడప్పుడూ అంతర్జాతీయ కార్టెల్స్ కూడా స్థాపించబడ్డాయి. ఉదాహరణకు ఇంగ్లీషు, జర్మన్ ఇనుము పరిశ్రమలు. అయితే ఉత్పత్తిలో ఈ రూపపు సహకారం కూడా చాలలేదు. విడి సంస్థల ప్రయోజనాల మధ్య వున్న శత్రుత్వం దానిని బద్దలుగొట్టుకుని తరచుగా పోటీని పునరుద్ధరించడం

జరిగింది. కొన్ని శాఖలలో ఉత్పత్తి స్థాయి అనుమతించిన చోట ఆ పారిశ్రామిక శాఖలో ఉన్న మొత్తం ఉత్పత్తిని ఒకే మేనేజ్‌మెంట్ కింద ఒకే పెద్ద జాయింట్ స్టాక్ కంపెనీలో కేంద్రీకరింప జేయడానికి ఇది దారితీసింది. ఇది అమెరికాలో పదే పదే జరుగుతోంది. యూరప్‌లో ఇంతవరకూ అత్యంత పెద్ద ఉదాహరణ యునైటెడ్ ఆల్కలి ట్రస్ట్. అది మొత్తం బ్రిటిష్ ఆల్కలి ఉత్పత్తినంతటిని ఒకే ఒక వ్యాపార సంస్థ చేతుల్లోకి తీసుకొచ్చేసింది. 30కి మించిన విడి సంస్థల మాజీ యజమానులు తమ సంస్థల విలువను అంచనా వేసి అనగా సుమారు 50 లక్షల పౌండ్లను షేర్లుగా పొందారు. అది ట్రస్టు యొక్క స్థిర పెట్టుబడిగా మారింది. సాంకేతిక నిర్వహణ ఇంతకు ముందు ఉన్నవారి చేతిలోనే సాగుతుంది. అయితే వ్యాపార అజమాయిషీ మాత్రం సాధారణ మేనేజిమెంట్ చేతుల్లో కేంద్రీకరించ బడింది. 10 లక్షల పౌండ్ల పెట్టుబడిని చలనంలో ఉంచటం కోసం ప్రజలు చందాదారులుగా చేరటం అనుమతించబడింది. కనుక ఇప్పుడు మొత్తం పెట్టుబడి 60 లక్షల పౌండ్లయింది. ఆ రకంగా ఈ శాఖలో మొత్తం రసాయనిక పరిశ్రమకు పునాది నేర్పరిచే ఈ శాఖలో ఇంగ్లండులో పోటీ అన్నది గుత్తాధిపత్యంచేత తొలగించబడింది. ఆ రకంగా మొత్తం సమాజం అనగా మొత్తం జాతి భవిష్యత్తులో దీనిని స్వాధీనం చేసుకోడానికి మార్గం సుగమం అయింది – ఎంగెల్స్]

పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానంలోనే పెట్టుబడిదారీ విధానాన్ని రద్దు జేయటమిది. తనను తాను రద్దుజేసుకునే వైరుధ్యమిది. ఇది ఒక కొత్త ఉత్పత్తి రూపానికి పరివర్తనా దశను స్పష్టంగా సూచిస్తుంది. అది ఆ విధంగా తన ప్రభావాల విషయంలో ఒక వైరుధ్యాన్ని వ్యక్తం చేస్తుంది. అది కొన్ని రంగాలలో గుత్తాధిపత్యాన్ని ఏర్పరుస్తుంది. తద్వారా ప్రభుత్వ జోక్యాన్ని కోరుతుంది. ఒక కొత్త ఆర్థిక ప్రభుత్వ వర్గాన్ని అది పునరుత్పత్తి చేస్తుంది. ప్రమోటర్లు, సట్టా వ్యాపారులు, నామమాత్రమైన డైరెక్టర్ల రూపంలో కొత్తరకం పరాన్నభుక్కుల్ని సృష్టిస్తుంది. కార్పొరేషన్ ప్రమోషన్ ద్వారా, స్టాక్ విడుదల ద్వారా, సట్టా వ్యాపారం ద్వారా వంచన దగాల యావత్తు వ్యవస్థను సృష్టిస్తుంది. ఇది ప్రైవేటు ఆస్తి అజమాయిషి లేని ప్రైవేటు ఉత్పత్తి.

IV. పెట్టుబడి దారీ వ్యవస్థ ప్రాతిపదికపైనే పెట్టుబడిదారీ ప్రైవేటు పరిశ్రమను రద్దుజేసి కొత్త ఉత్పత్తి రంగాలలోకి విస్తరించడం ద్వారా, వాటిపై దాడులు చేయడం ద్వారా ప్రైవేటు పరిశ్రమను నాశనం చేసే స్టాక్ కంపెనీ వ్యాపారాన్ని పక్కన ఉంచితే పరపతి అన్నది ఒక ప్రైవేటు పెట్టుబడిదారునికి లేదా పెట్టుబడిదారునిగా భావించబడిన వానికి ఇతరుల పెట్టుబడిపైన, ఆస్తిపైన, తద్వారా ఇతరుల శ్రమపైన కొన్ని పరిమితులకు లోబడి అపారమైన అజమాయిషీ ఇస్తుంది.[1] తన సొంత వ్యక్తిగత పెట్టుబడిపైన కాక సామాజిక పెట్టుబడిపైన అజమాయిషీ అన్నది అతనికి సామాజిక శ్రమపైన అజమాయిషీనిస్తుంది. ఒక మనిషికి ఉన్న లేదా

1. ఉదాహరణకు 1857 లాంటి సంక్షోభ సంవత్సరంలో టైమ్స్ పత్రికలో దివాళా తీసిన వ్యాపారాల జాబితాను చూడండి. దివాళా దీసిన వారి ప్రైవేటు ఆస్తిని వారి రుణాలతో పోల్చి చూడండి. "పెట్టుబడి, పరపతి ఉన్నవారి యొక్క కొనుగోలు శక్తి అన్నది ఈ సట్టా వ్యాపారపు మార్కెట్ల గురించి ఆచరణలో పరిచయం లేని వారికి ఊహకందని విషయం" (టూకే, ఇంక్వైరీ ఇంటు ది కరెన్సీ ప్రిన్సిపుల్, పుట 79) "తన రోజువారీ వ్యాపారంలో తగినంత పెట్టుబడి ఉందని పేరుబడ్డ వ్యక్తి, తన వ్యాపారంలో మంచి పరపతి ఉన్న వ్యక్తి తాను వ్యాపారం చేస్తున్న వస్తువుల ధరలు పెరిగే అవకాశముందని సరిగార ఊహించగలిగితే,

ఉన్నదని ప్రజలు భావిస్తున్న పెట్టుబడి పరపతి అన్న పెద్ద ఉపనిర్మాణానికి కేవలం పునాది అవుతుంది. ఇది టోకు వాణిజ్యం విషయంలో మరింత నిజం. ఈ వాణిజ్యం ద్వారానే సామాజిక ఉత్పాదితం యొక్క అత్యధిక భాగం పయనిస్తుంది. అన్ని కొలమానాలూ, పెట్టుబడిదారీ వ్యవస్థ కింద సమర్థించబడిన అన్ని సాకులూ ఇక్కడ అంతర్థానమవుతాయి. సట్టా వ్యాపారంజేసే టోకు వ్యాపారి ఒడ్డుతోంది తన పెట్టుబడిని కాదు. అది సామాజిక పెట్టుబడి మాత్రమే. పెట్టుబడి పుట్టుకకు పొదుపు చేయటమే ప్రధానమన్న సూక్తి ఇక్కడ నీచార్థం సంతరించుకుంటుంది. ఎందుకంటే ఇక్కడ అతడు డిమాండ్ చేస్తోంది ఇతరులు తన కోసం పొదుపు చేయాలని మాత్రమే (మొత్తం ఫ్రాన్సు ప్రజలంతా కలిసి పనామ కాలువ వంచకుల కోసం 150 కోట్లు పొదుపు చేసినట్లే ఇది కూడా. నిజానికి ఇరవై ఏళ్ళకు ముందే పనామా వంచన యావత్తూ ఇక్కడ ముందుగానే ఊహించబడింది – ఎంగెల్స్) ఇక భోగ విసర్జనకు సంబంధించిన వాదనను అతని భోగలాలసత ఖండిస్తోంది. ఆ భోగలాలసతే అతడు పరపతి పొందే సాధనంగా మారింది. పెట్టుబడిదారీ ఉత్పత్తి తక్కువగా అభివృద్ధి అయిన దశలో కొంత అర్థమున్న భావం ఇక్కడ పూర్తిగా అర్థరహితంగా మారుతుంది. ఇక్కడ విజయం, విఫలత్వం కూడా పెట్టుబడి కేంద్రీకరణకు దారితీస్తుంది. ఆ రకంగా అపారమైన స్థాయిలో పెట్టుబడి స్వాహా జరుగుతుంది. ప్రత్యక్ష ఉత్పత్తిదారుల నుంచి చిన్న, మధ్యతరహా పెట్టుబడిదారులకు కూడా ఈ స్వాహా అన్నది ఇక్కడే విస్తరిస్తుంది. పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానానికి ఇది ప్రారంభ స్థానం. ఈ ఉత్పత్తి లక్ష్యమే దాని విజయం. చివరి అంశంగా అది మొత్తం వ్యక్తులందరి యొక్క ఉత్పత్తి సాధనాలను స్వాహా చేయటమే తన లక్ష్యంగా పెట్టుకుంటుంది. సామాజిక ఉత్పత్తి అభివృద్ధితోపాటు ఉత్పత్తి సాధనాలు ప్రైవేటు ఉత్పత్తి సాధనాలుగానూ, ప్రైవేటు ఉత్పత్తి ఉత్పాదితాలుగానూ కాకుండాపోతాయి. ఆ తర్వాత అవి సమిష్టి ఉత్పత్తిదారుల చేతుల్లో ఉత్పత్తి సాధనాలుగా మాత్రమే ఉండగలుగుతాయి. అనగా సమిష్టి ఉత్పత్తిదారుల సామాజిక ఉత్పాదితాలు అయినట్టుగానే వారి సామాజిక ఆస్తిగా మారతాయి. అయితే ఈ స్వాహా అన్నది పెట్టుబడిదారీ వ్యవస్థ లోపల ఒక వైరుధ్యపూరితమైన రూపంలో కనిపిస్తుంది. సామాజిక ఆస్తిని కొద్దిమంది స్వాహా చేస్తున్నట్టు కనిపిస్తుంది. ఈ కొద్దిమందిని పరపతి అన్నది రానురాను కేవలం దుస్సాహసికులుగా మార్చివేస్తుంది. ఎందుకంటే ఇక్కడ ఆస్తి అన్నది స్టాక్ రూపంలో ఉండటం వల్ల దాని చలనమూ, బదిలీ అన్నవి కేవలం స్టాక్ ఎక్స్ఛేంజిలో జూదం ఫలితంగా మారతాయి. అక్కడ చిన్న చేపల్ని పెద్ద చేపలు మింగుతాయి. గొర్రెల్ని స్టాక్ ఎక్స్ఛేంజి తోడేళ్ళు మింగుతాయి. స్టాక్ కంపెనీలలో

---

ప్రారంభంలోనే అతనికి పరిస్థితులు, సట్టా వ్యాపార ప్రగతి అనుకూలంగా ఉంటే అతని పెట్టుబడితో పోల్చి చూస్తే అపారమైన స్థాయిలో అతడు కొనుగోళ్లు చేయగలుగుతాడు'' (అదే గ్రంథం, పుట 136). ''వ్యాపారులు, కార్ఖానాదారులు మొదలైనవారు తమ సొంత పెట్టుబడితో మాత్రమే చేయగలిగిన దానికంటే మించి చాలా పెద్ద ఎత్తున వ్యాపార కార్యకలాపాలను కొనసాగించగలుగుతారు.... పెట్టుబడి అన్నది మంచి పరపతిని నిర్మించడానికి పునాది. అది ఏ వాణిజ్య సంస్థ లావాదేవీలకైనా పరిమితి గాదు'' (ఎకనామిస్ట్, 1847 పుట 333)

పాత రూపానికి వ్యతిరేకంగా శత్రుత్వం ఉంటుంది. వాటిలో సామాజిక ఉత్పత్తి సాధనాలు ప్రైవేటు ఆస్తిలా కనిపిస్తాయి. అయితే స్టాక్ రూపంలోకి మార్చటం అన్నది ఇంకా పెట్టుబడిదారీ సంకెళ్ళలోనే ఉంటుంది. కనుక సామాజిక సంపద, ప్రైవేటు సంపదల స్వభావాల మధ్య ఉన్న వైరుధ్యాన్ని అధిగమించటానికి బదులు స్టాక్ కంపెనీలు దానిని ఒక కొత్త రూపంలో అభివృద్ధి చేస్తాయి.

కార్మికుల సహకార ఫ్యాక్టరీలు పాత రూపంలోనే తలెత్తిన కొత్త మొలకలు. అయితే అవి సహజంగానే తన సొంత నిర్వహణలో ప్రతిచోటా అమలులో వున్న వ్యవస్థ యొక్క లోపాలను పునరుత్పత్తి చేస్తాయి, చేయాల్సి వుంటుంది. పెట్టుబడికి శ్రమకు మధ్య ఉన్న వైరుధ్యాన్ని వాటి మధ్యలోనే అధిగమించడం జరుగుతుంది. మొదట సమిష్టి కార్మికులను తమ సొంత పెట్టుబడిదారునిగా చేయటం ద్వారా, అనగా ఉత్పత్తి సాధనాలను తమ సొంత శ్రమను పనిలో పెట్టడం కోసం ఉపయోగించగలిగేలా చేయడం ద్వారా అది అధిగమించబడుతుంది. పాత ఉత్పత్తి విధానం నుంచే ఒక కొత్త విధానం ఎలా తలెత్తగలుగుతుందో అవి చూపిస్తాయి. ఉత్పత్తి యొక్క పాదార్థిక శక్తుల అభివృద్ధి, వాటి కనుగుణమైన సామాజిక ఉత్పత్తి రూపాలు ఒక నిర్దిష్ట దశను చేరుకున్నప్పుడు ఇది జరుగుతుంది. పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం నుండి ఫ్యాక్టరీ వ్యవస్థ తలెత్తకుండా ఉంటే సహకార ఫ్యాక్టరీలన్నవి ఉండేవి కాదు. అదే ఉత్పత్తి విధానం నుంచి పరపతి వ్యవస్థ తలెత్తకున్నా ఇవి అభివృద్ధి చెందేవి కాదు. పరపతి వ్యవస్థ అన్నది ప్రైవేటు పెట్టుబడిదారీ సంస్థలు ప్రైవేటు స్టాక్ కంపెనీలుగా క్రమంగా మార్పుజెందడానికి ప్రధానమైన పునాది. అంతేగాదు సహకార పరిశ్రమలు దాదాపు జాతీయ స్థాయిలో క్రమంగా విస్తరించడానికి కూడా సమానంగా అది వసతి కల్పిస్తుంది. పెట్టుబడిదారీ స్టాక్ కంపెనీలను సహకార ఫ్యాక్టరీల వలెనే పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం నుంచి సమిష్టి విధానానికి మార్పు చెందుతున్న పరివర్తనా రూపాలుగా పరిగణించాలి. అయితే వీటి మధ్య ఉన్న తేడా ఏమంటే మొదటిదాంట్లో వైరుధ్యం ప్రతికూలంగానూ, రెండోదానిలో సానుకూలంగానూ పరిష్కరించబడింది.

ఇంతవరకు మనం పరపతి వ్యవస్థ అభివృద్ధిని పరిశీలించాం. దాంతోపాటు ప్రధానంగా పారిశ్రామిక పెట్టుబడికి సంబంధించినంత వరకు పెట్టుబడిదారీ ఆస్తిని అంతరార్థంలో గుప్తంగా రద్దు జేయడం గురించి చర్చించాం. రాబోయే అధ్యాయాల్లో వడ్డీ ఇచ్చే పెట్టుబడికి సంబంధించి పరపతిని పరిశీలిద్దాం. ఆ పెట్టుబడిపైన అది కలిగించే ప్రభావం గురించి, అక్కడ అది సంతరించుకునే రూపం గురించి చర్చిద్దాం. అయితే మరికొన్ని ప్రత్యేక వ్యాఖ్యలు ఇక్కడ అవసరం.

**మొదటి సంగతి ఇది :**

పరపతి వ్యవస్థ వాణిజ్యంలో అమితోత్పత్తికి, అమితమైన సట్టా వ్యాపారానికి ప్రధాన ఆధారంగా కనిపిస్తుంది. ఎందుకంటే కేవలం స్వభావసిద్ధంగా స్థితిస్థాపక శక్తిగల పునరుత్పత్తి ప్రక్రియ దాని పరిమితుల అంచులకు నెట్టబడింది. అది అలా ఎందుకు జరిగిందంటే సామాజిక పెట్టుబడిలో ఒక పెద్ద భాగం దాని సొంతదారులు కానిమనుషుల చేత పనిలో పెట్టబడింది. వారు దాని పర్యవసానంగా సొంతదారునికంటే భిన్నమైన రీతిలోనే వ్యవహరిస్తారు. సొంతదారుడే తన పెట్టుబడితో వ్యవహరిస్తే తన సొంత పెట్టుబడి పరిమితుల్ని ఆదుర్దాగా అంచనా వేసుకుంటాడు. పెట్టుబడి యొక్క స్వయం

విస్తరణ పెట్టుబడిదారీ ఉత్పత్తి యొక్క వైరుధ్యపూరిత స్వభావంపైన ఆధారపడి ఉంటుందని, అది ఒక నిర్దిష్ట పరిమితి మేరకే వాస్తవ స్వేచ్ఛాభివృద్ధిని అనుమతిస్తుందని, నిజానికి ఉత్పత్తికి సంకెళ్ళను వేస్తుందని, అడ్డుగోడలు నిర్మిస్తుందని, ఈ ఆటంకాల్ని నిరంతరాయంగా, పరపతి వ్యవస్థ బద్దలు కొడుతూ వుంటుందని ఇది స్పష్టంగా రుజువు చేస్తుంది.[1] కనుక పరపతి వ్యవస్థ అనేది ఉత్పాదక శక్తుల పాదార్థికాభివృద్ధిని, ప్రపంచ మార్కెట్ స్థాపనను త్వరితం చేస్తుంది. నూతన ఉత్పత్తి విధానం యొక్క ఈ పాదార్థిక పునాదుల్ని కొంత పరిపూర్ణతా స్థాయిలో నిర్మించడం అన్నది పెట్టుబడిదారీ ఉత్పత్తి వ్యవస్థ యొక్క చారిత్రక కర్తవ్యం. అదే సమయంలో ఈ వైరుధ్యం యొక్క ఉగ్రమైన విస్ఫోటనలను కూడా అనగా సంక్షోభాలను కూడా పరపతి వ్యవస్థ త్వరితం చేస్తుంది. ఆ రకంగా పాత ఉత్పత్తి విధానాన్ని విచ్ఛిన్నం చేసే శక్తులను కూడా త్వరితం చేస్తుంది.

పరపతి వ్యవస్థలో ఉన్న రెండు అంతర్గత స్వభావాలు ఇవి. ఒకటి ఒకవైపున పెట్టుబడిదారీ ఉత్పత్తికి అది ప్రోత్సాహకాలను పెంపొందిస్తుంది. ఇతరుల శ్రమ దోపిడీ ద్వారా పెట్టుబడిదారీ ఉత్పత్తిని జూదం, దగాతో కూడిన శుద్ధమైన భారీ రూపంగా అభివృద్ధిపరుస్తుంది. సామాజిక సంపదను దోపిడీజేసే వారి సంఖ్యను రానురాను మరింతగా తగ్గిస్తుంది. రెండోది మరోవైపున కొత్త ఉత్పత్తి విధానానికి పరివర్తనా రూపాన్ని కలిగి ఉంటుంది. ఈ ద్వంద్వార్థం సూచన స్వభావమే లా మొదలుకొని ఐజాక్ పెరేరీ వరకూ గల పరపతి ప్రధాన సమర్థకులకు దగాకోరు, ప్రవక్తల సరదా పుట్టించే మిశ్రమ స్వభావాన్ని ప్రసాదిస్తుంది.

★ ★ ★

1. టి.హెచ్. ఛామర్స్ (ఆన్ పొలిటికల్ ఎకానమీ.... గ్లాస్గో, 1832 - సం॥)

# అధ్యాయం - 28

# చలామణి సాధనాలు, పెట్టుబడి

## టూకే, ఫులార్టన్‌ల అభిప్రాయాలు

**టూ**కే,[1] విల్సన్ తదితరులు కరెన్సీకి, పెట్టుబడికి మధ్య ఉందని చెప్పిన తేడా (డబ్బు)గా సాధారణం అయిన డబ్బు పెట్టుబడిగా, వడ్డీనిచ్చే లేదా (ఇంగ్లీషువారి వాడుకలో ఉన్నట్టు డబ్బు గలిగిన పెట్టుబడిగా) చలామణి సాధనాల మధ్య ఉన్న తేడాలను కలగాపులగం చేశారు. వీటిలో రెండు విషయాలున్నాయి.

ఆదాయం యొక్క వ్యయాన్ని పెంపొందించిన మేరకు కరెన్సీ ఒకవైపున నాణెం (డబ్బు)గా చలామణి అవుతుంది. కనుక వ్యక్తిగత వినియోగదారులకు చిల్లర వ్యాపారులకు మధ్య అది రవాణా

1. టూకే జర్మన్ ప్రతి 390వ పేజీలో ఇచ్చిన ఈ పేరాలో సంబంధిత అంశాన్ని ఇక్కడిస్తున్నాం (ప్రస్తుత ప్రతి పుట 404) : "బ్యాంకర్ల వ్యాపారాన్ని, డిమాండుపైన చెల్లించాల్సిన ప్రామిసరీ నోట్ల విడుదలను పక్కన ఉంచితే, రెండు శాఖలుగా విభజించవచ్చును. ఇది డాక్టర్ (ఆడమ్) స్మిత్ విభజనకనుగుణంగా ఉంటుంది. అనగా వ్యాపారులకు వ్యాపారులకు మధ్య, వ్యాపారులకు ఖాతాదారులకు మధ్య లావాదేవీలు బ్యాంకర్ల వ్యాపారంలో ఒక శాఖ తక్షణ ప్రయోగం లేనివారి నుండి పెట్టుబడిని పోగుచేస్తుంది. దానిని తక్షణం ఉపయోగించే వారికి పంపిణీ లేదా బదిలీ చేస్తుంది. రెండో శాఖ తమ ఖాతాదారుల ఆదాయాల డిపాజిట్లను స్వీకరిస్తుంది. ఖాతాదారుల వినిమయావసరాలకై వారు కోరిన విధంగా ఆ మొత్తాల్ని చెల్లిస్తుంది. మొదటిది పెట్టుబడి చలామణి. రెండోది కరెన్సీ చలామణి." (టూకే, ఇంక్వైరీ ఇంటు ది కరెన్సీ ప్రిన్సిపుల్, లండన్, పుట 36) మొదటిది "ఒకవైపున పెట్టుబడి సాంద్రీకరణ రెండోవైపున దాని పంపిణీ." రెండోది "జిల్లా యొక్క స్థానిక లక్ష్యాలకోసం చలామణి నిర్వహిస్తుంది." (అదే గ్రంథం, పుట 37) ఈ క్రింది అంశంలో కిన్నియర్ ఇంతకంటే సరైన భావనను వ్యక్తం చేశాడు : "డబ్బు.... రెండు వేరు వేరు కార్య కలాపాలను నిర్వహించటానికి పనిలో పెట్టబడుతుంది... వ్యాపారులకు వ్యాపారులకు మధ్య మార్పిడి సాధనంగా అది పెట్టుబడి బదిలీలను ప్రభావితం చేసే పరికరం అనగా డబ్బు రూపంలో ఉన్న కొంత మొత్తం పెట్టుబడి సరుకుల రూపంలో వున్న అంతే మొత్తం పెట్టుబడితో మార్పిడిగావటం. అయితే వేతనాల చెల్లింపులోను వ్యాపారుల ఖాతాదారుల మధ్య క్రయ విక్రయాలలోనూ పనిలో పెట్టబడిన డబ్బు పెట్టుబడి కాదు. అది ఆదాయం. అది రోజువారీ వ్యయం కోసం ఉద్దేశించిన సమాజ ఆదాయాల భాగమది. అది నిరంతరాయమైన రోజువారీ ఉపయోగంలో చలామణిలో ఉంటుంది. అది మాత్రమే పూర్తి న్యాయంగా కరెన్సీ అనబడగలదు. పెట్టుబడి అడ్వాన్సులు అన్నది మొత్తంగా బ్యాంకు అభీష్టం పైన, ఇతర పెట్టుబడి యజమానులపైన ఆధారపడి వుంటుంది. ఎందుకంటే అప్పు తీసుకునే వాళ్ళు ఎప్పుడూ దొరుకుతారు. అయితే కరెన్సీ మొత్తం మాత్రం సమాజం యొక్క అవసరాలపైన ఆధారపడి వుంటుంది. రోజువారీ వ్యయం కోసం వారి మధ్య డబ్బు చలామణిలో ఉంటుంది." (జె.జి. కిన్నియర్, ది క్రైసిస్ అండ్ ది కరెన్సీ, లండన్, 1847, పుటలు 3, 4)

అవుతుంది. ఇక్కడ ఉత్పత్తిదారులకు ఉత్పాదక వినియోగదారులకు కాక వ్యక్తిగత వినియోగదారులకు అమ్మే వర్తకుల్ని చిల్లర వ్యాపారులుగా పరిగణిస్తున్నాం. ఇక్కడ డబ్బు నిరంతరాయంగా పెట్టుబడికి బదులు వ్యవహరిస్తూనే నాణెం యొక్క విధులు నిర్వహిస్తూ చలామణిలో ఉంటుంది. ఒక నిర్దిష్ట దేశంలో ఒక నిర్దిష్ట డబ్బు భాగాన్ని ఈ విధి నిర్వహణ కోసం డబ్బు భాగం వినియోగించబడుతుంది. అయితే ఈ భాగం నిరంతరాయంగా మారే విడి నాణాలను కలిగి వుంటుంది. డబ్బు కొనుగోలు సాధనంగా గాని (చలామణి సాధనంగా) లేదా చెల్లింపు సాధనంగా గాని పెట్టుబడి బదిలీని పెంపొందిస్తే అప్పుడది పెట్టుబడే. కనుక కొనుగోలు సాధనంగా ఉండటం వల్ల గాని, చెల్లింపు సాధనంగా ఉండటం వల్ల గాని నాణెం నుంచి అది వేరుగా మారదు. ఎందుకంటే ఒక వ్యాపారి మరో వ్యాపారి నుండి నగదు రొక్కంతో కొనుగోలు చేసిన మేరకు అది కొనుగోలు సాధనంగా కూడా వ్యవహరిస్తుంది. ఒక వ్యాపారి ఒక వినియోగదారుని మధ్య పరపతి ఇవ్వబడిన మేరకు ఆదాయం చెల్లించబడటానికి ముందే వినియోగం అయిన మేరకు అది చెల్లింపు సాధనంగా కూడా ఉంటుంది. కనుక ఇక్కడ తేడా ఏమంటే రెండో సందర్భంలో ఈ డబ్బు ఒక పార్శ్వానికి అనగా అమ్మేవానికి పెట్టుబడిని భర్తీ చేయటమేగాక రెండో పార్శ్వానికి, అనగా కొనుగోలుదారునికి పెట్టుబడిగా వ్యయమవుతుంది. అడ్వాన్సు చేయబడుతుంది. ఇక్కడ వున్న తేడా ఏమంటే నిజానికి డబ్బు రూపంలో ఉన్న ఆదాయానికి, డబ్బు రూపంలో ఉన్న పెట్టుబడికి మధ్య ఉంది. అంతేగాని కరెన్సీకి, పెట్టుబడికి మధ్య కాదు. ఎందుకంటే కొంత డబ్బు పరిమాణం వ్యాపారుల మధ్య లావాదేవీల్లోనూ, వినియోగదారులకూ వ్యాపారులకూ మధ్య లావాదేవీల్లో కూడా చలామణిలో వుంటుంది. కనుక అది రెండుచోట్ల సమానమైన కరెన్సీగా వుంటుంది. ఈ అంశానికి సంబంధించి టూకే యొక్క భావన అనేక రకాలుగా గందరగోళాన్ని జోడించింది :

1. కార్యనిర్వహణలో తేడాలను గందరగోళపర్చడం ద్వారా.
2. ఈ రెండు పనుల్లోనూ కలిసి చలామణిలో వున్న డబ్బు పరిమాణం అన్న ప్రశ్న లేవనెత్తడం ద్వారా.
3. రెండు పనుల్లోనూ అలాగే పునరుత్పత్తి ప్రక్రియ యొక్క రెండు రంగాల్లోనూ చలామణిలో ఉన్న కరెన్సీ పరిమాణాల సాపేక్ష నిష్పత్తులు అన్న ప్రశ్నను లేవనెత్తడం ద్వారా.

**ఈ మూడింటిని వరుసగా వివరిద్దాం.**

1. డబ్బు ఒక రూపంలో కరెన్సీ అని, మరో రూపంలో పెట్టుబడి అని దాని పనులను వేరు చేయడం ద్వారా గందరగోళం సృష్టించబడింది. డబ్బు ఏదో ఒక పని నిర్వహించిన మేరకు ఆదాయం రూపంలో కనిపించడం గాని లేదా పెట్టుబడిని బదిలీ చేయటంలో గాని క్రయ విక్రయాల్లోగాని కొనుగోలు సాధనంగా లేదా చెల్లింపు సాధనంగా చెల్లించటంలో గాని విస్తృతార్థంలో కరెన్సీగా వ్యవహరిస్తుంది. దానిని ఖర్చు చేసే వ్యక్తి, స్వీకరించే వ్యక్తి యొక్క అంచనాలలో పెట్టుబడిగా లేదా ఆదాయంగా ఉండటం అన్న లక్ష్యం ఇక్కడ దేన్నీ బొత్తిగా మార్చదు. అది రెండు విధాలా రుజువవుతుంది. రెండు రంగాల్లోనూ చలామణిలో ఉన్న డబ్బు వేరు వేరు తరహాలకు చెందినప్పటికీ ఒకే చిరుమొత్తం ఉదాహరణకు 5 పౌండ్ల నోటు ఒక రంగం నుంచి మరో రంగానికి పోతుంటుంది. ఆ రంగాల్లో రెండు పనులను ఒకదాని తర్వాత ఒకటి నిర్వహిస్తుంది. అది అనివార్యం. ఎందుకంటే చిల్లర

వ్యాపారి తన పెట్టుబడికి తాను తన ఖాతాదారుల్నుంచి పుచ్చుకున్న నాణాల రూపమే ఇవ్వగలుగుతాడు. వాస్తవంగా చిన్న నోట్లూ, నాణాల యొక్క చలామణి గరిమనాభి చిల్లర వ్యాపార ప్రపంచంలోనే వుంటుందని ఊహించవచ్చు. చిల్లర వ్యాపారికి నిరంతరాయంగా తన డబ్బును చిల్లరగా మార్చటం అవసరమవుతుంది. దానిని అతడు నిరంతరాయంగా తన ఖాతాదారులనుంచి తిరిగి స్వీకరిస్తుంటాడు. అతడు విలువకు ప్రమాణంగా ఉండే లోహపు నాణాల రూపంలో కూడా డబ్బును పుచ్చుకుంటాడు. అందుకే ఇంగ్లండులో పౌండు నాణాలూ, బ్యాంకు నోట్లూ 5, 10 పౌండ్ల లాంటి చిన్నచిన్న నోట్లూ ఉన్నాయి. ఈ బంగారు నాణాలు, నోట్లను చిల్లర వ్యాపారి ప్రతిరోజూ లేదా ప్రతివారం తన బ్యాంకులో డిపాజిట్ చేస్తుంటాడు. తన కొనుగోళ్ళకుగాను తన బ్యాంకు డిపాజిట్‌పైన చెక్కురాసి చెల్లిస్తుంటాడు. అవే బంగారు నాణాలు, బ్యాంకు నోట్లు అంతే క్రమబద్ధంగా ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా (ఉదాహరణకు వేతనాల చెల్లింపుకై కార్ఖానాదారులచేత చిల్లర తీసుకోబడినట్టుగా) బ్యాంకునుంచి ఉపసంహరించబడతాయి. అది మొత్తం ప్రజానీకం ఒక ఖాతాదారునిగా దానిని డబ్బు రూపంలో తీసుకుంటారు. అది నిరంతరాయంగా చిల్లర వ్యాపారుల దగ్గరికి తిరిగి ప్రవహిస్తుంది. ఈ రకంగా వారు చిల్లర వ్యాపారులకు కొంత పెట్టుబడి భాగాన్ని, దానితోపాటు తమ ఆదాయంలో ఒక భాగాన్ని అందిస్తారు. ఈ చివరి పరిస్థితి ముఖ్యం. దీనిని టూకే ఏమాత్రం గమనించలేదు. ఇంతకు ముందు పునరుత్పత్తి ప్రక్రియను పరిశీలించినచోట (సంపుటం 11, భాగం 1) డబ్బు, డబ్బు పెట్టుబడిగా వ్యయమైన సందర్భంలో పెట్టుబడి విలువ అన్నది శుద్ధంగా పెట్టుబడి విలువగా ఉంటుంది. ఎందుకంటే ఉత్పత్తి అయిన సరుకులు పెట్టుబడిని మాత్రమే కాక అదనపు విలువను కూడా కలిగి వుంటాయి. తమలో తాము పెట్టుబడి మాత్రమే కాక పెట్టుబడిగా వాస్తవ రూపం ధరించిన పెట్టుబడిగా, ఆదాయం యొక్క మూలాధారంతో కూడిన పెట్టుబడిగా అవి వుంటాయి. తనకు తిరిగి వచ్చే డబ్బుకు చిల్లర వ్యాపారి ఇచ్చే సరుకులు అతని దృష్టిలో లాభంతో కలిసిన పెట్టుబడి. అవి ఆదాయంతో కలిసిన పెట్టుబడి.

అంతేగాక చిల్లర వ్యాపారి దగ్గరికి తిరిగి రావడం ద్వారా చలామణిలో ఉన్న డబ్బు అతని పెట్టుబడి యొక్క డబ్బు రూపాన్ని పునరుద్ధరిస్తుంది.

కనుక ఆదాయం యొక్క చలామణిగాను, పెట్టుబడియొక్క చలామణిగాను చలామణి మధ్య వున్న తేడాను కరెన్సీకీ పెట్టుబడికీ మధ్య ఉన్న తేడాగా కుదించడం పూర్తిగా తప్పు. టూకే తన సొంత బ్యాంకు నోట్లను విడుదల చేసే బ్యాంకరు దృష్టినుంచి చూడటం వల్లనే ఈ రూపంలో వ్యక్తం చేస్తున్నాడు. నిరంతరాయంగా ప్రజల చేతుల్లో ఉంటూ (విభిన్న తరహాల నోట్లున్నప్పటికీ) కరెన్సీగా వ్యవహరించే అతని బ్యాంకు నోట్లవల్ల అతనికి కాగితం, ముద్రణ ఖర్చు తప్ప మరే ఖర్చూ ఉండదు. అవి తన పేరుమీదే చలామణి అవుతున్న రుణ సర్టిఫికేట్లు (మార్పిడి బిల్లులు). అయితే అవి అతనికి డబ్బు తెచ్చిపెడతాయి. తన పెట్టుబడిని విస్తరింపజేసే సాధనాలుగా వ్యవహరిస్తాయి. అందుకే అతని దృష్టిలో కరెన్సీకీ పెట్టుబడికీ మధ్య ఏదో తేడా వున్నట్లు కనిపిస్తుంది. నిజానికి ఈ పదాలను అలా నిర్వచించడానికి ముఖ్యంగా టూకే పద్ధతిలో నిర్వచించడానికి ఈ తేడాతో ప్రమేయం లేదు.

డబ్బు రూపంలో ఉన్న ఆదాయంగా వ్యవహరించినా, లేదా పెట్టుబడిగా వ్యవహరించినా

చలామణి సాధనంగా డబ్బు స్వభావంలో ఏమీ మార్పు ఉండదు. ఈ రెంటిలో ఏ పనిని నిర్వహించిన ప్పటికీ అది దాని స్వభావాన్ని నిలబెట్టుకుంటుంది. డబ్బు ఆదాయం యొక్క డబ్బు రూపంలో వ్యవహరించినప్పుడు క్రయ విక్రయాలు చెల్లాచెదురుగా వుండటం వల్ల అలాగే ఆదాయాన్ని తిరిగి వెచ్చించే అత్యధిక సంఖ్యాకులైన కార్మికులు పరపతిపైన కొనగలిగింది సాపేక్షంగా చాలా తక్కువ గనుక డబ్బు వాస్తవ చలామణి సాధనంగా (నాణెం, కొనుగోలు సాధనాలు) వ్యవహరిస్తుందన్నది నిజమే. కాగా వ్యాపార ప్రపంచపు డబ్బు రవాణాలో చలామణి సాధనం అన్నది పెట్టుబడి యొక్క డబ్బు రూపం. అక్కడ డబ్బు ప్రధానంగా చెల్లింపు సాధనంగా వ్యవహరిస్తుంది. ఇది కొంతవరకు సాంద్రీకరణ వల్లనూ, మరికొంత అమల్లో ఉన్న పరపతి వ్యవస్థ వల్లనూ జరుగుతుంది. అయితే చెల్లింపు సాధనానికి, కొనుగోలు (చలామణి సాధనాలు) సాధనానికి మధ్య వున్న తేడా డబ్బుకూ వర్తించే తేడా. అది డబ్బుకూ పెట్టుబడికీ ఉన్న తేడా కాదు. చిల్లర వ్యాపారంలో రాగి, వెండి నాణాలు ఎక్కువగా వుంటాయి. టోకు వ్యాపారంలో బంగారపు నాణాలు ఎక్కువగా వుంటాయి. అయితే ఒకవైపున రాగి, వెండి నాణాలకు మరోవైపున బంగారు నాణాలకు ఉన్న తేడా చలామణికీ, పెట్టుబడికీ ఉన్న తేడా కాదు.

2. రెండు పనుల్లోనూ కలిసి చెలామణిలో వున్న డబ్బు పరిమాణం అన్న ప్రశ్నను లేవనెత్తడం కొనుగోలు సాధనంగా గాని, చెల్లింపు సాధనంగా గాని – ఈ రెండు రంగాలలోనూ దేనిలోనైనా ఆదాయాన్ని లేదా పెట్టుబడిని వాస్తవ రూపం ఇచ్చే తన పనులతో నిమిత్తం లేకుండా డబ్బు చలామణిలో ఉన్న మేరకు దాని చలామణిలో వున్న మొత్తం పరిమాణం అన్నది సరుకుల సాధారణ చలామణి గురించి ఇంతకు ముందు చర్చించబడి[1] అభివృద్ధి చేయబడిన నియమాల పరిధిలోకి వస్తుంది. ఈ చలామణి యొక్క వేగం చలామణిలో ఉండే డబ్బు మొత్తాన్ని నిర్ణయిస్తుంది. అనగా కొనుగోలు సాధనాలుగానూ, చెల్లింపు సాధనాలుగానూ ఒక నిర్ణీత కాలంలో ఒకే డబ్బు శకలాలతో ఎన్నిసార్లు అదే పనిని నిర్వహించడం జరుగుతుంది అన్నదానిపైన ఆధారపడి వుంటుంది. ఏకకాలంలో జరిగే క్రయ విక్రయాలు చలామణిలో ఉన్న సరుకుల ధరల మొత్తం అదేకాలంలో పరిష్కరించాల్సిన చెల్లింపులు పోగా తేలిన మొత్తాలు అన్నీ కరెన్సీ పరిమాణాన్ని నిర్ధారిస్తాయి. ఇక్కడ అలా పనిలో పెట్టబడిన డబ్బు ఇచ్చేవానికీ లేదా పుచ్చుకునేవానికీ పెట్టుబడిగా వ్యవహరిస్తుందా లేక ఆదాయంగా వ్యవహరిస్తుందా అన్నది ముఖ్యం కాదు. అది విషయాన్ని ఏమాత్రం మార్చదు. కొనుగోలు, చెల్లింపు సాధనంగా అదిచేసే పని దాని పరిమాణాన్ని నిర్ణయిస్తుంది.

3. పునరుత్పత్తి ప్రక్రియలో రెండు రంగాల్లోనూ, రెండు విధుల్లోనూ చలామణిలో వున్న కరెన్సీ మొత్తాల సాపేక్ష నిష్పత్తుల ప్రశ్న : ఈ రెండు చలామణి రంగాల మధ్య అంతర్గత సంబంధం ఉంది. ఎందుకంటే ఒకవైపున ఖర్చు చేయాల్సిన ఆదాయాల మొత్తం వినియోగం యొక్క పరిమాణాన్ని తెలియజేస్తుంది. మరోవైపున ఉత్పత్తిలోనూ, వాణిజ్యంలోనూ చలామణిలో వున్న పెట్టుబడి మొత్తాల పరిమాణం పునరుత్పత్తి ప్రక్రియ యొక్క వేగాన్ని తెలియజేస్తుంది. అయినప్పటికీ ఒకే పరిస్థితులు రెండు పనుల్లోనూ లేదా రెండు రంగాల్లోనూ చలామణిలో వున్న డబ్బు మొత్తాలపైన ఇంగ్లీషువారి

1. సంపుటం II, అధ్యాయం III.

బ్యాంకు భాషలో చెప్పాలంటే కరెన్సీ మొత్తంపైన విభిన్నమైన ప్రభావం, ఒక్కోసారి పరస్పర విరుద్ధమైన దిశల్లో ఉంటుంది. పెట్టుబడికీ, కరెన్సీకీ మధ్య టూకే యొక్క మొరటు విభజనకు ఇది మరో కారణాన్నం దిస్తుంది. ఈ కరెన్సీ సిద్ధాంతపు పెద్దమనుషులు రెండు విషయాల్ని గందరగోళపరచినంత మాత్రాన అవి రెండు భావనలుగా వాటిని చూపించనక్కరలేదు.

సుభిక్ష కాలాల్లో విస్తరణ తీవ్రంగా ఉన్నప్పుడు పునరుత్పత్తి ప్రక్రియ వేగంగానూ, ఉధృతంగానూ ఉన్నప్పుడు కార్మికులు పూర్తిగా పనిలో ఉంచబడతారు. సాధారణంగా వేతనాల్లో కూడా కొంత పెరుగుదల ఉంటుంది. వాణిజ్య చక్రభ్రమణంలో ఇతర సందర్భాల్లో వారికి సగటుకంటే తక్కువ వేతనాలు లభించి వుంటాయి. దానిని ఇక్కడ కొంత భర్తీ చేయటం జరుగుతుంది. అదే సమయంలో పెట్టుబడిదారుల ఆదాయాలు గణనీయంగా పెరుగుతాయి. వినియోగం సాధారణంగా పెరుగుతుంది. సరుకు ధరలు కూడా క్రమంగా పెరుగుతాయి. కనీసం కొన్ని ప్రధాన వ్యాపార శాఖల్లో పెరుగుతాయి. పర్యవసానంగా చలామణిలో ఉన్న డబ్బు మొత్తం నిర్దిష్ట పరిమితుల లోపల పెరుగుతుంది. అయితే చలామణి యొక్క పెరిగిన వేగం కరెన్సీ మొత్తం యొక్క పెరుగుదలకు కొన్ని పరిధుల్ని నిర్ణయిస్తుంది. వేతనాల రూపంలో ఉన్న సామాజిక ఆదాయం మొదట పారిశ్రామిక పెట్టుబడిదారు అస్థిర పెట్టుబడి రూపంలో, డబ్బు రూపంలో అడ్వాన్సు చేశాడు గనుక సుభిక్ష కాలాల్లో చలామణి కోసం దానికి మరింత డబ్బు అవసరమవుతుంది. అయితే దీనిని మనం రెండుసార్లు లెక్కించనక్కర్లేదు. మొదట అస్థిర పెట్టుబడి చలామణి కోసం అవసరమైన డబ్బుగానూ, రెండోసారి కార్మికుల ఆదాయాల చలామణి కోసం అవసరమైన డబ్బుగానూ లెక్కించనక్కర్లేదు. కార్మికులకు వేతనాలుగా చెల్లించిన డబ్బు చిల్లర వ్యాపారంలో ఖర్చుపెట్టబడుతుంది. అది తిరిగి చిల్లర వ్యాపారి డిపాజిట్ల రూపంలో వారానికొకసారి బ్యాంకుకు తిరిగి వస్తుంది. ఇదంతా చిన్న చిన్న చక్రభ్రమణాలలో చిల్లర, మధ్యంతర లావాదేవీల్లో పయనించిన తర్వాత జరుగుతుంది. సుభిక్ష కాలాలలో పారిశ్రామిక పెట్టుబడిదారుల డబ్బు తిరిగి రావడమన్నది సాఫీగా నడిచిపోతుంది. ఆ రకంగా డబ్బు వసతి యొక్క అవసరం పెరగదు. ఎక్కువ వేతనాలు చెల్లించాల్సి రావడం వల్ల, వారి అస్థిర పెట్టుబడి చలామణి కోసం మరింత డబ్బు అవసరమైనందు వల్ల డబ్బు వసతి యొక్క అవసరం పెరగదు.

ఆదాయ వ్యయంగా వ్యవహరిస్తున్న చలామణి సాధనాల మొత్తం సుభిక్ష సమయాల్లో నిర్ణయాత్మకంగా పెరుగుతుంది. ఇదే దాని మొత్తం ఫలితం.

పెట్టుబడి బదిలీ కోసం అవసరమైన, అంటే కేవలం పెట్టుబడిదారుల మధ్య అవసరమైన చలామణికి సంబంధించినంత వరకు చురుకుగా వ్యాపారం సాగేకాలం సులభమైన వెసులుబాటైన పరపతి కాలం కూడా. పెట్టుబడిదారులకూ, పెట్టుబడిదారులకూ మధ్య ఆ చలామణి వేగం సూటిగా పరపతిచేతే క్రమబద్ధం చేయబడుతుంది. చెల్లింపుల కోసం అవసరమయ్యే చలామణి సాధనం యొక్క మొత్తం నగదు కొనుగోళ్ళలో సైతం ఆ మేరకు తగ్గుతుంది. అది నిరపేక్షంగా పెరిగితే పెరగొచ్చు. అయితే పునరుత్పత్తితో పోల్చి చూస్తే అన్ని పరిస్థితుల్లోనూ సాపేక్షంగా తగ్గుతుంది. ఒకవైపున పెద్ద మొత్తాలలో చెల్లింపులన్నీ డబ్బు మధ్యవర్తిత్వం లేకుండానే జరుగుతాయి. మరోవైపున పునరుత్పత్తి ప్రక్రియ ఉధృతి వల్ల అదే మొత్తం డబ్బు కొనుగోలు సాధనంగానూ, చెల్లింపు సాధనంగానూ శీఘ్రంగా

చలనంలో ఉంటుంది. అదే మొత్తం డబ్బు విడి పెట్టుబడులు మరింత పెద్ద సంఖ్యలో తిరిగి రావటాన్ని పెంపొందిస్తుంది.

మొత్తం మీద అటువంటి సమయాలలో డబ్బు కరెన్సీ పూర్తిగా కనిపిస్తుంది. దాని డిపార్ట్‌మెంట్ II (పెట్టుబడి బదిలీ) కనీసం సాపేక్షంగా తగ్గుతుంది. కాగా దాని డిపార్ట్‌మెంట్ I (ఆదాయపు వ్యయం) నిరపేక్షంగా విస్తరిస్తుంది.

ఈ తిరిగి రావటమన్నది సరుకు పెట్టుబడి డబ్బుగా, తిరిగి మార్చబడటాన్ని సూచిస్తుంది డ–స–డ'. ఈ అంశాన్ని మనం ఇంతకు ముందు పునరుత్పత్తి ప్రక్రియ యొక్క చర్చలో గ్రహించాం.[1] పారిశ్రామిక పెట్టుబడిదారునికీ వర్తకునికీ కూడా వాస్తవంగా తమ డబ్బు తిరిగి వచ్చే సమయంతో ప్రమేయం లేకుండా పరపతి అన్నది డబ్బు రూపంలో తిరిగి రావడమన్న దాన్ని సాధ్యం చేస్తుంది. వారిద్దరూ కూడా పరపతిపైన అమ్ముతారు. వారి సరుకులు వారికి డబ్బు రూపంలోకి మారటానికి ముందే వారి నుండి దూరమవుతాయి. డబ్బు రూపంలో అవి వారికి తిరిగి చేరకముందే ఇది జరుగుతుంది. మరోవైపున వారు పరపతిపైనే కొంటారు. ఈ రకంగా తమ సరుకుల విలువ తిరిగి మార్చబడింది. ఈ విలువ డబ్బు రూపంలోకి వాస్తవంగా రూపాంతరం చెందక ముందే సరుకు ధర చెల్లించే గడువుకు ముందే, చెల్లించడానికి ముందే అవి ఉత్పాదక పెట్టుబడిగా లేదా సరుకు పెట్టుబడిగా తిరిగి మార్చబడతాయి. అటువంటి సుభిక్ష సమయాలలో డబ్బు తిరిగి రావడమన్నది సాఫీగానూ, సులభంగానూ జరిగిపోతుంది. చిల్లర వ్యాపారి భద్రంగా టోకు వ్యాపారికి చెల్లిస్తాడు. టోకు వ్యాపారి కార్ఖానాదారునికి చెల్లిస్తాడు. కార్ఖానాదారుడు ముడిపదార్థాల దిగుమతిదారునికి చెల్లిస్తాడు. ఇలా శీఘ్రంగా, నమ్మకంగా తిరిగి వస్తున్నట్లు కనిపించడం అన్నది వాస్తవంగా తిరిగి రావటం ఆగిపోయినప్పటికీ చాలా కాలంపాటు కొనసాగుతూనే ఉంటుంది. అందుకు కారణం అమలులో ఉన్న పరపతి ప్రభావమే. వాస్తవంగా తిరిగి రావటంగా కనిపించే దాని యొక్క స్థానాన్ని పరపతి తిరిగి రావడం అన్నది భర్తీ చేయడం వల్ల అలా జరుగుతుంది. ఖాతాదారులు డబ్బు కంటే ఎక్కువగా మార్పిడి బిల్లులను డిపాజిట్ చేయడం ప్రారంభించగానే బ్యాంకులు ప్రమాదాన్ని పసిగడతాయి. లివర్ పూల్ బ్యాంక్ డైరెక్టర్ సాక్ష్యాన్ని చూడండి (ఇదే సంపుటిలో).

ఇంతకు ముందు నేను పేర్కొన్న విషయం ఇది. "పరపతి ప్రబలంగా వున్నప్పుడు డబ్బు చలామణి వేగం సరుకు ధరలకంటే త్వరగా పెరుగుతుంది. పరపతి తగ్గుతున్న కాలంలో సరుకు ధరల వేగం చలామణి వేగం కంటే తగ్గుతుంది." (ది క్రిటిక్ ఆఫ్ పొలిటికల్ ఎకానమీ, 1859, పుటలు 83, 84)

సంక్షోభ కాలంలో దీనికి విరుద్ధంగా ఉంటుంది. చలామణి నెం. I తగ్గుతుంది. ధరలు తగ్గుతాయి. అలాగే వేతనాలు తగ్గుతాయి. పని చేసే కార్మికుల సంఖ్య తగ్గించబడుతుంది. లావాదేవీల మొత్తం తగ్గుతుంది. అందుకు విరుద్ధంగా చలామణి నెం. II పరపతి తగ్గడంతో పాటు డబ్బు వసతి అవసరం పెరుగుతుంది. ఈ అంశాన్ని వెంటనే మరింత వివరంగా పరిశీలిద్దాం.

పునరుత్పత్తి ప్రక్రియలో మాంద్యంతో పాటుగా తగ్గే పరపతి సౌకర్యంతోపాటు నెం.I కోసం

1. సంపుటం II, భాగం I.

అనగా ఆదాయపు వ్యయం కోసం అవసరమైన చలామణి మొత్తం కూడా తగ్గుతుందనడంలో సందేహం లేదు. నెం. II కోసం అనగా పెట్టుబడి బదిలీ కోసం అవసరమైన చలామణి మొత్తం విస్తరిస్తుంది. ఫులార్టన్ తదితరులు ప్రకటించిన అంశాలతో ఈ నా ప్రకటన ఏ మేరకు ఏకీభవిస్తుందో విశ్లేషించాల్సి వుంది : "పెట్టుబడి అప్పు కోసం గిరాకీ, అదనపు చలామణి కోసం గిరాకీ అన్నవి వేరు వేరు అంశాలు. తరచుగా ఒకదానితో ఒకటి కలిసి ఉండవు." (ఫులార్టన్, అదే గ్రంథం, పుట 82, 5వ అధ్యాయం శీర్షిక)[1]

మొదటిది స్పష్టంగా వున్న అంశం ఏమంటే సుభిక్ష సమయాలలో చలామణి సాధనం యొక్క మొత్తం పెరగాల్సి వచ్చినపుడు దానికై గిరాకీ కూడా పెరుగుతుందని పైన పేర్కొన్న రెండు అంశాల్లోనూ మొదటిది తెలియజేస్తుంది. ఒక కార్ఖానాదారుడు డబ్బు రూపంలో మరింత పెట్టుబడిని వ్యయం చేయాల్సి వచ్చినపుడు బ్యాంకులో బంగారం లేదా బ్యాంకు నోట్ల రూపంలో ఉన్న తన డిపాజిట్ నుంచి కొంత పైకం తీసుకుంటే పెట్టుబడి కోసం అతని డిమాండ్ పెరిగినట్టు కాదని స్పష్టంగా ఉంది. తన పెట్టుబడిని ఏ రూపంలో వ్యయం చేస్తున్నాడో కేవలం ఆ రూపానికై మాత్రమే అతని

---

1. "డబ్బు అప్పు (పెట్టుబడి అప్పు) కోసం గిరాకీని అదనపు చలామణి సాధనాల కోసం గిరాకీతో సరిసమానమని ఊహించడం, పైగా ఈ రెండూ కలిసే వుంటాయని ఊహించడం పెద్ద పొరపాటు. ఈ ప్రతి గిరాకీ తనకు మాత్రమే ప్రత్యేకమైన పరిస్థితుల్లో తలెత్తుతుంది. ఇవి రెండూ వేరు వేరు అంశాలు. ప్రతిదీ సుభిక్షంగా కనిపించినపుడు, వేతనాలు బాగా ఉన్నప్పుడు ధరలు పెరుగుతున్నప్పుడు, ఫ్యాక్టరీలకు పూర్తి పని ఉన్నప్పుడు మామూలుగా అదనపు కరెన్సీ సరఫరా అవసరమవుతుంది. పెద్ద మొత్తాలలో ఎక్కువ సంఖ్యలో చెల్లింపులు చేయటంతో విడదీయలేని అదనపు కార్యకలాపాల నిర్వహణ కోసం ఇది అవసరమవుతుంది. కాగా ప్రధానంగా ఈ వాణిజ్య చక్రభ్రమణం యొక్క మరింత అభివృద్ధి చెందిన దశలో ఇబ్బందులు తొంగిచూడటం ప్రారంభమైనప్పుడు, మార్కెట్లు సరుకులతో నిండిపోయినపుడు, డబ్బు తిరిగి రావటం ఆలస్యమవుతున్నప్పుడు, వడ్డీ పెరుగుతున్నప్పుడు బ్యాంకుపైన పెట్టుబడి అడ్వాన్సులకోసం వత్తిడి పెరుగుతుంది. బ్యాంకు తన ప్రామిసరీ నోట్లతో పెట్టుబడిని అడ్వాన్సు చేయడానికి అలవాటుపడిన మరో సాధనం ఏదీ లేనిమాట వాస్తవం. కనుక ఈ నోట్లను తిరస్కరించడమంటే డబ్బు సదుపాయాన్ని నిరాకరించటమే. అయితే ఒకసారి ఈ సదుపాయాన్ని ఆమోదిస్తే ప్రతిదీ మార్కెట్ అవసరాలకు అనుగుణంగా తనంత తానే సర్దుకుంటుంది. అప్పు అలాగే వుంటుంది. కరెన్సీ అవసరం లేకుంటే విడుదల చేసిన వ్యక్తికే తిరిగి పోతుంది. అదే విధంగా పార్లమెంటుకు సమర్పించిన వివరాలను కొద్దిగా పరిశీలిస్తే ప్రతి ఒక్కరికీ అర్థమయ్యే విషయమేమంటే బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్ చేతిలో ఉన్న హామీ పత్రాలు దాని చలామణి దిశకు వ్యతిరేకంగా, ఆ దిశకు అనుకూలంగా కంటే ఎక్కువ తరచుగా ఆటుపోట్లకు లోనవుతూ ఉంటాయి. కనుక ఆ సంస్థ మనకందిస్తున్న ఆ ఉదాహరణ కూడా దేశవాళీ బ్యాంకర్లు గట్టిగా బలపరుస్తున్న సిద్ధాంతానికి మినహాయింపు కాదని అర్థమవుతుంది. ఆ సిద్ధాంతమిది : ఒక బ్యాంకు నోటు కరెన్సీకి ఉమ్మడిగా వర్తింపజేసే లక్ష్యానికి తగినంత చలామణి అప్పటికే ఉండి వుంటే ఏ బ్యాంకు కూడా తన చలామణిని పెంచలేదు. అయితే ఆ పరపతి దాటిపోయాక తన అడ్వాన్సులకు అదనపు మొత్తాలను కలపాలనుకుంటే అది తన సొంత పెట్టుబడి నుంచి కలపాలి. నిల్వలో ఉన్న తన కొన్ని హామీ పత్రాలను విక్రయించటం ద్వారా, అటువంటి హామీ పత్రాల్లో మరింతగా మదుపు పెట్టడాన్ని నిలిపివేయడం ద్వారా దానికి సరఫరా చేయాలి. నేను ఇంతకు ముందు పుటలో పేర్కొన్న అంశం 1833-1840 మధ్యకాలంలో పార్లమెంటుకు సమర్పించిన వివరాల నుండి ఒక జాబితా తయారు చేయబడింది. ఈ వాస్తవాన్ని ఆ జాబితాలో ఉన్న ఉదాహరణలు రుజువు చేస్తాయి. వీటిలో రెండు ఎంత స్పష్టంగా ఉన్నాయంటే వేరే

డిమాండ్ పెరిగింది. అతడు చలామణిలోకి పెట్టుబడిని ప్రవేశపెట్టే సాంకేతిక రూపానికి మాత్రమే ఈ డిమాండ్ వర్తిస్తుంది. పరపతి వ్యవస్థ భిన్నంగా అభివృద్ధి చెందిన సందర్భంలో ఒకే అస్థిర పెట్టుబడి లేదా ఒకే మొత్తం వేతనాలు ఒక దేశంలో కంటే మరో దేశంలో ఉదాహరణకు స్కాట్‌లాండ్‌లో కంటే ఇంగ్లండులోనూ, ఇంగ్లండులో కంటే జర్మనీలోనూ ఎక్కువ చలామణి సాధనం యొక్క మొత్తం అవసరమవుతుంది. అలాగే వ్యవసాయంలో కూడా పునరుత్పత్తి ప్రక్రియలో క్రియాశీలంగా ఉన్న ఒకే మొత్తం పెట్టుబడి విభిన్న రుతువుల్లో దాని పని నిర్వహణ కోసం విభిన్న మొత్తాలలో అవసరమవుతుంది.

అయితే ఫులార్టన్ చూపించిన వైరుధ్యం సరికాదు. సుభిక్ష కాలానికి, మాంద్యమున్న కాలానికి మధ్య తేడా అప్పులకై గట్టి గిరాకీ ఉండటం ఎంతమాత్రం కాదు. అయితే సుభిక్ష కాలాల్లో ఈ గిరాకీ తేలిగ్గా సంతృప్తిపరచబడుతుంది. మాంద్యమున్న కాలంలో ఈ గిరాకీ ఇబ్బందులనెదుర్కొంటుంది. సుభిక్ష కాలంలో పరపతి వ్యవస్థ అపారంగా అభివృద్ధిగావటం వల్ల అప్పు పెట్టుబడికై గిరాకీ అపారంగా పెరగటంవల్ల ఆ కాలంలో ఆ గిరాకీని సదా సంతృప్తిపరచే సరఫరా ఉండటం వల్ల మాంద్యం ఉన్న కాలంలో పరపతి కొరత ఏర్పడుతుంది. కనుక అప్పులకై ఈ గిరాకీ మొత్తంలో ఉన్న తేడా ఈ రెండు కాలాల స్వభావాలను తెలియజేస్తుందనటం సరికాదు.

ఇంతకుముందు మనం పేర్కొన్నట్టు ఈ రెండు కాలాలకు ఒక ప్రధానమైన తేడా వుంది.

---

ఉదాహరణలు ఇవ్వాల్సిన అవసరం లేకుండా చేశాయి. 1837 జనవరి 3వ తేదీన పరపతి అవసరాలను తీర్చడానికి, డబ్బు మార్కెట్ ఇబ్బందులను అధిగమించడానికి బ్యాంకు వనరులన్నీ పూర్తిగా ఉపయోగించబడ్డాయి. అప్పుపైన, డిస్కౌంటుపైన అది చేసిన అడ్వాన్సులు 17,022,000 పౌండ్లు. యుద్ధం తర్వాత ఇంత పెద్ద మొత్తం తెలియదు. ఇది దాదాపు మొత్తం విడుదల చేసిన మొత్తాలకు అనగా 1,776,000 పౌండ్లకు దగ్గరగా వుంది. మరోవైపున 1833 జూన్ 4వ తేదీన వ్యక్తిగత హామీ పత్రాలు తిరిగి వచ్చిన తర్వాత 18,892,000 పౌండ్ల చలామణి దాదాపు 972,000 పౌండ్ల స్థాయికి పడిపోయింది. ఇది గత అర్ధశతాబ్దిలోనూ అతి తక్కువ మొత్తం కాకపోయినప్పటికీ దాదాపు దానితో సమానం." (ఫులార్టన్, అదే గ్రంథం, పుటలు 97, 98) ధన సదుపాయం కోసం, ఉన్న గిరాకీ బంగారం కోసం ఉన్న గిరాకీతో ఏ రకంగానూ సరిసమానం కానక్కరలేదు. (బంగారాన్ని విల్సన్, టూకే తదితరులు పెట్టుబడి అంటారు.) ఈ విషయం బ్యాంకు ఆఫ్ ఇంగ్లండు గవర్నరు వెగ్యూలిన్ సాక్ష్యం నుంచి చూడవచ్చు. "ఆ మేరకు (మూడు రోజులు వరుసగా రోజుకు 10 లక్షల చొప్పున) బిల్లుల్ని డిస్కౌంటు చేసినప్పటికీ బ్యాంకు నోట్ల రిజర్వు తగ్గిపోదు. జనం క్రియాశీలమైన చలామణి మరింత ఎక్కువగా ఉండాలని కోరితే తప్ప ఇలా జరగదు. బిల్లుల డిస్కౌంటుపైన విడుదల చేసిన నోట్లు బ్యాంకర్ల ద్వారా, డిపాజిట్లు ద్వారా తిరిగి వస్తాయి. ఈ లావాదేవీలు వెండి, బంగారాలు ఎగుమతి చేసే ఉద్దేశంతో జరిగి వుండకపోతే, దేశంలో భయోత్పాత వాతావరణం వల్ల ప్రజలు వాటిని బ్యాంకర్ల చేతుల్లో పెట్టకుండా, తమ నోట్లను దాచిపెట్టకుండా ఉంటే... ఈ లావాదేవీల పరిమాణం వల్ల నిల్వ ప్రభావితమేమీ కాదు." - "రోజుకు బ్యాంకు 15 లక్షల డిస్కౌంటు చేయవచ్చు. దాని నిల్వ ఏమాత్రం దెబ్బతినకుండా ఆ పని నిరంతరాయంగా చేయవచ్చు. నోట్లు తిరిగి డిపాజిట్లుగా తిరిగి వస్తూ ఒక ఖాతానుంచి మరో ఖాతాకు బదిలీ జరగటం తప్ప మరేమీ మార్పులు లేకపోతే ఆ పని జరుగుతుంది." (రిపోర్టు ఆన్ బ్యాంక్ యాక్ట్స్, 1857, సాక్ష్యాల నెంబర్లు 241, 590) కనుక ఇక్కడ నోట్లు కేవలం పరపతి సౌకర్యాలను బదిలీ చేసే సాధనాలుగా మాత్రమే వ్యవహరిస్తాయి.

సుభిక్ష కాలంలో వినియోగదారులకు, వ్యాపారులకు మధ్య కరెన్సీ కోసం గిరాకీ ప్రబలంగా వుంటుంది. మాంద్యం ఉన్నప్పుడు పెట్టుబడిదారుల మధ్య కరెన్సీ కోసం గిరాకీ ప్రబలంగా వుంటుంది. మాంద్యం ఉన్నప్పుడు మొదటిది తగ్గి రెండవది పెరుగుతుంది.

పులార్టన్ తదితరులకు నిర్ణయాత్మక ప్రాధాన్యత ఉన్న అంశాలుగా కనిపిస్తున్నది. బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్ స్వాధీనంలో ఉన్న హామీ పత్రాలు పెరుగుతున్నప్పుడు దాని నోట్ల చలామణి తగ్గుతుంది. హామీ పత్రాలు తగ్గుతున్నప్పుడు నోట్ల చలామణి పెరుగుతుంది. అయితే ఈ హామీ పత్రాల స్థాయి ధన సదుపాయం యొక్క పరిమాణాన్ని తెలియజేస్తుంది. డిస్కౌంటు చేయబడిన మార్పిడి బిల్లుల పరిమాణాన్ని మార్కెట్ చేయదగిన హామీలపై చేసిన అడ్వాన్సులను కూడా తెలియజేస్తుంది. (404వ పేజీలోని పాదసూచికలో) పులార్టన్ చెప్పేదేమంటే బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్ చేతిలో ఉన్న హామీ పత్రాలు వాటి చలామణికి వ్యతిరేక దిశలో ఆటుపోట్లకు గురవుతుంటాయి. ఏ బ్యాంకూ తన బ్యాంకు నోట్లను ప్రజావసరాలచేత నిర్ధారించబడిన ఒక పరిధిని మించి విడుదల చేయలేదని, ఈ పరిధి దాటి ఒక బ్యాంకు అడ్వాన్సులు చేయదలచుకుంటే అది తన సొంత పెట్టుబడి నుంచే అలా చేయాలని, కనుక అది తన హామీ పత్రాలను డబ్బు రూపంలోకి మార్చాలని లేదా హామీ పత్రాలలో మదుపు పెట్టాల్సిన డిపాజిట్లను ఉపయోగించాలని అన్న అభిప్రాయం చాలాకాలంగా ప్రైవేటు బ్యాంకులకు ఉంది. దానిని పులార్టన్ అభిప్రాయం ధ్రువీకరిస్తుంది.

పులార్టన్ దృష్టిలో పెట్టుబడి అంటే ఏమిటో కూడా ఇది తెలియజేస్తుంది. పెట్టుబడి అన్నది సూచిస్తున్న దేమిటిక్కడ? బ్యాంకు తనకేమీ ఖర్చుగాని తన బ్యాంకు నోట్లతో లేదా ప్రామిసరీ నోట్లతో ఎంతమాత్రమూ అడ్వాన్సులను చేయలేదు. అటువంటప్పుడు అది అడ్వాన్సులను దేనితో చేయాలి? హామీ పత్రాలను అనగా తన దగ్గర రిజర్వులోనున్న ప్రభుత్వ బాండ్లను, సరుకులను అలాగే ఇతర వడ్డీ ఇచ్చే పత్రాలను అమ్మటం ద్వారా సేకరించిన సొమ్ముతో అడ్వాన్సు చేయాలి. అటువంటి పత్రాలను అమ్మటం కోసం అది చెల్లింపులలో ఏమి పొందుతుంది? డబ్బు – బంగారం లేదా బ్యాంకు నోట్లు. అవి బ్యాంకు ఆఫ్ ఇంగ్లండు నోట్లలాగా చట్టబద్ధమైన డబ్బు పత్రాలైన మేరకు ఇది వర్తిస్తుంది. కనుక బ్యాంకు అన్ని పరిస్థితుల్లోనూ అడ్వాన్సు చేసేదేమంటే డబ్బు మాత్రమే. అయితే ఈ డబ్బు ఇప్పుడు దాని పెట్టుబడిలో ఒక భాగం అయ్యుంటుంది. అది బంగారాన్ని అడ్వాన్సు చేస్తే దానిని అర్థం చేసుకోవచ్చు. అది నోట్లను అడ్వాన్సు చేస్తే ఈ నోట్లు పెట్టుబడికి ప్రాతినిధ్యం వహిస్తాయి. ఎందుకంటే అది వడ్డీ ఇచ్చే పత్రాలలాగా కొంత వాస్తవ విలువను వాటికి ఇచ్చివేస్తుంది కనుక ప్రైవేటు బ్యాంకులు సెక్యూరిటీల అమ్మకాల ద్వారా పొందిన నోట్లు ప్రధానంగా బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండు నోట్లయినా అయి వుండాలి. లేదా తమ సొంత నోట్లయినా అయివుండాలి. ఎందుకంటే ఇతరుల నోట్లు ఈ సెక్యూరిటీలకై చెల్లింపులలో తీసుకోబడటం అన్నది అరుదైన విషయం. అది బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండే అయితే తన సొంత నోట్లనే స్వీకరిస్తుంది. అది దానికి తన సొంత పెట్టుబడిపైన అనగా వడ్డీ ఇచ్చే పత్రాలపైన ఈ మొత్తాలు తిరిగి వస్తాయి. దాంతోపాటు ఆ తర్వాత అది తన సొంత నోట్లను చలామణి నుంచి ఉపసంహరించుకుంటుంది. ఈ నోట్లను అది తిరిగి విడుదలచేస్తే లేదా వాటికి బదులు అదే మొత్తంలో కొత్త నోట్లను విడుదల చేస్తే అవి ఇప్పుడు పెట్టుబడికి ప్రాతినిధ్యం

వహిస్తాయి. అవి పెట్టుబడిదారులకు అడ్వాన్సులు ఇవ్వటానికి ఉపయోగించబడినపుడు లేదా అవి తర్వాత ధన సదుపాయానికై గిరాకీ తగ్గినపుడు సెక్యూరిటీలలో తిరిగి మదుపు పెట్టడం కోసం ఉపయోగించబడినపుడు అంతే సమానంగా పెట్టుబడికి ప్రాతినిధ్యం వహిస్తాయి. ఈ సందర్భాలన్నిటి లోనూ పెట్టుబడి అన్న పదం కేవలం బ్యాంకర్ దృష్టి కోణం నుంచి మాత్రమే ఉపయోగించబడుతుంది. అతని పరపతికంటే మించి ఎక్కువ అప్పు ఇవ్వక తప్పడంలేదని కూడా దాని అర్థం.

బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండు తన సొంత నోట్ల రూపంలోనే అన్ని రకాల అడ్వాన్సులు చేస్తుందన్న విషయం తెలిసిందే. సాధారణంగా ఇలా జరిగినప్పటికీ బ్యాంకు చేతుల్లో ఉన్న డిస్కౌంటు చేయబడిన మార్పిడి బిల్లులు బ్యాంకు చేసే అడ్వాన్సులు పెరుగుదలతో పాటు అదే నిష్పత్తిలో బ్యాంకు యొక్క బ్యాంకు నోట్ల చలామణి తగ్గుతుంది. అటువంటప్పుడు చలామణిలోకి పంపిన నోట్లకు ఏమవుతుంది? అవి బ్యాంకుకు తిరిగి ఎలా వస్తాయి?

జాతీయ చెల్లింపుల సమతూకం ప్రతికూలంగా ఉన్నప్పుడు డబ్బు సదుపాయం కోసమై గిరాకీ తలెత్తితే అది బంగారాన్ని బయటికి తోడివేస్తే అపుడు విషయం చాలా సరళం. మార్పిడి బిల్లులు బ్యాంకు నోట్లను బ్యాంకే స్వయంగా తన విడుదల విభాగంలో బంగారంతో మార్పిడి చేస్తుంది. ఈ బంగారం ఎగుమతవుతుంది. బిల్లుల డిస్కౌంటింగుపై నోట్ల మధ్యవర్తిత్వం లేకుండానే బ్యాంకు బయటి దేశాలకు సూటిగా బంగారం రూపంలో చెల్లించినట్టే అవుతుంది. అలా పెరిగిన గిరాకీ కొన్ని సందర్భాల్లో 70 నుండి 100 లక్షల పౌండ్ల వరకు ఉండవచ్చు. అపుడు సహజంగానే స్వదేశీ చలామణికి అది కనీసం ఒక్క 5 పౌండ్ల నోట్లను కూడా జమచేయదు. ఇప్పుడు బ్యాంకు కరెన్సీని అడ్వాన్సు చేసేది కరెన్సీ కాదు, పెట్టుబడి మాత్రమే. అంటే దానికి రెండర్థాలున్నాయి. మొదటిది అది అడ్వాన్సు చేస్తున్నది పరపతి కాదని, వాస్తవమైన విలువలని, తన సొంత పెట్టుబడిలో ఒక భాగాన్ని లేదా తన దగ్గర డిస్కౌంట్ చేయబడిన పెట్టుబడిలో ఒక భాగాన్ని అడ్వాన్సు చేస్తుందని అర్థం. రెండోది అది డబ్బు అడ్వాన్సు చేస్తోంది స్వదేశీ చలామణి కోసం కాదని, అది విదేశీ చలామణి కోసం మాత్రమేనని అర్థం. అది ప్రపంచ డబ్బును అడ్వాన్సు చేస్తుంది. ఈ లక్ష్యం కోసం డబ్బు కూడబెట్టడానికి వీలైన తన రూపంలో, తన లోహ స్థితిలో ఉండి తీరాలి. తాను విలువకు కేవలం ఒక రూపంగా గాక తానే విలువైన రూపం, తన సొంత డబ్బు రూపం అది. ఈ బంగారం ఇప్పుడు బ్యాంకుకు, బంగారం ఎగుమతి చేసే వ్యాపారికి పెట్టుబడికి అనగా బ్యాంకింగ్ లేదా వాణిజ్య పెట్టుబడికి ప్రాతినిధ్యం వహిస్తుంది. దానికోసమై ఉన్న గిరాకీ పెట్టుబడి కోసం కాదు. డబ్బు పెట్టుబడి యొక్క సంపూర్ణ రూపం కోసం మాత్రమే. విదేశీ మార్కెట్లు అమ్ముడుపోని ఇంగ్లీషు సరుకు పెట్టుబడితో ముంచి వేయబడినపుడు సరిగ్గా ఈ గిరాకీ తలెత్తుతుంది. కనుక అప్పుడవసరమైనది పెట్టుబడిగా పెట్టుబడి కాదు. డబ్బుగా పెట్టుబడి మాత్రమే. సార్వత్రిక ప్రపంచ మార్కెట్ సరుకుగా వ్యవహరించే డబ్బు రూపం కోసం మాత్రమే. ఇది దాని తొలి విలువైన లోహ రూపం. కనుక పులార్టన్, టూకే తదితరులు చెబుతున్నట్టుగా బంగారం బయటికి పోవడం అన్నది "కేవలం పెట్టుబడికి సంబంధించిన ప్రశ్న" కాదు. నిజానికి అది ఒక నిర్దిష్ట కార్యకలాపంలోనే అయినప్పటికీ అది "డబ్బుకు సంబంధించిన ప్రశ్న." కరెన్సీ సిద్ధాంత ప్రచారకులు అంటున్నట్టుగా అది కేవలం స్వదేశీ చలామణికి సంబంధించిన

ప్రశ్న కూడా కాదు. పులార్టన్ తదితరులు అనుకున్నట్టుగా అది కేవలం పెట్టుబడికి సంబంధించిన ప్రశ్న అని కూడా రుజువు కాదు. అది కేవలం డబ్బుకు సంబంధించిన ప్రశ్న. అంతర్జాతీయ చెల్లింపు సాధనంగా ఉండగలిగిన రూపంలో డబ్బుకు సంబంధించిన ప్రశ్న ఇది. "ఈ పెట్టుబడి" (స్వదేశంలో పంట విఫలమైన తర్వాత 10 లక్షల బస్తాల విదేశీ గోధుమ కొనుగోలు ధర) "వ్యాపారంలోకి లేదా నగదులోకి మారిందా అన్నది ఏరకంగానూ లావాదేవీ స్వభావాన్ని ప్రభావితం చేయదు." (పులార్టన్, అదే గ్రంథం, పుట 131) అయితే బంగారం బయటికి పోయిందా లేదా అన్న ప్రశ్నను ఇది తీవ్రంగా ప్రభావితం చేస్తుంది. పెట్టుబడి విలువైన లోహం రూపంలో బదిలీ అవుతుంది. ఎందుకంటే అది ఏ మాత్రం బదిలీ కానైనా కారాదు, లేదా సరుకుల రూపంలో గణనీయమైన నష్టంతోనైనా జరుగుతుంది. బంగారం బయటికి పోవడం గురించిన భయం విలువైన లోహాలను మాత్రమే నిజమైన సంపదగా భావించే ద్రవ్య వ్యవస్థ. ఇంతవరకు ఊహించిన భయాలన్నిటినీ కూడా మించి ఆధునిక బ్యాంకు వ్యవస్థను పట్టుకుంది. ఉదాహరణకు బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండు గవర్నర్ అయిన మోరిస్ 1847-48 సంక్షోభంపైన పార్లమెంటరీ కమిటీకి ఇచ్చిన సాక్ష్యాన్ని గమనించండి : (3846 ప్రశ్న:) "సరుకుల నిర్వహణలోనూ, స్థిర పెట్టుబడిలోనూ తరుగుదల గురించి నేను మాట్లాడినప్పుడు సరుకుల నిల్వలలోనూ అన్నిరకాల ఉత్పత్తులలోనూ మదుపు పెట్టబడిన ఆస్తి అంతా ఒకేరకంగా తరుగుదలకు గురైందని, ముడిపత్తి, ముడిపట్టు, ఉన్ని అదే తరిగిన ధరలతో ఇతర దేశాలకు పంపించబడ్డాయని, బలవంతపు అమ్మకాలలో పంచదార, కాఫీ, తేయాకులు త్యాగం చేయబడ్డాయని మీకు తెలియదా? – పెద్ద ఎత్తున ఆహార దిగుమతి వల్ల వెండి, బంగారాలు బయటికి పోకుండా కాపాడటం కోసం దేశం గణనీయమైన స్థాయిలో త్యాగం చేయటం అనివార్యం." – "3848. అటువంటి త్యాగంతో బంగారాన్ని వెనక్కు తెచ్చుకోవడానికి ప్రయత్నించడం కంటే బ్యాంకు ఖజానాలో పడి వున్న 80 లక్షల పౌండ్లను బయటికి తేవడం మెరుగని మీరు భావించరా? – లేదు. నేను భావించను. – ఇక్కడ వారి దృష్టిలో బంగారం ఒకటే నిజమైన సంపదకు ప్రాతినిధ్యం వహిస్తుంది."

టూకే కనుగొన్న విషయాన్ని పులార్టన్ ఇలా ఉల్లేఖించాడు. "కేవలం ఒకటి రెండు మినహాయింపులతో, అది కూడా సంతృప్తికరమైన, వివరణ సాధ్యమైన మినహాయింపులతో, గత అర్ధశతాబ్ది కాలంలో బంగారం పెద్ద ఎత్తున బయటికి పోయిన తరువాత మార్పిడిలో జరిగిన ప్రతి పెద్ద పతనం చలామణి సాధనం సాపేక్షంగా తక్కువ స్థాయిలో ఉన్నప్పుడే జరిగింది. అలాగే చలామణి సాధనం సాపేక్షంగా ఎక్కువగా ఉన్నప్పుడు మార్పిడి పెరిగింది." (పులార్టన్, పుట 121) ఈ ఆవిష్కరణ తెలియజేసేదేమంటే పెద్ద ఎత్తున ఉత్తేజిత చలనం, సట్టా వ్యాపారం జరిగిన తర్వాత సాధారణంగా బంగారం బయటికి పోతుందని. ఇది "ఇంతకు ముందే మొదలైన పతనానికి చిహ్నంగా... సరుకులతో పేరుకొనిపోయిన మార్కెట్లకు సూచనగా, మన ఉత్పత్తుల కోసం ఆగిపోయిన విదేశీ గిరాకీకి నిదర్శనంగా డబ్బు తిరిగి రావటం ఆలస్యం కావడానికి ప్రతీకగా వీటన్నిటి అత్యవసర పర్యవసానంగా వాణిజ్యం యొక్క పరపతి రాహిత్యం కారణంగా మూతబడ్డ కార్ఖానాలకు పస్తులుంటున్న చేతిపనివాళ్ళకు పరిశ్రమ యొక్క సాధారణ మాంద్యానికి నిదర్శనగా ఇది జరుగుతుంది." (పుట 129) కరెన్సీ సిద్ధాంతపు ప్రచారకులు "పూర్తి చలామణి వెండి, బంగారాలను బయటకు నెడుతుంది. తక్కువ స్థాయి చలామణి

దానిని ఆకర్షిస్తుంది" అని చేసే వాదనకు ఇది అత్యున్నతమైన ఖండన. ఇందుకు విరుద్ధంగా బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండు సాధారణంగా సుభిక్ష కాలంలో పెద్ద బంగారపు నిల్వను కొనసాగిస్తుంది. అయితే ఈ కూడబెట్టడం అన్నది సాధారణంగా తుఫాను తర్వాత వచ్చే మాంద్యపు కాలంలో రూపొందుతుంది.

బంగారం బయటికి పోవడానికి సంబంధించిన ఈ వివేకమంతటి అర్థం ఇది. అంతర్జాతీయ చలామణి సాధనం కోసం ఉండే గిరాకీ స్వదేశీ చలామణి కోసమూ, చెల్లింపుల కోసమూ ఉండే గిరాకీ కంటే భిన్నమైనది. (కనుక ఫులార్టన్ గ్రంథంలో 112వ పేజీలో చెప్పినట్టు "బంగారం బయటికి పోవడమన్నది దేశం లోపల గిరాకీ తగ్గుదలను సూచిస్తుందని భావించాల్సిన అవసరం లేదు" అని వేరే చెప్పనక్కర్లేదు.) పెట్టుబడి ఎగుమతి, అంతర్జాతీయ చలామణిలోకి దానిని తోయడం అన్నది జాతీయ చలామణి నోట్లను లేదా నగదును నెట్టడం లాంటిది కాదు. మిగతా అంశాలకు వస్తే అంతర్జాతీయ చెల్లింపుల కోసం సాంద్రీకరించబడిన ఒక నిల్వగా కూడబెట్టిన నిధి యొక్క చలనాలకు చలామణి సాధనంగా డబ్బు చలనాలతో ప్రమేయం లేదు. ఈ అంశాన్ని ఇంతకు ముందు నేను వివరించాను.[1] ఏమైనప్పటికీ కూడబెట్టిన డబ్బు యొక్క విభిన్న విధులు ఇక్కడ కేవలం ఒకే ఒక రిజర్వు నిధికి ఆపాదించబడటంతో విషయం మరింత జటిలమయింది. డబ్బు యొక్క స్వభావాన్ని బట్టి నేను ఇంతకు ముందు అభివృద్ధి చేసిన విధులలో స్వదేశీ వాణిజ్యంలో గడువు బిల్లులను చెల్లించడానికి రిజర్వు నిధి యొక్క సాధనాలుగా పనిచేయడమూ, కరెన్సీ యొక్క రిజర్వు నిధి యొక్క పని నిర్వహణ చివరికి ప్రపంచ డబ్బుగా ఉండే రిజర్వు నిధి యొక్క పని ఉన్నాయి. కొన్ని పరిస్థితులలో బ్యాంకు నుంచి బంగారం బయటికి పోవడం అన్నది స్వదేశీ మార్కెట్‌లోకే గాక విదేశీ మార్కెట్‌కు కూడా పోవచ్చు. పరపతి వ్యవస్థ పరపతి డబ్బు అభివృద్ధి చెందిన దేశాలలో బ్యాంకు నోట్ల రూపపరివర్తనకు హామీ ఇచ్చే నిధిగా వ్యవహరించే అదనపు పని కూడా ఈ నిల్వకు తగిలించబడింది. దీనివల్ల కూడా విషయం మరింత జటిలమయింది. దీనంతటితోపాటు 1. ఒకే కేంద్ర బ్యాంకులో జాతీయ రిజర్వు నిధి సాంద్రీకరించబడటం 2. అది అతి తక్కువ మొత్తంగా కుదించబడటం జరిగాయి. అందుకే ఫులార్టన్ ఇలా ఫిర్యాదు చేస్తాడు (పుట 143) : "బ్యాంకు ఖజానా ఇంగ్లండులో ఖాళీ అయిపోవడానికి సిద్ధంగా ఉన్నప్పుడల్లా లోహ కరెన్సీకి సహజంగా ఉండే సదుపాయం కోల్పోయినప్పుడల్లా తలెత్తే అశాంతి, అలజడులతో పోల్చి చూస్తే అటువంటి మార్పులు వచ్చినప్పుడు ఖండాంతర దేశాలలో కేవలం నిశ్శబ్దంగానూ, వీలుగానూ గడిచిపోతాయని ఊహించలేము."

అయితే బంగారం బయటికి పోవడాన్ని మనం పక్కన పెడితే బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండులాగా నోట్లను విడుదల చేసే బ్యాంకు అది కల్పించే డబ్బు సదుపాయం యొక్క మొత్తాన్ని డబ్బు నోట్ల విడుదలను పెంచకుండానే ఎలా పెంచగలదు?

బ్యాంకుకు సంబంధించినంత వరకు దాని గోడల బయట వున్న నోట్లన్నీ అవి నిజంగా చలామణిలో ఉన్నా లేక ప్రైవేటు పాతరలలో ఉన్నా చెలామణిలో ఉన్నట్లే లెక్క. అనగా తన చేతుల్లో లేనట్టే లెక్క. కనుక బ్యాంకు తన డిస్కౌంటు వ్యాపారం, వడ్డీ వ్యాపారం సెక్యూరిటీల పైన దాని అడ్వాన్సులు విస్తరిస్తే, ఆ లక్ష్యంతో అది విడుదల చేసిన బ్యాంకు నోట్లన్నీ తిరిగి రావాలి. లేకుంటే

1. సంపుటం I - సంపాదకుడు.

చెలామణి పరిమాణాన్ని అవి పెంచుతాయి. అది జరగకూడని పని. ఈ తిరిగి రావడమన్నది రెండు రకాలుగా జరగవచ్చు.

**మొదటిది :** సెక్యూరిటీలకు ప్రతిగా బ్యాంకు 'అ'కు నోట్లు చెల్లిస్తుంది. అ, ఆకు చెల్లించాల్సిన మార్పిడి బిల్లులకు చెల్లించడానికి వాటిని ఉపయోగిస్తాడు. 'ఆ' ఈ నోట్లను మరోసారి బ్యాంకులో డిపాజిట్ చేస్తాడు. దీంతో ఈ నోట్ల చలామణి ముగుస్తుంది. కానీ అప్పు మాత్రం మిగిలి ఉంటుంది. ("అప్పు మిగిలి ఉంటుంది. కరెన్సీ అవసరం లేదనుకుంటే అది విడుదల చేసిన వ్యక్తి దగ్గరకే తిరిగి వస్తుంది." పులార్టన్, పుట 97) బ్యాంకు 'అ'కు అడ్వాన్సు చేసిన నోట్లు ఇప్పుడు దానికే తిరిగి వచ్చాయి. అయితే అది 'అ'కు పరపతి దాత. 'ఆ' దగ్గిర అది పరపతి గ్రహీత. ఈ నోట్లలో వ్యక్తమైన విలువ మేరకు ఇది వర్తిస్తుంది.

**రెండోది :** 'అ' 'ఆ'కు చెల్లిస్తాడు. బ్యాంకుకు చెల్లించాల్సిన బిల్లుల్ని చెల్లించడానికి 'ఆ' తానే స్వయంగా ఈ నోట్లను లేదా తాను ఇ కి చెల్లించగా బ్యాంకుకు ప్రత్యక్షంగా కానీ, పరోక్షంగా కానీ చెల్లిస్తాడు. అటువంటి సందర్భంలో బ్యాంకు దాని సొంత నోట్లతోనే చెల్లించడం జరిగింది. లావాదేవీ ఇంతటితో ముగుస్తుంది. (ఆ బ్యాంకుకు తిరిగి చెల్లించాల్సిన మొత్తం మిగులుతుంది.)

ఇప్పుడు 'అ'కు బ్యాంకు చేసిన అడ్వాన్సును ఏ మేరకు పెట్టుబడి అడ్వాన్సుగా భావించాలి? లేక కేవలం చెల్లింపు సాధనాల అడ్వాన్సుగా ఏ మేరకు భావించాలి?[1]

(ఇది రుణం స్వభావంపైన ఆధారపడి వుంటుంది. దీనిని మూడు తరహాలుగా విభజించవచ్చు.

**మొదటిది –** 'అ' తన సొంత వ్యక్తిగత పరపతిపైన ఏ సెక్యూరిటీ లేకుండానే బ్యాంకు నుంచి అప్పు తీసుకుంటాడు. ఇక్కడ అతడు చెల్లింపు సాధనాల్ని మాత్రమే గాక కొత్త పెట్టుబడిని కూడా నిస్సందేహంగా స్వీకరిస్తాడు. దానిని తన వర్తకంలో ఉపయోగించవచ్చు. దాని గడువు తేదీవరకు అదనపు పెట్టుబడిగా మార్చుకోవచ్చు.

**రెండోది –** బ్యాంకుకు అ సెక్యూరిటీలను, జాతీయ బాండ్లను, సరుకును హామీలుగా ఉంచి బ్యాంకు నుంచి వాటి ఆనాటి విలువకు మూడింట రెండు వంతులు నగదు రుణంగా తీసుకున్నాడు. ఈ సందర్భంలో అతడు తనకవసరమైన చెల్లింపు సాధనాలు మాత్రమే తీసుకున్నాడు. అదనపు పెట్టుబడిని కాదు. ఎందుకంటే అతడు బ్యాంకు నుంచి తీసుకున్న దానికంటే ఎక్కువ పెట్టుబడి విలువను బ్యాంకుకే అప్పజెప్పాడు. అయితే ఒకవైపున ఈ పెద్ద పెట్టుబడి విలువ తక్షణ అవసరాలకు (చెల్లింపు సాధనాలు) అందుబాటులో లేదు. ఎందుకంటే అవి ఒక ప్రత్యేకమైన వడ్డీ ఇచ్చే రూపంలో మదుపు పెట్టబడ్డాయి కనుక. మరోవైపున ఈ పెట్టుబడి విలువను అమ్మివేయటం ద్వారా, సూటిగా చెల్లింపు సాధనాలుగా మార్చాలని 'అ' అనుకోకుండా ఉండటానికి తన సొంత కారణాలు తనకున్నాయి. అతని సెక్యూరిటీలు రిజర్వు పెట్టుబడిగా ఉండగానే వాటిని అతడు చలనంలో ఉంచగలుగుతున్నాడు. కనుక బ్యాంకుకు 'అ'కు మధ్య లావాదేవీలో, తాత్కాలికమైన పెట్టుబడి యొక్క పరస్పర బదిలీ

---

1. మూలంలో రాతప్రతిలో ఈ భాగం అర్థం కాకుండా ఉంది కనుక బ్రాకెట్‌లో ఉన్న విషయాన్ని సంపాదకుడే తిరిగి రాశాడు. మరో సందర్భంలో 26వ అధ్యాయంలో ఈ అంశాన్ని వివరించడం జరిగింది. (ప్రస్తుత ముద్రణ : పుట 427-29 సంపా) ఎఫ్.ఇ.

ఉంటుంది. అతడు తనకు కావలసిన చెల్లింపు సాధనాల్ని పొందినప్పటికీ ఇక్కడ 'అ' అదనపు పెట్టుబడి ఏదీ గ్రహించడు. (అందుకు విరుద్ధంగా జరుగుతుంది.) మరోవైపున బ్యాంక్ దృష్టి నుంచి ఈ లావాదేవీ అన్నది డబ్బు పెట్టుబడిని తాత్కాలికంగా రుణం రూపంలోకి మార్చటంగా కనిపిస్తుంది. ఇది డబ్బు పెట్టుబడి ఒక రూపం నుంచి మరొక రూపానికి మారటం. ఈ మార్పే బ్యాంకు వ్యాపారం యొక్క అత్యవసరమైన కార్యకలాపం.

**మూడోది –** 'అ' ఒక మార్పిడి బిల్లుపైన బ్యాంకుచేత డిస్కౌంటు చేయించి డిస్కౌంటు పోగా మిగిలిన మొత్తాన్ని నగదుగా గ్రహించాడు. ఈ సందర్భంలో మార్చడానికి వీలుపడని డబ్బు పెట్టుబడిని బ్యాంకుకు అమ్మి అతడు మార్చడానికి వీలైన రూపంలో విలువ మొత్తాన్ని పొందాడు. ఇంకా గడువు సమీపించని బిల్లును అమ్మి నగదు మొత్తాన్ని తీసుకున్నాడు. ఆ బిల్లు ఇప్పుడు బ్యాంకు ఆస్తి. బిల్లుపైన హక్కును బదిలీ చేసిన చివరి వ్యక్తిగా బ్యాంకుకు చెల్లించటంలో విఫలమైతే 'అ' స్వయంగా బాధ్యత వహించవలసి ఉంటుంది. అయితే ఇక్కడ విషయాన్ని అది మార్చదు. అతడు హక్కు బదిలీ చేసిన ఇతర వ్యక్తులతోనూ, బిల్లు ఇచ్చిన వ్యక్తితోనూ కలిసి ఈ బాధ్యతను పంచుకుంటాడు. వీరంతా అతనికి బాధ్యులు. కనుక ఈ సందర్భంలో ఉన్నది రుణంగాదు. ఒక సాధారణమైన క్రయ విక్రయం మాత్రమే. ఈ కారణంచేత ఆ బ్యాంకుకు తిరిగి చెల్లించాల్సిందేమీ ఉండదు. బిల్లు గడువు తేదీ వచ్చినప్పుడు అది నగదు రూపంలోకి మారటం ద్వారా తనని తాను పూరించుకుంటుంది. ఇక్కడ కూడా 'అ'కి బ్యాంకుకు మధ్య పెట్టుబడి బదిలీ జరిగింది. ఇతర సరుకుల క్రయ విక్రయాలలో లాగానే ఇక్కడ కూడా జరగటం వల్ల 'అ' అదనపు పెట్టుబడి ఏదీ గ్రహించలేదు. అతనికి అవసరమైనవి, గ్రహించినవి చెల్లింపు సాధనాలు. తన డబ్బు పెట్టుబడి యొక్క ఒక రూపాన్ని – తన బిల్లును – మరో రూపంలోకి అనగా డబ్బు రూపంలోకి బ్యాంకుచేత మార్పించడం ద్వారా అతడు వాటిని పొందాడు.

కనుక మొదటి ఉదాహరణలో మాత్రమే వాస్తవమైన పెట్టుబడి అడ్వాన్నది ఉన్నది. రెండు, మూడు ఉదాహరణలలో ప్రతి పెట్టుబడి మదుపు పెట్టుబడి అడ్వాన్సును సూచిస్తుంది అన్న అర్థంలో మాత్రమే దానిని అలా పరిగణించవచ్చు. ఈ అర్థంలో బ్యాంకు డబ్బు పెట్టుబడిని 'అ'కు అడ్వాన్సు చేస్తుంది. అయితే 'అ' దృష్టిలో అది డబ్బు పెట్టుబడి. మహా అయితే తన పెట్టుబడిలో ఒక భాగం అన్న అర్థంలో మాత్రమే. అతడు దాన్ని కోరేదీ, ఉపయోగించేదీ ప్రత్యేకించి పెట్టుబడిగా కాదు. ప్రత్యేకించి చెల్లింపు సాధనంగా మాత్రమే. అలా కాకుంటే చెల్లింపు సాధనాలను పొందే ప్రతి సాధారణ సరుకు విక్రయాన్ని ఒక పెట్టుబడి అడ్వాన్సును పొందటంగా పరిగణించాల్సి వుంటుంది – ఎంగెల్స్)

తన సొంత నోట్లను తానే విడుదల చేసే ప్రైవేటు బ్యాంకుల విషయంలో ఈ తేడా ఉంది. వాటి నోట్లు స్థానిక చలామణిలో ఉండటం కానీ, డిపాజిట్ల రూపంలో లేదా మార్పిడి బిల్లుల గడువులో చెల్లింపులుగా గాని, తిరిగి రావడం గాని జరగకపోతే అవి ఎవరి చేతుల్లో పడతాయంటే ప్రైవేటు బ్యాంకుల దగ్గరికి ఆ నోట్లను తెచ్చి బంగారాన్ని లేదా బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్ నోట్లను కోరేవారి చేతుల్లో పడతాయి. ఈ సందర్భంలో దాని రుణం నిజానికి బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్ నోట్లలో అడ్వాన్సు చేసినట్లే అవుతుంది. అంటే ప్రైవేటు బ్యాంకు దృష్ట్యా బంగారాన్ని అనగా తన సొంత పెట్టుబడిలో

ఒక భాగాన్ని అడ్వాన్సు చేసినట్టే. బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్ లేదా మరో బ్యాంక్ నోట్ల విడుదలలో ఒక నిర్ణీతమైన పరిమితి ఉన్నప్పుడు తన నోట్లను చలామణి నుంచి ఉపసంహరించుకోవడానికి సెక్యూరిటీలను అమ్మాల్సి ఉంటుంది. తర్వాత అదే నోట్లను అడ్వాన్సులుగా విడుదల చేయవచ్చును. అటువంటప్పుడు బ్యాంకు సమీకరించిన పెట్టుబడిలో ఒక భాగానికి ఈ నోట్లు ప్రాతినిధ్యం వహిస్తాయి.

చలామణి కేవలం లోహ రూపంలో ఉన్నప్పటికీ రెండు విషయాలు సాధ్యం. 1) బంగారం బయటికి పోవడం (బంగారం బయటికి పోవటమంటే ఇందులో కొంతమేరకైనా విదేశాలకు పోవడం అని మార్క్స్ ప్రస్తావిస్తున్నాడన్నది స్పష్టం – ఎంగెల్స్) వల్ల ఖజానా ఖాళీ అవడం 2) బ్యాంకులు తమ చెల్లింపులు చేయడానికి (ఇంతకు ముందు లావాదేవీలను పరిష్కరించడానికి) బ్యాంకు ప్రధానంగా కోరేది బంగారాన్ని గనుక హామీపై అడ్వాన్సు ఇవ్వడమన్నది గణనీయంగా పెరగవచ్చు. అయితే డిపాజిట్ల రూపంలో గానీ, గడువుకొచ్చిన మార్పిడి బిల్లుల చెల్లింపు రూపంలో గానీ అవి తిరిగి వస్తాయి. అంటే ఒకవైపు బ్యాంకు చేతిలో ఉన్న సెక్యూరిటీలు పెరగటంతో పాటు బ్యాంకు ఖజానాలో సంపద తరుగుతుంటుంది. మరోవైపున ఇప్పుడు ఆ బ్యాంకు అంతే మొత్తాన్ని కలిగి వుంటుంది. అనగా ఒక యజమానిగా, తన డిపాజిటర్ల పరపతి గ్రహీతగా ఇంతకు ముందు తను స్వాధీనంలో ఉంచుకున్న అంతే మొత్తాన్ని అది కలిగి వుంటుంది. అయితే చివరికి కరెన్సీ పరిమాణం మొత్తం తగ్గుతుంది.

అప్పులు నోట్ల రూపంలోనే ఇవ్వబడతాయని, అందువల్ల తాత్కాలికమే అయినప్పటికీ, తక్షణమే అదృశ్యమయ్యేదే అయినప్పటికీ నోట్ల విడుదలలో పెరుగుదల ఉంటుందని మనం ఇంతవరకూ ఊహించాము. కానీ ఇది అవసరం లేదు. కాగితం నోట్లకు బదులు బ్యాంకు 'అ' కోసం పరపతి ఖాతాను తెరవచ్చు. అప్పుడు ఈ 'అ' అనగా బ్యాంకు యొక్క పరపతి గ్రహీత, బ్యాంకుకు ఊహాత్మకమైన డిపాజిటర్‌గా తయారవుతాడు. అతడు తన పరపతి దాతలకు ఈ బ్యాంకు చెక్కులతో చెల్లిస్తాడు. ఈ చెక్కులు పొందిన వ్యక్తి తన ఖాతా వున్న బ్యాంకరుకు వాటిని మారుస్తాడు. ఆ బ్యాంకరు క్లియరింగు హౌస్‌లో తన పేరుమీద తీసిన చెక్కులతో మార్పిడి చేసుకుంటాడు. ఈ సందర్భంలో నోట్ల మధ్యవర్తిత్వం జరగదు. మొత్తం లావాదేవీ అంతా బ్యాంకు తన రుణాన్ని తన సొంత చెక్కు ద్వారా పరిష్కరించుకుం టుందన్న వాస్తవానికి పరిమితమవుతుంది. వాస్తవంగా దాని మొత్తం తిరిగి రావటమన్నది 'అ' నుంచి జరగాల్సి వుంది. ఈ సందర్భంలో బ్యాంకు తన సొంత పెట్టుబడి నుంచి ఒక భాగాన్ని 'అ'కు అప్పిచ్చినట్టు అవుతుంది.

ధన సదుపాయం కోసం, ఉండే గిరాకీ పెట్టుబడి కోసం, గిరాకీ అయితే అది అప్పుడు డబ్బు పెట్టుబడి కోసం మాత్రమే అవుతుంది. బ్యాంకరు దృష్టి నుంచి మాత్రమే అది పెట్టుబడి అవుతుంది. అనగా బంగారం (విదేశాలకు బంగారం ఎగుమతయ్యే సందర్భంలో) లేదా జాతీయ బ్యాంకు నోట్లు అవుతాయి. ఈ నోట్లను ఒక ప్రైవేటు బ్యాంకు వీటికి సమవిలువ నొకదాన్ని అనగా ఆ బ్యాంకు యొక్క పెట్టుబడిని ఇవ్వడం ద్వారా మాత్రమే కొనగలుగుతుంది. లేదా వడ్డీ ఇచ్చే పత్రాలు, ప్రభుత్వ బాండ్లు, సెక్యూరిటీల నిల్వలు మొదలైన వాటిని బంగారం లేదా బ్యాంకు నోట్ల కోసం అమ్మాల్సి ఉంటుంది. అయితే అటువంటి పత్రాలు ప్రభుత్వ బాండ్లలో ఉంటే కొనుగోలుదారునికి మాత్రమే

అవి పెట్టుబడి. అతనికి కొనుగోలు ధరను అనగా వాటిలో అతడు పెట్టిన పెట్టుబడికి అవి ప్రాతినిధ్యం వహిస్తాయి. తమంత తామే అవి పెట్టుబడి కావు. కేవలం అ రుణంపైన హక్కులు మాత్రమే. అవి తాకట్టే ఉంటే భవిష్యత్తు భూమి కౌలుపైన హక్కు పత్రాలు మాత్రమే. అవి స్టాకుల వాటాలైతే అవి యాజమాన్యానికి సంబంధించిన హక్కు పత్రాలు మాత్రమే. అవి స్వాధీనంలో ఉన్న మనిషికి భవిష్యత్ అదనపు విలువలో వాటా వుంటుంది. ఇదంతా వాస్తవమైన పెట్టుబడి కాదు. ఇవి పెట్టుబడిలో అంతర్భాగాలు కాదు. తమంత తామే విలువలూ కావు. ఇలాంటి లావాదేవీల ద్వారానే బ్యాంకుకు చెందిన డబ్బు డిపాజిట్లుగా రూపాంతరం చెందవచ్చు. ఆ రకంగా బ్యాంకు ఈ డబ్బుకు యజమానిగా ఉండటానికి బదులు పరపతి గ్రహీత అవుతుంది. దాన్ని వేరే యాజమాన్యపు హక్కు పత్రం ద్వారా అది కలిగి వుంటుంది. బ్యాంకుకు ఇది ఎంత అవసరమైనప్పటికీ రిజర్వు పెట్టుబడి మొత్తంలో అది ఎటువంటి మార్పూ చేయదు. ఒక దేశంలో అందుబాటులో ఉన్న డబ్బు పెట్టుబడి మొత్తాన్ని సైతం ఇది మార్చదు. కనుక ఇక్కడ పెట్టుబడి కేవలం డబ్బు పెట్టుబడికి మాత్రమే ప్రాతినిధ్యం వహిస్తుంది. వాస్తవంగా డబ్బు రూపంలో గనుక అందుబాటులో లేకుంటే అది కేవలం పెట్టుబడిపైన హక్కును మాత్రమే సూచిస్తుంది. ఇది చాలా ప్రధానం. ఎందుకంటే బ్యాంకు పెట్టుబడి కొరత లేదా దానికై ఉన్న తీవ్రమైన గిరాకీ వాస్తవ పెట్టుబడి తరుగుదలగా గందరగోళపర్చబడుతోంది. ఈ వాస్తవ పెట్టుబడి అందుకు విరుద్ధంగా అటువంటి సందర్భాలలో ఉత్పత్తి సాధనాలు ఉత్పాదితాల రూపంలో విస్తారంగా ఉంది. అది మార్కెట్‌లను ముంచెత్తుతుంది.

కనుక బ్యాంకు హామీలుగా ఉంచుకున్న సెక్యూరిటీల మొత్తం ఎలా పెరుగుతుందో వివరించటం సులభం. మొత్తం కరెన్సీ యథాతథంగా ఉన్నప్పుడు లేదా తగ్గిపోయినప్పుడు ధన సదుపాయం కోసం పెరుగుతున్న గిరాకీని బ్యాంకు ఎలా సంతృప్తిపర్చగలదో వివరించవచ్చు. డబ్బు కొరత ఏర్పడిన అటువంటి కాలాలలో ఈ మొత్తాన్ని రెండు విధాలుగా అదుపులో ఉంచొచ్చు : 1. బంగారం బయటికి పోవడం ద్వారా 2. చెల్లింపు సాధనంగా ఉండే డబ్బు కోసం గిరాకీ ద్వారా. విడుదల చేసిన బ్యాంకు నోట్లు తక్షణమే తిరిగి వచ్చినప్పుడు లేదా లావాదేవీలు నోట్ల మధ్యవర్తిత్వం లేకుండానే పరపతి ఖాతా ద్వారానే జరిగినపుడు. అంటే కేవలం పరపతి లావాదేవీ ద్వారా చెల్లింపులు జరిగినప్పుడు ఈ చెల్లింపుల పరిష్కారమే ఈ కార్యకలాపపు ఏకైక లక్ష్యమైనప్పుడు రెండోది సాధ్యమవుతుంది. కేవలం జమా ఖర్చులు తేల్చడానికి మాత్రమే డబ్బు పనిజేసినపుడు (సంక్షోభ సమయాల్లో కొనటానికి కాక చెల్లించటానికి అప్పులు తీసుకోబడతాయి. పాత లావాదేవీలను పూర్తి చేయడానికి తప్ప కొత్త వాటిని ప్రారంభించడానికి కాదు.) దాని చలామణి చాలా తాత్కాలికంగా ఉంటుంది. డబ్బు మధ్యవర్తిత్వం లేకుండానే కేవలం పరపతి కార్యకలాపాల ద్వారా పరిష్కారం కానప్పుడు కూడా అంటే ధన సదుపాయం కోసం గట్టి గిరాకీ ఉన్నప్పుడు చలామణి విస్తరించకుండానే అటువంటి లావాదేవీలు అపారమైన పరిమాణంలో జరుగుతాయి. ఇదే డబ్బు ప్రత్యేకత. అయితే బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్ యొక్క డబ్బు సదుపాయం విస్తారంగా పెరిగినప్పటికీ దాని చలామణి స్థిరంగా ఉండటం లేదా తగ్గటం అన్నది పులార్టన్, టూకే తదితరలు భావిస్తున్నట్టుగా (ధన సదుపాయం అంటే అప్పుగా అదనపు పెట్టుబడిని పొందటంతో సర్వసమానమని భావించేవారి పొరపాటు వల్ల) డబ్బు (బ్యాంకు నోట్లు) చలామణి

చెల్లింపు సాధనాలుగా దాని కార్యకలాపం విషయంలో పెరగదు, విస్తరించదు. కొనుగోలు సాధనాలుగా నోట్ల చలామణి వ్యాపారం మాంద్యంలో పడినపుడు తగ్గుతుంది. అటువంటి విస్తృతమైన సదుపాయం అవసరమైనపుడు చెల్లింపు సాధనాలుగా వాటి చలామణి పెరగవచ్చు. మొత్తం చలామణి అనగా కొనుగోలు చెల్లింపు సాధనాలుగా పనిజేసే మొత్తం స్థిరంగా ఉండొచ్చు లేదా తగ్గవచ్చు. చలామణి అన్నది బ్యాంకు నోట్ల చెల్లింపు సాధనంగా ఉంటూ తక్షణమే బ్యాంకు విడుదల చేసిన నోట్లను తిరిగి బ్యాంకుకు తీసుకువస్తే అది ఈ ఆర్థికవేత్తల దృష్టిలో చలామణి కాదు.

కొనుగోలు సాధనంగా చలామణి యొక్క తగ్గుదల రేటుకంటే చెల్లింపు సాధనంగా దాని పెరుగుదల రేటు ఎక్కువ స్థాయిలో వుంటే చలామణి మొత్తం పెరుగుతుంది. కొనుగోలు సాధనంగా వ్యవహరిస్తున్న డబ్బు పరిమాణం గణనీయంగా తగ్గినప్పటికీ ఇలా జరుగుతుంది. కొన్ని సంక్షోభ సమయాల్లో మాత్రమే ఇది జరుగుతుంది. పరపతి పూర్తిగా దెబ్బతిన్నప్పుడు సరుకులు, సెక్యూరిటీలు అమ్మకం కానపుడు మార్పిడి బిల్లులు డిస్కౌంటు చేయబడనపుడు డబ్బు చెల్లింపు తప్ప, అనగా వర్తకుని భాషలో చెప్పాలంటే, రొక్కం తప్ప ఇక ఏదీ పనికిరానపుడు ఇలా జరుగుతుంది. అటువంటి డబ్బు కొరత ఏర్పడిన సమయాల్లో నోట్ల చలామణి చెల్లింపు సాధనాలుగా ఉండటం అన్నది వాటి స్వాభావిక లక్షణమన్న సంగతిని పులార్టన్ లాంటి వారు అర్థం చేసుకోలేదు. ఈ విషయాలను వారు యాదృచ్ఛికమైనవిగా పరిగణిస్తున్నారు. "బ్యాంకు నోట్ల స్వాధీనం కోసం ఆతృతగా జరిగే పోటీ గురించి ఉదాహరణలు భయోత్పాత వాతావరణాన్ని కలిగి వున్న రుతువులను సూచిస్తాయి. అవి కొన్నిసార్లు 1825 చివరిలోలాగా తాత్కాలికంగానే అయినా హఠాత్తుగా పెద్ద ఎత్తున నోట్ల విడుదలకు దారితీయవచ్చు. బంగారం బయటికి పోవడం ఇంకా జరుగుతూనే వున్నప్పటికీ ఇది జరుగుతుంది. ఈ లక్షణాలు తక్కువ స్థాయిలో మార్పిడి జరుగుతోందనటానికి సహజమైన అవసరమైన అంశాలుగా పరిగణించాల్సిన అవసరం లేదు. అలాంటి సందర్భాల్లో గిరాకీ అన్నది చలామణి కోసం కాదు." (చలామణి అనగా ఇక్కడ ఆయన ఉద్దేశం కొనుగోలు సాధనమని.) "అది కూడబెట్టడం కోసం కలవరపడ్డ బ్యాంకర్ల, పెట్టుబడిదారుల డిమాండ్ అది. అది సంక్షోభం యొక్క చివరి చర్యలో సాధారణంగా తలెత్తుతుంది." (అనగా చెల్లింపు సాధనాల రిజర్వు కోసం) "బంగారం బయటికి పోవడం అన్నది చాలాకాలం కొనసాగిన తర్వాతనూ, దాని ముగింపుకు ముందుగానూ ఇది జరుగుతుంది." (పులార్టన్, పుట 130)

చెల్లింపు సాధనంగా డబ్బును గురించిన చర్చలో[1] డబ్బు తన ఊహాత్మక రూపం నుంచి భౌతిక రూపానికి, అదే సమయంలో విలువ యొక్క నిరపేక్ష రూపం నుంచి సరుకుల రూపంలోనికి ఎలా మారుతుందో మనం ఇప్పటికే వివరించి వున్నాము. ఇది కొన్ని ఉదాహరణల ద్వారా నిరూపించబడింది. (ఫుట్‌నోట్‌లు 100, 101[2]) ఈ అంతరాయం స్వయంగా పాక్షికంగా కార్యం, పాక్షికంగా కారణం. మార్కెట్లను సరుకుల్తో ముంచెత్తటం, సరుకుల విలువ పడిపోవడం ఉత్పత్తిలో అంతరాయం మొదలైన అంశాలు, పరపతి అస్థిరంగా ఉండటం వల్లనూ దాంతోపాటు ఇతర పరిస్థితుల

1. అధ్యాయం III
2. సంపుటం I

వల్లనూ తలెత్తుతాయి. వీటి యొక్క కార్యంగానూ, కారణంగానూ కూడా ఈ అంతరాయం ఉంటుంది.

కొనుగోలు సాధనంగా ఉండే డబ్బుకు, చెల్లింపు సాధనంగా ఉండే డబ్బుకు మధ్య తేడాను ఫులార్టన్ కరెన్సీకీ పెట్టుబడికీ మధ్య తప్పుడు తేడాగా మారుస్తున్నాడనేది స్పష్టం. ఇది చలామణి యెడల బ్యాంకరుకున్న సంకుచిత దృక్కోణానికి నిదర్శనం.

అయినప్పటికీ ఒక ప్రశ్న తలెత్తుతుంది. డబ్బు కొరత ఉన్నప్పుడు సరఫరాలో కొరత ఏర్పడింది చెల్లింపు సాధనంగా ఉన్న డబ్బుకా లేక పెట్టుబడికా; ఇది సుపరిచితమైన వివాదం.

మొదటిది ఈ కొరత, బంగారం బయటికి పోవడంతోపాటు కనిపిస్తే ఇక్కడ అంతర్జాతీయ చెల్లింపు సాధనాల కోసం గిరాకీ ఉందన్నది స్పష్టం. అయితే అంతర్జాతీయ చెల్లింపు సాధనంగా ఉన్న డబ్బు అంటే దాని వాస్తవ లోహ రూపంలో ఉన్న బంగారమే. స్వయంగా అది విలువైన పదార్థం. అది విలువ పరిమాణం. అదే సమయంలో సరుకు పెట్టుబడిగా కాక డబ్బు పెట్టుబడిగా ఉండే పెట్టుబడి. అనగా సరుకుల రూపంలో కాక డబ్బు రూపంలో ఉన్న పెట్టుబడి (అది ప్రాచుర్యం పొందిన రూపంలో డబ్బు. అనగా సార్వత్రిక ప్రపంచ మార్కెట్ సరుకుగా ఉండే డబ్బు రూపంలో) అన్నమాట. చెల్లింపు సాధనంగా డబ్బుకోసం గిరాకీకి, పెట్టుబడి కోసం గిరాకీకి మధ్య ఇక్కడ వైరుధ్యం లేదు. వైరుధ్యం ఉన్నది డబ్బు రూపంలో ఉన్న పెట్టుబడికి, సరుకుల రూపంలో ఉన్న పెట్టుబడికి మాత్రమే. ఇక్కడ గిరాకీ ఉన్న రూపం, అది తన కార్యకలాపాన్ని నిర్వహించగలిగిన ఏకైకరూపం, దాని డబ్బు రూపం.

బంగారం కోసం (లేదా వెండి కోసం) ఉన్నప్పటికీ అటువంటి సంక్షోభ సమయాల్లో పెట్టుబడి కొరత అనేది ఉందని చెప్పలేము. అసాధారణమైన పరిస్థితుల్లో అనగా ధాన్యపు ధర పెరగటం లేదా ఒక పత్తి కాటకం వగైరాలు తలెత్తటంలాంటి పరిస్థితులలో ఇలా జరగవచ్చు. అయితే అటువంటి సమయాల్లో ఖచ్చితంగా పెట్టుబడి కొరత ఉంటుందని చెప్పలేము. డబ్బు సదుపాయం కోసం గిరాకీ ఉన్నంత మాత్రాన పెట్టుబడి కొరత ఉన్నట్టు అర్థం కాదు. ఇందుకు విరుద్ధంగా ఉంటుంది. మార్కెట్లు సరుకుల్తో ముంచివేయబడ్డాయి. సరుకు పెట్టుబడి అతిగా ఉంది కనుక ఈ డబ్బు కొరతకు కారణం సరుకు పెట్టుబడి లేకపోవడం కాదు. ఈ ప్రశ్నను తర్వాత మరోసారి పరిశీలిద్దాం.

★ ★ ★

## మూడవ సంపుటం

# పెట్టుబడిదారీ ఉత్పత్తి మొత్తం ప్రక్రియ

# II

## ఐదవ భాగం

# వడ్డీగా, పరిశ్రమ లాభంగా లాభవిభజన వడ్డీ కలిసిన పెట్టుబడి (కొనసాగింపు)

## అధ్యాయం - 29

# బ్యాంకు పెట్టుబడి అంతర్భాగాలు

ఇప్పుడు బ్యాంకు పెట్టుబడి అంతర్భాగాలను మరింత వివరంగా పరిశీలించడం అవసరం.

పులార్టన్ తదితరులు చలామణి సాధనంగా ఉండే డబ్బుకు, చెల్లింపు సాధనంగా ఉండే డబ్బుకు (బంగారం బయటికి పోవటానికి సంబంధించిన మేరకు సార్వత్రికమైన డబ్బుకు) మధ్య వున్న తేడాను కరెన్సీకి, పెట్టుబడికి మధ్య ఉన్న తేడాగా మార్చారని మనమింతకు ముందు చూశాం. వికాసవంతమైన అర్థశాస్త్రం డబ్బు అన్నది పెట్టుబడి కాదని ఎంత గట్టిగా వాదించిందో అంతే గట్టిగా డబ్బే శ్రేష్ఠమైన పెట్టుబడి అని బ్యాంకర్ల అర్థశాస్త్రం బోధించటానికి గల కారణం ఈ విషయంలో పెట్టుబడి నిర్వహించిన చిత్రమైన పాత్రే.

డబ్బు పెట్టుబడి అన్నదాన్ని వడ్డీ ఇచ్చే పెట్టుబడి అన్న అర్థంలో డబ్బు గలిగిన పెట్టుబడిగా గందరగోళపర్చడం జరుగుతోందని తర్వాత విశ్లేషణలో మనం నిరూపిద్దాం. మొదటి అర్థంలో డబ్బు పెట్టుబడి అన్నది కేవలం ఒక తాత్కాలికమైన పెట్టుబడి రూపం; సరుకు పెట్టుబడి, ఉత్పాదక పెట్టుబడి లాంటి రూపాలకు విరుద్ధమైన రూపం.

బ్యాంకు పెట్టుబడిలో రెండు అంశాలుంటాయి. ఒకటి – నగదు డబ్బు, బంగారం లేదా నోట్లు. రెండు – సెక్యూరిటీలు. రెండోదాన్ని రెండు భాగాలుగా విభజించవచ్చు. వాణిజ్య పత్రాలు లేదా మార్పిడి బిల్లులు. అవి కొంతకాలంపాటు ఉండి గడువుకొస్తుంటాయి. వాటిని డిస్కౌంటు చేయడం అన్నది బ్యాంకరు యొక్క ప్రధాన వ్యాపారం. ఇవికాక పబ్లిక్ సెక్యూరిటీలుంటాయి. అనగా ప్రభుత్వ బాండ్లు, ఖజానా నోట్లు, అన్ని రకాల స్టాకులు వగైరాలు. అనగా ఇదంతా వడ్డీ ఇచ్చే పత్రాలు. ఇవి మార్పిడి బిల్లులు కంటే చాలా భిన్నమైనవి. వీటిలో తాకట్టులను కూడా కలపవచ్చు. ఈ స్పష్టమైన అంతర్భాగాలను కలిగి ఉన్న పెట్టుబడిని తిరిగి బ్యాంకర్లు పెట్టిన పెట్టుబడిగాను, డిపాజిట్లుగాను విభజించవచ్చు. డిపాజిట్లలో బ్యాంకరు యొక్క బ్యాంకింగు పెట్టుబడి లేదా అప్పుదీసుకున్న పెట్టుబడి వుంటుంది. నోట్లను విడుదల చేసే బ్యాంకుల విషయంలో వీటిని కూడా

కలుపుకోవాల్సి వుంటుంది. ప్రస్తుతానికి డిపాజిట్లను, నోట్లను పరిశీలన నుంచి పక్కన పెడదాం. ఏమైనప్పటికీ బ్యాంకరు పెట్టుబడి యొక్క వాస్తవ అంతర్భాగాలు (డబ్బు, మార్పిడి బిల్లులు, డిపాజిట్ కరెన్సీ) వివిధ అంశాలు బ్యాంకరు యొక్క సొంత పెట్టుబడా లేక డిపాజిట్లా అనగా ఇతరుల పెట్టుబడా అన్నదాంతో ప్రమేయం లేకుండా యథాతథంగా ఉంటాయి. అతడు తన వ్యాపారాన్ని కేవలం తన సొంత పెట్టుబడితో నిర్వహించినా లేదా డిపాజిట్ చేయబడిన పెట్టుబడితో నిర్వహించినా అదే విభజన కొనసాగుతుంది.

నిర్దిష్టంగా, క్రమం తప్పకుండా వచ్చే డబ్బు ఆదాయం ఏదో ఒక పెట్టుబడిపై వడ్డీగా కనిపించడానికి కారణం ఈ వడ్డీ తెచ్చే పెట్టుబడి యొక్క రూపమే. డబ్బు ఆదాయం మొదట వడ్డీలోకి మార్చబడుతుంది. వడ్డీ నుంచి అది ఏ పెట్టుబడి నుంచి తలెత్తుతుందో నిర్ధారించవచ్చు. అదే విధంగా వడ్డీ ఇచ్చే పెట్టుబడి విషయంలో ప్రతి విలువ మొత్తమూ ఆదాయంగా ఖర్చు పెట్టబడని మేరకు పెట్టుబడిగానే కనిపిస్తుంది. అంటే అది తరువాత ఇవ్వగలిగిన లేదా వాస్తవమైన వడ్డీకి భిన్నంగా అసలు మొత్తంలా కనిపిస్తుంది.

విషయం ఇక్కడ సరళం. ఏడాదికి సగటు వడ్డీ రేటు 5 శాతం అనుకుందాం. 500 పౌండ్ల మొత్తాన్ని వడ్డీ ఇచ్చే పెట్టుబడిగా మారిస్తే అది ఏడాదికి 25 పౌండ్లు ఇస్తుంది. అప్పుడు వార్షికంగా నిర్ణీతంగా వచ్చే ప్రతి 25 పౌండ్ల ఆదాయాన్ని 500 పౌండ్లపైన వడ్డీగానే పరిగణించవచ్చు. ఇది నిజానికి కేవలం భ్రమతో కూడిన భావన. ఈ 25 పౌండ్ల మూలాధారం ఒక యాజమాన్యానికి లేదా హక్కుకు సంబంధించిన పట్టా కావచ్చు. లేదా ఒక స్థిరాస్తి లాంటి వాస్తవ ఉత్పత్తి అంశమూ కావచ్చు. అయితే ఇది ప్రత్యక్షంగా బదిలీ చేయబడగలగాలి. లేదా బదిలీ చేయబడటానికి వీలైన రూపాన్ని సంతరించుకోవాలి. లేకుంటే అది భ్రమతో కూడిన భావనే అవుతుంది. జాతీయ రుణాల్ని, వేతనాల్ని ఉదాహరణగా తీసుకుందాం.

ప్రభుత్వం ఏటా తన రుణదాతలకు వారి నుంచి అప్పు తీసుకున్న పెట్టుబడికి వడ్డీగా కొంత మొత్తాన్ని చెల్లించాల్సి వుంటుంది. ఈ సందర్భంలో పరపతి దాత తన రుణ గ్రహీత నుచి మదుపును వెనక్కు తీసుకోలేదు. దానిపైనున్న తన హక్కును లేదా తన యాజమాన్యపు హక్కును మాత్రమే అమ్మగలడు. పెట్టుబడి వినియోగమైపోయింది. అంటే ప్రభుత్వం దాన్ని వ్యయం చేసేసింది. అదిప్పుడు లేదు. పరపతి దాత దగ్గర ఇప్పుడు ఉన్నదేమంటే 1) ప్రభుత్వం యొక్క ప్రామిసరీ నోటు మాత్రమే. ఉదాహరణకు 100 పౌండ్లు అనుకుందాం. 2) ఈ ప్రామిసరీ నోటు ప్రభుత్వం యొక్క వార్షిక ఆదాయంపైన అనగా వార్షిక పన్ను వసూళ్ళపైన పరపతి దాతకు కొంత మొత్తానికిగాను ఉదాహరణకు 5 పౌండ్లు లేదా 5 శాతం మేరకు హక్కునిస్తుంది. 3) పరపతి దాత తన 100 పౌండ్ల ప్రామిసరీ నోటును తనకు నచ్చిన మరో వ్యక్తికి అమ్ముకోవచ్చు. వడ్డీ రేటు 5 శాతముంటే ప్రభుత్వం ఇస్తున్న హామీ బాగుంటే 'అ' అనే యజమాని ఈ ప్రామిసరీ నోటును 'ఆ'కు 100 పౌండ్లకు అమ్మగలడు. 'ఆ' విషయానికి వస్తే అతనికి 100 పౌండ్లను 5 శాతం చొప్పున అప్పిచ్చినా లేదా 100 పౌండ్లతో ప్రామిసరీ నోటును కొని ఏడాదికి 5 పౌండ్ల చొప్పున ప్రభుత్వం నుంచి కప్పాన్ని పొందటమైనా ఒకటే. ఈ అంశాలన్నిటిలోనూ ప్రభుత్వ చెల్లింపులకు (వడ్డీలకు) మూలాధారంగా భావించబడిన పెట్టుబడి భ్రమతోగూడిన మిధ్యా పెట్టుబడి. ప్రభుత్వానికి అప్పివ్వబడిన మొత్తం, అస్తిత్వంలో

లేకపోవడమేగాదు, దానిని పెట్టుబడిగా ఖర్చుపెట్టాలని ఎప్పుడూ అనుకోలేదు కూడా. కేవలం పెట్టుబడిగా పెట్టినపుడు మాత్రమే అది తనని తాను భద్రపరచుకునే విలువగా రూపాంతరం చెంది ఉండేది. తొలి పరపతి దాత 'అ'కు వార్షిక పన్నులలో వస్తున్న వాటా తన పెట్టుబడిపైన వడ్డీలా కనిపిస్తుంది. వడ్డీ వ్యాపారి దృష్టిలో ఖర్చుదారుని ఆదాయం నుంచి తనకు వచ్చే వాటా వడ్డీలా కనిపించినట్టే ఇది కూడా. ఈ రెండు సందర్భాల్లోనూ అప్పివ్వబడిన మొత్తం పెట్టుబడిగా పెట్టలేదు. ప్రభుత్వం యొక్క ప్రామిసరీ నోటును అమ్మటానికున్న సాధ్యతను అ తన అసలు మొత్తాన్ని తిరిగి పొందటానికున్న అవకాశంగా భావిస్తాడు. ఆ విషయానికొస్తే తన పెట్టుబడి తన వ్యక్తిగత దృష్టినుంచి వడ్డీ ఇచ్చే పెట్టుబడిగా మదుపు పెట్టబడింది. ఈ లావాదేవీకి సంబంధించినంత వరకు ఆ ప్రభుత్వ ఆదాయం పైన 'అ'కు ఉన్న హక్కును కొనుక్కోవడం ద్వారా కేవలం అతని స్థానాన్ని ఆక్రమించాడు. ఈ లావాదేవీ ఎన్నిసార్లు పునరావృత్తమైనప్పటికీ ప్రభుత్వం రుణం యొక్క పెట్టుబడి కేవలం మిథ్యా పెట్టుబడిగా మాత్రమే ఉంటుంది. ప్రామిసరీ నోట్లు అమ్మడానికి వీలుగాకుండా పోయినపుడు మాత్రమే ఈ పెట్టుబడి భ్రమ మాయమవుతుంది. అయినప్పటికీ ఈ మిథ్యా పెట్టుబడికి కూడా తన సొంత చలన నియమాలున్నాయి. వాటిని మనం ఇప్పుడు పరిశీలిద్దాం.

జాతీయ రుణం అన్న పెట్టుబడికి ప్రతిగా ఇప్పుడు మనం శ్రమశక్తిని పరిశీలిద్దాం. ఇక్కడ ఒక ప్రతికూల పరిమాణం పెట్టుబడిలా – కేవలం వడ్డీ ఇచ్చే పెట్టుబడిలా – కనిపిస్తుంది. సాధారణంగా అన్ని రకాల వికృత రూపాలకు అనగా రుణాలు బ్యాంకరు దృష్టిలో సరుకులుగా కనిపించడం లాంటి రూపాలన్నిటికీ ఈ వడ్డీ ఇచ్చే పెట్టుబడే మూలం. ఇక్కడ వేతనాలు వడ్డీగా పరిగణించబడతాయి. కనుక శ్రమశక్తి ఈ వడ్డీనిచ్చే పెట్టుబడిగా పరిగణించబడుతుంది. ఉదాహరణకు ఒక ఏడాది వేతనం 50 పౌండ్లయితే వడ్డీ రేటు 5 శాతం అయితే వార్షిక శ్రమ శక్తి 1000 పౌండ్ల పెట్టుబడితో సమానం. పెట్టుబడిదారీ విధానపు భావన యొక్క పిచ్చితనం పరాకాష్టకు చేరుకుంటుంది. ఎందుకంటే శ్రమశక్తిని దోపిడీ చేసే ప్రాతిపదికపైన పెట్టుబడి విస్తరణను వివరించడానికి బదులు ఇక్కడ విషయాన్ని తల్లకిందులు చేసి ఈ వడ్డీ ఇచ్చే పెట్టుబడి యొక్క మాయాగుణాన్ని శ్రమశక్తికి అంటగట్టడం ద్వారా శ్రమశక్తి ఉత్పాదకత వివరించబడుతోంది. పదిహేడవ శతాబ్దపు రెండో అర్ధభాగంలో ఇది కొంతమందికి (ఉదాహరణకు పెట్టీ) చాలా అభిమానపాత్రమైన భావన... అయితే ఇప్పుడు కూడా కొంతమంది భ్రష్ట ఆర్థికవాదులు ముఖ్యంగా కొంతమంది జర్మన్ గణాంక శాస్త్రవేత్తలు[1] అంతే సీరియస్‌గా ఈ భావనను అభిమానపాత్రంగా పరిగణిస్తున్నారు. దురదృష్టవశాత్తూ ఇబ్బందికరమైన రెండు వాస్తవాలు ఈ ఆలోచనా రహిత భావన అసలు రూపాన్ని ఎండగడుతున్నాయి. మొదటిది – ఈ వడ్డీ పొందటానికి కార్మికుడు పనిచేయాల్సి ఉంది. రెండోది, తన శ్రమశక్తి యొక్క పెట్టుబడి విలువను బదిలీ చేయటం ద్వారా నగదుగా మార్చుకోలేడు. నిజానికి అతని శ్రమశక్తి వార్షిక విలువ అతని సగటు వార్షిక

1. "కార్మికుడు పెట్టుబడి విలువ కలిగి వుంటాడు. అతని వార్షిక వేతనం యొక్క డబ్బు విలువను పెట్టుబడి నుంచి వచ్చిన వడ్డీగా పరిగణించడం ద్వారా ఈ పెట్టుబడి విలువను నిర్ధారించవచ్చు. సగటు దైనిక వేతనం 4%గా భావిస్తే ఒక పురుష వ్యవసాయ కార్మికుని సగటు పెట్టుబడి విలువ ఇలా ఉంటుంది : జర్మన్ ఆస్ట్రియాలో 1500 థేలర్లు, ప్రష్యాలో 1500, ఇంగ్లండులో 3750, ఫ్రాన్సులో 2000, రష్యా అంతర్భాగంలో 750 థేలర్లు." (ఓన్ రిడెన్, వెర్గ్లెయ్ చెండె కుల్తూర్ స్టాటిస్టిక్, బెర్లిన్, 1848, పుట 434)

వేతనంతో సమానం. పైగా అతడు తన కొనుగోలుదారునికి తన శ్రమ ద్వారా తిరిగి ఇవ్వాల్సింది ఈ విలువ మాత్రమే కాదు. దీనితోపాటు అదనపు విలువను కూడా అనగా తన శ్రమ సృష్టించిన వృద్ధిని కూడా ఇవ్వాలి. బానిస సమాజంలో కార్మికుడికి పెట్టుబడి విలువ ఉండింది. అది అతని కొనుగోలు ధర. అతన్ని కూలికి తీసుకున్నప్పుడు ఆ తీసుకున్నవాడు అతని కొనుగోలు ధరపైన వడ్డీ చెల్లించాల్సి వుంటుంది. దాంతోపాటు ఆ పెట్టుబడి వార్షిక అరుగుదలను భర్తీ చేయాల్సి వుంటుంది.

ఈ మిథ్యా పెట్టుబడిని రూపొందించటం పెట్టుబడీకరణ అనబడుతుంది. నిర్ణీత కాలానికి వచ్చే ప్రతి ఆదాయాన్నీ సగటు వడ్డీ రేటు ప్రాతిపదికపై, ఈ వడ్డీ రేటుపై అప్పివ్వబడిన పెట్టుబడి నుంచి గ్రహించే ఆదాయం లాగానే లెక్కవేయటం ద్వారా పెట్టుబడీకరించబడుతుంది. ఉదాహరణకు వార్షిక ఆదాయం 100 పౌండ్లు, వడ్డీ రేటు 5% అయితే అప్పుడు 100 పౌండ్లు 2000 పౌండ్లపై వార్షిక వడ్డీ రేటుగా కనిపిస్తుంది. ఈ 2000 పౌండ్లు ఏటా వచ్చే 100 పౌండ్లపై యాజమాన్యపు పట్టా యొక్క పెట్టుబడి విలువగా పరిగణించబడుతుంది. ఈ యాజమాన్యపు పట్టాను కొన్న వ్యక్తికి 100 పౌండ్ల వార్షికాదాయం 5 శాతం చొప్పున పెట్టిన తన పెట్టుబడిపై వడ్డీలా కనిపిస్తుంది. ఆ రకంగా పెట్టుబడి యొక్క వాస్తవ విస్తరణ ప్రక్రియతో ఉండే సంబంధం పూర్తిగా లుప్తమైపోతుంది. తర్వాత పెట్టుబడి తనంతతానే స్వయంవిస్తరణ స్వభావాన్ని కలిగి ఉందన్న భావన మరింత బలపడుతుంది.

ప్రామిసరీ నోటు – సెక్యూరిటీ – కేవలం పెట్టుబడికి మాత్రమే ప్రాతినిధ్యం వహించినపుడు కూడా అనగా ప్రభుత్వ రుణాల విషయంలోలా వ్యవహరించకపోయినప్పటికీ అటువంటి పత్రం యొక్క పెట్టుబడి విలువ పూర్తిగా భ్రమాత్మకం. పరపతి వ్యవస్థ సమిష్టి పెట్టుబడిని ఎలా సృష్టిస్తుందో మనమింతకు ముందు చూశాం. ఆ పత్రం పెట్టుబడికి ప్రాతినిధ్యం వహించే యాజమాన్యపు పట్టాగా వ్యవహరిస్తుంది. రైల్వేల, గనుల, నౌకా కంపెనీల స్టాకులు మొదలైనవి వాస్తవ పెట్టుబడికి ప్రాతినిధ్యం వహిస్తాయి. అనగా అలాంటి పరిశ్రమలు పనిజేయడానికి పెట్టిన పెట్టుబడికి లేదా అటువంటి పరిశ్రమల్లో పెట్టుబడిగా ఉపయోగించే లక్ష్యంతో స్టాక్‌హోల్డర్ల చేత అడ్వాన్సు చేయబడిన డబ్బు మొత్తానికి ఈ స్టాకులు ప్రాతినిధ్యం వహిస్తాయి. ఇదంతా పూర్తిగా దగా కావడానికి ఉన్న అవకాశాన్ని తొలగించదు. అయితే ఈ పెట్టుబడి రెండుసార్లు అస్తిత్వంలో ఉండదు. ఒకవైపున ఒకసారి యజమాన్యపు పట్టాల (స్టాకుల) పెట్టుబడి విలువగాను, మరోవైపున ఆ పరిశ్రమల్లో మదుపు పెట్టబడిన లేదా పెట్టబోయే, వాస్తవ పెట్టుబడిగాను ఇది రెండుసార్లు ఉండదు. అది ఈ రెండో రూపంలో మాత్రమే ఉంటుంది. అది గ్రహించే అదనపు విలువ భాగానికి అనుగుణంగా దాని యాజమాన్యపు పట్టాగా మాత్రమే ఈ స్టాకుల వాటా వుంటుంది. 'అ' తన పట్టాను 'ఆ'కు అమ్మవచ్చు. 'ఆ' దాన్ని 'ఇ'కి అమ్మవచ్చు. ఈ సమస్యలో ఉన్న స్వభావాన్ని ఈ లావాదేవీ మార్చవు. అ లేదా ఆ తన పట్టాను పెట్టుబడి రూపంలో ఉంచుకున్నాడు. అయితే ఈ స్టాకు పెట్టుబడి నుండి అదనపు విలువను పొందే ఉద్దేశంతో తన పెట్టుబడిని కేవలం యాజమాన్యపు పట్టాగా మార్చుకున్నాడు.

ప్రభుత్వ బాండ్లే కాకుండా స్టాకుల విలువ కూడా అనగా ఈ యాజమాన్యపు పట్టాల విలువలు స్వతంత్రంగా చలనంలో ఉండటం అన్నది అవి ఏ పెట్టుబడిపైన పట్టా కలిగి ఉన్నాయో దాంతోపాటు వాస్తవ పెట్టుబడిని కలిగి ఉన్నట్టుగా భ్రమింపజేయడానికి అవి మరో కారణమవుతున్నాయి. ఎందుకంటే

అవి సరుకులుగా మారుతున్నాయి. వాటి ధరకు తన సొంత స్వాభావిక చలనాలున్నాయి. ఆ ధర తన సొంత తరహాలో ఏర్పడుతోంది. వాటి మార్కెట్ విలువ వాటి నామమాత్రమైన విలువతో ప్రమేయం లేకుండా నిర్ణయమవుతుంది. వాస్తవ పెట్టుబడి విలువలో (విస్తరణ మారినప్పటికీ) ఎటువంటి మార్పు లేకుండానే, ఇది జరుగుతుంది. ఒకవైపున వాటికి చట్టబద్ధంగా పట్టా ఉన్న రాబడి మొత్తాన్ని బట్టి, వాటిపై ఉన్న నమ్మకాన్ని బట్టి వాటి మార్కెట్ విలువ ఆటుపోట్లకు గురవుతుంది. ఒక స్టాకు యొక్క షేరు తొలి విలువ అనగా ఈ షేరు ప్రాతినిధ్యం వహిస్తున్న తొలి మదుపు మొత్తం 100 పౌండ్లయితే ఆ పరిశ్రమ 5%కు బదులు 10% చెల్లిస్తుంటే, మిగిలిన అంశాలన్నీ యథాతథంగా ఉన్నప్పుడు దాని మార్కెట్ విలువ 200 పౌండ్లకు పెరుగుతుంది. అనగా ఇది వడ్డీ రేటు 5 శాతం ఉన్నప్పుడు 5 శాతం దగ్గర పెట్టుబడీకరించినపుడు అది ఇప్పుడు 200 పౌండ్లు ఉత్పత్తి (కృత్రిమ) పెట్టుబడికి ప్రాతినిధ్యం వహిస్తుంది. 200 పౌండ్లకు దాన్ని ఎవరు కొన్నప్పటికీ ఈ పెట్టుబడి మదుపుపైన వారికి 5 శాతం ఆదాయం వస్తుంది. పరిశ్రమ రాబడి తగ్గినపుడు దీనికి విరుద్ధంగా కూడా జరుగుతుంది. ఈ పత్రం యొక్క మార్కెట్టు విలువ పాక్షికంగా ఊహాజనితం. ఎందుకంటే అది వాస్తవ ఆదాయాన్ని బట్టి మాత్రమే గాక రాబోయే ఆదాయంపై పెట్టుకున్న ఆశలను బట్టి కూడా నిర్ణయించబడుతుంది. అయితే వాస్తవ పెట్టుబడి విస్తరణ స్థిరంగా ఉందనుకుంటే లేదా పెట్టుబడే లేదనుకుంటే (ప్రభుత్వ రుణాల విషయంలోలాగా) వార్షిక ఆదాయం చట్టం ద్వారా నిర్ణయించాల్సి వుంటుంది. లేదా తగినంతగా దానికి భద్రత కల్పించాల్సి వుంటుంది. ఈ సెక్యూరిటీల ధర వడ్డీ రేటుకు విలోమంగా పెరుగుతూ తరుగుతూ వుంటుంది. వడ్డీ రేటు 5% నుంచి 10% నికి పెరిగితే 5 పౌండ్ల ఆదాయానికి హామీ ఇస్తున్న సెక్యూరిటీలు ఇప్పుడు 50 పౌండ్ల పెట్టుబడికి మాత్రమే ప్రాతినిధ్యం వహిస్తాయి. అందుకు విరుద్ధంగా వడ్డీ రేటు $2\frac{1}{2}$ శాతానికి పడిపోతే అవే సెక్యూరిటీలు 200 పౌండ్ల పెట్టుబడికి ప్రాతినిధ్యం వహిస్తాయి. వాటి విలువ ఎప్పుడూ పెట్టుబడీకరించబడిన ఆదాయం మాత్రమే. అనగా అమలులో వున్న వడ్డీ రేటుతో నకిలీ పెట్టుబడి ప్రాతిపదికపై అంచనా వేయబడిన ఆదాయం. కనుక డబ్బు మార్కెట్టులో కొరత ఏర్పడినప్పుడు ఈ సెక్యూరిటీల ధర రెండు కారణాల వల్ల పడిపోతుంది. మొదటిది – వడ్డీ రేటు పెరుగుతుంది కనుక. రెండోది ఈ సెక్యూరిటీలు పెద్ద ఎత్తున మార్కెట్‌లోకి నగదుగా మార్చబడటం కోసం నెట్టబడతాయి. ఈ పత్రం దాని యజమానికి హామీ ఇచ్చే ఆదాయం ప్రభుత్వ బాండ్ల విషయంలోలాగా స్థిరంగా ఉన్నప్పటికీ ధర పడిపోవచ్చు. అలాగే పారిశ్రామిక సంస్థలలో లాగా వాస్తవ పెట్టుబడి, విస్తరణ ప్రక్రియలో తలెత్తే ఎగుడుదిగుళ్ళ వల్ల ప్రభావితమైనప్పటికీ ఇది జరగదు. రెండో సందర్భంలో పైన పేర్కొన్న దానికి మరో తరుగుదల జోడింపబడినట్టు అవుతుంది. తుఫాను ముగిసిపోగానే ఈ పత్రం మళ్ళీ తన పూర్వపు స్థాయికి పెరుగుతుంది. అది ఒక వాణిజ్య వైఫల్యం లేదా దగా కానిమేరకు అది జరుగుతుంది. సంక్షోభ సమయాల్లో దాని తరుగుదల సంపదల్ని కేంద్రీకరించడానికి సాధనంగా పనికొస్తుంది.[1]

1. ఫిబ్రవరి విప్లవం తరువాత వెంటనే సరుకులు, సెక్యూరిటీల విలువ తీవ్రంగా పడిపోయినప్పుడు ఏ మాత్రం అమ్మటానికి వీలులేకుండాపోయిన తరుణంలో లివర్‌పూల్‌లో ఉన్న ఆర్. జ్విన్‌చెన్ బాత్ అనే స్విస్ వర్తకుడు (ఈ విషయం అతడే స్వయంగా మా తండ్రికి చెప్పాడు.) తన ఆస్తులన్నిటినీ అమ్మి

వాస్తవ పెట్టుబడికి ప్రాతినిధ్యం వహించే విలువ చలనంతో ప్రమేయం లేకుండా ఈ పత్రం విలువ పెరగటం, తరగటం జరిగినంత మేరకు ఈ తరగటానికీ పెరగటానికీ ముందు జాతీయ సంపద ఎంత ఉందో ఆ తరువాత కూడా అంతే ఉంటుంది. "పబ్లిక్ స్టాకులు, కాల్వలపై రైల్వేలపై షేర్లు 1847 అక్టోబర్ 23 నాటికే 114,752,225 పౌండ్ల మొత్తానికి అవి తిరిగిపోయాయి." (బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండు గవర్నరు మోరిస్ 1847-48 కమర్షియల్ డిస్ట్రెస్‌పై నివేదికలో ఇచ్చిన సాక్ష్యం [నెం. 3800]). ఉత్పత్తిలోనూ, కాల్వల రైల్వేల రవాణాలోనూ వాస్తవంగా అంతరాయం రూపంలో లేదా అప్పటికే ప్రారంభించిన పరిశ్రమల నిలుపుదల రూపంలోనూ లేదా పనికిమాలిన సంస్థలలో పెట్టుబడి దుర్వినియోగం రూపంలో ఈ తరుగుదల ప్రతిబింబించకపోతే ఈ సబ్బు బుడగ పగిలిపోవటం వల్ల వాస్తవమైన డబ్బు పెట్టుబడి విషయంలో ఒక్క సెంట్ అయినా జాతీయ సంపద తగ్గదు.

ఈ పత్రాలన్నీ భవిష్యత్తు ఉత్పత్తిపైన పోగుబడిన హక్కుల్ని లేదా చట్టబద్ధమైన పట్టాల్ని తప్ప మరిదేన్నీ సూచించవు. వాటి డబ్బు లేదా పెట్టుబడి విలువ ప్రభుత్వ రుణాల విషయంలోలాగా అసలు ఏ పెట్టుబడికీ ప్రాతినిధ్యం వహించదు. లేదా అది ప్రాతినిధ్యం వహించే పెట్టుబడి విలువతో సంబంధం లేకుండా క్రమబద్ధం చేయబడతాయి.

పెట్టుబడిదారీ ఉత్పత్తి ప్రాతిపదికపైన నడిచే దేశాలన్నిటిలోనూ వడ్డీ ఇచ్చే పెట్టుబడి లేదా డబ్బు కలిగిన పెట్టుబడి అనబడే అపారమైన పరిమాణం ఈ రూపంలో వుంటుంది. డబ్బు, పెట్టుబడి సంచయనం ద్వారా ప్రధానంగా సంచయనం జరిగేది ఉత్పత్తిపైన ఈ హక్కులు, మార్కెటు ధర యొక్క సంచయనం, ఈ హక్కుల భ్రమాత్మకమైన పెట్టుబడి విలువ తప్ప మరొకటేదీ కాదు.

బ్యాంకరు పెట్టుబడిలో ఒక భాగం ఇప్పుడు వడ్డీ ఇచ్చే పత్రం అనబడేదాన్లో మదుపు పెట్టబడింది. ఇది స్వయంగా రిజర్వు పెట్టుబడిలో ఒక భాగం. ఈ రిజర్వు పెట్టుబడి వాస్తవ బ్యాంకింగ్ వాణిజ్యంలో ఎటువంటి పాత్ర నిర్వహించదు. ఈ పత్రాలలో అత్యంత ప్రధానమైన భాగం మార్పిడి బిల్లులు. అనగా పారిశ్రామిక పెట్టుబడిదారుల, వర్తకుల చెల్లింపు వాగ్దానాలు. వడ్డీ వ్యాపారి దృష్టిలో ఈ మార్పిడి బిల్లులు వడ్డీ ఇచ్చే పత్రాలు. మరో రకంగా చెప్పాలంటే వాటిని అతను కొన్నప్పుడు వాటి గడువు కాలం వరకు వడ్డీని లెక్కగట్టి తీసేస్తాడు. దీనిని డిస్కౌంటింగ్ అంటారు. మార్పిడి బిల్లు ప్రాతినిధ్యం వహించే మొత్తం నుండి ఎంత మొత్తాన్ని తీసివేయాలి అన్నది ఆనాడు అమల్లో ఉన్న వడ్డీ రేటుపైన ఆధారపడి వుంటుంది.

అంతిమంగా, ఒక బ్యాంకరు యొక్క పెట్టుబడి చివరి భాగం బంగారం రూపంలోనూ, నోట్ల రూపంలోనూ ఉన్న అతని డబ్బు రిజర్వు. ఒక ఒప్పందం ప్రకారం ఒక నిర్దిష్ట కాలం వరకు ఉంచాల్సి వస్తే తప్ప డిపాజిట్లు అన్నవి ఎప్పుడూ డిపాజిటర్ల ఇష్టం మేరకు ఉపసంహరించుకోవడానికి

---

నగదుగా మార్చాడు. ఆ డబ్బును పట్టుకొని ప్యారిస్ వెళ్ళి రాత్‌షీల్డ్‌ని కలిశాడు. ఒక ఉమ్మడి పరిశ్రమలో పాల్గొంటానన్న తన ప్రతిపాదనను ఆయనకు తెలియజేశాడు. రాత్‌షీల్డ్ అతనివంక తదేకంగా చూసి అతనివైపు వేగంగా దూసుకుపోయి అతని భుజాలు గట్టిగా పట్టుకుని 'నీ దగ్గర డబ్బుందా?' అని అడిగాడు. 'ఉందండీ' - 'అయితే నువ్వు నావాడివి' - వారిద్దరూ కలిసి జోరుగా వ్యాపారం చేశారు. **- ఎంగెల్స్**

వీలుగానే ఉంటాయి. అవి నిరంతరాయమైన ఆటుపోట్లలో ఉంటాయి. అయితే ఒక డిపాజిటరు తన ఖాతా నుంచి సొమ్మును వెనక్కు తీసుకుంటే మరో వ్యక్తి డిపాజిట్ చేస్తాడు. ఆ రకంగా సాధారణ సగటు డిపాజిట్ల మొత్తం మామూలుగా వ్యాపారం సాగుతున్న కాలంలో పెద్దగా ఆటుపోట్లకు గురికాదు.

అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ ఉత్పత్తి వున్న దేశాలలో బ్యాంకుల రిజర్వు నిధులు సగటున నిల్వ రూపంలో ఉన్న డబ్బు పరిమాణాన్ని తెలియజేస్తాయి. ఈ పాత్రలో ఒక భాగం పత్రాలు. ఇది బంగారంపై డ్రాఫ్టులు మాత్రమే. వీటికి స్వయంగా తమకంటూ ఒక విలువ లేదు. కనుక బ్యాంకరు పెట్టుబడిలో అధిక భాగం కేవలం ఉత్తుత్తి పెట్టుబడి మాత్రమే. దీనిలో హక్కు పత్రాలు (మార్పిడి బిల్లులు), ప్రభుత్వ సెక్యూరిటీలు (ఖర్చు పెట్టిన పెట్టుబడికి ఇవి ప్రాతినిధ్యం వహిస్తాయి), స్టాకులు (భవిష్యత్ ఆదాయంపైన డ్రాఫ్టులు) ఉంటాయి. బ్యాంకరు ఖజానాలలో ఉన్న పత్రాలు ప్రాతినిధ్యం వహించే పెట్టుబడి యొక్క డబ్బు విలువ కూడా నకిలీదేనని మర్చిపోరాదు. హామీ ఉన్న ఆదాయంపై డ్రాఫ్టులు (ఉదాహరణకు ప్రభుత్వం సెక్యూరిటీలు) లేదా వాస్తవ పెట్టుబడిపై యాజమాన్యపు పట్టాలు (ఉదాహరణకు స్టాకులు) మొదలైనవి ఈ పత్రాల్లో వున్న మేరకు దాని విలువ వాస్తవ పెట్టుబడి విలువ కంటే భిన్నంగా క్రమబద్ధం అయిన మేరకు (ఇక్కడ వాస్తవ విలువకు ఆ పత్రం పాక్షికంగానైనా ప్రాతినిధ్యం వహిస్తుంది.) లేదా అది పెట్టుబడిని గాక కేవలం ఆదాయంపై హక్కులకు ప్రాతినిధ్యం వహించిన మేరకు అదే ఆదాయంపై హక్కు అన్నది నిరంతరాయంగా మారే డబ్బు పెట్టుబడిని వ్యక్తం చేస్తుంది. దీనితోపాటు ఈ బ్యాంకరు యొక్క నకిలీ పెట్టుబడి ప్రధానంగా తన సొంత పెట్టుబడి గాక పబ్లిక్ పెట్టుబడికి ప్రాతినిధ్యం వహిస్తుంది. అనగా వడ్డీ ఇచ్చేదైనా కాకున్నా జనం తన వద్ద డిపాజిట్ చేసే పెట్టుబడికి ప్రాతినిధ్యం వహిస్తుంది.

డిపాజిట్లు డబ్బు, బంగారం లేదా నోట్లు లేదా వాటిపైన డ్రాఫ్టుల రూపంలో ఉంటాయి. వాస్తవ చలామణి అవసరాల కనుగుణంగా తగ్గుతూ, పెరుగుతూ ఉండే రిజర్వు నిధిని మినహాయిస్తే ఈ డిపాజిట్లు ఎప్పుడూ ఒకవైపున తమ మార్పిడి బిల్లులను డిస్కౌంటు చేయించుకుని అడ్వాన్సులను పొందే పారిశ్రామిక పెట్టుబడిదారుల, వ్యాపారుల చేతుల్లోనూ, మరోవైపున సెక్యూరిటీల వ్యాపారుల (స్టాక్ ఎక్స్ఛేంజి బ్రోకర్లు) చేతుల్లోనూ ఉంటాయి. లేదా తమ సెక్యూరిటీలను అమ్మిన ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో లేదా (ట్రెజరీ నోట్లు, కొత్త అప్పుల విషయంలో) ప్రభుత్వం చేతుల్లోనూ అవి ఉంటాయి. డిపాజిట్లు ద్విపాత్రాభినయం చేస్తాయి. ఒకవైపున మనమింతకు ముందే పేర్కొన్నట్టుగా అవి వడ్డీ ఇచ్చే పెట్టుబడి రూపంలో అప్పివ్వబడతాయి. కనుక అవి బ్యాంకు ఖజానాలలోకాక డిపాజిటర్ల పరపతి రూపంలో వాటి ఖాతా పుస్తకాలలో కనిపిస్తాయి. మరోవైపున డిపాజిటర్ల యొక్క పరస్పర హక్కు పత్రాలు ఆ డిపాజిట్లపైన చెక్కులచేత సమతూకానికి తేబడి ఒకదానిని మరొకటి రద్దు చేసుకునే మేరకు అవి కేవలం అటువంటి ఖాతా పుస్తకాల అంశాలుగా వుంటాయి.

వివిధ ఖాతాలను ఒక దానికి వ్యతిరేకంగా మరొకదాన్ని సరిచూసే ఒకే బ్యాంక్ ఈ డిపాజిట్లు అప్పగించబడ్డాయా లేక చెక్కులను పరస్పరం చేసి మిగిలిన మొత్తాలను ఆయా వ్యక్తులకు చెల్లించే వివిధ బ్యాంకులకు అప్పగించబడ్డాయా అన్నది ఈ సందర్భంలో ముఖ్యమైన విషయం కాదు.

వడ్డీ తెచ్చే పెట్టుబడి, పరపతి వ్యవస్థ అభివృద్ధితోపాటు ఒకే పెట్టుబడి లేదా ఒకే రుణంపై

హక్కు విభిన్న రూపాల్లోనూ, విభిన్న హస్తాలలో కనిపించే వివిధ పద్ధతుల్లో పెట్టుబడి అంతా రెట్టింపు అవుతున్నట్టు, కొన్నిసార్లు మూడింతలవుతున్నట్టు కనిపిస్తుంది.[1] ఈ డబ్బు 'పెట్టుబడి'లో అధికభాగం కేవలం పెట్టుబడి రిజర్వు నిధి మినహా మిగిలిన డిపాజిట్లన్నీ కేవలం బ్యాంకరు నుంచి రావాల్సినట్టు చూపే హక్కు పత్రాలు మాత్రమే. నిజానికవి ఎప్పుడూ డిపాజిట్ల రూపంలో అస్తిత్వంలో ఉండవు. క్లియరింగ్ హౌస్ లావాదేవీల్లో అవి పనిజేసినంత మేరకు బ్యాంకర్లకు అవి పెట్టుబడి పాత్ర నిర్వహిస్తాయి. బ్యాంకరు వాటిని అప్పు ఇచ్చిన తర్వాత అవి ఆ పాత్రను నిర్వహిస్తాయి. బ్యాంకర్లు తమ పరస్పర ఖాతాలను సరిజూడటం ద్వారా అస్తిత్వంలో లేని డిపాజిట్లపైన పరస్పర డ్రాఫ్టులను ఒకరికొకరు చెల్లించుకుంటారు.

డబ్బు అప్పివ్వడంలో పెట్టుబడి నిర్వహించే పాత్ర గురించి ఆడమ్ స్మిత్ ఇలా అంటాడు : "యజమానులు స్వయంగా తామే పనిలో పెట్టాలని కోరని పెట్టుబడుల మొత్తాలను ఒక చేతినుంచి మరొకచేతికి మార్చే అప్పగింతల పత్రమే డబ్బు. ఇలా చేతులు మారే పరికరంగా పనిజేసే డబ్బు మొత్తం కంటే ఆ పెట్టుబడులు ఎన్ని రెట్లయినా ఎక్కువగా ఉండవచ్చు. ఒకే డబ్బు మొత్తం వరుసగా అనేక విభిన్న రుణాలలో అలాగే అనేక విభిన్నమైన కొనుగోళ్ళలోనూ తన పాత్ర నిర్వహించవచ్చు. ఉదాహరణకు 'అ' 1000 పౌండ్లను 'ర'కి అప్పిస్తాడు. వెంటనే 'ర' 1000 పౌండ్ల సరుకుల్ని దానితో 'ఆ' దగ్గరినుంచి కొంటాడు. 'ఆ'కు ఆ డబ్బుతో వెంటనే పనిలేదు కాబట్టి 'గ'కు అప్పిస్తాడు. 'గ' వెంటనే 'ఇ' దగ్గిర దానితో 1000 పౌండ్ల సరుకుల్ని కొంటాడు. అదేరకంగా 'ఇ' ఆ మొత్తాన్ని 'మ'కి అప్పిస్తాడు. 'మ' వెంటనే వాటిని 'ఈ'కి ఇచ్చి దానితో సమానమైన సరుకుల మొత్తాన్ని కొంటాడు. ఈ రకంగా ఒకే మొత్తం నాణాలుగా ఉన్నా లేదా పత్రాలుగా వున్నా కొద్ది రోజుల్లో మూడు విభిన్నమైన

1. పెట్టుబడి ఇలా ఈ రెట్టింపు కావటం, మూడింతలు కావటం అన్నది ఇటీవల సంవత్సరాలలో గణనీయంగా మరింత అభివృద్ధి చెందింది. ఉదాహరణకు ఆర్థిక ట్రస్టుల ద్వారా ఇవి లండన్ స్టాక్ ఎక్స్ఛేంజి నివేదికలో ఇప్పటికీ ఒక ప్రత్యేక శీర్షిక కింద ప్రస్తావించబడ్డాయి. ఒక తరగతి వడ్డీ ఇచ్చే పత్రాలను ఉదాహరణకు విదేశీ ప్రభుత్వ సెక్యూరిటీలు ఇంగ్లీషు మునిసిపల్ లేదా అమెరికన్ పబ్లిక్ బాండ్లు, రైల్వే స్టాకులు మొదలైన వాటిని కొనటానికి ఒక కంపెనీ ఏర్పాటుకాబడింది. పెట్టుబడి, ఉదాహరణకు 20 లక్షల పౌండ్ల మొత్తాన్ని, స్టాకులమ్మటం ద్వారా సేకరించబడుతుంది. బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ ఆ విలువల్ని కొనేస్తుంది. లేదా వాటిలో చురుగ్గా సట్టా వ్యాపారం చేస్తుంది. ఖర్చుల్ని తీసేసి మిగిలిన వడ్డీని మిగిలిన స్టాక్‌హోల్డర్లకు డివిడెండ్ల రూపంలో పంపిణీ చేస్తుంది. అంతేగాక కొన్ని స్టాక్ కంపెనీలు మొత్తం స్టాక్‌ను రెండు తరగతులుగా విభజించే సంప్రదాయాన్ని చేపట్టాయి. ఇవి ప్రెఫర్డ్ స్టాకులు, డిఫర్డ్ స్టాకులు. ప్రెఫర్డ్ స్టాక్‌హోల్డర్లు స్థిరమైన వడ్డీ రేటును ఉదాహరణకు 5 శాతాన్ని పొందుతారు. అయితే దీనికి మొత్తం లాభం వీలుకల్పించాలి. దాని తర్వాత ఇంకా మిగిలి ఉన్న దాన్ని డిఫర్డ్ స్టాక్‌హోల్డర్లు పొందుతారు. ఈ రకంగా ప్రెఫర్డ్ షేర్లలో 'ఘనీభూతంగా' మదుపు పెట్టబడిన పెట్టుబడి డిఫర్డ్ షేర్లలో - జరిగే వాస్తవ సట్టా వ్యాపారం నుంచి వేరు చేయబడింది. కొన్ని పెద్ద సంస్థలు ఈ కొత్త సాంప్రదాయాన్ననుసరించటానికి సిద్ధంగా లేనందున వాటిలో సాధ్యపడిన సంస్థలు కొత్త కంపెనీలను ఏర్పాటు చేసే మార్గాన్నెంచుకున్నాయి. ఇవి పాత కంపెనీలలో ఒక మిలియను లేదా కొన్ని మిలియను పౌండ్ల స్టెర్లింగును షేర్లుగా మదుపు పెడతాయి. తరువాత కొన్న షేర్ల నామమాత్రపు విలువతో సమానమైన కొత్త షేర్లను విడుదల చేస్తాయి. అయితే వీటిలో సగం ప్రెఫర్డ్ గాను, మరోసగం డిఫర్డ్‌గాను విడుదల చేయబడతాయి. అటువంటి సందర్భాల్లో తొలి షేర్లు కొత్త, షేర్ల విడుదలకు ప్రాతిపదికగా వ్యవహరిస్తాయి గనుక రెట్టింపవుతాయి **- ఎంగెల్స్.**

రుణాలలోనూ, మూడు విభిన్నమైన కొనుగోళ్ళలోనూ తన పాత్రను నిర్వహించవచ్చు. ప్రతి కొనుగోలు లేదా ప్రతి రుణము ఇక్కడ ఆ డబ్బు మొత్తంతో సమానంగా వుంటుంది. డబ్బు గలిగిన అ, ఆ, ఇ లు అప్పు పుచ్చుకున్న ర, గ, మలకు అప్పుజెప్పిందేమంటే ఆ కొనుగోళ్ళు చేసే శక్తినన్నమాట. ఈ శక్తిలో ఆ రుణాల విలువ, ఉపయోగము రెండూ వున్నాయి. ఈ ముగ్గురు వ్యక్తులు అప్పిచ్చిన డబ్బు మొత్తం దానితో కొనగలిగిన సరుకుల మొత్తంతో సమానం. అంతేగాక ఈ కొనుగోళ్ళు జరిపిన డబ్బు మొత్తం కంటే మూడు రెట్లు అధికం. ఈ రుణాలన్నిటికీ మంచి భద్రత ఉండి ఉండవచ్చు. విభిన్న పరపతి గ్రహీతల చేత కొనబడిన సరుకులు అలా పనిలో పెట్టబడి ఉండవచ్చు. ఎలాగంటే నాణాల రూపంలో గాని లేదా కాగితాల రూపంలో గాని విలువ లాభంతో సహా సకాలంలో వెనక్కు తీసుకొచ్చేలా పనిలో పెట్టబడి ఉండొచ్చు. ఒకే డబ్బు మొత్తం విభిన్న రుణాల చెల్లింపుల్లో మూడు రెట్లు లేదా అదే కారణంగా వాటి విలువకు 30 రెట్లు అధికంగా చెల్లించే పరికరంగా వ్యవహరిస్తోంది కనుక అదే విధంగా అది తిరిగి చెల్లింపుల్లో కూడా వ్యవహరించవచ్చు." ([ఏన్ ఇంక్వైరీ ఇంటు ది నేచర్ అండ్ కాజెస్ ఆఫ్ ది వెల్త్ ఆఫ్ నేషన్స్, అబర్డీన్, లండన్ 1848, పుట 236 – సం.] గ్రంథం II, అధ్యాయం IV)

ఒకే డబ్బు మొత్తాన్ని దాని చలామణి వేగానికనుగుణంగా వివిధ కొనుగోళ్ళలో ఉపయోగించడం సాధ్యం కనుక అదే విధంగా దానిని వివిధ రుణాలకై ఉపయోగించవచ్చు. ఎందుకంటే కొనుగోళ్ళు ఒక వ్యక్తి నుంచి మరొక వ్యక్తి దగ్గరికి దానిని తీసుకువెళ్తాయి గనుక, రుణం అంటే కొనుగోలు మధ్యవర్తిత్వం లేకుండానే ఒక వ్యక్తి నుంచి మరో వ్యక్తికి బదిలీ కావటం మాత్రమే. ప్రతి అమ్మకం దారునికి డబ్బు అతని సరుకుల యొక్క మారిన రూపానికీ ప్రాతినిధ్యం వహిస్తుంది. ప్రతి విలువ పెట్టుబడి విలువగా వ్యక్తమవుతున్న ఈ రోజుల్లో అది వివిధ రుణాల్లో వరుసగా వివిధ పెట్టుబడులకు ప్రాతినిధ్యం వహిస్తుంది. అది వరుసగా వివిధ సరుకు విలువల్ని వాస్తవ రూపం ధరింపజేస్తుంది అన్న అంతకు ముందు ప్రకటనకు ఇది కేవలం మరో రకమైన వ్యక్తీకరణ మాత్రమే. అదే సమయంలో ఒక వ్యక్తి నుంచి మరో వ్యక్తికి వాస్తవ పెట్టుబడిని బదలీ చేయడం కోసం డబ్బు చలామణి సాధనంగా వ్యవహరిస్తుంది. రుణాల విషయంలో అది ఒక వ్యక్తి నుంచి మరొక వ్యక్తికి చలామణి సాధనంగా పయనించదు. అది రుణదాత చేతుల్లో ఉన్నంత వరకు ఒక చలామణి సాధనంగా కాక అతని పెట్టుబడి యొక్క విలువ అస్తిత్వంగా ఉంటుంది. ఈ రూపంలో అతడు దాన్ని అప్పిస్తున్నప్పుడు మరొకనికి బదిలీ చేస్తాడు. 'అ' డబ్బును 'ఆ'కు, 'ఆ' అదే డబ్బును కొనుగోళ్ళ మధ్యవర్తిత్వం లేకుండానే 'ఇ'కి అప్పిస్తే ఆ డబ్బు మూడు పెట్టుబడులకు ప్రాతినిధ్యం వహించదు. ఒకే పెట్టుబడి విలువకు ప్రాతినిధ్యం వహిస్తుంది. అది వాస్తవంగా ప్రాతినిధ్యం వహించే పెట్టుబడుల సంఖ్య వివిధ సరుకు పెట్టుబడుల విలువ రూపంగా అది ఎన్నిసార్లు వ్యవహరిస్తుంది అన్నదానిపైన ఆధారపడి వుంటుంది.

మొత్తం మీద రుణాల గురించి ఆడమ్ స్మిత్ చెప్పిన అంశం డిపాజిట్లకు కూడా వర్తిస్తుంది. ప్రజలు బ్యాంకర్లకు ఇచ్చే రుణాలకి మరో పేరే డిపాజిట్లు. ఒకే మొత్తం డబ్బు ఎన్ని డిపాజిట్లకైనా సాధనంగా వ్యవహరించవచ్చు.

" 'అ' దగ్గిర మీరు డిపాజిట్ చేసిన 1000 పౌండ్లు రేపు తిరిగి విడుదల చేయబడవచ్చు. అది 'ఆ' దగ్గర డిపాజిట్‌గా రూపొందవచ్చు అనడంలో సందేహం లేదు. ఎల్లుండి 'ఆ' దగ్గర నుంచి మళ్ళీ

విడుదలై 'ఇ' దగ్గర డిపాజిట్‌గా మారవచ్చు. ఇదిలా అనంతంగా సాగవచ్చు. ఈ 1000 పౌండ్ల ఒకే మొత్తం ఆ రకంగా బదిలీల పరంపర ద్వారా పూర్తిగా సంఖ్యానేక డిపాజిట్ల మొత్తంగా అనేక రెట్లు పెరగవచ్చు. కనుక యునైటెడ్ కింగ్‌డమ్‌లో ఉన్న డిపాజిట్లలో పదింట తొమ్మిది వంతులు నాటికి బాధ్యులైన బ్యాంకర్ల ఖాతా పుస్తకాలలో తప్ప వాస్తవ అస్తిత్వం ఉండి ఉండకపోవచ్చు... ఆ రకంగా ఉదాహరణకు స్కాట్లాండులో కరెన్సీ 30 లక్షల పౌండ్లకెప్పుడూ మించలేదు. బ్యాంకుల డిపాజిట్లు మాత్రం 270 లక్షల పౌండ్లుగా అంచనా వేయబడ్డాయి. ఒకేసారి బ్యాంకులపై ఒత్తిడి లేకుండా ఉంటే ఒకే 1000 పౌండ్ల మొత్తం దాని యాత్రల్లో తిరిగి వెనక్కు పంపించబడితే అంతే అనిర్దిష్టమైన మొత్తాన్ని అంతే సజావుగా అది రద్దు చేస్తుంది. ఒక వ్యాపారికి నువ్వు చెల్లించాల్సిన బాకీ 1000 పౌండ్లు ఇస్తే అదే మొత్తం రేపు మరో వర్తకం దగ్గర ఆ వ్యాపారికి ఉన్న బాకీని, ఆ రెండో రోజు బ్యాంకు దగ్గర వర్తకుని బాకీని అలాగే అనంతంగా రద్దు చేసుకుంటూ పోగలదు. కనుక ఒకే 1000 పౌండ్ల మొత్తం ఒక చేతి నుంచి మరో చేతికి, ఒక బ్యాంకు నుంచి మరో బ్యాంకుకు పయనించటం ద్వారా ఊహించగలిగిన డిపాజిట్ల మొత్తాన్ని దేన్నైనా అది రద్దుజేయవచ్చు." (ది కరెన్సీ థియరీ రెవ్యూడ్, పుటలు 62, 63)

ఈ పరపతి వ్యవస్థలో ప్రతీదీ రెట్టింపుగానూ, మూడింతలుగానూ మారి ఊహరూపంగా రూపాంతరం జెందినట్టే చివరకు వాస్తవమైనది దొరక్కపోదా అని జనం ఆశించే 'రిజర్వు నిధి' విషయంలోనూ జరుగుతుంది.

బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్ గవర్నరు మోరిస్ ఏమంటాడో మరోసారి విందాం : "ప్రైవేటు బ్యాంకర్ల రిజర్వులు బ్యాంక్ ఇంగ్లండు చేతుల్లో డిపాజిట్ల రూపంలో వున్నాయి... బంగారం యొక్క ఎగుమతి మొట్టమొదట ప్రత్యేకంగా బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండు రిజర్వు మీద ప్రభావం చూపుతుంది. బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్‌లో బ్యాంకర్లకున్న రిజర్వులలో ఒక భాగాన్ని ఉపసంహరించడానికి సంబంధించినంత మేరకు వారి రిజర్వులపైన కూడా అది ప్రభావం చూపుతుంది. దేశంలో ఉన్న బ్యాంకర్ల రిజర్వులన్నింటిపైన అది ప్రభావం చూపుతుంది." (కమర్షియల్ డిస్ట్రెస్, 1847–48, నెంబర్లు 3639, 3642). అంతిమంగా వాస్తవంలో ఈ రిజర్వు నిధులు బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్ రిజర్వు నిధిలో కలిసిపోతాయి.[1] అయితే ఈ రిజర్వు నిధికి కూడా ద్వంద్వ అస్తిత్వముంది. చలామణిలో ఉన్న నోట్లకు మించి అదనపు నోట్లను బ్యాంకు విడుదల చేయడానికి అధికారం కలిగి వుంది. అయితే ఆ అదనపు నోట్లు బ్యాంకింగ్ విభాగంలో ఉన్న రిజర్వు నిధికి సమానంగా ఉంటాయి. చట్టబద్ధంగా బ్యాంకు విడుదల చేయగలిగిన అత్యధిక నోట్ల మొత్తం 140 లక్షల పౌండ్లు (దీనికి వెండి, బంగారాల రిజర్వు అక్కరలేదు. ఇది బ్యాంకుకు ప్రభుత్వం సుమారుగా బాకీ ఉన్న మొత్తం.) మించకుండా ఉండాలి. అదిగాక విలువైన లోహాన్ని బ్యాంకు సరఫరా చేయగలిగినంత మేరకు అదనపు నోట్లను విడుదల చేయవచ్చు. అంటే బ్యాంకు దగ్గర 140 లక్షల పౌండ్ల విలువైన లోహం సరఫరాలో ఉంటే ఆ బ్యాంకు 280 లక్షల

1. అప్పటి నుంచి అది ఏ మేరకు తీవ్రతరమైందో 1892 నవంబర్‌లో 15 అత్యంత పెద్ద లండన్ బ్యాంకుల రిజర్వుల అధికారిక పట్టిక (ప్రక్క పేజీలో) తెలియజేస్తుంది. ఇది 1892 డిసెంబర్ 15వ తేదీ నాటి డైలీ న్యూస్ నుంచి తీసుకోబడింది. ☛

నోట్లను విడుదల చేయగలుగుతుంది. దీనిలో 200 లక్షలు చలామణిలో ఉంటే బ్యాంకింగ్ విభాగం యొక్క రిజర్వు నిధి 80 లక్షల పౌండ్లు అవుతుంది. అప్పుడు ఈ 80 లక్షల నోట్లు చట్టబద్ధంగా బ్యాంకు చేతుల్లో ఉన్న బ్యాంకర్ పెట్టుబడి. అదే సమయంలో దాని డిపాజిట్లకు అది రిజర్వు నిధి కూడా. ఇప్పుడు బంగారం బయటికి పోవడం ప్రారంభమై విలువైన లోహపు సరఫరా 60 లక్షల పౌండ్లు తగ్గిపోతే – అంతే సంఖ్యలో నోట్లను నాశనం చేయాల్సి వుంటుంది. బ్యాంకింగ్ విభాగపు రిజర్వు 80 లక్షల నుంచి 20 లక్షలకు పడిపోతుంది. ఒకవైపున బ్యాంక్ తన వడ్డీ రేటును గణనీయంగా పెంచుతుంది. మరోవైపున ఈ బ్యాంకులో డిపాజిట్ చేసి ఇతర బ్యాంకులు, ఇతర డిపాజిటర్లు, తమ పరపతులకు ఆ బ్యాంకులో రక్షణగా వుండే రిజర్వు నిధులు పెద్ద సంఖ్యలో తగ్గిపోవడం గమనిస్తారు. 1857లో లండన్‌లో ఉన్న నాలుగు అతి పెద్ద స్టాక్ బ్యాంకులు 1844 బ్యాంకు చట్టాన్ని[1] నిలిపివేస్తూ

☛

| బ్యాంక్ పేరు | అప్పులు పౌండ్లలో | నగదు రిజర్వులు పౌండ్లలో | శాతాలు |
|---|---|---|---|
| సిటీ.... | 9,317,629 | 746,551 | 8.01 |
| క్యాపిటల్ అండ్ కౌంటీస్.... | 11,392,744 | 1,307,483 | 11.47 |
| ఇంపీరియల్ ..... | 3,987,400 | 447,157 | 11.22 |
| లాయడ్స్.... | 23,800,937 | 2,966,806 | 12.46 |
| లండన్ అండ్ వెస్ట్ మినిస్టర్ | 24,671,559 | 3,818,885 | 15.50 |
| లండన్ అండ్ సౌత్ వెస్టర్న్ | 5,570,268 | 812,353 | 14.58 |
| లండన్ జాయింట్ స్టాక్.... | 12,127,993 | 1,288,977 | 10.62 |
| లండన్ అండ్ మిడ్‌ల్యాండ్ | 8,814,499 | 1,127,280 | 12.79 |
| లండన్ అండ్ కౌంటీ..... | 37,111,035 | 3,600,374 | 9.70 |
| నేషనల్.... | 11,163,829 | 1,426,225 | 12.77 |
| నేషనల్ ప్రావిన్షియల్.... | 41,907,384 | 4,614,780 | 11.01 |
| పార్స్ అండ్ ది అలియన్స్ | 12,794,489 | 1,532,707 | 11.98 |
| ప్రెస్ కాట్ అండ్ కంపెనీ | 4,041,058 | 538,517 | 13.07 |
| యూనియన్ ఆఫ్ లండన్ | 15,502,618 | 2,300,084 | 14.84 |
| విలియమ్స్, డెకన్ అండ్ మాంచెస్టర్ అండ్ కంపెనీ | 10,452,381 | 1,317,628 | 12.06 |
| మొత్తం | 232,655,823 | 27,845,807 | 11.97 |

ఈ సుమారు 280 లక్షల మొత్తం రిజర్వులో కనీసం 250 లక్షలు బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్‌లో డిపాజిట్ చేయబడింది. ఎక్కువలో ఎక్కువ 30 లక్షలు నగదు రూపంలో 15 బ్యాంకుల ఖజానాల్లో ఉంది. అయితే 1892లో బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్ యొక్క బ్యాంకింగ్ విభాగంలో ఉన్న నగదు రిజర్వు 160 లక్షల కంటే తక్కువుంది.

1. 1844 బ్యాంక్ చట్టం నిలుపుదల బ్యాంక్ తన స్వాధీనంలో ఉన్న బంగారం రిజర్వుతో సంబంధం లేకుండా ఎంత బ్యాంక్ నోట్ల మొత్తాన్నయినా విడుదల చేయడాన్ని అనుమతించింది. ఆ రకంగా బ్యాంకులకు ఎక్స్ఛేంజి బ్రోకర్లకు వారి ద్వారా వాణిజ్యానికి అప్పు పెట్టడం కోసం దానిని ఉపయోగించడానికి అది అనుమతించింది – **ఎంగెల్స్.**

'ప్రభుత్వ లేఖ'ను బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్ గనక పొందలేకపోతే తాము తమ డిపాజిట్లను వెనక్కు తీసుకుని బ్యాంకింగ్ శాఖను దివాళా తీయిస్తామని బెదిరించాయి. ఈ రకంగా బ్యాంకింగ్ శాఖ 1847లో లాగా దాని విడుదల విభాగంలో ఎన్ని మిలియన్ల పౌండ్లున్నప్పటికీ (ఉదాహరణకు 1847లో 80 లక్షలు) చలామణిలో వున్న నోట్లు వేరే రూపంలోకి మారటానికి హామీ ఇవ్వటంలో విఫలమయింది. అయితే ఇది కూడా ఒక భ్రమే.

"బ్యాంకర్లకు స్వయంగా తక్షణ ప్రయోజనం లేని ఆ పెద్ద మొత్తం (డిపాజిట్లు) బిల్లు బ్రోకర్ల చేతుల్లోకి పోతుంది. వాళ్ళు దానికి బదులు అప్పటికే డిస్కౌంటయిన వాణిజ్య బిల్లులను బ్యాంకులు అడ్వాన్సు చేసిన మొత్తానికి హామీగా ఇస్తారు. అవసరమైనప్పుడు ఈ డబ్బును బ్యాంకర్‌కు తిరిగి చెల్లించాల్సిన బాధ్యత బిల్లు బ్రోకర్‌పై వుంటుంది. అయితే ఈ లావాదేవీల పరిమాణం ఎంత పెద్ద ఎత్తున ఉంటుందంటే బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్ ప్రస్తుత గవర్నరు నివేదికకు ఇలా సాక్ష్యమిచ్చాడు : "ఒక బ్రోకరు దగ్గర 50 లక్షల పౌండ్లున్నట్టు మాకు తెలుసు. మరొకని దగ్గర 80 లక్షల నుంచి కోటి వరకు ఉన్నట్లు మమ్మల్ని నమ్మించడం జరిగింది. ఒకని దగ్గర 4, మరొకని దగ్గర $3\frac{1}{2}$, మూడవవాని దగ్గర 8 ఉన్నాయి. నేను బ్రోకర్ల డిపాజిట్ల గురించి మాట్లాడుతున్నాను." (రిపోర్ట్ ఆఫ్ కమిటీ ఆన్ బ్యాంక్ యాక్ట్స్, 1857-58, పుట 5, సెక్షన్ 8)

"లండన్ బిల్లు బ్రోకర్లు నగదు రిజర్వు లేకుండానే తమ బిల్లుల గడువుపై ఆధారపడి ఒక్కోసారి డిస్కౌంటులో ఉన్న తమ బిల్లుల హామీపైన బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్ నుండి అడ్వాన్సులు పొందగలిగిన శక్తిపై ఆధారపడి అపారమైన స్థాయిలో లావాదేవీలు నడిపారు." (అదే నివేదిక, పుట VIII, సెక్షన్ 17) "1847లో రెండు బిల్లు బ్రోకింగ్ సంస్థలు లండన్‌లో చెల్లింపుల్ని నిలిపివేశాయి. రెండు సంస్థలు తర్వాత వాణిజ్యాన్ని తిరిగి ప్రారంభించాయి. 1857లో మళ్ళీ వాణిజ్యాన్ని అవి ఆపేశాయి. 1847లో వాటి బకాయిలు సుమారు 2,683,000 పౌండ్లు. వాటి పెట్టుబడి 180,000 పౌండ్లు. 1857లో ఒకదాని బకాయిలు 5,300,000 పౌండ్లు. దాని పెట్టుబడి 1847తో పోలిస్తే నాలుగో వంతుకు మించి లేదు. మరో సంస్థ బకాయిలు 1847లోనూ, 1857లోనూ వరుసగా 3,000,000 పౌండ్లు, 4,000,000 పౌండ్లు వున్నాయి. దాని పెట్టుబడి ఈ రెంటిలో ఏ సందర్భంలోనూ 45,000 పౌండ్లకు మించి లేదు." (అదే నివేదిక, పుట XXII, సెక్షన్ 52).

★ ★ ★

## అధ్యాయం - 30

# డబ్బు పెట్టుబడి, నిజ పెట్టుబడి – I

**ప**రపతి వ్యవస్థకు సంబంధించి మనం పరిశీలించబోతున్న అత్యంత క్లిష్టమైన ప్రశ్నలు ఇలా ఉంటాయి :

**మొదటిది :** వాస్తవ డబ్బు పెట్టుబడి సంచయనం. ఏ మేరకు అది వాస్తవ పెట్టుబడి సంచయనానికి అనగా విస్తృత స్థాయిలో పునరుత్పత్తికి ఇది సూచికగా ఉంటుంది లేక ఉండదు. వడ్డీనిచ్చే పెట్టుబడి, అంటే డబ్బు పెట్టుబడికి సంబంధించి మాత్రమే ఉపయోగించే 'పెట్టుబడి వాపు' (plethora of capital) అనే వ్యక్తీకరణ పారిశ్రామిక అధికోత్పత్తిని వ్యక్తం చేసే ఒక ప్రత్యేక విధానమేనా లేక దాంతోబాటు అది వేరే దృగ్విషయాన్ని కల్పిస్తున్నదా? ఈ వాపు లేదా డబ్బు పెట్టుబడి యొక్క అతి సరఫరా అన్నది డబ్బు మొత్తాలు (వెండి, బంగారాలు, బంగారు నాణాలు, బ్యాంకు నోట్లు) స్తంభించిపోవడంతో పాటు ఏకకాలంలో జరుగుతుందా? అంటే వాస్తవమైన డబ్బు అతిగా లభ్యంగావడం అన్నది అప్పు పెట్టుబడి వాపు యొక్క బాహ్యరూపంగా వ్యక్తమౌతుందా?

**రెండోది :** డబ్బు కొరత అన్నది అంటే అప్పు పెట్టుబడి కొరత అన్నది ఏ మేరకు నిజ పెట్టుబడి (సరుకు పెట్టుబడి, ఉత్పాదక పెట్టుబడి) కొరతను వ్యక్తం చేస్తుంది? అది ఏ మేరకు డబ్బుగా డబ్బు కొరత అనగా చలామణి సాధనం యొక్క కొరతతో పాటు ఉంటుంది?

ఇంతవరకూ మనం పరిశీలించిన మేరకు డబ్బు పెట్టుబడి సంచయనం యొక్క విశేష రూపాన్ని, దరహం మీద డబ్బు సంపదను వాటి ప్రత్యేక రూపంలో పరిశీలించిన మేరకు అవి శ్రమపైన యాజమాన్యపు హక్కుల సంచయనంగా రుజువైంది. జాతీయ రుణాల పెట్టుబడి సంచయనం అంటే పన్ను రాబడిలో ఒక భాగంపైన హక్కును ప్రకటించే ప్రత్యేక సదుపాయం కలిగిన పరపతిదారుల వర్గం పెరుగుతోందని మాత్రమే అర్థం.[1] ఈ వాస్తవాలు ఆధారంగా రుణాల సంచయనం అన్నది

---

1. పబ్లిక్ ఫండ్ అంటే ఊహాజనిత పెట్టుబడి తప్ప వేరుకాదు. రుణాన్ని తీర్చడానికి పక్కన వుంచే వార్షిక ఆదాయంలో ఒక భాగాన్ని అది సూచిస్తుంది. దానితో సమానమైన పెట్టుబడి మొత్తం ఖర్చు చేయబడింది. అది రుణానికి ఆధారంగా ఉపయోగపడుతుంది. అయితే అది పబ్లిక్ నిధికి ప్రాతినిధ్యం వహించదు. ఎందుకంటే పెట్టుబడి ఇపుడు లేదు. కొత్త సంపదను పరిశ్రమ ద్వారా సృష్టించాల్సి వుంటుంది. ప్రతి ఏటా ఈ సంపదలో ఒక భాగాన్ని ముందుగానే ఈ ఖర్చయిపోయిన సంపదను అప్పుగా ఇచ్చిన వారికోసం కేటాయించాల్సి వుంటుంది. ఈ సంపదను ఉత్పత్తి చేసే వారి నుంచి పన్నుల రూపంలో తీసుకుని ప్రభుత్వానికి రుణమిచ్చిన వారికి ఇవ్వబడుతుంది. దేశంలో ఆనవాయితీగా వున్న పెట్టుబడి, వడ్డీల మధ్య నిష్పత్తి ప్రకారం ఊహాజనిత పెట్టుబడి ఉన్నట్టు భావించబడుతుంది. ఈ రుణదాతలు పొందే వార్షిక ఆదాయాన్ని ఇచ్చే మొత్తానికి ఈ ఊహాజనిత పెట్టుబడి సమానమవుతుంది. (సిస్మండి, నోలియే ప్రిన్సిపెస్, రెండవ కూర్పు, పారిస్, 1827, పుట 230)

పెట్టుబడి సంచయనంగా కనిపించడంతో పరపతి వ్యవస్థలోని వక్రీకరణ పరాకాష్టకు చేరుకున్న విషయం స్పష్టంగా తెలుస్తుంది. చాలా కాలం క్రితమే ఖర్చు చేయబడిన, అప్పు తీసుకోబడిన పెట్టుబడికి ఇవి ప్రామిసరీ నోట్లు. వినియోగమైపోయిన పెట్టుబడికి ఇవి నకళ్ళు. అవి విక్రయ సరుకులుగా ఉన్న మేరకు వాటి యజమానులకు పెట్టుబడిగా ఉపకరిస్తాయి. కనుక వాటిని పెట్టుబడిగా తిరిగి మార్చుకోవచ్చు.

పబ్లిక్ వర్క్స్, రైల్వేలు, గనులు వగైరాల యాజమాన్యపు పట్టాలు నిజమైన పెట్టుబడికి పట్టాలని మనం ఇంతకుముందు గమనించాం. అయితే ఇవి ఈ పెట్టుబడిని ఒకని స్వాధీనంలో ఉంచవు. అయితే దానిని ఉపసంహరించుకోడానికి వీలుపడదు. ఆ పెట్టుబడి ద్వారా ఉత్పత్తి చేయబడే అదనపు విలువలో ఒక భాగంపైన చట్టబద్ధమైన హక్కుల్ని మాత్రమే అవి వ్యక్తం చేస్తాయి. అయితే అదే విధంగా ఈ పట్టాలు కూడా వాస్తవమైన పెట్టుబడికి కాగితపు నకళ్ళుగా మారతాయి. ఓడలో ఉన్న సరుకుకు భిన్నమైన ప్రత్యేకమైన విలువను లేడింగ్ బిల్లులు ఏక సమయంలో సంతరించుకున్నట్టే ఇది కూడా. అవి అస్తిత్వంలో లేని పెట్టుబడికి నామమాత్ర ప్రాతినిధ్యం వహిస్తాయి. ఎందుకంటే వాస్తవమైన పెట్టుబడి వాటితోపాటు ప్రక్కనే ఉంటుంది. ఈ నకళ్ళు ఒక వ్యక్తి నుంచి వేరొక వ్యక్తికి బదిలీ కావటం కారణంగా పెట్టుబడి చేతులు మారదు. అవి వడ్డీ ఇచ్చే పెట్టుబడి రూపాన్ని సంతరించు కుంటాయి. అవి ఒక నిర్దిష్ట ఆదాయానికి హామీ ఇవ్వటంచేత మాత్రమే కాక వాటి అమ్మకం ద్వారా పెట్టుబడి విలువలుగా వాటిని తిరిగి చెల్లించటం అన్నది సాధ్యమవటం వల్ల కూడా అవి ఈ రూపాన్ని తీసుకోగలుగుతాయి. ఈ కాగితపు నకళ్ళ సంచయనం రైల్వేల, గనుల, ఆవిరి నౌకల సంచయనాన్ని వ్యక్తం చేసిన మేరకు అది వాస్తవ పునరుత్పత్తి ప్రక్రియను వ్యక్తం చేస్తుంది. ఉదాహరణకు చరాస్తిపైన పన్నుల జాబితా విస్తరించటం అన్నది ఆ ఆస్తి విస్తరణను సూచించినట్టే ఇది కూడా. ఈ నకళ్ళు సరుకులుగా లావాదేవీలకు గురవుతాయి. ఆ విధంగా అవి పెట్టుబడి విలువలుగా చలామణి అవుతాయి. కనుక ఈ నకళ్ళు అవాస్తవమైనవి. నిజమైన పెట్టుబడికి హక్కు పత్రాలైనా, నిజమైన పెట్టుబడి విలువ చలనంతో ప్రమేయం లేకుండా ఈ నకళ్ళ విలువ స్వతంత్రంగా తరగనూవచ్చు, పెరగనూ వచ్చు. వాటి విలువ అనగా వాటి స్టాక్ ఎక్స్చేంజి ధరలకు వడ్డీ రేటు పడిపోయినప్పుడు పెరిగే ధోరణి ఉంది. డబ్బు పెట్టుబడికి స్వభావసిద్ధమైన చలనాలతో ప్రమేయం లేకుండా ఇలా పడిపోవడం లాభం రేటు పడిపోయే ధోరణి వల్ల మాత్రమే అయినపుడు ఈ ఊహాజనిత సంపద పెట్టుబడిదారీ ఉత్పత్తి క్రమంలో ఈ కారణంచేతనే విస్తరిస్తుంది. ఇది ప్రత్యేక తొలి నామమాత్ర విలువ కలిగిన ప్రతి సమ విభాగం విషయంలో వ్యక్తమయిన విలువ ప్రకారం ఇది జరుగుతుంది.[1]

ఈ పట్టాల ధరలలో ఆటుపోటుల ద్వారా ఇవి లాభనష్టాలకు గురికావటమూ, ఇవి రైల్వేల

1. పోగుబడిన అప్పు ఇవ్వదగిన డబ్బు పెట్టుబడిలో ఒక భాగం నిజానికి పారిశ్రామిక పెట్టుబడికి వ్యక్తీకరణ మాత్రమే. ఉదాహరణకు 1857లో అమెరికన్ రైల్వేలోను, ఇతర పరిశ్రమలలోను ఇంగ్లండ్ 8 కోట్ల పౌండ్లను మదుపు పెట్టినపుడు దాదాపు ఈ మదుపు మొత్తం ఇంగ్లండే సరుకులను ఎగుమతి చేయటం ద్వారానే జరిగింది. దానికి బదులు అమెరికన్లు చెల్లింపులు చేయాల్సిన అవసరం లేకపోయింది. ఇంగ్లండ్ ఎగుమతిదారులు ఈ సరుకులపైన మార్పిడి బిల్లులను తీసుకున్నారు. వాటిని ఇంగ్లండ్ స్టాక్ ఖాతాదారులు కొనుక్కున్నారు. ఆ బిల్లులను అమెరికాలో స్టాక్ ఖాతాలను కొనటానికి అమెరికా పంపించారు.

గుత్తాధిపతుల చేతుల్లో కేంద్రీకరించబడటమూ కారణంగా వాటి స్వభావం రీత్యా అవి రానురాను మరింతగా జూదవ్యవహారంగా మారతాయి. అవి పెట్టుబడి సంపదను సంపాదించే తొలి పద్ధతి అయిన శ్రమ స్థానాన్ని ఆక్రమించుకుంటున్నట్టు కనిపిస్తాయి. శారీరక పశుబలం స్థానాన్ని కూడా ఆక్రమిస్తుంది. ఈ తరహా ఊహాజనిత ధన సంపద ప్రైవేటు వ్యక్తుల ధన సంపదలో గణనీయమైన భాగాన్ని కలిగి ఉంటుంది. అంతేగాక ఇంతకు ముందే మనం సూచించినట్లుగా బ్యాంకర్ల పెట్టుబడిలో కూడా గణనీయమైన భాగాన్నది ఆక్రమిస్తుంది.

ఈ అంశాన్ని త్వరితంగా తేల్చటం కోసం డబ్బు సంపద సంచయనం అంటే ఒకవైపున ప్రైవేటు డబ్బు పెట్టుబడిదారుకు, మరోవైపున ప్రభుత్వం, సామాజిక వర్గాలు, పునరుత్పత్తి చేసే రుణ గ్రహీతలకు మధ్య దళారీలుగా వ్యవహరించే బ్యాంకర్ల (వృత్తిరీత్యా రుణదాతలు) చేతుల్లో సంపద సంచయనమే అని అర్థం అని చెప్పాల్సి ఉంటుంది. ఎందుకంటే మొత్తం విస్తృతమైన పరపతి వ్యవస్థ విస్తరణను మొత్తంగా పరపతి సౌకర్యాన్ని వారు తమ ప్రైవేటు పెట్టుబడిగా వినియోగించుకుంటారు. వీరు ఎప్పుడూ పెట్టుబడిని, ఆదాయాన్ని డబ్బు రూపంలో లేదా డబ్బుపైన ప్రత్యక్ష హక్కుల రూపంలో కలిగి ఉంటారు. ఈ వర్గం యొక్క సంపద సంచయనం అన్నది వాస్తవ సంచయనం కంటే పూర్తిగా భిన్నంగా జరగవచ్చు. ఏమైనప్పటికీ ఈ వర్గం వాస్తవ సంచయనంలో ఒక గణనీయమైన భాగాన్ని జేబులో వేసుకుంటుంది.

మన ముందున్న సమస్య పరిధిని కుదిద్దాం. అప్పివ్వదగిన పెట్టుబడికి, వడ్డీకోసం ఉద్దేశింపబడిన పెట్టుబడికి స్టాకులు, తదితర అన్ని రకాల సెక్యూరిటీల లాగానే ప్రభుత్వ సెక్యూరిటీలు కూడా మదుపు రంగాలే. అటువంటి పెట్టుబడిని అప్పిచ్చే రూపాలవి. వాటిలో అప్పు పెట్టుబడి ఉన్నప్పటికీ వాటంతటవే అప్పు యిచ్చే పెట్టుబడి కాదు. పునరుత్పత్తి ప్రక్రియలో పరపతి ప్రత్యక్ష పాత్ర నిర్వహించే మేరకు ఒకవైపున పారిశ్రామికునికి వ్యాపారికి తమ బిల్లులు డిస్కౌంటు కావాలని, రుణం లభించాలని కోరుకుంటున్నప్పుడు కావల్సింది స్టాకులూ కాదు, ప్రభుత్వ సెక్యూరిటీలూ కాదు. అతనికి కావాల్సింది, డబ్బు. మరే రకంగానూ డబ్బు సేకరించలేనప్పుడు అతను ఆ సెక్యూరిటీలను తాకట్టు పెడతాడు లేదా అమ్ముతాడు. ఈ అప్పు పెట్టుబడి సంచయనం గురించి మరింత ప్రత్యేకించి అప్పివ్వదగిన డబ్బు పెట్టుబడి సంచయనం గురించే మనం ఇక్కడ పరిశీలించాలి. ఇక్కడ ఇల్లు, యంత్రాలు లేదా ఇతర నిశ్చల పెట్టుబడి రూపంలో ఉన్న అప్పుతో మనకు ప్రమేయం లేదు. పరిశ్రమదారులు, వ్యాపారులు పునరుత్పత్తి ప్రక్రియ పరిధిలోనూ, సరుకుల్లోనూ ఒకరికొకరు ఇచ్చుకునే అడ్వాన్సులతో కూడా మనకిక్కడ ప్రమేయం లేదు. అయితే ఈ అంశాన్ని ముందుగా మనం మరింత వివరంగా పరిశీలించాల్సిన అవసరం ఉంది. మనం ప్రధానంగా పరిశీలించాల్సిన అంశం పరిశ్రమదారులకు, వ్యాపారులకు, దళారులకు బ్యాంకర్లు ఇచ్చే డబ్బు రుణాలు మాత్రమే.

★ ★ ★

కనుక వ్యాపార పరపతితో అనగా పునరుత్పత్తిలో నిమగ్నమయిన పెట్టుబడిదారులు ఒకరికొకరు ఇచ్చుకునే పరపతి సౌకర్యంతో మన విశ్లేషణ ప్రారంభిద్దాం. పరపతి వ్యవస్థకు అది పునాదిగా

ఉంటుంది. మార్పిడి బిల్లుకు అనగా ఒక నిర్దిష్ట చెల్లింపు కాలపరిమితి కలిగిన ప్రామిసరీ నోటుకు తర్వాత భవిష్యత్తులో చెల్లించబడే పత్రానికి ప్రతినిధి మాత్రమే. ప్రతి ఒక్కరూ ఒక చేత్తో పరపతిని ఇస్తూ, మరో చేత్తో పరపతిని స్వీకరిస్తారు. పూర్తిగా వేరే రంగానికి చెందిన బ్యాంకర్ల పరపతి సౌకర్యాన్ని మన పరిశీలన నుంచి పూర్తిగా తొలగిద్దాం. చెల్లింపు సాధనాలుగా ఒకరికొకరు దఖలుపర్చిన పత్రాలుగా ఈ మార్పిడి బిల్లులు వ్యాపారుల మధ్య చలామణిలో ఉన్న మేరకు (డిస్కౌంటింగ్ మధ్యవర్తిత్వం లేదనుకుందాం) అది కేవలం 'అ' నుంచి 'ఆ'కు హక్కులు బదిలీ కావటం మాత్రమే. విషయాన్ని అది ఏమాత్రం మార్చదు. ఒక వ్యక్తి స్థానంలోకి మరో వ్యక్తి వస్తాడు – అంతే. డబ్బు జోక్యం లేకుండానే ఈ సందర్భంలో సైతం ఆదాన ప్రదానాలు జరుగుతాయి. ఉదాహరణకు 'అ' నూలు వడికేవాడు 'ఆ' అనే కాటన్ బ్రోకర్‌కు ఒక బిల్లు చెల్లించాల్సి ఉంటుంది. 'ఆ' దిగుమతిదారుడు 'ఇ'కి చెల్లించాల్సి ఉంటుంది. ఇప్పుడు 'ఇ' కూడా నూలు ఎగుమతి చేస్తే తరచుగా ఏం జరుగుతుందంటే అతడు 'అ' నుంచి మార్పిడి బిల్లు ఆధారంగా నూలు కొనుగోలు చేయవచ్చు. 'అ' బ్రోకర్ 'ఆ' కు బ్రోకర్ సొంత బిల్లు రూపంలోనే చెల్లించవచ్చు. ఈ బిల్లు 'ఇ' నుంచి పొందబడిన బిల్లు. మహా అయితే చెల్లించాల్సిన శేషం డబ్బు రూపంలో చెల్లించబడుతుంది. ఆ రకంగా ఆ మొత్తం లావాదేవీలో పత్తి, నూలు పరస్పర మార్పిడి మాత్రమే జరుగుతుంది. ఎగుమతిదారుడు నూలు వడికేవానికి మాత్రమే ప్రాతినిధ్యం వహిస్తాడు. కాటన్ బ్రోకర్ అలాగే పత్తి పండించే వానికి ప్రాతినిధ్యం వహిస్తాడు.

ఈ శుద్ధ వాణిజ్య పరపతికి చెందిన ఆవృత్తంలో రెండు అంశాలను గమనించాలి.

**మొదటిది –** ఈ పరస్పర హక్కు పత్రాల పరిష్కారం పెట్టుబడి తిరిగి రావడంపైన అనగా స–డ పైన ఆధారపడి ఉంటుంది. ఆ చెల్లింపు కేవలం వాయిదా తర్వాత జరిగింది. నూలు వడికే వ్యక్తి జౌళి వస్త్రాలు తయారు చేసే వ్యక్తి నుంచి మార్పిడి బిల్లును పొందాడు. వాటిని తయారు చేసే వ్యక్తి మార్కెట్లో తన వస్త్రాలను అమ్మగలిగితే ఆ మొత్తాన్ని చెల్లించగలుగుతాడు. ధాన్యపు సట్టా వ్యాపారి తన ఏజెంట్ నుంచి తీసుకున్న మార్పిడి బిల్లును ఆ ఏజెంట్ చెల్లించాలంటే ఈ మధ్యలో ఊహించిన ధరకు ఆ ధాన్యాన్ని అమ్మగలగాలి. కనుక ఈ చెల్లింపులు పునరుత్పత్తిపైన అనగా ఉత్పత్తి, వినియోగ ప్రక్రియ సాఫీగా నడవడంపైన ఆధారపడి ఉంటుంది. ఈ పరపతి సౌకర్యాలు పరస్పర ఆధారితాలు గనుక ఒకరు రుణ విముక్తులవడం అన్నది మరొకరు రుణ విముక్తులవటం పైన ఆధారపడి ఉంటుంది. ఎందుకంటే, మార్పిడి బిల్లు ఇచ్చిన వ్యక్తి తన సొంత వ్యాపారంలో పెట్టుబడి తిరిగి రావడంపైన ఆధారపడి ఉంటాడు లేదా తాను పుచ్చుకున్న మరో వ్యక్తి మార్పిడి బిల్లు ఈలోగా సకాలంలో డబ్బు రూపంలో మారుతుందని అంచనా వేసుకుంటాడు. పెట్టుబడి తిరిగి వచ్చే అవకాశం కాక చెల్లింపు అన్నది మార్పిడి బిల్లును ఇచ్చే వ్యక్తి దగ్గర రిజర్వ్ పెట్టుబడి ఉండటం ద్వారానే సాధ్యమవుతుంది. పెట్టుబడి తిరిగి రావడమన్నది ఆలస్యమైతే తన మార్పిడి బిల్లుకు చెల్లించటానికి ఇది అవసరం.

**రెండోది –** ఈ పరపతి వ్యవస్థ నగదు చెల్లింపుల్ని అనవసరం చేయదు. వేతనాలు, పన్నులు వగైరాల విషయంలో ఒక పెద్ద భాగం ఖర్చు నగదు రూపంలోనే ఉంటుంది. అంతేగాక 'ఇ' నుంచి నగదు చెల్లింపునకు బదులు మార్పిడి బిల్లును స్వీకరించిన పెట్టుబడిదారుడు ఆ, ఇ బిల్లు గడువు

రాకముందే ఈకి తన బిల్లును చెల్లించాల్సి రావచ్చు. అందుకు అతని దగ్గర నగదు సిద్ధంగా ఉండాలి. పైన ఊహించిన ఒక సంపూర్ణ పునరుత్పత్తి ఆవృత్తం అనగా పత్తి పండించే వాని దగ్గర నుంచి వడికే వానికి, ఆ తర్వాత మళ్ళీ వెనక్కి జరిగే ఆవృత్తం కేవలం అరుదుగా మాత్రమే సాధ్యమవుతుంది. చాలాచోట్ల అది నిరంతరాయంగా అంతరాయానికి గురవుతుంది. పునరుత్పత్తి ప్రక్రియ గురించి ఇంతకు ముందు జరిగిన చర్చలో[1] స్థిర పెట్టుబడి ఉత్పత్తిదారులు స్థిరపెట్టుబడిలో కొంత భాగాన్ని పరస్పరం మార్పిడి చేసుకుంటారు అని గమనించాం. ఫలితంగా ఏదో ఒకమేరకు ఈ మార్పిడి బిల్లులు పరస్పరం రద్దు చేసుకుంటాయి. అదే రకంగా ఉత్పత్తి రంగంలో పత్తి బ్రోకర్ దూది వడికే వ్యక్తి నుంచి, వడికే వ్యక్తి జౌళి వస్త్రాల కార్ఖానాదారు నుంచి, కార్ఖానాదారుడు ఎగుమతిదారుని నుంచి, ఎగుమతిదారుడు (బహుశా జౌళి వస్త్రాల) దిగుమతిదారుని నుంచి మార్పిడి బిల్లులు స్వీకరిస్తారు. అయితే ఈ లావాదేవీల ఆవృత్తం ఈ హక్కు పత్రాల పరంపర డబ్బుగా మారడం అన్నది ఒకే సమయంలో జరగదు. ఉదాహరణకు యంత్ర నిర్మాత నుంచి బొగ్గు వ్యాపారికి ముట్టాల్సిన సొమ్ము, నేతగాని నుంచి వడికే వ్యక్తికి ముట్టాల్సిన సొమ్ముకు పరిష్కారం కాదు. వడికే వ్యక్తి తన వ్యాపారంలో యంత్ర నిర్మాత నుంచి ఎటువంటి సొమ్మునూ ఆశించడు. ఎందుకంటే అతని ఉత్పాదితమైన నూలు యంత్ర నిర్మాత పునరుత్పత్తి ప్రక్రియలో ఒక అంశంగా ఎప్పుడూ ప్రవేశించదు. కనుక కొన్ని బకాయిలు నగదు రూపంలోనే చెల్లించబడతాయి.

వాణిజ్య పరపతి పరిమితుల్ని పరిశీలిస్తే అవి 1) పరిశ్రమదారుల, వ్యాపారుల పెట్టుబడి తిరిగి రావడం ఆలస్యమైన సందర్భాలలో వారి సంపద అంటే వారి ఆధీనంలో ఉన్న రిజర్వ్ పెట్టుబడి. 2) అలా తిరిగి వచ్చే పెట్టుబడులు. పెట్టుబడి తిరిగి రావడంలో ఆలస్యం జరగవచ్చు. లేదా ఈలోగా సరుకుల ధరలు పడిపోవచ్చు లేదా మార్కెట్ స్తంభించడం వల్ల తాత్కాలికంగా ఆ సరుకులు అమ్ముడు పోకపోవచ్చు. ఈ మార్పిడి బిల్లులు ఎంత ఎక్కువ కాలం వాయిదాపడితే అంత పెద్ద మొత్తంలో రిజర్వ్ పెట్టుబడి అవసరమవుతుంది. మార్కెట్లో ధరలు పడిపోవడం వల్ల లేదా మాంద్యం వల్ల పెట్టుబడి తిరిగి రావడం ఆలస్యం కావచ్చు లేదా తగ్గిపోవచ్చు. అంతేగాక ఈ లావాదేవీ సరుకు ధరల పెరుగుదల తరుగుదల సట్టా వ్యాపారానికి ఎంతగా గురయితే తిరిగి వచ్చే సొమ్ముకు అంత తక్కువ హామీ ఉంటుంది. అయితే శ్రమ ఉత్పాదక శక్తి అభివృద్ధి చెందటంతో పాటు భారీస్థాయిలో ఉత్పత్తి జరగటం వల్ల 1) మార్కెట్లు విస్తరిస్తాయి, ఉత్పత్తి స్థానం నుంచి మరింత దూరప్రాంతానికి పాకుతాయి. 2) రుణ సౌకర్యం కాలపరిమితి పెంచాల్సి ఉంటుంది. 3) ఈ లావాదేవీలపై సట్టా వ్యాపారపు అంశం రానురాను మరింతగా ప్రాబల్యం వహిస్తుంది. దూరప్రాంతాలలో మార్కెట్ల కోసం భారీ స్థాయిలో జరిగే ఉత్పత్తి మొత్తం ఉత్పాదితాన్ని వాణిజ్యం చేతులలోకి నెడుతుంది. అయితే మొత్తం జాతీయ ఉత్పాదితాన్ని వాణిజ్యం తన సొంత పెట్టుబడితోనే కొనుగోలు చేసి తిరిగి అమ్మ గలిగిన స్థాయిలో ఒక జాతీయ పెట్టుబడి రెట్టింపు కావడమన్నది అసాధ్యం. కనుక ఇక్కడ పరపతి అన్నది అనివార్యం. ఉత్పత్తి విలువ పరిమాణం పెరగటంతోపాటు పరపతి పరిమాణం కూడా పెరుగుతుంది. మార్కెట్ల దూరం పెరుగుతున్న కొద్దీ పరపతి కాలపరిమితి కూడా పెరుగుతుంది.

1. పెట్టుబడి రెండవ సంపుటి - సం

ఇక్కడ పరస్పరం చర్య, ప్రతిచర్య జరుగుతాయి. ఉత్పత్తి ప్రక్రియ అభివృద్ధి పరపతిని విస్తరింప జేస్తుంది. పరపతి సౌకర్యం అన్నది పారిశ్రామిక వాణిజ్య కార్యకలాపాల విస్తరణకు దారితీస్తుంది.

బ్యాంకర్ల పరపతి సౌకర్యం నుంచి వేరుచేసి ఈ పరపతి సౌకర్యాన్ని పరిశీలిస్తే పారిశ్రామిక పెట్టుబడి పరిమాణం పెరుగుదలతోపాటు అది కూడా పెరుగుతుందని స్పష్టమవుతుంది. రుణ పెట్టుబడి పారిశ్రామిక పెట్టుబడి సర్వసమానం. ఇక్కడ అప్పివ్వబడిన పెట్టుబడి సరుకు పెట్టుబడే. అది వ్యక్తిగత వినియోగం కోసం లేదా ఉత్పాదక పెట్టుబడి స్థిర అంశాలను భర్తీ చేయడానికి ఉద్దేశించబడింది. ఇక్కడ రుణ పెట్టుబడిగా కనిపించేది పునరుత్పత్తి ప్రక్రియ యొక్క ఒక నిర్దిష్ట దశలో ఉన్న పెట్టుబడి మాత్రమే. అయితే క్రయ విక్రయాల ద్వారా ఒక వ్యక్తి నుంచి మరో వ్యక్తికి పోతుంది. ఒక నిర్ణీత గడువుకు ముందు అది దానికి సమానమైన మొత్తాన్ని దాని కొనుగోలుదారుడు చెల్లించడు. ఉదాహరణకు మార్పిడి బిల్లుతో నూలు వడికే వ్యక్తికి పత్తి బదిలీ అవుతుంది. జౌళి మిల్లు యజమానికి నూలు మార్పిడి బిల్లు కోసం బదిలీ అవుతుంది. వ్యాపారి మార్పిడి బిల్లు ఇచ్చి జౌళి వస్త్రాలను పొందుతాడు. ఎగుమతిదారుడు మార్పిడి బిల్లుతో ఆ జౌళి వస్త్రాలను పొందుతాడు. తర్వాత ఇండియాలో ఉన్న ఒక వ్యాపారి దగ్గర బిల్లు గ్రహించి ఈ వస్త్రాలు అతనికి పంపబడతాయి. అతడా వస్త్రాలను అమ్మి దానికి బదులు నీలిమందు వగైరా కొంటాడు. ఒక చేతి నుంచి మరో చేతికి ఈ బదిలీ జరుగుతున్నప్పుడు పత్తి వస్త్రంగా రూపాంతరం చెందింది. జౌళి వస్త్రాలు చివరికి ఇండియాకు ఎగుమతి అయ్యాయి. నీలిమందుతో మార్పిడి అయ్యాయి. నీలిమందు యూరప్ కోసం ఓడకు ఎత్తబడింది. యూరప్‌లో అది తిరిగి పునరుత్పత్తి ప్రక్రియలో ప్రవేశిస్తుంది. పునరుత్పత్తి ప్రక్రియ వివిధ దశలు పరపతి సౌకర్యంచేత పెంపొందించబడతాయి. ఈ క్రమంలో నూలు వడికే వ్యక్తి పత్తి కోసమూ, జౌళి మిల్లు యజమాని నూలు కోసమూ, వ్యాపారి జౌళి వస్త్రాల కోసమూ వెంటనే ఏమీ చెల్లించరు. ఈ ప్రక్రియ మొదటి దశల్లో పత్తి అనే సరుకు వివిధ ఉత్పత్తి దశలగుండా పయనిస్తుంది. దానిని పరపతి సౌకర్యం పెంపొందిస్తుంది. పత్తి ఉత్పత్తితో సరుకుగా అంతిమ రూపం ధరించినపుడు ఈ సరుకు పెట్టుబడి కేవలం వివిధ వ్యాపారుల చేతులగుండా దూరంగా ఉన్నా మార్కెట్లకు పోతుంది. అంతిమంగా వ్యాపారి దానిని వినియోగదారునికి అమ్మి దాని బదులు వేరే సరుకులను కొంటాడు. ఆ సరుకులు అక్కడ వినియోగంకానూవచ్చు లేదా పునరుత్పత్తి ప్రక్రియలో ప్రవేశించనూవచ్చు. కనుక ఇక్కడ రెండు దశలను విడదీయడం అవసరం. మొదటి దశలో ఒకే వస్తువు ఉత్పత్తిలో వాస్తవంగా వరుసగా వచ్చే దశలను పరపతి సౌకర్యం పెంపొందిస్తుంది. రెండోదానిలో అది కేవలం ఆ వస్తువును ఒక వ్యాపారి నుంచి మరో వ్యాపారికి బదిలీ చేస్తుంది. ఇందులో రవాణా కూడా ఇమిడి ఉంది. మరో రకంగా చెప్పాలంటే స-డ ప్రక్రియ ఇక్కడ అమలు జరిగింది. అయితే ఇక్కడ కూడా సరుకు కనీసం చలామణి ప్రక్రియలో ఉంది. అంటే పునరుత్పత్తి ప్రక్రియ యొక్క ఒక దశలో ఉంది.

కనుక ఇక్కడ అప్పివ్వబడే పెట్టుబడి ఎప్పుడూ అనుత్పాదక పెట్టుబడి కాదు. ఈ పెట్టుబడి తన యజమాని చేతిలో రూపం మార్చుకోవాల్సి ఉంది. అతని దృష్టిలో కేవలం సరుకు పెట్టుబడి రూపంలోనే ఉంటుంది. దాని రూపాన్ని అతడు తిరిగి మార్చాలనుకుంటాడు. కనీసం డబ్బుగా

మార్చాలనుకుంటాడు. కనుక పరపతి సౌకర్యం ఇక్కడ పెంపొందిస్తున్నది సరుకుల రూపాంతరాన్నే. కనుక స-డ మాత్రమే గాక డ-స ని కూడా అంటే వాస్తవ ఉత్పత్తి ప్రక్రియను కూడా అది పెంపొందిస్తుంది. పునరుత్పత్తి ఆవృత్తంలో పరపతి సౌకర్యానికి చెందిన పెద్ద పరిమాణం (బ్యాంకర్ పరపతి సౌకర్యాన్ని మినహాయించాలి.) అనుత్పాదక పెట్టుబడి పెద్ద పరిమాణంలో ఉండటాన్ని సూచించదు. అనుత్పాదక పెట్టుబడి లాభదాయకమైన మదుపు కోసం ఎదురు చూస్తుంటుంది. ఇక్కడ వాస్తవంగా ఉన్నది పునరుత్పత్తి ప్రక్రియలో పెద్ద స్థాయిలో వినియోగించబడిన పెట్టుబడి అని అర్థం. పరపతి సౌకర్యం ఇక్కడ రెండు అంశాలను పెంపొందిస్తుంది. ఒకటి - పారిశ్రామిక పెట్టుబడులకు సంబంధించిన మేరకు పారిశ్రామిక పెట్టుబడిని ఒక దశనుంచి మరో దశకు పరివర్తన కావటాన్ని సాధ్యం చేస్తుంది. పరస్పర సంబంధం కలిగిన ఉత్పత్తి రంగాలను కలుపుతుంది. రెండు - వ్యాపారులకు సంబంధించినంత మేరకు సరుకులను ఒకరి నుంచి మరొకరికి రవాణా చేస్తుంది. బదిలీ చేస్తుంది. ఇది డబ్బు కోసం ఒక నిర్దిష్టమైన స్థాయిలో అమ్మకం జరిగేదాకానో లేదా ఇతర సరుకులతో మార్పిడి జరిగేదాకానో నడుస్తుంది.

ఇక్కడ పరపతి సౌకర్యంలో అత్యధిక భాగం పారిశ్రామిక పెట్టుబడి అత్యధిక వినియోగంతో సమానం. అంటే వినియోగం పరిమితులతో ప్రమేయం లేకుండా దాని పునరుత్పత్తి శక్తిని పూర్తిగా చివరదాకా వినియోగించటం. పునరుత్పత్తి ప్రక్రియను కడదాకా వినియోగించటం ద్వారా వినియోగం పరిమితులు కూడా విస్తరిస్తాయి. ఒకవైపున కార్మికులు, పెట్టుబడిదారులు కూడా ఆదాయాన్ని వినియోగం చేయటం దీనివల్ల పెరుగుతుంది. మరోవైపున ఇది ఉత్పాదక వినియోగాన్ని కడదాకా ఉపయోగించటంతో సమానం.

పునరుత్పత్తి ప్రక్రియ నిరంతరాయంగా సాగుతున్నంత కాలం, ప్రతిఫలం తిరిగి రావటం ఖాయంగా ఉన్నంత కాలం ఈ పరపతి సౌకర్యం ఉంటుంది; విస్తరిస్తుంది. పైగా దాని విస్తరణ పునరుత్పత్తి ప్రక్రియ విస్తరణపైనే ఆధారపడి ఉంది. ప్రతిఫలం తిరిగి రావడంలో జాప్యం వల్ల, సరుకులతో నిండిపోయిన మార్కెట్ల వల్ల లేదా ధరలు పడిపోవం వల్ల ఈ ప్రక్రియ స్తంభించగానే పారిశ్రామిక పెట్టుబడి అతి విస్తారంగా కనిపిస్తుంది. అయితే అది తన పని నిర్వహించలేని రూపంలో కనిపిస్తుంది. భారీ పరిమాణాల్లో సరుకు పెట్టుబడి అమ్మకానికి నోచుకోకుండా పడివుంటుంది. భారీ పరిమాణాల్లో నిశ్చల పెట్టుబడి పునరుత్పత్తి మాంద్యం వల్ల పెద్ద స్థాయిలో పనిలేకుండా పడివుంటుంది. పరపతి సౌకర్యం కుంచించుకుపోతుంది. ఎందుకంటే 1. ఈ పెట్టుబడికి పని లేదు. పునరుత్పత్తి దశలలో ఒకచోట అది నిలిచిపోయింది కనుక అది తన రూప పరివర్తనను పూర్తి చేయజాలదు. 2. పునరుత్పత్తి ప్రక్రియ కొనసాగుతుందన్న నమ్మకం సడలిపోయింది. 3. ఈ వాణిజ్య పరపతికై గిరాకీ తగ్గిపోయింది. తన ఉత్పత్తిని తగ్గించుకున్న పెద్ద స్థాయిలో తన నూలు అమ్మకాలకు నోచుకోని నూలు వడికే వ్యక్తి ఇప్పుడు పరపతి మీద పత్తిని కొనాలనుకోడు. వ్యాపారి పరపతి మీద సరుకులు కొనాలనుకోడు. ఎందుకంటే ఇప్పటికే ఆ సరుకులు అవసరానికి మించి అతని దగ్గరున్నాయి.

కనుక పునరుత్పత్తి ప్రక్రియ విస్తరణలో కానీ, లేదా మామూలుగా సాగే దాని క్రమంలో కానీ అంతరాయం ఏర్పడితే పరపతి సౌకర్యానికి సైతం కొరత ఏర్పడుతుంది. పరపతి మీద సరుకులు

కొనటం మరింత కష్టమవుతుంది. అయితే పారిశ్రామిక చక్రం కూలబడిన తర్వాత దశలో నగదు చెల్లింపుల కోసం గిరాకీ పెరుగుతుంది. అత్యంత జాగరూకత పాటించబడుతుంది. అది ఈ దశ స్వభావం అయితే సంక్షోభంలో ప్రతీ ఒక్కరి దగ్గర అమ్మటానికి సరుకులు ఉన్నాయి. కానీ అమ్మలేరు. అయితే నగదు చెల్లింపుల కోసం తప్పనిసరిగా వాటిని అమ్మితీరాలి. అది అనుత్పాదక, మదుపు కోసం చేసే పెట్టుబడి కాదు. పునరుత్పత్తి ప్రక్రియలో ఆగిపోయిన పెట్టుబడి మొత్తం మాత్రమే. పరపతి సౌకర్యం కొరత తీవ్రంగా ఉన్నప్పుడు భారీ మొత్తంలో కనిపించేది ఈ సరుకు పెట్టుబడే. (కనుక బ్యాంకర్ల పరపతి అత్యధిక డిస్కౌంట్ లభిస్తుంది.) అప్పటికే మదుపు పెట్టబడిన పెట్టుబడి, పునరుత్పత్తి ప్రక్రియ స్తంభించిపోవటం వల్ల పెద్ద పరిమాణాల్లో పనిలేకుండా ఉంటుంది. ఫ్యాక్టరీలు మూతపడతాయి. ముడిపదార్థాలు పోగుపడతాయి. తయారయిన వస్తువులు సరుకులుగా మార్కెటును ముంచెత్తుతాయి. కనుక అలాంటి పరిస్థితికి కారణం ఉత్పాదక పెట్టుబడి కొరతే అని అనటంకంటే పొరపాటు ఉండదు. సరిగా అలాంటి సందర్భాలలోనే మామూలు పునరుత్పత్తితో పోలిస్తే, తాత్కాలికంగా తగ్గిపోయిన పునరుత్పత్తి రీత్యానూ, బాగా దెబ్బతిన్న వినియోగం రీత్యానూ ఉత్పాదక పెట్టుబడి అతి విస్తారంగా కనిపిస్తుంది.

మొత్తం సమాజంలో కేవలం పారిశ్రామిక పెట్టుబడిదారులు, వేతన కార్మికులు మాత్రమే ఉన్నారనుకుందాం. ధరల ఆటుపోట్లు కూడా లేవనుకుందాం. ఈ ఆటుపోట్లు మొత్తం పెట్టుబడి పెద్ద భాగాలు సగటు నిష్పత్తులలో తమను తాము భర్తీ చేసుకోకుండా అడ్డుపడతాయి. ప్రత్యేకించి పరపతి సౌకర్యం అభివృద్ధి చేసిన మొత్తం పునరుత్పత్తి ప్రక్రియ సాధారణ అంతస్సంబంధాల వల్ల ఇలా జరుగుతుంది. ఈ ఆటుపోట్లు తాత్కాలిక స్వభావం కలిగిన అనేక సాధారణ అంతరాయాలను సృష్టిస్తాయి. పరపతి సౌకర్యం ఇష్టపడే నకిలీ లావాదేవీలను, సట్టా వ్యాపారాలను కూడా మన దృష్టిపథం నుంచి తొలగిద్దాం. అప్పుడు సంక్షోభాన్ని వివిధ ఆర్థిక శాఖలో ఉన్న నిష్పత్తి రాహిత్య ఫలితంగానే వివరించగలం. అంతేగాక పెట్టుబడిదారుల వినియోగానికి, వారి సంచయనానికి మధ్య నిష్పత్తి రాహిత్యం ఫలితమే ఈ సంక్షోభమని వివరించగలం. అయితే వాస్తవంలో ఉత్పత్తిలో మదుపు పెట్టబడిన పెట్టుబడిని భర్తీ చేయటం అన్నది ఉత్పత్తిలో లేని వర్గాల వినియోగ శక్తిపైన ఆధారపడి ఉంటుంది. కాగా కార్మికుల వినియోగ శక్తి పాక్షికంగా వేతన చట్టాల వల్లనూ, పాక్షికంగా వారిని లాభదాయకంగా పనిలో పెట్టగలిగిన మేరకే పెట్టుబడిదారీ వర్గం వారిని వినియోగించటం వల్లనూ పరిమితమవుతుంది. సమాజం యొక్క నిరపేక్ష వినిమయ శక్తి మాత్రమే వాటికి పరిమితి అన్నట్లుగా ఉత్పత్తి శక్తులను అభివృద్ధి చేసే పెట్టుబడిదారీ ఉత్పత్తి ధోరణి సముఖంలో నిజమైన సంక్షోభాలన్నింటికి అంతిమ కారణం ప్రజల దారిద్ర్యమూ, వారి పరిమిత వినిమయమూనే!

కనీసం పెట్టుబడిదారీ పంథాలో అభివృద్ధి చెందిన దేశాలలో ఉత్పాదక పెట్టుబడి కొరత అన్నది పంటలు దెబ్బతిన్న కాలంలో మాత్రమే ఉంటుంది. ఆ కొరత ఆహారధాన్యాల రూపంలోనూ లేదా ప్రధాన పారిశ్రామిక ముడిపదార్థాల రూపంలోనూ ఉంటుంది.

ఈ వాణిజ్య పరపతితోపాటు డబ్బు పరపతి కూడా ఉంటుంది. పరిశ్రమదారులు, వ్యాపారులు ఒకరికొకరు ఇచ్చుకునే పరపతితోపాటు బ్యాంకర్లు రుణదాతలు తమకిచ్చిన డబ్బు పరపతిని దానికి

కలుపుతారు. మార్పిడి బిల్లులను డిస్కౌంట్ చేసేటప్పుడు ఇలా ఒకరికొకరు ఇచ్చుకునే అడాన్స్ సంకేతం మాత్రమే. ఒక మార్పిడి బిల్లు తీసుకునే కార్ఖానాదారుడు తన ఉత్పాదితాన్ని అమ్ముతాడు. అతడు ఈ బిల్లును బిల్లు బ్రోకరు ద్వారా డిస్కౌంట్ చేయిస్తాడు. నిజానికి బిల్లు బ్రోకరు అడ్వాన్స్ చేస్తున్నది అతని బ్యాంకర్ యొక్క పరపతిని మాత్రమే. బ్యాంకర్ అందుకు ప్రతిగా తన డిపాజిటర్ల డబ్బు పెట్టుబడిని బ్రోకర్లకు అడ్వాన్స్ చేస్తాడు. డిపాజిటర్లలో పారిశ్రామిక పెట్టుబడిదారులు, వ్యాపారులు, కార్మికులు (సేవింగ్స్ బ్యాంకుల ద్వారా), భూమి కౌలు గ్రహీతలు తదితర అనుత్పాదక వర్గాలు ఉంటారు. ఈ రకంగా ప్రతీ పారిశ్రామిక పెట్టుబడిదారుడూ, వ్యాపారి ఒక పెద్ద రిజర్వు నిధిని ఉంచుకోవాల్సి వస్తుంది. వారు వాస్తవంగా తిరిగి వచ్చే ఆదాయాలపైన ఆధారపడి ఉంటారు. మరోవైపున ఈ ప్రక్రియ యావత్తూ మార్పిడి బిల్లుల మాయాజాలం వల్లనూ, మార్పిడి బిల్లుల ఉత్పత్తి కోసమే జరిగే సరుకు లావాదేవీల వల్లనూ మొత్తం ప్రక్రియ అత్యంత సంక్లిష్టంగా మారిపోతుంది. రుణదాతలూ, ఉత్పత్తిదారులూ వంచింపబడటం ద్వారా ఏమాత్రం రుణబంధనాల్లేని వాణిజ్యంలో పెట్టుబడులు సురక్షితంగా తిరిగి వచ్చే వాణిజ్యంలో ఆ ప్రక్రియ కనిపిస్తుంది. ఈ ప్రక్రియ పతనం కావటానికి ముందు అత్యంత సవ్యంగా ఉన్నట్లు కనిపిస్తుంది. 1857–58 బ్యాంక్ చట్టాలపై నివేదికలే దీనికి అత్యుత్తమ ఉదాహరణలు. ఈ నివేదికల్లో బ్యాంకు డైరెక్టర్లు, వ్యాపారులు ఒక్క మాటలో చెప్పాలంటే వర్‌స్టన్ నాయకత్వాన ఉన్న ఆర్థిక నిపుణులంతా 1857 ఆగస్టులో సంక్షోభం బద్దలవటానికి సరిగ్గా ఒక నెల ముందు వాణిజ్యం సుభిక్షంగానూ, సవ్యంగానూ ఉన్నందుకు వారు ఒకరినొకరు అభినందించుకున్నారు. చిత్రమేమిటంటే టూకే "ధరల చరిత్ర" అనే తన గ్రంథంలో ఒక చరిత్రకారుడిగా ప్రతి సంక్షోభం విషయంలోనూ ఇలాంటి భ్రమకే గురయ్యాడు. ఈ పతనం హఠాత్తుగా సంభవించే దాకా వాణిజ్యం పటిష్టంగానే ఉంటుంది, కార్యకలాపాలు ఉధృతంగానే సాగుతాయి.

★ ★ ★

ఇపుడు మనం డబ్బు పెట్టుబడి సంచయనానికి తిరిగి వద్దాం.

అప్పివ్వదగిన డబ్బు పెట్టుబడి పెరుగుదల ప్రతీది నిజమైన పెట్టుబడి సంచయనాన్ని లేదా పునరుత్పత్తి ప్రక్రియ విస్తరణను సూచించదు. సంక్షోభం తర్వాత తక్షణమే తలెత్తే పారిశ్రామిక చక్రం యొక్క దశలో ఇది అత్యంత స్పష్టంగా కనిపిస్తుంది. అప్పుడు రుణ పెట్టుబడి విస్తారంగా పనిలేకుండా పడివుంటుంది. ఉత్పత్తి ప్రక్రియ కుంటుపడిన అలాంటి సందర్భాలలో (1847 సంక్షోభం తర్వాత ఇంగ్లండు పారిశ్రామిక ప్రాంతాల ఉత్పత్తిలో మూడో వంతు తగ్గింది.) సరుకుల ధరలు అత్యంత తక్కువగా ఉన్నప్పుడు పరిశ్రమ స్ఫూర్తి పూర్తిగా దెబ్బతిన్నప్పుడు వడ్డీ రేటు తక్కువ స్థాయిలో ఉంటుంది. ఇది పారిశ్రామిక పెట్టుబడి కుంచించుకుపోవడం, స్తంభించటం, అప్పివ్వదగిన పెట్టుబడి పెరగడాన్ని తప్ప మరే అంశాన్ని సూచించదు. సరుకుల ధరలు పడిపోయినప్పుడు, లావాదేవీల సంఖ్య తగ్గినప్పుడు, వేతనాల కోసం కేటాయించిన పెట్టుబడి తగ్గిపోయినపుడు చలామణి సాధనం తక్కువ పరిమాణంలో అవసరం అవుతుందన్నది స్పష్టం. మరోవైపున బంగారం ఎగుమతి ద్వారా కానీ లేదా దివాళాల వల్ల కానీ విదేశీ రుణాలు రద్దయిపోయిం తర్వాత ప్రపంచ డబ్బుగా పనిచేయటానికి

అదనపు డబ్బుతో అవసరం ఉండదు. మార్పిడి బిల్లుల డిస్కౌంట్‌కు సంబంధించిన వాణిజ్య పరిమాణం మార్పిడి బిల్లులు తగ్గిన సంఖ్య, పరిమాణాలను బట్టే తగ్గిపోతుంది. కనుక అప్పివ్వదగిన డబ్బు పెట్టుబడి చలామణి సాధనంగా లేదా చెల్లింపు సాధనంగా వ్యవహరించటానికి దానికై ఉన్న గిరాకీ (కొత్త పెట్టుబడి మదుపు అన్న ప్రశ్న ఇంకా తలెత్తదు) అన్నది తగ్గిపోతుంది. కనుక సాపేక్షంగా ఈ పెట్టుబడి విస్తారంగా లభిస్తుంది. అటువంటి పరిస్థితులలో అప్పివ్వదగిన డబ్బు పెట్టుబడి కూడా పెరుగుతుంది. అది మనం తర్వాత గమనిస్తాం.

1847 సంక్షోభం తర్వాత పరిస్థితి "లావాదేవీలు పరిమితం కావడం, డబ్బు అత్యంత విస్తారంగా దొరకడం" లాంటి విలక్షణతో ఉంది. (1847-48 వాణిజ్య సంక్షోభం, సాక్ష్యం నెం. 1664) "దాదాపు వాణిజ్యం పూర్తిగా నాశనం కావడం వల్లనూ, అలాగే డబ్బును పనిలో పెట్టే సాధనాల సంపూర్ణ కొరత కారణంగానూ వడ్డీ రేటు బాగా పడిపోయింది. (అదే గ్రంథం, లివర్‌పూల్ రాయల్ బ్యాంక్ హాడ్జ్‌సన్ సాక్ష్యం. పుట 45) ఈ వాస్తవాలను వివరించటానికి ఈ పెద్దమనుషులు ఎటువంటి చెత్త కథలను అల్లారో (ఇలా అల్లటంలో హాడ్‌సన్ అత్యుత్తముల్లో ఒకరు) ఈ క్రింది ప్రస్తావనను బట్టి గమనించవచ్చు. "దేశంలో డబ్బు పెట్టుబడి తగ్గిపోవటం వల్ల ఈ ఒత్తిడి (1847) తలెత్తింది. ప్రపంచంలో నలుమూలల నుంచి వచ్చే దిగుమతుల కోసం బంగారాన్ని చెల్లించాల్సిన అవసరం వల్ల కొంత, అనిశ్చల పెట్టుబడిని నిశ్చల పెట్టుబడిగా ఇముడ్చుకోవడం వల్ల మరికొంత" (అదే గ్రంథం, పుట 39) ఈ కొరత ఏర్పడింది. అనిశ్చల పెట్టుబడి నిశ్చల పెట్టుబడిగా మారటంవల్ల ఒక దేశంలో ఉన్న డబ్బు పెట్టుబడి ఎలా కుదించబడుతుందో అర్థం కాదు. ఉదాహరణకు రైల్వేల విషయంలో బంగారాన్ని గా,ని పత్రాలను గాని రైలు వంతెనల నిర్మాణానికి గాని, రైలు పట్టాల నిర్మాణానికి గాని ఉపయోగించ లేదు. పెట్టుబడి ప్రధానంగా అపుడు రైల్వేలోనే మదుపు పెట్టబడింది. రైల్వే స్టాకుల కోసం చెల్లించబడిన డబ్బు చెల్లింపు రూపంలో డిపాజిట్ అయిన మేరకు బ్యాంకులలో డిపాజిట్ అయిన డబ్బు నిర్వహించే విధినే నిర్వహించింది. అది అప్పివ్వదగిన డబ్బు పెట్టుబడినే తాత్కాలికంగా పెంచింది కూడా. పైన ఈ విషయం రుజువు చేయబడింది. అయితే అది నిర్మాణం కోసం వాస్తవంగా ఖర్చయిన మేరకు దేశంలో కొనుగోలు సాధనంగా, చెల్లింపు సాధనంగా అది చలామణి అయింది. నిశ్చల పెట్టుబడి ఎగుమతి చేయబడలేనంత వరకు అంటే దాని ఎగుమతి అసాధ్యం కావడం వల్ల ఈ దేశం ఎగుమతి చేసిన సరుకుల అమ్మకాల వల్ల తిరిగి వచ్చే డబ్బు పరిమాణం తగ్గుతుంది. (నగదు రూపంలోగాని, వెండి బంగారాల రూపంలో గాని ఆ మేరకు మాత్రమే). డబ్బు పెట్టుబడి ప్రభావితమౌతుంది. అయితే ఆ సమయంలో ఇంగ్లండ్‌కు చెందిన ఎగుమతి వస్తువులు విదేశీ మార్కెట్లలో అమ్మకాలకు నోచుకోకుండా కుప్పలుగా పడివున్నాయి. వ్యాపారుల, మాంచెస్టర్ కార్ఖానాదారుల అనిశ్చల పెట్టుబడిని నిశ్చలంగా మార్చిందన్నది నిజమే. వారి వాణిజ్య పెట్టుబడిలో ఒక భాగం రైల్వే స్టాకుల్లో ఉండిపోయింది. కనుక వారు తమ వ్యాపారాన్ని నడిపేందుకు అప్పు తీసుకున్న పెట్టుబడిపైనే ఆధారపడ్డారు. కనుక వారు తరువాత పర్యవసానాలకు గురికావల్సి వచ్చింది. వారి వ్యాపారానికి సంబంధించిన పెట్టుబడిని ఉపసంహరించి రైల్వేలలో కాకుండా గనులలో మదుపు పెట్టినప్పటికీ అదే జరిగి ఉండేది. గని ఉత్పాదితాలయిన ఇనుము, బొగ్గు, రాగి అనిశ్చల పెట్టుబడి అయినప్పటికీ అదే జరిగి ఉండేది.

డబ్బు పెట్టుబడి లభించడం అన్నది పంటలు దెబ్బతినడం వల్ల ధాన్యపు దిగుమతుల వల్ల బంగారం ఎగుమతుల వల్ల వాస్తవంగా కుదించబడింది. అయితే రైల్వే వంచనతో దీనికి సంబంధం లేదు. – "దాదాపు వాణిజ్య గృహాలన్నీ తమ వాణిజ్య పెట్టుబడిలో ఒక భాగాన్ని రైల్వేలకు కేటాయించడంవల్ల తమ వాణిజ్యాన్ని ఆకలితో మాడ్చడం ప్రారంభించారు." – "రైల్వేలకు వాణిజ్య సంస్థలు ఇచ్చిన రుణాలు పెద్ద స్థాయిలో ఉండటం వల్ల (పుట 42) తమ సొంత వాణిజ్య కార్యకలాపాలను కొనసాగించడానికి తమ బిల్లుల డిస్కౌంట్ ద్వారా బ్యాంక్‌లపైన అతిగా ఆధారపడాల్సి వచ్చింది." (అదే హాడ్జ్‌సన్, పుట 67) "రైల్వేలో సట్టా వ్యాపారం ఫలితంగా మాంచెస్టర్‌లో విపరీతమైన నష్టాలు వచ్చాయి." (ఆర్. గార్డెనర్, ఇంతకు ముందు సంపుటి 1, 15వ అధ్యాయంలోనూ, అనేక ఇతర సందర్భాలలోనూ వివరించబడింది. సాక్ష్యం నెం. 4884)

1847 సంక్షోభానికి ప్రధాన కారణాలలో ఒకటి మార్కెట్‌ని బ్రహ్మాండంగా ముంచెత్తటమూ ఈస్ట్ ఇండియా సరుకుల వాణిజ్యంలో విపరీతమైన వంచన. ఈ రంగంలో చాలా సంపన్నమైన సంస్థలను దివాళా తీయించిన వేరే పరిస్థితులు కూడా ఉన్నాయి. "వారికి అపారమైన సంపదలున్నాయి. కానీ అవి అందుబాటులో లేవు. వారి పెట్టుబడి మొత్తం మారిషస్ ఎస్టేట్లలో ఇరుక్కుపోయింది. లేదా నీలిమందు ఫ్యాక్టరీలలో లేదా చక్కెర ఫ్యాక్టరీలలో ఉండిపోయింది. 500,000–600,000 పౌండ్ల మేరకు అప్పులపాలైన తర్వాత వారి బిల్లులను చెల్లించటానికి వారి దగ్గర తగిన స్థాయిలో ఆస్తులు లేవు. ఆ బిల్లులను చెల్లించడం కోసం వారు పూర్తిగా పరపతి సౌకర్యంపైనే ఆధారపడ్డట్లు అంతిమంతా రుజువైంది." (సిహెచ్. టర్నర్, లివర్‌పూల్ పెద్ద ఈస్ట్ ఇండియా వ్యాపారి, నెం. 730) గార్డెనర్ (నెం. 4872) కూడా చూడండి. "చైనా ఒప్పందం తర్వాత వెంటనే చైనాతో వాణిజ్య విస్తరణకు ఎంత పెద్ద అవకాశం వచ్చిందంటే కేవలం ఆ వాణిజ్యాన్నే దృష్టిలో పెట్టుకుని కేవలం చైనా మార్కెట్టుకు అవసరమైన వస్త్రాల తయారీ కోసం పెద్ద పెద్ద మిల్లులను నిర్మించారు. పాత మిల్లుల యజమానులు ఆ వస్త్రాల తయారీకి అదనపు ఏర్పాటు చేసుకున్నారు." – "4874. ఆ వాణిజ్యం ఏమైంది? – అత్యంత వినాశకరంగా, వర్ణించనలవి కాని విధంగా తయారయింది. 1844, 1845లలో చైనాకు తరలించిన ఓడలలో మూడింట రెండు వంతుల సరుకుకు చెందిన సొమ్ము తిరిగి వచ్చిందంటే నేను నమ్మను. ఆ సరుకుకు టీ ప్రధాన చెల్లింపు సాధనం. కార్ఖానాదారులకు మేమంతా టీ పైన సుంకాలు భారీగా తగ్గిపోతాయని అంచనా వేసుకున్నాం." – ఇంగ్లండ్ కార్ఖానాదారుడికి స్వభావోచితమైన తరహాలో అమాయకంగా ఇలా వ్యక్తీకరించాడు. "విదేశీ మార్కెట్‌తో మనకున్న వాణిజ్యానికి పరిమితి వారి కొనుగోలు శక్తి కాదు. మనం మన సరుకులకు తిరిగి పొందే సరుకులను వినియోగం చేయగల్గిన మన శక్తి మాత్రమే." (ఇంగ్లండ్ వ్యాపారం చేసే దేశాలు సాపేక్షంగా పేద దేశాలు. అవి ఇంగ్లండ్ ఉత్పాదితాలకు ఏ స్థాయిలో అయినా చెల్లిస్తాయి. వినియోగం చేస్తాయి. అయితే దురదృష్టవశాత్తూ వాటి బదులు తిరిగి పంపించబడిన ఉత్పాదితాలను సంపన్నమైన ఇంగ్లండ్ అరిగించుకోలేదు.) – "4876. మొదట నేను కొన్ని సరుకులను బయటికి పంపించాను. ఆ సరుకులు 15 శాతం నష్టానికి అమ్మబడ్డాయి. అయితే నా ఏజెంట్లు టీని కొనుగోలు చేస్తున్న ధరను బట్టి ఈ 15 శాతం నష్టాన్ని సునాయాసంగా పూడ్చుకోగలనని భావించాను. కానీ కొన్ని సందర్భాలలో నేను 25 శాతం, మరికొన్ని

సందర్భాలలో 50 శాతం వరకూ నష్టపోయాను." – "4877. కార్ఖానాదారులు తమ సొంత పూచీపైనే సాధారణంగా ఎగుమతి చేస్తారా? ప్రధానంగా అంతే. అతి త్వరలోనే వ్యాపారులు దీనివల్ల లాభం లేదని గ్రహించారు. వారు స్వయంగా ప్రత్యక్ష బాధ్యతను తీసుకోకుండా సరుకుల్ని పంపే విధంగా కార్ఖానాదారులను ప్రోత్సహించారు." – 1857లో ఈ వైఫల్యాల నష్టాలు వ్యాపారులపై పడ్డాయి. అప్పుడు కార్ఖానాదారులు విదేశీ మార్కెట్లను ముంచెత్తే కర్తవ్యాన్ని వ్యాపారుల "సొంత పూచీ"కి వదిలివేయడంతో ఇలా జరిగింది.

★ ★ ★

బ్యాంకింగ్ విస్తరణ దృష్ట్యా (ఇప్స్విచ్ ఉదాహరణ చూడండి. 1857కు ముందు కొద్ది సంవత్సరాల కాలంలో పెట్టుబడిదారీ రైతుల డిపాజిట్లు నాలుగింతలయ్యాయి.) ఇంతకు ముందు ప్రైవేట్ విలువ లేదా నాణాల రిజర్వ్‌గాను ఉన్నదాన్ని ఒక నిర్దిష్ట కాలంపాటు అప్పు ఇవ్వదగిన పెట్టుబడిగా మార్చబడటం ద్వారా డబ్బు పెట్టుబడి విస్తరిస్తుంది. అయితే లండన్ స్టాక్ బ్యాంక్‌లలో డిపాజిట్లు పెరిగితే వాటిపైన బ్యాంక్ వడ్డీ చెల్లిస్తుంది. అయితే ఈ వడ్డీ లాగానే ఈ డబ్బు పెట్టుబడి విస్తరణ కూడా ఉత్పాదక పెట్టుబడి పెరుగుదలను సూచించదు. ఉత్పత్తి స్థాయి యథాతథంగా ఉన్నంత వరకూ ఉత్పాదక పెట్టుబడితో పోలిస్తే అప్పివ్వదగిన డబ్బు పెట్టుబడి విస్తారంగా లభించడానికి మాత్రమే ఇది దారితీస్తుంది. ఫలితంగా వడ్డీ రేటు పడిపోతుంది.

పునరుత్పత్తి ప్రక్రియ మళ్లీ సుభిక్ష దశకు చేరుకున్న తర్వాత వాణిజ్య పరపతి బాగా విస్తరిస్తుంది. పెట్టుబడి వెంటనే తిరిగి రావడానికి విస్తరించబడిన ఉత్పత్తికి ఇది "పటిష్టమైన" పునాది. ఈ పరిస్థితిలో ఇంకా వడ్డీ రేటు తక్కువగానే ఉంటుంది. అయితే కనీస స్థాయికంటే కొంచెం పెరుగుతుంది. ఈ ఒక్క సందర్భంలో మాత్రమే తక్కువ వడ్డీ రేటు, అప్పు ఇవ్వదగిన పెట్టుబడి సాపేక్ష సమృద్ధి అన్నవి పారిశ్రామిక పెట్టుబడి నిజమైన విస్తరణతో ఏకీభవిస్తాయి. పెట్టుబడి క్రమబద్ధంగా తిరిగి రావడమూ విస్తారమైన వాణిజ్య పరపతి పెరగటం కారణంగా రుణ పెట్టుబడి కోసం గిరాకీ పెరిగినప్పటికీ దాని సరఫరాకు హామీ లభిస్తుంది. వడ్డీ రేటు పెరగకుండా అది అడ్డుకుంటుంది. మరోవైపున మాత్రం రిజర్వ్ పెట్టుబడి లేకుండా, కొన్ని సందర్భాలలో అసలు పెట్టుబడి లేకుండా పూర్తిగా డబ్బు పరపతి పైన వ్యవహరించే స్టాక్ ఎక్స్ఛేంజ్ బ్రోకర్లు ఈ సందర్భంలో గణనీయమైన సంఖ్యలో ప్రప్రథమంగా కనిపిస్తారు. దీనికితోడు అన్ని రూపాలలోనూ నిశ్చల పెట్టుబడి అపారంగా విస్తరిస్తుంది. ఇప్పుడు వడ్డీ రేటు తన సగటు స్థాయికి పెరుగుతుంది. కొత్త సంక్షోభం ప్రారంభం కాగానే వడ్డీ రేటు గరిష్ట స్థాయికి పెరుగుతుంది. పరపతి హఠాత్తుగా ఆగిపోతుంది. చెల్లింపులు ఆపివేయబడతాయి. పునరుత్పత్తి ప్రక్రియ కుంటుపడుతుంది. ఇంతకు ముందు పేర్కొన్న మినహాయింపులతో దాదాపు రుణ పెట్టుబడి అదృశ్యంతోపాటు పనిలేని పారిశ్రామిక పెట్టుబడి అతి విస్తారంగా లభిస్తుంది.

మొత్తం మీద వడ్డీ రేటులో వ్యక్తమైనట్లుగా రుణ పెట్టుబడి యొక్క చలనం పారిశ్రామిక పెట్టుబడి చలనానికి వ్యతిరేక దిశలో ఉంటుంది. తక్కువ వడ్డీ రేటు ఉంటూ కనీస స్థాయికంటే ఎక్కువ స్థాయిలో ఉన్న దశ సంక్షోభం తర్వాత నమ్మకం పెరగటానికి, పరిస్థితి మెరుగు కావటానికి

చిహ్నంగా ఉంటుంది. వడ్డీ రేటు సగటు స్థాయికి చేరే దశ దాని కనీస స్థాయికి గరిష్ఠ స్థాయికి మధ్యలో ఉండే దశ. ఈ రెండు దశల్లో మాత్రమే రుణ పెట్టుబడి అపారంగా లభిస్తుంది. దానితోపాటు పారిశ్రామిక పెట్టుబడి విస్తారంగా పెరుగుతుంది. పారిశ్రామికావృత్తం ప్రారంభ దశలో ఒకవైపు తక్కువ వడ్డీ రేటు, మరోవైపు పారిశ్రామిక పెట్టుబడి సంక్షోభం ఉంటాయి. పారిశ్రామిక ఆవృత్తం చివరి దశలో ఇటు ఎక్కువ వడ్డీ రేటు, అటు అత్యంత సమృద్ధంగా పారిశ్రామిక పెట్టుబడి ఉంటాయి. తక్కువ వడ్డీ రేటు పరిస్థితి "మెరుగుదలను" సూచించినపుడు ఒక విషయం స్పష్టం. వాణిజ్య పరపతి ఇంకా స్వయం సహాయక శక్తి కలిగి ఉంటుంది. కనుక దానికి బ్యాంక్ పరపతి చాలా తక్కువ అవసరమవుతుంది.

పారిశ్రామిక ఆవృత్తం మొదటి ఊపు లభించిన తర్వాత అదే ఆవృత్తం నిర్ణీత కాలానికోసారి తనను తాను పునరుత్పత్తి చేసుకుంటుంది.[1] మాంద్యం ఉన్న కాలంలో ఉత్పత్తి అంతకు ముందు ఆవృత్తం చేరుకున్న దశకంటే కింది దశకు ఉత్పత్తి పడిపోతుంది. అయితే అంతకు ముందు దశలో దానికవసరమైన సాంకేతిక పునాది ఏర్పడింది. మధ్య దశ అయిన సమృద్ధి దశ ఈ పునాదిపైన అభివృద్ధి కావటం కొనసాగిస్తుంది. అధికోత్పత్తి, వంచనల కాలంలో అది ఉత్పాదక శక్తుల్ని అతిగా బలవంతపెట్టి పెట్టుబడిదారీ ఉత్పత్తి ప్రక్రియ పరిమితుల్ని దాటిపోయేంతగా ఉత్పత్తి చేస్తుంది.

సంక్షోభ కాలంలో చెల్లింపు సాధనం కొరత ఉంటుందనేది స్పష్టం. సరుకులు తమంత తామే

---

1. నేను ఇంతకు ముందే పేర్కొన్నట్టుగా (ఒకటో సంపుటం - సం) గత సాధారణ సంక్షోభం నాటినుంచి ఇక్కడ ఒక మార్పు జరిగింది. ఇంతకుముందు పదేళ్ళకోసారి పునరావృత్తమయ్యే చక్రం మరింత సుదీర్ఘ మయిన ఆవృత్తానికి దారితీసిందనిపిస్తుంది. సాపేక్షంగా సుదీర్ఘంగా అనిశ్చిత పారిశ్రామిక మ్యాందం విభిన్న కాలాల్లో వివిధ పారిశ్రామిక దేశాల్లో జరుగుతున్నట్టుగా కనిపిస్తుంది. అయితే అది ఈ ఆవృత్తం కాలపరిమితి పెంచటం మాత్రమే కావచ్చు. ప్రపంచ వాణిజ్యపు తొలి సంవత్సరాలలో 1815-47లలో ఈ ఆవృత్తాలు సుమారు అయిదేళ్ళు కొనసాగేవి. 1847 నుంచి 1867 వరకు చూస్తే ఈ చక్రం పది ఏళ్ళు అని స్పష్టమవుతుంది. ఇంతకు ముందు కనీవినీ ఎరుగని శక్తితో కొత్త ప్రపంచ సంక్షోభం బద్దలవటానికి ముందు మనం సన్నాహ దశలో ఉన్నామా? అనేక అంశాలు ఈ దిశనే చూపిస్తున్నాయి. 1857 నాటి చివరి సంక్షోభం నుంచి ఇప్పటికే అనేక ప్రగాఢమైన మార్పులు జరిగాయి. వార్తా రవాణ సాధనాలు బాగా విస్తరించాయి. ఓడ రవాణా, రైల్వేలు, విద్యుత్తు, టెలిగ్రఫీ, సూయజ్ కాలువ లాంటి నిజమైన ప్రపంచ మార్కెట్ అన్నదాన్ని వాస్తవం చేశాయి. పారిశ్రామిక రంగంలో ఇంగ్లండుకున్న ఇదివరకటి గుత్తాధిపత్యాన్ని అనేక పోటీ పారిశ్రామిక దేశాలు సవాల్ చేశాయి. ప్రపంచంలో అన్ని మూలాల్లో యూరప్ అదనపు పెట్టుబడి మదుపు కోసం వైవిధ్యంతో కూడిన ఎంతో పెద్ద రంగాలు ఆవిష్కృతమయ్యాయి. మదుపు ఇంతకుముందు కంటే విస్తారంగా పంపిణీ అయింది. స్థానికంగా అతిగా జరిగే సట్టా వ్యాపారం తేలికగా అధిగమించబడింది. దీనంతటితోనూ సంక్షోభాలు తలెత్తడానికి ఇంతకు ముందున్న ఆధారాలు దాని అభివృద్ధికి ఉన్న అవకాశాలు రద్దు చేయబడ్డాయి. లేదా బాగా తగ్గించబడ్డాయి. అదే సమయంలో స్వదేశీ మార్కెట్ల కార్టెల్స్, ట్రస్టుల వల్ల పోటీ తగ్గుముఖం పట్టింది. విదేశీ మార్కెట్లో రక్షణ సుంకాల వల్ల అది పరిమితమయింది. ఒక్క ఇంగ్లండ్ మినహా మిగతా ప్రధాన పారిశ్రామిక దేశాలన్నీ తమ చుట్టూ రక్షణ సుంకం వలయాలను నిర్మించుకున్నాయి. అయితే ఈ రక్షణ సుంకాలన్నీ చివరికి సార్వత్రిక పారిశ్రామిక యుద్ధానికి సన్నాహాలు మాత్రమే. ప్రపంచ మార్కెట్‌పైన ఆధిపత్యం ఎవరిదన్నది సార్వత్రిక పారిశ్రామిక యుద్ధం నిర్ణయిస్తుంది. ఆ రకంగా పాత సంక్షోభాలు పునరావృత్తం కాకుండా చూసే ప్రతి అంశం దాని గర్భంలో అంతకంటే బలమైన భవిష్యత్ సంక్షోభపు బీజాన్ని కలిగి వుంటుంది. **- ఎంగెల్స్**

రూపపరివర్తనకు గురికావటానికి బదులు దాని స్థానాన్ని మార్పిడి బిల్లులు తీసుకుంటాయి. అటువంటి సందర్భాలలో అత్యధిక సంస్థలు కేవలం పరపతిపైనే పనిచేస్తాయి. 1844–45 నాటి మూర్ఖత్వపు పొరపాటు బ్యాంక్ చట్టాల్లాంటివి ఈ డబ్బు సంక్షోభాన్ని తీవ్రతరం చేయగలవు. అయితే ఏ రకపు బ్యాంక్ చట్టమూ సంక్షోభాన్ని రద్దు చేయలేదు.

మొత్తం పునరుత్పత్తి కొనసాగటం అంతా పరపతిపైనే ఆధారపడి ఉండే ఉత్పత్తి వ్యవస్థలో సంక్షోభం స్పష్టంగా తలెత్తుతుందని చెప్పవచ్చు. పరపతి హఠాత్తుగా ఆగిపోయి నగదు చెల్లింపులకు మాత్రమే విలువ ఉన్నప్పుడు చెల్లింపు సాధనాల కోసం పరుగులు ప్రారంభమవుతాయి. చూడగానే మొత్తం సంక్షోభం అంతా పరపతికి, డబ్బుకు సంబంధించిన సంక్షోభంలా కనిపిస్తుంది. నిజానికి మార్పిడి బిల్లులు డబ్బుగా మారడానికి సంబంధించిన సమస్య మాత్రమే ఇది. అయితే ఈ బిల్లులో అత్యధికం వాస్తవ క్రయ విక్రయాలనే సూచిస్తాయి. అయితే సమాజం అవసరాలకు మించి అవి విస్తరించాయి. మొత్తం సంక్షోభానికి పునాది వాటి విస్తరణే. అదే సమయంలో ఈ మార్పిడి బిల్లులలో పెద్ద భాగం కేవలం వంచనను సూచిస్తాయి. ఆ వంచన ఇప్పుడు తేటతెల్లమై బద్దలవుతుంది. అంతేగాక ఇతరుల పెట్టుబడితో చేసిన సట్టా వ్యాపారం విఫలమవుతుంది. చివరికి విలువ తగ్గిపోయిన సరుకు పెట్టుబడి లేదా ఏమాత్రం అమ్ముడుకాని సరుకు లేదా ఎప్పటికీ తిరిగిరాని పెట్టుబడులు వగైరాలకు ఈ బిల్లులు చిహ్నంగా ఉంటాయి. బలవంతంగా పునరుత్పత్తి ప్రక్రియను విస్తరింపచేసిన మొత్తం ఈ కృత్రిమ వ్యవస్థను బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్‌లాగా ఈ వంచకులకు విలువలేని కాగితం పెట్టుబడిని ఇవ్వటం ద్వారా విలువ తగ్గిన సరుకులన్నిటినీ వాటి పాత నామమాత్రం విలువలకే కొనివేయడం ద్వారా ఆ వ్యవస్థ జబ్బును నయం చేయటం సాధ్యం కాదు. సందర్భవశాత్తు ఇక్కడ ప్రతీది వక్రీకరించబడి కనిపిస్తుంది. ఈ కాగిత ప్రపంచంలో నిజమైన ధర, నిజమైన పునాది ఎక్కడా కనిపించదు. కేవలం వెండి, బంగారాలు, లోహపు నాణెం, నోట్లు, మార్పిడి బిల్లులు, సెక్యూరిటీలు మాత్రమే కనిపిస్తాయి. ముఖ్యంగా లండన్ లాంటి నగరాలలో డబ్బు వ్యాపారం కేంద్రీకరించబడినచోట్ల ఈ వక్రీకరణ మరింత ఎక్కువగా కనిపిస్తుంది. మొత్తం ప్రక్రియ అవగాహనకు అతీతంగా ఉంటుంది. ఉత్పత్తి కేంద్రాలలో ఈ పరిస్థితి కొంత తక్కువగా ఉంటుంది.

సంక్షోభ సమయాల్లో పారిశ్రామిక పెట్టుబడి అతి విస్తారంగా లభించటానికి సంబంధించి సందర్భవశాత్తూ ఈ క్రింది విషయాలను గమనించాలి. సరుకు పెట్టుబడి అన్నది స్వయంగా అదే సమయంలో డబ్బు పెట్టుబడి కూడా. అంటే సరుకుల ధరలో నిర్దిష్ట విలువ మొత్తం వ్యక్తమవుతుందన్న మాట. ఒక ఉపయోగ విలువగా అది నిర్దిష్ట పరిమాణం గల ఉపయోగ వస్తువుల సమూహం. సంక్షోభ సమయాలలో ఇవి అదనంగా లభిస్తాయి. అయితే డబ్బు పెట్టుబడి డబ్బుపెట్టుబడిగా, శక్యడబ్బు పెట్టుబడిగా (potential money capital) నిరంతరం సంకోచ వ్యాకోచాలకు గురి అవుతుంది. సంక్షోభ ప్రారంభంలోనూ, అది కొనసాగుతుండగానూ శక్య డబ్బు పెట్టుబడిగా దాని సామర్థ్యంలో సరుకు పెట్టుబడి కుంచించుకుపోతుంది. దాని యజమానికి, దాని పరపతిదారులకు అది తక్కువ డబ్బు పెట్టుబడికి ప్రాతినిధ్యం వహిస్తుంది. అది కొనబడినప్పుడు దానిపైన ఆధారపడి డిస్కౌంట్లు, తనఖాలు లాంటి లావాదేవీలు జరిగాయి. అప్పటికంటే అది తక్కువ డబ్బు పెట్టుబడికి ప్రాతినిధ్యం

వహిస్తుంది. (మార్పిడి బిల్లులకూ, రుణాలకూ అది తక్కువ హామీ ఇస్తుంది.) డబ్బు కొరత ఉన్న సమయాల్లో డబ్బు పెట్టుబడి తగ్గింది అంటే అర్థం ఇదే. అయితే సరుకుల ధరలు పడిపోవడంతో ఇది సమానమవుతుంది. అటువంటి ధరల పతనం అంతకుముందు జరిగిన ధరల పెరుగుదల ఫలితాన్ని సమం చేస్తుంది.

అనుత్పాదక వర్గాలవారి, స్థిర ఆదాయాలున్నవారి ఆదాయాలు ద్రవ్యోల్బణం కాలంలో కూడా మారవు. ఈ కాలంలో అధికోత్పత్తి, అధిక సట్టా వ్యాపారం జరుగుతుంది. కనుక వారి వినియోగ శక్తి సాపేక్షంగా తగ్గుతుంది. దానితోపాటు మొత్తం పునరుత్పత్తిలో వారి వినియోగాన్ని చేరే భాగాన్ని భర్తీ చేయటంలో వారి శక్తి కూడా తగ్గుతుంది. వారి గిరాకీ అంతే ఉన్నప్పటికీ వాస్తవంగా అది తగ్గుతుంది.

ఎగుమతి, దిగుమతుల విషయంలో ఒక అంశం గమనించాలి. ఒకదాని తర్వాత ఒకటి సంక్షోభంలో ఇరుక్కున్న దేశాలన్నీ కొద్ది మినహాయింపులతో ఎగుమతి, దిగుమతుల్ని అతిగా చేయటం వల్ల ప్రతికూలమైన చెల్లింపుల సమతూకాన్ని ఎదుర్కొంటున్నాయని స్పష్టమవుతుంది. నిజానికి ఈ ఇబ్బంది చెల్లింపుల సమతూకంతో ముడిపడి లేదు. ఉదాహరణకు ఇంగ్లండ్ నుంచి బంగారం బయటకు పంపబడుతుంది. అది అంతకుముందు అతిగా దిగుమతి చేసుకుంది. అదే సమయంలో ఇతర దేశాలకు ఇంగ్లండ్ తన సరుకులను అతిగా సరఫరా చేసింది. ఆ రకంగా అవి కూడా అతిగా దిగుమతి చేసుకున్నాయి. లేదా అలా చేసుకునేలా వత్తిడి చేయబడ్డాయి. (పరపతిపైన ఎగుమతి చేసే దేశానికీ, పరపతిపై అతితక్కువ లేక అసలు ఎగుమతి చేయని దేశానికీ తేడా ఉంది. అలా ఎగుమతి చేయని దేశం సైతం పరపతిపైనే దిగుమతి చేసుకుంటుంది. అయితే ఎగుమతి చేసే దేశం సొంత పూచీపైన సరుకులను పంపించినపుడు ఇది వర్తించదు.) సంక్షోభం మొదట ఇంగ్లండ్‌లో బయటపడ వచ్చు. ఆ దేశం పరపతి సౌకర్యంలో అత్యధిక భాగాన్ని ఇస్తుంది. అతి తక్కువ భాగాన్ని తీసుకుంటుంది. ఎందుకంటే చెల్లింపుల సమతూకం చెల్లింపుల సమతూకానికి చెందిన బాకీ వెంటనే పరిష్కారం కావాలి. సాధారణ వాణిజ్య సమతూకం అనుకూలంగానే ఉన్నప్పటికీ చెల్లింపుల సమతూకం ప్రతికూలంగా ఉంది. దీన్ని ఇలా వివరించవచ్చు. అది ఇచ్చిన పరపతి సౌకర్యం ఫలితంగా కొంత, విదేశాలకు అప్పివ్వబడిన పెట్టుబడి పరిమాణం అతిగా ఉండటం వల్ల మరికొంత పెట్టుబడి తిరిగి రావటం అన్నది సరుకుల రూపంలో జరుగుతుంది. వాస్తవ వాణిజ్యం తిరిగి వచ్చే సరుకులకు ఇవి తోడవుతాయి. (అయితే కొన్ని సందర్భాలలో ఇంగ్లండ్ నుంచి అత్యధిక వాణిజ్య, పెట్టుబడి పరపతిని పొందిన అమెరికాలో సంక్షోభం ప్రారంభమయింది.) ఇంగ్లండ్‌లో సంక్షోభం బంగారాన్ని బయటకు పంపించటంతో ప్రారంభమై దానితోపాటు కొనసాగింది. దాని దిగుమతిదారులు దివాళా తీయటం వల్ల కొంత (దీని గురించి మరికొంత వివరంగా కింద ఇవ్వబడింది.) తన సరుకు పెట్టుబడిలో ఒక భాగాన్ని విదేశాలకు తక్కువ ధరలకే పంపించటం వల్ల కొంత విదేశీ సెక్యూరిటీలను అమ్మకం ద్వారానూ, ఇంగ్లండ్ సెక్యూరిటీల కొనుగోలు ద్వారానూ, ఇంగ్లండ్ చెల్లింపుల సమతూకాన్ని పరిష్కరించడం జరుగుతుంది. చెల్లింపుల సమతూకం తాత్కాలికంగా దానికి అనుకూలంగా ఉంది. చెల్లింపుల సమతూకానికి వాణిజ్య సమతూకానికి మధ్య ఉన్న వ్యవస్థ సంకోభం వల్ల రద్దయింది

లేదా కనీసం కుదించబడింది. ఇపుడు చెల్లింపులన్నీ హఠాత్తుగా ఒక్కసారే చేయాల్సి ఉంది. ఇంతకుముందు విషయమే పునరావృత్తమయింది. ఇపుడు ఇంగ్లండ్ బంగారం ప్రవాహంగా వస్తుంది. ఇతర దేశం నుండి అది బయటకు పోతుంది. ఒక దేశంలో అతి దిగుమతుల్లా కనిపించినవి మరో దేశంలో అతి ఎగుమతులుగా కనిపిస్తాయి. అయితే అన్ని దేశాల్లోనూ అతి దిగుమతులు, అతి ఎగుమతులు రెండూ కొనసాగాయి. (ఇక్కడ మనం పంటలు దెబ్బతినడం గురించి మాట్లాడటం లేదు. సార్వత్రిక సంక్షోభం గురించి మాత్రమే ప్రస్తావన.) పరపతి పెంపొందించిన అమితోత్పత్తి, దానితోపాటు సార్వత్రిక ద్రవ్యోల్బణం అన్ని దేశాల్లోనూ జరుగుతుంది.

1857లో అమెరికాలో సంక్షోభం ప్రారంభమయింది. ఇంగ్లండ్ నుంచి అమెరికాకు బంగారం తరలివెళ్ళింది. అయితే అమెరికాలో ఆ గాలిబుడగ బద్దలవగానే ఇంగ్లండ్‌లో కూడా సంక్షోభం బద్దలయింది. బంగారం అమెరికా నుంచి ఇంగ్లండ్‌కు వెనక్కు ప్రవహించింది. ఇంగ్లండ్‌కు యూరప్‌కు మధ్య కూడా ఇదే జరిగింది. సార్వత్రిక సంక్షోభం కాలంలో చెల్లింపుల సమతూకం ప్రతి దేశం విషయంలోనూ, కనీసం వాణిజ్యపరంగా అభివృద్ధి చెందిన ప్రతీ దేశంలోనూ ప్రతికూలంగా ఉంటుంది. అయితే ఇది వరుస క్రమంలో జరుగుతుంది. చెల్లింపులు చేయాల్సిన సమయం వచ్చినపుడు అది ప్రతి దేశానికీ తప్పనిసరి అవుతుంది. సంక్షోభం ప్రారంభమయ్యాక ఉదాహరణకు ఇంగ్లండ్‌లో ప్రారంభమయ్యాక ఈ వ్యవధుల పరంపరను అది తక్కువ కాలపరిమితిగా కుదిస్తుంది. అప్పుడు ఈ దేశాలన్నీ ఏకకాలంలో అతిగా ఎగుమతిని (అమితోత్పత్తిని), అతిగా దిగుమతిని (అమిత వాణిజ్యాన్ని) చేస్తున్నాయని స్పష్టమవుతుంది. ఆ దేశాలన్నింటిలోనూ ధరలు బాగా పెరుగుతాయి. పరపతి బాగా విస్తరిస్తుంది. అన్ని దేశాల్లో ఇదే పతనం జరుగుతుంది. ప్రతి దేశం నుంచి బంగారం బయటకు పోవటమన్నది వరుసగా అన్ని దేశాల్లోనూ జరుగుతుంది. తన సాధారణ స్వభావం రీత్యా ఈ క్రింది అంశాలను అది రుజువుచేస్తుంది. 1) బంగారం బయటకు పోవటం అన్నది సంక్షోభానికి కార్యం మాత్రమే కాని కారణం మాత్రం కాదు. 2) వివిధ దేశాలను అది దెబ్బకొడుతున్న వరుస చూస్తే వాటి కాలం ఆసన్నమయిందని మాత్రమే తెలుస్తుంది. అంటే సంక్షోభం ప్రారంభమై గుప్తంగా ఉన్నదాని అంశాలు పైకి వస్తున్నాయని అర్థం.

1830 నుండి ఇంగ్లీషు రచయితల చెప్పుకోదగిన ఆర్థిక సాహిత్య స్వభావం ఏమంటే కరెన్సీ, పరపతి, సంక్షోభ సాహిత్యమే ఆర్థిక సాహిత్యంగా మారింది. అంటే సంక్షోభ కాలంలో వారు కేవలం విలువైన లోహాల ఎగుమతివైపే చూస్తారు. మార్పిడి రేట్లలో వచ్చిన మార్పును పట్టించుకోరు. ఇంగ్లండ్ దృష్టి నుంచి కేవలం ఒక జాతీయ పరిణామంగా మాత్రమే వారు దానిని గ్రహిస్తారు. తన సొంత బ్యాంకు వడ్డీ రేటును పెంచితే సంక్షోభ సమయంలో యూరోపియన్ బ్యాంకులన్నీ తక్కువ వడ్డీ రేట్లను కూడా పెంచుతాయన్న వాస్తవాన్ని వారు చూడ నిరాకరిస్తారు. ఈ రోజు బంగారం బయటకు పోతుందన్న గగ్గోలు ఇంగ్లండ్‌లో ఉంటే, రేపు అది అమెరికాలోనూ, ఎల్లుండి జర్మనీ, ఫ్రాన్స్‌ల్లోనూ జరుగుతుందన్న విషయాన్ని వారు గ్రహించరు.

1847లో "ఈ దేశంపై ఉన్న ఆర్థిక బాధ్యతల్ని నిర్వహించాల్సి ఉండింది." (ముఖ్యంగా ధాన్యం కోసం) "అయితే ఈ బాధ్యతను వైఫల్యాల ద్వారానే నిర్వహించడం జరిగింది." (సంపన్నమైన ఇంగ్లండ్ యూరప్‌కు, అమెరికాకు తాను నిర్వహించాల్సిన బాధ్యతల విషయంలో దివాళా తీయటం

ద్వారా బయటపడింది.) "వైఫల్యాల ద్వారా ఈ బాధ్యతలు నిర్వహించలేనపుడు వాటిని వెండి, బంగారాల ఎగుమతి ద్వారా నిర్వహించడం జరిగింది." (1857 బ్యాంక్ చట్టాలపైన కమిటీ నివేదిక) మరోలా చెప్పాలంటే బ్యాంక్ చట్టం వల్ల ఇంగ్లండ్‌లో సంక్షోభం తీవ్రతరమైన మేరకు ఈ చట్టం ధాన్యం ఎగుమతి చేసే దేశాలను కరువు కాలంలో మోసం చేయటానికి సాధనంగా తోడ్పడింది. ఈ మోసం మొదటి వారి ధాన్యం విషయంలోనూ, ఆ తర్వాత ఆ ధాన్యానికి ఇవ్వవలసిన డబ్బు విషయంలోనూ జరిగింది. ఎంతో కొంత కొరతను స్వయంగా ఎదుర్కొంటున్న దేశాలకు అటువంటి సందర్భంలో ధాన్యాన్ని ఎగుమతి చేయటం నిషేధించటం అన్నది బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్ పథకాన్ని విచ్ఛిన్నం చేయటానికి అవసరమైన హేతబద్ధమైన చర్య ఇది. అదేమంటే ధాన్యపు దిగుమతులకు సంబంధించిన "బాధ్యతలను దివాళాల ద్వారా" నిర్వహించటం ధాన్యపు ఉత్పత్తిదారులు, సట్టా వ్యాపారులు ఇంగ్లండ్ మేలు కోసం తమ పెట్టుబడిని వదులుకోవడం కంటే తమ సొంత దేశం మేలు కోసం తమ లాభంలో కొంత భాగాన్ని వదులుకోవటం నయం.

పైన వివరించిన దాన్నిబట్టి స్పష్టమయ్యేదేమంటే సంక్షోభ కాలంలోనూ వాణిజ్య మాంద్యం ఉన్నప్పుడు సరుకు పెట్టుబడి డబ్బు పెట్టుబడికి ప్రాతినిధ్యం వహించగల తన శక్తిని చాలా వరకూ కోల్పోతుంది. నకిలీ పెట్టుబడి, వడ్డీ యిచ్చే పత్రాలు డబ్బు పెట్టుబడిగా స్టాక్ ఎక్స్ఛేంజిలో చలామణిలో ఉన్న మేరకు ఇది వాటికి కూడా వర్తిస్తుంది. పెరిగే వడ్డీతోపాటు దాని ధర పడిపోతుంది. అంతేగాక సార్వత్రిక పరపతి కొరత వల్ల కూడా అది పడిపోతుంది. పరపతి యజమానులు దానిని పెద్ద పరిమాణాలలో మార్కెట్లో డబ్బుకోసం తెచ్చి పడేస్తారు. చివరికి స్టాకుల విషయంలో కూడా అది పడిపోతుంది. ఆదాయాలు తగ్గటం వల్ల కొంత, పరిశ్రమ నకిలీ స్వభావం వల్ల మరికొంత ఇది పడిపోతుంది. సంక్షోభ సమయాల్లో నకిలీ డబ్బు పెట్టుబడి అపారంగా కుదించబడుతుంది. దానితో పాటు మార్కెట్లో డబ్బు అప్పు తీసుకోగల శక్తి దాని యజమానులకు తగ్గిపోతుంది. అయితే ఈ స్టాక్ ఎక్స్ఛేంజి జాబితాలో ఉన్న సెక్యూరిటీల డబ్బు సమరూపాలు తగ్గిపోవడం అన్నదానికి వారి ప్రాతినిధ్యం వహించే వాస్తవ పెట్టుబడితో సంబంధం లేదు. అయితే దానికి దాని యజమానుల్ని రుణ విముక్తుల్ని చేయటంలో సంబంధం ఉంది.

★ ★ ★

## అధ్యాయం - 31

# డబ్బు పెట్టుబడి, నిజ పెట్టుబడి - II

### (కొనసాగింపు)

మనం ఈ ప్రశ్నను ఇంకా పూర్తి చేయలేదు. అప్పు ఇవ్వదగిన డబ్బు పెట్టుబడి రూపంలో ఏ మేరకు పెట్టుబడి సంచయనం వాస్తవ సంచయనంతో అనగా పునరుత్పత్తి ప్రక్రియ విస్తరణతో ఏకీభవిస్తుంది?

డబ్బు అప్పివ్వదగిన డబ్బు పెట్టుబడిగా రూపాంతరం చెందడం అన్నది డబ్బు ఉత్పాదక పెట్టుబడిగా రూపాంతరం చెందటం కంటే చాలా సరళమైన విషయం. ఇక్కడ రెండు అంశాల మధ్య ఉన్న తేడాను విస్పష్టం చేయాలి.

1. రుణ పెట్టుబడిగా డబ్బు కేవలం రూపాంతరం చెందటం.

2. పెట్టుబడి లేదా ఆదాయం డబ్బుగా రూపాంతరం చెందటం.

ఈ రెండవ అంశం మాత్రమే రుణ పెట్టుబడి సంచయనాన్ని పారిశ్రామిక పెట్టుబడి వాస్తవ సంచయనంతో జోడిస్తుంది.

### 1. డబ్బు రుణ పెట్టుబడిగా రూపాంతరం చెందటం

అదనపు పెట్టుబడి ఉత్పాదక సంచయనంతో జోడించబడి పెద్ద స్థాయిలో లభ్యమవుతుంది. అయితే అది దానికి విలోమానుపాతంలో వుంటుందని మనం గమనించాం. పారిశ్రామిక చక్రంలో రెండు దశలలో ఇది వర్తిస్తుంది. మొదటిది పారిశ్రామిక పెట్టుబడి తన ఉత్పాదక వాణిజ్య పెట్టుబడి రూపాలు రెంటిలోనూ సంకోచించినపుడు అంటే సంక్షోభం తర్వాత ఈ చక్రం ప్రారంభ దశలో, రెండవది మెరుగుదల ప్రారంభమయినపుడు, వాణిజ్య పరపతి ఇంకా పెద్ద స్థాయిలో బ్యాంక్ పరపతిని ఉపయోగించని దశకు ఇది వర్తిస్తుంది. మొదటి సందర్భంలో ఇంతకు ముందు ఉత్పత్తిలోనూ, వాణిజ్యంలోనూ వినియోగించబడిన డబ్బు పెట్టుబడి పనిలేని రుణ పెట్టుబడిగా కనిపిస్తుంది. రెండవదానిలో రానురాను ఎక్కువ ఉపయోగించబడుతున్నట్లు కనిపిస్తుంది. అయితే అది తక్కువ వడ్డీతో వుంటుంది. ఎందుకంటే పారిశ్రామిక పెట్టుబడిదారులు, వాణిజ్య పెట్టుబడిదారులు ఇప్పుడిక డబ్బు పెట్టుబడిదారునికి షరతులు పెడతారు. మొదటిదానిలో రుణ పెట్టుబడి మిగులు పారిశ్రామిక పెట్టుబడి స్తంభించిపోవటాన్ని వ్యక్తం చేస్తుంది. రెండోది వాణిజ్య పరపతికి బ్యాంకింగ్ పరపతితో ప్రమేయం లేకుండా వున్న సాపేక్ష స్వాతంత్ర్యాన్ని తెలియజేస్తుంది. ఇది ప్రతిఫలం సాఫీగా తిరిగి రావటంపైన, స్వల్పకాలిక పరపతిపైన, సొంత పెట్టుబడి కార్యకలాపాల ప్రాబల్యంపైన ఆధారపడి

వుంటుంది. ఇతరుల పరపతి పెట్టుబడితో వ్యవహరించే సట్టా వ్యాపారాలు ఇంకా రంగం మీదికి వచ్చి వుండవు. తమ సొంత పెట్టుబడితో వ్యవహరించే వ్యక్తులు కేవలం పరపతి కార్యకలాపాలు మాత్రమే నిర్వహించే దశకు చేరుకోలేదు. మొదటి దశలో రుణ పెట్టుబడి మిగులు వాస్తవ సంచయాన్ని వ్యక్తం చేయటానికి సరిగ్గా విరుద్ధం. రెండో దశలో పునరుత్పత్తి ప్రక్రియ విస్తరణ పునరుద్ధరణతో ఏకీభవిస్తుంది. దానిని అది అనుసరిస్తుంది. కానీ దానికి కారణం మాత్రం కాదు. రుణ పెట్టుబడి మిగులు అప్పటికే తగ్గిపోతుంది. గిరాకీతో పోలిస్తే అది కేవలం సాపేక్షంగా మాత్రమే వుంది. రెండు సందర్భాలలోనూ, వాస్తవ సంచయన ప్రక్రియ విస్తరణ తక్కువ వడ్డీ రేటు వల్ల పెంపొందించబడుతుంది. ఈ తక్కువ వడ్డీ రేటు అన్నది మొదటిదానిలో తక్కువ ధరలతోను, రెండవదానిలో నెమ్మదిగా పెరుగుతున్న ధరలతోను ఏకీభవిస్తుంది. వాస్తవ సంచయన ప్రక్రియ పరిశ్రమ లాభంగా రూపాంతరం చెందిన లాభం భాగాన్ని పెంచుతుంది. వడ్డీ దాని సగటు స్థాయికి పెరిగినపుడు అనగా సుభిక్ష కాలం అత్యున్నత దశలో వున్నప్పుడు చాలా వరకు అలా జరుగుతుంది. వడ్డీ అప్పుడు పెరిగింది, కానీ లాభంతో సాపేక్షంగా కాదు.

వాస్తవ సంచయనం ఏదీ లేకుండానే రుణ పెట్టుబడి సంచయనం జరగవచ్చని మనం చూశాం. బ్యాంకింగ్ వ్యవస్థ విస్తరణ ద్వారానూ, కేంద్రీకరణ ద్వారానూ, చలామణి రిజర్వులను పొదుపు చేయటం ద్వారానూ, ప్రైవేటు చెల్లింపు సాధనాల రిజర్వు నిధిని పొదుపు చేయటం ద్వారాను కేవలం ఇలాంటి సాంకేతిక సాధనాల ద్వారా ఇది సాధ్యమవుతుంది. ఈ అంశాలు అన్నీ స్వల్పకాలికంగా రుణ పెట్టుబడిగా రూపాంతరం చెందుతాయి. ఈ కారణంచేతనే ఈ రుణ పెట్టుబడి అనిశ్చల పెట్టుబడి అని పిలవబడినప్పటికీ అది రుణ పెట్టుబడి రూపాన్ని స్వల్పకాలికంగానే నిలబెట్టుకుంటుంది. (స్వల్పకాలిక ప్రాతిపదికపైనే దానిని డిస్కౌంట్ కోసం ఉపయోగించాల్సి వుంటుంది.) దానిలో నిరంతరాయంగా ఆటుపోట్లు వుంటాయి. ఒకరు దానిని కొంత వెనక్కు తీసుకుంటే మరొకరు దానిని కొంత జమ చేస్తారు. ఆ రకంగా వాస్తవ సంచయనంతో ప్రమేయం లేకుండా అప్పివ్వదగిన డబ్బు పెట్టుబడి పరిమాణం పెరుగుతుంది. (ఇక్కడ మనం దీర్ఘకాలిక రుణాల గురించి మాట్లాడటం లేదు. మార్పిడి బిల్లులపైన, డిపాజిట్లపైన స్వల్పకాలిక రుణాల గురించి మాత్రమే ప్రస్తావనజ)

బ్యాంక్ కమిటీ. 1857. ప్రశ్న 501. "అనిశ్చల పెట్టుబడి అంటే మీ ఉద్దేశం ఏమిటి?" (బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్ గవర్నర్ వెగ్యూలిన్ సమాధానం) "స్వల్పకాలిక రుణాలకు వర్తించే పెట్టుబడే.... 502. "బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్ నోట్లు... గ్రామీణ బ్యాంకుల చలామణి, దేశంలో వున్న నాణాల మొత్తం" (ప్రశ్న) "అనిశ్చల పెట్టుబడి అంటే మీ ఉద్దేశం క్రియాశీలమైన చలామణి అనా? (బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్ నోట్ల చలామణి) క్రియాశీల చలామణిలో పెద్ద తేడాలు వున్నాయి?" (ఈ క్రియాశీల చలామణి అన్నది రుణదాత వల్ల జరిగిందా లేదా పునరుత్పత్తి చేసే పెట్టుబడిదారుని వల్ల జరిగిందా అన్న దానినిబట్టి చాలా తేడా వుంటుంది.) వెగ్యూలిన్ సమాధానం "అనిశ్చల పెట్టుబడిలో బ్యాంకర్ల రిజర్వ్‌లను నేను కలుపుతాను. వాటిలో ఎగుడు దిగుడులుంటాయి." అంటే బ్యాంకర్లు తిరిగి రుణాలుగా ఇవ్వని డిపాజిట్ల భాగంలో గణనీయమైన ఆటుపోట్లు వుంటాయి. అయితే అది వారి రిజర్వు నిధిగా వుంటుంది. బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్‌కు కూడా దానిలో చాలా భాగం రిజర్వ్ నిధిగా వుంటుంది.

చివరిగా అదే వ్యక్తి ఇలా చెప్పాడు. "అనిశ్చల పెట్టుబడి వెండి, బంగారాలు కావచ్చు కడ్డీల రూపంలో లేదా నాణాల రూపంలో వుండవచ్చు." (503) – డబ్బు మార్కెట్ పరపతి భాషలో రాజకీయ అర్థశాస్త్రానికి సంబంధించిన అన్ని అభివర్గాలు భిన్న అర్థాన్ని, భిన్నమైన రూపాన్ని పొందటం ఆశ్చర్యకరం. అనిశ్చల పెట్టుబడి అన్నది అక్కడ చలామణికి, పెట్టుబడికి వ్యక్తీకరణ. అయితే ఈ రెంటికీ చాలా తేడా వుంది. అక్కడ డబ్బే పెట్టుబడి. వెండి, బంగారాలు కూడా పెట్టుబడులే. బ్యాంకు నోట్లేమో చలామణి, పెట్టుబడి ఒక సరుకు. బాకీలు కూడా సరుకులే. నిశ్చల పెట్టుబడి అమ్మటానికి వీల్లేని కాగితాలలో మదుపుపెట్టబడిన డబ్బు!

లండన్‌లో జాయింట్ స్టాక్ బ్యాంకులు 1847లో 8,850,574 పౌండ్ల డిపాజిట్లు కలిగి వున్నాయి. 1857 నాటికి అవి 43,200,724 పౌండ్లకు పెరిగాయి. ఈ కమిటీకి ఇచ్చిన సాక్ష్యాలను బట్టి ఈ పెద్ద మొత్తంలో అధిక భాగం ఇంతకు ముందు ఎప్పుడూ డిపాజిట్ చేయటం అలవాటు లేని వ్యక్తుల నుంచి గ్రహించబడిందని సూచనప్రాయంగా తెలుస్తుంది. ఖాతాలు ప్రారంభించటమూ, బ్యాంకర్ దగ్గర డబ్బు డిపాజిట్ చేయటమూ అన్నవి ఇంతకు ముందు తమ పెట్టుబడి (!)ని పనిలో పెట్టని అనేక వర్గాలకు విస్తరించాయి అని తెలుస్తుంది. ప్రైవేటు గ్రామీణ బ్యాంకర్ల సంఘం (ఇది జాయింట్ స్టాక్ బ్యాంక్‌ల కంటే భిన్నమయినది.) ఛైర్మన్ రాడ్‌వెల్ ఇలా ప్రకటించాడు. "ఇప్స్‌విచ్ ప్రాంతాలలో ఆ జిల్లాకు చెందిన రైతులు, దుకాణదారులలో ఈ మధ్య ఆచరణ నాలుగింతలు పెరిగింది. ఏడాదికి కేవలం 50 పౌండ్లు మాత్రమే చెల్లిస్తున్న రైతులతో సహా దాదాపు ప్రతి రైతు బ్యాంకులో డబ్బు డిపాజిట్ చేస్తున్నాడు. ఈ డిపాజిట్ల మొత్తం వాణిజ్యంలో ఉపయోగించబడింది. అవి వాణిజ్య కార్యకలాపాల కేంద్రమైన లండన్‌వైపు పయనిస్తాయి. మొదట ఆ మొత్తాలు బిల్లుల డిస్కౌంట్‌లో లేదా లండన్ బ్యాంకుల ఖాతాదారులకు ఇతర అడ్వాన్సుల్లో ఉపయోగపడతాయి. బ్యాంకర్లకు తక్షణమే అవసరంలేని పెద్ద భాగం బిల్లు బ్రోకర్ల చేతుల్లోకి ప్రవహిస్తుంది. ఈ బ్రోకర్లు బ్యాంకర్లకు అప్పటికే డిస్కౌంట్ అయిన బిల్లులను హామీగా ఇస్తారు. ఈ బిల్లులు లండన్‌లోను, దేశంలోని ఇతర భాగాల్లోను వున్న వ్యక్తుల పేరిట అప్పటికే డిస్కౌంట్ అయి వుంటాయి." (బ్యాంక్ కమిటీ, 1858 పుట V)

బిల్లు బ్రోకరు అప్పటికే ఒకసారి డిస్కౌంట్ చేసిన మార్పిడి బిల్లులపైన అతనికి డబ్బు మంజూరు చేయటం ద్వారా బ్యాంకరు మరోసారి డిస్కౌంట్ చేస్తున్నాడు. వాస్తవంలో ఈ బిల్లులలో అనేక బిల్లులు బ్రోకర్‌చేత రెండవసారి కూడా డిస్కౌంట్ చేయబడ్డాయి. బిల్లు బ్రోకర్ బిల్లులను రెండవసారి డిస్కౌంట్ చేయటానికి బ్యాంకర్ ఉపయోగించే డబ్బుతోనే బ్రోకరు కూడా కొత్త బిల్లులను రెండోసారి డిస్కౌంట్ చేస్తాడు. ఇది దేనికి దారితీస్తుందో ఈ కింది విషయం తెలియజేస్తుంది. "ఈ వెసులుబాటు బిల్లుల వల్ల, స్వేచ్ఛా పరపతి సౌకర్యాల వల్ల గ్రామీణ ప్రాంతాలలో వున్న జాయింట్ స్టాక్ బ్యాంకులు అటువంటి బిల్లులను డిస్కౌంట్ చేస్తూ ఆ బిల్లుల నాణ్యతను పట్టించుకోకుండా బ్యాంక్ పరపతి ఆధారంగా లండన్ మార్కెట్లో బిల్లు బ్రోకర్లతో తిరిగి ఆ బిల్లులను డిస్కౌంట్ చేయించటం వల్ల వచ్చిన అవకాశాలు కారణంగా విస్తారమైన స్థాయిలో మిథ్యా పరపతి సృష్టించబడింది." (అదే నివేదిక, పుట XXI)

మళ్ళీ మళ్ళీ ఇలా డిస్కౌంట్ చేయటానికి సంబంధించి, పరపతి మోసాలకు ఈ అప్పివ్వదగిన డబ్బు పెట్టుబడి కేవలం సాంకేతికంగా పెరిగిపోవటం వల్ల ఎలా సాయపడుతుందో ఎకనమిస్ట్ ఈ కింది విధంగా తెలియజేస్తుంది. “కొన్ని ఏళ్ళుగా (అప్పివ్వదగిన డబ్బు పెట్టుబడి) పెట్టుబడి కొన్ని జిల్లాలలో ఉపయోగించగలిగిన దానికంటే ఎక్కువ వేగంగా పోగుబడింది. మరికొన్ని జిల్లాలలో పెట్టుబడి కంటే వేగంగా దానిని ఉపయోగించే సాధనాలు పెరిగాయి. ఈ దేశంలో కేవలం వ్యవసాయ జిల్లాల్లో వున్న బ్యాంకరు తమ డిపాజిట్లను తమ జిల్లాల్లోనే లాభదాయకంగా, సురక్షితంగా పనిలో పెట్టడానికి బ్యాంకర్లకు తగిన సాధనాలు లేవు. పెద్ద వాణిజ్య నగరాలలో వున్న బ్యాంకర్లు, అలాగే పారిశ్రామిక జిల్లాల్లోను, గనులున్న జిల్లాల్లోను వున్న బ్యాంకర్లకు తాము సరఫరా చేయగలిగిన పెట్టుబడి కంటే ఎక్కువ గిరాకీ వుంది. కనుక వేరు వేరు జిల్లాల్లో వున్న ఈ సాపేక్ష పరిస్థితి వల్ల పెట్టుబడి పంపిణీలో ఒక కొత్త వర్గం సృష్టించబడి వేగంగా విస్తరించింది. వారే బిల్ బ్రోకర్లు. నిజానికి పెద్ద స్థాయిలో బ్యాంకర్లు కూడా. వీరి వాణిజ్యమేమంటే నిర్ణీతమైన కాలానికి నిర్ణీతమైన వడ్డీ రేట్లకు ఒప్పందం మేరకు పెట్టుబడి పూర్తిగా వినియోగించలేకపోయిన జిల్లాలలో బ్యాంకర్ల అదనపు పెట్టుబడిని తాత్కాలికంగా పనిలోలేని పబ్లిక్ కంపెనీల డబ్బులను విస్తారమైన వాణిజ్య సంస్థల సొమ్మును గ్రహించి పెట్టుబడికి గిరాకీ వున్న జిల్లాలలో బ్యాంకర్లకు ఎక్కువ వడ్డీ రేటుకు ఇవ్వడం. వారు తమ ఖాతాదారుల నుంచి తీసుకున్న బిల్లులను రెండోసారి డిస్కౌంట్ చేస్తారు... ఈ రకంగా పనిలేని పెట్టుబడి దేశంలో ఒక ప్రాంతం నుంచి పని వున్న మరో చోటికి బదిలీ చేయబడటం వల్ల ఇలాంటి పరిస్థితుల్లోనే ఒక వ్యక్తి దగ్గర నుంచి మరో వ్యక్తికి బదిలీ కావటం వల్ల లంబార్డ్ వీధి ఒక గొప్ప పెట్టుబడి కేంద్రంగా మారింది. మొదట ఈ లావాదేవీలు బ్యాంకింగ్ సెక్యూరిటీలపైన అప్పివ్వటానికి, పుచ్చుకోవటానికి మాత్రమే పరిమితమయ్యాయి. అయితే దేశంలో పెట్టుబడి వేగంగా పోగుబడటం వల్ల, బ్యాంక్ సంస్థలు దానిని మరింత పొదుపు చేయటంవల్ల ఈ డిస్కౌంట్ సంస్థల స్వాధీనంలో వున్న నిధులు అపారంగా పెరిగిపోయాయి. కనుక అవి మొదట డాక్ వారెంట్లపైన (ఓడరేవుల్లో వున్న సరుకుల నిల్వలపై బిల్లులు) అప్పులిచ్చాయి. తర్వాత దేశంలోకి ఇంకా చేరని సరుకుకు ప్రాతినిధ్యం వహించే లేడింగ్ బిల్లులపై ఇచ్చారు. ఒకోసారి అరుదుగా మాత్రమే ఈ సరుకుకు వ్యాపారుల హామీ బిల్లులు వున్నాయి. ఇంగ్లీష్ వాణిజ్య స్వభావాన్ని ఈ ఆచరణ వేగంగా మార్చింది. లంబార్డ్ వీధిలో వున్న ఈ సదుపాయాలు మిన్సింగ్ వీధిలో వుండే బ్రోకర్లకు విస్తారమైన అధికారాలను ఇచ్చాయి. వారు ఈ సదుపాయాలన్నిటినీ దిగుమతి చేసుకునే వ్యాపారికి ఇచ్చారు. ఆ వ్యాపారి ఇపుడు వాటినన్నిటినీ స్వీకరిస్తున్నాడు. 25 ఏళ్ళ క్రితం ఒక వ్యాపారి లేడింగ్ బిల్లులపైన, డాక్ వారెంట్లపైన అప్పు తీసుకున్నాడు అని తెలిస్తే అతని పరపతి మొత్తం మంటగలిసిపోయేది. ఇపుడు అదే ఆచరణ ఒక మినహాయింపుగా గాక, సాధారణ సూత్రంగా మారింది. 25 ఏళ్ళ క్రితం ఈ ఆచరణ అరుదుగా మాత్రమే వుండింది. ఈ పద్ధతి ఎంత ముందుకు సాగిందంటే దూరప్రాంతాల్లో వున్న వలసలలో రాబోయే పంటల బిల్లులపైన లంబార్డ్ వీధిలో పెద్ద మొత్తాలు అప్పు తీసుకోబడ్డాయి. అటువంటి సదుపాయాల పర్యవసానంగా దిగుమతి వ్యాపారులు ఈ లావాదేవీలను విదేశాలకు కూడా వర్తింపజేశారు. వారు తమ వ్యాపారాన్ని కొనసాగించడానికి ఉపయోగించే అనిశ్చల పెట్టుబడిని విదేశాలలో ఉపయోగించసాగారు. పైగా అత్యంత అభ్యంతరకరమైన స్థిర సెక్యూరిటీలైన విదేశీ

తోటలపైన తమ పెట్టుబడిని ఉపయోగించారు. ఆ తోటలపైన వారికి దాదాపు అదుపు ఏమీ ఉండదు. ఆ రకంగా గ్రామీణ బ్యాంకుల్లో డిపాజిట్ల రూపంలో గ్రామీణ జిల్లాలలో వసూలు చేయబడిన పరపతి ఎలా మారిందో గమనించవచ్చు. మొదట ఈ డబ్బు గనులున్న జిల్లాల్లోను, కార్ఖానాలున్న జిల్లాల్లోను కార్యకలాపాలు పెంచడానికి ఈ పెట్టుబడిని వినియోగించటం జరిగింది. ఆ ప్రాంతాలలో వున్న బ్యాంకులకు బిల్లులను రీ–డిస్కౌంట్ చేయడం ద్వారా ఇది సాధ్యమయింది. ఆ తర్వాత డాక్ వారెంట్లపైన, లేడింగ్ బిల్లులపైన అప్పులివ్వడం ద్వారా విదేశీ సరుకు దిగుమతికి సదుపాయాలు పెంచబడ్డాయి. ఆ రకంగా విదేశీ వలస వాణిజ్యంలో వున్న న్యాయమైన వాణిజ్య పెట్టుబడిని విముక్తి చేసి దానిని విదేశీ తోటలపైన అత్యంత అభ్యంతరకరమైన అడ్వాన్సులను వినియోగించటం జరిగింది." (ఎకనామిస్ట్, నవంబర్ 20, 1847, పుట 1334) పరపతిని "చక్కగా" దిగమింగిన పద్ధతి ఇది. గ్రామీణ ఖాతాదారుడు తన డిపాజిట్లు తన బ్యాంకర్ దగ్గరే వున్నాయని అనుకుంటాడు. తన బ్యాంకర్ ఇతరులకు అప్పిస్తే ఎవరో తనకు తెలిసిన వ్యక్తులకే ఇస్తూ వుంటాడని నమ్ముతాడు. అయితే ఈ బ్యాంకర్ లండన్‌లో వున్న బిల్ బ్రోకర్ స్వాధీనంలో తన డిపాజిట్‌ను ఉంచాడని, ఆ బిల్ బ్రోకర్ కార్యకలాపాలపైన తనకు గాని బ్యాంకర్‌కు గాని ఏ మాత్రం అదుపు లేదన్న అనుమానం అతనికి రాదు.

రైల్వేల్లాంటి పెద్ద పబ్లిక్ సంస్థలు తాత్కాలికంగా రుణ పెట్టుబడిని పెంచగలుగుతాయని మనం ఇంతకు ముందు చూశాం. డిపాజిట్ చేయబడిన మొత్తాలు అవి తర్వాత ఉపయోగించబడేంత వరకు బ్యాంకర్ల స్వాధీనంలో ఉండే పరిస్థితి వల్ల ఇది సాధ్యమవుతుంది.

★ ★ ★

సందర్భవశాత్తూ రుణ పెట్టుబడి పరిమాణం వేరు, చలామణి పరిమాణం వేరు. చలామణి పరిమాణం అంటే మొత్తం దేశంలో వున్న చలామణి అవుతున్న బ్యాంక్ నోట్లు, విలువైన లోహాల కడ్డీలతో సహా నాణాలు అని అర్థం. ఇందులో వున్న ఒక భాగం బ్యాంకుల రిజర్వుగా వుంటుంది. ఈ రిజర్వ్ పరిమాణం నిరంతరాయంగా మారిపోతుంది.

"1857 నవంబర్ 12న (1844 బ్యాంక్ చట్టాన్ని నిలుపుదల చేసిన తేదీ) బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్ మొత్తం రిజర్వ్ (లండన్ తదితర శాఖలతో సహా) కేవలం 580,751 పౌండ్లు. కాని వాటి డిపాజిట్లు మొత్తం 225,000 పౌండ్లు. ఇందులో లండన్ బ్యాంకర్లకు చెందినదే మొత్తం 65 లక్షలు." (బ్యాంక్ చట్టాలు 1888, పుట VII)

వడ్డీ రేట్లలో మార్పులు (వివిధ దేశాలలో వడ్డీ రేట్లలో దీర్ఘకాల వ్యవధుల్లో వచ్చే మార్పులు కాక, వడ్డీ రేట్లలో మార్పులు సాధారణ లాభం రేటుపైన ఆధారపడి వుంటాయి. లాభం రేట్లలో మార్పులు లాభం రేట్లకు పరపతి అభివృద్ధికి మధ్య తేడాపై ఆధారపడి వుంటుంది.) రుణ సరఫరాపై ఆధారపడి వుంటాయి. (విశ్వాసం లాంటి ఇతర పరిస్థితులన్నీ యథాతథంగా వుంటే) రుణ పెట్టుబడి అనగా డబ్బు రూపంలో, అలాగే నాణాలు నోట్ల రూపంలో అప్పివ్వబడిన పెట్టుబడి. ఇది సరుకు రూపంలో అప్పివ్వబడే పారిశ్రామిక పెట్టుబడికి విరుద్ధంగా వుంటుంది. ఈ పారిశ్రామిక పెట్టుబడిని పునరుత్పత్తి ప్రతినిధులు ఒకరికొకరు వాణిజ్య పరపతి సాధనాల ద్వారా అప్పిచ్చుకుంటారు.

ఏమైనప్పటికీ ఈ అప్పివ్వదగిన డబ్బు పెట్టుబడి మొత్తం చలామణిలో వున్న డబ్బు మొత్తం కంటే భిన్నమైనది, స్వతంత్రమైనది.

ఉదాహరణకు ఒకరోజులో 20 పౌండ్లను అయిదుసార్లు అప్పిస్తే 100 పౌండ్ల డబ్బు పెట్టుబడి అప్పిచ్చినట్లవుతుంది. అంతేగాక ఈ 20 పౌండ్లు కనీసం నాలుగుసార్లు కొనుగోలు సాధనంగా లేదా చెల్లింపు సాధనంగా ప్రవర్తించి వుండాలని తెలియజేస్తుంది. ఎందుకంటే ఇక్కడ కొనుగోలుగాని, చెల్లింపుగాని జరగకుంటే (అది నాలుగుసార్లు పెట్టుబడి యొక్క మారిన రూపానికి అనగా శ్రమ శక్తితో సహా సరుకులకు ప్రాతినిధ్యం వహించి వుండదు.) అది 100 పౌండ్ల పెట్టుబడిగా వుండదు. 20 పౌండ్లపైన అయిదుసార్లు ఏర్పడిన గిరాకీగా మాత్రమే వుంటుంది.

పరపతి వ్యవస్థ అభివృద్ధి చెందిన దేశాలలో అప్పివ్వటానికి వీలుగా వున్న డబ్బు పెట్టుబడి అంతా బ్యాంకులలో లేదా వడ్డీ వ్యాపారుల దగ్గర డిపాజిట్ల రూపంలో వుంటుందని భావించవచ్చు. కనీసం మొత్తం వ్యాపారానికి ఇది వర్తిస్తుంది. ఇంకా సట్టా వ్యాపారం ప్రారంభం కాకముందు వాణిజ్యం సుభిక్షంగా వున్నప్పుడు పరపతి తేలికగా లభిస్తున్నప్పుడు, నమ్మకం పెరుగుతున్నప్పుడు చలామణి కార్యకలాపాలలో అత్యధికం మామూలు పరపతి బదిలీ ద్వారా పరిష్కారమైపోతాయి. అపుడు నాణాల లేదా కాగితం డబ్బు సాయం అక్కరలేదు.

చలామణి సాధనం సాపేక్షంగా చిన్న పరిమాణంలో దొరుకుతున్నప్పుడు భారీ మొత్తాలలో డిపాజిట్లు దొరకడం అన్నది పూర్తిగా ఈ కింది అంశాలపై ఆధారపడుతుంది.

1) ఒకే నాణెం నిర్వహించే కొనుగోళ్ళు, చెల్లింపుల సంఖ్యపైన, 2) ప్రతిఫలం తిరిగి వచ్చే సంఖ్యపైనా. ఈ క్రమంలో అదే నాణెం బ్యాంకులకు డిపాజిట్‌గా తిరిగి వెళ్తుంది. ఇలా పదే పదే అది డిపాజిట్‌గా పరివర్తన చెందడం వల్ల, కొనుగోలు సాధనంగా, చెల్లింపు సాధనంగా దాని కార్యకలాపం వృద్ధి చెందుతుంది. ఉదాహరణకు ఒక చిన్న వ్యాపారి వారానికి 100 పౌండ్లు డబ్బును బ్యాంకులో డిపాజిట్ చేస్తాడు. ఈ డబ్బును బ్యాంకర్ ఒక కార్ఖానాదారునికి చెల్లిస్తాడు. దానిని కార్ఖానాదారుడు తన కార్మికులకు చెల్లిస్తాడు. కార్మికుడు దానిని చిన్న వ్యాపారికి చెల్లిస్తాడు. ఆ చిన్న వ్యాపారి మళ్ళీ మొత్తాన్ని బ్యాంక్‌లో డిపాజిట్ చేస్తాడు. కనుక చిన్న వ్యాపారి డిపాజిట్ చేసిన ఈ 100 పౌండ్లు మొదట కార్ఖానాదారునికి చెల్లించటానికి, రెండవసారి కార్మికునికి చెల్లించటానికి, మూడవసారి తనకే చెల్లించుకోవటానికి, నాలుగోసారి అదే చిన్న వ్యాపారి డబ్బు పెట్టుబడి మరో భాగాన్ని డిపాజిట్ చేయటానికి పనికి వచ్చింది. ఆ రకంగా 20 వారాల చివరలో ఈ డబ్బును చిన్న వ్యాపారి మధ్యలో తీసుకోకుండా వుంటే అతడు అదే 100 పౌండ్లతో 2000 పౌండ్లను డిపాజిట్ చేసుకుని వుంటాడు.

ఈ డబ్బు పెట్టుబడి ఏ మేరకు పనిలేకుండా వుంటుంది అన్నది బ్యాంకుల రిజర్వ్ నిధిలో ఆటుపోట్లను బట్టి తెలుస్తుంది. కనుక 1857లో బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్ గవర్నర్ వెగ్యూలిన్ బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్ బంగారం "మాత్రమే" రిజర్వు పెట్టుబడి అని నిర్ధారించాడు. "1258. ఆచరణలో దేశంలో వున్న పనిలేని పెట్టుబడి పరిమాణాన్ని బట్టి డిస్కౌంట్ రేటు శాసించబడుతుందని నేను భావిస్తున్నాను. పనిలేని పెట్టుబడి పరిమాణానికి బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్ రిజర్వు, ముఖ్యంగా వెండి బంగారాల రిజర్వు ప్రాతినిధ్యం వహిస్తుంది. కనుక వెండి బంగారాలను ఉపసంహరించుకుంటే దేశంలో వున్న పనిలేని పెట్టుబడిని అది తగ్గిస్తుంది. ఫలితంగా ఇంకా మిగిలివున్న పెట్టుబడి విలువ

పెరుగుతుంది." (న్యూ మార్చ్) "1364 బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్‌లో వున్న వెండి, బంగారాల రిజర్వు నిజానికి కేంద్ర రిజర్వు లేక సంపదల నిల్వ. దానిపైనే మొత్తం దేశంలో వున్న వాణిజ్యం నడుస్తుంది... ఆ నిల్వను లేక రిజర్వాయరును విదేశీ మారక ద్రవ్య కార్యకలాపం ఎల్లప్పుడూ ప్రభావితం చేస్తుంది." (బ్యాంక్ చట్టాలపై నివేదిక, 1857, పుటలు 108, 119)

★ ★ ★

ఎగుమతి, దిగుమతుల గణాంక సమాచారం నిజ పెట్టుబడిని అనగా ఉత్పాదక, సరుకు పెట్టుబడుల సంచయనపు పరిమాణాన్ని తెలియజేస్తుంది. బ్రిటిష్ పారిశ్రామికాభివృద్ధి (1815–1870) దశవర్ష ఆవృత్తాల సమయంలో ఈ గణాంక సమాచారం ఎప్పుడూ సూచించేదేమంటే సంక్షోభానికి ముందున్న చివరి అత్యున్నత సుభిక్షత తర్వాత వచ్చే సుభిక్షతకు కనీస స్థాయిలో పునఃప్రత్యక్షమవుతుంది. ఆ తర్వాత అది మరింత కొత్త ఉన్నత శిఖరాలను చేరుకుంటుంది.

సుభిక్షంగా ఉన్న 1824 సంవత్సరంలో గ్రేట్ బ్రిటన్, ఐర్లాండ్‌ల వాస్తవ లేదా ప్రకటిత ఎగుమతి ఉత్పాదితాల విలువ 40,396,300 పౌండ్లు. 1825 సంక్షోభంతో ఎగుమతుల మొత్తం పడిపోయి ఏడాదికి 35–39 మిలియన్ల మధ్య అది ఊగిసలాడింది. 1834లో మళ్ళీ సుభిక్ష పరిస్థితి వచ్చినపుడు ఇంతకు ముందు ఉన్న అత్యధిక స్థాయిని దాటి 41,649,191 పౌండ్లకు చేరింది. అదే 1836లో దాని అత్యధిక స్థాయి 53,368,571 పౌండ్లకు చేరింది. 1837 మొదలుకొని అది మళ్ళీ 42 మిలియన్లకు పడిపోయింది. ఆ రకంగా కొత్త అత్యల్ప స్థాయిలో పాత అత్యధిక స్థాయికంటే ఎక్కువగా వుంది. ఆ తర్వాత 50–53 మిలియన్ల మధ్య ఊగిసలాడింది. మళ్ళీ సుభిక్ష వాతావరణం నెలకొనటంతో 1844లో ఎగుమతులు మొత్తం 58,500,000 పౌండ్లకు పెరిగింది. 1836 నాటి అత్యధిక స్థాయిని ఇది దాటేసింది. 1845లో అది 60,111,082 పౌండ్లకు చేరింది. 1846లో 57 మిలియన్లకు పడిపోయింది. మళ్ళీ 1847లో దాదాపు 59 మిలియన్లకు చేరింది. 1948 53 మిలియన్లకు పడిపోయింది. మళ్ళీ 1849లో 63,500,000 పౌండ్లకు పెరిగింది. 1953లో దాదాపు 99 మిలియన్లకు పెరిగింది. 1954లో 97 మిలియన్లకు పడింది. 1855లో 94,500,000కు పడింది. 1856లో మళ్ళీ దాదాపు 116 మిలియన్లకు పెరిగింది. 1857లో 122 మిలియన్లతో శిఖరాగ్ర దశకు చేరుకుంది. 1858లో అది 116 మిలియన్లకు పడిపోయింది. 1859లోనే 130 మిలియన్లకు చేరింది. 1860లో దాదాపు 136 మిలియన్లకు పెరిగింది. 1861లో కేవలం 125 మిలియన్లు మాత్రమే వుంది. (ఇక్కడ కూడా కొత్త అత్యల్ప పరిమాణం పాత అత్యధిక పరిమాణం కంటే ఎక్కువగా వుంది.) 1863లో 146,500,000కు చేరింది.

ఇదే విషయం దిగుమతులకు కూడా వర్తిస్తుందని ఋజువు చేయవచ్చు. దిగుమతులు మార్కెట్ విస్తరణను సూచిస్తాయి. ఇది కేవలం ఉత్పత్తి స్థాయికి సంబంధించిన విషయం మాత్రమే. (వాస్తవ పారిశ్రామిక గుత్తాధిపత్యం వున్న కాలంలో మాత్రమే ఇంగ్లాండ్‌కు ఇది వర్తిస్తుంది. అయితే ఆధునిక భారీ పరిశ్రమలున్న దేశాల సముదాయాల మొత్తానికి కూడా ప్రపంచ మార్కెట్ విస్తరిస్తున్నంత కాలం ఇది వర్తిస్తుంది – ఎంగెల్స్)

## 2. పెట్టుబడి లేదా ఆదాయం రుణ పెట్టుబడిగా రూపాంతరం చెందే డబ్బుగా రూపాంతరీకరణ

వాణిజ్య పరపతి ప్రవాహంలో కానీ, ఆర్థిక వ్యవస్థలో కానీ స్తంభనకు వ్యక్తీకరణ కానిమేరకు డబ్బు పెట్టుబడి సంచయనాన్ని మనం ఇక్కడ పరిశీలిస్తున్నాం. వాస్తవ చలామణి సాధనం యొక్క ఆర్థిక వ్యవస్థ అయి వుండవచ్చు. లేదా పునరుత్పత్తి ప్రక్రియలో నిమగ్నమైన ప్రతినిధుల రిజర్వు పెట్టుబడి యొక్క ఆర్థిక విధానం కావచ్చు.

ఈ రెండు ఉదాహరణలు గాక 1852-1853లలో లాగా ఆస్ట్రేలియా, కాలిఫోర్నియాలలో కొత్తగా తవ్విన బంగారపు గనుల కారణంగా అసాధారణంగా బంగారం దేశంలో వచ్చి పడటంతో డబ్బు పెట్టుబడి సంచయనం కావచ్చు. ఈ బంగారం బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్‌లో డిపాజిట్ చేయబడింది. దాని బదులు డిపాజిటర్లు నోట్లు పొందారు. వాటిని వాళ్లు మళ్ళీ బ్యాంకర్ల దగ్గర డిపాజిట్ చేయలేదు. ఈ కారణంగా చలామణి సాధనం సాధారణంగా పెరిగింది. (1857లో బ్యాంక్ కమిటీ ముందు వెగ్యూలిన్ ఇచ్చిన సాక్ష్యం. నెం. 1329) ఈ డిపాజిట్లను 2 శాతానికి డిస్కౌంట్‌ను తగ్గించడం ద్వారా బ్యాంక్ ఉపయోగించుకోడానికి ప్రయత్నించింది. 1853లో 6 నెలల కాలంలో బ్యాంక్‌లో పోగుబడిన బంగారపు పరిమాణం 22-23 మిలియన్ల పౌండ్లకు చేరింది.

సహజంగానే వడ్డీ వ్యాపారులందరి సంచయనం ప్రత్యక్షంగా డబ్బు రూపంలో జరుగుతుంది. పారిశ్రామిక పెట్టుబడిదారుల సంచయనం తప్పనిసరిగా పునరుత్పాదక పెట్టుబడి అంశాల పెరుగుదల రూపంలో జరుగుతుంది. కనుక పరపతి వ్యవస్థ అభివృద్ధి, పెద్ద బ్యాంక్‌ల చేతుల్లో వడ్డీ వ్యాపారం అపారంగా కేంద్రీకరించబడటమూ అన్నవి అప్పివ్వదగిన పెట్టుబడి సంచయనాన్ని త్వరితం చేస్తాయి. ఇది వాస్తవ సంచయనానికి భిన్నమైన రూపంలో జరుగుతుంది. కనుక రుణ పెట్టుబడి ఇలా శీఘ్రంగా అభివృద్ధి చెందడమన్నది వాస్తవ సంచయనం యొక్క ఫలితమే. అది పునరుత్పత్తి ప్రక్రియ అభివృద్ధి పర్యవసానమే. ఈ డబ్బు పెట్టుబడిదారుల సంచయనానికి ఆధారమైన లాభం పునరుత్పాదక పెట్టుబడి గుంజుకునే అదనపు విలువ నుంచి తీసుకోబడింది మాత్రమే. (అదే సమయంలో ఇతరుల పొదుపు మొత్తాలపై వచ్చే వడ్డీ భాగం కూడా స్వాహా అవుతుంది.) రుణ పెట్టుబడి పారిశ్రామిక, వాణిజ్య పెట్టుబడిదారులను బలిపెట్టి పెరుగుతుంది. పారిశ్రామిక చక్రం ప్రతికూల దశలలో వడ్డీ రేటు అత్యధికంగా పెరిగి కొన్ని వాణిజ్య శాఖలలో ముఖ్యంగా కుంటుపడిన శాఖలలో మొత్తం లాభాన్ని మింగేస్తుందన్న విషయాన్ని మనం గమనించాం. అదే సమయంలో ప్రభుత్వ సెక్యూరిటీల, ఇతర సెక్యూరిటీల ధరలు పడిపోతాయి. సరిగ్గా ఇలాంటి సందర్భాలలో డబ్బు పెట్టుబడిదారులు ఇలా విలువ పడిపోయిన పత్రాలను భారీ స్థాయిలో కొంటారు. ఆ తరువాత దశలలో వాటి విలువ ఇదివరకటి స్థాయికి పెరుగుతుంది. అంతకంటే ఎక్కువ స్థాయికి కూడా పెరగవచ్చు. వాటిని అప్పుడు తిరిగి అమ్మటం జరుగుతుంది. సాధారణ జనాభా డబ్బు పెట్టుబడిలో ఒక భాగం అలా స్వాహా అవుతుంది. ఇంకా అమ్మబడని భాగం అధిక వడ్డీ రేటును ఇస్తుంది. ఎందుకంటే అది చాలా తక్కువకు కొనబడింది కనుక. డబ్బు పెట్టుబడిదారులు తాము సంపాదించిన లాభాన్ని తిరిగి పెట్టుబడిగా

మారుస్తారు. అయితే దానిని మొదట అప్పివ్వదగిన డబ్బు పెట్టుబడిగా మారుస్తారు. డబ్బు పెట్టుబడిదార్లను, బ్యాంకర్లను మాత్రమే ఈ ప్రత్యేక పెట్టుబడిదారుల వర్గం సంచయనంగా మనం భావించినప్పటికీ ఈ డబ్బు పెట్టుబడి సంచయనం జరుగుతుంది. ఇది వాస్తవ సంచయనానికి పుట్టిన బిడ్డే అయినప్పటికీ ఇది భిన్నంగా జరుగుతుంది. పునరుత్పత్తి ప్రక్రియ వాస్తవ విస్తరణతోపాటు పరపతి వ్యవస్థ కూడా పెరగాలి. దాని విస్తరణతోపాటు అప్పివ్వదగిన డబ్బు పెట్టుబడి పెరుగుతుంది.

వడ్డీ రేటు తక్కువగా వున్నప్పుడు ఈ డబ్బు పెట్టుబడి తరుగుదల ప్రధానంగా డిపాజిటర్లపైన పడుతుంది. ఇది బ్యాంకర్లపైన పడదు. స్టాక్ బ్యాంకులు ఇంకా అభివృద్ధి చెందక ముందు ఇంగ్లండ్‌లో వున్న నాలుగింట మూడు వంతుల డిపాజిట్లు బ్యాంకులలో ఏ మాత్రం వడ్డీ ఇవ్వకుండా పడివున్నాయి. ఇపుడు వాటిపైన వడ్డీ చెల్లించబడుతుంది. ప్రస్తుత వడ్డీ రేటు కంటే కనీసం 1% తక్కువ వడ్డీ ఇవ్వబడుతుంది.

ఇతర రకాల పెట్టుబడిదారుల డబ్బు సంచయనానికి సంబంధించినంత వరకూ మనం వడ్డీ ఇచ్చే పత్రాలలో మదుపు పెట్టిన భాగాన్ని ఆ రూపంలో సంచయనం జరిగే భాగాన్ని ఇక్కడ పట్టించుకోవడం లేదు. కేవలం మార్కెట్లో అప్పివ్వదగిన డబ్బు పెట్టుబడిగా వున్న మొత్తాన్ని మాత్రమే పరిగణిస్తున్నాం.

మొదటి అంశం, ఆదాయంగా ఖర్చు చేయబడిన మొత్తం కాక సంచయనం కోసం పక్కన పెట్టబడిన లాభపు భాగాన్ని మనం పరిశీలిస్తున్నాం. ప్రస్తుతం ఆ భాగంతో పారిశ్రామిక పెట్టుబడిదారునికి పనిలేదు. ఈ లాభం సరుకు పెట్టుబడి రూపంలో వుంటుంది. దానిలో కొంత భాగం సరుకు రూపంలో వుండగా, మరికొంత భాగం డబ్బు రూపంలోకి మారివుంటుంది. సరుకు పెట్టుబడి ఉత్పాదక అంశాలుగా అది తిరిగి మారకుండా వుంటే (ఇక్కడ వ్యాపారి గురించి వదిలేద్దాం. అతని గురించి వేరే ప్రత్యేకంగా చర్చిద్దాం.) కొంతకాలం పాటు అది డబ్బు రూపంలోనే ఉండాల్సి వుంటుంది. లాభం రేటు పడిపోతున్నప్పటికీ పెట్టుబడి పెరగటంతో పాటు ఈ మొత్తం కూడా పెరుగుతుంటుంది. ఆదాయంగా ఖర్చు పెట్టాల్సిన భాగం క్రమంగా వినిమయమయింది. అయితే ఈలోగా డిపాజిట్లుగా అది బ్యాంకర్ దగ్గర రుణ పెట్టుబడిగా వుంది. కనుక ఆదాయంగా ఖర్చు చేయబడిన లాభపు భాగం పెరుగుదల సైతం క్రమమైన నిరంతరాయమైన, పునరావృత్తమయ్యే రుణ పెట్టుబడి సంచయనంగానే వ్యక్తమవుతుంది. సంచయనం కోసం ఉద్దేశించబడిన భాగానికి కూడా ఇదే వర్తిస్తుంది. కనుక పరపతి వ్యవస్థ అభివృద్ధితోపాటు దాని నిర్వహణ పెరుగుదలతోపాటు, ఆదాయంలో పెరుగుదల సైతం అంటే పారిశ్రామిక వాణిజ్య పెట్టుబడిదారుల వినియోగం కూడా రుణ పెట్టుబడి సంచయనంగా వ్యక్తమవుతుంది. ఇది క్రమంగా నెమ్మదిగా వినియోగం అయిన మేరకు అన్ని ఆదాయాలకూ వర్తిస్తుంది. మరోలా చెప్పాలంటే భూమి కౌలుకూ, ఉన్నత రూపాల్లో వున్న వేతనాలకూ, అనుత్పాదక వర్గాల ఆదాయాలకూ ఇది వర్తిస్తుంది. కొంతకాలంపాటు ఇవన్నీ డబ్బు ఆదాయం రూపాన్ని కలిగి వుంటాయి. కనుక అవి డిపాజిట్లుగానూ, రుణ పెట్టుబడిగానూ మార్చడానికి వీలుగా వుంటాయి. వినియోగానికి ఉద్దేశించబడిన లేదా సంచయనానికి ఉద్దేశించబడిన మొత్తం ఆదాయం అంతా అది ఏదో ఒక డబ్బు రూపంలోనే వున్న మేరకు డబ్బుగా రూపాంతరం చెందిన సరుకు పెట్టుబడి విలువలో ఒక

భాగం మాత్రమే. ఈ కారణంచేత ఇది వాస్తవ సంచయనానికి ఫలితమూ, వ్యక్తీకరణ. అయితే తనంత తానుగా అది ఉత్పాదక పెట్టుబడి కాదు. నూలు వడికే వ్యక్తి తన నూలును పత్తితో మార్పిడి చేసుకున్నాడనుకుందాం. (అతని పారిశ్రామిక పెట్టుబడి నూలు రూపంలో వుంది. అది నేతగాని చేతుల్లోనికి లేదా ఒక ప్రైవేటు వినిమయదారుని చేతుల్లోనికి పోతుంది. నిజానికి ఈ నూలు అన్నది మొత్తం పెట్టుబడి విలువతోపాటు అదనపు విలువను కూడా కలిగి వుంటుంది.) డబ్బు రూపంలోకి మారిన అదనపు విలువ పరిమాణం నూలులో వున్న అదనపు విలువ పరిమాణంపైన ఆధారపడి వుంటుంది. అయితే అది డబ్బుగా రూపాంతరం చెందిన వెంటనే ఈ డబ్బు అదనపు విలువ యొక్క విలువ రూపం మాత్రమే. ఆ రకంగా అది రుణ పెట్టుబడిలో అంశంగా మారుతుంది. కనుక దానిని దాని యజమాని అప్పటికే అప్పుగా ఇచ్చి వుండకపోతే దానిని డిపాజిట్‌గా మార్చటం కంటే వేరే చేయాల్సిన పని వుండదు. అయితే ఉత్పాదక పెట్టుబడిగా దానిని తిరిగి మార్చాలంటే అది ఒక కనీస నిర్దిష్ట స్థాయికి చేరుకుని వుండడం అవసరం.

★ ★ ★

## అధ్యాయం - 32

# డబ్బు పెట్టుబడి, నిజ పెట్టుబడి - III

### (ముగింపు)

**ఈ** రకంగా తిరిగి పెట్టుబడిగా రూపాంతరం చెందాల్సిన డబ్బు మొత్తం అన్నది అపారమైన పునరుత్పత్తి ప్రక్రియ ఫలితం. అయితే దానంతటదే అప్పివ్వదగిన డబ్బు పెట్టుబడిగా పునరుత్పాదక పెట్టుబడి మొత్తం కాజాలదు.

ఇప్పటివరకు చర్చించిన అత్యంత ప్రధానమైన అంశమేమంటే వినియోగానికి ఉద్దేశించిన ఆదాయపు భాగం విస్తరించి (కార్మికుణ్ణి ఇక్కడ పరిగణించడం లేదు. ఎందుకంటే అతని ఆదాయం అస్థిర పెట్టుబడితో సమానం.) మొదట డబ్బు పెట్టుబడి సంచయనంగా కనిపిస్తుంది. ఆ రకంగా వాస్తవ పారిశ్రామిక సంచయనానికి భిన్నమైన డబ్బు పెట్టుబడి సంచయనంలో ఒక అంశం ప్రవేశిస్తుంది. ఎందుకంటే వినియోగం కోసం ఉద్దేశించిన వార్షిక ఉత్పాదితం ఏ రకంగానూ పెట్టుబడి కాదు. దానిలో ఒక భాగం పెట్టుబడిని భర్తీ చేస్తుంది. అనగా వినియోగ సాధనాల ఉత్పత్తిదారుల స్థిర పెట్టుబడిని భర్తీ చేస్తుంది. అయితే ఏ మేరకు పెట్టుబడిగా వాస్తవంగా రూపాంతరం చెందుతుందో ఆ మేరకు ఈ స్థిర పెట్టుబడి ఉత్పత్తిదారుల ఆదాయం యొక్క సహజ రూపంలో వుంటుంది. అదే డబ్బు ఆదాయానికి ప్రాతినిధ్యం వహిస్తూ వినియోగాన్ని పెంపొందించడానికి తోడ్పడే డబ్బే కొంతకాలం పాటు అప్పివ్వదగిన డబ్బు పెట్టుబడిగా రూపాంతరం చెందుతుంది. ఈ డబ్బు వేతనాలకు ప్రాతినిధ్యం వహించిన మేరకు అది అదే సమయంలో అస్థిర పెట్టుబడి యొక్క డబ్బు రూపం కూడా అది వినియోగ సాధనాల ఉత్పత్తిదారుల స్థిర పెట్టుబడిని భర్తీ చేసిన మేరకు అది తాత్కాలికంగా వారి స్థిర పెట్టుబడి ధరించిన డబ్బు రూపం. అది వస్తురూపంలో వారి స్థిర పెట్టుబడి భాగాలను కొనుగోలు చేయడానికి తోడ్పడుతుంది. అది ఏ రూపంలోనూ సంచయనాన్ని వ్యక్తం చేయదు. పునరుత్పత్తి ప్రక్రియ పెరుగుదలతో పాటు దాని పరిమాణం కూడా పెరుగుతూనే వుంటుంది. అది తాత్కాలికంగా అప్పివ్వదగిన డబ్బుగా, డబ్బు పెట్టుబడిగా వ్యవహరిస్తుంది. కనుక ఈ విషయంలో డబ్బు పెట్టుబడి సంచయనం అన్నది ఎప్పుడూ వ్యక్తిగత వినియోగం విస్తరించడం వల్ల వాస్తవంగా ఉన్న దానికంటే ఎక్కువ పెట్టుబడి సంచయనాన్ని అది ప్రతిబింబించాలి. ఎందుకంటే అది డబ్బు సాధనాల చేత అభివృద్ధి చెంది డబ్బు పెట్టుబడి సంచయనంగా కనిపిస్తుంది. వాస్తవ సంచయనానికి అనగా పెట్టుబడి కొత్త మదుపులను అనుమతించే డబ్బుకు డబ్బు రూపాన్ని సమకూరుస్తుంది.

ఆ రకంగా అప్పివ్వదగిన డబ్బు పెట్టుబడి సంచయనం అన్నది కొంత వరకు పారిశ్రామిక పెట్టుబడి దాని ఆవృత్తం కాలంలో ఆ పెట్టుబడిగా రూపాంతరం చెందే డబ్బు అంతా పునరుత్పాదక

పెట్టుబడిదారులు అడ్వాన్స్ చేసిన డబ్బు రూపాన్ని ధరించదు. కేవలం వారు అప్పు తీసుకున్న డబ్బు రూపాన్ని మాత్రమే అది సంతరించుకుంటుంది. పునరుత్పత్తి ప్రక్రియలో జరిగే డబ్బు అడ్వాన్స్ అనేది కేవలం అప్పు అడ్వాన్స్‌గా మాత్రమే కనిపిస్తుంది. నిజానికి వాణిజ్య పరపతి ప్రాతిపదికపైన ఒక వ్యక్తి మరో వ్యక్తికి పునరుత్పత్తి ప్రక్రియ కవసరమైన డబ్బు ఇస్తాడు. అది ఇప్పుడు ఈ క్రింది రూపాన్ని తీసుకుంటుంది. పునరుత్పాదక పెట్టుబడిదారుల ఒక బృందం దగ్గర బ్యాంకర్ రుణం సంగ్రహించి పునరుత్పాదక పెట్టుబడిదారుల మరో బృందానికి అప్పిస్తాడు. ఆ రకంగా బ్యాంకర్ అత్యున్నత శ్రేయోభిలాషిలా కనిపిస్తాడు. అదే సమయంలో ఈ పెట్టుబడిపైన అదుపు ఒక మధ్యవర్తిగా పూర్తిగా అతని చేతిలో వుంటుంది.

డబ్బు పెట్టుబడి సంచయనం యొక్క మరికొన్ని ప్రత్యేక రూపాల గురించి ఇంకా పేర్కొనవలసి వుంది. ఉదాహరణకు ఉత్పత్తి అంశాలు, ముడి పదార్థాలు వగైరాల ధర పడిపోవడం వల్ల విడుదలయ్యే పెట్టుబడి. పారిశ్రామిక పెట్టుబడిదారుడు తన పునరుత్పత్తి ప్రక్రియ వెంటనే విస్తరించలేకపోతే అతని డబ్బు పెట్టుబడిలో ఒక భాగం ఆవృత్తం నుంచి అవసరమని భావించబడి బయటకు పంపించబడి, అప్పివ్వదగిన డబ్బు పెట్టుబడిగా రూపాంతరం చెందుతుంది. రెండోది డబ్బు రూపంలో వున్న పెట్టుబడిని ముఖ్యంగా వ్యాపారి తన వ్యాపారంలో అంతరాయం కలిగినపుడల్లా విడుదల చేస్తాడు. వ్యాపారి ఒక లావాదేవీల వరస పూర్తి చేసిన తర్వాత అంతరాయాల కారణంగా కొత్త వరసను ఇంకా వెంటనే ప్రారంభించలేనప్పుడు తాను సంపాదించిన డబ్బు అతని దృష్టిలో నిల్వ, అదనపు పెట్టుబడిగా మాత్రమే వుంటుంది. అదే సమయంలో అది అప్పివ్వదగిన డబ్బు పెట్టుబడి ప్రత్యక్ష సంచయనంగా ఉంటుంది. మొదటి సందర్భంలో డబ్బు పెట్టుబడి సంచయనం మరింత అనుకూలమైన పరిస్థితులలో పునరావృత్తమయ్యే పునరుత్పత్తి ప్రక్రియను వ్యక్తం చేస్తుంది. అంతకు ముందు బంధించబడి వున్న పెట్టుబడిలో ఒక భాగం వాస్తవంగా విడుదలవుతుంది. మరోలా చెప్పాలంటే అదే మొత్తం డబ్బుతో పునరుత్పత్తి ప్రక్రియను విస్తరించడానికి అది ఒక అవకాశం. అయితే రెండో సందర్భంలో అది లావాదేవీల ప్రవాహానికి ఒక అంతరాయం మాత్రమే. అయితే రెండు సందర్భాలలోనూ అది అప్పివ్వదగిన డబ్బు పెట్టుబడిగా మారి, దాని సంచయనానికి ప్రాతినిధ్యం వహించి, డబ్బు మార్కెట్‌ను, వడ్డీ రేటును సమానంగా ప్రభావితం చేస్తుంది. అది ఒక సందర్భంలో వాస్తవ సంచయన ప్రక్రియను వృద్ధి చేసేదిగానూ, మరోదానిలో ఆటంకపడే అంశంగానూ వ్యక్తమయినప్పటికీ ఇది వర్తిస్తుంది. అంతిమంగా డబ్బు పెట్టుబడి సంచయనం అన్నది పునరుత్పత్తి కోసం సన్నద్ధమయిన తర్వాత తిరిగి ఉపసంహరించుకున్న వారి సంఖ్యచేత ప్రభావితమవుతుంది. పారిశ్రామిక చక్రం క్రమంలో లాభాలు పెరుగుతున్న కొద్దీ వారి సంఖ్య కూడా పెరుగుతుంది. ఈ విషయంలో అప్పివ్వదగిన డబ్బు పెట్టుబడి సంచయనం ఒకవైపున వాస్తవ సంచయనాన్ని (దాని సాపేక్ష పరిమితి మేరకు) మరో వైపున పారిశ్రామిక పెట్టుబడిదారులు కేవలం డబ్బు పెట్టుబడిదారులుగా రూపాంతరం చెందుతున్న స్థాయిని తెలియ జేస్తుంది.

ఆదాయంగా వినియోగానికి ఉద్దేశించని లాభపు భాగం అది తలెత్తిన ఉత్పాదక రంగంలో వాణిజ్య విస్తరణలో వెంటనే మదుపు పెట్టడానికి వీలులేనప్పుడు మాత్రమే డబ్బు పెట్టుబడిగా

మారుతుంది. అది రెండు కారణాలుగా జరగవచ్చు. ఈ ఉత్పత్తి రంగంలో పెట్టుబడితో సంతృప్తమై ఉండవచ్చు. లేదా పెట్టుబడిగా వ్యవహరించటానికి ముందు సంచయనం నిర్దిష్ట పరిమాణాన్ని చేరుకోవాల్సి రావచ్చు. ఈ ప్రత్యేక రంగంలో కొత్త పెట్టుబడి మదుపు పరిమాణాలపైన ఇది ఆధారపడుతుంది. కనుక కొంతకాలం పాటు అప్పివ్వదగిన డబ్బు పెట్టుబడిగా మారి ఇతర రంగాల్లో ఉత్పత్తి విస్తరణకు తోడ్పడుతుంది. మిగిలిన పరిస్థితులన్నీ యథాతథంగా ఉన్నాయనుకుంటే పెట్టుబడిగా తిరిగి రూపాంతరం చెందటానికి ఉద్దేశించబడిన లాభాల పరిమాణం అంతవరకు వచ్చిన లాభాల పరిమాణంపైన, పునరుత్పత్తి ప్రక్రియ విస్తరణపైన ఆధారపడి వుంటుంది. అయితే ఈ కొత్త సంచయనం అన్నది పనిలో పెట్టబడటానికి ఇబ్బందులను ఎదుర్కొన్నప్పుడు, మదుపు రంగాల కొరత వల్ల అనగా ఉత్పత్తి రంగాలలో మిగులు వల్ల రుణ పెట్టుబడి అధిక సరఫరా వల్ల ఈ ఇబ్బందులు ఎదురయినప్పుడు ఈ అప్పివ్వదగిన డబ్బు పెట్టుబడి వాపు అన్నది కేవలం పెట్టుబడిదారీ ఉత్పత్తి పరిమితుల్ని తెలియజేస్తుంది. ఆ తర్వాత జరిగే పరిమితి మోసాలు ఈ అదనపు పెట్టుబడిని పనిలో పెట్టడంలో ఎటువంటి నిజమైన ఆటంకాలు లేవని రుజువు చేస్తాయి. ఆ ఆటంకం ఉన్నది దాని విస్తరణ నియమాలలోనే. పెట్టుబడి తనను తాను పెట్టుబడిగా మార్చుకొనే పరిమితుల్లోనే ఆ ఆటంకం ఉంది. డబ్బు పెట్టుబడి వాపు అన్నది తనంత తానుగా అమితోత్పత్తిని సూచించదు. పెట్టుబడి మదుపు రంగాల కొరతను కూడా సూచించదు.

రుణ పెట్టుబడి సంచయనం అంటే డబ్బును అప్పివ్వదగిన డబ్బుగా మార్చడమే. ఈ ప్రక్రియ పెట్టుబడిగా వాస్తవంగా రూపాంతరం చెందే ప్రక్రియకంటే భిన్నమయింది. ఇది కేవలం డబ్బు సంచయనం మాత్రమే. అయితే పెట్టుబడిగా రూపాంతరం చెందటానికి వీలయిన డబ్బు సంచయనం. ఇంతకు ముందు మనం చూసినట్టుగా ఈ సంచయనం వాస్తవ సంచయనానికంటే అత్యంత భిన్నమైన సంఘటనలను ప్రతిబింబించవచ్చు. వాస్తవ సంచయనం నిరంతరాయంగా విస్తరిస్తున్నంత వరకూ ఈ డబ్బు పెట్టుబడి పెరిగిన సంచయనం కొంత మేరకు దాని ఫలితం కావచ్చు. కొంత వరకూ దానికి భిన్నమైన దానితోపాటు ఉండే పరిస్థితుల ఫలితమూ కావచ్చు. అంతిమంగా వాస్తవ సంచయనానికి ఎదురైన ఆటంకాల ఫలితమూ కావచ్చు. వాస్తవ సంచయనాన్ని అనుసరిస్తూనే ఆ సంచయనంతో ప్రమేయం లేకుండా స్వతంత్రంగా వుండే పరిస్థితుల వల్ల రుణ పెట్టుబడి సంచయనం జరిగితే పారిశ్రామిక చక్రం యొక్క నిర్దిష్ట దశలలో ఈ డబ్బు పెట్టుబడి వాపు నిరంతరాయంగా వుంటుంది. పరపతి విస్తరణతోపాటు ఈ వాపు పెరుగుతుంది. దానితోపాటు ఉత్పత్తి ప్రక్రియను దాని పెట్టుబడిదారీ పరిమితులకు మించి నెట్టాల్సిన అవసరం కూడా తలెత్తుతుంది. అమిత వాణిజ్యం, అమిత ఉత్పత్తి, మితిమీరిన పరపతి. అదే సమయంలో ప్రతిక్రియను సృష్టించే రూపాలలోనే ఇది ఎప్పుడూ జరుగుతుంది.

భూమి కౌలు, వేతనాలు వగైరాల నుంచి డబ్బు పెట్టుబడి సంచయనం అన్నదాని గురించి ఇక్కడ చర్చించాల్సిన అవసరం లేదు. ఇక్కడ ఒక్క అంశాన్ని మాత్రమే నొక్కి చెప్పాల్సి వుంది. వాస్తవ పొదుపుల వల్ల, భోగ విసర్జన వల్ల (నిల్వదారులు) సంచయన అంశాలు సమకూరే మేరకు అవి శ్రమ విభజనకు విడిచిపెట్టబడతాయి. ఈ విభజన పెట్టుబడిదారీ ఉత్పత్తి ప్రగతితోపాటు పెరుగుతుంది.

ఈ శ్రమ విభజనలో ఆ అంశాలను అతి తక్కువగా స్వీకరించేవారికి, తమ సొంత మదుపులను కూడా తరచుగా కోల్పోయేవారికి అంటే బ్యాంకుల దివాళా కాలంలో కార్మికుల్లాగా కోల్పోయేవారికి ఈ బాధ్యత వదిలివేయబడుతుంది. ఒకవైపున పారిశ్రామిక పెట్టుబడిదారుని పెట్టుబడిని అతడు "పొదుపు" చేయలేడు. ఇతరుల పొదుపు మొత్తాలపైన అతనికి అతని పెట్టుబడి పరిణామానికి అనులోమంగా అదుపు వుంది. మరోవైపున డబ్బు పెట్టుబడిదారు ఇతరుల పొదుపు మొత్తాలను తన సొంత పెట్టుబడిగా మార్చుకుంటాడు. పునరుత్పాదక పెట్టుబడిదారులు ఒకరికొకరు ఇచ్చుకొనే పరపతిని, జనం వారికిచ్చే పరపతిని అతడు మరింత ధనవంతుడిగా మారడానికి ఒక సొంత ఆధారంగా మార్చుకొంటాడు. పెట్టుబడి అన్నది సొంత శ్రమ, పొదుపు మొత్తాల ఫలితం అన్నది చివరి పెట్టుబడిదారీ విధాన భ్రమ ఆ రకంగా నాశనం అవుతుంది. ఇతర ప్రజల శ్రమను స్వాహా చేయడం ద్వారా లభించేది లాభం మాత్రమే కాదు. ఇతరుల శ్రమను చలనంలో వుంచి దోపిడీ చేయటానికి తోడ్పడే పెట్టుబడి కూడా ఇతరుల ఆస్తిని కలిగి వుంటుంది. దీనిని డబ్బు పెట్టుబడిదారుడు పారిశ్రామిక పెట్టుబడిదారుల స్వాధీనంలో వుంచుతాడు. అందుకు ప్రతిగా అతడు పారిశ్రామిక పెట్టుబడిదారుణ్ణి దోపిడీ చేస్తాడు.

పరపతి పెట్టుబడి గురించి కొన్ని వ్యాఖ్యలు చేయవలసి వుంది.

మనం ఇంతకు ముందు చూసినట్టుగానే ఒకే డబ్బు శకలం ఎన్నిసార్లు రుణ పెట్టుబడిగా వ్యవహరిస్తుందన్నది ఈ క్రింది అంశాలపై ఆధారపడి వుంటుంది.

1. అమ్మకంలో లేదా చెల్లింపులో సరుకు విలువల్ని రాబట్టడం ద్వారా ఆ డబ్బు శకలం ఎన్నిసార్లు పెట్టుబడిని బదిలీ చేస్తుంది. అలాగే ఆదాయాన్ని అది ఎన్నిసార్లు రాబడుతుంది. ఎన్నిసార్లు అది వాస్తవ రూపంలోకి వచ్చినా విలువగా అనగా పెట్టుబడి లేదా ఆదాయపు విలువగా ఇతరుల చేతుల్లోకి చేరుతుంది అన్నది వాస్తవ లావాదేవీల విస్తృతిపైన, పరిమాణంపైన ఆధారపడతాయన్నది స్పష్టం.
2. ఇది చెల్లింపుల ఆర్థిక విధానంపైన, పరపతి వ్యవస్థ అభివృద్ధి, నిర్వహణలపైన ఆధారపడుతుంది.
3. పరపతి సౌకర్యాల చర్యల వేగాన్ని బట్టి ఇది వుంటుంది. ఒకచోట ఒక డిపాజిట్ పుట్టగానే మరోచోట తక్షణమే అది వేరొకచోట రుణంగా ప్రారంభమవుతుంది.

రుణ పెట్టుబడి ఉండే రూపం నిజమైన డబ్బు లేదా బంగారం లేదా వెండి మాత్రమే అనుకుందాం. ఈ సరుకు యొక్క భౌతిక రూపం విలువ కొలబద్దగా వ్యవహరిస్తుందనుకుందాం. ఈ డబ్బు పెట్టుబడిలో అత్యధిక భాగం ఎప్పుడూ కేవలం నకిలీ పెట్టుబడిగానే వుంటుంది. అంటే కేవలం విలువపైన హక్కుగా మాత్రమే, కాగితం డబ్బుగా మాత్రమే వుంటుంది. పెట్టుబడి ఆవృత్తంలో డబ్బు పనిచేసిన మేరకు అది ఒక క్షణంపాటు డబ్బు పెట్టుబడిని కలిగి వుంటుంది. అయితే అది అప్పు ఇవ్వదగిన డబ్బు పెట్టుబడిగా రూపాంతరం చెందదు. ఉత్పాదక పెట్టుబడి అంశాలతో అది మార్పిడి చేయబడుతుంది. ఆదాయం పొందటానికిగాను చలామణి సాధనంగా చెల్లించబడుతుంది. కనుక అది తన యజమానికి రుణ పెట్టుబడిగా మారదు. అదే డబ్బు పదే పదే రుణ పెట్టుబడికి ప్రాతినిధ్యం వహిస్తుంది. అది ఒక స్థానంలో మాత్రమే లోహపు డబ్బు రూపంలో వుంటుంది.

మిగిలిన స్థానాలన్నిటిలోనూ పెట్టుబడిపైన హక్కుల రూపంలో మాత్రమే వుంటుంది. ఈ హక్కుల సంచయనం అన్నది వాస్తవ సంచయనం నుంచే తలెత్తుతుంది. సరుకు పెట్టుబడి విలువ డబ్బుగా రూపాంతరం చెందటం వల్లనే తలెత్తుతుంది. అయితే ఈ హక్కుల లేదా పట్టాల సంచయనం అది తలెత్తే వాస్తవ సంచయనం కంటే భిన్నమైనది. భవిష్యత్ వాస్తవ సంచయనాన్ని (కొత్త ఉత్పత్తి ప్రక్రియ) ఈ డబ్బు రుణం వృద్ధి చేస్తుంది. కానీ ఆ సంచయనం కంటే అది భిన్నమయినది.

రుణ పెట్టుబడి అప్పుడూ డబ్బు రూపంలోనే వుంటుందన్నది స్పష్టం.[1] ఇపుడు అప్పు తీసుకున్న వాని దగ్గర వాస్తవంగా డబ్బు రూపంలో ఉండటం వలన ఆ డబ్బు అప్పిచ్చే వ్యక్తి చేతిలో కేవలం హక్కుపత్రంగా మాత్రమే వుంటుంది. అప్పిచ్చిన వ్యక్తికి అది డబ్బుపైన హక్కుగా, యాజమాన్యపు పత్రంగా రూపాంతరం చెందింది. కనుక ఒకే వాస్తవ డబ్బు మొత్తం అనేక భిన్నమైన డబ్బు పెట్టుబడి మొత్తాలకు ప్రాతినిధ్యం వహించగలదు. పెట్టుబడి లేదా ఆదాయం డబ్బుగా మారినప్పటికీ కేవలం డబ్బు అనేది అప్పివ్వటం ద్వారా రుణ పెట్టుబడిగా మారుతుంది. అభివృద్ధి చెందిన పరపతి వ్యవస్థలో సాధారణ రూపాన్ని మనం పరిశీలిస్తే డబ్బు డిపాజిట్‌గా మారి రుణ పెట్టుబడి అవుతుంది. ఈ డిపాజిట్ ఖాతాదారునికి డబ్బు పెట్టుబడి అయితే బ్యాంకర్ చేతుల్లో అది డబ్బు పెట్టుబడి కాగల మొత్తం మాత్రమే. అది యజమాని ఖజానాలో ఉండాల్సింది బ్యాంకర్ ఖజానాలో పనిలేకుండా పడివుంటుంది.[2]

---

1. 1857 బ్యాంకర్ ట్వెల్స్ సాక్ష్యం "4516. ఒక బ్యాంకర్‌గా మీరు పెట్టుబడితో వ్యవహరిస్తారా లేక డబ్బుతోనా? - డబ్బుతోనే వ్యవహరిస్తాం." - "4517. మీ బ్యాంక్‌లో డిపాజిట్లు ఎలా చెల్లించబడతాయి? - డబ్బు రూపంలో" - "4518. బయటివారికి వాటిని మీ బ్యాంక్ ఎలా చెల్లిస్తుంది? - డబ్బు రూపంలో" - "4519. అయితే వాటిని డబ్బు అని కాకుండా మరేదయినా పేరుతో పిలవవచ్చా? - కూడదు."
ఓవర్‌స్టన్ (26వ అధ్యాయం చూడండి) "పెట్టుబడి"ని "డబ్బు"ను ఎపుడూ గందరగోళపరుస్తాడు. "డబ్బు విలువ" కూడా అతని దృష్టిలో వడ్డీయే. అది డబ్బు మొత్తంచేత నిర్ణయించబడిన మేరకు, ఇది వర్తిస్తుంది. ఉత్పాదక పెట్టుబడి కోసమూ, సృష్టించే లాభం కోసమూ ఉన్న గిరాకీచేత నిర్ణయించబడిన మేరకు "పెట్టుబడి విలువ" వడ్డీగా భావించబడుతుంది. అతడిలా అంటాడు "4840. "పెట్టుబడి" అన్న మాటను ఉపయోగించటం చాలా ప్రమాదకరం." - "4148 ఈ దేశం నుండి వెండి, బంగారాల ఎగుమతి అన్నది ఈ దేశంలో డబ్బు పరిమాణాన్ని తగ్గిస్తుంది. ఈ దేశంలో డబ్బు పరిమాణం తగ్గటం అన్నది సాధారణంగా డబ్బు మార్కెట్‌పైన ఒత్తిడి సృష్టిస్తుంది." (దీని ప్రకారం పెట్టుబడి మార్కెట్‌పైన కాదన్నమాట.) "4112. దేశం నుంచి డబ్బు బయటకుపోతే దేశంలో వున్న పరిమాణం తగ్గిపోతుంది. దేశంలో మిగిలి వున్న డబ్బు తగ్గిపోవటం వల్ల ఆ డబ్బు విలువ పెరిగిపోతుంది." (అతని సిద్ధాంతం ప్రకారం చలామణి సంకోచిస్తే సరుకుల విలువల్తో పోల్చినపుడు డబ్బు విలువ పెరుగుతుంది. మరోలా చెప్పాలంటే డబ్బు విలువ పెరగటం అంటే సరుకుల విలువ పడిపోవడమే. అయితే ఈలోగా మరిన్ని దుస్సాహసాలు చేయక ముందే చలామణిలో వున్న డబ్బు మొత్తం ధరలను నిర్ణయించదన్న వాస్తవాన్ని అతడు సైతం గుర్తించాడు. చలామణి సాధనంగా వున్న డబ్బు పరిమాణంలో తగ్గుదల వడ్డీ యిచ్చే పెట్టుబడిగా దాని విలువను పెంచుతుందని అనగా వడ్డీ రేటును పెంచుతుందని భావించబడింది.) ఇంకా మిగిలి వున్న డబ్బు విలువ పెరిగిపోవడం వల్ల డబ్బు బయటకు పోవటం ఆగిపోతుంది. సమతా స్థితిని పునరుద్ధరించడానికి అవసరమైన డబ్బు పరిమాణం తిరిగి వచ్చేదాకా ఈ పరిస్థితి కొనసాగుతుంది" ఓవర్‌స్టన్ వైరుధ్యాల గురించి తరువాత మరికొంత చర్చించుకోవచ్చు.
2. ఈ అంశం దగ్గర గందరగోళం మొదలవుతుంది. ఈ రెండు "డబ్బు"గానే ఉంటాయని భావించబడుతుంది. బ్యాంకర్ నుంచి ఎప్పుడైనా తీసుకోవడానికి వీలయిన మొత్తంగా డిపాజిట్, బ్యాంకర్ చేతుల్లో వున్న

భౌతిక సంపద పెరుగుదలతో పాటు డబ్బు పెట్టుబడిదారీ వర్గం కూడా పెరుగుతుంది. ఒకవైపున రిటైర్ అవుతున్న పెట్టుబడిదారుల, అద్దె వసూలుదారుల సంపద, సంఖ్య పెరుగుతుంది. మరోవైపున పరపతి వ్యవస్థ పెరిగి బ్యాంకర్లు, వడ్డీ వ్యాపారులు, డబ్బు వ్యాపారులు పెరుగుతారు. అందుబాటులో వున్న డబ్బు పెట్టుబడి అభివృద్ధి చెందటంతో పాటు వడ్డీ యిచ్చే పత్రాలు, ప్రభుత్వ సెక్యూరిటీలు, స్టాకులు వగైరాల పరిమాణం కూడా పెరుగుతుంది. ఇది మనం ఇంతకు ముందు చూశాం. అదే సమయంలో డబ్బు పెట్టుబడి కోసం గిరాకీ కూడా పెరుగుతుంది. ఈ పత్రాలతో సట్టా వ్యాపారం చేసే వ్యక్తులు డబ్బు మార్కెట్లో ప్రముఖమైన పాత్ర వహిస్తారు. మొత్తం క్రయ, విక్రయాలన్నీ వాస్తవమైన పెట్టుబడి మదుపులను మాత్రమే వ్యక్తం చేస్తే వాటి ప్రభావం రుణ పెట్టుబడిపైన ఉండదని చెప్పడం సరయినదే. ఎందుకంటే 'అ' తన పత్రాన్ని అమ్మినపుడు ఆ పత్రంలో 'ఆ' ఎంత డబ్బు పెడతాడో సరిగ్గా అంత డబ్బు మాత్రమే 'అ' వెనక్కు తీసుకోగలుగుతాడు. పత్రం ప్రాతినిధ్యం వహించే పెట్టుబడి లేకున్నప్పటికీ ఆ పత్రం వుంటే అలాంటి డబ్బు పెట్టుబడి కోసం అదెప్పుడూ ఆ మేరకు కొత్త గిరాకీని సృష్టిస్తుంది. అది ఏ రకంగా చూసినా డబ్బు పెట్టుబడే. ఇంతకు ముందు అది 'ఆ' స్వాధీనంలో వుంది. ఇప్పుడది 'అ' స్వాధీనంలోకి వచ్చింది.

---

డిపాజిట్ డబ్బు. బ్యాంకర్ ట్వెల్స్ 1857లో బ్యాంకింగ్ కమిటీ ముందు ఈ అంశాన్ని ఉదహరించాడు. "నేను పది వేల పౌండ్లతో వ్యాపారం ప్రారంభిస్తే 5 వేల పౌండ్లతో సరుకులు కొని గిడ్డంగిలో పెడతాను. మిగిలిన 5 వేల పౌండ్లను బ్యాంకర్ దగ్గర ఉంచుతాను. దానిని నాకవసరమయినపుడు ఉపయోగించు కుంటాను. అపుడు కూడా నా దగ్గర 10 వేల పౌండ్ల పెట్టుబడి ఉన్నట్టే భావిస్తాను. 5 వేల పౌండ్లు డిపాజిట్ లేదా డబ్బు రూపంలో ఉన్నప్పటికీ అలాగే భావిస్తాను." (4528) అపుడు ఈ కింది వింత చర్చ ప్రారంభమయింది. "4531. మీరు మీ 5 వేల పౌండ్లను వేరొకరికి ఇచ్చారు కదా? - అవును." - "4532. అయితే ఆ మరొక వ్యక్తి దగ్గర 5 వేల పౌండ్లు డిపాజిట్ వుంది కదా? - అవును." - "4533. ఇంకా మీ దగ్గర 5 వేల పౌండ్లు డిపాజిట్ మిగిలి వుందన్నమాట? - సరిగ్గా అంతే." - "4534. మీ దగ్గర 5 వేల పౌండ్లున్నాయి. ఆ మరొక వ్యక్తి దగ్గర 5 వేల పౌండ్లున్నాయి, అవునా? - అవును." - "4535. అయితే అదంతా డబ్బే గదా? - కాదు." ఈ గందరగోళానికి కారణం 5 వేల పౌండ్లు డిపాజిట్ చేసిన 'అ' డబ్బును ఎప్పుడైనా వెనక్కు తీసుకోగలడు. అది ఇంకా తన దగ్గర ఉన్నట్టుగానే దేనిపైనైనా ఖర్చుపెట్టగలడు. ఆ మేరకు అది అతనికి డబ్బు కాగల మొత్తం. అయితే అతడు ఆ డబ్బును తీసుకుంటే తన డిపాజిట్‌ను అంతం చేసినట్టే అవుతుంది. నిజమైన డబ్బును అతడు బయటకు తీస్తే అతనికి చెల్లించిన డబ్బు అతని డబ్బు కాదు. ఎందుకంటే అతని డబ్బు అప్పటికే మరో వ్యక్తికి అప్పివ్వబడింది. కనుక మరో డిపాజిటర్ డబ్బుతో అతనికి చెల్లించటం జరిగింది. తన బ్యాంకర్ చెక్కుతో 'ఆ'కి ఇవ్వాల్సిన బాకీ చెల్లిస్తే 'ఆ' ఆ చెక్కును తన బ్యాంకర్‌కు ఇస్తాడు. 'అ'కి సంబంధించిన బ్యాంకర్ 'ఆ' బ్యాంకర్ దగ్గర నుంచి చెక్కు పుచ్చుకుంటాడు. ఆ రకంగా ఇద్దరు బ్యాంకర్లు కేవలం చెక్కుల్ని మార్చుకుంటారు. 'అ' డిపాజిట్ చేసిన డబ్బు డబ్బు పాత్రనే రెండుసార్లు నిర్వహించింది. మొదట 'అ' డిపాజిట్ చేసిన డబ్బును తీసుకున్న వ్యక్తి చేతుల్లోను రెండోది స్వయంగా 'అ' చేతుల్లోను అది ఈ పాత్ర నిర్వహించింది. ఈ రెండో పాత్రలో డబ్బుపై వున్న హక్కుల్ని సమం చేయుటకు 'అ'కి తన బ్యాంకర్‌పై వున్న హక్కును ఆ బ్యాంకర్‌కు 'ఆ' బ్యాంకర్‌పైన తన హక్కును రద్దు చేయటమే అవుతుంది.) డబ్బును ఉపయోగించకుండానే ఇది జరుగుతుంది. ఇక్కడ డిపాజిట్ రెండుసార్లు డబ్బుగా వ్యవహరిస్తుంది. వాస్తవమైన డబ్బుగానూ, డబ్బుపైన హక్కుగానూ వ్యవహరిస్తుంది. కేవలం డబ్బుపై నున్న హక్కులు డబ్బు స్థానాన్ని ఆక్రమించటం అంటే ఆ హక్కుల్ని రద్దుచేయటమే అవుతుంది."

1857 బ్యాంకు చట్టాలు. నెం. 4886. "డిస్కౌంట్ రేటు మార్కెట్లో వున్న పెట్టుబడి పరిమాణం చేత నిర్ణయించబడుతుందని, ఇతర రకాల సెక్యూరిటీలకంటే భిన్నమయిన వాణిజ్య బిల్లుల డిస్కౌంట్‌కు వర్తించే పెట్టుబడి పరిమాణంచేత నిర్ణయించబడుతుందని వివరించటం సరయినదేనని మీరు భావిస్తారా?" – (చాప్‌మేన్) "లేదు. తాత్కాలిక స్వభావమున్న, డబ్బుగా మార్చటానికి వీలయిన సెక్యూరిటీలు అన్నిటికీ ఇది వర్తిస్తుంది. కేవలం బిల్లుల డిస్కౌంట్‌కు మాత్రమే దీనిని పరిమితం చేయటం పొరపాటు. కన్సోల్స్‌పైన, ఖజానా బిల్లులపైన ఇటీవలి కాలంలో వున్నట్టుగానే వాణిజ్య రేటు కంటే చాలా ఎక్కువ రేటుకు డబ్బు కోసం గిరాకీ విపరీతంగా పెరిగినపుడు వాణిజ్య ప్రపంచం దాని వలన ఏమీ ప్రభావితం కాలేదనటం అసంబద్ధం. అది భౌతికంగా ప్రభావితమౌతుంది." – "4890. బ్యాంకర్లు సజావుగా వున్నాయనుకున్న కరెంట్ సెక్యూరిటీలు మార్కెట్లో వున్నపుడు వాటిపైన ప్రజలు డబ్బు అప్పు తీసుకుంటారు. వాణిజ్య బిల్లుపైన దానికి ఖచ్చితంగా ప్రభావం వుంటుంది. ఉదాహరణకు ఒక వ్యక్తి తన డబ్బును తన కన్సోల్స్‌పైన 6%కు అప్పివ్వగలిగితే అతని వాణిజ్య బిల్లులపైన 5%కు నేను డబ్బు తీసుకోవడాన్ని అతడు అంగీకరిస్తాడని నేను భావించలేను. మా విషయంలోనూ అంతే. నేను నా డబ్బును 6%కు అప్పివ్వగలిగితే బిల్లుల్ని $5\frac{1}{2}$%కే నేను డిస్కౌంట్ చేయాలని ఎవరూ కోరరు." – "4892. 2 వేల పౌండ్లు 5 వేల పౌండ్లు లేదా 10 వేల పౌండ్లు మొత్తాలను కొనే మదుపుదార్ల గురించి మేం మాట్లాడటం లేదు. వారు డబ్బు మార్కెట్‌ను పెద్దగా ప్రభావితం చేయలేరు. కన్సోల్స్‌పైన వడ్డీ రేటును మీరు ప్రస్తావిస్తే లక్షలాది పౌండ్లతో వ్యాపారం చేసే వ్యక్తుల గురించి నేను మాట్లాడుతున్నాను. వారే డబ్బు సట్టా వ్యాపారులు. వారు పెద్ద ఎత్తున రుణాల్ని తీసుకుంటారు. లేదా మార్కెట్లో కొనుగోలు చేస్తారు. కొన్నదానిని నిలవ చేస్తారు. ప్రజల దృష్టి నుంచి ఆ సరుకును తప్పించాక దానిని పెద్ద లాభానికి అమ్ముతారు. కనుక వారికి డబ్బు అవసరం."

పరపతి వ్యవస్థ అభివృద్ధితో పాటు లండన్ లాంటి పెద్ద డబ్బు మార్కెట్లు సృష్టించబడ్డాయి. అవి ఈ పత్రాల వ్యాపారాన్ని కొనసాగించే ప్రధాన కేంద్రాలు కూడా. ఈ అసహ్యకరమైన వ్యాపారుల గుంపుకు బ్యాంకులు పెద్ద మొత్తాలలో ప్రజల డబ్బు పెట్టుబడిని అప్పచెప్పాయి. ఆ రకంగా ఈ జూదగాళ్ళ సంతతి అనేక రెట్లు పెరుగుతుంది. "స్టాక్ ఎక్స్ఛేంజిలో డబ్బు మిగిలినచోట్ల కంటే సాధారణంగా చౌకగా వుంటుంది." అని 1848లో బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్ గవర్నర్‌గా వచ్చిన జేమ్స్ మోరిస్, లార్డ్‌న్ సభ రహస్య కమిటీ ముందు సాక్ష్యం చెప్పాడు. (సి.డి. 1848, 1857 ప్రచురణ, నెం. 219)

వడ్డీ ఇచ్చే పెట్టుబడి పైన చర్చలో ఇతర పరిస్థితులన్నీ యథాతథంగా వున్నప్పుడు దీర్ఘకాలిక ప్రాతిపదికపైన చూస్తే సగటు వడ్డీ రేటన్నది సగటు లాభం రేటుపైన ఆధారపడుతుందని వివరించాం. ఇది పరిశ్రమ లాభంపైన ఆధారపడదు. పరిశ్రమ లాభం అంటే వడ్డీ పోగా మిగిలిన లాభం అని అర్థం.

వాణిజ్య వడ్డీలో తేడాలకు అనగా వాణిజ్య ప్రపంచంలో వడ్డీ వ్యాపారులు డిస్కౌంట్లపైన, అప్పులపైన లెక్కించే వడ్డీ రేట్లలో తేడాల గురించి ప్రస్తావిస్తూ పారిశ్రామిక చక్రక్రమంలో వడ్డీ రేటు కనీస స్థాయి దాటి సగటు స్థాయికి చేరుకునే దశ ఒకటి వస్తుందని ఇంతకు ముందు పేర్కొనబడింది. దీనిని మరోచోట మరికొంత విశ్లేషిద్దాం. (ఈ సగటు రేటును కూడా తర్వాత అది దాటిపోతుంది.) లాభాల పెరుగుదల కారణంగానే ఈ చలనం తలెత్తిందని కూడా పేర్కొన్నాం.

ఈలోగా ఇక్కడ రెండు అంశాలను గమనించాలి.

మొదటిది – వడ్డీ రేటు చాలా కాలంపాటు నిలిచి వుంటే (ఇంగ్లండ్ లాంటి ఒక నిర్ణీత దేశంలో, చాలా కాలంపాటు ఒక నిర్ణీతమైన సగటు వడ్డీ రేటు ఉన్నచోట వడ్డీ రేటు గురించి మనం ప్రస్తావిస్తున్నాం. ఇది దీర్ఘకాలిక రుణాలపై ఉన్న వడ్డీ రేట్లను బట్టి కూడా తెలుస్తుంది. దీనిని ప్రైవేటు వడ్డీ అంటారు.) ఈ కాలంలో లాభం రేటు ఎక్కువ స్థాయిలో ఉందనటానికి ఇది ఒక ప్రాథమిక నిదర్శనం. అయితే పరిశ్రమ లాభం రేటు ఎక్కువగా ఉందనడాన్ని ఇది రుజువు చేయదు. తమ సొంత పెట్టుబడితో వ్యాపారం చేసే పెట్టుబడిదారుల విషయంలో ఈ తేడా వర్తించదు. వారు తమకు తామే వడ్డీ చెల్లించుకుంటారు గనుక అధిక లాభం రేటును పొందగలుగుతారు. లాభం రేటు ఎక్కువగా వున్నపుడు చాలా కాలంపాటు వడ్డీ రేటు ఎక్కువ స్థాయిలో ఉండటం సాధ్యమవుతుంది. వాస్తవంగా లాభం గుంజుకునే దశకు ఇది వర్తించదు. ఈ అధిక లాభం రేటు, అధిక వడ్డీ రేటును తీసేశాక పరిశ్రమ లాభం రేటును కొద్దిగా మాత్రమే మిగల్చవచ్చు. లాభం రేటు ఉన్నత స్థాయిలో కొనసాగుతున్నప్పుడు, పరిశ్రమలలో లాభం రేటు కుంచించుకుపోవచ్చు. 'ఇది ఎందుకు సాధ్యపడుతుందంటే, ఒకసారి పరిశ్రమను ప్రారంభించాక వాటిని కొనసాగించాల్సి వుంటుంది. ఈ దశలో చాలావరకు శుద్ధ పరపతి పెట్టుబడి (ఇతరుల పెట్టుబడి)తో వ్యవహారాలు నడుస్తాయి. అధిక లాభం రేటన్నది సట్టా వ్యాపారం వల్లనూ కావచ్చు, భవిష్యత్ అవకాశాల వల్లనూ కావచ్చు. అధిక లాభం రేటుతోపాటు పరిశ్రమ లాభం రేటు తగ్గుతున్నప్పటికీ అధిక వడ్డీ రేటును చెల్లించటం సాధ్యమవుతుంది. దీనిని లాభం నుంచి కాక అప్పు తీసుకున్న పెట్టుబడి నుంచి చెల్లించవచ్చు. (కొంతవరకు ఇది సట్టా వ్యాపారం సందర్భంలో జరుగుతుంది.) కొంతకాలం ఇది కొనసాగవచ్చు.

రెండోది – లాభం రేటు ఎక్కువగా వుంది గనుక డబ్బు పెట్టుబడి కోసం గిరాకీ పెరిగిందని, వడ్డీ రేటు కూడా పెరిగిందని అనటం, వడ్డీ రేటు ఎక్కువగా వుండటానికి కారణం పారిశ్రామిక పెట్టుబడి కోసం గిరాకీ పెరగటమే అనటం ఒకటి కాదు.

సంక్షోభ సమయాలలో రుణ పెట్టుబడి కోసం గిరాకీ అత్యధిక స్థాయికి పెరుగుతుంది. వడ్డీ రేటు కూడా అంతే. లాభం రేటు దానితో పాటు పారిశ్రామిక పెట్టుబడి కోసం గిరాకీ అన్ని రకాలుగాను అదృశ్యమైపోతుంది. ఇంతకు ముందు కుదుర్చుకున్న ఒప్పందాల్ని అమలుచేయటానికి మాత్రమే, చెల్లింపుల కోసం మాత్రమే అటువంటి సందర్భాలలో ప్రతి ఒక్కరూ అప్పు తీసుకుంటారు. మరోవైపున సంక్షోభం తర్వాత కార్యకలాపాలు పునరుద్ధరించబడే సమయంలో కొనుగోలు చేయడానికి డబ్బు పెట్టుబడిని ఉత్పాదక పెట్టుబడిగా లేదా వాణిజ్య పెట్టుబడిగా మార్చడానికి తీసుకోవడం జరుగుతుంది. అప్పుడు దానిని పారిశ్రామిక పెట్టుబడిదారుడో లేదా వ్యాపారో కోరతాడు. పారిశ్రామిక పెట్టుబడిదారుడు దానిని ఉత్పత్తి సాధనాల కోసమూ, శ్రమశక్తి కోసమూ వెచ్చిస్తాడు.

శ్రమశక్తి కోసం గిరాకీ పెరగటమన్నది దానంతట అది ఎప్పుడూ వడ్డీ రేటు పెరగటానికి కారణం కాజాలదు. వడ్డీ రేటు లాభం రేటుచేత నిర్ణయించబడిన మేరకు ఇది వర్తిస్తుంది. అధిక వేతనాలు ఎప్పుడూ అధిక లాభాలకు కారణం కావు. అయితే పారిశ్రామిక చక్రంలో కొన్ని ప్రత్యేక దశలలో అధిక లాభాలకు అవి పర్యవసానాలు కావచ్చు.

ప్రత్యేకమైన అనుకూల పరిస్థితులలో శ్రమ దోపిడీ జరిగినప్పుడు శ్రమశక్తి కోసం గిరాకీ

పెరుగుతుంది. ఆ విధంగా అస్థిర పెట్టుబడి కోసం గిరాకీ కూడా పెరుగుతుంది. అయితే శ్రమశక్తి కోసం గిరాకీ పెరగటం, అస్థిర పెట్టుబడి కోసం గిరాకీ పెరగటం అన్నది లాభాన్ని పెంచదు. పైపెచ్చు ఈ గిరాకీ పెరిగిన స్థాయిలోనే అది తగ్గిపోతుంది. అదే సమయంలో అస్థిర పెట్టుబడి కోసమూ, డబ్బు పెట్టుబడి కోసమూ గిరాకీ పెరగవచ్చు. అది వడ్డీ రేటును పెంచగలదు. శ్రమశక్తి మార్కెట్ ధర అప్పుడు దాని సగటును మించిపోతుంది. కార్మికులు సగటు సంఖ్య కంటే ఎక్కువ మందికి పని దొరుకుతుంది. అలాంటి పరిస్థితులలో డబ్బు కోసం గిరాకీ పెరుగుతుంది కనుక అదే సమయంలో వడ్డీ రేటు పెరుగుతుంది. మిగిలిన సరుకులన్నిటి లాగానే ఈ సరుకు ధర కూడా శ్రమశక్తి కోసం గిరాకీ పెరగటం వల్ల పెరుగుతుంది. అయితే ఈ సరుకు సాపేక్షంగా చౌకగా ఉండటంపైనే ఆధారపడే లాభం మాత్రం పెరగదు. అయితే అదే సమయంలో మనం ఊహించిన పరిస్థితులలో అది వడ్డీ రేటును పెంచుతుంది. ఎందుకంటే అది డబ్బు కోసం గిరాకీ పెంచుతుంది కనుక. డబ్బు పెట్టుబడిదారుడు డబ్బును అప్పివ్వడానికి బదులు పారిశ్రామిక పెట్టుబడిదారునిగా మారితే అతను శ్రమశక్తి కోసం అధికంగా వెచ్చించాల్సి రావటం వల్ల అతని లాభం పెరగకపోగా అతడు అదనంగా వెచ్చించిన నిష్పత్తిలో తగ్గుతుంది. మొత్తం వ్యాపార పరిస్థితి వల్ల మొత్తం మీద లాభం పెరగవచ్చు. అయితే అది అతను శ్రమశక్తికి అధికంగా వెచ్చించినందువల్ల మాత్రం కాదు. డబ్బు పెట్టుబడి కోసం గిరాకీని పెంచిన మేరకు ఈ పరిస్థితి వడ్డీ రేటు పెంచటానికి సరిపోతుంది. వ్యాపారం ప్రతికూలంగా వున్న పరిస్థితులలో ఏదో కారణంగా వేతనాలు పెరిగితే ఆ వేతనాల పెరుగుదల లాభం రేటును తగ్గిస్తుంది. అయితే అది డబ్బు పెట్టుబడి కోసం గిరాకీని పెంచటం వల్ల ఆ మేరకు వడ్డీ రేటును పెంచుతుంది.

శ్రమ విషయాన్ని పక్కనుంచితే, ఓవర్‌స్టన్ చెప్పే 'పెట్టుబడి కోసం గిరాకీ' అనేది 'సరుకుల కోసం గిరాకీ' మాత్రమే. సరుకుల కోసం గిరాకీ వల్ల వాటి ధర పెరుగుతుంది. అది సగటు కంటే పెరగనూవచ్చు లేదా సరుకుల సరఫరా సగటు కంటే తగ్గటం వల్ల ధర పెరగనూవచ్చు. పారిశ్రామిక పెట్టుబడిదారు లేదా వ్యాపారి ఇంతకు ముందు 100 పౌండ్లు చెల్లించే సరుకుల కోసం ఇప్పుడు 150 పౌండ్లు చెల్లించాల్సి వస్తే ఇంతకు ముందు అప్పు తీసుకున్న 100 పౌండ్లకు బదులు ఇప్పుడు 150 పౌండ్లు అప్పు చేయాల్సి వుంటుంది. వడ్డీ రేటు 5% అనుకుంటే ఇంతకు ముందు చెల్లించిన 5 పౌండ్లకు బదులు ఇప్పుడు $7\frac{1}{2}$ పౌండ్లు చెల్లించాల్సి వస్తుంది. ఇపుడతడు ఎక్కువ పెట్టుబడి అప్పు చేయాలి గనుక అతడు చెల్లించాల్సిన వడ్డీ మొత్తం కూడా పెరుగుతుంది.

రుణ పెట్టుబడి, పారిశ్రామిక పెట్టుబడి వడ్డీలు ఒకటే అని చెప్పడమే ఓవర్‌స్టన్ ప్రయత్నమంతా. కాగా వీటి మధ్య వున్న తేడా, డబ్బు పెట్టుబడిదారులకు లాభించేలా చేయడానికే అతని బ్యాంక్ చట్టం ఉద్దేశించబడింది.

సగటు స్థాయికంటే సరుకుల సరఫరా పడిపోతే సరుకుల కోసం వున్న గిరాకీ ఇంతకు ముందుకంటే ఎక్కువ డబ్బు పెట్టుబడిని ఇముడ్చుకోకపోవడం సాధ్యమే. ఇంతకు ముందు మొత్తం లేదా అంతకంటే చిన్న మొత్తం, వాటి మొత్తం విలువ కోసం చెల్లించాల్సి వుంటుంది. అయితే ఆ మొత్తానికి అంతకు ముందుకంటే తక్కువ పరిమాణం గల ఉపయోగ విలువలు లభిస్తాయి. ఈ విషయంలో అప్పివ్వదగిన పెట్టుబడి కోసం గిరాకీలో మార్పు ఉండదు. కనుక వడ్డీ రేటు పెరగదు.

సరుకుల గిరాకీ వాటి సరఫరాతో పోలిస్తే పెరిగినప్పటికీ, వాటి ధర కూడా పెరిగినప్పటికీ వడ్డీ రేటు పెరగకపోవచ్చు. రుణ పెట్టుబడి కోసం గిరాకీ పెరగనంత వరకూ వడ్డీ రేటు ప్రభావితం కాదు. అయితే పై ఊహల ప్రకారం పరిస్థితి అలా లేదు.

ఒక వస్తువు సరఫరా సగటు స్థాయికంటే పడిపోవచ్చు. ధాన్యం లేదా పత్తి వగైరా పంటలు విఫలమయినపుడు అలా జరుగుతుంది. ఈ సరుకులపైన ఇంకా ధరలు పెరుగుతాయనే ఉద్దేశంతో సట్టా వ్యాపారం జోరుగా సాగటం వల్ల రుణ పెట్టుబడి కోసం గిరాకీ పెరగవచ్చు. వీటి ధరలు పెంచటానికి అత్యంత తేలికైన మార్గమేమంటే వాటి సరఫరాలో ఒక భాగాన్ని తాత్కాలికంగా ఉపసంహరించుకోవటమే. అయితే అలా అమ్మకుండా కొనుగోలు చేసిన సరుకులకు చెల్లించటానికి "మార్పిడి బిల్లు కార్యకలాపాల"కు చెందిన వాణిజ్య సాధనాల ద్వారా డబ్బు పొందటం జరుగుతుంది. ఈ సందర్భంలో రుణ పెట్టుబడి కోసం గిరాకీ పెరుగుతుంది. సరుకు సరఫరా మార్కెట్‌ను చేరకుండా కృత్రిమంగా ఆపే ఈ ప్రయత్నం వల్ల వడ్డీ రేటు పెరుగుతుంది. అటువంటప్పుడు వడ్డీ రేటులో పెరుగుదల సరుకు పెట్టుబడి సరఫరాలో కృత్రిమమైన తగ్గుదలను ప్రతిబింబిస్తుంది.

మరోవైపున ఒక సరుకు సరఫరా పెరగటం వల్ల దాని సగటు ధరకంటే తక్కువకే అమ్మటం వల్ల ఆ వస్తువు కోసం గిరాకీ పెరగవచ్చు.

ఈ సందర్భంలో అదే మొత్తం డబ్బుతో ఎక్కువ సరుకులు కొనవచ్చు కనుక రుణ పెట్టుబడి కోసం గిరాకీ యథాతథంగా ఉండవచ్చు లేదా పడిపోవచ్చు కూడా. సట్టా వ్యాపారంలో భాగంగా స్థానికులను పోగేయటం జరగవచ్చు. ఉత్పత్తి లక్ష్యాలతో అత్యంత అనుకూలమైన సమయాన్ని ఉపయోగించుకునే ఉద్దేశంతో కావచ్చు. లేదా భవిష్యత్తులో ధరల పెరుగుదల ఉంటుందని ఊహించటం వల్ల కావచ్చు. ఈ సందర్భంలో రుణ పెట్టుబడి కోసం గిరాకీ పెరగవచ్చు. వడ్డీ రేటులో పెరుగుదల అన్నది ఉత్పాదక పెట్టుబడి అంశాలను అదనంగా కుప్పగా పేర్చటం కోసం పెట్టుబడి మదుపును ప్రతిబింబిస్తుంది. సరుకు పెట్టుబడి కోసం గిరాకీ చేతనూ, దాని సరఫరా చేతనూ ప్రభావితమైన రుణ పెట్టుబడి గిరాకీని మనం ఇక్కడ పరిశీలిస్తున్నాం. పారిశ్రామిక చక్రం యొక్క వేరు వేరు దశల్లో పునరుత్పత్తి ప్రక్రియ కూడా మారుతూ వుంటుంది. ఆ మార్పులు రుణ పెట్టుబడి సరఫరాను ఎలా ప్రభావితం చేస్తాయో మనం చర్చించాం. మార్కెట్లో వడ్డీ రేటు అన్నది (రుణ) పెట్టుబడి సరఫరా, గిరాకీలపైన ఆధారపడి వుంటుంది అన్న చిల్లర ప్రతిపాదనను ఓవర్‌స్టన్ తన సొంత ప్రతిపాదనతో తెలివిగా గందరగోళపరిచాడు. రుణ పెట్టుబడి, దరహం మీద పెట్టుబడి రెండూ ఒకటే అని ప్రతిపాదించాడు. ఈ రకంగా అతను వడ్డీ వ్యాపారిని ఏకైక పెట్టుబడిదారుడిగానూ, అతని పెట్టుబడిని ఏకైక పెట్టుబడిగానూ మార్చటానికి ప్రయత్నిస్తున్నాడు.

డబ్బు కొరత వున్న సందర్భాలలో రుణ పెట్టుబడి కోసం గిరాకీ అంటే చెల్లింపు సాధనాల కోసం గిరాకీ తప్ప మరోటి కాదు. అది చెల్లింపు సాధనంగా డబ్బు కోసం గిరాకీ కాదు. అదే సమయంలో నిజమైన పెట్టుబడి అనగా ఉత్పాదక, సరుకు పెట్టుబడి సమృద్ధిగా వున్నా, కొరతగా వున్నా దానితో ప్రమేయం లేకుండా వడ్డీ రేటు అత్యధికంగా పెరగవచ్చు. చెల్లింపు సాధనం కోసం గిరాకీ అంటే అది డబ్బు రూపంలో మార్చడానికి గిరాకీ మాత్రమే. వ్యాపారులు, ఉత్పత్తిదారులు మంచి సెక్యూరిటీలు కలిగి వున్న మేరకు ఇది వర్తిస్తుంది. ఇవి లేనప్పుడు అది డబ్బు పెట్టుబడిపై

గిరాకీ మాత్రమే. చెల్లింపు సాధనాల అప్పు వారికి డబ్బు రూపాన్ని మాత్రమే గాక వారి దగ్గర లేని ఒకే సమ విలువను కూడా ఇస్తుంది. దాని రూపమేమయినప్పటికీ దానితో చెల్లింపులు జరపవచ్చు. సంక్షోభ సిద్ధాంతాల ఈ వాగ్వివాదాలకు ఇరువైపులా వున్న ఉభయ పార్శ్వాలు ఏకకాలంలో తప్పు ఒప్పు కూడా కేవలం చెల్లింపు సాధనానికి మాత్రమే కొరత వుంది అని చెప్పేవారి దృష్టిలో సెక్యూరిటీల యజమానులు మాత్రమే వుండి వుంటారు. లేదా దివాళా తీసిన వంచకులందర్నీ రుణ విముక్తుల్ని చేసి కాగితం ముక్కల ద్వారా గౌరవనీయమైన పెట్టుబడిదారులుగా మార్చటమే బ్యాంకుల బాధ్యత, అధికారమూ అని నమ్మే మూర్ఖులయినా అయివుంటారు. కేవలం పెట్టుబడి మాత్రమే కొరతగా వుంది అని వాదించేవారు మాటల గారడీ చేస్తూ ఉండి వుంటారు. ఎందుకంటే అటువంటి సందర్భాలలో అధిక దిగుమతులు, అధిక ఉత్పత్తి వల్ల డబ్బుగా మార్చ వీలులేని పెట్టుబడి పేరుకొని వుంటుంది. లేదా ఇప్పుడు ఇతరుల పెట్టుబడితో లభించని స్థితిలోకి నెట్టబడిన పరపతి సట్టా వ్యాపారుల్ని దృష్టిలో వుంచుకుని వారు కోల్పోయిన పెట్టుబడిని తిరిగి ఇవ్వటం మాత్రమే కాక బ్యాంకులు వారి వంచన కార్యకలాపాలు కొనసాగటానికి సాయపడాలని కోరుతూ వుండి వుండవచ్చు.

డబ్బు విలువ యొక్క ఒక స్వతంత్ర రూపంగా సరుకులకు వ్యతిరేకంగా నిలబడటం అనేది లేదా మార్పిడి విలువ డబ్బుగా ఒక స్వతంత్ర రూపాన్ని సంతరించుకోవటం అనేది పెట్టుబడిదారీ ఉత్పత్తి ప్రాథమిక సూత్రం. ఒక నిర్దిష్ట సరుకు విలువ మిగిలిన సరుకుల విలువలన్నింటికీ కొలమానంగా మారినప్పటికీ అది సాధ్యమవుతుంది. ఆ రకంగా అది సాధారణ సరుకు అవుతుంది. ఇతరుల సరుకులన్నిటికీ భిన్నమయిన, శ్రేష్ఠమైన సరుకుగా మారుతుంది. పెట్టుబడిదారీ పంథాలో అభివృద్ధి చెందిన దేశాలలో అది రెండు రకాలుగా వ్యక్తం కావచ్చు. ఒకవైపున పరపతి కార్యకలాపాల రూపంలోను, మరోవైపున పరపతి డబ్బు రూపంలోను వ్యక్తం కావచ్చు. ఉక్కిరిబిక్కిరిగా వున్న సందర్భాలలో పరపతి కుంచించుకుపోయినపుడు లేదా పూర్తిగా ఆగిపోయినపుడు డబ్బు హఠాత్తుగా ఏకైక చెల్లింపు సాధనంగా కనిపిస్తుంది. ఇతర సరుకులన్నిటికీ పూర్తి విరుద్ధంగా విలువకు నిజమైన అస్తిత్వంలా కనిపిస్తుంది. అందుకే సరుకులు సార్వత్రికంగా విలువను కోల్పోతాయి. వాటిని డబ్బుగా మార్చటం కష్టమవుతుంది. లేదా పూర్తిగా అసాధ్యమవుతుంది. తమ సొంత మాయారూపమైన డబ్బుగా మారటం వాటికి కష్టమవుతుంది. రెండోది వాస్తవమైన డబ్బును దాని ప్రకటిత విలువ మేరకు తొలగించి దాని స్థానాన్ని ఆక్రమించిన మేరకు పరపతి డబ్బు అన్నది కేవలం డబ్బు మాత్రమే. బంగారాన్ని బయటకు తోడివేయటం వల్ల దానిని మార్చటం అనగా వాస్తవమైన బంగారంగా దానిని గుర్తించటం ఒక సమస్యగా మారుతుంది. అందుకే వడ్డీ రేటు పెంచటం లాంటి బలవంతపు చర్యలు తలెత్తుతాయి. ఇవి బంగారం మార్చటానికి వీలయిన పరిస్థితుల్ని రక్షించే లక్ష్యంతో జరుగుతాయి. డబ్బు సిద్ధాంతాలపైన ఆధారపడిన పొరపాటు చట్టాల వల్ల, ఓవర్‌స్టన్ లాంటి వారి డబ్బు వ్యాపారుల ప్రయోజనాలకోసం దేశంపై రుద్దబడే నిర్ణయాల వల్ల ఇవి అతిగా కొనసాగవచ్చు. అయితే దీనికి పునాది ఉత్పత్తి విధానం పునాదిలోనే వుంది. పరపతి డబ్బు తరుగుదల అన్నది (సందర్భవశాత్తూ డబ్బుగా దానికున్న లక్షణాలను ఊహాజనితంగా కోల్పోవటం కాదు.) అస్తిత్వంలో వున్న సంబంధాలన్నిటిని ఛిన్నాభిన్నం చేస్తుంది. కనుక ఈ డబ్బు రూపంలో వున్న విలువ యొక్క స్వతంత్ర మాయారూప అస్తిత్వాన్ని కాపాడటం కోసం సరుకుల విలువను బలిచేయటం జరుగుతుంది. డబ్బు భద్రంగా వున్నంతవరకే డబ్బు విలువగా

అది భద్రంగా వుంటుంది. కనుక కొద్ది కోట్ల డబ్బు కోసం చాలా కోట్ల సరుకుల్ని బలిపెట్టాల్సివస్తుంది. పెట్టుబడిదారీ ఉత్పత్తిలో ఇవి అనివార్యం. దాని అందాలలో ఇది ఒకటి. ఇంతకు ముందు ఉండిన ఉత్పత్తి విధానాలలో అవి నిలబడిన సంకుచితమైన ప్రాతిపదికపైన పరపతిగాని, పరపతి డబ్బుగాని పెద్ద ఎత్తున అభివృద్ధి చెందకపోవటం వల్ల ఇలా జరగదు. శ్రమ సామాజిక స్వభావం సరుకుల డబ్బు అస్తిత్వంగా కనిపించిన వరకు, వాస్తవ ఉత్పత్తికి బాహ్యంగా వున్న ఒక అంశంగా కనిపించిన వరకు స్వతంత్రమయిన డబ్బు సంక్షోభాలు, లేదా వాస్తవ సంక్షోభాలు తీవ్రతరం కావటం వల్ల తలెత్తే డబ్బు సంక్షోభాలు అనివార్యమవుతాయి. మరోవైపున ఒక బ్యాంక్ పరపతి బలహీనం కానంత వరకు అది పరపతి డబ్బును పెంచడం ద్వారా భయోత్పాతాన్ని తగ్గిస్తుందని, పరపతి డబ్బును తగ్గించడం ద్వారా భయోత్పాతాన్ని తీవ్రతరం చేస్తుందని స్పష్టమవుతుంది. అంతర్జాతీయ వాణిజ్యలో సమతూకం తాత్కాలికంగా దెబ్బతిన్నప్పుడల్లా దానిని తిరిగి నెలకొల్పడానికి మాత్రమే లోహం అవసరమవుతుందని ఆధునిక పరిశ్రమ చరిత్ర మొత్తం తెలియజేస్తుంది. జాతీయ ఉత్పత్తి సుసంఘటితంగా ఉన్నప్పుడు ఇది వర్తిస్తుంది. జాతీయ మార్కెట్‌కు ఏ విలువైన లోహమూ అక్కరలేదన్న సంగతి అన్ని సంక్షోభ సమయాల్లో జాతీయ బ్యాంకులనబడేవి నగదు చెల్లింపులను రద్దు చేయడం ద్వారా తెలుస్తోంది. అన్ని సంక్లిష్ట పరిస్థితుల్లోనూ జాతీయ బ్యాంకులు ఈ పద్ధతిని ఏకైక నివారణ చర్యగా పాటిస్తాయి.

ఇద్దరు వ్యక్తుల విషయంలో వారి పరస్పర లావాదేవీలకు సంబంధించినంత వరకు ఇరువురికి ప్రతికూలమైన చెల్లింపుల సమతూకం ఉందని అనటం హాస్యాస్పదం. వారిరువురు పరస్పరం పరపతి దాత, పరపతి గ్రహీత అయితే వారికి రావలసిన సొమ్ము సమతూకంలో లేకపోతే అంతిమంగా వారిలో ఒకరు పరపతి దాతగాను, రెండోవారు పరపతి గ్రహీతగాను రుజువవుతుంది. అయితే దేశాలకు సంబంధించినంత వరకు ఇలా జరగనక్కరలేదు. ఈ సంగతిని ఆర్థికవేత్తలందరూ గుర్తించారు. ఒక దేశపు చెల్లింపుల సమతూకం అనుకూలంగా వున్నా, ప్రతికూలంగా వున్నా వాణిజ్య సమతూకం మాత్రం అంతిమంగా పరిష్కారం కావాల్సి వుంది. చెల్లింపుల సమతూకం వాణిజ్య సమతూకం కంటే భిన్నమయినది. వాణిజ్య సమతూకం ఒక నిర్దిష్ట సమయంలో పరిష్కారం కావాల్సివుంది. సమతూకానికి వాణిజ్య సమతూకానికి మధ్య వున్న తేడాను స్వల్ప వ్యవధికి తగ్గించడమే ఇప్పటి సంక్షోభాలు చేస్తున్న పని. సంక్షోభంతో బాధపడుతున్న దేశంలో, చెల్లింపులను బాకీపడిన దేశంలో అభివృద్ధి చెందే ప్రత్యేక పరిస్థితుల వల్ల పరిష్కార కాలం తగ్గిపోతుంది. మొదటిది విలువైన లోహాలను ఓడల కెత్తడమూ, సొంత బాధ్యతపై పంపించిన సరుకులను తక్కువ ధరలకు అమ్మడమూ, సరుకులను వదిలించుకోవడానికిగాను లేదా దానిపైన కొంత సొమ్ము రాబట్టడానికిగాను ఎగుమతి చేయడమూ, వడ్డీ రేటు పెంచడమూ, పరపతి సౌకర్యాన్ని ఉపసంహరించుకోవడమూ, సెక్యూరిటీల విలువ తగ్గించడమూ, విదేశీ సెక్యూరిటీలను అమ్మేయడమూ, ఈ విలువ తగ్గిన సెక్యూరిటీలపై మదుపు పెట్టడానికి విదేశీ పెట్టుబడిని ఆకర్షించడమూ, అంతిమంగా మొత్తం హక్కు వాదనలను పరిష్కరించే విధంగా దివాలా తీయడమూ లాంటి చర్యలు తీసుకోబడతాయి. అదే సమయంలో సంక్షోభం తలెత్తిన దేశానికి విలువైన లోహం తరచుగా పంపబడుతుంది. ఎందుకనంటే దానిపై పుచ్చుకున్న డ్రాఫ్టులకు భద్రత లేదు. వెండి, బంగారాలు మాత్రమే ఈ సందర్భంలో నమ్మకానికి అర్హమైనవి. ఆసియాకు

సంబంధించినంత వరకూ, ఏకకాలంలో పెట్టుబడిదారీ దేశాలన్నీ ప్రత్యక్షంగానో లేదా పరోక్షంగానో ఆసియాకు పరపతి గ్రహీతలే. ఇందులో నిమగ్నమైన మరోదేశంపైన ఈ వివిధ పరిస్థితులన్నీ తమ పూర్తి ప్రభావం కలిగించగానే ఆ దేశం కూడా వెండి, బంగారాలను ఎగుమతి చేయడం ప్రారంభిస్తుంది. అది చెల్లింపుల విషయంలో బాకీపడుతుంది. అవే పరిణామాలు పునరావృత్తమవుతాయి.

పరపతి ధరకు, నగదు ధరకు తేడాగా వడ్డీ అన్నది వాణిజ్య పరపతిలో సరుకుల ధరలో ప్రవేశిస్తుంది. మార్పిడి బిల్లులు మామూలు సమయం కంటే ఎక్కువ సమయాన్ని తీసుకుంటున్నపుడు ఇది వర్తిస్తుంది. అలా కానప్పుడు వడ్డీ ప్రవేశించదు. ప్రతి ఒక్కరూ ఒకచేత్తో పరపతి తీసుకుంటూ మరోచేత్తో పరపతి ఇవ్వటం అన్నది దీన్ని వివరిస్తుంది. (నా అనుభవంతో ఇది ఏకీభవించదు – ఎంగెల్స్) డిస్కౌంట్ ఈ రూపంలో ఇక్కడ ప్రవేశించిన మేరకు అది ఈ వాణిజ్య పరపతిచేత గాక డబ్బు మార్కెట్‌చేత క్రమబద్ధమవుతుంది.

వడ్డీ రేటును నిర్ణయించే డబ్బు పెట్టుబడి యొక్క సరఫరా, గిరాకీలు ఓవర్‌స్టన్ చెబుతున్నట్లు వాస్తవ పెట్టుబడి యొక్క సరఫరా, గిరాకీలు రెండూ ఒకటే అయినట్లయితే, వివిధ సరుకులను పరిశీలిస్తున్నామా లేక ఒకే సరుకు యొక్క వివిధ దశలను (ముడి పదార్థాలు, సగం తయారయిన వస్తువులు, పూర్తిగా తయారయిన వస్తువులు) పరిశీలిస్తున్నామా అన్న దానినిబట్టి వడ్డీ ఏకకాలంలో తక్కువగానూ ఉంటుంది, ఎక్కువగానూ ఉంటుంది. 1844లో బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్ వడ్డీ రేటు 4% (జనవరి నుంచి సెప్టెంబర్ వరకు) నుంచి $2\frac{1}{2}$, 3% (నవంబర్ నుంచి ఏడాది చివరి వరకు) మధ్య ఊగిసలాడింది. 1845లో జనవరి నుంచి అక్టోబర్ వరకు $2\frac{1}{2}$, $2\frac{3}{4}$, 3%ల మధ్య ఊగిసలాడింది. మిగిలిన నెలలలో 3–5% మధ్య ఉంది. నాణ్యత గల ఆర్లియన్స్ పత్తి సగటు ధర 1844లో $6\frac{1}{4}$ పెన్నీలు వుంది. 1845లో $4\frac{7}{8}$ పెన్నీలు ఉంది. 1844 మార్చి 3వ తేదీన లివర్‌పూల్ పత్తి సరఫరా 627,042 బేళ్ళు వుంది. 1845 మార్చి 3వ తేదీన అది 773,800 బేళ్ళు వుంది. పత్తి ధర తక్కువగా వుండటాన్ని బట్టి నిర్ధారణకు వస్తే 1845లో వడ్డీ రేటు తక్కువగా వుండి వుండాలి. అయితే ఈ సమయంలో చాలా కాలంపాటు అలాగే వుంది కూడా. అయితే నూలును బట్టి నిర్ధారణకు రాదలిస్తే దాని ధరలు సాపేక్షంగా ఎక్కువగా వుండటం వలన లాభాలు బాగా ఎక్కుగా వుండటం వలన వడ్డీ రేటు కూడా ఎక్కువగా వుండి వుండాలి. 4 పెన్నీలు ఖరీదున్న ఒక పౌను పత్తితో 1845లో 4 పెన్నీలు వడికే ఖర్చుతో నూలు వడకవచ్చు. (మంచి సెకుండామ్యూల్ ట్విస్ట్ నెం. 40) అంటే ఇక్కడ మొత్తం ఖర్చుకు పెన్నీలు 1845 సెప్టెంబర్–అక్టోబర్‌లలో నూలు వడికే వ్యక్తి దానిని పౌను $10\frac{1}{2}$ లేదా $11\frac{1}{2}$ చొప్పున అమ్మాడు. (కింద వైలీ సాక్ష్యం చూడండి.)

ఈ విషయాన్ని అంతటినీ ఈ విధంగా చెప్పవచ్చు :

సాధారణ రూపంలో రుణ పెట్టుబడి సరఫరా గిరాకీలు, పెట్టుబడి సరఫరా గిరాకీలతో ఏకీభవిస్తాయని చెప్పవచ్చు. (ఈ ప్రకటన అసంబద్ధం. పారిశ్రామిక లేదా వాణిజ్య పెట్టుబడిదారుకు అతని సరుకే అతని పెట్టుబడి రూపం. అయితే ఆ రూపంలో అతడు పెట్టుబడిని కోరడు. పెట్టుబడి ఆవృత్తంలో ధాన్య లేదా పత్తి లాంటి సరుకుల పాత్ర ఏమైనప్పటికీ వాటిని కొనటానికి, చెల్లించటానికి అతనికి పెట్టుబడి అవసరమవుతుంది.) అయితే వడ్డీ వ్యాపారులు లేకుంటేను, వారికి బదులుగా అప్పిచ్చే పెట్టుబడిదారుల స్వాధీనంలోనే యంత్రాలు, ముడి పదార్థాలు వగైరాలు వుంటేను, ఇపుడు

పారిశ్రామిక పెట్టుబడిదారులకు ఇళ్ళను అద్దెకిచ్చినట్లుగానే వాటిని కూడా అద్దె కివ్వగలిగితేనూ ఇది సాధ్యం. అయితే ఈ సరుకులలో కొన్నిటికి పారిశ్రామిక పెట్టుబడిదారులే యజమానులై వుంటారు. అటువంటి పరిస్థితులలో రుణ పెట్టుబడి సరఫరా ఉత్పత్తి అంశాల సరఫరాలతో సమానమవుతుంది. పారిశ్రామిక పెట్టుబడిదారునికి ఉత్పత్తి అంశాల సరఫరా వ్యాపారికి సరుకుల సరఫరాతో సమాన మవుతుంది. దాత, గ్రహీతల మధ్య లాభ విభజన అన్నది పెట్టుబడి ఎవరు అప్పు తీసుకున్నారు అనే అంశంపైన, దాన్ని ఉపయోగించే వ్యక్తి ఆస్తిపైనా పూర్తిగా ఆధారపడి వుంటుంది.

వెగ్యూలిన్ ప్రకారం (1857 బ్యాంకు చట్టాలు) వడ్డీ రేటన్నది పనిలో పెట్టని పెట్టుబడి మొత్తం అన్నదానిపైన ఆధారపడి వుంటుంది. (252) “పెద్ద మొత్తం పెట్టుబడి పనికోసం ఎదురు చూస్తుందని అనటానికి ఇది సూచన.” (271) ఈ పనిలో లేని పెట్టుబడి “అనిశ్చల పెట్టుబడి”గా మారుతుంది. (485) అంటే ఆయన ఉద్దేశం “దేశంలో చలామణిలో వున్న బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్ నోట్లు ఇతర అంశాలు ఉదాహరణకు గ్రామీణ బ్యాంకుల చలామణి దేశంలో వున్న నాణాల మొత్తం చలామణి... బ్యాంకుల రిజర్వులను కూడా నేను అనిశ్చల పెట్టుబడిలో చేరుస్తాను.” (502-503) బంగారం కూడా చేరుతుంది. (503) అదే వెగ్యూలిన్ “తాము” (బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్) “పనిలో పెట్టని పెట్టుబడిని పెద్ద మొత్తంలో కలిగి వున్నపుడు” (1198) బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్ వడ్డీ రేటుపైన గొప్ప ప్రభావాన్ని కలిగి వుంటుంది అంటాడు. అయితే ఓవర్‌స్టన్ చెప్పిన పై సాక్ష్యం ప్రకారం బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్ “పెట్టుబడి పెట్టడానికి అనువైన స్థానం కాదు.” వెగ్యూలిన్ ఇంకా ఇలా అంటాడు. “దేశంలో పనిలో పెట్టని పెట్టుబడి మొత్తం డిస్కౌంట్ రేటును శాసిస్తుందని నేను అనుకుంటున్నాను. పనిలో పెట్టని పెట్టుబడి మొత్తానికి బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్ రిజర్వు ప్రాతినిధ్యం వహిస్తుంది. అది ఆచరణలో వెండి, బంగారాల రిజర్వు మాత్రమే. కనుక వెండి, బంగారాలను బయటకు తీస్తే దేశంలో పనిలో పెట్టబడని పెట్టుబడి మొత్తం తగ్గిపోతుంది. పర్యవసానంగా ఇంకా మిగిలి వున్న మొత్తం విలువ పెరుగుతుంది.” (1258) జె. స్టువర్ట్‌మిల్ ఇలా అంటాడు (2102) “బ్యాంక్ తన రుణ విమోచన కోసం బ్యాంకింగ్ డిపార్ట్‌మెంట్‌పైన ఆధారపడక తప్పదు. అంటే ఆ డిపార్ట్‌మెంట్‌లో రిజర్వులను అది పూడ్చాలి. కనుక బంగారాన్ని వెలికితీయడం పెరిగితే అది తన రిజర్వు భద్రతను కాపాడుకోవాల్సి వుంటుంది. తన డిస్కౌంట్లను తగ్గించడం ద్వారా సెక్యూరిటీల అమ్మకం ద్వారా దాన్ని కాపాడుకోవాలి.” బ్యాంకింగ్ డిపార్ట్‌మెంట్‌కు సంబంధించినంత వరకూ రిజర్వు అన్నది డిపాజిట్‌ల రిజర్వు మాత్రమే. ఓవర్‌స్టన్ లాంటి వారి ప్రకారం బ్యాంకింగ్ డిపార్ట్‌మెంట్ బ్యాంకర్‌లాగానే వ్యవహరించాలి. నోట్ల విడుదలను అది పట్టించుకోదు. అయితే డబ్బు కొరత వున్న సందర్భాలలో బ్యాంకింగ్ డిపార్ట్‌మెంట్ రిజర్వులతో ప్రమేయం లేకుండా వెండి, బంగారాల రిజర్వుపై నిఘా ఉంచుతుంది. అది వైఫల్యానికి గురి కారాదు అనుకుంటే అలా చేయాల్సి వుంటుంది. వెండి, బంగారాల రిజర్వు కరిగిపోయిన మేరకు బ్యాంక్ నోట్ల రిజర్వు కూడా కరిగిపోతుంది. ఈ సమాచారం ఓవర్‌స్టన్ కంటే మరెవళ్ళకీ బాగా తెలియదు. అందుకే అతడు 1844 బ్యాంక్ చట్టం ద్వారా ముందు చూపుతో దీనిని నిరూపించాడు.

★ ★ ★

## అధ్యాయం - 33

# పరపతి వ్యవస్థలో చలామణి సాధనం

**"క**రెన్సీ వేగాన్ని క్రమబద్ధం చేసే ప్రధాన అంశం పరపతి. డబ్బు మార్కెట్‌పైన తీవ్రమైన ఒత్తిడి అన్నది పూర్తి చలామణి ఉన్నప్పుడే ఎందుకుంటుందో ఇది తెలియజేస్తుంది." (ది కరెన్సీ థియరీ రివ్యూడ్, పుట 65) దీనిని రెండర్థాలలో తీసుకోవచ్చు. ఒకవైపున చలామణి సాధనాన్ని పొదుపు చేసే పద్ధతులన్నీ పరపతిపైన ఆధారపడి వున్నాయి. మరోవైపున ఉదాహరణకు ఒక 500 పౌండ్ల నోటు తీసుకొందాం. 'అ' దానిని 'ఆ' మార్పిడి బిల్లుపైన చెల్లిస్తాడు. 'ఆ' ఆ సొమ్మును అదేరోజు తన బ్యాంక్‌లో డిపాజిట్ చేస్తాడు. ఆ బ్యాంకరు అదేరోజున 'ఇ' మార్పిడి బిల్లును ఆ సొమ్ముతో డిస్కౌంట్ చేస్తాడు. 'ఇ' దానిని తన బ్యాంకుకు చెల్లిస్తాడు. ఆ బ్యాంకు బిల్లు బ్రోకరుగా అడ్వాన్సుగా దానిని ఇస్తుంది. ఇక్కడ ఈ నోటు కొనుగోళ్ళు చెల్లింపుల కోసం చలామణి అవుతున్న వేగం ఆ నోటు డిపాజిట్ రూపంలో ఒకని దగ్గరికి పదేపదే తిరిగి వచ్చే వేగంపైన, మళ్ళీ రుణం రూపంలో మరొకని చేతిలోనికిపోయే వేగంపైన ఆధారపడి వుంటుంది. చలామణి సాధనంలో పొదుపు అన్నది అత్యంత అభివృద్ధి చెందిన రూపంలో క్లియరింగ్ హౌస్‌లో కనిపిస్తుంది. చెల్లించాల్సిన మార్పిడి బిల్లులు బదిలీ చేసుకోవడం ద్వారా అలాగే కేవలం కొదవ మొత్తాలను చెల్లించే సాధనాలుగా ప్రధానంగా డబ్బు వ్యవహరించటం కూడా చలామణి సాధనం పొదుపు కావటమే. అయితే ఈ మార్పిడి బిల్లుల అస్తిత్వం పరపతిపైన ఆధారపడి వుంటుంది. పరిశ్రమదారులు, వ్యాపారులు ఒకరికొకరు ఇచ్చుకొనే పరపతిపైన ఆధారపడుతుంది. ఈ పరపతి తగ్గితే బిల్లుల సంఖ్య కూడా తగ్గిపోతుంది. ముఖ్యంగా దీర్ఘకాలిక బిల్లులు తగ్గిపోతాయి. దానితోపాటు ఖాతాలను సర్దే ఈ పద్ధతి సమర్థత కూడా తగ్గుతుంది. ఈ పొదుపులో లావాదేవీల నుంచి డబ్బును రద్దు చేయటం ఉంటుంది. డబ్బు చెల్లింపు సాధనంగా వ్యవహరించడంపైనే పూర్తిగా ఈ పొదుపు ఆధారపడి వుంటుంది. ఈ చెల్లింపు సాధనం పరపతిపైన ఆధారపడి వుంటుంది. ఇది రెండు రకాలు (ఈ చెల్లింపులకే సాంద్రీకరణ విషయంలో అభివృద్ధి చెందిన పద్ధతితో పాటు) మార్పిడి బిల్లులు లేదా చెక్కులు ప్రాతినిధ్యం వహించే పరస్పరం ఇవ్వాల్సిన, పొందాల్సిన మొత్తాలు ఒకే బ్యాంకర్‌చేత సర్దబడతాయి. లేదా వివిధ బ్యాంకుల ద్వారా సర్దబడతాయి. ఒకే బ్యాంక్ అయితే అక్కడికక్కడే ఖాతాలలో సర్దుబాటు చేస్తారు.[1] ఓవరెండ్‌కు చెందిన 'గుర్ని అండ్

1. ఒక బ్యాంకు నోటు చలామణిలో వుండే సగటు రోజులు.

| సంవత్సరం | 5 పౌండ్ల నోటు | 10 పౌండ్ల నోటు | 20-100 పౌండ్లు | 200-500 పౌండ్లు | 1000 పౌండ్లు |
|---|---|---|---|---|---|
| 1792 | ? | 236 | 209 | 31 | 22 |

☛

కంపెనీ' లాంటి ఒక బిల్లు బ్రోకర్ సంస్థ చేతిలో ఎనభై లక్షల నుంచి కోటి వరకు మార్పిడి బిల్లులు కేంద్రీకరించబడటం అన్నది స్థానికంగా ఇలా సర్దుబాటు చేసే స్థాయిని విస్తరించటానికి ఉన్న ఒక ప్రధానమైన సాధనం. ఇలాంటి పొదుపు వల్ల ఖాతాలను సర్దటానికి చిన్న పరిమాణంలో చలామణి సాధనం ఎంత తక్కువ అవసరమో ఆ మేరకు దాని సమర్థత పెరుగుతుంది. మరోవైపున చలామణి సాధనంగా డబ్బు యొక్క వేగం కొనుగోళ్ళు, అమ్మకాల ప్రవాహంపైన పూర్తిగా ఆధారపడి వుంటుంది. చెల్లింపులు డబ్బు రూపంలో వరుసగా జరిగిన మేరకు అది చెల్లింపుల గొలుసుపైన కూడా ఆధారపడి వుంటుంది. అయితే పరపతి చలామణిని ప్రభావితం చేస్తుంది, దాని వేగాన్ని పెంచుతుంది. ఉదాహరణకు పరపతి మధ్యవర్తిత్వం లేకపోతే ఒక నోటు కేవలం అయిదు చలనాలు మాత్రమే చేసి ప్రతి వ్యక్తి దగ్గర కేవలం చలామణి సాధనంగా దీర్ఘకాలం పాటు ఉండిపోతుంది. 'అ' దాని యజమాని అనుకొందాం. అతడు 'ఆ' నుంచి కొంటాడు. 'ఆ' 'ఇ' నుంచి, 'ఇ' 'ఈ' నుంచి 'ఈ' 'ఉ' నుంచి 'ఉ' 'ఊ' నుంచి కొంటారు. ఒకచేతి నుంచి మరోచేతికి దాని బదిలీ కేవలం వాస్తవమైన క్రయ విక్రయాల వల్ల జరుగుతుంది. అయితే 'ఆ' 'అ' నుంచి పొందిన డబ్బును బ్యాంకులో వేస్తే ఆ బ్యాంకరు 'ఇ' మార్పిడి బిల్లును డిస్కౌంటు చేయడానికి ఆ సొమ్మును ఉపయోగించాడనుకుందాం. 'ఇ' దానితో 'ఈ' నుంచి కొన్నాడు. 'ఈ' దానిని తన బ్యాంకులో వేసుకొన్నాడు. ఆ బ్యాంకరు 'ఉ'కు అప్పు ఇచ్చాడు. 'ఉ' దానిలో 'ఊ' నుంచి కొన్నాడు. ఒక చలామణి సాధనంగా (కొనుగోలు సాధనంగా) దాని వేగం సైతం అనేక పరపతి చర్యలచేత ప్రభావితమవుతుంది. 'ఆ' తన బ్యాంకులో డిపాజిట్ చేయటమూ, ఆ బ్యాంకరు 'ఇ' కోసం దానిని డిస్కౌంటు చేయటమూ, 'ఈ' దానినే తన బ్యాంకులో వేసుకోవటమూ, ఆ బ్యాంకరు దానిని 'ఉ' కోసం డిస్కౌంటు చేయటమూ ఇవన్నీ నాలుగు పరపతి చర్యలు. ఈ పరపతి చర్యలు లేకుండా ఒకే డబ్బు మొత్తం ఒక నిర్ణీత కాలంలో వరుసగా అయిదు కొనుగోళ్ళను చేసి ఉండేది కాదు. వాస్తవమైన క్రయ విక్రయాల అవసరం లేకుండానే, డిపాజిటింగ్, డిస్కౌంటింగ్‌ల ద్వారా చేతులు మారిందన్న వాస్తవం అది అలా చేతులు మారే వేగాన్ని వాస్తవ లావాదేవీల వరుసలో పెంచింది.

ఒకే బ్యాంకు నోటు అనేక బ్యాంకులలో డిపాజిట్ల రూపంలో వుంటుందని మనమింతకు ముందు గమనించాం. అదే రకంగా ఒకే బ్యాంకులో అది వివిధ డిపాజిట్లుగా కూడా ఉండొచ్చు. 'అ' డిపాజిట్ చేసిన నోటుతో బ్యాంకరు 'ఆ' మార్పిడి బిల్లును డిస్కౌంట్ చేస్తాడు. 'ఆ' దానిని 'ఇ'కి చెల్లిస్తాడు. 'ఇ' అదే నోటును అదే బ్యాంకులో డిపాజిట్ చేస్తాడు.

సాధారణ డబ్బు చలామణి గురించి చెల్లించిన సందర్భంలో వాస్తవంగా చలామణిలో వున్న డబ్బు పరిమాణం చలామణి వేగం చెల్లింపుల పొదుపు నిర్ణీతంగా ఉన్నప్పుడు సరుకుల ధరలపైన

☛

| | | | | | |
|---|---|---|---|---|---|
| 1818 | 148 | 137 | 121 | 18 | 13 |
| 1846 | 79 | 71 | 34 | 12 | 8 |
| 1856 | 70 | 58 | 27 | 9 | 7 |

(1857 బ్యాంకు చట్టాలపై నివేదిక బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్ కేషియర్ మార్షల్ ఈ లెక్కలు సమకూర్చాడు. అనుబంధం II, పుటలు 300, 301)

లావాదేవీల పరిమాణంపైన ఆధారపడి వుంటుందని మనం ఇంతకు ముందే రుజువు చేశాం.[1] నోట్ల చలామణిని కూడా అదే నియమం శాసిస్తుంది.

ఈ కింది పట్టికలో ప్రజల చేతుల్లో వున్న మేరకు 5, 10 పౌండ్ల నోట్లు, 20 నుండి 100 వరకు పౌండ్ల నోట్లు, 200 నుండి 1000 పౌండ్ల వరకూ విలువైన బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్ నోట్ల వార్షిక సగటు సంఖ్యను సూచిస్తుంది. వీటి మొత్తం చలామణి శాతం కూడా ఇవ్వబడింది. ఈ మొత్తాలు వేలలో ఇవ్వబడ్డాయి. చివరి మూడు అంకెలు వదిలేయబడ్డాయి.[2]

| సం॥ | 5-10 పౌ నోట్లు | % | 20-100 పౌండ్లు | % | 200-1000 పౌండ్లు | % | మొత్తం పౌండ్లు |
|---|---|---|---|---|---|---|---|
| 1844 | 9,263 | 45.7 | 5,735 | 28.3 | 5,253 | 26.0 | 20,241 |
| 1845 | 9,698 | 46.9 | 6,082 | 29.3 | 4,942 | 23.8 | 20,722 |
| 1846 | 9,918 | 48.9 | 5,778 | 28.5 | 4,590 | 22.6 | 20,286 |
| 1847 | 9,591 | 50.1 | 5,498 | 28.7 | 4,066 | 21.2 | 19,155 |
| 1848 | 8,732 | 48.3 | 5,046 | 27.9 | 4,307 | 23.8 | 18,085 |
| 1849 | 8,692 | 47.2 | 5,234 | 28.5 | 4,477 | 24.3 | 18,403 |
| 1850 | 9,164 | 47.2 | 5,587 | 28.8 | 4,646 | 24.0 | 19,398 |
| 1851 | 9,362 | 48.1 | 5,554 | 28.5 | 4,557 | 23.4 | 19,473 |
| 1852 | 9,839 | 45.0 | 6,161 | 28.2 | 5,856 | 26.8 | 21,856 |
| 1853 | 10,699 | 47.3 | 6,393 | 28.2 | 5,541 | 24.5 | 22,653 |
| 1854 | 10,565 | 51.0 | 5,910 | 28.5 | 4,234 | 20.5 | 20,709 |
| 1855 | 10,628 | 53.6 | 5,706 | 28.9 | 3,459 | 17.5 | 19,793 |
| 1856 | 10,680 | 54.4 | 5,645 | 28.7 | 3,323 | 16.9 | 19,648 |
| 1857 | 10,659 | 54.7 | 5,567 | 28.6 | 3,241 | 16.7 | 19,467 |

(బ్యాంకు చట్టాలు, 1858, పుట XXVI) చలామణిలో వున్న బ్యాంకు నోట్ల మొత్తం ఆ రకంగా 1844 నుంచి 1857 వరకు స్పష్టంగా తగ్గింది. ఎగుమతి దిగుమతులు సూచించినట్టుగా వాణిజ్య కార్యకలాపాలు రెట్టింపు కంటే పెరిగాయి. 5 పౌండ్ల, 10 పౌండ్ల చిన్న బ్యాంకు నోట్లు 1844లో పట్టిక ప్రకారం 9,263,000 పౌండ్లు ఉన్నాయి. అవి 1857 నాటికి 10,659,000 పౌండ్లకు పెరిగాయి. ఆ సమయంలో బంగారపు చలామణి అపారంగా పెరిగింది. మరోవైపున పెద్ద నోట్లు (200-1000 పౌండ్ల నోట్లు) మొత్తం తగ్గింది. 1852లో అవి 5,856,000 పౌండ్లున్నాయి. 1857 నాటికి 3,241,000 పౌండ్లకు తగ్గాయి. అంటే 2,500,000 పౌండ్లకు పైగా తగ్గాయి. ఇది ఇలా వివరించబడింది. "1854 జూన్ 8న లండన్ ప్రైవేట్ బ్యాంకర్లు క్లియరింగ్ హౌస్ వసతులను

1. ఆంగ్ల ప్రచురణ మొదటి సంపుటి, మూడవ అధ్యాయం, 2 సం॥
2. ఈ పట్టిక మార్క్స్ సూచించిన మూలాధారపు ఫొటో కాపీ. దీని మొత్తం అంకెలన్నీ సరికాకపోవచ్చు. సం॥

ఉపయోగించుకొనే అవకాశం జాయింట్ స్టాక్ బ్యాంకులకు కూడా ఇచ్చారు. త్వరలోనే చివరి క్లియరింగ్ బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్‌లో సర్దబడింది. రోజువారీ క్లియరెన్సులు ఇప్పుడు ఆ సంస్థలో ఉన్న అనేక బ్యాంకుల ఖాతాలకు బదిలీ చేయడం ద్వారా జరిగాయి. ఈ పద్ధతి వల్ల ఇంతకు ముందు తమ ఖాతాలను సర్దటానికి ఉపయోగపడిన పెద్ద నోట్లతో అవసరం లేకుండా పోయింది." (బ్యాంక్ చట్టాలు, 1858, పుట V)

టోకు వ్యాపారంలో డబ్బు ఉపయోగం ఎంత చిన్న మొత్తానికి తగ్గిపోయిందో మొదటి సంపుటంలో (మూడవ అధ్యాయం) ఇచ్చిన పట్టికను బట్టి చూడొచ్చు. ఈ పట్టికను మోరిజాన్, డిల్లాన్ అండ్ కంపెనీ బ్యాంక్ కమిటీకి సమర్పించింది. చిన్న వ్యాపారి తన కవసరమైన సరుకులన్నీ ఒకేచోట కొనడానికి వీలుకల్పించే అతి పెద్ద లండన్ సంస్థలలో ఈ కంపెనీ ఒకటి.

1857లో బ్యాంకు కమిటీ ముందు డబ్ల్యు. న్యూమార్క్ ఇచ్చిన సాక్ష్యం, నెంబరు 1741 ప్రకారం చలామణి సాధనం పొదుపు కావటానికి పెన్నీ తపాలా బిళ్ళ, రైల్వేలు, టెలిగ్రాఫీ క్లుప్తంగా చెప్పాలంటే మెరుగైన వార్తా ప్రసార సాధనాల్లాంటి ఇతర పరిస్థితులు కూడా దోహదం చేశాయి. బ్యాంకు నోట్ల చలామణి అదే స్థాయిలో ఉంటూనే ఇంగ్లాండు ఇప్పుడు 5 లేక 6 రెట్లు ఎక్కువగా వ్యాపారం చేయగల్గుతుంది. ప్రధానంగా 10 పౌండ్లకు మించిన పెద్ద నోట్లను చలామణి నుంచి ఉపసంహరించుకోవటం వల్ల ఇది సాధ్యమైంది. ఒక పౌండు నోటు కూడా చలామణిలో వున్న స్కాట్లండ్, ఐర్లాండ్‌లలో నోట్ల చలామణి 31 శాతం పెరిగిందన్న వాస్తవాన్ని న్యూమార్క్ తన వివరణకు అనువైన అంశంగా భావించాడు (1747). ఇంగ్లండులో ఒక పౌండు నోట్లతో సహా మొత్తం బ్యాంకు నోట్ల చలామణి 3 కోట్ల 90 లక్షలుంటుంది (1749). బంగారం చలామణి 7 కోట్లు ఉంటుంది (1750). స్కాట్లాండులో 1834లో నోట్ల చలామణి 3,120,000 పౌండ్లు, 1844లో అది 3,020,000. 1854లో 4,050,000 పౌండ్లు ఉంది (1752).

ఈ అంకెలను బట్టే ఒక విషయం స్పష్టం అవుతుంది. నోట్లను విడుదల చేసే బ్యాంకులు చలామణి అయ్యే నోట్ల సంఖ్యను ఇష్టం వచ్చినట్లు పెంచలేవు. ఈ నోట్లు డబ్బుతో మార్పిడి కాగల్గిన మేరకు ఇది వర్తిస్తుంది. (మార్పిడి చేయడానికి వీల్లేని కాగితం డబ్బును ఇక్కడ పరిగణనలోనికి తీసుకోరాదు. మార్పిడి చేయబడని బ్యాంకు నోట్లు ప్రభుత్వ పరపతి అండ ఉన్నప్పుడు మాత్రమే ఒక సార్వత్రిక చలామణి సాధనం కాగల్గుతాయి. రష్యాలో ఇది ప్రస్తుతం అమలులో వుంది. మార్పిడి చేయటానికి వీలులేని ప్రభుత్వం విడుదల చేసే కాగితం డబ్బుకు వర్తించే నియమాలే వీటికి వర్తిస్తాయి. వీటిని గురించి మొదటి సంపుటంలో అధ్యాయం 3లో "నాణెము, విలువ చిహ్నాలు" అన్న శీర్షిక క్రింద వివరించడం జరిగింది – ఎంగెల్స్)

చలామణిలో వున్న నోట్ల పరిమాణాన్ని టర్నోవర్ అవసరాలు క్రమబద్ధం చేస్తాయి. అనవసరమైన ప్రతి నోటు తక్షణమే దాన్ని విడుదల చేసిన వారిని చేరుకొంటుంది. ఇంగ్లండులో బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్ నోట్లు మాత్రమే చట్టబద్ధమైన చెల్లింపు సాధనాలుగా సార్వత్రిక చలామణిలో ఉంటాయి కనుక ఇక్కడ మనం గ్రామీణ బ్యాంకుల నోటు చలామణిని కేవలం అప్రధానమయినదిగా, స్థానికమైనదిగా పరిగణించవచ్చు.

1858లో బ్యాంక్ కమిటీ ముందు బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్ గవర్నర్ నీవ్ ఇలా చెప్పాడు. "నెం. 947. (ప్రశ్న) మనం ఏ చర్యలు తీసుకొన్నప్పటికీ ప్రజల దగ్గర ఉన్న నోట్ల మొత్తం యథాతథంగా ఉంటుందని మీరన్నారు. అది సుమారు 2 కోట్ల పౌండ్లు అన్నారు అవునా? – మామూలు సమయాలలో ప్రజల అవసరాలకు రెండు కోట్ల పౌండ్లు సరిపోతాయనిపిస్తుంది. ఎప్పుడైనా ప్రత్యేకమైన ఎగుడు దిగుళ్లు వచ్చినప్పటికీ అవి మరో 10 లేదా 15 లక్షలు పెరగవచ్చు. ప్రజలు కావాలనుకొంటే వారు బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్ నుంచి ఎపుడైనా మొత్తాన్ని తీసుకోవచ్చు." – "948. భయోత్పాతం ఉన్న పరిస్థితుల్లో నోట్ల మొత్తాన్ని తగ్గించటానికి ప్రజలు మమ్మల్ని అనుమతించరని మీరన్నారు. అది వివరించండి – భయోత్పాతం ఉన్న సమయాలలో నేననుకొంటున్నట్లుగా జనం బ్యాంక్ తమకు బాకీ ఉన్న మేరకు నోట్లను తీసుకునే అధికారం వారికి ఉంది. ఆ అధికారాన్ని వాళ్ళు బ్యాంక్ నుంచి నోట్లు తీసుకోడానికి ఉపయోగించవచ్చు." – "949. అంటే అన్ని సందర్భాలలోనూ 2 కోట్ల పౌండ్లు చట్టబద్ధంగా చెల్లే డబ్బు అవసరమంటారా? – ప్రజల దగ్గర 2 కోట్ల పౌండ్లు అది మారుతూ వుంటుంది. కోటీ 85 లక్షలు, కోటీ 90 లక్షలు, 2 కోట్లు పౌండ్లు ఈ రకంగానే మారుతూ వుండవచ్చు. అయితే సగటున చూస్తే కోటీ 90 లక్షల నుంచి రెండు కోట్ల పౌండ్లకు మధ్య మారుతూ వుంటుందని మీరు గమనిస్తారు."

1848/57 వాణిజ్య సంక్షోభంపైన లార్డ్స్ సభా కమిటీ ముందు థామస్ టూకే సాక్ష్యం నెం. 3094 "బ్యాంకుకు ప్రజల చేతుల్లో చలామణిలో ఉన్న మొత్తాన్ని యథేచ్ఛగా పెంచే శక్తి లేదు. అయితే దానికి ప్రజల చేతుల్లో ఉన్న నోట్ల మొత్తాన్ని తగ్గించే శక్తి ఉంది. అయితే అది తీవ్రమైన చర్య ద్వారా మాత్రమే సాధ్యమవుతుంది."

జనానికి అవసరమైన దానికంటే ఎక్కువ నోట్లను చలామణిలో ఉంచటం ఒక గ్రామీణ బ్యాంకుకు ఎంత అసాధ్యమో నాటింగ్‌హామ్‌లో 30 ఏండ్లపాటు బ్యాంకర్‌గా ఉన్న జె.సి. రైట్ వివరించాడు. తర్వాత ఆయన బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్ నోట్ల గురించి ఇలా చెప్పాడు (సి.డి. 1848/57) నెం. 2844 "నోట్ల విడుదల విషయంలో బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్‌పైన ఏదైనా అదుపు ఉందో లేదో నాకు తెలియదు. అయితే అదనపు చలామణి ఏదైనా డిపాజిట్లుగా మారిపోతుంది. ఆ రకంగా అది వేరే పేరును సంతరించుకుంటుంది."

స్కాట్లాండ్‌కు కూడా ఇదే వర్తిస్తుంది. అక్కడ కాగితం డబ్బు తప్ప ఇంకేదీ చలామణిలో ఉండదు. "స్కాట్లాండు ప్రజలు బంగారాన్ని ద్వేషిస్తారు." అక్కడా, ఐర్లాండ్‌లోనూ ఒక పౌండు నోట్లు కూడా ఉపయోగంలో ఉంటాయి. ఒక స్కాట్లాండ్ బ్యాంక్ డైరెక్టర్ కెన్నడీ, బ్యాంకులు నోట్ల చలామణి అనేది తగ్గించలేవు కూడా అని ప్రకటించాడు. నోట్లు లేదా బంగారం నిర్వహించాల్సిన అంతర్గత లావాదేవీలు ఉన్న మేరకు "బ్యాంకర్లు తమ డిపాజిటర్ల డిమాండ్ల ద్వారా లేదా ఏదో ఒక రూపంలో ఆ లావాదేవీల కవసరమైన కరెన్సీని సమకూరుస్తారు.... స్కాట్లాండ్ బ్యాంకులు తమ లావాదేవీలను కుదించుకోగలవు. అయితే వాటి కరెన్సీని మాత్రం అదుపు చేయలేవని అతను భావించాడు." (సి.డి. నెం. 3446, 3448) అదేరకంగా యూనియన్ బ్యాంక్ ఆఫ్ స్కాట్లాండ్ డైరెక్టర్ ఆండర్సన్ ఇలా పేర్కొన్నాడు. (నెం.3578) "మీ మధ్య (స్కాట్లాండు బ్యాంకుల మధ్య) జరిగే మార్పిడుల వ్యవస్థ

ఏదైనా ఒక బ్యాంక్ అధికంగా నోట్లను విడుదల చేయటాన్ని నిరోధిస్తుందా? – అవును, మార్పిడుల వ్యవస్థ కంటే బలంగా నిరోధించే శక్తి వుంది." (దానికి దీనితో ఎటువంటి సంబంధం లేదు. అయితే స్కాట్లాండు అంతటా ప్రతి బ్యాంకు నోట్లు చలామణి అయ్యే శక్తికి ఇది హామీ ఇస్తుంది.) "స్కాట్లాండులో బ్యాంక్ ఖాతాను కలిగి వుండే అలవాటు సార్వత్రికంగా" ఉంది. "డబ్బున్న ప్రతి ఒక్కరికి బ్యాంకు ఖాతా ఉంటుంది. తనకు తక్షణమే అవసరంలేని డబ్బు అంతా ప్రతి రోజూ బ్యాంకులో వేయటం వారికి అలవాటు. ఆ రకంగా రోజూ వ్యాపారం ముగిసే సమయానికి బ్యాంకు బయట ప్రజల చేతుల్లో ఉండే డబ్బు తప్ప దాదాపు ఇంక ఏ రకమైన డబ్బూ ఉండదు."

ఐర్లాండుకు కూడా ఇదే వర్తిస్తుంది. బ్యాంక్ ఆఫ్ ఐర్లాండ్ గవర్నర్ మేక్డొనల్, ప్రొవిన్షియల్ బ్యాంకు ఆఫ్ ఐర్లాండ్ డైరెక్టర్ ముర్రే అదే కమిటీ ముందు ఆ విషయాన్ని తెలియజేశారు.

నోట్లు మారగల శక్తికి హామీ ఇచ్చే బంగారపు నిల్వలు బ్యాంకు ఖజానాలో ఉన్న స్థితితో ప్రమేయం లేకుండా నోట్ల చలామణి స్వతంత్రంగా వుంటుంది. అది బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్ అభీష్టంతో ప్రమేయం లేకుండా ఉంటుంది. "1846 సెప్టెంబర్ 18న బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్ చలామణి 2 కోట్ల 9 లక్షల పౌండ్లు. అప్పుడు ఆ బ్యాంకులో ఉన్న వెండి, బంగారాల విలువ 16,273,000 పౌండ్లు. 1847 ఏప్రిల్ 5న చలామణిలో ఉన్న నోట్లు 20,815,000 పౌండ్లు. వెండి, బంగారాల విలువ 10,246,000 పౌండ్లు ... దీనిని బట్టి 60 లక్షల విలువైన బంగారం ఎగుమతి అయిందన్నది స్పష్టం. దేశంలో కరెన్సీ కుంచించుకుపోలేదు." (జె.జి. కిన్నియర్, ది క్రైసిస్ అండ్ ది కరెన్సీ, లండన్, 1847, పుట 5) అయితే ఇది ప్రస్తుతం ఇంగ్లాండ్‌లో ఉన్న పరిస్థితులకు మాత్రమే వర్తిస్తుంది. ఇక్కడ సైతం నోటు విడుదలకు, లోహపు నిల్వలకు మధ్య భిన్నమైన నిష్పత్తిని శాసనం రీత్యా ఆదేశించకపోతేనే ఇది వర్తిస్తుంది.

కనుక వాణిజ్య అవసరాలే చలామణిలో వున్న డబ్బును అనగా నోట్లనూ, బంగారాన్ని ప్రభావితం చేస్తాయి. మొదట పేర్కొనవలసిన అంశాలు. నిర్ణీత కాలానికి ఒకసారి వచ్చే ఎగుడుదిగుళ్ళు. సాధారణ వాణిజ్య పరిస్థితితో ప్రమేయం లేకుండా ప్రతి ఏటా అవి పునరావృత్తమవుతుంటాయి. గత 20 ఏళ్ళుగా "ఒక నెలలో చలామణి ఎక్కువగా ఉంటుంది. మరో నెలలో తక్కువగా వుంటుంది. ఇంకో నెలలో మధ్యస్థంగా వుంటుంది." (న్యూమార్చ్, బ్యాంక్ చట్టాలు, 1857 నెం. 1650)

ఆ రకంగా ప్రతి యేటా ఆగస్టులో కొన్ని లక్షల పౌండ్లు సాధారణంగా బంగారం రూపంలో, పంట కోతల ఖర్చులను భరించటం కోసం దేశంలో చలామణిలోకి బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్ నుంచి డబ్బు ప్రవహిస్తుంది. ఇక్కడ వేతనాలు ప్రధానమైన చెల్లింపు లక్ష్యాలు గనుక దీని కోసం ఇంగ్లాండులో బ్యాంకు నోట్లు తక్కువ ఉపయోగపడతాయి. ఏడాది చివర ఈ డబ్బు బ్యాంకుకు తిరిగి ప్రవహిస్తుంది. స్కాట్లాండులో బంగారు నాణాలకు బదులు ఒక పౌండు నోట్లు తప్ప దాదాపు ఇంకేమీ ఉండవు. అటువంటి పరిస్థితిలో అనగా ఏడాదికి రెండుసార్లు మే, నవంబర్‌లలో నోట్ల చలామణి 30 లక్షల నుంచి 40 లక్షల వరకు పెరుగుతుంది. రెండు వారాల తర్వాత డబ్బు తిరిగి రావటం మొదలవుతుంది. ఒక నెలపాటు కొనసాగి దాదాపు పూర్తవుతుంది. (ఆండర్సన్, సి.డి. 1848/57 నెం. 3595–3600)

ప్రతి మూడు నెలలకొకసారి "డివిడెండ్లు" చెల్లించటం వల్ల అనగా జాతీయ రుణంపై వడ్డీ

చెల్లించటం వల్ల బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్ నోట్ల చలామణిలో తాత్కాలికమైన ఆటుపోట్లు వస్తాయి. అపుడు బ్యాంకు నోట్లు మొదట చలామణి నుంచి ఉపసంహరించుకోబడి తిరిగి విడుదల చేయబడతాయి. అయితే అవి తిరిగి చాలా త్వరితంగా వెనక్కు ప్రవహిస్తాయి. ఈ రకమైన ఆటుపోట్లు సుమారు 25 లక్షలు వుంటుందని వెగ్యూలిన్ ప్రకటించాడు. (బ్యాంకు చట్టాలు 1857 నెం. 38) అపఖ్యాతిపాలైన ఓవరండ్ యొక్క గుర్నీ అండ్ కంపెనీకి చెందిన చాప్‌మాన్ ప్రకారం డబ్బు మార్కెట్‌లో పుట్టిన అలజడి ఇంకా పెద్ద మొత్తంలో ఉంటుంది. “డివిడెండ్లను దృష్టిలో ఉంచుకొని చలామణి నుంచి మీరు 60 లక్షలు లేదా 70 లక్షలు పౌండ్లు ఉపసంహరించుకొంటే మధ్యకాలంలో దానిని సరఫరా చేసే మాధ్యమంగా ఎవరో ఒకరు ఉండాలి.” (బ్యాంకు చట్టం, 1857, నెం.5196)

పారిశ్రామిక చక్రం యొక్క వివిధ దశలకు అనుగుణమైన చలామణి సాధనపు పరిమాణంలో ఎగుడు దిగుళ్ళు మరింత ప్రాధాన్యం కలిగినవి, ఎక్కువ కాలం నిలిచి ఉండేవి. ఇదే ప్రశ్నపైన ఆ సంస్థకు చెందిన మరో ప్రముఖుడు గౌరవనీయుడైన శామ్యూల్ గుర్నీ (సి.డి. 1848/57 నెం.2645) ఇలా చెప్పాడు. “అక్టోబర్ చివరలో (1847) ప్రజల చేతుల్లో ఉన్న బ్యాంకు నోట్ల మొత్తం 20,800,000 పౌండ్లు. ఆ సమయంలో డబ్బు మార్కెట్‌లో బ్యాంక్ నోట్లను పొందడం చాలా కష్టంగా ఉండింది. 1844 బ్యాంక్ చట్టం విధించిన పరిమితి వల్ల ఏర్పడిన ఆందోళనాత్మక పరిస్థితి నుంచి ఈ కష్టం తలెత్తింది. ప్రస్తుతం (మార్చి 1848) ప్రజల చేతుల్లో ఉన్న బ్యాంకు నోట్లు 17,700,000 పౌండ్లు మాత్రమే. అయితే ఇపుడు వాణిజ్యపరంగా ఆందోళన చెందాల్సిన వాణిజ్య వాతావరణం లేదు కనుక అవసరమైన దానికంటే ఎక్కువ డబ్బు వున్నట్టుగా అనిపిస్తుంది. తాను ఉపయోగించిన వాటికంటే ఎక్కువ మొత్తంలో బ్యాంకు నోట్లను కలిగి ఉండని లండన్ బ్యాంకు గానీ, డబ్బు వ్యాపారి గానీ లేడు.” – “2650. బ్యాంకు అజమాయిషీకి వెలుపల ఉన్న బ్యాంకు నోట్ల మొత్తం విషయంలో ఇదే విధంగా వాణిజ్య ప్రపంచ పరిస్థితిని, పరపతి పరిస్థితిని పట్టించుకోకుండానే క్రియాశీలమైన చలామణి పరిస్థితికి తగినంత స్థాయిలో లేకపోవటం సాధ్యమే.” – “2651. ప్రజల చేతుల్లో ప్రస్తుతం ఉన్న చలామణి మొత్తంలో మిగిలి వుందన్న భావన చాలా వరకు మన ప్రస్తుత మాంద్యం నుంచి తలెత్తుతుంది. అధిక ధరలు, లావాదేవీల ఉద్రిక్తత ఉంటే 17,700,000 పౌండ్లు డబ్బు పరిమితమైనది అన్న భావన కలుగుతుంది.”

(ఇచ్చిన రుణాలు క్రమబద్ధంగా తిరిగి వస్తున్నప్పుడు, పరపతి దెబ్బతినకుండా ఉన్నప్పుడు, ఇలా వాణిజ్యం సజావుగా సాగుతున్నప్పుడు చలామణి సంకోచ వ్యాకోచాలు కేవలం పారిశ్రామిక వేత్తల, వ్యాపారుల అవసరాలపైనే ఆధారపడి వుంటాయి. ఎందుకంటే కనీసం ఇంగ్లాండులో టోకు వ్యాపారంలో బంగారం ప్రశ్న తలెత్తదు. వివిధ రుతువులలో ఉండే ఎగుడుదిగుళ్ళు కాక బంగారపు చలామణిని దాదాపు చాలా కాలంపాటు స్థిరంగా వుండే అంశంగా పరిగణించవచ్చు. బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్ నోట్ల చలామణి ఈ మార్పులను తగినంత ఖచ్చితంగా సూచించగల్గుతుంది. సంక్షోభం తర్వాత మాంద్యం ఉన్న కాలంలో చలామణి అతి తక్కువగా వుంటుంది. డిమాండ్ పునరుద్ధరించ బడడంతో చలామణి సాధనం కోసం అవసరం అభివృద్ధి అవుతుంది. సుభిక్షత పెరగటంతోపాటు ఈ అవసరం కూడా పెరుగుతుంది. పరిస్థితి అతి ఉద్రిక్తంగా ఉన్నప్పుడు సట్టా వ్యాపారం అతిగా

జరుగుతున్నప్పుడు చలామణి సాధనం యొక్క పరిమాణం శిఖర స్థాయికి చేరుకొంటుంది. సంక్షోభం భళ్ళున బద్దలవుతుంది. అప్పటి వరకు సమృద్ధిగా కనిపించిన బ్యాంక్ నోట్లు మార్కెట్ నుంచి అప్పటికప్పుడు మాయమైపోతాయి. వాటితోపాటు బిల్లులను డిస్కౌంట్ చేసేవారు, హామీలపై డబ్బు అప్పిచ్చేవారు, సరుకుల కొనుగోలుదార్లు అంతా అదృశ్యమైపోతారు. సాయం కోసం బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్‌ను అందరూ కోరతారు. అయితే దాని శక్తి కూడా త్వరలోనే అంతమైపోతుంది. ఎందుకంటే 1844 బ్యాంకు చట్టం దానిని తన నోట్ల చలామణిని కుదించుకునేలా ఒత్తిడి చేస్తుంది. మొత్తం ప్రపంచం నోట్ల కోసం తహతహలాడుతున్నప్పుడు, సరుకుల యజమానులు సరుకుల్ని అమ్మలేనప్పుడు అయినా వారిని చెల్లించాల్సిందిగా కోరినప్పుడు, బ్యాంకు నోట్లు దొరికితే త్యాగం చేయడానికి వారు సిద్ధంగా ఉన్నప్పుడు, ఇంగ్లాండ్ బ్యాంక్ తన నోట్ల చలామణిని కుదించివేస్తుంది. "ఆందోళనాత్మక వాతావరణం ఉన్నప్పుడు మామూలు సమయాలలో కంటే దేశంలో రెట్టింపు చలామణి అవసర మవుతుంది. ఎందుకంటే ఈ చలామణిని బ్యాంకర్లు, ఇతర్లు దాచేస్తారు" అని ఇంతకు ముందు మనం పేర్కొన్న బ్యాంకర్ రైట్ అన్నాడు. (నెం. 2930)

ఒకసారి సంక్షోభం బద్దలుకాగానే ఇక తర్వాత తలెత్తే ప్రశ్న చెల్లింపు సాధనాలదే. అయితే ప్రతి ఒక్కరు ఈ చెల్లింపు సాధనాలనే పొందటానికి మరొకరిపైన ఆధారపటం వల్ల నిర్ణీత గడువు లోగా ఆ అవతలి వ్యక్తి చెల్లించగలడో లేదో ఎవరికీ తెలియకపోవడం వల్ల ఈ మార్కెట్‌లో దొరికే చెల్లింపు సాధనాల కోసం అనగా బ్యాంకు నోట్ల కోసం తొక్కిసలాట మొదలవుతుంది. ప్రతి ఒక్కరు తమకు సాధ్యమైనన్ని నోట్లను దాచేస్తూ వుంటారు. ఆ రకంగా అవి సరిగ్గా బాగా అవసరమైన రోజునే మాయమైపోతాయి. 1847 అక్టోబర్‌లో అటువంటి బెంబేలు పరిస్థితి ఉన్నప్పుడు బ్యాంకు లోపలికి తీసుకొచ్చిన నోట్లు మొత్తం 40, 50 లక్షల పౌండ్లు ఉంటుందని సామ్యూల్ గుర్నీ (సి.డి. 1848/57, నెం.1116) అంచనా వేశాడు – ఎంగెల్స్)

1857 బ్యాంకు కమిటీ ముందు గుర్నీ సహచరుడైన చాప్‌మాన్‌పై సాగిన క్రాస్ ఎగ్జామినేషన్ ఈ సందర్భంలో ప్రత్యేకంగా ఆసక్తిదాయకంగా ఉంటుంది. ఇతని గురించి మనం ఇంతకు ముందు పేర్కొన్నాము. నేనిక్కడ ప్రధానమైన అంశాలనే పేర్కొంటాను. ఇక్కడ అనేక విషయాలను ప్రస్తావించి నప్పటికీ వాటిలో కొన్నింటి గురించి తర్వాత పరిశీలిద్దాం.

చాప్‌మాన్ ఇలా చెప్పాడు :

"4963. డబ్బు మార్కెట్ (ఇప్పటి లండన్‌లో ఉన్నట్టుగా) ఏ ఒక్క విడి పెట్టుబడిదారుని ఆధిపత్యం క్రింద ఉండటం అన్నది సరైన పరిస్థితి కాదని నేననుకొంటున్నాను. ఈ విషయం చెప్పటానికి నేను సంకోచించను. బయట చలామణి బాగా తక్కువగా వున్నప్పుడు ఈ విడి పెట్టుబడిదారుడు దారుణమైన కొరతను, ఒత్తిడిని సృష్టించగలగటం మంచిది కాదు. ఎవరైతే 10 లక్షలు, లేదా 20 లక్షల పౌండ్ల మొత్తం విలువగల నోట్లను, వారి లక్ష్య సాధన కోసం చలామణి నుండి ఉపసంహ రించగలరో అటువంటి పెట్టుబడిదారులు ఒకరికంటే ఎక్కువే ఉన్నారు కనుక అది సాధ్యమే."

– 4965[1]. ఒక పెద్ద సట్టా వ్యాపారి 10 లక్షల లేదా 20 లక్షల బాండ్లను అమ్మి మార్కెట్

1. జర్మన్, 1894 కూర్పులో 4995 అని వుంది - సం.

నుంచి డబ్బును వెనక్కు లాగేయగలదు. ఈ మధ్య ఇలాంటిదే ఒకటి జరిగింది. "దాని వల్ల చాలా తీవ్రమైన ఒత్తిడి సృష్టించబడుతుంది."

4967. అప్పుడు ఆ నోట్లు అనుత్పాదకమే. "అయితే పెట్టుబడిదారుని లక్ష్యం నెరవేరితే అది అనుత్పాదకమైనా ఫర్వాలేదు. అతని గొప్ప లక్ష్యం ఏమంటే నిధులను కరిగిపోయేలా చేయటం, కొరతను సృష్టించటం. అలా చేయగలిగిన శక్తి అతని స్వాధీనంలో వుంది." – ఒక ఉదాహరణ. ఒక ఉదయం స్టాక్ ఎక్స్చేంజ్‌లో డబ్బుకు డిమాండ్ అతిగా పెరిగింది. కారణం ఎవరికీ తెలియదు. ఒక వ్యక్తి 7% వడ్డీ చొప్పున 50,000 పౌండ్లను ఇవ్వమని చాప్‌మాన్‌ని అడిగాడు. చాప్‌మాన్ వడ్డీ రేటు అంతకంటే చాలా తక్కువ కనుక అతనికి ఆశ్చర్యం కలిగింది. అయినా డబ్బునిచ్చాడు. మళ్ళీ త్వరలోనే ఆ మనిషి తిరిగి వచ్చి $7\frac{1}{2}\%$ చొప్పున మరో 50,000 పౌండ్లు అప్పు తీసుకొన్నాడు. ఆ తర్వాత 8% చొప్పున లక్ష పౌండ్లను అప్పు తీసుకొన్నాడు. తర్వాత $8\frac{1}{2}$ ఇంకా కావాలని అడిగాడు. చాప్‌మాన్ సైతం కొంత ఇబ్బందికి గురయ్యాడు. మార్కెట్ నుంచి హఠాత్తుగా గణనీయమైన డబ్బు మొత్తం ఉపసంహరించుకోబడిందని తర్వాత తెలిసింది. చాప్‌మాన్ ఇలా అంటాడు. "8% చొప్పున నేను పెద్ద మొత్తం అప్పునే ఇచ్చాను. అంతకుమించి పోవటానికి భయపడ్డాను. ఏం జరగబోతోందో నాకు తెలియలేదు".

కోటీ 90 లక్షల నుంచి 2 కోట్ల వరకు నోట్లు నిరంతరాయంగా ప్రజల చేతుల్లో ఉంటాయని భావించినప్పటికీ వీటిలో వాస్తవంగా చలామణిలో వున్నవి, మరోవైపున బ్యాంకుల రిజర్వుగా పని లేకుండా ఉన్నవి ఒకదానితో ఒకటి పోల్చుకొన్నప్పుడు మారుతూ వుంటాయి. ఈ విషయాన్ని మరవరాదు. ఈ రిజర్వు పెద్ద స్థాయిలో ఉంది. దాని వల్ల వాస్తవ చలామణి స్వల్పంగా వున్నట్లయితే డబ్బు మార్కెట్ దృష్టి నుంచి చూస్తే చలామణి పూర్తిగా ఉందని, డబ్బు విస్తారంగా ఉందని అర్థం. రిజర్వు తక్కువగా వుండి, దానివల్ల వాస్తవ చలామణి సంపూర్ణంగా ఉన్నట్లయితే డబ్బు మార్కెట్ భాషలో చలామణి తక్కువగా వుందని, డబ్బు కొరత వుందని అర్థం. మరోలా చెప్పాలంటే పనిలేని రుణ పెట్టుబడి తక్కువగా వుందని అర్థం. పారిశ్రామిక ఆవృత్తపు దశలతో ప్రమేయం లేకుండా వుండే వాస్తవ చలామణి వ్యాకోచ సంకోచాలు (ప్రజల కవసరమైన డబ్బు మొత్తం యథాతథంగా వుందనుకొందాం.) కేవలం సాంకేతిక కారణాల వల్ల మాత్రమే జరుగుతాయి. ఉదాహరణకు పన్నులు కట్టాల్సిన తేదీలలో లేదా జాతీయ రుణాలపై వడ్డీ పొందే దినాలలో ఇది జరుగుతుంటుంది. పన్నులు చెల్లించబడితే మామూలుగా కంటే ఎక్కువగా బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాడులోకి నోట్లు, బంగారం ప్రవహిస్తాయి. దాని ఫలితంగా చలామణి అవసరాలతో నిమిత్తం లేకుండా అది సంకోచిస్తుంది. జాతీయ రుణంపై డివిడెండ్లు చెల్లించబడినపుడు ఇందుకు విరుద్ధంగా జరుగుతుంది. మొదటి విషయంలో చలామణి సాధనాన్ని పొందటం కోసం బ్యాంకు నుంచి రుణాలు తీసుకోబడతాయి. రెండో విషయంలో బ్యాంకు రిజర్వులు పెరగటం వల్ల ప్రైవేటు బ్యాంకుల్లో వడ్డీ రేటు పడిపోతుంది. చలామణి సాధనం మొత్తం పరిమాణంలో దీనికి ప్రమేయం లేదు. అయితే చలామణి సాధనాన్ని చలనంలో ఉంచే బ్యాంకింగ్ సంస్థకు దీనితో ప్రమేయం వుంది. ఆ సంస్థ రుణ పెట్టుబడిని వేరుచేయటం ద్వారానే లాభాన్ని సొంతం చేసుకోగల్గుతుంది.

ఒక సందర్భంలో చలామణి సాధనంలో కేవలం తాత్కాలికమైన స్థాన భ్రంశం మాత్రమే వుంటుంది. మూడు నెలల కొకసారి కట్టాల్సిన పన్నులకు ముందు తక్కువ వడ్డీ రేటుతో స్వల్పకాలిక రుణాల మంజూరు ద్వారా బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్ దీనిని సర్దుతుంది. మామూలుకంటే అధిక సంఖ్యలో నోట్ల విడుదల పన్నుల చెల్లింపు వల్ల తలెత్తిన లోటును భర్తీచేస్తుంది. డివిడెండ్ల చెల్లింపు ద్వారా జనం పొందిన అదనపు నోట్లు బ్యాంకుకు తిరిగి రావడం ద్వారా ఈ స్వల్పకాలిక రుణాలు చెల్లించబడతాయి.

మరో సందర్భంలో తక్కువ లేదా సంపూర్ణ చలామణి అన్నది ఎప్పుడూ చలామణి సాధనపు ఒకే పరిమాణాన్ని క్రియాశీలమైన చలామణిగాను, రుణాల పరికరమైన డిపాజిట్లుగాను భిన్నంగా పంపిణీ చేయటంపైన ఆధారపడి వుంటుంది.

మరోవైపున ఉదాహరణకు బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్‌లోకి బంగారం ప్రవాహం పెరగటం ప్రాతిపదికగా నోట్ల విడుదల సంఖ్య పెరిగితే ఈ నోట్లు బ్యాంకుకు బయట బిల్లులు డిస్కౌంట్ చేయటానికి తోడ్పడతాయి. రుణాలను తిరిగి చెల్లించటం ద్వారా అవి బ్యాంక్‌కు తిరిగి వస్తాయి. ఆ రకంగా చలామణిలో ఉండే నోట్ల పరిమాణం తాత్కాలికంగా మాత్రమే పెరుగుతుంది.

వాణిజ్యం విస్తరించటం వల్ల చలామణి పూర్తి స్థాయిలో ఉంటే (ధరలు సాపేక్షంగా తక్కువ వున్నప్పుడు కూడా ఇది సాధ్యం.) వడ్డీ రేటు సాపేక్షంగా ఎక్కువ ఉండొచ్చు. ఎందుకంటే పెరుగుతున్న లాభాల వల్లను, పెరిగిన కొత్త మదుపు వల్లను రుణ పెట్టుబడికి డిమాండ్ పెరగటం కారణంగా ఇది సాధ్యమవుతుంది. వ్యాపారం సంకోచించడం వల్లనో లేదా పరపతి విస్తారంగా లభించటం వల్లనో చలామణి తక్కువగా వుంటే, ధరలు అధికంగా వున్నప్పటికీ వడ్డీ రేటు తక్కువగా వుండొచ్చు. (హబ్బర్డ్ సాక్ష్యం చూడండి.)[1]

డబ్బు కొరత ఉన్న సమయాలలో మాత్రమే వడ్డీ రేటుపై చలామణి నిరపేక్ష మొత్తం యొక్క నిర్ణయాత్మక ప్రభావం వుంటుంది. సంపూర్ణ చలామణి కోసం డిమాండ్, పరపతి లోపించడం వల్ల దాచిపెట్టిన సాధనం కోసం ఉండే డిమాండ్‌ను ప్రతిబింబించవచ్చు. (డబ్బు చలామణి వేగం తగ్గటాన్ని, ఒకే డబ్బు మొత్తాలు నిరంతరాయంగా రుణ పెట్టుబడిగా మారటాన్ని ఇక్కడ పట్టించుకోరాదు.) బ్యాంకు చట్టం 1847లో నిలుపు చేయబడినపుడు చలామణి విస్తరణ జరగలేదు. కూడబెట్టిన నోట్లను బయటికి తీసి వాటిని చలామణిలోకి పంపటంతో సరిపోయింది. సంపూర్ణ చలామణి కోసం డిమాండ్‌కు అర్థం వాస్తవంగా ఆ పరిస్థితులలో ఎక్కువ చలామణి సాధనాల అవసరం కావటాన్ని ప్రతిబింబించటం కావచ్చు. బ్యాంకు చట్టం నిలుపుదల అయిన తర్వాత కొంత కాలంపాటు 1857లో చలామణి వాస్తవంగా విస్తరించింది.

అలా కాకుంటే చలామణి నిరపేక్ష పరిమాణం వల్ల వడ్డీ రేటుపైన ఏ రకమైన ప్రభావమూ వుండదు. ఎందుకంటే (కరెన్సీ వేగం దాని పొదుపు యథాతథంగా ఉన్నాయనుకొందాం.) ముఖ్యంగా అది సరుకు ధరలచేత, లావాదేవీల పరిమాణం చేత (ఈ రెండూ ఒకదానినొకటి తటస్థం చేసుకొంటాయి) చివరిగా పరపతి పరిస్థితిచేత నిర్ణయించబడుతుంది. అది పరపతిపైన ఎటువంటి

1. ఈ గ్రంథంలో 34వ అధ్యాయం - సం॥

ప్రతికూల ప్రభావమూ కల్గించదు. రెండవది సరుకుల ధరలతో వడ్డీకి తప్పనిసరి ప్రత్యక్ష సంబంధం లేదు.

బ్యాంకు ఆంక్షల చట్టం అమలు జరిగిన కాలంలో (1797–1819) కరెన్సీ అదనంగా ఉండి వడ్డీ రేటు ఎప్పుడూ అధికంగా ఉంది. నగదు చెల్లింపులు పునరుద్ధరింపబడిన తర్వాత కంటే ముందు ఇవి రెండూ ఎల్లప్పుడూ ఎక్కువే ఉన్నాయి. తర్వాత నోట్ల విడుదలపై ఆంక్షలతోపాటు, బిల్లుల కొటేషన్‌లు పెరగడంతోపాటు వడ్డీ రేటు పడిపోయింది. 1822, 1823, 1832లలో సాధారణ చలామణి తక్కువగా వుంది. వడ్డీ రేటు కూడా తక్కువే ఉంది. 1824, 1825, 1836లలో చలామణి పూర్తి స్థాయిలో ఉంది. వడ్డీ రేటు పెరిగింది. కొత్త బంగారం గనుల ఆవిష్కరణ తర్వాత యూరప్ అంతటా డబ్బు చలామణి విస్తరించింది. వడ్డీ రేటు పెరిగింది. 1830 వేసవిలో చలామణి పూర్తి స్థాయిలో వుంది. వడ్డీ రేటు తక్కువ ఉంది కనుక వడ్డీ రేటు చలామణిలో ఉన్న డబ్బు పరిమాణంపైన ఆధారపడి వుండదు.

చలామణి సాధనాన్ని విడుదల చేయటానికి, పెట్టుబడిని అప్పు ఇవ్వటానికి మధ్య తేడా వాస్తవ పునరుత్పత్తి ప్రక్రియలో బాగా వ్యక్తమవుతుంది. ఉత్పత్తి యొక్క వివిధ రుణాలు, అంగాలు ఒకదానితో ఒకటి ఎలా మార్పిడి చేసుకొంటాయో మనం చూశాం. (రెండవ సంపుటి మూడవ భాగం) ఉదాహరణకు అస్థిర పెట్టుబడిలో కార్మికుల జీవనాధారాలుంటాయి. వారి సొంత ఉత్పాదితంలో ఒక భాగం. అయితే ఇది కొద్ది కొద్దిగా డబ్బు రూపంలోనే చెల్లించబడుతుంది. పెట్టుబడిదారు దీనిని అడ్వాన్సు చేయాలి. ఇంతకు ముందు వారంలో అతడు చెల్లించిన పాత డబ్బుతో రాబోయే వారపు కొత్త అస్థిర పెట్టుబడిని చెల్లించగలడా అన్నది చాలా వరకు పరపతి వ్యవస్థ నిర్వహణపైన ఆధారపడి వుంటుంది. మొత్తం సామాజిక పెట్టుబడిలో ఉన్న వివిధ అంగాల మార్పిడికి కూడా ఇది వర్తిస్తుంది. ఉదాహరణకు జీవనాధారాలకూ, జీవనాధారాల ఉత్పత్తి సాధనాలకూ మధ్య మార్పిడికి కూడా ఇది వర్తిస్తుంది. వాటి చలామణి కోసం అవసరమైన డబ్బును మార్పిడి చేసుకొనే పక్షాలలో ఒకరూ లేదా ఇరువురూ అడ్వాన్సు చేయాల్సి వుంటుందని మనం గమనించాం. ఆ తర్వాత అది చలామణిలో వుంటుంది. మార్పిడి జరిగిన తర్వాత అడ్వాన్సు చేసిన వ్యక్తికి అది తిరిగి వస్తుంది. ఎందుకంటే ఆ వ్యక్తి తన పారిశ్రామిక పెట్టుబడికిపైన పారిశ్రామిక పెట్టుబడి కాక మరింత సొమ్మును అడ్వాన్సు చేశాడు కనుక (రెండవ సంపుటం, పుటలు 411–21) అభివృద్ధి చెందిన పరపతి వ్యవస్థలో డబ్బు బ్యాంకర్ల చేతుల్లో కేంద్రీకరించబడుతుంది. కనుక కనీసం నామమాత్రంగా అయినా దానిని అడ్వాన్సు చేసేది వారే. చలామణిలో వున్న డబ్బుకు మాత్రమే ఈ అడ్వాన్సు వర్తిస్తుంది. ఇది చలామణిని అడ్వాన్సు చేయటం మాత్రమే. అంతేకానీ అది చలామణిలో ఉంచే పెట్టుబడులను అడ్వాన్సు చేయటం కాదు.

చాప్‌మాన్. “5062. ప్రజల చేతుల్లో నోట్లు పెద్ద పరిమాణంలో ఉన్నప్పటికీ ఫలితం లేని సందర్భాలు ఉండొచ్చు.” భయోత్పాతక కాలంలో కూడా డబ్బు ఉంటుంది. అయితే దానిని అప్పిచ్చే పెట్టుబడిగా, అప్పిచ్చే డబ్బుగా మార్చకుండా ప్రతి ఒక్కరూ జాగ్రత్త తీసుకొంటారు. నిజమైన చెల్లింపు అవసరాల కోసం ప్రతి ఒక్కరూ జాగ్రత్త తీసుకొంటారు. నిజమైన చెల్లింపు అవసరాలకోసం ప్రతి ఒక్కరూ దానిని తమ దగ్గరే అట్టిపెట్టుకుంటారు.

"5099, గ్రామీణ ప్రాంతాల్లోని స్థానిక బ్యాంకర్లు తాము పనిలో పెట్టని సొమ్ముకు మీకు, ఇతర బ్యాంకింగ్ గృహాలకు పంపుతారు కదా? – అవును." – "5100. మరోవైపున లాంకషైర్, యార్క్‌షైర్ జిల్లాల వారు తమ వ్యాపారంలో ఉపయోగం కోసం మీనుంచి డిస్కౌంటులు కోరతారు కదా? – సరిగ్గా అంతే." బ్యాంకులు తమ మిగులు డబ్బు పెట్టుబడిని స్వల్పకాలికంగా బాండ్లను, ట్రెజరీ నోట్లను కొనే అలవాటు ఈ మధ్య గణనీయంగా తగ్గిందని చాప్‌మాన్ చెప్పాడు. ఈ డబ్బు అడిగిన వెంటనే చెల్లించే ఆనవాయితీ వచ్చినప్పటి నుంచి ఇలా జరుగుతోంది. అటువంటి కాగితాన్ని తన వాణిజ్యం కోసం కొనుగోలు చేయటాన్ని ఆచరణ సాధ్యం కాదని అతడు వ్యక్తిగతంగా భావిస్తున్నాడు. కనుక అతడు తన డబ్బును నమ్మదగిన మార్పిడి బిల్లులపైన మదుపు పెడతాడు. వాటితో కొన్నిటి గడువు ప్రతిరోజూ వస్తుంది. కనుక ప్రతిరోజూ ఎంత డబ్బు సిద్ధంగా ఉంటుందో అతనికి తెలుసు. (5101–5105)

ఎగుమతుల పెరుగుదల అన్నది కూడా ప్రతి దేశానికి, ముఖ్యంగా పరపతి ఇస్తున్న దేశానికి దేశంలో డబ్బు మార్కెట్‌పైన పెరిగే గిరాకీగా వ్యక్తమవుతుంది. అయితే ఇది డబ్బు కొరత తీవ్రంగా ఉన్నప్పుడే తెలుస్తుంది. ఎగుమతులు పెరిగినపుడు బ్రిటీష్ కార్ఖానాదారులు సాధారణంగా తమ సరుకులపైన దీర్ఘకాలికమైన మార్పిడి బిల్లులను ఎగుమతి వ్యాపారులకిచ్చి డిస్కౌంట్ చేయిస్తారు. (5126) – "5127 ఆ బిల్లులను తిరిగి నిర్ణీత కాలానికొకసారి తీసుకోవాల్సి వుంటుందన్న అవగాహన తరచుగా వుంటుంది గదా? – (చాప్‌మాన్) ఆ విషయం వాళ్ళు మాకు చెప్పరు. అటువంటి బిల్లుల్ని దేన్నీ మేము ఆమోదించకూడదు... అయితే అది జరుగుతూ వుంటుందని చెప్పగలను. ఏమైనా అటువంటి విషయం గురించి నేను చెప్పకూడదు." (అమాయకుడు చాప్‌మాన్) "5129. గత ఏడాదిలో లాగా ఒక దేశం ఎగుమతులు పెద్ద ఎత్తున అంటే 2 కోట్ల పౌండ్ల దాకా పెరిగితే, ఆ ఎగుమతులకు ప్రాతినిధ్యం వహిస్తున్న బిల్లుల డిస్కౌంటు కోసం, పెట్టుబడి కోసం పెద్ద ఎత్తున గిరాకీ తలెత్తదా? – సందేహం లేదు." – "5130 సాధారణంగా ఈ దేశం ఎగుమతులన్నిటిపైన విదేశాలకు ఎంతగా పరపతి ఇస్తుందో అదే స్థాయిలో తాత్కాలికంగా పెరిగిన పెట్టుబడిని గ్రహించటంతో సమానం కాదా? – ఈ దేశం అపారంగా పరపతి ఇస్తుంది. అయితే తన ముడిపదార్థాల కోసం పరపతి గ్రహిస్తుంది కూడా. అరవై రోజుల గడువుతో అమెరికా మనకు పరపతి ఇస్తుంది. ఇతర ప్రాంతాలకు సంబంధించి అయితే ఈ గడువు 90 రోజులుంటుంది. మరోవైపున మనమే పరపతి ఇస్తాము. మనం జర్మన్‌కు సరుకులు పంపితే రెండూ లేదా మూడు నెలలు గడువు ఇస్తున్నాము."

ఇంగ్లాండు చెల్లించాల్సిన మార్పిడి బిల్లులు, దిగుమతి అయ్యే ముడిపదార్థాల, వలస దేశాల సరుకుల లేడింగ్‌తో పాటు ఏకకాలంలో జరుగుతాయా? ఈ మార్పిడి బిల్లులు లేడింగ్ బిల్లులతో పాటు ఒకే సమయంలో చేరతాయా? అని విల్సన్, చాప్‌మాన్ (5131)ని అడిగాడు. చాప్‌మాన్ అలాగే జరుగుతాయని అనుకున్నాడు. అయితే అటువంటి వాణిజ్య లావాదేవీల గురించి తనకేమీ తెలీదనీ, ఈ రంగంలో నిపుణులను ప్రశ్నించడం మంచిదని సూచించాడు. అమెరికాకు ఎగుమతి చేయటంలో "సరుకులు రవాణా మార్గంలో డబ్బుగా మారతాయి" – ('the goods are Symbolized in transit') (5133) ఈ అర్థరహితమైన పదానికి అర్థమేమిటంటే ఇంగ్లాండు ఎగుమతి వ్యాపారి నాలుగు నెలల గడువుతో లండన్‌లో ఉన్న ఒక పెద్ద అమెరికన్ బ్యాంకింగ్ గృహం నుంచి తన

సరుకులపైన మార్పిడి బిల్లును సమర్పించి డబ్బు పొందుతాడు. ఆ సంస్థ అమెరికా నుంచి హామీ పొందుతుంది.

"5136. సాధారణంగా తన సరుకు అమ్మేవరకు తన పెట్టుబడి కోసం ఎదురుచూసే వ్యాపారి నిర్వహించే లావాదేవీలు ఎంతో దూరంగా ఉన్నవి కాదా? – పెద్ద సొంత సంపద ఉన్న సంస్థలుండవచ్చు. వారు తమ సొంత పెట్టుబడిని పెట్టవచ్చు. సరుకులపైన వారికి అడ్వాన్సు అవసరం లేకపోవచ్చు. అయితే ఇందులో అత్యధికం సువ్యవస్థిత సంస్థల ఆమోదం వల్ల అడ్వాన్సులుగా మార్చబడతాయి." – "5137. ఆ సంస్థలు లండన్‌లో లేదా లివర్‌పూల్‌లో, మరోచోట ఉండవచ్చు." – "5138. కనుక ఒక కార్ఖానాదారుడు తన సొంత డబ్బే ఉపయోగిస్తాడా? లేక, లండన్‌లో లేదా లివర్‌పూల్‌లో వున్న ఒక వ్యాపారి దానికోసం అడ్వాన్సు చేస్తాడా? అన్నదానితో ప్రమేయం లేదు. రెండు సందర్భాలలోను అది ఈ దేశంలో చేయబడిన అడ్వాన్సే గదా? – సరిగ్గా అంతే. కొన్ని సందర్భాలలో కార్ఖానాదారులకు (అయితే 1847లో అన్ని సందర్భాలలోను) దానితో ఇక్కడ ప్రమేయం లేదు. "మాంచెస్టర్‌లో ఉత్పత్తి అయిన సరుకులతో వ్యవహరిస్తున్న వ్యక్తి ఆ సరుకులను కొని, లండన్‌లో ఉన్న ఒక గౌరవనీయమైన సంస్థ ద్వారా వాటిని ఓడ కెత్తుతాడు. అనుకున్న ప్రకారమే ఆ ఓడలో సరుకులు ఎగుమతి అయ్యాయని లండన్ సంస్థ సంతృప్తిపడినపుడు అతడు ఆర్నెల్ల గడువుపైన ఇండియాకు లేదా చైనాకు లేదా మరో చోటకు పంపిన సరుకులపైన ఈ లండన్ సంస్థ నుంచి అవసరమైన సొమ్ము పొందుతాడు. అప్పుడు బ్యాంకింగ్ వ్యవస్థ ఆ బిల్లును డిస్కౌంట్ చేస్తుంది. ఆ సరుకులకు చెల్లించాల్సిన సమయానికి బిల్లు డిస్కౌంటు కావడం ద్వారా సిద్ధంగా ఉంటుంది." – "5139. అతని దగ్గర డబ్బు ఉన్నప్పటికీ బ్యాంకరు డబ్బు సర్దుతున్నాడు కదా? – బ్యాంకరు దగ్గర బిల్లు ఉంది. బ్యాంకరు బిల్లును కొనుక్కున్నాడు. తన బ్యాంకింగ్ పెట్టుబడిని ఆ రూపంలో అనగా వాణిజ్య బిల్లులను డిస్కౌంట్ చేసే రూపంలో అతడు ఉపయోగిస్తున్నాడు." (అంచేత బిల్లులను డిస్కౌంటు చేయటాన్ని చాప్‌మాన్ సహితం డబ్బును అడ్వాన్సు చేయటంగా పరిగణించటం లేదు. కేవలం సరుకుల కొనుగోలుగా మాత్రమే పరిగణిస్తున్నాడన్న మాట – ఎంగెల్స్) – "5140. అయితే లండన్ డబ్బు మార్కెట్‌పై గిరాకీలో అదొక భాగమే గదా? – సందేహం లేదు. డబ్బు మార్కెట్‌ను, బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్‌ను గణనీయంగా ఆక్రమించుకోవటమే. ఈ బిల్లులు మంచి ఆస్తులని దానికి తెలుసు కనుక వీటిని పొందటం మనకెంత ఇష్టమో బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్‌కు కూడా అంతే ఇష్టం." – "5141. ఆ రకంగా ఎగుమతి వాణిజ్యం పెరిగితే డబ్బు మార్కెట్‌లో గిరాకీ కూడా పెరుగుతుందన్న మాట. – దేశంలో సమృద్ధి పెరిగితే దానిలో మనం (చాప్‌మాన్లు) కూడా భాగం పంచుకొంటాం." – "5142. పెట్టుబడిని పనిలో పెట్టే వివిధ రంగాలు ఒక్కసారిగా పెరిగితే దాని సహజ పర్యవసానం వడ్డీ రేటు పెరగటమే కదా? – నిస్సందేహంగా."

"5143లో మన భారీ ఎగుమతులలో వెండి, బంగారాలు ఇంత అవసరమవుతాయని అర్థం కాలేదని" చాప్‌మాన్ అన్నాడు.

"5144లో గౌరవనీయుడైన విల్సన్ ఇలా అడిగాడు. మన ఎగుమతులపైన మనం ఇచ్చే పరపతి, మన దిగుమతులపైన మనం తీసుకునే పరపతి కంటే ఎక్కువగా ఉందా? – ఆ విషయం నాకే సందేహంగా వుంది. ఇండియాకు పంపించే తన మాంచెస్టర్ సరుకులపైన ఒక మనిషి ఆమోదిస్తే మీరు 10 నెలల కంటే తక్కువ గడువును ఆమోదించలేరు. అమెరికాకు దాని పత్తి కోసం మనం,

మనకు ఇండియా చెల్లించడానికి కొద్దిగా ముందే చెల్లించాల్సి వుంటుంది. (ఇది ఖచ్చితంగా నిజం) అయితే ఇదంతా చాలా సున్నితంగా జరుగుతుంది." – "5145. గత ఏడాది బాగా ఉత్పత్తి అయిన సరుకుల ఎగుమతి రెండు కోట్లకు పెరిగితే దానికంటే ముందు ముడిపదార్థాల దిగుమతులు పెద్ద యెత్తున మనం చేసుకొని ఉంటాము." (ఈ రకంగా అధిక ఎగుమతులు అధిక దిగుమతులుగాను, అధికోత్పత్తి అధిక వాణిజ్యంగానూ చూపించబడుతుంది.) ఈ సరుకుల తయారీకి ఆ దిగుమతి అవసరం కదా? – సందేహం లేదు" – "5146. మనం చాలా పెద్ద మొత్తంలో మిగులును చెల్లించాల్సి ఉంటుంది. ఆ కాలంలో అది మనకు ప్రతికూలంగానే వుంటుంది. కానీ దీర్ఘకాల ప్రాతిపదికపై చూస్తే అమెరికాతో మన మార్పిడులు మనకు అనుకూలంగా ఉంటాయి. మనం కొంతకాలంగా అమెరికా నుంచి వెండి, బంగారాల సరఫరాను పెద్ద ఎత్తున అందుకుంటూనే వున్నాం."

"5148. కరుడుగట్టిన వడ్డీ వ్యాపారి చాప్‌మాన్‌ను తన అధిక వడ్డీ రేటు గొప్ప సుభిక్షతకు, అధిక లాభం రేటుకు నిదర్శనం కాదా అని విల్సన్ అడిగాడు. ఈ కాకారాయుడి మర్మంలేని ధోరణికి చాప్‌మాన్ ఆశ్చర్యపోయి అవునని తలూపాడు. అయితే ఈ క్రింది అంశాన్ని చేర్చేపాటి నిజాయితీని ప్రదర్శించాడు. "తప్పనిసరి పరిస్థితులలో ఉన్నవారు ఉంటారు. వారు తీర్చాల్సిన అవసరాలు వుంటాయి. అది లాభదాయకమైనా, కాకున్నా వాటిని తీర్చాల్సి వుంటుంది. కేవలం కొనసాగటానికి [అధిక వడ్డీ రేటు] ఇది అవసరం. ఇది సమృద్ధిని సూచిస్తుంది." అయితే 1857లో లాగా తిరుగుబోతు సట్టా వ్యాపారులు వడ్డీ రేటును ఇతర్ల జేబు నుంచి చెల్లిస్తారు కనుక వారు అధిక వడ్డీ రేటు చెల్లించగలుగుతారు. (తద్వారా మిగిలిన వారందరికీ వర్తించే వడ్డీ రేటును నిర్ణయించగల్గుతారు) ఈలోగా రాబోయే లాభాల దృష్టిలో వారు వైభవోపేతంగా బతుకుతారు. అధిక వడ్డీ రేటు దీనిని మాత్రమే సూచించవచ్చు. ఈ అంశాన్ని ఇద్దరూ మర్చిపోయారు. ఈ అంశాన్ని అదే సమయంలో సందర్భవశాత్తూ కార్ఖానాదార్లకు, ఇతర్లకు ఇది లాభదాయకమైన వ్యాపారాన్ని సమకూర్చవచ్చు. రుణ వ్యవస్థ కారణంగా తిరిగి వచ్చే సొమ్ము మాయగా మారొచ్చు. ఇది ఈ కింది విషయాన్ని కూడా తెలియజేస్తుంది. నిజానికి బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్ ఇతర్లు అధిక వడ్డీ రేటు తీసుకొంటున్నప్పుడు అంతకంటే తక్కువ రేటుకు డిస్కౌంట్ చేస్తుంది. కనుక ఇంతకు మించిన వివరణ అక్కర్లేదు.

"5156. ప్రస్తుతం పరిస్థితిని గమనిస్తే మన డిస్కౌంట్లు అధిక స్థాయిలో ఉన్నాయి అని నేను చెప్పగలను. చాలా కాలంగా అధిక వడ్డీ రేటు వుంది" అని చాప్‌మాన్ అన్నాడు. [ఈ ప్రకటనను చాప్‌మాన్ 1857 జూలై 21న చేశాడు. ఆ తర్వాత రెండు నెల్లకు సంక్షోభం బ్రద్దలైంది.] – "5157. 1852లో [వడ్డీ రేటు తక్కువగా ఉన్నప్పుడు] డిస్కౌంట్‌లు అంత ఎక్కువగా లేవు." ఎందుకంటే వాణిజ్యం ఇప్పటికంటే అప్పుడు ఎంతో పటిష్టంగా ఉండింది.

"5159. మార్కెట్‌లో పెద్ద ఎత్తున డబ్బు ప్రవాహం ఉంటే, బ్యాంక్ రేటు తక్కువగా ఉంటే మనకు తక్కువ బిల్లులు వస్తాయి... 1852లో మొత్తంగా భిన్నమైన పరిస్థితులు ఉన్నాయి. ఇప్పటి పరిస్థితితో పోలిస్తే అప్పుడు ఎగుమతులు దిగుమతులు లేనట్లే లెక్క." – "5161. ఈ అధిక డిస్కౌంట్ రేటున మన డిస్కౌంటులు ఇప్పుడు 1854లో లాగా ఎక్కువగా ఉన్నాయి." [1854లో వడ్డీ రేటు 5, $5\frac{1}{2}$%కి మధ్య ఉంది.

చాప్‌మాన్ సాక్ష్యంలో సరదాగా వున్న భాగం ప్రజాధనాన్ని వీళ్ళు తమ సొంత డబ్బుగా ఎలా భావిస్తారో, డిస్కౌంట్ చేసిన మార్పిడి బిల్లులు నిరంతరాయంగా మార్పిడి చేయదగిన బిల్లులుగా ఉండే హక్కు కావాలని ఎలా కోరుకొంటారో తెలియజేస్తుంది. ఈ ప్రశ్నలు, సమాధానాలు వారి ఉద్దేశాలను దాపరికం లేకుండా తెలియజేస్తాయి. పెద్ద సంస్థలు ఆమోదించిన బిల్లులను అన్నివేళలా మార్చదగిన బిల్లులుగా చేసే శాసనం అవసరం అని వారు భావిస్తారు. అన్ని పరిస్థితులలోను బిల్లు బ్రోకర్ల సౌకర్యార్థం వాటిని బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్ తిరిగి డిస్కౌంట్ చేయటానికి వారు హామీ కావాలని కోరతారు. అయినప్పటికీ 1857లో అటువంటి బిల్లు బ్రోకర్లు ముగ్గురు దివాళా తీశారు. వారు 80 లక్షల పౌండ్లు బకాయిపడ్డారు. ఈ బాకీలతో పోలిస్తే వారి సొంత పెట్టుబడి అతి తక్కువ వుంది. – “5177. అలా అనటం ద్వారా మీ ఉద్దేశం (బేరింగ్స్ సంస్థో, లాయిడ్స్ సంస్థో ఆమోదించిన బిల్లులు) ఈ బిల్లులు కూడా బంగారంతో తప్పనిసరిగా మార్పిడి అయ్యే బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్ నోట్ల లాగానే తప్పనిసరిగా డిస్కౌంట్ చేయబడటానికి అర్హత ఉన్నట్లు పరిగణించాలనా? – అవి అలా డిస్కౌంట్ కాలేకపోవటం చాలా విచారించాల్సిన విషయం అని నేననుకొంటున్నాను. స్మిత్, పేనీ అండ్ కంపెనీ లేదా జోన్స్, లాయడ్ అండ్ కంపెనీ ఆమోదించిన బిల్లులను చెల్లించటాన్ని ఎవరైనా ఆపెయ్యటమన్నది అత్యంత అసాధారణ పరిస్థితి.” – “5178. బేరింగ్ కంపెనీ హామీ అంటే బిల్లు గడువు తేదీకి నిర్ణీత మొత్తం సొమ్మును చెల్లించే హామీయేనా? – అది ఖచ్చితంగా నిజం. అయితే ఆ హామీ ఇస్తున్నప్పుడు బేరింగ్ కంపెనీ గానీ, మరే ఇతర వ్యాపారి గానీ, తాను దానిని బంగారు నాణాల రూపంలో చెల్లించబోతున్నానని కలగనడు. ఆ చెల్లింపులు తాము క్లియరింగ్ హౌస్‌లో చేయగల్గుతామని మాత్రమే వారు అనుకొంటారు.” – “5180. బిల్లు గడువు తేదీకి ముందే దానిని ఎవరో ఒకరు డిస్కౌంట్ చేసి తమకు డబ్బు ఇవ్వాలనే హక్కు ప్రజలకుండేలా యంత్రాంగాన్ని మార్చాల్సిన అవసరం ఉందని మీరు భావిస్తారా? – అయితే ఆ బిల్లును ఆమోదించిన వ్యక్తి దగ్గర నుంచి కాదు. అయితే మీ ఉద్దేశం మనం వాణిజ్య బిల్లులను డిస్కౌంట్ చేయించుకోవటం సాధ్యపడటం లేదు అని. అయితే మనం మొత్తం పరిస్థితుల నిర్మాణాన్ని మార్చాల్సి వుంటుంది.” – “5182. అయితే మీరు బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్ నోటు బంగారంతో మార్పిడి చేయటానికి అర్హత కలిగి ఉన్నట్లే ఒక వాణిజ్య బిల్లు కూడా డబ్బుగా మార్చటానికి వీలైన అవకాశం ఉండాలంటారా? – ఖచ్చితంగా అంతే, కొన్ని పరిస్థితులలో” – “5184. నిస్సందేహమైన స్వభావం కలిగిన మార్పిడి బిల్లులు ఒక బ్యాంక్ నోట్ లాగానే డబ్బులో ఎపుడైనా మార్చటానికి వీలుగా ఉండే లాగా కరెన్సీ నిబంధనలను రూపొందించాలని మీరు భావిస్తారా?– ఆఁ!” “5185. బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్ గానీ లేదా ఎవరైనా వ్యక్తి గానీ చట్టబద్ధంగా దాన్ని తప్పనిసరిగా మార్చుకోవాల్సిన అవసరం ఉందని చెప్పటం మీ ఉద్దేశం కాదుగదా? – నా ఉద్దేశం అదే. కరెన్సీ కోసం ఒక బిల్లును రూపొందించటంలో మనం ఒక జాగ్రత్త తీసుకోవాలి. మార్పిడి బిల్లు నిస్సందేహంగా స్థిరంగానూ, చట్టబద్ధంగానూ ఉన్నట్లయితే అది మారకుండా ఉండే పరిస్థితిని నిరోధించటానికి వీలైన ఏర్పాటు చేయాలి.” బ్యాంకు నోట్లు మార్చబడటం పోల్చి వాణిజ్య బిల్లు మార్చబడటాన్ని చూపటం ఇది.

“5190. దేశంలో ఉన్న డబ్బు వ్యాపారులు మాత్రమే ప్రజలకు నిజానికి ప్రాతినిధ్యం వహిస్తారు.”

డేవిడ్‌సన్ కేసులో కోర్టు ఆఫ్ ఎసైజెస్![1] ముందు చాప్‌మాన్ చేసినట్లుగా గ్రేట్ సిటీ ఫ్రాడ్స్ చూడండి.[2]

"5196. డివిడెండ్లు చెల్లించే మూడు నెలల గడువు సమయంలో మనం తప్పనిసరిగా బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్‌కు వెళ్ళాల్సి వుంటుంది. చలామణి నుంచి 60 లక్షలు లేదా 70 లక్షలు ఆదాయాన్ని, డివిడెండ్లను ఆశిస్తూ వెనక్కు తీసుకుంటే ఆ మధ్యకాలంలో దానిని సరఫరా చేసే మాధ్యమంగా ఎవరో ఒకరు ఉండాలి." – (ఈ సందర్భంలో ఇది డబ్బు సరఫరాకు సంబంధించిన అంశమే కానీ పెట్టుబడి లేదా రుణ పెట్టుబడి సరఫరా వ్యవహారం కాదు.)

"5169. మన వాణిజ్య ఆవృత్తంలో పరిచయమున్న ప్రతి ఒక్కరికీ ఈ విషయం తెలుసు. మనం ఖజానా బిల్లులను అమ్మలేనపుడు, ఇండియా బాండ్లు పూర్తిగా ఉపయోగరహితమైనపుడు, మొదటి వాణిజ్య బిల్లులను మీరు డిస్కౌంట్ చేయలేనపుడు కోరిన వెంటనే చలామణి సాధనాన్ని చెల్లించాల్సిన వారికి అనగా బ్యాంకర్లందరికీ చాలా ఆందోళనకరంగా వుంటుందన్నది ప్రతి ఒక్కరికి తెలుసు. అపుడు ప్రతి మనిషి తన రిజర్వును రెట్టింపు చేసుకోటానికి ప్రయత్నిస్తాడు. దేశమంతటా దాని ప్రభావం ఎలా ఉంటుందో చూడండి. దేశంలో 500 గ్రామీణ బ్యాంకులున్నాయి. వాటిలో ప్రతి ఒక్క బ్యాంకు తమ లండన్ ప్రతినిధిని బ్యాంకు నోట్ల రూపంలో 5000 పౌండ్లను జమ చేయాలని కోరవచ్చు. ఇది చాలా అసంబద్ధమైన మొత్తమే అయినా ఆ పరిమితమైన మొత్తాన్ని సగటుగా భావిస్తే 25 లక్షల పౌండ్లు చలామణిలోంచి తీసేయబడుతుంది. దానిని ఎలా సరఫరా చేయాలి?"

మరోవైపున డబ్బులున్న ప్రైవేటు పెట్టుబడిదారులు ఎంత వడ్డీకైనా ఆ డబ్బును బయటికి పోనివ్వరు. "5195. మా డబ్బు మా కవసరమైనపుడు తిరిగి వస్తుందన్నది సందేహాస్పదమైతే మాకు అసలు వడ్డీయే అక్కర్లేదు" అన్న చాప్‌మాన్ లాగే వారు కూడా అంటారు.

"5173. మన వ్యవస్థ ఇలా ఉంది. ఈ దేశపు నాణెం రూపంలో మనం చెల్లించాల్సివచ్చే బకాయిలు ఒకేసారి చెల్లించాల్సివస్తే అవి 30 కోట్ల పౌండ్లు వుంటాయి. కానీ దేశంలో వున్న నాణాలు మొత్తం కేవలం 2 కోట్ల 30 లక్షల పౌండ్లు మాత్రమే. ఈ పరిస్థితి ఏమైనప్పటికీ ఏ క్షణమైనా మనను గందరగోళంలోనికి నెట్టే పరిస్థితి కాదా?" అందుకే పరపతి వ్యవస్థ సంక్షోభ సమయాలలో ద్రవ్య వ్యవస్థగా హఠాత్తుగా మారుతుంది.

సంక్షోభ సమయంలో దేశంలో ఉండే భయోత్పాత వాతావరణంతోపాటు డబ్బు పరిమాణం గురించి మాట్లాడాలంటే అది సార్వత్రిక ద్రవ్యం అయిన వెండి, బంగారాలకు సంబంధించి మాత్రమే మాట్లాడటం సాధ్యం. సరిగ్గా దీనినే చాప్‌మాన్ వదిలేస్తున్నది. అతడు కేవలం 2 కోట్ల 30 లక్షల బ్యాంకు నోట్లు గురించి మాత్రమే మాట్లాడుతున్నాడు.

అదే చాప్‌మాన్ ఇలా అన్నాడు (1847 ఏప్రిల్‌లోనూ, ఆ తర్వాత అక్టోబర్‌లోనూ) "5218. డబ్బు మార్కెట్ అస్తవ్యస్తం కావటానికి ప్రధాన కారణం డబ్బు పరిమాణమే అనటంలో సందేహం

---

1. ఆనాడు ఇంగ్లండులోని ప్రతి కౌంటీలోను సివిల్, క్రిమినల్ కేసులను విచారించే ప్రత్యేక కోర్టులుండేవి - అనువాదకుడు.
2. ఎస్. లెయ్యింగ్, న్యూ సిరీస్ ఆఫ్ ది గ్రేట్ సిటీ ఫ్రాడ్స్ ఆఫ్ కోల్, డేవిసన్ అండ్ కోర్డన్, లండన్ - సం.

లేదు. అది మన మార్పిడులను క్రమబద్ధం చేయటం అవసరం. ఆ ఏడాది అసాధారణంగా జరిగిన దిగుమతుల వల్ల ఈ పరిస్థితి తలెత్తింది." మొదటి అంశం ఈ ప్రపంచ మార్కెట్ డబ్బు నిల్వ దాని కనీస స్థాయికి కుదించబడింది. రెండవది అదే సమయంలో పరపతి డబ్బు బ్యాంకు నోట్లుగా మార్చబడటానికి వీలుగా అది హామీగా పనిచేసింది. ఈ రకంగా అది రెండు భిన్నమైన పనులను మేళవించింది. ఈ రెండూ కూడా డబ్బు స్వభావం నుంచే తలెత్తుతాయి. ఎందుకంటే వాస్తవమైన డబ్బు ఎప్పుడూ ప్రపంచ మార్కెట్ డబ్బే. పరపతి డబ్బు ఎప్పుడూ ప్రపంచ మార్కెట్ డబ్బుపైన ఆధారపడి వుంటుంది.

1847లో 1844 బ్యాంక్ చట్టాన్ని నిలిపివేసి ఉండకపోతే "క్లియరింగ్ హౌస్‌లలో పని పరిష్కారమై ఉండేది కాదు." (5221)

చాప్‌మాన్ రాబోయే సంక్షోభాన్ని పసిగట్టాడు. "5236. డబ్బు చాలా ఇబ్బందికావటం వల్ల బ్యాంకును ఆశ్రయించాల్సిన కొన్ని పరిస్థితులు డబ్బు మార్కెట్‌లో ఉంటాయి." (ప్రస్తుత పరిస్థితి దానికెంతో దూరంలో లేదు.)

"5239 మేము బ్యాంకు నుంచి శుక్రవారం, శనివారం, సోమవారం అనగా 1847 అక్టోబర్ 19, 20, 22న తీసుకొన్న మొత్తాలు గురించి మాట్లాడాలంటే ఆ తర్వాత బుధవారం నాడు బిల్లులు మాకు తిరిగి వచ్చినందుకు మేము ఎంతో కృతజ్ఞులం అనుకోవాలి. భయోత్పాతం ముగియడంతోపాటు మాకు ఆ సొమ్ము తిన్నగా తిరిగి వచ్చింది." – అక్టోబర్ 23వ తేదీన మంగళవారం బ్యాంకు చట్టం నిలుపు చేయబడింది. సంక్షోభం ఆ రకంగా నివారించబడింది.

లండన్‌లో ఏకకాలంలో రంగంలో వున్న మార్పిడి బిల్లులు 10 లేదా 12 కోట్లు ఉంటుందని చాప్‌మాన్ అంచనా. వివిధ ప్రాంతీయ సంస్థలు చెల్లించాల్సిన బిల్లులను ఇందులో కలపలేదు. "5287. 1856 అక్టోబర్‌లో ప్రజల చేతుల్లో నోట్లు 2 కోట్ల 11 లక్షల 55 వేలకు పెరిగినపుడు డబ్బు పొందటానికి, అసాధారణమైన ఇబ్బంది ఏర్పడింది. ప్రజల దగ్గర అంత డబ్బు ఉన్నప్పటికీ మేము దానిని అంటుకోలేకపోయాము. (1856 మార్చి) ఈస్టరన్ బ్యాంక్ కొంతకాలంపాటు స్తంభించి పోవడం మూలంగా కలిగిన భయం వల్ల ఈ పరిస్థితి తలెత్తింది."

5290–92 ఈ భయోత్పాతం ముగియగానే "వడ్డీ నుంచి తమ లాభాలను పొందే బ్యాంకర్లు అందరూ ఆ డబ్బును వెంటనే పనిలో పెట్ట ప్రారంభిస్తారు."

5302. డిపాజిట్ల గురించి సందేహం వల్ల బ్యాంకు రిజర్వు తగ్గిపోయినపుడు ఉండే ఇబ్బందిని చాప్‌మాన్ వివరించటం లేదు. పెద్ద మొత్తాలలో డబ్బును చెల్లించటం తప్పనిసరి అయిన వారంతా తమ ఆఖరి ఆశ్రయం బ్యాంకేనని ఎరుగుదురు. డబ్బు మార్కెట్‌లో కొరత ఉన్నప్పుడు ఇది వర్తిస్తుంది. "బ్యాంకుల దగ్గర అపుడు రిజర్వు తక్కువగా ఉంటే మమ్మల్ని బ్యాంకులు సాదరంగా ఆహ్వానించవు. అందుకు విరుద్ధంగా వుంటుంది."

సందర్భవశాత్తూ ఒక వాస్తవ పరిమాణంగా రిజర్వు ఎలా కరిగిపోతుందో చూడటం ముచ్చటగా వుంటుంది. బ్యాంకర్లు అప్పటి వ్యాపార అవసరాల నిమిత్తం కనీస మొత్తాన్ని తమ దగ్గర ఉంచుకొంటారు. లేదా బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్‌లో దాస్తారు. బిల్లు బ్రోకర్లు "దేశంలో ఉన్న విడి బ్యాంకు డబ్బును"

రిజర్వు ఏదీ లేకుండానే తమ దగ్గర ఉంచుకొంటారు. డిపాజిట్లు తిరిగి చెల్లించటానికి బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్ దగ్గర ఉండేది, కేవలం బ్యాంకర్లు, తదితరుల రిజర్వులు, కొన్ని పబ్లిక్ డిపాజిట్లు మాత్రమే తప్ప మరేమీ ఉండదు. ఈ రిజర్వులను అది చాలా తక్కువ స్థాయికి ఉదాహరణకు 20 లక్షల స్థాయి పౌండ్లకు పడిపోవటాన్ని అనుమానిస్తుంది. కాగితం రూపంలో ఉన్న 20 లక్షలు కాక ఈ వంచనకు మరే రిజర్వు ఉండదు. డబ్బు కొరత ఉన్న సమయాలలో వెండి, బంగారాల రిజర్వు మాత్రమే పనిచేస్తుంది. (డబ్బు, కొరతను తగ్గిస్తుంది. ఎందుకంటే బయటకు పోయే వెండి, బంగారాలను భర్తీ చేయడానికి లోపలకు వచ్చే నోట్లను రద్దు చేయక తప్పదు.) అందుకే ఆ రకంగా బంగారం బయటికి పోవడం వల్ల ఈ రిజర్వులో ప్రతి తగ్గుదలా సంక్షోభాన్ని పెంచుతుంది.

"5306 క్లియరింగ్ హౌస్‌లో లావాదేవీలను పరిష్కరించటానికి కరెన్సీ లేనపుడు ఒకచోట కలిసి మొదటి తరగతి బిల్లుల రూపంలో అనగా ఖజానా బిల్లులు, స్మిత్, పేనీ తదితరులు బిల్లుల రూపంలో మన చెల్లింపుల్ని కొనసాగించటం ద్వారా పరిష్కరించటమే మనకు మిగిలి ఉన్న ప్రత్యామ్నాయం" – "5307. అంటే ప్రభుత్వం మీకు చలామణి సాధనాన్ని సరఫరా చేయటంలో విఫలమైతే మీరు మీకోసం ఒక సాధనాన్ని సృష్టించుకొంటారన్నమాట? – మేము ఏమి చేయగలం; జనం వచ్చి మా చేతుల్లోని చలామణి సాధనాన్ని తీసుకుపోతారు. కనుక అది మా దగ్గర ఉండదు." – "5308. అంటే వాళ్ళు మాంచెస్టర్‌లో వారంలో ప్రతిరోజూ చేస్తున్న పనినే మీరిక్కడ లండన్‌లో చేస్తారన్నమాట? – అవును."

కేలీ అడిగిన ప్రశ్నకు (అట్‌వుడ్ శాఖకు చెందిన బర్మింగ్‌హామ్ వ్యక్తి) చాప్‌మాన్ ఇచ్చిన సమాధానం విశేషించి యుక్తిగా వుంది. ఇది ఓవర్‌స్టన్ పెట్టుబడి భావన గురించి ప్రశ్న. "5315. 1847లో లాగా ఒత్తిడి ఉన్నప్పుడు మనుషులు డబ్బు కోసం చూడరని, పెట్టుబడి కోసం చూస్తారని ఈ కమిటీ ముందు ఇంతకు ముందు ప్రకటించబడింది. ఈ విషయంలో మీ అభిప్రాయం ఏమిటి? – నాకది అర్థం కాలేదు. మేము డబ్బుతో మాత్రమే వ్యాపారం చేస్తున్నాము. మీరేమంటున్నారో నాకు అర్థం కాలేదు." – "5316. (వాణిజ్య పెట్టుబడి) అనటం ద్వారా మీ ఉద్దేశం తన సొంత వాణిజ్యంలో ఓ మనిషి కలిగి ఉండే డబ్బు పరిమాణాన్ని మీరు పెట్టుబడి అని పిలుస్తున్నారనుకొంటాను. చాలా సందర్భాలలో అతడు తన పరపతి ద్వారా ప్రజల దగ్గర పుచ్చుకొన్న డబ్బుతో పోలిస్తే తమ సొంత డబ్బు చాలా అల్పస్థాయిలో వుంటుంది." – చాప్‌మాన్‌ల మధ్యవర్తిత్వం ద్వారా ప్రజల డబ్బు వర్తకుని దగ్గరకు పోతుంది.

"5339. మనం నగదు చెల్లింపులకు స్వస్తి చెప్పడానికి కారణం ఆస్తి లేకపోవడమేనా? – ఏ మాత్రం కాదు.... మనం ఆస్తిని కోరటం లేదు. అయితే మనం చాలా కృత్రిమమైన వ్యవస్థలో సంచరిస్తున్నాం. మన కరెన్సీపైన అపారమైన గిరాకీ ఒక్కసారి పెరిగితే ఆ కరెన్సీని మనకు దొరకకుండా చేసే పరిస్థితులు తలెత్తవచ్చు. దానివల్ల దేశంలో ఉన్న మొత్తం వాణిజ్య పరిశ్రమ కుంటుపడాల్సిందేనా? మనం ఉద్యోగ మార్గాలన్నింటినీ మూసెయ్యాల్సిందేనా?" – "5338. మనం నగదు చెల్లింపుల్ని కొనసాగించాలా లేక దేశ పరిశ్రమను కొనసాగించాలా? అన్న ప్రశ్న తలెత్తితే దేనిని వదిలెయ్యాలో చెప్పటానికి నాకు సంకోచం ఏమీ లేదు."

బ్యాంకు నోట్లను దాచి పెట్టటానికి సంబంధించి "ఒత్తిడిని పెంచి పర్యవసానాల ప్రయోజనాన్ని పొందటం కోసం" (5358) ఇలా దాచిపెట్టడాన్ని గురించి అది చాలా తేలికగా జరుగుతుందని అతడు చెప్పాడు. దీని కోసం మూడు పెద్ద బ్యాంకులు చాలు. "5383. ఈ నగరంలో పెద్ద లావాదేవీలు అన్నిటిలోనూ బాగా పరిచయమున్న వారిగా పెట్టుబడిదారులు ఈ సంక్షోభాలను తమ కనుకూలంగా ఉపయోగించుకొంటారని ఈ సంక్షోభాలకు ప్రజలు వినాశనాన్ని ఆసరా చేసుకొని అపారంగా లాభం సంపాదిస్తారని మీకు తెలియకుండా ఉంటుందా? – అందులో సందేహం లేదు." "– ఈ విషయంలో మనం చాప్‌మాన్‌ను పూర్తిగా నమ్మవచ్చు. "బాధితుల వినాశనం నుంచి అపారమైన లాభాలు" ఆర్జించే ప్రయత్నంలో వాణిజ్యపరంగా చూస్తే ఆయన స్వయంగా హూనం అయ్యాడని చెప్పవచ్చు. ఆయన సహచరుడు గుర్నీ ఇలా చెప్పాడు. వాణిజ్యంలో, ముందే ప్రతి మార్పు విషయం తెలిసిన వారికి ప్రయోజనకరంగా వుంటుంది. కానీ చాప్‌మాన్ ఏమంటాడంటే, వ్యాపారంలో ఒక విభాగానికి మరో విభాగం గురించి తెలీదు. వీరిలో ఒకరు ఉదాహరణకు కార్ఖానాదారులు. యూరప్ ఖండ దేశాలకు అతడు ఎగుమతి చేస్తాడు. లేదా ముడిపదార్థాలను దిగుమతి చేసుకొంటాడు. వెండి, బంగారాలతో వ్యవహరిస్తున్న మనిషి గురించి అతనికి ఏమీ తెలియదు." (5046) – ఆ రకంగానే ఒక శుభోదయాన గుర్నీ, చాప్‌మాన్ పాపం "బాగా తెలిసిన వారు కారని తేలిపోయింది. దారుణంగా దివాళా తీశారు."

అన్ని సందర్భాలలోనూ నోట్ల విడుదల అన్నది పెట్టుబడి అడ్వాన్సును సూచించదు అని మనం ఇంతకు ముందు గమనించాం. 1848 సి.డి. కమిటీ ఆఫ్ లార్డ్స్ ముందు టూకే ఇచ్చిన సాక్ష్యం తెలియజేసేదేమంటే బ్యాంకు కొత్త నోట్లను విడుదల చేయటం ద్వారా ముందస్తు పెట్టుబడిని సమకూర్చినప్పటికి, అది చలామణిలో వున్న నోట్ల సంఖ్యకు దానంతటదే పెరగటాన్ని సూచించదు.

"3099. ఉదాహరణకు బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్ సమకూర్చే ముందస్తు పెట్టుబడిని పెంచినప్పటికీ నోట్ల విడుదల అదనంగా పెరగదంటారా? – దానిని రుజువు చేయడానికి అనేక వాస్తవాలున్నాయి. బాగా కొట్టొచ్చినట్లు కనిపించే ఉదాహరణ 1835లో దొరుకుతుంది. ప్రజలకు డబ్బు సమకూర్చటాన్ని పెంచటానికి ఈ బ్యాంకుకు వెస్ట్ ఇండియా డిపాజిట్లనూ, ఈస్ట్ ఇండియా కంపెనీనుంచి తీసుకొన్న రుణాన్నీ ఉపయోగించింది. ఆ సమయంలో ప్రజల చేతుల్లో ఉన్న నోట్ల పరిమాణం వాస్తవానికి తగ్గింది. 1846లో కూడా రైల్వే డిపాజిట్లు బ్యాంక్‌లో కట్టే సమయంలో ఇటువంటి అసంగతమే కనిపిస్తుంది. సెక్యూరిటీలు (డిస్కౌంట్ రూపంలోనూ, డిపాజిట్ల రూపంలోనూ) మూడు కోట్లకు పెరిగాయి. అయితే ప్రజల చేతుల్లో వున్న నోట్ల పరిమాణం విషయంలో గమనించదగిన ప్రభావం ఏమీ లేదు."

టోకు వ్యాపారానికి బ్యాంకు నోట్లు కాక మరో చలామణి సాధనం ఉంది. ఆ వ్యాపారానికది మరింత ముఖ్యమైంది. దాని పేరు మార్పిడి బిల్లులు. వాణిజ్యం క్రమబద్ధంగా నడవాలంటే ప్రతిచోటా అన్ని పరిస్థితుల్లోనూ మంచి మార్పిడి బిల్లులన్నిటినీ ఆమోదించాల్సిన అవసరాన్ని చాప్‌మాన్ మనకు తెలియజేశాడు. Gilt nicht mehrder Tausves Jontof, was soll gelten, Zeter, Zeter!* ఈ చలామణి సాధనాలు రెండింటి మధ్య ఉన్న పరస్పర సంబంధం ఏమిటి?

1. జర్మన్ కవి హైనే వ్యంగ్య రచన... "అరె, నీచ పరనిందకా, తావునఫజ్ - యోంతక్ కూడా మరేదీ కాకపోతే, ఆహా, ఇక మిగిలిందేమిటి? - హైనే, డిస్ప్యుటేషన్ - సం.

ఈ విషయంలో గిల్బర్ట్ ఇలా రాశాడు... "నోట్ల చలామణి మొత్తం తగ్గితే బిల్లు చలామణి మొత్తం ఏకరీతిగా పెరుగుతుంది. ఈ బిల్లులు రెండు రకాలు – వాణిజ్య బిల్లులు, బ్యాంకర్ల బిల్లులు. డబ్బు కొరత ఏర్పడినపుడు రుణదాతలు ఇలా అంటారు. "మాకు బిల్లులు ఇవ్వండి మేము ఆమోదిస్తాం." ఒక గ్రామీణ బ్యాంకర్ తన ఖాతాదారుని కోసం బిల్లును డిస్కౌంట్ చేసినపుడు అతడు ఖాతాదారునికి నగదు చెల్లించడానికి బదులు తన సొంత డ్రాఫ్టునే 21 రోజుల గడువులో లండన్ ఏజెంట్ చెల్లించేలా ఇస్తాడు. ఈ బిల్లులు కరెన్సీ లక్ష్యాన్ని నెరవేరుస్తాయి." (జె.డబ్ల్యు గిల్బర్ట్, ఏన్ ఎంక్వయిరీ ఇన్ టు ది కాజస్ ఆఫ్ ది ప్రెషర్... పుట 31)

దీనినే మరో రూపంలో న్యూమార్క్ వ్యక్తం చేశాడు. (బ్యాంకు చట్టాలు, 1857, నెం. 1426)

"బిల్లు చలామణి మొత్తంలో మార్పులకు, బ్యాంకు నోట్ల చలామణిలో మార్పులకు మధ్య సంబంధం ఏమీ లేదు.... డబ్బు మార్కెట్‌పైన ఒత్తిడి ఉన్నప్పుడల్లా అది డిస్కౌంట్ రేటు పెరుగుదల రూపంలో వ్యక్తమవుతుంది. అప్పుడు బిల్లు చలామణి పరిమాణం బాగా పెరుగుతుంది. అలాగే ఈ చలామణి పెరిగినపుడు డిస్కౌంట్ రేటు పెరుగుతుంది. బిల్లు చలామణి తగ్గినపుడు డిస్కౌంట్ రేటు కూడా తగ్గుతుంది."

అయితే అటువంటి సమయాలలో మార్చే మార్పిడి బిల్లులు గిల్బర్ట్ పేర్కొన్న స్వల్పకాలిక బ్యాంక్ బిల్లులు మాత్రమే కాదు. అందుకు విరుద్ధంగా అవి ప్రధానంగా డబ్బు వసతి బిల్లులు. అవి ఏ రకమైన నిజమైన లావాదేవీనీ సూచించవు. లేదా కేవలం మార్పిడి బిల్లుల్ని డబ్బుగా మార్చటం కోసమే చేయబడిన సాదా లావాదేవీలు. ఈ రెండింటికి సంబంధించిన ఉదాహరణలు మనం ఎక్కువే చూశాము. అటువంటి బ్యాంకు నోట్లతో పోలిస్తే అటువంటి బిల్లులకున్న హామీ గురించి ఎకనామిస్ట్ (విల్సన్) ఇలా అంటుంది. "అడిగిన వెంటనే చెల్లించవలసిన నోట్లను అధికంగా బయట ఉంచడం సాధ్యం కాదు. ఎందుకంటే అలా బయట ఉంచిన అధిక మొత్తం ఎపుడూ చెల్లించటం కోసం బ్యాంక్‌కు తిరిగి వస్తుంది. రెండు నెలల గడువులో బిల్లులను చాలా ఎక్కువగా విడుదల చేయవచ్చు. గడువు నాటిదాకా ఆ విడుదలను నిలువరించే సాధనాలు లేవు. కనుక, గడువు సమయంలో వాటి స్థానంలో ఇతర బిల్లులు ఉంచవచ్చును. ఎపుడో చెల్లించబడే బిల్లుల చలామణి యొక్క భద్రతను ఆమోదిస్తూ, కోరిన వెంటనే చెల్లించాల్సిన కాగితపు చలామణి భద్రతకు అభ్యంతరం తెలిపే ప్రజల్ని మనం పట్టించుకోనక్కర్లేదు." (ఎకనామిస్ట్, మే 22, 1847, పుట 575)

కనుక బ్యాంక్ నోట్ల పరిమాణంలాగానే చలామణిలో ఉన్న మార్పిడి బిల్లుల పరిమాణం కూడా వాణిజ్య అవసరాలను బట్టే నిర్ణయించబడుతుంది. సాధారణ సమయాలలో ఇంగ్లండులో యాభైలలో 3 కోట్ల 90 లక్షల పౌండ్ల బ్యాంకు నోట్లతోపాటు 30 కోట్ల మార్పిడి బిల్లులు కూడా చలామణిలో ఉన్నాయి... వాటిలో 10, 12 కోట్ల పౌండ్లు లండన్‌లోనే చలామణిలో ఉన్నాయి. చలామణిలో ఉన్న మార్పిడి బిల్లులు నోటు చలామణిపైన ప్రభావం కలిగించవు. డబ్బు కొరత వున్నప్పుడు మాత్రమే అలాంటి ప్రభావం ఉంటుంది. అపుడు బిల్లుల పరిమాణం పెరుగుతుంది. వాటి విలువ తగ్గిపోతుంది. అంతిమంగా సంక్షోభ కాలంలో బిల్లుల చలామణి పూర్తిగా కూలిపోతుంది. చెల్లిస్తాననే వాగ్దానాన్ని ఎవరూ ఉపయోగించుకోలేరు. ఎందుకంటే ప్రతి ఒక్కరూ నగదు చెల్లింపులు

మాత్రమే ఆమోదిస్తారు. కనీసం ఇంగ్లండులోనైనా ఇంతవరకూ చలామణి కాగల తన శక్తిని బ్యాంకు నోటు నిలబెట్టుకుంది. ఎందుకంటే తన మొత్తం సంపదతో జాతి యావత్తు బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్‌కు అండగా వుంది.

★ ★ ★

1857లో డబ్బు మార్కెట్‌లో అతి పెద్ద వ్యాపారుల్లో ఒకడైన చాప్‌మాన్ సైతం లండన్‌లో మొత్తం డబ్బు మార్కెట్‌ను ఏ క్షణాన్నయినా విచ్ఛిన్నం చేయటానికి తగినంత శక్తి కలిగిన అనేకమంది పెద్ద డబ్బు పెట్టుబడిదారులు ఉన్నారని చాలా కోపంగా ఫిర్యాదు చేసిన విషయం మనం గమనించాం. వారు చిన్న డబ్బు వ్యాపారులను పీల్చి పిప్పిచేయగలరని అతనన్నాడు. 10 లేదా 20 లక్షల మొత్తం విలువ గల బాండ్లను అమ్మటం ద్వారా అంతే మొత్తం బ్యాంకు నోట్లను మార్కెట్ నుంచి ఉపసంహరించుకోవడం ద్వారా (అదే సమయంలో అందుబాటులో ఉన్న రుణ పెట్టుబడిని తీసుకోవడం ద్వారా) డబ్బు కొరతను గణనీయంగా తీవ్రతరం చేయగలిగిన అనేక డబ్బు సొరచేపలున్నాయని ఆయన అన్నాడు. మూడు పెద్ద బ్యాంకులు కలిసి వ్యవహరిస్తే డబ్బు కొరతను ఇదే కుతంత్రంతో భయోత్పాతంగా మార్చివేయగలవు.

అయితే లండన్‌లో అతి పెద్ద పెట్టుబడి శక్తి బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండే. ఒక పాక్షిక ప్రభుత్వ సంస్థగా దానికున్న హోదావల్ల అంత పాశవికంగా అది తన ఆధిపత్యాన్ని చూపించకుండా నిరోధించబడింది. అయినప్పటికీ దానికి కూడా ముఖ్యంగా 1844 బ్యాంకు చట్టం నాటి నుంచి తన కోశాగారం ఎలా నింపుకోవాలో తెలుసు.

బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్‌కు 14,553,000 పౌండ్లు ఉంది. అది కాక 30 లక్షల పౌండ్ల "మిగులు" ఉంది. అదేమంటే ఇంకా పంపిణీగాని లాభాలు, పన్నుల రూపంలో ప్రభుత్వం వసూలు చేసిన డబ్బు వగైరాలు. ఈ డబ్బు ప్రభుత్వానికి అవసరమయ్యే దాకా బ్యాంక్‌లో డిపాజిట్ వుంటుంది. దీనికితోడు ఇతర డిపాజిట్లు సాధారణ సమయాలలో మరో 3 కోట్ల పౌండ్లు ఉంటాయి. రిజర్వు అండ లేకుండానే విడుదల చేసిన బ్యాంకు నోట్లు వాటికి తోడవుతాయి. న్యూమార్క్ తన ప్రకటన ద్వారా గీసి గీసి మితమైన అంచనా ఇచ్చాడని మనం చూడవచ్చు. (బ్యాంకు చట్టాలు, 1857, నెం. 1889) "లండన్ డబ్బు మార్కెట్‌లో నిరంతరాయంగా పనిలో పెట్టే నిధులు మొత్తం సుమారు 12 కోట్ల పౌండ్లుంటుందని చెప్పవచ్చును. ఈ 12 కోట్లలో గణనీయమైన భాగం సుమారు 15% లేదా 20% బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్ స్వాధీనంలో వుంటుంది."

బ్యాంక్ ఖజానాలో వెండి, బంగారాలు రిజర్వు అండ లేకుండా బ్యాంక్ నోట్లను విడుదల చేసినపుడు అది విలువ చిహ్నాలను సృష్టిస్తుంది. దానికి అవి చలామణి సాధనాలు మాత్రమే కాదు. ఈ ప్రాతిపదికలేని నోట్ల నామమాత్ర మొత్తానికి ఇది నకిలీ పెట్టుబడే అయినా అదనపు పెట్టుబడి కూడా. 1857 బ్యాంకు చట్టాలలో విల్సన్, న్యూమార్క్‌ను ఇలా అడుగుతాడు. "1563. బ్యాంకర్ చలామణి సగటుకంటే పైన ఉంచబడిన మేరకు ఆ బ్యాంకరు యొక్క క్రియాశీల పెట్టుబడికి అది అదనం కాదా? – ఖచ్చితంగా." – "1564. ఆ చలామణి నుంచే అతడు ఏ లాభం పొందినప్పటికి

అతడు దానిని పరపతి నుంచి మాత్రమే పొందాడు. అతని దగ్గర వాస్తవంగా ఉన్న పెట్టుబడి నుంచి కాదు గదా? – సరిగ్గా అంతే.”

నోట్లను విడుదల చేసే ప్రైవేటు బ్యాంకులకు కూడా ఇదే వర్తిస్తుంది. 1866 నుంచి 1868 నెంబర్లలో న్యూమార్క్ సమాధానం ప్రకారం వారు విడుదల చేసే బ్యాంకు నోట్లలో మూడింట రెండు వంతులు (చివరి మూడవ భాగానికి ఈ బ్యాంకులలో వెండి, బంగారాల ఆధారం ఉండాలి.) “ఫలానా ఇంత పెట్టుబడి సృష్టి” జరిగిందని చెప్పవచ్చు. ఎందుకంటే ఈ మొత్తం నాణెం పొదుపైంది. దీని ఫలితంగా బ్యాంకర్ లాభం ఇతర పెట్టుబడిదార్ల కంటే ఎక్కువగా ఉండకపోవచ్చు. అయితే ఈ జాతీయ నాణెం పొదుపు నుంచి అతడు తన లాభం రాబడతాడన్నది వాస్తవం. ఒక జాతీయ పొదుపు ఒక ప్రైవేటు లాభంగా మారుతోందన్న వాస్తవం బూర్జువా అర్థశాస్త్రవేత్తను ఏమాత్రం దిగ్భ్రాంతికి గురిచేయదు. ఎందుకంటే లాభం అన్నది సాధారణంగా జాతీయ శ్రమను స్వాహా చేయటం మాత్రమే. ఉదాహరణకు బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్ నోట్లకు ప్రభుత్వ యంత్రాంగం వల్లనే పరపతి లభిస్తుంది. (1797 నుంచి 1817) అది ప్రభుత్వ యంత్రాంగం నుంచి అనగా ప్రజల నుంచి ప్రభుత్వ రుణాలపైన వడ్డీ రూపంలో వసూలు చేస్తుంది. దానికి ఈ నోట్లను కాగితం రూపం నుంచి డబ్బుగా మార్చి మళ్ళీ ప్రభుత్వ యంత్రాంగానికే తిరిగి ఇచ్చే అధికారాన్ని మంజూరు చేసింది ఎవరు? ప్రభుత్వ యంత్రాంగమే. ఇంతకంటే అసంబద్ధమైన విషయం ఏమైనా ఉంటుందా?

సందర్భవశాత్తూ బ్యాంకుకు పెట్టుబడిని సృష్టించే ఇతర మార్గాలున్నాయి. పైన పేర్కొన్న విధంగా తమకు అనవసరమైన నిధులను (బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్ నోట్లను) దేశవాళీ బ్యాంకులు లండన్ బిల్లు బ్రోకర్లకు డిస్కౌంట్ చేయబడిన మార్పిడి బిల్లులకు బదులుగా పంపించే అలవాటు వుందని న్యూమార్క్ తెలియజేశాడు. ఈ మార్పిడి బిల్లులతో బ్యాంక్ ఖాతాదారులకు సేవ చేస్తుంది. తన స్థానిక ఖాతాదారుల నుంచి పొందిన మార్పిడి బిల్లులను అది తిరిగి విడుదల చేయరాదనే సూత్రాన్ని పాటిస్తుంది. వారి వాణిజ్య లావాదేవీలను తమ సొంత ప్రాంతాలలో మిగిలిన వారు తెలుసుకోవడానికి వీలు లేకుండా బ్యాంక్ ఈ చర్య తీసుకొంటుంది. లండన్ నుంచి పొందిన ఈ బిల్లులు లండన్‌లో ప్రత్యక్షంగా చెల్లించాల్సిన ఖాతాదార్లకు విడుదల చేయబడతాయి. బ్యాంక్ తన సొంత డ్రాఫ్టును లండన్‌లో పొందటానికి వారు ఇష్టపడకపోతే ఆ చెల్లింపులు స్థానికంగా పరిష్కరించ డానికి అవి తోడ్పడతాయి. ఎందుకంటే బ్యాంకరు దఖలుపర్చిన అధికారం వల్ల వారికి స్థానిక పరపతి లభిస్తుంది. ఆ రకంగా లాంక్‌షైర్‌లో స్థానిక బ్యాంకులన్నీ ఈ నోట్లు కలిగి వుంటాయి. అంటువంటి బిల్లుల వల్ల బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్ నోట్లలో చాలా భాగం చలామణి నుంచి బయటికి నెట్టబడుతుంది. (బ్యాంక్ చట్టాలు, 1568 నుంచి 1574) ఆ రకంగా 1) తన సొంత నోట్లను విడుదల చేయటం ద్వారా. 2) 21 రోజులు వరకూ గడువు ఉండే లండన్ చెల్లించే డ్రాఫ్టులను ఇవ్వడం ద్వారా. 3) ప్రధానంగా పరపతిని కలిగి వుంటూ కనీసం స్థానిక జిల్లా మేరకు బ్యాంకు ధ్రువీకరణ ద్వారా, డిస్కౌంటు చేయబడిన మార్పిడి బిల్లులను తిరిగి జారీ చేయడం ద్వారా బ్యాంకులు పరపతిని, పెట్టుబడిని సృష్టిస్తాయని మనం గమనించాం.

మార్కెట్ వడ్డీ రేటును క్రమబద్ధం చేయడం ద్వారా బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్ తన శక్తిని వ్యక్తం

చేస్తుంది. మామూలు కార్యకలాపాల సమయంలో ఒక మోస్తరుగా తన నిల్వ నుంచి బంగారం బయటకు పోవటాన్ని డిస్కౌంట్ రేటు పెంచటం ద్వారా ఆపలేకపోవచ్చు[1] ఎందుకంటే చెల్లింపు సాధనం కోసం గిరాకీని ప్రైవేటు బ్యాంకులు, గత 30 ఏళ్ళుగా గణనీయంగా పెరిగిన స్టాక్ బ్యాంకులు, బిల్లు బ్రోకర్లు సంతృప్తిపరుస్తారు. అటువంటి సందర్భంలో బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్ ఇతర సాధనాలను ఆశ్రయించాల్సి వుంటుంది. సి.డి. 1848/57 ముందు గ్లిన్ (గ్లిన్, మిల్స్, కరీ అండ్ కో, కి చెందిన) చేసిన ప్రకటన క్లిష్ట అంశంలో ఇప్పటికీ వర్తిస్తుంది. "1709. దేశంలో పెద్ద ఒత్తిడి ఉన్నప్పుడు వడ్డీ రేటుపై బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్ ఆధిపత్యం ఉంటుంది." – "1710. అసాధారణమైన ఒత్తిడి ఉన్న సందర్భంలో ప్రైవేటు బ్యాంకర్ల లేదా బ్రోకర్ల డిస్కౌంట్లు సాపేక్షంగా పరిమితమైనపుడల్లా అవి బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్ మీదే ఆధారపడతాయి. అపుడు మార్కెట్ రేటును నిర్దేశించే అధికారం బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్‌కే ఉంటుంది."

అయినప్పటికీ బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్ ప్రభుత్వ రక్షణలో ఉన్న పబ్లిక్ సంస్థ కనుక అందుకు అనుగుణమైన హక్కుల్ని అనుభవిస్తుంది కనుక ప్రైవేటు వాణిజ్యంలాగా అంత నిర్దాక్షిణ్యంగా దాని శక్తిని అంతగా దోపిడీ చేయదు. ఈ కారణంగానే బ్యాంకింగ్ కమిటీ ముందు హబ్బర్డ్ ఇలా ప్రస్తావించాడు. (బ్యాంకు చట్టాలు, 1857) "2844. (ప్రశ్న) డిస్కౌంట్ రేటు అత్యధికంగా వున్నప్పుడు బ్యాంక్ అత్యంత చౌకస్థానం కాదా? అలాగే ఆ రేటు అతి తక్కువగా ఉన్నప్పుడు బిల్లు బ్రోకర్లు అతి చౌక పక్షాలు కాదా? – (హబ్బర్డ్) బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్, దాని పోటీదారులంతా తక్కువ స్థాయికి దిగజారరు కనుక, ఆ రేటు అత్యధికంగా వున్నప్పుడు దాని రేటు అంత అధికంగా ఉండదు కనుక ఈ విషయం ఎల్లవేళలా వర్తిస్తుంది."

అయితే డబ్బు కొరత వున్నప్పుడు, ఏదో సామెత చెప్పినట్లు తన మీటలను బిగించినప్పుడు అనగా అప్పటికే సగటుకు మించి ఉన్న వడ్డీ రేటును ఇంకా ఎక్కువ స్థాయికి పెంచినపుడు అది వాణిజ్య జీవితంలో అతి తీవ్రమైన సంఘటన అవుతుంది. "బ్యాంక్ తననట్లు బిగించగానే విదేశీ ఎగుమతి కోసం చేసే కొనుగోళ్ళన్ని తక్షణమే ఆగిపోతాయి.... ఎగుమతిదారులు ధరలు అతి తక్కువ స్థాయికి పడిపోయేదాకా వేచి ఉంటారు. అపుడు మాత్రమే వారు కొనుగోళ్ళు చేస్తారు. అప్పటిదాకా చెయ్యరు. అయితే ఈ దశ రాగానే మార్పిడులు సర్దుకొంటాయి. మాంద్యం అతి తక్కువ దశకు చేరుకోవడానికి ముందు బంగారం ఎగుమతి ఆగిపోతుంది. ఎగుమతి కోసం సరుకులు కొనటానికి

---

1. యూనియన్ బ్యాంక్ ఆఫ్ లండన్ స్టాక్‌హోల్డర్ సర్వసభ్య సమావేశంలో 1894 జనవరి 17న అధ్యక్షుడు రిచే మాట్లాడుతూ ఇలా చెప్పాడు. 1893లో బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్ తన డిస్కౌంట్‌ను జూలైలో $2\frac{1}{2}$ నుంచి ఆగస్టులో 3-4% పెంచింది. అయినప్పటికీ అది నాలుగు వారాలలో 45 లక్షల బంగారాన్ని కోల్పోయింది. కనుక బ్యాంక్ రేటును 5%కు పెంచింది. అటుపిమ్మట బంగారం తిరిగి వెనక్కు ప్రవహించింది. ఆ తర్వాత బ్యాంకు రేటు సెప్టెంబరులో 4%, అక్టోబర్‌లో 3% పడిపోయింది. అయితే ఈ బ్యాంకు రేటు మార్కెట్‌లో గుర్తించబడలేదు. "బ్యాంక్ రేటు 5% ఉన్నప్పుడు డిస్కౌంట్ రేటు $3\frac{1}{2}$% డబ్బు రేటు $2\frac{1}{2}$% వుంది. బ్యాంక్ రేటు 4% పడిపోయినప్పుడు డిస్కౌంట్ రేటు $2\frac{3}{8}$% ఉంది. డబ్బు రేటు $1\frac{3}{4}$%, బ్యాంకు రేటు 3% వున్నప్పుడు డిస్కౌంట్ రేటు $1\frac{1}{2}$% డబ్బు రేటు అంతకంటే దిగువకు పడిపోయాయి." (డెయిలీ న్యూస్, జనవరి 18, 1894) - ఎంగెల్స్

అంతకు ముందు విదేశాలకు పంపబడిన బంగారంలో కొంత భాగాన్ని తిరిగి తేవటం జరుగుతుంది. అయితే బంగారం తరిగిపోవటాన్ని నిరోధించ వీలులేనంత ఆలస్యంగా అది జరుగుతుంది." (జె.డబ్ల్యు. గిల్బర్ట్. ఏన్ ఎంక్వయిరీ ఇంటు ది కాజెస్ ఆఫ్ ది ప్రెషర్ ఆన్ ది మనీ మార్కెట్, లండన్, 1840, పుట 35) – "విదేశీ మార్పిడులతో కరెన్సీని క్రమబద్ధం చేయడం వల్ల మరో ఫలితం ఏమంటే ఒత్తిడి ఉన్న సందర్భాలలో అపారమైన వడ్డీ రేటుకు అది దారితీస్తుంది. (పుట 40) – "మార్పిడులను సరిదిద్దే ఖర్చును దేశంలో ఉన్న ఉత్పాదక పరిశ్రమ భరించాల్సి వస్తుంది. కాగా ఈ క్రమంలో బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్ లాభాలు అతి కొద్దిపాటి పెట్టుబడితో తన వాణిజ్యం నిర్వహించటం వల్ల వాస్తవంగా పెరుగుతాయి." (పుట 52)

మిత్రుడు శామ్యూల్ గుర్నీ ఇలా అంటాడు. "వడ్డీ రేటులో గొప్ప ఆటుపోటులు బ్యాంకర్లకు, డబ్బు వ్యాపారులకూ ప్రయోజనకరం. విషయాలు తెలిసిన వాడికి వాణిజ్యంలో ఆటుపోటులన్నీ లాభదాయకమే. ప్రమాదకర వాణిజ్య పరిస్థితిని గుర్నీలు నిర్దాక్షిణ్యంగా దోపిడీ చేయటం ద్వారా దాని సారాన్ని పిండినప్పటికీ బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్ అంత స్వేచ్ఛగా దోపిడీ చేయలేదు. అయితే అది కూడా బాగా లాభాలు గడిస్తుంది. దాని డైరెక్టరుకు సాధారణ వాణిజ్య పరిస్థితిని అంచనా వేసే అపురూపమైన అవకాశం వుంటుంది. ఆ కారణంగా వారి ఒడిలోకి వచ్చి పడే వ్యక్తిగత లాభాల గురించి ఇక్కడ ప్రత్యేకించి చెప్పాల్సిన అవసరం లేదు. 1817లో నగదు చెల్లింపులు పునరుద్ధరించ బడినపుడు లార్డ్స్ సభా కమిటీకి సమర్పించిన సమాచారం ప్రకారం 1797 నుంచి 1817 వరకు గల మొత్తం కాలంలో బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్‌కు దక్కిన లాభాలు ఈ క్రింది విధంగా ఉన్నాయి."

| | | |
|---|---|---|
| బోనస్‌లు, పెరిగిన డివిడెండ్లు | .... | 74,51,136 |
| యజమానులు పంచుకొన్న కొత్త స్టాకు | .... | 72,76,500 |
| పెరిగిన పెట్టుబడి విలువ | .... | 14,553,000 |
| మొత్తం | .... | 29,280,636 |

ఇది పందొమ్మిదేళ్ళ కాలంలో 11,642,100 పౌండ్ల పెట్టుబడిపై సంపాదించిన మొత్తం (డిహార్డ్ కేజిల్, బ్యాంక్స్ అండ్ బ్యాంకర్స్, రెండవ కూర్పు, లండన్, 1843, పుట 120) బ్యాంక్ ఆఫ్ ఐర్లాండ్ కూడా తన నగదు చెల్లింపుల్ని 1797లోనే నిలిపివేసింది. దాని మొత్తం లాభాన్ని ఇదే పద్ధతిలో అంచనా వేస్తే ఈ క్రింది ఫలితం వస్తుంది.

| | | |
|---|---|---|
| 1821లో తిరిగి రావాల్సిన డివిడెండ్లు | .... | 4,736,085 |
| ప్రకటించిన బోనస్ | .... | 1,225,000 |
| పెరిగిన ఆస్తులు | .... | 1,214,800 |
| పెరిగిన పెట్టుబడి విలువ | .... | 4,185,000 |
| మొత్తం | ..... | 11,360,885 |

ఇది కేవలం 30 లక్షల పౌండ్ల పెట్టుబడిపైన లాభం.

కేంద్రీకరణ గురించి మాట్లాడటమా! జాతీయ బ్యాంకులు అనబడే వాటిపైనా, అప్పిచ్చే

వారిపైనా, వారి చుట్టూ ఉండే వడ్డీ వ్యాపారులపైనా దృష్టిని కేంద్రీకరించే పరపతి వ్యవస్థ ఒక అపారమైన కేంద్రీకరణ అవుతుంది. అది ఈ వర్గపు పరాన్నభుక్కులకు అపరిమితమైన అధికారాన్నిస్తుంది. పారిశ్రామిక పెట్టుబడిదారుల్ని అప్పుడప్పుడు నాశనం చేయటానికి అత్యంత ప్రమాదకరమైన రీతిలో వాస్తవ ఉత్పత్తిలో జోక్యం చేసుకోటానికిది అవకాశం కల్పిస్తుంది. ఈ ముఠాకు ఉత్పత్తి గురించీ ఏమీ తెలీదు. ఉత్పత్తితో దానికి బొత్తిగా ప్రమేయం లేదు. 1844, 1845 చట్టాలు ఈ బందిపోట్ల శక్తి పెరుగుతోందంటానికి నిదర్శనం. ఫైనాన్షియర్‌లు, స్టాకుల సట్టా వ్యాపారులు వీరికి తోడవుతారు.

జాతీయ ఉత్పత్తినీ, ప్రపంచ ఉత్పత్తినీ ఉత్పత్తి ప్రయోజనాలతోటే ఈ గౌరవనీయులైన బందిపోట్లు దోపిడీ చేస్తారనే విషయాన్ని ఇంకా ఎవరైనా సందేహిస్తే బ్యాంకర్ల అమితమైన నైతిక విలువను గురించి ఈ క్రింది నీతిపాఠం చదివి తెలుసుకోవటం మంచిది. "బ్యాంకింగ్ సంస్థలనేవి.... నైతిక, మత సంస్థలు..... తన బ్యాంకరు తనను పసిగడతాడేమోనన్న భయం యువ వ్యాపారులను విపరీతంగా ఖర్చు పెట్టే కజ్జాకోరు మిత్రులతో చేతులు కలపకుండా ఎన్నిసార్లు నిరోధించలేదు?... అతని తపనంతా తన బ్యాంకర్ అంచనాలో తాను నికార్సయిన వాడిగా ఉండాలన్నది కాదా?... తన మిత్రుల వేళాకోళాల కంటే, నిరుత్సాపరిచే చర్యలకంటే తన బ్యాంకరు నుదురు చిట్లించటమన్నది ఎక్కువ ప్రభావాన్ని కలిగించలేదా? చిన్న వంచన లేక నేరం, చిన్న పొరపాటు ప్రకటన అనుమానానికి తావివ్వటం కారణంగా తన డబ్బు వసతిని పరిమితం చేయటం, లేదా నిలిపివేయటం జరుగుతుందేమోనని భయంతో వణికిపోలేదా? మతగురువు సలహాకంటే బ్యాంకరు స్నేహశీల సలహా మరింత విలువైనది కాదా?" (జి.యమ్. బెల్, ఒక స్కాట్లాండ్ బ్యాంకు డైరెక్టరు, ద ఫిలాసఫీ ఆఫ్ జాయింట్ స్టాక్ బ్యాంకింగ్, లండన్, 1840, పుటలు 46, 47)

★ ★ ★

## అధ్యాయం - 34

# కరెన్సీ సూత్రం 1844 ఇంగ్లీష్ బ్యాంక్ చట్టం

[ఇంతకు ముందు ఒక గ్రంథంలో[1] సరుకుల ధరలకు సంబంధించి డబ్బు విలువపైన రికార్డో సిద్ధాంతాన్ని విశ్లేషించాము. కనుక తప్పనిసరి అంశాలకు మాత్రమే ఇక్కడ పరిమితమవుదాం. రికార్డో ప్రకారం లోహపు డబ్బు విలువ దానిలో ఇమిడి వున్న శ్రమ కాలాన్నిబట్టి నిర్ణయమవుతుంది. అయితే ఆ డబ్బు పరిమాణం మార్పిడి చేయాల్సిన సరుకుల పరిమాణంలోనూ, ధరలోనూ సరైన సంబంధంలో ఉన్న మేరకే ఇది జరుగుతుంది. ఈ నిష్పత్తికి మించి డబ్బు పరిమాణం పెరిగితే దాని విలువ పడిపోతుంది. కనుక సరుకు ధరలు పెరుగుతాయి. సరైన నిష్పత్తికి దిగువగా అది పడిపోతే డబ్బు విలువ పెరుగుతుంది. సరుకుల ధరలు పడిపోతాయి. మిగిలిన పరిస్థితులన్నీ యథాతథంగా ఉన్నాయని భావించాలి. మొదటి ఉదాహరణలో ఈ మిగులు బంగారం ఉన్న దేశం బంగారం విలువ తగ్గటం వల్ల దానిని ఎగుమతి చేస్తుంది. సరుకుల్ని దిగుమతి చేసుకొంటుంది. రెండవ ఉదాహరణలో బంగారం దాని విలువకు పైబడి ఉన్నప్పుడు ఆ దేశాల్లోకి బంగారం ప్రవహిస్తుంది. కాగా ఆ దేశంలో ఉన్న సరుకుల విలువ తగ్గటం వల్ల అవి ఇతర మార్కెట్లకు ప్రవహిస్తాయి. అక్కడ అవి మామూలు ధరలు పలుకుతాయి. ఈ పరిస్థితులలో "బంగారం నాణాలుగా లేదా కడ్డీలుగా మారవచ్చు. తన విలువ కంటే ఎక్కువగానో లేదా తక్కువగానో పరిమాణం గల లోహానికి అది చిహ్నంగా మారవచ్చు. కనుక చలామణిలో వున్న మార్చదగిన బ్యాంకునోట్లు పరిస్థితి కూడా అలాగే వుంటుందన్న విషయాన్ని ప్రత్యేకించి చెప్పనక్కర్లేదు. బ్యాంకు నోట్లను మార్చడం సాధ్యపడినప్పటికీ నాటి వాస్తవ విలువ, నామకః విలువతో తులతూగినప్పటికీ లోహం మార్చవీలైన నోట్లు మొత్తంగా కలిపి వాటి మొత్తం పరిమాణానికి అనుగుణంగా ఇంతకు ముందు చెప్పిన కారణాల వల్లనే విలువ పెంచుకోవచ్చు లేదా తగ్గించుకోవచ్చు. ఈ పెరగటం, తరగటం అన్నది చలామణిలో ఉన్న సరుకులు, బంగారపు లోహపు విలువ యొక్క మార్పిడి విలువచేత నిర్ణయించబడుతుంది.... విలువ తగ్గటమన్నది బంగారంలో పోల్చిన కాగితానికి సంబంధించిన విషయం కాదు. బంగారం కాగితం కలిసిన మొత్తం లేదా ఒక దేశం యొక్క మొత్తం కరెన్సీకి చెందిన విషయం ఇది. ఇదే రికార్డో ప్రధాన ఆవిష్కరణలో

1. కారల్ మార్క్స్ అర్థశాస్త్ర విమర్శ, 1859.

ఒకటి. దీనిని లార్డ్ ఓవర్‌స్టన్ అండ్ కంపెనీ తమకు వాటంగా వాడుకొన్నారు. 1844, 45లలో చేసిన సర్ రాబర్ట్ పీల్ బ్యాంక్ చట్టానికి దీనిని ఒక ప్రాథమిక సూత్రంగా వారు మార్చారు." (అదే గ్రంథం, పుట 155)

ఇక్కడ రికార్డో సిద్ధాంతం ఎలా తప్పో మరోసారి వివరించాల్సిన అవసరం లేదు. ఇంతకు ముందు పేర్కొన్న గ్రంథంలో ఆ వివరణ వుంది. పైన పేర్కొనబడిన బ్యాంక్ చట్టాలు నిర్దేశించిన బ్యాంక్ సిద్ధాంతవేత్తల బృందం రికార్డో ప్రతిపాదనలను ఎలా వాడుకున్నారు అన్న విషయం మాత్రమే మనకిక్కడ ఆసక్తిదాయకం.

"19వ శతాబ్దపు వాణిజ్య సంక్షోభాలు ముఖ్యంగా 1825, 1836లో వచ్చిన గొప్ప సంక్షోభాలు. రికార్డో డబ్బు సిద్ధాంతంలో కొత్త పరిమాణాలను సృష్టించలేదు కానీ అవి ఆ సిద్ధాంతాన్ని అన్వయించేం దుకు కొత్త మార్గాల్ని సమకూర్చాయి. హ్యూమ్ అభిప్రాయం ప్రకారం 16, 17 శతాబ్దాలలో విలువైన లోహాల విలువ తరిగిపోవటం లాగానో, లేదా రికార్డో ప్రకారం 18వ శతాబ్దం, 19వ శతాబ్దం తొలి భాగంలో కాగితం డబ్బు విలువ తరిగిపోవటమో లాంటి విడి, ఆర్థిక ధోరణులు కావవి. ప్రపంచ మార్కెట్లో చెలరేగిన ప్రాకృతమైన తుఫాన్‌లివి. ఇక్కడే పెట్టుబడిదారీ ఉత్పత్తి ప్రక్రియ సకల అంశాల ఘర్షణ బయటపడుతుంది. ఇక్కడే ఈ ధోరణి పుట్టుక, దీని పరిష్కారం, ఈ ప్రక్రియలో ఉన్న అత్యంత అనిర్దిష్టమైన, ఆర్థిక వ్యవస్థకు పైపైన మాత్రమే ఉండే, డబ్బు చలామణి రంగంలో అన్వేషించ బడుతుంది. ఒక వాస్తవ సైద్ధాంతిక భావన నుంచి ఆర్థిక వాతావరణ ప్రవక్తల బృందం తమ పయనం ప్రారంభిస్తుంది. ఈ భావనను వాస్తవంగా ఒక పిడిసూత్రంగా కుదిస్తారు. కేవలం లోహపు కరెన్సీని శాసించే నియమాలను రికార్డో కనుగొన్నాడన్నదే ఆ పిడిసూత్రం. వారికి మిగిలి వున్న అంశం ఒక్కటే. పరపతిని, బ్యాంక్ నోటు చలామణిని ఈ నియమాలకు లోబడి వుండేలా చేయటమే.

"చాలాకాలం పాటు మొత్తంగా సరుకుల ధరలు పెరిగి, పెరిగి ఒకేసారి సార్వత్రికంగా పడిపోయే ధోరణి వాణిజ్య సంక్షోభాలలో అత్యంత సాధారణమైనది, అతి స్పష్టమైనది. సరుకుల ధరలు సార్వత్రికంగా పడిపోవటమన్నది సరుకులకు సంబంధించి సాపేక్షంగా డబ్బు విలువ పెరగడంగా వ్యక్తం కావచ్చు. ఈ వ్యక్తీకరణలు రెంటిలోనూ దృగ్విషయం వర్ణించబడింది, కానీ వివరించబడలేదు. మాటలు మారటం వలన సమస్య పరిష్కారం కాదు. అది జర్మన్ నుంచి ఇంగ్లీషుకు తర్జుమా కావటం వల్ల సమస్య పరిష్కారం కానట్టే ఇది కూడా. కనుక రికార్డో డబ్బు సిద్ధాంతం పూర్తిగా అవకాశవాద సిద్ధాంతం మాత్రమే. ఎందుకంటే ఒక పునరుక్తికి కార్యకారణ సంబంధ ప్రకటన రూపాన్నిస్తుంది. నిర్ణీత కాలాని కొకసారి సరుకుల ధరలు సార్వత్రికంగా ఎందుకు పడిపోతున్నాయి? నిర్ణీత కాలాని కొకసారి సాపేక్షంగా డబ్బు విలువ పెరగటం వల్ల ధరలలో పెరుగుదల నిర్ణీత కాలాని కొకసారి ఎందుకు జరుగుతోంది. డబ్బు విలువ సాపేక్షంగా అప్పుడప్పుడు పడిపోవడంవల్లనా? దానిని ఇలా కూడా చెప్పవచ్చు. ధరలు అప్పుడప్పుడు పెరగటం, పడిపోవడం అన్నదానికి కారణం అని అప్పుడపుడు పెరగటమూ, తగ్గటమే అని చెప్పినట్లు అవుతుంది.... పునరుక్తిని ఒక కార్యకారణ సంబంధంగా ఆమోదిస్తే మిగతాదంతా దానంతటదే దీనిని అనుసరిస్తుంది. సరుకు ధరలలో

పెరుగుదలకు కారణం డబ్బు విలువ పడిపోవటం. డబ్బు విలువ పడిపోవటానికి కారణం రికార్డో ప్రకారం కరెన్సీ అధిక సరఫరా. అంటే దాని సహజ విలువచేత, సరుకుల సహజ విలువచేత నిర్ధారితమైన స్థాయికంటే హెచ్చుగా కరెన్సీ పరిమాణం పెరగటం ఒక కారణమన్నమాట. అదే విధంగా సరుకుల ధరలు సార్వత్రికంగా పడిపోవటమన్నది కరెన్సీ తక్కువ సరఫరా కారణంగా డబ్బు సహజ విలువకు మించి దాని విలువలో పెరుగుదల కారణమని వివరించవచ్చు. ఆ రకంగా నిర్ణీత కాలానికి ఒకసారి ధరలు పెరుగుతూ, పడిపోతూ వుంటాయి. ఎందుకంటే నిర్ణీత కాలానికి ఒకసారి చలామణిలో చాలా ఎక్కువ డబ్బు లేదా చాలా తక్కువ డబ్బు ఉంటుందన్నమాట. డబ్బు చలామణి తగ్గడంతో పాటు ధరలు పెరిగితే లేదా ధరలు పడిపోవటంతో పాటు చలామణి విస్తరిస్తే, అప్పుడు చలామణిలో వున్న డబ్బు నిరపేక్షంగా కాకపోయినప్పటికీ మార్కెట్లో సరుకుల పరిమాణం పెరగటాన్ని బట్టి, తగ్గటాన్ని బట్టి సాపేక్షంగా పెరుగుతూ లేదా తగ్గుతూ వుంటుందని చెప్పవచ్చు. దీనిని గణాంక సమాచారంతో రుజువు చెయ్యటం సాధ్యం కానప్పటికీ, రికార్డో ప్రకారం ఈ ధరల హెచ్చుతగ్గులు కేవలం లోహపు కరెన్సీ ఉన్నప్పుడు సైతం ఉంటాయని, అవి ఒకదానితో ఒకటి సర్దుకుంటూ వుంటాయని మనం గమనించాం. ఉదాహరణకు కరెన్సీ తక్కువగా సరఫరా అవుతున్నప్పుడు ధరలు పడిపోతాయి. విదేశాలకు సరుకుల ఎగుమతి పెరుగుతుంది. ఈ ఎగుమతి ఇతర దేశాల నుంచి బంగారం దిగుమతికి కారణం అవుతుంది. దానివల్ల మళ్ళీ ధరలు పెరుగుతాయి. దీనికి వ్యతిరేక దిశలో కూడా చలనం వుంటుంది. అది కరెన్సీ అధిక సరసరా వున్నప్పుడు సరుకుల దిగుమతి పెరిగినప్పుడు బంగారం ఎగుమతి జరిగినప్పుడు ఉంటుంది. అయితే ఈ సాధారణ ఆటుపోట్లు రికార్డో లోహపు కరెన్సీ భావనకు అనుగుణంగానే వుంటాయి. అయితే వాటి ఉద్ధృత, మహోగ్ర రూపం, వాటి సంక్షోభ రూపం మాత్రం అభివృద్ధి చెందిన పరపతి వ్యవస్థ కాలానికి చెందుతుంది. బ్యాంకు నోట్ల విడుదల, లోహ కరెన్సీ నియమాలచేత శాసించబడదన్నది సుస్పష్టం. లోహ కరెన్సీకి పరిష్కారం విలువైన లోహపు దిగుమతి, ఎగుమతులలో వుంటుంది. ఆ లోహం వెంటనే చలామణి రంగంలో నాణెం రూపంలో ప్రవేశిస్తుంది. అది లోపలికి రావటం, బయటికి ప్రవహించటం ద్వారా సరుకు ధరలు పడిపోవటానికి లేదా పెరగటానికి కారణమవుతుంది. ధరలపైన అదే ప్రభావాన్ని బ్యాంకులు కృత్రిమంగా కలిగించటానికి, లోహపు కరెన్సీ నియమాలను అనుకరించాల్సి వుంటుంది. విదేశాల నుంచి బంగారం లోపలికి ప్రవేశిస్తూ వుంటే కరెన్సీ సరఫరా తక్కువగానూ, డబ్బు విలువ బాగా ఎక్కువగానూ, సరుకుల ధరలు చాలా తక్కువగానూ ఉంటాయని తెలుస్తుంది. కనుక కొత్తగా దిగుమతి అయిన బంగారానికి తగిన స్థాయిలో బ్యాంకు నోట్లను విడుదల చేయాలని అర్థం. మరోవైపున దేశం నుంచి బంగారం ఎగుమతి అవుతుంటే దానికి తగిన నిష్పత్తిలోనే చలామణి నుంచి నోట్లను ఉపసంహరించుకోవాలి. అంటే దానర్థం నోట్ల విడుదలను వెండి, బంగారాల ఎగుమతి, దిగుమతుల తోనూ లేదా మార్పిడి రేటుతోనూ నియంత్రించాలి. బంగారం అన్నది కేవలం నాణెం మాత్రమే కాబట్టి దిగుమతి అయిన బంగారం అంతా కరెన్సీని ఉబ్బేలా చేస్తుందని దానివల్ల ధరలు పెరుగుతాయని, బంగారం ఎగుమతి అయితే కరెన్సీ తగ్గిపోతుందని, దానివల్ల ధరలు పడిపోతాయని చెప్పే రికార్డో

పొరపాటు అవగాహనను – ఈ సైద్ధాంతిక అవగాహనను – ఇక్కడ ఆచరణాత్మక ప్రయోగంగా మార్చారు. అంటే ప్రతి సందర్భంలోనూ అందుబాటులో ఉన్న బంగారం పరిమాణానికి తగిన స్థాయితో చలామణిలో నాణాల మొత్తాన్ని వుంచడం అమలుపరచారు. లార్డ్ ఓవర్‌స్టన్ (బోన్స్‌లాయడ్ బ్యాంకర్) కల్నల్ టోరెన్స్, నార్మన్, క్లే, ఆరబత్ నాట్ తదితర రచయితలందరూ కరెన్సీ సూత్ర ప్రచారకులుగా ఇంగ్లండులో సుప్రసిద్ధులు. వారంతా ఈ సిద్ధాంతాన్ని ప్రచారం చేయటం మాత్రమే కాక, సర్ రాబర్ట్ పీల్ బ్యాంక్ చట్టాల సాయంతో ఈ సూత్రాన్ని 1844, 1845లలో ఇంగ్లండు, స్కాట్లాండ్, బ్యాంకు శాసనాలకు పునాదిగా మార్చారు. దాని దారుణ వైఫల్యం, విస్తృతంగా జాతీయ స్థాయిలో జరిగిన ప్రయోగాలలో దాని సైద్ధాంతిక, ఆచరణాత్మక వైఫల్యం పరపతి సిద్ధాంతం గురించి చర్చించినపుడు, వివరించుకొందాం." (ఇదే గ్రంథం)

థామస్ టూకే, జేమ్స్ విల్సన్, (1844 నుంచి 1847 వరకూ ఎకనామిస్ట్ పత్రికలో) జాన్ పుల్లర్‌టన్, తదితరులు ఈ సిద్ధాంతాన్ని విమర్శించారు. అయితే అనేక సందర్భాలలో వారు ఎంత అసమగ్రంగా చర్చించారో ముఖ్యంగా మనం 28వ అధ్యాయంలో గమనించవచ్చు. బంగారం స్వభావాన్ని గురించి, డబ్బు, పెట్టుబడి సంబంధాన్ని గురించి వారు ఎటువంటి గందరగోళంలో వున్నారో కూడా చూశాం. పీల్ బ్యాంకు చట్టాలకు సంబంధించి 1857లో దిగువ సభ కమిటీ లావాదేవీలతో సంబంధం వున్న కొన్ని ఉదాహరణలను మాత్రమే ఇక్కడ ఉల్లేఖిస్తాను. (బి.సి. 1857) – ఎంగెల్స్]

జె.జి. హబ్బర్డ్, బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్ మాజీ గవర్నర్ ఇలా తెలియజేశాడు. "2400. వెండి, బంగారాల ఎగుమతి ప్రభావం.... ఏ రకంగానూ, సరుకుల ధరలపైన ఉండదు. అయితే వడ్డీ ఇచ్చే సెక్యూరిటీల ధరపైన దాని ప్రభావం చాలా ప్రధానంగా వుంటుంది. ఎందుకంటే వడ్డీ రేటు మారుతుంది గనుక. ఆ వడ్డీని కలిగి వుంటే సరుకుల విలువ కూడా తప్పనిసరిగా బలంగా ప్రభావితమవుతుంది." ఆయన 1834 నుంచి 1843 వరకూ, 1845 నుంచి 1853[1] వరకూ రెండు పట్టికలను ఇచ్చాడు. 15 ప్రధాన వాణిజ్య వస్తువుల ధరలలో మార్పులు బంగారం ఎగుమతి దిగుమతులతోనూ, వడ్డీ రేటుతోనూ ప్రమేయం లేకుండా వున్నాయని ఈ పట్టికలు రుజువు చేశాయి. అయితే, బంగారం ఎగుమతి దిగుమతులకు ("బంగారం మదుపు పెట్టని పెట్టుబడికి ప్రతినిధి") వడ్డీ రేటుకు చాలా సన్నిహితమైన సంబంధం ఉంటుందని అవి వెల్లడిస్తాయి. – "(2402) 1847లో అమెరికన్ సెక్యూరిటీలు పెద్ద పరిమాణంలో అమెరికాకు తిరిగి బదిలీ చేయబడ్డాయి. రష్యన్ సెక్యూరిటీలు రష్యాకు, యూరప్ ఖండంలోని ఇతర దేశాల సెక్యూరిటీలు ఆయా దేశాలకు బదిలీ అయ్యాయి. ఆ దేశాల నుంచి మనకు ధాన్యం సరఫరా అయింది."

హబ్బర్డ్, ఈ పట్టికను 15 ప్రధాన వస్తువుల ఆధారంగా తయారు చేశాడు. వాటిలో పత్తి, నూలు, జౌళి, వస్త్రాలు, ఉన్నీ, ఉన్ని వస్త్రాలు, జనపనార, వస్త్రాలు, నీలిమందు, దుక్క ఇనుము, తగరం, రాగి, కొవ్వు, పంచదార, కాఫీ, పట్టు వున్నాయి.

☛

1. 1894 జర్మన్ ఎడిషన్‌లో ఇది 1856గా ఉంది - సం.

## I. 1834-1843

| తేది | బ్యాంకులో వెండి, బంగారాల రిజర్వు (పౌండ్లు) | డిస్కౌంట్ మార్కెట్ రేటు (శాతం) | పదిహేను ప్రధాన సరుకులు | | మార్పులేదు |
|---|---|---|---|---|---|
| | | | పెరిగిన ధర | తగ్గిన ధర | |
| 1834 మార్చి 1 | 9,104,000 | $2\frac{3}{4}$ | - | - | - |
| 1835 మార్చి 1 | 6,274,000 | $3\frac{3}{4}$ | 7 | 7 | 1 |
| 1836 మార్చి 1 | 7,918,000 | $3\frac{1}{4}$ | 11 | 3 | 1 |
| 1837 మార్చి 1 | 4,077,000 | 5 | 5 | 9 | 1 |
| 1838 మార్చి 1 | 10,471,000 | $2\frac{3}{4}$ | 4 | 11 | - |
| 1839 సెప్టెంబర్ 1 | 2,684,000 | 6 | 8 | 5 | 2 |
| 1840 జూన్ 1 | 4,571,000 | $4\frac{3}{4}$ | 5 | 9 | 1 |
| 1840 డిసెంబర్ 1 | 3,642,000 | $5\frac{3}{4}$ | 7 | 6 | 2 |
| 1841 డిసెంబర్ 1 | 4,873,000 | 5 | 3 | 12 | - |
| 1842 డిసెంబర్ 1 | 10,603,000 | $2\frac{1}{2}$ | 2 | 13 | - |
| 1843 జూన్ 1 | 11,566,000 | $2\frac{1}{4}$ | 1 | 14 | - |

## II. 1844- 1853

| తేది | బ్యాంకులో వెండి బంగారాల రిజర్వు (పౌండ్లు) | డిస్కౌంట్ మార్కెట్ రేటు (శాతం) | పదిహేను ప్రధాన సరుకులు | | మార్పులేదు |
|---|---|---|---|---|---|
| | | | పెరిగిన ధర | తగ్గిన ధర | |
| 1844 మార్చి 1 | 16,162,000 | $2\frac{1}{4}$ | - | - | - |
| 1845 డిసెం 1 | 13,237,000 | $4\frac{1}{2}$ | 11 | 4 | - |
| 1846 సెప్టెం 1 | 16,366,000 | 3 | 7 | 8 | - |
| 1847 సెప్టెం 1 | 9,140,000 | 6 | 6 | 6 | 3 |
| 1850 మార్చి 1 | 17,126,000 | $2\frac{1}{2}$ | 5 | 9 | 1 |
| 1851 జూన్ 1 | 13,705,000 | 3 | 2 | 11 | 2 |
| 1852 సెప్టెం 1 | 21,853,000 | $1\frac{3}{4}$ | 9 | 5 | 1 |
| 1853 డిసెం 1 | 15,093,000 | 5 | 14 | - | 1 |

ఈ విషయంలో హబర్డ్ ఇలా వ్యాఖ్యానించాడు : "1834 నుంచి 1843 వరకూ గల పదేళ్ల కాలంలో మాదిరే 1844 నుంచి 1853 వరకూ గల పదేళ్ళ కాలంలో కూడా బ్యాంక్ తాలూకు వెండి, బంగారాల చలనాలను డిస్కౌంట్‌పై అడ్వాన్సు చేసిన అప్పివ్వతగిన డబ్బు విలువలో పెరుగుదల లేక తరుగుదల అనుసరించాయి. ఈ దేశంలో సరుకుల ధరల్లో మార్పులు, బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్ వెండి, బంగారాల ఆటుపోట్లలో చూపించిన చలామణి మొత్తంతో ప్రమేయం లేకుండా స్వతంత్రంగా ఉన్నాయి." (బ్యాంకు చట్టాల నివేదిక, 1857, II, పుటలు 290–91)

సరుకుల గిరాకీ, సరఫరాలు వాటి మార్కెట్ ధరలను క్రమబద్ధం చేస్తాయి కనుక ఇక్కడ ఓవర్‌స్టన్ అప్పివ్వదగిన డబ్బు పెట్టుబడి గిరాకీని "వాస్తవ పెట్టుబడి" గిరాకీగా చూపించడం ఎంత పొరపాటో స్పష్టమవుతుంది. సరుకు ధరలు కరెన్సీ పరిమాణంలో వచ్చే ఆటుపోట్లచేత క్రమబద్ధం చేయబడతాయి అన్న వాదన ఇప్పుడు డిస్కౌంట్ రేటులో వచ్చే ఆటుపోట్లు డబ్బు పెట్టుబడికి భిన్నంగా వాస్తవ పాదార్థిక పెట్టుబడి కోసం గిరాకీలో ఆటుపోట్లుగా వ్యక్తమవుతున్నందున పదజాలం మాటున దాచి వేయబడింది. అదే కమిటీ ముందు నార్మన్, ఓవర్‌స్టన్‌లు వాస్తవంగా ఇలాగే వాదించారు. ముఖ్యంగా ఓవర్‌స్టన్‌ను నిలదీసేదాకా అతడు కుంటిసాకులకు పాల్పడ్డాడు. (26వ అధ్యాయం) చలామణి సాధనం పరిమాణాన్ని పెంచటం లేదా తగ్గించడం ద్వారా ఈ దేశంలోపల ఉన్న బంగారపు పరిమాణంలోని మార్పులు సరుకు ధరలను పెంచుతాయి లేదా తగ్గిస్తాయి అన్నది నిజానికి ఒక పాత బూటకం మాత్రమే. బంగారం ఎగుమతి అయితే ఈ కరెన్సీ సిద్ధాంతం ప్రకారం బంగారాన్ని దిగుమతి చేసుకునే దేశంలో సరుకు ధరలు పెరగాలి. దానివల్ల బంగారం దిగుమతి చేసుకునే దేశం మార్కెట్‌పైన బంగారం ఎగుమతి చేసే దేశం నుండి ఎగుమతుల విలువ కూడా పెరగాలి. మరోవైపున బంగారం దిగుమతి చేసుకునే దేశం ఎగుమతుల విలువ, బంగారం ఎగుమతి చేసే దేశం మార్కెట్‌లో పడిపోవాలి. కాగా అది ఈ దేశంలో, అనగా బంగారంను స్వీకరించే దేశంలో దాని విలువ పెరగాలి. అయితే నిజానికి బంగారపు పరిమాణం తగ్గటం వల్ల వడ్డీ రేటు మాత్రమే పెరుగుతుంది. బంగారం పరిమాణంలో పెరుగుదల వడ్డీ రేటును తగ్గిస్తుంది. వడ్డీ రేటులో హెచ్చుతగ్గులు ఉత్పత్తి ఖర్చులను నిర్ణయించడంలోనూ లేదా గిరాకీ సరఫరాలను నిర్ణయించడంలోనూ ప్రవేశించకపోతే సరుకు ధరలపైన వాటి ప్రభావం ఏమాత్రం ఉండదు.

అదే నివేదికలో ఇండియాతో వ్యాపారం చేసే ఒక పెద్ద సంస్థ అధిపతి ఎన్. అలెగ్జాండర్ ఇండియా చైనాలకు 1850ల మధ్యభాగంలో భారీ ఎత్తున వెండి తరలిపోవడంపైన ఈ క్రింది అభిప్రాయాన్ని వ్యక్తం చేశాడు. దీనికి ఒక కారణం చైనా అంతర్యుద్ధం. అది చైనాలో ఇంగ్లీషు వస్త్రాల అమ్మకాన్ని ఆపింది. మరో కారణం యూరప్‌లో పట్టుపురుగులకు వ్యాధి సోకడం. దానివల్ల ఇటలీ, ఫ్రాన్సులలో పట్టుపురుగుల పెంపకం బాగా తగ్గిపోయింది.

"4337. వెండి తరలిపోయింది చైనాకా, ఇండియాకా? – ముందు ఇండియాకు వెండి పంపిస్తారు. అందులో పెద్ద మొత్తం పెట్టి అక్కడ నల్లమందు కొంటారు. నల్లమందంతా చైనాకు పోతుంది. చైనాలో పట్టు వస్త్రాలు కొనడానికి నిధులు పోగుచేయబడతాయి. ఇండియాలో మార్కెట్‌ల పరిస్థితి (అక్కడ వెండి బాగా పోగుపడినప్పటికి) సరుకులు, లేదా ఇంగ్లండు వస్తువులు పంపించడం

కంటే అక్కడ వెండిని మదుపు పెట్టడమే బ్రిటిష్ వ్యాపారికి లాభదాయకంగా ఉంటుంది." – "4338. వెండిని పొందటం కోసం ఫ్రాన్స్ నుంచి వెండిని తరలించడం జరగలేదా? – అవును చాలా మొత్తంలో" – "4344. ఫ్రాన్స్, ఇటలీల నుంచి పట్టును తీసుకురావడానికి బదులు దానిని బెంగాల్, చైనాల నుంచి పెద్ద మొత్తాలలో ఫ్రాన్స్, ఇటలీలకు పంపిస్తున్నాము."

మరోలా చెప్పాలంటే ఆ ఖండపు లోహం డబ్బైన వెండిని సరుకులకు బదులు ఆసియాకు పంపించారు. దేశంలో (ఇంగ్లాండులో) సరుకుల ధరలు పెరగటం వల్ల కాదు, సరుకుల ధరలు తగ్గటం వల్ల మాత్రమే. సరుకులను అమితంగా దిగుమతి చేసుకోవడం వల్ల ఇది జరిగింది. ఫ్రాన్సుకు కొంత బంగారం చెల్లించి వెండిని గ్రహించనప్పటికీ ఇలా జరిగింది. కరెన్సీ సిద్ధాంతం ప్రకారం అటువంటి దిగుమతుల వల్ల ఇంగ్లాండులో ధరలు పడిపోయి ఇండియా, చైనాలలో ధరలు పెరిగి వుండాల్సింది.

మరో ఉదాహరణ. లార్డ్స్ సభా కమిటీ ముందు (సి.డి. 1848/57) లివర్‌పూల్ వ్యాపారుల్లో ఒకరైన వైలీ ఇలా అన్నాడు – "1994. 1845 చివరలో నూలు వడకటం అంత గిట్టుబాటైనది, లాభదాయకమైనది మరో వ్యాపారం లేదు. పత్తి నిల్వలు అపారంగానూ, సజావుగానూ ఉన్నాయి. మంచి పత్తి పౌండుకు నాలుగు పెన్నీల చొప్పున కొనబడింది. ఆ పత్తి నుంచి మంచి 40 నెంబరు దారం తయారు కావటానికి 8 పెన్నీలు ఖర్చు అయింది. ఈ నూలు 1845 సెప్టెంబరు, అక్టోబరులలో $10\frac{1}{2}$ నుంచి $11\frac{1}{2}$ పెన్నీలకు చాలా వరకు అమ్మబడింది. కొన్ని సందర్భాలలో నూలు వడికే వారు మొదట పత్తిని కొన్న ధరతో సమంగా కూడా పొందగలిగారు." – "1996. 1846 ప్రారంభం వరకూ వాణిజ్యం గిట్టుబాటుగానే వుంది." – "2000. 1844 మార్చి 3న పత్తి నిల్వ (6,27,042 బేళ్ళు) ఇవాళ వున్న నిల్వ కంటే (1848 మార్చి 3న 3,01,070 బేళ్ళు) రెట్టింపు ఉంది. అయినా అప్పటి ధరలు పౌనుకు $1\frac{1}{4}$ పెన్నీలు ప్రియంగా వుంది." (5 పెన్నీలకు బదులు $6\frac{1}{4}$ పెన్నీలుంది) అదే సమయంలో 40 నెంబరు దారం 12 పెన్నీల నుంచి $9\frac{1}{2}$ పెన్నీలకు 1847 అక్టోబరులో పడిపోయింది. డిసెంబరులో అది $7\frac{3}{4}$ పెన్నీలకు పడిపోయింది. నూలును పత్తి ధరకే అమ్మేయటం జరిగింది. (అదే నివేదిక నెంబర్లు 2021, 2022) ఇది ఓవర్‌స్టన్ తెలివితేటల్లో ఉన్న సొంత ప్రయోజనాలను తెలియజేస్తుంది. ఆ తెలివి ప్రకారం పెట్టుబడి "కొరత" ఉంది కాబట్టి డబ్బు "ప్రియంగా" ఉండాలి. 1844 మార్చి 3న వడ్డీ రేటు 3% ఉంది, 1847 అక్టోబరు, నవంబర్‌లలో అది 8, 9 శాతం ఉంది. 1848 మార్చి 3న అది తిరిగి 4% అయింది. పత్తి ధరలు దాని సరఫరా ధరలకంటే తక్కువకు పడిపోయాయి. అమ్మకాలు పూర్తిగా ఆగిపోవడం వల్ల అధిక వడ్డీ రేటు సృష్టించిన భయోత్పాతం వల్ల ఇలా జరిగింది. ఆ కారణంగా 1848లో దిగుమతులు బాగా తగ్గిపోయాయి. పైగా అమెరికాలో ఉత్పత్తి కూడా తగ్గింది. దానివల్ల 1849లో మళ్ళీ ఓసారి పత్తి ధరలు బాగా పెరిగాయి. ఓవర్‌స్టన్ ప్రకారం సరుకులు మరీ ప్రియంగా ఎందుకున్నాయంటే దేశంలో మరీ ఎక్కువగా డబ్బుంది కనుక.

"2002 ఇటీవల పత్తి మిల్లుల్లో పరిస్థితి దిగజారడం అన్నది ముడి పదార్థాల కొరత వల్ల కాదు. ఎందుకంటే, ముడిపదార్థాల నిల్వ బాగా తగ్గిపోయినప్పటికీ ధరలు తక్కువగానే ఉన్నట్లు

కనిపిస్తుంది." సరుకుల ధరలను లేదా విలువను డబ్బు విలువతో అంటే వడ్డీ రేటుతో ఓవర్‌స్టన్ ఎంత చక్కగా గందరగోళపరుస్తాడో చూడొచ్చు. 2026 ప్రశ్నకు సమాధానంగా వైలీ కరెన్సీ సిద్ధాంతంపైన తన సాధారణ నిర్ధారణను ఇలా క్రోడీకరించాడు. ఈ సిద్ధాంతం ఆధారంగానే 1847 మేలో కార్డ్‌వెల్, సర్ చార్లెస్‌వుడ్ "1844 బ్యాంకు చట్టాన్ని సమగ్రంగా అమలుజరపాల్సిన ఆవశ్యకతను నొక్కి చెప్పారు." – "ఈ సూత్రాలు ఎటువంటివంటే అవి డబ్బుకు కృత్రిమంగా అధిక విలువను ఇస్తాయి. సరుకులకు, వస్తువులకు మాత్రం కృత్రిమంగా దారుణమైన తక్కువ విలువను ఇస్తాయి." – అంతేకాక వాణిజ్యం పైన ఈ బ్యాంకు చట్టాల ప్రభావానికి సంబంధించి ఆయన ఇలా అంటాడు "4 నెలల కాలపరిమితి గల బిల్లులు అమెరికాకు పంపాల్సిన సరుకులను కొనటానికి వ్యాపారుల దగ్గరకు, బ్యాంకర్ల దగ్గరకు పంపబడ్డాయి. అయితే అవి చాలా వరకూ పెద్ద నష్టంపై తప్ప డిస్కౌంట్ కాలేదు. అక్టోబర్ 25న ప్రభుత్వ లేఖ (బ్యాంకు చట్టాన్ని ఆపివేసే లేఖ) వచ్చే వరకూ ఆర్డర్ల అమలు ఆదేశాలన్నీ చాలావరకూ మూలపడ్డాయి. అపుడు 4 నెలలు కాలపరిమితి గల బిల్లులు డిస్కౌంటు చేయబడటానికి అర్హత పొందాయి." (2097) – ఈ బ్యాంకు చట్టాన్ని నిలుపు చేయటం రాష్ట్రాలలో సైతం పెద్ద ఊరట కలిగించింది – "2012. గత అక్టోబర్‌లో (1847) ఇక్కడ సరుకులను కొనే అమెరికా వ్యక్తి తను ఆపివేయగలిగినంతగా తన ఆర్డర్లను ఒక్కసారే ఆపివేయలేదు. డబ్బు ప్రియంగా ఉండాలనే మన సలహాలు అమెరికాను చేరగానే కొత్త ఆర్డర్లన్నీ ఆగిపోయాయి." – "2134. ధాన్యం, పంచదారను ప్రత్యేకించి పేర్కొనాలి. కోతల సమయం కావటం వల్ల ధాన్యం మార్కెట్ ప్రభావితమయింది. పంచదార మార్కెట్ పంచదార భారీ నిల్వల వల్ల, దిగుమతుల వల్ల ప్రభావితమయింది." – "2163. అమెరికాకు మన రుణగ్రస్తత గురించి సొంత బాధ్యతపై పంపే సరుకుల బలవంతపు అమ్మకాల వల్ల కొంత నాశనమైంది. అలాగే ఇక్కడ వైఫల్యాల వల్ల ఎక్కువ రద్దయింది." – "2196. నాకు జ్ఞాపకం వున్న మేరకు 1847 అక్టోబరులో మన స్టాకు ఎక్స్ఛేంజిలో 70% చెల్లించబడింది."

[1837 సంక్షోభం, దాని సుదీర్ఘ పర్యవసానాలు దాని తర్వాత 1842లో సంక్షోభానంతర పరిస్థితిలో పారిశ్రామికవేత్తల, వ్యాపారవేత్తల స్వార్థపూరిత అంధత్వము, అమితోత్పత్తి అన్న దానిని బొత్తిగా పట్టించుకోనివారి ధోరణి (అమితోత్పత్తి అన్నది భ్రష్ట ఆర్థిక శాస్త్రం ప్రకారం అసందర్భం, అసాధ్యం) అన్నీ కలిపి జాతీయ స్థాయిలో ఈ కరెన్సీ సిద్ధాంతం అనే పిడిసూత్రాన్ని ఆచరణలో పెట్టడానికి వీలైన గందరగోళపు ఆలోచనను సృష్టించాయి. ఈ పిడిసూత్రాన్ని జాతీయ స్థాయిలో ఆచరణలో పెట్టేందుకు కరెన్సీ సిద్ధాంతవేత్తలకు ఈ గందరగోళపు ఆలోచన తోడ్పడింది. 1844, 1845 బ్యాంకు చట్టం చేయబడింది.]

1844 బ్యాంకు చట్టం బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండును విడుదల విభాగం అని, బ్యాంకింగ్ విభాగం అని రెండుగా విభజించింది. విడుదల విభాగం సెక్యూరిటీలను ప్రధానంగా ప్రభుత్వ హామీపత్రాలను (కోటీ నలభై లక్షలు) మొత్తం లోహపు నిల్వను (దీనిలో వెండి నాల్గవ వంతుకు మించరాదు) స్వీకరిస్తుంది. ఈ మొత్తానికి సరిపడా నోట్లను అది విడుదల చేస్తుంది. ఈ నోట్లు ప్రజల చేతుల్లో లేని మేరకు అవి బ్యాంకింగ్ విభాగంలో రోజువారీ ఉపయోగం కోసం అవసరమైన చిల్లరతోపాటు (10 లక్షలు) వుంటుంది. అది దాని రోజువారీ నిల్వ విడుదల విభాగం ప్రజలకు నోట్లకు బదులు బంగారాన్ని,

బంగారంకు బదులు నోట్లను ఇస్తూ వుంటుంది. ప్రజలతో జరిగే మిగిలిన లావాదేవీలన్నింటిని బ్యాంకింగ్ విభాగం నిర్వహిస్తుంది. ఇంగ్లాండులోనూ, వేల్స్‌లోనూ ప్రైవేటు బ్యాంకులు తమ సొంత నోట్లను విడుదల చేసుకోవడానికి 1844లో అనుమతించబడ్డాయి. ఈ హక్కును ఇవి నిలుపుకొన్నాయి. అయితే ఈ నోట్ల విడుదల నిర్ణీత మొత్తం మాత్రమే! వీటిలో ఒక బ్యాంకు తన సొంత నోట్లను విడుదల చేయటం ఆపేస్తే, బ్యాంకు ఆఫ్ ఇంగ్లాండ్ బంగారం మద్దతు లేని తన నోట్లను మూడింట రెండు వంతులను పెంచవచ్చు. ఈ రకంగా దాని విడుదల 1892 నాటికి కోటీ నలభై లక్షల నుంచి కోటీ అరవై ఐదు లక్షలకు (16,450,000 పౌండ్లు) పెరిగింది.

ఆ రకంగా బ్యాంకు ఖజానా 5 పౌండ్ల బంగారం బయటికి పోతే విడుదల విభాగానికి 5 పౌండ్ల నోటు తిరిగి వస్తుంది. అది అక్కడే విచ్ఛిన్నం చేయబడుతుంది. ఖజానాలో ప్రవేశించే ప్రతి 5 బంగారు నాణాలు అయిదు పౌండ్ల కొత్త నోటును చలామణిలోనికి పంపిస్తాయి. ఈ రకంగా ఓవర్‌స్టన్ కాగితం డబ్బు చలామణి ఖచ్చితంగా లోహపు చలామణిని అనుసరించాలి. దానిని ఆచరించటం ద్వారా కరెన్సీ సిద్ధాంతపు ప్రచారకుల ప్రకారం సంక్షోభాలు శాశ్వతంగా అసాధ్యమయ్యేలా జాగ్రత్త తీసుకోబడింది.

అయితే వాస్తవంలో బ్యాంక్‌ను రెండు స్వతంత్ర విభాగాలుగా విడదీయటం వల్ల క్లిష్ట సమయాలలో మొత్తం అందుబాటులో ఉన్న సాధనాలన్నింటినీ స్వేచ్ఛగా ఉపయోగించుకోగల్గిన అవకాశం మేనేజ్‌మెంట్‌కు లేకుండా చేయబడింది. కొన్ని సందర్భాలలో విడుదల విభాగంలో సెక్యూరిటీల రూపంలో కోటీ నలభై లక్షలతో పాటు అనేక లక్షల విలువైన బంగారం యథాతథంగానే ఉండి వుండవచ్చు. అదే సమయంలో బ్యాంకింగ్ విభాగం దివాళా అంచులకు నెట్టబడవచ్చు. ఇలా జరగటానికి కారణం ప్రతి సంక్షోభంలోనూ ఒక దశలో బంగారం పెద్ద ఎత్తున ఎగుమతి అవుతుంది. అపుడు బ్యాంకులో వున్న బంగారపు నిల్వలు దానికి రక్షణగా వుంటాయి. అయితే బయటికి పోయే ప్రతి అయిదు పౌండ్ల బంగారానికి బదులు దేశంలో చలామణి నుంచి అయిదు పౌండ్లు నోటు ఉపసంహరించుకోబడుతుంది. అంటే పెద్ద పరిమాణంలో చలామణి సాధనం అవసరమైన సమయం లోనే సరిగ్గా చలామణి సాధనం పరిమాణం తగ్గించబడుతుంది. ఆ రకంగా 1844 బ్యాంకు చట్టం మొత్తం వాణిజ్య ప్రపంచాన్ని బ్యాంకు నోట్ల రిజర్వు నిధిని సంక్షోభానికి ముందు కాలంలో కూడబెట్టేలా చేసింది. మరోలా చెప్పాలంటే సంక్షోభాన్ని త్వరితం చెయ్యటానికి, తీవ్రతరం చేయటానికి అది దోహదం చేసింది. డబ్బు వసతి కోసం అనగా చెల్లింపు సాధనాల కోసం నిర్ణయాత్మకమైన తరుణంలో గిరాకీని అలా కృత్రిమంగా తీవ్రతరం చేయటం ద్వారా, అదే సమయంలో సరఫరాను పరిమితం చేయటం ద్వారా, ఈ బ్యాంక్ చట్టం సంక్షోభ కాలంలో వడ్డీ రేటును ఇంత వరకూ కనీవినీ ఎరుగని అధిక స్థాయికి నెడుతుంది. కనుక సంక్షోభాలను అంతం చేయటానికి బదులు అందుకు విరుద్ధంగా ఈ చట్టం వాటిని తీవ్రతరం చేస్తుంది. మొత్తం పారిశ్రామిక ప్రపంచం లేదా బ్యాంకు చట్టం విచ్ఛిన్నం కావాల్సిన స్థాయికి అది నెడుతుంది. 1847 అక్టోబర్ 25న, 1857 నవంబర్ 12న సంక్షోభం అటువంటి దశకు చేరుకొంది. ఈ రెండు సందర్భాలలోనూ 1844 చట్టాన్ని నిలిపివేస్తూ బ్యాంకు నోట్ల విడుదల పరిమితిని రద్దు చేస్తూ ప్రభుత్వం తీర్మానించిన తర్వాత రెండు సందర్భాలలోనూ

సంక్షోభం అధిగమించబడింది. 1847లో ప్రథమశ్రేణి సెక్యూరిటీలపైన మళ్ళీ బ్యాంకు నోట్లు విడుదల చేయబడతాయి అనే హామీ వల్ల అంతవరకూ దాచిపెట్టిన 40, 50 లక్షల పౌండ్లు చలామణిలోకి వచ్చి వెలుగు చూశాయి. 1857లో నోట్ల విడుదల చట్టబద్ధమైన పరిమితిని దాటి దాదాపు పది లక్షల వరకూ చేరుకుంది. అయితే ఇది చాలా కొద్దికాలంపాటు మాత్రమే వుంది.

1844 చట్టం 19వ శతాబ్దపు తొలి 20 సంవత్సరాలను గుర్తుకు తెచ్చే లక్షణాలను కలిగి వుందని ఇక్కడ పేర్కోవాలి. ఈ కాలంలో బంగారపు చెల్లింపుల్ని నిలిపివేశారు. నోట్ల విలువను తగ్గించారు. నోట్లు వాటి పరపతిని కోల్పోతాయేమోనన్న భయం ఇంకా స్పష్టంగానే కనిపిస్తుంది. అయితే ఈ భయం నిరాధారం. ఎందుకంటే 1825లో సైతం చలామణి నుంచి ఉపసంహరించుకోబడిన ఒక పౌండు నోట్ల సరఫరాను కనుక్కొని విడుదల చేయటం వల్ల సంక్షోభాన్ని నివారించటం జరిగింది. దానివల్ల నోట్ల పరపతి అత్యంత సాధారణంగా తీవ్రంగా, అపనమ్మకం ఉన్న కాలంలో సైతం చెక్కు చెదరలేదని రుజువైంది. దీనిని అర్థం చేసుకోవచ్చు. ఎందుకంటే ఈ విలువ చిహ్నాలకు జాతి యావత్తూ తన సొంత పరపతితో మద్దతు ఇస్తుంది. – ఎంగెల్స్]

బ్యాంకుకు చట్టం ప్రభావం గురించి కొన్ని వ్యాఖ్యాలను చూద్దాం. 1844 బ్యాంకు చట్టం[1] అమితమైన సట్టా వ్యాపారాన్ని నిరోధించిందని జాన్ స్టువర్టు మిల్ నమ్మాడు. 1857 జూన్ 12వ తేదీన ఆ జ్ఞాని అలా మాట్లాడాడు. ఆ తర్వాత 4 నెలలకే సంక్షోభం బద్దలైంది. "బ్యాంకు డైరెక్టర్లను, వాణిజ్యవేత్తలను" ఆయన అక్షరాలా అభినందించాడు. వారు "వాణిజ్య సంక్షోభ స్వభావం గురించి, అమితమైన సట్టా వ్యాపారం ద్వారా తమను తామేగాక ప్రజలను వంచించటం గురించి ఇంతకు ముందుకంటే బాగా అర్థం చేసుకొన్నారు" అని ఆయనన్నారు (బి.సి.1857, నెం. 2031)

ఈ వివేకవంతుడైన మిల్ ఏమంటాడంటే "ఒక – పౌండు నోట్లను వాణిజ్యవేత్తలకు ఇతరులకు ముందస్తు డబ్బు రూపంలో బ్యాంకులు విడుదల చేస్తే ఆ నోట్లు వేతనాల రూపంలో వాటిని వినియోగం చేసేవారి చేతుల్లోకి పోవచ్చు. అటువంటి సందర్భంలో ఆ నోట్లు సరుకుల గిరాకీని సృష్టించవచ్చు. కొంతకాలంపాటు ధర పెరుగుదలను సాగనియ్యవచ్చు." (2066) వాణిజ్యవేత్తలు బంగారానికి బదులు కాగితం డబ్బు రూపంలో చెల్లించటం వల్ల ఎక్కువ చెల్లిస్తారని మిల్ అనుకొంటున్నాడా? ఒక వాణిజ్యవేత్త వంద పౌండ్ల నోట్లను రుణంగా పొంది బంగారంలో మార్పిడి చేసినపుడు, ఈ వేతనాలు ఒక పౌండు నోట్ల రూపంలో తక్షణమే చెల్లించబడినప్పటికీ గనులున్న కొన్ని జిల్లాలలో స్థానిక బ్యాంకుల నోట్ల రూపంలో వేతనాలు చెల్లించబడతాయని అనేకమంది కార్మికులకు కలిపి ఓ 5 పౌండ్ల నోట్లను ఇచ్చే ఆనవాయితీ అక్కడే ఉందని ఆయనకు తెలుసా? దీనివల్ల వారి గిరాకీ పెరుగుతుందా? లేదా బ్యాంకర్లు వాణిజ్యవేత్తలకు పెద్ద నోట్లకంటే, చిన్న నోట్ల రూపంలో పెద్ద మొత్తాలలో సులభంగా ముందస్తు సొమ్ము ఇవ్వగలుగుతారా?

[ఒక – పౌండు నోట్లంటే మిల్‌కు ఉన్న ఈ ప్రత్యేకమైన భయం అర్థం కావాలంటే రాజకీయ అర్థశాస్త్రంపైన ఆయన మొత్తం రచనల్ని చదవాలి. ఈ రచనలు, అపారమైన మిశ్రమ వాదాన్ని ప్రచారం చేస్తాయి. వాటి మధ్య ఉన్న వైరుధ్యాన్ని ఆయన ఏమాత్రం పట్టించుకోడు. ఒకవైపున

1. 1894 జర్మన్ కూర్పులో ఇది 1847 చట్టం అని వుంది - సం.

ఓవర్‌స్టన్‌కు విరుద్ధంగా టూకేను అనేక అంశాలతో ఆయన సమర్థిస్తాడు. మరోవైపున అందుబాటులో ఉన్న డబ్బు పరిమాణమే సరుకు ధరలను నిర్ణయిస్తుందని ఆయన నమ్ముతాడు. అన్ని పరిస్థితులు యథాతథంగా ఉన్నప్పుడు ఒక పౌండు విడుదలైన ప్రతి సందర్భంలోనూ ఒక వెండి నాణెం బ్యాంకు ఖజానాలో చేరుతుంది అన్న విషయాన్ని నమ్మలేదు. చలామణి సాధనం పరిమాణం పెరగవచ్చునని, తద్వారా దాని విలువ పడిపోవచ్చునని, సరుకు ధరలు పెరగవచ్చునని ఆయన భయం. పైన పేర్కొన్న భయం వెనుక దాగివున్న అంశం ఇదే, మరేదీ కాదు – ఎంగెల్స్]

సి.డి. 1848/57 ముందు బ్యాంకును రెండు విభాగాలుగా చేసిన అంశంపైన నోట్లను నగదుగా మార్చకుండా తీసుకొన్న జాగ్రత్త చర్యలను గురించి టూకే ఈ కింది అభిప్రాయాలను వ్యక్తం చేశాడు.

1837, 1839లతో పోలిస్తే 1847లో వడ్డీ రేటులో ఆటుపోట్లు ఎక్కువ ఉండటానికి కారణం బ్యాంకును రెండు విభాగాలుగా విభజించటమే. (3010) – 1825లో గానీ, 1837లో గానీ లేదా 1839లో గానీ బ్యాంకు నోట్ల భద్రత దెబ్బతినలేదు. (3015) – 1825లో బంగారం కోసం ఉన్న గిరాకీ కేవలం స్థానిక బ్యాంకుల ఒక పౌండు నోట్ల పరపతి రాహిత్యం సృష్టించిన ఖాళీని పూరించటానికి మాత్రమే ఏర్పడింది. బ్యాంకు ఆఫ్ ఇంగ్లాండు కూడా ఒక–పౌండు నోట్లు విడుదల చేసేదాకా ఈ ఖాళీని బంగారం మాత్రమే పూరించగల్గింది. (3022) – 1825 నవంబర్, డిసెంబర్‌లలో ఎగుమతి అవసరాలకు బంగారానికి ఏమాత్రం గిరాకీ లేదు. (3023)

"దేశంలోను, విదేశాలలోనూ పరపతి నాశనం కావటం గురించి ఒక్కమాట. బ్యాంక్ నోట్ల చెల్లింపును నిలిపివేయడంకంటే డివిడెండ్లు, డిపాజిట్లు చెల్లించటంలో వైఫల్యం దారుణమైన పర్యవసానాలకు దారితీస్తుంది. (3028)"

"3035. నోటు మార్చబడటాన్ని అంతిమంగా ప్రమాదంలోకి నెట్టే పరిస్థితి ఏదైనా వాణిజ్య ఒత్తిడి ఉన్నప్పుడు తీవ్రమైన ఇబ్బందులను జోడిస్తుందని మీరు అనరా? – అననే అనను."

"1847లో... చలామణి విభాగం తన నోట్ల విడుదలను పెంచి ఉంటే అది 1825లో చేసినట్టుగానే బ్యాంకు ఖజానాను భర్తీ చేసి వుండేది." (3058)

1857 బ్యాంక్ చట్టాల కమిటీ ముందు న్యూమార్క్ ఇలా చెప్పాడు. "1357 (బ్యాంక్) విభాగాల విభజన మొదటి అనర్థక ప్రభావం ఏమంటే.... వెండి, బంగారాల నిల్వలను రెండుగా విభజించటం వల్ల పర్యవసానం ఏమంటే, బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్ బ్యాంకింగ్ వ్యవహారమంతా అనగా దేశంలో ఉన్న వాణిజ్యంలో తక్షణమే సంబంధంలోకి తీసుకు వచ్చే బ్యాంకు వ్యవహారమంతా ఇంతకు ముందు దాని నిల్వ మొత్తంలోనే నిర్వహించబడుతోందని అర్థం. ఆ రిజర్వును అలా విభజించటం వల్ల ఈ పరిస్థితులు తలెత్తాయి. బ్యాంకింగ్ విభాగంలో రిజర్వులు తగ్గించబడినప్పుడల్లా కొద్దిగానే తగ్గించబడినప్పటికీ బ్యాంకు తన డిస్కౌంటు రేటుపైన తగిన చర్యలు తీసుకోవలసివచ్చేది కనుక ఆ తగ్గిన రిజర్వు తరచుగా మార్పుల పరంపరలను, అలజడులను డిస్కౌంటు రేటులో సృష్టించింది." – "1358. 1844 నుంచి [1857 జూన్ వరకూ] జరిగిన మార్పులు దాదాపు అరవై కాగా 1844 ముందు ఇంతే కాల పరిమితిలో జరిగిన మార్పులు డజనుకు మించిలేవు."

1811 నుంచి బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండు డైరెక్టర్‌గానూ, కొంతకాలం పాటు దాని గవర్నర్‌గానూ

ఉన్న పామర్ సి.డి. 1848/57 లార్డ్స్ కమిటీ ముందు ఇచ్చిన సాక్ష్యం ప్రత్యేకంగా ఆసక్తిదాయకం.

"828. 1825 డిసెంబర్‌లో బ్యాంకులో 11 లక్షల పౌండ్ల వెండి, బంగారాలు ఉన్నాయి. ఈ చట్టం గనుక అప్పుడే ఉండి వుంటే [1844 చట్టం] అది నిస్సందేహంగా సంపూర్ణంగా విఫలమై వుండేది. ఆ కాలంలో ఉన్న భయోత్పాతాన్ని డిసెంబర్‌లో ఒక వారంలో చేసిన 50 లేదా 60 లక్షల నోట్ల విడుదల తొలగించింది."

"825. [1825 జూలై 1 నాటి నుంచి] బ్యాంకు తన లావాదేవీలను నిర్వహించడంలో ప్రస్తుత చట్టం ఉండి ఉంటే అది మొట్టమొదట 1837 ఫిబ్రవరి 28న విఫలమై ఉండేది. ఆ సమయంలో 39 లక్షల నుంచి 40 లక్షల పౌండ్ల వరకు బ్యాంకు స్వాధీనంలో వెండి, బంగారాలు ఉన్నాయి. అప్పుడు బ్యాంకు రిజర్వులో 6 లక్షల 50 వేలు మాత్రమే నిల్వ ఉండేది. మరో సందర్భం 1839వ సంవత్సరం. అది జూలై 9 నుంచి డిసెంబరు 5 వరకు కొనసాగింది." – "826. ఆ సందర్భంలో రిజర్వు మొత్తం ఎంత – సెప్టెంబర్ 5వ తేదీన మొత్తం రిజర్వు మైనస్ రెండు లక్షలు. నవంబర్ 5వ తేదీన అది 10 లేదా 15 లక్షలకు పెరిగింది." – "830. 1837లో అమెరికన్ వాణిజ్యానికి సాయాన్ని అందించకుండా ఈ చట్టం నిరోధించి వుండేది." – "831. విఫలమైన ప్రధాన అమెరికన్ సంస్థలు మూడు– అమెరికాకు సంబంధించిన సంస్థలన్నీ పరపతి రాహిత్యానికి గురైనాయి. ఆ సమయంలో బ్యాంకు వారిని రక్షించి ఉండకపోతే ఒకటి రెండు సంస్థలు తప్ప ఏవీ నిలబడగలిగి ఉండేవని నేననుకోను." – "836. 1837లో ఉన్న ఒత్తిడి 1847లో ఉన్న ఒత్తిడితో పోల్చదగినది కాదు. 1837లో ఒత్తిడి కేవలం అమెరికన్ వాణిజ్యానికి పరిమితమైనది మాత్రమే." – "838. (1837 జూన్ తొలిదశలో ఈ ఒత్తిడిని అధిగమించటం గురించి బ్యాంకు మేనేజ్‌మెంట్ చర్చించింది.) "వడ్డీ రేటు పెంచటమే సరైన సూత్రమని, ఆ రకంగా సరుకుల ధరలు తగ్గించవచ్చునని క్లుప్తంగా చెప్పాలంటే డబ్బును ప్రియంగానూ, సరుకులను చౌకగానూ మార్చటానికి విదేశీ చెల్లింపులను సాధించవచ్చునని" కొంతమంది పెద్దలు అభిప్రాయం వ్యక్తం చేశారు." – "906. 1844 చట్టం క్రింద బ్యాంకు అధికారాలకు కృత్రిమంగా పరిమితి విధించటం అన్నది కృత్రిమమైన ఇబ్బందిని సృష్టిస్తుంది. బంగారపు వాస్తవ పరిమాణాన్ని బట్టి బ్యాంకు అధికారాలను పరిమితం చేసే సహజమైన పాత పద్ధతి బదులు ఈ పద్ధతివల్ల సరుకుల ధరలపైన అవసరమైన ప్రభావం ప్రసరిస్తుంది." – "968. 1844 చట్టాన్ని అమలు చేయడం ద్వారా సాధారణ పరిస్థితులలో 95 లక్షల కంటే దిగువన వెండి, బంగారాలను తగ్గించటం సాధ్యం కాదు. దానివల్ల ధరలపైన, పరపతిపైన ఒత్తిడి పెరుగుతుంది. విదేశాలతో జరిగే మార్పిడులలో వెండి, బంగారాల దిగుమతిని పెంచే అడ్వాన్సులకు అది దారితీస్తుంది. ఆ మేరకు విడుదల విభాగంలో దాని పరిమాణం పెరుగుతుంది." – "996. మీరు [బ్యాంకు] ఇప్పుడున్న పరిమితులలో విదేశీ మార్పిడులలో అవసరమైనపుడు వినియోగించగలిగినంత మొత్తంలో మీ దగ్గర వెండి లేదు కదా." – "999. వెండి పరిమాణాన్ని అయిదవ వంతుకు కుదించటంలో బ్యాంకు చట్టం యొక్క లక్ష్యం ఏమిటి? – ఆ ప్రశ్నకు నేను సమాధానం చెప్పలేను."

డబ్బును ప్రియంగా మార్చటమే దాని లక్ష్యం. కరెన్సీ సిద్ధాంతం మాట అటుంచి రెండు బ్యాంకు విభాగాలను వేరుచేయటం, ఒక నిర్ణీత పరిమాణాని కంటే ఎక్కువగా విడుదలైన నోట్లకు మద్దతుగా రిజర్వులో బంగారాన్ని ఉంచుకోవాలని స్కాట్లాండు, ఐర్లాండ్ బ్యాంకులను నిర్దేశించటమూ

ఈ లక్ష్యంతోనే చేయబడింది. దీనివల్ల జాతీయ లోహపు నిల్వ వికేంద్రీకరించబడింది. ప్రతికూల మార్పిడి రేట్లను సరిదిద్దే సమర్థత తగ్గిపోయింది. ఈ క్రింది ఆదేశాలన్నీ వడ్డీ రేటు పెంచటానికే ఉద్దేశించబడ్డాయి. కోటీ నలభై లక్షలకు మించి బంగారపు నిల్వ మద్దతు లేకుండా బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్ నోట్లను విడుదల చేయరాదు. బ్యాకింగ్ విభాగం డబ్బు విస్తారంగా ఉన్నప్పుడు వడ్డీ రేటును తగ్గిస్తూ, డబ్బు కొరతగా ఉన్నప్పుడు వడ్డీ రేటును పెంచుతూ సాధారణ బ్యాంకు లాగానే వ్యవహరించాలి. అది యూరప్‌లోనూ, ఆసియాలోనూ మార్పిడి రేట్లను సరిదిద్దే ప్రధాన సాధనంగా వెండి నిల్వను పరిమితం చేయాలి. ఎగుమతి కోసం బంగారం ఎప్పుడూ అవసరం కాని స్కాట్లాండ్, ఐర్లాండు బ్యాంకులు ఇప్పుడు వాటి నోట్ల భ్రమాత్మకమైన మారకపు శక్తికి హామీ ఇచ్చే సాకుతో తప్పనిసరిగా బంగారాన్ని ఉంచుకోవాలని చేసిన ఈ నిబంధనలు అలాంటివే. వాస్తవమేమంటే 1844 చట్టం 1857లో మొట్టమొదటిసారి స్కాట్లాండు బ్యాంకులు బంగారం కోసం పరుగులు పెట్టేలా చేశాయి. ఈ బ్యాంకు చట్టం బంగారం బయటికి తరలిపోవడానికి బ్యాంకు నుంచి బయటికి పోయి దేశంలో ఇతర అవసరాలకు ఉపయోగపడటానికి మధ్య తేడా గమనించదు. ఈ రెండింటి ప్రభావాల మధ్య తేడా ఉందని వేరే చెప్పనక్కర్లేదు. అందుకే వడ్డీ రేటు మార్కెట్ ఇంత తీవ్రమైన ఆటుపోట్లకు గురయింది. వెండికి సంబంధించి రెండు సందర్భాలలో (992, 994) పామర్ ఇలా చెప్పాడు. మార్పిడి రేటు ఇంగ్లాండ్‌కు సానుకూలంగా ఉన్నప్పుడు మాత్రమే బ్యాంకు నోట్లకు బదులు వెండిని కొనగల్గుతుందని ఆయన చెప్పాడు. అప్పుడు వెండి అనవసరం. "1003. మార్పిడి రేట్లు దేశానికి ప్రతికూలంగా ఉన్నంతవరకూ విదేశీ చెల్లింపులకు వీలుకల్పించడానికి మాత్రమే గణనీయమైన మొత్తంలో వెండి కడ్డీలను కలిగి వుండటం జరుగుతుంది." – "1004. ప్రపంచంలో ఇతర భాగాలన్నిటిలోనూ డబ్బుగా వ్యవహరిస్తున్న సరుకు.... వెండి కనుక [విదేశాలలో చెల్లించటానికి] ఉపయోగించే అత్యంత ప్రత్యక్షమైన సరుకు ఇది. "ఇటీవల కాలంలో అమెరికా బంగారాన్ని మాత్రమే తీసుకొంది."

ఆయన అభిప్రాయంలో తీవ్రమైన డబ్బు కొరత ఉన్నప్పుడు బ్యాంకు తన పాత 5% స్థాయిని పెంచాల్సిన అవసరం లేదు. ప్రతికూలమైన మార్పిడి రేట్లు విదేశాలకు బంగారాన్ని తరలించనంత వరకు ఇది అవసరముండదు. 1844 చట్టం లేకపోతే దానికి వచ్చిన ప్రథమ శ్రేణి బిల్లులన్నింటిని పెద్దగా ఇబ్బంది లేకుండానే బ్యాంకు డిస్కౌంటు చేయగలిగి ఉండేది. [1018–20] 1844 చట్టం క్రింద 1847 అక్టోబర్‌లో బ్యాంక్ ఉన్న పరిస్థితులలో పరపతి సంస్థలకు బ్యాంకు విధించని వడ్డీ రేటు లేదు. ఆ సంస్థలు తమ చెల్లింపుల్ని కొనసాగించుకోవడం కోసం ఆ రేటు చెల్లించడానికి సుముఖంగా లేవు." [1022] సరిగ్గా ఈ అధిక వడ్డీ రేటే ఈ చట్టం యొక్క లక్ష్యం.

"1029.... వెండి, బంగారాల కోసం విదేశీ గిరాకీపైన వడ్డీ రేటు ప్రభావానికి, దేశంలో పరపతి రాహిత్య కాలంలో బ్యాంకుపైన గిరాకీని నిరోధించటానికి, వడ్డీ రేటు పెరగటానికి మధ్య భేదం వుందని నేను చెప్పదలుచుకొన్నాను." – "1023. 1844 చట్టానికి ముందు.... మార్పిడి రేట్లు ఈ దేశానికి అనుకూలంగా ఉన్నప్పుడు దేశంలో భయోత్పాతం, అలజడి వున్నాయి. అపుడు ఆ పరిస్థితిని తప్పించగలిగిన అంశం నోట్ల విడుదలపైన పరిమితి మాత్రమే. అటువంటి పరిమితి ఆనాడు లేదు."

బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్ ఉద్యోగంలో 39 ఏండ్ల పాటు ఉన్న ఒక మనిషి అంటున్న మాటలివి.

ఇపుడు మనం స్పూనర్, అట్‌వుడ్ అండ్ కంపెనీకి 1801 నుంచి అసోసియేట్‌గా వున్న ఒక ప్రైవేటు బ్యాంకర్ ట్వెల్స్ ఏమంటున్నాడో విందాం. బి.సి. 1857 కమిటీ ముందు మాట్లాడిన వారిలో దేశం ఆనాడున్న పరిస్థితులను, రాబోతున్న సంక్షోభాన్ని చూడగల్గింది ఇతనొక్కడే. అయితే ఇతర అంశాలతో అతని అసోసియేట్లు అయిన అట్‌వుడ్ సోదరులలాగానే అతడు కూడా బుల్లి షిల్లింగ్ మనిషే. (రాజకీయ అర్థశాస్త్ర విమర్శను చూడండి.) ఆయనిలా అంటాడు. "4488. 1844 చట్టం ఎలా పని చేసిందని మీరు అనుకొంటున్నారు? – ఒక బ్యాంకరుగా మీకు నేను సమాధానం చెప్పాలంటే అది మహా చక్కగా పనిచేసిందని చెప్పాల్సి వుంటుంది. ఎందుకంటే అన్నిరకాల [డబ్బు] పెట్టుబడిదారులకు, బ్యాంకర్లకు అది పంట పండించింది. అయితే నిజాయితీపరులైన, శ్రమశీలులైన వ్యాపారికి మాత్రం అది చాలా చెడ్డగా పనిచేసింది. అతనికి డిస్కౌంటు రేటు స్థిరంగా ఉండాలి. తన ఏర్పాట్లను అతను నమ్మకంగా చేసుకోగలగాలి.... వడ్డీ వ్యాపారాన్ని అత్యంత లాభదాయకమైన వాణిజ్యంగా అది మార్చింది." – "4489. లండన్ జాయింట్ స్టాక్ బ్యాంకులకు అది [బ్యాంకు చట్టం] 20 నుంచి 22% దాని యజమానులకు ప్రతిఫలం ఇచ్చిందా? మొన్న ఒకరు 18% చెల్లిస్తున్నారు. మరో వ్యక్తి 20% చెల్లిస్తున్నాడనుకొంటాను. వారు 1844 చట్టాన్ని బలంగా సమర్థించాల్సి వచ్చింది." – "4490. చిన్న వ్యాపారులకు, గౌరవనీయమైన వాణిజ్యవేత్తలకు పెద్ద స్థాయిలో పెట్టుబడి వుండదు.... అది వారిని బాగా ఇబ్బందిపెడుతుంది. వారి బిల్లులు చాలా పెద్ద మొత్తంలో చెల్లించబడవు. ఆ బిల్లులు చాలా చిన్నవై ఉంటాయి. బహుశా 20 నుంచి 100 పౌండ్ల వరకూ వుంటాయి. వాటిలో అత్యధికం చెల్లించబడవు. దేశంలో అన్ని విభాగాలకు అవి చెల్లించబడకుండానే తిరిగి వెళ్తాయి. చిన్న దుకాణందార్లు ఇబ్బందులలో ఉన్నారనటానికి అది ఎపుడూ ఒక సూచన." – 4494. వాణిజ్యం ఇపుడు లాభదాయకంగా లేదని అతను ప్రకటించాడు. ఆయన వ్యక్తం చేసిన ఈ క్రింది అంశాలకు ప్రాధాన్యం ఉంది. ఎందుకంటే, మిగిలిన వారెవరూ ఏ మాత్రం గమనించని సమయంలో గుప్తంగా ఉన్న సంక్షోభాన్ని ఆయన పసిగట్టినట్టుగా మనకర్థమవుతుంది.

"4494. మిన్సింగ్ లేన్‌లో సరుకుల ధరలు యథాతథంగానే ఉంటాయి. కానీ మేము అమ్మేది శూన్యం. ఏ షరతులపైన మేము అమ్మలేని పరిస్థితి. నామకః వుండే ధరలనే చెప్పాం." – 4495. ఈ క్రింది ఉదాహరణలను ఆయన తెలియజేశాడు. మిన్సింగ్ లేన్‌లో వున్న ఒక బ్రోకర్‌కు ఒక ఫ్రెంచి వ్యాపారి, 3000 పౌండ్ల సరుకును నిర్ణీత ధరకు అమ్మటం కోసం పంపుతాడు. బ్రోకర్ ఆ ధరకు అమ్మలేడు. ఫ్రెంచి వ్యాపారి అంతకంటే తక్కువ ధరకు ఇవ్వలేడు. సరుకులు అలా అమ్మకం కాకుండా వుండిపోతాయి. కానీ ఫ్రెంచి వ్యాపారికి డబ్బు కావాలి. కనుక బ్రోకరు అతనికి వెయ్యి పౌండ్ల ముందస్తు సొమ్ము ఇస్తాడు. ఫ్రెంచి వ్యాపారి మూన్నెళ్ళ గడువుతో తన సరుకుల హామీపైన 1000 పౌండ్లకు బిల్లు తీసుకుంటాడు. మూడు నెలల చివరలో బిల్లు గడువు అయిపోయింది. అయితే సరుకులు ఇంకా అమ్మకం కావు, బ్రోకర్ అప్పుడా బిల్లును చెల్లించాల్సి వుంటుంది. అతని దగ్గర 3000 పౌండ్ల సెక్యూరిటీ ఉన్నప్పటికీ అతడు దానిని నగదుగా మార్చలేడు. ఆ కారణంగా ఇబ్బందులకు గురి అవుతాడు. ఈ రకంగా ఒక వ్యక్తి మరో వ్యక్తిని తమతో పాటు కూలేస్తాడు. – "4496. పెద్ద ఎత్తున జరిగే ఎగుమతులకు సంబంధించి.... స్వదేశంలో వాణిజ్యం బాగా మందగించిన దశలో అది పెద్ద ఎత్తున ఎగుమతిని తప్పనిసరి చేస్తుంది." –"4497. స్వదేశీ వినియోగం తగ్గిందని

మీరు భావిస్తారా? – చాలావరకు... అపారంగా తగ్గింది. దుకాణందారులు దీనికి అత్యుత్తమ ప్రమాణం.” – “4498. అయినా ఎగుమతులు పెద్ద స్థాయిలో ఉన్నాయి. ఇది భారీ వినియోగాన్ని సూచించదా? – మీరు అమ్మగలిగితే అది అలా సూచిస్తుంది. గిడ్డంగులలో అనేకం ఈ సరుకులతో నిండి పోయి వున్నాయి. నేనిప్పుడు చెప్పిన ఈ ఉదాహరణలోనే అమ్మకంకాని దిగుమతైన సరుకుల విలువ 3000 పౌండ్లు వుంది.”

“4514. డబ్బు ప్రియంగా ఉన్నప్పుడు పెట్టుబడి చౌక అవుతుందని చెప్పగలరా? – అవును.” – అధిక వడ్డీ రేటు, ప్రియమైన పెట్టుబడి ఒకటేనన్న ఓవర్‌స్టన్ అభిప్రాయంలో ఈయన లేడు.

వాణిజ్యం ఎలాగ నిర్వహించబడుతోందో ఈ క్రింది అంశం తెలియజేస్తుంది. “4616. మిగిలిన వాళ్ళు ఎగుమతి దిగుమతులలో భారీ స్థాయిలో వాణిజ్యాన్ని కొనసాగిస్తున్నారు. వారు తమ పెట్టుబడికి మించిన స్థాయిలో దానిని కొనసాగిస్తున్నారు. వీరు సఫలీకృతులు కావచ్చు. అదృష్టవశాత్తు వారు పెద్ద లాభాలను గడించవచ్చు. ఈ ప్రస్తుత ఇబ్బందుల నుంచి బయటపడవచ్చు. వాణిజ్యంలో అత్యధిక భాగం నడుస్తోన్న పద్ధతి ఇది. ఒక ఓడ సరుకులకు 20, 30, 40 శాతం సైతం నష్టపోవటానికి ఒప్పుకొంటున్న వ్యక్తులున్నారు. ఈసారి పోయిన నష్టం పూడిపోవచ్చు. కానీ వరుసగా వారు ఒకదాని తర్వాత మరొక వైఫల్యాలను ఎదుర్కొంటే మాత్రం నాశనమైపోతారు. ఈ మధ్యకాలంలో అనేకసార్లు మన మీ దృశ్యాన్ని చూశాము. వాణిజ్య సంస్థలు చివరలో చేతిలో చిల్లిగవ్వ లేకుండా పతనమైపోయాయి.”

“4791. తక్కువ వడ్డీ రేటు (పదేళ్ళుగా) బ్యాంకర్స్‌కు వ్యతిరేకంగా పనిచేస్తోంది నిజమే కాని ఇంతకు ముందు కంటే ఇపుడు (తన) లాభాలు ఎంత ఎక్కువగా ఉన్నాయో తెలియజేసే ఖాతా పుస్తకాలను మీకు చూపిస్తే తప్ప మీకు నేను ఈ విషయాన్ని వివరించలేను. వడ్డీ రేటు తక్కువ ఉన్నప్పుడు విడుదలయ్యే మొత్తాలు పెరుగుతాయి కనుక డిపాజిట్లు కూడా పెరుగుతాయి. వడ్డీ రేటు అధికంగా వున్నప్పుడు ఆ రకంగా మేము ప్రయోజనం పొందుతాము.” – “4794. డబ్బు సరసంగా దొరుకుతున్నప్పుడు దానికి గిరాకీ పెరుగుతుంది. మేము ఎక్కువ అప్పు ఇస్తాము. అది ఆ రకంగా [బ్యాంకర్ల కోసం] పనిచేస్తోంది. వడ్డీ అధికం అయినప్పుడు దానిలో న్యాయమైన భాగం కంటే ఎక్కువ పొందుతాం. పొందాల్సిన దానికంటే మేము ఎక్కువ పొందుతాం.”

బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్ నోట్ల పరపతి విషయంలో అణుమాత్రం శంక వుండక్కర్లేదని నిపుణు లందరూ భావిస్తారని చూశాం. అయినప్పటికీ 90 లక్షల నుంచి కోటి వరకూ బంగారాన్ని ఈ నోట్ల పరివర్తనీయత (Convertibility) కు మద్దతుగా బ్యాంక్ చట్టం ముడిపెట్టి వుంచింది. ఈ రిజర్వు అతి పవిత్రత, అనుల్లంఘనీయత పాతకాలంలో డబ్బు కూడబెట్టే వారికంటే తీవ్రంగా కాపాడబడింది. లివర్‌పూల్‌కు చెందిన బ్రౌన్ ఇలా చెప్పాడు. సి.డి. 1847/57. “2311. ఈ డబ్బును [విడుదల విభాగంలో లోహపు నిల్వ] సముద్రంలో పారేసినా బాగుండేది. ఎందుకంటే ఆ సమయంలో దానికంతకు మించిన ఉపయోగమేమీ లేదు. పార్లమెంట్ చట్టాన్ని ఉల్లంఘించకుండా దానిలో ఏ భాగాన్నీ వినియోగించే వీలు లేదు.”

మనం ఇంతకు ముందే ప్రస్తావించిన బిల్డింగ్ కంట్రాక్టర్ ఇ.కాప్స్ బ్యాంక్ చట్టంపైన తన అభిప్రాయాన్ని ఇలా క్రోడీకరించాడు. [బ్యాంక్ చట్టాలు 1857] రెండో సంపుటిలో లండన్‌లో ఆధునిక నిర్మాణ వ్యవస్థను వివరించినపుడు కూడా ఇతన్ని ప్రస్తావించడం జరిగింది. “5508....

మొత్తం మీద ప్రస్తుత వ్యవస్థ [బ్యాంకు శాసనం] పరిశ్రమ లాభాలను నిర్ణీత కాలానికి ఒకసారి వడ్డీ వ్యాపారి జేబులోకి తేవటానికి ఉపయోగపడే ఒక తెలివైన పథకం అని మీరనుకొంటున్నారా? – అవును ఆ రకంగానే బిల్డింగ్ వాణిజ్యంలో పనిచేసిందని నాకు తెలుసు."

ఇంతకు ముందే పేర్కొన్నట్టుగా స్కాట్లాండ్ బ్యాంకులు, ఇంగ్లాండు బ్యాంకులు అనుసరించిన వ్యవస్థనే అనుసరించేలా 1845 బ్యాంకు చట్టం ఒత్తిడి చేసింది. ప్రతి బ్యాంక్‌కు నిర్ణయించిన పరపతిని మించి వారి నోటు విడుదల కోసం అధిక మొత్తంలో బంగారపు రిజర్వును ఉంచుకోవటం వారికి తప్పనిసరి అయింది. సి.డి. 1848/57 ముందు ఇచ్చిన ఈ సాక్ష్యాన్ని బట్టి దాని ప్రభావం ఎలా వుందో తెలుస్తోంది.

ఒక స్కాట్లాండ్ బ్యాంక్ డైరెక్టర్ కెన్నడీ : "3375. 1845 చట్టానికి ముందు స్కాట్లాండ్‌లో బంగారం చలామణి అని మీరనగల్గిందేమైనా ఉందా? అటువంటిదేమీ లేదు." – "3376. అప్పట్నుంచి బంగారపు అదనపు చలామణి ఉందా? – అటువంటిదేమీ లేదు. ప్రజలకు బంగారం అంటే అయిష్టం." – 3450. అతని అభిప్రాయం ప్రకారం స్కాట్లాండు బ్యాంకులు 1845 నుంచి తప్పనిసరిగా బంగారం రూపంలో ఉంచిన నిల్వ 9 లక్షల పౌండ్లు హానికరం. "స్కాట్లాండ్‌కు చెందిన పెద్ద మొత్తం పెట్టుబడిని అది లాభరహితంగా హరించివేస్తుంది."

అంతేకాక స్కాట్లాండ్ యూనియన్ బ్యాంక్ డైరెక్టర్ ఆండర్‌సన్; "3588. స్కాట్లాండ్‌లో ఉన్న బ్యాంకులపైన బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్ బంగారం కోసం తెచ్చిన ఒత్తిడి విదేశీ మార్పిడిల కోసమేనా? – ఇంతకు ముందు అంతే. అయితే ఎడిన్‌బరోలో బంగారం పెట్టుకొని కూర్చోటం వల్ల ఇప్పుడది పరిష్కారం కాదు." – "3590 బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్‌లో [లేదా ఇంగ్లాండ్ యొక్క ప్రైవేటు బ్యాంకుల్లో] అదే మొత్తం సెక్యూరిటీలు కలిగి ఉండటం ద్వారా ఇంతకు ముందు బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్ నుంచి బంగారాన్ని తొలగించడానికి మాకు ఉండిన శక్తే ఇప్పుడు కూడా వుంది."

అంతిమంగా ఎకనామిస్ట్‌లోని ఒక వ్యాసాన్ని (విల్సన్) ఉల్లేఖిస్తాను. "స్కాట్లాండ్ బ్యాంకులు ఉపయోగించని నగదు మొత్తాలను తమ లండన్ ఏజెంట్ల దగ్గర ఉంచుతాయి. వీరు బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్‌లో వాటిని ఉంచుతారు. ఈ మొత్తాల పరిమితుల్లో బ్యాంకుల్లో ఉన్న వెండి, బంగారాల రిజర్వుపైన స్కాట్లాండ్ బ్యాంకులకు ఆధిపత్యం వస్తుంది. అది ఎప్పుడూ ఉండాల్సినచోట ఉంటుంది. అనగా విదేశీ చెల్లింపులు జరగాల్సినచోట వుంటుంది." 1845 చట్టం వల్ల ఈ పద్ధతి దెబ్బతింది. 1845 చట్టం పర్యవసానంగా స్కాట్లాండ్‌లో "ఇటీవలి కాలంలో వెండి, బంగారు నాణాలు బ్యాంక్ నుంచి పెద్ద ఎత్తున తరలిపోయాయి. కేవలం స్కాట్లాండ్‌లో ఒక తాత్కాలిక గిరాకీని సంతృప్తిపర్చటం కోసం ఇలా జరిగింది. స్కాట్లాండ్‌లో అప్పటినుంచీ ఒకేరకంగా పెద్ద మొత్తం బందీ అయింది. మరో గణనీయమైన మొత్తం లండన్ – స్కాట్లాండ్‌ల మధ్య ముందుకు వెనక్కు పయనిస్తోంది. స్కాట్లాండ్ బ్యాంక్ తన నోట్లకు పెరిగిన గిరాకీని ఆశిస్తే ఒక బంగారపు పెట్టెను లండన్ నుంచి తెప్పిస్తుంది. ఈ సమయం అయిపోగానే అదే పెట్టె సాధారణంగా తెరవబడకుండానే లండన్‌కు తిరిగి పంపబడుతుంది." (ఎకనామిస్ట్, 1847, అక్టోబర్ 23 [పుటలు 1214–1215]).

[ఈ విషయం అంతటిపైన బ్యాంక్ చట్టానికి పితామహుడైన బ్యాంకర్ శామ్యూల్ జోన్స్ లాయడ్ ఉరఫ్ లార్డ్ ఓవర్‌స్టన్ ఏమంటాడు?

1848లోనే వాణిజ్య సంక్షోభం గురించి లార్డ్స్ సభా కమిటీ ముందు ఆయన పునరుద్ఘాటించాడు. “తగినంత స్థాయిలో పెట్టుబడి లేకపోవడం వల్ల తలెత్తిన ఒత్తిడిని అధిక వడ్డీ రేటును, బ్యాంక్ నోట్ల అదనపు విడుదల ద్వారా తొలగించడం సాధ్యం కాదు.” (1514) నిజానికి 1847 అక్టోబర్ 25న ప్రభుత్వ లేఖ వల్ల సంక్రమించిన నోట్ల విడుదలను పెంచే అధికారం వల్ల సంక్షోభ తీవ్రత తగ్గించబడింది.

“ఉత్పత్తి వాణిజ్య లక్ష్యాలకు అవసరమైన పాదార్థిక పెట్టుబడి తగ్గిపోవటం వల్ల అధిక వడ్డీ రేట్లు తలెత్తుతాయని, ఉత్పత్తిదారుల ప్రయోజనాలు దెబ్బతినక తప్పదని” (1604) అతను అభిప్రాయపడ్డాడు. అయినప్పటికీ ఉత్పాదక పరిశ్రమలో మాంద్యం ఉన్నప్పటికీ నెలల తరబడి పాదార్థిక సరుకు పెట్టుబడి గిడ్డంగులను అమితంగా నింపివేసింది. అమ్మకం కాకుండా సరుకులు పడివున్నాయి. ఆ కారణం చేతనే పాదార్థిక ఉత్పాదక పెట్టుబడి మొత్తంగానో, లేదా పాక్షికంగానో పనిలేకుండా పడివుంటుంది. మరింత అమ్మకంగాని సరుకు పెట్టుబడిని ఉత్పత్తి చేయకుండా వుండేందుకు ఇది అవసరం.

1857 బ్యాంక్ కమిటీ ముందు అతడిలా అన్నాడు. “1844 చట్టం సూత్రాలను తూచా తప్పకుండా పాటించడం వల్ల ప్రతీదీ క్రమబద్ధంగానూ, అనాయాసంగానూ సాగిపోయింది. ద్రవ్య వ్యవస్థ భద్రంగా అచంచలంగా ఉంది. దేశ సంక్షేమం వివాదరహితం. 1844 చట్టం యొక్క విజ్ఞత పైన ప్రజల విశ్వాసం రోజురోజుకు పెరుగుతోంది. ఈ చట్టం ఆధారపడిన సూత్రాల పటిష్టతను, అది సాధించిన ప్రయోజనకరమైన ఫలితాలను ఆచరణలో గమనించాలనుకొంటే మీ చుట్టూ చూడండి. దేశంలో ప్రస్తుత వాణిజ్య పరిస్థితులను గమనించండి. ప్రజల సంతృప్తిని గమనించండి. సమాజంలో ఉన్న ప్రతి వర్గాన్ని చేరిన సంపదను, సౌభాగ్యాన్ని గమనించండి. ఈ విషయాలను గమనించాక, ఈ ఫలితాలను సాధించిన చట్టాన్ని కొనసాగనివ్వకుండా జోక్యం చేసుకోవాలా? వద్దా అన్నది నిర్ణయించాల్సిందిగా కమిటీని కోరడం సముచితం.” (బి.సి. 1857, నెం. 4189)

జూలై 14న కమిటీ ముందు ఓవర్‌స్టన్ చేసిన ఈ ప్రశంసా గానానికి విరుగుడుగా అదే ఏడాది నవంబర్ 12న బ్యాంకు మేనేజ్‌మెంట్‌కు ప్రభుత్వం ఒక లేఖ పంపించింది. దానిలో ఇంకా కాపాడగలిగిన దాన్ని కాపాడడం కోసం, ఈ అద్భుతాలు నిర్వహించే 1844 చట్టాన్ని నిలిపివేసింది – ఎంగెల్స్]

★ ★ ★

## అధ్యాయం - 35

# విలువైన లోహమూ, మార్పిడి రేటు

### I. బంగారం నిల్వ చలనం

డబ్బు కొరత ఉన్న సమయాల్లో నోట్ల సంచయనానికి సంబంధించి ఒక విషయాన్ని గమనించాలి. అత్యంత ఆదిమ సామాజిక పరిస్థితుల్లో ఆర్థిక రంగం ఇబ్బందులపాలైనపుడు విలువైన లోహాన్ని కూడబెట్టడం అన్నది ఇప్పుడు నోట్ల సంచయనంగా పునరావృత్తమవుతున్నది. 1844 చట్టం అమలు ఆసక్తికరమైన చర్య. ఎందుకంటే అది దేశంలో ఉన్న విలువైన లోహాన్ని అంతటినీ చలామణి సాధనంగా మార్చాలనుకుంటుంది. బంగారాన్ని తోడివెయ్యటాన్ని చలామణి సాధనాన్ని తగ్గించడం ద్వారా, బంగారం వెనక్కు ప్రవహించటాన్ని చలామణి సాధనాన్ని పెంచడం ద్వారానూ అది సమం చేస్తుంది. దాని ఫలితంగా ఈ ప్రయోగం దీనికి విరుద్ధమైన ఫలితాలను నిరూపించింది. దీనికి మినహాయింపు ఒకే ఒక సందర్భం. దాని గురించి త్వరలో పరిశీలిద్దాం. 1844 నుంచి బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్‌కు చెందిన చలామణిలో వున్న నోట్ల మొత్తం, ఆ బ్యాంక్ విడుదల చెయ్యటానికి ఆమోదించిన అత్యధిక మొత్తాన్ని ఎప్పుడూ చేరలేదు. 1857 సంక్షోభం మరోవైపున కొన్ని పరిస్థితుల్లో ఈ గరిష్ఠ స్థాయి చాలదని నిరూపించింది. 1857, నవంబర్ 13 నుంచి 30 వరకు ఈ గరిష్ట స్థాయి కంటే సగటున రోజూ 488,830 పౌండ్లు చలామణిలో వున్నాయి. (బ్యాంకు చట్టాలు, 1858, పుట XI) ఆ సమయంలో చట్టబద్ధమైన గరిష్ఠ స్థాయి బ్యాంకులో ఉన్న లోహపు నిల్వలు + 14,475,000 పౌన్లు. ఇవి గాక బ్యాంక్ బీరువాల్లో లోహపు నిల్వ వుండింది.

వెండి, బంగారాల రాకపోకల గురించి ఈ క్రింది అంశాలను గమనించాలి.

మొదటిది – ఒకవైపున వెండి, బంగారాలు ఉత్పత్తి చేయని దేశంలో వాటి రాకపోకలకూ, మరోవైపున ఉత్పత్తి సాధనాల నుంచి వివిధ దేశాలకు వెండి, బంగారాలు ప్రవహించి ఆ దేశాల మధ్య ఈ అదనపు లోహం పంపిణీ కావటానికీ మధ్య ఉన్న తేడాను గమనించాలి.

రష్యా, కాలిఫోర్నియా, ఆస్ట్రేలియాలలో బంగారపు గనులు తమ ప్రభావాన్ని నెరపక ముందు, 19వ శతాబ్దం ప్రారంభం నుంచి అరిగిపోయిన నాణాలను తిరిగి భర్తీ చేయటానికి, విలాస వస్తువుల సాధారణ ఉపయోగానికి, ఆసియాకు వెండి ఎగుమతి చెయ్యటానికి మాత్రమే అప్పుడీ సరఫరా సరిపోయింది.

మొదటిది, అయితే అప్పటి నుంచి చూస్తే ఆసియాకు వెండి ఎగుమతులు అసాధారణంగా పెరిగాయి. అమెరికా, యూరప్‌లతో ఆసియా వాణిజ్యం దీనికి కారణం. యూరప్ నుంచి ఇలా

ఎగుమతి అయిన వెండిని బంగారం అదనపు సరఫరా పూడ్చింది. రెండవది – కొత్తగా దిగుమతి అయిన బంగారంలో భాగాన్ని అంతర్గత డబ్బు చలామణి ఇముడ్చుతుంది. 1857 వరకు ఇంగ్లాండ్ అంతర్గత చలామణిలో 3 కోట్ల పౌండ్ల విలువైన బంగారం కొత్తగా చేరింది.[1] అంతేకాక 1844 నుంచి యూరప్, అమెరికాలలో ఉన్న అన్ని కేంద్ర బ్యాంకుల్లోనూ వెండి, బంగారాల నిల్వల సగటు స్థాయి పెరిగింది. అదే సమయంలో దేశంలో డబ్బు చలామణి పెరగటం వల్ల భయోత్పాతం తర్వాత మాంద్యం కాలంలో బ్యాంకు రిజర్వులు మరింత వేగంగా పెరిగాయి. దేశంలో చలామణి నుంచి అంతకు ముందుకంటే ఎక్కువ పరిమాణంలో బంగారు నాణాలు బయటికి నెట్టి, వాటిని స్తంభింప జేయడం దీనికి కారణం. అంతిమంగా విలాస వస్తువుల కోసం వెండి, బంగారాలను వినియోగించటం అన్నది, సంపద పెరగటం కారణంగా కొత్త బంగారు గనులను కనుగొన్ననాటి నుంచి బాగా పెరిగింది.

రెండవది – వెండి, బంగారాలను ఉత్పత్తి చేయని దేశాలలో అవి వచ్చిపోతూ వుంటాయి. ఒకే దేశం నిరంతరాయంగా దిగుమతి చేసుకొంటుంది. ఎగుమతి కూడా చేస్తుంది. ఇది ఏదో ఒక దిశలో ఈ చలనం ప్రబలంగా ఉండటం అన్నదే, అంతిమ విశ్లేషణలో బంగారం క్షీణిస్తుందా, వృద్ధి పొందుతుందా అన్నదానిని నిర్ణయిస్తుంది. ఎందుకంటే వెండి, బంగారాల రాకపోకలు, తరచుగా జరిగే వాటి సమాంతర చలనాలు చాలా వరకు ఒకదానిని ఒకటి తటస్థం చేసుకొంటాయి. కనుక ఫలితానికి సంబంధించినంత మేరకు వీటి చలనాల నిరంతరాయతను సమాంతరంగా సాగే వీటి చలనాలను ఈ కారణం లేకుంటే ఉపేక్షించటం జరుగుతుంది. వెండి, బంగారాల అధిక దిగుమతి లేదా అధిక ఎగుమతి కేవలం సరుకుల దిగుమతి ఎగుమతుల మధ్య సంబంధానికి వ్యక్తీకరణగాను, ప్రభావంగానూ మాత్రమే పరిగణింపబడుతుంది. నిజానికి అదే సమయంలో వెండి, బంగారాల ఎగుమతి దిగుమతుల మధ్య వున్న సంబంధాన్ని కూడా సరుకు వాణిజ్యంతో ప్రమేయం లేకుండానే అది సూచిస్తుంది.

మూడవది – ఎగుమతులపైన దిగుమతుల ప్రాబల్యం, దిగుమతులపైన ఎగుమతుల ప్రాబల్యం మొత్తం మీద కేంద్ర బ్యాంకుల్లో వెండి, బంగారాల తరుగుదల పెరుగుదలనుబట్టి కొలవబడుతుంది.

---

1. డబ్బు మార్కెట్టుపైన దీని ప్రభావాన్ని న్యూమార్క్ సాక్ష్యం రుజువు చేస్తుంది : "1509-1853 చివరలో ప్రజల మనస్సులో గణనీయమైన స్థాయిలో భయాందోళనలు ఉన్నాయి. ఆ ఏడాది సెప్టెంబర్‌లో బ్యాంకు ఆఫ్ ఇంగ్లాండు తన డిస్కౌంటును మూడుసార్లు పెంచింది.... అక్టోబరు ప్రారంభంలో ప్రజల మనస్సుల్లో మళ్ళీ అదే స్థాయిలో భయాందోళనలు ఉన్నాయి. నవంబర్ చివరి నాటికి చాలా వరకు భయాందోళనలు తొలగిపోయాయి. ఆస్ట్రేలియా నుంచి దాదాపు 50 లక్షల పౌండ్ల బంగారం రావడంతో అవి పూర్తిగా తొలగిపోయాయి... 1854 ఆకురాలు కాలంలో కూడా ఇదే జరిగింది. అక్టోబరు, నవంబరులలో దాదాపు 60 లక్షల పౌండ్ల విలువ గల బంగారం వచ్చింది. 1855 ఆకురాలు కాలంలో కూడా మళ్ళీ అదే జరిగింది. అప్పుడు కూడా అటువంటి భయాందోళనలు తలెత్తాయి. సెప్టెంబరు, అక్టోబరు, నవంబరు మాసాల్లో దాదాపు 80 లక్షల పౌండ్ల బంగారం రావడంతో అవి తొలగిపోయాయి. 1856 చివరిలో కూడా అలాగే జరిగింది. డబ్బుకు సంబంధించిన ఒత్తిడి తలెత్తిన ప్రతి సందర్భంలోనూ దాని నుంచి సహజమైన సంపూర్ణమైన విమోచన కలిగించే ఒక ఆసరాగా బంగారపు ఓడ రాకను మనం అంతా భావిస్తున్నామా లేదా అన్న విషయాన్ని పరిశీలించాల్సిందిగా కమిటీలోని ప్రతి సభ్యునికీ విజ్ఞప్తి చేయగలను." [బ్యాంకు చట్టాలు, 1857]

ఈ గీటురాయి ఎంత ఖచ్చితంగా ఉన్నదీ అన్నది సహజంగానే బ్యాంకు వాణిజ్యం ఏ స్థాయిలో కేంద్రీకృతమై ఉన్నది? – అన్నదానిపైన ప్రధానంగా ఆధారపడుతుంది. జాతీయ బ్యాంకులు అనబడే వాటిల్లో సాధారణంగా వెండి, బంగారాలు ఏ మేరకు పోగుబడ్డాయి – అన్నది ఈ అంశంపైన ఆధారపడుతుంది. అయితే ఇది ఇలాగే జరుగుతుంది అని అనుకొన్నప్పటికీ ఈ గీటురాయి ఖచ్చితమైనది కాదు. ఎందుకంటే కొన్ని పరిస్థితులలో దేశంలో చలామణి వెండి, బంగారాల అదనపు దిగుమతిని ఇముడ్చుకోవచ్చు. అలాగే విలాస వస్తువుల ఉత్పత్తిలో అవి మరింత వినియోగం కావచ్చు. అంతేకాక అదనపు దిగుమతి లేకుండానే దేశంలో చలామణి కోసం బంగారు నాణాలను ఉపసంహరించుకోవటం జరగవచ్చు. ఈ విధంగా ఎగుమతులలో పెరుగుదల లేకుండానే వెండి, బంగారాల నిల్వలు తగ్గిపోవచ్చు.

నాల్గవది – వెండి, బంగారాల ఎగుమతి వల్ల చాలా కాలంపాటు వాటి తరుగుదల కొనసాగితే వాటిని బ్యాంకుల నుంచి తోడివేయటంతో సమానం అవుతుంది. ఈ తరుగుదల ఒక చలన ధోరణిని సూచిస్తుంది. బ్యాంకులో వెండి, బంగారాల రిజర్వు సగటు స్థాయిని గణనీయంగా అది తగ్గిస్తుంది. సుమారుగా దాని సగటు కనీస స్థాయికి తగ్గిస్తుంది. ఈ కనీస స్థాయి అన్నది ఇష్టానుసారం నిర్ణయించబడుతుంది. నోట్లను నగదుగా మార్చటానికి సంబంధించిన శాసనం వగైరాలచేత ప్రతి సందర్భంలోనూ ఇది వేరు వేరుగా నిర్ణయించబడుతుంది. బంగారం తరుగుదల అన్నది ఇంగ్లాండ్‌లో ఏ స్థాయికి చేరుకోగలదో 1857 బ్యాంకు చట్టాల కమిటీ ముందు న్యూమార్క్ తెలియజేశాడు. ఈ సాక్ష్యం నెం. 1494. "అనుభవాన్ని బట్టి, విదేశీ వాణిజ్యంలో ఆటుపోట్లు కారణంగా బంగారం బయటికి పోవటమన్నది 30 లక్షలు లేదా 40 లక్షలు పౌండ్లు దాటి జరుగదు అని చెప్పవచ్చు." – 1847 అక్టోబరు 23న బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్ బంగారపు నిల్వ అతి తక్కువ స్థాయికంటే 5,198,156 పౌండ్లు తగ్గింది. అతి తక్కువ స్థాయి దీనికి ముందు 1846 డిసెంబరు 26న ఉండింది. 1846 ఆగస్టు 29న ఉన్న అత్యధిక స్థాయితో పోల్చి చూస్తే 6,453,748 పౌండ్లు తగ్గింది.

అయిదవది – జాతీయ బ్యాంకులనబడే వాటిలో వెండి, బంగారాల రిజర్వును నిర్ణయించటం మూడు రకాలుగా జరుగుతుంది. అయితే ఈ నిర్ణయంచేతనే లోహపు నిల్వల పరిమాణం క్రమబద్ధం కాదు. ఎందుచేతనంటే దేశీయ వాణిజ్యం, అంతర్జాతీయ వాణిజ్యం స్తంభించిపోయిన ఏకైక కారణం వల్లనే దాని నిల్వలు పెరగవచ్చు.

1) అంతర్జాతీయ చెల్లింపుల కోసం రిజర్వు నిధి, అనగా ప్రపంచ డబ్బు యొక్క రిజర్వు నిధి. 2) ఒకసారి విస్తరిస్తూ మరోసారి సంకోచిస్తూ ఉండే వెండి, బంగారాల జాతీయ చలామణి కోసం రిజర్వు నిధి. 3) డిపాజిట్ల చెల్లింపుల కోసం, నోట్లను మార్చటం కోసం అవసరమైన రిజర్వు నిధి. (ఇది బ్యాంకు విధులకు సంబంధించిన వ్యవహారం. డబ్బు విధులతో దీనికి ప్రమేయం లేదు.) రిజర్వు నిధి – పైన చెప్పిన 3 విధులలో ప్రతిదానిచేతా ప్రభావితమవుతుంది. ఒక అంతర్జాతీయ నిధిగా చెల్లింపుల సమతూకంచేత ప్రభావితమవుతుంది. ఈ సమతూకం ఏ అంశాల చేత నిర్ణయించబడుతుంది, వాణిజ్య సమతూకంలో దానికున్న సంబంధమేమిటి అన్నదానితో ప్రమేయం లేకుండా ఇది జరుగుతుంది. దేశంలో ఉన్న లోహ చలామణికి రిజర్వు నిధిగా ఈ చలామణి వ్యాకోచ సంకోచాలచేత అది ప్రభావితం కావచ్చు. 3వ విధి భద్రతా నిధిగా ఉండటం. ఇది లోహపు

రిజర్వు స్వతంత్ర చలనాన్ని నిర్ణయించదు. అయితే దీనికి రెండు రకాల ప్రభావం ఉంటుంది. లోహపు డబ్బునూ భర్తీ చేయగల నోట్లు విడుదలయితే (వెండి విలువ ప్రమాణంగా ఉన్న దేశాలలో వెండి నాణాలు కూడా లోహపు డబ్బే) రెండవ అంశంలో ఉన్న రిజర్వు నిధి విధి అంతమయి పోతుంది. ఈ విధిని నిర్వహించటానికి తోడ్పడిన వెండి, బంగారాలలో ఒక భాగం విదేశాలకు పోతుంది. ఈ సందర్భంలో దేశంలో చలామణి కోసం లోహ నాణాలను ఉపసంహరించుకోవటం జరగదు. నాణాలుగా మారిన లోహం చలామణిలో ఒక భాగాన్ని స్తంభింపచేయడం ద్వారా లోహపు నిల్వ తాత్కాలికంగా వృద్ధి చెందటం అన్నది ఆగిపోతుంది. అంతేకాక డిపాజిట్ల చెల్లింపు కోసం, నోట్లను మార్చటం కోసం, అన్ని పరిస్థితులలోనూ లోహపు నిల్వల్ని ఒక కనీస స్థాయిలో కొనసాగించాలంటే బ్యాంకు అన్ని పరిస్థితులలోను కొనసాగించాల్సిన నిల్వ భాగాన్ని అది ప్రభావితం చేస్తుంది. లేదా కొన్ని సందర్భాలలో అది ఉపయోగరహితంగా భావించి వదిలించుకోవాలన్న భాగాన్ని ప్రభావితం చేస్తుంది. మొత్తం చలామణి లోహ రూపంలో ఉండి వుంటే బ్యాంకింగ్ వ్యవస్థ అత్యధిక స్థాయిలో కేంద్రీకృతమై ఉంటే అపుడు కూడా బ్యాంక్ తన లోహపు నిల్వల్ను తన డిపాజిట్లను చెల్లించటం కోసం ఒక హామీగా భావించవచ్చు. 1857లో హాంబర్గ్‌లో గమనించినట్లుగా వెండి, బంగారాలు తోడివేయటం అన్నది భయోత్పాతాన్ని సృష్టించగలదు.

ఆరవది – బహుశా 1837 మినహా ప్రతి సందర్భంలోనూ నిజమైన సంక్షోభం మార్పిడి రేట్లలో మార్పు తర్వాత మాత్రమే బద్దలైంది. అనగా వెండి, బంగారాల ఎగుమతి కంటే దిగుమతి పైచేయి సాధించిన వెంటనే అది బద్దలైంది.

1825లో బంగారం తోడివేయటం అన్నది ఆగిపోయిన తర్వాతనే సంక్షోభం వచ్చి పడింది. 1839లో బంగారాన్ని తోడివేయడం జరిగింది. అయితే అది సంక్షోభాన్ని తీసుకురాలేదు. 1847లో బంగారాన్ని తోడివేయటం ఏప్రిల్‌లో ఆగిపోయింది. అక్టోబర్‌లో సంక్షోభం వచ్చింది. 1857 నవంబర్ ప్రారంభంలో బంగారం బయటికి తరలిపోవటం ఆగిపోయింది. ఆ తర్వాత అదే నెల చివరిదాకా సంక్షోభం రాలేదు.

1847 సంక్షోభ కాలంలో కొద్దిపాటి సంక్షోభం తర్వాత ఇది మరింత స్పష్టంగా వెల్లడైంది. అప్పుడు ఏప్రిల్ నెలలో బంగారం తరలిపోవటం ఆగిపోవటం. స్వల్ప స్థాయిలో సంక్షోభం ప్రారంభ మయ్యాక అది ఆగిపోయింది. అక్టోబర్ నెలవరకు నిజమైన వాణిజ్య సంక్షోభం రాలేదు.

1848 వాణిజ్య సంక్షోభంపైన లార్డ్స్ సభ రహస్య కమిటీ ముందు ఈ క్రింది సాక్ష్యం ఇవ్వబడింది. ఈ సాక్ష్యం 1857 దాకా ముద్రించబడలేదు. (దీనినే సి.డి. 1848/57గా పేర్కొనటం జరిగింది)

టూకే సాక్ష్యం : 1847 ఏప్రిల్‌లో డబ్బు కొరత తలెత్తింది. నిజంగా చెప్పాలంటే అది భయోత్పాతానికి దగ్గరగా ఉంది. కానీ సాపేక్షంగా కొద్దికాలం పాటు మాత్రమే ఉంది. దానితోపాటు ప్రధానమైన వాణిజ్య వైఫల్యాలేవీ జరగలేదు. ఏప్రిల్‌లో ఏ రోజుకన్నా ఎక్కువ తీవ్రతరమైన డబ్బు కొరత అక్టోబర్‌లో ఎదురైంది. అప్పుడు ఎప్పుడూ కనీవినీ ఎరుగని వాణిజ్య వైఫల్యాలు సంభవించాయి (2996). – ఏప్రిల్‌లో మార్పిడి రేట్లు ముఖ్యంగా అమెరికాతో ఉన్న మార్పిడి రేట్ల వల్ల అసాధారణ

స్థాయిలో సాగిన దిగుమతులకై గణనీయ స్థాయిలో బంగారాన్ని చెల్లింపుల కోసం ఎగుమతి చేయక తప్పలేదు. అతి తీవ్రమైన ప్రయత్నం చేత మాత్రమే బ్యాంకు, బంగారాన్ని వెలికి పోకుండా ఆపి మార్పిడి రేట్లను పెరిగేలా చేసింది (2997). అక్టోబర్‌లో మార్పిడి రేట్లు ఇంగ్లాండ్‌కు అనుకూలంగా ఉన్నాయి (2998). మార్పిడి రేట్లలో మార్పు ఏప్రిల్ 3వ వారంలో మొదలైంది (3000). జూలై, ఆగస్టులలో అవి ఊగిసలాడాయి. ఆగస్టు ప్రారంభం నుంచీ అవి ఎప్పుడూ ఇంగ్లాండుకు అనుకూలంగా ఉన్నాయి (3001). ఆగస్టులో బంగారాన్ని తోడివేయటం అన్నది దేశంలో అంతర్గత చలామణికై గిరాకీ వల్ల పెరిగింది (3003).

బ్యాంకు ఆఫ్ ఇంగ్లాండ్ గవర్నర్ జె. మోరిస్ : ఆగస్టు 1847 నుంచీ మార్పిడి రేటు ఇంగ్లాండ్‌కు అనుకూలంగా ఉన్నప్పటికీ, ఆ కారణంగా బంగారం దిగుమతి జరిగినప్పటికీ బ్యాంకులో వెండి, బంగారాల రిజర్వు తగ్గిపోయింది. "అంతర్గత గిరాకీ కారణంగా దేశంలో 2,200,000 పౌండ్ల బంగారం బ్యాంకు నుంచి బయటకు పోయింది" (137). ఒకవైపున రైల్వే నిర్మాణంలో పెరిగిన కార్మికుల వినియోగం వల్లను "మరోవైపున కష్టకాలంలో తమ దగ్గర బంగారం ఉంచుకోవాలని కోరుకున్న బ్యాంకర్ల పరిస్థితి వలన ఇలా జరిగింది" (147).

1811 నుంచీ బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్ డైరెక్టరు మాజీ గవర్నర్ అయిన పామర్ : "684. 1847 ఏప్రిల్ మధ్య నుంచీ 1854లో బ్యాంక్ చట్టాన్ని ఉపసంహరించుకొన్న తేదీ వరకూ మొత్తం కాలం అంతటిలోనూ విదేశీ మార్పిడులు ఈ దేశానికే అనుకూలంగా వున్నాయి. కనుక 1847 ఏప్రిల్‌లో డబ్బు భయోత్పాతాన్ని స్వతంత్ర స్థాయిలో కల్గించిన వెండి, బంగారాల వెలికితీత – ఇదివరకటి లాగానే సంక్షోభానికి తొలి సూచన మాత్రమే. సంక్షోభం తలెత్తటానికి ముందే పరిస్థితిలో మార్పు వచ్చింది. 1839లో ధాన్యం వగైరాల కోసం వెండి, బంగారాలు అత్యధికంగా బయటకు తీయబడ్డాయి. వాణిజ్యం తీవ్రంగా మందగించింది. అయితే సంక్షోభం గానీ, డబ్బు భయోత్పాతం గానీ లేదు."

ఏడవది – సాధారణ సంక్షోభాలు గడచిపోగానే వెండి, బంగారాలు (బంగారం ఉత్పత్తి చేసే దేశాల నుంచి వచ్చే ప్రవాహంకాక) మరోసారి వివిధ దేశాలలో విడి నిల్వలుగా సమతులన స్థితిలో ఒకప్పుడున్న నిష్పత్తులలో పంపిణీ అవుతాయి. ఇతర పరిస్థితులన్నీ యథాతథంగా వున్న మేరకు ప్రతి దేశంలోనూ ఉన్న సాపేక్ష నిల్వ పరిమాణం ప్రపంచ మార్కెట్‌లో ఆ దేశపు పాత్రపైన ఆధారపడి వుంటుంది. తన సాధారణ వాటా కంటే ఎక్కువ కలిగి వున్న దేశం నుంచి తక్కువ కలిగిన దేశానికి వెండి, బంగారాలు ప్రవహిస్తాయి. వివిధ జాతీయ నిల్వల మధ్య ఇదివరకటి పంపిణీని వెండి, బంగారాల యొక్క ఈ విధమైన రాకపోకలు కేవలం పునరుద్ధరిస్తాయి. ఈ పునఃపంపిణీకి వివిధ పరిస్థితుల ప్రభావం కారణం. మార్పిడి రేట్లను పరిశీలించేటప్పుడు దీన్ని కూడా పరిశీలిద్దాం. ఈ క్షణంతో ప్రారంభమై సాధారణ పంపిణీ మరోసారి పునరుద్ధరించబడగానే పెరుగుదల దశ ప్రారంభమవుతుంది. మళ్ళీ తరుగుదల దశ తలెత్తుతుంది. (అయితే ప్రపంచ డబ్బు మార్కెట్ కేంద్రంగా ఇంగ్లాండ్‌కు మాత్రమే చివరి ప్రకటన వర్తిస్తుంది. – ఎంగెల్స్)

ఎనిమిదవది – వెండి, బంగారాల నిల్వలు తరగటం అన్నది, విదేశీ వాణిజ్య పరిస్థితిలో

మార్పుకు చిహ్నం. ఈ మార్పు – పరిస్థితులు సంక్షోభానికి దారితీస్తున్నాయి అనటానికి ముందు హెచ్చరిక.[1]

తొమ్మిదవది – చెల్లింపుల సమతూకం ఆసియాకు అనుకూలంగా – యూరప్, అమెరికాలకు ప్రతికూలంగా ఉండవచ్చు.[2]

వెండి, బంగారాల దిగుమతి ప్రధానంగా రెండు దశలలో జరుగుతుంది. ఒకవైపున అది వడ్డీ రేటు తక్కువగా వున్న మొదటి దశలో జరుగుతుంది. ఇది సంక్షోభం తర్వాత దశ. ఉత్పత్తి పరిమితంగా ఉంటుంది. రెండవ దశలో వడ్డీ రేటు పెరుగుతుంది. కానీ ఇంకా అది సగటు స్థాయిని అందుకోదు. ఈ దశలోనే పెట్టిన సొమ్ము త్వరితంగా తిరిగి వస్తుంది. వాణిజ్య పరపతి విస్తారంగా ఉంటుంది. కనుక ఉత్పత్తి విస్తృతికి అనులోమంగా రుణ పెట్టుబడి కోసం గిరాకీ పెరగదు. ఈ రెండు సందర్భాల లోనూ రుణ పెట్టుబడి సాపేక్షంగా విస్తారంగా వుంటుంది. అపుడు కృత్రిమంగా వెండి, బంగారాల రూపంలో అంటే అది ప్రధానంగా రుణ పెట్టుబడి రూపంలో మాత్రమే పనిచేయగలిగిన పెట్టుబడి కృత్రిమంగా కలగటం వల్ల వడ్డీ రేటు ప్రభావితం అవుతుంది. అలాగే సాధారణ రూపంలో వాణిజ్య వాతావరణం కూడా ఆ ప్రభావానికి గురవుతుంది.

మరోవైపున బంగారాన్ని తోడివేయటం, అధికంగా దానిని ఎగుమతి చేయడం అన్నది పెట్టిన సొమ్ము తిరిగి రానప్పుడు, మార్కెట్ – సరుకులతో నిండిపోయి వున్నప్పుడు, కేవలం పరపతి సాధనాల ద్వారా భ్రమగొలిపే సుభిక్షత కొనసాగుతున్నప్పుడు జరుగుతుంది. మరోలా చెప్పాలంటే రుణ పెట్టుబడి కోసం గిరాకీ బాగా పెరగగానే, వడ్డీ రేటు కనీసం దాని సగటు స్థాయిని చేరినపుడు ఇది జరుగుతుంది. అటువంటి పరిస్థితులలో వెండి, బంగారాలు బయటకుపోయే పరిస్థితులలో పెట్టుబడిని ముఖ్యంగా అప్పు ఇవ్వదగిన డబ్బు పెట్టుబడిగా ఉండే రూపంలో నిరంతరాయంగా ఉపసంహరించుకోవటం అన్నదాని ప్రభావం బాగా తీవ్రతరమవుతుంది. అది వడ్డీ రేటుపైన ప్రత్యక్ష ప్రభావాన్ని కలిగి వుంటుంది. అయితే అది పరపతి లావాదేవీలను పరిమితం చేయటానికి బదులు వడ్డీ రేటులో పెరుగుదల ఆ లావాదేవీలను విస్తరిస్తుంది. వాటి వనరులనన్నింటినీ అతిగా అరగదీస్తుంది. కనుక ఈ కాలం సంక్షోభానికి ముందుకాలం.

న్యూమార్క్‌ను ఈ ప్రశ్న అడిగారు (బ్యాంకు చట్టాలు 1857) "1520. డిస్కౌంట్ రేటు

---

1. న్యూమార్క్ అభిప్రాయం ప్రకారం విదేశాలకు వెండి, బంగారాలు తరలిపోవటం అన్నది మూడు కారణాలుగా తలెత్తవచ్చు. 1) కేవలం వాణిజ్య పరిస్థితుల వల్ల, దిగుమతులు ఎగుమతులను దాటిపోతే, 1834 నుంచి 1844 వరకు ఇలా జరిగింది. మళ్ళీ 1847లో ప్రధానంగా జరిగిన ధాన్యపు దిగుమతి వల్ల ఇలా జరిగింది. 2) 1857లో ఇండియాలో రైల్వేల విషయంలో జరిగినట్టుగా విదేశాలలో ఇంగ్లీషు పెట్టుబడి మదుపు సాధనాలను పొందటం కోసం జరగవచ్చు. 3) తూర్పు దేశాలలో 1853, 1854లలో యుద్ధావసరాల కోసం జరిగినట్టుగా విదేశాలలో నిర్దిష్టమైన ఖర్చుల కోసం జరగవచ్చు.
2. 1918. న్యూమార్క్ "భారత, చైనాలను మీరు కలిపితే భారత, ఆస్ట్రేలియా దేశాల మధ్య అంతకంటే ముఖ్యంగా చైనా, అమెరికాల మధ్య జరిగే లావాదేవీలను మీరు పరిగణనలోనికి తీసుకొంటే అది ముక్కోణపు వాణిజ్యం కావటంవల్ల, మా ద్వారా ఈ సర్దుబాటు జరగటం వలన... వాణిజ్య సమతూకం కేవలం ఈ దేశానికి మాత్రమే కాక ఫ్రాన్సు, అమెరికాలకు కూడా ప్రతిఫలంగా ఉందన్నది నిజం."-(1857, బ్యాంకు చట్టాలు)

పెరగటంతోపాటు చలామణిలో ఉన్న బిల్లుల పరిమాణం కూడా పెరుగుతుందా? – అలాగే కనిపిస్తుంది." – "1522. సాధారణ పరిస్థితులలో ఖాతాయే నిజమైన మార్పిడి సాధనం. అయితే ఏదైనా ఇబ్బంది తలెత్తగానే ఉదాహరణకు నేను సూచించిన పరిస్థితులలో బ్యాంకు డిస్కౌంటు రేటులో పెరుగుదల వుంటుంది..... అపుడు ఆ లావాదేవీలు మార్పిడి బిల్లులుగా మారతాయి. అవి ఆ బిల్లులు లావాదేవీలకు చట్టబద్ధమైన రుజువులుగా ఉండటానికి సంబంధించి వీలుగా ఉంటాయి. అంతేకాక వేరేచోట కొనుగోలు చేయటానికి కూడా అవి వీలుగా వుంటాయి. అంతకంటే మించి పెట్టుబడి సంపాదించటానికి వీలైన పరపతి సాధనాలుగా అవి చాలా వీలుగా వుంటాయి." – అంతేకాక ప్రమాదకరమైన పరిస్థితుల వల్ల బ్యాంకు తన డిస్కౌంట్ రేటును పెంచవల్సివస్తే బ్యాంకు తాను డిస్కౌంట్ చేసే బిల్లుల కాల వ్యవధిని తగ్గించే అవకాశం ఉంది. అపుడు డిస్కౌంట్ రేటు అపారంగా పెరుగుతుంది – అన్న భయం ప్రతిచోట వ్యాపిస్తుంది. ప్రతి ఒక్కరు ముఖ్యంగా పరపతి వంచకులు తక్షణమే సాధ్యమైనంత ఎక్కువ స్థాయిలో పరపతి సాధనాలను తమ స్వాధీనంలోనికి తెచ్చుకోవటానికి ప్రయత్నిస్తారు. ఈ కారణాలు ఇలా ఉంటాయి. దిగుమతి అయిన లేదా ఎగుమతి అవుతున్న వెండి, బంగారాల పరిమాణం మాత్రమే ప్రభావాన్ని కలిగించదు. మొదటి విషయం విలువైన లోహంగా దానికున్న ప్రత్యేక స్వభావం రీత్యా డబ్బు రూపంలో వున్న పెట్టుబడిగా దాని స్వభావం రీత్యాను – అది తన ప్రభావాన్ని నెరవుతుంది. రెండవది త్రాసులో వున్న సమ బరువులకు ఒకదానికి జత చేసిన పక్షి ఈక సైతం త్రాసు ఒకవైపు మొగ్గేలా చేస్తుంది. ఏ కొద్ది చేర్పు, మార్పు అయినా సమతూకాన్ని మార్చగలిగిన పరిస్థితులలో మాత్రమే తలెత్తుతుంది. ఈ కారణాలు లేకుండా కేవలం 5,000,000 పౌండ్ల నుంచి 8,000,000 పౌండ్ల వరకు వుండే బంగారం బయటికి పోయినంత మాత్రంచేత అది గణనీయమైన స్థాయిలో ప్రభావాన్ని ఎందుకు కలిగిస్తుందో చెప్పలేం. ఇంగ్లాండులో సగటున 7 కోట్ల పౌండ్ల విలువైన బంగారం చలామణిలో వుంది. ఈ మొత్తంతో పోల్చి చూసినా అది అప్రధానంగా కనిపిస్తుంది. ఇంగ్లాండ్ ఉత్పత్తి స్థాయితో పోలిస్తే అది ఏమాత్రం పరిగణించాల్సిన అవసరం లేని చిన్న మొత్తంగా కనిపిస్తుంది.[1] అయితే పరపతి బ్యాంకింగ్ వ్యవస్థ అభివృద్ధే డబ్బు పెట్టుబడి అంతటినీ ఉత్పత్తి సేవలో వినియోగించాలని చూస్తుంది. (లేదా డబ్బు రాబడి మొత్తాన్ని పెట్టుబడిగా మార్చాలని చూడటంతో ఇది సమానం.) మరోవైపున ఆవృత్త దశలో వెండి, బంగారాల నిల్వను కనీస స్థాయికి కుదిస్తుంది. అది తనకు ఉద్దేశించబడిన విధులను ఏమాత్రం నిర్వహించలేదు. బాగా అభివృద్ధి చెందిన పరపతి బ్యాంకింగ్ వ్యవస్థే ఈ మొత్తం ఆర్థిక శరీరం యొక్క అతి స్పందనా స్వభావాన్ని పెంచుతుంది. తక్కువగా అభివృద్ధి చెందిన దశలలో సగటు స్థాయికంటే మించిన లేదా

1. (1857 బ్యాంక్ చట్టాలు) వెగ్యూలిన్ ఇచ్చిన హాస్యాస్పదమైన సమాధానాన్ని చూడండి. 5,000,000 పౌండ్ల బంగారం బయటికి పోవటం అంటే అంతే విలువైన పెట్టుబడి తగ్గటం అని అతడు అంటాడు. ధరలు విపరీతంగా పెరిగినపుడు లేదా తగ్గినపుడు, నిజమైన పారిశ్రామిక పెట్టుబడి వ్యాకోచించినపుడు లేదా సంకోచించినపుడు జరగని కొన్ని పరిణామాలను బంగారం బయటకు పోవటం అన్న ప్రక్రియలో వివరించటానికి అతడు ప్రయత్నిస్తాడు. పైగా నిజమైన పెట్టుబడి పరిమాణం (దాని పాదార్థిక అంశాల దృష్టి నుంచి పరిశీలిస్తే) యొక్క వ్యాకోచ సంకోచాల లక్షణాలతో ఈ ధోరణులను వివరించాలనుకోవడం మరింత హాస్యాస్పదం.

తగ్గిన పెరుగుదల లేదా తరుగుదల వల్ల పెద్ద ప్రభావమేమీ ఉండదు. అదే విధంగా మరోవైపున పారిశ్రామిక చక్రం యొక్క సంక్లిష్ట దశలో కాకపోతే బంగారం గణనీయంగా బయటికి పోయినప్పటికీ దాని ప్రభావం పెద్దగా ఉండదు.

ఈ వివరణలో మనం పంటలు దెబ్బతిన్నప్పుడు బంగారం బయటికి పోయే పరిస్థితులను పరిశీలించలేదు. అటువంటి సందర్భాలలో ఉత్పత్తి సమతూకం హఠాత్తుగానూ, పెద్ద స్థాయిలోనూ దెబ్బతినటం అన్నది దాని ప్రభావం విషయంలో మరింత వివరించాల్సిన అవసరం లేదు. బంగారం బయటికి పోవటం సమతూకం దెబ్బతినటాన్ని వ్యక్తం చేస్తుంది. ఉత్పత్తి పూర్తిస్థాయిలో జరుగుతున్నప్పుడు ఈ అంతరాయం ఏ స్థాయిలో వుంటే దాని ప్రభావం కూడా అంత ఎక్కువగా వుంటుంది.

బ్యాంక్ నోట్లను మార్చటానికి హామీగానూ, మొత్తం పరపతి వ్యవస్థకు ఇరుసుగానూ వ్యవహరించే వెండి, బంగారాల రిజర్వును కూడా మనం పరిశీలన నుంచి తొలగించాం. కేంద్ర బ్యాంకు – పరపతి వ్యవస్థకు ఇరుసు లాంటిది. అదే విధంగా వెండి, బంగారాల రిజర్వు – బ్యాంకుకు ఇరుసు లాంటిది.[1] పరపతి వ్యవస్థ నుంచి ద్రవ్య వ్యవస్థకు మారటం అన్నది అవసరం. 'పెట్టుబడి' ప్రథమ సంపుటంలో చెల్లింపు సాధనాలను చర్చించే సందర్భంలో నేను ఈ అవసరాన్ని రుజువు చేశాను. క్లిష్ట సమయాలలో లోహ ప్రాతిపదికను కొనసాగించటానికి నిజమైన సంపదను పెద్ద ఎత్తున త్యాగం చేయాల్సి వుంటుంది – అన్న సంగతిని టూకే, లాయడ్ ఓవర్‌స్టన్‌లు అంగీకరిస్తున్నారు. వివాదం కేవలం కొద్దిగా కలపటం లేదా తీసివేయటంపైన సాగింది. ఈ అనివార్యమైన అంశాన్ని హేతుబద్ధంగా ఎలా పరిగణించాలి అన్న అంశం చుట్టూ అది తిరిగింది.[2] మొత్తం ఉత్పత్తితో పోలిస్తే అత్యంత అప్రధానమైన పరిమాణం గల లోహాన్ని ఈ వ్యవస్థకు ఇరుసుగా వారు ఆమోదిస్తున్నారు. సంక్షోభ సమయంలో అది ఇరుసుగా వ్యవహరించే దాని స్వభావానికి ఇది ప్రతీక. అదికాక సైద్ధాంతిక ద్వంద్వ వాదానికి కారణం అదే. వికసించిన శాస్త్రం exprofesso (ప్రకటితమయ్యే తీరులో) పెట్టుబడిని పరిగణించిన మేరకు అది వెండి, బంగారాలను తిరస్కారంగా పెట్టుబడి యొక్క పనికిమాలిన రూపంగా భావిస్తుంది. అయితే అది బ్యాంకింగ్ వ్యవస్థను పరిశీలించగానే ప్రతిదీ తారుమారు అవుతుంది. వెండి, బంగారాలు par excellence (అత్యుత్తమమైన) పెట్టుబడిగా మారతాయి. వాటి భద్రత కోసం పెట్టుబడి, శ్రమకు సంబంధించిన మిగిలిన రూపాలన్నీ త్యాగం చేయబడతాయి. ఇది వాటి విలువ పరిమాణాన్ని బట్టి కాదు. ఆ పరిమాణం వాటిలో ఇమిడి వున్న శ్రమ పరిమాణాన్ని బట్టి నిర్ణయించ బడుతుంది. అది వాటి స్వతంత్ర అవసరాలను సూచించిన మేరకు సంపద యొక్క సామాజిక

1. న్యూమార్క్ (బ్యాంక్ చట్టాలు 1857) "1364 బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్‌లో వెండి, బంగారాల రిజర్వే కేంద్ర రిజర్వు లేదా నిల్వ. మొత్తం దేశ వాణిజ్యం దానిపైనే నడుస్తుంది. దేశంలో ఉన్న మిగిలిన బ్యాంకులన్నీ తమ నాణాల రిజర్వును తీసుకోవడం కోసం బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్‌ను కేంద్ర ధనాగారంగా భావిస్తాయి. విదేశీ మార్పిడుల చర్య ఎప్పుడూ ఈ ధనాగారంపైనే పడుతుంది."

2. "ఆచరణలో టూకే, లాయిడ్ ఓవర్‌స్టన్ ఇద్దరూ బంగారం కోసం పెరిగిన గిరాకీని పరపతిని తగ్గించడం ద్వారానూ, వడ్డీ రేటుని పెంచడం ద్వారానూ, పెట్టుబడిని అందివ్వటాన్ని పరిమితం చేయటం ద్వారానూ పరిష్కరిస్తారు. అయితే ఓవర్‌స్టన్ సూత్రాలు కొన్ని (చట్టబద్ధమైన) ఆంక్షలకు, నియమాలకు దారితీస్తాయి. అవి చాలా తీవ్రమైన అసౌకర్యాన్ని కలిగిస్తాయి." (ఎకనామిస్ట్, డిసెంబర్ 11, 1847, పుట 1418)

స్వభావాన్ని వ్యక్తం చేసినంత మేరకు అది సాధ్యమవుతుంది. [సామాజిక సంపద విడి వ్యక్తుల సంపదగా ఉంటుంది. వారు దాని ప్రైవేటు యజమానులు. ఈ వ్యక్తులు పరస్పరం తమ అవసరాలను తీర్చుకోవటం కోసం గుణాత్మకంగా భిన్నమైన ఉపయోగ విలువలను మార్చుకోవటం ద్వారా అది తమ సామాజిక స్వభావాన్ని నిలబెట్టుకొంటుంది. పెట్టుబడిదారీ ఉత్పత్తిలో వారు కేవలం డబ్బు ద్వారా మాత్రమే అలా చేయగలుగుతారు. ఆ రకంగా వ్యక్తి సంపద డబ్బు మాధ్యమం ద్వారా మాత్రమే సామాజిక సంపదగా గ్రహించబడుతుంది. సంపద యొక్క సామాజిక స్వభావం దీనిలో, డబ్బు రూపంలో అవతారం ఎత్తింది – ఎంగెల్స్] కనుక సంపద సామాజిక అస్తిత్వం నిజమైన సామాజిక సంపద అంశాలతో పాటు వాటికి బాహ్యంగా ఒక వస్తువుకు, పదార్థానికి, సరుకుకు ఆవల వున్న ప్రపంచపు అంశంగా మారుతుంది. ఉత్పత్తి అస్థిరంగా వున్నప్పుడు ఇది విస్మరించ బడుతుంది. పరపతి సంపద యొక్క సామాజిక రూపం లాగానే డబ్బును నెట్టివేసి దాని స్థానాన్ని ఆక్రమించుకొంటుంది. ఉత్పత్తి సామాజిక స్వభావంలో విశ్వాసమే వస్తువుల డబ్బు రూపం కేవలం ఊహాజనితమైన అంశపు రూపాన్ని సంతరించుకొనటాన్ని అనుమతిస్తుంది. అయితే పరపతి దెబ్బతినగానే (ఇది తప్పనిసరి దశ, ఆధునిక పారిశ్రామిక చక్రంలో ఎపుడూ కనిపిస్తుంది.) మొత్తం సంపద అంతా నిజంగానూ, హఠాత్తుగానూ డబ్బుగా, వెండి, బంగారాలుగా మార్చాల్సి వుంటుంది. ఇది ఒక పిచ్చి డిమాండ్. అయితే ఈ వ్యవస్థ దానిని అత్యవసరంగా సృష్టిస్తుంది. అయితే ఈ భారీ డిమాండ్‌లను సంతృప్తిపరచాల్సిన వెండి, బంగారాల మొత్తం బ్యాంకులో ఉండే కొన్ని లక్షల పౌండ్లు మాత్రమే.[1]

బంగారం బయటికి పోవడం యొక్క ప్రభావాల్లో ఒకటి, సామాజిక ఉత్పత్తిగా, ఉత్పత్తి అన్నది సామాజిక అజమాయిషీకి నిజంగా లోబడి ఉండదు – అన్న వాస్తవం సంపద సామాజిక రూపం దానికి బాహ్యంగా అస్తిత్వంలో ఉండటం ద్వారా స్పష్టంగా రుజువైంది. నిజానికి పెట్టుబడిదారీ ఉత్పత్తి వ్యవస్థ ఇంతకు ముందు వున్న ఇతర వ్యవస్థలతో ఈ అంశాన్ని ఉమ్మడిగా కలిగి వుంది. ఆ వ్యవస్థలు సరుకుల రూపంలో వాణిజ్యం చేసిన మేరకు, వాటిలో ప్రైవేటు మార్పిడి జరిగిన మేరకు ఇది వర్తిస్తుంది. అయితే కేవలం పెట్టుబడిదారీ ఉత్పత్తి వ్యవస్థలో మాత్రమే ఇది కొట్టొచ్చినట్లుగా కనిపిస్తుంది. ఈ అసంబద్ధమైన వైరుధ్యం, విరుద్ధ అంశాల వింత రూపం కనిపించటానికి కారణం: మొదటిది – ప్రత్యక్ష ఉపయోగ విలువ కోసం ఉత్పత్తి, ఉత్పత్తిదారుల వినియోగం కోసమే ఉత్పత్తి; అన్నది పెట్టుబడిదారీ వ్యవస్థలో పూర్తిగా రద్దయిపోతుంది. కనుక సంపద అన్నది ఉత్పత్తి, చలామణిల సంగమంగా వ్యక్తమయ్యే సామాజిక ప్రక్రియగా ఉంటుంది. రెండవది – పరపతి వ్యవస్థ అభివృద్ధి చెందటంతో పెట్టుబడిదారీ ఉత్పత్తి నిరంతరాయంగా లోహపు అవరోధాలను అధిగమించటానికి

---

1. “వెండి బంగారాల కోసం గిరాకీని మార్చటానికి వడ్డీ రేటును పెంచటం తప్ప మరో పద్ధతి ఏదీ లేదని మీరు అంగీకరిస్తారా?” - చాప్‌మాన్ [పెద్ద బిల్లు బ్రోకర్ల సంస్థ అయిన ఓవరెండ్‌కు చెందిన గుర్నీ అండ్ కో అసోసియేట్ సభ్యుడు] “అలాగే చెప్పాల్సి వుంటుంది... వెండి, బంగారాలు ఒక స్థాయికి పడిపోయినప్పుడు నేను వెంటనే మృత్యుగంటను మోగించి మేము తూలిపోతున్నామని, విదేశాలకు డబ్బు పంపించే ప్రతి మనిషి తనకు తానే ప్రమాదాన్ని కొనితెచ్చుకొంటున్నాడని తెలియజేయాల్సి వుంటుంది.” (బ్యాంకు చట్టాలు, 1857, సాక్షి నెంబరు 50, 57)

కృషి చేస్తుంది. ఇది ఏకకాలంలో దాని చలనానికి పాదార్థిక ఊహాజనిత సంపద అవరోధం. అయితే అది పదే పదే ఈ అవరోధం దగ్గిర తన నడ్డి విరగ్గొట్టుకొంటుంది.

సంక్షోభంలో మార్పిడి బిల్లులు, సెక్యూరిటీలు, సరుకులు; ఏకకాలంలో బ్యాంకు డబ్బుగా మారాలన్న, ఈ బ్యాంకు డబ్బు బంగారంగా మారాలన్న – డిమాండ్ తలెత్తుతుంది.

## II. మార్పిడి రేటు

[డబ్బు లోహాల అంతర్జాతీయ చలనానికి మార్పిడి రేటు ఒక కొలమానం అని అంటారు. ఇంగ్లాండు జర్మనీకి చెల్లించాల్సిన మొత్తాలు, జర్మనీ, ఇంగ్లాండ్‌కు చెల్లించాల్సిన వాటికంటే ఎక్కువగా వుంటే స్టెర్లింగ్ రూపంలో వ్యక్తమయ్యే మార్పుల[1] ధర లండన్‌లో పెరుగుతుంది. మార్కుల్లో వ్యక్తమయ్యే స్టెర్లింగ్ ధర హాంబర్గ్‌లోనూ, బెర్లిన్‌లోనూ పడిపోతుంది. ఇంగ్లాండ్ జర్మనీకి చెల్లించాల్సిన మొత్తాలు ఇలా అధికంగా ఉంటే అవి ఇంగ్లాండులో జర్మనీ అధికంగా కొనటం ద్వారా సమతా స్థితిని స్థాపించకపోతే జర్మనీకి చెందిన మార్పిడి బిల్లుల ధర మార్కులలో పెరుగుతాయి. ఇంగ్లాండు జర్మనీకి చెల్లించాల్సిన మొత్తాలను మార్పిడి బిల్లుల రూపంలో కాక లోహం రూపంలో (బంగారు నాణాలు లేదా వెండి, బంగారాలు) చెల్లించే స్థాయికి పెరుగుతుంది. సాధారణంగా ఇలాగే జరుగుతుంది.

ఈ వెండి, బంగారాల ఎగుమతి విస్తృతిని సంతరించుకొంటే, ఎక్కువ కాలం కొనసాగితే ఇంగ్లాండ్‌లో బ్యాంక్ రిజర్వులు, ఇంగ్లాండ్ డబ్బు మార్కెట్ ప్రభావితం అవుతాయి. ముఖ్యంగా బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్ రక్షణాత్మక చర్యలు తీసుకోవలసి వుంటుంది. మనం ఇంతకు ముందే గమనించినట్లుగా వీటిలో వడ్డీ రేటును పెంచటం కూడా వుంటుంది. బంగారాన్ని తోడివేయటం గణనీయంగా జరిగినపుడు, డబ్బు మార్కెట్ చాలా క్లిష్టంగా మారుతుంది. అంటే డబ్బు రూపంలో రుణ పెట్టుబడి కోసం గిరాకీ సరఫరాను గణనీయంగా దాటిపోతుంది. దానివల్ల సహజంగానే అధిక వడ్డీ రేటు తలెత్తుతుంది. బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్ నిర్ణయించే డిస్కౌంట్ రేటు ఈ పరిస్థితికి అనుగుణంగా వుంటుంది. మార్కెట్‌లో అది నిలదొక్కుకొంటుంది. అయితే మామూలు వాణిజ్యపు లావాదేవీల కలయికలు కాక వేరే కారణాలచేత వెండి, బంగారాలు బయటకు పోవటం జరగవచ్చు. (ఉదాహరణకు విదేశాలకి రుణాలు, విదేశాలలో పెట్టుబడి మదుపు వగైరాలు) అప్పుడు లండన్ డబ్బు మార్కెట్‌లో వడ్డీ రేటు పెరగటం అన్నది దానివల్ల జరగదు. బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్ మొదట "బహిరంగ మార్కెట్"లో పెద్ద ఎత్తున రుణాల ద్వారా "డబ్బు కొరత"ను సృష్టించి కృత్రిమంగా వడ్డీ రేటును పెంచటాన్ని సమర్థించే పరిస్థితిని సృష్టించవచ్చు. లేదా వడ్డీ రేటు పెరుగుదల అవసరాన్ని సృష్టించవచ్చు. అయితే అటువంటి కుతంత్రం ఏడాది ఏడాదికి మరింత కష్టమవుతుంది. – ఎంగెల్స్]

1857లో (1857 బ్యాంక్ చట్టాలు) బ్యాంక్ చట్టాలకు సంబంధించి దిగువ సభలో కమిటీ ముందు ఇచ్చిన ఈ క్రింది సాక్ష్యాన్ని బట్టి వడ్డీ రేటు పెరగటం అన్నది మార్పిడి రేట్లను ఎలా ప్రభావితం చేస్తుందో తెలియజేస్తుంది.

జాన్ స్టువర్ట్ మిల్.... "2176. వాణిజ్య ఇబ్బంది ఉన్న పరిస్థితిలో ఎప్పుడూ... సెక్యూరిటీల ధర గణనీయంగా పడిపోతుంది.... ఈ దేశంలో రైల్వే వాటాలను కొనటానికి విదేశీయులు పంపిస్తారు.

1. మార్క్ : జర్మన్ డబ్బు యూనిట్, రూపాయిలాగా - తె. సం.

లేదా విదేశీ రైల్వే వాటాలు కలిగి వున్న ఇంగ్లీషు పౌరులు తమ వాటాలను విదేశాలలో అమ్ముతారు... వెండి, బంగారాల బదిలీని చాలా వరకు ఇది నిరోధిస్తుంది." – "2182. సెక్యూరిటీలతో వ్యాపారం చేసేవారి ద్వారా, బ్యాంకర్ల ద్వారా వడ్డీ రేటు సమమవుతూ వుంటుంది. విభిన్న దేశాల మధ్య వాణిజ్య ఒత్తిడి కూడా వారి ద్వారా సమమవుతుంది.... వీరిలో చాలామంది పెరగటానికి సిద్ధంగా వున్న సెక్యూరిటీలను ఎప్పుడూ కొనే ప్రయత్నంలో ఉంటారు.... వెండి, బంగారాలను బయటకు పంపిస్తున్న దేశంలో వారు ఈ సెక్యూరిటీలను కొంటారు." – "2184. 1847లో ఈ రకమైన పెట్టుబడి మదుపులు గణనీయమైన స్థాయిలో పెట్టుబడిని ఊడ్చేయటాన్ని తగ్గించే స్థాయిలో జరిగాయి."

1838 నుంచి బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్ డైరెక్టరు, మాజీ గవర్నరు జె.బి. హబ్బర్డ్... "2545. యూరప్ సెక్యూరిటీలు పెద్ద మొత్తాలలో ఉన్నాయి. విభిన్న డబ్బు మార్కెట్‌లలో అవి యూరప్ కరెన్సీలో ఉన్నాయి. ఒక మార్కెట్‌లో బాండ్ల విలువ ఒకటి లేదా రెండు శాతం తగ్గగానే వాటిని తక్షణమే కొని వాటి విలువ ఇంకా పడిపోని మార్కెట్‌లకు బదిలీ చేయటం జరుగుతుంది." – "2565. విదేశాలు ఈ దేశపు వ్యాపారులకు గణనీయమైన స్థాయిలో రుణపడి లేవా? – చాలా వరకు." – "2566. కనుక ఆ రుణాలను నగదుగా మార్చితే ఈ దేశంలో తగినంత పెద్ద మొత్తంలో పెట్టుబడి సంచయనం కాదా? – 1847లో అమెరికా ఈ దేశానికి ఇంతకుముందు ఇవ్వాల్సిన కోట్లాది పౌండ్లను, అలాగే రష్యా ఈ దేశానికి ఇవ్వాల్సిన కోట్లాది పౌండ్లను మాఫీ చేయడం ద్వారా మన పరిస్థితి పునరుద్ధరణకు హాని కలిగింది." [అదే సమయంలో ఇదే దేశాలకు ఇంగ్లాండ్ ధాన్యం కోసం "కొన్ని కోట్ల పౌండ్లు" బాకీపడింది. ఇంగ్లీషు రుణగ్రస్తులు దివాళా తీయటం వల్ల అంతకు ముందు మాఫీ చేసిన కోట్లను ఇపుడు చెల్లించాల్సిన కోట్లలో అత్యధిక భాగానికి ముడి వేయటాన్ని మర్చిపోలేదు – ఎంగెల్స్] – "2572. 1847లో ఈ దేశానికి, సెయింట్ పీటర్స్‌బర్గ్‌కు మధ్య మార్పిడి అత్యధిక స్థాయిలో జరిగింది. ఒక కోటీ నలభై లక్షల పౌండ్ల పరిమితితో ప్రమేయం లేకుండా [బంగారపు నిల్వకు మించి – ఎంగెల్స్] బ్యాంక్ విడుదలను ప్రభుత్వం ఆమోదించింది. అయితే ఒక షరతు ఏమంటే – డిస్కౌంట్ రేటు 8% ఉండాలి. ఆ సమయంలో అప్పుడున్న డిస్కౌంట్ రేటు ప్రకారం సెయింట్ పీటర్స్‌బర్గ్ నుంచి లండన్‌కు ఓడలపై బంగారాన్ని తెప్పించి దానిని మార్పిడి బిల్లుల మూడు నెలల వ్యవధిలోగా 8%కు అప్పు ఇవ్వడం లాభదాయకమైన వ్యవహారం" – "2573. వెండి, బంగారాల లావాదేవీల్లో అనేక అంశాలను పరిగణించాలి. బిల్లులు పరిణితి చెందే వ్యవధిలో (బంగారానికి సంబంధించిన బిల్లులు – ఎంగెల్స్) మదుపుకు అందుబాటులో ఉండే వడ్డీ రేటును, మార్పిడి రేటును పరిగణించాలి."

## ఆసియాతో మార్పిడి రేటు

ఈ క్రింది అంశాలు ముఖ్యం. ఎందుకంటే ఇంగ్లాండుకు ఆసియాతో ఉన్న మార్పిడి రేటు ప్రతికూలంగా ఉన్నప్పుడు అది ఇంగ్లీషు దళారుల ద్వారా ఆసియా నుంచి చేసుకొనే దిగుమతులకు చెల్లించే దేశాలను బలిపెట్టి తన నష్టాలను ఎలా పూడ్చుకొంటుందో ఇవి తెలియజేస్తాయి. మరోవైపున ఇది ఎందుకు అవసరం అంటే విల్సన్ మరోసారి మార్పిడి రేటుపైన, విలువైన లోహపు ఎగుమతికి ఉండే ప్రభావాన్ని సాధారణంగా పెట్టుబడి ఎగుమతికి ఆ రేట్లపై ఉండే ప్రభావంతో సమానంచేసి

చూపటానికి తెలివితక్కువగా ప్రయత్నిస్తున్నాడు. ఈ రెండు సందర్భాలలోను ఎగుమతి చెల్లింపు సాధనంగానో లేదా కొనుగోలు సాధనంగానో కాదు, కేవలం పెట్టుబడి మదుపుగా మాత్రమే జరుగుతుంది. మొదటిది కొన్ని మిలియన్ల పౌండ్ల స్టెర్లింగ్ భారతదేశంలో రైల్వేలలో మదుపు పెట్టడం కోసం వెండి, బంగారాల రూపంలో పంపినా లేదా ఇనప పట్టాల రూపంలో పంపినా ఇవి రెండూ కేవలం ఒకే ఒక మొత్తం పెట్టుబడిని మరో దేశానికి బదిలీ చేసిన రెండు భిన్నమైన రూపాలు మాత్రమే. ఈ బదిలీ సాధారణ వాణిజ్య మదింపుతో ప్రవేశించదు. దానికి బదులుగా ఎగుమతి చేసే దేశం ఈ రైల్వేల నుంచి భవిష్యత్‌లో వచ్చే వార్షిక ఆదాయం మినహా మరే ప్రతిఫలాన్ని ఆశించదు. ఈ ఎగుమతి వెండి, బంగారాల రూపంలో జరిగితే అది డబ్బు మార్కెట్‌పైన ప్రత్యక్ష ప్రభావాన్ని కలిగిస్తుంది. దానితోపాటు ఈ లోహాన్ని ఎగుమతి చేస్తున్న దేశంలో వడ్డీ రేటుపైన ప్రభావాన్ని కలిగిస్తుంది. అయితే ఇది అన్ని పరిస్థితుల్లోనూ కాకపోయినప్పటికీ ఇంతకు ముందు పేర్కొన్న పరిస్థితుల్లో మాత్రం ప్రభావాన్ని కలిగించవచ్చు. అది విలువైన లోహం గనుక ప్రత్యక్షంగా అప్పు ఇవ్వదగిన డబ్బు పెట్టుబడి కనుక మొత్తం ద్రవ్య వ్యవస్థకు ప్రాతిపదిక కనుక ఇది సాధ్యం. ఉదా॥ ఇండియా మార్పిడి బిల్లులు, లండన్ డబ్బు మార్కెట్‌లో అందుబాటులో వున్నవి, ఈ అదనపు చెల్లింపులకు సరిపడకపోవచ్చు. ఆ మేరకు మాత్రమే వెండి, బంగారాలు ఎగుమతి చేయబడతాయి. మరోలా చెప్పాలంటే ఇండియాకు చెందిన మార్పిడి బిల్లుల గిరాకీ, సరఫరాను మించి ఉంటుంది. కనుక రేట్లు తాత్కాలికంగా ఇంగ్లాండుకు ప్రతికూలంగా ఉంటాయి. అంటే ఇంగ్లాండు ఇండియాకు రుణపడి వుందని అర్థం కాదు. అది అసాధారణమైన స్థాయిలో సొమ్ము పంపాల్సి వుందని మాత్రమే అర్థం. దీర్ఘకాలంలో ఇండియాకు ఆ విధంగా ఓడలో పంపిన వెండి, బంగారాలు ఇంగ్లాండు సరుకులకై ఇండియా గిరాకీని పెంచాలి. ఎందుకంటే యూరప్ సరుకులకై ఇండియా వినియోగశక్తిని అది పరోక్షంగా పెంచుతుంది. అయితే పెట్టుబడి రైలుపట్టాల రూపంలో ఓడలకు ఎత్తబడితే మార్పిడి రేట్లపైన దాని ప్రభావం ఏమీ వుండదు. ఎందుకంటే ఇండియా వెంటనే తిరిగి చెల్లించాల్సినదేమీ లేదు. సరిగ్గా ఈ కారణంచేతనే డబ్బు మార్కెట్‌పైన దాని ప్రభావం ఏమీ ఉండనక్కర్లేదు. అయితే అటువంటి అదనపు వ్యయం వల్ల డబ్బు వసతికై అదనపు గిరాకీ పెరిగి వడ్డీ రేటు ప్రభావితమవుతుందని అనటం ద్వారా అటువంటి ప్రభావం ఉందని విల్సన్ చూపించటానికి ప్రయత్నిస్తున్నాడు. అలా కూడా జరగవచ్చు. కానీ అన్ని పరిస్థితుల్లోనూ అలాగే జరిగి తీరుతుందని అనటం మాత్రం పూర్తిగా తప్పు. రైలు పట్టాలు ఏ దేశం కోసం ఓడలకెత్తబడినా, రైలు పట్టాలు ఇంగ్లాండులో లేదా ఇండియాలో వేయబడినప్పటికీ ఒక ప్రత్యేక రంగంలో ఇంగ్లాండు ఉత్పత్తి నిర్దిష్టంగా విస్తరించిందనే అంశాన్ని మాత్రమే అవి తెలియజేస్తాయి. విశాలమైన పరిమితుల లోపల సైతం ఉత్పత్తి విస్తరణ వడ్డీ రేటును పెంచకుండా సాధ్యం కాదని వాదించటం అసంబద్ధం. డబ్బు వసతి అనగా పరపతి కార్యకలాపాలతో పాటు వాణిజ్య లావాదేవీల పరిమాణం పెరగవచ్చు. అయితే ఈ పరపతి కార్యకలాపాలు వడ్డీ రేటు యథాతథంగా ఉన్నప్పటికీ పెరగవచ్చు. నలభైలలో ఇంగ్లాండ్‌లో రైల్వే వెర్రి పట్టుకొన్న కాలంలో ఇలాగే జరిగింది. అప్పుడు వడ్డీ రేటు పెరగలేదు. వాస్తవ పెట్టుబడికి సంబంధించినంత వరకు అనగా ఈ సందర్భంలో సరుకులకు సంబంధించినంత వరకు డబ్బు మార్కెట్‌పైన ప్రభావం సరిగ్గా ఇంతకుముందులాగే వుంటుందన్నది స్పష్టం. ఈ సరుకులు విదేశాలకు ఉద్దేశించబడినా, స్వదేశ

వినియోగం కోసమైనా ఫలితం ఒకటే. విదేశాలలో ఇంగ్లాండు పెట్టే పెట్టుబడి మదుపులు దాని వాణిజ్యం ఎగుమతులను అదుపు చేస్తే అంటే వెంటనే చెల్లింపులు చేయాల్సిన వెంటనే ప్రతిఫలాన్ని సాధించే ఎగుమతులపైన ప్రభావాన్ని నెరపితే అప్పుడు తేడా కనిపిస్తుంది. లేదా ఈ పెట్టుబడి మదుపులు అన్నవి పరపతి అతిగా విస్తరించటాన్ని, వంచనా కార్యకలాపాలు ప్రారంభం కావటాన్ని సూచించే సాధారణ చిహ్నాలైతే అప్పుడు కూడా తేడా చూపుతుంది.

ఈ క్రింది పేరాలో విల్సన్ ప్రశ్నకు న్యూమార్క్ సమాధానం ఉంది.

"1786. తూర్పు దేశాలకు పోయే వెండి కోసం ఉన్న గిరాకీని ప్రస్తావిస్తూ ఇంతకు ముందు ఒకరోజు మీరు ఇండియాతో ఈ దేశానికి ఉన్న మార్పిడి రేట్లు ఈ దేశానికి అనుకూలంగా ఉన్నాయని నమ్మారు. తూర్పు దేశాలకు పెద్ద ఎత్తున వెండి, బంగారాలు నిరంతరాయంగా బదిలీ అయినప్పటికీ ఇది వర్తిస్తుందని నమ్మారు. మార్పిడి రేట్లు ఈ దేశానికి అనుకూలంగా వున్నాయని భావించటానికి మీకేదైనా ఆధారం ఉందా? – అవును ఆధారం ఉంది... ఇంగ్లాండు నుంచి ఇండియాకు 1851లో ఎగుమతిలో నిజవిలువ 74 లక్షల 20 వేల పౌండ్లు. దానికి ఇండియా హౌస్ డ్రాఫ్టుల మొత్తాన్ని జమ చేయాలి. అంటే ఈస్ట్ ఇండియా కంపెనీ తన ఖర్చులకోసం సంగ్రహించే నిధులన్నమాట. ఆ డ్రాఫ్టులు ఆ ఏడాది 32 లక్షలున్నాయి. కనుక ఇంగ్లాండు నుంచి ఇండియాకు ఆ ఏడాది అయిన ఎగుమతి ఒక కోటి ఆరు లక్షల ఇరవై వేల పౌండ్లు. 1855లో.... ఇంగ్లాండు నుంచి ఎగుమతి అయిన సరుకుల వాస్తవ విలువ ఒక కోటి మూడు లక్షల ఏభై వేలకు పెరిగింది. ఇండియా హౌస్ డ్రాఫ్టులు 37 లక్షల పౌండ్లున్నాయి. కనుక ఈ దేశం నుంచి జరిగిన మొత్తం ఎగుమతి ఒక కోటి నలభై లక్షల ఏభై వేలు. 1851కి సంబంధించి ఇంగ్లాండు నుంచి ఈ దేశానికి దిగుమతి అయిన వాస్తవ విలువ ఎంతో తెలియజేయడానికి అవసరమైన ఆధారాలు లేవని భావిస్తాను. అయితే 1854–55లో వాస్తవ విలువకు సంబంధించి ఒక ప్రకటన ఉంది. 1855లో ఇండియా నుంచి ఈ దేశానికి దిగుమతి అయిన సరుకుల మొత్తం విలువ కోటి ఇరవై ఆరు లక్షల డబ్బై వేలు. కోటి నలభై లక్షల ఏభై వేలతో పోల్చినపుడు ఈ సంఖ్య రెండు దేశాలకు మధ్య జరిగే ప్రత్యక్ష వాణిజ్యంలో ఇంగ్లాండ్‌కు అనుకూలంగా 13 లక్షల 80 వేల పౌండ్లను మిగులుస్తుంది." (బ్యాంకు చట్టాలు 1857)

మార్పిడి రేట్లు పరోక్ష వాణిజ్యంచేత ప్రభావితం అవుతాయని విల్సన్ పేర్కొన్నాడు. ఉదాహరణకు ఇండియా నుంచి ఆస్ట్రేలియాకు, ఉత్తర అమెరికాకు జరిగే ఎగుమతులు లండన్ చెల్లించాల్సిన డ్రాఫ్టుల ద్వారా పరిష్కారమవుతాయి. కనుక ఆ సరుకులు ఇండియా నుంచి తిన్నగా ఇంగ్లాండ్‌కే చేరిన రీతిలో అవి మార్పిడి రేటును ప్రభావితం చేస్తాయి. అంతేకాక ఇండియా, చైనాలను కలిపి చూసినపుడు సమతూకం ఇంగ్లాండ్‌కు వ్యతిరేకంగా ఉంది. ఎందుకంటే చైనా, ఇండియాకు నల్లమందు కోసం నిరంతరాయంగా పెద్ద మొత్తాలు చెల్లించాలి. ఇంగ్లాండు, చైనాకు చెల్లిస్తుంది. కనుక ఈ డొంకతిరుగుడు మార్గంలో సొమ్ము ఇండియా చేరుతుంది. (1787–1788)

1791– పెట్టుబడి "రైలు పట్టాల రూపంలో, ఆవిరి ఇంజన్ల రూపంలో వెళ్ళినా లేదా నాణెం రూపంలో ఎగుమతి అయినప్పటికీ" మార్పిడి రేట్లపై దాని ప్రభావం ఒకే విధంగా ఉండదా? అని విల్సన్ ఇపుడు అడిగాడు. న్యూమార్క్ సరిగ్గా సమాధానం చెప్పాడు : ఇండియాకు కొద్ది ఏళ్ళుగా రైల్వే నిర్మాణం కోసం పంపించబడిన కోటీ 20 లక్షల నిర్ణీత కాల వ్యవధుల్లో ఇండియా ఇంగ్లాండుకు

చెల్లించే వార్షిక మొత్తాలను కొనుగోలు చేయడానికి ఉపకరించాయి. "అయితే వెండి, బంగారాల మార్కెట్‌పైన తక్షణ ప్రభావానికి సంబంధించినంత వరకు కోటీ 20 లక్షల పౌండ్లు మదుపు వాస్తవ డబ్బు చెల్లింపులలో వెండి, బంగారాలను ఉపయోగించిన మేరకే వర్తిస్తుంది."

1797 (వెగ్యూలిన్ అడిగాడు) "ఈ ఇనప పట్టాల కోసం ప్రతిఫలం చెల్లించకపోతే అది మార్పిడి రేట్లను ప్రభావితం చేసిందని ఎలా చెప్పగలం? – సరుకుల రూపంలో పంపించిన వ్యయభాగం మార్పడి రేట్ల లెక్కను ప్రభావితం చేస్తుందని నేను అనుకోను. రెండు దేశాల మధ్య జరిగే మార్పిడి లెక్కను కేవలం ఒక దేశపు చెల్లింపుల లేదా బిల్లుల పరిమాణం రెండవ దేశపు పరిమాణంతో పోల్చి, మిగిలిన మొత్తం మాత్రమే ఆ రేట్లను ప్రభావితం చేయగలుగుతుంది. మార్పిడి తర్కం అది. కోటీ 20 లక్షల పౌండ్ల బదిలీకి సంబంధించినంత వరకూ ఆ డబ్బు ఈ దేశంలోనే పోగుచేయబడుతుంది. ఆ కోటీ 20 లక్షల పౌండ్ల మొత్తం కలకత్తా, బొంబాయి, మద్రాసులలో వెండి, బంగారాల రూపంలో బదిలీ జరిగితే... హఠాత్తుగా గిరాకీ పెరిగి వెండి ధరపైన, మార్పిడి రేటుపైన అది చాలా తీవ్రమైన ప్రభావం చూపుతుంది. ఇండియా కంపెనీ హఠాత్తుగా 30 లక్షల పౌండ్ల నుంచి కోటీ 20 లక్షలకు తన డ్రాఫ్టులను పెంచితే ఏం జరుగుతుందో ఇక్కడ కూడా అదే జరుగుతుంది. అయితే కోటీ 20 లక్షలలో సగం సొమ్ము... ఈ దేశంలో సరుకుల కొనుగోలులో ఖర్చవుతుంది... రైలుపట్టాలు, కలప తదితర పదార్థాలు, ఈ దేశపు పెట్టుబడి ఈ దేశంలోనే వ్యయం కావటం ఇది. అంటే ఒక ప్రత్యేకమైన సరుకును ఇండియాకు పంపించడం కోసం ఇలా జరిగింది. అక్కడితో అది అంతం అవుతుంది." – "1798. (వెగ్యూలిన్) రైల్వేలకు అవసరమైన ఆ పట్టాలు, కలప ఉత్పత్తికి చాలా పెద్ద స్థాయిలో విదేశీ వస్తువుల వినియోగం అవసరం అవుతుంది. అది మార్పిడి రేటును ప్రభావితం చేయదా? – ఖాయంగా చేస్తుంది."

ఇనుము చాలా వరకు ఇక్కడ శ్రమకు ప్రాతినిధ్యం వహిస్తుందని, ఈ శ్రమ కోసం చెల్లించిన వేతనం దిగుమతి అయిన వస్తువులకు (1799) ప్రాతినిధ్యం వహిస్తుందని విల్సన్ అనుకొంటున్నాడు. ఆ తరువాత ఇలా ప్రశ్నించాడు.

"1801. మామూలు మాటల్లో చెబితే, దిగుమతి అయిన వస్తువుల వినియోగంతో ఉత్పత్తి అయిన వస్తువులను వాటి కోసం వస్తు రూపంలో లేదా ఇతర రూపంలో చెల్లింపులు లేకుండానే విదేశాలకు పంపితే అది మార్పిడి రేట్లను ఈ దేశానికి ప్రతికూలంగా మార్చదా? – పెద్ద ఎత్తున రైల్వే వ్యయం జరిగిన కాలంలో (1845) ఈ దేశంలో ఆ సూత్రం వర్తిస్తుంది. 3, 4 లేదా 5 యేళ్ళపాటు 3 కోట్ల పౌండ్లను రైల్వేలలో వెచ్చించటం జరిగింది. దాదాపు అదంతా వేతనాల చెల్లింపునకే సరిపోయింది. రైల్వే నిర్మాణంలోను, ఇంజన్లు, రైలు పెట్టెలు, రైలు స్టేషన్ల నిర్మాణంలోను మొత్తం ఫ్యాక్టరీ జిల్లాల్లో పనిలో పెట్టిన వారికంటే ఎక్కువ సంఖ్యలో కార్మికులను మూడేళ్ళపాటు పోషించాల్సి వచ్చింది. వారు ఆ వేతనాలను టీ, పంచదార, సారాయి లాంటి ఇతర దేశాల సరుకులపై ఖర్చుపెట్టారు. ఆ సరుకులు దిగుమతి అయ్యాయి. అయితే ఆ కాలంలో ఈ పెద్ద వ్యయం జరుగుతున్నప్పుడు ఈ దేశానికి ఇతర దేశాలకు మధ్య విదేశీ మార్పిడులు దెబ్బతినలేదన్నది వాస్తవం. అపుడు వెండి, బంగారాలూ బయటికి పోలేదు. అందుకు విరుద్ధంగా అవి లోపలికి ప్రవహించాయి."

1802. ఇంగ్లాండు, ఇండియాల మధ్య సమానమైన వాణిజ్య సమతూకం, మార్పిడి రేట్లు ఉన్నప్పుడు రైలు పట్టాలు, రైలు ఇంజన్లు అదనంగా ఓడలకు ఎత్తటం "ఇండియాతో ఉన్న మార్పిడి రేట్లను ప్రభావితం చేస్తుంది" విల్సన్ వాదించాడు. న్యూమార్క్ అలా భావించలేదు. రైలు పట్టాలను పెట్టుబడి మదుపుగా పంపబడిన మేరకు, ఇండియా వాటికి బదులు ఏదో ఒక రూపంలో చెల్లించనంత వరకు ఎటువంటి ప్రభావం ఉండదని అతను భావించాడు. అతనింకా ఇలా అన్నాడు : "ఏ దేశమూ శాశ్వతంగా ఇతర దేశాలన్నింటితోనూ ప్రతికూలమైన మార్పిడి రేట్లను కలిగి ఉండజాలదు అన్న సూత్రంతో నేను ఏకీభవిస్తాను. ఒక దేశంతో ప్రతికూలమైన మార్పిడి తప్పనిసరిగా మరో దేశంతో సానుకూలమైన మార్పిడిని సృష్టిస్తుంది." విల్సన్ ఇలా డొల్ల సమాధానమిచ్చాడు. "1803. అది ఏ రూపంలో పంపించినా పెట్టుబడి బదిలీ అన్నది సమానం కాదా? చెల్లించాల్సిన బాధ్యత మేరకు అది ఒకటే" – "1804. కనుక ఇండియాలో రైల్వే నిర్మాణానికి వెండి, బంగారాలు పంపించినా లేదా వస్తువులు పంపించినా ఇక్కడ పెట్టుబడి మార్కెట్‌పైన దాని ప్రభావం ఒకటేకాదా? మొత్తం వెండి, బంగారాల రూపంలో పంపించబడినట్టుగా అది పెట్టుబడి విలువను పెంచదా?"

ఇనుము ధర పెరగకపోతే రైలు పట్టాలలో ఉన్న "పెట్టుబడి విలువ" పెరగలేదనటానికి అది నిదర్శనం. ఇక్కడ నిజానికి మనం ప్రస్తావిస్తున్న అంశం డబ్బు పెట్టుబడి విలువ అంటే వడ్డీ రేటు. డబ్బు పెట్టుబడిని సాధారణ పెట్టుబడితో సమం చేసి చూపటానికి విల్సన్ ప్రయత్నిస్తున్నాడు. వాస్తవమేమంటే కోటీ 20 లక్షల పౌండ్ల సొమ్ము ఇండియా రైల్వేల కోసం ఇంగ్లాండులో వసూలు చేయబడింది. ఈ విషయానికి మార్పిడి రేట్లతో ఎటువంటి ప్రత్యక్ష సంబంధమూ లేదు. అలాగే కోటీ 20 లక్షల రూపం డబ్బు మార్కెట్‌ను ప్రభావితం చేయదు. డబ్బు మార్కెట్ సజావుగా ఉంటే దానిపైన అది ఎటువంటి ప్రభావాన్ని కలిగించదు. 1844–1845లలో ఇంగ్లాండు రైల్వే వసూళ్ళు డబ్బు మార్కెట్‌ను ఎంతమాత్రమూ ప్రభావితం చేయలేదు. ఇది కూడా అంతే. డబ్బు మార్కెట్ అప్పటికే ఇబ్బందులలో ఉంటే వడ్డీ రేటు ప్రభావితమవుతుంది. అది పెరుగుతుంది. విల్సన్ సిద్ధాంతం ప్రకారం ఇంగ్లాండు మార్పిడి రేట్లను సానుకూలంగా ప్రభావితం చేస్తుంది. ఇండియాకు కాకపోతే మరొక దేశానికి వెండి, బంగారాలను ఎగుమతి చేసే ధోరణికి వ్యతిరేకంగా ఇది పనిచేస్తుందని ఆయనంటాడు. విల్సన్ ఒక అంశం నుంచి మరొక అంశానికి కప్పదాట్లు వేస్తాడు. ప్రశ్న : 1802లో మార్పిడి రేట్లు ప్రభావితం అవుతాయని అన్నాడు. ప్రశ్న : 1804లో "పెట్టుబడి విలువ" ప్రభావితం అవుతుందంటున్నాడు. ఈ రెండూ వేరు వేరు విషయాలు. వడ్డీ రేటు మార్పిడి రేట్లను ప్రభావితం చేయవచ్చు. మార్పిడి రేటు వడ్డీ రేటును ప్రభావితం చేయవచ్చు. అయితే మార్పిడి రేట్లు అస్థిరంగా ఉన్నప్పుడు కూడా వడ్డీ రేటు స్థిరంగా ఉండగలదు. అలాగే వడ్డీ రేటు అస్థిరంగా ఉన్నప్పుడు మార్పిడి రేటు స్థిరంగా వుండవచ్చు. పెట్టుబడి ఓడలకు ఎత్తబడిన రూపం మాత్రమే. అంత తేడాను సృష్టిస్తుందని విల్సన్ గ్రహించటానికి సిద్ధపడడు. పెట్టుబడి రూపంలో భిన్నత్వానికి ముఖ్యంగా దాని డబ్బు రూపానికి అంత ప్రాధాన్యం వుందని అతడు అంగీకరించటానికి ఇష్టపడడు. న్యూమార్క్ విల్సన్‌కు అసంపూర్ణంగా సమాధానం చెప్తాడు. విల్సన్ మార్పిడి రేటు నుంచి వడ్డీ రేటుకు హఠాత్తుగా కప్పదాట్లు వేశాడనే విషయాన్ని అతడు సూచించడు. ప్రశ్న : 1804లో న్యూమార్క్ అస్థిరంగానూ, ద్వంద్వార్థ సూచకంగానూ సమాధానం

చెప్పాడు. "కోటీ 20 లక్షలను వసూలు చేయడానికి గిరాకీ ఉంటే సాధారణ వడ్డీ రేటుకు సంబంధించినంత వరకు ఈ కోటీ 20 లక్షలు వెండి, బంగారాల రూపంలో వస్తువుల రూపంలో పంపబడిందన్న దానికి ప్రాధాన్యం ఉండదు. అయితే (ఈ 'అయితే' అన్నపదం ముందు చెప్పిన దానికి వ్యతిరేకమైనదాన్ని చెప్పటం కోసం మంచి సాకుగా ఉపయోగపడింది.) అది అంత ప్రధానం కూడా కాదు." (అది అప్రధానమే అయినప్పటికీ అది అప్రధానం కాదు.) ఎందుకంటే ఒక సందర్భంలో 60 లక్షల పౌండ్లు వెంటనే తిరిగి వస్తుంది. మరో సందర్భంలో అంత త్వరితంగా తిరిగి రాదు కనుక అది కొంత (ఏమి నిర్దిష్టత!) తేడాను సృష్టిస్తుంది. ఈ 60 లక్షలు ఈ దేశంలోనే వ్యయమైందా లేక మొత్తంగా బయటకు పంపబడిందా అన్నది తేడాను సృష్టిస్తుంది." అరవై లక్షలు వెంటనే తిరిగి వస్తాయంటున్నప్పుడు అతని ఉద్దేశం ఏమిటి. ఇంగ్లాండులో 60 లక్షలు ఖర్చైన మేరకు అది భారతదేశానికి పంపబడిన పట్టాలలోను, ఇంజన్లలోను ఉంటుంది. అక్కడ నుంచి ఆ మొత్తం తిరిగి రాదు. వాటి విలువ క్రమంగా మాత్రమే తిరిగి వస్తుంది. కాగా వెండి, బంగారాల రూపంలో పంపిన 60 లక్షలు వస్తురూపేణా అతి త్వరగా రావచ్చు. ఆ అరవై లక్షలు వేతనాలుగా ఖర్చయిన మేరకు అవి వినియోగం అయిపోయాయి. అయితే చెల్లింపునకై ఉపయోగించిన డబ్బు దేశంలో ఇది వరకు లాగే చలామణిలో ఉంటుంది. లేదా రిజర్వుగా రూపొందుతుంది. రైలు ఉత్పత్తిదార్ల లాభాలకు, వారి స్థిర పెట్టుబడిని భర్తీ చేసే అరవై లక్షల భాగానికి కూడా ఇది వర్తిస్తుంది. కనుక ద్వంద్వార్థ సూచకమైన ప్రకటనను న్యూమార్క్ ప్రత్యక్షంగా ఈ అంశాన్ని చెప్పకుండా దాటవేయడానికి ఉపయోగించాడు... డబ్బు దేశంలోనే ఉంది. అది అప్పివ్వదగిన డబ్బు. పెట్టుబడిగా ఉపయోగపడిన మేరకు అది 'ఏ' ఖాతాకు బదులు 'బి' ఖాతానుంచి వసూలు చేయడం మినహా డబ్బు మార్కెట్ దృష్టిలో తేడా లేదు. (చలామణి మరింత మొత్తంలో నాణాలను ఇముడ్చుకొని ఉండవచ్చును) పెట్టుబడి ఇతర దేశాలకు వెండి, బంగారాల రూపంలో కాక, సరుకుల రూపంలో బదిలీ అయినప్పుడు ఇటువంటి మదుపు ఈ ఎగుమతి అయిన సరుకుల ఉత్పత్తికి విదేశీ సరుకుల అదనపు దిగుమతి అవసరమైన మేరకు మాత్రమే మార్పిడి రేట్లను (ఎగుమతి అయిన పెట్టుబడి మదుపు పెట్టబడిన దేశంలో మార్పిడి రేటు కాదు.) ప్రభావితం చేస్తుంది. ఈ ఉత్పత్తి అపుడు అదనపు దిగుమతికి సరిపడా ఉండదు. అయితే పరపతిపై జరిగే ప్రతి ఎగుమతి విషయంలోనూ అదే జరుగుతుంది. పెట్టుబడి మదుపు కోసం జరిగినా లేదా సాధారణ వాణిజ్య లక్ష్యంతో జరిగినా ఒకటే. అంతేకాక ఈ అదనపు దిగుమతి దాని ప్రతిచర్యగా ఇంగ్లీషు సరుకుల కోసం అదనపు గిరాకీని కూడా సృష్టించవచ్చు. ఉదాహరణకు వలస దేశాలు లేదా అమెరికా విషయంలో ఇదే జరిగింది.

★ ★ ★

ఇంతకు ముందు (1786) ఈస్ట్ ఇండియా కంపెనీ డ్రాఫ్టుల వల్ల ఇంగ్లాండు నుంచి ఇండియాకు పోయే ఎగుమతులు దిగుమతులకంటే ఎక్కువగా ఉన్నాయని న్యూమార్క్ చెప్పాడు. సర్ చార్లెస్ వుడ్ ఈ విషయంలో ఆయన్ను ప్రశ్నించాడు. ఇండియాకు పోయే ఎగుమతులు ఇండియా నుంచి వచ్చే దిగుమతులకంటే ఎక్కువగా ఉండటానికి కారణం ఆ దిగుమతులకు సమ విలువ ఏదీ చెల్లించబడక

పోవటమే. ఈస్ట్ ఇండియా కంపెనీ (ప్రస్తుతం ఈస్ట్ ఇండియా ప్రభుత్వం) డ్రాఫ్టులు ఇండియాపై విధించబడిన కప్పంగా మారతాయి. ఉదాహరణకు 1855లో ఇంగ్లాండ్ నుంచి ఇండియాకు దిగుమతులు ఒక కోటీ 26 లక్షల 70 వేల పౌండ్లు. ఇండియాకు ఇంగ్లాండు ఎగుమతులు ఒక కోటీ 3 లక్షల 50 వేల పౌండ్లు. ఇండియాకు మిగులు 22 లక్షల 50 వేలు.[1] "అటువంటి పరిస్థితులలో ఏదో ఒక రూపంలో ఇండియాకు ఈ 22 లక్షల 50 వేల పౌండ్లను ఇంగ్లాండు చెల్లించాలి. అయితే అపుడు ఇండియా హౌస్ నుండి వ్యాపార ప్రకటనలు వస్తాయి. ఈ మేరకు ఇండియా హౌస్ ఇండియాలో వున్న వివిధ ప్రెసిడెన్సీలకు 32 లక్షల 50 వేల పౌండ్ల డ్రాఫ్టులు మంజూరు చేయబోతున్నట్టు ప్రకటిస్తుంది. (లండన్‌లో ఈస్ట్ ఇండియా కంపెనీ ఖర్చుల కోసం, స్టాక్‌హోల్డర్ల డివిడెండ్లు చెల్లించటం కోసం ఈ మొత్తం విధించబడింది.) అది 22 లక్షల 50 వేల పౌండ్లను రద్దు చేయటం మాత్రమే కాక 10 లక్షల మిగులును కూడా ఇస్తుంది." (1917) (బ్యాంకు చట్టాలు 1857).

"1922. (వుడ్) ఆ ఇండియా హౌస్ డ్రాఫ్టుల ప్రభావం ఇండియాకు ఎగుమతులను పెంచటం కాక తగ్గించడం అన్నమాట." (అంటే దాని అర్థం ఇండియా నుంచి వచ్చే దిగుమతులను ఆ దేశానికి పంపే ఎగుమతులతో పరిష్కరించాల్సిన అవసరాన్ని తగ్గించడం అన్నమాట.) దీనిని న్యూమార్క్ ఇలా వివరించాడు. ఈ 37 లక్షల పౌండ్ల కోసం ఇండియాలోకి "మంచి ప్రభుత్వాన్ని" బ్రిటీష్ వారు దిగుమతి చేస్తున్నారని ఆయన చెప్పారు. (1925) ఇండియాలో మాజీ మంత్రిగా 'వుడ్'కు భారతదేశానికి దిగుమతి అవుతున్న బ్రిటిష్ "మంచి ప్రభుత్వం" గురించి బాగా తెలుసు. అందుకే వ్యంగ్యంగా ఇలా అన్నారు. "1926. అంటే మీరు చెప్పిన ఎగుమతి 'మంచి ప్రభుత్వం ఎగుమతి' తప్ప ఉత్పత్తి ఎగుమతి కాదన్నమాట." "మంచి ప్రభుత్వం" కోసం "ఈ రకంగా" ఇంగ్లాండ్ చాలా పెద్ద ఎత్తున ఎగుమతి చేస్తుంది. ఇతర దేశాలలో మదుపు పెట్టుబడిని కూడా ఎగుమతి చేస్తుంది. ఆ రకంగా మామూలు వాణిజ్యంతో ప్రమేయం లేకుండా దిగుమతులను పొందుతోంది. పాక్షికంగా "మంచి ప్రభుత్వాన్ని" ఎగుమతి చేసినందుకు, పాక్షికంగా వలసలలోనూ, మరోచోట మదుపు పెట్టబడిన పెట్టుబడిని ఆదాయం రూపంలోను అది పొందుతుంది. ఇది సమవిలువ చెల్లించబడని కప్పం మాత్రమే. ఇంగ్లాండు ఈ కప్పానికి బదులు ఏమీ ఎగుమతి చేయకుండానే దాన్ని వినియోగం చేస్తే మార్పిడి రేట్లు ప్రభావితం కావనేది స్పష్టం. ఈ కప్పాన్ని ఇంగ్లాండులో కాక ఇతర దేశాలలో ఉత్పాదకంగా లేదా అనుత్పాదకంగా తిరిగి మదుపు పెట్టినప్పటికీ మార్పిడి రేట్లు ప్రభావితం కావనేది కూడా స్పష్టమే. ఉదాహరణకు అది క్రిమియాకు పంపించే యుద్ధ సామాగ్రి. అంతేగాక విదేశాల నుంచి వచ్చే దిగుమతులు ఇంగ్లాండు ఆదాయంలో ప్రవేశించిన మేరకు (అయితే అవి సమ విలువ చెల్లించబడని కప్పం రూపంలో రావాలి. సాధారణ వాణిజ్య క్రమంలో లేదా ఈ చెల్లించబడని కప్పం మార్పిడి ద్వారా జరగాలి.) ఇంగ్లాండు వాటిని వినియోగించుకోగలదు లేదా పెట్టుబడిగా తిరిగి మదుపు పెట్టగలదు. వీటిలో ఏ సందర్భంలోనూ మార్పిడి రేట్లు ప్రభావితం కావు. ఈ సంగతిని విల్సన్ మహర్షి విస్మరించాడు. ఒక స్వదేశ లేదా విదేశ ఉత్పాదితంలో ఒక ఆదాయం భాగం ఉంటే (అది విదేశీ ఉత్పాదితం అయితే దాని బదులు స్వదేశీ ఉత్పాదితం మార్పిడి జరిగితే సరిపోతుంది.)

1. ఇది సుమారు లెక్క. ఇంకా ఖచ్చితంగా చెప్పాలంటే అది 23 లక్షల 20 వేలు అవుతుంది - సం.

ఈ ఆదాయపు వినియోగం ఉత్పాదకమైనా, అనుత్పాదకమైనా ఉత్పత్తి స్థాయిని అది మార్చినప్పటికి మార్పిడి రేట్లను ఏమాత్రం మార్చదు. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకొని ఈ క్రింది విషయాన్ని చదవాలి :

1934. క్రిమియాకి పోయే యుద్ధ సరఫరాలు టర్కీతో ఉన్న మార్పిడి రేటును ఎలా ప్రభావితం చేస్తాయని న్యూమార్క్‌ను వుడ్ అడిగాడు. న్యూమార్క్ ఇలా సమాధానం చెప్పాడు. "యుద్ధ సామాగ్రిని మాత్రమే పంపటం అన్నది మార్పిడి రేట్లను తప్పనిసరిగా ప్రభావితం చేస్తుందని నేను అనుకోను. అయితే వెండి, బంగారాలను పంపితే మాత్రం అది తప్పనిసరిగా ప్రభావితమవుతుంది." ఈ విషయంలో ఆయన డబ్బు రూపంలో వున్న పెట్టుబడిని ఇతర రూపాలలో ఉన్న పెట్టుబడుల నుంచి వేరు చేసి చూపుతున్నాడు. అపుడు విల్సన్ అడిగాడు.

"1935. ఏ వస్తువైనా పెద్ద స్థాయిలో దానికి అనుగుణమైన దిగుమతి లేకుండా మీరు ఎగుమతి చేస్తే." (అనుగుణమైన ఎగుమతులు లేకుండా ఇంగ్లాండు నుంచి పెద్ద మొత్తాలలో దిగుమతులు వస్తున్నాయన్న సంగతిని విల్సన్ మర్చిపోయాడు. ఈ దిగుమతులకు బదులు మంచి ప్రభుత్వం రూపంలో లేదా ఇంతకు ముందు ఎగుమతి అయిన పెట్టుబడి రూపంలో తప్ప ఇంకేవీ పంపించ బడలేదు. ఆ రకంగా ఈ దిగుమతులు సాధారణ వాణిజ్య చలనంలోకి ప్రవేశించవు. అంతేకాక ఈ దిగుమతులు ఉదాహరణకు అమెరికన్ ఉత్పాదితాలతో మార్పిడి కాబడతాయి. అమెరికన్ సరుకులు సమతుల్యమైన దిగుమతులు లేకుండానే ఎగుమతి అవుతాయి – అన్న విషయం ఈ దిగుమతుల విలువ వాటికి సమవిలువ విదేశాలకు పంపబడకుండానే వినియోగం కాగలవన్న వాస్తవాన్ని మార్చలేదు. ఈ దిగుమతులు వాటికి ప్రతిగా ఎగుమతులు లేకుండానే గ్రహించబడ్డాయి. అందుకని వాణిజ్య సమతూకంలో ప్రవేశించకుండానే వినియోగం అవుతాయి). "మీ దిగుమతుల ద్వారా సృష్టించిన విదేశీ రుణాన్ని మీరు తీర్చటం లేదు." (అయితే మీరు ఇంతకు ముందే దిగుమతులకై చెల్లించి వుంటే, ఉదాహరణకు విదేశాలలో ఇచ్చిన పరపతి ద్వారా చెల్లించి ఉంటే రుణం అన్నది తలెత్తదు. దీనికి అంతర్జాతీయ సమతూకంతో సంబంధం లేదు. అది కేవలం ఉత్పాదక, అనుత్పాదక వ్యయాలుగా మారుతుంది. అది వినియోగం కాబడిన ఉత్పాదితాలు స్వదేశానివా? విదేశాలవా? అన్నదానితో ప్రమేయం లేదు.) "కనుక ఈ లావాదేవీ ద్వారా మీరు విదేశీ రుణాన్ని తీర్చకపోవడం వల్ల, మీ ఎగుమతులకు సమతుల్యమైన దిగుమతులు లేకపోవడం వల్ల మార్పిడి రేట్లను ప్రభావితం చేస్తున్నారు కదా – సాధారణంగా ఇది దేశాలన్నింటికీ వర్తిస్తుంది."

విల్సన్ ఇచ్చిన ఈ ఉపన్యాసం అర్థం ఇది. సమతుల్యమైన దిగుమతిలేని ప్రతి ఎగుమతీ సమతుల్యమైన ఎగుమతి లేని దిగుమతితో సమానమే. ఎందుకంటే విదేశీ సరుకులు అంటే దిగుమతి అయిన సరుకులు ఎగుమతి అయిన వస్తువు ఉత్పత్తిలో ప్రవేశిస్తాయి. ఈ రకం ఎగుమతులన్నీ తిరిగి చెల్లించబడని దిగుమతిపై ఆధారపడి వున్నాయని లేదా అటువంటి దిగుమతిని సృష్టిస్తున్నాయని ఆయన ఊహ. కనుక ఒక విదేశీ రుణాన్ని ఆయన ఊహిస్తున్నాడు. ఈ కింది రెండు అంశాలు లేవనుకున్నప్పటికీ ఇది తప్పవుతుంది. 1) ఇంగ్లాండు కొన్ని దిగుమతులను ఉచితంగా పంపుతుంది. వాటికి అది సమవిలువను చెల్లించదు. ఉదాహరణకు దాని ఇండియన్ దిగుమతులలో ఒక భాగం. వీటిని అది అమెరికన్ దిగుమతులతో మార్పిడి చేయవచ్చు. వీటిని ఎగుమతి చేసి, దానికి బదులుగా

దిగుమతులు చేసుకోకపోవచ్చు. ఏమైనప్పటికీ విలువకు సంబంధించినంత వరకు అది దానికి ఏమీ ఖర్చుగాని సరుకులనే ఎగుమతి చేసింది. 2) ఇంగ్లాండు తన దిగుమతులకు చెల్లించి వుండవచ్చు. ఉదాహరణకు అమెరికన్ దిగుమతులకు అది అప్పుడు అదనపు పెట్టుబడి అవుతుంది. వీటిని ఇంగ్లాండు అనుత్పాదకంగా వినియోగం చేస్తే ఉదాహరణకు యుద్ధ సామాగ్రిగా వినియోగం చేస్తే అది అమెరికాకు రుణపడదు. ఇది అమెరికాతో దానికున్న మార్పిడి రేట్లను ప్రభావితం చేయదు. 1934, 1935 ప్రశ్నలలో న్యూమార్క్ పరస్పర విరుద్ధంగా మాట్లాడాడు. 1938 ప్రశ్నలో వుడ్ దానిని అతని దృష్టికి ఇలా తీసుకొచ్చాడు. "ప్రతిఫలం తిరిగిరాని ఎగుమతి అయిన వస్తువుల ఉత్పత్తిలో ఏ భాగమూ (యుద్ధ సామాగ్రి ఉత్పత్తిలో) ఈ సరుకులు పంపించే దేశం నుంచి వచ్చిన వస్తువులు లేకుంటే ఆ దేశంలో వున్న మార్పిడి రేటు ఎలా ప్రభావితం అవుతుంది? ఉదాహరణకు టర్కీతో వాణిజ్యం సమతా స్థితిలో ఉందనుకొందాం. అపుడు ఈ దేశానికి టర్కీకి మధ్య ఉన్న మార్పిడి రేట్లను యుద్ధ సామాగ్రి క్రిమియాకు ఎగుమతి కావటం అన్నది ఎలా ప్రభావితం చేస్తుంది?" ఇక్కడ న్యూమార్క్ తన నిగ్రహాన్ని కోల్పోయాడు. 1934 ప్రశ్నలో ఇదే సాదా ప్రశ్నకు తాను సరిగా జవాబు చెప్పానన్న సంగతి మర్చిపోయి ఇలా అన్నాడు. "ఆచరణాత్మక ప్రశ్నను మనం సంపూర్ణంగా పరిశీలించి ఇప్పుడిక అక్కడి నుంచి అది భౌతిక చర్చ ఉన్నత శిఖరాలకు చేరుకున్నామనుకొంటున్నాను."

★ ★ ★

(ఒక దేశం నుంచి మరొక దేశానికి జరిగే ప్రతి పెట్టుబడి బదిలీ అది విలువైన లోహం రూపంలో జరిగినా లేక సరుకుల రూపంలో జరిగినా మార్పిడి రేటును ప్రభావితం చేస్తుందని విల్సన్ అంటాడు. మార్పిడి రేటు వడ్డీ రేటుతో ప్రభావితమవుతుందని మనం చర్చిస్తున్న రెండు దేశాలలోని వడ్డీ రేట్ల మధ్య ఉన్న సంబంధం ముఖ్యంగా ప్రభావితమవుతుందని విల్సన్‌కు తెలుసు. పెట్టుబడి మిగుళ్ళు సాధారణ రూపంలో, విలువైన లోహంతో సహా అన్ని రకాల సరుకులు వడ్డీ రేటును ప్రభావితం చేయటంలో పాత్ర కలిగి వుంటాయి – అని అతడు రుజువు చేయగలిగితే అతడు తన లక్ష్యం దిశగా మరొక అడుగు ముందుకు వేసినట్లే. ఈ పెట్టుబడిలో గణనీయమైన భాగం ఏ దేశానికి బదిలీ అయినప్పటికీ ఆ బదిలీ ఈ రెండు దేశాల్లోని వడ్డీ రేటును మార్చి తీరుతుంది. అయితే ఈ మార్పు పరస్పర వ్యతిరేక దిశల్లో జరుగుతుంది. ఆ రకంగా రెండు దేశాల్లో ఉన్న మార్పిడి రేటు కూడా మారుతుంది – ఎంగెల్స్)

1847 మే 22న 'ఎకనామిస్ట్' 574 పుటలో ఆయన ఇలా అన్నాడు. అపుడు దానికి ఆయన సంపాదకుడు.

"..... వెండి, బంగారాలతో సహా అన్ని రకాల సరుకుల పెద్ద నిల్వలు సూచించే పెట్టుబడి సమృద్ధి కేవలం సాధారణ రూపంలో సరుకుల తక్కువ ధరలకు మాత్రమే కాక పెట్టుబడి ఉపయోగానికై వడ్డీ తక్కువ రేట్లకు కూడా దారితీస్తుంది.[1]) దేశంలో రెండేండ్లకు సరిపడా సరుకు నిల్వ ఉందనుకొందాం. కేవలం రెండు నెలలకు మాత్రమే సరిపోయే సరుకులు ఉన్నప్పుడు వీటిపై అజమాయిషీకంటే ఆ సరుకులపైన అదుపు కోసం అవసరమైన డబ్బు తక్కువ వడ్డీ రేటుతో లభిస్తుంది.[2]) అన్ని డబ్బు రుణాలు అవి ఏ రూపంలో ఉన్నప్పటికీ సరుకులపై ఆధిపత్యాన్ని ఒకరి నుండి మరొకరికి బదిలీ

చేయటం మాత్రమే కాబట్టి సరుకులు అపరిమితంగా ఉన్నప్పుడు వడ్డీ తక్కువగా ఉండాలి. సరుకుల కొరత ఉన్నప్పుడు వడ్డీ ఎక్కువగా ఉండాలి.[3]) సరుకులు విస్తారంగా ఉన్నప్పుడు కొనుగోలుదార్ల సంఖ్యతో పోలిస్తే అమ్మకందార్ల సంఖ్య పెరుగుతుంది. తక్షణ వినియోగానికి అవసరమైన దానికంటే పరిమాణం ఎక్కువ ఉంది కనుక అదే నిష్పత్తిలో పెరుగుతుంది. కనుక భవిష్యత్తులో వినియోగం కోసం అంతకంటే పెద్ద భాగాన్ని ఉంచాల్సి వస్తుంది. ఈ పరిస్థితులలో సరుకులు కలిగిన వ్యక్తి భవిష్యత్తులో చెల్లింపులు పొందేందుకు లేదా పరపతిపై సరుకులను ఇవ్వడానికి విధించే షరతులు తగ్గిపోతాయి. కొన్ని వారాలలోనే తన సరుకులు అన్నీ అమ్ముడు పోతాయని నమ్మకం ఉన్నప్పటికంటే ఈ షరతులు మరింత తగ్గుతాయి."[4])

మొదటి ప్రకటనకు సంబంధించి[1]) ఉత్పత్తి కుంచించుకుపోవటంతో పాటు ఏకకాలంలో పెద్ద ఎత్తున విలువైన లోహం లోపలికి ప్రవహించవచ్చు. సంక్షోభానంతర దశలలో ఇలా ఎప్పుడూ జరుగుతూ వుంటుంది. ఆ తర్వాత దశలో విలువైన లోహాన్ని ఉత్పత్తి చేసే దేశం నుంచి అది దిగుమతి కావచ్చు. ఇతర సరుకుల దిగుమతులు సాధారణంగా ఎగుమతుల ద్వారా సమం చేయబడతాయి. ఈ రెండు దశలలోనూ వడ్డీ రేటు తక్కువగా ఉంటుంది. పెరుగుతుంది గానీ నెమ్మదిగా పెరుగుతుంది. ఇంతకు ముందే మనం దీనికి కారణాన్ని చర్చించాం. "అన్ని రకాల సరుకుల భారీ నిల్వల" ప్రభావాన్ని ప్రస్తావించకుండానే ఈ తక్కువ వడ్డీ రేటును వివరించవచ్చు. అయితే ఈ ప్రభావం ఎలా జరుగుతుంది. ఉదాహరణకు పత్తి ధర తక్కువగా ఉంటే నూలు వడికేవానికి అధిక లాభాలు సాధ్యం. మరి అప్పుడు వడ్డీ రేటు ఎందుకు తక్కువగా ఉన్నట్లు? అప్పు తీసుకున్న పెట్టుబడిపై లాభం ఎక్కువగా ఉండటం వలన కాదు. అప్పుడున్న పరిస్థితులలో, ఈ లాభానికి అనుగుణమైన నిష్పత్తిలో రుణ పెట్టుబడి కోసం గిరాకీ పెరగదు కాబట్టే ఇలా జరుగుతుంది. మరోలా చెప్పాలంటే పారిశ్రామిక పెట్టుబడికంటే భిన్నమైన చలనాన్ని రుణ పెట్టుబడి కలిగి వుంటుంది. ఈ ఎకనామిస్ట్ రుజువు చేయాలనుకొంటున్నది సరిగ్గా ఇందుకు విరుద్ధం. రుణ పెట్టుబడి చలనాలు పారిశ్రామిక పెట్టుబడి చలనాలు ఒకటే అని ఆయన భావం.

ఆయన రెండో ప్రకటన[2]) చూద్దాం. రెండేళ్ళకు సరిపడా నిల్వలు అన్న అసంబద్ధమైన ఊహను కాస్త అర్థవంతంగా చేసేందుకు మార్కెట్ సరుకులతో నిండి ఉందని పేర్కొందాం. దీనివల్ల ధరలు పడిపోతాయి. ఒక పత్తి బేలుకు తక్కువ చెల్లించాల్సి వుంటుంది. అంతమాత్రంచేత పత్తిని కొనుగోలు చేయటానికి అవసరమైన డబ్బు రుణం తేలికగా దొరుకుతుందని అర్థం కాదు. ఇది డబ్బు మార్కెట్ పరిస్థితిపైన ఆధారపడి వుంటుంది. డబ్బు మరింత సులభంగా అప్పుగా దొరికితే బ్యాంక్ పరపతి కంటే వాణిజ్య పరపతి యొక్క ఉపయోగాన్ని తగ్గించాల్సిన అవసరం వుందని అర్థం. మార్కెట్‌లో కుప్పలు తెప్పలుగా ఉన్న సరుకులు జీవనభృతి సాధనాలయినా అవ్వాలి లేదా ఉత్పత్తి సాధనాలయినా అవ్వాలి. ఇవి రెండూ తక్కువ ధరలలో లభ్యం కావడం వల్ల పారిశ్రామిక పెట్టుబడిదారుని లాభం పెరుగుతుంది. కనుక అది వడ్డీ రేటును ఎందుకు పడగొట్టాలి? పారిశ్రామిక పెట్టుబడి అపారంగా దొరకటం, డబ్బు వసతి కోసం గిరాకీ పెరగటం ఒకటే కావడం వల్ల కాక అవి పరస్పరం విరుద్ధాలు కావడం వల్ల వడ్డీ రేటు పడిపోవాలి. వ్యాపారి, పారిశ్రామికవేత్త ఒకరికొకరు చాలా తేలికగా పరపతిని

ఇచ్చుకోగలరు. వాణిజ్య పరపతికున్న ఈ సౌకర్యం వల్ల పారిశ్రామికవేత్తకు, వాణిజ్యవేత్తకు తక్కువ బ్యాంకు పరపతి అవసరమవుతుంది. కనుక వడ్డీ రేటు ఆ రకంగా తక్కువగా వుండొచ్చు. ఈ వడ్డీ రేటుకు విలువైన లోహపు దిగుమతితో ఏమాత్రం ప్రమేయం లేదు. అయితే రెండూ సమాంతరంగా జరగవచ్చు. దిగుమతి అయిన వస్తువుల ధరలను పడగొట్టిన కారణాలే దిగుమతి అయిన విలువైన లోహపు మిగులును కూడా ఉత్పత్తి చేయవచ్చు. దిగుమతి మార్కెట్ సరుకులతో నిండిపోయి వుంటే దిగుమతి అయ్యే వస్తువుల కోసం గిరాకీ తగ్గిపోయిందని అర్థం. స్వదేశ పారిశ్రామికోత్పత్తి కుంచించుకుపోయి వుంటే తప్ప తక్కువ ధరలున్నా ఇలా ఎందుకు జరిగిందో వివరించలేము. అయితే తక్కువ ధరలతో అమితంగా దిగుమతి జరుగుతున్నప్పుడు కూడా ఇలా ఎందుకు జరుగుతుందో వివరించటం సాధ్యం కాదు. ఇదంతా అసంబద్ధాల పుట్ట. ధరల తగ్గుదల = వడ్డీ తగ్గుదల అని రుజువు చేయడానికి సృష్టించుకున్న అసంబద్ధాలివి. ఈ రెండూ ఏకకాలంలో పక్కపక్కనే వుంటే ఉండవచ్చు. పారిశ్రామిక పెట్టుబడి చలనం, అప్పు ఇవ్వదగిన డబ్బు పెట్టుబడి చలనం పరస్పర వ్యతిరేక దిశలో ఉన్నప్పుడే అవి అలా పక్కన ఉండొచ్చు. అంతేగానీ అవి రెండూ ఒకటే అనటానికి మొదటి స్థితికి రెండో స్థితి ప్రతిబింబిబం మాత్రమే. అది నిదర్శనం కాదు.

ఆయన 3వ ప్రకటన చూద్దాం. పై వివరణ తర్వాత కూడా సరుకులు విస్తారంగా ఉన్నప్పుడు వడ్డీ రేటు ఎందుకు తక్కువ వుండాలో అర్థం చేసుకోవడం కష్టం. సరుకులు చౌకగా వుంటే ఒక నిర్దిష్ట పరిమాణం గల సరుకును కొనటానికి నాకు ఇంతకుముందు 2000 పౌండ్లు అవసరమయితే ఇప్పుడు కేవలం వెయ్యి పౌండ్లు అవసరం కావచ్చు. అయితే నేను 2000 పౌండ్లనే మదుపు పెడుతున్నాననుకొందాం. అంటే ఇంతకు ముందుకంటే రెండు రెట్లు సరుకులను కొనగలుగుతాను. ఈ రకంగా ఒకే పెట్టుబడిని ఒకే మొత్తం పెట్టుబడితో నేను నా వ్యాపారాన్ని విస్తరింపచేస్తాను. నేను 2000 పౌండ్ల సరుకులను ఇదివరకులాగే కొంటాను. కనుక డబ్బు మార్కెట్లో నా గిరాకీ యథాతథంగా ఉంటుంది. సరుకుల ధరలు పడిపోవడం వల్ల సరుకుల మార్కెట్లో నా గిరాకీ పెరుగుతుంది. అయితే సరుకులపై ఉన్న ఈ గిరాకీ తగ్గిపోతే సరుకుల ధరలు పడిపోవడంతో పాటు ఉత్పత్తి విస్తరించకపోతే 'ఎకనామిస్ట్' చెప్పిన నియమాలన్నీ తలకిందులవుతాయి. అప్పివ్వదగిన డబ్బు పెట్టుబడి కోసం గిరాకీ కూడా పడిపోతుంది. లాభం పెరిగినప్పటికీ ఇది ఇలాగే జరుగుతుంది. అయితే ఇలా పెరిగే లాభం రుణ పెట్టుబడి కోసం గిరాకీని పెంచుతుంది. సరుకుల ధరలు తక్కువ స్థాయిలో ఉండటం అన్నది మూడు కారణాల వల్ల కావచ్చు. మొదటిది గిరాకీ లేకపోవడం. అటువంటి సందర్భంలో ఉత్పత్తి కుంటుపడటం వల్ల వడ్డీ రేటు తక్కువగా వుంటుంది. అంతేగానీ సరుకులు చౌకగా ఉండటం వల్ల కాదు. తక్కువ ధరలు ఉండటం అన్నది ఉత్పత్తి కుంటుబడటానికి ప్రతిబింబం మాత్రమే. రెండవది గిరాకీని మించిన సరఫరా ఉండటం వల్ల కావచ్చు. అది మార్కెట్ సరుకులతో నిండిపోవడం వల్ల కావచ్చు. అది సంక్షోభానికి దారితీయవచ్చును. సంక్షోభంలోనే అధిక వడ్డీ రేటుతో అది ఏకీభవించవచ్చు. లేదా సరుకుల విలువ పడిపోవడం కారణంగా కూడా కావచ్చు. కనుక అదే గిరాకీని అంతకు ముందుకంటే తక్కువ ధరలలో సంతృప్తిపరచడం సాధ్యం అవుతుంది. చివరి సందర్భంలో వడ్డీ రేటు ఎందుకు పడిపోవాలి? లాభాలు పెరగటం వల్లనా? ఒకే స్థాయిలో ఉత్పాదక సరుకు పెట్టుబడిని

పొందటం కోసం అవసరమైన డబ్బు పెట్టుబడి తక్కువ కావటం వల్ల అయితే లాభం వడ్డీ ఒకదానికొకటి విలోమానుపాతంలో ఉన్నాయని ఇది రుజువు చేస్తుంది. ఏరకంగా చూసినా 'ఎకనామిస్ట్' ప్రకటన పొరపాటు. సరుకుల ధరలు తగ్గిపోవటమూ వడ్డీ రేటు పడిపోవటమూ కలిసే పయనించనక్కర్లేదు. అలా కాకుంటే అతి పేద దేశాలలో అంటే సరుకుల ధరలు అతి తక్కువగా ఉండే దేశాలలో వడ్డీ రేటు తక్కువగా ఉండి ఉండాలి. అతి ధనిక దేశాలలో అంటే వ్యవసాయ ఉత్పాదితాల ధరలు అత్యధికంగా ఉండే దేశాలలో వడ్డీ రేటు ఎక్కువగా ఉండాలి. సాధారణ రూపంలో ఎకనామిస్ట్ క్రింది విషయాన్ని అంగీకరిస్తాడు. డబ్బు విలువ పడిపోతే వడ్డీ రేటుపైన దాని ప్రభావం ఉండదు. 100 పౌండ్లు ఇదివరకటి లాగానే 105 పౌండ్లను సంపాదిస్తాయి. 100 పౌండ్ల విలువ పడిపోతే అయిదు పౌండ్ల వడ్డీ విలువ కూడా పడిపోతుంది. తొలి మొత్తం విలువ పెరగటం వల్ల లేదా తగ్గటం వల్ల ఈ సంబంధం మారదు. విలువ దృష్టి నుంచి చూస్తే సరుకుల ఒక నిర్దిష్ట పరిమాణం – ఒక నిర్దిష్ట డబ్బు పరిమాణంతో సమానం. ఈ విలువ పెరిగితే అది ఎక్కువ డబ్బు మొత్తంతో సమానం అవుతుంది. విలువ తగ్గితే తక్కువ మొత్తంతో సమానం అవుతుంది. ఆ విలువ రెండు వేలతో సమానం అయితే అప్పుడు 5% = 100. అది 1000తో సమానమైతే 5% = 50. అయితే ఇది వడ్డీ రేటును ఏరకంగానూ మార్చదు. ఇందులో తార్కికంగా ఉన్న అంశమేమంటే ఒకే పరిమాణం గల సరుకులకు అమ్మటానికి దానికి 1000 పౌండ్లు అవసరమైనప్పటికంటే 2000 పౌండ్లు అవసరమైనప్పుడు మరింత ఎక్కువ డబ్బు వసతి అవసరమైందని అర్థం. అంటే ఇక్కడ లాభం వడ్డీ ఒకదానికొకటి విలోమానుపాతంలో ఉన్నాయని మాత్రమే ఇది తెలియచేస్తుంది. స్థిర, అస్థిర పెట్టుబడి అంశాల ధరలు ఎంత తక్కువగా ఉంటే లాభం అంత ఎక్కువగా వుంటుంది. వడ్డీ రేటు అంత తక్కువగా ఉంటుంది. దీనికి విరుద్ధమైనది కూడా సాధ్యమే. తరచూ అలా జరుగుతుంది కూడా. ఉదాహరణకు నూలు కోసం, వస్త్రాల కోసం గిరాకీ లేనందున పత్తి ధర చౌకగా ఉండవచ్చు. లేదా జౌళి పరిశ్రమలో అధిక లాభాలు ఉండటం వల్ల దానికి గిరాకీ బాగా పెరిగి పత్తి ధర సాపేక్షంగా అధికంగా ఉండవచ్చు. మరోవైపున పత్తి ధర తక్కువగా ఉండటం కారణంచేతనే పారిశ్రామికుని లాభాలు ఎక్కువగా వుండవచ్చును. వడ్డీ రేటు, సరుకుల ధరల చలనాలు పరస్పరం పూర్తిగా స్వతంత్రంగా ఉంటాయని హబ్బర్డ్ పట్టిక తెలియజేస్తుంది. అయితే వడ్డీ రేటు చలనం, లోహపు నిల్వల చలనంతోనూ, మార్పిడి రేట్ల చలనంతోనూ సన్నిహితంగా జతపడి వుంటుంది.

'ఎకనామిస్ట్' పత్రిక ఇలా అంటుంది : "కనుక సరుకులు విస్తారంగా ఉన్నప్పుడల్లా వడ్డీ తక్కువగా ఉండాలి." సంక్షోభ సమయాలలో ఇందుకు సరిగ్గా వ్యతిరేకంగా వుంటుంది. సరుకులు అపారమైన స్థాయిలో ఉంటాయి. వాటిని డబ్బుగా మార్చటం సాధ్యం కాదు. అందుకని వడ్డీ రేటు అధికంగా వుంటుంది. మరోదశలో సరుకుల కోసం గిరాకీ చాలా ఎక్కువగా వుంటుంది. కనుక ప్రతిఫలం చాలా త్వరితంగా లభిస్తుంది. అదే సమయంలో ధరలు పెరుగుతాయి. ఎందుకంటే వడ్డీ రేటు తక్కువ కావటంవల్ల ప్రతిఫలం త్వరితంగా రావడంవల్ల "అవి (సరుకులు) కొరతగా ఉన్నప్పుడు వడ్డీ అధికంగా వుండాలి." సంక్షోభం తర్వాత వచ్చే మాంద్యంలో సరిగా ఇందుకు వ్యతిరేకంగా జరుగుతుంది. సరుకుల కొరత ఉంటుంది. అంటే గిరాకీతో పోల్చనవసరం లేకుండా మొత్తంగానే కొరత ఉంటుంది. అటువంటప్పుడు వడ్డీ రేటు తక్కువ ఉంటుంది.

ఆయన నాలుగో ప్రకటన. ఒక సరుకుల యజమాని తన దగ్గర ఉన్న సరుకులు త్వరితంగా ఖర్చైపోయే అవకాశం ఉన్నప్పటికంటే మార్కెట్ సరుకులతో నిండిపోయి ఉన్నప్పుడు తన సరుకును కూడా అతడు తక్కువ ధరలకైనా వదిలించుకోవటానికి ప్రయత్నిస్తాడు అన్నది స్పష్టం. అయితే దానివల్ల వడ్డీ రేటు ఎందుకు పడిపోవాలి అన్నది మాత్రం అస్పష్టం.

దిగుమతి అయిన సరుకులతో మార్కెట్ నిండిపోయి వుంటే వడ్డీ రేటు పెరగవచ్చు. తమ సరుకుల్ని మార్కెట్‌లోకి దించకుండా ఉండేందుకు యజమానులకు రుణ పెట్టుబడి అవసరం కావటం వల్ల దాని గిరాకీ పెరిగి ఇలా జరగవచ్చు. వడ్డీ రేటు పడిపోవచ్చు కూడా. వాణిజ్య పరపతి సులభంగా అందుబాటులో ఉంటే బ్యాంకు పరపతి కోసం గిరాకీ తగ్గిపోవడం వల్ల ఇలా జరగవచ్చు.

★ ★ ★

వడ్డీ రేటు పెరగటం వల్ల డబ్బు మార్కెట్‌పై ఒత్తిడి తెచ్చే ఇతర పరిస్థితుల వల్ల మార్పిడి రేట్లపైన 1847లో ఎటువంటి శీఘ్రమైన ప్రభావం కలిగిందో ఎకనామిస్ట్ పేర్కొంది : అయితే మార్పిడి రేట్లలో మార్పు వచ్చినప్పటికి ఏప్రిల్ చివరి వరకు బంగారం బయటికి పోతూనే ఉందనేది గమనించాలి. మే తొలిదినాల వరకు ఎటువంటి మార్పు లేదు.

1847 జనవరి 1న బ్యాంకు లోహపు నిల్వ 15,066,691 పౌండ్లు వడ్డీ రేటు $3\frac{1}{2}$% మూడు నెలల మార్పిడి రేట్లు పారిస్‌తో 25.75, హాంబర్గ్‌తో 13.10, అమ్‌స్టర్‌డామ్‌తో 12.325 వున్నాయి. మార్చి 5న లోహపు నిల్వ 11,595,535 పౌండ్లు ఉంది. డిస్కౌంటు 4% పెరిగింది. మార్పిడి రేట్లు పారిస్‌తో $25.67\frac{1}{2}$, హాంబర్గ్‌తో $13.9\frac{1}{4}$, ఆమ్‌స్టర్‌డామ్‌తో $12.2\frac{1}{2}$ ఉంది. బంగారం బయటికి పోవటం కొనసాగింది.

| 1847 | బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్ వెండి, బంగారాల నిల్వ (పౌండ్లు) | డబ్బు మార్కెట్ | అత్యధిక – మూడు నెలల రేట్లు | | |
|---|---|---|---|---|---|
| | | | పారిస్ | హాంబర్గ్ | ఆమ్‌స్టర్‌డామ్ |
| మార్చి 20 | 11,231,630 | బ్యాంక్ డిస్కౌంట్ 4% | $25.67\frac{1}{2}$ | $13.9\frac{3}{4}$ | $12.2\frac{1}{2}$ |
| ఏప్రిల్ 3 | 10,246,410 | బ్యాంక్ డిస్కౌంట్ 5% | 25.80 | 13.10 | $12.3\frac{1}{2}$ |
| ఏప్రిల్ 10 | 9,867,053 | డబ్బు కొరత తీవ్రం | 25.90 | $13.10\frac{1}{2}$ | $12.4\frac{1}{2}$ |
| ఏప్రిల్ 17 | 9,329,841 | బ్యాంకు డిస్కౌంట్ 5.5% | $26.02\frac{1}{2}$ | $13.10\frac{3}{4}$ | $12.5\frac{1}{2}$ |
| ఏప్రిల్ 24 | 9,213,890 | ఒత్తిడి.... | 26.05 | 13.12 | 12.6 |
| మే 1 | 9,337,716 | పెరిగే ఒత్తిడి | 26.15 | $13.12\frac{3}{4}$ | $12.6\frac{1}{2}$ |
| మే 8 | 9,588,759 | అత్యధిక ఒత్తిడి | $26.27\frac{1}{2}$ | $13.15\frac{1}{2}$ | $12.7\frac{3}{4}$ |

1847లో ఇంగ్లాండు నుంచి విలువైన లోహం మొత్తం ఎగుమతి 8,602,597 పౌండ్లు. దానిలో

| | | |
|---|---|---|
| అమెరికాకు | ..... | 3,226,411 పౌండ్లు |
| ఫ్రాన్సుకు | ..... | 2,479,892 పౌండ్లు |
| హాన్సటౌన్స్‌కు | ..... | 958,781 పౌండ్లు |
| హాలెండ్‌కు | ..... | 247,743 పౌండ్లు |

మార్చి చివర రేట్లలో మార్పు ఉన్నప్పటికి మరోనెల పాటు పూర్తిగా బంగారం బయటికి పోయింది. బహుశా అమెరికాకు అయి వుండవచ్చు.

"వడ్డీ రేటు పెరగటం వల్ల ఎటువంటి శీఘ్రమైన, స్పష్టమైన ప్రభావం ఉంటుందో మనం చూశాం. (1847 ఆగస్టు 2న ఎకనామిస్ట్ అంటుంది. పుట 954) ప్రతికూలమైన మార్పిడిని సరిదిద్దడానికీ, ఈ దేశానికి వెండి, బంగారాలు తిరిగి ప్రవహించేలా చేయటానికీ అవసరమైన ఒత్తిడిని కూడా గమనించాం. ఈ ప్రభావం పూర్తిగా వాణిజ్య సమతూకంతో ప్రమేయం లేకుండా జరిగింది. అధిక వడ్డీ రేటు ఇంగ్లీషు, విదేశీ సెక్యూరిటీల ధరను పడగొట్టింది. విదేశీ ఖాతాపై పెద్ద ఎత్తున కొనుగోళ్లు చేసేలా ప్రోత్సహించింది. ఈ దేశం నుంచి తీసుకోవాల్సిన బిల్లుల మొత్తం పెరిగింది. కాగా మరోవైపున అధిక వడ్డీ రేటు వల్ల డబ్బు పొందటంలో ఉన్న ఇబ్బంది వల్ల ఆ బిల్లుల గిరాకీ పడిపోయింది. కాగా వాటి మొత్తం పెరిగింది. అదే కారణంచేత దిగుమతులపై చేసిన ఆర్డర్లు ఉపసంహరించుకోబడ్డాయి. విదేశాలలో ఉన్న ఇంగ్లీషు నిధుల మదుపులు డబ్బు రూపంలోకి మార్చబడ్డాయి. ఈ దేశంలో ఉపయోగించటం కోసం అవి వెనక్కు తీసుకురాబడ్డాయి. ఆ రకంగా ఉదాహరణకు మే 10కి చెందిన "రియేడిజానైరోప్రైస్ కరెంట్"లో మనం ఈ విధంగా చదవచ్చు. "మార్పిడి (ఇంగ్లండుతో) మరింత పడిపోయింది. ప్రధానంగా ఇంగ్లీషు ఖాతాలో పెద్ద యెత్తున అమ్మబడిన (బ్రెజిల్‌కి చెందిన) ప్రభుత్వ స్టాకుల వల్ల వచ్చిన సొమ్ము కోసం మార్కెట్‌పైన ఒత్తిడి పెరగటం వల్ల అలా జరిగింది. ఈ దేశానికి చెందిన పెట్టుబడి విదేశాలలోను, ఇంగ్లాండులోను సెక్యూరిటీల రూపంలో వడ్డీ రేటు తక్కువగా ఉన్నప్పుడు మదుపు పెట్టబడిన పెట్టుబడి వడ్డీ రేటు పెరగగానే వెంటనే వెనక్కు తీసుకురాబడింది."

## ఇంగ్లాండు వాణిజ్య సమతూకం

ఇండియాలో ఉన్న బ్రిటిష్ అధికారుల జీతాలు వగైరాల రూపంలోనూ, ఇంగ్లీషు వ్యాపారులు ఇంగ్లాండులో మదుపు పెట్టడానికి తమ లాభాల రూపంలోనూ వెనక్కు పంపించే మొత్తాలు కాక "మంచి ప్రభుత్వం" కోసం కప్పంలాగా, బ్రిటిష్ పెట్టుబడిపైన వడ్డీ డివిడెండుల రూపంలో కేవలం ఇండియా 50 లక్షల పౌండ్లు ఏటా పంపిస్తుంది. ప్రతి బ్రిటీష్ వలస నిరంతరాయంగా ఇలా పెద్ద మొత్తాలను చెల్లిస్తోంది. వెస్ట్‌యిండీస్, కెనడాలో, ఆస్ట్రేలియాలో ఉన్న అత్యధిక బ్యాంకులు ఇంగ్లీషు పెట్టుబడితో ప్రారంభమయ్యాయి. కనుక డివిడెండ్లు ఇంగ్లాండులో చెల్లించబడతాయి. ఆ రకంగా ఇంగ్లాండుకు యూరప్‌లో, ఉత్తర అమెరికాలో, దక్షిణ అమెరికాలో అనేక విదేశీ సెక్యూరిటీలున్నాయి. వాటిపైన అది వడ్డీ రాబడుతుంది. ఇది కాక విదేశీ రైల్వేలలో, కాల్వలలో, గనులు వగైరాలలో దానికి ప్రయోజనాలున్నాయి. ఆ సంస్థల నుంచి తగిన డివిడెండ్లు వస్తాయి. వీటన్నిటిపైన వచ్చే సొమ్ము

ఇంగ్లాండు ఎగుమతులపై వచ్చే సొమ్ముతో ప్రమేయం లేకుండా వస్తురూపంలో చెల్లించబడుతుంది. దీంతో పోల్చి చూస్తే ఇంగ్లాండు నుంచి విదేశాలలో ఉన్న ఇంగ్లీషు సెక్యూరిటీల యజమానులకు, విదేశాలలో ఉన్న ఇంగ్లీషు వారి వినియోగం కోసం ఇంగ్లాండు పంపించేది అతి తక్కువగా వుంటుంది.

వాణిజ్య సమతూకం మార్పిడి రేట్లకు సంబంధించినంత వరకు "ఏ ప్రత్యేక క్షణంలోనైనా" అన్నదే సమస్య. ఆచరణాత్మకంగా మాట్లాడాలంటే.... ఇంగ్లాండు తన ఎగుమతులపైన దీర్ఘకాలిక పరపతిని ఇస్తుంది. కాగా దిగుమతులకు వెంటనే నగదు చెల్లిస్తుంది. కొన్నిసార్లు ఈ ఆచరణలో వున్న తేడా మార్పిడి రేట్లపైన గణనీయమైన ప్రభావాన్ని కలిగిస్తుంది. మన ఎగుమతులు గణనీయంగా పెరుగుతున్నప్పుడు ఉదాహరణకు 1850లో బ్రిటిష్ పెట్టుబడి మదుపు నిరంతరాయంగా పెరుగుతూ వుండి వుండాలి. ఈ రకంగా 1849లో ఎగుమతి అయిన సరుకులకు 1850లో చెల్లించిన సొమ్ము లభిస్తుంది. అయితే 1850లో ఎగుమతులు 1849 ఎగుమతులకంటే 60 లక్షల పౌండ్లు మించి వున్నాయి. అంటే ఆచరణలో ఆ సొమ్ము విదేశాలకు పంపబడిందన్నమాట. ఆ రకంగా వడ్డీ రేట్లపైన, మార్పిడి రేట్లపైన ఒక ప్రభావం పడుతుంది. అందుకు విరుద్ధంగా వాణిజ్య సంక్షోభం తర్వాత మన వ్యాపారం పడిపోయినపుడు మన ఎగుమతులు తగ్గిపోయినప్పుడు, ఇంతకు ముందు మనం ఎక్కువ ఎగుమతి చేసినపుడు వాటికిగాను ఈ ఏడాది లభించే మొత్తాలు మన దిగుమతుల విలువకు మించి ఉంటాయి. దానికనుగుణంగా అప్పుడు మార్పిడి రేట్లు మనకనుకూలంగా ఉంటాయి. దేశంలో పెట్టుబడి వేగంగా పోగుబడుతుంది. వడ్డీ రేటు తగ్గుతుంది." (ఎకనామిస్ట్, జనవరి 11, 1851, పుట 30)

విదేశీ మార్పిడి రేట్లు క్రింది కారణాల వల్ల మారవచ్చు.

1. కారణం ఏదైనప్పటికీ కేవలం వాణిజ్య కారణం కావచ్చు. లేదా విదేశాలలో పెట్టుబడి మదుపు కావచ్చు. లేదా యుద్ధాల కోసం ప్రభుత్వం ఖర్చు కావచ్చు. విదేశాలలో నగదు చెల్లింపులు జరిగిన మేరకు తక్షణ వాణిజ్య సమతూకం పర్యవసానంగా ఈ మార్పు జరగవచ్చు.
2. ఒక ప్రత్యేక దేశంలో లోహపు లేదా కాగితపు డబ్బు విలువ పడిపోవటం పర్యవసానంగా కావచ్చు. ఇది కేవలం నామమాత్రమే. ఒక పౌండు ఇపుడు కేవలం ఇంతకు ముందు దానిలో సగం విలువకు మాత్రమే ప్రాతినిధ్యం వహిస్తే, అది 25 ఫ్రాంకులకు బదులు 12.5 ఫ్రాంకులుగా లెక్కించబడుతుంది.
3. రెండు దేశాలకు సంబంధించిన మార్పిడి రేట్ల విషయంలో ఒక దేశం బంగారాన్ని, మరో దేశం వెండిని "డబ్బు"గా పరిగణిస్తూ ఉంటే ఈ రెండూ లోహం విలువ సాపేక్ష ఆటుపోట్లపైన ఈ మార్పిడి రేటు ఆధారపడి వుంటుంది. వాటి మధ్య ఉన్న సమతూకాన్ని ఈ ఆటుపోట్లు మారుస్తాయి. 1850లో మార్పిడి రేట్లు ఈ అంశాన్ని రుజువు చేశాయి. ఇంగ్లాండు ఎగుమతులు అపారంగా పెరిగినప్పటికీ మార్పిడి రేట్లు ఇంగ్లాండుకు ప్రతికూలంగా వున్నాయి. అయినప్పటికీ బంగారం బయటికి ప్రవహించలేదు. ఇది బంగారం ధరతో పోలిస్తే వెండి విలువ తాత్కాలికంగా పెరగటం కారణంగా జరిగింది. (చూ. ఎకనామిస్ట్, నవంబర్ 30, 1850 [పుటలు 1319–1320])

ఒక పౌండు మార్పిడి రేటు : పారిస్‌లో 25 ఫ్రాంకుల 20 సెంట్లు, హాంబర్గ్‌లో 13 మార్కుల

10.5 షిల్లింగులు, ఆమ్‌స్టర్‌డాంలో 11 ఫ్లోరిన్‌ల 97 సెంట్లు. పారిస్ మార్పిడి రేటు 25.20 ఫ్రాంకులకు మించిన మేరకు ఫ్రాన్సుకు చెందిన ఇంగ్లీషు పరపతి గ్రహీతకు అది అనుకూలంగా మారుతుంది. లేదా ఫ్రెంచి సరుకుల కొనుగోలుదారుడికి అది అనుకూలంగా మారుతుంది. ఈ రెండు సందర్భాలలోనూ విదేశాలలో కొనుగోళ్ళలో అతనికి తక్కువ పౌండ్ల స్టెర్లింగ్ సరిపోతాయి. మార్పిడి బిల్లులు కొరత ఉన్నప్పుడు ఇంగ్లాండుకు చెల్లించాల్సిన సొమ్ము తగినంత లేనప్పుడు, విలువైన లోహం సులభంగా లభ్యం కానప్పుడు ఇంగ్లాండుకు పంపించే సరుకుల ధరలను పెంచటం సహజ మవుతుంది. ఎందుకంటే వాటికి గిరాకీ పెరుగుతుంది. మార్పిడి బిల్లుకు బదులు సరుకులు పంపటం జరుగుతుంది. ఇండియాలో తరచూ ఇది జరుగుతూ వుంటుంది.

ఇంగ్లాండులో డబ్బు విస్తారంగా ఉన్నప్పుడు, వడ్డీ రేటు తక్కువగా ఉన్నప్పుడు, సెక్యూరిటీల ధర ఎక్కువగా ఉన్నప్పుడు మార్పిడి రేటు ఇంగ్లాండుకు ప్రతికూలంగా ఉండవచ్చు. బంగారం బయటికి ప్రవహించవచ్చు కూడా.

1848లో ఇంగ్లాండు ఇండియా నుంచి పెద్ద మొత్తాలలో వెండిని పొందింది. మంచి మార్పిడి బిల్లులు లేకపోవడం వల్ల, 1847 సంక్షోభ ఫలితంగా నాసిరకం బిల్లులను వెంటనే ఆమోదించక పోవడం వల్ల ఇండియాతో ఉన్న వాణిజ్యంలో పరపతి సాధారణంగా లోపించడం వల్ల ఇది సాధ్యమైంది. ఈ వెండి అంతా ఇంగ్లాండు చేరగానే అది తిరిగి యూరప్ దేశాలన్నింటికీ ప్రవహించింది. అక్కడ విప్లవం కారణంగా ఎక్కడికక్కడ వెండిని దాచివేయటం జరిగింది. అయితే ఆ వెండిలో అత్యధిక భాగం 1850లో ఇండియాకు తిరిగి వచ్చేసింది. అప్పుడు మార్పిడి రేటు లాభదాయకంగా ఉండటమే కారణం.

★ ★ ★

ద్రవ్య వ్యవస్థ ప్రధానంగా కేథలిక్ సంస్థ లాంటిది. పరపతి వ్యవస్థ ప్రధానంగా ప్రొటెస్టెంట్ సంస్థ లాంటిది. స్కాట్లాండ్ వారు బంగారాన్ని ద్వేషిస్తారు. కాగితం రూపంలో సరుకుల డబ్బు అస్తిత్వం సామాజికం మాత్రమే. విశ్వాసమే ముక్తికి మార్గం. సరుకుల ఆత్మగా డబ్బు విలువపై విశ్వాసం, ఉత్పత్తి విధానంపై విశ్వాసం ముందే నిర్ణయమైపోయిన వ్యవస్థపై విశ్వాసం, స్వయం విస్తరణ పెట్టుబడికి కేవలం వ్యక్తి రూపాలుగా వ్యక్తిగత ఉత్పత్తి ప్రతినిధులపై విశ్వాసం. అయితే కేథాలిసిజమ్ పునాదుల నుంచి ప్రొటెస్టాంటిజమ్ తనను తాను ఎలా విముక్తి చేసుకోలేదో ద్రవ్య వ్యవస్థ పునాదుల నుంచి పరపతి వ్యవస్థ కూడా తనను తాను విముక్తి చేసుకోలేదు.

★ ★ ★

## అధ్యాయం - 36

# పెట్టుబడిదారీ పూర్వ సంబంధాలు

**వ**డ్డీ ఇచ్చే పెట్టుబడి లేదా దాని కాలం చెల్లిన రూపంలో పిలవాలంటే వడ్డీ వ్యాపారి పెట్టుబడి, దాని కవల సోదరుడైన వాణిజ్య పెట్టుబడి, రెండూ పెట్టుబడి తాలూకు కాలం చెల్లిన రూపాలు. ఇవి పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానానికి చాలా ముందు కాలంలోనూ, అత్యంత విభిన్న సామాజికార్థిక నిర్మాణాల్లోనూ కనిపిస్తాయి.

వడ్డీ వ్యాపారి పెట్టుబడి ఉనికికి కనీస ఉత్పాదితాలలో ఒక భాగం సరుకులుగా రూపాంతరం చెందటం సరుకుల వాణిజ్యంతో పాటు ఆ డబ్బు తన వివిధ కార్యకలాపాలలో అభివృద్ధి చెందటం అవసరం.

వడ్డీ వ్యాపారి పెట్టుబడి అభివృద్ధి అన్నది వాణిజ్య పెట్టుబడి అభివృద్ధితో, ముఖ్యంగా డబ్బుతో వ్యవహరించే పెట్టుబడి అభివృద్ధితో ముడిపడి వుంటుంది. ప్రాచీన రోమ్‌లో రిపబ్లిక్ చివరి సంవత్సరాలలో ప్రారంభమై వాణిజ్య పెట్టుబడి, డబ్బుతో వ్యవహరించే పెట్టుబడి, వడ్డీ వ్యాపారి పెట్టుబడి ఆ ప్రాచీన రూపం పరిధిలోనే వాటి అత్యున్నత దశకు చేరుకున్నాయి. అవి ప్రారంభమైన నాటికి ప్రాచీన ప్రపంచ సగటు అభివృద్ధి స్థాయికంటే వస్తూత్పత్తి దిగువన ఉండింది.

కూడపెట్టడం అన్నది డబ్బుతోపాటే తలెత్తుతుందన్న అంశాన్ని మనం గ్రహించాము. అయితే వృత్తిరీత్యా కూడబెట్టే వ్యక్తి వడ్డీ వ్యాపారిగా రూపాంతరం చెందే వరకూ అతను ప్రాధాన్యాన్ని సంతరించు కోలేడు. వ్యాపారి లాభం సంపాదించటానికే డబ్బు అప్పుగా తీసుకొంటాడు. దానిని పెట్టుబడిగా ఉపయోగించటానికి, అంటే దానిని వ్యయం చేయటానికి తీసుకొంటాడు. కనుక ప్రాచీన సామాజిక రూపాలలో కూడా వడ్డీ వ్యాపారి ఇప్పటి ఆధునిక పెట్టుబడిదారునితో కలిగి వున్న సంబంధాన్నే ఆనాటి వర్తకంలో కలిగి వున్నాడు. ఈ ప్రత్యేక సంబంధంతో కేథలిక్ విశ్వవిద్యాలయానికి కూడా అనుభవం ఉంది. 'అల్కల', 'సలమాంక', 'ఇంగోల్‌స్టాట్', బ్రేస్‌గోలోని 'ఫ్రైబర్గ్', 'మేయన్స్', 'కొలోన్', 'ట్రేవ్స్' విశ్వవిద్యాలయాలన్నీ ఒకదాని తర్వాత ఒకటి వాణిజ్య రుణాలపై వడ్డీ చట్టబద్ధతను గుర్తించాయి. వీటిలో మొదటి అయిదు ఆమోద ముద్రలు లయాన్స్ నగరంలో కాన్సలేట్‌లోని ప్రాచీన పత్రాలయంలో భద్రపరచబడి వున్నాయి. 'Traite de l'usure et des interets by Bruyset - Ponthus, Lyons' అనుబంధంలో ఇవి ప్రచురితమయ్యాయి. (ఎమ్. ఆగియర్, లేక్రెడిట్ పబ్లిక్... పారిస్ 1842) బానిస వ్యవస్థ (పితృస్వామిక వ్యవస్థ కాక తర్వాత కాలానికి చెందిన గ్రీకు, రోమన్ తరహా వ్యవస్థ) సంపదను పోగుచేసే సాధనంగా తోడ్పడే రూపాలన్నింటిలోనూ, బానిసలు భూమి తదితరాల కొనుగోళ్ళ ద్వారా ఇతరుల శ్రమను స్వాహా చేసే సాధనంగా డబ్బు వినియోగపడే రూపాలలో డబ్బు పెట్టుబడిగా

విస్తరించటం సాధ్యమవుతుంది. అంటే డబ్బు వడ్డీని ఇస్తుంది. ఎందుకంటే దానిని మదుపు పెట్టడం సాధ్యం కనుక.

పెట్టుబడిదారీ ఉత్పత్తికి ముందు దశలలో వడ్డీ వ్యాపారి పెట్టుబడి రెండు రకాల స్వాభావిక రూపాలలో కనిపిస్తుంది. స్వాభావిక రూపాలని నేను కావాలనే అంటున్నాను. అవే రూపాలు పెట్టుబడిదారీ ఉత్పత్తి ప్రాతిపదికపై కూడా పునరావృత్తమవుతాయి. అయితే కేవలం ద్వితీయ ప్రాధాన్యం గల రూపాలుగా ఉంటాయి. ఈ విధానంలో వడ్డీ ఇచ్చే పెట్టుబడి స్వభావాన్ని ఈ రూపాలు నిర్ధారించలేవు. ఈ రెండు రూపాలు : ఒకటి – పై వర్గాలలో అతిగా ఖర్చుపెట్టే వారికి, ముఖ్యంగా భూస్వాములకు అధిక వడ్డీపై ఇచ్చే రుణం. రెండు – తమ శ్రమ పరిస్థితులకు తామే యజమానులైన చిన్న ఉత్పత్తిదారులకు అధిక వడ్డీపై అప్పు ఇవ్వటం. వీరిలో చేతివృత్తిదారుడు ఉంటాడు. కానీ ప్రధానంగా రైతాంగం ఉంటుంది. ఎందుకంటే పెట్టుబడిదారీ పూర్వ పరిస్థితులలో స్వతంత్ర వ్యష్టి ఉత్పత్తిదారులకు అవకాశం ఉన్న మేరకు వారిలో అత్యధిక సంఖ్యాకులు రైతులే అవుతారు.

అధిక వడ్డీ భారం వల్ల ధనిక భూస్వాములు నాశనమైపోవటం, చిన్న ఉత్పత్తిదారులు పూర్తిగా దరిద్రులుగా మారిపోవటం అన్నవి డబ్బు పెట్టుబడి పెద్ద మొత్తాలలో ఏర్పడటానికి, కేంద్రీకరించ బడటానికి దారితీస్తాయి. అయితే ఈ ప్రక్రియ పాత ఉత్పత్తి విధానాన్ని ఏ మేరకు యూరప్‌లోలాగా రద్దు చేస్తుంది, దాని స్థానంలో పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానాన్ని ఏ మేరకు స్థాపిస్తుంది అనేది చారిత్రకాభివృద్ధి దశపైన, ఇతర పరిస్థితులపైన పూర్తిగా ఆధారపడి వుంటుంది.

వడ్డీ ఇచ్చే పెట్టుబడికి స్వాభావిక రూపంగా వడ్డీ వ్యాపారి పెట్టుబడి అన్నది స్వయం నియుక్త రైతుకు, చిన్న చేతివృత్తుల యజమానికి చెందే చిన్నతరహా ఉత్పత్తి ప్రాబల్యానికి అనుగుణంగా వుంటుంది. శ్రమ పరిస్థితులు, శ్రమ ఉత్పాదితం అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ విధానంలోలాగా పెట్టుబడి రూపంలో కార్మికుణ్ణి ఎదుర్కొంటున్నప్పుడు ఉత్పత్తిదారుడు అతడు డబ్బును అప్పు తీసుకోవాల్సిన అవసరం లేదు. డబ్బు అప్పు తీసుకొంటే అతడు తాకట్టు దుకాణంలో తన వ్యక్తిగతమైన అవసరాలు తీర్చుకోవటం కోసం మాత్రం అప్పు తీసుకొంటాడు. అయితే కార్మికుడే యజమాని అయినచోటల్లా అతని శ్రమ పరిస్థితులకు అతని ఉత్పాదితానికి అతడే వాస్తవంగానో, నామమాత్రంగానో యజమాని అయినప్పుడు వడ్డీ వ్యాపారి పెట్టుబడితో అతడు ఉత్పత్తిదారునిగా సంబంధం కలిగి ఉంటాడు. ఆ పెట్టుబడి అతనిని వడ్డీ వ్యాపారి పెట్టుబడిగా ఎదుర్కొంటుంది. బ్యాంకరు గౌరవించ బడతాడని, వడ్డీ వ్యాపారి ద్వేషించబడతాడని, అసహ్యించుకోబడతాడని, ఎందుకంటే బ్యాంకరు ధనికులకే అప్పు ఇస్తాడని కాగా వడ్డీ వ్యాపారి పేదవాళ్ళకు అప్పు ఇస్తాడని న్యూమాన్ చేసిన ప్రకటన సారహీనంగా వుంది. (ఎఫ్.డబ్ల్యు. న్యూమాన్, లెక్చర్స్ ఆన్ పొలిటికల్ ఎకానమీ, లండన్, 1851) రెండు ఉత్పత్తి విధానాల మధ్య వాటికి సంబంధించిన సామాజిక వ్యవస్థల మధ్య ఉన్న భేదం ఇక్కడ ప్రధానమన్న వాస్తవాన్ని అతడు పట్టించుకోలేదు. ఈ పరిస్థితిని ధనిక, పేద తేడాతో వివరించడం సాధ్యం కాదు. చిన్న ఉత్పత్తిదారుని పీల్చిపిప్పిచేసే వడ్డీ వ్యాపారమే పెద్ద ఎస్టేట్‌ల ధనిక యజమానిని కూడా పీల్చిపిప్పి చేస్తుంది. రోమన్ కులీనుల వడ్డీ వ్యాపారం రోమన్ సాదా పౌరులను, చిన్న రైతులను పూర్తిగా నాశనం చేసిన వెంటనే ఈ రూపంలో దోపిడీ అంతమయిపోయింది. చిన్న రైతాంగ ఆర్థిక విధాన స్థానాన్ని నికార్సైన బానిస ఆర్థిక వ్యవస్థ ఆక్రమించింది.

వడ్డీ రూపంలో కనీస జీవనభృతి సాధనాలపైన ఉన్న మిగులు మొత్తాన్ని (జీవనభృతి సాధనాల మొత్తమే తర్వాత ఉత్పత్తిదారుల వేతనాలుగా మారుతుంది.) వడ్డీ వ్యాపారం మింగేయగలుగుతుంది. (వడ్డీ వ్యాపారం తర్వాత కాలంలో లాభం, భూమి కౌలుల రూపాన్ని సంతరించుకొంటుంది.) కనుక ఈ వడ్డీ స్థాయితో, ప్రభుత్వానికి పోయే వాటా తప్ప మిగిలిన అదనపు మొత్తాన్నంతటినీ స్వాహా చేసే ఈ వడ్డీ స్థాయితో ఆధునిక వడ్డీ రేటు స్థాయిని పోల్చటం అసంబద్ధం. ఇక్కడ వడ్డీ అన్నది అదనపు విలువలో ఒక భాగం మాత్రమే. వేతన కార్మికుడు లాభాన్ని, వడ్డీని, భూమి కౌలును – అనగా మొత్తం అదనపు విలువను ఉత్పత్తి చేసి పెట్టుబడిదారునికి ఇస్తాడన్న విషయాన్ని ఈ పోలిక విస్మరిస్తుంది. పెట్టుబడిదారీ అభివృద్ధి దానితోపాటు వడ్డీ రేటు పడిపోవడం అన్నవి కార్మికునికి ఎంత సానుకూలమైన అంశాలో చూపించటానికి కేరీ ఈ అసంబద్ధపు పోలికను తెచ్చాడు. అంతేకాక కార్మికుణ్ణుంచి అదనపు శ్రమను పిండటంతో మాత్రమే సంతృప్తిపడక వడ్డీ వ్యాపారి క్రమంగా అతని శ్రమ పరిస్థితులను, భూమిని, ఇంటిని, ఇతర అంశాలను స్వాధీనం చేసుకొంటాడు. అతడలా నిరంతరాయంగా స్వాహా చేస్తూనే వుంటాడు. అయితే మరోవైపున ఇలా కార్మికుని శ్రమ పరిస్థితులు అతనినుంచి దూరమైపోవటం అన్నది పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం సాధించదల్చుకున్న లక్ష్యం కాదు. అది దాని ప్రారంభ స్థానానికి ముందే ఏర్పడిన పరిస్థితి మాత్రమే. వేతన బానిస, నిజమైన బానిసలాగానే అతని పరిస్థితివల్ల, రుణదాతకు బానిసగా మారలేదు. కనీసం ఉత్పత్తిదారుని హోదాలో అలా మారలేదు. వేతన బానిస ఒక వినిమయదారునిగా పరపతిదాతకు బానిస కావచ్చు. ప్రత్యక్ష ఉత్పత్తిదారుల అదనపు శ్రమ మొత్తాన్ని ఉత్పత్తి విధానాన్ని మార్చకుండానే స్వాహా చేసే వడ్డీ వ్యాపారి పెట్టుబడి రూపం, శ్రమ పరిస్థితులు (దీనికి తగిన చిన్న స్థాయి ఉత్పత్తి) ఉత్పత్తిదారుల యాజమాన్యంలో లేదా స్వాధీనంలో ఉండటం అన్నది దాని ప్రధానమైన షరతుగా ఉండే రూపంలో, పెట్టుబడి ప్రత్యక్షంగా శ్రమను తన ఆధిపత్యం కిందికి తీసికోని రూపంలో, పెట్టుబడి శ్రమను పారిశ్రామిక పెట్టుబడిగా ఎదుర్కోని రూపంలో ఈ వడ్డీ వ్యాపారి పెట్టుబడి ఉత్పత్తి విధానాన్ని మరింత దరిద్రంగా మారుస్తుంది. ఉత్పాదక శక్తులను అభివృద్ధి చేయటానికి బదులు కుంటుపరుస్తుంది. పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానంలోలాగా శ్రమను బలిపెట్టి శ్రమ ఉత్పాదకతను అభివృద్ధి చేయని దుర్భర పరిస్థితులను శాశ్వతం చేస్తుంది.

ఆ రకంగా వడ్డీ వ్యాపారం ప్రాచీన భూస్వామ్య సంపదపైన, ఆస్తిపైన, బలహీనపరిచే విచ్ఛిన్న కరమైన ప్రభావాన్ని నెరపుతుంది. మరోవైపున చిన్న రైతును, పట్టణాల్లోని పెట్టీ బూర్జువా ఉత్పత్తిని క్లుప్తంగా చెప్పాలంటే ఉత్పత్తిదారుడు ఇంకా తన ఉత్పత్తి సాధనాలకు యజమానిగా కనిపించే అన్ని రూపాలను బలహీనపరుస్తుంది. నాశనం చేస్తుంది. అభివృద్ధిచెందిన పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానంలో కార్మికుడు ఉత్పత్తి సాధనాల యజమాని కాడు. అతడు దున్నే భూమికి, అతడు శుద్ధి చేసే ముడిపదార్థాలకు అతడు యజమాని కాడు. అయితే ఈ వ్యవస్థలో ఉత్పత్తిదారు నుంచి ఉత్పత్తి సాధనాలను వేరుచేయటమన్నది, ఉత్పత్తి విధానంలో వాస్తవంగా వచ్చిన విప్లవాన్ని ప్రతిబింబిస్తుంది. విడివిడిగా ఉండే కార్మికులంతా పెద్ద వర్క్‌షాపుల్లో, అంతస్సంబంధం కలిగిన వేర్వేరు పనులను నిర్వహించటం కోసం తీసుకురాబడతారు. పరికరం యంత్రం అవుతుంది. చిన్న ఆస్తితో కూడి వుండే ఉత్పత్తి పరికరాలు చెల్లాచెదురు కావటాన్ని ఉత్పత్తి విధానమే అనుమతించదు. కార్మికుడు

విడిగా వుండటాన్ని కూడా అనుమతించదు. పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానంలో వడ్డీ వ్యాపారం ఉత్పత్తిదారుని ఉత్పత్తి సాధనాల నుంచి వేరుచేయజాలదు. ఎందుకంటే అవి అప్పటికే వేరు అయిపోయాయి.

ఉత్పత్తి సాధనాలు చెల్లాచెదురుగా ఉన్నప్పుడు వడ్డీ వ్యాపారం డబ్బును కేంద్రీకరిస్తుంది. అది ఉత్పత్తి విధానాన్ని మార్చదు. అయితే దానికది పరాన్నభుక్కులా అతుక్కుని ఉంటుంది. దానిని దరిద్రంగా మారుస్తుంది. దాని రక్తాన్ని పీలుస్తుంది. శక్తి ఉడిగిపోయేలా చేస్తుంది. మరింత దయనీయ మైన పరిస్థితులకు పునరుత్పత్తిని నెడుతుంది. వడ్డీ వ్యాపారులకు వ్యతిరేకంగా తీవ్రమైన ప్రజాద్వేషానికి అదే కారణం. ఉత్పత్తి సాధనాలపైన ఉత్పత్తిదారుని యాజమాన్యం స్వతంత్ర పౌరునికి తగిన రాజకీయ హోదానిచ్చే ప్రాతిపదికగా ఉన్న ప్రాచీన ప్రపంచంలో ఈ ద్వేషం అత్యంత తీవ్ర స్థాయిలో వుండింది.

బానిస వ్యవస్థ ప్రబలంగా వున్న మేరకు లేదా అదనపు ఉత్పాదితం ఫ్యూడల్ ప్రభువు, అతని మందీ మార్బలంచేత వినియోగం కాబడుతున్న మేరకు – బానిస యజమాని గానీ లేదా ఫ్యూడల్ ప్రభువు గానీ వడ్డీ వ్యాపారి విషకౌగిలిలో చిక్కుకొన్నప్పటికీ ఉత్పత్తి విధానం యథాతథంగానే వుంటుంది. కార్మికుని పరిస్థితి మరింత దుర్భరంగా మారుతుంది. రుణగ్రస్త బానిస యజమాని లేదా ఫ్యూడల్ ప్రభువు తాను స్వయంగా అణచబడటం వల్ల మరింత తీవ్రంగా కార్మికుల్ని అణచివేస్తాడు. లేదా చివరికి వడ్డీ వ్యాపారికి తన స్థానాన్ని వదులుకొంటాడు. వడ్డీ వ్యాపారి స్వయంగా ప్రాచీన రోమ్‌లో నైట్సులాగా భూస్వామి లేదా బానిస యజమాని అవుతాడు. పాత దోపిడీదారుని స్థానాన్ని అనగా కేవలం రాజకీయ అధికారానికి సాధనంగా ఉండే పితృస్వామిక దోపిడీదారుని స్థానాన్ని డబ్బు పిచ్చి ముదిరిన నడమంత్రపు దోపిడీదారుడు ఆక్రమిస్తాడు. అయితే దానివల్ల ఉత్పత్తి విధానం ఏమీ మారదు.

రాజకీయ నిర్మాణం అదే రూపంలో – దేని స్థిరమైన ప్రాతిపదికపైన, నిరంతరాయమైన పునరుత్పత్తిపైన ఆధారపడి ఉందో – అటువంటి పెట్టుబడిదారీ పూర్వ ఉత్పత్తి విధానాలన్నింటిలోనూ ఆ సంపద రూపాలన్నింటినీ నాశనం చేసి రద్దు చేసిన మేరకే వడ్డీ వ్యాపారానికి విప్లవాత్మకమైన ప్రభావం ఉందని చెప్పవచ్చు. ఆసియా రూపాలలో ఆర్థిక పతనం రాజకీయ అవినీతిని పెంచడం తప్ప మరిదేన్నీ ఉత్పత్తి చేయకుండానే వడ్డీ వ్యాపారం చాలా కాలంపాటు కొనసాగగలదు. పెట్టుబడిదారీ ఉత్పత్తికి ఇతర ప్రాథమిక అవసరాలు సమకూడినచోట మాత్రమే ఒకవైపున ఫ్యూడల్ ప్రభువును, చిన్నతరహా ఉత్పత్తిదారుణ్ణి నాశనం చేయటం ద్వారానూ, మరోవైపున శ్రమ పరిస్థితులను పెట్టుబడిగా కేంద్రీకరించటం ద్వారాను కొత్త ఉత్పత్తి విధానాన్ని ఏర్పరచడంలో తోడ్పడేందుకు వడ్డీ వ్యాపారం ఒకానొక సాధనంగా మారుతుంది.

మధ్యయుగాలలో ఏ దేశానికీ సార్వత్రిక వడ్డీ రేటు అన్నది లేదు. వడ్డీకి అప్పు ఇవ్వటాన్ని చర్చి ముందునుంచే నిషేధించింది. చట్టాలు, కోర్టులు, రుణాలకు రక్షణ ఇచ్చింది శూన్యం. ప్రత్యేక సందర్భాలలో వడ్డీ రేటు అత్యధికంగా ఉండేది. డబ్బు పరిమితంగా చలామణిలో ఉండటమూ, చెల్లింపులలో అత్యధికం నగదు రూపంలో జరగటం అన్నవి ప్రజలు డబ్బు అప్పులు చేయటం తప్పనిసరి అయింది. మార్పిడి వ్యాపారం ఇంకా అభివృద్ధి చెందనపుడు ఇది మరింతగా వర్తిస్తుంది. వడ్డీ రేట్ల విషయంలో, వడ్డీకి సంబంధించిన భావనల విషయంలో చాలా తేడాలు ఉండేవి. చార్లెమాన్

కాలంలో 100% వడ్డీ వసూలు చేయటం అధిక వడ్డీగా భావించబడింది. 1348లో విండోలో కొంతమంది పట్టణాల్లోని చిన్న వ్యాపారులు $216\frac{2}{3}$ % వడ్డీ తీసుకొన్నారు. జ్యూరిచ్‌లో సిటీ కౌన్సిల్ $43\frac{1}{3}$%ను చట్టబద్ధమైన వడ్డీ రేటుగా నిర్దేశించింది. ఇటలీలో 12వ శతాబ్దం నుంచి 14వ శతాబ్దం వరకు మామూలు వడ్డీ రేటు 20% దాటనప్పటికీ కొన్ని సందర్భాలలో 40% చెల్లించాల్సి వచ్చేది. $12\frac{1}{2}$% చట్టబద్ధమైన రేటు అన్నది వెరోనా ఆదేశం. రెండవ ఫ్రెడరిక్ చక్రవర్తి 10% వడ్డీ రేటుగా నిర్ణయించాడు. అయితే అది యూదులకు మాత్రమే వర్తించేది. అతడు క్రైస్తవుల విషయం మాట్లాడటం మంచిది కాదనుకున్నాడు. జర్మన్ రైన్ రాష్ట్రాలలో ఎప్పుడో 13వ శతాబ్దంలోనే 10% సాధారణంగా అమలులో వుంది. (హ్యూల్ మాన్ గెసిస్టే డెస్ స్టాటె వెసన్స్ – II ఎస్. 55–57)

వడ్డీ వ్యాపారి పెట్టుబడి, పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం లేకుండానే, పెట్టుబడిలాగా దోపిడీ చేస్తుంది. ఈ పరిస్థితి బూర్జువా ఆర్థిక విధానంలో కూడా వెనుకబడిన పారిశ్రామిక శాఖల్లో లేదా ఆధునిక ఉత్పత్తి విధానానికి జరిగే పరివర్తనను ప్రతిఘటించే శాఖల్లో కూడా పునరావృత్తమవుతుంది. ఉదాహరణకు మనం ఇంగ్లాండులో వడ్డీ రేటును ఇండియన్ వడ్డీ రేటుతో పోల్చదల్చుకుంటే తీసుకోవలసింది, బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండు వడ్డీ రేటును కాదు, ఇంగ్లాండులో చిన్న పరిశ్రమ ఉత్పత్తిదారుల దగ్గర చిన్న యంత్రాలను అప్పిచ్చేవారు వసూలు చేసే వడ్డీని పరిగణించాలి.

వడ్డీ వ్యాపారం తనంత తానుగా పెట్టుబడిని సృష్టించే ప్రక్రియగా ఉన్న మేరకు సంపదను వినిమయించడానికి విరుద్ధంగా – దానికి చారిత్రక ప్రాధాన్యత వున్నది. వడ్డీ వ్యాపారి పెట్టుబడి, వర్తకుని సంపద భూ ఆస్తితో ప్రమేయం లేకుండానే డబ్బు సంపదను రూపొందించటాన్ని పెంపొందిస్తుంది. ఉత్పాదితాలు సరుకుల స్వభావాన్ని ఎంత తక్కువగా సంతరించుకొంటే, మార్పిడి విలువ ఉత్పత్తిని ఎంత తక్కువ తీవ్రంగా, ఎంత తక్కువ విస్తారంగా ఆక్రమిస్తే అంత ఎక్కువగా డబ్బు వాస్తవ సంపదలా కనిపిస్తుంది. ఉపయోగ విలువల్లో దాని పరిమిత ప్రాతినిధ్యానికి విరుద్ధంగా అది దరహంమీద సంపదలా కనిపిస్తుంది. కూడబెట్టడానికి పునాది ఇదే. ప్రపంచ డబ్బుగాను, కూడబెట్టిన డబ్బుగాను ఉండటంతో పాటు డబ్బు ప్రత్యేకించి చెల్లింపు సాధనాల రూపం కూడా. ఇక్కడ అది సరుకుల నిరపేక్ష రూపంగా కనిపిస్తుంది. చెల్లింపు సాధనంగా దాని కార్యకలాపమే వడ్డీని, డబ్బు పెట్టుబడిని అభివృద్ధి చేస్తుంది. సంపద దుబారా, అవినీతి సంపదా డబ్బును డబ్బుగా కోరతాయి. అంటే ప్రతీదాన్ని కొనే సాధనంగా (అప్పులు తీర్చే సాధనంగా) డబ్బును కోరతాయి. చిన్న ఉత్పత్తిదారునికి ముఖ్యంగా చెల్లింపుల కోసం డబ్బు కావాలి. (భూస్వాములకు ప్రభుత్వానికి వస్తురూపేణా చేసే సేవలు కట్టే పన్నులు డబ్బు కిరాయిగాను, డబ్బు రూపంలో పన్నులుగానూ మారటానికి ఇక్కడే గొప్ప పాత్ర వుంది). పై రెండు సందర్భాలలోనూ డబ్బు డబ్బు రూపంలోనే కావాలి. మరోవైపున వడ్డీ వ్యాపారంలోనే కూడబెట్టడం అన్నది మొదట వాస్తవంగా మారుతుంది. కూడబెట్టేవాడు తన స్వప్నాన్ని సార్థక్యం చేసుకుంటాడు. కూడబెట్టే వ్యక్తి నుంచి కావాల్సింది పెట్టుబడికాదు, డబ్బుగా మాత్రమే కోరబడుతుంది. అయితే వడ్డీ ద్వారా ఈ డబ్బు నిల్వను అతడు పెట్టుబడిగా మారుస్తాడు. అంటే అదనపు శ్రమను పాక్షికంగా లేదా పూర్తిగా స్వాహా చేసే సాధనంగా మారుస్తాడు. ఆ రకంగా ఉత్పత్తి సాధనాలు పేరుకు ఇతరుల ఆస్తిగానే ఉన్నప్పటికీ వాటిలో ఒక భాగంపైన పట్టు సంపాదిస్తాడు. ఎపిక్యూరస్ దేవుళ్ళు వివిధ ప్రపంచాలకు మధ్య ఉన్న స్థలాల్లో నివసించినట్టే వడ్డీ వ్యాపారం కూడా ఉత్పత్తి

రంధ్రాలలో నివసిస్తుంది. సరుకు రూపం ఎంత తక్కువగా ఉత్పాదితాల సాధారణ రూపంలో ఉంటే డబ్బును పొందటం అంత కష్టం. కనుక వడ్డీ వ్యాపారికి అవసరం ఉన్నవాడి కట్టగల్గిన శక్తి లేదా ప్రతిఘటించగల శక్తి తప్ప మరో ఆటంకం ఏమీ లేదు. కార్మికుని ఉత్పత్తి సాధనాలు (అతడు ఇంకా ఈ ఉత్పత్తి విధానాలలో ఉత్పత్తి సాధనాల యజమానిగానే ఉంటాడు.) కార్మికుని ఉత్పత్తి సాధనాలు ప్రమాదవశాత్తూ లేదా అసాధారణమైన ఇబ్బందుల వల్ల లేదా మామూలు పునరుత్పత్తి క్రమంలో భర్తీ కాకపోవడం వల్ల కోల్పోతే – చిన్న రైతు, చిన్న పట్టణ వ్యాపారి ఉత్పత్తిలో డబ్బు కొనుగోలు సాధనంగా పనికొస్తుంది. జీవనభృతి సాధనాలు, ముడిపదార్థాలు ఈ ఉత్పత్తి అవసరాలలో ప్రధానమైన భాగం. ఇది మరింత ప్రియంగా మారితే ఉత్పాదితం అమ్మగా వచ్చిన సొమ్ముతో వాటిని భర్తీచేయటం అసాధ్యమవుతుంది. పంటలు దెబ్బతిన్నప్పుడు రైతు విత్తనాలను కూడా భర్తీ చేయలేని స్థితిలో పడతాడు. రోమన్ కులీనులు సాదా పౌరుల్ని బలవంతంగా సైనికులుగా మార్చటానికి వీలు కల్పించిన యుద్ధాలే, సాదా పౌరులు తమ శ్రమ పరిస్థితులను పునరుద్ధరించుకోకుండా అడ్డుకొని వారిని దరిద్రులుగా మార్చిన ఈ యుద్ధాలే (దరిద్రులుగా మార్చటమూ, పునరుత్పత్తికి పూర్వావసరాలను నష్టపర్చటమూ ఇక్కడ ప్రబలమైన రూపం.) కులీనులు నిల్వ గదులను, ఖజానాలను దోపిడీ చేసిన రాగితో నింపాయి. రాగి ఆనాటి డబ్బు. సాదా పౌరులకు అవసరమైన ధాన్యము, గుర్రాలు, పశువులు మొదలైన సరుకులను ఇవ్వడానికి బదులు వారికి ఈ రాగిని అప్పుగా ఇచ్చారు. ఈ రాగితో స్వయంగా కులీనులకు పనేమీలేదు. ఈ పరిస్థితిని అధిక వడ్డీని పిండటానికి వారు వాడుకున్నారు. ఆ రకంగా వారు సాదా పౌరులను తమ రుణగ్రస్త బానిసలుగా మార్చారు. చార్ల్‌మాన్ (Charlemagne) హయాములో ఫ్రెంచ్ రైతులు కూడా ఇలాగే యుద్ధాలవల్ల నాశనమయ్యారు. పరపతి గ్రహీతలుగా ఉండటానికి బదులు దాసులుగా మారటం తప్ప వారికి గత్యంతరం లేకుండాపోయింది. రోమన్ సామ్రాజ్యంలో తీవ్రమైన ఆకలిదప్పుల వల్ల పిల్లల్ని అమ్మేయటం, స్వేచ్ఛాపౌరులు కూడా ధనవంతులకు తమను తాము అమ్ముకోవటం అన్నవి తరచుగా జరిగాయన్నది తెలిసిన విషయమే. ఇవి మూలమలుపు అంశాలు. ఇక వ్యక్తిగత స్థాయిలో ఉత్పత్తి సాధనాలను చిన్న ఉత్పత్తిదారులు కొనసాగించటం లేదా కోల్పోవటం అన్నదానికి వెయ్యి రకాల ఇబ్బందులు కారణం కావచ్చు. వీటిలో ఏ ఒక్క ఇబ్బంది అయినా ఏ ఒక్క నష్టమైనా చిన్న ఉత్పత్తిదారుని దరిద్రునిగా మార్చేయగలదు. ఆ ఇబ్బంది చిన్న రంధ్రం చేస్తే దానిలో పరాన్నభుక్కు వడ్డీ వ్యాపారి చొరబడిపోతాడు. చిన్న రైతు నాశనం కావటానికి అతని ఆవు చనిపోతే చాలు. అతని పునరుత్పత్తిని పాతస్థాయిలో కొనసాగించకుండా చేయటానికి అది చాలు. అతడు ఆ తర్వాత వడ్డీవ్యాపారి కబంధహస్తాల్లో ఇరుక్కుంటాడు. ఇక అక్కడి నుంచి బయటపడటం అతనికి దుస్సాధ్యమవుతుంది.

వడ్డీ వ్యాపారికి చాలా ప్రధానమైన స్వాభావికమైన స్థానం ఏదంటే డబ్బు చెల్లింపు సాధనంగా తన పనిని నిర్వహించటమే. భూమి కౌలు, కప్పం, పన్నులు వగైరాల డబ్బు చెల్లింపులకు ఒక నిర్ణీత తేదీ ఉంటుంది. కనుక ఆ తేదీకి డబ్బు సంపాదించాల్సిన అవసరం వుంటుంది. కాబట్టి ప్రాచీన రోమ్ నాటి నుంచి ఆధునిక కాలం వరకూ టోకు వడ్డీ వ్యాపారం పన్ను వసూలు ధరపైన ఆధారపడి వుంది. (fermiers generaux, receveurs generaux) వాణిజ్యాభివృద్ధితోపాటు సరుకు ఉత్పత్తి సార్వత్రికం కావటంతోపాటు కొనుగోలు, చెల్లింపు అన్నవి కాలక్రమంలో విడిపోతాయి. డబ్బును ఒక నిర్ణీత తేదీకి చెల్లించాల్సి ఉంటుంది. ఇవాళ కూడా డబ్బు పెట్టుబడిదారుడు, వడ్డీ వ్యాపారి

ఒకరుగా మమేకమైపోయే పరిస్థితులకు ఇది ఎలా దారితీస్తుందనేదాన్ని ఆధునిక డబ్బు సంక్షోభాలు తెలియజేస్తాయి. ఇదే వడ్డీ వ్యాపారం, ఒక చెల్లింపు సాధనంగా డబ్బుకున్న అవసరాన్ని అభివృద్ధి చేసే ప్రధాన సాధనంగా మారుతుంది. ఉత్పత్తిదారుణ్ణి రుణాల రొంపిలో దించటం ద్వారా, అతని మామూలు చెల్లింపు సాధనాలను విచ్ఛిన్నం చేయటం ద్వారా ఇది సాధ్యమవుతుంది. వడ్డీ భారమే అతని మామూలు పునరుత్పత్తిని అసాధ్యం చేస్తుంది. ఈ దశలో డబ్బు నుంచి వడ్డీ వ్యాపారం చెల్లింపు సాధనంగా అంకురిస్తుంది. వడ్డీ వ్యాపారం డబ్బు చేసే పనిని తన సొంత హక్కులాగా విస్తరిస్తుంది.

పరపతి వ్యవస్థ వడ్డీ వ్యాపారానికి వ్యతిరేక ప్రతిక్రియగా అభివృద్ధి చెందుతుంది. అయితే ప్రాచీన రచయితలు, చర్చి ఫాదర్లు, లూథర్ లేక తొలి షోషలిస్టులు భాష్యం చెప్పిన రీతిలో దీనిని అపార్థం చేసుకోరాదు. ఇది పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానపు పరిస్థితులకు, అవసరాలకు వడ్డీ ఇచ్చే పెట్టుబడి లోబడి ఉండేలా చేయటం తప్ప మరొకటి కాదు.

మొత్తం మీద ఆధునిక పరపతి వ్యవస్థలో పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానపు పరిస్థితులకు అనుగుణంగా వడ్డీ ఇచ్చే పెట్టుబడి మలచబడింది. వడ్డీ వ్యాపారం ఇంకా మనుగడ సాగిస్తూనే వుంది. అంతేకాదు అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం సాగే దేశాలలో ఇంతకు ముందు కాలపు శాసనాల సంకెళ్ళను విడగొట్టి దానికి స్వేచ్ఛ కల్పించబడింది. అప్పు తీసుకోవటం అన్నది పెట్టుబడిదారీ ఉత్పత్తికి తగిన రీతిలో కాక వేరే వ్యక్తులకు లేక వర్గాలకు లేదా వేరే పరిస్థితులలో జరిగినపుడు వడ్డీ ఇచ్చే పెట్టుబడి వడ్డీ వ్యాపారి పెట్టుబడిగా తన రూపాన్ని నిలబెట్టుకుంటుంది. తాకట్టు దుకాణంలో లాగా వ్యక్తిగతమైన అవసరంతో అప్పు చేసినప్పుడు, దుబారా చేయటానికి ధనికులైన ఖర్చుదారులు డబ్బు అప్పు తీసుకొన్నప్పుడు లేదా ఉత్పత్తిదారుడు చిన్న రైతు లేదా చేతివృత్తిదారునిలాగా పెట్టుబడిదారీయేతర ఉత్పత్తిదారుడైనప్పుడు ఆ రకంగా తక్షణ ఉత్పత్తిదారుడు తన ఉత్పత్తి సాధనాలకు తానే యజమానిగా ఉన్నప్పుడు అంతిమంగా స్వయంగా పెట్టుబడిదారీ ఉత్పత్తిదారుడే ఈ స్వయం నియుక్త ఉత్పత్తిదారులను పోలిన చిన్న స్థాయి ఉత్పత్తిని మాత్రమే నిర్వహిస్తున్నప్పుడు వడ్డీ ఇచ్చే పెట్టుబడి వడ్డీ వ్యాపారి పెట్టుబడిగా తన రూపాన్ని నిలబెట్టుకొంటుంది.

వడ్డీ తెచ్చే పెట్టుబడికీ, (పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానంలో అది ఒక అత్యవసర అంశంగా వున్న మేరకు) వడ్డీ వ్యాపారి పెట్టుబడికీ ఉన్న తేడా ఈ పెట్టుబడి యొక్క స్వభావం కాదు. అది పనిచేసే మారిన పరిస్థితులలో మాత్రమే ఈ తేడా వుంది. రుణదాతను ఎదుర్కొనే రుణగ్రహీత యొక్క పూర్తిగా మారిన స్వభావంలో కూడా ఈ తేడా వుంది. ఒక పారిశ్రామికవేత్తగా లేదా ఒక వాణిజ్యవేత్తగా ఒక వ్యక్తి తన దగ్గర డబ్బు లేకపోయినా పరపతిని పుచ్చుకొన్నప్పుడు సైతం అతడు పెట్టుబడిదారునిగా వ్యవహరిస్తాడని, అప్పు తీసుకొన్న పెట్టుబడితో ప్రతిఫలం పొందని శ్రమ స్వాహా చేస్తాడని భావించటంవల్లనే అతనికి పరపతి ఇవ్వడం జరుగుతుంది. అతడు పెట్టుబడిదారునిగా రూపొందగల హోదాలోనే పరపతిని గ్రహిస్తాడు. డబ్బు లేకపోయినా అతను శక్తి స్థోమత, స్థిరత్వం, వ్యాపారపు తెలివితేటలు కలిగివుంటే ఈ రకంగా అతడు పెట్టుబడిదారుడు కావచ్చు. (పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానంలో ప్రతి వ్యక్తి వాణిజ్య విలువ దాదాపు ఖచ్చితంగా అంచనా వేయబడుతుంది.) ఈ పరిస్థితులను, ఈ లక్షణాలను పెట్టుబడిదారీ సమర్థకులు ఘనంగా శ్లాఘిస్తారు. అయితే ఈ

పరిస్థితి నిరంతరాయంగా రంగంలోకి కొత్త అదృష్టపు వేటగాళ్ళను అవాంఛనీయ సంఖ్యలో నెడుతూ ఉంటుంది. అప్పటికే వున్న వ్యక్తిగత పెట్టుబడిదారులతో వీరు పోటీపడుతూ ఉంటారు. అది పెట్టుబడి ఆధిక్యతను సుదృఢం చేస్తుంది. దాని పునాదిని విస్తరిస్తుంది. సమాజపు అడుగు పొరల నుండి కొత్త శక్తులను తన కోసం తెచ్చుకొంటూ వుంటుంది. ఈ క్రింది వాస్తవంతో దీనికి పోలిక వుంది. మధ్య యుగాలలో కేథలిక్ చర్చి తన అధికార పీఠాల క్రమాన్ని వారి వారి హోదాతో, జన్మతో, సొమ్ముతో ప్రమేయం లేకుండా కేవలం వారి తెలివితేటలపై ఆధారపడి అత్యుత్తమ మేధావులతో నింపింది. తమ మతాధిపత్యాన్ని స్థిరపర్చుకోవటానికి, సామాన్యులను అణచివుంచటానికి ఈ పరిస్థితి ఒక ప్రధాన సాధనంగా ఉపయోగపడింది. ఒక పాలకవర్గం ఒక పాలిత వర్గంలో అత్యున్నతమైన మేధావులను తనలో ఎంతగా కలుపుకోగలిగితే అది అంత స్థిరంగా వుంటుంది. దాని పాలన అంత ప్రమాదకరంగా వుంటుంది.

ఆధునిక పరపతి వ్యవస్థకు ఆద్యులు వడ్డీ ఇచ్చే పెట్టుబడిని గర్హనీయమని భావించరు. వారు అందుకు విరుద్ధంగా దానిని బహిరంగంగా గుర్తించటంతో ప్రస్థానం ప్రారంభిస్తారు.

పేద ప్రజలను కాపాడటం కోసం వడ్డీ వ్యాపారానికి వ్యతిరేకంగా తలెత్తిన ప్రతిక్రియలను మనం ఇక్కడ ప్రస్తావించటం లేదు. ఉదాహరణకు Monts-de-piete (ఫ్రాంచి కామెట్‌లోని సాల్లిన్స్‌లో 1350లో తరువాత, ఇటలీలోని పెరూగియా సవోనాలలో 1400–1479లలో) పవిత్రమైన ఆకాంక్షను వాస్తవంగా మార్చే ప్రక్రియలో సరిగ్గా వాటికి వ్యతిరేకమైన ఫలితాన్ని చరిత్ర సాధిస్తుంది. ఈ చరిత్ర పరిహాసాన్ని వెల్లడించే గమనార్హమైన అంశాలివి. ఆధునిక అంచనాల ప్రకారం ఇంగ్లాండు కార్మికవర్గం 100% వడ్డీని తాకట్టు దుకాణాలలో చెల్లిస్తుంది. ఈ దుకాణాలు Monts-de-piete ఆధునిక వారసులు.[1] డా॥ హ్యూ చాంబర్లేన్ లేదా జాన్ బ్రిస్కో లాంటి వారి – పరపతికి సంబంధించిన వింత ఊహలను మనం ప్రస్తావించటం లేదు. 17వ శతాబ్దపు చివరి దశాబ్దంలో స్థలాల, భవనాల సంపద ప్రాతిపదికగా కాగితం, డబ్బు ఉపయోగించి రైతుల బ్యాంకు ద్వారా ఇంగ్లీషు ప్రభువర్గాన్ని వడ్డీ వ్యాపారం సంకెళ్ళ నుండి విముక్తి చేయాలి అని వీరు ప్రయత్నించారు.[2]

---

1. "ఒక నెలలోనే తరచుగా వచ్చే ఆటుపోట్ల వల్ల ఒక వస్తువును విడుదల చేయటం కోసం మరో వస్తువును తాకట్టు పెడుతూ వుంటారు. కొద్దిపాటి సొమ్ము లభిస్తుంది. ఆ డబ్బుకోసం కట్టే ప్రీమియం అమితంగా ఉంటుంది. నగరంలో 240 మంది లైసెన్సు పొందిన తాకట్టు వ్యాపారులు ఉన్నారు. గ్రామసీమలలో దాదాపు 1450 మంది ఉన్నారు. దీనిలో తిరుగుతున్న పెట్టుబడి 10 లక్షల పౌండ్ల స్టెర్లింగ్‌కు మించి వుంటుంది. ఈ పెట్టుబడి ఏడాదిలో మూడుసార్లు తిరిగి వస్తుంది. ప్రతీసారి అది $33\frac{1}{2}$% చొప్పున సగటున వడ్డీ ఇస్తుంది. ఈ అంచనా ప్రకారం ఇంగ్లాండులో సమాజపు అట్టడుగున ఉన్న ప్రజలు ఏడాదికి తమ తాత్కాలిక రుణాలపైన 10 లక్షల పౌండ్లను చెల్లిస్తారు. వారు వస్తువులను కోల్పోవటానికి ఇక్కడే మినహాయింపు." (జె.డి. టకెట్, ఎ హిస్టరీ ఆఫ్ ది పాస్ట్ అండ్ ప్రజంట్ స్టేట్ ఆఫ్ ది లేబరింగ్ పాపులేషన్, లండన్, 1846)
2. వారి పుస్తకాల శీర్షికల్లో సైతం వారి ప్రధాన లక్ష్యాన్ని దాచుకోలేదు. "భూస్వాముల సార్వత్రిక క్షేమం కోసం భూమి విలువ బాగా పెరగటం కోసం," "ప్రభువర్గాన్ని భూస్వాములను పన్నుల నుంచి మినహాయించటం కోసం వారి ఎస్టేట్లు ఏటా పెంచుకోవటం కోసం" అని వారు స్పష్టం చేశారు. దీనివల్ల నష్టపోయేది కేవలం వడ్డీ వ్యాపారులు మాత్రమే. ఈ దేశద్రోహులు ఫ్రాన్స్ నుంచి దండెత్తి వచ్చిన సైనిక దళాలకంటే ప్రభువర్గానికి, భూస్వాములకు ఎక్కువ హాని చేశారు.

12, 14 శతాబ్దాలలో వెనిస్, జెనోవాలలో స్థాపించబడిన పరపతి సంఘాలు, సముద్ర వాణిజ్యపు అవసరాల నుంచి దానితో కలిపి ఉండే టోకు వాణిజ్యపు అవసరాలను తీర్చటానికి, కాలం చెల్లిన వడ్డీ వ్యాపారం నుంచి డబ్బు వాణిజ్యపు గుత్తాధిపత్యం నుంచి తమను తాము విముక్తం చేసుకోవటానికి గాను ఈ సంఘాలు తలెత్తాయి. ఆ నగర రిపబ్లిక్‌లలో స్థాపించబడిన వాస్తవ బ్యాంకులు అదే సమయంలో పబ్లిక్ పరపతి సంస్థలుగా రూపొందాయి. వాటినుంచి ప్రభుత్వం తన భవిష్యత్ ఆదాయాలపైన రుణాలను గ్రహించింది. ఈ సంఘాలను స్థాపించిన వర్తకులు ఆ ప్రభుత్వాలలో ప్రముఖులన్న సంగతిని మర్చిపోరాదు. వారు వడ్డీ వ్యాపారుల నుంచి తమను తాము విముక్తి చేసుకోవటంతో పాటు తమ ప్రభుత్వాన్ని కూడా విముక్తి చేయటంలో అంతే ఆసక్తిని కలిగి ఉన్నారు.[1] అదే సమయంలో రాజ్యాంగ యంత్రంపైన మరింత గట్టి పట్టును సంపాదించుకోవటానికి వారు ఈ రకంగా ప్రయత్నించారు. కనుక బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండు స్థాపించాల్సి వచ్చినప్పుడు టోరీలు కూడా ఇలా నిరసన వ్యక్తం చేశారు. "బ్యాంకులు గణతంత్ర సంస్థలు. వెనిస్, జెనోవా, ఆమ్‌స్టర్‌డామ్, హాంబర్గ్‌లలో సుభిక్షంగా ఉన్న బ్యాంకులు వర్ధిల్లాయి కానీ ఎవరైనా బ్యాంక్ ఆఫ్ ఫ్రాన్స్ లేదా బ్యాంక్ ఆఫ్ స్పెయిన్ అన్న పదాన్ని విన్నారా?"

1609లో స్థాపించిన బ్యాంక్ ఆఫ్ ఆమ్‌స్టర్‌డామ్ లాంటిదే 1619లో హాంబర్గ్ బ్యాంకు. ఆధునిక పరపతి వ్యవస్థ అభివృద్ధిలో ఇవి యుగ నిర్మాతలు కాదు. బ్యాంకు ఆఫ్ ఆమ్‌స్టర్‌డామ్, బ్యాంక్ ఆఫ్ హాంబర్గ్ కేవలం డిపాజిట్ల బ్యాంకులు మాత్రమే. బ్యాంకు విడుదల చేసిన చెక్కులు డిపాజిట్టు చేయబడిన నాణాలకు, నాణాల రూపంలోలేని విలువైన లోహానికి ఇచ్చిన రసీదులు మాత్రమే, ఇది ఆమోదించిన వారి ముద్రలో మాత్రమే చలామణిలో పెట్టబడ్డాయి. అయితే హాలెండ్‌లో వాణిజ్య పరపతి, డబ్బు వ్యాపారం, వాణిజ్యంతో పాటు కార్ఖానాలతో పాటు అభివృద్ధి అయ్యాయి. వడ్డీ ఇచ్చే పెట్టుబడి అభివృద్ధి క్రమంలోనే పారిశ్రామిక, వాణిజ్య పెట్టుబడికి లోబర్చబడింది. తక్కువ వడ్డీ రేటును బట్టి ఈ విషయం గ్రహించవచ్చు. ఇప్పటి ఇంగ్లండును చూసినట్టుగానే 17వ శతాబ్దంలో హాలెండును ఆర్థికాభివృద్ధికి ఆదర్శంగా పరిగణించేవారు. దరిద్రంపై ఆధారపడిన పాత తరహా వడ్డీ వ్యాపారపు గుత్తాధిపత్యం దాని సొంత భారం మోయలేక కుప్పకూలిపోయింది.

18వ శతాబ్దం మొత్తంలో హాలెండును నమూనాగా చూపించి నిర్బంధంగా వడ్డీ రేటును తగ్గించాలనే నినాదం చెలరేగింది. (శాసనాలను దాని ప్రకారం రూపొందించుకోవటం కోసం) వడ్డీ

1. ఉదాహరణకు ధనికుడైన కంసాలి (బ్యాంకర్‌కు ముందున్న మూలపురుషుడు) రెండో చార్లెస్ రాజుకు డబ్బు సర్ది 20, 30 శాతం వడ్డీ వసూలు చేశాడు. ఇంత లాభదాయకమైన వాణిజ్యం కావటాన కంసాలి "రాజుకు రోజురోజుకు మరింత పెద్ద మొత్తాలు అప్పిచ్చేలా చేసింది. ఆదాయాన్నంతటిని గ్రహించటానికి పార్లమెంట్ గ్రాంటులన్నిటిని తాకట్టు దుకాణానికి తీసుకుపోవటానికి ఆర్డర్లూ బిల్లులను కొనుగోలు చేయటంలోనూ తాకట్టు పెట్టుకోవటంలోను ఒకరితో ఒకరు పోటీ పడ్డారు. ఫలితంగా మొత్తం ప్రభుత్వ ఆదాయం అంతా వారి చేతుల మీదుగా నడిచింది." (జాన్ ఫ్రాన్సిస్, హిస్టరీ ఆఫ్ ది బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్, లండన్, 1848) "అంతకు ముందు ఈ బ్యాంకు స్థాపన అనేకసార్లు సూచించబడింది. చివరికి తప్పనిసరి అవసరంగా మారింది." (అదే గ్రంథం, పుట 38) "వడ్డీ వ్యాపారులు పీల్చి పిప్పిచేసిన ప్రభుత్వానికి బ్యాంకు అత్యవసరం. పార్లమెంటరీ గ్రాంటుల హామీతో సముచితమైన రేటు చొప్పున అప్పు పుచ్చుకోవటానికి ఇది తప్పనిసరి అవసరంగా మారింది." (అదే గ్రంథం, పుటలు 59, 60)

ఇచ్చే పెట్టుబడిని వాణిజ్య పారిశ్రామిక పెట్టుబడిపై పెత్తనం చేసేదిగా కాక దానికి లోబడి ఉండేదిగా మార్చటం కోసం ఈ నినాదం తలెత్తింది. సాధారణ ఇంగ్లీషు ప్రైవేటు బ్యాంకింగ్‌కు పితామహుడైన సర్ జోసయా చైల్డ్ ఈ ఉద్యమానికి ప్రధాన ప్రతినిధి. "ప్రైవేటు టైలర్సు" గుత్తాధిపత్యానికి వ్యతిరేకంగా పోరాడుతూ టోకు వస్త్రాల ఉత్పత్తిదారులు మోసెస్ అండ్ సన్ కంపెనీవారు ఖండించినట్లుగానే అతడు కూడా వడ్డీ వ్యాపారుల గుత్తాధిపత్యాన్ని తీవ్రంగా గర్హిస్తాడు. ఈ జోసయా చైల్డ్ అదే సమయంలో ఇంగ్లీషు స్టాకుల సట్టా వ్యాపారానికి పితామహుడు. ఆ రకంగా ఈ ఈస్టిండియా కంపెనీ నియంత స్వేచ్ఛా వాణిజ్యం పేరుతో దాని గుత్తాధిపత్యాన్ని సమర్థిస్తాడు. థామస్ మాన్లీకి వ్యతిరేకంగా (ఇంటరెస్ట్ ఆఫ్ మనీ మిస్‌టేకెన్)[1] అతడిలా అంటాడు. "వణికిపోతున్న పిరికి వడ్డీ వ్యాపారుల మొనగాడులా అతడు నేను అత్యంత బలహీనమైన అంశాలను పేర్కొన్నచోట తన ఆయుధాలను నిలబెట్టాడు... తక్కువ వడ్డీ రేటన్నది సంపదకు మూలం అన్న అంశాన్ని అతడు సూటిగా తిరస్కరిస్తున్నాడు. అది కేవలం సంపద ప్రభావం మాత్రమే అని అంటున్నాడు." (ట్రైటిస్ సర్ లీకామర్స్... 1669 ఆమ్‌స్టర్‌డామ్ ఎట్ బెర్లిన్, 1754) "ఒక దేశాన్ని సుసంపన్నం చేసేది వాణిజ్యం అయితే వడ్డీ రేటు తగ్గించటం వాణిజ్యాన్ని పెంచితే అప్పుడు వడ్డీ రేటు తగ్గించటం అన్నది, అధిక వడ్డీని పరిమితం చేయటమన్నది నిస్సందేహంగా ఒక జాతి సంపదకు ఫలప్రదమైన ప్రధాన కారణమవుతుంది. అదే విషయం అదే సమయంలో కొన్ని పరిస్థితులలో కారణంగానూ, మరికొన్ని పరిస్థితుల్లో కార్యంగానూ ఉంటుందనటం ఏమాత్రం అసంబద్ధం కాదు." (అదే గ్రంథం, పుట 155) "గుడ్డు కోడికి కారణం, కోడి గుడ్డుకు కారణం. వడ్డీ రేటు తగ్గించటం అన్నది ప్రపంచ పెరుగుదలకు కారణం కావచ్చు. సంపద పెరుగుదల వడ్డీ రేటును మరింతగా తగ్గించవచ్చు. (అదే గ్రంథం, పుట 156) "నేను పరిశ్రమను సమర్థిస్తున్నాను. నా ప్రత్యర్థి సోమరితనాన్ని, మందగమనాన్ని సమర్థిస్తున్నాడు." (పుట 179)

వడ్డీ వ్యాపారానికి వ్యతిరేకంగా సాగిన ఈ ప్రచండ యుద్ధం, పారిశ్రామిక పెట్టుబడికి వడ్డీ ఇచ్చే పెట్టుబడి లోబడి ఉండాలనే ఈ కోరిక, ఆధునిక బ్యాంకింగ్ వ్యవస్థలో పెట్టుబడిదారీ ఉత్పత్తి యొక్క ఈ అవసరాలను, పరిస్థితులను నెలకొల్పబోయే నిర్మాణ సంస్థలకు సూచిక మాత్రమే. ఈ బ్యాంకింగ్ వ్యవస్థ పనిలేని డబ్బు నిల్వలనన్నింటినీ కేంద్రీకరించి డబ్బు మార్కెట్‌లోనికి నెట్టడం ద్వారా వడ్డీ వ్యాపారి పెట్టుబడి గుత్తాధిపత్యాన్ని కూలగొడుతుంది. పరపతి డబ్బును సృష్టించడం ద్వారా వెండి, బంగారాల గుత్తాధిపత్యాన్ని పరిమితం చేస్తుంది.

చైల్డ్ విషయంలో మనం గమనించిన అధిక వడ్డీకి సంబంధించిన ఈ వ్యతిరేకత – వాణిజ్యం, పరిశ్రమ, ప్రభుత్వాలను వడ్డీ వ్యాపారపు సంకెళ్ళ నుంచి విముక్తి చేయాలనే కోరిక 17వ శతాబ్దపు మూడవ పాదంలోనూ, 18వ శతాబ్దపు తొలి సంవత్సరాలలోను ఇంగ్లాండులో బ్యాంకింగ్‌కు సంబంధించిన అన్ని రచనలలోనూ కనిపిస్తాయి. పరపతి యొక్క అద్భుత ప్రభావం గురించి, విలువైన లోహపు గుత్తాధిపత్యం రద్దయిపోవటం గురించి, దాని స్థానాన్ని కాగితం ఆక్రమించుకోవటం గురించి కూడా బ్రహ్మాండమైన భ్రమలను మనం ఈ రచనలలో చూడవచ్చు. స్కాట్లాండుకు చెందిన విలియమ్

1. ఈ గ్రంథం రచయిత థామస్ మాన్లీ కాదు. ఇది 1668లో లండన్‌లో రచయిత పేరు లేకుండా ముద్రించబడింది - సం॥

పాటర్‌సన్ బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండు, బ్యాంక్ ఆఫ్ స్కాట్లాండుల నిర్మాత. ఆయన్ని ఏ రకంగా చూసినా ప్రథమ శాసనకర్తగా పేర్కొనవచ్చును.[1]

బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్‌కు వ్యతిరేకంగా "కంసాలులు, తాకట్టు వ్యాపారులు ఆగ్రహంతో పెడబొబ్బలు పెట్టారు." (మెకాలే, హిస్టరీ ఆఫ్ ఇంగ్లండు, IV, పుట 499) "మొదటి 10 సంవత్సరాలలోనూ బ్యాంకు పెద్ద ఇబ్బందులను, విదేశీ కుమ్ములాటల్ని ఎదుర్కోవలసి వచ్చింది. దాని నోట్లు నామకః విలువకంటే తక్కువగా మాత్రమే ఆమోదించబడ్డాయి... (కంసాలులు – వీరి చేతిలో వెండి, బంగారాల వ్యాపారం ఆదిమ బ్యాంకింగ్ వాణిజ్యానికి ప్రాతిపదికగా పనిచేసింది.) బ్యాంకుపైన అసూయపడ్డారు. ఎందుకంటే వారి వ్యాపారం పడిపోయింది. వారి డిస్కౌంటులు తగ్గించబడ్డాయి. ప్రభుత్వంతో వారి లావాదేవీలు వారి ప్రత్యర్థులకు దక్కాయి." (జె. ఫ్రాన్సిస్, అదే గ్రంథం, పుట 73)

బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్‌ను నెలకొల్పటానికి ముందే 1683లో జాతీయ పరపతి బ్యాంకు పథకం ఒకటి ప్రతిపాదించబడింది. దాని లక్ష్యాలలో ఒకటి "వ్యాపారుల దగ్గర గణనీయమైన పరిమాణంలో సరుకులు వున్నప్పుడు ఈ బ్యాంకు సాయంతో తమ సరుకుల్ని డిపాజిట్ చేసుకోవచ్చు. ఈ సరుకులపైన పరపతిని తీసుకోవచ్చు, సేవకులను నియమించుకోవచ్చు. వాణిజ్యాన్ని పెంచుకోవచ్చు. ఆ సరుకులను అప్పటికప్పుడు నష్టానికి అమ్మటానికి బదులు మంచి మార్కెట్ ఏర్పడేదాకా ఇది అంతా నిర్వహించవచ్చు." [జె. ఫ్రాన్సిస్, అదే గ్రంథం, పుటలు 39, 40] అందులోనే చాలా ప్రయత్నాల తర్వాత బిషప్స్ గేటు వీధిలో డెవన్‌షైర్ హౌస్‌లో ఈ పరపతి బ్యాంకు నెలకొల్పబడింది. అది పారిశ్రామికవేత్తలకు, వ్యాపారులకు వారు డిపాజిట్ చేసిన సరుకులపైన వాటి విలువలో నాల్గింట మూడొంతులు చొప్పున మార్పిడి బిల్లుల రూపంలో రుణాలిచ్చింది. ఈ బిల్లులను చలామణిలో వుంచటానికి వీలుగా, ప్రతి వాణిజ్య శాఖలోనూ కొంతమంది వ్యక్తులు కలిసి ఒక సంఘంగా ఏర్పడ్డారు. దానిలో ఈ బిల్లులు కలిగిన ప్రతి వ్యక్తి తన దగ్గర నగదు ఉన్నట్టుగానే సరుకులను పొందగల్గుతాడు. అయితే ఈ బ్యాంకు వాణిజ్యం వృద్ధి కాలేదు. దాని పనితీరు చాలా సంక్లిష్టంగా వుండింది. సరుకుల విలువ పడిపోతే ప్రమాదం మరీ ఎక్కువగా వుండింది.

ఇంగ్లాండులో ఆధునిక పరపతి వ్యవస్థను నెలకొల్పడానికి సైద్ధాంతికంగా తోడ్పడిన ఈ రికార్డుల వాస్తవ సారాంశాన్ని పరిశీలిస్తే అందులో మనకు ప్రధానంగా కనిపించే షరతు ఏమంటే వడ్డీ ఇచ్చే పెట్టుబడి అప్పు ఇవ్వదగిన ఉత్పత్తి సాధనాలూ పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానానికి లోబడి ఉండాలనే కోరిక మాత్రమే కనిపిస్తుంది. మరోవైపున మనం కేవలం పదజాలానికి మాత్రమే ప్రాధాన్యతనిస్తే బ్యాంకింగ్ పరపతి వ్యవహారాలలో సెయింట్ సైమన్ అనుయాయుల భ్రమలతో తరచుగా ఈ పదజాలం దాని వ్యక్తీకరణ పద్ధతితో సహా ఏకీభవించటం ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది.

ఫిజియోక్రాట్ల రచనలలో లాగానే CULTIVATEUR అన్నదానికి అర్థం సెయింట్ సైమన్ గ్రంథంలో కూడా భూమిని దున్నేవాడు అని కాదు. కేవలం పెద్ద రైతు అని మాత్రమే. అదే విధంగా

1. ఈయన బ్యాంకరే కాక అర్థశాస్త్రవేత్త కూడా. మార్చుకోడానికి వీల్లేని నోట్లను జారీ చేయడం ద్వారా ప్రజా సంపదను ప్రభుత్వం పెంచడం సాధ్యమని నమ్మిన వ్యక్తి ఈయన - అనువాదకుడు.

TRAVAILLEUR అంటే అతని దృష్టిలో కార్మికుడు కాదు. పారిశ్రామిక వాణిజ్య పెట్టుబడిదారుడు మాత్రమే. అతని అనుయాయులు కూడా ఇదే ధోరణి కొనసాగించారు.

"Un travailleur a besoin d'aides, de seconds, d'ouvriers; il les cherche intelligents, habiles, devoues; il les met a l'oeuvre, et leurs travaux sont productifs" [Enfantin][1]

నిజానికి సెయింట్ సైమన్ తన చివరి గ్రంథం అయిన “లెనోవీ క్రిష్టియానిజ్మే”లో మాత్రమే కార్మికవర్గాన్ని సమర్థిస్తూ వారి విమోచనే తన ప్రయత్నాల లక్ష్యమని ప్రకటిస్తాడు. ఆయన ఇంతకు ముందు రాసిన గ్రంథాలన్నీ ఫ్యూడల్ వ్యవస్థకు వ్యతిరేకంగా, ఆధునిక బూర్జువా సమాజానికి ప్రశంసలు మాత్రమే. అలాగే నెపోలియన్ యుగపు సైనికాధిపతులకు, న్యాయాధిపతులకు వ్యతిరేకంగా పారిశ్రామిక వేత్తల, బ్యాంకర్ల శ్లాఘన మాత్రమే. సమకాలీన ఓవెన్ రచనలతో పోల్చినపుడు ఎంత భేదం![2] సెయింట్ సైమన్ అనుయాయుల దృష్టిలో పారిశ్రామిక పెట్టుబడిదారుడు ఒక అత్యుత్తమ TRAVAILLEURగా కనిపిస్తాడు. వారి రచనలను విమర్శనాత్మకంగా చదివితే సెయింట్ సైమన్ మాజీ అనుయాయుడు ఎమిలీ పెరైరీ నెలకొల్పిన క్రెడిట్ మొబిలియర్‌లో వారి పరపతి, బ్యాంకుకు సంబంధించిన వింత ఊహలు వాస్తవ రూపం ధరించిన తీరు ఆశ్చర్యం కలిగించదు. సందర్భవశాత్తూ ఈ రూపం ఫ్రాన్సులాంటి దేశంలో మాత్రమే ప్రబలంగా మారగలిగింది. అక్కడ పరపతి వ్యవస్థగాని, లేదా భారీస్థాయి పరిశ్రమగాని ఆధునిక అభివృద్ధి స్థాయిని చేరుకోలేదు. ఇంగ్లాండు, అమెరికాలలో ఇది ఏమాత్రం సాధ్యం కాలేదు. “డాక్ట్రిన్ డిసెయింట్ సైమన్”లో ఉన్న ఈ క్రింది అంశాలలో క్రెడిట్ మొబిలియర్‌కు బీజాలు దొరుకుతాయి. (ఎక్స్‌పొజీషన్, ప్రీమియర్ అన్నే, 1828–29) ప్యారిస్ పెట్టుబడిదారులకంటే, ప్రైవేటు వడ్డీ వ్యాపారులకంటే బ్యాంకర్లు చౌకగా అప్పు ఇవ్వగలుగుతారన్న

---

1. “ఒక TRAVAILLEUR కి సహాయకులు, సమర్థకులు, కార్మికులు అవసరం. తెలివైన, సమర్థులైన, దీక్ష కలిగిన వారికోసం అతడు వెతుకుతాడు. అతడు వారిని పనిలో పెడతాడు. వారి శ్రమ ఉత్పాదకం.” (రెలిజియన్ సెయింట్ సైమోనియన్, ఎకానమీ పొలిటిక్ ఎట్ పొలిటిక్స్. ప్యారిస్, 1831, పుట 104) (ఎన్‌ఫానెటిన్)

2. తన రాతప్రతిని తిరగరాయటానికి అవకాశం ఉండి ఉంటే ఈ పేరాను మార్క్స్ గణనీయంగా స్వయంగా మార్చి వుండేవాడు. ఫ్రాన్సు రెండవ సామ్రాజ్య కాలంలో సెయింట్ సైమన్ మాజీ అనుయాయులు నిర్వహించిన పాత్ర ఈ పేరాకు ప్రేరణ ఇచ్చింది. మార్క్స్ ఈ అంశాన్ని రాస్తున్న కాలంలో ప్రపంచాన్ని విముక్తం చేస్తాయని వీరు ప్రచారం చేసిన పరపతి అభూత కల్పనలు ఇంతకుముందు ఎన్నడూ కనీవినీ ఎరుగని స్థాయిలో భయంకరమైన వంచన రూపంలో తలకిందులుగా అమలు జరిగాయి. చరిత్ర చేసిన అపహాస్యం ఇది. తరువాత కాలంలో మార్క్స్, సెయింట్ సైమన్ మహామేధావి, అమోఘమైన జ్ఞాని అని శ్లాఘించాడు. సెయింట్ సైమన్ తన తొలి రచనలలో బూర్జువా వర్గానికి కార్మికవర్గానికి మధ్య వున్న వైరుధ్యాన్ని పట్టించుకోని మాట నిజమే. కార్మిక వర్గం ఫ్రాన్సులో అప్పుడే పుడుతూ వున్న కాలం అది. TRAVAILLEUR అన్న పదంలో ఆయన ఉత్పత్తిలో చురుకుగా పాల్గొంటున్న బూర్జువావర్గం యొక్క విభాగాన్ని చేర్చాడు. పెట్టుబడికి, శ్రమకు రాజీ కుదర్చాలనే ఫోరియర్ భావనకు ఇది అనుగుణంగా వుంది. అయితే ఆనాటి ఫ్రాన్సు రాజకీయ, ఆర్థిక పరిస్థితులు అందుకు తావిచ్చాయి. ఈ విషయంలో ఓవెన్ మరింత దూరదృష్టిని కలిగి ఉండటానికి కారణం అతనున్న పరిసరాలు భిన్నంగా వుండటమే. పారిశ్రామిక విప్లవ కాలంలో వర్గ వైరుధ్యాలు తీవ్రంగా పదునెక్కుతున్న కాలంలో ఆయన జీవించాడు - ఎంగెల్స్.

దాన్ని అర్థం చేసుకోవచ్చు కనుక ఈ బ్యాంకర్లు "పారిశ్రామికవేత్తలకు రియల్ ఎస్టేట్ యజమానుల కంటే, పెట్టుబడిదారుల కంటే మరింత చౌకగా, తక్కువ వడ్డీ రేటుకు పరికరాలను సరఫరా చేయగలుగుతారు. రుణగ్రహీతల విషయంలో రియల్ ఎస్టేట్ యజమానులు, పెట్టుబడిదారులు పొరపొటుపడవచ్చు." ఈ రచయితలే ఈ పాద సూచికను జోడించారు. "సోమరి ధనికులకూ, TRAVAILLEURSకూ బ్యాంకర్ల మధ్యవర్తిత్వం వహించటం వల్ల లభించే సౌకర్యం మన అసంఘటిత సమాజంలో అహం పెరగటానికి అవకాశాలు రావటం ద్వారా రద్దయిపోవచ్చు. ఈ అహం అన్నది వంచన, దొంగవేషాల రూపాలలో వ్యక్తం కావచ్చు. తరచుగా బ్యాంకర్లు TRAVAILLEURS సోమరి ధనికులకూ మధ్య చొరబడి సమాజానికీ, వారిరువురికీ నష్టం కలిగించేలా దోపిడీ చేశారు." ఇక్కడ TRAVAILLEUR అంటే పారిశ్రామిక పెట్టుబడిదారుడు, ఆధునిక బ్యాంకింగ్ వ్యవస్థ అధీనంలో ఉన్న సాధనాలను సోమరుల సాధనాలుగా భావించటం తప్పు. మొదటిది, పారిశ్రామికవేత్తలు, వర్తకులు తాత్కాలికంగా పనిలేని డబ్బు రూపంలో ఒక డబ్బు రిజర్వుగా లేదా మదుపు పెట్టాల్సిన పెట్టుబడిగా ఉంచుకొనే పెట్టుబడి భాగం అది. కనుక అది పనిలేని పెట్టుబడి మాత్రమే. పనిలేనివారి పెట్టుబడి కాదు. రెండవది, తాత్కాలికంగానో లేదా శాశ్వతంగానో సాధారణ రూపంలో పోగు చేయాల్సిన అన్ని రకాల ఆదాయమూ పొదుపులకు సంబంధించిన భాగం అది. బ్యాంకింగ్ వ్యవస్థ స్వభావానికి ఈ రెండూ అత్యవసరమే.

మొదటిది పరపతి వ్యవస్థ దాని స్వభావం రీత్యా వెండి, బంగారాల రూపంలో వున్న డబ్బు పునాది నుంచి ఎప్పుడూ బయటపడజాలదని గుర్తుంచుకోవాలి. రెండవది పరపతి వ్యవస్థకు ప్రైవేటు వ్యక్తుల గుత్తాధిపత్యంలో సామాజిక ఉత్పత్తి సాధనాలు ఉండటం అవసరం అవుతుంది. (పెట్టుబడి, భూ ఆస్తి రూపంలో ఒకవైపున అది పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానంలో సహజంగా ఉండే రూపం. రెండవవైపున ఆ విధానం అత్యున్నత స్థాయికి, అంతిమ రూపానికి అభివృద్ధి చెందటంలో ఒక చోదక శక్తి.)

బ్యాంకింగ్ వ్యవస్థ దాని లాంఛనపూర్వక నిర్మాణానికి, కేంద్రీకరణకు సంబంధించిన మేరకు పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం సృష్టించిన అత్యంత కృత్రిమమైన అత్యంత అభివృద్ధి చెందిన సంస్థ. ఈ వాస్తవాన్ని 1697లోనే "సమ్ థాట్స్ ఆఫ్ ది ఇంటెరెస్ట్స్ ఆఫ్ ఇంగ్లాండు"లో వ్యక్తమయింది. వాణిజ్య, పరిశ్రమలపైన బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్ లాంటి ఒక సంస్థకున్న అపారమైన శక్తికి ఇదే కారణం. వాటి వాస్తవ చలనాలు పూర్తిగా దాని అధీనంలో లేనప్పటికీ వాటి విషయంలో ఇది క్రియారహితంగా ఉన్నప్పటికీ వర్తిస్తుంది. నిజానికి ఈ బ్యాంకింగ్ వ్యవస్థ ఒక సామాజిక స్థాయిలో సార్వత్రికమైన ఖాతాను నిర్వహించటానికి ఉత్పత్తి సాధనాల పంపిణీని నిర్వహించే రూపాన్ని కలిగి వుంటుంది. అయితే అది రూపం మాత్రమే. విడి పెట్టుబడిదారుని సగటు లాభం ప్రతి పెట్టుబడిదారుడు స్వాహా చేసే అదనపు శ్రమ పరిమాణంచేత నిర్ణయించబడదు. అది మొత్తం పెట్టుబడిచేత స్వాహా చేయబడిన మొత్తం అదనపు శ్రమ పరిమాణంచేత నిర్ణయించబడుతుంది. ఆ పరిమాణం నుంచి ప్రతి విడి పెట్టుబడి మొత్తం పెట్టుబడిలో అది ఎన్నో వంతుందో దానినిబట్టి తన వంతు లాభాన్ని పొందుతుంది. పెట్టుబడి యొక్క ఈ సామాజిక స్వభావం పరపతి బ్యాంకింగ్ వ్యవస్థల సంపూర్ణ అభివృద్ధి ద్వారా పెంపొందించబడి వాస్తవ రూపం ధరిస్తుంది. మరోవైపున అది అంతకంటే ముందుకు

పోతుంది. మొత్తం అందుబాటులో ఉన్న పెట్టుబడి కాగలిగిన సామాజిక మొత్తాలను ఇంతవరకు క్రియాశీలంగా ఉపయోగించని ఆ సొమ్మును పారిశ్రామిక వాణిజ్య పెట్టుబడిదారుల స్వాధీనంలో వుంచుతుంది. ఆ రకంగా ఈ పెట్టుబడిని అప్పిచ్చేవారు గానీ, పుచ్చుకునేవారు గానీ దాని నిజమైన యజమానుదారులు కారు, ఉత్పత్తిదారులూ కారు. ఆ రకంగా అది పెట్టుబడి యొక్క ప్రైవేటు స్వభావాన్ని రద్దుచేస్తుంది. తనలో తాను తనలో మాత్రమే పెట్టుబడిని రద్దు చేయగలిగిన శక్తి కలిగి వుంటుంది. బ్యాంకింగ్ వ్యవస్థ ద్వారా పెట్టుబడి పంపిణీ అన్నది ఒక ప్రత్యేక వ్యవహారంగా, ఒక సామాజిక కార్యకలాపంగా ప్రైవేటు పెట్టుబడిదార్ల చేతుల్నుంచి తీసేసుకోబడుతుంది. అదే సమయంలో పెట్టుబడిదారీ ఉత్పత్తిని దాని సొంత పరిధిని దాటిపోయేలాగా చెయ్యటంలో బ్యాంకింగ్ పరపతి అన్నవి అత్యంత శక్తివంతమైన సాధనాలవుతాయి. అలాగే సంక్షోభాలకు, వంచనకు దారితీసే అత్యంత ప్రభావశీలమైన సాధనాలవుతాయి.

అంతేకాక, పరపతిని చెలామణిలో పెట్టే వివిధ రూపాలను డబ్బు స్థానంలో ప్రత్యామ్నాయంగా ఉంచడం ద్వారా డబ్బు అన్నది వాస్తవానికి శ్రమ, దాని ఉత్పాదితాల ప్రత్యేక వ్యక్తీకరణ తప్ప మరోటి కాదని బ్యాంకింగ్ వ్యవస్థ నిరూపిస్తుంది. అయితే ఈ శ్రమ ప్రైవేటు ఉత్పత్తి ప్రాతిపదికకు విరుద్ధం కనుక అంతిమ విశ్లేషణలో ఎప్పుడూ అది ఇతర సరుకులతో పాటు ఒక వస్తువులాగా, ఒక ప్రత్యేక సరుకులాగా కనిపిస్తుంది.

అంతిమంగా పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం నుంచి సమష్టి శ్రమ ఉత్పత్తి విధానానికి మారే పరివర్తనా దశలో పరపతి వ్యవస్థ చాలా కీలకమైన అంశంగా పనిచేస్తుందనటంలో సందేహం లేదు. అయితే ఈ ఉత్పత్తి విధానంలోనే అనేక గొప్ప సమూల విప్లవాలతో సంబంధం ఉన్న ఒకానొక అంశంగా మాత్రమే ఇది ఉంటుంది. మరోవైపున పరపతి బ్యాంకింగ్ వ్యవస్థల అద్భుత శక్తికి సంబంధించిన భ్రమలు సోషలిస్టు అర్థంలో తలెత్తటానికి కారణం పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానానికి, దాని రూపాలలో ఒకటైన పరపతి వ్యవస్థకు సంబంధించిన పరిచయం బొత్తిగా లేకపోవటమే. ఉత్పత్తి సాధనాలు పెట్టుబడిగా రూపాంతరం చెందటం ఆగిపోగానే (భూమి ప్రైవేటు ఆస్తి కూడా రద్దు అవుతుంది.) పరపతి పరపతిగా అర్థాన్ని కోల్పోతుంది. సందర్భవశాత్తూ సెయింట్ సైమన్ అనుయాయులు సైతం దీనిని అర్థం చేసుకొన్నారు. మరోవైపున పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం కొనసాగినంత కాలం వడ్డీ ఇచ్చే పెట్టుబడి దాని రూపాలలో ఒకటిగా కొనసాగుతూనే వుంటుంది. దాని పరపతి వ్యవస్థకు ప్రాతిపదికగా కూడా వుంటుంది. సరుకు ఉత్పత్తిని శాశ్వతం చేసి డబ్బును రద్దు చేయాలనుకొన్న[1] ఆ సంచలనాత్మక రచయిత ప్రౌధాన్ మాత్రమే భయంకరమైన వడ్డీలేని పరపతి వ్యవస్థను కలలు కనగలడు. ఇది పెట్టీ బూర్జువా వర్గాల పవిత్ర ఆకాంక్షల సులభప్రదమైన ప్రతిరూపం మాత్రమే.

'రెలిజియన్ సెయింట్ సైమోనియన్ ఎకానమీ పొలిటిక్ ఎట్ పొలిటిక్' 45వ పేజీలో ఇలా వుంది : "కొంతమందికి పారిశ్రామిక పరికరాలు ఉంటాయి. కానీ పనిచేయగల శక్తి కానీ ఇష్టం కానీ వారికుండదు. శ్రమించే ఓపిక ఉన్న ఇతరుల దగ్గర శ్రమ పరికరాలు ఉండవు. అటువంటి సమాజంలో

1. కార్ల్‌మార్క్స్ 'తత్వశాస్త్ర దారిద్ర్యం' ప్యారిస్, 1847. కార్ల్‌మార్క్స్ రాజకీయ అర్థశాస్త్ర విమర్శ.

పరపతి ఈ పరికరాలను చాలా సులభంగా మొదటి రకం వారి చేతుల నుంచి రెండో రకం వారికి/ మార్చటానికి కృషి చేస్తుంది. ఆస్తి అన్నది ఎలా రూపొందిందో పరపతికి సంబంధించిన ఈ నిర్వచనం తెలియజేస్తుంది." కనుక ఈ ఆస్తి రూపొందటం అన్నది మాయమైతే పరపతి కూడా మాయమవు తుందన్నమాట. 98వ పేజీలో ఇంకా ఇలా వుంది : ప్రస్తుత బ్యాంకులు తమ పరిధికి వెలుపల జరిగే లావాదేవీలు ప్రారంభించిన చలనాన్ని అనుసరించటమే తమ విధి అనుకొంటాయి. ఈ చలనానికి ఒక ప్రేరణ ఇవ్వవలసిన అవసరం వాటికి కనిపించదు. మరో విధంగా చెప్పాలంటే TRAVAILLEURSతో సంబంధంతో వారికి డబ్బు అప్పు ఇచ్చే పెట్టుబడిదారుల పాత్రను బ్యాంకులు నిర్వహిస్తాయి." బ్యాంకులు స్వయంగా మేనేజ్‌మెంట్ బాధ్యతను తీసుకొని అవి "తమచే నిర్వహించబడే సంస్థల సంఖ్య ద్వారా ఉపయోగం ద్వారా తమను తాము ప్రత్యేకంగా వేరుచేసి చూపించుకోవాలి అన్న భావనలు Credit mobilier (క్రెడిట్ మొబిలియార్) బీజరూపంలో కలిగి వుంటాయి. చార్లెస్ పెక్యుయర్ కూడా ఇదే రకంగా బ్యాంకులు (సెయింట్ సైమన్ అనుయాయులు దీనిని సిస్టేమ్ జనరల్ డెస్ బ్యాంక్ వెస్ అన్నారు.) "ఉత్పత్తిని శాసించాలి" పెర్కర్ ముఖ్యంగా సెయింట్ సైమన్ అనుయాయుడు అయితే అంతకంటే తీవ్రవాది "పరపతి సంస్థలు జాతీయ ఉత్పత్తి మొత్తం చలనాన్ని అజమాయిషీ చెయ్యాలని" కోరతాడు. – "ఒక జాతీయ పరపతి సంస్థను సృష్టించడానికి ప్రయత్నించండి. అది ప్రజ్ఞా పాటవాలున్న, అవసరం ఉన్న వారికి అవసరమైన సామాగ్రిని సరఫరా చేస్తుంది. అయితే ఈ రుణ గ్రహీతలను ఉత్పత్తి వినియోగాలలో కలిసే ఉండేలా బలవంతం చేయరాదు. అయితే తమ సొంత మార్పిడి ఉత్పత్తులను నిర్ణయించటానికి వారికి వీలు కల్పించాలి. ఈ రకంగా ప్రైవేటు బ్యాంకులు ఇప్పటికే సాధించినదాన్నే, నువ్వు కూడా సాధిస్తావు. అంటే అరాచకత్వం, ఉత్పత్తి నియమాల మధ్య అసమతుల్యత, హఠాత్తుగా ఒక మనిషి పతనం కావటం, మరో వ్యక్తి సుసంపన్నం కావటం ఇవే నువ్వు సాధించేది. ఆ రకంగా మీ సంస్థ ఒక వ్యక్తికి కొంత మేలు చేస్తుంది. మరో వ్యక్తి అదే మోతాదులో కీడు అనుభవించేలా చేస్తుంది. ఇంతకుమించి అది ఎన్నటికీ పురోగమించలేదు... మహా అయితే వేతన కార్మికులు పెట్టుబడిదారీ యజమానుల లాగానే ఒకరితో ఒకరు పోటీపడటానికి వీలయ్యేలా సాధనాలను సమకూర్చి పెడతారు." (సిహెచ్. పెర్కర్, థియరీ నోవల్లే డి ఎకనామీ సోషియల్ ఎట్ పొలిటిక్, ప్యారిస్, 1842, పుట 434)

వర్తకుని పెట్టుబడి, వడ్డీ ఇచ్చే పెట్టుబడి, పెట్టుబడి యొక్క అత్యంత పాత రూపాలను మనం గమనించాం. అయితే ప్రజల మనస్సుల్లో వడ్డీ ఇచ్చే పెట్టుబడి అసలైన పెట్టుబడి రూపంగా ముద్రపడటానికి ఆయా వస్తువుల స్వభావమే దీనికి కారణం. వర్తకుని పెట్టుబడిలో మధ్యవర్తి పని ఇమిడి వుంటుంది. దానిని వంచన అనుకొన్నా, శ్రమగా పరిగణించినా మరెలా పరిగణించినా అది తప్పదు. అయితే వడ్డీ ఇచ్చే పెట్టుబడి విషయంలో స్వయంగా పునరుత్పత్తి చేసుకొనే పెట్టుబడి స్వభావం స్వయం విస్తరిత విలువ, అదనపు విలువ ఉత్పత్తి అన్నవి – కేవలం దాని నిగూఢ ఆస్తిలో కనిపిస్తాయి. కొంతమంది రాజకీయ అర్థశాస్త్రవేత్తలు సైతం ముఖ్యంగా ఫ్రాన్సులోలా ఇంకా పూర్తిగా అభివృద్ధి చెందని పారిశ్రామిక పెట్టుబడి వున్న దేశాలలో వడ్డీ ఇచ్చే పెట్టుబడిని పెట్టుబడి యొక్క ప్రాథమిక రూపం అని భావించటానికి కారణం ఇదే. వారు ఉదాహరణకు భూమి కౌలును వడ్డీ ఇచ్చే పెట్టుబడికి మారిన రూపంగా పరిగణిస్తారు. ఎందుకంటే ఇక్కడ అప్పు రూపం కూడా ప్రబలంగా

వుంది. ఈ రకంగా పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం అంతర్గత నిర్మాణం పూర్తిగా అపార్థం చేసుకోబడుతుంది. అలాగే పెట్టుబడిలాగే భూమి కూడా పెట్టుబడిదారులకే అప్పు ఇవ్వబడుతున్న వాస్తవం పూర్తిగా విస్మరింపబడుతుంది. అయితే డబ్బుకు బదులు యంత్రాలు, వ్యాపార కార్యాలయాలు లాంటి ఉత్పత్తి సాధనాలు కూడా అప్పు ఇవ్వవచ్చు. అయితే అప్పుడది ఒక నిర్దిష్టమైన డబ్బు మొత్తానికి ప్రాతినిధ్యం వహిస్తాయి. వడ్డీతో పాటు వాటి ఉపయోగం కోసం, ఒక భాగం వాటి అరుగుదల కోసం కూడా చెల్లించబడుతుంది. ఇక్కడ నిర్ణయాత్మకమైన అంశం ఏమంటే వాటిని ప్రత్యక్ష ఉత్పత్తిదారులకు అప్పు ఇవ్వటం జరిగిందా, లేక పారిశ్రామిక పెట్టుబడిదారులకు అప్పు ఇవ్వటం జరిగిందా? మొదటిది – పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం కనీసం ఈ ప్రత్యేక రంగంలో అయినా లేకుండటాన్ని ఊహిస్తుంది. రెండో సందర్భం. పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానపు ప్రాతిపదికపైన ఊహించబడుతుంది. వ్యక్తిగత ఉపయోగం కోసం ఇల్లు వగైరాలను అప్పు ఇవ్వడం అన్న అంశానికి చర్చను కొనసాగించటం మరింత అసంగతమూ, అర్థరహితమూ అవుతుంది. ఈ రూపంలో కార్మికవర్గం కూడా బాగా వంచింపబడుతుంది అన్నది స్పష్టం. కార్మికుడికి జీవనభృతి సాధనాలను అమ్మే చిల్లర వ్యాపారి కూడా అదే పని చేస్తాడు. ఇది ద్వితీయ ప్రాధాన్యం గల దోపిడీ. ఉత్పత్తి రంగంలో జరిగే ప్రధాన దోపిడీకి సమాంతరంగానే ఇది నడుస్తుంది. ఈ సందర్భంలో అమ్మకానికి, అప్పు ఇవ్వటానికి మధ్య తేడా కూడా ముఖ్యమైంది కాదు. ఇది కేవలం రూపానికి సంబంధించినది మాత్రమే. ఈ సమస్య వాస్తవ స్వభావంతో బొత్తిగా పరిచయం లేని వ్యక్తికి తప్ప ఇది ఎవరికీ ప్రధానమైందిగా కనిపించదు.[1]

★ ★ ★

వాణిజ్యం లాగానే వ్యాపారం కూడా నిర్ణీత ఉత్పత్తి విధానాన్ని వాడుకుంటుంది తప్ప ఆ ఉత్పత్తి విధానాన్ని అది సృష్టించదు. బయటి నుంచి మాత్రమే దానితో సంబంధం కలిగి వుంటుంది. వడ్డీ వ్యాపారం ఆ సంబంధాన్ని ప్రత్యక్షంగా కలిగి ఉండటానికి ప్రయత్నిస్తుంది. నిత్యనూతనంగా దానిని వాడుకోవటం కోసం దానికిది అవసరం. ఇది మార్పును వ్యతిరేకిస్తుంది. ఈ ఉత్పత్తి విధానాన్ని మరింత దయనీయంగా మారుస్తుంది. ఉత్పత్తి ప్రక్రియలో ఉత్పత్తి అంశాలు ఎంత తక్కువగా సరుకుల రూపంలో ప్రవేశించి సరుకుల రూపంలో బయటపడతాయో; అంత ఎక్కువగా డబ్బు నుంచి వాటి పుట్టుక ఒక ప్రత్యేక చర్యలా కనిపిస్తుంది. సామాజిక పునరుత్పత్తిలో చలామణి ఎంత అప్రధానమైన పాత్ర నిర్వహిస్తే వడ్డీ వ్యాపారం అంత ఎక్కువగా వృద్ధి చెందుతుంది.

డబ్బు సంపద ఒక ప్రత్యేక తరహా సంపదగా అభివృద్ధి చెందుతుంది అంటే అర్థం వడ్డీ వ్యాపారి పెట్టుబడి విషయంలో అది కోరే హక్కులన్నీ డబ్బు రూపంలోనే ఉంటాయి. దేశంలో ప్రధాన ఉత్పత్తి రంగం సహజమైన సేవలు వగైరాలకు, ఉపయోగ విలువలకు ఎంతగా పరిమితమై ఉంటే ఒక దేశంలో అది అంతగా అభివృద్ధి చెందుతుంది.

పారిశ్రామిక పెట్టుబడి అవసరమైన పరిస్థితులను అభివృద్ధి చేయటానికి వడ్డీ వ్యాపారం

1. ప్రస్తుత సంపుటం అయిదవ భాగం 21వ అధ్యాయం.

శక్తివంతమైన సాధనం. అది వర్తకుని సంపదతోపాటు స్వతంత్రమైన డబ్బు సంపదను సార్వత్రికంగా పోగుచేస్తుంది. రెండవది అది శ్రమ పరిస్థితులను హస్తగతం చేసుకుంటుంది. అనగా పాత శ్రమ పరిస్థితుల యజమానులను నాశనం చేస్తుంది. ద్విముఖ పాత్ర నిర్వహించిన మేరకు పారిశ్రామిక పెట్టుబడికి అవసరమైన పరిస్థితులను నిర్మించటంలో అది తోడ్పడుతుంది.

## మధ్యయుగాలలో వడ్డీ

"మధ్య యుగాలలో జనాభా వృత్తి కేవలం వ్యవసాయం. ఫ్యూడల్ వ్యవస్థ వున్న ప్రభుత్వాలలో వ్యాపారం అన్నది పరిమితం కనుక లాభం కూడా అంతే పరిమితంగా ఉంటుంది. అందుచేత వడ్డీ వ్యాపారానికి వ్యతిరేకంగా మధ్యయుగాలలో చేయబడిన శాసనాలు న్యాయమే. అంతేకాక ఒక వ్యవసాయ దేశంలో ఒక వ్యక్తి దారిద్ర్యానికి లేక దురవస్థలకు లోనయితే తప్ప డబ్బు – అప్పుకు కావాలని కోరుకోడు... 8వ హెన్రీ కాలంలో వడ్డీ రేటు 10%కు పరిమితం చేయబడింది. మొదటి జేమ్స్ దానిని 8%కి తగ్గించాడు.... రెండో చార్లెస్ దానిని 6%కి తగ్గించాడు. అన్నీ రాణి హయాంలో అది 5%కి తగ్గించబడింది... ఆ రోజుల్లో రుణదాతలు... నిజానికి చట్టబద్ధమైన హక్కులు పెద్దగా కలిగి ఉండనప్పటికీ వారు వాస్తవంగా గుత్తాధిపత్యాన్ని కలిగి వున్నారు. కనుక ఇతర గుత్తాధిపతుల్లాగానే వారిని కూడా అదుపులో ఉంచటం అవసరమైంది. మన కాలంలో లాభం రేటే వడ్డీ రేటును క్రమబద్ధం చేస్తుంది. ఆ రోజుల్లో వడ్డీ రేటే లాభం రేటును శాసించింది. అపుడు వ్యాపారి దగ్గర వడ్డీ వ్యాపారి ఎక్కువ వడ్డీ రేటును వసూలు చేస్తే, వర్తకుడు తన సరుకులపైన అధిక లాభం రేటును వసూలు చేయాల్సి వుంది. కనుక కొనుగోలుదారుల జేబుల నుంచి పెద్ద మొత్తం సొమ్మును లాక్కుని వడ్డీ వ్యాపారుల జేబులలో పెట్టడం జరిగేది." (గిల్బర్ట్, హిస్టరీ అండ్ ప్రిన్సిపుల్స్ ఆఫ్ బ్యాంకింగ్, పుటలు 163–165)

"ప్రతి లీప్జిగ్ సంత[1]లోను 10 గుల్డెన్‌లు వసూలు చేస్తారని నాకు చెప్పారు. అంటే ప్రతి 100 గుల్డెన్‌లపైనా 30 గుల్డెన్‌లన్నమాట. కొంతమంది న్యూన్‌బర్గ్ సంతను కూడా ఉపయోగించుకొంటారట. అంటే 100కు 40 గుల్డెన్‌లన్నమాట. అది నిజమో కాదో నాకు తెలియదు. అయినా ఎంత సిగ్గుచేటు! దీని ఫలితం ఎంత బీభత్సంగా ఉంటుంది. లీప్జిగ్‌లో 100 ఫ్లోరిన్‌లు చేతిలో వున్న వారెవరైనా ఏటా 40 ఫ్లోరిన్‌లు సంపాదిస్తారు. అంటే ఏడాదికి ఒక రైతును లేదా పట్టణ వ్యాపారాన్ని మింగెయ్యటమే. 1000 ఫ్లోరిన్‌లు కలిగివున్న వ్యక్తి ఏటా 400 ఫ్లోరిన్‌లు తీసుకొంటాడు. అంటే ఒక యోధుణ్ణీ, ఒక ధనిక భూస్వామిని ఏటా మింగెయ్యటమే అవుతుంది. ఒకరి దగ్గర 10 వేల ఫ్లోరిన్‌లు ఉంటే అతడు ఏటా 4000 ఫ్లోరిన్‌లు గుంజుకోగల్గుతాడు. అంటే ఏటా ఒక ధనిక కౌంట్‌ను స్వాహా చెయ్యటం అవుతుంది. లక్ష ఫ్లోరిన్‌లు వున్న పెద్ద వర్తకుడు ఏటా 40 వేల ఫ్లోరిన్‌లు తీసుకుపోతాడు. అంటే ఒక ధనిక రాజవంశీకుడ్ని మింగేస్తాడు. 10 లక్షల ఫ్లోరిన్‌లు ఉంటే ఏటా 4 లక్షల ఫ్లోరిన్‌లు పట్టుకుపోవచ్చు .అంటే ఒక బలమైన రాజును మింగేయవచ్చు. అతడు తనను తాను వ్యక్తిగా గానీ,

1. ఏడాదికి 3సార్లు నిర్వహించబడే లీప్జిగ్ సంతలో 100 గుల్డెన్‌ల రుణానికి గాను 3 వాయిదాలలో చెల్లించబడే వడ్డీ రచయిత దృష్టిలో ఉంది. కొత్త సంవత్సరం రోజున, ఈస్టర్ పండుగ రోజున, సెయింట్ మైఖేల్ పర్వదినాన ఈ సంత జరుగుతుంది.

తన సామాగ్రిని గానీ వడ్డేది ఏమీ లేదు. అతడు చేసే పనేమీ లేదు. చలికాలంలో కుంపటి దగ్గర వెచ్చగా కూర్చుని వుండగలడు. ఒక నీచమైన దోపిడీ దొంగలాగా ఇంట్లోనే కూర్చుని వీడు 10 సంవత్సరాలలో మొత్తం ప్రపంచాన్ని మింగేయగలడు." (బుకర్‌హోమ్ హౌఫాండెల్ అండ్ బూచర్ హోమ్ జాహరే 1524, లూథర్ రచనలు, విటెన్‌బర్గ్ 1589, టెయిల్ 6, ఎస్. 312)

"15 ఏండ్ల క్రితం వడ్డీ వ్యాపారానికి వ్యతిరేకంగా నేను కలం పట్టాను. అది అప్పుడు అత్యంత ప్రమాదకరమైన స్థాయిలో వ్యాపించింది. అది మెరుగుపడుతుందన్న ఆశ లేకుండాపోయింది. అప్పటి నుంచి ఇప్పటికి అది మరింత తలబిరుసుగా వ్యవహరిస్తోంది. అది పాపం లేదా అవమానాల సరసన కూర్చోటానికి నిరాకరిస్తోంది. అది ఒక సుగుణంలాగా, ఒక గౌరవం లాగా పొగడ్తలను అందుకొంటోంది. ప్రజలకు గొప్ప మేలు చేస్తున్నట్టు, క్రైస్తవ సేవ చేస్తున్నట్టుగా అది ప్రశంసలందు కుంటున్నది. ఈ అవమానం గౌరవంగానూ, పాపం పుణ్యంగానూ మారిపోయిన ఈ పరిస్థితులలో మనకు విముక్తి కలిగించగలిగిన శక్తి ఏది?" (మార్టిన్ లూథర్ ఆన్ డై ఫార్ హెర్‌న్ వైడర్ డెన్ ఊచర్ జూ ప్రెడిగెన్, విటెన్‌బర్గ్, 1540)

★ ★ ★

"యూదులు, లంబార్డులు, వడ్డీ వ్యాపారులు బెదిరించి బలవంతంగా లాక్కొనేవాళ్ళు, మన మొదటి బ్యాంకర్లు. డబ్బుతో వాణిజ్యం చేసిన తొలి వ్యక్తులు. వారి స్వభావం కువిఖ్యాతం.... వారికి లండన్ కంసాలులు తోడయ్యారు. వీరంతా.... మన ఆదిమ బ్యాంకర్లంతా... చాలా దుర్మార్గులు. పిండి వసూలు చేసే వడ్డీ వ్యాపారులు, గుండె లేని కసాయివాళ్ళు" (డిహార్ట్ కేజిల్, బ్యాంక్స్ అండ్ బ్యాంకర్సు, రెండవ ముద్రణ, లండన్, 1843, పుటలు 19, 20)

"వెనిస్ నగరం (బ్యాంకును నెలకొల్పటం ద్వారా) ప్రదర్శించిన చొరవను అనేక నగరాలు అందుకున్నాయి. సముద్రతీర నగరాలన్నీ తమ స్వాతంత్ర్యానికి, వాణిజ్యానికి పేరుగాంచిన నగరాలన్నీ తమ మొదటి బ్యాంకులను నెలకొల్పుతున్నాయి. వాటి నౌకల తిరుగు ప్రయాణం తరచుగా సుదీర్ఘంగా ఉండేది. అది తప్పనిసరిగా అనివార్యంగా పరపతిపైన రుణాలనిచ్చే ఆచారానికి దారితీసింది. అమెరికాను కనుక్కోవటంలో ఆ ఖండంలో ఆ తర్వాత జరిగిన వాణిజ్యం వల్ల ఈ ఆచారం మరింత తీవ్రతరమైంది." (ఇదే ప్రధాన అంశం) నౌకల్ని అద్దెకు తీసుకోవడానికి పెద్ద ఎత్తున రుణాలు అవసరమయ్యాయి. ప్రాచీన ఏథెన్స్‌లోనూ, గ్రీసులోనూ అంతకు ముందే ఈ విధానం ఉంది. 1308లో బ్రూగెస్‌కు చెందిన హాన్స్ టౌన్‌లో ఒక భీమా కంపెనీ ఉండేది (ఎమ్. ఆగియార్, అదే గ్రంథం, పుటలు 202, 203)

17వ శతాబ్దం మూడవ పాదంలో ఇంగ్లండులో సైతం ఆధునిక పరపతి అభివృద్ధికి ముందు, భూస్వాములకు సాధారణంగా భోగలాలసులైన ధనికులకు ఏ మేరకు అప్పు లివ్వబడ్డాయో ఇతర ఆధారాలతోపాటు సర్ డడ్లీ నార్త్ రచనలలో చూడవచ్చు. ఆయన ప్రప్రథమ ఇంగ్లీషు వ్యాపార వేత్తల్లో ఒకరు మాత్రమే కాదు. ఆయన కాలంలో అత్యంత ప్రముఖ సిద్ధాంతవేత్తల్లో ఒకరు కూడా. "ఈ దేశంలో వడ్డీకి ఇవ్వబడిన డబ్బుల్లో 10వ భాగం సైతం తమ వాణిజ్యాలు నిర్వహించుకోటానికి గాను వాణిజ్యవేత్తలకు అప్పులు ఇవ్వబడలేదు. దీనిలో అత్యధిక భాగం విలాసాల సరఫరాకు

అప్పివ్వబడింది. పెద్ద భూస్వాములైనప్పటికీ తమ ఆదాయాలకు మించి ఖర్చు చేసే వారి ఖర్చుల కోసం అప్పులివ్వబడ్డాయి. వారికి అమ్మటం అంటే అసహ్యం కనుక తమ ఎస్టేట్‌లను తనఖా పెట్టారు.” (డిస్కోర్సెస్ అపాన్ ట్రేడ్, లండన్, 1691, పుటలు 6, 7)

18వ శతాబ్దంలో పోలెండు : “వార్సా పెద్ద ఎత్తున మార్పిడి బిల్లులతో వ్యాపారం చేసింది. అయితే ఆ వ్యాపారానికి ప్రధానమైన ప్రాతిపదిక, లక్ష్యమూ ఏమంటే బ్యాంకర్ల వడ్డీ ధనమే. ఈ బ్యాంకర్లు దుబారా భూస్వాములకు 8% అంతకుమించిన శాతానికి అప్పులివ్వటానికి గాను వారి కవసరమైన డబ్బు పొందటానికి విదేశాలలో వారు బహిరంగ మార్పిడిలో పరపతి కోసం ప్రయత్నించి పొందారు. ఈ పరపతికి సరుకు వాణిజ్యం పునాదిగా లేదు. అయితే – ఈ పరపతి కార్యకలాపాల్లో డబ్బు తిరిగి వస్తున్న మేరకు విదేశీ పరపతిదాత ఈ పరిస్థితిని ఆమోదించాడు. అయితే ట్యాపర్ లాంటి అత్యధిక గౌరవం పొందిన వార్సా బ్యాంకర్లు దివాళా తియ్యటంలో వారు భారీ మూల్యం చెల్లించారు.” (జె.జి. బ్యూష్. థియరిటిష్ ప్రాక్టిసే డార్ స్టెలంగ్ డెర్ హెండ్లంగ్, మూడవ ముద్రణ హాంబర్గ్ 1802, 2వ సంపుటి, పుటలు 232, 233)

## వడ్డీ నిషేధం వల్ల చర్చికి చేకూరిన ప్రయోజనాలు

“వడ్డీ తీసుకోవటాన్ని చర్చి నిషేధించింది. అయితే అవసరానికి ఆస్తిని అమ్ముకోవటాన్ని మాత్రం నిషేధించలేదు. కొంతకాలంపాటు వడ్డీ వ్యాపారికి ఆస్తిని బదిలీ చేయటాన్ని కూడా నిషేధించలేదు. ఈ ఆస్తిని రుణగ్రహీత తన రుణం చెల్లించేంతవరకు అనుభవించటానికి వడ్డీ వ్యాపారికి హక్కు వుంది. అతడు తన డబ్బుతో నైష్టికంగా వున్నందుకుగాను ఈ ప్రతిఫలం లభిస్తుంది... స్వయంగా చర్చి దానికి అనుబంధంగా వున్న కమ్యూనులు, pia corporo (పవిత్ర నికాయ) ఈ ఆచరణ నుంచి చాలా ప్రయోజనాన్ని పొందాయి. ముఖ్యంగా మత యుద్ధాల కాలంలో ఎక్కువ లాభాన్ని పొందాయి. దీనివల్ల జాతీయ సంపదలో చాలా పెద్ద భాగం “మృతహస్తం” అనబడే దాని చేతుల్లోకి వచ్చిపడింది. అటువంటి వడ్డీ వ్యాపారం యూదులు చేయరాదని నిషేధం ఉండటం వల్ల అటువంటి స్థిర ఆస్తుల్ని వారు దాయటానికి వీలులేనందువల్ల ఇది మరింత ఎక్కువగా సాధ్యపడింది.... వడ్డీపైన నిషేధం లేకపోతే చర్చీలు, మఠాలు సంపన్నం కాగలిగేవి కాదు.” (అదే గ్రంథం, పుట 55)

★ ★ ★

## ఆరవ భాగం

# అదనపు లాభం భూమి కౌలుగా రూపాంతరం చెందటం

## అధ్యాయం - 37

## పరిచయం

**భూ** ఆస్తిని దాని వివిధ చారిత్రక రూపాల్లో విశ్లేషించటం ఈ గ్రంథం పరిధిలో లేదు. పెట్టుబడి ఉత్పత్తి చేసిన అదనపు విలువలో ఒక భాగం భూమి యజమాని వాటాగా మారటం గురించి మాత్రమే ఇక్కడ మనకు అవసరం. కార్ఖానాలలో లాగానే వ్యవసాయంలో కూడా పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం ఆధిపత్యం వహిస్తుందని మనం భావిస్తాం. మరోలా చెప్పాలంటే తమ పెట్టుబడిని, ఆ పెట్టుబడి చలనంలో ఉంచే వేతన శ్రమను మదుపు పెట్టే విషయంలో ఇతర పెట్టుబడిదారులకు భిన్నమైన పెట్టుబడిదారులు వ్యవసాయాన్ని కొనసాగిస్తున్నారని భావిస్తాం. మనకు సంబంధించినంత వరకు కార్ఖానాదారుడు నూలును లేదా యంత్రాలను ఉత్పత్తి చేస్తున్నట్టుగానే రైతు గోధుమ వగైరాలను ఉత్పత్తి చేస్తున్నాడు. పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం వ్యవసాయాన్ని ఆవరించింది అనుకుంటున్నామంటే అర్థం, అన్ని ఉత్పత్తి రంగాలపైనా, బూర్జువా సమాజంపైనా అది ఆధిపత్యం వహిస్తోంది అని. అనగా పెట్టుబడుల మధ్య స్వేచ్ఛాయుగ పోటీ, ఆ పెట్టుబడులు ఒక రంగం నుంచి మరో రంగానికి బదిలీ కావటం సాధ్యపడటమూ, సగటు లాభం అన్నది ఒకే స్థాయిలో ఉండటమూ అన్న పూర్వావసరాలు పూర్తిగా పరిణతి చెందాయని అర్థం. ఇక్కడ మనం పరిశీలించబోయే భూ ఆస్తి రూపం ప్రత్యేకంగా చారిత్రకమైనది. పెట్టుబడి వల్లా పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానాల ప్రభావం వల్లా మార్పు చెందిన రూపం అది. ఆ మార్పు, ఫ్యూడల్ భూ యాజమాన్యం నుంచి కావచ్చు లేదా ఫ్యూడల్ జీవనాధారంగా వున్న సన్నకారు వ్యవసాయం నుంచి జరిగి ఉండవచ్చు. సన్నకారు రైతాంగ వ్యవసాయంలో ప్రత్యక్ష ఉత్పత్తిదారునికి ఆ భూమి, నేల స్వాధీనంలో ఉండటం అనే అంశం పూర్వావసరమవుతుంది. అతనికి తన ఉత్పత్తి విధానం వర్ధిల్లాలంటే భూమిపైన యాజమాన్యం అన్నది తప్పనిసరి షరతులా కనిపించాలి. పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం సాధారణంగా శ్రమ పరిస్థితుల్ని కార్మికుల స్వాధీనం నుంచి తొలగించటం పైన ఆధారపడి ఉన్నట్టుగానే వ్యవసాయంలో కూడా వ్యవసాయాన్ని లాభం కోసం కొనసాగించే పెట్టుబడిదారుని ఆధిపత్యంలోకి గ్రామీణ కార్మికులను తేవడమే కాక భూమి నుంచి వారిని తొలగించటం

జరుగుతుంది. ఈ రూపంతోపాటు భూ ఆస్తికి వ్యవసాయానికి సంబంధించిన ఇతర రూపాలు ఉన్నాయని, ఇంకా ఉన్నాయని చెప్పే అభ్యంతరాలు ఇక్కడ మన విశ్లేషణకు సంబంధించినంత వరకూ అప్రస్తుతం. వ్యవసాయంలో పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానాన్ని, దానికి అనుగుణమైన భూ ఆస్తి రూపాన్ని చారిత్రకమైన అంశాలుగా, శాశ్వతమైన అభివర్గాలుగా పరిగణించే ఆర్థికవేత్తలే ఈ అభ్యంతరాలు లేవనెత్తుతారు.

మన విశ్లేషణకు సంబంధించి భూ ఆస్తి ఆధునిక రూపాన్ని అధ్యయనం చేయటం అవసరం. ఎందుకంటే వ్యవసాయంలో పెట్టుబడిని పెట్టడం వలన తలెత్తే ప్రత్యేకమైన ఉత్పత్తి, చలామణి పరిస్థితుల్ని పరిశీలించడం మన కర్తవ్యం. ఇది జరగక్కుండా మన పెట్టుబడి విశ్లేషణ పూర్తి కాదు. కనుక వ్యవసాయంలోని పెట్టుబడి అనే విషయానికి మాత్రమే మనం పరిమితమవుదాం. ఒక నిర్ణీత జనాభాను పోషించే ముఖ్యమైన వ్యవసాయ పంటను పరిశీలిద్దాం. మనం ఇందుకోసం గోధుమను తీసుకోవచ్చు. ఆధునికంగా పెట్టుబడిదారీ పంథాల్లో అభివృద్ధి చెందిన దేశాలలో గోధుమ ప్రధానమైన జీవనాధారం కనుక. (వ్యవసాయానికి బదులు మనం గని పనిని కూడా ఉదాహరణగా తీసుకోవచ్చు. ఎందుకంటే ఈ రెండింటిలోనూ వర్తించే నియమాలు ఒక్కటే.)

జనపనార, అద్దకం పనుల్లో ఉపయోగించే ఉత్పాదితాలు వ్యవసాయంలోనూ, స్వతంత్రంగా నిర్వహించే పశుపోషణ వగైరాల్లోనూ పెట్టిన పెట్టుబడిపై భూమి కౌలు అన్నది ప్రధాన జీవనాధారం. వాణిజ్య పంట ఉత్పత్తి చెయ్యటంలో పెట్టిన పెట్టుబడిపై పొందే భూమి కౌలునుబట్టి నిర్ణయమవుతుందని తెలియజేయటం ఆడమ్ స్మిత్ చేసిన గొప్ప సూచనల్లో ఒక్కటి.[1] నిజానికి అప్పటి నుంచీ ఈ విషయంలో ఇంతకు మించి సాధించిన ప్రగతి ఏదీ లేదు. పరిమితులు లేదా చేర్పులు వగైరాలు భూ ఆస్తికి సంబంధించిన స్వతంత్ర అధ్యాయానికి అవసరమవుతాయి, కాని ఇక్కడ ఆ అవసరం లేదు. కనుక ఇక్కడ గోధుమ ఉత్పత్తికి ఉపయోగించిన భూమి ఆస్తిని గురించి మనం ప్రస్తావించటం లేదు. ఉదాహరణకు అవసరమైన మేరకే సందర్భవశాత్తూ దానిని గురించి ప్రస్తావిస్తాం.

సమగ్రత కోసం ఇక్కడ నేలతో పాటు నీరు వగైరాలను కూడా కలిపి భూమి అన్న పదాన్ని వాడుతున్నాం అని గమనించాలి. నేలపైన, దానితో పాటు వున్న నీటిపైన ఏదో ఒక వ్యక్తికి యాజమాన్యం వున్న మేరకు ఇది వర్తిస్తుంది.

భూగోళంలో కొన్ని నిర్దిష్ట భాగాలపైన కొంతమంది వ్యక్తులకు తమ సొంత అభీష్టం మేరకు మిగిలిన వారందరికీ లేని ప్రత్యేకమైన గుత్తాధిపత్యం మీద భూ ఆస్తి అన్నది ఆధారపడి వున్నది.[2] దీనిని మనస్సులో వుంచుకుని దాని ఆర్థిక విలువను అంచనా కట్టవలసి వుంటుంది. అంటే

---

1. స్మిత్ - యాన్ ఇంక్వైరీ ఇన్ టు ది నేచర్ అండ్ కాజెస్ ఆఫ్ ది వెల్త్ ఆఫ్ నేషన్స్, అబర్డీన్, లండన్ 1848, పుటలు 105-16 సం॥

2. సొంత భూ ఆస్తి ఏర్పడ్డం గురించి హెగెల్ చెప్పినదానికంటే హాస్యాస్పదమైంది మరొటి ఉండదు. దీని ప్రకారం మనిషి ఒక వ్యక్తిగా బాహ్యప్రకృతి ఆత్మగా తన సంకల్పాన్ని యథార్థానికి సమర్పించాలని ఆయన అంటాడు. కనుక ఈ ప్రకృతిని స్వాధీనం చేసుకుని దానిని వ్యక్తి తన సొంత ఆస్తిగా మార్చుకోవాలన్న మాట. "వ్యక్తి" యొక్క గమ్యం ఇదే అయితే ప్రతీ మనిషీ నిజమైన వ్యక్తిగా మారాలంటే భూస్వామిగా మారాల్సిందే. భూమిపైన నిరాటంకమైన సొంత యాజమాన్యం అన్నది ఇటీవలే తలెత్తిన అంశం. కాని

పెట్టుబడిదారీ ఉత్పత్తి ప్రాతిపదికపైన ఈ గుత్తాధిపత్యపు విలువను నిర్ధారించాలి. భూగోళం మీద నిర్దిష్ట భాగాలను ఉపయోగించటానికి లేదా దుర్వినియోగం చెయ్యటానికి ఈ వ్యక్తులకు చట్టబద్ధమైన హక్కు వుండటం వల్ల తేలేది ఏమీ ఉండదు. ఈ శక్తిని ఉపయోగించటం అన్నది పూర్తిగా ఆర్థిక పరిస్థితులపైన ఆధారపడి వుంటుంది. ఈ పరిస్థితులకు వారి అభీష్టంతో ప్రమేయం లేదు. చట్టబద్ధమైన దృక్పథం అన్నది తెలియజేసేది ఏమంటే ప్రతీ సరుకు యజమానీ తన సరుకులతో ఏం చెయ్యగలడో భూమి యజమాని కూడా తన భూమితో అదే చెయ్యగలడని మాత్రమే. ఈ అభిప్రాయం, భూమిపైన సొంత యాజమాన్యం గురించిన ఈ శాసనపరమైన దృక్పథం, ప్రాచీన ప్రపంచంలో సజీవ సామాజిక వ్యవస్థ అంతమైనప్పుడు మాత్రమే ఆధునిక ప్రపంచంలో పెట్టుబడిదారీ ఉత్పత్తి అభివృద్ధి జరిగినప్పుడు మాత్రమే తలెత్తుతుంది. ఆసియాకు, అదీ అక్కడక్కడ మాత్రమే, యూరోపియన్ల ద్వారా దిగుమతి అయింది. ఆదిమ సంచయనాన్ని గురించి చర్చించిన విభాగంలో[1] ఈ ఉత్పత్తి విధానంలో ఓ పక్క ప్రత్యక్ష ఉత్పత్తిదారుల్ని వాళ్ళ స్థానం నుంచి భూమికి కేవలం సైదోడులుగా వుండేటట్టు (దాసులు, భూస్వామ్య దాసులు, బానిసలు వగైరా రూపాలలో) వేర్పాటు చెయ్యడం గర్భితమై వుందని గ్రహించాం.

---

హెగెల్ ప్రకారం ఇది ఒక నిర్దిష్ట సామాజిక సంబంధం కాక వ్యక్తిగా మనిషికి "ప్రకృతి"తో వున్న సంబంధం. అంటే మొత్తం వస్తువులన్నింటిని సొంతం చేసుకోవటానికి మనిషికి ఉన్న సంపూర్ణమైన హక్కు అన్నమాట. (హెగెల్ ఫిలాసఫీ రైట్, బెర్లిన్ 1840 సెక్షన్ 79). దీనిని బట్టి స్పష్టంగా అర్థమయ్యేది ఇది. మరో వ్యక్తి అభీష్టానికి వ్యతిరేకంగా తన సొంత అభీష్టం మేరకు ఒక వ్యక్తి తనకు తాను భూ యజమానిగా కొనసాగలేడు. ఆ రెండవ వ్యక్తి కూడా భూమిని కలిగి వుండటం ద్వారా "నిజమైన వ్యక్తిగా మారాలనుకుంటాడు. కేవలం అభీష్టం మాత్రమే కాక మరేదో దీనికి అవసరమవుతుంది. అంతే కాదు "వ్యక్తి" తన అభీష్టాన్ని నెరవేర్చుకునేందుకు అవసరమైన సరిహద్దు రేఖను నిర్ణయించటం పూర్తిగా అసాధ్యం. అది మొత్తం దేశాన్ని స్వాధీనంలో తీసుకోవాలనుకుంటుందా లేక "వస్తువు మీద నా ఆధిపత్యం వ్యక్తం కావడం కోసం" మొత్తం కొన్ని దేశాల బృందాలనే స్వాధీనం చేసుకోవాలనుకుంటుందా, చెప్పటం అసాధ్యం. ఇక్కడ హెగెల్ పూర్తిగా అవాక్కయిపోతాడు. "ఈ స్వాధీనం అన్నది ఒక ప్రత్యేక తరహాకు చెందిన అంశం. నేను నా శరీరంతో స్పృశించిన దానికంటే ఎక్కువ స్వాధీనంలోనికి తీసుకోను. అయితే మరోవైపున బాహ్య వస్తువులు నేను గ్రహించగలిగిన దానికంటే చాలా విస్తారంగా ఉంటాయనేది స్పష్టం. ఆ రకంగా ఒక వస్తువుపై స్వాధీనం సంపాదించిన తరువాత దానితో మరొకటి కలిసి వుంటుంది. నేను నా స్వాధీనంలోకి తెచ్చుకోవడం అనే చర్యను నా చేతి ద్వారా చేస్తాను. అయితే దాని అవకాశాన్ని పెంచవచ్చు." (పుట 90) అయితే ఈ మరో అంశం అన్నదానితో వేరే ఇంకో అంశం కలిసి వుంటుంది. కనుక ఒక ఆత్రంగా నా అభీష్టం నేలలోకి ఇంకటానికి వీలున్న పరిధి అంతర్థానం అవుతుంది. నేను ఒకదానిపై స్వాధీనం సంపాదించిన తరువాత దానితో పాటు కలిసి వున్న ఆస్తులు కూడా నావే అన్న భావన నాకు కలుగుతుంది. కనుక ఈ అభీష్టమనే భావన నుంచి మరేదీ గ్రహించలేము కనుక ఇక్కడ రూఢిగా ఉండే హక్కు మాత్రమే నిర్ణయిస్తుంది." (పుట 91) ఇది అభీష్టానికి సంబంధించిన "భావన" గురించి హెగెల్ అమాయకంగా ఒప్పుకుంటున్నాడు. బూర్జువా సమాజానికి చెందిన ఈ భూమి ఆస్తి అన్న శాసన సంబంధమైన దృక్పథాన్ని సంపూర్ణమైన, శాశ్వతమైన అంశంగా పరిగణించే ఘోర తప్పిదం ఈ భావన ప్రారంభంలోనే వుంది. ఆ రకంగా ఆయన ఈ భూ ఆస్తికి సంబంధించిన వాస్తవ స్వభావాన్ని ఏమాత్రం అర్థం చేసుకోలేదు. సామాజిక, అంటే ఆర్థిక అవసరాలు మారే కొద్దీ, "రూఢిగా ఉండే హక్కు" అన్నది భూ ఆస్తికి సంబంధించిన తన నిబంధనలను మార్చాలని, మార్చగలదని ఆయన అదే సమయంలో ఒప్పుకుంటున్నాడు.

1. సంపుటి I, భాగం VIII - సం॥

మరోవైపున భూమి నుంచి ప్రజానీకాన్ని పెద్ద సంఖ్యలో తొలగిస్తుందని కూడా గమనించాం. ఈ మేరకు భూ ఆస్తిపైన గుత్తాధిపత్యం అన్నది ఒక చారిత్రక ఉపోద్ఘాతం. అది ఇంకా పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం యొక్క ప్రాతిపదికగానే వుంది. ఏదో ఒక రూపంలో ప్రజల దోపిడీలపై ఆధారపడిన గత ఉత్పత్తి విధానాల్లాంటిదే ఇది కూడా. అయితే తొలి పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం ఎదుర్కొనే భూ ఆస్తి రూపం దానికి అనుకూలంగా ఉండదు. కనుక వ్యవసాయాన్ని పెట్టుబడికి చేర్చటం ద్వారా తనకు అవసరమైన రూపాన్ని అది సృష్టించుకుంటుంది. ఆ రకంగా అది ఫ్యూడల్ భూ ఆస్తిని, గణ ఆస్తిని గ్రామీణ సంఘానికి సమష్టిగా వున్న భూమిలో చిన్న రైతు ఆస్తిని – వాటి శాసన సంబంధమైన రూపాలు ఎంత వైవిధ్యంగా ఉన్నప్పటికీ – తన ఉత్పత్తి విధాన అవసరాలకు అనుగుణంగా ఉండే ఆర్థిక రూపంలోకి మారుస్తుంది. పెట్టుబడిదారీ ఉత్పత్తి విధాన ప్రధాన ఫలితాల్లో ఒకటి సమాజంలో అతి తక్కువగా అభివృద్ధి చెందిన ప్రజలు తమ అనుభవాన్ని మాత్రమే ఆసరాగా చేసుకుని యాంత్రికంగా చేసిన పనినే చేస్తూ వుండే దశ నుంచి వ్యవసాయాన్ని అది పూర్తిగా మారుస్తుంది. సొంత ఆస్తి పరిస్థితుల క్రింద సాధ్యమైన మేరకు చైతన్య పూరితంగా వ్యవసాయ శాస్త్రాన్ని శాస్త్రీయ అనువర్తన అందచేస్తుంది.[1] ఒకవైపున ఆధిపత్యమూ, దాస్యమూ అన్న సంబంధాల నుంచి భూ ఆస్తిని విడదీస్తుంది. మరోవైపున అది భూస్వామి నుంచి భూ ఆస్తిని ఒక ఉత్పత్తి సాధనంగా పూర్తిగా వేరుచేస్తుంది. భూస్వామి దృష్టిలో అది కేవలం ఒక డబ్బు అంచనా మాత్రమే. దానిని అతడు తన గుత్తాధిపత్యం కారణంగా పారిశ్రామిక పెట్టుబడిదారుడు నుంచి, పెట్టుబడిదారీ రైతు నుంచి వసూళ్ళు చేస్తాడు.

1. జాన్‌స్టన్ లాంటి యథాస్థితివాద వ్యవసాయ, రసాయనిక శాస్త్రవేత్తలు కూడా అంగీకరిస్తున్నది ఏమంటే ప్రతీచోటా సహేతుకమైన వ్యవసాయం అన్నది సొంత ఆస్తి నుంచి తలెత్తుతున్న అధిగమించ వీలులేని ఆటంకాలను ఎదుర్కొంటుంది. ప్రపంచంలో సొంత ఆస్తి గుత్తాధిపత్యం ఉండాలని వాదించే రచయితలు కూడా దీనిని అంగీకరిస్తున్నారు. ఉదాహరణకు ప్రత్యేకంగా సొంత ఆస్తిని సమర్థించటానికి రాసిన తన రెండు సంపుటాల గ్రంథంలో చార్లెస్ కోట్ ఇలా అంటాడు. ''ప్రతీ చిన్న భూభాగమూ సార్వత్రిక ప్రయోజనానికి అనుగుణంగా లేకుంటే ఒక జాతి తన స్వభావానికి అనుగుణమైన స్థాయిలో సుభిక్షతనూ శక్తి స్తోమతనూ సంపాదించలేదు. దాని సంపదకు ఒక బలమైన అభివృద్ధిని అందివ్వాలంటే ఒక మేధోవంతమైన సంకల్పం ఒకటి దానిని నిర్ణయించగలిగి వుండాలి. సాధ్యమైతే ప్రతి భూభాగానికి దాని కర్తవ్యాన్ని అప్పగిస్తూ మిగిలిన వారందరి సౌభాగ్యానికి దోహదపడేలా దానిని ఆదేశించే శక్తి ఒక్కటి ఉండాలి.... అప్పుడు సొంత భూ భాగాలుగా మొత్తం భూమిని విడదీయటం అన్నది ఇక్కడ పొసగదు. అలాగే తన ఆస్తిని పూర్తిగా తన ఇష్టం వచ్చినట్టు వదిలివేసే హక్కును ఇవ్వటం కూడా ఇక్కడ పొసగని విషయమే.'' (ట్రయిటే డిరా ప్రొప్రయిటే, టోమ్ I పారిస్, 1834, పుట 228 - సం॥) - జాన్‌స్టన్, కోట్ తదితరులు ఆస్తికి సహేతుకమైన వ్యవసాయానికి మధ్య వైరుధ్యం గురించి మాట్లాడుతున్నప్పుడు ఒక దేశం భూభాగాన్ని మొత్తంగా సాగు చెయ్యాల్సిన అవసరాన్ని దృష్టిలో ఉంచుకుని మాట్లాడుతున్నారు. అయితే కొన్ని ప్రత్యేకమైన వ్యవసాయ ఉత్పాదితాల సాగు అన్నది మార్కెట్టు ధరల ఎగుడుదిగుళ్ళపై ఆధారపడి వుంది. ఈ ధరల ఎగుడుదిగుళ్ళతో పాటు వ్యవసాయంలో నిరంతరంగా మార్పులు జరుగుతాయి. మొత్తం పెట్టుబడిదారీ ఉత్పత్తి ఆత్మ ఇది. అది తక్షణ లాభంవైపు పయనిస్తుంది. అనేక తరాల ప్రజల జీవనాధారం అయిన శాశ్వత అవసరాలను అందించాల్సిన వ్యవసాయానికి ఇది విరుద్ధంగా వుంటుంది. ఈ విషయంలో స్పష్టంగా కనిపించే ఉదాహరణ అడవులు. అవి ప్రైవేటు ఆస్తి కాకుండా ప్రభుత్వ అజమాయిషీలో ఉన్నప్పుడు మాత్రమే మొత్తం సామాజిక ప్రయోజనాలకు అనుగుణంగా నిర్వహించటం జరుగుతుంది.

అది భూస్వామికి భూమికి వున్న సంబంధాన్ని ఎంత సంపూర్ణంగా అంతం చేస్తుందంటే స్కాట్లాండ్‌లో ఎస్టేట్లు ఉన్న భూస్వామి తన జీవిత కాలమంతా కాన్‌స్టాంట్ నోపుల్‌లో గడిపేయొచ్చు. భూ ఆస్తి ఆ రకంగా తన గత రాజకీయ సామాజిక అలంకారాలను, సంస్థలను వదులుకుంటుంది. అనగా క్లుప్తంగా చెప్పాలంటే సాంప్రదాయిక సహచరులుగా ఉండే అంశాలన్నింటిని వదిలేస్తుంది. వాటన్నింటిని పారిశ్రామిక పెట్టుబడిదారులు, వారి సైద్ధాంతిక ప్రతినిధులు భూ ఆస్తితో సాగే తమ పోరాటపు వేడిలో నిరుపయోగమని, అసంబద్ధమని, అనవసర అంశాలని ఖండించటం మనం తరువాత గమనిస్తాం. ఈ రూపాలన్నింటిని త్యజించి భూ ఆస్తి కేవలం తన ఆర్థిక రూపాన్ని గ్రహిస్తుంది. ఒకవైపున హేతుబద్ధమైన వ్యవసాయం వలన వ్యవసాయాన్ని సామాజిక స్థాయిలో నిర్వహించటం సాధ్యమవుతుంది. మరోవైపున భూమిలో ఆస్తిని అది అసంబద్ధమైన స్థాయిలో కుదిస్తుంది. ఈ రెండు అంశాలు పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం సాధించిన గొప్ప విజయాలు. అయితే దాని ఇతర చారిత్రక పురోగమనాలు అన్నింటిలాగానే వీటిని కూడా అది ప్రత్యక్ష ఉత్పత్తిదారుల్ని పూర్తిగా దరిద్రులుగా మార్చటం ద్వారా సాధించింది.

మనం అసలు సమస్యను పరిశీలించటానికి ముందు, పొరపాటు అవగాహన తలెత్తకుండా ఉండటానికి అనేక ప్రాథమిక వివరణలు అవసరం.

పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం యొక్క ప్రాథమిక అవసరాలు ఇలా ఉంటాయి : నేలను వాస్తవంగా దున్నేది వేతన కార్మికులు. వారిని పెట్టుబడిదారులు పనిలో పెడతారు. ఆ పెట్టుబడిదారీ రైతు తన పెట్టుబడిని సొంత లాభం అందించే అనువైన ఒక రంగంగానే వ్యవసాయంలో దిగుతాడు. ఒక ప్రత్యేక ఉత్పత్తి రంగంగానే తన పెట్టుబడికి మదుపుగా పెడతాడు. ఈ పెట్టుబడిదారీ రైతు భూ యజమానికి ఒక నిర్ణీతమైన కాలపరిమితులలో కొంత మొత్తాన్ని చెల్లిస్తాడు. ఇది ఉదాహరణకు సంవత్సరానికి ఒకసారి ఒప్పందం ద్వారా నిర్ణయమైన మేరకు (డబ్బు పెట్టుబడిని అప్పు తీసుకున్న వ్యక్తి నిర్ణీతమైన వడ్డీని చెల్లించినట్లుగానే) తన పెట్టుబడిని ఈ ప్రత్యేక ఉత్పత్తి రంగంలో మదుపు పెట్టటానికై హక్కు కోసం కొంత మొత్తం చెల్లిస్తాడు. ఈ మొత్తాన్ని భూమి కౌలు అని పిలుస్తారు. వ్యవసాయ భూమికిగాని భవనాలకు గాని, గనులకు, చేపలు పట్టే స్థలానికి గాని, అడవులు వగైరాలకు గాని చెల్లించేదంతా భూమి కౌలే. భూ యజమాని పెట్టుబడిదారీ రైతుతో తన భూమిని కౌలు కివ్వటానికి ఒప్పందం చేసుకున్న కాలమంతటికీ చెల్లించబడుతుంది. కనుక ఇక్కడ భూమి కౌలు అన్నది భూ ఆస్తి యొక్క ఆర్థిక రూపం. అనగా అది విలువను ఉత్పత్తి చేస్తుంది. ఇక్కడ మన ముందు మూడు వర్గాలు వున్నాయి. వేతన కార్మికులు, పారిశ్రామిక పెట్టుబడిదారులు, భూమి యజమానులు. ఆధునిక సమాజ చక్రంలో ఈ వర్గాలు పరస్పరం అభిముఖంగా ఎదిరించుకుంటూ కలిసి వున్నాయి.

పెట్టుబడిని భూమిలో తాత్కాలికంగా పెట్టవచ్చు. రసాయనిక స్వభావ మెరుగుదలలు, ఎరువుల వాడకం వగైరాలు ఈ కోవకు చెందుతాయి. లేదా అది శాశ్వత ప్రాతిపదికపై కూడా వుండవచ్చు. మురుగు కాల్వలు, నీటిపారుదల పనులు, భూమిని చదును చెయ్యటమూ, పొలంలో భవనాలు కట్టటమూ వగైరాలు ఈ కోవకు చెందుతాయి. ఇటువంటి పెట్టుబడిని నేను వేరేచోట భూమిపై

పెట్టుబడి అని వ్యవహరించాను.[1] అది స్థిర పెట్టుబడి అనే అభివర్గానికి చెందుతుంది. భూమిమీద పెట్టిన పెట్టుబడిపై వడ్డీ, ఒక ఉత్పత్తి పరికరంగా నేలలో చేసిన మెరుగుదలలూ పెట్టుబడిదారీ రైతు భూ యజమానికి చెల్లించే కౌలులో ఒక భాగం కాగలవు.[2] కానీ భూమి తన సహజ స్థితిలో వున్నా, వ్యవసాయయోగ్య స్థితిలో వున్నా, భూమిని భూమిగా ఉపయోగించుకున్నందుకు చెల్లించే మొత్తం వాస్తవంగా భూమి కౌలు కాజాలదు. భూ ఆస్తిని గురించి క్రమబద్ధంగా జరిగే పరిశీలనలో భూ యజమాని యొక్క ఈ తరహా ఆదాయం గురించి వివరంగా చర్చించటం అవసరమవుతుంది. అయితే అటువంటి వివరమైన చర్చ ఇక్కడ మన పరిధిలో లేదు. అయితే దాని గురించి కొన్ని మాటలు ఇక్కడ సరిపోతాయి. తాత్కాలికమైన పెట్టుబడి మదుపులన్నీ వ్యవసాయంలో ఎటువంటి మినహాయింపులు లేకుండా పెట్టుబడిదారీ రైతే పెడతాడు. సాగు చెయ్యటం లాగానే ఈ మదుపుల వలన కూడా భూమి మెరుగవుతుంది.[3] దాని ఉత్పత్తి పెరుగుతుంది. భూమిని కేవలం పదార్థ స్థాయి నుంచి భూమి పెట్టుబడి స్థాయికి అది పెంచుతుంది. అమెరికాలో గతంలో బానిస యజమానులు చేసినట్లుగా భూమిని పాశవికంగా చెడగొట్టడం కాక దానిని హేతుబద్ధంగా సాగులోకి తెస్తే ఈ మెరుగుదల సాధ్యం అవుతుంది. అయితే భూమిని దుర్వినియోగం చెయ్యకుండా భూ యజమానులు ఒక ఒప్పందం ద్వారా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసుకుంటారు. ఒకే స్వభావం కలిగి సాగులోకి తెచ్చిన భూమి ఇంకా సాగులోకి రాని భూమికంటే విలువైనది. శాశ్వతమైన పెట్టుబడి మదుపులు భూమిపై పెరిగిన కొద్దీ వీటిలో చాలా వరకు లేదా మొత్తంగా పెట్టుబడిదారీ రైతే భరిస్తాడు. అయితే ఒప్పందం గడువు పూర్తికాగానే భూమిలో జమ చేయబడిన మెరుగుదలలన్నీ భూ యజమాని సొంతం అవుతాయి. అవి భూమిలో దాని నుంచి విడదీయలేని పదార్థంగా మారిపోతాయి. ఈ ఒప్పందపు కాలాలను సాధ్యమైనంతగా భూ యజమానులు పెట్టుబడిదారీ అభివృద్ధితోపాటు తగ్గించేందుకు ప్రయత్నించటానికి గల కారణాలలో ఇది ఒకటి. కొత్త ఒప్పందంలో భూ యజమాని తన భూమిలో జమ అయిన పెట్టుబడిపైన వడ్డీని తన భూమి కౌలుకు కలుపుతాడు. అతడు తన భూమిని ఈ బాగుచేతలకై పెట్టుబడి పెట్టిన పాత పెట్టుబడిదారీ రైతుకు కౌలుకిచ్చినా లేదా మరో రైతుకు కౌలుకిచ్చినా భూమి కౌలు మాత్రం పెంచుతాడు. ఆ రకంగా అతని భూమి కౌలు, అతను భూమిని అమ్మదల్చుకుంటే

---

1. తత్వశాస్త్ర దారిద్ర్యం. దానిలో నేను భౌతిక భూమికీ - పెట్టుబడి భూమికీ తేడాను చూపించాను. "అప్పుడిక ఉత్పత్తి సాధనంగా మారిన నేలపైన మరింతగా పెట్టుబడిని పెట్టడం వలన నేలలో మరే పదార్థాన్ని జోడించకుండానే పెట్టుబడిగా ఆ నేల విలువ పెరుగుతుంది. పెట్టుబడిగా నేల ఇతర పెట్టుబడుల కంటే శాశ్వతం కాదు. పెట్టుబడిగా ఆ నేల స్థిర పెట్టుబడి. చలామణి పెట్టుబడి లాగానే స్థిర పెట్టుబడి కూడా కొంత కాలానికి ఖర్చవుతుంది."
2. "కాగలవు" అని ఎందుకంటున్నానంటే కొన్ని పరిస్థితుల్లో ఈ వడ్డీ చట్టపర భూమి కౌలు నియమాలచేత క్రమబద్ధం అవుతుంది. కనుక ఉదాహరణకు బీడుభూములకూ, సహజమైన సారవంతమైన భూములకూ పోటీ తలెత్తిన సందర్భాలలోలాగా అది అంతర్ధానమైపోగలదు.
3. జేమ్స్ ఆండర్సన్ గ్రంథం చూడండి [ఎ కామ్ ఇన్విష్టిగేషన్ ఆఫ్ ది సర్ కమస్టనెస్ దట్ హావ్‌లెడ్ టుది ప్రజంట్ స్కేర్‌సిటి ఆఫ్ గ్రెయిన్ ఇన్ బ్రిటన్, లండన్, 1801, పుటలు 35, 36, 38 - సం॥] అలాగే కెరీ గ్రంథాన్ని చూడండి. [ది పాస్ట్ ది ప్రజంట్ అండ్ ది ఫ్యూచర్ ఫిడెటెల్ఫియా, 1848, పుటలు 129-31 - సం॥]

(దాని ధర ఎలా నిర్ణయించబడుతుందో పరిశీలిద్దాం) దాని విలువ ఇప్పుడు మరింత ఎక్కువగా ఉంటుంది. అతనిప్పుడు కేవలం భూమిని మాత్రమే కాదు, బాగుచెయ్యబడిన భూమిని అమ్ముతాడు. బాగుచెయ్యటానికి అతను ఏ మాత్రం పెట్టకపోయినా భూమి కౌలు హెచ్చుతగ్గులతో సంబంధం లేకుండానే భూ యజమానులు రానురానూ మరింత ధనవంతులు కావటంలో వున్న ఒక రహస్యం ఇదీ. వారి కౌలులు నిరంతరాయంగా పెరగటం, అంతే నిరంతరాయమైన ఆర్థిక అభివృద్ధితో పాటూ వారి ఎస్టేటుల విలువ కూడా పెరగటం జరుగుతుంది. ఆ రకంగా వారి తోడ్పాటు ఏమాత్రం లేకుండా సృష్టించిన సామాజికాభివృద్ధి ఉత్పత్తిని వారు జేబులో వేసుకుంటారు. అయితే వ్యవసాయం హేతుబద్ధంగా అభివృద్ధి చెందటానికి వీలులేని పెద్ద ఆటంకాలలో ఇదొకటి. ఎందుకంటే తన కౌలు కాలంలో పూర్తిగా తిరిగి రాబట్టుకోగలనన్న ఆశ లేకపోవటంతో ఖర్చులను, భూమి బాగుసేతలను కౌలు రైతు మానుకుంటాడు. ఈ పరిస్థితిని 18వ శతాబ్దపు రచయిత జేమ్స్ ఆండర్సన్ ఒక ఆటంకంగా పదేపదే ఖండించాడు. ఆయన ఆధునిక కౌలు సిద్ధాంతాన్ని కనుగొన్న మొదటి వ్యక్తి. తనే స్వయంగా పెట్టుబడిదారీ రైతు. ఆయన కాలంలో గొప్ప వ్యవసాయ శాస్త్రజ్ఞుడు కూడా. ఆయనే కాక మన కాలంలో కూడా ఇంగ్లాండులో భూ ఆస్తి అన్నదాన్ని దాని వ్యతిరేకులు తీవ్రంగా ఖండిస్తున్నారు.

'హిస్టరీ ఆఫ్ ది లాండెడ్ టెన్యూర్ ఆఫ్ గ్రేట్ బ్రిటన్ అండ్ ఐర్లాండ్ (లండన్ 1865)' అనే తన గ్రంథంలో ఎ.ఎ. వాల్టన్ ఇలా అంటాడు (పుటలు 96–97) – "దేశంలో వున్న అనేక వ్యవసాయ సంస్థల ప్రయత్నాలన్నీ వ్యవసాయాన్ని బాగుచెయ్యటంలోనూ, వాస్తవ పురోగమనం సాధించటంలోనూ, విస్తృతమైన, నిజంగా ప్రస్తుతించదగిన ఫలితాలను సాధించటంలో విఫల మవుతాయి. అలా జరిగే మెరుగుదల అంతా ఎస్టేటు పెరిగిన విలువగానూ, భూస్వామికి పెరిగిన కౌలుగానూ మారినంత కాలం కౌలుకు తీసుకున్న రైతు లేదా కార్మికుని పరిస్థితి మెరుగుపడనంత కాలం ఇలాగే ఉంటుంది. మురుగు కాల్వల వ్యవస్థ, విస్తారంగా ఎరువుల వాడకం, మంచి నిర్వహణ, కార్మికుల్ని మరింత ఎక్కువ సంఖ్యలో పనిలో పెట్టుకోవటమూ, తద్వారా భూమి క్షుణ్ణంగా శుభ్రంచేసి బాగు చెయ్యటం – అన్నవి భూమిని మెరుగు చెయ్యటంలోనూ, ఉత్పత్తిలోనూ అద్భుతమైన ఫలితాలు సాధిస్తాయన్న సంగతి భూస్వామికి లేదా అతని ప్రతినిధికి లేదా వ్యవసాయ సంస్థ అధ్యక్షునికి తెలిసినంత స్పష్టంగానే రైతులకు కూడా తెలుసు. ఇది అంతా చెయ్యాలంటే గణనీయమైన స్థాయిలో ఖర్చులు పెట్టాలి. వారు భూమిని ఎంత బాగుచేసినా, దాని విలువను ఎంతగా పెంచినా చివరకు దాని ప్రధానమైన లాభాన్ని అధిక కౌలు రూపాలలోనూ, తమ ఎస్టేట్ల పెరిగిన విలువ రూపంలోనూ భూస్వాములే పొందుతారన్న సంగతి రైతులకు తెలుసు. ఆ వక్తలు (భూ యజమానులు, వారి ప్రతినిధులు వ్యవసాయ ఉత్సవాలలో ఉపన్యాసాలు దంచుతూ) పరాకుపడి తమకు ఒక విషయం చెప్పకుండా దాటవేస్తున్నారని గ్రహించగలిగే పాటి తెలివితేటలు వారికున్నాయి. అది ఏమంటే వారు భూమిని ఎంత బాగుచేసినా దాని ఫలితంలో అత్యధిక భాగం భూస్వాముల వశమే అవుతుంది... పాత కౌలుదారులు పొలాన్ని ఎంతగా బాగుచేసినప్పటికీ ఆ పాత మెరుగుదలను బట్టి పెరిగిన భూమి విలువకు అనుగుణంగా కౌలును కూడా భూస్వామి ఆ తరువాత కౌలుకు తీసుకునే రైతుకు పెంచుతాడు."

ఈ ప్రక్రియ భవన నిర్మాణాల కోసం భూమిని ఉపయోగించేటప్పుడు కనిపించినంత స్పష్టంగా

వ్యవసాయంలో కనిపించదు. ఇంతవరకూ ఇంగ్లాండులో భవన నిర్మాణార్థం ఉద్దేశించిన భూమిలో అత్యధిక భాగం పూర్తిగా హక్కుభుక్తంగా అమ్మడం కాక భూస్వాములచేత 99 సంవత్సరాలకో, మరికొంత తక్కువ కాలానికో కౌలుకు యివ్వబడుతుంది. ఈ గడువు పూర్తికాగానే భూమితో పాటూ ఈ భవనాలు కూడా భూస్వామి స్వాధీనం అవుతాయి. "వారు (కౌలుదారులు) లీజు గడువు పూర్తి అయ్యేదాకా అత్యధిక స్థాయిలో భూమి కౌలును చెల్లిస్తూ గడువు పూర్తికాగానే ఆ భవనాలతో సహా భూమిని మళ్ళీ కౌలుకు ఇవ్వటానికి వీలైన పరిస్థితుల్లో పెద్ద భూస్వామికి అప్పచెప్పవలసి వుంటుంది. లీజు గడువు పూర్తికాగానే భూస్వామి ప్రతినిధో లేదా సర్వేయరో వచ్చి మీ ఇంటిని పరీక్షిస్తాడు. దానిని సక్రమంగా వుంచావో లేదో చూస్తాడు. తరువాత దానిని స్వాధీనం చేసుకుని భూస్వామి ఆస్తులకు జమ చేస్తాడు. ఇదే పద్ధతి ఇలాగే చాలా కాలంపాటు కొనసాగితే రాజ్యంలో వున్న మొత్తం భవనాల ఆస్తి అంతా భూమితో పాటుగా పెద్ద భూస్వాముల చేతుల్లోకి వెళ్తాయి. లండన్‌కు పశ్చిమ భాగాన వున్న భూములు, టెంపుల్ బార్‌కు ఉత్తర దక్షిణ ప్రాంతంలో వున్న భూములన్నీ అరడజను మంది పెద్ద భూస్వాముల చేతుల్లో ఉన్నాయి. వారంతా వాటిని అధిక కౌలుకిచ్చారు. వాటి లీజు గడువు త్వరలోనే పూర్తి కావస్తుంది. రాజ్యంలో ఉన్న ప్రతీ పట్టణం గురించి దాదాపు ఇలాగే చెప్పవచ్చు. ఇలా "grasping system of exclusion" – లేదు. ఊరు కొట్టి నోట్లో వేసుకునే హక్కు భుక్తం, గుత్తాధిపత్య వ్యవస్థ ఇక్కడితో ఆగదు కూడా. ఓడరేవులు ఉన్న పట్టణాలలో నౌకాశ్రయ భవనాలన్నీ దాదాపు ఇదే విధంగా భూస్వామి తిమింగలాల స్వాధీనంలోనే ఉన్నాయి." (అదే గ్రంథం పుటలు 92-93) 1861 గణాంక సమాచారం ప్రకారం ఇంగ్లాండ్, వేల్స్‌ల మొత్తం జనాభా 20,066,224. వారిలో భూస్వాములు 36,032 మంది అయితే, చిన్న భూస్వాముల్ని ఓ పక్క, పెద్ద భూస్వాముల్ని ఒక పక్క విడదీసి జనాభాకూ, వున్న ఇళ్ళ స్వామ్యానికీ దామాషా చూస్తే ఈ చిత్రం పూర్తిగా మారిపోతుంది.

భవనాల యాజమాన్య విషయంలో ఈ ఉదాహరణ ముఖ్యం. మొదటి విషయం అది వాస్తవంగా ఉన్న నేల కౌలుకు, భూమికి పెట్టిన స్థిర పెట్టుబడి వడ్డీకి మధ్య ఉన్న తేడాను ఇది తెలియజేస్తుంది. ఈ వడ్డీ, భూమి కౌలులో ఒక అదనపు భాగంగా ఉండవచ్చు. భూమికి పెట్టిన పెట్టుబడిపైన వడ్డీ లాగానే భవనాలపై వడ్డీ కూడా ఆ లీజు కొనసాగినంత కాలమూ పారిశ్రామిక పెట్టుబడిదారునికి, భవనాల సట్టా వ్యాపారికి లేదా కౌలుదారునికి చెందుతుంది. భూమిని ఉపయోగించుకున్నందుకు వార్షికంగా నిర్ణీత సమయాలలో చెల్లించాల్సిన భూమి కౌలుతో దానికి ఏ ప్రమేయమూ ఉండదు. రెండవ అంశం ఏమంటే ఇతరులు భూమిపై పెట్టిన పెట్టుబడి ఆ భూమితో పాటు ఆఖరికి భూస్వామి చేతుల్లోకి పోతుంది. ఆ రకంగా దాని వడ్డీ కౌలును పెంచిపారేస్తుంది.

భూస్వామ్య విధానం తరపున వకాల్తా తీసుకున్న రచయితలు లేదా బూర్జువా ఆర్థికవేత్తల దాడులకు వ్యతిరేకంగా వాదించేవారు లేదా క్యారీ లాగా పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానంలో వున్న వైరుధ్యాలకు "సామరస్యాన్ని" చేకూర్చాలనుకునే వారు భూమి కౌలును అనగా భూ ఆస్తికి ఒక ప్రత్యేక ఆర్థిక వ్యక్తీకరణ అయిన భూమి కౌలును వడ్డీతో సర్వసమానమని రుజువు చెయ్యటానికి ప్రయత్నించారు. ఇది భూస్వాములకు, పెట్టుబడిదారులకు మధ్య ఉన్న వ్యతిరేకతను రద్దు చేస్తుంది. పెట్టుబడిదారీ విధానపు తొలిదశలో ఈ విరుద్ధ పద్ధతిని ప్రయోగించేవారు. ఆ రోజుల్లో భూ ఆస్తి

అన్నది తొలి కాలపు గౌరవనీయమైన సొంత ఆస్తి రూపంగా ప్రజానీక భావనలో వుండేది. కాని పెట్టుబడిపైన వడ్డీ మాత్రం అన్యాయంగా డబ్బు గుంజటం అని పరిగణించే వారు కనుక డడ్లీనార్త్, లాకి తదితరులు పెట్టుబడిపై వడ్డీని భూమి కౌలు లాంటిదే అని చెప్పటానికి ప్రయత్నించారు. భూమి కౌలు అస్తిత్వాన్ని టర్గాట్ వడ్డీని సమర్థించటం లాంటిదే ఇది కూడా. భూమిలో పెట్టిన పెట్టుబడిపై వడ్డీ జమ కావటంతో ప్రమేయం లేకుండానే కౌలు అన్నది తన శుద్ధ రూపంలో వుండొచ్చు, ఉంటుంది – అన్న దానితో సంబంధం లేకుండానే ఇటీవలి రచయితలు ఈ రకంగా ఒక విషయాన్ని మర్చిపోతున్నారు. భూస్వామ్య – ఇతరుల పెట్టుబడిపై పెట్టిన వడ్డీనే కాక ఈ ఇతరుల పెట్టుబడిని కూడా నష్టపరిహారం లేకుండా స్వాహా చేస్తాడు అన్న సంగతిని వారు మర్చిపోతారు. ఒకానొక ఉత్పత్తి విధానికి అనుగుణమైన ఇతర ఆస్తి రూపాలన్నింటి లాగానే భూ ఆస్తిని సమర్థించాలంటే ఆ ఉత్పత్తి విధానం కూడా ఒక పరివర్తనాశీలమైన చారిత్రక ఆవశ్యకతే. దాని ఉత్పత్తి సంబంధాలు దాని నుంచి తలెత్తే మార్పిడి సంబంధాలు కూడా అటువంటి చారిత్రక తాత్కాలిక ఆవశ్యకతలే. భూ ఆస్తి అన్నది ఒకానొక అభివృద్ధి దశలో పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం దృష్టి నుంచి సైతం అనవసరంగానూ, అపాయకరంగానూ కనిపిస్తుంది. అది ఇతర ఆస్తులకంటే ఆ రకంగా మాత్రమే భిన్నమైనది.

భూమి కౌలును మరో రూపంలో వడ్డీతో గందరగోళపర్చవచ్చు. ఆ రకంగా దాని ప్రత్యేక స్వభావాన్ని ఉపేక్షించవచ్చు. మన భూగోళంపైన ఒక నిర్దిష్ట భాగాన్ని కౌలుకివ్వటం ద్వారా భూస్వామి వార్షికంగా పొందే ఒక మొత్తం డబ్బు రూపాన్ని భూమి కౌలు సంతరించుకుంటుంది. ప్రతి ప్రత్యేక డబ్బు మొత్తాన్ని పెట్టుబడీకరించవచ్చునని మనం గమనించాం. అనగా ప్రతి మొత్తాన్ని ఒక ఊహాజనిత పెట్టుబడిపైన వడ్డీగా పరిగణించవచ్చు. ఉదాహరణకు సగటు వడ్డీ రేటు 5% అయితే అప్పుడు వార్షికంగా వచ్చే 200 పౌండ్లు భూమి కౌలును 4 వేల పౌండ్ల పెట్టుబడిపైన వడ్డీగా భావించవచ్చును. ఆ రకంగా పెట్టుబడీకరించబడిన భూమి కౌలులో నేల విలువ లేదా కొనుగోలు ధర ఉంటుంది. అయితే చూసీ చూడగానే ఇది కూడా శ్రమ ధర లాగానే హేతువిరుద్ధంగా వుండే అభివర్గం. ఎందుకంటే భూమి అన్నది శ్రమ ఉత్పాదితం కాదు. కనుక దానికి విలువ ఉండదు. మరోవైపున ఉత్పత్తిలో వున్న ఒక వాస్తవిక సంబంధం ఈ హేతువిరుద్ధ రూపం వెనుక దాచబడుతుంది. ఒక పెట్టుబడిదారుడు వార్షికంగా 200 పౌండ్ల కౌలునిచ్చే భూమిని కొని 4 వేల పౌండ్లను చెల్లిస్తే అప్పుడు దాని మీద అతడు సగటున 5% వడ్డీని వార్షికంగా పొందుతాడు. అతను నేరుగా వడ్డీ ఇచ్చే పత్రాల్లో మదుపు పెట్టినట్లుగానే లేదా నేరుగా తన డబ్బునే 5% వడ్డీకి అప్పు ఇచ్చినట్టుగానే అతనికి కనిపిస్తుంది. 4 వేల పెట్టుబడి ఇలా 5% చొప్పున విస్తరిస్తుంది. ఈ ఊహతో తన ఎస్టేటు కొనుగోలు ధరను దానిపై వచ్చే ఆదాయం ద్వారా అతను 20 ఏళ్ళలో తిరిగి పొందుతాడు. కనుక ఇంగ్లాండులో భూమి కొనుగోలు ధరను ఇన్ని సంవత్సరాలలో కొనుగోలుగా తిరిగి వస్తుంది – అని అంచనా వేస్తాడు. ఇది భూమి కౌలును పెట్టుబడీకరించటాన్ని వ్యక్తం చేసే మరో పద్ధతి మాత్రమే. అది నిజానికి భూమి కొనుగోలు ధరగా కాక అది ఇచ్చే భూమి కౌలు కొనుగోలు ధర – అని మామూలు వడ్డీ రేటు ప్రకారం అంచనా వేసినది. అయితే కౌలును ఈ రకంగా పెట్టుబడీకరించటం అన్నది కౌలు అస్తిత్వం ఉందనుకోవడం కాగా దీనికి విలోమంగా కౌలును తన సొంత పెట్టుబడీకరణ నుంచి పొందలేము.

వివరించలేము. అమ్మకంతో ప్రమేయంలేని దాని అస్తిత్వం అన్నది మన దర్యాప్తుకు ప్రారంభ కేంద్రం.

భూమి కౌలును ఒక స్థిరమైన పరిమాణం అని భావిస్తే భూమి ధర వడ్డీ రేటుకు విలోమంగా పెరుగుతుంది. లేదా తరుగుతుంది. మామూలు వడ్డీ రేటు 5% నుండి 4%కు పడిపోతే అప్పుడు 200 పౌండ్ల వార్షిక భూమి కౌలు 4 వేల పౌండ్లకు కాక 5వేల పౌండ్ల పెట్టుబడి నుంచి వచ్చినటువంటి దన్నమాట. పొలం ధర 4 వేల పౌండ్ల నుంచి 5 వేల పౌండ్లకు పెరిగి వుంటుంది. అనగా 20 యేళ్ళ కొనుగోలు నుంచి 25 యేళ్ళ కొనుగోలుకు పెరిగి వుంటుంది. దీనికి వ్యతిరేకమైన ఉదాహరణలో ఇందుకు విరుద్ధంగా జరుగుతుంది. ఇది భూమి ధర యొక్క చలనం. దీనికి భూమి కౌలు చలనంతో ప్రమేయం లేదు. కేవలం వడ్డీ రేటు మాత్రమే శాసించుతుంది. లాభం రేటు సామాజిక ప్రగతి క్రమంలో పడిపోయే ధోరణి ఉన్నట్లుగా మనం గమనించాం. కనుక లాభం రేటు నియంత్రించిన మేరకు వడ్డీ రేటుకు కూడా ఇదే ధోరణి ఉంది. అంతేకాక అప్పు ఇవ్వబడే డబ్బు పెట్టుబడి పెరుగుదలతో పాటు, లాభం రేటు ప్రభావం మాట అటుంచి, వడ్డీ రేటు కూడా పడిపోయే ధోరణి వ్యక్తం చేస్తుందని మనం గమనించాం. కనుక భూమి కౌలు చలనంతోనూ, నేల ఉత్పాదితాల ధరల చలనంతోనూ నిమిత్తం లేకుండా (ఈ ఉత్పాదితాలలో కౌలు ఒక భాగం) భూమి ధర పెరిగే ధోరణిని వ్యక్తం చేస్తుంది.

భూమి కౌలును వడ్డీ రూపంలో గందరగోళపర్చటం అన్నది అత్యంత అసంబద్ధమైన నిర్ణయానికి తప్పనిసరిగా దారితీస్తుంది. పొలం కొన్న ఆసామి విషయంలో ఈ రూపం కనిపిస్తుంది. భూమి కౌలు స్వభావానికి సంబంధించి బొత్తిగా పరిచయం లేకపోవటం వలన తలెత్తే గందరగోళం ఇది. ప్రాచీన దేశాలన్నింటిలోనూ భూమి ఆస్తి చాలా సరసమైన ఆస్తి రూపంగా ఉండేది. దాని కొనుగోలు సురక్షితమైన పెట్టుబడి మదుపుగా భావించేవాళ్ళు. కనుక భూమి కౌలును కొన్న వడ్డీ రేటు సాధారణంగా ఇతర దీర్ఘకాలిక పెట్టుబడి మదుపుల కంటే తక్కువగా వుండేది. అనగా ఉదాహరణకు ఒక స్థిరమైన భూమి కొనుగోలుదారుడు తన కొనుగోలు ధరపైన ఉదా॥ 4% పొందితే ఇతర పెట్టుబడి మదుపులలో అతడు 5% పొందవచ్చు. మరోరకంగా చెప్పాలంటే అతడు అదే మొత్తం వార్షిక ఆదాయానికి గాను, నియోగించే దానికంటే భూమి కౌలు నిమిత్తం ఎక్కువ పెట్టుబడిని పెడతాడు. ఇది ఆస్తి అనే తన నాసిరకం గ్రంథంలో థైయర్స్ ([1]1849లో ప్రౌథాన్ మీద గురిపెట్టి ఫ్రెంచి నేషనల్ అసెంబ్లీలో ఇచ్చిన ఉపన్యాసం పునర్ముద్రణ) భూమికౌలు తక్కువ వుంది అంటే దాని కొనుగోలు ధర ఎక్కువగా వుందన్నమాట అనేందుకు దారితీసింది.

పెట్టుబడీకరించబడిన కౌలు భూమి ధరగానూ లేదా విలువగానూ కనిపించే వాస్తవం, అనగా ఇతర సరుకులు అన్నింటిలాగానే భూమిని కొనటం, అమ్మటం జరుగుతోంది అన్న వాస్తవం, భూ ఆస్తిని సమర్థించటానికి కొంతమంది వకాల్తాదారులకు తోడ్పడుతుంది. ఎందుకంటే కొనుగోలుదారుడు ఇతర సరుకులకు చెల్లించేటట్లుగానే ఒక సమవిలువను చెల్లిస్తాడు కనుక. ఈ రకంగానే భూమిలో అత్యధిక భాగం చేతులు మారింది అని అంటారు. అటువంటప్పుడు బానిసత్వాన్ని కూడా సమర్థించటానికి ఇదే వాదం తోడ్పడుతుంది. బానిస యజమాని కొనుక్కున్న బానిస శ్రమ నుంచి

1. ప్రౌథాన్ ఉపన్యాసం నేషనల్ అసెంబ్లీలో 1849లో పారిస్‌లో ముద్రించబడినది. పుటలు 666-71 - సం॥

వచ్చే ఫలితం కేవలం ఈ కొనుగోలులో మదుపు పెట్టబడిన పెట్టుబడిపైన వడ్డీకి ప్రాతినిధ్యం వహిస్తుంది కదా! భూమి కౌలు క్రయ విక్రయాలను బట్టి దాని అస్తిత్వాన్ని సమర్థించటం అంటే దాని అస్తిత్వాన్ని దాని అస్తిత్వంలోనే సమర్థించటం అన్నమాట.

భూమి కౌలును శాస్త్రీయంగా విశ్లేషించటం ఎంత అవసరమో – పెట్టుబడిదారీ ఉత్పత్తి ప్రాతిపదికపైన భూ ఆస్తి యొక్క స్వతంత్ర ప్రత్యేక ఆర్థిక రూపం ఈ కౌలు – అనగా దానిని వక్రీకరించే అసంగతాలన్నింటి నుంచి వేరు చేసి దాని నిసర్గ రూపంలో పరిశీలించటం అన్నది భూ ఆస్తి యొక్క ఆచరణాత్మక ప్రభావాలని అర్థం చేసుకోవటానికి అంతే అవసరం. భూమి కౌలు భావనకు, స్వభావానికి విరుద్ధమైన అనేక వాస్తవాలు భూమి కౌలు అస్తిత్వ రూపాలుగా కనిపిస్తాయి. సైద్ధాంతిక అవగాహనకు కూడా ఇది అవసరం. సైద్ధాంతికంగా ఇటువంటి గందరగోళానికి మూలాధారాలను తెలుసుకోవటానికి ఈ విశ్లేషణ అవసరం.

నేలను సాగుచేసే హక్కు కోసం భూస్వామికి కౌలుదారుడు కౌలు డబ్బుగా చెల్లించే ప్రతి మొత్తం ఆచరణలో సహజంగానే కౌలులా కనిపిస్తుంది. ఈ కప్పానికి ఆధారం ఏమైనప్పటికీ దీనిలో ఏయే అంశాలు ఉన్నప్పటికీ నేల కౌలుకు దానికున్న ఉమ్మడి అంశం ఇది. మన భూగోళం మీద కొంత ప్రదేశానికి భూస్వామి అని పిలిచే అతనికున్న గుత్తాధిపత్యం వల్ల అటువంటి కప్పం విధించేలాగానూ, అటువంటి పన్ను కట్టేలాగానూ చేయగల్గుతుంది. వాస్తవమైన నేల కౌలుతో వున్న ఉమ్మడి అంశం ఇది. మనం ఇంతకు ముందే తెలియజేసినట్లుగా అది నేల ధరను నిర్ణయిస్తుంది. భూమిని లీజుకివ్వటం ద్వారా వచ్చే ఆదాయాన్ని పెట్టుబడీకరించటం తప్ప ఇది వేరు కాదు.

భూమి మీద పెట్టిన పెట్టుబడిపై వడ్డీ అనేది అలాంటి అన్యమైన భాగంగా నేల కౌలులో వుండవచ్చు. ఆర్థిక ప్రగతి కొనసాగే కొద్దీ ఇది ఒక దేశం మొత్తం కౌలుపైన నిరంతరాయంగా పెరిగే అదనపు భారంగా మారుతుంది. ఈ వడ్డీ కాక లీజుగా వచ్చే డబ్బు సగటు లాభం నుంచి లేదా మామూలు వేతనాల నుంచి లేదా రెండింటి నుంచి కొంత స్వాహా చేస్తున్న విషయాన్ని సాపేక్షంగానూ ఒక్కొకసారి సంపూర్ణంగానూ దాచివేస్తుంది. వాస్తవంగా భూమి కౌలు లేనప్పుడు అనగా నేల పూర్తిగా పనికిరానిదయినప్పుడు ఈ అంశాన్ని అది పూర్తిగా కప్పిపెట్టుతుంది. లాభంలో గాని, వేతనాల్లో గాని వుంటే ఈ భాగం ఇక్కడ నేల కౌలుగా కనిపిస్తుంది. ఎందుకంటే పారిశ్రామిక పెట్టుబడిదారునికి లేదా వేతన కార్మికునికి చెందాల్సిన భాగం లీజు డబ్బు రూపంలో భూస్వామికి చెల్లించబడుతుంది. ఆర్థికంగా చెప్పాలంటే ఈ రెండింటిలో ఏ భాగమూ కూడా భూమి కౌలు కాజాలదు. కాని ఆచరణలో అది భూస్వామి ఆదాయంగా మారుతుంది. వాస్తవమైన భూమి కౌలులాగానే భూమిపైన అతని గుత్తాధిపత్యం వలన ఆర్థికంగా దాని ధర నిర్ణయించబడుతుంది. భూమి ధరలపైన దానికి భూమి కౌలు వున్నంత ప్రభావం వుంటుంది.

భూమి కౌలు పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానంలో భూమి ఆస్తి కనిపించే పద్ధతి, గతంలో పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానమే లేనప్పుడు అంటే కౌలుదారు పారిశ్రామిక పెట్టుబడిదారుడు కానప్పుడు గాని, అతని నిర్వహణ పెట్టుబడిదారీ విధానంలో లేనప్పుడుగాని భూమి కౌలుకు వున్న పరిస్థితుల గురించి మనమిప్పుడు మాట్లాడుకోవటం లేదు. అటువంటి పరిస్థితులకు ఉదాహరణ ఐర్లాండ్. అక్కడ సాధారణంగా కౌలు – చిన్న రైతు. అతను భూస్వామికి కౌలు రూపంలో చెల్లించే మొత్తంలో

అతని లాభంలో ఒక భాగం మాత్రమే కాక అనగా అతని అదనపు శ్రమలో (తన సొంత శ్రమ పరికరాలు కలిగి వున్నందున అది అతనికే దక్కాలి.) ఒక భాగం మాత్రమే కాక, అతని వేతనంలో కూడా కొంత భాగం అయి వుంటుంది. అదే మొత్తం శ్రమ చేస్తున్నందుకుగానూ అతనికి వేతనంగా దక్కాల్సిన మొత్తంలో కొంత భాగాన్ని భూస్వామి స్వాహా చేస్తాడు.

దానితోపాటు నేలను బాగు చెయ్యటానికి ఏ మాత్రం కృషి చెయ్యని భూస్వామి అతని కొద్దిపాటి పెట్టుబడిని కూడా స్వాహా చేస్తాడు. కౌలుదారుడు ఆ పెట్టుబడిలో చాలా భాగాన్ని తన సొంత శ్రమ ద్వారా నేలలో జమ చేస్తాడు. ఇటువంటి పరిస్థితుల్లో ఆశపోతు వడ్డీ వ్యాపారి కూడా సరిగ్గా ఈ మాదిరిగానే వ్యవహరిస్తాడు. అయితే తేడా అల్లా వడ్డీ వ్యాపారి కనీసం తన పెట్టుబడిని ఒడ్డుతాడు. ఈ నిరంతరాయమైన దోపిడీ అన్నది ఐరిష్ కౌలుదారీ హక్కుల బిల్లుపైన చెలరేగిన వివాదంలో ప్రధాన అంశం. ఈ బిల్లు ప్రధాన లక్ష్యమేమంటే భూస్వామి కౌలుదారుని భూమి నుంచి వెళ్ళగొట్టడానికి ముందు నేలను బాగు చెయ్యటానికి కౌలుదారులు చేసిన ఖర్చుపెట్టిన పెట్టుబడిని తిరిగి చెల్లించాలనే బిల్లు ఆదేశించింది. ఈ డిమాండ్‌నే పామర్‌స్టన్ "హౌస్ ఆఫ్ కామన్స్ అన్నది సామాన్యుల సభ కాదు, భూస్వాముల సభ" అంటూ నిర్లక్ష్యంగా కొట్టిపారేసేవాడు.

కొన్ని అరుదైన సందర్భాలలో – పెట్టుబడిదారీ ఉత్పత్తి వున్న దేశాల్లో సహితం భూమి నుంచి వచ్చే ఫలసాయంతో సంబంధం లేకుండా అధిక కౌలు లివ్వాలిన భూస్వాములు ఒత్తిడి చెయ్యవచ్చు. మనం ఇక్కడ దానిని ప్రస్తావించబోవటం లేదు. ఉదాహరణకు ఇంగ్లీషు పారిశ్రామికవాడల్లో కార్మికులకు చిన్న కమతాలను లేదా చిన్న తోటలను తీరిక సమయంలో ఔత్సాహిక వ్యవసాయ కార్యకలాపాలకు గానూ అధిక కౌళ్ళపై ఇవ్వటం ఇలాంటిదే. (ఫ్యాక్టరీ ఇన్‌స్పెక్టర్ల నివేదికలు)

పెట్టుబడిదారీ ఉత్పత్తి అభివృద్ధి చెందిన దేశాల్లో భూమి కౌలును మాత్రమే ప్రస్తావిస్తున్నాం. ఉదాహరణకు ఇంగ్లీషు కౌలుదారుల్లో కొంతమంది చిన్న పెట్టుబడిదారులున్నారు. వారు తమ చదువు వల్ల, శిక్షణ వల్ల, సంప్రదాయం వల్ల, పోటీ వల్ల, ఇతర పరిస్థితుల వల్ల వ్యవసాయంలో కౌలుదారులుగా తమ పెట్టుబడిని మదుపు పెట్టాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. సగటు లాభం కంటే తక్కువ మొత్తంలో వారు సంతృప్తిపడాల్సి వస్తుంది. ఆ మొత్తంలో కొంత భాగాన్ని భూమి కౌలుగా భూస్వాములకు చెల్లించాల్సి వుంటుంది. భూమిమీద వ్యవసాయానికి వాళ్ళు పెట్టుబడి దానికి అనుమతించేందుకు ఇదొక్కటే షరతుంది. శాసన నిర్మాణంపై భూస్వాముల పట్టు గణనీయంగా వుంటుంది కనుక, ఇది ఇంగ్లాండులో మరింత అధికంగా వుంటుంది కనుక, ఈ పరిస్థితిని మొత్తం కౌలుదారీ వర్గాన్ని బలిచేసే విధంగా శాసనాలు తయారవుతాయి. ఉదాహరణకు 1815 ధాన్యచట్టాలను తీసుకుందాం. వీటి ప్రకారం సోమరి భూస్వాములకు జాకోబిన్ వ్యతిరేక యుద్ధకాలంలో అసాధారణమైన స్థాయిలో భూమి కౌళ్ళ వసూళ్ళను కొనసాగించేందుకుగానూ బ్రెడ్ టాక్స్ పేరుతో పన్ను విధించారు. ఎక్కడో పంటలు బాగా పండిన సందర్భాల్లో తప్ప మిగిలిన సందర్భాలలో దీనివలన వ్యవసాయ ఉత్పాదితాల ధరలను ఒక స్థాయిలో నిలబెట్టారు. దిగుమతులపై ఆంక్షలు లేనట్లయితే ధరలు ఆ స్థాయి దిగువకు పడిపోయేవి. అయితే, విదేశీ ధాన్యాన్ని దిగుమతి చేసుకోవటానికి చట్టబద్ధమైన పరిమితిని విధించే విధంగా ఇవి మామూలు ధరలుగా ఉంటాయని శాసనాలను చేసిన భూస్వాములు చెప్పినట్లుగా జరగలేదు. ఈ సాధారణ ధరలు సృష్టించిన వాతావరణంలో కౌలుదారులు భూస్వాములతో

ఒప్పందాలను కుదుర్చుకోవాల్సి వచ్చింది. ఈ భ్రమలు తొలగిపోగానే కొత్త చట్టం చేశారు. దాని ప్రకారం కొత్త ధరలు తలెత్తాయి. ఈ ధరలు కూడా పాత వాటిలాగానే ఆశపోతు భూస్వామిలా కాల్పనికతకు అసమర్థపు వ్యక్తీకరణ మాత్రమే. ఈ రకంగా 1815 నుంచి 1830 వరకూ కౌలుదారులు దగాకు గురైయ్యారు. అందుకే వ్యవసాయ విపద్దశ ఈ కాలమంతటిలోనూ సమస్య అయింది. ఆ కారణంగానే ఈ కాలంలో మొత్తం ఒక తరం కౌలుదారులు నాశనమై స్థానభ్రష్టత్వం పాలయ్యారు. కొత్త పెట్టుబడిదారీ వర్గం వారి స్థానాన్ని ఆక్రమించింది.[1]

అయితే ఇంతకంటే సార్వత్రికమైన, ప్రధానమైన వాస్తవం ఏమంటే వ్యవసాయ కార్మికుని వేతనం దాని సాధారణ సగటు స్థాయి నుంచి పడిపోయింది. దానితో కొంత భాగం కౌలు డబ్బుగా మినహాయింపు అయింది. ఆ రకంగా నేల కౌలు ముసుగులో కార్మికుని జేబులోకి కాక భూస్వామి జేబులోకి జారింది. కొన్ని సానుకూల పరిస్థితులున్న ప్రాంతాలను మినహాయిస్తే ఇంగ్లాండు, స్కాట్లాండ్‌లలో సాధారణంగా ఉండే పరిస్థితి యిది. వేతనాల స్థాయిని దర్యాప్తు చెయ్యటానికి పార్లమెంటరీ దర్యాప్తు కమిటీలను ఇంగ్లాండులో ధాన్యపు చట్టాలు రాకముందే నియమించారు. 19వ శతాబ్దంలో వేతనాల చరిత్ర గురించి ఇవి ఎంతో విలువైన సమాచారాన్ని అందించాయి. వీటిని ఇంతవరకూ ఎవరూ ఉపయోగించుకోలేదు. ఇదే సమయంలో ఇంగ్లీషు ప్రభువర్గమూ, బూర్జువా వర్గమూ తమను తాము కొరత వేసుకోవటానికి సృష్టించుకున్న సాధనాలు ఇవి. అధిక కౌలు రేట్లు, వాటితోపాటు జాకోబిన్ వ్యతిరేక యుద్ధకాలంలో భూమి ధరలు పెరగటం అన్నవి వేతనాల నుంచి కొంత భాగాన్ని స్వాహా చెయ్యటం వలననూ, కనీస భౌతిక అవసరాలకు తగిన స్థాయికంటే తక్కువ స్థాయికి పడిపోవడం వలననూ సాధ్యమైనాయని ఆ కమిటీలు సందేహాలకు సందులేకుండా, ఢంకా బజాయించి రుజువు చేశాయి. అంటే మామూలు వేతనాల్లో నుంచి భూస్వాములకు దక్కాయి. కౌలుదారుల ఆదాయాలు అపారంగా పెరుగుతున్నప్పుడూ, భూస్వాములు అపారంగా ధనరాశుల్ని పోగుచేసుకుంటున్నప్పుడూ డబ్బు విలువ పడిపోవటమూ, వ్యవసాయ ప్రాంతాలలో పేదరికపు చట్టాలను తెలివిగా ఉపయోగించటం ద్వారానూ ఇటువంటి వివిధ పరిస్థితుల ద్వారా వేతనాలను కుదించటమనే ఈ చర్య సాధ్యమైంది. ధాన్యంపైన సుంకాలు విధించటానికి సంబంధించి భూస్వాములు, కౌలుదారులు చేసిన ప్రధానమైన వాదన ఏమంటే వ్యవసాయ కార్మికుని వేతనాల్ని ఇంకా అంతకంటే తగ్గించటం భౌతికంగా అసాధ్యం అని. ఈ పరిస్థితుల్లో గణనీయమైన మార్పు ఏదీ రాలేదు. ఇతర యూరోపియన్ దేశాలన్నింటిలో లాగానే ఇంగ్లాండులో కూడా సాధారణ వేతనంలో ఒక భాగం ఇదివరకు లాగానే భూమి కౌలు రూపంలో స్వాహా అయ్యింది. అప్పట్లో షాఫ్ట్స్ బరీ కౌంట్ అయిన ఆష్లే ప్రభువు కారుణ్యవాదుల్లో ఒకరు. ఇంగ్లీషు ఫ్యాక్టరీ కార్మికుల పరిస్థితులు చూసిన ఆయన ఎంతగా చలించిపోయాడంటే పది గంటల దినం కోసం ఆందోళన సాగుతున్న రోజుల్లో పార్లమెంటులో ఆయన కార్మికుల ప్రతినిధిగా వ్యవహరించాడు. అయితే ఆయనకు సంబంధించిన గ్రామాలలో వ్యవసాయ కార్మికుల గణాంక

1. ధాన్యచట్ట వ్యతిరేక ముఖ్య వ్యాసాలను చూడండి. ధాన్యపు చట్టాలు సర్వదా ధరలను కృత్రిమంగా అధిక స్థాయిలో ఉంచాయి. సానుకూల పరిస్థితులున్న కౌలుదారులకు ఇది లాభించింది. అసాధారణమైన సగటు ధరపైన సబబో బేసబబో అత్యధిక సంఖ్యలో కౌలుదారులు ఆధారపడ్డ రక్షణ సుంకాలు వారిని క్రియారహితంగా ఉండేలా చేశాయి. ఈ పరిస్థితిని ఆ కొద్దిమంది కౌలుదారులు ఉపయోగించుకున్నారు.

సమాచారాన్ని ప్రచురించడం ద్వారా పారిశ్రామికవేత్తల ప్రతినిధులు ఆయనపై తమ కసిని తీర్చుకున్నారు. (చూడండి. పెట్టుబడి సంపుటం I, అధ్యాయం 25, 5) ("బ్రిటిష్ వ్యవసాయ కార్మికుడు") ఈ జీవ కారుణ్యవాదికి చెందిన భూమి కౌలు వ్యవసాయ కార్మికుల వేతనాల నుండి ఒక భాగాన్ని ఆయన కౌలుదారులు దొంగిలించి కొల్లగొట్టడం ద్వారా సమకూడిందేనన్నది ఆ సమాచారం. ఈ ప్రచురణ మరోరకంగా కూడా ఆసక్తిదాయకం. 1814, 1815లలో ఆయా కమిటీలు వెల్లడించిన దారుణమైన వాస్తవాల సరసన వీటికి స్థానం లభించింది. వ్యవసాయ కార్మికుల వేతనం తాత్కాలికంగా పెంచక తప్పని పరిస్థితులు ఏర్పడగానే పెట్టుబడిదారీ కౌలుదారు రైతులు గగ్గోలుపెడతారు. ఇతర పారిశ్రామిక శాఖలలో లాగానే మామూలు స్థాయిలో జీతాలు పెంచటం, భూమి కౌలును తగ్గించకుండా అసాధ్యమని వారు వాదిస్తారు. భూస్వాములకు అందజేసే భూమి కౌలు అన్నదానిలో కార్మికుల వేతనాలలో కొంత భాగం కలిసి వుంది అనటానికి ఇది ఒప్పుకోలు. ఉదాహరణకు ఇంగ్లాండులో రకరకాల ప్రబల సంఘటనల మేళనం వల్ల 1849 దగ్గర నుండి 59 వరకూ వ్యవసాయ కార్మికుల వేతనాలు పెరిగాయి. ఐర్లాండ్ నుంచి పెద్ద ఎత్తున ప్రజల వలస; ఆ కారణంగా అక్కడ నుంచి రావాల్సిన వ్యవసాయ కార్మికులు రాకపోవడం; పెద్ద సంఖ్యలో వ్యవసాయ జనాభాను ఫ్యాక్టరీలు ఇముడ్చుకోవడం; యుద్ధ కాలానికి అధిక సైనికుల అవసరం; ఆస్ట్రేలియాకు, అమెరికాకు (కాలిఫోర్నియాకు) పెద్ద ఎత్తున జనం వలస పోవడం – ఇలాంటివే అనేక పరిస్థితులు. వాటన్నింటినీ ఇక్కడ తడమాల్సిన అవసరం లేదు. అదే సమయంలో ఈ కాలంలో సగటు ధాన్యపు ధరలు 16 శాతం పడిపోయాయి. 1854–56 సంవత్సరాలు దీనికి మినహాయింపు. ఈ రెండేళ్ళల్లోనూ దిగుబడి తగ్గింది. కౌలుదారీ రైతులు కౌలును తగ్గించమని గగ్గోలుపెట్టారు. కొన్ని విడి సందర్భాలలో వారు దీనిని సాధించారు. అయితే మొత్తంమీద ఈ డిమాండ్లను సాధించటంలో విఫలమయ్యారు. వారికి ఉత్పత్తి ఖర్చులు తగ్గించే ఉపాయం కనిపించింది. మిగిలిన అంశాలతోపాటు వారు ఆవిరి యంత్రాలను, కొత్తరకం యంత్రాలను పెద్ద ఎత్తున ఉత్పత్తి చేశారు. ఆ యంత్రాలు కొంతమేరకు గుర్రాలను తొలగించాయి; ఆర్థిక రంగం నుంచి వాటిని నెట్టివేశాయి. వ్యవసాయ కార్మికుల్ని కొంతమందిని పనిలో నుంచి తొలగించటం ద్వారా కృత్రిమంగా అధిక జనాభాను సృష్టించారు. ఆ రకంగా మళ్ళీ వేతనాల పతనం కలిగించగలిగారు. నిజానికి మొత్తం జనాభా పెరుగుదలతో పోల్చి చూస్తే వ్యవసాయ జనాభా సాపేక్షంగా తగ్గినప్పటికినీ, కొన్ని శుద్ధ వ్యవసాయ జిల్లాలలో వ్యవసాయ జనాభా పూర్తిగా పడిపోయినప్పటికీ వేతనాలను తగ్గించగలిగారు.[1] కేమ్‌బ్రిడ్జి విశ్వవిద్యాలయంలో అర్థశాస్త్ర విభాగంలో ప్రొఫెసర్ ఫాసెట్, 1865 అక్టోబర్ 12వ తేదీన సామాజిక శాస్త్రాల సమావేశంలో ఇలా అన్నాడు. (ఆయన 1884లో పోస్ట్‌మాస్టర్ జనరల్‌గా వుండగా మరణించాడు.) "కార్మికులు వలస పోవటం ప్రారంభమయ్యింది. ఇంతకు ముందు చెల్లిస్తున్న రీతిలో హెచ్చు కౌళ్ళను చెల్లించలేమని రైతులు మొత్తుకుంటున్నారు. కార్మికులు వలసపోవటం వలన, వారి వేతనాలు పెరగటం వలన రైతులు పాత స్థాయిలో కౌలును చెల్లించలేమంటున్నారు." ఇక్కడ కూడా అధిక భూకౌలు ప్రత్యక్షంగా తక్కువ వేతనాలతో సారూప్యం

1. జాన్ సీ మోర్టన్ ది ఫోర్సస్ యూజ్డ్ ఇన్ అగ్రికల్చర్ - 12 స్కాటిష్ ప్రాంతాలలోనూ, 35 ఇంగ్లీషు ప్రాంతాలలోను 100 మంది కౌలుదారుల నుండి సేకరించిన ప్రామాణిక పత్రాలపై ఆధారంగా 1860లో లండన్ సొసైటీ ఆఫ్ ఆర్ట్స్‌లో ఇచ్చిన ఉపన్యాసం.

చెయ్యబడింది. ఈ పరిస్థితి ద్వారా భూమి ధర స్థాయి నిర్ణయించబడిందనుకుందాం. కౌలు పెరగటం అన్నది అనగా భూమి విలువ పెరగటం అన్నది శ్రమ విలువ తగ్గటంతో సమానం. నేల ధర పెరగటం అన్నది శ్రమ ధర తగ్గటంతో సమానం.

ఫ్రాన్స్‌కు కూడా ఇదే వర్తిస్తుంది. "ఒకవైపున బ్రెడ్, వైన్, మాంసం, కూరగాయలు, పళ్ళ ధరలు పెరుగుతున్నాయి. మరోవైపున శ్రమ ధర యథాతథంగా ఉంది. అందుచేత కౌలు పెరుగుతుంది. వందేళ్ళ క్రితం తమ తండ్రుల ఖాతాలను ఇప్పటి వృద్ధులు పరిశీలిస్తే ఆనాటి గ్రామీణ ఫ్రాన్స్ శ్రమ ధర ఎంత ఉందో ఈనాడు కూడా అంతే ఉన్నట్లు తెలుస్తుంది. మాంసం ధర అప్పటి నుండి మూడు రెట్లు పెరిగింది.... ఈ విప్లవం వలన నష్టపోయిందెవరు? ఎస్టేటు యజమాని అయిన ధనికుడా? లేక ఆ ఎస్టేటులో పనిచేస్తున్న పేదవాడా?.... భూమి కౌలు పెరుగుదల అనేది జనజీవన విపత్తుకు దాఖలా?" (ఎం. రూబికాన్, "డు మెకానిజమ్".... 2వ ఎడిషన్, పారిస్, 1837, పుట 101)

ఒకవైపున సగటు లాభం నుంచి మరోవైపున సగటు వేతనాల నుంచి స్వాహా చేసిన ఉదాహరణలు వేరే రియల్ ఎస్టేట్ ఏజెంట్, వ్యవసాయ నిపుణుడు అయిన మోర్టన్‌ను[1] ఇంతకు ముందు ఉల్లేఖించటం జరిగింది. చిన్న కమతాల మీద కంటే పెద్ద కమతాల మీద కౌలు తక్కువ అని ఆయన అంటున్నాడు. ఎందుకంటే "చిన్న కమతాల విషయంలో పెద్ద కమతాల కంటే పోటీ ఎక్కువ ఉంటుంది. చిన్న రైతులు మిగిలిన వ్యాపారాల్ని చెయ్యటంపై తమ దృష్టిని పెట్టలేరు. తమకు తగిన వృత్తి చేసుకోవాలన్న ఆరాటం వల్ల చాలా సందర్భాలలో వారు తమకు న్యాయం అనిపించిన దానికంటే ఎక్కువ కౌలునే ఇవ్వటానికి తయారవుతారు." (జాన్ ఎల్. మోర్టన్, ది రిసోర్సెస్ ఆఫ్ ఎస్టేట్స్, లండన్, 1859, పుట 116)

ఏమైనా ఇంగ్లాండులో ఈ తేడా క్రమంగా మాయమవుతున్నట్లు వుంది. ఇందుకు కారణం ముఖ్యంగా చిన్న రైతువర్గం వలస పోవటం అని ఆయన అంటారు. అదే మోర్టన్ మరో ఉదాహరణలో కౌలుదారుని వేతనాల నుంచి, అలాగే మరింత ఎక్కువ స్థాయిలో అతని కార్మికుల వేతనాల నుంచి నేల కౌలు రూపంలో స్వాహా అవుతుందని తెలియజేశారు. 70 నుంచి 80 ఎకరాలకు (30, 34 హెక్టార్లు) లోపు వున్న కమతాలను సాగుచేసే కౌలుదారుల విషయంలో ఇది జరుగుతుంది. రెండు గుర్రాల నాగళ్ళను పెట్టుకోవడం ఇక్కడ కష్టం. "కౌలుదారుడు స్వయంగా తన చేతులతో తను పనిచెయ్యకపోతే అతని కమతాలు అతన్ని పోషించలేవు. అతని పనినంతటిని కార్మికులకు అప్పజెప్పి కేవలం వారిని పర్యవేక్షించటానికే వుంటే అతడు కౌలును చెల్లించలేని పరిస్థితికి దిగజారిపోవచ్చు." (అదే గ్రంథం, పుట 118) కనుక మోర్టన్ అనేది ఏమంటే స్థానికంగా ఉన్న కౌలుదారులు మరీ పేదవారు కాకుంటే కౌలుకు తీసుకున్న కమతాలు 70 ఎకరాల కంటే తక్కువ ఉండకూడదు. అప్పుడు రెండు లేదా మూడు గుర్రాలను ఉంచుకోవడం సాధ్యమవుతుంది.

ఫ్రాన్స్‌లో కేంద్ర వ్యవసాయ సంస్థ సభ్యుడు లియోన్స్ డీ లావెర్గ్నె గొప్ప వివేకవంతుడు. ఇంగ్లాండు గ్రామీణ ఆర్థిక విధానంపై రాసిన తన గ్రంథంలో (ఇంగ్లీషు అనువాదం నుంచి ఉల్లేఖన, లండన్, 1855) వ్యవసాయంలో ఫ్రాన్స్‌లో పశువుల్ని ఉపయోగించటం వలన వార్షికంగా లభించే

1. జాన్ లోకార్ట్ మోర్టన్‌ను ఇక్కడ మార్క్స్ ఉల్లేఖిస్తున్నాడు - సం॥

ప్రయోజనం గురించి ఈ క్రింది తులనాత్మక పరిశీలన చేశారు. ఇంగ్లాండులో గుర్రాలను ఉపయోగిస్తారు. (పేజీ 42)

| | | |
|---|---|---|
| ఫ్రాన్స్ | పాలు.... | 40 లక్షల పౌండ్లు |
| | మాంసం.... | 160 లక్షల పౌండ్లు |
| | శ్రమ.... | 80 లక్షల పౌండ్లు |
| | | 280 లక్షల పౌండ్లు |
| ఇంగ్లాండ్ | పాలు.... | 160 లక్షల పౌండ్లు |
| | మాంసం.... | 200 లక్షల పౌండ్లు |
| | శ్రమ.... | – |
| | | 360 లక్షల పౌండ్లు |

ఇక్కడ ఇంగ్లాండుకు ఎక్కువ మొత్తం లభించటానికి గల కారణాలలో ఒకటి ఆయన చెప్పిన దానినిబట్టి పాలు ఫ్రాన్సులో కంటే ఇంగ్లాండులో రెట్టింపు ప్రియంగా ఉంటాయి. మాంసం ధరలు రెండు దేశాల్లోనూ ఒకేలా ఉన్నాయని ఆయన భావించాడు. (పుట 35) కనుక ఇంగ్లీషు పాల ఉత్పత్తి 80 లక్షల పౌండ్లకు కుదించబడుతుంది. ఆ రకంగా మొత్తం ఆదాయం ఫ్రాన్స్‌లో లాగానే 280 లక్షల పౌండ్లు అవుతుంది. పరిమాణాలు, ధరలో వున్న తేడాలు ఏకకాలంలో లావెర్‌గ్నె గుణించటం సాహసం. ఇంగ్లాండు కొన్ని వస్తువులను ఫ్రాన్స్ కంటే ఎక్కువ ప్రియంగా తయారు చేసినపుడు అది ఇంగ్లీషు వ్యవసాయానికి లాభసాటిగా వున్నట్టు ఆయనకు అనిపించింది. నిజానికి అది మహా అయితే కౌలుదారుకు భూస్వాములకు మరింత ఎక్కువ లాభాన్ని సూచిస్తుంది.

లావెర్‌గ్నెకి ఇంగ్లీషు వ్యవసాయం సాధించిన ఆర్థిక విజయాలతో పరిచయం ఉంది. ఉండడమే కాదు, ఇంగ్లీషు కౌలుదారుల భూస్వాముల దురభిప్రాయాలు కూడా ఆయన్ను పట్టుకున్నాయి. 48వ పేజీ చూడండి. "తృణధాన్యాల విషయంలో ఒక లోపం వుంది... అవి నేల సారాన్ని దెబ్బతీస్తాయి." ఇతర మొక్కలు అలా చెయ్యవని నమ్మటమే కాక పశుగ్రాసం ఇచ్చే మొక్కలు, దుంప పంటలు నేలను సారవంతంగా మారుస్తాయని కూడా లావెర్‌గ్నె నమ్ముతున్నాడు. "పశుగ్రాసం ఇచ్చే మొక్కలు వాతావరణం నుంచి వాటి పెరుగుదలకు అవసరమైన ప్రధాన అంశాలను గ్రహిస్తాయి. కాగా అవి నేలనుంచి తాము తీసుకొనే దానికంటే నేలకే ఎక్కువగా అందిస్తాయి. ఆ రకంగా అది సూటిగాను, ఎరువుగా మార్చబడటం ద్వారానూ పప్పుధాన్యాలు చేసిన నష్టాల్ని పూడుస్తాయి. కనుక నేల సారాన్ని దెబ్బతీసే పంటలు తరువాత ఈ పంటలను వెయ్యటం ద్వారా ఆ సారాన్ని పూడ్చవచ్చు. దీనినే నార్‌ఫోక్ పంట మార్పిడి సూత్రం అంటారు." (పుటలు 50–51)

ఈ ఇంగ్లీషు కాకమ్మ కథల్ని నమ్మే లావెర్‌గ్నె ఇంగ్లీషు వ్యవసాయ కార్మికుల వేతనాలు, ధాన్యంపై పన్ను ఎత్తివేయటం వలన తమ పాత అసమానతలను, అవకతవకలను కోల్పోయాయని

నమ్మటంలో ఆశ్చర్యం లేదు. (దీనికి సంబంధించి ఇంతకు ముందే ప్రస్తావించాం బక్, ఐ.కె. XXIII, 5, పుటలు 701-729[1]) అయితే 1865 డిసెంబర్ 14వ తేదీన బర్మింగ్‌హాంలో జాన్ బ్రాయిట్ ఇచ్చిన ఉపన్యాసాన్ని కూడా విందాం. పార్లమెంట్‌లో ప్రాతినిధ్యం లేని 50 లక్షల కుటుంబాల గురించి ప్రస్తావించిన తరువాత ఆయన ఇలా కొనసాగించారు. "వాటిలో 10 లక్షల కుటుంబాలను లేదా 10 లక్షల కంటే ఎక్కువ కుటుంబాలను ఇంగ్లాండులో పేదలనే దురదృష్టపు జాబితాలో చేర్చారు. "దారిద్ర్యం" అనే దానికి ఒక వీసం పైన మరో 10 లక్షల కుటుంబాలు ఉన్నాయి. కాని సర్వదా దరిద్రులుగా మారిపోతామేమోననుకునే ప్రమాదపుటంచున ఈ కుటుంబాలు ఉన్నాయి. వాళ్ళ అవకాశాలు, పరిస్థితులు దరిద్రులకంటే మెరుగ్గా ఏమీ లేవు. వీరిలో కొంత దిగువన ఉన్న అజ్ఞానపు విభాగాన్ని చూడండి. వారి దారుణమైన పరిస్థితిని, వారి దారిద్ర్యాన్ని, వారి బాధలను, ఏమీ చెయ్యలేని వారి నిస్సహాయతనూ చూడండి. అమెరికాలో బానిసత్వం సాగుతున్నప్పుడు – దక్షిణాది రాష్ట్రాలలో సహితం – ప్రతి నీగ్రోకీ తనకో శుభదినం వస్తుందని నమ్మకం ఉండేది. అయితే ఈ కుటుంబాలకు – దేశంలో అట్టడుగున ఉన్న ఈ ప్రజలకు మాత్రం – ఇంతకంటే మెరుగైనది ఏదైనా జరుగుతుందన్న ఆశ గాని, దాని కోసం చూసే ఆకాంక్ష గాని లేవని నేను చెప్పగలను. డోర్‌షెట్ షైర్‌కి చెందిన జాన్ క్రాస్ అనే ఒక కార్మికుని గురించి ఇటీవల వార్తాపత్రికల్లో చూశారా? అతడు వారానికి 6 రోజులు పని చేస్తాడు. అతని యజమాని దగ్గర వారానికి 8 షిల్లింగులు చొప్పున 24 ఏళ్ళపాటు పని చేశాడు. అతని యజమాని నుండి అతను చాలా మంచివాడనే పేరు కూడా సంపాదించాడు. జాన్‌క్రాస్ తన గుడిసెలో ఈ కూలి డబ్బుల్తోనే ఏడుగురు పిల్లల్ని, బక్కచిక్కిన భార్యను ఒక పసిబిడ్డతో సహా పోషించాలి. అతడు ఆరు పెన్నీలు చేసే ఒక కొయ్య వస్తువును తీసుకున్నాడు – చట్టబద్ధంగానే, దొంగిలించాడు కాబోలు. ఈ నేరానికిగాను మేజిస్ట్రేటు కోర్టు అతనిని విచారించి 14 రోజులో, 20 రోజులో జైలుశిక్ష విధించారు. ఈ జాన్‌క్రాస్ లాంటి కేసులు దేశం అంతటా వేలాదిగా కనిపిస్తాయని నేను చెప్పగలను. దక్షిణాదిన మరింత ఎక్కువగా కనిపిస్తాయి. వారి పరిస్థితుల్ని దర్యాప్తు చేసిన వాళ్ళకు, ఆ పరిస్థితుల్లో వారు ఎలా బతకగల్గుతున్నారోనన్న వింత అర్థం కాలేదు. ఈ దేశాన్ని చూడండి. ఈ దేశంలోని ఈ 50 లక్షల కుటుంబాలనూ, వీరి దయనీయ స్థితినీ కళ్ళారా చూడండి. ఓటు హక్కులేని జాతి ఒకటి నిర్విరామంగా, అదే పనిగా విశ్రాంతి అనేది తెలీకుండా పనిచేస్తూనే వుందన్నది వాస్తవం కాదా? పాలకవర్గంతో దీనిని పోల్చి చూడండి. అయితే నేను ఇలా పోలిస్తే నా మీద కమ్యూనిజాన్ని ఆరోపిస్తారు... అయితే తీవ్రంగా పరిశ్రమించే ఓటు హక్కులేని జాతిని పాలక వర్గాలుగా పిలవబడే విభాగంతో పోల్చి చూడండి. దాని సంపద చూడండి. దాని దర్పం చూడండి. దాని భోగం చూడండి. దాని అలసట చూడండి. వారికి కూడా అలసట ఉంది. అయితే అది పీకలదాకా నిండిన తృప్తి నుంచి వచ్చే అలసట – ఒకచోటు నుండి మరోచోటికి కొత్త సుఖాల కోసం వారు ఎలా పరుగులు పెడుతున్నారో చూడండి." (మార్నింగ్ స్టార్, డిసెంబర్ 14, 1865)

అదనపు శ్రమను, దానితోపాటు అదనపు ఉత్పాదితాన్ని సాధారణంగా భూమి కౌలులో ఎలా గందరగోళపరుస్తారో ఈ క్రింద చూద్దాం. అదనపు ఉత్పాదితంలో ఒక భాగం కనీసం పెట్టుబడిదారీ

1. సం I - 25వ అధ్యాయం.

ఉత్పత్తి విధానం ప్రాతిపదికన పరిమాణాత్మకంగానూ, గుణాత్మకంగానూ నిర్ణయమవుతుంది. సాధారణంగా అదనపు శ్రమకు సహజమైన ప్రాతిపదిక అనగా ఏ సహజమైన ఆధారం లేకుండా అటువంటి శ్రమ సాధ్యపడదో అటువంటి ఆధారాన్ని ప్రకృతి జంతువుల రూపంలోనూ, నేలలో పండే కూరగాయల రూపంలోనూ, చేపలు వగైరాల రూపంలోనూ సరఫరా చేయాల్సి ఉంటుంది. అలాగే ఇవన్నీ జీవనాధార వస్తువులు. వీటికై హెచ్చించే శ్రమకు మొత్తం పనిదినం వినియోగం అవదు. వ్యవసాయ శ్రమైక ఈ ప్రాకృతిక ఉత్పాదకత (కేవలం పోగుచెయ్యటం, వేటాడటం, చేపలు పట్టటం, పశుపోషణ మొదలైనవన్నీ ఈ శ్రమలో ఉంటాయి.) అదనపు శ్రమ అంతటికీ ప్రాతిపదిక. ఎందుకంటే శ్రమ అంతా ప్రాథమికంగా ఆహారాన్ని ఉత్పత్తి చెయ్యటానికి, వినియోగించుకోవటానికి మళ్ళించబడుతుంది. (పశువులు కూడా శీతల వాతావరణాలలో చలిని ఆపేందుకు అవసరమైన తోళ్ళను సరఫరా చేస్తాయి; గుహలలో ఉండడం వగైరా కూడా.)

ఇదే గందరగోళం అదనపు ఉత్పాదితానికీ భూమి కౌలుకూ మధ్య ఉంది. డౌవ్ దాన్ని భిన్నంగా వ్యక్తం చేశాడు.[1] మొదట్లో వ్యవసాయ శ్రమ, పారిశ్రామిక శ్రమ వేరుపడి లేవు. పారిశ్రామిక శ్రమ వ్యవసాయ శ్రమకు అనుబంధంగా ఉండేది. భూమిని సాగుచేసే తెగో, గృహగణాల కుటుంబాల అదనపు శ్రమా, అదనపు ఉత్పాదితాలలో వ్యవసాయక శ్రమా, పారిశ్రామిక శ్రమా కలిసి ఉన్నాయి. రెండూ ఒక దానితో ఒకటి కలిసే కొనసాగాయి. వేట, చేపలు పట్టడం, వ్యవసాయమూ తగిన పరికరాలు లేకుండా అసాధ్యం. నేయటమూ, నూలు వడకటమూ లాంటివి వ్యవసాయానికి తోడుగా ఉండే రంగాలుగానే మొదట సాగేయి.

ఒక వ్యక్తిగత కార్మికుని శ్రమను అవసర శ్రమ, అదనపు శ్రమగా విభజించవచ్చునని ఇంతకు ముందు చూశాం. అలాగే మొత్తం కార్మికవర్గం యొక్క సగటు శ్రమను కూడా విడదీయవచ్చు. కార్మిక వర్గానికి జీవనాధార వస్తువుల మొత్తాన్ని (అందుకవసరమైన ఉత్పత్తి సాధనాలతో సహా) ఉత్పత్తి చెయ్యటానికి ఒక విభాగం హెచ్చించే శ్రమ మొత్తం సమాజానికి సంబంధించిన అవసర శ్రమను నిర్వహిస్తున్నట్టు. మిగతా కార్మికవర్గం నిర్వహించే శ్రమను అదనపు శ్రమగా పరిగణించవచ్చు. అవసర శ్రమలో వ్యవసాయ శ్రమ మాత్రమే కాక కార్మికుని సగటు వినియోగానికి అవసరమైన వస్తువులను ఉత్పత్తి చేసే శ్రమ కూడా వుంటుంది. అంతేకాక సామాజిక దృష్టి నుంచి చూస్తే కొంతమంది అవసర శ్రమను మాత్రమే నిర్వహిస్తారు. ఏమంటే మరి కొంతమంది అదనపు శ్రమను మాత్రమే నిర్వహిస్తారు. అటువాళ్ళు ఇటూ, ఇటువాళ్ళు అటూ కూడా మారుతూ వుండవచ్చు. అది వారి మధ్య ఒక రకమైన పని విభజన మాత్రమే. వ్యవసాయ కార్మికులకు, పారిశ్రామిక కార్మికులకు మధ్య శ్రమ విభజనకు కూడా అదే వర్తిస్తుంది. ఒకవైపున శ్రమకు కేవలం పారిశ్రామిక స్వభావమే ఉండటం అన్నది మరోవైపున కేవలం వ్యవసాయ స్వభావం ఉండటానికి అనుగుణంగానే వుంటుంది. కేవలం వ్యవసాయ శ్రమ అనేది ఏ రకంగానూ ప్రకృతిసిద్ధం కాదు. అది ఒక ఉత్పాదితం. సామాజిక అభివృద్ధి ఫలితం. అందులోనూ ఆధునికం కూడా. అది అన్నిచోట్లా ఇంకా సాధించబడలేదు కూడా. అది ఉత్పత్తి అభివృద్ధిలో ఒక నిర్దిష్ట దశకు అనుగుణంగా ఉంటుంది. వ్యవసాయ శ్రమలో ఒక

1. పి. డౌవ్ ది ఎలిమెంట్స్ ఆఫ్ పొలిటికల్ సైన్స్, ఎడిన్‌బర్గ్, 1854, పుటలు 264-273 - సం॥

భాగం విలాస వస్తువుల తయారీలో లేదా పరిశ్రమల్లో ముడిపదార్థాలలో పనికొచ్చేటట్టో వాస్తవ రూపం పొందుతుంది. అది ఆహారంగా వ్యవహరించదు. ప్రజలకు సంబంధించిన ఆహారంగా అసలు వర్తించదు. అదే విధంగా మరోవైపున పారిశ్రామిక శ్రమలో ఒక భాగం వ్యవసాయ కార్మికులకు, వ్యవసాయేతర కార్మికులకు కూడా అవసరమైన వినియోగ సాధనాల రూపం ధరిస్తుంది. సామాజిక దృష్టి నుంచి ఈ పారిశ్రామిక శ్రమను అదనపు శ్రమగా పరిగణించటం పొరపాటు. వ్యవసాయ శ్రమలోని ఆవశ్యక భాగంలాగానే ఇది కూడా కొంత భాగం అవసర శ్రమే! వ్యవసాయ శ్రమతో గతంలో సహజంగా జోడించబడి వున్న పారిశ్రామిక శ్రమలో ఒక భాగం స్వతంత్ర రూపం ఇది. ఇప్పుడు దాని నుంచి విడదీయబడిన వ్యవసాయ శ్రమకు అది అవసరమైన పరస్పర అనుబంధం మాత్రమే. (ఉదాహరణకు కేవలం పాదార్థిక దృక్పథం నుండి చూస్తే 500 మంది నేతగాళ్ళు యంత్రాలతో తమ సొంత బట్టలకు అవసరమైన దానికంటే చాలా ఎక్కువ స్థాయిలో అదనపు వస్త్రాల్ని నేయగలుగుతారు.)

అంతిమంగా భూమి కౌలు వ్యక్తమయ్యే వివిధ రూపాలను పరిశీలించేటప్పుడు అనగా ఉత్పత్తి కోసమూ లేదా వినియోగం కోసమూ నేలను ఉపయోగించుకోవటానికి భూస్వామికి భూమి కౌలు పేరుతో చెల్లించే లీజు డబ్బును పరిశీలించేటప్పుడు స్వయంగా విలువలేని వస్తువుల ధరలు అనేక యాదృచ్ఛికమైన అంశాల కలయిక వల్ల నిర్ణయించబడతాయని గుర్తుంచుకోవాలి. ఉదాహరణకు భూమి వగైరాలు శ్రమ ఉత్పాదితాలు కాదు. శ్రమ పునరుత్పత్తి చెయ్యలేని కొన్ని పురాతన వస్తువులు. అలాగే గొప్ప చిత్రకారులు చిత్రించిన కళాఖండాలు వగైరాల ధరలను యాదృచ్ఛిక అంశాలే నిర్ణయిస్తాయి. ఒక వస్తువును అమ్మాలంటే, గుత్తాధిపత్యంలోకి అది వెళ్ళే సత్తా, అన్యధాకరణ చెందడం కంటే మరేదీ అవసరం లేదు.

★ ★ ★

భూమి కౌలు విశ్లేషణను కనుమరుగు చేసే మూడు ప్రధానమైన తప్పిదాలను మనం తొలగించాల్సి వుంటుంది. అవి :

1) సామాజిక ఉత్పత్తి క్రమంలో వివిధ అభివృద్ధి దశలకు చెందిన భూమి కౌలు యొక్క వేరు వేరు రూపాల మధ్య గందరగోళం.

కౌలు యొక్క ప్రత్యేక రూపం ఏదైనప్పటికీ ఆ రూపాలన్నిటి మధ్య ఉమ్మడిగా వున్న అంశం ఇదీ : భూ ఆస్తి అన్నదాన్ని ఏ ఆర్థిక రూపంలో పొందవచ్చునో అదే కౌలు. భూమి కౌలు అన్నదాంట్లో భూమి ఆస్తి గర్భితమై వుంది. మన భూగోళంలో కొన్ని భాగాలపైన కొంతమంది వ్యక్తుల యాజమాన్యం అన్నమాట. ఆసియా, ఈజిప్టు మొదలైన ప్రాంతాల్లో యజమాని కమ్యూనిటీ ప్రతినిధి కావచ్చు. లేదా బానిసత్వంలోనో, భూస్వామ్య దాస్యంలోనో వున్నట్లు ప్రత్యక్ష ఉత్పత్తిదార్లపైన ఒక వ్యక్తి యాజమాన్యం వలన భూ ఆస్తి మీద కూడా యాజమాన్యం దఖలుపడి వుండవచ్చు. లేదా ప్రకృతిపై ఉత్పత్తి చెయ్యనివారి ప్రైవేటు యాజమాన్యం కావచ్చు. అంటే భూమిపైన కేవలం హక్కులు కావచ్చు. లేదా వలస పోయినవారి విషయంలోలాగాను, భూమిని కలిగి వుండే చిన్న రైతుల విషయంలోలాగాను నేలను స్వాధీనం చేసుకుని తామే స్వయంగా కొన్ని కమతాలను సాగు చెయ్యటం ద్వారా భూమితో ఏర్పర్చుకున్న

సంబంధం కావచ్చు. ఇది సామాజికంగా అభివృద్ధి చెందిన శ్రమగా కాక విడి శ్రమగా ఉంటుంది.

ఈ వివిధ రూపాల కౌలుల మధ్య వున్న ఉమ్మడి అంశం. అంటే – భూ ఆస్తిని ఆర్థికంగా పొందడం అనేది చట్టబద్ధమైన కట్టుకథల వల్ల మన భూగోళంలో కొన్ని భాగాలపైన కొంతమంది వ్యక్తులకు ప్రత్యేక హక్కులు దక్కాయి. దీని వలన భూ కౌలులో వున్న వివిధ తరహాల మధ్య తేడా కనుమరుగవుతుంది.

2. భూమి కౌలు అంతా అదనపు విలువ మాత్రమే. అది అదనపు శ్రమ ఉత్పాదితం మాత్రమే. ఇంకా అభివృద్ధి చెందని రూపంలో వస్తురూపంలో ఇచ్చే కౌలు అది స్వయంగా అదనపు ఉత్పాదితం. పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానానికి సంబంధించిన అంశం మాత్రమే అని భూమి కౌలును పొరపాటుగా భావించటం జరుగుతోంది. అందుచేతనే ఈ అదనపు విలువ యొక్క ప్రత్యేక భాగాన్ని సాధారణంగా అదనపు విలువ, లాభాల పరిస్థితులను వివరించడం ద్వారా వ్యక్తం చేయడానికి ప్రయత్నం జరుగుతుంది. పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానంలో ఈ భూమి కౌలు ఎప్పుడూ లాభంపైన మిగులుగా వుంటుంది. అంటే అదనపు విలువ (అదనపు శ్రమను) కలిగి వుండే సరుకుల యొక్క విలువ భాగంపైన మిగులుగా వుంటుంది. అదనపు విలువ, లాభమూ ఉండే పరిస్థితులివి : ప్రత్యక్ష ఉత్పత్తిదారులు తమ సొంత శ్రమశక్తిని పునరుత్పత్తి చేయడానికి అంటే తమను తాము సొంతంగా పునరుత్పత్తి చేసుకోవడానికి అవసరమైన కాలంకంటే ఎక్కువ పని చేయాలి. సాధారణంగా అదనపు శ్రమను వారు నిర్వహించాలి. ఇది వ్యక్తిపరమైన షరతు. వస్తుగతమైన షరతేమంటే అదనపు శ్రమను వారు నిర్వహించగలిగి వుండాలి. సహజమైన పరిస్థితులు ఏరకంగా ఉండాలంటే ఉత్పత్తిదారులుగా వారు పునరుత్పత్తికీ, వారి పోషణకుగాను వారి శ్రమకాలంలో ఒక భాగం వెచ్చిస్తే సరిపడేటట్టు ఉండాలి. అంటే తమ జీవనాధార వస్తువుల ఉత్పత్తిలో వారి మొత్తం శ్రమశక్తి వినియోగమైపోరాదు. భూసారానికి ప్రకృతి ఒక పరిమితిని విధిస్తుంది. అది ఓ ప్రారంభ స్థానాన్నీ, ఓ ప్రాతిపదికనీ సమకూరుస్తుంది. మరోవైపున వారి శ్రమ యొక్క సామాజిక ఉత్పాదక శక్తి అభివృద్ధి మరో పరిమితిని విధిస్తుంది. మరింత బాగా పరిశీలిస్తే, జీవనాధార వస్తువుల ఉత్పత్తి వారి అస్తిత్వానికి, దరహం మీద మొత్తం ఉత్పత్తికి మొట్టమొదటి షరతు. కనుక ఈ ఉత్పత్తిలో ఉపయోగించే శ్రమ విస్తృతార్థంలో చెప్పాలంటే వ్యవసాయ శ్రమ ఫలప్రదంగా ఉండాలి. ప్రత్యక్ష ఉత్పత్తిదారులకు జీవనాధార వస్తువులను ఉత్పత్తి చెయ్యటంలో మొత్తం శ్రమ కాలమంతా ఖర్చయిపోరాదు. అంటే వ్యవసాయ అదనపు శ్రమ, వ్యవసాయ అదనపు ఉత్పాదితం సాధ్యం కావాలి. దీనిని మరింత కొనసాగిస్తే సమాజంలో వున్న ఒక విభాగానికి చెందిన మొత్తం వ్యవసాయ శ్రమ అనగా దాని అవసర, అదనపు శ్రమ రెండూ కలిసి మొత్తం సమాజానికి, అనగా వ్యవసాయేతర కార్మికులకు కూడా, అవసరమైన జీవనాధార వస్తువులను ఉత్పత్తి చెయ్యగలగాలి. కనుక దీని అర్థం ఏమంటే వ్యవసాయ పారిశ్రామిక శాఖల మధ్య శ్రమను విభజించటం సాధ్యం కావాలి. అలాగే జీవనాధార వస్తువుల ఉత్పత్తిలో నేలను సాగుచేసే వారికి ముడిపదార్థాలను ఉత్పత్తి చేసే వారి మధ్య కూడా శ్రమ విభజితం కాగలగాలి. జీవనాధార వస్తువుల ప్రత్యక్ష ఉత్పత్తిదారుల శ్రమ అవసర, అదనపు శ్రమలుగా విడిపోయినప్పటికీ సామాజిక దృష్టి నుంచి

చూస్తే జీవనాధార వస్తువులను ఉత్పత్తిచేసే అవసర శ్రమగా మాత్రమే అది కనిపిస్తుంది. విడి కార్ఖానాలలో శ్రమ విభజనకు భిన్నంగా సమాజంలో మొత్తంగా శ్రమ విభజనకు కూడా ఇది వర్తిస్తుంది. కొన్ని ప్రత్యేక వస్తువుల ఉత్పత్తి కోసం, ఈ ప్రత్యేక వస్తువుల కోసం ప్రత్యేక సామాజిక అవసరాన్ని సంతృప్తిపరచటం కోసం అవసరమయిన శ్రమ యిది. ఈ విభజన సరైన నిష్పత్తిలో ఉంటే వివిధ బృందాలకు చెందిన ఉత్పాదితాలు వాటి విలువలకు (అభివృద్ధి తరువాత దశలో అవి వాటి ఉత్పత్తి ధరలకే అమ్మబడతాయి.) లేదా ఈ విలువలకు కొంత మారు రూపంగా ఉండే ధరలకు లేదా సాధారణ నియమాలచేత నిర్ణయించబడిన ఉత్పత్తి ధరలకు అమ్మబడతాయి. ఇది నిజానికి విలువ నియమం యొక్క ప్రభావం. విడి సరుకుల లేదా వస్తువులకు సంబంధించినది కాదు. శ్రమ విభజనచేత విడిపోయిన ఆయా ప్రత్యేక సామాజిక ఉత్పత్తి రంగాల యొక్క ప్రతీ ఉత్పాదితానికి ఇది వర్తిస్తుంది. ప్రతీ ప్రత్యేక సరుకు ఉత్పత్తి కోసం అవసర శ్రమకు మించి ఉపయోగించబడరాదు. అంతేకాదు మొత్తం సామాజిక శ్రమ కాలం అవసరమైన నిష్పత్తిలో మాత్రమే వివిధ ఉత్పత్తి రంగాల మధ్య ఖర్చు కావలసి వుంది. సరుకు ఉపయోగ విలువకు ప్రాతినిధ్యం వహించడం ఇక్కడ ఉండనే ఉంటుంది. విడి సరుకుల ఉపయోగం విలువ అన్నది అవి ఒక ప్రత్యేక అవసరాన్ని సంతృప్తిపరచగలవా? అన్నదాని మీద ఆధారపడి వుంటుంది. ఒక సామాజిక ఉత్పాదితం మొత్తం ఉపయోగపు విలువ అనేది పరిమాణం రీత్యా ఒక నిర్దిష్ట సామాజిక అవసరాన్ని సంతృప్తిపరచగలుగుతుందా అన్నదాని మీద ఆధారపడి వుంటుంది. ఇది తగిన రీతిలో ఆ ప్రత్యేక తరహా ఉత్పాదితానికై ఉన్న సామాజిక అవసరాన్ని సంతృప్తిపరచగలగాలి. పరిమాణం రీత్యా పరిమితమైన ఈ సామాజిక అవసరాల్ని దృష్టిలో వుంచుకుని విభిన్న రంగాలలో శ్రమ తగిన పాళ్ళలో విభజితమైనదా లేదా అన్నది చూడాలి. (వివిధ ఉత్పత్తిరంగాలలో పెట్టుబడిని పంచటంలో ఈ అంశాన్ని దృష్టిలో వుంచుకోవాలి.) సామాజిక అవసరం, అంటే సామాజిక స్థాయిలో ఉపయోగపు విలువ అనేది, ఇక్కడ వివిధ ప్రత్యేక ఉత్పత్తి రంగాలలో వ్యయమయ్యే మొత్తం సామాజిక శ్రమకాలం యొక్క పరిమాణాన్ని నిర్ధారించే అంశంగా కనిపిస్తుంది. అయితే విడి సరుకులకు వర్తించే నియమమే ఇది కూడా. అంటే ఒక సరుకు ఉపయోగపు విలువ దాని మార్పిడి విలువకు, దాని విలువకు ప్రాతిపదిక. ఈ అంశం అవసరపు శ్రమ, అదనపు శ్రమల మధ్య సంబంధంపై ప్రభావం కలిగి వుంటుంది. ఈ నిష్పత్తి ఉల్లంఘించబడితే సరుకు విలువను దానిలో వున్న అదనపు విలువను డబ్బు రూపంలో మార్చటం అసాధ్య మవుతుంది. ఉదాహరణకు నిష్పత్తి రీత్యా జౌళి వస్త్రాలు అతిగా ఉత్పత్తి చెయ్యబడ్డాయి అనుకుందాం. అప్పటికి అమలులో వున్న పరిస్థితుల్లో మొత్తం వస్త్ర ఉత్పత్తిలో అవసరమైన శ్రమకాలం మాత్రమే వెచ్చించబడింది అనుకుందాం. అయితే ఈ రంగంలో అమితంగా సామాజిక శ్రమ వ్యయం అయిందన్నమాట. మరోలా చెప్పాలంటే ఈ ఉత్పాదితంలో ఒక భాగం నిరుపయోగం అవుతుంది. కనుక తగిన పాళ్ళలో ఉత్పత్తి అయినట్లుగానే దానిని అమ్మటం జరుగుతుంది. వివిధ ప్రత్యేక ఉత్పత్తి రంగాలకై అందుబాటులో ఉన్న సామాజిక శ్రమ కాలానికి పరిమాణం ఈ పరిమితి ఉండటం అన్నది విలువ నియమపు మరింత

అభివృద్ధి చెందిన రూపం మాత్రమే. అవసర శ్రమ కాలం అన్నది ఇక్కడ మరో అర్థాన్ని సంతరించుకుంటుంది. సామాజిక అవసరాల సంతృప్తి కోసం ఫలానా ఇంత శ్రమకాలం మాత్రమే అవసరం. ఈ పరిమితికి కారణం ఉపయోగపు విలువ. మొత్తం శ్రమకాలంలో ఫలానా ఇంత భాగాన్ని మాత్రమే ఒక ప్రత్యేక తరహా ఉత్పాదితం కోసం ప్రస్తుత ఉత్పత్తి పరిస్థితులలో సమాజం ఉపయోగించగల్గుతుంది. అయితే అదనపు శ్రమ అదనపు విలువ యొక్క స్వీయ, వస్తుగత పరిస్థితులకు లాభం లేదా కౌలు యొక్క ప్రత్యేక రూపంతో సంబంధం లేదు. ఈ పరిస్థితులు అదనపు విలువకు అదనపు విలువగానే వర్తిస్తాయి. అది ఏ ప్రత్యేక రూపాన్ని సంతరించుకున్నప్పటికీ ఇవి వర్తిస్తాయి. కనుక అవి భూమి కౌలును వివరించవు.

3. భూమి కౌలు అభివృద్ధిలో, అంటే భూ ఆస్తి యొక్క ఆర్థిక సిద్ధిలోనే కచ్చితంగా ఈ దిగువ స్వభావసిద్ధ ప్రత్యేకత ముందుకు వస్తుంది. అంటే ఆ మొత్తాన్ని దాని గ్రహీత చర్యలు నిర్ణయించకపోగా, ఆ గ్రహీత పాత్ర ఏమీ లేని సామాజిక శ్రమ యొక్క స్వతంత్ర అభివృద్ధి దాన్ని నిర్ణయిస్తుంది. అందుచేత, సరుకుల ఉత్పత్తే ప్రాతిపదికగా గల ఉత్పత్తి శాఖలు, వాటి ఉత్పాదితాలన్నింటిలోనూ, మరీ ప్రత్యేకంగా మొత్తంగా సరుకు ఉత్పత్తి వ్యవస్థ అయిన పెట్టుబడిదారీ ఉత్పత్తిలోనూ నిజంగా ఉమ్మడి లక్షణంగా ఉండేదాన్ని కౌలుకు (దరహం మీద వ్యవసాయ ఉత్పాదితాలన్నింటికి) వుండే విశిష్ట లక్షణంగా సులభంగానే భావించే వీలుంది.

భూమి కౌలు (దానితోపాటు భూమి విలువ) యావత్తు సామాజిక శ్రమ ఫలితంగా జరిగే సామాజిక అభివృద్ధితోపాటు పెరుగుతుంది. ఒకవైపున ఇది మార్కెట్ విస్తరించటానికి, భూమి ఉత్పాదితాల కోసం డిమాండ్ పెరగటానికి తోడ్పడుతుంది. మరోవైపున ఆ భూమికే గిరాకీని ప్రోత్సహిస్తుంది. ఇదే అన్ని రంగాల కార్యకలాపాలలోనూ, వ్యవసాయకం కానివాటిలో సహితం పోటీ ఉత్పత్తికి ప్రధానమైన ముందస్తు అవసరం. ఇంకా కచ్చితంగా చెప్పాలంటే – కేవలం వాస్తవ వ్యవసాయక కౌలును మాత్రమే పరిశీలిస్తే గనుక – కౌలు, దాని వల్ల భూమి విలువ, భూమి ఉత్పాదితాల కోసం మార్కెట్‌తోపాటు అభివృద్ధి చెందుతాయి. ఆ రకంగా వ్యవసాయేతర జనాభా పెరుగుదలతోపాటు జీవనాధార వస్తువుల కోసం, ముడిపదార్థాల కోసం పెరిగే గిరాకీ అవసరాలతోపాటు అది అభివృద్ధి చెందుతుంది. వ్యవసాయేతర జనాభాతో పోలిస్తే వ్యవసాయ జనాభాను నిరంతరాయంగా తగ్గించటం అన్నది పెట్టుబడిదారీ ఉత్పత్తి స్వభావంలోనే వుంది. ఎందుకంటే పరిశ్రమలో (ఖచ్చితమైన అర్థంలో) అస్థిర పెట్టుబడితో సంబంధంలో స్థిర పెట్టుబడి పెరుగుదల, అస్థిర పెట్టుబడి నిరపేక్ష (absolute) వృద్ధితో (స్థిర పెట్టుబడితో పోల్చినపుడు తగ్గినప్పటికీ) ముడిపడి వుంది. మరోవైపున ఒక భూ కమతాన్ని వినియోగంలోకి తేవడానికి అవసరమైన అస్థిర పెట్టుబడి వ్యవసాయంలో నిరపేక్షంగా తగ్గుతుంది. ఆ రకంగా అది కొత్త భూమిని సాగులోకి తీసుకువస్తే, ఆ మేరకు మాత్రమే పెరుగుతుంది. అయితే దానికి వ్యవసాయేతర జనాభా మరింత ఎక్కువగా పెరగడం అనే పూర్వావసరం కావాలి.

నిజానికి మనం ఇక్కడ వ్యవసాయానికి, దాని ఉత్పాదితాలకు విశిష్టంగా వుండే ప్రత్యేకతల గురించి మాట్లాడటం లేదు. అందుకు విరుద్ధంగా సరుకు ఉత్పత్తి, దాని నిరపేక్షమైన పెట్టుబడిదారీ ఉత్పత్తి, పునాదిగా వున్న సకల ఇతర ఉత్పత్తి శాఖలకు, ఉత్పాదితాలకు ఇదే వర్తిస్తుంది.

ఈ ఉత్పాదితాలు, సరుకులు లేదా ఉపయోగపు విలువలు. వాటికి మార్పిడి విలువ ఉంది.

దాన్ని రాబట్టుకోవాలి, డబ్బు రూపంలోకి మార్చుకోవాలి. ఇతర సరుకులు వాటికి సమ విలువలుగా ఏర్పడ్డ మేరకు, అంటే ఇతర ఉత్పాదితాలు వాటిని సరుకులుగానూ, విలువలుగానూ ఎదుర్కొంటున్నంత మేరకు, ఆ రకంగా ఉత్పత్తిదార్లకే స్వయంగా తక్షణం జీవనాధార వస్తువులుగా కాక సరుకులుగా, వాటి అన్యథాకరణ ద్వారా, మార్పిడి విలువలుగా (డబ్బుగా) వాటి పరివర్తన ద్వారా మాత్రమే ఉపయోగపు విలువలుగా మారే ఉత్పాదితాలుగా వున్న మేరకు అవి సరుకులు అవుతాయి. ఈ సరుకులకు మార్కెట్టు సామాజిక శ్రమ విభజన ద్వారా అభివృద్ధి చెందుతుంది. ఉత్పాదక శ్రమల విభజన ఆయా ఉత్పాదితాలను పరస్పరం సరుకులుగా, ఒకదానికొకటి సమ విలువలుగా పరస్పరం మార్కెట్టుగా వ్యవహరించేందుకు సహకరించేలా చేస్తాయి. ఇది వ్యవసాయ ఉత్పాదితాలకే ఏ రకంగాను ప్రత్యేక లక్షణం కాదు.

కేవలం సరుకు ఉత్పత్తి ప్రాతిపదికపైన మాత్రమే, అంటే ఒక ప్రత్యేక పెట్టుబడిదారీ ఉత్పత్తి పునాదిపై మాత్రమే కౌలు అన్నది డబ్బు కౌలుగా అభివృద్ధి చెందగలదు. వ్యవసాయ ఉత్పత్తి సరుకు ఉత్పత్తిగా మారిన మేరకు అది అభివృద్ధి చెందుతుంది. అంటే వ్యవసాయేతర ఉత్పత్తి, వ్యవసాయం ఉత్పత్తితో ప్రమేయం లేకుండా విడిగా అభివృద్ధి చెందిన మేరకు, ఆ మేరకు వ్యవసాయ ఉత్పాదితం సరుకుగా, మార్పిడి విలువగా మారుతుంది. పెట్టుబడిదారీ ఉత్పత్తితోపాటు సరుకు ఉత్పత్తి, దానితోపాటు విలువ ఉత్పత్తి అభివృద్ధి చెందిన మేరకు అదనపు విలువ, అదనపు ఉత్పాదితాల ఉత్పత్తి అభివృద్ధి చెందుతాయి. అదనపు ఉత్పాదితం అభివృద్ధి చెందిన నిష్పత్తిలోనే భూ ఆస్తి రాను రాను మరింత ఎక్కువగా ఈ అదనపు విలువను నేలపైన తనకున్న గుత్తాధిపత్యం ద్వారా, కౌలు విలువ పెంచటం ద్వారా, భూమి ధరను పెంచటం ద్వారా స్వాహా చేస్తుంది. పెట్టుబడిదారుడు ఈ అదనపు విలువ, అదనపు ఉత్పాదితాల అభివృద్ధిలో ఇంకా క్రియాశీలమైన పాత్రను నిర్వహిస్తాడు. భూ యజమాని మాత్రం అదనపు ఉత్పాదితం, అదనపు విలువ పెరగటానికి ఏ మాత్రం తోడ్పడకుండానే వాటిలో రాను రాను మరింత పెద్ద వాటాను స్వాహా చేస్తాడు. అది అతని స్థానానికి వున్న స్వభావసిద్ధమైన ప్రత్యేకత. అంతేకాని ఉత్పాదితాల విలువ, భూమి విలువ వాటి మార్కెట్టు పెరుగుదలతో పాటు పెరగటం కాదిది. గిరాకీ పెరుగుతుంది. దానితోపాటు భూమి ఉత్పాదితాలను ఇతర సరుకుల ప్రపంచం ఎదుర్కొంటుంది. మరోలా చెప్పాలంటే వ్యవసాయేతర సరుకు ఉత్పత్తిదారులు వ్యవసాయేతర సరుకు ఉత్పత్తిదారులను ఎదుర్కొంటారు. అయితే తన చర్య ఏదీ లేకుండానే ఇదంతా జరగటం వలన అతనికి ఇదంతా వింతగా అనిపిస్తుంది. విలువ మొత్తం, అదనపు విలువ మొత్తం, అదనపు విలువలో కొంత భాగం కౌలుగా మారటం, సామాజిక ఉత్పత్తి క్రమంపైన, సాధారణంగా సరుకు ఉత్పత్తి అభివృద్ధిపైన ఇదంతా ఆధారపడి వుంటుందని అతడు భావిస్తాడు. ఉదాహరణకు ఈ కారణం చేతనే డౌవ్ అనే ఆయన కౌలును దీని నుండి సంగ్రహించటానికి ప్రయత్నిస్తాడు. కౌలు వ్యవసాయ ఉత్పాదితం యొక్క మొత్తంపైన కాక దాని విలువపైన ఆధారపడివుంటుందని అతడంటాడు.[1] అయితే ఇది వ్యవసాయేతర జనాభా యొక్క మొత్తంపైన ఉత్పాదితంపైన ఆధారపడి వుంటుంది. ఇది ఇతర ఉత్పాదితాలన్నింటికి వర్తిస్తుంది. ప్రతి ఉత్పాదితం సరుకుగా అభివృద్ధి చెందాలంటే పాక్షికంగా అది

1. పి డౌవ్ ది ఎలిమెంట్స్ ఆఫ్ పొలిటికల్ సైన్స్, ఎడిన్‌బరో, 1854, పుట 279 - సం॥

ఒక మొత్తంగాను, పాక్షికంగా దానికి సమ విలువలుగా ఉండే ఇతర సరుకుల వైవిధ్యంగాను ఉండాలి. విలువ గురించి చర్చించిన సందర్భంలో ఇది ఇంతకుముందే రుజువు చేయబడింది.[1] ఒక వైపున సాధారణంగా ఒక ఉత్పాదితం యొక్క మార్పిడి శక్తి దానితోపాటు అస్తిత్వంలో ఉన్న సరుకుల వైవిధ్యంపైన ఆధారపడి వుంటుంది. మరోవైపున దానిపైన ఈ ఉత్పాదితాన్ని సరుకుగా ఎంత పరిమాణంలో ఉత్పత్తి చెయ్యవచ్చునో ఆధారపడి వుంటుంది. తానొక్కడే ఉన్నాడనుకున్నప్పుడు ఏ పరిశ్రమదారుడూ లేదా వ్యవసాయదారుడూ విలువను లేదా సరుకును ఉత్పత్తి చేయడు. నిర్దిష్ట సామాజిక అంతర సంబంధాలు ఉన్నప్పుడు మాత్రమే అతని ఉత్పాదితం విలువగాను, సరుకుగాను మారుతుంది. మొదటిది అది సామాజిక శ్రమ వ్యక్తీకరణగా కనిపించిన మేరకు అంటే వ్యక్తిగత ఉత్పత్తిదారుని శ్రమకాలం సాధారణంగా సామాజిక శ్రమ కాలంలో ఒక భాగంగా లెక్కించబడినప్పుడు ఇది జరుగుతుంది. రెండవది అతని శ్రమ యొక్క సామాజిక స్వభావం అతని ఉత్పాదితం యొక్క డబ్బు స్వభావం ద్వారానూ, దాని ధర ద్వారా నిర్ణయమైన దాని సాధారణ మార్పిడి శక్తి ద్వారానూ ఆ ఉత్పాదితంపైన కనిపిస్తుంది.

కనుక ఒకవైపున అదనపు విలువ లేదా మరింత పరిమిత అర్థంలో అదనపు ఉత్పాదితాన్ని కౌలుకు బదులు వెలువరించినప్పుడు చేస్తున్న పొరపాటు ఏమిటంటే సరుకులుగా, విలువలుగా ఉత్పాదితాలన్నింటికి వర్తించే, స్వభావాన్ని కేవలం వ్యవసాయ ఉత్పాదితాలకు మాత్రమే వర్తిస్తాయి – అన్నట్లుగా ఆపాదించటం జరుగుతుంది. సాధారణ విలువ నిర్ధారణ నుంచి ఒక ప్రత్యేక సరుకు విలువను రాబట్టుకోవడంలోకి మార్చటంవైపు ప్రయత్నించే వారి వలన ఇది మరింత భ్రష్టుపడుతుంది. ప్రతి సరుకు చలామణి ప్రక్రియలో మాత్రమే తన విలువను డబ్బు రూపంలోకి మార్చుకోగలుగుతుంది. అది తన విలువను డబ్బు రూపంలోకి మార్చుకుంటుందా, అది ఏ మేరకు చెయ్యగల్గుతుంది – అన్నది ఆనాడు ఉన్న మార్కెట్టు పరిస్థితులపైన ఆధారపడి వుంటుంది.

వ్యయసాయ ఉత్పాదితాలు విలువలుగా అభివృద్ధి చెందటంలో గానీ లేదా అవి ఇతర సరుకుల్ని సరుకులుగా ఎదుర్కోవటంలో గానీ, వాటిని వ్యవసాయేతర ఉత్పాదితాలు సరుకులుగా ఎదుర్కోవటంలో గానీ లేదా అవి సామాజిక శ్రమ ప్రత్యేక వ్యక్తీకరణలుగా అభివృద్ధి చెందటంలో గాని భూమి కౌలు ప్రత్యేకతే కాదు వ్యవసాయ ఉత్పాదితాలు విలువలుగా (సరుకులుగా) అభివృద్ధి చెందే పరిస్థితులతో పాటు, వాటి విలువలు డబ్బు రూపంలోకి మారగల పరిస్థితులతోపాటు భూ ఆస్తి సాయం లేకుండానే సృష్టించబడిన ఈ విలువలతో రానురానూ మరింత అత్యధిక భాగాన్ని స్వాహా చేసే శక్తి భూ ఆస్తికి పెరుగుతుంది. భూమి కౌలు ప్రత్యేకత దీనిలో వుంది. కనుక అదనపు విలువల్లో అత్యధిక భాగం భూమి కౌలుగా మారుతుంది.

★ ★ ★

1. సంపుటి I.

## అధ్యాయం - 38

# వ్యత్యాసపు కౌలు - సాధారణ వ్యాఖ్యలు

**భూ**మి కౌలును విశ్లేషించేటప్పుడు అటువంటి కౌలును చెల్లించే ఉత్పాదితాలు, అదనపు విలువలో ఒక భాగం, ఆ రకంగా వాటి మొత్తం ధరలో ఒక భాగం కౌలుగా మారే ఉత్పాదితాలు వుంటాయనే ఊహతో ప్రారంభిస్తాం. అనగా వ్యవసాయ, ఖనిజ ఉత్పాదితాలు ఇతర సరుకులన్నింటి లాగానే వాటి ఉత్పత్తి ధరలకే అమ్ముడవుతాయి. (ఇక్కడ వ్యవసాయ ఖనిజ ఉత్పాదితాలకు పరిమితమైతే సరిపోతుంది.) మరోలా చెప్పాలంటే వాటి అమ్మకం ధరల్లో ఉత్పత్తి ఖర్చూ, లాభమూ కలసి వుంటాయి. (ఉత్పత్తి ఖర్చు అంటే వినియోగమైన స్థిర, అస్థిర పెట్టుబడుల విలువ.) ఆ లాభం అనేది సార్వత్రిక లాభం రేటుచేత నిర్ణయించబడుతుంది. వినియోగమైనా కాకున్నా అడ్వాన్స్ చేయబడిన మొత్తం పెట్టుబడిపైన అది లెక్కకట్టబడుతుంది. అప్పుడు ఈ ఉత్పాదితాల సగటు అమ్మకం ధరలు వాటి ఉత్పత్తి ధరలకు సమానమని మనం భావిస్తాం. ఈ పరిస్థితులలో భూమి కౌలు అభివృద్ధి చెందడం ఎలా సాధ్యం? అన్న ప్రశ్న తలెత్తుతుంది. అంటే లాభంలో ఒక భాగం భూమి కౌలుగా మారడం సరుకు ధరలో ఒక భాగం భూస్వామికి దఖలుపడేటట్టు కావడం ఎలా సాధ్యం?

ఈ రూపంలో ఉన్న భూమి కౌలు సాధారణ స్వభావాన్ని వివరించటానికి ఇలా ఊహిద్దాం : ఒక దేశంలో ఉన్న అత్యధిక ఫ్యాక్టరీలు తమకవసరమైన శక్తిని ఆవిరి యంత్రాల ద్వారా పొందుతున్నాయని అనుకుందాం. కాగా కొద్ది సంఖ్యలో ఫ్యాక్టరీలు సహజమైన జలపాతాలపైన ఆధారపడి నడుస్తున్నాయని అనుకుందాం. మొదటి రకం ఫ్యాక్టరీలలో ఒక పరిమాణంలో సరుకుల ఉత్పత్తికి ఉత్పత్తి ధర 115 ఉందని అనుకుందాం. ఆ సరుకుల మొత్తం వినియోగం చేసుకున్న పెట్టుబడి 100 అనుకుందాం. ఇక్కడ లభించే 15 శాతం లాభం వినియోగమైన 100 పెట్టుబడిపైన మాత్రమే కాక ఈ సరుకు విలువ ఉత్పత్తిలో వినియోగించిన మొత్తం పెట్టుబడిపైన లెక్కకట్టబడుతుంది. ఈ ఉత్పత్తి ధర అన్నది ప్రతీ పారిశ్రామికోత్పత్తిదారునీ విడి ఉత్పత్తి ఖర్చు – ధరపైన కాక మొత్తం – ఉత్పత్తి రంగంలో ఉన్న సగటు పెట్టుబడి పరిస్థితుల్లో సరుకు యొక్క సగటు ఉత్పత్తి ఖర్చు – ధర పైన ఆధారపడి వుంటుంది. ఈ విషయాన్ని ఇంతకు ముందే తెలియజేశాం. నిజానికి అది ఉత్పత్తి యొక్క మార్కెట్టు ధర. హెచ్చుతగ్గులకు భిన్నంగా ఒక సగటు మార్కెట్టు ధర. సాధారణంగా అది మార్కెట్టు ధర రూపంలో ఉంటుంది. ఇదేగాక అది క్రమబద్ధం చేసే మార్కెట్టు ధర రూపంలో లేదా ఉత్పత్తి యొక్క మార్కెట్టు ధర రూపంలో ఉంటుంది. ఆ విధంగా సరుకుల విలువ స్వభావం నిలదొక్కు కుంటుంది. ఆ నిర్ధారణ ఒక నిర్దిష్ట సరుకుల పరిమాణాన్ని ఉత్పత్తి చేయడం కోసం ఒక వ్యష్టి ఉత్పత్తి దారునికీ, లేదా విడి వస్తువు ఉత్పత్తికీ అవసరమైన శ్రమకాలంచేత నిర్ణయించబడదు. ఇది సామాజికంగా

అవసరమైన శ్రమకాలంచేత నిర్ణయించబడుతుంది. అంటే అప్పటికి వున్న సామాజిక ఉత్పత్తి సగటు పరిస్థితులలో సామాజికంగా అవసరమైన వివిధ సరుకుల మొత్తాన్ని ఉత్పత్తి చేయడం కోసం అవసరమైన శ్రమకాలంచేత నిర్ణయించబడుతుంది.

ఇక్కడ నిర్దిష్టమైన సంఖ్యతో అవసరంలేదు. కనుక జలపాతం శక్తితో నడిచే ఫ్యాక్టరీల ఉత్పత్తి ఖర్చు 100కు బదులు 90 మాత్రమే అనుకుందాం. ఈ పరిమాణం గల సరుకుల ఉత్పత్తిని క్రమబద్ధం చేసే మార్కెట్టు ధర 115 అంటే లాభం 15 శాతం. జలపాతాల సాయంతో యంత్రాలను నడిపే కార్ఖానాదారులు కూడా తమ సరుకుల్ని 115కే అమ్ముతారు. ఎందుకంటే అది మార్కెట్టు ధరను క్రమబద్ధం చేస్తున్న సగటు ధర. అప్పుడు వారి లాభం 15కు బదులు 25 ఉంటుంది. అమలులో ఉన్న ఉత్పత్తి ధర కారణంగా 10 శాతం అదనపు లాభం లభిస్తుంది. వారు ఉత్పత్తి ధరకు మించి అమ్మటం వల్లకాక ఉత్పత్తి ధరకు అమ్మటం వల్ల ఈ లాభం లభిస్తుంది. ఎందుకంటే అసాధారణమైన సానుకూల పరిస్థితుల్లో అంటే ఈ రంగంలో ఉన్న సగటు పరిస్థితులకంటే అనుకూలమైన వాతావరణంలో వారి సరుకులు ఉత్పత్తి చెయ్యబడినాయి. లేదా వారి పెట్టుబడి పనిచేస్తుంది. ఇక్కడ తక్షణం రెండు విషయాలు స్పష్టమవుతాయి.

మొదటిది – ప్రకృతిసిద్ధమైన జలపాతాలను చోదక శక్తిగా ఉపయోగించే ఉత్పత్తిదారుల అదనపు లాభం అన్నది యావత్ అదనపు విలువతో అదే స్థాయిలోనే ఉంది. ఇది చలామణి రంగంలో లావాదేవీల వల్ల తలెత్తిన యాదృచ్ఛిక ఫలితం కాదు. మార్కెట్టు ధరలలో వచ్చే ఆటుపోట్లు ఫలితం వల్ల కూడా రాలేదు. (అదనపు లాభం అన్న అభివర్గాన్ని మనం ఉత్పత్తి ధరలను చర్చిస్తున్నప్పుడు ఇంతకు ముందే విశ్లేషించాం.) ఈ అదనపు లాభం అన్నది అదృష్టవంతులైన ఉత్పత్తిదార్ల వ్యక్తిగత ఉత్పత్తి ధరకు మార్కెట్టులో ఈ యావత్తు ఉత్పత్తి రంగంలో సార్వత్రిక, సామాజిక ఉత్పత్తి ధరకు మధ్య ఉన్న తేడాతో సమానం. సరుకుల వ్యక్తిగత ఉత్పత్తి ధరకు మించి సార్వత్రిక ఉత్పత్తి ధర ఎంత ఉన్నదో అది ఈ తేడాతో సమానం అవుతుంది. ఇలా మించి ఉన్న మొత్తాన్ని క్రమబద్ధం చేసే పరిమితులు రెండు. ఒకవైపున వ్యక్తిగతమైన ఉత్పత్తి ఖర్చు. అంటే వ్యక్తిగతమైన ఉత్పత్తి ధర. మరోవైపున సార్వత్రిక ఉత్పత్తి ధర. జలశక్తితో ఉత్పత్తి అయిన సరుకుల విలువ తక్కువ వుంటుంది. ఎందుకంటే వాటి ఉత్పత్తి కోసం తక్కువ శ్రమ మొత్తం అవసరమవుతుంది. అంటే తక్కువ శ్రమ – భౌతిక రూపం ధరించిన శ్రమ – స్థిర పెట్టుబడిలో ప్రవేశిస్తుంది. ఇక్కడ వినియోగించిన శ్రమ మరింత ఉత్పాదకం. అదే రకం ఇతర ఫ్యాక్టరీలలో ఉపయోగించిన శ్రమ కంటే ఈ వ్యక్తిగత శ్రమ ఉత్పాదక శక్తి ఎక్కువ. ఒకే మొత్తం సరుకులను తయారు చెయ్యటం కోసం దానికి తక్కువ మొత్తంలో స్థిర పెట్టుబడి అవసరమవుతుంది. భౌతిక రూపం ధరించిన శ్రమ కూడా తక్కువ మోతాదులో అవసరమవుతుంది. జలచక్రాన్ని వేడిచెయ్యక్కరలేదు. కనుక సజీవ శ్రమ కూడా తక్కువ అవసరమవుతుంది. ఇలా వినియోగించబడిన శ్రమ యొక్క అధిక ఉత్పాదకత దాని విలువను, ఉత్పత్తి ఖర్చును, సరుకు యొక్క ఉత్పత్తి ధరను తగ్గిస్తుంది. వ్యక్తిగత పారిశ్రామిక పెట్టుబడిదారునికి తన సరుకుల ఉత్పత్తికి తక్కువ ఖర్చు అవుతుంది. అతడు భౌతిక రూపం ధరించిన తక్కువ శ్రమ మొత్తానికి చెల్లించాల్సి వుంటుంది. తక్కువ సజీవ శ్రమను ఉపయోగించినందుకు తక్కువ వేతనాన్ని చెల్లిస్తాడు. అతని సరుకుల ఉత్పత్తి ఖర్చు తక్కువ కనుక అతని వ్యక్తిగత ఉత్పత్తి ధర కూడా తక్కువే

అవుతుంది. అతని ఉత్పత్తి ఖర్చు 100 బదులు 90 మాత్రమే వుంటుంది. అంచేత అతని విడి ఉత్పత్తి ధర 115కు బదులు $103\frac{1}{2}$ మాత్రమే వుంటుంది. ($100:115=90:103\frac{1}{2}$) అతని విడి ఉత్పత్తి ధరకు సార్వత్రిక ఉత్పత్తి ధరకు వున్న తేడా విడి ఉత్పత్తి ధరకు, విడి ఉత్పత్తి ఖర్చుకు సార్వత్రిక ఉత్పత్తి ఖర్చుకు మధ్య ఉన్న తేడాను బట్టి పరిమితమవుతుంది. అతని అదనపు లాభానికి పరిమితులు విధించే పరిమాణాలలో ఇదొకటి. రెండవది సార్వత్రిక ఉత్పత్తి ధర యొక్క పరిమాణం. దానిలో సార్వత్రిక లాభం రేటు క్రమబద్ధం చేసే అంశాలలో ఒకటిగా ప్రవేశిస్తుంది. బొగ్గు చౌకపడితే అతని విడి ఉత్పత్తి ఖర్చుకు సార్వత్రిక ఉత్పత్తి ఖర్చుకు మధ్య తేడా తగ్గుతుంది. దానితోపాటు అతని అదనపు లాభం తగ్గుతుంది. అతడు తన సరుకుల్ని వాటి విడి విలువల్ని బట్టి అమ్మవలసివస్తేగనక అంటే వాటి విడి విలువను బట్టి నిర్ణయించబడిన ఉత్పత్తి ధరకు అమ్మాల్సివస్తే అప్పుడు ఈ తేడా మాయమవుతుంది. ఒకవైపున ఇది సరుకులు తన మామూలు మార్కెట్టు ధరలకు అమ్మబడతాయనే వాస్తవం నుండి వచ్చిన ఫలితం. పోటీ ద్వారా విడి ధరలు సమానం కావటం వలన ఈ మార్కెట్టు ధర తలెత్తుతుంది. మరోవైపున ఫ్యాక్టరీ యజమాని చలనంలో ఉంచిన అధిక వ్యక్తిగత శ్రమ ఉత్పాదకతలు అన్నింటి వలననే కార్మికులకు కాక యజమానికే ప్రయోజనం చేకూరుస్తుంది. అవి శ్రమ ఉత్పాదకతలా కాక – పెట్టుబడి ఉత్పాదకతలా కనిపిస్తుంది.

సార్వత్రిక ఉత్పత్తి ధర స్థాయి అదనపు లాభం యొక్క పరిమితుల్లో ఒకటి కనుక సగటు లాభం రేటు స్థాయి అన్నదానికున్న అంశాలలో ఒకటి కనుక ఈ అదనపు లాభం అన్నది సార్వత్రిక ఉత్పత్తి ధరకు, వ్యక్తిగత ఉత్పత్తి ధరకు మధ్య ఉన్న తేడా నుంచి మాత్రమే తలెత్తుతుంది. కనుక సార్వత్రిక వ్యక్తిగత లాభం రేట్ల మధ్య నున్న తేడా నుంచి తలెత్తుతుంది. ఈ తేడాను మించి ఏదైనా మొత్తం వుంటే ఉత్పాదితాలు మార్కెట్టుతో క్రమబద్ధం చెయ్యబడిన ఉత్పత్తి ధరకు కాక వాటికి మించి అమ్మబడినాయని అర్థం.

రెండోది – ఇంత వరకు ఆవిరికి బదులు ప్రకృతిసిద్ధమైన జలశక్తిని ఉపయోగించే కార్ఖానాదారుని అదనపు లాభం ఇతర రకాల అదనపు లాభం కంటే ఏ రకంగానూ భిన్నం కాదు. మామూలు అదనపు లాభం అంతా, అంటే మార్కెట్టు ధరల ఊగిసలాట వలన లేదా యాదృచ్ఛిక అమ్మకాల వల్ల తలెత్తే అదనపు లాభం కాదు. అది ఒక ప్రత్యేక పెట్టుబడి యొక్క సరుకుల వ్యక్తిగత ఉత్పత్తి ఖర్చును సాధారణంగా ఈ ఉత్పత్తి రంగంలోనే ఉన్న పెట్టుబడి ఉత్పత్తి చేసిన సరుకుల మార్కెట్టు ధరను క్రమబద్ధం చేసే సార్వత్రిక ఉత్పత్తి ధరకు మధ్య ఉన్న తేడాచేత నిర్ణయించబడుతుంది. అంటే మరోలా చెప్పాలంటే సార్వత్రిక ఉత్పత్తి ధర అంటే ఈ రంగంలో పెట్టిన మొత్తం పెట్టుబడి యొక్క సరుకుల మార్కెట్టు ధరలు అని అర్థం.

ఇప్పుడు ఆ తేడాను పరిశీలిద్దాం.

ప్రస్తుతం ఉదాహరణలో పారిశ్రామిక పెట్టుబడిదారుడు తన అదనపు లాభాన్ని అనగా వ్యక్తిగతంగా తనకు ఉత్పత్తి ధరనుంచి లభిస్తున్న అదనపు మొత్తాన్ని ఎలా పొందగలుగుతున్నాడు.

అది అతనికి ప్రకృతి శక్తి వల్ల, అనగా జలపాతం యొక్క చోదక శక్తి వల్ల లభిస్తుంది. అతనికి అది ప్రకృతిలో సిద్ధంగా దొరుకుతుంది. నీటిని ఆవిరిగా మార్చే బొగ్గులాగా అది శ్రమ ఉత్పాదితం కాదు. బొగ్గుకు విలువ ఉంటుంది. దానికి ఒక సమాన విలువను చెల్లించాల్సి ఉంటుంది. కనుక

దానికొక ధర ఉంటుంది. జలపాతం అన్నది సహజమైన ఉత్పాదక సాధనం. దానిని ఉత్పత్తి చెయ్యడానికి శ్రమ పాత్ర లేదు.

అంతేకాదు ఆవిరి యంత్రాలను ఉపయోగించే కార్ఖానాదారుడు కూడా అతనికి ఏ మాత్రం ఖర్చుకాని ప్రకృతి శక్తుల్ని ఉపయోగిస్తాడు. ఆ రకంగా అతడు శ్రమను మరింత ఉత్పాదకంగా మార్చి అదనపు విలువను, లాభాన్ని పెంచుతాడు. కార్మికులకు అవసరమైన జీవనాధార వస్తువుల తయారీని చౌకగా మార్చిన మేరకు అతడు అలా వ్యవహరించగలుగుతాడు. సహకారమూ, శ్రమ విభజన మొదలైన సామాజిక సహజ శక్తుల్ని గుత్తాధిపత్యంలోకి తెచ్చుకున్నట్లే ఈ ప్రకృతి శక్తులు కూడా పెట్టుబడికి గుత్తగా మారతాయి. కార్ఖానాదారుడు బొగ్గు కోసం వెల చెల్లిస్తాడు. కాని తన భౌతిక రూపాన్ని ఆవిరిగా మార్చుకోగలిగిన నీటి శక్తికి అతడు చెల్లించడు. అలాగే ఆవిరి యొక్క స్థితిస్థాపకతకు చెల్లించడు. ప్రకృతి శక్తులపైన ఈ గుత్తాధిపత్యం వాటి వల్ల శ్రమశక్తిలో తలెత్తే పెరుగుదలపై గుత్తాధిపత్యమూ ఆవిరి యంత్రాలతో చేసే పెట్టుబడికి ఉమ్మడి లక్షణం. అదనపు విలువకు ప్రాతినిధ్యం వహించే శ్రమ ఉత్పాదితం యొక్క భాగాన్ని వేతనాలుగా మార్చబడే భాగంతో పోల్చి చూస్తే అది పెంచవచ్చు. అలా జరిగిన మేరకు అది సార్వత్రిక లాభం రేటును పెంచుతుంది. అది అదనపు లాభాన్ని సృష్టించదు. అదనపు లాభం అంటే సగటు లాభాన్ని మించి ఉన్న వ్యక్తిగత లాభం మాత్రమే. ఈ సందర్భంలో ఒక ప్రకృతి శక్తిని, జలపాతాన్ని ఉపయోగించటం ద్వారా అదనపు లాభాన్ని సృష్టించవచ్చు. అయితే ఇవి కేవలం ప్రకృతి శక్తిని ఉపయోగించటం ద్వారా శ్రమ ఉత్పాదకత పెరిగిన పరిస్థితి వల్ల మాత్రమే కాదు; మార్పు తెచ్చే ఇతర పరిస్థితులు కూడా అవసరం.

అందుకు విరుద్ధంగా పరిశ్రమలో కేవలం ప్రకృతి శక్తిని ఉపయోగించటం ద్వారా సార్వత్రిక రేటు స్థాయిని ప్రభావితం చెయ్యవచ్చు. ఎందుకంటే జీవనాధార వస్తువుల ఉత్పత్తి కవసరమైన శ్రమ మొత్తాన్ని అది ప్రభావితం చేస్తుంది. అయితే దానంతటదే సార్వత్రిక లాభం రేటు నుంచి వేరే మార్గాలను సృష్టించదు. అంతేకాదు ఒకానొక ఉత్పత్తి రంగంలో ఒక విడి పెట్టుబడి సాధించే అదనపు లాభం అన్నది యాదృచ్ఛిక కారణాల వల్ల మాత్రమే కాకపోవచ్చు. (వివిధ ఉత్పత్తి రంగాలలో లాభం రేట్లలో ఉన్న తేడాలు ఒక సగటు రేటుగా తమను తాము నిరంతరాయంగా సరిచేసుకుంటాయి.) ఉత్పత్తి ఖర్చులను తగ్గించడం ద్వారా అదనపు లాభాన్ని సంపాదించవచ్చు. పెట్టుబడిని సగటు మొత్తాలకంటే పెద్ద మొత్తాలలో ఉపయోగించటం వలన సాధించవచ్చును. లేదా శ్రమ ఉత్పాదకతను పెంచే సాధారణ కారకాలు (సహకారమూ, శ్రమ విభజన మొదలైనవి) మరింత ఎక్కువ స్థాయిలో మరింత ప్రభావశీలంగా మారవచ్చు. పెట్టుబడి మొత్తం పెరగటం వలన వాటి ఆచరణ రంగం పెరగటం వలన ఇది సాధ్యపడుతుంది. లేదా పని చేసే పెట్టుబడి పెరగటాన్ని అలా ఉంచితే మెరుగైన శ్రమ పద్ధతుల వలన అంటే కొత్త విషయాలను కనుక్కోవటం ద్వారా మెరుగైన యంత్రాల వల్ల, రసాయనాల తయారీ రహస్యాల వల్ల కూడా ఇది సాధించవచ్చును. క్లుప్తంగా చెప్పాలంటే సగటు కంటే మేలైన ఉత్పత్తి సాధనాలను, ఉత్పత్తి పద్ధతులను ఉపయోగించటం ద్వారా ఇది సాధించవచ్చు. ఉత్పత్తి ఖర్చులను తగ్గించటమూ దాని నుంచి అదనపు లాభం తలెత్తటం అన్నది పెట్టుబడిని మదుపు పెట్టిన విధానం యొక్క ఫలితాలు. అసాధారణమైన పెద్ద మొత్తాలతో పెట్టుబడి ఒక వ్యక్తి చేతిలో

కేంద్రీకరించబడటం వల్ల తలెత్తవచ్చు. (అంటే – పెద్ద మొత్తాలలో పెట్టుబడిని సగటుగా ఉపయోగించటం ప్రారంభమైన వెంటనే ఈ పరిస్థితి రద్దయిపోతుంది.) లేదా ఒక నిర్దిష్ట పరిమాణం గల పెట్టుబడి ప్రత్యేకంగా ఒక ఉత్పాదక పద్ధతిలో పని చెయ్యటం వలన కూడా ఇది తలెత్తుతుంది. (ఈ అసాధారణ ఉత్పత్తి విధానం సాధారణమైపోయినప్పుడు లేదా ఇంతకంటే అభివృద్ధి చెందిన పద్ధతి తలెత్తినప్పుడు ఈ పరిస్థితి కూడా అంతర్ధానమవుతుంది.)

అప్పుడు అదనపు లాభానికి కారణం పెట్టుబడి నుంచే తలెత్తుతుంది. (ఈ పెట్టుబడిలో అది చలనంలో ఉంచిన శ్రమ కూడా ఉంటుంది.) అది పెట్టుబడి పెద్ద మొత్తంలో ఉపయోగించటం వల్లనూ కావచ్చు లేదా దానిని సమర్థంగా ఉపయోగించటం వల్లనూ కావచ్చు. ఒకే ఉత్పత్తి రంగంలో పెట్టే పెట్టుబడి అంతా ఒకే విధంగా పెట్టరాదనటానికి కారణం ఏమీ లేదు. అందుకు విరుద్ధంగా పెట్టుబడుల మధ్య ఉన్న పోటీ ఈ తేడాలను రానురానూ మరింత ఎక్కువగా రద్దు చేసుకునే ధోరణి ఉంటుంది. సామాజికంగా అవసరమైన శ్రమ కాలంచేత విలువ నిర్ణయించబడటం అన్నది సరుకులను చౌకగా తయారు చేయడంలోనూ, ఒకే సానుకూల పరిస్థితుల కింద సరుకులను ఉత్పత్తి చేయటాన్ని అది తప్పనిసరి చేయడంలోనూ తనను తాను వక్కాణించుకుంటుంది. అయితే జలపాతాన్ని ఉపయోగించే పారిశ్రామిక కార్మికుని అదనపు లాభం విషయంలో ఇది భిన్నంగా వుంటుంది. అతను ఉపయోగించిన శ్రమ యొక్క పెరిగిన ఉత్పాదకత పెట్టుబడి నుంచి గాని, శ్రమ నుంచి గాని రాదు. పెట్టుబడికి, శ్రమకు భిన్నమైన, పెట్టుబడితో జమ చెయ్యబడిన ఒక ప్రకృతి శక్తిని ఉపయోగించటం ద్వారా కూడా అది రాదు. ప్రకృతి శక్తి ఉపయోగించటంతో ముడిపడి ఉన్న శ్రమ యొక్క సహజ ఉత్పాదక శక్తి పెరుగుదల నుంచి అది తలెత్తుతుంది. అంతేగాని అదే రంగంలో మొత్తం పెట్టుబడి అదుపాజ్ఞల్లో ఉన్న ప్రకృతి శక్తి నుంచి తలెత్తదు. ఉదాహరణకు ఆవిరి స్థితిస్థాపకత. మరోలా చెప్పాలంటే ఈ ఉత్పత్తి రంగంలో సాధారణ రీతిలో పెట్టుబడి పెట్టినప్పుడల్లా దానిని ఉపయోగించడం సాధ్యమవుతుందని అనుకోరాదు. అందుకు విరుద్ధంగా అది జలపాతం లాగానే గుత్తాధిపత్యం క్రిందకు రాగలిగిన ప్రకృతి శక్తి. అది భూమిలో కొన్ని భాగాలను భూమికి సంబంధించిన ఇతర అంశాలను తమ స్వాధీనంలో వుంచుకొన్న వారి ఆధిపత్యంలో ఉంటుంది. ఏ పెట్టుబడి అయినా నీటిని ఆవిరిగా మార్చగల్గినట్లుగా ఈ సహజ భూమికనే సృష్టించటం అన్నది పెట్టుబడికి సాధ్యమయ్యే విషయం కాదు. అది స్థానికంగా ప్రకృతిలో ఉంటుంది. అది లేనిచోట నిర్దిష్టమైన పెట్టుబడిని పెట్టడం ద్వారా దానిని స్థాపించలేరు. యంత్రాలు, బొగ్గు లాంటి శ్రమ ఉత్పత్తి చెయ్యగలిగిన వస్తువులతో అది ముడిపడి వుండదు. భూమిలో కొన్ని భాగాలలో ఉన్న కొన్ని ప్రత్యేక సహజ పరిస్థితులతో అది ముడిపడి వుంటుంది. జలపాతాలకు యజమానులుగా వున్న కార్ఖానాదారులు అలా కాని యజమానులను ఈ ప్రకృతి శక్తి నుంచి మినహాయిస్తారు. ఎందుకంటే భూమి, ముఖ్యంగా జలశక్తితో కూడిన భూమి పరిమితం కనుక. అయితే పారిశ్రామిక లక్ష్యాలకు అందుబాటులో ఉన్న జలశక్తి మొత్తాన్ని పెంచకుండా ఇది నిరోధించలేదు. ఒక దేశంలో ఉన్న జలపాతాల సంఖ్య పరిమితమే అయినప్పటికీ అది నిరోధించలేదు. జలపాతం యొక్క చోదకశక్తిని పూర్తిగా ఉపయోగించుకొనేలా జలపాతాన్ని మనిషి మలుచుకోగలడు. అవసరమైతే ఎంత జలశక్తిని ఉపయోగించటం సాధ్యమైతే

అంత వరకూ జలచక్రాన్ని మెరుగుపరుచుకోగలడు. నీటి సరఫరాకు మామూలు జలచక్రం అనుగుణంగా లేనప్పుడు టర్బయన్లు వగైరాలను ఉపయోగించవచ్చు. ఈ ప్రకృతి శక్తిని స్వాధీనంలో ఉంచుకోవటం అన్నది దానిపైన గుత్తాధిపత్యం వహించటం అవుతుంది. మదుపు పెట్టిన పెట్టుబడి ఉత్పాదకతను పెంచటానికి అది ఒక షరతు. అది పెట్టుబడి ఉత్పత్తి ప్రక్రియ వల్ల ఏర్పడలేదు.[1] ఇలా గుత్తాధిపత్యం క్రిందికి రాగలిగిన ఈ ప్రకృతి శక్తి ఎప్పుడూ నేలతో ముడిపడి వుంటుంది. అటువంటి ప్రకృతి శక్తి మనం ప్రస్తావిస్తున్న ఉత్పత్తి రంగం యొక్క సాధారణ పరిస్థితులకు గాని లేదా సాధారణంగా ఏర్పరచ గలిగిన ఉత్పత్తి పరిస్థితులకు గాని చెందదు.

భూమితో సహా అక్కడ వున్న జలపాతాలు కొంతమంది వ్యక్తులకు చెందుతాయని ఊహిద్దాం. వారు ఈ భూభాగాల యజమానులుగా పరిగణింపబడుతున్నారు. ఈ భూ యజమానులు జలపాతాలలో పెట్టుబడి పెట్టడాన్ని, అలాగే పెట్టుబడి ద్వారా వాటిని వాడుకోవడాన్ని నిరోధిస్తారు. అలా ఉపయో గించటాన్ని వారు అనుమతించగలరు లేదా నిషేధించగలరు. అయితే పెట్టుబడి ద్వారా జలపాతం సృష్టించబడదు. కనుక ఈ జలపాతాన్ని ఉపయోగించటం ద్వారా వచ్చిన అదనపు లాభం పెట్టుబడి వల్ల వచ్చింది కాదు. అది ఒక ప్రకృతి శక్తిని ఉపయోగించటం వలన వచ్చింది. ఆ శక్తి గుత్తాధిపత్యం లోనికి పోగలదు. పెట్టుబడి దానిని తన గుత్తాధిపత్యంలోనికి తెచ్చుకుంది. ఈ పరిస్థితులలో అదనపు లాభం భూమి కౌలుగా రూపాంతరం చెందుతుంది. అంటే – అది జలపాతం యజమాని స్వాధీనంలో కొచ్చింది. కార్ఖానాదారుడు జలపాతం యజమానికి ఏడాదికి 10 పౌండ్లు చెల్లిస్తే అతని లాభం 15 పౌండ్లు అనగా అతని ఇప్పటి ఉత్పత్తి ఖర్చు 100 పౌండ్లపైన 15% లాభం. ఈ ఉత్పత్తి రంగంలో ఆవిరితో పనిచేసే పెట్టుబడిదారులు అందరిలాగానూ లేదా వారందరికంటే మెరుగ్గానూ అతనుంటాడు. పెట్టుబడిదారుడు తానే స్వయంగా జలపాతానికి యజమాని అయితే అది విషయాన్ని లేశం కూడా మార్చదు. అటువంటప్పుడు అతడు ఒక పెట్టుబడిదారునిగా కాక జలపాతం యజమానిగా ఈ 10 పౌండ్లు అదనపు లాభాన్ని జేబులో వేసుకుంటాడు. ఎందుకంటే ఈ అదనపు లాభం అతని పెట్టుబడి నుంచి రాలేదు. అతని పెట్టుబడి కంటే భిన్నమైన గుత్తాధిపత్యం కిందికి తేబడిన ఒక పరిమిత ప్రకృతి శక్తిపైన తన ఆధిపత్యం వల్ల, అది భూమి కౌలుగా రూపాంతరం చెందింది.

మొదటిది – ఈ కౌలు ఎప్పుడూ వ్యత్యాసపు కౌలు అన్నది స్పష్టం. ఎందుకంటే ఇది సరుకుల సార్వత్రిక ఉత్పత్తి ధరలో ఒక నిర్ణయాత్మక అంశంగా ప్రవేశించదు. అది దానిపైన ఆధారపడి వుంటుంది. అది ఒకవైపున గుత్తగా ఉన్న ప్రకృతి శక్తిపైన ఒక ప్రత్యేక పెట్టుబడికి వున్న ఆధిపత్యం వల్ల ఏర్పడిన వ్యక్తిగత ఉత్పత్తి ధరకు, మరోవైపున ఆ ఉత్పత్తి రంగంలో పెట్టిన మొత్తం పెట్టుబడి సార్వత్రిక ఉత్పత్తి ధరకు మధ్య వున్న తేడా నుంచి అది అనివార్యంగా తలెత్తుతుంది.

రెండవది – ఉపయోగించిన మొత్తం పెట్టుబడి లేదా అది స్వాహా చేసిన శ్రమ ఉత్పాదకతలో పెరుగుదల నుంచి ఈ నేల కౌలు తలెత్తదు. ఎందుకంటే దాని వల్ల మొత్తం సరుకుల విలువ

1. అదనపు లాభం గురించి ఈ గ్రంథం చూడండి - ఎంక్వైరీ ఇన్ టు దోజ్ ప్రిన్స్‌పుల్స్ రెస్‌పెక్టింగ్ ద నేచర్ ఆఫ్ డిమాండ్ అండ్ ది నెసెసిటీ ఆఫ్ కంజంప్షన్ లేటలీ ఎడ్‌వొకేటెడ్ బై మిస్టర్ మాల్తస్, లండన్, 1821 - సం॥ (మాల్తస్‌కు వ్యతిరేకంగా)

తగ్గుతుంది. ఉత్పాదకతకు అనుకూలమైన అసాధారణ సహజ పరిస్థితుల నుంచి మినహాయించబడిన పెట్టుబడి మదుపులతో పోలిస్తే అదే ఉత్పత్తి రంగంలో పెట్టిన ప్రత్యేక విడి పెట్టుబడుల అధిక సాపేక్ష ఫలదాయకత నుండి ఇది తలెత్తుతుంది. ఉదాహరణకు ఆవిరిని ఉపయోగించటం అన్నది, జలశక్తిని ఉపయోగించటం వల్ల వచ్చే ప్రయోజనాల కంటే ఎక్కువ ప్రయోజనాలను సాధించగలిగితే అప్పుడు జలపాతం ఉపయోగించబడదు. అది అదనపు లాభాన్ని ఉత్పత్తి చెయ్యదు. కనుక కౌలును కూడా ఉత్పత్తి చెయ్యదు. ఇక్కడ బొగ్గుకు విలువ ఉన్నప్పటికీ, జలపాతానికి విలువ లేనప్పటికీ ఆవిరి యంత్రాల వల్ల వచ్చే ప్రయోజనాలు దానిపై పెట్టే ఖర్చును మించి ఉంటే ఇది వర్తిస్తుంది.

మూడవది – ప్రకృతి శక్తి అదనపు లాభానికి మూలాధారం కాదు. అది దాని సహజ ప్రాతిపదిక మాత్రమే. ఎందుకంటే ఈ సహజ ప్రాతిపదిక మీద శ్రముత్పాదకత అసాధారణంగా పెరగడం జరుగుతుంది. అదే విధంగా ఉపయోగపు విలువ అన్నది సామాన్యంగా మార్పిడి విలువను కలిగి వుంటుంది. అంతేగాని అది దానికి కారణం కాదు. శ్రమ లేకుండానే అదే ఉపయోగపు విలువల్ని పొందగల్గితే, దానికి మార్పిడి విలువ ఉండదు. అయినప్పటికీ ఇంతకు ముందులాగే ఉపయోగపు విలువకు ఉన్న సహజ ప్రయోజనం ఉంటుంది. మరోవైపున ఉపయోగపు విలువ లేకుండా మార్పిడి విలువ అన్నది ఉండదు. అది సహజంగా శ్రమ కలిగి ఉంటే తప్ప జరగదు. వివిధ విలువలు ఉత్పత్తి ధరలుగా సగటుగా మారతాయి. అలాగే వివిధ విడి ఉత్పత్తి ధరలు మార్కెట్టును క్రమబద్ధం చేసే సార్వత్రిక ఉత్పత్తి ధరగా మారతాయి. ఈ కారణం చేత జలపాతాన్ని ఉపయోగించటం ద్వారా శ్రమ ఉత్పాదకతలో పెరుగుదల వస్తే ఆ జలపాతం సాయంతో ఉత్పత్తి అయిన సరుకుల ధర మాత్రమే తగ్గుతుంది. అంతేగాని ఈ సరుకులలో ఉన్న లాభం వాటాను పెంచదు. అదే విధంగా మరోవైపున పెట్టుబడి తానుపయోగించే శ్రమ యొక్క సహజమైన సామాజిక ఉత్పాదకతను తన సొంత ఉత్పాదకతగా స్వాహా చెయ్యకుండా వుంటే ఈ పెరిగిన శ్రమ ఉత్పాదకత అన్నది అదనపు విలువగా మార్చబడదు.

నాలుగవది – అదనపు విలువ (లాభం) భాగాన్ని సృష్టించటంలో జలపాతం ప్రైవేటు యాజమాన్యంలో ఉండటం అన్నదానికి ఏ పాత్రా ఉండదు. కనుక జలపాతం సహాయంతో ఉత్పత్తి అయిన సరుకు ధర విషయంలో ఈ ప్రైవేటు యాజమాన్యానికి ప్రమేయం ఉండదు. భూ ఆస్తి లేకున్నప్పటికీ ఈ అదనపు లాభం వుంటుంది. ఉదాహరణకు కార్ఖానాదారుడు ఉపయోగించిన జలపాతం ఉన్న భూమి ఎవరికీ చెందని భూమి అనుకుందాం. కనుక అదనపు విలువగా రూపాంతరం చెందే విలువ భాగాన్ని భూ ఆస్తి సృష్టించదు. అది జలపాతం యజమానికి, కార్ఖానాదారుని జేబునుంచి ఈ అదనపు లాభాన్ని లాక్కుని తన జేబులో వేసుకోవటానికి తోడ్పడుతుంది. అటువంటి అదనపు లాభాన్ని సృష్టించటానికి అది కారణం కాదు. భూమి కౌలుగా రూపాంతరం చెందటానికి మాత్రమే అది కారణం. కనుకనే ఈ లాభం భాగం లేదా సరుకు ధర భూ యజమాని లేదా జలపాతాల యజమాని స్వాహా చెయ్యటం సాధ్యమవుతుంది.

ఐదవది – భూ యజమాని జలపాతాన్ని మూడవ వ్యక్తికి లేదా కార్ఖానాదారునికి అమ్మాడను కుందాం. అప్పుడు జలపాతం ధర అనగా భూ యజమాని గ్రహిస్తున్న ధర సరుకుల ఉత్పత్తి

ధరలోకి తక్షణమే ప్రవేశించదు. అయితే ఇది కార్ఖానాదారుని వ్యక్తిగత ఉత్పత్తి ఖర్చులోకి ప్రవేశిస్తుంది. ఇక్కడ కౌలు అన్నది ఆవిరి యంత్రంతో ఉత్పత్తి అయిన అదే రకపు సరుకుల ఉత్పత్తి ధర నుంచి తలెత్తుతుంది. ఈ ధర జలపాతంతో ప్రమేయం లేకుండా నిర్ణయించబడుతుంది. అంతేకాక మొత్తం మీద జలపాతం ధర అన్నది ఒక హేతువిరుద్ధమైన వ్యక్తీకరణ అయితే దాని వెనుక ఒక వాస్తవ ఆర్థిక సంబంధం దాగి వున్నది. సాధారణంగా భూమిలాగానే ఇతర ప్రకృతి శక్తులన్నింటి లాగానే జలపాతానికి కూడా విలువ లేదు. ఎందుకంటే భౌతిక రూపం చెందిన శ్రమకు అది ప్రాతినిధ్యం వహించదు. కనుక దానికి ధర కూడా లేదు. సాధారణంగా ధర అంటే డబ్బు రూపంలో వ్యక్తం చెయ్యబడిన విలువ మాత్రమే. విలువ అనేది లేనప్పుడు డబ్బు రూపంలో వ్యక్తం చెయ్యటం అన్నది ఉండదు. ఈ ధర అన్నది పెట్టుబడీకరించబడిన కౌలు తప్ప వేరు కాదు. భూ యాజమాన్యం అన్నది వ్యక్తిగత లాభానికి, సగటు లాభానికి మధ్య ఉన్న తేడాను స్వాహా చెయ్యటానికి భూ యజమానికి అవకాశం కల్పిస్తుంది. ప్రతీ యేడాది భూ యజమానికి లాభం వస్తూనే వుంటుంది. అలా సంపాదించిన ఈ లాభం ప్రకృతి శక్తి ధరలాగానే కనిపిస్తుంది. జలపాతాన్ని ఉపయోగించిన కార్ఖానాదారుని అదనపు లాభం ఏడాదికి 10 పౌండ్లు, సగటు వడ్డీ రేటు 5% అయితే ఈ 10 పౌండ్ల మొత్తం 200 పౌండ్ల పెట్టుబడిపైన వార్షిక వడ్డీలా కనిపిస్తుంది. వార్షికంగా కార్ఖానాదారునికి, జలపాతం యజమాని కాబట్టి 10 పౌండ్ల పెట్టుబడీకరణ స్వయంగా జలపాతం యొక్క పెట్టుబడి విలువలా కనిపించేలా చేస్తుంది. విలువ ఉన్నది జలపాతానికి కాదు. స్వాహా చెయ్యబడిన అదనపు లాభాన్ని పెట్టుబడిదారీ పద్ధతిలో లెక్కగట్టడం వల్ల వచ్చిన ప్రతిఫలమే ఈ ధర. 10 పౌండ్ల అదనపు విలువను 20 సంవత్సరాలతో గుణించటంవల్ల వచ్చిన ఉత్పాదితాన్ని ఈ 200 పౌండ్ల ధర అన్నది కేవలం ప్రతిబింబిస్తూందని, పరిస్థితులు యథాతథంగా వుంటే అదే జలపాతం ఏటా ఈ 10 పౌండ్లను అనంతంగా ఏళ్ళ తరబడి – 30 ఏళ్ళు, 100 ఏళ్ళు లేదా X సంవత్సరాల పాటు ఆ యజమానికి ఏటా 10 పౌండ్ల చొప్పున ఇస్తుంది అన్న విషయం – పై విషయాన్ని రుజువు చేస్తుంది. మరోవైపున జలశక్తితో సంబంధం లేని మరో కొత్త ఉత్పత్తి పద్ధతి వల్ల ఆవిరి యంత్రంతో తయారైన సరుకుల ఉత్పత్తి ఖర్చును 100 పౌండ్ల నుంచి 90 పౌండ్లకు తగ్గించగలిగితే అదనపు లాభమూ, తద్వారా దాని కౌలు, ఆ రకంగా జలపాతం యొక్క ధర మాయమవుతాయి.

ఇప్పుడు వ్యత్యాసపు కౌలు యొక్క సాధారణ భావనను వివరించుకున్నాం. అసలు వ్యవసాయంలో యెలా వుండేది పరిశీలించటానికి ప్రయత్నిద్దాం. వ్యవసాయానికి వర్తించేది మొత్తం మీద గని పనికి కూడా వర్తిస్తుంది.

★ ★ ★

## అధ్యాయం - 39

# వ్యత్యాసపు కౌలు మొదటి రూపం

### (వ్యత్యాసపు కౌలు - I)

**ఈ** క్రింది పరిశీలనను రికార్డో సరిగ్గానే చేశాడు :

"రెండు సమానమైన పరిమాణాల్లో పెట్టుబడిని, శ్రమను పనిలో పెట్టడం ద్వారా పొందిన ఉత్పాదితాల మధ్య తేడాయే ఎప్పుడూ కౌలుగా మారుతుంది." (ప్రిన్స్‌పుల్స్, పుట 59) [అతని ఉద్దేశం వ్యత్యాసపు కౌలు. ఎందుకంటే అతను వ్యత్యాసపు కౌలు తప్ప వేరే కౌలు వుంటుందని ఊహించడు.] అతడు "ఈ సమాన భూమి కమతాలలో" అని జోడించాల్సి వుంది. అది సాధారణంగా అదనపు లాభానికి సంబంధించిన వ్యవహారంలా కాక భూమి కౌలుకు సంబంధించిన వ్యవహారం అయిన మేరకు కాబట్టి.

మరోలా చెప్పాలంటే అదనపు లాభం అన్నది చలామణి ప్రక్రియలో యాదృచ్ఛిక పరిస్థితుల వల్ల కాక మామూలు అంశం అయినప్పుడు రెండు సమాన పరిమాణాల పెట్టుబడి, శ్రమల ఉత్పాదితాల మధ్య తేడా వల్ల తలెత్తుతుంది. రెండు సమాన పరిమాణాలలో గల పెట్టుబడి, శ్రమ సమాన భూకమతాలపై ఉపయోగించినప్పుడు అసమాన ఫలితాలు వస్తే అప్పుడు ఈ అదనపు లాభం భూమి కౌలుగా రూపాంతరం చెందుతుంది. అంతేగాక సమాన పరిమాణాలలో పెట్టిన పెట్టుబడి అసమాన ఫలితాలు ఇవ్వటంవల్ల అదనపు లాభం తప్పనిసరిగా తలెత్తాలనేమీ లేదు. వివిధ మదుపులు అసమాన పరిమాణాలలో పెట్టుబడిని పెట్టవచ్చు. సాధారణంగా ఇదే జరుగుతుంది కూడాను. అయితే సమాన నిష్పత్తిలో ప్రతీది – ఉదాహరణకు 100 పౌండ్లు ఉందనుకుందాం – అవి అసమాన ఫలితాలు ఇస్తాయి. అంటే వాటి లాభం రేట్లు వేరు వేరుగా ఉంటాయని అర్థం. పెట్టుబడి పెట్టే ఏ రంగంలోనైనా అదనపు లాభానికి ఇది సాధారణమైన పూర్వావసరం. రెండో పూర్వావసరం, ఈ అదనపు లాభం భూమి కౌలు రూపంలోకి మారటం. (అంటే లాభానికి భిన్నమైన రూపంలో భూమి కౌలుగా మారటం.) ఈ రూపాంతరం అన్నది ఎప్పుడు, ఎలా ఏ పరిస్థితుల్లో జరుగుతుందన్నది సందర్భానుసారం విడిగా పరిశీలించాల్సి వుంది.

వ్యత్యాసపు కౌలుకు పరిమితమైన మేరకు ఈ కింది వ్యాఖ్యానం కూడా రికార్డో సరిగ్గానే చేశాడు :

"ఒకే రకపు లేదా కొత్త భూమిలో లభించే ఉత్పాదితాల అసమానతను ఏది తగ్గించినా అది కౌలును తగ్గించే దిశలో వుంటుంది. ఈ అసమానతను ఏది పెంచినా, తప్పనిసరిగా వ్యతిరేక ప్రభావాన్ని కలిగించి దానిని పెంచటానికి ప్రయత్నిస్తుంది." (పుట 74)

ఈ కారణాల్లో కేవలం సాధారణమైనవి (సారం, స్థానం) మాత్రమే కాక ఇతరమైనవి కూడా ఉంటాయి. 1. భూమి ఏకరూపంగా ఉన్నదా, లేదా అన్నదాన్ని బట్టి పన్నుల పంపిణీ ఉంటుంది. ఇంగ్లాండులోలాగా కేంద్రీకృతం కానప్పుడు ఏకరూపంగా ఉండదు. అప్పుడు పన్నులు కౌలుపైన కాక, భూమిపైన విధించబడతాయి. 2. దేశంలో ఉన్న విభిన్న ప్రాంతాల్లో వ్యవసాయాభివృద్ధిలో తేడాల వల్ల అసమానతలు తలెత్తుతాయి. ఏమంటే వ్యవసాయ ఉత్పత్తి రంగం సాంప్రదాయక స్వభావంతో ఉంటుంది. కనుక పరిశ్రమ రంగంలో కంటే సమానత్వం సాధించడం కష్టం. 3. పెట్టుబడిదారీ కౌలుదారుల మధ్య పెట్టుబడి పంపిణీ అసమానంగా జరుగుతుంది. వ్యవసాయంపై పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం దురాక్రమణ వల్ల, స్వతంత్ర రైతులు వేతన కార్మికులుగా మారతారు. నిజానికి ఇది ఈ ఉత్పత్తి విధానపు చివరి గెలుపు. అంచేత ఈ అసమానతలు ఇతర ఉత్పత్తి రంగాల అన్నిటికంటే ఇక్కడ ఎక్కువగా వుంటాయి.

ఈ ప్రాథమిక వ్యాఖ్యల తరువాత నేను – రికార్డో తదితరులకు విభిన్నంగా విశ్లేషణలో వున్న విశిష్ట లక్షణాల సారాంశాన్ని సంక్షిప్తంగా మీ ముందు ఉంచుతాను.

★ ★ ★

సమాన పరిమాణంలో వున్న విభిన్న కమతాలలో పెట్టిన సమాన పరిమాణం ఉన్న పెట్టుబడి అసమాన ఫలితాన్ని ఇవ్వటాన్ని మొదట పరిశీలిద్దాం. అసమాన పరిమాణాలు ఉంటే సమాన కమతాల ఫలితాల ఆధారంగా లెక్కిద్దాం.

ఈ అసమాన ఫలితాలకు – పెట్టుబడితో ప్రమేయం లేకుండా – రెండు సాధారణ కారణాలు వున్నాయి. 1. సారం (ఈ మొదటి అంశానికి సంబంధించి సహజమైన నేల సారం అంటే ఏమిటి; అందులో ఏయే అంశాలు ఇమిడి వున్నాయి అన్నదాన్ని చర్చించటం అవసరం.) 2. క్షేత్రం వున్న స్థానం. ఇది వలసల విషయంలో నిర్ణయాత్మకమైన అంశం. ఇది కమతాలను సాగుచెయ్యాల్సిన వరుస క్రమాన్ని సాధారణంగా నిర్ణయిస్తుంది. అంతేకాక ఈ వ్యత్యాసపు కౌలుకు ఈ రెండు భిన్నమైన కారణాలు – సారం, స్థానం – పరస్పర వ్యతిరేక దిశలలో పనిచెయ్యవచ్చు. ఒక కమతం చాలా అనుకూలమైన స్థానంలోనే ఉండి వుండవచ్చును. కాని భూసారం రీత్యా అది చాలా నాసిరకం అయి వుండవచ్చు. లేదా భూసారం రీత్యా అనుకూలమైనది, స్థానం రీత్యా కాకపోవచ్చు. ఈ పరిస్థితి ముఖ్యం. ఎందుకంటే – ఒక దేశపు భూమిని సాగులోకి తీసుకురావడంలో మెరుగైన భూముల నుంచి అధ్వాన్న భూములకు, అందుకు వ్యతిరేక దిశలోనూ ఆ క్రమం వీలవుతుందా అన్నదానివల్ల తెలుస్తుంది. అంతిమంగా ఒకవైపున సాధారణంగా సామాజిక ఉత్పత్తి ప్రగతి భూమి కౌలుకు ఒక కారణం అయిన స్థానం బట్టి తలెత్తే తేడాలను సమం చేసే ప్రభావం నెరపుతుంది. స్థానిక మార్కెట్లను సృష్టించడం ద్వారా, వార్తా రవాణా సదుపాయాలను ఏర్పరిచి ఆ స్థానాలను మెరుగుపరచటం ద్వారా అది ఈ పనిని నిర్వహిస్తుంది. మరోవైపున వేరు వేరు కమతాల మధ్య భేదాలను పెంచుతుంది. వ్యవసాయాన్ని పరిశ్రమల నుంచి వేరుచెయ్యటం ద్వారాను ఒకవైపున పెద్ద ఉత్పత్తి కేంద్రాలను, మరోవైపున సాపేక్షంగా ఒంటరిగా ఉండే వ్యవసాయ జిల్లాలను వేర్పర్చటం ద్వారా ఈ తేడాలను పెంచుతుంది.

ప్రస్తుతానికి స్థానానికి సంబంధించిన అంశాన్ని మన పరిశీలన నుంచి పక్కన పెడదాం. భూసారానికి మాత్రమే పరిమితమవుదాం. వాతావరణ పరిస్థితులు వగైరా కాక సహజమైన సారంలో తేడా భూమి పైపొర స్వరూపంపైన ఆధారపడి వుంటుంది. అనగా దాని భిన్నమైన మొక్కల పోషక సారంపైన ఆధారపడి వుంటుంది. అయితే ఈ విషయంలో రెండు కమతాలలో రసాయనిక స్వరూపం సహజ సారం ఒకేలా ఉన్నాయనుకుందాం. అప్పుడు ఈ మొక్కల పోషకాహార అంశాలు పంటల పోషణ కోసం తేలికగా గ్రహించబడటానికి, తక్షణమే ఉపయోగించటానికి వీలుగా ఉన్నాయా లేదా అన్నదానిపైన ఆచరణలో ఈ భూసారం భిన్నంగా ఉండవచ్చు. కనుక ఇది పాక్షికంగా రసాయనిక అభివృద్ధిపైన, పాక్షికంగా యాంత్రికాభివృద్ధిపైన ఒకే తీరున సహజమైన సారం ఉన్న కమతాలకు ఈ సహజమైన సారం అందుబాటులోకి వస్తుంది అన్నది ఆధారపడి వుంటుంది. సారం అన్నది భూమి వస్తుగత స్వభావమే అయినప్పటికీ అందులో ఎప్పుడూ ఒక ఆర్థిక సంబంధం గర్భితమై వుంటుంది. అది వ్యవసాయంలో ఉన్న రసాయనిక యాంత్రిక అభివృద్ధి స్థాయిని తెలియజేస్తుంది. కనుక అది ఈ అభివృద్ధి స్థాయితోపాటు మారుతుంటుంది. సమానమైన సారం కలిగిన భూమిని దిగనాసిల్ల చేసిన అవరోధాలను రసాయనిక సాధనాల ద్వారా గాని (గట్టి బంకమట్టి భూములపైన ద్రవరూపంలో ఉన్న కొన్ని రకాల ఎరువులను వాడటం ద్వారా, అలాగే బంకమట్టి భూముల్ని పొడిగా మార్చటం ద్వారాను), యాంత్రిక సాధనాల ద్వారా గాని (గట్టి భూముల్ని సాగు చెయ్యటానికి ప్రత్యేకమైన నాగళ్ళను ఉపయోగించడం వగైరా) తొలగించవచ్చు. (మురుగు నీటి పారుదల వ్యవస్థ కూడా ఈ శీర్షిక కిందకే వస్తుంది.) సాగులోకి తేబడిన భూముల వరుస క్రమాన్ని మార్చవచ్చు. ఉదాహరణకు ఇంగ్లాండు వ్యవసాయంలో ఒక అభివృద్ధి దశలో తేలిక ఇసుక భూముల విషయంలోనూ, బరువైన బంక భూముల విషయంలోనూ ఇలా జరిగింది. సాగు చేసే భూముల వరుస క్రమంలో ఎక్కువ సారవంతమైన భూముల నుంచి తక్కువ సారవంతమైన భూములకు, అలాగే ఇటు నుంచి అటు కూడా వుండే క్రమం చారిత్రకంగా కొనసాగవచ్చున్న విషయాన్ని ఇది మరొకసారి తెలియజేస్తుంది. భూమి స్వరూపంలో కృత్రిమంగా సృష్టించిన మెరుగుదల వలన లేదా కేవలం వ్యవసాయ పద్ధతుల మార్పు వల్ల అవే ఫలితాలు పొందవచ్చు. చివరికి లోతట్టు భూమి పరిస్థితులు భిన్నంగా ఉండటం వలన భూమి పొరలను మార్చటం ద్వారా ఇవే ఫలితాలను సాధించవచ్చు. భూమి లోపలి పొరను సాగు చెయ్యటం ప్రారంభించగానే దాని లోపలి పొరను తిరగెయ్యటం జరిగిన తర్వాత ఇవే ఫలితాలు రావచ్చు. ఇది పాక్షికంగా కొత్త వ్యవసాయ పద్ధతులు ఉపయోగించటంపైన (పశుగ్రాసాన్ని ఇచ్చే గడ్డి సాగు వగైరాలు) పాక్షికంగా యాంత్రిక సాధనాలు ఉపయోగించటంపైన ఆధారపడి వుంటుంది. లోపలి పొరను పైపొరలుగా తిరగవెయ్యటమూ లేదా పైపొరలతో లోపలి పొరలను మిశ్రమం చెయ్యటమూ లేదా లోపలి పొరను తిరగవెయ్యకుండానే దానిని సాగు చెయ్యటమూ, వగైరాల రూపంలో ఇది కొనసాగవచ్చు.

వివిధ కమతాల యొక్క వ్యత్యాసపు సారంపైన ఉండే ప్రభావాలన్నీ, ఆర్థిక సారం దృష్టి నుంచి శ్రమ ఉత్పాదకత స్థాయి అన్నది సహజమైన భూసారం అనబడే దానిలో రసాయనిక స్వరూపం ఇతర సహజ ధర్మాలంత ప్రధానమైన అంశంగా ఉంటుంది. ఈ సందర్భంలో ఉత్పాదకత స్థాయి

అంటే సహజ భూసారాన్ని తక్షణమే వినియోగంలోకి తెచ్చే శక్తి. ఈ శక్తి వివిధ అభివృద్ధి దశలలో విభిన్నంగా వుంటుంది.

కనుక మనం వ్యవసాయంలో ప్రత్యేక అభివృద్ధి దశను ఊహిద్దాం. దానితోపాటు భూమి పొరలను ఏర్పాటు చెయ్యటం అన్నది ఈ అభివృద్ధికి అనుగుణంగా ఉంటుందని భావిద్దాం. విభిన్న కమతాలపైన ఏకకాలంలో పెట్టుబడి పెట్టడం విషయంలో ఇది ఎప్పుడూ ఇలాగే వుంటుంది. వ్యత్యాసపు కౌలు అన్నది పైనుంచి కిందికి లేదా కింది నుంచి పైకి మారే వరస క్రమం కావచ్చు. వాస్తవంగా సాగులో ఉన్న కమతాల మొత్తానికి ఈ వరుస క్రమం నిర్ణీతంగా ఉన్నప్పటికీ అది ఏర్పడటానికి దారితీసిన చలనాల పరంపర అన్నది తప్పనిసరిగా ఇంతకు ముందే ఉంది.

నాలుగు రకాల భూములు ఉన్నాయనుకుందాం. ఎ, బి, సి, డి. ఒక బస్తా గోధుమ ధర = 3 పౌండ్లు లేదా 60 షిల్లింగులు అనుకుందాం. కౌలు కేవలం వ్యత్యాసపు కౌలు కనుక పరమ అధ్యాన్నపు భూమిలో పండే ఒక బస్తాకు లభించే 60 షిల్లింగుల ధర ఉత్పత్తి ధరతో సమానం. అనగా సగటు లాభంతో కూడిన పెట్టుబడితో సమానం.

ఎ. అన్నింటికంటే అధ్వాన్నమైన భూమి అనుకుందాం. అది ఒక బస్తాకు 60 షిల్లింగులు ఇస్తుంది. ఒక బస్తాకు ఖర్చు 50 షిల్లింగులు కనుక లాభం 10 షిల్లింగులు లేదా 20%.

బి. అదే వ్యయానికిగానూ రెండు బస్తాల దిగుబడి ఇస్తుంది. అంటే 120 షిల్లింగులు. అనగా లాభం 70 షిల్లింగులు లేదా అదనపు లాభం 60 షిల్లింగులు.

సి. దిగుబడి మూడు బస్తాలు = 180 షిల్లింగులు అదే ఖర్చుకు; మొత్తం. లాభం = 130 షిల్లింగులు. అదనపు లాభం = 120 షిల్లింగులు.

డి. దిగుబడి నాలుగు బస్తాలు = 240 షిల్లింగులు = 180 షిల్లింగుల అదనపు లాభం.

మనకు అప్పుడు ఈ క్రింది వరుస క్రమం లభిస్తుంది.

**పట్టిక – I**

| భూమి రకం | ఉత్పత్తి | | అద్వాన్ను చెయ్యబడిన పెట్టుబడి | లాభం | | కౌలు | |
|---|---|---|---|---|---|---|---|
| | బస్తాలు | షిల్లింగులు | | బస్తాలు | షిల్లింగులు | బస్తాలు | షిల్లింగులు |
| ఎ | 1 | 60 | 50 | $\frac{1}{6}$ | 10 | – | – |
| బి | 2 | 120 | 50 | $1\frac{1}{6}$ | 70 | 1 | 60 |
| సి | 3 | 180 | 50 | $2\frac{1}{6}$ | 130 | 2 | 120 |
| డి | 4 | 240 | 50 | $3\frac{1}{6}$ | 190 | 3 | 180 |
| మొత్తం | 10 బ॥ | 600 షి॥ | | | | 6 బ॥ | 360 షి॥ |

వరుసగా కౌళ్ళు ఇలా ఉంటాయి. డి = 190–10 షిల్లింగులు. లేదా డి కి ఎకి మధ్య వున్న తేడా; సి = 130–10 షిల్లింగులు. లేదా సికి ఎకి మధ్య ఉన్న తేడా. బి = 70–10 షిల్లింగులు. లేదా బికి ఎకి మధ్య వున్న తేడా. బి సి డిలకు మొత్తం కౌలు = 6 బస్తాలు = 360 షిల్లింగులు. ఇది డికి ఎకి, సికి ఎకి, బికి ఎకి మధ్య ఉన్న తేడాల మొత్తంతో సమానం.

నిర్దిష్ట పరిస్థితులో ఒక నిర్ణీత ఉత్పాదితానికి ప్రాతినిధ్యం వహించే ఈ వరుస క్రమాన్ని అనిర్దిష్టంగా పరిశీలిస్తే (వాస్తవంగా ఇలా ఎందుకు జరుగుతుందో కారణాలు ఇంతకు ముందే తెలియజేశాం.) అది డి నుంచి ఎకి అనగా ఎక్కువ సారవంతమైన భూమి నుంచి తక్కువ, మరింత తక్కువ సారవంతమైన భూమికి ఆ క్రమం దిగుతుంది. లేదా ఎ నుంచి డికి, సాపేక్షంగా అధ్వాన్న స్థితిలో ఉన్న భూమి నుంచి ఎక్కువ – మరింత ఎక్కువ సారవంతమైన భూమికి పెరుగుతుంది. లేదా ఆఖరికి అది వాటి మధ్య ఎక్కుతూ దిగుతూ ఊగిసలాడవచ్చు. ఉదాహరణకు బి నుంచి సికి, ఎ నుంచి బికి ఇలా కొనసాగవచ్చు.

దిగే వరుస క్రమం ప్రక్రియ ఇలా వుంటుంది – ఒక గోధుమ బస్తా ధర క్రమంగా 15 షిల్లింగుల నుండి 60 షిల్లింగులకు పెరిగిందనుకుందాం. డి ఉత్పత్తి చేసిన 4 బస్తాలు (ఈ 4 బస్తాలను ఫలానా ఇన్ని లక్షల బస్తాలు అనీ అనుకోవచ్చు.) సరిపోలేదనుకుందాం వెంటనే సరఫరాలో ఉన్న కొరతను పూడ్చటానికి సి కూడా ఉత్పత్తిచేసేలా పెరిగినట్టు. బస్తాకు 30 షిల్లింగులకు చేరితే ఎ ని కూడా సాగులోకి తేవచ్చు. మదుపు పెట్టిన పెట్టుబడి 20% కంటే తక్కువ లాభానికి సంతృప్తి పడాల్సి రాలేదు. ఈ రకంగా మొదటి డి కి బస్తాకు 5 షిల్లింగుల చొప్పున 4 బస్తాలకు 20 షిల్లింగుల కౌలు ఏర్పడింది. తరువాత బస్తాకు 15 షిల్లింగులు చొప్పున 60 షిల్లింగులు, ఆ తరువాత బస్తాకు 45 షిల్లింగులు చొప్పున 4 బస్తాలకుగానూ 180 షిల్లింగులు భూమి కౌలు లభించింది.

మొదట డి లాభం రేటు ఇదే విధంగా 20% ఉందనుకుందాం. నాలుగు బస్తాల గోధుమపైన మొత్తం లాభం కూడా 10 షిల్లింగులే. అయితే ధర 60 షిల్లింగులు ఉన్నప్పటికంటే 15 షిల్లింగులు ఉన్నప్పుడు ఈ 10 షిల్లింగుల లాభం ఎక్కువ ధాన్యానికి ప్రాతినిధ్యం వహించింది. అయితే ధాన్యం శ్రమ శక్తి పునరుత్పత్తిలో ప్రవేశిస్తుంది కనుక ప్రతి బస్తాలోనూ ఒక భాగం వేతనాలుగానూ, మరోభాగం స్థిర పెట్టుబడిగానూ మారుతుంది. కనుక ఈ పరిస్థితుల్లో అదనపు విలువ అధికంగా వుంటుంది. ఇతర పరిస్థితులు యధాతథంగా వుంటే లాభం రేటు కూడా అధికంగానే వుంటుంది. (లాభం రేటు విషయం ప్రత్యేకంగా, మరింత వివరంగా విశ్లేషించాల్సి వుంది.)

అలాకాక వరుస క్రమం విపర్యంగా ఉంటే, అంటే ఈ ప్రక్రియ ఎ నుంచి ప్రారంభం అయితే, కొత్త భూమిని సాగులోకి తెచ్చుకోవాల్సినప్పుడు గోధుమ ధర మొదట బస్తాకు 60 షిల్లింగుల కంటే పెరుగుతుంది. అయితే అవసరమైన సరఫరాను అనగా 2 బస్తాల సరఫరాను బి ఉత్పత్తి చేస్తుంది కనుక ధర మళ్ళీ 60 షిల్లింగులకు పడుతుంది. ఏమంటే బి గోధుమను బస్తాకు 30 షిల్లింగుల ఖర్చుతో ఉత్పత్తి చేసింది. కాని సరఫరా కేవలం గిరాకీ సంతృప్తిపరచటానికి మాత్రమే తగినంత స్థాయిలో ఉన్నది కనుక అది 60 షిల్లింగుల చొప్పున అమ్ముతుంది. ఆ రకంగా బికి 60 షిల్లింగుల కౌలు ఏర్పడింది. సి, డిలకు కూడా అదే రకంగా ఏర్పడుతుంది. ఈ కాలం అంతటిలోనూ మార్కెట్టు ధర 60 షిల్లింగులు ఉందనుకుందాం. ఎ సరఫరా చేసే ఒక బస్తా గోధుమ మొత్తం గిరాకీని సంతృప్తిపరచటానికి ఇంతకు ముందులాగానూ అవసరం కనుక సి, డిలు ఉత్పత్తి చేసిన గోధుమ వాస్తవ విలువ బస్తాకు వరుసగా 20, 15 షిల్లింగులు మాత్రమే ఉన్నప్పటికీ మార్కెట్టు ధర 20 షిల్లింగులే ఉందనుకుందాం. ఈ సందర్భంలో సరఫరాకు మించి గిరాకీలో వచ్చిన పెరుగుదలను మొదట ఎ సంతృప్తిపరిచింది. తరువాత ఎ, బిలు సంతృప్తిపరిచాయి. ఇది బి, సి, డిలు వరుస

క్రమంలో సాగుచెయ్యటానికి వీలుకల్పించి ఉండకపోవచ్చు. అది కేవలం సాగుభూమిని విస్తరించి వుండవచ్చు. మరింత సారవంతమైన భూములు తరువాత మాత్రమే సాగులోకి వచ్చి ఉండవచ్చు.

మొదటి క్రమంలో ధరల పెరుగుదల కౌలును పెంచి లాభం రేటును తగ్గిస్తుంది. అటువంటి తగ్గుదలనే పూర్తిగానూ లేదా పాక్షికంగానూ, అందుకు విరుద్ధమైన పరిస్థితులు అదుపు చెయ్యవచ్చు. ఈ అంశాన్ని తరువాత మరింత వివరంగా చర్చించాల్సి వుంది. సార్వత్రిక లాభం రేటు అన్ని ఉత్పత్తి రంగాలలోనూ అదనపు విలువచేత ఏకరూపంగా నిర్ణయించబడదు అన్న విషయాన్ని మనం మరచిపోరాదు. పారిశ్రామిక లాభాన్ని నిర్ణయించేది వ్యవసాయ లాభం కాదు – పారిశ్రామిక లాభమే వ్యవసాయ లాభాన్ని నిర్ణయిస్తుంది. అయితే దీని వివరం తరువాత.

రెండవ వరుస క్రమంలో లాభం రేటు మదుపు పెట్టిన పెట్టుబడిపైన యథాతథంగా వుంటుంది. లాభం మొత్తానికి మరింత తక్కువ ధాన్యం ప్రాతినిధ్యం వహిస్తుంది. అయితే ఇతర సరుకులతో పోల్చినప్పుడు ధాన్యం యొక్క సాపేక్ష ధర పెరిగి వుంటుంది. లాభంలో పెరుగుదల సంభవించినపుడల్లా, ఆ పెరుగుదల పెట్టుబడిదారీ కౌలు రైతు జేబులోకి ప్రవహించడానికి బదులు, పెరుగుతున్న లాభంలా కనిపించడానికి బదులు, కౌలు రూపంలో లాభం నుంచి వేరుచెయ్యబడుతుంది. అయితే ధాన్యపు ధర మనం ఇక్కడ ఊహించిన పరిస్థితుల్లో మారకుండా వుండగల్గింది.

నిశ్చితమైన ధరలకు లేదా పెరిగే ధరలకు, అధ్వాన్నపు భూములనుంచి మరింత మెరుగైన భూములకు వరుస క్రమం – సాగుతున్నప్పుడు మెరుగైన భూముల నుంచి అధ్వాన్నపు నేలలకు ఆ క్రమం సాగుతున్నప్పుడు వ్యత్యాసపు కౌలు అభివృద్ధి, పెరుగుదల యథాతథంగా వుంటాయి.

ఇంతవరకూ మనం ఊహించింది : 1. మొదటి వరుస క్రమంలో ధరలు పెరుగుతాయి. రెండవదానిలో యథాతథంగా ఉంటాయి. 2. మెరుగైన భూముల నుంచి అధ్వాన్నపు భూములకు లేదా అధ్వాన్నపు భూముల నుంచి మెరుగైన భూములకు ఈ సాగు చేసే క్రమం నిరంతరాయంగా మారుతూ వుంటుంది.

ధాన్యం గిరాకీ దాని మొదటి సంఖ్య 10 నుంచి 17 బస్తాలకు పెరిగిందనుకుందాం. అంతేకాక పరమ అధ్వాన్నమైన ఎ స్థానంలో మరో 'ఎ' భూమి వచ్చిందనుకుందాం. అది 60 షిల్లింగుల ఉత్పత్తి ధరతో (50 షిల్లింగుల ఖర్చు, 10 షిల్లింగుల లాభం, అనగా 20% లాభం) $1\frac{1}{3}$ బస్తాలను ఉత్పత్తి చేస్తుందనుకుందాం. దాని బస్తా ఉత్పత్తి ధర = 45 షిల్లింగులు; లేదా బహుశా పాత భూమి ఎ నిరంతర సహేతుక వ్యవసాయం ద్వారా మెరుగుపడి వుండవచ్చు, లేదా, అది అదే ఖర్చులో మరింత ఉత్పాదకంగా సాగులో ఉంది అనుకుందాం. అంటే ఉదాహరణకు పశుగ్రాసంతో చేసిన ఎరువును వాడడం ద్వారా ఒకే పెట్టుబడి మొత్తంతో ఉత్పత్తి $1\frac{1}{3}$ బస్తాలు పెరగవచ్చును. బి, సి, డి భూములు ఇదివరకు లాగానే ఉత్పత్తిని ఇస్తున్నాయి అనుకుందాం. అయితే కొత్త భూముల్ని సాగులోకి తెచ్చారనుకుందాం. ఉదాహరణకు ఎ' భూమి సారం ఎ', బిలకు మధ్య ఉంటుంది. అలాగే, బి', బి''ల భూసారం బి, సిల మధ్య వుంటుంది. అప్పుడు ఈ క్రింది ప్రక్రియను గమనించవచ్చు :

మొదటిది : ఒక బస్తా గోధుమ ఉత్పత్తి ధర లేదా అమలులో ఉన్న దాని మార్కెట్టు ధర 60 షిల్లింగుల నుంచి 45 షిల్లింగులకే పడిపోతుంది. అంటే 25% పడిపోతుంది.

రెండవది : సాగు మెరుగైన భూముల నుంచి తక్కువ సారవంతమైన భూములకు అలాగే

అధ్వాన్నపు భూముల నుంచి ఎక్కువ సారవంతమైన భూములకు ఏకకాలంలో కొనసాగుతూ వుంటుంది. నేల ఎ' ఎ కంటే సారవంతమైనది. కాని ఇప్పటి వరకూ సాగుచేస్తున్న బి, సి, డి కంటే తక్కువ సారవంతమైనది. బి' బి"లు ఎ, ఎ' బిల కంటే సారవంతమైనవి. కాని సి, డిల కంటే తక్కువ సారవంతమైనవి. ఈ వరుస క్రమం ఇలా చిందరవందరగా కొనసాగుతుంది. ఈ సాగు అన్నది ఎ భూమి వగైరాల కంటే మరీ తక్కువ సారవంతమైన భూములకు మారకపోవచ్చు. అయితే అది ఇప్పటిదాకా చాలా సారవంతంగా వున్న సి, డి రకం భూములకంటే సాపేక్షంగా తక్కువ సారవంతంగా వున్న భూములకు ఇది వ్యాపించవచ్చును. మరోవైపున పూర్తిగా అన్నింటికంటే ఎక్కువ సారవంతమైన భూములకు కాక ఇప్పటిదాకా పరమ చౌడుగా వున్న ఎ లేదా బిల కంటే సాపేక్షంగా ఎక్కువ సారవంతమైన భూమికి ఈ ప్రయాణం సాగవచ్చును.

మూడవది : బి కౌలు పడిపోతుంది. అలాగే సి, డిల కౌళ్ళు కూడా పడిపోతాయి. కాని ధాన్యం రూపంలో వున్న మొత్తం కౌలు 6 బస్తాల నుంచి $7\frac{2}{3}$ బస్తాలకి పెరుగుతుంది. సాగులో వున్న భూమి అలాగే కౌలు ఇచ్చే భూముల పరిమాణం పెరుగుతుంది. ధాన్యం ఉత్పత్తి కూడా 10 బస్తాల నుంచి 17కి పెరుగుతుంది. లాభం ఎ విషయంలో యథాతథంగా వున్నప్పటికీ అది ధాన్యం రూపంలో వ్యక్తం అయినప్పుడు పెరుగవచ్చు, దాని సాపేక్ష అదనపు విలువ పెరుగుతుంది కనుక. ఈ సందర్భంలో జీవనాధార సాధనాలను చౌకగా మార్చటం వలన వేతనం తగ్గించబడుతుంది. అనగా అస్థిర పెట్టుబడి మదుపు తగ్గుతుంది. ఆ మేరకు పెట్టుబడి మొత్తం కూడా తగ్గుతుంది. డబ్బు రూపంలో వ్యక్తమైన మొత్తం కౌలు 360 షిల్లింగుల నుంచి 345 షిల్లింగులకు పడిపోతుంది.

## పట్టిక – II

| భూమి రకం | ఉత్పాదితం | | మదుపు పెట్టిన పెట్టుబడి | లాభం | | కౌలు | | బస్తా ఉత్పత్తి ధర షిల్లింగుల్లో |
|---|---|---|---|---|---|---|---|---|
| | బస్తాలు | షిల్లింగులు | | బస్తాలు | షిల్లింగులు | బస్తాలు | షిల్లింగులు | |
| ఎ | $1\frac{1}{3}$ | 60 | 50 | $\frac{2}{9}$ | 10 | – | – | 45 |
| ఎ' | $1\frac{2}{3}$ | 75 | 50 | $\frac{5}{9}$ | 25 | $\frac{1}{3}$ | 15 | 36 |
| బి | 2 | 90 | 50 | $\frac{8}{9}$ | 40 | $\frac{2}{3}$ | 30 | 30 |
| బి' | $2\frac{1}{3}$ | 105 | 50 | $1\frac{2}{9}$ | 55 | 1 | 45 | $25\frac{5}{7}$* |
| బి" | $2\frac{2}{3}$ | 120 | 50 | $1\frac{5}{9}$ | 70 | $1\frac{1}{3}$ | 60 | $22\frac{1}{2}$ |
| సి | 3 | 135 | 50 | $1\frac{8}{9}$ | 85 | $1\frac{2}{3}$ | 75 | 20 |
| డి | 4 | 180 | 50 | $2\frac{8}{9}$ | 130 | $2\frac{2}{3}$ | 120 | 15 |
| మొత్తం | 17 | | | | | $7\frac{2}{3}$ | 345 | |

* 1894 నాటి జర్మన్ ముద్రణలో ఇది $25\frac{2}{7}$ గా వుంది – సం॥

కొత్త వరుస క్రమాన్ని ఊహిద్దాం. (పట్టిక IIని చూడండి – సం॥) ఆఖరిగా, ఎ, బి, సి, డి భూములే ఇంతకు ముందులాగానే సాగు చేయబడినాయి అనుకుందాం. అయితే వాటి ఉత్పాదకత ఈ రకంగా పెరిగిందనుకుందాం. ఎ ఒకటి బదులు 2 బస్తాలు ఉత్పత్తి చేస్తుంది. బి రెండు బదులు

4 బస్తాలు, సి 3 బదులు 7 బస్తాలు, డి 4 బదులు 10 బస్తాలు ఉత్పత్తి చేశాయి అనుకుందాం. కనుక ఒకే కారణాలు వివిధ రకాలైన భూముల్ని విభిన్నంగా ప్రభావితం చేసి, 10 బస్తాల ఉత్పత్తిని 23 బస్తాలకు పెంచుతాయి. జనాభా పెరుగుదల వల్లనూ, ధరల తగ్గుదల వల్లనూ ఈ మొత్తం 23 బస్తాల ధాన్యం అప్పుడు ఉన్న గిరాకీని సంతృప్తిపరుస్తుందనుకుందాం. అప్పుడు ఈ క్రింది పట్టిక–III వస్తుంది.

## పట్టిక - III

| భూమి రకం | ఉత్పాదితం | | మదుపు పెట్టిన పెట్టుబడి | ఉత్పత్తి ధర బస్తాకు | లాభం | | కౌలు | |
|---|---|---|---|---|---|---|---|---|
| | బస్తాలు | షిల్లింగులు | | | బస్తాలు | షిల్లింగులు | బస్తాలు | షిల్లింగులు |
| ఎ | 2 | 60 | 50 | 30 | $\frac{1}{3}$ | 10 | 0 | 0 |
| బి | 4 | 120 | 50 | 15 | $2\frac{1}{3}$ | 70 | 2 | 60 |
| సి | 7 | 210 | 50 | $8\frac{4}{7}$ | $5\frac{1}{3}$ | 160 | 5 | 150 |
| డి | 10 | 300 | 50 | 6 | $8\frac{1}{3}$ | 250 | 8 | 240 |
| మొత్తం | 23 | | | | | | 15 | 450 |

ఇక్కడ వున్న సంఖ్యాపరమైన నిష్పత్తులు చిత్తాయత్తంగా (random) తీసుకున్నవి అయినప్పటికి ఊహలు హేతుబద్ధమైనవే.

మొదటి ప్రధానమైన ఊహ ఏమంటే – వ్యవసాయంలో మెరుగుదల అన్నది విభిన్న భూములపైన, విభిన్నంగా వ్యవహరిస్తుంది. ఈ సందర్భంలో అవి ఎ, బి తరహా భూముల కంటే సి, డి తరహా భూముల్ని ఎక్కువ ప్రభావితం చేస్తుంది. సాధారణంగా ఇలాగే జరుగుతుందని అనుభవం తెలియజేస్తుంది. అయితే దీనికి విరుద్ధంగా కూడా జరగవచ్చు. మెరుగైన భూమి కంటే అధ్వాన్నపు భూముల్ని మెరుగుదల ఎక్కువ ప్రభావితం చేస్తే గనక, మెరుగైన భూముల కౌలు పెరగటానికి బదులు తగ్గాలి. అయితే ఇక్కడ మన పట్టికలో అన్ని భూముల్లోనూ, భూసారం పెరిగింది. దానితోపాటు మెరుగైన భూముల్లో అనగా సి, డిలలో సాపేక్షంగా భూసారం మరింత పెరిగింది. అంటే అర్థం మదుపు పెట్టబడిన పెట్టుబడిలో తేడా లేనప్పటికీ ఉత్పాదితంలో పెరుగుదల, ఆ మేరకు వ్యత్యాసపు కౌలులో పెరుగుదల ఉన్నాయన్న మాట.

మొత్తం ఉత్పాదితం పెరుగుదలతో పాటు మొత్తం గిరాకీ కూడా పెరుగుతుందనేది రెండవ ఊహ. మొదటిది అటువంటి పెరుగుదల హఠాత్తుగా జరుగుతుందని ఊహించనక్కరలేదు. IIIవ పట్టిక దశకు చేరుకునే వరకు అది క్రమంగా పెరుగుతుందని ఊహించవచ్చు. రెండవది : జీవనాధార వస్తువులు చౌక అయితే వాటి వినియోగం పెరగదనటం వాస్తవం కాదు. ఇంగ్లాండులో ధాన్యపు చట్టాలను రద్దు చేసినప్పుడు ఇందుకు విపర్యంగా జరిగింది. (న్యూమేన్[1] గ్రంథాన్ని చూడండి) కేవలం వాతావరణంలో మార్పుల వలన హఠాత్తుగా పంట ఫలితాలలో పెద్ద ఎత్తున తేడాల వల్ల

1. ఎఫ్. న్యూమేన్ లెక్చర్స్ ఆన్ పొలిటికల్ ఎకానమీ, లండన్, 1851, పుట 158 - సం॥

ఒకసారి అసాధారణంగా ధరలు పడిపోవచ్చు. మరోసారి అంతే అసాధారణంగా ధాన్యం ధరలు పెరగవచ్చు. ఈ కారణంగా పైన పేర్కొన్నదానికి భిన్నమైన భావన తలెత్తుతుంది. అటువంటి సందర్భంలో హఠాత్తుగా ధరలు పడిపోవచ్చు. అయితే వినియోగంపైన దాని పూర్తి ప్రభావం కలిగించటానికి అవసరమైనంత కాలం ఈ ధరల తగ్గుదల నిలబడకపోవచ్చు. అలాగే అమలులో ఉన్న ఉత్పత్తి ధర తగ్గించటం వల్ల ధరలో తలెత్తిన తగ్గుదల దీర్ఘకాలంపాటు ఉన్నప్పుడు దీనికి విరుద్ధమైన ఫలితం వస్తుంది. మూడవది : ధాన్యంలో ఒక భాగం బ్రాంది లేక బీరు రూపంలో వినియోగం కావచ్చు. ఈ రెండు ఈ సరుకుల వినియోగం పెరుగుదల మేరకుగానూ సంకుచిత పరిమితుల్లో కుదించుకుపోయినదీ కాదు. నాల్గవది : జనాభా పెరుగుదలపైన కొంత, ఆ దేశం ధాన్య ఎగుమతి చేసే దేశం అయితే – అది ఎగుమతి చేసే మొత్తంపైన కొంత ఆధారపడి వుంటుంది. 18వ శతాబ్దం మధ్యభాగం తర్వాత చాలా వరకు ఇంగ్లాండు అటువంటి దేశమే. కనుక ఈ గిరాకీ అన్నది జాతీయ వినియోగ పరిమితుల్లో ఉంటుందనటానికి వీలులేదు. చివరి అంశం గోధమ పెరుగుదలతోపాటు దాని ధర తగ్గటం అన్నది రై ధాన్యం లేదా ఓట్స్‌కు బదులు ప్రజా బాహుళ్యం గోధుమను ప్రాథమిక ఆహారంగా మార్చుకోవడం వల్ల కూడా జరగవచ్చు. ఆ కారణం వల్ల కూడా దాని గిరాకీ పెరగవచ్చు. ఉత్పత్తి తగ్గినప్పుడు, ధరలు పెరిగినప్పుడు ఇందుకు విరుద్ధంగా కూడా జరగవచ్చు. ఆ రకంగా ఈ పరికల్పనల ప్రకారం, ఇంతకు ముందు ఎంచుకున్న నిష్పత్తుల ప్రకారం III వ పట్టిక ఈ క్రింది ఫలితాలను ఇస్తుంది. బస్తా ధాన్యం ధర 60 నుంచి 30 షిల్లింగులకు పడిపోతుంది. అనగా 50% పడిపోతుంది. పట్టిక–I తో పోల్చితే ఉత్పత్తి 10 నుంచి 23 బస్తాలకు పెరుగుతుంది. అనగా 130% పెరుగుతుంది. బి విషయంలో కౌలు యథాతథంగా వుంటుంది. సి విషయంలో అది 25%[1] పెరుగుతుంది. డి విషయంలో $33\frac{1}{3}$%[2] పెరుగుతుంది. మొత్తం 18 పౌన్లనుంచి $22\frac{1}{2}$[3] పౌన్లకి పెరుగుతుంది. అనగా 25% పెరుగుతుంది.[4]

ఈ మూడు పట్టికలను పోల్చి చూద్దాం. (మొదటి వరుస క్రమాన్ని రెండుసార్లు తీసుకోవాలి. ఎ నుంచి డికి పెరిగే దశ, డి నుంచి ఎకి తగ్గే దశ) సమాజం యొక్క ఒకానొక దశలో మూడు విభిన్న దేశాల్లో పక్కపక్కనే వుంటే మూడు దశలుగా వీటిని గ్రహించవచ్చు. లేదా ఒకే దేశంలో మూడు విభిన్న అభివృద్ధి కాలాలలో ఒకదాని వెంబడి మరొకటి వచ్చే మూడు దశలుగా గ్రహించవచ్చు. ఈ పోలికను బట్టి :

1. ఈ వరుస క్రమం పూర్తి అయిన తరువాత తప్పనిసరిగా తగ్గే దిశగా ఉంటుంది. దాని ప్రారంభ స్థానం ఏమైనప్పటికీ ఇలాగే జరుగుతుంది. కౌలును విశ్లేషించేటప్పుడు ప్రతి సందర్భంలోనూ ప్రారంభ స్థానం అత్యధిక కౌలునిచ్చే భూమితో ప్రారంభమవుతుంది. అంతిమంగా మాత్రమే ఏ కౌలూ ఇవ్వని భూమికి మనం వస్తాం.
2. బొత్తిగా కౌలు ఇవ్వని అధ్వాన్నపు భూమిపై ఉత్పత్తి ధర ఎప్పుడూ అమలులో ఉండే మార్కెట్టు ధర అవుతుంది. అయితే పట్టిక–Iలో రానురానూ మరింత మెరుగైన భూములు సాగులోకి

1. 1894 జర్మన్ ప్రతిలో "రెట్టింపు" అని వుంది : - సం॥
2. అదే గ్రంథం : - రెట్టింపు కంటే ఎక్కువ అవుతుంది - సం॥
3. 22 - సం॥
4. అదే గ్రంథం : $22\frac{1}{9}$ % - సం॥

తేవటం వల్ల ఆ వరుస క్రమం పైకి పెరిగినప్పటికీ మార్కెట్టు ధర స్థిరంగా ఉంది. అటువంటి సందర్భంలో అత్యుత్తమ భూమిలో ఉత్పత్తి అయిన పరిమాణాన్నిబట్టి ఆ భూమిలో ఉత్పత్తి అయిన ధాన్యం ధర మార్కెట్టు ధరను క్రమబద్ధం (regulate) చెయ్యగల్గుతుంది. అంతేగాక ఇది ఏ మేరకు ఎ భూమిని క్రమబద్ధం చేసే అంశంగా ఉంటుంది అన్నదాని మీద కూడా ఆధారపడి వుంటుంది. గిరాకీని మించి బి, సి, డిలు ఎక్కువగా ఉత్పత్తి చేసినట్టయితే ఎ క్రమబద్ధం చేసేదిగా వుండదు. అత్యుత్తమ భూమిని మార్కెట్టు ధరలను క్రమబద్ధం చేసే భూమిగా భావించిన స్టార్చ్ మనస్సులో ఇదే అభిప్రాయం అస్పష్టంగా ఉంది.[1] ఈ రకంగా అమెరికా ధాన్యం ధర ఇంగ్లీషు ధాన్యం ధరను నియంత్రిస్తుంది.

3. వ్యత్యాసపు కౌలు అన్నది సహజమైన భూసారంలో ఉన్న తేడాల నుండి తలెత్తుతుంది. ఈ భూసారం అన్నది ప్రతీ వ్యవసాయ అభివృద్ధి దశలోనూ నిర్ణీతంగా ఉంటుంది. (ప్రస్తుతానికి స్థానానికి సంబంధించిన వివరాన్ని వదిలేద్దాం.) మరోలా చెప్పాలంటే అత్యుత్తమ భూమి ఉండే పరిమితమైన ప్రదేశం నుండి, అసమాన రకాల భూములపైన సమాన మొత్తాల పెట్టుబడి పెట్టాల్సిన పరిస్థితుల నుండి అనగా సమాన మొత్తాల పెట్టుబడి నుంచి అసమాన ఉత్పాదితం లభించే పరిస్థితుల నుంచి వ్యత్యాసపు కౌలు తలెత్తుతుంది.

4. వ్యత్యాసపు కౌలు మెరుగైన భూములనుంచి అధ్వాన్నపు భూములకు తగ్గే వరుస క్రమంలో గాని లేదా అధ్వాన్నపు భూముల నుంచి మెరుగైన భూములకు పెరిగిన క్రమంలో గాని ఇవి తలెత్తవచ్చు. అలాగే ఒకసారి పెరిగే క్రమంలోనూ, మరొకసారి తరిగే క్రమంలోనూ వ్యత్యాసపు కౌలు తలెత్తవచ్చు. (మొదటి పట్టికలో డి నుంచి ఎకి, ఎ నుంచి డికి వరుస క్రమాన్ని ఊహించవచ్చు. రెండవ వరుస క్రమంలో రెండు రకాల చలనాలు కనిపిస్తాయి.)

5. వ్యత్యాసపు కౌలు ఏర్పడిన విధానాన్ని బట్టి అది భూమి ఉత్పాదితాల ధర స్థిరంగా ఉన్నప్పుడూ, పెరుగుతున్నప్పుడూ, తగ్గుతున్నప్పుడూ వాటితోబాటు వృద్ధి చెందవచ్చు. ధర పడిపోతున్నప్పుడు మొత్తం ఉత్పత్తి, మొత్తం కౌలు పెరగవచ్చు. ఇంతకు ముందు కౌలులేని భూమిపైన కౌలు పెరగవచ్చు. అధ్వాన్నపు భూమి ఎ స్థానంలో అంతకంటే మెరుగైన భూమి రావచ్చు. లేదా స్వయంగా ఎ మెరుగుకావచ్చు. మెరుగైన మరో భూమిలో లేదా అత్యుత్తమ భూమిలో (పట్టిక II) కౌలు తగ్గినప్పటికీ ఇలా జరగవచ్చు. ఈ ప్రక్రియ మొత్తం కౌలు (డబ్బు రూపంలో) పడిపోవడానికి జోడింపబడవచ్చు. ఆఖరిగా సాగు పద్ధతుల్లో సాధారణమైన మెరుగుదల వల్ల ధరలు పడిపోతున్న సమయంలో అనగా అధ్వాన్నపు భూమి ధర దాని ఉత్పాదితం ధర తగ్గుతున్నప్పుడు మెరుగైన భూమిలో వచ్చే కౌలు యథాతథంగా ఉండవచ్చు లేదా పడిపోవచ్చు. అయితే అత్యుత్తమ భూముల్లో కౌలు పెరగవచ్చు. అయినప్పటికీ అధ్వాన్నపు భూములతో పోల్చి చూస్తే ఇతర భూములపై వచ్చే వ్యత్యాసపు కౌలు ఒక బస్తా గోధుమ ధరపైన ఆధారపడి వుంటుంది. అంటే ఉత్పాదితాల పరిమాణంలో ఉన్న తేడా నిర్ణీతంగా ఉన్నప్పుడు ఇలా జరుగుతుంది. అయితే ధర నిర్ణీతంగా ఉన్నప్పుడు వ్యత్యాసపు కౌలు ఉత్పాదితాల పరిమాణాలలో ఉన్న తేడాపై ఆధారపడి వుంటుంది. మొత్తం భూముల్లో సారం పెరుగుతున్నప్పుడు అధ్వాన్నపు

1. హెచ్. స్టార్చ్, కోర్స్ డి. ఎకనామీ పొలిటిక్... సంపుటి 2 సెయింట్ పీటర్స్‌బర్గ్, 1815, పుటలు 78-79 - సం॥

భూముల కంటే వేగంగా మెరుగైన భూములు సారవంతం అవుతున్నప్పుడు ఈ తేడా పరిమాణం అందుకు తగ్గరీతిలో పెరుగుతుంది. ఈ రకంగా (పట్టిక–I) ధర 60 షిల్లింగులు వున్నప్పుడు డి పైన ఎ తో పోల్చి చూడగా దాని ఉత్పత్తిలో ఉన్న వ్యత్యాసం బట్టి నిర్ణయించబడుతుంది. అనగా దాని అదనపు మూడు బస్తాలను బట్టి నిర్ణయించబడుతుంది. కనుక కౌలు = 3×60=180 షిల్లింగులు అయితే మూడవ పట్టికలో ధర 30 షిల్లింగులు మాత్రమే. అక్కడ కౌలు ఎతో పోల్చి చూడగా డి యొక్క అదనపు ఉత్పాదితం పరిమాణం బట్టి నిర్ణయించ బడుతుంది. దానినిబట్టి అది 8×30=240 షిల్లింగులు.

కేవలం ఈ చలనం రానురానూ మరింత అధ్వాన్నంగా ఉండే భూములవైపు సాగుతుందని తప్పుగా భావించే వెస్ట్, మాల్తస్, రికార్డోలా పొరపాటు అవగాహనకు అది వ్యత్యాసపు కౌలు విషయంలో సమాధానం చెపుతుంది.[1] మనం ఇంతకు ముందు చూసినట్లుగా అది మరింత మంచి భూములవైపు ఆ క్రమం కొనసాగవచ్చు. అంతకు ముందు ఒక అధ్వాన్నపు భూమి ఉన్న స్థానాన్ని అంతకంటే మెరుగైన భూమి తీసుకున్నప్పుడు అలా జరగవచ్చు. దానికి వ్యవసాయంలో క్రమానుగత మెరుగుదలతో సంబంధం వుంది. ఇక్కడ ప్రధానమైన షరతు ఏమంటే వివిధ తరహా భూముల మధ్య అసమానత్వం మాత్రమే. ఉత్పాదకతలో పెరుగుదలకు సంబంధించిన మేరకు మొత్తం ప్రాంతం యొక్క భూసారం పెరిగినప్పుడు ఈ అసమానత్వాన్ని రద్దు చెయ్యవచ్చు. అయితే ఉత్పాదకత అసమానత్వాన్ని పెంచవచ్చు. యథాతథంగా ఉంచవచ్చు లేదా తగ్గించవచ్చు.

18వ శతాబ్దం ప్రారంభం నుంచి మధ్యభాగం వరకూ వెండి, బంగారాల ధరలు పడిపోయి నప్పటికీ ధాన్యం ధరలు స్థిరంగా పడిపోయాయి. అదే సమయంలో (ఈ మొత్తం కాలాన్ని దృష్టిలో ఉంచుకుంటే) కౌలులోనూ, మొత్తం కౌలు రాబడిలోనూ సాగుభూమిలోనూ, వ్యవసాయ ఉత్పత్తి విషయంలోనూ, జనాభాలోనూ పెరుగుదల ఉంది. పట్టిక–IIలో కలిపి తీసుకున్న పట్టిక–I దీనికి అనుగుణంగా ఉంటుంది. అత్యంత అధ్వాన్నమైన భూమి మెరుగైనా అయి వుంటుంది. లేదా ధాన్యపు ఉత్పత్తి నుంచి అది తొలగించబడి ఉంటుంది. అంటే దాని మొత్తం ఆ భూమి ఇతర వ్యవసాయ లేదా పారిశ్రామిక లక్ష్యాలకు ఉపయోగించబడలేదని కాదు.

19వ శతాబ్దపు తొలి దశ నుంచి (ఈ తేదీని మరింత ఖచ్చితంగా పేర్కొనాలి.) 1815 వరకూ ధాన్యపు ధరలలో స్థిరమైన పెరుగుదల ఉంది. దానితోపాటు స్థిరంగా కౌలు రేటు, మొత్తం కౌలు, సాగుభూమి, వ్యవసాయ ఉత్పత్తి పెరిగాయి. జనాభా పెరిగింది. ఇది పట్టిక–I కి కిందికి దిగుతున్న క్రమంలో అనుగుణంగా ఉంటుంది. (ఆ కాలంలో సాగులోకొచ్చిన అధ్వాన్నపు భూముల గురించి కొన్ని మూలాధారాలను ఉల్లేఖించాలి.)

పెట్టీ, డావేనాంట్‌ల కాలంలో భూమి మెరుగుదలల గురించి, కొత్త భూములను సాగులోకి తేవటం గురించి రైతులు, భూస్వాములు ఫిర్యాదు చేశారు. మెరుగైన భూమిలో కౌలు తగ్గిపోయింది.

1. వెస్ట్ ఎస్సే ఆన్ ది అప్లికేషన్ ఆఫ్ కేపిటల్ టు లాండ్, లండన్, 1815 - సం॥ మాల్తస్ : ప్రిన్స్‌పుల్స్ ఆఫ్ పొలిటికల్ ఎకానమీ, లండన్, 1836 - సం॥ మాల్తస్: ఏన్ ఎంక్వయిరీ ఇన్‌టు ది నేచర్ అండ్ ప్రోగ్రస్ ఆఫ్ రెంట్..... లండన్, 1815 - సం॥ రికార్డో : ఆన్ ది ప్రిన్సిపుల్స్ ఆఫ్ పొలిటికల్ ఎకానమీ అండ్ టాక్సేషన్, లండన్, 1821 - సం॥

కౌలు ఇచ్చే భూములను విస్తరించడం ద్వారా కౌలు మొత్తం పెరిగింది.

(ఈ మూడు అంశాలను ఉల్లేఖనల ద్వారా నిరూపించాలి. ఒకానొక దేశంలో వున్న వివిధ సాగుభూముల సారంలో తేడా విషయంలో కూడా వీటిని ఉదహరించాలి.)

సాధారణంగా వ్యత్యాసపు కౌలుకు సంబంధించి ఒక అంశాన్ని గమనించాలి. మొత్తం వస్తువు ఉత్పాదితాల పరిమాణం యొక్క మొత్తం ఉత్పత్తి ధర కంటే, ఎప్పుడూ మార్కెట్టు ధర ఎక్కువే వుంటుంది. ఉదాహరణకు పట్టిక–I ను చూడొచ్చు. 100 బస్తాల మొత్తం ఉత్పాదితం 600 షిల్లింగులకు అమ్మబడింది. ఎందుకంటే మార్కెట్టు ధర ఎ ఉత్పాదిత ధరచేత నిర్ణయించబడుతుంది. ఎ ఉత్పత్తి ధర బసాకు 60 షిల్లింగులు. వాస్తవ ఉత్పత్తి ధర –

| | | |
|---|---|---|
| ఎ...... | 1 బస్తా = 60 షిల్లింగులు | 1 బస్తా = 60 షిల్లింగులు |
| బి...... | 2 బస్తాలు = 60 షిల్లింగులు | 1 బస్తా = 30 షిల్లింగులు |
| సి...... | 3 బస్తాలు = 60 షిల్లింగులు | 1 బస్తా = 20 షిల్లింగులు |
| డి...... | 4 బస్తాలు = 60 షిల్లింగులు | 1 బస్తా = 15 షిల్లింగులు |
| | 10 బస్తాలు = 240 షిల్లింగులు | సగటున 1 బస్తా = 24 షిల్లింగులు |

ఈ 10 బస్తాల వాస్తవ ఉత్పత్తి ధర 240 షిల్లింగులు. అయితే అవి 600 షిల్లింగులకు అమ్మబడ్డాయి. అనగా 250% అధికంగా అమ్మబడ్డాయి. ఒక బస్తా సగటు వాస్తవ ధర 24 షిల్లింగులు. మార్కెట్టు ధర 60 షిల్లింగులు. అనగా ఉత్పత్తి ధరకంటే 250% ఎక్కువకు అమ్మబడింది.

పెట్టుబడిదారీ ఉత్పత్తి ప్రాతిపదికపైన పోటీ ద్వారా మార్కెట్టు విలువ తనను తాను నిర్ధారించు కుంటుంది. కనుక, ఈ ధరను అది నిర్ణయించుకుంది. ఇది ఒక నకిలీ సామాజిక విలువను సృష్టిస్తుంది. ఇది మార్కెట్టు విలువ నియమం నుంచి తలెత్తుతుంది. ఈ నియమానికి భూమి ఉత్పాదితాలు లోబడి ఉంటాయి. ఉత్పాదితాల మార్కెట్టు విలువ నిర్ధారించటమన్నది ఒక సామాజిక చర్య. అది వ్యవసాయ ఉత్పాదితాలకూ వర్తిస్తూంది. సామాజికంగా అనాలోచితంగానూ, అనుకోకుండానూ జరిగినప్పటికీ ఇది సామాజిక చర్య. అది ఉత్పాదితం యొక్క మార్పిడి విలువపైన ఆధారపడి వుంటుంది. అంతేగాని భూమిపైన, దాని సారంలో ఉన్న తేడాలపైన కాదు. పెట్టుబడిదారీ రూపం రద్దయిందనుకుంటే మొత్తం సమాజం పూర్తి స్పృహతో ప్రణాళికాబద్ధంగా ఒక ఉమ్మడి సంస్థగా సంఘటితమైతే అప్పుడు 10 బస్తాలు 240 షిల్లింగులలో ఉన్న సమానమైన స్వతంత్ర శ్రమ కాలం యొక్క పరిమాణానికి ప్రాతినిధ్యం వహిస్తుంది. అప్పుడు సమాజం ఈ వ్యవసాయ ఉత్పాదితాన్ని దానిలో వాస్తవంగా ఉన్న శ్రమ కాలానికి $2\frac{1}{2}$ రెట్లు ఎక్కువ పెట్టి కొనదు. ఆ రకంగా భూ యజమానుల వర్గానికి వున్న ప్రాతిపదిక నాశనం చెయ్యబడుతుంది. విదేశీ ఎగుమతుల ద్వారా ఉత్పాదితం ధర తగ్గినట్టుగానే ఈ విషయంలో కూడా అదేలాంటి ప్రభావం కలుగుతుంది. కనుక ప్రస్తుత ఉత్పత్తి విధానాన్ని నిలబెట్టడం ద్వారా ఈ వ్యత్యాసపు కౌలు ప్రభుత్వానికి చెల్లించబడుతున్నట్లు ఊహించుకుందాం. మిగిలిన అంశాలన్నీ యథాతథంగా వుంటే వ్యవసాయ ఉత్పాదితాల ధరలు కూడా యథాతథంగా వుంటాయి. అయితే పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం స్థానంలో ఉమ్మడి వ్యవస్థ చోటుచేసుకోగలిగితే ఉత్పాదితాల విలువ కూడా యథాతథంగా వుంటుంది అనటం కూడా తప్పే. ఒకే రకపు సరుకులు సమానమైన ఒకే మార్కెట్టు ధరను కలిగి వుండటమే, పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానంలోనూ, దరహంమీద వ్యక్తుల

మధ్య సరుకుల మార్పిడిపై ఆధారపడిన ఉత్పత్తిలోనూ విలువ యొక్క సామాజిక స్వభావం సిద్ధించే మార్గం. ఒక వినియోగదారునిగా సమాజం వ్యవసాయ ఉత్పాదితాలకై చెల్లించే మొత్తం అనగా వ్యవసాయ ఉత్పత్తిలో తన శ్రమ శక్తిని విలువ రాబట్టటంలో జరిగిన నష్టం ఒక సామాజిక భాగానికి అనగా భూస్వాములకు లాభంగా మారుతుంది.

రెండవ సందర్భం ఈ క్రింది విధంగా వుంటుంది. తరువాత అధ్యాయంలో II కింద ఇవ్వాల్సిన ప్రధానమైన విశ్లేషణ ఇది.

ఇది ఒక ఎకరానికి లేదా హెక్టారుకు కౌలుకు సంబంధించిన వ్యవహారం మాత్రమే కాదు. ఇది ఉత్పత్తి ధరకు మార్కెట్టు ధరకు మధ్య వున్న తేడాగానే లేదా ఒక ఎకరం యొక్క విడి ఉత్పత్తి ధరకు, సాధారణ ఉత్పత్తి ధరకు మధ్య ఉన్న తేడాకు మాత్రమే సంబంధించిన వ్యవహారం కాదు. మొత్తం సాగులో ఉన్న భూమిలో ఏ తరహా భూమి ఎన్ని ఎకరాలు ఉంది అన్న అంశాన్ని కూడా ఇది ప్రస్తావిస్తుంది. ఇక్కడ ప్రధానమైన అంశం కౌలు పరిమాణానికి మాత్రమే సూటిగా వర్తిస్తుంది. అంటే మొత్తం సాగుభూమిపై వచ్చే కౌలుకు మాత్రమే వర్తిస్తుంది. ధరలలో పెరుగుదల లేకపోయినప్పటికీ, ధరలు పడిపోతే వివిధ భూమి రకాల సాపేక్ష సారాల మధ్య తేడాలు పెరగనప్పటికీ కౌలు రేటును పరిశీలించటానికి మనకది ప్రథమ సోపానంగా పనిచేస్తుంది.

**పట్టిక - I**

| భూమి రకం | ఎకరాలు | ఉత్పత్తి ధర | ఉత్పాదితం (బస్తాలలో) | ధాన్య రూప కౌలు (బస్తాలలో) | డబ్బు రూపంలో కౌలు (పౌండ్లలో) |
|---|---|---|---|---|---|
| ఎ | 1 | 3 పౌండ్లు | 1 | 0 | 0 |
| బి | 1 | 3 పౌండ్లు | 2 | 1 | 3 పౌండ్లు |
| సి | 1 | 3 పౌండ్లు | 3 | 2 | 6 పౌండ్లు |
| డి | 1 | 3 పౌండ్లు | 4 | 3 | 9 పౌండ్లు |
| మొత్తం | 4 | | 10 | 6 | 18 |

ప్రతి తరగతిలోనూ సాగైన ఎకరాల సంఖ్య రెట్టింపయిందనుకొందాం. అప్పుడు ఈ క్రింది విధంగా ఉంటుంది.

**పట్టిక - I (ఎ)**

| భూమి రకం | ఎకరాలు | ఉత్పత్తి ధర | ఉత్పాదితం (బస్తాలలో) | ధాన్య రూప కౌలు (బస్తాలలో) | డబ్బు రూపంలో కౌలు (పౌండ్లలో) |
|---|---|---|---|---|---|
| ఎ | 2 | 6 పౌండ్లు | 2 | 0 | 0 |
| బి | 2 | 6 పౌండ్లు | 4 | 2 | 6 పౌండ్లు |
| సి | 2 | 6 పౌండ్లు | 6 | 4 | 12 పౌండ్లు |
| డి | 2 | 6 పౌండ్లు | 8 | 6 | 18 పౌండ్లు |
| మొత్తం | 8 | | 20 | 12 | 36 |

మరో రెండు నమూనాలను ఊహిద్దాం. మొదటి నమూనాలో ఈ క్రింది విధంగా రెండు పరమ అధ్వాన్నపు భూములకు ఉత్పత్తి విస్తరించిందనుకుందాం :

**పట్టిక – I (బి)**

| భూమి రకం | ఎకరాలు | ఉత్పత్తి ధర | | ఉత్పాదితం (బస్తాలలో) | ధాన్యపు కౌలు (బస్తాలలో) | డబ్బు కౌలు (పౌండ్లలో) |
|---|---|---|---|---|---|---|
| | | ఎకరాకు | మొత్తం | | | |
| ఎ | 4 | 3 పౌండ్లు | 12 పౌండ్లు | 4 | 0 | 0 |
| బి | 4 | 3 పౌండ్లు | 12 పౌండ్లు | 8 | 4 | 12 |
| సి | 2 | 3 పౌండ్లు | 6 పౌండ్లు | 6 | 4 | 12 |
| డి | 2 | 3 పౌండ్లు | 6 పౌండ్లు | 8 | 6 | 18 |
| మొత్తం | 12 | | 36 | 26 | 14 | 42 |

చివరిగా ఈ నాలుగు రకాల భూముల్లోనూ ఉత్పత్తి సాగు విస్తీర్ణం అసమానంగా విస్తరించిందనుకుందాం.

**పట్టిక – I (సి)**

| భూమి రకం | ఎకరాలు | ఉత్పత్తి ధర | | ఉత్పాదితం (బస్తాలలో) | ధాన్యపు కౌలు (బస్తాలలో) | డబ్బు కౌలు (పౌండ్లలో) |
|---|---|---|---|---|---|---|
| | | ఎకరాకు | మొత్తం | | | |
| ఎ | 1 | 3 పౌండ్లు | 3 పౌండ్లు | 1 | 0 | 0 |
| బి | 2 | 3 పౌండ్లు | 6 పౌండ్లు | 4 | 2 | 6 |
| సి | 5 | 3 పౌండ్లు | 15 పౌండ్లు | 15 | 10 | 30 |
| డి | 4 | 3 పౌండ్లు | 12 పౌండ్లు | 16 | 12 | 36 |
| మొత్తం | 12 | | 36 పౌండ్లు | 36 | 24 | 72 |

I, Iఎ, Iబి, Iసి – వీటన్నింటిలోనూ ఎకరంపై వచ్చే కౌలు యథాతథంగా ఉంటుంది. నిజానికి ఒకే రకం నేలలో ఎకరానికి పెట్టిన పెట్టుబడి యొక్క ఫలితం యథాతథంగా వుంటుంది. ఒక నిర్ణీత సమయంలో ఏ దేశానికైనా వర్తించే వాస్తవాన్ని మనం పరిగణిస్తున్నాం. అనగా మొత్తం సాగుభూమికి వివిధ రకాల భూములు నిర్దిష్టమైన నిష్పత్తుల్లో వుంటాయి. విభిన్న రకాలయిన భూముల కింద మొత్తం భూమి పంపిణీ అయ్యే నిష్పత్తులు వివిధ రకాలుగా ఉంటాయి అన్నదానిని కూడా మనం పరిగణనలోనికి తీసుకుంటున్నాం. ఏ రెండు దేశాలను పోల్చి చూసినా, లేదా ఒకే దేశం యొక్క విభిన్న కాలాలను తీసుకున్నా ఇది స్పష్టం అవుతుంది.

Iఎ ని Iతో పోల్చి చూస్తే నాలుగు రకాల భూములలోనూ సాగు ఒకే నిష్పత్తిలో పెరుగుతుంది. సాగులో ఉన్న ఎకరాలు రెట్టింపు అవుతాయి. మొత్తం ఉత్పత్తి కూడా రెట్టింపు అవుతుంది. ధాన్య రూపంలోనూ, డబ్బు రూపంలోనూ కౌలుకు కూడా ఇది వర్తిస్తుంది.

Iబి ని తరువాత Iసి ని Iతో పోల్చి చూస్తే ఈ మూడు సందర్భాలలోనూ సాగు భూమి మూడింతలు పెరిగిందని అర్థమవుతుంది. ఈ రెండింటిలోనూ అది నాలుగు ఎకరాల నుంచి 12

ఎకరాలకు పెరుగుతుంది. అయితే I బి విషయంలో ఎ, బిలు పెరుగుదలకు ఎక్కువగా దోహద పడుతున్నాయి. ఎ అసలు కౌలు ఇవ్వదు, బి అతి తక్కువ వ్యత్యాసపు కౌలును ఇస్తుంది. ఆ రకంగా కొత్తగా సాగులోకి వచ్చిన 12 ఎకరాలలో చెరొక 3 ఎకరాల చొప్పున ఎ, బిలు 6 ఎకరాలకు ప్రాతినిధ్యం వహిస్తాయి. సి, డిలు చెరొక ఎకరం చొప్పున 2 ఎకరాలకు ప్రాతినిధ్యం వహిస్తాయి. మరోలా చెప్పాలంటే పెరుగుదలలో మూడు వంతులు ఎ, బి ల ద్వారాను, ఒక వంతు సి, డిల ద్వారానూ జరిగింది. ఈ సందర్భంలో I తో I బి పోల్చి చూసినప్పుడు సాగుభూములు మూడింతలు అయినప్పటికీ ఉత్పత్తి మూడింతలు కాదు. అది 10 నుంచి 30 బస్తాలు కాక 26 బస్తాలు మాత్రమే పెరుగుతుంది. గణనీయమైన పెరుగుదల ఎ నుంచి వచ్చింది. అది అసలు కౌలు ఇవ్వదు. మెరుగైన భూముల్లో పెరుగుదలల్లో పెద్ద వాటా ఇది. కనుక ధాన్యం రూపంలో కౌలు కేవలం 6 నుంచి 14 బస్తాలకే పెరుగుతుంది. డబ్బు రూపంలో కౌలు 18 పౌండ్ల నుంచి 42 పౌండ్లకు పెరుగుతుంది.

అయితే మనం Iసి ని Iతో పోల్చి చూస్తే, కౌలు ఇవ్వని సాగుభూమి పెరగలేదు. అతి తక్కువ కౌలు ఇచ్చే భూమి కొద్దిగా పెరిగింది. కాగా సి, డి లది మొత్తం పెరుగుదలలో ప్రధాన వాటా సాగు భూమి మూడింతలు పెరిగినప్పుడు ఉత్పత్తి 10 నుంచి 36 బస్తాలకు పెరుగుతుంది. అంటే మూడు రెట్లు కంటే ఎక్కువగా పెరుగుతుంది. ధాన్యం రూపంలో కౌలు 6 నుంచి 24 బస్తాలకు పెరుగుతుంది. అనగా నాలుగు రెట్లు పెరుగుతుంది. అదే విధంగా డబ్బు కౌలు 18 పౌండ్ల నుంచి 72 పౌండ్లకు పెరుగుతుంది.

ఈ సందర్భాలు అన్నింటిలోనూ వ్యవసాయ ఉత్పాదితం ధర యథాతథంగా ఉండడం స్వభావసిద్ధం. అలాగే సాగుభూమి విస్తరణతోపాటు మొత్తం కౌలు కూడా పెరుగుతుంది. అయితే మొత్తం పెరుగుదల అంతా పరమ అధ్వాన్నపు భూమిలో మాత్రమే జరిగితే అది ఎటువంటి కౌలు ఇవ్వదు కనుక కౌలు మొత్తం పెరగదు. అయితే ఈ పెరుగుదల వివిధ రకాలుగా వుంటుంది. సాగుభూమి విస్తరణ మెరుగైన భూముల్లో జరిగితే అది కేవలం భూమి విస్తరణ నిష్పత్తిలో మాత్రమేకాక అంతకంటే ఎక్కువగా కౌలు పెరుగుతుంది. అదే మేరకు ధాన్య రూపంలోనూ, డబ్బు రూపంలోనూ కౌలు పెరుగుతుంది. ఆ భూమి పరమ అధ్వాన్నపు భూమి అయితే లేదా దాదాపు అంతే అధ్వాన్నపు భూమి అయితే వాటి విస్తరణ (అత్యంత అధ్వాన్నపు భూములు ఒక స్థిరమైన రకానికి ప్రాతినిధ్యం వహిస్తాయని పరిగణించబడుతుంది.) వల్ల అదే నిష్పత్తితో మొత్తం కౌలు పెరగదు. ఆ రకంగా రెండు దేశాలలో కౌలు ఇవ్వని భూమి ఎ ఒకే స్వభావం కలిగి ఉందనుకుందాం. అప్పుడు మొత్తం సాగుభూమిలో అధ్వాన్నపు భూముల నిష్పత్తికి కౌలు విలోమంగా ఉంటుంది. కనుక అది ఉత్పత్తికి కూడా విలోమంగానే ఉంటుంది. సమానమైన భూ కమతాలలో సమానమైన పెట్టుబడి పెట్టబడుతుందని పరిగణించాలి. ఒక దేశం యొక్క మొత్తం సాగుభూముల్లో అధ్వాన్నపు భూముల సాగు పరిమాణానికి మెరుగైన భూముల పరిమాణానికి మధ్య ఉన్న సంబంధం, మొత్తం కౌలు వ్యతిరేక ప్రభావం కలిగి వుంటుంది. సాగులో ఉన్న అధ్వాన్నపు భూముల స్వభావానికి ఉత్తమ, అత్యుత్తమ భూముల స్వభావానికి మధ్య వున్న సంబంధం కంటే ఇది వ్యతిరేక ప్రభావం కలిగి వుంటుంది. ఇక్కడ మిగిలిన అంశాలన్నీ యథాతథంగా వున్నాయని పరిగణించాలి. ఈ రెండు అంశాల మధ్య ఉన్న గందరగోళం అన్ని రకాల పొరపాటు అభ్యంతరాలను వ్యత్యాసపు కౌలుకు వ్యతిరేకంగా తలెత్తేలా చేసింది.

కేవలం సాగుభూమి విస్తరణ వలన దానితోపాటు పెట్టుబడి మదుపు, శ్రమ పెరగటం వలన మొత్తం కౌలు పెరుగుతుంది.

అయితే అత్యంత ప్రధానమైన అంశం ఇది. వివిధ రకాల భూములపై ఎకరానికి వచ్చే కౌలులు యథాతథంగా ఉన్నాయని మనం భావించినప్పటికీ అది ప్రతి ఎకరంలోనూ పట్టిక పెట్టుబడితో పోల్చి చూస్తే కౌలు రేటు యథాతథంగా వున్నప్పటికీ ఈ క్రింది విషయాన్ని గమనించాల్సి వుంది; Iఎ ని మనం I తో పోల్చితే అక్కడ సాగులో ఉన్న ఎకరాలు వాటితోపాటు వాటిపై పెట్టిన పెట్టుబడి ఒకే నిష్పత్తిలో పెరిగాయి. సాగునేల విస్తరణను బట్టి అదే నిష్పత్తిలో ఉత్పత్తి కూడా పెరిగింది. అనగా అది రెట్టింపు అయింది. కౌలు కూడా రెట్టింపు అయింది. అది 18 పౌండ్ల నుంచి 36 పౌండ్లకు, 4 ఎకరాల నుంచి 8 ఎకరాలకు పెరిగిన నిష్పత్తిలోనే పెరిగింది.

మనం మొత్తం సాగుభూమిని 4 ఎకరాలుగా పరిగణిస్తే, మొత్తం కౌలు దానిపైన 18 పౌండ్లు వుంది. అసలు కౌలు ఇవ్వని భూమితో సహా సగటున ఎకరానికి లభించే కౌలు $4\frac{1}{2}$ పౌండ్లు. అయితే ఈ 4 ఎకరాలు ఒకే భూస్వామికి ఉంటే ఆయన అటువంటి లెక్క వేయవచ్చు. ఈ రకంగానే మొత్తం దేశంలో వస్తున్న సగటు కౌలును లెక్కగట్టవచ్చు. 10 పౌండ్ల పెట్టుబడిపై 18 పౌండ్ల కౌలు వచ్చింది. ఈ రెండు అంకెల నిష్పత్తిని మనం కౌలు రేటు అంటాం. కనుక ఈ సందర్భంలో అది 180%.

Iఎ లో కూడా కౌలు రేటు ఇంతే ఉంటుంది. అక్కడ 4 ఎకరాలకు బదులు 8 ఎకరాలు సాగు చేయబడింది. అయితే పెరుగుదలకు అన్ని రకాల భూములు అదే నిష్పత్తిలో దోహదపడ్డాయి. కనుక మొత్తం కౌలు 8 ఎకరాలకుగానూ ఎకరానికి $4\frac{1}{2}$ పౌండ్ల చొప్పున 36 పౌండ్లు. పెట్టుబడి 20 పౌండ్లు కనుక ఇక్కడ కూడా కౌలు రేటు 180% గానే వుంటుంది.

అయితే I బి ని మనం పరిశీలిద్దాం. అక్కడ సాగుభూమి విస్తరణ అంతా ప్రధానంగా అధ్వాన్నపు భూముల్లో జరిగింది. అక్కడ కౌలు 12 ఎకరాలకుగాను 42 పౌండ్లు వచ్చింది. అనగా సగటున ఎకరానికి $3\frac{1}{2}$ పౌండ్లు చొప్పున లభించింది. మొత్తం పెట్టిన పెట్టుబడి 30 పౌండ్లు కనుక కౌలు రేటు = 140%. ఆ రకంగా ఎకరానికి సగటు రేటు 1 పౌండు చొప్పున తగ్గిపోయింది. కౌలు రేటు 180% నుంచి 140%కి పడిపోయింది. అయితే మొత్తం కౌలు 18 పౌండ్ల నుంచి 42 పౌండ్లకు పెరిగింది. ఒక ఎకరంపైన గాని, పెట్టుబడి ప్రాతిపదికపై గాని లెక్కిస్తే సగటు కౌలు పడిపోయింది. ఇది ఉత్పత్తి పెరుగుదలకు సమాంతరంగా పడిపోయింది. అయితే అదే నిష్పత్తిలో మాత్రం కాదు. అన్ని రకాల భూములపైన కౌలును ఎకరంపైన, మొత్తం పెట్టుబడి ప్రాతిపదికపైన చూస్తే యథాతథంగా ఉన్నప్పటికీ ఇది జరుగుతుంది. ఎందుకంటే నాలుగింట మూడింతలు విస్తరణ ఎ, బి లలో జరిగింది. ఎ ఎటువంటి కౌలును ఇవ్వదు. బి కొద్దిగా మాత్రమే కౌలు ఇస్తుంది.

Iబిలో మొత్తం విస్తరణ ఎ భూమిలోనే జరిగిందనుకుందాం. అప్పుడు ఎ భూమి 9 ఎకరాలు, బి ఒక ఎకరం, సి ఒక ఎకరం, డి ఒక ఎకరం ఉంటాయి. మొత్తం కౌలు ఇంతకు ముందులాగానే 18 పౌండ్లు వుంటుంది. కనుక 12 ఎకరాలపైన సగటు కౌలు ఎకరానికి $1\frac{1}{2}$ పౌండ్ల చొప్పున వుంటుంది. 30 పౌండ్ల పెట్టుబడిపైన 18 పౌండ్ల కౌలు అనగా 60% కౌలు రేటు లభిస్తుంది.

సగటు కౌలు ఎకరం ప్రాతిపదికగానూ, పెట్టుబడి ప్రాతిపదికగానూ బాగా పడిపోయింది. కాగా మొత్తం కౌలు పెరగలేదు.

ఇక చివరన మనం Iసి ని Iతోనూ, Iబి తోనూ పోల్చుదాం. Iతో పోల్చితే సాగుభూమి మూడింతలయింది. పెట్టిన పెట్టుబడి కూడా మూడింతలయింది. 12 ఎకరాలపైన మొత్తం కౌలు 72 పౌండ్లు అనగా ఎకరానికి పట్టిక–I లో $4\frac{1}{2}$ పౌండ్లు లభించగా ఇక్కడ 6 పౌండ్లు వస్తుంది. పెట్టుబడి పైన కౌలు రేటు (72 పౌండ్లు; 32 పౌండ్లు) 180%కు బదులు 240% లభిస్తుంది. మొత్తం ఉత్పత్తి 10 నుంచి 36 బస్తాలకు పెరిగింది.

Iబి తో పోల్చి చూద్దాం. అక్కడ సాగులో వున్న ఎకరాలు, పెట్టిన పెట్టుబడి, సాగుభూముల్లో వున్న తేడాలు అన్నీ యథాతథంగా ఉన్నాయి. కాని పంపిణీ విభిన్నంగా ఉంది. ఉత్పత్తి 26 బస్తాలకు బదులు 36 బస్తాలు. ఎకరానికి సగటు కౌలు $3\frac{1}{2}$ పౌండ్లకు బదులు 6 పౌండ్లకు పెరిగింది. ఒకే పెట్టుబడి పైన వచ్చిన కౌలు రేటు 140% బదులు 240% ఉంటుంది.

Iఎ, Iబి, Iసి పట్టికల్లో ఉన్న వివిధ పరిస్థితులను ఏకకాలంలో వివిధ దేశాల్లో వున్నాయని భావించినా లేదా ఒకే దేశంలో అవి ఒకదాని తరువాత ఒకటి ఉన్నాయని భావించినా ఫరవాలేదు. ఏమైనప్పటికీ ఈ నిర్ధారణలకు మనం రావచ్చు. పరమ అధ్వాన్నపు, కౌలు లేని భూముల్లో వచ్చే దిగుబడిలో మార్పు లేదు. కనుక ధాన్యం ధరలో మార్పు లేనంత వరకూ వివిధ రకాల సాగుభూముల సారంలో తేడా యథాతథంగా ఉన్నంత మేరకు ఆయా భూముల్లో వచ్చే ఉత్పత్తులు యథాతథంగా వున్నంత వరకు ఆయా రకాల సాగుభూముల్లో పెట్టే పెట్టుబడి యథాతథంగా ఉన్నంత వరకూ ప్రతీ ఒక్కరకం భూమిలోనూ, ఎకరానికి వచ్చే కౌలుల మధ్య నిష్పత్తి స్థిరంగా ఉన్నంత వరకూ, ఒకే రకం భూమిలో ఉన్న ప్రతి కమతంపైన పెట్టిన పెట్టుబడిపైన కౌలు రేటు స్థిరంగా వున్నప్పుడు : మొదటిది – సాగుభూమి విస్తరణ మొత్తం కౌలు లేని భూమిలో జరిగిన సందర్భంలో తప్ప మిగిలిన అన్ని సందర్భాలలోనూ, సాగుభూమి పెరుగుదల జరిగినప్పుడల్లా మొత్తం కౌలు కూడా పెరుగుతుంది. రెండవది – ఎకరానికి సగటు కౌలు (మొత్తం కౌలును సాగులో ఉన్న ఎకరాల సంఖ్యతో విభజించాలి.) సగటు కౌలు రేటు (మొత్తం కౌలును మొత్తం పెట్టుబడిలో విభజించాలి.) గణనీయంగా మారవచ్చు. ఈ రెండూ ఒకే దిశగా మారతాయి. అయితే ఇవి ఒక దానికొకటి విభిన్నమైన నిష్పత్తుల్లో మారతాయి. పూర్తిగా కౌలు లేని భూమి ఎ లో మాత్రమే విస్తరణ జరిగిందన్న ఉదాహరణను ఇక్కడ వదిలేద్దాం. ఇక్కడ మొత్తం సాగుభూమిలో వివిధ రకాల భూముల నిష్పత్తిని బట్టి ఎకరంపైన వచ్చే సగటు కౌలు పెట్టుబడిపై వచ్చే సగటు కౌలు రేటు ఆధారపడి వుంటాయి. లేదా మొత్తం పెట్టుబడిని వివిధ రకాల సారం ఉన్న భూముల మధ్య పంపిణీ చేసిన తీరును బట్టి ఆధారపడి వుంటుంది. ఎక్కువ భూమి లేదా తక్కువ భూమి సాగులో ఉన్నప్పటికీ మొత్తం కౌలు ఎక్కువగా లేదా తక్కువగా ఉన్నప్పటికీ (ఎకి మాత్రమే పరిమితమైన విస్తరణ ఉదాహరణకు ఇక్కడ మినహాయించాలి.) ఎకరంపైన సగటు కౌలు లేదా పెట్టిన పెట్టుబడిపై సగటు కౌలు రేటు అన్నవి మొత్తం సాగుభూమిలో వివిధ రకాలైన భూముల మధ్య నిష్పత్తి మారనంత వరకూ యథాతథంగా ఉంటాయి. సాగుభూమి విస్తరించటంతో పాటు, పెట్టుబడి పెరగటంతో పాటు మొత్తం కౌలులో పెరుగుదల గణనీయంగా ఉన్నప్పటికీ – ఈ విస్తరణ

ఎక్కువ కౌలు ఇచ్చే మెరుగైన భూమిలో కంటే అసలు కౌలు ఇవ్వని భూముల్లోనూ, కొద్దిగా మాత్రమే కౌలు ఇచ్చే భూముల్లోనూ అధికంగా జరిగే ఉంటే ఎకరంపై వచ్చే సగటు కౌలు, పెట్టుబడిపై వచ్చే సగటు కౌలు రేటు తగ్గిపోతుంది. ఇందుకు వ్యతిరేకంగా మొత్తం సాగుభూమి విస్తరణలో మెరుగైన భూముల వాటా ఎక్కువగా వున్నప్పుడు ఆ భూముల్లో ఎక్కువ పెట్టుబడి పెట్టబడినప్పుడు సగటు కౌలు, సగటు కౌలు రేటు అదే నిష్పత్తిలో పెరుగుతాయి.

కనుక సాధారణంగా గణాంక గ్రంథాల్లో చేసినట్టు మనం ఒక ఎకరంపైన లేదా ఒక హెక్టారు పైన వచ్చే సగటు కౌలును మొత్తం సాగుభూమిపైన పరిగణిస్తూ ఏకకాలంలో విభిన్న దేశాలను పోల్చి చూసినా లేదా ఒకే దేశంలో ఉన్న విభిన్న కాలాలను పోల్చి చూసినా ఈ విషయం అర్థమవుతుంది: ఎకరంపైన వచ్చే సగటు కౌలు అలాగే మొత్తం కౌలు కూడా కొంతవరకూ (ఇవి రెండూ సర్వసమానం కానప్పటికీ ఇవి చాలా వేగంగా వృద్ధి చెందే ఒక విస్తరణ.) ఒక దేశపు సాపేక్ష భూసారాన్ని బట్టి కాక సంపూర్ణ భూసారానికి అనుగుణంగా ఉంటుంది. అనగా ఒకే ప్రాంతంలో అది ఇచ్చే ఉత్పత్తి సగటు పరిమాణానికి అనుగుణంగా ఉంటుంది. ఎందుకంటే మొత్తం సాగుభూముల్లో మెరుగైన భూముల వాటా ఎంత ఎక్కువ ఉంటే ఉత్పత్తి అంత అధికంగా వుంటుంది. సమాన భూ కమతాలపైన సమాన పెట్టుబడులు పెట్టబడినాయని భావిద్దాం. అటువంటప్పుడు ఎకరానికి సగటు కౌలు కూడా అంతే ఎక్కువగా ఉంటుంది. ఇందుకు విరుద్ధమైన ఉదాహరణలో దీనికి వ్యతిరేకమైన ఫలితం వస్తుంది. ఆ రకంగా కౌలు వ్యత్యాసపు సారం యొక్క నిష్పత్తిచేత కాక మొత్తం సారంచేత నిర్ణయించబడుతున్నట్లుగా కనిపిస్తుంది. వ్యత్యాసపు కౌలు నియమం చెల్లినట్లు కనిపిస్తుంది. ఈ కారణంచేత కొన్ని దృగ్విషయాలపై వివాదం చెలరేగుతుంది. లేదా ధాన్యం సగటు ధరలో లేని తేడాలను బట్టి, సాగు భూముల వ్యత్యాసపు సారాన్ని బట్టి ఈ రూపాలన్నీ వివరించటానికి ప్రయత్నం జరుగుతుంది. మొత్తం కౌలుకు మొత్తం సాగుభూమితో లేదా ఆ భూమిపై పెట్టిన పెట్టుబడి మొత్తంతో వుండే నిష్పత్తి ఎకరంపై వచ్చే కౌలుచేత గాని, పెట్టుబడిపై కౌలు రేటుచేత గాని నిర్ధారింపబడదు. మొత్తం సాగు అవుతున్న భూమిలో ఏ రకం భూమి ఎన్ని ఎకరాల సాగులో ఉంది అన్నదానిపైన ఆధారపడి వుంటుంది. ఈ వాస్తవం కారణంగా మాత్రమే అటువంటి దృగ్విషయాలు తలెత్తుతాయి. వివిధ రకాల భూముల్లో మొత్తం పెట్టుబడి ఎలా పంపిణీ అయింది అన్నదానిపై కూడా ఇది ఆధారపడుతుంది. అయితే కౌలులేని భూసారమూ, ఉత్పత్తి ధరలు, వివిధ రకాల భూముల మధ్య తేడాలు – యథాతథంగా ఉన్నాయని పరిగణించాలి. చిత్రమేమంటే ఇంతవరకూ ఈ వాస్తవాన్ని ఎవరూ గమనించలేదు. ఏమైనప్పటికీ ఎకరంపైన సగటు కౌలు యొక్క సాపేక్ష స్థాయి, సగటు కౌలు రేటు (భూమిపై పెట్టిన మొత్తం పెట్టుబడికీ, మొత్తం కౌలుకూ ఉన్న నిష్పత్తి) కేవలం సాగుభూమిని విస్తరించడం ద్వారా పెరగొచ్చు, పడిపోవచ్చు అని మనం గమనిస్తాం. (మన తరువాతి విశ్లేషణకు అది అవసరం.) ధరలు మారనంత వరకూ వివిధ రకాల భూముల వ్యత్యాసపు సారాలు మారనంత వరకూ, ఎకరంపై వచ్చే కౌలు లేదా ఎకరంపై పెట్టిన పెట్టుబడి యొక్క కౌలు రేటు, వాస్తవంగా కౌలు ఇచ్చే అన్ని రకాల భూములు – వాస్తవంగా కౌలు నిచ్చే పెట్టుబడి అంతా యథాతథంగా వుంటుంది.

★ ★ ★

వ్యత్యాసపు కౌలు Iలో ఈ క్రింది అంశాలను ప్రస్తావించటం అవసరం. ఈ అంశాలు వ్యత్యాసపు కౌలు II కి పాక్షికంగా వర్తిస్తాయి.

మొదటిది. ఎకరంపై సగటు కౌలు, పెట్టుబడిపై సగటు కౌలు రేటు ధరలు నిలకడగా ఉన్నప్పుడు – సాగులో ఉన్న కమతాల వ్యత్యాసపు సారం యథాతథంగా వున్నప్పుడు, సాగుభూమి విస్తరణతోపాటు పెరగవచ్చు. ఒక దేశంలో ఉన్న మొత్తం భూమిని స్వాధీనంలోనికి తీసుకువచ్చినప్పుడు భూమిలోనూ, సాగులోనూ, జనాభా విషయంలోనూ పెట్టే పెట్టుబడి ఒక నిర్దిష్ట స్థాయి చేరుకున్నప్పుడు (పెట్టుబడిదారీ విధానం పైచేయి సంపాదించి వ్యవసాయాన్ని కూడా ఆశ్రయించుకున్నప్పుడు ఉండే పరిస్థితులన్నీ తలెత్తినప్పుడు) సాగులో లేని వివిధ రకాల భూముల ధర (కేవలం వ్యత్యాసపు కౌలు మాత్రమే ఉందనుకుందాం.) అదే స్వభావం కలిగిన అదేలాంటి ప్రాంతంలో వున్న సాగులో ఉన్న కమతాల ధరనుబట్టి నిర్ణయించబడుతుంది. ఈ భూమి ఏమీ కౌలు ఇవ్వనప్పటికీ దాని ధర మామూలుగా అంతే వుంటుంది. (కొత్త భూమిని సాగులోకి తేవటానికి అయ్యే ఖర్చును దీనినుంచి తీసివేయాలి.) భూమి ధర నిజానికి పెట్టుబడీకరించిన కౌలు తప్ప వేరుకాదు. అయితే సాగుభూమి విషయంలో కూడా ధర భవిష్యత్తు కౌళ్ళను మాత్రమే చెల్లిస్తుంది. ఉదాహరణకు అమలులో వున్న వడ్డీ రేటు 5% అయితే 20 ఏళ్ళ కౌలును ఒకేసారి చెల్లించటం జరిగితే భూమిని అమ్మినప్పుడు కౌలు ఇచ్చే భూమిగానే అమ్మబడుతుంది. కౌలు రావడానికి అవకాశం ఉండటం అన్నది (ఇక్కడ అది భూమి ఉత్పాదితంగా పరిగణించబడుతుంది. అయితే అది అలా కనిపిస్తుంది. అంతే.) సాగుభూమిని, సాగులోలేని భూమిని వేరుచేసి చూడదు. సాగులో లేని భూమి ధర, దాని కౌలు లాగానే భూమి వాస్తవంగా ఉపయోగంలోకి రానంత కాలం – కేవలం భ్రమాత్మకం మాత్రమే. అయితే ఆ రకంగా అది ముందుగానే నిర్ణయించబడి ఒక కొనుగోలుదారుడు దొరకగానే డబ్బు రూపంలోకి మారుతుంది. కనుక ఒక దేశంలో ఉన్న వాస్తవ సగటు కౌలు ఆ దేశంలో ఉన్న వాస్తవ సగటు వార్షిక కౌలుపైన, మొత్తం సాగుభూమికి ఈ వార్షిక కౌలుకు గల సంబంధంపైన ఆధారపడి వుంటుంది. సాగులో లేని భూమి ధర, సాగులో వున్న భూమి ధరనుబట్టి నిర్ణయించబడుతుంది. కనుక అది సాగులో ఉన్న భూమిపై పెట్టిన పెట్టుబడికి, దాని నుంచి వచ్చిన ఫలితాలకు అది ఒక ప్రతిబింబం మాత్రమే. అత్యంత అధ్వాన్నమైన భూమి తప్ప మిగిలిన భూములు అన్నీ కౌలును ఇస్తాయి. కనుక (ఈ కౌలు పెట్టుబడి పరిమాణం, దానితోపాటు సాగు తీవ్రత పెరగటంతోపాటు పెరుగుతుంది. దీనిని మనం వ్యత్యాసపు కౌలు II లో చూస్తాం.) సాగులో లేని కమతాల నామమాత్రపు ధర ఆ రకంగా ఏర్పడుతుంది. ఆ రకంగా అది సరుకులుగా మారి అవి తమ యజమానులకు సంపద ఆధారాలుగా మారతాయి. అదే సమయంలో సాగులో లేని భాగంతో సహా ఒక ప్రాంతంలో ఉన్న భూమి ధరలు ఎందుకు పెరుగుతాయో ఇది వివరిస్తుంది. (అప్పటికే) ఉదాహరణకు అమెరికాలో భూమి సట్టా వ్యాపారం అన్నది సాగులో లేని భూమిపై ప్రతిఫలించే పెట్టుబడి, శ్రమల ప్రతిబింబంపైన మాత్రమే ఆధారపడి వుంది.

రెండవది – సాగుభూమి విస్తరణలో ప్రగతి అధ్వాన్నపు భూమివైపు సాగుతుంది లేదా వివిధ రకాల నిష్పత్తులలో వివిధ రకాల భూములవైపు సాగుతుంది. ఇది – అవి లభ్యమయ్యే తీరుపైన ఆధారపడి వుంటుంది. అధ్వాన్నపు భూమిపైన సాగు విస్తరించటం అన్నది ఎప్పుడూ స్వచ్ఛందంగా జరగదు. అది పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానంలో ధరలు పెరగటం వలన లేదా ఏ ఉత్పత్తి విధానంలో

అయినా అవసరం ఒత్తిడి చెయ్యటం వలన మాత్రమే జరుగుతుంది. అయితే పూర్తిగా అలా కూడా కాకపోవచ్చు. అది ఉన్న స్థానాన్ని బట్టి సాపేక్షంగా మెరుగైన భూముల కంటే సారం తక్కువ వున్న భూముల్ని ఎంచుకోవచ్చు. తరుణ దేశాలలో సాగు విస్తరణ విషయంలో స్థానం అన్నది నిర్ణయాత్మకమైన పాత్రను నిర్వహిస్తుంది. అంతేకాక ఒక ప్రాంతంలో సాధారణంగా సారవంతమైన భూమి అని వర్గీకరించబడినప్పటికీ అది మెరుగైన భూములు, అధ్వాన్నపు భూములు అంటూ కలగాపులగంగా ఒకే ప్రాంతంలో ఉండవచ్చు. మెరుగైన భూముల పక్కనే ఉండటం వలన వాటితోపాటు అప్పుడు అధ్వాన్నపు భూములు కూడా సాగులోకి వస్తాయి. అధ్వాన్నపు భూముల చుట్టూ మంచి భూమి ఉంటే దానివల్ల ఈ అధ్వాన్నపు భూములు ఇంకా సాగులోకి రాని సారవంతమైన భూముల కంటే స్థానం రీత్యా ఎక్కువ అనుకూలమైన స్థితిలో ఉన్నాయని చెప్పవచ్చు.

ఆ రకంగా మిచిగన్ రాష్ట్రం పశ్చిమ రాష్ట్రాలలో ధాన్యం ఎగుమతి చేసిన మొదటి రాష్ట్రం. అయినా దాని భూమి మొత్తం మీద సారవంతమైంది కాదు. అయితే న్యూయార్క్ రాష్ట్రానికి అది దగ్గరగా ఉండటం వల్లనూ, సరస్సుల ద్వారానూ, ఈరీ కాలువ ద్వారాను ఉన్న జలమార్గాలు ఎక్కువ సారవంతమైన భూములు వున్న పశ్చిమ రాష్ట్రాలకంటే అదనపు సౌకర్యాలను తొలి దశలో పొందగలిగింది. మిగిలిన రాష్ట్రాలు పశ్చిమాన మరింత దూరంగా ఉన్నాయి. న్యూయార్క్ రాష్ట్రంతో ఈ రాష్ట్రాన్ని పోల్చి చూస్తే మెరుగైన భూముల నుంచి అధ్వాన్నపు భూములకు పరివర్తన ఎలా జరుగుతుందో తెలుస్తుంది. న్యూయార్క్ రాష్ట్రంలోని భూమి, ముఖ్యంగా దాని పశ్చిమ భాగపు భూములు చాలా సారవంతమైనవి. ముఖ్యంగా గోధుమ సాగు విషయంలో ఇది మరింత స్పష్టం. ఈ సారవంతమైన భూమిని దురాశాపూరితమైన సాగు పద్ధతుల ద్వారా నిస్సారమైన భూములుగా మార్చటం జరిగింది. దాంతో మిచిగన్ భూములే అంతకంటే సారవంతమైన భూములుగా కనిపించాయి.

“1838లో గోధుమ పిండి పశ్చిమ రాష్ట్రాల కోసం బఫెలొ దగ్గర ఓడలకు ఎత్తబడింది. న్యూయార్క్, ఎగువ కెనడాల గోధుమ ప్రాంతాలు ఈ గోధుమ పిండిని ప్రధానంగా సరఫరా చేశాయి. 12 యేళ్ళ తరువాత ఇప్పుడు పశ్చిమ రాష్ట్రాల నుంచి అపారమైన స్థాయిలో గోధుమ సరఫరా అవుతుంది. ఈరీ సరస్సు ద్వారా, ఈరీ కాలువ ద్వారా తూర్పు రాష్ట్రాల కోసం బఫెలొ దగ్గర దానిని ఆనుకుని వున్న బ్లాక్‌రాక్ దగ్గర గోధుమ, గోధుమపిండి ఓడలకు ఎత్తబడుతున్నాయి... ఐరోపా కరువు సంవత్సరాలలో ఈ సరఫరాలు అసహజంగా ప్రేరణ పొందాయి. పశ్చిమ రాష్ట్రాల నుంచి అపారంగా వస్తున్న ఈ ధాన్యం వల్ల పశ్చిమ న్యూయార్క్‌లో గోధుమ విలువ తగ్గింది. గోధుమ పంటకు తగినంత గిట్టుబాటు కాకుండా పోయింది. దానివల్ల న్యూయార్క్ రైతులు తమ దృష్టిని పశు పోషణవైపు, పళ్ళ తోటలవైపు, గ్రామీణ ఆర్థిక రంగంలోని ఇతర శాఖలవైపు మళ్ళించారు. ఆ శాఖలలో పశ్చిమ రాష్ట్రాలు ప్రత్యక్షంగా తమతో పోటీకి దిగలేవని భావించారు.” (జె.డబ్ల్యు. జాన్‌స్టన్ నోట్స్ ఆన్ నార్త్ అమెరికా, లండన్, 1851, I, పుటలు 220–23)

మూడవది – వలసలలోనూ, ధాన్యాన్ని చౌకగా ఎగుమతి చేసే తరుణ దేశాలలోనూ భూసారం ఎక్కువగా ఉన్నదని భావించటం పొరపాటు. అటువంటి సందర్భాలలో ధాన్యం దాని విలువ కంటే తక్కువకు అమ్మబడుతుంది. అంతేకాదు దాని ఉత్పత్తి ధర కంటే తక్కువకు, అనగా పాత దేశాలలో సగటుకు లాభం రేటుచేత నిర్ణయించబడిన ఉత్పత్తి ధరకంటే తక్కువగా అమ్మబడుతుంది.

జాన్‌స్టన్ చెప్పినట్లుగా (పుట 223) “బఫెలో నౌకాశ్రయం దగ్గర ప్రతీ యేటా అపారంగా ఓడలకు ఎత్తబడుతున్న ధాన్యాన్ని సరఫరా చేసే కొత్త రాష్ట్రాలలో ప్రకృతిసిద్ధంగా అపారమైన ఫలదాయకత కలిగిన సుసంపన్నమైన, విస్తారమైన భూభాగాలు ఉన్నాయని” భావించటం మనకు అలవాటయింది. నిజానికి ఆ సరఫరా ఆర్థిక పరిస్థితుల ఫలితం. ఉదాహరణకు మిచిగన్ లాంటి రాష్ట్రాన్ని తీసుకుంటే అక్కడ మొత్తం జనాభా దాదాపుగా పూర్తి వ్యవసాయంలో నిమగ్నమై ఉన్నారు. వ్యవసాయ ఉత్పాదితాలను పెద్ద ఎత్తున ఉత్పత్తి చేయగలుగుతున్నారు. వారికి అవసరమైన పారిశ్రామిక ఉత్పాదితాల కోసం, ఉష్ణమండల సరుకుల కోసం ఇవ్వటానికి వారి దగ్గర ఉన్నది వ్యవసాయ ఉత్పాదితాలు మాత్రమే. కనుక దాని మొత్తం అదనపు ఉత్పత్తి ధాన్యం రూపంలో కనిపిస్తుంది. ఇది మొదటి నుంచీ ఆధునిక ప్రపంచ మార్కెట్టు ప్రాతిపదికపైన కనుగొనబడిన – వలస రాష్ట్రాలను ప్రాచీన రాష్ట్రాల నుంచి వేరు చేసి చూస్తుంది. కొత్త రాష్ట్రాలు తమకు అవసరమైన వస్త్రాలను, ఇతర పరికరాలను ప్రపంచ మార్కెట్టు నుంచి పూర్తిగా తయారయిన రూపంలో పొందుతాయి. లేకుంటే వాటిని కూడా తామే తయారు చేసుకోవాల్సి వచ్చేది. ఆ ప్రాతిపదికపై మాత్రమే దక్షిణాది రాష్ట్రాలు తమ పత్తిని ప్రధానమైన పంటగా చేసుకోగలిగాయి. ప్రపంచ మార్కెట్టులో శ్రమ విభజన దీనిని సాధ్యం చేసింది. కనుక తరుణ వయస్కులు, సాపేక్షంగా తక్కువ జనాభా కలిగిన ఈ రాష్ట్రాలు పెద్ద ఎత్తున దీనిని అదనంగా ఉత్పత్తి చెయ్యటానికి కారణం వారి భూముల సారమూ కాదు, వారి శ్రమ ఫలదాయకతా కాదు. దీనికి కారణం వారి శ్రమ ఏకపార్శ్వంగా ఉండటం మాత్రమే. కనుక ఆ శ్రమ దేనిలో నియుక్తమవుతుందో ఆ రంగంలో అదనపు ఉత్పాదితం లభిస్తుంది.

అంతేకాదు కొత్తగా సాగులోకి వచ్చిన నేల సాపేక్షంగా తక్కువ సారవంతమైనదే అయినప్పటికీ ఇంతకు ముందు నాగరికత స్పృశించని ఆ భూమి మరీ ప్రతికూలంకాని వాతావరణ పరిస్థితులు వుంటే అప్పటికి మొక్కల పోషక పదార్థాలన్నీ – తేలికగా భూమిలో కలిసిపోయే పదార్థాలన్నీ కనీసం తన పైపొరల్లో కలుపుకుని ఉంటుంది. కనుక ఆ భూమి ఎరువులను వాడకుండానే కేవలం పైపైన సాగు చేసినప్పటికీ చాలాకాలం వరకు అది పంటల్ని ఇస్తుంది. పశ్చిమాన ఉన్న అడవి భూములకు ఈ అదనపు సదుపాయం ఉంది. ప్రకృతి వాటిని దున్నటానికి సిద్ధంగా మార్చింది. కనుక వాటిని సాగు చేయటానికి దాదాపు ఖర్చు ఏమీ కాదు.[1] ఈ రకపు సారం తక్కువ ప్రాంతాలలో భూసారం ఎక్కువగా ఉండటం వల్ల కాక – అనగా ఎకరానికి వచ్చే దిగుబడి వల్ల కాక – కృత్రిమంగా సాగులోకి తేబడిన ఎకరాలు అపారంగా ఉండటం వల్ల ఈ అదనపు ఉత్పాదితం లభిస్తుంది. ఎందుకంటే

---

1. అడవి భూములలోనూ, మైదాన భూములలోనూ, శీఘ్రంగా పెరుగుతున్న సాగు మాల్తస్ యొక్క వ్యాఖ్యానాలను హాస్యాస్పదంగా మార్చుతోంది. “జీవితాధార వస్తువులపైన పెరిగే జనాభా ఒక భారం” అన్న ఆయన మాటలు నవ్వులపాలవుతున్నాయి. ఆ మాటలకు బదులు ప్రజలపై భారంగా వున్న జీవితాధార వస్తువులకు వారినుంచి బలవంతంగా దూరంగా ఉంచకపోతే, వ్యవసాయమూ, దానితో పాటు జర్మనీ నాశనం అయిపోతాయనే విలాపాన్ని ఈ సాగు సృష్టించింది. ఈ పచ్చిక బీడు మైదానాలు, అటవీ భూములు మొక్క మొడుసూ లేని చాళ్ళు వగైరాల సాగు ఇంకా దాని తొలి దశలో మాత్రమే వుంది. ఐరోపా వ్యవసాయంపై దాని విప్లవాత్మక ప్రభావం ఇప్పటికంటే భవిష్యత్తులో మరింత ఎక్కువగా వుంటుంది - ఎంగెల్స్



సాగుదారునికి ఆ భూమి వల్ల ఖర్చు ఉండదు. ఉన్న పాత భూములతో పోల్చితే దాదాపు ఖర్చు లేనట్లే. ఉదాహరణకు న్యూయార్క్, మిచిగన్, కెనడా మొదలైన కోరుసాగు (Share cropping) పద్ధతులున్న ప్రాంతాలకు ఇది వర్తిస్తుంది. ఒక కుటుంబం ఉదాహరణకు ఒక వంద ఎకరాలకుపైన సాగు చేస్తుందనుకుందాం. ఎకరంపై వచ్చే దిగుబడి తక్కువే ఉన్నప్పటికీ వంద ఎకరాల మీద గణనీయమైన స్థాయిలో అమ్మకానికి వీలైన అదనపు ఉత్పాదితం లభిస్తుంది. దీనితోపాటు ఏమాత్రం ఖర్చు లేకుండానే సహజమైన పచ్చిక బయళ్ళలో పశువుల్ని మేపవచ్చు. దీనికోసం ప్రత్యేకంగా పశు గ్రాసాన్ని పెంచనక్కరలేదు. ఇక్కడ నిర్ణయాత్మకమైన అంశం – భూ పరిమాణం మాత్రమే భూసారం కాదు. అయితే అలా పైపైన సాగుచేసే అవకాశం సహజంగానే కాస్త ముందు వెనకగా త్వరలోనే అంతమైపోతుంది. క్రొత్త భూసారానికి విలోమంగానూ, దాని ఉత్పాదితాల ఎగుమతికి అనులోమం గానూ ఇది జరుగుతుంది. "అయినప్పటికీ అటువంటి దేశం అద్భుతమైన మొదటి పంటల్ని ఇస్తుంది. ఆ దేశాన్ని చిలికి మొదటి సారాన్ని వెలికితీసేవారికి మార్కెట్టుకు పంపించటానికి అవసరమైన అదనపు ధాన్యాన్ని పెద్ద ఎత్తున సరఫరా చేస్తుంది." (అదే గ్రంథం, పుట 224) మరింత పరిణతి చెందిన నాగరికత ఉన్న దేశాలలో ఆస్తి సంబంధాలు అటువంటి విస్తృతమైన ఆర్థిక విధానాన్ని అసాధ్యం చేస్తాయి. ఎందుకంటే అక్కడ సాగులోకి రాని భూమి ధర – సాగులో ఉన్న భూమి ధరచేత నిర్ణయించ బడుతుంది.

కనుక రికార్డో భావించినట్లుగా ఈ భూమి అత్యంత సుసంపన్నమైన భూమి కానక్కరలేదు. సమానమైన సారం ఉన్న భూములు సాగులోకి రానక్కరలేదు కూడా. దానిని ఈ క్రింది వివరాలలో చూడవచ్చు. 1840లో మిచిగన్ రాష్ట్రంలో 465,900 ఎకరాలలో గోధుమ వెయ్యబడింది. దానిలో 4,739,300 బస్తాలు దిగుబడివచ్చింది. అంటే సగటున ఎకరానికి $10\frac{1}{5}$ బస్తాలు లభించాయి. విత్తనాలకు వేసిన ధాన్యాన్ని తీసివెయ్యగా ఎకరానికి 9 బస్తాలు మిగిలాయి. ఈ రాష్ట్రంలో 29 కౌంటీలు ఉన్నాయి. రెండింటిలో సగటున 7 బస్తాలు చొప్పున దిగుబడి వచ్చింది. మూడింటిలో సగటున 8 బస్తాలు, రెండింటిలో 9 బస్తాలు, మూడింటిలో 12 బస్తాలు, నాలుగింటిలో 13 బస్తాలు చొప్పున దిగుబడి లభించింది. కేవలం ఒక కౌంటీలో సగటున 10 బస్తాలు, మరోదానిలో 18 బస్తాలు లభించాయి. (అదే గ్రంథం – పుట 225)

ఆచరణాత్మకమైన సాగులో భూమి యొక్క అధిక సారం అన్నది – ఆ సారం తక్షణమే ఉపయోగించటానికి వీలుగా ఉండటం అన్నదానితో ఏకీభవిస్తుంది. రెండో అంశం ప్రకృతిసిద్ధంగా సారవంతమైన భూముల కంటే సారం తక్కువ వున్న భూముల విషయంలో మరింత ఎక్కువగా వర్తించవచ్చును. ఇలా తక్షణమే సారాన్ని ఉపయోగించుకోవటానికి వీలైన భూములనే వలస వచ్చిన రైతు మొదట సాగు చేస్తాడు. ఎందుకంటే అప్పుడు పెట్టుబడి కొరత ఉంటుంది.

చివరిది – ఇప్పుడు పేర్కొన్న ఉదాహరణలో ఇంతకు ముందు సాగులో వున్న భూముల కంటే సాగులోలేని, తక్కువ సారం గల భూములన్నీ సాగుచెయ్యటం కనిపిస్తుంది. దానిని అలా ఉంచి ఎ నుంచి డి వరకూ గల వివిధ రకాలైన భూములకు పెద్దయెత్తున సాగు విస్తరించటం అన్నది – అనగా ఉదాహరణకు బి, సి లలో ఉన్న పెద్ద భూభాగాలను సాగులోకి తేవటం అన్నదానికి

అంతకు ముందే ధాన్యపు ధరలు పెరగటం అన్నది అత్యవసరం కాదు. ఉదాహరణకు అంతకు ముందు సంవత్సరాల్లో దూది వడకడం విస్తరించడం అన్నదానికి నూలు ధర పెరగటం అన్నది అత్యవసరం కానట్లే ఇది కూడా. మార్కెట్టు ధరల్లో గణనీయమైన పెరుగుదల కానీ, తగ్గుదల కానీ ఉత్పత్తి పరిమాణాన్ని ప్రభావితం చేస్తుంది. అయితే దానితో ప్రమేయం లేకుండానే వ్యవసాయంలో (పెట్టుబడిదారీ తరహాతో నిర్వహించబడే ఉత్పత్తి రంగాల అన్నిటిలాగానే) ఒక నిరంతరాయమైన సాపేక్ష అధికోత్పత్తి వుంటుంది. అది స్వయంగా సంచయనంతో సమానం. ఉత్పత్తిని తగ్గించటానికి గాని, ప్రేరేపించటానికి గాని చేయని సగటు ధరల స్థాయిలో సహితం ఇలా జరుగుతుంది. ఇతర ఉత్పత్తి విధానాలతో ఈ సాపేక్ష అధికోత్పత్తి – జనాభా పెరుగుదలచేత ప్రత్యక్షంగా ప్రభావితం అవుతుంది. వలసలలో వలస జనం పెరగటం వలన కూడా ప్రభావితం అవుతుంది. స్థిరంగా గిరాకీ పెరుగుతుంది. ఆ అంచనాతో నిరంతరాయంగా కొత్త భూముల్లో పెట్టుబడి పెట్టడం జరుగుతుంది. అయితే ఇది వివిధ విభిన్న వ్యవసాయ ఉత్పాదితాల పరిస్థితులను బట్టి వేరు వేరుగా ఉంటుంది. కొత్త పెట్టుబడులు ఏర్పడటమే దీనిని సాధిస్తుంది. అయితే వ్యక్తిగత పెట్టుబడిదారునికి సంబంధించినంత వరకూ – తన ఉత్పత్తి పరిమాణాన్ని, తనకు అందుబాటులో ఉన్న పెట్టుబడినిబట్టి దానిపై తానే స్వయంగా ఆధిపత్యం వహించగలిగిన మేరకు కొలుస్తాడు. మార్కెట్టులో సాధ్యమైనంత పెద్ద భాగాన్ని స్వాధీనం చేసుకోవటం అతని లక్ష్యం. అధిక ఉత్పత్తి ఉంటే ఆ నిందను తనపై వేసుకోడు. దానిని అతని పోటీదారులపైకి నెట్టుతాడు. వ్యష్టి పెట్టుబడిదారుడు ఆనాడు ఉన్న మార్కెట్టులో పెద్ద వాటాను స్వాధీనం చేసుకోవటం ద్వారా గాని లేదా మార్కెట్టునే విస్తరించటం ద్వారా గాని తన సొంత ఉత్పత్తిని విస్తరింపచేసుకోవచ్చు.

★ ★ ★

## అధ్యాయం - 40

# వ్యత్యాసపు కౌలు రెండవ రూపం

### (వ్యత్యాసపు కౌలు - II )

ఇంత వరకూ మనం విభిన్న భూసారాలు కలిగిన సమ విస్తీర్ణ కమతాలలో పెట్టిన సమానమైన పెట్టుబడి మొత్తాల వేరువేరు ఉత్పాదకతల ఫలితంగా మాత్రమే వ్యత్యాసపు కౌలును పరిశీలించాము. పరమ అధ్వాన్నపు భూమిలో అనగా కౌలులేని భూమిలో పెట్టిన పెట్టుబడి నుంచి వచ్చే దిగుబడికి, మెరుగైన భూమిలో పెట్టిన పెట్టుబడి వల్ల వచ్చే దిగుబడికి మధ్య ఉన్న తేడా వ్యత్యాసపు కౌలును నిర్ణయించింది. పక్కపక్కనే వేరు వేరు కమతాలలో మదుపు పెట్టిన పెట్టుబడి వుంది. ఆ రకంగా ప్రతీ కొత్త మదుపూ – భూమి యొక్క మరింత విస్తృతమైన సాగునూ, సాగుభూమి విస్తరించటాన్నీ సూచించింది. అయితే చివరి విశ్లేషణలో వ్యత్యాసపు కౌలు దాని స్వభావం రీత్యా భూమిలో పెట్టిన సమాన పెట్టుబడుల విభిన్న ఉత్పాదకతల ఫలితంగా మాత్రమే ఉండింది. విభిన్న ఉత్పాదకతలు కలిగిన పెట్టుబడులను ఒకే కమతంలో వరుసగా ఒకదాని తర్వాత ఒకటి పెట్టడానికీ లేదా అదే ఫలితాలతో పక్కపక్కనే వున్న వేరువేరు కమతాలలో పెట్టడానికీ మధ్య ఫలితంలో తేడా వుంటుందా?

అదనపు లాభం ఏర్పడటానికి సంబంధించినంత వరకూ చూస్తే ఎ పొలంలో ఎకరానికి 3 పౌండ్లకు గాను ఒక బస్తా దిగుబడి వస్తే దాని ఉత్పత్తి ధర 3 పౌండ్లు, ఒక బస్తా ధాన్యం మార్కెట్ ధర 3 పౌండ్లు. బి పొలంలో ఉత్పత్తి ధర 3 పౌండ్లు, దిగుబడి రెండు బస్తాలు కనుక అదనపు లాభం 3 పౌండ్లు; అదేవిధంగా సి పొలంలో ఉత్పత్తి ధర 3 పౌండ్లు, దిగుబడి మూడు బస్తాలు, అదనపు లాభం 6 పౌండ్లు; అలాగే డి పొలంలో ఉత్పత్తి ధర 3 పౌండ్లు, దిగుబడి నాలుగు బస్తాలు, అదనపు లాభం 9 పౌండ్లు. ఈ 12 పౌండ్ల ఉత్పత్తి ధర లేదా 10 పౌండ్ల పెట్టుబడిని – అంతే ఫలప్రదంగా అదే వరుసలో ఒకే ఎకరంలో వినియోగిస్తే అదే ఫలితం వస్తుందా? అదనపు లాభానికి సంబంధించి నంత వరకూ ఈ రెంటికీ మధ్య తేడా ఏమీ ఉండదు. ఈ రెండు ఉదాహరణల్లోనూ పెట్టుబడి 10 పౌండ్లే. దాని విలువ భాగాలు $2\frac{1}{2}$ పౌండ్ల చొప్పున వరుసగా మదుపు పెట్టబడ్డాయి. వేరు వేరు భూసారాలతో పక్కపక్కనే ఉన్న నాలుగు ఎకరాలలో ఆ పెట్టుబడిని ఉపయోగించి ఉండవచ్చును. లేదా ఒకే ఎకరంలో ఒక పెట్టుబడి భాగం తర్వాత మరొక భాగాన్ని ఉపయోగించి ఉండవచ్చు. వాటి ఉత్పత్తులు వేరువేరుగా ఉండటం వల్ల ఒక భాగం అదనపు లాభాన్నివ్వదు. ఇతర భాగాలు కౌలు లేని మదుపుతో పోల్చినప్పుడు వాటి దిగుబడులలో వున్న తేడాలకు అనులోమంగా అదనపు లాభాన్నిస్తాయి.

అదనపు లాభమూ, వివిధ పెట్టుబడి విలువ భాగాల విషయంలో వేరువేరు రేట్ల అదనపు లాభం – ఈ రెండు ఉదాహరణలలోనూ ఈ రకంగానే ఏర్పడతాయి. కౌలు అదనపు లాభం యొక్క

రూపం మాత్రమే. అదనపు లాభం దాని సారాంశం. అయితే రెండో పద్ధతిలో అదనపు లాభం కౌలుగా మారడానికి సంబంధించి కొన్ని ఇబ్బందులున్నాయి. ఈ రూపం మార్పిడితో పెట్టుబడిదారీ కౌలుదారుని నుంచి భూస్వామికి అదనపు లాభం బదిలీ కావడం కూడా ఉంది. అధికారిక వ్యవసాయక గణాంక సమాచారానికి వ్యతిరేకంగా ఇంగ్లీషు కౌలుదారుల తీవ్ర ప్రతిఘటనకు కారణం ఇదే. వారి పెట్టుబడి మదుపు నుంచి వచ్చే వాస్తవ ఫలితాలను భూస్వాములు నిర్ధారించటానికి వ్యతిరేకంగా వారు పోరాడటానికి గల కారణం ఇదే. (మోర్టన్) ఎందుకంటే భూమి కౌలుకివ్వబడినప్పుడు కౌలు నిర్ణయించబడుతుంది. దాని తర్వాత ఆ కౌలు కొనసాగినంత కాలం వరుసగా పెట్టుబడి మదుపుల వల్ల వచ్చే అదనపు లాభం కౌలుదారుని జేబుల్లోకి పోతుంది. అందుచేతనే దీర్ఘకాలికమైన కౌళ్ళ కోసం కౌలుదార్లు పోరాడారు. మరోవైపున భూస్వాములకు ఎక్కువ బలం ఉండటం వల్ల యథేచ్ఛగా ఎప్పటికప్పుడు మార్చగలిగిన కౌళ్ళు – అనగా ప్రతీ ఏటా రద్దయే కౌళ్ళ సంఖ్య పెరిగింది.

పక్కపక్కనే ఉన్న సమాన భూ కమతాలలో అసమాన ఫలితాలతో సమాన పెట్టుబడులు పెట్టబడినాయా? లేదా ఒకే పొలంలో వరుసగా మదుపు పెట్టబడినాయా? అన్న అంశానికి అదనపు విలువ ఏర్పడే నియమంతో ప్రమేయం లేదు. కానీ అదనపు లాభం భూమికౌలుగా రూపాంతరం చెందే విషయంతో దానికి సంబంధం వుంది. ఒకవైపున ఈ రెండో పద్ధతి ఈ రూపాంతరాన్ని మరింత సంకుచితమైన పరిమితుల్లో ఉంచుతుంది. మరోవైపున మరింత వేరువేరు పరిమితుల్లోనూ ఉంచుతుంది. ఈ కారణం చేతనే మోర్టన్ తన "రీసోర్సెస్ ఆఫ్ ఎస్టేట్స్" అన్న గ్రంథంలో నిరూపించినట్లుగా సాంద్ర వ్యవసాయం (ఆర్థికంగా చెప్పాలంటే సాంద్ర వ్యవసాయం అంటే పక్కపక్కనే ఉన్న అనేక కమతాలలో కాక ఒకే కమతంలో పెట్టుబడిని కేంద్రీకరించడం అని మాత్రమే అర్థం.) అమలులో వున్న దేశాలలో పన్నులను అంచనా కట్టే వాని వృత్తి – చాలా ప్రధానమూ సంక్లిష్టమూ కష్టతరమూ. భూమిని బాగుచేయటం అన్నది మరింత శాశ్వత స్వభావం కలిగి ఉంటే దానివల్ల కృత్రిమంగా పెరిగిన భూమిని వ్యత్యాసపు సారం కౌలు కాలం పూర్తికాగానే సహజమైన వ్యత్యాసపు సారంగా పరిగణించబడుతుంది. కౌలు అంచనా అన్నది సాధారణంగా విభిన్న సారాలున్న కమతాలపైన వస్తున్న కౌలును బట్టి నిర్ణయించబడుతుంది. మరోవైపున అస్థిర పెట్టుబడి పరిమాణాన్ని బట్టి అదనపు లాభం ఏర్పడటం అన్నది నిర్ణయించబడిన మేరకు ఒక నిర్దిష్ట అస్థిర పెట్టుబడి మొత్తంపై వచ్చే కౌలును దేశంలో ఉన్న సగటు కౌలుతో కలపటం జరుగుతుంది. ఆ రకంగా కొత్త కౌలుదారుడు అదే విధమైన సాంద్ర వ్యవసాయాన్ని కొనసాగించడానికి తగినంత పెట్టుబడిని కలిగి ఉండే అవకాశం యేర్పడాలి.

★ ★ ★

వ్యత్యాసపు కౌలు–II అధ్యయనంలో ఈ క్రింది అంశాలను ప్రత్యేకించి చెప్పాల్సి వుంటుంది.

మొదటిది, వ్యస్యాసపు కౌలు–I ప్రాతిపదిక, ప్రారంభ స్థానం. ఇది కేవలం చారిత్రకంగా మాత్రమే కాదు. ఏ నిర్ణీత కాలంలో దాని చలనాలను పరిశీలించినా ఇదే స్పష్టమవుతుంది. వ్యత్యాసపు కౌలు–I అనగా పక్కపక్కనే ఉంటూ అసమాన సారమూ, స్థానమూ కలిగిన వేరు వేరు నేలలను

ఏకకాలంలో సాగు చేయడం. మరోలా చెప్పాలంటే మొత్తం వ్యవసాయ ఎట్టుబడి యొక్క అసమాన భాగాలను అసమాన సారాలు కలిగిన కమతాలలో ఏకకాలంలో వర్తింపచేయడం.

చారిత్రకంగా చూస్తే ఇది స్వయం విదితం. వలసలలో వలస పోయిన వారి దగ్గర మొదట మదుపు పెట్టడానికి కొద్ది పెట్టుబడి మాత్రమే వుంటుంది. ప్రధానమైన ఉత్పత్తి కారకాలు అపుడు శ్రమ, భూమి మాత్రమే. ప్రతీ కుటుంబ పెద్దా తనకూ తన కుటుంబ సభ్యులకూ కలిపి తన పొరుగు కుటుంబాల వారితోపాటు వారిలాగానే స్వతంత్రంగా పనిచేయడానికి వీలైన కమతాల కోసం అన్వేషిస్తాడు. వ్యవసాయంలో పెట్టుబడిదారీ పూర్వ ఉత్పత్తి విధానాలకు సైతం సాధారణంగా ఇదే వర్తిస్తుంది. గొర్రెల పెంపకం, పశుపోషణ అనేవి స్వతంత్ర ఉత్పత్తి శాఖలు. వీటి విషయంలో ప్రారంభం నుంచీ నేలను వినియోగించడం అన్నది ఉమ్మడిగా విస్తృత పద్ధతిలో జరుగుతుంది. పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం దానికి ముందున్న ఉత్పత్తి విధానాల పునాదిపై తలెత్తి – వేరుపడింది. ఆ విధానాలలో ఉత్పత్తి సాధనాలు వాస్తవంగానూ, చట్టబద్ధంగానూ దున్నేవాని ఆస్తిగా ఉండేవి. ఒక్కమాటలో చెప్పాలంటే వ్యవసాయం కూడా చేతివృత్తి లాంటిదిగానే ఉండేది. అయితే క్రమంగా వ్యవసాయం ఉత్పత్తి సాధనాల కేంద్రీకరణకు, ఉత్పత్తి సాధనాలు పెట్టుబడిగా రూపాంతరం చెందడానికీ సహజంగానే దారితీస్తుంది. ప్రత్యక్ష ఉత్పత్తిదారులు వేతన కార్మికులుగా మారినట్లుగా పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం దాని సొంత తరహాలో ఇక్కడ వ్యక్తమైన మేరకు గొర్రెల పెంపకంలోనూ, పశుపోషణలోనూ మొదట కనిపిస్తుంది. అయితే అది ఆ రకంగా సాపేక్షంగా చిన్న భూభాగంపైన పెట్టుబడి కేంద్రీకరణగా కాక పెద్ద స్థాయిలో జరిగే ఉత్పత్తిలో గుర్రాలను పెంచడంలో అయ్యే ఖర్చుల్నీ, ఇతర ఉత్పత్తి ఖర్చుల్నీ పొదుపు చేయడం ద్వారా వ్యక్తమవుతుంది. అయితే నిజానికి అది అదే భూభాగంలో మరింత పెట్టుబడిని మదుపు పెట్టడం ద్వారా కాదు. అంతేకాక వ్యవసాయ శాస్త్ర సహజ నియమాల ప్రకారం ఇక్కడ ఉపయోగించిన పెట్టుబడి అనగా అప్పటికే ఉత్పత్తి అయిన ఉత్పత్తి సాధనాలు అనే అర్థంలో వ్యవసాయం ఒక నిర్దిష్ట అభివృద్ధి దశను చేరుకున్నప్పుడు – అలాగే దానికి అనుగుణంగానే కొత్త భూమి లభ్యం కానప్పుడు – పెట్టుబడి అన్నది భూమి సాగు విషయంలో నిర్ణయాత్మకమైన అంశంగా మారుతుంది. సాగులో ఉన్న భూభాగం సాగులోలేని భూభాగంతో పోలిస్తే తక్కువగా ఉన్నప్పుడు, సహజమైన భూసారం అంతం కానప్పుడు (వాస్తవ వ్యవసాయమూ, మొక్కల పోషకత్వమూ ఇంకా ప్రబలంగా తయారు కావడానికి ముందు పశువుల పోషణ, మాంసభక్షణ వ్యాప్తిలో ఉంటాయి.) కొత్తగా అభివృద్ధి చెందుతున్న ఉత్పత్తి విధానం ప్రధానంగా విస్తృత స్థాయిలో భూమిని సాగు చేయడం ద్వారా; మరోలా చెప్పాలంటే పెద్ద భూ భాగాలలో పెట్టుబడిని విస్తృతంగా ఉపయోగించడం ద్వారా రైత్వారీ ఉత్పత్తికి ఇది వ్యతిరేకమైనది. కనుక వ్యత్యాసపు కౌలు–I అన్నది చారిత్రక పునాది అని, అది ప్రారంభ స్థానంగా ఉపకరిస్తుందని మనం ముందునుంచీ గుర్తుంచుకోవాలి. మరోవైపున వ్యత్యాసపు కౌలు–II యొక్క చలనం ఏ నిర్ణీత దశలోనైనా వ్యత్యాసపు కౌలు యొక్క వేరే రూపంలో ఉన్న పునాది పరిధిలోనే ఉంటుంది.

రెండవది. రూపం–II లో వ్యత్యాసపు కౌలులో పెట్టుబడి పంపిణీలో ఉన్న తేడాలను (పరపతి సంపాదించే శక్తిలో తేడాలను కూడా) భూసారంలో ఉన్న తేడాలకు కలపబడ్డాయి. కార్ఖానాలలో

ప్రతీ వాణిజ్య శాఖా ఒక కనీస వాణిజ్యాన్నీ, దాని కనుగుణమైన కనీస పెట్టుబడినీ చాలా శీఘ్రంగా అభివృద్ధి చేసుకుంటుంది. అంతకు తక్కువ పెట్టుబడితో ఏ విడి వాణిజ్యాన్నీ విజయవంతంగా నిర్వహించటం సాధ్యం కాదు. అదే విధంగా ప్రతీ వాణిజ్య శాఖా ఈ కనీస మొత్తంపైన సాధారణ సగటు పెట్టుబడి మొత్తాన్ని ఏర్పరచుకుంటుంది. ఉత్పత్తిదారులలో అత్యధికులు ఈ మొత్తాన్ని కలిగి వుండాలి, కలిగి వుంటారు. ఇంతకంటే ఎక్కువ పరిమాణం గల పెట్టుబడి అదనపు లాభాన్ని ఇవ్వగలదు. ఇంతకంటే తక్కువ పరిమాణం గల పెట్టుబడి కనీసం సగటు లాభాన్ని కూడా ఇవ్వలేదు. వ్యవసాయంలో పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం నెమ్మదిగానూ, అసమంగానూ విస్తరిస్తుంది. వ్యవసాయంలో పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానానికి ప్రామాణికమైన ఇంగ్లాండులో దీనిని గమనించవచ్చు. స్వేచ్ఛగా ధాన్యం ఎగుమతి జరగనప్పుడు లేదా దాని పరిమాణం తక్కువగా ఉండటం వల్ల – దాని ప్రభావం పరిమితంగా ఉన్నప్పుడు, నాసిరకం నేలలో, అంటే సగటు ఉత్పత్తి పరిస్థితుల కంటే అధ్వాన్నపు పరిస్థితులలో పనిచేస్తున్న ఉత్పత్తిదారులు మార్కెట్టు ధరను నిర్ణయిస్తారు. పశుపోషణలో మదుపు పెట్టబడిన పెట్టుబడి – మొత్తంలో సాధారణంగా దానికి అందుబాటులో ఒక పెద్ద భాగం వున్న వారి చేతులలో ఉంటుంది.

ఉదాహరణకు రైతు తన చిన్న కమతంలో ఎక్కువ శ్రమను వెచ్చిస్తాడన్నది నిజం. అయితే ఉత్పాదకత తాలూకు వస్తుగత సామాజిక పాదార్థిక పరిస్థితుల నుంచి వేరుపడిన శ్రమ అది. ఈ పరిస్థితుల నుంచి తొలగించబడి కొల్లగొట్టిన శ్రమ.

ఈ పరిస్థితి పెట్టుబడిదారీ కౌలుదారులు అదనపు లాభంలో ఒక భాగాన్ని స్వాహా చేయడానికి వీలు కల్పిస్తుంది. అయితే పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం పరిశ్రమలో లాగానే వ్యవసాయంలో కూడా సమంగా అభివృద్ధి చెంది వుంటే ఈ అంశానికి సంబంధించినంత వరకూ ఈ వాస్తవం మనకు కనిపించదు.

వ్యత్యాసపు కౌలు–IIతో పాటు అదనపు లాభం ఏర్పడటాన్ని మనం మొదట పరిశీలిద్దాం. ప్రస్తుతానికి ఈ అదనపు లాభం భూమి కౌలుగా ఏ పరిస్థితుల్లో రూపాంతరం చెందుతుందో వాటిని ప్రస్తుతానికి వదిలేద్దాం.

వ్యత్యాసపు కౌలు–II అన్నది భిన్నంగా వ్యక్తమయిన వ్యత్యాసపు కౌలు–I మాత్రమే అని, సారాంశం రీత్యా – అది దానితో సర్వసమం అన్నది స్పష్టం. భూమిలో పెట్టిన పెట్టుబడులు అసమ ఫలితాలిచ్చిన మేరకు అనగా సమాన పరిమాణాలు గల పెట్టుబడి లేదా సమాన నిష్పత్తులలో వున్న పెట్టుబడి మొత్తాలు సృష్టించిన ఉత్పాదితాల పరిమాణాలు అసమంగా వున్న మేరకు వివిధ రకాల భూముల వేరు వేరు సారాలు వాటి మధ్య తేడా వ్యత్యాసపు కౌలు–I విషయంలో తన ప్రభావాన్ని కలిగిస్తుంది. ఈ అసమానత అన్నది ఒకే కమతంలో వరుసగా మదుపు పెట్టబడిన వివిధ పెట్టుబడుల విషయంలో వుంటుందా? లేక వేరువేరు రకాల సారాలు కలిగిన కమతాలలో పెట్టిన పెట్టుబడుల విషయాలలో వుంటుందా? అన్నది, ఉత్పాదకతలో తేడాను గానీ లేదా ఉత్పాదితంలో తేడాను గానీ ఏ మాత్రం మార్చలేదు. కనుక మరింత ఉత్పాదకంగా పెట్టిన పెట్టుబడి మొత్తాలపై వ్యత్యాసపు కౌలు ఏర్పడటంలో కూడా ఎటువంటి మార్పూ చేయలేదు. ఇంతకు ముందు లాగానే ఒకేరకం పెట్టుబడితో

విభిన్న సారాల్ని చూపిస్తున్నది - ఇక్కడ భూమి మాత్రమే. అయితే ఇక్కడ ఇంతకు ముందు - విభిన్న కమతాల విషయంలో విభిన్న సమాన భాగాలు కలిగిన సామాజిక పెట్టుబడి మదుపు పెట్టబడినప్పుడు, వ్యత్యాసపు కౌలు-I తలెత్తింది. అయితే ఈ సందర్భంలో ఒకే కమతంలో వేరు వేరు భాగాల పెట్టుబడులు వరుసగా మదుపు పెట్టబడతాయి.

పట్టిక-I లో చూపించబడినట్టుగా వేరువేరు స్వతంత్ర పెట్టుబడి భాగాలు ఎ, బి, సి, డి నాలుగు రకాల భూసారాలు కలిగిన కమతాలలో ఎకరానికి రెండున్నర పౌండ్లు చొప్పున వేరువేరు కౌలుదార్లు మదుపు పెట్టినట్టుగాక - అదే పది పౌండ్ల పెట్టుబడిని డి భూమిలో వరుసగా ఈ మొత్తంలో ఒక్కొక్క భాగాన్ని పెట్టుబడి పెట్టారనుకుందాం. అప్పుడు మొదటి భాగం పెట్టుబడి వల్ల 4 బస్తాలు, రెండవదానికి 3 బస్తాలు, మూడవదానికి 2 బస్తాలు, నాల్గవదానికి 1 బస్తా చొప్పున (లేదా ఇందుకు వ్యతిరేక దిశలో) వచ్చాయనుకుందాం. అతి తక్కువ ఉత్పాదకత కలిగిన పెట్టుబడి సమకూర్చిన ఒక బస్తా ధాన్యం ధర = 3 పౌండ్లు. ఇది ఏరకమైన వ్యత్యాసపు కౌలునూ ఇవ్వదు. 3 పౌండ్ల ధర కలిగిన గోధుమ సరఫరా అవసరమయిన మేరకు ఇది ఉత్పత్తి ధరను నిర్ణయిస్తుంది. పెట్టుబడిదారీ విధానం అమలులో ఉందని మనం ఊహిస్తున్నాం కనుక, ఈ 3 పౌండ్లలో సాధారణంగా $2\frac{1}{2}$ పౌండ్ల పెట్టుబడి సంపాదించే సగటు లాభం కూడా ఉంటుంది. $2\frac{1}{2}$ పౌండ్లు చొప్పున ఉన్న మిగతా మూడు భాగాలు వాటి ఉత్పత్తుల్లో ఉన్న తేడాలనుబట్టి ప్రతిదీ అదనపు లాభాన్ని సంపాదిస్తుంది. ఎందుకంటే, ఈ ఉత్పత్తి తన సొంత ఉత్పత్తి ధరపై కాక, అత్యంత తక్కువ ఉత్పాదకత కలిగిన $2\frac{1}{2}$ పౌండ్ల మదుపు భాగం యొక్క ఉత్పత్తి ధరపైన అమ్మబడుతుంది. $2\frac{1}{2}$ పౌండ్ల మదుపు ఎటువంటి కౌలునూ సంపాదించదు. దాని ఉత్పాదితాల ధర ఉత్పత్తి ధరల సాధారణ నియమాన్ని బట్టి నిర్ణయించ బడుతుంది. అదనపు లాభం ఏర్పడడం అన్నది పట్టిక-I విషయంలో లాగానే వుంటుంది.

వ్యత్యాసపు కౌలు-IIకు ముందు వ్యత్యాసపు కౌలు-I ఉండి తీరాలి అన్నది ఇక్కడ మరోసారి తెలుస్తుంది. పరమ అధ్వాన్నపు భూమి నుంచి $2\frac{1}{2}$ పౌండ్లు పెట్టుబడి వల్ల వచ్చిన కనీస దిగుబడి ఒక బస్తా అని ఇక్కడ భావించబడింది. $2\frac{1}{2}$ పౌండ్ల పెట్టుబడి వల్ల నాలుగు బస్తాలు దిగుబడి వచ్చినప్పుడు మూడు బస్తాల వ్యత్యాసపు కౌలును చెల్లించే కౌలుదారుడు అదే భూమిలో అంటే డిలో మరో $2\frac{1}{2}$ పౌండ్లు మదుపు పెట్టగా పరమ అధ్వాన్నమైన భూమి ఎలో వచ్చినట్టుగా ఒక బస్తా దిగుబడి వచ్చిందనుకుందాం. అప్పుడు ఈ పెట్టుబడి మదుపు వల్ల అతనికి కేవలం సగటు లాభం మాత్రమే వస్తుంది తప్ప అది కౌలుకు ఇవ్వదు. కౌలుగా మార్చడానికి వీలయిన అదనపు లాభమూ ఉండదు. మరోవైపున డి భూమిలో పెట్టిన రెండవ మదుపు వల్ల తక్కువ దిగుబడి, లాభం రేటుపైన ఎటువంటి ప్రభావమూ చూపించదు. అదనంగా $2\frac{1}{2}$ పౌండ్లను కొత్తగా ఎ రకం అదనపు భూమిలో మదుపు పెట్టగా వచ్చిన ఫలితమే ఇప్పుడు వస్తుంది. ఈ పరిస్థితి ఏ రకంగానూ అదనపు లాభాన్ని ప్రభావితం చేయదు. కనుక ఎ, బి, సి, డి భూముల వ్యత్యాసపు కౌలును కూడా ప్రభావితం చేయదు. అయితే కౌలుదారుని విషయంలో డి పొలంలో అతడు పెట్టిన అదనపు పెట్టుబడి $2\frac{1}{2}$ పౌండ్లు. అదే పొలంలో మొదట పెట్టిన $2\frac{1}{2}$ పౌండ్ల లాగానే అంతే లాభదాయకంగా వుంటుంది. అయితే మొదట పెట్టిన $2\frac{1}{2}$ పౌండ్లు 4 బస్తాల ధాన్యాన్ని ఇచ్చినప్పటికీ లాభం రెండింటి విషయంలోనూ

సమానంగా వుంటుంది. అంతేగాక $2\frac{1}{2}$ పౌండ్ల చొప్పున మరో రెండు పెట్టుబడులు వరుసగా 3 బస్తాలు, 2 బస్తాల అదనపు ఉత్పత్తిని ఇస్తే డి పొలంలో పెట్టిన మొదటి పెట్టుబడితో పోల్చితే అనగా 4 బస్తాల ధాన్యాన్ని, 3 బస్తాల అదనపు లాభాన్ని ఇచ్చిన ఆ పెట్టుబడితో పోల్చితే ఉత్పత్తిలో తగ్గుదల కనిపిస్తుంది. అయితే అది కేవలం అదనపు లాభంలో తగ్గుదల మాత్రమే. అది సగటు లాభాన్ని గాని లేదా అమలులో ఉండే ఉత్పత్తి ధరను గాని ప్రభావితం చెయ్యదు. ఈ అదనపు ఉత్పత్తి, అదనపు లాభాన్ని తగ్గించే ఈ ఉత్పత్తి ఎ పొలంలో ఉత్పత్తిని అనవసరంగా మార్చి ఎ పొలాన్ని సాగు నుంచి బయటకు నెట్టినప్పుడు మాత్రమే అది సగటు లాభంపైన, ఉత్పత్తి ధరపైన ప్రభావం చూపుతుంది. అటువంటి సందర్భంలో డి పొలంలో అదనపు పెట్టుబడి యొక్క ఉత్పాదకత తగ్గిపోవడంతో పాటు ఉత్పత్తి ధర కూడా పడిపోతుంది. ఉదాహరణకు బి భూమి కౌలు లేని భూమిగానూ, మార్కెట్టు ధరనే క్రమబద్ధం చేసే భూమిగానూ తయారైతే ఉత్పత్తి ధర 3 పౌండ్ల నుంచి $1\frac{1}{2}$ పౌండ్లకు పడిపోతుంది.

ఇప్పుడు డి ఉత్పత్తి = 4+1+3+2=10. ఇంతకు ముందు ఉత్పత్తి = 4 బస్తాలు అయితే బి క్రమబద్ధం చేసిన విధంగా బస్తా ధాన్యం ధర $1\frac{1}{2}$ పౌండ్లకు పడిపోయింది. డి, బిల మధ్య తేడా = 10−2=8 బస్తాలు. బస్తాకు $1\frac{1}{2}$ పౌండ్లు చొప్పున 12 పౌండ్లు. ఇంతకుముందు డి పైన డబ్బు కౌలు = 9 పౌండ్లు. దీనిని గమనించాలి. ఎకరం ప్రాతిపదికగా లెక్కగట్టితే కౌలు పరిమాణం $33\frac{1}{3}\%$ పెరిగింది. $2\frac{1}{2}$ పౌండ్ల చొప్పున పెట్టిన అదనపు పెట్టుబడులపై అదనపు లాభం రేటు పడిపోయే దిశగా ఉన్నప్పటికీ కౌలు పరిమాణం పెరిగింది.

సాధారణ రూపంలో వ్యత్యాసపు కౌలు ప్రత్యేకం. II రూపంలో కలిసిన I రూపంలోనూ వ్యత్యాసపు కౌలు కలయికల్ని ప్రదర్శిస్తాయో మనం చూడవచ్చు. అయితే రికార్డో ఏదో సాదా వ్యవహారం అయినట్టుగా దీనిని ఒక పార్శ్వం నుంచే పరిశీలిస్తాడు. పై ఉదాహరణలలాగానే అమలులో వున్న మార్కెట్టు ధర పడిపోవటమూ, అదే సమయంలో సారవంతమైన భూముల్లో కౌలు పెరగటమూ జరగవచ్చు. నిరపేక్ష ఉత్పత్తి అలాగే నిరపేక్ష అదనపు ఉత్పత్తి పెరుగుతాయి. (వ్యత్యాసపు కౌలు I లో కిందికి దిగే క్రమంలో సాపేక్ష అదనపు ఉత్పత్తి, ఆ రకంగా ఎకరంపై లభించే కౌలు పెరగవచ్చు. నిరపేక్ష అదనపు ఉత్పత్తి స్థిరంగా వున్నప్పటికీ లేదా తగ్గినప్పటికీ ఇలా జరగవచ్చు.) అయితే అదే సమయంలో వరుసగా ఒకే భూమిలో పెట్టిన ఉత్పాదకత తగ్గుతుంది. ఆ పెట్టుబడుల్లో అత్యధిక భాగం మరింత సారవంతమైన భూములలో పెట్టబడినప్పటికీ ఇదే జరుగుతుంది. ఉత్పత్తికీ, ఉత్పత్తి ధరకూ సంబంధించినంత వరకూ ఒక దృష్టి నుంచి చూస్తే శ్రమ ఉత్పాదకత పెరిగింది. మరో దృష్టి నుంచి చూస్తే ఎకరానికి అదనపు లాభమూ, అదనపు ఉత్పాదితమూ అదే భూమిపై పెట్టిన వివిధ పెట్టుబడుల విషయంలో తగ్గటం వలన శ్రమ ఉత్పాదకత తగ్గింది.

వ్యత్యాసపు కౌలు II దానితో వరుసగా పెట్టే పెట్టుబడుల ఉత్పాదకత క్రమంగా తగ్గిపోవడంతో పాటు తప్పనిసరిగా ఉత్పత్తి ధరలో పెరుగుదల, ఉత్పాదకతలో నిరపేక్ష తగ్గుదల సాధ్యం. అయితే పరమ అధ్వాన్నమైన ఎ భూమిలో మొత్తం పెట్టుబడిని మదుపు పెట్టినప్పుడు మాత్రమే ఇది జరుగుతుంది. ఒక ఎకరం ఎ భూమి $2\frac{1}{2}$ పౌండ్ల పెట్టుబడిపైన 3 పౌండ్ల ఉత్పత్తి ధర కలిగి 1 బస్తా ధాన్యాన్ని ఉత్పత్తి చేస్తుందనుకుందాం. అది మరో $2\frac{1}{2}$ అదనపు పెట్టుబడిపైన అంటే − మొత్తం 5 పౌండ్ల

పెట్టుబడిపైన కేవలం $1\frac{1}{2}$ బస్తాల దిగుబడిని ఇచ్చిందనుకుందాం. అప్పుడు ఈ $1\frac{1}{2}$ బస్తాల ఉత్పత్తి ధర = 6 పౌండ్లు లేదా 1 బస్తా ధర = 4 పౌండ్లు. పెరుగుతున్న పెట్టుబడితోపాటు తగ్గుతున్న ఉత్పాదకత – ఇక్కడ ఎకరంపై వచ్చే ఉత్పత్తి సాపేక్షంగా తగ్గుతుందని తెలియజేస్తుంది. కాగా ఇది మెరుగైన భూముల విషయంలో అవసరమైన అదనపు ఉత్పాదితం యొక్క తగ్గుదలను మాత్రమే సూచిస్తుంది.

అయితే స్వభావసిద్ధంగా సాంద్ర వ్యవసాయ అభివృద్ధితోపాటు ఒకే భూమిలో వరుసగా పెట్టుబడులు పెట్టడంతో పాటు ఇది రాను రాను మరింత ఎక్కువగానూ, వీలుగానూ మెరుగైన భూమిలో జరుగుతుంది. (ఒక పనికిరాని భూమిని పనికివచ్చే భూమిగా మార్చే శాశ్వత ప్రాతిపదికపై బాగుచెయ్యటాన్ని గురించి మనం ఇక్కడ ప్రస్తావించటం లేదు.) కనుక వరుసగా పెట్టే పెట్టుబడుల ఉత్పాదకత తగ్గిపోవటం అన్నది ప్రధానంగా పైన పేర్కొన్న ప్రభావాన్ని కలిగి వుంటుంది. మెరుగైన భూముల్లో సహజంగా సారవంతమైన అంశాలు ఉండటం వలన వాటిని ఉపయోగించుకోవటం తప్ప చెయ్యాల్సింది ఏమీ లేదు కనుక, దానిలో పెట్టే పెట్టుబడి మరింత లాభదాయకంగా ఉంటుందనే హామీ వుంటుంది – కనుక మెరుగైన భూమే ఎంచుకోబడుతుంది.

ధాన్యపు చట్టాల రద్దు తరువాత ఇంగ్లాండులో వ్యవసాయం మరింత సాంద్రతరంగా మారింది. అంతకు ముందు గోధుమ పండించిన భూమిలో అత్యధిక భాగం ఇతర లక్ష్యాల కోసం వినియోగించ బడింది. ముఖ్యంగా పచ్చిక బయళ్ళుగా ఉపయోగించబడింది. గోధుమ పంటకు బాగా అనువుగా వున్న సారవంతమైన భూమికి నీటిపారుదల వగైరా సదుపాయాలను సమకూర్చటం ద్వారా బాగు చెయ్యటం జరిగింది. గోధుమ సాగుకు ఉపయోగించిన ఆ పెట్టుబడినే ఆ రకంగా మరింత పరిమితమైన ప్రాంతంపై కేంద్రీకరించటం జరిగింది.

ఈ విషయంలో (అత్యంత ఉత్తమమైన భూమి యొక్క అత్యధిక అదనపు ఉత్పాదితానికి కౌలు లేని భూమి ఎ యొక్క ఉత్పాదితానికి మధ్య వున్న అన్ని అదనపు రేట్లు ఎకరంపై జరిగే సాపేక్ష పెరుగుదలతో కాక మొత్తం పెరుగుదలతో ఏకీభవిస్తాయి.) కొత్తగా ఏర్పడిన అదనపు లాభం (కౌలుగా మారగలిగిన మొత్తం) కౌలుగా మారిన ఇదివరకటి సగటు లాభంలో ఒక భాగానికి ప్రాతినిధ్యం వహిస్తుంది. (ఇంతకు ముందు సగటు లాభం వ్యక్తమైన ఒక ఉత్పత్తి భాగం) అయితే అది అదనపు లాభానికి ఇది ఈ రూపం నుంచి కౌలుగా మారిన భాగానికి ప్రాతినిధ్యం వహిస్తుంది.

మరోవైపున ఎ పొలంలో ధాన్యం ఉత్పత్తి ధరను మించి మార్కెట్టు ధర పెరిగిన మేరకు అనగా ఎ, బి లేదా ఏ ఇతర రకపు భూముల్లో భూముల నుంచి వచ్చే అదనపు ఉత్పాదితం 3 పౌండ్ల కంటే ఎక్కువ ధరకు మాత్రమే సరఫరా అయిన మేరకు ధాన్యానికి గిరాకి పెరుగుతుంది. ఉత్పత్తి ధర పెరగటం వల్లా, మార్కెట్ ధర నియంత్రణ వల్లా ఎ, బి, సి, డి రకాల భూముల్లో దేంట్లోనైనా అదనపు పెట్టుబడిని మదుపు పెట్టడం నుంచి వచ్చే దిగుబడిలో తగ్గుదల ఉంటున్నప్పుడు ఇలా జరుగుతుంది. అదనపు భూమి ఎ ని సాగులోకి తేనవసరం లేకుండానే (కనీసం ఎ లాంటి భూమిని) లేదా ఇతర పరిస్థితుల కారణంగా ధాన్యం చౌకగా సరఫరా కాకుండా వుంటే – ఇది దీర్ఘకాలంపాటు కొనసాగిన మేరకు, రొట్టె ధర పెరగటం కారణంగా వేతనాలు కూడా పెరుగుతాయి. మిగిలిన అన్ని

అంశాలు యథాతథంగా వున్న మేరకు లాభం రేటు దానికి అనుగుణంగా పడిపోతుంది. ఈ సందర్భంలో పెరిగిన గిరాకి ఎ కంటే నాసిరకపు భూములను సాగులోకి తేవడం వల్ల తీరుతుందా లేక మిగిలిన నాలుగు భూముల్లో దేనిలోనయినా అదనంగా పెట్టుబడిని మదుపు పెట్టడం ద్వారా జరుగుతుందా అన్నదానితో ఇక్కడ ప్రమేయం లేదు. అప్పుడు వ్యత్యాసపు కౌలు పడిపోతున్న లాభం రేటుతో పాటు పెరుగుతుంది.

అప్పటికే సాగు చేసిన భూములలో పెట్టే అదనపు పెట్టుబడుల ఉత్పాదకత తగ్గుతూ వుంటే అది ఉత్పత్తి ధరలో పెరుగుదలకు, లాభం రేటులో తగ్గుదలకు, వ్యత్యాసపు కౌలు పెరుగుదలకు – వ్యత్యాసపు కౌలు అన్ని నిర్ణీత పరిస్థితుల్లోనూ, అన్ని రకాల భూముల్లోనూ ఎ కంటే నాసిరకపు భూముల మార్కెట్టు ధరను శాసిస్తున్నట్టుగా పెరుగుతుంది – లేదా అందుకు దారితీయవచ్చు. ఇటువంటి సందర్భాన్ని ఏకైక ఉదాహరణగా రికార్డో చూపించాడు. ఇది ఒక సాధారణమైన ఉదాహరణ. వ్యత్యాసపు కౌలు II ఏర్పడే ప్రక్రియ మొత్తాన్ని ఈ సాధారణ ఉదాహరణకు అతడు కుదిస్తాడు.

కేవలం ఎ తరహా భూములు మాత్రమే సాగుచెయ్యబడి దానిలో వరుసగా పెట్టే పెట్టుబడులకు అనుగుణమైన ఉత్పత్తి పెరుగుదల లభించనప్పుడు కూడా ఇదే వర్తిస్తుంది.

ఇక్కడ వ్యత్యాసపు కౌలు II విషయంలో వ్యత్యాసపు కౌలు I ని పూర్తిగా విస్మరించడం జరుగుతుంది.

అదనపు నాసిరకపు భూములు కొత్తగా సాగులోనికి తేబడేదాకా, లేదా వివిధ రకాల నేలల్లో పెట్టిన అదనపు పెట్టుబడి యొక్క మొత్తం ఉత్పాదితం ఇంతవరకూ అమలులో వున్న ఉత్పత్తి ధర కంటే ఎక్కువ ధరకు మాత్రమే సరఫరా చెయ్యటం సాధ్యమైనంత వరకూ – సాగులో ఉన్న భూముల నుంచి వచ్చే సరఫరా చాలకపోవటమూ ఆ రకంగా మార్కెట్టు ధర ఉత్పత్తి ధర కంటే ఎప్పుడూ ఎక్కువగా ఉండే సందర్భంలో తప్ప అదనపు పెట్టుబడుల ఉత్పాదకత పడిపోవడం అన్నది అమల్లో వున్న ఉత్పత్తి ధరను, లాభం రేటును యథాతథంగా వుంచుతుంది. ఇక మిగిలిన విషయాలకు వస్తే మూడు అదనపు ఉదాహరణలు సాధ్యం.

అ. ఎ, బి, సి, డి భూముల రకాలలో ఒకదానిలో పెట్టిన అదనపు పెట్టుబడి ఎ ఉత్పత్తి ధర నిర్ణయించిన లాభం రేటును మాత్రమే ఇస్తే అప్పుడు అదనపు లాభంగాని, గుప్త కౌలుగాని ఏర్పడదు. ఎ రకం అదనపు భూములే సాగులోకి తేవడంతో సమానమవుతుంది.

ఆ. అదనపు పెట్టుబడి ఎక్కువ ఉత్పాదితాన్ని ఇస్తే కొత్త అదనపు లాభం (గుప్తకౌలు) ఏర్పడుతుంది. అయితే అమల్లో వున్న ధర యథాతథంగా ఉండాలి. ఇలాగే జరగాలని లేదు. ముఖ్యంగా అదనపు ఉత్పత్తి ఎ భూమినే సాగునుంచి తొలగించినప్పుడు అంటే పోటీలో వున్న భూముల వరుస నుంచి తప్పించినప్పుడు ఇలా జరుగదు. ఈ సందర్భంలో అమల్లో వున్న ఉత్పత్తి ధర పడిపోతుంది. దీనితోపాటు వేతనాలు కూడా పడిపోతే లేదా స్థిర పెట్టుబడిలో భాగంగా ఒక చౌక ఉత్పాదితం ప్రవేశిస్తే లాభం రేటు పెరుగుతుంది. అదనపు పెట్టుబడి యొక్క పెరిగిన ఉత్పాదకత ఉత్తమ భూములయిన సి, డిల నుంచి వచ్చి ఉంటే అప్పుడవి పూర్తిగా పెరిగిన ఉత్పాదకతపైన అదనపు కొత్త పెట్టుబడి మొత్తంపైన ఆధారపడి వుంటుంది. పెరిగిన అదనపు

లాభం (పెరిగిన కౌలు) ఏర్పడటం అన్నది ధరలు పడిపోవటంలోనూ, లాభం రేటు పెరగటం లోనూ ఏ మేరకు ముడిపడి వున్నది అన్నదానిపైన ఆధారపడి వుంటుంది. వేతనాలు పడిపోయి నప్పటికీ స్థిర పెట్టుబడిలో ఉన్న అంశాలు చౌకగా లభించటం ద్వారా కూడా లాభం రేటు పెరగవచ్చు.

ఇ. తగ్గుతున్న అదనపు లాభంతోపాటు అదనపు పెట్టుబడి మదుపు పెట్టబడితే, అదనపు పెట్టుబడి అప్పటికే ఎ భూమిపై వచ్చే దిగుబడి కంటే అదనపు ఫలితాన్ని ఇస్తూ వుంటే – ఎ భూమి సాగులో నుంచి తప్పించబడితే తప్ప మిగిలిన అన్ని పరిస్థితుల్లోనూ అదనపు లాభం అన్నది కొత్తగా ఏర్పడుతుంది. ఇది డి, సి, బి, ఎ లలో ఏకకాలంలో జరగవచ్చు. అయితే మరోవైపున ఎ భూమిని సాగునుంచి తప్పిస్తే అమల్లో వున్న ఉత్పత్తి ధర పడిపోతుంది. ఒక బస్తా తగ్గిన ధరకు అదనపు లాభాన్ని ఏర్పరుస్తున్న పెరిగిన బస్తాల సంఖ్యకు మధ్య వున్న సంబంధంపైన అది ఆధారపడి వుంటుంది. డబ్బు రూపంలో వ్యక్తమైన అదనపు లాభం అనగా వ్యత్యాసపు కౌలు పెరిగినా తగ్గినా ఇది జరుగుతుంది. ఏమైనప్పటికీ వరుసగా పెట్టే పెట్టుబడుల మదుపుల నుంచి అదనపు లాభం పడిపోవడంతోపాటు ఉత్పత్తి ధర పెరుగుతున్నట్లు పైకి కనిపించినప్పటికీ అది పెరగటానికి బదులు పడిపోవచ్చు.

క్రమంగా తగ్గుతున్న అదనపు దిగుబడులనిచ్చే అదనపు మదుపులు ఈ ఉదాహరణకు పూర్తిగా అనుగుణంగా వుంటాయి. ఉదాహరణకు నాలుగు కొత్త స్వతంత్ర పెట్టుబడులు $2\frac{1}{2}$ పౌండ్ల చొప్పున మదుపు పెట్టబడినాయి. భూముల సారం ఎ, బి లకు మధ్య, బి, సి లకు మధ్య, సి, డి లకు మధ్య వుంది. అవి వరుసగా $1\frac{1}{2}$, $2\frac{1}{3}$, $2\frac{2}{2}$, 3 బస్తాల దిగుబడి ఇస్తాయి. వీటిపై పెట్టిన అదనపు పెట్టుబడులకుగానూ అదనపు లాభం (గుప్తకౌలు) ఈ అన్ని భూముల్లోనూ ఏర్పడుతుంది. అయితే అదే మదుపు ఇంతకంటే మెరుగైన భూమిలో పెట్టినదానికంటే అదనపు లాభం రేటు పడిపోవచ్చు. ఈ నాలుగు పెట్టుబడులు డి లాంటి ఒకే భూమిలో పెట్టబడినాయా లేదా డి, ఎ లకు మధ్య పంపిణీ అయినాయా అన్నదానితో ఇక్కడ ప్రమేయం లేదు.

రెండు రూపాల వ్యత్యాసపు కౌలుల మధ్య ఉన్న ప్రధానమైన తేడాను మనం ఇప్పుడు పరిశీలిద్దాం.

వ్యత్యాసపు కౌలు I లో ఉత్పత్తి ధర స్థిరంగా వున్నప్పుడూ, వ్యత్యాసాలూ స్థిరంగా వున్నప్పుడూ ఎకరంపై వచ్చే సగటు కౌలు లేదా పెట్టుబడిపై వచ్చే సగటు కౌలు రేటు కౌలుతో పాటుగా పెరగవచ్చు. అయితే సగటు అన్నది కేవలం ఊహాజనితం మాత్రమే. ఇక్కడ వాస్తవ కౌలు మొత్తం ఎకరంపై లెక్కకట్టినా లేక పెట్టుబడిపై లెక్కగట్టినా ఒకేలా వుంటుంది.

మరోవైపున అవే పరిస్థితులలో, మదుపు పెట్టిన పెట్టుబడితో పోల్చితే వచ్చే కౌలురేటు యథాతథంగా వున్నప్పటికీ ఎకరంపై లెక్కకట్టిన కౌలు పెరగవచ్చు.

$2\frac{1}{2}$ పౌండ్లకు బదులు ఎ, బి, సి, డి నేలల్లో ఒక్కొక్కదానిలో 5 పౌండ్ల చొప్పున పెట్టుబడి పెట్టబడిందనుకుందాం. అనగా 10 పౌండ్లకు బదులు 20 పౌండ్లు పెట్టబడింది. ఉత్పత్తి రెట్టింపు అయింది. ఇక్కడ సాపేక్ష సారం యథాతథంగా వుంటుంది. ఇది ప్రతీ రకం భూముల్లోనూ ఒక

ఎకరానికి బదులు రెండు ఎకరాలు సాగుచేసిన దానితో సమానం అవుతుంది. లాభం రేటు అలాగే వుంటుంది. అదనపు లాభంతో గాని, లేదా కౌలుతో గాని దాని సంబంధం అలాగే వుంటుంది. ఇప్పుడు ఎ 2 బస్తాలను, బి 4 బస్తాలను, సి 6 బస్తాలను, డి 8 బస్తాలను ఇస్తే గనుక – ఉత్పత్తి ధర బసాకు 3 పౌండ్లుగానే వుంటుంది. ఎందుకంటే ఈ పెరుగుదల అదే పెట్టుబడిలో రెట్టింపు అయిన సారం వలన కాక రెట్టింపు పెట్టుబడికి అదే నిష్పత్తిలో ఉన్న సారం వల్ల మాత్రమే సాధ్యమైంది. ముందు ఎ భూమిలో పండిన 1 బస్తా ధాన్యం ధర ఇంతకు ముందు 3 పౌండ్లు వున్నట్లుగానే ఇప్పుడు కూడా 2 బస్తాల ధర 6 పౌండ్లు వుంటుంది. ఈ నాలుగు భూములన్నింటిలోనూ పెట్టుబడి రెట్టింపు అయింది. కనుక లాభం కూడా రెట్టింపు అయింది. అదే నిష్పత్తిలో కౌలు కూడా రెట్టింపు అవ్వాల్సింది. బి విషయంలో అది 1 బస్తా బదులు 2 బస్తాలు, సి విషయంలో అది 2 బస్తాలకు బదులు 4 బస్తాలు, డి విషయంలో అది 3 బస్తాలకు బదులు 6 బస్తాలు. అదే విధంగా బి, సి, డి లకు వరుసగా డబ్బు రూపంలో వచ్చే కౌలు మొత్తాలు 6, 12, 18 పౌండ్లు వుంటాయి. ఎకరానికి దిగుబడి పెరిగినట్లే డబ్బు రూపంలో వున్న కౌలు కూడా రెట్టింపు అవుతుంది. పర్యవసానంగా ఈ డబ్బు కౌలునే పెట్టుబడి చేసిన సందర్భాలలో భూమి ధర కూడా రెట్టింపు అవుతుంది. ఈ రకంగా లెక్కిస్తే ధాన్యం రూపంలోనూ, డబ్బు రూపంలోనూ ఉన్న కౌలు మొత్తం పెరుగుతుంది. ఆ రకంగా భూమి ధర కూడా పెరుగుతుంది. ఎందుకంటే దానిని లెక్కించటంలో ఉపయోగించిన ప్రమాణం ఒక స్థిరమైన పరిమాణం కలిగిన విస్తీర్ణం. అంటే ఎకరం మరోవైపున పెట్టుబడిపైన లెక్కకట్టబడిన కౌలు రేటులో అనగా కౌలు మొత్తం యొక్క నిష్పత్తిలో ఎటువంటి మార్పు ఉండదు. 10 పౌండ్లపైన 18 పౌండ్ల కౌలు రావటం అంటే ఎంతో, 20 పౌండ్లుపై 36 పౌండ్లు రావడం కూడా అంతే అవుతుంది. ప్రతీ రకం భూమిలోనూ పెట్టిన పెట్టుబడికీ, దాని డబ్బు కౌలుకూ మధ్య ఉన్న నిష్పత్తికి కూడా ఇదే వర్తిస్తుంది. ఉదాహరణకు సి భూమిలో ఇంతకు ముందు $2\frac{1}{2}$ పౌండ్లు పెట్టుబడిపైన 6 పౌండ్లు కౌలు రాగా ఇపుడు 5 పౌండ్ల పెట్టుబడిపై 12 పౌండ్ల కౌలు వస్తుంది. ఇక్కడ మదుపు పెట్టబడిన పెట్టుబడుల మధ్య కొత్తగా తేడాలు రావు. అయితే కొత్త అదనపు లాభాలు మాత్రం వస్తాయి. ఎందుకంటే వాటిలో ఒక భూమిలో, లేదా అన్ని భూముల్లోనూ అదనపు పెట్టుబడి పెట్టగా ఇదివరకటి నిష్పత్తిలోనే దిగుబడి లభిస్తుంది కనుక. ఈ రెట్టింపు పెట్టుబడి కేవలం సి భూమిలో మాత్రమే పెట్టబడిందనుకుందాం. సి, బి, డిల మధ్య వున్న వ్యత్యాసపు కౌలు పెట్టుబడితో పోల్చి చూస్తే యథాతథంగా వుంటుంది. ఎందుకంటే సి నుంచి లభించే కౌలు మొత్తం రెట్టింపు అయిందంటే దానితో పెట్టిన పెట్టుబడి కూడా రెట్టింపు వుంది గనుక.

ఎకరంపై వచ్చే కౌలు ఉత్పత్తి రూపంలోనూ, డబ్బు రూపంలోనూ కూడా పెరగవచ్చు. ఆ రకంగా భూమి ధర కూడా పెరగవచ్చు. కాగా ఉత్పత్తి ధర, లాభం రేటు, వ్యత్యాసాలు యథాతథంగా వుండవచ్చు. (అందుచేత పెట్టుబడిపై అంచనాకట్టిన అదనపు లాభం రేటు లేదా కౌలు రేటు యథాతథంగా ఉంటాయి.)

తగ్గుతున్న అదనపు లాభం రేట్లు, కౌలు రేట్లతో పాటు కూడా ఇది జరగవచ్చు. అనగా ఇంకా కౌలును ఇస్తూ వున్న అదనపు పెట్టుబడి మొత్తాల ఉత్పాదకత తగ్గటంతోపాటు ఇది జరగవచ్చు.

రెండవ పెట్టుబడి $2\frac{1}{2}$ పౌండ్లు ఉత్పత్తిని రెట్టింపు చెయ్యలేదనుకుందాం. బి కేవలం $3\frac{1}{2}$ బస్తాలను, సి 5 బస్తాలను డి 7[1] బస్తాలను ఇచ్చాయనుకుందాం. అటువంటప్పుడు రెండో పెట్టుబడి అయిన $2\frac{1}{2}$ పౌండ్లకుగానూ బి భూమిపై వచ్చే అదనపు కౌలు 1 బస్తాకు బదులు కేవలం $\frac{1}{2}$ బస్తా మాత్రమే వుంటుంది. సి విషయంలో అది 2 బస్తాలకు బదులు 1 బస్తా, అలాగే డి విషయంలో 3 బస్తాలకు బదులు 2 బస్తాలు లభిస్తాయి. రెండు దఫాలుగా పెట్టిన పెట్టుబడులకు వాటిపై వచ్చే కౌలుకు మధ్య నిష్పత్తి – ఈ క్రింది విధంగా వుంటుంది.

| మొదటి పెట్టుబడి | | | | రెండవ పెట్టుబడి | | | |
|---|---|---|---|---|---|---|---|
| బి కౌలు | 3 పౌండ్లు | పెట్టుబడి | $2\frac{1}{2}$ పౌండ్లు | కౌలు | $1\frac{1}{2}$ పౌండ్లు | పెట్టుబడి | $2\frac{1}{2}$ పౌండ్లు |
| సి కౌలు | 6 పౌండ్లు | ” | $2\frac{1}{2}$ పౌండ్లు | కౌలు | 3 పౌండ్లు | ” | $2\frac{1}{2}$ పౌండ్లు |
| డి కౌలు | 9 పౌండ్లు | ” | $2\frac{1}{2}$ పౌండ్లు | కౌలు | 6 పౌండ్లు | ” | $2\frac{1}{2}$ పౌండ్లు |

పెట్టుబడి సాపేక్ష ఉత్పాదకత రేటు అలాగే పెట్టుబడిపై లెక్కించబడిన అదనపు లాభం రేటు ఇలా తగ్గినప్పటికీ, డబ్బు రూపంలోనూ, ధాన్యం రూపంలోనూ ఉన్న కౌలు పెరిగింది. బి భూమిలో 1 నుంచి $1\frac{1}{2}$ బస్తాలకు (3 పౌండ్ల నుంచి $4\frac{1}{2}$ పౌండ్లకు), సి భూమిలో 2 నుంచి 3 బస్తాలకు (6 నుంచి 9 పౌండ్లకు), డి భూమిలో 3 నుంచి 5 బస్తాలకు (9 నుంచి 15 పౌండ్లకు) పెరిగింది. ఈ సందర్భంలో ఎ భూమిలో పెట్టిన పెట్టుబడితో పోల్చితే, అదనపు పెట్టుబడుల విషయంలో వ్యత్యాసాలు తగ్గాయి. ఉత్పత్తి ధర యథాతథంగా వుంది. ఎకరంపైన కౌలు, ఎకరం భూమి ధర పెరుగుతాయి.

వ్యత్యాసపు కౌలు Iని ప్రాతిపదికగా తీసుకుని వ్యత్యాసపు కౌలు II యొక్క వివిధ కలయికల్ని ఇప్పుడు పరిశీలిద్దాం.

★ ★ ★

1. 1894, జర్మన్ సంపుటిలో ఇది 6 బస్తాలుగా వుంది - సం॥

## అధ్యాయం - 41

# వ్యత్యాసపు కౌలు II

# మొదటి అధ్యయనాంశం

# స్థిరమైన ఉత్పత్తి ధర

ఇంతకు ముందులాగే పరమ అధ్వాన్నపు భూమి ఎ లో పెట్టిన పెట్టుబడే మార్కెట్టు ధరను నియంత్రిస్తుందని భావిద్దాం.

I. బి, సి, డి భూముల్లో కౌలునిచ్చే ఏ భూమిలో అయినా పెట్టిన అదనపు పెట్టుబడి, ఎ భూమిలో పెట్టిన పెట్టుబడి ఉత్పత్తి చేసినంత మాత్రమే చేస్తుందనుకుందాం. అంటే నియంత్రణలో ఉన్న ఉత్పత్తి ధర ప్రకారం అది అదనపు లాభాన్ని కాక సగటు లాభాన్ని మాత్రమే ఇస్తుందనుకుందాం. అప్పుడు కౌలుపైన దాని ప్రభావం ఏమీ ఉండదు. ప్రతీది ఇంతకు ముందులాగానే ఉంటుంది. ఎ రకం భూములు అనగా పరమ అధ్వాన్నపు భూములు కొన్ని సాగు ప్రాంతానికి జతచేసిన దానితో ఇది సమానం.

II. వివిధ రకాల భూములలో ప్రతిదానిలోనూ పెట్టిన అదనపు పెట్టుబడులు వాటి పరిమాణానికి అనుగుణంగా అదనపు ఉత్పత్తిని ఇస్తాయి. మరోలా చెప్పాలంటే ప్రతీ భూమి యొక్క స్వభావాన్ని, బట్టి ప్రత్యేక సారాన్ని బట్టి ఉత్పత్తి పరిమాణం పెరుగుతుంది. అది అదనపు పెట్టుబడి పరిమాణానికి అనులోమంగా పెరుగుతుంది. 39వ అధ్యాయంలో మనం ఈ క్రింది పట్టిక–Iతో ప్రారంభించాం.

పట్టిక - I

| భూమి రకం | ఎకరాలు | పెట్టుబడి పౌం. | లాభం పౌం. | ఉత్పత్తి ధర పౌం. | ఉత్పత్తి బస్తాలు | అమ్మకం ధర పౌం. | రాబడి పౌం. | కౌలు: ధాన్యపు కౌలు | కౌలు: డబ్బు కౌలు | అదనపు లాభం రేటు |
|---|---|---|---|---|---|---|---|---|---|---|
| ఎ | 1 | $2\frac{1}{2}$ | $\frac{1}{2}$ | 3 | 1 | 3 | 3 | 0 | 0 | 0 |
| బి | 1 | $2\frac{1}{2}$ | $\frac{1}{2}$ | 3 | 2 | 3 | 6 | 1 | 3 | 120% |
| సి | 1 | $2\frac{1}{2}$ | $\frac{1}{2}$ | 3 | 3 | 3 | 9 | 2 | 6 | 240% |
| డి | 1 | $2\frac{1}{2}$ | $\frac{1}{2}$ | 3 | 4 | 3 | 12 | 3 | 9 | 360[1]% |
| మొత్తం | 4 | 10 | | 12 | 10 | | 30 | 6 | 18 | |

1. 1894 నాటి జర్మన్ సంపుటంలో ఈ అంకెలు 12%, 24%, 36%గా వున్నాయి - సం॥

ఈ పట్టిక ఇప్పుడు పట్టిక–II గా రూపాంతరం చెందింది.

## పట్టిక – II

| భూమి రకం | ఎకరాలు | పెట్టుబడి పౌం. | లాభం పౌం. | ఉత్పత్తి ధర పౌం. | ఉత్పత్తి బస్తాలు | బస్తా అమ్మకం ధర పౌం. | రాబడి పౌం. | కౌలు | | అదనపు లాభం రేటు |
|---|---|---|---|---|---|---|---|---|---|---|
| | | | | | | | | ధాన్యపు కౌలు | డబ్బు కౌలు | |
| ఎ | 1 | $2\frac{1}{2}+2\frac{1}{2}=5$ | 1 | 6 | 2 | 3 | 6 | 0 | 0 | 0 |
| బి | 1 | $2\frac{1}{2}+2\frac{1}{2}=5$ | 1 | 6 | 4 | 3 | 12 | 2 | 6 | 120% |
| సి | 1 | $2\frac{1}{2}+2\frac{1}{2}=5$ | 1 | 6 | 6 | 3 | 18 | 4 | 12 | 240% |
| డి | 1 | $2\frac{1}{2}+2\frac{1}{2}=5$ | 1 | 6 | 8 | 3 | 24 | 6 | 18 | 360% |
| మొత్తం | 4 | 20 | 4 | | 20 | | 60 | 12 | 36 | |

ఈ సందర్భంగా పట్టికలో చూపబడినట్లు భూములు అన్నిటిలోనూ పెట్టుబడి మదుపు రెట్టింపు కానవసరం లేదు. అదనపు పెట్టుబడి ఒకటి లేదా అంతకంటే ఎక్కువ కౌలు నిచ్చే భూముల్లో పెట్టబడినంత వరకు అది ఏ నిష్పత్తిలో ఉంది అన్నదానితో ప్రమేయం లేదు. ఒకే నియమం వర్తిస్తుంది. ప్రతి భూమిలోనూ పెరిగిన పెట్టుబడి నిష్పత్తిలోనే ఉత్పత్తి కూడా పెరుగుతుంది. భూమిలో పెట్టిన పెట్టుబడి పెరగటం ద్వారా మాత్రమే అదే నిష్పత్తిలో కౌలు కూడా పెరుగుతుంది. పెరిగిన పెట్టుబడికి అనులోమంగానూ, దాని ఫలితంగా ఉత్పత్తి, కౌలు పెరగటం అన్నది ఒకేరకపు కౌలునిచ్చే కమతాల సాగు ప్రాంతం పెరిగినప్పుడు, ఇంతకు ముందు పెట్టిన మొత్తంలోనే పెట్టుబడి అవసరం అయినప్పుడు – ఆ అదనపు భూములు అదనపు ఉత్పత్తిని, కౌలునూ ఇచ్చినట్లే ఇది కూడా. ఉదాహరణకు పట్టిక–II విషయంలో $2\frac{1}{2}$ పౌండ్ల అదనపు పెట్టుబడిని బి, సి, డి ల అదనపు ఎకరాలలో పెట్టి వుంటే ఫలితం యథాతథంగానే ఉంటుంది.

అంతేకాదు. ఈ ఊహ ప్రకారం పెట్టుబడి మరింత ఉత్పాదకంగా పెట్టబడలేదు. అదే ప్రాంతంలో ఇంతకు ముందులాగానే మరింత పెట్టుబడిని పెట్టడం ద్వారా అంతే ఫలితం లభిస్తుంది.

ఇక్కడ అన్ని సాపేక్ష నిష్పత్తులు యథాతథంగా ఉంటాయి. మనం ఇక్కడ నిష్పత్తుల్లో ఉన్న తేడాను పట్టించుకోకుండా కేవలం అంకగణిత తేడాలను పరిశీలిస్తే వివిధ భూముల్లో వ్యత్యాసపు కౌలు మారవచ్చు. ఉదాహరణకు అదనపు పెట్టుబడి కేవలం బి, డిలలో మాత్రమే పెట్టబడిం దనుకుందాం. అప్పుడు డి, ఎ లకు మధ్య తేడా 7 బస్తాలు. కాగా ఇంతకు ముందు తేడా 3 బస్తాలు మాత్రమే. బి, ఎ లకు మధ్య ఇంతకు ముందు తేడా 1 కాగా ఇప్పటి తేడా 3 బస్తాలు. సి, బి లకు మధ్య ఇంతకు ముందు తేడా +1 కాగా ఇపుడది – 1. ఈ తేడా సమానమైన పెట్టుబడి మొత్తాల ఉత్పాదకతల్లో ఉన్న తేడాను వ్యక్తం చేసే మేరకు వ్యత్యాసపు కౌలు I కి చాలా ప్రధానమైన అంశం. కాని ఇక్కడ అవి అప్రస్తుతం. ఎందుకంటే ఇది విభిన్న అదనపు పెట్టుబడుల లేదా అదనంగాని పెట్టుబడుల ఫలితం మాత్రమే. కాగా వివిధ కమతాలలో పెట్టిన సమానమైన పెట్టుబడి మొత్తాల వ్యత్యాసం యథాతథంగా ఉంటుంది.

III. అదనపు పెట్టుబడులు అదనపు ఉత్పత్తిని ఇస్తాయి. ఆ రకంగా అదనపు లాభాన్ని తెస్తాయి. అయితే ఇది తమ పరిమాణానికి అనుగుణమైన నిష్పత్తిలో కాక, రానురాను తగ్గిపోయే దిశగా జరుగుతుంది.

**పట్టిక – III**

| భూమి రకం | ఎకరాలు | పెట్టుబడి పౌం. | లాభం పౌం. | ఉత్పత్తి ధర పౌం. | ఉత్పత్తి బస్తాలు | బస్తా అమ్మకం ధర పౌం. | రాబడి పౌం. | కౌలు | | అదనపు లాభం రేటు |
|---|---|---|---|---|---|---|---|---|---|---|
| | | | | | | | | ధాన్యపు కౌలు | డబ్బు కౌలు | |
| ఎ | 1 | $2\frac{1}{2}$ | $\frac{1}{2}$ | 3 | 1 | 3 | 3 | 0 | 0 | 0 |
| బి | 1 | $2\frac{1}{2}+2\frac{1}{2}=5$ | 1 | 6 | $2+1\frac{1}{2}=3\frac{1}{2}$ | 3 | $10\frac{1}{2}$ | $1\frac{1}{2}$ | $4\frac{1}{2}$ | 90% |
| సి | 1 | $2\frac{1}{2}+2\frac{1}{2}=5$ | 1 | 6 | 3+2=5 | 3 | 15 | 3 | 9 | 180% |
| డి | 1 | $2\frac{1}{2}+2\frac{1}{2}=5$ | 1 | 6 | $4+3\frac{1}{2}=7\frac{1}{2}$ | 3 | $22\frac{1}{2}$ | $5\frac{1}{2}$ | $16\frac{1}{2}$ | 330% |
| మొత్తం | | $17\frac{1}{2}$ | $3\frac{1}{2}$ | 21 | 17 | | 51 | 10 | 30 | |

ఈ మూడవ ఊహ ప్రకారం వివిధ రకాల భూముల్లో ఈ రెండోసారి పెట్టిన అదనపు పెట్టుబడులు ఏకరీతిగా పంపిణీ అయినాయా లేదా అన్నదానితో ప్రమేయం లేదు. అదనపు లాభం యొక్క తగ్గిపోతున్న ఉత్పత్తి ఒక నిష్పత్తి ప్రకారం జరుగుతుందా లేదా అన్నదానితో కూడా ప్రమేయం లేదు. మొత్తం అదనపు పెట్టుబడులు అన్నీ కౌలు ఇచ్చే ఒకే భూమిలో పెట్టబడినాయా లేక వేరువేరు రకాల కౌలు నిచ్చే కమతాలలో సమంగా లేదా అసమంగా పంపిణీ అయినాయా అన్నదానితో కూడా ప్రమేయం లేదు. ఇక్కడ పరిణామం చెందే నియమానికి ఈ పరిస్థితులతో ప్రమేయం లేదు. కౌలునిచ్చే భూములు దేనిలోనయినా అదనపు పెట్టుబడులు, అదనపు లాభాన్ని ఇస్తాయని – అయితే అది పెరిగిన పెట్టుబడితో పోల్చినప్పుడు అంతకంటే తగ్గిపోతున్న నిష్పత్తిలో ఆ లాభాన్ని ఇస్తాయని మాత్రమే ఇక్కడ భావించ బడుతుంది. మన ముందు వున్న పట్టికను చూస్తే తగ్గుదల పరిమితులు ఇట్లా వుంటాయి. డి భూమిలో అనగా అత్యుత్తమ భూమిలో పెట్టిన మొట్టమొదటి పెట్టుబడి నుంచి వచ్చిన ఉత్పత్తి 4 బస్తాలు అనగా 12 పౌండ్లు అలాగే ఎ భూమిలో అనగా పరమ అధ్వాన్నపు భూమిలో పెట్టిన పెట్టుబడి నుంచి వచ్చిన ఉత్పత్తి 1 బస్తా. అనగా 3 పౌండ్లు. ఈ తగ్గుదలకు ఇవి రెండూ పరిమితులుగా వుంటాయి. అత్యుత్తమ భూమిలో మొదట పెట్టిన పెట్టుబడి దాని గరిష్ఠ పరిమితిగా ఉంటుంది. అలాగే ఎ భూమిలో పెట్టిన పెట్టుబడి, కౌలుగాని, అదనపు లాభంగాని ఇవ్వని ఆ పెట్టుబడి నుంచి వచ్చిన ఉత్పత్తి దాని అట్టడుగు పరిమితిగా ఉంటుంది. ఆ తరువాత పెట్టిన పెట్టుబడులు ఏ భూమిలో అయినా అదనపు లాభాన్ని ఇచ్చినప్పటికీ వాటి ఉత్పాదకత – తగ్గిపోతున్న దిశగా వుంటుంది. ఒకే సారం కలిగిన కొత్త కమతాలు మెరుగైన నేలల నుంచి సాగు ప్రాంతానికి కలపబడతాయి. ఈ సాగు భూముల్లో ఏదో ఒక తరహా సాగుభూమి మొత్తం పెంచబడుతుంది. ఇది రెండవ పేరాలో ఊహించబడిన అంశం. అలాగే మూడవ పేరా ప్రకారం అదనపు కమతాలు సాగులోకి తేబడతాయి. డి నుంచి ఎ

వరకూ అనగా అత్యుత్తమ భూముల నుంచి అత్యంత అధ్వాన్నపు భూముల వరకు వివిధ స్థాయిల్లో ఉన్న వాటి సారం పంపిణీ అవుతుంది. డి భూములలోనే వరుసగా మొత్తం పెట్టుబడులు పెడితే డి, ఎలకు మధ్య ఉన్న తేడాలు దానిలో ఉంటాయి. అంటే డి, సి లకు మధ్య వున్న తేడాలు – అలాగే డి, బి లకు మధ్య ఉన్న తేడాలు కూడా అందులో ఇమిడి వుంటాయి. కేవలం సి భూమిలో మాత్రమే మొత్తం పెట్టుబడులు పెట్టబడితే కేవలం సి, ఎలకు సి, బిలకు మధ్య ఉన్న తేడాలు మాత్రమే అందులో ఇమిడి వుంటాయి. కేవలం బి భూమిలో మాత్రమే పెట్టుబడిని ఉపయోగిస్తే బి, ఎ ల మధ్య మాత్రమే తేడాలు వుంటాయి.

కాని నియమం ఇదీ : కౌలు అన్నది మదుపు పెట్టబడిన అదనపు పెట్టుబడికి సమాంతరంగా కాకపోయినప్పటికీ ఈ భూములన్నింటిలోనూ నిరపేక్షంగా పెరుగుతుంది.

అదనపు పెట్టుబడిని, భూమిలో మదుపు పెట్టబడిన మొత్తం పెట్టుబడిని పరిగణనలోనికి తీసుకొన్నప్పుడు అదనపు లాభం రేటు తగ్గుతుంది. అయితే అదనపు లాభం పరిమాణం మాత్రం నిరపేక్షంగా పెరుగుతుంది. పెట్టుబడిపైన లాభం రేటు తగ్గినప్పటికీ మొత్తం మీద లాభం పరిమాణం పెరిగినట్లే ఇది కూడా. ఆ రకంగా బిలో పెట్టిన పెట్టుబడిపైన ఇప్పుడు సగటు అదనపు లాభం 90% కాగా మొదటి పెట్టుబడిపైన అదనపు లాభం 120%. మొత్తం మీద అదనపు లాభం 1 బస్తా నుంచి $1\frac{1}{2}$ బస్తాకు లేదా 3 పౌండ్ల నుంచి $4\frac{1}{2}$ పౌండ్లకు పెరుగుతుంది. రెట్టింపు పెరిగిన పెట్టుబడితో పోల్చకుండా చూసినట్లయితే మొత్తం కౌలు, మొత్తం మీద పెరిగింది. వివిధ భూముల నుంచి వచ్చే కౌళ్ళలోనూ వాటి సాపేక్ష నిష్పత్తులలోనూ ఉన్న తేడాలు ఇక్కడ వేరు వేరుగా వుండవచ్చు. అయితే తేడాలలో ఉన్న ఈ వైవిధ్యం ఒకదానితో ఒకటి పోల్చి చూడగా పెరిగిన కౌళ్ళ ఫలితం మాత్రమే – అంతేగాని దాని కారణం కాదు.

IV. మెరుగైన భూముల్లో అదనపు పెట్టుబడులు పెట్టినప్పుడు తొలి పెట్టుబడుల కంటే ఎక్కువ ఉత్పత్తిని ఇవ్వవచ్చు. అయితే దీనిని మరింత విశ్లేషించాల్సిన అవసరం లేదు. ఎకరంపై కౌలు పెరుగుతుందని వేరే చెప్పనక్కరలేదు. ఏ రకం భూమిలో పెట్టుబడులు పెట్టినప్పటికీ ఈ ఊహ ప్రకారం అదనపు పెట్టుబడికి అనులోమంగా కంటే ఎక్కువ కౌలు పెరుగుతుంది. ఈ సందర్భంలో అదనపు పెట్టుబడితోపాటు ఇతర మెరుగుదల అంశాలు కూడా ఇమిడి వుంటాయి. తక్కువ మొత్తంలో పెట్టే అదనపు పెట్టుబడి ఇంతకు ముందు ఎక్కువ మొత్తంలో పెట్టిన అదనపు పెట్టుబడిలాగే సమానమైన ప్రభావాన్ని కలిగించవచ్చు. లేదా మరింత ఎక్కువ ప్రభావాన్ని కలిగించవచ్చు. ఇది కూడా ఈ ఉదాహరణలో ఒక భాగం అవుతుంది. మొదట అదనపు పెట్టుబడితో ఇది సర్వసమానం కాదు. పెట్టుబడి యొక్క అన్ని మదుపుల్లోనూ దాని భిన్నత్వం అన్నది ప్రధానం. ఉదాహరణకు 100 పౌండ్లు పెట్టుబడి 10 పౌండ్ల లాభాన్ని ఇస్తే 200 పౌండ్లు మరొక పొలంలో 40 పౌండ్ల లాభాన్ని ఇచ్చాయనుకుందాం. అప్పుడు లాభం 10% నుంచి 20%కు పెరిగింది. ఆ మేరకు మరింత లాభదాయకమైన పొలంలో 50 పౌండ్లు వినియోగిస్తే లాభం 5 పౌండ్లకు బదులు 10 పౌండ్లు వచ్చిన దానితో ఇది సమానం. ఉత్పత్తిలో అనులోమంగా జరిగిన వృద్ధిని మనం లాభంతో ఇక్కడ ముడిపెట్టి ఆలోచిస్తాం.

అయితే ఇక్కడ వున్న తేడా ఏమంటే ఒక సందర్భంలో నేను పెట్టుబడిని రెట్టింపు చేస్తున్నాను. రెండవదానిలో అదే మొత్తం పెట్టుబడితో రెట్టింపు ప్రభావాన్ని సృష్టిస్తున్నాను. 1. సగం సజీవ, వాస్తవీకృత శ్రమలతో ఇంతకు ముందు పరిమాణం గల ఉత్పత్తి జరుగుతుంది. లేదా 2. అదే శ్రమతో ఉత్పత్తి రెట్టింపు అయ్యింది. లేదా 3. రెట్టింపు శ్రమతో ఇంతకు ముందు వున్న ఉత్పత్తి నాలుగు రెట్లు అయ్యింది. ఈ మూడు అంశాలు ఏ రకంగానూ సమానం కాదు. మొదటి సందర్భంలో సజీవ, వాస్తవీకృత రూపంలో వున్న శ్రమ విడుదల అయింది. దానిని మరో రకంగా పనిలో పెట్టవచ్చు. పెట్టుబడి (శ్రమ)ని విడుదల చెయ్యటం అంటే సంపదను వృద్ధి చెయ్యటమే. పెట్టుబడి సంచయనం ద్వారా ఈ అదనపు పెట్టుబడి లభించింది – అన్న ఫలితమే ఈ సందర్భంలో కూడా వస్తుంది. అయితే అది సంచయనానికి అవసరమైన శ్రమను పొదుపు చేస్తుంది.

100 పౌండ్ల పెట్టుబడి 10 మీటర్లను ఉత్పత్తి చేసిందనుకుందాం. ఈ 100లో స్థిర పెట్టుబడి, సజీవ శ్రమ, లాభం వుంటాయి. ఆ రకంగా ఒక మీటరు ఖర్చు 10 పౌండ్లు. ఇప్పుడు నేను 20 మీటర్లను అదే పెట్టుబడితో ఉత్పత్తి చెయ్యగలిగితే అప్పుడు 1 మీటరు ఖర్చు 5 పౌండ్లు అవుతుంది. మరోవైపున నేను 50 పౌండ్ల పెట్టుబడితో 10 మీటర్లను ఉత్పత్తి చెయ్యగలిగితే అప్పుడు కూడా మీటరు ఖర్చు 5 పౌండ్లే అవుతుంది. మొదటి సరుకుల సరఫరా సరిపోతే 50 పౌండ్ల పెట్టుబడి విడుదల చెయ్యబడుతుంది. 40 మీటర్లనే ఉత్పత్తి చెయ్యటం కోసం 200 పెట్టుబడిని నేను మదుపు పెట్టాల్సివస్తే అప్పుడు కూడా 1 మీటరు ఖర్చు 5 పౌండ్లు. ఇక్కడ విలువ, ధరల నిర్ధారణ ఎటువంటి తేడాను పరిశీలించటానికి అనుమతించదు. ఇక్కడ మొత్తం పెట్టుబడికీ, ఉత్పత్తికీ మధ్య వున్న నిష్పత్తిని మాత్రమే తెలియజేస్తుంది. అయితే మొదటి సందర్భంలో అదనపు పెట్టుబడి పొదుపు చెయ్యబడింది.[1] ఆ పెట్టుబడిని అవసరమైతే బహుశా రెట్టింపు ఉత్పత్తి చెయ్యటానికి ఉపయోగించబడుతుంది. రెండవ సందర్భంలో పెట్టబడిన పెట్టుబడి విడుదలయింది.[2] మూడవ సందర్భంలో మదుపు పెట్టబడిన పెట్టుబడిని పెంచటం ద్వారా మాత్రమే ఉత్పత్తి పెరుగుతుంది. అయితే ఇది గతంలో అదనపు ఉత్పత్తిని సరఫరా చేసిన ఉత్పాదక శక్తి యొక్క నిష్పత్తిలోనే కాకపోవచ్చు. (ఇది 1వ భాగానికి చెందుతుంది)

పెట్టుబడిదారీ ఉత్పత్తి దృష్టి నుంచి అస్థిర పెట్టుబడిని ఉపయోగించటం కంటే స్థిర పెట్టుబడిని ఉపయోగించటం ఎప్పుడూ చౌకగా ఉంటుంది. అదనపు విలువను పెంచటం కాదు. ఈ ఉత్పత్తి ఖర్చును తగ్గించడం. అదనపు విలువను సృష్టించే అంశమైన శ్రమ ఖర్చును కూడా పొదుపు చెయ్యటం ఇందులో ఇమిడి వుంటుంది. అమల్లో ఉన్న ఉత్పత్తి ధర మారనంత వరకూ ఇది పెట్టుబడిదారునికి లాభాన్ని తెచ్చిపెడుతుంది. నిజానికి దీనికి ముందు పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానానికి అనుగుణమైన రీతిలో పరపతి అభివృద్ధిచెంది ఉండాలి; రుణ పెట్టుబడి విస్తారంగా లభిస్తుండాలి. ఒకవైపున సంవత్సరం పొడుగునా అయిదుగురు కార్మికుల మొత్తం ఉత్పత్తి 100 పౌండ్లు అయితే, నేను 100 పౌండ్ల

1. 1894 జర్మన్ ప్రతి "పెట్టుబడి విడుదలయ్యింది" అని వుంది - సం॥
2. అదే గ్రంథం అదనపు పెట్టుబడి పొదుపు చెయ్యబడింది - సం॥

అదనపు స్థిర పెట్టుబడిని ఉపయోగిస్తాను. మరోవైపున 100 పౌండ్ల అస్థిర పెట్టుబడిని ఉపయోగిస్తాను. అదనపు విలువ రేటు 100% అయితే అయిదుగురు కార్మికులు సృష్టించిన విలువ 200 పౌండ్లు అవుతుంది. మరోవైపున 100 పౌండ్ల స్థిర పెట్టుబడి విలువ ఒకవేళ వడ్డీ రేటు 5% అయితే, పెట్టుబడిగా 100 పౌండ్ల విలువ 105 పౌండ్లు అవుతుంది. ఒకే మొత్తాల డబ్బు అవి చేసే ఉత్పత్తి దృష్టి నుంచి విభిన్న విలువల్ని వ్యక్తం చేస్తాయి. అవి స్థిర పెట్టుబడి విలువ ప్రమాణాలుగా అడ్వాన్సు చేయబడినాయా లేక అస్థిర పెట్టుబడి విలువ ప్రమాణాలుగానా అన్నదాన్ని బట్టి ఇది ఆధారపడి వుంటుంది. అంతేకాక పెట్టుబడిదారుల దృష్టిలో సరుకుల ఖర్చుకు సంబంధించి కూడా ఈ తేడా వుంటుంది. స్థిర పెట్టుబడిలో ఉన్న 100 పౌండ్ల నిశ్చల పెట్టుబడులుగా పెట్టబడిన మేరకు, కేవలం అరుగుదల మాత్రమే సరుకు విలువలోకి ప్రవేశిస్తుంది. కాగా వేతనాలకై పెట్టబడిన 100 పౌండ్లు మొత్తంగా సరుకుల్లో పునరుత్పత్తి కావాల్సిందే.

సాధారణంగా వలసబోయిన రైతులకు, స్వతంత్ర సన్నకారు రైతులకు పెట్టుబడి అనేదే వుండదు. ఒకవేళ లభించినా అధిక వడ్డీ రేట్లకే. వారి విషయంలో ఉత్పత్తిలో వేతనాలకు ప్రాతినిధ్యం వహించే భాగమే వారి ఆదాయం. కాగా పెట్టుబడిదారుని విషయంలో అది పెట్టుబడి అడ్వాన్సు అవుతుంది. కనుక మొదటివారు ఈ శ్రమ వ్యయాన్ని శ్రమ ఉత్పాదితానికి అనివార్యంగా అవసరమైన అంశంగా భావిస్తారు. శ్రమ ఉత్పాదితమే వారి ప్రధాన ధ్యేయం. అతని అవసర శ్రమ పోగా అదనపు శ్రమకు సంబంధించి చూస్తే అది స్పష్టంగానే అదనపు ఉత్పాదితంగా మారింది. అదనపు ఉత్పాదితాన్ని అతడు అమ్మగానే లేదా తనంతట తాను ఉపయోగించుకోగానే దానిని ఉత్పత్తి చెయ్యటానికి అతనికేమీ ఖర్చు కానట్లే అతడు భావిస్తాడు. ఎందుకంటే అతనికి వాస్తవీకృత శ్రమ ఏదీ ఖర్చు కాలేదు కనుక. కేవలం వాస్తవీకృత శ్రమను ఖర్చు పెట్టినప్పుడు మాత్రమే సంపదను అన్యధాకరించుకున్నట్లుగా అతడు భావిస్తాడు. అయితే ఆ ఉత్పాదితాన్ని సాధ్యమైనంత ఎక్కువ ధరకే అమ్మాలనుకుంటాడు. దాని విలువ కంటే తక్కువకు – పెట్టుబడిదారీ ఉత్పత్తి ధర కంటే తక్కువకు – అమ్మినప్పటికీ రుణాలు, తనఖాలు లేకుండా ఉంటే అప్పుడు కూడా అతనికి లాభదాయకంగానే ఉన్నట్లు అనిపిస్తుంది. అయితే పెట్టుబడిదారుని దృష్టి నుంచి స్థిర, అస్థిర పెట్టుబడి – మదుపులు రెండూ పెట్టుబడి అడ్వాన్సుగానే కన్పిస్తాయి. స్థిర పెట్టుబడి అడ్వాన్సు అన్ని అంశాలు యథాతథంగా ఉంటే సాపేక్షంగా ఎక్కువగా వుంటే ఉత్పత్తి ఖర్చును అలాగే సరుకుల విలువను అది తగ్గిస్తుంది. అదనపు శ్రమ నుంచి మాత్రమే అనగా అస్థిర పెట్టుబడిని వినియోగించడం ద్వారా మాత్రమే లాభం తలెత్తుతుంది. అయితే వ్యక్తిగత పెట్టుబడిదారునికి తన ఉత్పత్తి ధరలో సజీవ శ్రమే అన్నిటికంటే ఎక్కువ ఖర్చుతో కూడిన అంశంగా కనిపిస్తుంది. ఉత్పత్తి ధరను సాధ్యమైనంత తగ్గించాలని అతడనుకుంటాడు. సజీవ శ్రమతో పోల్చినపుడు సంచిత శ్రమ ఎక్కువగా ఉంటే సామాజిక శ్రమ, సామాజిక సంపద మరింతగా పెరుగుతుంది. వాస్తవానికి ఇది పెట్టుబడిదారీ తరహాలో వక్రీకరించబడిన పోటీ దృష్టి నుంచి ప్రతిదీ ఆ రకంగా వక్రీకరించబడినట్లు, తల్లక్రిందులుగా ఉన్నట్లు కనిపిస్తుంది.

ఉత్పత్తి ధరలు యథాతథంగా ఉన్నాయనుకుంటే, మెరుగైన భూముల్లో అనగా బి నుంచి పైనున్న భూములన్నింటిపైనా పెట్టుబడుల అదనపు మదుపులు పెడితే ఉత్పాదకత యథాతథంగా

ఉండొచ్చు. పెరగవచ్చు లేక తగ్గవచ్చు. ఎ భూమికి సంబంధించి మనం ఊహించిన పరిస్థితుల ప్రకారం ఉత్పాదకత యథాతథంగా ఉంటే ఆ భూమి కౌలును ఇవ్వకుండా ఇదివరకు లాగానే వుంటుంది. ఉత్పాదకత పెరిగితే ఎ భూమిలో పెట్టిన పెట్టుబడిలో ఒక భాగం కౌలు ఇవ్వదు. కాగా మిగిలిన భాగం కౌలునిస్తుంది. అయితే ఎ ఉత్పాదకత తగ్గితే ఇది అసాధ్యం అవుతుంది. అటువంటప్పుడు ఉత్పత్తి ధర యథాతథంగా ఉండదు. అది పెరుగుతుంది. అయితే ఈ సందర్భాలు అన్నింటిలోనూ అనగా అదనపు పెట్టుబడులపై వచ్చే అదనపు ఉత్పాదితం అనులోమంగా లేదా ఎక్కువగా లేదా తక్కువగా వచ్చే పరిస్థితులన్నింటిలోనూ, అనగా పెట్టుబడిపైన వచ్చే అదనపు లాభం రేటు ఈ పెట్టుబడి పెరిగినప్పుడు స్థిరంగా వున్నా, ఎక్కువగా వున్నా, తక్కువగా వున్నా, ఎకరంపైన లభించే అదనపు ఉత్పాదితమూ, దానికి అనుగుణమైన అదనపు లాభమూ పెరుగుతాయి. కనుక ధాన్య రూపంలోనూ, డబ్బు రూపంలోనూ గుప్తకౌలు కూడా పెరుగుతుంది. అదనపు లాభం లేదా కౌలు పరిమాణం పెరగటం అన్నది ఒక ఎకరంపైన లెక్కిస్తే అనగా ఒక స్థిరమైన పరిమాణం ప్రాతిపదికగా (ఈ సందర్భంలో ఒక ఎకరం లేదా ఒక హెక్టారు) ఈ పెరిగిన పరిమాణాన్ని లెక్కిస్తే, అది పెరుగుతున్న పరిమాణాన్ని వ్యక్తం చేస్తుంది. కనుక ఎకరంపైన లెక్కించబడిన కౌలు పరిమాణం అటువంటి పరిస్థితుల్లో కేవలం భూమిపై పెట్టిన పెట్టుబడి పెరగటం ఫలితంగా కూడా పెరుగుతుంది. ఉత్పత్తి ధరలు యథాతథంగా ఉన్నాయనుకుంటేనే ఇది జరుగుతుంది. మరోవైపున అదనపు పెట్టుబడి ఉత్పాదకత యథాతథంగా ఉందా, పెరిగిందా లేక తగ్గిందా అన్నదానితో ప్రమేయం లేకుండా ఇది జరుగుతుంది. ఉత్పాదకత పెరగటం తగ్గటం అన్నది ఎకరంపై కౌలు ఏ పరిమాణంలో పెరుగుతుంది అన్నదాన్ని మార్చవచ్చునే కానీ దాని పెరుగుదల అస్తిత్వాన్ని మాత్రం మార్చలేదు. ఇది వ్యత్యాసపు కౌలు II లో కనిపించే ప్రత్యేక రూపం – ఇది వ్యత్యాసపు కౌలు I నుంచి II ను వేరు చేసే అంశం. ఈ అదనపు పెట్టుబడులు అదేరకపు స్వభావం కలిగిన కొత్త భూముల్లో పెట్టబడితే అంటే వరుసగా ఒకే భూమిపై కాక వేరు వేరు భూముల్లో పెట్టబడితే కౌలు పరిమాణం ఇంతకు ముందు చూపించినట్టుగానే పెరుగుతుంది. మొత్తం సాగుభూమి నుంచి లభించే సగటు కౌలు కూడా పెరుగుతుంది. అయితే ఎకరం ప్రాతిపదికగా కౌలు పరిమాణం మాత్రం పెరగదు. మొత్తం ఉత్పత్తి అలాగే అదనపు ఉత్పత్తుల పరిమాణం విలువలకు సంబంధించిన మేరకు ఒకే ఫలితం వస్తే ఒక చిన్న భూభాగంపైన పెట్టుబడి కేంద్రీకరణ అన్నది ఎకరంపైన వచ్చే కౌలు మొత్తాన్ని పెంచుతుంది. కాగా అదే పరిస్థితుల్లో, మిగిలిన పరిస్థితులన్నీ యథాతథంగా ఉన్నప్పుడు, ఆ పెట్టుబడినే ఒక పెద్ద భూభాగంలో ఉపయోగిస్తే, అదే ప్రభావం కలగదు. పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం అభివృద్ధి చెందినకొద్దీ ఒకే కమతంపైనే పెట్టుబడి కేంద్రీకరణ కూడా అభివృద్ధి చెందుతుంది. కనుక ఎకరంపైన కౌలు కూడా అలాగే పెరుగుతుంది. ఉత్పత్తి ధరలు, భూమి రకాల మధ్య తేడాలు సమానంగా వున్న రెండు దేశాలలో సమానమైన మొత్తాల్లో పెట్టుబడిని పెట్టటం జరిగిందనుకుందాం. అయితే ఒక దేశంలో ఒక పరిమితమైన భూభాగంపైన పెట్టుబడులు వరుసగా కేంద్రీకరించబడినాయని అనుకుందాం. కాగా రెండవ దేశంలో ఒక పెద్ద భూభాగంలో సమన్వయీకృత రూపంలో పెట్టుబడులు పెట్టబడినా యనుకుందాం. అటువంటప్పుడు రెండు దేశాల్లోనూ మొత్తంగా లభించే కౌలు సమానంగానే

ఉన్నప్పటికీ మొదటి దేశంలో ఎకరంపైన లభించే కౌలు, అలాగే భూమి ధర రెండవ దేశంలో దానికంటే ఎక్కువగా ఉంటాయి. ఆ రకంగా కౌలు రేటు అన్నది ఇక్కడ వివిధ రకాల భూముల సహజ సారాలలో ఉన్న తేడాలను బట్టిగాని లేదా ఉపయోగించబడిన శ్రమ పరిమాణంలో ఉన్న తేడాను బట్టిగాని మార్పు చెందదు. అది కేవలం పెట్టుబడి విభిన్న రకాలుగా వినియోగించబడటం వల్ల వచ్చిన ఫలితం మాత్రమే.

మనం ఇక్కడ అదనపు ఉత్పాదితం అని పేర్కొంటున్నప్పుడు అదనపు లాభానికి ప్రాతినిధ్యం వహించే ఉత్పత్తిలో ఒక సమవిభాగం అని మాత్రమే అర్థం. సాధారణంగా అదనపు ఉత్పాదితం అని మనం ప్రస్తావిస్తున్నప్పుడు మొత్తం అదనపు విలువను లేదా కొన్ని సందర్భాల్లో సగటు లాభానికి ప్రాతినిధ్యం వహించే భాగాన్ని అది సూచిస్తుంది. కౌలు ఇచ్చే పెట్టుబడి విషయంలో ఈ పదం సంతరించుకునే ప్రత్యేక అర్థం ఇంతకుముందు పేర్కొన్నట్టుగానే పొరపాటు అవగాహనకు దారి తీస్తుంది.

★ ★ ★

# అధ్యాయం - 42

# వ్యత్యాసపు కౌలు II

# రెండవ అధ్యయనాంశం

## I. పడిపోతున్న ఉత్పత్తి ధర

పెట్టుబడి యొక్క అదనపు మదుపుల తాలూకు ఉత్పాదకత యథాతథంగా వున్నా, పడిపోయినా లేక పెరిగినప్పటికీ ఉత్పత్తి ధర పడిపోవచ్చు. I అదనపు మదుపు యొక్క ఉత్పాదకత యథాతథంగా వుందనుకుందాం.

ఈ సందర్భంలో – వివిధ రకాల భూముల్లో పెట్టిన పెట్టుబడులకు అనులోమంగానూ, ఈ భూముల స్వభావానికి అనుగుణంగానూ ఉత్పత్తి కూడా పెరుగుతుంది. అంటే భూముల మధ్య ఉండే స్థిరమైన తేడాలకు అనుగుణంగానే పెరిగిన పెట్టుబడి మదుపుతోపాటు అదనపు ఉత్పాదితం కూడా పెరుగుతుంది. ఈ ఉదాహరణలో వ్యత్యాసపు కౌలును ప్రభావితం చేసే ఎ భూమిలో ఎటువంటి అదనపు పెట్టుబడీ ఉండదు. ఈ భూమికి సంబంధించి అదనపు లాభం రేటు = 0. ఆ రకంగా అదనపు పెట్టుబడి ఉత్పాదకత దానితోపాటు అదనపు లాభం రేటు యథాతథంగా వుంటాయి గనుక అది 0 గానే ఉంటుంది.

అయితే ఈ పరిస్థితుల్లో అమలులో వుండే ఉత్పత్తి ధర పడిపోగలదు. ఎందుకంటే – అది దాని తర్వాత ఎ కంటే మెరుగైన భూమి అయిన బి లేదా మరింత మెరుగైన భూమికి సంబంధించిన ఉత్పత్తి ధర మాత్రమే. 'ఎ భూమి' ఉత్పత్తి ధరను క్రమబద్ధం చేసే అంశంగా ఉండజాలదు. కనుక పెట్టుబడి ఎ నుంచి వెనక్కు తీసుకోబడుతుంది. నియంత్రించే ఉత్పత్తి ధర సి భూమి ప్రాతిపదికగా నిర్ణయించబడితే ఎ, బిల నుండి అంటే సి కంటే అధ్వాన్నంగా ఉన్న భూములన్నీ ధాన్యం ఉత్పత్తి చేసే భూముల నుంచి ఉపసంహరింపబడతాయి. మనం ఊహిస్తున్న పరిస్థితుల ప్రకారం అదనపు పెట్టుబడుల వల్ల వచ్చే అదనపు దిగుబడి గిరాకీని సంతృప్తిపరచాలి. ఆ రకంగా ఎ లాంటి తక్కువ రకం భూముల్ని పూర్తి సరఫరా కోసం పునస్థాపించడం అన్నది అనవసరం అవుతుంది.

ఉదాహరణకు మనం పట్టిక II ను చూద్దాం. అయితే 20 బస్తాల బదులు 18 బస్తాలు గిరాకీని సంతృప్తిపరుస్తాయనే తీరులోనన్న మాట. 'ఎ' భూమి రంగం నుంచి తప్పుకుంటుంది. 'బి'[1] భూమి దాని ఉత్పత్తి ధర అయిన 30 షిల్లింగులు నియంత్రణలోకొస్తాయి. అప్పుడు వ్యత్యాసపు కౌలు ఈ క్రింది రూపం సంతరించుకుంటుంది.

---

1. 1894 జర్మన్ సంపుటిలో 'డి' అని వుంది - సం॥

పట్టిక - IV

| భూమి రకం | ఎకరాలు | పెట్టుబడి పౌండ్లు | లాభం పౌం. | ఉత్పత్తి ధర పౌం. | ఉత్పత్తి బస్తాలు | బస్తా అమ్మకం ధర పౌండ్లు | రాబడి పౌండ్లు | కౌలు | | అదనపు లాభం రేటు |
|---|---|---|---|---|---|---|---|---|---|---|
| | | | | | | | | ధాన్యపు కౌలు | డబ్బు కౌలు | |
| బి | 1 | 5 | 1 | 6 | 4 | $1\frac{1}{2}$ | 6 | 0 | 0 | 0 |
| సి | 1 | 5 | 1 | 6 | 6 | $1\frac{1}{2}$ | 9 | 2 | 3 | 60% |
| డి | 1 | 5 | 1 | 6 | 8 | $1\frac{1}{2}$ | 12 | 4 | 6 | 120% |
| మొత్తం | 3 | 15 | 3 | 18 | 18 | | 27 | 6 | 9 | |

పట్టిక IIతో పోల్చి చూస్తే కౌలు 36 పౌండ్ల నుంచి 9 పౌండ్లకు పడిపోయింది. ధాన్యం రూపంలో కౌలు 12 బస్తాల నుంచి 6 బస్తాలకు పడిపోయింది. మొత్తం ఉత్పత్తి 20 బస్తాల నుంచి 18 బస్తాలకు అనగా కేవలం 2 బస్తాలు మాత్రమే పడిపోయింది. పెట్టుబడి ప్రాతిపదికగా లెక్కించిన అదనపు లాభం రేటు 180% నుంచి 60%కు[1] అనగా 3వ వంతుకు పడిపోయింది. ఆ రకంగా ఉత్పత్తి ధర పడిపోవడంతోపాటు ధాన్య రూపంలోనూ, డబ్బు రూపంలోనూ ఉన్న కౌలు కూడా పడిపోయింది.

పట్టిక I తో పోలిస్తే కేవలం డబ్బు కౌలులో మాత్రమే తగ్గుదల ఉంది. రెండు సందర్భాలలోనూ ధాన్యపు కౌలు 6 బస్తాలే అయితే ఒక సందర్భంలో 18 పౌండ్లూ, రెండవ సందర్భంలో అది 9 పౌండ్లూ మాత్రమే. సి[2] భూమి విషయంలో ధాన్యపు కౌలు పట్టిక I తో పోల్చి చూస్తే యథాతథంగానే ఉంది. నిజానికి ఏకరీతిగా వ్యవహరించే అదనపు పెట్టుబడి ఫలితంగా వచ్చిన అదనపు ఉత్పత్తి వల్ల మార్కెట్ నుంచి ఎ దిగుబడి మినహాయించబడింది. ఆ రకంగా ఎ భూమి పోటీలో ఉన్న ఉత్పత్తి అంశంగా రద్దు చేయబడింది. ఈ వాస్తవం కారణంగానే ఒక కొత్త వ్యత్యాసపు కౌలు I రూపొందింది. ఇంతకు ముందు అధ్వాన్నపు ఎ భూమి నిర్వహించిన పాత్రను ఇప్పుడు అంతకంటే మెరుగైన బి భూమి నిర్వహిస్తుంది. మరోవైపున బి వైపు నుంచి వచ్చే కౌలు మాయమైపోతుంది. బి, సి, డి ల మధ్య ఉన్న తేడాలు అదనపు పెట్టుబడి వల్ల ఉండదు. ఆ కారణంగా కౌలుగా మారే ఉత్పత్తి భాగం తగ్గిపోతుంది.

గిరాకీని ఎ భూమి ఉత్పాదితంతో సంతృప్తిపరచడం అనే అంశాన్ని సి లేదా డి లేదా రెంటిలో పెట్టే పెట్టుబడిని రెట్టింపు చేయడం ద్వారా మినహాయించగలిగితే అప్పుడు విషయం మరో రూపం తీసుకుంటుంది. ఉదాహరణకు మూడో పెట్టుబడి మదుపు సి భూమిలో జరిగిందనుకుందాం.

1. అదే సంపుటిలో ఒకటిన్నర, 180% నుంచి 90% అని వుంది - సం॥
2. అదే సంపుటి : 'సి, డి భూములకు' - సం॥

## పట్టిక - IV (అ)

| భూమి రకం | ఎకరాలు | పెట్టుబడి పౌండ్లు | లాభం పౌండ్లు | ఉత్పత్తి ధర పౌండ్లు | ఉత్పత్తి బస్తాలు | బస్తా అమ్మకం ధర పౌండ్లు | రాబడి పౌండ్లు | కౌలు | | అదనపు లాభం రేటు |
|---|---|---|---|---|---|---|---|---|---|---|
| | | | | | | | | ధాన్యపు కౌలు | డబ్బు కౌలు | |
| బి | 1 | 5 | 1 | 6 | 4 | $1\frac{1}{2}$ | 6 | 0 | 0 | 0 |
| సి | 1 | $7\frac{1}{2}$ | $1\frac{1}{2}$ | 9 | 9 | $1\frac{1}{2}$ | $13\frac{1}{2}$ | 3 | $4\frac{1}{2}$ | 60% |
| డి | 1 | 5 | 1 | 6 | 8 | $1\frac{1}{2}$ | 12 | 4 | 6 | 120% |
| మొత్తం | 3 | $17\frac{1}{2}$ | $3\frac{1}{2}$ | 21 | 21 | | $31\frac{1}{2}$ | 7 | $10\frac{1}{2}$ | |

పట్టిక–IV తో పోల్చి చూస్తే దీనిలో సి నుంచి వచ్చే దిగుబడి 6 నుంచి 9 బస్తాలకు పెరిగింది. అదనపు ఉత్పాదితం రెండు నుంచి 3 బస్తాలకు, డబ్బు కౌలు 3 పౌండ్ల నుంచి $4\frac{1}{2}$ పౌండ్లకు పెరిగింది. పట్టిక–II[1]లో డబ్బు కౌలు 12 పౌండ్లు. పట్టిక I లో అది 6 పౌండ్లు. వీటితో పోలిస్తే డబ్బు కౌలు తగ్గింది. మొత్తం ధాన్యపు కౌలు ఇందులో 7 బస్తాలు. 12 బస్తాలున్న పట్టిక II–తోనూ 6 బస్తాలున్న పట్టిక–I తోనూ పోల్చి చూస్తే అది పడిపోయింది. డబ్బు కౌలు విషయంలో కూడా ($10\frac{1}{2}$ పౌండ్లు) అది ఈ రెండు పట్టికలతోనూ పోల్చి చూస్తే (18 పౌండ్లు, 36 పౌండ్లు) పడిపోయింది.

$2\frac{1}{2}$ పౌండ్లను మూడవ మదుపు బి భూమిలో పెట్టుబడి పెడితే అది ఉత్పత్తి పరిమాణాన్ని ఖచ్చితంగా మార్చి ఉండేది. అయితే అది కౌలును ప్రభావితం చేసి వుండేది కాదు. ఎందుకంటే మన ఊహ ప్రకారం వరుసగా పెట్టే మదుపులు అదే భూమిపై తేడాలేవీ సృష్టించవు. బి భూమి కౌలు ఏదీ ఇవ్వదు.

మరోవైపున మనం ఈ మూడో మదుపు సి భూమిలో కాక డి భూమిలో జరిగిందనుకుందాం. ఫలితం ఇలా ఉంటుంది.

## పట్టిక - IV (ఆ)

| భూమి రకం | ఎకరాలు | పెట్టుబడి పౌండ్లు | లాభం పౌండ్లు | ఉత్పత్తి ధర పౌండ్లు | ఉత్పత్తి బస్తాలు | బస్తా అమ్మకం ధర పౌండ్లు | రాబడి పౌండ్లు | కౌలు | | అదనపు లాభం రేటు |
|---|---|---|---|---|---|---|---|---|---|---|
| | | | | | | | | ధాన్యపు కౌలు | డబ్బు కౌలు | |
| బి | 1 | 5 | 1 | 6 | 4 | $1\frac{1}{2}$ | 6 | 0 | 0 | 0 |
| సి | 1 | 5 | 1 | 6 | 6 | $1\frac{1}{2}$ | 9 | 2 | 3 | 60% |
| డి | 1 | $7\frac{1}{2}$ | $1\frac{1}{2}$ | 9 | 12 | $1\frac{1}{2}$ | 18 | 6 | 9 | 120% |
| మొత్తం | 3 | $17\frac{1}{2}$ | $3\frac{1}{2}$ | 21 | 22 | | 33 | 8 | 12 | |

1. అదే పుస్తకంలో I అని వుంది - సం.

ఇక్కడ మొత్తం ఉత్పాదితం 22 బస్తాలు. ఇది పట్టిక–I లోని ఉత్పాదితం కంటే రెట్టింపు కంటే ఎక్కువ. మదుపు పెట్టిన పెట్టుబడి 10 పౌండ్లకు ప్రతిగా కేవలం $17\frac{1}{2}$ పౌండ్లే అయినప్పటికీ ఆ సొమ్ము రెట్టింపు కాదు. మదుపు పెట్టుబడి రెట్టింపు కాదు. మొత్తం ఉత్పాదితం పట్టిక–II కంటే రెండు బస్తాలు అదనం. పట్టిక–IIలో పెట్టిన మదుపు నిజానికి దీనికంటే ఎక్కువ. అనగా 20 పౌండ్లు.

పట్టిక–Iతో పోలిస్తే డి భూమి ధాన్యపు కౌలు 3 నుంచి 6[1] బస్తాలకు పెరిగింది. కాగా డబ్బు కౌలు 9 పౌండ్లు. అంటే యథాతథంగా ఉంది. పట్టిక రెండుతో పోలిస్తే డి ధాన్యపు కౌలు యథాతథంగా ఉంది. అనగా 6 బస్తాలుంది. అయితే డబ్బు కౌలు 18 పౌండ్ల నుంచి 9 పౌండ్లకు పడిపోయింది.

మొత్తం కౌళ్ళను పోల్చి చూస్తే 'పట్టిక–IV(ఆ)' ధాన్యపు కౌలు = 8 బస్తాలు. అది పట్టిక–I (6 బస్తాలు) కంటే ఎక్కువ. పట్టిక–IVఎ (7 బస్తాలు) కంటే కూడా ఎక్కువ. అయితే పట్టిక–II (12 బస్తాలు) కంటే ఇది తక్కువ. పట్టిక–IVబి డబ్బు కౌలు = 12 పౌండ్లు. పట్టిక IVఎ $10\frac{1}{2}$ పౌండ్ల కంటే ఇది ఎక్కువ. పట్టిక–I 18 పౌండ్ల కంటే ఇది తక్కువ. పట్టిక–II 36 పౌండ్ల కంటే కూడా ఇది తక్కువ.

పట్టిక–IVబి (బి కౌలు రద్దు కావడంతో) పరిస్థితుల ప్రకారం మొత్తం కౌలు పట్టిక–I తో సమానం కావాలంటే అదనపు ఉత్పాదితం మరో 6 పౌండ్లు కావాలి. కొత్త ఉత్పత్తి ధర $1\frac{1}{2}$ పౌండ్ల ప్రకారం నాలుగు బస్తాలు అదనంగా అవసరం. పట్టిక Iలో లాగా అప్పుడు మళ్ళీ మొత్తం కౌలు 18 పౌండ్లు అవుతుంది. అవసరమైన అదనపు పెట్టుబడి పరిమాణం సిలో ఉపయోగించబడిందా? లేక డిలోనా? లేదా రెంటి మధ్య ఎలా విభజించబడింది? అన్న దానినిబట్టి మారుతూ వుంటుంది.

సిలో ఐదు పౌండ్ల పెట్టుబడి రెండు బస్తాల అదనపు ఉత్పాదితాన్ని ఇస్తుంది. అంటే 10 పౌండ్ల అదనపు పెట్టుబడి 4 బస్తాల అదనపు ఉత్పాదితాన్ని ఇస్తుంది. డిలో 5 పౌండ్ల అదనపు పెట్టుబడి 4 బస్తాల అదనపు ధాన్యపు కౌలును ఉత్పత్తి చేయడానికి సరిపోతుంది. అదనపు పెట్టుబడుల ఉత్పాదకత యథాతథంగా ఉంటుందని ఇక్కడ భావించబడుతుంది. అప్పుడు మనకు ఈ క్రింది ఫలితాలొస్తాయి.

**పట్టిక – IV (ఇ)**

| భూమి రకం | ఎకరాలు | పెట్టుబడి పౌండ్లు | లాభం పౌండ్లు | ఉత్పత్తి ధర పౌండ్లు | ఉత్పత్తి బస్తాలు | బస్తా అమ్మకం ధర పౌండ్లు | రాబడి పౌండ్లు | కౌలు | | అదనపు లాభం రేటు |
|---|---|---|---|---|---|---|---|---|---|---|
| | | | | | | | | ధాన్యపు కౌలు | డబ్బు కౌలు | |
| బి | 1 | 5 | 1 | 6 | 4 | $1\frac{1}{2}$ | 6 | 0 | 0 | 0 |
| సి | 1 | 15 | 3 | 18 | 18 | $1\frac{1}{2}$ | 27 | 6 | 9 | 60% |
| డి | 1 | $7\frac{1}{2}$ | $1\frac{1}{2}$ | 9 | 12 | $1\frac{1}{2}$ | 18 | 6 | 9 | 120% |
| మొత్తం | 3 | $27\frac{1}{2}$ | $5\frac{1}{2}$ | 33 | 34 | | 51 | 12 | 18 | |

1. 1894 నాటి జర్మన్ సంపుటిలో ఇది 2 అని వుంది - సం.

## పట్టిక – IV (ఈ)

| భూమి రకం | ఎకరాలు | పెట్టుబడి పౌండ్లు | లాభం పౌండ్లు | ఉత్పత్తి ధర పౌండ్లు | ఉత్పత్తి బస్తాలు | బస్తా అమ్మకం ధర పౌండ్లు | రాబడి పౌండ్లు | కౌలు | | అదనపు లాభం రేటు |
|---|---|---|---|---|---|---|---|---|---|---|
| | | | | | | | | ధాన్యపు కౌలు | డబ్బు కౌలు | |
| బి | 1 | 5 | 1 | 6 | 4 | $1\frac{1}{2}$ | 6 | 0 | 0 | 0 |
| సి | 1 | 5 | 1 | 6 | 6 | $1\frac{1}{2}$ | 9 | 2 | 3 | 60% |
| డి | 1 | $12\frac{1}{2}$ | $2\frac{1}{2}$ | 15 | 20 | $1\frac{1}{2}$ | 30 | 10 | 15 | 120% |
| మొత్తం | 3 | $22\frac{1}{2}$ | $4\frac{1}{2}$ | 27 | 30 | | 45 | 12 | 18 | |

మొత్తం డబ్బు కౌలు పట్టిక–IIతో పోలిస్తే సరిగ్గా సగం అవుతుంది. పట్టిక–IIలో అదనపు పెట్టుబడులు స్థిరమైన ఉత్పత్తి ఖర్చులున్న పరిస్థితుల్లో పెట్టబడినాయి.

పై పట్టికలను పట్టిక–I తో పోల్చి చూడటం అత్యంత ప్రధానమైన అంశం.

ఉత్పత్తి ధర సగానికి సగం అనగా బస్తాకు 60 షిల్లింగుల నుంచి 30 షిల్లింగులకు పడిపోయింది. అయితే మొత్తం డబ్బు కౌలు మాత్రం యథాతథంగా ఉంది. అనగా 18 పౌండ్లు ఉంది. ధాన్యపు కౌలు 6 నుండి 12 బస్తాలకు రెట్టింపు అయ్యింది. బి భూమిపైన కౌలు మాయమైంది. సి భూమిపైన డబ్బు కౌలు IV ఇ లో సగం పెరిగింది. IVఈ లో అది సగానికి పడిపోయింది. IV ఇ లో డి భూమిపైన డబ్బు కౌలు యథాతథంగా ఉంది. అనగా 9 పౌండ్లు ఉంది. IVఈ లో అది 15 పౌండ్లకు పెరిగింది. ఉత్పత్తి IVఇ లో 10 నుండి 34 బస్తాలకు పెరిగింది. IVఈ లో అది 30 బస్తాలకు పెరిగింది. లాభం IVఇ లో 2 పౌండ్ల నుంచి $5\frac{1}{2}$ పౌండ్లకి పెరిగింది. IVఈ లో అది $4\frac{1}{2}$ పౌండ్లకు పెరిగింది. మొత్తం పెట్టుబడి మదుపు ఒక సందర్భంలో 10 పౌండ్ల నుంచి $27\frac{1}{2}$ పౌండ్లకు పెరిగింది. రెండో సందర్భంలో 10 పౌండ్ల నుంచి $22\frac{1}{2}$ పౌండ్లకు పెరిగింది. రెండు చోట్లా అది రెట్టింపు కంటే ఎక్కువ పెరిగింది. కౌలు రేటు అనగా పెట్టుబడి మీద అంచనా వెయ్యబడిన కౌలు IV నుంచి IV ఈ వరకూ గల అన్ని పట్టికల్లోనూ ప్రతి ఒక్క భూమి విషయంలోనూ ఒకేలా ఉంది. ప్రతీ ఒక్క భూమిలోనూ వరుసగా పెట్టిన రెండు పెట్టుబడుల ఉత్పాదకత రేటు యథాతథంగా ఉంటుందని ముందుగానే ఊహించాము. అయితే పట్టిక–I తో పోల్చితే, ఈ రేటు సగటున అన్ని రకాల భూముల విషయంలోనూ, విడిగా ప్రతి భూమి విషయంలోనూ పడిపోయింది. అది పట్టిక–I లో సగటున 180% ఉంది. IVఇ లో అది $18/27\frac{1}{2}\times100 = 65\frac{5}{11}$ %. IVఈ లో $18/22\frac{1}{2}\times100=80\%$ ఉంది. ఎకరంపై సగటు డబ్బు కౌలు పెరిగింది. ఇంతకు ముందు పట్టిక–I లో మొత్తం నాలుగు ఎకరాలపైన సగటున $4\frac{1}{2}$ పౌండ్లు వుంది. కాగా IV ఇ, IVఈ లలో మూడు ఎకరాలపైన సగటున ఎకరానికి 6 పౌండ్లు వుంది. కౌలునిచ్చే భూమిపైన అది ఎకరానికి సగటున 6 పౌండ్లు ఉండేది. ఇప్పుడది 9 పౌండ్లు వుంది. ఎకరంపైన డబ్బు కౌలు పెరిగింది. అది ఇంతకు ముందు కంటే రెట్టింపు ధాన్యాన్ని సూచిస్తుంది. అయితే 12 బస్తాల ధాన్యపు కౌలు ఇప్పుడు వరుస వచ్చిన 34, 30 బస్తాల ధాన్యంతో పోల్చితే సగం కంటే తక్కువ ఉంది. కాగా పట్టిక–I లో 6 బస్తాలు మొత్తం ఉత్పత్తి

10 బస్తాలలో $\frac{3}{5}$ వంతుకు ప్రాతినిధ్యం వహిస్తుంది. అంటే మొత్తం ఉత్పత్తితో పోల్చినప్పుడు ధాన్యపు కౌలు పడిపోయింది. పెట్టుబడిపైన లెక్కగట్టిన డబ్బు కౌలు కూడా పడిపోయింది. అయితే ఎకరంపైన లెక్కగట్టబడిన దాని డబ్బు విలువ మాత్రం పెరిగింది. ఉత్పాదకంగా దాని విలువ మరింత పెరిగింది. IVఈ పట్టికలో డి భూమిని చూద్దాం. పెట్టుబడికి అనుగుణమైన ఉత్పత్తి ధర ఇక్కడ 15 పౌండ్లు. అందులో $12\frac{1}{2}$ పౌండ్లు మదుపు పెట్టబడిన పెట్టుబడి. డబ్బు కౌలు 15 పౌండ్లు. పట్టిక–Iలో అదే భూమి డి విషయంలో ఉత్పత్తి ధర 3 పౌండ్లు, మదుపు పెట్టుబడి $2\frac{1}{2}$ పౌండ్లు, డబ్బు కౌలు 9 పౌండ్లు అంటే రెండవ ఉదాహరణలో డబ్బు కౌలు ఉత్పత్తి ధరకు మూడింతలు ఉంది. పెట్టుబడితో పోల్చితే దాదాపు నాలుగింతలు ఉంది. IVఈ లో డి డబ్బు కౌలు 15 పౌండ్లు. ఇది ఉత్పత్తి ధరకు సరిగ్గా సమానంగా వుంది. పెట్టుబడి కంటే 5వ వంతు మాత్రమే ఎక్కువ అయినప్పటికీ ఎకరంపై వచ్చే డబ్బు కౌలు మూడింట రెండు వంతులు ఎక్కువ ఉంది. అనగా 9 పౌండ్లకు బదులు 15 పౌండ్లు లభించింది. పట్టిక–I లో మూడు బస్తాల ధాన్యపు కౌలు మొత్తం ఉత్పత్తి 4 బస్తాలతో పోల్చితే $\frac{3}{4}$ వంతు వుంది. IVఈ పట్టికలో అది 10 బస్తాలు ఉంది. అంటే డి భూమిలో మొత్తం ఉత్పత్తి ఎకరానికి 20 బస్తాలతో పోల్చితే దానిలో సగం డబ్బు కౌలు. అంటే డబ్బు విలువ అలాగే ఎకరంపైన వచ్చే కౌలు ధాన్యం విలువ పెరగవచ్చు. అదే సమయంలో మొత్తం దిగబడితో పోల్చినప్పుడు అది ఒక చిన్న భాగమే అయినప్పటికీ – మదుపు పెట్టుబడితో దాని నిష్పత్తి పడిపోయినప్పటికీ ఎకరంపైన మొత్తం మీద కౌలు యొక్క డబ్బు విలువ, ధాన్యం విలువ పెరగవచ్చు.

పట్టిక–I లో మొత్తం ఉత్పాదితం విలువ 30 పౌండ్లు, కౌలు 18 పౌండ్లు. అంటే సగం కంటే ఎక్కువ. IVఈ లో మొత్తం ఉత్పాదితం విలువ 45 పౌండ్లు. కౌలు 18 పౌండ్లు. అనగా సగం కంటే తక్కువ.

1 బస్తా పైన $1\frac{1}{2}$ పౌండ్ల ధర పడిపోయినప్పటికీ అనగా 50 శాతం పడిపోయినప్పటికీ పోటీలో వున్న భూమి 4 ఎకరాల నుంచి 3 ఎకరాలకు తగ్గిపోయినప్పటికీ మొత్తం డబ్బు కౌలు యథాతథంగా వుంది. మొత్తం ధాన్యపు కౌలు రెట్టింపు అయింది. ఎకరంపైన లెక్కించబడిన డబ్బు కౌలు, ధాన్యం కౌలు పెరిగాయి. దానికి కారణం – ఎక్కువ బస్తాల అదనపు ఉత్పాదితం ఉత్పత్తి అయింది. ధాన్యం ధర 50 శాతం పడిపోయింది. అదనపు ఉత్పాదితం 100% పెరిగింది. అయితే ఈ ఫలితం రావాలంటే మనం ఊహించిన పరిస్థితుల్లో మొత్తం ఉత్పత్తి మూడింతలు పెరగాలి. మెరుగైన భూముల్లో పెట్టుబడి మదుపు రెట్టింపు కంటే పెరగాలి. ఈ పెట్టుబడి మదుపు ఏ రేటులో పెరగాలి అనేది, అదనపు పెట్టుబడి మదుపులు ఉత్తమ భూములు, అత్యుత్తమ భూముల మధ్య పంపిణీ అయిన పద్ధతిపై ఆధారపడి వుంటుంది. ప్రతీ ఒక్క రకం భూమిలోనూ మదుపు పెట్టిన ఉత్పాదకత పెట్టుబడి పరిమాణానికి సమాంతరంగా వుంటుందని భావించబడుతుంది.

ఉత్పత్తి ధరలో తగ్గుదల కొద్దిగా వుంటే అదే డబ్బు కౌలును ఉత్పత్తి చెయ్యటానికి కొద్దిపాటి అదనపు పెట్టుబడి సరిపోతుంది. ఎ నేలను సాగునేల నుంచి తొలగించటానికి – ఇది కేవలం ఎ భూమి ఉత్పత్తిపైన మాత్రమే కాక మొత్తం సాగు ప్రాంతంలో ఎ వాటాపైన కూడా ఆధారపడి వుంటుంది. పెద్ద మొత్తంలో సరఫరా అవసరమైతే, అలాగే ఎ కంటే మెరుగైన భూమిలో ఉపయోగించాల్సిన అదనపు పెట్టుబడి ఎక్కువ అవసరమైతే మిగిలిన పరిస్థితులు యథాతథంగా వున్న మేరకు డబ్బు

కౌళ్ళు, ధాన్యం కౌళ్ళు మరింతగా పెరిగి వుండేవి. బి భూమి డబ్బు కౌలు గాని, ధాన్యపు కౌలు గాని ఇవ్వజాలనప్పటికీ.

ఎ భూమి నుంచి తొలగించిన పెట్టుబడి 5 పౌండ్లు అనుకుందాం. ఈ సందర్భంలో పోల్చాల్సిన పట్టికలు II, పట్టిక–IVఈ. మొత్తం ఉత్పాదితం 20 బస్తాల నుండి 30 బస్తాలకు పెరుగుతుంది. డబ్బు కౌలు సగం వుంటుంది. అనగా 36 పౌండ్లకు బదులు 18 పౌండ్లు వుంటుంది. ధాన్యపు కౌలు మాత్రం యథాతథంగా వుంటుంది. అనగా 12 బస్తాలు.

44 బస్తాలు (66 పౌండ్లు) $27\frac{1}{2}$ పౌండ్ల పెట్టుబడితో డి భూమిపైన ఉత్పత్తి చేయబడుతుందని అనుకుందాం. ఇది (డి విషయంలో $2\frac{1}{2}$ పౌండ్లు పెట్టుబడికి 4 బస్తాలు ఉత్పత్తి అవుతుందని ఇంతకు ముందు మనం చూశాం.) అప్పుడు మొత్తం కౌలు పట్టిక–II లో ఉన్న స్థాయికి చేరుకుంటుంది. ఆ పట్టిక ఇలా ఉంటుంది :

| భూమి రకం | పెట్టుబడి పౌండ్లు | ఉత్పత్తి బస్తాలు | ధాన్యపు కౌలు (బ.) | డబ్బు కౌలు (పౌండ్లు) |
|---|---|---|---|---|
| బి | 5 | 4 | 0 | 0 |
| సి | 5 | 6 | 2 | 3 |
| డి | $27\frac{1}{2}$ | 44 | 22 | 33 |
| మొత్తం | $37\frac{1}{2}$ | 54 | 24 | 36 |

పట్టిక–II లో వున్న మొత్తం ఉత్పత్తి 20 బస్తాలకు బదులు ఇప్పుడు ఇక్కడ 54 బస్తాలు వుంటుంది. డబ్బు కౌలు యథాతథంగా వుంది. అనగా 36 పౌండ్లు. మొత్తం పెట్టుబడి ఇక్కడ $37\frac{1}{2}$ పౌండ్లు ఉంది. పట్టిక II లో అది 20 పౌండ్లు. మొత్తం మదుపు పెట్టుబడి దాదాపు రెట్టింపు. ఉత్పత్తి దాదాపు మూడింతలు ఉంది. ధాన్యపు కౌలు రెట్టింపు వుంటుంది. డబ్బు కౌలు యథాతథంగా వుంటుంది. కనుక ఉత్పాదకత యథాతథంగా వుండి, ధర పడిపోతూ ఎ కంటే మెరుగైన భూములు అన్నింటిలోనూ కౌలు ఇచ్చే భూముల్లో అదనపు పెట్టుబడి పెరగటం వలన ఇలా జరిగితే అప్పుడు ఉత్పత్తి రేటు, ధాన్యపు రేటుతో సమానంగా మొత్తం పెట్టుబడి పెరగదు. ఆ రకంగా ధాన్యపు కౌలు పెరుగుదల అన్నది ధర పడిపోవడం వలన డబ్బు కౌలులో వచ్చిన నష్టాన్ని పూడ్చవచ్చు. ఇదే నియమం మదుపు పెట్టుబడి అనులోమంగా అంతే పెద్దగా ఉండాలన్న అంశంలో వ్యక్తం అవుతుంది. ఎందుకంటే సి, డిలలో అనగా ఎక్కువ కౌలు ఇచ్చే భూములకంటే తక్కువ కౌలు ఇచ్చే భూముల్లో ఎక్కువగా మదుపు పెట్టబడుతుంది. అసలు విషయం ఇది. డబ్బు కౌలు యథాతథంగా వుండాలి లేదా పెరగాలి అన్నప్పుడు ఒక నిర్దిష్టమైన అదనపు పరిమాణంలో అదనపు ఉత్పాదితాన్ని ఉత్పత్తి చేయాలి. అదనపు ఉత్పాదితాన్ని ఇచ్చే భూముల సారం ఎంత ఎక్కువగా ఉంటే పెట్టుబడి అంత తక్కువ అవసరం అవుతుంది. డి, సి లకు మధ్య సి, డిలకు మధ్య తేడా ఇంకా ఎక్కువగానే ఉంటే మరింత తక్కువ పెట్టుబడి అవసరం అవుతుంది. ప్రత్యేక నిష్పత్తి ఈ క్రింది అంశాలచేత నిర్ణయించ బడుతుంది. 1. పడిపోయిన ధర నిష్పత్తి. మరోలా చెప్పాలంటే ఇప్పుడు కౌలు ఇవ్వని భూమి బికి,

ఇంతకు ముందు కౌలు ఇవ్వని భూమి ఎకి మధ్య తేడా. 2. బి పైన, బి కంటే మెరుగైన భూముల మధ్య తేడాలు. 3. అదనంగా మదుపు పెట్టిన పెట్టుబడి మొత్తం. 4. వివిధ రకాల సారం కలిగిన భూముల్లో దాని పంపిణీ.

నిజానికి మొదటి నమూనాలో నిరూపితమైన అంశాన్నే ఈ నియమం కూడా వ్యక్తం చేస్తుంది. ఉత్పత్తి ధర నిర్ణీతంగా ఉన్నప్పుడు దాని పరిమాణం ఏమైనప్పటికీ అదనపు పెట్టుబడి మదుపు ఫలితంగా కౌలు పెరగవచ్చు. ఎ భూమిని తొలగించటం వల్ల ఇప్పుడు కొత్త వ్యత్యాసపు కౌలు ఒక్కటి అన్నది ప్రస్తుతం అత్యంత అధ్వాన్నమైన బి భూమి ప్రాతిపదికగా, కొత్త ఉత్పత్తిధర $1\frac{1}{2}$ పౌండ్ల ప్రాతిపదికగాను వుంటుంది. ఇది పట్టిక–IVకు, పట్టిక–IIకు కూడా వర్తిస్తుంది. ఇక్కడ ఎ భూమికి బదులు బి భూమి, 3 పౌండ్లకు బదులు ఉత్పత్తి ధర $1\frac{1}{2}$ పౌండ్లు మారటం తప్ప నియమం అదే వర్తిస్తుంది.

ఇక్కడ ప్రధానమైన అంశం ఇది. ఎ భూమి నుంచి పెట్టుబడిని ఉపసంహరించి అది లేకుండానే సరఫరాను సృష్టించటానికి అవసరమైన అదనపు పెట్టుబడి ఫలానా ఇంత కావాలన్న మేరకు దానితో పాటు ఒక ఎకరంపైన వచ్చే కౌలు యథాతథంగా ఉండవచ్చు, పెరగవచ్చు లేదా తరగవచ్చు. మొత్తం కమతాలు అన్నింటి నుంచి కాకపోయినా కనీసం కొన్నింటి నుంచి, సాగు చేసిన కమతాల సగటుకు సంబంధించిన మేరకు ఇది వర్తిస్తుంది. ధాన్యపు కౌలు, డబ్బు కౌలు ఒకదానితో మరొకటి ఏకరీతి సంబంధాన్ని కలిగి వుండవని మనం గమనించాం. ఆర్థిక రంగంలో కేవలం సంప్రదాయం వలన మాత్రమే ధాన్యపు కౌలుకు ఇంకా ఏదైనా ప్రాధాన్యం వుంది. ఉదాహరణకు ఒక కార్ఖానాదారుడు తన నూలును ఇంతకు ముందు తన 10 పౌండ్ల లాభంతో కొనగలిగినదాన్ని ఇప్పుడు 5 పౌండ్లకే కొనగలుగుతాడని ఎవరైనా వాదిస్తే వాదించవచ్చును. ఏమైనప్పటికీ భూస్వాములు కార్ఖానాల్లోనూ, చక్కెర పరిశ్రమల్లోనూ, డిస్టలరీస్ తదితరాలలోనూ ఏకకాలంలో యజమానులుగాను లేదా వాటాదార్లు గానూ ఉన్న సందర్భంలో తమకు అవసరమైన ముడి పదార్థాలన్నీ తామే ఉత్పత్తి చేసుకునే యజమాను లుగా మాత్రమే డబ్బు కౌలు పడిపోతున్నప్పుడు గణనీయమైన లాభాన్ని సంపాదించ గలుగుతారు.[1]

## II. అదనపు పెట్టుబడి యొక్క తగ్గిపోతున్న ఉత్పాదకత

ఈ సందర్భంలో ఇంతకు ముందు అంశంలో లాగానే ఉత్పత్తి ధర పడిపోతున్న మేరకు – ఇది కొత్తగా ఎటువంటి సమస్యలనూ లేవనెత్తదు. ఎ కంటే మెరుగైన భూముల్లో అదనపు పెట్టుబడి

1. పైన ఉన్న IV అ నుంచి IV ఈ వరకు గల పట్టికలు తిరిగి లెక్కించాల్సి వచ్చింది. మొదటి నుంచి వాటిలో దొర్లిన పొరపాట్లను సవరించాల్సి వచ్చింది. ఆ పట్టికల నుంచి తీసుకున్న సైద్ధాంతిక నిర్ధారణలను అది ప్రభావితం చెయ్యనప్పటికీ దానివల్ల ఎకరంపై వచ్చే ఉత్పత్తి విలువలు సంఖ్యాపరంగా విపరీతంగా పెరిగాయి. సూత్రరీత్యా ఇవి కూడా ఆక్షేపణీయం కాదు. నిజానికి అన్ని రకాల మ్యాపులలోనూ అడ్డంగా కంటే నిలువుగా పెద్ద స్కేలును తీసుకోవటం మామూలే. అయినప్పటికీ ఎవరైనా తనలోని వ్యవసాయ దారుని భావాలు గాయపడ్డాయని భావిస్తే అతడు ఆ ఎకరాల సంఖ్యను ఏ సంఖ్యతోనయినా హెచ్చించు కోవచ్చును. పట్టిక-II లో వున్న 1, 2, 3, 4 బస్తాలకు బదులు 10, 12, 14, 16 బుషెల్స్‌ను మార్చుకోవచ్చును. ఇతర పట్టికల నుంచి గ్రహించబడిన సంఖ్యాపరమైన విలువల్లో గణనీయమైన మార్పు ఉండదు. పెట్టుబడి పైన పెరిగే కౌలు నిష్పత్తి యథాతథంగా ఉంటుంది. తరువాత అధ్యాయంలో సంపాదకుడే కూర్చిన పట్టికల్లో ఈ విషయాన్ని చూపవచ్చు - ఎంగెల్స్.

మదుపులు ఎ భూమినే అవసరం చేసినప్పుడూ, ఎ నుంచి పెట్టుబడిని ఉపసంహరించుకున్నప్పుడు లేదా ఇతర ఉత్పాదితాల ఉత్పత్తిలో ఎ ని ఉపయోగించినప్పుడూ అది కొత్త సమస్యలను సృష్టించదు. ఈ అంశాన్ని పైన వివరంగా చర్చించాము. ఎకరంపైన వచ్చే ధాన్యపు కౌలు, డబ్బు కౌలు పెరగొచ్చు, తరగొచ్చు లేదా యథాతథంగా ఉండవచ్చు అని పైన చూపించబడింది.

సరిపోల్చటానికి వీలుగా ఈ కింది పట్టికను ఇక్కడ తిరిగి చూద్దాం.

**పట్టిక – IV**

| భూమి రకం | ఎకరాలు | పెట్టుబడి పౌండ్లు | లాభం పౌండ్లు | ఉత్పత్తి ధర బస్తాకు | ఉత్పత్తి బస్తాల్లో | ధాన్యపు కౌలు బస్తాలు | డబ్బు కౌలు బస్తాలు | అదనపు లాభపు రేటు |
|---|---|---|---|---|---|---|---|---|
| ఎ | 1 | $2\frac{1}{2}$ | $\frac{1}{2}$ | 3 | 1 | 0 | 0 | 0 |
| బి | 1 | $2\frac{1}{2}$ | $\frac{1}{2}$ | $1\frac{1}{2}$ | 2 | 1 | 3 | 120% |
| సి | 1 | $2\frac{1}{2}$ | $\frac{1}{2}$ | 1 | 3 | 2 | 6 | 240% |
| డి | 1 | $2\frac{1}{2}$ | $\frac{1}{2}$ | $\frac{3}{4}$ | 4 | 3 | 9 | 360% |
| మొత్తం | 4 | 10 | | | 10 | 6 | 18 | 180% |

బి, సి, డిలు తమ తగ్గిపోతున్న ఉత్పాదకతల్లో సరఫరా చేసిన 16 బస్తాల పరిమాణం సాగు నుంచి ఎ భూమిని తొలగించటానికి సరిపోతుందని భావిద్దాం. అటువంటప్పుడు పట్టిక–III ఈ క్రింది పట్టికగా మారుతుంది.

**పట్టిక – V**

| భూమి రకం | ఎకరాలు | పెట్టుబడి మదుపు పౌండ్లు | లాభం పౌండ్లు | ఉత్పత్తి బస్తాలు | అమ్మకం ధర పౌండ్లు | రాబడి పౌం. | ధాన్యపు కౌలు బస్తాలు | డబ్బు కౌలు పౌం. | అదనపు లాభం రేటు |
|---|---|---|---|---|---|---|---|---|---|
| బి | 1 | $2\frac{1}{2}+2\frac{1}{2}$ | 1 | $2+1\frac{1}{2}=3\frac{1}{2}$ | $1\frac{5}{7}$ | 6 | 0 | 0 | 0 |
| సి | 1 | $2\frac{1}{2}+2\frac{1}{2}$ | 1 | 3+2=5 | $1\frac{5}{7}$ | $8\frac{4}{7}$ | $1\frac{1}{2}$ | $2\frac{4}{7}$ | $51\frac{3}{7}\%$[1] |
| డి | 1 | $2\frac{1}{2}+2\frac{1}{2}$ | 1 | $4+3\frac{1}{2}=7\frac{1}{2}$ | $1\frac{5}{7}$ | $12\frac{6}{7}$ | 4 | $6\frac{6}{7}$ | $137\underline{1}\%$[2] |
| మొత్తం | 3[3] | 15 | | 16 | | $27\frac{3}{7}$ | $5\frac{1}{2}$ | $9\frac{3}{7}$ | $94\frac{2}{7}\%$[4] సగటు |

1. 1894 జర్మన్ సంపుటిలో ఇది $51\frac{2}{5}$ గా వుంది - సం.
2. ఇదే సంపుటం : $137\frac{1}{3}$ గా వుంది - సం.
3. ఇదే సంపుటం : 4 అని వుంది - సం.
4. ఇక్కడా, అలాగే IV, VII, VIII, IX, X పట్టికల్లో కౌలునీయని భూములను పరిగణనలోకి తీసుకోకుండా వదిలెయ్యడం జరిగింది - సం.

ఇక్కడ అదనపు పెట్టుబడి ఉత్పాదకత రేటు తగ్గిపోతుంది. వివిధ రకాల భూముల్లో ఈ తగ్గుదల భిన్నంగా ఉంది. నియంత్రణ ఉత్పత్తి ధర 3 పౌండ్ల నుంచి 15/7 పౌండ్లకు పడిపోయింది. పెట్టుబడి మదుపు సగం పెరిగింది. అనగా 10 పౌండ్ల నుంచి 15 పౌండ్లకు పెరిగింది. డబ్బు కౌలు దాదాపు సగానికి పడిపోయింది. అనగా 18 పౌండ్ల నుంచి $9\frac{3}{7}$ పౌండ్లకు పడిపోయింది. అయితే ధాన్యపు కౌలు $\frac{1}{12}$ వ వంతు మాత్రమే పడిపోయింది. అనగా 6 బస్తాల నుంచి $5\frac{1}{2}$ బస్తాలకు పడిపోయింది. మొత్తం ఉత్పత్తి 10 నుంచి 16కు పెరిగింది. అనగా 60%. మొత్తం ఉత్పత్తిలో ధాన్యపు కౌలు 3వ వంతుకంటే కొంచెం ఎక్కువ వుంది. అడ్వాన్సు చెయ్యబడిన పెట్టుబడి, డబ్బు కౌలుల నిష్పత్తి = $15:9\frac{3}{7}$. ఇంతకు ముందు ఈ నిష్పత్తి 10:18.

## III. అదనపు పెట్టుబడి యొక్క పెరిగే ఉత్పాదకత రేటు

ఈ అధ్యాయం మొదట్లో నమూనా I లో ఉత్పత్తి ధర పడిపోయి ఉత్పాదకత రేటు యథాతథంగా వుంటుంది. ఇక్కడ ఎ భూమిని తొలగించటానికి అవసరమైన స్థాయిలో అదనపు ఉత్పత్తి నిర్ణీత పరిమాణంలో అవసరమవ్వటం అన్నది తేడా. అది ఇక్కడ మరింత త్వరితంగా జరుగుతుంది.

వివిధ రకాల భూముల్లో అదనపు పెట్టుబడి మదుపుల ఉత్పాదకత పడిపోతున్నప్పుడు లేదా పెరుగుతున్నప్పుడు మదుపు పంపిణీ అయిన దానినిబట్టి ప్రభావం వేరు వేరుగా వుంటుంది. ఈ వేరు వేరుగా ఉండే ప్రభావం తేడాలను సమస్థితికి తీసుకురావటమో లేదా వాటిని పెంచటమో చేస్తుంది. ఆ మేరకు మెరుగైన భూముల వ్యత్యాసపు కౌలు – అలాగే మొత్తం కౌలు, వ్యత్యాసపు కౌలు I లో మాదిరిగానే పడిపోతుంది లేదా పెరుగుతుంది. ఇతర అంశాల్లో ప్రతీది భూమి పరిమాణాన్ని బట్టి, ఎ భూమితోపాటు మినహాయించిన పెట్టుబడిని బట్టి, గిరాకీని సంతృప్తిపరచటానికి అదనపు ఉత్పాదితాన్ని ఉత్పత్తి చెయ్యటానికై పెరుగుతున్న ఉత్పాదకతతో పాటు అవసరమైన అడ్వాన్సు చెయ్యబడిన పెట్టుబడి సాపేక్ష పరిమాణంపై అది ఆధారపడుతుంది.

ఇక్కడ విశ్లేషించదగిన అంశం ఒకే ఒక్కటి వుంది. వ్యత్యాసపు లాభం వ్యత్యాసపు కౌలుగా ఎలా మారుతుందన్న పరిశీలనకు అది మనల్ని వెనక్కు తీసుకుపోతుంది. ఆ అంశం ఇది :

మొదటి నమూనాలో ఉత్పత్తి ధర యథాతథంగా వుంది. ఎ భూమిలో పెట్టిన అదనపు పెట్టుబడి వ్యత్యాసపు కౌలును మార్చదు. ఎందుకంటే ఎ భూమి ఇదివరకులాగే కౌలును ఇవ్వదు. దాని ఉత్పత్తి ధర యథాతథంగా ఉంటుంది. మార్కెట్టు ధరను నియంత్రించడం కొనసాగిస్తుంది.

రెండవ నమూనాలో ఉత్పత్తి ధర పడిపోతుంది. ఉత్పాదకత రేటు యథాతథంగా వుంటుంది. ఎ భూమి తప్పనిసరిగా తొలగించబడుతుంది. ఒకటవ ఉదాహరణ కంటే రెండవ ఉదాహరణలో ఎక్కువ జరుగుతుంది. (రెండవ ఉదాహరణలో ఉత్పత్తి ధర, ఉత్పాదకత రేటు పడిపోతాయి) అలా కాకుంటే ఎ భూమిలో పెట్టిన పెట్టుబడి ఉత్పత్తి ధరను పెంచాల్సి వుంటుంది. రెండవ నమూనాలో మూడవ ఉదాహరణ అదనపు పెట్టుబడి ఉత్పాదకత పెరగటం వల్ల ఉత్పత్తి ధర పడిపోతుంది. కొన్ని పరిస్థితుల్లో ఈ అదనపు పెట్టుబడిని ఎ భూమిలోనూ, మెరుగైన భూముల్లో కూడా పెట్టవచ్చు.

ఎ భూమిలో పెట్టిన అదనపు పెట్టుబడి $2\frac{1}{2}$ పౌండ్లు అనుకుందాం. అది 1 బస్తాకు బదులు $1\frac{1}{5}$ బస్తాలు ఉత్పత్తి చేసిందనుకుందాం.

## పట్టిక - VI

| నేల రకం | ఎకరాలు | పెట్టుబడి పౌండ్లు | లాభం పౌం. | ఉత్పత్తి ధర పౌం. | ఉత్పత్తి బస్తాలు | బస్తా అమ్మకం ధర పౌం. | రాబడి పౌం. | కౌలు | | అదనపు లాభం రేటు |
|---|---|---|---|---|---|---|---|---|---|---|
| | | | | | | | | ధాన్యపు కౌలు | డబ్బు కౌలు | |
| ఎ | 1 | $2\frac{1}{2}+2\frac{1}{2}=5$ | 1 | 6 | $1+1\frac{1}{5}=2\frac{1}{5}$ | $2\frac{8}{11}$ | 6 | 0 | 0 | 0 |
| బి | 1 | $2\frac{1}{2}+2\frac{1}{2}=5$ | 1 | 6 | $2+2\frac{2}{5}=4\frac{2}{5}$ | $2\frac{8}{11}$ | 12 | $2\frac{1}{5}$ | 6 | 120% |
| సి | 1 | $2\frac{1}{2}+2\frac{1}{2}=5$ | 1 | 6 | $3+3\frac{3}{5}=6\frac{3}{5}$ | $2\frac{8}{11}$ | 18 | $4\frac{2}{5}$ | 12 | 240% |
| డి | 1 | $2\frac{1}{2}+2\frac{1}{2}=5$ | 1 | 6 | $4+4\frac{4}{5}=8\frac{4}{5}$ | $2\frac{8}{11}$ | 24 | $6\frac{3}{5}$ | 18 | 360% |
| | 4 | 20 | 4 | 24 | 22 | | 60 | $13\frac{1}{5}$ | 36 | 240% |

ఈ పట్టికను పట్టిక I తో మాత్రమే కాక పట్టిక II తో కూడా పోల్చి చూడాలి. పట్టిక II తో పెట్టుబడికి తగ్గట్టు స్థిరమైన ఉత్పాదకతతోపాటు పెట్టుబడి రెండింతలు అవుతుంది.

మన ఊహ ప్రకారం నియంత్రిత ఉత్పత్తి ధర పడిపోతుంది. అది 3 పౌండ్ల దగ్గర యథా తథంగా వుంటే, $2\frac{1}{2}$ పౌండ్ల మదుపుతో కౌలు ఇవ్వని ఎ భూమి మరింత అధ్వాన్నపు భూమిని సాగులోకి తేకుండానే ఇప్పుడు కౌలు ఇస్తుంది. ఇది భూమి ఉత్పాదకత పెరగటంవల్ల జరిగి వుంటుంది. అయితే మొదట పెట్టిన పెట్టుబడి విషయంలో కాక పెట్టుబడిలో ఒక భాగానికి మాత్రమే ఇది వర్తిస్తుంది. మొదటి 3 పౌండ్ల ఉత్పత్తి ధర 1 బస్తా ఇస్తుంది. రెండో పెట్టుబడి $1\frac{1}{5}$ బస్తాలు ఇస్తుంది. అయితే ఈ మొత్తం $2\frac{1}{5}$ బస్తాలు వాని సగటు ధరకే అమ్మబడతాయి. అదనపు పెట్టుబడి మదుపువల్ల ఉత్పాదకత రేటు పెరుగుతుంది కనుక ఇది మెరుగవుతుంది. ఈ మెరుగుదలలో ఎకరంపైన పెట్టే పెట్టుబడి పెరగవచ్చు. (మరింత ఎక్కువగా రసాయనిక ఎరువులు, యాంత్రిక శ్రమ వగైరా) లేదా ఈ అదనపు పెట్టుబడి ద్వారా మాత్రమే గుణాత్మకంగా భిన్నమైన మరింత ఉత్పాదకమైన పెట్టుబడి మదుపును సాధించవచ్చును. ఈ రెండు సందర్భాల్లోనూ ఎకరానికి 10 పౌండ్ల పెట్టుబడి మదుపు $2\frac{1}{5}$ బస్తాల ధాన్యాన్ని ఇస్తుంది. ఇందులో సగం పెట్టుబడి అనగా $2\frac{1}{2}$ పౌండ్లు 1 బస్తా ఉత్పాదితాన్ని మాత్రమే ఇస్తాయి. ఎ భూమితో ఉత్పాదితం తాత్కాలికంగా మారే మార్కెట్టు పరిస్థితులతో ప్రమేయం లేకుండా కొత్త సగటు ధరకు బదులు ఇదివరకులాగే ఎక్కువ ఉత్పత్తి ధరకే అమ్మబడుతుంది. సాగు భూమిలో గణనీయమైన భాగం ఎకరానికి $2\frac{1}{2}$ పౌండ్ల పెట్టుబడితో సాగు అవుతున్నంత కాలం ఇది వర్తిస్తుంది. అయితే ఎకరానికి 5 పౌండ్ల ద్వారా సంబంధమూ, మెరుగైన నిర్వహణ సార్వత్రికంగానే ఉత్పత్తి ధర పడిపోయి $2\frac{8}{11}$ పౌండ్ల దగ్గర నిలుస్తుంది. పెట్టుబడి యొక్క రెండు విభాగాల మధ్య వున్న తేడా అదృశ్యమవుతుంది. అప్పుడు నిజానికి ఎ భూమిలో ఎకరం సాగుకు కేవలం $2\frac{1}{2}$ పౌండ్లు మాత్రమే ఉపయోగించడం అసాధారణమవుతుంది. అంటే కొత్త ఉత్పత్తి పరిస్థితులకు అది అనుగుణంగా వుండదు. ఒకే ఎకరంలో పెట్టిన పెట్టుబడి యొక్క విభిన్న భాగాల దిగుబడుల తేడాగా అది ఉండ జాలదు. చాలినంత, చాలనంత పెట్టుబడుల మధ్య తేడాగా మాత్రమే ఉంటుంది. మొదటి

అంశం ఏమంటే – అధిక సంఖ్యలో కౌలుదారుల చేతుల్లో పెట్టుబడి చాలకపోవడంవల్ల (వారి సంఖ్య అధికంగా వుండాలి. ఎందుకంటే – కొద్దిమంది ఉత్పత్తి ధర కంటే తక్కువకు అమ్మేలా వత్తిడికి గురవుతారు.) వివిధ భూముల మధ్య అవరోహణ క్రమంలో వ్యత్యాసం తలెత్తటం లాంటి ప్రభావాన్ని కలిగిస్తుంది. అధ్వాన్నపు భూమిని నాసిరకంగా సాగు చెయ్యటంవల్ల మెరుగైన భూముల్లో కౌలు పెరుగుతుంది. అంతే అధ్వాన్నంగా ఉన్న భూమిని సహితం మెరుగ్గా సాగు చేసినప్పుడు కూడా ఆ భూమి కౌలు ఇవ్వవచ్చు. సాగు మెరుగ్గా లేనప్పుడు ఆ భూమి కౌలు ఇవ్వదు. రెండవ అంశం ఏమంటే ఒకే ప్రాంతం మొత్తంలో వరుసగా పెట్టిన పెట్టుబడులవల్ల తలెత్తిన మేరకు వ్యత్యాసపు కౌలు వాస్తవంలో ఒక సగటుగా మారుతుంది. ఈ సగటులో వివిధ పెట్టుబడి మదుపుల వేరువేరు ప్రభావాలు గుర్తించటానికి వేరు చెయ్యటానికి వీలుండదు. కనుక అధ్వాన్నపు భూమి నుంచి కౌలు తలెత్తదు. అయితే 1. దానివల్ల మొత్తం దిగుబడి యొక్క సగటు ధర అనగా ఎ భూమిలో ఉత్పాదితం ధర కొత్త ధరగా అమల్లోకి వస్తుంది. 2. కొత్త పరిస్థితుల్లో భూమిని సక్రమంగా సాగు చెయ్యటానికి అవసరమైన ఎకరంపై పెట్టే పెట్టుబడి పరిమాణంలో మార్పుగా కనిపిస్తుంది. వరుసగా పెట్టిన మదుపులు, వాటి ఫలితాలు ఒకదానితో ఒకటి కలిసిపోయి కనిపిస్తాయి. మెరుగైన భూముల నుంచి వచ్చే విడి వ్యత్యాసపు కౌలులకు కూడా సరిగ్గా ఇదే వర్తిస్తుంది. ప్రతి ఉదాహరణలోనూ ఆ ప్రత్యేకమైన భూమి నుంచి వచ్చే సగటు ఉత్పత్తికీ, ఇప్పుడు మామూలుగా మారిన పెరిగిన పెట్టుబడి మదుపుతో పరమ అధ్వాన్నపు భూమి నుంచి వచ్చే ఉత్పత్తికీ – మధ్య ఉన్న తేడాను బట్టి వ్యత్యాసపు కౌలులు ఉంటాయి.

పెట్టుబడి మదుపు లేకుండా ఏ భూమి ఉత్పాదితాన్ని ఇవ్వదు. సాధారణమైన వ్యత్యాసపు కౌలు అయిన వ్యత్యాసపు కౌలు I విషయంలో కూడా ఇలాగే వుంటుంది. ఎ భూమిలో ఒక ఎకరం అనగా ఉత్పత్తి ధరను క్రమబద్ధంజేసే భూమిలో ఒక ఎకరం – ఫలానా ఇంత ధరకు ఫలానా ఇంత ఉత్పత్తి ఇస్తుందని, బి, సి, డి మెరుగైన భూములు ఫలానా ఇంత వ్యత్యాసపు ఉత్పాదితాన్ని ఇస్తాయని; కనుక నియంత్రణలో వున్న ఉత్పత్తి ధర ప్రకారం ఫలానా ఇంత డబ్బు కౌలు ఇస్తాయని చెప్పబడినప్పుడు – అమల్లో ఉన్న ఉత్పత్తి పరిస్థితుల్లో ఒక నిర్దిష్ట పరిమాణం గల పెట్టుబడి, అనగా మామూలు అని భావించబడిన పెట్టుబడి, పెట్టబడుతుందని ఇక్కడ భావిస్తున్నాం.

అయితే, కొత్త సాగు పద్ధతి సాధారణమైన మామూలుగా మారిన వెంటనే ఉత్పత్తి ధర పడిపోతుంది. మెరుగైన భూముల కౌలు కూడా మరోసారి తగ్గుతుంది. ప్రసుత్తం సగటుగా మారిన అస్థిర పెట్టుబడి కలిగి ఉండని ఎ భూమిలో ఒక విభాగం – తన వ్యక్తిగత ఉత్పత్తి ధర కంటే, అనగా సగటు లాభం కంటే తక్కువకు అమ్మాల్సి వస్తుంది.

ఉత్పత్తి ధర పడిపోవటం విషయానికి సంబంధించి, అదనపు పెట్టుబడి తాలూకు ఉత్పాదకత తగ్గుదల నుంచి ఇలా జరగవచ్చు. మెరుగైన భూములు పెట్టుబడి మదుపును పెంచడంవల్ల అవసరమైన మొత్తం ఉత్పాదితం సరఫరా కాగానే ఎ భూమి నుంచి అస్థిర పెట్టుబడి ఉపసంహరించుకోబడుతుంది. ఈ ప్రత్యేకమైన ఉత్పాదితాన్ని ఉదాహరణకు గోధుమల్ని ఉత్పత్తి చెయ్యటంలో ఎ మాత్రం పోటీ చెయ్యదు. ఇప్పుడు అవసరమైన పెట్టుబడి పరిమాణం అంతకంటే మెరుగైన బి భూమిలో

పెట్టబడుతుంది. బి భూమి ఉత్పత్తి ధరను కొత్తగా శాసిస్తుంది. అది ఆ రకంగా సామాన్యమవుతుంది. వివిధ కమతాల యొక్క వేరువేరు సారాల గురించి మాట్లాడుతున్నప్పుడు ఎకరంపైన ఈ కొత్త, మామూలు పెట్టుబడి పరిమాణం వినియోగించబడిందని అర్థం.

మరోవైపున ఈ సగటు పెట్టుబడి మదుపు, తరువాత చేసుకునే కౌలు ఒప్పందాల్లో ప్రామాణికంగా మారుతుందనేది స్పష్టం. 1848కి ముందు ఇంగ్లాండులో అది ఎకరానికి 8 పౌండ్ల చొప్పున వుంది. ఆ తరువాత సంవత్సరాల్లో 12 పౌండ్లు వుంది. ఇంతకంటే ఎక్కువ ఖర్చు చేసే రైతుకు ఒప్పందం ఉన్న కాలంలో అదనపు లాభం కౌలుగా మారదు. ఒప్పందం అయిపోయాక కౌలుగా మారుతుందా లేదా అన్నది ఒకే మొత్తంలో అదనపు పెట్టుబడిని వెచ్చించే రైతుల మధ్య వున్న పోటీని బట్టి వుంటుంది. అదే స్థాయిలోనూ, అంతకంటే తక్కువ స్థాయిలోనూ పెట్టిన పెట్టుబడి ఉత్పాదితాన్ని పెంచటానికి వీలు కల్పించే విధంగా భూమిని శాశ్వతంగా బాగుచెయ్యటం గురించి మనం ఇక్కడ ప్రస్తావించటం లేదు. ఇలాంటి మెరుగుదలలు పెట్టుబడి ఉత్పాదితాలే అయినప్పటికీ, భూమి స్వభావంలో ఉన్న సహజమైన తేడాలు కలిగించే ప్రభావమే కలిగిస్తాయి.

ఇక్కడ వ్యత్యాసపు కౌలు I లో కనిపించని అంశం ఒకటి వ్యత్యాసపు కౌలు II లో పరిశీలనలోకి వస్తుంది. ఎందుకంటే ఎకరంపైన మామూలుగా పెట్టే మదుపు విషయంలో మార్పులతో వ్యత్యాసపు కౌలు I కి ప్రమేయం లేదు. ఒకవైపున ఇప్పుడు ఎకరానికి సగటున మామూలుగా వచ్చే ఉత్పాదితాన్ని ఇచ్చేదిగా కనిపించే ఎ భూమి క్రమబద్ధం చెయ్యటంలో వివిధ పెట్టుబడుల ఫలితాల మధ్య తేడాలు చెరిగిపోతాయి. మరోవైపున కనీస పెట్టుబడుల్లో లేదా ఎకరంపై పెట్టిన సగటు పెట్టుబడిలో మార్పు భూమి స్వభావంగానే కనిపిస్తుంది. అంతిమంగా అదనపు లాభాన్ని కౌలు రూపంగా మార్చే తీరులో ఉన్న తేడా ఇది.

అంతేకాక పట్టిక I, పట్టిక II లతో పోల్చితే, పట్టిక VI సూచించేది ఏమంటే ధాన్యపు కౌలు I తో పోల్చితే రెట్టింపు, II తో పోల్చితే $1\frac{1}{5}$ బస్తాలు పెరిగింది. డబ్బు కౌలు Iతో పోల్చితే రెట్టింపు అయింది. II తో పోల్చితే మార్పు ఏమీ లేదు. మెరుగైన భూముల్లో ఎక్కువ అదనపు పెట్టుబడిని వినియోగించి వుంటే లేదా మరోవైపున ఎ భూమిలో అదనపు పెట్టుబడి ప్రభావం తక్కువగా పెరిగి నియంత్రణ సగటు బస్తా ధర కొంత పెరిగితే డబ్బు కౌలు గణనీయంగా పెరిగి వుండేది. (మిగిలిన పరిస్థితులన్నీ యథాతథంగా వున్నాయనుకుంటే.)

అదనపు పెట్టుబడి ద్వారా పెరిగిన ఉత్పాదకత వివిధ రకాల భూముల్లో వివిధ రకాల ఫలితాలను ఇచ్చినప్పుడు దానివల్ల వ్యత్యాసపు కౌలుల్లో కూడా మార్పు వస్తుంది.

ఏమైనప్పటికీ పెట్టుబడి మదుపు రెట్టింపు అయినప్పటికీ ఎకరంపై వచ్చే కౌలు రెట్టింపు మాత్రమే కాక అంతకంటే ఎక్కువగా ఉండవచ్చు. అదనంగా పెట్టిన పెట్టుబడి ఉత్పాదకత రేటు పెరగటంవల్ల అనగా ముందస్తు పెట్టుబడి కంటే ఎక్కువ రేటు చొప్పున ఉత్పాదితం పెరిగినప్పుడు ఉత్పత్తి ధర పడిపోతుంది. ఎ భూమిలో ఉత్పాదకత అంతకంటే వేగంగా పెరగటం వల్ల ఉత్పత్తి ధర మరీ తక్కువకు పడిపోతే ఉత్పాదకత కూడా పడిపోవచ్చు.

బి, సి భూములలో అదనపు మదుపులు ఎ భూమిలోలాగా అంతే ఉత్పాదకతను పెంచటం

లేదనుకుందాం. ఆ రకంగా బి, సిల నిష్పత్తుల తేడాలు తగ్గి ఉత్పత్తిలో పెరుగుదల ధరలో తగ్గుదలను పూడ్చలేకపోయిందనుకుందాం. అప్పుడు పట్టిక II తో పోల్చితే డి నుండి వచ్చే డబ్బు కౌలు యథాతథంగా ఉంటూంది. బి, సి ల (డబ్బు) కౌలు పడిపోతుంది.

**పట్టిక – VI (అ)**

| భూమి రకం | ఎకరాలు | పెట్టుబడి పౌండ్లు | లాభం పౌండ్లు | ఎకరానికి ఉత్పత్తి బస్తాలు | అమ్మకం ధర పౌండ్లు | రాబడి పౌండ్లు | ధాన్యపు కౌలు బస్తాలు | డబ్బు కౌలు పౌండ్లు |
|---|---|---|---|---|---|---|---|---|
| ఎ | 1 | $2\frac{1}{2}+2\frac{1}{2}=5$ | 1 | 1+3=4 | $1\frac{1}{2}$ | 6 | 0 | 0 |
| బి | 1 | $2\frac{1}{2}+2\frac{1}{2}=5$ | 1 | $2+2\frac{1}{2}=4\frac{1}{2}$ | $1\frac{1}{2}$ | $6\frac{3}{4}$ | $\frac{1}{2}$ | $\frac{3}{4}$ |
| సి | 1 | $2\frac{1}{2}+2\frac{1}{2}=5$ | 1 | 3+5=8 | $1\frac{1}{2}$ | 12 | 4 | 6 |
| డి | 1 | $2\frac{1}{2}+2\frac{1}{2}=5$ | 1 | 4+12=16 | $1\frac{1}{2}$ | 24 | 12 | 18 |
| మొత్తం | 4 | 20 | | $32\frac{1}{2}$ | | | $16\frac{1}{2}$ | $24\frac{3}{4}$ |

చివరిగా ఉత్పదకత అనులోమంగా పెరిగినప్పుడు మెరుగైన భూముల్లో అదనపు పెట్టుబడి ఎక్కువగా పెట్టినప్పుడు అదనపు కౌలు ఎ భూమిలో కంటే పెరుగుతుంది. లేదా మెరుగైన భూముల్లో అదనపు మదుపులు ఉత్పాదకత రేటును పెంచడంలో ప్రభావం నెరపుతాయి. ఈ రెండు సందర్భాల్లోనూ తేడాలు పెరుగుతాయి.

అదనపు మదుపువల్ల వచ్చే మెరుగుదల తేడాలను పూర్తిగా లేదా పాక్షికంగా తగ్గించినప్పుడు, బి, సిల కంటే ఎ ని ఎక్కువగా ప్రభావితం చేసినప్పుడు డబ్బు కౌలు పడిపోతుంది. మెరుగైన భూముల్లో ఉత్పాదకత ఎంత తక్కువగా పెరిగితే డబ్బు కౌలు అంతగా పడిపోతుంది. ధాన్యపు కౌలు పెరుగుతుందా, పడిపోతుందా, లేక యథాతథంగా వుంటుందా అన్నది ఏ మేరకు ఈ ఉత్పత్తి అసమానత అన్నదానిపై ఆధారపడి వుంటుంది.

కౌలు ఇవ్వని ఎ భూమిలో కంటే కౌలు ఇచ్చే భూమిలో ఎక్కువ పెట్టుబడి పెట్టినప్పుడు, తక్కువ కౌలునిచ్చే భూమిలో కంటే, ఎక్కువ కౌలునిచ్చే భూముల్లో పెట్టినప్పుడు (వివిధ భూముల అదనపు సారాల నిష్పత్తుల తేడా యథాతథంగా ఉందనుకుందాం) డబ్బు కౌలు, ధాన్యపు కౌలు కూడా పెరుగుతాయి. లేదా ఎ భూమిలో కంటే మెరుగైన భూముల్లోనూ, అత్యుత్తమ భూముల్లోనూ సారం పెరిగినప్పుడు (అదనపు పెట్టుబడి యథాతథంగా వుందనుకుందాం) నాసిరకం భూములకు మించి మెరుగైన భూముల సారం పెరిగిన నిష్పత్తిలో డబ్బు కౌలు, ధాన్యపు కౌలు పెరుగుతాయి.

అయితే అన్ని రకాల పరిస్థితుల్లోనూ పెట్టుబడిని అదనంగా పెట్టిన ఫలితంగా ఉత్పాదకత శక్తి పెరిగినప్పుడు కౌలు సాపేక్షంగా పెరుగుతుంది. యథాతథంగా ఉన్న పెట్టుబడి మదుపుతో భూసారం పెరగటం కారణంగా మాత్రమే కానక్కరలేదు. ఈ పెట్టుబడి స్థిరమైన లేదా పడిపోయే ధరలలో స్థిరమైన ఉత్పాదకత రేటుతో పనిచేస్తుందా లేక స్థిరమైన లేదా పడిపోయే ధరలలో, పడిపోతున్న

ఉత్పాదకతతో పనిచేస్తుందా లేక పడిపోతున్న ధరలలో పెరుగుతున్న ఉత్పాదకతతో పనిచేస్తుందా అన్నదానితో ప్రమేయం లేకుండా ఎకరంపై వచ్చే కౌలు, పెరిగిన కౌలు (మొత్తం సాగుభూమిలో వ్యత్యాసపు కౌలు I విషయంలోలాగా – సగటు కౌలు పరిమాణం విషయంలోలాగా) ఇదివరకటి ఉదాహరణలన్నింటిలోలాగానే భూమిపై పెట్టిన పెట్టుబడి పెరగటం వల్ల ఏర్పడిన ఫలితాలేనని నిరూపించే నిరపేక్ష దృక్పథం ఇది. మన ఊహ ప్రకారం స్థిరమైన, పడిపోయే లేదా పెరిగే అదనపు పెట్టుబడి ఉత్పాదకత రేటుతో స్థిరమైన ధరలు, స్థిరమైన, పడిపోయే, పెరిగే లేదా ఉత్పాదకత రేటులో పడిపోయే ధరలు స్థిరమైన లేదా పడిపోయే ధరలలో అదనపు పెట్టుబడి ఉత్పాదకత స్థిరమైన రేటుగాని స్థిరమైన లేదా పడిపోయే ధరలలో ఉత్పాదకత యొక్క పడిపోయే రేటుగాని, స్థిరమైన, పడిపోయే ధరలలో ఉత్పాదకత యొక్క పెరిగే రేటుగాని రూపొందుతాయి. ఈ అన్ని విషయాల్లోనూ కౌలు యథాతథంగా ఉండవచ్చు లేదా పడిపోవచ్చు. మిగిలిన పరిస్థితులన్నీ యథాతథంగా ఉన్నప్పుడు పెరిగిన ఉత్పాదకతకు అదనపు పెట్టుబడి మదుపు మూలకారణం కానప్పుడు కౌలు మరింతగా పడిపోతుంది. కౌలు నిరపేక్షంగా తగ్గిపోయినప్పటికీ సాపేక్షంగా కౌలు పెరగటానికి అదనపు పెట్టుబడి కారణం అవుతుంది.

★ ★ ★

## అధ్యాయం - 43

# వ్యత్యాసపు కౌలు II
# మూడవ అధ్యయనాంశం
# పెరిగే ఉత్పత్తి ధర

కౌలు ఇవ్వని పరమ అధ్వాన్నపు భూమి యొక్క ఉత్పాదకత తగ్గిపోతే ఉత్పత్తి ధర పెరగక తప్పదు. ఎ భూమిలో $2\frac{1}{2}$ పౌండ్ల మదుపు 1 బస్తాకంటే తక్కువగా లేదా 5 పౌండ్లు, 2 బస్తాల కంటే తక్కువగా ఉత్పత్తి చేయకపోతే – ముందు ఊహించిన 3 పౌండ్ల ఉత్పత్తి ధర అంతకంటే పెరగడం, లేదా ఎ భూమికంటే నాసిరకం భూమి సాగులోకి రావడం జరుగుతుంది.

మొదటి $2\frac{1}{2}$ పౌండ్ల మదుపు యొక్క ఉత్పాదకత తగ్గినప్పుడే రెండో మదుపు తాలూకు ఉత్పాదకత యథాతథంగా ఉండడం కానీ లేక పెరగడం కానీ సాధ్యమవుతుంది. ఇది తరచూ జరుగుతూ వుంటుంది. ఉదాహరణకు పైపైన దున్నటం వలన భూమి పైపొర సారం అంతమై పంటల దిగుబడి తగ్గిపోవటంతో అప్పుడు భూమి లోపల పొరల్ని లోతుగా దున్నటం ద్వారా పైకి తీసుకురావటం వల్ల మరింత సహేతుకమైన సాగు పద్ధతులతో పంటలు మెరుగవుతాయి. అయితే ఖచ్చితంగా చెప్పాలంటే ఈ ప్రత్యేక ఉదాహరణ ఇక్కడ వర్తించదు. మొదటి $2\frac{1}{2}$ పౌండ్ల ఉత్పాదక తగ్గటం అన్నది మెరుగైన భూముల్లో పరిస్థితులు ఒకేలా ఉన్నాయనుకున్నప్పటికీ ఆ భూముల్లో వ్యత్యాసపు కౌలు I తగ్గుదలను అది సూచిస్తుంది. అయితే ఇక్కడ మనం కేవలం వ్యత్యాసపు కౌలు II మాత్రమే పరిశీలిస్తున్నాం. వ్యత్యాసపు కౌలు II ఉందని భావించకపోతే ఈ ప్రత్యేకమైన అధ్యయనం సాధ్యం కాదు. నిజానికి వ్యత్యాసపు కౌలు II పైన వ్యత్యాసపు కౌలు I కి చేసిన మార్పుకు – ఇది ప్రతిస్పందన మాత్రమే. ఇక్కడ ఒక ఉదాహరణ చూడవచ్చు. (పట్టిక VII చూడండి – సం॥)

డబ్బు కౌలు, మొత్తం రాబడి – పట్టిక II లో లాగానే ఉన్నాయి. ఉత్పత్తి పరిమాణంలో వున్న లోటును పెరిగిన ఉత్పత్తి ధర భర్తీ చేస్తుంది. ఈ ధర, ఉత్పత్తి పరిమాణం విలోమానుపాతంలో వుంటాయి. కనుక ఆ రెండింటివల్ల వచ్చే గణనాత్మక ఉత్పత్తి యథాతథంగా వుంటుంది.

## పట్టిక - VII

| భూమి రకం | ఎకరాలు | పౌండ్లలో మదుపు పెట్టుబడి | పౌం.లో లాభం | పౌం.లో ఉత్పత్తి ఖర్చు | బస్తాలలో ఉత్పత్తి | అమ్మకం ధర | రాబడి పౌండ్లలో | ధాన్యపు కౌలు బస్తాలలో | డబ్బు కౌలు పౌం.లో | కౌలు రేటు |
|---|---|---|---|---|---|---|---|---|---|---|
| ఎ | 1 | $2\frac{1}{2}+2\frac{1}{2}$ | 1 | 6 | $\frac{1}{2}+1\frac{1}{4}=1\frac{3}{4}$ | $3\frac{3}{7}$ | 6 | 0 | 0 | 0 |
| బి | 1 | $2\frac{1}{2}+2\frac{1}{2}$ | 1 | 6 | $1+2\frac{1}{2}=3\frac{1}{2}$ | $3\frac{3}{7}$ | 12 | $1\frac{3}{4}$ | 6 | 120% |
| సి | 1 | $2\frac{1}{2}+2\frac{1}{2}$ | 1 | 6 | $1\frac{1}{2}+3\frac{3}{4}=5\frac{1}{4}$ | $3\frac{3}{7}$ | 18 | $3\frac{1}{2}$ | 12 | 240% |
| డి | 1 | $2\frac{1}{2}+2\frac{1}{2}$ | 1 | 6 | 2+5=7 | $3\frac{3}{7}$ | 24 | $5\frac{1}{4}$ | 18 | 360% |
| | | 20 | | | $17\frac{1}{2}$ | | 60 | $10\frac{1}{2}$ | 36 | 240% |

పై ఉదాహరణలో మొదటి మదుపు తొట్టతొలి ఉత్పాదకత కంటే రెండవ మదుపు ఉత్పాదకత ఎక్కువగా వుందని భావించబడింది. రెండవ మదుపు ఉత్పాదకత మొదటిదాని ఉత్పాదకతతో సమానంగా ఉంది అని భావిస్తే ఈ కింది పట్టికలో చూపించిన విధంగా విషయంలో మార్పు వుండదు.

## పట్టిక - VIII

| భూమి రకం | ఎకరాలు | పెట్టుబడి మదుపు పౌండ్లు | లాభం పౌండ్లు | ఉత్పత్తి ధర పౌం. | ఉత్పత్తి బస్తాలు | బస్తా అమ్మకం ధర పౌండ్లు | రాబడి పౌండ్లు | కౌలు | | అదనపు లాభం రేటు |
|---|---|---|---|---|---|---|---|---|---|---|
| | | | | | | | | ధాన్యపు కౌలు బస్తాలు | డబ్బు కౌలు పౌండ్లు | |
| ఎ | 1 | $2\frac{1}{2}+2\frac{1}{2}=5$ | 1 | 6 | $\frac{1}{2}+1=1\frac{1}{2}$ | 4 | 6 | 0 | 0 | 0 |
| బి | 1 | $2\frac{1}{2}+2\frac{1}{2}=5$ | 1 | 6 | 1+2=3 | 4 | 12 | $1\frac{1}{2}$ | 6 | 120% |
| సి | 1 | $2\frac{1}{2}+2\frac{1}{2}=5$ | 1 | 6 | $1\frac{1}{2}+3=4\frac{1}{2}$ | 4 | 18 | 3 | 12 | 240% |
| డి | 1 | $2\frac{1}{2}+2\frac{1}{2}=5$ | 1 | 6 | 2+4 = 6 | 4 | 24 | $4\frac{1}{2}$ | 18 | 360% |
| | | 20 | | | 15 | | 60 | 9 | 36 | 240% |

ఇక్కడ కూడా ఒకే రేటున పెరుగుతున్న ఉత్పత్తి ధర, డబ్బు కౌలులోనూ దిగుబడిలోనూ వున్న ఉత్పాదకత తగ్గుదలను భర్తీ చేస్తుంది. రెండవ మదుపు యొక్క ఉత్పాదకత పడిపోయినప్పుడు మొదటిదాని ఉత్పాదకత యథాతథంగా ఉన్నప్పుడు మూడవ అధ్యయనాంశం తన శుద్ధ రూపంలో కనిపిస్తుంది. మొదటి, రెండవ నమూనాలలో ఇది ఎప్పుడూ అలాంటి భావనగానే వుంది. ఇక్కడ వ్యత్యాసపు కౌలు I ప్రభావితం కాలేదు. అనగా వ్యత్యాసపు కౌలు II నుంచి తలెత్తే ఆ భాగాన్ని మాత్రమే ఆ మార్పు ప్రభావితం చేస్తుంది. ఇక్కడ రెండు ఉదాహరణలు ఇవ్వచ్చు. మొదటిదానిలో రెండవ మదుపు ఉత్పాదకత $\frac{1}{2}$కు తగ్గిందని, రెండవ దానిలో $\frac{3}{4}$కు తగ్గిందని భావించవచ్చు.

## పట్టిక - IX

| భూమి రకం | ఎకరాలు | పెట్టుబడి మదుపు పౌండ్లు | లాభం పౌండ్లు | ఉత్పత్తి ధర పౌం. | ఉత్పత్తి బస్తాలు | బస్తా అమ్మకం ధర పౌండ్లు | రాబడి పౌండ్లు | కౌలు | | అదనపు లాభం రేటు |
|---|---|---|---|---|---|---|---|---|---|---|
| | | | | | | | | ధాన్యపు కౌలు బస్తాలు | డబ్బు కౌలు పౌండ్లు | |
| ఎ | 1 | $2\frac{1}{2}+2\frac{1}{2}=5$ | 1 | 6 | $1+\frac{1}{2}=1\frac{1}{2}$ | 4 | 6 | 0 | 0 | 0 |
| బి | 1 | $2\frac{1}{2}+2\frac{1}{2}=5$ | 1 | 6 | 2+1=3 | 4 | 12 | $1\frac{1}{2}$ | 6 | 120% |
| సి | 1 | $2\frac{1}{2}+2\frac{1}{2}=5$ | 1 | 6 | $3+1\frac{1}{2}=4\frac{1}{2}$ | 4 | 18 | 3 | 12 | 240% |
| డి | 1 | $2\frac{1}{2}+2\frac{1}{2}=5$ | 1 | 6 | 4+2 = 6 | 4 | 24 | $4\frac{1}{2}$ | 18 | 360% |
| | | 20 | | | 15 | | 60 | 9 | 36 | 240% |

పట్టిక IX పట్టిక VIII లాంటిదే. అయితే ఉత్పాదకతలో తగ్గుదల - VIIIలో మొదటి మదుపు విషయంలో జరిగితే - IX లో రెండవ మదుపు విషయంలో జరుగుతుంది.

## పట్టిక - X

| భూమి రకం | ఎకరాలు | పెట్టుబడి మదుపు పౌండ్లు | లాభం పౌండ్లు | ఉత్పత్తి ధర పౌం. | ఉత్పత్తి బస్తాలు | బస్తా అమ్మకం ధర పౌండ్లు | రాబడి పౌండ్లు | కౌలు | | అదనపు లాభం రేటు |
|---|---|---|---|---|---|---|---|---|---|---|
| | | | | | | | | ధాన్యపు కౌలు బస్తాలు | డబ్బు కౌలు పౌండ్లు | |
| ఎ | 1 | $2\frac{1}{2}+2\frac{1}{2}=5$ | 1 | 6 | $1+\frac{1}{4}=1\frac{1}{4}$ | $4\frac{4}{5}$ | 6 | 0 | 0 | 0 |
| బి | 1 | $2\frac{1}{2}+2\frac{1}{2}=5$ | 1 | 6 | $2+\frac{1}{2}=2\frac{1}{2}$ | $4\frac{4}{5}$ | 12 | $1\frac{1}{4}$ | 6 | 120% |
| సి | 1 | $2\frac{1}{2}+2\frac{1}{2}=5$ | 1 | 6 | $3+\frac{3}{4}=3\frac{3}{4}$ | $4\frac{4}{5}$ | 18 | $2\frac{1}{2}$ | 12 | 240% |
| డి | 1 | $2\frac{1}{2}+2\frac{1}{2}=5$ | 1 | 6 | 4+1 = 5 | $4\frac{4}{5}$ | 24 | $3\frac{3}{4}$ | 18 | 360% |
| | | 20 | | 24 | $12\frac{1}{2}$ | | 60 | $7\frac{1}{2}$ | 36 | 240% |

ఈ పట్టికలో కూడా మొత్తం రాబడి, డబ్బు కౌలు, కౌలు రేటు పట్టిక II, VII, VIII లలో లాగానే యథాతథంగా ఉంటుంది. ఎందుకంటే ఉత్పత్తి, అమ్మకం ధర విలోమానుపాతంలో ఉన్నాయి. కాగా పెట్టిన మదుపు సమానంగా వుంది.

అయితే అప్పటి వరకూ సాగులోలేని నాసిరకం భూమిని సాగులోకి తీసుకువచ్చినప్పుడు ఉత్పత్తి ధర పెరిగితే ఆ సందర్భంలో మిగిలిన విషయాలు ఎలా ఉంటాయి?

ఈ రకం భూమికి మనం 'అ' అని పేరు పెడదాం. అది ఇప్పుడు పోటీలో ప్రవేశిస్తుంది.

ఇంతవరకూ కౌలు ఇవ్వని భూమి ఎ ఇప్పుడు కౌలు ఇస్తుంది. అటువంటప్పుడు పట్టికలు VII, VIII, X ఈ కింది రూపాలు సంతరించుకుంటాయి.

## పట్టిక - VII (అ)

| భూమి రకం | ఎకరాలు | పెట్టుబడి పౌం. | లాభం పౌండ్లు | ఉత్పత్తి ధర పౌం. | ఉత్పత్తి బస్తాలు | బస్తా అమ్మకం ధర పౌం. | రాబడి పౌం. | కౌలు: ధాన్యపు కౌలు బస్తాలు | కౌలు: డబ్బు కౌలు పౌం. | అదనపు లాభం రేటు |
|---|---|---|---|---|---|---|---|---|---|---|
| అ | 1 | 5 | 1 | 6 | $1\frac{1}{2}$ | 4 | 6 | 0 | 0 | 0 |
| ఎ | 1 | $2\frac{1}{2}+2\frac{1}{2}$ | 1 | 6 | $\frac{1}{2}+1\frac{1}{4}=1\frac{3}{4}$ | 4 | $7\frac{1}{5}$ | $\frac{1}{4}$ | 1 | 1 |
| బి | 1 | $2\frac{1}{2}+2\frac{1}{2}$ | 1 | 6 | $1+2\frac{1}{2}=3\frac{1}{2}$ | 4 | 14 | 2 | 8 | 1+7 |
| సి | 1 | $2\frac{1}{2}+2\frac{1}{2}$ | 1 | 6 | $1\frac{1}{2}+3\frac{3}{4}=5\frac{1}{4}$ | 4 | 21 | $3\frac{3}{4}$ | 15 | 1+2×7 |
| డి | 1 | $2\frac{1}{2}+2\frac{1}{2}$ | 1 | 6 | 2+5 = 7 | 4 | 28 | $5\frac{1}{2}$ | 22 | 1+3×7 |
| | | 20 | | 30 | 19 | | 76 | $11\frac{1}{2}$ | 46 | |

## పట్టిక - VIII (ఆ)

| భూమి రకం | ఎకరాలు | పెట్టుబడి పౌండ్లు | లాభం పౌండ్లు | ఉత్పత్తి ధర పౌం. | ఉత్పత్తి బస్తాలు | బస్తా అమ్మకం ధర పౌండ్లు | రాబడి పౌం. | కౌలు: ధాన్యపు కౌలు బస్తాలు | కౌలు: డబ్బు కౌలు పౌం. | అదనపు లాభం రేటు |
|---|---|---|---|---|---|---|---|---|---|---|
| అ | 1 | 5 | 1 | 6 | $1\frac{1}{4}$ | $4\frac{4}{5}$ | 6 | 0 | 0 | 0 |
| ఎ | 1 | $2\frac{1}{2}+2\frac{1}{2}$ | 1 | 6 | $\frac{1}{2}+1=1\frac{1}{2}$ | $4\frac{4}{5}$ | $7\frac{1}{5}$ | $\frac{1}{4}$ | $1\frac{1}{5}$ | $1\frac{1}{5}$ |
| బి | 1 | $2\frac{1}{2}+2\frac{1}{2}$ | 1 | 6 | 1+2=3 | $4\frac{4}{5}$ | $14\frac{2}{5}$ | $1\frac{3}{4}$ | $8\frac{2}{5}$ | $1\frac{1}{5}+7\frac{1}{5}$ |
| సి | 1 | $2\frac{1}{2}+2\frac{1}{2}$ | 1 | 6 | $1\frac{1}{2}+3=4\frac{1}{2}$ | $4\frac{4}{5}$ | $21\frac{3}{5}$ | $3\frac{1}{4}$[1] | $15\frac{3}{5}$ | $1\frac{1}{5}+2\times7\frac{1}{5}$ |
| డి | 1 | $2\frac{1}{2}+2\frac{1}{2}$ | 1 | 6 | 2+4=6 | $4\frac{4}{5}$ | $28\frac{4}{5}$ | $4\frac{3}{4}$ | $22\frac{4}{5}$ | $1\frac{1}{5}+3\times7\frac{1}{5}$ |
| | 5 | | | 30 | $16\frac{1}{4}$ | | 78 | 10[2] | 48 | |

1. 1894 జర్మన్ సంపుటిలో యిది $2\frac{1}{4}$గా వుంది - సం.
2. అదే సంపుటం : 9 అని వుంది - సం.

## పట్టిక – X (అ)

| భూమి రకం | ఎకరాలు | పెట్టుబడి పౌండ్లు | లాభం పౌండ్లు | ఉత్పత్తి ధర పౌం. | ఉత్పత్తి బస్తాలు | బస్తా అమ్మకం ధర పౌండ్లు | రాబడి పౌం. | కౌలు: ధాన్యపు కౌలు | కౌలు: డబ్బు కౌలు | అదనపు లాభం రేటు |
|---|---|---|---|---|---|---|---|---|---|---|
| అ | 1 | 5 | 1 | 6 | $1\frac{1}{8}$ | $5\frac{1}{3}$ | 6 | 0 | 0 | 0 |
| ఎ | 1 | $2\frac{1}{2}+2\frac{1}{2}$ | 1 | 6 | $1+\frac{1}{4}=1\frac{1}{4}$ | $5\frac{1}{3}$ | $6\frac{2}{3}$ | $\frac{1}{8}$ | $\frac{2}{3}$ | $\frac{2}{3}$ |
| బి | 1 | $2\frac{1}{2}+2\frac{1}{2}$ | 1 | 6 | $2+\frac{1}{2}=2\frac{1}{2}$ | $5\frac{1}{3}$ | $13\frac{1}{3}$ | $1\frac{3}{8}$ | $7\frac{1}{3}$ | $\frac{2}{3}+6\frac{2}{3}$ |
| సి | 1 | $2\frac{1}{2}+2\frac{1}{2}$ | 1 | 6 | $3+\frac{3}{4}=3\frac{3}{4}$ | $5\frac{1}{3}$ | 20 | $2\frac{5}{8}$ | 14 | $\frac{2}{3}+2\times6\frac{2}{3}$ |
| డి | 1 | $2\frac{1}{2}+2\frac{1}{2}$ | 1 | 6 | $4+1=5$ | $5\frac{1}{3}$ | $26\frac{2}{3}$ | $3\frac{7}{8}$ | $20\frac{2}{3}$ | $\frac{2}{3}+3\times6\frac{2}{3}$ |
| | | | | 30 | $13\frac{5}{8}$ | | $72\frac{2}{3}$ | 8 | $42\frac{2}{3}$ | |

'అ' భూమిని చేర్చటం ద్వారా కొత్త వ్యత్యాసపు కౌలు I తలెత్తుతుంది. ఈ కొత్త పునాది పైన వ్యత్యాసపు కౌలు II కూడా ఒక మారిన రూపంలో తలెత్తుతుంది. పైన ఉన్న మూడు పట్టికల్లో ప్రతిదానిలోనూ ఆ భూమి భిన్నమైన సారాన్ని కలిగి వుంది. సమానంగా పెరిగే సారాల వరుస ఎ భూమితో మాత్రమే ప్రారంభమవుతాయి. పెరిగే కౌలుల వరుస కూడా అదే విధంగా ప్రవర్తిస్తుంది. పరమ అధ్వాన్నపు కౌలునిచ్చే భూమి ఇదివరకు కౌలును ఇవ్వలేదు. ఇప్పుడది కొంత కౌలును ఇస్తుంది. అది అంతకంటే ఎక్కువ కౌలులన్నింటికీ జోడించబడే స్థిరమైన అంశంగా ఉంటుంది. ఈ పెద్ద కౌలుల నుంచి ఈ స్థిరమైన అంశాలనిను తీసివేసిన తరువాత మాత్రమే తేడాల వరుస స్పష్టంగా కనిపిస్తుంది. విభిన్న భూముల సారం యొక్క వరుస క్రమంలో దీనికి సమాంతరంగా ఉండే అంశం కూడా కనిపిస్తుంది. పట్టికలన్నింటిలోనూ ఎ నుండి డి వరకు గల సారాలను 1:2:3:4 గా ఊహించటం జరిగింది. అదే విధంగా కౌలులు ఈ రకంగా వుంటాయి.

పట్టిక VII అ లో $1 : (1+7) :(1+2\times7) : (1+3\times7)$

పట్టిక VIII ఆ లో $1\frac{1}{5} : (1\frac{1}{5}+7\frac{1}{5}) : (1\frac{1}{5}+2\times7\frac{1}{5}) : (1\frac{1}{5}+3\times7\frac{1}{5})$

పట్టిక X అ $\frac{2}{3} : (\frac{2}{3}+6\frac{2}{3}) : (\frac{2}{3}+2\times6\frac{2}{3}) : (\frac{2}{3}+3\times6\frac{2}{3})$

క్లుప్తంగా చెప్పాలంటే ఎ నుంచి వచ్చే కౌలు = ఎన్ దాని తరువాత ఎక్కువ సారం కలిగిన భూమి నుంచి వచ్చే కౌలు = ఎన్+ఎమ్. తరువాత ఆ వరుస ఇలా కొనసాగుతుంది.

ఎన్ : (ఎన్+ఎమ్); (ఎన్+2ఎమ్) : (ఎన్+3ఎమ్) వగైరా – ఎంగెల్స్.

★ ★ ★

[ఇంతకు ముందు చెప్పిన మూడవ నమూనా గురించి రాత ప్రతిలో విపులీకరణ లేదు. అక్కడ కేవలం శీర్షిక మాత్రమే వుంది. తనకు సాధ్యమైన మేరకు ఆ ఖాళీని భర్తీ చేయడం సంపాదకుని పని అయింది. దానితోపాటు వ్యత్యాసపు కౌలు II కు సంబంధించి దాని మూడు నమూనాలు 9

ఉపనమూనాలను విశ్లేషించి సాధారణ నిర్ధారణలు చెయ్యాల్సిన బాధ్యత కూడా సంపాదకునిపైన ఉంది. అయితే రాతప్రతిలో ఇచ్చిన ఉదాహరణలు ఈ లక్ష్యానికి అంత అనువైనవిగా లేవు. మొదటి అంశం సమానమైన ప్రాంతాల్లో 1:2:3:4 దిగుబడులనిచ్చే కమతాలను ఆ పట్టికలు పోల్చాయి. అనగా ముందు నుంచి ఈ తేడాలను ఎక్కువ చేసి చెప్పటం అవుతుంది. ఈ ప్రాతిపదికపై చేసిన ఊహలు అంచనాలను మరింత పెంచుకుపోవడంతో మరీ పెద్ద సంఖ్యాపరమైన విలువలకకు ఇది దారితీస్తుంది. రెండవది అవి పూర్తిగా పొరపాటు అభిప్రాయాన్ని కలిగిస్తాయి. భూమి సారం 1:2:3:4గా ఉంటే కౌలు 0:1:2:3 వరుసలో వస్తాయి. ఆ రకంగా మొదటి వరుస నుంచి తలెత్తిన రెండవ వరుస వల్ల మొత్తం రాబడులు రెట్టింపు, మూడు రెట్లు అవటంవల్ల కౌలులు కూడా రెట్టింపు మూడు రెట్లు అవుతాయన్నట్లు వివరించడానికి ప్రయత్నించవచ్చు. అయితే ఇది పూర్తి తప్పు భావాన్ని కలిగిస్తుంది. భూమి సారం ఎన్ : (ఎన్+1) : (ఎన్+2) : (ఎన్+3) : (ఎన్+4) గా ఉన్నప్పుడు సైతం కౌలులు 0:1:2:3:4 ఉన్నాయి అని భావించబడింది. కౌలులు భూమి సారం యొక్క స్థాయిలుగా కాక ఆ సారాలలో ఉన్న వ్యత్యాసాలుగా భావించడం జరిగింది. ఈ సారాలు సున్న దగ్గర ప్రారంభమవుతాయి.

ఈ అంశాన్ని వివరించటానికి మొదట పేర్కొన్న పట్టికలను కూడా చూడవచ్చు. అయితే మన పరిశీలనలో వచ్చిన ఈ కింది ఫలితాల యొక్క అవగాహనపరమైన పునాది కోసం నేను మరో కొత్త పట్టికల వరుసను మీ ముందు ఉంచుతున్నాను. వాటిలో బుషెల్స్‌నీ, షిల్లింగులనీ వాడుతున్నాను. బుషెల్=36.35 లీటర్లు. (తెలుగు పాఠకుల సౌలభ్యం కోసం బుషెల్స్‌ను బస్తాలుగా పేర్కొన్నాము – అనువాదకుడు.)

ఈ పట్టికలో మొదటిది పట్టిక XI. అది పట్టిక I ని పోలి వుంటుంది. పట్టిక XI 5 భిన్నమైన స్వభావాలు కలిగిన భూముల దిగుబడుల్ని, కౌలుల్ని చూపిస్తుంది. ఆ భూములు ఎ నుంచి ఇ వరకు ఉన్నాయి. మొదటి పెట్టుబడి మదుపు 50 షిల్లింగులు. లాభం 10 షిల్లింగులు. మొత్తం ఉత్పత్తి ఖర్చు ఎకరానికి 60 షిల్లింగులు. ధాన్యపు దిగుబడి ఎకరానికి 10, 12, 14, 16, 18 బస్తాలు. దీనివల్ల అమల్లోకి వచ్చే ఉత్పత్తి ధర బస్తాకు 6 షిల్లింగులు.

ఈ కింద ఇవ్వబడ్డ 13 పట్టికలు వ్యత్యాసపు కౌలు II కు చెందిన మూడు నమూనాలకు చెందుతాయి. ఈ నమూనాల గురించి ఈ అధ్యాయంలోనూ, దీనికి ముందు రెండు అధ్యాయాల్లోనూ వివరించడం జరిగింది. ఈ పట్టికల్లో ఒకే రకం భూమిపై స్థిరమైన, పడిపోతున్న, పెరుగుతున్న ఉత్పత్తి ధరలతో ఎకరానికి 50 షిల్లింగుల చొప్పున అదనపు మదుపు ఉపయోగించబడింది. ఈ నమూనాల్లో ప్రతి ఒక్కదాన్ని మొదటి మదుపుతో పోల్చినపుడు రెండవ మదుపు ఉత్పాదకత 1 స్థిరంగా వున్నప్పుడు, 2 పడిపోతున్నప్పుడు, 3 పెరుగుతున్నప్పుడూ పరిశీలించటం జరిగింది.

**నమూనా I :** స్థిరమైన ఉత్పత్తి ధర ఉన్నప్పుడు ఈ కింది విధంగా వుంటుంది.

**ఉపనమూనా 1 :** రెండవ మదుపు ఉత్పాదకత యథాతథంగా వుంటుంది. (పట్టిక XII)

**ఉపనమూనా 2 :** ఉత్పాదకత తగ్గుతుంది. ఎ భూమిలో రెండవ మదుపు పెట్టనప్పుడు మాత్రమే ఇది జరుగుతుంది. ఎలాగంటే,

అ) అప్పుడు బి భూమి కూడా కౌలు ఇవ్వదు (పట్టిక XIII)

ఆ) బి భూమి పూర్తిగా లేదా కౌలు లేని భూమిగా మారదు (పట్టిక XIV)

**ఉపనమూనా 3 :** ఉత్పాదకత పెరుగుతుంది. (పట్టిక XV) దీనిలో కూడా ఎ భూమిలో రెండవ మదుపు ఉండదు.

**నమూనా II :** ఉత్పత్తి ధర పడిపోవటం.

**ఉపనమూనా 1 :** రెండవ మదుపు ఉత్పాదకత యథాతథంగా వుంటుంది. (పట్టిక XVI)

**ఉపనమూనా 2 :** ఉత్పాదకత పడిపోతుంది. (పట్టిక XVII) ఈ రెండు ఉపనమూనాల్లోనూ ఎ భూమి పోటీ నుంచి తొలగించబడుతుంది. బి భూమి కౌలు లేని భూమిగా మారుతుంది. ఉత్పత్తి ధరను అది క్రమబద్ధం చేస్తుంది.

**ఉపనమూనా 3 :** ఉత్పాదకత పెరుగుతుంది. (పట్టిక XVIII) ఇక్కడ ఎ భూమి ఉత్పత్తి ధరను క్రమబద్ధం చేస్తుంది.

**నమూనా III :** పెరిగే ఉత్పత్తి ధర – ఇక్కడ రెండు అవకాశాలు వున్నాయి. ఎ భూమి కౌలులేని భూమిగా ఉంటూ ధరను క్రమబద్ధం చెయ్యవచ్చు. లేదా ఎ కంటే నాసిరకం భూమి పోటీలో ప్రవేశించి ధరను శాసించవచ్చు. అప్పుడు ఎ కౌలు ఇవ్వదు. మొదటి అవకాశాన్ని చూద్దాం. దానిలో ఎ భూమి ధరను నిర్ణయిస్తుంది.

**ఉపనమూనా 1 :** రెండవ మదుపు ఉత్పాదకత యథాతథంగా వుంటుంది. (పట్టిక XIX) మనం ఊహించిన పరిస్థితుల్లో మొదటి మదుపు ఉత్పాదకత తగ్గిపోతే ఇది సాధ్యమవుతుంది.

**ఉపనమూనా 2 :** రెండవ మదుపు ఉత్పాదకత తగ్గిపోతుంది. (పట్టిక X X) దీనిలో మొదటి మదుపు ఉత్పాదకత యథాతథంగా వుంటే వుండవచ్చు.

**ఉపనమూనా 3 :** రెండవ మదుపు ఉత్పాదకత పెరుగుతుంది. (పట్టిక XXI)[1] మళ్ళీ ఇది కూడా మొదటి మదుపు ఉత్పాదకత పడిపోవటాన్ని ఊహిస్తుంది.

**రెండవ అవకాశం :** ఒక నాసిరకం భూమి (అ) పోటీలో ప్రవేశిస్తుంది. ఎ భూమి కౌలు ఇస్తుంది.

**ఉపనమూనా 1 :** రెండవ మదుపు ఉత్పాదకత యథాతథంగా ఉంటుంది. (పట్టిక XXII)

**ఉపనమూనా 2 :** ఉత్పాదకత తగ్గుతుంది. (పట్టిక XXIII)

**ఉపనమూనా 3 :** ఉత్పాదకత పెరుగుతుంది. (పట్టిక XXIV)

ఈ మూడు ఉపనమూనాలు సమస్య యొక్క సాధారణ పరిస్థితులనే ధ్రువీకరిస్తాయి. కనుక వేరే వ్యాఖ్య అవసరం లేదు. కింది పట్టికను చూడండి.

**పట్టిక – XI**

| భూమి రకం | ఉత్పత్తి ధర (షిల్లింగులు) | దిగుబడి (బస్తాలు) | అమ్మకం ధర (షిల్లింగులు) | రాబడి (షిల్లింగులు) | కౌలు (షిల్లింగులు) | కౌలు పెరుగుదల |
|---|---|---|---|---|---|---|
| ఎ | 60 | 10 | 6 | 60 | 0 | 0 |
| బి | 60 | 12 | 6 | 72 | 12 | 12 |
| సి | 60 | 14 | 6 | 84 | 24 | 2×12 |
| డి | 60 | 16 | 6 | 96 | 36 | 3×12 |
| ఇ | 60 | 18 | 6 | 108 | 48 | 4×12 |
| | | | | | 120 | 10×12 |

1. 1894 నాటి జర్మన్ సంపుటిలో ఇది XIX అని వుంది - సం.

అదే భూమిలో పెట్టిన రెండవ మదుపు మొదటి నమూనా : ఉత్పత్తి ధర యథాతథంగా ఉంటుంది.

**ఉపనమూనా 1 :** రెండవ మదుపు ఉత్పాదకత యథాతథంగా ఉంటుంది.

### పట్టిక - XII

| భూమి రకం | ఉత్పత్తి ధర (షిల్లింగులు) | దిగుబడి (బస్తాలు) | అమ్మకం ధర (షిల్లింగులు) | రాబడి (షిల్లిం) | కౌలు (షిల్లిం) | కౌలు పెరుగుదల |
|---|---|---|---|---|---|---|
| ఎ | 60+60=120 | 10+10=20 | 6 | 120 | 0 | 0 |
| బి | 60+60=120 | 12+12=24 | 6 | 144 | 24 | 24 |
| సి | 60+60=120 | 14+14=28 | 6 | 168 | 48 | 2×24 |
| డి | 60+60=120 | 16+16=32 | 6 | 192 | 72 | 3×24 |
| ఇ | 60+60=120 | 18+18=36 | 6 | 216 | 96 | 4×24 |
| | | | | | 240 | 10×24 |

**ఉపనమూనా 2 :** రెండవ మదుపు ఉత్పాదకత తగ్గిపోతుంది. కనుక ఎ భూమిలో రెండవ మదుపు వుండదు.

1 : బి భూమి కౌలు ఇవ్వదు.

### పట్టిక - XIII

| భూమి రకం | ఉత్పత్తి ధర (షిల్లింగులు) | దిగుబడి (బస్తాలు) | అమ్మకం ధర (షిల్లిం) | రాబడి (షిల్లిం) | కౌలు (షిల్లిం) | కౌలు పెరుగుదల |
|---|---|---|---|---|---|---|
| ఎ | 60 | 10 | 6 | 60 | 0 | 0 |
| బి | 60+60=120 | 12+8=20 | 6 | 120 | 0 | 0 |
| సి | 60+60=120 | $14+9\frac{1}{3}=23\frac{1}{3}$ | 6 | 140 | 20 | 20 |
| డి | 60+60=120 | $16+10\frac{2}{3}=26\frac{2}{3}$ | 6 | 160 | 40 | 2×20 |
| ఇ | 60+60=120 | 18+12[1]=30 | 6 | 180 | 60 | 3×20 |
| | | | | | 120 | 6×20 |

బి భూమి పూర్తిగా కౌలు ఇవ్వని భూమిగా మారదు.

1. 1894 జర్మన్ ప్రతిలో ఇది 20గా వుంది - సం.

## పట్టిక - XIV

| భూమి రకం | ఉత్పత్తి ధర (షిల్లింగులు) | దిగుబడి (బస్తాలు) | అమ్మకం ధర (షిల్లింగులు) | రాబడి (షిల్లిం) | కౌలు (షిల్లిం) | కౌలు పెరుగుదల |
|---|---|---|---|---|---|---|
| ఎ | 60 | 10 | 6 | 60 | 0 | 0 |
| బి | 60+60=120 | 12+9=21 | 6 | 126 | 6 | 6 |
| సి | 60+60=120 | $14+10\frac{1}{2}=24\frac{1}{2}$ | 6 | 147 | 27 | 6+21 |
| డి | 60+60=120 | 16+12=28 | 6 | 168 | 48 | 6+2×21 |
| ఇ | 60+60=120 | $18+13\frac{1}{2}=31\frac{1}{2}$ | 6 | 189 | 69 | 6+3×21 |
| | | | | | 150 | 4×6+6×21 |

**ఉపనమూనా 3 :** రెండవ మదుపు ఉత్పాదకత పెరుగుతుంది. ఇక్కడ కూడా ఎ భూమిలో రెండవ మదుపు ఉండదు.

## పట్టిక - XV

| భూమి రకం | ఉత్పత్తి ధర (షిల్లింగులు) | దిగుబడి (బస్తాలు) | అమ్మకం ధర (షిల్లింగులు) | రాబడి (షిల్లిం) | కౌలు (షిల్లిం) | కౌలు పెరుగుదల |
|---|---|---|---|---|---|---|
| ఎ | 60 | 10 | 6 | 60 | 0 | 0 |
| బి | 60+60=120 | 12+15=27 | 6 | 162 | 42 | 42 |
| సి | 60+60=120 | $14+17\frac{1}{2}=31\frac{1}{2}$ | 6 | 189 | 69 | 42+27 |
| డి | 60+60=120 | 16+20=36 | 6 | 216 | 96 | 42+2×27 |
| ఇ | 60+60=120 | $18+22\frac{1}{2}=40\frac{1}{2}$ | 6 | 243 | 123 | 42+3×27 |
| | | | | | 330 | 4×42+6×27 |

**రెండవ నమూనా :** ఉత్పత్తి ధర తగ్గుతుంది.

**ఉపనమూనా 1 :** రెండవ మదుపు ఉత్పాదకత యథాతథంగా ఉంటుంది. ఎ భూమి పోటీ నుంచి తొలగించబడుతుంది. బి భూమి కౌలులేని భూమిగా మారుతుంది.

## పట్టిక - XVI

| భూమి రకం | ఉత్పత్తి ధర (షిల్లిం) | దిగుబడి (బస్తాలు) | అమ్మకం ధర (షిల్లిం) | రాబడి (షిల్లిం) | కౌలు (షిల్లిం) | కౌలు పెరుగుదల |
|---|---|---|---|---|---|---|
| బి | 60+60=120 | 12+12=24 | 5 | 120 | 0 | 0 |
| సి | 60+60=120 | 14+14=28 | 5 | 140 | 20 | 20 |
| డి | 60+60=120 | 16+16=32 | 5 | 160 | 40 | 2×20 |
| ఇ | 60+60=120 | 18+18=36 | 5 | 180 | 60 | 3×20 |
| | | | | | 120 | 6×20 |

**ఉపనమూనా 2 :** రెండవ మదుపు ఉత్పాదకత తగ్గుతుంది. ఎ భూమి పోటీ నుంచి తొలగిపోతుంది. బి భూమి కౌలులేని భూమిగా మారుతుంది.

## పట్టిక - XVII

| భూమి రకం | ఉత్పత్తి ధర (షిల్లింగులు) | దిగుబడి (బస్తాలు) | అమ్మకం ధర (షిల్లింగులు) | రాబడి (షిల్లిం) | కౌలు (షిల్లిం) | కౌలు పెరుగుదల |
|---|---|---|---|---|---|---|
| బి | 60+60=120 | 12+9=21 | $5\frac{5}{7}$ | 120 | 0 | 0 |
| సి | 60+60=120 | $14+10\frac{1}{2}=24\frac{1}{2}$ | $5\frac{5}{7}$ | 140 | 20 | 20 |
| డి | 60+60=120 | 16+12=28 | $5\frac{5}{7}$ | 160 | 40 | 2×20 |
| ఇ | 60+60=120 | $18+13\frac{1}{2}=31\frac{1}{2}$ | $5\frac{5}{7}$ | 180 | 60 | 3×20 |
| | | | | | 120 | 6×20 |

**ఉపనమూనా 3 :** రెండవ మదుపు ఉత్పాదకత పెరుగుతుంది. ఎ భూమి పోటీలోనే ఉంటుంది. బి భూమి కౌలు ఇస్తుంది.

## పట్టిక - XVIII

| భూమి రకం | ఉత్పత్తి ధర (షిల్లింగులు) | దిగుబడి (బస్తాలు) | అమ్మకం ధర (షిల్లింగులు) | రాబడి (షిల్లిం) | కౌలు (షిల్లిం) | కౌలు పెరుగుదల |
|---|---|---|---|---|---|---|
| ఎ | 60+60=120 | 10+15=25 | $4\frac{4}{5}$ | 120 | 0 | 0 |
| బి | 60+60=120 | 12+18=30 | $4\frac{4}{5}$ | 144 | 24 | 24 |
| సి | 60+60=120 | 14+21=35 | $4\frac{4}{5}$ | 168 | 48 | 2×24 |
| డి | 60+60=120 | 16+24=40 | $4\frac{4}{5}$ | 192 | 72 | 3×24 |
| ఇ | 60+60=120 | 18+27=45 | $4\frac{4}{5}$ | 216 | 96 | 4×24 |
| | | | | | 240 | 10×24 |

**మూడవ నమూనా :** ఉత్పత్తి ధర పెరుగుతుంది.

అ. ఎ భూమి కౌలులేని భూమిగా వుంటుంది. అది ధరను శాసించటాన్ని కొనసాగిస్తుంది.

**ఉపనమూనా 1 :** రెండవ మదుపు ఉత్పాదకత యథాతథంగా ఉంటుంది. అంటే ఈ ఉదాహరణలో మొదటి మదుపు ఉత్పాదకత తగ్గుతుందని అర్థం.

**పట్టిక - XIX**

| భూమి రకం | ఉత్పత్తి ధర (షిల్లింగులు) | దిగుబడి (బస్తాలు)[1] | అమ్మకం ధర (షిల్లింగులు) | రాబడి (షిల్లిం) | కౌలు (షిల్లిం) | కౌలు పెరుగుదల |
|---|---|---|---|---|---|---|
| ఎ | 60+60=120 | $7\frac{1}{2}+10=17\frac{1}{2}$ | $6\frac{6}{7}$ | 120 | 0 | 0 |
| బి | 60+60=120 | 9+12=21 | $6\frac{6}{7}$ | 144 | 24 | 24 |
| సి | 60+60=120 | $10\frac{1}{2}+14=24\frac{1}{2}$ | $6\frac{6}{7}$ | 168 | 48 | 2×24 |
| డి | 60+60=120 | 12+16=28 | $6\frac{6}{7}$ | 192 | 72 | 3×24 |
| ఇ | 60+60=120 | $13\frac{1}{2}+18=31\frac{1}{2}$ | $6\frac{6}{7}$ | 216 | 96 | 4×24 |
| | | | | | 240 | 10×24 |

**ఉపనమూనా 2 :** రెండవ మదుపు ఉత్పాదకత తగ్గుతుంది. మొదటి ఉత్పాదకత స్థిరంగా ఉంటే వుండవచ్చు.

**పట్టిక - XX**

| భూమి రకం | ఉత్పత్తి ధర (షిల్లింగులు) | దిగుబడి (బస్తాలు) | అమ్మకం ధర (షిల్లింగులు) | రాబడి (షిల్లిం) | కౌలు (షిల్లిం) | కౌలు పెరుగుదల |
|---|---|---|---|---|---|---|
| ఎ | 60+60=120 | 10+5=15 | 8 | 120 | 0 | 0 |
| బి | 60+60=120 | 12+6=18 | 8 | 144 | 24 | 24 |
| సి | 60+60=120 | 14+7=21 | 8 | 168 | 48 | 2×24 |
| డి | 60+60=120 | 16+8=24 | 8 | 192 | 72 | 3×24 |
| ఇ | 60+60=120 | 18+9=27 | 8 | 216 | 96 | 4×24 |
| | | | | | 240 | 10×24 |

**ఉపనమూనా 3 :** రెండవ మదుపు ఉత్పాదకత తగ్గుతుంది. ఊహించిన పరిస్థితుల్లో మొదటి మదుపు ఉత్పాదకత తగ్గుదలనిది సూచిస్తుంది.

1. 1894 జర్మన్ ప్రతిలో ఈ శీర్షిక కింద ఇచ్చిన సంఖ్యలు పొరపాటు సంఖ్యలు కనుక ఉదాహరణకు తగినట్లుగా వాటిని దిద్దడం జరిగింది - సం.

పట్టిక - XXI

| భూమి రకం | ఉత్పత్తి ధర (షిల్లింగులు) | దిగుబడి (బస్తాలు) | అమ్మకం ధర (షిల్లింగులు) | రాబడి (షిల్లిం) | కౌలు (షిల్లిం) | కౌలు పెరుగుదల |
|---|---|---|---|---|---|---|
| ఎ | 60+60=120 | $5+12\frac{1}{2}=17\frac{1}{2}$ | $6\frac{6}{7}$ | 120 | 0 | 0 |
| బి | 60+60=120 | 6+15=21 | $6\frac{6}{7}$ | 144 | 24 | 24 |
| సి | 60+60=120 | $7+17\frac{1}{2}=24\frac{1}{2}$ | $6\frac{6}{7}$ | 168 | 48 | 2×24 |
| డి | 60+60=120 | 8+20=28 | $6\frac{6}{7}$ | 192 | 72 | 3×24 |
| ఇ | 60+60=120 | $19+22\frac{1}{2}=31\frac{1}{2}$ | $6\frac{6}{7}$ | 216 | 96 | 4×24 |
| | | | | | 240 | 10×24 |

ఆ. 'అ' అనే నాసిరకం భూమి ఇక్కడ ధరను శాసించే భూమిగా మారుతుంది. ఆ రకంగా ఎ భూమి కౌలు ఇచ్చే భూమిగా మారుతుంది. రెండవ మదుపు ఉత్పాదకత స్థిరంగా ఉండటం అన్నది అన్ని ఉపనమూనాల్లోనూ సాధ్యమవుతుంది.

**ఉపనమూనా :** రెండవ మదుపు ఉత్పాదకత యథాతథంగా వుంటుంది.

పట్టిక - XXII

| భూమి రకం | ఉత్పత్తి ధర (షిల్లింగులు) | దిగుబడి (బస్తాలు) | అమ్మకం ధర (షిల్లింగులు) | రాబడి (షిల్లిం) | కౌలు (షిల్లిం) | కౌలు పెరుగుదల |
|---|---|---|---|---|---|---|
| అ | 120 | 16 | $7\frac{1}{2}$ | 120 | 0 | 0 |
| ఎ | 60+60=120 | 10+10=20 | $7\frac{1}{2}$ | 150 | 30 | 30 |
| బి | 60+60=120 | 12+12=24 | $7\frac{1}{2}$ | 180 | 60 | 2×30 |
| సి | 60+60=120 | 14+14=28 | $7\frac{1}{2}$ | 210 | 90 | 3×30 |
| డి | 60+60=120 | 16+16=32 | $7\frac{1}{2}$ | 240 | 120 | 4×30 |
| ఇ | 60+60=120 | 18+18=36 | $7\frac{1}{2}$ | 270 | 150 | 5×30 |
| | | | | | 450 | 15×30 |

**ఉపనమూనా 2 :** రెండవ మదుపు ఉత్పాదకత తగ్గిపోతుంది.

## పట్టిక - XXIII

| భూమి రకం | ఉత్పత్తి ధర (షిల్లింగులు) | దిగుబడి (బస్తాలు) | అమ్మకం ధర (షిల్లింగులు) | రాబడి (షిల్లిం) | కౌలు (షిల్లిం) | కౌలు పెరుగుదల |
|---|---|---|---|---|---|---|
| అ | 120 | 15 | 8 | 120 | 0 | 0 |
| ఎ | 60+60=120 | $10+7\frac{1}{2}=17\frac{1}{2}$ | 8 | 140 | 20 | 20 |
| బి | 60+60=120 | 12+9=21 | 8 | 168 | 48 | 20×28 |
| సి | 60+60=120 | $14+10\frac{1}{2}=24\frac{1}{2}$ | 8 | 196 | 76 | 20+2×28 |
| డి | 60+60=120 | 16+12=28 | 8 | 224 | 104 | 20+3×28 |
| ఇ | 60+60=120 | $18+13\frac{1}{2}=31\frac{1}{2}$ | 8 | 252 | 132 | 20+4×28 |
| | | | | | 380 | 5×20+10×28 |

**ఉపనమూనా 3 :** రెండవ మదుపు ఉత్పాదకత పెరుగుతుంది.

## పట్టిక - XXIV

| భూమి రకం | ఉత్పత్తి ధర (షిల్లింగులు) | దిగుబడి (బస్తాలు) | అమ్మకం ధర (షిల్లింగులు) | రాబడి (షిల్లిం) | కౌలు (షిల్లిం) | కౌలు పెరుగుదల |
|---|---|---|---|---|---|---|
| అ | 120 | 16 | $7\frac{1}{2}$ | 120 | 0 | 0 |
| ఎ | 60+60=120 | $10+12\frac{1}{2}=22\frac{1}{2}$ | $7\frac{1}{2}$ | $168\frac{3}{4}$ | $48\frac{3}{4}$ | $15+33\frac{3}{4}$ |
| బి | 60+60=120 | 12+15=27 | $7\frac{1}{2}$ | $202\frac{1}{2}$ | $82\frac{1}{2}$ | $15+2\times33\frac{3}{4}$ |
| సి | 60+60=120 | $14+17\frac{1}{2}=31\frac{1}{2}$ | $7\frac{1}{2}$ | $236\frac{1}{4}$ | $116\frac{1}{4}$ | $15+3\times33\frac{3}{4}$ |
| డి | 60+60=120 | 16+20=36 | $7\frac{1}{2}$ | 270 | 150 | $15+4\times33\frac{3}{4}$ |
| ఇ | 60+60=120 | $18+22\frac{1}{2}=40\frac{1}{2}$ | $7\frac{1}{2}$ | $303\frac{3}{4}$ | $183\frac{3}{4}$ | $15+5\times33\frac{3}{4}$ |
| | | | | | $581\frac{1}{4}$ | $5\times15+15\times33\frac{3}{4}$ |

ఈ పట్టికలు అన్ని ఈ కింది నిర్ధారణలకు దారితీస్తాయి. మొదటిది కౌలుల వరుస భూసారాలలో ఉన్న తేడాల వరుసలాగానే ప్రవర్తిస్తుంది. కౌలు ఇవ్వని, ఉత్పత్తి ధర నిర్ణయించే భూమి సున్నా స్థానంలో ఉన్నదని భావించాలి. మొత్తం దిగుబడి కాక దిగుబడిలో ఉన్న తేడాలు మాత్రమే కౌలును నిర్ణయించే అంశాలు. వివిధ రకాల భూములు ఎకరానికి 1, 2, 3, 4, 5 బస్తాల దిగుబడి ఇస్తాయా లేదా 11, 12, 13, 14, 15 బస్తాలు ఇస్తాయా అన్నదానితో ప్రమేయం లేకుండా ఈ రెండు సందర్భాల్లోనూ కౌలులు 0, 1, 2, 3, 4 బస్తాలు వరుసలో లభిస్తాయి. లేదా వాటి సమవిలువ డబ్బు రూపంలో లభిస్తుంది.

అయితే ఒక భూమిలో పదే పదే పెట్టిన మదుపులపై వచ్చే మొత్తం కౌలుకు సంబంధించిన ఫలితాలు ఇంతకంటే చాలా ముఖ్యమైన అంశాలు.

ఇక్కడ విశ్లేషించిన 13 నమూనాల్లో 5 నమూనాల్లో మొత్తం మదుపు రెట్టింపు అయినప్పుడు మొత్తం కౌలు కూడా రెట్టింపు అవుతుంది. 10×12 షిల్లింగులకు బదులు అది 10×24=240 షిల్లింగులు అవుతుంది. ఆ నమూనాలు ఇలా ఉంటాయి.

**నమూనా I :** స్థిరమైన ధర.

**ఉప నమూనా 1 :** స్థిరమైన ఉత్పత్తి పెరుగుదల. (పట్టిక XII)

**నమూనా II :** పడిపోయే ధర.

**ఉప నమూనా 3 :** పెరుగుతున్న ఉత్పత్తి పెరుగుదల. (పట్టిక XVIII)

**నమూనా III**: పెరిగే ధర. మొదటి రకం (ఎ భూమి ధరను శాసిస్తుంది) మూడు ఉపనమూనాల్లోనూ. (పట్టికలు XIX, XX, XXI)

నాలుగు నమూనాల్లో కౌలు రెట్టింపుకంటే పెరుగుతుంది.

అవి :

**నమూనా I; ఉపనమూనా 3 :** స్థిరమైన ధర అయితే ఉత్పత్తి పెరుగుదల పెరుగుతూనే వుంటుంది. (పట్టిక XV) మొత్తం కిరాయి 330 షిల్లింగులకు పెరుగుతుంది.

**నమూనా III :** రెండవ రకం (ఎ భూమి ఇక్కడ కౌలునిస్తుంది) మూడు రకాల ఉపనమూనాల్లోనూ (పట్టిక XXII), కౌలు = 15×30=450 షిల్లింగులు, (పట్టిక XXIII, కిరాయి = 5×20+10×28=380 షిల్లింగులు. పట్టిక XXIV, కౌలు = 5×15+15×33$\frac{3}{4}$=581$\frac{1}{4}$ షిల్లింగులు)

ఒక నమూనాలో కౌలు పెరుగుతుంది. కాని మొదటి మదుపువల్ల అది రెట్టింపు కాదు.

నమూనా I, స్థిరమైన ధర, ఉపనమూనా 2. రెండవ మదుపు ఉత్పాదకత పడిపోతుంది. బి భూమి పూర్తిగా కౌలు ఇవ్వని భూమిగా మారని పరిస్థితుల్లో (పట్టిక XIV కౌలు = 4×6+6×21=150 షిల్లింగులు)

చివరి అంశం కేవలం మూడు నమూనాల్లో మాత్రమే మొత్తం కౌలు భూములు అన్నింటిని పరిగణనలోనికి తీసుకోగా, మొదటి మదుపు (పట్టిక XI) స్థాయిలోనే మొత్తం కౌలు రెండవ మదుపు విషయంలో కూడా మూడు సందర్భాల్లో మాత్రమే వుంది. ఈ నమూనాలలో ఎ భూమి పోటీ నుంచి తొలగించబడింది. బి భూమి ధరను శాసిస్తుంది. కనుక కౌలులేని భూమిగా మారుతుంది. ఆ రకంగా బి భూమి కౌలు మాయమవ్వటమే కాక దాని తరువాత వచ్చే కౌలుల్నుంచి అది తీసి వేయబడుతుంది. ఫలితం అలా నిర్ణయించబడుతుంది. ఆ నమూనాలు ఇలా ఉంటాయి.

నమూనా I, ఉపనమూనా 2; ఎ భూమి తొలగించబడిన పరిస్థితులు (పట్టిక XIII). మొత్తం కౌలు=6×20 లేదా 10×12=120. ఇది పట్టిక XIలో లాగానే ఉంది.

నమూనా II, ఉపనమూనాలు 1, 2; ఇక్కడ ఊహించిన ప్రకారం ఎ భూమి తొలగించబడు తుంది. (పట్టికలు XVI, XVII) మళ్ళీ మొత్తం కౌలు 6×20=10×12=120 షిల్లింగులు.

దాని అర్థమేమంటే, అత్యధిక సందర్భాల్లో భూమిలో మదుపు పెరగటంవల్ల (కౌలు ఇచ్చే భూమిలో ఎకరంపైన, దాని మొత్తంపైన) కౌలు పెరుగుతుంది. ఇక్కడ విశ్లేషించిన బి నమూనాల్లో

మూడింటిలో మాత్రమే దాని మొత్తం యథాతథంగా వుంది. ఆ నమూనాలలో ఇంతవరకు ధరను నిర్ణయించిన అత్యంత అధ్వాన్నపు భూమి పోటీ నుంచి తొలగించబడుతుంది. దాని తరువాత మెరుగైన భూమి దాని స్థానాన్ని ఆక్రమిస్తుంది. అది తిరిగి కౌలులేని భూమిగా మారుతుంది. సి భూమిపై కౌలు 24 నుంచి 20కి తగ్గుతుంది. అయితే డి, ఇ భూమిలో వరుసగా 36 నుంచి 48కి 48 నుంచి 60 షిల్లింగులకు పెరుగుతుంది.

మొదటి మదుపు స్థాయికంటే మొత్తం కౌలులు పడిపోవడం అన్నది ఎ భూమితో పాటు బి భూమి కూడా పోటీ నుంచి తొలగించబడి సి భూమి కౌలులేని భూమిగా మారి ధరను శాసించినప్పుడు మాత్రమే సాధ్యమవుతుంది. (పట్టిక XI)

ఆ రకంగా భూమిలో ఎంత ఎక్కువ పెట్టుబడి పెడితే – ఒక దేశంలో వ్యవసాయ అభివృద్ధి, నాగరికతా అభివృద్ధి ఎంత ఎక్కువగా ఉంటే – ఎకరానికి కౌలులు, అలాగే మొత్తం కౌలులు అంతగా పెరుగుతాయి. అదనపు లాభాల రూపంలో మొత్తం సమాజం పెద్ద భూస్వాములకు చెల్లించే కప్పం అంతగా పెరుగుతుంది. వివిధ భూములు సాగులోకి వచ్చాక పోటీని కొనసాగించగలిగితే తప్ప దీనిలో మార్పు ఉండదు.

పెద్ద భూస్వాముల వర్గం ఆడంబరంగా నివసించటానికి ఈ నియమం కారణం. ఇంత సంతృప్తిగా ఏ సామాజిక వర్గమూ జీవించదు. తన "అంతస్తు"కు తగినట్టుగా డబ్బు ఎక్కడి నుండి వస్తుంది అన్నదానితో ప్రమేయం లేకుండా సాంప్రదాయకంగా వస్తున్న విలాసాలను ఇంతగా తన హక్కుగా భావించే మరో వర్గమేదీ లేదు. ఇంత నిశ్చింతగా రుణాలు పేర్చే మరో వర్గమేదీ లేదు. అయితే మళ్ళీ ప్రతిసారి అది తన కాళ్ళమీద తను నిలబడుతూనే ఉంటుంది. ఆ భూమిలో ఇతరులు పెట్టిన పెట్టుబడివల్ల, దానిపై వచ్చే కౌలువల్ల ఇది సాధ్యమవుతుంది. దాని నుంచి పెట్టుబడిదారుడు పొందే లాభాలకు మించి అనేక రెట్లు ఈ వర్గం అనుభవిస్తుంది.

అయితే అదే నియమం పెద్ద భూస్వామి యొక్క జీవశక్తి క్రమంగా ఎందుకు హరించుకు పోతున్నదో కూడా వివరిస్తుంది.

1846 ఇంగ్లీషు ధాన్యం చట్టాలు రద్దయినప్పుడు భూస్వామి ప్రభు వర్గాన్ని, తాము దరిద్రులుగా మార్చగలిగామని ఇంగ్లీషు కార్ఖానాదారులు నమ్మారు. పైపెచ్చు భూస్వాములు ఇంతకు ముందుకంటే సంపన్నులయ్యారు. ఇది ఎలా జరిగింది? చాలా మామూలుగా మొదటిది. ఒక ఒప్పందం రీత్యా రైతులు ఎకరానికి 8 పౌండ్లు కాక 12 పౌండ్లు మదుపు పెట్టాలని నిర్బంధించబడ్డారు. రెండవది – దిగువ సభలో కూడా బలమైన ప్రాతినిధ్యం ఉన్న భూస్వాములు తమ భూములపైన డ్రయినేజి పథకాలకు, ఇతర శాశ్వతమైన మెరుగుదల కార్యక్రమాలకు పెద్ద ఎత్తున ప్రభుత్వ సబ్సిడీని తమకు తామే మంజూరు చేసుకున్నారు. దానివల్ల అత్యంత అధ్వాన్నపు భూమిని తొలగించటం కాక అది ఇతర ప్రయోజనాలకు వినియోగించబడింది. ఇది చాలా వరకు తాత్కాలికంగానే జరిగింది. పెరిగిన పెట్టుబడి మదుపుకు అనులోమంగా కౌలులు పెరిగాయి. ఫలితంగా భూస్వామ్య ప్రభువర్గం ఇంతకు ముందుకంటే మరింత సంపన్నులయ్యారు.

అయితే ప్రతిదీ తాత్కాలికమే. మహాసముద్రాల్లో పయనించే ఓడల అభివృద్ధి, ఉత్తర, దక్షిణ అమెరికాల్లోనూ, ఇండియాలోనూ రైల్వేల అభివృద్ధి, కొన్ని ప్రత్యేకమైన భూములు యూరప్ మార్కెట్లలో

పోటీ చెయ్యటానికి అవకాశం కల్పించాయి. ఇవి ఒకవైపున ఉత్తర అమెరికాలోనూ, అర్జంటీనాలోనూ ప్రకృతి సాగుకు సిద్ధం చేసిన బంజర భూములు అందుబాటులోకొచ్చాయి. ఎరువులు వాడకుండానే ఆదిమ పద్ధతులలో సాగుచేసినప్పటికీ అవి మంచి పంటల్ని ఇచ్చాయి. మరోవైపున రష్యాలోనూ, ఇండియాలోనూ సామూహికంగా నిర్వహించే వ్యవసాయంలో కొంత ఉత్పత్తిని పన్నులు కట్టడం కోసం అమ్మాల్సివస్తుంది. ఈ భాగం స్థిరంగా పెరుగుతూనే వుంది. దయాదాక్షిణ్యం లేని నియంతృత్వ ప్రభుత్వం తరచుగా హింసించటం ద్వారా కూడా పన్నులు వసూలు చేస్తుంది. ఈ ఉత్పత్తులు 1. ఉత్పత్తి ధరతో ప్రమేయం లేకుండా అమ్మబడతాయి. కొనేవాడు ఎంత ఇస్తానంటే అంతే. ఎందుకంటే పన్నులు కట్టాల్సిన గడువు సమీపించినప్పుడు రైతుకు డబ్బు అత్యవసరం కనుక ఈ పోటీవల్ల (బీడు భూముల్నుంచి, పన్నుల భారంతో కుంగిపోయే రష్యన్, ఇండియన్ రైతుల నుంచి) యూరప్ కౌలుదారీ రైతు పాత కౌలుల్ని కడుతూ బతకలేడు. యూరప్‌లో కొంత భూభాగం ధాన్యపు సాగుకు సంబంధించినంత వరకూ పోటీ నుంచి తప్పుకుంది. ప్రతిచోట కౌలులు పడిపోయాయి. మన రెండవ నమూనా, రెండవ ఉపనమూనా : పడిపోయే ధరలు, అదనపు మదుపు ఉత్పాదకత పడిపోవటమూ యూరప్‌లో సర్వసాధారణమయింది. స్కాట్లండ్ నుండి ఇటలీ వరకూ, దక్షిణ ఫ్రాన్స్ నుండి తూర్పు ప్రష్యా వరకూ గల భూస్వాముల శోకానికి కారణం ఇది. అదృష్టవశాత్తూ మైదానపు బీడుభూములన్నీ ఇంకా సాగులోకి రాలేదు. మొత్తం యూరప్‌లో ఉన్న పెద్ద భూస్వాముల్ని నాశనం చేసి చిన్న భూస్వాముల్ని ఇరకాటంలో పెట్టగలిగినన్ని బీడుభూములు ఇంకా సాగుకు వెలుపలే ఉన్నాయి – ఎంగెల్స్.]

★ ★ ★

కౌలును విశ్లేషించాల్సిన శీర్షికలు ఇవి.

అ. వ్యత్యాసపు కౌలు.

1. వ్యత్యాసపు కౌలు భావన. ఉదాహరణగా జలశక్తి వ్యవసాయ కౌలుగా పరివర్తన.
2. వ్యత్యాసపు కౌలు I. ఇది వివిధ కమతాల వేరువేరు సారాల నుంచి తలెత్తుతుంది.
3. వ్యత్యాసపు కౌలు II. ఒకే భూమిలో ఒకదాని వెంట ఒకటి వరుసగా మదుపుల నుంచి ఇది తలెత్తుతుంది. వ్యత్యాసపు కౌలు II ను

a. యథాతథమైన

b. పడిపోయే

c. పెరిగే ఉత్పత్తి ధరతో విశ్లేషించాలి. దానితోపాటు

d. అదనపు లాభం కౌలుగా రూపొందటాన్ని కూడా విశ్లేషించాలి.

4. లాభం రేటుపై ఈ కౌలు ప్రభావం

ఆ. నిరపేక్షమైన కౌలు

ఇ. భూమి ధర

ఈ. భూమి కౌలుకు సంబంధించి అంతిమ ప్రస్తావన.

★ ★ ★

వ్యత్యాసపు కౌలును స్థూలంగా పరిశీలిస్తే మొత్తంమీద రాగలిగిన నిర్ధారణలు ఇలా వుంటాయి.

మొదటిది – అదనపు లాభం రూపొందటం అనేక విధాలుగా జరగవచ్చు. ఒకవైపున వ్యత్యాసపు కౌలు I పైన ఆధారపడి జరగవచ్చు. అంటే వివిధ రకాల సారాలు గల భూములలో మొత్తం వ్యవసాయ పెట్టుబడి పెట్టటంవల్ల రూపొందవచ్చు. లేదా వ్యత్యాసపు కౌలు II రూపంలో కూడా జరగవచ్చు. అనగా ఒకే భూమిలో వివిధ రకాల వ్యత్యాసపు ఉత్పత్తి కలిగిన మదుపులను వరుసగా పెట్టటం ఆధారంగా రూపొందవచ్చు. అనగా అదే మదుపుతో అత్యంత అధ్వాన్నపు భూమిలో అనగా ఉత్పత్తి ధరను నియంత్రించే కౌలులేని భూమిలో సాధించే ఉత్పాదకత కంటే ఎక్కువ ఉత్పాదకతను, ఉదాహరణకు గోధుమ బస్తాల రూపంలో సాధించటం ద్వారా రూపొందవచ్చు. ఈ అదనపు లాభం ఎలా ఏర్పడినప్పటికీ కౌలు రూపంలోకి అది మారటానికి అనగా రైతు చేతిలో నుంచి భూస్వామి చేతుల్లోకి పోవటానికి వివిధ రకాల విడి మదుపుల నుంచి ఉత్పత్తి అయిన భాగాల, విడి ఉత్పత్తి ధరలు – ఈ ధరలు మార్కెట్టును నియంత్రిస్తున్న సాధారణ ఉత్పత్తి ధరతో ప్రమేయం లేకుండా స్వతంత్రంగా ఉంటాయి. విడి సగటు ఉత్పత్తి ధరకు ఇంతకు ముందు కుదించబడ్డాయి. ఎకరంపై వచ్చే ఉత్పాదితం యొక్క సాధారణ ఉత్పత్తి ధర మార్కెట్టును నియంత్రిస్తుందనుకుందాం. అప్పుడు ఆ ధర ఈ విడి సగటు ఉత్పత్తి ధరకంటే ఎంత ఎక్కువగా ఉంటే అంత ఎకరంపైన వచ్చే కౌలుగా రూపొందుతుంది. వ్యత్యాసపు కౌలు I విషయంలో ఈ వ్యత్యాసపు ఫలితాలు స్పష్టంగా కనిపిస్తాయి. ఎందుకంటే అవి విభిన్న భూభాగాల (వేరువేరుగా పక్కపక్కనే ఉన్న) నుంచి వస్తాయి. ఎకరంపైన పెట్టిన మదుపు, సాగు స్థాయి – సాధారణ స్థాయిలో ఉన్నాయని భావించాలి. వ్యత్యాసపు కౌలు II విషయంలో విడి పెట్టుబడి భాగాలను వేరుచేసి చూడాలి. నిజానికి వాటిని తిరిగి వ్యత్యాసపు కౌలు I రూపంలోకి మార్చాలి. అది ఇక్కడ సూచించిన ప్రకారం మాత్రమే జరుగుతుంది. ఉదాహరణకు పట్టిక III ని తీసుకుందాం.[1]

*బి* భూమి మొదటి మదుపు $2\frac{1}{2}$ పౌండ్లకు ఎకరానికి 2 బస్తాల ధాన్యాన్ని ఇస్తుంది. అంతే పరిమాణం గల రెండవ మదుపుకు $1\frac{1}{2}$ బస్తాలను ఇస్తుంది. అంటే ఎకరం మీద మొత్తం $3\frac{1}{2}$ బస్తాలు దిగుబడి ఇస్తుంది. ఈ $3\frac{1}{2}$ బస్తాలు ఒకే భూమిలో పండటంవల్ల దీనిలో ఏ భాగం పెట్టుబడి మదుపు I నుంచి వచ్చిందో ఏ భాగం పెట్టుబడి మదుపు II నుంచి వచ్చిందో విడదీయటం సాధ్యం కాదు. నిజానికి ఈ $3\frac{1}{2}$ బస్తాలు మొత్తం 5 పౌండ్ల పెట్టుబడిపైన వచ్చిన దిగుబడి. ఇక్కడ వున్న వాస్తవం క్లుప్తంగా చెప్పాలంటే – $2\frac{1}{2}$ పౌండ్ల పెట్టుబడి రెండు బస్తాలను ఇస్తే, 5 పౌండ్ల పెట్టుబడి 4 బస్తాలకు బదులు $3\frac{1}{2}$ బస్తాలనే ఇస్తుంది. రెండు మదుపుల దిగుబడి సమానంగా ఉంటే 5 పౌండ్ల పెట్టుబడి మీద 4 బస్తాలు వచ్చి వుండేవి. అదే విధంగా దిగుబడి 5 బస్తాలు ఉన్నదనుకుంటే అనగా రెండవ మదుపువల్ల ఒక బస్తా అదనంగా లభిస్తుంది అనుకుంటే కూడా విషయంలో తేడా ఏమీ రాదు. మొదటి 2 బస్తాల ఉత్పత్తి ధర బస్తాకు $1\frac{1}{2}$ పౌండ్లు ఉంది. మిగిలిన $1\frac{1}{2}$ బస్తాల ధర బస్తాకు 2 పౌండ్ల చొప్పున ఉంది. దాని ఫలితంగా మొత్తం $3\frac{1}{2}$ బస్తాల ధర 6 పౌండ్లు. మొత్తం ఉత్పాదితం యొక్క విడి ఉత్పత్తి ధర యిది. సగటున బస్తాకు సుమారుగా $1\frac{3}{4}$ పౌండ్లు అవుతుంది.

1. ప్రస్తుత సంపుటి (ఇంగ్లీషు)లో 687 పేజీ - సం.

ఇక్కడ సాధారణ ఉత్పత్తి ధర 3 పౌండ్లు. దీనిని ఎ భూమి నిర్ణయిస్తుంది. కనుక అదనపు లాభం బస్తాకు భూమిలో $1\frac{1}{4}$ పౌండ్లు వుంటుంది. కనుక మొత్తం $3\frac{1}{2}$ బస్తాలకుగాను అదనపు లాభం $4\frac{3}{8}$ పౌండ్లు వుంటుంది. 'బి' భూమిలో సగటు ఉత్పత్తి ధర రీత్యా ఈ అదనపు లాభం $1\frac{1}{2}$ బస్తాలకు దాదాపు సమానం అవుతుంది. మరోలా చెప్పాలంటే 'బి' నుంచి వచ్చే అదనపు లాభం బి నుంచి వచ్చే మొత్తం ఉత్పాదితంలో 1 సమభాగాన్ని సూచిస్తుంది. అది ఇక్కడ కౌలును ధాన్యం రూపంలో వ్యక్తం చేస్తుంది. అది సాధారణ ఉత్పత్తి ధర ప్రకారం $4\frac{1}{2}$ పౌండ్లకు ఈ ధాన్యం అమ్మకమవుతుంది. అయితే మరోవైపున 'బి' భూమిలో 'ఎ' భూమికి మించిన ఉత్పత్తి దానంతటదే అదనపు లాభానికి ప్రాతినిధ్యం వహించదు. కనుక అదనపు ఉత్పాదితానికి కూడా ప్రాతినిధ్యం వహించదు. మన ఊహ ప్రకారం 'బి' భూమి ఒక ఎకరంలో $3\frac{1}{2}$ బస్తాలను ఇస్తుంది. కాగా 'ఎ' భూమి 1 బస్తాను మాత్రమే ఇస్తుంది. కనుక ఇక్కడ 'బి' అదనంగా ఉత్పత్తి చేస్తున్నది $2\frac{1}{2}$ బస్తాలు. కానీ అదనపు ఉత్పాదితం మాత్రం $1\frac{1}{2}$ బస్తాలు మాత్రమే. ఎందుకంటే 'బి' భూమిలో పెట్టిన పెట్టుబడి 'ఎ' భూమిలో కంటే రెట్టింపు ఉంటుంది. 'ఎ' భూమిలో కూడా 5 పౌండ్లు పెట్టి వుంటే ఉత్పాదకత రేటు యథాతథంగా ఉండి ఉంటే అప్పుడు ఉత్పత్తి 1 బస్తా కాక 2 బస్తాలు ఉంటుంది. కనుక వాస్తవ అదనపు ఉత్పాదితం $3\frac{1}{2}$ బస్తాలను ఒక బస్తాతో కాక $3\frac{1}{2}$ బస్తాలను 2 బస్తాలతో పోల్చటం ద్వారా నిర్ణయించ బడుతుందని గమనించవచ్చు. అప్పుడు అదనపు ఉత్పాదితం $2\frac{1}{2}$ బస్తాలు కాదు. $1\frac{1}{2}$ బస్తా మాత్రమే. అంతేకాక బి భూమిలో $2\frac{1}{2}$ పౌండ్ల మూడవ మదుపు పెట్టగా అది 1 బస్తా దిగుబడిని ఇచ్చిం దనుకుందాం. 'ఎ' భూమిలో లాగానే ఈ బస్తా ఉత్పత్తికి 3 పౌండ్లవల్ల దాని ఉత్పత్తి ధర మాత్రమే వస్తుంది. అనగా కేవలం సగటు లాభం మాత్రమే వస్తుంది. అదనపు లాభం రాదు. కనుక కౌలుగా మారటానికి వీలున్న దేనినీ ఉత్పత్తి చెయ్యలేదన్నమాట. 'ఎ' భూమి నుంచి ఒక ఎకరానికి వచ్చే దిగుబడితో మరో భూమి ఎకరంపై వచ్చే దిగుబడిని పోల్చితే, ఆ దిగుబడి సమానమైన మదుపు నుంచి వచ్చిందో, అంతకంటే పెద్ద మదుపు నుంచి వచ్చిందో తెలియదు. ఈ అదనపు దిగుబడి కేవలం ఉత్పత్తి ధరను మాత్రమే సంపాదిస్తుందో లేక అదనపు పెట్టుబడి, అధిక ఉత్పాదకతవల్ల వచ్చిందో తెలియదు.

రెండవది – అదనపు మదుపుల ఉత్పాదకత రేటు తగ్గుతున్నదని భావిద్దాం. అదనపు విలువ కొత్తగా రూపొందటానికి సంబంధించినంత వరకు అదనపు మదుపుల పరిమితి ఏమంటే కేవలం ఉత్పత్తి ధరను మాత్రమే అందించే పెట్టుబడి మదుపు అంటే 'ఎ' భూమిలో ఒక ఎకరంపై పెట్టిన మదుపు 1 బస్తా ధాన్యాన్ని ఉత్పత్తి చెయ్యటానికి అవసరమైన మొత్తం అని అర్థం. అంటే అది 3 పౌండ్లు పెట్టిన మదుపు మొత్తం కౌలు ఇవ్వని పరిస్థితి 'బి' భూమిలో ఒక ఎకరంపై వచ్చే ఉత్పత్తి యొక్క విడి సగటు ధర 'ఎ' భూమిలో ఉత్పత్తి ధర స్థాయికి పెరిగినప్పుడు వస్తుంది.

కేవలం ఉత్పత్తి ధరను మాత్రమే ఇచ్చే మదుపులను అంటే అదనపు లాభాన్ని గాని, అదనపు కౌలును గాని ఇవ్వని మదుపులను 'బి' భూమిలో పెడితే అది బస్తాపైన విడి సగటు ఉత్పత్తి ధరను పెంచుతుంది. కాని అదనపు లాభాన్ని అలాగే ఇంతకుముందు పెట్టిన మదుపువల్ల ఏర్పడిన కౌలును ప్రభావితం చెయ్యదు. ఎందుకంటే సగటు ఉత్పత్తి ధర ఎప్పుడూ 'ఎ' ధరకంటే తక్కువే వుంటుంది. ఒక బస్తాపైన పెచ్చుగా ఉన్న ధర తగ్గిపోతే ఆ మేరకు బస్తాల సంఖ్య పెరుగుతుంది. కనుక ధరలో ఉన్న మొత్తం అదనపు ధర యథాతథంగా వుంటుంది.

మనం ఊహించిన నమూనాలో 'బి' భూమిలో పెట్టిన మొదటి రెండు మదుపులు కలిపి 5 పౌండ్లు. అది $3\frac{1}{2}$ బస్తాలను ఇస్తాయి. మన ఊహ ప్రకారం కౌలు $1\frac{1}{2}$ బస్తాలు. అంటే $4\frac{1}{2}$ పౌండ్లు. మరో $2\frac{1}{2}$ పౌండ్ల మూడవ మదుపు పెడితే మరో బస్తా ధాన్యాన్ని అదనంగా ఉత్పత్తి చేస్తుంది. అప్పుడు మొత్తం ఉత్పత్తి ధర (20% లాభంతో సహా) $4\frac{1}{2}$ బస్తాల ధర = 9 పౌండ్లు. ఆ రకంగా బస్తాకు సగటు ధర 2 పౌండ్లు. బి భూమిలో సగటు ఉత్పత్తి ధర ఆ రకంగా $1\frac{5}{7}$ పౌండ్ల నుంచి 2 పౌండ్లకు పెరిగింది. మార్కెట్టు ధరను శాసిస్తున్న 'ఏ' ధరతో పోల్చితే, బస్తాపై అదనపు లాభం $1\frac{2}{7}$ పౌండ్ల నుంచి 1 పౌండుకు పడిపోయింది. అయితే ఇంతకు ముందు $1\frac{2}{7}\times3\frac{1}{2}=4\frac{1}{2}$ పౌండ్లు వున్నట్టుగానే ఇప్పుడు $1\times4\frac{1}{2} = 4\frac{1}{2}$ పౌండ్లు అదనపు లాభం వుంటుంది.

$2\frac{1}{2}$ పౌండ్లు చొప్పున 4వ, 5వ అదనపు మదుపులు బి భూమిలో పెట్టబడినాయనుకుందాం. అవి దాని సాధారణ ఉత్పత్తి ధరతో ఒక బస్తాకు మించి ఉత్పత్తి చెయ్యవు. అప్పుడు మొత్తం ఎకరంపై ఉత్పత్తి $6\frac{1}{2}$ బస్తాలు. వాటి ఉత్పత్తి ధర 15 పౌండ్లు. బి విషయంలో బస్తా సగటు ఉత్పత్తి ధర మళ్ళీ 2[1] పౌండ్ల నుంచి $2\frac{4}{13}$ పౌండ్లకు తగ్గుతుంది. అయితే ఈ $\frac{9}{13}$ పౌండ్లను ఇప్పుడు $4\frac{1}{2}$ బస్తాలపై కాక $6\frac{1}{2}$ బస్తాల ప్రాతిపదికగా అంచనా వెయ్యాలి. కనుక $\frac{9}{13}\times6\frac{1}{2} = 1\times4\frac{1}{2} = 4\frac{1}{2}$ పౌండ్లు.

అదనపు పెట్టుబడి పూర్తిగా అదనపు లాభాన్ని ఉత్పత్తి చెయ్యటం మానేసి కేవలం సగటు లాభాన్ని మాత్రమే ఇచ్చే మేరకు కౌలు ఇచ్చే భూముల్లో అదనపు మదుపులు పెట్టడాన్ని సాధ్యం చెయ్యటానికి ఈ పరిస్థితులలో అమల్లో వున్న ఉత్పత్తి ధర పెరగనవసరం లేదని దీనినిబట్టి తెలుస్తుంది. అంతేకాక బస్తాపైన అదనపు లాభం ఎంతగా తగ్గిపోయినప్పటికీ ఈ తగ్గుదల ఆ ఎకరంలో ఉత్పత్తి అయ్యే బస్తాల సంఖ్య పెరుగుదలవల్ల భర్తీ అవుతుంది. కనుక ఒక ఎకరంపై మొత్తం అదనపు లాభం యథాతథంగా వుంటుంది. సగటు ఉత్పత్తి ధర సార్వత్రిక ఉత్పత్తి ధరను చేరుకోవాలంటే (బి విషయంలో 3 పౌండ్లు) అదనపు మదుపుల ఉత్పత్తి ధర అమల్లో వున్న ఉత్పత్తి ధరకంటే ఎక్కువ ఉండాలి. బి భూమిలో ఒక బస్తా సగటు ఉత్పత్తి ధరను 3 పౌండ్ల సాధారణ ఉత్పత్తి ధర స్థాయికి పెంచాలంటే కేవలం ఇది మాత్రమే సరిపోదని మనకు తెలుస్తుంది.

'బి' భూమి ఈ విధంగా ఉత్పత్తి చేస్తుందనుకుందాం.

1. ఇదివరకటిలాగానే 6 పౌండ్ల ఉత్పత్తి ధరతో $3\frac{1}{2}$ బస్తాలు. అనగా $2\frac{1}{2}$ పౌండ్ల చొప్పున రెండు పెట్టుబడి మదుపులు. రెండూ అదనపు లాభాన్ని ఇస్తాయిగాని తగ్గిపోయే క్రమంలో ఇస్తాయి.
2. 3 పౌండ్ల పెట్టుబడి మదుపుపై 1 బస్తా. అనగా ఇక్కడ విడి ఉత్పత్తి ధర అమల్లో వున్న ఉత్పత్తి ధరకు సమానం.
3. ఒక బస్తా ధాన్యాన్ని 4 పౌండ్ల మదుపుతో ఉత్పత్తి చేస్తుంది. అంటే ఇక్కడ విడి ఉత్పత్తి ధర అమల్లో వున్న ధరకంటే 33% ఎక్కువ వుంది.

ఇక్కడ ఒక ఎకరంలో 13 పౌండ్ల ఉత్పత్తి ధరపై, $10\frac{7}{10}$ పౌండ్ల పెట్టుబడిపై $5\frac{1}{2}$ బస్తాలు ఉత్పత్తి అయ్యాయి. మొదట పెట్టిన పెట్టుబడికి ఇది 4 రెట్లు. అయితే మొదటి పెట్టుబడి ఉత్పత్తికి ఇది 3 రెట్లుకంటే తక్కువ వుంది.

1. 1894 జర్మన్ సంపుటిలో ఇది 1 అని వుంది - సం.

13 పౌండ్లకు $5\frac{1}{2}$ బస్తాల చొప్పున బస్తా ఉత్పత్తి ధర $2\frac{4}{11}$ పౌండ్లు అంటే బస్తాకు అమల్లో వున్న ఉత్పత్తి ధర (3 పౌండ్లు) ప్రకారం $\frac{7}{11}$ పౌండ్లు అధికంగా వుంది. ఈ అధికంగా వున్న మొత్తాన్ని కౌలుగా మార్చవచ్చు. అమల్లో వున్న 3 పౌండ్ల ఉత్పత్తి ధర ప్రకారం $5\frac{1}{2}$ బస్తాల ధర $16\frac{1}{2}$ పౌండ్లు అవుతుంది. 13 పౌండ్ల ఉత్పత్తి ధరను తీసివేస్తే, అదనపు లాభం లేదా కౌలు $3\frac{1}{2}$ పౌండ్లు మిగులుతుంది. 'బి' భూమిలో బస్తా సగటు ఉత్పత్తి ధర $2\frac{4}{11}$ పౌండ్లు అంటే అది $1\frac{25}{52}$ బస్తాలకు ప్రాతినిధ్యం వహిస్తుంది. ఇక్కడ డబ్బు కౌలు 1 పౌండు తక్కువ వుంటుంది. ధాన్యపు కౌలు $\frac{1}{2}$ బస్తా తక్కువ వుంటుంది. 'బి' భూమిలో పెట్టిన 4వ మదుపు అదనపు లాభాన్ని ఇవ్వకపోవటమే కాక సగటు లాభంకంటే తక్కువ ఇస్తుంది. అయినప్పటికీ అదనపు లాభం కౌలు ఇంకా ఉంటుంది. 3వ మదుపుతో పాటు 2వ మదుపు కూడా నియంత్రణలో వున్న ఉత్పత్తి ధరకంటే ఎక్కువ ధరకు ఉత్పత్తి చేస్తుం దనుకుందాం. అప్పుడు మొత్తం ఉత్పత్తి 6 పౌండ్లకు $3\frac{1}{2}$ బస్తాలు + 8 పౌండ్లకు 2 బస్తాలు అంటే మొత్తం 14 పౌండ్లకు $5\frac{1}{2}$ బస్తాలు. కనుక బస్తా సగటు ఉత్పత్తి ధర $2\frac{6}{11}$ పౌండ్లు ఇంకా $\frac{5}{11}$ పౌండ్లు ఎక్కువగానే వుంది. $5\frac{1}{2}$ బస్తాలను 3 పౌండ్ల చొప్పున అమ్మితే 16 పౌండ్లు వస్తుంది. దానిలో నుంచి 14 పౌండ్ల ఉత్పత్తి ధరను తగ్గిస్తే, కౌలు కోసం మరో $2\frac{1}{2}$ పౌండ్లు మిగులుతుంది. 'బి' భూమిలో ఇప్పటి సగటు ఉత్పత్తి ధర ప్రకారం ఇది $\frac{55}{56}$ బస్తాకు సమానం అవుతుంది. మరోలా చెప్పాలంటే ఇంతకు ముందుకంటే తక్కువగానే అయినప్పటికీ ఇంకా కౌలు లభిస్తూనే వుంది.

ఏమైనప్పటికీ మెరుగైన భూముల్లో అదనపు మదుపులు అమల్లో ఉన్న ఉత్పత్తి ధరకంటే ఎక్కువ ఖర్చుతో ఉత్పత్తి చేసినప్పటికీ కౌలు మటుమాయం కాదని (కనీస ఆచరణ పరిమితుల్లో) మహా అయితే అది తగ్గుతుందని ఇది స్పష్టంగా తెలియజేస్తుంది. మొత్తం మదుపులో ఈ తక్కువ ఉత్పాదకమైన పెట్టుబడి ఉన్న నిష్పత్తినిబట్టి, మరోవైపున ఆ ఉత్పాదకత తగ్గుదల స్థాయినిబట్టి కౌలు తగ్గుతుంది. దాని ఉత్పత్తి సగటు ధర నియంత్రణలో వున్న ధరకంటే అప్పటికీ తక్కువగానే వుంటుంది. కనుక అదనపు లాభం ఏర్పడటానికి అది కౌలుగా రూపొందటానికి అనుమతిస్తుంది.

వరుసగా నాలుగు మదుపులను ($2\frac{1}{2}$ పౌండ్లు, $2\frac{1}{2}$ పౌండ్లు, 5 పౌండ్లు, 5 పౌండ్లు) తగ్గుతున్న ఉత్పాదకతతో ఊహిద్దాం. ఇక్కడ సగటు ఉత్పత్తి ధర సాధారణ ఉత్పత్తి ధరతో సమానమవుతుందని భావిద్దాం.

**పట్టిక**

| | పెట్టుబడి (పౌండ్లలో) | లాభం (పౌం) | ఉత్పత్తి (బ.లలో) | ఉత్పత్తి ధర | | అమ్మకపు ధర (పౌం.లో) | రాబడి (పౌం.లో) | కౌలుకై మిగులు | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| | | | | బస్తాకి (పౌం.లో) | మొత్తం (పౌం.లో) | | | బస్తాలు | పౌండ్లలో |
| 1 | $2\frac{1}{2}$ | $\frac{1}{2}$ | 2 | $1\frac{1}{2}$ | 3 | 3 | 6 | 1 | 3 |
| 2 | $2\frac{1}{2}$ | $\frac{1}{2}$ | $1\frac{1}{2}$ | 2 | 3 | 3 | $4\frac{1}{2}$ | $\frac{1}{2}$ | $1\frac{1}{2}$ |
| 3 | 5 | 1 | $1\frac{1}{2}$ | 4 | 6 | 3 | $4\frac{1}{2}$ | $-\frac{1}{2}$ | $-1\frac{1}{2}$ |
| 4 | 5 | 1 | 1 | 6 | 6 | 3 | 3 | -1 | -3 |
| | 15 | 3 | 6 | | 18 | | 18 | 0 | 0 |

ఈ సందర్భంలో రైతు ప్రతి బస్తాను దాని విడి ఉత్పత్తి ధరకు అమ్ముతాడు. అయితే మొత్తం మీద అన్ని బస్తాలను కలిపి సగటు ఉత్పత్తి ధరకు అమ్ముతాడు. బస్తా సగటు ధర ఇక్కడ అమల్లో వున్న 3 పౌండ్లతో సమానమవుతుంది. అతనికి 20% లాభం వస్తుంది. అంటే అతని పెట్టుబడి 15 పౌండ్లపైన 3 పౌండ్లు వస్తుంది. కౌలు మాత్రం మాయమవుతుంది. 1 బస్తా విడి ఉత్పత్తి ధర సాధారణ ఉత్పత్తి ధరతో ఇలా సమానం అయినప్పుడు అదనపు మొత్తం ఏమవుతుంది?

మొదటి $2\frac{1}{2}$ పౌండ్లపైన అదనపు లాభం 3 పౌండ్లు. తరువాత $2\frac{1}{2}$ పౌండ్లపైన అది $1\frac{1}{2}$ పౌండ్లు. పెట్టిన మదుపులో 3వ వంతు నుంచి మొత్తం అదనపు లాభం అంటే 5 పౌండ్ల నుంచి $4\frac{1}{2}$ పౌండ్లు లభిస్తుంది. అంటే 90% అదనపు లాభం.

మూడవ మదుపు విషయంలో 5 పౌండ్లు అదనపు లాభాన్ని ఇవ్వదు. పైగా దాని ఉత్పత్తిని $1\frac{1}{2}$ బస్తాలను సార్వత్రిక ఉత్పత్తి ధరకు అమ్మటంవల్ల $1\frac{1}{2}$ పౌండ్లు లోటు వస్తుంది. ఆఖరిగా 4వ మదుపు విషయానికి వస్తే దాని 5 పౌండ్లు 1 బస్తా ధాన్యాన్ని మాత్రమే ఉత్పత్తి చేసింది. దానిని సాధారణ ఉత్పత్తి ధరకు అమ్మగా 3 పౌండ్లు లోటు వస్తుంది. కనుక ఈ రెండు మదుపులు కలిసి $4\frac{1}{2}$ పౌండ్ల లోటు వచ్చింది. 1, 2 మదుపుల నుంచి సంపాదించిన అదనపు లాభం $4\frac{1}{2}$ పౌండ్లకు ఈ లోటు సమానం.

అదనపు లాభమూ, లోటూ ఒకదాని నొకటి రద్దు చేసుకుంటాయి. కనుక కౌలు మాయమవు తుంది. నిజానికి అదనపు లాభాన్ని, కౌలును రూపొందించిన అదనపు విలువ అంశాలు ఇప్పుడు సగటు లాభాన్ని రూపొందించటంలో ప్రవేశిస్తాయి. కనుక ఇది సాధ్యమవుతుంది. 15 పౌండ్లపైన రైతు 3 పౌండ్ల సగటు లాభాన్ని అనగా 20% లాభాన్ని పొందుతాడు. కౌలు ఉండదు.

బి విడి సగటు ఉత్పత్తి ధర మార్కెట్టు ధరను నియంత్రించే ఎ సాధారణ ఉత్పత్తి ధరతో సమం కావాలంటే అమల్లో వున్న ధరకంటే తక్కువ ధరకు ఉత్పత్తి చేసే మొదటి మదుపుల ఉత్పాదితం ధర రానురాను నియంత్రణలో ఉన్న ఉత్పత్తి ధరకంటే ఎక్కువ ధరకు ఉత్పత్తి చేసే మదుపులవల్ల తేడా రద్దయిపోవాలి. చివరకు, అదనపు పెట్టుబడులవల్ల లభించిన ఉత్పత్తి యొక్క ధరకూ, శాసించే ధరకూ మధ్యనున్న తేడా ఆ తేడాను సమం చేయాలి. మొదటి మదుపు ఉత్పాదితం తనంతట తానే వేరుగా అమ్మబడినప్పుడు అదనపు లాభంగా కనిపించింది. క్రమంగా సగటు ఉత్పత్తి ధరలో భాగంగా మారుతుంది. అది పూర్తిగా సగటు లాభంలో ఇమిడిపోయే వరకు సగటు లాభాన్ని ఏర్పర్చడంలో తోడ్పడుతుంది.

15 పౌండ్లకు బదులు బి భూమిలో 5 పౌండ్లు మాత్రమే మదుపు పెట్టబడి ఇంతకు ముందు పట్టికలో ఇవ్వబడిన $2\frac{1}{2}$ అదనపు బస్తాలను ఎ భూమిలో కొత్త మరో $2\frac{1}{2}$ ఎకరాలను సాగులోకి తేవటం ద్వారా ఉత్పత్తి చేశారనుకుందాం. ఇక్కడ ఎకరానికి $2\frac{1}{2}$ పౌండ్లు మాత్రమే అవుతుంది. అంటే ఈ 6 బస్తాలను ఉత్పత్తి చెయ్యటంలో 'ఎ', 'బి' భూముల్లో పెట్టిన మొత్తం మదుపు 15 పౌండ్లకు బదులు $11\frac{1}{4}$ పౌండ్లు మాత్రమే అవుతుంది. వాటి మొత్తం ఉత్పత్తి ధర లాభంతో సహా $13\frac{1}{2}$ పౌండ్లు. ఈ 6 బస్తాలను 18 పౌండ్లకు అమ్మటం జరుగుతుంది. అయితే మదుపు $3\frac{3}{4}$

పౌండ్లు తగ్గిపోయింది. ఇంతకు ముందులాగే 'బి' భూమిలో ఎకరానికి $4\frac{1}{2}$ పౌండ్ల కౌలు లభిస్తుంది. ఈ $2\frac{1}{2}$ అదనపు బస్తాల ఉత్పత్తి కోసం 'ఎ' కంటే నాసిరకం భూముల్ని అనగా '$ఎ_1$' '$ఎ_2$'లను సాగులోకి తేవలసిన అవసరం ఏర్పడితే అప్పుడు విషయం మారిపోతుంది. అప్పుడు బస్తా ఉత్పత్తి ధర ఇలా వుంటుంది. '$ఎ_1$' భూమిపైన 4 పౌండ్ల ఉత్పత్తి ఖర్చుతో $1\frac{1}{2}$ బస్తాలు ఉత్పత్తి అవుతుందని '$ఎ_2$' భూమిలో 6 పౌండ్ల ఉత్పత్తి ఖర్చుతో 1 బస్తా ఉత్పత్తి అవుతుందని భావిద్దాం. ఈ సందర్భంలో అమల్లోకొచ్చే ఉత్పత్తి ధర బస్తాకు 6 పౌండ్లు వుంటుంది. అప్పుడు 'బి' భూమి నుంచి లభించే $3\frac{1}{2}$ బస్తాలను$10\frac{1}{2}$ పౌండ్లకు కాక 21 పౌండ్లకు అమ్మటం జరుగుతుంది. అంటే $4\frac{1}{2}$ పౌండ్ల కౌలు బదులు 15 పౌండ్ల కౌలు లభిస్తుంది. ధాన్యం రూపంలో $1\frac{1}{2}$ బస్తాలకు బదులు $2\frac{1}{2}$ బస్తాల కౌలు లభిస్తుంది. అదే విధంగా 'ఎ' భూమిలో 1 బస్తాకు 3 పౌండ్ల చొప్పున, $\frac{1}{2}$ బస్తా చొప్పున కౌలు లభిస్తుంది.

దీనిని మరికొంత చర్చించే ముందు మరో పరిశీలన.

మొత్తం పెట్టుబడిలో $1\frac{1}{2}$ బస్తాలను అధికంగా ఉత్పత్తి చేసే భాగాన్ని $1\frac{1}{2}$ బస్తాల లోటును ఉత్పత్తి చేసే భాగం రద్దు చెయ్యగానే 'బి' సగటు బస్తా ధర సమానమైపోతుంది. అంటే మార్కెట్టు ధరను శాసించే 'ఎ' బస్తా ధర అయిన 3 పౌండ్ల సాధారణ ఉత్పత్తి ధరతో అది ఏకీభవిస్తుంది. ఇలా సమంగా మారటం ఎంత త్వరగా జరుగుతుంది? అలాగే దీనికోసం తక్కువ ఉత్పాదకత కలిగిన పెట్టుబడిని 'బి' భూమిలో ఎంత మదుపు పెట్టాలి? అన్నవి మొదటి మదుపుల అదనపు ఉత్పాదకత నిర్ణీతంగా ఉందని భావించినప్పుడు రెండు అంశాలపై ఆధారపడతాయి. మొదటిది మార్కెట్టు ధరను నియంత్రిస్తున్న పరమ అధ్వాన్నమైన 'ఎ' భూమిలో అదే మొత్తంలో పెట్టిన మదుపులతో పోల్చినప్పుడు 'బి' భూమిలో తరువాత పెట్టిన ఈ మదుపులు ఎంత తక్కువ ఉత్పాదకత కలిగి వున్నాయి అన్న దానిపైన ఆధారపడి వుంటుంది. లేదా రెండవది, నియంత్రణ ఉన్న ధరతో పోల్చగా వాటి విడి ఉత్పత్తి ధరపైన ఇది ఆధారపడి వుంటుంది.

★ ★ ★

ఇంతకు ముందు వివరించిన దాని నుండి ఈ కింది నిర్ధారణలకు రావచ్చు.

మొదటిది – అదనపు పెట్టుబడులు, అదనపు ఉత్పాదకతతో ఒకే భూమిలో పెట్టబడినప్పుడు ఆ అదనపు ఉత్పాదకత తగ్గుముఖం పట్టినప్పటికీ కౌలు సాపేక్షంగా తగ్గినప్పటికీ నిరపేక్షంగా డబ్బు రూపంలోనూ, ధాన్యం రూపంలోనూ పెరుగుతుంది. ముందస్తు పెట్టుబడి పెరిగిన నిష్పత్తిలోనే (మరోలా చెప్పాలంటే అదనపు లాభం లేదా కౌలు రేటు) పెరుగుతుంది. సగటు లాభాన్ని మాత్రమే ఇచ్చే అదనపు పెట్టుబడి ఇక్కడ పరిమితిని విధిస్తుంది. లేదా దాని ఉత్పత్తి విడి ధర సాధారణ ఉత్పత్తి ధరలో సమసించినప్పుడు అది పరిమితంగా పనిచేస్తుంది. ఈ పరిస్థితులలో పెరిగిన సరఫరా కారణంగా అధ్వాన్నపు భూముల్లో ఉత్పత్తి అనవసరం కాకుండా ఉంటే ఉత్పత్తి ధర యథాతథంగా వుంటుంది. ధర పడిపోతున్నప్పుడు సహితం కొన్ని పరిమితుల పరిధిలో ఈ అదనపు పెట్టుబడులు తక్కువే

అయినప్పటికీ, అదనపు లాభాన్ని ఉత్పత్తి చేస్తాయి.

రెండవది – కేవలం సగటు లాభాన్ని మాత్రమే ఇచ్చే అదనపు పెట్టుబడి అదనపు ఉత్పాదకత=0. అది అప్పటికి ఉన్న అదనపు లాభాన్నీ కౌలు ఏ రకంగానూ మార్చదు. దానివల్ల మెరుగైన భూమిలో బస్తా విడి సగటు ధర పెరుగుతుంది. బస్తాపై మిగిలే అదనపు సొమ్ము తగ్గుతుంది. అయితే ఈ తగ్గిన అదనపు సొమ్మునిచ్చే బస్తాల సంఖ్య పెరుగుతుంది. కనుక సంఖ్యాపరంగా ఉత్పాదితం యథాతథంగా ఉంటుంది.

మూడవది – అదనపు మదుపు మెరుగైన భూముల మొత్తం ఉత్పాదితం యొక్క విడి సగటు ఉత్పత్తి ధరను సాధారణ ఉత్పత్తి ధరకు రానురానూ మరింత దగ్గర చేస్తుంది. అనగా అది ఆ రెండింటి మధ్య తేడాను అనగా అదనపు లాభాన్ని లేదా కౌలును కలిగి ఉండే ఆ తేడాను తగ్గిస్తుంది. ఇక్కడ అదనపు మదుపుల ఉత్పాదితం విడి ఉత్పత్తి ధర అమల్లో ఉన్న ధరకంటే ఎక్కువ ఉందని భావించాలి. అంటే అదనపు ఉత్పాదకత కేవలం సున్నా కాదు. సున్నా కంటే తక్కువ లేదా ఒక ప్రతికూల పరిమాణం అంటే 'ఎ' భూమిలో పెట్టిన అంతే మొత్తం మదుపు ఇచ్చే ఉత్పాదకతకంటే తక్కువ. అదనపు లాభం లేదా కౌలు కలిగి వున్న ఉత్పాదితంలో అత్యధిక భాగం రానురానూ సగటు లాభాన్ని రూపొందించటంలో ప్రవేశిస్తుంది. అయితే 'బి' భూమిలో ఒక ఎకరంలో మదుపు పెట్టిన మొత్తం పెట్టుబడి ఇంకా అదనపు లాభాన్ని ఇస్తూనే వుంటుంది. అయితే తక్కువ ఉత్పాదకత కలిగిన పెట్టుబడి పెరుగుతున్నకొద్దీ దాని ఉత్పాదకత తగ్గిన మేరకు అదనపు లాభం తగ్గుతుంది. పెరిగే పెట్టుబడితోనూ, పెరిగే ఉత్పత్తితోనూ ఎకరం మొత్తంపైన వచ్చే కౌలు తగ్గుతుంది. రెండవ సందర్భంలో చెప్పినట్లుగా పెరుగుతున్న మదుపు పరిమాణంతో పోలిస్తే, కేవలం సాపేక్షంగానే కాక అది నిరపేక్షంగా కూడా తగ్గుతుంది.

మెరుగైన భూమి 'బి' మొత్తం ఉత్పత్తి యొక్క సగటు ధర అమల్లో ఉన్న ఉత్పత్తి ధరతో సమానమైనప్పుడు కౌలు పూర్తిగా తొలగించబడుతుంది. అంటే మొదట పెట్టిన మరింత ఉత్పాదక మదుపుల అదనపు లాభం మొత్తం సగటు లాభాన్ని రూపొందించటానికి వినియోగమైనప్పుడు కౌలు పూర్తిగా రద్దవుతుంది.

ఎకరంపై కౌలు ఏ స్థానం దగ్గర మాయమవుతుందో అదే దాని తగ్గుదలకు కనీసపు పరిమితి. అయితే అదనపు పెట్టుబడి మదుపు తక్కువ ఉత్పాదకత కలిగి వున్న వెంటనే ఈ స్థానం తలెత్తదు. ఈ అదనపు మదుపు దాని తక్కువ ఉత్పాదకతతో మొదటి మదుపుల అధిక ఉత్పాదకతను రద్దు చేసిన వెంటనే ఈ స్థానం తలెత్తుతుంది. అంటే మొత్తం మదుపు యొక్క ఉత్పాదకత 'ఎ' భూమిలో పెట్టిన మదుపుతో సమానమైనప్పుడు 'బి' భూమిలో ఒక బస్తా విడి సగటు ధర 'ఎ' భూమిలో బస్తా ధరకు సమానమైనప్పుడు మాత్రమే ఇలా జరుగుతుంది.

ఈ సందర్భంలో కూడా కౌలు మాయమైనప్పటికీ నియంత్రణ ఉన్న ఉత్పత్తి ధర 3 పౌండ్లు అన్నది యథాతథంగా వుంటుంది. ఈ స్థానం తరువాత మాత్రమే అదనపు పెట్టుబడి ఉత్పాదకత తగ్గిపోవడంవల్ల గాని లేదా తక్కువ ఉత్పాదకత కలిగిన అదనపు పెట్టుబడి పెరగటంవల్ల గాని

ఉత్పత్తి ధర పెరగాల్సి వుంటుంది. ఉదాహరణకు ఈ పై పట్టికలో (ఎస్. 265[1]) $1\frac{1}{2}$ బస్తాలకు బదులు బస్తాకు 4 పౌండ్ల చొప్పున $2\frac{1}{2}$ బస్తాలు పండాయనుకుందాం. అప్పుడు 22 పౌండ్ల ఉత్పత్తి ధరకు 7 బస్తాలు ఉత్పత్తి అవుతాయి. అంటే 1 బస్తా ధర $3\frac{1}{7}$ పౌండ్లు. ఇది సాధారణ ఉత్పత్తి ధరకంటే $\frac{1}{7}$ పౌండ్లు ఎక్కువ. కనుక సార్వత్రిక ఉత్పత్తి ధర పెరగాల్సి వుంటుంది.

ఉత్తమ భూములనుండి బస్తాకు విడి సగటు ధర సార్వత్రిక ఉత్పత్తి ధరతో సమానమయ్యేంత వరకు సార్వత్రిక ఉత్పత్తి ధరలో విడి సగటు ధరకంటే హెచ్చుగా వున్న భాగం మాయమయ్యేంత వరకు – అనగా అదనపు లాభం, కౌలు పూర్తిగా మాయమయ్యేంత వరకు – తక్కువ ఉత్పాదకత కలిగిన లేదా తక్కువ దిగుబడి అనేది పెరుగుతూ వున్న అదనపు పెట్టుబడిని చాలాకాలం పెట్టడం జరగవచ్చు.

అప్పుడు సహితం మెరుగైన భూముల్లో కౌలు మాయమవ్వటం అన్నది వాటి సగటు ధర అన్నది సార్వత్రిక ఉత్పత్తి ధరకు సమానమవటాన్ని మాత్రమే సూచిస్తుంది. కనుక అది సార్వత్రిక ఉత్పత్తి ధరలో పెరుగుదలను సూచించదు.

పై ఉదాహరణలో మెరుగైన కౌలు ఇచ్చే భూముల వరుసలో అన్నింటికంటే తక్కువ కౌలు ఇచ్చే 'బి' భూముల్లో 5 పౌండ్ల పెట్టుబడితో తక్కువ ఉత్పాదకతతో $3\frac{1}{2}$ బస్తాలు ఉత్పత్తి అయ్యాయి. 10 పౌండ్ల పెట్టుబడి తక్కువ ఉత్పాదకతతో $2\frac{1}{2}$ బస్తాలను ఉత్పత్తి చెయ్యటం జరిగింది. అంటే మొత్తం 6 బస్తాలలో ఈ మొత్తంలో $5\frac{5}{12}$ ఆ రకంగా తక్కువ దిగుబడి వచ్చే పెట్టుబడి భాగాల నుంచి ఉత్పత్తి అయింది. ఈ స్థానం దగ్గర మాత్రమే విడి సగటు ఉత్పత్తి ధర బస్తాకు 3 పౌండ్ల చొప్పున పెరుగుతుంది. ఆ రకంగా అది సాధారణ ఉత్పత్తి ధరతో ఏకీభవిస్తుంది.

అయితే భూ ఆస్తి నియమం ప్రకారం తరువాత పండించిన $2\frac{1}{2}$ బస్తాలు, ఈ రకంగా బస్తాకు 3 పౌండ్లు చొప్పున ఉత్పత్తి చెయ్యటం సాధ్యమై వుండేది కాదు. ఆ బస్తాలను 'ఎ' భూమిలో ఉన్న కొత్త ఎకరాలలో మాత్రమే ఉత్పత్తి చెయ్యవచ్చు. కేవలం సార్వత్రిక ఉత్పత్తి ధర ప్రాతిపదికగా అదనపు పెట్టుబడి ఉత్పత్తి చెయ్యటమే ఇక్కడ కనీస పరిమితి. ఈ పరిమితికి ఆవల, అదనపు మదుపు అదే భూమిలో అంతమైపోతుంది.

రైతు మొదటి రెండు మదుపులకుగాను $4\frac{1}{2}$ పౌండ్లు కౌలు చెల్లిస్తే దానిని అతడు కొనసాగించాల్సి వుంటుంది. కనుక బస్తా 3 పౌండ్లకు[2] మించి ఉత్పత్తి చేసే మదుపులన్నీ అతని లాభం నుంచి కొంత భాగాన్ని కాజేస్తాయి. విడి సగటు ధర తక్కువ ఉత్పాదకత ఉన్నప్పుడు సమానం కావటం అన్నది ఆ రకంగా నివారించబడుతుంది.

ఇంతకు ముందు ఉదాహరణలో 'ఎ' భూమి ఉత్పత్తి ధర బస్తాకు 3 పౌండ్లు. అది 'బి' ధరను కూడా శాసిస్తుంది. దానిని పరిశీలిద్దాం.

---

1. ప్రస్తుత సంపుటిలో (ఇంగ్లీషు) 731 పేజీ - సం.
2. 'మూడుకు తక్కువ' అని 1894 జర్మన్ సంపుటి - సం.

## పట్టిక

| పెట్టుబడి పౌండ్లలో | లాభం పౌం. | ఉత్పత్తి ధర పౌం. | ఉత్పత్తి బ.లలో | బస్తా ఉత్పత్తి ధర పౌం.లో | అమ్మకం ధర | | అదనపు లాభం పౌం.లో | నష్టం పౌం.లో |
|---|---|---|---|---|---|---|---|---|
| | | | | | బస్తాకు పౌం.లో | మొత్తం పౌం.లో | | |
| $2\frac{1}{2}$ | $\frac{1}{2}$ | 3 | 2 | $1\frac{1}{2}$ | 3 | 6 | 3 | – |
| $2\frac{1}{2}$ | $\frac{1}{2}$ | 3 | $1\frac{1}{2}$ | 2 | 3 | $4\frac{1}{2}$ | $1\frac{1}{2}$ | – |
| 5 | 1 | 6 | $1\frac{1}{2}$ | 4[1] | 3 | $4\frac{1}{2}$ | – | $1\frac{1}{2}$ |
| 5 | 1 | 6 | 1 | 6 | 3 | 3 | – | 3 |
| 15 | 3 | 18 | | | | 18 | $4\frac{1}{2}$ | $4\frac{1}{2}$ |

మొదటి రెండు మదుపులలో ఉత్పత్తి అయిన $3\frac{1}{2}$ బస్తాల ఉత్పత్తి ధర కూడా బస్తాకు 3 పౌండ్లే కనుక రైతు $4\frac{1}{2}$ పౌండ్ల కౌలును చెల్లించాల్సి వుంటుంది. విడి సగటు ధరకు, సార్వత్రిక ఉత్పత్తి ధరకు ఉన్న తేడాను రైతు తన జేబులో వేసుకోలేదు. కనుక మొదటి రెండు మదుపుల విషయంలో ఉత్పత్తిలో వచ్చిన మిగులు 3, 4వ మదుపుల ఉత్పత్తిలో వచ్చిన లోటును పూడ్చలేదు.

మూడవ మదుపు $1\frac{1}{2}$ బస్తాలను ఉత్పత్తి చేస్తుంది. దానికి లాభంతో సహా రైతుకు 6 పౌండ్లు ఖర్చవుతుంది. అయితే నియంత్రణలో ఉన్న ధర బస్తాకు 3 పౌండ్లు మాత్రమే. కనుక వాటిని అతడు $4\frac{1}{2}$ పౌండ్లకు మాత్రమే అమ్మగలుగుతాడు. ఇంకోలా చెప్పాలంటే అతడు తన మొత్తం లాభాన్ని కోల్పోవటమే కాక $\frac{1}{2}$ పౌండును లేదా అతడు మదుపు పెట్టిన 5 పౌండ్లలో 10% ని కోల్పోతాడు. అంటే లాభాన్ని 3వ మదుపులో కొంత భాగాన్ని కోల్పోతాడు. కోల్పోయిన మొత్తం $1\frac{1}{2}$ పౌండ్లు అవుతుంది. 4వ మదుపు విషయంలో మొత్తం 3 పౌండ్లు కోల్పోతాడు. అనగా మొత్తం రెండు మదుపుల నుంచి వచ్చిన కౌలుతో ఇది సమానం. అయితే ఈ విషయంలో చివరి రెండు మదుపుల విడి ఉత్పత్తి ధర 'బి' భూములలో మొత్తం సగటు ఉత్పత్తి ధరను పూడ్చలేదు. ఎందుకంటే మెరుగైన మదుపులవల్ల అంతకు ముందు వచ్చిన మిగులును మూడవ వ్యక్తికి కౌలుగా ఇచ్చివేయటం జరిగింది.

3వ మదుపు అదనంగా ఉత్పత్తి చేసే $1\frac{1}{2}$ బస్తాలు గిరాకీ సంతృప్తిపరచటం కోసం, అవసరమైతే అమల్లో వున్న మార్కెట్టు ధర బస్తాకు 4 పౌండ్లు చొప్పున పెరగాల్సివుంటుంది. అమల్లో ఉన్న మార్కెట్టు ధరలో వచ్చిన ఈ పెరుగుదల కారణంగా 'బి' భూమిలో మొదటి, రెండు మదుపులవల్ల వచ్చే కౌలు పెరుగుతుంది. 'ఎ' భూమిపై కౌలు రూపొందుతుంది.

ఆ రకంగా అదనపు లాభం కౌలుగా రూపపరివర్తన చెందటమే వ్యత్యాసపు కౌలు. భూమిపై ఉన్న ఆస్తి (హక్కు) ఈ విషయంలో వ్యవసాయదారుని అదనపు లాభాన్ని తనకే బదిలీ చేసుకునే అవకాశాన్ని దాని యజమానికి ఇస్తుంది. అయినప్పటికీ, అదే భూమిలో వరుసగా పెట్టుబడి పెట్టినప్పుడు అనగా అదే భూమిలో పెట్టిన మదుపు పెరిగిన సందర్భంలో ఆ పెట్టుబడి ఉత్పాదకత రేటు తగ్గి

1. 1894 జర్మన్ ప్రతిలో '3' అని వుంది - సం.

అమల్లో ఉన్న ఉత్పత్తి ధర యథాతథంగా ఉన్నప్పుడు అది మరింత శీఘ్రంగా తన పరిమితిని చేరుకుంటుంది. నిజానికి ఇక్కడ ఇంచుమించుగా ఒక కృత్రిమమైన ఆటంకం ఎదురైంది. అదేమంటే భూ ఆస్తి ఉన్న కారణంగా అదనపు లాభం భూమి కౌలుగా మారటంవల్ల ఈ ఆటంకం ఎదురైంది. సార్వత్రిక ఉత్పత్తి ధరలో పెరుగుదల మరింత పరిమితమైన పరిధుల్లో ఇక్కడ అవసరమవుతుంది. అది ఈ సందర్భంలో వ్యత్యాసపు కౌలు పెరుగుదలకు కారణం మాత్రమే కాక – వ్యత్యాసపు కౌలు, కౌలుగా ఉండటానికి కూడా అదే కారణం. అదే సమయంలో సార్వత్రిక ఉత్పత్తి ధర శీఘ్రంగా పెరగటానికి కూడా అది కారణం. అవసరమైన ఉత్పత్తిని పెరిగిన స్థాయిలో సరఫరా చెయ్యాలంటే సార్వత్రిక ధర పెరగాల్సి వుంటుంది.

ఇంకా కింది విషయాల్ని గమనించాలి. 'బి' భూమిలో అదనపు మదుపు ద్వారా పైన పేర్కొన్న విధంగా అమల్లో ఉన్న ధర 4 పౌండ్లు పెరగకపోవచ్చు. ఎలాగంటే 'ఎ' భూమిలో 4 పౌండ్లకంటే తక్కువ అదనపు పెట్టుబడితో ఉత్పాదితాన్ని సాధించగల్గితే; లేదా 'ఎ' కంటే అధ్వాన్నమైన మరో కొత్త భూమి ఉత్పత్తి ధర 3 పౌండ్లకంటే ఎక్కువ ఉన్నప్పటికీ, 4 పౌండ్లకంటే తక్కువ ఉండి పోటీలోకి ప్రవేశించగలిగితే, సార్వత్రిక ధర 4 పౌండ్లకు పెరగాల్సిన అవసరం లేదు. అప్పుడు వ్యత్యాసపు కౌలు II, దానికి ప్రాతిపదికగా ఉన్న వ్యత్యాసపు కౌలు I ఒకదానికొకటి పరిమితులుగా వ్యవహరిస్తాయి. ఒకసారి అదే భూమిలో మరోసారి పెట్టుబడి మదుపు పెట్టడం జరిగితే మరోసారి మరో అదనపు భూమిలో మరోపక్క అదనపు మదుపును పెట్టడం జరుగుతుంది. అదే విధంగా ఇతర సందర్భాల్లో ఉదాహరణకు మెరుగైన భూముల్ని సాగులోకి తెచ్చినప్పుడు అవి ఒకదాని నొకటి పరిమితం చేసుకుంటాయి.

★ ★ ★

## అధ్యాయం - 44

# పరమ అధ్వాన్నపు సాగు భూములలో కూడా వ్యత్యాసపు కౌలు

ధాన్యం గిరాకీ పెరుగుతుందని అనుకుందాం. కౌలు ఇచ్చే భూముల్లో ఉత్పాదకత తగ్గిపోతున్న పరిస్థితులలో వరుసగా పెట్టిన మదుపుల ఫలితంగా మాత్రమే సరఫరా జరుగుతుందని అనుకుందాం. లేదా తగ్గుతున్న ఉత్పాదకతతోనే 'ఎ' భూమిలో అదనపు మదుపు ద్వారా లేదా 'ఎ' భూమికంటే నాసిరకపు భూముల్లో మదుపుల ద్వారా సరఫరా జరుగుతుందనుకుందాం.

కౌలు ఇచ్చే భూములకు 'బి' భూమిని ఉదాహరణగా తీసుకుందాం.

అదనపు మదుపు ఇంతకు ముందు మార్కెట్టులో వున్న బస్తాకు 3 పౌండ్ల ఉత్పత్తి ధరకు మించి మార్కెట్టు ధర పెరగాలని కోరుతుంది. 'బి' భూమిలో ఒక బస్తా అదనంగా ఉత్పత్తి చేయడానికి ఇది అవసరం. (ఇక్కడ ఒక బస్తా 10 లక్షలు బస్తాలుగానూ, ఒక ఎకరం 10 లక్షల ఎకరాలుగానూ ఊహించుకోవచ్చు.) అత్యధిక కౌలునిచ్చే 'సి' 'డి' మొదలైన భూముల్లో కూడా ఉత్పత్తి పెరగవచ్చు. అయితే ఇది తగ్గుతున్న అదనపు ఉత్పాదకతతోపాటు జరుగుతుంది. అయితే అదనంగా ఉత్పత్తి చేస్తున్న ఆ బస్తా 'బి' భూమి నుంచి గిరాకీని సంతృప్తిపరచడానికి అవసరం. ఒకే మొత్తం మదుపును 'ఎ' భూమిలో గాని లేదా 'ఎ$_1$' భూమిలో గానీ ఉత్పత్తి అయిన దానికంటే 'బి' భూమిలో ఎక్కువ చౌకగా ఉత్పత్తి కావలసి ఉంది. 'ఎ$_1$' భూమిలో బస్తా ధాన్యం ఉత్పత్తికి 4 పౌండ్లు. ఎ భూమిలో $3\frac{3}{4}$ పౌండ్లు అదనంగా అవసరమవుతున్నాయి అనుకుందాం. అప్పుడు బి భూమిలో అదనపు పెట్టుబడి మార్కెట్టు ధరను నియంత్రిస్తుంది.

ఇంతకు ముందులాగే 'ఎ' భూమి 3 పౌండ్లు ఖర్చుతో 1 బస్తాను ఉత్పత్తి చేస్తుంది. అదే విధంగా ఇంతకు ముందులాగే 'బి' దాని మొత్తం ఉత్పాదితానికిగాను '6' పౌండ్ల ఖర్చుతో $3\frac{1}{2}$ బస్తాలను ఉత్పత్తి చేస్తుంది. ఇప్పుడు ఒక అదనపు బస్తాను ఉత్పత్తి చెయ్యటానికి 'బి' భూమిలో 4 పౌండ్లు, 'ఎ' భూమిలో $3\frac{3}{4}$ పౌండ్లు అవసరమనుకుందాం. అప్పుడది సహజంగా 'బి' భూమిలో కాక 'ఎ' భూమిలోనే ఉత్పత్తి చెయ్యబడవచ్చు. బి భూమిలో $3\frac{1}{2}$ పౌండ్ల అదనపు ఉత్పత్తి ధరతో బస్తా ధాన్యం ఉత్పత్తి అవుతుందనుకుందాం. ఈ సందర్భంలో మొత్తం ఉత్పత్తికి $3\frac{1}{2}$ పౌండ్ల ధర నియంత్రణకు వస్తుంది. 'బి' ఇప్పుడు తన $4\frac{1}{2}$ బస్తాల ధాన్యాన్ని $15\frac{3}{4}$ పౌండ్లకు అమ్ముతుంది. దీనిలో 6 పౌండ్లు మొదటి $3\frac{1}{2}$ బస్తాలకు ఉత్పత్తి ధర. $3\frac{1}{2}$ పౌండ్లు ఆఖరి బస్తా ఉత్పత్తి ధర. అంటే $9\frac{1}{2}$ పౌండ్ల మొత్తం. ఇంతకు ముందు కౌలు $4\frac{1}{2}$ పౌండ్లకు బదులు ఇప్పుడు $6\frac{1}{2}$ పౌండ్లు మిగులుతుంది. ఈ

సందర్భంలో 'ఎ' భూమిలో ఒక ఎకరం కూడా $\frac{1}{2}$ పౌండు కౌలును ఇస్తుంది. ఇక్కడ $3\frac{1}{2}$ పౌండ్లు. మార్కెట్టు ధరను శాసించేది పరమ అధ్వాన్నపు భూమి 'ఎ' కాక అంతకంటే మెరుగైన భూమి 'బి' మాత్రమే. 'ఎ' భూమి వంటి స్వభావమూ అంతే అనుకూలమైన స్థానం కలిగిన కొత్త భూమి దొరకలేదనుకుందాం. అప్పుడు ఇంతకు ముందే సాగులో వున్న 'ఎ' భూమిలో రెండవ మదుపు పెట్టడంగాని లేదా అంతకంటే నాసిరకం భూమియైన '$ఎ_1$' భూమిని సాగు చెయ్యటం గాని అవసరం అనుకుందాం. ఇక్కడ వ్యత్యాసపు కౌలు II ఒకే భూమిలో వరుసగా పెట్టిన మదుపులవల్ల రంగంలోనికి రాగానే పెరుగుతున్న ఉత్పత్తి ధర పరిమితుల్ని మెరుగైన భూమే నియంత్రిస్తుంది. అప్పుడు వ్యత్యాసపు కౌలు I కు ప్రాతిపదిక అయిన అత్యంత అధ్వాన్నపు భూమి కౌలును ఇవ్వవచ్చు. ఆ రకంగా కేవలం ఒకే వ్యత్యాసపు కౌలు సహితం సాగులో వున్న భూమి అంతా కౌలు ఇస్తుంది. అప్పుడు మనకీ కింది రెండు పట్టికలు ముందుకు వస్తాయి. ఉత్పత్తి ధర అంటే మదుపు పెట్టిన పెట్టుబడి + 20% లాభం. మరోలా చెప్పాలంటే ప్రతి $2\frac{1}{2}$ పౌండ్లు పెట్టుబడిపైన $\frac{1}{2}$ పౌండ్ల లాభం లేదా మొత్తం 3 పౌండ్లు.

**పట్టిక**

| భూమి రకం | ఎకరాలు | ఉత్పత్తి ధర (పౌండ్లలో) | ఉత్పత్తి (బస్తాలు) | అమ్మకం ధర (పౌండ్లలో) | రాబడి (పౌండ్లలో) | ధాన్యపు కౌలు (బస్తాలలో) | డబ్బు కౌలు (పౌండ్లలో) |
|---|---|---|---|---|---|---|---|
| ఎ | 1 | 3 | 1 | 3 | 3 | 0 | 0 |
| బి | 1 | 6 | $3\frac{1}{2}$ | 3 | $10\frac{1}{2}$ | $1\frac{1}{2}$ | $4\frac{1}{2}$ |
| సి | 1 | 6 | $5\frac{1}{2}$ | 3 | $16\frac{1}{2}$ | $3\frac{1}{2}$ | $10\frac{1}{2}$ |
| డి | 1 | 6 | $7\frac{1}{2}$ | 3 | $22\frac{1}{2}$ | $5\frac{1}{2}$ | $16\frac{1}{2}$ |
| మొత్తం | 4 | 21 | $17\frac{1}{2}$ | | $52\frac{1}{2}$ | $10\frac{1}{2}$ | $31\frac{1}{2}$ |

కేవలం 1 బస్తా మాత్రమే ఇచ్చే $3\frac{1}{2}$ పౌండ్ల కొత్త పెట్టుబడిని 'బి'లో పెట్టటానికి ముందు వున్న పరిస్థితి ఇది. ఈ మదుపు తరువాత పరిస్థితి ఈ కింది విధంగా కనిపిస్తుంది.

**పట్టిక**

| భూమి రకం | ఎకరాలు | ఉత్పత్తి ధర (పౌండ్లలో) | ఉత్పత్తి (బస్తాలు) | అమ్మకం ధర (పౌండ్లలో) | రాబడి (పౌండ్లలో) | ధాన్యపు కౌలు (బస్తాలలో) | డబ్బు కౌలు (పౌండ్లలో) |
|---|---|---|---|---|---|---|---|
| ఎ | 1 | 3 | 1 | $3\frac{1}{2}$ | $3\frac{1}{2}$ | $\frac{1}{7}$ | $\frac{1}{2}$ |
| బి | 1 | $9\frac{1}{2}$ | $4\frac{1}{2}$ | $3\frac{1}{2}$ | $15\frac{3}{4}$ | $1\frac{11}{14}$ | $6\frac{1}{4}$ |
| సి | 1 | 6 | $5\frac{1}{2}$ | $3\frac{1}{2}$ | $19\frac{1}{4}$ | $3\frac{11}{14}$ | $13\frac{1}{4}$ |
| డి | 1 | 6 | $7\frac{1}{2}$ | $3\frac{1}{2}$ | $26\frac{1}{4}$ | $5\frac{11}{14}$ | $20\frac{1}{4}$ |
| మొత్తం | 4 | $24\frac{1}{2}$ | $18\frac{1}{2}$ | | $64\frac{3}{4}$ | $11\frac{1}{2}$ | $40\frac{1}{4}$ |

[ఇక్కడ కూడా ఖచ్చితంగా లెక్కకట్టలేదు. మొదటిది 'బి' విషయంలో $4\frac{1}{2}$ బస్తాల ఉత్పత్తి ధర $9\frac{1}{2}$ పౌండ్లు. రెండవ అంశం $4\frac{1}{2}$ పౌండ్ల కౌలు. మొత్తం 14 పౌండ్లు. బస్తా సగటు ధర $3\frac{1}{9}$ పౌండ్లు. 'బి' రైతుకు తన మొత్తం ఉత్పత్తి యొక్క సగటు ధర అమల్లో వున్న మార్కెట్టు ధరగా

మారుతుంది. ఆ రకంగా 'ఎ' భూమిలో కౌలు ఇంతకు ముందులాగే $4\frac{1}{2}$ పౌండ్లు వుంటుంది. $3\frac{1}{9}$ పౌండ్ల చొప్పున $4\frac{1}{2}$ బస్తాలు = 14 పౌండ్లు. దాని నుంచి $9\frac{1}{2}$ పౌండ్లు ఉత్పత్తి ధరను తీసివెయ్యగా $4\frac{1}{2}$ పౌండ్ల అదనపు లాభం మిగులుతుంది. కనుక అంకెల విలువల్ని కొంత మార్చాల్సివచ్చినప్పటికీ, అప్పటికే కౌలు ఇస్తున్న మెరుగైన భూమి ధరను శాసించవచ్చునీ, ఇంతవరకు కౌలులేని భూమితో సహా మొత్తం భూమినంతటినీ కౌలు ఇచ్చే భూమిగా మార్చగలదనీ వ్యత్యాసపు కౌలు II ద్వారా ఈ ఉదాహరణ నిరూపిస్తుందని గమనించవచ్చు – ఎంగెల్స్.]

అమల్లో ఉన్న ధాన్యం ఉత్పత్తి ధర పెరగగానే అంటే ధరను శాసించే భూమి నుంచి ఉత్పత్తి అయిన ధాన్యపు ధర గానీ లేదా వివిధ రకాల భూముల్లో ఒకదానిలో పెట్టిన మదుపులలో శాసించే ధరగానీ పెరిగినప్పుడు ధాన్యపు కౌలు పెరిగితీరుతుంది. ప్రతి కొత్త $2\frac{1}{2}$ పౌండ్లకు 1 బస్తా చొప్పున కాక కేవలం $\frac{5}{7}$ బస్తాలు మాత్రమే ఉత్పత్తి అయ్యేంతగా అన్ని భూములు తక్కువ ఉత్పాదకంగా మారటంతో ఇది సమానం. అదే మదుపుతో ధాన్యం రూపంలో ఇంతకంటే ఎక్కువ ఉత్పత్తి అయ్యేదంతా అదనపు ఉత్పాదితంగా మారిపోతుంది. అది అదనపు లాభానికి అలాగే కౌలుకు ప్రాతినిధ్యం వహిస్తుంది. లాభం రేటు యథాతథంగా ఉందని భావిస్తే, ఇప్పుడు రైతు తన లాభంతో తక్కువ ధాన్యాన్ని కొనగలుగుతాడు. వేతనాలు పెరగకుండా ఉంటే లాభం రేటు యథాతథంగా వుండవచ్చు. వేతనాలను భౌతికంగా కనీస స్థాయిలో అణచిపెట్టి ఉంచినప్పుడు అనగా శ్రమశక్తి యొక్క సాధారణ విలువకు దిగువన ఉంచినప్పుడు లేదా కార్ఖానా యజమాని సరఫరా చేసే కార్మికుని వినియోగ వస్తువులు సాపేక్షంగా చౌక అయినప్పుడు వేతనాలు పెరగకుండా ఉండవచ్చు. పనిదినం దీర్ఘంగా వుండవచ్చు లేదా పనితీవ్రత మరింత పెరగవచ్చు. వ్యవసాయ రంగంలో లాభాన్ని శాసించే వ్యవసాయేతర రంగాల లాభం రేటు యథాతథంగా ఉండవచ్చు లేదా పెరగవచ్చు. లేదా స్థిర పెట్టుబడి ఎక్కువగానూ, అస్థిర పెట్టుబడి తక్కువగానూ వ్యవసాయంలో వినియోగించబడి వుండవచ్చు. అయితే మొత్తంమీద పెట్టిన పెట్టుబడి యథాతథంగానే ఉండవచ్చు. ఇవి ఇలా వుంటే లాభం రేటు యథాతథంగా వుండవచ్చు.

'ఎ' కంటే నాసిరకం భూమిని సాగులోకి తేకుండానే 'ఎ' భూమిలో కౌలు ఎలా ఉత్పన్నం కాగలదో తెలిపే మొదటి పద్ధతిని మనం పరిశీలించాం. 'ఎ' భూమి ఇంత వరకు శాసిస్తున్న విడి ఉత్పత్తి ధరకు, అవసరమైన అదనపు ఉత్పాదితాన్ని సరఫరా చేసే అంతకంటే మెరుగైన భూమి తగ్గిన ఉత్పాదకత పరిస్థితులలో పెట్టబడిన చివరి అదనపు పెట్టుబడి యొక్క కొత్త అధిక ఉత్పత్తి ధరకు మధ్య తేడా నుంచి కౌలు తలెత్తవచ్చు.

అదనపు ఉత్పాదితం '$ఎ_1$' భూమి నుంచి సరఫరా అయిందనుకుందాం. అది 4 పౌండ్లకంటే తక్కువ ఖర్చుకు ఉత్పత్తి చెయ్యలేదు. అప్పుడు 'ఎ' భూమిలో ఒక ఎకరంపై వచ్చే కౌలు 1 పౌండుకు పెరుగుతుంది. ఈ సందర్భంలో '$ఎ_1$' భూమి అత్యంత అధ్వాన్నపు భూమిగా ఉన్న 'ఎ' పాత్రను ఇప్పుడు నిర్వహిస్తుంది. 'ఎ' భూమి కౌలు ఇచ్చే భూముల్లో ఒకటిగా అన్నిటికంటే తక్కువ ఇచ్చే భూమిగా దిగజారుతుంది. వ్యత్యాసపు కౌలు I మారుతుంది. అయితే ఈ నమూనాను వ్యత్యాసపు కౌలు II పరిశీలనలో కలపలేదు. వ్యత్యాసపు కౌలు II అన్నది ఒకే కమతంలో వరుసగా పెట్టిన మదుపుల యొక్క వివిధ రకాల ఉత్పాదకతల నుంచి తలెత్తుతుంది.

దీనితోపాటు 'ఎ' భూమిపైన మరో రెండు రకాలుగా వ్యత్యాసపు కౌలు తలెత్తవచ్చు.

ధర – ఏ ధర అయినా, ఇంతకు ముందుకంటే తక్కువ ధర అయినా – మారకుండా ఉంటే అదనపు మదుపులవల్ల అదనపు ఉత్పాదకత సాధ్యమైనప్పుడు ఇలా జరుగుతుంది. పరమ అధ్వాన్నపు భూమిలో కొంతమేరకు ఇలాగే జరుగుతుందన్నట్టుగా కనిపిస్తుంది.

అయితే రెండోది 'ఎ' భూమిలో వరుసగా పెట్టిన పెట్టుబడుల ఉత్పాదకత తగ్గినప్పుడు కూడా వ్యత్యాసపు కౌలు తలెత్తవచ్చు.

ఈ రెండు సందర్భాల్లోనూ గిరాకీని సంతృప్తిపరచటానికి ఉత్పత్తి పెరగటం అవసరమని భావించాలి.

అయితే వ్యత్యాసపు కౌలు దృష్టి నుంచి ఇంతకు ముందు తలెత్తిన నియమం కారణంగా ఒక ప్రత్యేక ఇబ్బంది తలెత్తుతుంది. మొత్తం ఉత్పత్తికిగానూ (లేదా మొత్తం పెట్టుబడి కేటాయింపుకు గానూ) ఒక బస్తా విడి సగటు ధర నిర్ణయాత్మక అంశంగా వ్యవహరిస్తుంది అన్నదే ఆ నియమం. 'ఎ' భూమి విషయంలో మిగిలిన కౌలునిచ్చే మెరుగైన భూముల విషయంలోలాగా వేరే మరో ఉత్పత్తి ధర ఏమీ లేదు. విడి ఉత్పత్తి ధర సార్వత్రిక ఉత్పత్తి ధరతో సమానమవ్వటం ద్వారా కొత్త పెట్టుబడి మదుపును పరిమితం చేసే మరో ఉత్పత్తి ధర ఏమీ లేదు. ఎందుకంటే 'ఎ' భూమిలో విడి ఉత్పత్తి ధరే మార్కెట్టు ధరను శాసించే సార్వత్రిక ఉత్పత్తి ధర కూడా.

మనం ఈ కింది విధంగా ఊహిద్దాం.

1. వరుసగా పెట్టే మదుపుల ఉత్పాదకత పెరుగుతున్నప్పుడు : 'ఎ' భూమిలో 5 పౌండ్ల మదుపుకు ఒక ఎకరం భూమిలో 2 బస్తాలకు బదులు 3 బస్తాలు ధాన్యం ఉత్పత్తి అవుతుంది. దాని ఉత్పత్తి ధర 6 పౌండ్లు అనుకుందాం. మొదట పెట్టిన $2\frac{1}{2}$ పౌండ్ల మదుపు 1 బస్తా ధాన్యాన్ని ఇచ్చింది. రెండవ మదుపు 2 బస్తాల ధాన్యాన్ని ఇచ్చింది. ఈ సందర్భంలో 6 పౌండ్ల ఉత్పత్తి ధరతో 3 బస్తాలు ఉత్పత్తి అవుతాయి. అంటే సగటు ధర బస్తాకు రెండు పౌండ్లు. 3 బస్తాలను బస్తాకు 2 పౌండ్ల చొప్పున అమ్మితే 'ఎ' భూమి ఇంతకు ముందులాగానే కౌలు ఏదీ ఇవ్వదు. ఇక్కడ వ్యత్యాసపు కౌలు II ప్రాతిపదిక మాత్రమే మారింది. 3 పౌండ్లు ఒక బస్తాను ఉత్పత్తి చేశాయి. ఇప్పుడు సగటున $1\frac{1}{2}$ బస్తాను ఉత్పత్తి చేస్తున్నాయి. కనుక ఇప్పుడు అన్ని మెరుగైన భూముల్లోనూ ఇది అధికారిక ఉత్పాదకత. అయితే ఒక నిర్ణీతమైన మదుపు $2\frac{1}{2}$ పౌండ్లు వాటి అదనపు ఉత్పాదితంలో ఒక భాగం ఇకనుంచి అవసరమైన ఉత్పాదితాన్ని మార్చటంలో ప్రవేశిస్తుంది. వాటి అదనపు లాభంలో ఒక భాగం సగటు లాభం అవడం లాంటిదే ఇది కూడా.

మరోవైపున మెరుగైన భూముల్లో ఈ సగటు అంచనా నిరపేక్ష అదనపు ఉత్పాదితాన్ని మార్చదు. ఎందుకంటే ఆ భూముల్లో పెట్టుబడి మదుపుకు సార్వత్రిక ఉత్పత్తి ధర ఒక పరిమితి. కనుక మెరుగైన భూముల ప్రాతిపదికపై అంచనా కడితే మొదటి మదుపుతో ఉత్పత్తి అయ్యే బస్తాకు 3 పౌండ్లు ఖర్చవుతుంది. రెండవ మదుపుతో ఉత్పత్తి అయ్యే 2 బస్తాలకు బస్తాకు $1\frac{1}{2}$ పౌండ్ల చొప్పున ఖర్చవుతుంది. కనుక 'ఎ' భూమిలో 1 బస్తా ధాన్యపు కౌలు, 3 పౌండ్ల డబ్బు కౌలు లభిస్తాయి. ఈ 3 బస్తాలను

పాత ధర 9 పౌండ్లకు అమ్మటం జరుగుతుంది. అదే ఉత్పాదకత ఉన్న పరిస్థితుల్లో మరో $2\frac{1}{2}$ పౌండ్ల మూడవ మదుపు పెట్టబడిందనుకుందాం. అప్పుడు 9 పౌండ్ల ఉత్పత్తి ధరతో 5 బస్తాలు ఉత్పత్తి అయ్యాయి. 'ఎ' సగటు విడి ఉత్పత్తి ధర మార్కెట్టు ధరను శాసిస్తే, ఒక బస్తా ఇప్పుడు $1\frac{4}{5}$ పౌండ్లకు అమ్మబడుతుంది. మూడవ మదుపులో కొత్తగా మరోసారి ఉత్పాదకత పెరగటంవల్ల కాక కేవలం రెండవదానిలాగే అంతే అదనపు ఉత్పాదకత కలిగిన మరో కొత్త మదుపు జోడించబడటంవల్ల మాత్రమే సగటు ధర మరోసారి పడిపోయి వుంటుంది. కౌలు ఇచ్చే భూముల్లోలాగా కౌలును పెంచడానికి బదులు 'ఎ' భూమిలో పెట్టిన స్థిరమైన ఎక్కువ ఉత్పాదకత కలిగిన మదుపుల వరసవల్ల ఉత్పత్తి ధర తగ్గిపోతుంది. అన్ని అంశాలు యథాతథంగా ఉంటే మిగిలిన భూములు అన్నిటిలోనూ వ్యత్యాసపు కౌలు యథాతథంగా వుంటే ఇది వర్తిస్తుంది. మరోవైపున 3 పౌండ్ల ఉత్పత్తి ధరతో ఒక బస్తాను ఉత్పత్తి చేసే మొదటి మదుపు మార్కెట్టు ధరను శాసిస్తే, అప్పుడు 5 బస్తాల ధాన్యం, 15 పౌండ్లకు అమ్మబడుతుంది. 'ఎ' భూమిలో తరువాత పెట్టిన మదుపుల వ్యత్యాసపు కౌలు 6 పౌండ్లు అవుతుంది. ఇక్కడ ఎ భూమిలో ఒక ఎకరంపై పెట్టిన అదనపు పెట్టుబడి ఏ విధంగా పెట్టబడినప్పటికీ మెరుగుదల పెట్టుబడిగా భావించబడుతుంది. అది పెట్టుబడి తొలి భాగాన్ని మరింత ఉత్పాదకంగా మారుస్తుంది. ఇక్కడ $\frac{1}{3}$వ వంతు పెట్టుబడితో ఒక బస్తాను, $\frac{2}{3}$వ వంతు పెట్టుబడితో 4 బస్తాలను ఉత్పత్తి చెయ్యటం జరిగిందనటం హాస్యాస్పదం. ఎందుకంటే ఎకరంపై 9 పౌండ్ల పెట్టుబడి ఎప్పుడూ 5 బస్తాలనే ఉత్పత్తి చేస్తుంది. కాగా 3 పౌండ్లు ఎప్పుడూ 1 బస్తాను ఉత్పత్తి చేస్తాయి. ఇక్కడ కౌలు తలెత్తటం, తలెత్తకపోవడం అన్నది అదనపు లాభం పొందటం, పొందకపోవటం అన్నది పూర్తిగా పరిస్థితులపైన ఆధారపడి వుంటుంది. మామూలుగా అమల్లో వున్న ఉత్పత్తి ధర పడిపోవాల్సి వుంటుంది. 'ఎ' భూమిలో జరిగే మరింత మెరుగైన, మరింత ఖర్చుతో కూడిన సాగుకు కారణం మెరుగైన భూముల్లో కూడా ఆ విధంగా జరుగుతుండడమే. మరోలా చెప్పాలంటే వ్యవసాయంలో సార్వత్రిక విప్లవం వచ్చిందన్నమాట. మనం ఇప్పుడు 'ఎ' భూమి యొక్క సహజమైన సారాన్ని ప్రస్తావిస్తున్నప్పుడు ఆ భూమిలో 3 పౌండ్లకు బదులు 6 పౌండ్లు లేదా 9 పౌండ్లు మదుపు పెట్టబడిందని భావించబడుతుంది. దేశానికి అవసరమైన ప్రధాన సరఫరాను సమకూర్చే 'ఎ' భూమిలో సాగులో ఉన్న భూమిలో అత్యధిక ఎకరాలు ఈ కొత్త పద్ధతిని అనుసరించినప్పుడు ఈ సూత్రం వర్తిస్తుంది. అయితే ఈ మెరుగుదల తొలిదశలో 'ఎ' భూమిలో ఉన్న ఒక చిన్న ప్రాంతానికి మాత్రమే విస్తరిస్తే అప్పుడు ఇలా మెరుగ్గా సాగుచెయ్యబడిన భాగం అదనపు లాభాన్ని ఇస్తుంది. దానిలో కొంత భాగాన్ని లేదా మొత్తాన్ని చాలా త్వరితంగా కౌలుగా మార్చి ఆ రూపంలో కౌలును నిర్ణయించటానికి భూస్వామి ప్రయత్నిస్తాడు. ఈ రకంగా (పెరుగుతున్న సరఫరాతోపాటు గిరాకీ కూడా పెరిగితే) 'ఎ' భూమిలో రానురానూ మరింత ఎక్కువ భాగం కొత్త సాగు పద్ధతిని స్వీకరించడంవల్ల మొత్తం 'ఎ' భూమిపైన క్రమంగా కౌలు ఏర్పడవచ్చు. మార్కెట్టు పరిస్థితులపైన ఆధారపడి అదనపు ఉత్పాదకత అన్నది మొత్తంగాగాని లేదా పాక్షికంగాగాని రద్దుకావచ్చు. 'ఎ' ఉత్పత్తి ధరను పెట్టుబడి మదుపు పెరిగిన ఈ పరిస్థితుల్లో 'ఎ' ఉత్పాదితం యొక్క సగటు ధరతో సమానం కాకుండా పెరిగిన మదుపువల్ల వచ్చిన అదనపు లాభాన్ని ఇలా కౌలు రూపంలోకి మార్చటం అన్నది నిరోధిస్తుంది. ఆ రకంగా ఇంతకు ముందు గమనించి

నట్లుగానే అదనపు పెట్టుబడి యొక్క ఉత్పాదకత తగ్గినప్పుడు అదనపు లాభం భూమి కౌలుగా మారుతుంది. అంటే భూమిలో ఆస్తి జోక్యంవల్ల ఉత్పత్తి ధర పెరుగుతుంది. సగటు, సార్వత్రిక ఉత్పత్తి ధరల మధ్య తేడా ఫలితంగా వ్యత్యాసపు కౌలు తలెత్తటానికి బదులు ఉత్పత్తి ధర పెరుగుతూ వుంటుంది. 'ఎ' భూమి విషయంలో ఈ రెండు ధరలు సమానం కావటాన్ని అది నిరోధిస్తుంది. ఎందుకంటే 'ఎ' సగటు ఉత్పత్తి ధర మార్కెట్టు ఉత్పత్తి ధరను శాసించటం విషయంలో అది జోక్యం చేసుకుంటుంది. కనుక అది అవసరమైన దానికంటే ఎక్కువ ఉత్పత్తి ధరను కొనసాగించి ఆరకంగా కౌలు సృష్టిస్తుంది. ధాన్యాన్ని బయట నుంచి దిగుమతి చేసుకున్నప్పటికీ రైతుల్ని అంతర్జాతీయంగా అమల్లో ఉన్న ఉత్పత్తి ధరకు మెరుగైన భూముల్లో ఉత్పత్తి చెయ్యటానికి ఒత్తిడి చేసేలా, పోటీలో నిలబడలేని భూముల్ని పచ్చిక బయళ్ళుగాను, ఇతరత్రానూ వినియోగించేలా చెయ్యటం ద్వారా ఇదే ఫలితాన్ని సాధించవచ్చు. అంతర్జాతీయంగా నిర్ణయించబడిన ఉత్పత్తి ధరకంటే తక్కువగా ఉండే విడి సగటు ధర ఉన్న భూముల్ని మాత్రమే సాగుచెయ్యవచ్చు. మొత్తంమీద ఈ ఉదాహరణలో ఉత్పత్తి ధర పడిపోవచ్చు. కానీ సగటు స్థాయికి మాత్రం కాదు. అది సగటుకంటే ఎక్కువగానూ, పరమ అధ్వాన్నపు భూమి అయిన 'ఎ' ఉత్పత్తి ధరకంటే తక్కువగానూ వుంటుంది. కనుక కొత్త భూమి 'ఎ' నుంచి పోటీ అన్నది పరిమితంగా వుంటుంది.

2. అదనపు పెట్టుబడి ఉన్న ఉత్పాదకత తగ్గుతున్నప్పుడు – '$ఎ_1$' భూమిలో ఒక అదనపు బస్తాను ఉత్పత్తి చెయ్యటానికి 4 పౌండ్లు ఖర్చుకాగా 'ఎ' భూమిలో $3\frac{3}{4}$ పౌండ్లు ఖర్చు అవుతుందనుకుందాం. ఇది మొదటి విడత పెట్టుబడి కంటే $\frac{3}{4}$ పౌండ్లు ఎక్కువ ఖర్చుతో ఉత్పత్తి చేసింది. ఈ సందర్భంలో 'ఎ' భూమిలో ఉత్పత్తి అయిన మొత్తం 2 బస్తాల ధర = $6\frac{3}{4}$ పౌండ్లు. ఆ రకంగా బస్తా సగటు ధర $3\frac{3}{8}$ పౌండ్లు. ఇక్కడ ఉత్పత్తి ధర $\frac{3}{8}$ పౌండ్లు మాత్రమే పెరుగుతుంది. $3\frac{3}{4}$ పౌండ్ల ఖర్చుతో ఉత్పత్తి చేసే భూమిలో అదనపు పెట్టుబడి పెడితే ఈ $\frac{3}{8}$ పౌండ్లు మరో $\frac{3}{8}$ పౌండ్లు పెరుగుతాయి. అనగా $3\frac{3}{4}$ పౌండ్లు అవుతుంది. ఆ రకంగా అది ఇతర వ్యత్యాసపు కౌలులన్నింటిలోనూ అనులోమ వృద్ధిని సాధిస్తుంది.

'ఎ' భూమిలో $3\frac{3}{8}$ పౌండ్ల ఉత్పత్తి ధర మదుపు పెరుగుదలవల్ల సగటు ఉత్పత్తి ధరకు సమానం చెయ్యబడుతుంది. అప్పుడదే మార్కెట్టు ధరను నియంత్రిస్తుంది. కనుక అది కౌలును ఇవ్వదు. ఎందుకంటే అది అదనపు లాభాన్ని ఉత్పత్తి చెయ్యటం లేదు కనుక.

అయితే రెండవ మదుపు ఉత్పత్తి చేసిన బస్తాను $3\frac{3}{4}$ పౌండ్లకు అమ్మితే 'ఎ' భూమి $\frac{3}{4}$ పౌండ్ల కౌలునిస్తుంది. అదనపు మదుపులు పెట్టనిచోట కూడా 'ఎ'కి సంబంధించిన ఎకరాలు అన్నింటిలోనూ బస్తా 3 పౌండ్ల చొప్పున ఉత్పత్తి అవుతూ వుంటుంది. 'ఎ'కి సంబంధించిన భూముల్లో ఇంకా సాగుచెయ్యని భూమి ఉన్నంత వరకూ ధర కేవలం తాత్కాలికంగా $3\frac{3}{4}$ పౌండ్లకు పెరుగుతుంది. 'ఎ' భూముల్లో కొత్త పొలాల పోటీవల్ల 'ఎ' రకం భూములన్నీ ఒక బస్తాను తన సానుకూల స్థానం రీత్యా $3\frac{3}{4}$ పౌండ్లకంటే తక్కువకు ఉత్పత్తి చేసే భూమంతా పూర్తిగా వినియోగం అయ్యేంత వరకూ ఉత్పత్తి ధర 3 పౌండ్లు వుంటుంది. ఒక ఎకరం భూమి కౌలు ఇస్తున్నప్పుడు మరో ఎకరాన్ని కౌలుదారునికి భూస్వామి కౌలు లేకుండా ఉచితంగా ఇవ్వడు.

'ఎ' భూమిలో అందుబాటులో ఉన్న భూమిలో రెండవ మదుపు ఏమేరకు సార్వత్రికం అయిందీ అన్నదానిపై అది ఆధారపడి వుంటుంది. ఉత్పత్తి ధర సగటు ధరతో సమానమయిందా లేక రెండవ మదుపు విడి ఉత్పత్తి ధర $3\frac{3}{4}$ పౌండ్ల ధరగా అమల్లోకొచ్చిందా అన్నదానిపై ఆధారపడి వుంటుంది. గిరాకీ పూర్తిగా సంతృప్తిపడేలోగా $3\frac{3}{4}$ పౌండ్ల ధరకు అమ్మటంవల్ల వచ్చిన అదనపు లాభాన్ని కౌలుగా మార్చటానికి వీలైన సమయం భూస్వామికి ఉన్నప్పుడు రెండవ మదుపు ధర అయిన $3\frac{3}{4}$ పౌండ్లు మార్కెట్టు ధర అవుతుంది.

★ ★ ★

వరుసగా పెట్టిన మదుపుల విషయంలో భూమి ఉత్పాదకత తగ్గటం గురించి లీబిగ్[1] రచన చూడండి. కొత్త మదుపులవల్ల వరుసగా అదనపు ఉత్పాదకత తగ్గుదలవల్ల తప్పనిసరిగా ఎకరం కౌలు పెరుగుతుంది అని మనం గమనించాం. ఉత్పత్తి ధర యథాతథంగా ఉన్నప్పుడూ, ఉత్పత్తి ధర పడిపోతున్నప్పుడూ కూడా ఇది వర్తిస్తుంది.

అయితే దరహం మీద ఈ కింది అంశాన్ని గమనించాలి.

పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం దృష్టి నుంచి ఇంతకు ముందు చెయ్యని ఖర్చు లేదా చెల్లింపు కొత్తగా చెయ్యందే ఉత్పాదితాన్ని తయారు చెయ్యలేనప్పుడు ఉత్పాదితాల ధర సాపేక్షంగా పెరుగుతుంది. ఉత్పత్తిలో వినియోగమైన పెట్టుబడిని భర్తీ చెయ్యటం అంటే కొన్ని ఉత్పత్తి సాధనాలు ప్రాతినిధ్యం వహించే విలువలను భర్తీ చెయ్యటం అని మాత్రమే మన ఉద్దేశం. ప్రకృతిసిద్ధమైన అంశాలకు ఖర్చు ఎలానూ లేదు. ఉత్పత్తిలో ఏ పాత్ర నిర్వహించినప్పటికీ అవి ఉత్పత్తిలో పెట్టుబడి అంశాలుగా ప్రవేశించవు. అవి పెట్టుబడికి ప్రకృతి ఇచ్చే ఉచిత బహుమానంగా కనిపిస్తాయి. శ్రమకు ప్రకృతి ఉత్పాదక శక్తి ఇచ్చే బహుమతి ఇక్కడ పెట్టుబడి ఉత్పాదకతలా కనిపిస్తుంది. పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానంలో ఉత్పత్తి అంతటికీ ఇది వర్తిస్తుంది. కనుక మొదట్లో ఏమీ ఖర్చు లేనటువంటి ఒక ప్రకృతి శక్తి ఉత్పత్తిలో పాల్గొంటే అది ధర నిర్ణయించటంలో పాత్ర వహించదు. ఆ శక్తి ఉత్పత్తి చెయ్యటానికి సాయపడిన ఉత్పాదితం గిరాకీని సంతృప్తిపరిచిన మేరకు ఇది వర్తిస్తుంది. అయితే అభివృద్ధి క్రమంలో ప్రకృతి శక్తి సాయంలో ఇప్పుడు సరఫరా అయ్యే ఉత్పత్తి కంటే పెద్ద మొత్తంలో ఉత్పత్తి అవసరం అయినప్పుడు, అనగా ఈ అదనపు ఉత్పత్తిని ప్రకృతి శక్తి సాయం లేకుండా నిర్వహించాల్సి వచ్చినప్పుడు లేదా ఆ శక్తికి మానవ శ్రమశక్తిని జోడించాల్సి వచ్చినప్పుడు ఒక కొత్త అదనపు అంశం పెట్టుబడిలోకి ప్రవేశిస్తుంది. ఆ రకంగా సాపేక్షంగా మరింత పెద్ద మదుపు అన్నది ఉత్పత్తి సాధించటం కోసం అవసరమవుతుంది. మిగిలిన పరిస్థితులు యథాతథంగా ఉంటే ఉత్పత్తి ధర పెరుగుతుంది.

★ ★ ★

("1876 ఫిబ్రవరి మధ్యలో ప్రారంభమైన" ఒక నోట్ పుస్తకం నుంచి – ఎంగెల్స్)

---

1. లీబిగ్ : Die chemie in ihrer Anwendung auf Agricultur und Physiologie, Braunschweig. 1862 - సం.

వ్యత్యాసపు కౌలు, భూమిలో పెట్టిన పెట్టుబడిపై కేవలం వడ్డీగా కౌలు.

ఈ శాశ్వత మెరుగుదలలు అనబడేవి భూమి యొక్క భౌతిక పరిస్థితిని పాక్షికంగా రసాయనిక పరిస్థితులను అదనపు పెట్టుబడి వ్యయం ద్వారా మారుస్తాయి. అవి భూమిలో పెట్టబడిన పెట్టుబడుల లాగానే పరిగణించబడతాయి. ఈ మెరుగుదలలు అన్నీ ఒకానొక పరిమిత ప్రాంతంలో ఉన్న ఒక ప్రత్యేక భూభాగానికి మరోచోట ఎక్కడో వున్న భూభాగంలో సహజసిద్ధంగా ఉన్నటువంటి లక్షణాలను ఇవ్వటానికి తోడ్పడతాయి. ఒక భూభాగం సహజంగానే చదునుగా ఉండవచ్చు. మరోభాగాన్ని చదును చెయ్యాల్సిరావచ్చు. ఒక భాగంలో మురుగు పారుదల సౌకర్యం సహజంగానే ఉండవచ్చు. మరోచోట కృత్రిమంగా మురుగును తోడివెయ్యటం అవసరం కావచ్చు. భూమి పైపొర ఒకచోట సహజంగానే చాలా లోతు వరకు ఉండవచ్చు. వేరేచోట దాని లోతును కృత్రిమంగానే పెంచవల్సిరావచ్చు. ఒక బంకమట్టి భూమి సహజంగానే అవసరమైన ఇసుకతో కలిసి ఉండవచ్చు. మరోచోట ఈ నిష్పత్తిని సాధించాల్సిరావచ్చు. ఒక పచ్చిక బయలులో సహజంగానే నీటి పారుదల సౌకర్యం ఉండవచ్చు. లేదా అవసరమైన పాళ్ళలో ఒండ్రు ఉండవచ్చు. మరోచోట ఆ సౌకర్యాన్ని సమకూర్చటానికి శ్రమ అవసరం కావచ్చు; లేదా బూర్జువా అర్థశాస్త్ర పరిభాషలో పెట్టుబడి అవసరం కావచ్చు.

ఈ సాపేక్ష సౌకర్యాలను కృత్రిమంగా సమకూర్చుతున్న భూమిలో కౌలే వడ్డీ అని, ఈ సౌకర్యాలన్నీ ప్రకృతిసిద్ధంగా ఉన్న భూభాగంలో అది వడ్డీ కాదని అనటం నిజానికి ఒక వినోదాత్మకమైన సిద్ధాంతం. (ఒక సందర్భంలో నిజంగానే కౌలు వడ్డీతో ఏకీభవించటం వలన ఇది ఎంతగా వక్రీకరించ బడింది అంటే కౌలు వడ్డీకాని పరిస్థితిలో సహితం దానిని వడ్డీగానే పరిగణించటం అన్నది పొరపాటుగా జరుగుతూనే వున్నది.) పెట్టుబడి పెట్టిన తరువాత భూమి కౌలు ఇస్తుంది, నిజమే కానీ అది కేవలం పెట్టుబడి మదుపు పెట్టడం వల్లనే కాదు. ఆ పెట్టుబడి భూమిని ఇంతకు ముందుకంటే ఎక్కువ ఉత్పాదకంగా మార్చినందువల్ల మాత్రమే. ఒకానొక దేశంలో భూమి అంతటికీ పెట్టుబడి మదుపు అవసరమనుకుందాం. ఆ పెట్టుబడి పొందని ప్రతి భూభాగమూ ఈ దశ గుండా పోవల్సిందే అనుకుందాం. అప్పటికే మదుపు పెట్టబడిన భూమిపై కౌలు (ఈ సందర్భంలో అది వడ్డీ) వ్యత్యాసపు కౌలును కలిగి వుంటుంది. ఇతర భూభాగాలు కృత్రిమంగా పొందాల్సిన ఈ లక్షణాన్ని ఈ భూభాగం ప్రకృతిసిద్ధంగా కలిగి వున్నట్లుగా పైకి కనిపిస్తుంది.

మదుపు పెట్టిన పెట్టుబడి పూర్తిగా క్రమేపీ ఖర్చు కాగానే వడ్డీ మారే కౌలు కూడా శుద్ధమైన వ్యత్యాసపు కౌలుగా మారుతుంది. లేకుంటే ఒకే పెట్టుబడి పెట్టుబడిగా రెండుసార్లు అస్తిత్వంలో ఉండాల్సి వస్తుంది.

★ ★ ★

రికార్డోను వ్యతిరేకించిన వారంతా – విలువ నిర్ధారణ అన్నది కేవలం శ్రమ ప్రాతిపదికపైనే జరుగుతుందన్న భావాన్ని వ్యతిరేకించిన వారు. వ్యత్యాసపు కౌలు భూమిలో వున్న వ్యత్యాసాలవల్ల తలెత్తుతుందనీ, ఇక్కడ విలువను నిర్ణయిస్తున్నది శ్రమ కాదనీ, కేవలం ప్రకృతి మాత్రమేననీ వాదిస్తున్నారు. అదే సమయంలో ఈ నిర్ణయం అన్నది భూమి స్థానంపై ఆధారపడి వుంటుందని

లేదా అంతకంటే ఎక్కువగా భూమి సాగులో ఉన్నప్పుడు పెట్టిన పెట్టుబడిమీద వడ్డీపై ఆధారపడి వుంటుందని వారు వాదిస్తున్నారు. ఈ వాదన గమ్మత్తుగా ఉంది. ఒక నిర్ణీత కాలంలో ఒకేలాంటి విలువ ఉత్పత్తి చెయ్యటానికి ఒకేలాంటి శ్రమ అవసరమవుతుంది. అయితే ఈ వస్తువు పరిమాణమూ దానితోపాటు ఆ వస్తువులో ఒక సమభాగం యొక్క విలువ భాగం అన్నవి శ్రమ ఉత్పాదకతపైన ఆధారపడి వుంటాయి. అంటే ఒక నిర్దిష్ట పరిమాణం గల శ్రమ ఉత్పాదకతపైన ఆధారపడి వుంటుంది. అంతేగాని ఆ పరిమాణంపైన ఆధారపడి వుండదు. ఆ ఉత్పాదకత ప్రకృతిసిద్ధమైనదా లేక సామాజికంగా సమకూడిందా అన్నదానితో ప్రమేయం లేదు. ఈ ఉత్పాదకతకు శ్రమ ఆ రకంగా పెట్టుబడి అవసరమైనప్పుడు మాత్రమే, ఒక కొత్త అంశంవల్ల మాత్రమే – ఉత్పత్తి ధర పెరుగుతుంది – దాన్ని ప్రకృతి స్వయంగా చెయ్యదు.

★ ★ ★

## అధ్యాయం - 45

# నిరపేక్ష భూమి కౌలు

**వ్య**త్యాసపు కౌలును విశ్లేషించే సందర్భంలో పరమ అధ్వాన్నపు భూమి, కౌలును ఇవ్వదనే ఊహతో మనం ప్రారంభించాం. మరింత సాధారణ రూపంలో చెప్పాలంటే మార్కెట్టును శాసిస్తున్న ఉత్పత్తి ధర కంటే తక్కువ ఉత్పత్తి ధర కలిగిన ఉత్పాదితం యొక్క భూమి మాత్రమే భూమి కౌలును చెల్లిస్తుందని, ఈ రకంగా ఒక అదనపు లాభం తలెత్తుతుందని, అది కౌలుగా మారుతుందని భావించాం. వ్యత్యాసపు కౌలు నియమం అన్నదానికి ఈ ఊహ యొక్క తప్పు ఒప్పులతో ఏమాత్రం ప్రమేయం లేదని మనం ముందే గమనించాలి.

మార్కెట్టును శాసించే సార్వత్రిక ఉత్పత్తి ధరను 'పి' అనుకుందాం. అప్పుడు 'పి' పరమ అధ్వాన్నపు భూమి అయిన 'ఎ' విడి ఉత్పత్తి ధరతో ఏకీభవిస్తుంది. అంటే ఈ ధర ఉత్పత్తిలో వినియోగమైన స్థిర, అస్థిర పెట్టుబడులతోపాటు సగటు లాభాన్ని (పరిశ్రమ లాభం + వడ్డీ) కూడా చెల్లిస్తుంది.

ఈ సందర్భంలో కౌలు సున్నాతో సమానం. అంతకంటే మెరుగైన భూమి 'బి' విడి ఉత్పత్తి ధర = పి'. పి కంటే పి' పెద్దది. అనగా బి భూమి ఉత్పాదితం యొక్క వాస్తవ ఉత్పత్తి ధర కంటే 'పి' ఎక్కువ చెల్లిస్తుంది. ఇప్పుడు పి–పి' =డి అనుకుందాం. బి భూమి రైతు పొందే అదనపు లాభం డి. ఈ డి కౌలుగా మార్చబడి భూస్వామికి చెల్లించబడుతుంది. మూడవ భూమి 'సి' వాస్తవ ఉత్పత్తి ధర = పి". కనుక పి–పి" = 2డి. ఈ 2డి కౌలుగా మారుతుంది. 4వ రకం భూ 'డి' విడి ఉత్పత్తి ధర పి'''. పి–పి''' = 3డి. అది ఇక్కడ భూమి కౌలుగా మారుతుంది. 'ఎ' నేలలో కౌలు సున్నా అనే ఊహతోపాటు ఆ భూమి ఉత్పాదితం ధర = పి+0 అన్న ఊహ కూడా తప్పు అనుకుందాం. ఆ భూమి కూడా కౌలు ఇస్తుందనుకుందాం. ఆ కౌలు = ఆర్. అప్పుడు రెండు నిర్ధారణలు వస్తాయి.

మొదటిది – 'ఎ' భూమి ఉత్పాదితం ధర, దాని ఉత్పత్తి ధరచేత శాసించబడదు. ఉత్పాదితం ధర = పి+ఆర్ అవుతుంది. ఎందుకంటే పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం మామూలుగా పనిచేస్తుందని భావిద్దాం. రైతు భూస్వామికి చెల్లించే ఈ అదనపు 'ఆర్' వేతనాల నుంచి గాని, పెట్టుబడిపై వచ్చే సగటు లాభం నుంచి గాని తగ్గించకుండానే చెల్లించబడుతుందనుకుందాం. అప్పుడు రైతు ఆ ఉత్పాదితాన్ని దాని ఉత్పత్తి ధర కంటే ఎక్కువకు అమ్మటం ద్వారానే చెల్లించగలుగుతాడు. అతడు కౌలు రూపంలో ఈ మిగులును భూస్వామికి చెల్లించాల్సిన అవసరం లేకుండా అతనికి అది అదనపు లాభాన్ని ఇస్తుంది. మొత్తం అన్ని భూముల ఉత్పత్తి మార్కెట్టు ధర అన్ని ఉత్పత్తి రంగాల్లోనూ పెట్టుబడి సాధారణంగా ఇచ్చే ఉత్పత్తి ధరతో సమానం కాదు. కౌలుతో కలిపిన ఉత్పత్తి ధరతో సమానం

అవుతుంది. అంటే అది పి కాదు. లా+ఆర్ అవుతుంది. 'ఎ' భూమి ఉత్పాదితం ధర అమల్లో ఉన్న సార్వత్రిక మార్కెట్టు ధర పరిమితిని సూచిస్తుంది. అంటే మొత్తం ఉత్పాదితం సరఫరా కాగలిగిన ధరను సూచిస్తుంది. కనుక ఆ మేరకు ఈ మొత్తం ఉత్పాదితం యొక్క ధరను అది శాసిస్తుంది.

రెండవది – వ్యవసాయ ఉత్పాదితాల సార్వత్రిక ధర ఈ సందర్భంలో గణనీయంగా మారినప్పటికీ, వ్యత్యాసపు కౌలు నియమం ఏ రకంగానూ వర్తించకుండాపోదు. 'ఎ' భూమి ఉత్పాదితం ధర, సాధారణ మార్కెట్టు ధర = పి+ఆర్ బి, సి, డి మొదలైన భూముల ఉత్పాదితాల ధరలు కూడా పి+ఆర్ అవుతుంది. అయితే బి భూమిలో పి–పి' = డి. కనుక (పి+ఆర్) – (పి'+ఆర్) = డి. అలాగే సి విషయంలో పి–పి" = (లా+ఆర్) – (లా"+ఆర్) = 2డి. డి భూమి విషయంలో పి–పి"' = (పి+ఆర్)–(పి"'+ఆర్) = 3డి. ఇలాగే మిగిలిన పొలాలకు వర్తిస్తుంది. కనుక ఇంతకు ముందులాగానే వ్యత్యాసపు కౌలు యథాతథంగా వుంటుంది. ఒకే నియమంచేత శాసించ బడుతుంది. కౌలు ఈ నియమానికి స్వతంత్రంగా మరో అంశాన్ని చేర్చినప్పటికీ వ్యవసాయ ఉత్పాదితం ధరతోపాటు ఒక సాధారణ పెరుగుదలను చూపించినప్పటికీ ఈ నియమం వర్తిస్తుంది. అత్యంత తక్కువ సారవంతమైన భూముల కౌలుకు సంబంధించి పరిస్థితి ఎలా ఉన్నప్పటికీ వ్యత్యాసపు కౌలు నియమం స్వతంత్రంగా ఉండటమే కాక దాని స్వభావాన్ని గ్రహించటానికి 'ఎ' భూమి కౌలు=0 అని భావించటం తప్ప మరో మార్గం లేదు. ఇది వాస్తవంగా సున్నా అయి వుండవచ్చు లేదా అంతకంటే ఎక్కువ కావచ్చు. వ్యత్యాసపు కౌలుకు సంబంధించినంత వరకు అది అనవసరం. నిజానికది పరిశీలనలోకి రాదు.

ఈ కింది అధ్యయన ఫలితాలలో వ్యత్యాసపు కౌలు నియమానికి ప్రమేయం లేదు.

'ఎ' భూమి ఉత్పాదితం ఏమాత్రం కౌలు ఇవ్వదు అన్న ఊహ యొక్క ఆధారాన్ని లోతుగా పరిశీలించాలి. అంటే సమాధానం ఈ కింది విధంగా వుంటుంది. ఒక వ్యవసాయ ఉత్పాదితం, ఉదాహరణకు ధాన్యం యొక్క మార్కెట్టు ధర 'ఎ' భూమిలో అదనపు మదుపువల్ల సార్వత్రిక ఉత్పత్తి ధర స్థాయిని చేరుకోగలిగితే అంటే పెట్టుబడిపైన సార్వత్రిక లాభం లభిస్తే అప్పుడు ఈ పరిస్థితి 'ఎ' భూమిలో అదనపు మదుపుకు వీలుకల్పిస్తుంది. మరోలా చెప్పాలంటే సాధారణమైన లాభాన్ని ఇచ్చే కొత్త పెట్టుబడిని మదుపు పెట్టటానికి సాధారణమైన పద్ధతిలో వినియోగించటానికి పెట్టుబడిదారునికి ఈ పరిస్థితి సరిపోతుంది.

ఈ సందర్భంలో కూడా మార్కెట్టు ధర 'ఎ' ఉత్పత్తి ధర కంటే ఎక్కువ ఉండాలి అన్నది గమనించాలి. అదనపు సరఫరాను సృష్టించగానే సరఫరా, గిరాకీల మధ్య సంబంధం మారుతుంది. మొదట సరఫరా తగినంత లేదు. ఇప్పుడు ఉంది. కనుక ధర పడిపోతుంది. అలా ఉండిపోవాలంటే 'ఎ' ఉత్పత్తి ధరకంటే ఎక్కువగా ఉండాలి. కొత్తగా సాగులోకి తేబడిన 'ఎ' భూమి తక్కువ సారవంతమైనది కావటంవల్ల – 'బి' ఉత్పత్తి ధర మార్కెట్టును శాసించినపుడు ఉన్న ధర అంత తక్కువ స్థాయికి – ఈ ధర పడిపోదు. 'ఎ' ఉత్పత్తి ధర మార్కెట్ ధర తాత్కాలికమైన పెరుగుదలకు కాక సాపేక్షంగా శాశ్వతమైన పెరుగుదలకు పరిమితి విధిస్తుంది. సాగులోకి తేబడిన భూమి ఇంతవరకు మార్కెట్టు ధరను శాసిస్తున్న 'ఎ' భూమి కంటే ఎక్కువ సారవంతమైనది. అయితే దాని ఉత్పాదితం పెరిగిన గిరాకీని సంతృప్తి పరచటానికి సరిపడినప్పుడు మార్కెట్టు ధర యథాతథంగా ఉంటుంది. పరమ అధ్వాన్నపు భూమి

కౌలు ఇస్తుందా ఇవ్వదా అన్న పరిశీలన మన ప్రస్తుత పరిశీలనతో ఈ సందర్భంలో కూడా ఏకీభవిస్తుంది. ఎందుకంటే ఇక్కడ కూడా మార్కెట్టు ధర అన్నది పెట్టుబడిదారీ రైతుకు ఈ ధరను భర్తీ చేయటానికి అనగా పెట్టిన పెట్టుబడిని సగటు లాభాన్ని రాబట్టటానికి ఈ మార్కెట్టు ధర సరిపోతుంది. ఈ వాస్తవం 'ఎ' భూమి కౌలును ఇవ్వదు అన్న ఊహను వివరిస్తుంది. క్లుప్తంగా చెప్పాలంటే మార్కెట్ ధర అన్నది రైతుకు తన సరుకుల ఉత్పత్తి ధరను ఇస్తుందన్న వాస్తవం ఈ అంశాన్ని వివరిస్తుంది.

ఏమైనప్పటికీ పెట్టుబడిదారీ రైతు ఈ పరిస్థితుల్లో ఒక పెట్టుబడిదారునిగా తనకు నిర్ణయించే శక్తి ఉన్నది కనుక 'ఎ' భూమిని సాగుచేస్తాడు. ఎ భూమిలో సాధారణమైన పెట్టుబడి విస్తరణకు అవసరమైన పరిస్థితి ఇప్పుడు ఉంది. అయితే తొలి ఊహ ప్రకారం పెట్టుబడిదారీ రైతు కౌలు ఏమీ చెల్లించాల్సిన అవసరం లేనప్పటికీ పెట్టుబడి విస్తరణ కోసం సగటు పరిస్థితుల్లో 'ఎ' భూమిలో పెట్టుబడిని మదుపు పెట్టగలడు అన్నదాన్నిబట్టి 'ఎ' తరహా భూమి అంతా నేరుగా ఇప్పుడే రైతు స్వాధీనంలో ఉందని అనుకోనక్కరలేదు. కౌలుదారులు కౌలు చెల్లించాల్సిన అవసరం లేనప్పుడు మాత్రమే తన మామూలు లాభాన్ని పొందగలిగిన సందర్భంలో సహితం భూస్వామి తన భూమిని కౌలుదారునికి ఉచితంగా ఇచ్చేంత జీవకారుణ్యవాది కాదు. వాణిజ్య స్నేహంకోసం పెట్టుబడిదారుడు ఉచిత రుణ సౌకర్యం కల్పించనట్లే ఇది కూడా! కనుక అటువంటి ఊహకు అర్థం భూమి ఆస్తి రద్దు కావటమే, భూమిపై యాజమాన్యం రద్దు కావటమే. సరిగ్గా భూస్వామ్యం ఉండటం వల్లనే భూమిలో పెట్టుబడి మదుపుకు, పెట్టుబడి స్వేచ్ఛగా విస్తరించటానికి పరిమితి విధించబడుతుంది. కౌలు చెల్లించాల్సిన అవసరం లేకుంటే 'ఎ' భూమిలో మదుపు పెట్టడం ద్వారా అప్పటి ధాన్యం ధరల స్థాయినిబట్టి తనకు మామూలు లాభం లభించవచ్చుననే సాదా ఊహ రైతుకు ఉన్నంత మాత్రంచేత ఈ పరిమితి మాయమైపోదు. భూ ఆస్తి లేదన్నట్టుగా అతడు వ్యవహరించటంవల్ల ఈ పరిమితి తొలగిపోదు. అయితే వ్యత్యాసపు కౌలు అన్నదానికి ముందు భూమిపైన గుత్తాధిపత్యమూ, పెట్టుబడికి పరిమితి విధించే భూ ఆస్తి ఉంటాయి. లేకుంటే అదనపు లాభం కౌలుగా మారదు. అది రైతుకు బదులు భూస్వామి స్వాధీనంలోకి పోదు. కౌలు 'ఎ' భూమిలో వ్యత్యాసపు కౌలు రూపంలో కౌలు మాయమైనప్పటికీ భూ ఆస్తి అన్నది ఒక పరిమితిగా కొనసాగుతూనే వుంటుంది. కౌలు చెల్లించాల్సిన అవసరం లేకుండానే భూమిలో పెట్టుబడి మదుపు సాధ్యం అయినచోట పెట్టుబడిదారీ ఉత్పత్తి అమలులో ఉన్న ఒక దేశంలో ఉదాహరణల్ని మనం పరిశీలిస్తే అవి ఆచరణలో భూ ఆస్తి రద్దుపైన ఆధారపడి ఉంటాయి. చట్టబద్ధమైన రద్దు కాకపోయినప్పటికీ ఈ ప్రక్రియ కొన్ని ప్రత్యేక యాదృచ్ఛిక పరిస్థితుల్లో సాధ్యమవుతుంది.

**మొదటిది :** భూస్వామి స్వయంగా తానే పెట్టుబడిదారుడు అయినప్పుడు లేదా పెట్టుబడిదారుడు స్వయంగా భూస్వామి అయినప్పుడు. ఈ సందర్భంలో 'ఎ' భూమిలో తగిన ఉత్పత్తి ధర అనగా పెట్టుబడి + సగటు లాభాన్ని పొందటానికి వీలైనంతగా మార్కెట్ ధర పెరగగానే తన భూమిని తానే నిర్వహించుకోవచ్చు. అయితే ఎందుచేత? ఎందుకంటే భూ ఆస్తి అన్నది పెట్టుబడి మదుపుకు అతని విషయంలో ఆటంకం కాదు కనుక. అతడు తన భూమిని కేవలం ప్రకృతిసిద్ధమైన అంశంగా భావించవచ్చు. తన పెట్టుబడిని విస్తరించే ఉద్దేశంతో అనగా పెట్టుబడిదారీ ప్రయోజనాల కోసం మాత్రమే తన పని నిర్వహించుకోవచ్చు. ఆచరణలో అటువంటి ఉదాహరణలు ఉంటాయి. కానీ

అవి చాలా అరుదుగా మాత్రమే ఉంటాయి. పెట్టుబడిదారీ సాగు జరగాలంటే పెట్టుబడికి భూ ఆస్తికి మధ్య వేర్పాటు ఉండి తీరాలి. అలాగే అది భూ ఆస్తి స్వయం నిర్వహణ అవకాశాన్ని కూడా అనుమతించదు. కనుక అటువంటిది కేవలం యాదృచ్ఛికంగా మాత్రమే జరుగుతుంది. స్వయంగా నిర్వహించుకుంటున్న యజమానుల చేతుల్లో ఉన్న 'ఎ' తరహా భూమికంటే ఎక్కువ విస్తీర్ణపు భూమి ధాన్యం కోసం పెరిగిన గిరాకీ వల్ల అవసరమైతే, దానిలో కొంత భాగాన్ని కొత్తగా సాగు చెయ్యటానికి కౌలుకిస్తే అప్పుడు పెట్టుబడి మదుపుకు భూ ఆస్తి పెడుతున్న పరిమితిని రద్దు చెయ్యటం అన్న ఊహ అంతమైపోతుంది. పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానంలో పెట్టుబడికి భూమికి మధ్య, రైతులకు భూస్వాములకు మధ్య భేదంతో ప్రారంభమై తిరిగి భూస్వాములే స్వయంగా తమ సొంత భూమిని సాగు చేస్తారని – భూ ఆస్తి పెట్టుబడి నుండి వేరుకానప్పుడు పెట్టుబడికి వీలుగా భూమి కౌలు రాని సందర్భాల్లో భూస్వాములు తమ భూముల్ని స్వయంగా సాగుచేసుకుంటారని ఊహించటంలో అసంబద్ధమైన వైరుధ్యం ఉంది. (గనులలో కౌలు గురించి 46వ అధ్యాయంలో పేర్కొన్న ఆడమ్ స్మిత్ ఉల్లేఖన చూడండి.[1]) భూ ఆస్తి ఇలా రద్దు కావటం యాదృచ్ఛికం. అది జరగవచ్చు. జరగకపోవచ్చు.

**రెండవది :** అప్పటికి ఉన్న మార్కెట్టు ధర స్థాయిలో మొత్తం కౌలుకు ఇవ్వబడిన ప్రాంతాల్లో కొన్ని ఏ విధమైన కౌలును ఇవ్వకపోవచ్చు. ఆచరణలో అవి వడ్డీ లేకుండా అప్పుగా ఇచ్చినట్టే. అయితే భూస్వామి దానిని అలా చూడడు. కౌలుకిచ్చిన భూమి మొత్తం కౌలును మాత్రమే అతడు చూస్తాడు. ఆ భూమితో పాటు అనుబంధ కమతాల ప్రత్యేకమైన కౌలు గురించి అతడు ఆలోచించడం ఈ సందర్భంలో ఆ మొత్తం భూమిలో కౌలులు లేని అనుబంధ కమతాలకు సంబంధించి పెట్టుబడి మదుపుకు పరిమితి విధించే భూ ఆస్తి అన్నది ఆ పెట్టుబడిదారీ రైతు విషయంలో రద్దయింది. ఇది కూడా భూస్వామితో ఒప్పందం ద్వారానే జరిగింది. అయితే ఈ కమతాలకు అతడు కౌలు చెల్లించటం లేదు. ఎందుకంటే దానితోపాటు వున్న మరి కొన్ని కమతాలకు మాత్రమే కౌలు చెల్లిస్తున్నాడు. నాసిరకంగా ఉన్న 'ఎ' భూమి సరఫరా లోటును పూడ్చటం కోసం కొత్తగా సాగులోకి తేవలసిన భూమిగా ఉండాల్సిన అవసరంలేని పరిస్థితిని ఊహిద్దాం. అది కేవలం మెరుగైన భూమికి ఒక విడదీయరాని భాగంగా మాత్రమే ఉందనుకుందాం. 'ఎ' తరహా భూమిలో కొన్ని కమతాలు స్వతంత్రంగా నిర్వహించబడుతున్నాయి. అంటే సాధారణంగా పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానంలో ఉండే పరిస్థితులలో వాటిని స్వతంత్రంగా కౌలుకు ఇవ్వవలసి వుంది. ఈ తరహా కమతాలు ఏవి – అనే విషయాన్నే పరిశీలించవలసి వుంది.

**మూడవది :** అమల్లో వున్న మార్కెట్టు ధరలలో అదనపు ఉత్పాదితంవల్ల కేవలం ఉత్పత్తి ధర మాత్రమే వచ్చినప్పటికీ అంటే పరిస్థితి సాధారణ లాభం మాత్రమే వచ్చి అదనపు కౌలు చెల్లించటానికి వీలు కల్పించని విధంగా ఉంటే కూడా ఒక రైతు అదనపు పెట్టుబడిని ఆ భూమిలో పెట్టవచ్చు. అప్పుడతడు ఒక పెట్టుబడి మదుపుపైన భూమి కౌలు చెల్లిస్తాడు. మరో మదుపుపైన చెల్లించడు. ఈ ఊహ సమస్యను పరిష్కరించటానికి ఏ మాత్రం తోడ్పడదు అన్న సంగతి ఈ కింది అంశాన్నిబట్టి గ్రహించవచ్చు. మార్కెట్ ధర (భూసారం కూడా) అతని అదనపు పెట్టుబడితో అదనపు దిగుమతి

1. ప్రస్తుత సంపుటిలో పేజీ 775 (ఇంగ్లీషు) - సం.

సాధించటానికి అతని పాత పెట్టుబడి విషయంలోలాగే వీలు కల్పిస్తే, ఉత్పత్తి ధరతోపాటు అదనపు లాభం కూడా వస్తుంది. అతని లీజుకాలం పూర్తి కానంత వరకు ఈ అదనపు లాభాన్ని స్వయంగా జేబులో వేసుకోగల్గుతాడు. ఎందుచేత? లీజు కాలంలో ఆ భూమిలో మదుపు పెట్టే పెట్టుబడిపైన భూ ఆస్తి విధించే పరిమితి రద్దయింది కనుక. ఈ అదనపు లాభాన్ని పొందాలంటే అదనపు నాసిరకం భూమిని స్వతంత్రంగా బాగుచేసి, స్వతంత్రంగానే అతనికి లీజుకివ్వాల్సి వుంటుంది. అంటే పాత భూమిలో పెట్టిన అదనపు పెట్టుబడి అదనపు సరఫరాను ఉత్పత్తి చెయ్యటానికి ఏమాత్రం సరిపోదన్న సంగతి నిస్సందేహంగా రుజువవుతుంది. కనుక ఇక్కడ ఒక ఊహ మరోదాన్ని తొలగిస్తుంది. ఇప్పుడు ఎవరైనా ఇలా అనవచ్చు : 1. పరమ అధ్వాన్నపు భూమి 'ఎ' కౌలు స్వయంగా వ్యత్యాసపు కౌలు యజమాని తానే స్వయంగా సాగుచేసి (ఇది కేవలం ఒక యాదృచ్ఛిక మినహాయింపుగా మాత్రమే జరుగుతుంది.) భూమితో పోల్చవచ్చు. లేదా లీజుకిచ్చిన కౌలు ఇవ్వని పాత భూమిలో పెట్టిన అదనపు మదుపుతో పోల్చి చూడవచ్చు. ఆ రకంగా అది వ్యత్యాసపు కౌలు అవుతుందని ఎవరైనా వాదించవచ్చు. అయితే అది 1. వివిధ రకాల భూసారాలలో ఉన్న తేడా నుంచి తలెత్తని వ్యత్యాసపు కౌలు. కనుక 'ఎ' భూమి కౌలు ఇవ్వదని, దాని ఉత్పాదితం ఉత్పత్తి ధరకు అమ్మబడుతుందని చెప్పలేం. 2. ఒకే కౌలు భూమిలో అదనపు మదుపులు కౌలును ఇస్తాయా, ఇవ్వవా అన్న ప్రశ్న కొత్తగా సాగులోకి తీసుకోబడే 'ఎ' భూమి రకం కౌలు ఇస్తుందా ఇవ్వదా అన్న ప్రశ్నలాగే అసంగతం. ఒక కొత్త స్వతంత్ర పరిశ్రమ విషయంలో మరో పారిశ్రామికవేత్త అదే రంగంలో ఉంటూ తమ పెట్టుబడి భాగాన్ని మొత్తం తన వ్యాపారంలో ఉపయోగించలేకపోవటం వల్ల వడ్డీ ఇచ్చే యంత్రాల్లో మదుపు పెట్టాడా లేక అతనికి మొత్తం లాభం ఇవ్వకపోయినప్పటికీ వడ్డీని మించిన లాభాన్ని ఇవ్వగల్గినందువల్ల ఆ పెట్టుబడి భాగాన్ని కొంత బాగుజేత కార్యక్రమానికి ఖర్చు పెట్టాడా అన్నది ఇక్కడ అసంగతం. అతని దృష్టిలో ఇది ద్వితీయ ప్రాధాన్యత కలిగిన అంశం మాత్రమే. మరోవైపున కొత్తగా పెట్టిన పరిశ్రమలు సగటు లాభాన్ని ఇవ్వగలిగి ఉండాలి. ఈ సగటు లాభం సంపాదించే, ఆశతో వాటిని నిర్వహించటం జరుగుతుంది. పాత లీజు భూముల్లో పెట్టే అదనపు పెట్టుబడులు, 'ఎ' తరహా అన్నది వాస్తవం. అదే పాత లీజు భూమిలో ప్రతికూల ఉత్పత్తి పరిస్థితుల్లో అదనపు పెట్టుబడి పరిమితిని 'ఎ' భూమిలో పోటీపడే కొత్త మదుపులు నిర్ణయిస్తాయి. మరోవైపున 'ఎ' భూమి ఏ మేరకు కౌలు ఇస్తుంది అన్న దానిని పాత భూమితో పోటీపడుతున్న అదనపు మదుపులు పరిమితి చేస్తాయి.

అయితే ఈ డొంకతిరుగుడు వ్యవహారం అంతా అసలు సమస్యను పరిష్కరించదు. 'ఎ' భూమిలో కొన్ని భూభాగాల్ని సాగులోకి తీసుకోవటానికి తగినంత మార్కెట్టు ధర ధాన్యానికి (ఈ దర్యాప్తులో భూమి ఉత్పాదితాన్నంతటికి వర్తిస్తుంది.) ఉందని భావిద్దాం. ఈ కొత్త భూముల్లో పెట్టిన మదుపు ఉత్పత్తి ధరను తిరిగి ఇస్తుందని – అనగా పెట్టుబడి సగటు లాభాన్ని తిరిగి ఇస్తుందని భావిద్దాం. 'ఎ' భూమిపైన పెట్టుబడి విస్తరణకు అవసరమైన సాధారణ పరిస్థితులు ఉన్నాయనుకుందాం. ఇది సరిపోతుందా? అప్పుడు ఈ పెట్టుబడి నిజంగా మదుపు పెట్టబడుతుందా? పరమ అధ్వాన్నపు భూమి 'ఎ' కూడా కౌలు ఇచ్చే స్థాయికి మార్కెట్ ధర పెరగాలా వద్దా? మరోరకంగా చెప్పాలంటే భూమిపైన గుత్తాధిపత్యం పెట్టుబడి మదుపుకు ఆటంకం కల్పిస్తుందా? ఈ గుత్తాధిపత్యం లేనట్లయితే

పెట్టుబడిదారుని దృష్టి నుంచి ఇలా ఆటంకం తలెత్తదు. ఈ ప్రశ్న వేసిన తీరునుబట్టి ఈ కింది విషయం వెల్లడవుతుంది. పాత గుత్త భూముల్లో అదనపు పెట్టుబడులు ఒక నిర్ణీత మార్కెట్ ధరతో సగటు లాభాన్ని ఇస్తున్నాయనుకుందాం. అయితే అవి కౌలు ఇవ్వటంలేదని భావిద్దాం. 'ఎ' భూమిలో సగటు లాభాన్ని ఇచ్చి కౌలు ఇవ్వని పెట్టుబడి ఇప్పుడు మదుపు పెట్టబడుతుందా అన్న ప్రశ్నకు ఈ పరిస్థితి సమాధానం చెప్పదు. అయితే సరిగ్గా మన ముందు ఉన్న ప్రశ్న ఇదే. కౌలు ఇవ్వని అదనపు మదుపులు గిరాకీని సంతృప్తిపరచలేవన్న సంగతి 'ఎ'కి చెందిన కొత్త భూమిని సాగులోకి తీసుకోవలసిన అవసరాన్ని రుజువు చేస్తుంది. ఇక్కడ రెండు ప్రత్యామ్నాయాలకు అవకాశం వుంది. 'ఎ' భూమిలో అదనపు సాగు అన్నది కౌలు లభించిన మేరకు అనగా ఉత్పత్తి ధరకంటే ఎక్కువ లభించిన మేరకు సాధ్యమవుతుంది. పాత లీజు (గుత్త) భూమిలో పెట్టే చివరి అదనపు మదుపు కూడా అదనపు లాభాన్ని ఇచ్చే విధంగా మార్కెట్టు ధర ఉండాలి. ఈ అదనపు లాభాన్ని రైతు జేబులో వేసుకోవచ్చు లేదా భూస్వామి వేసుకోవచ్చు. 'ఎ' భూమి కౌలు ఇవ్వకుండా సాగులోకి రాదన్న వాస్తవం నుంచి ధరలో ఈ రకమైన పెరుగుదల, అదనపు మదుపులపైన ఈ రకమైన అదనపు లాభమూ తలెత్తుతాయి. కేవలం సగటు లాభాన్ని మాత్రమే ఇచ్చే విధంగా సాగు చెయ్యటానికి ఉత్పత్తి ధర సరిపోతే అంతకంటే ఎక్కువగా ధర పెరిగి ఉండదు. ఈ ఉత్పత్తి ధర ఇవ్వగలిగిన మేరకు కొత్త కమతాల నుండి కూడా పోటీ ఎదురయ్యేది. కౌలు ఇవ్వని పాత లీజు భూముల్లో అదనపు మదుపులతో అలాగే కౌలు ఇవ్వని 'ఎ' భూమి మదుపులు పోటీపడేవి. లేదా పాత లీజు భూముల్లో చివరి మదుపులు ఎటువంటి కౌలును ఇవ్వవు. అయితే 'ఎ' భూమిని సాగులోకి తీసుకురావటానికి అది కౌలు ఇవ్వటానికి తగినంతగా మార్కెట్ ధర పెరిగిందనుకుందాం. ఈ సందర్భంలో కౌలు ఇవ్వని అదనపు మదుపు అన్నది సాధ్యం కావటానికి కారణం కేవలం 'ఎ' భూమి కౌలు చెల్లించటానికి వీలుకల్పించే విధంగా మార్కెట్‌లో ధర పెరగనంత వరకూ సాగులోకి రావటం సాధ్యం కాదు కనుక. ఈ షరతు లేకుండా ఉంటే దాని సాగు అప్పటికే మరింత తక్కువ ధర స్థాయిలో ప్రారంభమై ఉండేది. అప్పుడు పాత గుత్త భూముల్లో కౌలు లేకుండా సార్వత్రిక లాభం ఇచ్చే అధిక మార్కెట్టు ధర అవసరమైన తరువాత పెట్టిన మదుపులు సాధ్యమై ఉండేవి కావు. అధిక మార్కెట్టు ధరలలో అవి కేవలం సగటు లాభాన్ని మాత్రమే ఇస్తాయన్నది వాస్తవం. తక్కువ మార్కెట్ ధరలో అవి సగటు లాభాన్ని ఇవ్వగలిగి ఉండేవి కావు – తక్కువ మార్కెట్టు ధర అన్నది 'ఎ' భూమి సాగులోకి వచ్చిన సమయం నుంచి ఉత్పత్తి ధరను శాసించి ఉండవచ్చు – అంటే ఈ పెట్టుబడి మదుపులు ఈ పరిస్థితుల్లో సాధ్యమై ఉండేవి కావు. ఈ రకంగా 'ఎ' భూమిలో కౌలు పాత గుత్త భూముల్లో కౌలు ఇవ్వని మదుపులతో పోల్చినప్పుడు వ్యత్యాసపు కౌలు అవుతుంది. అయితే 'ఎ' భూమికి సంబంధించిన కమతాల నుంచి కౌలు లభ్యం కానందువల్ల మాత్రమే 'ఎ' భూమిలో అటువంటి వ్యత్యాసపు కౌలు తలెత్తుతుంది. అంటే ఇక్కడ కౌలు అవసరమవుతుంది. ఈ అవసరం వివిధ రకాల నేలల మధ్య తేడా ఉండటం వల్ల రాలేదు. ఈ అవసరం పాత లీజు భూముల్లో అదనపు పెట్టుబడి మదుపులకు ఆటంకం కలిగిస్తుంది. ఏ రకంగా చూసినా 'ఎ' భూమి కౌలు ధాన్యపు ధరల పెరుగుదల ఫలితం కాదు. అందుకు విరుద్ధంగా పరమ అధ్వాన్నపు భూమి సాగులోకి రావాలంటే అది కౌలు ఇచ్చితీరాలన్న అంశమే దానిని సంతృప్తిపరిచే మేరకు ధాన్యం ధరల పెరుగుదల కారణభూతమవుతుంది.

వ్యత్యాసపు కౌలుకు ఒక ప్రత్యేకత ఉంది. భూ ఆస్తి మామూలుగా రైతు జేబులోకి పోవలసిన అదనపు లాభాన్ని అడ్డుకుంటుంది. రైతు కొన్ని పరిస్థితుల్లో తన గుత్తకాలంలో ఈ అదనపు లాభాన్ని జేబులో వేసుకుంటాడు. ఆస్తితో సంబంధం లేకుండా తలెత్తిన సరుకు ధరలో ఒక భాగాన్ని మార్చటానికి భూ ఆస్తి అన్నది ఇక్కడ కేవలం ఒక కారణం. (మార్కెట్టు ధరను శాసించే ఉత్పత్తి ధర పోటీచేత నిర్ణయించబడటం కారణంగా) అది అదనపు లాభంగా మారుతుంది. ధరలో ఈ భాగం ఒక వ్యక్తి నుండి మరో వ్యక్తికి, పెట్టుబడిదారుడి నుంచి భూస్వామికి మారటానికి భూ ఆస్తి ఒక కారణం. అయితే ధరలో ఆ భాగం సృష్టించబడటానికి గాని, ఈ భాగం తలెత్తటానికి వీలుకల్పించిన ధరలో పెరుగుదలకు గాని భూ ఆస్తి కారణం కాదు. మరోవైపున పరమ అధ్వాన్నపు భూమి 'ఎ' సాగు ఉత్పత్తి ధర ఇచ్చినప్పటికీ ఉత్పత్తి ధర కంటే కొంత అదనంగా ఉత్పత్తి చెయ్యలేనంత వరకు అంటే కౌలును ఉత్పత్తి చెయ్యలేనంత వరకు ఆ భూమి సాగులోకి రాకపోతే అప్పుడు ధరలో ఈ పెరుగుదలకు భూ ఆస్తి కారణమవుతుంది. భూ ఆస్తే స్వయంగా కౌలును సృష్టించింది. రెండవ నమూనాలో పేర్కొన్నట్టుగా 'ఎ' భూమిలో ఇప్పుడు చెల్లించిన కౌలు పాత భూమిలో చివరి పెట్టుబడి మదుపులతో పోల్చి చూసినప్పుడు వ్యత్యాసపు కౌలును కలిగి ఉంటుంది. ఈ వాస్తవం తారుమారు కాదు. పాత గుత్త భూముల్లో చివరి మదుపులు కేవలం ఉత్పత్తి ధరను మాత్రమే చెల్లిస్తాయి. 'ఎ' భూమి నుంచి కౌలును ఇవ్వటానికి వీలైనంత మార్కెట్ ధర పెరిగేంతవరకు 'ఎ' భూమి సాగు చెయ్యబడలేని పరిస్థితి ఉంది. ఈ పరిస్థితి మాత్రమే పాత గుత్త భూముల్లో చివరి మదుపులు సాధ్యం అయ్యేలా మార్కెట్టు ధర పెరగటానికి ప్రాతిపదిక. చివరి మదుపులు నిజానికి కేవలం వాటి ఉత్పత్తి ధరను మాత్రమే ఇస్తాయి. అయితే అదే సమయంలో ఆ ఉత్పత్తి ధర 'ఎ' భూమిలో కౌలు ఇస్తుంది. 'ఎ' భూమి ఈ విషయంలో కౌలు ఇవ్వాల్సి రావటమే 'ఎ' భూమికి పాత గుత్త భూముల్లో చివరి మదుపులకు మధ్య వ్యత్యాసపు కౌలుకు కారణం.

'ఎ' భూమి కౌలు చెల్లించదు అని సాధారణంగా ప్రకటించినప్పుడు ధాన్యపు ధర ఉత్పత్తి ధరనుబట్టి నిర్ణయించబడుతుంది అని భావిస్తాం. అప్పుడు కౌలు అంటే ఆ పదానికి ఉన్న ప్రత్యేక అర్థంలో వాడుతున్నాం. తన కార్మికుల మామూలు వేతనాల నుంచి లేదా తన సగటు సార్వత్రిక లాభం నుంచి తీసి కొంత భాగాన్ని లీజు డబ్బుగా రైతు చెల్లించవచ్చు. అప్పుడతను చెల్లిస్తున్నది కౌలు కాదు. కౌలు అన్నది వేతనాలకు, లాభానికి భిన్నమైన, సరుకుల ధరలో ఒక స్వతంత్రమైన అంశం. ఇది తరచుగా ఆచరణలో జరుగుతూ వుంటుందని మనం ఇంతకు ముందే చూశాం. ఒక ఫలానా దేశంలో వ్యవసాయ కార్మికుల వేతనాలు సార్వత్రిక సగటు వేతనాల స్థాయికంటే తక్కువ స్థాయికి అణగదొక్కినప్పుడు వేతనాలలో ఒక భాగం సాధారణంగా కౌలులో ప్రవేశిస్తుంది. పరమ అధ్వాన్నపు భూమిని సాగుచేస్తున్న రైతుకు మాత్రమే చెందిన ప్రత్యేక వ్యవహారం కాదది. పరమ అధ్వాన్నపు భూమిలో సాగుకు వీలుకల్పించే అదే ఉత్పత్తి ధరలో ఈ తక్కువ వేతనాలు అప్పటికే ఒక అంతర్గత అంశంగా ఉంటాయి. కనుక ఉత్పత్తి ధరకు ఉత్పాదితాన్ని అమ్మటంవల్ల ఈ భూమిని సాగుచేస్తున్న రైతుకు కౌలు చెల్లించటానికి వీలుకల్పించదు. ఈ భూస్వామి ఒక కార్మికునికి తన భూమిని లీజుకివ్వగలడు. ఆ కార్మికుడు తన వేతనాలకు మించి వున్న అమ్మకం ధర ద్వారా వచ్చిన సొమ్ము మొత్తాన్ని లేదా అత్యధిక భాగాన్ని కౌలు రూపంలో భూస్వామికి చెల్లించటానికి సిద్ధపడవచ్చు.

ఈ సందర్భాలన్నింటిలోనూ వాస్తవంగా చెల్లించబడింది కౌలు కాదు, లీజు డబ్బు మాత్రమే. అయితే పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానంలో ఉండే పరిస్థితులకు ఈ పరిస్థితులు అనుగుణంగా ఉన్నప్పుడల్లా కౌలూ, లీజు డబ్బూ ఏకీభవిస్తాయి. సరిగ్గా ఈ సాధారణ పరిస్థితినే మనం ఇక్కడ విశ్లేషించాలి.

పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానంలో కౌలు ఇవ్వకుండానే భూముల్లో పెట్టుబడి మదుపులు సాధ్యమవుతాయని చెప్పిన పై ఉదాహరణలు మన సమస్య పరిష్కారానికి తోడ్పడవు. వలస పరిస్థితుల ప్రస్తావన అంతకంటే తక్కువ తోడ్పడుతుంది. ఒక వలసను వలసగా స్థాపించటానికి అవసరమైన గీటురాయి (మనం ఇక్కడ కేవలం వ్యవసాయ వలసల్ని మాత్రమే ప్రస్తావిస్తున్నాం.) కేవలం సహజమైన పరిస్థితుల్లో విస్తారమైన, సారవంతమైన భూములు లభ్యం కావటమే కాదు. ఈ భూమి ఎవరి స్వాధీనంలోనూ, ప్రైవేటు యాజమాన్యంలోనూ లేకుండా ఉండాలి. దేశాలకు, వలసకు మధ్య భూమికి సంబంధించినంత వరకు ఉన్న అపారమైన భేదం ఇందులోనే వుంది. వేక్ ఫీల్డ్[1] సరిగ్గా పేర్కొన్నట్లు చట్టబద్ధంగా గాని లేదా వాస్తవంగా గాని భూ ఆస్తి అన్నది లేకపోవటమే ఇక్కడ ప్రధాన అంశం. ఫిజియోక్రాట్ మిరాబూ తదితర వృద్ధ ఆర్థికవేత్తలు అతనికంటే ముందే ఈ అంశాన్ని కనుగొన్నారు. వలస రైతులు భూమిని స్వాధీనం చేసుకున్నారా లేక నామమాత్రమైన ధర రూపంలో ప్రభుత్వానికి కొంత సొమ్ము చెల్లించి చట్టబద్ధమైన పట్టాను పొందారా అన్నది ఇక్కడ అప్రస్తుతం. అప్పటికే స్థిరపడిన వలస రైతులు ఆ భూమికి చట్టబద్ధమైన యజమానులు అయి ఉండవచ్చు అన్న అంశం కూడా అప్రస్తుతమే. నిజానికి భూ ఆస్తి అన్నది ఇక్కడ పెట్టుబడి మదుపుకు గాని, పెట్టుబడి లేని శ్రమకు గాని పరిమితి విధించటం లేదు. అక్కడ కొంత భూమిని అప్పటికే వలస రైతులు స్వాధీనం చేసుకున్నప్పటికీ కొత్తగా వచ్చే రైతులు కొత్త భూమిపైన తమ పెట్టుబడి లేదా తమ శ్రమను వినియోగించటానికి ఇది ఆటంకం కాదు. కనుక భూ ఆస్తి ప్రభావం భూమి ఉత్పాదితాల ధరపైన, కౌలుపైన ఎలా వుంటుందో పరిశీలించటానికి (పెట్టుబడి మదుపుకు వీలైన రంగంగా భూమిపై భూ ఆస్తి పరిమితులు విధించే సందర్భాలను) మన స్వేచ్ఛాయుతమైన బూర్జువా వలసల్ని ఉదాహరణగా తీసుకోవటం అసంబద్ధం. వ్యవసాయంలో పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం గాని, దానికి అనుగుణమైన భూ ఆస్తి గాని అక్కడ ఉండనే ఉండవు. భూమి కౌలు అనే తన అధ్యాయంలో రికార్డో అదే పని చేశాడు. భూమిని స్వాధీనం చేసుకోవటం అన్నది భూమి ఉత్పాదితాల విలువపైన కలిగించే ప్రభావాన్ని పరిశీలించటం తన ఉద్దేశమని ఆయన ఉపోద్ఘాతంలో తెలియజేశాడు. దానికోసం ఆయన వలసల్ని ఒక ఉదాహరణగా తీసుకున్నాడు. దానినిబట్టి భూమి సాపేక్షంగా ప్రాథమిక రూపంలో ఉంటుందని దాని వినియోగం భూ ఆస్తిపైన గుత్తాధిపత్యంచేత పరిమితం చెయ్యబడదని భావించాడు.

కేవలం చట్టబద్ధమైన యాజమాన్యం భూమిపైన ఉన్నంత మాత్రాన ఆ యజమానికి భూమి కౌలును తెచ్చిపెట్టదు. అయితే ఆర్థిక పరిస్థితులు అతనికి తన భూమిని అదనపు ఫలితాన్ని ఇచ్చే స్థాయిలో ఉపయోగించే వీలుకల్పించటంచేత తన భూమిని ఉత్పత్తి నుంచి ఉపసంహరించుకోగలిగిన అధికారాన్ని ఇస్తుంది. ఆ భూమి వాస్తవంగా వ్యవసాయ ప్రయోజనాలకు లేదా భవనాలు వగైరా

1. వేక్ ఫీల్డ్, ఇంగ్లాండ్ అండ్ అమెరికా, లండన్, 1833, పెట్టుబడి మొదటి సంపుటంలో 33వ అధ్యాయాన్ని కూడా పోల్చి చూడండి.

ఇతర ఉత్పత్తి ప్రయోజనాలకు ఉపయోగించటానికి అతనికి అధికారం ఇస్తుంది. అయితే ఈ రంగం యొక్క మొత్తం పరిమాణాన్ని పెంచనూలేడు తగ్గించనూలేడు. అయితే మార్కెట్టులో ఉంచదగిన భూమి పరిమాణాన్ని మార్చగలడు. ఫోరియర్ ఇంతకుముందే పేర్కొన్నట్టుగా నాగరిక దేశాలన్నింటిలోనూ భూమిలో సాపేక్షంగా గణనీయమైన భాగం సాగుచెయ్యబడకుండా ఉంటుంది.

సాగులో వున్న భూమికంటే తక్కువ సారవంతమైన భూమిని సాగుచెయ్యటం గిరాకీని సంతృప్తి పరచటానికి అవసరమనుకుందాం. అప్పుడు ఆ భూమి ఉత్పాదితం మార్కెట్టు ధర కేవలం రైతుకు ఉత్పత్తి ధరను అనగా ఈ భూమిలో పెట్టే మదుపులపై సాధారణ లాభాన్ని మాత్రమే ఇచ్చే విధంగా ఉంటే భూస్వామి ఆ భూమిని ఉచితంగా లీజుకి ఇస్తాడా? ఎంతమాత్రం ఇవ్వడు. ఆ పెట్టుబడి మదుపు అతనికి కౌలునివ్వాలి. లీజు డబ్బు లేకుండా అతడు తన భూమిని లీజుకివ్వడు. కనుక మార్కెట్టు ధర ఉత్పత్తి ధరను మించి పెరగాలి. భూస్వామికి కౌలు చెల్లించే విధంగా అది పి+ఆర్ స్థాయికి పెరగాలి. భూ ఆస్తి, మన భావన ప్రకారం లీజు ఇవ్వనంత వరకు ఏమీ ఫలితాన్ని ఇవ్వదు. లీజు ఇవ్వనంత వరకూ అది ఆర్థికంగా నిరుపయోగంగానే వుంటుంది. ఉత్పత్తి ధరకంటే మార్కెట్ ధర కొద్దిగా పెరిగినా చాలు, అధ్వాన్నమైన కొత్త నేలను మార్కెట్‌లోకి తీసుకురావడం సాధ్యపడుతుంది.

అప్పుడు ఈ కింది ప్రశ్న తలెత్తుతుంది. దీనినిబట్టి పరమ అధ్వాన్నపు భూమి, భూసారాలలో ఉన్న తేడా నుంచి కాక వేరే రకంగా భూమి కౌలును ఇస్తుందని అర్థమా? ఇక్కడ భూమి ఉత్పాదితం ధర, గుత్తాధిపత్యం ధర అని లేదా ఆ ధరలో కౌలు పన్నుగా ప్రవేశిస్తుందని, ఇక్కడ వున్న ఏకైక భేదం ఆ పన్నును ప్రభుత్వానికి బదులు భూస్వామి విధిస్తున్నాడని అర్థమా? ఈ పన్నుకు ప్రత్యేకమైన ఆర్థిక పరిమితులు ఉంటాయని వేరే చెప్పనక్కరలేదు. పాత లీజు భూముల్లో అదనపు మదుపులు, విదేశాల నుంచి వచ్చే వ్యవసాయ ఉత్పాదితాల పోటీ (వాటి దిగుమతిపైన ఆంక్షలు లేవనుకుందాం.) భూస్వాముల మధ్య పోటీ, అంతిమంగా వినియోగదారుల అవసరాలు, వారి కొనుగోలు శక్తి మొదలైన అంశాలు ఆ పన్నుకు పరిమితులు విధిస్తాయి. అయితే అసలు విషయం ఇది కాదు. ఇక్కడ ప్రధాన అంశం ఏమంటే పరమ అధ్వాన్నపు భూమిపై చెల్లించబడిన కౌలు ఈ భూమి ఉత్పాదితాల ధరలో (మన ఊహ ప్రకారం ఈ ధర సాధారణ మార్కెట్టు ధరను శాసిస్తుంది.) ఒక సరుకుపైన విధించిన పన్ను లాగానే, అంటే సరుకు విలువతో ప్రమేయంలేని వేరే అంశంగానే ప్రవేశిస్తుందా అన్నది ప్రశ్న.

అది సరిగ్గా అలా కానక్కరలేదు. అటువంటి ఊహకు కారణం సరుకుల విలువకు, వాటి ఉత్పత్తి ధరకు మధ్య వున్న తేడాను ఇంతవరకు సక్రమంగా అర్థం చేసుకోకపోవటం. ఒక సరుకు ఉత్పత్తి ధర దాని విలువతో ఏమాత్రం సర్వసమానం కాదని మనం గమనించాం. అయితే మొత్తంగా చూస్తే సరుకుల ఉత్పత్తి ధరలు వాటి మొత్తం విలువచేత శాసించబడతాయి. అన్ని పరిస్థితులు యథాతథంగా ఉంటే వివిధ రకాల సరుకుల ఉత్పత్తి ధరల చలనం వాటి విలువల చలనంచేత నిర్ణయించబడుతుంది. ఒక సరుకు ఉత్పత్తి ధర దాని విలువకు ఎగువనో, దిగవనో ఉండవచ్చు. ఎప్పుడో ఒకసారి మినహాయింపుగా అది దాని విలువతో సమానంగా వుండవచ్చు. కనుక భూమి ఉత్పాదితాలు వాటి ఉత్పత్తి ధరలకు మించి అమ్మబడినాయంటే అర్థం వాటి విలువకు మించి అమ్మబడినాయని కాదు. అలాగే పారిశ్రామిక వస్తువులు సగటున వాటి ఉత్పత్తి ధరకు అమ్మబడితే

అవి వాటి విలువకు అమ్మబడినట్లు కాదు. వ్యవసాయ ఉత్పాదితాలు వాటి ఉత్పత్తి ధరకు ఎగువన, వాటి విలువకు దిగువన అమ్మబడటం సాధ్యమే. కాగా మరోవైపున అనేక పారిశ్రామిక వస్తువులు వాటి విలువకు పైన అమ్మబడటంవల్ల ఉత్పత్తి ధర లభించవచ్చు.

సరుకును ఉత్పత్తిచేసిన పెట్టుబడిలోని అస్థిర భాగం, స్థిర భాగం లేక పెట్టుబడి అంతర్నిర్మాణం మధ్య గల నిష్పత్తి మాత్రమే ఒక సరుకు ఉత్పత్తి ధరకు దాని విలువతో ఉన్న సంబంధాన్ని నిర్ణయిస్తుంది. ఒక నిర్ణీత ఉత్పత్తి రంగంలో పెట్టుబడి అంతర్నిర్మాణం సగటు సామాజిక అంతర్నిర్మాణం కంటే తక్కువగా ఉంటే అనగా వేతనాల కోసం ఉపయోగించిన అస్థిర భాగం శ్రమ భౌతిక పరిస్థితులకు ఉపయోగించిన స్థిర భాగంతో పోల్చితే సగటు సామాజిక పెట్టుబడి విషయంలోకంటే ఎక్కువగా ఉన్నప్పుడు ఆ వస్తువు విలువ ఉత్పత్తి ధరకంటే ఎక్కువ ఉంటుంది. మరోలా చెప్పాలంటే అటువంటి పెట్టుబడి మరింత ఎక్కువ సజీవ శ్రమను వినియోగిస్తుంది. కనుక మరింత అదనపు విలువను, మరింత లాభాన్ని సృష్టిస్తుంది. సామాజిక సగటు పెట్టుబడికంటే సమానమైన శ్రమ దోపిడీని ఇక్కడ ఊహించాల్సి వుంటుంది. దాని ఉత్పాదితం విలువ ఉత్పత్తి ధరకంటే ఎక్కువ. ఉత్పత్తి ధర అంటే పెట్టుబడి + సగటు లాభం. ఈ సగటు లాభం ఈ సరుకులో ఉత్పత్తి అయిన లాభంకంటే తక్కువ సగటు సామాజిక పెట్టుబడి ఉత్పత్తి చేసిన అదనపు విలువ. ఈ తక్కువ అంతర్నిర్మాణం కలిగిన పెట్టుబడి ఉత్పత్తి చేసిన అదనపు విలువకంటే తక్కువగా వుంటుంది. ఒక ఉత్పత్తి రంగంలో పెట్టిన పెట్టుబడి సామాజిక సగటు పెట్టుబడి అంతర్నిర్మాణంకంటే ఎక్కువ అంతర్నిర్మాణాన్ని కలిగి వుంటే సరిగ్గా ఇందుకు విరుద్ధమైన ఫలితం వస్తుంది. అది ఉత్పత్తి చేసిన సరుకుల విలువ వాటి ఉత్పత్తి ధరకు దిగువన ఉంటుంది. అత్యంత అభివృద్ధి చెందిన పరిశ్రమల ఉత్పాదితాల విషయంలో సాధారణంగా ఇలాగే వుంటుంది.

ఒక ఉత్పత్తి రంగంలో పెట్టుబడి అంతర్నిర్మాణం సగటు సామాజిక పెట్టుబడి అంతర్నిర్మాణం కంటే తక్కువగా వుంటే ఈ ప్రత్యేక ఉత్పత్తి రంగంలో సగటుకంటే తక్కువ ఉత్పాదకత ఉందని చెప్పటంతో సమానం. ఎందుకంటే సాధించిన ఉత్పాదకత స్థాయి అస్థిర పెట్టుబడికంటే స్థిర పెట్టుబడి సాపేక్షంగా ప్రబలంగా వుండటాన్ని సూచిస్తుంది. లేదా అదే పెట్టుబడితో పోల్చితే వేతనాలకై ఉపయోగించే భాగం స్థిరంగా తగ్గటాన్ని సూచిస్తుంది. మరోవైపున ఒక ఉత్పత్తి రంగంలో పెట్టుబడి అంతర్నిర్మాణం ఎక్కువగా ఉంటే అది సగటుకు మించిన స్థాయిలో ఉత్పాదకత అభివృద్ధిని ప్రతిబింబిస్తుంది.

మన చర్చ నుంచి వాస్తవ కళాఖండాలను వాటి స్వభావం రీత్యా పక్కన ఉంచితే, విభిన్న ఉత్పత్తి రంగాలలో విభిన్న నిష్పత్తులలో స్థిర, అస్థిర పెట్టుబడి భాగాలు అవసరమవుతాయి అన్నది స్వయంవిదితం. అవి వాటి ప్రత్యేక సాంకేతిక లక్షణాలపైన ఆధారపడి వుంటాయి. కొన్నిచోట్ల సజీవ శ్రమ పెద్ద పాత్ర వహిస్తే, కొన్నిచోట్ల చిన్న పాత్ర వహిస్తుంది. ఉదాహరణకు వ్యవసాయం నుంచి స్పష్టంగా వేరుచేసి చూడాల్సిన ఖనిజ పరిశ్రమలలో ఒక స్థిర పెట్టుబడి అంశంగా ముడిపదార్థం అన్నది ఉండదు. సహాయక పదార్థం సహితం అరుదుగా మాత్రమే ప్రధానమైన పాత్ర నిర్వహిస్తుంది. ఒక గని పరిశ్రమలో స్థిర పెట్టుబడి యొక్క మరో భాగం నిశ్చల పెట్టుబడి ప్రధానమైన పాత్ర

నిర్వహిస్తుంది. అయినప్పటికీ ఇక్కడ కూడా అస్థిర పెట్టుబడితో పోల్చి చూస్తే స్థిర పెట్టుబడి పెరుగుదలను బట్టి ప్రగతి అంచనా వెయ్యవచ్చు.

వ్యవసాయంలో పెట్టుబడి అంతర్నిర్మాణం సగటు సామాజిక పెట్టుబడికంటే తక్కువ వుంటే అభివృద్ధి చెందిన ఉత్పత్తి కలిగిన దేశాలలో సరుకు తయారీ పరిశ్రమలంతగా వ్యవసాయం అభివృద్ధి చెందలేదన్న దాన్ని వ్యక్తం చేస్తుంది. అదే వాస్తవాన్ని (మిగిలిన పరిస్థితులన్నింటినీ నిర్ణయాత్మకమైన ఆర్థిక పరిస్థితులతో సహా అన్నింటినీ ఇక్కడ పరిగణన నుంచి తప్పించాలి.) యంత్రశాస్త్రాల శీఘ్రతరమైన తొలి అభివృద్ధి ద్వారా వివరించవచ్చు. ఆ తరువాత ఇటీవలి కాలంలో వచ్చిన రసాయనిక, భౌగోళిక, శారీరక శాస్త్రాల అభివృద్ధితో పోల్చి చూస్తే యంత్ర శాస్త్రాలు ముఖ్యంగా వ్యవసాయంలో ఏ మేరకు వర్తింపచేయబడుతున్నాయో తెలుస్తుంది. సందర్భవశాత్తూ నిస్సందేహంగా, చాలాకాలంగా తెలిసిన వాస్తవం[1] ఏమంటే వ్యవసాయ ప్రగతి అస్థిర పెట్టుబడితో పోల్చినప్పుడు స్థిర పెట్టుబడి సాపేక్ష పెరుగుదల ద్వారా నిరంతరాయంగా వ్యక్తమవుతుంది. పెట్టుబడిదారీ అభివృద్ధి విధానం ప్రబలంగా వున్న ఒక ప్రత్యేక దేశంలో, ఉదాహరణకు ఇంగ్లాండులో సగటు సామాజిక పెట్టుబడికంటే వ్యవసాయ పెట్టుబడి అంతర్నిర్మాణం తక్కువగా ఉందా లేదా అన్న ప్రశ్న గణాంక సమాచారాన్నిబట్టి మాత్రమే నిర్ణయించవచ్చు. అయితే ఇక్కడ మన అవసరాల దృష్టితో చూసినప్పుడు ఆ వివరాలలోకి పోవాల్సిన అవసరం లేదు. అయితే ఈ భావనపై ఆధారపడి మాత్రమే వ్యవసాయ ఉత్పాదితాల విలువ వాటి ఉత్పత్తి ధరకంటే ఎక్కువగా ఉండవచ్చు అన్న సంగతి సైద్ధాంతికంగా రుజువైంది. మరోలా చెప్పాలంటే వ్యవసాయంలో ఒక పరిమాణంలో ఉన్న పెట్టుబడి సగటు సామాజిక అంతర్నిర్మాణంలో ఉన్న అదే పరిమాణం గల పెట్టుబడికంటే ఎక్కువ అదనపు విలువను ఉత్పత్తి చేస్తుంది. అంటే ఎక్కువ అదనపు శ్రమను చలనంలో ఉంచుతుంది; ఆదేశిస్తుంది. (సాధారణంగా ఎక్కువ సజీవ శ్రమను పనిలో పెడుతుంది.)

ఇక్కడ మనం విశ్లేషిస్తున్న కౌలు రూపానికి ఈ ఊహ సరిపోతుంది. ఈ ఊహ వర్తించిన మేరకు ఆ కౌలు లభిస్తుంది. ఈ ఊహ వర్తించనిచోట దీనికి అనుగుణమైన కౌలు రూపం కూడా ఉండదు.

అయితే వ్యవసాయ ఉత్పాదితాల ఉత్పత్తి ధరలపై అదనంగా ఉన్న వాటి విలువ అస్తిత్వం భూమి కౌలు అస్తిత్వాన్ని వివరించటానికి సరిపోదు. ఈ భూమి కౌలు వివిధ రకాల భూసారాల లోనూ, ఒకే భూమిలో పెట్టిన పెట్టుబడులలోనూ ఉన్న తేడాలతో ప్రమేయం లేకుండా ఉంటుంది. ఈ కౌలును భావనరీత్యా వ్యత్యాసపు కౌలు నుంచి స్పష్టంగా వేరుచెయ్యాల్సి వుంది. కనుక దానిని మనం నిరపేక్ష కౌలు అనవచ్చు. అనేక పారిశ్రామిక ఉత్పాదితాల విలువ వాటి ఉత్పత్తి ధరకంటే ఎక్కువ వుండవచ్చు. అయితే కౌలుగా మారదగిన అదనపు లాభం అన్నది ఉండనక్కరలేదు. సగటు లాభానికి మించిన మొత్తాన్ని అది ఇవ్వకపోవచ్చు. అందుకు విరుద్ధంగా ఉత్పత్తి ధర, సార్వత్రిక లాభం రేటు అన్న భావనలు విడి సరుకులు వాటి విలువకు అమ్మబడవు అనే వాస్తవంపైన ఆధారపడి

1. డమ్‌బాస్లే, యేనల్స్.... పారిస్, 1824-37 సం॥ ఆర్. జోన్స్ - యాన్ ఎస్సే ఆన్ ది డిస్ట్రిబ్యూషన్ ఆఫ్ వెల్త్.... లండన్, 1831 - సం.

వుంటాయి. సరుకుల విలువలు సమం కావడంవల్ల ఉత్పత్తి ధరలు తలెత్తుతాయి. వివిధ ఉత్పత్తి రంగాలలో ఉపయోగించిన ఆయా పెట్టుబడి విలువలను భర్తీ చేసిన తరువాత మొత్తం అదనపు విలువను విడి ఉత్పత్తి రంగాలలో ఉత్పత్తి అయిన సరుకుల నిష్పత్తినిబట్టి కాక ముందస్తుగా పెట్టిన పెట్టుబడుల పరిమాణాల నిష్పత్తిలో పంచబడుతుంది. ఈ రకంగా మాత్రమే సగటు లాభమూ, ఉత్పత్తి ధరా తలెత్తుతాయి. ముందు చెప్పుకున్న దాని విశిష్ట అంశం యిదే. పోటీ ద్వారా మొత్తం పెట్టుబడి ఉత్పత్తి చేసిన అదనపు విలువ పంపిణీలో ఈ సమత్వాన్ని సాధించటం అన్నది, ఈ సమత్వానికి ఎదురయ్యే అవరోధాలన్నీ అధిగమించటం అన్నది పెట్టుబడుల నిరంతరాయమైన ధోరణి. కనుక సరుకుల విలువల మధ్య, ఉత్పత్తి ధరల మధ్య ఉన్న తేడాల నుంచి కాక అన్ని పరిస్థితుల్లోనూ మార్కెట్టును శాసిస్తున్న సాధారణ ఉత్పత్తి ధరకు విడి ఉత్పత్తి ధరలకు మధ్య వున్న తేడాల నుంచి తలెత్తే అదనపు లాభాన్ని మాత్రమే ఈ ధోరణి సహిస్తుంది. ఇది రెండు విభిన్న రంగాల నుంచి కాక ఒకే ఉత్పత్తి రంగంలో ఉండే అదనపు లాభాల నుంచి తలెత్తుతుంది. ఇది రెండు విభిన్న రంగాల మధ్య తలెత్తదు. కనుక వివిధ రంగాల సార్వత్రిక ఉత్పత్తి ధరలను, సార్వత్రిక లాభం రేటును ప్రభావితం చెయ్యదు. అవి విలువల్ని ఉత్పత్తి ధరలుగానూ, సార్వత్రిక లాభం రేటుగానూ పరివర్తన చెందటాన్ని ఊహిస్తుంది. ఈ ఊహ వివిధ ఉత్పత్తి రంగాలలో మొత్తం సామాజిక పెట్టుబడి పంపిణీ అయ్యే నిష్పత్తి నిరంతరాయంగా మారటంపైన ఆధారపడి వుంటుంది. నిరంతరాయంగా పెట్టుబడులు లోపలికి రావటంపైన, బయటికి పోవడంపైన, ఒక రంగంనుంచి మరో రంగానికి మార్చబడటానికి వీలుగా ఉండటంపైన – అనగా క్లుప్తంగా చెప్పాలంటే వివిధ ఉత్పత్తి రంగాల మధ్య వాటి స్వతంత్ర చలనంపైన ఆధారపడి వుంటుంది. మొత్తం సామాజిక పెట్టుబడి స్వతంత్ర భాగాలకు అనేక మదుపు రంగాలు అందుబాటులో ఉన్నాయని ఇది సూచిస్తుంది. పెట్టుబడుల మధ్య ఈ పోటీలో ఏ ఆటంకమూ యాదృచ్ఛికమైన తాత్కాలికమైన ఆటంకాలతో సహా ఏదీ ఇక్కడ జోక్యం చేసుకోదు అనేది ఈ సందర్భంలో మన ప్రారంభ ఊహ. ఉదాహరణకు ఉత్పత్తి ధరలకంటే సరుకుల విలువలు ఎక్కువగా వున్న ఉత్పత్తి రంగంలో లేదా ఉత్పత్తి అయిన అదనపు విలువ సగటు లాభాన్ని మించినచోట ఆ విలువను ఉత్పత్తి స్థాయికి కుదించటానికీ, ఈ ఉత్పత్తి రంగంలో అధికంగా ఉన్న అదనపు విలువను పెట్టుబడి పని చేసే అన్ని రంగాలలోనూ అనులోమంగా పంపిణీ చెయ్యటానికీ మధ్య ఆటంకాలను ఇది సహించదు. అయితే ఇందుకు విరుద్ధంగా జరిగితే, పెట్టుబడి ఒక అన్య అంశాన్ని ఎదుర్కొంటే, ఆ అన్య అంశాన్ని అది పాక్షికంగా లేదా పూర్తిగా అధిగమించలేకపోతే, ఆ అంశం పెట్టుబడి మదుపును కొన్ని రంగాలకు మాత్రమే పరిమితం చేస్తే, అదనపు విలువను అదనపు లాభంగా సాధారణ రీతిలో సమం చెయ్యటాన్ని పూర్తిగా లేదా పాక్షికంగా రద్దుచేసే పరిస్థితుల్లో మాత్రమే దానిని అనుమతిస్తే, అటువంటి ఉత్పత్తి రంగాలలో సరుకుల ఉత్పత్తి ధరలకు మించి వాటి విలువ కౌలుగా మారటానికి వీలైన, లాభానికి సంబంధించి స్వతంత్రంగా ఉండగలిగిన అదనపు లాభాన్ని ఇవ్వలేదు. ఆ అన్య శక్తికీ, ఆటంకానికీ భూ ఆస్తి ప్రాతినిధ్యం వహిస్తుంది. భూమిలో మదుపు పెట్టటానికి పెట్టుబడి చేసే కృషికి అది ఆటంకం అవుతుంది. పెట్టుబడిదారునికి వ్యతిరేకంగా ఉండే భూస్వామి ఆ అన్య శక్తి.

పన్ను విధించకుండా లేదా మరోలా చెప్పాలంటే కౌలును కోరకుండా ఇంతవరకు సాగు చెయ్యబడని, కౌలుకు ఇవ్వబడని, భూమిలో ఎటువంటి పెట్టుబడి మదుపును అనుమతించని

ఆటంకంగా ఇక్కడ భూ ఆస్తి ఉంటుంది. కొత్తగా సాగులోకి తెచ్చే భూమి ఎటువంటి వ్యత్యాసపు కౌలునూ ఇవ్వకపోవచ్చు. భూ ఆస్తి లేకుండా ఉంటే మార్కెట్టు ధరలో కొద్దిపాటి పెరుగుదలతోనే సాగులోకి తీసుకురాబడి ఉండవచ్చు. అప్పుడు అమల్లో వున్న మార్కెట్టు ధర సాగుదారునికి ఈ అత్యంత అధ్వాన్నపు భూమి అతని ఉత్పత్తి ధర మాత్రమే ఇచ్చి వుండవచ్చు. అయితే భూ ఆస్తి విధించిన ఈ ఆటంకంవల్ల భూమి ఉత్పత్తి ధరపైన మిగులును ఇవ్వగలగాలి. అంటే కౌలును ఇవ్వగలగాలి. అయితే వ్యవసాయ పెట్టుబడి ఉత్పత్తి చేసిన సరుకుల విలువ మన ఊహ ప్రకారం వాటి ఉత్పత్తి ధర కంటే ఎక్కువగా ఉంది కనుక ఈ కౌలు (ఒక సందర్భంలో తప్ప, ఆ సందర్భాన్ని మనం వెంటనే ఇక్కడ చర్చిద్దాం.) ఉత్పత్తి ధరపైన మిగులు విలువను లేదా దానిలో ఒక భాగాన్ని రూపొందిస్తుంది. కౌలు విలువకు ఉత్పత్తి ధరకు మధ్య ఉన్న తేడా మొత్తానికి సమానమవుతుందా? లేక దానిలో ఒక భాగానికి మాత్రమే సమానమవుతుందా అన్నది సరఫరా, గిరాకీల మధ్య సంబంధాన్ని బట్టి, కొత్తగా సాగులోకి తేబడిన భూమి విస్తీర్ణాన్ని బట్టి వుంటుంది. వ్యవసాయ ఉత్పాదితాల ఉత్పత్తి ధరపైన వాటి మిగులు విలువ, కౌలుతో సమానం కానంతవరకూ ఈ మిగులులో ఒక భాగం ఎప్పుడూ వివిధ విడి పెట్టుబడుల మధ్య మొత్తం అదనపు విలువను పంపిణీ చెయ్యటంలోనూ, సాధారణ రూపంలో సమం చేసే అంశంగానూ ప్రవేశిస్తుంది. ఉత్పత్తి ధరపైన మిగులు విలువతో కౌలు సమం కాగానే సగటు లాభంపై దానిని మించి ఉన్న మొత్తం అదనపు విలువ భాగం ఈ సమత్వం నుంచి ఉపసంహరించుకోబడుతుంది. అయితే ఈ నిరపేక్ష కౌలు – ఉత్పత్తి ధరపైన మొత్తం మిగులు విలువతో సమానమైన లేదా ఒక భాగంతో సమానమైన వ్యవసాయ ఉత్పాదితాలు ఒక గుత్తాధిపత్య ధరకే అమ్మబడతాయి. వాటి ధర వాటి విలువను మించిపోవడటంవల్ల కాదు. వాటి విలువతో సమానమైనందునా లేదా వాటి ధర వాటి విలువకంటే తక్కువగానూ, వాటి ఉత్పత్తి ధరకంటే ఎక్కువగానూ ఉండటం వల్ల మాత్రమే. సాధారణ ఉత్పత్తి ధరకంటే ఎక్కువ విలువ ఉన్న ఇతర పారిశ్రామిక ఉత్పాదితాలలాగా అవి ఉత్పత్తి ధరతో సమానం చెయ్యబడవు. ఈ వాస్తవంలోనే వాటి గుత్తాధిపత్య స్వభావం ఉంది. విలువలోనూ, ఉత్పత్తి ధరలోనూ ఒక భాగం ఒక నిర్ణీతమైన స్థిరమైన అంశం. అది ఉత్పత్తి ఖర్చు, ఉత్పత్తిలో వినియోగించిన పెట్టుబడికి ప్రాతినిధ్యం వహిస్తుంది = కె. వాటి తేడా, మరో అంశంలో ఉంది. అది దాని అస్థిర అంశం, అదనపు విలువ. అది ఉత్పత్తి ధర లాభంతో సమానమవుతుంది = పి. సామాజిక పెట్టుబడిపైన ఆ సామాజిక పెట్టుబడిలో భాగంగా ప్రతి విడి పెట్టుబడిపైన లెక్కించబడిన మొత్తం అదనపు విలువతో సమానమవుతుంది. అయితే సరుకుల విలువలో ఈ ప్రత్యేక పెట్టుబడి సృష్టించిన వాస్తవం అదనపు విలువతో సమానమవుతుంది. ఈ పెట్టుబడి ఉత్పత్తి చేసిన సరుకు, విలువలలో ఒక అంతర్గత భాగంగా రూపొందుతుంది. సరుకుల విలువ వాటి ఉత్పత్తి ధరకంటే ఎక్కువగా వుంటే ఉత్పత్తి ధర = కె+పి. వాటి విలువ = కె+పి+డి కనుక పి+డి = వాటిలో ఉన్న అదనపు విలువ. విలువకు ఉత్పత్తి ధరకు మధ్య ఉన్న తేడా = డి. ఈ పెట్టుబడి సాధారణ లాభం రేటు ద్వారా కేటాయించబడిన అదనపు విలువను మించి ఉత్పత్తి చేసిన మిగులు అదనపు విలువ. వ్యవసాయ ఉత్పాదితాల ధర వాటి ఉత్పత్తి ధరకంటే ఎక్కువగా వుంటూనే వాటి విలువకంటే తక్కువగా ఉండవచ్చునని ఇది తెలియజేస్తుంది. అంతేకాక వ్యవసాయ ఉత్పాదితాల ధరలో ఒక శాశ్వతమైన పెరుగుదల అన్నది వాటి ధర వాటి విలువను చేరకముందే ఒక దశ వరకు

జరగవచ్చునని తెలుస్తుంది. వ్యవసాయ ఉత్పాదితాల మిగులు విలువ వాటి ఉత్పత్తి ధరను మించి ఉండటం అన్నది కేవలం భూ ఆస్తి విషయంలో గుత్తాధిపత్యం వలన మాత్రమే వాటి సాధారణ మార్కెట్టు ధర నిర్ణయించే అంశంగా మారవచ్చు. ఈ సందర్భంలో ఉత్పాదితం ధర పెరగటం అన్నది కౌలుకు కారణం కాదు. ఉత్పాదితం ధర పెరగటానికి కౌలే కారణం. పరమ అధ్వాన్నపు భూమిలో ఒక నిర్ణీత విస్తీర్ణం కలిగిన భాగం యొక్క ఉత్పాదితం ధర = పి+ఆర్ అయితే మిగిలిన వ్యత్యాసపు కౌలులన్నీ ఆర్‌ని గుణించగా ఏర్పడతాయి. ఎందుకంటే పి+ఆర్ ఇక్కడ మార్కెట్టుని నియంత్రించే ధరగా ఉంటుందని ఊహించవచ్చు.

వ్యవసాయేతర సామాజిక పెట్టుబడి సగటు అంతర్నిర్మాణం = 85స+15వ, అదనపు విలువ రేటు = 100% అనుకుందాం. అప్పుడు ఉత్పత్తి ధర = 115. వ్యవసాయ పెట్టుబడి అంతర్నిర్మాణం = 75స+25వ అనుకుందాం. అదనపు విలువ రేటు యథాతథంగా ఉంటే, వ్యవసాయ ఉత్పాదితం విలువ మార్కెట్టులో అమల్లో ఉండే ధర = 125. వ్యవసాయ, వ్యవసాయేతర ఉత్పాదితాన్ని ఒకే సగటు ధరకు సమం చేస్తే (వీలు కోసం రెండు రంగాల్లోనూ ఉన్న మొత్తం పెట్టుబడి సమంగా ఉందనుకుందాం.) అప్పుడు మొత్తం అదనపు విలువ = 40 లేదా 200 పెట్టుబడిపైన 20%. ఈ రెండింటి ఉత్పాదితమూ 120 దగ్గర అమ్మబడతాయి. ఉత్పత్తి ఖర్చులతో సమానం చెయ్యటంలో వ్యవసాయేతర ఉత్పాదితాల యొక్క సగటు మార్కెట్టు ధరలు ఆ రకంగా వాటి విలువకంటే ఎక్కువగానూ, వ్యవసాయ ఉత్పాదితాల ధరలు వాటి విలువకంటే తక్కువగానూ ఉంటాయి. వ్యవసాయ ఉత్పాదితాలు వాటి పూర్తి విలువకు అమ్మబడి ఉంటే అవి విలువలు సమం చెయ్యబడినప్పటికంటే 5 ఎక్కువగా ఉంటుంది. పారిశ్రామిక ఉత్పాదితాలు 5 తక్కువగా ఉంటాయి. వ్యవసాయ ఉత్పాదితాలను వాటి పూర్తి విలువకే అమ్మటాన్ని మార్కెట్టు పరిస్థితులు అనుమతించకపోతే – అంటే వాటి ఉత్పత్తి ధరపైన పూర్తి మిగులు లభించేలా అమ్మబడకపోతే – దాని ఫలితం రెండు చివర్ల నడుమ వుంటుంది. పారిశ్రామిక ఉత్పాదితాలు వాటి విలువకు మించి అమ్మబడతాయి. వ్యవసాయ ఉత్పాదితాలు వాటి ఉత్పత్తి ధరలకు మించి అమ్మబడతాయి.

భూ ఆస్తి అన్నది వ్యవసాయ ఉత్పాదితం ధరను దాని ఉత్పత్తి ధరకంటే మించి పైకి నెట్టినప్పటికీ, దానిపై అది ఆధారపడి ఉండదు. అది సాధారణ మార్కెట్ పరిస్థితిపైనా, ఏ మేరకు మార్కెట్ ధర ఉత్పత్తి ధరను మించి దాని విలువ స్థాయికి చేరుకుంటుంది? – అన్నదానిపైన ఆధారపడి వుంటుంది. అంతేకాక వ్యవసాయంలో సగటు లాభాన్ని మించి సృష్టించబడిన అదనపు విలువ ఏ మేరకు కౌలుగా మారుతుంది? లేక అదనపు విలువ సగటు లాభానికి సమం చేసే సాధారణ చర్యలో ఏ మేరకు ప్రవేశిస్తుంది? అన్నదానిపైన అది ఆధారపడి వుంటుంది. ఏమైనప్పటికీ ఈ నిరపేక్ష కౌలు, ఉత్పత్తి ధరను మించిన మిగులు విలువ నుంచి తలెత్తిన ఈ కౌలు వ్యవసాయ అదనపు విలువలో ఒక భాగం మాత్రమే. ఈ అదనపు విలువ కౌలుగా మారి భూస్వామిచేత గుంజబడుతుంది. అదనపు లాభం కౌలుగా మారటం నుంచి వ్యత్యాసపు కౌలు తలెత్తినట్లే సాధారణంగా మార్కెట్టును నియంత్రించే ఉత్పత్తి ధరలలో భూస్వామి దానిని గుంజగలుగుతున్నాడు. కౌలు యొక్క ఈ రెండు రూపాలు దాని మామూలు రూపాలు మాత్రమే. అవి కాక వాస్తవ గుత్తాధిపత్య ధరపైన ఆధారపడిన కౌలు ఉండవచ్చు. అది ఉత్పత్తి ధరపై గాని, సరుకుల విలువపై గాని ఆధారపడి ఉండదు. కొనుగోలుదారుని

అవసరాలపైన, చెల్లించగలిగిన వారి శక్తిపైన ఆధారపడి వుంటుంది. మార్కెట్టు ధరల వాస్తవ చలనాన్ని పరిశీలించే పోటీ సిద్ధాంతంలో దీనిని విశ్లేషిద్దాం.

వ్యవసాయానికి అనువైన భూమినంతటినీ ఒకానొక దేశంలో లీజుకిస్తే (పెట్టుబడి దారీ ఉత్పత్తి విధానమూ, ఇతర పరిస్థితులు సార్వత్రికంగా ఉన్నాయనుకుందాం.) కౌలు చెల్లించని భూమి ఏదీ ఉండదు. అయితే కొన్ని పెట్టుబడులు అనగా భూమిలో పెట్టిన పెట్టుబడులలో కొన్ని భాగాలు కౌలు ఇవ్వనివి ఉండవచ్చు. ఎందుకంటే భూమి కౌలుకివ్వబడగానే భూ ఆస్తి అన్నది అవసరమైన పెట్టుబడి మదుపుకు వ్యతిరేకంగా సంపూర్ణ ఆటంకంగా ఉండజాలదు. అయితే ఆ తరువాత అది సాపేక్ష ఆటంకంగా కొనసాగవచ్చు. భూమిలో పెట్టిన పెట్టుబడి చిట్టచివరికి భూస్వామికి తిరిగి వచ్చే మేరకు అది కౌలుదారుని కార్యకలాపాలకు నిర్దిష్టమైన పరిమితులు విధిస్తుంది. ఈ సందర్భంలో మాత్రమే కౌలు మొత్తం వ్యత్యాసపు కౌలుగా రూపొందుతుంది. భూసారంలో ఉన్న తేడానుబట్టి నిర్ణయించబడిన వ్యత్యాసపు కౌలు కానప్పటికీ ఇది ఒక భూమిలో వరుసగా పెట్టిన మదుపులలో చివరి మదుపుపై వచ్చే అదనపు లాభానికి, అత్యంత అధ్వాన్నపు భూమి లీజుకై చెల్లించే కౌలుకు మధ్య తేడాచేత నిర్ణయించబడిన వ్యత్యాసపు కౌలు అయినప్పటికీ ఇది వర్తిస్తుంది. పెట్టుబడి మదుపుకు తన భూమిలో వీలుకల్పించినందుకుగాను భూస్వామి కప్పం వసూలు చేసిన మేరకు భూ ఆస్తి ఒక సంపూర్ణమైన ఆటంకంగా వ్యవహరిస్తుంది. ఒకసారి భూమిని లీజుకిచ్చిన తరువాత ఒక నిర్ణీతమైన కమతంలో పెట్టుబడి మదుపు ఎంత ఉండవచ్చు అన్నదానికి అతడు పరిమితి విధించలేడు. సాధారణంగా ఇళ్ళ నిర్మాణంలో వాటిని నిర్మించాల్సిన భూమి మూడవ వ్యక్తిది కావటంవల్ల ఆటంకం తలెత్తుతుంది. అయితే ఈ భూమి ఇంటి నిర్మాణానికి లీజుకిచ్చిన తరువాత కౌలుదారుడు పెద్ద ఇల్లు కడతాడా, చిన్న ఇల్లు కడతాడా అనేది స్వయంగా అతనిపైనే ఆధారపడి వుంటుంది.

వ్యవసాయ పెట్టుబడి సగటు అంతర్నిర్మాణం సగటు సామాజిక పెట్టుబడి అంతర్నిర్మాణం కంటే ఎక్కువగా గాని లేదా దానితో సమానంగా గాని ఉంటే ఇంతకు ముందు వివరించిన అర్థంలో నిరపేక్ష కౌలు మాయమవుతుంది. వ్యత్యాసపు కౌలుకంటే, అలాగే వాస్తవ గుత్తాధిపత్య ధరపై ఆధారపడిన కౌలుకంటే భిన్నమైన కౌలు మాయమవుతుంది. వ్యవసాయ ఉత్పాదితం విలువ అప్పుడు ఉత్పత్తి ధరకంటే ఎక్కువ ఉండదు. వ్యవసాయ పెట్టుబడి వ్యవసాయేతర పెట్టుబడికంటే ఎక్కువగా శ్రమను చలనంలో ఉంచదు. కనుక అంతకు మించిన అదనపు శ్రమను రాబట్టలేదు. నాగరికతా ప్రగతితో పాటు వ్యవసాయ పెట్టుబడి అంతర్నిర్మాణం సామాజిక సగటు పెట్టుబడి అంతర్నిర్మాణంతో సమానమైనప్పుడు కూడా ఇదే జరుగుతుంది. ఒకవైపున వ్యవసాయ పెట్టుబడి అంతర్నిర్మాణం పెరుగుతుంది. అంటే దాని అస్థిర భాగంతో పోల్చినప్పుడు స్థిర భాగం పెరుగుతుంది. మరోవైపున వ్యవసాయం ఉత్పాదితం ధర ఇంతకుముందు సాగులో ఉన్న అధ్వాన్నపు భూమికంటే మరింత అధ్వాన్నమైన కొత్త భూమిలో కౌలును అనుమతించే స్థాయికి పెరుగుతుంది. ఇది పైకి వైరుధ్యంలా కనిపిస్తుంది. ఈ కౌలు ఈ సందర్భంలో ఉత్పత్తి విలువపైన, ఉత్పత్తి ధరపైన వున్న మార్కెట్టు ధర మిగులు నుంచి తలెత్తుతుంది. క్లుప్తంగా చెప్పాలంటే, ఉత్పాదితం యొక్క గుత్తాధిపత్య ధర నుంచి మాత్రమే ఇది తలెత్తుతుంది.

ఇక్కడ ఓ తేడాను గమనించాలి.

**మొదటి అంశం :** లాభం రేటు రూపొందే తీరును పరిశీలించినప్పుడు ఒక విషయం గమనించబడింది. సాంకేతిక అర్థంలో సమాన అంతర్నిర్మాణం ఉన్న పెట్టుబడులు అంటే యంత్రాలతో, ముడి పదార్థాలతో పోల్చి చూసినప్పుడు సమానమైన శ్రమ మొత్తాలను చలనంలో ఉంచే పెట్టుబడులు వాటి స్థిర భాగాలు విభిన్న విలువలు కలిగి వుండటంచేత విభిన్నమైన అంతర్నిర్మాణం కలిగి ఉండవచ్చు. ముడిపదార్థాలు లేదా యంత్రాలు ఒక సందర్భంలోకంటే మరో సందర్భంలో ప్రియంగా ఉండవచ్చు. చలనంలో ఉండాల్సిన ఒకే శ్రమ పరిమాణానికి (మన ఊహ ప్రకారం దానికి అంతే పరిమాణం కలిగిన ముడిపదార్థాలు అవసరమవుతాయి.) ఒక సందర్భంలో మరింత ఎక్కువ పెట్టుబడి అవసరం కావచ్చు. ఎందుకంటే – ముడిపదార్థం ఖర్చు ఒక సందర్భంలో 40 గాను, మరో సందర్భంలో 20 గాను ఉన్నప్పుడు అదే మొత్తం శ్రమను ఒక పెట్టుబడితో అనగా 100తో చలనంతో ఉంచటం సాధ్యం కాదు. ప్రియంగా ఉన్న ముడిపదార్థం చౌకగా ఉన్న ముడిపదార్థం ధర స్థాయికి పడిపోగానే ఈ రెండు పెట్టుబడులు ఒకే సాంకేతిక అంతర్నిర్మాణం కలిగి వున్నాయని అర్థమవుతుంది. సజీవ శ్రమను ఈ పెట్టుబడి పనిలో పెట్టిన శ్రమ పరిస్థితుల పరిమాణాల స్వభావానికి మధ్య సాంకేతిక నిష్పత్తులలో ఎటువంటి మార్పు లేనప్పటికీ స్థిర, అస్థిర భాగాల మధ్య ఈ సందర్భంలో విలువ నిష్పత్తి అలాగే వుంటుంది. మరోవైపున తక్కువ అంతర్నిర్మాణం కలిగిన పెట్టుబడి కేవలం దాని స్థిర భాగాల విలువ పెరగటం వల్ల, విలువ అంతర్నిర్మాణం దృష్టి నుంచి మాత్రమే అంతకంటే ఎక్కువ స్థాయిలో అంతర్నిర్మాణం కలిగిన పెట్టుబడి తరగతిలో ఉన్నట్లు కనిపిస్తుంది. ఒక పెట్టుబడి = 60స్థి+40వి అనుకుందాం. అంటే అది సజీవ శ్రమశక్తితో పోల్చినప్పుడు ఎక్కువ యంత్రాలను, ముడిపదార్థాలను ఉపయోగిస్తుంది. మరో పెట్టుబడి = 40స్థి+60వి' అంటే అది యంత్రాలు (ఉదాహరణకు 10%) చౌక ముడిపదార్థాల (ఉదాహరణకు 30%) కంటే ఎక్కువగా సజీవ శ్రమను (60%) పనిలో పెడుతుందని అర్థం. ముడిపదార్థాలు, సహాయ పదార్థాల విలువ 30 నుంచి 80కి పెరిగింది అనుకుందాం. అప్పుడు అంతర్నిర్మాణం సమానమవుతుంది. ఎలాగంటే ఈ రెండవ పెట్టుబడిలో యంత్రాలు 10, ముడిపదార్థాలు 80, శ్రమశక్తి 60. కనుక దాని అంతర్నిర్మాణం 90స్థి+60వి' దానికి శాతం కడితే 60స్థి+40వి' అవుతుంది. అంటే సాంకేతిక అంతర్నిర్మాణంలో మార్పు జరగదు. మరోలా చెప్పాలంటే సమానమైన అంతర్నిర్మాణం గల పెట్టుబడులు విభిన్నమైన విలువల పొందికలు కలిగి ఉండవచ్చు. అలాగే ఒకే శాతం విలువ అంతర్నిర్మాణం గల పెట్టుబడులు వివిధ రకాల అంతర్నిర్మాణాలను చూపించవచ్చు. ఆ రకంగా అవి శ్రమ సామాజిక ఉత్పాదకత అభివృద్ధిలో విభిన్న దశలను వ్యక్తం చేయవచ్చు. వ్యవసాయ పెట్టుబడి విలువ పొందిక సాధారణ స్థాయిలో ఉన్నంత మాత్రంచేత శ్రమ సామాజిక ఉత్పాదకత అదే స్థాయిలో సమానంగా అభివృద్ధి చెందిందని కాదు. తన ఉత్పత్తి పరిస్థితుల్లో భాగం అయిన తన సొంత ఉత్పాదితం ప్రియంగా ఉందని మాత్రమే అర్థం. లేదా ఎరువులు వగైరా సహాయక పదార్థాలు ఇంతకు ముందు దగ్గరలో దొరికేవి, ఇప్పుడు దూరం అవటం లాంటి కారణాలు కావచ్చు.

ఇది కాక వ్యవసాయం యొక్క ప్రత్యేక స్వభావాన్ని కూడా పరిగణనలోకి తీసుకోవాలి. శ్రమను ఆదా చేసే యంత్రాలు, రసాయనిక పదార్థాలు వగైరా వ్యవసాయంలో విస్తృతంగా

ఉపయోగించబడినాయని అనుకుందాం. కనుక సాంకేతిక స్థిర పెట్టుబడి విలువలో మాత్రమే కాకుండా పనిలో పెట్టబడిన శ్రమశక్తితో పోల్చినప్పుడు దాని పరిమాణం రీత్యా కూడా పెరిగిందనుకుందాం. అయితే వ్యవసాయంలో (గనులలో లాగానే) శ్రమ సామాజిక ఉత్పాదకత మాత్రమే కాక సహజ ఉత్పాదకత సహితం శ్రమకున్న ప్రకృతిసిద్ధమైన పరిస్థితులపైన ఆధారపడి వుంటుంది. ప్రకృతిసిద్ధమైన శక్తి తగ్గుతున్నప్పుడు దానిని భర్తీ చెయ్యటానికి లేదా పూర్తిగా భర్తీ చెయ్యలేకపోవటానికి వ్యవసాయంలో సామాజిక ఉత్పాదకత పెంచటం సాధ్యం – ఇలా భర్తీ చెయ్యటం అన్నది స్వల్పకాలానికి మాత్రమే వర్తిస్తుంది – అంటే సాంకేతికంగా అభివృద్ధి జరిగినప్పటికీ ఉత్పాదితం చౌకగా మారదు. అయితే దాని ధర మరింత పెరగకుండా నిరోధించబడుతుంది. ధాన్యం ధరలు పెరగటంతోపాటు ఉత్పాదితాల నిరపేక్ష రాశి తగ్గటం కూడా సాధ్యమే. సాపేక్ష అదనపు ఉత్పాదితం పెరగటంతోపాటు ఇలా జరగవచ్చు. అంటే అరుగుదలను తరుగుదలను పూడ్చవలసిన యంత్రాలు, జంతువులు వుండే స్థిర పెట్టుబడి సాపేక్షంగా పెరిగేటప్పుడు; అలాగే వేతనాల మీద వ్యయం చేసిన అస్థిర పెట్టుబడితో తుల్యమైన తగ్గుదల వున్నప్పుడు – దీన్ని ఉత్పత్తి నుంచి పూర్తిగా నిరంతరం తిరిగి స్థాపిస్తూ వుండాలి – ఇలా జరగవచ్చు. కేవలం అరుగుదలను మాత్రమే భర్తీ చెయ్యాల్సిన యంత్రాలు, జంతువులు ప్రధానంగా గల స్థిర పెట్టుబడి సాపేక్షంగా పెరుగుతున్నప్పుడు వేతనాల మీద వ్యయం చేసే భర్తీ చెయ్యాల్సిన అస్థిర పెట్టుబడి అదే స్థాయిలో తగ్గుతున్నప్పుడు కూడా ఇలా జరగవచ్చు.

అంతేకాక వ్యవసాయంలో ప్రగతి కారణంగా నాసిరకం భూమి నుంచి కౌలును పొందటానికి దానిని సాగులోకి తేవటానికి మార్కెట్టు ధరలో సగటుకంటే స్వల్పమైన పెరుగుదల మాత్రమే అవసరం కావచ్చు. సాంకేతిక పరికరాలు తక్కువగా అభివృద్ధి చెంది వుంటే మార్కెట్ ధర మరింత ఎక్కువగా పెరగాల్సిన అవసరం ఉండేది.

ఉదాహరణకు భారీ స్థాయిలో నిర్వహించే పశుపోషణకు వినియోగించే శ్రమశక్తి, పశువులు ప్రాతినిధ్యం వహించే స్థిర పెట్టుబడితో పోల్చినప్పుడు చాలా తక్కువ ఉంటుంది. సగటు సామాజిక పెట్టుబడికంటే వ్యవసాయ పెట్టుబడి ఎక్కువ శ్రమశక్తిని చలనంలో ఉంచుతుంది అన్న వాదనను ఈ ఉదాహరణతో తిరస్కరించవచ్చు. నాగరిక దేశాలలో ప్రధానమైన ఆహార పదార్థాన్ని, సరఫరా చేసే పంటలను పండించే వ్యవసాయ పెట్టుబడి భాగాన్ని మనం కౌలును విశ్లేషించటంలో నిర్ణాయక అంశంగా తీసుకున్నామని గమనించాలి. పశువుల పెంపకంలో భిన్నమైన అంశాన్ని ధరలు నిర్ణయించ టానికి తీసుకోవాలని ఆడమ్ స్మిత్ రుజువు చేశాడు. అది ఆయన విజయాల్లో ఒకటి. ప్రధాన జీవనాధారం, ఉదాహరణకు ధాన్యం, పండించటానికి తప్ప మిగిలిన అంశాల ఉత్పత్తిలో ఉపయోగించిన పెట్టుబడులకు ఇది సాధారణంగా వర్తిస్తుంది. అటువంటప్పుడు ధర ఎలా నిర్ణయించబడుతుందంటే పశువుల పెంపకానికి ఉపయోగించిన భూమి ఉత్పాదితం ధర అంటే ఒక పచ్చిక బయలు ఒకేలాంటి నాణ్యత కలిగిన ధాన్యాన్ని ఉత్పత్తి చెయ్యగలిగి ఉంటే ఆ ధాన్యాన్ని ఉత్పత్తి చేసే భూమి ఎంత కౌలునిస్తుందో అంతే కౌలు ఇచ్చే విధంగా ధాన్యం ధర పెరుగుతుంది. మరో రకంగా చెప్పాలంటే ధాన్యపు పొలాల కౌలు పశువుల ధర నిర్ణయించే అంశంగా మారుతుంది. ఈ కారణంచేతనే ఈ రకంగా పశువుల ధర, కౌలు పెరుగుదలతోపాటు కృత్రిమంగా పెంచబడుతుందని రామ్సే సరిగానే

పేర్కొన్నాడు. భూ ఆస్తి ద్వారా, భూ ఆస్తి ఆర్థిక వ్యక్తీకరణ ద్వారా (కౌలు) ఇది కృత్రిమంగా పెంచ బడుతుంది.[1]

"మాంసం గిరాకీకి తగిన సరఫరా అందివ్వటంలో సాగును విస్తృతం చెయ్యటంవల్ల అభివృద్ధి పరచని అడవులు సరిపోవు. సాగుభూముల్లో చాలావరకు పశువులను మేపటానికి ఉపయోగించాల్సి వస్తుంది. కనుక పశువుల్ని పెంచటానికి అవసరమైన శ్రమకు మాత్రమే కాక ఆ భూమి నుంచి భూస్వామికి వచ్చే కౌలూ, రైతుకు రాగలిగిన లాభమూ అన్నింటికీ సరిపడా పశువుల ధర రూపొందు తుంది. సాగుచెయ్యని అడవి భూముల్లో మేసిన పశువులు అదే మార్కెట్టుకు వచ్చినప్పుడు వాటి బరువుకు లేదా ఆరోగ్యానికి తగినట్లుగా బాగుచేసిన భూమిలో మేసిన పశువులు అమ్మబడిన ధరకే ఇవి కూడా అమ్మబడతాయి. ఆ గడ్డి భూముల యజమానులు దానివల్ల లాభపడతారు. వారి పశు వుల ధరకు సమాంతరంగా వారి భూముల కౌలు కూడా పెంచుతారు." (ఆడమ్ స్మిత్, బుక్ I, అధ్యాయం XI, భాగం I ) ధాన్యపు కౌలుకు భిన్నంగా ఈ సందర్భంలో కూడా వ్యత్యాసపు కౌలు పరమ అధ్వాన్నపు భూమివైపు మొగ్గుచూపుతుంది.

కౌలుకు కేవలం గుత్తాధిపత్యం ధరే కారణంగా కనిపింపచేసే కొన్ని బాహ్య రూపాలను నిరపేక్ష కౌలు వివరిస్తుంది. ఆడమ్ స్మిత్ ఉదాహరణను కొనసాగించటానికి ఒక నార్వేజియన్ అటవీ భూమి యజమానిని ఉదాహరణ తీసుకోండి. ఆ అడవి మానవ కార్యకలాపాలకు దూరంగా స్వతంత్రంగా ఉంటుంది. అంటే అది మానవుడు పెంచిన అడవి కాదు. ఇంగ్లాండులో గిరాకీని సంతృప్తిపరచటం కోసం ఆ అడవిలో కలపను నరుకుతున్న పెట్టుబడిదారుడి నుంచి అడవి యజమాని కౌలు వసూలు చేసినా లేదా తానే స్వయంగా ఆ కలపను నరికినా, అతడు పెట్టిన పెట్టుబడిపై లాభం కాక ఆ కలపలో అతనికి ఎంతో కొంత కౌలు కూడా లభిస్తుంది. కేవలం ప్రకృతి ఉత్పాదితం నుంచి పొందిన గుత్త సుంకంలా ఇది కనిపిస్తుంది. ఇక్కడ పెట్టుబడి దాదాపు మొత్తంగా శ్రమ కోసం హెచ్చించబడిన అస్థిర భాగంగా కనిపిస్తుంది. ఆ రకంగా ఆ పెట్టుబడి భాగం అదే పరిమాణం గల మరో భాగంకంటే ఎక్కువ అదనపు శ్రమను చలనంలో వుంచుతుంది. అప్పుడు అధిక అంతర్నిర్మాణం కలిగిన పెట్టుబడి ఉత్పాదితం విలువలోకంటే కలప విలువలో వేతనం చెల్లించని శ్రమ అధికంగా ఉంటుంది. అంటే మరింత అదనపు విలువ వుంటుంది. ఈ కారణంచేత ఈ కలప నుంచి సగటు లాభం పొందవచ్చు. కౌలు రూపంలో గణనీయమైన అదనపు మొత్తం అడవి యజమాని వాటాగా రావచ్చు. ఇందుకు విరుద్ధంగా కలప నరకటం తేలిక కనుక అది విస్తరించిందనుకుందాం. అంటే శీఘ్రంగా పెరిగిందనుకుందాం. అప్పుడు కలప విలువకు సమానంగా దాని ధర మారాలంటే గిరాకీ గణనీయంగా పెరగాల్సి వుంటుంది. వేతనం చెల్లించని శ్రమలో మొత్తం మిగులు (పెట్టుబడిదారునికి సగటు లాభంగా లభించే భాగానికి మించిన మొత్తం) కౌలు రూపంలో అడవి యజమానికి లభించాలి అంటే ఈ గిరాకీ పెరగాలి.

ఇంతకు ముందు సాగులో వున్న అత్యంత అధ్వాన్నపు భూమికంటే మరింత నాసిరకం భూమి సాగులోకి తేబడిందని మనం భావించాం. అది దానికంటే మెరుగైనదైతే వ్యత్యాసపు కౌలు

1. జి. రామ్‌సే యాన్ ఎస్సే ఆన్ ది డిస్ట్రిబ్యూషన్ ఆఫ్ వెల్త్, ఎడింబరో, 1836, పుటలు 278-79 - సం.

ఇస్తుంది. అయితే ఇక్కడ మనం సరిగ్గా వ్యత్యాసపు కౌలుగా కనిపించని కౌలును విశ్లేషిస్తున్నాం. ఇక్కడ రెండు రకాల సందర్భాలు సాధ్యమవుతాయి. కొత్తగా సాగులోకి తేబడిన భూమి అంతకుముందు సాగులో వున్న భూమికంటే నాసిరకందే అయి వుండాలి. లేదా దానిలాంటిదే అయి వుండాలి. నాసి రకం భూమి విషయంలో ఇప్పటికే విశ్లేషణ జరిగింది. దానిలాంటి భూమి విశ్లేషణ మాత్రమే మిగిలింది.

వ్యత్యాసపు కౌలు విశ్లేషణలో మనం ఇంతకు ముందే పేర్కొన్నట్లుగా సాగు పద్ధతిలో ప్రగతి వల్ల అప్పటికి సాగులో వున్న భూమిలాంటి, దానికంటే మెరుగైన, అంతకంటే నాసిరకమైన భూములు సాగులోకి రావచ్చు.

**మొదటిది :** వ్యత్యాసపు కౌలులో రెండు రకాల పరిస్థితులు పరస్పర వ్యతిరేక దిశలలో పనిచేస్తాయి. ఒక్కోసారి ఒకదానినొకటి రద్దు చేసుకుంటాయి. మరోసారి ఒకదానిపై మరొకటి నిర్ణయాత్మకమైన ప్రభావాన్ని నెరపుకొంటాయి. (కేవలం వ్యత్యాసపు కౌలు మాత్రమే కాదు, వ్యత్యాసపు కౌలు కానికౌలులో సహితం ఈ ప్రశ్న తలెత్తుతుంది. అమల్లో ఉన్న మార్కెట్టు ధరలో లాభమూ కౌలు ఇవ్వటాన్ని భూసారము దాని స్థానమూ అనుమతిస్తాయా, లేదా అన్నది ప్రశ్న.) మార్కెట్టు ధరలో పెరుగుదలవల్ల ఇంతకు ముందు తన స్థానం కారణంగా పోటీలో లేని మరింత సారవంతమైన భూమి సాగులోకి రావచ్చు. (సాగు ఉత్పత్తి ఖర్చు పడిపోలేదని భావించాలి. అలాగే కొత్త సాంకేతిక ప్రగతి సాగు చెయ్యటానికి కొత్త ఊపును ఇవ్వలేదని భావించాలి.) లేదా ఒక నాసిరకం భూమి, వెసులుబాటు అయిన స్థానంలో వుండటంవల్ల దాని సారంలో ఉన్న లోపాన్ని దాని స్థానం భర్తీ చెయ్యవచ్చు. లేదా సమాచార సాధనాల మెరుగుదల ద్వారా మార్కెట్టు ధరలో పెరుగుదల అవసరం లేకుండానే స్థానానికి ఉన్న సదుపాయంవల్ల మరింత మెరుగైన భూములు పోటీలోకి రావచ్చు. ఉత్తర అమెరికాలో చెట్లులేని మైదాన భూముల విషయంలో దీనిని పెద్దయెత్తున గమనించవచ్చు. వలసల్లో జరిగినంత స్థాయిలో కాకపోయినప్పటికీ ప్రాచీన నాగరిక దేశాల్లో సహితం ఈ ప్రక్రియను గమనించవచ్చు. స్థానం అన్నది నిర్ణయాత్మకమైన అంశం అని వెక్ ఫీల్డ్ సరిగ్గానే పేర్కొన్నాడు.[1] స్థానమూ, సారమూ కలిగించే పరస్పర విరుద్ధమైన ప్రభావాలు, నిరంతరాయంగా మారగలిగిన స్థానానికి ఉన్న సదుపాయమూ, దాని నిరంతరాయంగా ప్రభావితం చేసే ప్రగతిశీల మార్పులు, ఈ మార్పులు సమత్వం దిశగా పయనించటమూ అంతకు ముందు సాగులో వున్న భూమికంటే ఒక సందర్భంలో అటువంటి భూమినీ, మరో సందర్భంలో అంతకంటే మెరుగైన భూమినీ, మరికొన్ని సందర్భాల్లో అంతకంటే నాసిరకం భూమినీ కొత్తగా సాగులోకి పోటీలోకి తెస్తాయి.

**రెండవది :** భౌతిక శాస్త్రమూ, వ్యవసాయ శాస్త్రమూ అభివృద్ధి చెందటంతోపాటు భూమిలో వున్న వివిధ పదార్థాలు తక్షణం ప్రయోజనకరంగా మారటానికి వీలుకల్పించే సాధనాల ద్వారా భూసారం కూడా మారుతుంది. ఈ రకంగా ఫ్రాన్స్‌లోనూ, ఇంగ్లాండులోనూ, తూర్పు ప్రాంతాలలోనూ ఒకనాడు నాసిరకం భూములుగా పరిగణించబడిన తేలిక తరహా భూములు ఇప్పుడు ప్రథమ తరహా

1. వెక్ ఫీల్డ్ ఇంగ్లాండ్ అండ్ అమెరికా, ఏ కంపేరిజన్ ఆఫ్ ది సోషల్ అండ్ పొలిటికల్ స్టేట్ ఆఫ్ బోత్ నేషన్స్. సంపుటి I, లండన్, 1833, పుటలు 214-15 - సం.

భూముల స్థాయికి పెరిగాయి. (ఫాసీ[1]) మరోవైపున రసాయనిక స్వరూపాన్నిబట్టి కాక కొన్ని యాంత్రిక, భౌతిక అవరోధాలవల్ల సాగులో లేని భూమి నాసిరకమైన భూమిగా పరిగణించబడుతుంది. అయితే ఈ అవరోధాలను తొలగించే మార్గాలు దొరకగానే అవి మెరుగైన భూములుగా మారిపోతాయి.

**మూడవది :** ప్రాచీన నాగరిక దేశాలు అన్నింటిలోనూ అలనాటి చారిత్రక సాంప్రదాయ సంబంధాల్లో ఉదాహరణకు ప్రభుత్వ భూములు, ఉమ్మడి భూములు మొదలైన వాటిని వివేచనా రహితంగా సాగు నుంచి దూరంగా ఉంచబడ్డాయి. అవి కొద్ది కొద్దిగా మాత్రమే సాగులోకి రావటం జరుగుతుంది. అవి ఏ క్రమంలో సాగులోకి రావటం జరుగుతుంది. అవి ఏ క్రమంలో సాగులోకి వస్తాయి అన్నది వాటి సారంపై గాని, స్థానంపై గాని ఆధారపడి ఉండదు. పూర్తిగా బాహ్య పరిస్థితులపైన ఆధారపడి వుంటుంది. ఉమ్మడి భూముల వినియోగ చట్టాల ద్వారా ఇంగ్లాండులోని ఉమ్మడి భూములు ప్రైవేటు ఆస్తిగా క్రమంగా మారిన చరిత్రను పరిశీలిస్తే, లీబిగ్ లాంటి ఆధునిక రసాయనిక, వ్యవసాయ శాస్త్రవేత్త ఈ భూమిని ఏ క్రమంలో సాగుకై ఎంచుకోవాలి? వాటి రసాయనిక స్వభావాల రీత్యా ఏ భూమిని వదిలెయ్యాలి? అనే విషయాన్ని సూచించినట్టుగా భావించటం కంటే హాస్యాస్పదమైనది మరొకటి ఉండదు. ఇక్కడ నిర్ణయాత్మకమైన అంశం ఏమిటంటే – దొంగను సృష్టించడానికి ఉన్న అవకాశమే. పెద్ద భూస్వాములు తమ భూ స్వాధీనాన్ని సమర్థించుకోవటానికి అనువైన చట్ట సంబంధమైన సాకులు మాత్రమే.

**నాల్గవది :** ఏ ప్రత్యేక కాలంలో అయినా సాగు విస్తరణకు జనాభా, పెట్టుబడి వృద్ధి అన్నవి ఆనాటి అభివృద్ధి దశనుబట్టి పరిమితులు విధిస్తాయి. ఆ పరిమితి తగ్గటానికీ, పెరగటానికీ వీలైనదే కావచ్చు. మార్కెట్టు ధరను తాత్కాలికంగా ప్రభావితం చేసే అంశాలు ఉంటాయి. వరుసగా పంటలు బాగా పండవచ్చు. లేదా వరుసగా దెబ్బతినవచ్చు. అయితే ఈ అంశాలు అన్నింటితోపాటు ఒక విస్తారమైన భాగంలో సాగు విస్తరణ అన్నది ఆ దేశంలో వున్న పెట్టుబడి మార్కెట్టుపైన, వాణిజ్య పరిస్థితులపైన ఆధారపడి ఉంటుంది. డబ్బు కొరత వున్న కాలాల్లో అంతవరకు సాగులో లేని భూమిలో అదనపు పెట్టుబడిని పెట్టాలంటే కౌలుదారునికి (అతడు కౌలు చెల్లించినా, చెల్లించక పోయినా) సగటు లాభం చాలదు. ఇతర సందర్భాల్లో పెట్టుబడి సమృద్ధిగా లభ్యమవుతున్నప్పుడు కేవలం సాధారణ పరిస్థితులు ఉంటే చాలు, మార్కెట్టు ధర పెరగకుండానే అది వ్యవసాయంలోకి ప్రవేశిస్తుంది. ఇంతవరకు సాగులో ఉన్న భూమికంటే మెరుగైన భూమి కేవలం ప్రతికూల స్థానంలో ఉన్నందున పోటీ నుంచి తొలగించబడుతుంది. ఇంత వరకు తొలగించలేకపోయిన అవరోధాలు వున్న ఆ భూమి పోటీలో ఉందనుకుందాం లేదా అది పోటీలో లేకపోవడం యాదృచ్ఛికం కూడా కావచ్చు. ఈ కారణంవల్ల ఇంతకు ముందు సాగులో ఉన్న లాంటి భూములనే మనం పరిశీలిద్దాం. అయితే అంతకు ముందు సాగులో ఉన్నదానికి కొత్తగా సాగులోకి వచ్చేదానికి బాగుజేత ఖర్చులో తేడా ఉండనే ఉంటుంది. ఆ పని నిర్వహణ స్వీకరించబడుతుందా లేదా అన్నది అప్పటి మార్కెట్టు ధరల స్థాయినిబట్టి, పరపతి పరిస్థితులనుబట్టి ఉంటుంది. ఈ భూమి వాస్తవంగా పోటీలోకి దిగగానే

1. హెచ్. ఫాసీ, రెంట్ డూ సోల్... సంపుటి 2, పారిస్, 1854, పుట 515 - సం.

మిగిలిన పరిస్థితులు అన్నీ యథాతథంగా ఉంటే మార్కెట్టు ధర తన పాత స్థాయికి పడిపోతుంది. అప్పుడు కొత్త భూమి కూడా దానితో సమానమైన పాత భూమి ఇచ్చిన కౌలే ఇస్తుంది. ఆ భూమి ఎటువంటి కౌలు ఇవ్వదు అని వాదించేవారు ఇంకా ఈ రుజువు చేయాల్సిన ఊహ ఆధారంగా, చివరి భూమి ఎటువంటి కౌలునివ్వదు అనే ఊహ ఆధారంగా వాదిస్తున్నారు. ఆఖరికి కట్టిన ఇల్లు లీజు కివ్వబడినప్పటికీ ఇంటి అద్దె తప్ప భవనానికి ప్రత్యేకంగా కిరాయి చెల్లించబడదు అన్న విధంగా – వీరి తరహాలో రుజువు చెయ్యవచ్చు. అయితే నిజానికి చాలా కాలంపాటు ఆ భూములు తరచుగా ఖాళీగా వున్నప్పటికీ ఇంటి అద్దె ఇవ్వటానికి ముందే కౌలునిస్తాయి. ఒకానొక కమతంలో వరుసగా పెట్టిన మదుపులు అదనపు మొత్తాలలో మొదటి మదుపులాగానే అనులోమ నిష్పత్తిలో సాధించవచ్చు. అలాగే ఒక స్వభావం కలిగిన పొలాలు చివరిలో సాగు చేయబడిన పొలాల స్వభావం కలిగిన భూములలాగే అంతే ఖర్చుతో, అంతే రాబడిని సాధించవచ్చు. అలా కాకుంటే ఒకే స్వభావం కలిగిన భూములు ఒకదాని తరువాత ఒకటి సాగులోకి ఎలా వస్తాయో వివరించటం సాధ్యం కాదు. వాటన్నింటినీ కలిపి ఒకేసారి సాగులోకి తేనైనా తేవాలి. లేదా అన్నింటినీ వదిలెయ్యనయినా వదిలెయ్యాలి. అందులో ఒకదానిని సాగులోకి తెస్తే మిగిలిన వాటి నుంచి పోటీ ఎదురవుతుంది. కనుక దానిని సాగులోకి తేకుండా ఉండాల్సి వస్తుంది – భూస్వామి ఎపుడూ కౌలు పుచ్చుకోవటానికి సిద్ధంగానే ఉంటాడు – అంటే ఒట్టి పుణ్యానికి యెంతో కొంత. అయితే అతని కోరిక తీర్చాలంటే పెట్టుబడికి కొన్ని పరిస్థితులు ఉండాలి. కనుక వివిధ కమతాల మధ్య పోటీ అన్నది వాటిని పోటీలో పెట్టాలనుకునే భూస్వామిపై కాక రంగంలో వున్న ఇతర పెట్టుబడులపై, పోటీ పడాలనుకునే పెట్టుబడి పైన ఆధారపడి వుంటుంది.

వ్యవసాయ కౌలు కేవలం గుత్తాధిపత్య ధరగా వున్న మేరకు ఈ ధర తక్కువగానే వుంటుంది. ఉత్పత్తి ధరపైన ఉత్పాదితం విలువ ఎంత ఎక్కువగా ఉన్నప్పటికీ మామూలు పరిస్థితుల్లో నిరపేక్ష కౌలు తక్కువగా మాత్రమే ఉన్నట్టుగానే ఇది కూడా. కనుక నిరపేక్ష కౌలు సారాంశం ఇలా వుంటుంది. ఒకే అదనపు విలువ రేటు లేదా శ్రమ దోపిడి స్థాయి వున్న వివిధ రంగాల్లో ఉన్న సమాన పరిమాణం గల పెట్టుబడులు విభిన్న పరిమాణాలు అదనపు విలువను సృష్టిస్తాయి. అది వాటి సగటు స్వరూపాన్ని బట్టి మారుతుంది. పరిశ్రమలో ఈ వివిధ రకాల అదనపు విలువల మొత్తాలు సగటు లాభంగా సమమై సామాజిక పెట్టుబడులలో భాగాలైన విడి పెట్టుబడుల మధ్య ఏకరూపంగా పంపిణీ అవుతాయి. భూమిలో పెట్టిన మదుపులు అలా సమం కాకుండా భూ ఆస్తి అడ్డుపడుతుంది. వ్యవసాయం కోసం గాని, ముడి పదార్థాలు వెలికి తీయటం కోసం గాని ఉత్పత్తికై భూమి అవసరం అయినప్పుడు సార్వత్రిక లాభం రేటును సమం చేసే ప్రక్రియలో పాల్గొనే ఒక అదనపు విలువ భాగాన్ని భూ ఆస్తి స్వాధీనపర్చుకుంటుంది. ఆ కౌలు అప్పుడు ఒక సరుకుల విలువ భాగాన్ని రూపొందిస్తుంది. మరింత ప్రత్యేకంగా చెప్పాలంటే అదనపు విలువ భాగాన్ని రూపొందిస్తుంది. ఈ భాగం పెట్టుబడిదారు కార్మికుల నుంచి రాబట్టుతాడు. అయితే అది పెట్టుడిదారునికి దక్కకుండా భూస్వామికి దక్కుతుంది. వ్యవసాయ పెట్టుబడి, వ్యవసాయేతర పెట్టుబడి కంటే ఎక్కువ శ్రమను చలనంలో ఉంచుతుంది అని ఇక్కడ భావించబడుతుంది. ఈ తేడా ఎంత వరకు ఉంటుంది? అసలు ఉంటుందా వుండదా?

అన్నది పరిశ్రమతో పోల్చితే, వ్యవసాయం యొక్క సాపేక్ష అభివృద్ధిపైన ఆధారపడి వుంటుంది. వ్యవసాయం పురోగమించిన కొద్దీ ఈ తేడా తగ్గుతుంది. స్థిర పెట్టుబడితో పోల్చినప్పుడు అస్థిర పెట్టుబడి నిష్పత్తి రీత్యా తగ్గిపోవడం అన్నది వ్యవసాయ పెట్టుబడికంటే పారిశ్రామిక పెట్టుబడి విషయంలో మరింత ఎక్కువ స్థాయిలో ఉంటే ఈ తేడా తగ్గదు.

గనుల పరిశ్రమలో ఈ నిరపేక్ష కౌలు మరింత ప్రధానమైన పాత్రను నిర్వహిస్తుంది. అక్కడ స్థిర పెట్టుబడిలో ఒక అంశమైన ముడిపదార్థం అన్నది ఏమాత్రం ఉండదు. యంత్రాలు తదితర నిశ్చల పెట్టుబడి గణనీయంగా వున్న రంగాలను మినహాయిస్తే, మిగిలినచోట్ల పెట్టుబడి అత్యంత తక్కువ అంతర్నిర్మాణాన్ని కలిగి వుంటుంది. సరిగ్గా ఇక్కడ కౌలు మొత్తం గుత్తాధిపత్య ధరవల్ల తలెత్తుతున్నట్టు కనిపిస్తుంది. సరుకులు తమ విలువకు అమ్మబడాలంటే లేదా ఉత్పత్తి ధరపైన సరుకు అదనపు విలువ యొక్క మొత్తం మిగులుతో కౌలు సమానం కావాలంటే అసాధారణమైన సానుకూల మార్కెటు పరిస్థితులు ఉండాలి. ఉదాహరణకు మత్స్య పరిశ్రమలకూ, రాతి గనులకూ, ప్రకృతిసిద్ధమైన అడవులు మొదలైన వాటికి ఇది వర్తిస్తుంది.[1]

★ ★ ★

1. ఈ అంశాన్ని రికార్డో పైపైన మాత్రమే చర్చించాడు. తన ప్రిన్స్‌పుల్స్ గ్రంథంలో రెండవ అధ్యాయం ప్రారంభంలోనే నార్వేలో అడవిపై వచ్చే కౌలు గురించి ఆడమ్ స్మిత్‌కు వ్యతిరేకంగా చేసిన వాదనను చూడండి - సం.

## అధ్యాయం - 46

# భవన స్థలం కౌలు, గని కౌలు - భూమి ధర

కౌలు అనేది వున్న ప్రతిచోటా సర్వదా వ్యత్యాసపు కౌలు కూడా కనిపిస్తుంది. వ్యవసాయపు వ్యత్యాసపు కౌలును శాసించే నియమాలన్నీ దానినీ శాసిస్తాయి. ప్రకృతి శక్తులు గుత్తాధిపత్యంలో వున్న ప్రతిచోట వాటిని ఉపయోగించే పారిశ్రామిక పెట్టుబడిదారునికి ఒక అదనపు లాభం వస్తుందన్న హామీ వున్న ప్రతిచోటా - ఆ శక్తులు జలపాతాలు కావచ్చు, సుసంపన్నమైన గనులు కావచ్చు, చేపలు పుష్కలంగా దొరికే జలాశయాలు కావచ్చు, చాలా అనువైన స్థానంలో వున్న భవనాల స్థలం అయి ఉండవచ్చు. ఆ సందర్భంలో భూగోళంలో ఒక భాగంపై హక్కు పత్రాన్ని కలిగి వుండటంచేత ఒక వ్యక్తి ఈ ప్రకృతిసిద్ధమైన అంశాలకు యజమానిగా మారి పనిచేసే పెట్టుబడిదారుడి నుంచి కౌలు రూపంలో ఈ అదనపు లాభాన్ని గుంజుకుంటాడు. భవన నిర్మాణ స్థలానికి సంబంధించిన కౌలు ప్రాతిపదిక వ్యవసాయేతర భూములు అన్నింటిలాగానే వ్యవసాయపు కౌలుచేత శాసించ బడుతుందని ఆడమ్ స్మిత్ స్పష్టం చేశాడు. (బుక్ I, అధ్యాయం XI) ఈ కౌలు ముఖ్యంగా వ్యత్యాసపు కౌలుపైన స్థానానికి ఉన్న ప్రబలమైన ప్రభుత్వాన్ని సూచిస్తుంది. (ఉదాహరణకు ద్రాక్షతోటలు పెద్ద పట్టణాలలో వున్న భవన స్థలాలలో ఇది ప్రముఖంగా కనిపిస్తుంది.) రెండవది వీటి యజమాని పూర్తిగా క్రియారహితంగా ఉండటం స్పష్టంగా కనిపిస్తుంది. అతని ఏకైక కార్యకలాపం (ప్రత్యేకించి గనులు) సామాజిక అభివృద్ధి ప్రగతిని దోచుకోవటమే. దానికోసం అతడు దోహదపడేది గాని, ఒడ్డేది గాని ఏమీ లేదు. పారిశ్రామిక పెట్టుబడిదారునికి భిన్నంగా అతడు పూర్తి క్రియారహితంగా ఉంటాడు. చాలా సందర్భాల్లో గుత్తాధిపత్య ధరలు ఉండటం వలన, దారిద్ర్యాన్ని అత్యంత లజ్జా రహితంగా దోపిడీ చెయ్యటం ద్వారా (స్పెయిన్‌లో ఉన్న పటోసీ గనులకంటే భూస్వామి దృష్టిలో కిరాయి ఇంటి విషయంలో దారిద్ర్యం మరింత ఆకర్షణీయమైనది.)[1] పారిశ్రామిక పెట్టుబడిదారుడితో చేతులు కలిపి భూ ఆస్తికి వచ్చే అమానుషమైన శక్తి ద్వారా అది వేతనాల పోరాటంలో నిమగ్నమైన కార్మికులకు వ్యతిరేకంగా ఆ శక్తిని ఉపయోగించి వారిని తమ నివాస స్థలాల భూమి నుంచి ఆచరణలో వెళ్ళగొట్టడం జరుగుతుంది.[2] భూమిపై నివసించటానికిగాను ఆ రకంగా సమాజంలో ఒక భాగం మరో భాగం నుంచి కప్పం వసూలు చేస్తుంది. భూ ఆస్తి ఆ రకంగా భూతలాన్ని, భూగర్భాన్ని, గాలిని, ఆ రకంగా జీవితాభివృద్ధిని దాని పోషణను దోపిడీ చేసే హక్కును భూస్వామికిస్తుంది.

---

1. లెయింగ్, నేషనల్ డిస్ట్రెస్, ఇట్స్ కాజెస్ అండ్ రెమిడీస్, లండన్, 1844 - సం॥ న్యూమాన్, లెక్చర్స్ ఆన్ పొలిటికల్ ఎకానమీ, లండన్, 1857 - సం.
2. క్రోలింగ్‌టన్‌లో జరిగిన సమ్మె - ఎంగెల్స్, కండిషన్ ఆఫ్ ది వర్కింగ్ క్లాస్ ఇన్ ఇంగ్లండ్.

జనాభా పెరుగుదలవల్ల నివాస స్థలాలకై పెరిగే గిరాకీ మాత్రమే కాక భూమిలో చేర్చబడిన నిశ్చల పెట్టుబడి అభివృద్ధి కూడా, అంటే పారిశ్రామిక భవనాలపైన, రైలు మార్గాలపైన, గిడ్డంగులపైన, ఫ్యాక్టరీ భవనాలపైన, నౌకాశ్రయాలు వగైరాలపైన పెట్టిన నిశ్చల పెట్టుబడి అభివృద్ధి కూడా భవనపు కౌలును తప్పనిసరిగా పెంచుతుంది. ఇంటిపై పెట్టిన పెట్టుబడిపై వడ్డీని కలిగి ఉన్న మేరకు ఇంటి కౌలుకు – కేవలం స్థలం కౌలుకు మధ్య ఈ సందర్భంలో గందరగోళం అక్కరలేదు. ముఖ్యంగా ఇంగ్లాండులో భూస్వామి, భవనాల సట్టా వ్యాపారి విభిన్న వ్యక్తులుగా వున్న ఈ సందర్భంలో క్యేరీ లాంటి సహృదయులకు కూడా ఈ గందరగోళం అవసరం లేదు. ఇక్కడ రెండు అంశాలు పరిగణనలోకి తీసుకోవాలి. ఒకవైపున పునరుత్పత్తి లేదా ఖనిజాన్ని వెలికి తియ్యటం లక్ష్యంతో భూమిని ఉపయోగించటం, మరోవైపున మొత్తం ఉత్పత్తికి మొత్తం మానవ కార్యకలాపాలకు అవసరమైన అంశంగా స్థలాన్ని వినియోగించటం. ఈ రెండు అర్థాలలోనూ భూ ఆస్తి కప్పాన్ని కోరుతుంది. భవన స్థలాల కోసమై వున్న గిరాకీ ఒక స్థలంగానూ, ఆధారంగానూ ఉండే భూమి విలువను పెంచుతుంది. దానితోపాటు భవన నిర్మాణానికి పనికివచ్చే భౌగోళిక పదార్థాలకు కూడా అదే సమయంలో గిరాకీ పెరుగుతుంది.[1]

వేగంగా పెరుగుతున్న నగరాలలో భవనాల సట్టా వ్యాపారంలో వాస్తవమైన లక్ష్యం ఇల్లు కాదు, భూమి కౌలు మాత్రమే. ముఖ్యంగా లండన్ లాంటి నగరాల్లో పారిశ్రామిక స్థాయిలో నిర్మాణం జరుగుతున్నచోట ఇది వర్తిస్తుంది. ఇది ఇంతకు ముందే సంపుటి 2, 12వ అధ్యాయంలో వివరించబడింది.[2] లండన్‌లో ఉన్న భవనాల బడా సట్టా వ్యాపారి ఎడ్వాడ్ కెప్స్, 1857 బ్యాంకు చట్టాలపై సెలెక్టు కమిటీ ముందు ఇచ్చిన సాక్ష్యంలో ఇలా అన్నాడు. నెం.5435; "ప్రపంచంలో పైకి ఎదగాలనుకున్న మనిషి న్యాయమైన వ్యాపారం చేసి పైకి రావటం సాధ్యంకాదని నేననుకుంటున్నాను... దానితోపాటు అతడు భవనాల సట్టా వ్యాపారాన్ని జోడించాలి. అది కూడా కొద్ది స్థాయిలో కాదు. ఎందుకంటే, భవనాలపైన – వాటిని నిర్మించే వ్యక్తికి చాలా తక్కువ లాభం లభిస్తుంది. అతడు తన లాభంలో ప్రధానమైన భాగాన్ని మెరుగైన భూమి కౌలుల నుంచి సంపాదిస్తాడు. బహుశా అతడు ఒక భూభాగాన్ని తీసుకుని ఏడాదికి దానిపైన 300 పౌండ్లు ఇవ్వటానికి అంగీకరిస్తాడు. దానిపైన కట్టే భవనాల లే–అవుట్ విషయంలో జాగ్రత్తతీసుకోవటం ద్వారా ఆ భూమి నుంచి అతడు ఏడాదికి 400 లేదా 450 పౌండ్లు రాబట్టడంలో సఫలం కావచ్చు. అతని లాభం ఏడాదికి పెరిగిన భూమి కౌలు 100 లేదా 150 పౌండ్లు మాత్రమే. అంతేగాని అది భవనాలపైన వచ్చిన లాభం కాదు.... చాలా సందర్భాల్లో అతడు ఆ భవనాలవైపు కన్నెత్తి కూడా చూడడు." గడువు పూర్తికాగానే సాధారణంగా 99 ఏళ్ళ తరువాత ఆ భూమి తన భవనాలతోనూ ఈ మధ్యకాలంలో రెండూ లేదా మూడు రెట్లు పెరిగిన భూమి కౌలుతో సహా భవనాల సట్టా వ్యాపారి నుంచి లేదా అతని వారసుని నుంచి భూస్వామికి తిరిగి వస్తుందన్న అంశాన్ని ఇక్కడ మర్చిపోవద్దు.

---

1. "లండన్ రోడ్ల నిర్మాణంవల్ల స్కాట్లాండ్ తీరాన వున్న కొంతమంది రాతి భూముల యజమానులకు ఇంతకు ముందు ఎప్పుడూ కిరాయి ఇవ్వని ఆ రాళ్ళ నుంచి కొత్తగా కిరాయి లభించింది" ఆడమ్ స్మిత్. (యాన్ ఇంక్వరీ ఇన్ టు ది నేచర్ అండ్ కాజెస్ ఆఫ్ ది వెల్త్ ఆఫ్ నేషన్స్) బుక్ I, అధ్యాయం XI, 2.
2. ఇంగ్లీషు సంపుటి వాల్యూం II, పేజీలు 237-238 - సం.

గని కౌలు కూడా వ్యవసాయం కౌలులాగానే నిర్ణయించబడుతుంది. "కొన్ని గనుల్లో ఉత్పత్తి కార్మికులకు వేతనాలు చెల్లించటానికి సాధారణమైన లాభాలతోపాటు గనిలో పనిచెయ్యటానికి పెట్టిన పెట్టుబడి భర్తీ చెయ్యటానికి మాత్రమే బొటాబొటీగా సరిపోతుంది. ఆ గనులు ఆ పని నిర్వాహకునికి కొద్దిపాటి లాభాన్ని ఇవ్వగలుగుతాయి. కాని భూస్వామికి కౌలు మాత్రం ఉండదు. అటువంటప్పుడు భూస్వామి తప్ప మరొకరు దానిని సానుకూలంగా ఉపయోగించలేరు. భూస్వామే పని నిర్వాహకునిగా మారి అతను పెట్టిన పెట్టుబడిపైన సార్వత్రిక లాభాన్ని పొందుతాడు. స్కాట్‌లాండ్‌లో చాలా బొగ్గు గనులు ఈ రకంగానే నిర్వహించబడుతున్నాయి. మరోరకంగా సాధ్యం కాదు. మరో వ్యక్తిని కౌలు చెల్లించకుండా భూస్వామి అనుమతించడు. మరో వ్యక్తి ఎవరూ కౌలు చెల్లించలేడు." (ఆడమ్ స్మిత్, బుక్ I, 11వ అధ్యాయం).

కౌలు అన్నది గుత్తాధిపత్యం ధరవల్ల, ఉత్పాదితం యొక్క గుత్తాధిపత్యం ధరవల్ల లేదా దానితో ప్రమేయం లేని భూమి గుత్తాధిపత్యం ధరవల్ల తలెత్తుతోందా లేక కౌలు కారణంగా ఉత్పాదితాలు గుత్తాధిపత్యం ధరలకు అమ్మబడుతున్నాయా అన్నదాన్ని వేరుచేసి చూడాలి. గుత్తాధిపత్యం అని మనం ప్రస్తావించినప్పుడు సాధారణ ఉత్పత్తి ధరచేత, ఉత్పాదితాల విలువచేత నిర్ణయించబడిన ధరతో ప్రమేయం లేకుండా కొనుగోలుదారుని ఆతృతపైన, అతని కొనుగోలుశక్తిపైన ఆధారపడి నిర్ణయించబడిన ధర అని అర్థం. ఒక అసాధారణమైన నాణ్యత కలిగిన ద్రాక్షను సాపేక్షంగా చిన్న పరిమాణాల్లో మాత్రమే ఇచ్చే ద్రాక్షతోటకు గుత్తాధిపత్యం ధర లభిస్తుంది. గుత్తాధిపత్యం ధరవల్ల ద్రాక్షతోటను పెంచే వ్యక్తికి గణనీయమైన స్థాయిలో అదనపు లాభం లభిస్తుంది. దాని రుచి తెలిసి, తాగే వ్యక్తుల ఇష్టం స్థాయినిబట్టి, వారి ఆర్థిక స్థోమతనుబట్టి ఈ గుత్తాధిపత్యం ధర ఉత్పాదితం విలువను మించి ఎంత అదనంగా ఉంటుంది? అన్నది ఆధారపడి ఉంటుంది. గుత్తాధిపత్యం ధర ద్వారా లభించిన ఈ అదనపు లాభం కౌలుగా మార్చబడి భూస్వామి చేతుల్లోకి పోతుంది. ఈ ప్రత్యేక లక్షణాలు ఉన్న ఒక భూభాగంపైన అతనికి హక్కు పత్రం వున్న పుణ్యమా అని ఇది సాధ్యమయింది. ఈ సందర్భంలో గుత్తాధిపత్యం ధర కౌలును సృష్టించింది. మరోవైపున ధాన్యం దాని ఉత్పత్తి ధరను మాత్రమే కాక దాని విలువను కూడా మించి అమ్మినప్పుడు, కౌలు చెల్లించకుండా అంతవరకూ సాగులో లేని భూమిలో పెట్టుబడి పెట్టటానికి భూ ఆస్తి పరిమితులు విధించటంవల్ల ధాన్యం అమ్మబడితే కౌలు అప్పుడు గుత్తాధిపత్యం ధరను సృష్టిస్తుంది. కేవలం భూగోళంపైన కొంతమంది వ్యక్తులకు హక్కు పత్రాలు ఉండటంవల్ల సమాజం యొక్క అదనపు శ్రమలో ఒక భాగాన్ని వీరు కప్పంగా స్వాహా చెయ్యగల్గుతున్నారు. ఉత్పత్తి అభివృద్ధితోపాటు ఇది మరింత ఎక్కువ స్థాయిలో జరుగుతుంది. అయితే పెట్టుబడీకరించబడిన కౌలు అంటే పెట్టుబడీకరించబడిన ఈ కప్పం భూమి ధరగా కనిపించడం వల్ల భూమి ఏ ఇతర వాణిజ్య వస్తువులాగానే అమ్మబడటంవల్ల ఈ అంశం మరుగునపడుతుంది. కనుక కొనుగోలుదారుడు తనకు వచ్చే కౌలును ఊరికే పొదుతున్నట్టు అనుకోడు. శ్రమగానీ, వడ్డాల్సింది గానీ, పెట్టుబడిదారునికి ఉండే వాణిజ్య స్ఫూర్తిగానీ యేమీ లేకుండానే ఊరికే చేతిలో పడుతున్న సొమ్ముగా కాక దానికి అంతకు ముందే సమఫలాన్ని చెల్లించినట్టు భావిస్తాడు. ఇంతకు ముందు చెప్పినట్లుగానే ఆ కొనుగోలుదారునికి అతడు భూమి కొనుగోలుకు పెట్టిన పెట్టుబడిపై వడ్డీగా మాత్రమే కౌలు కనిపిస్తుంది. కనుక ఆ కౌలుపైన అతనికి హక్కు ఉందని భావిస్తాడు. అదే రకంగా ఒక

నీగ్రోను కొనుగోలు చేసిన బానిస యజమాని కూడా, ఆ బానిస తన ఆస్తి అనుకుంటాడు. బానిస వ్యవస్థ అతనికా హక్కు ఇచ్చిందని భావించక అతడా నీగ్రోను ఇతర సరుకులన్నింటిలాగే క్రయవిక్రయాల ద్వారా పొందానని భావిస్తాడు. అయితే ఈ హక్కు అన్నది ఆ అమ్మకం ద్వారా బదిలీ అయింది తప్ప సృష్టించబడలేదు. హక్కు పత్రం అన్నది అమ్మబడటానికి ముందు ఉండాలి గదా! ఒకే అమ్మకం కానీ, అమ్మకాల పరంపరకానీ, అమ్మకాల పునరావృతం కానీ ఈ హక్కు పత్రాన్ని సృష్టించలేవు. దానిని సృష్టించినది ప్రధానంగా ఉత్పత్తి సంబంధాలు. ఇవి సరికొత్త రూపాన్ని సంతరించుకునే స్థాయికి చేరుకోగానే సామాజిక జీవితాన్ని సృష్టించిన ప్రక్రియ నుండి తలెత్తిన, ఆర్థికంగా, చారిత్రకంగా సమర్థించబడిన ఈ హక్కు పత్రం యొక్క భౌతిక ఆధారాలు దానిపై ఆధారపడిన లావాదేవీలన్నింటితో సహా దాని పక్కన పడిపోతాయి. ఇంతకంటే ఉన్నతమైన ఆర్థిక రూపం దృష్టి నుంచి భూగోళంపైన కొంతమంది వ్యక్తుల ప్రైవేటు యాజమాన్యం అన్నది ఒక మనిషిపైన మరో మనిషికున్న ప్రైవేటు యాజమాన్యంలాగే అంత అసంబద్ధంగానూ కనిపిస్తుంది. మొత్తం సమాజం ఒక జాతి లేదా భూగోళంపై ఉన్న సమాజాల మొత్తం భూగోళానికి యజమానులు కారు. వారు దానిని కేవలం కలిగి ఉన్నారు. దాని నుంచి లాభం పొందుతారు అంతే. వారు మంచి కుటుంబ యజమానులలాగా దానిని మరింత మెరుగైన పరిస్థితులతో రాబోయే తరాలకు అందించాల్సి వుంది.

★ ★ ★

భూమి ధరపై ఈ కింది విశ్లేషణలో పోటీలో తలెత్తే ఆటుపోట్లను మొత్తం భూమి సట్టా వ్యాపారాన్ని పరిగణించటం లేదు. అలాగే భూమి ఉత్పత్తిదారుల ప్రధాన పరికరంగా ఉండే సన్నకారు భూ ఆస్తి విషయంలో సన్నకారు ఉత్పత్తిదారులు భూమిని ఆ కారణంచేత ఎంత ధరకైనా కొంటారు. అయితే ఈ అంశాన్ని కూడా ఇక్కడ పరిగణనలోనికి తీసుకోవటం లేదు.

I. కౌలు పెరగకుండానే భూమి ధర రెండు రకాలుగా పెరగవచ్చు.

1. కేవలం వడ్డీ రేటు పడిపోవడం వల్ల కౌలును మరింత ప్రియంగా అమ్మేలా అది చేస్తుంది. అంటే పెట్టుబడీకరించిన కౌలు లేదా భూమి ధర పెరుగుతుంది.
2. భూమిపై పెట్టిన పెట్టుబడిపైన వడ్డీ పెరగటం వల్ల.

II. కౌలు పెరగటంవల్ల భూమి ధర పెరగవచ్చు.

భూమి ఉత్పాదితం ధర పెరగటంవల్ల కౌలు పెరగవచ్చు. ఈ సందర్భంలో వ్యత్యాసపు కౌలు రేటు ఎప్పుడూ పెరుగుతుంది. అత్యంత అధ్వాన్నపు భూమిపై కౌలు ఎక్కువగా ఉన్నా, తక్కువగా ఉన్నా లేదా అసలు లేకున్నా ఇది వర్తిస్తుంది. వ్యత్యాసపు కౌలు రేటు అంటే కౌలుగా మారిన అదనపు విలువ భాగానికి, వ్యవసాయ ఉత్పాదితాన్ని ఉత్పత్తి చేసే పెట్టుబడి మదుపుకు మధ్య ఉన్న నిష్పత్తి అని అర్థం. అదనపు ఉత్పాదితానికి, మొత్తం ఉత్పాదితానికి మధ్య ఉన్న నిష్పత్తికంటే ఇది భిన్నమైనది. ఎందుకంటే మొత్తం ఉత్పాదితం అన్నది మొత్తం మదుపు పెట్టిన పెట్టుబడితో అనగా నిశ్చల పెట్టుబడితో సమానం కాదు. ఈ నిశ్చల పెట్టుబడి ఉత్పాదితంతో పాటు అస్థిత్వంలో ఉంటుంది. మరోవైపున వ్యత్యాసపు కౌలునిచ్చే భూముల్లో ఉత్పాదితంలో భాగం రానురానూ మరింత అధికంగా అదనపు ఉత్పాదితం యొక్క మిగులుగా రూపొందుతుంది అన్న విషయాన్ని అది కప్పిపెడుతుంది. పరమ

అధ్వాన్నపు భూమి యొక్క వ్యవసాయ ఉత్పాదితం ధరలో పెరుగుదల కౌలును సృష్టిస్తుంది. తరువాత భూమి ధరను సృష్టిస్తుంది.

వ్యవసాయ ఉత్పాదితం ధరలో పెరుగుదల లేకుండా కూడా కౌలు పెరగవచ్చు. ఈ ధర స్థిరంగా ఉండవచ్చు లేదా తగ్గిపోవచ్చు.

ధర స్థిరంగా ఉండే ఒకవైపున పాత భూముల్లో పెట్టుబడి మొత్తం అంతే ఉంది కనుక అంతకంటే మెరుగైన కొత్త భూములు సాగుచెయ్యబడతాయి. ఆ భూములు పెరిగిన గిరాకీని సంతృప్తి పరచటానికి మాత్రమే సరిపోతాయి. కనుక అమల్లో వున్న మార్కెట్టు ధర యథాతథంగా ఉంటుంది. కౌలు (గుత్తాధిపత్య ధరవల్ల కాక) అప్పుడు పెరుగుతుంది. ఈ సందర్భంలో పాత భూముల ధర పెరగదు. అయితే కొత్తగా సాగులోకి వచ్చిన భూముల ధర పాత వాటికంటే పెరుగుతుంది.

మరోవైపున భూమిలో పెట్టే పెట్టుబడి రాశి పెరగటంవల్ల కూడా కౌలు పెరుగుతుంది. ఇక్కడ సాపేక్ష ఉత్పాదకత, మార్కెట్టు ధర యథాతథంగా ఉన్నాయని భావించాలి. పెట్టిన పెట్టుబడితో పోల్చితే, కౌలు యథాతథంగా ఉన్నప్పటికీ పెట్టుబడి రాశి రెట్టింపు కావటంవల్ల మొత్తం కౌలు కూడా రెట్టింపు కావచ్చు. ధర పడిపోలేదు కనుక రెండవ మదుపు కూడా మొదటి మదుపులాగానే అదనపు లాభాన్ని ఇస్తుంది. కనుక లీజు గడువు పూర్తికాగానే అది కూడా కౌలుగా మారుతుంది. కౌలును ఉత్పత్తి చేసే పెట్టుబడి మొత్తం పెరగటంవల్ల ఇక్కడ కౌలు మొత్తం కూడా పెరుగుతుంది. ఒకే భూమిలో వరుసగా పెట్టే వివిధ మదుపులు దిగుబడి అసమంగా వున్నప్పుడు మాత్రమే ఆ భూమి కౌలు ఉత్పత్తి చేస్తుందని అనడం అంటే అర్థం – సమాన ఉత్పాదకతలు కలిగిన రెండు పొలాల్లో 1000 పౌండ్ల సమాన పెట్టుబడిని పెట్టినప్పుడు వాటిలో ఒకటి మాత్రమే కౌలు ఇస్తుందని చెప్పడం అవుతుంది. వ్యత్యాసపు కౌలు అలా మాత్రమే తలెత్తుతుందని ఈ వాదన సారాంశం. ఈ రెండు పొలాలు వ్యత్యాసపు కౌలును ఉత్పత్తి చేసే మెరుగైన భూముల్లో ఉన్నప్పటికీ ఇది వర్తిస్తుందని వారి ఊహ. (విడి భూమి ధరగాని, దానిపై కౌలు రేటుగాని, దానిపై కౌలు మొత్తంగాని పెరగకుండానే ఒక దేశంలో వున్న కౌలు మొత్తం పెరగవచ్చు. ఈ సందర్భంలో విస్తారమైన భూభాగంలో సాగు విస్తరించడంవల్ల కౌలు మొత్తం పెరుగుతుంది. విడి కమతాలపైన కౌలు తగ్గినప్పుడు కూడా దేశం మొత్తంలో కౌలు పెరగవచ్చు.) అలా కాకుంటే పక్కపక్కనే వున్న రెండు పొలాల్లో పెట్టుబడి మదుపు అన్నది ఒకే పొలంలో వరుసగా పెట్టిన పెట్టుబడి మదుపుకంటే భిన్నమైన నియమాలను అనుసరిస్తుందని వాదించినట్టు అవుతుంది. ఈ రెండు సందర్భాలలోనూ వర్తించే నియమం సర్వసమంగా వుండటం వల్ల మాత్రమే, రెండు వేర్వేరు పొలాల్లోగాని, ఒకే పొలంలోగాని పెట్టుబడి ఉత్పాదకత పెరగడంవల్ల మాత్రమే వ్యత్యాసపు కౌలు లభిస్తుంది. అయితే ఇక్కడ ఇంతవరకూ గమనించబడని మార్పేమంటే వరస పెట్టుబడి మదుపులు వేర్వేరు పొలాల్లో పెట్టడానికి భూ ఆస్తి ఆటంకంగా వుంటుంది. ఒకే కమతంలో పెట్టే మదుపుల విషయంలో అలా జరగదు. ఈ రెండు భిన్న రూపాల మదుపుల ఆచరణలో ఒకదాన్నొకటి అడ్డుకుంటాయి. ఇలా విరుద్ధ ధోరణుల వల్ల ఈ ఫలితం వస్తుంది. పెట్టుబడిలో తేడా ఏదీ ఇక్కడ కనిపించదు. పెట్టుబడి అంతర్నిర్మాణం, దానితోపాటు అదనపు విలువ రేటు యథాతథంగా ఉంటే లాభం రేటు కూడా యథాతథంగా వుంటుంది. కనుక పెట్టుబడి రెట్టింపు అయినప్పుడు లాభం కూడా రెట్టింపు అవుతుంది. అలాగే ఈ పరిస్థితులలో కౌలు రేటు కూడా యథాతథంగా

వుంటుంది. 1000 పౌండ్ల పెట్టుబడి 'X' కౌలును ఉత్పత్తి చేస్తే, 2000 పౌండ్ల పెట్టుబడి అదే పరిస్థితులలో '2X' కౌలును ఉత్పత్తి చేస్తుంది. అయితే భూమి వైశాల్యంతో పోల్చి చూస్తే మన ఊహ ప్రకారం రెట్టింపు పెట్టుబడి అదే పొలంలో పనిచేసినప్పుడు కౌలు మొత్తం పెరగడంవల్ల కౌలు స్థాయి కూడా పెరుగుతుంది. ఇంతకు ముందు 2 పౌండ్ల కౌలు ఇచ్చిన భూమి ఇప్పుడు 4 పౌండ్ల కౌలు నిస్తుంది.[1] డబ్బు అన్నది విలువ యొక్క స్వతంత్రమైన వ్యక్తీకరణ కనుక అదనపు విలువ యొక్క ఒక భాగాన్ని అంటే డబ్బు కౌలును భూమితో పోల్చి చూడటం అసంబద్ధమూ, హేతువిరుద్ధం. ఎందుకంటే ఈ పరిమాణాలు రెండూ తులనాత్మకాలు కాదు. ఒకవైపున ఫలానా ఇన్ని అడుగుల విస్తీర్ణం గల ఒక పొలం వుంది. అది ఒక ఉపయోగ విలువ. మరోవైపున అది ఒక విలువ, ప్రత్యేకంగా అదనపు విలువ. నిర్ణీత పరిస్థితులలో ఫలానా ఇన్ని చదరపు అడుగుల భూమిపై వున్న యాజమాన్యంవల్ల ఈ చదరపు అడుగుల్లో బంగాళాదుంపల్లో పందిలా కూరుకుపోయిన పెట్టుబడి స్వాహా చేసే వేతనం చెల్లించని శ్రమలో ఒక భాగాన్ని గుంజుకోవటానికి భూస్వామికి అవకాశం ఏర్పడుతుంది. పై వాస్తవం ఈ అంశాన్ని మాత్రమే వ్యక్తం చేస్తుంది. [రాత ప్రతిలో కుండలీకరణాల మధ్య "లీబిగ్" అని రాసి కొట్టివేయబడింది.] అయితే చూడగానే పైకి ఈ వ్యక్తీకరణ ఎలా కనిపిస్తుంది. అంటే భూమండలం వ్యాసంతో 5 పౌండ్ల నోటును ముడిపెట్టడం లాంటిది. అయితే కొన్ని ఆర్థిక సంబంధాలు ఆచరణలో ఎటువంటి హేతువిరుద్ధమైన రూపాలలో పనిజేస్తాయి అన్న విషయం రోజువారీ జీవితంలో ఈ సంబంధాలకు ప్రతినిధులుగా వున్న వారిని బాధించవు. అటువంటి సంబంధాలతో వ్యవహరించటం వారికి అలవాటైపోతుంది. కనుక అందులో వారికి వింత ఏమీ కనిపించదు. ఈ పూర్తి వైరుధ్యం వారికేమాత్రం అనూహ్యంగా అనిపించదు. వాటి అంతర్ సంబంధాల నుండి వేరైన ఈ వ్యక్తీకరణల విషయంలో వారు నీళ్ళలో చేపలా సజావుగా ఉండగలరు. వేరు చేసి చూస్తే ఈ సంబంధాలు అసంబద్ధంగా మారతాయి. కొన్ని గణితశాస్త్ర సూత్రాల విషయంలో సాధారణ వ్యవహారిక జ్ఞానానికి హేతువిరుద్ధంగా కనిపించేదే హేతుబద్ధం![2] దానికి హేతుబద్ధంగా కనిపించేదే హేతువిరుద్ధం.

---

1. ఈ అంశాన్ని తన గ్రంథంలో రాడ్‌బెర్టస్ బాగా వివరించగలిగారు. దీనిని నాలుగవ సంపుటి (అదనపు విలువ సిద్ధాంతాలు)లో చర్చిద్దాం. అయితే ఇక్కడ ఆయన ఒక పొరపాటు చేశారు. పెట్టుబడి పెరిగినప్పుడు అనులోమంగా లాభం కూడా పెరిగినప్పుడు మొత్తం లాభం పెరిగినప్పటికీ పెట్టుబడి లాభాల మధ్య నిష్పత్తిలో మార్పుండదు. అయితే ఇది సరిగాదు. ఎందుకంటే పెట్టుబడి అంతర్నిర్మాణం మారితే, శ్రమ దోపిడి యథాతథంగా వున్నప్పటికీ లాభం రేటు పెరగవచ్చు. ఎందుకంటే అస్థిర పెట్టుబడితో పోల్చినప్పుడు స్థిర పెట్టుబడి సమ విలువ పడిపోతుంది గనుక. రెండో అంశమేమంటే డబ్బు కౌలును ఆయన నిర్దిష్టమైన విస్తీర్ణం గల భూభాగంతో ఉదాహరణకు ఒక ఎకరంతో నిష్పతిలో ఉంచుతాడు. సాంప్రదాయక అర్థశాస్త్రం కౌలు పెరుగుదల, తగ్గుదల గురించిన తన విశ్లేషణలో దీనిని ప్రాథమిక ఆధారంగా తీసుకుందన్నట్లుగా ఆయన భావిస్తాడు. ఇది మరో పొరపాటు. కౌలును దాని సహజ రూపంలో పరిశీలించిన మేరకు కౌలు రేటును సాంప్రదాయక అర్థశాస్త్రం ఉత్పాదితంతో పోల్చి చూస్తుంది. అది కౌలును డబ్బు కౌలుగా పరిశీలించినప్పుడు ముందస్తు పెట్టుబడితో పోల్చి చూస్తుంది. ఎందుకంటే ఇవి మాత్రమే సహేతుకమైన వ్యక్తీకరణలు.
2. హెగెల్ ఎన్‌సైక్లోపిడియా... బెర్లిన్, 1840 - సం.

భూ విస్తీర్ణంతో ముడిపెట్టి పరిశీలించినప్పుడు కౌలు మొత్తంలో పెరుగుదల అదే విధంగా కౌలు రేటులో పెరుగుదలగా వ్యక్తమవుతుంది. దీనిలో ఒక అంశాన్ని వివరించే పరిస్థితులు మరో అంశంలో లేకపోవటంవల్ల ఇరుకున ఉండటం జరుగుతుంది.

వ్యవసాయ ఉత్పాదితం ధర తగ్గినప్పుడు సహితం భూమి ధర పెరగవచ్చు.

ఈ సందర్భంలో మరిన్ని వ్యత్యాసాలవల్ల మెరుగైన భూములకు సంబంధించిన వ్యత్యాసపు కౌలు దానితోపాటు భూమి ధర కూడా పెరిగి వుండవచ్చు. అలా కాకుంటే ఎక్కువ శ్రమ ఉత్పాదకత కారణంగా వ్యవసాయ ఉత్పాదితం ధర పడిపోయి ఉండవచ్చు. అయితే పెరిగిన ఉత్పత్తి ధరలో తగ్గుదలకంటే ఎక్కువ స్థాయిలో వుండవచ్చు. ఒక బస్తా ధాన్యం 60 షిల్లింగులు ఉందనుకుందాం. ఇప్పుడు అదే ఎకరాలలో అదే పెట్టుబడి 1 బస్తాకు బదులు 2 బస్తాలు ఉత్పత్తి చెయ్యగల్గిందని అనుకుందాం. అప్పుడు బస్తా ధర 40 షిల్లింగులకు పడిపోయి ఉంటే, 2 బస్తాలకు 80 షిల్లింగులు వస్తాయి. కనుక అదే భూమిలో పెట్టిన అదే పెట్టుబడితో ఉత్పాదితం విలువ 3వ వంతు పెరిగింది. బస్తా ధర 3వ వంతు పడిపోయినప్పటికీ ఇది సాధ్యమే. ఉత్పాదితాన్ని, దాని ఉత్పత్తి ధర కంటే, దాని విలువకంటే ఎక్కువకు అమ్మకపోయినా ఇది ఎలా సాధ్యమవుతుంది అన్న విషయాన్ని వ్యత్యాసపు కౌలు విశ్లేషణలో చర్చించబడింది. నిజానికి ఇది రెండు విధాలుగా సాధ్యమవుతుంది. నాసిరకం భూమి పోటీ నుంచి తొలగించబడి మెరుగైన భూమిలో వ్యత్యాసపు కౌలు పెరుగుదలతోపాటు ఆ భూమి ధర కూడా పెరుగుతుంది. అంటే సాధారణమైన మెరుగుదల వివిధ రకాల భూముల్ని విభిన్నంగా ప్రభావితం చేస్తుంది. లేదా అదే ఉత్పత్తి ధర (నిరపేక్ష కౌలు చెల్లించబడితే అదే విలువ) అధ్వాన్నపు భూమిలో అంతకంటే ఎక్కువ మొత్తంలో వున్న ఉత్పాదితాల ద్వారా శ్రమ ఉత్పాదకత పెరిగినప్పుడు వ్యక్తమవుతుంది. ఉత్పాదితం ఇంతకు ముందులాగే అదే విలువను వ్యక్తం చేస్తుంది. అయితే దాని విడి సమభాగాల సంఖ్య పెరుగుతుంది. ఒక విడిభాగం ధర తగ్గుతుంది. అంతే పెట్టుబడి వినియోగించినప్పుడు అది అసాధ్యం. ఎందుకంటే ఈ సందర్భంలో ఉత్పాదితం యొక్క ఏ భాగంనుంచయినా అదే విలువ ఎప్పుడూ వ్యక్తమవుతుంది. అదనపు పెట్టుబడిని ఏళ్ళ తరబడి ప్రభావం కలిగించే మెరుగదల కార్యక్రమంపైన హెచ్చిస్తే ఇది సాధ్యమవుతుంది. విడి బస్తా ధర పడిపోయినప్పటికీ బస్తాల సంఖ్య పెరిగిన స్థాయిలో ఈ తగ్గుదల ఉండరాదు. ఇందులో ఉన్న షరతు ఇది.

III. కౌలు, దానితో పాటు సాధారణంగా భూమి ధర లేదా కొన్ని ప్రత్యేక తరహాల భూమి ధర పెరగటానికి తోడ్పడే ఈ విభిన్నమైన పరిస్థితులు ఒకదానితో ఒకటి పాక్షికంగా పోటీపడతాయి. లేదా పాక్షికంగా ఒకదానినొకటి హరించుకుంటాయి. ఒకదాని తరువాత ఒకటి మాత్రమే వ్యవహరించగల్గుతాయి. దీని అంతటినీబట్టి స్పష్టమయ్యేది ఏమంటే భూమి ధర పెరిగినప్పుడు తప్పనిసరిగా కౌలు కూడా పెరగకపోవచ్చు. కౌలు ధర పెరిగినప్పుడు భూమి ధర పెరిగినప్పటికీ వ్యవసాయం ఉత్పాదితం పెరగకపోవచ్చు.[1]

★ ★ ★

1. కౌలు పెరిగినప్పుడు వాస్తవంగా భూమి ధర తగ్గిపోవటం గురించి ఫాసీ గ్రంథాన్ని చూడండి.

ఆనాటి వ్యవసాయ రసాయనిక శాస్త్రం స్థాయివల్ల వ్యత్యాసపు కౌలును గురించి రాసిన అర్థశాస్త్రవేత్తలకు భూమిని పూర్తిగా ఉపయోగించటానికి దారితీసే సహజమైన వాస్తవ కారణాలు తెలియవు. కనుక వాటి పుట్టుకను పట్టుకోవటానికి బదులు ఒక పరిమితమైన భూభాగంలో ఏ మొత్తం పెట్టుబడి అయినా పెట్టటం సాధ్యంకాదనే సంకుచిత భావనను వారు ఆశ్రయించారు. ఉదాహరణకు 'ఏడిన్‌బరో రివ్యూ'లో రిచర్డ్ జోన్స్‌కు వ్యతిరేకంగా ఇలా వాదించబడింది.[1] సోహో స్క్వేర్‌లో సాగు చెయ్యటం ద్వారా మొత్తం ఇంగ్లాండును పోషించలేము అన్నది ఆ భావన. వ్యవసాయానికి సంబంధించిన ప్రత్యేక అసౌకర్యంగా ఇది పరిగణించబడితే వాస్తవం సరిగ్గా దీనికి విరుద్ధంగా వుంటుంది. ఇక్కడ భూమి స్వయంగా ఒక ఉత్పత్తి పరికరం కావటంవల్ల వరుసగా పెట్టుబడిని మదుపు పెట్టి ఫల ప్రదమైన ఫలితాలను పొందటం సాధ్యం. ఒక ఫ్యాక్టరీ విషయంలో ఇలా సాధ్యం కాదు. సాధ్యమైనప్పటికీ కొంతమేరకే సాధ్యమవుతుంది. ఎందుకంటే అది ఒక పునాదిగా మాత్రమే వ్యవహరిస్తుంది. కార్యకలాపాల ప్రాతిపదికను సమకూర్చే ఒక స్థలంగా మాత్రమే, ఒక స్థానంగా మాత్రమే వుంటుంది. చెల్లాచెదురుగా వున్న చేతివృత్తులతో పోల్చితే భారీ పరిశ్రమ చిన్న ప్రాంతంలోనే ఎక్కువ ఉత్పత్తిని కేంద్రీకరించగలుగుతుంది అన్నది నిజమే. అయితే ఏ దశలోనయినా ఆనాటి ఉత్పాదకత స్థాయిని బట్టి ఒక నిర్దిష్ట పరిమాణంగల స్థలం అవసరమవుతుంది. ఎత్తయిన భవనాల నిర్మాణానికి కూడా ఆచరణలో దాని పరిమితులు దానికున్నాయి. ఈ పరిమితికి ఆవల ఉత్పత్తి విస్తరించాలి. అంటే విస్తీర్ణం కూడా విస్తరించాల్సి వుంటుంది. యంత్రాలు వగైరాలలో మదుపు పెట్టిన నిశ్చల పెట్టుబడి వాటిని ఉపయోగించటం ద్వారా మెరుగుపడదు. అందుకు విరుద్ధంగా అరిగిపోతుంది. అయితే ఈ విషయంలో కొంత మెరుగుదలను కొత్త ఆవిష్కరణలు అనుమతించవచ్చు. ఉత్పాదకత శక్తితో అభివృద్ధితో పాటు యంత్రాలు పాతబడటం కూడా జరుగుతుంది. ఉత్పాదకత వేగంగా అభివృద్ధి అయితే పాత యంత్రాలు అన్నింటినీ మరింత సదుపాయమైన యంత్రాలతో భర్తీచేయాల్సి వుంటుంది. మరోలా చెప్పాలంటే ఆ యంత్రాలు అంతమైపోతాయి. అయితే భూమి మాత్రం జాగ్రత్తగా చూసుకుంటే రానురానూ మరింత మెరుగవుతుంది. పాత మదుపులు కోల్పోకుండానే కొత్త మదుపుల వల్ల అదనపు ప్రతిఫలాన్ని ఇవ్వటం అన్నది భూమివల్ల వచ్చే అదనపు సదుపాయం. ఈ సదుపాయం వరుసగా పెట్టే ఈ మదుపుల ఫలితాలలో తేడాలు ఉండటం సాధ్యమని సూచిస్తుంది.

★ ★ ★

1. 44వ అధ్యాయం, సంపుటి ఆగస్టు - డిశంబర్, 1831, పుటలు 94-95 - సం.

## అధ్యాయం - 47

# పెట్టుబడిదారీ భూమి-కౌలు ఉత్పాదన విధానం

### I. పరిచయ వ్యాఖ్యలు

పెట్టుబడిదారీ ఉత్పత్తి విధాన సైద్ధాంతిక వ్యక్తీకరణగా ఆధునిక అర్థశాస్త్ర దృష్టికోణం నుంచి భూమి కౌలును విశ్లేషించటంలో నిజమైన ఇబ్బంది ఎక్కడ ఉన్నదో మనం మన మనసులో స్పష్టం చేసుకోవాలి. చాలామంది ఆధునిక రచయితలు సహితం దీనిని గ్రహించలేదు. భూమి కౌలును "కొత్త"గా వివరించటానికి నిత్యనూతనంగా జరుగుతున్న ప్రయత్నాన్నిబట్టి ఇది రుజువవుతుంది. చాలా ఏళ్ళ క్రితమే కాలం చెల్లిన అభిప్రాయాలలోకి మారటం అన్నది ఈ కొత్త వాదనల ప్రత్యేకత. వ్యవసాయం ఉత్పత్తి చేసే అదనపు ఉత్పాదితాన్ని, దానితోపాటు సాధారణ రూపంలో అదనపు విలువను వివరించటంలో ఇబ్బంది లేదు. ఏ ఉత్పత్తి రంగంలోనయినా పెట్టబడిన ఉత్పాదక పెట్టుబడి అంతా ఉత్పత్తి చేసే అదనపు విలువ విశ్లేషణలో ఈ ప్రశ్న పరిష్కరించబడింది. భూమిలో మదుపు పెట్టిన పెట్టుబడి కౌలు రూపంలో భూస్వామికి చెల్లించే అదనపు విలువపై మిగులుకు మూలాధారాన్ని చూపించటంలోనే అసలు ఇబ్బంది ఉంది. అదనపు విలువ వివిధ పెట్టుబడుల మధ్య సగటు లాభానికి సమమయిన తరువాత అన్ని ఉత్పత్తి రంగాలలోనూ ఉన్న సామాజిక పెట్టుబడి ఉత్పత్తి చేసిన అదనపు విలువ మొత్తాన్ని వివిధ పెట్టుబడులు తమ పరిమాణాన్నిబట్టి పంచుకున్న తరువాత మరోలా చెప్పాలంటే పంపిణీ జరగాల్సిన మొత్తం అదనపు విలువ పంపిణీ అప్పటికే పూర్తయిపోయినట్లు కనిపించిన మూలాన్ని గ్రహించటంలో ఇబ్బంది ఉంది. భూ ఆస్తికి వ్యతిరేకంగా పారిశ్రామిక పెట్టుబడి ప్రతినిధులయిన ఆధునిక ఆర్థికవేత్తల ఆచరణ దృష్టి గల లక్ష్యాలను – భూమి కౌలు చరిత్రను తెలియజేసే అధ్యాయం ఈ లక్ష్యాలను గురించి మరింత స్పష్టంగా వివరిస్తుంది. – అలా ఉంచి సిద్ధాంతవేత్తలుగా కూడా వారికి ఈ ప్రశ్న అన్నిటికంటే ఎక్కువ ఆసక్తి కలిగించే అంశమే. వ్యవసాయంలో పెట్టిన పెట్టుబడికి కౌలు తలెత్తటం అన్నది మదుపు పెట్టిన రంగానికి ఉన్న ప్రత్యేక ప్రభావం వల్లనో, భూమి పైభాగానికి వున్న ప్రత్యేక లక్షణాల వల్లనో సాధ్యమయిందని అంగీకరించటమంటే విలువ అన్న భావాన్ని వదిలెయ్యటంతో సమానమే. ఆ రకంగా ఇది ఈ రంగాన్ని గురించిన శాస్త్రీయ అవగాహన ప్రయత్నాలన్నింటినీ వదిలెయ్యటంతో సమానం. కౌలు అన్నది వ్యవసాయ ఉత్పాదితం ధర నుంచి చెల్లించబడుతుంది అన్న భావన (రైతు తన ఉత్పత్తి ధరను రాబట్టాల్సినచోట కౌలు ధాన్యం రూపంలో చెల్లించబడిన సందర్భంలో కూడా ఇది జరుగుతుంది.) మామూలు ఉత్పత్తి ధరపైన ఈ ధర మిగులును వివరించటానికి ప్రయత్నించే అసంబద్ధతను నిరూపిస్తుంది. మరోలా చెప్పాలంటే వ్యవసాయ ఉత్పాదితాలు సాపేక్షంగా ప్రియంగా ఉండటాన్ని ఇతర ఉత్పత్తి రంగాలలో ఉత్పాదకతను

మించి వ్యవసాయ ఉత్పాదితం యొక్క సహజ ఉత్పాదకతలో ఉంటే మిగులు అనే పునాదిపై కూర్చో బెట్టడం జరుగుతుంది. నిజానికి వాస్తవం ఇందుకు విరుద్ధంగా వుంటుంది. శ్రమ ఎంత ఉత్పాదకంగా ఉంటే ఉత్పాదితం యొక్క ప్రతి సమభాగం అంత చౌకగా వుంటుంది. ఎందుకంటే అదే పరిమాణం కలిగిన శ్రమలో అనగా అదే విలువలో మరిన్ని ఎక్కువ పరిమాణంలో ఉపయోగపు విలువలు ఉంటాయి కనుక.

అందుకని కౌలును విశ్లేషించటంలో ఉన్న మొత్తం ఇబ్బంది అదనపు విలువను వివరించటంలో కాక సగటు లాభంపైన వ్యవసాయ లాభంలో వచ్చే మిగులును అనగా ఈ ఉత్పత్తి రంగానికి విశిష్టగా వుండే అదనపు విలువ మిగులును వివరించటంలోనే ఉంది. మరోలా చెప్పాలంటే "నికర ఉత్పాదితాన్ని" వివరించటంలో కాక ఇతర పారిశ్రామిక శాఖలు అన్నింటిలోనూ లభించే నికర ఉత్పాదితంపైన ఈ రంగంలో లభించే నికర ఉత్పాదితం యొక్క మిగులును వివరించటంలో ఇబ్బంది ఉంది. సగటు లాభం అన్నది సామాజిక ప్రక్రియల చలనంచేత నిర్దిష్టమైన చారిత్రక ఉత్పత్తి సంబంధాలలో రూపొందిన ఉత్పాదితం. ఇంతకు ముందు మనం చూసినట్లుగా ఈ ఉత్పాదితానికి చాలా సంకీర్ణమైన సర్దుబాటు అవసరమవుతుంది. సగటు లాభంపైన మిగులు గురించి మాట్లాడగలగాలి అంటే ఈ సగటు లాభమే ఇంతకు ముందే పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానంలోలాగే సాధారణ రూపంలో ఉత్పత్తిని శాసించే అంశంగానూ, ప్రామాణిక అంశంగానూ ఉండి ఉండాలి. సగటు లాభాన్ని మించిన మిగులును కలిగి ఉండే కౌలు అనగా మొత్తం సామాజిక పెట్టుబడి ఉత్పత్తి చేసే అదనపు విలువలో ప్రతి విడి పెట్టుబడికీ సమంగా లభించే వాటాపైని మించిన మిగులు అన్నది సాధ్యం కాదు. అదనపు శ్రమను శాసించేది, అదనపు విలువ మొత్తాన్ని సూటిగా అనుభవించేది పెట్టుబడికాని సామాజిక వ్యవస్థల్లో ఆధునిక అర్థంలో కౌలు గురించిన ప్రస్తావనకు అవకాశం లేదు. పెట్టుబడి సామాజిక శ్రమను తన స్వాధీనంలోకి పూర్తిగా ఇంకా తెచ్చుకోలేనిచోట లేదా అక్కడక్కడా మాత్రమే తెచ్చుకున్న సందర్భంలో ఈ మిగులును వివరించటం సాధ్యం కాదు. ఆదిమ సమాజంలో కౌలును లాభంపైని మిగులుగా[1] ప్రస్తావించే ఫాసీ లాంటి వ్యక్తి అమాయకత్వాన్ని ప్రతిబింబిస్తుంది. అది నిజానికి చారిత్రకంగా నిర్వచించబడిన అదనపు విలువ సామాజిక రూపం మాత్రమే. అయితే ఫాసీ అభిప్రాయం ప్రకారం ఇది దాదాపుగా ఏ సమాజం లేకుండానే అస్తిత్వంలో ఉండవచ్చు.

పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం ఇంకా అభివృద్ధి చెందని రోజుల్లో దాన్ని సాధారణ రూపంలో విశ్లేషించ ప్రారంభించిన పాత ఆర్థికవేత్తలకు కౌలు విశ్లేషణ బొత్తిగా ఇబ్బందుల్ని తెచ్చిపెట్టలేదు. లేదా పూర్తిగా భిన్నమైన ఇబ్బందిని తెచ్చిపెట్టింది. ఫ్యూడల్ కాలానికి సన్నిహితంగా ఉన్న పెట్టీ, కేంటీలాన్ తదితర ఆర్థికవేత్తలు సాధారణ రూపంలో భూమి కౌలు అన్నది అదనపు విలువ యొక్క మామూలు రూపం అని భావించారు.[2] వారి దృష్టిలో లాభం అన్నది వేతనాలతోపాటు కలగాపులగంగా ఉంటుంది. మహా అయితే భూస్వామి నుంచి పెట్టుబడిదారుడు గుంజిన అదనపు విలువ భాగంగా అది కనిపిస్తుంది. వ్యవసాయ జనాభా జాతిలో ఇంకా అత్యధిక సంఖ్యాకులుగా వున్న సమయంలో సహజంగానే భూస్వామి భూ ఆస్తిపైన తన గుత్తాధిపత్యం కారణంగా ప్రత్యక్ష ఉత్పత్తిదారుల అదనపు

1. ఫాసీ రెంటె డూ సోల్ ...... పారిస్, 1854 - సం.
2. పెట్టీ "ఏ ట్రీటైజ్" లండన్, 1667, రిచర్డ్ కాంటిలాన్ "ఎస్సయ్" ఆమ్‌స్టర్‌డామ్, 1756 - సం.

శ్రమను ప్రప్రథమంగా స్వాహా చేసే వ్యక్తిగా కనిపిస్తాడు. కనుక అది వారి దృష్టిలో ఉత్పత్తికి ప్రధాన షరతుగా కనిపిస్తుంది. పెట్టుబడిదారీ దృష్టికోణం నుంచి అదనపు విలువ ఒక భాగాన్ని పెట్టుబడినుంచి భూ ఆస్తి ఎలా గుంజుకోగల్గుతుంది అన్న ప్రశ్న ఈ రచయితలకు ఇంకా అప్పటికీ ఉదయించలేదు. ప్రత్యక్ష ఉత్పత్తిదారుల నుంచి ఈ అదనపు విలువను గుంజుకుని పెట్టుబడి స్వయంగా స్వాహా చేస్తుందన్న అంశం వారికి గుర్తుకు రాలేదు.

ఫిజియోక్రాట్ల[1]ను వేరే స్వభావం గల ఇతర ఇబ్బందులు వేధించాయి. పెట్టుబడికి వాస్తవంగా క్రమబద్ధమైన మొదటి ప్రతినిధులుగా వారు సాధారణ రూపంలో అదనపు విలువ స్వభావాన్ని విశ్లేషించటానికి ప్రయత్నించారు. వారి దృష్టిలో కౌలు విశ్లేషణ, అదనపు విలువ విశ్లేషణ రెండూ ఒక్కటే. ఎందుకంటే వారు అదనపు విలువను కౌలు రూపంలో మాత్రమే గుర్తిస్తారు. కనుక కౌలు నిచ్చే వ్యవసాయ పెట్టుబడిని మాత్రమే అదనపు విలువను ఉత్పత్తి చేసే పెట్టుబడిగా వారు పరిగణిస్తారు. ఆ పెట్టుబడి చలనంలో ఉంచే వ్యవసాయ శ్రమ మాత్రమే అదనపు విలువను సృష్టిస్తుందని పెట్టుబడిదారీ దృష్టి నుంచి ఆ శ్రమను మాత్రమే ఉత్పాదక శ్రమగా వారు పరిగణిస్తారు. అదనపు విలువ సృష్టి అన్నదే నిర్ణయాత్మకమైన అంశం అని వారు పరిగణించటం సరియైనదే. నాలుగవ సంపుటిలో వారి ఇతర సుగుణాలను ప్రస్తావిద్దాం. అయితే ప్రాథమికంగా కేవలం చలామణి రంగంలో మాత్రమే పని చేసే వాణిజ్య పెట్టుబడి నుంచి ఉత్పాదక పెట్టుబడికి తిరిగి రావటం అన్నది ఒక ప్రధానమైన సుగుణం. వాణిజ్య వ్యవస్థ తన మొరటు వాస్తవిక పాదంతో ఆనాటి వాస్తవ మొరటు అర్థశాస్త్రం, పెట్టీ, అతని వారసులు చేసిన శాస్త్రీయ విశ్లేషణ ప్రారంభ ప్రయత్నాలను తన ఆచరణ ప్రయోజనాలకు అనుగుణంగా నేపథ్యంలోకి నెట్టివేసింది. ఈ వాణిజ్య వ్యవస్థ విమర్శలో పెట్టుబడిపైన, అదనపు విలువపైన దాని భావనలు మాత్రమే పరిశీలించటం జరిగింది. ప్రపంచ మార్కెట్ కోసం ఉత్పత్తి అన్నదాన్ని ద్రవ్యవ్యవస్థ సరిగ్గానే ప్రకటించిందని ఉత్పత్తి సరుకులుగానూ, సరుకులు డబ్బుగానూ రూపాంతరం చెందటం అన్నది పెట్టుబడిదారీ ఉత్పత్తికి అవసరమూ, షరతూ అన్న విషయం ఇంతకు ముందే తెలియజేయబడింది. ఈ వ్యవస్థ వాణిజ్య వ్యవస్థగా అభివృద్ధి చెందిన తరువాత సరుకుల విలువ డబ్బుగా మారటం అన్నది కాక అదనపు విలువ సృష్టి అన్నదే నిర్ణయాత్మక అంశం. అయితే చలామణి రంగం యొక్క అర్థరహిత దృష్టి కోణం నుంచి చూస్తే, అదనపు విలువ అన్నది అదనపు డబ్బుగా, వాణిజ్య మిగులుగా కనిపిస్తుంది. అదే సమయంలో ఆనాటి వ్యాపారుల, పరిశ్రమదారుల స్వభావోచితమైన లక్షణం వారు ప్రాతినిధ్యం వహించే పెట్టుబడిదారీ అభివృద్ధి దశకు అనుగుణంగానే ఉంటుంది. భూస్వామ్య వ్యవసాయ సమాజాలు పారిశ్రామిక సమాజాలుగా మారటమూ, ప్రపంచ మార్కెట్టులో జరిగే జాతుల పారిశ్రామిక పోరాటమూ అన్నది పెట్టుబడి శీఘ్రంగా అభివృద్ధి చెందటం పైన ఆధారపడి వుంటుంది. సహజమైన మార్గం అనబడేదాని ద్వారా కాక బలవంతపు చర్యల ద్వారా మాత్రమే ఇది సాధ్యమవుతుంది. జాతీయ పెట్టుబడి పారిశ్రామిక పెట్టుబడిగా క్రమంగా, నెమ్మదిగా రూపాంతరం చెందిందా లేక ప్రధానంగా భూస్వాములపైన, మధ్యతరగతి రైతులు, సన్నకారు రైతులు, చేతిపనివారలపైన రక్షణ సుంకాలు విధించటం ద్వారా శీఘ్రంగా జరిగిందా అన్న రెండు

1. ఫిజియోక్రాట్ : 18వ శతాబ్దంలో క్విన్‌సీ అనుయాయులు - భూమే ఉత్పత్తికి కార్యం అని - సం.

అంశాల మధ్య అపారమైన భేదముంది. స్వతంత్ర, ప్రత్యక్ష ఉత్పాదకులను వేగంగా దోచుకోవటం ద్వారా ప్రచండమైన వేగవృద్ధితో పెట్టుబడి సంచయనం, కేంద్రీకరణ ద్వారా క్లుప్తంగా చెప్పాలంటే వేగం పుంజుకున్న పెట్టుబడిదారీ ఉత్పత్తి వ్యవస్థాపన ద్వారా ఈ రూపాంతరం జరిగిందా లేదా అన్నది ప్రధానమైన అంశం. ప్రకృతిసిద్ధమైన జాతీయ ఉత్పాదక శక్తిని పెట్టుబడిదారీ పారిశ్రామిక మార్గంలో దోపిడీ చెయ్యటంలో అది అపారమైన భేదాన్ని సృష్టిస్తుంది. కనుక వాణిజ్య వ్యవస్థ జాతీయ స్వభావం గురించి ఆ వ్యవస్థ ప్రతినిధులు మాట్లాడటం కేవలం ఒక నినాదం మాత్రమే కాదు. జాతీయ సంపద గురించి ప్రభుత్వ వనరులు మాత్రమే తమ లక్ష్యం అని చెపుతూ నిజానికి వారు ప్రకటించే ప్రయోజనాలు పెట్టుబడిదారీ వర్గానికి మాత్రమే. ప్రభుత్వ అంతిమ లక్ష్యం సంపదను కూడబెట్టడం మాత్రమే అని చెప్పడం ద్వారా పాత, దైవదత్త ప్రభుత్వం స్థానంలో బూర్జువా సమాజాన్ని ప్రకటించటం మాత్రమే. అయితే అదే సమయంలో పెట్టుబడి, పెట్టుబడిదారీ వర్గపు, పెట్టుబడిదారీ ఉత్పత్తి ప్రయోజనాల అభివృద్ధే ఆధునిక సమాజంలో జాతీయ శక్తికి, జాతీయ ఆధిపత్యానికి పునాదిని రూపొందిస్తుందన్న సంగతి వారికి చాలా స్పష్టంగా తెలుసు.

అంతేకాక ఫిజియోక్రాట్లు అదనపు విలువ ఉత్పత్తి అంతా, పెట్టుబడి అభివృద్ధి అంతా వ్యవసాయ శ్రమ ఉత్పాదకతపైన ఆధారపడి వుంది అంటారు. అది సరియైనదే. ఒక పనిదినంలో ఒక కార్మికుడు తన సొంత పునరుత్పత్తికి అవసరమైన జీవనాధార సాధనాలను అంటే ఖచ్చితంగా చెప్పాలంటే వ్యవసాయ ఉత్పాదితాలకంటే ఎక్కువగా ఉత్పత్తి చెయ్యలేకపోతే, అతని శ్రమశక్తి రోజువారీ వ్యయం వల్ల తన సొంత వ్యక్తిగతమైన తప్పనిసరి అవసరాలను తీర్చే జీవనాధార వస్తువులను మాత్రమే ఉత్పత్తి చేస్తే – అప్పుడు అదనపు ఉత్పాదితం గురించి గాని, అదనపు విలువ గురించి గాని మాట్లాడటమే సాధ్యం కాదు. కార్మికుని వ్యక్తిగత అవసరాలకు మించిన వ్యవసాయ శ్రమ ఉత్పాదకత అన్నది అన్ని సమాజాలకూ పునాది. ముఖ్యంగా మౌలిక ఆహార పదార్థాల ఉత్పత్తి నుంచి నిరంతరాయంగా రానురానూ మరింత ఎక్కువ సంఖ్యలో ఒక సామాజిక విభాగాన్ని వేరుచేసి స్టువార్ట్[1] పేర్కొన్న విధంగా "స్వేచ్ఛాయుతమైన హస్తాలు"గా మార్చే, ఇతర రంగాలలో దోపిడీ చెయ్యబడటానికి వీలుగా వారిని సిద్ధంగా వుంచే పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం యొక్క ప్రాతిపదిక అది.

ఇక డెయిరే, ఫాసీ తదితర ఈ కాలపు అర్థశాస్త్ర రచయితలు సంప్రదాయ అర్థశాస్త్రం అస్తమిస్తున్న సమయంలో, నిజానికి అవి మరణశయ్యపై ఉన్నప్పుడు, అదనపు శ్రమ, సాధారణ రూపంలో అదనపు విలువల సహజ పరిస్థితులకు సంబంధించి అత్యంత ఆదిమ భావనలను చిలకల్లా వల్లించటాన్ని ఏమనాలి? ఈ భూమి కౌలును ఒక ప్రత్యేక రూపంగా పరిశీలించిన చాలా కాలానికి, అది అదనపు విలువ యొక్క ప్రత్యేక రూపంగా మారిన చాలా కాలానికి తమ చిలక పలుకుల్ని భూమి కౌలు విషయంలో ఒక కొత్త అంశంగాను, కొట్టొచ్చినట్టు కనిపించే అంశంగాను ఊహించుకోటాన్ని ఏమనాలి?[2] ఇప్పుడు కాలంచెల్లిన ఒక అభివృద్ధి దశ తొలి సంవత్సరాలలో కొత్త, మౌలిక, పరిపూర్ణ,

1. జె. స్టువార్ట్ యాన్ యింక్వరీ ఇన్ టు ది ప్రిన్స్‌పుల్స్ ఆఫ్ పొలిటికల్ ఎకానమీ, సంపుటి I, డబ్లిన్, 1770, పుట 396 - సం.
2. డెయిరే : ఇంట్రడక్షన్ ఫిజియోక్రాట్స్, పారిస్, 1846. ఫాసీ రెంటే డూ సోల్. డిక్షనరీ ఆఫ్ పొలిటికల్ ఎకానమీ, పారిస్, 1854 - సం.

సమర్థనీయమైన భావనలు నేలబారు అభిప్రాయాలుగా, పాత పొరపాటు అభిప్రాయాలుగా మారిపోయిన కాలాలలో అదే భావనలను వ్యక్తం చేయటంతోపాటు అర్థశాస్త్ర స్వాభావిక లక్షణం సంప్రదాయ అర్థశాస్త్రం పట్టించుకొన్న అంశాల్లోని విషయాల గురించి దీనికి బొత్తిగా అవగాహన లేదనేది స్పష్టం. బూర్జువా సమాజంకంటే తక్కువ అభివృద్ధి స్థాయి వున్న దశలో మాత్రమే వెయ్యాల్సిన ప్రశ్నలతో ఆ సమస్యలను అది ఎదుర్కొంటుంది. స్వేచ్ఛా వాణిజ్యానికి సంబంధించి కూడా ఫిజియోక్రాటిక్ పదాలను నిరంతరాయంగా పూర్తి ఆత్మసంతృప్తితో ఉపయోగించటం విషయంలో కూడా ఇది వర్తిస్తుంది. ఈ పదాలు చాలా కాలం క్రితమే సైద్ధాంతిక ఆసక్తిని కోల్పోయాయి. ఏదో ఒక ప్రభుత్వం యొక్క ఆచరణాత్మక దృష్టిని ఈ పదాలు ఆకర్షిస్తే ఆకర్షించవచ్చుగాక.

సహజ ఆర్థిక వ్యవస్థలో ఉత్పాదితం చలామణి క్రమంలో బొత్తిగా ప్రవేశించని పరిస్థితుల్లో లేదా కొద్దిపాటి స్వల్పభాగం మాత్రమే ప్రవేశించినప్పుడు భూస్వామ్య ఆదాయానికి ప్రాతినిధ్యం వహించే ఉత్పాదితం యొక్క సాపేక్షంగా చిన్నదైన ఆ భాగం మాత్రమే చలామణి క్రమంలోకి ప్రవేశిస్తుంది. ఉదాహరణకు రోమన్ పెద్ద జమీందారులను చూడవచ్చు. లేదా షార్లమాన్ భారీ భవనాలను చూడవచ్చు. దాదాపు మధ్యయుగాల అనుభవాన్ని చూడవచ్చు. (విన్‌కార్ద్ రాసిన "హిస్టోరియ్ డూ ట్రావైల్"ను చూడండి.) పెద్ద పెద్ద ఎస్టేట్ల ఉత్పాదితమూ, అదనపు ఉత్పాదితం కేవలం వ్యవసాయ ఉత్పాదితాలనే కాక పారిశ్రామిక ఉత్పాదితాలను కూడా కలిగి ఉంటాయి. ఇళ్ళలో నిర్వహించే చేతివృత్తుల శ్రమకు వ్యవసాయ శ్రమ తరువాత ద్వితీయ స్థానం ఉంటుంది. సహజ ఆర్థిక విధానం అనబడే ఆ ఉత్పత్తి విధానానికి ఈ అంశాలు తప్పనిసరి అవసరాలు. ప్రాచీన యూరప్‌లోనూ, మధ్య యుగాలలోనూ, ఇంకా సాంప్రదాయ వ్యవస్థ విచ్ఛిన్నంగాని నేటి భారతీయ సమాజంలోనూ ఇది గమనించవచ్చు. పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం ఈ సంబంధాన్ని పూర్తిగా రద్దుచేస్తుంది. 18వ శతాబ్దపు చివరి మూడోభాగంలో ముఖ్యంగా ఇంగ్లాండులో ఈ క్రమాన్ని పెద్ద స్థాయిలో గమనించవచ్చు. అర్థభూస్వామ్య సమాజాలలో పుట్టి పెరిగిన హెరెన్‌స్వాండ్ లాంటి ఆలోచనాపరులు 18వ శతాబ్దపు చివరిదశలో సహితం వ్యవసాయం నుంచి ఈ రకంగా పరిశ్రమ విడిపోవటాన్ని తెలివిమాలిన సామాజిక దుస్సాహసంగానూ, ఆలోచించటానికే వీలుకానంత ప్రమాదకరమైన అస్తిత్వ విధానంగానూ పరిగణిస్తున్నారు. పెట్టుబడిదారీ వ్యవసాయంతో ఎక్కువ పోలికలు కలిగిన కార్థేజ్, రోమ్ లాంటి ప్రాచీన వ్యవసాయ ఆర్థిక వ్యవస్థల్లో సహితం ఆ సామ్యం మొత్తం పెట్టుబడిదారీ దోపిడీ విధానం కంటే తోటల ఆర్థిక వ్యవస్థకే ఎక్కువ దగ్గరగా వుంటుంది.[1] పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానంతో పరిచయం వున్న వ్యక్తికి ఈ రెండు వ్యవస్థల మధ్య అన్ని ప్రధాన అంశాలలోనూ రూపం విషయంలో

1. కౌలు, లాభమూ అన్నవి తన కాలంలో ఇంకా దానినుంచి మరొకటి వేరుపడిపోలేదని (ఉష్ణమండల దేశాలలోనూ, సమశీతోష్ణ మండల దేశాలలోనూ ఈనాడు కూడా ప్లాంటేషన్‌లో ఇది వర్తిస్తుంది.) ఆడమ్ స్మిత్ పేర్కొన్నాడు. (స్మిత్ యాన్ యింక్వరీ..... 1848 - సం॥) ఇక్కడ భూస్వామే పెట్టుబడిదారుడు. ఉదాహరణకు తన ఎస్టేటులను తానే నిర్వహించుకున్న కాటో. అయితే ఇలా వేరుపడటం అన్నదే పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానానికి ప్రాథమిక అవసరం. దాని భావనకు బానిస వ్యవస్థకున్న పునాది విరుద్ధంగా వుంది.

పోలిక ఉండటం పూర్తిగా భ్రమ అని తెలుసు. ఆ వ్యక్తి ప్రతి ఆర్థిక వ్యవస్థలోనూ శ్రీమాన్ మామ్సెన్[1] లాగా పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానాన్ని కనుక్కోరు. మొత్తం ప్రాచీన ఇటలీ అంతటిలోనూ కాక సిసిలీ విషయంలో మాత్రమే కొంత పోలికను గమనిస్తారు. ఎందుకంటే – ఈ దీవిలో వ్యవసాయం ప్రధానంగా ఎగుమతి కోసమే చేయబడింది. కనుక అది వ్యవసాయ సుంకాలను వసూలు చేసే కేంద్రంగా రోమ్‌కు తోడ్పడింది. ఆధునిక అర్థంలో అక్కడ ఆ నాటికే రైతులు ఉన్నారు.

చర్చికి ఉత్పత్తిలో పదోవంతు భాగాన్ని సమర్పించుకునే పద్ధతివల్ల కొంత, దీర్ఘకాలంగా ఆనవాయితీగా వస్తున్న ఒప్పందాల్లో ధాన్య రూపపు చెల్లింపులు అమల్లో వుండటం వల్ల కొంత ఇవి పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానపు పరిస్థితులకు పూర్తి విరుద్ధంగా మధ్యయుగాల సహజ ఆర్థిక విధానాల నుంచి ఆధునిక కాలానికి ఈ ఆనవాయితీ సాగలాగటంవల్ల కౌలు స్వభావానికి సంబంధించిన ఒక పొరపాటు భావన తలెత్తింది. కౌలు అన్నది వ్యవసాయ ఉత్పాదితం ధర నుంచి గాక దాని ఉత్పత్తి మొత్తం నుంచి తలెత్తుతుందని, సామాజిక పరిస్థితుల నుంచి కాక భూమి నుంచి తలెత్తుతుందని అభిప్రాయం కలగజేస్తుంది. అదనపు విలువ అదనపు ఉత్పాదితంలో వ్యక్తమయినప్పటికీ ఉత్పత్తి మొత్తం పెరుగుదలకు ప్రాతినిధ్యం వహించే అదనపు ఉత్పాదితం అన్నది అదనపు విలువను కలిగి వుంటుందని అర్థం కాదని మనం ఇంతకు ముందు తెలియజేశాం. అది విలువలో మినహాయింపు పరిమాణానికి ప్రాతినిధ్యం వహించవచ్చు. అలా కాకుంటే 1840తో పోల్చి చూస్తే, 1860 జౌళి పరిశ్రమ అపారమైన అదనపు విలువను చూపించి ఉండాల్సింది. అయితే అందుకు విరుద్ధంగా నూలు ధర పడిపోయింది. పంటలు వరుసగా విఫలం కావటంవల్ల ధాన్యం ధర పెరుగుతుంది. కనుక కౌలు అపారంగా పెరగవచ్చు. పూర్తిగా తగ్గిపోతున్న గోధుమ మరింత ప్రియంగా మారుతుంది. ఈ అదనపు విలువ ప్రియంగా మారిన గోధుమలా కనిపించినప్పటికీ ఇది వర్తిస్తుంది. ఇందుకు విరుద్ధంగా వరుసగా పంటలు బాగా పండిన సంవత్సరాలలో ధాన్యం ధర పడిపోతుంది కనుక తగ్గిన కౌలు చౌక గోధుమ యొక్క పెరిగిన పరిమాణంలా కనిపించినప్పటికీ కౌలు పడిపోవచ్చు. ధాన్యం రూపంలో కౌలుకు సంబంధించి ఒక విషయాన్ని గమనించాలి. మొదటిది, ఒక కాలంచెల్లిన ఉత్పత్తి విధానం నుంచి దాని అస్థిత్వ శిథిలంగా ఆ పాత సంప్రదాయం సుదీర్ఘ కాలం కొనసాగుతుంది. పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానానికి అది విరుద్ధం అన్న సంగతి ప్రైవేటు ఒప్పందాల నుంచి అవి మాయమవ్వటం ద్వారా వ్యక్తమవుతుంది. ఇంగ్లాండులో చర్చికి కట్టే పదోవంతు ఉత్పాదితం విషయంలో లాగా చట్టం జోక్యం చేసుకున్నచోట ఈ ఆనవాయితీని వదిలించుకోవచ్చు. రెండవది, పెట్టుబడిదారీ ఉత్పత్తి ప్రాతిపదికపైన ధాన్యం కౌలు ఇంకా కొనసాగుతూ వుంటే అది డబ్బు కౌలుకకు మధ్యయుగాల ముసుగుకు వ్యక్తీకరణ తప్ప మరొకటి కాదు, కాజాలదు. ఉదాహరణకు ఒక బస్తా ధాన్యం ధర 40 షిల్లింగులు ఉందనుకుందాం. ఇందులో ఒక భాగం వాటిలో వున్న వేతనాలను భర్తీ చెయ్యాలి. వ్యయాన్ని పునరుద్ధరించటానికిగాను ఆ భాగాన్ని అమ్మి సిద్ధం చెయ్యాలి. దాని వాటాకు చెల్లించాల్సిన

1. మామ్సెన్ తన "రోమన్ హిస్టరీ"లో పెట్టుబడిదారు అన్న పదాన్ని ఆధునిక అర్థశాస్త్రం ఇచ్చే అర్థంలోగాని, ఆధునిక సమాజం ఇచ్చే అర్థంలోగాని ప్రయోగించలేదు. దానిని ఒక విస్తృత ప్రచారం కలిగిన భావనగా ప్రయోగిస్తాడు. ఇంగ్లాండు, అమెరికాలో తప్ప యూరప్‌లో అన్ని దేశాలలోనూ గడిచిపోయిన పరిస్థితులను ప్రతిబింబించే ప్రాచీన సంప్రదాయంగా ప్రచారంలో వుంది.

పన్నుల కోసం మరో భాగాన్ని అమ్మాలి. పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం, సామాజిక శ్రమ విభజన అభివృద్ధి చెందినచోటల్లా విత్తనాలు, ఎరువుల్లో ఒక భాగమూ పునరుత్పత్తి ప్రక్రియలో సరుకులుగా ప్రవేశిస్తాయి. భర్తీ చెయ్యటం కోసం వాటిని కొనుగోలు చెయ్యాల్సి వుంటుంది. కనుక ఈ బస్తాలో మరో భాగం దీనికి అవసరమైన డబ్బు కోసం అమ్మాల్సి వుంటుంది. వాస్తవంగా సరుకుల రూపంలో కొనాల్సిన అవసరం లేకుండా పునరుత్పత్తిలో కొత్తగా ఉత్పత్తి పరిస్థితులుగా ప్రవేశించటం కోసం ఉత్పాదితం నుంచే అదే రూపంలో తీసుకోబడతాయి. ఇది వ్యవసాయంలోనే కాక స్థిర పెట్టుబడిని ఉత్పత్తి చేసే అనేక ఉత్పత్తి రంగాల్లో కూడా ఇలాగే జరుగుతుంది. ఖాతా పుస్తకాల్లో అవి ఖాతా డబ్బుగా నమోదవుతాయి. ఉత్పత్తి ఖర్చులుగా తీసివేయబడతాయి. యంత్రాల అరుగుదల సాధారణ రూపంలో, నిశ్చల పెట్టుబడి డబ్బు రూపంలో లెక్కించాల్సి వుంటుంది. ఆఖరికి వచ్చేది లాభం. అది ఈ మొత్తం సొమ్ము మీద లెక్కించబడుతుంది. అది వాస్తవంగా డబ్బు రూపంలో లేదా ఖాతా డబ్బు రూపంలో ఖర్చులుగా వ్యక్తమవుతుంది. ఈ లాభం మొత్తం ఉత్పాదితం యొక్క ఒక నిర్దిష్ట భాగానికి ప్రాతినిధ్యం వహిస్తుంది. అయితే అది దాని ధరచేత నిర్ణయించబడుతుంది. ఇంకా మిగిలి ఉండే అదనపు మొత్తం కౌలుగా రూపొందుతుంది. ఇలా ధరచేత నిర్ణయించబడిన మిగులుకంటే ఒప్పందం ద్వారా అమల్లో ఉన్న ధాన్యం కౌలు ఎక్కువగా ఉంటే అప్పుడది కౌలును కలిగి ఉండదు. అది లాభం నుంచి తీసివేయబడిన మొత్తం మాత్రమే. ఇలాంటి అవకాశం వల్ల మాత్రమే ఉత్పాదితం ధరను అది ప్రతిబింబించకపోతే, ధాన్యపు కౌలు అన్నది కాలంచెల్లిన రూపం మాత్రమే. ఈ ధాన్యపు కౌలు వాస్తవమైన కౌలుకంటే ఎక్కువ కావచ్చు లేదా తక్కువగా ఉండవచ్చు. ఆ రకంగా అది లాభం నుంచి తీసివేసిన మొత్తం లాభంగా మాత్రమేకాక పెట్టుబడిని భర్తీచేయటానికి అవసరమైన అంశాల నుండి కూడా గ్రహించబడిన మొత్తం కావచ్చును. నిజానికి ఈ ధాన్యం కౌలు పేరుతోనేకాక సారాంశం రీత్యా కూడా కౌలుగా వున్నంత మేరకు ఉత్పత్తి ధరపైన ఉత్పాదితం ధరకు ఉన్న మిగులుచేత నిర్ణయించబడుతుంది. ఈ అస్థిర భాగమే స్థిర పరిమాణంగా ఉంటుందని అది ఊహిస్తుంది. అయితే ఇది ఎంత ఉల్లాసకరమైన ఊహ అంటే ఈ ఉత్పాదితం ముందు కార్మికుని పోషించగలగాలి. తరువాత పెట్టుబడిదారీ కౌలుదారీ రైతుకు అతని అవసరమైన ఆహారంకంటే ఎక్కువ వదలాలి. చివరి అంశం ఏమంటే, ఆ మిగులులో సహజమైన కౌలు ఉండాలి. ఇక్కడ 2,00,000 గజాల జౌళి వస్త్రాలను తయారుచేసే పరిశ్రమదారునితో పోల్చవచ్చు. కార్మికులకు బట్టల అవసరం తీర్చటానికి, పరిశ్రమదారుని భార్యకు, పిల్లలకు, తనకు సమృద్ధిగా వస్త్రాలను సమకూర్చటానికి ఇది సరిపోతుంది. అంతేకాక తగినంత స్థాయిలో విక్రయానికి వీలైన వస్త్రాలు వుంటాయి. పైగా జౌళి వస్త్రాల రూపంలో అపారమైన స్థాయిలో కౌలు చెల్లించటంతోపాటు ఇవి ఉంటాయి. ఇది ఎంత సాదాగా ఉందని! 2,00,000 గజాల జౌళి వస్త్రాల నుంచి ఉత్పత్తి ధరను తీసివెయ్యి. జౌళి వస్త్రాలపైనున్న అదనపు మొత్తం కౌలు కోసం మిగిలి వుంటుంది. ఈ వస్త్రాల అమ్మకం ధర తెలియకుండానే 2,00,000 గజాల జౌళి వస్త్రాల నుంచి 10 వేల పౌండ్ల సొమ్మును, ఉత్పత్తి ధరను తీసివెయ్యటం అన్నది నిజంగా అమాయకత్వమే. జౌళి వస్త్రాల నుంచి డబ్బును తీసివెయ్యటం ఉపయోగపు విలువ నుంచి మార్కెట్టు విలువను తీసివెయ్యటమూ, పౌండ్లు, స్టెర్లింగులకు మించిన జౌళి వస్త్రాల మిగులు గజాలను నిర్ణయించటమూ అమాయకత్వమవుతుంది. ఇది వృత్తాన్ని చతురస్రంగా మార్చటం కంటే అధ్వాన్నం.

కనీసం దీనిలో సరళరేఖలు, వక్రరేఖలు ఎక్కడ ఏకీభవిస్తాయో దానికి ఒక పరిమితి వుందన్న భావన వుంది. అయితే ఇది ఎమ్. ఫాసీ చేసిన వంటకం. జౌళి వస్త్రాలు ఒకరి మనస్సులో లేదా వాస్తవంగా డబ్బుగా మారటానికి ముందే జౌళి వస్త్రాల నుంచి డబ్బును తీసివెయ్యండి! ఇక మిగిలేది కౌలే. అయితే దానిని "సహజం"గా అర్థం చేసుకోవాలి. (చూ: ఉదాహరణకు కార్ల ఆరండ్[1] రచన) అంతేగాని కుతర్కపు దెయ్యాల్లా మాత్రం కాదు. ధాన్యపు రూపంలో కౌలును మొత్తంగా పునరుద్ధరించటం అన్నది, ఫలానా ఇన్ని గోధుమల నుండి దాని ఉత్పత్తి ధరను, దాని కొలమానం నుండి ఒక డబ్బు మొత్తాన్ని తీసివెయ్యటంలాంటి వెర్రితనానికి ఇది కుదించబడింది.

## II. శ్రమ కౌలు

భూమి కౌలును దాని సాదా రూపంలో, శ్రమ కౌలు రూపంలో పరిశీలిస్తే, ఈ సందర్భంలో పరిస్థితి స్పష్టంగా ఉంటుంది. ఎందుకంటే ఈ విషయంలో కౌలూ, అదనపు విలువా రెండూ ఒకటే. ఈ సందర్భంలో ప్రత్యక్ష ఉత్పాదకుడు వాస్తవంగా లేదా చట్టబద్ధంగా అతనికి చెందే శ్రమ పరికరాలను (నాగలి, పశువులు వగైరా) ఉపయోగించి తనే యజమానిగా ఉన్న భూమిలో వారంలో కొన్ని దినాలు సాగు చేస్తాడు. మిగతా రోజుల్లో భూస్వామి నుంచి ఎటువంటి పారితోషికం లేకుండా అతని ఎస్టేటులో పనిచేస్తాడు. వేతనం చెల్లించని అదనపు శ్రమ ఇక్కడ వ్యక్తం అయ్యేది లాభం రూపంలో కాదు, కౌలు రూపంలో మాత్రమే. కార్మికుడు (స్వయం పోషకదాసులు) ఈ సందర్భంలో తనకు తప్పనిసరి జీవిత అవసరాలను మించి అనగా పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానంలో మనం వేతనాలు అని పిలిచే వాటిపైన మిగిలే మొత్తం, మిగిలిన పరిస్థితులన్ని యథాతథంగా ఉన్నప్పుడు, తనకోసం ఖర్చు చేసుకునే శ్రమ కాలానికి, అతని భూస్వామి కోసం బలవంతంగా ఉపయోగించాల్సిన శ్రమ కాలానికి మధ్య ఉన్న నిష్పత్తిపై ఆధారపడి వుంటుంది. తప్పనిసరి జీవితావసరాలకు మించిన మిగులు, పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానంలో లాభంగా కనిపించే ఈ మిగులు మొత్తంగా భూమి కౌలు పరిమాణంపైన ఆధారపడి వుంటుంది. ఈ సందర్భంలో భూమి కౌలు కేవలం వేతనం చెల్లించని అదనపు శ్రమ మాత్రమే కాక అది అలా కనిపిస్తుంది కూడా. ఉత్పత్తి సాధనాల 'యజమానికి' అది వేతనం చెల్లించని అదనపు శ్రమ మాత్రమే. ఇక్కడ అవి ఒకదానితో ఒకటి భిన్నంగా ఉన్న మేరకు అవి భూమితో ఏకీభవిస్తాయి. అవి భిన్నంగా వున్న మేరకు దానికి సహాయ అంశాలుగా మారిపోతాయి. భూస్వామ్యదాసుని ఉత్పాదితం అతని జీవితావసర అంశాలతోపాటు అతని శ్రమ పరిస్థితులను కూడా పునరుత్పత్తి చేయడానికి సరిపోయి ఉండాలి. ఈ పరిస్థితి అన్ని ఉత్పత్తి విధానాల్లోనూ ఇలాగే వుంటుంది. ఎందుకంటే అది వాటి ప్రత్యేక రూపం ఫలితం కాదు. నిరంతరాయంగా కొనసాగే ఏ ఉత్పత్తి అయినా అదే సమయంలో పునరుత్పత్తి అవుతుంది కనుక (తన పని పరిస్థితుల పునరుత్పత్తితో సహా) నిరంతరాయమైన పునరుత్పాదక శ్రమకు అది ఒక సహజమైన అవసరం. ఉత్పత్తి సాధనాలనూ, తన సొంత జీవితావసరాల ఉత్పత్తి కోసం అవసరాలను, శ్రమ పరిస్థితులను ప్రత్యక్ష ఉత్పాదకుడు "కలిగి ఉన్నప్పుడు" ఆస్తి సంబంధం ప్రభువుకూ, దాసునికీ మధ్య ఉన్న సంబంధంగా కనిపిస్తుంది.

1. కె. ఆరండ్, ది నేచురల్..... హానో, 1845 - సం.

ప్రత్యక్ష ఉత్పాదకుడు ఇక్కడ స్వతంత్రుడు కాదు. స్వేచ్ఛ లేకపోవటం అన్నది బలవంతపు శ్రమతో కూడిన దాస్యత్వం నుంచి ప్రభువుకు కప్పం కట్టాల్సిన పరిస్థితికి కుదించవచ్చు. మన ఊహ ప్రకారం ప్రత్యక్ష ఉత్పాదకుడు తన సొంత ఉత్పత్తి సాధనాలను కలిగి ఉంటాడు. అతని శ్రమను వాస్తవ రూపం ధరింపచెయ్యటానికి అవసరమైన భౌతిక శ్రమ పరిస్థితులను, అతని జీవితావసర వస్తువుల ఉత్పత్తికి వీలుపడే పరిస్థితులను అతడు కలిగి ఉంటాడు. అతడు తన వ్యవసాయ కార్యకలాపాన్ని, దానితో జోడింపబడి ఉండే గ్రామీణ గృహ పరిశ్రమలను స్వతంత్రంగా నిర్వహిస్తాడు. భారతదేశంలో లాగా చిన్న రైతులు తమలో తాము ఒక ఉత్పత్తి సముదాయంగా రూపొందవచ్చు. అయితే ఈ పరిస్థితివల్ల ఈ స్వతంత్రం బలహీనపడదు. ఎందుకంటే ఇక్కడ స్వతంత్రం అన్నది ఒక నామమాత్రమైన ప్రభువు నుంచి మాత్రమే అని అర్థం. అటువంటి పరిస్థితులలో అదనపు శ్రమ అన్నదాన్ని భూమిపైన ఈ నామమాత్రపు ప్రభువు ఆర్థికమైన వత్తిడి ద్వారా కాక మరే రూపంలోనైనా గుంజుకుంటాడు.[1] బానిస వ్యవస్థలోనూ, తోటల ఆర్థిక విధానంలోనూ ఇది భిన్నంగా వుంటుంది. అక్కడ బానిస పరాయి ఉత్పత్తి పరిస్థితుల్లో పని చేస్తాడు. స్వతంత్రంగా కాదు. కనుక అక్కడ వ్యక్తిగతంగా ఆధారపడాల్సిన పరిస్థితులు వుంటాయి. ఏదో ఒక మేరకు వ్యక్తిగత స్వేచ్ఛ లోపిస్తుంది. బానిస భూమికి ఒక అనుబంధంగా కట్టివేయబడతాయి. దాని నిజమైన అర్థంలో దాస్యం అన్నమాటకే ప్రతిరూపంగా ఉంటాడు. ప్రత్యక్ష ఉత్పాదకులు ఒక ప్రైవేటు భూస్వామి ఆధిపత్యంలో కాక ఆసియాలోలాగా ప్రత్యక్ష ప్రభుత్వ ఆధిపత్యం కింద ఉంటే అప్పుడు కౌలు, పన్నులు ఒక్కటే అవుతాయి. అంటే ఈ రూపంలో ఉన్న భూమి కౌలుకు భిన్నమైన పన్ను ఏదీ అప్పుడు ఉండదు. అటువంటి పరిస్థితులలో మొత్తంగా ప్రభుత్వానికి ఉమ్మడిగా లోబడటానికి మించి అంతకంటే బలమైన రాజకీయ లేదా ఆర్థిక వత్తిడి ఏదీ ఉండదు. అప్పుడు ప్రభుత్వమే అందరికంటే పెద్ద భూస్వామి. సర్వసత్తాకత అన్నది ఇక్కడ జాతీయ స్థాయిలో కేంద్రీకృతమైన భూ యాజమాన్యంలో ఉంటుంది. భూమిని ప్రైవేటుగానూ, ఉమ్మడిగానూ ఉపయోగించుకోవటం వున్నప్పటికీ భూమిపైన ప్రైవేటు యాజమాన్యం ఉండదు.

ప్రత్యక్ష ఉత్పాదకుల నుంచి వేతనం చెల్లించని అదనపు శ్రమను బయటికి పంపించే ప్రత్యేక ఆర్థిక రూపం పాలకులకు, పాలితులకు మధ్య సంబంధాన్ని నిర్ణయిస్తుంది. అది సూటిగా ఉత్పత్తి నుంచే పెరుగుతుంది. కనుక ఆ సంబంధాన్ని నిర్ణయించే అంశంగా దానిపైన ప్రతిస్పందిస్తుంది. దీనిపైన ఆ మొత్తం ఆర్థిక సమాజ నిర్మాణం ఆధారపడి వుంటుంది. ఈ సమాజ నిర్మాణం ఉత్పత్తి సంబంధాల నుంచి, అదే సమయంలో దాని ప్రత్యేక రాజకీయ రూపం నుంచి తలెత్తుతుంది. అది ఎప్పుడూ ఉత్పత్తి పరిస్థితుల యజమానులకు, ప్రత్యక్ష ఉత్పాదకునికి మధ్య ప్రత్యక్ష సంబంధంగానే ఉంటుంది. ఈ సంబంధం ఎప్పుడూ సహజంగానే శ్రమ పద్ధతుల నిర్దిష్ట అభివృద్ధి దశకు, దాని సామాజిక ఉత్పత్తి ధరకు అనుగుణంగా వుంటుంది. అది అంతర్నిహితంగా వున్న రహస్యాన్ని మొత్తం సామాజిక నిర్మాణానికి ఉన్న గుప్త ఆధారానికి, సర్వాధిపత్యానికి, పరాధీనతకూ మధ్య సంబంధానికి

---

1. ఒక దేశాన్ని జయించిన తరువాత విజేత తక్షణ ఉద్దేశం అక్కడి ప్రజల్ని కూడా తనకు ఉపయోగకరంగా మలుచుకోవటమే. CF. Linguet [Theorie des loix civiles, ou Principes fondamentaux de la societe, Tomes I-II, Londres, 1767. -Ed.]. See also Moser [Osnabrukische Geschichte, 1.Theil, Berlin und Stettin, S 178.-Ed.].

ఉన్న రాజకీయ రూపాన్ని, దాని పునాదిని వెల్లడిస్తుంది. అంటే దానికి అనుగుణమైన ప్రత్యేక రాజ్యాంగ యంత్ర రూపాన్ని అది వెల్లడిస్తుంది. అసంఖ్యాకంగా ఉన్న విభిన్న అనుభవాలు పరిస్థితులవల్ల, సహజమైన వాతావరణం వల్ల, వర్ణ సంబంధాలవల్ల, బాహ్య చారిత్రక ప్రభావాలు మొదలైన వాటివల్ల ఈ ఆర్థిక ప్రాతిపదిక దాని ప్రధాన పరిస్థితుల దృష్టి నుంచి అసంఖ్యాకమైన రూప వైవిధ్యాలను చూపించకుండా వుండజాలదు. ఆచరణలో ఉన్న పరిస్థితులను విశ్లేషించటం ద్వారా మాత్రమే ఆ పునాదిని నిర్ధారించటం సాధ్యమవుతుంది.

శ్రమ కౌలుకు సంబంధించి, అత్యంత సాదా, ఆదిమ కౌలు రూపం గురించి యిది విశదం. ఇక్కడ కౌలు అన్నది అదనపు శ్రమ యొక్క అనాది రూపం, దానితో ఏకీభవిస్తుంది. అయితే అదనపు విలువ ఇతర వేతనం చెల్లించని శ్రమతో సర్వసమం కావటం అన్నదానిని ఇక్కడ విశ్లేషించాల్సిన అవసరం లేదు. ఎందుకంటే ఆ రూపం ఇక్కడ స్పష్టంగానూ, సాదాగాను ఇప్పటికీ కనిపిస్తుంది. ప్రత్యక్ష ఉత్పత్తిదారుడు తనకై తాను చేసుకునే శ్రమ, భూస్వామికి చేసే శ్రమ, స్థల, కాలాల్లో స్పష్టంగా విభజించబడింది. భూస్వామికి చేసే శ్రమ మరో వ్యక్తికోసం చేసే బలవంతపు శ్రమగా తరువాత ప్రత్యక్షంగా పాశవిక రూపంలో కనిపిస్తూనే ఉంది. అదేరకంగా కౌలును ఉత్పత్తి చేసే భూమి "స్వభావం" అన్నది ఇక్కడ బహిరంగ రహస్యం స్థాయికి కుదించబడింది. కౌలును సమకూర్చాలి అంటే భూమికి మానవ శ్రమశక్తిని జోడించాల్సిందే. ఆనాడు ఉన్న ఆస్తి సంబంధం వల్ల శ్రమశక్తి యజమాని తన తప్పనిసరి అవసరాలను తీర్చుకోవటం కోసం తన శ్రమశక్తిని తన అవసరాలకు మించి క్రియాశీలంగా మారుస్తాడు. ఈ శ్రమశక్తి అదనపు వ్యయాన్ని భూస్వామి స్వాధీనం చేసుకోవటంలోనే కౌలు అన్నది ఇమిడి వున్నది. ప్రత్యక్ష ఉత్పత్తిదారుడు అంతకుమించి కౌలు చెల్లించడు. అదనపు విలువ, కౌలు ఒకే రూపంలో వున్న ఈ సందర్భంలో అదనపు విలువ, అదనపు శ్రమ రూపంలో వున్న ఈ సందర్భంలో కౌలుకు వున్న సహజమైన పరిస్థితులు లేదా పరిమితులే సాధారణ రూపంలో అదనపు విలువకు కూడా వుండే పరిస్థితులు పరిమితులు అవుతాయన్నది స్పష్టం. ప్రత్యక్ష ఉత్పాదకుడు 1. తగినంత శ్రమశక్తిని కలిగి ఉండాలి. 2 అతని శ్రమ సహజ పరిస్థితులు ముఖ్యంగా అతను సాగుచేసే భూమి తగినంత స్థాయిలో ఉత్పాదకంగా ఉండాలి. ఒక్కమాటలో చెప్పాలంటే, తన తప్పనిసరి అవసరాలను తీర్చుకోవటానికి అవసరమైన అదనపు శ్రమకంటే ఎక్కువ శ్రమను ఇవ్వగలిగినంత సహజ ఉత్పాదకత కలిగిన శ్రమ ఉండాలి. కౌలును సృష్టించే అవకాశంగా కాక ఈ అవకాశాన్ని వాస్తవంగా మార్చే బలమైన పరిస్థితి ఉండాలి. అయితే ఈ అవకాశం అన్నది వ్యక్తిపరమైన, వస్తుగతమైన సహజ పరిస్థితులపైన ఆధారపడి వున్నది. ఇందులో నిగూఢమైనది ఏదీ లేదు. శ్రమశక్తి తక్కువగా వున్నప్పుడు, సహజమైన శ్రమ పరిస్థితులు అరుదుగా ఉన్నప్పుడు అప్పుడు అదనపు శ్రమ చాలా తక్కువగా వుంటుంది. అయితే అటువంటి సందర్భంలో ఒకవైపున ఉత్పత్తిదారుల అవసరాలు కూడా తక్కువగానే వుంటాయి. మరోవైపున అదనపు శ్రమను దోచుకునే వారి సాపేక్ష సంఖ్య కూడా తక్కువగానే వుంటుంది. అదనపు ఉత్పాదితం కూడా తక్కువగానే వుంటుంది. అంటే ఈ దోపిడీ చేసే కొద్దిమంది భూస్వాములకు అంత ఉత్పాదితంగాని అదనపు శ్రమ ఫలితం కూడా తక్కువగానే వుంటుంది.

చివరిది. మొత్తం పరిస్థితులు యథాతథంగా ఉన్నప్పుడు శ్రమ కౌలు తెలియజేసేది ఏమంటే అది మొత్తం సాపేక్ష అదనపు మొత్తంపైన లేదా బలవంతపు శ్రమపైన ఆధారపడి వుంటుంది. ప్రత్యక్ష ఉత్పాదకుడు తన సొంత పరిస్థితిని మెరుగు చేసుకోవటానికి, సంపదను గడించటానికి తనకు తప్పనిసరిగా అవసరమైన జీవితావసర వస్తువులకు మించి అదనంగా ఉత్పత్తి చేయటానికి లేదా పెట్టుబడిదారీ వ్యక్తీకరణ శైలిలో చెప్పాలంటే అతడు తనకు తాను లాభం ఉత్పత్తి చేసుకోగలుగుతాడా, ఎంత లాభం చేసుకోగలుగుతాడు, అతను ఉత్పత్తి చేసిన తన వేతనాలకుపైన అదనంగా ఎంత ఉత్పత్తి చేయగలుగుతాడు అన్నదానిపైన ఆధారపడి వుంటుంది. ఇక్కడ కౌలు అన్నది అదనపు విలువ యొక్క సాధారణ, న్యాయమైన రూపం. ఇది లాభాన్ని మించిన మొత్తం కాదు. అంటే ఈ సందర్భంలో వేతనానికి మించిన మొత్తం కాదు. అటువంటి లాభం మొత్తమూ, దాని అస్తిత్వమూ మిగిలిన పరిస్థితులన్నీ యథాతథంగా ఉంటే కౌలు మొత్తంపైన ఆధారపడి వుంటుంది. అంటే భూస్వాములకు స్వాధీనం చెయ్యాల్సిన బలవంతపు అదనపు శ్రమపైన ఆధారపడి వుంటుంది.

ప్రత్యక్ష ఉత్పాదకుడు భూమికి యజమానికాడు. కేవలం భూమిని కలిగి వుంటాడు. అతని అదనపు శ్రమ అంతా చట్టరూపంలోనూ, వాస్తవంగానూ భూస్వామికే చెందుతుంది. అటువంటి పరిస్థితుల్లో బలవంతపు శ్రమ చేసేవారికి లేదా భూస్వామ్యదాసులకు స్వతంత్ర ఆస్తి అన్నది లేదా సాపేక్ష సంపద అన్నది సాధించటం సాధ్యపడుతుందా అని కొంతమంది చరిత్రకారులు తమ ఆశ్చర్యాన్ని వ్యక్తం చేశారు. అయితే ఈ ఆదిమమైన, అభివృద్ధి చెందని పరిస్థితులపైన సామాజిక ఉత్పత్తి సంబంధాలూ, దానికి అనుగుణమైన ఉత్పత్తి విధానమూ ఆధారపడి వున్నాయి. ఈ పరిస్థితుల్లో సంప్రదాయం ప్రబలమైన పాత్ర వహిస్తుంది. అస్తిత్వంలో ఉన్న వ్యవస్థను ఆమోదిస్తూ దానికి అర్హతను కల్పించటమూ, సంప్రదాయమూ ఆనవాయితీల ద్వారా దానికి చట్టబద్ధమైన పరిమితులు విధించటమూ అన్నవి పాలక వర్గానికి ఎప్పుడూ ప్రయోజనకరంగా ఉంటాయన్నది స్పష్టం. దీనంతటితోపాటు ఇదంతా, దానంతట అదే అమల్లో వున్న వ్యవస్థ పునాది నిరంతరాయంగా పునరుత్పత్తి చెందటం వల్ల, దాని మౌలిక సంబంధాలు కాలక్రమంలో క్రమబద్ధమైన రూపం సంతరించుకోవటంవల్ల సాధ్యమవుతుంది. ఏ ఉత్పత్తి విధానానికైనా సామాజిక స్థిరత్వం చేకూరాలంటే, యాదృచ్ఛికత నుంచి ఇతరుల ఇష్టాయిష్టాల నుంచి స్వతంత్రం పొందాలంటే అటువంటి క్రమబద్ధమైన వ్యవస్థ తప్పనిసరి అవుతుంది. ఆ వ్యవస్థ సామాజిక స్థిరత్వానికి సరిగ్గా అదే రూపం. అందుకే ఇతరుల ఇష్టాయిష్టాల నుంచి యాదృచ్ఛికత నుంచి అది సాపేక్షంగా స్వతంత్రంగా ఉంటుంది. ఉత్పత్తి ప్రక్రియ దాని కనుగుణమైన సామాజిక సంబంధాలు వెనుకబడిన పరిస్థితుల్లో వున్నప్పుడు వాటి పునరుత్పత్తినే కేవలం పునరావృత్తం చెయ్యటం ద్వారా ఈ రూపాన్ని అది సాధిస్తుంది. కొంతకాలం ఇది ఇలా కొనసాగితే అది ఆనవాయితీగానూ, సంప్రదాయంగానూ మారుతుంది. చివరికి స్పష్టమైన చట్టంగా రూపొందుతుంది. అయితే ఈ అదనపు శ్రమ, ఈ బలవంతపు శ్రమ రూపం సామాజిక ఉత్పత్తి శక్తుల యొక్క అసంపూర్ణ అభివృద్ధిపైన, శ్రమ పద్ధతుల మొరటుతనంపైన ఆధారపడి వుంటుంది. అది సహజంగానే అభివృద్ధిచెందిన ఉత్పత్తి విధానంలోకంటే, ముఖ్యంగా పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానంలోకంటే ప్రత్యక్ష ఉత్పత్తిదారుల మొత్తం శ్రమలో సాపేక్షంగా తక్కువ శ్రమ భాగాన్ని మాత్రమే ఇముడ్చుకోగలుగుతుంది. ఉదాహరణకు భూస్వామికి లభించే బలవంతపు శ్రమ వారానికి రెండు

రోజులు వుండేది. ఈ రెండు రోజుల బలవంతపు శ్రమ నిశ్చితమైనటువంటిది. అంటే స్థిరమైన పరిమాణంగానూ, చట్టబద్ధంగా గుర్తించబడిన భాగంగానూ ఉండేది. వారంలో మిగతా రోజుల ఉత్పాదకత అన్నది అస్థిరమైన పరిమాణంలో ఉండేది. ఈ ఉత్పాదకత ప్రత్యక్ష ఉత్పాదకుని స్వాధీనంలోనే ఉండేది. అనుభవ క్రమంలో అతనికి కొత్త అవసరాలు తలెత్తుతున్నకొద్దీ, అతని ఉత్పాదితాన్ని గ్రహించే మార్కెట్టు విస్తరిస్తున్నకొద్దీ అతని ఉత్పాదకత పెరుగుతూనే వుంటుంది. తన ఈ శ్రమశక్తి భాగాన్ని మార్కెట్టులో హెచ్చించటానికి హామీ పెరుగుతున్నకొద్దీ తన శ్రమశక్తిని మరింత ఎక్కువగా ఖర్చు పెట్టేందుకు ఆ హామీ మరింత ఉత్తేజమిస్తుంది. అతని శ్రమశక్తిని కేవలం వ్యవసాయంలోనే కాక గ్రామీణ గృహ పరిశ్రమలో కూడా వెచ్చిస్తాడన్న సంగతి మర్చిపోరాదు. నిర్దిష్టమైన ఆర్థిక అభివృద్ధి జరగటం సాధ్యమన్న సంగతి ఇక్కడ రుజువవుతుంది. అయితే ఇది అనుకూల పరిస్థితులపైన, అంతర్నిహితంగా ఉండే వర్ణ స్వభావాలు వగైరాలపైన కూడా ఆధారపడి వుంటుంది.

## III. వస్తురూపంలో కౌలు

శ్రమ కౌలు వస్తురూపంలో కౌలుగా రూపాంతరం చెందటం అన్నది ఆర్థిక దృష్టి నుంచి చూస్తే భూమి కౌలు స్వభావంలో ఎటువంటి మార్పునూ సృష్టించదు. ఇక్కడ పరిశీలించిన రూపాలలో వస్తురూప కౌలులో కౌలు ఏకైక సాధారణ అదనపు విలువ లేదా అదనపు శ్రమ రూపంగా అమల్లో వుంటుంది. ప్రత్యక్ష ఉత్పాదకుడు తన పునరుత్పత్తి కోసం భూమి యజమానికి ఇవ్వాల్సిన ఏకైక అదనపు శ్రమ లేదా ఏకైక అదనపు ఉత్పాదితమూ మాత్రమే. ఈ పరిస్థితి సర్వవ్యాప్తమైన శ్రమ పరిస్థితి. ఈ పరిస్థితి ద్వారా పైన చెప్పిన విషయం మరింత స్పష్టమవుతుంది. అంతేకాక ప్రత్యక్ష ఉత్పాదకుని ఒక పరాయి ఆస్తిగా, అతనితో ప్రమేయం లేకుండా, భూస్వామిచేత వ్యక్తీకరించబడే అంశంగా, భూమి అన్న ఒకే శ్రమ పరిస్థితి ఉత్పత్తిదారుని ఎదుర్కొంటుంది. వస్తురూపంలో కౌలు ఏ మేరకు భూమి కౌలుగా అమల్లో వుంది, ప్రబలంగా ఉంది అన్నదానితో సంబంధం లేకుండా దానితో పాటు దాని తొలిరూపం అవశేషాలు కూడా అనుసరించి ఉంటాయి. ఈ భూస్వామి ప్రైవేటు వ్యక్తీ కావచ్చు లేదా ప్రభుత్వమూ కావచ్చు. కౌలును నేరుగా శ్రమరూపంలో చెల్లించే వివిధ రూపాలు కొనసాగుతూనే వుంటాయి. వస్తురూప కౌలు ప్రత్యక్ష ఉత్పాదకునికి మరింత ఉన్నతమైన నాగరికత దశను కోరుతుంది. అంటే అతని శ్రమ అభివృద్ధి స్థాయి, సార్వత్రికంగా సామాజిక స్థాయి మరింత ఉన్నత స్థాయిలో ఉండాలి. ఇంతకు ముందున్న రూపం కంటే ఈ రూపం భిన్నమైనది. ఇక్కడ అదనపు శ్రమ దాని సహజ రూపంలో నిర్వహించాల్సిన అవసరం లేదు. అంటే భూస్వామిగాని, అతని ప్రతినిధిగాని ప్రత్యక్ష తనిఖీ లేదా బలవంతం చెయ్యనక్కరలేదు. ప్రత్యక్ష ఉత్పత్తిదారుడు తన సొంత బాధ్యత మీద పని నిర్వహించటానికి కారణం పరిస్థితుల ప్రాబల్యం తప్ప ప్రత్యక్ష బలప్రయోగం కాదు. అది శాసన బలం తప్ప కొరడావల్ల కాదు. ప్రత్యక్ష ఉత్పాదకుని తప్పనిసరి అవసరాలకు మించిన ఉత్పత్తి అన్న అర్థంలో, వాస్తవంగా తనకే చెందిన పొలంలో ఉత్పత్తి అన్న అర్థంలో అదనపు ఉత్పత్తి అన్నదానిని ఇక్కడ అర్థం చేసుకోవాలి. ఇంతకు ముందు తన భూస్వామికి ఆవల దగ్గరలో వున్న భూస్వామి ఎస్టేటులో కాక దానికి బదులు తన సొంత భూమిలోనే సాధించే అదనపు ఉత్పత్తి అని అర్థం. ఈ సంబంధంలో ప్రత్యక్ష ఉత్పాదకుడు దాదాపు తన శ్రమ కాలాన్ని అంతటిని తానే

వెచ్చించగలుగుతాడు. ఇదివరకులాగే ఈ శ్రమ కాలంలో ఒక భాగం, మొదట ఆచరణలో దానిలో వున్న మొత్తం అదనపు లాభం ఎటువంటి పరిహారం లేకుండా భూస్వామికే చెందుతుంది. అయితే భూస్వామి ఈ అదనపు శ్రమను దాని సహజ రూపంలో సూటిగా కాక అది వాస్తవ రూపం ధరించిన ఉత్పాదితపు సహజ రూపంలో పొందుతాడు. బలవంతపు శ్రమ ఏరకంగా చట్టబద్ధమైంది అన్నదాన్నిబట్టి భూస్వామి కోసం చేసే బరువైన అవశేషాలతో కూడిన పని వస్తురూపంలో కౌలు స్వచ్ఛమైన రూపంలో ప్రత్యక్షమైన ప్రతిచోట ఆగిపోతుంది. కనీసం అది కొన్ని చిన్న విరామ సమయాలకు పరిమితమవుతుంది. అది కూడా వస్తురూపంలో కౌలు పక్కనే చట్టబద్ధమైన బలవంతపు శ్రమ కూడా ఉన్నప్పుడు మాత్రమే జరుగుతుంది. ఉత్పాదకుడు తన కోసం చేసుకునే శ్రమ, భూస్వామి కోసం చేసే శ్రమ స్థల, కాలాల్లో స్పష్టంగా ఇక్కడ విడిపోవు. ఈ వస్తురూపంలో కౌలు తన స్వచ్ఛమైన రూపంలో కొన్ని అంశాలను తనతోపాటు ఇంతకంటే ఉన్నతంగా అభివృద్ధిచెందిన ఉత్పత్తి విధానమూ, ఉత్పత్తి సంబంధాల్లోకి తీసుకుపోతుంది. అయితే అది ఒక సహజ ఆర్థిక విధానంలో మాత్రమే అస్తిత్వంలో వుంటుంది. సహజ విధానం అంటే దాని పరిస్థితులు మొత్తంగా కానీ లేదా చాలావరకు కానీ ఆ విధానంచేతనే సృష్టించబడతాయి. దాని మొత్తం ఉత్పాదితంచేత సూటిగా భర్తీ చెయ్యబడి పునరుత్పత్తి అవుతాయి. అంతేకాక ఈ వ్యవస్థలో గృహ పరిశ్రమ వ్యవసాయంతో కలిసే వుంటుంది. కౌలును రూపొందించే అదనపు ఉత్పాదితం అన్నది వ్యవసాయ, పారిశ్రామిక కుటుంబ శ్రమ ఫలితం. ఈ కౌలులో మధ్య యుగాల్లోలాగా ఎంతో కొంత పారిశ్రామిక ఉత్పాదితం ఉండవచ్చు. లేదా భూ ఉత్పాదితాల రూపంలో మాత్రమే అది చెల్లించబడవచ్చు. ఈ రూపపు కౌలులో వస్తురూపంలో కౌలు గ్రామీణ కుటుంబం యొక్క మొత్తం అదనపు శ్రమను పూర్తిగా కబళించాల్సిన అవసరం లేదు. శ్రమ కౌలుతో పోల్చితే, ఉత్పత్తిదారునికి అదనపు శ్రమకోసం హెచ్చించగలిగిన కాలం పెరుగుతుంది. అదనపు శ్రమలో స్వయంగా తనకు చెందే వాటా కూడా పెరుగుతుంది. అదేరకంగా వ్యక్తిగత ప్రత్యక్ష ఉత్పాదకుల ఆర్థిక స్థితిలో భేదాలను ఈ రూపం తీసుకొస్తుంది. కనీసం అటువంటి భేదాలకు అవకాశం ఉంటుంది. ప్రత్యక్ష ఉత్పాదకునికి ఉత్పత్తి సాధనాలను సంపాదించటం ద్వారా ఇతర కార్మికులను దోపిడీ చెయ్యటం సాధ్యమవుతుంది. మనమిక్కడ శుద్ధ రూపంలో వస్తుకౌలును గురించి పరిశీలిస్తున్నాం కనుక పై అంశాన్ని మనం ఇక్కడ పరిశీలించబోవటం లేదు. ఎందుకంటే వివిధ రకాల కౌలులు సమైక్యం కావటమూ, కల్తీ కావటమూ కలగాపులగం కావటమూ అన్నది అనంతంగా వివిధ రకాల కలయికల ద్వారా జరుగుతుంది. ఒక నిర్దిష్టమైన ఉత్పాదితానికి బంధించబడడంవల్ల వస్తురూపంలో ఉన్న కౌలు సహజ ఆర్థిక విధానం స్వభావం కారణంగా చలన రహితమైన సామాజిక పరిస్థితుల కోసం, ఉదాహరణకు ఆసియాలో మనం గమనించే పరిస్థితుల కోసం అవసరమైన పునాదిని సమకూరుస్తుంది. ఈ విధానంలో వ్యవసాయమూ, గృహ పరిశ్రమా అనివార్యంగా కలిసిపోయి వుంటాయి. రైతు కుటుంబం మార్కెట్టుతో ప్రమేయం లేకుండా, తన పరిధికి ఆవల వున్న సహజ విభాగం యొక్క ఉత్పత్తితోగాని, చరిత్రతోగాని ప్రమేయం లేకుండా స్వతంత్రంగా తనని తాను నిలబెట్టుకుంటుంది. దాదాపు పూర్తిగా స్వయం సంతృప్తంగా వుంటుంది. ఇంతకు ముందు ఉన్న శ్రమ కౌలు విషయంలో లాగానే ఇక్కడ కూడా భూమి కౌలు అదనపు విలువకు, అదనపు శ్రమకు అనగా కార్మికుడు ఊరికే చేసే మిగులు శ్రమ మొత్తానికి ఇక్కడ సాధారణ రూపం. ఇక్కడ ఈ

రూపంలో కూడా వత్తిడి ఉన్నప్పటికీ, ఈ వత్తిడి ఇంతకు ముందులాంటి పాశవిక రూపంలో ఉండదు. అవసర శ్రమపైన ప్రత్యక్ష ఉత్పాదకులు నిర్వహించే మిగులు శ్రమను మనం లాభం అని పొరపాటుగా తేలిస్తే, అది వస్తురూప కౌలును నిర్ణయించడంలో నిర్వహించే పాత్ర అతి స్వల్పం. ఇందుకు విరుద్ధంగా ఈ లాభం కౌలు పూర్వరంగంలో పెరుగుతుంది. వస్తు రూపంలో కౌలు పరిమాణమే దాని సహజ పరిమితి. వస్తురూపంలో కౌలు శ్రమ పరిస్థితుల పునరుత్పత్తినే, ఉత్పత్తి సాధనాలనే తీవ్రంగా ప్రమాదంలో పడవేసే స్థాయికి పెరగవచ్చు. ఉత్పత్తి విస్తరణను దాదాపు అసాధ్యం చేసి ప్రత్యక్ష ఉత్పత్తిదారులను ప్రాణాధార వస్తువుల భౌతిక పరిమితికి కుదిస్తుంది. ఒక వాణిజ్య దేశం విజేతగా మారినప్పుడు, ఉదాహరణకు ఇండియాపై ఆధిపత్యం వహించిన ఇంగ్లాండు, ఈ రూపాన్ని స్వీకరించి దోపిడీ చేసినప్పుడు ఇది మరింత స్పష్టంగా కనిపిస్తుంది.

## IV. డబ్బు కౌలు

పారిశ్రామిక, వాణిజ్య భూమి కౌలుకు భిన్నంగా డబ్బు కౌలు కేవలం వస్తురూప కౌలు రూపం మారటం ద్వారా తలెత్తుతుంది. వస్తురూప కౌలు కూడా శ్రమ కౌలు రూపం మారటంవల్ల మాత్రమే తలెత్తుతుంది. అది పారిశ్రామిక వాణిజ్య కౌలుతో పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానంపై ఆధారపడి వుంటుంది. ఆ భూమి కౌలు సగటు లాభంపైన మిగులు మాత్రమే. ప్రత్యక్ష ఉత్పాదకుడు ఇక్కడ భూస్వామికి (అది ప్రభుత్వమూ కావచ్చు లేదా ప్రైవేటు వ్యక్తీ కావచ్చు) తన ఉత్పాదితం బదులు దాని ధరను చెల్లిస్తాడు. తమ సహజ రూపంలో ఉత్పాదితాల మిగులు అన్నది ఇక్కడ ఎంతమాత్రమూ సరిపోదు. ప్రత్యక్ష ఉత్పాదకుడు తనకవసరమైన జీవనాధార వస్తువులలో అత్యధిక భాగం ఉత్పత్తి చెయ్యటం కొనసాగించినప్పటికీ ఈ ఉత్పాదితంలో కొంత భాగాన్ని సరుకులుగా మార్చాల్సి వుంటుంది. ఆ రకంగా మొత్తం ఉత్పత్తి విధానం యొక్క స్వభావం దాదాపు మారుతుంది. సామాజిక సంబంధం నుంచి దాని స్వాతంత్ర్యాన్ని ప్రత్యేక స్వభావాన్ని అది కోల్పోతుంది. ఉత్పత్తి ఖర్చు యొక్క నిష్పత్తి ఇక్కడ నిర్ణయాత్మకంగా మారుతుంది. ఆ ఖర్చు డబ్బు వ్యయంగా రూపొందుతుంది. మొత్తం ఉత్పాదితంలో డబ్బుగా మారాల్సిన మిగులు ఒకవైపున పునరుత్పత్తి సాధనాలుగానూ, రెండవవైపున ప్రాణాధార వస్తువులుగానూ మారగా మిగిలిన మొత్తం డబ్బుగా మారుతుంది. అది నిర్ణయాత్మకమైన పాత్ర వహిస్తుంది. ఈ రకం కౌలు పునాది దాని అంతాన్ని సమీపిస్తున్నప్పటికీ వస్తురూపంలో కౌలు వున్న పునాది మాత్రమే. ఇదివరకులాగే ప్రత్యక్ష ఉత్పాదకుడు వారసత్వం ద్వారానో లేదా ఏదో ఒక సాంప్రదాయక హక్కు ద్వారానో ఒక భూభాగాన్ని కలిగి వుంటాడు. కాని ఆ భాగానికి యజమాని అయిన భూస్వామికి అదనపు చట్టబద్ధమైన అదనపు శ్రమ అనగా వేతనం చెల్లించని, ప్రతిఫలం లభించని శ్రమను నిర్వహించాల్సి వుంటుంది. డబ్బు రూపంలో మారిన అదనపు ఉత్పాదితం రూపంలో నిర్వహించాల్సి వుంటుంది. భూమి విషయంలో కాక వ్యవసాయ పరికరాలు, పశువులు వగైరా అంశాలపై యాజమాన్యం ప్రత్యక్ష ఉత్పాదకునికే తొలి కౌలు రూపాలు వున్నప్పుడు కూడా దఖలు పడుతుంది. మొదట ఆచరణలోనూ, తరువాత చట్టబద్ధంగానూ జరుగుతుంది. వస్తు కౌలు డబ్బు కౌలుగా రూపాంతరం చెందటం అన్నది మొదట అక్కడక్కడా జరుగుతుంది. తరువాత జాతీయ స్థాయిలో జరుగుతుంది. దీనికి వాణిజ్యమూ నగర పరిశ్రమ సార్వత్రిక సరుకు ఉత్పత్తి, డబ్బు

చలామణి గణనీయంగా అభివృద్ధి చెందాల్సి వుంటుంది. ఉత్పాదితాలకు అది మార్కెట్ ధరను ఊహిస్తుంది. అంతేకాక అవి వాటి విలువలకు దగ్గరగా వున్న ధరలకు అమ్మాల్సి వుంటుంది. ఇంతకు ముందు రూపాల్లో ఈ అవసరం లేదు. తూర్పు యూరప్‌లో మన కళ్ళముందే ఈ పరివర్తన జరగటాన్ని మనం గమనించవచ్చు. ఒక నిర్దిష్ట స్థాయిలో సామాజిక శ్రమ ఉత్పాదకత అభివృద్ధి చెందకపోతే ఇది సాధ్యం కాదు. రోమన్ సామ్రాజ్యంలో కౌలును పన్నుల వసూళ్ళ విషయంలోనైనా డబ్బు కౌలుగా మార్చాలనే ప్రయత్నాలన్నీ విఫలం కావటం ఇందుకు ఒక నిదర్శనం. ఇలాంటి పరివర్తనా క్రమంలో ఉండే ఇబ్బందులన్నీ విప్లవానికి ముందు ఫ్రాన్స్‌లో కూడా గమనించవచ్చు. ఆ కాలంలో డబ్బు కౌలు దాని తొలి రూపాల అవశేషాలతో కలిసి కలగాపులగం అయింది.

వస్తురూప కౌలుకు మారురూపం డబ్బు కౌలు. అది దాని విరుద్ధ అంశమూ, దాని అంతిమ రూపం కూడా. ఇంతవరకూ మనం పరిశీలించిన భూమి కౌలును అంతం చేసే రూపం. అనగా ఉత్పత్తి పరిస్థితులకు సంబంధించిన యజమాని కోసం నిర్వహించే అదనపు విలువ, వేతనం చెల్లించబడని అదనపు శ్రమల సాధారణ రూపంగా భూమి కౌలు అంతమయ్యే చివరి రూపం. ఈ కౌలు దాని శుద్ధ రూపంలో శ్రమకౌలు, వస్తురూప కౌలుల లాగానే లాభంపై మిగులుకకు ప్రాతినిధ్యం వహించదు. లాభం ఆచరణలో మిగులు శ్రమ యొక్క వేరే భాగంగా తలెత్తిన మేరకు డబ్బు కౌలు కూడా దాని తొలి రూపాల్లో ఉన్న కౌలులాగానే అటువంటి తొలి లాభానికి పరిమితులు విధిస్తుంది. ఈ లాభం దోపిడీ అవకాశాలతోపాటు పెరుగుతుంది. సొంత మిగులు శ్రమను లేదా ఇతరుల మిగులు శ్రమను వినియోగించటానికి గల అవకాశాలనుబట్టి అది పెరుగుతుంది. డబ్బు కౌలుకు ప్రాతినిధ్యం వహించే అదనపు శ్రమ నిర్వహించబడిన తరువాత ఆ లాభం ఉంటుంది. ఈ కౌలుతోపాటు వాస్తవంగా ఏదైనా లాభం తలెత్తితే అప్పుడు ఈ లాభం కౌలుకు పరిమితి విధించదు. ఇందుకు విరుద్ధంగా ఇక్కడ కౌలే లాభానికి పరిమితి విధిస్తుంది. అయితే ఇంతకు ముందే పేర్కొన్నట్టుగా డబ్బు కౌలు అన్నది ఇంతవరకు పరిశీలించిన భూమి కౌలును రద్దు చేసే రూపం మాత్రమే. అది అదనపు విలువతోనూ, అదనపు శ్రమతోనూ అనగా అదనపు విలువ యొక్క సాధారణ, ప్రాబల్య రూపంగా భూమి కౌలుతోనూ ఏకీభవిస్తుంది.

దాని పురోగమనంలో డబ్బు కౌలు అన్నది (సన్నకారు రైతు, కౌలుదారీ రైతులాంటి మధ్యంతర రూపాలన్నీ కాక) రైతుల పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానానికి అనుగుణమైన రూపానికి అనగా పెట్టుబడిదారీ, కౌలుదారీ రైతు కౌలు చెల్లించే రూపానికి దారితీస్తుంది.

డబ్బు కౌలు రూపం అమల్లో ఉన్నప్పుడు పెట్టుబడిదారునికీ, అతని భూమి చేస్తున్నవారికీ మధ్య సంబంధం డబ్బు సంబంధంగా మారుతుంది. సాంప్రదాయకమైన ఆనవాయితీ అయిన సంబంధం ఖచ్చితమైన, చట్టబద్ధమైన డబ్బు సంబంధమైన ఒప్పందంగా మారుతుంది. సాగు నిర్వహించే వ్యక్తి – ఆచరణలో ఒక కౌలుదారునిగా మారతాడు. ఇతర ఉత్పత్తి సంబంధాలన్నీ అవకాశం ఇస్తే ఈ రూపాంతరంవల్ల పాత తరహా రైతులు పోయి, వారి స్థానంలో పెట్టుబడిదారీ కౌలుదారులు తలెత్తుతారు. మరోవైపున పాత రైతులు (భూమి) కొనుగోలు ద్వారా కౌలు చెల్లించాల్సిన తమ బాధ్యత నుంచి బయటపడి తాను దున్నే భూమికి సంపూర్ణమైన యజమానిగా, స్వతంత్ర రైతుగా మారగలుగుతాడు. వస్తు కౌలు డబ్బు కౌలుగా మారటం అన్నదానితోపాటు తప్పనిసరిగా ఆస్తిపాస్తులు

లేని వ్యవసాయ కార్మికుల వర్గం రూపొందుతుంది. వారు డబ్బు కోసం తమ శ్రమను అమ్ముకుంటారు. అక్కడక్కడ వారు పుట్టే తొలిదశలో మరింత ధనవంతులైన రైతులు స్వయంగా తాము కౌలు చెల్లిస్తూనే, తమ కోసం వ్యవసాయ కార్మికుల్ని దోపిడీ చెయ్యటం కూడా ప్రారంభమవుతుంది. మధ్య యుగాల్లో ధనికులైన దాసులు తాము స్వయంగా కొంతమంది దాసుల్ని కలిగి ఉన్నట్లే ఇక్కడ కూడా జరుగుతుంది. ఈ రకంగా వారు క్రమంగా కొంత సంపదను కూడబెట్టడానికి, భవిష్యత్తులో పెట్టుబడిదారులుగా రూపొందడానికీ అవకాశాలను సంపాదించుకుంటారు. భూమిని సాగుచేసిన తొలి రైతులు పెట్టుబడిదారీ కౌలు దారులకు నర్సరీ పాఠశాలలుగా ఉపయోగపడతారు. ఈ పెట్టుబడిదారీ కౌలుదార్ల అభివృద్ధి గ్రామీణ ప్రాంతాలకు ఆవల సాధారణ పెట్టుబడిదారీ ఉత్పత్తి అభివృద్ధికి లోబడి వుంటుంది. ఈ పెట్టుబడిదారీ కౌలుదారీ వర్గం 16వ శతాబ్దం ఇంగ్లాండులోలాగా ప్రత్యేకమైన అనుకూల పరిస్థితులు రాగానే శీఘ్రంగా పెరుగుతుంది. ఆ సందర్భంలో డబ్బు విలువ పడిపోవటంవల్ల, దీర్ఘకాలికమైన లీజులు అమల్లో ఉండటం వల్ల భూస్వాముల ఆదాయం పడిపోయి రైతులు సంపన్నులయ్యారు.

అంతేకాదు. కౌలు, డబ్బు కౌలు రూపం ధరించగానే కౌలు చెల్లించే రైతుకు, భూస్వామికి మధ్య సంబంధం ఒక ఒప్పందం ద్వారా నిర్ణీతమైన సంబంధంగా మారగానే (ఈ పరిణామం ప్రపంచ మార్కెట్టు, వాణిజ్యం, పరిశ్రమ సాపేక్షంగా ఒక ఉన్నత స్థాయికి చేరుకున్నప్పుడు మాత్రమే సాధ్యం.) పెట్టుబడిదారులకు భూమి లీజుగా ఇవ్వటమనేది తప్పనిసరిగా ప్రత్యక్షమవుతుంది. పెట్టుబడిదారుడు ఇంతవరకూ గ్రామీణ పరిధులకు ఆవల వున్నాడు. పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం అభివృద్ధి కావడంతో నగరాలలో సంపాదించిన పెట్టుబడితో ఇప్పుడు గ్రామీణ ప్రాంతాల వ్యవసాయంలో కూడా ప్రవేశిస్తాడు. కేవలం ఒక సరుకుగా ఉత్పాదితాన్ని సృష్టిస్తాడు. అంటే అదనపు విలువను గ్రహించటానికి ఒక సాధనంగా మాత్రమే ఉపయోగిస్తాడు. ఫ్యూడల్ ఉత్పత్తి విధానం నుంచి పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానానికి పరివర్తన జరిగే కాలంలో ప్రపంచ మార్కెట్టుపై ఆధిపత్యం వహిస్తున్న దేశాలలో మాత్రమే ఇది సార్వత్రిక సూత్రంగా మారుతుంది. పెట్టుబడిదారీ కౌలుదారీ రైతు భూస్వామికి – 'వాస్తవంగా నేలను దున్నేవాని'కి మధ్య అడుగుపెట్టినప్పుడు పాత గ్రామీణ ఉత్పత్తి విధానం నుంచి తలెత్తిన సంబంధాలన్నీ ఛిన్నాభిన్నమవుతాయి. ఈ వ్యవసాయ కార్మికులకు రైతు వాస్తవమైన నాయకుడిగా మారతాడు. వాస్తవంగా వారి అదనపు శ్రమను దోపిడీ చేసే వ్యక్తి కూడా అతడే అవుతాడు. కాగా భూస్వామి ఒక ప్రత్యక్ష సంబంధాన్ని, నిజానికి డబ్బు ఒప్పందంతో కూడిన ఒప్పందాన్ని కేవలం పెట్టుబడిదారీ కౌలుదార్లతో మాత్రమే కలిగి వుంటాడు. ఆ రకంగా కౌలు స్వభావం కూడా రూపాంతరం చెందుతుంది. ఇంతకు ముందు రూపాలలో జరిగినట్టుగా యాదృచ్ఛికంగా మాత్రమే కాక గుర్తించబడిన అమలులో వుండే రూపంగా అది మారుతుంది. అదనపు విలువ అదనపు శ్రమల ఈ సాధారణ రూపం నుంచి లాభం రూపంలో దోపిడీ చేసే పెట్టుబడి స్వాహా చేసే భాగం యొక్క పరిమితిని మించి అనగా అదనపు శ్రమకు మించిన మిగులుగా మారుతుంది. మొత్తం అదనపు శ్రమ లాభం, లాభంపై మిగులు నేరుగా అతనిచేత సంగ్రహించబడి మొత్తం అదనపు ఉత్పాదితం రూపంలో పోగుచేయబడి నగదుగా మారినట్టే ఇది కూడా. అతడు వ్యవసాయ కార్మికుని నుంచి ప్రత్యక్ష దోపిడీ ద్వారా, అతని పెట్టుబడి ద్వారా ఈ అదనపు విలువ మిగులు భాగాన్ని గ్రహించి కౌలుగా అతడు భూస్వామికి సమర్పిస్తాడు. ఈ భాగం ఎంత ఎక్కువ వుంటుంది? ఎంత

తక్కువ వుంటుంది? అన్న విషయం సగటుపైన, వ్యవసాయేతర ఉత్పత్తి రంగంలో పెట్టుబడి సంపాదించ గలిగిన సగటు లాభం విధించే పరిమితులపైన, ఈ సగటు లాభం శాసించే వ్యవసాయేతర ఉత్పత్తి ధరలపైన ఆధారపడి వుంటుంది. అదనపు విలువ, అదనపు శ్రమల సాధారణ రూపం నుంచి ఆ అదనపు విలువపై మిగిలిన భాగంగా కౌలు మారుతుంది. ఆ అదనపు విలువను పెట్టుబడి తన న్యాయమైన సాధారణ వాటాగా భావిస్తుంది. కౌలు ఇలా మారటమన్నది ఈ ప్రత్యేక ఉత్పత్తి రంగం, వ్యవసాయ ఉత్పత్తి రంగం స్వభావం, కౌలుకు బదులు ఇప్పుడు లాభం అన్నది అదనపు విలువ సాధారణ రూపంగా మారింది. కౌలు ఇప్పుడు సాధారణ అదనపు విలువగా కాక దాని ఉప ఉత్పత్తుల్లో ఒకటిగా అదనపు లాభంగా అస్తిత్వంలో వుంటుంది. కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో స్వతంత్ర రూపాన్ని సంతరించుకుంటుంది. ఉత్పత్తి విధానంలో వచ్చే క్రమానుగత పరివర్తన ఈ పరివర్తనకు ఎలా అనుగుణంగా వుంటుందో వివరించవలసిన అవసరం లేదు. పెట్టుబడిదారీ కౌలుదారీ రైతు వ్యవసాయ ఉత్పాదితాల్ని సరుకులుగా ఉత్పత్తి చేస్తాడు. ఇంతకు ముందు అతని జీవనాధార వస్తువులకు మించిన వాటిని మాత్రమే సరుకులుగా మార్చేవాడు. ఇప్పుడు ఈ సరుకుల్లో అతి స్వల్ప భాగాన్ని మాత్రమే జీవనాధార వస్తువులుగా అతడు సూటిగా ఉపయోగించుకుంటాడు. ఇదంతా స్పష్టంగా కనిపిస్తూనే వుంటుంది. వ్యవసాయ శ్రమను సహితం ఇప్పుడు తన ప్రత్యక్ష పెత్తనం కిందికి, ఉత్పాదకత కిందికి తీసుకొచ్చింది, భూమి కాదు – పెట్టుబడి మాత్రమే.

సగటు లాభం, దానిచేత క్రమబద్ధం కాబడిన ఉత్పత్తి ధర అన్నవి గ్రామీణ సంబంధాలకు ఆవల నగర వాణిజ్య పారిశ్రామిక రంగాలలో రూపొందుతాయి. కౌలు చెల్లించే రైతు లాభం దానిలో సమ అంశంగా ప్రవేశిస్తుంది. ఎందుకంటే – భూస్వామితో అతని సంబంధం పెట్టుబడిదారీ సంబంధం కాదు. అతడు లాభం సంపాదించిన మేరకు అనగా తన సొంత శ్రమ ద్వారా గాని, ఇతర ప్రజల శ్రమను దోపిడీ చేయడం ద్వారా గాని, తన జీవనాధార వస్తువులకు అవసరమైన దానికంటే ఎక్కువ మిగులును సాధించగలిగిన మేరకు అదంతా సాధారణ సంబంధానికి వెనుక మాత్రమే జరుగుతుంది. మిగిలిన పరిస్థితులన్నీ యథాతథంగా వుంటే ఈ లాభం యొక్క పరిమాణం కౌలును నిర్ణయించదు. అందుకు విరుద్ధంగా దానికి పరిమితిగా కౌలు నిర్ణాయకమవుతుంది. మధ్యయుగాలలో అధిక లాభం రేటు అన్నది కేవలం పెట్టుబడి పొందిక – కింది స్థాయిలో వుండటం వల్ల మాత్రమే కాదు. ఆ పొందికలో వేతనాలపై వెచ్చించిన అస్థిర పెట్టుబడి ప్రబలంగా వుంటుంది. భూమి విషయంలో వంచనవల్ల భూస్వామి కౌలులోనూ, అతని భృత్యుల ఆదాయంలోనూ ఒక భాగాన్ని స్వాహా చేయడం ద్వారా మాత్రమే జరిగింది. మధ్యయుగాలలో అసాధారణమైన నగరాభివృద్ధి భూస్వామ్య విధానాన్ని బద్దలుకొట్టలేకపోయినప్పుడు రాజకీయంగా గ్రామీణ ప్రాంతం నగరాన్ని దోపిడీ చేస్తుంది. ఉదా : ఇటలీ, మరోవైపున నగరం తన గుత్తాధిపత్యం ధరల ద్వారా, తన పన్నుల విధానం ద్వారా, తన సంఘాల వ్యవస్థ ద్వారా, తన ప్రత్యక్ష వాణిజ్య వంచన ద్వారా, అధిక వడ్డీల ద్వారా భూమిని ఆర్థికంగా దోపిడీ చేయగలుగుతుంది.

వ్యవసాయ ఉత్పత్తిలో పెట్టుబడిదారీ రైతు ప్రవేశించగానే వ్యవసాయ ఉత్పాదితాల ధర కనీసం మొదటి దశలో పారిశ్రామిక ఉత్పత్తి ధరలకంటే ఎక్కువగా వుంటుందని ఊహించవచ్చు. వ్యవసాయ ఉత్పాదితాలు అనాదిగా ఏదో ఒక రూపంలో కౌలు చెల్లిస్తూనే వున్నాయి. ఇలా ధర ఎక్కువగా

ఉండటానికి గల కారణం గుత్తాధిపత్యం ధర కావచ్చు. లేదా వాటి ధర వ్యవసాయ ఉత్పాదితాల విలువకంటే ఎక్కువ ఉండటం కావచ్చు. వాటి విలువ సగటు లాభంచేత శాసించబడే ఉత్పత్తి ధరకంటే వాస్తవంగా ఎక్కువగా వుంటుంది. అలా కాకుంటే పెట్టుబడిదారీ రైతు వ్యవసాయ ఉత్పాదితాల ఆనాటి ధరలలో మొదట సగటు లాభాన్ని సంపాదించలేడు. రెండోది అదే ధర నుంచి మరో మిగులు భాగాన్ని కౌలు రూపంలో చెల్లించలేడు. భూస్వామితో తన ఒప్పందంలో పెట్టుబడిదారుణ్ణి నడిపించే సాధారణ లాభం రేటు కౌలు అన్నది కలపకుండానే రూపొందిందని దీనినిబట్టి ఎవరైనా భావించవచ్చు. కనుక వ్యవసాయ ఉత్పత్తిలో క్రమబద్ధంచేసే పాత్రను అది సంతరించుకోగానే ఈ మిగులు దాని చేతిలోకొస్తుంది. దానిని అది భూస్వామికి చెల్లిస్తుంది. ఈ సాంప్రదాయిక పద్ధతిలోనే ఉదాహరణకు రాడ్ బెర్టస్ ఈ అంశాన్ని వివరిస్తారు.[1] కాని :

మొదటిది – వ్యవసాయంలో ఒక స్వతంత్రమైన ప్రబలమైన శక్తిగా పెట్టుబడి ఇలా కనిపించడమన్నది ఒకేసారి జరగదు. సార్వత్రికంగా జరగదు. క్రమంగానూ కొన్ని ప్రత్యేక ఉత్పత్తి రంగాలలోనూ మాత్రమే జరుగుతుంది. మొదట తిన్నగా ప్రధాన వ్యవసాయంలో కాక పశుపోషణ, ముఖ్యంగా గొర్రెల పెంపకం లాంటి ఉత్పత్తి శాఖలను అది ఆవరిస్తుంది. పరిశ్రమ పెరుగుతున్న తొలి దశలో గొర్రెల పెంపకం నుంచి తలెత్తే ప్రధానమైన ఉత్పత్తి ఉన్నివల్ల ఉత్పత్తి ధరకంటే నిరంతరాయంగా అధికమైన మార్కెట్ ధర లభిస్తుంది. చాలాకాలం వరకూ ఇది సమానం కాదు. ఆ రకంగా ఇంగ్లాండ్‌లో 16వ శతాబ్దంలో జరిగింది.

రెండవది – ఈ పెట్టుబడిదారీ ఉత్పత్తి మొదట చెల్లాచెదురుగా మాత్రమే కనిపిస్తుంది. కనుక అది మొదట ప్రత్యేకమైన సారవంతమైన భూముల్లోనూ, స్థానం రీత్యా అసాధారణమైన సానుకూల అంశాలున్న భూమిలోనూ విస్తరిస్తుంది అన్న ఊహ సరైందే. ఈ భూములు సహజంగానే వ్యత్యాసపు కౌలునిస్తాయి.

మూడవది – ఈ ఉత్పత్తి విధానం కనిపించిన కాలంలో (దీనికి పెరిగిన నగర డిమాండ్ అవసరం) వ్యవసాయ ఉత్పాదితాల ధరలు ఇంగ్లాండులో 17వ శతాబ్దపు చివరి 3వ భాగంలోలాగా నిస్సందేహంగా ఉత్పత్తి ధరకంటే అధికంగా ఉంటాయని భావిద్దాం. అయినప్పటికీ వ్యవసాయాన్ని పెట్టుబడికి లోబరిచే చర్య నుంచి ఈ ఉత్పత్తి విధానం తనను తాను బయటికి లాక్కోగానే, వ్యవసాయంలో మెరుగుదల సాధించగానే, దాని ఉత్పత్తి ఖర్చులు తగ్గి వ్యవసాయం అభివృద్ధి చెందగానే మళ్ళీ సమతూకం పునరుద్ధరించబడి వ్యవసాయ ఉత్పాదితం ధరలు పడిపోతాయి. ఇంగ్లాండులో 18వ శతాబ్దపు ప్రారంభంలో ఇలా జరిగింది.

కనుక సగటు లాభానికి పైన వున్న మిగులుగా కౌలును ఈ సాంప్రదాయిక పద్ధతిలో వివరించడం సాధ్యం కాదు. కౌలు మొదట ప్రత్యక్షమైనప్పుడు వున్న ప్రత్యేక చారిత్రక పరిస్థితులేమైనప్పటికీ అది వేళ్ళుపాతుకున్న తర్వాత ఇంతకు ముందు పేర్కొన్న ఆధునిక పరిస్థితులలో తప్ప వేరే రకంగా మనజాలదు.

చివరి అంశం – వస్తు కౌలు డబ్బు కౌలుగా రూపాంతరం చెందడంలో పెట్టుబడీకరించిన

1. జె. రాడ్ బెర్టస్ - "సోషియల్ బ్రీఫ్-" కార్ల్‌మార్క్స్ అదనపు విలువ సిద్ధాంతాలు, రెండవ భాగం - సం.

కౌలుగాను, భూమి ధరగాను మారటంలో భూమి అన్యాక్రాంతం కావడం, పరాయిగా మారటానికి అవకాశం కలగటం అన్నది, అత్యవసరమైన అవసరాలుగా మారతాయన్నది గమనించాలి. ఇంతకు ముందు కౌలు చెల్లించే రైతు ఇప్పుడు ఒక స్వతంత్ర రైతు యజమానిగా మారతాడు. అంతేకాదు. నగరాలలో ధనికులు, డబ్బున్న ఇతరులు రియల్ ఎస్టేట్‌ను కొనగలుగుతారు. దానినే రైతులకు లేదా పెట్టుబడిదారులకు లీజుకు ఇవ్వగలుగుతారు. అలా మదుపు పెట్టిన వారి పెట్టుబడిపైన వడ్డీ రూపంగా కౌలును అనుభవిస్తారు. కనుక ఈ పరిస్థితి కూడా పాత ఉత్పత్తి విధానాన్ని, భూమి యజమానికీ, భూమిని వాస్తవంగా దున్నే వ్యక్తికీ మధ్య వున్న సంబంధాన్ని, కౌలు సంబంధాన్ని సహితం మార్చడానికి అవకాశం కల్పిస్తుంది.

## V. పాలికాపు పద్ధతి, కమతాలపై రైతుల యాజమాన్యం

మనం భూమి కౌలు వివరణ చివరి దశకు చేరుకున్నాం.

శ్రమ కౌలు వస్తు కౌలు లేదా డబ్బు కౌలు (వస్తు కౌలు మారిన రూపంగా మాత్రమే) లాంటి భూమి కౌలు రూపాలన్నింటిలోనూ కౌలు చెల్లించే వ్యక్తి భూమిని వాస్తవంగా సాగుచేసేవాడు, దానిని కలిగి వుండేవాడు అయి వుంటాడు. అతని వేతనం చెల్లించబడని అదనపు శ్రమ సూటిగా భూస్వామి చేతుల్లోకి పోతుంది. చివరికి, రూపంలో సైతం, డబ్బు కౌలు తన శుద్ధ రూపంలో అనగా వస్తు కౌలు యొక్క మారిన రూపంలో ఇది సాధ్యం కావడమే కాదు అలా వాస్తవంగా జరుగుతుంది. కౌలు – పెట్టుబడిదారీ కౌలుగా మారే పరివర్తన రూపంగా ఈ పాలికాపు పద్ధతిని లేదా పాళ్ళకు ఇచ్చే పద్ధతిని మనం పరిగణించవచ్చు. ఈ పద్ధతిలో మేనేజరు (రైతు) శ్రమను (తన సొంత శ్రమను లేదా ఇతరుల శ్రమను) పెట్టడంతోపాటు అనిశ్చల పెట్టుబడిలో ఒక భాగాన్ని కూడా సమకూరుస్తాడు. భూస్వామి తన భూమితోపాటు మిగిలిన అనిశ్చల పెట్టుబడి భాగాన్ని (ఉదాహరణకు పశువుల్ని) సమకూరుస్తాడు. ఉత్పాదితాన్ని నిర్దిష్ట నిష్పత్తులలో కౌలుదారుడు, భూస్వామి పంచుకుంటారు. ఈ నిష్పత్తి ఒకోదేశంలో ఒకోలా వుంటుంది. ఒకవైపున ఇక్కడ పూర్తిగా పెట్టుబడిదారీ నిర్వహణకు అవసరమైన తగినంత పెట్టుబడి రైతు దగ్గర వుండదు. మరోవైపున ఇక్కడ భూస్వామి స్వాహాచేసే వాటా కౌలు శుద్ధ రూపాన్ని ధరించదు. అది అతడు ముందుగా పెట్టిన పెట్టుబడిపై వడ్డీతోపాటు అదనపు కౌలును కూడా కలిగి వుంటుంది. అది ఆచరణలో రైతు శ్రమ శక్తి మొత్తాన్ని గ్రహించవచ్చు లేదా అతనికి అతని అదనపు శ్రమలో కొంత భాగాన్ని వదిలిపెట్టవచ్చు. అయితే ఇక్కడ అదనపు విలువ సాధారణ రూపంలో మాత్రం కనిపించదు. ఒకవైపున పాలుపంచుకునే రైతు తన సొంత శ్రమను వెచ్చించవచ్చు లేదా ఇతరుల శ్రమను వెచ్చించవచ్చు. ఉత్పాదితంలో ఒక భాగాన్ని అతడు కార్మికునిగా కాక శ్రమ పరికరాల్లో ఒక భాగాన్ని కలిగి వున్నందుకుగాను, అంటే అతడు తన సొంత పెట్టుబడిదారునిగా ఉన్నందుకు పొందుతాడు. మరోవైపున భూస్వామి తన భూయాజమాన్యం ప్రాతిపదికగా మాత్రమే గాక పెట్టుబడిదాతగా తన వాటాను కోరతాడు.[1]

పోలెండ్, రుమేనియాలలో లాగా స్వతంత్ర రైతాంగ వ్యవస్థకు పరివర్తనా కాలంలో నిలబడిన

1. బురెట్ (కోర్స్ డి ఎకనామి పొలిటెక్, బ్రగ్జెల్స్, 1842) టోకెవిల్లే (లాన్సియన్ రెజిమె ఎట్ లా రివల్యూషన్, పారిస్, 1856) సిస్మండి (నోవి ప్రిన్సిప్స్ డి ఎకనామి పొలిటెక్, పారిస్, 1827) - సం.

భూమిపై పాత ఉమ్మడి యాజమాన్యం యొక్క అవశేషం భూమి కౌలు కింద రూపాలకు పరివర్తన చెందడానికి ఆధారంగా పనిజేస్తుంది. విడి రైతుకు చెందిన ఒక భూభాగాన్ని అతడు స్వయంగా స్వతంత్రంగా సాగు చేయడానికి అవకాశం ఏర్పడింది. మిగిలిన భాగం ఉమ్మడిగా సాగుచేయబడి అదనపు ఉత్పాదితాన్ని సృష్టించింది. ఆ భాగం గ్రామీణ ప్రజల ఉమ్మడి ఖర్చులను భరించడానికి, పంట పాడైన సందర్భాలలో రిజర్వు నిధిగానూ పనికొచ్చింది. అదనపు ఉత్పాదితంలో ఈ చివరి రెండు భాగాలు, భూమితో సహా మొత్తం అదనపు ఉత్పాదితం రానురాను ప్రభుత్వ అధికారులు, ప్రైవేటు వ్యక్తులు కబళించారు. ఆ రకంగా తొలి దశలో స్వేచ్ఛగా వున్న రైతు యజమానులు – దాసులుగా మారిపోయారు. వారు చట్టబద్ధమైన అదనపు శ్రమను లేదా వస్తు కౌలును చెల్లించాల్సి వచ్చింది. కాగా ఈ ఉమ్మడి భూమిని కబళించిన వారు కేవలం ఆ కబళించబడిన ఉమ్మడి భూములకే గాక రైతుల భూములకు కూడా యజమానులుగా మారారు.

అచ్చమైన బానిస ఆర్థిక విధానాన్ని గాని, (ఈ విధానం కూడా స్థానిక అవసరాలకు సరఫరా చేసే పితృస్వామిక విధానం నుంచి ప్రపంచ మార్కెట్టుకు సరఫరా చేసే తోటల పెంపకం విధానానికి రూపాంతరం చెందింది.) భూస్వాములు స్వయంగా స్వతంత్ర సాగుదారులుగా వుంటూ మొత్తం ఉత్పత్తి పరికరాలను కలిగి వుంటూ, స్వేచ్ఛాయుతమైన లేదా స్వేచ్ఛారహితమైన దాసుల శ్రమను దోపిడీ చేస్తూ వారి నుంచి వస్తు రూపంలో లేదా డబ్బు రూపంలో సొమ్ము రాబడుతూ ఎస్టేట్‌లను నిర్వహించే విధానాన్ని గురించి గాని ఇక్కడ మరింతగా పరిశీలించాల్సిన అవసరం లేదు. భూస్వామి, ఉత్పత్తి పరికరాల యజమానిగా వుండే వ్యక్తి, కార్మికుల్ని సూటిగా దోపిడీ చేయడం అన్నది ఈ ఉత్పత్తి అంశాలలో ఒకటి. ఇక్కడ ఈ పనులన్నీ ఒకే వ్యక్తి నిర్వహిస్తాడు. అప్పుడు కౌలు, లాభం కూడా అదేరకంగా ఒకేచోట వుంటాయి. అదనపు విలువ యొక్క విభిన్న రూపాలు వేరుకావు. కార్మికుల అదనపు శ్రమ మొత్తం ఇక్కడ అదనపు ఉత్పాదితంగా వ్యక్తమవుతుంది. ఉత్పత్తి పరికరాల యజమాని, భూయజమాని ఈ అదనపు ఉత్పాదితాన్ని నేరుగా గుంజుతాడు. బానిస వ్యవస్థలో తక్షణ ఉత్పత్తిదారుల నుంచి ఇది స్వాహా చేయబడుతుంది. అమెరికన్ తోటల పెంపకంలోలాగా పెట్టుబడిదారీ దృష్టితో పరిశీలించినప్పుడు ఈ మొత్తం అదనపు విలువ లాభంగా పరిగణించబడుతుంది. పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం లేనిచోట, పెట్టుబడిదారీ దేశాల నుంచి ఆ దృష్టికోణం బదిలీ కానిచోట అది కౌలుగానే కనిపిస్తుంది. ఏమైనప్పటికీ ఈ రూపం ఇబ్బందులు తెచ్చిపెట్టదు. భూస్వామి ఆదాయాన్ని ఏ పేరుతో పిలిచినప్పటికీ అది అతడు స్వాహా చేసిన అదనపు ఉత్పాదితం. వేతనం చెల్లించబడిన అదనపు శ్రమ మొత్తం నేరుగా స్వాహా చేయబడుతుంది. ఇక్కడ ఇది మామూలుగా అమలులో వుండే రూపం. భూ ఆస్తి అటువంటి స్వాహాకు ప్రాతిపదికను ఏర్పరుస్తుంది.

కమతాలపై యాజమాన్యం : ఇక్కడ రైతే తన భూమికి యజమాని. అది అతని ప్రధాన ఉత్పత్తి పరికరం. అతని శ్రమను, అతని పెట్టుబడిని వినియోగించడానికి వున్న తప్పనిసరి రంగం అది. ఈ రూపంలో లీజు డబ్బు చెల్లించబడదు. కనుక కౌలు ప్రత్యేక అదనపు విలువ రూపంగా కనిపించదు. అయితే పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం అభివృద్ధి చెందిన దేశాలలో ఇతర ఉత్పత్తి రంగాలలో లాగానే అదనపు లాభంగా కనిపిస్తుంది. రైతు శ్రమవల్ల వచ్చే రాబడి మొత్తంలాగానే ఈ అదనపు లాభం కూడా అతనికే దక్కుతుంది.

ఈ రూపంలో భూ ఆస్తి ఉండాలంటే ఇంతకు ముందున్న పాత రూపాలలో లాగానే నగర జనాభాకంటే గ్రామీణ జనాభా చాలా ఎక్కువగా వుండి వుండాలి. పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం వున్నప్పటికీ అది సాపేక్షంగా తక్కువ స్థాయిలో అభివృద్ధి చెందినదై వుంటుంది. ఇతర ఉత్పత్తి రంగాలలో పెట్టుబడి కేంద్రీకరణ చాలా స్వల్పమైన పరిమితుల్లో జరిగి వుంటుంది. పెట్టుబడి చిన్నచిన్న భాగాలుగా విడిపోయి వుంటుంది. వ్యవసాయ ఉత్పాదితంలో అత్యధిక భాగం సూటిగా జీవనాధార వస్తువులుగా ఉత్పాదకులే వినియోగం చేస్తారు. మిగిలిన కొద్దిభాగం మాత్రమే సరుకులుగా నగర వాణిజ్యంలో ప్రవేశిస్తుంది. ఇక్కడ వ్యవసాయ ఉత్పాదితాల సగటు మార్కెట్ ధర ఎలా క్రమబద్ధమైనప్పటికీ వ్యత్యాసపు కౌలు మాత్రం వుంటుంది. అంటే పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానంలోలాగానే సారం రీత్యా లేదా స్థానం రీత్యా మరింత సానుకూలమైన లేదా మెరుగైన భూమి నుంచి ఉత్పత్తి అయిన సరుకుల ధరలలో మిగులుగా వ్యత్యాసపు కౌలు వుంటుంది. ఇంకా సాధారణ మార్కెట్ ధర అభివృద్ధి చెందని సామాజిక పరిస్థితుల్లో సైతం ఈ వ్యత్యాసపు కౌలు వుంటుంది. అదనపు ఉత్పాదితం మిగులులో అది కనిపిస్తుంది. అప్పుడు మాత్రమే మరింత అనుకూలమైన సహజ పరిస్థితులలో శ్రమ నిర్వహించ బడిన రైతు జేబుల్లోకి అది ప్రవహిస్తుంది. ఇక్కడ నిరపేక్ష కౌలు వుండదని అంటే పరమ అధ్వాన్నపు భూమి కౌలు చెల్లించదని సాధారణంగా భావించబడుతుంది. రైతు వాస్తవ ఉత్పత్తి ఖర్చులో భూమి ధర కూడా ఈ రూపంలో ప్రవేశిస్తుంది. కాలక్రమంలో ఈ రూపం మరింత అభివృద్ధి చెందుతున్నప్పుడు ఒక వారసత్వపు ఆస్తిని పంచుతున్నప్పుడు గానీ లేదా మొత్తం ఎస్టేటు లేదా దాని విడిభాగాల యాజమాన్యం మారుతున్నప్పుడు గానీ భూమిని ఒక నిర్దిష్టమైన డబ్బు విలువ ప్రకారం లెక్కించడం జరుగుతుంది. తాకట్టు పెట్టడం ద్వారా డబ్బును సేకరించి సాగుదారుడే ఆ భూమిని కొనుగోలు చేసి వుండవచ్చు. కనుక ఆ సందర్భంలో భూమి ధర పెట్టుబడీకరించబడిన కౌలు తప్ప మరి దేనినీ సూచించదు. ఈ అంశాన్ని ముందుగానే ఊహించటం జరుగుతుంది. ఆ రకంగా భూసారమూ, స్థానమూ అనే అంశాలలో ఉన్న తేడాలతో ప్రమేయం లేకుండా కౌలు అస్థిత్వంలో వుంటుందని భావించబడుతుంది. ఎందుకంటే – నిరపేక్ష కౌలు ముందుగానే దాని ఉత్పత్తి ఖర్చును మించిన ఉత్పత్తి విలువలో మిగులును కోరుతుంది. లేదా ఉత్పాదితం విలువను మించిన గుత్తాధిపత్య ధర అయినా ఉండాలి. అయితే ఇక్కడ సూటిగా జీవనాధార వస్తువుల కోసం సాగుచెయ్యబడుతుంది. కనుక అత్యధిక జనాభా విషయంలో వారి శ్రమ పెట్టుబడులను వినియోగించటానికి ఉన్న తప్పనిసరి రంగంగా భూమి అస్తిత్వంలో ఉంటుంది. ఉత్పాదితం యొక్క అమల్లో ఉన్న మార్కెట్టు ధర కేవలం అసాధారణ పరిస్థితుల్లో మాత్రమే దాని విలువను అందుకోగలుగుతుంది. అయితే ఈ విలువ సాధారణంగా దాని ఉత్పత్తి ధరకంటే ఎక్కువగా వుంటుంది. దానికి కారణం సజీవ శ్రమ అతి విస్తారంగా వుండటమే. అయితే ఈ ఉత్పత్తి ధరపైన విలువ మిగులు అనేది చిన్న కమతాలు ప్రబలంగా ఉన్న ఆర్థిక రంగం కలిగిన దేశాలలో వ్యవసాయేతర పెట్టుబడి సహితం దిగువ స్థాయిలో ఉండటం వల్ల పరిమితికి గురవుతుంది. ఒక కమతం ఉన్న రైతుకు ఈ పరిమితి – పెట్టుబడిపై సగటు లాభం వల్ల ఏర్పడదు. అతడు చిన్న పెట్టుబడిదారుడు అయిన మేరకు ఇది వర్తిస్తుంది. మరోవైపున అతడు భూస్వామి అయిన మేరకు కౌలు అవసరం కూడా ఈ పరిమితిని విధించదు. చిన్న పెట్టుబడిదారునిగా ఖర్చులు పోగా అతడు తనకు తాను ఇచ్చుకునే వేతనాలే గరిష్ఠ పరిమితి. ఉత్పాదితం ధర వేతనాలకు

సరిపడా వున్నంత మేరకు అతడు ఆ భూమిని సాగు చేస్తాడు. ఒక్కొక్కసారి కనీస భౌతిక అవసరాలకు సరిపోయే వేతనాలకే సంతృప్తిపడతాడు. భూమి యజమానిగా అతనికి భూ ఆస్తి అనే ఆటంకం ఎదురు కాదు. పెట్టుబడికి (శ్రమతో సహా) అభిముఖంగా మాత్రమే పెట్టుబడి మదుపుకు ఆటంకంగా కల్పించే అంశంగా మాత్రమే అది ముందుకు వస్తుంది. భూమి ధరపైన వడ్డీ (దానిని మరో వ్యక్తికి, తనఖా పెట్టుకున్న రుణదాతకు చెల్లించాల్సి వుంటుంది.) ఇక్కడ ఆటంకంగానే ఉంటుంది. అయితే ఈ వడ్డీని పెట్టుబడిదారీ పరిస్థితులలో లాభాన్ని కలిగి వుండే అదనపు శ్రమ భాగం నుంచి చెల్లించవచ్చు. భూమి ధరపై లెక్కగట్టే కౌలు, దానికోసం చెల్లించే వడ్డీ అనేవి రైతు యొక్క పెట్టుబడీకరించబడిన అదనపు శ్రమలో ఒక భాగం తప్ప వేరుకాదు. కార్మికుడు తన మనుగడ కోసం తప్పనిసరిగా వెచ్చించాల్సిన శ్రమను మించిన అదనపు శ్రమభాగం ఇది. ఇది సగటు లాభంతో సమానమైన సరుకు విలువ భాగంలో వాస్తవ రూపం ధరించదు. సగటు లాభంలో వాస్తవ రూపం ధరించిన అదనపు విలువపై మిగులులో, అనగా అదనపు లాభంలో కూడా వాస్తవ రూపం ధరించదు. కౌలు అన్నది సగటు లాభం నుంచి తీయబడి ఉండొచ్చు. లేదా వాస్తవ రూపం ధరించిన సగటు లాభం యొక్క ఏకైక భాగమూ కావచ్చు. చిన్న కమతందారు తన కమతం సాగుచేసుకోవడానికి లేదా సాగుకై భూమిని కొనుగోలుచేయడానికి, మామూలు పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానంలోలాగా వ్యవసాయ ఉత్పాదితాల ధర అతనికి సగటు లాభాన్ని ఇచ్చే స్థాయికి పెరగాల్సిన అవసరం లేదు. కౌలు రూపంలో ఈ సగటు లాభానికి మించి నిర్దిష్టమైన మిగులును ఇచ్చే స్థాయికి పెరగక్కర్లేదు. కనుక అతని ఉత్పాదితం విలువ స్థాయికి లేదా ధర స్థాయికి మార్కెట్ ధర పెరగవలసిన అవసరం లేదు. పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం ఉన్న దేశాలలోకంటే, భూమిపైన చిన్న రైతుల యాజమాన్యం ప్రబలంగా వున్న దేశాలలో ధాన్యం ధరలు తక్కువ వుండటానికి గల కారణాలలో ఇదొకటి. అత్యంత ప్రతికూల వాతావరణంలో పనిచేసే రైతుల అదనపు శ్రమలో ఒక భాగం సమాజానికి ఊరికే దక్కుతుంది. అది ఉత్పత్తి ధరలోకి గాని, సాధారణ విలువ సృష్టిలో గాని ఏమాత్రం ప్రవేశించదు. ఈ తక్కువ ధరకు కారణం, ఉత్పాదకుల పేదరికమే తప్ప వారి శ్రమ ఉత్పాదకత ఎంతమాత్రం కాదు.

సర్వవ్యాప్తంగా అమలులో వున్న ఒక సాధారణ రూపంగా, స్వతంత్ర, స్వయం నిర్వాహిత రైతుస్వామ్యం ఒకవైపున సంప్రదాయక ప్రాచీనయుగపు అత్యుత్తమ యుగాలలో సామాజిక ఆర్థిక పునాదులుగా వుంది. మరోవైపున ఆధునిక దేశాలలో ఫ్యూడల్ తరహా భూస్వామ్యం రద్దయిన దశలో తలెత్తిన రూపాల్లో ఒకటిగా కనిపిస్తుంది. ఇంగ్లండులో ఐచ్ఛిక రైతాంగ దళం, స్వీడన్‌లో రైతాంగమూ, ఫ్రెంచి, పశ్చిమ జర్మన్ రైతులూ ఇందుకు ఉదాహరణ. ఇక్కడ వలసలను చేర్చలేదు. ఎందుకంటే వలసల్లో స్వతంత్ర రైతు భిన్నమైన పరిస్థితుల్లో అభివృద్ధి చెందుతాడు.

సన్నకారు వ్యవసాయానికి, స్వయం నిర్వాహక రైతు స్వతంత్ర యాజమాన్యమే భూ ఆస్తి యొక్క అత్యంత సాధారణ రూపం అన్నది స్పష్టం. ఈ ఉత్పత్తి విధానంలో తన శ్రమ ఉత్పాదితంపై కార్మికుని యాజమాన్యం ఉండాలంటే భూమి అతని స్వాధీనంలో ఉండాలి. దానిలో సాగుదారుడు స్వతంత్రుడైనా, కాకున్నా ఎప్పుడూ తన మనుగడ అవసరాలను స్వతంత్రంగా, తన కుటుంబంతో కలిపి ఒక విడి కార్మికునిగా ఉత్పత్తి చేయాలి. చేతివృత్తుల స్వేచ్ఛాభివృద్ధికి పరికరాలపై యాజమాన్యం

అవసరమైనట్టే ఈ ఉత్పత్తి విధానపు సంపూర్ణ వికాసానికి భూమిపైన యాజమాన్యం అవసరం. వ్యక్తి స్వాతంత్ర్యానికీ, దాని అభివృద్ధికీ పునాది ఇక్కడ వుంది. వ్యవసాయ అభివృద్ధికే ఇది ఒక అవసరమైన పరివర్తనా దశ. దాని పతనానికి కారణాలే దాని పరిమితులను చూపుతాయి. అవి : భారీ పరిశ్రమల అభివృద్ధి కారణంగా, దానికి సాధారణ అనుబంధంగా రూపొందిన గ్రామీణ పరిశ్రమ విచ్ఛిన్నం; ఈ రకం సాగువల్ల భూమి నిస్సారంగా మారడం, ఉమ్మడి భూములను భూస్వాములు ఆక్రమించటమూ; (చిన్న కమతాల స్వతంత్ర వ్యవసాయానికి ఈ ఉమ్మడి భూములు రెండో అనుబంధం, పశువుల పెంపకానికి అవి వీలు కల్పించేవి.) తోటల పెంపకం విధానం నుండి లేదా భారీ స్థాయి పెట్టుబడిదారీ వ్యవసాయం నుండి ఎదురయ్యే పోటీ. వ్యవసాయంలో మెరుగుదలవల్ల ఒకవైపున వ్యవసాయపు ధరలు పడిపోతాయి. మరోవైపున మరింత పెట్టుబడి, మరింత విస్తృతమైన పాదార్థిక ఉత్పత్తి పరిస్థితులూ అవసరమవుతాయి. ఇంగ్లండులో 18వ శతాబ్దపు మొదటి అర్ధభాగంలోలాగా ఈ అంశాలు కూడా ఈ తరహా సాగు పతనానికి కారణాలవుతాయి.

సామాజిక ఉత్పత్తి శక్తులూ, సామాజిక శ్రమ రూపాలూ, సామాజిక పెట్టుబడి కేంద్రీకరణ, భారీ స్థాయిలో పశువుల పెంపకమూ, ప్రగతిశీలంగా విజ్ఞాన శాస్త్రాన్ని వినియోగించుకోవడమూ అన్నవి అభివృద్ధి కాకుండా చిన్న కమతాల యాజమాన్యం స్వభావసిద్ధంగానే అడ్డుపడుతుంది.

అధిక వడ్డీ రేట్లూ, పన్నుల విధానమూ దాన్ని ప్రతిచోటా దారిద్ర్యంలోకి నెడతాయి. భూమి ధరలో జరిగిన పెట్టుబడి వ్యయం ఈ పెట్టుబడిని సాగునుంచి ఉపసంహరించుకొంటుంది. ఉత్పత్తి సాధనాలు ముక్కచెక్కలవుతాయి. ఉత్పత్తిదారులు ఎవరికి వారుగా చెల్లాచెదురవుతారు. మానవశక్తి విపరీతంగా వృధా అవుతుంది. ఉత్పత్తి పరిస్థితులు క్రమానుగతంగా క్షీణిస్తాయి. ఉత్పత్తి సాధనాల ధరలు పెరిగిపోతాయి. చిన్న కమతాల యాజమాన్యపు అనివార్యపు నియమం ఇది. ఒక్కో రుతువులో సమృద్ధి ఈ ఉత్పత్తి విధానానికి వినాశకరమైనది.[1]

స్వతంత్ర భూ యాజమాన్యంలో కలిసిన సన్నకారు వ్యవసాయాన్ని పట్టుకొన్న ప్రత్యేకమైన పీడల్లో ఒకటి – భూమి కొనుగోలులో పెట్టుబడిని మదుపు పెట్టడం. (పెద్ద భూస్వామి మొదట భూమిని కొనడానికి, తర్వాత తనే తన సొంత కౌలుదారునిగా నిర్వహించడానికీ పెట్టుబడిపెట్టే పరివర్తన దశకు కూడా ఇదే వర్తిస్తుంది.) భూమి ఇక్కడ ఒక సరుకుగా మారడానికి వీలున్న రూపాన్ని సంతరించుకోవడంవల్ల యాజమాన్యపు మార్పులు అధికమవుతాయి.[2] ఆ రకంగా రైతు దృష్టిలో, తరం తర్వాత తరం గడుస్తున్న కొద్దీ, ఎస్టేట్లు విడిపోతున్న కొద్దీ అది పెట్టుబడి మదుపుగా మారుతుంది. అంటే అది తాను కొనుక్కున్న భూమిగా మారుతుంది. ఇక్కడ భూమి ధర అన్నది వ్యక్తిగత ఉత్పాద కుని అనుత్పాదక ఉత్పత్తి ఖర్చుల్లో, లేదా ఉత్పాదితం ఉత్పత్తి ఖర్చుల్లో ఒక గుదిబండగా మారుతుంది.

భూమి ధర అన్నది పెట్టుబడీకరించబడిన ఈ విధంగా ఊహించబడిన కౌలు తప్ప వేరుగాదు. వ్యవసాయంలో పెట్టుబడిదారీ పద్ధతులు ప్రయోగిస్తే భూస్వామి కౌలు మాత్రమే పొందుతాడు. రైతు

1. టూకే గ్రంథంలో ఫ్రాన్స్ రాజసింహాసనం నుంచి వెలువడిన ఉపన్యాసాన్ని చూడండి. [న్యూమార్చ్, ఎ హిస్టరీ ఆఫ్ ప్రైసెస్.... లండన్, 1857 - సం]
2. చూ: మోనియర్ (ది అగ్రికల్చర్ ఎన్ ఫ్రాన్స్, పారిస్, 1846), రూబికన్ (డూ మెకానిజ్మ్.... పారిస్, 1837)-సం.

ఈ వార్షిక కౌలు తప్ప భూమి కోసం మరేదీ చెల్లించదు. అప్పుడు భూస్వామి భూమి కొనుగోలులో పెట్టే మదుపులో భూస్వామికి వడ్డీ ఇచ్చే పెట్టుబడి మాత్రమే ఉంటుంది. అంతేగాని వ్యవసాయంలో పెట్టే మదుపుతో దానికి ఎటువంటి సంబంధమూ ఉండదు. ఇక్కడ ప్రయోగించబడిన పెట్టుబడిలో నిశ్చల భాగంతోగాని, చలామణి భాగంతోగాని దానికి ప్రమేయం లేదు.[1] అది కొనుగోలుదారునికి కేవలం ఏటా కౌలు పొందే హక్కును మాత్రమే ఇస్తుంది. ఆ కౌలును ఉత్పత్తి చేయడంలో మాత్రం దానికి ఏమాత్రం పాత్ర ఉండదు. భూమిని కొన్న వ్యక్తి అమ్మిన వ్యక్తికి తన పెట్టుబడిని చెల్లిస్తాడు. దానికి ప్రతిగా అమ్మిన వ్యక్తి భూమిపై తన హక్కుల్ని వదులుకుంటాడు. కనుక పెట్టుబడి ఇక కొనుగోలుదారుని పెట్టుబడిగా ఏమాత్రం ఉండదు. అది ఇక అతని దగ్గర లేదు. కనుక భూమిలో ఏదో ఒకరకంగా మదుపు పెట్టే పెట్టుబడికి అది చెందదు. అతడు ఆ భూమిని ప్రియంగా కొన్నా, చౌకగా కొన్నా లేదా అది అతనికి ఊరికే లభించినా, ఆ భూమిలో రైతు పెట్టే మదుపును అది ఏరకంగానూ మార్చదు. కౌలును కూడా ఏరకంగానూ మార్చదు. అది అతనికి వడ్డీలా కనిపిస్తుందా, మరోలా కనిపిస్తుందా లేక ఎక్కువ వడ్డీ ఇస్తుందా, తక్కువ వడ్డీ తెస్తుందా అన్న విషయాన్ని మాత్రమే మారుస్తుంది.

ఉదాహరణకు, బానిస ఆర్థిక విధానాన్ని చూడండి. బానిస కోసం చెల్లించిన ధర బానిస నుంచి గుంజబడే పెట్టుబడీకరించబడిన అదనపు విలువ, లాభం తప్ప మరేమీ కాదు. అయితే బానిసను కొనుగోలు చేయడానికి చెల్లించిన పెట్టుబడి, అతన్నుంచి లాభాన్ని, అదనపు శ్రమను రాబట్టే పెట్టుబడికి చెందదు. అందుకు విరుద్ధంగా జరుగుతుంది. బానిస యజమాని వదిలేసుకున్న పెట్టుబడి అది. వాస్తవ ఉత్పత్తికై అతని దగ్గరున్న పెట్టుబడిలో నుంచి తీసివేయబడిన మొత్తం అది. అతనికి సంబంధించినంత వరకూ ఆ మొత్తం అయిపోయింది. భమి కొనుగోలులో వెచ్చించిన పెట్టుబడి కూడా ఇలాగే వ్యవసాయం దృష్ట్యా అయిపోయింది. బానిస యజమాని తన బానిసను, భూయజమాని తన భూమిని అమ్మినప్పుడు తప్ప ఈ పెట్టుబడి వారికి తిరిగి కనిపించదు అన్నదే దీని అత్యుత్తమ నిదర్శనం. అయితే ఇదే పరిస్థితి కొనుగోలుదారునికి కూడా ఎదురవుతుంది. అతడు బానిసను కొన్నాడన్న వాస్తవం, అదనపు ప్రయత్నం ఏదీ లేకుండానే ఆ బానిసను దోపిడీ చేసే వీలు అతనికి కలిగించదు. బానిస ఆర్థిక విధానంలో అదనపు పెట్టుబడిని వెచ్చించినప్పుడు మాత్రమే అతనలా దోపిడీ చేయగలడు.

---

1. డా॥ హెచ్. మారన్ (ఎక్స్‌టెన్సివ్ ఓడర్ ఇంటెన్సివ్) [ఇక్కడ, ఇంతకు మించి మరే సమాచారమూ లేదు.] తాను వ్యతిరేకించే ఆర్థిక వేత్తల పొరపాటు అభిప్రాయంతోనే ప్రారంభిస్తాడు. భూమి కొనుగోలులో వెచ్చించిన పెట్టుబడిని అతడు "మదుపు పెట్టుబడి"గా భావించి ఆ తర్వాత "మదుపు పెట్టుబడి, అనిశ్చల పెట్టుబడికి అనగా నిశ్చల, చలామణి పెట్టుబడులకు సంబంధించిన నిర్వచనాలపై వివాదంలోకి దిగుతాడు. పెట్టుబడిపై అతనికున్న అపరిమిత భావాలను క్షమించవచ్చు. ఎందుకంటే జర్మన్ అర్థశాస్త్ర స్థితిరీత్యా అతను ఆర్థికవేత్త కాజాలడు. స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో స్టాకులు కొనడానికో, ప్రభుత్వ హామీ పత్రాలను కొనడానికో వెచ్చించిన సొమ్ము మదుపు పెట్టుబడి కానట్టే, భూమిని కొనడానికి వెచ్చించే సొమ్ము వ్యవసాయంలో మదుపు పెట్టుబడి లేదా చలామణి పెట్టుబడి కాజాలదన్న సంగతి అతని దృష్టికి రాదు. ఈ పెట్టుబడు"లన్నీ అతని దృష్టికి ఏదో ఒక ఉత్పత్తి శాఖలో వ్యక్తిగతమైన పెట్టుబడి మదుపుగానే కనిపిస్తాయి.

ఒకే పెట్టుబడి ఒకసారి అమ్మేవాని చేతిలోనూ, మరోసారి భూమిని కొనేవాని చేతిలోనూ రెండుసార్లు అస్తిత్వంలో ఉండదు. కొనుగోలుదారుని చేతినుండి అమ్మేవాని చేతిలోకి అది పోతుంది. అక్కడితో ఆ వ్యవహారం అంతమవుతుంది. కొనుగోలుదారుని దగ్గర ఇప్పుడు పెట్టుబడి లేదు. దానికి బదులు ఓ భూభాగం వుంది. 3% ఇచ్చే ప్రభుత్వ పత్రాలకై 1000 పౌండ్లు చెల్లించిన వ్యక్తి వాస్తవంగా ఏ పెట్టుబడి ఆదాయం నుంచి ఈ జాతీయ రుణంపై వడ్డీ చెల్లించబడుతుందో పట్టించుకోడు. అలాగే భూమిలో పెట్టిన కొత్త పెట్టుబడి మదుపువల్ల వచ్చిన కౌలును కొత్త భూస్వామి తాను భూమిలో పెట్టని పెట్టుబడిపై, అనగా భూమిని కొనటానికి వెచ్చించిన పెట్టుబడిపై వడ్డీగా భావిస్తాడు. అయితే ఈ పరిస్థితి భూ అంశపు ఆర్థిక స్వభావాన్ని ఏమాత్రం మార్చదు.

నిజానికి, భూమిని కొనుగోలు చేయడానికి వెచ్చించిన డబ్బు, ప్రభుత్వ రుణపత్రాలు కొనడానికి పెట్టిన డబ్బు కేవలం తనలో తాను పెట్టుబడి ఏ విలువ మొత్తం అయినా దానిలో అది పెట్టుబడే. పెట్టుబడిదారీ ఉత్పత్తి ప్రాతిపదికపై పెట్టుబడి కాగలిగిన మొత్తమే. ప్రభుత్వ పత్రాలకు చెల్లించిన మొత్తంలాగే భూమికోసం చెల్లించబడినది కూడా ఒక డబ్బు మొత్తం మాత్రమే. ఇది తనలో తాను పెట్టుబడే. ఎందుకంటే అది పెట్టుబడిగా మార్చబడగలదు. అమ్మకందారుడు ఆ సొమ్మును ఎలా ఉపయోగించాడన్న దానినిబట్టి అతను పొందిన సొమ్ము పెట్టుబడిగా మారిందా లేదా అన్నది ఆధారపడి వుంటుంది. కొనుగోలుదారునికి మాత్రం అది ఇక ఎప్పుడూ పెట్టుబడిగా వ్యవహరించదు. అతడు నిర్దిష్టంగా చెల్లించివేసిన ఏ డబ్బు అయినా అంతే. అతని ఖాతాలో అది వడ్డీ ఇచ్చే పెట్టుబడిగా నమోదవుతుంది. ఎందుకంటే అతడు ఈ ఆదాయాన్ని భూమినుంచి పొందిన కౌలులాగా లేదా ప్రభుత్వ రుణాలపై వడ్డీలాగా భావిస్తాడు. అంటే ఈ ఆదాయంపై హక్కును కొనుగోలు చేయడానికి ఖర్చు అయిన డబ్బుపై వడ్డీగా భావిస్తాడు. తిరిగి అమ్మడం ద్వారా మాత్రమే అతడు దాన్ని పెట్టుబడిగా గ్రహించగలడు. అయితే అప్పుడు మరో వ్యక్తి, కొత్త కొనుగోలుదారుడు ఇంతకు ముందు వ్యక్తి కొనసాగించిన సంబంధాన్నే స్వీకరిస్తాడు. కనుక ఎన్నిసార్లు చేతులు మార్చినా ఆ రకంగా వెచ్చించబడిన డబ్బు ఆ వెచ్చించిన వ్యక్తికి పెట్టుబడిగా రూపాంతరం చెందదు.

యంత్రాలు, ముడిపదార్థాలలాగే, భూమి కూడా విలువను కలిగి వుంటుందనీ, అది ఉత్పాదితం ఉత్పత్తి ధరలో పెట్టుబడిగా ప్రవేశిస్తుందనే భ్రమ సన్నకారు భూ ఆస్తి విషయంలో మరింత బలంగా ఉంటుంది. అయితే కౌలు, పెట్టుబడీకరించబడిన కౌలు అయిన భూమి ధర రెండు సందర్భాల్లో మాత్రమే వ్యవసాయ ఉత్పాదితాల ధరలో నిర్ణాయక అంశంగా ప్రవేశిస్తుంది. మొదటిది, వ్యవసాయ పెట్టుబడి అంతర్నిర్మాణం పర్యవసానంగా (ఈ పెట్టుబడికి, భూమిని కొనుగోలు చేయడంలో వినియోగించిన పెట్టుబడితో ఏమాత్రం సంబంధం లేదు.) భూమి ఉత్పాదితాల విలువ వాటి ఉత్పత్తి ధరకంటే ఎక్కువ వుంటుంది. ఆ భేదాన్ని మార్కెట్టు పరిస్థితుల కారణంగా భూస్వామి పొందగలుగుతాడు. రెండోది, గుత్తాధిపత్య ధర సాగినప్పుడు. అయితే ఈ రెండు సందర్భాలూ చిన్న కమతాల యాజమాన్యమూ, సన్నకారు రైతుస్వామ్యం విషయంలో ఎదురుకావు. ఎందుకంటే ఇక్కడ ఉత్పత్తి చాలా వరకు ఉత్పాదకుని సొంత అవసరాలనే సంతృప్తిపరుస్తుంది. సగటు లాభం రేటుచేత శాసించబడకుండానే స్వతంత్రంగా కొనసాగించబడుతుంది. లీజు భూములలో వ్యవసాయం చేసినప్పటికీ, ఇతర సందర్భాలలో కంటే ఎక్కువగా ఆ లీజు డబ్బులో లాభంలో ఒక భాగం వుంటుంది.

వేతనాలలో ఒక భాగం సైతం దానిలో ఉండవచ్చు. ఈ డబ్బు కేవలం నామమాత్రమైన కౌలు అయి వుంటుంది. అంతేగాని వేతనాలకూ, లాభానికే విరుద్ధమైన స్వతంత్ర అభివర్గంగా కౌలు మాత్రం కాదు.

భూమిని కొనటానికి వెచ్చించిన డబ్బు పెట్టుబడి వ్యవసాయ పెట్టుబడి మదుపు కాదు. అది సన్నకారు రైతులు తమ సొంత ఉత్పత్తి రంగంలో వినియోగించగలిగిన పెట్టుబడిలో కోత మాత్రమే. అది వారి ఉత్పత్తి సాధనాల పరిమాణాన్ని తగ్గిస్తుంది. ఆ రకంగా పునరుత్పత్తి ఆర్థిక ప్రాతిపదికను కుంచింపజేస్తుంది. అది సన్నకారు రైతును వడ్డీ వ్యాపారికి అప్పుజెపుతుంది. ఎందుకంటే ఈ రంగంలో పరపతి సౌకర్యం చాలా అరుదు. పెద్ద ఎస్టేట్ల విషయంలో ఈ కొనుగోలు జరిగినప్పటికీ అది వ్యవసాయానికి ఆటంకమే. భూ యజమాని అప్పుల్లో ఉన్నాడా, తన ఎస్టేటును కొన్నాడా లేక వారసత్వంగా పొందాడా అన్న అంశాన్ని పట్టించుకోని పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానానికి అది విరుద్ధం. భూయజమాని కౌలును తానే స్వయంగా జేబులో వేసుకుంటాడా లేదా తన తనఖా వ్యాపారికి చెల్లిస్తాడా అన్నది లీజుకు తీసుకున్న ఎస్టేటు నిర్వహణ స్వభావాన్ని మార్చదు.

నిర్ణీతమైన భూమి కౌలు ఉన్నప్పుడు భూమి ధర వడ్డీ రేటుచేత శాసించబడుతుంది అని ఇంతకు ముందు గమనించాము. వడ్డీ రేటు తక్కువగా వుంటే భూమి ధర ఎక్కువగానూ, ఆ రేటు ఎక్కువగా వుంటే భూమి ధర తక్కువగానూ వుంటుంది. మామూలుగా, ఎక్కువ ధర తక్కువ వడ్డీ రేటు కలిసి వుండాలి. తక్కువ వడ్డీ రేటు కారణంగా ఒక రైతు ఎక్కువ ధర చెల్లిస్తే, అదే తక్కువ రేటు కారణంగా అతనికి అవసరమైన అనిశ్చల పెట్టుబడి తేలిక పరపతి షరతులపైన దొరికి వుంటుంది. అయితే సన్నకారు రైతుస్వామ్యం ప్రబలంగా ఉన్నప్పుడు వాస్తవంలో వ్యవహారం మారిపోతుంది. మొదటిది, పరపతికి సంబంధించిన సాధారణ నియమాలు ఇక్కడ వర్తించవు. ఎందుకంటే ఈ నియమాలు పెట్టుబడిదారుడే ఉత్పత్తిదారుడు అయినప్పుడు వర్తిస్తాయి. రెండోది చిన్న కమతాల యాజమాన్యం ప్రబలంగా వున్నచోట, (ఇక్కడ మనం వలసను ప్రస్తావించడం లేదు.) చిన్నరైతే జాతికి వెన్నెముకగా ఉన్నచోట పెట్టుబడి రూపొందడం అన్నది, అనగా సామాజిక పునరుత్పత్తి సాపేక్షంగా బలహీనంగా ఉంటుంది. ఇంతకు ముందు వివరించిన అర్థంలో అప్పివ్వడానికి వీలైన డబ్బు పెట్టుబడి పరిస్థితి మరింత బలహీనంగా వుంటుంది. డబ్బు పెట్టుబడి బాగా ఉండాలంటే ధనిక, సోమరి పెట్టుబడిదారుల వర్గం ఉండాలి, కేంద్రీకృతం కావాలి (మాసీ).[1] మూడోది, అత్యధిక ఉత్పత్తిదారుల అస్తిత్వానికి అవసరమైన షరతుగాను, వారి పెట్టుబడి మదుపుకు తప్పనిసరి అయిన రంగంగాను భూమి యాజమాన్యం వుండే ఈ సందర్భంలో వడ్డీ రేటుతో సంబంధం లేకుండానూ, తరచుగా దానికి విలోమంగానూ భూమి ధర పెంచబడుతుంది. భూ ఆస్తి కోసం గిరాకీ భూమి సరఫరాకంటే చాలా ఎక్కువగా వుండటంవల్ల ఇది సాధ్యమవుతుంది. అటువంటి సందర్భాల్లో చిన్న కొనుగోలుదారులు పెద్ద సంఖ్యలోనూ, పెద్ద కొనుగోలుదారులు చిన్న సంఖ్యలోనూ ఉంటారు గనుక (బాండెస్ నోయిరెస్,[2] రూబికన్, న్యూమాన్[3]) పెద్ద కమతాలకంటే చిన్న కమతాలు సాపేక్షంగా ఎక్కువ ధర పలుకుతాయి. ఈ కారణలన్నింటివల్ల అధిక వడ్డీ రేటుతోపాటు ఇక్కడ భూమి ధర

1. మాసీ, యాన్ ఎస్సే ఆన్ ది గవర్నింగ్ కాజెస్ ఆఫ్ ది నాచురల్ రేట్ ఆఫ్ ఇన్టరెస్ట్, లండన్, 1750 - సం.
2. అసోసియేషన్స్ ఆఫ్ ప్రాఫిటీర్స్ - సం.
3. న్యూమాన్, లెక్చర్స్ ఆన్ పొలిటికల్ ఎకానమీ, లండన్, 1851 - సం.

కూడా పెరుగుతుంది. భూమిని కొనడానికై రైతు వెచ్చించిన పెట్టుబడిపై అతనికి సాపేక్షంగా తక్కువ వడ్డీ లభిస్తుంది. అయితే మరోవైపున అతడు తన తనఖా పరపతిదారులకు మాత్రం అధిక వడ్డీ రేట్లు చెల్లిస్తాడు (మోనియర్). మరో రూపంలో ఐరిష్ వ్యవస్థ దీన్ని రుజువు చేస్తుంది.

తనంత తానుగా ఉత్పత్తికి పరాయి అంశమైన ఈ భూమి ధర అన్నది ఉత్పత్తిని అసాధ్యం చేసే స్థాయికి సైతం పెరగవచ్చు (డంబాస్లె).

భూమి ధర ఇటువంటి పాత్ర నిర్వహించడానికీ, భూమి క్రయ విక్రయాలూ, ఒక సరుకుగా దాని చలామణి ఈ స్థాయికి పెరగడానికీ ప్రధాన కారణం పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానపు అభివృద్ధి. ఈ విధానంలో సరుకు అన్నది అన్ని ఉత్పాదితాల, అన్ని ఉత్పత్తి పరికరాల సాధారణ రూపం. మరో వైపున, ఈ పరిమాణం, పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం పరిమితంగా అభివృద్ధి చెందినప్పుడు, అది ఇంకా తన సొంత ప్రత్యేకతలన్నిటినీ వెల్లడించకముందు మాత్రమే సాధ్యమవుతుంది. ఎందుకంటే వ్యవసాయం ఇంకా పూర్తిగా పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం పరిధిలోకి వచ్చి ఉండదు. శిథిల సామాజిక రూపాలకు వారసత్వంగా వచ్చిన విధానం పరిధిలోనే ఉంటుంది. ఉత్పాదకుడు తన ఉత్పాదితం డబ్బు ధరపై ఆధారపడాల్సిన పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానపు అసౌకర్యాలు, పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానపు అసంపూర్ణ అభివృద్ధివల్ల తలెత్తిన అసౌకర్యాలతో ఇక్కడ కలిసిపోతాయి. రైతు తన ఉత్పాదితాలను సరుకులుగా ఉత్పత్తి చేసే పరిస్థితులు లేకుండానే వ్యాపారిగానూ, పారిశ్రామికునిగానూ మారతాడు.

భూమి ధర ఉత్పాదకుని ఉత్పత్తి ఖర్చులో ఒక అంశం. అది ఉత్పత్తి ధరలో ఒక అంశం కాదు. (వ్యవసాయ ఉత్పాదితం ధరలో కౌలు నిర్ణాయక అంశంగా ప్రవేశించినప్పటికీ, 20 ఏళ్ళకు లేదా అంతకంటే ఎక్కువ కాలానికీ ముందస్తుగా చెల్లించిన పెట్టుబడీకరించిన కౌలు మాత్రం ఏ రకంగానూ ఈ ధరలో నిర్ణాయక అంశంగా ప్రవేశించదు.) ఈ రెండు అంశాల మధ్య ఉన్న ఘర్షణ, ప్రైవేటు భూ యాజమాన్యానికీ, హేతుబద్ధ వ్యవసాయానికీ అంటే భూమిని సామాజికంగా ఉపయోగించ డానికీ మధ్య సాధారణ వైరుధ్యాన్ని వ్యక్తంచేసే రూపాలలో ఒకటి. అయితే మరోవైపున ప్రైవేటు భూ యాజమాన్యమూ, భూమి నుంచి ప్రత్యక్ష ఉత్పత్తిదారులను తొలగించడమూ (ఒకనికి ప్రైవేటు భూ యాజమాన్యం ఉందీ అంటే పలువురికి ఆ యాజమాన్యం లేదని అర్థం.) పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానపు ప్రాతిపదిక.

సన్నకారు వ్యవసాయంలో, ప్రైవేటు భూ యాజమాన్యపు ఒక రూపమూ, ఫలితమూ అయిన భూమి ధర ఇక్కడ ఉత్పత్తికి ఆటంకంలా కనిపిస్తుంది. భారీ వ్యవసాయంలోనూ, పెట్టుబడిదారీ ప్రాతిపదిక పనిచేసే పెద్ద ఎస్టేటులోనూ యాజమాన్యం అన్నది అదే విధంగా ఆటంకంగానే వ్యవహరిస్తుంది. ఎందుకంటే కౌల్దారీ రైతు ఉత్పాదక పెట్టుబడి మదుపును అది పరిమితం చేస్తుంది; అంతిమ విశ్లేషణలో ఆ మదుపు అతనికి కాక భూస్వామికి ప్రయోజనకరంగా వుంటుంది. ఈ రెండు రూపాల్లోనూ, భవిష్యత్తరాల మానవజాతి మనుగడకూ, పునరుత్పత్తికీ అనివార్యమైన షరతుగా ఉండాల్సిన, ఒక శాశ్వత సామూహిక ఆస్తిగా ఉండాల్సి భూమిని చైతన్యయుతంగా, హేతుబద్ధంగా సాగుచేయడానికి బదులు భూమి జీవనశక్తి దోచుకోబడుతుంది. వృధా చేయబడుతుంది. (సామాజిక అభివృద్ధి స్థాయిపై గాక, వ్యక్తిగత ఉత్పత్తిదారుల యాదృచ్ఛిక, అసమ పరిస్థితులపైన దోపిడీని

ఆధారపడేలా చేయడంతో పాటు) చిన్న ఆస్తి విషయంలో సామాజిక శ్రమశక్తిని ఆచరణలో వినియోగించే సాధనాలు గానీ, విజ్ఞానం గానీ లేకపోవడంవల్ల ఇది జరుగుతుంది. పెద్ద ఆస్తి వ్యవహారంలో, అటువంటి సాధనాలను యజమానిని శీఘ్రాతిశీఘ్రంగా సంపన్నుడిని చేయటానికి వాడటంవల్ల జరుగుతుంది. ఈ రెండింటి విషయంలోనూ మార్కెటు ధరపై ఆధారపడటంవల్ల కూడా జరుగుతుంది.

చిన్న భూ ఆస్తిపై చేసే విమర్శ అంతా చివరికి వ్యవసాయానికి అడ్డుగానూ, ఆటంకంగానూ ఉండే ప్రైవేటు యాజమాన్యానికి వ్యతిరేకమైన విమర్శగా మారుతుంది. పెద్ద భూ ఆస్తిపై చేసే విమర్శ కూడా అలాగే మారుతుంది. రెండు సందర్భాల్లోనూ, ద్వితీయ ప్రాధాన్యం కలిగిన రాజకీయ పరిగణనలను అన్నింటినీ వదిలేస్తున్నాం. వ్యవసాయ ఉత్పత్తికీ, భూమిని హేతుబద్ధంగా సాగు చేయడానికీ, కాపాడటానికీ, బాగు చేయడానికీ వ్యతిరేకంగా ప్రైవేటు భూ ఆస్తి నిలబెట్టిన ఈ ఆటంకం అవాంతరాలు ఇరువైపులా విభిన్న రూపాలలో అభివృద్ధి చెందుతాయి. ఈ రుగ్మత ప్రత్యేక రూపాల గురించి వాదులాటలో దాని అసలు కారణం విస్మరించబడుతుంది.

చిన్న భూ ఆస్తికి, అత్యధిక ప్రజానీకం గ్రామీణులై వుండాలి. సామాజిక శ్రమకాక, ఒంటరి శ్రమ ప్రబలంగా వుండాలి. కనుక అటువంటి పరిస్థితుల్లో పునరుత్పత్తి, దాని భౌతిక, ఆత్మిక అవసరాల సమృద్ధి, అభివృద్ధీ అన్నవి అసాధ్యం. హేతుబద్ధ వ్యవసాయానికి అవసరమైన పరిస్థితులు కూడా దుర్లభం. మరోవైపున భారీ భూ ఆస్తి అన్నది వ్యవసాయ జనాభాను నిరంతరాయంగా కనిష్ఠ స్థాయికి కుదించివేస్తుంది. పెద్ద నగరాల్లో గుమిగూడిన, నిరంతరాయంగా పెరుగుతున్న పారిశ్రామిక జనాభాను ఎదుర్కొంటుంది. ప్రాకృతిక జీవిత నియమాలు నిర్దేశించిన సామాజికంగా ఇచ్చిపుచ్చుకొనే సంబంధాల లోని స్పష్టతను తిరిగి సంస్కరించడానికి వీలులేని విధంగా నాశనం చేసే పరిస్థితులను సృష్టిస్తుంది. దాని ఫలితంగా భూమి జీవశక్తి దుర్వ్యయం అవుతుంది. ఈ అకాల దుర్వినియోగాన్ని ఒక దేశపు సరిహద్దుల కావల చాలా దూరం వరకూ వాణిజ్యం మోసుకుపోతుంది. (లీబిగ్)[1]

చిన్న రైతుస్వామ్యం సమాజానికి ఆవల సగం దూరంలో నిలబడిన బర్బరుల వర్గాన్ని, ఆదిమ సామాజిక రూపాల మొరటుతనాన్నంతటినీ, నాగరిక దేశాల ఆవేదనతోనూ, దారిద్ర్యంతోనూ కలగలిపే వర్గాన్ని సృష్టిస్తుంది. కాగా పెద్ద భూస్వామ్యం శ్రమశక్తిని చివరిరంగంలో బలహీనపరుస్తుంది. ఈ రంగంలోనే శ్రమశక్తి ఆశ్రయాన్ని కోరుతుంది. జాతుల జీవశక్తి పునరుత్పత్తి కోసం రిజర్వు నిధిగా తన బలాన్ని భూమిలోనే నిల్వ ఉంచుతుంది. భారీస్థాయి పరిశ్రమ, భారీస్థాయి యాంత్రీకృత వ్యవసాయమూ కలిసే పనిజేస్తాయి. మొదటిది, ప్రధానంగా శ్రమశక్తిని, మానవుల సహజ శక్తిని వృధా చేస్తుంది. విచ్ఛిన్నం చేస్తుంది. కాగా రెండోది, మరింత సూటిగా భూమి యొక్క సహజసిద్ధమైన జీవశక్తిని అంతం చేస్తుంది. తర్వాత అభివృద్ధి క్రమంలో కూడా అవి రెండూ చేతులు కలుపుతాయి. గ్రామీణ ప్రాంతంలో కూడా పారిశ్రామిక వ్యవస్థ కార్మికుల్ని భౌతికంగా కుంగదీస్తుంది. పరిశ్రమ, వాణిజ్యమూ భూసారాన్ని అంతంచేసే సాధనాలను వ్యవసాయానికి సరఫరా చేస్తాయి.

★ ★ ★

1. లీబిగ్, డై చెమీ..... బ్రాన్స్‌విగ్, 1862 - సం.

## ఏడవ భాగం

# ఆదాయాలు, వాటి మూలాధారాలు

## అధ్యాయం - 48

# త్రికసూత్రం

### I[1]

పెట్టుబడి – లాభం (పరిశ్రమ లాభం + వడ్డీ), భూమి – కౌలు, శ్రమ – వేతనాలు, ఇదీ సామాజిక ఉత్పత్తి ప్రక్రియలోని సమస్త రహస్యాలు ఇమిడి వున్న త్రికసూత్రం.

మనం ముందు చూసినట్లుగా, వడ్డీ పెట్టుబడి యొక్క విశిష్ట, విలక్షణ ఉత్పాదితంగా కనిపిస్తుంది కనుక, అందుకు భిన్నంగా పరిశ్రమ లాభం, పెట్టుబడి నుండి స్వతంత్రమైన వేతనంగా కనిపిస్తుంది కనుక ఈ మొదటి త్రికరూపాన్ని రెండవ రూపంగా కుదించవచ్చు: పెట్టుబడి–వడ్డీ, భూమి–భూమికౌలు, శ్రమ–వేతనాలు: ఇందులో పెట్టుబడిదారీ విధానానికి నిర్దిష్టంగా/ప్రత్యేకంగా విలక్షణమైన, అదనపు విలువ రూపమైన లాభాన్ని అదృష్టవశాత్తూ వదిలివేయడం జరిగింది. ఈ ఆర్థికత్రయాన్ని మరింత నిశితంగా పరీక్షించి చూస్తే, మనకు కింది విషయాలు స్పష్టమవుతాయి.

మొదటిది; ఏటా లభించే సంపదకు మూలాధారాలుగా చెప్పబడుతున్నవి. ఏమాత్రమూ పరస్పర సారూప్యం లేని రంగాలకు చెందినవి. వాటి మధ్య ఎలాంటి పోలికా లేదు. వాటి మధ్య గల సంబంధం వకీలు ఫీజుకు, ఎర్ర చిలగడదుంపకు, సంగీతానికి మధ్య గల సంబంధం లాంటిదే.

పెట్టుబడి, భూమి, శ్రమ! అయితే పెట్టుబడి వస్తువు కాదు. ఒక నిర్దిష్టమైన చారిత్రక సమాజ నిర్మాణానికి చెందిన నిర్దిష్ట సామాజిక ఉత్పత్తి సంబంధమది. ఈ సంబంధం ఒక వస్తువులో అభివ్యక్తమై, ఆ వస్తువుకు ఒక ప్రత్యేక సామాజిక లక్షణాన్ని చేకూర్చుతుంది. పెట్టుబడి అన్నది పాదార్థికమైనట్టి, ఉత్పత్తి చేయబడ్డ ఉత్పత్తి సాధనాల సమాహారం కాదు. అది పెట్టుబడిగా పరివర్తితమైన ఉత్పత్తి సాధనాలు. బంగారం లేదా వెండి స్వతహాగా డబ్బు కానట్లే, ఉత్పత్తి సాధనాలు కూడా స్వతహాగా పెట్టుబడి కాదు. ఉత్పత్తి సాధనాలు సమాజంలోని ఒక భాగం యొక్క గుత్త సొమ్మై, ఉత్పాదితాలుగానూ, సజీవ శ్రమశక్తితో ప్రమేయం లేని పని పరిస్థితులుగానూ ఆ సజీవ శ్రమశక్తికి ఎదురైనప్పుడు మాత్రమే

1. కింది మూడు అసంపూర్ణ రచనా ఖండికలు 6వ భాగానికి ఉద్దేశించిన రాత ప్రతిలోని వేరువేరు భాగాల్లో కనిపించాయి - ఎంగెల్స్.
2. ఈ కూర్పులో అధ్యాయం XXIII - సం.

ఆ ఉత్పత్తి సాధనాలు పెట్టుబడి అవుతాయి. ఈ వైరుధ్యం ద్వారా అవి పెట్టుబడిగా మూర్తీభవిస్తాయి. పెట్టుబడి అన్నది, స్వతంత్ర శక్తులుగా మారిన శ్రామిక జన ఉత్పాదితాలు మాత్రమే కాదు; తమ ఉత్పాదకుల పాలకులుగానూ, కొనుగోలుదార్లుగానూ మారిన ఉత్పాదితాలు మాత్రమే కాదు. అది, శ్రామికుల ఉత్పాదితాల యొక్క ధర్మాలుగా వారికి ఎదురయ్యే సామాజిక శక్తులు కూడా, ఈ శ్రమ భావి (ఇక్కడ దస్తూరీ అస్పష్టంగా వుంది)[1]... రూపం కూడా. కాబట్టి ఇది, చారిత్రకంగా ఉద్భవించిన సామాజిక ఉత్పత్తి ప్రక్రియలోని కారకాల్లో ఒకదాని ఖచ్చితమైన సామాజిక రూపం, పైకి చాలా నిగూఢమైనదిగా కనిపించే సామాజిక రూపం.

అయితే దీనితోపాటు భూమి వుంది; అది నిర్జీవ ప్రకృతి; అనాదిగా వున్న అరణ్యాదులతోటి rudis indigestaque moles.[2] విలువ అనేది శ్రమే. కాబట్టి అదనపు విలువ భూమి కాదు. అచ్చమైన భూసారం కింద పేర్కొన్నదానికి మించి మరేమీ చేయదు. ఒక నిర్దిష్ట పరిమాణంలోని శ్రమ ప్రకృతి సిద్ధమైన భూసారాన్నిబట్టి ఒక నిర్దిష్టమైన ఉత్పాదితాన్ని ఇస్తుంది. భూసారంలోని తేడాల వల్ల, ఒకే పరిమాణాల్లోని శ్రమా, పెట్టుబడీ అంటే ఒకే విలువ, వేరువేరు పరిమాణాలు గల వ్యవసాయోత్పత్తుల్లో అభివ్యక్తమవుతుంది. అంటే, ఈ తేడావల్ల ఈ ఉత్పాదితాలకు వేరువేరు విలువలు వుంటాయన్నమాట. "నిస్సారమైన భూమిపై సారవంతమైన భూమికి గల ఆధిక్యతలు... సాగుదారు నుంచి లేదా వినియోగదారు నుంచి భూస్వామికి బదిలీ కావడానికి", ఈ వేరువేరు విలువలు మార్కెట్ విలువగా సమానం కావడమే కారణం. (రికార్డో, ప్రిన్సిపుల్స్, లండన్, 1821, పు. 62)

ఆఖరున, "అచ్చమైన" శ్రమ ఈ కూటమిలో మూడవ పక్షంగా, కేవలం భూతాకారంగా వుంది. ఇది కేవలం భావమాత్ర గ్రాహ్యమైనది. స్వతహాగా దానికి అస్తిత్వం లేదు. లేదా, ప్రకృతితో తమ పరస్పర పరివర్తక చర్యలకు దోహదం చేసే మానవుల ఉత్పాదక కార్యకలాపాలను మొత్తంపై మనం తీసుకొంటే[3] (ఇక్కడ రాతప్రతిలో దస్తూరీ అస్పష్టంగా వుంది.) ప్రతి సామాజిక రూపం నుంచీ, విస్పష్ట లక్షణం నుంచీ వేరుపడినవే కాక, సమాజంతో ప్రమేయం లేకుండా అన్ని సమాజాలకు దూరంగా, తన సహజ స్థితిలోనే వున్న ఉత్పాదక కార్యకలాపాలను సైతం తీసుకొంటే, ఇంకా సామాజిక జీవికాని మానవునికీ, ఏవిధంగానైనా సరే – సామాజిక జీవి అయిన మానవునికీ ఉమ్మడి అంశమై, జీవిత వ్యక్తీకరణగానూ, ధ్రువీకరణగానూ వున్న ఈ ఉత్పాదక కార్యకలాపాలను తీసుకొంటే, అవి కేవలం భావమాత్ర గ్రాహ్యమైనవే.

## II

పెట్టుబడి – వడ్డీ; భూ ఆస్తి, భూమిపై వ్యక్తిగత యాజమాన్యం, నిస్సందేహంగా, ఆధునికమైన, పెట్టుబడిదారీ ఉత్పత్తి పద్ధతికి అనుగుణమైన వ్యక్తిగత యాజమాన్యం – కౌలు; వేతన శ్రమ – వేతనం. ఈ రూపం ఆదాయ మూలాధారాల మధ్య సంబంధాన్ని తెలియ జేస్తుందని భావిస్తున్నారు.

---

1. రాత ప్రతితో ఆ తరువాత సరిచూచినప్పుడు ఇక్కడ పాఠం ఇలా వుంది : ("వారి శ్రమ తాలూకు సామాజిక శక్తులూ, ఈ శ్రమ సామాజికీకృత రూపమున్నూ")
2. "ముతన్, అపరిష్కృత సమష్టి" ఒవిడ్, మెటామార్ఫొసెస్, 1వ భాగం, 7 -సం.
3. రాతప్రతిని తరువాత చదివితే ఇది ఇలా వుందని తేలింది. ("దాని వెనుక వున్నదేమిటో తీసుకొంటే") -సం.

పెట్టుబడిలాగే, వేతన శ్రమ, భూ ఆస్తి చారిత్రకంగా నిర్ణయమైన సామాజిక రూపాలు. ఒకటి శ్రమ సామాజిక రూపం, రెండవది గుత్తాధిపత్యంలోని భూగోళ సామాజిక రూపం. వాస్తవంలో రెండు రూపాలూ పెట్టుబడికి అనుగుణమైన రూపాలు, సమాజం యొక్క ఒకే ఆర్థిక నిర్మాణానికి చెందిన రూపాలు.

ఈ సూత్రంలో కొట్టవచ్చినట్లున్న మొదటి విషయమిది : పెట్టుబడి సరసనే ఒక నిర్దిష్ట ఉత్పత్తి పద్ధతికి, సామాజిక ఉత్పత్తి ప్రక్రియ యొక్క ఒక నిర్దిష్ట చారిత్రక రూపానికి చెందిన ఒక ఉత్పాదకాంశం యొక్క ఈ రూపం సరసనే, ఒక నిర్దిష్ట సామాజిక రూపంతో సమ్మిళితమై, దానికి ప్రతీకగా వున్న ఒక ఉత్పాదకాంశం సరసనే, విచక్షణా రహితంగా, ఒకవైపు భూమిని, మరోవైపు శ్రమను ఉంచారు. ఈ రెండూ నిజమైన శ్రమ ప్రక్రియలోని రెండు అంశాలు. ఈ పాదార్థిక రూపంలో, ఇవి అన్ని ఉత్పత్తి పద్ధతులకు సర్వసాధారణమైనవీ, ప్రతి ఉత్పత్తి ప్రక్రియ యొక్క పాదార్థిక అంశాలుగా వుండేవీ, దాని సామాజిక రూపంతో ప్రమేయం లేనివీ.

రెండవ విషయం : పెట్టుబడి–వడ్డీ, భూమి–కౌలు, శ్రమ–వేతనం అనే సూత్రంలో పెట్టుబడి, భూమి, శ్రమ వరుసగా వడ్డీకి (లాభానికి మారు) కౌలుకు, వేతనానికి మూలాధారాలుగా, వాటి ఉత్పాదితాలుగా లేదా వాటి ఫలితాలుగా కనిపిస్తున్నాయి. మొదట పేర్కొన్నవి ప్రాతిపదిక, తరువాతివి పర్యవసానం; అవి కారణం, ఇవి ఫలితం; నిజంగా ప్రతి మూలాధారం దాని ఉత్పాదితానికి ముడిపెట్టబడిన తీరు, ఆ మూలాధారం దాన్ని బయటికి నెట్టినట్లుగా, ఉత్పత్తి చేసినట్లుగా వుంది. అమ్మకంవల్ల వచ్చినదంతా – వడ్డీ (లాభానికి మారు), కౌలు, వేతనం – ఉత్పాదితాల విలువలోని మూడు అంతర్భాగాలు; అంటే – స్థూలంగా చెప్పినప్పుడు, విలువ అంతర్భాగాలు; లేదా డబ్బు రూపంలో వ్యక్తం చేసినప్పుడు, డబ్బులోనే నిర్దిష్ట అంతర్భాగాలు; ధర అంతర్భాగాలు. పెట్టుబడి–వడ్డీ అనే సూత్రం నిజంగా, ఇప్పుడు పెట్టుబడికి సంబంధించిన పూర్తిగా అర్థరహితమైన సూత్రమవుతుంది. అయినా అది దాని సూత్రాల్లో ఒకటి. అయితే, విలువను, అంటే సామాజికంగా నిర్ణీతమైన పరిమాణం లోని శ్రమను భూమి ఎలా సృష్టిస్తుంది? అందులోనూ, తన ఉత్పాదితాల విలువలో, కౌలుగా వున్న ఆ ప్రత్యేక భాగాన్ని భూమి ఎలా సృష్టిస్తుంది? ఉదాహరణకు భూమి ఉపయోగపు విలువను, ఒక పాదార్థిక ఉత్పాదితాన్ని, గోధుమను సృష్టించడంలో ఉత్పాదక సాధనంగా పాల్గొంటుంది. కాని గోధుమ విలువ ఉత్పత్తిలో దానికి ఏమాత్రమూ ప్రమేయం లేదు. విలువకు గోధుమ ప్రతినిధిగా వున్న మేరకు గోధుమను, వస్తురూపం ధరించిన ఒక నిర్దిష్ట పరిమాణంలోని సామాజిక శ్రమగా పరిగణిస్తున్నాము, అంతే. ఈ శ్రమ ఏ పదార్థంగా వ్యక్తమవుతున్నది లేదా ఈ పదార్థం యొక్క ఉపయోగపు విలువ ఏమిటి అనేదానితో ఇక్కడ నిమిత్తం లేదు. ఇది ఏ విధంగానూ కింది వాటికి విరుద్ధం కాదు : 1) తక్కిన పరిస్థితులన్నీ సమానంగా వున్నప్పుడు, గోధుమ చౌకగా వుందా లేదా ప్రియంగా వుందా అనేది భూమి ఉత్పాదకతపై ఆధారపడి వుంది. వ్యావసాయిక శ్రమ ఉత్పాదకత ప్రకృతి పరిస్థితులపై ఆధారపడి వుంటుంది. కాబట్టి, అటువంటి ఉత్పాదకతను బట్టి ఒకే పరిమాణంలోని శ్రమకు ప్రాతినిధ్యం వహించే ఉత్పాదితాలు, ఉపయోగపు విలువలు ఎక్కువగానూ వుంటాయి లేదా తక్కువగానూ వుంటాయి. ఒక బస్తా గోధుమ ఎంత పరిమాణంలోని శ్రమకు ప్రాతినిధ్యం వహిస్తుందనేది, అదే పరిమాణంలోని శ్రమవల్ల ఎన్ని బస్తాల గోధుమ లభిస్తుందనే దాన్నిబట్టి వుంటుంది. ప్రస్తుత సందర్భంలో అది భూమి

ఉత్పాదకతపైన, విలువ ఎంత పరిమాణాల్లోని ఉత్పాదితంలో అభివ్యక్తమవుతుందనేది, అదే పరిమాణం లోని శ్రమవల్ల ఎన్ని బస్తాల గోధుమ లభిస్తుందనే దాన్నిబట్టి వుంటుంది. ప్రస్తుత సందర్భంలో అది భూమి ఉత్పాదకతపైన, విలువ ఎంత పరిమాణాల్లోని ఉత్పాదితంలో అభివ్యక్తమవుతుందనే దానిపైన ఆధారపడి వుంటుంది. కాని ఈ విలువ నిర్ణీతమై వుంటుంది. ఎంత పరిమాణంలోని ఉత్పాదితంలో అది పంపిణీ అయి వుందనేదానితో విలువకు నిమిత్తం లేదు. విలువ ఉపయోగపు విలువలో నిక్షిప్తమై వుంటుంది. విలువ సృష్టికి ఉపయోగపు విలువ ఒక పూర్వావసరం. కానీ భూమి వంటి ఉపయోగపు విలువను ఒకవైపు, విలువను, అందులోనూ విలువలోని ఒక ప్రత్యేక భాగాన్ని మరోవైపు ఉంచడం ద్వారా వైరుధ్యం సృష్టించడం తెలివిలేనిపని. 2).... (ఇక్కడ రాత ప్రతి ఆగిపోతూంది.)

## III

నాటు అర్థశాస్త్రం బూర్జువా సంబంధాల వలలో చిక్కుకొన్న బూర్జువా ఉత్పత్తి ఏజెంట్ల భావనలను వ్యాఖ్యానించడం, వ్యవస్థీకరించడం, శుష్క సిద్ధాంతసరళిలో సమర్థించడం తప్ప, వాస్తవంలో అంతకు మించి ఏమీ చేయదు. అందువల్ల చూడగానే గోచరించే ఈ అసంగతమైన, సంపూర్ణ వైరుధ్యాలను రంగంపైకి తెచ్చిన ఆర్థిక సంబంధాల అవాస్తవ బాహ్యరూపాలు నాటు అర్థశాస్త్రానికి సహజమైనవిగా కనిపిస్తున్నాయంటే, మనం ఆశ్చర్యపడరాదు. ఈ సంబంధాలు స్వయం విదితమైనవిగా పైకి కనిపించే కొద్దీ, వాటి అంతర్గత సంబంధాలు ఆ అర్థశాస్త్రానికి మరింత కనుమరుగైపోతాయి. జనసామాన్యానికి అవి అవగతమైనప్పటికీ, వస్తువుల బాహ్యరూపాలూ, ఆ వస్తువుల అంతస్సారమూ ప్రత్యక్షంగా ఏకీభవిస్తే శాస్త్రాలన్నీ అనవసరం. భూమి–కౌలు, పెట్టుబడి–వడ్డీ, శ్రమ–వేతనం లేదా శ్రమ–వెల అనే త్రికసూత్రాన్ని నాటు అర్థశాస్త్రం తన పరిశీలనకు ప్రాతిపదికగా చేసుకొంది. కానీ ఈ త్రికసూత్రం చూసీచూడగానే మూడు అసాధ్య సమ్మేళనాలని తెలిసిపోతున్నా, అలా అయివుండవచ్చునన్న సందేహం ఈ శాస్త్రజ్ఞులకు కించిత్తు కూడా రాలేదు. మొదట, ఉపయోగపు విలువ అయిన భూమిని, మార్పిడి విలువ అయిన కౌలును తీసుకొందాం. భూమికి విలువ లేదు. కౌలేమో మార్పిడి విలువ. ఒక సామాజిక సంబంధాన్ని ఒక వస్తువుగా భావించి, దానికీ ప్రకృతికీ ఒక నైష్పత్తిక సంబంధాన్ని వీరు అంటగట్టారు. అంటే, రెండు అననురూప పరిణామాలను పరస్పరం ఒక నిర్ణీత నిష్పత్తిలో వున్నట్లు భావిస్తున్నారు. తరువాత పెట్టుబడి–వడ్డీని తీసుకొందాం. పెట్టుబడి కొన్ని విలువల సమాహారమనీ, దానికి డబ్బు స్వతంత్రంగా ప్రాతినిధ్యం వహిస్తుందనీ భావించినప్పుడు, ఒకానొక విలువ మూల్యం ఆ విలువ మూల్యంకన్నా ఎక్కువ అని చెప్పడం అర్థంపర్థంలేని మాటలని పైనే తెలిసిపోతోంది. మధ్యంతర లింకులన్నీ తొలగింపబడినదీ, పెట్టుబడి దాని అతి సార్వత్రిక సూత్రంలో కుదించబడినదీ పెట్టుబడి–వడ్డీ అన్న రూపంలోనే. కాబట్టి స్వతహాగా ఈ సూత్రం కూడా వివరించ వీలులేనిదీ, అర్థంపర్థం లేనిదీ. పెట్టుబడి–లాభం అన్న సూత్రాన్ని కాదని, ఒక విలువను దానికి అసమంగా వుండేలా చేసే నిగూఢ గుణం గల పెట్టుబడి–వడ్డీ అనే సూత్రాన్ని నాటు అర్థశాస్త్రజ్ఞుడు ఎంచుకోవడానికి ప్రత్యేక కారణముంది. ఏమంటే, ఇది, యథార్థమైన పెట్టుబడిదారీ సంబంధాలకు మరింత దగ్గరగా వుంది. అంతేకాదు నాలుగు అయిదు కాదు, 100 టేలర్ 110 టేలర్ కాజాలదు అనే ఆందోళనకరమైన ఆలోచన తరచుగా, అతను విలువ అయిన పెట్టుబడి నుంచి పెట్టుబడి యొక్క పాదార్థిక రూపానికి

పరుగెత్తుతున్నాడు; ఉత్పత్తి చేయడానికి, శ్రమకు అవసరమైన పెట్టుబడి యొక్క ఉపయోగపు విలువకు, అంటే యంత్రాలు, ముడి పదార్థాలు మొదలయిన వాటికి పరుగెత్తుతున్నాడు. ఆ విధంగా అతను బుద్ధికి అందని మొదటి సంబంధం స్థానంలో నాలుగును, అయిదుకు సమానం చేసే సంబంధం స్థానంలో పూర్తిగా అననురూపమైన సంబంధాన్ని మరోసారి ప్రవేశపెట్టగలుగుతున్నాడు; వస్తువైన ఉపయోగపు విలువను ఒకవైపు, నిర్దిష్ట సామాజిక ఉత్పత్తి సంబంధాన్ని, అంటే అదనపు విలువను మరొకవైపు వుంచి, వాటిని ముడిపెడుతున్నాడు – భూ ఆస్తి విషయంలోలాగే. పోలూ పొందికా లేని ఈ సంబంధాన్ని రాబట్టిన వెంటనే, నాటు అర్థశాస్త్రవేత్తకు సర్వం కరతలామలకమైపోతుంది. ఇక ఆలోచించవలసిన అవసరమే అతనికి కనిపించదు. ఎందుకంటే, బూర్జువా భావనలో "హేతుబద్ధమైన దాన్ని" తాను రాబట్టాడు కదా. ఆఖరులో శ్రమ–వేతనం లేదా శ్రమ–ధరను తీసుకొందాం. ఇది, ప్రథమ సంపుటిలో నిరూపించినట్లు, విలువ–ధర, ఈ రెండింటి గురించిన భావనకే నిస్సందేహంగా విరుద్ధమైన మాట అనేది స్పష్టం. ధర మామూలుగా, విలువను వ్యక్తం చేసే ఒక నిర్దిష్టమైన మాట. "శ్రమ యొక్క ధర" అనేది, ఎల్లో లాగరిదమ్ అనే మాటలాగా హేతువిరుద్ధమైనది. కానీ ఇక్కడ నాటు అర్థశాస్త్రజ్ఞునికి మరింత సంతృప్తి కలుగుతోంది. ఎందువల్లనంటే, శ్రమకు డబ్బు చెల్లించడంలో బూర్జువా వర్గీయునికి గల అంతర్దృష్టి తనకు అవగాహన అయింది. సూత్రానికీ, విలువ గురించిన భావనకూ మధ్య గల వైరుధ్యమే, విలువను అర్థం చేసుకోవలసిన బాధ్యత నుంచి తన్ను తప్పించింది.

★ ★ ★

దరహం మీద పెట్టుబడిదారీ ఉత్పత్తి ప్రక్రియ చారిత్రకంగా నిర్ణయమైన సామాజిక ఉత్పత్తి ప్రక్రియా రూపం అని మనం చూశాము. సామాజిక ఉత్పత్తి ప్రక్రియ మానవ జీవిత పాదార్థిక పరిస్థితుల యొక్క ఉత్పత్తి ప్రక్రియ అయినట్లే, నిర్దిష్టమైన చారిత్రక, ఆర్థిక ఉత్పత్తి సంబంధాల కింద జరిగే ప్రక్రియ కూడా. అది ఈ ఉత్పత్తి సంబంధాలను సైతం ఉత్పత్తి చేస్తూంటుంది, పునరుత్పత్తి చేస్తూంటుంది. తద్వారా ఈ ప్రక్రియ వాహకులను, వారి పాదార్థిక జీవిత పరిస్థితులను, వారి పరస్పర సంబంధాలను, అంటే వారి ప్రత్యేక సామాజిక – ఆర్థిక రూపాన్ని ఉత్పత్తి చేస్తూంటుంది. ఎందువల్లనంటే, ఒక సమాజ ఆర్థిక నిర్మాణ స్వరూపాన్ని దృష్టిలో ఉంచుకొని సమాజాన్ని పరిశీలిస్తే ఈ ఉత్పత్తి ఏజెంట్లకు ప్రకృతితో, ఒకరితో ఒకరికి గల ఈ సంబంధాల సమాహారమే సమాజమంటే అనేది స్పష్టం. పెట్టుబడిదారీ ఉత్పత్తి ప్రక్రియ కూడా తన మునుపటి ఉత్పత్తి ప్రక్రియల లాగానే కొన్ని నిర్దిష్ట పాదార్థిక పరిస్థితుల్లో సాగుతూంటుంది. కాని అదే సమయంలో అవి నిర్దిష్టమైన సామాజిక సంబంధాల వాహికలు కూడా. తమ జీవిత పునరుత్పత్తి క్రమంలో వ్యక్తులు ఏర్పరచుకున్న సంబంధాలివి. ఈ సంబంధాల లాగానే ఆ పరిస్థితులు కూడా. పెట్టుబడిదారీ ఉత్పత్తి ప్రక్రియకు ఒకవైపు పూర్వావసరాలు, మరోవైపు ఆ ప్రక్రియ ఫలితాలూ, దానిచే సృష్టి అయినవీ. ఆ ప్రక్రియే వాటిని ఉత్పత్తి చేస్తూంటుంది; పునరుత్పత్తి చేస్తూంటుంది. పెట్టుబడి (పెట్టుబడిదారు కేవలం మానవాకారంలోని పెట్టుబడే; అతను ఉత్పత్తి ప్రక్రియలో పెట్టుబడి ఏజెంటుగా మాత్రమే పనిచేస్తాడు.) తనకు సంబంధించిన సామాజిక ఉత్పత్తి ప్రక్రియలో ప్రత్యక్ష ఉత్పాదకుల నుంచి, అంటే శ్రామికుల నుంచి అదనపు శ్రమను ఒక నిర్దిష్ట పరిమాణంలో పిండుతుందని కూడా మనం చూశాము. పెట్టుబడి ఈ అదనపు

శ్రమను దానికి తుల్యమైనదాన్ని ఇవ్వకుండానే గ్రహిస్తుంది. ఇది స్వేచ్ఛగా కుదుర్చుకున్న ఒప్పందం ఫలితమని ఎంతయినా కనిపించవచ్చుగాక. దీని సారభూతాంశాన్నిబట్టి, ఇది ఎల్లప్పుడూ నిర్బంధ శ్రమే. ఈ అదనపు శ్రమ అదనపు విలువగా ప్రత్యక్షమవుతుంది. ఈ అదనపు విలువ అదనపు ఉత్పాదిత రూపంలో వుంటుంది. నిర్ణీత అవసరాలకు మించి జరిగిన శ్రమగా అదనపు శ్రమ ఉండవలసిందే. పెట్టుబడిదారీ వ్యవస్థలోనూ, అదేవిధంగా బానిస వ్యవస్థ మొదలగు వ్యవస్థల్లోనూ అది కేవలం శత్రుపూరిత రూపం ధరించగా, సమాజంలోని ఒక తరగతి సంపూర్ణ నిర్వ్యాపారత్వం దానికి అనుబంధితమవుతుంది. ప్రమాదాలవల్ల జరిగే నష్టాన్ని భర్తీచేసే భీమాగానూ, జనాభా అవసరాల పెంపుదలకు జనాభా పెరుగుదలకు అనుగుణంగా, పునరుత్పత్తి తప్పనిసరిగా అధికాధికంగా విస్తరించవలసి ఉన్నందువల్లనూ ఒక నిర్దిష్ట పరిమాణంలో అదనపు శ్రమ అవసరం. పెట్టుబడిదారుని దృక్కోణం నుంచి దీన్ని సంచయనం అని అంటున్నారు. పెట్టుబడి ఈ అదనపు శ్రమ చేయించే పద్ధతీ, పరిస్థితులూ అంతకు మునుపున్న బానిస విధానం, ఫ్యూడల్ దాస్యం మొదలైన రూపాలలో కన్నా ఉత్పాదక శక్తుల సామాజిక సంబంధాలు అభివృద్ధికి ఒక కొత్త, మరింత ఉన్నత రూపం యొక్క అంశాల సృష్టికీ మరింత అనుకూలమైనవి. ఇది పెట్టుబడి నాగరీకరణ లక్షణాల్లో ఒకటి. ఈ విధంగా, బలప్రయోగం, సమాజంలోని ఒక భాగం మరో భాగానికి నష్టకరంగా, (పాదార్థిక, బౌద్ధిక సదుపాయాలతో సహా) సామాజికాభివృద్ధిపై గుత్తాధిపత్యం వహించడం తొలగిపోయిన ఒక దశను పెట్టుబడి ఒకవైపు ప్రాదుర్భవింపచేస్తుంది. మరోవైపు, మొత్తంపై భౌతిక శ్రమకు కేటాయించిన కాలాన్ని మరింత తగ్గించే క్రమంతో ఈ అదనపు శ్రమను జోడించేందుకు మరింత ఉన్నతమైన సామాజిక రూపంతో వీలుకల్పించే పాదార్థిక సాధనాలనూ, బీజరూపంలో పరిస్థితులనూ అది సృష్టిస్తుంది. ఎందువల్లనంటే, శ్రమ ఉత్పాదకతను బట్టి, మొత్తం పనిదినం చిన్నదే అయినా, అదనపు శ్రమ పెద్దగా వుండవచ్చు. సుదీర్ఘమైన మొత్తం పనిదినంలో అదనపు శ్రమ సాపేక్షంగా కొద్దిగానే వుండవచ్చు. అవసర శ్రమకాలం = 3, అదనపు శ్రమ = 3 అయినప్పుడు, మొత్తం శ్రమదినం = 6. అదనపు శ్రమ రేటు = 100% అవసర శ్రమ = 9, అదనపు శ్రమ = 3 అయితే, మొత్తం శ్రమదినం = 12. అదనపు శ్రమ రేటు = $33\frac{1}{3}\%$ మాత్రమే. అటువంటి సందర్భంలో, ఒక నిర్దిష్ట కాలంలో, కాబట్టి ఒక నిర్దిష్ట అదనపు శ్రమకాలంలో కూడా ఎంత ఉపయోగపు విలువ ఉత్పత్తి అవుతుందనేది శ్రమ ఉత్పాదకతపై ఆధారపడి వుంటుంది. అందువల్ల, సమాజ వాస్తవ సంపదా, ఆ సమాజ పునరుత్పత్తి ప్రక్రియ నిరంతరం విస్తరించే అవకాశమూ, అదనపు శ్రమ ఉత్పాదకతపైన ఎంత సమృద్ధ పరిస్థితులలో ఉత్పత్తి జరుగుతున్నదనేదానిపైనా ఆధారపడి వుంటుందే తప్ప, అదనపు శ్రమకాలంపై కాదు. వాస్తవంలో, ఆవశ్యకతవల్లనూ భౌతిక పరిస్థితులవల్లనూ విధిగా జరిగే శ్రమ ఎక్కడ అంతమవుతుందో అక్కడ నుంచే స్వేచ్ఛారాజ్యం ప్రారంభమవుతుంది. ఆ విధంగా దాని అత్యంత సహజ స్వభావాన్ని బట్టే, స్వేచ్ఛా మండలం యథార్థమైన పాదార్థిక ఉత్పత్తి రంగం ఆవల వుంది. ఆటవికుడు తన అవసరాలను తీర్చుకొనేందు కోసం, బతుకుతెరువు కోసం, మానవాళి పునరుత్పత్తి కోసం ప్రకృతితో తలపడవలసి వచ్చినట్లే, నాగరిక మానవుడూ అలా తలపడవలసి వుంటుంది. అన్ని సామాజిక నిర్మాణాలలోనూ, వీలున్న అన్ని ఉత్పత్తి పద్ధతులలోనూ ఆ విధంగా చేయక తప్పదు. మానవాభివృద్ధితో,

1. రాతప్రతి ప్రకారం అధ్యాయం XLVIII ప్రారంభం - ఎంగెల్స్.

అతని అవసరాలు విస్తరించడంవల్ల ఈ భౌతిక ఆవశ్యకతా మండలం విస్తరిస్తుంది. కానీ, అదే సమయంలో ఈ అవసరాలను తీర్చే ఉత్పాదక శక్తులు కూడా పెంపొందుతాయి. ఈ రంగంలో స్వేచ్ఛ, ప్రకృతితో తమ పరస్పర మార్పును హేతుబద్ధంగా క్రమబద్ధం చేసే సామాజికీకృత మానవుని లోనూ, సహకారయుత ఉత్పాదకులలోనూ మాత్రమే ఉండగలదు. అంధప్రాకృతిక శక్తులకు లోబడి ఉండటానికి బదులుగా, ఆ ప్రకృతిని తమ ఉమ్మడి నియంత్రణలోకి తెచ్చుకోవడం, అది కూడా వారి మానవ స్వభావానికి అత్యంత అనుకూలమైన, అర్హమైన పరిస్థితులలో అత్యల్ప శక్తి వినియోగించి దీన్ని (ప్రకృతిపై నియంత్రణ) సాధించడంలోనే ఈ స్వేచ్ఛ ఉండగలదు. అయినప్పటికీ ఇది ఆవశ్యకతా రంగంగానే ఉంటుంది. ఈ ఆవశ్యకతా రంగానికావల దానికదే లక్ష్యమైన మానవ శక్త్యాభివృద్ధి, నిజమైన స్వేచ్ఛా మండలం ఆరంభమవుతాయి. అయితే ఈ స్వేచ్ఛా మండలం ఆవశ్యకతా మండల ప్రాతిపదికపై మాత్రమే వికసించగలదు. పనిదిన పరిమాణం తగ్గడం దీనికి ప్రాథమిక పూర్వావసరం.

పెట్టుబడిదారీ సమాజంలో, ఈ అదనపు విలువ లేదా ఈ అదనపు ఉత్పాదితం (ఇక్కడ దాని పంపిణీలో యాదృచ్ఛికంగా జరిగే హెచ్చుతగ్గులను వదిలివేసి, కేవలం దాని నియంత్రక నియమాన్నీ, దాని ప్రమాణ నిర్ణాయక పరిమితులనూ మాత్రమే పరిగణనలోకి తీసుకొంటున్నది.) ప్రతి పెట్టుబడిదారు నికి సామాజిక పెట్టుబడిలో వున్న తన వాటానుబట్టి డివిడెండ్లుగా పెట్టుబడిదార్ల మధ్య పంపక మవుతుంది. ఈ రూపంలో అదనపు విలువ పెట్టుబడి వాటాకు వచ్చే సగటు లాభంగా వుంటుంది. ఇది మళ్ళీ వ్యాపార సంస్థ లాభంగానూ, వడ్డీగానూ విభజితమై, ఈ రెండు అభివర్గాల క్రింద, భిన్నరకాల పెట్టుబడిదారుల ఒడిలో పడుతుంది. కానీ పెట్టుబడి ఈ అదనపు విలువను లేదా అదనపు ఉత్పాదితాన్ని స్వాయత్తం చేసుకుని, పంపకం చేసుకొనేందుకు భూ ఆస్తి అడ్డుగా వుంటుంది. పెట్టుబడిదారు శ్రామికుని నుంచి లాభం రూపంలో అదనపు శ్రమను, తద్వారా అదనపు విలువను, అదనపు ఉత్పాదితాన్ని పిండుకొన్నట్లుగానే, భూస్వామి తన వంతుగా, ఈ అదనపు విలువలో లేదా ఈ అదనపు ఉత్పాదితంలో ఒక భాగాన్ని పెట్టుబడిదారు నుంచి కౌలురూపంలో, ఇదివరకే వివరించిన నియమాల ననుసరించి, పిండుకొంటాడు.

కాబట్టి, లాభం అదనపు విలువలో పెట్టుబడి వాటాకు వచ్చే భాగమని ఇక్కడ మనం అంటున్నప్పుడు, మొత్తం లాభం (ఇది రాశీభూతమైన అదనపు విలువే) నుంచి కౌలును తీసివేయడం వల్ల అదివరకే పరిమితమైన సగటు లాభమని (వ్యాపార సంస్థ లాభం+వడ్డీకి సమానమైన మొత్తం) మన భావం – కౌలు తీసివేయబడిందని మనం ఊహించుకొంటున్నాము. ఆ విధంగా పెట్టుబడి యొక్క లాభమూ (వ్యాపార సంస్థ లాభం+వడ్డీ), భూమికౌలు అనేది అదనపు విలువలోని నిర్దిష్ట అంతర్భాగాలు తప్ప మరొకటి కాదు. పెట్టుబడి వాటాకు వచ్చేదా, లేక భూ ఆస్తి వాటాకు వచ్చేదా అనేదాన్నిబట్టి అదనపు విలువను భిన్నభాగాలుగా విభజించే అభివర్గాలివి. కానీ ఈ పేర్లు అదనపు విలువ స్వభావాన్ని ఎంతమాత్రం మార్చవు. వీటిని కూడితే ఇవి మొత్తం సామాజిక అదనపు విలువ అవుతాయి. అదనపు విలువచే లేక అదనపు ఉత్పాదితంచే సూచితమైన అదనపు శ్రమను పెట్టుబడి ప్రత్యక్షంగా శ్రామికుల నుంచి పిండుతుంది. ఆ అర్థంలో అదనపు విలువను ఉత్పత్తి చేసేదిగా పెట్టుబడిని పరిగణింపవచ్చు. భూ ఆస్తికి నిజమైన ఉత్పాదన ప్రక్రియతో ఎటువంటి సంబంధమూ లేదు. ఉత్పత్తి అయిన అదనపు విలువలో కొంత భాగాన్ని పెట్టుబడి జేబునుంచి తన జేబులోకి

మార్చుకోవడమే, అది నిర్వహించే పాత్రల్లా. కాని భూస్వామి పెట్టుబడిదారీ ఉత్పత్తి ప్రక్రియలో పాత్ర నిర్వహించేది, పెట్టుబడిని ఒత్తిడి పెట్టడం ద్వారానే కాదు ఉత్పత్తి సాధనాలను శ్రామికుని నుంచి లాక్కోవడానికి పూర్వావసరమూ, తప్పనిసరియైన స్థితీ కాబట్టి, పెట్టుబడిదారీ ఉత్పత్తికి అది పూర్వావసరమూ, తప్పనిసరియైన స్థితి కావడం వల్లనే కాదు. ఉత్పత్తికి అత్యవసరమైన పరిస్థితుల్లో ఒకదానికి భూస్వామి మూర్తీభావం కావడం ప్రత్యేకించి, ఇందుకు కారణం.

ఆఖరు విషయం, తన వ్యక్తిగత శ్రమశక్తికి సొంతదారుగా, దాని అమ్మకందారైన శ్రామికునికి వేతనం పేరిట ఉత్పాదితంలో ఒక భాగం లభిస్తుంది. అతని శ్రమలో అవసర శ్రమ అని మనం పేర్కొంటున్నది, అంటే ఈ శ్రమశక్తి పోషణకూ, దీని పునరుత్పత్తికీ అవసరమైనది, వేతన రూపంలో అగుపిస్తుంది. శ్రమశక్తి పోషణకు, దాని పునరుత్పత్తికి అవసరమైన పరిస్థితులు చాలీచాలకుండా వున్నాయా లేక పుష్కలంగా వున్నాయా, అనుకూలంగా వున్నాయా లేక ప్రతికూలంగా వున్నాయా అనేదానితో ఇక్కడ నిమిత్తం లేదు.

ఇతర విషయాల్లో ఈ సంబంధాల మధ్య తేడా ఎలా వున్నప్పటికీ, వాటన్నిటికీ ఒక సమానాంశం వుంది. పెట్టుబడి ఏటేటా పెట్టుబడిదారుకు లాభం చేకూర్చుతుంది; భూమి భూస్వామికి కౌలునిస్తుంది. శ్రమశక్తి, మామూలు పరిస్థితుల్లో, అది ఉపయోగకరమైన శ్రమశక్తిగా వున్నంతకాలం శ్రామికునికి వేతన మిస్తుంది. ఏటా ఉత్పత్తి అయ్యే మొత్తం విలువలోని ఈ మూడు భాగాలను, ఏటా సృష్టి అయ్యే మొత్తం ఉత్పాదితంలోని తత్సంబంధ భాగాలను (ప్రస్తుతానికి సంచయనాన్ని ఏ రకంగానూ పరిగణనకు తీసుకోవడంలేదు.) వాటి సొంతదారులు, వాటి పునరుత్పత్తి యొక్క మూలాధారాన్ని హరించివేయకుండా ఏటా వినియోగించుకోవచ్చు. అవి ఏటా వినియోగించుకో వీలున్న ఒక కల్పవృక్ష ఫలాలు. ఒక వృక్షం అనడంకన్నా మూడు వృక్షాల ఫలాలు అనవచ్చు. అవి పెట్టుబడిదారీ, భూస్వామ్య, శ్రామిక వర్గాలనే మూడు వర్గాల వార్షిక ఆదాయాలు; అదనపు శ్రమను ప్రత్యక్షంగా పిండుకొనే వ్యక్తిగా మొత్తం మీద శ్రమను వినియోగించుకొనే వానిగా క్రియాశీల పెట్టుబడిదారు పంపిణీ చేసే ఆదాయాలు. ఆ విధంగా పెట్టుబడిదారునికి పెట్టుబడీ, భూస్వామికి భూమీ, శ్రామికునికి శ్రమశక్తీ, లేదా అసలు శ్రమా – తమ ప్రత్యేక ఆదాయాలకు, అంటే లాభానికి, కౌలుకు, వేతనానికి వున్న మూడు విభిన్న మూలాధారాలుగా కనిపిస్తాయి. (ఇక్కడ శ్రమశక్తికన్నా 'అసలు శ్రమే' అని ఎందుకంటున్నామంటే, శ్రామికుడు వాస్తవంలో శ్రమశక్తిని, అది అభివ్యక్తమైన స్థితిలో అమ్ముతున్నాడు; అంతేకాదు, ఇంతకు ముందు నిరూపించినట్లుగా, పెట్టుబడిదారీ ఉత్పత్తి పద్ధతిలో శ్రమశక్తి ధర తప్పనిసరిగా శ్రమ ధరగానే అగుపిస్తుంది.) కింది అర్థంలో అవి నిజంగా మూలాధారాలే. పెట్టుబడి పెట్టుబడిదారుని కోసం, అదనపు శ్రమను తోడే శాశ్వతమైన పంపింగ్ యంత్రం. భూమేమో పెట్టుబడి తోడిన అదనపు విలువలో ఒక భాగాన్ని భూస్వామి కోసం ఆకర్షించే శాశ్వతమైన అయస్కాంతం. ఆఖరున శ్రమ అనేది, శ్రామికుడు సృష్టించిన విలువలో ఒక భాగాన్ని, కాబట్టి విలువలోని ఈ భాగంచే, అంటే జీవితావసరాలచే కొలవబడిన సామాజిక ఉత్పాదిత భాగాన్ని వేతనం పేరుతో సేకరించే నిరంతర స్వయం పునరుజ్జీవన స్థితీ, స్వయం పునరుజ్జీవన సాధనమున్ను. ఇంకా కింది అర్థంలో కూడా అవి అలాంటివే : పెట్టుబడి, విలువలోని ఒక భాగాన్ని, ఆ విధంగా వార్షిక శ్రమ యొక్క ఉత్పాదితంలో ఒక భాగాన్ని లాభం రూపంలో స్థిరపరుస్తుంది. భూస్థితి అలాగే మరోభాగాన్ని కౌలు రూపంలో

స్థిరపరుస్తుంది. వేతన శ్రమ వేతన రూపంలో మూడో భాగాన్ని స్థిరపరుస్తూ ఈ రూపాంతరీకరణ ద్వారా వాటిని పెట్టుబడిదారుని, భూఖామందును, శ్రామికుని ఆదాయాలుగా మార్చుతుంది. అయితే వివిధ అభివర్గాలుగా పరివర్తన చెందిన అసలు వస్తువును సృష్టించకుండానే ఇలా చేస్తుంది. ఈ పంపిణీ జరిగిందంటే, ఈ వస్తువు, అంటే వార్షిక ఉత్పాదితం యొక్క మొత్తం విలువ వుందనేది అందులో గర్భితం. ఇది వస్తురూపం ధరించిన సామాజిక శ్రమ తప్ప మరొకటి కాదు. అయితే, ఉత్పత్తి ఏజెంట్లకు, ఉత్పత్తి ప్రక్రియలోని వివిధ విధి వాహకులకు ఈ వ్యవహారం కనిపించేది ఈ రూపంలో కాదు. అదొక వక్రరూపంలో వారికి అగుపిస్తుంది. ఇలా ఎందుకు జరుగుతుందో మన విశ్లేషణా గతిక్రమంలో మున్ముందు వివరిస్తాము. ఉత్పత్తి ఏజెంట్లకు పెట్టుబడి, భూస్థితి, శ్రమ మూడు విభిన్న, స్వతంత్ర మూలాధారాలుగా కనిపిస్తాయి. ఏటా ఉత్పత్తి అయ్యే విలువలోని, ఆ విలువకు ఉనికిపట్టుగా వున్న ఉత్పాదితంలోని మూడు భిన్న భాగాలు ఈ మూలాధారాల నుంచి ప్రాదుర్భవిస్తున్నట్లుగా కనిపిస్తాయి. ఆ విధంగా, సామాజిక ఉత్పత్తి ప్రక్రియలోని ఆయా కారకాల వాటాకు ఆదాయాలుగా వెళ్ళే ఈ విలువ భిన్న రూపాలు మాత్రమే కాదు, అసలు ఈ విలువే, తద్వారా ఈ ఆదాయ రూపాల్లోని వస్తువు సైతం ఈ మూలాధారాల నుంచి ఉత్పన్నమవుతున్నట్లు వారికి కనిపిస్తుంది.

(ఇక్కడ రాతప్రతిలో ఒక తావు కాగితం లేదు.)

.....వ్యత్యాసపు కౌలు సాపేక్షమైన భూసారంతో ముడిపడి వుంది. వేరు మాటల్లో భూమిని బట్టి దానికి గల లక్షణాలతో ముడిపడి వుంది. కానీ మొదటి విషయం, ఇది భిన్న రకాల భూమి ఉత్పాదితాలకు గల విభిన్న వైయక్తిక విలువలపై ఆధారపడి వున్న మేరకు పైన పేర్కొన్న నిశ్చితాంశమే తప్ప వేరుకాదు. రెండవది, ఈ విడివిడి విలువకు భిన్నమైనట్టి, నియంత్రకమైనట్టి సాధారణ మార్కెట్ – విలువపై ఆధారపడి వున్న మేరకు ఇది పోటీ ద్వారా అమలుజరిగే ఒక సామాజిక నియమం. దీనికి భూమితోగాని, భూసార తారతమ్యంతోగాని సంబంధం లేదు.

"శ్రమ–వేతనాలు" అనే దానిలో ఒక సహేతుకమైన సంబంధం అభివ్యక్తమైనట్లు కనిపించవచ్చు. కానీ "భూమి–కౌలు"లో లాగానే ఇందులో సైతం అలాంటిదేమీ లేదు. శ్రమ విలువను సృష్టిస్తున్న మేరకు, సరుకుల విలువలో ఇది అభివ్యక్తమవుతున్న మేరకు, వివిధ అభివర్గాల మధ్య ఈ విలువ పంపిణీతో దీనికి ఎలాంటి సంబంధం లేదు. దీనికి వేతన శ్రమ అనే ప్రత్యేక సామాజిక లక్షణం వున్న మేరకు ఇది విలువను సృష్టించదు. శ్రమ యొక్క వేతనాలు లేక శ్రమ ధర విలువకు లేక శ్రమశక్తి ధరకు ఒక అసంబద్ధ వ్యక్తీకరణ అనీ, ఈ శ్రమశక్తి అమ్మబడే నిర్దిష్ట సామాజిక పరిస్థితులకు, ఉత్పత్తిలో ఒక సాధారణ ఏజెంటు అయిన శ్రమతో ఎలాంటి ప్రమేయం లేదనీ ఇదివరకే స్థూలంగా నిరూపించాము. సరుకు విలువలోని వేతన భాగంలో, అంటే శ్రమశక్తి ధరగా వున్న ఆ భాగంలో కూడా శ్రమ, వస్తురూపం ధరిస్తుంది. శ్రమ ఉత్పాదితంలోని ఇతర భాగాల్లాగానే ఈ భాగాన్ని కూడా సృష్టిస్తోంది. సరుకు విలువలో కౌలుగా లేక లాభంగా వున్న ఇతర భాగాల్లోలాగానే ఈ భాగంలో సైతం శ్రమ వస్తురూపం ధరిస్తుందే తప్ప దానికి భిన్నంగా కానీ, దానికి మించి కానీ కాదు. శ్రమను విలువకు సృష్టికర్తగా మనం నిరూపిస్తున్నప్పుడు, సమాజ నిర్ణీత పరిమితులు గల శ్రమను పరిగణనకు తీసుకొంటున్నామే తప్ప, ఉత్పత్తికి తప్పనిసరియైన దాని నిర్దిష్ట రూపంలోని

శ్రమను కాదు. మరి, ఈ పరిమితులు వేతన శ్రమ పరిమితులకు భిన్నమైనవి.

"పెట్టుబడి–లాభం" అన్న పదబంధం కూడా ఇక్కడ సరికాదు. పెట్టుబడి అదనపు విలువను ఉత్పత్తి చేసేది ఒకే ఒక సంబంధంలో. అది శ్రామికునితో దానికి గల సంబంధం. శ్రమశక్తిని, అంటే వేతన శ్రామికుణ్ణి నిర్బంధపెట్టి అదనపు శ్రమను రాబట్టడానికి వీలిచ్చే సంబంధమిది. ఈ సంబంధంలో పెట్టుబడిని పరిశీలించినట్లయితే, ఈ అదనపు విలువతో ఒక్క లాభమే (వ్యాపార సంస్థ లాభం+వడ్డీ) కాదు, కౌలు కూడా ఇమిడివుందనేది స్పష్టం. ఒక మాటలో చెప్పాలంటే ఇది అవిభక్తమైన యావత్తు అదనపు విలువ. కానీ ఆదాయపు మూలాధారంగా పెట్టుబడికి, కేవలం పెట్టుబడిదారు వాటాకు వచ్చే విలువ భాగంతో గల సంబంధం మాత్రమే ప్రస్తుత సందర్భంలో సూచితం. ఇది పెట్టుబడి, మొత్తం మీద పిండుకొనే అదనపు విలువ కాదు; ఇది పెట్టుబడిదారుకై పిండుకొనే భాగం మాత్రమే. ఈ సూత్రం "పెట్టుబడి–వడ్డీ"గా రూపాంతరం చెందిన వెంటనే, ఇదే కాదు, అన్ని సంబంధాలు అదృశ్యమవుతాయి!

పై మూలాధారాల మధ్య వున్న వ్యత్యాసాన్ని మనం మొదట్లో గమనించి, పరిశీలించి చూశాము. కానీ, వాటి ఉత్పాదితాలు, వాటి రెమ్మలు లేదా ఆదాయాలు అలాకాక, ఒకే రంగానికి – విలువ రంగానికి చెందినవని ఇప్పుడు గమనిస్తున్నాము. కానీ అననురూప పరిమాణాల మధ్యనే కాక, పూర్తిగా భిన్నమైన, పరస్పర సంబంధం లేని, ఒకదానితో ఒకటి పోల్చ వీలులేని వస్తువుల మధ్య వున్న సంబంధాన్ని చూపినందుకు పరిహారంగా భూమి, శ్రమలలాగా పెట్టుబడిని కూడా కేవలం ఒక భౌతిక వస్తువుగా, అంటే కేవలం ఉత్పత్తి చేయబడిన ఉత్పాదక సాధనంగా పరిగణిస్తున్నారు. శ్రామికునితో ఒక సంబంధంగానూ, ఒక విలువగానూ వున్న పెట్టుబడి ఆ విధంగా వాటి నుంచి విడదీయబడింది.

మూడవది, ఈ విధంగా అర్థం చేసుకొంటే, పెట్టుబడి–వడ్డీ (లాభం), భూమి–కౌలు, శ్రమ–వేతనాలు అనే సూత్రం ఒకే విధమైన, పొందికైన అసంగతంగా కనిపిస్తుంది. వాస్తవంలో, వేతన శ్రమ సమాజ నిర్ణీతమైన శ్రమ రూపంగా కనిపించదు సరికదా, సమస్త శ్రమ స్వభావరీత్యా వేతన శ్రమగా కనిపిస్తుంది. (పెట్టుబడిదారీ ఉత్పత్తి సంబంధాల పట్టులో వున్న వారికి అలాగే కనిపిస్తుంది మరి.) అందువల్ల, శ్రమ పాదార్థిక అవసరాలు – అంటే ఉత్పత్తి చేయబడిన ఉత్పాదక సాధనాలూ, భూమీ – ఇవి. వేతన శ్రమ విషయంలో ధరించే ప్రత్యేక సామాజిక రూపాలు (ఈ రూపాలున్నాయంటే వేతన శ్రమ ఉనికి తప్పనిసరియైన విధంగానే) శ్రమ యొక్క ఈ అవసరాల పాదార్థిక అస్తిత్వంతో, లేక వాస్తవ శ్రమ ప్రక్రియలో మామూలుగా వాటికి గల రూపంతో ఏకీభవిస్తాయి. శ్రమ ప్రక్రియ యొక్క నిర్దిష్టమైన, చారిత్రకంగా నిర్ణయమైన సామాజిక రూపంతో లేక నిజంగా ఏ సామాజిక రూపంతోనూ దీనికి నిమిత్తం లేదు. శ్రమ అవసరాల రూపం మాదిరి; అంటే అవి శ్రమ నుంచి వేరుపడిపోయి, స్వతంత్రంగా శ్రమకు ఎదురవుతాయి; ఉత్పత్తి చేయబడిన ఉత్పాదక సాధనాలు, తద్వారా పెట్టుబడిగా మారతాయి; భూమి గుత్తాధిపత్యంలో వున్న భూమిగా, అంటే భూస్థితిగా మారుతుంది. ఒక నిర్దిష్ట చారిత్రక దశకు చెందిన ఈ మారిన రూపం తద్వారా మొత్తం ఉత్పత్తి ప్రక్రియలో, ఉత్పాదితమైన ఉత్పత్తి సాధనాల యొక్క భూమి యొక్క ఉనికితోనూ, విధితోనూ ఏకీభవిస్తుంది. ఈ ఉత్పత్తి సాధనాలు స్వతహాగా, స్వభావ రీత్యానే పెట్టుబడి. పెట్టుబడి అనేది ఈ

ఉత్పత్తి సాధనాలకు ఒక "ఆర్థిక నామధేయం" మాత్రమే. ఆ విధంగానే భూమి స్వతహాగా, స్వభావ రీత్యానే కొందరు భూస్వాముల గుత్త సొమ్ము అయిన భూమి. ఉత్పాదితాలు పెట్టుబడిలో, పెట్టుబడిదారుల్లో – పెట్టుబడికి కేవలం మూర్తీభావంగా వున్న వీరిలో – ఒక స్వతంత్ర శక్తిగా ఉత్పాదకునికి ఎదురైనట్లుగానే, భూమి భూస్వామిగా మూర్తీభవించింది. ఒక స్వతంత్ర శక్తిగా, తన సహాయంతో సృష్టి అయిన ఉత్పాదితంలో తన వాటా ఇవ్వవలసిందిగా అలాగే నిగ్గదీసి అడుగుతుంది. ఆ విధంగా, తన పునరుజ్జీవనానికై, అభివృద్ధికై ఉత్పాదితంలో రావలసిన తన వాటా భూమికి రాదు; అందుకు బదులుగా ఈ ఉత్పాదితంలో ఒక భాగాన్ని భూస్వామి తీసుకొని యధేచ్ఛగా వృథావ్యయం చేస్తాడు. పెట్టుబడి వుందంటే, శ్రమ వేతన శ్రమగా వున్నట్లే లెక్క. ఇది సుస్పష్టమే. కానీ శ్రమను వేతన శ్రమగా పరిగణించడంతో ప్రారంభిస్తే, తత్కారణంగా మొత్తం శ్రమా, వేతన శ్రమా ఒకటేననేది స్వయం విదితమైన విషయంగా కనిపిస్తుందనీ, అప్పుడు పెట్టుబడీ, గుత్తాధిపత్యంలోని భూమీ – ఈ రెండూ కూడా మొత్తం శ్రమ అవసరాల సహజరూపంగా కనిపిస్తాయనేది సుస్పష్టమే. అందువల్ల పెట్టుబడిగా వుండటం, శ్రమ సాధనాల సహజరూపంగా కనిపిస్తుంది; కాబట్టి అది, మొత్తం శ్రమ ప్రక్రియలో వాటి విధి నుంచి తలెత్తిన ఒక అచ్చమైన వాస్తవ లక్షణంగా కనిపిస్తుంది. ఆ విధంగా పెట్టుబడీ, ఉత్పత్తి చేయబడిన ఉత్పత్తి సాధనాలూ అభిన్నపదాలవుతాయి. అదే విధంగా భూమీ, వ్యక్తిగత స్వామ్యం ద్వారా గుత్త సొమ్ముగా మారిన భూమీ ఒకటే అవుతాయి. స్వతహాగా భూమి కౌలుకు మూలాధారం అయినట్లుగా, స్వభావరీత్యానే పెట్టుబడిగా వున్న శ్రమ సాధనాలు లాభానికి మూలాధార సాధనాలవుతాయి.

లక్ష్యశుద్ధి గల ఉత్పాదత కార్యకలాపంగా తన సామాన్య ప్రతిపత్తిలో వున్న శ్రమకు ఉత్పత్తి సాధనాలతో సంబంధమున్నది, వాటి సామాజిక నిర్ణీత రూపంలో కాదు; వాటి నిర్దిష్ట పాదార్థిక రూపంలో – అంటే శ్రమ పదార్థంగా, శ్రమ సాధనాలుగా. అదే విధంగా శ్రమ సాధనాలు కూడా ఒకదాని నుంచి మరొకటి భేదించేది కేవలం పాదార్థికంగానే, ఉపయోగ విలువలుగానే. అంటే భూమి అనుత్పాదితమైన శ్రమ సాధనమైతే, మిగతావి ఉత్పాదితమైన శ్రమ సాధనాలు. కాబట్టి, శ్రమ వేతనశ్రమతో ఏకీభవిస్తున్నప్పుడు, శ్రమకు ఎదురయ్యే శ్రమ అవసరాల ప్రత్యేక సామాజిక రూపం వాటి పాదార్థిక అస్తిత్వంతో ఏకీభవిస్తుంది. కాబట్టి, శ్రమ సాధనాలు స్వతహాగా పెట్టుబడి అవుతాయి. భూమి స్వతహాగా భూ ఆస్తి అవుతుంది. అందువల్ల, శ్రమతో ప్రమేయం లేకుండా వున్న ఈ శ్రమ అవసరాల స్వతంత్ర ప్రతిపత్తి వేతన శ్రమతో ప్రమేయం లేని ప్రతిపత్తి యొక్క ప్రత్యేక రూపం, వస్తువులుగా ఉత్పత్తి పాదార్థిక ఆవశ్యకతలుగా వాటి అవిభాజ్య లక్షణం. ఉత్పాదక అంశాలుగా వాటి స్వతస్సిద్ధ, అంతర్గత లక్షణం. పెట్టుబడిదారీ ఉత్పత్తి ప్రక్రియలో ఒక నిర్దిష్ట చారిత్రక యుగ ముద్ర గల వాటి నిర్దిష్ట సామాజిక లక్షణం, ఉత్పత్తి ప్రక్రియలోని అంశాలుగా వాటికి అనాదికాలం నుంచి వున్నట్లు అనిపించే వాటి సహజ అంతర్గత లక్షణం. కాబట్టి, శ్రమ కార్యకలాపాలకు మొట్ట మొదటి క్షేత్రంగానూ, ప్రకృతి శక్తుల ఆటపట్టుగానూ, సమస్త శ్రమ వస్తువులకు అంతఃపూర్వ ఆధారంగానూ, భూమి మొత్తం ఉత్పత్తి ప్రక్రియలో నిర్వహించే పాత్ర, అదేవిధంగా ఉత్పాదితమైన ఉత్పత్తి సాధనాలు (పరికరాలు, ముడిపదార్థాలు, మొదలయినవి) ఆ ప్రక్రియలో నిర్వహించే పాత్ర – పెట్టుబడిగా, భూ ఆస్తిగా అవి తమకు రావాలని చెప్పే వాటాల్లో, అంటే వాటి సామాజిక ప్రతినిధులకు

లాభం (వడ్డీ), కౌలు రూపంలో వెళ్ళే వాటాల్లో అభివ్యక్తమైనట్లు కనిపించక తప్పదు. శ్రామికుని శ్రమ ఉత్పత్తి ప్రక్రియలో నిర్వహించే పాత్ర వేతన రూపంలో అభివ్యక్తమై అతని వాటాకు వెళ్ళినట్లుగానే ఇవీ. ఏ విధమైన చారిత్రక రూపాన్నైనా సరే వదిలేసి, శ్రమ ప్రక్రియను కేవలం మనిషి ప్రకృతుల మధ్య జరిగే ప్రక్రియగా పరిగణించినప్పుడు సైతం కౌలు, లాభం, వేతనం అనేవి ఈ విధంగా, సామాన్య శ్రమ ప్రక్రియలో భూమి, ఉత్పాదితమైన ఉత్పత్తి సాధనాలు, శ్రమ నిర్వహించే పాత్ర నుంచి ఉత్పన్నమవుతున్నట్లు కనిపిస్తాయి. కింది విధంగా వాదించినప్పుడు కూడా ఇదే సంగతిని మరోరూపంలో చెబుతున్నారంతే. ఒక వేతన శ్రామికుడు తనకోసం చేసే శ్రమకు ప్రత్యక్ష రూపమైన ఉత్పాదితమే, అతని రాబడే లేదా ఆదాయమే వేతనం, దానికి ప్రాతినిధ్యం వహించే విలువ భాగం. (కాబట్టి ఈ విలువతో లెక్కగట్టిన సామాజిక ఉత్పాదితం) ఆ విధంగా, వేతన శ్రమ సార్వజనిక శ్రమతో ఏకీభవించినప్పుడు, వేతనం శ్రమ ఫలితంతో ఏకీభవిస్తుంది. వేతనం ప్రాతినిధ్యం వహించే విలువ భాగం సార్వజనిక శ్రమ సృష్టించిన విలువతో ఏకీభవిస్తుంది కానీ ఈ విధంగానే, విలువలోని ఇతర భాగాలు – లాభం, కౌలు కూడా వేతనంతో నిమిత్తం లేనివిగా కనిపిస్తాయి. కాబట్టి అవి ప్రత్యేకించి శ్రమకు భిన్నమైన, శ్రమతో నిమిత్తం లేని తమ సొంత మూలాధారాల నుంచి ఉత్పన్నమై వుండాలి. అవి ఉత్పత్తిలో పాల్గొనే అంశాల నుంచి ఉత్పన్నమై వుండాలి. అవి ఆ అంశాల సొంతదారుల వాటాకు వెళతాయి. లాభం ఉత్పత్తి సాధనాల నుంచీ, అంటే పెట్టుబడి యొక్క పాదార్థిక అంశాల నుంచీ ఉత్పన్నం కావాలి; కౌలు భూస్వామి ప్రాతినిధ్యం వహించే భూమి నుంచి లేదా ప్రకృతి నుంచి ఉత్పన్నం కావాలి.[1]

శ్రమ నుంచి పెట్టుబడిదారు పిండుకొనే అదనపు విలువలోని ఒక భాగాన్ని లాభం రూపంలో పెట్టుబడిదారుకోసం పెట్టుబడి లాగివేస్తుంది; మరో భాగాన్ని కౌలురూపంలో భూమిపై గుత్తాధిపత్యం భూస్వామికోసం లాగి వేస్తుంది. విలువలోని మిగతా భాగాన్ని వేతన రూపంలో శ్రామికునికి శ్రమ ప్రసాదిస్తుంది అన్న అర్థంలో భూ ఆస్తి, పెట్టుబడి, వేతన శ్రమ ఆదాయపు మూలాధారాలుగా వున్నాయి; అంటే విలువలోని ఒక భాగాన్ని లాభం రూపంలోకి, మరో భాగాన్ని కౌలు రూపంలోకి మూడో భాగాన్ని వేతన రూపంలోకి మార్చే మూలాధారాలుగా వున్నాయి. అది అలాంటి స్థితి నుంచి ఈ విలువ భాగాల ప్రాదుర్భావానికి, ఈ భాగాలకు ఉనికిపట్టు అయిన లేదా వాటితో మార్పిడి కాగలిగిన ఉత్పాదిత భాగాల ప్రాదుర్భావానికి వాస్తవ మూలాధారాలుగా పరివర్తన చెందుతాయి; కాబట్టి తుదకంటా విశ్లేషించితే, అసలు ఉత్పాదితం విలువ ప్రాదుర్భావానికే మూలాధారాలుగా పరివర్తన చెందుతాయన్నమాట.[2]

---

1. రోశ్చర్ System der Volkswirtschaft, Band I, Die Grundlagen der Nationalokonomie, స్టుట్‌గార్ట్, ఆగ్స్‌బర్గ్, 1858 - సం.

2. సమస్త ఆదాయానికీ, అదే విధంగా మార్పిడికీ గల సమస్త విలువకు వేతనం, లాభం, కౌలు మూడు ఆదిమ మూలాధారాలు. (ఎ. స్మిత్) [దేశాల సంపద స్వభావం వాటి కారణాల గురించిన పరిశీలన; అబర్‌డీన్, లండన్, 1848, ఎస్ - 43 - సం] - ఈ విధంగా పాదార్థిక ఉత్పత్తి కారణాలు, అదే సమయంలో, ఉనికిలోని ఆదిమ ఆదాయాలకు మూలాధారాలు కూడా. (స్టార్చ్) [Cours d'economie. Politique, సెయింట్ పీటర్స్‌బర్గ్, 1815-సం] 1, పు. 259 - సం.

పెట్టుబడిదారీ ఉత్పత్తి పద్ధతికి, సరుకు ఉత్పత్తి పద్ధతికి సైతం చెందిన అతి సామాన్య అభివర్గాల విషయంలో, ఒక నిగూఢ లక్షణాన్ని మేము ఇదివరకే పేర్కొన్నాము. సంపద యొక్క పాదార్థిక అంశాలు ఉత్పత్తిలో వేటికి వాహికలుగా ఉపకరిస్తాయో, ఆ సామాజిక సంబంధాలను ఈ వస్తువుల (సరుకుల) గుణాలుగా, అంతకన్నా ప్రస్ఫుటంగా, ఉత్పత్తి సంబంధాన్నే ఒక వస్తువుగా (డబ్బుగా) మార్చివేసే లక్షణమిది. సరుకు ఉత్పత్తి, డబ్బు చలామణి జరిగే దశకు చేరుకున్న మేరకు సమాజ రూపాలన్నీ ఈ వైపరీత్యంలో పాల్గొంటాయి. కానీ, పెట్టుబడిదారీ ఉత్పత్తి పద్ధతిలో, దాని ప్రబల అభివర్గంగా, దాని నిర్ణాయక ఉత్పత్తి సంబంధంగా వున్న పెట్టుబడి విషయంలో ఈ మాయామేయ విపరీత జగత్తు మరింత వృద్ధి పొందుతుంది. ఒక సంగతితో ప్రారంభిద్దాం. పెట్టుబడిని వాస్తవ ఉత్పత్తి ప్రక్రియలో అదనపు శ్రమను పిండే సాధనంగా పరిగణిస్తే, అప్పుడీ సంబంధం ఇంకా చాలా సులభగ్రాహ్యంగానే వుంటుంది కాబట్టి, ఈ ప్రక్రియ వాహకులపై, సాక్షాత్తు పెట్టుబడిదారులపై, దీని ముద్రపడి వారి చైతన్యంలో నిలిచిపోతుంది. పనిదినం పరిమితులపై జరిగే ఉగ్ర పోరాటమే దీన్ని కొట్టవచ్చినట్లు  చూపుతోంది. మధ్యస్థమైనదేదీ లేని ఈ రంగంలో, అంటే శ్రమ పెట్టుబడుల మధ్య ప్రత్యక్ష పోరాటం జరిగే ఈ రంగంలో సైతం, వ్యవహారం సులభగ్రాహ్యంగా వుండిపోదు. ప్రత్యేకించి యథార్థమైన పెట్టుబడిదారీ పద్ధతిలో జరిగే ఉత్పత్తి విధానంలో, ఆ విధానం ద్వారా సామాజిక శ్రమ యొక్క ఉత్పాదక శక్తులు పెంపొందడం వల్ల, సాపేక్ష అదనపు విలువ పెరుగుతుంది. దాని పెరుగుదలతో, ఈ ఉత్పాదక శక్తులు, ప్రత్యక్ష శ్రమ ప్రక్రియలోని శ్రమ అంతస్సంబంధాలు శ్రమ నుంచి పెట్టుబడికి బదలాయింపబడినట్లు కనిపిస్తాయి. ఆ విధంగా పెట్టుబడి చాలా నిగూఢజీవి అవుతుంది. ఎందువల్లనంటే – శ్రమ తాలూకు సామాజిక ఉత్పాదక శక్తులన్నిటికీ కారణం పెట్టుబడే తప్ప శ్రమ కానట్లు అగుపిస్తుంది. అవి సాక్షాత్తూ పెట్టుబడి గర్భం నుంచి ప్రాదుర్భవించినట్లు తోస్తుంది. తరువాత, వస్తువునూ, రూపాన్ని మార్చుతూ మధ్యలో చలామణి క్రమం రంగప్రవేశం చేస్తుంది. ప్రత్యేకించి పెట్టుబడిదారీ రీతిలో జరిగే ఉత్పత్తి ఏ మోతాదులో అభివృద్ధి చెందుతుందో ఆ మోతాదులో పెట్టుబడికి చెందిన అన్ని భాగాలు, వ్యవసాయ పెట్టుబడికి చెందినవి సైతం చలామణి రంగంపై వచ్చిపడతాయి. మొట్టమొదట విలువ ఏ సంబంధాల ఆసరాతో ఉత్పత్తి అయిందో, ఆ సంబంధాలు ఈ రంగంలో సంపూర్తిగా వెనక్కు నెట్టబడతాయి. ప్రత్యక్ష ఉత్పత్తి క్రమంలో, అప్పటికే పెట్టుబడిదారు ఏకకాలంలో సరుకుల ఉత్పాదకుడుగా, సరుకు ఉత్పత్తిరంగ మేనేజరుగా కూడా వ్యవహరిస్తాడు. కాబట్టి, ఈ ఉత్పత్తి ప్రక్రియ కేవలం అదనపు విలువను ఉత్పత్తి చేసే ప్రక్రియగా అతనికి అగుపించదు. అయితే, వాస్తవ ఉత్పత్తి ప్రక్రియలో పెట్టుబడిదారు పిండుకొన్నట్టి, సరుకుల్లో ప్రత్యక్షమవుతున్నట్టి అదనపు విలువ ఎంతైనా కావచ్చుగాక, సరుకుల్లో వున్న విలువా, అదనపు విలువా, మొదట చలామణి క్రమంలో చేతికందవలసిందే. ఉత్పత్తిలో మదుపు పెట్టిన విలువలూ, ప్రత్యేకించిన సరుకుల్లో వున్న అదనపు విలువా చలామణిలో తిరిగి చేతికందుతున్నట్లు మాత్రమే కాక, అవి రెండూ వాస్తవంలో చలామణి నుంచి ఉత్పన్నమవుతున్నట్లు కనిపిస్తుంది. ఇలా కనిపించడానికి ప్రత్యేకించి దోహదం చేసే రెండు అంశాలున్నాయి. మొదటిది, అమ్మకంలో వచ్చే లాభం దగాపైనా, మోసం ఆంతరంగిక విషయ పరిజ్ఞానం, నేర్పులపైనా, వేయిన్నొక్క మార్కెట్ అవకాశాలపైన ఆధారపడి

వుంది. రెండవది, ఇక్కడ శ్రమకాలానికి మరో నిర్ణాయకాంశం – చలామణి కాలం – కూడా వచ్చి చేరడం కూడా ఒక దోహదకారి. వాస్తవంలో, ఇది విలువా, అదనపు విలువా రూపొందకుండా అడ్డుపడే ఒక ప్రతికూల అంశంగా పనిచేసినప్పటికీ, అసలు శ్రమ అంతటి ఖచ్చితమైన ప్రాతిపదికగా గోచరిస్తుంది; శ్రమతో నిమిత్తం లేకుండా, పెట్టుబడి స్వభావం సిద్ధించిన ఒక నిర్ణాయకాంశాన్ని ప్రవేశపెడుతున్నట్లుగా కనిపిస్తుంది. IIవ సంపుటంలో మేము ఈ చలామణి రంగం సృష్టించే కేవల రూప నిర్ధారణలకు సంబంధించి మాత్రమే ఈ రంగాన్ని చిత్రించి, ఈ రంగంలో పెట్టుబడి నిర్మాణ స్వరూపం తదుపరి చెందే పరిణామాన్ని మాత్రమే చూపవలసి వచ్చింది. కానీ వాస్తవంలో ఈ రంగం పోటీ జరిగే రంగం. ప్రతి విడివిడి సందర్భాన్ని దృష్టిలో వుంచుకొని చూస్తే, ఇక్కడ ప్రాబల్యం వహించేది కాకతాళీయ వ్యయమే. అందువల్ల, ఇందులోని ఈ యాదృచ్ఛిక ఘటనల్లో వుండే వాటిని క్రమబద్ధంగా నడిపించే అంతర్గత నియమం వీటిని పెద్ద సంఖ్యలో సమాహరించినప్పుడు మాత్రమే కనిపిస్తుంది. కాబట్టి ఉత్పత్తిలోని విడివిడి ఏజెంట్లకు అది కనిపించకుండా, తెలియరాకుండా వుండిపోతుంది. కానీ మరోసంగతి కూడా పేర్కొనాలి. ప్రత్యక్ష ఉత్పత్తి ప్రక్రియకూ, చలామణి ప్రక్రియా ఈ రెంటి ఏకతగా వాస్తవ ఉత్పత్తి ప్రక్రియ, కొత్త రూపాలను ఉద్భవింపచేస్తుంది. వీటిలో అంతర్గత సంబంధాల జాడ అంతకంతకు అదృశ్యమవుతుంది. ఉత్పత్తి సంబంధాలు వేటికవి స్వతంత్ర ప్రతిపత్తిని సంతరించుకొంటాయి. అంతర్భాగ విలువలు వేటికవి స్వతంత్రమైన రూపాలుగా కరుడుగట్టుకు పోతాయి.

మనమిదివరకే గమనించినట్లు, అదనపు విలువ లాభంగా పరివర్తన చెందడానికి ఉత్పత్తి ప్రక్రియ ఎంత కారణమో, చలామణి ప్రక్రియ కూడా అంతే కారణం. లాభం రూపంలోని అదనపు విలువను, ఆ విలువను సృష్టించిన శ్రమ కోసం మదుపు పెట్టిన పెట్టుబడి భాగానికి సంబంధించినదిగా ఇక పరిగణించరు. దాన్ని లాభం మొత్తం పెట్టుబడితో ముడిపెడతారు. లాభం రేటును దాని సొంత నియమాలు నియంత్రిస్తాయి. అదనపు విలువ రేటు యథాతథంగా ఉండగా, లాభం రేటు మారడానికి ఈ నియమాలు వీలు కల్పిస్తాయి; వీలు కల్పించడమే కాదు, మారవలసిన అవసరం కల్పిస్తాయి కూడా. దీనంతటివల్ల అదనపు విలువ వాస్తవ స్వభావం అంతకంతకు మరుగైపోతుంది. ఆ విధంగా పెట్టుబడి యథార్థంగా పనిచేసే తీరు మరుగైపోతుంది. లాభం సగటు లాభంగా, విలువలు ఉత్పత్తి ధరలుగా, మార్కెట్ ధరల యొక్క నియంత్రక సగటుగా పరివర్తన చెందడం ద్వారా అది ఇంకా ఎక్కువ మరుగవుతుంది. ఇక్కడ జటిలమైన ఒక సామాజిక క్రమం చొరబడుతుంది. అది పెట్టుబడులను సమానం చేసే క్రమం. అది సరుకుల సాపేక్ష సగటు ధరలను వాటి విలువల నుంచి వేరుపరుస్తుంది. వివిధ ఉత్పత్తి రంగాల్లోని సగటు లాభాలను (ప్రతి ప్రత్యేక ఉత్పత్తి రంగంలో ఆ పెట్టుబడి మదుపులతో ఏ మాత్రం నిమిత్తం లేకుండా) ఆయా ప్రత్యేక పెట్టుబడులు దోచుకున్న శ్రమ పరిమాణం నుంచి వేరుపరుస్తుంది. సరుకు సగటు ధర వాటి విలువకు భిన్నంగా వున్నట్లు, వాటిలో వాస్తవ రూపం ధరించిన శ్రమకు ఆ విధంగా భిన్నంగా వున్నట్లు, ఒక ప్రత్యేక పెట్టుబడి యొక్క సగటు లాభం, తన శ్రామికుల నుంచి ఆ పెట్టుబడి పిండిన అదనపు విలువకు భిన్నంగా వున్నట్లు కనిపించడమే కాదు – వాస్తవంలో కూడా భిన్నంగానే వుంటుంది. ఉత్పత్తి ధరల అంతిమ అవధులపై కాక, ఆ ధరల

హెచ్చుతగ్గులపై, వాటి చలనంపై అస్థిరమైన శ్రమ ఉత్పాదకతకు గల ప్రభావంలో మాత్రమే సరుకుల విలువ ప్రత్యక్షంగా ప్రదర్శితమవుతుంది. నియంత్రణాత్మక మార్కెట్ ధరలు, శ్రమను ప్రత్యక్షంగా దోచుకోవడంతో ప్రమేయం లేకుండా నిర్ధారణ అయినట్లు కనిపిస్తుంది. ఈ ధరలను బట్టి వచ్చే సగటు లాభానికి భిన్నమైన లాభం పొందడానికి వీలు కల్పిస్తున్న మేరకు, ఈ దోపిడీ లాభ నిర్ణయంలో గల పాత్ర ప్రధానమైనది కానట్లు తోస్తుంది. మామూలు సగటు లాభాలు పెట్టుబడిలో అంతర్భూతంగా వున్నట్లు, వాటికి దోపిడీతో ప్రమేయం లేనట్లు కనిపిస్తుంది. అసాధారణమైన దోపిడీ, సానుకూలమైన, ప్రత్యేకమైన పరిస్థితుల్లో సాగే సగటు దోపిడీ సైతం సగటు లాభానికి భిన్నమైన లాభాలు రావడానికి మాత్రమే కారణంగా కనిపిస్తుందే తప్ప ఈ లాభానికి కాదు. లాభం పరిశ్రమ లాభంగా, వడ్డీగా విభజితం కావడంతో, అదనపు విలువ రూపం ప్రత్యేకత సంతరించుకొనే క్రమం – ఆ విలువ సారభూతాంశానికి భిన్నమైన దాని రూపం కరుడుగట్టే క్రమం పూర్తవుతుంది. (ఇక్కడ వర్తక లావాదేవీల్లోని లాభం డబ్బు లావాదేవీల్లోని లాభం, మధ్యలో జోక్యం చేసుకొనే సంగతిని పేర్కొనడం లేదు. ఇవి చలామణిపై స్థాపితమైనవి. ఇవి పూర్తిగా దాని నుంచి ఉద్భవించినట్లు కనిపిస్తాయే తప్ప, ఉత్పత్తి ప్రక్రియ నుంచి ఉద్భవించినట్లు కనిపించవు.) లాభంలో ఒక భాగానికి విరుద్ధమైన మరోభాగం పెట్టుబడితో తనకు గల సంబంధం నుంచి పూర్తిగా వేరుపడిపోతుంది. అది వేతన శ్రమను దోపిడీ చేసే క్రియ నుంచికాక, అసలు పెట్టుబడిదారుని వేతన శ్రమ నుంచి ప్రాదుర్భవించినట్లు కనిపిస్తుంది. దానిలా కాక వడ్డీ, శ్రామికుని వేతన శ్రమతో గానీ, పెట్టుబడిదారుని సొంత శ్రమతో గానీ ప్రమేయం లేకుండా, తన సొంత మూలాధారమైన పెట్టుబడి నుంచే ప్రాదుర్భవించినట్లు కనిపిస్తుంది. ప్రారంభంలో పెట్టుబడి చలామణి ఉపరితలంపైకి ఆరాధ్య పెట్టుబడిగా విలువను సృష్టించే విలువగా ప్రత్యక్షం కాగా, ఇప్పుడది వడ్డీ గడించే పెట్టుబడి రూపంలోని దాని అత్యంత విచిత్రమైన, విలక్షణమైన రూపంలో మళ్ళీ ప్రత్యక్షమవుతుంది. అందువల్ల, భూమి–కౌలు, శ్రమ–వేతనం అనే వాటికి మూడవదిగా వున్న పెట్టుబడి–వడ్డీ అనే సూత్రం; పెట్టుబడి–లాభం అనే దానికన్నా మరింత అనుగుణమైనది. ఎందువల్ల నంటే లాభంలో దాని మూలాధార స్మృతి ఇంకా నిలిచి వుంది. ఇది వడ్డీలో అంతర్ధానం కావడమే కాక, ఈ మూలాధారానికి పూర్తిగా విరుద్ధమైన రూపంలో వుంది కూడా.

ఆఖరు విషయం. అదనపు విలువకు ఒక స్వతంత్ర మూలాధారమైన పెట్టుబడికి భూ ఆస్తి వచ్చి చేరుతుంది. ఇది సగటు లాభానికి అడ్డంకిగా వ్యవహరిస్తూ, తాను స్వయంగా శ్రమించడం గానీ, ప్రత్యక్షంగా శ్రమను దోచుకోవడం గానీ చేయని ఒక వర్గానికి అదనపు విలువలో ఒక భాగాన్ని బదలాయిస్తుంది. ఇతరులకు వడ్డీకి పెట్టుబడిని అప్పుపెట్టడంలో అసలుకే మోసం రాగల ప్రమాదం, త్యాగం వున్నదంటూ చెప్పుకోగల పెట్టుబడిలాగా, తన్ను సమర్థించే నీతిబోధక వాదనలు సైతం లేని వర్గమిది. ఇక్కడ, అదనపు విలువలో ఒక భాగం ప్రకృతిలో భాగమయిన భూమితో ప్రత్యక్షంగా ముడిపడి వుందే తప్ప, సామాజిక సంబంధాలతో కాదు. అందువల్ల అదనపు విలువలోని వివిధ భాగాలు ఒకదాని కొకటి దూరమై, కరుడుగట్టే క్రమం పూర్తవుతుంది; అంతర్గత సంబంధం పూర్తిగా విచ్ఛిన్నమవుతుంది. అదనపు విలువలోని ఈ భాగం యొక్క మూలాధారం పూర్తిగా మరుగైపోతుంది. ఎందువల్లనంటే, ఉత్పత్తి ప్రక్రియలోని వివిధ పాదార్థిక భాగాలతో ముడిపడి వున్న ఉత్పత్తి సంబంధాలు

పరస్పర ప్రమేయం లేని స్వతంత్ర ప్రతిపత్తి సంతరించుకొన్నాయి.

పెట్టుబడి–లాభం, అంతకన్నా సరిగ్గా చెప్పాలంటే పెట్టుబడి–వడ్డీ, భూమి–కౌలు, శ్రమ–వేతనం అన్న ఆర్థికత్రయంలో విలువలోని, మొత్తంపై సంపదలోని అంతర్భాగాలకూ, వాటి మూలాధారాలకు మధ్య సంబంధాన్ని తెలిపే ఈ ఆర్థికత్రయంలో పెట్టుబడిదారీ ఉత్పత్తి పద్ధతి పూర్తిగా నిగూఢమైపోవడం, సామాజిక సంబంధాలు వస్తువులుగా మారడం భౌతిక ఉత్పత్తి సంబంధాలు వాటి చారిత్రక, సామాజిక, నిర్ధారణతో లీనమయిపోవడం మనకు కనిపిస్తుంది. ఇదొక మంత్ర సమ్మోహితమైన, విపరీతమైన, తలకిందులుగా వున్న ప్రపంచం. ఇందులో శ్రీమాన్ పెట్టుబడీ, శ్రీమతి భూమి సామాజిక పాత్రలుగానూ, అదే సమయంలో ప్రత్యక్షంగా కేవలం వస్తువులుగానూ, తమ భూతసంచారం సాగిస్తున్నాయి. ఈ కపట వేషాన్ని, ఈ భ్రాంతిని, సంపదలోని వివిధ సామాజిక భాగాలు దేనికదిగా వున్న వాటి స్వతంత్ర ప్రతిపత్తిని, వస్తువులు సంతరించుకొన్న ఈ మానవ మూర్తీభావాన్ని, భౌతిక అస్తిత్వాంశాలుగా ఉత్పత్తి సంబంధాల పరివర్తనను, దైనందిన జీవితానికి సంబంధించిన ఈ మతాన్ని బద్దలుగొట్టిన మహా ఘనత సంప్రదాయక అర్థశాస్త్రానిదే. అది ఈ పని ఎలా చేయగలిగిందంటే : కౌలును సగటు లాభానికి పైబడ్డ మిగులుగా తేల్చివేయడంతో అవి రెండూ అదనపు విలువలో చేరిపోయాయి. చలామణి ప్రక్రియను రూపాల కేవల రూపాంతరీకరణగా చిత్రించింది. ఆఖరున, సరుకుల విలువను, అదనపు విలువను ప్రత్యక్ష ఉత్పత్తి ప్రక్రియలోని శ్రమగా తేల్చింది. అయినప్పటికీ, సాంప్రదాయిక అర్థశాస్త్ర అత్యుత్తమ ప్రతినిధులు సైతం, తమ విమర్శ ధ్వంసం చేసిన భ్రాంతి జగత్తు భల్లూకపు పట్టులోనే దాదాపు వుండిపోయారు. బూర్జువా దృక్కోణం నుంచి అది మరో విధంగా జరగదు. ఆ విధంగా వారంతా స్వవచోవ్యాఘాతాల్లో, అర్థసత్యాల్లో, అపరిష్కృత వైరుధ్యాల్లో కూరుకుపోయారు. మరోవైపు, పెట్టుబడి–వడ్డీ, భూమి–కౌలు, శ్రమ–వేతనం అనే ఈ పరస్పర వ్యతిరేక హేతువిరుద్ధ రూపాలు ఉత్పత్తి యొక్క వాస్తవ ఏజెంట్లకు చిరపరిచిత ప్రియంగా వుండటం అంతగానూ సహజమే. ఎందువల్లనంటే, వారు తిరుగాడేదీ, వారి నిత్యవృత్తి వున్నదీ ఈ భ్రమజనిత రూపాల్లోనే. నాటు అర్థశాస్త్రం, ఉత్పత్తి వాస్తవ ఏజెంట్ల అనుదిన భావనల బోధనాత్మక పిడివాదపు అనువాదం తప్ప మరేమీ కాదు. అయితే వాటిని అది సహేతుకమైన ఒకానొక క్రమంలో అమర్చింది. కనుక అటువంటి అర్థశాస్త్రానికి, ఏ అంతస్సంబంధమూ లేని ఈ సూత్రత్రయం, తన మిడిమిడి జ్ఞాన ప్రదర్శన పటాటోపానికి సహజ, నిర్వివాద, ఉదాత్త ప్రాతిపదికగా కనిపించడం అంతగానూ సహజమే. పాలకవర్గాలకు ఆదాయ మూలాధారాలుండటం భౌతికంగా అవసరమనీ, సదా న్యాయసమ్మతమనీ చాటడంవల్లా, వాటిని ఒక సైద్ధాంతిక సూత్రస్థాయికి తీసుకువెళ్ళటంవల్లా ఈ సూత్రం అదే సమయంలో పాలకవర్గాల ప్రయోజనాలకు అనుగుణంగా వుంది.

ఉత్పత్తి సంబంధాలు ఎలా ప్రత్యేక అస్తిత్వం గల అంశాలుగా మారి, ఉత్పత్తి ఏజెంట్ల విషయంలో ఎలా స్వతంత్ర ప్రతిపత్తిని సంతరించుకొంటాయో వివరిస్తున్నప్పుడు ఒక విషయం వదలివేస్తున్నాము. అదేమిటంటే : ప్రపంచ మార్కెట్, దాని కీలక సమయాలు, మార్కెట్ ధరల గమనాలు, పరపతి కాల వ్యవధులు, పారిశ్రామిక, వాణిజ్య చక్రభ్రమణాలు, మార్చి మార్చి సౌభాగ్య సంక్షోభాలు రావటం – వీటి కారణంగా అంతస్సంబంధాలు ఉత్పత్తి ఏజెంట్లకు అజేయమైన సహజ నియమాలుగా, నిజ

సంకల్పాన్ని తమపై నిర్నిరోధంగా రుద్దుతూ, గుడ్డి ఆవశ్యకతగా తమకు ఎదురవుతున్నట్లు కనిపిస్తున్న తీరును గురించిన వివరం. పోటీ వాస్తవ గతిక్రమం మా పరిశీలనా పరిధిలో లేదు కనుక దాన్ని వదిలివేస్తున్నాం. పెట్టుబడిదారీ ఉత్పత్తి పద్ధతి, ఒక విధంగా చెప్పాలంటే, ఆదర్శప్రాయమైన సగటు పెట్టుబడిదారీ ఉత్పత్తి పద్ధతి అంతర్గతంగా వ్యవస్థీకృతమైన తీరును మాత్రమే చూపడం ఇక్కడ అవసరం.

మునుపటి సామాజిక రూపాల్లో ఈ ఆర్థిక నిగూఢత్వం ప్రధానంగా డబ్బు విషయంలోనూ, వడ్డీ సంపాదించే పెట్టుబడి విషయంలోనూ ఉత్పన్నమయింది. పరిస్థితుల స్వభావాన్నిబట్టి ఇలాంటి నిగూఢతకు రెండు సందర్భాల్లో ఆస్కారం లేదు. మొదటిది, ఉపయోగపు విలువ కోసం, తక్షణ వ్యక్తిగత అవసరాల కోసం జరిగే ఉత్పత్తి ప్రబలంగా వున్న సందర్భం. రెండవది, ప్రాచీన కాలంలో మధ్యయుగాలలో వరుసగా బానిస విధానం లేదా ఫ్యూడల్ విధానం సామాజిక ఉత్పత్తికి విశాలమైన పునాదిగా ఉన్న సందర్భం. ఇక్కడ ఉత్పాదకులపై ఉత్పత్తి పరిస్థితుల ఆధిపత్యాన్ని యాజమాన్యం, భృత్యత్వ సంబంధాలు మరుగుపరుస్తున్నాయి. ఆదిమ కమ్యూనిజం నెలకొని వున్న తొలినాళ్ళ సాముదాయక సమాజాల్లోనూ, ప్రాచీన సాముదాయక వ్యవస్థలున్న పట్టణాల్లో సైతం ఉత్పత్తికి ప్రాతిపదికగా కనిపించినది ఈ సాముదాయక సమాజమూ, దాని పరిస్థితులే. ఆ సమాజపు పునరుత్పత్తే దాని పరమోద్దేశంగా కనిపించింది. మధ్యయుగాలనాటి వృత్తి సంఘ వ్యవస్థలో సైతం పెట్టుబడి కానీ, శ్రమ కానీ ఏ కట్టుబాట్లు లేనివిగా కనిపించవు. వాటి సంబంధాలను సంఘ నిబంధనలూ, అదే సాహచర్య సంబంధాలూ, వృత్తి ధర్మం, వృత్తి నైపుణ్యం మొదలయిన వాటి గురించిన తదనుగుణ భావనలూ నిర్దేశించాయి. ఎప్పుడైతే పెట్టుబడిదారీ ఉత్పత్తి పద్ధతి.....[1]

★ ★ ★

1. ఇక్కడ రాతప్రతి ఆగిపోయింది - సం.

## అధ్యాయం - 49

# ఉత్పత్తి ప్రక్రియ విశ్లేషణ గురించి

**కిం**ది విశ్లేషణకు మనం ఉత్పత్తి ధరకు, విలువకు మధ్య గల భేదాన్ని పరిశీలన నుంచి వదలివేయవచ్చు. ఎందువల్లనంటే ఇక్కడిలాగా, శ్రమ వార్షిక ఉత్పాదితాన్ని, అంటే మొత్తం సామాజిక పెట్టుబడి యొక్క ఉత్పాదితాన్ని పరిగణనకు తీసుకొన్నప్పుడు ఈ భేదం పూర్తిగా అదృశ్యమవుతుంది.

లాభం (పరిశ్రమ లాభం+వడ్డీ), కౌలు – ఇవి సరుకుల అదనపు విలువలోని ప్రత్యేక భాగాలు ధరించిన విచిత్ర రూపాలు తప్ప మరొకటి కాదు. అదనపు విలువ పరిమాణం, ఆ విలువను విభజించ వీలున్న భాగాల మొత్తం పరిమాణానికి అవధి. కాబట్టి సగటు లాభం+కౌలు=అదనపు విలువ. అదనపు శ్రమలో ఒక భాగం అంటే సరుకుల్లో నిక్షిప్తమైన అదనపు విలువలోని ఒక భాగం ఒక సగటు లాభాన్ని సమానం చేయడంలో ప్రత్యక్షంగా పాల్గొనకుండా వుండే అవకాశం వుంది. ఫలితంగా సరుకు విలువలోని కొంత భాగం దాని ధరలో బొత్తిగా వ్యక్తం కాదు. కానీ, మొదటి విషయం, ఈ పరిస్థితిని ఒక వాస్తవం సరిదిద్దుతోంది : తమ విలువకన్నా తక్కువగా వున్న ధరకు అమ్మకమైన సరుకులు స్థిర పెట్టుబడిలోని అంశంగా వున్నప్పుడు, లాభం రేటు ఎక్కువవుతుంది; లేదా అలా అమ్మకమైన సరుకులు వ్యక్తిగత వినియోగపు వస్తువుల రూపంలో ఆదాయంగా వినియోగమైన విలువ భాగంలోకి ప్రవేశించినప్పుడు, లాభానికి కౌలుకు ప్రాతినిధ్యం వహించే ఉత్పాదితం ఎక్కువగా వుంటుంది. రెండవది, సగటు గమన క్రమంలో ఈ పరిస్థితి తొలగిపోతుంది. ఏది ఏమైనా, సరుకు ధరలో వ్యక్తంకాని అదనపు విలువ భాగం, ధర రూపొందడానికి ఉపయోగపడకపోయినా, సగటు లాభం, కౌలు, ఈ రెంటి సమాహారం తన మామూలు రూపంలో మొత్తం అదనపు విలువకన్నా ఎన్నటికీ పెద్దదిగా వుండజాలదు. అదనపు విలువ కొద్దిపాటిదైనా, అంటే అది మామూలు రూపంలో వుందంటే, వేతనం శ్రమశక్తి విలువకు అనుగుణంగా ఉన్నట్లే లెక్క. గుత్తాధిపత్యపు కౌలు సైతం, వేతనంలో కోతకానంత మేరకు, అంటే ఒక ప్రత్యేక అభివర్గంగా ఏర్పడనంత వరకు, అది అదనపు విలువలో పరోక్షంగా, ఎల్లప్పుడూ ఒక భాగంగా వుండక తప్పదు. తాను అంతర్భాగంగా వున్న సరుకు ఉత్పత్తి ధరకు పైబడిన అదనపు ధరలో అది భాగం కానప్పుడు (వ్యత్యాసపు కౌలులోలాగా) లేక తాను అంతర్భాగంగా వున్న సరుకు అదనపు విలువకన్నా అధికంగా వున్న విలువలో అది భాగంగా కానప్పుడు, అంటే సగటు లాభాన్నిబట్టి లెక్కగట్టబడిన అదనపు విలువలో తనకు సంబంధించిన భాగానికన్నా అధికంగా వున్న విలువ కానప్పుడు (నిరపేక్ష కౌలులోలాగా) అది కనీసం ఇతర సరుకుల అదనపు విలువలో భాగంగా వుంటుంది; అంటే గుత్తాధిపత్యపు ధర గల ఈ సరుకుకు మార్పిడి అయ్యే సరుకుల అదనపు విలువలో భాగంగా వుంటుందన్నమాట. సగటు లాభం,

కౌలు, దేనిలోనైతే అంతర్భాగాలో, ఆ పరిమాణానికి – ఈ విభజనకు ముందున్న ఈ పరిమాణానికి ఈ రెంటి మొత్తం ఎన్నటికీ మించదు. కాబట్టి, సరుకుల అదనపు విలువ యావత్తూ, అంటే ఆ సరుకుల్లో వున్న సమస్త అదనపు శ్రమా వాటి రూపంలో ఫలసిద్ధి చెందిందా, లేదా అనేది మన చర్చకు అనావశ్యకం. అదనపు శ్రమ ఫలసిద్ధి చెందకపోవడానికి, తక్కిన కారణాలనలా ఉంచినా తప్పనిసరియైన మరొక కారణముంది. శ్రమ ఉత్పాదకతలో నిరంతరంగా వచ్చే మార్పు ఫలితంగా ఒకానొక సరుకు ఉత్పత్తికి సామాజికంగా అవసరమైన శ్రమ పరిమాణం నిరంతరం మారుతూంటుంది. అందువల్ల కొన్ని సరుకులు ఎల్లప్పుడూ అసాధారణ పరిస్థితుల్లో ఉత్పత్తి అవుతూంటాయి. కాబట్టి అవి వాటి వ్యష్టి విలువకన్నా తక్కువ ధరకే అమ్మకం కాకతప్పదు. ఏది ఎలా వున్నా, లాభం+కౌలు చేతికందిన అదనపు విలువకు (అదనపు శ్రమకు) సమానం. ప్రస్తుత చర్చకు సంబంధించి, చేతికందిన అదనపు విలువను సమస్త అదనపు విలువకు సమానంగా పరిగణించవచ్చు. ఎందువల్లనంటే, లాభమూ, కౌలు – ఇవి చేతికందిన అదనపు విలువే; లేక మొత్తంపై చెప్పవలసివస్తే, ఇవి సరుకుల ధరల్లో ప్రవేశించే అదనపు విలువ; కాబట్టి ఆచరణలో, ఈ ధరలో అంతర్భాగంగా రూపొందే సమస్త అదనపు విలువ.

కానీ, ఆదాయం యొక్క మూడవ నిర్దిష్ట రూపమైన వేతనాలు ఎల్లప్పుడూ పెట్టుబడిలోని అస్థిర అంతర్భాగానికి సమానంగా వుంటాయి. అంటే శ్రమ సాధనాలకై కాక, సజీవ శ్రమశక్తి కొనుగోలుకై, కార్మికులకు చెల్లించడానికై మదుపుపెట్టే అంతర్భాగమది. (ఆదాయాన్ని ఖర్చు పెట్టడంలో శ్రమకు చెల్లించే డబ్బు వేతనాల నుంచి లాభం నుంచి, లేదా కౌలు నుంచి చెల్లించడం జరుగుతుంది. కాబట్టి, అలా చెల్లించేందుకు వాడిన సరుకుల విలువలో ఆ శ్రమ అంతర్భాగం కాదు. అందువల్ల సరుకు విలువను, అది విభజితమయ్యే అంతర్భాగాలను గురించిన విశ్లేషణలో ఆ శ్రమ పరిగణనకు రాదు.) అది కార్మికుని మొత్తం పనిదినంలో, అస్థిర పెట్టుబడి విలువ, కనుక శ్రమ ధర పునరుత్పత్తి అయ్యేందుకు పట్టే భాగానికి మూర్తీభాగం. కార్మికుడు తన శ్రమశక్తి విలువను లేదా తన శ్రమ ధరను పునరుత్పత్తి చేసేది సరుకు విలువలోని ఆ భాగంలోనే. శ్రామికుని మొత్తం పనిదినం రెండు భాగాలుగా విభజితమవుతుంది. ఒక భాగంలో అతడు తన జీవితావసరాల విలువను పునరుత్పత్తి చేసేందుకు అవసరమైన శ్రమ చేస్తాడు. అది అతని మొత్తం శ్రమలో మూల్యం చెల్లించబడిన భాగం, తన పోషణకు, పునరుత్పత్తికి అవసరమైన భాగం. పనిదినంలోని మిగతా భాగం యావత్తూ తన వేతన రూపంలో తన చేతికందిన అతని శ్రమ విలువకు మించి చేసిన శ్రమ పరిమాణం యావత్తూ అదనపు శ్రమ, మూల్యం చెల్లించబడని శ్రమ. అతని మొత్తం సరుకు ఉత్పత్తి యొక్క అదనపు విలువ (కనుక అదనంగా ఉత్పత్తి అయిన సరుకులు) దీనికి ప్రాతినిధ్యం వహిస్తున్నాయి. ఈ అదనపు విలువే మళ్ళీ వేరు వేరు పేర్లున్న భాగాలుగా – లాభంగా (పరిశ్రమ లాభం + వడ్డీ), కౌలుగా విభజితమవుతూంది.

ఒక రోజులో లేదా ఒక సంవత్సరంలో కార్మికులు చేర్చిన మొత్తం శ్రమకు, సరుకుల విలువలో ఏ భాగమైతే వస్తు రూపంగా వుందో ఆ భాగం యావత్తూ, అంటే ఈ శ్రమ సృష్టించిన వార్షిక ఉత్పాదితపు విలువ యావత్తూ వేతనాల విలువగా, లాభంగా, కౌలుగా విభజితమవుతుంది. ఎందువల్లనంటే, ఈ మొత్తం శ్రమ అవసర శ్రమగానూ, మూల్యం చెల్లించబడని అదనపు శ్రమగానూ విభజితమవు

తుంది; అవసర శ్రమతో శ్రామికుడు, ఉత్పాదితపు విలువలో తనకు మూల్యంగా ముట్టే భాగాన్ని, అంటే తన వేతనాన్ని సృష్టిస్తున్నాడు; మూల్యం చెల్లించబడని అదనపు శ్రమతో అతను ఉత్పాదితం విలువలో అదనపు విలువకు ప్రాతినిధ్యం వహించే భాగాన్ని సృష్టిస్తున్నాడు. ఉత్తరోత్తరా లాభంగానూ, కౌలుగానూ విభజితమయ్యేది ఈ అదనపు విలువే. ఈ శ్రమ మినహా శ్రామికుడు చేసే శ్రమ మరేదీ లేదు. వేతనం, లాభం, కౌలు అనే రూపాలు ధరించే ఉత్పాదితపు మొత్తం విలువ మినహా అతను సృషించే విలువ మరేదీ లేదు. సంవత్సరంలో శ్రామికుడు చేర్చిన కొత్త శ్రమకు మూర్తీభావమైన వార్షిక ఉత్పాదితపు విలువ, వేతనం లేదా అస్థిర పెట్టుబడి విలువ+అదనపు విలువ మొత్తానికి సమానం. ఈ అదనపు విలువే తరువాత లాభంగానూ, కౌలుగానూ విభజితమవుతూంది.

సంవత్సర కాలంలో కార్మికుడు సృష్టించే వార్షిక ఉత్పాదితపు విలువ భాగమంతా వేతనాల విలువ, లాభం, కౌలు ఈ మూడు ఆదాయాల వార్షిక విలువ సమాహారంలో వ్యక్తమవుతుంది. కనుక, పెట్టుబడిలోని స్థిరభాగం ఏటా సృష్టి అయ్యే ఉత్పాదితపు విలువలో పునరుత్పత్తి కాదు అనేది స్పష్టమే. ఎందువల్లనంటే వేతనాలు ఉత్పత్తిలో మదుపు పెట్టిన అస్థిర పెట్టుబడి విలువకు మాత్రమే సమానంగా వుంటాయి; కౌలు–లాభం ఇవి అదనపు విలువకు మాత్రమే సమానంగా వుంటాయి. అంటే మదుపు పెట్టిన మొత్తం పెట్టుబడి విలువకు మించి, అంటే స్థిర పెట్టుబడి విలువ+అస్థిర పెట్టుబడి విలువకు మించినప్పుడు అయిన విలువకు సమానంగా వుంటాయన్నమాట.

లాభం, కౌలు రూపాల్లోకి మార్చబడ్డ అదనపు విలువలో కొంత భాగం ఆదాయంగా వినియోగం కాకుండా, సంచయనమవుతుందనే సంగతికి ఇక్కడ పరిష్కరించవలసి వున్న సమస్యతో ఏ మాత్రమూ ప్రమేయం లేదు. సంచయన నిధిగా ఆదా చేసిన ఆ భాగం కొత్త, అదనపు పెట్టుబడిని సృష్టించడానికి ఉపకరిస్తుందే తప్ప, పాత పెట్టుబడి స్థానాన్ని, శ్రమశక్తికై లేదా శ్రమ సాధనాలకై మదుపు పెట్టిన పాత పెట్టుబడిలోని ఏ భాగం స్థానాన్నైనా సరే భర్తీ చేయడానికి ఉపకరించదు. కాబట్టి, ఆదాయమంతా వ్యక్తిగత వినియోగంలోకి వెళ్ళిపోతుందని ఇక్కడ మనం పరిశీలన సౌలభ్యం కోసం ఊహించుకోవచ్చు. ఇక్కడ చిక్కు రెండు విధాలుగా వుంది. ఒకవైపు, ఆదాయాలుగా – వేతనాలు, లాభం, కౌలుగా వినియోగమవుతున్న వార్షిక ఉత్పాదితం విలువలో దాని తయారీలు వినియుక్తమయిన స్థిర పెట్టుబడి విలువ భాగానికి సమానమైన విలువ భాగం వుంది. అంటే వేతనాలుగా విభజితమైన విలువ భాగమూ, లాభంగా, కౌలుగా విభజితమైన విలువ భాగమూ మాత్రమే కాకుండా, పైన పేర్కొన్న విలువ భాగమూ వుంది. కాబట్టి దాని విలువ = వేతనాలు+లాభం+కౌలు+స్థి.పె. (విలువలోని స్థిరభాగం). మరి వేతనాలు+లాభం+కౌలుకు సమానంగా ఏడాదికి ఉత్పత్తి అయ్యే విలువ (వేతనాలు+లాభం+కౌలు) + స్థి.పె.కి సమానమైన విలువ గల ఉత్పాదితాన్ని ఎలా కొనగలదు? ఏడాదికి ఉత్పత్తి అయ్యే విలువ తన విలువకన్నా ఎక్కువ విలువ గల ఉత్పాదితాన్ని ఎలా కొనగలదు?

ఉత్పాదితంలోకి ప్రవేశించని స్థిర పెట్టుబడి భాగాన్ని, అంటే సరుకుల వార్షిక ఉత్పత్తికి మునుపటి వలెనే తన ఉనికిని, తరిగిన విలువతోనైనా సరే, కొనసాగించే భాగాన్ని వదిలివేద్దాం. మరోవిధంగా చెప్పాలంటే, నియుక్తమైనప్పటికీ, వినియోగంకాని నిశ్చల పెట్టుబడిని పరిగణనకు తీసుకోకుండా తాత్కాలికంగా వదిలివేద్దాం. అప్పుడు, మదుపు పెట్టిన పెట్టుబడిలోని స్థిరభాగం – ముడి అనుబంధ పదార్థాల రూపంలో నూతన ఉత్పాదితానికి పూర్తిగా బదలాయించబడగా, శ్రమ

సాధనాల్లో ఒక భాగం పూర్తిగానూ, మరోభాగం పాక్షికంగానూ వినియోగమయిందని కనిపిస్తుంది. ఆ విధంగా దాని విలువలో కొంతభాగం మాత్రమే ఉత్పత్తిలో వినియోగమయింది. ఉత్పత్తిలో వినియోగమయిన స్థిర పెట్టుబడిలోని ఈ మొత్తం భాగం వస్తురూపంలో భర్తీ కావలసి వుంటుంది. తక్కిన పరిస్థితులన్నీ, ప్రత్యేకించి శ్రమ ఉత్పాదక శక్తి మారకుండా వున్నవని ఊహించుకొన్నప్పుడు. ఈ భాగం భర్తీ కావడానికి మునుపటంత శ్రమ అవసరం. అంటే, దాని స్థానం తత్సమాన విలువచే భర్తీ కావాలి. లేకపోతే పునరుత్పత్తి మునుపటి స్థాయిలో జరుగజాలదు. అయితే ఈ శ్రమ చేయవలసిన బాధ్యత ఎవరిది, ఎవరీ శ్రమ చేస్తారు? మొదటి చిక్కును తీసుకొని చూద్దాం : ఉత్పాదితంలో నిక్షిప్తమైన విలువలోని స్థిర భాగానికి చెల్లించవలసిన బాధ్యత ఎవరిది? దేనితో చెల్లించాలి? – ఉత్పత్తిలో వినియోగమయిన స్థిరపెట్టుబడి విలువ ఉత్పాదితపు విలువలో ఒక భాగంగా పునర్దర్శన మిస్తుందని ఊహించుకొంటున్నాము. ఇది రెండవ చిక్కుల్లోని ఊహలకు విరుద్ధమైనది కాదు. ఎందువల్లనంటే, కొత్త శ్రమను కేవలం చేర్చడం ద్వారా ఉత్పాదితంలో పాత విలువ అదే సమయంలో ఎలా భద్రపరచడం జరుగుతుందో, ఇది పాత విలువను పునరుత్పత్తి చేయకపోయినా ఉత్పాదితానికి దాన్ని చేర్చటం తప్ప మరేమీ చేయకపోయినా, కేవలం కొత్త విలువను సృష్టించినా ఇది ఎలా జరుగుతుందో Iవ సంపుటిలో నిరూపించాము. ("శ్రమ ప్రక్రియ – అదనపు విలువ ఉత్పాదన ప్రక్రియ")[1] ఇలా జరగడానికి కారణం శ్రమే అయినా, అది విలువను సృష్టించే శ్రమగా కాక, అంటే సార్వత్రిక శ్రమగా కాక, నిర్దిష్టమైన ఉత్పాదక శ్రమగా నిర్వర్తించే క్రియ ఫలితమిది అని కూడా అందులో నిరూపించాము. కాబట్టి, ఉత్పాదితంలోని ఆదాయం, అంటే ఏడాదిలో సృష్టి అయిన మొత్తం విలువ ఖర్చు కావచ్చుగాక, దానిలోని స్థిరభాగం విలువను భద్రంగా వుంచడానికి అదనపు శ్రమ అవసరం కాలేదు. కానీ, మునుపటి సంవత్సరంలో వినియోగమయిన స్థిర పెట్టుబడి యొక్క విలువను, ఉపయోగపు విలువను భర్తీ చేయడానికి మాత్రం కొత్త, అదనపు శ్రమ తప్పనిసరిగా అవసరం. దాన్ని భర్తీ చేయనిదే పునరుత్పత్తి ఎంతమాత్రమూ సాధ్యం కాదు.

కొత్తగా చేర్చిన శ్రమకు, ఏడాదిలో కొత్తగా సృష్టి అయిన విలువ ప్రాతినిధ్యం వహిస్తుంది. ఇది మళ్ళీ మూడు ఆదాయాలుగా – వేతనాలు, లాభం, కౌలుగా విభజితమవుతుంది. ఆ విధంగా ఒకవైపేమో, వినియోగమయిన స్థిరపెట్టుబడి స్థానాన్ని భర్తీ చేయడానికి అదనపు సామాజిక శ్రమ మిగలదు. మరి దీన్ని కొంత వస్తు రూపంలో, దీని విలువకు తగ్గట్టుగా భర్తీ చేయవలసి వుంటుంది; కొంత కేవలం దాని విలువకు తగినట్లు (నిశ్చల పెట్టుబడి అరుగుదల ననుసరించి) భర్తీ చేయవలసి వుంటుంది. మరోవైపేమో, ఏడాదిలో శ్రమ సృష్టించిన విలువ – వేతనాలుగానూ, లాభంగానూ, కౌలుగానూ విభజితమై, ఆ రూపంలో వ్యయం కావలసిన ఆ విలువ – పెట్టుబడి యొక్క స్థిర భాగానికై చెల్లించడానికి లేదా దాన్ని కొనడానికి చాలదని కనిపిస్తుంది. మరి వార్షిక ఉత్పాదితంలో ఈ మూడింటి విలువే కాక, ఆ స్థిర భాగం కూడా పొందుపడి వుండాలి.

ఇక్కడ వ్యయం చేసిన సమస్య, మొత్తం సామాజిక పెట్టుబడి పునరుత్పత్తి గురించిన పరిశీలన సందర్భంగా, ఇదివరకే పరిష్కరింపబడిందనేది విదితమే. (సంపుటం II, 3వ భాగం) దాన్ని ఇక్కడ

1. అధ్యాయం VII - సం.

తిరిగి పేర్కొంటున్నాము. ఎందుకంటే, మొదటి విషయం, అక్కడ అదనపు విలువ పరిమాణాన్ని దాని ఆదాయపు రూపాల్లో, అంటే లాభం (పరిశ్రమ లాభం+వడ్డీ) కౌలు రూపాల్లో చూపలేదు. కాబట్టి, ఈ రూపాల్లో దాన్ని పరిశీలించడం సాధ్యం కాలేదు. మరో విషయమేమిటంటే, విశ్లేషణలో నమ్మశక్యం కాని ఘోరమైన తప్పు వున్నది. సరిగ్గా వేతనాలు, లాభం, కౌలు రూపాల విశ్లేషణలోనే, ఆడమ్ స్మిత్ నాటినుంచీ ఈ తప్పు అర్థశాస్త్రమంతటా పూసల్లో దారంలా చోటుచేసుకొని వుంది.

అక్కడ మేము పెట్టుబడినంతటినీ రెండు పెద్ద తరగతుల కింద విభజించాము. అవి ఉత్పత్తి సాధనాలను ఉత్పత్తి చేసే Iవ తరగతి, వ్యక్తిగత వినియోగ వస్తువును ఉత్పత్తి చేసే IIవ తరగతి. కొన్ని ఉత్పాదితాలు, ఉదాహరణకు, గుర్రం, ధాన్యం మొదలయినవి అటు వ్యక్తిగత వినియోగానికీ, ఇటు ఉత్పత్తి సాధనాలుగానూ ఉపకరిస్తాయనే వాస్తవంవల్ల ఈ విభజన పూర్తిగా సరియైనది కాకుండా పోదు. ఈ విభజన కేవలం వాస్తవ వ్యక్తీకరణే తప్ప, అనిర్ధారిత సూత్రీకరణ కాదు. ఒక దేశంలోని వార్షిక ఉత్పాదితాన్ని తీసుకోండి. ఉత్పాదితంలోని ఒక భాగం, దానికి ఉత్పత్తి సాధనాలుగా ఉపకరించగల శక్తి ఎంత వున్నాసరే, వ్యక్తిగత వినియోగంలోకి వెళ్ళిపోతుంది. వేతనాలు, లాభం, కౌలు ఖర్చయ్యేది ఈ ఉత్పాదితం కోసమే. ఈ ఉత్పాదితం సామాజిక పెట్టుబడిలోని ఒక నిర్దిష్ట శాఖ యొక్క ఉత్పాదితం. ఇదే పెట్టుబడి Iవ తరగతికి చెందిన ఉత్పాదితాలను సైతం ఉత్పత్తి చేయవచ్చు. అది అలా చేసిన మేరకు, ఉత్పాదకంగా వినియోగమయ్యే I వ తరగతి ఉత్పాదితాలను సరఫరా చేసేది, IIవ తరగతి ఉత్పాదితాల్లో వ్యక్తిగత వినియోగానికి చెందిన ఉత్పాదితాల్లో వినియోగమైపోయిన ఈ పెట్టుబడి భాగం కాదు. వ్యక్తిగత వినియోగంలోకి ప్రవేశించినందువల్ల ఆదాయంగా వ్యయమయ్యే ఈ IIవ తరగతి ఉత్పాదితం యావత్తూ, అందులో వినియోగమయిన పెట్టుబడి+ఉత్పత్తి అయిన అదనపు విలువ యొక్క అస్తిత్వ రూపం. ఆ విధంగా అది కేవలం వినియోగ వస్తువుల ఉత్పత్తిలో మాత్రమే మదుపుపెట్టిన పెట్టుబడి యొక్క ఉత్పాదితం. అదే విధంగా, వార్షిక ఉత్పాదితంలోని I శాఖ, అంటే పునరుత్పత్తి సాధనాలుగా ఉపకరించే ముడి పదార్థాలు, శ్రమ సాధనాల రూపంలోని ఉత్పాదితానికి వినియోగ వస్తువులుగా ఉపకరించగల శక్తి, దాని సహజగుణంవల్ల ఇతరత్రా ఎంత వున్నాసరే, అది ఉత్పత్తి సాధనాల ఉత్పత్తిలో మాత్రమే మదుపుపెట్టిన పెట్టుబడి యొక్క ఉత్పాదితమే. స్థిర పెట్టుబడిగా వున్న ఉత్పాదితాల్లో అత్యధిక భాగం, వ్యక్తిగత వినియోగంలోకి ప్రవేశించేందుకు వీలులేని పాదార్థిక రూపంలో వుంటుంది కూడా. వ్యక్తిగతంగా వినియోగించుకో వీలున్న మేరకు ఉదాహరణకు, వ్యవసాయదారుడు తన విత్తన ధాన్యాన్నీ, కసాయివాడు తన బండికి కట్టే ఎడ్లను లేక గుర్రాలను తినడానికి వీలున్న మేరకు, ఆర్థిక అవరోధమే అతణ్ణి అడ్డుకొంటుంది; అంటే ఈ ఉత్పాదిత భాగం వినియోగించ వీలున్న రూపంలో లేనట్లుగా అతను వ్యవహరిస్తాడు.

ఇదివరకే సూచించినట్లు, రెండు తరగతులలోనూ స్థిర పెట్టుబడిలోని నిశ్చల భాగాన్ని మనం పరిగణనకు తీసుకోవడం లేదు. ఇది వస్తురూపంలో, దాని విలువకు సంబంధించినంత వరకు, రెండు తరగతుల వార్షిక ఉత్పాదితంతో నిమిత్తం లేకుండానూ కొనసాగుతూనే వుంటుంది.

IIవ తరగతి ఉత్పాదితాల కోసం వేతనాలు, లాభం, కౌలు ఖర్చవుతుందనీ, ఒక ముక్కలో చెప్పాలంటే, ఆదాయాలు వినియోగమవుతాయని చూచాము. ఈ తరగతి ఉత్పాదితపు విలువకు సంబంధించినంత వరకు, ఈ ఉత్పాదితంలో మూడు అంతర్భాగాలున్నాయి. ఒక అంతర్భాగం,

ఉత్పత్తిలో వినియోగమయిన స్థిర పెట్టుబడి భాగం యొక్క విలువకు సమానం. రెండవ అంతర్భాగం అడ్వాన్సు చేసిన అస్థిర పెట్టుబడి విలువకు సమానం. ఇది వేతనాల కోసం ఖర్చయినది. ఆఖరున, మూడవ అంతర్భాగం ఉత్పత్తి అయిన అదనపు విలువకు సమానం. ఆ విధంగా లాభం+కౌలుకు సమానం. IIవ తరగతి ఉత్పాదితంలోని మొదటి అంతర్భాగాన్ని, అంటే పెట్టుబడిలోని స్థిర భాగం విలువను IIవ తరగతి పెట్టుబడిదారులు గానీ, ఈ తరగతిలోని కార్మికులు గానీ లేదా భూస్వాములు గానీ వినియోగించుకోలేదు. ఇది వారి ఆదాయాల్లో భాగంగా రూపొందదు. దాన్ని వస్తురూపంలో భర్తీ చేయవలసిందే. ఇలా చేయాలంటే దాన్ని అమ్మితీరాలి. కానీ ఈ ఉత్పాదితంలోని మిగతా రెండు అంతర్భాగాలు ఈ తరగతిలో సృష్టి అయిన ఆదాయాల విలువకు సమానం. అంటే వేతనాలు+ లాభం+కౌలుకు సమానం.

Iవ తరగతిలో ఉత్పాదితంలో కూడా రూపానికి సంబంధించినంత వరకు అవే అంతర్భాగా లున్నాయి. కాని ఇక్కడ ఆదాయంగా వున్న భాగం, అంటే వేతనాలు+లాభం+కౌలు క్లుప్తంగా చెప్పాలంటే, పెట్టుబడిలోని అస్థిర భాగం+అదనపు విలువ, IIవ తరగతి ఉత్పాదితాల రూపంలో వినియోగమవుతుందే తప్ప, Iవ తరగతి ఉత్పాదితాల సహజ రూపంలో వినియోగం కాదు. కాబట్టి IIవ తరగతి ఉత్పాదితాల్లో ఏ భాగమైతే, భర్తీ కావలసిన ఆ తరగతి స్థిర పెట్టుబడిగా వుందో ఆ భాగంలో Iవ తరగతి ఆదాయాల విలువ వినియోగం కావాలి. IIవ తరగతిలోని స్థిర పెట్టుబడి స్థానాన్ని భర్తీ చేయవలసి వున్న ఆ తరగతి ఉత్పాదిత భాగాన్ని Iవ తరగతికి చెందిన కార్మికులు, పెట్టుబడిదారులు, భూస్వాములు, దాని సహజ రూపంలో IIవ తరగతిచే ఉత్పాదకంగా వినియోగింప బడుతుంది. II వ తరగతి స్థిర పెట్టుబడిని వస్తురూపంలో భర్తీచేసేది అదే. ఆఖరు విషయం, Iవ తరగతి పెట్టుబడిలో వినియోగమయిపోయిన స్థిర భాగాన్ని ఈ తరగతి ఉత్పాదితాలే భర్తీ చేస్తాయి. శ్రమ సాధనాలు, ముడి అనుబంధ పదార్థాలు మొదలయిన ఈ ఉత్పాదితాలను Iవ తరగతి పెట్టుబడి దారులు తమలో తాము మార్పిడి చేసుకోవడంవల్లనేమి, ఈ పెట్టుబడిదారులు తమ సొంత ఉత్పాదితాన్నే మళ్ళీ ఉత్పత్తి సాధనాలుగా నేరుగా ఉపయోగించుకోవడంవల్లనేమి ఈ స్థిర పెట్టుబడి స్థానం భర్తీ అవుతుంది.

సామాన్య పునరుత్పత్తికి మునుపటి పథకాన్నే (సంపుటి II, అధ్యాయం XXII) తీసుకొందాం.

$$\left.\begin{array}{l} \text{I. } 4{,}000_{\text{స్థి.పె.}} + 1{,}000_{\text{అ.పె.}} + 1000_{\text{అ.వి.}} = 6{,}000 \\ \text{II. } 2{,}000_{\text{స్థి.పె.}} + 500_{\text{అ.పె.}} + 500_{\text{అ.వి.}} = 3{,}000 \end{array}\right\} = 9000$$

ఈ పథకం ప్రకారం, II వ తరగతిలోని ఉత్పాదకులూ, భూస్వాములూ $500_{\text{అ.పె}}+500_{\text{అ.వి}}$ = 1000ని ఆదాయంగా వినియోగించుకొంటారు. పోతే 2,000 స్థి.పె. స్థానాన్ని భర్తీ చేయవలసి వుంటుంది. దీన్ని Iవ తరగతిలోని కార్మికులు, పెట్టుబడిదారులూ, ఆ తరగతి నుంచి కౌలును పొందే భూస్వాములు వినియోగించుకొంటారు. వీరి ఆదాయం = $1000_{\text{అ.పె}}+1000_{\text{అ.వి}}$=2000. వినియోగమయిన II తాలూకు ఉత్పాదితాన్ని I ఆదాయంగా వినియోగిస్తున్నది. I వ తరగతి ఆదాయపు భాగం వినియోగించుకో వీలులేని ఉత్పాదితపు రూపంలో వుంటుంది. దీన్ని స్థిర పెట్టుబడిగా IIవ తరగతి వినియోగించుకొంటుంది. ఇక I కి చెందిన $4{,}000_{\text{స్థి.పె.}}$ ఏమవుతుందో తేల్చవలసి వుంటుంది. దీని స్థానాన్ని I వ తరగతి ఉత్పాదితమే భర్తీ చేస్తుంది. ఇది 6000కు లేక 6000–2000కు సమానం.

ఎందువల్లనంటే, ఈ 2000కు IIకు స్థిర పెట్టుబడిగా ఇదివరకే మార్చడం జరిగింది. ఈ అంకెలను ఇచ్ఛానుసారం ఎంచుకొన్నామని గుర్తుంచుకోవాలి. కాబట్టి, Iవ తరగతి ఆదాయం విలువకు, IIవ తరగతి స్థిర పెట్టుబడి విలువకు మధ్య సంబంధం కూడా ఇచ్ఛానుసారంగా వున్నట్లు కనిపిస్తుంది. కానీ ఒక విషయం సుస్పష్టమే. ప్రక్రియ మామూలుగా వుండి, ఇతరత్రా సమాన పరిస్థితుల్లో జరుగుతూన్న సందర్భంలో, అంటే సంచయనాన్ని పరిగణనకు తీసుకోకుండా వదిలివేస్తే, Iవ తరగతిలో వేతనాలు, లాభం, కౌలు విలువ IIవ తరగతి పెట్టుబడిలోని స్థిర భాగం విలువకు సమానంగా వుండితీరాలి. లేనంతట IIవ తరగతి తన స్థిర పెట్టుబడిని భర్తీ చేసుకోనైనా చేసుకోలేదు, లేదా Iవ తరగతి తన ఆదాయాన్ని వినియోగానర్హ రూపం నుండి వినియోగార్హ రూపంలోకి మార్చుకోనైనా మార్చుకోలేదు.

ఆ విధంగా, వార్షిక సరుకు ఉత్పాదితం విలువ, ఏదో ఒక ప్రత్యేక పెట్టుబడి మదుపువల్ల ఉత్పత్తి అయ్యే సరుకు పెట్టుబడి విలువలాగానే, ఏదో వ్యష్టి సరుకు విలువలాగానే రెండు అంతర్భాగాలుగా విభజితమవుతుంది. అవి, (అ), అడ్వాన్స్ చేసిన స్థిర పెట్టుబడి విలువ స్థానాన్ని భర్తీ చేసేది, ఆ ఆదాయ రూపానికి – వేతనాలు, లాభం, కౌలు, వీటికి – ప్రాతినిధ్యం వహించేది. విలువలోని రెండవ అంతర్భాగం, ఆ మొదటి అంతర్భాగం 'అ'కు రెండు విషయాల్లో భిన్నమైనది : ఇతరత్రా సమానంగా వున్న పరిస్థితుల్లో, (1) అ ఎన్నటికీ ఆదాయ రూపం ధరించదు; (2) ఎల్లప్పుడూ పెట్టుబడి రూపంలో, వాస్తవంగా స్థిర పెట్టుబడి రూపంలో తిరిగి వస్తూంటుంది. కానీ, మిగతా అంతర్భాగం ఆ లో ఒక వైరుధ్యముంది. లాభానికి, కౌలుకు వేతనాలతో గల ఉమ్మడి అంశమేమంటే, అవి మూడూ ఆదాయపు రూపాలు. కానీ అవి ఒక ప్రధానాంశంలో భిన్నమైనవి : లాభం, కౌలు అదనపు విలువకు, అంటే, మూల్యం చెల్లించబడని శ్రమకు ప్రాతినిధ్యం వహించగా, వేతనాలు మూల్యం చెల్లించబడిన శ్రమకు ప్రాతినిధ్యం వహిస్తున్నాయి. ఆ విధంగా చెల్లించబడిన వేతనాలకు ప్రాతినిధ్యం వహించే విలువ భాగం వేతనాల స్థానాన్ని భర్తీ చేస్తుంది. మనం ఊహించుకొన్న పరిస్థితుల్లో – అంటే అదే స్థాయిలో, అదే పరిస్థితుల్లో పునరుత్పత్తి జరుగుతున్నప్పుడు, ఇది మళ్ళీ వేతనాలుగా మారి, మొదట, అస్థిర పెట్టుబడిగా, పునరుత్పత్తికిగాను మళ్ళీ మదుపు పెట్టవలసిన పెట్టుబడిలోని ఒక అంతర్భాగంగా తిరిగి వస్తుంది. ఈ భాగం రెండు విధులను నిర్వర్తిస్తుంది. అది మొదట్లో, పెట్టుబడి రూపంలో వుండి, పెట్టుబడిగానే శ్రమశక్తితో మార్పిడి అవుతుంది. కార్మికుల చేతుల్లో అది ఆదాయంగా పరివర్తన చెందుతుంది. అతను తన శ్రమశక్తి అమ్మకం నుంచి పొందిన ఆదాయమది. ఆ ఆదాయాన్ని అతడు జీవితావసరాలుగా మార్చుకొని వినియోగించుకొంటాడు. డబ్బు చలామణి ద్వారా ఈ ద్వంద ప్రక్రియ వెల్లడవుతుంది. అస్థిర పెట్టుబడిని డబ్బు రూపంలో మదుపుపెడతారు, వేతనాలుగా చెల్లిస్తారు. ఇది పెట్టుబడిగా అది నిర్వహించే మొదటి విధి : ఇది శ్రమశక్తికి మార్పిడి అయి, ఈ శ్రమశక్తి యొక్క అభివ్యక్తిగా, అంటే శ్రమగా పరివర్తన చెందుతుంది. పెట్టుబడిదారుకు సంబంధించినంత వరకు జరిగే ప్రక్రియ ఇదీ. కానీ రెండవ ప్రక్రియ తీరు ఇది : ఈ డబ్బుతో కార్మికులు తాము ఉత్పత్తి చేసిన సరుకుల్లోనే ఒక భాగాన్ని, ఆ డబ్బుకు సరితూగే భాగాన్ని కొని, దాన్ని ఆదాయంగా వినియోగించుకొంటారు. ఇందులో డబ్బు చలామణి లేనట్లు మనం భావించుకొన్నట్లయితే, అప్పుడు కార్మికుల ఉత్పాదితంలో ఒక భాగం అందుబాటులో వున్న పెట్టుబడిగా పెట్టుబడిదారు

చేతిలో వున్నట్లే కదా. ఈ భాగాన్ని అతడు పెట్టుబడిగా అడ్వాన్సు చేస్తున్నాడు, దాన్ని కార్మికునికి కొత్త శ్రమశక్తికిగాను ఇస్తున్నాడు. కార్మికుడేమో దాన్ని ఇతర సరుకులకు మార్పిడి చేయడం ద్వారా ప్రత్యక్షంగానో లేదా పరోక్షంగానో ఆదాయంగా వినియోగించానంటున్నాడు. కాబట్టి ఉత్పాదితం విలువలో ఏ భాగం పునరుత్పత్తి గతిక్రమంలో వేతనాలుగా, అంటే కార్మికులకు ఆదాయంగా పరివర్తన చెందబోతున్నదో ఆ భాగం, మొదట పెట్టుబడిదారు చేతిలోకి పెట్టుబడి రూపంలో, మరింత ఖచ్చితంగా చెప్పాలంటే అస్థిర పెట్టుబడి రూపంలో తిరిగి వస్తుంది. శ్రమ – వేతన శ్రమగానూ, ఉత్పత్తి సాధనాలు పెట్టుబడిగానూ, అసలు ఉత్పత్తి ప్రక్రియే పెట్టుబడిదారీ ఉత్పత్తిగానూ నిరంతరాయంగా, సరికొత్తగా పునరుత్పత్తి కావాలంటే, ఇది ఈ రూపంలో తిరిగి రావడం తప్పనిసరిగా అవసరం.

అనవసరమైన చిక్కుల నుంచి తప్పుకొనేందుకు మనం మొత్తం ఉత్పత్తి, నికర ఉత్పత్తి అనేవాటికీ, మొత్తం ఆదాయం, నికర ఆదాయం అనేవాటికీ మధ్య గల భేదాన్ని గమనించాలి.

మొత్తం ఉత్పత్తి లేక మొత్తం ఉత్పాదితం అంటే పునరుత్పత్తి అయిన మొత్తం ఉత్పాదితమన్న మాట. నియుక్తమైనప్పటికీ, వినియోగంకాని నిశ్చల పెట్టుబడిని మినహాయిస్తే, మొత్తం ఉత్పత్తి విలువ లేక మొత్తం ఉత్పాదితం విలువ ఉత్పత్తిలో మదుపు పెట్టబడి వినియోగమయిన పెట్టుబడి విలువకు సమానం. అంటే స్థిర, అస్థిర పెట్టుబడి + అదనపు విలువకు సమానం. అదనపు విలువ లాభం కింద, కౌలు కింద విభజితమవుతుంది. లేదా, వ్యష్టి పెట్టుబడి యొక్క ఉత్పాదితానికి మారు, మొత్తం సామాజిక పెట్టుబడి యొక్క ఉత్పాదితాన్ని గనుక తీసుకొని చూస్తే, మొత్తం ఉత్పత్తి = స్థిర, అస్థిర పెట్టుబడిగా వున్న పాదార్థిక అంశాలు+లాభం, కౌలు, ఈ రెంటికి ప్రాతినిధ్యం వహించే అదనపు ఉత్పాదితం యొక్క పాదార్థిక అంశాలు.

మొత్తం ఆదాయమంటే, మొత్తం ఉత్పాదితం విలువలో నుంచి ఆ విలువనుబట్టి లెక్కగట్టిన మొత్తం ఉత్పాదితంలో నుంచి, ఉత్పత్తిలో మదుపు పెట్టబడి, వినియోగమయిన స్థిర పెట్టుబడి స్థానాన్ని భర్తీచేసే ఆ ఉత్పాదితం విలువ భాగాన్ని, ఆ విలువనుబట్టి లెక్కగట్టిన ఆ ఉత్పాదిత భాగాన్ని తీసివేయగా మిగిలిన ఉత్పాదితపు విలువ భాగం, ఉత్పాదిత భాగం. కనుక మొత్తం ఆదాయం = వేతనాలు (లేక, మళ్ళీ కార్మికుని ఆదాయం కానున్న ఉత్పాదిత భాగం) + లాభం + కౌలు. కాని నికర ఆదాయమంటే విలువ. అంటే, వేతనాలను తీసివేయగా మిగిలిన అదనపు ఉత్పాదితం. అంటే, పెట్టుబడిదారు డబ్బుగా మార్చుకొన్నట్టి, భూస్వామితో పంచుకొన్నట్టి అదనపు విలువ. దాన్నిబట్టి లెక్కగట్టిన అదనపు ఉత్పాదితం అన్నమాట.

ఆ విధంగా ప్రతి ఒక్క సరుకు విలువ, ప్రతి ఒక్క పెట్టుబడికి చెందిన మొత్తం సరుకు ఉత్పాదితం విలువ రెండు భాగాలుగా విభజితమవుతుందని చూశాము : ఒక భాగం స్థిర పెట్టుబడి స్థానాన్ని మాత్రమే భర్తీ చేస్తుంది. రెండవదానిలో కొంత భాగం అస్థిర పెట్టుబడిగా తిరిగి వస్తున్నప్పటికీ – ఆ విధంగా పెట్టుబడి రూపంలో తిరిగి వస్తున్నప్పటికీ – మొత్తం ఆదాయంగా పూర్తిగా పరివర్తన చెంది వేతనాలు, లాభం, కౌలు రూపం ధరించనున్న భాగం. మొత్తం ఆదాయమయ్యేది ఈ మూడింటి వెరసే. సమాజం యొక్క మొత్తం వార్షిక ఉత్పాదితం విలువకు కూడా ఇదే వర్తిస్తుందని కూడా ఇదివరకే చూశాము. వ్యష్టి పెట్టుబడిదారుని ఉత్పాదితానికీ, సమాజ ఉత్పాదితానికీ మధ్య గల భేదమల్లా ఏమిటంటే వ్యష్టి పెట్టుబడిదారు దృష్టిలో నికర ఆదాయం మొత్తం ఆదాయానికి భిన్నమైనది.

ఎందువల్లనంటే, మొత్తం ఆదాయంలో వేతనాలు కలిసి వున్నాయి. నికరాదాయమంటే వేతనాలు పోగా మిగిలినది. మొత్తం సమాజ ఆదాయాన్ని దృష్టిలో ఉంచుకొన్నప్పుడు, జాతీయాదాయం అంటే వేతనాలు+లాభం+కౌలు. అంటే మొత్తం ఆదాయమన్నమాట. ఇది కూడా ఊహతో గ్రహించవలసిన విషయమే. ఎందువల్లనంటే, మొత్తం సమాజం పెట్టుబడిదారీ ఉత్పత్తి ప్రాతిపదికపై పెట్టుబడిదారీ దృక్కోణం నుంచే చూస్తుంది కాబట్టి. లాభం కౌలుగా విభజితమైన ఆదాయాన్ని మాత్రమే అది నికరాదాయంగా పరిగణిస్తుంది.

మరోవైపు, సే లాంటి వ్యక్తులకు ఒక విచిత్రమైన అభిప్రాయముంది. యావత్తు దిగుబడీ, అంటే మొత్తం ఉత్పాదితమంతా, దేశ నికరాదాయంగా విభజితమవుతుందనీ, ఆ రెంటిని వేరు చేసి చూడలేము కాబట్టి, ఈ భేదం దేశం దృష్టిలో అదృశ్యమవుతుందనీ వారి భావం. ఈ భావం ఆడమ్ స్మిత్ నాటి నుంచి అర్థశాస్త్రంలో సర్వత్రా వ్యాప్తిలో వున్న ఒక అసంబద్ధ సూత్రీకరణ యొక్క అనివార్య, అంతిమ వ్యకీకరణ తప్ప మరొకటి కాదు. తుదకంటా విశ్లేషించి చూస్తే, సరుకుల విలువ ఆదాయంగా, అంటే వేతనాలు, లాభం, కౌలుగా సంపూర్ణంగా విభజితమవుతుందనేదే ఆ సూత్రీకరణ.[1]

ప్రతి వ్యష్టి పెట్టుబడిదారుని విషయంలో, ఉత్పాదితంలో ఒక భాగం మళ్ళీ పెట్టుబడిగా (పునరుత్పత్తి విస్తరణ లేదా సంచయనం మాట అలా వుంచినప్పటికీ) రూపాంతరం చెంది తీరాల్సిందే. నిజంగా, అస్థిర పెట్టుబడిగానే కాక – తదుపరి మళ్ళీ కార్మికులకు ఆదాయమై, ఆ విధంగా ఒక ఆదాయం రూపం ధరించుకున్న అస్థిర పెట్టుబడిగానే కాక – ఎన్నటికీ ఆదాయంగా మార్చ వీలులేని స్థిర పెట్టుబడిగా కూడా రూపాంతరం చెంది తీరాల్సిందే. ఈ విషయ అవగాహన, ఈ వివేచన సహజంగానే అతి సులభం. ఉత్పత్తి ప్రక్రియను కేవలం పరిశీలిస్తే చాలు ఇది స్పష్టమవుతుంది. ఉత్పత్తి ప్రక్రియను మొత్తంగా తీసుకొని పరిశీలించిన వెనువెంటనే చిక్కు ప్రారంభమవుతుంది. వేతనాలు, లాభం, కౌలు – వీటి రూపంలో ఆదాయంగా వినియోగించబడిన ఉత్పాదిత భాగమంతటి విలువ (ఈ వినియోగం వ్యక్తిగతమైనదా, ఉత్పాదకమైనదా అనేది ఇక్కడ ఎంతమాత్రమూ ముఖ్యం కాదు.) విశ్లేషణలో, నిజంగా వేతనాలు + లాభం + కౌలు – వీటి మొత్తం విలువగా అంటే ఈ మూడింటి ఆదాయాల మొత్తం విలువగా విడిపోతుంది. ఉత్పాదితంలోని ఈ భాగం, విలువలో కూడా, ఆదాయంలో

---

1. ఆలోచనా రహితుడైన 'సే'పై 'రికార్డో' చేసిన బహుయుక్తమైన వ్యాఖ్య ఇది : ''నికర ఉత్పత్తి, మొత్తం ఉత్పత్తి గురించి ఎం. సే ఇలా చెబుతున్నాడు : 'ఉత్పాదితమైన యావత్తు విలువ మొత్తం ఉత్పత్తే. ఈ విలువ నుంచి ఉత్పత్తి ఖర్చులు తీసివేయగా వున్నదే నికర ఉత్పత్తి' (సం II, పుట 491). అప్పుడు నికర ఉత్పత్తి అనేదే ఉండజాలదు. ఎందువల్లనంటే, ఎం. సే చెబుతున్నదాని ప్రకారం ఉత్పత్తి ఖర్చులనేవి కౌలు, వేతనాలు, లాభం. 508వ పుటలో ఆయన ఇలా అంటున్నారు : 'పరిస్థితులను వాటి సహజ గతి క్రమానికి వదలివేసినప్పుడల్లా ఒక ఉత్పాదితం విలువ, ఒక ఉత్పాదక సేవ విలువ, ఉత్పత్తి ఖర్చుల విలువ - ఇవన్నీ ఒకే విధమైన విలువలు.' మొత్తం నుంచి మొత్తం తీసేసుకొంటే, ఏమీ మిగలదు.'' (రికార్డో, ప్రిన్సిపుల్స్, అధ్యాయం XXII, పుట 512) నోట్స్ - సందర్భవశాత్తూ ఒక విషయం. సరుకు ధర గురించి స్మిత్ తప్పుడు విశ్లేషణను, ఆ ధరను ఆదాయాల యొక్క విలువ మొత్తంగా తేల్చిన సంగతిని రికార్డో ఎక్కడా ఖండించలేదని ఉత్తరోత్తరా మనకు తెలుస్తుంది. దాన్ని గురించి ఆయన పట్టించుకోడు, అది సరియైనదైనట్టు ఆయన తన విశ్లేషణలో ఎంతవరకు అంగీకరించాడంటే, సరుకుల విలువలోని స్థిర భాగం నుంచి ఆయన వేరుపరచి చూపుతాడు. అంతేకాదు, అదే విషయావలోకన పద్ధతిలోకి తరచు దిగజారుతాడు.

ప్రవేశించని భాగంలోలాగానే, ఈ భాగాల్లోని స్థిర పెట్టుబడి విలువకు – స్థి.పె.కి సమానమైన విలువ వున్నందువల్ల, దీన్ని కేవలం ఆదాయం విలువకు పరిమితం చేయ వీలులేనప్పటికీ ఇలా విడిపోతుంది. ఒకవైపు ఆచరణలో, నిరాకరించ వీలులేని వాస్తవంగా, మరోవైపు అంతగానూ నిర్వివాద మైన వైరుధ్యంగా వున్న ఈ పరిస్థితివల్ల ఏర్పడుతున్న చిక్కును ఒక్క విషయాన్ని నొక్కి చెప్పడం ద్వారా సులభంగా దాటివేస్తున్నారు : సరుకు విలువలో మరో విలువ భాగం వుంది. అది వ్యష్టి పెట్టుబడిదారుని దృష్టిలో, ఆదాయం రూపంలో వున్న విలువ భాగానికి భిన్నమైనదిగా పైకి కనిపిస్తుంది, అంతే, అని వీరంటారు. ఒకరికి ఆదాయంగా కనిపించేది మరొకరికి స్థిర పెట్టుబడిగా వుంటుంది, అన్నమాటలు, ఆపై ఆలోచించవలసిన ఆవశ్యకత, బెడద లేకుండా చేస్తుంది. మరి, మొత్తం ఉత్పాదితం విలువ ఆదాయం ఈ రూపంలో వినియోగించుకో వీలున్నప్పుడు, పాత పెట్టుబడి స్థానాన్ని, ఎలా భర్తీచేయ వీలవుతుంది? అన్ని పెట్టుబడుల యొక్క ఉత్పాదితాల విలువల మొత్తం మూడు ఆదాయాల విలువ మొత్తం + 0కు సమానంగా వున్నప్పుడు, ప్రతి వ్యష్టి పెట్టుబడి యొక్క ఉత్పాదితం విలువ మూడు ఆదాయాల మొత్తం విలువ + స్థి.పె.కి ఎలా సమానమవుతుంది? ఇది, సహజంగానే, పరిష్కరించ వీలులేని నిగూఢ సమస్యగా కనిపిస్తుంది. ఈ విశ్లేషణ ధరలోని సామాన్య అంశాలను ఏ మాత్రమూ విడమర్చి చూపజాలదని ప్రకటించడమే దీనికి పరిష్కారం. విషవలయంలో చక్కర్లు కొడుతూ, బూటకమైన అనంత పురోగమనం సాధించడంతో ఈ విశ్లేషణ తృప్తిపడవలసిందే. ఉదాహరణకు, స్థిర పెట్టుబడిగా కనిపించే దాన్ని వేతనాలు, లాభం, కౌలుగా విభజించవచ్చు. కానీ వేతనాలు, లాభం, కౌలు పొందుపడివున్న సరుకు విలువలను నిర్ధారణ చేస్తున్నది, ఇటు వేతనాలు, లాభం, కౌలే – ఇలా అనంతంగా సాగుతుంది ఈ విశ్లేషణ.[1]

సరుకుల విలువను తుదకంటా విశ్లేషించినప్పుడు, దాన్ని వేతనాలు + లాభం + కౌలుగా విభజించవచ్చునన్న మూలంలోనే తప్పుగా వున్న సూత్రీకరణ, టూకే ప్రతిపాదనతో కూడా వ్యక్తమవుతూంది. మొత్తం ఉత్పాదితం విలువనంతటినీ తుట్టతుదకు చెల్లించేది వినిమయదారే;

---

1. "ప్రతి సమాజంలోనూ, ప్రతి సరుకు ధర చివరకు ఈ మూడు భాగాల్లో (అంటే వేతనాలు, లాభం, కౌలు) ఏదో ఒకటిగానో లేక ఈ మూడుగానో విభజితమవుతుంది... వ్యవసాయదారుని పెట్టుబడిని భర్తీ చేయడానికి, లేదా అతని కాడిపశువులు, ఇతర వ్యవసాయప్పనిముట్లు - వీటిలో తరుగుదలవల్ల జరిగిన నష్టాన్ని భర్తీ చేయడానికి ఒక నాల్గవ భాగం కూడా అవసరమని బహుశా అనుకోవచ్చు. కానీ, కాడిగుర్రంలాంటి వ్యవసాయరంగ సాధనమేదైనా సరే, దాని ధరలో కూడా అదే మూడు భాగాలున్నట్లు పరిగణించాలి. అవి, దాన్ని మేపడానికి ఉపయోగించిన భూమి యొక్క కౌలూ, గుర్రాన్ని మేపడానికి, పెంచడానికి పట్టిన శ్రమా, తన భూమి కౌలును, తన శ్రమకు వేతనాలను, రెంటినీ అడ్వాన్సు చేసే వ్యవసాయదారుని లాభమూ. కాబట్టి, ధాన్యం ధరతో గుర్రాన్ని పోషించడానికి అయ్యే ఖర్చులను భరించవీలులేనప్పటికీ మొత్తం ధర వెనువెంటనే లేదా తుట్టతుదకో కౌలు, శ్రమ (వేతనాలు అనే అర్థంలో) లాభం అక్కడే మూడు భాగాలుగా విభజితమవుతుంది." (ఆడమ్ స్మిత్) - సమస్యను దాటవేసే ఈ ఎత్తుగడ పరస్పర విరుద్ధంగానూ, అసమగ్రంగానూ వుందని ఆడమ్ స్మిత్ మనసుకే ఎలా తోచిందో మున్ముందు చూపిస్తాము. ఈయన ఎన్ని గిరికీలు కొట్టినా పెట్టుబడి మదుపు గురించి ఎక్కడా ఏ విధంగానూ స్పష్టం చేయడు. అంటే దేని ధర అయితే అంతిమంగా ఈ మూడు విభాగాలుగా విభజితమవుతుందో ఆ పెట్టుబడి మదుపు గురించి ఆయన స్పష్టమే చేయడు.

అంతేకాక, ఉత్పత్తిదారులకూ, వినియోగదారులకూ మధ్య డబ్బు చలామణి, తుట్టతుదకు ఉత్పత్తిదారుల మధ్య డబ్బు చలామణికి సమానంగా వుండాలి అని ఆయన ప్రతిపాదిస్తున్నాడు. ఈ ప్రతిపాదనలకు ప్రాతిపదికగా వున్న మూలసూత్రం ఎంత తప్పో, ఈ ప్రతిపాదలన్నీ కూడా అంత తప్పు.

ఈ తప్పు విశ్లేషణకు, చూచీ చూడగానే అసంబద్ధమైనదిగా స్పష్టమవుతున్న ఈ విశ్లేషణకు దారితీస్తున్న చిక్కులు క్లుప్తంగా ఇవి :

1. స్థిర, అస్థిర పెట్టుబడుల మౌలిక సంబంధాన్ని, తత్కారణంగా, అదనపు విలువ స్వభావాన్ని కూడా, పెట్టుబడిదారీ ఉత్పత్తి పద్ధతికి గల మొత్తం ప్రాతిపదికను అవగాహన చేసుకోవడం జరగలేదు. పెట్టుబడి యొక్క ప్రతి పాక్షిక ఉత్పాదితం విలువలో, ప్రతి ఒక్క సరుకులో, స్థిర పెట్టుబడికి సమానమైన ఒక విలువ భాగం, కార్మికులకు వేతనాలుగా పరివర్తన చెందిన అస్థిర పెట్టుబడికి సమానమైన ఒక విలువ భాగం, ఉత్తరోత్తరా లాభంగానూ, కౌలుగానూ విడిపోయే అదనపు విలువకు సమానమైన ఒక విలువ భాగం ఉంటాయి. కాబట్టి, ఈ అంతర్భాగాల్లో ఒకటి మాత్రమే కాకుండా, ఈ మూడు అంశాలు ప్రతి ఒక్క సరుకులో వున్నప్పుడూ, తన వేతనాలతో కార్మికుడు, తన లాభంతో పెట్టుబడిదారు, తన కౌలుతో భూస్వామి సరుకులను కొనడం ఎలా సాధ్యం? వేతనాలు, లాభం, కౌలు – విలువల మొత్తం, అంటే ఆదాయాల యొక్క మూడు మూలాధారాలు వెరశి, ఈ ఆదాయాల గ్రహీతల మొత్తం వినియోగంలోకి వెళ్ళే సరుకులను ఈ మూడు విలువ భాగాలే కాక, మరో విలువ భాగం, అంటే, స్థిర పెట్టుబడి కూడా వున్న సరుకులను కొనడం ఎలా సాధ్యం? మూడు విలువలతో నాలుగు విలువలను వారు ఎలా కొనాలి?[1] మా విశ్లేషణను IIవ సంపుటిలోని IIIవ భాగంలో ఇచ్చాము.

---

1. ప్రౌధాన్ దీన్ని గ్రహించే శక్తి తనకు లేదనే సంగతిని, కింది తెలివితక్కువ సూత్రీకరణలో బయటపెట్టు కొంటున్నాడు : కార్మికుడు తన సొంత ఉత్పాదితాన్ని కొనజాలడు. ఎందువల్లనంటే, ఉత్పత్తి ధరకు చేర్చబడిన వడ్డీ ఆ ఉత్పాదితంలో పొందుపడివుంది కదా. కానీ, ఇంతకు మించిన విషయ పరిజ్ఞానం వుండేలా ఎ. యుగెనే ఫొర్కెడ్ అతనికి ఎలా బోధించగలడు? "ప్రౌధాన్ ఆక్షేపణ సరియైనదైతే అది పెట్టుబడి లాభాలను దెబ్బతీయడమే కాకుండా, పరిశ్రమ అనేదానికే అవకాశం లేకుండా చేస్తుంది. వస్తువుకు 80 మాత్రమే పొందిన కార్మికుడు అటువంటి ప్రతి వస్తువుకు 100 చెల్లించి తీరవలసివస్తే, ఒక ఉత్పాదితంలో అతను చేర్చిన విలువను మాత్రమే అతని వేతనాలు తిరిగి కొనగలిగితే, కార్మికుడు దేన్నీ తిరిగి కొనజాలడనీ, వేతనాలు దేని ధరనైనా సరే - చెల్లించలేవనీ చెప్పవచ్చు. వాస్తవంలో, ఉత్పత్తి ధరలో కార్మికుని వేతనాలకన్నా ఎల్లప్పుడూ ఎక్కువ వుంటుంది. అమ్మకం ధరలో కర్మాగారాల లాభాలకన్నా ఎల్లప్పుడూ, ఎక్కువే వుంటుంది. ఉదాహరణకు ముడిపదార్థాల ధర కూడా వుంటుంది. ఇది తరచూ విదేశాలకు చెల్లించబడుతుంటుంది... దేశ పెట్టుబడి నిరంతరం పెరుగుతూ వుంటుందనే సంగతిని ప్రౌధాన్ మరచిపోయాడు. ఈ పెరుగుదల యావన్మంది శ్రామికులకు వారు కర్మాగారంలోని వారైనా, చేతివృత్తుల్లోని వారైనా - వర్తిస్తుందని ప్రౌధాన్ మరచిపోయాడు. (Revue der deux Monder, 1848, టామ్ 24, పుట 998) ఇక్కడ మనకు, బూర్జువా అనాలోచిత ఆశావాదం తదనుగుణమైన వివేచనా రూపంలో కనిపిస్తోంది. మొదటి విషయం, శ్రామికుడు తాను ఉత్పత్తి చేసినదానికన్నా ఎక్కువ విలువను పొందనట్లయితే అతడు బతకలేడని ఎం. ఫొర్కెడ్ అభిప్రాయపడుతున్నాడు. అయితే, అందుకు భిన్నంగా, అతడు ఉత్పత్తి చేసే యావత్తు విలువ అతను నిజంగా పొందినట్లయితే పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం

2. కొత్త విలువను చేర్చడంలో శ్రమ పాత విలువను కొత్తగా ఉత్పత్తి చేయకుండా దాన్ని కొత్త రూపంలో ఏ విధంగా అట్టిపెడుతుందో గ్రహించడం జరగలేదు.

3. పునరుత్పత్తి ప్రక్రియ జరిగే తీరును వ్యష్టి పెట్టుబడి దృక్కోణం నుంచి కాకుండా మొత్తం పెట్టుబడి దృక్కోణం నుంచి చూస్తే అది ఎలా కనిపిస్తుందో అర్థం చేసుకోవడం జరగలేదు. వేతనాలు, అదనపు విలువ, ఒక ముక్కలో చెప్పాలంటే, సంవత్సరంలో కొత్తగా చేర్చబడిన సమస్త శ్రమ ఉత్పత్తి చేసిన యావత్తు విలువ ఉత్పాదితంలో వస్తురూపం ధరిస్తుంది కదా! అటువంటి ఉత్పాదితం విలువలోని స్థిర భాగాన్ని భర్తీ చేస్తూనే, అదే సమయంలో కేవలం ఆదాయాలకే పరిమితమైన విలువగా ఎలా విభజితమవుతుందనేది ఇక్కడ ఒక సమస్య – ఈ సమస్యను అర్థం చేసుకోలేదన్నమాట. అంతేకాదు, కొత్తగా చేర్చబడిన మొత్తం శ్రమ వేతనాలు గానూ, అదనపు విలువగానూ చేతికందుతూ, అది ఈ రెంటి విలువల మొత్తానికి పూర్తిగా ప్రాతినిధ్యం వహిస్తున్నప్పటికీ, ఉత్పత్తి సందర్భంగా వినియోగమయిన స్థిర పెట్టుబడి స్థానాన్ని కొత్త పెట్టుబడి వస్తు రీత్యా, విలువ రీత్యా ఎలా భర్తీ చేయగలదు అనే ఒక సమస్యను కూడా వీరు అర్థంచేసుకోలేదు. పునరుత్పత్తినీ, పాదార్థిక స్వభావరీత్యానూ, విలువ సంబంధాలరీత్యానూ, పునరుత్పత్తిలోని వివిధ అంతర్భాగాలనూ గురించిన విశ్లేషణే ఇక్కడున్న ప్రధానమైన చిక్కు.

4. ఈ చిక్కులకు తోడు మరొకటిక్కడ వుంది. అదనపు విలువలోని వివిధ భాగాల పరస్పర ప్రమేయం లేని ఆదాయాలుగా రంగంపైకి రాగానే ఈ కొత్త చిక్కు మరింత క్లిష్టమైనదిగా తయారవుతుంది. ఇదేమిటంటే, ఆదాయం, పెట్టుబడి అనే నిర్దిష్టమైన పేర్లు ఒకదానికొకటి మారుతుంటాయి. అవి తమ స్థానాలను పరస్పరం మార్చుకొంటుంటాయి. ఫలితంగా, అవి వ్యష్టి పెట్టుబడిదారుల దృష్ట్యా సాపేక్షంగా నిర్ణయమైన పేర్లుగానూ, మొత్తం ఉత్పత్తి ప్రక్రియ నంతటినీ దృష్టిలో ఉంచుకొంటే అవి అదృశ్యమవుతున్నట్టుగానూ తోస్తుంది. ఉదాహరణకు, స్థిర పెట్టుబడిని ఉత్పత్తి చేసే Iవ శాఖ కార్మికుల, పెట్టుబడిదారుల ఆదాయం IIవ శాఖ పెట్టుబడిదారుల స్థిర పెట్టుబడి స్థానాన్ని వస్తు రీత్యానూ, విలువ రీత్యానూ భర్తీ చేస్తుంది. కాబట్టి, ఒకరికి ఆదాయంగా వున్నది మరొకరికి పెట్టుబడిగా వుంటుందనీ, ఈ పేర్లకూ, సరుకుల విలువ యొక్క వాస్తవ ప్రత్యేక లక్షణాలకూ ఎలాంటి సంబంధమూ లేదనీ అడ్డగోలుగా

---

ఉండేదే కాదు. రెండవ విషయం, ప్రౌధాన్ ఒక సంకుచిత దృక్కోణం నుంచి మాత్రమే వ్యక్తం చేసిన చిక్కును ఎం. ఫార్కెడ్ సరిగ్గా సామాన్యీకరించాడు. సరుకుల ధరలో వేతనాలకే కాకుండా, లాభానికి కూడా పైబడినది, అంటే విలువలోని స్థిర భాగం వుంది. కనుక ప్రౌధాన్ వాదన ప్రకారం, పెట్టుబడిదారు సైతం తన లాభంతో సరుకును తిరిగి కొనలేడు. ఫార్కెడ్ ఈ చిక్కు సమస్యను ఎలా పరిష్కరిస్తున్నాడో? పెట్టుబడి పెరుగుదల అనే అర్థరహితమైన పదజాలంతో! 100 పెట్టుబడి విషయంలో అర్థశాస్త్రజ్ఞునికి సాధ్యం కాదని సరుకు ధర విశ్లేషణ 10,000 పెట్టుబడి విషయంలో అవసరమే లేకుండాపోతుంది. కాబట్టి పెట్టుబడి నిరంతరాయ పెరుగుదల రుజువవుతున్నట్లు భావించుకోవాలి. భూమిలో ఉత్పత్తి అయ్యేదానిలో, భూమిలోకన్నా ఎక్కువ కర్బనం వుండటానికి కారణమేమిటని అడిగితే, వ్యవసాయోత్పత్తి లోని నిరంతరాయ పెరుగుదల నుంచి అది వస్తుందని సమాధానం చెప్పే రసాయన శాస్త్రవేత్తను గురించి ఏమనుకోవాలి? ఉండగల ప్రపంచాల్లోకెల్లా అత్యుత్తమమైనది బూర్జువా ప్రపంచమే అనే సంగతిని కనుగొనాలన్న సదుద్దేశం నాటు అర్థశాస్త్రంలో సత్యప్రీతికి, శాస్త్ర పరిశోధనా స్వేచ్ఛకు తావులేకుండా చేసింది.''

వాదిస్తూ, ఈ సందిగ్ధావస్థ నుంచి ఎవరైనా బయటపడవచ్చు. మరోసంగతి : చివరకు; ఆదాయవ్యయానికి సంబంధించిన పాదార్థిక అంశాలు కానున్న సరుకులు, అంటే వినియోగ వస్తువులు సంవత్సరంలో వివిధ దశలను గడుస్తాయి. ఉన్ని దారం, వస్త్రం ఇందుకు ఉదాహరణలు. ఒక దశలో అవి స్థిర పెట్టుబడిలో ఒక భాగంగా వుంటాయి. మరోదశలో అవి, వేరు వేరుగా వినియోగమై, పూర్తిగా ఆదాయంలోకి వెళ్ళిపోతాయి. కాబట్టి ఆడమ్ స్మిత్ భావించినట్లు, స్థిర పెట్టుబడి, సరుకు విలువలోని ఒక అంశంగా కనిపిస్తుందే కాని, మొత్తం ప్రక్రియ సరళిలో అది అదృశ్యమవుతుందని ఎవరైనా అనుకోవచ్చు. ఉదాహరణకు, అస్థిర పెట్టుబడి మళ్ళీ ఆదాయానికి మార్పిడి అవుతుంది. కార్మికుడు తన వేతనంతో సరుకుల్లో తన ఆదాయంగా వున్న భాగాన్ని కొంటాడు. ఈ విధంగా అతను, అదే సమయంలో, పెట్టుబడిదారుకు అస్థిర పెట్టుబడి యొక్క డబ్బు రూపాన్ని భర్తీ చేస్తాడు. చివరి విషయం. ఉత్పాదితాల్లో స్థిర పెట్టుబడిగా వున్న ఒక భాగం వస్తురూపంలోనో, లేదా స్థిరపెట్టుబడి ఉత్పాదకుల మధ్య మార్పిడి ద్వారానో భర్తీ అవుతుంది; ఈ ప్రక్రియతో వినియోగదారులకు ఎలాంటి సంబంధమూ లేదు. దీన్ని విస్మరించినప్పుడు, వినియోగదారుల ఆదాయమే, మొత్తం ఉత్పాదితం స్థానాన్ని, అంటే విలువలో స్థిర భాగంతో సహా ఉత్పాదితం స్థానాన్ని భర్తీ చేస్తుందనే అభిప్రాయం కలుగుతుంది.

5. విలువలు ఉత్పత్తి ధరలుగా పరివర్తన చెందడంవల్ల కలిగే గందరగోళమే కాకుండా మరో గందరగోళం తలెత్తుతుంది. అదనపు విలువ ఉత్పత్తిలోని వివిధ భాగాలకు వర్తించే విభిన్నమైన, ప్రత్యేకమైన, దేనికదిగా వున్న ఆదాయాలుగా అంటే లాభంగా, కౌలుగా రూపాంతరం చెందడం వల్ల ఏర్పడే గందరగోళమది. ఒక వాస్తవాన్ని ఇక్కడ మరచిపోతున్నారు : అదేమంటే, సరుకుల విలువలే ప్రాతిపదిక; నిర్దిష్టమైన అంతర్భాగాలుగా ఈ సరుకు విలువల విభజన, ఆదాయ రూపాలుగా ఈ అంతర్భాగాల తదనంతర పరిణామం, విలువలోని ఆయా అంతర్భాగాలతో ఉత్పత్తిలోని వేరువేరు కారకాల సొంతదారుల సంబంధాలుగా ఈ ఆదాయాల రూపాల మార్పు, ఖచ్చితమైన అభివర్గాలను, హక్కులను అనుసరించి ఈ సొంతదారుల మధ్య ఈ ఆదాయాల పంపిణీ – ఇదంతా కూడా విలువ రూపుతీసుకోవడంలో, ఆ విలువ నియమంలో ఎటువంటి మార్పును తీసుకురాదు. అంతేకాదు. లాభ సమీకరణవల్లా, అంటే వివిధ పెట్టుబడుల మధ్య మొత్తం అదనపు విలువ పంపిణీవల్లా ఈ సమీకరణ మార్గంలో భూ ఆస్తి పాక్షికంగా (సంపూర్ణ కౌలులో) పెట్టే అడ్డంకులు, ఒక క్రమంలో వుంచే సగటు ధరలకూ, సరుకుల వ్యష్టి విలువలకు మధ్య తేడా తెచ్చిపెట్టడంవల్లా విలువ నియమం ఏమాత్రమూ మారదు. ఈ తేడా వివిధ సరుకు ధరలకు అదనపు విలువ చేరికను ప్రభావితం చేస్తుందే తప్ప అసలు అదనపు విలువను గానీ, ధరలోని ఈ వేరువేరు అంతర్భాగాలకు మూలకందంగా వున్న సరుకుల మొత్తం విలువను గానీ రద్దు చేయదు.

పైన పేర్కొన్న వారి ఈ ప్రతివాదాన్ని తరువాత అధ్యాయంలో పరిశీలిస్తాం. విలువ తన అంతర్భాగాల నుంచే ఉద్భవిస్తుందనే భ్రమతో అనివార్యంగా ముడిపడి వున్న వాదమది. అంటే, సరుకులోని వేరువేరు విలువ భాగాలు ఆదాయాలుగా స్వతంత్ర రూపాలను సంతరించుకొంటాయనీ,

ఆ రూపాల్లోని ఆదాయాలుగా అవి తమకు మూలమైన సరుకు విలువతో ముడిపడి వుండటానికి బదులు, తమ ఆవిర్భావానికి మూలాధారాలుగా, ఉత్పత్తి యొక్క ఆయా పాదార్థిక అంశాలతో ముడిపడి వున్నాయనీ వీరి భ్రమ. అయితే వాస్తవంలో వాటిని ముడిపెడుతున్నది, విలువలోని అంతర్భాగాలుగా కాదు; ఆదాయాలుగానే; ఉత్పత్తిలో ప్రత్యేక తరగతులకు చెందిన ఏజెంట్లయిన కార్మికుని, పెట్టుబడిదారుని, భూస్వామి – వాటాలుగా వుండే విలువ అంతర్భాగాలుగా అలా ముడిపెడుతున్నారు. కాని విలువలోని ఈ అంతర్భాగాలు సరుకు విలువ విభజన నుంచి ఉద్భవించినవి కాదు సరికదా, వాటి సంయోగం ద్వారా మాత్రమే ఆ విలువ రూపుగొంటున్నదని ఎవరైనా భ్రమపడవచ్చు. వేతనాలు, లాభం, కౌలు, ఈ విలువ మొత్తం నుంచి సరుకుల విలువ ఉద్భవిస్తుంది. వేతనాలు, లాభం, కౌలు – వీటి మొత్తం విలువ ఇటునుంచి సరుకుల విలువను నిర్ధారణ చేస్తుంది. ఇలా తిరగేసి చెబుతూపోయే అందమైన విషవలయానికి ఈ భ్రమ దారితీస్తుంది.[1]

---

1. "పదార్థాలు, ముడిపదార్థాలు, తయారైన సరుకులలో మదుపు పెట్టిన చలామణి పెట్టుబడే సరుకులతో ఏర్పడినది. దీని ఆవశ్యక ధర అదే అంశాలతో రూపొందినదే - ఫలితంగా, ఒక దేశంలోని మొత్తం సరుకులను దృష్టిలో వుంచుకొన్నప్పుడు ఆవశ్యకత ధరలోని అంశాలలో ఈ చలామణి పెట్టుబడి భాగాన్ని లెక్కలోకి తీసుకోవడమంటే దాన్ని రెండుసార్లు లెక్కగట్టినట్లవుతుంది. "(స్టార్చ్, Cours d'economie politique, II, పుట 140) చలామణి పెట్టుబడిలోని ఈ అంశాలంటే స్థిర పెట్టుబడి విలువ అని స్టార్చ్ భావం. (నిశ్చల పెట్టుబడి మరో రూపంలో చలామణి అవుతూంటుంది అంతే.) "పరిశ్రమ లాభంలోని వేతన భాగంలాగానే కార్మికుని వేతనాల్లో సైతం (వాటిని జీవితావసరాల్లో ఒక భాగంగా పరిగణిస్తే), వర్తమాన ధరలతో కొన్న సరుకులున్నాయనేది నిజం. ఈ సరుకుల్లోనూ వేతనాలూ, పెట్టుబడిపై వడ్డీ, భూమి కౌలూ, పరిశ్రమ లాభమూ ఉన్నాయి.... ఈ మాటలు ఆవశ్యక ధరను, దాని అతి సూక్ష్మాంశాలుగా విభజించడం అసాధ్యమని రుజువు చేయడానికి ఉపకరిస్తుంది. అంతే." (అదే గ్రంథం, నోట్) విలువను కేవలం ఆదాయాలుగా విభజించినప్పుడు, సరుకు విలువ గురించిన ఈ తప్పు విశ్లేషణ ఎంతటి అసంబద్ధతకు దారితీస్తుందో స్టార్చ్, Considerations sur la nature du revenu national అనే తన గ్రంథంలో, సే తోటి వివాద సందర్భంగా నిజంగానే గుర్తిస్తున్నాడు. అటువంటి విశ్లేషణ ఫలితాలు ఎంత తెలివిమాలినవో వ్యష్టి పెట్టుబడిదారుని దృక్కోణం నుంచి కాక, మొత్తం దేశాన్ని దృష్టిలో పెట్టుకొని ఆయన సరిగా చెప్పాడు. కానీ ఈ ఆవశ్యక ధరల విశ్లేషణలో ఆయన సైతం తన "Cours"లో చెప్పిన దానికి మించి ఒక అడుగు కూడా ముందుకు పోలేదు. దాన్ని బూటకమైన అనంత ప్రగతిగా విభజిస్తూ పోకుండా, దానిలోని వాస్తవాంశాలుగా విభజించడం అసాధ్యమనేది ఈ విశ్లేషణ తాత్పర్యం. "వార్షిక ఉత్పాదితం విలువలో కొంత భాగం పెట్టుబడులుగా, కొంత భాగం లాభాలుగా విభజితమవుతుంది. వార్షిక ఉత్పాదితం విలువలోని ఈ భాగాలు ప్రతి ఒకటీ దేశానికి అవసరమైన ఉత్పాదితాలను కొనడానికి, దేశ వినియోగ నిధి పునరుద్ధరణకులాగానే దాని పెట్టుబడిని భద్రపరచడానికి కూడా క్రమం తప్పకుండా ఉపయోగపడుతుంది - ఇది విదితమే. (పుటలు 134, 135) అది (తన రెక్కలపై ఆధారపడిన రైతు కుటుంబం) తన ధాన్యపు కొట్టులో లేదా గుర్రపుశాలలో నివసించగలదా, తన విత్తనాలను పశుగ్రాసాన్ని తినగలదా, తన దుక్కిపశువులతో బట్టలు కొనగలదా, తన వ్యవసాయ పనిముట్లను అమ్ముకోగలదా? ఎం. సే సిద్ధాంతాన్నిబట్టి ఈ ప్రశ్నలకన్నిటికీ మనం అవునని జవాబు చెప్పాల్సి వుంది. (పుటలు 135, 136) ఒక దేశపు ఆదాయం దాని మొత్తం ఉత్పాదితానికి సమానమని అంగీకరిస్తే, అంటే, దానినుంచి పెట్టుబడిని మినహాయించుకుంటే, అప్పుడు దేశం, తన భావి ఆదాయానికి ఎట్టి హానీ రానీకుండానే, తన వార్షిక ఉత్పాదితపు విలువనంతటినీ అనుత్పాదకంగా ఖర్చుపెట్టవచ్చునని అంగీకరించవలసి వుంటుంది. (147) ఒక దేశపు పెట్టుబడిగా వున్న ఉత్పాదితాలు వినియోగించుకోదగినవి కావు." (పు. 150)

పునరుత్పత్తి దాని సాధారణ స్థితిలో వున్నదనుకొన్నప్పుడు, కొత్తగా చేర్చిన శ్రమలో ఒక భాగం మాత్రమే స్థిర పెట్టుబడి ఉత్పత్తికి, తద్వారా దాని స్థానాన్ని భర్తీ చేసేందుకు నియుక్తమవుతుంది. వినియోగ వస్తువుల, అంటే ఆదాయపు పదార్థాల ఉత్పత్తిలో వ్యయమైపోయిన స్థిర పెట్టుబడి స్థానాన్ని భర్తీచేసే భాగమది. IIవ శాఖలోని ఈ స్థిర భాగానికి అదనంగా ఎట్టి శ్రమ వ్యయం కాదన్న వాస్తవం దీనికి సరియెత్తుగా వుంటుంది. మొత్తం పునరుత్పత్తి ప్రక్రియను దృష్టిలో వుంచుకొన్నప్పుడు, అందువల్ల, I, II శాఖల మధ్య పైన పేర్కొన్న సమతుల్యం ఈ ప్రక్రియలో ఇమిడి వున్నప్పుడు – ఈ స్థిర పెట్టుబడి, కొత్తగా చేర్చిన శ్రమ లేకుండా ఉత్పత్తి అయ్యే వీలులేకపోయినా, ఆ శ్రమ ఉత్పాదితానికి ప్రాతినిధ్యం వహించదు. అలాంటి ఈ స్థిర పెట్టుబడి పదార్థం దృష్ట్యా, కొన్ని హఠాత్ పరిణామాలకు, ప్రమాదాలకు గురయి, వాటివల్ల ధ్వంసమయ్యే అవకాశం వుంది. (కాని ఇంకో సంగతి. విలువ దృష్ట్యా కూడా చూసినప్పుడు, శ్రమ ఉత్పాదకతలోని మార్పువల్ల దాని విలువ తగ్గవచ్చు. అయితే ఇది వ్యష్టి పెట్టుబడిదారుకు మాత్రమే వర్తించే విషయం.) తదనుగుణంగా లాభంలో ఒక భాగం కనుక అదనపు విలువలో ఒక భాగం. అందువల్ల అదనపు ఉత్పాదితంలో ఒక భాగం – కొత్తగా చేర్చిన శ్రమకు మాత్రమే (విలువకు సంబంధించినంత వరకు) ప్రాతినిధ్యం వహించే ఈ భాగం భీమా నిధిగా ఉపకరిస్తుంది. ఈ భీమా నిధిని ప్రత్యేక వ్యాపారంగా భీమా కంపెనీలు నిర్వహిస్తున్నాయా, లేదా అనేదానితో ఇక్కడ నిమిత్తం లేదు. అటు ఆదాయంగా వినియోగం కాకుండానూ, ఇటు సంచయన నిధిగా ఉపకరించకుండానూ వున్నది, ఆదాయంలోని ఈ భాగం మాత్రమే. ఇది వాస్తవంలో భీమా నిధిగా పనిచేస్తుందా, లేక కేవలం పునరుత్పత్తిలో వచ్చిన నష్టాన్ని పూడుస్తుందా అనేది యాదృచ్ఛికం. అదనపు విలువలో, అదనపు ఉత్పాదితంలో ఉన్నది కాబట్టి అదనపు శ్రమలో ఈ భాగం మాత్రమే పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం రద్దయిన తరువాత సైతం, సంచయనానికి, తత్కారణంగా పునరుత్పత్తి ప్రక్రియ విస్తరణకు ఉపకరించే భాగం వెలుపల అలాగే కొనసాగుతుంటుంది. ఇలా చెప్పడంలో, ప్రత్యక్ష ఉత్పాదకులు క్రమానుసారం వినియోగించుకొనే భాగం ప్రస్తుత కనీస స్థాయికి పరిమితమై వుండదనేది, సహజంగానే గర్భితం. ఉత్పత్తిలో పాల్గొనే వయసు ఇంకా రానివారికి లేదా పాల్గొనే వయసు చెల్లక వారిని పోషించడానికి ఉద్దేశించిన అదనపు శ్రమ తప్పిస్తే, పనిచేయని వారి పోషణకై చేసే శ్రమ ఇక వుండదు. సమాజారంభం నాటి రోజులను గురించి మనం ఆలోచిస్తే, మనిషి ఉత్పత్తి చేసిన ఉత్పాదక సాధనాలు లేవనేది స్పష్టం. కాబట్టి, ఉత్పాదితంలో తన విలువను ప్రవేశపెట్టగల స్థిర పెట్టుబడి – అదే స్థాయిలోని పునరుత్పత్తిలో వస్తు రీత్యానూ, దాని విలువనుబట్టీ భర్తీ చేయవలసిన అలాంటి స్థిర పెట్టుబడి ఆనాడు లేదు. కానీ అది ప్రత్యేక జీవితావసరాలను ప్రత్యక్షంగా సమకూర్చేది. వాటిని మొదట ఉత్పత్తి చేయవలసిన అవసరం వుండలేదు. అందువల్లనూ, ఆటవికులకు తీర్చుకోవలసిన అవసరాలు బహుకొద్దే కావటంవల్లనూ, సహజమైన ఉత్పత్తి సాధనాలను స్వాయత్తం చేసుకోవడానికి శ్రమించటంతోపాటు ఇతర ప్రకృతి ఉత్పాదితాలకు ఉత్పత్తి సాధనాలుగా – విల్లంబులు, రాతికత్తులు, పడవలు వగైరాలుగా మార్చేందుకు వ్యవధి అతనికి ప్రకృతి ప్రసాదించగా లభించింది. (ఇంకా ఉనికిలోనే లేని ఉత్పత్తి సాధనాలను కొత్త ఉత్పత్తిలో వాడేందుకు ఈ వ్యవధిని వినియోగించే సమస్యే లేదు). పదార్థ దృక్పథంతో చూసే ఆటవికుల్లో ఈ ప్రక్రియ అదనపు శ్రమను కొత్త పెట్టుబడిగా మళ్ళీ

మార్చే ప్రక్రియ వంటిదే. సంచయన ప్రక్రియలో, అటువంటి అదనపు శ్రమ ఉత్పాదితాలను పెట్టుబడిగా మార్చడం నిరంతరాయంగా సాగుతుంది. యావత్తు కొత్త పెట్టుబడి లాభం, కౌలు లేదా ఇతర రూపాల ఆదాయం నుంచి, అంటే అదనపు శ్రమ నుంచి ఉత్పన్నమవుతున్న పరిస్థితివల్ల, సరుకుల విలువలన్నీ ఏదో ఆదాయం నుంచి ఉత్పన్నమవుతుందన్న పొరపాటు అభిప్రాయం ఏర్పడుతూంది. అది సరికాదనీ, ఎల్లప్పుడూ లాభం ఇలా మళ్ళీ పెట్టుబడిగా మారే క్రమాన్ని జాగ్రత్తగా విశ్లేషించి చూస్తే, జరిగేది ఇందుకు తలకిందులుగా వుందనీ స్పష్టమవుతుంది. అంటే, అదనపు శ్రమ ఎల్లప్పుడూ ఆదాయ రూపంలోనే వుంటుందనీ, దాన్ని ఆదాయంగా వాడకుండా వున్న మేరకు అది కొత్త అదనపు పెట్టుబడిని సృష్టించడానికి ఉపకరిస్తుందే తప్ప – పాతపెట్టుబడి విలువను కాపాడటానికి లేదా ఆ విలువ పునరుత్పత్తికి కాదనీ స్పష్టమవుతుందన్నమాట.

గందరగోళపరచే చిక్కంతటికీ కారణమిది : కొత్తగా చేర్చిన శ్రమవల్ల సృష్టి అయిన విలువ ఏ మేరకు వేతనాలుగా విభజితం కాదో ఆ మేరకు లాభంగా దర్శనమిస్తుంది. (ఇక్కడ లాభాన్ని మొత్తంపై అదనపు విలువ రూపమన్న అర్థంలో వాడుతున్నాము.) అంటే, పెట్టుబడిదారునికి ఖర్చులేకుండా లభించిన విలువగా. కాబట్టి, అతను మదుపు పెట్టినదేన్నీ, ఎలాంటి పెట్టుబడినీ భర్తీ చేయనవసరం లేని విలువగా దర్శనమిస్తుంది. ఒక్క ముక్కలో చెప్పాలంటే ఈ విలువ, వ్యష్టి పెట్టుబడిదారుని దృష్టిలో, అందుబాటులో వున్న అదనపు సంపద రూపంలో, తన ఆదాయం రూపంలో వుంటుంది. కానీ కొత్తగా సృష్టి అయిన ఈ విలువను ఉత్పాదకంగానూ వాడవచ్చు, వ్యక్తిగతంగానూ వాడవచ్చు. అంటే పెట్టుబడిగానూ వాడవచ్చు, లేదా ఆదాయంగానూ వాడవచ్చు. దాని సహజ రూపం కారణంగా, దానిలో కొంత ఉత్పాదితంగా వాడకతప్పదు. కనుక, ఏడాదిలో చేర్చిన శ్రమ సంచయన ప్రక్రియలో స్పష్టంగా కనిపిస్తున్నట్టు పెట్టుబడినీ సృష్టిస్తుంది, ఆదాయాన్నీ సృష్టిస్తుంది. అయితే శ్రమశక్తిలో కొత్త పెట్టుబడికై వినియుక్తమైన భాగం (ఇది, ఆటవికుడు జీవితావసరాల సేకరణకు కాకుండా, వాటి సేకరణ కోసం వాడే పరికరాలను తయారు చేసుకొనేందుకు నియోగించే పనిదిన భాగం వంటిదే.) కంటికి కనిపించదు. ఎందువల్లనంటే అదనపు విలువ యొక్క ఉత్పాదితం యావత్తూ మొదట లాభం రూపంలో దర్శనమిస్తుంది. లాభమనే పేరుకూ, ఈ అదనపు ఉత్పాదితానికీ ఎలాంటి సంబంధమూ లేదు. ఇది, తాను జేబులో వేసుకొన్న అదనపు విలువతో పెట్టుబడిదారుకు వ్యక్తిగతంగా వున్న సంబంధాన్ని సూచించే పదం, అంతే. వాస్తవంలో, శ్రామికుడు సృష్టించే అదనపు విలువ ఆదాయం గానూ, పెట్టుబడిగానూ, అంటే వినియోగ వస్తువులుగానూ, ఉత్పత్తికి సంబంధించిన అదనపు సాధనాలు గానూ విభజితమవుతుంది. కానీ గత సంవత్సరం నుంచి గ్రహించిన ఆనాటి స్థిర పెట్టుబడిని, కొత్తగా చేర్చిన శ్రమ, విలువ రీత్యా పునరుత్పత్తి చేయదు. (ఇక్కడ దెబ్బతిని, ఆ విధంగా ధ్వంసమయి నందువల్ల పునరుత్పత్తి చేయవలసిన అవసరంలేని భాగాన్ని వదిలివేస్తున్నాం – పునరుత్పత్తి ప్రక్రియలో వచ్చే అంతరాయాలు భీమా కిందికి వస్తాయి.)

కొత్తగా చేర్చిన శ్రమ ఆదాయంగా మాత్రమే, అంటే వేతనాలూ, లాభమూ, కౌలుగా మాత్రమే విభజితమయినప్పటికీ, వినియోగమైపోయిన స్థిర పెట్టుబడిని పునరుత్పత్తి చేయడంలో, దాని స్థానాన్ని భర్తీ చేయడంలో ఈ శ్రమలో ఒక భాగం నిరంతరం వ్యయమవుతూనే వుంటుందని కూడా మనం

చూశాము. కానీ, అందువల్ల కింది విషయాలను విస్మరించడం జరుగుతుంది. 1) ఈ శ్రమ ఉత్పాదితపు విలువలోని ఒక భాగం కొత్తగా చేర్చిన ఈ శ్రమ ఉత్పాదితం కాదు. అందువల్ల ఈ విలువ భాగం పొందుపడి వున్న ఉత్పాదిత భాగం ఆదాయంగా పరివర్తన చెందదు కూడా. అది ఈ స్థిర పెట్టుబడి యొక్క ఉత్పత్తి సాధనాల స్థానాన్ని వస్తురూపంలో భర్తీ చేస్తుంది; 2) కొత్తగా చేర్చిన ఈ శ్రమ పొందుపడి వున్న విలువ భాగం ఆదాయంగా వస్తురూపంలో వినియోగించబడదు; అది మరో రంగంలో స్థిర పెట్టుబడిని భర్తీ చేస్తుంది. అక్కడ అది ఆదాయంగా వినియోగించ వీలున్న ఒక సహజ రూపంలోకి పరివర్తన చెందుతుంది. అయితే, ఆ రూపంలో నున్నది కూడా, సంపూర్ణంగా కొత్తగా చేర్చిన శ్రమ ఉత్పాదితం కాదు.

పునరుత్పత్తి అదే స్థాయిలో జరుగుతున్న మేరకు, స్థిర పెట్టుబడిలో వినియోగమైపోయిన ప్రతిదీ, అదే రకానికి చెందిన ఒక కొత్త నమూనాచే భర్తీ కావలసి వుంటుంది. పరిమాణంలోనూ, రూపంలోనూ కాకపోయినా, కనీసం ఫలదాయకతలోనైనా భర్తీ కావాలి. శ్రమ ఉత్పాదకత మునుపటి లాగానే వున్నట్లయితే, వస్తురూపంలో భర్తీ అయినప్పుడు. స్థిర పెట్టుబడి తన పాత రూపంలో ఎంత విలువ కలిగి వుందో అంతే విలువ భర్తీ అయినట్లు లెక్క. కాని శ్రమ ఉత్పాదకత పెరిగి, ఫలితంగా అదే పాదార్థిక అంశాలను తక్కువ శ్రమతో పునరుత్పత్తి చేయ వీలున్నప్పుడు, ఉత్పాదితపు విలువలో మునుపటికన్నా తక్కువ భాగమే స్థిర పెట్టుబడిని వస్తురూపంలో పూర్తిగా భర్తీ చేయగలదు. అప్పుడు మిగులును కొత్త అదనపు పెట్టుబడిగా రూపొందించడానికి ఉపయోగించవచ్చు, లేదా ఉత్పాదితంలో మునుపటికన్నా ఎక్కువ భాగానికి వినియోగ వస్తువుల రూపమివ్వవచ్చు, లేదా అదనపు శ్రమను తగ్గించవచ్చు. మరోవైపు శ్రమ ఉత్పాదకత తగ్గినట్లయితే, ఉత్పాదితంలో మునుపటికన్నా ఎక్కువ భాగం మునుపటి పెట్టుబడి స్థానాన్ని భర్తీ చేయడానికి వాడక తప్పదు. అప్పుడు అదనపు ఉత్పాదితం తగ్గుతుంది.

లాభాన్ని, లేదా మరో రూపంలోనిదైనా సరే మొత్తంపై అదనపు విలువను పెట్టుబడిగా మళ్ళీ మారడాన్నిబట్టి (ఇక్కడ చారిత్రకంగా నిర్ధారణ అయిన ఆర్థిక రూపాన్ని పక్కనబెట్టి, పెట్టుబడిని నూతన ఉత్పత్తి సాధనాల సామాన్య రూపంగా పరిగణిస్తున్నాము.) ఒక విషయం రుజువవుతోంది. కార్మికుడు తన తక్షణ జీవితావసరాల సేకరణకు అవసరమైన శ్రమ కాకుండా, ఉత్పత్తి సాధనాల ఉత్పత్తికి అవసరమైన శ్రమ కూడా చేసే పరిస్థితి ఇప్పటికీ నెలకొని వుంది. లాభాన్ని పెట్టుబడిగా మార్చడమంటే, మిగులుగా వున్న శ్రమలో ఒక భాగాన్ని కొత్త, అదనపు ఉత్పత్తి సాధనాల తయారీకి నియోగించడమే తప్ప మరేమీ కాదు. కొత్త అదనపు ఉత్పత్తి సాధనాల తయారీ, లాభాన్ని పెట్టుబడిగా మార్చే రూపంలో జరగడంవల్ల మిగులు శ్రమను వినియోగించుకొనేది పెట్టుబడిదారే తప్ప కార్మికుడు కాదని స్పష్టమవుతూంది. ఈ మిగులు శ్రమ ఆదాయంగా గోచరించే దశను మొదట గడపవలసి వస్తున్నదంటే, ఈ శ్రమను లేదా దాని ఉత్పాదితాన్ని శ్రామికేతరుడు స్వాయత్తం చేసుకొంటున్నాడన్న మాటేకదా. (కానీ ఉదాహరణకు ఆటవికుని విషయంలో అది నేరుగా ఉత్పాదక సాధనాల ఉత్పత్తి కోసం వ్యయం కానున్న మిగులు శ్రమగా గోచరమవుతుంది.) అయితే వాస్తవంలో పెట్టుబడిగా పరివర్తన చెందేది అసలు లాభం కాదు. అదనపు విలువను, అదనపు ఉత్పాదితాన్ని ఆదాయంగా

పెట్టుబడిదారు వ్యక్తిగతంగా వినియోగించుకోడని మాత్రమే – పెట్టుబడిగా అదనపు విలువ పరివర్తన సూచిస్తుంది. వాస్తవంగా అలా పరివర్తన చెందేది విలువ, వస్తురూపంలోని శ్రమ లేదా ఆ విలువకు ప్రత్యక్ష వ్యక్తీకరణ అయిన ఉత్పాదితం లేదా అంతకు ముందు డబ్బుగా రూపాంతరం చెందిన విలువతో మార్పిడి అయిన ఉత్పాదితం. లాభం తిరిగి పెట్టుబడిగా మారినప్పుడు, అదనపు విలువ యొక్క ఈ నిర్దిష్ట రూపం లేక ఈ లాభం ఈ కొత్త పెట్టుబడికి మూలాధారం కాజాలదు. తద్వారా అదనపు విలువ కేవలం ఒక రూపం నుంచి మరో రూపంలోకి మారుతుందంతే. కానీ దాన్ని పెట్టుబడిగా మార్చేది ఈ రూపాంతరీకరణ కాదు. ఇప్పుడు పెట్టుబడిగా పనిచేసేది సరుకు, దాని విలువ. కానీ ఈ సరుకు విలువకు మూల్యం చెల్లించబడలేదనేది – ఇలా చెల్లించబడనందువల్లనే అది అదనపు విలువ అవుతుంది – శ్రమ వస్తురూపం ధరించడంతో, అసలు విలువతో సంబంధం లేని విషయం.

ఇంతకు ముందు పేర్కొన్న అపోహ వివిధ రూపాల్లో వ్యక్తమవుతూంది. స్థిర పెట్టుబడిగా ఏర్పడిన సరుకుల్లో సైతం వేతనాలు, లాభం, కౌలు వున్నాయనేది ఇందుకు ఒక ఉదాహరణ. లేదా, ఒకరికి ఆదాయమైనది మరొకరికి పెట్టుబడి అవుతుంది. అందువల్ల అవి కేవలం ఆత్మగతమైన సంబంధాలే అనేది మరో అపోహ. ఉదాహరణకు నూలు కర్మాగారం యజమాని వద్ద వున్న నూలులో అతని లాభానికి ప్రాతినిధ్యం వహించే విలువ భాగం వుంది. నేత కర్మాగారం యజమాని ఆ నూలు కొంటే, నూలు కర్మాగారం యజమానికి ఆ లాభం అందేలా చేస్తున్నాడు కానీ ఆ నూలు అతనికేమో తన స్థిర పెట్టుబడిలో భాగం మాత్రమే.

ఆదాయానికీ, పెట్టుబడికీ మధ్య సంబంధాల గురించి లోగడ చేసిన వ్యాఖ్యలను కాక కిందివి కూడా గమనంలో వుంచుకోవాలి. విలువకు సంబంధించినంత వరకు, నూలుతో పాటు, నేత పరిశ్రమదారుని పెట్టుబడి అంతర్గత భాగంగా వెళ్ళేది నూలు విలువే. ఈ విలువలోని భాగాలు నూలు పరిశ్రమదారుకు పెట్టుబడిగానూ, ఆదాయంగానూ, వేరు మాటల్లో చెప్పాలంటే మూల్యం చెల్లించిన శ్రమగా, అలా చెల్లించని శ్రమగా ఏ విధంగా విభజితమవుతాయనేది, అసలు సరుకు విలువ నిర్ధారణకు (సగటు విలువ ద్వారా జరిగే సవరింపులకే కాకుండా) బొత్తిగా సంబంధం లేని విషయం. లాభం అనేది లేదా మొత్తంపై అదనపు విలువ అనేది, సరుకు విలువకు పైబడిన మిగులు; ఎక్కువ ధర పెట్టడంవల్ల, ఒకరినొకరు మోసగించడంవల్ల, లేదా అమ్మకం ద్వారా పొందే లబ్ధివల్ల మాత్రమే ఇది హస్తగతం కాగలదు – అన్న భావం దీనంతటి వెనుక దాగి వుంది. ఉత్పత్తి ధర లేదా సరుకు విలువ సైతం చెల్లించబడినప్పుడు, అమ్మకందారుకు ఆదాయం రూపంలో కనిపించే సరుకు అంతర్భాగ విలువలు, సహజంగా చెల్లించబడినట్లే. ఇక్కడ గుత్తవ్యాపార ధరల సంగతి ఎత్తుకోలేదని వేరే చెప్పనవసరం లేదు.

రెండవది, స్థిర పెట్టుబడిగా వున్న సరుకుల్లోని అంతర్భాగాలను, ఏ ఇతర సరుకు విలువలాగానే, ఉత్పాదకులకు, ఉత్పత్తి సాధనాల సొంతదారులకు, వేతనాలు, లాభం, కౌలుగా విభజితమయ్యే విలువ భాగాలకింద తేల్చి చూపవచ్చు. యావత్తు సరుకు విలువా, ఒక సరుకులోని సామాజికంగా అవసరమైన శ్రమ కొలమానమే తప్ప మరేమీ కాదనే వాస్తవానికి ఇది కేవలం పెట్టుబడిదారీ వ్యక్తీకరణ

రూపమే. అయితే ఇందువల్ల ఏ పెట్టుబడి యొక్క సరుకు ఉత్పాదితాన్నైనా సరే మూడు విడివిడి భాగాలుగా – ఒకటి కేవలం పెట్టుబడిలోని స్థిర భాగానికీ, మరొకటి పెట్టుబడిలోని అస్థిర భాగానికీ, మూడవది అదనపు విలువకు మాత్రమే ప్రాతినిధ్యం వహించే భాగాలుగా – విభజించడానికి అవరోధమేర్పడదని Iవ సంపుటంలో ఇదివరకే నిరూపించాము.

స్టార్చ్ కింది విధంగా చెబుతున్నప్పుడు, ఆయన అనేకమంది ఇతరుల అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నాడు. "దేశ ఆదాయంగా వున్న విక్రయార్హ ఉత్పాదితాలను అర్థశాస్త్రంలో రెండు విభిన్న దృక్పథాలతో, వ్యక్తులకు సంబంధించి విలువలుగానూ, దేశానికి సంబంధించి సరుకులుగానూ చూడాలి. ఎందువల్లనంటే, ఒక దేశం ఆదాయాన్ని వ్యక్తి ఆదాయంలాగా, దాని విలువనుబట్టి అంచనా కట్టరాదు. దాని ఉపయోగాన్ని, అంటే అది తీర్చగల అవసరాలనుబట్టి అంచనా కట్టాలి." (Considerations sur le revenu national, పుట 19)

మొదటి విషయం, విలువపై ఆధారపడినదే కాకుండా, పెట్టుబడిదారీ పద్ధతిలో వ్యవస్థీకృతమైన ఉత్పత్తి విధానం గల ఒక దేశాన్ని కేవలం దేశ అవసరాలను తీర్చడానికి మాత్రమే పనిచేస్తున్న సమష్టి సంస్థగా పరిగణించడం ఒక తప్పు ఊహాకల్పన.

రెండవది, పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం రద్దయిన తరువాత సైతం అయితే, సామాజిక ఉత్పత్తి ఇంకా కొనసాగుతున్న స్థితిలో శ్రమకాల క్రమబద్ధీకరణ, వివిధ ఉత్పాదక బృందాల మధ్య సామాజిక శ్రమ విభజన, తుదకు దీనికంతటికీ ఆవరించిన జమా ఖర్చు లెక్కాచారమూ మునుపటి కన్నా మరింత అవసరమవుతుంది. ఈ అర్థంలో విలువ నిర్ధారణ – ప్రాబల్యం వహిస్తూనే వుంటుంది.

★ ★ ★

## అధ్యాయం - 50

# పోటీ సృష్టించిన భ్రమలు

సరుకుల విలువ లేక వాటి మొత్తం విలువచే క్రమబద్ధమైన ఉత్పత్తి ధర కింది విధంగా విభజితమవుతుందని ఇదివరకే నిరూపించాము :

1. సరుకు తయారీ సందర్భంగా ఉత్పత్తి విధానాల రూపంలో వినియోగమైపోయిన స్థిర పెట్టుబడి స్థానాన్ని భర్తీచేసే విలువ భాగం, లేక గత శ్రమకు ప్రాతినిధ్యం వహించే విలువ భాగం; ఒక్కమాటలో చెప్పాలంటే, సరుకుల ఉత్పత్తి ప్రక్రియలోకి ఈ ఉత్పత్తి సాధనాలు తీసుకెళ్ళిన విలువ లేక ధర. మేమిక్కడ చెబుతున్నది, ఆయా విడి సరుకులను గురించి కాదు. సరుకు పెట్టుబడిని గురించి అంటే ఒక నిర్దిష్ట కాలంలో, మాటవరసకు ఒక సంవత్సరంలో పెట్టుబడి యొక్క ఉత్పాదితం ప్రత్యక్షంగా వ్యక్తమయ్యే రూపం గురించి విడి సరుకు, సరుకు పెట్టుబడిలోని ఒక అంశంగా వుంటుంది. అంతేకాక, ఇది, తన విలువకు సంబంధించినంతవరకు, అదేవిధమైన అంతర్భాగాలుగా విభజితమవుతుంది.
2. అస్థిర పెట్టుబడికి ప్రాతినిధ్యం వహించే విలువ భాగం; శ్రామికుని ఆదాయాన్ని లెక్కగట్టేది దీన్నిబట్టే. ఇది అతని వేతనాలుగా మారుతుంది. అంటే, శ్రామికుడు ఈ వేతనాలను విలువలోని ఈ అస్థిర భాగంలో పునరుత్పత్తి చేశాడన్నమాట. క్లుప్తంగా చెప్పాలంటే, సరుకుల ఉత్పత్తిలో, పైన పేర్కొన్న స్థిర భాగానికి చేర్చిన నూతన శ్రమలో, మూల్యం చెల్లించబడిన భాగానికి ప్రాతినిధ్యం వహించే విలువ భాగమిది.
3. అదనపు విలువ అంటే ఉత్పత్తి అయిన సరుకుల విలువలో, మూల్యం చెల్లించబడని శ్రమకు, లేక అదనపు శ్రమకు మూర్తీభావంగా వున్న భాగం. విలువలోని ఈ ఆఖరు భాగం, మళ్ళీ స్వతంత్ర రూపాలను ధరిస్తుంది. ఇవి అదే సమయంలో కింది ఆదాయ రూపాలుగా వుంటాయి: పెట్టుబడిపై లాభం (కేవలం పెట్టుబడి, దానిపై కట్టే వడ్డీ, క్రియాశీల పెట్టుబడిగా దానిపై వచ్చిన పరిశ్రమ లాభం), ఉత్పత్తి ప్రక్రియలో పాల్గొనే భూమికి యజమానిగా వున్న వ్యక్తి తనకు చెందాలనే భూమి కౌలు. పైన పేర్కొన్న (2), (3) అంతర్భాగాలను – అంటే వేతనాలు, లాభం, కౌలు అనే ఆదాయపు రూపాలను ఎల్లప్పుడూ ధరించే విలువ భాగాన్ని (వేతనాలు మొదట అస్థిర పెట్టుబడి రూపాన్ని గడచిన తరువాతనే ఆ రూపాలను అవి ధరిస్తాయని వేరే చెప్పపని లేదు.) స్థిర పెట్టుబడి నుంచి వేరుచేసి చూపేదేమిటంటే, (1) స్థిర పెట్టుబడికి, సరుకులను ఉత్పత్తి చేసే సాధనాలకు కొత్తగా చేర్చిన అదనపు శ్రమకు పదార్థ రూపమైన యావత్తు విలువా దీనిలో నిక్షిప్తమై వుంది. ఇక్కడొక విషయం. స్థిర భాగాన్ని వదలివేస్తే, ఒక

సరుకు విలువ, అంటే కొత్తగా చేర్చిన శ్రమకు అది ప్రతీకగా వున్న మేరకు, నిరంతరాయంగా వేతనాలు, లాభం, కౌలు అనే మూడు ఆదాయపు రూపాలైన మూడు భాగాలుగా విభజిత మవుతుందని చెప్పడం సరియైనదే.[1] వీటి విలువ పరిమాణాలను అంటే మొత్తం విలువలో వీటి పాళ్ళను పైన విపులీకరించిన వివిధ నిర్దిష్ట నియమాలు నిర్ణయిస్తాయి. కానీ దీన్ని తిరగేసి చెప్పడం తప్పు. అంటే, వేతనాల విలువ, లాభం రేటు, కౌలు రేటు – ఇవి విలువలోని స్వతంత్ర భాగాలనీ, వీటి సమ్మేళన మూలంగా, స్థిర భాగాన్ని మినహాయించి, సరుకుల విలువ ఏర్పడుతూందనీ చెప్పడం తప్పు. వేరు మాటల్లో చెప్పాలంటే, అవి సరుకుల విలువలోని లేదా ఉత్పత్తి ధరలోని అంతర్భాగాలని చెప్పడం తప్పు.[2]

రెంటికీ తేడా సులభగ్రాహ్యమే.

500 పెట్టుబడి యొక్క ఉత్పాదితం విలువ $400_{స్థి.పె} + 100_{అ.పె} + 150_{అ.వి.} = 650$ అనీ, $150_{అ.వి.}$ మళ్ళీ 75 లాభం + 75 కౌలుగా విభజింపబడుతుందనీ అనుకొందాం. లేనిపోని చిక్కు ఎదురుకాకుండా వుండటానికై ఇది సగటు అంతర్నిర్మాణం గల పెట్టుబడి అని కూడా అనుకొందాం. అప్పుడు దాని ఉత్పత్తి ధర, దాని విలువ ఏకీభవిస్తాయి. అలాంటి వ్యష్టి పెట్టుబడి యొక్క ఉత్పాదితాన్ని మొత్తం పెట్టుబడిలోని ఏదో ఒక భాగం (దాని పరిమాణానికి అనుగుణమైన భాగం) యొక్క ఉత్పాదితంగా పరిగణించ వీలున్నప్పుడల్లా ఈ ఏకీభావం వుంటుంది.

వేతనాల పరిమాణం అస్థిర పెట్టుబడి పరిమాణమే. అదనపు విలువను మొత్తం పెట్టుబడిపై లెక్కగడతాం. కాబట్టి ఇక్కడ వేతనాలు, మదుపు పెట్టిన పెట్టుబడిలో 20 శాతం, అదనపు విలువ 30 శాతం అంటే లాభం 15 శాతం, కౌలు 15 శాతం. సరుకులో, కొత్తగా చేర్చబడిన శ్రమకు

1. పెట్టుబడిలోని స్థిర భాగానికి చేర్చబడిన విలువను వేతనాలు, లాభం, భూమి కౌలుకింద విడగొడుతూ న్నప్పుడు ఇవి విలువ భాగాలని వేరే చెప్పవలసిన అవసరం లేదు. ఈ విలువ ఎందులో కనిపిస్తుందో ఆ ప్రత్యక్ష ఉత్పాదితంలో ఈ మూడు వున్నట్టుగా మనం నిజంగా భావించవచ్చు. అంటే, ఏదో ఒక ఉత్పత్తి రంగంలో కార్మికులు, పెట్టుబడిదారులు తయారు చేసిన ప్రత్యక్ష ఉత్పాదితంలో ఉదాహరణకు నూలు పరిశ్రమలో తయారయ్యే నూలులో వున్నట్టు భావించవచ్చు. నిజానికి, మరే సరుకులోనైనా పాదార్థిక సంపదలోని అంతే విలువగల మరే భాగంలోనైనా సరే అవి వస్తురూపం ధరించిన మోతాదులోనే వెంట్రుకవాసి తేడా లేకుండా ఈ ఉత్పాదితంలోనూ ధరిస్తాయి. ఆచరణలో వేతనాలను డబ్బురూపంలో అంటే విలువకు అచ్చమైన వ్యక్తీకరణగా వున్న రూపంలో చెల్లిస్తారు. వడ్డీ, కౌలు కూడా అంతే. పెట్టుబడి దారుకు, తన ఉత్పాదితాన్ని విలువ యొక్క అచ్చమైన వ్యక్తీకరణగా వున్న రూపంలోకి మార్చుకోవడం, నిజంగా చాలా ముఖ్యం. పంపిణీలోనే ఈ రూపాంతరీకరణ ఊహ్యం. ఈ విలువులు ఏ ఉత్పాదితం నుంచి ఆవిర్భవించాయో ఆ ఉత్పాదితంగా అంటే ఏ సరుకు ఉత్పత్తి నుంచి ఆవిర్భవించాయో ఆ సరుకుగా పునఃపరివర్తన చెందుతాయా, కార్మికుడు తాను ప్రత్యక్షంగా తయారు చేసిన ఉత్పాదితంలో కొంత భాగాన్ని తానే తిరిగి కొంటాడా లేక మరోరకమైన శ్రమ యొక్క ఉత్పాదితాన్ని కొంటాడా అనే దానికి పై విషయంతో ఎట్టి సంబంధమూ లేదు. హెర్ రాడ్‌బెర్టస్ అనవసరంగా దీన్ని గురించి ఆవేశం పెంచుకొంటున్నాడు.
2. "ముడి ఉత్పాదితాల, తయారైన సరుకుల విలువను శాసించే సాధారణ నిబంధనే లోహాలకు కూడా వర్తిస్తుందని చెబితే చాలు. వాటి విలువ ఆధారపడి వుండేది లాభాల రేటుపై కాదు, వేతనాల రేటుపైనా కాదు, గనులకు చెల్లించే కౌలుపై కూడా కాదు. లోహాన్ని తయారు చేసి, మార్కెట్‌కు తీసుకు రావడానికి అవసరమైన మొత్తం శ్రమపై అది ఆధారపడి వుంది." (రికార్డో, Principles అధ్యా. III పుట 77)

ప్రాతినిధ్యం వహించే భాగం యొక్క విలువ $100_{\text{అ.పె}}+15_{\text{అ.వి.}}=250$కి సమానం. దీని పరిమాణం వేతనాలుగానూ, లాభంగానూ, కౌలుగానూ ఇది విభజితం కావడంపై ఆధారపడదు. శ్రమశక్తికి డబ్బు రూపంలో 100, మాట వరుసకు 100 పౌండ్లు చెల్లించబడింది. పై భాగాల పరస్పర సంబంధాన్ని బట్టి, 100 పౌండ్లు ముట్టిన శ్రమశక్తి 250 పౌండ్ల డబ్బుకు ప్రాతినిధ్యం వహించే పరిమాణం గల శ్రమను సరఫరా చేసిందని మనకు తెలుస్తూనే వుంది. కార్మికుడు తన కోసం చేసిన శ్రమకు $1\frac{1}{2}$ రెట్లు అదనపు శ్రమను చేశాడని దీని నుంచి స్పష్టమవుతూంది. పనిదినం=10 గంటలయితే, అతను 4 గంటలు తనకోసం, 6 గంటలు పెట్టుబడిదారుని కోసం పనిచేశాడన్నమాట. కాబట్టి 100 పౌండ్లు చెల్లించబడిన కార్మికుని శ్రమ – 250 పౌండ్ల డబ్బు విలువలో అభివ్యక్త మవుతూంది. ఈ 250 పౌండ్ల విలువ కాక, కార్మికునికీ పెట్టుబడిదారునికీ మధ్యా, పెట్టుబడిదారునికీ భూస్వామికీ మధ్యా విభజన చేయవలసినదేదీ లేదు. ఉత్పత్తి సాధనాల విలువకు అంటే 400కు కొత్తగా చేరిన మొత్తం విలువ ఇదే. కనుక ఉత్పత్తి అయినట్టి, తనలో వస్తురూపం ధరించిన శ్రమ పరిమాణం ప్రకారం నిర్ధారణ అయినట్టి, ఈ 250 సరుకు విలువే, కార్మికుడు, పెట్టుబడిదారు, భూస్వామి ఆదాయ రూపంలో (వేతనాలు, లాభం, కౌలు రూపంలో) ఈ విలువ నుంచి, తీసేసుకోగల డివిడెండ్లకు పరిమితి అవుతుంది.

అదే ఆంగిక అంతర్నిర్మాణం గల పెట్టుబడి, అంటే నియోగింపబడిన సజీవ శ్రమశక్తికీ, చలనంలో వుంచబడిన స్థిర పెట్టుబడికీ మధ్య అదే నిష్పత్తి గల పెట్టుబడి, 400 స్థిర పెట్టుబడిని చలనంలో వుంచిన అదే శ్రమశక్తికి 100 పౌండ్లకు బదులు 150 పౌండ్లు చెల్లించవలసివచ్చిందను కొందాం. అదనపు విలువలో లాభం, కౌలుపాలు భిన్న నిష్పత్తిలో వుందని కూడా అనుకొందాం. 100 పౌండ్ల అస్థిర పెట్టుబడి చలనంలో పెట్టిన శ్రమ పరిమాణాన్నే 150 పౌండ్ల అస్థిర పెట్టుబడి కూడా చలనంలో పెట్టిందని ఊహించుకొన్నాము కనుక, కొత్తగా ఉత్పత్తి అయిన విలువ, మునుపటిలాగానే 250కి సమానంగా వుంటుంది. మొత్తం ఉత్పాదితం విలువ కూడా మునుపటిలాగానే 650కి సమానంగా వుంటుంది. కానీ ఇప్పుడున్నది $400_{\text{స్థి.పె.}}+150_{\text{అ.పె}}+100_{\text{అ.వి.}}$ ఈ $100_{\text{అ.వి.}}$ ఇప్పుడు 45 లాభంగానూ, 55 కౌలుగానూ విభజింపబడుతుందనుకొందాం. కొత్తగా ఉత్పత్తి అయిన విలువ వేతనాల కింద, లాభం కౌలు కింద పంపిణీ అయ్యే నిష్పత్తి ఇప్పుడు చాలా భిన్నంగా వుంటుంది. తాను చలనంలో పెట్టిన మొత్తం శ్రమ పరిమాణం మునుపటంతే అయినప్పటికీ, మదుపు పెట్టిన మొత్తం పెట్టుబడి పరిమాణం కూడా అదే విధంగా భిన్నంగా వుంటుంది. మదుపు పెట్టిన పెట్టుబడిలో వేతనాలు $27\frac{3}{11}$ శాతం, లాభం $8\frac{2}{11}$ శాతం, కౌలు 10 శాతం వుంటాయి. ఆ విధంగా మొత్తం అదనపు విలువ దాదాపు 18 శాతానికి పైబడుతుంది.

వేతనాల్లో పెరుగుదల ఫలితంగా మొత్తం శ్రమలో ప్రతిఫలం చెల్లించబడకుండా వున్న భాగమూ, అందువల్ల అదనపు విలువా భిన్నంగా వుంటాయి. శ్రమదినంలో 10 గంటలుంటే, కార్మికుడు తన కోసం 6 గంటలు, పెట్టుబడిదారుకోసం 4 గంటలు మాత్రమే పని చేస్తాడు. లాభం, కౌలుల నిష్పత్తులు కూడా భిన్నంగా వుంటాయి. తగ్గిపోయిన అదనపు విలువ పెట్టుబడిదారునికి, భూస్వామికి మధ్య పంపిణీ అయ్యే నిష్పత్తి కూడా భిన్నంగా వుంటుంది. ఆఖరి విషయం, స్థిర పెట్టుబడి విలువ మునుపటిలాగే వుండి, మదుపు పెట్టిన అస్థిర పెట్టుబడి పెరిగి వుంటుంది. కనుక, తగ్గిపోయిన

అదనపు విలువ మరింత తగ్గిపోయిన మొత్తం లాభం రేటులో వ్యక్తమవుతూంది. ఇక్కడ మొత్తం లాభం రేటు అంటే, మదుపు పెట్టిన మొత్తం పెట్టుబడికీ, మొత్తం అదనపు విలువకూ మధ్య గల నిష్పత్తి అని మా భావం.

వేతనాలు, లాభం, కౌలు – వీటి పరస్పర నిష్పత్తులను నియంత్రించే నియమాల ప్రభావం ఎలా ఉన్నప్పటికీ, వేతనాల విలువలో, లాభం రేటులో, కౌలు రేటులో మార్పులు కొత్తగా ఉత్పత్తి అయిన సరుకు విలువ 250. పెట్టిన పరిమితుల్లో మాత్రమే జరుగగలవు. కౌలు గుత్తాధిపత్యపు ధరపై ఆధారపడి వున్న సందర్భం మాత్రమే ఇందుకు భిన్నంగా జరుగవచ్చు; ఇది విశ్లేషణను క్లిష్టతరం చేస్తుందే తప్ప నియమాన్ని ఏ విధంగానూ మార్చదు. ఎందువల్లనంటే, మనం ఈ సందర్భంలో అసలు ఉత్పాదితాన్ని మాత్రమే పరిగణనకు తీసుకొంటే, అప్పుడు మాత్రమే అదనపు విలువ విభజన మరో విధంగా వుంటుంది. కానీ ఇతర సరుకులతో పోల్చినప్పుడు దీనికి గల సాపేక్ష విలువను పరిశీలిస్తే, వాటి నుంచి అదనపు విలువలో కొంత భాగం ఈ ప్రత్యేక సరుకుకు బదలాయింపబడిందన్న దొక్కటే మనకు కనిపించే భేదమల్లా.

ఇంతకు ముందు వివరించిన వాటిని గుర్తుకు తెచ్చుకొందాం :

| ఉత్పాదితం విలువ | కొత్త విలువ | అదనపు విలువ రేటు | మొత్తం లాభం రేటు |
|---|---|---|---|
| మొదటి సందర్భంలో : $400_{\text{స్థి. పె.}} + 100_{\text{అ. పె.}} + 150_{\text{అ. వి.}} = 650$ | 250 | 150% | 30% |
| రెండవ సందర్భంలో : $400_{\text{స్థి. పె.}} + 150_{\text{అ. పె.}} + 100_{\text{అ. వి.}} = 650$ | 250 | $66\frac{2}{3}\%$ | $18\frac{2}{11}\%$ |

మొదటి విషయం; అదనపు విలువ మునుపున్న దానిలో మూడోవంతు, అంటే 150 నుంచి 100కి తగ్గిపోతుంది. లాభం రేటు మూడోవంతు కన్నా కాస్త ఎక్కువ, అంటే 30% నుంచి 18%కి తగ్గిపోతుంది. ఎందువల్లనంటే తగ్గిపోయిన అదనపు విలువను మదుపు పెట్టిన మొత్తం పెట్టుబడిని బట్టి లెక్కవేయాలి. మరి మొత్తం పెట్టుబడి పెరిగింది. కానీ అదనపు విలువ రేటు పడిపోయిన నిష్పత్తిలోనే లాభం రేటు పడిపోదు. అదనపు విలువ రేటు $\frac{150}{100}$ నుంచి $\frac{100}{150}$ కు, అంటే 150 శాతం నుంచి $66\frac{2}{3}$ శాతానికి పడిపోగా, లాభం రేటు $\frac{150}{500}$ నుంచి $\frac{100}{550}$ కి, అంటే 30% నుంచి $18\frac{2}{11}$ శాతానికి మాత్రమే పడిపోతుంది. కాబట్టి నిష్పత్తి రీత్యా లాభం రేటు అదనపు విలువ రాసి కన్నా ఎక్కువగానూ, కానీ అదనపు విలువ రేటు కన్నా తక్కువగానూ పడిపోతుంది. అంతేకాదు, పెట్టుబడిలోని అస్థిర భాగం పెరుగుదల వల్ల మదుపుపెట్టిన పెట్టుబడి పెరిగినప్పటికీ, ఒకే పరిమాణం గల శ్రమ నియుక్తమైనంత కొలది, ఉత్పాదితాల విలువ, వాటి రాసి మారవు. మదుపు పెట్టిన పెట్టుబడిలోని ఈ పెరుగుదల, కొత్త పరిశ్రమాది సంస్థల స్థాపనను చేపట్టిన పెట్టుబడిదారునికి బాగా అనుభూత మవుతుంది. కానీ మొత్తం పునరుత్పత్తిని దృష్టిలో ఉంచుకొన్నప్పుడు అస్థిర పెట్టుబడి పెరిగిందంటే, కొత్తగా చేర్చిన శ్రమ కొత్తగా సృష్టించిన విలువలో మునుపటికన్నా ఎక్కువ భాగం వేతనాలుగా మారిందన్న మాట. ఆ విధంగా, అది మొదట అదనపు విలువగా, అదనపు ఉత్పాదితంగా మారటానికి బదులు, మొదట అస్థిర పెట్టుబడిగా మారిందన్నమాట; అంతే! కాబట్టి ఉత్పాదితం విలువ అంతే

వుంటుంది. ఎందువల్లనంటే అది ఒకవైపు స్థిర పెట్టుబడి (400) విలువ వల్లనో, మరోవైపు కొత్తగా చేర్చిన శ్రమకు ప్రతీకగా వున్న 250 వల్లనూ పరిమితమైన విలువ. కానీ ఈ రెండూ మారకుండా వుంటాయి. ఈ ఉత్పాదితం స్థిర పెట్టుబడిలోకి మళ్ళీ ప్రవేశించిన మేరకు, ఇది మునుపటిలాగే, అది పరిమాణం గల విలువలో అదే పరిమాణంలోని ఉపయోగపు విలువకు ప్రాతినిధ్యం వహిస్తుంది. కాబట్టి, స్థిర పెట్టుబడి అంశాల అదే రాసికి అదే విలువ వుంటుంది. వేతనాలు పెరగడానికి కారణం కార్మికునికి తన శ్రమలో మునుపటికన్నా ఎక్కువ భాగం అందడం కాక, శ్రమ ఉత్పాదకత తగ్గడం వల్ల; అతనికి తన శ్రమలో మునుపటికన్నా ఎక్కువభాగం అందడం ఆ పెరుగుదలకు కారణమయినప్పుడు, పరిస్థితి మరో విధంగా వుంటుంది. ఈ సందర్భంలో మూల్యం చెల్లించబడిన, చెల్లించబడని అదే శ్రమకు మూర్తీభావమైన మొత్తం విలువ మునుపటంతే వుంటుంది. కానీ ఈ మొత్తం శ్రమకు మూర్తీభావమైన ఉత్పాదితాల రాసి తగ్గుతుంది. ఫలితంగా ఈ ఉత్పాదితంలోని ప్రతి సమభాగం యొక్క ధర పెరుగుతుంది. ఎందువల్లనంటే ప్రతిభాగంలో మునుపటికన్నా ఎక్కువ శ్రమ నిక్షిప్తమై వుంటుంది. పెరిగిన వేతనాలు 150 మునుపు వేతనాలు 100 ప్రాతినిధ్యం వహించిన దానికన్నా ఎక్కువ ఉత్పాదితానికి ప్రాతినిధ్యం వహించవు. తగ్గిపోయిన అదనపు విలువ 100 మునుపటి ఉత్పాదితంలోని $\frac{2}{3}$ వ భాగానికి మాత్రమే, అంటే, మునుపు 100లో వున్న ఉపయోగపు విలువల రాసిలోని $66\frac{2}{3}$ శాతానికే ప్రాతినిధ్యం వహిస్తాయి. ఈ సందర్భంలో ఈ ఉత్పాదితం స్థిర పెట్టుబడిలో ప్రవేశించిన మేరకు స్థిర పెట్టుబడి వెల కూడా ఎక్కువవుతుంది. కానీ, ఇది వేతనాల పెరుగుదల ఫలితం కాదు సరికదా, వేతనాల పెరుగుదలే సరుకుల ధరలో వచ్చిన పెరుగుదల ఫలితమన్నమాట, అదే పరిమాణంలోని శ్రమ ఉత్పాదకత తగ్గిన ఫలితమన్నమాట. ఇక్కడ వేతనాల పెరుగుదల వల్ల ఉత్పాదితాలు ప్రియమయ్యాయని పైకి కనిపిస్తుంది. అయితే ఈ పెరుగుదల, శ్రమ ఉత్పాదకత తగ్గుదల మూలంగా సరుకుల విలువలో వచ్చిన మార్పుకు కారణం కాదు సరికదా, అది ఆ మార్పు ఫలితం.

మరోవైపు, ఇతర పరిస్థితులన్నీ యథాతథంగా వున్నప్పుడు, అంటే నియుక్తమైన అదే శ్రమ పరిమాణానికి 250 ప్రాతినిధ్యం వహిస్తున్నప్పుడు, నియుక్తమైన ఉత్పత్తి సాధనాల విలువ పెరిగితే, లేక పడిపోతే, అదే పరిమాణం గల ఉత్పాదితాల విలువ అదే పరిమాణంలో పెరుగుతుంది. లేక పడిపోతుంది. 450స్థి.పె+100అ.పె+150అ.వి. ఇచ్చే ఉత్పాదితం విలువ = 700. అయితే 350స్థి.పె.+100అ.పె+150అ.వి. అదే పరిమాణం గల ఉత్పాదితాలకు, మునుపటి 650కి, 600కు మాత్రమే సమానమైన విలువను ఇస్తుంది. కాబట్టి, అదే పరిమాణం గల శ్రమవల్ల చలనంలో వున్న పెట్టుబడి పెరిగితే లేక తగ్గిపోతే, ఇతర పరిస్థితులు యథాతథంగా వున్న స్థితిలో, ఈ తగ్గుదలకు లేక పెరుగుదలకు, పెట్టుబడిలోని స్థిరభాగం విలువ యొక్క పరిమాణంలో వచ్చిన మార్పు కారణమైనప్పుడు, ఉత్పాదితం విలువ పెరుగుతుంది లేక తగ్గుతుంది. కానీ మదుపు పెట్టిన పెట్టుబడి పెరుగుదలకు లేక తగ్గుదలకు పెట్టుబడిలోని అస్థిర భాగం విలువ యొక్క పరిమాణంలో వచ్చిన మార్పు కారణమైతే, అప్పుడు ఉత్పాదితం విలువ మారకుండా యథాతథంగా వుంటుంది. ఇక్కడ శ్రమ ఉత్పాదకత యథాతథంగా వుందని ఊహించుకొంటున్నాం. స్థిర పెట్టుబడి విషయంలో దాని విలువ పెరుగుదలకు, లేక తగ్గుదలకు పరిహారంగా వున్న తద్విరుద్ధ చలనమేదీ లేదు. కానీ అస్థిర పెట్టుబడి విషయంలో,

దాని విలువ పెరుగుదలకు లేక తగ్గుదలకు పరిహారంగా ఒక విరుద్ధ చలనం వుంది. అది అదనపు విలువ చలనం. ఫలితంగా అస్థిర పెట్టుబడి విలువ + అదనపు విలువ, అంటే ఉత్పత్తి సాధనాలకు శ్రమ కొత్తగా చేర్చినట్టి, ఉత్పాదితంలో కొత్తగా నిక్షిప్తమైనట్టి విలువ యథాతథంగా వుంటుంది. ఇక్కడ కూడా శ్రమ, ఉత్పాదకత మారకుండా వుందని ఊహించుకొంటున్నాం.

కానీ, అస్థిర పెట్టుబడి విలువ లేక వేతనాల పెరుగుదలకు లేక తగ్గుదలకు, సరుకు ధర పెరుగుదల లేక తగ్గుదల కారణమైతే, అంటే మదుపు పెట్టిన ఈ పెట్టుబడిచే నియుక్తమైన శ్రమ ఉత్పాదకత తగ్గుదల లేక పెరుగుదల కారణమైతే, దాని ప్రభావం ఉత్పాదితం విలువపై పడుతుంది. కానీ ఈ సందర్భంలో వేతనాల పెరుగుదల లేక తగ్గుదల కేవలం ఫలితమే తప్ప కారణం కాదు.

మరోవైపు, పైన పేర్కొన్న ఉదాహరణలో స్థిర పెట్టుబడి 400స్థి.పె. గానే వుంటుందనుకొందాం. 100అ.పె+150అ.వి. నుంచి 150అ.పె.+100అ.వి.కి మార్పుకు, అంటే అస్థిర పెట్టుబడి పెరుగుదలకు కారణం పరిశ్రమలోని ఈ ప్రత్యేక శాఖలో, ఉదాహరణలో నూలు పరిశ్రమలో శ్రమ ఉత్పాదకత తగ్గుదలకాక, బహుశా మరే రంగంలోనో, కార్మికునికి ఆహార పదార్థాలు సరఫరా చేసే వ్యవసాయంలో శ్రమ ఉత్పాదకత తగ్గుదల కారణమైనట్లయితే, అప్పుడు ఉత్పాదితం విలువ మారకుండా యథాతథంగా వుంటుంది. 650కు సమానమైన విలువకు అప్పుడు కూడా అదే పరిమాణం గల నూలు ప్రాతినిధ్యం వహిస్తుంది.

పైన చెప్పిన దాన్నిబట్టి ఇంకో సంగతి కూడా రుజువవుతోంది : స్థిర పెట్టుబడి వ్యయం తగ్గడానికి, కార్మికుని వినియోగంలో ప్రవేశించే ఉత్పాదితాలకు సంబంధించిన ఉత్పత్తి విభాగాల్లో పొదుపులు మొదలైనవి కారణమైనప్పుడు, ఇవి నియుక్త శ్రమ ఉత్పాదకత ప్రత్యక్ష పెరుగుదల లాగానే, వేతనాల తగ్గుదలకు దారితీయవచ్చు. ఎందువల్లనంటే కార్మికులకు జీవనావసరాలు చౌక అవుతాయి. వేతనాల తగ్గుదల అదనపు విలువ పెరుగుదలకు దారితీయవచ్చు. ఫలితంగా, ఈ సందర్భంలో రెండు కారణాలవల్ల లాభం రేటు పెరుగుతుంది. ఆ కారణాలివి : ఒకవైపు, స్థిర పెట్టుబడి విలువ తగ్గడం, మరోవైపు అదనపు విలువ పెరగడం. అదనపు విలువ లాభంగా పరివర్తన చెందడానికి సంబంధించిన మన పరిశీలనలో, వేతనాలు పడిపోకుండా స్థిరంగా వుంటాయని ఊహించుకొన్నాము. ఎందువల్లనంటే, అక్కడ అదనపు విలువ రేటులో వచ్చే మార్పులతో నిమిత్తం లేకుండా లాభం రేటులోని ఒడిదుడుకులను మనం పరిశీలించవలసి వచ్చింది. అంతేకాక, అక్కడ విశదీకరించిన నియమాలు సార్వత్రికమైనవి. కార్మికుని వినియోగంలోకి ప్రవేశించని వస్తువులను ఉత్పత్తి చేసే పెట్టుబడి మదుపుకు కూడా అవి వర్తిస్తాయి. అందువల్ల, ఉత్పాదితం విలువలోని మార్పుల ప్రభావం వేతనాలపై పడదు.

★ ★ ★

కాబట్టి ఏటా కొత్త శ్రమ ఉత్పత్తి సాధనాలకు, లేక పెట్టుబడిలోని స్థిర భాగానికి చేర్చిన కొత్త విలువ పడిపోయి, వివిధ ఆదాయ రూపాలుగా, అంటే వేతనాలు, లాభం, కౌలుగా విభజితం కావడంవల్ల అసలు విలువ పరిమితులు ఈ వివిధ అభివర్గాల మధ్య పంపిణీ కావలసిన మొత్తం విలువ పరిమితులు, ఏ మాత్రమూ మారవు. ఈ విడి విడి భాగాల పరస్పర సంబంధాలవల్ల ఈ

భాగాల మొత్తం, ఈ నిర్ణీత విలువ పరిమాణం ఎలా మారదో అదీ అంతే. 100 అనే సంఖ్య 50+50గా విభజితమైనా లేక 20+70+10గా, లేక 40+30+30గా విభజితమైనా, అది ఎల్లప్పుడూ 100గానే వుంటుంది. ఉత్పాదితం విలువలో, ఈ ఆదాయాలుగా విభజితమయ్యే భాగం, పెట్టుబడి విలువలోని స్థిర భాగంలాగానే, సరుకుల విలువచే, అంటే ప్రతిసారి వాటిలో నిక్షిప్తమైన శ్రమ పరిమాణంచే నిర్ధారణ అవుతుంది. కాబట్టి మొదట నిర్ణీతమై వుండేది వేతనాలు, లాభం, కౌలుల మధ్య పంపిణీ కావలసిన సరుకుల విలువ పరిమాణం; వేరు మాటల్లో చెబితే, ఈ సరుకుల విలువలోని భాగాల పూర్తి మొత్తం. రెండవది, ఆయా అభివర్గాలకు సంబంధించినంత వరకు, వాటిని క్రమబద్ధం చేసే వాటి సగటు పరిమితులు కూడా నిర్ణీతమైనవే. ఈ పరిమితికి వేతనాలు ప్రాతిపదిక అవుతాయి. వాటిని ఒకవైపు ఒక ప్రకృతి నియమం క్రమబద్ధం చేస్తుంది. వాటి కనిష్ఠ పరిమితిని కార్మికునికి తన శ్రమశక్తి సంరక్షణకూ, దాని పునరుత్పత్తికీ అవసరమైన జీవనావసరాల భౌతిక కనీస స్థాయి నిర్ణయిస్తుంది. అంటే, ఒక నిర్దిష్టమైన సరుకుల పరిమాణం నిర్ణయిస్తుంది. ఈ సరుకుల విలువను వాటి పునరుత్పత్తికి అవసరమైన శ్రమకాలం నిర్ణయిస్తుంది. ఆ విధంగా, ఉత్పత్తి సాధనాలకు చేర్చిన కొత్త శ్రమలోని భాగం లేక ఈ ఆవశ్యక జీవనాధారాల విలువకు సమతుల్యమైన దాని ఉత్పత్తి, పునరుత్పత్తులకు ప్రతి పనిదినమూ కార్మికునికి అవసరమైన భాగం నిర్ణయిస్తుంది. ఉదాహరణకు, అతని సగటు దినసరి జీవనాధారాలకున్న విలువ = 6 సగటు పని గంటలయితే, అతను సగటున రోజుకు తన కోసం ఆరుగంటలు పనిచేయవలసి వుంటుంది. అతని శ్రమశక్తి వాస్తవ విలువకూ, ఈ భౌతిక కనిష్ఠ స్థాయికీ తేడా వుంటుంది. ఈ వ్యత్యాసం శీతోష్ణస్థితిని బట్టి సామాజికాభివృద్ధి స్థాయిని బట్టి వుంటుంది. ఈ వాస్తవ విలువ ఆధారపడి వుండేది కేవలం భౌతికావసరాలపైనే కాదు, చారిత్రకంగా అభివృద్ధి చెందిన సామాజిక అవసరాలపైన కూడా. రెండవ ప్రకృతిగా రూపొందే అవసరాలివి. కానీ, క్రమబద్ధం చేసే ఈ సగటు వేతనం ప్రతి దేశంలోనూ, ఒక నిర్ణీత కాలంలో ఒక నిర్ణీత పరిమాణం. ఆ విధంగా ఇతర యావత్తు ఆదాయం విలువకూ దాని పరిమితి ఉంటుంది. మొత్తం పనిదినంలో నుంచి వేతనంలో నిక్షిప్తమై వున్న పనిదిన భాగం తీసివేయగా మిగిలిన భాగం నిక్షిప్తమై వున్న విలువకు ఇది ఎప్పుడూ సమానం. (ప్రస్తుత సందర్భంలో మొత్తం పనిదినం సగటు శ్రమదినంతో ఏకీభవిస్తుంది. ఎందువల్లనంటే, మొత్తం సమాజం యొక్క పెట్టుబడి చలనంలో పెట్టిన మొత్తం శ్రమ పరిమాణం ఇందులో వుంటుంది.) కాబట్టి దీని పరిమితిని మూల్యం చెల్లించబడని శ్రమ యొక్క అభివ్యక్తిగా వున్న విలువ పరిమితి, అంటే మూల్యం చెల్లించబడని ఈ శ్రమ పరిమాణం నిర్ణయిస్తుంది. కార్మికునికి తన వేతనం విలువను పునరుత్పత్తి చేసేందుకు పనిదినంలో పట్టే భాగానికి గరిష్ఠ పరిమితి, వేతనం యొక్క కనిష్ట భౌతిక స్థాయినిబట్టి వుంటుంది. కానీ అదనపు విలువ నిక్షిప్తమై వున్న మిగతా పనిదిన భాగానికి, అంటే అదనపు విలువకు ప్రాతినిధ్యం వహించే భాగానికి పరిమితి, పనిదినం యొక్క గరిష్ట భౌతిక స్థాయినిబట్టి వుంటుంది. అంటే, సాధారణంగా, కార్మికులు పనిచేస్తూనే, తన శ్రమశక్తిని పదిలంగా వుంచుకొని దాన్ని పునరుత్పత్తి చేసుకోగల దినసరి మొత్తం శ్రమకాలం. ఏటా కొత్తగా చేర్చే శ్రమకు ప్రాతినిధ్యం వహించే విలువ పంపిణీ కావటం గురించే ఇక్కడ మనం చర్చిస్తున్నాం కనుక – పనిదినాన్ని ఇక్కడ ఒక స్థిర పరిమాణంగా పరిగణించవచ్చు. దాని భౌతిక గరిష్ఠ స్థాయి నుంచి అది ఎంత ఎక్కువగా లేక ఎంత తక్కువగా వైదొలగినా, దాన్ని స్థిర

పరిమాణంగానే ఊహించుకొంటున్నాం. అదనపు విలువగా రూపొంది, లాభంగానూ భూమి కౌలుగానూ విభజితమయ్యే విలువ భాగం యొక్క చరమావధి ఆ విధంగా నిర్ణీతమైంది. పనిదినంలో మూల్యం చెల్లించబడిన భాగం పోను, అలా చెల్లించబడకుండా వున్న మిగతా భాగం అంటే, మొత్తం ఉత్పాదితం విలువలో ఈ అదనపు శ్రమ వున్న భాగం దీన్ని నిర్ణయిస్తుంది. ఆ విధంగా ఒక పరిమితి కలిగి, మదుపు పెట్టిన మొత్తం పెట్టుబడినిబట్టి మదింపు చేయబడే అదనపు విలువను, నేను పేర్కొన్నట్టుగా లాభం అని పేర్కొన్నట్టయితే, ఈ లాభం – దాని నిరపేక్ష పరిమాణానికి సంబంధించినంత వరకు, అదనపు విలువకు సమానమైనది. కాబట్టి అదనపు విలువగానే, లాభం పరిమితులు సైతం నిర్ణీతమైనవి. మరోవైపు లాభం రేటు స్థాయి కూడా. అదే విధంగా, సరుకుల విలువచే నిర్ణయమైన కొన్ని నిర్దిష్ట పరిమితుల్లో వుండే ఒక పరిమాణం. అది మొత్తం అదనపు విలువకూ, ఉత్పత్తిలో మదుపు పెట్టిన మొత్తం సామాజిక పెట్టుబడికీ మధ్యగల నిష్పత్తి. ఈ పెట్టుబడి = 500 (మిలియన్లు) అనీ, అదనపు విలువ = 100 అనీ అనుకొందాం. అప్పుడు లాభం రేటు చరమావధి 20%. వివిధ ఉత్పత్తి రంగాల్లో మదుపు పెట్టిన పెట్టుబడుల మధ్య, ఈ రేటు ననుసరించి సామాజిక లాభం పంపిణీ అవుతుంది. ఈ పంపిణీ వల్ల ఉత్పత్తి ధరలు ఏర్పడతాయి. ఇవి సరుకుల విలువలంతే వుండవు; వాటినుంచి కొంత వైదొలగి వుంటాయి. నిజంగా నియంత్రించే సగటు మార్కెట్ ధరలు ఇవే. అయితే విలువలచే ధరల నిర్ధారణను గానీ, నియతమైన లాభ పరిమితులను గానీ, ఈ వైదొలగడమనేది రద్దు చేయదు. ఒక సరుకు విలువ, సరుకు ఉత్పత్తిలో వినియోగమైపోయిన పెట్టుబడి + ఆ సరుకులో వున్న అదనపు విలువకు సమానంగా ఉండటానికి మారు, దాని ఉత్పత్తి ధర ఇప్పుడు ఉత్పత్తిలో వినియోగమైన పెట్టుబడి స్థి.పె+సరుకు ఉత్పత్తిలో మదుపుపెట్టిన పెట్టుబడిపై సార్వత్రిక లాభం రేటు ఫలితంగా, ప్రస్తుత సందర్భంలో 20 శాతం ఫలితంగా, దాని వాటాకు వెళ్ళే అదనపు విలువకు సమానంగా వుంటుంది. ఇక్కడ వినియోగమైన పెట్టుబడినీ, కేవలం నియుక్తమైన పెట్టుబడినీ లెక్కలోకి తీసుకొంటున్నాం. కానీ, ఈ అదనపు 20 శాతం మొత్తాన్ని యావత్తు సామాజిక పెట్టుబడి సృష్టించిన అదనపు విలువ, ఈ పెట్టుబడి విలువతో దానికి గల సంబంధం నిర్ధారణ చేస్తున్నాయి. ఈ కారణం వల్ల ఇది 20 శాతమే తప్ప 10 శాతమూ కాదు, లేదా 100 శాతమూ కాదు. కనుక, ఉత్పత్తి ధరలుగా విలువల పరివర్తన లాభంపై గల పరిమితులను తొలగించదు. అది సామాజిక పెట్టుబడిగా వున్న వివిధ ప్రత్యేక పెట్టుబడుల మధ్య దాని పంపిణీని మారుస్తుంది, అంతే. అంటే, ఈ మొత్తం పెట్టుబడిలో అవి ఏ నిష్పత్తిలో భాగాలవుతున్నాయో ఆ నిష్పత్తిలో అది వాటి మధ్య లాభాన్ని పంపిణీ చేస్తుంది. మార్కెట్ ధరలు క్రమబద్ధం చేసే ఈ ఉత్పత్తి ధరలకన్నా ఎక్కువగానో, తక్కువగానో వుంటాయి. కానీ ఈ ఎక్కువ తక్కువలు ఒకదానినొకటి సమతూకంలో వుంచుతాయి. కొంత దీర్ఘకాలానికి సంబంధించిన ఈ ధరల పట్టీని గనుక మనం పరిశీలించినట్లయితే, శ్రమ ఉత్పాదకత మార్పువల్ల సరుకుల వాస్తవ విలువ మారిన సందర్భాలనూ, అదే విధంగా ప్రాకృతికమైన లేదా సామాజికమైన హఠాత్ ఘటనలవల్ల ఉత్పత్తి ప్రక్రియకు అంతరాయమేర్పడిన సందర్భాలనూ పరిశీలించినట్లయితే, ఈ వ్యత్యాసాల పరిమితులు సాపేక్షంగా ఎంత అల్పమైనవో, అవి ఎంత క్రమబద్ధంగా ఒకదానికొకటి పరిహారంగా వుంటూ వచ్చాయో చూస్తే మనకు ఆశ్చర్యం కలుగుతుంది. సామాజిక పరిణామాల విషయంలో క్వెట్‌లెట్ మన దృష్టికి తెచ్చిన క్రమపరచే సగటుల ప్రాబల్యం

ఇక్కడ కూడా మనకు అగుపిస్తుంది. సరుకుల విలువలను ఉత్పత్తి ధరలుగా సమానం చేసే క్రమానికి ఎటువంటి ఆటంకాలు ఎదురుకాకుంటే, అప్పుడు కౌలు వ్యత్యాస కౌలు అవుతుంది. అంటే నియంత్రక ఉత్పత్తి ధరల మూలంగా కొంతమంది పెట్టుబడిదారులకు లభించినట్టి, ఇప్పుడు భూస్వామి స్వాహా చేసుకొన్నట్టి అదనపు లాభాలను సమానం చేయడానికి కౌలు పరిమితమై వుంటుందన్నమాట. కనుక, ఇక్కడ లాభం యొక్క సార్వత్రిక రేటు ఉత్పత్తి ధరలను నియంత్రించడంవల్ల ఆయా విడివిడి లాభం రేట్లలో వచ్చే వ్యత్యాసాలకు కౌలు విలువ ఖచ్చితంగా పరిమితమై వుంటుంది. సరుకుల విలువలు ఉత్పత్తి ధరలకు సమానంగా వుండే క్రమాన్ని భూ ఆస్తి అడ్డుకొని, నిరపేక్ష కౌలును స్వాయత్తం చేసుకొంటే, అప్పుడు నిరపేక్ష కౌలు వ్యవసాయ సరుకుల ఉత్పత్తి ధర వున్న వాటి విలువ ఎంత ఎక్కువో ఆ మిగులుకు పరిమితమై వుంటుంది. అంటే లాభం యొక్క సార్వత్రిక రేటు పెట్టుబడులకు కేటాయించిన లాభం రేటుకు మించి ఆ ఉత్పాదితాల్లో వున్న అదనపు విలువకు పరిమితమై వుంటుంది. కౌలుకు గల పరిమితి ఈ తేడాయే. ఇది మునుపటిలాగా, సరుకుల్లో నిక్షిప్తమై వున్న నిర్ణీత అదనపు విలువలో ఒక భాగం తప్ప మరొకటి కాదు.

చివరి విషయం. వివిధ ఉత్పత్తి రంగాల్లో కల్పిత లేదా సహజ గుత్తాధిపత్యాల రూపంలోని ప్రత్యేకించి భూ ఆస్తిపై గల గుత్తాధిపత్యం రూపం అడ్డంకులు అదనపు విలువ సగటు లాభానికి సమానం కాకుండా నిరోధించినందువల్ల గుత్తాధిపత్యపు ధరకు అవకాశముంటుంది. ఇది ఉత్పత్తి ధరకు, అటువంటి గుత్తాధిపత్యపు ప్రభావానికి లోనైన సరుకుల విలువకు మించి వుంటుంది. అయినప్పటికీ, సరుకుల విలువ విధించిన పరిమితులు, ఇందువల్ల తొలగిపోవు. కొన్ని సరుకుల గుత్తాధిపత్యపు ధర మూలంగా, ఈ ధర గల సరుకులకు ఇతర సరుకు ఉత్పత్తిదారుల లాభంలో ఒక భాగం బదిలీ అవుతుంది. అంటే, వివిధ ఉత్పత్తి రంగాల మధ్య అదనపు విలువ పంపిణీలో పరోక్షంగా స్థానిక అంతరాయం సంభవిస్తుంది. కానీ ఇది అదనపు విలువకు గల పరిమితిని మార్చదు. కార్మికుడు తన శ్రమశక్తికి మునుపటి విలువే పొందుతున్నప్పుడు, గుత్తాధిపత్యపు ధర గల సరుకు కార్మికుని అవశ్య వినియోగంలో ప్రవేశించినట్లయితే, అందువల్ల వేతనం పెరుగుతుంది; ఫలితంగా అదనపు విలువ తగ్గుతుంది. ఇలా ప్రవేశించడం వల్ల వేతనాలు శ్రమశక్తి విలువకన్నా తగ్గవచ్చు కానీ, ఈ గుత్తాధిపత్యపు సరుకు వేతనాలు కనిష్ఠ భౌతిక స్థాయి పరిమితికి మించి ప్రవేశించిన మేరకు మాత్రమే తగ్గుతాయి. ఈ సందర్భంలో గుత్తాధిపత్యపు ధర వాస్తవ వేతనాల నుంచి (కార్మికుడు ఒక నిర్దిష్ట పరిమాణంలోని శ్రమకు పొందే అదే పరిమాణంలోని ఉపయోగపు విలువల నుంచి), ఇతర పెట్టుబడిదారుల లాభం నుంచి కోత పెట్టడం ద్వారా చెల్లించడం జరుగుతుంది. సరుకుల ధరల మామూలు నియంత్రణపై గుత్తాధిపత్యపు ధరకు గల ప్రభావం యొక్క పరిమితులు దృఢంగా నిర్ణయమై వుంటాయి. వాటిని ఖచ్చితంగా లెక్కగట్టవచ్చు.

సరుకులకు కొత్తగా చేరిన విలువ విభజనకు, మొత్తం మీద ఆదాయంగా విడదీయ వీలున్న విలువ విభజనకు గల నిర్ణీత, నియంత్రక పరిమితులను అవసర శ్రమకు, అదనపు శ్రమకు మధ్య సంబంధం నిర్దేశిస్తున్నట్లుగానే లాభంగానూ, కౌలుగానూ అదనపు విలువ విభజనకు గల పరిమితులను కూడా లాభం రేటు సమానీకరణను నియంత్రించే నియమాలు నిర్దేశిస్తున్నాయి. వడ్డీ కింద, పరిశ్రమ లాభం కింద జరిగే విభజన సంగతికి వస్తే, ఈ రెంటికీ కలిపి సగటు లాభమే పరిమితి అవుతుంది.

అది ఒక నిర్ణీత పరిమాణం గల విలువ. వడ్డీ కింద, లాభం కింద విభజితం కాగలదీ, అలా విభజితమయ్యేదీ అదొక్కటే. ఏ నిర్దిష్ట నిష్పత్తిలో ఈ విభజన జరుగుతుందనేది యాదృచ్ఛికమైనది. అది పోటీ పరిస్థితులపై పూర్తిగా ఆధారపడి వుంటుంది. ఇతర సందర్భాల్లో సరఫరా గిరాకీల సమతూకం వుందంటే తన నియంత్రక సగటు ధరల నుంచి మార్కెట్ ధరలు వైదొలగటానికి వీలులేదన్నమాట. అంటే వ్యాపార పోటీ ప్రభావానికి వీలులేదన్నమాట. కానీ ఇక్కడ ఆ పోటీ ఒక్కటే నిర్ణాయకాంశం ఎందుకు? ఎందుకంటే, ఒకే ఉత్పాదన కారకం – పెట్టుబడి – అదనపు విలువలోని తన వాటాను తన ఇద్దరు యజమానుల మధ్య పంపిణీ చేయవలసి వుంటుంది. కానీ, ఇక్కడ సగటు లాభ విభజనకు ఒక ఖచ్చితమైన క్రమబద్ధమైన పరిమితి లేదన్న వాస్తవం సరుకు విలువలో భాగంగా దానికి గల పరిమితిని తొలగించదు. ఏదైనా ఒక వ్యాపారంలో ఇద్దరు భాగస్వాములు తమ లాభాన్ని భిన్నమైన బాహ్య పరిస్థితులవల్ల అసమంగా పంచుకొంటారనే వాస్తవం ఈ లాభ పరిమితులను ఏ విధంగానూ ప్రభావితం చేయనట్లే – ఇదీను.

కాబట్టి, ఉత్పత్తి సాధనాల విలువకు కొత్తగా చేర్చిన శ్రమ నిక్షిప్తమై వున్న సరుకు విలువలోని ఆ భాగం వివిధ విభాగాలుగా విభజితమై, పరస్పర ప్రమేయం లేని ఆదాయ రూపాలు ధరించినప్పటికీ, వేతనాలు, లాభం, కౌలు – ఈ మూడూ కలిసి సరుకుల నియంత్రక ధరకు (సహజ ధరకు, prix necessaire) మూలాధారమవుతాయని అనుకొనేందుకు ఇది కారణం కాజాలదు. ఇలా అనుకొన్నామంటే, ఈ మూడు భాగాలుగా విభజితమయ్యే మూలాంశం, విలువ స్థిర భాగాన్ని తీసివేయగా మిగిలిన సరుకు విలువ కాదన్నమాట. పైపెచ్చు ఈ మూడు భాగాల్లోని ప్రతి ఒక్కదాని ధర స్వతంత్రంగా నిర్ధారణ అవుతుంది. ఈ మూడు స్వతంత్ర పరిమాణాలను కూడితే, అప్పుడు సరుకుల ధర ఏర్పడుతుందన్నమాట. కానీ వాస్తవంలో, వేతనాలు, లాభం, కౌలు – వీటి యావత్తు విలువల మొత్తానికి ముందే వున్న పరిమాణం సరుకు విలువ. లాభం, కౌలు, ఈ రెంటి సాపేక్ష పరిమాణాలతో ఇక్కడ నిమిత్తం లేదు. పైన పేర్కొన్న తప్పు భావనలో వేతనాలు, లాభం, కౌలు – ఇవి స్వతంత్రమైన మూడు విలువ పరిమాణాలు; వీటి మొత్తం పరిమాణం సరుకు విలువ యొక్క పరిమాణాన్ని ఉత్పత్తి చేస్తుంది; దానికి పరిమితి విధిస్తుంది; దాన్ని నిర్ణయిస్తుంది.

మొదటి విషయం, వేతనాలు, లాభం, కౌలు కలిసి సరుకుల ధరగా ఏర్పడినట్లయితే, అస్థిర పెట్టుబడి, అదనపు విలువ నిక్షిప్తమై వున్న సరుకు విలువ భాగానికి ఇది వర్తించినట్లే, సరుకు విలువలోని స్థిర భాగానికి కూడా వర్తిస్తుందనేది స్పష్టమే. అందువల్ల, ఈ స్థిర భాగాన్ని పరిగణనకే తీసుకోకుండా వదిలివేయవచ్చు. ఎందువల్లనంటే, ఆ స్థిర భాగంగా వున్న సరుకుల విలువ కూడా అదే విధంగా వేతనాలు, లాభం, కౌలు అనే విలువల మొత్తంగా విడిపోతుంది. కాబట్టి, ఇదివరకే చెప్పినట్లు, సరుకు విలువలో అలాంటి స్థిర భాగం ఉనికినే ఈ భావన నిరాకరిస్తుంది.

అంతేకాదు. ఇక్కడ విలువకు అర్థమే లేకుండాపోయింది. శ్రమశక్తి, పెట్టుబడి, భూమి – వీటి సొంతదారులకు కొంత డబ్బు చెల్లించబడిందనే అర్థంలో, ధర గురించిన భావన మాత్రమే ఇంకా మిగిలివుంది. కానీ డబ్బంటే ఏమిటి? డబ్బు ఒక వస్తువు కాదు. అది ఒక విలువ యొక్క నిర్దిష్ట రూపం. కాబట్టి, విలువ గురించిన భావన గర్భితం. ఉత్పత్తిలోని ఈ మూడు అంశాలకు బంగారం లేదా వెండి రూపంలో ఒక నిర్దిష్ట మొత్తం చెల్లించబడిందని అనుకొందాం. లేదా దాన్ని

వాటితో సమానమైనదిగా మనసులో భావిద్దాం. కానీ బంగారం, వెండి కూడా ఇతర సరుకుల్లాగానే సరుకులే (వికాసవంతుడైన అర్థశాస్త్రజ్ఞుడు ఈ కొత్త విషయం కనుగొన్నందుకు గర్విస్తున్నాడు.) కాబట్టి బంగారం, వెండి ధరను కూడా వేతనాలు, లాభం, కౌలు నిర్ణయిస్తున్నాయి. అందువల్ల వేతనాలు, లాభం, కౌలు వీటిని ఒకానొక పరిమాణంలోని బంగారానికి లేదా వెండికి సమానమైనవిగా చూపడం ద్వారా వాటిని నిర్ధారణ చేయలేము. ఎందువల్లనంటే, వాటిని విలువగట్టడానికి తత్తుల్యంగా తీసుకొన్న బంగారం, వెండి విలువను మొదట నిర్ణయించవలసినది, బంగారంతో వెండితో ప్రమేయం లేకుండా అదే వేతనాలు, లాభం, కౌలు ద్వారానే. అంటే ఏ సరుకు విలువతోనూ ప్రమేయం లేకుండా బంగారం, వెండి విలువలను మొదట నిర్ధారణ చేయవలసి వుంటుందన్నమాట. మరి ఏ సరుకు విలువైనా పై మూడు కారకాల ఉత్పాదితమే. కాబట్టి వేతనాలు, లాభం, కౌలుల విలువ ఒక నిర్ణీత పరిమాణంలోని బంగారం, వెండికి సమానమని చెప్పడమంటే, అవి ఒక నిర్ణీత పరిమాణంలోని వేతనాలు, లాభం, కౌలుకు సమానమని చెప్పడమే.

మొదట వేతనాలను తీసుకొందాం. ఎందువల్లనంటే విషయాన్ని ఈ దృక్పథం నుంచి చూసినప్పుడు సైతం శ్రమతో ప్రారంభించడం అవసరం. మరి వేతనాల నియంత్రక ధర, అంటే వేతనాల మార్కెట్ ధరలు దేనికి అటూ, ఇటూగా వుంటాయో ఆ ధర ఎలా నిర్ణయమవుతుంది?

అది శ్రమశక్తి సరఫరా, గిరాకీలను బట్టి నిర్ణయమవుతుందనుకొందాం. కానీ ఇది ఏ విధమైన శ్రమశక్తి గిరాకీ? అది పెట్టుబడి నుంచి దానికి వచ్చిన గిరాకీ. కాబట్టి శ్రమకు గిరాకీ వుందంటే పెట్టుబడి సరఫరా అయిందని అర్థం. పెట్టుబడి సరఫరాను గురించి మాట్లాడాలంటే, అన్నిటికన్నా ముందు పెట్టుబడి అంటే ఏమిటో మనం తెలుసుకోవాలి. పెట్టుబడిగా వున్నదేమిటి? దాని అతి సరళ లక్షణాన్ని తీసుకొని చూస్తే, డబ్బూ, సరుకులూ కలిసి పెట్టుబడిగా ఏర్పడతాయి. డబ్బు ఒక సరుకు రూపమే. కాబట్టి పెట్టుబడిగా వున్నది సరుకులే. కానీ ఊహించుకొన్నదాని ప్రకారం, సరుకుల విలువను అన్నిటికన్నా ముందు ఆ సరుకులను ఉత్పత్తి చేసే శ్రమ ధర నిర్ణయిస్తుంది; అంటే వేతనాలు నిర్ణయిస్తాయన్నమాట. వేతనాలు గురించిన భావన ఇక్కడ గర్భితం. అవి సరుకుల ధరలో ఒక అంతర్భాగంగా పరిగణింపబడుతున్నాయి. మరి ఈ ధర లభ్యమాన శ్రమకూ, పెట్టుబడికీ మధ్య గల నిష్పత్తిని బట్టి నిర్ధారణ కావాలి. పెట్టుబడి ధరే, ఆ పెట్టుబడిలో చేరివున్న సరుకుల ధరకు సమానం. పెట్టుబడి సరఫరా, నిర్ణీత ధర గల, ఒకానొక పరిమాణంలోని సరుకుల సరఫరాకు సమానం. ఈ ధరను అన్నిటికన్నా ముందు నియంత్రించేది శ్రమధర. శ్రమధర అస్థిర పెట్టుబడిగా వున్న సరుకు ధరలోని ఆ భాగానికి సమానం. ఇది కార్మికుని శ్రమను తీసుకొన్నందుకు అతనికి ఇచ్చే మొత్తం. ఈ అస్థిర పెట్టుబడిగా వున్న సరుకుల ధరను ప్రధానంగా శ్రమధర నిర్ణయిస్తుంది. ఎందువల్లనంటే అది వేతనాల ధర, లాభం, కౌలును బట్టి నిర్ణయమవుతుంది. కాబట్టి వేతనాలను నిర్ణయించడానికి, అంతకు ముందే పెట్టుబడి వున్నట్లు ఊహించుకోలేము. ఎందువల్లనంటే పెట్టుబడి విలువను కొంతవరకు వేతనాలు నిర్ణయిస్తాయి.

అంతేకాక, ఈ సమస్యలో పోటీని లాక్కురావడం బొత్తిగా తోడ్పడదు. పోటీవల్ల శ్రమధర పెరగడమో, పడిపోవడమో జరుగుతుంది. కానీ శ్రమ విషయంలో సరఫరా, గిరాకీలు సమతుల్యంగా

వున్నాయని అనుకొందాం. అప్పుడు వేతనాలు ఎలా నిర్ణయమవుతాయి? పోటీవల్ల కాని పోటీ ఒక నిర్ణాయక శక్తిగా వుండటం ఆగిపోయిందనీ, రెండు పరస్పర విరుద్ధ శక్తుల సమతూకంవల్ల పోటీ ప్రభావం రద్దయిందని ఇప్పుడే కదా అనుకొన్నాం. నిజంగా మనం కనుగొనాలని అనుకొన్నది వేతనాల సహజ ధరనే; పోటీచే నియంత్రితం కాకుండా, పోటీని నియంత్రించే శ్రమధరనే అన్నమాట.

కార్మికుని ఆవశ్యక జీవితాధారాలను బట్టి శ్రమ ఆవశ్యకత ధరను నిర్ణయించడం ఒక్కటే ఇప్పుడు మిగిలింది. కానీ జీవితాధారాలు సరుకులే. వాటికీ ధర వుంది. కాబట్టి శ్రమధర ఆవశ్యక జీవితాధారాల ధరను బట్టి నిర్ణయమవుతుంది; జీవితాధారాల ధర, ఇతర అన్ని సరుకులలాగానే ప్రధానంగా శ్రమధరను బట్టి నిర్ణయమవుతుంది. అందువల్ల జీవితాధారాల ధరను బట్టి నిర్ణయమయ్యే శ్రమధర నిర్ణయమయ్యేది శ్రమధరను బట్టేనన్నమాట. అంటే శ్రమధర, తన్ను తానే నిర్ణయించు కొంటుంది. వేరుమాటల్లో చెప్పాలంటే, శ్రమధర ఎలా నిర్ణయమవుతుందో మనకు తెలీదన్నమాట. ఈ సందర్భంలో శ్రమకు ఒక సార్వత్రిక ధర వుంటుంది. ఎందువల్లనంటే దాన్ని సరుకుగా పరిగణిస్తున్నాము. కాబట్టి, శ్రమధరను గురించి మాట్లాడాలంటే మనం సార్వత్రిక ధర అంటే ఏమిటో తెలుసుకోవాలి. కానీ ఈ పద్ధతిలో సార్వత్రిక ధర అంటే ఏమిటో తెలుసుకోలేము.

అయినప్పటికీ శ్రమ ఆవశ్యక ధర ఈ ఆమోదయోగ్యమైన పద్ధతిలో నిర్ణయమవుతుందని అనుకొందాం. అప్పుడు సగటు భాగం, అంటే మామూలు పరిస్థితుల్లో ప్రతి పెట్టుబడి లాభం, సరుకుల ధరలో అంతర్భాగంగా వున్న ఈ రెండవ అంశం ఎలా నిర్ణయమవుతుంది. సగటు లాభం నిర్ణయమయ్యేది లాభం యొక్క సగటు రేటును బట్టి. ఈ రేటు ఎలా నిర్ణయమవుతుంది? పెట్టుబడిదారుల మధ్య పోటీవల్లనా? కానీ పోటీ వుందంటే లాభం వుందనేది గర్భితమే కదా? పోటీలో లాభం యొక్క వేరు వేరు రేట్లు వున్నాయనీ, ఆ విధంగానే వేరువేరు లాభాలున్నాయనీ గర్భితం – ఇది ఒకే ఉత్పత్తి రంగంలోనైనా కావచ్చు, లేక వేరువేరు ఉత్పత్తి రంగాల్లోనైనా కావచ్చు. పోటీ సరుకుల ధరలను ప్రభావితంచేసే మేరకు లాభం రేటును ప్రభావితం చేయగలదు. పోటీ, తాను చేయగలిగినది ఒక్కటే: ఉత్పత్తి రంగంలోని ఉత్పాదకులు తమ సరుకులను ఒకే ధరలకు అమ్మేలా చేయగలదు. వివిధ ఉత్పత్తి రంగాలలోని సరుకులను, తమకు ఒకే లాభాన్ని తెచ్చిపెట్టే ధరలకు, అంటే, ఇదివరకే వేతనాలచే పాక్షికంగా నిర్ధారణ అయిన సరుకుల ధరలకు ఒకే నిష్పత్తిలో వున్న అదనపు మొత్తాన్ని తమకు అందజేసే ధరలకు అమ్మేలా చేయగలదు, అంతే. కాబట్టి వ్యాపార పోటీ లాభం రేటులోని అసమానతలను సమానం చేయగలదంతే. అసమానంగా వున్న లాభం రేట్లను సమానం చేయాలంటే, లాభం అనేది సరుకుల ధరలో ఒక అంశంగా వుండి తీరాలి. పోటీ లాభాన్ని సృష్టించదు. పోటీ దాని స్థాయిని తగ్గించడమో లేక పెంచడమో చేస్తుందే తప్ప దాని స్థాయిని సృష్టించదు. ఆ స్థాయి లాభం రేట్లు సమానం చేయబడినప్పటికీ స్థాపితమవుతుంది. మనం లాభం యొక్క ఆవశ్యక రేటును గురించి మాట్లాడుతూన్నప్పుడు, మనం తెలుసుకో గోరేది, పోటీ గతిక్రమాలతో నిమిత్తం లేనట్టి, పైగా ఈ పోటీని నియంత్రిస్తున్నట్టి ఈ లాభం రేటునే. పోటీపడుతున్న పెట్టుబడిదారుల బలాబలాలు సమతూకంగా వున్నప్పుడు లాభం సగటు రేటు నెలకొంటుంది. పోటీ ఈ సమతూకాన్ని స్థాపించవచ్చును కానీ, ఈ సమతూకంతోపాటు తలెత్తే లాభం సార్వత్రిక రేటు ఏ 10 శాతమో, లేక ఏ 20 శాతమో

లేక ఏ 100 శాతమో ఎలా అయింది? పోటీవల్లనా? కానేకాదు. కాకపోగా లాభం 10, 20 లేదా 100 శాతానికి అటూ ఇటూగా వుండటానికి గల కారణాలను పోటీ తొలగించింది. ప్రతి పెట్టుబడికీ తన పరిమాణానికి అనుగుణమైన నిష్పత్తిలో వుండే ఒకే లాభాన్ని తెచ్చిపెట్టగలిగేలా సరుకులకు ధరలను కల్పించింది పోటీ. కానీ, లాభపరిమాణానికి పోటీతో నిమిత్తం లేదు. ఈ పరిమాణానికి అటూ ఇటూగా వున్న వ్యత్యాసాలను పోటీ తగ్గిస్తుందంతే. ఒక వ్యక్తి మరొక వ్యక్తితో పోటీపడతాడు. పోటీ మూలంగా అతను తన సరుకులను రెండో వ్యక్తి అమ్మే ధరకే అమ్మక తప్పదు. కానీ ఈ ధర 10 శాతం లేదా 20 శాతం లేక 100 శాతం కావడానికి కారణమేమి?

కనుక, లాభం రేటు అనేది, ఆ విధంగానే లాభం అనేది ఇప్పటివరకు వేతనాలచే నిర్ణయమైన సరుకుల ధరకు, మనకు తెలీనిదేదో ఒక విధంగా చేరిన అదనపు వెలగా ప్రకటించడమొక్కటే మనకు మిగిలిన మార్గం. పోటీ మనకు తెలియజేసేదల్లా లాభం రేటు ఒక నిర్ణీత పరిమాణంగా వుండాలనేదే. కానీ మనకు ఈ విషయం ఇంతకు ముందే, లాభం యొక్క సార్వత్రిక రేటును, లాభం యొక్క "ఆవశ్యక ధరను" గురించి మనం చర్చించినప్పుడే తెలుసు.

భూమి కౌలు విషయంలో మళ్ళీ ఈ అసంబద్ధ పరిశీలనా క్రమాన్ని సాగించడం అనవసరం. ఇలా చేయకుండానే, లాభం, కౌలు అనేవి వేతనాల వల్ల నిర్ణయమైన సరుకుల ధరకు, ఏవో తెలియరాని నియమాల వల్ల చేరే నిర్దిష్టమైన అదనపు ఖర్చులు అయినట్లు ఈ పరిశీలనా క్రమం చెబుతుందని మనం తెలుసుకోవచ్చు. ఒక్క ముక్కలో చెప్పాలంటే, అర్థశాస్త్రజ్ఞులు వ్యాపార పోటీని వివరించవలసి వుండగా, వారి అర్థంపర్థంలేని భావాలకు కారణాలను వివరించవలసిన బాధ్యతను ఆ పోటీ తన నెత్తిపై వేసుకోవలసి వచ్చింది.

లాభం, కౌలు, చలామణి సృష్టించినవన్న భ్రమను, అంటే అమ్మకంవల్ల ఉత్పన్నమైన ధర అంతర్భాగాలన్న భ్రమను తోసిపారేద్దాం. ఎందువల్లనంటే తాను మొదట్లో తీసుకోకుండా వున్న దేనినీ చలామణి మనకు ఇవ్వజాలదు. ఈ భ్రమను తోసేసినట్లయితే, ఈ వ్యవహారం ఇలా వుంటుంది.

వేతనాలవల్ల నిర్ణయమైన ఒక సరుకు ధర =100 అనీ, లాభం రేటు వేతనాల్లో 10 శాతమనీ, కౌలు వేతనాల్లో 15 శాతమనీ అనుకొందాం. అప్పుడు, వేతనాలు, లాభం, కౌలు – వీటి మొత్తం వల్ల నిర్ణయమైన సరుకు ధర = 125. ఈ 25 అదనపు మొత్తం, సరుకు అమ్మకం నుంచి ఉత్పన్నం కాజాలదు. ఎందువల్లనంటే, ఒకరికొకరు సరుకులను అమ్మేవారంతా, వేతనాల రూపంలో 100 ఖర్చయినదాన్ని 125కు అమ్ముతారు. వీరంతా 100 చొప్పుననే అమ్మినట్లయితే వుండే పరిస్థితికీ, దీనికీ తేడా లేదు. కాబట్టి, ఈ ప్రక్రియను చలామణి క్రమంతో నిమిత్తం లేకుండా పరిశీలించాలి.

ఇప్పుడు సరుకు ఖరీదు 125. ఈ సరుకును ముగ్గురూ పంచుకొంటే, కార్మికునికి విలువలోనూ, ఉత్పాదితంలోనూ $\frac{4}{5}$ –100 వస్తుంది. పెట్టుబడిదారు ఉత్పాదితాన్ని మొదట 125కు అమ్మి, ఆ తరువాతనే కార్మికునికి 100 ఇచ్చి, తనకు 10 వుంచుకొని, భూస్వామికి 15 ఇచ్చినప్పటికీ పరిస్థితి ఏవిధంగానూ మారదు. పెట్టుబడిదారుకు విలువలో, ఉత్పాదితంలో $\frac{3}{25}$ వస్తుంది. పెట్టుబడిదారు 100కు బదులు 125కు అమ్ముతాడు. కాబట్టి, అతను కార్మికుని శ్రమ నిక్షిప్తమై వున్న ఉత్పాదితంలో $\frac{4}{5}$ మాత్రమే అతనికి ఇస్తున్నాడు. అంటే అతడు 20 అట్టిపెట్టుకొని 80 మాత్రమే కార్మికునికి

ఇచ్చినట్లయింది. ఈ 20లో పెట్టుబడిదారు వాటా 8, భూస్వామి వాటా 12. ఈ సందర్భంలో పెట్టుబడిదారు సరుకును దాని విలువకే అమ్మివుంటాడు. ఎందువల్లనంటే, వాస్తవంలో ధరకు కలిపిన మొత్తాలు సరుకు విలువతో నిమిత్తం లేని పెరుగుదలలు. మరి మనం ఊహించుకొన్న దాని ప్రకారం సరుకు ధర వేతనాల విలువను బట్టి నిర్ణయమవుతుంది. ఇది డొంకతిరుగుడుగా కింది విధంగా చెప్పడమే. ఈ భావన ప్రకారం "వేతనాలు" అనే పదానికి (ఇక్కడ ఇది 100) ఉత్పాదితం విలువ అని అర్థం; అంటే ఈ నిర్దిష్ట పరిమాణంలోని శ్రమకు ప్రాతినిధ్యం వహించేటంత డబ్బు అని అర్థం. అయితే, ఈ విలువకు, వాస్తవ వేతనాలకు తేడా వున్నందువల్ల కొంత మిగులు తేలుతుంది. కానీ ఇక్కడ ధరకు కొంత మొత్తం చేర్చడం ద్వారా ఈ మిగులు చేతికందుతూంది. కాబట్టి వేతనాలు కనుక 100కు బదులు 110 అయితే, లాభం 11కు, భూమి కౌలు $16\frac{1}{2}$కు సమానమవుతుంది. ఫలితంగా సరుకు ధర = $137\frac{1}{2}$. ఇందువల్ల నిష్పత్తులు మారవు. కాని, వేతనాలకు ఒక నిర్దిష్ట శాతం డబ్బు రూపంలో కలపడం ద్వారా ఎల్లప్పుడూ, ఈ విభజన జరగడం వల్ల ధర వేతనాలతో పాటు పెరుగుతూ, తగ్గుతూ వుంటుంది. ఇక్కడ వేతనాలను మొదట సరుకు విలువకు సమానం చేసి ఆ తరువాత దాని నుంచి మళ్ళీ విడదీయడం జరుగుతుంది. ఈ విభజన జరిగేది ఎల్లప్పుడూ, వేతనాలను ఒక నిర్దిష్ట శాతం మేరకు డబ్బు రూపంలో కలపడం ద్వారానే. కనుక ధర వేతనాలతోపాటు పెరుగుతూ, తగ్గుతూ వుంటుంది. ఇక్కడ వేతనాలను మొదట సరుకు విలువతో సమానంగా పరిగణించి, ఆ తరువాత దాని నుంచి విడదీయడం జరుగుతూంది. ఇది డొంకతిరుగుడుగా, అర్థంపర్థం లేని తీరులో ఇలా చెప్పడమే : సరుకు విలువను ఆ సరుకులో నిక్షిప్తమై వున్న శ్రమ పరిమాణం నిర్ణయిస్తుంది, కానీ వేతనాల విలువను అవసరమైన జీవనాధారాల ధర నిర్ణయిస్తుంది. వేతనాలకు పైబడి వున్న విలువకే లాభం, కౌలూ అవుతుంది.

సరుకుల తయారీలో వినియోగమైపోయిన ఉత్పత్తి సాధనాల విలువను తీసివేసిన తరువాత సరుకుల విలువ విభజితమవుతూంది. తయారైన సరుకుల్లో నిక్షిప్తమై వున్న శ్రమ పరిమాణంచే నిర్ణయమైన ఈ విలువ పరిమాణం వేతనాలుగా, లాభంగా, కౌలుగా స్వతంత్రమైన, పరస్పర సంబంధం లేని ఆదాయ రూపాలు ధరించే మూడు అంతర్భాగాలుగా విభజితమవుతూంది. ఇలా విభజితం కావడం పెట్టుబడిదారీ ఉత్పత్తిరంగ ఉపరితలంపైన, ఒక విపరీత రూపంలో అగుపిస్తూంది. ఫలితంగా పెట్టుబడిదారీ ఉత్పత్తికి వశవర్తులైపోయినవారి మనసుల్లో కూడా అలాగే అగుపిస్తూంది.

ఒకానొక సరుకు మొత్తం విలువ = 300 అని అనుకొందాం. ఇందులో సదరు సరుకు ఉత్పత్తిలో వినియోగమైపోయిన ఉత్పత్తి సాధనాల లేదా స్థిర పెట్టుబడి భాగాల విలువ = 200 అని అనుకొందాం. కాబట్టి ఉత్పత్తి ప్రక్రియ సందర్భంగా సరుకుకు చేరిన కొత్త విలువ = 100. మూడు ఆదాయ రూపాల మధ్య విభజనకు లభించినదల్లా ఈ కొత్త విలువ 100 తప్ప మరేదీ లేదు. వేతనాలు = క, లాభం = చ, భూమి కౌలు = ట అని అనుకొందాం. అప్పుడు ఈ సందర్భంలో క+చ+ట ఎల్లప్పుడూ 100కు సమానం. కాని పెట్టుబడిదారులు, వ్యాపారస్తులు, బ్యాంకు యజమానులు, నాటు అర్థశాస్త్రజ్ఞులు – వీరందరి దృష్టికి ఇది పూర్తి భిన్నంగా కనిపిస్తుంది. వారి దృష్టిలో ఉత్పత్తి సాధనాల విలువను తీసివేసిన తరువాత సరుకు విలువ ఈ 100 కాదు, ఆ

తరువాత ఇది క, చ, టగా విభజితం కాదు. వేతనాల విలువ, లాభం విలువ, కౌలు విలువ – ఇవన్నీ కలిసి సరుకు ధరగా రూపొందుతాయి. ఈ విలువల పరిమాణాలు సరుకు విలువతో గాని, ఒకదానితో ఒకటి గాని సంబంధం లేకుండా నిర్ణయమవుతాయి. ఫలితంగా క, చ, టల్లోని ప్రతిదీ నిర్ణీతమైనవీ, స్వతంత్రంగా రూపుగొన్నవీ. ఇవి 100 కన్నా తక్కువగానో, ఎక్కువగానో ఉండవచ్చు. ఈ పరిమాణాల మొత్తం నుంచే అంతర్భాగ విలువను కూడటం ద్వారానే సరుకు విలువను తెలుసుకోగలం. వారి ఈ ప్రతివాదం అనివార్యం. ఎందువల్లనంటే :

**మొదటి విషయం :** సరుకు విలువలోని అంతర్భాగాలు ఒకదానికొకటి సంబంధం లేని ఆదాయాలుగా కనిపిస్తాయి. అటువంటి స్వతంత్ర ప్రతిపత్తి గల ఆదాయాలుగా అవి ఎంతో పరస్పర భిన్నమైన ఉత్పత్తి కారకాలతో, అంటే శ్రమ, పెట్టుబడి, భూమి అన్నవాటితో ముడిపడి వున్నట్లు, అందువల్ల అవి ఈ కారకాల నుంచి ఉద్భవించినట్లు కనిపిస్తాయి. శ్రమశక్తికి, పెట్టుబడికి, భూమికి సొంతదారులుగా వున్నందువల్లనే శ్రామికునికి, పెట్టుబడిదారుకు, భూస్వామికి సరుకు విలువలోని ఈ వివిధ అంతర్భాగాల్లో ఎవరికి వారి వాటా చెందుతూంది అన్నట్లు, ఆ విధంగా అవి ఆదాయాలుగా మారుతున్నట్టు వారికి కనిపిస్తుంది. కానీ ఆదాయాలుగా పరివర్తన చెందే క్రమం నుంచి ఈ విలువ ఉద్భవించదు. అది ఆదాయంగా పరివర్తన చెందడానికి మునుపే, అది ఈ రూపం ధరించగలగడానికి మునుపే అస్తిత్వంలో వుండాలి కదా. దీనికి విరుద్ధమైనది నిజమనే భ్రమ బలపడటానికి కారణముంది. ఈ అంతర్భాగాల సాపేక్ష పరిమాణాల నిర్ధారణ వేరువేరు నియమాలనుబట్టి జరగడమూ, సరుకుల విలువతో వీటికి గల సంబంధం, ఆ విలువచే నిర్ణీతమైన వీటి పరిమితి ఎక్కడా పైకి కనిపించక పోవడమూ ఇందుకు కారణం.

**రెండవది :** వేతనాల్లో, సార్వత్రిక పెరుగుదల లేక తగ్గుదలల మూలంగా లాభం సార్వత్రిక రేటు యొక్క గమనం తద్వ్యతిరేక దిశాభిముఖంగా వుంటుందనీ, తక్కిన పరిస్థితులు యథాతథంగా వున్నట్లయితే, ఇది వివిధ సరుకుల ఉత్పత్తి ధరల్లో మార్పును తెస్తుందనీ, అంటే ఆయా ఉత్పత్తి రంగాల్లో పెట్టుబడి యొక్క సగటు అంతర్నిర్మాణాన్ని బట్టి కొన్ని ధరలు పెరగడం, కొన్ని తగ్గడం జరుగుతుందనీ మనం చూశాము. కనుక ఏది ఏమైనా, కొన్ని ఉత్పత్తి రంగాల్లో వేతనాలు పెరిగినందు వల్ల సరుకు సగటు ధర పెరగడం, వేతనాలు పడిపోయినందువల్ల సరుకు నగదు ధర పడిపోవడం జరుగుతుందని, ఇక్కడ అనుభవం తెలుపుతూంది. కానీ వేతనాలతో ప్రమేయం లేని సరుకుల విలువ రహస్యంగా ఈ మార్పులను నియంత్రిస్తున్నట్లు "అనుభవం" తెలపదు. కానీ వేతనాల్లోని పెరుగుదల స్థానికమైనదైతే, కొన్ని ప్రత్యేక పరిస్థితుల కారణంగా ఒక ప్రత్యేక ఉత్పత్తి రంగంలో మాత్రమే వేతనాలు పెరిగినట్లయితే, ఈ సరుకుల ధరలు తదనుగుణంగా పెరగవచ్చు. వేతనాలు పెరగకుండా వున్న ఇతర రకాల సరుకులతో పోల్చి చూసినప్పుడు, ఒక రకం సరుకు సాపేక్ష విలువ ఈ విధంగా పెరగడం, వివిధ ఉత్పత్తి రంగాల మధ్య ఒకే విధంగా అదనపు విలువ పంపిణీలో జరిగిన స్థానిక అంతరాయానికి వ్యతిరేకమైన ఒక ప్రతిక్రియ తప్ప మరొకటి కాదు. లాభం యొక్క ప్రత్యేక రేట్లను సార్వత్రిక రేటు స్థాయికి సమానం చేసే సాధనమిది. ఈ సందర్భంలో కూడా వేతనాలు ధరను నిర్ణయిస్తాయని "అనుభవం" తెలుపుతూంది. కాని ఈ పరస్పర సంబంధం వెనుక

దాగివున్న కారణం "అనుభవం" తెలపదు. అంతే కాదు, శ్రమ – సగటు ధరను అంటే శ్రమశక్తి విలువను అవసరమైన జీవనాధారాల ఉత్పత్తి ధర నిర్ణయిస్తుంది. ఈ జీవనాధారాల ధర పెరుగుదల లేదా తగ్గుదలతో శ్రమశక్తి విలువ తదనుగుణంగా పెరుగుతుంది లేదా తగ్గుతుంది. ఈ విధంగా, వేతనాలకు, సరుకుల ధరకు మధ్య సంబంధం వుందని అనుభవం మరోసారి తెలుపుతూంది. కానీ కారణం కార్యంగానూ, కార్యం కారణంగానూ కనిపించవచ్చు. మార్కెట్ ధరల గమనాలకు కూడా ఇది వర్తిస్తుంది. ఆర్థిక వికాస దశల్లో తమ సగటు స్థాయికి మించి పెరిగిన వేతనాలకు అనుగుణంగా మార్కెట్ ధరలు, ఉత్పత్తి ధరలకు మించి పెరుగుతాయి; ఆ తరువాత వేతనాలు తమ సగటు స్థాయికన్నా తగ్గిపోయినప్పుడు మార్కెట్ ధరలు, ఉత్పత్తి ధరలకన్నా తగ్గిపోతాయి. సరుకుల విలువలపై ఉత్పత్తి ధరలు ఆధారపడి వున్నవని చూచీచూడగానే కనిపిస్తున్న స్థితికి అనుగుణంగా వుండవలసినది, మార్కెట్ ధరల ఆరోహణావరోహణ గమనమే కాదు, వేతనాలు పెరిగినప్పుడల్లా లాభం రేటు పడిపోతుందనీ, వేతనాలు పడిపోయినప్పుడల్లా లాభం రేటు పెరుగుతుందనీ తెలిసిన అనుభవం కూడా దానికి సరిపోవాలి. కానీ, లాభం రేటును స్థిర పెట్టుబడి విలువలోని గమనాలు, వేతనాల గమనాలతో నిమిత్తం లేకుండా నిర్ణయించవచ్చు. పర్యవసానంగా వేతనాల గమనం, లాభం రేటు గమనం పరస్పర విరుద్ధ దిశాముఖం పట్టడానికి బదులు ఒకే దిశలో సాగినట్టు, అంటే కలిసి పెరగడమో లేక పడిపోవడమో జరగవచ్చు. అదనపు విలువ రేటు లాభం రేటుతో ప్రత్యక్షంగా ఏకీభవించినట్లయితే ఇది సాధ్యం కాదు. అదేవిధంగా, జీవితావసరాల ధరలు పెరిగిన ఫలితంగా వేతనాలు పెరిగినట్లయితే, శ్రమ తీవ్రతను పెంచడం వల్ల లేదా పనిదినాన్ని పొడిగించడం వల్ల లాభం రేటు యథాతథంగా వుంచవచ్చు. అంతర్భాగ విలువల స్వతంత్ర, వక్రీకృత రూపం సృష్టించే భ్రమను కేవలం వేతనాలు మాత్రమే లేదా వేతనాలూ, లాభం కలిసికట్టుగా సరుకుల విలువను నిర్ణయిస్తాయనే భ్రమను పై అనుభవాలన్నీ ధ్రువపరుస్తాయి. వేతనాలకు సంబంధించి, అటువంటి భ్రమ ఏర్పడిందంటే, శ్రమధర, శ్రమ సృష్టించిన విలువ ఏకీభవిస్తున్నట్లు కనిపించిందంటే, ఇక అది లాభానికి, కౌలుకు వర్తిస్తుందని వేరే చెప్పనక్కరలేదు. వాటి ధరలు, అంటే వాటి డబ్బు రూపాలు శ్రమతో, శ్రమ సృష్టించిన విలువతో నిమిత్తం లేకుండా నియంత్రితం కాకతప్పదు.

**మూడవది :** ఒక సరుకు విలువలు లేక ఈ విలువతో సంబంధంలేనట్లు పైకి కనిపిస్తున్న ఉత్పత్తి ధరలు మార్కెట్ ధరలతో ఎల్లప్పుడూ ఏకీభవిస్తున్నవనేది, ప్రత్యక్షానుభవవేద్యమని ఊహించుకుందాం. అంటే ఉత్పత్తి ధరలు మార్కెట్ ధరలో నిరంతరాయంగా వచ్చే హెచ్చుతగ్గులకు సదా పరిహారంగా పనిచేయడం ద్వారా దాన్ని నియంత్రించే సగటు ధరలుగా మాత్రమే వ్యవహరించడం లేదన్నమాట. అంతేకాకుండా, ఏ మాత్రమూ మార్పులేని అదే పరిస్థితుల్లో పునరుత్పత్తి జరుగుతూందని కూడా ఊహించుకుందాం. అంటే పెట్టుబడిలోని అన్ని అంశాల్లో శ్రమ ఉత్పాదకత స్థిరంగా వుందని అనుకొందాం. ఆఖరున, నూతన శ్రమ పరిమాణం ఉత్పత్తి సాధనాలకు చేరడం ద్వారా ప్రతి ఉత్పత్తి రంగంలోనూ, సరుకు ఉత్పాదితంలో రూపుగొనే దాని విలువ భాగం, అంటే కొత్తగా ఉత్పత్తి అయిన విలువ, ఎల్లప్పుడూ స్థిరమైన నిష్పత్తుల్లో వేతనాలుగా, లాభంగా, కౌలుగా విభజితమవుతుందని కూడా ఊహించుకుందాం. ఇలా విభజితమయ్యే తీరునుబట్టి వాస్తవంగా చెల్లించిన వేతనం శ్రమశక్తి

విలువతో ఎల్లప్పుడూ ప్రత్యక్షంగా ఏకీభవిస్తుందనీ, అలాగే వాస్తవంగా చేతికందని లాభం, మొత్తం పెట్టుబడిలో, స్వతంత్రంగా పని చేస్తున్న ప్రతి భాగానికి, సగటు లాభం రేటు కారణంగా, మొత్తం అదనపు విలువ నుంచి లభ్యమయ్యే వాటాతో ఏకీభవిస్తుందనీ, అదే విధంగా వాస్తవమైన కౌలు, మామూలుగా భూమి కౌలును ఈ ప్రాతిపదికపై కట్టుబాటు చేసే అవధులకు ఎల్లప్పుడూ పరిమితమై వుంటుందనీ ఊహించుకొందాం. ఒక్క ముక్కలో చెప్పాలంటే, సామాజికంగా ఉత్పత్తి అయిన విలువల విభజన, ఉత్పత్తి ధరల నియంత్రణ పెట్టుబడిదారీ ప్రాతిపదికపై జరుగుతుందనీ, అయితే ఇందులో వ్యాపార పోటీ లేదనీ ఊహించుకుందాం.

పరిస్థితి ఈ ఊహల ప్రకారం వున్నప్పుడు, సరుకుల విలువ స్థిరంగా వుంటుంది; అలా వున్నట్లు కనిపిస్తుంది. సరుకు–ఉత్పాదితం యొక్క విలువలో ఆదాయంగా విడిపోయే భాగం ఒక స్థిరమైన పరిమాణంగా వుంటుంది. అలా వున్నట్లు ఎల్లప్పుడూ కనిపిస్తుంది. విలువలోని ఈ నిర్ణీత, స్థిర భాగం స్థిర నిష్పత్తుల్లో వేతనాలుగా, లాభంగా, కౌలుగా విభజితమవుతుంది. పరిస్థితి ఈ ఊహల ప్రకారం వున్నప్పుడు సైతం వాస్తవ గమన క్రమం ఆవశ్యంగా వక్రీకృత రూపంలోనే కనిపిస్తుంది. అంటే మునుపే నిర్ణీతమైన పరిమాణంలోని విలువ మూడు భాగాలుగా చీలిపోయి, అవి పరస్పర ప్రమేయం లేని ఆదాయ రూపాలను ధరిస్తున్నట్లు కనిపించదు. దానికి విరుద్ధంగా, స్వతంత్రమైన, దేనికదిగా నిర్ధారణ అయిన వేతనాలూ, లాభమూ, భూమికౌలూ అనే విలువ భాగాల సమాహారం ఈ విలువ పరిమాణంగా రూపొందినట్లు కనిపిస్తుంది. ఈ భ్రమ తప్పనిసరిగా ఉత్పన్నం కావడానికి కారణమేమిటంటే, వ్యష్టి పెట్టుబడుల వాస్తవ గమనంలోనూ, అవి ఉత్పత్తి చేసిన సరుకుల గమనంలోనూ – సరుకుల విలువ దాని విభజనకు పూర్వావసరంగా కనిపించదు సరికదా, అలా విభజితమైన భాగాలే సరుకుల విలువ రూపొందడానికి పూర్వావసరంగా పనిచేస్తున్నట్లు కనిపిస్తుంది. మొదటి విషయం, ప్రతి ఒక్క పెట్టుబడిదారుకు తన సరుకుల ఉత్పత్తి వ్యయం ఒక నిర్ణీతమైన పరిమాణంగా కనిపిస్తుందనీ, వాస్తవ ఉత్పత్తి ధరలో అది అలాంటి పరిమాణంగా నిరంతరం కనిపిస్తూంటుందనీ మనం ఇదివరకే చూశాము. ఉత్పత్తి వ్యయం = స్థిర పెట్టుబడి విలువ, అంటే అడ్వాన్స్ చేసిన ఉత్పత్తి సాధనాల విలువ + శ్రమశక్తి విలువ. అయితే, శ్రమశక్తి విలువ ఉత్పత్తి ఏజెంటు దృష్టికి శ్రమధర అనే హేతువిరుద్ధమైన రూపంలో దర్శనమిస్తుంది. పర్యవసానంగా వేతనాలు అదే సమయంలో కార్మికుని ఆదాయంగా కనిపిస్తాయి. శ్రమ సగటు ధర ఒక నిర్ణీతమైన పరిమాణం. ఎందువల్లనంటే తక్కిన సరుకుల విలువలాగానే శ్రమశక్తి విలువ కూడా దాని పునరుత్పత్తికి పట్టే ఆవశ్యక శ్రమకాలాన్ని బట్టి నిర్ణయమవుతుంది. కానీ, వేతనాలుగా మూర్తీభవించిన సరుకుల విలువ భాగాన్ని తీసుకొని చూస్తే, ఆ భాగం ఈ వేతనాల రూపం ధరిస్తుందన్న వాస్తవంలో నుంచి ఉత్పన్నం కాదు. కార్మికునికి అతని ఉత్పాదితంలో అతని వాటాను వేతనాల రూపంలో పెట్టుబడిదారు ముందుగా ఇస్తాడన్న వాస్తవం నుంచి ఉత్పన్నం కాదు. కార్మికుడు తన వేతనాల సమతుల్యాన్ని ఉత్పత్తి చేస్తాడన్న వాస్తవం నుంచి ఆ విలువ భాగం ఉత్పన్నమవుతుంది. తన శ్రమశక్తి ధరలో వున్న విలువను అతని రోజువారీ, లేదా వార్షిక శ్రమ ఉత్పత్తి చేస్తుందన్న వాస్తవం నుంచి ఆ భాగం విలువ ఉత్పన్నమవుతుంది. కానీ వేతనాలకు అనుగుణమైన, సమతుల్యమైన విలువ ఉత్పత్తి కాకముందే, వేతనాలు ఒప్పందం ద్వారా

నిర్ణయమవుతున్నాయి. వేతనాలు ధరలోని ఒక అంశం. సరుకూ దాని విలువ ఉత్పత్తి కాకముందే ఈ అంశం యొక్క పరిమాణం ఆ విధంగా నిర్ణయమై వుంటుంది. అలాంటి అంశంగా ఉత్పత్తి వ్యయంలో ఒక భాగంగా, వేతనాలు స్వతంత్ర రూపంలో సరుకు యొక్క మొత్తం విలువ నుంచి విడిపోయిన తద్భాగంగా కనిపించదు సరికదా, అందుకు పూర్తి విరుద్ధంగా, ఆ విలువను ముందుగానే నిర్ధారించే ఒక నిర్ణీత పరిమాణంగా కనిపిస్తుంది. అంటే, ధరను, విలువను సృష్టించేదిగా కనిపిస్తుందన్న మాట. సరుకుల ఉత్పత్తి వ్యయంలో వేతనాలు నిర్వహించే పాత్ర వంటిదే, వాటి ఉత్పత్తి ధరలు, సగటు లాభం నిర్వహిస్తుంది. ఎందువల్లనంటే ఉత్పత్తి ధర = ఉత్పత్తి వ్యయం + అడ్వాన్స్ చేసిన పెట్టుబడిపై సగటు లాభం. ఆచరణలో ఈ సగటు లాభం పెట్టుబడిదారుని మనసులోనూ, లెక్కాచారం లోనూ ఒక నియంత్రకాంశంగా చోటుచేసుకుంటుంది. మదింపునకు సంబంధించిన ఒక రంగం నుంచి మరొక రంగానికి పెట్టుబడి బదలాయింపును నిర్ణయించే విషయంలోనే కాకుండా, అన్ని అమ్మకాలలోనూ, దీర్ఘకాలాలకు విస్తరించిన పునరుత్పత్తి ప్రక్రియకు ఆవరించే అన్ని ఒప్పందాలలోనూ ఇది నిర్ణాయకాంశంగా వున్నందువల్ల అలా చోటుచేసుకుంటుంది. విలువను విభజించిన ఫలితంగా కనిపించడానికి మారు, ఉత్పత్తి అయిన సరుకుల విలువతో నిమిత్తంలేని ఒక పరిమాణంగా అభివ్యక్త మవుతుంది. ఇది సరుకుల ఉత్పత్తి ప్రక్రియకు మునుపే వున్నట్టు, ఆ సరుకుల సగటు ధరను స్వయంగా నిర్ణయిస్తున్నట్టు, అంటే విలువకు సృష్టికర్త అయినట్టు కనిపిస్తుంది. అదనపు విలువ భాగాలు ఒకదానితో ఒకటి సంబంధం లేని రూపాలుగా విడిపోవడం వల్ల అదనపు విలువ సరుకు విలువను సృష్టించడానికి ఒక పూర్వావసరంగా మరింత నిర్దిష్ట రూపంలో కనిపిస్తుంది. సగటు లాభంలో ఒక భాగం, సరుకుల ఉత్పత్తిలో, వాటి విలువ ఉత్పత్తిలో స్వతంత్రమైన అంశమైనట్టు పెట్టుబడిదారుకు ఎదురవుతుంది. వడ్డీ పరిమాణం ఎంత అస్థిరంగా హెచ్చుతూ, తగ్గుతూ వున్నప్పటికీ ప్రతిదఫా, ప్రతి పెట్టుబడిదారుని దృష్టిలో అది ఒక నిర్ణీత పరిమాణమే. వ్యష్టి పెట్టుబడిదారుగా తాను ఉత్పత్తి చేస్తున్న సరుకులు ఉత్పత్తి వ్యయంలో అది ప్రవేశిస్తున్నట్టు అతనికి గోచరిస్తుంది. వ్యవసాయ పెట్టుబడిదారుకు ఒప్పందం నిర్ణయించే కౌలు డబ్బు రూపంలోనూ, ఇతర పరిశ్రమదారుల విషయంలో కర్మాగారాదుల స్థలానికి చెల్లించవలసిన అద్దె రూపంలోనూ – భూమి కౌలు కూడా ఇదే పాత్ర నిర్వహిస్తుంది. అదనపు విలువ ఇలా భాగాలుగా విభజితమై, వ్యష్టి పెట్టుబడిదారునికి అయ్యే ఉత్పత్తి వ్యయంలో నిర్ణీతమైన అంశాలుగా వున్నందువల్ల, ఇవే అదనపు విలువను సృష్టిస్తున్నట్లు తారుమారుగా కనిపిస్తాయి. వేతనాలు సరుకుల ధరలోని ఒక భాగాన్ని సృష్టిస్తున్నట్లు కనిపించిన విధంగానే ఇవి మరో భాగాన్ని సృష్టిస్తున్నట్లు కనిపిస్తాయి. సరుకు విలువ విభజితమైన ఫలితంగా ఏర్పడ్డ తద్భాగాలు విలువ రూపు తీసుకునేందుకు పూర్వావసరాలుగా నిరంతరం కనిపించడంలోని రహస్యానికి కారణం మరేమీ కాదు – పెట్టుబడి దారీ ఉత్పత్తి పద్ధతి, ఇతర ఉత్పత్తి పద్ధతుల లాగానే, కేవలం పాదార్థిక ఉత్పాదితాన్ని నిరంతరం పునరుత్పత్తి చేయడమే కాకుండా, తన ఉత్పత్తి యొక్క విశిష్ట ఆర్థిక రూపాలయిన సామాజిక, ఆర్థిక సంబంధాలను కూడా నిరంతరం పునరుత్పత్తి చేయడమే. కాబట్టి దాని పూర్వావసరాలు దాని ఫలితాలుగా నిరంతరం కనిపించినట్లే, దాని ఫలితం దాని పూర్వావసరంగా నిరంతరం కనిపిస్తూంటుంది. అదే సంబంధాల ఈ నిరంతరాయ పునరుత్పత్తినే

వ్యష్టి పెట్టుబడిదారు స్వయంవిదితమైన నిస్సందేహమైన వాస్తవమనే ముందుచూపుతో వ్యవహరిస్తున్నాడు. పెట్టుబడిదారీ ఉత్పత్తి పద్ధతి స్థిరంగా కొనసాగినన్నాళ్ళు, కొత్తగా చేర్చిన శ్రమలో ఒక భాగం వేతనాలుగా, మరోభాగం లాభంగా (వడ్డీగా, పరిశ్రమ లాభంగా), మూడో భాగం కౌలుగా నిరంతరాయంగా విభజింపబడుతూనే వుంటుంది. వివిధ ఉత్పత్తి కారకాల సొంతదారుల మధ్య జరిగే ఒప్పందాల్లో, ఈ శ్రమ విభజన ఎల్లప్పుడూ ఊహ్యం. ఆయా సందర్భాల్లో వీటి సాపేక్ష నిష్పత్తులు ఎంతగా మారినప్పటికీ, ఈ ఊహ సరియైనదే! విలువలోని వేరు వేరు భాగాలు ఒకదాని కొకటి ఫలానా నిర్దిష్ట రూపంలో ఎదురవుతాయనేది ముందే ఊహ్యం. ఎందువల్లనంటే ఆ రూపం నిరంతరాయంగా పునరుత్పత్తి అవుతూంటుంది. అది ఎందువల్ల నిరంతరాయంగా పునరుత్పత్తి అవుతూందంటే, అది నిరంతరాయంగా ముందే ఊహ్యం.

పెట్టుబడిదారుని దృష్టిలో విలువను ప్రభావితం చేసే ఏకైకాంశంగా వున్న మార్కెట్ ధరలు, వాటి పరిమాణానికి సంబంధించినంత వరకు, అలాంటి ముందుచూపుతో పెట్టుబడిదారు వ్యవహరించడంపై ఆధారపడి వుండదనీ, నిర్ణయించిన వడ్డీ లేక కౌలు ఎక్కువా లేక తక్కువా అనే దానికి అవి అనుగుణంగా వుండవనీ అనుభవమూ, నేడు కనిపిస్తున్న పరిస్థితీ కూడా స్పష్టంగా నిరూపిస్తున్నాయి. అయితే మార్కెట్ ధర స్థిరత్వం వాటి వ్యత్యాసంలోనే వుంది. దీర్ఘకాలాల్లో వాటి సగటును తీసుకొంటే అది స్థిర పరిమాణాలైన తత్సంబంధిత వేతనాలు, లాభం, కౌలు సగటుల కింద తేలుతుంది. కాబట్టి, చివరికంటా విశ్లేషించి చూస్తే మార్కెట్ ధరలను ప్రభావితం చేస్తున్నది ఈ సగటులే అన్నమాట.

కానీ, ఆలోచించినప్పుడు, ఒక విషయం తేటతెల్లమని తోస్తుంది : విలువ ఉత్పత్తిలో వేతనాలు, లాభం, కౌలు పూర్వావసరాలుగా వున్నట్లు తోస్తున్నందువల్లనూ, వ్యష్టి పెట్టుబడిదారు తన ఉత్పత్తి వ్యయంలోనూ, ఉత్పత్తి ధరలోనూ అవి వున్నట్లు ఊహించుకుంటున్నందువల్లనూ, అవి విలువ సృష్టికర్త లవుతున్నాయి. అప్పుడు పెట్టుబడిలోని స్థిర భాగం కూడా విలువను సృష్టించేదే. ఎందువల్లనంటే ప్రతి సరుకు ఉత్పత్తిలో దాని విలువ ప్రవేశించడం ఒక నిర్ణీత విషయంగా పరిగణింపబడుతూంది. కానీని పెట్టుబడిలోని స్థిర భాగం కొన్ని సరుకుల సమాహారం తప్ప మరేమీ కాదు. కాబట్టి అది సరుకు విలువల సమాహారం తప్ప మరేమీ కాదు. సరుకు విలువను సృష్టించేదీ, దానికి కారణభూతమైనదీ సరుకు విలువే అనే అర్థంపర్థంలేని పునరుక్తిగా, ఇది చివరకు తేలుతుంది.

కానీ పెట్టుబడిదారుకు దీన్ని గురించి ఆలోచించాలన్న ఆసక్తే వుంటే (అతణ్ణి ఆలోచింప చేసేది కేవలం అతని ప్రయోజనాలూ, స్వార్థ ప్రయోజనాలను నెరవేర్చుకోవాలన్న ఉద్దేశాలే.) తాను ఉత్పత్తి చేసేది పెట్టుబడి యొక్క స్థిర భాగంగా ఇతర ఉత్పత్తి రంగాల్లోకి ప్రవేశిస్తుందనీ, ఈ ఇతర ఉత్పత్తి రంగాల ఉత్పాదితాలు పెట్టుబడిలోని స్థిర భాగాలుగా తన ఉత్పాదితంలోకి ప్రవేశిస్తాయనీ, అనుభవం నుంచి అతనికి అవగతం అయివుండేదే. తన కొత్త ఉత్పత్తికి సంబంధించినంత వరకు పెట్టుబడిదారుని దృష్టిలో అదనపు విలువను రూపొందిస్తున్నది వేతనాలు, లాభం, కౌలు పరిమాణాలు. కనుక, ఇతర పెట్టుబడిదారుల ఉత్పాదితాలున్న ఈ స్థిర పెట్టుబడికి కూడా ఇది వర్తిస్తుంది. కాబట్టి పెట్టుబడిలోని స్థిర భాగం యొక్క ధరను, ఆ కారణాన సరుకుల మొత్తం విలువను తుదకంటా

విశ్లేషించినప్పుడు, అది విలువను స్వతంత్రంగా సృష్టించే వేతనాలను, లాభాన్ని, కౌలును కూడితే, భిన్న నియమాలచే నియంత్రితమయ్యే, భిన్న మూలాధారాల నుంచి ఉత్పన్నమయ్యే ఈ మూటిని కూడితే వచ్చే విలువ మొత్తంగా తేలుతుంది. అయితే ఇది ఎలాగో ఇదమిత్థంగా చెప్ప వీలులేదు.

**నాల్గవది :** సరుకులు వాటి విలువకు అమ్మకమవుతాయా లేదా అనేది వ్యష్టి పెట్టుబడిదారుకు పట్టదు. కాబట్టి అసలు విలువ ఎలా నిర్ణయమవుతుందనేది అతనికి పట్టదు. అది ఆరంభం నుంచే అతని కనుమరుగున జరిగే పరిణామక్రమం. అతనితో ప్రమేయం లేని పరిస్థితుల బలంచేత నియంత్రితమైన క్రమం. ఎందువల్లనంటే ప్రతి ఉత్పత్తి రంగంలోనూ నియంత్రక సగటు ధరలుగా రూపొందేది, భిన్నమైన ఉత్పత్తి ధరలే తప్ప విలువ కాదు. విలువ నిర్ధారణ ప్రతి ప్రత్యేక ఉత్పత్తి రంగంలోని వ్యష్టి పెట్టుబడిదారుకు, పెట్టుబడికి ఆసక్తి రేకెత్తించేదీ, పెట్టుబడిదారునిపైనా, పెట్టుబడిపైనా నిర్ణాయక ప్రభావం నెరపేదీ ఒక సందర్భంలో మాత్రమే : శ్రమ ఉత్పాదకత పెరిగిన ఫలితంగా సరుకుల ఉత్పత్తికి అవసరమైన శ్రమ పరిమాణం తగ్గడం వల్ల, అతను అప్పుడున్న మార్కెట్ ధరల ప్రకారం మామూలుకన్నా అదనంగా లాభం సంపాదించగలుగుతాడు. లేదా శ్రమ ఉత్పాదకత పడిపోయిన ఫలితంగా సరుకుల ఉత్పత్తికి అవసరమైన శ్రమ పరిమాణం పెరగడం వల్ల – అతను తన సరుకుల ధరను పెంచవలసి వస్తుంది. ఎందువల్లనంటే ఉత్పాదితంలోని ప్రతి భాగంపైనా, ప్రతి ఒక్క సరుకుపైనా మరింత ఎక్కువ వేతనాలు, మరింత ఎక్కువ స్థిర పెట్టుబడి, అందువల్ల మరింత ఎక్కువ వడ్డీ భారం పడుతుంది. తన సరుకుల ఉత్పత్తి వ్యయాన్ని హెచ్చించిన మేరకు లేదా తగ్గిన మేరకు మాత్రమే, ఆ విధంగా అతని స్థానం ప్రత్యేకమైనదిగా చేసిన మేరకు మాత్రమే విలువ నిర్ధారణపట్ల అతడు ఆసక్తి చూపుతాడు.

మరోవైపు పెట్టుబడిదారు తన వ్యాపార సంస్థ యొక్క లాభాన్ని, క్రియాశీల పెట్టుబడిదారుగా లాభంలో తన వాటాకు వచ్చే భాగాన్ని పొందగల ధరనే కాకుండా, నిరంతరాయ పునరుత్పత్తి జరగాలంటే తన సరుకులను మామూలుగా అమ్ముకోవలసిన ధరను కూడా నియంత్రించే పరిమితులుగా కూడా అతనికి వేతనాలు, వడ్డీ, కౌలు కనిపిస్తాయి. తన సరుకుల్లో నిక్షిప్తమై వున్న విలువ, అదనపు విలువ ఆ సరుకుల అమ్మకం ద్వారా తన చేతికందిందా, లేదా అనేది పెట్టుబడిదారుకు పట్టదు. అతనికి కావలసిందల్లా వేతనాలూ, వడ్డీ, కౌలు నిర్ణయించిన తన ఉత్పత్తి ధరకు పైబడ్డ నిర్ణీత ధరలకు అమ్మడం ద్వారా తన వ్యాపార సంస్థ యొక్క మామూలు లాభం లేదా అంతకన్నా ఎక్కువ లాభం అందడమే. కాబట్టి, పెట్టుబడిలోని స్థిర భాగం సంగతి వదిలేస్తే, వేతనాలు, వడ్డీ, కౌలు సరుకు ధరకు పరిమితి విధించే అంశాలుగా అతనికి కనిపిస్తాయి. కాబట్టి అవి సరుకు ధర యొక్క ఉత్పాదకపర నిర్ణాయకాంశాలుగా కనిపిస్తాయి. ఉదాహరణకు పెట్టుబడిదారు వేతనాలను శ్రమశక్తి విలువకన్నా, అంటే దాని మామూలు స్థాయికన్నా తక్కువగా ఉండేలా తొక్కిపెట్టగలిగితే, మామూలు మొత్తంకన్నా తక్కువ డబ్బును కౌలుగా చెల్లించగలిగితే, తన ఉత్పాదితం దాని విలువకన్నా తుదకు సార్వత్రిక ఉత్పత్తి ధరకన్నా తక్కువ ధరకు అమ్మకమైనా అతను పట్టించుకోడు. పెట్టుబడిలోని స్థిర భాగానికి కూడా ఇదే వర్తిస్తుంది. ఉదాహరణకు ఒక పరిశ్రమదారు తన ముడిపదార్థాలను వాటి ఉత్పత్తి ధరకన్నా తక్కువ ధరకు కొనగలిగితే, తయారైన సరుకును దాని ఉత్పత్తి ధరకన్నా తక్కువ

ధరకు అమ్మినప్పటికీ, అతనికి కలిగే నష్టానికి ఇది ఆపుగా (buffer) వుంటుంది. సరుకు ధరగా రూపుగొన్న అంశాలను పెట్టుబడిదారుకు చెల్లించాలి కాబట్టి వాటి స్థానం భర్తీకావలసి వుంటుంది. ఈ ధరకు పైబడిన అదనపు ధర యథాతథంగా వుంటే లేదా పెరిగితే చాలు, వ్యాపార సంస్థ లాభం యథాతథంగా వుండవచ్చు లేదా పెరగవచ్చు. కానీ అతని సరుకుల ఉత్పత్తిలోకి ఒక నిర్ణీత ధర పరిమాణంగా ప్రవేశించే ఉత్పత్తి సాధనాల విలువ కాక, పరిమితిని విధించే, నియంత్రించే ధర పరిమాణాలుగా ఈ ఉత్పత్తిలో ప్రవేశించేది వేతనాలూ, వడ్డీ, కౌలే. ఫలితంగా అవి సరుకుల ధరను నిర్ణయించే అంశాలుగా అతనికి కనిపిస్తాయి. ఈ దృక్కోణం నుంచి చూస్తే, పైన పేర్కొన్న ధర తాలూకు అంశాలు నిర్ణయించే సరుకుల అంతస్థ విలువకు మించి, పోటీ యాదృచ్ఛిక పరిస్థితులను బట్టి, అదనంగా వున్న మార్కెట్ ధరలే కర్మాగారాదుల లాభాన్ని నిర్ణయిస్తున్నట్లైనా కనిపిస్తుంది, లేదా ఈ లాభం మార్కెట్ ధరలపై నిర్ణాయక ప్రభావాన్ని నెరపుతున్న మేరకు, అది కొనుగోలుదార్లకు, అమ్మకందార్లకు మధ్య పోటీపై ఆధారపడి వున్నట్లైనా కనిపిస్తుంది.

వ్యష్టి పెట్టుబడిదారుల మధ్య పోటీలోనూ, ప్రపంచ మార్కెట్‌లో పోటీలోనూ స్థిరమైన, నియంత్రణాత్మకమైన పరిమాణాలుగా లెక్కల్లో చోటుచేసుకొనేది, వేతనాలు, వడ్డీ, కౌలు తాలూకు నిర్ణీతమైన, ఊహించుకొన్న పరిమాణాలే. ఇక్కడ స్థిరమైన పరిమాణాలంటే, మార్పువీలులేనివని అర్థం కాదు. ప్రతి ఒక్క సందర్భంలోనూ, అవి నిర్ణీతమై నిరంతరం హెచ్చుతూ తగ్గుతూ వుండే మార్కెట్ ధరలకు అవి ఒక స్థిరమైన అవధిగా వుంటాయని మాత్రమే అర్థం. ఉదాహరణకు, సరుకులు అప్పుడున్న వేతనాలు, వడ్డీ, కౌలుతో సార్వత్రిక మార్కెట్ ధరల చొప్పున లేదా వాటికన్నా తక్కువ ధరకు సానుకూలంగా అమ్మవీలుందా, అంటే తదనుగుణంగా కర్మాగారాది సంస్థ లాభం చేతికంద వీలుందా అనే దొక్కటే ప్రపంచ మార్కెట్‌లో జరిగే పోటీలోని సమస్య. ఒక దేశంలో పెట్టుబడిదారీ ఉత్పత్తి పద్ధతి సర్వత్రా అభివృద్ధి చెందకుండా వున్నందువల్ల పెట్టుబడిపై వడ్డీ ఎక్కువగానూ, వేతనాలు, భూమి ధర తక్కువగానూ వుండి, మరో దేశంలో వేతనాలు, భూమి ధర ఎక్కువగానూ, పెట్టుబడిపై వడ్డీ తక్కువగానూ వుంటే, మొదటి దేశంలోని పెట్టుబడిదారు ఎక్కువ శ్రమను, భూమిని – రెండవ దేశంలో పెట్టుబడిదారు సాపేక్షంగా ఎక్కువ పెట్టుబడినీ వినియోగిస్తాడు. ఈ ఇద్దరు పెట్టుబడిదార్ల మధ్య పోటీ జరిగే వీలున్నంత మేరకు, ఈ కారకాలు నిర్ణాయకాంశాలుగా లెక్కల్లో కెక్కుతాయి. కాబట్టి, సరుకుల ధరలను వేతనాలు, వడ్డీ, కౌలు నిర్ణయిస్తాయనీ, అంటే శ్రమ, పెట్టుబడి, భూమి వీటి ధరలు నిర్ణయిస్తాయనీ, ధరకు సంబంధించిన ఈ అంశాలు నిజంగా ధర యొక్క నియంత్రక, ఆంగిక కారకాలనీ సైద్ధాంతికంగానూ, పెట్టుబడిదారు స్వప్రయోజన దృష్టితో వేసే లెక్కలనుబట్టి ఆచరణ రీత్యానూ అనుభవం నిరూపిస్తుంది.

ఇక్కడ ఊహించుకోని అంశమొకటి ఎల్లప్పుడూ వుంటుందని వేరే చెప్పపనిలేదు. అది సరుకుల మార్కెట్ ధర నుంచి ఉత్పన్నమవుతుంది. అదేమిటంటే పైన పేర్కొన్న వేతనాలూ, వడ్డీ, కౌలు అనే అంశాలను కూడినందువల్ల ఏర్పడిన ఉత్పత్తి వ్యయానికి మించి వున్న అదనపు మార్కెట్ ధర. ఈ నాల్గవ అంశాన్ని ప్రతి ఒక్క సందర్భంలో పోటీ నిర్ణయిస్తుంది. సగటు సందర్భంలో సగటు లాభం నిర్ణయిస్తుంది. సగటు లాభాన్ని కూడా నియంత్రించేది ఈ పోటీయే. కానీ ఇది దీర్ఘకాలాల తరబడి

జరిగే పోటీ.

**అయిదవది :** కొత్తగా చేర్చిన శ్రమకు ప్రాతినిధ్యం వహించే విలువను, ఆదాయ రూపాలుగా అంటే వేతనాలు, లాభం, కౌలుగా పెట్టుబడిదారీ ఉత్పత్తి విధాన ప్రాతిపదికపై విభజించడం ఎంత మామూలు విషయమయిందంటే, ఈ పద్ధతిని ఈ ఆదాయ రూపాలు ఏర్పడాలంటే అంతకు ముందుండ వలసిన పరిస్థితులు లేనిచోట సైతం ఈ విభజన పద్ధతిని వర్తింపచేస్తున్నారు. అంటే, ఈ ఆదాయ రూపాలలోనే అంతా అంతర్గతంగా వున్నట్లు సాదృశ్యం ద్వారా చూపుతున్నారు.

ఒక స్వతంత్ర కార్మికుడు తన కోసమే పని చేసుకొంటూ, తన ఉత్పాదితాన్ని అమ్మినప్పుడు (ఒక సన్నకారు వ్యవసాయదారుణ్ణి ఇందుకు ఉదాహరణగా తీసుకుందాం. ఎందువల్లనంటే మూడు ఆదాయ రూపాలనూ, ఇక్కడ వర్తింపచేయవచ్చు.) అతణ్ణి, తన్నుతాను కార్మికునిగా ఉపయోగించు కుంటున్న అతణ్ణి యజమానిగానూ (పెట్టుబడిదారుగా), తన్నుతాను కౌలుదారుగా ఉపయోగించు కుంటున్న అతణ్ణి భూస్వామిగానూ పరిగణిస్తున్నారు. వేతన కార్మికుడుగా తనకు తాను వేతనాలను చెల్లించుకుంటాడు. పెట్టుబడిదారుగా తనకు తాను లాభం ఇచ్చుకుంటాడు. భూస్వామిగా తనకు తాను కౌలు చెల్లించుకుంటాడు. పెట్టుబడిదారీ ఉత్పత్తి పద్ధతినీ, తదనుగుణమైన సంబంధాలనూ సమాజ సార్వత్రిక ప్రాతిపదికగా ఊహించుకుంటే, పైన పేర్కొన్న అంతర్గణన సరియైనదే. అయితే అది ఏ మేరకు సరియైనదంటే, అతను తన అదనపు శ్రమను స్వాహా చేసుకోగలిగిన స్థితిలో వుండటానికి కారణం, ఇక్కడ పెట్టుబడి యొక్క సార్వత్రిక రూపం ధరించిన ఉత్పత్తి సాధనాలకు తానే యజమాని కావడమే తప్ప, అతని శ్రమ కాదు. మరో విషయం అతను తన ఉత్పాదితాన్ని సరుకులుగా ఉత్పత్తి చేసిన మేరకు, తత్కారణంగా దాని ధరపై ఆధారపడిన మేరకు (అలా ఆధారపడకపోయినా, ఈ ధరను లెక్కగట్ట వీలుంది.) అతని చేతికందగల అదనపు శ్రమ ఎంత అనేది లాభం యొక్క సార్వత్రిక రేటుపై ఆధారపడి వుంటుందే తప్ప, ఆ శ్రమ పరిమాణంపై కాదు. అదేవిధంగా, లాభం యొక్క సార్వత్రిక రేటువల్ల నిర్ణయమయ్యే అదనపు విలువకు పైబడిన మిగులు ఏదైనా వుంటే, దాన్ని అతను చేసిన శ్రమ పరిమాణం నిర్ణయించదు. కానీ దాన్ని అతను స్వాహా చేసుకోగలగడానికి కారణం అతడు భూమి సొంతదారు కావడం తప్ప మరొకటి కాదు. పెట్టుబడిదారీ ఉత్పత్తి పద్ధతికి అనుగుణంగా అటువంటి ఉత్పత్తి రూపాన్ని ఉత్పత్తి పద్ధతిలోని ఆదాయ రూపాల్లోకి అలా కొంతవరకు సరిగానే ఇమిడించవచ్చు. అందువల్ల పెట్టుబడిదారీ ఉత్పత్తి సంబంధాలే ప్రతి ఉత్పత్తి పద్ధతిలోని సహజ సంబంధాలన్న భ్రమ మరింత బలపడుతుంది.

వేతనాలను వాటి సార్వత్రిక ప్రాతిపదికకు కుదించినట్లయితే, అంటే ఉత్పాదకుని సొంత శ్రమ ఉత్పత్తి చేసినదానిలో ఆ కార్మికుని వ్యక్తిగత వినియోగంలోకి వెళ్ళే భాగానికి వేతనాలను కుదించినట్లయితే; ఆ భాగాన్ని దాని పెట్టుబడిదారీ పరిమితుల నుంచి విముక్తం చేసి, దాన్ని అప్పటి సమాజ ఉత్పాదకత (అంటే, వాస్తవంగా సామాజిక శ్రమ అయిన అతని వ్యక్తిగత శ్రమ యొక్క సామాజిక ఉత్పాదకత) అనుమతించిన మేరకు, మరోవైపు మనిషి వ్యక్తిత్వ సంపూర్ణ వికాసానికి అవసరమైన మేరకు ఆ వినియోగ పరిమాణాన్ని విస్తరించినట్లయితే, అంతేకాకుండా, అప్పటి సమాజ ఉత్పత్తి పరిస్థితులలో ఒక భీమా నిధిని, నిల్వ నిధిని ఏర్పాటు చేయడానికి, మరోవైపున సామాజిక

అవసరాలు నిర్దేశించిన మేరకు నిరంతరం పునరుత్పత్తిని విస్తరింపచేయడానికి అవసరమైన స్థాయికి అదనపు శ్రమను, అదనపు ఉత్పాదితాన్ని తగ్గించినట్లయితే, చివరగా, సమాజంలోని అపరిణత వయస్కుల లేదా అశక్తుల తరఫున దృఢ శరీరులు తప్పకుండా చేయవలసిన శ్రమ పరిమాణాన్ని 1) అవసర శ్రమలోనూ, 2) అదనపు శ్రమలోనూ మనం చేర్చినట్లయితే అంటే, వేతనాలు, అదనపు శ్రమ – ఈ రెంటికీ గల ప్రత్యేక పెట్టుబడిదారీ లక్షణాన్ని తొలగించినట్లయితే, అప్పుడు మిగిలి వుండేది ఈ రూపాలు కాదు; అన్ని సామాజిక ఉత్పత్తి పద్ధతులకు ఉమ్మడిగా వుండే వాటి బీజాలు మాత్రమే.

అంతేకాక, మునుపు ప్రాబల్యంలో వుండిన ఉత్పత్తి పద్ధతులకు ఉదాహరణకు ఫ్యూడలిజంకు అంతర్గణన పద్ధతి కూడా ఒక లక్షణంగా వుండేది. ఫ్యూడలిజంకు ఏ విధంగానూ సొంతంగానట్టి, దానికి పూర్తిగా అన్యమైనట్టి ఉత్పత్తి సంబంధాలను ఫ్యూడల్ సంబంధాల కింద ఇమడ్చడం జరిగింది. ఉదాహరణకు ఇంగ్లండులో ఉమ్మడి ఇనాములోని జిరాయతీలు (భూస్వామి సేవలకై పొందిన జిరాయతీ హక్కులకు భిన్నమైనవి), కేవలం డబ్బు చెల్లింపుకు సంబంధించినవి కాబట్టి ఇవి పేరుకు మాత్రమే ఫ్యూడల్ హక్కులు.

★ ★ ★

## అధ్యాయం - 51

# పంపిణీ సంబంధాలు, ఉత్పత్తి సంబంధాలు

ఏటా కొత్తగా చేర్చబడిన శ్రమవల్ల చేరిన కొత్త విలువ ఆ విధంగా మూడు భాగాలుగా విభజితమవుతుంది. వార్షిక ఉత్పాదితంలో ఈ విలువకు ప్రాతినిధ్యం వహించే భాగాన్ని మొత్తం ఉత్పాదితం నుంచి గ్రహించి, వేరుచేయవచ్చును. కనుక అది కూడా మూడు భాగాలుగా విభజిత మవుతుంది. అవి ఆదాయం యొక్క మూడు భిన్న రూపాలు ధరిస్తాయి. కొత్త విలువలో, శ్రమశక్తి సొంతదారు వాటాగా వున్న ఒక భాగాన్ని, పెట్టుబడి సొంతదారు వాటాగా వున్న మరో భాగాన్ని, భూ ఆస్తి సొంతదారు వాటాగా ఉన్న మూడో భాగాన్ని వ్యక్తం చేసే రూపాలివి. కాబట్టి ఇవి పంపిణీలు, సంబంధాలు లేక పంపిణీ రూపాలే. ఎందువల్లనంటే, కొత్తగా ఉత్పత్తి అయిన మొత్తం విలువ వివిధ ఉత్పత్తి కారకాల సొంతదారుల మధ్య పంపిణీకి దారితీసిన సంబంధాలను ఇవి వ్యక్తం చేస్తున్నాయి.

మామూలు దృష్టికి ఈ పంపిణీ సంబంధాలు సహజ సంబంధాలుగా, సమస్త సామాజిక ఉత్పత్తి స్వభావం నుంచి, మానవాళి సార్వత్రిక ఉత్పత్తి నియమాల నుంచి ప్రత్యక్షంగా తలెత్తిన సంబంధాలుగా కనిపిస్తాయి. పెట్టుబడిదారీ విధానానికి పూర్వమున్న సమాజాల్లో ఇతర పంపిణీ పద్ధతులున్నట్లు వెల్లడవుతోంది. దీన్ని కాదనలేము. కానీ, వీటిని అభివృద్ధి చెందనివీ, అపరిణతమైనవీ, ప్రచ్ఛన్నమైనవీ అని చెబుతున్నారు. ఇవి తమ తమ స్వచ్ఛమైన అభివ్యక్తిని, తమ అత్యున్నత రూపాన్ని సహజమైన పంపిణీ సంబంధాల్లో ఛాయాభేదాలు గల తరహాలను ఇంకా అందుకోనివనీ వ్యాఖ్యానిస్తున్నారు.

ఈ భావనలో కింది విషయం మాత్రమే సరియైనది : ఏదో ఒక రూపంలో సామాజిక ఉత్పత్తి వున్నట్లు (ఉదాహరణకు ఆదిమ ఇండియన్ సాముదాయక సమాజాలు, లేక అంతకన్నా నేర్పుతో రూపొందించిన పెరూ ప్రజల కమ్యూనిజం) ఊహించుకుందాం. వస్తూత్పాదకులు, వారి కుటుంబాలు ప్రత్యక్షంగా వినియోగించుకొనే ఉత్పాదితాన్ని సృష్టించిన శ్రమ భాగానికీ, నిశ్చిత అదనపు శ్రమగా వున్న శ్రమ భాగానికీ మధ్య తేడా ఎప్పుడూ చూపవచ్చు. (ఇక్కడ ఉత్పాదకంగా వినియోగమయ్యే శ్రమ భాగాన్ని వదలివేస్తున్నాము.) అదనపు శ్రమ ఉత్పాదితం మొత్తంపై సామాజిక అవసరాలను తీర్చడానికి నిరంతరం ఉపయోగపడుతూంది. ఈ అదనపు ఉత్పాదితం ఎలా పంపకం కావీలుందో, ఈ సామాజిక అవసరాలకు ఎవరు ప్రాతినిధ్యం వహించవచ్చునో అనేదానితో ఇక్కడ నిమిత్తం లేదు. ఆ విధంగా వివిధ పంపిణీ పద్ధతుల ఏకత్వానికి అర్థం కేవలం ఇంతే : వాటి తేడాలను, ప్రత్యేక రూపాలను ఈ పద్ధతుల నుంచి వేరుచేసి, వాటి భిన్నత్వాన్ని కాక, వాటి ఏకతను మనం మనసులో ఉంచుకొంటే వాటి మధ్య ఏకత్వం వుంది.

అయితే, పంపిణీ సంబంధాలు చారిత్రకంగా అభివృద్ధి చెందుతూ వస్తున్నాయన్న సంగతిని, మరింత పురోగామిశీలమూ, విమర్శనాత్మకమూ అయిన దృష్టి కలవారు అంగీకరిస్తున్నారు.[1] అయినప్పటికీ, ఉత్పత్తి సంబంధాలు మారవు. అవి మానవ స్వభావం నుంచి తలెత్తినవి కాబట్టి, యావత్తు చారిత్రక అభివృద్ధితో నిమిత్తం లేనివి అన్న అభిప్రాయాన్ని వారు మరింత మొండిగా పట్టుకొని వేలాడుతున్నారు.

అయితే, పెట్టుబడిదారీ ఉత్పత్తి పద్ధతిని గురించిన శాస్త్రీయ విశ్లేషణ నిరూపిస్తున్నది, ఇందుకు పూర్తిగా విరుద్ధమైనది. అది ఒక ప్రత్యేక రకమైన ఉత్పత్తి పద్ధతి అనీ, ప్రత్యేక చారిత్రక లక్షణాలు గలది అనీ, ఇతర ఉత్పత్తి యొక్క ప్రత్యేక పద్ధతులలాగానే దానిలోనూ ఒక నిర్ణీత స్థాయిలో సమాజ ఉత్పాదక శక్తుల అభివృద్ధీ, వాటి అభివృద్ధి రూపాలూ – దాని చారిత్రక పూర్వావసరంగా ఆ ఉత్పత్తి పద్ధతిలో గర్భితమనీ ఈ విశ్లేషణ రుజువు చేస్తున్నది. ఈ పూర్వావసరమే అంతకు మునుపటి క్రమం యొక్క ఫలితమూ, సృష్టీ. దీన్ని ప్రాతిపదికగా చేసుకునే కొత్త ఉత్పత్తి పద్ధతి ముందుకు సాగుతుంది. చారిత్రకంగా నిర్ణయమైన ఈ ఉత్పత్తి పద్ధతికి అనుగుణమైన ఉత్పత్తి సంబంధాలకు – సామాజిక జీవిత క్రమ సందర్భంగా మానవులు తమ సామాజిక జీవన క్రమంలో ఏర్పరచుకునే ఈ సంబంధాలకు – ఒక ప్రత్యేక, చారిత్రక, తాత్కాలిక స్వభావం వుందనీ, వాటికి సమకాలికమైన పంపిణీ సంబంధాలు ఆ ఉత్పత్తి సంబంధాల బొమ్మకు బొరుసు అనీ, అందువల్ల రెంటికీ చారిత్రకంగా ఒకే తాత్కాలిక లక్షణముందనీ ఈ విశ్లేషణ స్పష్టం చేస్తోంది.

వేతనాలు, లాభం, కౌలుల మధ్య వార్షిక ఉత్పాదితం పంపిణీ అవుతుందన్నది ఒక వాస్తవ మనుకుని, దానితో పంపిణీ సంబంధాల పరిశీలనను ప్రారంభించడం జరుగుతోంది. కానీ ఆ విధంగా చెప్పడం తప్పు. ఉత్పాదితం ఒకవైపున పెట్టుబడికీ, మరోవైపున ఆదాయానికి మధ్య పంపిణీ అవుతూంది. ఈ ఆదాయాల్లో ఒకటైన వేతనాలు, అంటే కార్మికుని ఆదాయం మొదట పెట్టుబడి రూపంలో ఈ కార్మికునికి ఎదురైన తరువాత గాని ఆదాయ రూపం ధరించదు. శ్రమకోసం సిద్ధం చేయబడిన పరిస్థితులు, మొత్తంపై శ్రమ ఉత్పాదితాలు పెట్టుబడిగా ప్రత్యక్షుత్పాదకులకు ఎదురు కావడంలో ఆది నుంచే ఒక విషయం అంతర్లీనంగా వుంది. అదేమంటే, కార్మికులకు సంబంధించిన శ్రమ భౌతిక పరిస్థితులకు గల ఒక నిర్దిష్ట సామాజిక స్వభావం; కాబట్టి, ఉత్పత్తి సందర్భంగా కార్మికులు ఉత్పత్తి సాధనాల సొంతదారుతోనూ, తమలో తాము ఏర్పరచుకొనే ఒక నిర్దిష్ట సంబంధ శ్రమకు సంబంధించిన ఈ పరిస్థితులు పెట్టుబడిగా పరివర్తన చెందడంలో భూమి నుంచి ప్రత్యక్ష ఉత్పాదకుల బేదఖలూ, తద్వారా భూ ఆస్తి యొక్క ఒక నిర్దిష్ట రూపమూ అంతర్లీనంగా వున్నాయి.

ఉత్పాదితంలోని ఒక భాగం పెట్టుబడిగా పరివర్తన చెందకుంటే, మిగతా భాగం వేతనాలు, లాభం, కౌలు రూపం ధరించదు.

మరోవైపు, పెట్టుబడిదారీ ఉత్పత్తి పద్ధతిలో ఉత్పత్తి పరిస్థితుల యొక్క ఈ నిర్దిష్ట సామాజిక రూపం గర్భితమైనప్పుడు, ఆ ఉత్పత్తి పద్ధతి ఆ సామాజిక రూపాన్ని నిరంతరాయంగా పునరుత్పత్తి

1. జె. స్టువర్ట్ మిల్, Some unsettled questions in political economy (అర్థశాస్త్రంలో పరిష్కారం కాని కొన్ని సమస్యలు) లండన్; 1844.

చేస్తున్నట్లే లెక్క. అది కేవలం భౌతిక ఉత్పాదితాలను మాత్రమే ఉత్పత్తి చేయదు. ఏ ఉత్పత్తి సంబంధాల్లో ఇవి ఉత్పత్తి అవుతున్నాయో ఆ సంబంధాలను అది నిరంతరాయంగా పునరుత్పత్తి చేస్తుంది; తద్వారా తదనుగుణమైన పంపిణీ సంబంధాలను కూడా పునరుత్పత్తి చేస్తుంది.

అయితే, పెట్టుబడిలోనే (దీనిలో భాగంగా వున్న తద్విరుద్ధమైన భూ ఆస్తిలో కూడా) ఒకానొక విధమైన పంపిణీ గర్భితమే కదా అని ఎవరైనా అనవచ్చు. కార్మికుని నుంచి శ్రమకు అవసరమైనవి లాక్కోబడటం, అల్ప సంఖ్యాకులైన వ్యక్తుల చేతుల్లో వాటి కేంద్రీకరణ, భూమిపై ఇతర వ్యక్తుల ఏకస్వామ్యం, ఒక్క ముక్కలో చెప్పాలంటే, ఆదిమ సంచయనాన్ని గురించి చెప్పిన భాగంలో (పెట్టుబడి I వ సం. VIII వ భాగం) వర్ణించిన అన్ని సంబంధాల పంపిణీయే గదా అనవచ్చు. కానీ ఉత్పత్తి సంబంధాలకు వ్యత్యస్తమైన చారిత్రక లక్షణాన్ని పంపిణీ సంబంధాలు సంతరించుకున్నప్పుడు ఆ పంపిణీ సంబంధాలకు గల అర్థం ఈ పంపిణీకి గల అర్థానికి పూర్తిగా భిన్నమైనది. వ్యక్తిగత వినియోగంలోకి వెళ్ళే ఉత్పాదిత భాగానికి వివిధ వ్యక్తుల హక్కులను మాత్రమే అక్కడ ఆ మాటలకు అర్థం. కానీ, పైపేరాలో పేర్కొన్న పంపిణీ సంబంధాలు, అలాంటివి కాదు; ప్రత్యక్ష ఉత్పాదకులు కాని ఉత్పత్తి సంబంధాల ఏజెంట్లు కొందరు – తదుత్పత్తి సంబంధాల్లోనే నిర్వహించే ప్రత్యేక సామాజిక విధులకు ఈ పంపిణీ సంబంధాలు ప్రాతిపదికగా వుంటాయి. అవి ఉత్పత్తి సంబంధాలకు వాటి ప్రతినిధులకు ఒక ప్రత్యేక సామాజిక లక్షణాన్ని చేకూరుస్తాయి. అవి ఉత్పత్తి యొక్క మొత్తం స్వభావాన్ని, మొత్తం గమనాన్ని నిర్ణయిస్తాయి.

పెట్టుబడిదారీ ఉత్పత్తికి ప్రారంభం నుంచీ వేరుచేసి చూపే రెండు విశిష్ట లక్షణాలున్నాయి.

**మొదటిది :** అది తన ఉత్పాదితాలను సరుకులుగానే ఉత్పత్తి చేస్తుంది. దాన్ని ఇతర ఉత్పత్తి పద్ధతుల నుంచి వేరుచేసి చూపేది, అది సరుకులను ఉత్పత్తి చేస్తుందనేది వాస్తవం కాదు; సరుకుగా వుండటమే దాని ఉత్పాదితాల అతిముఖ్యమైన, నిర్ణయాత్మకమైన లక్షణమనే వాస్తవం కార్మికుడు సైతం కేవలం సరుకుల అమ్మకందారుగా రంగంపైకి వస్తాడనేది, ఇందులోని ప్రప్రథమ అంతర్గతార్థం. అంటే అతను బంధాలు లేని వేతన శ్రామికుడుగా రంగంపైకి వస్తాడన్నమాట; పర్యవసానంగా శ్రమ సాధారణంగా వేతన శ్రమగా వుంటుంది. ఇదివరకే వివరించిన దాని దృష్ట్యా పెట్టుబడికీ వేతన శ్రమకూ మధ్య సంబంధాలు ఉత్పత్తి పద్ధతి తాలూకు మొత్తం స్వభావాన్ని నిర్ణయిస్తాయని మళ్ళీ ఇక్కడ నిరూపించటం అనవసరం. ఈ ఉత్పత్తి పద్ధతి తాలూకు ప్రధాన ఏజెంట్లయిన పెట్టుబడిదారూ, వేతన శ్రామికుడు పెట్టుబడికీ, వేతన శ్రమకు, వ్యక్తులపై సామాజిక ఉత్పత్తి ప్రక్రియ ముద్రించిన సామాజిక లక్షణాలకు, ఈ నిర్దిష్ట సామాజిక సంబంధాల ఉత్పాదితాలకు కేవలం మూర్తీభావాలు, మానుషాకారాలు.

ఒక సరుకుగా (1) ఉత్పాదితం యొక్క లక్షణంలోనూ, పెట్టుబడి యొక్క ఉత్పాదితంగా (2) సరుకు లక్షణంలోనూ అన్ని చలామణి సంబంధాలూ గర్భితం. అంటే, ఉత్పాదితాలు దేనినైతే గడపవలసి వుంటుందో, దేనిలోనైతే అవి నిర్దిష్ట సామాజిక లక్షణాలను సంతరించుకొంటాయో ఆ నిర్దిష్ట సామాజిక ప్రక్రియ గర్భితమన్నమాట. అదేవిధంగా, ఉత్పత్తి ఏజెంట్ల మధ్య గల నిర్దిష్ట సంబంధాలు కూడా దానిలో గర్భితం. తదుత్పాదితం యొక్క విలువ విస్తరణనూ, జీవనాధారాలుగానో, లేక

ఉత్పత్తి సాధనాలుగానో దాని పునఃపరివర్తననూ నిర్ణయించేది ఈ సంబంధాలే. కానీ వీటిని అలా ఉంచినప్పటికీ, పూర్తిగా విలువ నిర్ణయం, విలువచే మొత్తం ఉత్పత్తి నియంత్రణా – ఇవి, సరుకుగా ఉత్పాదితానికి లేక పెట్టుబడిదారీ పద్ధతిలో ఉత్పత్తి అయిన సరుకుగా, సరుకుకు గల పై రెండు లక్షణాల ఫలితమే. విలువ యొక్క ఈ ప్రత్యేక రూపంలో శ్రమ, ఒకవైపు సామాజిక శ్రమగా మాత్రమే నెలకొని వుంటుంది. మరోవైపు ఈ సామాజిక శ్రమ పంపిణీ, దాని ఉత్పాదితాల పరస్పర పూరణ, వాటి పరస్పర మార్పిడి, వాటిని సామాజిక యంత్రాంగానికి లోనుచేయడం, దానిలో ప్రవేశపెట్టడం – ఇవి వ్యష్టి పెట్టుబడిదారుల యాదృచ్ఛిక పరస్పర విచ్ఛేదక ప్రేరణలకు వదిలిపెట్టబడ్డాయి. వ్యష్టి పెట్టుబడిదారులు సరుకు సొంతదారులుగా ఒకరికొకరు ఎదురుపడతారు; ప్రతి ఒక్కరూ తన సరుకును సాధ్యమయినంత ప్రియంగా అమ్ముకోచూస్తారు. (ఉత్పత్తి నియంత్రణలోనే అతడు తన స్వేచ్ఛాయుత సంకల్పాన్నిబట్టే నడుచుకుంటున్నట్లు కనిపిస్తుంది.) అందువల్ల, అంతర్గత నియమం వారి పోటీ ద్వారా మాత్రమే, ఒకరిపై మరొకరి నుంచి వచ్చే ఒత్తిడి ద్వారా మాత్రమే అమలుజరుగుతుంది. ఇందువల్ల వ్యత్యాసాలు ఒకదానినొకటి రద్దు చేసుకుంటాయి. వ్యక్తిగత ఏజెంట్లకు ముఖాముఖిగా వున్న ఒక అంతర్గత నియమంగా మాత్రమే, ప్రాకృతిక అంధనియమంగా మాత్రమే ఇక్కడ విలువ నియమం తన ప్రభావాన్ని నెరపుతుంది. ఉత్పత్తిలోని యాదృచ్ఛికమైన హెచ్చుతగ్గుల మధ్య ఉత్పత్తి సామాజిక సమతూకాన్ని కాపాడుతుంది.

అంతేకాక, ఉత్పత్తి సామాజిక లక్షణాల పాదార్థిక రూపం ధరించడం, ఉత్పత్తి పాదార్థిక పునాదులు మానవాకారం ధరించడం – ఇవి సరుకులో, అంతకన్నా ఎక్కువగా పెట్టుబడి ఉత్పాదితమైన సరుకులో అదివరకే అంతర్లీనంగా వుండడం – మొత్తం పెట్టుబడిదారీ ఉత్పత్తి పద్ధతి విశిష్ట లక్షణాలు ఇవే.

అదనపు విలువ ఉత్పత్తే, ఉత్పత్తి యొక్క ప్రత్యక్ష, నిర్ణాయక లక్ష్యంగా వుండటం, పెట్టుబడిదారీ ఉత్పత్తి పద్ధతి యొక్క రెండవ ప్రత్యేక లక్షణం. పెట్టుబడి ప్రధానంగా పెట్టుబడిని ఉత్పత్తి చేస్తుంది; అదనపు విలువను ఉత్పత్తి చేసిన మేరకే అలా చేస్తుంది. సాపేక్ష అదనపు విలువ చర్చలోనూ, లాభంగా అదనపు విలువ పరివర్తనను గురించిన పరిశీలనలోనూ మనం, పెట్టుబడిదారీ దశకు ప్రత్యేకమైన ఒక ఉత్పత్తి విధానం ఎలా స్థాపితమవుతుందో చూశాము. అది శ్రమ యొక్క సామాజిక ఉత్పత్తి శక్తులు అభివృద్ధి చెందే ఒక ప్రత్యేక రూపంపై నెలకొని వుంటుంది. కానీ ఈ శక్తులు స్వతంత్ర ప్రతిపత్తి గల పెట్టుబడి శక్తులుగా కార్మికునికి ఎదురవుతాయి. కాబట్టి అవి కార్మికుని అభివృద్ధికి ప్రత్యక్షంగా వ్యతిరేకమైనవిగా వుంటాయి. మా విశ్లేషణలో నిరూపించినట్లు, విలువ అదనపు విలువ కోసం ఉత్పత్తిలో, సరుకు ఉత్పత్తికి అవసరమైన శ్రమకాలాన్ని, అంటే ఆ సరుకు విలువకు ఆనాడు వాస్తవంగా వున్న సగటుకన్నా తగ్గించేందుకై నిరంతరం పనిచేసే ధోరణి అంతర్గర్భితం. ఉత్పత్తి ధరను దాని కనీస స్థాయికి తగ్గించేందుకు గల ఒత్తిడి శ్రమ తాలూకు సామాజిక ఉత్పాదకతను పెంచడానికి అత్యంత బలీయమైన సాధనమవుతుంది. కానీ శ్రమ యొక్క ఈ సామాజిక ఉత్పాదకత పెరుగుదల, పెట్టుబడి ఉత్పాదకతలో వస్తున్న నిరంతరాయ పెరుగుదలగానే ఇక్కడ కనిపిస్తుంది.

ఉత్పత్తి ప్రత్యక్ష ప్రక్రియలోని పెట్టుబడికి మూర్తీభావంగా పెట్టుబడిదారు చేపట్టే అధికారం – ఉత్పత్తి మేనేజరుగానూ, దాని పాలకుడుగానూ అతడు నిర్వహించే సామాజిక విధి, బానిసలు, భూస్వామ్య దాసులు మొదలయినవారి ద్వారా జరిగే ఉత్పత్తి ప్రాతిపదికపై చలాయించే అధికారానికి ప్రధాన విషయాల్లో భిన్నమైనది.

పెట్టుబడిదారీ ఉత్పత్తి ప్రాతిపదికపై ప్రత్యక్ష ఉత్పాదకుల బాహుళ్యానికి వారి ఉత్పత్తి సామాజిక స్వభావం శ్రమ ప్రక్రియను నియంత్రించే ఆధిపత్య రూపంలో, ఒక సంపూర్ణ అధికార బృందంగా వ్యవస్థీకృతమైన ఉత్పత్తి ప్రక్రియ తాలూకు సామాజిక యంత్రాంగం రూపంలో ఎదురవుతుంది. (కానీ ఈ అధికారం దాని వాహకులకు చేకూరేది అసలు శ్రమకు భిన్నమైన శ్రమ పరిస్థితుల మూర్తీభావంగానే తప్ప, మునుపటి ఉత్పత్తి పద్ధతుల నాటి రాజకీయ లేదా మత పాలకులుగా కాదు.) ఈ అధికార వాహకుల ఆధిపత్యం ఇలా సుసంఘటితమై వుండగా, సరుకు సొంతదారులుగా మాత్రమే ఒకరికొకరు ఎదురయ్యే ఈ వాహకుల మధ్య, అంటే పెట్టుబడిదారులకు మధ్య సంపూర్ణమైన అరాజకం రాజ్యమేలుతూంటుంది. ఈ అరాజకం పరిధిలో ఉత్పత్తి సామాజిక అంతస్సంబంధాలు వ్యక్తుల స్వేచ్ఛా సంకల్పాలకు అతీతమైన ఒక ప్రకృతి నియమంగా మాత్రమే నిలదొక్కుకుంటాయి.

శ్రమ – వేతన శ్రమగానూ, ఉత్పత్తి సాధనాలు – పెట్టుబడిగానూ అంతకు ముందే వున్నందు వల్లనే, అంటే కేవలం ఈ ప్రధాన ఉత్పత్తి కారకాల ఈ ప్రత్యేక రూపం వల్లనే, విలువలో (ఉత్పాదితంలో) ఒక భాగం అదనపు విలువగా, ఈ అదనపు విలువ లాభంగా (కౌలుగా), పెట్టుబడిదారుని సంపాదనగా, అతనికి అదనంగా లభ్యమైన సంపదగా రంగంపైకి వస్తుంది. కానీ ఈ అదనపు విలువ ఆ విధంగా అతని లాభంగా రంగంపైకి వస్తున్నందువల్లనే, పునరుత్పత్తి విస్తరణకు ఉద్దేశించినట్టి, ఈ లాభంలో భాగమైనట్టి అదనపు ఉత్పత్తి సాధనాలు కొత్త అదనపు పెట్టుబడిగా, మొత్తంపై పునరుత్పత్తి ప్రక్రియ విస్తరణ పెట్టుబడిదారీ సంచయన ప్రక్రియగా కనిపిస్తాయి.

వేతన శ్రమగా వున్న శ్రమ రూపం, సమస్త ఉత్పత్తి ప్రక్రియలో రూపానికి, ఉత్పత్తి ప్రత్యేక పద్ధతికే నిర్ణయాత్మకమైనదే, కానీ విలువను నిర్ణయించేది వేతన శ్రమ కాదు. విలువ నిర్ణయంలో సమస్య సాధారణమైన సామాజిక శ్రమ కాలానికి సంబంధించినది. మొత్తం సమాజం వినియోగించుకో గల శ్రమ పరిమాణానికి సంబంధించినది. వివిధ ఉత్పాదితాలు ఈ శ్రమ పరిమాణం నుంచి సాపేక్షంగా గ్రహించే శ్రమను బట్టి, ఒక విధంగా చూస్తే, వాటి సామాజిక ప్రాముఖ్యం నిర్ణయమవు తుంది. సామాజిక శ్రమ కాలం సరుకుల విలువ నిర్ధారణలో నిర్ణయాత్మకమైనదిగా వుండే నిర్దిష్ట రూపం వేతన శ్రమగా వున్న శ్రమ రూపంతో, పెట్టుబడిగా ఉత్పత్తి సాధనాల యొక్క తదనుగుణమైన రూపంతో, సహజంగానే ముడిపడి వుంది. సరుకు ఉత్పత్తి కేవలం ఈ ప్రాతిపదికపై మాత్రమే ఉత్పత్తి సార్వత్రిక రూపమయిన మేరకు ఇలా ముడిపడి వుంటుంది.

అంతేకాదు, పంపిణీ సంబంధాలనబడే వాటినే పరిశీలిద్దాం. వేతనంలో వేతన శ్రమ, లాభంలో పెట్టుబడి గర్భితం. పంపిణీ యొక్క ఈ నిర్దిష్ట రూపాల్లో ఉత్పత్తి సంస్థల యొక్క నిర్దిష్ట సామాజిక లక్షణాలు, ఉత్పత్తి ఏజెంట్ల మధ్య గల నిర్దిష్ట సామాజిక సంబంధాలు ఆ విధంగా గర్భితం. ప్రత్యేక పంపిణీ సంబంధాలు ఆ విధంగా, ప్రత్యేకమైన చారిత్రక ఉత్పత్తి సంబంధాల అభివ్యక్తి మాత్రమే.

ఇప్పుడు లాభాన్ని పరిశీలిద్దాం. ఉత్పత్తి సాధనాల నూతన సృష్టి పెట్టుబడిదారీ ఉత్పత్తి రూపంలో జరగడమన్న వాస్తవానికి అదనపు విలువ యొక్క ఈ ప్రత్యేక రూపం తప్పనిసరియైన పూర్వావసరం. వాస్తవంలో తన లాభమంతటినీ ఆదాయంగా వినియోగించుకో వీలున్నట్లు వ్యష్టి పెట్టుబడిదారుకు తోచినప్పటికీ, ఇది పునరుత్పత్తిని శాసించే ఒక సంబంధం. కానీ, ఇలా వినియోగించుకోవడంలో అతనికి భీమా, రిజర్వ్ నిధులు, పోటీ నియమాలు మొదలయిన వాటి రూపంలో సైతం అడ్డంకు లెదురవుతాయి. ఇవి అతని చేతులను కట్టివేస్తూ, లాభం అనేది కేవలం వ్యక్తిగతంగా వినియోగించ వీలున్న పంపిణీ తాలూకు అభివర్గం కాదని ఆచరణలో రుజువు చేస్తాయి. అంతే కాకుండా, పెట్టుబడిదారీ ఉత్పత్తి ప్రక్రియను మొత్తంగా ఉత్పాదితాల ధరలు నియంత్రిస్తాయి. కానీ, ఇలా నియంత్రించే ఉత్పత్తి ధరలను లాభం రేటు సమానీకరణా, తదనుగుణంగా వివిధ సామాజిక ఉత్పత్తి రంగాల మధ్య పెట్టుబడి పంపిణీ నియంత్రిస్తాయి. కాబట్టి ఇక్కడ లాభం ఉత్పాదితాల పంపిణీకి కాక అసలు ఉత్పత్తికే ప్రధాన కారకంగా, వివిధ ఉత్పత్తి రంగాల మధ్య శ్రమ, పెట్టుబడుల పంపిణీలో ఒక కారకంగా కనిపిస్తుంది. పరిశ్రమ లాభంగా, వడ్డీగా లాభవిభజన ఒకే ఆదాయం పంపిణీగా కనిపిస్తుంది. కానీ మొట్టమొదటి విషయం, స్వయం విస్తరణ విలువగా, అదనపు విలువ స్రష్టగా పెట్టుబడి అభివృద్ధి చెందడం, అంటే స్థిరపడిన ఉత్పత్తి ప్రక్రియ యొక్క ఈ ప్రత్యేక సామాజిక రూపం దీనికి మూలం. ఇది తన నుంచీ ఈ పరపతి, పరపతి సంస్థలు, తద్వారా ఈ ఉత్పత్తి రూపం పుట్టుకొచ్చేలా చేస్తుంది. బయటికి కనిపించే పంపిణీ రూపాలయిన వడ్డీ, వగైరాలు నిర్ణాయక ఉత్పత్తి కారకాలుగా ధరలో ప్రవేశిస్తాయి.

భూమి కౌలు కేవలం పంపిణీ రూపంగా కనిపించవచ్చు. ఎందువల్లనంటే భూ ఆస్తి ఉత్పత్తి ప్రక్రియలో ఏవిధమైన విధినీ లేదా కనీసం ఏ మామూలు విధినీ నిర్వహించదు. కానీ, (1) కౌలు సగటు లాభానికి పైబడిన మొత్తానికి పరిమితమై వుండటం, (2) భూస్వామి ఉత్పత్తి ప్రక్రియకు మొత్తం సామాజిక జీవిత క్రమానికే మేనేజరుగా, యజమానిగా వున్న దశ నుంచి కేవలం భూమిని కౌలుకిచ్చే వ్యక్తిగా, భూమిపై అన్యాయార్జన చేసే వ్యక్తిగా, కేవలం కౌలు వసూలు చేసుకొనే వ్యక్తిగా దిగజారడం – ఇది పెట్టుబడిదారీ ఉత్పత్తి పద్ధతి యొక్క ప్రత్యేక చారిత్రక ఫలితం. నేల భూ ఆస్తి రూపం ధరించడం దీనికొక చారిత్రక పూర్వావసరం. భూ ఆస్తి వ్యవసాయంలో పెట్టుబడిదారీ పని పద్ధతికి వీలిచ్చే రూపాలను ధరించడం ఈ ఉత్పత్తి పద్ధతి యొక్క ప్రత్యేక లక్షణ ఫలితం. భూస్వామి ఆదాయం – ఇతర రూపాల సమాజంలో సైతం కౌలుగా పేర్కొనబడవచ్చు. కానినీ అది, ఈ ఉత్పత్తి పద్ధతి రంగంపైకి వచ్చే కౌలుకు ప్రధాన విషయాల్లో భిన్నమైనది.

ఉత్పత్తి క్రమం సంతరించుకొన్న చరిత్ర నిర్ణీత ప్రత్యేక రూపాలకు మానవ జీవిత పునరుత్పత్తి క్రమంలో మానవులు ఏర్పరచుకొన్న పరస్పర సంబంధాలకు పంపిణీ సంబంధాలనేవి అనుగుణమైనవీ, వాటి నుంచి ఉత్పన్నమైనవీ. ఈ పంపిణీ సంబంధాల చారిత్రక స్వభావం ఉత్పత్తి సంబంధాల చారిత్రక స్వభావమే. అవి ఉత్పత్తి సంబంధాల స్వభావంలోని ఒక అంశాన్ని మాత్రమే వ్యక్తం చేస్తున్నాయి. పెట్టుబడిదారీ పంపిణీ, ఇతర ఉత్పత్తి పద్ధతుల నుంచి ఉత్పన్నమైన పంపిణీ రూపానికి భిన్నమైనది. ప్రతి పంపిణీ రూపమూ తాను దేనినుంచి పుట్టిందో, దేనికి అనుగుణంగా ఉంటూ వచ్చిందో ఆ ప్రత్యేక ఉత్పత్తి రూపంతోపాటే అంతరించిపోతుంది.

పంపిణీ సంబంధాలు మాత్రమే చారిత్రకమైనవనీ, అయితే ఉత్పత్తి సంబంధాలు అలాంటివి కాదనీ అనుకునే దృక్పథం ఒకవైపు, బూర్జువా అర్థశాస్త్రపు తొలుతటి విమర్శనా దృక్పథం మాత్రమే. తొలుతటిదే అయినా ఆ విమర్శకు ఇప్పటికీ అది ప్రతిబంధకంగానే వుంది. మరోవైపు అసాధారణంగా ఏకాకి అయిన ఒక మనిషి సైతం, ఎటువంటి సామాజిక సహాయమూ లేకుండా చేయగలలాంటి అతి సులభమైన శ్రమ ప్రక్రియతో సామాజిక ఉత్పత్తి ప్రక్రియను గందరగోళపరచడం, ఆ రెండూ ఒకటే అని భావించడం ఈ దృక్పథానికి ప్రాతిపదిక. శ్రమ ప్రక్రియ మనిషికీ, ప్రకృతికీ మధ్య జరిగే ప్రక్రియగా ఉన్నంత మేరకు, ఆ శ్రమ ప్రక్రియలోని సామాన్య మూలాంశాలు సామాజిక అభివృద్ధి రూపాలకన్నిటికీ ఉమ్మడిగా వుండేవే. కానీ ఈ ప్రక్రియ యొక్క ప్రతి ప్రత్యేక చారిత్రక రూపమూ దాని పాదార్థిక పునాదులను, సామాజిక రూపాలను పెంపొందిస్తుంది. ఒకానొక పరిణత దశ అందుకొన్నప్పుడల్లా ఆయా ప్రత్యేక చారిత్రక రూపం విసర్జితమై, మరింత ఉన్నతమైన రూపానికి తన స్థానమిస్తుంది. ఒకవైపు పంపిణీ సంబంధాలకు, త్వరగా తమకు సంబంధించిన ఉత్పత్తి సంబంధాల నిర్దిష్ట చారిత్రక రూపానికీ, మరోవైపు ఉత్పాదక శక్తులకు, బలాలకు, వాటి ప్రాతినిధ్య సంస్థల అభివృద్ధికీ మధ్య వైరుధ్యాలు, శతృత్వాలు అందుకున్న ప్రగాఢత వల్ల, విస్తృతి వల్ల అటువంటి ఒక సంక్షోభ తరుణం ఆసన్నమైందని వెల్లడి అవుతుంది.[1]

★ ★ ★

1. "పోటీ, సహకారం" అన్న రచనను (1832 ?) చూడండి.

# అధ్యాయం - 52

# వర్గాలు

వేతనాలు, లాభం, భూమి కౌలు వరుసగా వీటిని తమ ఆదాయ మూలాధారాలుగా గల కేవల శ్రమశక్తి సొంతదారులు, పెట్టుబడి సొంతదారులు, భూమి సొంతదారులు – వేరుమాటల్లో, వేతన శ్రామికులు, పెట్టుబడిదారులు, భూస్వాములు ఆ విధంగా పెట్టుబడిదారీ ఉత్పత్తి పద్ధతిపై ఆధారపడిన ఆధునిక సమాజంలోని మూడు పెద్ద వర్గాలుగా ఏర్పడ్డారు.

ఇంగ్లండులో ఆధునిక సమాజం, ఆర్థిక నిర్మాణ స్వరూపంలో నిస్సందేహంగా, అత్యున్నతంగా, ప్రామాణికంగా అభివృద్ధి చెందింది. అయినప్పటికీ ఇక్కడ కూడా వర్గాల విభజన దాని అచ్చమైన రూపంలో కనిపించదు. మధ్య, మధ్యంతర పొరలు ప్రతిచోటా (నగరాల్లోకన్నా గ్రామీణ ప్రాంతాల్లో చాలా తక్కువగానే అయినా) ఈ విభజన రేఖను తుడిచిపెడుతున్నాయి. కానీ ఇది మన విశ్లేషణకు అనవసరం. ఉత్పత్తి సాధనాలను శ్రమ నుంచి అంతకంతకు వేరుచేయడం, చెదురుమదురుగా వున్న ఉత్పత్తి సాధనాలను పెద్ద సముదాయాలుగా అంతకంతకు కేంద్రీకృతమయ్యేలా చేయడం, తద్వారా శ్రమను వేతన శ్రమగా, ఉత్పత్తి సాధనాలను పెట్టుబడిగా రూపాంతరం చెందించడం – ఇది పెట్టుబడిదారీ ఉత్పత్తి పద్ధతి యొక్క నిరంతర ధోరణీ, దాని అభివృద్ధి నియమమూ అని మనం చూశాము. మరోవైపు, పెట్టుబడి నుంచీ, శ్రమ నుంచీ భూ ఆస్తి స్వతంత్రంగా వేరుపడిపోవడం[1] లేదా యావత్తు భూ ఆస్తి పెట్టుబడిదారీ ఉత్పత్తి పద్ధతికి సరిపడిన భూ ఆస్తి రూపంగా పరివర్తన చెందడం పైధోరణికి అనుగుణమైనదే.

సమాధానమివ్వవలసిన మొదటి ప్రశ్న ఇది : ఏది ఒక వర్గమవుతుంది? దీనికి సమాధానం, మరో ప్రశ్నకిచ్చే సమాధానం నుంచి సహజంగా ఉత్పన్నమవుతుంది. ఆ ప్రశ్న ఇది : వేతన శ్రామికులను, పెట్టుబడిదారులను, భూస్వాములను మూడు పెద్ద సామాజిక వర్గాలుగా చేసేదేమిటి?

చూసీ చూడగానే ఇలా చెప్పవచ్చు – ఆదాయాల ఏకత్వం, ఆదాయ మూలాధారాల ఏకత్వం.

---

1. ఎఫ్. లిస్ట్ సరిగ్గానే ఇలా వ్యాఖ్యానిస్తున్నారు : "భారీ ఎస్టేట్లపై స్వయంపోషక ఆర్థిక వ్యవస్థ యొక్క ప్రాబల్యం నిరూపిస్తున్నదల్లా, నాగరికతా, రవాణా, సమాచార ప్రసార సాధనాలు, దేశీయ పారిశ్రామిక శాఖలు, సంపన్న నగరాలు కొరవడ్డాయనే. కాబట్టే రష్యా, పోలెండ్, హంగరీ, మెక్‌లెన్‌బర్గ్‌లలో అంతటా ఇది ఎదురవుతుంది. మునుపు ఇంగ్లండులో సైతం ఇది ప్రబలంగా వుండేది. కాని పారిశ్రామిక శాఖలు, వర్తకం అభివృద్ధి చెందడంతో, భారీ ఎస్టేట్లు మధ్యస్థాయి ఎస్టేట్లుగా చీలడం, భూమిని కౌలుకివ్వడం దీని స్థానాన్ని ఆక్రమించింది." (Die Ackerverfassung, die Zwergwirtschaft und die awswanderung, 1842, పుట 10)

ఇక్కడ మూడు పెద్ద సామాజిక బృందాలున్నాయి. వీటి సభ్యులు – ఈ బృందాలుగా ఏర్పడిన వ్యక్తులు వరుసగా వేతనాలపైన, లాభంపైన, భూమి కౌలుపైన ఆధారపడుతున్నారు. తమ శ్రమశక్తి, తమ పెట్టుబడి, తమ భూ ఆస్తి డబ్బుగా తమ చేతికందడంపై ఆధారపడి జీవిస్తున్నారు.

కానీ ఈ దృక్కోణం నుంచి చూస్తే, ఉదాహరణకు వైద్యులు, ఉద్యోగులు కూడా రెండు వర్గాలుగా వున్నారు. ఎందువల్లనంటే వారు రెండు వేరు వేరు సామాజిక బృందాలకు చెందినవారు; ఈ బృందాల్లోని ప్రతి ఒక్కదాని సభ్యుల ఆదాయానికి గల మూలాధారం ఒకటే. సామాజిక శ్రమ విభజనవల్ల శ్రామికులూ, పెట్టుబడిదారులూ, భూస్వాములూ తమ ప్రయోజనాలనుబట్టి, అంతస్తులను బట్టి అసంఖ్యాకమైన ముక్కచెక్కలుగా చీలి వున్న స్థితికి కూడా (ఉదాహరణకు భూస్వాములు ద్రాక్ష తోటల యజమానులుగా, వ్యవసాయ క్షేత్ర యజమానులుగా, అడవుల యజమానులుగా, మత్స్య పరిశ్రమల యజమానులుగా చీలి వున్నారు.) ఇదే వర్తిస్తుంది.

[ఇక్కడ రాత ప్రతి ఆగిపోయింది]

★ ★ ★

# ఫ్రెడరిక్ ఎంగెల్స్ పెట్టుబడి మూడవ సంపుటికి చేర్చిన అనుబంధం

**పె**ట్టుబడి 3వ సంపుటి వెలువడి, దానిపై జనాభిప్రాయం వ్యక్తమవుతూ వచ్చినప్పటినుంచి దానికి బహువిధ వివరణలు ఎన్నో వెలువడ్డాయి. అది అనుకోనిదేమీ కాదు. దీనిని ప్రచురించడంలో నా ఉద్దేశం ప్రధానంగా ఇదీ : సాధ్యమయినంత యథార్థమైన పాఠాన్ని తయారు చేయడం, మార్క్స్ సాధించిన కొత్త ఫలితాలను సాధ్యమయినంత వరకు ఆయన మాటల్లోనే చూపడం, పూర్తిగా అనివార్యమైన సందర్భాల్లో మాత్రమే నేను జోక్యం చేసుకోవడం, అప్పుడు సైతం తనతో మాట్లాడుతున్న దెవరు అనే విషయంలో పాఠకునికి ఎటువంటి సందేహమూ లేకుండా చూడటం నాకు లభ్యమైన సమాచారాన్ని ఒక క్రమపద్ధతిలో రాసిన గ్రంథంగా మార్చి వుండవలసిందని (ఫ్రెంచివారి[1] మాటల్లో en faire un livre) కొందరన్నారు. వేరుమాటల్లో చెప్పాలంటే, పాఠకుని సౌకర్యానికి పాఠం యొక్క యథార్థతను బలిపెట్టి వుండవలసిందన్నమాట. కానీ నేను నా కర్తవ్యంగా భావించిన దదికాదు. నేను అలా దిద్దడం ఏ విధంగానూ సమర్థనీయం కాదు. మార్క్స్ వంటి వ్యక్తికి తన మాటల్ని వినిపించే హక్కుంది. తాను కనుగొన్న కొత్త శాస్త్రీయ విషయాలను భావితరాలకు వాస్తవంగా తనదైన పద్ధతిలో అందించే హక్కుంది. అదీకాక, అంతటి ఉన్నత స్థానంలోని వ్యక్తి వారసత్వాన్ని ఆ విధంగా ఉల్లంఘించాలనే కోర్కె నాకు లేదు – అది ఉల్లంఘనగానే నాకు తోచక తప్పదు కదా. అది నా దృష్టిలో విశ్వాసఘాతుకత్వమయి వుండేది. మూడవది, అది పూర్తి నిరుపయోగమయి వుండేది. ఎందువల్లనంటే, చదవలేని లేదా చదవాలనే ఇచ్ఛలేని వారికి, పెట్టుబడి Iవ సంపుటిలో సైతం, దాన్ని సరిగా అర్థం చేసుకొనేందుకు అవసరమైన దానికన్నా, దాన్ని అపార్థం చేసుకొనేందుకే ఎక్కువ శ్రమ పడ్డవారికి, ఏ విధంగా పాటుపడినా అది బధిర శంఖారావమే. కానీ నిజంగా అర్థం చేసుకోవాలనే ఆసక్తి గలవారికి మూలపాఠమే అన్నిటికన్నా ముఖ్యమైనది. వారి దృష్టిలో నేను మార్చి రాసిన దాని విలువల్లా కేవలం ఒక వ్యాఖ్యానానికి గల విలువే. అందులోనూ, అముద్రితమూ, అలభ్యమూ అయిన దానిపై వ్యాఖ్యానానికి గల విలువే. మొదటి వివాద సందర్భంలోనే మూలపాఠాన్ని సంప్రదించవలసిన అవసరమేర్పడేది. రెండవ, మూడవ వివాదం తలెత్తినప్పుడు మూలపాఠాన్ని in extenso (సవిస్తరంగా) ప్రస్తావించడం అనివార్యమై వుండేది.

1. యథార్థ పాఠాన్ని రూపొందించడం - అనువాదకుడు.

అన్ని కొత్త విషయాలున్న రచనల్లో, పైగా త్వరత్వరగా రేఖామాత్రంగా, కొంతవరకు అసంపూర్ణంగా వున్న ముసాయిదాలో – అలాంటి వివాదాలు రావడం సహజమే. ఇక్కడ నా జోక్యం సహజంగానే ఉపయోగపడగలదు. అర్థం చేసుకోవడంలో కలిగే చిక్కులను తొలగించడానికి, గ్రంథపాఠంలో కొట్టవచ్చినట్లు, తగినంత ప్రముఖంగా కనిపించని ముఖ్యాంశాలను మరింత ముందుకు తీసుకురావడానికీ, 1865లో రాసిన పాఠాన్ని 1895 నాటి పరిస్థితులకు సరిపోయేలా ఆ పాఠానికి కొన్ని ముఖ్యమైన చేర్పులను చేయడానికీ నా జోక్యం ఉపయోగపడగలదు. నిజానికి క్లుప్తంగా చర్చించడం అవసరమైన రెండు అంశాలు ఇప్పటికే వున్నాయి.

★ ★ ★

## I. విలువ నియమం, లాభం రేటు

ఈ రెండు అంశాల మధ్య పైకి కనిపించే వైరుధ్యం యొక్క పరిష్కరణ, మార్క్స్ పాఠం ప్రచురణ ముందు వాద ప్రతివాదాలకు ఎంతగా దారితీసిందో, దాని ప్రచురణ తరువాత కూడా అంతగానే దారితీస్తుందనేది అనుకొన్నదే. కొందరు ఏదో ఒక సంపూర్ణ అద్భుతానికి సన్నద్ధులయ్యారు. వారికిప్పుడు ఆశాభంగం కలుగుతోంది. ఎందువల్లనంటే, వారిప్పుడు చూస్తున్నది, ఈ వైరుధ్యానికి ఒక సరళమైన, సహేతుకమైన, స్థిమితంగా ఆలోచించిన పరిష్కారమే తప్ప వారు ఆశించిన మాయామంత్రం కాదు. అందరికన్నా మహదానందంతో ఆశాభంగానికి లోనైనది, సుప్రసిద్ధుడైన లోరియా. పకడ్బందీగా కట్టిన బ్రహ్మాండమైన మార్క్సియన్ నిర్మాణాన్ని తనవంటి మరుగుజ్జు సైతం గాలిలోకి ఎత్తి పేల్చివేయడానికి అతనికి తుట్టతుదకు ఆర్కిమిడిస్ ఆధారం దొరికింది. అతను ఆగ్రహంతో అంటాడు కదా, ఏమేమీ! అదొక పరిష్కారమనుకోవాలా? అది అచ్చంగా మాయ చేయడమే. అర్థశాస్త్రజ్ఞులు విలువను గురించి మాట్లాడేటప్పుడు మార్పిడిలో వాస్తవంగా స్థాపకమైన విలువ అన్నదే వారి భావం. "సరుకులు ఏ విలువకు అమ్మకం కావడంలేదో, లేక ఏ విలువకు ఎన్నటికీ అమ్మకం కాజాలవో (ne possono vendersi mai) ఆ విలువను గురించి, ఏకాస్త ఇంగితజ్ఞానమున్న ఆర్థిక వేత్త కూడా పట్టించుకోలేదు; లేదా, పట్టించుకోవాలని ఎన్నటికీ అనుకోబోడు.... ఏ విలువకు సరుకులు ఎన్నటికీ అమ్మకంకావో ఆ విలువ, వాటిలో వున్న శ్రమకు అనుగుణంగా వుంటుందని బల్లగుద్ది చెప్పడంలో మార్క్స్ చేస్తున్నదల్లా ఏమిటి? సరుకులు అమ్మకమయ్యే విలువ వాటిపై వ్యయమైన శ్రమకు అనుగుణంగా వుండదు అన్న సాంప్రదాయవాదులైన అర్థశాస్త్రజ్ఞుల సిద్ధాంతాన్ని తిప్పేసి తిరిగి చెప్పడమే కదా.... వ్యష్టి విలువలు వ్యష్టి ధరలకు భిన్నంగా వున్నప్పటికీ, అన్ని సరుకుల మొత్తం ధర వాటి మొత్తం విలువతో లేదా మొత్తం సరుకుల్లోని శ్రమ పరిమాణంతో ఎల్లప్పుడూ ఏకీభవిస్తాయని మార్క్స్ చెప్పడం విషయావగాహనకు తోడ్పడదు. ఎందువల్లనంటే, విలువ అనేది ఒక సరుకు మరో సరుకుకు మధ్య మార్పిడి నిష్పత్తి తప్ప మరొకటి కాదు కనుక. మొత్తం విలువ అనే భావనే అసంగతమైనది, అర్థంపర్థం లేనిది.... Contradictio in adjecto' లోరియా ఇంకా ఇలా వాదిస్తున్నాడు : రెండు సరుకుల్లోని ఒకే విధమైన, సమానంగా పెద్దదైన అంశం, అంటే సమాన పరిమాణం గల శ్రమ కారణంగానే, వాటిని మార్పిడి సమానం చేయగలదని మార్క్స్ పుస్తక

ప్రారంభంలోనే చెప్పాడు. తమలోని శ్రమ పరిమాణాన్ని పూర్తిగా భిన్నమైన నిష్పత్తిలో సరుకులు మార్పిడి అవుతాయని ఇప్పుడు గట్టిగా చెప్పడం ద్వారా మార్క్స్ తన మాటను తానే గంభీరంగా కాదంటున్నాడు. "ఒక సిద్ధాంతాన్ని ఇంత అర్థంపర్థం లేనిదని తేల్చిన సందర్భం reductio ad absurdum ఇంత సంపూర్ణంగా సైద్ధాంతిక దివాళాకోరుతనం ఎన్నడైనా కద్దా? ఇంతకన్నా – ఆర్భాటంగా, గంభీరంగా శాస్త్రీయ ఆత్మహత్య చేసుకొన్న సందర్భం ఎన్నడైనా కద్దా!" (Nuova Antologia, ఫిబ్రవరి 1, 1895, పుటలు 477–78, 479)

మన లోరియాగారు సంతోషం పట్టలేకున్నారని మనకు కనిపిస్తూనే వుంది. మార్క్స్‌ను తన కోవలోని వాడిగానే, ఒక మామూలు ప్రగల్భాలు పలికే వ్యక్తిగానే పరిగణించడం సరియైనదే కదూ! అదీ సంగతి – లోరియాలాగానే మార్క్స్ కూడా తన పాఠకలోకాన్ని ఎద్దేవా చేస్తున్నాడు. ఇటాలియన్ ఆర్థికశాస్త్ర ఆచార్యుల్లో కెల్లా అత్యల్పుడైన ఇతనిలాగా మార్క్స్ కూడా మాయామంత్రాలతో పబ్బం గడుపుకొంటున్నాడన్నమాట. కానీ డుల్ కామరా[1] అయితే, తెలివైన డుల్ కామరా అలా చెయ్యగలడు గానీ, అయోమయపు ఉత్తరాదివాడు మార్క్స్, అసందర్భంగా, అర్థంపర్థంలేని అసంగత విషయాలు రాశాడు. అందుచేత అతనికి పవిత్ర ఆత్మహత్య తప్ప వేరే దారేమీ మిగలలేదు.

శ్రమవల్ల నిర్ధారితమైన విలువలకు సరుకులెపుడూ అమ్ముడుకాలేదనీ, లేదా అలా అమ్ముడు కాలేవనీ చేసిన ప్రకటన సంగతి తర్వాత చూద్దాం! మనమిక్కడ కేవలం "విలువ అంటే ఒక సరుకుకు, మరో సరుకు మధ్య మారకపు నిష్పత్తి తప్ప మరేమీ కాదు" అనీ, అందుచేత "సరుకుల మొత్తం విలువ అనే భావమే అసంగతమైనదీ, అర్థంపర్థం లేనిదీ...." అని లోరియాగారు చేసిన విస్పష్ట ప్రకటన సంగతి చూద్దాం!

రెండు సరుకులు పరస్పరం మార్పిడి అయ్యే నిష్పత్తి, అంటే వాటి విలువ కేవలం కాకతాళీయమైనది. బయటినుంచి సరుకులకు అతికించినది. ఇది నేడు ఒకటైతే, రేపు మరొకటి కావచ్చు. ఒక మెట్రిక్ హండ్రెడ్ వెయిట్ గోధుమ ఒక గ్రాము బంగారానికి మార్పిడి అవుతుందా లేక ఒక కిలోగ్రాము బంగారానికి మార్పిడి అవుతుందా అనేది ఆ గోధుమ లేక ఆ బంగారంలోని స్వతస్సిద్ధ స్థితిగతులపై ఏమాత్రమూ ఆధారపడదు. అది ఆ రెంటికీ పూర్తిగా అన్యమైన పరిస్థితులపై ఆధారపడి వుంటుందన్నమాట. ఎందువల్లనంటే, అలా ఆధారపడి వున్నట్లయితే, ఈ పరిస్థితులు మార్పిడిలో కూడా గోధుమ పాత్రను చాటి చెప్పవలసి వుంటుంది. మొత్తం మీద మార్పిడిని శాసించ వలసి వుంటుంది; అంతేకాక, మార్పిడికి వెలుపల కూడా వాటికి స్వతంత్ర అస్తిత్వం వుంటుంది. పర్యవసానంగా, సరుకుల మొత్తం విలువను గురించి ఎవరైనా మాట్లాడ వీలుంది. అది అర్థంలేని మాట అంటాడు లోరియా. రెండు సరుకులు ఒక దానికొకటి ఏ నిష్పత్తిలో మార్పిడి అయినా సరే, అదే వాటి విలువ – ఉన్న సంగతంతా అంతే; కాబట్టి విలువా, ధరా ఒకటే. ప్రతి సరుకుకూ ఎన్ని ధరలు లభిస్తాయో అన్ని విలువలుంటాయి. మరి ధరనేమో సరఫరా గిరాకీలు నిర్ణయిస్తాయి. ఇంతకు మించి ప్రశ్నలు వేసే వాడెవడైనా, వాటికి సమాధానాలు వస్తాయని ఆశిస్తే, అతడు పరమమూర్ఖుడు.

అయితే విషయంలో ఒక తిరకాసు వుంది. మామూలు పరిస్థితిలో సరఫరా, గిరాకీలు

1. డోనిజెట్టి హాస్య సంగీత నాటకం L'Elisir d' A more లోని కోతలరాయుడు.

సమతూకంలో వుంటాయి. కాబట్టి ప్రపంచంలోని సమస్త సరుకులను రెండు అర్ధభాగాలుగా అంటే సరఫరా సముదాయంగానూ, దానంత పెద్దదైన గిరాకీ సముదాయంగానూ విభజిద్దాం. వీటిలో ప్రతి ఒక్కటీ, 1,000,000 మిలియన్ మార్కులు, పౌన్లు ఫ్రాంక్‌లు లేదా పౌండ్లు, లేదా మీకిష్టమైన మరేదో నాణేలలోని ధరకు ప్రాతినిధ్యం వహిస్తూందనుకొందాం. ప్రాథమిక గణితశాస్త్రాన్ని బట్టి వీటి మొత్తం ధర లేదా విలువ 2,000,000 మిలియన్లు. ఇది అర్థంలేని మాట, అసంగతమైన మాట, అంటాడు లోరియా. ఈ రెండు సముదాయాలు కలిసి 2,000,000 మిలియన్ ధరకు ప్రాతినిధ్యం వహించవచ్చు. కానీ విలువ సంగతి వేరు. ధర సంగతికి వస్తే, 1000+1000=2000, కానీ విలువ సంగతి తీసుకొంటే 1000+1000=0. కనీసం, మొత్తం సరుకులకు సంబంధించిన ఈ సందర్భంలో అది సున్న. ఎందువల్లనంటే, ప్రతి సముదాయానికి చెందిన సరుకులు 1,000,000 మిలియన్ చేస్తున్నావంటే ఈ రెంటిలోని ప్రతి సముదాయాల రెండవ సముదాయంలోని సరుకు కోసం ఈ మొత్తాన్ని ఇవ్వగలగటం, ఇస్తూండటం ఒక్కటే అందుకు కారణం. కానీ ఈ రెండు సముదాయాల్లోని మొత్తం సరుకులను మూడవ వ్యక్తి చేతుల్లో కలబోసినట్లయితే, అతని చేతిలో మొదటి సముదాయానికి గానీ, రెండవ సముదాయానికి గానీ ఎట్టి విలువా లేదు. ఇక ఈ రెండూ కలిసి వున్న మూడవ సముదాయానికి ఏ విలువా లేనేలేదు. చివరకు ఎవరివద్దా ఏమీ లేదు. విలువ భావన జాడ కూడా మిగలని విధంగా, ఆ భావనను మన దక్షిణాది కాగ్లియోస్ట్రో చీల్చిచెండాడడంలో ప్రదర్శించిన ఆత్మాతిశయం మనకు ఆశ్చర్యం గొలుపుతుంది. నాటు అర్థశాస్త్రానికి ఇది పరాకాష్ఠే![1]

---

1. తరువాత కొన్నాళ్ళకు - IIIవ సంపుటికి నా ఉపోద్ఘాతం ఇటాలియన్ భాషలో 1895లో రస్సెగ్నా (Rassegna) ప్రథమ సంచికలో ప్రచురింపబడిన తరువాత - ఇదే పెద్దమనిషికి "తన కీర్తి ద్వారా అందరికీ తెలిసిన" ఈ పెద్దమనిషికి (హెన్రిక్ హైనె - Ritter Olaf - సం) (హైనె మాటల్లోనే చెప్పాలంటే) నా ఉపోద్ఘాతానికి సమాధానం ఇవ్వక తప్పదనిపించింది కూడా. ఈ సమాధానం 1895 ఫిబ్రవరి 25న Riforma Sociale లో అచ్చయింది. నాపైన అనివార్యమైన (ఆ కారణంవల్ల మరింత అసహ్యకరమైన) పొగడ్తలు కురిపించిన తరువాత ఆయన, చరిత్ర గురించిన భౌతిక భావనకై మార్క్స్‌కు వచ్చిన పేరును తను కాజేయాలని తానెన్నడూ అనుకోలేదని అంటున్నాడు. ఆ ఘనతను తాను 1885లోనే ఒప్పుకొన్నానని అంటున్నాడు - ఏదో ప్రాసంగికంగా, ఒక మేగజైన్‌లోని వ్యాసంలో. కానీ, దానికి బదులుగా, అసలు ఆ గుర్తింపు ఖచ్చితంగా ఉండవలసినచోట, అంటే ఆ విషయంపై తాను రాసిన పుస్తకంలో, మరింత మొండిపట్టుతో మౌనంగా దాటవేస్తున్నాడు. ఆ పుస్తకంలో మొదటిసారి 129వ పుటలోనూ, తరువాత, ఫ్రాన్సులోని కొద్దిపాటి భూ ఆస్తి సందర్భంగానూ మార్క్స్ గురించిన ప్రస్తావన వుంది. మార్క్స్ ఈ సిద్ధాంత మూలకర్త కానేకాదని ఇప్పుడతను ధైర్యంగా చాటుతున్నాడు. అరిస్టాటిల్ ఏనాడో దాన్ని సూచించాడు. కాదంటారా, హారింగ్టన్ 1656లోనే నిస్సందేహంగా దాన్ని చాటిచెప్పాడు. మార్క్స్‌కు చాలానాళ్ళ ముందే బోలెడుమంది చారిత్రకులు, రాజకీయవేత్తలూ, న్యాయశాస్త్రజ్ఞులు, ఆర్థికవేత్తలు దాన్ని వృద్ధి చేశారు. ఇదంతా లోరియా పుస్తకం ఫ్రెంచి కూర్పులో మనకు కనిపిస్తుంది. ఒక్కముక్కలో చెప్పాలంటే, అతను నిష్ణాతుడైన గ్రంథచోరుడు. మార్క్స్ రచనల నుంచి దొంగిలించిన విషయాల ఆధారంతో అతడు తన్ను గురించి గొప్పలు చెప్పుకొనేందుకు నేను వీలు లేకుండా చేసిన తరువాత, ఇప్పుడతను, (తాను చేస్తున్నట్టుగా) మార్క్స్ తాను ఇతరుల నుంచి అరువుతెచ్చుకొన్న భావాలను తనవిగా ప్రదర్శిస్తున్నట్టు వాదిస్తున్నాడు. పెట్టుబడి 2వ సంపుటంగాని, 3వ సంపుటిగాని రాసే యోచన మార్క్స్‌కు ఎన్నడూ లేదన్న తన ఆరోపణపై నేను చేసిన దాడిని, నా తదితర దాడుల నుంచి ఎంచుకొని ఇలా అంటున్నాడు. "ఇప్పుడు ఎంగెల్స్ ఇందుకు

బ్రౌన్ Archiv fur soziale Gesetzgebung సం. II, 4వ సంచికలో వెర్నర్ సొంబర్ట్ మార్క్సియన్ భావవ్యవస్థను రేఖామాత్రంగా యిచ్చాడు. అది మొత్తంపైన చక్కగా వుంది. ఒక జర్మన్ విశ్వవిద్యాలయ ఆచార్యుడు మార్క్స్ రచనల్లో మార్క్స్ నిజంగా చెప్పినదేమిటో, మొత్తంపై గమనించి చూచిన మొట్టమొదటి సందర్భమిదే. మార్క్సియన్ భావవ్యవస్థ గురించిన సవిమర్శక పరిశీలన అంటే కేవలం దాన్ని మరింత అభివృద్ధి చేయడమే తప్ప, దాన్ని నిరాకరించడం కాదు. "ఆ పని ఎగబాకుడు రాజకీయునికి వదిలివేద్దాం" అని అంటాడాయన. అనుకొన్నట్టుగానే, సొంబర్ట్ కూడా మన ప్రస్తుత విషయాన్ని చర్చకు తీసుకొన్నాడు. మార్క్సియన్ వ్యవస్థలో విలువ ప్రాధాన్యాన్ని శోధించి కింది నిర్ధారణకు వచ్చాడు : పెట్టుబడిదారీ పద్ధతిలో ఉత్పత్తి అయిన సరుకుల మార్పిడి సంబంధంలో విలువ అభివ్యక్తం కాదు. అది పెట్టుబడిదారీ ఉత్పత్తి ఏజెంట్ల చైతన్యంలో నెలకొని వుండదు. అది ఒక భావాత్మకమైన, తార్కికమైన వాస్తవమే తప్ప ఆచరణాత్మక వాస్తవం కాదు. మార్క్స్ రచనల్లో విలువ గురించిన భావనను దాని పాదార్థిక నిర్దిష్టతను బట్టి తీసుకొని చూస్తే శ్రమకు సామాజికంగా గల ఉత్పాదకశక్తే ఆర్థిక జీవితపు ప్రాతిపదిక అన్న వాస్తవానికది ఆర్థిక వ్యక్తీకరణ తప్ప మరేమీ కాదు. తుదకంటా చూస్తే, విలువ నియమం పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థలో ఆర్థిక ప్రక్రియల్లో ప్రాబల్యం వహిస్తుంది. ఈ ఆర్థిక వ్యవస్థలో సర్వసాధారణంగా వున్న అంతర్విషయమిది : అంతిమ విశ్లేషణలో, సరుకుల విలువ అనేది ఒక ప్రత్యేకమైన చారిత్రక రూపమని తేలుతుంది. ఈ రూపంలోని శ్రమ ఉత్పాదకశక్తి సమస్త ఆర్థిక ప్రక్రియలను శాసిస్తూ తనే ఒక నిర్ణాయక కారకమని ఉద్ఘాటిస్తుంది – సొంబర్ట్ చెబుతున్నది ఇదీ.

---

సమాధానంగా, రెండవ, మూడవ సంపుటాలను విజయోత్సాహంతో, నా ముఖాన కొడుతున్నాడు.... భేష్! నా మెదడుకు మేత ఇచ్చిన ఈ సంపుటాలు చూచి నేనెంత సంతోషించానంటే, ఏ విజయం కూడా నేడు నాకు పరాజయమంత ప్రియమైనది కాదు - ఇది నిజంగా పరాజయమే అయితే. కానీ వాసత్వంగా ఇది పరాజయమా? ఎంగెల్స్ తన పవిత్ర స్నేహభావంతో సంకలనం చేసిన పరస్పర సంబంధం లేని ఈ టిప్పణుల కలగాపులగాన్ని, ప్రచురించాలన్న ఉద్దేశంతో మార్క్స్ రాశాడనేది నిజమా?..... మార్క్స్ తన రచనలకు, తన వ్యవస్థకు ఈ మాటలను మకుటాయమానంగా చేశాడని ఊహించుకోవడానికి నిజంగా వీలుందా? అనేక సంవత్సరాలుగా అదిగో ఇదిగో అని వాగ్దానం చేసిన సమస్య పరిష్కారం సగటు లాభం గురించిన అధ్యాయంలో అతి ఘోరమైన మాయామంత్రంగా, అతి నికృష్టమైన పదాల గారడీగా దిగజార్చడం జరిగింది. ఆ అధ్యాయాన్ని మార్క్స్ ప్రకటించి ఉండేవాడని దృఢంగా చెప్పగలమా? కనీసం దాన్ని శంకించడానికి వీలుంది... మార్క్స్ తన అద్భుత గ్రంథాన్ని ప్రచురించిన తరువాత, దాని తదుపరి సంపుటాన్ని అందించ తలపెట్టలేదనీ, లేదా, ఈ బ్రహ్మాండమైన రచనను పూర్తి చేసే పనిని తనకెట్టి బాధ్యత లేకుండా తన వారసులకు వదిలివేయడం ఆయన ఉద్దేశమనీ దీన్నిబట్టి రుజువవుతున్నట్లు నాకు తోస్తోంది."

267వ పుటలోని మాటలివి. సంస్కారులైన తన పాఠకలోకాన్ని గురించి హైనె కిందిమాటల్లో వ్యక్తమయిన దానికన్నా ఎక్కువ తృణీకార భావంతో మాట్లాడలేకపోయాడు : "తన పాఠకలోకం ఇంగితజ్ఞానం గల జీవే అయినట్లు దానికి రచయిత తుదకు అలవాటుపడిపోతాడు."

ముగింపులో, దురదృష్టవంతుడైన నాపై మరోసారి కుండపోతగా పొగడ్తలను గుమ్మరించడం జరిగింది. ఇందులో ఈ మహాశయుడు తాను బలాంకు సాటివచ్చేలా వ్యవహరిస్తున్నాడు. బలాం శపించడానికి వచ్చాడు కానీ అతని సంకల్పానికి వ్యతిరేకంగా, అతని నోటి నుంచి "ఆశీర్వాద, ప్రేమ వచనాలు" దొర్లాయి. ఎందువల్లనంటే, మంచివాడైన ఆ బలాంకు, ఒక ప్రత్యేకత వుంది. అతను ఎక్కి వచ్చిన గాడిద తన యజమానికన్నా తెలివైనది.

ఈసారి బలాం తన గాడిదను ఇంట్లోనే వదలి వచ్చాడనేది కనిపిస్తూనే వుంది.

పెట్టుబడిదారీ ఉత్పత్తి రూపం విషయంలో విలువ నియమ ప్రాముఖ్యం గురించిన ఈ భావన తప్పు అని చెప్పజాలం. కానీ ఇది మరీ విస్తృతంగా వున్నట్టు నాకు అనిపిస్తోంది. దీన్ని కుదించి, మరింత ఖచ్చితంగా సూత్రీకరించ వీలుందని అనుకొంటున్నాను. పైగా ఈ నియమ శాసిత సమాజాభివృద్ధిలోని ఆర్థిక దశల విషయంలో ఈ నియమానికి గల ప్రాముఖ్యమంతా ఈ భావనలో ఇమడలేదని నా అభిప్రాయం.

1895 ఫిబ్రవరి 25వ తేదీ నాటి బ్రౌన్ Sozialpolitisches Zentrablatt 22వ సంచికలో పెట్టుబడి 3వ సంపుటిపై కాన్రాడ్ ష్మిడ్ రాసిన ఒక చక్కని వ్యాసం వుంది. అదనపు విలువ నుంచి సగటు లాభాన్ని రాబట్టిన మార్క్సియన్ పద్ధతి, ఇంతవరకు అర్థశాస్త్రం కనీసం లేవనెత్తనైనా లేవనెత్తని కింది ప్రశ్నకు మొట్టమొదటిసారిగా సమాధానమిచ్చిందనేందుకు గల రుజువును ఇక్కడ ప్రత్యేకించి నొక్కి చెప్పాలి; లాభం యొక్క ఈ సగటు రేటు పరిమాణం ఎలా నిర్ణయమవుతుంది, ఆ రేటు ఏ 50 శాతమో, లేక ఏ 100 శాతమో కాకుండా ఎలా 10 లేక 15 శాతంగా వుంటుంది? మొదట పారిశ్రామిక పెట్టుబడిదారు స్వాహా చేసుకొన్న అదనపు విలువ ఒక్కటే లాభం, కౌలులకు మూలాధార మని మనకు తెలుసు కనుక, ఈ సమస్య పరిష్కారమయిపోతుంది. ష్మిడ్ వ్యాసంలోని ఈ భాగాన్ని లోరియా వంటి అర్థశాస్త్రజ్ఞుల కోసం నేరుగా ఎత్తి రాయవచ్చును కానీ, చూడ నిరాకరించే వారి కళ్ళు తెరిపించడం వృథా శ్రమే అవుతుంది.

ష్మిడ్‌కు సైతం విలువ నియమం గురించిన తన మునుపటి అపోహలున్నాయి. దాన్ని ఆయన శాస్త్రీయ పరికల్పన అని అంటాడు. వాస్తవమైన మార్పిడి ప్రక్రియను వివరించడానికి ఏర్పరచుకొన్న దనీ, విలువ నియమానికి సంపూర్ణంగా విరుద్ధమైనదిగా కనిపించే పోటీ ధరల వ్యవహారంలో సైతం ఇది విషయ బోధకమూ, అనివార్యమూ, ఆవశ్యకమూ అయిన సైద్ధాంతిక ప్రారంభాంశంగా రుజువయిందనీ ఆయన చెబుతున్నాడు. విలువ నియమం లేకుంటే, పెట్టుబడిదారీ వాస్తవపు ఆర్థిక యంత్రాంగాన్ని సైద్ధాంతికంగా తరచి చూడటం ఆగిపోతుందని ఆయన అభిప్రాయం. ఉటంకించడానికి నన్ను అనుమతించిన తన వ్యక్తిగత లేఖలో ష్మిడ్ పెట్టుబడిదారీ ఉత్పత్తి రూపపరిధిలో విలువ నియమం అచ్చమైన ఊహాకల్పన అనీ, సైద్ధాంతికంగా అవసరమైన కల్పనే అయినా, కల్పితమే అనీ ఘంటా పథంగా చెబుతున్నాడు. కానీ ఈ దృక్పథం పూర్తిగా తప్పని నా అభిప్రాయం. పెట్టుబడిదారీ ఉత్పత్తి విషయంలో విలువ నియమానికి, కేవల పరికల్పనకన్నా ఎంతో ఎక్కువ, మరింత నిర్దిష్ట ప్రాముఖ్యముంది – ఆవశ్యకమైనదైనా, కేవల కల్పనే అన్న మాట సంగతి వేరే చెప్పపని లేదు.

ఇక్కడ మనం పరిశీలిస్తున్నది అచ్చమైన తార్కిక క్రమాన్నే కాదు, ఒక చారిత్రక క్రమాన్నీ, ఆలోచనలో దాని కార్యకారణాల వివరణ యొక్క ప్రతిబింబాన్ని, దాని అంతస్సంబంధాల తార్కిక పరిశీలననూ అన్న వాస్తవాన్ని సొంబర్ట్, అలాగే ష్మిడ్ తగినంత పరిగణనకు తీసుకోలేదు. (ఇక్కడ సుప్రసిద్ధుడైన లోరియాను కేవలం ఒక వినోదకర నాటు అర్థశాస్త్ర ముచ్చిరేకుగానే ప్రస్తావిస్తున్నాను. అంతే!)

ఇందుకు సంబంధించిన నిర్ణయాత్మక భాగం మార్క్స్ పెట్టుబడి IIIవ సంపుటి 1వ భాగంలో వుంది.

"సరుకులు కేవలం సరుకులుగానే కాదు, పెట్టుబడుల ఉత్పాదితాలుగా మార్పిడి అవుతాయనే

వాస్తవమే మొత్తం చిక్కుకు కారణం. ఈ పెట్టుబడులు తమ పరిమాణానికి అనుగుణంగా, లేక తాము సమాన పరిమాణం గలవి అయితే, సమాన పరిమాణంలో అదనపు విలువ మొత్తంలో తమకు పాలున్నవంటాయి."

ఈ చిక్కు ఎలాంటిదో చూపడానికి ఇలా ఊహించుకుందాము : కార్మికులే తమ ఉత్పత్తి సాధనాల సొంతదారులుగా వున్నారు. వారు సగటున సమాన కాలాలపాటు, సమాన శ్రమ తీవ్రతతో పనిచేస్తారు. తమ సరుకులను తమలో తామే నేరుగా మార్పిడి చేసుకొంటారు. అప్పుడు, ఒక రోజులో ఇద్దరు కార్మికులు తమ శ్రమ ద్వారా తమ ఉత్పాదితాలకు సమానమైన కొత్త విలువను చేర్చి వుంటారన్నమాట. అయితే, ఉత్పత్తి సాధనాల్లో ఇదివరకే నిక్షిప్తమై వున్న శ్రమనుబట్టి, ప్రతి ఒక్కరి ఉత్పాదితం విలువ భిన్నంగా వుంటుంది. విలువలోని ఈ భాగం పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థలోని స్థిర పెట్టుబడికి ప్రాతినిధ్యం వహిస్తుంది. కొత్తగా చేరిన విలువలో, కార్మికుల జీవనాధారాలకై వినియుక్త మైన భాగం అస్థిర పెట్టుబడికి ప్రాతినిధ్యం వహిస్తుంది. కొత్త విలువలో, ఈ రెండూ పోగా మిగిలి వున్న భాగం అదనపు విలువ అవుతుంది. ప్రస్తుత సందర్భంలో ఇది కార్మికునికే చెందుతుంది. ఈ విధంగా ఈ ఇద్దరు కార్మికులు అడ్వాన్సు చేసిన విలువ "స్థిర" భాగాన్ని మాత్రమే భర్తీ చేసేందుకు అవసరమైన మొత్తాన్ని తీసివేసిన తరువాత, ఉభయులకు సమాన విలువలు అందుతాయి. కానీ అదనపు విలువకు ప్రాతినిధ్యం వహించే భాగానికీ, ఉత్పత్తి సాధనాల విలువకూ మధ్య నిష్పత్తి – ఇది పెట్టుబడిదారీ లాభం రేటుకు అనుగుణంగా వుంటుంది. ప్రతి సందర్భంలో భిన్నంగా వుంటుంది. కానీ ప్రతి ఒకడూ మార్పిడి ద్వారా భర్తీ అయిన ఉత్పత్తి సాధనాల విలువను అందుకొంటాడు కాబట్టి, ఇది ఏ మాత్రమూ పట్టించుకోవలసిన విషయం కాదు.

"ఆ విధంగా సరుకులు తమ విలువకు లేదా దాదాపు తమ విలువకు మార్పిడి కావాలంటే తమ ఉత్పత్తి ధరకు అవి మార్పిడి కావడానికన్నా చాలా తక్కువ దశ అవసరం. ఉత్పత్తి ధరలకు సరుకుల మార్పిడి కావాలంటే, పెట్టుబడిదారీ అభివృద్ధి ఒక ఖచ్చితమైన స్థాయినందుకొని వుండాలి.... ధరలపై, ధరల గమనంపై విలువ నియమం ప్రాబల్యం వహించడమనేదే కాకుండా, సరుకుల విలువను సైద్ధాంతికంగానే కాకుండా చారిత్రకంగా కూడా ఉత్పత్తి ధరలకు ముందే వున్నదిగా (prius) పరిగణించడం సరియైనదే. కార్మికుడు తన ఉత్పత్తి సాధనాల సొంతదారుగా వున్న పరిస్థితులకు ఇది వర్తిస్తుంది. ప్రాచీన ప్రపంచంలోనూ, ఆధునిక ప్రపంచంలోనూ తన శ్రమపై బతుకుతున్న భూఖామందుల, చేతివృత్తుల వారి పరిస్థితి ఇదే. ఒకే ఉమ్మడి సమాజంలోని సభ్యుల మధ్య కాకుండా భిన్న ఉమ్మడి సమాజాల మధ్య మార్పిడి ద్వారా ఉత్పాదితాలు సరుకులుగా పరిణామం చెందాయని ఇంతకు ముందు మేము వ్యక్తంచేసిన భావంతో ఇది ఏకీభవిస్తుంది. ఆదిమ కాల పరిస్థితికే కాకుండా, బానిసత్వం, భూదాస్య వ్యవస్థలపై ఆధారపడిన తదుపరి పరిస్థితులకూ, చేతివృత్తుల వారి సంఘాలకూ కూడా ఇది వర్తిస్తుంది. అయితే ఒక ఉత్పత్తి రంగంలోని ఉత్పత్తి సాధనాలు మరో రంగానికి అతి కష్టంపై తప్ప బదలాయించ వీలులేకుండా వున్నన్నాళ్ళు, అందువల్ల, వివిధ ఉత్పత్తి రంగాలు విదేశాలలాగా, లేదా కమ్యూనిస్టు సమాజాల్లాగా కొన్ని పరిమితుల్లో, ఒకదానితో ఒకటి ముడిపడి వున్నన్నాళ్ళు మాత్రమే ఇది వర్తిస్తుంది." (మార్క్స్ సం. III, 1వ విభాగం)

మార్క్స్‌కు మూడవ సంపుటిని మరోసారి తిరగేసే అవకాశం వుండి వుంటే ఆయన ఈ

పాఠభాగాన్ని నిస్సందేహంగా, బాగా విస్తరించి వుండేవాడు. ఇప్పుడున్న స్థితిలో, ఇది చర్చనీయాంశంపై చెప్పవలసినదాన్ని కేవలం రేఖామాత్రంగా చెబుతోంది. కాబట్టి దీన్ని కొంత లోతుగా పరిశీలిద్దాం.

మనకందరికీ కింది విషయాలు తెలుసు; సమాజ ప్రారంభంలో ఉత్పాదితాలను ఉత్పాదకులే వినియోగించేవారు. ఈ ఉత్పాదకులు ఇంచుమించు కమ్యూనిస్టు సమాజాలుగా అసంకల్పితంగానే సంఘటితులై వుండేవారు. ఈ ఉత్పాదితాల్లో అదనంగా వున్న వాటిని కొత్తవారితో మార్పిడి చేసుకోవడం తదనంతర కాలంనాటి పరిణామమే. సరుకులుగా ఉత్పాదితాల పరివర్తనను తెచ్చిపెట్టింది ఈ విధమైన మార్పిడే! ఇది మొదట్లో వేరువేరు తెగలకు చెందిన విడివిడి సమాజాల మధ్య మాత్రమే జరిగేది. కానీ తరువాత, తరువాత సమాజంలోనే అంతర్గతంగా కూడా ఇది పైకొని, ఆ సమాజం పెద్ద లేదా చిన్న కుటుంబ బృందాలుగా చీలిపోవడానికి గణనీయంగా తోడ్పడింది. కానీ అలా చీలిపోయిన తరువాత కూడా ఇలా మార్పిడి చేసుకొనే కుటుంబ పెద్దలు పని చేసే రైతులుగానే వుంటారు. వారు తమ సొంత వ్యవసాయక్షేత్రాల్లో తమ కుటుంబాల సహాయంతో తమకు కావలసిన వాటినన్నీ ఉత్పత్తి చేసుకొనేవారు. తమకు కావలసిన అవసర వస్తువుల్లో చాలా కొద్దిభాగాన్ని మాత్రమే, తమ సొంత అదనపు ఉత్పాదితాలతో మార్పిడి చేసుకోవడం ద్వారా బయటి నుంచి తెచ్చుకొనేవారు. నాటి కుటుంబం వ్యవసాయమే కాకుండా పశుపోషణ వృత్తిలో కూడా నిమగ్నమై వుండేది. అది తమ ఉత్పాదితాలను పూర్తిగా తయారైన వినియోగ వస్తువులుగా తీర్చిదిద్దేది. అప్పుడప్పుడు అది చేతిమరతో తన ధాన్యాన్ని తానే పిండి చేసేది. రొట్టెలు తయారుచేసేది; ఎల్లగిసెనార, ఉన్ని నూలు వడికేది, రంగు అద్దేది, బట్టలు నేసేది, తోలు పదును చేసేది, కర్ర ఇళ్ళను నిర్మించేది, వాటిని మరమ్మతు చేసేది; పరికరాలను, పాత్రలను తయారు చేసుకొనేది. అప్పుడప్పుడు తన వడ్రంగి, కమ్మరి పనులు కూడా తనే చేసుకొనేది. పర్యవసానంగా కుటుంబం లేక కుటుంబ బృందం చాలావరకు స్వయంపోషకంగా వుండేది.

జర్మనీలో 19వ శతాబ్ది ప్రారంభం వరకూ కూడా అటువంటి కుటుంబం వస్తు మార్పిడి ద్వారా లేదా బయటి నుంచి కొనడం ద్వారా చేకూర్చుకొనే కాస్త వస్తువులు – ప్రధానంగా చేతివృత్తుల ఉత్పాదితాలే. వాటిని తయారుచేసే తీరు రైతుకు తెలియనిది కాదు. అయితే అతను వాటిని స్వయంగా తయారు చేసికోకపోవడానికి కారణం ఒకటే. వాటి ముడిపదార్థాలు తనకు లేకపోవడం; లేదా కొన్న వస్తువులే మరింత బాగా లేదా మరింత చౌకగా వుండడం. కనుక, మధ్యయుగాల నాటి రైతుకు, తాను వస్తు మార్పిడి ద్వారా చేకూర్చుకొన్న వస్తువులను తయారు చేయడానికి పట్టే శ్రమకాలం ఖచ్చితంగానే తెలుసు. పల్లెలోని వడ్రంగి, బండ్లను తయారు చేసేవాడు కూడా తన కళ్ళముందే పని చేసేవారు. అదేవిధంగా దర్జీ, ముచ్చీ (shoe maker), నా యౌవనదశలో, మా రైన్ రైతుల ఇళ్ళకు ఒకరి తరువాత ఒకరు వచ్చి, ఇళ్ళలో తయారైన ముడి సామగ్రిని బూట్లుగా, దుస్తులుగా మార్చి ఇచ్చేవారు. రైతులూ, వారికి వస్తువులను అమ్మేవారూ శ్రామికులే. మార్పిడి అయిన వస్తువులు, ఎవరివి వారి ఉత్పాదితాలే. ఈ ఉత్పాదితాల తయారీలో వారు వెచ్చించినదేమి? శ్రమే, కేవలం శ్రమే. అరిగిపోయిన పరికరాలను భర్తీ చేసుకొనేందుకు, ముడిపదార్థాల తయారీకి, వాటి శుద్ధికి తమ సొంత శ్రమశక్తిని తప్ప వారు మరేదీ వెచ్చించలేదు. మరి, వాటిపై వెచ్చించిన శ్రమ నిష్పత్తిని బట్టి కాక, మరేవిధంగా వారు తమ ఉత్పాదితాలను ఇతర శ్రామికుల ఉత్పాదితాలతో మార్పిడి చేసుకోగలరు? ఈ ఉత్పాదితాలపై వెచ్చించిన శ్రమకాలం ఒక్కటే మార్పిడి అయ్యే విలువల పరిమాణాన్ని

నిర్ణయించడానికి తగిన ఏకైక కొలమానం. తగిన కొలమానమే కాదు, మరేదీ కొలమానంగా వుండే వీలేలేదు. లేక, రైతు లేదా చేతిపనివారు తన పది గంటల శ్రమ ఉత్పత్తి చేసినదాన్ని మరొకరు ఒక గంట శ్రమతో ఉత్పత్తి చేసినదానికై ఇచ్చివేసేటంత మూర్ఖులని అనుకోవాలా? మార్పిడి అయిన సరుకుల పరిమాణాలకు, వాటిలో పొందుపడిన శ్రమ పరిమాణాలు అంతకంతకు కొలమానంగా వుండే పద్ధతి తప్ప, మరే విధమైన మార్పిడీ రైతాంగ సహజ ఆర్థిక వ్యవస్థలో వుండే వీలులేదు. ఈ ఆర్థిక విధానంలోకి డబ్బు ప్రవేశించిన క్షణం నుంచీ, ఒకవైపు విలువ నియమానికి అనుగుణంగా వ్యవహరించే ధోరణి (మార్క్సియన్ సూత్రీకరణలో అని గుర్తుపెట్టుకోండి!) మరింత ప్రస్ఫుటమవుతుంది. మరోవైపు, వడ్డీ వ్యాపారుల పెట్టుబడీ, పీల్చిపిప్పిచేసే పన్నులూ జోక్యం చేసుకోని ఈ ధోరణికి – అప్పటికే అంతరాయం కలిగిస్తాయి. విలువలకు తమకు గల వ్యత్యాసం లెక్కలోకి రాని విధంగా ధరలు వాటిని సమీపించే కాల వ్యవధులు పెరగనారంభిస్తాయి.

రైతు ఉత్పాదితాలకు, చేతిపనివారి ఉత్పాదితాలకు మధ్య మార్పిడికి కూడా ఇదే వర్తిస్తుంది. ప్రారంభంలో ఈ వస్తుమార్పిడి వర్తకుని ప్రమేయం లేకుండా, పట్టణాల సంత రోజుల్లో నేరుగా జరుగుతుంది. రైతు ఆ సంతలో తన వస్తువులను అమ్ముతాడు, ఇతరులవి కొంటాడు. ఇక్కడ రైతు కూడా చేతివృత్తులవారి పని పరిస్థితులు రైతుకు తెలియడమే కాదు. చేతివృత్తికారునికి కూడా రైతు పని పరిస్థితులు తెలుసు. ఎందువల్లనంటే చేతివృత్తికారుడు సైతం కొంతవరకు రైతే. అతనికి కూరగాయల పళ్ళతోట వుండటమే కాక, చిన్న ఖండ్రిక, ఒకటి రెండు ఆవులు, పందులు, కోళ్ళు మొదలయినవి వుంటాయి. కాబట్టి మధ్యయుగాల్లోని ప్రజలు ఒకరి ముడిపదార్థాల, సహాయక పదార్థాల ఉత్పత్తి ఖర్చులను, శ్రమకాలాన్ని మరొకరు చెప్పుకోదగినంత ఖచ్చితంగా – కనీసం దైనందినోపయోగ వస్తువుల విషయంలో – పరీక్షించి తెలుసుకోగలిగేవారు.

కానీ శ్రమ పరిమాణ ప్రాతిపదికపై జరిగే ఈ వస్తుమార్పిడిలో ధాన్యం, పశువుల వంటి ఉత్పాదితాలకు పట్టే శ్రమ పరిమాణాన్ని ఎలా లెక్క గట్టాలి? వీటికి సుదీర్ఘమైన శ్రమ అవసరం. అది మధ్యలో క్రమరహితంగా ఆగిపోతూంటుంది. పైగా శ్రమ ఫలితం అనిశ్చితమైనది. ఆ శ్రమను పరోక్షంగానే, సాపేక్షంగానే అయినా ఎలా లెక్కగట్టాలి? అందులోనూ లెక్కా పక్కా లేనివారి మధ్య ఈ వస్తు మార్పిడి జరిగినప్పుడు ఎలా లెక్కగట్టాలి? రమారమి అంచనాలు కట్టే సుదీర్ఘమైన వంకరటింకర పద్ధతి ద్వారానే; చీకట్లో తారాడుతూ తరచూ దోవ తెలుసుకొన్నట్లుగానే; మామూలుగా జరిగినట్టుగా తప్పులు చేయడం ద్వారా నేర్చుకొన్నట్లుగానే. అయితే, తాను వెచ్చించిన శ్రమ ఫలితమంతటినీ మొత్తంపై రాబట్టుకోవలసిన అవసరం ప్రతి ఒక్కరికీ వుంటుంది. కనుక అతను సరియైన దిశకు తిరిగిరావడానికి ఇది తోడ్పడుతుంది. పైగా బహు తక్కువ రకాలకు చెందిన వస్తువులు చలామణిలో వుండటం, వాటి ఉత్పత్తి శతాబ్దాలుగా ఒక స్థిర స్వభావాన్ని సంతరించుకోవడం ఈ లక్ష్యసాధనకు తోడ్పడ్డాయి. ఒక్కొక్క పశువు ఉత్పత్తికి దీర్ఘకాలం పట్టడంవల్ల ఈ సరుకు విలువ యొక్క సాపేక్ష పరిమాణాన్ని నిర్ణయించడం అతి కష్టం. అటువంటి పశుగణం సర్వత్రా అంగీకరింపబడిన డబ్బు సరుకుగా రూపొందడమే చలామణిలో వున్న ఉత్పాదితాల విలువ యొక్క సాపేక్ష పరిమాణాన్ని దాదాపు వాస్తవానికి చాలా దగ్గరగా నిర్ణయించడానికి చాలాకాలం పట్టలేదనడానికి రుజువు. పశువు

డబ్బు సరుకు అయిందంటే, వాటి విలువ, ఇతర అనేక సరుకులతో వాటి మార్పిడి నిష్పత్తి అప్పటికే సాపేక్షంగా అసాధారణమైన స్థిరత్వం అందుకొని వుండాలి. దాన్ని అనేక తెగల భూభాగాల్లో కాదనకుండా అందరూ అంగీకరించి వుండాలి. ఆనాటి జనం – పశుపోషకులు, వాటి బేరగాళ్ళూ, తాము వెచ్చించిన శ్రమకాలాన్ని మార్పిడిలో తత్సమాన విలువను తీసుకోకుండా వదలుకొనేవారు కాదు. నిజంగా వారు ఆ మాత్రం తెలివితేటలు గలవారే. అలా వదలుకోడు సరికదా, సరుకు ఉత్పత్తి యొక్క ఆదిమ దశకు జనం దగ్గరగా వున్నకొద్దీ, ఉదాహరణకు రష్యన్లు, ప్రాచ్య దేశస్తులు – భల్లూకపు పట్టుతో బేరమాడటం ద్వారా, ఉత్పాదితంపై తాము వెచ్చించిన శ్రమకాలానికి సంపూర్ణ పరిహారాన్ని రాబట్టడానికై ఇప్పుడు కూడా కాలం వృథా చేస్తున్నారు.

శ్రమకాలాన్ని బట్టి ఇలా విలువ నిర్ణయం ప్రారంభమై, మొత్తం సరుకు ఉత్పత్తి అభివృద్ధి చెందింది. దానితోపాటు, విలువ నియమం యొక్క వివిధ పార్శ్వాలు స్థిరంగా నిలదొక్కుకొనేందుకు వీలు కల్పించే బహుముఖ సంబంధాలు, పెట్టుబడి Iవ సంపుటి మొదటి భాగంలో వర్ణించినట్లు, అభివృద్ధి చెందుతాయి. అంటే, ప్రత్యేకించి, ఏ పరిస్థితుల్లోనైతే శ్రమ ఒక్కటే విలువను సృష్టిస్తుందో ఆ పరిస్థితులన్నమాట. భాగస్వాముల చైతన్యంలో ప్రవేశించకుండా, స్థిరంగా నిలదొక్కుకొనే సంబంధాలవి. ఎంతో శ్రమకోర్చి చేసే సైద్ధాంతిక పరిశోధన ద్వారా మాత్రమే వీటిని దైనందిన ఆచరణ నుంచి వేరుపరచి చూడవచ్చు. మార్క్స్ నిరూపించినట్లుగా సరుకు ఉత్పత్తి స్వభావం నుంచి నిష్పన్నం కానున్న సహజ నియమాల్లాగానే పనిచేసే పరిస్థితులివి. లోహ రూపంలోని డబ్బుకు మారడం అతి ముఖ్యమైన, ప్రగాఢమైన పురోగమనం. కానీ దీని పర్యవసానమేమిటంటే, శ్రమకాలాన్ని బట్టి విలువ నిర్ణయమవుతుందనేది, సరుకు మార్పిడిలో పైకి కనిపించకుండా పోవడం. ఆచరణ దృష్ట్యా, డబ్బే విలువకు నిర్ణయాత్మక కొలమానమయింది. వర్తకంలోకి ప్రవేశించిన సరుకుల రకాలు పెరిగినకొద్దీ, అవి దూరదేశాల నుంచి వచ్చినకొద్దీ, ఆ కారణంవల్ల, వాటి ఉత్పత్తికి అవసరమైన శ్రమకాలాన్ని పరీక్షించి చూసే అవకాశం తగ్గినకొద్దీ, విలువకు డబ్బు నిర్ణాయక కొలమానం కావడం హెచ్చింది. అసలు డబ్బు అనేదే మామూలుగా, మొదట విదేశాల నుంచి వచ్చిందే. వెండి, బంగారం దేశంలోనే లభించినప్పుడు కూడా, వాటిలో నియుక్తమైన శ్రమను రమారమి అంచనా వేయడానికి రైతుకు, చేతివృత్తికారునికి కొంతవరకు సాధ్యం కాలేదు. శ్రమకు విలువను కొలిచే లక్షణముందన్న స్పృహ, డబ్బు సహాయంతో దాన్ని లెక్కగట్టే అలవాటువల్ల బాగా మందగించింది. జనం మనసులో నిరపేక్ష విలువకు డబ్బు ప్రాతినిధ్యం వహించనారంభించింది.

ఒక్క మాటలో చెప్పాలంటే : సాధారణ సరుకు ఉత్పత్తి దశకు అంతటికీ అంటే, పెట్టుబడిదారీ ఉత్పత్తి రూపం రంగంపైకి రావడం ద్వారా సాధారణ సరుకు ఉత్పత్తి మార్పుకు లోనయ్యేదాకా, విలువ గురించిన మార్క్సియన్ నియమం సర్వత్రా చెల్లుబాటు అవుతుంది. (ఆర్థిక నియమాలు అసలు చెల్లుబాటు అయిన మేరకు ఇదే చెల్లుతుంది.) మార్క్సియన్ నియమాన్ని అనుసరించి నిర్ణయమైన విలువవైపుగా ధరలు మొగ్గుతుంటాయి. పర్యవసానంగా, సరుకు ఉత్పత్తి మరింత సమగ్రంగా అభివృద్ధి అయినకొద్దీ, తీవ్రమైన బాహ్య అవరోధాలచే అంతరాయానికి లోనుకాని సగటు ధరలు సుదీర్ఘ కాలాలపాటు, లెక్కలోకే రాని వ్యత్యాసంతో, విలువలతో ఏకీభవిస్తాయి. ఆ విధంగా, ఉత్పాదితాలను

సరుకులుగా పరివర్తన చెందించే మార్పిడి క్రమం ప్రారంభమయినప్పటి నుంచి ప్రస్తుత యుగంలోని 15వ శతాబ్దం వరకు గల కాలానికి మార్క్సియన్ విలువ నియమానికి మొత్తంపై ఆర్థికమైన చెల్లుబాటు వుంది. కానీ సరుకుల మార్పిడి సమస్త లిఖిత చరిత్రకన్నా ముందునుంచే వుంది. అంటే, ఈజిప్టులో ఇది కనీసం క్రీ.పూ. 2500 సంవత్సరాలకు బహుశా క్రీ.పూ. 5000 సంవత్సరాలకు పూర్వం నుంచీనే, బాబిలోన్‌లో క్రీ.పూ. 4000 సంవత్సరాలకు, బహుశా క్రీ.పూ. 6000 సంవత్సరాలకు పూర్వం నుంచే వుందన్నమాట. కాబట్టి అయిదు నుంచి ఏడు వేల సంవత్సరాలపాటు విలువ నియమం నెలకొని వుంది. ఈ కాలమంతటా సర్వసాధారణంగా ప్రత్యక్షంగా చెల్లుబాటయిన విలువకు సరుకులు ఎన్నడూ అమ్మకం కాలేదు, కాజాలవు. ఆవగింజంత ఇంగితజ్ఞానమున్న ఆర్థికవేత్త ఎవరూ దీన్ని గురించి పట్టించుకోడు, అని ఘంటాపథంగా ప్రకటించే లోరియా కూలంకష జ్ఞానాన్ని ఇప్పుడు మనం మెచ్చుకోవచ్చు!

ఇప్పటి వరకు మేము వర్తకుణ్ణి గురించి చెప్పలేదు. అతని జోక్యాన్ని గురించిన పరిశీలనను, ఇప్పటివరకు వాయిదా వేయగలిగాము. పెట్టుబడిదారీ సరుకు ఉత్పత్తిగా సామాన్య సరుకు ఉత్పత్తి పరివర్తన ఇప్పుడు చర్చకు తీసుకుందాం. తక్కిన ప్రతి ఒక్కటీ స్థిరంగా వున్న ఈ సమాజంలో వర్తకుడు విప్లవశక్తి అయ్యాడు. ఆ స్థిరత్వం, ఒక విధంగా చెప్పాలంటే, వారసత్వంగా సంక్రమించిన స్థిరత్వం. ఆ సమాజంలో రైతు వారసత్వంగా పొందినది తన సాలు భూమినే కాదు. స్వేచ్ఛ గల భూఖామందుగా, స్వేచ్ఛగల లేదా బద్ధుడైన ఈనాం రైతుగా, అంటే భూదాసుడుగా తన హోదాను కూడా వారసత్వంగా పొందేవాడు; పట్టణాల్లోని చేతివృత్తికారుడు తన వృత్తినే కాకుండా తన గిల్డుకు గల ప్రత్యేక హక్కులను కూడా వారసత్వంగా దాదాపు శాశ్వతంగా పొందేవాడు. వారిలో ప్రతి ఒక్కరూ, వీటికితోడు తన ఖాతాదారులను, తన మార్కెట్‌ను, వంశపారంపర్యంగా సంక్రమించిన చేతివృత్తిలో చిన్ననాటి నుంచి శిక్షణ పొందినందువల్ల చేకూరిన వృత్తి నైపుణ్యాన్ని వారసత్వంగా పొందేవాడు. ఇటువంటి ప్రపంచంలోకి వర్తకుడు ప్రవేశించాడు. ఆ ప్రపంచంలో విప్లవం ప్రారంభం కానున్నది అతనితోనే. కానీ చైతన్యయుతుడైన విప్లవకారుడుగా అలా ప్రవేశించలేదు సరికదా దానితో అంగాంగిక సంబంధం కలవాడుగానే ప్రవేశించాడు. మధ్యయుగాల వర్తకుడు ఏ మాత్రమూ వ్యక్తి వాది కాడు. అతను తన సమకాలీనుల లాగానే ఒక సంస్థ సభ్యుడు. ఆదిమ కమ్యూనిజం నుంచి పుట్టిన గొంచిముద్ర సంస్థ (గ్రామ సాముదాయ భూమిని పంచే సంస్థ – అను) పల్లెసీమలో ప్రబలంగా వుండేది. ప్రారంభంలో ప్రతి రైతుకు – ప్రతిరకం భూమిలో సమానమైన చెలకలున్న సమాన భూఖండం ఆ ముద్రకు సంబంధించిన హక్కుల్లో సమాన వాటా వుండేది. గొంచిముద్ర కొత్తవారికి ప్రవేశంలేని సంస్థగా మారిపోయి, కొత్త భూఖండాలను కేటాయించడం ఆగిపోయిన తరువాత, వారసత్వం, మొదలయిన వాటి ద్వారా ఆ ఖండికల ఉప విభజన, తదనుగుణంగా, గొంచిముద్రలోని ఉమ్మడి హక్కుల ఉప విభజన జరిగింది. కానీ సంపూర్ణ భూఖండ్రికే యూనిట్‌గా వుండేది. ఫలితంగా సగమో, నాల్గోవంతు, ఎనిమిదో వంతు ఖండ్రికా, దానితోపాటు ముద్ర హక్కుల్లో సగం, నాల్గోవంతు, ఎనిమిదో వంతు హక్కులూ ఉండేవి. తరువాత ఉత్పాదక సంఘాలన్నీ, ప్రత్యేకించి, నగరాల్లోని గిల్డులు (వృత్తి సంఘాలు – అను) గొంచిముద్ర సంస్థల నమూనానే అనుసరించాయి. గిల్డులు నిబంధనావళి, గొంచిముద్ర నిబంధనావళిని ఒక పరిమిత విస్తీర్ణం గల భూమికి బదులు చేతివృత్తి ప్రత్యేక హక్కులకు

వర్తింపచేయడమే తప్ప మరొకటి కాదు. గిల్డుకు గ్యారంటీగా లభించిన హక్కుల్లో, ఉత్పాదితాల్లో ప్రతి సభ్యునికి సమాన భాగస్వామ్యం ఆ సంస్థ అంతటిలోని ప్రధానాంశం. 1527 నాటి ఎల్బర్‌ఫెల్డ్, బార్మెన్ నూలు వర్తకపు లైసెన్సులో ఇది అతి స్పష్టంగా వ్యక్తమవుతూంది. (థన్ : Industrie am Niederrhein, Vol. II, పుట 164). గనుల గిల్డులకు కూడా ఇదే వర్తిస్తుంది. ఇందులో ప్రతి వాటాకు సమాన భాగస్వామ్యముంది. ఈ వాటాను కూడా దాని హక్కులూ, బాధ్యతలతో విభజించ వీలుండేది – గొంచిముద్ర సభ్యుని భూఖండంలాగా, విదేశాలతో ఓడ వర్తకాన్ని ప్రారంభించిన వర్తక కంపెనీలకు కూడా ఇదే, ఈ మోతాదులోనే వర్తిస్తుంది. అలెగ్జాండ్రియా లేక కాన్‌స్టాంటినోపుల్ రేవుల్లోని వెనిస్, జనోవా వర్తకులు, అంటే ప్రతి "జాతి" తన సొంత ఫొండావోలో (క్షేత్రగృహంలో) నివాస గృహం, హోటల్, గిడ్డంగి, ప్రదర్శన, విక్రయశాలలు, కేంద్ర కార్యాలయాలలో – సమగ్రమై వర్తక సంఘాలను ఏర్పాటు చేసుకున్నారు. పోటీదార్లకు, ఖాతాదార్లకు వాటి ప్రవేశం లేదు. ఆ సంఘాలు తమ మధ్య నిర్ణయించుకొన్న ధరలకే అమ్మేవి. వాటి సరుకులు ఒక ఖచ్చితమైన నాణ్యం గలవి. ఆ నాణ్యానికి ప్రభుత్వ తనిఖీ, తరచూ ఒక ముద్ర పూచీ ఇచ్చేవి. తమ ఉత్పాదితాలకు స్థానిక ప్రజలు చెల్లించవలసిన ధరలు, మొదలయినవాటిని గురించి ఈ సంఘాలు సమష్టిగా చర్చలు జరుపుతూండేవి. హాన్స్ వర్తకులు కూడా నార్వేలో, బెర్గెన్‌లోని జర్మన్ బ్రిడ్జి (టిడ్‌స్కే బ్రగ్గెన్) ఇందుకు భిన్నంగా వ్యవహరించలేదు. డచ్, ఇంగ్లీషు పోటీదార్లకు కూడా ఇదే వర్తిస్తుంది. తక్కువ ధరకు అమ్మిన లేదా ఎక్కువ ధరకు కొన్న వ్యక్తి అగచాట్లు కుక్కలొల్లవు! అతనికి విధించిన బహిష్కరణవల్ల ఆ కాలంలో అతనికి సర్వనాశనం తప్పదన్నమాటే. దోషిపై సంఘం విధించిన ప్రత్యక్ష అపరాధ రుసుములను ఇక్కడ లెక్కలోకి తీసుకోలేదు. కొన్ని నిర్దిష్ట లక్ష్యాల కోసం ఇంతకన్నా పకడ్బందీ అయిన సంఘాలు స్థాపితమయ్యాయి. ఇందుకు ఉదాహరణలు జనీవాకు చెందిన 14, 15 శతాబ్దాల నాటి మహోనా – ఇది అనేక సంవత్సరాలపాటు ఆసియా మైనర్‌లోని ఫోసియా, చియోస్ దీవిలోని పటిక గనులపై సర్వాధిపత్యం వహించింది; గొప్ప రవెన్స్‌బర్గ్ వ్యాపార కంపెనీ – ఇది 14వ శతాబ్దం చివరి నుంచి ఇటలీ, స్పెయిన్‌లతో వ్యాపారం చేస్తూ, ఆ దేశాల్లో శాఖలను స్థాపించింది; ఆగ్స్‌బర్గర్లు, ఫుగ్గర్, వెల్సర్, వోట్లాన్, ఓచ్‌స్టెట్టర్ మొదలయిన వారి జర్మన్ కంపెనీ; నూరెంబర్గర్లు, హిర్ష్‌వోగెల్ మొదలయిన వారి కంపెనీ – ఇది 66,000 డకెట్ల పెట్టుబడితోనూ, మూడు ఓడలతోనూ 1505–06 పోర్చుగీస్ వారి భారత యాత్రలో పాల్గొని, 150 శాతం నికర లాభాన్ని, మరికొందరు చెబుతున్న దాన్నిబట్టి 175 శాతం లాభాన్ని సంపాదించింది. (హెయిడ్ : Levantehandel, సం. II, పుట 524); ఇంకా అనేక కంపెనీలు (monopolia అంటే గుత్త కంపెనీలు) – లూథర్ ఆగ్రహోదగ్రుడై తీవ్రంగా ఖండించినది, ఈ గుత్తవ్యాపార సంస్థలనే.

ఇక్కడ మనకు మొట్టమొదటిసారిగా లాభం రేటు ఎదురవుతూంది. భాగస్వాములందరికీ లాభం రేటు సమానంగా వుండేలా చూడటానికి వర్తకులు ఉద్దేశపూర్వకంగా, చైతన్యంతో కృషి చేస్తూ వచ్చారు. లెవెంట్‌లో లెవిషియన్లు, ఉత్తరాదిన హాన్స్ వర్తకులు ప్రతి ఒక్కరూ తన సరుకులకు తన పొరుగువాడు చెల్లించిన ధరలే చెల్లించేవాడు. అతని రవాణా ఖర్చులూ ఒకే విధంగా వుండేవి. తన సరుకులకు అతనికి ఒకే విధమైన ధరలు లభించేవి. తన "జాతి"కి చెందిన ప్రతి ఇతర వర్తకుని లాగానే తన తిరుగు ప్రయాణంలో తెచ్చే సరుకును ఒకే విధమయిన ధరలకు కొనేవాడు. ఆ విధంగా

లాభం రేటు అందరికీ సమానంగా వుంటూ వచ్చింది. గొంచిముద్ర హక్కుల్లో భాగస్వామ్యం భూఖండ్రిక వాటా ప్రకారం వున్నట్లుగానే, లేదా గని తవ్వకం లాభం గనిలోని వాటా ప్రకారం పంపకం అయినట్లుగానే పెద్ద పెద్ద వర్తక కంపెనీల్లో చెల్లించబడిన పెట్టుబడి వాటా ననుసరించి, లాభం కేటాయించడం మామూలు. సంపూర్ణంగా అభివృద్ధి చెందిన రూపంలోని సమానమైన లాభం రేటు పెట్టుబడిదారీ ఉత్పత్తి తుది ఫలితాల్లో ఒకటి. ఇది, ఈ విధంగా, తన అత్యంత సరళరూపంలో, చారిత్రకంగా పెట్టుబడికి ప్రారంభ స్థానాల్లో ఒకటిగా, వాస్తవంలో గొంచిముద్ర సంఘం యొక్క ప్రత్యక్ష అంకురంగా ఇక్కడ అభివ్యక్తమవుతోంది. అసలు గొంచిముద్ర సంఘమే ఆదిమ కమ్యూనిజం యొక్క ప్రత్యక్ష అంకురం.

ప్రారంభంలో లాభం రేటు తప్పనిసరిగా చాలా ఎక్కువగా ఉండేది. వాటి వ్యాపారంలోని గండాలు అన్నీ ఇన్నీ కావు. కారణం సముద్రంపై బందిపోట్ల దొంగతనాలు మాత్రమే కాదు. పోటీ పడే దేశాలు కూడా, అవకాశం ఉన్నప్పుడు నానా రకాల దౌర్జన్య చర్యలకు పాల్పడుతుండేవి. చివరగా, అమ్మకాలు, మార్కెటింగ్ పరిస్థితులు విదేశీ ప్రభువులు మంజూరు చేసిన లైసెన్సులపై ఆధారపడి వుండేవి. వాటిని వారే తరచూ ఉల్లంఘించడం లేదా రద్దు చేయడం జరుగుతుండేది. అందువల్ల పెద్ద మొత్తాల్లో భీమా ప్రీమియమ్‌ను కూడా లాభంలో జమకట్టుకోవలసి వచ్చింది. టర్నోవర్ నిదానంగా జరిగేది. బేరసారాలు ఈడిగలుబడుతూ సాగేవి. వ్యాపారానికి శుక్రమహర్దశ అనదగిన కాలాల్లోని వర్తకం గుత్త వ్యాపారమే. దాని లాభం గుత్తాధిపత్యపు లాభమే. పైగా ఆ ధర చాలా రోజులు సాగేది కాదు. ఇది అందరూ ఒప్పుకున్న విషయమే. మామూలు వ్యాపార లాభ శాతం కన్నా ఎల్లప్పుడూ ఆవశ్యంగా తక్కువగా వుండక తప్పని వడ్డీ రేట్లు సైతం ఆ కాలంలో చాలా ఎక్కువగా వుండేవంటే, లాభం రేటు సగటున చాలా ఎక్కువగా వుండేదని రుజువవుతూంది.

కానీ, భాగస్వాములందరికీ సమానంగా వున్నట్టి, సమాజ సమష్టి శ్రమ ద్వారా లభించినట్టి ఈ అధికతర లాభం రేటు స్థానికంగా ఆయా సంఘాల్లో అంతర్గతంగా, అంటే ఈ సందర్భంలో ఆయా "జాతికి" మాత్రమే వర్తించేది. వెనిషియన్లు, జనీవావాసులు, డచ్‌వారు వగైరా హాన్స్ (వర్తకులు) లాంటి ప్రతి "జాతికి", ప్రారంభ ధరల్లో వివిధ మార్కెట్ ప్రాంతాలకూ ఒక ప్రత్యేక లాభం రేటు వుండేది. ఈ వేరు వేరు కంపెనీ లాభం రేట్లు సమానం కావడం, విరుద్ధమైన మార్గంలో పోటీ ద్వారా జరిగింది. మొదట్లో వేరు వేరు మార్కెట్లలోని లాభం రేట్లు ఒకే దేశం వారికి సమానమయ్యాయి. ఉదాహరణకు వెనిస్ సరుకులకు సైప్రస్, కాన్‌స్టాంటినోపుల్, లేదా ట్రైబిజాండ్‌ల కన్నా అలెగ్జాండ్రియా ఎక్కువ లాభం ఇవ్వజూపితే, వెనిషియన్లు పెట్టుబడిని ఇతర మార్కెట్లలో వ్యాపారం నుంచి ఉపసంహరించి అలెగ్జాండ్రియాకు తరలించేవారు. ఒకే, లేదా ఒకే తరహా సరుకులను ఒకే మార్కెట్‌కు ఎగుమతి చేసే వేరు వేరు జాతుల మధ్య లాభం రేట్లు, ఆ తరువాత క్రమక్రమంగా సమానం కాక తప్పలేదు. ఈ జాతుల్లో కొన్ని తరచూ పోటీదార్ల ధాటికి చతికిలబడి రంగం నుంచి అదృశ్యమయ్యాయి. కానీ మధ్యధరాతీరం తూర్పు దేశాలతో వర్తకం, మంగోలియన్, టర్కిష్ దండయాత్రల ఫలితంగా కుప్పకూలిపోయింది. 1492 తరువాత ఆవిష్కృతమైన కొత్త భౌగోళిక ప్రాంతాలు, వ్యాపారరంగాలు మధ్యధరా తూర్పు దేశాల వర్తకం మరింత త్వరగా క్షీణించడానికి, తుదకు అంతరించిపోవడానికి దారితీశాయి.

తదనంతరం మార్కెట్ ప్రాంతాల విస్తీర్ణం హఠాత్తుగా విస్తరించడంవల్ల దానితో పెనవేసుకొని రవాణా, ప్రసారాల్లో వచ్చిన విప్లవంవల్ల, మొదట వర్తక కార్యకలాపాల్లో ప్రధానమైన మార్పులేవీ రాలేదు. ప్రారంభంలో ఇండియా అమెరికాలతో జరిగే వ్యాపారంపై కూడా సహకార కంపెనీలు ప్రాబల్యం వహించాయి. కానీ, మొదటి విషయం, ఈ కంపెనీలకు పెద్ద దేశాలు దన్నుగా నిలబడ్డాయి. అమెరికాతో వర్తకంలో సమైక్య డిస్పెయిన్ మహాదేశం మొత్తంగా, మధ్యధరా సముద్రతీరంలోని తూర్పు దేశాలతో వర్తకం చేస్తున్నాక టోలియన్ల స్థానం వహించింది. దానితోపాటు ఇంగ్లండు, ఫ్రాన్సు వంటి పెద్ద దేశాలు ఇదే విధానం అవలంబించాయి. అతి చిన్నదేశాలయిన హాలండ్, పోర్చుగల్లులు సైతం మునుపటి కాలంలో అన్నిటికన్నా గొప్ప, బలమైన వర్తక దేశంగా వుండిన వెనిస్‌కు విస్తీర్ణంలో, బలంలో కనీసం సమ ఉజ్జీలైన ఈ చిన్నదేశాలు సైతం ఇదే మార్గం అవలంబించాయి. ఇది 16వ, 17వ శతాబ్దాల పర్యాటక వర్తకునికి, సాహసి అయిన నాటి వర్తకునికి ఇచ్చిన దన్నువల్ల, తన సభ్యులను ఆయుధాలతో రక్షిస్తూ వచ్చిన కంపెనీల అవసరం అంతకంతకు తగ్గిపోయింది. ఆ కంపెనీ ఖర్చులు నిర్ద్వంద్వంగా ఒక బరువుగా పరిణమించాయి. అంతేకాక, ఒక్కొక్క వ్యక్తి చేతిలోని సంపద మునుపటికన్నా ఎంతో త్వరత్వరగా పెరిగింది. పర్యవసానంగా, మునుపు మొత్తం ఒక కంపెనీ ఒక వ్యాపారంలో మదుపు చేయగలిగినంత పెద్ద మొత్తాలను వర్తకులు ఒక్కొక్క కంపెనీలో పెట్టుబడి పెట్టగలిగారు. వర్తకం చేసే కంపెనీలు, అవి ఇంకా ఉన్నచోట్లలో మామూలుగా సాయుధ సంఘాలుగా మారిపోయాయి. ఇవి కొత్తగా కనుగొనబడిన దేశాలను జయించి, తమ మాతృదేశ రక్షణ కిందా, దాని సార్వభౌమాధికారం ఆసరాతోనూ వాటిని గుత్తాధికారంతో దోపిడీ చేశాయి. కానీ, కొత్త ప్రాంతాల్లో చాలావరకు ప్రభుత్వం వలసలను స్థాపించిన కొద్దీ, వ్యష్టి వర్తకుని వ్యాపారం ముందు కంపెనీ వర్తకం వెనుకపట్టు పట్టింది. దానితో లాభం రేటు సమానం కావడం అంతకంతకు కేవలం పోటీ ద్వారా జరిగే వ్యవహారం అయింది.

ఇప్పటివరకు మనం వర్తకుని పెట్టుబడికి సంబంధించి మాత్రమే, లాభం రేటును గురించి తెలుసుకున్నాము. ఎందువల్లనంటే, అంతవరకు వర్తకుని పెట్టుబడి, వడ్డీ వ్యాపారుని పెట్టుబడి మాత్రమే ఉండేవి. పారిశ్రామిక పెట్టుబడి ఇంకా రూపుగొనలేదు. ఉత్పత్తి ప్రధానంగా, ఉత్పత్తి విధానాలు గల కార్మికుల చేతుల్లో ఉండేది. కాబట్టి వారి పనివల్ల ఏ పెట్టుబడీ అదనపు విలువను పొందలేదు. ఆ కార్మికులు తమ ఉత్పాదితంలో కొంత భాగాన్ని, ప్రతిఫలం పొందకుండా మూడో వ్యక్తికి వదులుకోవలసి వస్తే, అది ఫ్యూడల్ ప్రభువులకు కప్పం రూపంలో వుండేది. కాబట్టి, వ్యాపార పెట్టుబడి లాభం ఆర్జించగలిగింది, కనీసం ప్రారంభంలో, దేశీయ ఉత్పాదితాల విదేశీ కొనుగోలుదారుల నుంచే లేదా, విదేశీ ఉత్పాదితాల దేశీయ కొనుగోలుదారుల నుంచే. విదేశీ పోటీ, మార్కెటింగ్ చిక్కులు కారణంగా, ఎగుమతి సరుకులను ఉత్పత్తిచేసే చేతివృత్తులవారు ఆ సరుకును ఎగుమతి వ్యాపారస్తులకు దాని విలువకన్నా తక్కువకు అమ్మవలసి వచ్చింది. పైన పేర్కొన్న దశ చివరిలోనే (ఇటలీ విషయంలో మధ్యధరా సముద్ర దేశాల వర్తకం క్షీణించడంతో) – ఈ విధంగా సరుకులు సగటున తమ విలువలకు అమ్మకమవుతూ వచ్చాయి. వ్యష్టి ఉత్పాదకుల మధ్య సాగే దేశీయ చిల్లర వర్తకంలోనే అనీ, మామూలుగా అంతర్జాతీయ వర్తకంలో కాదనీ మనకు స్పష్టమవుతూంది. ఇది నేటి ప్రపంచంలో పరిస్థితికి పూర్తిగా విరుద్ధమయినది. ఎందువల్లనంటే – నేడు అంతర్జాతీయ

వర్తకంలోనూ, టోకు వర్తకంలోనూ ఉత్పత్తి ధరలు చెల్లుబాటు అవుతుండగా, పట్టణ చిల్లర వ్యాపారంలో మరోవిధమైన లాభం రేట్లనుబట్టి ధరలు నిర్ణయమవుతున్నాయి. అందువల్లనే, ఉదాహరణకు, ఎద్దు మాంసం చికాగోలోని టోకు వర్తకుని నుంచి లండన్ టోకు వర్తకునికి రవాణా అవుతూన్నప్పుడు దాని ధరలో (రవాణా ఖర్చులతో సహా) వచ్చే పెరుగుదల లండన్ టోకు వర్తకుని నుంచి లండన్‌లోని వ్యష్టి వినియోగదారునికి వస్తున్నప్పుడు దాని ధర పెరుగుదల అధికంగా వుంటోంది.

ఈ ధర రూపుగొనడంలో ఈ విప్లవాన్ని క్రమక్రమంగా తెచ్చిందేమిటంటే, పారిశ్రామిక పెట్టుబడి, పారిశ్రామిక పెట్టుబడి బీజాలు మధ్యయుగాల్లోనే మూడు రంగాల్లో ఏర్పడ్డాయి. అవి నౌకాయానం, గనితవ్వకం, జౌళి పరిశ్రమ. సముద్రతీర ప్రాంతపు ఇటాలియన్, హాన్‌సియాన్ సముద్ర ప్రాంత రిపబ్లిక్కులు నిర్వహించిన స్థాయిలో నౌకాయానం ఆనాటి ఓడలకు నావికులు, అంటే వేతన శ్రామికులు (వీరి వేతన సంబంధాన్ని లాభంతో పొత్తు సంఘ రూపాల ముసుగులో దాచి వుండవచ్చు.) లేకుండా లేదా కలాసీలు – వేతన శ్రామికులు లేదా బానిసలు – లేకుండా నిర్వహించడం అసాధ్యం. ఖనిజపు గనుల్లోని గిల్డులు ప్రారంభంలో, కలిసి పనిచేసే కార్మికుల సంస్థలు. ఇవి దాదాపు ప్రతి సందర్భంలోనూ, వేతన శ్రామికుల నియామకంతో ఖనిజ నిక్షేపాలను వినియోగంలోకి తెచ్చే స్టాక్ కంపెనీలుగా అప్పటికే మారిపోయాయి. ఇక జౌళి పరిశ్రమలో, వర్తకుడు సన్నకారు నేత కార్మికుణ్ణి ప్రత్యక్షంగా తన కింద పనికి కుదుర్చుకోవడం ప్రారంభించాడు. అతనికి నూలు సరఫరా చేసి, దాన్ని ఒక నిర్ణీత వేతనానికి అతనిచే తనకోసం నేయించడం ద్వారా – ఒక్కముక్కలో చెప్పాలంటే అంతవరకు కేవలం కొనుగోలు దారుగా వున్నవాడు కాంట్రాక్టరుగా మారిపోవడం ద్వారా – ఇలా కుదుర్చుకున్నాడు.

పెట్టుబడిదారీ అదనపు విలువ రూపుగొనే క్రమం ప్రారంభమయిన తీరు ఇదీ. గని తవ్వకం గిల్డులతో, సభ్యులకే పరిమితమైన గుత్త సంఘాలుగా మనం తోసివేయవచ్చు. నౌకా యజమానుల సంగతికి వస్తే, వారి లాభం కనీసం దేశంలోని సాంప్రదాయక లాభమంత అధికంగా వుండటమే కాక, భీమా, నౌకల అరుగుదల మొదలయిన వాటికై అదనపు మొత్తం కూడా అందులో చేరి వుండవలసి వచ్చింది. కానీ, ప్రత్యక్షంగా పెట్టుబడిదారుని ఖాతా కింద తయారైన సరుకులను మొదట మార్కెట్‌లోకి తెచ్చి, చేతివృత్తుల వారి ఖాతాకింద తయారైన అదేరకం సరుకులతో పోటీపడ్డ జౌళి కాంట్రాక్టర్ల విషయం ఎలా వుండేది?

మొదట, వర్తకుని పెట్టుబడికి వున్న లాభం రేటు అతని ముందుంది. అదేవిధంగా, కనీసం సంబంధిత ప్రాంతంలో, ఆ లాభం రేటు అప్పటికే రమారమిగా సగటు రేటుకు సమానం చేయబడి వుంది. మరి కాంట్రాక్టరు యొక్క అదనపు పనిని చేపట్టడానికి ప్రేరేపించినది ఏమై వుంటుంది? ఒకటి మాత్రమే : ఇతరులు అమ్మే ధరకే అమ్ముతూనే, వారికన్నా ఎక్కువ లాభం పొందే అవకాశం అతనికి కలిగింది. సన్నకారు చేనేత కార్మికుణ్ణి తన కింద పనిలో పెట్టుకోవడం ద్వారా అతను సాంప్రదాయక ఉత్పత్తి సంబంధాలను తెంచివేశాడు. వాటి పరిధిలో ఉత్పాదకుడు, తయారైన తన ఉత్పాదితాన్ని తప్ప మరేదీ అమ్మేవాడు కాదు. సొంత ఉత్పత్తి పరికరాలున్నప్పటికీ, ఇక తన వద్ద ముడిపదార్థాలు లేని శ్రమశక్తిని వర్తక పెట్టుబడిదారు కొన్నాడు. ఆ విధంగా నేత కార్మికునికి క్రమం తప్పకుండా ఉపాధి ఉంటుందనే హామీ ఇవ్వడం ద్వారా వర్తక పెట్టుబడిదారులు నేత కార్మికుని

వేతనాన్ని ఏ స్థాయికి తొక్కిపెట్టగలిగారంటే, అతని శ్రమ కాలంలో కొంత భాగం ప్రతిఫలానికి నోచుకోకుండా వుండిపోయింది. ఆ విధంగా కాంట్రాక్టరు తన వ్యాపార లాభానికి పైబడి వున్న అదనపు విలువను స్వాహా చేసుకోగలిగాడో అతను నూలు మొదలయిన వాటిని కొనేందుకై అదనపు పెట్టుబడిని మదుపు పెట్టి, దాన్ని వస్తువు పూర్తిగా తయారయ్యే వరకు నేత కార్మికుని చేతిలో వుంచ వలసి వచ్చిందనేది కాదనము. మునుపైతే, ఆ వస్తువు పూర్తి ధరను దాన్ని కొన్నప్పుడు మాత్రమే చెల్లించేవాడు. కానీ, మొదటి విషయం, అంతకు ముందు కూడా అత్యధిక సందర్భాల్లో అతను నేత కార్మికునికి బయానాలకై అదనపు పెట్టుబడిని వినియోగించేవాడు. నేత కార్మికుడు మామూలుగా అప్పుల ఒత్తిడి వల్లనే కొత్త ఉత్పత్తి షరతులకు తలొగ్గాడు. రెండవ విషయం, దీనికి తోడు, లెక్కాచారం కింది రూపం ధరించింది :

మన వర్తకుడు తన ఎగుమతి వ్యాపారాన్ని 30,000 డకెట్లు, సెక్విన్లు, పౌండు లేదా ఆ సందర్భాన్నిబట్టి మరే చలామణి ద్రవ్యంతోనో నిర్వహించే వాడనుకుందాం. ఆ డబ్బులో దేశీయ సరుకుల కొనుగోలుకు 10,000 నియుక్తంగా కాగా, విదేశీ మార్కెట్‌లో 20,000 ఉపయోగించా డనుకుందాం. పెట్టుబడి రెండు సంవత్సరాల్లో తిరుగుడు పడుతుందనుకుందాం. వార్షిక టర్నోవర్ = 15,000. మన వర్తకుడు తాను కాంట్రాక్టరు అవాలనీ, బట్టలు నేయడం తన సొంత ఖాతాపై జరగాలనీ అనుకుంటాడనుకుందాం. అతను ఎంత అదనపు పెట్టుబడిని మదుపు పెట్టాలి. అతను అమ్మే రకం బట్ట తయారు కావడానికి, సగటున రెండు నెలలు పడుతుందనుకుందాం. (ఇది నిజంగా చాలా ఎక్కువే.) అంతేకాక, అతను అన్నిటికీ నగదు చెల్లించవలసి వుంటుందనుకుందాం. కాబట్టి, అతను తన నేత కార్మికులకు, రెండు నెలలకు సరిపడా పెట్టుబడిని ముందుగా చెల్లించవలసి వుంటుంది. అతని టర్నోవరు ఏడాదికి 15,000 కనుక, అతను రెండు నెలల్లో 2,500 ఖరీదు చేసే బట్ట కొంటాడు. ఆ మొత్తంలో 2,000 నూలు విలువ అనీ, 500 నేత కార్మికుని వేతనమనీ అనుకుందాం. అప్పుడు తన వర్తకునికి 2,000 అదనపు పెట్టుబడి అవసరమవుతుంది. కొత్త పద్ధతి ద్వారా అతను నేత కార్మికుని నుంచి స్వాహా చేసుకునే అదనపు విలువ బట్ట విలువలో 5 శాతం మాత్రమే అని ఊహించుకుందాం. ఇక్కడ అదనపు విలువ రేటు 25 శాతం మాత్రమే. ఇది నిజంగా చాలా పరిమితమైన రేటే. (2000$_{\text{స్థి.పె.}}$ +500$_{\text{అ.పె}}$+125$_{\text{అ.వి.}}$; అ.వి. రేటు $\frac{125}{500}$ = 25% అదనపు లాభం రేటు = $\frac{125}{2,500}$ = 5%) కాబట్టి మన వర్తకుడు తన వార్షిక టర్నోవర్ 15,000 మీద 150 మేరకు అదనపు లాభం సంపాదిస్తున్నాడు. ఆ విధంగా అతనికి $2\frac{2}{3}$ సంవత్సరాల్లో అతనికి అదనపు పెట్టుబడి తిరిగి చేతికందుతుంది.

కానీ, తన అమ్మకాలూ, తద్వారా తన టర్నోవరూ త్వరితగతితో సాగేలా చూడటానికై, ఆ విధంగా అదే పెట్టుబడితో అదే లాభాన్ని మరింత తక్కువ కాలంలో సంపాదించడానికై, అందువల్ల అదే కాలంలో ఎక్కువ లాభం పొందడానికై అతను తన అదనపు విలువలో కొద్దిపాటి భాగం కొనుగోలుదారుకు ఇచ్చివేస్తాడు. అంటే అతను తన పోటీదార్లకన్నా చౌకగా అమ్ముతాడు. వారు కూడా క్రమక్రమంగా కంట్రాక్టర్లుగా మారతారు. అప్పుడు అదనపు లాభం వారందరికీ మామూలు లాభంకంటే తగ్గిపోతుంది. వారందరికీ పెరిగిన పెట్టుబడిపై ఈ లాభం ఇంతకన్నా తగ్గుతుంది

కూడా. లాభం రేటులో సమానత్వం ఇలా తిరిగి స్థాపితమవుతుంది. అయితే, ఆ దేశంలో చేజిక్కించుకున్న అదనపు విలువలో కొంత భాగం విదేశీ కొనుగోలుదారులకు దఖలుపరచడం ద్వారా ఇది బహుశా మరో స్థాయిలో స్థాపితమవుతుంది.

పరిశ్రమను తన పట్టులోకి తెచ్చుకోవడంలో పెట్టుబడి వేసే తరువాతి ముందడుగు కార్ఖానా ఉత్పత్తిని ప్రవేశపెట్టడం. 17, 18వ శతాబ్దాల్లో అతి తరచుగా కార్ఖానా యజమానే తన ఎగుమతి వర్తకుడుగా వుండేవాడు. 1850 వరకు జర్మనీలో సర్వత్రా నేడు సైతం అక్కడక్కడ పరిస్థితి ఇదే. కార్ఖానా ఉత్పత్తివల్ల అతను తన పాతకాలపు పోటీదారు అయిన చేతివృత్తికారునికన్నా చౌకగా ఉత్పత్తి చేయగలుగుతాడు కూడా. పైన చెప్పిన క్రమమే పునరావృతమవుతుంది. కార్ఖానా ఉత్పత్తిని చేపట్టిన పెట్టుబడిదారు అదనపు విలువను స్వాహా చేసుకోవడం వల్ల, అతను (లేదా దాన్ని అతనితో పాలుపంచుకునే ఎగుమతి వర్తకుడు) తన పోటీదార్లకన్నా చౌకగా అమ్మగలుగుతాడు. కొత్త ఉత్పత్తి పద్ధతి సర్వత్రా ప్రవేశపెట్టబడే వరకు ఇది కొనసాగుతుంది. అలా ప్రవేశపెట్టబడినప్పుడు లాభం రేటు మళ్ళీ సమానమవుతుంది. ఇదివరకే వున్న వర్తక లాభం రేటు స్థానికంగా మాత్రమే సమాన స్థాయి నందుకొన్నప్పటికీ, మరీ ఎక్కువగా వున్న పారిశ్రామిక అదనపు విలువను నిర్దాక్షిణ్యంగా తెగ్గోసేందుకు అది ప్రమాణంగా పనిచేస్తూనే వుంటుంది.

తన ఉత్పాదితాలను చౌకపరచడం ద్వారా కార్ఖానా ఉత్పత్తి ముందుకు లంఘించిందంటే, ఇక ఆధునిక పరిశ్రమల మాట చెప్పనక్కరలేదు. అది ఉత్పత్తిలో పునఃపున విప్లవాల ద్వారా సరుకు ఉత్పత్తి ఖర్చులను అంతకంతకు తగ్గిస్తూ, మునుపటి ఉత్పత్తి పద్ధతులన్నిటినీ నిర్దాక్షిణ్యంగా తొలగించి వేసింది. అంతేకాదు; ఆ విధంగా దేశీయ మార్కెట్‌ను పెట్టుబడి యొక్క తిరుగులేని సర్వాధిపత్యం కిందికి తెచ్చేదీ, స్వయంపోషక రైతు కుటుంబాల సన్నకారు ఉత్పత్తికీ, సహజ ఆర్థిక వ్యవస్థకూ స్వస్తి చెప్పేదీ, సన్నకారు ఉత్పాదకుల మధ్య ప్రత్యక్ష మార్పిడిని తొలిగించి మొత్తం దేశాన్ని పెట్టుబడి సేవలో నియమించేదీ భారీస్థాయి పరిశ్రమలే. అదేవిధంగా అది వేరు వేరు వర్తక, పారిశ్రామిక శాఖల్లో లాభం రేటును ఒకే సార్వత్రిక రేటుగా సమానం చేస్తుంది. పెట్టుబడిని ఒక శాఖ నుంచి మరో శాఖకు బదలాయింపును అరికట్టే మునుపటి అవరోధాల్లో అత్యధిక భాగాన్ని తొలగించడం ద్వారా ఈ సమానీకరణలో పరిశ్రమలకు తదర్హమైన ఆధిపత్య స్థానం వుండేలా హామీ కల్పించింది. తద్వారా, మొత్తం అన్ని మార్పిడుల విషయంలోనూ విలువలు ఉత్పత్తి ధరలుగా పరివర్తన చెందుతాయి. కాబట్టి ఈ పరివర్తన, భాగస్వాముల ఎరుక, సంకల్పం లేకుండానే వస్తుగత నియమాల ననుసరించి జరుగుతుంది. పోటీ సార్వత్రిక రేటుకు మించిన లాభాలను సార్వత్రిక స్థాయికి తగ్గించి, సగటుకు పైబడిన అదనపు విలువను మొట్టమొదట స్వాహా చేసుకున్న పరిశ్రమదారుకు ఆ విధంగా, ఆ అవకాశం లేకుండా చేస్తుందన్న వాస్తవంలో సైద్ధాంతికంగా ఎట్టి చిక్కూ లేదు. ఆచరణలో అంతకన్నా చిక్కులేదు. ఎందువల్లనంటే, అత్యధికమైన అదనపు విలువ గల ఉత్పత్తి రంగాలు – అస్థిర పెట్టుబడి చాలా ఎక్కువగానూ, స్థిర పెట్టుబడి చాలా తక్కువగానూ వున్న ఉత్పత్తి రంగాలు, అంటే అంగ నిర్మాణంలో పెట్టుబడిపాలు తక్కువగా వున్న ఉత్పత్తి రంగాలు, ప్రత్యేకించి వ్యవసాయ రంగ పెట్టుబడిదారీ ఉత్పత్తికి సంపూర్తిగా లోనయ్యేది, తమ స్వభావరీత్యా చిట్టచివరకే, అందులోనూ అంతంతమాత్రంగానే.

కానీ, అంతర్నిర్మాణంలో పెట్టుబడి అధికంగా వున్న ఉత్పత్తి రంగాల ఉత్పాదితాల్లో, సగటుకన్నా తక్కువగా వున్న అదనపు విలువను లాభం సగటు రేటు యొక్క స్థాయికి పెంచేందుకు ఉత్పత్తి ధరలను సరుకు విలువకు మించి వుండేలా పెంచడం సైద్ధాంతికంగా అతి కష్టంగా కనిపిస్తుంది. అయితే, మనం ఇంతకు ముందు చూసినట్లు ఇది ఆచరణలో అతి త్వరగా, అతి సులభంగా జరిగిపో తుంది. ఎందువల్లనంటే, ఈ తరగతికి చెందిన సరుకులు మొదటిసారిగా పెట్టుబడిదారీ పద్ధతిలో ఉత్పత్తి అయి, పెట్టుబడిదారీ వాణిజ్యంలోకి ప్రవేశించినప్పుడు, అవి పెట్టుబడిదారీ విధానానికి మునుపు వున్న పద్ధతుల్లో ఉత్పత్తి అయి, ఆ కారణాన ధర ఎక్కువగా వున్న అదే రకం సరుకులతో పోటీపడతాయి. ఆ విధంగా, పెట్టుబడిదారీ ఉత్పాదకులు అదనపు విలువలో కొంత భాగాన్ని వదులుకున్నప్పటికీ, తన ప్రాంతంలో స్థిరపడి వున్న లాభం రేటు పొందగలడు. ప్రారంభంలో ఈ లాభం రేటుకు అదనపు విలువతో ప్రత్యక్ష సంబంధం వుండదు. ఎందువల్లనంటే, అది అసలు పెట్టుబడిదారీ ఉత్పత్తి అనేది రంగంపైకి రావడానికి చాలాకాలం ముందే, అంటే పారిశ్రామిక లాభం రేటుకు అవకాశం ఉండటానికి చాలాకాలం ముందే, వర్తక పెట్టుబడి నుంచి ఉద్భవించిన లాభం రేటు.

★ ★ ★

## II. స్టాక్ ఎక్స్ఛేంజ్[1]

1. పెట్టుబడిదారీ ఉత్పత్తిలో మొత్తంపై స్టాక్ ఎక్స్ఛేంజ్‌కి గల స్థానం III వ సంపుటి, 5వ భాగం నుంచి ప్రత్యేకించి..... అధ్యాయం[2] నుంచి స్పష్టమవుతోంది. కానీ ఇది 1865లో రాసిన పుస్తకం. దరిమిలా వచ్చిన మార్పు స్టాక్ ఎక్స్ఛేంజ్‌కి గణనీయంగా అధికమైన, నిరంతరం పెరుగుతున్న పాత్రను కట్టబెట్టింది; ఇది పెంపొందేకొద్దీ, సమస్త ఉత్పత్తినీ, పారిశ్రామిక ఉత్పత్తినీ, వ్యవసాయిక ఉత్పత్తినీ కూడా – సమస్త వాణిజ్యాన్ని, రవాణా, వార్తాప్రసార సాధనాలను, మార్పిడి విధులను స్టాక్ ఎక్స్ఛేంజ్ నిర్వాహకుల చేతుల్లో కేంద్రీకరించే ధోరణిని సంతరించుకుంటుంది. తత్పర్యవసానంగా స్టాక్ ఎక్స్ఛేంజ్ పెట్టుబడిదారీ ఉత్పత్తికే అతి ప్రముఖ ప్రతినిధిగా రూపొందుతుంది.

2. 1865లో స్టాక్ ఎక్స్ఛేంజ్ పెట్టుబడిదారీ వ్యవస్థలో ఇంకా అప్రధానమైన అంశంగానే వుండేది. స్టాక్ ఎక్స్ఛేంజ్ సెక్యూరిటీల్లో అత్యధిక భాగం ప్రభుత్వ రుణపత్రాలే. వాటన్నిటి మొత్తం ఇంకా సాపేక్షంగా కొద్దిపాటిదే. ఇవికాక, జాయింట్ స్టాక్ బ్యాంకులు కూడా వుండేవి. యూరపు ఖండంలోనూ, అమెరికాలోనూ అవి ప్రబలస్థానం వహిస్తూ, ఇంగ్లండులోని ప్రైవేటు బ్యాంకులను కబళించడం అప్పుడప్పుడే ప్రారంభించాయి. అయినప్పటికీ రాశిరీత్యా నాటికింకా దాదాపు లెక్కలోకి తీసుకోవలసినవి కావు. నేటి పరిస్థితితో పోల్చితే, రైల్వే వాటాలు ఇంకా దుర్బలంగానే వుండేవి. స్టాక్ కంపెనీ రూపంలోని ప్రత్యక్ష ఉత్పాదక సంస్థలు అప్పటికి ఇంకా బహు తక్కువ – ముఖ్యంగా మరింత పేదదేశాలయిన జర్మనీ, ఆస్ట్రియా, అమెరికా మొదలయిన వాటిలో అవి బ్యాంకుల్లాగా వుండేవి. "కర్త నేత్రాలు" (Minister's eye) ఇంకా సర్వవ్యాప్త అంధ విశ్వాసంగానే వున్నాయి.

ఆనాడు స్టాక్ ఎక్స్ఛేంజ్ అనేది, ఇంకా పెట్టుబడిదారుల వద్ద పోగయిన పెట్టుబడి ఒకరినుంచి మరొకరు తీసుకొని వెళ్ళే స్థలమే. కార్మికులతో దానికి గల ప్రత్యక్ష సంబంధమల్లా, గుండె నిబ్బరాన్ని సడలించే పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థ సార్వత్రిక ప్రభావానికి ఒక సరికొత్త రుజువుగానే; ఈ జీవితంలో సైతం దైవదత్త శుభాలనూ, శాపగ్రస్తతనూ, సంపదనూ అంటే సర్వసుఖ, అధికారాలనూ, దారిద్ర్యాన్నీ, అంటే లేమిడి, దాస్య వృత్తులనూ నిర్ణయించేది విధే (ఉరఫ్ అదృష్టమే.) అన్న కాల్పనిక సిద్ధాంతానికి ఒక ధృవీకరణగానే.

3. ఇప్పటి పరిస్థితి వేరు. 1866 సంక్షోభం దరిమిలా పెట్టుబడి సంచయనం అధికాధిక వేగంతో సాగింది. పర్యవసానంగా, ఏ పారిశ్రామిక దేశంలోనూ, ప్రత్యేకించి ఇంగ్లండులో ఉత్పత్తి విస్తరణ పెట్టుబడి సంచయన వేగాన్ని అందుకోలేకపోయింది; లేక, వ్యష్టి పెట్టుబడిదారుడు తనవద్ద పోగుపడిన పెట్టుబడిని తన సొంత పరిశ్రమ విస్తరణకు పూర్తిగా వినియోగించుకో

---

1. ఈ రాతపత్రికి ఎంగెల్స్ పెట్టిన శీర్షిక ఇది : "స్టాక్ ఎక్స్ఛేంజ్, పెట్టుబడి 3వ సంపుటికి అనుబంధ టిప్పణి" - సం.
2. రాతప్రతిలో ఎంగెల్స్, అధ్యాయం సంఖ్య వేయడానికి స్థలం ఖాళీగా వుంచాడు. ఆయన అనుకొన్నది, "పెట్టుబడిదారీ ఉత్పత్తిలో పరపతి పాత్ర" అనే శీర్షిక గల అధ్యాయం XXVII అనేది స్పష్టమే - సం.

లేకపోయాడు. 1845 నాటికే ఇంగ్లీషు వస్త్ర పరిశ్రమ పరిస్థితి, రైల్వేల మోసాలు ఆ విధంగానే వుండేవి. కానీ, ఈ సంచయనంతో, కేవలం డబ్బు మదుపులపై బతికేవారి సంఖ్య కూడా పెరిగింది. వీరు పరిశ్రమదారుల నిర్వహణలో తప్పనిసరియైన మానసిక ఉద్విగ్నతతో విసిగిపోయి, కేవలం వినోద విలాసాలతో కాలం గడపాలనో, లేక కంపెనీల డైరెక్టర్లుగా లేదా గవర్నర్లుగా ప్రశాంత వృత్తిని చేపట్టాలనో అనుకున్నవారు. మూడవది, నలుదిక్కులా కుప్పతెప్పలుగా వున్న ఈ ధనరాశిని డబ్బు పెట్టుబడిగా మదుపు పెట్టడానికి దోహదం చేసేందుకై పరిమిత పూచీగల కంపెనీల యొక్క కొత్త శాసనబద్ధ రూపాలు, అవిలేనిచోటల్లా స్థాపితమయ్యాయి; మునుపు కంపెనీ వాటాదారు పూచీకి ఒక పరిమితి అంటూ వుండేది కాదు. ఇప్పుడు అతని పూచీని కూడా తగ్గించారు. (జర్మనీలో 1890లో జాయింట్ స్టాక్ కంపెనీలు చెల్లించిన వాటాధనం 40 శాతం!)

4. కాబట్టి పరిశ్రమలు క్రమేణా జాయింట్ స్టాక్ కంపెనీలుగా మారాయి. పారిశ్రామిక శాఖలకు వరుసగా ఈ గతిపట్టింది. మొదట ఇనుము – ఈ శాఖలో ఇప్పుడు బ్రహ్మాండమైన కర్మాగారాల స్థాపన అవసరం. (దానికి ముందు, వాటాల ప్రాతిపదికపై ప్రారంభంలో వ్యవస్థీకృతం కాని గనులు.) తరువాత రసాయనిక పరిశ్రమ; అదేవిధంగా యంత్ర నిర్మాణ కర్మాగారాలు. యూరపు ఖండంలో వస్త్ర పరిశ్రమ; ఇంగ్లండులో లాంక్‌షైరులోని కొన్ని ప్రాంతాల్లో మాత్రమే (ఓల్డామ్ స్పిన్నింగ్ మిల్లు, బర్న్‌లే వీవింగ్ మిల్లు వగైరా దర్జీ సహకార సంస్థలు. అయితే ఇది ప్రాథమిక దశ మాత్రమే. రాబోయే సంక్షోభంలో ఇవి మళ్ళీ యజమానుల చేతుల్లోకి వెళతాయి.) సారా బట్టీలు (కొన్ని సంవత్సరాల క్రితం అమెరికా సారా బట్టీలు ఇంగ్లీషు పెట్టుబడికి, నాటి గిన్నెస్, బ్యాస్, ఆల్‌సోప్‌లకు అమ్మబడ్డాయి.) తరువాత ట్రస్టులు – ఇవి ఉమ్మడి మేనేజ్‌మెంట్ కింద బ్రహ్మాండమైన కర్మాగారాదులను స్థాపించాయి. (యునైటెడ్ ఆల్కలీ వంటివి.) “జాయింట్ స్టాక్ కంపెనీగా స్థాపితం” అయ్యే భారీస్థాయి వ్యాపారాన్ని పెంచేందుకు మామూలు విడి కంపెనీ రానురాను కేవలం ఒక ప్రాథమిక దశ అవుతోంది.

అదే విధంగా వర్తకంలో : లీఫ్స్, పార్సన్స్, మోర్లేస్, మారిసన్, డిల్లన్ – ఇవన్నీ జాయింట్ స్టాక్ కంపెనీలయ్యాయి. ఇప్పుడు చిల్లరకొట్ల విషయంలో “స్టోర్స్” తరహాలో సహకారం ముసుగులోనే కాదు – ఇదే పరిస్థితి.

అదేవిధంగా ఇంగ్లాండులో సైతం బ్యాంకులు, ఇతర పరపతి సంస్థలు కూడా. ఎన్నెన్నో కొత్త బ్యాంకుల వాటాలన్నీ పరిమిత పూచీ గలవిగా మార్చబడ్డాయి. పాత బ్యాంకులు సైతం, ఉదాహరణకు...[1] మొదలయినవి, ఏడుగురు ప్రైవేటు వాటాదార్లతో లిమిటెడ్ కంపెనీలుగా మార్చబడ్డాయి.

5. వ్యవసాయరంగంలో కూడా ఇంతే. బ్రహ్మాండంగా విస్తరించిన బ్యాంకులు, ప్రత్యేకించి జర్మన్‌లో నానారకాల అధికారవర్గ నామధేయాలతో, అంతకంతకు ఎక్కువ సంఖ్యలో భూములను తాకట్టు పెట్టుకుని అప్పులిస్తున్నాయి. వాటి వాటాలతో, భూ ఆస్తిపై యథార్థమైన యాజమాన్యం పైస్థాయిలో స్టాక్ ఎక్స్ఛేంజ్‌లకు బదిలీ అవుతోంది. వ్యవసాయదారులు అప్పులవాళ్ళ చేతుల్లోకి

1. రాతప్రతిలోని అక్షరాలు స్పష్టంగా లేవు. అవి ‘‘గ్లిన్&కో’’ - అని తోస్తుంది. అది ఒక బ్యాంక్ పేరు - సం.

పడిపోయినప్పుడు ఇలా జరగడం మరింత ఖాయం. ఇక్కడ పచ్చిక బయళ్ళ సాగులో వచ్చిన వ్యవసాయిక విప్లవం ప్రగాఢ ముద్ర వేస్తోంది. ఇది కొనసాగితే, ఇంగ్లండు, ఫ్రాన్సు దేశాల భూములు కూడా స్టాక్ ఎక్స్ఛేంజి చేతుల్లో వుండే రోజులను ఊహించుకోవచ్చు.

6. ఇప్పుడు అన్ని విదేశీ పెట్టుబడి మదుపులు వాటాల రూపంలోనే వున్నాయి. ఇంగ్లండు ఉదాహరణను మాత్రమే పేర్కొంటున్నాను : అమెరికన్ ఉత్తర, దక్షిణ రైల్వేలు (స్టాక్ ఎక్స్ఛేంజ్ పట్టీని చూడవచ్చు), గోల్డ్ బెర్గర్ మొదలయినవి.

7. తరువాత వలసల స్థాపన. ఇది నేడు స్టాక్ ఎక్స్ఛేంజ్‌కి కేవలం ఉపాంగంగా వుంది. యూరప్ రాజ్యాలు కొన్నేళ్ళ క్రితం ఆఫ్రికాను తమలో తాము పంచుకున్నదీ, ఫ్రెంచ్‌వారు టునిస్‌ను, టోంకిన్‌ను జయించినదీ స్టాక్ ఎక్స్ఛేంజ్ ప్రయోజనాల కోసమే. ఆఫ్రికాను ప్రత్యక్షంగా కంపెనీలకు లీజుకివ్వడం జరిగింది. (నైగర్, దక్షిణాఫ్రికా, జర్మన్ నైరుతి ఆఫ్రికా, జర్మన్ తూర్పు ఆఫ్రికా) మాషోనా లాండ్‌ను, నాటాల్‌ను రోడ్స్ ఆక్రమించుకున్నది స్టాక్ ఎక్స్ఛేంజ్ కోసమే.

# రచయితల సూచిక


ఎ

ఆండర్సన్ ఆడమ్ (1692–1765)
ఆండర్సన్ జేమ్స్ (1739–1808)
ఆన్నీ (1665–1714) 1702 నుంచీ రాణి
ఆర్బుత్‌నాట్ జార్జి (1802–1865)
అరిస్టాటిల్ (క్రీ.పూ. 384–322)
అరండ్ కార్ల్ (అరండ్‌ట్ కార్ల్) (1788–1877)
ఆష్లీ ఆంటోనీ కూపర్, ఎర్ల్ ఆఫ్ షాఫ్ట్స్‌బరీ (1801–1885)
అట్‌వుడ్ మత్తయాస్ (1779–1851)
అట్‌వుడ్ థామస్ (1783–1856)
ఆగియెర్ మారీ

బి

బాబ్బేజ్ ఛార్లెస్ (1792–1871)
బాల్జాక్ హానర్ డె (1799–1850)
బేరింగ్ – ఇంగ్లండ్‌లో బడా బ్యాంకింగ్ సంస్థ
బాస్టియట్ ఫ్రెడరిక్ (1801–1850)
బెల్లర్స్ జాన్ (1654–1725)
బంటింక్ జార్జి
బెర్నల్ ఓస్బోర్న్ రాల్ఫ్ (1808–1882)
బెస్సెమీర్ హెన్రీ (1813–1898)
బొసాంకెట్ జేమ్స్ వాట్‌మన్ (1801–1877)
బ్రైట్ జాన్ (1811–1889)
బ్రిస్కోజాన్ (18వ శతాబ్దం చివర్లో)
బరెట్ యూజినీ (1811–1842)
బుష్క్ జోహాన్ గియోర్గ్ (1728–1800)

సి

కెయిర్న్స్ జాన్ ఎలియట్ (1823–1875)
కాంటిల్లాన్ ఫిలిప్ రిచర్డ్ (1680–1734)
కారీ హెన్రీ ఛార్లెస్ (1793–1879)
కాటొ మార్కస్ పోర్సియస్ ఉటిసెన్సిస్ (క్రీ.పూ. 234–149)
చాల్‌మర్స్ థామస్ (1780–1847)
ఛాంబర్ లెయినె లేదా చాంబర్లేన్ హ్యూ (1630 ప్రాంతం 1720)
ఛార్లెమాగ్నె (ఛార్లెస్ ది గ్రేట్ 742–814) 768 నుంచి రాజు, 800 నుంచి చక్రవర్తి
ఛార్లెస్ (1630–1685) 1660 నుంచి రాజు
చెర్బులియెజ్–ఆంటోయినె ఎలిసీ (1797– 1869)
చైల్డ్, జోసియా (1630–1699)
క్లే విలియమ్ (1791–1969)
కోట్, ఫాంకొయిస్ ఛార్లెస్ లూయీ (1782– 1837)
కోహెలీన్ ఛార్లెస్ (1803–1852)
కార్బెట్, థామస్
కాటన్, విలియం

డి

డైరె లూయిస్ యూజిన్ (1798–1847)
డాంటె అలిఘెరి (1265–1321)
డావేనాంట్ ఛార్లెస్ (1656–1714)
డిజ్రాయిలీ బెంజమిన్ (1804–1881)

దంబాస్లే క్రిస్టఫర్ జోసెఫ్ ఆలెగ్జాండ్రె మాథియూ డె (1777–1843)
డౌవ్ పాట్రిక్ ఎడ్వర్డ్ (1815–1873)
డ్యురోవ్ డె లా మాలీ అడాల్ఫ్ జూల్స్ సీజర్ ఆగస్ట్ (1777–1857)

ఇ

ఎంగెల్స్ ఫ్రెడరిక్ (1820–1895)
ఎపిక్యురస్ (341–271 క్రీ.పూ.)

ఎఫ్

ఫాసెట్ హెన్రీ (1833–1884)
ఫెల్లర్ ఫ్రెడరిక్ ఎర్నెస్ట్ (1800–1859)
ఫైర్‌మన్ పీటర్ (జననం 1863)
ఫార్కేడ్ యూజిని (1820–1869)
ఫోరియర్ ఛార్లెస్ (1772–1837)
ఫ్రాన్సిస్ జాన్ (1811–1882)
ఫ్రెడరిక్–II (1194–1250) 1212 నుంచీ చక్రవర్తి
పుగ్గర్ – 6వ శతాబ్దం నాటి అత్యంత సంపన్న జర్మన్ వ్యాపారి, బ్యాంక్ సంస్థ
పుల్లర్టన్ జాన్ (1780–1849)

జి

గారిబాల్డి గైసెప్పె (1807–1882)
జార్జి–III (1738–1820) 1760 నుంచి రాజు
గిల్బర్ట్ జేమ్స్ విలియం (1794–1863)
గ్రెగ్ రాబర్ట్ హైడ్ (1795–1875)
గుర్నీ శామ్యూల్ (1786–1856)

హెచ్

హేమిల్టన్ రాబర్ట్ (1743–1829)
హార్డ్‌కేజిల్ డానియెల్
హారింగ్టన్ జేమ్స్ (1611–1677)
హెగెల్ జార్జి ఫ్రెడరిక్ విల్‌హెల్మ్ (1770– 1831)
హైనే హీన్రెక్ (1797–1856)
హెన్రీ–VIII (1491–1541) 1509 నుంచి రాజు
హెరెన్ స్వాండ్ జీన్ (1728–1811)
హైడ్ విల్‌హెల్మ్ (1823–1906)
హాడ్జ్‌స్కిన్ థామస్ (1787–1869)
హార్నర్ లియోనార్డ్ (1785–1864)
హబ్బర్డ్ జాన్ గెల్లిబ్రాండ్ (1805–1889)
హ్యాల్‌మాన్ కారల్‌డెయిట్ రిచ్ (1765– 1846)
హ్యూమ్ డేవిడ్ (1711–1776)

జె

జేమ్స్–I (1566–1625) 1603 నుంచి రాజు
జెవాన్స్ విలియం స్టాన్లీ (1835–1885)
జాన్‌స్టన్ జేమ్స్ (1796–1855)
జోన్స్ రిచర్డ్ (1790–1855)

కె

కీసెల్ బాక్ విల్‌హెల్మ్
కిన్కెయిడ్ జాన్ (1787–1862)
కిన్నియర్ జె.జి.

ఎల్

లెయింగ్ శామ్యూల్ (1780–1868)
లావెర్గ్నె లూయీ గాబ్రియెల్ లెయొన్‌సి (1809–1880)
లా జాన్ (1671–1729)
లియాథామ్ విలియమ్ హెన్రీ (1815–1889)
లెక్సిస్ విల్‌హెల్మ్ (1837–1914)
లీబిగ్ జస్టస్‌వాన్ (1803–1873)
లింగెట్ సైమన్ నికొలస్ హెన్రీ (1736–1794)
లిస్ట్ ఫ్రెడరిక్ (1789–1846)
లాయిడ్ శామ్యూల్ జోన్స్, తొలి ఒవర్‌స్టన్ బారన్ (1796–1883)
లుజాక్ ఎలి (1723–1796)
లాకి జాన్ (1632–1704)
లోరియా అకిల్లె (జననం 1857)

లూథర్ మార్టిన్ (1483–1546)
లూయిస్–XIV (1638–1715)
1643 నుంచి రాజు

**ఎమ్**

మెకాలే థామస్ బాబింగ్టన్ (1800–1859)
మాక్కుల్లక్ జాన్‌రామ్సె (1789–1864)
మాగొ (VI బి.సి.)
మాల్తస్ థామస్ రాబర్ట్ (1766–1834)
మాస్లీ థామస్ (1628–1690)
మారన్ హెచ్
మార్క్స్ కార్ల్ (1818–1883)
మాసీ జోసెఫ్ (మరణం 1784)
మారర్ జార్జ్ లుడ్విగ్ వాన్ (1790–1872)
మెంజెర్ కారల్ (1840–1921)
మిల్ జాన్ స్టూవర్ట్ (1806–1873)
మిరాబూ విక్టర్ మార్క్విస్ డె (1715–1789)
మామ్‌సెన్ థియొడోర్ (1817–1903)
మూర్ శామ్యూల్ (1830–1912)
మోర్గాన్ లెవిస్ హెన్రీ (1818–1881)
మోర్టన్ జాన్ ఛామర్స్ (1821–1888)
మోర్టన్ జాన్ లోకార్డ్
మోసెర్ జస్టిస్ (1720–1794)
మోనియర్ ఎల్
ముల్లర్ ఆడం హెన్రిక్ (1779–1829)

**ఎన్**

నాస్మిత్ జేమ్స్ (1808–1890)
న్యూమన్ ఫ్రాన్సిస్ విలియం (1805–1897)
న్యూమన్ శామ్యూల్ ఫిలిప్స్ (1797–1842)
న్యూమార్క్ విలియం (1820–1882)
నార్మన్ జార్జ్ వార్డె (1793–1882)
నార్త్ డడ్లీ (1641–1691)

**ఒ**

ఒ'కోనార్ చార్లెస్ (1804–1884)
ఓడర్‌మాన్ (1815–1904)
ఓప్‌డైక్ జార్జి (1805–1880)
ఓవర్‌స్టన్ – లాయిడ్ చూడండి
ఓవెన్ రాబర్ట్ (1771–1858)

**పి**

పామర్ జాన్ హార్స్‌లీ (1779–1858)
పామర్ స్టన్ హెన్రీ జాన్ టెంపుల్ లార్డ్ (1784–1865)
పార్‌మెంటైర్ ఆంటోని అగస్టిన్ (1737– 1813)
పాసీ హిపోలైట్ ఫిలిబెర్ట్ (1793–1880)
పాటర్‌సన్ విలియం (1658–1719)
పాటెన్ – విల్సన్ పాటెన్ చూడండి.
పెక్యుయెర్ ఛార్లెస్ – పెక్యుయెర్ కాన్‌స్టాంటిన్ చూడండి
పెక్యుయెర్ కాన్‌స్టాంటిన్ (1801–1887)
పీల్ రాబర్ట్ (1788–1850)
పెరైరీ జాకోబ్ ఎమిలి (1800–1875)
పెరెరీ ఐజాక్ (1806–1880)
పెట్టీ విలియం (1623–1687)
పిండార్ (క్రీ.పూ. 522–443)
పిట్ విలియం జూనియర్ (1759–1806)
ప్లినీ ది ఎల్డర్ గెయిస్ ప్లినియస్ సెకండస్ (23–79)
పోపీ జోహాన్ హేన్రిక్ మారిట్జ్ (1776–1854)
ప్రైస్ రిచర్డ్ (1723–1791)
ప్రౌథాన్ పియరె జోసెఫ్ (1809–1865)

**క్యూ**

క్వెటెలెట్ లాంబర్డ్ అడాల్ఫ్ జాక్వెస్ (1796– 1874)

**ఆర్**

రామ్సే జార్జ్ (1800–1871)

రెడెన్ ఫ్రెడరిక్ విల్‌హెల్మ్ ఒట్టో లుడ్విగ్ (1804–1857)

రోడ్స్ సిసిల్ జాన్ (1853–1902)

రికార్డో డేవిడ్ (1772–1823)

రాడ్‌బెర్టస్ జాన్ కారల్ (1805–1875)

రోశ్చర్ విల్‌హెల్మ్ (1817–1894)

రాత్‌షీల్డ్ జేమ్స్ (1792–1868)

రుబికన్ మారిస్ (1766–1849)

రస్సెల్ జాన్ లార్డ్ (1792–1878)

**ఎస్**

సెయింట్ సైమన్ క్లాడ్ హెన్రీ (1760–1825)

సే జీన్ బాప్టిస్ట్ (1767–1832)

ష్మిడ్ట్ కాన్రాడ్ (1863–1932)

సీనియర్ నాసూ విలియం (1790–1864)

షాఫ్ట్సబరీ – ఆష్లీ చూడండి

షా జార్జి బెర్నార్డ్ (1856–1950)

సీమెన్స్ అగస్ట్ ఫ్రెడరిక్ (1826–1908)

సీమెన్స్ కార్ల్ విల్‌హెల్మ్ (1825–1883)

సైమన్ జాన్ (1816–1904)

సిస్మండి జీన్ ఛార్లెస్ లియోనార్డ్ సిమోండ్ డె (1773–1842)

స్మిత్ ఆడమ్ (1723–1790)

సాంబర్ట్ వెర్మెర్ (1863–1941)

స్టువార్ట్ జేమ్స్ (1712–1780)

స్టార్ఛ్ హీన్రిక్ ఫ్రెడరిక్ (1766–1835)

**టి**

థైయర్స్ లూయీ అడాల్ఫ్ (1797–1877)

థామస్ సిడ్నీ గిల్‌క్రిస్ట్ (1850–1885)

థన్ అల్ఫాన్స్ (1853–1885)

టోకెవిల్లె అలెక్సి ఛార్లెస్ హెన్రీ (1805–1859)

టూకే థామస్ (1774–1858)

టోరెన్స్ రాబర్ట్ (1780–1864)

టకెట్ జాన్ డెబెల్ (మరణం 1864)

టర్గాట్ అన్నె రాబర్ట్ జాక్వెస్ (1727–1781)

**యు**

ఉరే ఆండ్రూ (1778–1857)

**వి**

వెర్రీ పియెత్రో (1728–1797)

విన్‌కార్డ్ పియరె (1820–1882)

విశరింగ్ ఎస్ (1818–1888)

**డబ్ల్యు**

వేక్‌ఫీల్డ్ ఎడ్వర్డ్ గిబ్బన్ (1796–1862)

వాల్‌టన్ ఆల్ఫ్రెడ్ (1816–1883)

వెస్ట్ ఎడ్వర్డ్ (1782–1828)

విల్సన్ జేమ్స్ (1805–1860)

విల్సన్ పాటన్ జాన్ (1802–1892)

ఉల్ఫ్ జూలియస్ (జననం 1862)

ఉడ్ ఛార్లెస్ (1800–1885)


★ ★ ★

# పెట్టుబడి మూడవ సంపుటంలో ఉల్లేఖించిన ప్రామాణిక రచయితల, పత్రాల సూచిక

## I. రచయితలు

ఎ

**ఆండర్సన్ ఆడమ్ :** యాన్ హిస్టారికల్ అండ్ క్రొనలాజికల్ డిడక్షన్ ఆఫ్ ది ఆరిజన్ ఆఫ్ కామర్స్, ఫ్రమ్ ది ఎర్లీయెస్ట్ అక్కౌంట్స్ టు ది ప్రెజంట్ టైమ్ వాల్యూం-2, లండన్ (1764).

**ఆండర్సన్ జేమ్స్ :** ఎ కామ్ ఇన్వెస్టిగేషన్ ఆఫ్ ది సర్కమస్టెన్సెస్ దట్ హేవ్ లెడ్ టు ది ప్రెజంట్ స్కేర్‌సిటి ఆఫ్ గ్రెయిన్ ఇన్ బ్రిటన్, లండన్ (1801).

**అరిస్టాటిల్ :** డె రిపబ్లిక లిబ్రి-VIII ఎట్ ఓకనమికా. ఎక్స్ రిసెన్షన్ ఇమ్మాన్యులిస్ బెక్కరీ ఓక్సానీ 1837.

**ఆర్నోడ్ కారల్ :** డై నాచుర్‌గమెస్ వాల్ట్బ విర్ట్ షాఫ్ జెజెనుబెర్ డెమ్ మొనాపొలీయింగ్ స్టె ఉండ్ డెమ్ కమ్యూనిజ్మస్, మిట్ ఎయినిమ్ రుక్బ్లిక్ జేఫ్ డై ఎయిన్‌ష్కలాగెండె లిటరేచర్, హనోవ్ 1845.

**ఆగియెర్ మారీ :** డుక్రెడిట్ పబ్లిక్ ఎట్ డె సన్ హిస్టరీ డెపూయిస్ లెస్ టెంప్స్ ఎన్షియన్స్ జస్కా నాస్ జూర్, పారిస్ 1842.

బి

**బాల్జాక్ :** హనరీ డె లెస్ పాయసన్స్, 1845.

**బాస్టియట్ ఫ్రె :** గ్రాట్యుయట్ డు క్రెడిట్, డిస్కషన్ ఎంత్రె ఎమ్.ఫ్రె. బాస్టియట్ ఎట్ ఎమ్.పి.జె. ప్రౌథాన్, పారిస్ 1850.

**బెల్ జి.ఎమ్. :** ది ఫిలాసఫీ ఆఫ్ జాయింట్ స్టాక్ బ్యాంకింగ్, లండన్ 1840.

**బొసాంక్వెట్ జె.డబ్ల్యు. :** మెటాలిక్, పేపర్ అండ్ క్రెడిట్ కరెన్సీ అండ్ ది మీన్స్ ఆఫ్ రెగ్యులేటింగ్ దైర్ క్వాంటిటీ అండ్ వాల్యూ, లండన్, 1842.

**బ్రిస్కోవ్ జాన్ :** టు ది నైట్స్, సిటిజెన్స్ అండ్ బర్గెస్సెస్ ఇన్ పార్లమెంట్ ఎసెంబ్ల్డ్, 1695.

**బురెట్ యూజిని :** డె లా మిజరీ డెస్ క్లాసెస్ లేబరియనెస్ ఎన్ ఆంగ్లెటెరె ఎట్ ఎన్ ఫ్రాన్స్ ఎట్‌సెట్రా, పారిస్, 1840.

**బుష్క్ జాన్ జార్జ్ :** థియొరెటిష్క్ ప్రాక్టిస్కె డార్‌స్టెల్లింగ్ డెర్ హండ్‌లుంగ్ ఇన్ ఇహ్రెన్ మానింగ్ షాల్టిజెన్ జెష్కాఫెన్ (1792) - విస్తృతపరిచి, మరింత సమాచారం అందిం చేట్టు రూపొందించిన మూడవ ముద్రణ. జి.పి.హెచ్. నార్మన్, హాంబర్గ్ 1808లో చేర్పులు, అనుబంధాలు జతచేసిన సంపుటం.

సి

**కెయిర్న్స్ జె.ఇ. :** ది స్లేవ్ పవర్, ఇట్స్ కారక్టర్ కెరీర్ అండ్ ప్రోబబుల్ డిజైన్స్, వగైరా. లండన్, 1862.

**కాంటిల్లాన్ రిచర్డ్ :** ఎస్సెయ్ సర్ లా నేచర్ డు కామర్స్ ఎన్ జెనరల్. ట్రాడ్యుయిట్ డెలా ఆంగెయిస్, లండన్, 1755.

**కారీ హెచ్.సి. :** ప్రిన్సిపుల్స్ ఆఫ్ సోషల్ సైన్స్ వాల్యూం–III ఫిలడెల్ఫియా, 1860.

**ఛాల్మర్స్ థామస్ :** ఆన్ పొలిటికల్ ఎకానమీ ఇన్ కనెక్షన్ విత్ ది మోరల్ స్టేట్ అండ్ మోరల్ ప్రాస్పెక్ట్స్ ఆఫ్ సొసైటీ, రెండవ ప్రచురణ, గ్లాస్గో, 1832.

**ఛాంబర్లెయిన్ డా॥ హ్యూ :** ఎ ఫ్యూ ప్రపోజల్స్ హంబ్లీ రికమెండింగ్ ఎట్‌సెట్రా ఎస్టాబ్లిషింగ్ ఎ లేండ్ క్రెడిట్ ఇన్ దిస్ కింగ్‌డమ్, ఎడింబరో, 1700.

**చెర్బులీజ్ ఎ. :** రిచె ఆన్ పూవ్ ఎక్స్‌పోజిషన్ సక్‌సింటెడెస్ కాజెస్ ఎట్ డెస్ ఎఫెట్స్ డె లా డిస్ట్రిబ్యూషన్ ఆక్చువలీ డెస్ రిచ్‌నెస్ సోషి యాలె, పారిస్ ఎట్ జెనీవా, 1840.

**ఛైల్డ్ జోసయా :** ట్రైటెస్ సర్ లె కామర్స్ ఎట్ సర్ లె అవాంటేజెస్ క్వి రిజల్టెంట్ డిలా రిడక్షన్ డె లింట్ రెట్ డె లార్జెంట్ (1694) ఆమెస్టర్ డామ్ ఎట్ బెర్లిన్, 1754.

**కామ్టే చార్లెస్ :** ట్రైట్ డె లా ప్రోఫైటె టి.ఐ. పారిస్, 1834.

**కోకెలిన్ ఛార్లెస్ :** డు క్రెడిట్ ఎట్‌డెస్ బాంక్వెస్. రివ్యు డెస్ డ్యుయెక్సె మాండెస్, అన్నదాంట్లో, పారిస్, 1842.

**కార్బెట్ థామస్ :** యాన్ ఎన్‌క్వైరీ ఇన్ టు ది కాజెస్ అండ్ మోడ్స్ ఆఫ్ ది వెల్త్ ఆఫ్ ఇండివిద్యువల్స్; ఆర్ ది ప్రిన్సిపుల్స్ ఆఫ్ ట్రేడ్ అండ్ స్పెక్యులేషన్ ఎక్స్‌ప్లెయిన్డ్, లండన్, 1841.

డి

**డ్యురో డెలామాల్ ఎ.జె. :** ఎకానమీ పొలిటికె డెస్ రొమైన్స్, పారిస్; 1840.

ఇ

**ఎంగెల్స్ ఫ్రెడరిక్ :** డై లాగె డెర్ ఆర్బియెటెండన్ క్లాస్ ఇన్ ఇంగ్లండ్, నాక్ ఎయ్‌గ్నెర్ ఆన్ ష్కావుంగ్ ఉండ్ ఆథెంటిష్కెన్ క్వెల్లెన్, లీప్జిగ్ 1845.

దిస్టాక్ ఎక్స్‌ఛేంజి, సప్లిమెంటరీ నోట్సు టు కేపిటల్, వాల్యూం–3 (1895).

ఎఫ్

**ఫ్లెర్ డాక్టర్ ఎఫ్.ఇ. :** ఉండ్ ఆడర్‌మన్ డా. సి.జి. దాస్ గాంజె డెర్ కేఫ్ మాన్నిస్కెన్, అరిథ్ మెటిక్ పూర్ హాండిల్స్ రియల్ ఉండ్ గెవెర్ బెస్క్యూలెన్ సా వియె జుమ్ సెల్బ్‌స్టుంట్ రిఫ్టా పూర్ గెష్కాఫ్ట్ మానెర్ ఉబెర్‌హాప్ట్ (1842) 7, అఫ్లేజ్ లీప్జిగ్, 1859.

**ఫైర్‌మాన్ పీటర్ :** క్రిటిక్ డెర్ మార్క్‌ష్కెన్ వెర్ట్ థియొరి, జాహ్రుబుఖె పూర్ నేషనలెకానమీ ఉండ్ స్టాటిస్టిక్, డ్రిట్ ఫోల్జ్ (బిడి III జెనా) రాసిన దాంట్లో, 1892.

**ఫోర్కేడ్ యూజినీ :** లా దయెరె డు సోషియలిజ్మే II ఎకానమీ పొలిటికె రివల్యూషనరీ ఎట్ సోషియాలె. రివ్యూ డెస్ డ్యుమ్‌మోండెస్ టి, నుంచి 4, బ్రూక్ సెల్లెస్ 1848.

**ఫ్రాన్సిస్ జాన్ :** హిస్టరీ ఆఫ్ ది బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్, ఇట్స్ టైమ్స్ అండ్ ట్రెడిషన్స్, మూడవ ముద్రణ, లండన్, 1848.

**ఫుల్లార్టన్ జాన్ :** ఆన్ ది రెగ్యులేషన్ ఆఫ్ కరెన్సీస్ బీయింగ్ యాన్ ఎగ్జామినేషన్ ఆఫ్ ది ప్రిన్సిపుల్స్ ఆన్ విచ్ ఇటీజ్ ప్రపోజ్డ్ టు రిస్ట్రిక్ట్ విదిన్ సర్టెన్ ఫిక్స్‌డ్ లిమిట్స్, ది ఫ్యూచర్ ఇష్యూస్ ఆన్ క్రెడిట్ ఆఫ్ ది బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్ అండ్ ఆఫ్ ది అదర్ బ్యాంకింగ్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ త్రూ అవుట్ ది కంట్రీ, లండన్, 1845.

జి

**గిల్బర్ట్ విలియమ్ జేమ్స్ :** ది హిస్టరీ అండ్ ప్రిన్సిపుల్స్ ఆఫ్ బ్యాంకింగ్, లండన్ 1834.

– యాన్ ఎంక్వైరీ ఇన్ టు ది కాజెస్ ఆఫ్ ది ప్రెషర్ ఆన్ ద మనీ మార్కెట్ డ్యూరింగ్ ది ఇయర్ 1839.

– ఎ ప్రాక్టికల్ ట్రిటైజ్ ఆన్ బ్యాంకింగ్, (1827) 5వ ముద్రణ, లండన్, 1849.

**గ్రెగ్ ఆర్.హెచ్ :** ద ఫ్యాక్టరీ క్వశ్చన్, కన్‌సిడర్డ్ ఇన్ రిలేషన్ టు ఇట్స్ ఎఫెక్ట్స్ ఆన్ ద హెల్త్ అండ్ మోరల్స్ ఆఫ్ దోజ్ ఎంప్లాయిడ్ ఇన్ ఫ్యాక్టరీస్ అండ్ ద టెన్ అవర్స్ బిల్ ఎట్‌సెట్రా, లండన్, 1837.

హెచ్

**హామిల్టన్ రాబర్ట్ :** యాన్ ఎంక్వైరీ కన్‌సర్నింగ్ ది రైజ్ అండ్ ప్రోగ్రెస్, ద రీడెంప్షన్ అండ్ ప్రజంట్ స్టేట్ అండ్ ద మేనేజ్‌మెంట్ ఆఫ్ ద నేషనల్ డెట్ ఆఫ్ గ్రేట్ బ్రిటన్, రెండవ ముద్రణ, ఎడింబరో, 1814.

**హార్డ్ కేజిల్ డేనియల్ జూనియర్ :** బ్యాంక్స్ అండ్ బ్యాంకర్స్, రెండవ ముద్రణ, లండన్, 1843.

**హెగెల్ జార్జ్ విల్‌హెల్మ్ ఫ్రెడరిక్ :** గ్రండ్‌లినియన్ డెర్ ఫిలాసఫీ డెస్ రెఖెట్స్, ఆడర్ నాచురెఖ్ట్ ఉండ్ స్టాట్స్‌విస్సెన్ ష్కాఫ్ట్ ఇమ్ గ్రుండ్‌రెస్సె, 'వర్క్'లో డా॥ ఎడ్వర్డ్ గాన్స్ ప్రచురణ. ఏడవ ముద్రణ, బెర్లిన్, 1840.

**హియిన్స్ హీన్రిక్ :** డిస్పుటేషన్, గెడిఖ్ట్, డ్రిట్టర్ బాండ్, రోమాంజెరో, 3, బుఖ్ హైః బ్రైష్క మెలోడన్.

**హెయిడ్ డా॥ విల్‌హెల్మ్ :** గ్రెష్కి టె డెస్ లెవాంట్ హేండిల్స్ ఇమ్ మిట్టిలాల్ ట్రె, స్టుటగర్ట్ 1879.

**హాడ్గ్‌స్కిన్ :** లేబర్ డిఫెండెడ్ ఎగెనెస్ట్ ద క్లెయిమ్స్ ఆఫ్ కాపిటల్ ఆర్ ది అన్ ప్రొడక్టివ్‌నెస్ ఆఫ్ కేపిటల్ ప్రూవ్డ్, బై ఎ లేబరర్, లండన్, 1825.

**హబ్బర్డ్ జాన్ గెల్లిబ్రాండ్ :** ద కరెన్సీ అండ్ ద కంట్రీ, లండన్, 1843.

**హూల్ మాన్ కారల్ డట్రిష్ :** స్టడ్టెవెసెన్ డెస్ మిట్టె లేల్‌టర్స్ బాన్, 1826.

జె

**జాన్‌స్టన్ జేమ్స్ ఎఫ్.డబ్ల్యు. :** నోట్స్ ఆన్ నార్త్ అమెరికా, అగ్రికల్చరల్, ఎకనామికల్ అండ్ సోషల్, ఎడింబరో, లండన్, 1851.

**జోన్స్ రిచర్డ్ :** యాన్ ఇంట్రడక్టరీ లెక్చర్ ఆన్ ద పొలిటికల్ ఎకానమీ, లండన్, 1833

– యాన్ ఎస్సే ఆన్ ద డిస్ట్రిబ్యూషన్ ఆఫ్ వెల్త్, లండన్, 1831.

కె

**కెజెల్ బాఖ్ విల్‌హెల్మ్ :** డేర్ గాంగ్‌డెస్ వెల్ట్ హుడిల్స్ ఉండ్ డై ఎంట్విక్ లుగ్ డెస్ యూరో పెయిస్కెన్ వాల్కర్ లెబెన్స్ ఇమ్‌మిట్టెలాల్టర్, స్టుట్‌గర్ట్, 1860.

**కిన్నెయర్ జె.జి. :** ద క్రైసిస్ అండ్ ద కరెన్సీ, లండన్, 1847.

ఎల్

**లెయింగ్ శామ్యూల్ :** నేషనల్ డిస్ట్రెస్, ఇట్స్ కాజెస్ అండ్ రెమెడీస్, లండన్, 1844.

**లావెర్నె లియోన్ డి :** ద రూరల్ ఎకానమీ ఆఫ్ ఇంగ్లండ్ స్కాట్లండ్ అండ్ ఐర్లండ్ ఎకానమీ రూరలె డ ల అంగ్లెతరె పారిస్, 1854 కి అనువాదం, లండన్, 1855.

**లియాథమ్ విలియం :** లెటర్స్ ఆన్ ద కరెన్సీ, ఛార్లెస్ వుడ్‌కి రాసినవి. లండన్, 1840.

**లెక్సీస్ డబ్ల్యు :** డై మార్క్సిష్క్ కాపిటల్ తియెరీ. కాన్రాడ్స్ జార్బుఖెర్ ఫర్ నేషనలెకానమీ ఉండ్ స్టాటిస్టిక్‌లో, న్యూయె ఫోల్జె బిడి XI జెనా, 1885.

**లింగ్యూట్ ఎన్. :** థియొరి డెస్ లోయిస్ సివిలెస్ ఔ ప్రిన్సిపెస్ ఫండమెంటా డె లా సొసైటీ టి.ఐ. లండన్, 1767.

**లిస్ట్ డా॥ ఫ్రెడరిక్ :** డై అక్కెర్‌వెర్ ఫాసుంగ్ డై జ్వెర్గ్‌విట్ ష్కాఫ్ట్ ఉండ్ డై ఔవాండెరుంగ్. డ్యూయెశ్చె వియెర్ట్‌లజార్, ష్రిఫ్ట్ నుంచి 1842. హెఫ్ట్ IV. ఎన్ఆర్. XX. ప్రత్యేక ముద్రణ, స్టుట్‌గర్ట్ ఉండ్ ట్యూబింగిన్, 1842.

**లోరియా అకిల్లె :** కార్ల్‌మార్క్స్ ''న్యువో అంటలోగియా''లో, ఏప్రిల్ 1883.

- లాధి యొరియా ఎకనామిక్ డెల్లా కాస్టిట్యూషనె పొలిటిక్, రోమా, టోరినో, ఫిరెంజ్ 1886.
- డై దర్‌ష్కన్నిట్ ప్రాఫిటేట్ ఔఫ్ గ్రుండ్ లేజ్ డెస్ మార్క్స్ ష్కెన్ వేర్ట్ గెస్టెజ్. వాన్ డా॥ కాన్రాడ్ ష్మిడ్ట్, స్టుటగర్ట్, 1889. కాన్రాడ్స్ జార్బుఖేర్ పూర్ నేషనల్ ఒకానమీ ఉండ్ స్టాటిస్టిక్‌లో సమీక్ష. న్యూయె ఫాల్జె బిడి XX జెనా, 1890.
- ల ఒపెరా పాస్టుమా డి కార్లో మార్క్స్. "న్యూటెవా ఆంటోలోగియా"లో, వాల్యూ. LV, ఫిబ్రవరి, 1895.

**లూథర్ మార్టిన్ :** మాన్ డై ఫారెన్ విడేర్ డెన్ వూఖెర్ జు ప్రెడిజెన్, విట్టెంబర్గ్, 1540. లూథర్ 'వర్క్' విట్టెంబర్గ్, 1589. 6 టెల్.

- వాన్ కాన్ఫ్‌స్కాండ్‌లుండ్ ఉండ్ ఊఖెర్ విట్టెంబర్గ్, 1524, లూథర్ వర్క్స్, విట్టెంబర్గ్ 1589.

**లుజాక్, ఇ. :** హాలండ్స్ రిజ్క్‌డమ్ బెహెల్‌జెండ్ డెన్ ఊర్‌స్ప్రంగ్ వాన్ డెన్ ఖూఫండెల్, ఎన్ వాన్ డె మార్గ్ట్ వాన్ డె జెన్ స్టాట్ ఎట్‌సెట్రా, లెడెన్, 1782.

ఎమ్

**మెకాలే థామస్ బి. :** ది హిస్టరీ ఆఫ్ ఇంగ్లండ్ ఫ్రమ్ ది యాక్సెషన్ ఆఫ్ జేమ్స్ ది సెకండ్, వాల్యూం-4, లండన్, 1857.

**మాల్తస్ టి.ఆర్. :** డెఫినిషన్స్ ఇన్ పొలిటికల్ ఎకా నమీ, లండన్ 1827; లండన్ 1853.

- ప్రిన్సిపుల్స్ ఆఫ్ పొలిటికల్ ఎకానమీ కన్సిడర్డ్ విత్ ఎ వ్యూ టు దైర్ ప్రాక్టికల్ అప్లికేషన్, 2వ ముద్రణ, లండన్, 1836.

**మాస్లె థామస్ :** ఇంటరెస్ట్ ఆఫ్ మనీ మిస్టేకెన్ ఆర్ ఎ ట్రిటైజ్ ప్రూవింగ్ దట్ ది ఎబెట్‌మెంట్ ఆఫ్ ఇంటరెస్ట్ ఈజ్ ది ఎఫెక్ట్ అండ్ నాట్ ద కాజ్ ఆఫ్ రిచ్చస్ ఆఫ్ ఎ నేషన్ అండ్ దట్ సిక్స్ పెర్‌సెంట్ ఈజ్ ఎ ప్రపోర్షనబుల్ ఇంటరెస్టు టు ది ప్రెజంట్ కండీషన్స్ ఆఫ్ కింగ్‌డమ్, లండన్, 1668.

**మారన్ డా॥ హెచ్ :** ఎక్స్‌టెన్సివ్ ఆడర్ ఇంటెన్సివ్? ఎయిన్ కేపిటల్ జేజే డేర్ లేండ్ విర్ట్ – స్కాఫ్‌టిలిచెన్, బెట్రియెబ్స్రె, ఓప్‌లెన్, 1859.

**మార్క్స్ కార్ల్ :** దాస్ కాపిటల్ క్రిటిక్ డేర్ పొలిటి లిస్కె ఒకానమీ, బుక్ I.

- బుక్ II.
- దాస్ కాపిటల్ ఎట్‌సెట్రా, ఎర్‌స్టర్ బాండ్ బుక్ I డెర్ ప్రొడక్షన్ ప్రోసెజెస్ డెస్ కాపిటల్స్ 2 ఔఫ్లేజ్, హాంబర్గ్, 1872.
- 3 ఔ:ఫ్లేజ్, హాంబర్గ్, 1883.

– దాస్ కాపిటల్ ఎట్‌సెట్రా జ్వెటర్‌బాండ్.

– బుక్ II డేర్ జిర్కులేషన్స్ ప్రోజెస్ డెస్ కాపిటల్స్, హాంబర్గ్, 1885.

– మిసరె డెలా ఫిలాసఫీ. రెస్పాన్స్ అ లా ఫిలాసఫీ డె లా మిజరీ డె ఎమ్. ప్రౌథాన్. పారిస్, 1847.

– జూర్ క్రిటిక్ డెర్ పొలిటిష్చెన్ ఒకానమీ ఎర్టెస్ హెఫ్ట్, బెర్లిన్, 1859.

**మాసీ జోసెఫ్ :** యాన్ ఎస్సే ఆన్ ది గవర్నింగ్ కాజెస్ ఆఫ్ ద నాచురల్ రేట్ ఆఫ్ ఇంటరెస్ట్ ఎట్‌సెటెరా, లండన్, 1750.

**మిల్ జాన్ స్టూవర్ట్ :** ఎస్సేస్ ఆన్ సమ్ అన్‌సెటిల్డ్ క్వశ్చన్ ఆఫ్ పొలిటికల్ ఎకానమీ, లండన్, 1844.

– ప్రిన్సిపుల్స్ ఆఫ్ పొలిటికల్ ఎకానమీ విత్ సమ్ ఆఫ్ దైర్ అప్లికేషన్స్ టు సోషల్ ఫిలాసఫీ, రెండవ ముద్రణ, లండన్, 1849.

**మామ్‌సెన్ థియొడోర్ :** రోమిశ్చె గెష్కిశ్చె 2 ఔఫ్లేజ్, బెర్లిన్, 1856.

**మోర్టన్ జె.సి. :** ఆన్ ద ఫోర్సెస్ యూజ్డ్ ఇన్ అగ్రికల్చర్ సొసైటీ ఆఫ్ ఆర్ట్స్‌కు సమర్పించిన నివేదిక. జర్నల్ ఆఫ్ ది సొసైటీ ఫర్ ఆర్ట్స్‌లో, డిసెంబరు 9, 1859.

**మోర్టన్ జాన్ లాక్‌హార్ట్ :** ది రిసోర్సెస్ ఆఫ్ ఎస్టేట్స్, బీయింగ్ ఎ ట్రిటైజ్ ఆన్ ది అగ్రికల్చరల్ ఇంప్రూవ్‌మెంట్ అండ్ జనరల్ మేనేజ్‌మెంట్ ఆఫ్ లాండెడ్ ప్రోపర్టీ, లండన్, 1858.

**మూనియెర్ ఎల్.ఎమ్. :** డె ల'అగ్రికల్చరె ఎన్ ఫ్రాన్స్ ద' ఆఫర్స్ లెస్ డాక్యుమెంట్స్ అఫిషియల్స్ అవెక్ డెస్ రిమార్క్స్ పార్ ఎమ్. రూబికాన్, పారిస్, 1846.

**ముల్లర్ ఆడమ్ హెచ్. :** డై ఎలెమెంట్ డెర్ స్టాట్ స్కున్స్ట్, బెర్లిన్, 1809.

### ఎన్

**న్యూమన్ ఫ్రాన్సిస్ విలియం :** లెక్చర్స్ ఆన్ పొలిటికల్ ఎకానమీ, లండన్, 1851.

**న్యూమన్ ఎస్.పి. :** ఎలెమెంట్స్ ఆఫ్ పొలిటికల్ ఎకానమీ, అండోవర్ అండ్ న్యూయార్క్, 1835.

**నార్త్ సర్‌డడ్లే :** డిస్కోర్సెస్ అపాన్ ట్రేడ్; ప్రిన్సిపల్లీ డైరెక్టెడ్ టు ది కేసెస్ ఆఫ్ ద ఇంటరెస్ట్, కోయినేజ్, క్లిప్పింగ్, ఇంక్రీజ్ ఆఫ్ మనీ, లండన్, 1691.

### ఒ

**ఓ కోనార్ ఛార్లెస్ :** డిసెంబర్ 19, 1859 నాటి ఉపన్యాసం, న్యూయార్క్ డైలీ, ట్రిబ్యూన్‌లలో, డిసెంబర్ 20, 1859.

**ఓడర్‌మాన్ డా॥ సి.జి. :** ఫెల్లెర్ చూడండి.

**ఒప్‌డైక్ జార్జి :** ఎ ట్రీటైజ్ ఆన్ పొటిలిక్ ఎకానమీ, న్యూయార్క్, 1851.

### పి

**పాసీ హిపోలైట్ :** డెస్ సిస్టమ్స్ డె కల్చర్ ఎట్ డె లుయెర్ ఇన్‌ఫ్ల్యూయెన్స్ సర్ ఎకానమీ సోషియెలె, రెండవ ముద్రణ, పారిస్, 1853.

**పెక్యుయెర్ సి.హెచ్. :** థియొరి నోవిల్ ద ఎకానమీ సోషియలె ఎట్ పోలిటికె ఔ ఎట్యుడ్ సర్ ల' ఆర్గనైజేషన్ డెస్ సొసైటీస్, పారిస్, 1842.

**ప్లినియస్ గెయిస్ సెకుండస్ :** డెర్ అయెల్ తెరె హిస్టారియె నాచురలిస్ లిబ్రి XXXVII, పారిస్, 1826.

**ప్రైస్ రిచర్డ్ :** యాన్ అప్పీల్ టు ద పబ్లిక్ ఆన్ ద

సబ్జెక్ట్ ఆఫ్ ద నేషనల్ డెట్ 1772. రెండవ ముద్రణ, లండన్, 1774.

– అబ్జర్వేషన్స్ ఆన్ రివర్షనరీ పేమెంట్స్ ఆన్ స్కీమ్స్ ఫర్ ప్రొవైడింగ్ యాన్యూలుటీస్ ఫర్ విడోస్ అండ్ ఫర్ పర్సన్స్ ఇన్ ఓల్డ్ ఏజ్; ఆన్ ద మెథడ్ ఆఫ్ కాలుక్యులేటింగ్ ద వాల్యూస్ ఆఫ్ అష్యురెన్సెస్ ఆన్ లైవ్స్ అండ్ ఆన్ నేషనల్ డెట్ వగైరా (1771) – రెండవ ముద్రణ, లండన్ (1772).

**ప్రౌధాన్ పి.జె. :** బాస్టియట్ చూడండి.

**ఆర్**

**రామ్సే జార్జ్ :** యాన్ ఎస్సే ఆన్ ద డిస్ట్రిబ్యూషన్ ఆఫ్ వెల్త్, ఎడింబరో, 1836.

**రెడెన్ డా॥ ఫ్రైహర్‌వాన్ :** వల్గర్ వెషెండ్ కుల్తుర్ స్టాటిస్టిక్ డెర్ గెబైట్స్ ఉండ్ బెవాల్క్ రుంగ్, ష్వెర్చాల్నిస్ డెర్ గ్రాప్ స్టాటిక్ యూరోపాస్, బెర్లిన్, 1848.

**రికార్డో డేవిడ్ :** ఆన్ ద ప్రిన్సిపుల్స్ ఆఫ్ పొలిటికల్ ఎకానమీ అండ్ టాక్సేషన్, సంపా. మాకుల్లక్, లండన్, 1862.

**రాడ్‌బర్టెస్ – జాగెట్‌జౌ కార్ల్ :** సోజియాలె బ్రీఫెయాన్ వాన్ కిర్కిమాన్. డ్రిట్టర్ బ్రీఫ్ వైడర్ లెగుంగ్ డెర్ డె రికార్డోష్కెన్ లెహ్రెవాన్ డెర్ గ్రుండ్‌రెంట్ ఉండ్ బెర్గ్రుండంగ్ ఐనెర్ న్యూ ఎన్ రెంట్ థియరె, బెర్లిన్ 1851.

**రోశ్చర్ విల్‌హెల్మ్ :** డై గ్రుండ్ లగెన్ డేర్ నేషనలె కానమీ, ఎయిన్ హాండ్ ఉండ్ లెస్‌బక్ పూర్ గెష్కాఫ్‌ట్స్ మానెర్ ఉండ్ స్టుడియెరెండె (2, ఔఫ్లంగ్, స్టుటగర్ట్ ఉండ్ ఆగ్స్‌బర్గ్, 1857).

**రుబికాన్ మారిస్ :** డు మెకానిజ్మె డెల సొసైటి ఎన్‌ఫ్రాన్స్ ఎట్ ఎన్ ఆంగ్లెతెరి (1833) నూతన ప్రచురణ, పారిస్, 1837.

**ఎస్**

**సెయింట్ సైమన్ :** నొవియొ క్రిస్టియనిజ్మె డయలాగ్ ఎంత్రె ఉన్ కన్సర్వేచర్. ఎట్ ఉన్ నోవాతెర్, పారిస్, 1825.

**సే జీన్ బాప్టిస్టె :** ట్రైట్ డె, ఎకానమీ పొలిటికె ఔ సింపుల్ ఎక్స్‌పొజిషన్‌డెల మానియరె దోంత్ సె ఫార్మెంట్ సె. డిస్ట్రిబ్యుయెంట్ ఎట్ సె కన్ సమెంట్ లెస్ రిచెస్ (1803), మూడవ ముద్రణ, పారిస్ (1817).

**ష్మిడ్ట్ కాన్రాడ్ :** డై దుదర్క్‌స్కినిట్ ప్రాఫిట్ రేట్ ఔఫ్ గ్రుండింగె మార్క్సె వెర్ట్‌గెస్టెన్, స్టుట్‌గర్ట్, 1889.

డు డుర్క్ స్కినిట్ ప్రాఫిటేరేట్ ఉండ్ దాస్ మార్క్సిశ్చె వెర్ట్ గెస్టెన్. డైన్యూయె జేట్ లో. XI జహోర్గ్ బి.డి.ఐ. స్టుట్‌గర్ట్ 1893.

**సిస్మాండి జె.సి.హెచ్.ఎల్.సి.మోండె :** నోవియె ప్రిన్సిపెస్ ద ఎకానమీ పొలిటికె ఔ డె ల రిచెస్ డాన్స్ నెస్ రాపార్ట్స్ అవేక్ ల పాప్యులేషన్, పారిస్, 1819.

**స్మిత్ ఆడమ్ :** యాన్ ఎంక్వైరీ ఇన్ టు ద నేచర్ అండ్ కాజెస్ ఆఫ్ ద వెల్త్ ఆఫ్ నేషన్స్ (1776) వేక్‌ఫీల్డ్, లండన్ ప్రచురణ, 1835 టు 1889.

**సోంబర్ట్ వెర్నర్ :** జూర్ క్రిటిక్ డెస్ ఒకనామిష్కెన్ సిస్టమ్స్ వాన్ కార్ల్‌మార్క్స్ ఇన్ ఆర్కివ్ ఫర్ సోజియాలె గెస్టింగ్ జెబంగ్ ఉండ్ స్టాటిస్టిక్‌లో ప్రచురణ, బిడి VIII, బెర్లిన్, 1894.

**స్టూవర్ట్ జాక్వెస్ (జేమ్స్) :** రిసెర్చె డెస్ ప్రిన్సిపెసె డె లెకానమి పొలిటికె ఔ ఎస్సై సర్ ల సైన్స్ డె ల పొలిటికె ఇంటీరియర్ డెస్ నేషన్స్ లిబరె (యాన్ ఎంక్వైరీ ఇన్ టు ది ప్రిన్సిపుల్స్ ఆఫ్ పొలిటికల్ ఎకానమీ వగైరా అనువాదం, లండన్, 1767), పారిస్ 1789.

**స్టీబెలింగ్ జార్జి సి. :** దాస్ వెర్టెగెసెట్జ్ ఉండ్ డై ప్రోఫిట్రేట్, న్యూయార్క్, 1890.

**స్టార్చ్ హెన్రీ :** కోర్స్ డిఎకానమీ పొలిటికె ఔ ఎక్స్‌పొజిషన్ డెస్ ప్రిన్సిపెస్ క్వి డిటర్మినెంట్‌ల ప్రాస్పెరైట్ డెస్ నేషన్స్, సెయింట్ పీటర్స్‌బర్గ్, 1815.

– కన్సిడరేషన్స్ సర్ ల నేచర్ దురెవెన్యు నేషనల్, పారిస్, 1824.

**టి**

**థెయిర్స్ అడాల్ఫ్ :** ది లా ప్రాపర్టీ, పారిస్, 1848.

**థున్ అల్ఫాన్స్ :** డై ఇండస్ట్రీ యామ్ నీడెరీన్ ఉండ్ ఉహ్రె ఆర్బీటరీ, లీప్జిగ్ 1879.

**టూకె థామస్ :** ఎ హిస్టరీ ఆఫ్ ది ప్రైసెస్ అండ్ ఆఫ్ ద స్టేట్ ఆఫ్ ది సర్క్యులేషన్ ఫ్రమ్ 1793 టు 1837, ప్రిసీడెడ్ బై ఎ బ్రీఫ్ స్కెచ్ ఆఫ్ ది స్టేట్ ఆఫ్ ద కార్న్‌ట్రేడ్ ఇన్ ద లాస్ట్ టు సెంచరీస్, లండన్, 1838.

– యాన్ ఎంక్వైరీ ఇన్ టు ద కరెన్సీ ప్రిన్సిపుల్స్ ద కనెక్షన్ ఆఫ్ ద కరెన్సీ విత్ ప్రైసెస్ అండ్ ద ఎక్స్‌పీడియన్సీ ఆఫ్ ఎ సపరేషన్ ఆఫ్ ఇష్యూ ఫ్రమ్ బ్యాంకింగ్, రెండవ ప్రచురణ, లండన్ 1844.

– ఎ హిస్టరీ ఆఫ్ ప్రైసెస్ అండ్ ఆఫ్ ద స్టేట్ ఆఫ్ ద సర్క్యులేషన్ ఫ్రమ్ 1839 టు 1847 ఇన్‌క్లూసివ్ విత్ ఎ జనరల్ రివ్యూ ఆఫ్ ద కరెన్సీ క్వశ్చన్ ఎట్‌సెట్రా, లండన్, 1848.

– ఇంకా న్యూమార్క్ విలియంతో, ఎ హిస్టరీ ఆఫ్ ద ప్రైసెస్ అండ్ ఆఫ్ ద స్టేట్ ఆఫ్ ద సర్క్యులేషన్ డ్యూరింగ్ ద నైన్ ఇయర్స్, 1848 – 1856, లండన్, 1857.

**టారెన్స్ రాబర్ట్ :** యాన్ ఎస్సే ఆన్ ద ప్రొడక్షన్ ఆఫ్ వెల్త్ విత్ యాన్ ఎపెండిక్స్ ఇన్ విచ్ ద ప్రిన్సిపుల్స్ ఆఫ్ పొలిటికల్ ఎకానమీ ఆర్ అప్లైడ్ టు ది యాక్చువల్ సర్కమ్‌స్టెన్సెస్ ఆఫ్ దిస్ కంట్రీ, లండన్, 1821.

– ఆన్ ది ఆపరేషన్ ఆఫ్ ది బ్యాంక్ చార్టర్ యాక్ట్ ఆఫ్ 1844 ఎట్‌సెట్రా, రెండవ ముద్రణ, లండన్, 1847.

**టక్కెట్ జె.డి. :** ఎ హిస్టరీ ఆఫ్ ది పాస్ట్ అడ్ ప్రెజంట్ స్టేట్ ఆఫ్ ది లేబరింగ్ పాపులేషన్, ఇన్‌క్లూడింగ్ ది ప్రోగ్రెస్ ఆఫ్ అగ్రికల్చర్, మాన్యుఫాక్చర్స్ అండ్ కామర్స్, షోయింగ్ ది ఎక్స్‌ట్రీమ్స్ ఆఫ్ ఆపులెన్స్ అండ్ డెస్టిట్యూషన్ ఎమాంగ్ ద ఆపరేటివ్ క్లాసెస్ విత్ ప్రాక్టికల్ మీన్స్ ఫర్ దైర్ ఎంప్లాయ్‌మెంట్ అండ్ ఫ్యూచర్ ప్రాస్పెరిటీ, లండన్, 1846.

**యు**

**ఉరె ఆంద్రూ :** ఫిలాసఫీ డెస్ మాన్యుఫాక్టర్స్ ఔ ఎకానమీ ఇండస్ట్రియల్ డె ల ఫాబ్రికేషన్ ద కాటన్ డె లా లైనె డు లిన్ ఎట్ డె లా సోయీ అవెక్ ల డిస్క్రిప్షన్ డెస్ అటెలీర్స్ ఆంగ్లెయిస్ (ఫిలాసఫీ ఆఫ్ మాన్యుఫ్యాక్చర్స్ వగైరా అనువాదం) లండన్, 1835, పారిస్, 1836.

**వి**

**వెరీ పియెట్రో :** మెడిటాటియోని సల్లా ఎకొనమియ పొలిటికా, పార్టె మోడర్నా, వాల్యూం–15, మిలన్, 1804.

**వింకార్డ్ జూనియర్ :** హిస్టరీ డు ట్రవైల్ ఎట్ డెస్, ట్రవైలుర్స్ ఎన్ ఫ్రాన్స్, పారిస్, 1845.

**విసరింగ్ ఎస్. :** హేండ్ బుక్ వాన్ ప్రాక్టిష్కెస్టాటా యిుష్ ఔట్‌కుండె, ఎమెన్స్టర్‌డామ్, 1860–1865.

**డబ్ల్యు**

**వేక్‌ఫీల్డ్ ఎడ్వర్డ్ గిబ్బన్ :** ఇంగ్లండ్ అండ్ అమెరికా ఎ కంపేరిజన్ ఆఫ్ ద సోషల్ అండ్

పొలిటికల్ స్టేట్ ఆఫ్ బోత్ నేషన్స్, లండన్, 1833.

**వాల్టన్ ఆల్ఫ్రెడ్ :** ఎ హిస్టరీ ఆఫ్ ద లాండెడ్ టెన్యూర్స్ ఆఫ్ గ్రేట్ బ్రిటన్ అండ్ ఐర్లెండ్ ఫ్రమ్ ద నార్మన్ కాంక్వెస్ట్ టు ది ప్రెజంట్ టైమ్, లండన్, 1865.

**వెస్ట్ ఎడ్వర్డ్ :** ఎస్సే ఆన్ ది అప్లికేషన్ ఆఫ్ కాపిటల్ టు లేండ్ ఎట్‌సెట్రా. బై ఎ ఫెలో ఆఫ్ ద యూనివర్శిటీ కాలేజి, ఆక్స్‌ఫర్డ్, లండన్, 1815.

**ఉల్ఫ్ జూలియస్ :** దాస్ రాట్‌సెల్ డెర్ డర్క్‌స్కి న్నటిస్‌ప్రాఫిట్ రేట్ బై మార్క్స్ ఇన్ కాన్రాడ్స్ జార్ బుఖెర్ ఫర్ నేషనల్ ఎకనమీ ఉండ్ స్టాటిస్టిక్‌లో నుంచి డ్రిట్టే ఫోల్జ్ బిడి–II జేన 1891.

– సోషలిజమ్స్ ఉండ్ కాపిటల్ స్టిష్కె జెసెల్ స్కాఫ్ట్ ర్కొడంగ్. క్రిటిష్కె వూర్డిగుంగ్ బీడర్ ఆల్స్ గ్రుండ్‌లెగంగ్ ఎయినర్ సోజి యాపొలిటిక్, సిస్టమ్ డెర్ సోజియాపొలిటిక్, బిడి–I స్టుట్‌గర్ట్, 1892.

★ ★ ★

## II. అజ్ఞాత రచయితల సూచిక


ది సిటీ ఆర్ ది ఫిజియాలజీ ఆఫ్ లండన్ బిజినెస్ విత్ స్కెచెస్ ఆన్ ఛేంజ్ అండ్ ఎట్ ది కాఫీ హౌసెస్ (డేవిడ్ మారియర్ ఇవాన్స్) లండన్, 1845.

కాంపిటీషన్ అండ్ కో–ఆపరేషన్, 1832.

ది కరెన్సీ థియరీ రివ్యూడ్ ఇన్ ఎ లెటర్ టు ది స్కాటిష్ పీపుల్ ఆన్ ది మెనేస్డ్ ఇంటర్‌ఫియరెన్స్ బై గవర్నమెంట్ విత్ ది ఎగ్జిస్టింగ్ సిస్టం ఆఫ్ బ్యాంకింగ్ ఇన్ స్కాట్‌లేండ్. బై ఎ బ్యాంకర్ ఇన్ ఇంగ్లండ్, ఎడింబరో, 1845.

డాక్ట్రిన్ డె సెయింట్ – సైమన్. ఎక్స్‌పొజిషన్ ప్రైమరీ అన్నే 1828–1829 (ఎన్‌ఫాన్‌టిన్) మూడవ ఎడిషన్, పారిస్, 1831.

ఏన్ ఎంక్వైరీ ఇంటు దోస్ ప్రిన్సిపుల్స్ రెస్పెక్టింగ్ ది నేచర్ ఆఫ్ డిమాండ్ అండ్ ది నెసెసిటీ ఆఫ్ కన్‌సంప్షన్, లేట్‌లీ అడ్వొకేటెడ్ బై మిస్టర్ మాల్తస్, లండన్, 1821.

అబ్జర్వేషన్స్ ఆన్ సర్టెన్ వెర్బల్ డిస్ప్యూట్స్ ఇన్ పొలిటికల్ ఎకానమీ, పర్టిక్యులర్లీ రిలేటింగ్ టు వాల్యూ, అండ్ టు డిమాండ్ అండ్ సప్లై, లండన్, 1821.

రెలిజియన్ సెయింట్ – సైమనియన్ ఎకనామి పొలిటికె ఎట్ పొలిటికె ఆర్టికల్స్ ఎక్స్‌ట్రైట్స్ అవ్ గ్లోబ్ (ఎన్‌ఫాన్‌టిన్) పారిస్, 1831.

సమ్ థాట్స్ ఆఫ్ ది ఇంటరెస్ట్ ఆన్ ఇంగ్లండ్ బై ఎ లవర్ ఆఫ్ కామర్స్, లండన్, 1697.

ది థియరీ ఆఫ్ ఎక్స్‌ఛేంజెస్. ది బ్యాంక్ ఛార్టర్ యాక్ట్ ఆఫ్ 1844 ఎట్‌సెట్రా (జి. హెన్రీ రాయ్) లండన్, 1864.

ది థ్రీ ప్రైస్ ఎస్సేస్ ఆన్ అగ్రికల్చర్ అండ్ ది కార్న్ లా పబ్లిష్డ్ బై ది నేషనల్ యాంటీ – కార్న్ – లా లీగ్ (జార్జి హోప్. డబ్ల్యు.ఆర్.గ్రే, ఆర్థర్ మోర్స్) మాంఛెస్టర్, లండన్, 1842.


★ ★ ★

## III. వార్తాపత్రికలు, ఇతర పత్రికల సూచిక


ఆర్చివ్ ఫర్ సాజియాలె గెసిగ్జెబంగ్ ఉండ్ స్టాటిస్టిక్ – డా॥ హెన్రీ బ్రౌన్ ప్రచురణ; బెర్లిన్, 1894.

డెయిలీ న్యూస్ – డిసెంబర్ 10, 1889

డెయిలీ న్యూస్ – డిసెంబర్ 15, 1892.

డెయిలీ న్యూస్ – జనవరి 18, 1894.

డాయ్ న్యూయె జెట్ XI జెహాగ్ బి.డి.I –1893 (కాన్రాడ్ ష్మిడ్ట్ మీద వ్యాసం)

ఎకానమిస్ట్ – మార్చి 18, 1845.

ఎకానమిస్ట్ –మే 22, 1847.

ఎకానమిస్ట్ – ఆగస్టు 2, 1847.

ఎకానమిస్ట్ – అక్టోబర్ 23, 1847.

ఎకానమిస్ట్ – నవంబర్ 20, 1847.

ఎకానమిస్ట్ – డిసెంబర్ 11, 1847.

ఎకానమిస్ట్ – నవంబర్ 30, 1850.

ఎకానమిస్ట్ – జనవరి 11, 1851.

ఎకానమిస్ట్ – జనవరి 22, 1853.

ఎకానమిస్ట్ – జులై 19, 1859.

ఎకానమిస్ట్ జార్ బుఖెర్ పూర్ నేషనల్ ఎకనమి అండ్ స్టాటిస్టిక్స్ – జె. కాన్రాడ్ ప్రచురణ

ఎకానమిస్ట్ 1885, న్యూయె ఫోల్జె (లెక్సిస్ వ్యాసం)

1890. న్యూయె ఫోల్జె (అఖిల్ లోరియా వ్యాసం)

1891, III. న్యూయె ఫోల్జె (జూలియస్ ఉల్ఫ్ వ్యాసం)

1892, III. ఫోల్జె (పీటర్ ఫైర్మన్ వ్యాసం)

జర్నల్ ఆఫ్ ది సొసైటీ ఆఫ్ ఆర్ట్స్ – వాల్యూం VII నెం. 368, లండన్; డిసెంబర్ 9, 1859 (జె.సి. మోర్టన్ రిపోర్టు).

మాంఛెస్టర్ గార్డియన్ – నవంబర్ 24, 1847.

మార్నింగ్ స్టార్ – డిసెంబర్ 14, 1865 (జాన్ బ్రైట్ ఉపన్యాసం)

న్యూయార్క్ డెయిలీ ట్రిబ్యూన్ – డిసెంబర్ 20, 1859 (ఒ' కానార్ ఉపన్యాసం)

నోవా ఆంటలోగియా – ఏప్రిల్ 1883 (అఖిల్ లోరియా వ్యాసం)

నోవా ఆంటలోగియా – ఫిబ్రవరి 1895 (అఖిల్ లోరియా వ్యాసం)

రివ్యూ డెస్ డ్యూయెక్స్ మాండెస్ – 1842 (కాక్వెలిన్ వ్యాసం)

రివ్యూ డెస్ డ్యూయెక్స్ మాండెస్ – 1848, (ఫోర్కేడ్ వ్యాసం)

టైమ్స్ – లండన్, డిసెంబర్ 3, 5, 7, 1857.

ఎడింబరో రివ్యూ.


★ ★ ★

# IV. పార్లమెంటు నివేదికలు మరియు ఇతర అధికారిక ప్రచురణలు

అన్ నో విసిమో సెక్స్‌టో జార్జి III రెగిస్. క్యాపుట్ XXXI ఏన్ యాక్ట్ ఫర్ విస్టింగ్ సర్టెన్ సమ్స్ ఇన్ కమిషనర్స్ ఎట్ ది ఎండ్ ఆఫ్ ఎవ్రీ క్వార్టర్ ఆఫ్ ఎ ఇయర్ టు బి బై దెమ్ అప్లైడ్ టు ది రిడక్షన్ ఆఫ్ ది నేషనల్ డెట్ (1786)

ఫస్ట్ రిపోర్ట్ ఆన్ చిల్డ్రన్స్ ఎంప్లాయిమెంట్ ఇన్ మైన్స్ అండ్ కాలరీస్, ఏప్రిల్ 21, 1829.

కోల్‌మైన్ యాక్సిడెంట్స్. ఆబ్‌స్ట్రాక్ట్ ఆఫ్ రిటర్న్ టు యాన్ అడ్రస్ ఆఫ్ ది హానరబుల్ హౌస్ ఆఫ్ కామన్స్, డేటెడ్ 3, మే 1861.

ఫస్ట్ రిపోర్ట్ ఫ్రమ్ ది సెలెక్ట్ కమిటీ ఆఫ్ ది హౌస్ ఆఫ్ లార్డ్స్ ఆన్ ది స్వెట్టింగ్ సిస్టమ్ టు గెదర్ విత్ ది ప్రొసీడింగ్స్ ఆఫ్ ది కమిటీ, మినిట్స్ ఆఫ్ ఎవిడెన్స్, 11, ఆగస్ట్, 1888.

పబ్లిక్ హెల్త్ VI రిపోర్ట్ ఆఫ్ ది మెడికల్ ఆఫీసర్ ఆఫ్ ది ప్రీవీ కౌన్సిల్ విత్ అపెండెక్స్ 1863, లండన్, 1864.

రిపోర్ట్ ఫ్రమ్ ది సెలెక్ట్ కమిటీ ఆన్ బ్యాంక్ యాక్ట్స్ టుగెదర్ విత్ ది ప్రొసీడింగ్స్ ఆఫ్ ది కమిటీ, మినిట్స్ ఆఫ్ ఎవిడెన్స్ అపెండెక్స్ అండ్ ఇండెక్స్, 30, జూలై 1957.

రిపోర్ట్ ఫ్రమ్ ది సెలెక్ట్ కమిటీ 1, జూలై 1858, లండన్.

ఫస్ట్ రిపోర్ట్ ఫ్రమ్ ది సీక్రెట్ కమిటీ ఆఫ్ ది హౌస్ ఆఫ్ లార్డ్స్ అపాయింటెడ్ టు ఎంక్వైర్ ఇన్ టు ది కాజెస్ ఆఫ్ ది డిస్ట్రస్, 28, జూలై 1848.

రిపోర్ట్ ఆఫ్ ది ఇన్‌స్పెక్టర్స్ ఆఫ్ ది ఫ్యాక్టరీస్, లండన్ – 31, అక్టోబర్, 1845, 1846, 1847, 1848, 30 ఏప్రిల్ 1849, 31 అక్టోబర్ 1849, 30 ఏప్రిల్ 1850, 31 అక్టోబర్ 1850, 30 ఏప్రిల్ 1851 నుండి 1864 వరకు.



**PETTUBADI (CAPITAL)** KARL MARX
Volume 3 ( Telugu)

"పెట్టుబడి" గ్రంథం వెలువడి నూటయాభై సంవత్సరాలైనా, దాని ప్రాధాన్యత నానాటికీ పెరుగుతూనే ఉందిగాని, తరగడం లేదు. అందులో విశ్లేషించిన అంశాలు, ప్రతిపాదించిన సూత్రీకరణలు సజీవంగా నేటికీ మన సామాజిక జీవనంలో ప్రస్ఫుటంగా కనిపిస్తున్నందువల్లనే ఆ గ్రంథానికి అంత ప్రాధాన్యత ఉంది. 2008లో అమెరికాతో ప్రారంభమై ప్రపంచంలోని పెట్టుబడిదారీ దేశాలనూ, వాటితో వ్యాపార లావాదేవీలు కలిగిన అభివృద్ధి చెందుతున్న దేశాలను సహితం కుదిపివేసిన ఆర్థిక సంక్షోభం అనంతరం మార్క్సిస్టు మేధావులతోపాటుగా ఇతర మేధావులు, ఆర్థికవేత్తలు పెట్టుబడి గ్రంథాన్ని తిరిగి అధ్యయనం చేస్తున్నారన్న వార్తలు ఆ గ్రంథ ప్రాధాన్యతను నొక్కి వక్కాణిస్తున్నాయి. ప్రపంచ వ్యాపితంగా లక్షల సంఖ్యలో పెట్టుబడి గ్రంథ కాపీలు పునర్ముద్రించబడ్డాయి.

చరిత్రగతినీ, మన కాలపు మహద్విజయాలనూ, అపజయాలనూ అవగాహన చేసుకోడానికి సహాయపడగలిగిన భావాలకు "పెట్టుబడి" గ్రంథం ఒక అక్షయనిధి. చారిత్రక పరిణామ నూతన అనుభవాలనుపయోగించి, భావజాలాన్ని, ఘటనలను సృజనాత్మకంగా వివరించగలిగిన మార్క్సిస్టు-లెనినిస్టు మూల సూత్రాలకు "పెట్టుబడి" గ్రంథం పునాదిరాయి. అలాంటి గ్రంథాన్ని అధ్యయనం చేయడం ప్రతి సామాజిక శాస్త్రవేత్తకూ, ప్రత్యేకించి ప్రతి మార్క్సిస్టు-లెనినిస్టుకూ శ్రమభరితమైనా, సంతోషకరమైన ఉత్తమ కర్తవ్యం కావాలి.

వెల : ₹ 680/-
(మూడు సంపుటాల వెల ₹ 1699/-)

విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్
చంద్రం బిల్డింగ్స్, చుట్టుగుంట, విజయవాడ-520 004